రామాయణం

వాల్మీకి సంపూర్ణ రామాయణం-1,2

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ద్వారకాదీష్ వాస్తు వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్: http://dwarkadheeshvastu.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుపమనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

ద్వారకాదీష్ వాస్తు వారి వెబ్ సైట్:

http://dwarkadheeshvastu.com



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటీ కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

Lord Rama

Visit Dwarkadheeshvastu.com For
FREE Vastu Consultancy, Music, Epics, Devotional Videos Educational Books, Educational Videos, Wallpapers
****
All Music is also available in **CD** format. **CD Cover** can also be print with your Firm Name
****
We also provide this whole Music and Data in **PENDRIVE** and **EXTERNAL HARD DISK.**
Contact : Ankit Mishra (+91-8010381364, dwarkadheeshvastu@gmail.com)

Valmiki-Ramayan Telugu - Part - 1

విషయానుక్రమణిక

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
1)	శ్రీరామాయణ మహిమ	12
2)	ప్రస్తావన	15
3)	శ్రీరామాయణ పారాయణవిధిః	34
4)	శ్రీరామాయణమాహాత్మ్యమ్	39
	బాలకాండము	
1)	నారదుడు వాల్మీకిమహర్షికి రామాయణమును సంక్షిప్తముగా తెలుపుట.	69
2)	రామాయణకావ్యముయొక్క ఆవిర్భావము.	79
3)	రామాయణకావ్యకథాసంగ్రహము.	83
4)	కుశలవులు రామాయణమును గానము చేయుట.	87
5)	అయోధ్యానగరవర్ణనము.	91
6)	దశరథునిపాలనలో అయోధ్యానగరవైభవము.	93
7)	దశరథునిమంత్రులు - వారిగుణగణములు.	97
8)	దశరథుడు సంతానము లేనందులకు విచారపడుట - అశ్వమేధయాగముచేయుటకు సంకల్పించుట.	100
9)	'పుత్రసంతానప్రాప్తికై ఋష్యశృంగమహర్షిని పిలిపించుట అవసరము' - అని పలికి సుమంత్రుడు రోమపాదుని వృత్తాంతమును దశరథునకు తెల్పుట.	102
10)	అంగదేశమునకు ఋష్యశృంగునిఆగమనము.	103
11)	అయోధ్యకు ఋష్యశృంగునిరాక.	106
12)	అశ్వమేధయాగమునకు ఏర్పాట్లు చేయుటకై దశరథునిఆదేశము.	109
13)	అశ్వమేధయాగమునకు సన్నాహములు - దశరథుడు సపరివారముగా యజ్ఞశాలలో ప్రవేశించి, దీక్షను గైకొనుట.	111
14)	దశరథుడు అశ్వమేధయాగమును చేయుట.	114
15)	రావణసంహారమునకై దేవతలు విష్ణువును ప్రార్థించుట.	120
16)	యజ్ఞపురుషునిచే దశరథునకు పాయసప్రదానము, దానిని భుజించి కౌసల్య, సుమిత్ర, కైకేయి గర్భములను దాల్చుట.	123
17)	బ్రహ్మయొక్క ప్రేరణప్రభావమున దేవతలఅంశలతో భల్లూక, వానరవీరులు జన్మించుట.	126
18)	శ్రీరామావతారఘట్టము - విశ్వామిత్రునిఆగమనము.	129
19)	యజ్ఞసంరక్షణార్థమై శ్రీరాముని పంపుమని విశ్వామిత్రునిఅభ్యర్థనము.	136
20)	దశరథుడు విశ్వామిత్రునివెంట శ్రీరాముని పంపుటకు తనఅశక్తతను ప్రకటించుట.	138
21)	విశ్వామిత్రుడు క్రుద్ధుడగుట - వసిష్ఠుని ఉపదేశము - దశరథుని అంగీకారము.	140
22)	రామలక్ష్మణులు విశ్వామిత్రునివెంటనడచుట - ఆయననుండి 'బల' 'అతిబల' విద్యలను గ్రహించుట.	142
23)	విశ్వామిత్రునితోగూడి రామలక్ష్మణులు గంగాసరయూసంగమప్రదేశమునగల పవిత్రాశ్రమమునందు ఒకరాత్రి గడుపుట.	145
24)	గంగాసరయూనదుల సంగమప్రదేశమును గూర్చియు, మలద కరూశప్రదేశముల ఆవిర్భావమును గుఱించియు, అచట తాటకనివాసమునుగూర్చియు, విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు తెలుపుట.	147
25)	తాటకజన్మవృత్తాంతము, వివాహము, అగస్త్యశాపమునకు గుఱియగుట - 'లోకకంటకురాలైన ఆ తాటకను చంపుము'- అని శ్రీరామునకు విశ్వామిత్రునిఆదేశము.	150
26)	శ్రీరాముడు తాటకను వధించుట.	152
27)	విశ్వామిత్రుడు శ్రీరామునకు వివిధములగు దివ్యాస్త్రములనొసంగుట.	155
28)	విశ్వామిత్రుడు శ్రీరామునకు అస్త్రముల ఉపసంహారమంత్రములను ఉపదేశించుట.	158
29)	సిద్ధాశ్రమవృత్తాంతము - విశ్వామిత్రుడు యజ్ఞదీక్షనుగైకొనుట.	160
30)	రామలక్ష్మణులు సుబాహుమారీచాదిరాక్షసులను నిగ్రహించుట - విశ్వామిత్రయాగమును సంరక్షించుట.	163
31)	విశ్వామిత్రుడు - రామలక్ష్మణులు - ఇతరమహర్షులు మిథిలకు బయలుదేరుట.	165
32)	కుశనాభునికుమార్తెలవృత్తాంతము.	168
33)	బ్రహ్మదత్తుని జన్మవృత్తాంతము - కుశనాభునిపుత్రికలతో ఆయనవివాహము.	170

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
34)	విశ్వామిత్రునిజన్మవృత్తాంతము.	173
35)	గంగాపార్వతులవృత్తాంతములు.	175
36)	పార్వతీదేవిమహిమ.	177
37)	కుమారస్వామియొక్క జన్మవృత్తాంతము.	179
38)	సగరునకు పుత్రప్రాప్తి.	182
39)	సగరునియజ్ఞము - యజ్ఞాశ్వమును వెదకుట.	184
40)	కపిలునిక్రోధాగ్నిలో సగరునికుమారులు భస్మమగుట.	187
41)	అంశుమంతుడు యజ్ఞాశ్వమును తీసికొనివచ్చుట.	189
42)	భగీరథుడు గంగానదిని దివినుండి భువికి గొనివచ్చుటకై యత్నించుట.	192
43)	గంగావతరణము.	194
44)	భగీరథుడు పవిత్రగంగాజలములతో సగరపుత్రులకు (తన ముత్తాతలకు) పుణ్యలోకములను ప్రాప్తింపజేయుట	197
45)	క్షీరసాగరమథనము- శివునిచే హాలాహలభక్షణము- అమృతముకొఱకై దేవాసురులసంగ్రామము.	199
46)	ఇంద్రుని సంహరింపగల పుత్రునిబడయుటకై దితి తపమొనరించుట - ఇంద్రుడు ఆమె గర్భస్థశిశువును ఏడుముక్కలుచేయుట.	204
47)	సప్తమరుత్తులవృత్తాంతము - విశాలానగరప్రభువైన 'సుమతి' విశ్వామిత్రునకు ఆదరసత్కారములను ఒనర్చుట.	206
48)	అహల్యాశాపవృత్తాంతము.	208
49)	అహల్యాశాపవిముక్తి.	211
50)	విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంటనిడుకొని మిథిలకు ఏతెంచుట - జనకమహారాజుతో సంభాషించుట.	213
51)	శతానందుడు శ్రీరామునిజూచి పరవశుడగుట- అతడు విశ్వామిత్రునిపూర్వచరిత్రమును తెలుపుట.	216
52)	వసిష్ఠమహర్షి తన ఆతిథ్యమును స్వీకరింపుమని విశ్వామిత్రుని ఆహ్వానించుట.	218
53)	వసిష్ఠమహర్షి విశ్వామిత్రునకు ఆతిథ్యమును ఒసంగుట - కామధేనువును ఇమ్మని విశ్వామిత్రుడు కోరుట - వసిష్ఠుడు అందులకు నిరాకరించుట.	220
54)	కామధేనువును తీసికొనిపోవుటకై విశ్వామిత్రుడు తన సేనలను ప్రయోగించుట - వాటిని ఎదుర్కొనుటకై కామధేనువు వసిష్ఠుని అనుమతితో బలములను సృష్టించుట.	222
55)	విశ్వామిత్రుడు పరమశివునిఅనుగ్రహముచే అస్త్రబలమును సంపాదించి, వసిష్ఠాశ్రమమును ధ్వంసము గావించుట- వసిష్ఠమహర్షి తన బ్రహ్మదండముతో ఆయనను ఎదుర్కొనుట.	224
56)	విశ్వామిత్రుడు ప్రయోగించిన అస్త్రములను అన్నింటిని వసిష్ఠుడు నమ్మిగావించుట.	226
57)	విశ్వామిత్రుడు రాజర్షియగుట- త్రిశంకుమహారాజు సశరీరస్వర్గప్రాప్తికై వసిష్ఠమహర్షిని ప్రార్థించుట - అందులకు ఆయన నిరాకరించుట - పిదప ఆ రాజు ఆయన కుమారులను అభ్యర్థించుట.	228
58)	వసిష్ఠపుత్రులశాపకారణముగా త్రిశంకువు చండాలత్వమును పొందుట - పిమ్మట అతడు విశ్వామిత్రుని జేరి, మొఱపెట్టుకొనుట.	230
59)	త్రిశంకుని ప్రార్థనపై విశ్వామిత్రుడు 'నిన్ను సశరీరముగా స్వర్గమునకు పంపెదను' - అని అతనికి మాటఇచ్చుట - శిష్యులద్వారా మునులను అందఱిని ఆహ్వానించుట - తన ఆహ్వానమును తిరస్కరించినందులకు అతడు వసిష్ఠుని సుతులను, మహోదయుని శపించుట.	233
60)	విశ్వామిత్రుడు త్రిశంకువును స్వర్గమునకు పంపుట, ఇంద్రాదులు అతనిని స్వర్గమున ప్రవేశింపనీయక త్రోసివేయుట, విశ్వామిత్రుడు త్రిశంకువుకొఱకు మఱియొకస్వర్గమును సృష్టించి, అందు అతనిని నిలుపుట.	235
61)	విశ్వామిత్రుడు పుష్కరతీర్థమున తపమొనరించుట - అంబరీషుడు శునశ్శేపుని యజ్ఞపశువుగా గొనివచ్చుట.	238
62)	శునశ్శేపుడు విశ్వామిత్రునిఅనుగ్రహముతో ప్రాణప్రమాదమునుండి బయటపడుట - ఇంద్రునివలన దీర్ఘాయువగుట.	240
63)	విశ్వామిత్రుడు మేనకనుజూచి మరులుగొనుట- ఫలితముగా ఆయన తపస్సు భంగమగుట - అతడు మఱల తీవ్రముగా తపస్సుచేసి, మహర్షి యగుట.	242
64)	విశ్వామిత్రునితపస్సును భంగపఱచుటకై ఇంద్రుడు రంభను పంపుట - విశ్వామిత్రుడు ఆమెను శపించి, మఱల తపోదీక్షలో నిమగ్నుడగుట.	245

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
65)	తూర్పుదిశయందు విశ్వామిత్రునితపశ్చర్య - అతడు బ్రహ్మర్షియగుట.	247
66)	జనకుడు శివధనుస్సువృత్తాంతమును తెల్పుట, సీతాదేవిని వివాహమాడగోరివచ్చిన రాజకుమారులతీరుతెన్నులను వివరించుట.	251
67)	శ్రీరాముడు శివధనుర్భంగమొనర్చుట - దశరథుని ఆహ్వానించుటకై జనకుడు మంత్రివర్యులను అయోధ్యకు పంపుట.	253
68)	దశరథుడు జనకునిఆహ్వానమును అందుకొనుట - ఆ శుభవార్తను విని, అందఱును ఆనందించుట.	256
69)	జనకునిఆహ్వానముమేరకు దశరథమహారాజు సపరివారముగా మిథిలానగరమునకు చేరుట.	258
70)	జనకమహారాజు తనసోదరుడగు కుశధ్వజుని పిలిపించుట - వసిష్ఠుడు ఇక్ష్వాకువంశ చరిత్రమును వివరించుట.	260
71)	జనకమహారాజు దశరథునిసమక్షమున వసిష్ఠునకు తనవంశవృత్తాంతమును పూర్తిగా దెల్పుట-	263
72)	శ్రీరామలక్ష్మణ భరత శత్రుఘ్నులకు వరుసగా సీతా - ఊర్మిళా మాండవీ శ్రుతకీర్తులను ఇచ్చి వివాహములనొనర్చుటకు నిశ్చయించుట - వివాహములకుముందు నాందీప్రభృతి శుభకార్యములను నిర్వర్తించుట.	265
73)	రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల వివాహమహోత్సవములు.	268
74)	వివాహమహోత్సవములు ముగిసిన పిమ్మట దశరథుడు సపరివారముగా అయోధ్యకు బయలుదేఱుట - మార్గమధ్యమున పరశురాముడు ఎదురగుట.	272
75)	వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టుమని పరశురాముడు శ్రీరాముని ప్రేరేపించుట.	274
76)	శ్రీరాముడు వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టుట - వైష్ణవతేజము ఆయనను చేరుట - అతని బాణప్రయోగముతో పరశురామునిపుణ్యలోకములు నశించుట - పరశురాముడు మహేంద్రగిరికి వెళ్లిపోవుట.	277
77)	దశరథుడు నవవధూవరులతో, పరివారములతో అయోధ్యకు చేరుట - భరతుడు శత్రుఘ్నునితోగూడి మేనమామవెంట తాతగారింటికి వెళ్లుట - రామలక్ష్మణులు మాతాపితరులను, గురువులను సేవించుచు అయోధ్యలో విలసిల్లుచుండుట.	279

అయోధ్యాకాండము

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
1)	దశరథుడు శ్రీరాముని యువరాజపట్టాభిషిక్తుని గావించుటకై సంకల్పించుట.	283
2)	శ్రీరాముని యువరాజుగా చేయుటకు ప్రజలు సమ్మతించుట.	290
3)	మహారాజుఆజ్ఞమేరకు వసిష్ఠుడు సుమంత్రాదులను ఆదేశించుట - దశరథుడు శ్రీరామునకు సూచనలను ఇచ్చుట.	295
4)	శ్రీరాముడు కౌసల్యామాతను దర్శించుట. ఆమె తనకుమారుని ఆశీర్వదించుట.	300
5)	వసిష్ఠమహర్షి సీతారాములచే ఉపవాసవ్రతదీక్షలను స్వీకరింపజేయుట.	304
6)	శ్రీరామునిపట్టాభిషేకవార్తను వినినంతనే ప్రజలు సంబరముతో పొంగిపోవుట, పురమంతయును అలంకారములతో మిలుమిల్లు గొల్పుట.	307
7)	కైకేయికి మంథరదుర్బోధ.	309
8)	'శ్రీరాముడు యువరాజైనచో నీవు, భరతుడు ఇక్కట్లపాలు అయ్యెదరు' అని మంథర కైకకు పెక్కువిధముల నూరిపోయుట.	313
9)	'శ్రీరాముని వనవాసమునకు పంపుట, భరతుని పట్టాభిషిక్తునిజేయుట' అను రెండువరములను సాధించుకొనుటకై - మంథర ప్రేరణచే కైక కోపగృహమున ప్రవేశించుట.	317
10)	కోపగృహమున నేలపైబడి దుర్మనస్కయైయున్న కైకనుజూచి, దశరథుడు మిగుల పరితపించి, ఆమెను పలువిధముల ఓదార్చుట, ఎట్టకేలకు ఆమె కొంత ఊరడిల్లుట.	323
11)	కైక దశరథమహారాజును ప్రతిజ్ఞాబద్ధునిగావించి, తన రెండు వరములను కోరుట.	326
12)	శ్రీరాముని వనములకు పంపెడివిషయమున దశరథుడు మిగుల పరితపించుచు కైకముందర తనఆవేదనను ప్రకటించుట.	329

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
13)	'శ్రీరాముని వనవాసమునకుపంపెడి యోచనను మానుము' - అని దశరథుడు కైకను వేడుకొనుట.	341
14)	'ఇచ్చినమాటను నిలబెట్టుకొనుము' - అని కైకేయి దశరథమహారాజును ఒత్తిడిచేయుట. వసిష్ఠాదులు రాజదర్శనమునకై వచ్చేయుట - శ్రీరాముని తీసికొనివచ్చుటకై కైకేయి సుమంత్రుని ఆదేశించుట.	344
15)	సుమంత్రుడు శ్రీరామునిమందిరమున ప్రవేశించుట.	349
16)	శ్రీరాముడు రథముపై దశరథుని మందిరమునకు బయలుదేఱుట.	354
17)	శ్రీరాముడు రాజవీథులను దాటుచు మహారాజప్రాసాదమున ప్రవేశించుట.	358
18)	శ్రీరాముడు తన తండ్రియైన దశరథుని దైన్యస్థితికి కారణమడుగుట. కైక తనకుమహారాజు ఇచ్చిన రెండు వరములనుగూర్చి వివరించుట.	361
19)	శ్రీరాముని వనగమనమునకై కైక ఆయనను తొందరపెట్టుట, దశరథునకును, తల్లి కైకేయికిని ప్రణమిల్లి, శ్రీరాముడు కౌసల్యామాతమందిరమునకు చేరుట.	364
20)	శ్రీరాముడు తనవనవాసవార్తను కౌసల్యామాతకు దెల్పుట - అంతట ఆమె తీరని దుఃఖమునకుగుఱియై, ఆక్రందించుచు తన వేదనను శ్రీరామునకు వివరించుట.	368
21)	'వనములకు వెళ్లవలదు' - అని లక్ష్మణుడును, కౌసల్యాదేవియు శ్రీరాముని ఒత్తిడిచేయుట - 'పితృవాక్య పరిపాలనము పరమధర్మము' అని శ్రీరాముడు వారికి నచ్చజెప్పి, తాను వనములకు వెళ్లుటకే నిశ్చయించుకొనుట.	373
22)	'యువరాజ పట్టాభిషేకము ఆగిపోవుట - వనవాసము ప్రాప్తించుట - అనునవి దైవికములే - ఈ రెండును నాకు సమానములే' అని శ్రీరాముడు లక్ష్మణునితో పల్కుట - మఱియు కైకేయియెడ గౌరవభావమును ప్రకటించుట.	380
23)	శ్రీరామునిపైగల అపారమైన భక్తికారణముగా లక్ష్మణుడు సాహసవచనములను పలుకుట - రాముడు తనదృఢసంకల్పమును వెల్లడించుట.	383
24)	"నన్నును నీవెంట తీసికొనిపొమ్ము" - అని కౌసల్య శ్రీరాముని కోరుట - "నీవు మహారాజునకు సేవలు చేయుచు ఇచట ఉండుటయే ధర్మము" - అని అతడు ఆమెకు నచ్చజెప్పుట.	387
25)	వనవాసమునకు బయలుదేఱనున్న శ్రీరామునకు కౌసల్యాదేవి శుభాశీస్సులను ఒసంగుట.	391
26)	శ్రీరాముడు రాజలాంఛనములు లేకుండవచ్చుటకుగల కారణములను సీతాదేవి అడుగుట - శ్రీరాముడు తనవనవాసవిషయములను వివరించి, పిదప రాజకుటుంబసభ్యులతో ఆమె మసలుకొనవలసినరీతిని దెల్పుట.	395
27)	'నేనును మీవెంట అరణ్యములకు వచ్చెదను'- అని సీతాదేవి శ్రీరాముని పలువిధములుగా ప్రార్థించుట.	398
28)	వనవాసమునందలి కష్టములనుగూర్చి శ్రీరాముడు సీతాదేవికి వివరించుట.	401
29)	'అన్ని పరిస్థితులలోను భార్య భర్తను అనుసరించుటయే యుక్తము' - అని పలికి సీతాదేవి పతివెంట వనములకు వెళ్లుటకు సిద్ధపడుట.	404
30)	సీతాదేవి తనవెంట వనములకు వచ్చుటకు శ్రీరాముడు సమ్మతించుట, అతడు మాతాపితృసేవలప్రాముఖ్యమును, పరమార్థమును ఆమెకు వివరించుట.	406
31)	'మీవెంట వనములకు నన్నును అనుమతింపుము.' అని లక్ష్మణుడు శ్రీరాముని ప్రార్థించుట - ఎట్టకేలకు శ్రీరాముడు అందులకు అనుమతించుట- అన్న సూచనపై లక్ష్మణుడు వసిష్ఠుని ఆశ్రమమునందున్న దివ్యాయుధములను తీసికొనివచ్చుట.	410
32)	శ్రీరాముడు వసిష్ఠునికుమారుడైన సుయజ్ఞునకును, ఇతర బ్రాహ్మణోత్తములకును సంతృప్తికరముగా కానుకలనొసంగుట - గర్గవంశమువాడైన త్రిజటునకు కోరుకొనిన రీతిగా గోసంపదను ఇచ్చుట.	414
33)	శ్రీరాముడు తనతండ్రియగు దశరథుని దర్శించుటకై సీతాలక్ష్మణులతోగూడి బయలుదేఱుట - నగరవాసులు వారినిజూచి దుఃఖితులగుట.	417

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
34)	వనవాసమునకు సిద్ధపడిన శ్రీరామునివిషయమున దశరథుడు కడుదుఃఖితుడగుట - శ్రీరాముడు తండ్రిని పలువిధముల ఓదార్చి, ఆయననుండి సెలవుగైకొనుట.	420
35)	సుమంత్రుడు కైకేయిని హెచ్చరించుచు ఆమెకు హితబోధచేయుట.	426
36)	శ్రీరాముడు వనవాసమును సుఖముగా గడపుటకై, ఆయనవెంట పరివారమును, పదార్థములను పంపుమని దశరథుడు సుమంత్రుని ఆదేశించుట. అందులకు కైకేయి అభ్యంతరము చెప్పుట - వృద్ధమంత్రి సిద్ధార్థుడు కైకేయికి హితము పలుకుట.	429
37)	కైకేయి స్వయముగా తెచ్చియిచ్చిన వల్కలములను రామలక్ష్మణులు ధరించుట, సీతాదేవి నారచీరలను ధరించునప్పుడు అచటనున్న అంతఃపురస్త్రీలు దుఃఖపడుట, ఈ సందర్భమున వసిష్ఠుడు కైకేయిని మందలించుట.	432
38)	సీతాదేవిచే నారచీరలను ధరింపజేసినందులకు దశరథుడు కైకను మందలించుట - శ్రీరాముడు తండ్రిని ఊరడించుట.	435
39)	దశరథునిపరితాపము - ఆయనఆజ్ఞపై పరిచారకులు సీతాదేవికి ఆభరణాదులను తెచ్చియిచ్చుట - కౌసల్యాదేవి సీతమ్మకు పతివ్రతాధర్మములను దెల్పుట.	437
40)	సీతారామలక్ష్మణులు మాతాపితరులకు నమస్కరించుట - సుమిత్రాదేవి లక్ష్మణునకు హితోక్తులు పల్కుట - వారు అందఱును రథమును ఎక్కగా సుమంత్రుడు ఆ రథమును అడవులవైపుగా వేగముతో నడుపుట.	441
41)	శ్రీరామునివనగమనమునకు మిగుల దిగులుపడి, అయోధ్యానగరమంతయును ఆర్తనాదములతో నిండిపోవుట.	446
42)	దుఃఖితుడైన దశరథుడు తనభవనమునకు చేరుట - అనంతరము అతడు కౌసల్యామందిరమున ప్రవేశించి, పరితపించుట.	448
43)	పుత్రునియెడబాటునకు గుఱియైన కౌసల్యాదేవి తనపతిసమక్షమున విలపించుట.	451
44)	శోకభారముతో మిగుల కుమిలిపోవుచున్న కౌసల్యాదేవిని సుమిత్రాదేవి యుక్తియుక్తములైన తన చల్లని మాటలతో ఓదార్చుట-ఆమె ఊరడిల్లుట.	454
45)	"మీరు అయోధ్యకు మఱలిపొండు." అని శ్రీరాముడు తనను అనుసరించివచ్చుచున్న ప్రజలకు హితవుపలుకుట - "మీరే అయోధ్యకు మఱలిరండు. లేదా మేము మీవెంట వచ్చుటకు అనుమతింపుడు" - అని విప్రోత్తములు శ్రీరాముని వేడుకొనుట.	457
46)	సీతారామలక్ష్మణులు ప్రజలతోగూడి తమసానదీతీరమున ఒకరాత్రి విడిదిచేయుట, ప్రజలకు తెలియకుండా వారు రథమునెక్కి, తమసానదిని దాటివెళ్లుట.	460
47)	ప్రజలు నిద్రనుండి మేల్కొనిన పిమ్మట శ్రీరాముడు కన్పింపకపోవుటచే కొంతసేపు తికమకపడుట - ఎట్టకేలకు వారు అయోధ్యకు చేరుట - వెలవెలబోవుచున్న ఆ నగరమును జూచి, వారు మిగుల దుఃఖపడుట.	464
48)	శ్రీరామునివీడి అయోధ్యకు తిరిగివచ్చిన పురుషులను వారిపత్నులు నిందించుట - ఆ నగరస్త్రీలు సీతారాములకై విలపించుట.	466
49)	సీతారాములను వనములపాలుచేసినందులకు పల్లెప్రజలు కైకేయీదశరథులను తప్పుపట్టుట - సీతారామలక్ష్మణులు గోమతీనదిని దాటి, స్యందికా (సఈ) నదియొక్క ఆవలితీరమునకు చేరుట.	469
50)	కోసలదేశపు పొలిమేరలకు చేరినపిమ్మట శ్రీరాముడు అయోధ్యకు నమస్కరించుట. అనంతరము వారు గంగాతీరమునగల శృంగిబేరపురమును చేరుట-గుహుడు వారికి సేవలొనర్చుట. సీతారామలక్ష్మణులు గారచెట్టును ఆశ్రయించి, ఆ రాత్రిని అచట గడుపుట.	471
51)	నిషాదరాజుసమక్షమున లక్ష్మణునిపరితాపము.	476
52)	శ్రీరామునిసూచనపై గుహుడు నావను సిద్ధముచేయించుట - పిమ్మట రఘువరుడు సుమంత్రునకు నచ్చజెప్పి అతనిని వీడ్కొనుట - వారు నావను ఎక్కి, గంగనుదాటునప్పుడు సీతాదేవి గంగను పూజించుట - వారు ఆవలితీరమునకుచేరి, వత్సదేశమున ప్రవేశించుట.	478

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
76)	భరతుడు తనతండ్రియగు దశరథునకు అంత్యక్రియలొనర్చుట.	569
77)	భరతశత్రుఘ్నులు తమతండ్రికి అగ్నిసంస్కారములుచేసిన ప్రదేశమునకుచేరి విలపించుట.	571
78)	శత్రుఘ్నుడు మంథరను శిక్షించుట.	574
79)	మంత్రులు మొదలగువారు రాజ్యాధికారమును చేపట్టుమని భరతుని ప్రార్థించుట - 'ఈ రాజ్యమునకు శ్రీరాముడే ప్రభువు' - అని భరతుడు ప్రకటించుట.	576
80)	భరతునిఆదేశానుసారము శ్రీరామునికడకు వెళ్లుటకై సచివులు చక్కని మార్గములను, ఇంకను వలసిన ఏర్పాట్లను పూర్తిచేయించుట.	578
81)	వసిష్ఠమహర్షి పిలుపుపై భరతశత్రుఘ్నులు, మంత్రులు మొదలగు ప్రముఖులు సభాభవనమునకు విచ్చేయుట.	580
82)	శ్రీరాముని అయోధ్యకు గొనివచ్చుటకై భరతుడు తననిర్ణయమును నిండుసభలో ప్రకటించుట. ఆయనఆదేశముప్రకారము సచివులు ప్రయాణసన్నాహములు గావించుట.	582
83)	శ్రీరామునిగొనివచ్చుటకై భరతుడు తనపరివారములతో, అయోధ్యావాసులతో బయలుదేరుట - వారు గంగాతీరమునగల శృంగిబేరపురమునకు చేరుట.	585
84)	గుహుడు భరతునిరాకలోని ఆంతర్యము తెలియక 'యుద్ధసన్నద్ధులైయుండుడు' అని తనవారిని ఆదేశించుట. భరతుని భావమును గ్రహించుటకై అతడు కానుకలతో ఎదురేగి, వారిని తనపురమునకు ఆహ్వానించుట.	587
85)	భరతగుహులఆత్మీయసంభాషణము - దుఃఖమగ్నుడైన భరతుని గుహుడు ఓదార్చుట.	589
86)	శ్రీరామునిపై లక్ష్మణునకుగల భక్తిభావమును గూర్చి గుహుడు భరతునకు వివరించుట.	591
87)	సీతారామలక్ష్మణులు వనవాసదీక్షను స్వీకరించినతీరును విని భరతుడు దుఃఖితుడై మూర్ఛిల్లుట. కౌసల్యాదిమాతలు ఆయనను ఓదార్చుట - గంగాతీరమున నారచెట్టుక్రింద సీతారామలక్ష్మణులు ఒక రాత్రిని గడపిన విధానమును గుహుడు భరతునకు తెల్పుట.	594
88)	మహారాజసుఖములకు అర్హులైన సీతారాములు కటికినేలమీద, తృణశయ్యపై శయనించినారని విని, భరతుడు మిగుల ఖిన్నుడగుట.	596
89)	భరతుడు గుహునిసహకారముతో సపరివారముగా గంగానదిని దాటుట - పిమ్మట భరద్వాజాశ్రమమునకు చేరుట.	599
90)	భరతుడు భరద్వాజుని దర్శించుట - శ్రీరాముని అయోధ్యకు తోడ్కొనివెళ్లుటకై తాను వచ్చినట్లు అతడు ఆ మహర్షికి విన్నవించుకొనుట.	601
91)	భరతునకును, ఆయనపరివారములకును భరద్వాజుడు దివ్యములగు పదార్థములతో ఆతిథ్యమొసంగుట - అందఱును పరమానందభరితులగుట.	603
92)	భరద్వాజమహర్షి అనుమతితో భరతుడు సపరివారముగా చిత్రకూటమునకు బయలుదేరుట.	610
93)	భరతుడు తనపరివారముతోగూడి, వనప్రదేశముల అందచందములను దర్శించుచు ముందునకు సాగుట - పొగలుపైకి లేచుచున్న ప్రదేశమును గమనించుట.	614
94)	శ్రీరాముడు సీతాదేవితోగూడి చిత్రకూటపర్వతప్రదేశమున విహరించుచు ఆ వనశోభలను వర్ణించి చెప్పుట.	616
95)	శ్రీరాముడు సీతాదేవికి మందాకినీనదీతీరముల మనోహరదృశ్యములను చక్కగా వివరించుట.	619
96)	అడవిమృగములఅలజడులనుజూచిన శ్రీరాముడు 'అందులకు కారణముతెలిసికొనుము' అని లక్ష్మణుని ఆదేశించుట. భరతుడు సైన్యములతో అచటకువచ్చినట్లు గమనించి, లక్ష్మణుడు అతనిపై కారాలు మిరియాలు నూఱుచు అన్నతో పల్కుట.	621
97)	భరతునియెడ కుపితుడైయున్న లక్ష్మణుని శ్రీరాముడు చల్లబఱచుట.	624
98)	భరతుడు శ్రీరామునిదర్శనమునకై ఆరాటపడుట- ఆ మహాత్మునిఆశ్రమము కనబడినంతనే ఆనందించుట.	627
99)	శ్రీరామభరతులసమాగమము.	628
100)	కుశలప్రశ్నలరూపములో శ్రీరాముడు భరతునకు రాజనీతిధర్మములను బోధించుట.	632

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
101)	దశరథమహారాజు స్వర్గస్థుడైనట్లు భరతుడు తన అన్నయగు శ్రీరామునకు తెల్పుట, 'అయోధ్యకువచ్చి రాజ్యాధికారమును చేపట్టుము' అని అతడు తనఅన్నను అభ్యర్థించుట.	642
102)	శ్రీరాముడు తనతండ్రిమృతికి విలపించుట - ఆయనకు పిండోదకములను సమర్పించుట. జనులందఱును త్వరత్వరగా ఆశ్రమమునకువచ్చి శ్రీరాముని దర్శించుట.	643
103)	కౌసల్యాదేవి వసిష్ఠునితో, తోడి రాజపత్నులు మున్నగువారితోగూడి మందాకినీతీరమునకు జేరుట. అచట రాముడొనర్చిన పితృశ్రాద్ధక్రియలచిహ్నములను గాంచి దుఃఖించుట - అందఱును చిత్రకూటము నందలి ఆశ్రమమున సీతారామాదులను కలిసికొనుట.	647
104)	'అయోధ్యకు విచ్చేసి, రాజ్యపాలనమును స్వీకరింపుము' - అని భరతుడు శ్రీరాముని అభ్యర్థించుట - తండ్రియాజ్ఞను పాలించుటయే తనకు శ్రేయస్కరము, కర్తవ్యము - అని శ్రీరాముడు అతనికి తెల్పుట.	651
105)	'అన్నా! అయోధ్యను పాలించుటకు నీవే అర్హుడవు' అని భరతుడు శ్రీరామునకు విన్నవించుకొనుట - 'జననమరణములు అనివార్యములు' కావున తండ్రిమృతికి చింతింపకుము - అని పలుకుచు శ్రీరాముడు "మనకు తండ్రిఆజ్ఞ శిరోధార్యము" - అని హితవు పలుకుట.	653
106)	అయోధ్యకు విచ్చేయుమని భరతుడు శ్రీరాముని పరిపరివిధముల వేడుకొనుట.	658
107)	'మనతండ్రిని సత్యసంధునిజేయుటయే మనకర్తవ్యము'. కనుక నీవు రాజ్యపాలన గావింపుము - నేను వనవాసము చేసెదను.' - అని శ్రీరాముడు భరతునితో పల్కుట.	661
108)	జాబాలి శ్రీరామునకు నాస్తికవాదమును వినిపించుట - రాజ్యపాలనము చేయుమనినుడువుట.	663
109)	జాబాలియొక్క నాస్తికవాదమును ఖండించుచు శ్రీరాముడు సత్యముయొక్క వైశిష్ట్యమును పేర్కొనుట.	665
110)	వసిష్ఠుడు శ్రీరామునివంశముయొక్క పుట్టుపూర్వోత్తరములను వివరించి, కోసలరాజ్య పరిపాలనను చేపట్టుమని ఆ ప్రభువును కోరుట.	669
111)	'అయోధ్యకు తిరిగిరమ్ము' - అని వసిష్ఠుడు ఎంతగా చెప్పినను - శ్రీరాముడు తండ్రియాజ్ఞను పాలించుటకే దృఢముగా నిలబడుట - ఆ కారణముగా భరతుడు నిరాహారదీక్షకు సిద్ధపడుట - శ్రీరాముడు అతనిని సముదాయించుట.	672
112)	శ్రీరామభరతులకలయికను జూచి ఋషీశ్వరులందఱును పొంగిపోవుట - భరతునిప్రార్థనపై శ్రీరాముడు తనపాదుకలను ఆయనకు ఒసంగుట - పిమ్మట అతడు అందఱికిని వీడ్కోలు పలుకుట.	674
113)	చిత్రకూటమునుండి సపరివారముగా బయలుదేరిన భరతుడు మార్గమధ్యమున భరద్వాజమహర్షి ఆశీస్సులనుగొని, తిన్నగా అయోధ్యకు చేరుట.	677
114)	భరతుడు అయోధ్యానగరమున ప్రవేశించి, దానిదుఃస్థితినిజూచి, కన్నీరుగార్చుట.	679
115)	భరతుడు తల్లులకు నమస్కరించి, నందిగ్రామమునకు చేరుట - పాదుకలకు పట్టాభిషేకమొనర్చుట - సమస్తకార్యములను వాటికి నివేదించుచు రాజ్యపాలనము చేయుచుండుట.	683
116)	ఋషులందఱును కులపతితోగూడి చిత్రకూటమును వీడి వెళ్లుట.	686
117)	శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై అత్రిమహర్షి ఆశ్రమమునకు చేరుట - ఆ మహాముని వారికి స్వాగతమర్యాదలను నెఱపి, అనసూయాదేవి తపఃప్రభావమును దెల్పుట - అనసూయాదేవి సీతాదేవికి స్త్రీ ధర్మములనుగూర్చి వివరించుట.	689
118)	అనసూయాదేవి సీతాదేవికి దివ్యములైన అంగరాగములను వస్త్రాభరణాదులను కానుకలుగా సమర్పించుట - ఆ ఋషిపత్నికోరికపై సీతాదేవి తనవివాహగాథను ఆమెకు వివరించుట.	691
119)	అనసూయాదేవి కోరికపై ఆమె ఇచ్చిన వస్త్రాభరణాదులను సీతాదేవి ధరించుట - అలంకృతయై తనకడకు వచ్చిన సీతాదేవినిజూచి శ్రీరాముడు సంతోషించుట - మునీశ్వరుల ఆశీస్సులనుగొని శ్రీరాముడు సీతాలక్ష్మణులతో దండకారణ్యమున ప్రవేశించుట.	697
	దాశరథి శతకము	699

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
101)	దశరథమహారాజు స్వర్గస్థుడైనట్లు భరతుడు తన అన్నయగు శ్రీరామునకు తెల్పుట. 'అయోధ్యకువచ్చి రాజ్యాధికారమును చేపట్టుము' అని అతడు తనఅన్నను అభ్యర్థించుట.	642
102)	శ్రీరాముడు తనతండ్రిమృతికి విలపించుట - ఆయునకు పిండోదకములను సమర్పించుట. జనులందఱును త్వరత్వరగా ఆశ్రమమునకువచ్చి శ్రీరాముని దర్శించుట.	643
103)	కౌసల్యాదేవి వసిష్ఠునితో, తోడి రాజపత్నులు మున్నగువారితోగూడి మందాకినీతీరమునకు జేరుట. అచట రాముడొనర్చిన పితృశ్రాద్ధక్రియలచిహ్నములను గాంచి దుఃఖించుట - అందఱును చిత్రకూటము నందలి ఆశ్రమమున సీతారాములను కలిసికొనుట.	647
104)	'అయోధ్యకు విచ్చేసి, రాజ్యపాలనమును స్వీకరింపుము' - అని భరతుడు శ్రీరాముని అభ్యర్థించుట - తండ్రియాజ్ఞను పాలించుటయే తనకు శ్రేయస్కరము, కర్తవ్యము - అని శ్రీరాముడు అతనికి తెల్పుట.	651
105)	'అన్నా! అయోధ్యను పాలించుటకు నీవే అర్హుడవు' అని భరతుడు శ్రీరామునకు విన్నవించుకొనుట - 'జననమరణములు అనివార్యములు' కావున తండ్రిమృతికి చింతింపకుము - అని పలుకుచు శ్రీరాముడు "మనకు తండ్రిఆజ్ఞ శిరోధార్యము" - అని హితవు పలుకుట.	653
106)	అయోధ్యకు విచ్చేయుమని భరతుడు శ్రీరాముని పరిపరివిధముల వేడుకొనుట.	658
107)	'మనతండ్రిని సత్యసంధునిజేయుటయే మనకర్తవ్యము', కనుక నీవు రాజ్యపాలన గావింపుము - నేను వనవాసము చేసెదను.' - అని శ్రీరాముడు భరతునితో పల్కుట.	661
108)	జాబాలి శ్రీరామునకు నాస్తికవాదమును వినిపించుట - రాజ్యపాలనము చేయుమనినుడువుట.	663
109)	జాబాలియొక్క నాస్తికవాదమును ఖండించుచు శ్రీరాముడు సత్యముయొక్క వైశిష్ట్యమును పేర్కొనుట.	665
110)	వసిష్ఠుడు శ్రీరామునివంశముయొక్క పుట్టుపూర్వోత్తరములను వివరించి, కోసలరాజ్య పరిపాలనము చేపట్టుమని ఆ ప్రభువును కోరుట.	669
111)	'అయోధ్యకు తిరిగిరమ్ము' - అని వసిష్ఠుడు ఎంతగా చెప్పినను - శ్రీరాముడు తండ్రియాజ్ఞను పాలించుటకే దృఢముగా నిలబడుట - ఆ కారణముగా భరతుడు నిరాహారదీక్షకు సిద్ధపడుట - శ్రీరాముడు అతనిని సముదాయించుట.	672
112)	శ్రీరామభరతులకలయికను జూచి ఋషీశ్వరులందఱును పొంగిపోవుట - భరతునిప్రార్థనపై శ్రీరాముడు తనపాదుకలను ఆయునకు ఒసంగుట - వీడ్కొట అతడు అందఱికిని వీడ్కోలు పలుకుట.	674
113)	చిత్రకూటమునుండి సపరివారముగా బయలుదేఱిన భరతుడు మార్గమధ్యమున భరద్వాజమహర్షి ఆశీస్సులనుగొని, చివ్వగా అయోధ్యకు చేరుట.	677
114)	భరతుడు అయోధ్యానగరమున ప్రవేశించి, దానిదుస్థితినిజూచి, కన్నీరుగార్చుట.	679
115)	భరతుడు తల్లులకు నమస్కరించి, నందిగ్రామమునకు చేరుట - పాదుకలకు పట్టాభిషేకమొనర్చుట - సమస్తకార్యములను వాటికి నివేదించుచు రాజ్యపాలనము చేయుచుండుట.	683
116)	ఋషులందఱును కులపతితోగూడి చిత్రకూటమును వీడి వెళ్ళుట.	686
117)	శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై అత్రిమహర్షి ఆశ్రమమునకు చేరుట - ఆ మహాముని వారికి స్వాగతమర్యాదలను నెఱపి, అనసూయాదేవి తపఃప్రభావమును దెల్పుట - అనసూయాదేవి సీతాదేవికి స్త్రీ ధర్మములనుగూర్చి వివరించుట.	689
118)	అనసూయాదేవి సీతాదేవికి దివ్యములైన అంగరాగములను వస్త్రాభరణాదులను కానుకలుగా సమర్పించుట - ఆ ఋషిపత్నికోరికపై సీతాదేవి తనవివాహగాథను ఆమెకు వివరించుట.	691
119)	అనసూయాదేవి కోరికపై ఆమె ఇచ్చిన వస్త్రాభరణాదులను సీతాదేవి ధరించుట - అలంకృతయై తనకడకు వచ్చిన సీతాదేవినిజూచి శ్రీరాముడు సంతోషించుట - మునీశ్వరుల ఆశీస్సులనుగొని శ్రీరాముడు సీతాలక్ష్మణులతో దండకారణ్యమున ప్రవేశించుట.	697
	దాశరథి శతకము	699

శ్రీసీతారామాభ్యాం నమః

శ్రీమద్రామాయణ మహిమ

బ్రహ్మలీన - శ్రీ జయదయాల్ గోయందకా

శ్లో ॥ ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

వేదవిజ్ఞానరహస్యములఅవగాహనమునకు ఇతిహాసపురాణములను అధ్యయనముచేయుట ఎంతయు అవశ్యకము - ఇతిహాసపురాణములను లోతుగా అధ్యయనముచేయని అల్పజ్ఞుడు వేదములను (వేదరహస్యములను) గూర్చి ప్రస్తావించుటకు పూనుకొనినప్పుడు వానిని జూచి, "వేదములకు విపరీతార్థములను కల్పించి చెప్పుచు యథార్థములను భ్రష్టుపట్టించును" - అని వేదములు భీతిల్లును.

వాస్తవముగా వేదములను అధ్యయనముచేయుటకు కొంతమంది మాత్రమే అర్హులు. వేదభాష మిక్కిలి ప్రాచీనమైనది. వేదార్థములు మిగుల గంభీరములు, ఊహలకు అందనివి. అందువలన వేదములను అందఱును సులభముగా అర్థము చేసికొనజాలరు. యుగధర్మమునుబట్టి వేదమును పరంపరగా పఠించుటయు (అధ్యయనముచేయుటయు) బోధించుటయు ఈ కాలమున క్రమముగా సన్నగిల్లుచున్నది. బ్రాహ్మణులలోసైతము ఎంతగా వెదకినను అతికష్టముమీద అరుదుగా మాత్రమే వేదపండితులు లభింతురు. ఏలననగా వేదములను సాంగోపాంగముగా అధ్యయనము చేయుటకు అధికసమయము, సూక్ష్మబుద్ధి ఈ రెండును ఆవశ్యకములు. ఈ కాలమున ఈ రెండును లోపించుచున్నట్లు కనబడుచున్నది. రానురాను మానవుల ఆయుర్దాయము, బుద్ధి తగ్గిపోవుచున్నవి. వేదములను అధ్యయనము చేయుటకు బ్రహ్మచర్యముగూడ చాల ముఖ్యము. బ్రహ్మచర్యదీక్షను పాటించుటగూడ జనులలో లోపించుచున్నది. ఈ విషయములను దృష్టిలో ఉంచుకొనియే త్రికాలజ్ఞులైన మనమహర్షులు వేదవిజ్ఞానము సామాన్యజనులకు అందుబాటులోనుండునట్లుగా సరళమై, సుబోధకమైన భాషలో ఆకర్షణీయమైనశైలిలో ఇతిహాసములను, పురాణములను రచించిరి.

ఇతిహాసగ్రంథములలో శ్రీమద్రామాయణము, మహాభారతము అను రెండుమాత్రమే ప్రస్తుతము లభించుచున్నవి. ఈ రెండుగ్రంథములు భారతీయవాఙ్మయమునకు తలమానికములు, ఆర్యసభ్యతకు పట్టుగొమ్మలు. ఇవి భారతీయగౌరవమును ఇనుమడింపజేయునవి. ఈ రెండింటిలో భక్తి, జ్ఞాన, వైరాగ్యములు, సదాచారములు, నీతినియమములు, ధర్మము మున్నగువాని ప్రబోధములు అడుగడుగునను కన్పట్టుచుండును. రామాయణమునందు మర్యాదాపురుషోత్తముడైన శ్రీరామచంద్రప్రభువుయొక్క దివ్యలీలలు వర్ణింపబడినవి. మహాభారతమున మణిమాలలో దారమువలె లీలాపురుషోత్తముడైన శ్రీకృష్ణభగవానునిమహిమలు అవిచ్ఛిన్నముగా ప్రస్తావింపబడినవి. ఈ రెండింటియందును చైతన్యవంతమైన భారతీయసంస్కృతియొక్క సజీవరూపము తొణికిసలాడుచుండును. సంస్కృతసాహిత్యమునందు వెలువడిన దృశ్య, శ్రవ్య కావ్యములన్నింటికిని (నాటకములు, ప్రబంధములు, సంకీర్తనలు మున్నగువానికన్నింటికిని) దాదాపు ఈ రెండు ఇతిహాసగ్రంథములే ఆధారములు.

ఋషిప్రణీతములై, ఆర్యసంస్కృతికి మూలములైన ఈ రెండుగ్రంథములును నిత్యసత్యములైన ఇతిహాసములుగా చిరస్థిరకీర్తిని ఆర్జించినవి. అట్లే కవితాదృష్టిలోగూడ వాఙ్మయరంగమున అత్యున్నతస్థానమును అలంకరించినవి. ఐనను మహాభారతమునకు ఇతిహాసముగా వచ్చిన గుర్తింపు కావ్యముగా రాలేదు. వాల్మీకి ప్రణీతమైన శ్రీమద్రామాయణమునకు మాత్రము ఇతిహాసముగానేగాక 'ఆదికావ్యము'గా గూడ ఎనలేని గౌరవము దక్కినది. ఈ మహాకావ్యము కాంతవలె ఆనందింపజేయుచు[1] కర్తవ్యమును ఉపదేశించును. ఇదియే ఈ రామాయణముయొక్క విశేషము.

'సత్యంవద, ధర్మంచర, ఆచారాన్మాప్రమదః, ప్రజాతంతుం మావ్యవచ్ఛేత్సీః' - మున్నగు విధివాక్యములద్వారా వేదములు గురువువలె ఉపదేశించును. ఇతిహాసపురాణములు మాత్రము 'రామవత్ వర్తితవ్యం న రావణవత్' అను విధముగా మిత్రునివలె హితబోధ చేయును. కావ్యములైతే కాంతవలె ప్రేమానురాగములను రంగరించుచు ఆకర్షణీయములైన మృదుమధురవచనములతో మనలను కర్తవ్యపథమునకు మఱల్చును. రామాయణమునందలి శ్రీరామచంద్రుని 'మాతృభక్తి, పితృభక్తి' కావ్యరూపవర్ణనలప్రభావము మనపై ఉన్నట్లు "మాతృదేవోభవ, పితృదేవోభవ" అను వేదవాక్యములప్రభావము అంతగా ఉండదు. కాంతాసమ్మితములై ఉపదేశములనందించు కావ్యములలో వాల్మీకిరామాయణమహాకావ్యముయొక్క స్థానము సర్వోన్నతమైనది. రచనాకౌశలము, కావ్యవస్తు గౌరవము - అను ఈ రెండింటినిబట్టి రామాయణము ప్రపంచమునందలి సమస్తకావ్యములకును మకుటాయమానము.

వాల్మీకిరామాయణము (1) 'ఆయా పరిస్థితులలో వ్యక్తులు ఎవరెవరితో ఎట్లు ప్రవర్తింపవలెను?' - అను సామాజిక విషయములను నొక్కిచెప్పును. (2) ప్రతివ్యక్తియు తన కుటుంబసభ్యులకును, లోకములోని ఇతరులకును సుఖములను చేకూర్చుటకై పాటుపడుట తనవిధిగా భావింపవలెనని తెలుపును. అందులకై అవసరమగుచో తనవ్యక్తిగతమైన సుఖములను త్యజించుటకును, ఎట్టి కష్టములనైనను సహనముతో భరించుటకును సిద్ధపడవలెను-' అను నైతికబాధ్యతను వక్కాణించును. (3) అంతేగాక సత్యము, న్యాయము, సదాచారము, ప్రతిజ్ఞాపాలనము మొదలగు ఉదాత్తధర్మములను పాటించుచు, ఆదర్శజీవనమును గడిపెడివిధానములను ప్రబోధించును. ఈ విధముగా వాల్మీకిరామాయణము వివిధములైన సామాజిక, నైతిక, ధార్మిక విషయముల ప్రబోధములకు పెన్నిధి. ఇందు అవతారపురుషుడైన శ్రీరామచంద్రునియొక్క దివ్యములైన మానుషలీలలు సర్వాంగసుందరముగా చిత్రింపబడినవి. ఇంకను ఇందు జగజ్జననియైన సీతాదేవియొక్క ఆదర్శవంతమైన పాతివ్రత్యము, భరతునినిరుపమానమైన భ్రాతృభక్తి, త్యాగగుణము, దశరథమహారాజుయొక్క అపూర్వమైన వాత్సల్యము, కౌసల్యాదేవియొక్కమహోన్నతసౌజన్యము, ఆదర్శప్రాయమైన శ్రవణకుమారునిపితృభక్తి, హనుమంతునియొక్క సాటిలేని స్వామిభక్తి, విభీషణునియొక్క అసాధారణమైన న్యాయదృష్టి, శ్రీరామునియెడ ప్రజలయొక్క స్వాభావికములైన గాఢానురాగములు సందర్భానుసారముగా చక్కగా వర్ణితములు. అంతేగాక పురుషోత్తముడైన శ్రీరామచంద్రప్రభువునకు అందఱియెడలనుగల సంపూర్ణమైన దయ, చక్కని శ్రద్ధాదరములు, ప్రేమానురాగములు, వీటన్నింటితోగూడిన యోగ్యమైన వ్యవహారసరళి ఇందు సాంగోపాంగముగా

(1) *1) ప్రభుసమ్మితో వేదః = వేదము ప్రభువువలె కర్తవ్యమును శాసించును.*

2) మిత్రసమ్మితం పురాణమ్ = పురాణము మిత్రునివలె కర్తవ్యమును సూచించును.

3) కాంతాసమ్మితం కావ్యమ్ = కావ్యము కాంతవలె ఆనందింపజేయుచు కర్తవ్యపథమునకు మఱలించును.

ప్రతిపాదింపబడినవి. ఇందలి శ్లోకములన్నియును మిక్కిలి మధురములు, రుచిరములు. ఇవి మహాకావ్యోచితములైన గుణములతో, శబ్దార్థాలంకారములతో సుశోభితములు. రాగతాళయుక్తముగా గానముచేయుటకు అనువైనవి, గంభీరార్థయుక్తములు. సమయోచితముగా ఇందు శృంగార, వీరకరుణాద్భుతాది నవరసములు పరిపుష్టములైనవి. రసములన్నింటికిని ఇది కుదురైయైనను కరుణరసముమాత్రము దీనికి ప్రాణము. ఏ దృష్టితో చూచినను ఇది అందఱును ఆదరింపదగిన (అందఱి అభిరుచులను తీర్పగల) ఉత్తమగ్రంథము.

'వాల్మీకిరామాయణము సర్వోత్కృష్టమైన ఒక మహాకావ్యము. అంతేగాక ఇది శ్రీరామచంద్రప్రభువుయొక్క అవతారలీలావిశేషములను తెలుపునట్టి చక్కని ఇతిహాసము' - అను విషయము విస్మరింపరానిది. 'స్వయంభువు' అని బ్రహ్మదేవుడే వాల్మీకిమహామునికి సాక్షాత్కరించి, రామాయణమును రచించుటకు ఆ మునిని ప్రోత్సహించెను. మఱియు ఆతడు "శ్రీరామునివృత్తాంతమునకు సంబంధించిన విశేషములన్నియును నీకు సహజముగనే కరతలామలకములగును." అని ఆ మహర్షికి వరమును ప్రసాదించెను. ఆ వరప్రభావమున కథావిషయములన్నియును ఆ మునీశ్వరునిమనస్సునకు స్పష్టముగా గోచరించెను. కావ్యనాయకుడైన శ్రీరామచంద్రునిఅవతారకాలముననే వాటిని ఆ మహర్షి శ్లోకబద్ధమొనర్చెను. అంతేగాదు శ్రీరామచంద్రుని కుమారులైన లవకుశులచే వాటిని కంఠస్థముచేయించెను. వారిచేతనే రాబోవు సంఘటనలతోసహా ఆ వృత్తాంతమును సంపూర్ణముగా శ్రీరామునిసమక్షముననే నిండుసభలో వినిపింపజేసెను. ఈ విధముగా ఈ ఇతిహాసగాథకు శ్రీరామునిఆమోదము లభించినట్లైనది. దీనిప్రామాణికవిషయమున ఇంతకంటె చెప్పవలసినదేమియుండును? శ్రీరామునిఆమోదముద్రకు నోచుకొనిన ఈ మహాకావ్యమునందు అసత్యములుగాని, దోషములుగాని, అతిశయోక్తులుగాని ఉండునని ఊహించుటకు ఏమాత్రమును వీలులేదు. ఇది సకలజనులకు ఆదరణీయము, మిగుల ప్రయోజనకరము ఈ రామాయణమహాకావ్యమును (ఈ రామగాథను) ప్రచారముచేయుటవలన అనంతమైన లోకకల్యాణము సిద్ధించును.

ప్రపంచమునందలి అన్ని జాతులవారును, అన్ని వర్గములవారును (మానవులెల్లరును) దీనిని పఠించుటకును, వినుటకును అర్హులే. ప్రతివ్యక్తియు దీనిని శ్రద్ధగా పఠించి, అవగాహనచేసికొని, ఇందలి ఉత్తమోత్తమ-ఉపదేశములను యథాశక్తి ఆచరించినచో ఆతనిజీవితము ఆదర్శప్రాయమై సఫలమగును.

❖ ❖ ❖

ప్రస్తావన

శ్రీరామావతారపరమార్థము

పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే ॥

"దుష్టులను శిక్షించుటద్వారా సత్పురుషులను రక్షించుటకును, ధర్మమును సుస్థిరమొనర్చుటకును ప్రతియుగమునందును నేను అవతరించుచుందును." - అని గీతాచార్యుడు తెలిపెను.

త్రేతాయుగమునందు రావణుడు కఠోరమైన తపస్సొనర్చి బ్రహ్మదేవునినుండి గొప్పవరములనుపొందెను. తదాది అతడు పరగర్వితుడై చేయుచున్న ఆగడములకు అంతులేకుండెను. ఫలితముగా తపోజీవనులైన ఋషీశ్వరులును, దేవతలెల్లరును లోకకంటకుడైన రావణుడుపెట్టెడి అంతులేని బాధలకు తట్టుకొనలేకుండిరి. వారితపస్సులు భంగముగుచుండెను, యజ్ఞయాగాదులకు విఘ్నములు ఎదురుకాసాగెను. కడకు వారి జీవితములే దుర్భరములయ్యెను. ఇంతయేల దేవతలకేగాక దేవేంద్రునకును దిక్కులేనిస్థితి దాపురించెను. చేయునదిలేక బ్రహ్మాదిదేవతలు అందఱును శ్రీమన్నారాయణుని శరణుజొచ్చి, ఆయనకు తమ కష్టగాథలను తెలుపుకొని, తమను రక్షింపవలసినదిగా పలువిధముల మొఱపెట్టుకొనిరి. అప్పుడు ఆ శ్రీహరి వారికి అభయమొసంగెను.

రావణుడు బ్రహ్మదేవుని వరములను అడుగుచు 'యక్షగంధర్వులవలనగాని, దేవదానవులవలనగాని, రాక్షసులవలనగాని తనకు మరణములేకుండునట్లు కోరియుండెను. కాని మానవులయెడగల చులకనభావముచే అతడు వారివలన తనకు మృత్యువు కలుగకుండునట్లు అడుగలేదు. కావున దేవతలసూచననుసరించి శ్రీమహావిష్ణువు "మానవుడై" 'శ్రీరాముడు'గా అవతరించెను. దుర్మార్గములకు ఒడిగట్టిన రావణుడు మిక్కిలి తపశ్శక్తిగలవాడు. అట్టివానిని సంహరించుటకు శ్రీరాముడుగూడ గొప్ప తపఃఫలములను సంపాదించెను. పిమ్మట అతడు ఆ దుష్టుని తుదముట్టించి, సమస్తలోకములవారిని పరిరక్షించెను. 'రామాయణము'గా వాసికెక్కిన శ్రీరామునివృత్తాంతము అంతయును మహాతపస్సునకు ఫలరూపముగా దర్శనమిచ్చును.

తైత్తిరీయ-ఉపనిషత్తు తపస్సునుగూర్చి ఇట్లు పేర్కొనినది. 'ఋతం తపః, సత్యం తపః, శ్రుతం తపః, శాంతం తపః, దమస్తపః, శమస్తపః, దానం తపః, యజ్ఞం తపః ------- పితద్బ్రహ్మ'. ఋజువర్తనము, సత్యవాక్పరిపాలనము, వేదశాస్త్రముల అధ్యయనము, శాంతస్వభావము, బాహ్యేంద్రియములను అదుపుచేయుట, అంతరింద్రియనిగ్రహము, దానధర్మములను ఆచరించుట, యజ్ఞములను నిర్వహించుట మున్నగు పవిత్రకార్యములన్నియును తపశ్చర్యలే - ఇవి దివ్యశక్తిప్రదాయకములు.

దుష్టరావణుని సంహరించుటయే శ్రీరాముని ప్రధానలక్ష్యము. అందులకై శ్రీరాముడు అతని తపోనిష్ఠను మించిన తపశ్శక్తిని కలిగియేయుండవలెను. ఆ రాఘవుడు సాధించిన తపఃప్రభావములు ఈ రామాయణమునందు మొదటినుండి తుదివఱకు శ్రద్ధగా పరికించినచో చక్కగా గోచరమగును.

అశ్వమేధాది మహాయజ్ఞములను ఆచరించిన దశరథుడు సత్యసంధుడు. సత్త్వగుణసంపన్నురాలైన కౌసల్యాదేవి మహాపతివ్రత. ఆమె నోచిననోములకును, చేసిన దానధర్మములకును లెక్కయేలేదు. ఆ పుణ్యదంపతులతపఃఫలముగా వారికి పుత్రుడై ఈ భూలోకమున అవతరించిన మర్యాదాపురుషోత్తముడు శ్రీరాముడు. 'బ్రహ్మర్షి'యైన వసిష్ఠునికడ వేదములను, వేదాంగములను, సకలశాస్త్రములను అభ్యసించుట, మహాతపస్వియైన విశ్వామిత్రునినుండి అస్త్రశస్త్రములను గ్రహించుట, వనవాసదీక్షలో భరద్వాజమహర్షి, అత్రిమహాముని, అగస్త్యమునీశ్వరుడు, సుతీక్ష్ణమునిపుంగవుడు మొదలగువారి ఆశీస్సులతో వారి మహాతపఃఫలములను సమకూర్చుకొనిన శ్రీరామచంద్రుడు ఆ దివ్యతపశ్శక్తులకు ప్రతిరూపమై

భాసిల్లెను. శ్రీమద్రామాయణము లోకమున అవతరించుటకు మూలపురుషుడైన వాల్మీకి ఒకమహాతపస్వి. ఆ మునికి శ్రీరామగాథను అనుగ్రహించిన నారదుడు వేదశాస్త్రములను అభ్యసించినవాడు, గొప్పయోగిపుంగవుడు, దివ్యతపస్వి. వారు పూజ్యులు, చిరస్మరణీయులు

వాల్మీకి నారద సంవాదము

శ్లో ॥ తపఃస్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరమ్ । నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్ ॥

తపశ్శాలుడును, వేదాధ్యయననిరతుడును, వాక్చతురులలో అగ్రేసరుడును, మునిశేఖరుడును ఐన నారదుడు ఒకనాడు వాల్మీకిమహర్షియొక్క ఆశ్రమమునకు విచ్చేసెను. అప్పుడు గొప్ప తాపసియైన వాల్మీకిముని జిజ్ఞాసతో ఆ దేవర్షిని ఇట్లు ప్రశ్నించెను. "ఓ మహర్షీ! సకలసద్గుణ సంపన్నుడును, ఎట్టి విపత్కరపరిస్థితిలోను తొణకనివాడును, సామాన్య-విశేష (లౌకికాలౌకిక) ధర్మములను ఎఱిగినవాడును, శరణాగతవత్సలుడును, ఎట్టి క్లిష్టపరిస్థితులయందును ఆడితప్పనివాడును, నిశ్చలమైన సంకల్పముగలవాడును, సదాచారసంపన్నుడును సకలప్రాణులకును హితమునుగూర్చెడివాడును, సకలశాస్త్రకుశలుడును, సర్వకార్యధురంధరుడును, తన దర్శనముచే ఎల్లరను సంతసింపజేయువాడును, ధైర్యశాలియును, అరిషడ్వర్గమును జయించినవాడును, చక్కని రూపలావణ్యములతో శోభిల్లుచుండెడివాడును, ఎవ్వరిపైనను అసూయలేనివాడును, రణరంగమున కుపితుడైనచో దేవాసురులనుసైతము భయకంపితులనుజేయువాడును అగు మహాపురుషుడు ఎవరు? ఓ దేవర్షీ! మీరు సర్వజ్ఞులు. ఇట్టి మహాపురుషునిగుఱించి తెల్పగల సమర్థులు మీరే." అంతట త్రిలోకజ్ఞుడైన నారదుడు వాల్మీకిపలుకులకు సంతసించి, "ఓ మహామునీ! నీవు ప్రస్తావించిన ఈ ఉదాత్తగుణములు ఒక్కరియందే కుదురుకొనియుండుట దుర్లభము. ఐనను అట్టి విశిష్టగుణములుగల ఉత్తమపురుషునిగూర్చి తెల్పెదను వినుము" - అని పల్కి, నారదమహర్షి శ్రీరామునిగుణగణములను వివరించెడి రామాయణగాథను సంక్షిప్తముగా దెలిపి బ్రహ్మలోకమునకేగెను.

రామాయణకావ్యావతరణము

ఆదికవీ చతురాస్యౌ కమలజవల్మీకజౌ వందే । లోకశ్లోకవిధాత్రోః యయోర్భిదా లేశమాత్రేణ ॥

కమలోద్భవుడైన బ్రహ్మముఖమునుండి వేదము, వల్మీకసంభవుడైన వాల్మీకిమహర్షిగంటమునుండి శ్రీమద్రామాయణము జాలువాఱినవి. ఇరువురును చతురాస్యులు- అనగా ఒకరు చతుర్ముఖులు, మఱియొకరు చతుర వచనులు. బ్రహ్మ లోకవిధాత, వాల్మీకి శ్లోకవిధాత. ఆయుభయుల మధ్యగల భేదము లేశమాత్రమే. కావుననే వేదసారమైన రామాయణము వాల్మీకి మహర్షి హృదయమునుండి ఆవిర్భవించినది.

మహర్షి వాల్మీకి ఆదికవియే గాక వేదాంతి, దార్శనికుడు, తపస్వి, ప్రజలకు మార్గదర్శకుడు.

వాల్మీకి మహర్షి శిష్యులతోగూడి తమసానదీతీరమున వెళ్లుచుండగా ఒక వేటగాడు క్రౌంచపక్షులజంటలో మగపక్షిని బాణముతో కొట్టెను. అప్పుడది నేలకొరిగి, విలవిలలాడుచు అసువులు వీడెను. ఆ దృశ్యమును జూచి, వాల్మీకిమునిహృదయము ద్రవించెను. మనస్సు ఆర్ద్రమయ్యెను. నయనములు అశ్రువులతో నిండెను. కంఠము గద్గదమయ్యెను. ఫలితముగా అతడు శోకాకులుడయ్యెను. ఆ శోకప్రభావమున వెంటనే ఆయన ముఖమునుండి ఈ మాటలు వెలువడెను.

"మానిషాద ప్రతిష్ఠాం త్వమగమః శాశ్వతీస్సమాః । యత్ క్రౌంచమిథునాదేకమవధీః కామమోహితమ్ ॥"

"ఓరీ! కిరాతుడా! క్రౌంచదంపతులలో కామమోహితమగు ఒక దానిని చంపి, నీవు శాశ్వతమగు అపకీర్తిని పొందితివి." శోకపరితప్తహృదయముతో వాల్మీకిముని తన ఆశ్రమమునకు చేరెను. కాని కరుణాపూరితమైన ఆ దృశ్యమునుండి అతడు తనమనస్సును మఱల్చుకొనలేకపోయెను. అతని మానసిక కల్లోలస్థితినిగాంచి బ్రహ్మ ఇట్లు పలికెను.

"మహర్షీ! శోకముతో నీవు ఉచ్చరించినది ఛందోబద్ధమైన శ్లోకమే. శ్రీరామచరిత్రమును నీవు ఒక కావ్యరూపమున రచింపుము. ఈ రామాయణమహాకావ్యము లోకములయందు పర్వతములు నదులు ఉన్నంతకాలము విరాజిల్లుచు శాశ్వతకీర్తిని సంపాదించును.

"యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే । తావత్ రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి ॥

బ్రహ్మదేవుని ఈ పలుకులు వాల్మీకికి కావ్యరచనకై ప్రేరణనొసగెను. అనంతరమతడు యోగాసీనుడై రామచరిత ఘట్టములను, దృశ్యములను తన మనోనేత్రమున గాంచగలిగెను. పిమ్మట ఆదికావ్యమైన శ్రీమద్రామాయణరచనకు 'అంకురార్పణ' జరిగెను.

"కావ్యం రామాయణం కృత్స్నమ్, సీతాయాశ్చరితం మహత్ ।
పౌలస్త్యవధమిత్యేవ చకార చరితవ్రతః ॥ బాల ॥4/7

ఈ కావ్యమున 'రామకథ, సీతాచరిత్రము, రావణవధ వర్ణింపబడినట్లు బాహ్యముగ గన్పట్టును- కాని లోతుగా పరిశీలించినచో ఇందు 'బ్రహ్మకథ' మనోవిజయము వర్ణితమైనట్లు గోచరించును.

రామస్య అయనమ్ = రామాయణమ్, అనగా రాముని యొక్క చరిత్రము రామాయణము- రామః అయ్యతే అనేన - ఇతి రామాయణమ్ - అనగా దీనిని పఠించిన వారు రామునివలె ధర్మశీలురై కడకు బ్రహ్మసాయుజ్యమును పొందుదురని భావము-

రామాయాః (సీతాయాః) అయనమ్ = రామాయణమ్, అనగా ఇది సీతాదేవి చరిత్రము

శ్రీరాముడు, సీతాదేవియు లోకమునకు ఆదర్శమూర్తులు, ఆరాధ్యులు.

శ్రీరాముడు మానవాళికి ఆవశ్యకములగు పుత్త్రధర్మము, మిత్రధర్మము, భ్రాతృధర్మము, భర్తృధర్మము, శిష్య ధర్మము, శత్రుధర్మము మొదలగు ధర్మములను అన్నింటిని స్వయముగా ఆచరించి, లోకమునకు మార్గదర్శకుడయ్యెను. సీతామాతయు స్త్రీలకు ఆచరణీయములగు సమస్తధర్మములను నిజజీవితముద్వారా లోకమునకు ప్రకటించెను. ఇట్లు రామాయణము కావ్యమగుటయే గాక ఒక ధర్మశాస్త్ర గ్రంథమైనది.

మానవునిజీవితములో ధర్మము, అర్థము, కామము అను మూడు పురుషార్థములను సాధింపదగినవి. ఈ త్రివర్గమునకు ధర్మము మూలము. ధర్మబద్ధములు గాని అర్థకామములు రెండును అనర్థహేతువులు. ధర్మమునకు విరుద్ధముగా పుత్రస్వార్థముతో భరతునకు రాజ్యమును (అర్థమును) కట్టబెట్టజూచిన కైక నలుగురిలో నవ్వులపాలై, లోకనిందకు గురియైనది. అట్లే ధర్మమును వీడి కామాతురుడై, పరసతులను ఆశించిన దుష్టరావణుడు లోకమున అపకీర్తిపాలయ్యెను, సపరివారముగా నశించెను. ధర్మబద్ధుడై, రాజ్యమునే పరిత్యజించిన శ్రీరాముడు లోకారాధ్యుడయ్యెను. కావుననే 'రామో విగ్రహవాన్ ధర్మః' (శ్రీరాముడు మూర్తీభవించిన ధర్మము) అని వాల్మీకి మహర్షి పలికెను. అందువలననే **'ధర్మో రక్షతి రక్షితః'** (ధర్మమును ఆశ్రయించిన వానిని ఆ ధర్మమే కాపాడును.) అను సూక్తి ఏర్పడినది.

బాలకాండము - కథా సంగ్రహము - విశేషాంశములు

పుత్త్రకామేష్టి - సంతానప్రాప్తి - నామకరణము: అయోధ్యాధిపతియైన దశరథమహారాజు తనకు ఎంతకాలమునకును సంతానము కలుగకుండుటచే పరితపించుచుండెను. పాపపరిహారార్థమై అతడు అశ్వమేధయాగముచేయుటకు సంకల్పించెను. తన సంకల్పమును వసిష్ఠాది మహర్షులకు ఇట్లు తెల్పెను.

మమ లాలప్యమానస్య పుత్రార్థం నాస్తి వై సుఖమ్ । తదర్థం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ ॥

"పుత్త్రులులేక తపనపడుచున్న నాకు మనశ్శాంతి కఱవైనది. అందులకై అశ్వమేధయాగము చేయవలయునని నా సంకల్పము." అని పల్కెను. వసిష్ఠాదులసూచనమేరకు ఋశ్యశృంగమహామునిని ఆహ్వానించి, ఆయనపర్యవేక్షణలో ఆ మహాయాగమును నిర్వహించెను. అనంతరము సంతానప్రాప్తికై ప్రత్యేకముగా 'పుత్త్రకామేష్టి' అను క్రతువును ఆచరించెను. యజ్ఞపురుషుడు అనుగ్రహించిన పాయసమును అతడు కౌసల్య, సుమిత్ర, కైకేయి అను తన ముగ్గురు భార్యలకును పంచెను. పాయసప్రభావమున ఆ ముగ్గురును సంతానవతులైరి.

భవిష్యద్ద్రష్టయైన వసిష్ఠమహర్షి ఆ నలువురు బాలకులకు నామకరణమొనర్చెను. తన సద్గుణములచే అందఱిని ఆనందింపజేయువాడుగావున కౌసల్యాతనయునకు 'రాముడు' అను పేరిడెను. ముమ్ముందు రాజ్యభారమును వహించెడివాడగుటచే కైకేయిపుత్రునకు 'భరతుడు' అను పేరు పెట్టెను. సుమిత్రకు కలిగిన ఇరువురు కుమారులలో సర్వశుభలక్షణసంపన్నుడైన ఒకనికి 'లక్ష్మణుడు'అనియు, శత్రువులను హతమొనర్చుటలో ఘటికుడగు రెండవానికి 'శత్రుఘ్నుడు' అనియు నామకరణముగావించెను. ఇదియే వారి పేర్లలోని వైశిష్ట్యము. వారు సార్థకనామధేయులు. ఆ నలుగురు రాజకుమారులును వసిష్ఠమహర్షియొద్ద వేదవేదాంగములను, సకలశాస్త్రములను అభ్యసించిరి. దశరథుడును, ఆయన ముగ్గురు పత్నులును ఆ చిన్నారులగుణగణములకు ఎంతయో మురిసిపోవుచుండిరి.

యాగరక్షణకై విశ్వామిత్రునివెంట రామలక్ష్మణుల ప్రయాణము-

ఇట్లు కొంతకాలము గడిచినపిమ్మట తపస్సంపన్నుడైన విశ్వామిత్రమహర్షి దశరథునిసభకేతెంచెను. దశరథుడు ఆయనకు అతిథిసత్కారములనొనర్చి, ఆయనకోరికను నెఱవేర్చెదనని మాటఇచ్చెను. తన యజ్ఞసంరక్షణార్థమై శ్రీరాముని తనవెంట పంపుమని ఆ మహర్షి కోరెను. అల్లారుముద్దుగా పెంచుకొనుచున్న తన చిన్నారి రాముని ఆ మునివెంట పంపుటకు దశరథుడు తటపటాయింపసాగెను. అప్పుడు విశ్వామిత్రమహర్షి

శ్లో ॥ అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్ । వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః ॥

ఓ దశరథా! శ్రీరాముడు సత్యమే పరాక్రమముగా (ఆయుధముగా) గలవాడు. తన సత్యప్రభావముచే ముల్లోకములను ఆక్రమింపగలవాడు. అంతేగాదు అతడు మహాత్ముడు. అనగా మహాపురుషుడు. పరమాత్ముడు, అహం వేద్మి = నేను ఇతనిని విష్ణువుగా ఎఱుగుదును. (అహః = విష్ణువు. విష్ణువుయొక్క వేయి నామములలో 'అహః' అనునది ఒకటి. అహస్సంవర్తకో వహ్నిః అనిగదా!) ఈ విషయములను అన్నింటిని నేనేగాదు మీ కులపురోహితుడైన మహాతేజస్వియగు వసిష్ఠుడును, తపస్సంపన్నులైన ఈ మహర్షులెల్లరును ఎఱుగుదురు.

వసిష్ఠుని సూచనపై దశరథుడు రామలక్ష్మణులను విశ్వామిత్రునివెంట పంపెను. పదునాఱు సంవత్సరములుగూడ నిండని ఆ చిన్నారులకు ఆకలిదప్పులు మొదలగు బాధలులేకుండుటకై విశ్వామిత్రుడు 'బల-అతిబల' అను విద్యలను నేర్పెను. ముమ్ముందు శ్రీరాముడు చేయవలసిన రాక్షససంహారమును దృష్టిలో ఉంచుకొని విశ్వామిత్రుడు వారికి వివిధములగు అస్త్రశస్త్రములను ప్రయోగ-ఉపసంహారపూర్వకముగా అందించెను. శ్రీరాముని మేలుకొలుపుచు విశ్వామిత్రుడు 'కౌసల్యాసుప్రజారామ!' అని సంబోధించెను. విలసన తల్లినిమించిన దైవము లేదు, (నమాతుఃపరదైవతమ్) తండ్రికంటె తల్లి వందరెట్లు గొప్పది. (పితుః శతగుణం మాతా గౌరవేణ అతిరిచ్యతే) అని గదా! ఆర్యోక్తి. నేటికిని భగవంతుని సుప్రభాతసేవలు ఈ సంబోధనతోడనే ప్రారంభమగుచున్నవి.

మార్గమధ్యమున శోణనదీవృత్తాంతమును దెల్పుచు విశ్వామిత్రుడు కుశనాభునికథను ప్రస్తావించెను. వనమున విహరించుచున్న కుశనాభుని కుమార్తెలను వాయుదేవుడు తనను పెండ్లియాడుడని కోరెను. అప్పుడు వారు "మేము తండ్రిచాటు బిడ్డలము. ఈ విషయమును అడుగవలసినది వారినే" - అని పలికిరి- ఇది భారతీయ సంస్కృతికి ఒక మచ్చుతునక. రామలక్ష్మణులు రాక్షసులబాధను తొలగింపగా విశ్వామిత్రుని యజ్ఞము నిర్విఘ్నముగా ముగిసెను. పిమ్మట వారు ధనుర్యాగమును తిలకించుటకై మిథిలకు బయలుదేఱిరి.

అహల్యా శాపవిమోచనము: అహల్య బ్రహ్మమానసపుత్రిక - అయోనిజ. ఈమె మహాతపస్వియైన గౌతమమహర్షి ధర్మపత్ని. గౌతముడు తీవ్రమైన తపము ఆచరించుచుండెను. తాపసులను కామక్రోధములకు వశులను గావించుచు వారి తపశ్శక్తిని భంగపఱచుట ఇంద్రుని లక్షణము. తన (ఇంద్ర) పదవికి ఎట్టి ప్రమాదములేకుండ దానిని నిల్పుకొనుటకై అతడు అట్లు చేయుచుండును. ప్రస్తుతము ఇంద్రుడు గౌతమునితపస్సును భంగపఱచుటకై సిద్ధపడెను. జితేంద్రియుడైన ఆ మహర్షి కామునకు లొంగడని గ్రహించి, అతనిలో క్రోధమును కల్గించుటకై ఒక పన్నాగమును

వెళ్లెను. వెంటనే గౌతముడు ఆశ్రమమునలేని సమయమును జూచుకొని ఇంద్రుడు గౌతమమునివేషములో ఆ ఆశ్రమమునకుచేరి, తనను సుఖపెట్టుమని అహల్యను కోరెను. అంతట ఆమె

"అథాబ్రవీత్ సురశ్రేష్ఠం కృతార్థేనాంతరాత్మనా ।
కృతార్థాస్మి సురశ్రేష్ఠ! గచ్ఛ శీఘ్రమితఃప్రభో ।
ఆత్మానం మాం చ దేవేశ సర్వథా రక్ష మానద ॥

"ఓ సురశ్రేష్ఠా! నా దాంపత్యజీవనమున నేను సంతుష్టురాలను. నీవు ఇచటినుండి వెంటనే వెళ్లిపొమ్ము. నీ, నా గౌరవములను నిల్పుము". అని ఇంద్రునితో పల్కెను. ఇంతలో గౌతముడు తన ఆశ్రమమునకు వచ్చెను ఆ వేషముననే తనరూపమున నిలిచియున్నవాడు ఇంద్రుడని గ్రహించెను. ఇంద్రునిదుష్టసంకల్పమును ఎఱింగిన ఆ మహర్షి ఆ సురపతిని శపించెను. పిమ్మట అతడు క్రోధావేశములో అహల్యనుగూడ 'వేలకొలది సంవత్సరములు అన్నపానములను వీడి, వాయుభక్షణముతో తపించుచు, భస్మశాయినివై ఈ యాశ్రమముననే పడియుండుము. శ్రీరామునిరాకతో నీకు నీ నిజరూపము ప్రాప్తించును"-అని శపించెను. ఫలితముగా గౌతమునితపశ్శక్తి క్షీణించెను. ఇంద్రుని వృషణములు ఫలించెను. శ్రీరామునిదర్శనముతో అహల్యకు శాపవిముక్తి కలిగెను. పరమపునీతయైన ఆమె శ్రీరామునకు అతిథిమర్యాదలను నెఱపి, తన తపఃఫలములను ఆయునకు ధారపోసెను. శ్రీరాముడు ఆ మునిదంపతులకు నమస్కరించి ముందునకు సాగెను.

ధిక్! బలం క్షత్రియబలం - బ్రహ్మతేజోబలం బలం: విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంటబెట్టుకొని మిథిలానగరమునకుచేరెను. జనకమహారాజు తన కులపురోహితుడైన శతానందమహర్షి మొదలగువారితోగూడి వారికి స్వాగతమర్యాదలను నెఱపెను. సందర్భవశమున శతానందుడు రామలక్ష్మణులకు విశ్వామిత్రునికథను వివరించెను. గాధినందనుడైన విశ్వామిత్రుడు క్షత్రియవంశమువాడు. అతడొకపర్యాయము తనసైన్యములతో భూమండలమును చుట్టివచ్చుచు వసిష్ఠుని ఆశ్రమమునకేగెను. ఆ మహర్షి తన కామధేనువుప్రభావమున వారందఱిని షడ్రసోపేతభోజనములతో సత్కరించెను. కామధేనుమహిమనెఱింగిన విశ్వామిత్రుడు ఆ గోవును తనకిమ్మని ఆ మహర్షిని కోరెను. అతడందులకు ఆమోదింపలేదు. అంతట ఆ గాధిసుతుడు ఆ గోవును కొనిపోవుటకై బలప్రయోగమునకు దిగెను. వసిష్ఠుని అనుమతితో ఆ ధేనువు సైన్యమును సృజించి విశ్వామిత్రబలములను నిర్వీర్యమొనర్చెను. అనంతరము విశ్వామిత్రుడు తీవ్రమైన తపమొనర్చి పరమేశ్వరునినుండి దివ్యాస్త్రములను పొంది, బలగర్వితుడై మఱల వసిష్ఠునిపై దాడిచేసి, ఆయనఆశ్రమమును ధ్వంసముచేసెను. కుపితుడైన వసిష్ఠుడు తనబ్రహ్మదండముచే విశ్వామిత్రునియొక్క దివ్యాస్త్రములనన్నింటిని వమ్ముగావించెను. అప్పుడు ఆ గాధిసుతుడు-

ధిక్! బలం క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్ । ఏకేన బ్రహ్మదండేన సర్వాస్త్రాణి హతాని మే ॥

"ఛీ! క్షత్రియబలమూ ఒక బలమేనా? బ్రహ్మతేజోబలమే నిజమైన బలము. ఒకే ఒక్క బ్రహ్మదండము నా అస్త్రములను అన్నింటిని చిత్తుచేసెను". పిమ్మట ఆ కౌశికుడు 'బ్రహ్మర్షి'యగుటకై తీవ్రమైన తపస్సునకు దిగెను.

విశ్వామిత్రుడు అవరోధములను అధిగమించి "బ్రహ్మర్షి" అగుట

పిదప విశ్వామిత్రుడు దక్షిణదిశకువెళ్లి, అచట వేయి సంవత్సరములు తీవ్రముగా తపమొనర్చెను. బ్రహ్మప్రత్యక్షమై అతనిని 'రాజర్షి' గా గుర్తించెను. 'బ్రహ్మర్షి' కానందులకు చింతించుచు అతడు ఇంకను ఘోరతపమాచరించెను. అంతట ఇక్ష్వాకువంశజుడైన 'త్రిశంకు' మహారాజును సశరీరముగా స్వర్గమునకు పంపుటకైచేసిన ప్రయత్నములతో ఆయన తపశ్శక్తియంతయు మిగుల క్షీణించెను. పిమ్మట అతడు పశ్చిమదిశకుచేరి పుష్కరతీర్థమునందు అచంచలదీక్షతో తపమొనరించెను. అంబరీషునియజ్ఞమునకు బలిపశువుకానున్న తనమేనల్లుడగు శునశ్శేపుని రక్షించుటకును, అంబరీషునకు యజ్ఞఫలమును ప్రసాదించుటకును ఆ కౌశికుడు మఱల తనతపస్సునంతయును ధారపోసెను. అనంతరము ఆ పుష్కరక్షేత్రముననే అతడు మఱియొక వేయిసంవత్సరములు తపస్సుచేసెను. బ్రహ్మ ప్రత్యక్షమై ఆయునకు 'ఋషిత్వము'ను అనుగ్రహించెను.

అంతటితో తృప్తిచెందక విశ్వామిత్రుడు ఇంకను దీక్షతో తపమాచరింపసాగెను. ఈ స్థితిలో దేవతలు పంపగావచ్చిన మేనకవలపులలో చిక్కుకొని, అతడు తన తపశ్శక్తిని మరల వమ్ముచేసికొనెను. తనజితేంద్రియత్వమును కోల్పోయిన విశ్వామిత్రుడు మిగుల పశ్చాత్తాపపడి ఉత్తరదిశకుచేరి హిమగిరిపై మరల కడు దీక్షవహించి, తపస్సొనర్చెను. అంతట బ్రహ్మ ప్రసన్నుడై ఆయనకు 'మహర్షిత్వము'ను అనుగ్రహించి, 'ఇంతమాత్రమునకే నీవు జితేంద్రియుడవైనట్లు తలంపవలదు. ఇంకను ప్రయత్నింపుము.' అని పలికెను. తదుపరి ఆ గాధిసుతుడు ఊర్ధ్వబాహుడై, వాయువును ఆహారముగా గొనుచు, వేసవికాలమున పంచాగ్నిమధ్యమునను, చలికాలమున జలములయందును ఉండి, వేయి సంవత్సరములు కఠోరముగా తపస్సుచేసెను. అంతట దేవతలు రంభను పంపి ఆయనను కామపరవశునిజేయుటకు యత్నించిరి. అందులకు ఆగ్రహించిన ఆ గాధిసుతుడు 'శిలవైపొమ్ము' అని ఆమెను శపించెను. క్రోధకారణముగా మరల ఆయనతపస్సు కుంటుపడెను. వెంటనే ఆయన తూర్పుదిశకుచేరి, తీవ్రతపోదీక్షకుదిగెను. ముల్లోకములు అల్లకల్లోలములయ్యెను. అప్పుడు బ్రహ్మసాక్షాత్కరించి, ఆయనకు 'బ్రహ్మర్షిత్వము'ను అనుగ్రహించెను. అనంతరము వసిష్ఠమహర్షియు ఆయనను 'బ్రహ్మర్షి'గా పేర్కొనుటతో విశ్వామిత్రుడు మిగుల తృప్తిచెందెను." శతానందులవారి ద్వారా 'బ్రహ్మర్షి' విశ్వామిత్రుని వృత్తాంతమునువిని, రామలక్ష్మణులు, జనకమహారాజు ఎంతయు సంప్రీతులైరి.

'ఇయం సీతా మమసుతా': యుక్తవయస్కురాలైన సీతాదేవికి జనకమహారాజు వివాహముచేయసంకల్పించెను. తనవద్దనున్న శివధనుస్సును ఎక్కుపెట్టినవానికే తనకూతురును ఇచ్చి పెండ్లిచేసెదనని ఆ మహారాజు ప్రకటించెను. ఆమెను పెండ్లియాడగోరి, పెక్కుమంది రాజకుమారులు మిథిలకువచ్చి, వింటిని సంధింపలేక విఫలులై ఇంటిముఖముపట్టిరి. ఈ స్థితిలో రామలక్ష్మణులు అచటికి విచ్చేసిరి. విశ్వామిత్రమహర్షికోరికపై జనకుడు ఆ శివధనుస్సును వారికి చూపించెను. వెంటనే శ్రీరాముడు ఆ ధనుస్సును చేతిలోనికిదీసికొని ఎక్కుపెట్టునంతలో అది 'ఫెళ్లు'మని విఱిగి రెండు ముక్కలాయెను. అప్పుడు జనకుడుమాత్రమేగాక సదస్యులెల్లరును సంతోషముతో పొంగిపోయిరి. జనకునిఆహ్వానముపై దశరథమహారాజు సపరివారముగా మిథిలకు విచ్చేసెను. కల్యాణవేదిక చక్కగా అలంకృతమై, సదస్యులతో కలకలలాడుచుండెను. సీతారాములు (వధూవరులు) వేదికను అలంకరించిరి. అంతట మిథిలాధిపతి (జనకుడు) శ్రీరామునకు కన్యాదానమొనర్చుచు ఇట్లు నుడివెను.

ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ। ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా ॥

సౌందర్యరాశి, సౌకుమార్యనిధి, లావణ్యవతి - ఐన ఈ కన్యకామణియే సీత. ఈమె అయోనిజ. మహాతపస్సంపన్నులైన రాజర్షులకు ఆలవాలము, కీర్తిప్రతిష్ఠలకు నిలయమువంటి మా వంశమునకు ప్రతీక. నా పుత్రికయైన ఈ సీత నేటినుండి నీకు సహధర్మచారిణి, ధర్మార్థకామ (పురుషార్థ)ముల ఆచరణానుభవములలోను, కష్టసుఖములలోను సర్వదా నీకు తోడుగానుండును. విధ్యుక్తముగా ఈమెను పాణిగ్రహణమొనర్చి, ప్రేమానురాగములతో నీవు స్వీకరింపుము. నీకు శుభమగును. (ఉద్దండులైన పండితులు ఈ శ్లోకమును వివిధకోణములలో దర్శించి, పలురీతుల వ్యాఖ్యానించి, సహృదయపాఠకులను సంతసింపజేసిరి.) లోక కల్యాణదాయకమైన సీతారాముల వివాహమహోత్సవము వైభవోపేతముగా జరిగెను. ఆ సమయముననే జనకుని సోదరుడైన కుశధ్వజుని కుమార్తెలగు ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తులతో క్రమముగా లక్ష్మణభరతశత్రుఘ్నులకును వివాహములు జరిగెను.

పరశురామునినుండి వైష్ణవతేజము శ్రీరాముని జేరుట

పెండ్లివేడుకలు ముగియగనే దశరథమహారాజు నవవధూవరులతో సపరివారముగా అయోధ్యకు బయలుదేఱెను. మార్గమధ్యమున పరశురాముడు వారికి ఎదురై, వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టుమని శ్రీరాముని ప్రేరేపించెను. అంతట శ్రీరాముడు ఆ ధనుస్సుతోపాటు పరశురామునిలోని దివ్యమైన వైష్ణవతేజమును, ఆయనయొక్క తపశ్శక్తిని గ్రహించెను. పిదప వారు అందఱును అయోధ్యకుచేరిరి.

లోకకంటకుడైన రావణుని సంహరించుటకై ఈ భూలోకమున శ్రీరాముడు అవతరించెను. అతడు వసిష్ఠునికడ వేదవేదాంగములను, సకలశాస్త్రములను, ధనుర్విద్యలనునేర్చెను. విశ్వామిత్రునివలన వివిధ అస్త్రశస్త్రములను

నముపొర్ధించెను. తాటకాది రాక్షసులను సంహరించి దుష్టశిక్షణమునకు నాందిపలికెను. విశ్వామిత్రుని ఆశీర్వాదరూపమున ఆయన తపశ్శక్తిని సంపాదించెను. తపశ్శక్తిసంపన్నులైన అహల్యాగౌతముల ఆశీస్సులనుపొందెను. ఇంకను ఆ రాఘవుడు శివధనుర్భంగముగావించి తనశక్తిసామర్థ్యములను లోకమునకు చాటెను. శక్తిస్వరూపిణియైన సీతాదేవిని తనకు సహధర్మచారిణిగా జేసికొనెను. పరశురామునినుండి వైష్ణవధనుస్సును, దివ్యతేజమును స్వీకరించెను. ఈ విధముగా బాలకాండము శ్రీరామునిని సర్వసన్నద్ధునిగావించుటద్వారా రావణసంహారమహాయజ్ఞమునకు పూర్వరంగమును సిద్ధమొనర్చెను.

అయోధ్యాకాండము - కథాసంగ్రహము - విశేషాంశములు

ప్రజామోదముతో శ్రీరాముని యువరాజపట్టాభిషేకమునకై దశరథమహారాజు నిర్ణయము.

యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి । నిందితస్స జనో లోకే స్వాఽఽత్మాప్యేనం విగర్హతే ॥

శ్రీరాముని దర్శింపనివాడును, ఆయన దృష్టికి రానివాడును తనను ఒక దురదృష్టవంతునిగా భావించుకొనును. తనను తాను నిందించుకొనును. ఇది శ్రీరాముని ప్రజాభిమానమునకును, ఆయనపై ప్రజలకుగల ఆదరాభిమానములకును ఒక చక్కని నిదర్శనము. ఆ రఘురాముని 'రామా! రామభద్రా! రామచంద్రా! దేవా! రఘునాథా!' అని తల్లిదండ్రులు మొదలుకొని సామాన్యప్రజలవఱకు ఆప్యాయముగా పిలువసాగిరి. సీతాదేవిమాత్రము 'నాథా!' అని పిలుచుచుండెను. ఎవరిముద్దుమురిపెములు వారివిగదా! ఈ విధముగా శ్రీరాముడు ఆబాలగోపాలముయొక్క ప్రేమానురాగములను చూఱగొనెను.

అంతట దశరథమహారాజు శ్రీరామునివయోవైభవములను గమనించెను. ఆ మహారాజు తనవార్ధక్యమునుగూడ దృష్టిలోపెట్టుకొని, కోసలదేశమునకు శ్రీరాముని యువరాజపట్టాభిషిక్తునిగా చేయదలచెను. అతడు నిండుసభలో ప్రజాభిప్రాయమునకై తనసంకల్పమును ప్రకటించెను. మంత్రులెల్లరును తమఆమోదమును తెలిపిరి. వసిష్ఠాదిమహర్షులందఱును అందులకు తమఆశీర్వాదములనందించిరి. సామంతరాజులు, పౌరులు, జానపదులు మున్నగువారందఱును ఏకగ్రీవముగా తమసమ్మతిని తెలుపుచు శ్రీరామునియొక్క ఉత్తమగుణములను శ్లాఘించిరి.

ప్రజలఆమోదమును పొందినపిమ్మట దశరథుడు ఆ మఱునాడే శ్రీరామునకు యువరాజపట్టాభిషేకముచేయుటకు నిర్ణయించెను. వెంటనే మహారాజు రామచంద్రుని తనకడకుపిలిపించుకొని ఆయనతో ఇట్లు వచించెను. "నాయనా! మంత్రులు మొదలగువారు అందఱును నీవు అయోధ్యకు యువరాజువుకావలెనని కోరుకొనుచున్నారు. ఈమధ్య నాకు కలలో దుస్స్వప్నములు కనబడుచున్నవి. పట్టపగలే మహోత్పాతములనుగావించుచు పిడుగులతోగూడిన ఉల్కాలు (తోకచుక్కలు) నేలపై రాలుచున్నవి. నా జన్మరాశియందు క్రూరగ్రహములుచేరినవట. సాధారణముగా ఇట్టి దుర్నిమిత్తములు ఏర్పడినప్పుడు రాజు మరణించుటయో లేక ఆపదలపాలగుటయో జరుగునని దైవజ్ఞులు నుడువుచున్నారు. నాబుద్ధి మాఱకముందే నీవు యువరాజువు కమ్ము. మానవులకు బుద్ధిచాంచల్యము సహజముగదా! రేపు చంద్రుడు పుష్యమీనక్షత్రమున ఉన్నప్పుడు పట్టాభిషేకము జరుపుట యుక్తమని శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. నా మనస్సు నన్ను తొందరపెట్టుచున్నది. రేపే నీవు పట్టాభిషిక్తుడవు కమ్ము.

తతః పుష్యేఽభిషించస్వ మనస్త్వరయతీవ మామ్ । శ్వస్త్వాఽహమ్ అభిషేక్ష్యామి యౌవరాజ్యే పరంతప ॥

'రామా! నీవును, నీ భార్యయగు సీతాదేవియు దీక్షలను స్వీకరింపుడు' - అని రాజు ఆయనను ఆదేశించెను. పిదప రాముడు తనభవనమునకేగెను.

కైకేయి వరములను గోరుట: "మానవునిగా అవతరించి, రావణుని వధింతును" - అని శ్రీ మహావిష్ణువు దేవతలకు అభయమిచ్చియుండెను. శ్రీరాముడు యువరాజై రాజ్యపాలనచేపట్టి, అయోధ్యలోనేయున్నచో రావణవధ జరుగదు. కనుక

యువరాజపట్టాభిషేకమునకు భంగమువాటిల్లుట అవసరము. ఈ పట్టాభిషేకము భంగమగుటకు మంథరయు, కైకేయియు నిమిత్తమాత్రమే. ఇది విధినిర్ణయము. అందువలన కైక (1) శ్రీరాముడు 14 సంవత్సరములు వనవాసముచేయుట, (2) భరతుని యువరాజ పట్టాభిషిక్తునిచేయుట - అను రెండు వరములను దశరథమహారాజును కోరెను. దశరథుడు తనప్రతిజ్ఞకు కట్టుబడి, విధిలేని పరిస్థితులలో అందులకు తలయూపెను. తండ్రిని సత్యసంధునిగావించుటకై శ్రీరాముడు 'పితృవాక్య' పరిపాలనముకావింతును' అని కైకేయిదశరథులయెదుట ప్రకటించెను. కైకేయిశంకను దీర్చుటకై ఆ రాఘవుడు "రామో ద్విర్నాఽభిభాషతే" (శ్రీరాముడు ఆడినమాట తప్పడు) అని ఆమెకు మాట ఇచ్చెను.

మానవశక్తి - దైవబలము: 'ఒక స్త్రీమూలముగా మహారాజు తనజ్యేష్ఠకుమారుని వనములకు పంపుట అధర్మము' - అని లక్ష్మణుడు హుంకరింపగా 'విధి నిర్ణయము' అని రాముడు అతనికి సమాధానమిచ్చెను. అప్పుడు లక్ష్మణుడు 'పిటికివారు, పరాక్రమహీనులుమాత్రమే దైవమును ఆశ్రయింతురు. పరాక్రమశాలురును, లోకముచే గౌరవింపదగినవీరులును దైవముమీద ఆధారపడరు. వారు స్వప్రయత్నములకే ప్రాముఖ్యమిత్తురు.

విక్లబో వీర్యహీనో యః స దైవమ్ అనువర్తతే । వీరాః సంభావితాత్మానో న దైవం పర్యుపాసతే ॥

అంతట శ్రీరాముడు లక్ష్మణుని కన్నీరుతుడిచి "నాయనా! లక్ష్మణా! తల్లిదండ్రులఆజ్ఞలను త్రికరణశుద్ధితో పాటించువానినిగా నన్నెఱుంగుము. ఇదియే సత్పురుషులమార్గము" అని పలుకుచు వనములకు వెళ్లుటకే తాను దృఢముగా నిశ్చయించుకొనినట్లు తెల్పెను. ఈ సందర్భమున ఈ ఇరువురిమధ్య జరిగిన చర్చ ఆసక్తికరముగను, విజ్ఞానదాయకముగాను ఉన్నది. దీనివలన మానవశక్తియొక్క పరిమితి స్పష్టమైనది, దైవబలముయొక్క ప్రాబల్యము బోధపడినది.

శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి వనములకేగుట:

తల్లియాజ్ఞనుగొనుటకై శ్రీరాముడు కౌసల్యాదేవికడకు వెళ్లెను. శ్రీరాముని వనవాసవార్తనువిని ఆమె దిగ్భ్రమచెందెను. తట్టుకొనలేని దుఃఖముతో తల్లడిల్లెను. "నాయనా! రామా! నీ యెడబాటును నేను భరింపజాలను. కనుక నేనును నీవెంటవత్తును" అని పల్కెను. అప్పుడు ఆ రఘువరుడు 'పతిసేవయే సతికి పరమధర్మము' - కనుక మాతండ్రికి సేవలుచేయుచు నీవు ఇచటనేయుండుము' అని పలువిధముల ఓదార్చి, ఆమెనుండి శుభాశీస్సులనుపొందెను.

అంతట సీతాదేవి శ్రీరామునితో "నాథా! నేనును నీవెంట వనములకు వచ్చెదను. వనములలో మీముందుభాగమున నడుచుచు, కంటకములను తొలగించుచు మీమార్గమును సుగమమొనర్చెదను.

అగ్రతస్తే గమిష్యామి మృద్నంతీ కుశకంటకాన్ ॥

(ఇందలి విశేషము - 'స్వామీ! మీకంటెను ముందుగా నేను లంకకుజేరి, లోకకంటకుడైన రావణాసురుని తుదముట్టించుటకై మీకు మార్గమును సుగమమొనర్చెదను) అని విన్నవించెను. ఐనను శ్రీరాముడు ఆమెపలుకులను ఆమోదింపక 'ఓ కోమలీ! వనవాసజీవితము దుర్భరము-కనుక నీవు అచటికిరావలదు' అని వచించి, ఆమెను నివారింపజూచెను. ఇంకను పలురీతులుగా మైథిలి ప్రార్థించుచు ప్రాణత్యాగమునకు సిద్ధముకాగా అప్పుడు రాఘవుడు తనతో ఆమెప్రయాణమునకు సమ్మతించెను. తదుపరి లక్ష్మణుడును ఎంతయువేడుకొనగా అతడును తనవెంట వనములకు వచ్చుటకు శ్రీరాముడు అంగీకరించెను.

అంతట లక్ష్మణస్వామి తన తల్లిఆశీస్సులకొఱకై సుమిత్రాదేవి కడకేగెను. అందులకు తనఅంగీకారమునుదెలుపుచు ఆ తల్లి తనకుమారునితో - "నాయనా! కుమారా! హాయిగా వనములకు వెళ్లుము - నీవు అచట సీతారాములను తల్లిదండ్రులనుగా తలంచి నిత్యము వారిని సేవించుచుండుము. అరణ్యమును అయోధ్యగాతలంచి చక్కగా మసలుకొనుము"- అని పలికి, పుత్రుని ఆశీర్వదించెను.

రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్ । అయోధ్యామ్ అటవీం విద్ధి గచ్ఛ తాత యథాసుఖమ్ ॥
(దీని విశేషార్థములు - 40వ సర్గములో వివరింపబడినవి.)

కైకేయిఇచ్చిన వల్కలములను రామలక్ష్మణులు ధరించిరి. సీతాదేవి దశరథుడు తెప్పించిన వస్త్రాభరణములను దాల్చెను. పిదప ఆ ముగ్గురు రథముపైనెక్కి వనవాసమునకు బయలుదేరిరి. రామునియెడబాటునకు తట్టుకొనలేక ప్రజలందరును ఆ రథమును కొంతదూరము అనుసరించిరి. దశరథుడును, కౌసల్యాదులును మూర్ఛిల్లిరి. శృంగిబేరపురమున గుహునిసహకారముతో రామలక్ష్మణులు మఱ్ఱిపాలతో జటాజూటములను ధరించి, ఆ రాత్రి తృణశయ్యలపై అచట గడిపిరి. వారు గంగానదినిదాటి, తిన్నగా భరద్వాజాశ్రమముచేరిరి. భరద్వాజమహర్షినుండి అతిథిసత్కారములను, ఆశీస్సులను గైకొనినపిమ్మట వారు చిత్రకూటమునకు అరిగి, అచట వనవాసమును నడుపసాగిరి.

పుత్రదుఃఖముతో దశరథునిమృతి - అరాజకమున ఏర్పడు విపరీతములు

శృంగిబేరపురమున గుహునివీడ్కొని, సుమంత్రుడు తిన్నగా అయోధ్యను చేరెను. శ్రీరామునియెడబాటుబాధను భరింపలేక దశరథుడు పుత్రదుఃఖముతో ప్రాణములను కోల్పోయెను. కళేబరమును తైలద్రోణిలోనుంచిరి.

దశరథమహారాజు కన్నుమూసిన సమయమున రామలక్ష్మణులు వనములపాలైయుండిరి. భరతశత్రుఘ్నులు కేకయ రాజ్యమున తాతగారిఇంటనుండిరి. నలుగురు కొడుకులుండియు సమయమునకు ఉత్తరక్రియలు ఆచరించుటకు ఒక్క పుత్రుడుగూడ దగ్గరలేకుండుట మిగులశోచనీయము. ఒక మహారాజునంతటివానికి పట్టిన దుస్థితి ఇది. ఇక రాజ్యము సంగతి సరేసరి. దానిని పాలించుటకు (పట్టాభిషిక్తుడైన) ప్రభువులేడు. రాజులేని రాజ్యమున ఏర్పడెడి అల్లకల్లోలపరిస్థితులనుగూర్చి మార్కండేయాది మహర్షులు వసిష్ఠమహామునితో ఇట్లు పేర్కొనిరి.

"ఓ మహర్షీ! రాజులేని రాజ్యమున ధర్మము గతి తప్పును. కొడుకులు తల్లిదండ్రులమాటలను వినరు. సతులు పతులఆజ్ఞలను పాటింపరు. దంపతులఅన్యోన్యానురాగములు సన్నగిల్లును. నీతినిజాయితీలు అడుగంటును. సత్యమునకు విలువనీయుండదు. పాపభీతియుండదు. చెల్లను నటికివేయుదురు. విఘ్నభయముచే యజ్ఞములు ఆగిపోవును. పోషించువారులేక లలితకళలు మఱుగునపడును. సామాజికకార్యక్రమములు కుంటుపడును. దొంగలభయము మితిమీఱును. స్త్రీలకు రక్షణ కఱవగును. సైనికులలో క్రమశిక్షణ లోపించును. బలవంతులు బలహీనులను పీడుకొందురు. ప్రజలు జాతిమర్యాదలను వర్ణాశ్రమధర్మములను పాటింపరు. నాస్తికులు చెలరేగుదురు. దేశమునకు అరిష్టములు చుట్టుకొనును. ఈతిబాధలు పెల్లుబుకును". మహర్షులు భవిష్యత్తును దర్శింపగలవారుగావున వారు తెలిపిన ఈ విషయములు ఏ కాలములయందైనను, ప్రభువు (సమర్థుడైన పాలకుడు) లేని ఏ దేశమునకైనను వర్తించును.

భరతునిరాక - అతనిశపథము: ఋషులమాటలను ఆలకించిన వసిష్ఠమహర్షి వెంటనే దూతలనుపంపి, భరతశత్రుఘ్నులను కేకయరాజ్యమునుండి అయోధ్యకు రప్పించెను. అంతట భరతుడు తండ్రి మృతిచెందిన సంఘటనను, సీతారామలక్ష్మణులవనవాసవిషయములను విఁటిగి తల్లడిల్లిపోయెను. తనతల్లి కైకేయి ఘోరమైన అకృత్యములకు పాల్పడి, ఇట్టి దురవస్థలను తెచ్చిపెట్టినందులకు అతడు ఆమెను దూషించెను. పిమ్మట అతడు కౌసల్యామాతకడకేగి జరిగిన సంఘటనలకు మిగుల రోదించుచు, తన నిర్దోషిత్వమును ఋజువుపఱచుటకై ఇట్లు శపథవచనములను పలికెను.

"అమ్మా! శ్రీరాముడు సత్యనిరతుడు, పూజ్యుడు. అట్టి మహాత్ముని అడవులపాలుచేయువారి బుద్ధి దుష్టమైనది. నాకు అందు ఆవంతయును ప్రమేయములేదు. నాకు ఆ విషయమున ఏమాత్రము జోక్యము ఉన్నను నాకు పాపాత్మునకు సేవచేయవలసిన గతిపట్టును. సూర్యునకు ఎదురుగానుండి మలమూత్రములను విసర్జించినవానిపాపములు అంటుకొనును. గోవును కాలితో తన్నినవానిపాపము చుట్టుకొనును. భృత్యునకు కూలిధనమును ఎగగొట్టిన యజమానిదుర్గతి నాకు

ప్రాప్తించును. ఉత్తముడైన రాజునకు ద్రోహముతలపెట్టినవానిదుస్థితి నాకు పట్టును. ప్రజలనుండి 'పన్నులను' స్వీకరించి, వారియోగక్షేమములను విస్మరించిన పాలకునకు పట్టెడి దుర్గతి నాకు దాపురించును. ఋత్విజులకు యజ్ఞదక్షిణలను ఎగవేసిన యజ్ఞకర్తకు చుట్టుకొనెడి పాపము, శస్త్రాదులన్నియును ఉన్నను వీరధర్మమును విస్మరించి, రణరంగమున వెన్నుచూపెడి యోధునకు పట్టెడి దుర్గతియు, గురువులను అవమానించెడివానికిని, తల్లిదండ్రులను నిందించెడి మూర్ఖునకును, మిత్రద్రోహమునకు ఒడిగట్టునట్టి నీచునకును చుట్టుకొను పాపము నాకు ప్రాప్తించును. కుటుంబసభ్యులకును, పరిజనులకును పెట్టక తానొక్కడే సుష్టుగా భుజించెడివానిపాపము నాకు అంటును. రాజును, స్త్రీలను, బాలబాలికలను, వృద్ధులను చంపినవాని పాపము నాకు చుట్టుకొనును. విశ్వాసపాత్రులైన సేవకులను మధ్యలోనే తొలగించినవానిపాపము, కామక్రోధములకువశుడై, మద్యపానము, పరస్త్రీసంగమము, ద్యూతక్రీడలు సల్పెడివానికి పట్టెడు దుర్గతి నాకు ప్రాప్తించును. సూర్యభగవానుడు ఉదయించునప్పుడును, అస్తమించుసమయమునను నిద్రించుచుండు సోమరికివలె నాకు మహాపాపములు అంటును. సత్పురుషులను దర్శింపనివానికివలెను, సాధువర్తనులను శ్లాఘింపనివానికివలెను, సజ్జనులను సేవింపనివానికివలెను దుర్గతులు, నరకయాతనలు, నాకు ప్రాప్తించును. నిర్మలజలములను మురికిచేసినవానికిని, దైవ. బ్రాహ్మణపూజలను భంగపరచెడివానికిని, లేగదూడలకు మిగులకుండ తల్లియావులపొదుగులనుండి పూర్తిగా పాలు పిండుకొనెడివానికిని పట్టెడు దుర్గతులు నాకు ప్రాప్తించును.'' ఇట్లు తీవ్రమైన శపథవచనములను భరతుడు పలికెను. పుత్రునియెడబాటుచే శోకార్తయైయున్న కౌసల్యామాతను పరిపరివిధముల ఓదార్చుచు, అతడు దుఃఖమునకు తట్టుకొనలేక మూర్ఛిల్లెను. కొంతతడవునకు అతడు మూర్ఛనుండి తేరుకొనెను. అప్పుడు కౌసల్యాదేవి సాదరముగా ఆయనను ఊరడించెను.

శ్రీరామునిగొనివచ్చుటకై భరతుడు సపరివారముగా చిత్రకూటమునకు చేరుట

పిమ్మట భరతుడు వసిష్ఠమహర్షికడకేగెను. ఋషులయొక్క ఆమోదముతో అతడు శ్రీరామునిగొనివచ్చుటకై చిత్రకూటమునకు వెళ్లుటకు నిశ్చయించుకొనెను. చతురంగబలములతో, సపరివారముగా బయలుదేఱుటకై అనువగు మార్గములను నిర్మింపజేయుటకు అతడు ఆజ్ఞయిచ్చెను. వెంటనే ఆయా పనులవారందఱును 'ఇదియొక శ్రీరామసేవగా తలంచి' భక్తిశ్రద్ధలతో మార్గనిర్మాణ కార్యక్రమములను పూర్తిచేసిరి. చతురంగబలములతో వచ్చుచున్న భరతునిజూచి 'అతడు దురుద్దేశముతో' వచ్చుచున్నాడేమోయని అపోహపడి, శృంగిబేరపురాధిపతి గుహుడు తనవారిని యుద్ధమునకు సర్వసన్నద్ధులనుగావించెను. తాను ముందుగా భరతునకు ఎదురేగి, వాస్తవవిషయములు తెలియగా సంతోషపడి వారినాదరించెను. పిమ్మట వారినందఱిని పడవలపై గంగానదిని దాటించెను.

పిదప భరతుడు తనవారితో ప్రయాగచేరి, భరద్వాజమునిని దర్శించి ఆయనఆశీస్సులనుపొందెను. భరద్వాజుడు వారందఱికిని చక్కని విందునొసంగెను. ఆ మహర్షి రామావతారముయొక్క పరమప్రయోజనమును ఎఱిగినవాడగుటచే కైకేయినిర్దోషిత్వమును తెలుపుచు ఇట్లు నుడివెను. "ఓ భరతా! నీతల్లి కైకేయిని తప్పుపట్టవద్దు. ఆమెదోషము ఏమియునులేదు. శ్రీరామునివనవాసము భవిష్యత్తులో ఎల్లరకును సుఖశాంతులను వర్ధిల్లజేయును. శ్రీరాముడు దండకారణ్యములకు చేరుటవలన దేవతలకును, దానవులకును, భగవద్ధ్యాననిరతులైన మహర్షులకును, ఈ జగత్తునకును హితమే జరుగును.

న దోషేణావగంతవ్యా కైకేయీ భరత త్వయా । రామప్రవ్రాజనం హ్యేతత్ సుఖోదర్కం భవిష్యతి॥
దేవానాం దానవానాంచ ఋషీణాం భావితాత్మనామ్ । హితమేవ భవిష్యద్ధి రామప్రవ్రాజనాదిహ॥

అంతట భరతుడు శ్రీరాముని నివాసప్రదేశమును, అచటికి వెళ్లుమార్గమును ఆమహర్షివలన ఎఱింగి, ఆయన ఆశీస్సులనుగైకొని, తనవారితోగూడి అచటినుండి బయలుదేఱి చిత్రకూటమునకు చేరెను.

శ్రీరాముడు భరతునకు రాజధర్మములను ఉపదేశించుట

భరతుడు శ్రీరామునిసన్నిధికిచేరి, ఆయనకు ప్రణమిల్లెను. పిమ్మట శ్రీరాముడు భరతునితో కుశలప్రశ్నలుగావించుచు, రాజధర్మములను, పరిపాలనవిషయమున పాలకుడు తెలిసికొనవలసిన మెలకువలను సమగ్రముగా పేర్కొనెను. "ఓ భరతా! జ్ఞాన, శీల, వయోవృద్ధులైన ఋత్విజులచే యజ్ఞములను నిర్వహింపజేయుచున్నావుగదా? విశ్వాసపాత్రులు, ధీరులు, రాజనీతినిపుణులు, ప్రలోభములకు లొంగనివారు, ఉత్తమవంశమున పుట్టినవారు ప్రభువుమనస్సును ఎఱిగి ప్రవర్తించెడివారు ఐన సత్పురుషులను మంత్రులుగా నియమించితివా? రాజ్యతంత్రములనుగూర్చి నీవు ఒక్కడవే ఆలోచించుటలేదుగదా? అట్లని పెక్కుమందితో మంత్రాంగమును నెఱపుట లేదుగదా? పెక్కుమంది మూర్ఖులకంటెను మేధావియు, సమర్థుడును ఐన అమాత్యుడు ఒక్కడైనను ప్రయోజనమును చేకూర్పగలడుసుమా!

రాజసత్కారములతో సంతుష్టుడైయుండువాడును, శత్రువులను నిగ్రహింపసమర్థుడును, సేనావ్యూహములయందు చతురుడును, విపత్కరపరిస్థితులలో ధైర్యముగా ఉండువాడును, పవిత్రముగా ఉండెడివాడును, సద్వంశమున జన్మించినవాడును, రాజభక్తిగలవాడును, యుద్ధకార్యకుశలుడును ఐన వానిని సేనాపతిగా నియమించితివి గదా! సేనలోని ప్రముఖయోధులందఱును మిగుల బలశాలురు, పరాక్రమవంతులుఐనవారేనా? వారు బలపరీక్షలలో నెగ్గినవారేనా? సరియగు పారితోషికములతోను, సకాలములో జీతబత్తెములతోను వారిని తృప్తిపఱచుచున్నావుగదా?

స్వదేశీయులును, ఇతరులభావములగ్రహింపగలవారును, కార్యదక్షులును, సమయస్ఫూర్తిగలవారును, రాజసందేశములను యథాతథముగ తెల్పగలవారును, యుక్తాయుక్తవిచక్షణగలవారునుఐన పురుషులనే విదేశములకు దూతలుగా నియమించుచున్నావుగదా? స్వదేశములయందును, విదేశములలోను రాజకార్యములను నిర్వహించెడివారి కార్యకలాపములను గూఢచారులద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించుచున్నావా? నాస్తికులు, పండితమ్మన్యులు, వితండవాదులుఐన వారిని చేరదీయుటలేదుగదా చతుర్వర్ణములవారును, అన్నివృత్తులవారును తమతమధర్మకర్మలలో నిరతులైయున్నారు గదా? వారికి సరియగు రక్షణ కల్పించుచున్నావుగదా?

రాజోద్యోగులకు మిక్కిలి చనువును ఇచ్చుటగాని, వారిని పూర్తిగా దూరముగానుంచుటగాని తగదుసుమా! వ్యయము రాజ్యాదాయపరిమితికి లోబడియున్నదా? దోషులను ధనలోభముచే విడిచిపెట్టుటగాని, నిర్దోషులను శిక్షించుటగాని నీ రాజ్యమున లేదుగదా? ధర్మాచరణమును, అర్థార్జనమును, కామసుఖములను ఒకదానికి మఱియొకటి హానికరముగాకుండ సకాలములో నడుపుచున్నావుగదా? పెక్కుమంది శత్రువులపై ఒకే సమయములో దండెత్తుట మొదలగు దోషములను పరిత్యజించుచున్నావుగదా?

నాస్తిక్యమ్ అనృతం క్రోధం ప్రమాదం దీర్ఘసూత్రతామ్ । అదర్శనం జ్ఞానవతామ్ ఆలస్యం పంచవృత్తితామ్ ॥
ఏకచింతనమర్థానామ్ అనర్థజ్ఞైశ్చమంత్రణమ్ । నిశ్చితానామ్ అనారంభం మంత్రస్యాఽపరిరక్షణమ్ ॥
మంగళస్యాఽప్రయోగంచ ప్రత్యుత్థానంచ సర్వతః । కచ్చిత్ త్వం వర్జయస్యేతాన్ రాజదోషాంశ్చతుర్దశ ॥

రాజనీతిధర్మజ్ఞుడైన మహారాజు ఆత్మజ్ఞానియై, న్యాయమార్గమును అనుసరించి, ప్రజలను ధర్మబద్ధముగా పరిపాలించినచో సమస్తభూమండలము అతనికి వశమగును సుమా!" శ్రీరాముడు ప్రస్తావించిన ఈ రాజనీతివిషయములు అన్నియును ఎల్లకాలములయందును సకలదేశపరిపాలకులకును ఆచరణీయములు.

శ్రీరాముడు భరతుని ప్రార్థనను, జాబాలినాస్తికవాదమును త్రోసిపుచ్చుట - సత్యస్వరూపమును వివరించుట

అంతట భరతుడు "అన్నా! నిన్ను సేవించుటయే నాకు పరమధర్మము. దానికి దూరమైనప్పుడు ఇతర రాజధర్మములతో నాకు పనియేమి?" అని పలికి శ్రీరాముని అయోధ్యకురమ్మని ప్రార్థించెను. పిమ్మట అతడు తమతండ్రి మరణవార్తను ఎఱింగించెను. అందులకు శ్రీరాముడు దుఃఖితుడై, శాస్త్రోక్తముగా తండ్రికి శ్రాద్ధకర్మలను

నిర్వహించెను. "పుట్టిన ప్రతిప్రాణియు గిట్టుట సహజము. కనుక తండ్రిమృతికి వగవక ఆయన ఆజ్ఞనుపాటించుటయే మనలందఱి కర్తవ్యము. కావున నీవు రాజ్యభారమును వహింపుము. నేను పదునాలుగుసంవత్సరములు వనవాసము ముగించుకొని అయోధ్యకు మఱలివత్తును" - అని శ్రీరాముడు భరతునకు హితవు పలికెను.

"ఈ లోకముతప్ప మఱియొక లోకములేదు. పరోక్షములైన పారలౌకికలాభములను విశ్వసింపక, ప్రత్యక్షముగానున్న రాజ్యములను (భౌతిక సుఖములను) అనుభవించుటయే ముఖ్యకర్తవ్యము" మున్నుగా సాగిన జాబాలినాస్తికవాదమును తీవ్రముగా ఖండించి, శ్రీరాముడు 'తండ్రిని సత్యసంధునిగాజేయుటయే' తన ముఖ్యకర్తవ్యమని నొక్కివక్కాణించెను. ఈ సందర్భమున ఆ రఘురాముడు సత్యస్వరూపమునుగూర్చియు, దాని ప్రభావపరమార్థములనుగుఱించియు లోకమునకు తేటతెల్లముగావించెను. రాజు సత్యప్రవర్తనుడైనచో ప్రజలందఱును సత్యమార్గముననే ప్రవర్తింతురు.

(యద్వృత్తాః సంతి రాజానః తద్వృత్తాః సంతి హి ప్రజాః)

లోకమంతయును సత్యముమీదనే ఆధారపడియున్నది. ("సత్యే లోకః ప్రతిష్ఠితః)

ఋషీశ్వరులును, దేవతలును సత్యమే మిగుల శ్రేష్ఠమైనదని తలంతురు. (సత్యప్రవర్తనులనే గౌరవింతురు) ఈ లోకమున సత్యవాదియే పరమధామమును (ఉన్నతస్థితికి) చేరును.

ఋషయశ్చైవ దేవాశ్చ సత్యమేవ హి మేనిరే । సత్యవాదీ హి లోకేఽస్మిన్ పరమం గచ్ఛతి క్షయమ్ ॥

ఈ లోకమున ధర్మమునకు సత్యమే పరాకాష్ఠ. స్వర్గప్రాప్తికి అదియేమూలము.

'ధర్మః సత్యం పరో లోకే మూలం స్వర్గస్యచోచ్యతే'

లోకమున సత్యమే భగవత్స్వరూపము. సంపదలన్నియును సత్యముమీదనే ఆధారపడియుండును. అన్నింటికిని సత్యమే ఆధారము. సత్యముకంటెను శ్రేష్ఠమైనది మఱియొకటిలేదు.

సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా । సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరంపదమ్ ॥

వేదములు మున్నగునవి అన్నియును సత్యముపైననే ఆధారపడియున్నవి. కావున లోకమంతయును సత్యమార్గముననే ఆశ్రయింపవలెను. **'వేదాః సత్యప్రతిష్ఠానాః తస్మాత్ సత్యపరోభవేత్' ।**

భరతునకు పాదుకలనొసంగి, శ్రీరాముడు సీతాలక్ష్మణులతో దండకవనమున ప్రవేశించుట

పిమ్మట భరతునిప్రార్థనపై రఘువరుడు తనపాదుకలను అతనికి న్యాసముగా ఇచ్చెను. అనంతరము భరతుడు శ్రీరామునిపాదుకలను తనశిరసున ధరించి, పరివారములతోగూడి, అయోధ్యకు బయలుదేఱెను. మార్గమధ్యమున భరద్వాజమహామునియొక్క ఆశీస్సులనుగొని, క్రమముగా అయోధ్యకు చేరెను. తదుపరి భరతుడు ఆ నగరసమీపమునగల 'నందిగ్రామము'న శ్రీరామునకు ప్రతినిధులుగానున్న ఆ పాదుకలకు పట్టాభిషేకమొనర్చి, వాటికి నివేదించుచు రాజ్యకార్యములను నిర్వహింపసాగెను.

భరతాదులసమాగమస్మృతులను కొంతమేరకు తగ్గించుకొనుటకై శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి చిత్రకూటమును విడిచి, అత్రిమహాముని ఆశ్రమమునకు చేరెను. అంతటవారు అత్రిమహర్షిని, ఆయన ధర్మపత్నియగు అనసూయాదేవిని దర్శించి వారిని సేవించిరి. అచట అనసూయాదేవి సీతాదేవికి పతివ్రతాధర్మములను ఉపదేశించెను. ఆమె కోరికపై జానకి ఆమెకు తన కల్యాణగాథను వివరించెను. పిమ్మట ఆ అత్రిపత్ని ఆ రామపత్నిని వస్త్రాభరణములతో ఆదరించి, ఆశీర్వదించెను. మఱునాటి ఉదయమున సీతారామలక్ష్మణులు అచటినుండి బయలుదేఱి దండకారణ్యమున ప్రవేశించిరి.

పాత్రలు - వాటి ఔన్నత్యములు

శ్రీరాముడు : శ్రీమద్రామాయణమునకు శ్రీరామచంద్రుడు కథానాయకుడు. ధర్మపరిరక్షణకై భగవంతుడే రఘువంశమున కౌసల్యాదశరథులపుణ్యఫలముగా వారికి పుత్రుడై అవతరించెను. ఆయన భగవదవతారమేయైనను లోకమునకు ఆదర్శప్రాయుడైన ఒక మహాపురుషుడుగా తనలీలలను ప్రదర్శించెను. ఆయనలీలావిలాసములు వినినవారికిని, చదివినవారికిని, స్మరించినవారికిని వారివారిహృదయములయందు పవిత్రభావములను కలిగించును. శ్రీరామచంద్రుడు సద్గుణనిధి. ఆయనప్రతిచర్యయు లోకమునకు అనుసరణీయము. మాతాపితరులయెడ భక్తి, గురువులయెడ వినయవిధేయతలు, ఏకపత్నీవ్రతనియమము, భ్రాతృప్రేమ, మిత్రులయెడ అనురాగము, శరణాగతవాత్సల్యము, ప్రజానురాగము ఆయనకు సహజలక్షణములు.

శ్రీరామునిపితృవాక్యపరిపాలనము నిరుపమానమైనది. బాల్యమునందు తల్లిదండ్రులమాటలను పాటించుచు, వారికి ముద్దుమురిపెములగూర్చుచు పెరిగి పెద్దయైనవాడు మన చిన్నారి రాముడు. ఆతడు తండ్రియాజ్ఞను తలదాల్చి, తల్లి ఆశీస్సులనుగైకొని, యాగసంరక్షణమునకై విశ్వామిత్రమహర్షివెంట బయలుదేఱెను. 'తాటకను సంహరింపుము' - అని ఆ మహర్షి పలికినప్పుడు శ్రీరాముడు ఆయనకు అంజలిఘటించి ఇట్లు నుడివెను.

"గురువర్యా! 'ఈ విశ్వామిత్రులమాటలను తు, చ తప్పక పాటింపుము.' అనునది మా తండ్రిగారి ఆజ్ఞ – వారి ఆజ్ఞలను అవశ్యము గౌరవింతును. మహాత్ముడును, మా తండ్రియు ఐన దశరథుడు అయోధ్యలో వసిష్ఠాదులసమక్షమున నన్ను అట్లు ఆజ్ఞాపించియుండెను. ఆ మాట నాకు ఉల్లంఘింపరానిది. తండ్రిగారిఆజ్ఞప్రకారము బ్రహ్మవాదులైన మీ ఆనతిని శిరసావహించి, నిస్సంశయముగా తాటకను వధించితీరెదను."

పితుర్వచననిర్దేశాత్ పితుర్వచనగౌరవాత్ । వచనం కౌశికస్యేతి కర్తవ్యమ్ అవిశంకయా ॥

అనుశిష్టోఽస్మ్యయోధ్యాయాం గురుమధ్యే మహాత్మనా । పిత్రా దశరథేనాఽహం నావజ్ఞేయం హి తద్వచః ॥

సోఽహం పితుర్వచః శ్రుత్వా శాసనాత్ బ్రహ్మవాదినః । కరిష్యామి న సందేహః తాటకావధముత్తమమ్ ॥

దశరథునిసమక్షమున కైక తనరెండువరములగూర్చి ప్రస్తావించినప్పుడు శ్రీరాముడు ఆమెతో ఇట్లు వచించెను.

"అమ్మా! నాకు రాజ్యకాంక్షలేదు. నేను ఇచటనేయుండిపోవలెనని ఆశించుటయును లేదు. కేవలము ధర్మమునే ఆశ్రయించియున్న నన్ను ఋషితుల్యునిగా ఎఱుంగుము. పూజ్యుడైన మా తండ్రికి ఏకొంచెముగానైనను ప్రియమునుచేయగల్గియున్నచో ప్రాణములనొడ్డియైనను అన్నివిధములుగా దానిని చేసియే తీరెదను. తండ్రికి శుశ్రూషచేయుట, ఆయనఆజ్ఞలను పాటించుట అనువాటికంటెమించిన ధర్మాచరణము మానవులకు మఱియొకటి లేనేలేదు." -

నాఽహమ్ అర్థపరో దేవి! లోకమావస్తుముత్సహే । విద్ధి మామ్ ఋషిభిస్తుల్యమ్ కేవలం ధర్మమాస్థితమ్ ॥

యదత్ర భవతః కించిత్ శక్యం కర్తుం ప్రియం మయా । ప్రాణానపి పరిత్యజ్య సర్వథా కృతమేవ తత్ ॥

న హ్యతో ధర్మచరణం కించిదస్తి మహత్తరమ్ । యథా పితరి శుశ్రూషా తస్య వా వచనక్రియా ॥

శ్రీరాముని అరణ్యములకు పంపెడివిషయమున సౌమిత్రి కోపముతో ఊగిపోయెను. అప్పుడు ఆ లక్ష్మణుని శాంతపఱచుచు రఘురాముడు అతనితో ఇట్లనెను. "నాయనా! లక్ష్మణా! తల్లిదండ్రులఆజ్ఞలను త్రికరణశుద్ధితో పాటించువానినిగా నన్నెఱుంగుము. ఇదియే సత్పురుషులమార్గము." -

ఈ సందర్భముననే దైన్యముతో విలపించుచున్న కౌసల్యామాతను ఊరడించుచు ధర్మాత్ముడైన శ్రీరాముడు "అమ్మా! తండ్రిఆజ్ఞను జవదాటుటకు నేను అశక్తుడను. శిరసా నీకు ప్రణమిల్లుచున్నాను. నేను వనములకు వెళ్ళుటకే

సిద్ధముగా ఉన్నాను. నన్ను అనుమతింపుము. జననీ! ఈ లోకమున ప్రతివ్యక్తియు పితృవాక్యపరిపాలనచేసియే తీరవలెను. తండ్రిమాటను శిరసావహించిన వాడెవ్వడును ధర్మమునుండి పతనముకాడు."

చిత్రకూటమున భరతుడు శ్రీరాముని దర్శించి, 'అయోధ్యకు తిరిగిరమ్ము' – అని ఆయనను ప్రార్థించెను. అప్పుడు ఆ రఘురాముడు అతనితో "నాయనా! భరతా! తండ్రియాజ్ఞకు బద్ధుడనై నేను ఈ నిర్జనవనములకు వచ్చితిని. ఈ విషయమున నన్ను ఎవ్వరును నివారింపజాలరు, నీవును తండ్రిమాటను తలదాల్చి శీఘ్రముగా రాజ్యాభిషిక్తుడవు కమ్ము. తండ్రిని సత్యసంధునిగావింపుము." అని నుడివెను. ఆ తరువాత జాబాలియు, వసిష్ఠుడును ఎంతగా నచ్చజెప్పినను శ్రీరాముడు పితృాజ్ఞను పాలించుటకే కటిబద్ధుడాయెను. ఇవియన్నియు శ్రీరామునిపితృవాక్యపరిపాలనకు పరమనిదర్శనములు.

భరతునియెడలను, లక్ష్మణశత్రుఘ్నులపైనను శ్రీరామునకు గల 'భ్రాతృప్రేమ' అపారము. 'నేను ఆడినమాట తప్పను' – అని కైకతో పలుకుచు "నా సోదరుడైన భరతునికొఱకై నేను రాజ్యమును, సమస్తసంపదలను, కడకు అత్యంత ప్రీతికరములైన ప్రాణములనుసైతము స్వయముగా సంతోషముతో ఇచ్చివేయుదును" అని శ్రీరాముడు నుడివెను.

భరతుడు సైన్యములతోగూడి చిత్రకూటమునకు వచ్చుచుండుటను లక్ష్మణుడు ముందుగా గమనించెను. అప్పుడు అతడు భరతునియెడ అపోహపడి కుపితుడై నిష్ఠురోక్తులుపల్కెను. అంతట శ్రీరాముడు అతనితో "ఓ లక్ష్మణా! భరతునిసోదరప్రేమ నిరుపమానమైనది. అతడు నాకు ప్రాణములకంటెను ఎక్కువ ప్రీతిపాత్రుడు. భరతుడు ఇక్కడికి వచ్చినప్పుడు నీవు అతనితో పరుషముగాగాని, అప్రియముగాగాని పలుకరాదు. అట్లు పలికినచో ఆ మాటలను నీవు నన్నుగూర్చి పలికినట్లే భావింతును." అని వచించెను. ఈ వచనములన్నియును శ్రీరామునిభ్రాతృప్రేమకు మచ్చుతునకలు.

'(1) పితృవాక్యపరిపాలనము (2) భ్రాతృప్రేమ' అను శ్రీరాముని ఈ సద్గుణములు లోకమునకే ఆదర్శప్రాయములు. వీటిని అనుసరించినచో మానవాళియునుగడ ఎల్లవేళల సుఖశాంతులతో వర్ధిల్లగలదు.

లక్ష్మణుడు : శ్రీరామునివెన్నంటివచ్చిన ఆదిశేషునిఅవతారమే శ్రీలక్ష్మణస్వామి. ధర్మస్వరూపుడైన శ్రీరామచంద్రప్రభువుయొక్క పాదపద్మములను సర్వదా సేవించుటయే తనకు కర్తవ్యమని భావించి, అతడు ఆయన సేవలలోనే పరవశుడగుచుండును. విశ్వామిత్రునియాగసంరక్షణసమయమునను, శ్రీరామునివనవాసకాలమునను లక్ష్మణుడు నిరంతరము అంకితభావముతో భ్రాతృసేవలొనర్చినతీరు అత్యద్భుతము. రామలక్ష్మణుల పరస్పరప్రేమానురాగములు అపూర్వములు. వనవాసమునకు సన్నద్ధుడగుచున్న శ్రీరాముని అనుసరించుటకై లక్ష్మణుడు ఆయనతో విన్నవించుకొనినతీరు కొనియాడదగినది. "స్వామీ! నేను సర్వదా నీవెంటనే ఉందును. నిన్ను సేవించెడిభాగ్యమునకు దూరమైనచో త్రిలోకాధిపత్యము లభించినను నాకు అక్కఱయేలేదు. జననమరణరాహిత్యమునుగూడ నేను కోరుకొనను. అంతేగాదు పరమపదప్రాప్తినిసైతము నేను వాంఛింపను."

న దేవలోకాక్రమణం నాఽమరత్వమహం వృణే । ఐశ్వర్యం వాపి లోకానాం కామయే న త్వయా వినా ॥

అనునది లక్ష్మణుని భ్రాతృభక్తికి పరాకాష్ఠ. అతడు క్షణముగూడ శ్రీరాముని చూడకుండ ఉండలేడు. ఆయనఅనుగ్రహమునకు దూరమైనచో అతడేమాత్రమును తట్టుకొనలేడు. వాల్మీకి పేర్కొనిన ఈ శ్లోకము లక్ష్మణస్వామియెడ పూర్తిగావర్తించును.

యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి । నిందితః స వసేల్లోకే స్వాత్మాఽప్యేనం విగర్హతి ॥

భరతుడు : శ్రీరామునకు భరతుడు ప్రియసోదరుడేగాక, పరమభక్తుడుగూడ. తల్లి కైకేయియొక్క మోహకారణముగ కోసలరాజ్యాధికారము తనచేతికి అందినను అతడు దానిని తృణప్రాయముగా త్యజించెను. కౌసల్యామాతసమక్షమునను, నిండుసభలో వసిష్ఠాదిమహర్షులయెదుటను అతడు ప్రకటించిన పరితాపవచనములు ఆయనహృదయస్వచ్ఛతను

వెల్లడించుచున్నవి. ఇంకను చిత్రకూటమున రామునిముందు అతడుపడిన వేదన, శ్రీరామునిపాదుకలకు పట్టముగట్టినతీరు శ్రీరామునియెడగల భరతునిఅనన్యభక్తికిని, నిస్వార్థబుద్ధికిని నిదర్శనములు. నందిగ్రామమున ఆయన ఆచరించిన నిష్ఠానియమజీవనములు మహామునులకును ఆదర్శప్రాయములు.

శత్రుఘ్నుడు : సుమిత్రాదేవి సుతులలో శత్రుఘ్నుడు ద్వితీయుడేయైనను సుగుణగణసంపదచే అద్వితీయుడు. ఇతని భ్రాతృభక్తియు, సేవానిరతియు సాటిలేనివి. లక్ష్మణుడు శ్రీరామునకు నిరంతరము తోడునీడకాగా, ఇతడు భరతునకు అనవరతము అనుయాయియయ్యెను. అన్నయగు లక్ష్మణునకువలె ఈయనలోను ధర్మాభినివేశము మెండు. దుష్టవంచకులకు బుద్ధిచెప్పునప్పుడు ఇతని ఆవేశము కట్టలు త్రెంచుకొనును. కుటిలభావములకు ప్రతిరూపమై, కైకేయిని పెడదారికి మళ్లించి, అయోధ్యలోనికల్లోలములకు కారకురాలైన మంథర కనబడినంతనే శత్రుఘ్నుడు పట్టరానికోపమునకు లోనై, ఆమె జుట్టుపట్టుకొని చావమోదెను. చిత్రకూటమునుండి శ్రీరాముని అయోధ్యకుగొనివచ్చుటకై తానును భరతుని వెంటనడిచెను. ఇతడు మితభాషి, స్మితభాషి, క్రియాశూరుడు.

సీతాదేవి : అవనిజాత సీత మహాసాధ్వి, నిస్సంగనిష్ఠానియమజీవనవిధానములతో వాసికెక్కిన జనకునియొక్క గారాలబిడ్డ. ఆమె మహాలక్ష్మీదేవిఅవతారము. శివధనుర్భంగముగావించిన శ్రీరామునిమెడలో వరమాలవేసి, రామపత్నియై రాణించిన వనితామణి. కనిపెంచిన తల్లిదండ్రులకును, ఆశీర్వదించి, ఆదరించిన అత్తమామలకును ప్రేమపాత్రురాలై అందఱిమన్ననలను చూరగొనిన ఉత్తమురాలు. శ్రీరామునిఅనుమతిని, కౌసల్యాదేవిఆమోదమునుపొంది, ప్రాణనాథునివెంట వనములకు నడిచిన పతిసేవాపరాయణ. మునీశ్వరులసేవలతో, మునిపత్నులఆశీస్సులతో పరమపునీతయైన సీత ఆదర్శనారీశిరోమణి.

సీతాదేవియొక్క స్వభావసౌశీల్యములనుగూర్చియు వ్యక్తిత్వవైభవములనుగురించియు ఆమెనోటనే వెలువడిన వాల్మీకివాణిని ఇచట గుర్తునకు తెచ్చుకొనుట ఎంతేనియుక్తము.

"నాథా! భర్తతోగూడి మసలుకొనువిషయమున మాతల్లిదండ్రులు నాకు చక్కనిబోధచేసిరి. అట్లే అత్తమామలయెడలను, తోడివారితోడను, తదితరులవిషయమునను ప్రవర్తించుటను గూర్చి వారికడ నేను శిక్షితురాలను. సమస్తసుఖములకును నిలయమైన రాజభవనములలో నివసించుటకంటెను, స్వర్గాదిలోకములలో విమానములలో విహరించుటకంటెను, అష్టైశ్వర్యసంపదలతో అంబరమున హాయిగా సంచరించుటకంటెను ఎన్ని కష్టములు అనుభవింపవలసివచ్చినను పతిఅడుగుజాడలలో సాగిపోవుటయే సతికి సుఖప్రదము, శుభప్రదము, ధర్మసమ్మతము.

అనుశిష్టాఽస్మి మాత్రాచ పిత్రాచ వివిధాశ్రయమ్ । ప్రాసాదాగ్రైర్విమానైర్వా వైహాయస గతేన వా ॥

సర్వావస్థాగతా భర్తుః పాదచ్ఛాయా విశిష్యతే । నాఽస్మి సంప్రతి వక్తవ్యా వర్తితవ్యం యథా మయా ॥

పతివెంట వనములకు వెళ్లుచున్న సీతాదేవికి కౌసల్యాదేవి పతివ్రతాధర్మములను నుడువగా ఆమెతో జానకి పలికిన మాటలు ఆణిముత్యములు. ఇవి వనితా రత్నములకు ఒరవడిపెట్టునవి.

"దేవీ! చంద్రునినుండి వెన్నెలవేఱుకానట్లు నేనును ధర్మపథమునకు దూరముకాబోను. తంత్రులు లేనిదే వీణమ్రోగదు. చక్రములులేనిదే రథము కదలదు. అట్లే వందమంది కుమారులతల్లియైనను ఆపడతి పతికి దూరముగానున్నచో నిజమైన సుఖములకు నోచుకొనదు. ఏ పతికైనను తండ్రిగాని తల్లిగాని కడకు తనకడుపునబుట్టిన పుత్త్రులుగాని పరిమితముగామాత్రమే తోడ్పడగలరు. కాని భర్తమాత్రము ఆమెకు అపరిమితముగా ఐహికములైన సుఖసంతోషములను గూర్చుటయే గాక పారమార్థికలాభములనుగూడ పంచియిచ్చును. కనుక ఏ సతి తనపతిని గౌరవింపదు?

న మామసజ్జనేనాఽఽర్యా సమానయితుమర్హతి । ధర్మాద్విచలితుం నాహమ్ అలం చంద్రాదివ ప్రభా ॥

నాఽతంత్రీ వాద్యతే వీణా నాఽచక్రో వర్తతే రథః । నాఽపతిస్సుఖమేధేత యా స్యాదపి శతాత్మజా ॥

మితం దదాతి హి పితా మితం మాతా మితం సుతః । అమితస్య చ దాతారం భర్తారం కా న పూజయేత్ ॥

సీతాసాధ్వి వెల్లడించిన 'స్వాభావికములును, ఆమె మనోభావములకు అద్దముపట్టుచున్నవియు' అగు ఈ అమృతవచనములు ఆమె సహజ-ఔన్నత్యమునకు వెలుగులను నింపుచున్నవి. వనితాలోకగౌరవప్రతిష్ఠలకు నీరాజనములెత్తుచున్నవి.

దశరథుడు : సూర్యవంశమునకుచెందిన దశరథమహారాజు అయోధ్యకు ప్రభువు. ఇక్ష్వాకువంశపురాజులలో ప్రముఖుడు. ఇతనితండ్రి అజమహారాజు. పరాక్రమమునను, రణకౌశలమునను సాటిలేనివాడు ఈ కోసలదేశాధిపతి. ఇతడు ఇంద్రునకును సాయపడగలిగిన సమరవీరుడు, సత్యసంధుడు. పెద్దలమాటలను, గురువచనములను గౌరవించెడివాడు. దేశమును సుదీర్ఘకాలము ప్రజానురంజకముగా పరిపాలించిన ఉత్తమప్రభువు. లేకలేక కలిగిన కుమారులపై, ముఖ్యముగా శ్రీరామచంద్రునియెడ ఆయనకుగల వాత్సల్యము అపూర్వము. ఆ కారణముననే విశ్వామిత్రునివెంట శ్రీరాముని పంపుటకు వెతచెందెను. కడకు వసిష్ఠునిసూచనపై రఘువరుని ఆ కౌశికునివెంటపంపి, యజ్ఞరక్షణమునకు తోడ్పడెను. వివాహితులైన తనకుమారులను వెంటబెట్టుకొని, దశరథుడు మిథిలనుండి అయోధ్యకు వచ్చునప్పుడు మార్గమధ్యమున పరశురాముడు ఉగ్రరూపమున తారసపడెను. ఆయనవలన తనసుతులకు ఏమి ప్రమాదమువచ్చెడునోయని ఆ మహారాజు మిగులకలవరపడెను. ఆయన మమకారములు అట్టివి.

విధివశమున కైకేయి కుతంత్రములకు బలియై, విలవిలలాడినను అతడు ఆడినమాట తప్పని సత్యసంధుడు. మునీశ్వరుని శాపఫలితముగ అంతులేని పుత్రశోకమునకుగురియై, స్వర్గమునలంకరించిన పుణ్యపురుషుడతడు. అవతారమూర్తియైన శ్రీరామచంద్రప్రభువునకు తండ్రియైన దశరథుడు సుచరిత్రుడు.

కౌసల్యాదేవి : కోసలదేశపురాజైన భానుమంతునికూతురు కౌసల్యాదేవి. ఈమె దశరథమహారాజునకు పెద్దభార్య. శ్రీహరి అవతారమైన శ్రీరాముని తనబంగారు కడుపునగన్న ధన్యాత్మురాలు. ముద్దులుమూటగట్టు శిశువై, తనయొడిచేరిన శ్రీరామునిలీలావిలాసములను దర్శించి ఆ తల్లి మురిసిపోయెను. వచ్చియురాని బుడిబుడినడకలతో తన ముందు తారాడు ఆ బాలరామునకు తన చల్లనిచేతులతో గోరుముద్దలు తినిపించుచు, అల్లారుముద్దుగా ఆయనను లాలించి పాలించిన కృతార్థురాలు ఆ కౌసల్యామాత. ఊగుటుయ్యేలలో తన చిన్నారి రామన్నను పరుండబెట్టి, కమ్మని జోలలుపాడుచు, జోకొట్టుచు పరవశించిపోయిన అదృష్టవంతురాలు ఆ రామజనని.

యాగరక్షణ నిమిత్తముగా తనవెంటవచ్చిన శ్రీరాముని మేల్కొలుపుచు విశ్వామిత్రుడు 'కౌసల్యాసుప్రజారామ!' అని సంబోధించెను. ఆ కమ్మని పిలుపు నేటికిని ఇంటింటా మారుమ్రోగుచు కౌసల్యామాతకీర్తిని సకలలోకములలో చిరస్థిరముగాపించుచున్నది. శ్రీరామునివనగమనసమయమున ఆమెపడిన మనోవేదన వర్ణనాతీతము. వెళ్లవలదన్నచో పతియాజ్ఞను మీరినట్లగును. దానివలన పాపములంటును. 'వెళ్లుము' అనుటకు పుత్రవాత్సల్యము అడ్డువచ్చును. ఎట్టకేలకు ఈ డోలాయమానస్థితినుండి బయటపడి, పతియాజ్ఞను తలదాల్చి, ఆమె తనరామునివనగమనమునకు అనుమతించెను. ఈ సందర్భమున తనఆశీస్సులకై తన్నుజేరిన సీతాదేవికి ఆమె సతీధర్మములను ఉపదేశించెను. మచ్చునకు

"సీతా! సాధ్వీమణులపద్ధతి సాధారణస్త్రీలకు భిన్నముగానుండును. వారు తమవంశమర్యాదలకు తగినట్లుగా ప్రవర్తింతురు. గురువుల (పెద్దల) ఉపదేశములను అనుసరించి నడుచుకొందురు. శాంతస్వభావము కలిగియుందురు. వారికి పతియేదైవము. వారి జీవితములు పరమపవిత్రములు"-

సాధ్వీనాం హి స్థితానాం తు శీలే సత్యే శ్రుతే శమే । స్త్రీణాం పవిత్రం పరమం పతిరేకో విశిష్యతే ॥

సీతాదేవిపై ఆమెకుగల వాత్సల్యము లోకమునకే ఆదర్శప్రాయము.

భరతుడు కౌసల్యామాతముందు నిలిచి తననిర్దోషిత్వమును నిరూపించుకొనుచు శ్రీరామునికై పరిపరివిధముల విలపించుచుండెను. అప్పుడు ఆ తల్లి తనగుండెను దిటవుచేసికొని, విజ్ఞతతో అతనిని ఓదార్చిన తీరు ప్రశంసనీయము. నేయేల? సర్వదా సర్వథా మన రామజననిజన్మ ధన్యము –

సుమిత్రాదేవి : వాల్మీకిరామాయణమునందలి పాత్రలలో సుమిత్రాదేవి పాత్రపరిధినిబట్టి చిన్నది. కాని ప్రాశస్త్యగుణప్రభావమున మిన్నయైనది. లక్ష్మణశత్రుఘ్నులకన్నతల్లియైన ఈ రాజపత్ని తనసాధుస్వభావముచేతను, సత్ప్రవర్తనకారణమునను లోకములమన్ననలనుపొందిన మహితాత్మురాలు. సీతారాములను సేవించుటకై వనగమనమునకు అనుమతినిగోరిన లక్ష్మణస్వామికి ఈ సుమిత్రామాత ఒసంగిన ఉపదేశములు అత్యద్భుతములు, శ్లాఘ్యములు, ఆదర్శప్రాయములు.

"కుమారా! లక్ష్మణా! శ్రీరాముని దశరథునిగా (మీ తండ్రినిగా) భావింపుము. సీతాదేవిని నన్నుగా (తల్లినిగా) తలంపుము. అడవిని అయోధ్యనుగా భావింపుము. వారి సేవలలోనే ఆనందమును అనుభవింపుము. నాయనా! ఇక నీవు సుఖముగా వెళ్లిరమ్ము.

రామం దశరథం విద్ధి, మాం విద్ధి జనకాత్మజామ్ । అయోధ్యామ్ అటవీం విద్ధి గచ్ఛ తాత! యథాసుఖమ్ ॥

అను ఈ పలుకులు ఆమె సహనసౌశీల్యములకు మచ్చుతునకలు. తనయిరువురుసుతులలో లక్ష్మణస్వామిని శ్రీరామునిసేవలకును, శత్రుఘ్నుని భరతునిసేవలకును నియోగించిన త్యాగమూర్తి మనసుమిత్రామాత.

కైకేయి : భరతునియందువలె శ్రీరామునియందును కైకేయికి ఎనలేని ప్రీతి. శ్రీరాముడును ఆమెకడ చనవుగలిగి మసలుకొనును. కైక మంథరవలన శ్రీరాముని పట్టాభిషేకవార్తను వినినప్పుడు ఎంతయు సంతసించెను.

ఓ మంథరా! నీవు తెల్పిన ఈ పట్టాభిషేకవార్త నాకు మిక్కిలి ప్రీతికరమైనది. రామభరతులిద్దఱును నాకు సమానులే. నాకు ఆ ఇరువురిలో ఏమాత్రమును హెచ్చుతగ్గులు గోచరింపవు. కావున మహారాజు శ్రీరాముని పట్టాభిషిక్తునిజేయుచున్నందులకు నేను ఎంతయు సంతోషపడుచుంటిని.

ఇదం తు మంథరే! మహ్యం ఆఖ్యాసి పరమం ప్రియమ్ ।
రామే వా భరతే వాఽహం విశేషం నోపలక్షయే ।
తస్మాత్ తుష్టాఽస్మి యద్రాజా రామం రాజ్యేఽభిషిక్ష్యతి ॥

కాని మంథర దుర్బోధలతో ఆమెమనసు మారిపోయెను. భరతునిపైగల ప్రేమకారణముగ ఆమెలో స్వార్థము పడగలువిప్పుకొనెను. అహంకారము బుసలుకొట్టెను. ఆమెలోని రజోగుణము విజృంభించెను. ఆమె మాయమాటలతో దశరథునిచే వాగ్దానము చేయించుకొనెను. శ్రీరామునివనవాసముమాటను విన్నంతనే దశరథమహారాజు స్పృహనుకోల్పోయెను. కైక రాజాజ్ఞపేరుతో శ్రీరాముని పిలిపించి, ఆయనను వనవాసమునకు సిద్ధమగునట్లుచేసెను. ఆమెకు తృప్తినిగూర్చుచు తండ్రిని సత్యసంధునిగానిలుపుటకై శ్రీరాముడు సీతాలక్ష్మణులతో వనములకేగెను.

ఈ సందర్భమున కైకేయి నిర్వహించిన పాత్ర ప్రజలయొక్క ఆగ్రహావేశములకు గురియయ్యెను. వసిష్ఠాదుల మందలింపులకు లోనయ్యెను. ఆమె వ్యవహరించిన తీరునకు భరతుని హృదయము విలవిలలాడెను. ఫలితముగా కైక అందరిలో నిందాపాత్రురాలయ్యెను. కాని భరద్వాజమహర్షి తన ఆశ్రమమున భరతుడు, వసిష్ఠాదిమహామునులు మున్నగువారిసమక్షమునందు "శ్రీరాముని వనవాసాదిసంఘటనలు విధివిలాసములోని భాగములే. ఇందు కైకేయి నిమిత్తమాత్రురాలు. వీటివలన మునీశ్వరులకును, దేవతలకును కష్టములు తొలగుటయేగాక లోకమునకు మహోపకారము జరుగును." అని వచించెను. ఈ మహామునిపలుకులు అందఱిలోను కనువిప్పు కలిగించెను. కైకేయికి నిందావిముక్తిని ప్రసాదించెను. ఆ కారణముగా అందఱిమనస్సులును కుదుటపడెను. రామావతారలక్ష్యము సాధితమయ్యెను.

వసిష్ఠుడు : సూర్యవంశమునకు కులగురువైన వసిష్ఠమహర్షి ఋషిపరంపరలో జగద్విఖ్యాతినందినవాడు. ఈయనకు అన్నివిధములుగా తగిన ఇల్లాలు అరుంధతీదేవి. నూతనవధూవరులకు ఈ పవిత్రదంపతులు కలకాలము ఆరాధ్యులు. వసిష్ఠుడు వేదపురాణధర్మమర్మజ్ఞుడు. రామలక్ష్మణభరతశత్రుఘ్నులకు విద్యాగురువు. సందర్భోచితముగా ధర్మప్రబోధముచేయుటలో సర్వసమర్థుడు. పుత్రప్రేమచే వెనుకముందాడుచున్న దశరథునకు హితవచనములను పలికి, రామలక్ష్మణులను విశ్వామిత్రునివెంట పంపుటలో ప్రముఖపాత్రవహించినవాడు. సీతారామకల్యాణమహోత్సవమున గురుస్థానమును అలంకరించి, ఆ నవదంపతులకు ఆశీస్సులను అందించిన ఋషిపుంగవుడు. దశరథుడు స్వర్గస్థుడై విపత్కరపరిస్థితులు ఏర్పడగా సమయోచితముగా వ్యవహరించి, కార్యములను చక్కబఱచినవాడు. శోకవిహ్వలుడైన భరతునకు హితోపదేశమునుగావించి, ఆయనను ఓదార్చినవాడు. భరతునివెంట చిత్రకూటమునకువెళ్ళి, శ్రీరామునిపిత్రాజ్ఞాపరిపాలనదీక్షకును. భరతునిఅనన్యభక్తితత్పరతకును భంగమురాకుండ సమన్వయమార్గమును సూచించి, సమస్యాపరిష్కారమునకు తోడ్పడిన ఋషిసత్తముడు.

విశ్వామిత్రమహర్షి : కుశికునివంశమున జన్మించినందున విశ్వామిత్రుడు కౌశికుడయ్యెను. ఇతడుగాధిపుత్రుడు. కృశాశ్వునికడ అస్త్రవిద్యలను అభ్యసించెను. తండ్రియనంతరము ఇతడు రాజ్యమునేలెను. నందినీధేనువుయొక్క సామర్థ్యముచేతను, వసిష్ఠమహర్షిబ్రహ్మదండముయొక్క శక్తిచేతను పరాజితుడై ఆ మహామునివలె తానును బ్రహ్మర్షి కావలెనని దీక్షవహించెను. వేలకొలది సంవత్సరములు తీవ్రముగా తపమొనరించి, బ్రహ్మర్షియయ్యెను.

ఈ మహర్షి యాగసంరక్షణనెపముతో రామలక్ష్మణులకు 'బల' 'అతిబల' అను విద్యలను ఉపదేశించుటయేగాక, వారికి వివిధములగు దివ్య శస్త్రాస్త్రములను ప్రయోగ-ఉపసంహారపూర్వకముగా అందించి, రాక్షససంహారమునకు నాంది పలికెను. ఇతడు మార్గమధ్యమున ఆ రాకుమారులకు పెక్కు దివ్యగాథలను వినిపించెను. శివధనుర్భంగమొనర్చుటకు శ్రీరాముని ప్రోత్సహించుటద్వారా ఆయనశౌర్యపరాక్రమములు లోకమున వెల్లడియగుటకు కారకుడయ్యెను. సీతారాముల కల్యాణమహోత్సవమును జరిపించి, మిథిలా-అయోధ్యావాసుల మన్ననలను పొందిన మహామహర్షి ఇతడు. ఈ విధముగా తన దివ్యకర్తవ్యములను ముగించుకొని, మరల తపోవనమునకు చేరిన మహాయోగిపుంగవుడితడు.

సుమంత్రుడు : దశరథమహారాజుకడనున్న మంత్రులలో సుమంత్రుడు ప్రముఖుడు. ఇతడు మిక్కిలి ప్రజ్ఞాశాలి, సద్గుణసంపన్నుడు, అంతఃపురప్రవేశమున అడ్డులేనివాడు, మహారాజునకు అంతరంగికుడు, రథసారథి. మహారాజునకు సంతానప్రాప్తికై పుత్రకామేష్టియజ్ఞమునుగూర్చి ముందుగా సూచించినవాడు. కుతంత్రములను పన్ని శ్రీరాముని వనములకు పంపుటకై సిద్ధపడిన కైకేయిని మందలించినవాడు. రాముడు వనములకు వెళ్ళునప్పుడు రథసారథ్యము నెఱపినవాడు. ఆ రామచంద్రప్రభువు వనములపాలైనందులకు విలవిలలాడినవాడు. గంగాతీరమునకు చేరినపిమ్మట 'నీవు ఇంక అయోధ్యకు మఱలిపొమ్ము' అని రాముడు తనను ఆదేశించినప్పుడు, ఆ ప్రభువును వీడి వెళ్ళలేక సుమంత్రుడు తీవ్రమైన మనోవేదనకు లోనై ఇట్లునుడివెను.

"ఓ పుణ్యపురుషా! నీవు లేకుండ నేను అయోధ్యకు వెళ్లజాలను. నీవెంట వనములకు వచ్చుటకు నన్ను అనుమతింపుము. స్వామీ! వనమునందు మీతోగూడి నివసించుచు, మీ ఆజ్ఞలను తలదాల్చి మీకు ఉపచారములు చేయగలను. ఆ భాగ్యమునకై అయోధ్యనేగాదు ఆ దేవలోకమునుగూడ, పరిత్యజించుటకు నేను సిద్ధమే. ఇంతలగా ప్రార్థించుచున్నను నన్ను మీవెంటరానీయనిచో, మీరు నన్ను వీడివెళ్లిన మఱుక్షణముననే ఇచట రథముతోగూడ నేను అగ్నిలో ప్రవేశించెదను.

తం న శక్ష్యామ్యహం గంతుమ్ అయోధ్యాం త్వదృతేఽనఘ । వనవాసానుయానాయ మామ్ అనుజ్ఞాతుమర్హసి ॥
తవ శుశ్రూషణం మూర్ధ్నా కరిష్యామి వనే వసన్ । అయోధ్యాం దేవలోకం వా సర్వథా ప్రజహామ్యహమ్ ॥
యది మే యాచమానస్య త్యాగమేవ కరిష్యసి । సరథోఽగ్నిం ప్రవేక్ష్యామి త్యక్తమాత్ర ఇహ త్వయా ॥

ఈ వచనములు సుమంత్రునకు శ్రీరామునియెడగల భక్తిప్రపత్తులకును, ఆతనిసేవానిరతికిని మచ్చుతునకలు.

శ్రీరామునియెడబాటునకు తట్టుకొనలేనిసుమంత్రునియొక్క ఈ తీవ్రపరితాపవచనములు సహృదయులహృదయములను ద్రవింపజేయును. అందఱిచేతను కంటతడిపెట్టించును. సుమంత్రుడు తిరిగి అయోధ్యకుచేరుట మొదలుకొని పట్టాభిషేకమువఱకు ఇతడు నిర్వహించిన పాత్ర ప్రభుభక్తిపరాయణులైన సచివులకెల్లరకును ఆదర్శప్రాయము.

గుహుడు : శృంగిబేరపురమునకుచేరిన సీతారామలక్ష్మణులను గుహుడు వినయవిధేయతలతో సేవించెను. అతడు వారికి అనుగుణములగు అతిథిమర్యాదలను నిండుగుండెతో నెఱపెను. వారిని గంగానదిని దాటించి, రామానుగ్రహమునకుపాత్రుడై, అతడు పరమానందభరితుడయ్యెను. సహజముగా అతడొకనిషాదుడేయైనను పురుషోత్తముడైన ఆ ప్రభువుయొక్క కృపకు నోచుకొనిన కారణముగా గుహుడు శ్రీరామభక్తులలో మేలుబంతిగా రాణించెను.

భరద్వాజుడు : మహర్షులలో భరద్వాజమహాముని సుప్రసిద్ధుడు. వనవాససమయమున సీతారామలక్ష్మణులకు సాదరముగా అతిథి సత్కారములను అందించిన అదృష్టవంతుడు. వారిచిత్రకూటప్రయాణమునకు తోడ్పడిన ధన్యజీవి అతడు. వనవాసముననున్న శ్రీరాముని అయోధ్యకు గొనివచ్చుటకై భరతుడు సర్వసన్నద్ధుడై తనఆశ్రమునకువచ్చినప్పుడు ఆ మహర్షి భరతునకును, అతనిఅసంఖ్యాకసైన్యమునకును, వసిష్ఠాదులకును నెఱపిన అతిథిమర్యాదలు అపూర్వములు. 'శ్రీరాముని వనవాసము ఒక విధివిలాసము. కైకేయి నిమిత్తమాత్రురాలు. దీనివలన లోకకల్యాణము జరుగును' - అని ప్రకటించి, ఆ త్రికాలవేది అచటివారిహృదయపరితాపములను ఉపశమింపజేసెను. ఈ ఘట్టమున కీలకపాత్రవహించిన భరద్వాజమహర్షి సుచరిత్రుడు.

అత్రి - అనసూయాదేవి : చిత్రకూటమునుండి దండకారణ్యమునకు బయలుదేఱిన సీతారామలక్ష్మణులు తమ ఆశ్రమమునకుచేరినప్పుడు, అత్రిమహర్షియు, అనసూయాదేవియు వారికిఒనర్చినమర్యాదలు, చూపిన ఆదరాభిమానములు, చేసిన ఉపదేశములు మఱువరానివి. అనసూయాదేవి సీతమ్మకు పతివ్రతాధర్మములను బోధించెను. ఆమెకోరికపై సీతాదేవి తన కల్యాణగాథను వినిపింపగా ఆమె ఎంతయు సంతసించెను. పిమ్మట ఆ మునిపత్ని రామపత్నికి ఎన్నటికిని చెక్కుచెదరని, వన్నెతగ్గని వస్త్రాభరణములను బహూకరించెను.

ముక్తాయింపు : బాల-అయోధ్యకాండములలో చిన్నారులైన లవకుశులయొక్క రామాయణగానమాధుర్యము చవిచూపబడినది. అయోధ్య, మిథిల మున్నగు నగరముల అందచందములు వర్ణింపబడినవి. రాజకుటుంబమర్యాదారీతులు, నాటి ప్రజల జీవనవిధానములు తెలుపబడినవి. వైదికధర్మములు, సంప్రదాయరీతులు, అశ్వమేధాదియజ్ఞములనిర్వహణములు, రాజకుమారులవిద్యాభ్యాసములు పేర్కొనబడినవి. రామాదులజననసమయమునందును, తదితరసందర్భములయందును జ్యోతిషశాస్త్రము ప్రస్తావింపబడినది. సీతాదేవిజీవితవిషయమున సాముద్రికశాస్త్రప్రస్తావన జరిగినది. సందర్భానుసారముగా వివిధదేశములగాథలు, నదీతీరములవైభవములు, ప్రకృతిసౌందర్యములు, రాజుల వంశచరిత్రలు, మహాపురుషులపూర్వగాథలు, మహర్షులతపఃప్రభావములు వర్ణింపబడినవి.

వాస్తుశాస్త్రము, మార్గనిర్మాణపద్ధతి, రాజనీతిశాస్త్రము మున్నగునవి విపులముగా వివరింపబడినవి. నారీధర్మములు, దంపతులఅన్యోన్యానురాగములు, పుత్త్రులకర్తవ్యములు, తల్లిదండ్రులవాత్సల్యములు, భ్రాతృప్రేమలు మొదలగు సామాజికవిశేషములు అన్నియును ఇందు తెలుపబడినవి. మొత్తముమీద రామాయణమహాకావ్యమునకు ఈ బాల-అయోధ్యకాండములు నాందీప్రస్తావనలు పల్కి, కావ్యగౌరవమునుపెంచి పోషించినవి.

శ్రీసీతారామాభ్యాం నమః

పారాయణవిధిః

(శ్రీమద్రామాయణ పూజాక్రమః)

ఓమ్ - శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

ఓం భూర్భువస్సువః- ఓమ్ । మమోపాత్త సమస్త దురితక్షయద్వారా శ్రీ పరమేశ్వరప్రీత్యర్థం శ్రీ సీతాలక్ష్మణభరతశత్రుఘ్నహనుమత్సమేత శ్రీ రామచంద్రప్రసాద సిద్ధ్యర్థం శ్రీరామచంద్రప్రసాదేన ధర్మార్థకామమోక్ష చతుర్విధపురుషార్థఫలసిద్ధ్యర్థం ఇష్టకామ్యార్థసిద్ధ్యర్థం సర్వపాపక్షయార్థం శ్రీవాల్మీకిరామాయణపారాయణం కరిష్యే ॥

తదర్థం శ్రీరామచంద్రపూజాం కరిష్యే - అస్మిన్ పుస్తకే శ్రీరామచంద్రం ధ్యాయామి, ఆవాహయామి, ఆసనం సమర్పయామి, పాద్యం సమర్పయామి, అర్ఘ్యం సమర్పయామి, ఆచమనీయం సమర్పయామి, పంచామృతేన, శుద్ధోదకేన స్నపయామి, వస్త్రం సమర్పయామి, యజ్ఞోపవీతం సమర్పయామి, ఆభరణాని సమర్పయామి, శ్రీ గంధాన్ ధారయామి, అక్షతాన్ సమర్పయామి, పుష్పైః పూజయామి.

ఓం కేశవాయ నమః ఓం నారాయణాయ నమః ఓం మాధవాయ నమః
ఓం గోవిందాయ నమః ఓం విష్ణవే నమః ఓం మధుసూదనాయ నమః
ఓం త్రివిక్రమాయ నమః ఓం వామనాయ నమః ఓం శ్రీధరాయ నమః
ఓం హృషీకేశాయ నమః ఓం పద్మనాభాయ నమః ఓం దామోదరాయ నమః
ఓం శ్రీరామాయ నమః ఓం శ్రీరామభద్రాయ నమః ఓం శ్రీరామచంద్రాయ నమః
ఓం శ్రీ వేధసే నమః ఓం శ్రీ దాశరథయే నమః ఓం శ్రీ రఘునాథాయ నమః
ఓం శ్రీనాథాయ నమః ఓం శ్రీ సీతాయాఃపతయే నమః

శ్రీ రామచంద్రాయ నమః ధూపమాఘ్రాపయామి, దీపం దర్శయామి, ధూపదీపానంతరం (క్షీరాది) నైవేద్యం సమర్పయామి, శుద్ధ-ఆచమనీయం సమర్పయామి, తాంబూలం సమర్పయామి, కర్పూర - ఆనంద నీరాజనం దర్శయామి, ఛత్రం ధారయామి, చామరం వీజయామి, గీతం శ్రావయామి, నృత్యం దర్శయామి, వాద్యం ఘోషయామి, సువర్ణదివ్య మంత్రపుష్పం సమర్పయామి, సమస్తరాజోపచార - దేవోపచారాన్ సమర్పయామి. ప్రదక్షిణనమస్కారాన్ సమర్పయామి, సర్వం శ్రీ పరమేశ్వరార్పణమస్తు.

శ్రీమద్రామాయణ పారాయణ - ఉపక్రమః

అంగన్యాసకరన్యాసాదయః

అస్య శ్రీమద్వాల్మీకిరామాయణ మహామంత్రస్య నారదో భగవాన్ ఋషిః, అనుష్టుప్ ఛందః, శ్రీ సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్రో దేవతా, ఓం బీజమ్, ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది ఇతి శక్తిః, పౌరుషే చాప్రతిద్వంద్వః శరైనం జహి రావణిమ్ ఇతి కీలకమ్, శ్రీ సీతారామచంద్ర ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః.

ధర్మాత్మా - అంగుష్ఠాభ్యాం నమః, సత్యసంధశ్చ - తర్జనీభ్యాం నమః రామః మధ్యమాభ్యాం నమః, దాశరథిర్యది - అనామికాభ్యాం నమః, పౌరుషే చాప్రతిద్వంద్వః - కనిష్ఠికాభ్యాం నమః, శరైనం జహి రావణిమ్ - కరతల కరపృష్ఠాభ్యాం నమః ధర్మాత్మా - హృదయాయ నమః, సత్యసంధశ్చ - శిరసే స్వాహా, రామః - శిఖాయై వషట్, దాశరథి ర్యది- కవచాయ హుం, పౌరుషే చాప్రతిద్వంద్వః - నేత్రత్రయాయ వౌషట్ - శరైనం జహి రావణిమ్ - అస్త్రాయ ఫట్, భూర్భువస్సువరోమ్ ఇతి - దిగ్బంధః.

ధ్యానమ్

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ । ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే । 1

అగజాననపద్మార్కం గజాననమహర్నిశమ్ । అనేకదం తం భక్తానామ్ ఏకదంతమ్ ఉపాస్మహే । 2

వాగీశాద్యాః సుమనసః సర్వార్థానామ్ ఉపక్రమే । యం నత్వా కృతకృత్యాః స్యుః తం నమామి గజాననమ్ । 3

శారదా శారదాంభోజవదనా వదనాంబుజే । సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధిస్సన్నిధిం క్రియాత్ । 4

యా కుందేందు తుషారహారధవళా యా శుభ్రవస్త్రావృతా
యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా ।
యా బ్రహ్మాఽచ్యుత శంకరప్రభృతిభిః దేవైః సదా పూజితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా । 5

దోర్భిర్యుక్తా చతుర్భిః స్ఫటికమణిమయీమ్ అక్షమాలాం దధానా
హస్తేనైకేనపద్మం సితమపి చ శుకం పుస్తకం చాఽపరేణ ।
భాసా కుందేందుశంఖస్ఫటికమణినిభా భాసమానాఽసమానా
సా మే వాగ్దేవతేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా । 6

జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్ । ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే । 7

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్ । ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్ । 8

వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః । శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్ । 9

యః పిబన్ సతతం రామచరితామృతసాగరమ్ । అతృప్తస్తం మునిం వందే ప్రాచేతసమకల్మషమ్ । 10

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్ । రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్ । 11

అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్ । కపీశమ్ అక్షహంతారం వందే లంకాభయంకరమ్ । 12

ఆమిషీకృతమార్తాండం గోష్పదీకృతసాగరమ్ । తృణీకృతదశగ్రీవమ్ ఆంజనేయం నమామ్యహమ్ । 13

ఉల్లంఘ్య సింధోః సలిలం సలీలం, యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః ।
ఆదాయ తేనైవ దదాహ లంకాం, నమామి తం ప్రాంజలిరాంజనేయమ్ । 14

ఆంజనేయమతిపాటలాననం, కాంచనాద్రికమనీయవిగ్రహమ్ ।
పారిజాతతరుమూలవాసినం, భావయామి పవమాననందనమ్ । 15

యత్రయత్ర రఘునాథకీర్తనం, తత్రతత్ర కృతమస్తకాంజలిమ్ ।
బాష్పవారిపరిపూర్ణలోచనం, మారుతిం నమత రాక్షసాంతకమ్ । 16

మనోజవం మారుతతుల్యవేగం, జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానరయూథముఖ్యం, శ్రీరామదూతం శిరసా నమామి । 17

యః కర్ణాంజలిసంపుటైః అహరహః సమ్యక్ పిబత్యాదరాత్
వాల్మీకేర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు ।
జన్మవ్యాధిజరావిపత్తిమరణైః అత్యంతసోపద్రవమ్
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణోః పదం శాశ్వతమ్ । 18

తదుపగత సమాస సంధియోగం, సమమధురోపనతార్థవాక్యబద్ధమ్ ।
రఘువరచరితం మునిప్రణీతం, దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్ । 19

వాల్మీకిగిరిసంభూతా రామసాగరగామినీ । పునాతు భువనం పుణ్యా రామాయణమహానదీ । 20

శ్లోకసారసమాకీర్ణం సర్గకల్లోలసంకులమ్ । కాండగ్రాహమహామీనం వందే రామాయణార్ణవమ్ । 21

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే । వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా । 22

వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితం ।
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్యః పరమ్
వ్యాఖ్యాంతం భరతాదిభిః పరివృతం రామం భజే శ్యామలమ్ । 23

వామే భూమిసుతా పురశ్చ హనుమాన్ పశ్చాత్ సుమిత్రాసుతః
శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయోః వాయ్వాదికోణేషు చ
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో జాంబవాన్
మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్ । 24

మాతా రామో మత్పితా రామభద్రో భ్రాతా రామో మత్సఖా రాఘవేశః
సర్వస్వం మే రామచంద్రో దయాళుః నాఽన్యం దేవం నైవ జానే న జానే । 25

సాకేతే శరదిందుకుందధవళే సౌధే మహామండపే । పర్యస్తాగరుధూపదీపలలితే కర్పూరదీపోజ్జ్వలే ।
సుగ్రీవాంగదజాంబవత్పరివృతం సౌమిత్రిణా సేవితమ్ । లీలామానుషవిగ్రహం రఘువరం రామం భజే శ్యామలమ్ । 26

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై ।
నమోఽస్తు రుద్రేంద్రయమాఽనిలేభ్యో నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః । 27

రామాయణపారాయణసమాపనశ్లోకాః

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః ।
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం లోకాస్సమస్తాః సుఖినో భవంతు । 1
కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ । దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయాః । 2
అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః । అధనాః సధనాస్సంతు జీవంతు శరదాం శతమ్ । 3
చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్ । ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్ । 4
శృణ్వన్ రామాయణం భక్త్యా, యః పాదం పదమేవ వా । స యాతి బ్రహ్మణః స్థానం, బ్రహ్మణా పూజ్యతే సదా । 5
రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే । రఘునాథాయ నాథాయ సీతాయాఃపతయే నమః । 6
మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే । చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్ । 7
వేదవేదాంతవేద్యాయ మేఘశ్యామలమూర్తయే । పుంసాం మోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్ । 8
విశ్వామిత్రాంతరంగాయ మిథిలానగరీపతేః । భాగ్యానాం పరిపాకాయ భవ్యరూపాయ మంగళమ్ । 9
పితృభక్తాయ సతతం భ్రాతృభిస్సహసీతయా । నందితాఖిలలోకాయ రామభద్రాయ మంగళమ్ । 10
త్యక్తసాకేతవాసాయ చిత్రకూటవిహారిణే । సేవ్యాయ సర్వయమినాం ధీరోదారాయ మంగళమ్ । 11
సౌమిత్రిణా చ జానక్యా చాపబాణాసిధారిణే । సంసేవ్యాయ సదా భక్త్యా స్వామినే మమ మంగళమ్ । 12
దండకారణ్యవాసాయ ఖండితామరశత్రవే । గృధ్రరాజాయ భక్తాయ ముక్తిదాయాఽస్తు మంగళమ్ । 13

సాదరం శబరీదత్తఫలమూలాభిలాషిణే । సౌలభ్యపరిపూర్ణాయ సత్త్వోద్రిక్తాయ మంగళమ్ । 14

హనుమత్సమవేతాయ హరీశాభీష్టదాయినే । వాలిప్రమథనాయాఽస్తు మహాధీరాయ మంగళమ్ । 15

శ్రీమతే రఘువీరాయ సేతూల్లంఘితసింధవే । జితరాక్షసరాజాయ రణధీరాయ మంగళమ్ । 16

ఆసాద్య నగరీం దివ్యామ్ అభిషిక్తాయ సీతయా । రాజాధిరాజరాజాయ రామభద్రాయ మంగళమ్ । 17

మంగళాశాసనపరైః మదాచార్యపురోగమైః । సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాఽస్తు మంగళమ్ । 18

కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్ ।
కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి । 19

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్ । తత్సర్వం క్షమ్యతాం దేవ శ్రీరాఘవ నమోఽస్తు తే । 20

ఆత్మా త్వం క్షితిజా మతిః ప్రాణాః శరీరం గృహమ్ ।
పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః ।
సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వాగిరో
యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం రామాఽస్తు తే పూజనమ్ । 21

* * *

శ్రీసీతారామాభ్యాం నమః

స్కందపురాణాంతర్గత శ్రీమద్రామాయణ మాహాత్మ్యమ్

1. ప్రథమోఽధ్యాయః

శ్రీరామః శరణం సమస్తజగతాం రామం వినా కా గతీ
రామేణ ప్రతిహన్యతే కలిమలం రామాయ కార్యం నమః।
రామాత్ త్రస్యతి కాలభీమభుజగో రామస్య సర్వం వశే
రామే భక్తిరఖండితా భవతు మే రామ! త్వమేవాశ్రయః। 1

ఈ సమస్తజగత్తునకు శ్రీరాముడే శరణ్యుడు. ఇహపర లాభములకు మనకు రాముడేగతి. శ్రీరామునిస్మరణమువలననే కలిదోషములన్నియు నశించును. సమస్తకార్యములను సిద్ధింపుటకై ఆయనకు నమస్కరింతును. భయంకరమైన కాలసర్పము శ్రీరామునకు భీతిల్లును. సమస్తజగత్తు శ్రీరాముని అధీనమునందేయుండును. శ్రీరామునియందే నాలో అచంచలమైన భక్తి కుదురుకొనియుండుగాక. ఓరామా! నీవే నాకు దిక్కు. (1)

చిత్రకూటాలయం రామమ్ ఇందిరానందమందిరమ్।
వందే చ పరమానందం భక్తానామభయప్రదమ్। 2

శ్రీరామచంద్రుడు చిత్రకూటనివాసి. సీతాదేవియొక్క ఆనందమునకు నెలవైనవాడు, భక్తులకు అభయమునిచ్చు వాడు, పరమానందస్వరూపుడు. అట్టి ప్రభువునకు ప్రణమిల్లెదను. (2)

బ్రహ్మవిష్ణుమహేశాద్యా యస్యాంశా లోకసాధకాః।
తమాదిదేవం శ్రీరామం విశుద్ధం పరమం భజే। 3

లోకసాధకులైన (సృష్టి, స్థితి, లయకారకులైన) బ్రహ్మ విష్ణుమహేశ్వరులు (త్రిమూర్తులు) శ్రీరామునియొక్క అంశలే. పరమపవిత్రుడు, సచ్చిదానందస్వరూపుడు, ఆదిదేవుడునైన శ్రీరాముని నేను సర్వదా భజింతును. (3)

ఋషయ ఊచుః

భగవన్ సర్వమాఖ్యాతం యత్ పృష్టం విదుషా త్వయా।
సంసారపాశబద్ధానామ్ దుఃఖాని సుబహూని చ। 4

ఏతత్సంసారపాశస్య ఛేదకః కతమః స్మృతః।
కలౌ వేదోక్తమార్గాశ్చ నశ్యంతీతి త్వయోదితాః। 5

అధర్మనిరతానాం చ యాతనాశ్చ ప్రకీర్తితాః।
ఘోరే కలియుగే ప్రాప్తే వేదమార్గబహిష్కృతే। 6

పాఖండత్వం ప్రసిద్ధం వై తత్ సర్వం పరికీర్తితమ్।
కామార్తా హ్రస్వదేహాశ్చ లుబ్ధా అన్యోన్యతత్పరాః। 7

ఋషులు సూతునితో ఇట్లు పలికిరి

ఓ పూజ్యుడా! నీవు గొప్పవిద్వాంసుడవు. మేము అడిగిన విషయములను అన్నింటిని చక్కగా విశదపఱచితివి. సంసారబంధములలో చిక్కుకొనినవారికి దుఃఖములు అనంతములు. ఈ సంసారబంధములనుండి విముక్తి కలిగించువారెవరు? వైదికధర్మములన్నియును కలియుగమున నిరాదరణమునకు గురియగునని నీవు తెల్పియుంటివి. అధర్మమార్గములను అనుసరించెడివారికి సంభవించు తీవ్రవేదనలనుగూర్చి నీవు పూర్తిగా తేటతెల్లముగావించితివి. 'ఘోరమైన కలియుగము ప్రారంభమైనంతనే వైదికధర్మములు లుప్తములగును. నాస్తికత్వము పెచ్చుపెఱుగును' అని పెద్దలందఱును పేర్కొని యుండిరి. కలియుగమునందలి జనులు కామాతురులు, పొట్టివారు, లోభులుఐయుందురు. వారు ధర్మమును, అట్లే భగవంతునిగూడ ఆశ్రయింపక, తమలోతాము ఒకరిపైనొకరు ఆధారపడియుందురు. కలియుగమున అందఱును అల్పాయుష్కులును, అధికసంతానముగలవారును అగుదురు. స్త్రీలు తమశరీరసౌందర్యపోషణలకై ప్రాధాన్యమిత్తురు.

కలౌ సర్వే భవిష్యంతి స్వల్పాయుర్బహుపుత్రకాః।
స్త్రియః స్వపోషణపరా వేశ్యా లావణ్యశాలినః। 8

పతివాక్యమనాదృత్య సదాఽన్యగృహతత్పరాః।
దుశ్శీలా దుష్టశీలేషు కరిష్యంతి సదా స్పృహామ్। 9

అసంవృత్తా భవిష్యంతి పురుషేషు కులాంగనాః।
పరుషానృతభాషిణ్యో దేహసంస్కారవర్జితాః। 10

వాచాలాశ్చ భవిష్యంతి కలౌ ప్రాప్తే చ యోషితః।
భిక్షవశ్చాపి మిత్రాదిస్నేహసంబంధయంత్రితాః। 11

అన్నోపాధినిమిత్తేన శిష్యానుగ్రహలోలుపాః।
పాఖండాలాపనిరతాః పాఖండజనసంగినః। 12

యదా ద్విజా భవిష్యంతి తదావృద్ధిగతః కలిః।
విప్రవంశోద్భవశ్రేష్ఠ ఉపవీతం శిఖాం త్యజేత్। 13

కథం తన్నిష్కృతిం యాతి వద సూత మహామతే।
రాక్షసాః కలిమాశ్రిత్య జాయంతే బ్రహ్మయోనిషు। 14

పరస్పరం విరుధ్యంతి భగవద్ధర్మబంధకాః।
ద్విజానుష్ఠానరహితా భగవద్ధర్మవర్జితాః। 15

కలౌ విప్రా భవిష్యంతి కంచుకోష్ణీషధారిణః।
ఘోరే కలియుగే బ్రహ్మన్ జనానాం పాపకర్మణామ్। 16

మనశ్శుద్ధివిహీనానాం నిష్కృతిశ్చ కథం భవేత్।
శూద్రహస్తోదకం పక్వం శూద్రైశ్చ సహభోజనం। 17

శూద్రమన్నం తథాశ్నీయాత్ కథం శుద్ధిమవాప్నుయాత్।
యథా తుష్యతి దేవేశో దేవదేవో జగద్గురుః। 18

తన్నో వదస్వ సర్వజ్ఞ సూత కారుణ్యవారిధే। 19

వారు స్వార్జితముమీద ఆధారపడిజీవించుటకై ప్రాకులాడు చుందురు. లావణ్యమును సాధనముగాజేసికొని వేశ్యావృత్తిని అవలంబించుటకును సిద్ధపడుచుందురు. (4-8)

స్త్రీలు పతియాజ్ఞను లక్ష్యపెట్టక ఇతరులఇండ్లకు స్వేచ్ఛగా తిరిగినచ్చుచుందురు, వారు స్వయముగా శీలములేనివారై, దుశ్శీలురైన పురుషులను కాంక్షించుచుందురు. (9)

కొందఱు కులసతులుగూడ పరపురుషులసమక్షమున అసంబద్ధములైన పరుషవచనములను పలుకుచుందురు. అసత్యములాడుచుందురు. వారివస్త్రధారణాదులు సంస్కారరహితముగానుండును. (10)

కలియుగమున వనితలు తఱచుగా వ్యర్థసంభాషణలు చేయుచుందురు. భిక్షాజీవనులైన సన్న్యాసులుగూడ బంధు మిత్రులసంబంధములలో చిక్కుకొనియుందురు. వారు సుఖ జీవనమునకై శిష్యులఅనుగ్రహమును పొందుటకు ప్రాకులాడు చుందురు. ద్విజులు నాస్తికులతో కూడితిరుగుదురు. అదేపనిగా నాస్తిక వాదములను చేయుచుందురు. అది కలియుగ లక్షణవిజృంభణకు సంకేతము. శ్రేష్ఠమైన బ్రాహ్మణ కుటుంబములలో పుట్టినవారు సైతము శిఖ, యజ్ఞోపవీతములను పరిత్యజించుచుందురు. (11-13)

ఓ ప్రతిభాశాలీ! సూతా! రాక్షసులు కలియుగమున బ్రాహ్మణకుటుంబములలో జన్మించుచుందురు. వారు ఆస్థితి నుండి (రాక్షసలక్షణములనుండి) ఎట్లు విముక్తులగుదురు? (14)

భగవంతునిసేవించు విధానములయందు (మత సంప్రదాయముల విషయమున) జనులు పరస్పరము విరోధములను కలిగి యుందురు. ద్విజులు స్నానసంధ్యాది- అనుష్ఠానములను ఉల్లంఘించుచుందురు. దైవసేవలను మానివేయుదురు. (15)

కలియుగమున బ్రాహ్మణులు కంచుకములను (చొక్కాలు మున్నగువానిని) తలపాగలను (టోపీలు మొదలగువానిని) ధరింతురు. ఓ బ్రహ్మజ్ఞానీ! ఘోరమైన ఈ కలియుగము నందు పాపాత్ములకును, మనశ్శుద్ధిలేనివారికిని నిష్కృతి (విముక్తి) యెట్లు లభించును? ద్విజులు శూద్రులు ఇచ్చిన జలములను త్రాగుదురు, వారు వండిన అన్నమును వారితో గూడి భుజింతురు. అట్లు శూద్రులసాంగత్యముతో ఆహార వ్యవహారములు నడిపెడివారు పవిత్రులగు మార్గమేమి? దయానిధీ! సర్వజ్ఞా! సూతా! దేవేశ్వరుడు, దేవదేవుడు, జగన్నాథుడు ఐన శ్రీరాముని సంతృప్తిపఱచు ఉపాయమును తెల్పుము. (16-19)

వద సూత మునిశ్రేష్ఠ సర్వమేతదశేషతః ।
శృణ్వతాం న జాయతే తృప్తిః సూత త్వద్వచనామృతాత్ । 20

మహానుభావా! ఓసూతా! ఈ విషయములను అన్నింటిని తేటతెల్లముగావింపుము. నీవచనామృతము ఎవరికి తృప్తిని గూర్చదు? (ఎల్లరకును తప్పక తృప్తినికలిగించును). (20)

సూత ఉవాచ

శృణుధ్వం ఋషయః సర్వే యదిష్టం వో వదామ్యహమ్ ।
గీతం సనత్కుమారాయ నారదేన మహాత్మనా । 21

సూతుడు ఇట్లనెను

ఓ ఋషీశ్వరులారా! మీరుకోరిన ఈ విషయములను అన్నింటిని పూర్వము మహాత్ముడైన నారదమహర్షి సనత్కుమారునకు తెల్పియుండెను. వాటిని మీకు ఇప్పుడు వివరించెదను, సావధానముగా వినుడు. (21)

రామాయణమహాకావ్యం సర్వవేదార్థసమ్మతమ్ ।
సర్వపాపప్రశమనం దుష్టగ్రహనివారణమ్ । 22

శ్రీమద్రామాయణము ఒక మహాకావ్యము. అది సర్వ వేదములసారము. మహాపాపములనుసైతము అది రూపుమాపును, దుష్టగ్రహబాధలను తొలగించును. (22)

దుఃస్వప్ననాశనం ధన్యం భుక్తిముక్తిఫలప్రదమ్ ।
రామచంద్రగుణోపేతం సర్వకల్యాణసిద్ధిదమ్ । 23

ధర్మార్థకామమోక్షాణాం హేతుభూతం మహాఫలమ్ ।
అపూర్వపుణ్యఫలదం శృణుధ్వం సుసమాహితాః । 24

రామచంద్రునిగుణగణములను వర్ణించునట్టి ఈ కావ్యము దుఃస్వప్నములను తొలగించును. దుఃఖములను అంతరింపజేయును. ఇది ఐహికములైన భోగభాగ్యములనేగాక మోక్షఫలములనుగూడ ప్రాప్తింపజేయును, సకలశుభములను సిద్ధింపజేయును. ఇది ప్రశంసావహమైనది. ఓ మునులారా! ఇది ధర్మార్థకామమోక్షములనెడి చతుర్విధపురుషార్థ మహాఫలములను ప్రసాదించునట్టి పెన్నిధి. సాటిలేని ఈ కావ్యము పుణ్యఫలములను ఒసంగును. మీరు ఈ విషయములను ఏకాగ్రచిత్తులై వినుడు. (23-24)

మహాపాతకయుక్తో వా యుక్తో వా సర్వపాతకైః ।
శ్రుత్వైతదార్షం దివ్యం హి కావ్యం శుద్ధిమవాప్నుయాత్ । 25

గోహత్యాదిమహాపాతకములనుజేసినవారుగాని, అట్టి పాపాత్ములతో సాంగత్యముచేసినవారుగాని ఋషిప్రోక్తమైన ఈ కావ్యమును వినినచో పవిత్రులగుదురు. (25)

రామాయణే ప్రవర్తంతే సజ్జనా యే జగద్ధితాః ।
త ఏవ కృతకృత్యాశ్చ సర్వశాస్త్రార్థకోవిదాః । 26

రామాయణవిషయమున భక్తిశ్రద్ధలుగలవారు సమస్తము లైన శాస్త్రార్థములయందు ఆరితేరుదురు. వారివలన లోకమునకు మేలుకలుగుచుండును. ఈ విధముగా వారు కృతార్థులగుదురు. (26)

ధర్మార్థకామమోక్షాణాం సాధనే చ ద్విజోత్తమాః ।
శ్రోతవ్యంచ సదా భక్త్యా రామాఖ్యానం సదా నృభిః । 27

ఓ ద్విజోత్తములారా! శ్రీమద్రామాయణము ధర్మార్థకామ మోక్షఫలప్రాప్తికి సాధనము. ఇందలి వృత్తాంతము పవిత్రమైనది, మానవులెల్లరును భక్తిసరతులై వినదగినది. (27)

పురార్జితాని పాపాని నాశమాయాంతి యస్య వై ।
రామాయణే మహాప్రీతిః తస్య వై భవతి ధ్రువమ్ । 28

పూర్వజన్మలలో చేసికొనిన పాపములనుండి విముక్తులైన వారికి ఈ జన్మలో రామాయణమునందు ప్రీతి జనించును. ఇది తథ్యము. (28)

రామాయణే వర్తమానే పాపపాశేన యంత్రితః ।
అనాదృత్యాన్యథా గాథాసక్తబుద్ధిః ప్రవర్తతే । 29

పాపబంధములలో చిక్కుకొనినవాడు రామాయణ వృత్తాంతము ప్రారంభముకాగానే దానియెడ నిరాదరణచూపుచు నిమ్నశ్రేణికిచెందిన ఇతరగాథలను వినుటలో ఆసక్తుడగును. తత్ఫలితముగా ఆ మార్గములోనే ప్రవర్తించును. (29)

తస్మాత్తు రామాయణనామధేయమ్
పరంతు కావ్యమ్ శృణుత ద్విజేంద్రాః ।
యస్మిన్ శ్రుతే జన్మజరాదినాశో
భవత్యదోషః స నరోఽచ్యుతస్స్యాత్ । 30

కనుక ఓ బ్రాహ్మణోత్తములారా! 'రామాయణము' అను పేరుగల సర్వశ్రేష్ఠమైన ఆ కావ్యమును వినుడు. దానిని వినుట వలన మనుజునకు జననమరణాదులు దూరమగును. పాపశ్రేణియు ఉండదు. అతడు పాపరహితుడై ముక్తిని పొందును. (30)

వరం వరేణ్యం వరదం తు భావ్యమ్
నిజప్రభాభాసితసర్వలోకమ్ ।
సంకల్పితార్థప్రదమాదికావ్యమ్
శ్రుత్వా ప్రజేన్మోక్షపదం మనుష్యః । 31

బ్రహ్మేశ విష్ణ్వాఖ్య శరీరభేదైః
విశ్వం సృజత్యత్తి చ పాతి యశ్చ ।
తమాదిదేవం పరమం పరేశమ్
ఆధాయ చేతస్యుపయాతి ముక్తిమ్ । 32

యో నామజాత్యాది వికల్పహీనః
పరః పరాణాం పరమః పరస్స్యాత్ ।
వేదాంతవేద్యః స్వరుచా ప్రకాశః
స వీక్ష్యతే సర్వపురాణవేదైః । 33

ఊర్జే మాఘే సితే పక్షే చైత్రే చ ద్విజసత్తమాః ।
నవమ్యహాని శ్రోతవ్యం రామాయణకథామృతమ్ । 34

ఇత్యేవం శృణుయాద్యస్తు శ్రీరామచరితం శుభమ్ ।
సర్వాన్ కామానవాప్నోతి పరత్రాముత్ర చోత్తమాన్ । 35

త్రిసప్తకులసంయుక్తః సర్వపాపవివర్జితః ।
ప్రయాతి రామభవనం యత్ర గత్వా న శోచ్యతే । 36
చైత్రే మాఘే కార్తికే చ సితే పక్షేచ వాచయేత్ ।
నవమ్యహాని తస్మాత్తు శ్రోతవ్యం చ ప్రయత్నతః । 37

రామాయణం చాదికావ్యం స్వర్గమోక్షప్రదాయకమ్ ।
తస్మాత్ కలియుగే ఘోరే సర్వధర్మబహిష్కృతే । 38

నవమ్యహాని శ్రోతవ్యం రామాయణకథామృతమ్ ।
రామాయణపరా యే తు ఘోరే కలియుగే ద్విజాః । 39

ఆ రామభద్రునివృత్తాంతము ప్రముఖమైనది, సర్వశ్రేష్ఠమైనది. వరములను ఇచ్చునది. తనయొక్క ప్రభావముచే సమస్త లోకములను వికసింపజేయునది. ఆ ఆదికావ్యము కోరిన కోర్కెలనుదీర్చు కల్పవృక్షము. కావున ఆ కావ్యగాథను విన్న మానవులు పరమపదమును జేరుదురు. (31)

ఆపరమాత్మ బ్రహ్మవిష్ణుమహేశ్వరులరూపములలో సృష్టిస్థితిలయములను నెఱపుచున్నాడు. సర్వశ్రేష్ఠుడును, పరాత్పరుడునునైన ఆ ఆదిదేవుని మనసున నిలుపుకొనిన మానవుడు ముక్తినిబడయును. (32)

ఆ పరమాత్మ కార్యకారణములకు అతీతుడు. నామ, రూప, జాతి భేదములులేని సర్వోత్కృష్టుడు, వేదశాస్త్రముల ద్వారా ఎఱుగ దగినవాడు. స్వయంప్రకాశుడు, పురాణములు, వేదములు అతనినే వర్ణించును. (ఈరామాయణ కావ్య పఠనముద్వారా అతడులభ్యుడు).(33)

ఓ మహర్షులారా! కార్తికమునందును, మాఘమునందును, చైత్రమాసమునందును శుక్లపక్షమునందలి పాడ్యమి మొదలుకొని తొమ్మిది దినములు పగిటిపూట అమృతతుల్యమైన రామాయణ గాథను శ్రవణముచేయుటమంచిది. శుభదాయకమైన శ్రీరామ వృత్తాంతమును ఈ విధముగా ఆస్వాదించినవానికి ఉత్తమము లైన మనోరథములన్నియును ఈడేరును. అతడు సకలపాపముల నుండియు ముక్తుడగును. మఱియు అతనితోపాటు అతనికి పూర్వులైన పదితరముల వారును, తరువాతిపదితరముల వారును పరంధామమును చేరుదురు. అట్లుచేరినవారికి ఇక ఎన్నడును దుఃఖములే యుండవు. (34-36)

చైత్ర, కార్తిక, మాఘమాసములయందుగల శుక్లపక్షముల యందు (పాడ్యమి మొదలుకొని) తొమ్మిదిదినములలో రామాయణమును పారాయణముచేయుట మిగులఫలప్రదము. అట్లే దీక్షతో దానిని శ్రవణముచేయుటవలనగూడ తత్ఫలితము లభించును. (37)

ఆదికావ్యమైన రామాయణము స్వర్గసుఖములను ప్రసాదించును. మోక్షమును ప్రాప్తింపజేయును. ఘోరమైన కలియుగమునందు వర్ణాశ్రమాదిధర్మములన్నియు అడుగంటును. అందువలన జనులు ఇహపరలాభములకై వరుసగా తొమ్మిది దినములు రామాయణకథాశ్రవణము చేయవలెను. ఓ మహర్షులారా! దుర్భరమైన ఈ కలియుగమున రామనామజపతత్పరులైన వారు తత్ప్రభావమున కృతార్థులగుదురు. వారిని కలియుగ

తే నరాః కృతకృత్యాశ్చ న కలిర్బాధతే హి తాన్।
కథారామాయణస్యాపి నిత్యం భవతి యద్గృహే।
తద్గృహం తీర్థరూపం హి దుష్టానాం పాపనాశనమ్। 40

బాధలు అంటవు. రామాయణకథాపఠనశ్రవణములు జరిగెడి గృహము ఒక పుణ్యతీర్థమై ఒప్పును. దుష్టులుసైతము అయింట అడుగిడినచో వారిపాపములు అంతరించును. (38-40)

తావత్ పాపాని దేహేఽస్మిన్ నివసంతి తపోధనాః।
యావన్నశ్రూయతే సమ్యక్ శ్రీమద్రామాయణం నరైః। 41

ఓ తపోధనులారా! శ్రీమద్రామాయణమును భక్తిశ్రద్ధలతో శ్రవణముచేయునంతవఱకును జనులయొక్క దేహములు పాపభూయిష్ఠములైయుండును. (41)

దుర్లభైవ కథాలోకే శ్రీమద్రామాయణోద్భవా।
కోటిజన్మసముత్థేన పుణ్యేనైవ తు లభ్యతే। 42

రామాయణగాథను పఠనశ్రవణములుచేసెడిబుద్ధి కలుగుట దుర్లభము. కోట్లకొలది జన్మలపుణ్యఫలప్రభావముననే జనులకు ఆ అదృష్టము పట్టును. (42)

ఊర్జే మాఘే సితే పక్షే చైత్రే చ ద్విజసత్తమాః।
యస్య శ్రవణమాత్రేణ సౌదాసోఽపి విమోచితః। 43

ఓ ద్విజోత్తములారా! చైత్ర కార్తిక మాఘమాసముల యందు శుక్లపక్షమున క్రమముగా తొమ్మిదిదినములు రామాయణ గాథను వినుటవలననే సౌదాసుడు శాపవిముక్తుడయ్యెను. (43)

గౌతమశాపతః ప్రాప్తః సౌదాసో రాక్షసీం తనుమ్।
రామాయణప్రభావేణ విముక్తిం ప్రాప్తవాన్ పునః। 44

గౌతమహర్షిని అవమానించుటచే కలిగిన శాపమువలన 'సౌదాసుడు' అనువానికి రాక్షసరూపము ప్రాప్తించెను. రామాయణ శ్రవణప్రభావమున అతనికి ఆ శాపమునుండి విముక్తి లభించెను. (44)

యస్త్వేతత్ శృణుయాద్భక్త్యా రామభక్తిపరాయణః।
స ముచ్యతే మహాపాపైః ఉపపాతకరాశిభిః। 45

రామభక్తితత్పరుడై ఈగాథను సావధానముగా వినిన మనుజుడు మహాపాపములనుండియేగాక, ఉపపాతకముల నుండియు విముక్తుడగును. (45)

ఇతి శ్రీస్కందపురాణే ఉత్తరఖండే నారదసనత్కుమారసంవాదే రామాయణమాహాత్మ్యే
'కల్పానుకీర్తనం' నామ ప్రథమోఽధ్యాయః

శ్రీ స్కందపురాణాంతర్గత - ఉత్తర ఖండమునందలి నారదసనత్కుమారసంవాదమునందు రామాయణమాహాత్మ్యమున 'కల్పానుకీర్తనము' అను మొదటి అధ్యాయము సమాప్తము (1)

- ❋ ❋ ❋ -

2. ద్వితీయోఽధ్యాయః

ఋషయ ఊచుః

కథం సనత్కుమారాయ దేవర్షిర్నారదో మునిః।
ప్రోక్తవాన్ సకలాన్ ధర్మాన్ కథం చ మిలితావుభౌ। 1

కస్మిన్ క్షేత్రే స్థితౌ తాత తావుభౌ బ్రహ్మవాదినౌ।
యదుక్తం నారదేనాస్మై తన్నో బ్రూహి మహామునే। 2

ఋషులు వచించిరి

పూజ్యుడవైన ఓ మహామునీ! మహాత్ముడైన నారదమహర్షి రామాయణమునందలి సమస్తమైన ధర్మములను సనత్-కుమారునకు ఎట్లు వివరించెను? ఆ ఇద్దరు బ్రహ్మవాదులును ఏక్షేత్రమున ఎట్లు కలిసికొనిరి? నారదమహర్షి అయనకు తెలిపిన విశేషములేవి? వాటిని అన్నింటిని మాకు విశదపఱచుము.(1-2)

సూత ఉవాచ

సనకాద్యా మహాత్మానో బ్రహ్మణస్తనయా స్మృతాః ।
నిర్మమా నిరహంకారాః సర్వే తే హ్యూర్ధ్వరేతసః ॥ 3

తేషాం నామాని వక్ష్యామి సనకశ్చ సనందనః ।
సనత్కుమారశ్చ తథా సనాతన ఇతి స్మృతః ॥ 4

విష్ణుభక్తా మహాత్మానో బ్రహ్మధ్యానపరాయణాః ।
సహస్రసూర్యసంకాశాః సత్యవంతో ముముక్షవః ॥ 5

ఏకదా బ్రహ్మణః పుత్రాః సనకాద్యా మహౌజసః ।
మేరుశృంగం సమాజగ్ముః వీక్షితుం బ్రహ్మణస్సభామ్ ॥ 6

తత్ర గంగాం మహాపుణ్యాం విష్ణుపాదోద్భవాం నదీమ్ ।
నిరీక్ష్య స్నాతుముద్యుక్తాః సీతాఖ్యాం ప్రథితౌజసః ॥ 7

ఏతస్మిన్నంతరే విప్రాః దేవర్షిః నారదో మునిః ।
ఆజగామోచ్చరన్ నామ హరేర్నారాయణాదికమ్ ॥ 8

నారాయణాచ్యుతానంత వాసుదేవ జనార్దన ।
యజ్ఞేశ యజ్ఞపురుష రామ విష్ణో నమోఽస్తుతే ॥ 9

ఇత్యుచ్చరన్ హరేర్నామ పావయన్ నిఖిలం జగత్ ।
ఆజగామ స్తువన్ గంగాం మునిః లోకైకపావనీమ్ ॥ 10

అథాయాంతం సముద్వీక్ష్య సనకాద్యా మహౌజసః ।
యథార్హామర్హణాం చక్రుః వవందే సోఽపి తాన్ మునీన్ ॥ 11
అథ తత్ర సభామధ్యే నారాయణపరాయణమ్ ।
సనత్కుమారః ప్రోవాచ నారదమ్ మునిపుంగవమ్ ॥ 12

సనత్కుమార ఉవాచ

సర్వజ్ఞోఽసి మహాప్రాజ్ఞ మునిమానద నారద ।
హరిభక్తిపరో యస్మాత్ త్వత్తో నాస్త్యపరోఽధికః ॥ 13

యేనేదమఖిలం జాతం జగత్ స్థావరజంగమమ్ ।
గంగా పాదోద్భవా యస్య కథం స జ్ఞాయతే హరిః ।
అనుగ్రాహ్యోఽస్మి యది తే తత్త్వతో వక్తుమర్హసి ॥ 14

సూతమహర్షి పలికెను

మహాత్ములైన సనకాదులు సృష్టికర్తయైన బ్రహ్మదేవునకు మానసపుత్రులు. వారు అహంకార మమకారములు ఏమాత్రమును లేనివారు. వారు జితేంద్రియులు. సనక, సనందన, సనత్కుమార, సనాతనులు అనునవి వారిపేర్లు. ఆ మహాత్ములు విష్ణుభక్తులు, సర్వదా బ్రహ్మధ్యానమునందే నిరతులైయుండువారు. వారు సత్యవచనులు, మోక్షకాంక్షగలవారు. సహస్రసూర్యకాంతులతో వెలుగొందుచుందురు. (3-5)

మహాతేజోమూర్తులు, బ్రహ్మదేవునికుమారులునైన సనకాదులు ఒకానొకప్పుడు బ్రహ్మదేవునిసభను వీక్షించుటకై మేరుశృంగమునకు వెళ్లిరి. అచట వారు విష్ణుపాదమునుండి జన్మించిన పవిత్రగంగానదిని చూచిరి. ఏదప తేజోనిధులైన ఆ మునులు 'సీత' అను నామాంతరముగల ఆ నదిలో స్నానముచేయుటకు సిద్ధపడిరి. (6-7)

ఓ విప్రోత్తములారా! ఇంతలో దేవర్షియైన నారదమహాముని శ్రీమహావిష్ణువుయొక్క నారాయణాది నామములను కీర్తించుచు అచటికి చేరెను. (8)

'నారాయణా! అచ్యుతా! అనంతా! వాసుదేవా! జనార్దనా! యజ్ఞేశా! యజ్ఞపురుషా! రామా! విష్ణూ! నీకు నానమస్కారములు.' అని హరినామములను ఉచ్చరించుచు, సమస్తజగత్తును పావనమొనర్చుచు, ఆముని లోకపావనియైన గంగానదిని స్తుతించుచు అచటికి విచ్చేసెను. (9-10)

ఆవిధముగా అచటికి విచ్చేసిన ఆమునిని జూచి తేజోమూర్తులైన ఆ సనకాదులు యథోచితముగా ఆయనను సత్కరించిరి. అంతట నారదుడు వారికి అభివందనమొనర్చెను. (11)

వారు బ్రహ్మసభలో సుఖాసీనులైనపిమ్మట, నారాయణ నామస్మరణమునందే నిమగ్నుడైయున్న నారదమహామునిని జూచి సనత్కుమారుడు ఇట్లు నుడివెను. (12)

సనత్కుమారుడు పలికెను

సర్వజ్ఞుడవైన ఓ నారదమహర్షీ! నీవు వేదవేదాంగములను బాగుగా ఎఱింగినవాడవు, మునిలోకమునకే వన్నెదెచ్చెడివాడవు. నీవు హరిభక్తులలో అగ్రేసరుడవు, నిన్నుమించిన విష్ణుభక్తుడు మఱియొకడు లేడు. (13)

ఆ శ్రీమహావిష్ణువునుండియే ఈ సమస్తచరాచరజగత్తు వెలువడినది. ఆయనపాదమునుండియే ఈ గంగానది ఆవిర్భవించినది. అట్టిహరినిగూర్చిన జ్ఞానము ఎట్లుకలుగును? మాపై దయయుంచి ఈ విషయములను అన్నింటిని సమగ్రముగా వివరింపుము. (14)

నారద ఉవాచ

నమః పరాయ దేవాయ పరాత్పరతరాయ చ । 15

పరాత్పరనివాసాయ సగుణాయాగుణాయ చ ।
జ్ఞానాజ్ఞానస్వరూపాయ ధర్మాధర్మస్వరూపిణే । 16

విద్యాఽవిద్యాస్వరూపాయ స్వస్వరూపాయ తే నమః 17

యో దైత్యహంతా నరకాంతకశ్చ భుజాగ్రమాత్రేణ దధార గోత్రం ।
భూభారవిచ్ఛేదవినోదకామం తమాదిదేవం రఘువంశదీపమ్ । 18

ఆవిర్భూతః చతుర్ధా యః కపిభిః పరివారితః ।
హతవాన్ రాక్షసానీకం రామం దాశరథిం భజే । 19

ఏవమాదీన్యనేకాని చరితాని మహాత్మనః ।
తేషాం నామాని సంఖ్యాతుం శక్యతే నాబ్దకోటిభిః । 20

మహిమానం తు యన్నామ్నః పారం గంతుం న శక్యతే ।
మనవోఽపి మునీంద్రాశ్చ కథం తం క్షుల్లకో భజే । 21

యన్నామశ్రవణేనాఽపి మహాపాతకినోఽపి యే ।
పావనత్వం ప్రపద్యంతే కథం స్తోష్యామి క్షుద్రధీః । 22

రామాయణపరా యే తు ఘోరే కలియుగే ద్విజాః ।
త ఏవ కృతకృత్యాశ్చ తేషాం నిత్యం నమోనమః । 23

ఊర్జేమాసే సితే పక్షే చైత్రే మాఘే తథైవ చ ।
నవాహ్నాకిల శ్రోతవ్యం రామాయణ కథామృతమ్ । 24

గౌతమశాపతః ప్రాప్తః సౌదాసో రాక్షసీం తనుమ్ ।
రామాయణ ప్రభావేణ విముక్తిం ప్రాప్తవాన్ పునః । 25

నారదుడు నుడివెను.

ఆ శ్రీమహావిష్ణువు దేవదేవుడు, పరాత్పరుడు, ఆయన నివాసస్థానమైన పరంధామము సర్వోత్కృష్టమైనది. అతడు సగుణస్వరూపుడు, నిర్గుణస్వరూపుడు, జ్ఞానము, అజ్ఞానము, ధర్మము, అధర్మము, విద్య, అవిద్య - ఇవియన్నియును ఆయనస్వరూపములే. సకలజీవులకును అతడు ఆత్మస్వరూపుడు. అట్టి మహావిష్ణువునకు అనుక్షణము నమస్కరింతును. (15-17)

త్రేతాయుగమున, ఈలోకమునందు రఘువంశమున అవతరించిన శ్రీరాముడు ఆ శ్రీమహావిష్ణువే. అతడు రాక్షసులను సంహరించెను, పాపములను రూపుమాపెను. తన భుజబలముచేతనే ధర్మమును రక్షించెను. భూభారమును తొలగించుట ఆయునకు వినోదము. అట్టి ఆ ఆదిదేవునకు (శ్రీరామునకు) నమస్కరించుచున్నాను. (18)

అతడు ఒక్కడే నాలుగు (రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల) రూపములలో అవతరించెను, వానరోత్తములతో గూడి రాక్షసులసమూహములను హతమార్చెను, దశరథ కుమారుడైన అట్టి శ్రీరాముని భజింతును. (19)

మహాత్ముడైన శ్రీరామునియొక్క చరిత్రములు అనేకములు. ఆయననామములను లెక్కించుటకు ఎన్ని సంవత్సరములకాలమైనను చాలదు. ఆయననామమహిమను పూర్తిగా ఎఱుంగుటకు మనువులకును, మహర్షులకును అసాధ్యము. ఇకనావంటి అల్పునివిషయము చెప్పనేల? ఆయన పవిత్రనామములను విన్నంతనే మహాపాపాత్ములును పునీతులు అగుదురు. ఇక అట్టి మహాత్మునిగూర్చి అల్పబుద్ధినైన నేను ఎట్లు స్తుతింపగలను? (20-22)

ఓ బ్రాహ్మణోత్తములారా! ఘోరమైన ఈ కలియుగమున రామాయణపఠనశ్రవణములయందు నిరతులైనవారు మాత్రమే ధన్యాత్ములగుదురు. వారికి నేను నిత్యము నమస్కరించు చుందును. (23)

భగవన్నామమహిమను ఎఱుంగగోరువారు చైత్ర, కార్తిక, మాఘమాసములయందు శుక్లపక్షపాడ్యమినుండి నవమివఱకు తొమ్మిది దినములు రామాయణకథామృతమును ఆస్వాదింప వలెను. (24)

గౌతమమహర్షిని అవమానించిన కారణమున శపింపబడిన సౌదాసుడు రాక్షసరూపమును పొందెను. మఱల రామాయణమహిమచే అతడు ఆ రాక్షసత్వమునుండి విముక్తుడాయెను. (25)

సనత్కుమార ఉవాచ

రామాయణం కేన ప్రోక్తం సర్వధర్మఫలప్రదమ్।
శప్తః కథం గౌతమేన సౌదాసో మునిసత్తమ। 26

రామాయణప్రభావేణ కథం భూయో విమోచితః ।
అనుగ్రాహ్యోఽస్మి యది తే చేదస్తికరుణా మయి । 27

సర్వమేతదశేషేణ మునే నో వక్తుమర్హసి।
శృణ్వతాం వదతాం చైవ కథా పాపప్రణాశినీ। 28

నారద ఉవాచ

శృణు రామాయణం విప్ర యద్వాల్మీకిముఖోద్గతమ్।
నవాహ్నా ఖలు శ్రోతవ్యం రామాయణకథామృతమ్। 29

ఆస్తే కృతయుగే విప్రో ధర్మకర్మవిశారదః।
సోమదత్త ఇతి ఖ్యాతో నామ్నా ధర్మపరాయణః। 30

విప్రస్తు గౌతమాఖ్యేన మునినా బ్రహ్మవాదినా।
శ్రుతవాన్ సర్వధర్మాన్ వై గంగాతీరే మనోరమే। 31

పురాణశాస్త్రకథనైః తేనాసౌ బోధితోఽపిచ।
శ్రుతవాన్ సర్వధర్మాన్ వై తేనోక్తాన్ అఖిలానపి । 32

కదాచిత్ పరమేశస్య పరిచర్యాపరోఽభవత్ ।
ఉపస్థితాయాపి తస్మై ప్రణామం న హ్యకారిచ । 33

స తు శాంతో మహాబుద్ధిః గౌతమస్తేజసాం నిధిః।
మమోదితాని కర్మాణి కరోతీతి ముదం యయౌ ।
యస్త్వర్చితో మహాదేవః శివః సర్వజగద్గురుః। 34

గౌతమశ్చాగతస్తత్ర న చోత్థాపత్ తతో ద్విజః।
సర్వజ్ఞాకృతం పాపం రాక్షసత్వేన చోక్తవాన్। 35

భగవాన్ సర్వధర్మజ్ఞః సర్వదర్శీ సురేశ్వరః।
ఉవాచ ప్రాంజలిర్భూత్వా వినయాత్ నయకోవిదమ్। 36

సనత్కుమారుడు నుడివెను

ఓ మునిసత్తమా! సమస్తధర్మములఫలములను ప్రసాదించు నట్టి రామాయణమును ఎవరు రచించిరి? గౌతముడు సౌదాసుని ఏందులకు శపించెను? రామాయణప్రభావముచే అతడు మరల ఎట్లు శాపవిముక్తుడయ్యెను? ఓ మునీశ్వరా! మీకు నాపై దయయున్నచో నన్ను అనుగ్రహింపుడు. ఈ విషయములను అన్నింటిని మాకు సమగ్రముగా దెల్పుడు. ఏలనన ఈ రామాయణకథ తెల్పెడివారియొక్క, వినెడివారి యొక్క సమస్తపాపములను రూపుమాపునట్టిదిగదా!(26-28)

నారదుడు పలికెను

ఓ విప్రోత్తమా! శ్రద్ధగా వినుము. ఈ రామాయణము వాల్మీకిమహర్షిముఖమునుండి వెలువడినది. మహిమాన్వితమైన ఈ కథామృతమును తొమ్మిది దినములు ఆస్వాదించుట ఎంతయు శ్రేయోదాయకము. (29)

కృతయుగమునందు ఒకానొక విప్రుడుకలడు. అతని పేరు సోమదత్తుడు, అతడు ధర్మకర్మలను ఆచరించుటలో గొప్పవాడు, ధర్మనిరతుడు. (30)

'సోమదత్తుడు' అనుబ్రాహ్మణుడు బ్రహ్మవాదియైన గౌతమమునివలన మనోహరమైన గంగానదీతీరమునందు సకలధర్మములను వినెను (నేర్చెను) మఱియు గౌతముడు అతనికి పురాణములను, శాస్త్రములను బోధించెను, ఇంకను ఆ సోమదత్తుడు వివిధములగు ధర్మరహస్యములనుగూర్చి ఆ మహర్షినుండి తెలిసికొనెను. (31-32)

ఒకానొక సమయమున ఆ సోమదత్తుడు (ఇతడే సౌదాసుడు) పరమేశ్వరునిసేవలలో నిమగ్నుడైయుండెను. ఆ సమయమున అతనిగురువైన గౌతమమహర్షి అచటికి విచ్చేసెను. కాని సౌదాసుడు దైవసేవలో మునిగియున్నందున లేచి ఆయనకు నమస్కరింపలేదు. (33)

శాంతస్వభావుడును, మహాబుద్ధిశాలియు, తేజోనిధియు ఐన గౌతముడు సౌదాసునిజూచి, 'ఇతడు నేను బోధించిన రీతిగా ధర్మకార్యములనే (దైవార్చననే) చేయుచున్నాడు' అని సంతోషించెను. 'జగద్గురువు, మహాదేవుడునైన శివుని ఉపాసించి నట్టి గౌతముడు (గురువు) అచటికి వచ్చినప్పటికిని ఆసౌదాసుడు లేచి నిలబడి తనగురువును గౌరవింపలేదు' ఇట్లుచేయుటమహాపచారము' అని తలంచి సర్వధర్మజ్ఞుడు, సర్వదర్శి, దేవదేవుడునైన పరమశివుడు 'గురువును అవమానించిన పాపమునకు ఇతనికి రాక్షసత్వము ప్రాప్తించును గాక." అని శపించెను. అంతట సౌదాసుడు పశ్చాత్తాపముతో

క్షమస్వ భగవన్ సర్వమ్ అపరాధం మయాకృతమ్ । 37

గౌతమ ఉవాచ

ఊర్జే మాసే సితే పక్షే రామాయణకథామృతమ్ ।
నవాహ్నాకిల శ్రోతవ్యం భక్తిభావేన సాదరం ।
నాత్యంతికం భవేదేతత్ ద్వాదశాబ్దం భవిష్యతి । 38

విప్ర ఉవాచ

కేన రామాయణం ప్రోక్తం చరితాని తు కస్య వై ।
మనసా ప్రీతిమాపన్నో వవందే చరణం గురోః ।
ఏతత్ సర్వం మహాప్రాజ్ఞ సంక్షేపాద్వక్తుమర్హసి 39

గౌతమ ఉవాచ

శృణు రామాయణం విప్ర వాల్మీకిమునినా కృతమ్ ।
యచ్ఛ్రుత్వా ముచ్యతే పాపాత్ స్వం రూపం పునరేతి సః ।
యేన రామావతారేణ రాక్షసా రావణాదయః । 40
హతాస్తు దేవకార్యార్థం చరితం తస్య వై శృణు । 41

కార్తికేచ సితే పక్షే కథా రామాయణస్య తు । 42

నవమ్యహాని శ్రోతవ్యా సర్వపాపప్రణాశినీ ।
ఇత్యుక్త్వా సర్వసంపన్నో గౌతమః స్వాశ్రమం యయౌ । 43

విప్రోఽపి దుఃఖమాపన్నో రాక్షసీం తనుమాశ్రితః ।
క్షుత్పిపాసాతివేగార్తో నిత్యం క్రోధపరాయణః । 44

కృష్ణపక్షద్యుతిర్భీమో బభ్రామ విజనే వనే ।
మృగాంశ్చ వివిధాం స్తత్ర మనుష్యాంశ్చ సరీసృపాన్ ।
విహగాన్ ప్లవగాంశ్చైవ ప్రశస్తాంస్తాన్ అభక్షయత్ । 45

అస్థిభిర్బహుభిర్విప్రాః పీతరక్తకళేబరైః ।
రక్తార్ద్రప్రేతకైశ్చైవ తేనాసీద్భూర్భయంకరీ । 46

అంజలిఘటించి, నయకోవిదుడైన గౌతమునితో "ఓ పూజ్య మహర్షీ! గురుదేవా! మీయెడ నేనొనర్చిన మహాపరాధముల నన్నింటిని క్షమింపుడు" - అని వేడుకొనెను. (34-37)

గౌతముడు పలికెను

'ఓ విప్రా! కార్తికమాసమునందలి శుక్లపక్షమున పాడ్యమి నుండి తొమ్మిదిదినములు భక్తిశ్రద్ధలతో సాదరముగా రామాయణకథామృతమును గ్రోలుము. నేటినుండి పండ్రెండు సంవత్సరములకాలము ముగియగనే ఈ రాక్షసత్వమునుండి నీకు విముక్తి కల్గును. అంతవఱకును ఈశాపఫలితము ననుభవింపవలసినదే' - అని (38)

విప్రుడు పలికెను

వెంటనే విప్రుడైన ఆ సౌదాసుడు గురువుపలికిన అనుగ్రహ వచనములకు సంప్రీతుడై, ఆయనపాదములకు నమస్కరించి, ఇట్లు విన్నవించెను. "ఓ గురువరా! ఈ రామాయణమును రచించిన మహాత్ముడెవరు? ఇందలి వృత్తాంతము ఎవరిది? మొదలగు విషయములను అన్నింటిని సంగ్రహముగా దెల్పుము." (39)

గౌతముడు పలికెను

"ఓవిప్రుడా! వినుము. రామాయణమహాకావ్యమును వాల్మీకిమహర్షి రచించెను. ఆరామవృత్తాంతమును శ్రద్ధాదరములతో విన్నవాడు తనపాపములనుండి విముక్తుడై, మఱల తనరూపమును పొందును. దేవకార్యార్థమై శ్రీమహావిష్ణువు శ్రీరాముడుగా ఈలోకమున అవతరించెను. అతడు రావణాది రాక్షసులను హతమార్చెను. ఆ మహాత్మునిచరిత్రమును వినుము. మహిమాన్వితమైన ఆ రామాయణము సమస్త పాపములను రూపుమాపును. దానిని కార్తికశుద్ధపాడ్యమినుండి నవమివఱకు విన్నచో మహాపుణ్యఫలము లభించును." అని పలికి, తపోబల సంపన్నుడైన గౌతమముని తనఆశ్రమమునకు వెళ్లెను. (40-43)

రాక్షసశరీరము ప్రాప్తించిన కారణముగా ఆ విప్రుడు మిగుల దుఃఖితుడయ్యెను. అతడు నిత్యము అమితమైన ఆకలిదప్పులతో అలమటించుచుండెను. అందువలన అతనిలో కోపము మెండయ్యెను. (44)

అతడు నల్లత్రాచుపామువలె భయంకరుడై, నిర్జనములైన వనప్రదేశములలో తిరుగసాగెను. వివిధములగు ప్రసిద్ధములైన క్రూరమృగములు, మనుష్యులు, సర్పములు, పక్షులు, వానరములు మొదలగుప్రాణులనన్నింటిని అతడు భక్షించుచుండెను. (45)

ఓ విప్రులారా! ఆ రాక్షసునికారణముగా అనేకములైన ఎముకలతోడను, పసుపు ఎఱుపు కళేబరములతోను, రక్తమును గ్రాగెడి భూతప్రేతములతోడను నిండి, అచటి ప్రదేశములన్నియును భయంకరముగా ఉండెను. (46)

ఋతుత్రయే స పృథివీం శతయోజనవిస్తరాం। 47

కృత్వాఽతిదూషితాం పశ్చాత్ వనాంతరమగాత్ పునః।
తత్రాపి కృతవాన్ నిత్యం నరమాంసాశనం తదా। 48

జగామ నర్మదాతీరే సర్వలోకభయంకరః।
ఏతస్మిన్నంతరే ప్రాప్తః కశ్చిద్విప్రోఽతిధార్మికః। 49

కలింగదేశసంభూతో నామ్నా గర్గ ఇతి శ్రుతః।
వహన్ గంగాజలం స్కంధే స్తువన్ విశ్వేశ్వరం ప్రభుమ్।
గాయన్ నామాని రామస్య సమాయాతోఽతిహర్షితః। 50

తమాగతం మునిం దృష్ట్వా సుదాసోనామ రాక్షసః।
ప్రాప్తే నః పారణేత్యుక్త్వా భుజావుద్యమ్య తం యయౌ। 51

తేన కీర్తితనామాని శ్రుత్వాదూరే వ్యవస్థితః।
అశక్తః తద్ద్విజం హంతుమ్ ఇదమూచే స రాక్షసః। 52

రాక్షస ఉవాచ

అహో భద్ర మహాభాగ నమస్తుభ్యం మహాత్మనే। 53

నామస్మరణమాహాత్మ్యాత్ రాక్షసా అపి దూరగాః।
మయా ప్రభక్షితాః పూర్వం విప్రాః కోటిసహస్రశః। 54

నామప్రావరణం విప్ర రక్షతి త్వాం మహాభయాత్।
నామస్మరణమాత్రేణ రాక్షసా అపి భో వయమ్। 55

పరాం శాంతిం సమాపన్నా మహిమానోఽచ్యుతస్య కః।
సర్వథా త్వం మహాభాగ రాగాదిరహితో ద్విజ।
రామకథాప్రభావేణ పాహ్యస్మాత్ పాతకాధమాత్। 56

గుర్వవజ్ఞా మయా పూర్వం కృతా చ మునిసత్తమ।
కృతశ్చానుగ్రహః పశ్చాత్ గురుణాప్రోక్తవానిదమ్। 57

అతడు నూఱుయోజనముల వైశాల్యముగల ఆభూభాగము నంతయును ఆఋతువులలోనే మిగుల కలుషితమొనర్చి (పాడుచేసి) పిమ్మట మఱియొకవనముకేగెను. అక్కడగూడ అతడు నిత్యము నరమాంసమునే భక్షింపదొడంగెను. (47-48)

సకలప్రాణులకు భయంకరుడైయున్న ఆరాక్షసుడు క్రమముగా నర్మదానదీతీరమునకు చేరెను. ఇంతలోపల మిగుల ధార్మికుడైన ఒకానొకవిప్రుడు అచటికి ఏతెంచెను. (49)

అచటికివచ్చిన ఆ బ్రాహ్మణునిపేరు గర్గుడు. అతడు సుప్రసిద్ధుడు. కళింగదేశమునకుచెందినవాడు. అతడు తన భుజముపై గంగాజలములతో నిండినపాత్రను మోయుచు, విశ్వేశ్వరుని స్తుతించుచు, శ్రీరామునినామములను గానము చేయుచు, మిగుల సంతోషముతో అచటికి చేఱెను. (50)

రాక్షసుడుగా మాఱియున్న ఆ సుదాసుడు అచటికి విచ్చేసిన ఆ మునీశ్వరునిజూచి, 'నాకు నేటికి కావలసిన ఆహారము లభించినది' - అని అనుకొనుచు, అతడు చేతులుపైకెత్తి, ఆమునిని సమీపించెను. (51)

ఆ గర్గమహర్షి కీర్తించుచున్న దైవనామములను విని, అతడు దూరముననే నిలబడిపోయెను. ఆ బ్రాహ్మణోత్తముని చంపుటకు అశక్తుడై ఆ రాక్షసుడు ఆయనతో ఇట్లు పలికెను. (52)

రాక్షసుడు ఇట్లు పలికెను

'ఏమాశ్చర్యము! ఓ భద్రుడా! ఓ మహాభాగా! మహాత్ముడవైన నీకు నమస్కారము. మీ దైవనామస్మరణ ప్రభావమున నావంటి రాక్షసులుగూడ దూరముననే నిలిచిపోవుచున్నారు. నేను ఇదివఱలో లెక్కలేనంతమంది బ్రాహ్మణులను భక్షించియుంటిని. (53-54)

ఓ బ్రాహ్మణుడా! దివ్యనామము అను ఆయుధమే నీకు భద్రకవచమై మహాభయమునుండి నిన్ను కాపాడుచున్నది. అయ్యో! భగవంతునినామమును స్మరించినంత మాత్రముననే రాక్షసులమైన మేముగూడ పరమశాంతినిపొందుచుంటిమి. భగవంతునిమహిమ నిజముగా ఎంతగొప్పది! ఓ మహాత్మా! నీవు అన్నివిధములుగా రాగద్వేషములు లేనట్టి బ్రాహ్మణోత్తముడవు. కనుక నీవు రామకథనుదెలిపి, దానిప్రభావముతో మహాపాపినైన నన్ను ఈ రాక్షసరూపమునుండి విముక్తునిగావింపుము. (55-56)

ఓ మునీశ్వరా! నేనిదివఱలో నాగురువును అవమానించితిని. తత్ఫలితముగా "రాక్షసశరీరమును పొందుము" - అని శపింపబడితిని. పిమ్మటగురువు నన్ను అనుగ్రహించి, నాతో ఇట్లు వచించెను. (57)

వాల్మీకి మునినా పూర్వం కథా రామాయణస్య చ । 58

ఊర్జే మాసి సితే పక్షే శ్రోతవ్యాచ ప్రయత్నతః ।
నయణాపి పునః ప్రోక్తం రమ్యంతు శుభదం వచః । 59

నవమ్యహాని శ్రోతవ్యం రామాయణకథామృతమ్ ।
తస్మాద్ బ్రహ్మన్ మహాభాగ సర్వశాస్త్రార్థకోవిద ।
కథాశ్రవణమాత్రేణ పాహ్యస్మాత్ పాపకర్మణః । 60

శ్రీ నారద ఉవాచ

ఇత్యాఖ్యాతం రాక్షసేన రామమాహాత్మ్యముత్తమం ।
నిశమ్య విస్మయావిష్టో బభూవ ద్విజసత్తమః । 61

తతో విప్రః కృపావిష్టః రామనామపరాయణః ।
సౌదాసం రాక్షసం నామ చేదం వాక్యమథాబ్రవీత్ । 62

విప్ర ఉవాచ

రాక్షసేంద్ర మహాభాగ మతిస్తే విమలాగతా । 63

అస్మిన్నూర్జే సితే పక్షే రామాయణకథాం శృణు ।
శృణు త్వం రామమాహాత్మ్యం రామభక్తిపరాత్మనా । 64

రామధ్యానపరాణాం చ కః సమర్థః ప్రబాధితుమ్ ।
రామభక్తిపరా యత్ర బ్రహ్మా విష్ణుః సదాశివః । 65

తత్ర దేవాశ్చ సిద్ధాశ్చ రామాయణపరా నరాః ।
తస్మాదూర్జే సితే పక్షే రామాయణకథాం శృణు ।
నవాహ్నో ఖలు శ్రోతవ్యం సావధానః సదా భవన్ । 66

కథాశ్రవణమాత్రేణ రాక్షసత్వమపాకృతమ్ । 67

విసృజ్య రాక్షసం భావమ్ అభవద్దేవతోపమః ।
కోటిసూర్యప్రతీకాశమ్ అపన్నో విబుధర్షభః । 68

శంఖచక్రగదాపాణిః రామభద్రః సమాగతః ।
స్తువంస్తు బ్రాహ్మణం సమ్యక్ జగామ హరిమందిరమ్ । 69

"పూర్వకాలమున వాల్మీకిమహర్షి శ్రీరామగాథను ఒక మహాకావ్యముగా రచించెను. కార్తికమాస శుక్లపక్షమునందు తొమ్మిదిదినములు ప్రయత్నపూర్వకముగా దీనిని వినుటవలన మహాపుణ్యఫలము లభించును." - ఇంకను ఆ మహాత్ముడు మనోహరమైన శుభప్రదమైన వచనములను ఇట్లు నుడివెను. "పాడ్యమునుండి తొమ్మిది దినములు రామాయణకథామృతమును గ్రోలవలెను."- అని - అప్పుడు ఆ రాక్షసుడు ఆ మునితో "సర్వశాస్త్రార్థకోవిదా! మహాత్మా! పూజ్యుడవైన ఓ గర్గమహర్షీ! అందువలన ఆ పవిత్రకథను వినిపించి, పాపాత్ముడనైన నన్ను శాపవిముక్తునిగాచేసి రక్షింపుము." - అని విన్నవించెను.(58-60)

శ్రీ నారదమహర్షి వచించెను

శ్రీమద్రామాయణమహిమనుగూర్చి రాక్షసుడు ఇట్లు పలుకగా వినినపిమ్మట ఆ గర్గమహర్షి మిగుల ఆశ్చర్యమున మునిగెను. అనంతరము రామనామస్మరణమునందే నిమగ్నమైయుండెడి ఆ బ్రాహ్మణుడు సౌదాసుడు అను రాక్షసునితో ఇట్లు పలికెను. (61-62)

విప్రుడు నుడివెను

"మహాత్ముడవైన ఓ రాక్షసోత్తమా! నీబుద్ధి పవిత్రమైనది. ఈ కార్తికమాసమునందలి శుక్లపక్షమున రామాయణపుణ్యకథను శ్రద్ధగా వినుము. రామభక్తినిరతుడవై రామనామ మాహాత్మ్యమును భక్తితో ఆలకింపుము. (63-64)

శ్రీరామునిధ్యానమునందే నిరతులైనవారిని ఎవ్వరును బాధింపజాలరు. రామభక్తిపరులు ఉన్నచోట త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఉందురు. రామాయణప్రవచనము, శ్రవణముచేయుచుండెడి నరులున్నచోట దేవతలు, సిద్ధులు మొదలగు దివ్యజాతులవారును ఉందురు. అందువలన కార్తిక మాసమునందలి శుక్లపక్షమునందు తొమ్మిదిదినములు అనుక్షణము సావధానుడవై రామాయణగాథను వినుము". (65-66)

ఆ పవిత్రరామాయణవృత్తాంతమును విన్నంతమాత్రముననే ఆ సౌదాసునిరాక్షసత్వము తొలగిపోయెను. అంతట అతడు రాక్షసస్వభావమునుండి బయటపడి, దేవతాసముడయ్యెను. పిదప ఆబ్రాహ్మణోత్తముడు కోటిసూర్యకాంతులతో తేజరిల్లెను. (67-68)

అంతట శ్రీరామచంద్రుడు శంఖచక్రములను, గదను ధరించి, అభయహస్తముతో అచట ప్రత్యక్షమై, విప్రోత్తముడైన సౌదాసుని కొనియాడినపిమ్మట ఆ ప్రభువు పరంధామమునకు చేరెను.(69)

నారద ఉవాచ

తస్మాచ్ఛృణుధ్వం విప్రేంద్రా రామాయణకథామృతమ్।
నవమ్యహని శ్రోతవ్యమ్ ఊర్జే మాసి చ కీర్త్యతే। 70

యన్నామ స్మరణాదేవ మహాపాతకకోటిభిః।
విముక్తః సర్వపాపేభ్యో నరో యాతి పరాంగతిమ్।
రామాయణేతి యన్నామ సకృదప్యుచ్యతే యదా। 71

తదైవ పాపనిర్ముక్తో విష్ణులోకం స గచ్ఛతి।
యే పఠంతీదమాఖ్యానం భక్త్యా శృణ్వంతి వా నరాః।
గంగాస్నానఫలం పుణ్యం తేషాం సంజాయతే సదమ్। 72

నారదుడు పలికెను

ఓ విప్రులారా! అందువలన కార్తిక శుద్ధపాడ్యమినుండి తొమ్మిదిదినములు ప్రవచింపబడు రామాయణకథామృతమును ఆస్వాదింపుడు. ఆ రామనామస్మరణప్రభావముననే మానవులు సమస్తమహాపాతకములనుండియు విముక్తులై పరమగతిని పొందుదురు. రామాయణనామమును ఒక్కసారియైనను ఉచ్చరించినవారు వెంటనే పాపవిముక్తులై, వైకుంఠమునకు చేరుదురు. ఈ రామాయణగాథను భక్తితో పఠించెడివారును, వినెడివారును శీఘ్రముగా గంగాస్నానపుణ్యఫలములను పొందెదరు. (70-72)

ఇతి శ్రీస్కందపురాణే ఉత్తరఖండే నారద సనత్కుమార సంవాదే రామాయణమాహాత్మ్యే
రాక్షసమోక్షణంనామ ద్వితీయోఽధ్యాయః

శ్రీ స్కందపురాణాంతర్గత - ఉత్తర ఖండమునందలి నారదసనత్కుమారసంవాదమునందు
రామాయణమాహాత్మ్యమున 'రాక్షసవిమోచనము' అను రెండవ అధ్యాయము సమాప్తము *(2)*

- ❋ ❋ ❋ -

3. తృతీయోఽధ్యాయః

సనత్కుమార ఉవాచ

అహో! చిత్రమిదం ప్రోక్తం మునిమానద నారద।
రామాయణస్య మాహాత్మ్యం పునస్త్వం వద విస్తరాత్। 1

అన్యమాసస్య మాహాత్మ్యం కథయస్వ ప్రసాదతః।
కథం నో జాయతే తుష్టిః మునే త్వద్వచనామృతాత్। 2

నారద ఉవాచ

సర్వే యూయం మహాభాగాః కృతార్థా నాఽత్రసంశయః।
యతః ప్రభావం రామస్య భక్తితః శ్రోతుముద్యతాః। 3

మాహాత్మ్యశ్రవణం యస్య రాఘవస్య కృతాత్మనామ్।
దుర్లభం ప్రాహురిత్యేతత్ మునయో బ్రహ్మవాదినః। 4

శృణుధ్వం ఋషయః చిత్రమ్ ఇతిహాసం పురాతనమ్।
సర్వపాపప్రశమనం సర్వరోగవినాశనమ్। 5

సనత్కుమారుడు పలికెను

మునిలోకమునకే వన్నెతెచ్చిన ఓ నారదమహర్షీ! నీవు నుడివిన ఈ గాథ మిగుల ఆశ్చర్యమును గొలుపుచున్నది. రామాయణ మాహాత్మ్యమును ఇంకను విపులముగా వివరింపుము. మఱియు ఇతరమాసములలో రామాయణ పఠనశ్రవణములఫలితములను గూడ దయతో తెలుపుము. ఓ మునీశ్వరా! ఆ విశేషములను మీనోట విన్నప్పుడే మాకు నిజమైన తృప్తికలుగును. (1-2)

నారదుడు నుడివెను

ఓ మహాత్ములారా! శ్రీరామునిమహిమను భక్తితో వినుటకు ఉద్యుక్తులైన మీరందఱును యథార్థముగా ధన్యాత్ములు. ఇందుసందేహములేదు. "ఎవరెంతగా ప్రయత్నించినను శ్రీరాముని మాహాత్మ్యమునుగూర్చి వినెడిభాగ్యము అబ్బుట దుర్లభము"- అని బ్రహ్మవాదులైన మునులు పేర్కొనిరి. ఓ ఋషులారా! వినుడు. చిత్రమైన ఈ రామాయణేతిహాసము అతిప్రాచీనమైనది, సమస్తపాపములను పాఱద్రోలునది, సమస్త క్లేశములను[1] నిర్మూలించునది. (3-5)

1) అవిద్య, అస్మిత, (అహంకారము) రాగ (ఆసక్తి) ద్వేష-అభినివేశములు - అనునవి పంచక్లేశములు.

ఆసీత్ పురా ద్వాపరేచ సుమతిర్నామ భూపతిః।
సోమవంశోద్భవః శ్రీమాన్ సప్తద్వీపైకనాయకః। 6

ధర్మాత్మా సత్యసంపన్నః సర్వసంపద్విభూషితః।
సదా రామకథాసేవీ రామపూజాపరాయణః। 7

రామపూజాపరాణాం చ శుశ్రూషుః నిరహంకృతిః।
పూజ్యేషు పూజానిరతః సమదర్శీ గుణాన్వితః।
సర్వభూతహితః శాంతః కృతజ్ఞః కీర్తిమాన్ నృపః। 8

పూర్వకాలమున ద్వాపరయుగమున 'సుమతి' అను ఒక మహారాజు గలడు. అతడు చంద్రవంశమునబుట్టినవాడు. సద్గుణసంపన్నుడు. ఏడుద్వీపములకు ఏకైకప్రభువు. ధర్మాత్ముడు. సత్యసంధుడు. సకలసంపదలతో తులతూగుచున్నవాడు. అనుక్షణము రామకథలను వినుటయందే నిమగ్నుడై యుండెడివాడు. అహంకారములేనివాడు. అతడు నిరంతరము స్వయముగా శ్రీరాముని పూజించుచుండుటయేగాక రామపూజాపరాయణులను భక్తిశ్రద్ధలతో సేవించుచుండెడివాడు. పూజ్యులను పూజించుటలో నిరతుడు, ఎట్టి తారతమ్యములను చూపక అందరిని సమానముగా గౌరవించుచుండెడివాడు. ఉదారబుద్ధిగలవాడు. ఆ రాజు అందరికిని (సమస్తప్రాణులకును) మేలుచేయుచుండెడివాడు. తనకు ఇతరులు చేసినమేలును మఱువని వాడు. అతడు చక్కని కీర్తిప్రతిష్ఠలుగలవాడు. (6-8)

తస్య భార్యా మహాభాగా సర్వలక్షణసంయుతా।
పతివ్రతా పతిప్రాణా నామ్నా సత్యవతీ శుభా। 9

ఆ సుమతిప్రభువుయొక్క భార్య మిగుల గుణవంతురాలు. ఆమెపేరు సత్యవతి. ఆమె సర్వశుభలక్షణములుగలది, పతివ్రత, ఆమె తనపతిని ప్రాణములతో సమానముగా చూచుకొనును. (9)

తావుభౌ దంపతీ నిత్యం రామాయణపరాయణౌ। 10

అన్నదానరతౌ నిత్యం జలదానపరాయణౌ।
తటాకారామవాప్యాదీన్ అసంఖ్యాతాన్ వితేనతుః। 11

ఆ దంపతులు ఇరువురును నిరంతరము రామాయణ పఠనశ్రవణములయందే నిమగ్నులైయుండురు. వారు నిత్యము అన్నదానములతో, జలదానములతో భూతతృప్తి గలిగించుచుండురు. వారు చెఱువులను, ఉద్యానవనములను, దిగుడుబావులను అసంఖ్యాకములుగా నిర్మింపజేసిరి. (10-11)

సోఽపి రాజా మహాభాగో రామాయణపరాయణః।
వాచయేత్ శృణుయాద్వాపి భక్తిభావేన భావితః। 12

ఏవం రామపరం నిత్యం రాజానం ధర్మకోవిదమ్।
తస్య ప్రియాం సత్యవతీం దేవా అపి సదాఽస్తువన్। 13

మహాత్ముడైన ఆ మహారాజు ప్రవచనసమయమునందును శ్రవణసమయమునను భక్తిశ్రద్ధలతో రామాయణమునందే నిమగ్నుడైయుండును. ఇట్లు సంతతము రామసేవాతత్పరుడును, ధర్మాచరణమునందు కుశలుడును ఐన ఆ ప్రభువును, ఆయనప్రియపత్నియైన సత్యవతీదేవిని, దేవతలుసైతము అనవరతము ప్రశంసించుచుండురు. (12-13)

త్రిలోకే విశ్రుతౌ తౌ చ దంపత్యత్యంతధార్మికౌ।
ఆయయౌ బహుభిః శిష్యైః ద్రష్టుకామో విభాండకః। 14

ముల్లోకములలోను మిక్కిలి ధార్మికులుగా వాసిగాంచిన ఆ దంపతులను చూడగోరినవాడై 'విభాండక' మహర్షి పెక్కుమంది శిష్యులతోగూడి అచటికి విచ్చేసెను. (14)

విభాండకమునిం దృష్ట్వా సమాయాన్తం జనేశ్వరః।
ప్రత్యుద్యయౌ సపత్నీకః పూజాభిః బహువిస్తరమ్। 15

ఆ మహామునిరాకను ఎఱింగి ఆ మహారాజు భార్యాసమేతుడై పూజాద్రవ్యములను సమృద్ధిగాగొని, ఎదురేగి ఆయనను దర్శించెను. (15)

కృతాతిథ్యక్రియం శాంతం కృతాసనపరిగ్రహమ్।
నీచాసనగతో భూపః ప్రాంజలిర్మునిమబ్రవీత్। 16

పిమ్మట ఆ మహారాజు అతిథిసత్కారములతో ఆమునిని సంతృప్తునిగావించి, ఉన్నతాసనముపై ఆయనను ఆసీనునిగావించెను. అతడు అంతకంటెను ఎత్తుతక్కువగానున్న ఒక ఆసనమున కూర్చుండి, అంజలి ఘటించి, వినమ్రుడై ఆ మహర్షితో ఇట్లనెను. (16)

రాజోవాచ

భగవన్ కృతకృత్యోఽస్మి తవాత్రాగమనేన భోః ।
సతామాగమనం సంతః ప్రశంసంతి సుఖావహమ్ । 17

యత్ర స్యాన్మహతాం ప్రేమ తత్ర స్యుః సర్వసంపదః ।
తేజః కీర్తిః ధనం పుత్రా ఇతి ప్రాహుర్విపశ్చితః । 18

తత్ర వృద్ధిం గమిష్యంతి శ్రేయాంస్యనుదినం మునే ।
యత్ర సంతః ప్రకుర్వంతి మహతీం కరుణాం ప్రభో । 19

యో మూర్ధ్ని ధారయేత్ బ్రహ్మన్ విప్రపాదతలోదకమ్ ।
స స్నాతః సర్వతీర్థేషు పుణ్యవాన్ నాఽత్రసంశయః । 20

మమ పుత్రాశ్చ దారాశ్చ సంపత్ త్వయి సమర్పితాః ।
సమాజ్ఞాపయ శాంతాత్మన్ బ్రహ్మన్ కిం కరవాణి తే । 21

వినయావనతం భూపం తం నిరీక్ష్య మునీశ్వరః ।
స్పృశన్ కరేణ రాజానం ప్రత్యువాచాతిహర్షితః । 22

ఋషిః ఉవాచ

రాజన్ యదుక్తం భవతా తత్ సర్వం త్వత్కులోచితమ్ ।
వినయావనతాః సర్వే పరం శ్రేయో భజంతి హి । 23

ప్రీతోఽస్మి తవ భూపాల! సన్మార్గే పరివర్తినః ।
స్వస్తి తేఽస్తు మహాభాగ యత్ ప్రక్ష్యామి తదుచ్యతామ్ । 24

పురాణాః బహవస్సంతి హరిసంతుష్టికారకాః ।
మాఘే మాస్యప్యుద్యతోఽసి రామాయణపరాయణః । 25

తవ భార్యాఽపి సాధ్వీయం నిత్యం రామపరాయణా ।
కిమర్థమేతద్వృత్తాంతం యథావత్ వక్తుమర్హసి । 26

రాజోవాచ

శ్రూయతాం భగవన్ సర్వం యత్ పృచ్ఛసి వదామి తత్ ।
ఆశ్చర్యభూతం లోకానాం ఆవయోశ్చరితం మునే । 27

అహమాసం పురా శూద్రో మాలిర్నామ సత్తమ ।
కుమార్గనిరతో నిత్యం సర్వలోకాహితే రతః । 28

రాజు నుడివెను

"అయ్యా! పూజ్యమహర్షీ! మీ ఆగమనముతో నేను ధన్యాత్ముడను ఐతిని. సత్పురుషులరాక సుఖసంతోషములను గూర్చునని పెద్దలు పల్కుదురు. మహాత్ముల అనుగ్రహము ప్రసరించెడిచోట సమస్తసంపదలును, కీర్తిప్రతిష్ఠలును, అంతులేని ఆనందము, ధనధాన్యములును, సంతానసమృద్ధియు వెల్లివిరియు చుండునని ప్రాజ్ఞులు పలింతురు. (17-18)

ఓ మహామునీ! సత్పురుషులకరుణ ప్రసరించెడిచోట అనవరతము సకలశ్రేయోభివృద్ధులును సమకూరుచుండును. (19)

ఓ బ్రహ్మర్షీ! విప్రోత్తములయొక్క పవిత్రపాదోదకములను శిరసున ధరించినవానికి సకలతీర్థములయందును మునిగిన సత్ఫలములు లభించును. ఇందులకు సందేహము లేదు. (20)

ఓ బ్రహ్మర్షీ! శాంతాత్మా! నా సమస్తసంపదలను, భార్యాపుత్త్రులను మీపాదములచెంత సమర్పించుచున్నాను. ఈ సేవకుడు ఇంకను మీకు ఏమి చేయవలయునో ఆజ్ఞాపింపుడు." (21)

వినయముతో నమస్కరించుచున్న ఆభూపతినిజూచి, విభాండకమహాముని ఆయనను తనకరతలముతో స్పృశించి, మిగుల సంతోషముతో ఇట్లునుడివెను. (22)

మహర్షి వచించెను

"ఓ మహారాజా! నీవు పలికిన పలుకులన్నియును మీవంశోన్నతికి తగినట్లుగా ఉన్నవి. ఇట్టి వినయశీలురు అందఱును పరమ శ్రేయస్సును పొందుదురు. (23)

ఓ భూపాలా! సన్మార్గములో సాగిపోవుచున్న నీయెడ నేను ప్రసన్నుడనైతిని. ఓ మహాత్మా నీకు శుభపరంపర ప్రాప్తించు గాక. నేను అడిగిన విషయములను విశదపఱచుము. (24)

శ్రీమహావిష్ణువును సంతృప్తిపఱచెడి పురాణములు పెక్కుగలవు. మాఘమాసమునందును రామాయణప్రవచన శ్రవణములకు పూనుకొంటివి. పరమసాధ్వియైన నీ ధర్మపత్నియు ఈ రామ కార్యమున నీకు సహధర్మచారిణియై నిలిచినది. ఇట్టి మీసేవా కార్యక్రమములకు కారణమేమో సవిస్తరముగా తెల్పుడు." (25-26)

రాజు నుడివెను

"ఓ పూజ్యమహర్షీ! మీరడిగిన విషయములను అన్నింటిని తెలిపెదను వినుడు. మాదంపతులచరిత్రము సమస్త లోకములకును ఆశ్చర్యమును గొలుపునది. (27)

ఓ సాధుశిరోమణీ! పూర్వజన్మలో నేను 'మాలి' అను పేరు గల శూద్రుడను. సమస్తప్రాణులకును హానిగూర్చుట యందే నిరతుడనై, నిత్యము చెడుమార్గములలో మసలుచుండెడివాడను. (28)

పిశునో ధర్మవిద్వేషీ దేవద్రవ్యాపహారకః।
మహాపాతకిసంసర్గీ దేవద్రవ్యోపజీవితః। 29

గోఘ్నశ్చ బ్రహ్మహా చౌరో నిత్యం ప్రాణివధే రతః।
నిత్యం నిష్ఠురవక్తా చ పాపీ వేశ్యాపరాయణః। 30

ఇతరులపై కొండెములను చెప్పుచుండెడివాడను. ధర్మమార్గములకు వ్యతిరేకినై, దేవద్రవ్యములను అపహరించుచుండెడివాడను. మహాపాపులతో కలిసితిరుగుచు దేవద్రవ్యములతో జీవించుచుండెడివాడను. గోహత్యలకును, బ్రాహ్మణహత్యలకును ఒడిగట్టుచుండెడివాడను. నిత్యము దొంగతనములకును ప్రాణివధలకును పాల్పడుచుండెడివాడను. ఎల్లప్పుడును పరుషముగా మాటాడుచుండెడివాడను. పాపాత్ముడనై, వేశ్యాలోలుడనై జీవించుచుంటిని. (29-30)

కించిత్ కాలం స్థితో హ్యేవమ్ అనాదృత్య మహద్వచః।
సర్వబంధుపరిత్యక్తో దుఃఖీ వనముపాగమమ్। 31

ఇట్లు కొంతకాలము గడచిన పిమ్మట పెద్దలమాటలను పెడచెవినబెట్టినకారణమున నాబంధువులందఱును నాకు దూరమైరి. అంతట దుఃఖములకు లోనై వనములపాలైతిని. (31)

మృగమాంసాశనో నిత్యం తథా మార్గవిరోధకృత్।
ఏకాకీ దుఃఖబహులో హ్యవసం నిర్జనే వనే। 32

అనుదినము మృగములమాంసములను భక్షించుచు నేను ఆకలిదీర్చుకొనుచుంటిని. ఆ అరణ్యములలో బాటసారులను అడ్డగించుచు, వారిని దోచుకొనసాగితిని. ఆ నిర్జనవనములలో అంతులేని కష్టములకు ఓర్చుకొనుచు ఒంటరిగా జీవింపసాగితిని. (32)

ఏకదా క్షుత్పరిశ్రాంతో నిదాఘార్తః పిపాసితః।
వసిష్ఠస్యాశ్రమం దైవాత్ అపశ్యం విజనే వనే। 33

ఇట్లుండగా ఒకనాడు గ్రీష్మతాపమునకులోనై, ఆకలిదప్పులబాధలకుతట్టుకొనలేక మిగుల అలసిపోయితిని. ఇంతలో ఆ నిర్జనారణ్యమునందు దైవవశమున నాకు వసిష్ఠునిఆశ్రమము గోచరమయ్యెను. (33)

హంసకారండవాకీర్ణం తత్సమీపే మహత్ సరః।
పర్యంతే వనపుష్పౌఘైః ఛాదితం తన్మునీశ్వరైః। 34

ఆ ఆశ్రమసమీపముననే ఒక మహాసరస్సు ఉండెను. అది హంసలతోడను, బెగ్గురుపక్షులతోడను ఒప్పుచుండెను. అడవిపూవులతో అది వ్యాప్తమైయుండెను. పెక్కుమంది మునీశ్వరులు అచట చేరియుండిరి. (34)

అపిబం తత్రపానీయం తత్తటే విగతశ్రమః।
ఉన్మూల్య వృక్షమూలాని మయా క్షుచ్చ నివారితా। 35

ఆ సరస్సులోని జలములనుద్రాగి దానియొడ్డున సేద దీర్చుకొంటిని. పిమ్మట చెట్లను పెకలించి, వాటిమూలములతో ఆకలిదీర్చుకొంటిని. (35)

వసిష్ఠస్యాశ్రమే తిష్ఠన్ నివాసం కృతవానహమ్।
శీర్ణస్ఫటికసంధానం తత్ర చాహమకారిషమ్।
పర్ణైస్తృణైశ్చ కాష్ఠైశ్చ గృహం సమ్యక్ ప్రకల్పితమ్। 36

నేను ఆ వసిష్ఠునిఆశ్రమమునకు సమీపముననే పగిలిపోయిన స్ఫటికశిలలనుచేర్చి, గోడలను నిర్మించితిని. ఆగోడలపై కఱ్ఱలను పఱచి, వాటిపై ఆకులను, గడ్డిని కప్పి, ఒక చక్కని గృహమును ఏర్పఱచుకొని, అందు నివసింపసాగితిని. (36)

తత్రాహం వ్యాధవత్త్యస్థో హత్వా బహువిధాన్ మృగాన్।
ఆజీవం వర్తనం కృత్వా ప్రతారాణాం చ వింశతిమ్। 37

అచ్చట వేటగానివృత్తిని అవలంబించితిని. చాటుమాటుగా పొంచియుండి, బహువిధములైన మృగములను చంపుచు వాటిమాంసములను భక్షించుచు ఇరువది సంవత్సరములపాటు అక్కడనే గడపితిని. (37)

అథేయమ్ ఆగతా సాధ్వీ వింధ్యదేశసముద్భవా।
నిషాదకులసంభూతా నామ్నా కాళీ తు విశ్రుతా। 38

ఈ సాధ్వి పూర్వజన్మలో వింధ్యపర్వతప్రాంతమున నిషాదవంశమున జన్మించినది. అప్పుడు ఈమెపేరు కాళి. నేను వసిష్ఠాశ్రమసమీపమున నివసించుచుండగా ఈమె నాకడకు వచ్చెను. (38)

బంధువర్గైః పరిత్యక్తా దుఃఖితా జీర్ణవిగ్రహా । 39

బ్రహ్మన్ క్షుత్తృట్పరిశ్రాంతా శోచంతీ స్వక్రియాం క్రియాం ।
దైవయోగాత్ సమాయాతా భ్రమంతీ విజనే వనే । 40

మాసి గ్రీష్మే చ తాపార్తా హ్యంతస్తాపప్రపీడితా ।
ఇమాం దుఃఖవతీం దృష్ట్వా జాతా మే విపులా ఘృణా । 41

మయా దత్తం జలం చాస్యై మాంసం వన్యఫలం తథా ।
గతశ్రమా తు తుష్టా సా మయా బ్రహ్మన్ యథాతథమ్ ।
న్యవేదయత్ స్వకర్మాణి శృణు తాని మహామునే । 42

ఇయం కాళీ తు నామ్నైవ నిషాదకులసంభవా । 43

దానికస్య సుతా విద్వన్ న్యవసత్ వింధ్యపర్వతే ।
పరస్వహారిణీ నిత్యం సదాపైశున్యవాదినీ । 44

బంధువర్గైః పరిత్యక్తా యతో హతవతీ పతిమ్ ।
కాంతారే విజనే బ్రహ్మన్ మత్సమీప ఉపాగతా । 45

ఇత్యేవం స్వకృతం కర్మ సా చ మహ్యం న్యవేదయత్ ।
వసిష్ఠస్యాశ్రమే పుణ్యే హ్యహం చేయం చ వై మునే ।
దంపతీభావమాశ్రిత్య స్థితా మాంసాశనా తదా । 46

ఉచ్ఛిష్టార్థం గతౌ చైవ వసిష్ఠస్యాశ్రమే తదా ।
సమాజం తత్ర దృష్ట్వాపి దేవర్షీణాంచ సత్రకం । 47

రామాయణపరా విప్రా మాఘే దృష్టా దినేదినే । 48

నిరాహారా చ విశ్రాంతా క్షుత్పిపాసాప్రపీడితా ।
యదృచ్ఛయా గతౌ తత్ర వసిష్ఠస్యాశ్రమం ప్రతి । 49

రామాయణకథాం శ్రోతుం నవాహ్నా చైవ భక్తితః ।
తత్కాల ఏవ పంచత్వం అవయోరభవన్మునే । 50

కర్మణా తేన హృష్టాత్మా భగవాన్ మధుసూదనః ।
స్వదూతాన్ ప్రేషయామాస మదాహరణకారణాత్ । 51

బంధువులందఱును దూరమైపోవుటచే ఈమె కడు దుఃఖితురాలై మిగుల కృశించియుండెను. ఓ బ్రహ్మర్షీ! ఈమె ఆకలిదప్పులతో అలమటించుచు, అన్నపానములకై ఎంతయు వెదకుకొనుచుండెను. అట్లునిర్జనవనములయందు సంచరించుచు దైవానుగ్రహమున ఈమె నాయొద్దకుచేరెను. (39-40)

గ్రీష్మ-ఋతువునందలి సూర్యతాపమునకుతోడుగా ఎదురైన కష్టములకారణముగా మనస్తాపము ఈమెను పీడించివేసినది. అట్లు దుఃఖములతో కృశించియున్న యీమెనుజూచి. నాకు మిగుల జాలికల్గెను. (41)

ఓ బ్రహ్మర్షీ! వెంటనే ఈమెకు జలములను, మాంసమును, అడవిపండ్లను ఒసంగితిని. వాటిని స్వీకరించుటతో శ్రమయంతయును తొలగిపోగా ఈమె మిగులసంతుష్టురాలయ్యెను. పిమ్మట ఈమె తనవృత్తాంతమునంతయును యథాతథముగా నాకు వివరించెను. ఓ మహామునీ! ఆ విశేషములను తెల్పెదను వినుము. (42)

ఓ విద్వాంసుడా! నిషాదకులమున బుట్టిన ఈమెపేరు కాళి. దానికుడు ఈమెతండ్రి. ఈమె వింధ్యపర్వతప్రాంతమున నివసించునది. ఈమె నిత్యము పరులసొత్తును అపహరించు చుండెడిది. నిరంతరము ఇతరులపై చాడీలు చెప్పుచుండుట ఈమెకు సహజము. పతిని చంపిన హంతకురాలగుటచే ఈమెను బంధువులు అడవులపాలుచేసిరి. క్రమముగా ఈమె నాచెంతచేరినది. (43-45)

ఓ మునీశ్వరా! ఈవిధముగా ఈమె తనజీవితవిశేషముల నన్నింటిని నాకు తెల్పెను. పవిత్రమైన వసిష్ఠాశ్రమసమీపమున నేనును, ఈమెయును దంపతులముగా జీవించుచుంటిమి. ప్రతి దినము మేము మాంసాహారములతో కాలము గడుపు చుంటిమి. (46)

మేము ఇద్దఱము ఋషులు తినగా మిగిలిన ప్రసాదమునకై వసిష్ఠాశ్రమమునకు వెళ్లివచ్చుచు ఉంటిమి. ఇట్లుండగా ఒకనాడు పవిత్రమైన ఆప్రదేశమున దేవర్షులసమూహము ఉన్నప్పటికిని ఆకలితొందరచే అచటికి చేరితిమి. మాఘ మాసమున ప్రతిదినము రామాయణపారాయణమునందు నిరతులైన విప్రులు అచట మాకు కనబడిరి. (47-48)

నిరాహారులమైయుండుటచేత ఆకలిదప్పుల బాధతో మేము మిగుల అలసిపోయి, కృశించియుంటిమి. ఆ వసిష్ఠాశ్రమమునకు మేము అప్రయత్నముగా చేరితిమి. మాలో ఏర్పడిన భక్తి కారణముగా రామాయణగాథను వరుసగా తొమ్మిది దినములు వింటిమి. ఆ సమయమునందే మేము ఉభయులము మృతిచెందితిమి. (49-50)

మా రామాయణశ్రవణకారణముగా శ్రీమహావిష్ణువు సంతసించి, మమ్ములను తీసికొనిపోవుటకై తనదూతలను పంపెను. ఆ దూతలు మా ఇరువురిని విమానముపై

ఆరోప్యావాం విమానే తే యయుశ్చ పరమం పదమ్ ।
ఆవాం సమీపమాపన్నౌ దేవదేవస్య చక్రిణః ॥ 52

భుక్తవంతౌ మహాభోగాన్ యావత్కాలం శృణుష్వ మే ।
యుగకోటిసహస్రాణి యుగకోటిశతాని చ ॥ 53

ఉషిత్వా రామభవనే బ్రహ్మలోకముపాగతౌ ।
తావత్కాలం చ తత్రాపి స్థిత్వేశపదమాగతౌ ॥ 54

తత్రాఽపి తావత్కాలం చ భుక్త్వా భోగానను త్తమాన్ ।
తతః పృథ్వీశతాం ప్రాప్తౌ క్రమేణ మునిసత్తమ ॥ 55

అత్రాపి సంపదతులా రామాయణప్రసాదతః ।
అనిచ్ఛయా కృతేనాఽపి ప్రాప్తమేవం విధం మునే ॥ 56

నవాహ్నా కిల శ్రోతవ్యం రామాయణకథామృతమ్ ।
భక్తిభావేన ధర్మాత్మన్ జన్మమృత్యుజరాపహమ్ ॥ 57

అవశేనాఽపి యత్కర్మ కృతం తు సుమహాఫలమ్ ।
దదాతి నృణాం విప్రేంద్ర రామాయణప్రసాదతః ॥ 58

నారద ఉవాచ

ఏతత్ సర్వం నిశమ్యాసౌ విభాండకమునీశ్వరః ।
అభివంద్య మహీపాలం ప్రయయౌ స్వం తపోవనమ్ ॥ 59

తస్మాత్ శృణుధ్వం విప్రేంద్రా దేవదేవస్య చక్రిణః ।
రామాయణకథా హ్యేషా కామధేనూపమా స్మృతా ॥ 60

మాఘే మాసే సితే పక్షే రామాఖ్యానం ప్రయత్నతః ।
నవాహ్నా కిల శ్రోతవ్యం సర్వధర్మఫలప్రదమ్ ॥ 61

య ఇదం పుణ్యమాఖ్యానం సర్వపాపప్రణాశనమ్ ।
వాచయేత్ శృణుయాద్వాఽపి రామే భక్తిశ్చ జాయతే ॥ 62

చేర్చుకొని, పరమపదమునకు చేరిరి. ఆ విధముగా మేము ఇద్దఱము ఆ దేవదేవుని సన్నిధికి చేరితిమి. (51-52)

ఓ మహర్షీ! మేము అచట ఎంతకాలము ఉంటిమో? ఏయే సుఖభోగములను అనుభవించితిమో? తెలిపెదను వినుము. అనేకవేలసంవత్సరములు ఆ శ్రీరామధామమున ఉండి, పిదప బ్రహ్మలోకమునకు చేరితిమి. ఆ సత్యలోకమునందును కొంతకాలము ఉండి, పిదప ఇంద్రలోకమునకు (స్వర్గమునకు) వచ్చితిమి. (53-54)

ఆ స్వర్గమునందును కొంతకాలము ఉండి, అచట దివ్య భోగములను అనుభవించితిమి. ఓ మునీశ్వరా! అనంతరము క్రమముగా మేము ఇరువురము భూలోకమున రాజ కుటుంబములలో జన్మించితిమి. రామాయణమహిమా ప్రభావమున ఈలోకమునందును అపూర్వసంపదలను పొందితిమి. మేము అప్రయత్నముగనే రామాయణశ్రవణమును చేసినను ఇట్టివైభవము మాకులభించినది. (55-56)

ఓ ధర్మాత్మా! జననమరణభయములను, వార్ధక్యభీతిని పాఱద్రోలునట్టి రామాయణకథామృతమును వరుసగా తొమ్మిదిదినములు భక్తిశ్రద్ధలతో సేవింపవలెను. (57)

ఓ విప్రోత్తమా! అప్రయత్నముగానైనను రామాయణ శ్రవణముచేసినచో తత్ప్రభావమున మానవులకు అనంత పుణ్యఫలములు లభించును." (58)

నారదుడు నుడివెను

అంతట విభాండకమహర్షి ఈ సమస్తగాథను విని, మహారాజునకు నమస్కరించి, తనతపోవనమునకు వెళ్లెను. ఓ విప్రోత్తములారా! అందువలన వినుడు - 'చక్రధరుడు దేవదేవుడు ఐన శ్రీరామునికథ సకలమనోరథములను సిద్ధింపజేసెడి కామధేనువువంటిది. (59-60)

రామాయణమహాకావ్యము సమస్తధర్మఫలములను ప్రసాదించును. కావున ఈరామగాథను మాఘమాసమునందు శుక్లపక్షమున క్రమముగా తొమ్మిది దినములు ప్రయత్న పూర్వకముగా వినవలెను. శ్రీమద్రామాయణము అతిపవిత్రమైనది. సమస్తపాపములను రూపుమాపునది. దీనిని ప్రవచించిన వారికిని, వినినవారికిని శ్రీరామునియందు గాఢమైన భక్తి కుదురుకొనును. (61-62)

ఇతి శ్రీస్కాందపురాణే ఉత్తరఖండే నారదసనత్కుమారసంవాదే రామాయణమాహాత్మ్యే
మాఘఫలానుకీర్తనంనామ తృతీయోఽధ్యాయః

శ్రీ స్కందపురాణాంతర్గత - ఉత్తరఖండమునందలి నారదసనత్కుమారసంవాదమునందు రామాయణమాహాత్మ్యమున
'మాఘఫలానుకీర్తనము' అను మూడవ అధ్యాయము సమాప్తము (3)

- ❊ ❊ ❊ -

4. చతుర్థోఽధ్యాయః

నారద ఉవాచ

అన్యమాసే ప్రవక్ష్యామి శృణుధ్వం సుసమాహితాః।
సర్వపాపహరం పుణ్యం సర్వదుఃఖనివారణమ్। 1

బ్రాహ్మణక్షత్రియవిశాం శూద్రాణాం చైవ యోషితామ్।
సమస్తకామఫలదం సర్వవ్రతఫలప్రదమ్। 2

దుఃస్వప్ననాశనం ధన్యం భుక్తిముక్తిఫలప్రదమ్।
రామాయణస్య మాహాత్మ్యం శ్రోతవ్యంచ ప్రయత్నతః। 3

అత్రైవోదాహరంతీమమ్ ఇతిహాసం పురాతనమ్।
పఠతాం శృణ్వతాం చైవ సర్వపాపప్రణాశనమ్। 4

వింధ్యాటవ్యామభూదేకః కలికోనామ లుబ్ధకః।
పరదారపరద్రవ్యహరణే సతతం రతః। 5

పరనిందాపరో నిత్యం జంతుపీడాకరస్తథా।
హతవాన్ బ్రాహ్మణాన్ గాశ్చ శతశోఽథ సహస్రశః। 6

దేవస్వహరణే నిత్యం పరస్వహరణే తథా।
తేన పాపాన్యనేకాని కృతాని సుమహాంతి చ। 7

న తేషాం శక్యతే వక్తుం సంఖ్యావత్సరకోటిభిః।
స కదాచిన్మహాపాపో జంతూనామంతకోపమః। 8

సౌవీరనగరం ప్రాప్తః సర్వైశ్వర్యసమన్వితమ్।
యోషిద్భిర్భూషితాభిశ్చ సరోభిర్విమలోదకైః। 9

నారదుడు పలికెను

ఓ విప్రోత్తములారా! ఇతరమాసములలో రామాయణ ప్రవచనమును, శ్రవణమును చేయుటవలన కలిగెడి మహాఫలములనుగూర్చి వివరించెదను. సావధానముగా వినుడు. తత్ప్రభావమున అనంతపుణ్యము లభించును. సమస్తపాపములును అంతరించును. దుఃఖములన్నియును తొలగిపోవును. (1)

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, అట్లే స్త్రీలు- వీరందఱును రామాయణశ్రవణమువలన తమ మనోవాంఛాఫలములను పొందుదురు. ఇది సర్వవ్రతఫలములను గూడ ప్రసాదించును. (2)

ఇది దుఃస్వప్నములను నశింపజేయును, దీనివలన ఇహపరలాభములు సిద్ధించును. కనుక రామాయణమాహాత్మ్యమును ప్రయత్నపూర్వకముగా వినవలెను. అట్టివారు ఎల్లరును ధన్యులగుదురు. (3)

ఈ రామాయణమాహాత్మ్యవిషయమున పెద్దలు ప్రాచీనమైన ఒక ఇతిహాసమును ఉదాహరింతురు. దీనిని పఠించువారియొక్క, వినెడివారియొక్క సమస్తపాపములును రూపుమాయును. (4)

పూర్వకాలమున వింధ్యారణ్యమునందు 'కలికుడు' అను ఒక వేటగాడు కలడు. అతడు నిరంతరము పరస్త్రీలను, పరులద్రవ్యములను అపహరించుచుండువాడు. ఎల్లప్పుడును ఇతరులను నిందించుచుండెడివాడు. జంతువులను పీడించుచుండుట అతనికి వినోదము. అతడు వందలకొలది బ్రాహ్మణులను వేలకొలది గోవులను హతమార్చెను. (5-6)

అతడు పరులసొత్తులను అపహరించుచుండుటయేగాక ప్రతిదినము దేవతలఆభరణాదులనుగూడ కాజేయుచుండెడివాడు. అతడొనర్చుచుండెడి మహాపాపములకును, నేరములకును అంతే లేకుండెడిది. (7)

అతడు చేసిన పాపములను లెక్కించుటకు ఎంతకాలమైనను చాలదు. మహాహంతకుడైన అతనిని చూచినవెంటనే ప్రాణులన్నియును మృత్యుదేవతనుగాంచినట్లు గడగడవణకిపోవుచుండెడివి. అతడు ఒకానొకసమయమున సౌవీరనగరమునకుజేరెను. ఆ నగరము సకలైశ్వర్యములతో తులతూగుచుండెను. అందలి స్త్రీలు అమూల్యములైన వస్త్రాభరణములతో

అలంకృతం విపణిభిః యయౌ దేవపురోపమమ్ ।
తస్యోపవనమధ్యస్థం రమ్యం కేశవమందిరమ్ । 10

శోభితం హేమకలశైః దృష్ట్వా వ్యాధో ముదం యయౌ ।
హీరముక్తాసువర్ణాని బహూనీతి వినిశ్చితః । 11

జగామ రామభవనం విత్తాశః చౌర్యలోలుపః ।
తత్రాపశ్యత్ ద్విజవరం శాంతం తత్త్వార్థకోవిదమ్ । 12

పరిచర్యాపరం విష్ణోః ఉత్తంకం తపసాం నిధిమ్ ।
ఏకాకినం దయాళుం చ నిస్స్పృహం ధ్యానలోలుపమ్ । 13

దృష్ట్వాఽసౌ లుబ్ధకో మేనే తం చౌర్యస్యాంతరాయిణమ్ ।
దేవస్య ద్రవ్యజాతం తు సమాదాతుమనా నిశి । 14

ఉత్తంకం హంతుమారేభే విధృతాసిఃమదోద్ధతః ।
పాదేనాక్రమ్య తద్వక్షో జటాః సంగృహ్య పాణినా ।
హంతుం కృతమతిం వ్యాధం ఉత్తంకః ప్రేక్ష్యచాబ్రవీత్ । 15

ఉత్తంక ఉవాచ

భోభోసాధో వృథా మాం త్వం హనిష్యసి నిరాగసమ్ ।
మయా కిమపరాద్ధంతే తద్వద త్వం చ లుబ్ధక । 16

కృతాపరాధినో లోకే హింసాం కుర్వంతి యత్నతః ।
న హింసంతి వృథా సౌమ్య సజ్జనా అప్యపాపినమ్ । 17

విరోధిష్వపి మూర్ఖేషు నిరీక్ష్యావస్థితాన్ గుణాన్ ।
విరోధం నాధిగచ్ఛంతి సజ్జనాః శాంతచేతసః । 18

శోభిల్లుచుండెను. అచటి సరస్సులు స్వచ్ఛములైన జలములతో దర్శనీయముగాఉండెను. అందున్న అంగడులన్నియును చూడముచ్చటగా ఉండెను. అమరావతి (ఇంద్రుని రాజధాని) వంటి ఆ సుందరనగరమున అతడు అడుగిడెను. ఆ నగరము నందలి ఉద్యానవనములమధ్య ఒక రామమందిరము గలదు. అది మిగుల రమ్యమైనది. (8-10)

ఆ దైవమందిరముపైగల బంగారుకలశములు ధగధగలాడు చుండెను. తస్కరుడైన ఆ వ్యాధుడు ఆ కలశములను గాంచి చాలసంతోషపడెను. అందలి ముత్యములను, మణులను పొదిగిన బంగారునగలనుజూచి, వాటినన్నింటిని దొంగిలింపవలెనని నిశ్చయించుకొనెను. (11)

దొంగతనమునకు అలవాటుపడిన ఆ వ్యాధుడు ధనాశతో ఆ రామమందిరమున ప్రవేశించెను. అచట అతనికి ఒక విప్రోత్తముడు కనబడెను. అతడు శాంతస్వభావుడు. గొప్పతత్త్వవేత్త. (12)

ఆ బ్రాహ్మణునిపేరు ఉత్తంకుడు. అతడు మహాతపస్వి. దైవసేవలలో నిరతుడు. అతడు పరమదయాళువు. అతడు అచట ఒంటరిగానుండి. దైవధ్యానమున నిమగ్నుడై తన్నుతాను మఱచియుండెను. అట్టిస్థితిలోనున్న ఆ బ్రాహ్మణుని కిరాతుడు చూచెను. అర్ధరాత్రివేళ ఆ దైవద్రవ్యమును అపహరింప దలచినవాడై, తనదొంగతనమునకు ఆ విప్రుడు అడ్డునచ్చునని అతడు తలంచెను. అంతట ఆ మదోన్మత్తుడు ఖడ్గమును చేతబట్టి ఆ ఉత్తంకుని చంపుటకు సిద్ధపడెను. పిమ్మట కిరాతుడు ఆ బ్రాహ్మణుని పడద్రోసి. అతనివక్షః స్థలమున కాలునూని, తనచేతితో అతనిజుట్టును పట్టుకొనెను. తనను చంపివేయుటకు ఉద్యుక్తుడైన ఆ వ్యాధునిజూచి, ఉత్తంకుడు అతనితో ఇట్లనెను. (13-15)

ఉత్తంకుడు పలికెను

అయ్యా! ఓ సాధూ! నిరపరాధినైన నన్ను నిష్కారణముగా ఏల చంపబోవుచున్నావు? ఓ లుబ్ధకా! నేను నీకు చేసిన అపకారమేమి? తెలుపుము. అపరాధము చేసినవారిని లోకమున తప్పక శిక్షింతురు. ఓ సౌమ్యుడా! సజ్జనులు నిర్దోషిని అకారణముగా బాధింపరు. (16-17)

శాంతచిత్తులైన సత్పురుషులు తమయెడ విరోధభావమును వహించెడి మూర్ఖులయందును సద్గుణములనేచూచి, వారియెడ శత్రుభావమును వహింపరు. (18)

బహుధా వాచ్యమానోఽపి యో నరః క్షమయాన్వితః ।
తముత్తమం నరం ప్రాహుః విష్ణోః ప్రియతరం తథా । 19

క్షమాశీలుడు ఇతరులదోషములనుగూర్చి ఎంతగావిన్నను వాటిని ఏమాత్రము పట్టించుకొనడు. అట్టివానిని ఉత్తమ పురుషునిగా పెద్దలు పేర్కొనిరి. అట్టివాడే భగవంతుని అనుగ్రహమునకు పాత్రుడగును. (19)

సుజనో న యాతి వైరం పరహితనిరతో వినాశకాలేఽపి ।
ఛేదేఽపి చందనతరుః సురభయతి ముఖం కుఠారస్య । 20

ఎల్లప్పుడును ఇతరులకు హితమొనర్చుటయందే నిరతుడైయుండెడి సజ్జనుడు తనకు హానితలపెట్టుచున్న వారియందుగూడ కించిత్తైనను వైరభావమును కలిగియుండడు. గొడ్డలి చందనవృక్షమును నరికివేయుచున్నను ఆ తరువు ఆ గొడ్డలిముఖమున(అందున) సువాసనలనే నింపుచుండును. (20)

అహో విధిర్వై బలవాన్ బాధతే బహుధా జనాన్ ।
తత్రాఽపి సాధూన్ బాధంతే లోకే వై దుర్జనా జనాః । 21

విధి బలీయమైనది. అది జనులకు అనేకవిధములుగా కష్టములను తెచ్చిపెట్టుచుండును. ఎంత ఆశ్చర్యము! లోకమున నిస్సంగులైన సాధువులకుగూడ దుర్జనులవలన బాధలు వచ్చిపడుచుండుటయే ఇందులకు ప్రబలనిదర్శనము. (21)

మృగమీనసజ్జనానాం తృణజలసంతోషవిహితవృత్తీనామ్ ।
లుబ్ధక ధీవర పిశునా నిష్కారణవైరిణో జగతి । 22

గడ్డితిని హాయిగా జీవించుచుండెడి లేళ్లను కిరాతులు, నీటిలో ప్రశాంతముగా బ్రతుకుచుండెడి చేపలను జాలరులు, ఎల్లప్పుడును సంతృప్తితోనుండెడి సజ్జనులను దుష్టులు ఈలోకమున నిష్కారణముగా బాధించుచుందురు. (22)

అహో బలవతీ మాయా మోహయత్యఖిలం జగత్ ।
పుత్రమిత్రకళత్రాద్యైః సర్వదుఃఖేన యోజ్యతే । 23

మాయ ఎంతయో బలీయమైనది. ఈ సమస్తజగత్తును అది మోహములో ముంచివేయుచుండును. ఆలుబిడ్డల అనుబంధమును, బంధుమిత్రులసంబంధమును ఏర్పఱచి, వారిద్వారా ఈమాయ జనులకు పెక్కుకష్టములను తెచ్చి పెట్టుచుండును. (23)

పరద్రవ్యాపహారేణ కళత్రం పోషితం చ తత్ ।
అంతే తత్సర్వముత్సృజ్య ఏకఏవ ప్రయాతి వై । 24

మానవుడు భార్యాపుత్రాదులను పోషించుటకై పరుల సొమ్ములను అపహరించుటకైనను పాల్పడుచుండును. ఆ విధముగా సంపదలను ప్రోగుచేయుచుండును. కాని చివరకు ఆ భార్యాపుత్రాదులను, ఈ సంపదలను అన్నింటిని వదలి, తానొక్కడే పరలోకములకేగును. (24)

మమ మాతా మమ పితా మమ భార్యా మమాత్మజాః ।
మమేదమితి జంతూనాం మమతా బాధతే వృథా । 25

'ఈమె నాతల్లి, ఇతడు నాతండ్రి. ఈమె నాభార్య వీరందఱును నాపిల్లలు. ఈ సంపదయంతయు నాదే' - అనెడి మమకారమే జనులను పిచ్చిగా బాధించుచుండును. వాస్తవముగా ఈ మమకారమంతయును వృథా. (25)

యావదర్జయతి ద్రవ్యం తావదేవ హి బాంధవాః ।
ధర్మాధర్మౌ సహైవాస్తాం ఇహాముత్ర చ నాపరః । 26

ధనమును సంపాదించిపెట్టుచున్నంతవఱకే జనులచుట్టును బంధుమిత్రులు చేరుచుందురు. వారివలన తమకేమియు లాభము లేదనుకొన్నప్పుడు ఆ బంధుమిత్రులు అందఱును క్రమముగా వారికి దూరమగుదురు. ఈ లోకమునందును పరలోకమునందును వారిని వెంబడించియుండునవి ధర్మాధర్మములు మాత్రమే. (26)

అర్జితం తు ధనం సర్వే భుంజంతే బాంధవాస్సదా।
సర్వేష్వేకతమో మూఢః తత్పాపఫలమశ్నుతే। 27

ఇతి బ్రువాణం తమ్ ఋషిం విమృశ్య భయవిహ్వలః।
కలికః ప్రాంజలిః ప్రాహ క్షమస్వేతి పునఃపునః। 28

తత్సంగస్య ప్రభావేణ హరిసన్నిధిమాత్రతః।
గతపాపో లుబ్ధకశ్చ సానుతాపోఽభవద్ధ్రువమ్। 29

మయా కృతాని కర్మాణి మహాంతి సుబహూని చ।
తాని సర్వాణి నష్టాని విప్రేంద్ర తవ దర్శనాత్। 30

అహం వై పాపకృన్నిత్యం మహాపాపం సమాచరం।
కథం మే నిష్కృతిర్భూయాత్ కం యామి శరణం విభో!। 31

పూర్వజన్మార్జితైః పాపైః లుబ్ధకత్వమవాప్నువమ్।
అత్రాపి పాపజాలాని కృత్వా కాం గతిమాప్నుయామ్। 32

ఇతివాక్యం సమాకర్ణ్య కలికస్య మహాత్మనః।
ఉత్తంకోనామ విప్రర్షిః వాక్యం చేదమథాబ్రవీత్। 33

ఉత్తంక ఉవాచ

సాధు సాధు మహాప్రాజ్ఞ మతిస్తే విమలోజ్జ్వలా।
యస్మాత్ సంసారదుఃఖానాం నాశోపాయమభీప్ససి। 34

చైత్రే మాసే సితే పక్షే కథా రామాయణస్య చ।
నవాహ్నా కిల శ్రోతవ్యా భక్తిభావేన సాదరమ్।
యస్య శ్రవణమాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే। 35

తస్మిన్ క్షణేఽసౌ కలికో లుబ్ధకో వీతకల్మషః।
రామాయణకథాం శ్రుత్వా సద్యః పంచత్వమాగతః। 36

కూడబెట్టిన సంపదలనన్నింటిని బంధువులందఱును ఎల్లకాలము అనుభవించుచుందురు. తానుచేసిన పాపములయొక్క ఫలితములను మాత్రము ఆమూఢుడు ఒక్కడే అనుభవించును. వారెవ్వరును అందు పాలుపంచుకొనరు." (27)

ఇట్లు నుడువుచున్న ఆ ఋషియొక్క పలుకులను అవగాహన చేసికొని, కలికుడు యథార్థమును గ్రహించి, భయముతో వణకుచు ఆయనను వదలివేసెను. పిమ్మట అతడు చేతులు జోడించి, 'స్వామీ! నన్ను క్షమింపుము' అని - ఆయనను పదే పదే వేడుకొనెను. (28)

ఉత్తంకమహర్షియొక్క సాంగత్యప్రభావముచేతను, ఆ మందిరమున భగవత్సన్నిధిలో ఉండుటవలనను ఆలుబ్ధకునిపాపములు అన్నియును పటాపంచలైపోయెను. పిమ్మట అతడు మిగుల పశ్చాత్తప్తుడై ఆఋషితో ఇట్లు పలికెను. (29)

"ఓ విప్రోత్తమా! నేనొనర్చిన మహాపాపకార్యములకు అంతమే లేదు. నీదర్శనప్రభావముచే వాటినన్నింటినుండియు నేను విముక్తుడనైతిని. నేను అనుదినము పాపములనే ఆచరించుచు చెప్పనలవికాని మహాపరాధములకు ఒడిగట్టితిని. ఇక నాకు విముక్తి ఎట్లు లభించును? ఓ స్వామీ! నేను ఇప్పుడు ఎవరిని శరణుపొందదగును? (30-31)

పూర్వజన్మలో చేసికొనిన పాపములకారణముగా ఈ జన్మలో నేను లుబ్ధకుడనైతిని. ఈ జన్మలోగూడ నేనొనర్చిన పాపములకు నాకు ఇంక ఎట్టి గతి ప్రాప్తింపనున్నదోగదా!"(32)

మహాత్ముడైన కలికుడు పలికిన వచనములను వినిన పిమ్మట ఆ ఉత్తంకమహర్షి మిగుల కరుణతో ఇట్లనెను. (33)

ఉత్తంకుడు నుడివెను

"ఓ ప్రాజ్ఞుడా! నీవు ధన్యుడవు. నీబుద్ధి నిర్మలమైనది. పదునైనది. కనుక నీవు నీబుద్ధిబలముతో ఈ సంసారదుఃఖముల నుండి బయటపడు ఉపాయమును పొందగలవు. (34)

చైత్రమాసశుక్లపక్షమునందు పాడ్యమి మొదలుకొని తొమ్మిది దినములు భక్తిశ్రద్ధలతో రామాయణగాథను సాదరముగా వినవలెను. ఎవ్వరైనను ఈ కథను విన్నంతమాత్రముననే పాపములనుండి విముక్తులగుదురు." (35)

పాపరహితుడైన ఆ కలికుడు ఆ క్షణమునందే రామాయణవృత్తాంతమును వినెను. పిమ్మట అతడు తనువును చాలించెను. (36)

ఉత్తంకః పతితం వీక్ష్య లుబ్ధకం తం దయాపరః।
విస్మితః స్మృష్ట్వా విస్మితశ్చ అస్తౌషీత్ కమలాపతిమ్। 37

కథాం రామాయణస్యాపి శ్రుత్వా తాం వీతకల్మషః।
దివ్యం విమానమారుహ్య మునిమేతదథాబ్రవీత్। 38

కలిక ఉవాచ

ఉత్తంక మునిశార్దూల గురుస్త్వం మమ సువ్రత।
విముక్తః త్వత్ప్రసాదేన మహాపాతకసంకటాత్। 39

జ్ఞానం త్వదుపదేశాన్మే సంజాతం మునిసత్తమ।
తేన మే పాపజాలాని వినష్టాన్యతివేగతః। 40

రామాయణకథాం శ్రుత్వా మమత్వాన్ముక్తవాన్ మునే।
ప్రాపితోఽస్మి త్వయా యస్మాత్ తద్విష్ణోః పరమంపదమ్। 41

త్వయాఽహం కృతకృత్యోఽస్మి గురుణా కరుణాత్మనా।
తస్మాన్నతోఽస్మి తే విద్వన్ యత్కృతం తత్ క్షమస్వ మే। 42

సూత ఉవాచ

ఇత్యుక్త్వా దేవకుసుమైః మునిశ్రేష్ఠమవాకిరత్।
ప్రదక్షిణత్రయం కృత్వా నమస్కారం చకార సః। 43

తతో విమానమారుహ్య సర్వకామసమన్వితమ్।
అప్సరోగణసంకీర్ణం ప్రపేదే హరిమందిరమ్। 44

తస్మాత్ శృణుధ్వం విప్రేంద్రాః కథా రామాయణస్య చ।
చైత్రమాసే సితే పక్షే శ్రోతవ్యం చ ప్రయత్నతః। 45

నవాహ్నాకిల రామస్య రామాయణకథామృతమ్।
తస్మాత్ ఋతుషు సర్వేషు హితకృత్ హరిపూజకః। 46

జాలిగుండెగలవాడగు ఉత్తంకుడు నేలకొఱిగిన ఆ లుబ్ధకునిజూచి, మిగుల విస్మితుడయ్యెను. పిమ్మట అతడు శ్రీమహావిష్ణువును స్తుతించెను. (37)

రామాయణకథాశ్రవణములో పాపరహితుడైన లుబ్ధకుడు (విష్ణుదూతలు తీసికొనివచ్చిన) దివ్యవిమానమును అధిరోహించి, ఉత్తంకమహర్షితో ఇట్లు నుడివెను. (38)

కలికుడు పలికెను

దీక్షతో వ్రతములను ఆచరించిన ఓ ఉత్తంకమహాముని! నాపరమగురువువు నీవే. నీ అనుగ్రహమువలననే మహాపాతక ప్రమాదములనుండి నేను విముక్తుడనైతిని. (39)

ఓ మునీశ్వరా! నీ యుపదేశమువలననే నాలో కనువిప్పు కల్గినది. అందువలన నేనొనర్చిన మహాపాపములన్నియును అతి శీఘ్రముగా అంతరించిపోయినవి. (40)

ఓ మునీ! రామాయణవృత్తాంతమును విని, నావి మమతచే మమకారబంధములనుండి బయటపడితిని. నీ కృపచే ఆ కథాశ్రవణమువలననే విష్ణుధామమైన పరమ పదమునకుచేరితిని. (41)

ఓ గురుదేవా! నీవు దయాసముద్రుడవు. నీవలననే నేను కృతార్థుడనైతిని. ఓ తత్త్వజ్ఞానీ! అందువలన నేను నీకు పాదాభివందనమును ఒనర్చుచున్నాను. నాతప్పులను మన్నింపుము. (42)

సూతుడు నుడివెను

ఇట్లు పలికిన పిదప ఆ లుబ్ధకుడు దివ్యకుసుమములతో ఆ ఉత్తంకమునికి పుష్పాభిషేకమొనర్చెను. అనంతరము అతడు గురువునకు మూడుపర్యాయములు ప్రదక్షిణ పూర్వకముగా నమస్కరించెను. (43)

అనంతరము అతడు ఆ దివ్యవిమానమునెక్కి, సకల భోగానుభవములకు నెలవైనదియు, అప్సరసలతో విలసిల్లునదియు ఐన హరిధామమునకు చేరెను. (44)

ఓ విప్రులారా! వినుడు. అందువలన చైత్రమాసశుక్లపక్షము నందు దీక్షతో రామాయణకథాశ్రవణము చేయవలెను. హరిభక్తి గలవాడు సంపూర్ణముగా ఇహపరలాభములను గూర్చునట్టి రామాయణకథామృతమును నవాహ్నదీక్షతో అన్ని ఋతువుల యందును తనివిదీర గ్రోలవలెను. (45-46)

ఈప్సితం మనసా యద్యత్ తదాప్నోతి న సంశయః ।
సనత్కుమారైః యత్ పృష్టం తత్సర్వం గదితం మయా । 47

రామాయణస్య మాహాత్మ్యం కిమన్యత్ శ్రోతుమర్హసి । 48

ఈ కథామృతమునుగ్రోలిన వారియొక్క మనోరథములు అన్నియును తప్పక ఈడేరును. సనత్కుమారాదులు అడిగిన విషయములనన్నింటిని సమగ్రముగా వివరించితిని. మహిమాన్వితమైన ఈ రామాయణమును కాదని ఎవ్వరైనను మరియొక్క గాథను వినుటకు ఎట్లు యత్నింతురు? (47-48)

ఇతి శ్రీస్కందపురాణే ఉత్తరఖండే నారదసనత్కుమారసంవాదే రామాయణమాహాత్మ్యే
చైత్రమాసఫలానుకీర్తనం నామ చతుర్థోఽధ్యాయః

శ్రీ స్కందపురాణాంతర్గత – ఉత్తర ఖండమునందలి నారద సనత్కుమార సంవాదరూపమైన
రామాయణమాహాత్మ్యమునందు చైత్రమాసఫలానుకీర్తనమనెడి నాల్గవ అధ్యాయము సమాప్తము *(4)*

- ❋ ❋ ❋ -

5. పంచమోఽధ్యాయః

సూత ఉవాచ

రామాయణస్య మాహాత్మ్యం శ్రుత్వా ప్రీతో మునీశ్వరః ।
సనత్కుమారః పప్రచ్ఛ నారదం మునిసత్తమమ్ । 1

సూతుడు వచించెను

శ్రీమద్రామాయణమాహాత్మ్యమును విని, సనత్కుమార మహాముని ఎంతయు సంతృప్తుడాయెను. పిమ్మట అతడు నారదమహర్షిని ఇంకను ఇట్లు ప్రశ్నించెను. (1)

సనత్కుమార ఉవాచ

రామాయణస్య మాహాత్మ్యం కథితం వై మునీశ్వర ।
ఇదానీం శ్రోతుమిచ్ఛామి విధిం రామాయణస్య చ । 2

ఏతచ్చాపి మహాభాగ మునే తత్త్వార్థకోవిద ।
కృపయా పరయావిష్టో యథావత్ వక్తుమర్హసి । 3

సనత్కుమారుడు పలికెను

ఓ దేవర్షి! మీరు రామాయణమహాత్మ్యమును దయతో మాకు విశదీకరించియుంటిరి. ఇప్పుడు శ్రీరామాయణపారాయణ విధానమును వినగోరుచున్నాము. ఓ మహానుభావా! మీరు తత్త్వార్థములను వివరించుటలో సర్వసమర్థులు. కనుక మాయందు మిగుల అనుగ్రహముంచి, ఆ విశేషములను సమగ్రముగా వివరింప ప్రార్థన. (2-3)

నారద ఉవాచ

రామాయణవిధిం చైవ శృణుధ్వం సుసమాహితాః ।
సర్వలోకేషు విఖ్యాతం స్వర్గమోక్షవివర్ధనమ్ । 4

విధానం తస్య వక్ష్యామి శృణుధ్వం గదితం మయా ।
రామాయణకథాం కుర్వన్ భక్తిభావేన భావితః । 5

నారదుడు నుడివెను

ఓ మహర్షులారా! రామాయణపారాయణాది విధివిధానములను చక్కగా వివరింతును. సావధానముగా వినుడు. ఇది ముల్లోకములయందును ఖ్యాతికెక్కినది. ఇది స్వర్గసుఖ లాభములకును, మోక్షప్రాప్తికిని పరమసాధనము. రామాయణ కథాశ్రవణవిధానమును, పారాయణ (పఠన) పద్ధతిని తెలిపెదను. శ్రద్ధగా ఆలకింపుడు. దీనిని మిగులభక్తిశ్రద్ధలతో అనుష్ఠించుట ఎంతేని ముఖ్యము. (4-5)

యేన చీర్ణేన పాపానాం కోటికోటిః ప్రణశ్యతి।
చైత్రే మాఘే కార్తికే చ పంచమ్యామపి చారభేత్ । 6

సంకల్పంతు తతః కుర్యాత్ స్వస్తివాచనపూర్వకమ్।
నవస్వహస్సు శ్రోతవ్యం రామాయణ కథామృతమ్ । 7

అద్యప్రభృత్యహం రామ శృణోమి త్వత్కథామృతమ్ ।
ప్రత్యహం పూర్ణతామేతు తవ రామప్రసాదతః। 8

ప్రత్యహం దంతసంశుద్ధిం హ్యపామార్గస్య శాఖయా ।
కృత్వా స్నాయాత్తు విధివత్ రామభక్తిపరాయణః ।
స్వయం చ బంధుభిస్సార్ధం శృణుయాత్ ప్రయతేంద్రియః । 9

స్నానం కృత్వాయథాచారం దంతధావన పూర్వకమ్ ।
శుక్లాంబరధరః శుద్ధో గృహమాగత్య వాగ్యతః। 10

ప్రక్షాళ్య పాదావాచమ్య స్మరన్ నారాయణం ప్రభుమ్। 11

నిత్యదేవార్చనం కృత్వా పశ్చాత్ సంకల్పపూర్వకమ్ ।
రామాయణపుస్తకంచ అర్చయేత్ భక్తిభావతః। 12

ఆవాహనాసనాద్యైశ్చ గంధపుష్పాదిభిర్వ్రతీ।
ఓమ్ నమో నారాయణాయేతి పూజయేత్ భక్తితత్పరః। 13

ఏకవారం ద్వివారంచ త్రివారం వాఽపి శక్తితః ।
హోమం కుర్యాత్ ప్రయత్నేన సర్వపాపనివృత్తయే। 14

ఏవం యః ప్రయతః కుర్యాత్ రామాయణవిధిం తథా।
స యాతి విష్ణుభవనం పునరావృత్తివర్జితమ్। 15

రామాయణవ్రతధరో ధర్మకారీ చ సత్తమః ।
చాండాలాన్ పతితాంశ్చైవ వాఙ్మాత్రేణాపినాలపేత్ । 16

ఈ పారాయణాదివిధులను ఆచరించిన వారియొక్క వివిధములగు పాపములు అన్నియును పూర్తిగా నశించును. ఈ అనుష్ఠానమును చైత్రమాసమునగాని, కార్తికమాసమునందుగాని, మాఘమాసమునగాని శుక్లపక్షమునందలి పంచమి నుండియైనను ప్రారంభింపవచ్చును. స్వస్తివాచనపూర్వకముగా ఈ కార్యక్రమమును సంకల్పింపవలెను. పిమ్మట శ్రీరామాయణ కథాశ్రవణమును తొమ్మిదిదినములు దీక్షతో నడుపవలెను. (6-7)

"ఓ రామా! నేటినుండి ప్రతిదినము నీ కథామృతమును భక్తిశ్రద్ధలతో గ్రోలెదను. రామాయణపారాయణ, కథాశ్రవణ పూర్వకమైన ఈ నవరాత్రదీక్ష నిర్విఘ్నముగా నెఱవేఱునట్లు అనుగ్రహింపుము" – అని భగవంతుని ప్రార్థింపవలెను. (8)

ప్రతిదినము ఉషఃకాలముననే మేల్కొని, ఉత్తరేణుపుల్లలతో దంతశుద్ధిచేసికొని, స్నానాదికములను ముగించుకొనవలయును. పిమ్మట రామభక్తితత్పరులై అనుష్ఠానమునకు సిద్ధముకావలెను. అనంతరము సంయమనముతో ఏకాగ్రతవహించి, బంధుమిత్రులతోగూడి రామవృత్తాంతమును వినవలెను. (9)

ఇట్లే ప్రతిదినము సంప్రదాయానుసారము స్నానాదికృత్యములను ముగించుకొని, శుభ్రవస్త్రములను ధరించి, పవిత్రభావనతో మౌనముగా ఇంటికి చేరవలెను. పిదప పాదప్రక్షాళనమొనర్చుకొని, ఆచమించి, జగద్రక్షకుడైన శ్రీమన్నారాయణుని స్మరింపవలెను. (10-11)

తరువాత నిత్యదేవతార్చనను ముగించుకొని, సంకల్పపూర్వకముగా శ్రీమద్రామాయణగ్రంథమును భక్తిశ్రద్ధలతో పూజింపవలెను. (12)

వ్రతదీక్షను వహించి, ఆవాహన-ఆసన-అభిషేక-గంధపుష్పాదులతో 'ఓంనమో నారాయణాయ' అను మంత్రమును పఠించుచు స్వామికి భక్తితో షోడశోపచారములను నెఱపవలెను. (13)

భక్తిశ్రద్ధలుగలవారు ఈ పూజాదికములకు అనుబంధముగా ఒకపర్యాయముగాని, రెండుపర్యాయములుగాని, శక్తిని అనుసరించి మూడు పర్యాయములుగాని హోమకార్యములను నిర్వర్తింపవలెను. దీక్షతో అట్లు హోమములను ఒనరించినచో వారిపాపములన్నియును తొలగిపోవును. (14)

ఇట్లు రామాయణపారాయణాదివిధులను పావనాత్ములై ఆచరించినవారు దైవానుగ్రహమునకు పాత్రులై, వారు పరమపదమునకు చేరుదురు. వారికి పునర్జన్మయుండదు. (15)

చండాలురు, పతితులు, వైదికధర్మములను, మర్యాదలను నిందించునట్టి నాస్తికులు, దుర్భాషలాడువారు మొదలగు

నాస్తికాన్ భిన్నమర్యాదాన్ నిందకాన్ పిశునాంస్తథా।
రామాయణవ్రతధరో వాఙ్మాత్రేణాపి నాలపేత్। 17

కుండాశినం గాయకంచ తథాదేవలకాశినమ్।
భిషజం కావ్యకర్తారం దేవద్విజవిరోధినమ్। 18

పరాన్నలోలుపం చైవ పరస్త్రీనిరతం తథా।
రామాయణవ్రతధరో వాఙ్మాత్రేణాఽపి నార్చయేత్। 19

ఇత్యేవమాదిభిః శుద్ధో వసన్ సర్వహితేరతః।
రామాయణపరో భూత్వా పరాం సిద్ధిం గమిష్యతి। 20

నాస్తి గంగాసమం తీర్థం నాస్తి మాతృసమో గురుః।
నాస్తి విష్ణుసమో దేవో నాస్తి రామాయణాత్ పరమ్। 21

నాస్తి వేదసమం శాస్త్రం నాస్తి శాంతిసమం సుఖమ్।
నాస్తి సూర్యసమం జ్యోతిః నాస్తి రామాయణాత్ పరమ్। 22

నాస్తి క్షమాసమం సారం నాస్తి కీర్తిసమం ధనమ్।
నాస్తి జ్ఞానసమో లాభో నాస్తి రామాయణాత్ పరం। 23

తదంతే వేదవిదుషే గాం దద్యాచ్చ సదక్షిణామ్।
రామాయణపుస్తకం చ వస్త్రాణ్యాభరణాని చ। 24

రామాయణ పుస్తకం యో వాచకాయ ప్రదాపయేత్।
స యాతి విష్ణుభవనం యత్ర గత్వా నశోచతి। 25

నవాహ్నికఫలం కర్తుః శృణు ధర్మవిదాంవర।
పంచమ్యహాని చారభ్య రామాయణకథామృతమ్।
కథాశ్రవణమాత్రేణ సర్వపాపైః ప్రముచ్యతే। 26

వారినిగూర్చి రామాయణవ్రతదీక్షలోనున్న ధర్మనిరతులు మాటవరుసకైనను ఏమాత్రము ప్రస్తావింపరాదు. (16-17)

కుండునిచేతిభోజనముచేసినవాడు. (కుండుడు=భర్త జీవించియుండగా ఆ స్త్రీకి పరపురుషునివలన జన్మించినవాడు) దుష్టుడు, దేవలకునిచేతిభోజనమును చేసినవాడు (దేవలకుడు= దేవునిసొమ్మును అక్రమముగా తినువాడు) కపటవైద్యుడు, పొట్టకూటికై అనర్హులను పొగడుచు కవిత్వమువ్రాయువాడు, దేవతలను బ్రాహ్మణులను నిందించువాడు, ఎల్లప్పుడును పరులసొత్తుకై ఆశపడుచుండువాడు, పరస్త్రీలంపటుడు మొదలగువారిని రామాయణవ్రతదీక్షలోనున్నవాడు ఏవిధముగనూ ఆదరింపరాదు. (18-19)

ఇట్లు అన్నివిధములుగా పవిత్రుడైన పురుషుడు ఎల్లరకును హితమును గోరుచుండువాడై, శ్రీమద్రామాయణము నందు చక్కని శ్రద్ధాదరములను కలిగియున్నచో అట్టివానికి ఐహికసుఖలాభములేగాక పరకు మోక్షసిద్ధియు కలుగును. (20)

గంగాజలమువలె పవిత్రమైన తీర్థము, తల్లితో సమానమగు గురువు, విష్ణువుతో తుల్యుడగుదైవము, రామాయణముకంటె పవిత్రమైన గ్రంథము లేవు. (21)

వేదమువంటి శాస్త్రము, శాంతినిమించినసుఖము, సూర్య కిరణములతో సమానముగుకాంతిమండలము, రామాయణమునకు సాటిరాగల ఉదాత్తకావ్యము ఈ లోకమున లేనేలేవు. (22)

సహనమే అన్నింటిని మించినబలము, కీర్తియే సిరుసమానమైన సంపద. జ్ఞానమే అపూర్వమైన ఒకవిన్నది, శ్రీమద్రామాయణమే సర్వోత్కృష్టమైన మహాకావ్యము. (23)

రామాయణవ్రతదీక్ష ముగిసిన తదుపరి వేదశాస్త్రపండితులకు దక్షిణాపూర్వకముగా గోవులను, రామాయణగ్రంథములను, అమూల్యములైన వస్త్రములను, ఆభరణములను, దానము చేయవలెను. (24)

రామాయణప్రవచనముచేసినవారికి ఆ మహాకావ్యములను కానుకలుగా సమర్పింపవలెను, అట్లొనర్చిన వారి క్లేశములన్నియును తొలగిపోవుటయేగాక వారికి ఆనందధామమైన విష్ణుసాన్నిధ్యము గూడ ప్రాప్తించును. (25)

ధర్మవేత్తలలో శ్రేష్ఠుడవైన ఓ సనత్కుమారా! నవాహ్నికదీక్షతో కథాశ్రవణముచేసినవారికి లభించు మహా ఫలమునుగూర్చి వినుము. పంచమినాటినుండి ప్రారంభించి ఈ రామాయణకథామృతమును గ్రోలినవారిపాపములు అన్నియును పటాపంచలగును. (26)

యది ద్వయం కృతం తస్య పుండరీకఫలం లభేత్।
వ్రతధారీ తు శ్రవణం యః కుర్యాత్ స జితేంద్రియః। 27

జితేంద్రియుడై, వ్రతదీక్షతో రెండుమాఋులు కథాశ్రవణము చేసినవానికి పుండరీకయాగముచేసిన ఫలము చేకూరును. (27)

అశ్వమేధస్య యజ్ఞస్య ద్విగుణం ఫలమశ్నుతే।
చతుఃకృత్వః శ్రుతం యేన కథితం మునిసత్తమాః। 28

ఓ మునీశ్వరులారా! ఈ కథాశ్రవణమును నాలుగు పర్యాయములుచేసినవారికి రెండువార్లు అశ్వమేధయజ్ఞముచేసిన ఫలము లభించును. (28)

స లభేత్ పరమం పుణ్యమ్ అగ్నిష్టోమాష్టసంభవమ్।
పంచకృత్వో వ్రతమిదం కృతం యేన మహాత్మనా। 29

శ్రీరామవృత్తాంతమును విధివిధానముగా ఐదు పర్యాయములు విన్నమహాత్మునకు అగ్నిష్టోమయాగఫలమునకు ఎనిమిదిరెట్లు పుణ్యాలాభములు కల్గును. (29)

అత్యగ్నిష్టోమజం పుణ్యం ద్విగుణం ప్రాప్నుయాన్నరః।
ఏవం వ్రతం చ షట్కృత్వః కుర్యాద్యస్తు సమాహితః। 30

ఏకాగ్రచిత్తముతో వ్రతనియమములను పాటించుచు ఆఋపార్లు ఈ కథాశ్రవణముచేసినవారికి రెండు తడవలు 'అత్యగ్నిష్టోమము' ఆచరించినఫలము దక్కును. (30)

అగ్నిష్టోమస్య యజ్ఞస్య ఫలమష్టగుణం భవేత్।
వ్రతధారీతు ధర్మాత్మా సప్తకృత్వః తథా లభేత్। 31

ధర్మాత్ముడై, వ్రతదీక్షవహించి ఏడుమాఋులు కథాశ్రవణము చేసిన పురుషునకు 'అగ్నిష్టోమము' ఎనిమిదిసార్లుచేసినఫలము ప్రాప్తించును. (31)

అశ్వమేధస్య యజ్ఞస్య ఫలమష్టగుణం లభేత్।
నారీ వా పురుషః కుర్యాత్ అష్టకృత్వో మునీశ్వరాః। 32

ఓ మునిప్రవరులారా! స్త్రీపురుషులలో ఎవరైనను ఎనిమిది పర్యాయములు ఈ రామగాథను శ్రద్ధగా విన్నచో వారికి అశ్వమేధఫలమునకు ఎనిమిదిరెట్లు ఫలము లభించును. (32)

అశ్వమేధస్య యజ్ఞస్య ఫలం పంచగుణం లభేత్।
నరో రామపరో వాఽపి నవరాత్రం సమాచరేత్। 33

మానవుడు రామభక్తితత్పరుడై నవరాత్రదీక్షలో ఈ వ్రతమును ఆచరించినచో వానికి అశ్వమేధయజ్ఞఫలమునకు ఐదురెట్లు ఫలము ప్రాప్తించును. (33)

గోమేధయజ్ఞజం పుణ్యం స లభేత్ త్రిగుణం నరః।
రామాయణం తు యః కుర్యాత్ శాంతాత్మా నియతేంద్రియః। 34

ఇంద్రియనిగ్రహముతో ప్రశాంతచిత్తుడై ఈ రామాయణ వ్రతమును ఆచరించిన పురుషునకు 'గోమేధయజ్ఞ'[1] పుణ్యఫలమునకు మూడురెట్లు ఫలము కలుగును. (34)

స యాతి పరమానందం యత్ర గత్వా న శోచతి।
రామాయణపరో నిత్యం గంగాస్నానపరాయణః। 35

ప్రతిదినము పవిత్రగంగాజలములలో స్నానములను ఆచరించుచు రామాయణవ్రతమును పాటించునరుడు శోకరహితుడై, పరమానందధామమును చేరును. (35)

ధర్మమార్గప్రవక్తారో ముక్తా ఏవ న సంశయః।
యతీనాం బ్రహ్మచారిణాం అచారిణాం చ సత్తమాః। 36

ధర్మమార్గములయందు నడచుచు, వాటినిగూర్చి ప్రవచించువారు యతీశ్వరులకంటెను, బ్రహ్మచారులకంటెను, జితేంద్రియులకంటెను శ్రేష్ఠులు. వారును తప్పక ముక్తిని పొందుదురు. ఇందు సందేహములేదు. (36)

1) గోమాతను ప్రత్యక్షదేవతగాని. విధివిధానముగా హోమకార్యములను నిర్వర్తింపవలెను. పిమ్మట ఆ గోవును పూజించి, యోగ్యుడైన (గోసేవచేయునట్టి) బ్రాహ్మణునకు దానము చేయవలెను. జీవితాంతము ఆ గోమాతను పోషించుటకై ఏర్పాటుచేయవలెను. కనీసము ఒక సంవత్సరపోషణమునకైనను తగు వ్యవస్థను ఏర్పరచవలెను. ఇట్లు చేయుటను 'గోమేధము' అని యందురు. కృష్ణావతారమున భగవంతుడే స్వయముగా గోసేవ చేసెను. గోసేవ చేసినచో భగవంతుడు ఎంతయు ప్రసన్నుడగును.

वाल्मीकिका शोक

Vālmīki aggrieved

माता कौसल्याकी गोदमें परब्रह्म श्रीराम

Supreme Brahma Śrī Rāma in the lap of Kausalyā



जनकद्वारा विश्वामित्रका स्वागत

Janaka hails Viśvāmitra



श्रीरामद्वारा धनुष उठाना

Śrī Rāma lifts the bow

चारों भाई वर वेशमें

Four brothers in bridal apparel

गङ्गा-संतरण

Crossing Gaṅgā

चित्रकूटमें भरतका प्रणिपात

Bharata prostrating at Citrakūṭa

शबरीके अतिथि

Guests to Śabarī

నవాహ్నైః కిల శ్రోతవ్యా కథా రామాయణస్య చ ।
శ్రుత్వా నరో రామకథామ్ అతిదీప్తోఽతిభక్తితః ।
బ్రహ్మణః పదమాసాద్య తత్రైవ పరిముచ్యతే। 37

మానవుడు భక్తితత్పరుడై రామాయణగాథను తొమ్మిది దినములు దీక్షతో విన్నచో అతడు మిగుల తేజస్వియై, శాశ్వతముగా బ్రహ్మపదమును పొందును. (37)

శ్రావ్యాణాం పరమం శ్రావ్యం పవిత్రాణామ్ అనుత్తమమ్।
దుఃస్వప్ననాశనం ధన్యం శ్రోతవ్యం యత్నతస్తతః। 38

వినదగిన గాథలలో రామాయణము మిగుల శ్రేష్ఠమైనది. పవిత్రమైన వృత్తాంతములలో అత్యుత్తమమైనది. దీనిని వినుట వలన దుస్స్వప్నములు నశించును. శ్రోతలు ధన్యులగుదురు. కనుక ఎల్లరును దీనిని ప్రయత్నపూర్వకముగా వినవలెను. (38)

నరోఽత్ర శ్రద్ధయా యుక్తః శ్లోకం శ్లోకార్ధమేవ వా ।
పఠతే ముచ్యతే సద్యో హ్యుపపాతకకోటిభిః। 39

మానవుడు ఈ రామాయణమునందలి ఒక్కశ్లోకమును గాని శ్లోకములోని సగభాగమునుగాని భక్తిశ్రద్ధలతో పఠించినచో అతడు తన సర్వపాపములనుండియు వెంటనే విముక్తుడగును. (39)

సతామేవ ప్రయోక్తవ్యం గుహ్యాత్ గుహ్యతమం యతః।
వాచయేత్ రామభావేన పుణ్యక్షేత్రే చ సంసది। 40

అత్యంతరహస్యమైన ఈ వృత్తాంతమును, తద్విశేషములను పుణ్యక్షేత్రమునగాని, సత్పురుషులసదస్సునగాని రామభక్తి తత్పరులై పూనికతో ప్రవచింపవలెను. (40)

బ్రహ్మద్వేషరతానాంచ దంభాచారరతాత్మనామ్।
లోకానాం బకవృత్తీనాం న బ్రూయాదిదముత్తమమ్। 41

అతి పవిత్రమైన ఈ రామాయణమును బ్రాహ్మణులను ద్వేషించువారికిని, దంభాచారులకును (కపటప్రవర్తనగలవారికిని) దొంగజపముచేయువారికిని ఉపదేశింపరాదు. (41)

త్యక్తకామాదిదోషాణాం రామభక్తిరతాత్మనామ్।
గురుభక్తిరతానాంచ వక్తవ్యం మోక్షసాధనమ్। 42

ఈ రామచరితము మోక్షప్రాప్తికి ప్రముఖసాధనము. కావున దీనిని పొందుటకు కామక్రోధాది-అరిషడ్వర్గములను జయించినవారును, దైవభక్తితత్పరులును, గురుభక్తి పరాయణులును అర్హులు. (42)

సర్వదేవమయో రామః స్మృతశ్చార్తిప్రణాశనః।
సద్భక్తవత్సలో దేవో భక్త్యా తుష్యతి నాన్యథా। 43

శ్రీరాముడు సకలదేవతలకును అధినాథుడు. ఆ దయామయుని స్మరించినంతమాత్రముననే ఆర్తులదుఃఖములు దూరమగును. అతడు పతితపావనుడు. పరమభక్తులకు దయానిధి. అనన్యభక్తితోమాత్రమే ఆయనఅనుగ్రహము ప్రాప్తించును. (43)

అవశేనాఽపి యన్నామ్ని కీర్తితోవా స్మృతోఽపి వా।
విముక్తపాతకస్సోఽపి పరమం పదమశ్నుతే। 44

భగవన్నామమును అప్రయత్నముగానైనను కీర్తించినచో, స్మరించినచో ఆ వ్యక్తియొక్క పాపములన్నియును అంతరించి పోవుటయేగాక అతనికి పరమపదముగూడ లభించును. (44)

సంసారఘోరకాంతారదావాగ్నిర్మధుసూదనః ।
స్మర్తౄణాం సర్వపాపాని నాశయత్యాశు సత్తమాః। 45

ఓ మహాత్ములారా! శ్రీరాముడు సంసారమనెడి భయంకరవనమును కాల్చివేయుటలో దావాగ్నివంటివాడు. ఆ ప్రభువు తనను స్మరించినవారిపాపములనన్నింటిని వెంటనే రూపుమాపును. (45)

తదర్థకమిదం పుణ్యం కావ్యం సుశ్రావ్యముత్తమమ్।
శ్రవణాత్ పఠనాద్వాపి సర్వపాపవినాశకృత్। 46

శ్రీరామునిమహాత్మ్యమును ప్రతిపాదించు ఈ రామాయణము మిగుల పవిత్రమైనది. వీనులకు విందుగూర్చునది, సర్వశ్రేష్ఠమైనది. ఈ వృత్తాంతమును శ్రద్ధగా పఠించినను, విన్నను వారి సమస్తపాపములను అది నిర్మూలించును. (46)

యస్య రామకథే ప్రీతిః వర్తతే భక్తిసంయుతా।
స ఏవ కృతకృత్యశ్చ సర్వశాస్త్రార్థకోవిదః। 47

తదర్జితం తపః పుణ్యం తత్సత్యం సఫలం ద్విజాః।
యదర్థే శ్రవణే ప్రీతిః అన్యథా నహి వర్తతే। 48

రామాయణపరా యే తు రామనామపరాయణాః।
త ఏవ కృతకృత్యాశ్చ ఘోరే కలియుగే ద్విజాః। 49

నవమ్యహని శృణ్వంతి రామాయణకథామృతమ్।
తే కృతార్థా మహాత్మానః తేభ్యో నిత్యం నమోనమః। 50

రామనామైవ నామైవ నామైవ మమ జీవనమ్। 51

సంసార విషయాంధానాం నరాణాం పాపకర్మణామ్।
కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా। 52

సూత ఉవాచ

ఏవం సనత్కుమారస్తు నారదేన మహాత్మనా।
సమ్యక్ ప్రబోధితః సద్యః పరాం నిర్వృతిమాప హ। 53

తస్మాత్ శ్రుత్వాతు విప్రేంద్రా రామాయణకథామృతమ్।
ప్రయాతి పరమం స్థానమ్ పునరావృత్తివర్జితమ్। 54

ఘోరే కలియుగే ప్రాప్తే రామాయణపరాయణాః।
సమస్తపాపనిర్ముక్తా యాస్యంతి పరమం పదమ్। 55

తస్మాత్ శృణుధ్వం విప్రేంద్రా రామాయణకథామృతమ్।
నవమ్యహని శ్రోతవ్యం సర్వపాపప్రమోచకమ్। 56

శ్రుత్వా చైతన్మహాకావ్యం వాచకం యస్తుపూజయేత్।
తస్య విష్ణుః ప్రసన్నస్స్యాత్ శ్రియాసహ ద్విజోత్తమాః। 57

శ్రీరామునియందును, రామాయణకావ్యమునందును భక్తి విశ్వాసములతోగూడిన ప్రీతిగలవాడు నిజముగా చరితార్థుడే. వాస్తవముగా అతడు సర్వశాస్త్రార్థములయందును ఆరితేరిన వాడు. (47)

ఓ బ్రాహ్మణోత్తములారా! రామాయణశ్రవణమునందు చక్కని కుతూహలముగలవాడు చేసినతపస్సు పవిత్రమగును, అప్పుడే అది సఫలమగును. ఇది సత్యము. లేనిచో వానికి తపఃఫలాదులు అసంభవములు. (48)

ఓ ద్విజులారా! ఈ ఘోరమైన కలియుగమున రామాయణకథాశ్రవణమునందు ఆదరాభిమానములుగలవారు, రామనామమును జపించుటయందు నిరతులైనవారు మాత్రమే కృతకృత్యులగుదురు. వారిజన్మమే సఫలము. (49)

వరుసగా తొమ్మిదిదినములు రామాయణకథామృతమును గ్రోలినవారు యథార్థముగా ధన్యులు. అట్టి మహాత్ములకు నేను నిత్యము ప్రణమిల్లుదును. (50)

రామనామజపమే నాజీవితపరమార్థము. ఇది ముమ్మాటికిని సత్యము. సంసారవిషయలంపటులై, పాపాత్ములైన నరులకు రామనామజపమే తరణోపాయము. కనుక ఈ సంసారమనెడి ఊబినుండి బయటపడుటకు మఱియొక మార్గమేలేదు. ఇది ముమ్మాటికిని నిజము. (51-52)

సూతుడు పలికెను

మహాత్ముడైన నారదునినుండి చక్కని ఈ ప్రబోధమును పొందినవెంటనే సనత్కుమారుడు పరమానందభరితుడయ్యెను. (53)

కనుక ఓ విప్రోత్తములారా! రామాయణకథామృతమును గ్రోలినచో ప్రతివ్యక్తియు పునరావృత్తిరహితమైన పరమపదమును పొందును. (54)

ఘోరమైన కలియుగమున జన్మించినవారు రామాయణమునందు నిరతులైనచో వారు సమస్తపాపములనుండి విముక్తులగుటయే గాక కడకు కైవల్యమునుగూడ పొందుదురు. (55)

కావున ఓ ద్విజోత్తములారా! పాపములను రూపుమాపునట్టి రామాయణకథామృతమును వరుసగా తొమ్మిదిదినములు గ్రోలుట ఎంతేని యుక్తము. (56)

ఓ బ్రాహ్మణోత్తములారా! మహిమాన్వితమైన ఈ రామాయణమహాకావ్యమును వినినపిదప, ప్రవచనముచేసిన సజ్జనుని భక్తిశ్రద్ధలతో పూజింపవలెను. అట్టివారికి శ్రీమహావిష్ణువు ప్రసన్నుడై, సకలైశ్వర్యములను అనుగ్రహించును. ఈ విధముగ

వాచకే ప్రీతిమాపన్నే బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।
ప్రీతా భవంతి విప్రేంద్రా నాత్రకార్యా విచారణా । 58

రామాయణవాచకాయ గావో వాసాంసి కాంచనమ్ ।
రామాయణపుస్తకం చ దద్యాత్ విత్తానుసారతః । 59

తస్య పుణ్యఫలం వక్ష్యే శృణుధ్వం సుసమాహితాః ।
న బాధంతే గ్రహాస్తస్య భూతభేతాళకాదయః । 60

తస్యైవ సర్వశ్రేయాంసి వర్ధంతే చరితే శ్రుతే ।
న చాగ్నిర్బాధతే తస్య చౌరాదేర్నభయం తథా । 61

కోటిజన్మార్జితైః పాపైః సద్య ఏవ విముచ్యతే ।
సప్తవంశసమేతస్తు దేహాంతే మోక్షమాప్నుయాత్ । 62

ఇత్యేతద్వః సమాఖ్యాతం నారదేన ప్రభాషితమ్ ।
సనత్కుమారమునయే పృచ్ఛతే భక్తితః పురా । 63

రామాయణమ్ ఆదికావ్యమ్ సర్వవేదార్థసమ్మతమ్ ।
సర్వపాపహరం పుణ్యం సర్వదుఃఖనిబర్హణమ్ । 64

సమస్తపుణ్యఫలదం సర్వయజ్ఞఫలప్రదమ్ ।
యే పఠంత్యత్ర విబుధాః శ్లోకం శ్లోకార్ధమేవవా । 65

న తేషాం పాపబంధస్తు కదాచిదపిజాయతే ।
రామార్పితమిదం పుణ్యం కావ్యం తు సర్వకామదమ్ । 66

భక్త్యా శృణ్వంతి గాయంతి తేషాం పుణ్యఫలం శృణు ।
శతజన్మార్జితైః పాపైః సద్య ఏవ విమోచితాః । 67

రామాయణప్రవచనముచేసిన సత్పురుషుని సంతోషపెట్టినచో బ్రహ్మవిష్ణుమహేశ్వరులు (త్రిమూర్తులు)సైతము ప్రసన్నులగుదురు (సంతుష్టులగుదురు). ఇందు సందేహమునకు తావులేదు.(57-58)

రామాయణప్రవచనముచేసినవారికి గోవులను, వస్త్రములను, సువర్ణాభరణములను, రామాయణకావ్యమును యథాశక్తి సమర్పింపవలెను. అట్లొనర్చినవారికి ప్రాప్తించెడి ఫలమునుగూర్చి వివరించెదను. సావధానులై వినుడు. ఆ సత్పురుషుని పూజించిన వారిని భూతభేతాళాదిదుష్టశక్తులుగాని, అరిష్టస్థానముల యందున్నగ్రహములుగాని బాధింపజాలవు. (59-60)

శ్రీరామచరితమును విన్నవారికి సకలశ్రేయస్సులును చేకూరును. అట్టిసత్పురుషులకు అగ్నిబాధలుగాని, చోరాది భయములుగాని ఉండవు. పూర్వజన్మలలో చేసికొనిన సమస్త పాపములనుండియు వారికి వెంటనే విముక్తి లభించును. మఱియు మరణానంతరము వారికి మోక్షముగూడ ప్రాప్తించును. అంతేగాక వారివంశములకు చెందిన ఏడుతరములవారును తరింతురు. (61-62)

లోగడ సనత్కుమారమహర్షి అడుగగా నారదమహాముని చెప్పిన విశేషములను అన్నింటిని ఈవిధముగా నేను మీకు వివరించితిని. (63)

శ్రీమద్రామాయణము సంస్కృతవాఙ్మయమునకే శ్రీకారము చుట్టిన ఆదికావ్యము. ఇందు సర్వవేదార్థములును ప్రతిపాదింప బడినవి. ఇది నానావిధములైన పాపములను అంతరింపజేయగల పవిత్రగ్రంథము. దీనిని పఠించినను, శ్రవణముచేసినను వారిదుఃఖములన్నియును తొలగిపోవును. (64)

ఈ రామాయణమునందలి ఒక్క శ్లోకమునుగాని, ఆ శ్లోకములోని సగభాగమునుగాని పఠించిన పండితులకు సమస్త పుణ్యఫలములును, సకలయజ్ఞఫలములును ప్రాప్తించును. అట్టివారికి ఎట్టి పరిస్థితులలోను పాపబంధములస్పర్శయే యుండదు. ఈ రామాయణము శ్రీరామమహాత్మ్యమును ప్రకటించునదియగుటచే పరమపునీతమైనది. ఇది సమస్తమైన మనోరథములను ఈడేర్చునది. (65-66)

రామాయణపుణ్యచరితమును భక్తితో కీర్తించినవారును, వినినవారును అమోఘఫలములను పొందుదురు. వందల కొలదిజన్మలలో చేసికొనిన మహాపాపములనుండియు వెంటనే వారు విముక్తులగుదురు. వారికి సంబంధించిన వేయి

సహస్రకులసంయుక్తాః ప్రయాంతి పరమం పదమ్ ।
కిం తీర్థైః గోప్రదానైర్వా కిం తపోభిః కిమధ్వరైః । 68

వంశములవారును పరమపదమును పొందుదురు. ఒకే ఒక్క ఈ రామాయణమును శ్రద్ధాభక్తులతో సేవించినవారికి తీర్థయాత్రలతోగాని, గోదానములతోగాని, తపశ్చర్యలతోగాని, యజ్ఞాచరణములతోగాని పనియేలేదు. ఆ తీర్థసేవాదులవలన కలుగు ఫలములన్నియును ఈ పవిత్రగ్రంథసేవవలననే లభించును. (67-68)

అహన్యహని రామస్య కీర్తనం పరిశృణ్వతామ్ ।
చైత్రే మాఘే కార్తికే చ రామాయణకథామృతమ్ । 69

నవమ్యహని శ్రోతవ్యమ్ సర్వపాపైః ప్రముచ్యతే ।
రామప్రసాదజనకమ్ రామభక్తివివర్ధనమ్ ।
సర్వపాపక్షయకరం సర్వసంపద్వివర్ధనమ్ । 70

ప్రతిదినము రామనామమును కీర్తించినచో లభించెడి ఫలమును వినుడు. చైత్ర, కార్తిక, మాఘమాసములలో, నవరాత్రదీక్షతో ఈ రామాయణ కథామృతమును గ్రోలుట ఎంతేని ఫలప్రదము. అట్లొనర్చినవారిపాపములన్నియు నశించును. ఇది రామానుగ్రహమును ప్రసాదించును, రామభక్తిని పెంపొందించును. సకలపాపములను నిర్మూలించును. సమస్త సంపదలను పుష్కలముగా అనుగ్రహించును. (69-70)

యస్త్వేతత్ శృణుయాద్వాపి పఠేద్వా సుసమాహితః ।
సర్వపాపవినిర్ముక్తో విష్ణులోకం స గచ్ఛతి । 71

శ్రీమద్రామాయణమును భక్తిశ్రద్ధలతో ఏకాగ్రచిత్తులై, పఠించినవారును (పారాయణమొనర్చినవారును) శ్రవణము చేసినవారును సమస్తపాపములనుండి విముక్తులగుదురు. కడకు వారు విష్ణులోకమునుగూడ పొందుదురు. (71)

ఇతి శ్రీస్కందపురాణే ఉత్తరఖండే శ్రీమద్రామాయణమాహాత్మ్యే నారదసనత్కుమారసంవాదే
ఫలానుకీర్తనం నామ పంచమోఽధ్యాయః

శ్రీ స్కందపురాణాంతర్గత - ఉత్తర ఖండమునందలి నారద సనత్కుమార సంవాదరూపమున రామాయణమాహాత్మ్యమునందు 'ఫలానుకీర్తనము' అను ఐదవ అధ్యాయము సమాప్తము (5)

ఇతి శ్రీవాల్మీకిరామాయణమాహాత్మ్యం సంపూర్ణమ్
శ్రీవాల్మీకిరామాయణ మాహాత్మ్యము సంపూర్ణము

- ❊ ❊ ❊ -

శ్రీసీతారామాభ్యాం నమః

శ్రీమద్వాల్మీకి రామాయణము

బాలకాండము

1. మొదటి సర్గము - సంక్షిప్తరామాయణము

నారదుడు వాల్మీకిమహర్షికి రామాయణమును సంక్షిప్తముగా తెలుపుట.

ఓమ్ తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్।
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్। 1

తపశ్శీలుడును, వేదాధ్యయననిరతుడును, వాక్చతురులలో అగ్రేసరుడును, మునిశేఖరుడును, ఐన నారదుని గొప్ప తపస్వియైన వాల్మీకిమహర్షి జిజ్ఞాసతో ఇట్లు ప్రశ్నించెను. (1)

కో న్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్।
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః। 2

"ఓ మహర్షీ! సకలసద్గుణసంపన్నుడును, ఎట్టి విపత్కర పరిస్థితులలోను తొణకనివాడును, సామాన్య విశేష (లౌకికాలౌకిక) ధర్మములను ఎఱిగినవాడును, శరణాగతవత్సలుడును, ఎట్టి క్లిష్టపరిస్థితులయందును ఆడితప్పనివాడును, నిశ్చలమైన సంకల్పము గలవాడును అగు పురుషుడు ఇప్పుడు ఈ భూమండలమున ఎవడు? (2)

చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః।
విద్వాన్ కః కస్సమర్థశ్చ కశ్చైకప్రియదర్శనః। 3

సదాచారసంపన్నుడును, సకలప్రాణులకును (తనయెడ విముఖులైన వారికిని) హితమును గూర్చువాడును సకలశాస్త్ర కుశలుడును, సర్వకార్య ధురంధరుడును, తనదర్శనముచే ఎల్లరకును సంతోషమును గూర్చువాడును ఐన మహాపురుషుడెవడు? (3)

ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః।
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే। 4

ధైర్యశాలియు, క్రోధమును (అరిషడ్వర్గమును) జయించినవాడును, శోభలతో వెలసిల్లువాడును, ఎవ్వరిపైనను అసూయ లేనివాడును, రణరంగమున కుపితుడైనచో, దేవాసురులను సైతము భయకంపితులను జేయువాడును అగు మహాపురుషుడు ఎవడు ? (4)

ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే।
మహర్షే త్వం సమర్థోఽసి జ్ఞాతుమేవంవిధం నరమ్। 5

ఈ విషయములనుగూర్చి తెలిసికొనుటకు నేను మిక్కిలి కుతూహలపడుచున్నాను. ఓ మహర్షీ! మీరు సర్వజ్ఞులు, ఇట్టి మహాపురుషునిగుఱించి తెలుపగల సమర్థులు మీరే." (5)

శ్రుత్వా చైతత్ త్రిలోకజ్ఞో వాల్మీకేర్నారదో వచః।
శ్రూయతామితి చామంత్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్। 6

త్రిలోకజ్ఞుడైన నారదుడు వాల్మీకిపలుకులను ఆలకించి, ఎంతయు సంతోషించెను. పిమ్మట అతడు "ఓ మహర్షీ! సరే! వినుము" అని వాల్మీకితో ఇట్లనెను. (6)

బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీర్తితా గుణాః।
మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాం నరః। 7

"ఓ మునీ ! నీవు ప్రస్తుతించిన బహువిధములైన ఆ ఉదాత్త గుణములు ఒక్కరియందే కుదురుకొనియుండుట సాధారణముగ దుర్లభము. ఐనను స్మృతికి దెచ్చుకొని, అట్టి గుణములు గల ఉత్తమపురుషునిగూర్చి తెలిపెదను వినుము. (7)

ఇక్ష్వాకువంశప్రభవో రామో నామ జనైః శ్రుతః।
నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ వశీ। 8

బుద్ధిమాన్ నీతిమాన్ వాగ్మీ శ్రీమాన్ శత్రునిబర్హణః।
విపులాంసో మహాబాహుః కంబుగ్రీవో మహాహనుః। 9

మహోరస్కో మహేష్వాసో గూఢజత్రుః అరిందమః।
ఆజానుబాహుః సుశిరాః సులలాటః సువిక్రమః। 10

సమః సమవిభక్తాంగః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్।
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః। 11

ధర్మజ్ఞః సత్యసంధశ్చ ప్రజానాం చ హితే రతః।
యశస్వీ జ్ఞానసంపన్నః శుచి ర్వశ్యః సమాధిమాన్। 12

ప్రజాపతిసమః శ్రీమాన్ ధాతా రిపునిషూదనః।
రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా। 13

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా।
వేదవేదాంగతత్త్వజ్ఞో ధనుర్వేదే చ నిష్ఠితః। 14

సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్।
సర్వలోకప్రియః సాధుః అదీనాత్మా విచక్షణః। 15

ఇక్ష్వాకువంశము మిక్కిలి వాసిగాంచినది. లోకోత్తరపురుషుడైన శ్రీరాముడు అందవతరించి, ఎంతయు జగత్ప్రసిద్ధుడాయెను. అతడు మనోనిగ్రహము గలవాడు, గొప్ప పరాక్రమవంతుడు, మహాతేజస్వి, ధైర్యశాలి, జితేంద్రియుడు, ప్రతిభామూర్తి, నీతిశాస్త్ర కుశలుడు, విజ్ఞులతో మితముగా మాటాడుటలో నేర్పరి, షడ్గుణైశ్వర్యసంపన్నుడు, శత్రువులను సంహరించువాడు, ఎత్తైన భుజములు గలవాడు, బలిష్ఠమైన బాహువులు గలవాడు, శంఖమువలె నునుపైన కంఠముగలవాడు, ఉన్నతమైన హనువులు (చెక్కిలి పైభాగములు) గలవాడు, విశాలమైన వక్షఃస్థలము గలవాడు, బలమైన ధనుస్సుగలవాడు, పుష్టిగా గూఢముగానున్న సంధియెముకలుగలవాడు, అంతశ్శత్రువులను అదుపుచేయగలవాడు, ఆజానుబాహువు, అందమైన గుండ్రని శిరస్సు గలవాడు, అర్ధచంద్రాకారములో ఎత్తైన నొసలు గలవాడు, గజాదులకు వలె గంభీరమైన నడక గలవాడు, (8-10)

శ్రీరాముడు అంతగా పొడవుగాని, పొట్టిగాని గాక ప్రమాణమైన దేహము గలవాడు, సమానమైన కరచరణాది- అవయవ సౌష్ఠవము గలవాడు, కనువిందుగావించు దేహకాంతి గలవాడు, పరాక్రమశాలి, పరిపుష్టమైన వక్షఃస్థలము గలవాడు, విశాలమైన కన్నులుగలవాడు, పొంకమైన అవయవములపొందిక గలవాడు, సాటిలేని శుభ లక్షణములు గలవాడు, ఆశ్రయించిన వారిని ఆదుకొనుటయే పరమధర్మముగా గలవాడు, ఆడిన మాటను తప్పనివాడు, ప్రజలకు హితమొనర్చు స్వభావము గలవాడు, ఆ విధముగా ఖ్యాతికెక్కిన వాడు, సకలశాస్త్ర పారంగతుడు, స్వయముగా పవిత్రుడు, ప్రాణికోటిని పవిత్ర మొనర్చువాడు, భక్త (ఆశ్రిత) పరాధీనుడు, ఏకాగ్రచిత్తుడు, త్రిమూర్తి స్వరూపుడై, ప్రజాపతి బ్రహ్మవలె జనులను సృష్టించువాడు, విష్ణువువలె అఖండైశ్వర్య సంపన్నుడై పోషించువాడు, సాధుపురుషులను బాధించువారిని పరిమార్చుటలో హరునివంటివాడు, స్వ-పర భేదములులేక అందరిని రక్షించువాడు, ధర్మమును స్వయముగా ఆచరించుచు, లోకులచే ఆచరింప జేయుచు దానిని కాపాడు వాడు, స్వధర్మమును పాటించువాడు, తనను ఆశ్రయించిన వారు ఎట్టివారైనను వారిని రక్షించువాడు, వేదవేదాంగముల పరమార్థములను ఎఱిగినవాడు, ధనుర్వేదము నందును (యుద్ధ విద్యలయందు) ఆరితేరినవాడు, సకలశాస్త్రములను సాకల్యముగా ఎఱిగినవాడు. శాస్త్రాదివిషయములయందు ఏమరుపాటు లేని వాడు, సమస్త వ్యవహారములయందు చక్కని స్ఫూర్తిగలవాడు, సమస్తజనులకును ప్రీతి పాత్రుడు, సౌమ్య స్వభావము గలవాడు, ఉదారస్వభావుడు, సదసద్వివేక సంపన్నుడు, (11-15)

సర్వదాభిగతః సద్భిః సముద్ర ఇవ సింధుభిః।
ఆర్యః సర్వసమశ్చైవ సదైవప్రియదర్శనః। 16

స చ సర్వగుణోపేతః కౌసల్యానందవర్ధనః।
సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ। 17

విష్ణునా సదృశో వీర్యే సోమవత్ ప్రియదర్శనః।
కాలాగ్నిసదృశః క్రోధే క్షమయా పృథివీసమః।
ధనదేన సమ స్త్యాగే సత్యే ధర్మ ఇవాపరః। 18

తమేవం గుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్।
జ్యేష్ఠం శ్రేష్ఠగుణై ర్యుక్తం ప్రియం దశరథస్సుతమ్। 19

ప్రకృతీనాం హితై ర్యుక్తం ప్రకృతిప్రియకామ్యయా।
యౌవరాజ్యేన సంయోక్తుమ్ ఐచ్ఛత్ ప్రీత్యా మహీపతిః। 20

తస్యాభిషేకసంభారాన్ దృష్ట్వా భార్యాఽథ కైకయీ। 21

పూర్వం దత్తవరా దేవీ వర మేనమ్ అయాచత।
వివాసనం చ రామస్య భరతస్యాభిషేచనమ్। 22

స సత్యవచనాద్రాజా ధర్మపాశేన సంయతః।
వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్। 23

స జగామ వనం వీరః ప్రతిజ్ఞామ్ అనుపాలయన్।
పితు ర్వచన నిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్। 24

తం వ్రజంతం ప్రియో భ్రాతా లక్ష్మణోఽనుజగామ హ।
స్నేహాద్వినయసంపన్నః సుమిత్రానందవర్ధనః।
భ్రాతరం దయితో భ్రాతుః సౌభ్రాత్ర మనుదర్శయన్। 25

నదులు సముద్రమునుగలిసినట్లు సత్పురుషులు నిరంతరము శ్రీరాముని చేరుచుండురు. అతడు అందఱికిని పూజ్యుడు. ఎవ్వరి యెడలను వైషమ్యములుగాని తారతమ్యములు గాని లేక మెలగువాడు. ఎల్లవేళల అందఱికిని ఆయన దర్శనము ప్రీతిని గొల్పుచుండును. కౌసల్యానందనుడైన ఆ రాముడు సర్వ సద్గుణవిలసితుడు. అతడు సముద్రుని వలె గంభీరుడు, ధైర్యమున హిమవంతుడు, పరాక్రమమున శ్రీమహావిష్ణువు. చంద్రునివలె ఆహ్లాదకరుడు, సుతిమెత్తని హృదయము గలవాడేయైనను తన ఆశ్రితులకు అపకారము చేసినవారియెడల ప్రళయాగ్నివంటివాడు. సహనమున భూదేవి వంటివాడు. కుబేరునివలె త్యాగస్వభావముగలవాడు, సత్యపాలనమున ధర్మదేవత వంటివాడు.[1] (16-18)

అమోఘపరాక్రమశాలియైన శ్రీరాముడు ఇట్టి సద్గుణములతో ఒప్పుచుండువాడు. సోదరులలో పెద్దవాడు, దశరథునకు ప్రియపుత్రుడు. ప్రజలకు హితమును గూర్చుటలో నిరతుడు, అట్టి సకలగుణాభిరాముడు ఐన శ్రీరామచంద్రుని తన మంత్రులవిజ్ఞప్తిమేరకు ప్రజల క్షేమము గోరి దశరథుడు మిక్కిలి ప్రసన్నుడై యువరాజుపట్టాభిషిక్తునిగా చేయుటకు సిద్ధపడెను. (19-20)

శ్రీరామునియువరాజపట్టాభిషేకమునకై జరుగుచున్న ఏర్పాట్లను దశరథుని ప్రియభార్యయైన కైకేయి (తన దాసియైన మంథర ద్వారా) ఎఱింగెను. పూర్వము (శంబరాసురుని జయించిన సందర్భమున) దశరథుడు ఆమెకు రెండు వరములను ఇచ్చియుండెను. రాముని వనములకు పంపుటయు, భరతుని యువరాజ పట్టాభిషిక్తునిగా జేయుటయు - ఆ రెండు వరములను ఇప్పుడు ఆమె తన భర్తనుకోరెను. (21-22)

సత్యసంధుడైన ఆ దశరథమహారాజు ధర్మ(పాశ)మునకు కట్టుబడి, ప్రియతమసుతుడైన శ్రీరాముని వనములకు పంపవలసి వచ్చెను. వీరుడైన శ్రీరాముడు కైకేయికి ప్రియమును గూర్చుటకై తాను చేసిన ప్రతిజ్ఞను అనుసరించి, పితృవాక్య పరిపాలనకై వనవాసమునకు బయలుదేరెను (23-24)

సుమిత్రాసుతుడైన లక్ష్మణుడు శ్రీరామునకు ప్రియసోదరుడు, మిక్కిలి వినయసంపన్నుడు. రామునియందు భక్తితత్పరుడు. అన్న అడవులకు బయలుదేరుచుండగా స్నేహాతిరేకముతో లక్ష్మణుడును ఆయనను అనుగమించెను. (25)

1). ఇక్ష్వాకువంశప్రభవః - అను ప్రయోగమునచే శ్రీరాముని అవతారము, మహావీర్యః - అను ప్రస్తావనతో తాటకాది రాక్షస సంహారము ధనుర్వేదేచనిష్ఠితః - అను పదముల ద్వారా రామ లక్ష్మణులకు విశ్వామిత్రునివలన కలిగిన శస్త్రాస్త్ర లాభములు. 'శ్రీమాన్' అను పద ప్రయోగముచే సీతారామకల్యాణము మొదలగు బాలకాండ విషయములు సూచితములు - ఇక్కడినుండి 'అయోధ్యాకాండ' గాథ ప్రస్తావింపబడును.

రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణసమా హితా।
జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా। 26

సర్వలక్షణసంపన్నా నారీణామ్ ఉత్తమా వధూః।
సీతాఽప్యనుగతా రామం శశినం రోహిణీ యథా। 27

పౌరై రనుగతో దూరం పిత్రా దశరథేన చ। 28

శృంగిబేరపురే సూతం గంగాకూలే వ్యసర్జయత్।
గుహ మాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియమ్। 29

గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా।
తే వనేన వనం గత్వా నదీ స్తీర్త్వా బహూదకాః। 30

చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్।
రమ్య మావసథం కృత్వా రమమాణా వనే త్రయః।
దేవగంధర్వసంకాశాః తత్ర తే న్యవసన్ సుఖమ్। 31

చిత్రకూటం గతే రామే పుత్రశోకాతురస్తదా।
రాజా దశరథః స్వర్గం జగామ విలపన్ సుతమ్। 32

మృతే తు తస్మిన్ భరతో వసిష్ఠప్రముఖై ర్ద్విజైః।
నియుజ్యమానో రాజ్యాయ నైచ్ఛద్రాజ్యం మహాబలః। 33

స జగామ వనం వీరో రామపాదప్రసాదకః। 34

గత్వా తు సుమహాత్మానం రామం సత్యపరాక్రమమ్।
అయాచత్ భ్రాతరం రామమ్ ఆర్యభావపురస్కృతః।
త్వమేవ రాజా ధర్మజ్ఞ ఇతి రామం వచోఽబ్రవీత్। 35

రామోఽపి పరమోదారః సుముఖః సుమహాయశాః।
న చైచ్ఛత్ పితురాదేశాత్ రాజ్యం రామో మహాబలః। 36

పాదుకే చాస్య రాజ్యాయ న్యాసం దత్త్వా పునః పునః।
నివర్తయామాస తతో భరతం భరతాగ్రజః। 37

జనకుని వంశమున పుట్టిన సీతాదేవి శ్రీరామునకు ధర్మపత్ని. ఆమెపై ఆయనకుగల ప్రేమ అపారము, ప్రాణసమానురాలు, దేవ మాయ వలె (దేవతలను సైతము మోహింపజేసిన మోహినివలె) అపూర్వమైన సౌందర్యము గలది, సర్వ శుభలక్షణ శోభిత, దశరథుని కోడలు, స్త్రీలలో ఉత్తమురాలు. ఆమెయు చంద్రుని రోహిణివలె శ్రీరాముని అనుగమించెను. (26-27)

దశరథుడును ద్వారముదాక వారిని అనుసరించెను- పౌరులును (ఆయనను విడిచియుండలేక) చాల దూరము ఆయనను అనుగమించిరి. ధర్మాత్ముడైన శ్రీరాముడు గంగాతీరమున గల శృంగిబేరపురమున తనకు భక్తుడు, నిషాదులకు రాజు ఐన గుహుని గలిసికొనెను. పిమ్మట రథసారథిని (రథమును) వెనుకకు పంపివేసెను. (28-29)

శ్రీరాముడు సీతాలక్ష్మణులతోడను, గుహునితోడను గూడి వనములలో సాగిపోవుచు, గుహుని సాయముతో జలసమృద్ధిగల గంగానదిని దాటెను. పిమ్మట భరద్వాజమహర్షిఆదేశమును అనుసరించి, సీతారామలక్ష్మణులు మందాకినీ నదీతీరమునగల చిత్రకూటమునకు చేరిరి. అచట చక్కని పర్ణశాలను నిర్మించుకొని ఆ ముగ్గురును దేవగంధర్వసన్నిభులై సుఖముగా ప్రశాంతముగా నివసింపసాగిరి. (30-31)

సీతారామలక్ష్మణులు చిత్రకూటమునకు చేరగా (అయోధ్యలో) దశరథమహారాజు పుత్రశోకకారణముగా సుతునకై విలపించుచు స్వర్గస్థుడాయెను. (32)

దశరథుడు మృతిచెందిన పిమ్మట వసిష్ఠుడు మొదలగు బ్రాహ్మణోత్తములు రాజ్యాధికారమును స్వీకరింపుమని భరతుని కోరిరి. అందులకు ఆ మహావీరుడు సమ్మతింపలేదు. రాజ్యకాంక్ష లేని ఆ భరతుడు పూజ్యుడైన రామునిఅనుగ్రహమును పొందగోరినవాడై, వనములకు బయలుదేరెను. (33-34)

ప్రసన్నహృదయుడు, సత్యసంధుడు ఐన శ్రీరాముని జేరి, భరతుడు మిక్కిలిపూజ్యభావముతో 'ఓ ధర్మజ్ఞా! జ్యేష్ఠుడవు, శ్రేష్ఠుడవు ఐన నీవే అయోధ్యకు రాజు కాదగినవాడవు'.[1] అని పలుకుచు సోదరుడైన శ్రీరాముని వేడుకొనెను. (35)

మిక్కిలి ఔదార్యము గలవాడును, ఎల్లప్పుడూ ప్రసన్నముగా ఉండువాడును, వాసిగాంచినవాడును ఐన శ్రీరాముడు అర్థుల ప్రార్థనలను మన్నించువాడే ఐనప్పటికిని తండ్రిఆదేశమును అనుసరించి రాజ్యాధికారమును చేపట్టుటకు ఇష్టపడలేదు. (36)

అనంతరము రాముడు తనకు ప్రతినిధిగా తన పాదుకలను న్యాసముగా భరతునకు ఒసంగి, పలువిధములుగా నచ్చజెప్పి, అతనిని అయోధ్యకు పంపెను. (37)

1) సోదరులలో జ్యేష్ఠుడు ఉండగా కనిష్ఠుడు రాజ్యార్హుడు కాడు- అనునది రాజధర్మము.

స కామమ్ అనవాప్యైవ రామపాదావుపస్పృశన్।
నందిగ్రామేఽకరోత్ రాజ్యం రామాగమనకాంక్షయా। 38

గతే తు భరతే శ్రీమాన్ సత్యసంధో జితేంద్రియః। 39

రామస్తు పునరాలక్ష్య నాగరస్య జనస్య చ।
తత్రాగమనమేకాగ్రో దండకాన్ ప్రవివేశ హ। 40

ప్రవిశ్య తు మహారణ్యం రామో రాజీవలోచనః।
విరాధం రాక్షసం హత్వా శరభంగం దదర్శ హ।
సుతీక్ష్ణం చాప్యగస్త్యం చ అగస్త్యభ్రాతరం తథా। 41

అగస్త్యవచనాచ్చైవ జగ్రాహైంద్రం శరాసనమ్।
ఖడ్గం చ పరమప్రీతః తూణీచాక్షయసాయకౌ। 42

వసతస్తస్య రామస్య వనే వనచరైః సహ।
ఋషయోఽభ్యాగమన్ సర్వే వధాయాసురరక్షసామ్। 43

స తేషాం ప్రతిశుశ్రావ రాక్షసానాం తథా వనే। 44

ప్రతిజ్ఞాతశ్చ రామేణ వధః సంయతి రక్షసామ్।
ఋషీణామగ్నికల్పానాం దండకారణ్యవాసినామ్। 45

తేన తత్రైవ వసతా జనస్థాననివాసినీ।
విరూపితా శూర్పణఖా రాక్షసీ కామరూపిణీ। 46

తతః శూర్పణఖావాక్యాదుద్యుక్తాన్ సర్వరాక్షసాన్।
ఖరం త్రిశిరసం చైవ దూషణం చైవ రాక్షసమ్।
నిజఘాన రణే రామః తేషాం చైవ పదానుగాన్। 47

వనే తస్మిన్ నివసతా జనస్థాననివాసినామ్।
రక్షసాం నిహతాన్యాసన్ సహస్రాణి చతుర్దశ। 48

'అయోధ్యకు శ్రీరాముని తీసుకొని రావలెను' - అను తన లక్ష్యము నెరవేరకున్నను, భరతుడు రాజప్రతినిధిగా రామ పాదుకలను సింహాసనమున ప్రతిష్ఠించి, వాటిని సేవించుచు నందిగ్రామముననే యుండి, రామునికై ఎదురుతెన్నులు చూచుచు రాజ్యపాలన చేయసాగెను. (38)

భరతుడు అయోధ్యకు మరలి వెళ్ళెను. సత్యసంధుడు, జితేంద్రియుడు ఐన శ్రీరాముడు తన దర్శనమునకై తఱుచుగా పౌరులు జానపదులు అచటికి వచ్చుచుండుట గమనించి, ఆ కారణముగా అచటి మునులతపశ్చర్యలకు విఘ్నములు ఏర్పడునని భావించెను. పిమ్మట అతడు దండకారణ్యము చేరుటకు నిశ్చయించుకొనెను. సావధానముగా సీతా లక్ష్మణులతో గూడి దండకారణ్యమును జేరెను. (39-40)

దండకవనమున ప్రవేశించిన పిమ్మట రాజీవలోచనుడైన శ్రీరాముడు 'విరాధుడు' అను రాక్షసుని సంహరించెను. శరభంగమహర్షిని దర్శించెను. అట్లే సుతీక్ష్ణుని, అగస్త్యమునిని, ఆయనసోదరుని[1] దర్శించెను. (41)

శ్రీరాముడు అగస్త్యుని ఆదేశానుసారము ఆయననుండి ఇంద్రచాపమును, ఖడ్గమును, అక్షయములైన బాణములుగల తూణీరములను గ్రహించి పరమప్రీతుడాయెను. (42)

వనవాసులతోగూడి, సీతాలక్ష్మణులతో శ్రీరాముడు దండకారణ్యమున నివసించుచుండగా పరిసరములలోనున్న ఋషీశ్వరులందఱును తమను బాధించుచున్న రాక్షసులను వధింపుమని కోరుటకై శ్రీరామునికడకు విచ్చేసిరి. (43)

శ్రీరాముడు దండకారణ్యమున నివసించుచున్న ఆ మునుల యొక్క ప్రార్థనను ఆలకించెను. అగ్నితుల్యులైన ఆ ఋషీశ్వరుల యెదుట "ఆ వనములలోని రాక్షసులను అందరిని యుద్ధమున మట్టుపెట్టెదను"- అని అతడు ప్రతినబూనెను. (44-45)

ఆ దండకారణ్యమున రామునివాసనివేశస్థానమున 'శూర్పణఖ' అను రక్కసి నివసించుచుండెను. శ్రీరాముడు లక్ష్మణునిచే కామరూపిణియైన ఆ రాక్షసి యొక్క ముక్కుచెవులను కోయించి, ఆమెను వికృతరూపను గావించెను. (46)

అనంతరము శూర్పణఖచే రెచ్చగొట్టబడిన ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు అను రాక్షసప్రముఖులు అసంఖ్యాక రాక్షసులతోగూడి, యుద్ధసన్నద్ధులై వచ్చిరి. అంతట శ్రీరాముడు ఒక్కడే జనస్థాననివాసులైన పదునాలుగు వేలమంది రాక్షసయోధులను, ఖరదూషణ త్రిశిరులను రణభూమికి బలిగావించెను. (47-48)

1) 'అగస్త్యసోదరుని పేరు 'సుదర్శనుడు' - అని సనత్కుమార సంహితలో పేర్కొనబడినది.
'ఋషీయాన్ ఏష మే భ్రాతా సుదర్శన' ఇతి స్మృతః'' । సనత్కుమారసంహిత

తతో జ్ఞాతివధం శ్రుత్వా రావణః క్రోధమూర్ఛితః।
సహాయం వరయామాస మారీచం నామ రాక్షసమ్। 49

వార్యమాణ స్సుబహుశో మారీచేన స రావణః।
న విరోధో బలవతా క్షమో రావణ తేన తే। 50

అనాదృత్య తు తద్వాక్యం రావణః కాలచోదితః।
జగామ సహమారీచః తస్యాశ్రమపదం తదా। 51

తేన మాయావినా దూరమ్ అపవాహ్య నృపాత్మజౌ।
జహార భార్యాం రామస్య గృధ్రం హత్వా జటాయుషమ్। 52

గృధ్రం చ నిహతం దృష్ట్వా హృతాం శ్రుత్వా చ మైథిలీమ్।
రాఘవః శోకసంతప్తో విలలాపాకులేంద్రియః। 53

తత స్తేనైవ శోకేన గృధ్రం దగ్ధ్వా జటాయుషమ్। 54

మార్గమాణో వనే సీతాం రాక్షసం సందదర్శ హ।
కబంధం నామ రూపేణ వికృతం ఘోరదర్శనమ్।
తం నిహత్య మహాబాహు ర్దదాహ స్వర్గతశ్చ సః। 55

స చాస్య కథయామాస శబరీం ధర్మచారిణీమ్।
శ్రమణీం ధర్మనిపుణామ్ అభిగచ్ఛేతి రాఘవ। 56

సోఽభ్యగచ్ఛన్మహాతేజాః శబరీం శత్రుసూదనః।
శబర్యా పూజితః సమ్యగ్రామో దశరథాత్మజః। 57

పంపాతీరే హనుమతా సంగతో వానరేణ హ।
హనుమద్వచనా చ్చైవ సుగ్రీవేణ సమాగతః। 58

రావణుడు తన దాయాదులైన ఖరదూషణ త్రిశిరులను శ్రీరాముడు వధించిన వార్తను శూర్పణఖ ద్వారా విని, క్రోధముతో ఉడికిపోయెను. పిమ్మట అతడు మారీచుడు అను రాక్షసుని కడకు వెళ్ళి, (సీతాపహరణ విషయమై) అతని సహాయమును అర్థించెను. (49)

అప్పుడా మారీచుడు "శ్రీరాముడు నీకంటెను శక్తిమంతుడు. అంతటివానితో విరోధము నీకు తగదు." అని పలికి, రావణుని పెక్కువిధముల వారించెను. వాని హెచ్చరికలను పెడచెవిన బెట్టి, ఆయువుమూడిన రావణుడు మారీచుని వెంటబెట్టుకొని, శ్రీరాముని ఆశ్రమ (పంచవటి) సమీపమునకు చేరెను.(50-51)

పిమ్మట రావణుడు మాయావియైన మారీచునిసహాయముతో రామలక్ష్మణులను వారిఆశ్రమమునుండి దూరముగా పంపి, సీతాదేవిని అపహరించుకొని పోయెను. దారిలో తనకు అడ్డుతగిలిన 'జటాయువు' అను గృధ్రమును ప్రాణములు అన్నుబిట్టునట్లుగా గాయపఱచెను. పిమ్మట శ్రీరాముడు ప్రాణావసానదశలోనున్న జటాయువును చూచెను. ఆగృధ్రము రావణుడు సీతాదేవిని అపహరించుకొని పోయిన వార్తను తెలిపి, రామునిపాదసన్నిధిలో కన్నుమూసెను. జటాయువుమృతికి శ్రీరాముడు వ్యాకులపాటుతో శోకసంతప్తుడై విలవిలలాడెను. అట్టి శోకమున మునిఁగియు శ్రీరాముడు జటాయువునకు అంత్యసంస్కారములను నిర్వహించెను. (52-54)

శ్రీరాముడు సీతాదేవికై అడవులలో అన్వేషించుచు కబంధుడను పేరుగల రాక్షసుని గాంచెను. అతడు వికృతాకారముతో చూడ భయంకరుడైయుండెను. మహాబాహువైన శ్రీరాముడు ప్రాణులను హింసించుచున్న ఆ దానవుని హతమార్చి, అతని కోరికమేరకు ఆ కళేబరమును దహింపజేసెను. ఫలితముగా అతనికి స్వర్గప్రాప్తికలిగెను. (55)

శాపవిముక్తుడైన కబంధుడు దివ్యరూపముతో స్వర్గమునకు వెళ్ళునప్పుడు ఆకాశమున కొంతతడవాగి, శ్రీరామునితో "ఓ రామా! ఈ సమీపముననే నీ భక్తురాలైన శబరి గలదు. గురువులను సేవించుట ఆమెస్వభావము, అతిథిసత్కారముల యందు ఆమె నిరతురాలు, ఆమె సన్న్యాసిని, నీవు ఆ శబరి యొద్దకు వెళ్ళుము" - అని పలికెను. (56)

శత్రువులను రూపుమాపువాడును, మహాతేజశ్శాలియు ఐన శ్రీరాముడు శబరికడకు వెళ్ళెను. శబరి భక్తిశ్రద్ధలతో కొసరి కొసరి ఫలములను అర్పించి, ఆయనను పూజించెను. (57)

పంపాసరస్సుతీరమున శ్రీరాముడు వానరుడైన హనుమంతుని కలిసికొనెను. ఆ వానరోత్తముని సూచనను అనుసరించి, రాముడు సుగ్రీవుని కడకు వెళ్ళెను. (58)

సుగ్రీవాయ చ తత్సర్వం శంస ద్రామో మహాబలః।
ఆదితస్తద్ యథావృత్తం సీతాయాశ్చ విశేషతః। 59

సుగ్రీవ శ్చాపి తత్సర్వం శ్రుత్వా రామస్య వానరః।
చకార సఖ్యం రామేణ ప్రీతశ్చైవాగ్నిసాక్షికమ్। 60

తతో వానరరాజేన వైరానుకథనం ప్రతి।
రామాయావేదితం సర్వం ప్రణయాద్దుఃఖితేన చ। 61

ప్రతిజ్ఞాతం చ రామేణ తదా వాలివధం ప్రతి।
వాలినశ్చ బలం తత్ర కథయామాస వానరః। 62

సుగ్రీవ శ్శంకిత శ్చాసీ న్నిత్యం వీర్యేణ రాఘవే। 63

రాఘవప్రత్యయార్థం తు దుందుభేః కాయ ముత్తమమ్।
దర్శయామాస సుగ్రీవో మహాపర్వతసన్నిభమ్। 64

ఉత్స్మయిత్వా మహాబాహుః ప్రేక్ష్య చాస్థి మహాబలః।
పాదాంగుష్ఠేన చిక్షేప సంపూర్ణం దశయోజనమ్। 65

బిభేద చ పునస్సాలాన్ సప్తైకేన మహేషుణా।
గిరిం రసాతలం చైవ జనయన్ ప్రత్యయం తదా। 66

తతః ప్రీతమనాస్తేన విశ్వస్తః స మహాకపిః।
కిష్కింధాం రామసహితో జగామ చ గుహాం తదా। 67

తతోఽగర్జత్ హరివరః సుగ్రీవో హేమపింగళః।
తేన నాదేన మహతా నిర్జగామ హరీశ్వరః। 68

అనుమాన్య తదా తారాం సుగ్రీవేణ సమాగతః।
నిజఘాన చ తత్రైనం శరేణైకేన రాఘవః। 69

తతః సుగ్రీవవచనాత్ హత్వా వాలినమాహవే।
సుగ్రీవమేవ తద్రాజ్యే రాఘవః ప్రత్యపాదయత్। 70

మహావీరుడైన శ్రీరాముడు సుగ్రీవునకు తనవృత్తాంతమును అంతయును దెలిపెను. మఱియు సీతాపహరణగాథను గూడ ఆయనకు పూర్తిగా వివరించెను. (59)

సుగ్రీవుడును శ్రీరాముడు చెప్పిన విశేషములను అన్నింటిని వినెను. శ్రీరామునకు తోడ్పడుటవలన తనకు ప్రయోజనము కలుగునని భావించి, అతడు శ్రీరామునితో అగ్నిసాక్షిగా మైత్రిని నెఱపెను. పిమ్మట సుగ్రీవుడు దుఃఖితుడై యుండుట గమనించి, శ్రీరాముడు "నీ దుఃఖకారణమేమి?" అని అతనిని అడిగెను. అప్పుడు సుగ్రీవుడు తనపై మొదట వాలికిగల ప్రేమ విశ్వాసములను, పిదప వాలితో తనకు ఏర్పడిన వైరగాథను (తనదురవస్థను) అంతయును రామునకు మిక్కిలి దుఃఖముతో విపులముగా దెలిపెను. (60-61)

అనంతరము రాముడు "వాలిని వధింతును" అని ప్రతిజ్ఞ చేసెను. పిమ్మట సుగ్రీవుడు వాలియొక్క (అసాధారణ) బలపరాక్రమములను గూర్చి శ్రీరామునకు వివరించెను. (62)

వాలిని హతమార్చుటకు శ్రీరామునకుగల పరాక్రమ విషయమున సుగ్రీవునిమనస్సులో సందేహము మెదలుచుండెను. ఆయన బలపరాక్రమములను తెలిసికొనుటకొఱకు వాలిచే హతుడైన 'దుందుభి'యను రాక్షసునికళేబరమును సుగ్రీవుడు ఆయనకు చూపెను. మహాపర్వతసదృశమైన ఆ అస్థిపంజరమును జూచి, మహాబాహువైన రాముడు ఒక చిఱునవ్వు నవ్వి, 'ఇంతేనా' అనియనుచు దానిని తనకాలిబొటనవ్రేలికొనతో అవలీలగా విసిరెను. అప్పుడా కళేబరము పూర్తిగా పదియోజనముల దూరమున పడిపోయెను. (63-65)

సుగ్రీవునకు పూర్తిగా విశ్వాసము కలిగించుటకై రాముడు ప్రయోగించిన బాణము ఏడు మద్దిచెట్లను, వరుసగానున్న ఏడు మద్దిచెట్లను, ఆ సమీపముననే ఉన్న ఒకపర్వతమును, రసాతలమును భేదించి, అదేవేగముతో వచ్చి ఆయన తూణీరమున జేరెను. (66)

అప్పుడాసుగ్రీవుడు లోకోత్తరమైన శ్రీరాముని పరాక్రమమును జూచి, ఎంతయు సంతోషించెను. సుగ్రీవునకు అతనిపరాక్రమముపై పూర్తిగా నమ్మకము కుదురుకొనెను. పిమ్మట అతడు రామునితో గూడి కొండలమధ్య గుహావలెనున్న కిష్కింధను సమీపించెను. బంగారు పింగళవర్ణములు గలవాడు, కపిశ్రేష్ఠుడు ఐన సుగ్రీవుడు బిగ్గరగా గర్జించెను. ఆ మహానాదమును విని, వానరప్రభువైన వాలి తనగృహమునుండి బయటికి వచ్చెను. 'సుగ్రీవునితో యుద్ధము చేయుటకు వెళ్లవలదు-' అని వారించుచున్న తారను సమాధానపఱచి, వాలి సుగ్రీవునితోతలపడెను. అప్పుడు రాఘవుడు వాలిని ఒకే ఒక్క బాణముతో వధించెను. సుగ్రీవుని ప్రార్థనను అనుసరించి వాలిని వధించిన పిమ్మట శ్రీరాముడు సుగ్రీవుని కిష్కింధకు రాజునుగా జేసెను. (67-70)

స చ సర్వాన్ సమానీయ వానరాన్ వానరర్షభః।
దిశః ప్రస్థాపయామాస దిదృక్షుర్జనకాత్మజామ్। 71

అనంతరము వానరప్రముఖుడైన సుగ్రీవుడు వివిధ ప్రదేశముల యందున్న వానరులనందఱిని రప్పించి, సీతాన్వేషణకై వారిని నలుదెసలకు పంపెను. (71)

తతో గృధ్రస్య వచనాత్ సంపాతేర్హనుమాన్ బలీ।
శతయోజనవిస్తీర్ణం పుప్లువే లవణార్ణవమ్। 72

పిమ్మట (సీతాదేవిని వెదకుటకై జాంబవదాదులతో దక్షిణదిశకు వెళ్ళిన) మహాబలసంపన్నుడైన హనుమంతుడు గృధ్రరాజైన సంపాతి సూచన మేరకు నూఱు యోజనముల విస్తీర్ణముగల లవణసముద్రమును ఒక్కగంతులో దాటెను.(72)

తత్ర లంకాం సమాసాద్య పురీం రావణపాలితామ్।
దదర్శ సీతాం ధ్యాయంతీమ్ అశోకవనికాం గతామ్। 73

అంతట ఆ రామబంటు రావణునిచే పాలింపబడుచున్న లంకకు చేరెను. క్రమముగా సీతాదేవికొఱకు వెదకుచు అతడు అశోక వనమున అడుగిడి, అచట రామధ్యానమున నిమగ్నురాలైయున్న జానకిని కనుగొనెను. (73)

నివేదయిత్వాభిజ్ఞానం ప్రవృత్తిం చ నివేద్య చ।
సమాశ్వాస్య చ వైదేహీం మర్దయామాస తోరణమ్। 74

పిదప ఆంజనేయుడు సీతాదేవికి 'రామసుగ్రీవుల మైత్రిని దెలిపి, రామనామాంకితమైన ఉంగరమును ఆమెకు ఆనవాలుగా సమర్పించెను. ఆమెకై శ్రీరాముడు పరితపించుచున్న తీరును వివరించి, ఆమెను ఓదార్చెను. పిమ్మట అశోకవనమును ధ్వంసము చేసెను. (74)

పంచ సేనాగ్రగాన్ హత్వా సప్త మంత్రిసుతానపి।
శూరమక్షం చ నిష్పిష్య గ్రహణం సముపాగమత్। 75

అస్త్రేణోన్ముక్త మాత్మానం జ్ఞాత్వా పైతామహాద్వరాత్।
మర్షయన్ రాక్షసాన్ వీరో యంత్రిణస్తాన్ యదృచ్ఛయా। 76

వాయుసుతుడు ఏుగురు సేనాపతులను అంతమొందించెను, ఏడుగురు మంత్రిపుత్రులను మట్టిగఱపించెను, శూరుడైన అక్షకుమారుని హతమార్చెను. ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకు బుద్ధిపూర్వకముగా కట్టుబడెను. ఎదురులేని పరాక్రమశాలియైన వాయునందనుడు బ్రహ్మవరప్రభావమున బ్రహ్మాస్త్రమునుండి అప్రయత్నముగా తాను విముక్తుడైనట్లు తెలిసికొనెను. ఐనప్పటికిని హనుమంతుడు రామకార్యమును సాధించుటకై బ్రహ్మాస్త్రమునకు బద్ధుడైయున్నట్లు నటించుచు, రాక్షసులుపెట్టు బాధలను సహించెను. (75-76)

తతో దగ్ధ్వా పురీం లంకాం ఋతే సీతాం చ మైథిలీమ్।
రామాయ ప్రియమాఖ్యాతుం పునరాయాన్మహాకపిః। 77

సోఽభిగమ్య మహాత్మానం కృత్వా రామం ప్రదక్షిణమ్।
న్యవేదయదమేయాత్మా దృష్టా సీతేతి తత్త్వతః। 78

(రావణాజ్ఞననుసరించి, రాక్షసులు తనతోకకు నిప్పంటింపగా) మారుతి తనవాలాగ్నితో సీతాదేవి ఉన్న స్థలమునుదప్ప లంకను దగ్ధము గావించెను. సీతాదేవికుశలవార్తను దెలిపి, శ్రీరామునకు ప్రీతిని గూర్చుటకై ఆ హనుమంతుడు అతి శీఘ్రముగా ఆ ప్రభువుసమీపమునకు మఱలివచ్చెను. మహాబుద్ధిశాలియైన పవనసుతుడు 'కనుగొంటిని సీతమ్మను' అని పలికి, రామునకు ప్రదక్షిణమొనర్చెను. సీతాదేవి మొదబాటునకు లోనయ్యెను. నిశ్చలుడై యున్న ఆ ప్రభువునకు ఆ వాయుసుతుడు యావద్వృత్తాంతమును వివరించెను. (77-78)

తతః సుగ్రీవసహితో గత్వా తీరం మహోదధేః।
సముద్రం క్షోభయామాస శరైరాదిత్యసన్నిభైః। 79

దర్శయామాస చాత్మానం సముద్రః సరితాం పతిః।
సముద్రవచనాచ్చైవ నళం సేతుమకారయత్। 80

హనుమంతుడు తెలిపిన సమాచారమును గ్రహించిన పిమ్మట, శ్రీరాముడు సుగ్రీవాదులతోగూడి, మహాసముద్ర తీరమునకుచేరెను. అనంతరము అతడు సూర్యకిరణములవలె తీక్ష్ణములైన బాణములతో సముద్రమును అల్లకల్లోలమొనర్చెను. అంతట సముద్రుడు రామునకు నిజరూపమును ప్రదర్శించెను. సముద్రుని సూచనలను అనుసరించి, శ్రీరాముడు సముద్రముపై నలునిద్వారా సేతువును నిర్మింపజేసెను. (79-80)

తేన గత్వా పురీం లంకాం హత్వా రావణమాహవే।
రామస్సీతామనుప్రాప్య పరాం వ్రీడాముపాగమత్॥ 81

తాముపాచ తతో రామః పరుషం జనసంసది।
అమృష్యమాణా సా సీతా వివేశ జ్వలనం సతీ॥ 82

ఆ సేతువుద్వారా లంకను జేరి, శ్రీరాముడు రావణుని రణరంగమున హతమార్చెను. తదనంతరము సీతను సమీపించి, పరుల పంచనయున్న ఆమెను స్వీకరించుటకు (లోకాపవాదశంకతో) వెనుకాడెను. (సీతాదేవి సౌశీల్యమునుగూర్చి ఎల్లరకును విశ్వాసము కలిగించుటకై) అందఱియెదుట శ్రీరాముడు పరుషవచనములను పలికెను. సాధ్వియైన ఆ సీతాదేవి ఆకఠినోక్తులను భరింపజాలక అగ్నిలో ప్రవేశించెను. (81-82)

తతోఽగ్నివచనాత్ సీతాం జ్ఞాత్వా విగతకల్మషామ్।
బభౌ రామః సంప్రహృష్టః పూజితః సర్వదైవతైః॥ 83

పిదప అగ్నిదేవుడు ప్రత్యక్షమై "సీతాదేవి త్రికరణశుద్ధిగా పరమసాధ్వి, దోషరహిత" అని ప్రకటించెను. అంతట శ్రీరాముడు పరమసంతుష్టుడాయెను. రాముని ధర్మనిరతిని దేవతలందఱును కొనియాడిరి. (83)

కర్మణా తేన మహతా త్రైలోక్యం సచరాచరమ్।
సదేవర్షిగణం తుష్టం రాఘవస్య మహాత్మనః॥ 84

మహాత్ముడైన శ్రీరాముడు ఆదుష్టరావణుని అంతమొందింపగా దేవతలతో, ఋషులతో, సకలచరాచరములతోగూడిన ముల్లోకములును సంతసించినవి. (84)

అభిషిచ్య చ లంకాయాం రాక్షసేంద్రం విభీషణమ్।
కృతకృత్యస్తదా రామో విజ్వరః ప్రముమోద హ॥ 85

పిదప శ్రీరాముడు రాక్షసశ్రేష్ఠుడైన విభీషణుని లంకా రాజ్యమునకు పట్టాభిషిక్తునిగావించెను. అట్లు కృతకృత్యుడైన రాముడు ప్రసన్నమనస్కుడయ్యెను. (85)

దేవతాభ్యో వరం ప్రాప్య సముత్థాప్య చ వానరాన్।
అయోధ్యాం ప్రస్థితో రామః పుష్పకేణ సుహృద్వృతః॥ 86

తనవిజయమును శ్లాఘించుటకై వచ్చిన దేవతలనుండి వరమును పొంది, శ్రీరాముడు ఆ వరప్రభావముతో రణరంగమున మృతులై పడియున్న వానరులను పునర్జీవితులను గావించెను. పిమ్మట శ్రీరాముడు సుగ్రీవవిభీషణాదిమిత్రులతో, వానరులందఱితోగూడి పుష్పకవిమానముపై అయోధ్యకు బయలుదేఱెను. (86)

భరద్వాజాశ్రమం గత్వా రామః సత్యపరాక్రమః।
భరతస్యాంతికం రామో హనూమంతం వ్యసర్జయత్॥ 87

శ్రీరాముడు తనవారితో భరద్వాజాశ్రమమునకు చేరెను. "పదునాలుగుసంవత్సరములు పూర్తియైన వెంటనే అయోధ్యకు తప్పక తిరిగి వత్తును" అని భరతునకు తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకొనుటకై శ్రీరాముడు ముందుగా హనుమంతుని భరతునియొద్దకు పంపెను. (87)

పునరాఖ్యాయికాం జల్పన్ సుగ్రీవసహితశ్చ సః।
పుష్పకం తత్ సమారుహ్య నందిగ్రామం యయౌ తదా॥ 88

సుగ్రీవాదులతో పుష్పకవిమానమును అధిరోహించి, శ్రీరాముడు ప్రయాణసమయమున భరతునిగూర్చిన విశేషగాథలను వారికి తెలుపుచు నందిగ్రామమునకు చేరెను. (88)

నందిగ్రామే జటాం హిత్వా భ్రాతృభిః సహితోఽనఘః।
రామః సీతా మనుప్రాప్య రాజ్యం పునరవాప్తవాన్॥ 89

చక్కగా పితృవాక్యపరిపాలనమొనర్చివచ్చిన మహానుభావుడగు శ్రీరాముడు నందిగ్రామమున తనసోదరులను కలిసికొని, జటాదీక్షను పరిత్యజించెను. పిమ్మట సీతాదేవితోగూడి పట్టాభిషిక్తుడై రాజ్యాధికారమును చేపట్టెను. (89)

ప్రహృష్టముదితో లోకః తుష్టః పుష్టః సుధార్మికః।
నిరామయో హ్యరోగశ్చ దుర్భిక్షభయవర్జితః॥ 90

శ్రీరాముడు రాజైనందులకు ప్రజలెల్లరును సంతోషముతో పొంగిపోవుచు. ఆయనపాలనలో సుఖసౌభాగ్యములతో పిలసిల్లుదురు. ప్రభుభక్తితత్పరులై ధర్మమార్గమున ప్రవర్తించుదురు. ఆరోగ్యభాగ్యములతో హాయిగానుందురు. కఱవు కాటకములు లేకుండా నిర్భయముగా జీవించుచుందురు. (90)

న పుత్త్రమరణం కేంచిత్ ద్రక్ష్యంతి పురుషాః క్వచిత్।
నార్యశ్చాఽవిధవా నిత్యం భవిష్యంతి పతివ్రతాః। 91

న చాగ్నిజం భయం కించిత్ నాప్సు మజ్జంతి జంతవః।
న వాతజం భయం కించిత్ నాపి జ్వరకృతం తథా।
న చాపి క్షుద్భయం తత్ర న తస్కరభయం తథా। 92

నగరాణి చ రాష్ట్రాణి ధనధాన్యయుతాని చ।
నిత్యం ప్రముదితాః సర్వే యథా కృతయుగే తథా। 93

అశ్వమేధశతైరిష్ట్వా తథా బహుసువర్ణకైః। 94

గవాం కోట్యయుతం దత్త్వా విద్వద్భ్యో విధిపూర్వకమ్।
అసంఖ్యేయం ధనం దత్త్వా బ్రాహ్మణేభ్యో మహాయశాః। 95

రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః।
చాతుర్వర్ణ్యం చ లోకేఽస్మిన్ స్వే స్వే ధర్మే నియోక్ష్యతి। 96

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ।
రామో రాజ్య ముపాసిత్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి। 97

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితమ్।
యః పఠేద్రామచరితం సర్వపాపైః ప్రముచ్యతే। 98

ఏతదాఖ్యానమాయుష్యం పఠన్ రామాయణం నరః।
సపుత్త్రపౌత్త్రః సగణః ప్రేత్య స్వర్గే మహీయతే। 99

పఠన్ ద్విజో వాగృషభత్వమీయాత్
స్యాత్ క్షత్రియో భూమిపతిత్వమీయాత్।
వణిగ్జనః పణ్యఫలత్వ మీయాత్
జనశ్చ శూద్రోఽపి మహత్త్వమీయాత్। 100

రామరాజ్యమున పుత్త్రమరణములు లేకుండును. స్త్రీలు పాతివ్రత్యధర్మములను పాటించుచు నిత్యసుమంగళులై వర్ధిల్లుచు ఉందురు. అగ్నిప్రమాదములు గాని, జలప్రమాద (మరణ)ములు గాని, వాయుభయములుగాని లేకుండును. జ్వరాదిబాధలు, అట్లే ఆకలిదప్పుల బాధలు, చోరభయములు మచ్చునకైనను ఉండవు - (ఆధ్యాత్మిక-ఆధిదైవిక-ఆధి భౌతిక బాధలు లేకుండును.) రాజ్యములోని నగరములు, ఇతర ప్రదేశములు ధనధాన్యములతో పాడిపంటలతో తులతూగుచుండును. జనులు కృతయుగమునందువలె ఎల్లవేళల సుఖశాంతులతో వర్ధిల్లుచుందురు. (91-93)

అనేకములైన అశ్వమేధాదిక్రతువులను, సువర్ణక యాగములను[1] శ్రీరాముడు నిర్వహించును. బ్రాహ్మణోత్తములకును పండితులకును కోట్లకొలది గోవులను దానము చేయును. అతడు అపరిమితమైన ధనధాన్యములను దానమొనర్చి, వాసికెక్కును. (94-95)

రాముడు క్షత్రియవంశములను నూరురెట్లు వృద్ధిపఱచును. నాలుగువర్ణముల వారిని ఈ లోకమున తమతమ వర్ణధర్మముల ప్రకారము నడిపించును. ఆ ప్రభువు పదునొకండువేల సంవత్సరముల కాలము ప్రజానురంజకముగా పరిపాలన సాగించి, అనంతరము వైకుంఠమునకు చేరును. (96-97)

ఈ శ్రీరామచరితము అంతఃకరణమును పవిత్రమొనర్చును, సర్వపాపములను రూపుమాపును, పుణ్యప్రదమైనది, వేదార్థమును ప్రతిపాదించునదియు గావున ఇది సర్వవేదసారము. నిత్యము దీనిని నిష్ఠతో పఠించువారి పాపములు అన్నియును పటాపంచలై పోవును. ఈ రామాయణమును పఠించినవారికి ఆయుష్యాభివృద్ధి కలుగును, వారిపుత్త్రపౌత్త్రులకును, పరివారములకును క్షేమలాభములు ప్రాప్తించును. మఱియు అంత్యకాలమున మోక్షప్రాప్తియు కలుగును. (98-99)

ఈ రామాయణమును పఠించిన ద్విజులు వేదవేదాంగముల యందును, శాస్త్రములయందును పండితులు అగుదురు. క్షత్రియులు రాజ్యాధికారమును పొందుదురు. వైశ్యులకు వ్యాపారలాభములు కలుగును. శూద్రులు తోడివారిలో శ్రేష్ఠులు అగుదురు. ఈ రామాయణమును పఠించినవారును, వినిన వారును పొందెడి ఫలము అనంతము, అద్వితీయము. (100)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ప్రథమస్సర్గః (1)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు మొదటిసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

1. శ్లో॥ సుబహూని సువర్ణాని యత్రోపకరణాత్మతః । విందతే స క్రతుస్సర్వైః స్మృతో బహు సువర్ణకః ॥
అనేకములైన వెండి బంగారు ఉపకరణములతో నిర్వహింపబడు క్రతువులను 'సువర్ణకయాగములు' అనియందురు.

2. రెండవసర్గము

రామాయణకావ్యముయొక్క ఆవిర్భావము.

నారదస్య తు తద్వాక్యం శ్రుత్వా వాక్యవిశారదః।
పూజయామాస ధర్మాత్మా సహశిష్యో మహామునిః। 1

యథావత్ పూజితస్తేన దేవర్షిః నారద స్తదా।
ఆపృష్ట్వైవాభ్యనుజ్ఞాతః స జగామ విహాయసమ్। 2

స ముహూర్తం గతే తస్మిన్ దేవలోకం ముని స్తదా।
జగామ తమసాతీరం జాహ్నవ్యాస్త్వవిదూరతః। 3

స తు తీరం సమాసాద్య తమసాయా మునిస్తదా।
శిష్యమాహ స్థితం పార్శ్వే దృష్ట్వా తీర్థమకర్దమమ్। 4

అకర్దమమిదం తీర్థం భరద్వాజ నిశామయ।
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా। 5

న్యస్యతాం కలశస్తాత దీయతాం వల్కలం మమ।
ఇదమేవావగాహిష్యే తమసాతీర్థముత్తమమ్। 6

ఏవముక్తో భరద్వాజో వాల్మీకేన మహాత్మనా।
ప్రాయచ్ఛత మునే స్తస్య వల్కలం నియతో గురోః। 7

స శిష్యహస్తాదాదాయ వల్కలం నియతేంద్రియః।
విచచార హ పశ్యంస్తత్ సర్వతో విపులం వనమ్। 8

తస్యాభ్యాశే తు మిథునం చరంతమనపాయినమ్।
దదర్శ భగవాంస్తత్ర క్రౌంచయోః చారునిస్వనమ్। 9

తస్మాత్తు మిథునాదేకం పుమాంసం పాపనిశ్చయః।
జఘాన వైరనిలయో నిషాదస్తస్య పశ్యతః। 10

తం శోణితపరీతాంగం వేష్టమానం మహీతలే।
భార్యా తు నిహతం దృష్ట్వా రురావ కరుణాం గిరమ్। 11

ధర్మాత్ముడును, శబ్దార్థవిశేషములను బాగుగా నెఱిగి, వివరించుటయందు నేర్పరియు ఐన వాల్మీకిమహర్షి నారదుడు ఉపదేశించిన (తెలిపిన) సంక్షిప్తరామాయణవిశేషములను గ్రహించి, శిష్యసహితుడై ఆదేవర్షిని విధివిధానముగా పూజించెను. దేవమునిశ్రేష్ఠుడైన నారదుడు వాల్మీకినుండి పూజలను అందుకొని, ఆయనఅనుజ్ఞను గైకొని, గగనమార్గమున వెళ్లిపోయెను. (1-2)

నారదుడు బ్రహ్మ (దేవ) లోకమునకు వెళ్లిన పిమ్మట వాల్మీకి మహాముని గంగానదీతీరమునకు సమీపమునగల తమసానదీతటమునకు చేరెను. (3)

ఆ మహర్షి తమసానదీతీరమునకు చేరి, నిర్మలములైన ఆ జలములలోనికి దిగుచు ప్రక్కనున్న శిష్యునితో ఇట్లనెను. (4)

"ఓ భరద్వాజా ! ఏ మాత్రము బురదలేని ఈ తీర్థము నిష్కల్మషమైన సత్పురుషునిమనస్సువలె స్వచ్ఛమై రమణీయముగా నున్నది. దీనిని చూడుము. నాయనా! ఉదకపాత్రను ఒడ్డున ఉంచి, నా స్నానవస్త్రమును ఇమ్ము. గంగాజలమువలె పవిత్రమైన ఈ తమసాతీర్థమునందు స్నానము చేసెదను. నీవును ఇపుడనే స్నానమాచరింపుము." (5-6)

మహామనస్వియైన వాల్మీకి ఇట్లు ఆదేశింపగా గురుసేవానిరతుడైన భరద్వాజుడు ఆ మహర్షికి వల్కలమును అందించెను. జితేంద్రియుడైన ఆ ముని శిష్యునినుండి తనవస్త్రమును గ్రహించి, విశాలమైన ఆ వనమును తిలకించుచు దివ్యమైన దానిరామణీయకమునకు మిక్కిలి అబ్బురపడెను. (7-8)

శాపానుగ్రహసమర్థుడైన వాల్మీకి ఆ వనసమీపమున క్షణకాలమైనను ఎడబాటును సహింపజాలని క్రౌంచపక్షులజంటను చూచెను. అన్యోన్యానురాగములతో మసలుచున్న వాటిమధుర ధ్వనులను వినెను. (9)

సమస్తప్రాణులను నిష్కారణముగా హింసించు స్వభావము గల క్రూరాత్ముడైన ఒక కిరాతుడు వాల్మీకిముని చూచుచుండగనే ఆ క్రౌంచపక్షులజంటలో మగపక్షిని బాణముతో కొట్టెను. కిరాతునిబాణపు దెబ్బకు నేలపైబడి, రక్తసిక్తమైన అంగములతో గిలగిల కొట్టుకొనుచున్న ఆ మగపక్షిని ఆడుపక్షి చూచెను. అనుక్షణము తనపై అనురాగముతో మసలుకొనునదియు, బలమైన రెక్కలుగలదియు, రతిపారవశ్యమున మత్తిల్లి

వియుక్తా పతినా తేన ద్విజేన సహచారిణా।
తామ్రశీర్షేణ మత్తేన పత్త్రిణా సహితేన వై। 12

తథా తు తం ద్విజం దృష్ట్వా నిషాదేన నిపాతితమ్।
ఋషేర్ధర్మాత్మనస్తస్య కారుణ్యం సమపద్యత। 13

తతః కరుణవేదిత్వాత్ అధర్మోఽయ మితి ద్విజః।
నిశామ్య రుదతీం క్రౌంచీమ్ ఇదం వచనమబ్రవీత్। 14

మా నిషాద ప్రతిష్ఠాం త్వ మగమః శాశ్వతీః సమాః।
యత్ క్రౌంచమిథునాదేకమ్ అవధీః కామమోహితమ్। 15

తస్యైవం బ్రువత శ్చింతా బభూవ హృది వీక్షతః।
శోకార్తేనాస్య శకునేః కిమిదం వ్యాహృతం మయా। 16

చింతయన్ స మహాప్రాజ్ఞః చకార మతిమాన్ మతిమ్।
శిష్యం చైవాబ్రవీద్వాక్యమ్ ఇదం స మునిపుంగవః। 17

పాదబద్ధోఽక్షరసమః తంత్రీలయసమన్వితః।
శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు నాన్యథా। 18

యున్నదియు, ఐన తనభర్తయగు మగపక్షి నెత్తురోడుచున్న తలతో, అట్లు విలవిలలాడుచుండగా దాని వియోగమునకు తట్టుకొనలేక జాలిగొలుపు ధ్వనితో క్రౌంచి (ఆడుపక్షి) ఏడువసాగెను. (10-12)

క్రూరుడైన కిరాతునిహింసకు గురియై, నెత్తురోడుచు పడియున్న ఆ క్రౌంచపక్షిని చూచి, ధర్మశీలుడైన వాల్మీకిమహర్షి హృదయమున కరుణరసము పొంగి పొరలెను. (13)

మిక్కిలి జాలిగొలిపెడి ఆ క్రౌంచపక్షులదురవస్థను జూచి, సుతిమెత్తని హృదయముగలవాడైన ఆ వాల్మీకిముని 'ఇట్లు రతిక్రీడలోనున్న పక్షులను హింసించి, విడదీయుట' కటికి కసాయితనము అధర్మము అని భావించుచు ఇట్లు పలికెను.(14)

ఓ కిరాతుడా! క్రౌంచ పక్షులజంటలో కామ పరవశమైయున్న ఒక (మగ) పక్షిని చంపితివి. అందువలన నీవు ఎక్కువకాలము జీవించి యుండవు. (శాశ్వతముగా అపకీర్తి పొందగలవు.[1][2]) (15)

క్రౌంచపక్షులదుస్థితిని గాంచుచు పలికిన ఆ మునీశ్వరుని మనస్సున "ఈ పక్షివిషయమున శోకాతురుడనై నేను పలికినదేమి?" అను ఆలోచన మొదలెను. (16)

మిక్కిలి ప్రజ్ఞాశాలియు, శాస్త్రకోవిదుడును ఐన ఆ వాల్మీకి ఇట్లాలోచించుచు, ఒక నిర్ణయమునకు వచ్చెను. పిమ్మట ఆ మహర్షి తన శిష్యునితో ఇట్లు పలికెను. 'నేను పలికిన మాటలసమూహము సమానాక్షరములుగల నాలుగుపాదములతో ఒప్పుచున్నది. లయబద్ధమై వాద్యయుక్తముగ గానము చేయుటకు తగియున్నది. కనుక ఇది ఛందోబద్ధమైన శ్లోకమే.(17-18)

---

1) *ఇది శ్రీ మద్రామాయణమునకు మంగళాచరణ శ్లోకముగా (నాందిగా) పేర్కొనబడుచున్నది - "ఓ శ్రీనివాసా! కామాతురుడైన (పరమసాధ్వియగు సీతాదేవిని అపహరించిన) దుష్టరావణుని చంపి, నీవు చిరస్థిర కీర్తిని పొందితివి." అని పండితులవివరణము.*

2) *ఈ శ్లోకమునందు రామాయణమునందలి ఏడుకాండల కథాంశములు సూచింపబడుచున్నట్లు - పండితులు విశ్లేషింతురు.*

(1) *మా + నిషాద = లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవిని చేపట్టిన ఓరామా! ఈ పదముద్వారా శ్రీ సీతారాముల కల్యాణఘట్టము (బాలకాండకథ) సూచితము అగుచున్నది.*

(2) *ప్రతిష్ఠాం, త్వం, అగమః = పితృవాక్య పరిపాలనమొనర్చి, నీవు జగద్విఖ్యాతిని పొందితివి. ఈ పదముద్వారా అయోధ్యాకాండ కథ వెల్లడియగుచున్నది.*

(3) *శాశ్వతీః సమాః = ఆడినమాట తప్పకుండుటకై (ఓరామా! నీవు) పెక్కు (14) సంవత్సరములు వనవాసమొనర్చితివి- ఈ పలుకులవలన అరణ్యకాండ వృత్తాంతము ప్రకటింపబడుచున్నది.*

(4) *క్రౌంచమిథునాత్ = కుటిల (దుష్ట) ప్రవర్తనగల తారావాలిదంపతులలో వాలివధ-దీనివలన కిష్కింధకాండ కథ సూచితము.*

(5) *ఏకమ్ = అసహాయశూరుడు, ఏకైకవీరుడు హనుమంతుడు-దీనివలన సుందరకాండ, గాథ సూచితము.*

(6) *అవధీః = లోకకంటకుడైన దుష్టరావణుని వధించితివి-దీనిద్వారా రావణవధ. అనగా యుద్ధకాండ సూచింపబడినది.*

(7) *కామమోహితమ్ = పట్టాభిషేకానంతరము సీతాదేవియొక్క వనవిహార కుతూహలస్థితి - అనగా ఉత్తరకాండవృత్తాంతము సూచితము.*

శిష్యస్తు తస్య బ్రువతో మునే ర్వాక్యమ్ అనుత్తమమ్।
ప్రతిజగ్రాహ సంహృష్టః తస్య తుష్టోఽభవద్గురుః। 19

సోఽభిషేకం తతః కృత్వా తీర్థే తస్మిన్ యథావిధి।
తమేవ చింతయన్నర్థమ్ ఉపావర్తత వై మునిః। 20

భరద్వాజస్తతః శిష్యో వినీతః శ్రుతవాన్ గురోః।
కలశం పూర్ణమాదాయ పృష్ఠతోఽనుజగామ హ। 21

స ప్రవిశ్యాశ్రమపదం శిష్యేణసహ ధర్మవిత్।
ఉపవిష్టః కథాశ్చాన్యాః చకార ధ్యానమాస్థితః। 22

ఆజగామ తతో బ్రహ్మా లోకకర్తా స్వయం ప్రభుః।
చతుర్ముఖో మహాతేజా ద్రష్టుం తం మునిపుంగవమ్। 23

వాల్మీకిరథ తం దృష్ట్వా సహసోత్థాయ వాగ్యతః।
ప్రాంజలిః ప్రయతో భూత్వా తస్థౌ పరమవిస్మితః। 24

పూజయామాస తం దేవం పాద్యార్ఘ్యాసనవందనైః।
ప్రణమ్య విధివచ్చైనం పృష్ట్వా ఽనామయమవ్యయమ్। 25

అథోపవిశ్య భగవాన్ ఆసనే పరమార్చితే।
వాల్మీకయే చ ఋషయే సందిదేశాసనం తతః। 26

బ్రహ్మణా సమనుజ్ఞాతః సోఽప్యుపావిశదాసనే।
ఉపవిష్టే తదా తస్మిన్ సాక్షాల్లోకపితామహే। 27

తద్గతేనైవ మనసా వాల్మీకిర్ధ్యానమాస్థితః।
పాపాత్మనా కృతం కష్టం వైరగ్రహణబుద్ధినా। 28

ఆ విధముగా పలికిన ముని వచనములను (శ్లోకమును) శిష్యుడు సంతోషముతో స్వీకరించెను. దానిని కంఠస్థము చేసికొనెను. ఆ శిష్యునివిషయమున మహర్షియు సంతుష్టుడాయెను. అనంతరము ఆ మహర్షి తమసానదీజలములలో యథావిధిగా మాధ్యాహ్నికస్నానమాచరించి.[1] అప్రయత్నముగా తననోటి నుండి వెలువడిన 'మానిషాద' శ్లోకార్థవిశేషములనే స్మరించుచు తనఆశ్రమమునకు చేరెను. (19-20)

వినయసంపన్నుడు, వేదశాస్త్రములను అభ్యసించినవాడు, 'మానిషాద' శ్లోకమును ధారణ చేసినవాడు ఐన భరద్వాజుడను పేరుగల ఆశిష్యుడు కలశమున నీరు నింపుకొని, గురువుగారి వెంట ఆశ్రమమునకు వచ్చెను. (21)

ఆ మహర్షి శిష్యునితోగూడి, ఆశ్రమమున ప్రవేశించి దేవపూజాదికకర్మములను నిర్వర్తించెను. పిదప సుఖాసీనుడై నదీతీరమున జరిగిన సంఘటనలనే తలపోయుచు ఇతర కథాప్రసంగములను పురాణ పారాయణాది కార్యక్రమములను నిర్వర్తించెను. (22)

సృష్టికర్తయు, లోకములకు అధిపతియు, మహాతేజశ్శాలియు ఐన చతుర్ముఖబ్రహ్మ ఆ వాల్మీకిమహర్షిని చూచుటకై స్వయముగా ఆయన ఆశ్రమమునకు విచ్చేసెను. (23)

అంతట వాల్మీకి ఆ బ్రహ్మదేవుని జూచి, పరమాశ్చర్యముతో కుశలప్రశ్నలు గావించెను. శాస్త్రోక్తముగా క్రమముగా వాగ్వ్యాపారముల నాపర్చి, సాష్టాంగ దండప్రణామము చేసెను. లేచి నిలబడి, ఏకాగ్రచిత్తుడై మౌనముగా ఆయనకు అంజలిఘటించెను. పిమ్మట ఆ బ్రహ్మదేవునకు పాద్యమును, అర్ఘ్యమును సమర్పించి, ఆయనను సుఖాసీనుని గావించి స్తుతించెను. (24-25)

అనంతరము బ్రహ్మోపదేశమునకు అర్హమగునట్లుగా పూజింపబడిన ఆసనముపై ఆసీనుడై, బ్రహ్మదేవుడు వాల్మీకి మహర్షిని కూర్చొనుటకు ఆజ్ఞాపించెను. బ్రహ్మయొక్క అనుజ్ఞతో వాల్మీకియు (కొంచెము ఎత్తు తక్కువగానున్న) ఆసనముపై కూర్చొనెను. బ్రహ్మయంతటివాడు (సాక్షాత్తుగా బ్రహ్మయే) ఎదుట కూర్చొని యున్నప్పటికిని వాల్మీకి క్రౌంచపక్షి కిరాతునిచే చంపబడినదృశ్యమునే మనస్సున చింతించుచుండెను. "క్రౌంచపక్షిని వేటాడవలెననెడి దుర్బుద్ధితో పాపాత్ముడైన కిరాతుడు ఎంతటి క్రూరకార్యము చేసినాడు! రతిక్రీడలో మునిగి, మధురధ్వనిచేయుచున్న క్రౌంచపక్షిని ఆ కిరాతుడు

1) నదీషు దేవఖాతేషు తటాకేషు సరస్సు చ। స్నానం సమాచరేన్నిత్యం సదీ ప్రస్రవణేషు చ॥
నదులలోను, పుష్కరిణులయందును, చెఱువులలోను, సరస్సులలోను, సెలయేటులలోను నిత్యము స్నానము చేయుట యుత్తమము- వ్యాసస్మృతి.

యస్తాదృశం చారురవం క్రౌంచం హన్యాదకారణాత్।
శోచన్నేవ ముహుః క్రౌంచీమ్ ఉపశ్లోక మిమం పునః।
జగావంతర్గతమనా భూత్వా శోకపరాయణః। 29

త మువాచ తతో బ్రహ్మా ప్రహసన్ మునిపుంగవమ్।
శ్లోక ఏవ త్వయా బద్ధో నాత్ర కార్యా విచారణా। 30

మచ్ఛందాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ।
రామస్య చరితం సర్వం కురు త్వమ్ ఋషిసత్తమ। 31

ధర్మాత్మనో గుణవతో లోకే రామస్య ధీమతః।
వృత్తం కథయ ధీరస్య యథా తే నారదాచ్ఛ్రుతమ్। 32

రహస్యం చ ప్రకాశం చ యద్వృత్తం తస్య ధీమతః।
రామస్య సహ సౌమిత్రే రాక్షసానాం చ సర్వశః। 33

వైదేహ్యాశ్చైవ యద్వృత్తం ప్రకాశం యది వా రహః।
తచ్చాప్యవిదితం సర్వం విదితం తే భవిష్యతి। 34

న తే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి।
కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్। 35

యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే।
తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి। 36

యావద్రామాయణకథా త్వత్కృతా ప్రచరిష్యతి।
తావదూర్ధ్వమధశ్చ త్వం మల్లోకేషు నివత్స్యసి। 37

ఇత్యుక్త్వా భగవాన్ బ్రహ్మా తత్రైవాంతరధీయత।
తతః సశిష్యో వాల్మీకిః మునిర్విస్మయమాయయౌ। 38

తస్య శిష్యాస్తతః సర్వే జగుః శ్లోకమిమం పునః।
ముహుర్ముహుః ప్రీయమాణాః ప్రాహుశ్చ భృశవిస్మితాః। 39

విష్కారణముగా వధించెనుగదా!" ఆ దృశ్యమునే తలంచుచు, ఆడు (క్రౌంచి) పక్షియొక్క దురవస్థనుగూడ స్మరించుచు కరుణార్ద్రహృదయుడై, తాను అప్రయత్నముగా పలికిన 'మానిషాద' అను శ్లోకమునే మనస్సులో మరల పఠించెను. (26-29)

అంతట బ్రహ్మ (తన అభిమతానుసారమే అతని ముఖమున ఆ పలుకులు వెలువడినవని భావించి) చిఱునవ్వు నవ్వుచు ఆ మహర్షితో పలికెను. "నీవు కనికరముతో పలికిన మాటలు ఛందోబద్ధమైన శ్లోకమే. ఈ విషయమున విచారింపవలసిన పనిలేదు. ఓ బ్రాహ్మణోత్తమా ! ఈ నీ వాక్కు (సరస్వతి) నా సంకల్ప ప్రకారమే ప్రవర్తిల్లినది. ఓ ఋషీశ్వరా ! నీవు శ్రీరామచరితమును సంపూర్ణముగా ఇట్టి ఛందస్సులోనే రచింపుము. (30-31)

శ్రీరాముడు 'ధర్మాత్ముడు, (ధర్మమును స్వయముగా ఆచరించుచు, ఇతరులచే ఆచరింపజేయును.) కరుణాళువు, సకలసద్గుణసంపన్నుడు, గొప్ప ప్రజ్ఞాశాలి, మేరునగధీరుడు.' అని లోకమున ఖ్యాతి కెక్కినవాడు. అట్టి శ్రీరామునిచరిత్రమును నారదుడు నీకు తెల్పిన ప్రకారము వర్ణింపుము. (32)

ప్రతిభామూర్తియైన శ్రీరాముని యొక్క చరితము, లక్ష్మణుని ఉదంతము, సీతావృత్తాంతము, భరతాదుల గాథలు రావణాది రాక్షసులకథలు లోకప్రసిద్ధములైనవీ, రహస్యముగానే మిగిలినవీ అన్నింటిని వివరింపుము. నారదుడు నీకు స్పష్టముగా వివరింపని రహస్యములుగూడ సాకల్యముగా నీ స్ఫురణకు వచ్చును. నీవు రచింపబోవు రామాయణమునందలి అంశములు అన్నియును సత్యములేయగును, అందలి పదములలోగాని, వాక్యములలో గాని, వాటి అర్థములలోగాని ఎట్టి దోషములూ ఉండవు. రామకథ పాపములను రూపుమాపునది, వినినమాత్రముననే పరమానందమును గూర్చునది. కనుక దానిని శ్లోకములలో రచింపుము. ఈ భూమండలమున పర్వతములు, నదులు ఉన్నంతకాలము ఈ రామాయణగాథ సమస్తలోకములయందును కీర్తింపబడుచుండును. నీచే రచితమగు రామాయణగాథ శ్లాఘింపబడుచుండునంతవఱకును నీకీర్తిప్రతిష్ఠలు ముల్లోకములయందును వ్యాపించుచుండును." (33-37)

ఈ విధముగా పలికి, బ్రహ్మదేవుడు అప్పుడే అంతర్ధానమాయెను. అప్పుడు వాల్మీకిమహర్షియు, ఆయనశిష్యులును ఆశ్చర్యమున మునింగిరి. (38)

అనంతరము ఆమునిశిష్యులు అందఱును 'మానిషాద' అను శ్లోకమును అత్యంతప్రీతితో గానముచేసిరి. వారిలో వారు (పరస్పరము) తమ ఆనందాశ్చర్యములను ప్రకటించుకొనిరి. (39)

సమాక్షరైః చతుర్భిర్యః పాదై ర్గీతో మహర్షిణా।
సోఽనువ్యాహరణాద్భూయః శోకః శ్లోకత్వమాగతః। 40

వాల్మీకిమహర్షి శోకాతిరేకమున కారుణ్యముతో సమానాక్షరములు గల నాలుగుపాదములశ్లోకమును పలికెను. దానినే శిష్యులు పలుమాఱులు వెంటవెంట పఠించుటవలన ఆ శ్లోకము మిక్కిలి ప్రసిద్ధికెక్కినది. శోకమే శ్లోకరూపమును పొందినది. అందువలన రామాయణము కరుణారసభరితమైనది. (40)

తస్య బుద్ధిరియం జాతా వాల్మీకేః భావితాత్మనః।
కృత్స్నం రామాయణం కావ్యమ్ ఈదృశైః కరవాణ్యహమ్। 41

అంతట ఆ వాల్మీకి పరమాత్మను ధ్యానించినవాడై "ఈ రామాయణకావ్యమును పూర్తిగా ఇట్టి శ్లోకములలోనే రచించెదను" అని సంకల్పము చేసెను. (41)

ఉదారవృత్తార్థపదైర్మనోరమైః
తదాస్య రామస్య చకార కీర్తిమాన్ ।
సమాక్షరైః శ్లోకశతైర్యశస్వినో
యశస్కరం కావ్యముదారధీర్మునిః । 42

తదుపగత సమాససంధియోగం
సమమధురోపనతార్థవాక్యబద్ధమ్ ।
రఘువరచరితం మునిప్రణీతం
దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్ । 43

మిక్కిలి ధీశాలియు, ఋషులలో సుప్రసిద్ధుడును ఐన వాల్మీకి వాసికెక్కిన శ్రీరామునియొక్క కీర్తిపరిమళములను ముల్లోకములలో గుబాళింపజేయునట్లు 'రామాయణకావ్యము'ను సమానాక్షరములుగల పాదములతో, విశేషవృత్తములతో, అర్థవంతములైన చక్కనిపదములతో వందలకొలది (ఇరువది నాలుగువేల) శ్లోకములతో మనోహరముగా రచించెను. వాల్మీకిమహర్షిప్రణీతమైన ఈ మహాకావ్యము రఘువంశోత్తముడైన శ్రీరామునిచరితమును, దశకంఠుడైన రావణునివధను వర్ణించు చున్నది. ఇందలి సమాసములు, సంధులు శాస్త్రానుకూలములై చక్కగా కుదురుకొనినవి. రసస్ఫోరకములై, మధురములై అర్థవంతములైన వాక్యములతో ఇది కూర్చబడినది. అట్టి ఈ 'రామాయణకావ్యమును వినుడు'- అని వాల్మీకి శిష్యులకును, లోకమునకును వెల్లడించెను. (42-43)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ద్వితీయస్సర్గః *(2)*

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు రెండవసర్గము సమాప్తము

-- * * * --

3. మూడవసర్గము

రామాయణకావ్యకథాసంగ్రహము.

శ్రుత్వా వస్తుసమగ్రం తత్ ధర్మాత్మా ధర్మసంహితమ్।
వ్యక్తమన్వేషతే భూయో యద్వృత్తం తస్య ధీమతః। 1

ధర్మాత్ముడైన వాల్మీకిముని ఇదివరలో నారదమహర్షివలన ధర్మసహితమైన రామకథను వినియుండెను. మహానుభావుడైన శ్రీరామచంద్రుని వృత్తాంతములో ఇంకను విశేషాంశములు ఏవైనను కలవేమోయని ఆలోచింపసాగెను. (1)

ఉపస్పృశ్యోదకం సమ్యక్ మునిః స్థిత్వా కృతాంజలిః।
ప్రాచీనాగ్రేషు దర్భేషు ధర్మేణాన్వేషతే గతిమ్। 2

ఆ మునీశ్వరుడు తూర్పువైపు కొనలుగల దర్భలపై కూర్చొని, విధ్యుక్తముగా ఆచమనము చేసి, భగవంతుని స్మరించుచు నమస్కరించెను. పిదప తనతపశ్శక్తిచే (దివ్యదృష్టితో) రామకథారీతినిగూర్చి ఆలోచన చేయసాగెను. (2)

రామలక్ష్మణసీతాభి రాజ్ఞా దశరథేన చ।
సభార్యేణ సరాష్ట్రేణ యత్ ప్రాప్తం తత్ర తత్త్వతః। 3

హసితం భాషితం చైవ గతిర్యా యచ్చ చేష్టితమ్।
తత్సర్వం ధర్మవీర్యేణ యథావత్ సంప్రపశ్యతి। 4అ

స్త్రీతృతీయేన చ తథా యత్ప్రాప్తం చరతా వనే।
సత్యసంధేన రామేణ తత్సర్వం చాన్వవేక్షత। 5

తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగమాస్థితః।
పురా యత్ తత్ర నిర్వృత్తం పాణావామలకం యథా। 6

తత్సర్వం తత్త్వతో దృష్ట్వా ధర్మేణ స మహాద్యుతిః।
అభిరామస్య రామస్య చరితం కర్తుముద్యతః। 7

కామార్థగుణసంయుక్తం ధర్మార్థగుణవిస్తరమ్।
సముద్రమివ రత్నాఢ్యం సర్వశ్రుతిమనోహరమ్। 8

స యథా కథితం పూర్వం నారదేన మహర్షిణా।
రఘువంశస్య చరితం చకార భగవాన్ ఋషిః। 9

జన్మ రామస్య సుమహత్ వీర్యం సర్వానుకూలతామ్।
లోకస్య ప్రియతాం క్షాంతిం సౌమ్యతాం సత్యశీలతామ్। 10

నానాచిత్రకథాశ్చాన్యాః విశ్వామిత్రసమాగమే।
జానక్యాశ్చ వివాహం చ ధనుషశ్చ విభేదనమ్। 11

రామరామవివాదం చ గుణాన్ దాశరథే స్తథా।
తథాఽభిషేకం రామస్య కైకేయ్యా దుష్టభావతామ్। 12

సీతారామలక్ష్మణులు, దశరథమహారాజు, ఆతని భార్యలు, ఆయనరాజ్యప్రజలు (రాజ్యము) మొదలగు వారినిగూర్చియు, వారిప్రసన్నదరహాసములు, మధుర భాషణములు, గంభీర గమనములు, కార్య కలాపములు మున్నగువాటినిగూర్చియు బ్రహ్మవరప్రభావముచేత యోగదృష్టితో యథాతథముగ కన్నులగట్టినట్లు ఆ మునికి విదితమాయెను. (3-4)

సత్యసంధుడైన శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి దండకారణ్యమునకు వెళ్లుటను, జరిగినసంఘటలను అన్నింటిని ఆ తపస్వి దర్శించెను. అంతట ధర్మాత్ముడైన వాల్మీకికి యోగశక్తి ప్రభావమున రామాయణసంఘటనములన్నియును ఆ మూలాగ్రముగ కరతలామలకములయ్యెను (విశదమాయెను). (5-6)

శ్రీరామునిగుణములను యోగదృష్టితో దర్శించి, సంతోషమున వెలుగొందుచున్న వాల్మీకి మిక్కిలి మనోహరుడైన శ్రీరాముని యొక్క చరిత్రమును రచించుటకు పూనుకొనెను. శంఖములు, ముత్యపుచిప్పలు మొదలగు సాధారణవస్తువులు కలిగియున్నను సముద్రము ముఖ్యముగా రత్నాకరమేయైనట్లు రామాయణము కామార్థగుణములను అప్రధానముగా కలిగియున్నను ప్రధానముగా ధర్మమోక్షములనే ప్రతిపాదించును.ఇంకను అది వీనులకు విందొనర్చునది, మనస్సునకు ఆనందమును గూర్చునది - వేదసార సంగ్రహము. (7-8)

నారదమహర్షి ఇదివరలో చెప్పినరీతిగా పరమపూజ్యుడైన వాల్మీకిముని రఘువంశమున అవతరించిన శ్రీరామునియొక్క చరితమును రచించెను. (9)

దశరథునితపఃఫలముగా శ్రీమహావిష్ణువు రఘువంశమున శ్రీరాముడుగా అవతరించుట, తాటకాది రాక్షసులను వధింపగల ఆయనపరాక్రమము, అందఱికిని అనుకూలముగానుండు సత్ప్రవర్తన, అందఱిప్రేమలను చూఱగొనుట, ఇతరుల అపరాధములను మన్నించుట, ఎల్లరను అనుగ్రహించులక్షణము, సత్యస్వభావము మొదలగు విషయములను ఈ కావ్యమున ముని వర్ణించెను. (10)

శ్రీరామగాథకు అనుగుణమగు తదితరములైన విచిత్ర కథలను, రామలక్ష్మణులు విశ్వామిత్రునివెంటవెళ్లి, యాగసంరక్షణ చేయుటను, రాముడు శివధనుర్భంగముగావించుటను, జానకీ-ఊర్మిళా మాండవీ శ్రుతకీర్తులతో జరిగిన రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల వివాహములను, శ్రీరామపరశురాముల సంవాదమును, అట్లే శ్రీరాముని ఉదాత్తగుణములను కవి వర్ణించెను. రామునకు యువరాజపట్టాభిషేకప్రయత్నములను, కైకేయి దుర్భాగమువలన పట్టాభిషేకమునకు విఘ్నము ఏర్పడుటను,

విఘాతం చాభిషేకస్య రాఘవస్య వివాసనమ్।
రాజ్ఞః శోకవిలాపం చ పరలోకస్య చాశ్రయమ్। 13

ప్రకృతీనాం విషాదం చ ప్రకృతీనాం విసర్జనమ్।
నిషాదాధిపసంవాదం సూతోపావర్తనం తథా। 14

గంగాయాశ్చాపి సంతారం భరద్వాజస్య దర్శనమ్।
భరద్వాజాభ్యనుజ్ఞానాత్ చిత్రకూటస్య దర్శనమ్। 15

వాస్తుకర్మనివేశం చ భరతాగమనం తథా।
ప్రసాదనం చ రామస్య పితుశ్చ సలిలక్రియామ్।
పాదుకాగ్ర్యాభిషేకం చ నందిగ్రామనివాసనమ్। 16

దండకారణ్యగమనం విరాధస్య వధం తథా।
దర్శనం శరభంగస్య సుతీక్ష్ణేన సమాగమమ్। 17

అనసూయాసహాస్యామప్యంగరాగస్యచార్పణమ్।
అగస్త్యదర్శనం చైవ జటాయోరభిసంగమమ్।
పంచవట్యాశ్చ గమనం శూర్పణఖ్యాశ్చ దర్శనమ్। 18

శూర్పణఖ్యాశ్చ సంవాదం విరూపకరణం తథా।
వధం ఖరత్రిశిరసోః ఉత్థానం రావణస్య చ। 19

మారీచస్య వధం చైవ వైదేహ్యా హరణం తథా।
రాఘవస్య విలాపం చ గృధ్రరాజనిబర్హణమ్। 20

కబంధదర్శనం చైవ పంపాయాశ్చాపి దర్శనమ్। 21

శబర్యా దర్శనం చైవ హనుమద్దర్శనం తథా।
విలాపం చైవ పంపాయాం రాఘవస్యమహాత్మనః। 22

ఋశ్యమూకస్య గమనం సుగ్రీవేణ సమాగమమ్।
ప్రత్యయోత్పాదనం సఖ్యం వాలిసుగ్రీవవిగ్రహమ్। 23

శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి వనవాసమునకు బయలుదేఱుటను, దశరథుడు పుత్రశోకవిహ్వలుడై స్వర్గస్థుడగుటను మహర్షి వివరించెను. (11-13)

పురజనులు దుఃఖించుట, శ్రీరాముడు వారికన్నుగప్పి వెడలిపోవుట, నిషాదరాజైన గుహునితో సంభాషించుట, రథసారథిగానున్న సుమంత్రుడు అయోధ్యకు మఱలుట, మున్నగు విషయములను ఆ ముని వివరించెను. (14)

సీతారామలక్ష్మణులు గంగానదిని దాటుట, వారు భరద్వాజ మహామునిని దర్శించుట, ఆయనఅనుజ్ఞతో చిత్రకూటమునకు చేరుట, వాస్తుశాస్త్రప్రకారము అచట పర్ణశాలను నిర్మించుట, అందువసించుట, భరతుడు వసిష్ఠాదులతోగూడి శ్రీరాముని దర్శించుట, ప్రసన్నునిజేసికొనుట, శ్రీరాముడు స్వర్గస్థుడైన తండ్రికి తర్పణములను అర్పించుట, భరతుడు శ్రీరాముని పాదుకలను తీసికొని వచ్చి, వాటికి పట్టాభిషేకమొనర్చుట, పిమ్మట అతడు నందిగ్రామమున నివసించుట మొదలగు ఘట్టములను ముని వివరించెను. (15-16)

శ్రీరాముడు సీతాలక్ష్మణులతో దండకారణ్యమున ప్రవేశించుట, విరాధుని వధించుట, శరభంగుని దర్శించుట, సుతీక్ష్ణుని గలిసికొనుట, అత్రిమహర్షి ఆశ్రమమునకు చేరుట,[1] అచ్చట అనసూయాదేవి సీతాదేవికి దివ్య చందనాదులను సమర్పించుట, అగస్త్య మహామునిని దర్శించుట, ఆయిననుండి ధనుర్బాణములను గైకొనుట, జటాయువుతో సమాగమము, పంచవటిలో నివాసము శూర్పణఖరాక మున్నగు విషయములు తెలుపబడినవి. (17-18)

శూర్పణఖతో సంవాదము, ఆమెముక్కుచెవులను ఖండించుట, రాముడు ఖరదూషణత్రిశిరులను సంహరించుట, రావణుడు మారీచునితోగూడి పంచవటికి చేరుట, శ్రీరామునిచే మారీచ సంహారము, రావణునిచే సీతాపహరణము, శ్రీరాముడు సీతాదేవికై విలపించుట, జటాయుమరణము, మొదలగు అంశములు వివరింపబడినవి. (19-20)

కబంధుని, శబరిని దర్శించిన పిమ్మట, శ్రీరాముడు దుఃఖముతో పంపాతీరమునకు చేరుట, హనుమంతుని గలిసికొనుట, ఋశ్యమూకపర్వతమునకు చేరి, సుగ్రీవుని గలియుట, రామసుగ్రీవమైత్రి, పరస్పర ప్రతిజ్ఞలు, సుగ్రీవునకు రాముడు తనపై విశ్వాసము కల్గించుట, వాలిసుగ్రీవులయుద్ధము, రామునిచే వాలివధ, సుగ్రీవుని కిష్కింధకు రాజును జేయుట,

1) సీతారామలక్ష్మణులు విరాధుని వధింపకముందే అత్రిమునిఆశ్రమమునకు చేరిరి. ఇచట కథను సంక్షిప్తముగా తెలుపుటయే ప్రధానముగా భావింపబడుటచే సంఘటనలక్రమము పాటింపబడలేదు. "అత్ర సర్వత్ర క్రమో న వివక్షితః, రామాయణ ప్రతిపాద్యసంక్షేపమాత్రే తాత్పర్యాత్ "- గోవిందరాజీయ వ్యాఖ్య.

వాలిప్రమథనం చైవ సుగ్రీవప్రతిపాదనమ్ ।
తారావిలాపం సమయం వర్షరాత్రనివాసనమ్ । 24

కోపం రాఘవసింహస్య బలానామ్ ఉపసంగ్రహమ్ ।
దిశః ప్రస్థాపనం చైవ పృథివ్యాశ్చ నివేదనమ్ । 25

అంగులీయకదానం చ ఋక్షస్య బిలదర్శనమ్ ।
ప్రాయోపవేశనం చాపి సంపాతే శ్చాపి దర్శనమ్ । 26

పర్వతారోహణం చైవ సాగరస్య చ లంఘనమ్ ।
సముద్రవచనాచ్చైవ మైనాకస్య చ దర్శనమ్ । 27

రాక్షసీతర్జనం చైవ ఛాయాగ్రాహస్య దర్శనమ్ ।
సింహికాయాశ్చ నిధనం లంకామలయదర్శనమ్ ।
రాత్రౌ లంకాప్రవేశం చ ఏకస్యాపి విచింతనమ్ । 28

ఆపానభూమిగమనమ్ అవరోధస్య దర్శనమ్ ।
దర్శనం రావణస్యాపి పుష్పకస్య చ దర్శనమ్ । 29

అశోకవనికాయానం సీతాయాశ్చాపి దర్శనమ్ ।
అభిజ్ఞాన ప్రదానం చ సీతాయాశ్చాభిభాషణమ్ । 30

రాక్షసీతర్జనం చైవ త్రిజటాస్వప్నదర్శనమ్ ।
మణిప్రదానం సీతాయాః వృక్షభంగం తథైవ చ । 31

రాక్షసీవిద్రవం చైవ కింకరాణాం నిబర్హణమ్ ।
గ్రహణం వాయుసూనోశ్చ లంకాదాహాభిగర్జనమ్ । 32

ప్రతిప్లవనమేవాథ మధూనాం హరణం తథా ।
రాఘవాశ్వాసనం చాపి మణినిర్యాతనం తథా । 33

సంగమం చ సముద్రేణ నళసేతోశ్చ బంధనమ్ ।
ప్రతారం చ సముద్రస్య రాత్రౌ లంకావరోధనమ్ । 34

విభీషణేన సంసర్గం వధోపాయనివేదనమ్ ।
కుంభకర్ణస్య నిధనం మేఘనాదనిబర్హణమ్ । 35

రావణస్య వినాశం చ సీతావాప్తిమ్ అరేః పురే ।
విభీషణాభిషేకం చ పుష్పకస్య చ దర్శనమ్ । 36

తారావిలాపము, రామలక్ష్మణులు వర్షాకాలములో ప్రస్రవణ గిరిపై గడుపుట, మొదలగు ఘట్టములు వివరింపబడెను. (21-24)

సుగ్రీవునిఉపేక్షకు శ్రీరాముడు కుపితుడగుట, సేనల సమీకరణము, సుగ్రీవుడు నలుదిక్కులకును వానరయోధులను పంపుచువారికి భౌగోళికాంశములను తెలుపుట, శ్రీరాముడు హనుమంతునకు అంగుళీయకమును ఇచ్చుట, జాంబవదాదులు స్వయంప్రభను దర్శించుట, ప్రాయోపవేశమునకు సిద్ధపడిన అంగదాదులు సంపాతిని దర్శించుట మున్నగు అంశములు వర్ణితములు. (25-26)

మహేంద్రగిరినుండి హనుమంతుని సముద్రలంఘనము, సముద్రునిప్రేరణతో మైనాకునిఆతిథ్యప్రయత్నము, సురసను జయించుట, సింహికను వధించుట, లంకామలయపర్వతముల దర్శనము, రాత్రియందు మారుతి లంకలో ప్రవేశించి, ఒంటరిగా ఆలోచించుట, పానభూమిని, అంతఃపురమును గాలించుట, రావణుని దర్శించుట, పుష్పకమును పరిశీలించుట మున్నగు ఘట్టములు వక్కాణింపబడినవి. (27-29)

మారుతి అశోకవనమునకు చేరుట, రావణుడు సీతను భయపెట్టుట, హనుమంతుడు సీతమ్మను దర్శించుట, ఆమెకు అంగుళీయకమును సమర్పించుట, ఆమెతో సంభాషించుట, రాక్షసస్త్రీలు సీతాదేవిని భయపెట్టుట, త్రిజటాస్వప్నవృత్తాంతము, సీతాదేవి చూడామణిని హనుమంతునకు ఇచ్చుట, మారుతి అశోకవనమును ధ్వంసమొనర్చుట - అను విషయములు వర్ణితములు. (30-31)

హనుమంతునకు భయపడి రాక్షసస్త్రీలు పారిపోవుట, కింకరనాయకరాక్షసులను, తదితరరాక్షసయోధులను మారుతి మట్టుపెట్టుట, బ్రహ్మాస్త్రముచే బంధితుడైన వాయుసుతుడు రావణసభకు చేరుట, లంకను గాల్చుట, సముద్రముపై తిరుగు ప్రయాణము, వానరులచే మధుభక్షణము, ఆంజనేయుడు రాముని ఓదార్చుట చూడామణిని సమర్పించుట మొదలగు అంశములు తెలుపబడినవి. (32-33)

శ్రీరాముడు సైన్యములతో సముద్రతీరమునకు చేరుట, నలుడు సముద్రముపై సేతువును నిర్మించుట, సముద్రమును దాటి, రాత్రివేళ లంకను ముట్టడించుట, విభీషణశరణాగతి, రాక్షసయోధులను వధించు ఉపాయములను విభీషణుడు శ్రీరామునకు తెల్పుట, కుంభకర్ణమేఘనాదులసంహారము మున్నగు విషయములు వర్ణితములు. (34-35)

శ్రీరాముడు రావణుని పరిమార్చుట, సీతాదేవిని చేరదీయుట, విభీషణుని లంకాధిపతిని గావించి, పుష్పకమును అధిరోహించుట- విమానముపై అయోధ్యకు బయలుదేరుట, భరతుని గలియుట,

అయోధ్యాయాశ్చ గమనం భరతేన సమాగమమ్।
రామాభిషేకాభ్యుదయం సర్వసైన్యవిసర్జనమ్। 37

స్వరాష్ట్రరంజనం చైవ వైదేహ్యాశ్చ విసర్జనమ్।
అనాగతం చ యత్కించిత్ రామస్య వసుధాతలే।
తచ్చకారోత్తరే కావ్యే వాల్మీకిర్భగవాన్ ఋషిః। 38

శ్రీరాముడు రాజ్యాభిషిక్తుడగుట, వానరసైన్యములను వారివారి ప్రదేశములకు పంపివేయుట, ప్రజానురంజకముగా శ్రీరాముని పరిపాలనము, మున్నగు ఘట్టములు వర్ణింపబడినవి. ఇంతవరకునుగల రామాయణకావ్యవిశేషములన్నియును ఆఱు కాండములుగా వాల్మీకి మునిచే రచింపబడినవి. 'సీతా పరిత్యాగము'ను, తదనంతర ఘట్టములను పూజ్యుడైన వాల్మీకి మహర్షి ఉత్తరకాండమున వివరించెను. (36-38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే తృతీయస్సర్గః (3)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు మూడవసర్గము సమాప్తము

-- ❊ ❊ ❊ --

4. నాల్గవసర్గము

కుశలవులు రామాయణమును గానము చేయుట.

ప్రాప్తరాజ్యస్య రామస్య వాల్మీకి ర్భగవాన్ ఋషిః।
చకార చరితం కృత్స్నం విచిత్రపద మాత్మవాన్। 1

బ్రహ్మదేవుని అనుగ్రహమువలన దివ్యజ్ఞానమును పొందినవాడును, మహాకావ్యనిర్మాణచతురుడును ఐన వాల్మీకిమహర్షి కోసలాధీశుడైయున్న శ్రీరామునిచరితమును మనోజ్ఞములైన శబ్దార్థాలంకారశోభలతో లోకకల్యాణమునకై అద్భుతముగా రచించెను. (1)

చతుర్వింశత్ సహస్రాణి శ్లోకానామ్ ఉక్తవాన్ ఋషిః।
తథా సర్గశతాన్ పంచ షట్కాండాని తథోత్తరమ్। 2

వాల్మీకిమహర్షి రామాయణమును ఆఱుకాండములుగ ఐదునూఱుల సర్గములలో ఇరువదినాలుగువేల శ్లోకములతో రచించెను. పిదప ఉత్తరకాండమునకు రూపుదిద్దెను. (2)

కృత్వాఽపి తన్మహాప్రాజ్ఞః సభవిష్యం సహోత్తరమ్।
చింతయామాస కో న్వేతత్ ప్రయుంజీయాదితి ప్రభుః। 3

మిక్కిలి ప్రజ్ఞాశాలియు కడుసమర్థుడు ఐన వాల్మీకి శ్రీరామపట్టాభిషేకానంతరగాథను, అశ్వమేధయాగమునకు పిమ్మట జరుగనున్న వృత్తాంతమునుగూడ (ఉత్తరకాండమునుగూడ) రచించెను. ఇక 'ఈ రామాయణమును కంఠస్థము చేసి గానము చేయగలవారు ఎవరు? అని అతడు ఆలోచింపసాగెను. (3)

తస్య చింతయమానస్య మహర్షేర్భావితాత్మనః।
అగృహ్ణీతాం తతః పాదౌ మునివేషౌ కుశీలవౌ। 4

కుశీలవౌ తు ధర్మజ్ఞౌ రాజపుత్రౌ యశస్వినౌ।
భ్రాతరౌ స్వరసంపన్నౌ దదర్శాశ్రమవాసినౌ। 5

ఇట్లు చింతించుచున్న ఆ మహర్షి అట్టి (కావ్య శ్లోకములను కంఠస్థమొనర్చి గానముచేయుగల) శిష్యప్రాప్తికై భగవంతుని ధ్యానించుచుండగా మునివేషములలోనున్న కుశలవులు అచటికి వచ్చి, ఆయనపాదములను ఆశ్రయించిరి. గురుశుశ్రూష చేయుటలో నిరతులును, అధ్యయనము పూర్తియగునంతకును స్థిరమైన నిష్ఠగలిగిన రాజకుమారులును మంచి విద్యార్థులుగా ప్రసిద్ధికెక్కినవారును, సమానస్థాయిలో గానము చేయగల సోదరులును (కంఠములు కలిసినవారును) చక్కని గాత్రము గలవారును, తనఆశ్రమవాసులును ఐన ఆ లవకుశులను మహర్షి చూచెను. "వీరు రామాయణమును గానము చేయుటకు సమర్థులు" అని తలంచెను. (4-5)

స తు మేధావినౌ దృష్ట్వా వేదేషు పరినిష్ఠితౌ।
వేదోపబృంహణార్థాయ తావగ్రాహయత ప్రభుః। 6

కావ్యం రామాయణం కృత్స్నం సీతాయాశ్చరితం మహత్।
పౌలస్త్యవధమిత్యేవ చకార చరితవ్రతః। 7

పాఠ్యే గేయే చ మధురం ప్రమాణైస్త్రిభిరన్వితమ్।
జాతిభిః సప్తభిర్బద్ధం తంత్రీలయసమన్వితమ్। 8

రసైః శృంగార కారుణ్య హాస్య వీర భయానకైః।
రౌద్రాదిభిశ్చ సంయుక్తం కావ్యమేతదగాయతామ్। 9

తౌ తు గాంధర్వతత్త్వజ్ఞౌ మూర్ఛనాస్థానకోవిదౌ।
భ్రాతరౌ స్వరసంపన్నౌ గంధర్వావివ రూపిణౌ। 10

రూపలక్షణసంపన్నౌ మధురస్వరభాషిణౌ।
బింబాదివోద్ధృతౌ బింబౌ రామదేహాత్ తథాపరౌ। 11

తౌ రాజపుత్రౌ కార్త్స్న్యేన ధర్మ్య మాఖ్యాన ముత్తమమ్।
వాచోవిధేయం తత్సర్వం కృత్వా కావ్యమనిందితౌ। 12

ఋషీణాం చ ద్విజాతీనాం సాధూనాం చ సమాగమే।
యథోపదేశం తత్త్వజ్ఞౌ జగతుస్తౌ సమాహితౌ। 13

వేదతుల్యమైన (వేదప్రతిరూపమైన) రామాయణమును గానము చేయుటద్వారా వేదార్థములను వ్యక్తపఱచుటకై (వేదధర్మములకు ప్రసిద్ధిని గూర్చుటకై) సర్వసమర్థుడైన వాల్మీకి విషయములను గ్రహించుటలోను వాటిని ధారణ చేయుటలోను గట్టిశక్తిగలవారును, వేదవేదాంగములను అధ్యయనము చేసినవారును ఐన లవకుశులను స్వీకరించెను. ఈ రామాయణమహాకావ్యమున ముఖ్యముగా శ్రీరామవృత్తాంతము, సీతాచరితము, రావణవధ వర్ణింపబడినందున దీనిని 'రామాయణము' అనియు, 'సీతాచరిత్రము' అనియు, 'పౌలస్త్య వధము' అనియు పేర్కొననగునని అపారజ్ఞానసంపన్నుడైన వాల్మీకి కుశలవులకు ఉపదేశించెను. (6-7)

ఈ రామాయణము చక్కగా పఠించుటకును, మధురముగా గానము చేయుటకును అనువైనది. త్రిస్ర, చతురశ్ర, మిశ్ర ప్రమాణములతో లేదా ద్రుత, మధ్య, విలంబిత ప్రమాణములతో అలరారునది. స,రి,గ,మ,ప,ద,ని అను సప్తస్వరములతో కూర్చబడినది. వీణాది తంత్రీవాద్యములపైనను, మృదంగాదిలయ వాద్యములతోడను పలికించుటకు అనువైనది, శృంగార, వీర, కరుణ, హాస్య, రౌద్ర, భయానకాది నవరసములతో పరిపుష్టమైనది. అట్టి రామాయణకావ్యమును ఆ లవకుశులు గానము చేసిరి. (8-9)

కవలలైన ఆ లవకుశులు సంగీతశాస్త్రమున ఆరితేఱినవారు. వీణావాదనమున నేర్పరులు. మంద్ర మధ్యమ తార స్థాయులలో గానము చేయుటయందు నిపుణులు, కమ్మని కంఠము గలవారు, మనుష్య వేషములలోనున్న గంధర్వులవలె ఒప్పుచున్నవారు, అభినయించుచు పాడుటలో కుశలురు, మృదుమధురముగా భాషించుటలో చతురులు. రాముని రూపమునకు అచ్చుగుద్దినట్లుగా (రామునకు ప్రతిబింబములుగా) ఉన్నవారు. ఇట్టి లవకుశులు రామాయణమును గానము చేసిరి. (10-11)

ఏమాత్రమును లోపము లేకుండా గురూపదేశము ప్రకారము గానముచేయగలవారును, మునిబాలురవేషములలోనున్న వారును ఐన ఆ రాజకుమారులు సకలధర్మములను తెలుపునట్టి ఉత్తమమైన ఆ రామాయణకావ్యమును పూర్తిగా కంఠస్థ మొనర్చిరి. వారు అర్థవంతముగా చక్కగా పఠింపగలవారు, ఏ విషయమునందును మఱపులేక సావధానచిత్తులైయుండు వారు, మిక్కిలి ప్రజ్ఞాశాలురు, ఉత్తమ గుణములకు కుదురైన వారు, సమస్తశబ్దలక్షణములను ఎఱిగినవారు. మహర్షులు, బ్రాహ్మణోత్తములు, సాధుపురుషులు చేరియున్నచోట ఆ సోదరులు రామాయణకావ్యగానము చేసిరి. (12-13)

మహాత్మానౌ మహాభాగౌ సర్వలక్షణలక్షితౌ।
తౌ కదాచిత్ సమేతానామ్ ఋషీణాం భావితాత్మనామ్।
ఆసీనానాం సమీపస్థౌ ఇదం కావ్యమ్ అగాయతామ్। 14

తచ్ఛ్రుత్వా మునయస్సర్వే బాష్పపర్యాకులేక్షణాః।
సాధు సాధ్వితి తావూచుః పరం విస్మయమాగతాః। 15

తే ప్రీతమనసః సర్వే మునయో ధర్మవత్సలాః।
ప్రశశంసుః ప్రశస్తవ్యౌ గాయమానౌ కుశీలవౌ। 16

అహో గీతస్య మాధుర్యం శ్లోకానాం తు విశేషతః।
చిరనిర్వృత్తమప్యేతత్ ప్రత్యక్షమివ దర్శితమ్। 17

ప్రవిశ్య తావుభౌ సుష్ఠు భావం సమ్యగగాయతామ్।
సహితౌ మధురం రక్తం సంపన్నం స్వరసంపదా। 18

ఏవం ప్రశస్యమానౌ తౌ తపః శ్లాఘ్యైః మహాత్మభిః।
సంరక్తతరమత్యర్థం మధురం తావగాయతామ్। 19

ప్రీతః కశ్చిన్మునిస్తాభ్యాం సంస్థితః కలశం దదౌ।
ప్రసన్నో వల్కలం కశ్చిద్దదౌ తాభ్యాం మహాయశాః। 20

అన్యః కృష్ణాజినం ప్రాదాత్ మౌంజీమన్యో మహామునిః।
కశ్చిత్ కమండలుం ప్రాదాత్ యజ్ఞసూత్రం తథాపరః। 21

ఔదుంబరీం బ్రుసీమన్యో జపమాలామ్ అథాపరః।
బ్రుసీమన్యత్తదా ప్రాదాత్ కౌపీనమ్ అపరోమునిః। 22

తాభ్యాం దదౌ తదాహృష్టః కుఠారమపరోమునిః।
కాషాయమపరోవస్త్రం చీరమన్యో దదౌ మునిః। 23

జటాబంధనమన్యస్తు కాష్ఠరజ్జుం ముదాన్వితః।
యజ్ఞభాండమ్ ఋషిః కశ్చిత్ కాష్ఠభారం తథాపరః। 24

ఆయుష్యమపరే ప్రాహుః ముదా తత్రమహర్షయః।
దదుశ్చైవ వరాన్ సర్వే మునయః సత్యవాదినః। 25

ఆశ్చర్యమిదమాఖ్యానం మునినా సంప్రకీర్తితమ్।
పరం కవీనామాధారం సమాప్తం చ యథాక్రమమ్। 26

అభిగీతమిదం గీతం సర్వగీతేషు కోవిదౌ।
ఆయుష్యం పుష్టిజనకం సర్వశ్రుతిమనోహరమ్। 27

ఒకానొకప్పుడు వాల్మీకిమహర్షి ఆశ్రమమునకు పవిత్రాత్ములైన ఋషులెల్లరును విచ్చేసిరి. వారు అందరును అచట సుఖాసీనులై యుండిరి. అప్పుడు మిగుల బుద్ధిశాలురు, మహాసౌభాగ్యముగల వారు, సర్వ శుభలక్షణ సంపన్నులు ఐన ఆ కుశలవులు వారి సమక్షమున ఈ కావ్యమును గానము చేసిరి. (14)

ఆ సభలోని మునులు అందరును ఆ కావ్యగానమును విని, పరమాశ్చర్యభరితులైరి, వారు ఆనందాశ్రువులతో 'బాగుబాగు' అనుచు ఆ లవకుశులపై ప్రశంసలజల్లు కురిపించిరి. ఏ మాత్రము మాత్సర్యము లేనివారు, గానానందమున పొంగిపోయినవారు, అయిన ఆ మునులు అందరును, గానమధురిమలచే ప్రశంసార్హులైన కుశలవులను "అహో! ఈ గాన మాధుర్యము అత్యద్భుతము. అని మెచ్చుకొనుచు "శ్లోకముల రచనావైశిష్ట్యము ఇంకను ప్రశంసనీయము. ఇది ఎన్నడో జరిగిన వృత్తాంతమేయైనను నేడు కన్నులకు గట్టినట్లున్నది"- అని కొనియాడసాగిరి. (15-17)

ఆ లవకుశులు ఇద్దరును శ్లోకములలోని భావములు, రసములు చక్కగా వ్యక్తమగునట్లుగా లయబద్ధముగా సప్తస్వర సంపదతో రాగయుక్తముగా మధురముగా గానముచేసిరి. తపోధనులు, మహాత్ములు ఐన ఆ మునుల ప్రశంసావాక్యములను గాంచి, ఆ లవకుశులు భావరాగతాళయుక్తముగా ఇంకను మధురముగా గానము చేయసాగిరి. (18-19)

వారిగానమునకు ఆనందించిన అచటి మునులలో ఒకరు వారికి కలశమును బహూకరించెను. వాసికెక్కిన మఱియొక మహర్షి ప్రసన్నుడై వల్కలమును, ఇంకొకరు జింకచర్మమును, వేఱొకరు మౌంజిని (దర్భ మొలత్రాడును) మఱియొకరు కమండలువును, యజ్ఞోపవీతమును వేఱొకరును బహుమతిగా ఇచ్చిరి. ఒకరు మేడిపీఠమును, దానిపై అందమైన మెత్తని ఆసనమును, మఱియొకరు జపమాలను, వేఱొకరు కౌపీనమును బహూకరించిరి. అట్లే ప్రసన్నమైన మనస్సుతో ఒకరు గొడ్డలిని, వేఱొకరు కాషాయవస్త్రములను, ఉత్తరీయమును, మఱియొకరు జటాబంధనమును, ఇంకొకరు కాష్ఠరజ్జువును, యజ్ఞపాత్రను, వేఱొకరు సమిధలను కానుకలుగా సమర్పించిరి. పిమ్మట సభలోని మహర్షులు అందరును స్వస్తివాచనములతో వారిని ఆశీర్వదించిరి, వరములను ఇచ్చిరి. (20-25)

వాల్మీకి మహర్షి విరచించిన ఈ మహాకావ్యము మిక్కిలి అద్భుతావహముగా ఉన్నది. మొదటినుండియు చివరివఱకు ఏమాత్రము కుంటుపడక పూర్తిగా రచింపబడిన ఈ కావ్యము కవీశ్వరులకు అందఱికిని మిక్కిలి ఆదర్శప్రాయమైనది. (26)

"ఓ గానకోవిదులారా! మీ కావ్యగానము అద్భుతముగా ఉన్నది. ఇది ఆయుర్వృద్ధికరమైనది, పుష్టిని గూర్చునది,

ప్రశస్యమానౌ సర్వత్ర కదాచిత్ తత్ర గాయకౌ।
రథ్యాసు రాజమార్గేషు దదర్శ భరతాగ్రజః। 28

స్వవేశ్మ చానీయ తదా భ్రాతరౌ చ కుశీలవౌ।
పూజయామాస పూజార్హౌ రామ శ్శత్రునిబర్హణః। 29

ఆసీనః కాంచనే దివ్యే స చ సింహాసనే ప్రభుః।
ఉపోపవిష్టః సచివైః భ్రాతృభిశ్చ పరంతపః। 30

దృష్ట్వా తు రూపసంపన్నౌ తావుభౌ నియత స్తదా।
ఉవాచ లక్ష్మణం రామః శత్రుఘ్నం భరతం తథా। 31

శ్రూయతా మిద మాఖ్యానమ్ అనయో ర్దేవవర్చసోః।
విచిత్రార్థ పదం సమ్య గ్గాయకౌ తావచోదయత్। 32

తౌ చాపి మధురం రక్తం స్వంచితాయత నిస్స్వనమ్।
తంత్రీలయవదత్యర్థం విశ్రుతార్థమగాయతామ్। 33

హ్లాదయత్ సర్వగాత్రాణి మనాంసి హృదయాని చ।
శ్రోత్రాశ్రయసుఖం గేయం తద్బభౌ జనసంసది। 34

ఇమౌ మునీ పార్థివలక్షణాన్వితౌ
కుశీలవౌ చైవ మహాతపస్వినౌ ।
మమాపి తద్భూతికరం ప్రవక్ష్యతే
మహానుభావం చరితం నిబోధత । 35

తతస్తు తౌ రామవచః ప్రచోదితౌ
ఆగాయతాం మార్గవిధాన సంపదా ।
స చాపి రామః పరిషద్గతః శనైః
బుభూషయాసక్తమనా బభూవ హ । 36

పెక్కురకముల కర్ణపేయమైనది. ఈ కావ్యమును మీరు మధురముగా ఆలపించితిరి" అని అచటివారు అందఱును వారిని ప్రశంసించిరి. ఒకానొకప్పుడు వీధులయందును, రాజమార్గముల యందును గానము చేయుచున్న ఆ లవకుశులను భరతాగ్రజుడైన శ్రీరాముడు తిలకించెను. (27-28)

అంతట రామాయణమును మధురముగా గానము చేయుచు అందరి ప్రశంసలకు పాత్రులైన, ఆ లవకుశసోదరులను అరివీరభయంకరుడైన శ్రీరాముడు తనభవనమునకు రప్పించి, వారిని ప్రశంసించెను. (29)

శ్రీరామచంద్రప్రభువు దివ్యమైన బంగారు సింహాసనముపై ఆసీనుడై యుండెను. ఆ మహావీరుని సమీపమున మంత్రులు, సోదరులు చేరియుండిరి. (30)

అశ్వమేధయాగదీక్షలోనున్న శ్రీరాముడు ముద్దులొలుకుచున్న ఆ ఇద్దఱు చిన్నారులను చూచి, లక్ష్మణ భరత శత్రుఘ్నులతో "దివ్యమైన వర్చస్సుగల ఈ చిరంజీవులు గానము చేసెడి విచిత్రార్థపద విలసితమైన ఈ వృత్తాంతమును వినుడు" అని పలికి, ఆ మధుర గాయకులను పాడుటకై ప్రోత్సహించెను. (31-32)

ఆ బాలకులిద్దఱును ప్రసిద్ధికెక్కిన ఆ రామాయణ గాథను మధురముగా, రాగరసయుక్తముగా, వీణాతంత్రులను మీటుచు లయబద్ధముగా శ్రావ్యమైన కంఠస్వరములతో గానము చేసిరి. ఆ మహాజనసభలో వీనులవిందు గావించుచు వారు హాయిగా గానము చేసిన ఆ పాట సదస్యుల శరీరములను పులకింపజేసెను, మనస్సులను ఆహ్లాదపఱచెను, హృదయములను ద్రవింపజేసెను. అది సభకే ఒక వెలుగు దివ్వెయై విలసిల్లెను. (33-34)

"ఈ బాలురు ఇద్దఱును మునివేషములలో ఉన్నను రాజలక్షణములు గలవారు. వీరు గాయకులు, మహాతపస్సంపన్నులు. వీరికావ్యగానము నాకును ఆనందమును గూర్చుచున్నది. కనుక నాకును శ్రేయస్కరమైన ఈ మహాచరితమును వినుడు." అంతట వారు శ్రీరాముని ప్రోత్సాహముతో సర్వజనామోదకమైన మార్గపద్ధతిలో గానము[1] చేసిరి. శ్రీరాముడును సభలోని వారితో పాటు ఆ గానానందమును తాను అనుభవింపదలచినవాడై ఆ గానమును వినుటలోనే నిమగ్నుడాయెను. దానిని ఎంతగా విన్నను వారికి తనివితీరకుండెను. (35-36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే వాల్మీకీయే బాలకాండే చతుర్థస్సర్గః (4)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నాల్గవసర్గము సమాప్తము

-- * * * --

1) సంగీతము(గానము) 'మార్గము, దేశి' అని రెండువిధములు. వేర్వేరు ప్రాంతములయందలి ప్రాకృతభాషలలో గానముచేయబడు సంగీతమును 'దేశి' అనియందురు. సంప్రదాయబద్ధముగా సంస్కృతభాషను అనుసరించి గానముచేయబడుదానిని 'మార్గసంగీతము' అనియందురు. శాస్త్రీయసంగీతము మార్గము, లలితసంగీతము 'దేశి'

5. ఐదవసర్గము

అయోధ్యానగరవర్ణనము.

సర్వాపూర్వమియం యేషామ్ ఆసీత్ కృత్స్నా వసుంధరా।
ప్రజాపతిముపాదాయ నృపాణాం జయశాలినామ్। 1

యేషాం స సగరో నామ సాగరో యేన ఖానితః।
షష్టిః పుత్రసహస్రాణి యం యాంతం పర్యవారయన్। 2

ఇక్ష్వాకూణామిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనామ్।
మహదుత్పన్నమాఖ్యానం రామాయణమితి శ్రుతమ్। 3

తదిదం వర్తయిష్యామి సర్వం నిఖిలమాదితః।
ధర్మకామార్థసహితం శ్రోతవ్యమ్ అనసూయయా। 4

కోసలో నామ ముదితః స్ఫీతో జనపదో మహాన్।
నివిష్టః సరయూతీరే ప్రభూతధనధాన్యవాన్। 5

అయోధ్యా నామ నగరీ తత్రాసీల్లోకవిశ్రుతా।
మనునా మానవేంద్రేణ యా పురీ నిర్మితా స్వయమ్। 6

ఆయతా దశ చ ద్వే చ యోజనాని మహాపురీ।
శ్రీమతీ త్రీణివిస్తీర్ణా సువిభక్తమహాపథా। 7

రాజమార్గేణ మహతా సువిభక్తేన శోభితా।
ముక్తపుష్పావకీర్ణేన జలసిక్తేన నిత్యశః। 8

తాం తు రాజా దశరథో మహారాష్ట్రవివర్ధనః।
పురీమావాసయామాస దివం దేవపతి ర్యథా। 9

కవాటతోరణవతీం సువిభక్తాంతరాపణామ్।
సర్వయంత్రాయుధవతీమ్ ఉపేతాం సర్వశిల్పిభిః। 10

సప్తద్వీపములతోగూడిన ఈ సమస్త భూమండలమును మనుప్రజాపతి మొదలుకొని జయశీలురైన పెక్కుమంది రాజులు పరిపాలించిరి. ఈ వంశమున సగరుడనువాడు సుప్రసిద్ధుడు. ఈ సగరునిఅఱువదివేలమంది కుమారులును యజ్ఞాశ్వనిమిత్తమై సముద్రమును త్రవ్విరి. కావున దానికి సాగరము అని పేరు వచ్చెను. ఈ ఇక్ష్వాకువంశమున మహానుభావులైన ఎందఱో రాజులు జన్మించి, వంశమునకు వన్నెదెచ్చిరి. అట్టి మహావంశమున జన్మించిన శ్రీరాముని చరితమే రామాయణము. బ్రహ్మానుగ్రహప్రభావమున పూవు దిద్దుకొనెను ఈ రామాయణమును లోకమున ప్రవర్తింపజేయుదును. ఇది ధర్మకామార్థములను ప్రతిపాదించును. దీనిని ఎట్టి దోష దృష్టియు లేకుండ వినవలసినది, పఠింపవలసినది. (1-4)

సరయూనదీతీరమున 'కోసల' అను సుప్రసిద్ధదేశము గలదు. అది ధనధాన్యసంపదలతో తులతూగుచున్నది. కనుక అచటి జనులు మిక్కిలి సంతుష్టులైయుండిరి. (5)

ఆ కోసలదేశమున 'అయోధ్య' అను పేరుగల ఒక మహానగరము గలదు. ఆ పురమును మానవేంద్రుడైన మనువు స్వయముగా నిర్మింపజేసెను. ఆ కారణముగా అది లోకప్రసిద్ధి వహించెను. ఆ మహానగరము పండ్రెండు యోజనముల పొడవును, మూడు యోజనముల వెడల్పును గలిగి మిక్కిలివిశాలమై అపూర్వశోభలతో విలసిల్లుచున్నది. అచటివీధులు ఇరువైపుల వృక్షములతో విరాజిల్లుచు విశాలములై యున్నవి. ఆ పురియందలి రాజమార్గము సువిశాలమై ఇరువంకల పూలవృక్షములతో శోభిల్లుచున్నది. జలములచే తడుపబడిన ఆ రాజమార్గము చెట్లనుండి రాలిన పుష్పములతో నిండి, చూడముచ్చటగా నున్నది. (6-8)

కోసలదేశమును ధర్మమార్గమున పరిపాలించుచున్న దశరథమహారాజు దేవేంద్రుడు అమరావతినివలె అయోధ్యాపుర వైభవమును ఇనుమడింపజేసెను. (9)

ఆ పురము ప్రశస్తమైన ద్వారములతోడను, ద్వారబంధముల తోడను అలరారుచుండెను. నగర మధ్యభాగమున వరుసలు దీరియున్న అంగళ్లతో అది మనోహరముగానుండెను. అచ్చట వివిధములగు యంత్రములు, ఆయుధములు అమర్చబడి యుండెను. అన్ని కళలయందును నిపుణులైన శిల్పులు

సూతమాగధసంబాధాం శ్రీమతీమ్ అతులప్రభామ్।
ఉచ్చాట్టాలధ్వజవతీం శతఘ్నీశతసంకులామ్। 11

వధూనాటక సంఘైశ్చ సంయుక్తాం సర్వతః పురీమ్।
ఉద్యానామ్రవణోపేతాం మహతీం సాలమేఖలామ్। 12

దుర్గగంభీరపరిఘాం దుర్గామ్ అన్యైః దురాసదామ్।
వాజివారణసంపూర్ణాం గోభిరుష్ట్రైః ఖరైస్తథా। 13

సామంతరాజసంఘైశ్చ బలికర్మభిరావృతామ్।
నానాదేశనివాసైశ్చ వణిగ్భిరుపశోభితామ్। 14

ప్రాసాదై రత్నవికృతైః పర్వతైరుపశోభితామ్।
కూటాగారైశ్చ సంపూర్ణామ్ ఇంద్రస్యేవామరావతీమ్। 15

చిత్రామ్ అష్టాపదాకారాం వరనారీగణైర్యుతామ్।
సర్వరత్నసమాకీర్ణాం విమానగృహశోభితామ్। 16

గృహగాఢా మవిచ్ఛిద్రాం సమభూమౌ నివేశితామ్।
శాలితండులసంపూర్ణామ్ ఇక్షుకాండరసోదకామ్। 17

దుందుభీభిః మృదంగైశ్చ వీణాభిః పణవై స్తథా।
నాదితాం భృశమత్యర్థం పృథివ్యాం తామనుత్తమామ్। 18

విమానమివ సిద్ధానాం తపసాధిగతం దివి।
సునివేశితవేశ్మాంతాం నరోత్తమసమావృతామ్। 19

యే చ బాణైర్న విధ్యంతి వివిక్తమ్ అపరాపరమ్।
శబ్దవేధ్యం చ వితతం లఘుహస్తా విశారదాః। 20

సింహవ్యాఘ్రవరాహాణాం మత్తానాం నర్దతాం వనే।
హంతారో నిశితైః శస్త్రైః బలాద్బాహుబలాదపి। 21

ఆ నగరమున ఉండిరి. అందు వాసిగాంచిన స్తుతిపాఠకులు, వందిమాగధులు గలరు. అది ధనధాన్య సంపదలతో శోభిల్లుచుండెను. ఎత్తైన కోటబురుజులతోను, ధ్వజములతోను, వందలకొలది శతఘ్నులతోను ఆ పురి రాజిల్లుచుండెను. (10-11)

ఆ పురి నృత్యకళాకుశలురైన నటీనటులతో శోభిల్లుచుండెను. అందు చూడముచ్చటైన మామిడి తోపులు గలవు. చుట్టునుగల విశాలమైన ప్రాకారము ఆ పురికి ఒడ్డాణమువలె మనోజ్ఞముగా నుండెను. దాని చుట్టును విశాలమైన లోతైన అగడ్తయు, శత్రువులకు దుర్భేద్యమైన కోటయు గలవు. అందు మేలు జాతికి చెందిన గుఱ్ఱములు, వేగముగాసాగి పోగల ఏనుగులు, వృషభములు, ఒంటెలు, అసంఖ్యాకముగా గలవు. (12-13)

కప్పములను చెల్లించుటకై వచ్చెడి సామంతరాజులనందడితో ఆ నగరము కలకలలాడుచుండెను. క్రయవిక్రయములకై ఏతెంచెడి వివిధదేశవాసులైన వ్యాపారులతో అది క్రిక్కిరిసి యుండెను. రత్నములు పొదిగిన రాజగృహములతోడను, క్రీడాపర్వతములతోడను, అంతస్తులతోగూడిన మేడలతోను ఒప్పుచు అది ఇంద్రుని అమరావతినగరమువలె విరాజిల్లు చుండెను. (14-15)

జూదపుపలకవలె 'అష్టాపదాకారములో'నున్న చిత్ర విచిత్రములైన రాజగృహములతో అది యొప్పుచుండెను. అది అందమైన సుందరీమణులతో అలరారుచుండెను, నానావిధ రత్నశోభలతో కలకలలాడుచుండెను. ఆకాశమును తాకుచుండెడి ఎత్తైన భవనములతో శోభిల్లుచుండెను. అచటి గృహస్థుల ఇండ్లు ఎట్టి దోషములును లేకుండ సమతలముపై నిర్మింపబడి క్రిక్కిరిసియుండెను. ఆ పురము మేలైన వరిధాన్యముతో, చెఱకురసమువంటి మధురజలములతో సమృద్ధమై యుండెను. (16-17)

దుందుభుల మ్రోతలతో, మృదంగధ్వనులతో, వీణానాదములతో, మద్దెలరవములతో ఆ మహానగరము ఎంతయు మాఱుమ్రోగు చుండెను. సిద్ధపురుషులకు తపఃఫలముగా లభించిన దివ్య భవనములవలె ఆ నగరమునందలి గృహములు బారులుదీఱి, విద్వాంసులతో నిండియుండెను. (18-19)

ఆ నగరమునందలి యోధులు, శస్త్రాస్త్రవిద్యలలో ఆరితేఱినవారు, సమర్థులు, శబ్దభేది విద్యానిపుణులు. కాని వారు సహాయపడువారులేక ఒంటరిగానున్నవారినిగాని, పాఱిపోవుచున్నవారినిగాని చంపెడువారు గారు. వనమునందు మత్తిల్లి గర్వముతో గర్జించెడి సింహములను, గాండ్రించు పెద్దపులులను, ఘుర్ఘురించు అడవి పందులను ఆ యోధులు

తాదృశానాం సహస్రైస్తైమ్ అభిపూర్ణాం మహారథైః।
పురీమ్ ఆవాసయామాస రాజా దశరథస్తదా। 22

రియలై వాడియైన శస్త్రములతో, బాహుబలముతో సంహరించు చుండెడివారు. అట్టి వేలకొలదిమహారథులతో[1] నిండియున్న ఆ అయోధ్యానగరమును దశరథమహారాజు పరిపాలించు చుండెను. (20-22)

తామగ్నిమద్భిః గుణవద్భి రావృతాం
ద్విజోత్తమైః వేదషడంగపారగైః ।
సహస్రదై స్సత్యరతైర్మహాత్మభిః
మహర్షికల్పైః ఋషిభిశ్చ కేవలైః । 23

ఆచటి ద్విజోత్తములు అందఱును నిత్యాగ్నిహోత్రులు, శమదమాది గుణసంపన్నులు, వేదవేదాంగములయందు పారంగతులు, సత్యమును పల్కుటయందు నిరతులు, మిక్కిలి ప్రజ్ఞావంతులు, కొల్లలుగా దానములు చేయువారు, మహర్షులతో సమానులు. అంతేగాదు వారు సాక్షాత్తుగా మహర్షులే. అట్టి అయోధ్యానగరమును రాజధానిగా జేసికొని, దశరథ మహారాజు కోసలదేశమును పరిపాలించుచుండెను. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచమస్సర్గః (5)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు ఐదవసర్గము సమాప్తము

-- * * * --

6. ఆఱవసర్గము

దశరథునిపాలనలో అయోధ్యానగరవైభవము.

తస్యాం పుర్యామ్ అయోధ్యాయాం వేదవిత్ సర్వసంగ్రహః।
దీర్ఘదర్శీ మహాతేజాః పౌరజానపదప్రియః। 1

ఇక్ష్వాకూణామ్ అతిరథో యజ్వా ధర్మపరో వశీ।
మహర్షికల్పో రాజర్షిః త్రిషు లోకేషు విశ్రుతః। 2

బలవాన్ నిహతామిత్రో మిత్రవాన్ విజితేంద్రియః।
ధనైశ్చ సంగ్రహైశ్చాన్యైః శక్రవైశ్రవణోపమః। 3

యథా మనుర్మహాతేజా లోకస్య పరిరక్షితా।
తథా దశరథో రాజా వసన్ జగదపాలయత్। 4

దశరథమహారాజు వేదార్థములను బాగుగా ఎఱిగినవాడు. ధనధాన్యాదులచే శూరులను, పండితులను ఆదరించి, తనవశమునందు ఉంచుకొనెడివాడు. భావిపరిణామములను ముందుగా గుర్తించువాడు, మిక్కిలి ప్రతాపశాలి, పురజనులకును, గ్రామప్రజలకును ప్రియమునుగూర్చువాడు, ఇక్ష్వాకువంశజులలో అతిరథుడు, విధ్యుక్తముగా యజ్ఞములను చేయువాడు, ధర్మకార్యములయందు నిరతుడు, ప్రజలనందఱిని అదుపులోనుంచగలవాడు. మహర్షితుల్యుడు, రాజర్షి, ముల్లోకములయందును సుప్రసిద్ధుడు, చతురంగ బలములు గలవాడు, శత్రువులను తుదముట్టించెడువాడు, సుప్రసిద్ధులైన మిత్రులు గలవాడు, నిషిద్ధ విషయములయందు మనసుపెట్టనివాడు, ధనకనక వస్తువాహనములను, తదితర నిధులను కల్గియుండుట యందు ఇంద్రునితో, కుబేరునితో సమానుడు. అట్టి దశరథమహారాజు లోకపరిరక్షణయందు మహా తేజశ్శాలియైన వైవస్వతమనువువలె తనకోసల రాజ్యమును పరిపాలించెను. (1-4)

1) శ్లో॥ ఆత్మానం సారథిం చాశ్వాన్ రక్షన్ యుధ్యేత యో నరః। స మహారథ సంజ్ఞః స్యాత్॥
తనను, తనసారథిని, అశ్వములను రక్షించుకొనుచు యుద్ధము చేయువాడు 'మహారథుడు' అనబడును.

తేన సత్యాభిసంధేన త్రివర్గమ్ అనుతిష్ఠతా।
పాలితా సా పురీ శ్రేష్ఠా ఇంద్రేణేవామరావతీ। 5

సత్యసంధుడును, ధర్మమును, ధర్మమునకు లోబడి అర్థకామములను పరిరక్షించువాడును ఐన దశరథుడు ఇంద్రుడు అమరావతిని వలె అయోధ్యను పాలించెను.(5)

తస్మిన్ పురవరే హృష్టా ధర్మాత్మానో బహుశ్రుతాః।
నరాస్తుష్టా ధనైః స్వైః స్వైః అలుబ్ధాః సత్యవాదినః। 6

శ్రేష్ఠమైన ఆ అయోధ్యానగరమునందలి జనులు సుఖశాంతులలో సంతోషముగా జీవించుచుండిరి. వారు ధర్మాత్ములు. అనేకశాస్త్రములను అధ్యయనము చేసినవారు. తాము కష్టపడి సంపాదించిన ధనములోడనే తృప్తిపడువారు, లోభగుణము లేనివారు, సత్యమును పలికెడువారు. (6)

నాల్పసన్నిచయః కశ్చిత్ ఆసీత్తస్మిన్ పురోత్తమే।
కుటుంబీ యో హ్యసిద్ధార్థోఽగవాశ్వధనధాన్యవాన్। 7

ఆ మహానగరమునందలి గృహస్థులలో[1] ఏ ఒక్కడును సంపన్నుడు కానివాడుగాని, గోవులు, అశ్వములు, ధనధాన్య సమృద్ధియు లేనివాడుగాని లేడు. వారందఱును తమ సంపదలను ధర్మకార్యములకును, ధర్మబద్ధముగా అర్థ, కామపురుషార్థములను సాధించుటకును వినియోగించెడి వారే. (7)

కామీ వా న కదర్యో వా నృశంసః పురుషః క్వచిత్।
ద్రష్టుం శక్యమ్ అయోధ్యాయాం నావిద్వాన్ న చ నాస్తికః। 8

ఆ పురమునందలిజనులలో కామాతురుడుగాని, కదర్యుడు (లోభి) గాని, క్రూరుడుగాని, విద్యాహీనుడుగాని, నాస్తికుడు గాని ఎంతగా వెదికినను కానరాడు.[2] (8)

సర్వే నరాశ్చ నార్యశ్చ ధర్మశీలాః సుసంయతాః।
ఉదితాశ్శీలవృత్తాభ్యాం మహర్షయ ఇవామలాః। 9

అయోధ్యయందలి స్త్రీపురుషులు ధర్మప్రవర్తనచే శ్రేష్ఠులు, ఇంద్రియనిగ్రహముగలవారు, సత్స్వభావము గలవారు, సదాచార సంపన్నులు, మహర్షులవలె నిర్మలస్వాంతులు. (9)

నాకుండలీ నాముకుటీ నాస్రగ్వీ నాల్పభోగవాన్।
నామృష్టో నానులిప్తాంగో నాసుగంధశ్చ విద్యతే। 10

ఆ అయోధ్యలో చెవులకు ఆభరణములు లేనివాడు లేడు, శిరస్త్రాణమును, తలపాగ మొదలగువానిని ధరింపని వాడులేడు, తనసంపదకు తగినట్లుగా భోగములను అనుభవింపనివాడు లేడు, అభ్యంగనస్నానములను చేయని వాడు లేడు, చందనాదికములను అలదుకొననివాడు లేడు, నుదుట తిలకమునుగాని, కస్తూరిని గాని బొట్టుగా ధరింపని వాడు లేడు. (10)

నామృష్టభోజీ నాదాతా నాప్యనఙ్గదనిష్కధృక్।
నాహస్తాభరణో వాపి దృశ్యతే నాప్యనాత్మవాన్। 11

ఆ అయోధ్యయందు ఆకలితో అలమటించువారు లేరు, అందఱును తనివిదీర భుజించువారే, అతిథి - అభ్యాగతులను ఆదరించెడివారే, అర్థులకు దానములను చేయువారే, బాహుభూషణములను, కంఠాభరణములను, కంకణములను, ఉంగరములను ధరించెడివారే, అందఱును అంతఃకరణ శుద్ధిగలవారే. (11)

1) కుటుంబీ = గృహస్థుడు, యజమాని
శ్లో॥ మాతా పితా స్నుషే పుత్రౌ పుత్రీ పత్న్యతిథిస్స్వయమ్। దశసంఖ్యా కుటుంబీతి విష్ణుశ్లోక్తం ద్విజోత్తమ!॥
ఓ బ్రాహ్మణోత్తమా! తల్లి, తండ్రి, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కోడండ్రు, కూతురు, తన ధర్మపత్ని, తాను, అతిథి అను పదిమందితో గూడియుండువాడు 'కుటుంబి'.

2) శ్లో॥ ఆత్మానం ధర్మకృత్యంచ పుత్రదారాంశ్చ పీడయేత్। లోభాద్యః పితరౌ భ్రాతౄన్ స కదర్య ఇతిస్మృతః॥
లోభమువలన ఆలుబిడ్డలను, తల్లిదండ్రులను, సోదరులను పీడించువాడు, ధర్మకార్యాచరణమునకు వెనుకాడువాడు, పిలిపిలాడు వాడు, కడకు తానుగూడ అనుభవింపక కష్టించుచు కూడబెట్టువాడు కదర్యుడు. – గోవిందరాజీయవ్యాఖ్య.

నానాహితాగ్నిః నాయజ్వా న క్షుద్రో వా న తస్కరః।
కశ్చిదాసీదయోధ్యాయాం న చ నిర్వృత్తసంకరః। 12

ఆ అయోధ్యానగరమునందు అగ్నికార్యములను చేయనివాడుగాని, సోమయాగమును ఆచరింపనివాడుగాని, విద్యలను అరకొరగా నేర్చినవాడు గాని, చాలియు చాలని సంపదగలవాడు గాని లేడు. దొంగలుగాని, వర్ణసంకరులుగాని అచట లేనేలేరు. (12)

స్వకర్మనిరతా నిత్యం బ్రాహ్మణా విజితేంద్రియాః।
దానాధ్యయనశీలాశ్చ సంయతాశ్చ ప్రతిగ్రహే। 13

అయోధ్యయందలి బ్రాహ్మణులు సర్వదా విధ్యుక్తములైన స్వకర్మలయందు నిరతులు, ఇంద్రియములను జయించినవారు, దానశీలురు, జపము, వేదాధ్యయనము చేసెడిస్వభావముగలవారు. దానములను స్వీకరించుటయందు విముఖులు. (13)

న నాస్తికో నానృతకో న కశ్చిదబహుశ్రుతః।
నాసూయకో న చాశక్తో నావిద్వాన్ విద్యతే తదా। 14

దశరథునిపరిపాలనకాలమునందు జానపదులలో నాస్తికులుగాని, అసత్యవాదులుగాని, శాస్త్రములను అభ్యసింపనివారుగాని, అసూయాపరులుగాని, ఇహపర సాధనయందు అశక్తులుగాని, అజ్ఞానులుగాని లేరు. (14)

నాషడంగవిదత్రాసీత్ నావ్రతో నాసహస్రదః।
న దీనః క్షిప్తచిత్తో వా వ్యథితో వాపి కశ్చన। 15

ఆ నగరమున వేదాంగములు (శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము) తెలియనివాడుగాని, వ్రతములను ఆచరింపనివాడుగాని లేడు, వేలకొలది ద్రవ్యములను దానము చేయనివాడుగాని, దీనుడుగాని, వ్యాకులచిత్తుడుగాని, రోగపీడితుడుగాని లేడు. (15)

కశ్చి న్నరో వా నారీ వా నాశ్రీమాన్ నాప్యరూపవాన్।
ద్రష్టుం శక్యమ్ అయోధ్యాయాం నాపి రాజన్యభక్తిమాన్। 16

అచటి స్త్రీపురుషులలో కాంతివిహీనులుగాని, సౌందర్యహీనులుగాని, రాజభక్తి లేనివారుగాని మచ్చునకైనను కనబడరు. (16)

వర్ణేష్వగ్ర్యచతుర్థేషు దేవతాతిథిపూజకాః।
కృతజ్ఞాశ్చ వదాన్యాశ్చ శూరా విక్రమసంయుతాః। 17

దీర్ఘాయుషో నరా స్సర్వే ధర్మం సత్యం చ సంశ్రితాః।
సహితాః పుత్రపౌత్రైశ్చ నిత్యం స్త్రీభిః పురోత్తమే। 18

ఆ నగరమునందలి బ్రాహ్మణులు మొదలగు నాలుగు వర్ణములవారు దేవతలను, అతిథులను పూజించుచుండెడివారు, చేసిన మేలును మఱువనివారు, ప్రీతితో దానములను చేసెడివారు, బ్రాహ్మణులు పాండిత్యమునందును, శాస్త్రవాదములయందును శూరులు, పరాక్రమవంతులు, ఇతరులు తమతమరంగములలో వీరులు, శూరులు, ఆ మహానగరమునందలి జనులు ఎల్లరును ధర్మములను ఆచరించువారు, సత్యమార్గమును వీడనివారు. అందువలన వారు దీర్ఘాయుష్మంతులు. భార్యాపుత్ర పౌత్రాదులతో కూడియుండువారు. (17-18)

క్షత్రం బ్రహ్మముఖంచాసీత్ వైశ్యాః క్షత్ర మనువ్రతాః।
శూద్రాః స్వధర్మనిరతాః త్రీన్ వర్ణానుపచారిణః। 19

క్షత్రియులు బ్రాహ్మణులయెడ గౌరవముగలిగి రాజ్యపాలన చేయుచుండెడివారు. వైశ్యులు క్షత్రియులఆజ్ఞలను పాటించెడివారు, శూద్రులు తమతమ ధర్మములనాచరించుచు ఈ మూడువర్ణములవారిని సేవించుచుండెడివారు. (19)

సా తేనేక్ష్వాకునాథేన పురీ సుపరిరక్షితా।
యథా పురస్తాన్మనునా మానవేంద్రేణ ధీమతా। 20

ఇక్ష్వాకువంశజుడైన దశరథమహారాజు ఆ అయోధ్యానగరమును పూర్వము ప్రతిభామూర్తియు, మానవేంద్రుడును ఐన మనువువలె చక్కగా రక్షించుచుండెను. (20)

యోధానామ్ అగ్నికల్పానాం పేశలానామ్ అమర్షిణామ్।
సంపూర్ణా కృతవిద్యానాం గుహా కేసరిణా మివ। 21

అచటి యోధులు పరాక్రమమున అగ్నివంటివారు, కుటిలత్వము లేనివారు, పరాభవములను ఏ మాత్రము సహింపనివారు, శస్త్రాస్త్రాదియుద్ధవిద్యలయందు ఆఱితేఱినవారు. అట్టి యోధులచే నిండి, ఆ నగరము సింహములచే గుహవలె దుర్భేద్యమై యుండెను. (21)

కాంభోజవిషయే జాతైః బాహ్లీకైశ్చ హయోత్తమైః ।
వనాయుజైః నదీజైశ్చ పూర్ణా హరిహయోత్తమైః । 22

వింధ్యపర్వతజైః మత్తైః పూర్ణా హైమవతైరపి ।
మదాన్వితైరతిబలైః మాతంగైః పర్వతోపమైః । 23

ఐరావతకులీనైశ్చ మహాపద్మకులైస్తథా ।
అంజనాదపి నిష్పన్నైః వామనాదపి చ ద్విపైః । 24

భద్రై ర్మంద్రై ర్మృగై శ్చైవ భద్రమంద్రమృగై స్తథా ।
భద్రమంద్రైర్భద్రమృగైః మృగమంద్రైశ్చ సా పురీ ।
నిత్యమత్తైః సదా పూర్ణా నాగై రచలసన్నిభైః । 25

సా యోజనే చ ద్వే భూయః సత్యనామా ప్రకాశతే ।
యస్యాం దశరథో రాజా వసన్ జగదపాలయత్ । 26

తాం పురీం స మహాతేజా రాజా దశరథో మహాన్ ।
శశాస శమితామిత్రో నక్షత్రాణీవ చంద్రమాః । 27

తాం సత్యనామాం దృఢతోరణార్గళాం
గృహైర్విచిత్రైః ఉపశోభితాం శివామ్ ।
పురీమ్ అయోధ్యాం నృసహస్రసంకులాం
శశాస వై శక్రసమో మహీపతిః । 28

కాంభోజదేశపు జాతిగుఱ్ఱములతోడను, బాహ్లీక దేశమునకు చెందిన ఉత్తమాశ్వములతోడను, వనాయురాజ్యమున బుట్టిన మేలుజాతిహయములతోడను, సింధుదేశమున జన్మించిన శ్రేష్ఠములైన గుఱ్ఱములతోడను ఉచ్చైఃశ్రవమువంటి ఉత్తమోత్తమహయములతోడను ఆ పురము విలసిల్లుచుండెను. వింధ్యపర్వతమున బుట్టిన మదపుటేనుగులతోడను, హిమవన్నగమున జన్మించిన మహాగజములతోడను, బాగుగా బలిసి, మిక్కిలి మదించి, పర్వతముల వలెనున్న మాతంగముల తోడను, ఐరావతవంశమున జన్మించినట్టివియు, పుండరీకమను పేరుగల మహాపద్మజాతికి చెందినవియు, వరుణదిగ్గజమైన అంజనజాతికి చెందినవియు, దక్షిణ దిగ్గజమైన వామనజాతిలో ఉద్భవించినవియు అగు భద్రగజములతోడను ఆ పురము నిండియుండెను. (22-24)

భద్రజాతిగజములతోడను, మంద్రజాతియేనుగుల తోడను, మృగజాతివారణములతోడను, అట్లే, భద్రమంద్ర, భద్రమృగ, మృగమంద్ర - అను రెండేసిజాతులసాంకర్యముగల ఏనుగుల తోడను, భద్ర మంద్ర మృగ- అను మూడేసి జాతులసంకర గజములతోడను, ఎల్లప్పుడు మదించియుండి, పర్వత సమానములైన ఏనుగులతోడను ఆ అయోధ్య విలసిల్లు చుండెను. (25)

ఆ నగరము వెలుపలగూడ రెండుయోజనముల మేరకు వ్యాపించియుండెను. సార్థకనామధేయము గల ఆ అయోధ్యను (యోద్ధుం అశక్యా, ఇతరులకు జయించుటకు సాధ్యముగానిది) దశరథమహారాజు పరిపాలించుచుండెను. (26)

రాజశిరోమణియు, మహాతేజశ్శాలియు ఐన ఆ దశరథ మహారాజు చంద్రుడు నక్షత్రములనువలె శత్రువులను తేజోవిహీనులను గావించుచు పరిపాలించుచుండెను. (27)

ఆ నగరము పేరుకు తగినట్లుగా దృఢమైన గడియలుగల కవాటములతోడను, చిత్రములైన గృహములతోడను, శోభిల్లు చుండెను. వేలకొలది పురజనులతో కలకలలాడుచు శుభప్రదమైన ఆ పురిని ఇంద్రసమానుడైన ఆ దశరథమహారాజు పరిపాలించుచుండెను. (28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే, బాలకాండే షష్ఠస్సర్గః *(6)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఆఱవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

7. ఏడవసర్గము

దశరథునిమంత్రులు - వారిగుణగణములు.

తస్యామాత్యా గుణైరాసన్ ఇక్ష్వాకోస్తు మహాత్మనః।
మంత్రజ్ఞాశ్చేంగితజ్ఞాశ్చ నిత్యం ప్రియహితే రతాః। 1

ఇక్ష్వాకువంశజుడును, మిక్కిలి ప్రజ్ఞాశాలియు ఐన ఆ దశరథ మహారాజు యొక్క అమాత్యులు కార్యవిచారణలో దక్షులు, ఇతరులఅభిప్రాయములను గుర్తించుటలో సమర్థులు, ఎల్లప్పుడును రాజునకు ప్రియమును గూర్చుట (మేలుచేయుట) యందే నిరతులు, సద్గుణ సంపన్నులు. (1)

అష్టౌ బభూవు ర్వీరస్య తస్యామాత్యా యశస్వినః।
శుచయశ్చానురక్తాశ్చ రాజకృత్యేషు నిత్యశః। 2

ధృష్టి ర్జయంతో విజయ స్సిద్ధార్థో హ్యర్థసాధకః।
అశోకో మంత్రపాలశ్చ సుమంత్ర శ్చాష్టమోఽభవత్। 3

వీరుడును, గొప్ప కీర్తిప్రతిష్ఠలు గలవాడును ఐన దశరథుని యొక్క ఆస్థానమున ఎనిమిదిమంది మంత్రులు గలరు. వారు సర్వవ్యవహారములయందు ఎట్టి దోషములకును తావీయనివారు, సర్వదా రాజకార్యములను నిర్వహించుట యందు తత్పరులు. ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రపాలుడు, సుమంత్రుడు అనువారు ఆ ఎనిమిది మంది మంత్రులు. (2-3)

ఋత్విజౌ ద్వావభిమతౌ తస్యాస్తామ్ ఋషిసత్తమౌ।
వసిష్ఠో వామదేవశ్చ మంత్రిణశ్చ తథాఽపరే। 4

విద్యావినీతా హ్రీమంతః కుశలా నియతేంద్రియాః।
శ్రీమంతశ్చ మహాత్మానః శాస్త్రజ్ఞా దృఢవిక్రమాః। 5

కీర్తిమంతః ప్రణిహితా యథావచనకారిణః।
తేజః క్షమాయశః ప్రాప్తాః స్మితపూర్వాభిభాషిణః। 6

క్రోధాత్ కామార్థహేతోర్వా న బ్రూయురనృతం వచః।
తేషామవిదితం కించిత్ స్వేషు నాస్తి పరేషు వా।
క్రియమాణం కృతం వాపి చారేణాపి చికీర్షితమ్। 7

వసిష్ఠుడు, వామదేవుడు అను మహర్షులు ఋత్విజులును ఆ ఆస్థానమున ప్రధాన పురోహితులుగా ఉండిరి. ఇంకను జాబాలి మొదలగు పురోహితులును, మంత్రులును ఉండిరి. వారు న్యాయశాస్త్రము, దండనీతి మొదలగు రాజవిద్యలలో నిపుణులు, అకృత్యములకు పాల్పడనివారు, నీతికుశలురు, విధ్యుక్తముగాని కార్యములయెడ విముఖులు, సంపన్నులు, మిక్కిలి ప్రజ్ఞావంతులు, రాజనీతిని ఎఱిగినవారు, తిరుగులేని పరాక్రమముగలవారు, మంత్రాంగమునందు ఖ్యాతికెక్కినవారు, రాజకార్యములయందు ఏమఱుపాటు లేనివారు, త్రికరణశుద్ధి గలవారు, తేజోమూర్తులు, క్షమాగుణముగలవారు, కీర్తిప్రతిష్ఠలుగలవారు, చిఱునవ్వుతో ముందుగా మాట్లాడు వారు, కోపమువలన గాని, కోరికలవలనగాని, స్వార్థచింతన వలనగాని అసత్యమునకు ఒడిగట్టనివారు. స్వరాష్ట్రములయందు గాని, పరరాష్ట్రములయందుగాని జరిగిన, జరుగుచున్న, జరుగబోవు విషయములన్నియును ఆ మంత్రులకు చారుల ద్వారా తెలియుచునే యుండును. (4-7)

కుశలా వ్యవహారేషు సౌహృదేషు పరీక్షితాః।
ప్రాప్తకాలం తు తే దండం ధారయేయుః సుతేష్వపి। 8

ఆ మంత్రులు, సమస్త వ్యవహారములయందును సమర్థులు. మిత్రులయెడ తమప్రవర్తనకు సంబంధించి రాజపరీక్షలలో నెగ్గినవారు. అపరాధము చేసినవారు తమసుతులైనప్పటికిని నిష్పక్షపాతముగా దండించెడివారు. వారు కోశాగారమును

కోశసంగ్రహణే యుక్తా బలస్య చ పరిగ్రహే।
అహితం చాపి పురుషం న విహింస్యుః అదూషకమ్। 9

వీరాశ్చ నియతోత్సాహా రాజశాస్త్రమనుష్ఠితాః।
శుచీనాం రక్షితారశ్చ నిత్యం విషయవాసినామ్। 10

బ్రహ్మక్షత్రమ్ అహింసంతః తే కోశం సమపూరయన్।
సుతీక్ష్ణ దండాః సంప్రేక్ష్య పురుషస్య బలాబలమ్। 11

శుచీనామ్ ఏకబుద్ధీనాం సర్వేషాం సంప్రజానతామ్। 12

నాసీత్ పురే వా రాష్ట్రే వా మృషావాదీ నరః క్వచిత్।
కశ్చిన్న దుష్టస్తత్రాసీత్ పరదారరతో నరః। 13

ప్రశాంతం సర్వమేవాసీత్ రాష్ట్రం పురవరం చ తత్।
సువాసస సువేషాశ్చ తే చ సర్వే సుశీలినః। 14

హితార్థం చ నరేంద్రస్య జాగ్రతో నయచక్షుషా।
గురౌ గుణగృహీతాశ్చ ప్రఖ్యాతాశ్చ పరాక్రమే। 15

విదేశేష్వపి విజ్ఞాతాః సర్వతో బుద్ధినిశ్చయాత్।
సంధి విగ్రహతత్త్వజ్ఞాః ప్రకృత్యా సంపదాన్వితాః। 16

మంత్ర సంవరణే శక్తాః శ్లక్ష్ణాః సూక్ష్మాసు బుద్ధిషు।
నీతిశాస్త్రవిశేషజ్ఞాః సతతం ప్రియవాదినః। 17

నింపుటకై ధనమును సమకూర్చుటయందును, యోగ్యతలను బట్టి వేతనములను ఒసంగుచు చతురంగబలములను సంరక్షించుటయందును జాగరూకులై యుందురు. ఇంకను, వారు శత్రువులను ఎదుర్కొనగల వీరులు, సర్వదా శత్రువులను జయించుటకు ఉత్సాహపడుచుండువారు. ఐనను శత్రువు నిరపరాధియైనచో అతనిని దండించెడివారు కారు. రాజనీతిని అనుసరించి శాసనములను ఆచరణలోనుంచెడివారు. అందువలన స్వదేశవాసులైన సాధువులను రక్షించువారు, అసాధువులను శిక్షించువారు. మఱియు వారు బ్రాహ్మణులకును, క్షత్రియులకును బాధ కలుగకుండ ధనాగారమును నింపెడివారు. అపరాధుల యొక్క దోషముల తారతమ్యములను బట్టియు, (అపరాధ రుసుము చెల్లించు విషయమున) వారి శక్తిసామర్థ్యములను బట్టియు దండనలను విధించెడివారు. (8-11)

మంత్రులందఱును త్రికరణశుద్ధితో ఏకగ్రీవముగా రాజ్యవ్యవహారములను నడుపుచుండువారు. ఆ పురమునందు గాని, రాజ్యమునందుగాని అబద్ధమాడువాడు ఎవ్వడును లేడు. అయోధ్యానగరమునందును, కోసలదేశమునందును ఏ ఒక్కడును వంచకుడు గాని, పరస్త్రీరతుడుగాని లేకుండెను. కనుక అంతటను ప్రశాంతి నెలకొనియుండెను. ఆ మంత్రులందఱును శుభవస్త్రములను, సముచితములైన వేషభూషణములను ధరించుచుండెడివారు. వారు సచ్ఛీలురు, రాజహితమునందే దృష్టిని నిలిపి, జాగరూకులై రాజ్య తంత్రములను నడిపెడివారు. వారు తల్లిదండ్రులు, గురువులు మొదలగు పెద్దలలోగల మంచిగుణములనే గ్రహింతురు. తమసద్గుణములకారణముగా పెద్దలఆదరాభిమానములకు పాత్రులైనవారు. వారు పరాక్రమమునందు ప్రసిద్ధులు. (12-15)

వారు తమబుద్ధిబలముచే భూత భవిష్యద్వర్తమాన విషయ పరిజ్ఞానము గలవారుగా విదేశములయందును ఖ్యాతివహించిన వారు. ఆ అమాత్యులందఱును ఇతరరాజులతో దేశకాల పరిస్థితులకు అనుగుణముగా సంధిచేసికొనుటను, యుద్ధమును నడిపించుటను ఎఱిగినవారు[1] కలిగిన సంపదతోడనే తృప్తిపడువారు, మంత్రాలోచనలను రహస్యముగానుంచుటలో సమర్థులు, సున్నితమైన విషయములను సూక్ష్మబుద్ధితో ఆలోచనచేయుటలో ప్రతిభగలవారు. రాజనీతిశాస్త్రపురోతులను

1) శ్లో॥ యదాత్వేవాల్పికా పీడా తదా సంధిం సమాశ్రయేత్। అభ్యుచ్ఛ్రయో యదాత్మానం తదా మన్యేత విగ్రహమ్॥
పరరాజులతో సంఘర్షణ అల్పముగా ఉన్నప్పుడు వారితో సంధి చేసికొనుట యుక్తము, మితిమీఱినప్పుడు యుద్ధమునకే సిద్ధము కావలెను. (మనుస్మృతి)

ఈదృశైస్తై రమాత్యైస్తు రాజా దశరథోఽనఘః।
ఉపపన్నో గుణోపేతైః అన్వశాసద్వసుంధరామ్। 18

అవేక్షమాణశ్చారేణ ప్రజా ధర్మేణ రంజయన్।
ప్రజానాం పాలనం కుర్వన్ అధర్మం పరివర్జయన్। 19

విశ్రుతస్త్రిషు లోకేషు వదాన్యః సత్యసంగరః।
స తత్ర పురుషవ్యాఘ్రః శశాస పృథివీమిమామ్। 20

నాధ్యగచ్ఛద్విశిష్టం వా తుల్యం వా శత్రు మాత్మనః।
మిత్రవాన్ నతసామంతః ప్రతాపహతకంటకః।
స శశాస జగద్రాజా దివం దేవపతిర్యథా। 21

తై ర్మంత్రిభి ర్మంత్రహితే నియుక్తైః
వృతోఽనురక్తైః కుశలైః సమర్థైః ।
స పార్థివో దీప్తి మవాప యుక్తః
తేజోమయై ర్గోభి రివోదితోఽర్కః । 22

బాగుగా ఎఱిగినవారు, రాజునకు హితము కలుగునట్లు ప్రియముగా మాటాడువారు. ఇట్టి సద్గుణసంపన్నులైన అమాత్యులతో గూడి ఎట్టి వ్యసనములు(1) లేని దశరథ మహారాజు కోసలరాజ్యమును పరిపాలించెను. (16-18)

దశరథ మహారాజు గూఢచారుల ద్వారా స్వదేశ పరదేశ పరిస్థితులను గమనించుచు అధర్మమునకు తావు లేకుండ ధర్మయుక్తముగా ప్రజలను రంజింపజేయుచు దేశమును పాలించుచుండెను. మహాదాతగా, సత్యసంధుడుగా ముల్లోకములయందును ఖ్యాతికెక్కినవాడై ఆ నరేంద్రుడు ఈ పృథివిని పరిపాలించుచుండెను. (19-20)

దశరథునకు పెక్కుమంది రాజులు మిత్రులుగా ఉండిరి. సామంతరాజులందఱును ఆయనకు పాదాక్రాంతులై యుండిరి. అతడు తనప్రతాపముచే క్షుద్రులైన శత్రువుల నందఱిని రూపుమాపెను. శత్రువులలో ఆయనకంటె అధికుడు గాని ఆయనతో సమానుడుగాని ఎవ్వడునులేడు- ఇంద్రుడు దేవలోకమునువలె ఆ దశరథుడు ఈ భూలోకమును పరిపాలించుచుండెను. (21)

రాజునకు హితమును గూర్చుటకై, తగినవిధముగా మంత్రాలోచనలు చేయుటకు నియమింపబడినవారును, ప్రభుభక్తి పరాయణులును, బుద్ధికుశలురును, కార్యదక్షులును ఐనట్టి మంత్రులతోగూడిన దశరథమహారాజు తేజోమయములైన కిరణములతో ఒప్పుచున్న ఉదయభానుని వలె ప్రకాశించుచుండెను. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తమస్సర్గః (7)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏడవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

1) శ్లో ॥ దశకామ సముత్థాని తథాష్టౌక్రోధజానిచ । వ్యసనాని దురంతాని ప్రయత్నేన వివర్జయేత్ ॥ (మనుస్మృతి)
కామజములైన వ్యసనములు పది, క్రోధజములైన వ్యసనములు ఎనిమిది - ఈ దుర్వ్యసనములకు లోనుగాకుండ ప్రయత్నపూర్వకముగా వీటిని వర్జింపవలెను.

శ్లో ॥ మృగయాక్షో దివాస్వాపః పరివాదస్త్రియోమదః । తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకోగణః ॥
పైశున్యం సాహసంద్రోహ ఈర్ష్యాసూయార్థ దూషణే । వాగ్దండజంచ పారుష్యమ్ క్రోధజోఽపి గణో ఽష్టకః ॥ మనుస్మృతి

వేట, పాచికల ఆట (జూదము) పగలు నిద్రించుట, నిందించుట, స్త్రీలోల్యము, గర్వపడుట, నృత్య, గీత, వాద్యములయందు విపరీతమైన ఆసక్తి, వ్యర్థముగా తిరుగుచుండుట - ఈ పదియును కామజములైన వ్యసనములు. చాడీలు చెప్పుట, దుస్సాహసము, ద్రోహచింత, అసహనము, ఇతరుల గుణములయందు దోషములను ఆరోపించుట, ధనముకొఱకై హీనముగా మాటాడుట, తిట్టుట, కఠినముగా మాట్లాడుట అను ఈ ఎనిమిదియును క్రోధజములైన వ్యసనములు.

8. ఎనిమిదవసర్గము

దశరథుడు సంతానము లేనందులకు విచారపడుట - అశ్వమేధయాగముచేయుటకు సంకల్పించుట.

తస్యత్వేవంప్రభావస్య ధర్మజ్ఞస్య మహాత్మనః।
సుతార్థం తప్యమానస్య నాసీద్వంశకరః సుతః। 1

చింతయానస్య తస్యైవం బుద్ధిరాసీన్మహాత్మనః।
సుతార్థం హయమేధేన కిమర్థం న యజామ్యహమ్। 2

స నిశ్చితాం మతిం కృత్వా యష్టవ్యమితి బుద్ధిమాన్।
మంత్రిభిః సహ ధర్మాత్మా సర్వై రేవ కృతాత్మభిః। 3

తతోఽబ్రవీదిదం రాజా సుమంత్రం మంత్రిసత్తమమ్।
శీఘ్రమానయ మే సర్వాన్ గురూం స్తాన్ సపురోహితాన్। 4

తతస్సుమంత్రస్త్వరితం గత్వా త్వరితవిక్రమః।
సమానయత్ స తాన్ సర్వాన్ సమస్తాన్ వేదపారగాన్। 5

సుయజ్ఞం వామదేవం చ జాబాలిమథ కాశ్యపమ్।
పురోహితం వసిష్ఠం చ యే చాన్యే ద్విజసత్తమాః। 6

తాన్ పూజయిత్వా ధర్మాత్మా రాజా దశరథ స్తదా।
ఇదం ధర్మార్థసహితం శ్లక్ష్ణం వచనమబ్రవీత్। 7

మమ లాలప్యమానస్య పుత్రార్థం నాస్తి వై సుఖమ్।
తదర్థం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ। 8

తదహం యష్టుమిచ్ఛామి శాస్త్రదృష్టేన కర్మణా।
కథం ప్రాప్స్యామ్యహం కామం బుద్ధిరత్ర విచార్యతామ్। 9

తతః సాధ్వితి తద్వాక్యం బ్రాహ్మణాః ప్రత్యపూజయన్।
వసిష్ఠప్రముఖాః సర్వే పార్థివస్య ముఖాచ్చ్యుతమ్। 10

ఊచుశ్చ పరమప్రీతాః సర్వే దశరథం వచః।
సంభారాః సంభ్రియంతాం తే తురగశ్చ విముచ్యతామ్। 11

సర్వథా ప్రాప్స్యసే పుత్రాన్ అభిప్రేతాంశ్చ పార్థివ।
యస్య తే ధార్మికీ బుద్ధిః ఇయం పుత్రార్థమాగతా। 12

తతః ప్రీతోఽభవద్రాజా శ్రుత్వా తద్ద్విజభాషితమ్।
అమాత్యాంశ్చాబ్రవీద్రాజా హర్షపర్యాకులేక్షణః। 13

ఇంతటి ప్రభావశాలియు, ధర్మజ్ఞుడును, మహాత్ముడును ఐన ఆ దశరథునకు వంశోద్ధారకుడైన పుత్రుడు లేకుండుటచే అతడు సంతానముకొఱకై పరితపించుచుండెను. (1)

ఈ విధముగా చింతించుచున్న ఆ మహారాజునకు "సంతానప్రాప్తికై అశ్వమేధయాగము చేయుట యుక్తముగదా" అను ఆలోచన తట్టెను. ప్రజ్ఞాశాలియు ధార్మికుడును ఐన ఆ మహారాజు మిక్కిలి బుద్ధికుశలురైన మంత్రులందఱితో గూడ సమాలోచనచేసి, 'యాగము చేయుటయే తగును' అను నిశ్చయమునకు వచ్చెను. (2-3)

అంతట దశరథుడు "పురోహితులతోగూడ గురువులందఱిని తోడ్కొనిరమ్ము" అని మంత్రి సత్తముడైన సుమంత్రుని ఆదేశించెను. పిమ్మట సుమంత్రుడు తత్క్షణమే త్వరత్వరగా వెళ్లి, వేదపారంగతులైన సుయజ్ఞుని, వామదేవుని, జాబాలిని, కాశ్యపుని, పురోహితముఖ్యుడైన వసిష్ఠుని, అట్లే ఇతరబ్రాహ్మణోత్తములను రాజభవనమునకు తోడ్కొనివచ్చెను. (4-6)

ధార్మికోత్తముడైన దశరథమహారాజు అచటికి విచ్చేసిన వసిష్ఠాది బ్రాహ్మణోత్తములనందఱిని పూజించి, ధర్మార్థ సహితములైన వచనములను మధురముగా ఇట్లు పలికెను. 'పుత్రులులేనందున తపనపడుచున్న నాకు మనఃశాంతి కఱవైనది. అందులకై అశ్వమేధయాగము చేయవలయునని నా సంకల్పము. అందువలన విధివిధానముగా యజ్ఞదీక్షను గైకొనదలచితిని. నేను కోరుకొనుచున్న ఈ అశ్వమేధయాగము నిర్విఘ్నముగా కొనసాగు ఉపాయమును ఆలోచింపుడు."(7-9)

వసిష్ఠుడు మొదలగు బ్రాహ్మణోత్తములందఱును రాజుగారి నోట వెలువడిన ఆ పలుకులకు 'బాగు బాగు' అనుచు మిక్కిలి సంతోషించిరి. వారందఱును పరమప్రీతులై దశరథునితో ఇట్లనిరి. "యజ్ఞమునకు అవసరమైన యూపపాత్రాది - ఉపకరణములన్నింటిని తెప్పింపుడు, యజ్ఞాశ్వమును విడువుడు. ఓ రాజా! పుత్ర సంతానముకొఱకై మీకు కలిగిన ఈ ధర్మసంకల్పము ఉత్తమమైనది - కావున మీరు అభిలషించిన రీతిగా పుత్రులను బడయగలరు". (10-12)

దశరథుడు ఆద్విజోత్తములఅమృతవాక్యములను విని, మిక్కిలి ప్రీతిచెందెను, పిమ్మట ఆ రాజు ఆనందాశ్రువులను రాల్చుచు అమాత్యులతో ఇట్లనెను. "మా గురువులు ఆదేశించిన

సంభారాస్సంభ్రియంతాం మే గురూణాం వచనాదిహ।
సమర్థాధిష్ఠితశ్చాశ్వః సోపాధ్యాయో విముచ్యతామ్। 14

సరయ్వాశ్చోత్తరే తీరే యజ్ఞభూమిః విధీయతామ్।
శాంతయశ్చాభివర్ధంతాం యథాకల్పం యథావిధి। 15

శక్యః ప్రాప్తుమయం యజ్ఞః సర్వేణాపి మహీక్షితా।
నాపరాధో భవేత్ కష్టో యద్యస్మిన్ క్రతుసత్తమే। 16

ఛిద్రం హి మృగయంతేఽత్ర విద్వాంసో బ్రహ్మరాక్షసాః।
నిహతస్య చ యజ్ఞస్య సద్యః కర్తా వినశ్యతి। 17

తద్యథా విధిపూర్వం మే క్రతురేష సమాప్యతే।
తథా విధానం క్రియతాం సమర్థాః కరణే ష్విహ। 18

తథేతి చాబ్రువన్ సర్వే మంత్రిణః ప్రత్యపూజయన్।
పార్థివేంద్రస్య తద్వాక్యం యథాజ్ఞప్తం నిశమ్య తే। 19

తథా ద్విజా స్తే ధర్మజ్ఞా వర్ధయంతో నృపోత్తమమ్।
అనుజ్ఞాతాస్తత స్సర్వే పునర్జగ్ముః యథాగతమ్। 20

విసర్జయిత్వా తాన్ విప్రాన్ సచివానిదమబ్రవీత్।
ఋత్విగ్భిః ఉపదిష్టోఽయం యథావత్ క్రతురాప్యతామ్। 21

ఇత్యుక్త్వా నృపశార్దూలః సచివాన్ సముపస్థితాన్।
విసర్జయిత్వా స్వం వేశ్మ ప్రవివేశ మహాద్యుతిః। 22

తతః స గత్వా తాః పత్నీః నరేంద్రో హృదయప్రియాః।
ఉవాచ దీక్షాం విశత యక్ష్యేఽహం సుతకారణాత్। 23

తాసాం తేనాతికాంతేన వచనేన సువర్చసామ్।
ముఖపద్మాన్యశోభంత పద్మానీవ హిమాత్యయే। 24

రీతిగా యజ్ఞమునకు వలయువస్తువులను సమకూర్చుడు. అధ్వర్యుడు (యజుర్వేదమును పఠించువాడు) మొదలగు ఋత్విక్కులు వెంటనడచుచుండగా సమర్థులైన యోధులచే రక్షింపబడు యజ్ఞాశ్వమును విడిచిపెట్టుడు. (13-14)

సరయూనదికి ఉత్తరతీరమున యజ్ఞభూమిని సిద్ధపఱచుడు. విఘ్ననివారకములైన శాంతికార్యములను క్రమముగా శాస్త్రోక్తముగా జరిపింపుడు. (15)

ఈ అశ్వమేధమహాయజ్ఞమును ఆచరించుటలో కష్టములుగాని అపచారములుగాని సంభవించు అవకాశమే లేకున్నచో సామాన్యులైన రాజులు అందఱును ఈ యజ్ఞమును చేయుటకు పూనుకొనెడివారే. విద్వాంసులైన (అశ్వమేధ యాగవిషయములను బాగుగా ఎఱిగిన) బ్రహ్మరాక్షసులు[1] యజ్ఞకార్యమునందలి దోషములను వెదకుచుందురు. వారు యజ్ఞమును భంగపఱచుటకు యత్నించుచుందురు. యజ్ఞము పాడైనచో కర్త వెంటనే నశించును. నేను సంకల్పించిన ఈ అశ్వమేధ యాగము ఎట్టిలోప(దోష)ములు లేకుండా యథావిధిగా పరిసమాప్తమగునట్లు చూడుడు. మీరు కార్యనిర్వహణదక్షులు గదా!" (16-18)

ఆ మంత్రులందఱును మహారాజుయొక్క ఆజ్ఞలను విని, ఆయనను ప్రశంసించుచు "ప్రభువులు ఆదేశించినట్లే చేయుదుము" అని పలికిరి. (19)

ధర్మజ్ఞులైన ఆ బ్రాహ్మణులందఱును రాజును ఆశీర్వదించి ఆయన అనుజ్ఞను గైకొని, తమతమనివాసములకు వెళ్ళిరి. (20)

బ్రాహ్మణోత్తములను వీడ్కొలిపిన పిదప మహారాజు "ఋత్విజులు ఆదేశించిన విధముగా యజ్ఞద్రవ్యములను సిద్ధపఱచుడు" అని సచివులతో పలికెను. (21)

మహారాజు ఈ విధముగా పలికి, అచట చేరియున్న అమాత్యులను పంపివైచి, సంతోషముతో తన మందిరమున ప్రవేశించెను. పిమ్మట ఆ మహారాజు తనప్రియపత్నులైన కౌసల్యాదులకడకేగి. "పుత్త్రప్రాప్తికై యజ్ఞమును చేయదలచితిని. మీరును దీక్షగైకొనుడు". అని పలికెను. మిక్కిలి సంతోషకరములైన ఆ పలుకులకు సుందరీమణులైన ఆ రాణులముఖపద్మములు మంచు తొలగిన పిమ్మట వికసించు కమలములవలె శోభిల్లెను. (22-24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే అష్టమస్సర్గః (8)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఎనిమిదవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

1) అకృతప్రాయశ్చిత్తాః అప్రతిగ్రాహ్యప్రతిగ్రహాః అయాజ్యయాజనాదిపాపైః రాక్షసత్వం ప్రాప్తాః బ్రాహ్మణాః బ్రహ్మరాక్షసాః ॥ యజ్ఞకార్యములయందు మంత్రలోపక్రియాలోపములకు ప్రాయశ్చిత్తములను చేసికొననివారు, గ్రహింపగూడనివస్తువులను దానముగా పుచ్చుకొనువారు, అనర్హులచే యజ్ఞములను చేయించువారు ఐన బ్రాహ్మణులు బ్రహ్మరాక్షసులు అయ్యెదరు. - గోవిందరాజీయవ్యాఖ్య

9. తొమ్మిదవసర్గము

'పుత్రసంతానప్రాప్తికై ఋష్యశృంగమహర్షిని పిలిపించుట అవసరము' - అని పలికి సుమంత్రుడు రోమపాదుని వృత్తాంతమును దశరథునకు తెల్పుట.

ఏతచ్ఛ్రుత్వా రహస్సూతో రాజానమ్ ఇదమబ్రవీత్।
ఋత్విగ్భిరుపదిష్టోఽయం పురావృత్తో మయా శ్రుతః। 1

సనత్కుమారో భగవాన్ పూర్వం కథితవాన్ కథామ్।
ఋషీణాం సన్నిధౌ రాజన్ తవ పుత్త్రాగమం ప్రతి। 2

కాశ్యపస్య తు పుత్త్రోఽస్తి విభండక ఇతి శ్రుతః।
ఋశ్యశృంగ ఇతి ఖ్యాతః తస్య పుత్త్రో భవిష్యతి। 3

స వనే నిత్యసంవృద్ధో మునిర్వనచరస్సదా।
నాన్యం జానాతి విప్రేంద్రో నిత్యం పిత్రనువర్తనాత్। 4

ద్వైవిధ్యం బ్రహ్మచర్యస్య భవిష్యతి మహాత్మనః।
లోకేషు ప్రథితం రాజన్ విప్రైశ్చ కథితం సదా। 5

తస్యైవం వర్తమానస్య కాలస్సమభివర్తత।
అగ్నిం శుశ్రూషమాణస్య పితరం చ యశస్వినమ్। 6

ఏతస్మిన్నేవ కాలే తు రోమపాదః ప్రతాపవాన్।
అంగేషు ప్రథితో రాజా భవిష్యతి మహాబలః। 7

తస్య వ్యతిక్రమాద్రాజ్ఞో భవిష్యతి సుదారుణా।
అనావృష్టిస్సుఘోరా వై సర్వభూతభయావహా। 8

అనావృష్ట్యాం తు వృత్తాయాం రాజా దుఃఖసమన్వితః।
బ్రాహ్మణాన్ శ్రుతవృద్ధాంశ్చ సమానీయ ప్రవక్ష్యతి। 9

భవంతః శ్రుతధర్మాణో లోకచారిత్రవేదినః।
సమాదిశంతు నియమం ప్రాయశ్చిత్తం యథా భవేత్। 10

వక్ష్యంతి తే మహీపాలం బ్రాహ్మణా వేదపారగాః।
విభండకసుతం రాజన్ సర్వోపాయైరిహానయ। 11

మంత్రియు సారథియు ఐన సుమంత్రుడు, మహారాజు రాణులతో పలికిన మాటలను విని, ఏకాంతముగా ఆయనతో ఇట్లనెను. "పుత్రప్రాప్తికై వసిష్ఠాదిమహర్షులు మీకుపదేశించిన అశ్వమేధయాగవిషయమును నేను ఇదివరలో ఇతిహాసరూపమున వినియుంటిని. ఓ రాజా! భవిష్యత్ సంఘటనలు వర్ణింపగల సనత్కుమారమహర్షి మీకు పుత్రప్రాప్తినిగూర్చి ఋషుల సమక్షమున ఈ కథను తెలిపియుండెను. (1-2)

కశ్యపమహర్షిపుత్త్రుడు విభండకుడు. అతనికి ఋశ్యశృంగుడు అను పుత్త్రుడు కలిగి ఖ్యాతికెక్కును. ఆ ఋశ్యశృంగమహర్షి నిరంతరము తండ్రియైన విభండకుని అనుసరించి, వనములలోనే సంచరించుచుండుటవలన ఆయనకు ఆ వనములు, అచటికి వచ్చివెళ్ళు ఋషులు తప్ప మఱియొక ప్రపంచమే తెలియదు. ఓ రాజా! ధర్మశాస్త్రజ్ఞులచే తెలుపబడి, లోకప్రసిద్ధమైన బ్రహ్మచర్యము రెండు విధములు.[1] ఋశ్యశృంగుడు ఈ రెండువిధములైన బ్రహ్మచర్యములను నడుపగలడు. అగ్నికార్యములను ఒనర్చుచు ప్రసిద్ధుడైన తండ్రిని, గురువులను సేవించుచు మొదటి బ్రహ్మచర్యమును పాటించుట ద్వారా ఋశ్యశృంగుడు కొంతకాలమును గడుపును. (3-6)

ఈ కాలమునందే పరాక్రమవంతుడు, మహాబలశాలియైన రోమపాదుడు అంగరాజ్యమునకు ప్రభువు అగును. ఆ రాజు ఒకప్పుడు ధర్మము తప్పినందువలన ఆ రాజ్యమునందు అంతటను చాలాకాలము అనావృష్టి ఏర్పడును. అది సమస్త ప్రాణులకు భీతిగొల్పునదియగును. తీవ్రమైన ఆ క్షామ పరిస్థితులకు రాజు మిక్కిలి ఖిన్నుడై వేదశాస్త్ర పండితులైన బ్రాహ్మణులను పిలిపించి, ఇట్లు పల్కును. (7-9)

"మీరందఱును సమస్తధర్మములను తెలిసినవారు. లోకవృత్తాంతములను ఎఱిగినవారు. ఈ అనావృష్టికి కారణమైన నా పాపములు తొలగుటకై తగుప్రాయశ్చిత్తములను, వాటి నియమములను దయతో తెలుపుడు." వేదపండితులైన ఆ బ్రాహ్మణులు ఇట్లు చెప్పెదరు. "ఓ రాజా! విభండక సుతుడైన ఋష్యశృంగ మహర్షిని ఏ విధముగనైనను ఇచటికి రప్పింపుడు. (10-11)

1) స్మృతికారులచే చెప్పబడి, లోకప్రసిద్ధమైన బ్రహ్మచర్యము రెండు విధములు - వివాహాత్పూర్వము మేఖలాజిన దండాదులను ధరించుచు నియమ జీవనమును నడుపుట యొకటి - వివాహానంతరము నిషిద్ధదినములలో భార్యతో కలియకుండుట రెండవది.

ఆనాయ్య చ మహీపాల ఋశ్యశృంగం సుసత్కృతమ్।
ప్రయచ్ఛ కన్యాం శాంతాం వై విధినా సుసమాహితః। 12

తేషాం తు వచనం శ్రుత్వా రాజా చింతాం ప్రపద్యతే।
కేనోపాయేన వై శక్యమ్ ఇహానేతుం స వీర్యవాన్। 13

తతో రాజా వినిశ్చిత్య సహమంత్రిభిరాత్మవాన్।
పురోహితమమాత్యాంశ్చ తతః ప్రేష్యతి సత్కృతాన్। 14

తే తు రాజ్ఞో వచః శ్రుత్వా వ్యథితా వినతాననాః।
న గచ్ఛేమ ఋషే ర్భీతా అనునేష్యంతి తం నృపమ్। 15

వక్ష్యంతి చింతయిత్వా తే తస్యోపాయాంశ్చ తత్క్షమాన్।
ఆనేష్యామో వయం విప్రం న చ దోషో భవిష్యతి। 16

ఏవమంగాధిపేనైవ గణికాభిః ఋషేః సుతః।
ఆనీతోఽవర్షయద్దేవ శాంతా చాస్మై ప్రదీయతే। 17

ఋశ్యశృంగస్తు జామాతా పుత్రాంస్తవ విధాస్యతి।
సనత్కుమార కథితమ్ ఏతావ ద్వ్యాహృతం మయా। 18

అథ హృష్టో దశరథః సుమంత్రం ప్రత్యభాషత।
యథర్శ్యశృంగ స్త్వానీతో విస్తరేణ త్వయోచ్యతామ్। 19

అట్లు ఋష్యశృంగుని పిలిపించి, బాగుగా సత్కరించి, ఆయనకు మీకుమార్తెయైన శాంతనిచ్చి నిర్విచారముగా వివాహము చేయుడు" అని - అప్పుడు రాజు బ్రహ్మచర్య వ్రతనిష్ఠలోనున్న ఆ మహర్షిని ఇచ్చటికి రప్పించుట యెట్లు? అని ఆలోచనలోపడును. (12-13)

అంతట ధీమంతుడగు ఆరాజు మంత్రులతో ఆలోచించి "ఋశ్యశృంగుని తీసికొనివచ్చుటకై బ్రాహ్మణులను పంపుటయే తగును" అని భావించి, పురోహితుని, మంత్రులను సత్కరించి పంపుటకు నిశ్చయించును. (14)

వారు రాజుమాటలను విని, కలవరపడి, వినమ్రులై "రాజా! విభండకమహర్షి యనిన మాకు భయము. కావున మేము అచటికి వెళ్లజాలము. కాని ఋశ్యశృంగుని రప్పించు ఉపాయమును తెల్పెదము" అని రాజునకు సవ్వుచెప్పుదురు. (15)

వారు ఆయనను తీసికొని వచ్చుటకు తగిన ఉపాయములను ఆలోచించి, ఆ రాజుతో ఇట్లు చెప్పెదరు. "మనకు ఎట్టి దోషమును అంటకుండ ఆ బ్రాహ్మణుని ఇచటికి రప్పింతము" అని - అంతట అంగరాజైన రోమపాదుడు గణికలద్వారా ఋశ్యశృంగుని రప్పించును. ఆయనరాకతో వర్షములు కురిసి, అనావృష్టి తొలగును. అనంతరము రాజు తన కుమార్తెయైన శాంతను ఆయనకు ఇచ్చి వివాహము జరిపించును. (16-17)

ఋశ్యశృంగుడు మీకును అల్లుడే[1] ఆ పుణ్యాత్ముని రాకతో మీకు పుత్రులు కలుగుదురు. సనత్కుమారుడు తెల్పిన వృత్తాంతమునంతయు మీకు తెల్పితిని." అందులకు దశరథుడు సంతసించినవాడై "రోమపాదుడు ఋశ్యశృంగుని అంగదేశమునకు రప్పించినరీతిని వివరింపుము" అని సుమంత్రునితో పలికెను. (18-19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే నవమస్సర్గః *(9)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు తొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

10. పదియవసర్గము

అంగదేశమునకు ఋశ్యశృంగునిఆగమనము.

సుమంత్రశ్చోదితో రాజ్ఞా ప్రోవాచేదం వచస్తథా।
యథర్శ్యశృంగస్త్వానీతః శృణు మే మంత్రిభిః సహ। 1

రాజుకోరికపై సుమంత్రుడు ఇట్లు చెప్పదొడంగెను. "మహారాజా! రోమపాదునిమంత్రులు ఋశ్యశృంగుని రప్పించిన రీతిని తెల్పెదను వినుడు." (1)

(1). శాంత దశరథుని ఔరసపుత్రిక. ఆమె రోమపాదునకు దత్తపుత్రిక. అందువలన రోమపాదునకువలె దశరథునకును ఋశ్యశృంగుడు అల్లుడే.

రోమపాదమువాచేదం సహామాత్యః పురోహితః।
ఉపాయో నిరపాయోఽయమ్ అస్మాభిరభిచింతితః। 2

ఋశ్యశృంగో వనచరః తపస్స్వాధ్యాయనే రతః।
అనభిజ్ఞః స నారీణాం విషయాణాం సుఖస్య చ। 3

ఇంద్రియార్థైరభిమతైః నరచిత్తప్రమాథిభిః।
పురమ్ ఆనాయయిష్యామః క్షిప్రం చాధ్యవసీయతామ్। 4

గణికా స్తత్ర గచ్ఛంతు రూపవత్యః స్వలంకృతాః।
ప్రలోభ్య వివిధోపాయైః ఆనేష్యంతీహ సత్కృతాః। 5

శ్రుత్వా తథేతి రాజా చ ప్రత్యువాచ పురోహితమ్।
పురోహితో మంత్రిణశ్చ తథా చక్రుశ్చ తే తదా। 6

వారముఖ్యాశ్చ తచ్ఛ్రుత్వా వనం ప్రవివిశుర్మహత్।
ఆశ్రమస్యావిదూరేఽస్మిన్ యత్నం కుర్వంతి దర్శనే। 7

ఋషిపుత్రస్య ధీరస్య నిత్యమాశ్రమవాసినః।
పితుస్స నిత్యసంతుష్టో నాతిచక్రామ చాశ్రమాత్। 8

న తేన జన్మప్రభృతి దృష్టపూర్వం తపస్వినా।
స్త్రీ వా పుమాన్ వా యచ్చాన్యత్ సర్వం నగరరాష్ట్రజమ్। 9

తతః కదాచిత్ తం దేశమ్ ఆజగామ యదృచ్ఛయా।
విభండకసుతస్తత్ర తాశ్చాపశ్యద్వరాంగనాః। 10

తాశ్చిత్రవేషాః ప్రమదా గాయంత్యో మధురస్వరాః।
ఋషిపుత్రమ్ ఉపాగమ్య సర్వా వచనమబ్రువన్। 11

కస్త్వం కిం వర్తసే బ్రహ్మన్ జ్ఞాతుమిచ్ఛామహే వయమ్।
ఏకస్త్వం విజనే ఘోరే వనే చరసి శంస నః। 12

అదృష్టరూపాః తాస్తేన కామ్యరూపా వనే స్త్రియః।
హార్దాత్తస్య మతిర్జాతా హ్యాఖ్యాతుం పితరం స్వకమ్। 13

పితా విభాండకోఽస్మాకం తస్యాహం సుత ఔరసః।
ఋశ్యశృంగ ఇతి ఖ్యాతం నామ కర్మ చ మే భువి। 14

అమాత్యులతోగూడియున్న పురోహితుడు రోమపాదునితో ఇట్లనెను. "మేము తెల్పిన ఈ ఉపాయమువలన ఎట్టి అపాయమూ జరుగదు. ఋశ్యశృంగుడు వనమున నివసించువాడు. అతడు తపస్సునందును, వేదాధ్యయనమునందును నిమగ్నుడై యుండువాడు. అతడు స్త్రీలస్వరూపములనుగూర్చి గాని, ఇంద్రియసుఖములనుగూర్చిగాని ఎఱుగడు. మానవుల చిత్తములను ఆకర్షించునట్టి ఇష్టమగు విషయములద్వారా ఆయనను పురమునకు శీఘ్రముగా రప్పింతము. నిశ్చయింపుడు. చక్కగా అలంకరించుకొనిన అందమైన గణికలకు బహుమానములను ఇచ్చి, వారిని పంపుదము. వారు అచటికి వెళ్లి, వివిధోపాయములతో ఋశ్యశృంగుని ఆకర్షించి తీసికొని వచ్చెదరు." (2-5)

రోమపాదుడు పురోహితునిసూచనలను ఆమోదించెను. పిమ్మట పురోహితుడు, మంత్రులు ఆ విధముగనే చేసిరి. వారిఆదేశములప్రకారము వారాంగనలును ఆ మహావనమున ప్రవేశించిరి. ఆ ఆశ్రమ సమీపమునకు చేరి, వారు నిత్యము ఆశ్రమవాసియు, జితేంద్రియుడును, ఋషిపుత్త్రుడును ఐన ఋశ్యశృంగమహర్షిదర్శనమునకై ప్రయత్నము చేయుచుండిరి. (6-7)

పితృసేవలలోనే సదా సంతుష్టుడైయుండు ఋశ్యశృంగుడు ఆశ్రమమును దాటి బయటికి రాలేదు. ఆ తపస్వి పుట్టినది మొదలు ఇంతవఱకును స్త్రీనిగాని, పురుషునిగాని, నగరములకును, గ్రామములకును సంబంధించిన మఱేప్రాణినీ చూచియెఱుగడు. అనంతరము ఋశ్యశృంగుడు ఒకసారి తలవని తలంపుగా ఆగణికలున్న ప్రదేశమునకు వచ్చి, వారిని చూచెను. (8-10)

చిత్రవిచిత్రములైన వేషములను ధరించియున్న ఆ సుందరీమణులందఱును మధురస్వరములతో గానము చేయుచు ఋషిపుత్త్రుని సమీపించి, ఇట్లు పలికిరి. (11)

"ఓ బ్రాహ్మణోత్తమా! నీవు ఎవరు? ఎవరి కుమారుడవు? ఇచ్చట ఉండుటకు కారణమేమి? ఈ నిర్జనమైన ఘోరారణ్యమున ఒంటరిగా సంచరించుటకు హేతువేమి? తెల్పుము. మేము వినగోరుచున్నాము." (12)

ఆ ఋశ్యశృంగుడు ఇదివరలో ఎన్నడును అట్టి ఆకర్షణీయములైన రూపములుగల స్త్రీలను చూచియెఱుగడు. కనుక వారిని చూచిన సంతోషములో తనతండ్రినిగూర్చి వారితో చెప్పదలచెను. (13)

"మాతండ్రి విభాండకమహర్షి. నేను ఆయనయొక్క ఔరస పుత్త్రుడను. నా పేరు ఋశ్యశృంగుడు. ఈ వనమున నా తపోజీవనము సుప్రసిద్ధము. ఓ సౌందర్యమూర్తులారా! ఇదిగో

ఇహాశ్రమపదోఽస్మాకం సమీపే శుభదర్శనాః।
కరిష్యే వోఽత్ర పూజాం వై సర్వేషాం విధిపూర్వకమ్। 15

ఋషిపుత్రవచః శ్రుత్వా సర్వాసాం మతిరాస వై।
తదాశ్రమపదం ద్రష్టుం జగ్ముస్సర్వాశ్చ తేన తాః। 16

ఆగతానాం తతః పూజామ్ ఋషిపుత్రశ్చకార హ।
ఇదమర్ఘ్యమ్ ఇదం పాద్యమ్ ఇదం మూలం ఫలం చ నః। 17

ప్రతిగృహ్య చ తాం పూజాం సర్వా ఏవ సముత్సుకాః।
ఋషేర్భీతాశ్చ శీఘ్రం తా గమనాయ మతిం దధుః। 18

అస్మాకమపి ముఖ్యాని ఫలానీమాని వై ద్విజ।
గృహాణ ప్రతి భద్రం తే భక్షయస్వ చ మా చిరమ్। 19

తతస్తాః తం సమాలింగ్య సర్వా హర్షసమన్వితాః।
మోదకాన్ ప్రదదుస్తస్మై భక్ష్యాంశ్చ వివిధాన్ బహూన్। 20

తాని చాస్వాద్య తేజస్వీ ఫలానీతి స్మ మన్యతే।
అనాస్వాదితపూర్వాణి వనే నిత్యనివాసినామ్। 21

ఆపృచ్ఛ్య చ తదా విప్రం వ్రతచర్యాం నివేద్య చ।
గచ్ఛంతి స్మాపదేశాత్తాః భీతా స్తస్య పితుః స్త్రియః। 22

గతాసు తాసు సర్వాసు కాశ్యపస్యాత్మజో ద్విజః।
అస్వస్థహృదయశ్చాసీత్ దుఃఖం స్మ పరివర్తతే। 23

తతోఽపరేద్యుః తం దేశమ్ ఆజగామ స వీర్యవాన్।
మనోజ్ఞా యత్ర తా దృష్టా వారముఖ్యాస్స్వలంకృతాః। 24

దృష్ట్వైవ తా స్తదా విప్రమ్ ఆయాంతం హృష్టమానసాః।
ఉపసృత్య తత స్సర్వాః తా స్తమూచురిదం వచః। 25

ఏహ్యాశ్రమపదం సౌమ్య హ్యస్మాకమితిచాబ్రువన్।
తత్రాప్యేషవిధిశ్శ్రీమాన్ విశేషేణ భవిష్యతి। 26

శ్రుత్వా తు వచనం తాసాం సర్వాసాం హృదయంగమమ్।
గమనాయ మతిం చక్రే తం చ నిన్యుస్తదా స్త్రియః। 27

ఈ సమీపముననే మా ఆశ్రమము గలదు. ఈ ఆశ్రమమున విధివిధానముగా మీ అందఱిని పూజింతును. కనుక మా ఆశ్రమమునకు విచ్చేయుడు." - ఆయనవచనములను విని, వారందఱికిని ఆశ్రమమును చూడవలెనని బుద్ధిపుట్టెను. అంతట వారు ఆయనతో గూడి ఆశ్రమమునకు వెళ్ళిరి. (14-16)

ఆశ్రమమునకు విచ్చేసిన వారికందఱికిని అతడు అర్ఘ్యపాద్యములను, కందమూల ఫలములను సమర్పించి వారిని ఆదరించెను. (17)

వారు ఆయనతో సల్లాపములొనర్చుటకు ఉత్సాహ పడుచున్నవారై, ఆయనపూజలను స్వీకరించిరి. పిదప అచటికి విభాండకముని వచ్చునను భయముతో శీఘ్రముగా అచటినుండి వెళ్ళిపోదలచిరి. (18)

"ఓ ద్విజోత్తమా ! మేము ఒసంగుచున్న ముఖ్యములైన ఈ ఫలములనుగూడ స్వీకరింపుడు. నీకు మేలు జరుగును. ఆలసింపక ఆరగింపుడు." పిదప వారందఱును ఆయనను కౌగిలించుకొని, మిక్కిలి ఆనందించిరి. మధురములైన లడ్డూలను, వివిధములగు భక్ష్యములను సమర్పించిరి. (19-20)

తేజోమూర్తియైన ఆ ఋశ్యశృంగుడు వాటిని భక్షించి, 'ఎల్లప్పుడును వనములలో నివసించువారు ఇంతకుముందెన్నడును రుచిచూడని ఫలములివి' అని భావించెను. (21)

ఆ గణికలు 'విభండకమహార్షి వీక్షణములో వచ్చి పడునోయని భయపడుచున్నవారై, మేము ఒక వ్రతమును ఆచరింపవలసియున్నది'. అని చెప్పి, ఋశ్యశృంగునినుండి సెలవుగైకొని, ఆ సాకుతో వారు ఆ ఆశ్రమమునుండి వెళ్ళసాగిరి. (22)

వారందఱును వెళ్ళిపోవుచుండగా విభాండకసుతుడైన ఋశ్యశృంగుడు వ్యాకులచిత్తుడై మిక్కిలి దుఃఖపడెను. జితేంద్రియుడైన ఆ ఋశ్యశృంగుడు అస్వస్థచిత్తుడైనందు వలన మఱునాడు, మనోహరముగా అలంకరించుకొని యున్న ఆ గణికలున్న ప్రదేశమునకు వచ్చెను. తమకడకు వచ్చుచున్న ఆ విప్రుని చూచినవెంటనే వారు సంతోషముతో పొంగిపోయిరి. పిమ్మట ఆయనను సమీపించి, వారు అందఱును ఇట్లు పలికిరి. (23-25)

"ఓ మహాత్మా! మా ఆశ్రమమునకు విచ్చేయుము. అచట ఇచ్చటికంటెను ఘనముగా మీకు సత్కారము జరుగును". అని వారు ఆయనతో పలికిరి. హృదయంగమములైన వారిమాటలను విని, అతడు వారివెంట పోదలచెను. ఆ వారాంగనలును ఆయనను తమవెంట దీసికొని అంగదేశమునకు వెళ్ళిరి. (26-27)

తత్ర చానీయమానే తు విప్రే తస్మిన్ మహాత్మని।
వవర్ష సహసా దేవో జగత్ ప్రహ్లాదయంస్తదా। 28

మహాత్ముడైన ఆ బ్రాహ్మణోత్తముడు అంగదేశమున కాలుమోపినంతనే వరుణదేవుడు లోకమునకు ఆహ్లాదమును గూర్చుచు వర్షముగురిపించెను. (28)

వర్షేణైవాగతం విప్రం విషయం స్వం నరాధిపః।
ప్రత్యుద్గమ్య మునిం ప్రహ్వః శిరసా చ మహీం గతః। 29

అంతట రోమపాదమహారాజు తనదేశమునకు వర్షమును తీసికొనివచ్చిన మునికి ఎదురేగి, భువిపై సాగిలపడి వినమ్రతతో నమస్కరించెను. (29)

అర్ఘ్యం చ ప్రదదౌ తస్మై న్యాయతస్సుసమాహితః।
వవ్రే ప్రసాదం విప్రేంద్రాత్ మా విప్రం మన్యురావిశేత్। 30

"ఆ రాజు భక్తిశ్రద్ధలతో ఆ మునికి అర్ఘ్యపాద్యాదులను సమర్పించెను. పిమ్మట ఓ మునీశ్వరా! వారాంగనలద్వారా ఆకర్షించి, మిమ్ము ఇక్కడికి రప్పించినందులకు ఆగ్రహింపక మమ్ము అనుగ్రహింపుడు" ('మిమ్ము ఇచ్చటికి రప్పించినందులకు మీ తండ్రియైన విభండకమహర్షి మమ్ము ఆగ్రహింపకుండునట్లు మీరు అనుగ్రహింపుడు') అని రాజు ఋశ్యశృంగుని వేడుకొనెను. (30)

అంతఃపురం ప్రవిశ్యాస్మై కన్యాం దత్త్వా యథావిధి।
శాంతాం శాంతేన మనసా రాజా హర్షమవాప సః। 31

ఏవం స న్యవసత్ తత్ర సర్వకామైః సుపూజితః।
ఋశ్య శృంగో మహాతేజా శాంతయా సహభార్యయా। 32

మునితోగూడ అంతఃపురమున ప్రవేశించిన పిదప ఆ రోమపాదుడు ప్రసన్నమనస్కుడై, తనకూతురైన శాంతను ఆయనకిచ్చి యథావిధిగా వివాహముసల్పి, ఆనందభరితుడాయెను. మహాతేజశ్శాలియైన ఆ ఋశ్యశృంగ మహర్షి గౌరవాదరములనందుకొనుచు, భార్యయైన శాంతతోగూడి రాజాంతఃపురమున సర్వసుఖములతో నివసింపసాగెను. (31-32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే దశమస్సర్గః *(10)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదియవసర్గము సమాప్తము

— * * * —

11. పదునొకొండవసర్గము

అయోధ్యకు ఋశ్యశృంగునిరాక.

భూయ ఏవ హి రాజేంద్ర శృణు మే వచనం హితమ్।
యథా స దేవప్రవరః కథాయామ్ ఏవమబ్రవీత్। 1

"ఓ రాజేంద్రా! సనత్కుమారమహర్షి తనకథాప్రసంగమునందు ఇంకను ఇట్లు చెప్పెను. అది మీకు హితకరమైనది. దానిని చెప్పెదను వినుము. (1)

ఇక్ష్వాకూణాం కులే జాతో భవిష్యతి సుధార్మికః।
రాజా దశరథో నామ్నా శ్రీమాన్ సత్యప్రతిశ్రవః। 2

అంగరాజేన సఖ్యం చ తస్య రాజ్ఞో భవిష్యతి।
కన్యా చాస్య మహాభాగా శాంతా నామ భవిష్యతి। 3

ఇక్ష్వాకుమహారాజవంశమున దశరథుడు అను పేరుగల ఒక మహాపురుషుడు ఉదయింపగలడు. అతడు ధార్మికుడై సర్వశుభలక్షణములతో సత్యసంధుడుగా ప్రసిద్ధి వహించును. అంగరాజైన ధర్మరథునితో[1] అతనికి మైత్రి యేర్పడును. దశరథునకు 'శాంత' అను కూతురు కలుగగలదు. అంగరాజైన ధర్మరథుని కుమారుడైన చిత్రరథుడు రోమపాదుడుగా

1) అంగదేశమునకు రాజు దివిరథుడు. అతనికుమారుడు ధర్మరథుడు, అతనికుమారుడు రోమపాదుడు. ఇతని మొదటిపేరు చిత్రరథుడు. ఇతనికి సంతానము లేకపోవుటచే దశరథునికూతురైన 'శాంత'ను ఇతడు దత్తు తీసికొనెను.

పుత్రస్తు సోఽఙ్గరాజస్య రోమపాద ఇతి శ్రుతః।
తం స రాజా దశరథో గమిష్యతి మహాయశాః। 4

అనపత్యోఽస్మి ధర్మాత్మన్ శాంతాభర్తా మమ క్రతుమ్।
ఆహరేత త్వయాఽఽజ్ఞప్తః సంతానార్థం కులస్య చ। 5

శ్రుత్వా రాజ్ఞోఽథ తద్వాక్యం మనసా స విచింత్య చ।
ప్రదాస్యతే పుత్రవంతం శాంతాభర్తారమాత్మవాన్। 6

ప్రతిగృహ్య చ తం విప్రం స రాజా విగతజ్వరః।
ఆహరిష్యతి తం యజ్ఞం ప్రహృష్టే నాంతరాత్మనా। 7

తం చ రాజాదశరథో యష్టుకామః కృతాంజలిః।
ఋష్యశృంగం ద్విజశ్రేష్ఠం వరయిష్యతి ధర్మవిత్। 8

యజ్ఞార్థం ప్రసవార్థం చ స్వర్గార్థం చ నరేశ్వరః।
లభతే చ స తం కామం ద్విజముఖ్యాద్విశాంపతిః। 9

పుత్రా శ్చాస్య భవిష్యంతి చత్వారోఽమితవిక్రమాః।
వంశ ప్రతిష్ఠానకరాః సర్వలోకేషు విశ్రుతాః। 10

ఏవం స దేవప్రవరః పూర్వం కథితవాన్ కథామ్।
సనత్కుమారో భగవాన్ పురా దేవయుగే ప్రభుః। 11

స త్వం పురుషశార్దూల తమానయ సుసత్కృతమ్।
స్వయమేవ మహారాజ గత్వా సబలవాహనః। 12

అనుమాన్య వసిష్ఠం చ సూతవాక్యం నిశమ్య చ।
(వసిష్ఠేనాభ్యను జ్ఞాతో రాజా సంపూర్ణమానసః)।
సాంతఃపుర స్సహామాత్యః ప్రయయౌ యత్ర స ద్విజః। 13

వనాని సరితశ్చైవ వ్యతిక్రమ్య శనైః శనైః।
అభిచక్రామ తం దేశం యత్ర వై మునిపుంగవః। 14

ఆసాద్య తం ద్విజశ్రేష్ఠం రోమపాద సమీపగమ్।
ఋషిపుత్రం దదర్శాదౌ దీప్యమానమివానలమ్। 15

ప్రసిద్ధికెక్కును. ఆ రోమపాదునికడకు సుప్రసిద్ధుడైన దశరథ మహారాజు వెళ్లును. పిమ్మట అతడు" ఓ ధర్మాత్ముడా! నాకు పుత్రసంతానము లేదు. నాకు సంతానప్రాప్తికిని, వంశాభివృద్ధికిని శాంతభర్తయైన ఋశ్యశృంగుడు మీ అనుమతితోనైనచో నా కొఱకై యజ్ఞమును ఆచరించును." అని రోమపాదునితో పల్కును. దశరథ మహారాజు పలికిన ఆ వాక్యములను విని, ఉదారగుణముగల ఆ రోమపాదుడు మనస్సులో తర్కించుకొనిన పిమ్మట దశరథునకు పుత్రప్రాప్తికై పుత్రకామేష్టి యజ్ఞమును నిర్వహింప సమర్థుడగు ఋశ్యశృంగుని ఆయనకడకు పంపించును. (2-6)

దశరథుడు మనస్తాపము తీరినవాడై, ఆ బ్రాహ్మణోత్తముని వెంటబెట్టుకొనివచ్చి, సంతోషముతో మనస్ఫూర్తిగా ఆ యజ్ఞమును ఆచరించును. (7)

యజ్ఞము చేయగోరినవాడును, ధర్మజ్ఞుడును ఐన ఆ దశరథమహారాజు ద్విజోత్తముడైన ఆ ఋశ్యశృంగునకు దోసిలొగ్గి నమస్కరించి, యజ్ఞ నిర్వహణకును, తత్ఫలితముగ తనకు పుత్రలాభము, స్వర్గప్రాప్తి కలుగుటకును ఆయనను కోరుకొనును. ఆ మహారాజు ఆ విప్రోత్తముని సహాయముతో యజ్ఞమును నిర్వహించుట ద్వారా తనకోరికలను ఈడేర్చుకొనును. ఆయనకు అమితపరాక్రమశాలురైన నలుగురు కుమారులు కలుగుదురు. వారు వంశప్రతిష్ఠను ఇనుమడింప జేయుదురు. అన్నిలోకములయందును వారు ఖ్యాతినొందుదురు. (8-10)

మహర్షులలో శ్రేష్ఠుడు, పూజ్యుడు, సర్వసమర్థుడు ఐన సనత్కుమారమహర్షి పూర్వకాలమున కృతయుగమునందు ఈ కథను తెల్పియుండెను. (11)

ఓ నరోత్తమా! మహారాజా! పుత్రార్థివైన నీవు పురోహితుల ద్వారాగాక స్వయముగా పరివారములతో వాహనములతో వెళ్లి, పూజ్యార్హుడైన ఆ ఋశ్యశృంగ మునిని సాదరముగా తీసికొనిరండు." (12)

సుమంత్రుడు తెల్పిన ఈ కథను విని వసిష్ఠుని అనుమతిని గైకొని, దశరథమహారాజు రాణులతో, అమాత్యులతోగూడి ఋశ్యశృంగుడు ఉన్న రోమపాద నగరమునకు బయలుదేరెను. వనవృక్షములను, నదీతీరములను తిన్నగా దర్శించుచు క్రమముగా ఆ మహారాజు ముని పుంగవుడున్న ప్రదేశమునకు చేరెను. (13-14)

రోమపాదనగరమునకు చేరిన దశరథుడు ద్విజోత్తముడును, విభాండకునికుమారుడును, అగ్నివలె తేజశ్శాలియును ఐన ఋశ్యశృంగుని రోమపాదునిసమీపమున ఉండగా చూచెను. (15)

తతో రాజా యథాన్యాయం పూజాం చక్రే విశేషతః।
సఖిత్వాత్ తస్య వై రాజ్ఞః ప్రహృష్టేనాంతరాత్మనా। 16

రోమపాదేన చాఖ్యాతమ్ ఋషిపుత్రాయ ధీమతే।
సఖ్యం సంబంధకం చైవ తదా తం ప్రత్యపూజయత్। 17

ఏవం సుసత్కృతస్తేన సహోషిత్వా నరర్షభః।
సప్తాష్టదివసాన్ రాజా రాజానమ్ ఇదమబ్రవీత్। 18

శాంతా తవ సుతా రాజన్ సహభర్త్రా విశాంపతే।
మదీయం నగరం యాతు కార్యం హి మహదుద్యతమ్। 19

తథేతి రాజా సంశ్రుత్య గమనం తస్య ధీమతః।
ఉవాచ వచనం విప్రం గచ్ఛ త్వం సహ భార్యయా। 20

ఋషిపుత్రః ప్రతిశ్రుత్య తథేత్యాహ నృపం తదా।
స నృపేణాభ్యనుజ్ఞాతః ప్రయయౌ సహభార్యయా। 21

తావన్యోన్యాంజలిం కృత్వా స్నేహాత్ సంశ్లిష్య చోరసా।
ననందతుర్దశరథో రోమపాదశ్చ వీర్యవాన్। 22

తతః సుహృదమాపృచ్ఛ్య ప్రస్థితో రఘునందనః।
పౌరేభ్యః ప్రేషయామాస దూతాన్ వై శీఘ్రగామినః। 23

క్రియతాం నగరం సర్వం క్షిప్రమేవ స్వలంకృతమ్।
ధూపితం సిక్తసమ్మృష్టం పతాకాభిరలంకృతమ్। 24

తతః ప్రహృష్టాః పౌరాస్తే శ్రుత్వా రాజానమాగతమ్।
తథా ప్రచక్రుః తత్సర్వం రాజ్ఞా యత్ప్రేషితం తదా। 25

తతః స్వలంకృతం రాజా నగరం ప్రవివేశ హ।
శంఖదుందుభినిర్ఘోషైః పురస్కృత్య ద్విజర్షభమ్। 26

తతః ప్రముదితాః సర్వే దృష్ట్వా తం నాగరా ద్విజమ్।
ప్రవేశ్యమానం సత్కృత్య నరేంద్రేణేంద్రకర్మణా। 27

అంతట రోమపాదుడు దశరథమహారాజుతో తనకుగల మైత్రిని పురస్కరించుకొని, ప్రసన్నమనస్కుడై సముచితముగా ఆయనకు విశేషపూజలను గావించెను. (16)

దీశాలియైన ఋశ్యశృంగునకు రోమపాదుడు తనకు దశరథునితోగల మైత్రిని, బంధుత్వమును గూర్చి తెల్పెను. అప్పుడు ఆ ముని దశరథుని పూజించెను. (17)

ఇట్లు సత్కారములను పొందిన దశరథమహారాజు రోమపాదునికడ ఏడెనిమిది దినములు గడిపి, పిదప ఆయనతో ఇట్లనెను. (18)

"ఓ మహారాజా! నీ కూతురైన శాంతను, అల్లుడైన ఋశ్యశృంగుని నా నగరమునకు పంపుము. అచట ఒక మహాత్కార్యము జరుగనున్నది. రోమపాదుడు ప్రతిభామూర్తియైన ఋశ్యశృంగునిప్రయాణమునకు తన ఆమోదమును తెలిపెను. పిమ్మట ఋశ్యశృంగునితో "ఓ విప్రోత్తమా! నీ భార్యయైన శాంతతో అయోధ్యా నగరమునకు వెళ్లుము" అని పలికెను. (19-20)

ఋషిపుత్రుడు ఆ మాటలను విని, రాజుగారితో 'అట్లే' అని పలికి రాజుగారిఅనుమతితో భార్యతోగూడి బయలువెడలెను. (21)

పరాక్రమవంతులైన దశరథుడు, రోమపాదుడు ఇద్దరును పరస్పరనమస్కారములతో, స్నేహపూర్వకములైన ఆలింగనములతో ఆనందించిరి. (22)

అనంతరము దశరథుడు రోమపాదునికడ సెలవుగైకొని, బయలువెడలెను. పిమ్మట అతడు త్వరగా వెళ్లునట్టి దూతల ద్వారా తమరాకను దెలుపుచు పౌరులకు తనఆదేశమును పంపెను. (23)

"నగరమునందు అంతటను పూలదండలతో, అరటి స్తంభములతో అలంకరింపుడు, కస్తూరికలాపితో, సుగంధ దూపపరిమళములతో వీథులను గుబాళింపజేయుడు, పతాకములను ఎగురవేయుడు." (24)

పౌరులు రాజుగారిశుభాగమనవార్తను విని, మిక్కిలి సంతోషించిరి. రాజుగారిసందేశముప్రకారము పూర్తిగా నగరమును అలంకరించిరి. (25)

పిమ్మట దశరథుడు శంఖదుందుభులధ్వనులమధ్య విప్రోత్తముడైన ఋశ్యశృంగుని ముందుంచుకొని, బాగుగా అలంకరింపబడిన నగరమున సపరివారముగా ప్రవేశించెను.

ఇంద్రునివలె పరాక్రమశాలియైన దశరథుడు ఆదర సత్కారములతో నగరమునకు తీసికొనివచ్చుచున్న బ్రాహ్మణోత్తముని జూచి, ఆ నగరవాసులెల్లరును మిక్కిలి సంతోషపడిరి. (26-27)

అంతఃపురం ప్రవేశ్యైనం పూజాం కృత్వా చ శాస్త్రతః।
కృతకృత్యం తదాత్మానం మేనే తస్యోపవాహనాత్। 28

దశరథుడు ఋశ్యశృంగుని తన అంతఃపురమునకు తీసికొని వచ్చి, శాస్త్రోక్తముగా పూజించెను. ఇంకను ఆయన రాకతో తాను కృతార్థుడైనట్లు తలంచెను. (28)

అంతఃపురస్త్రియః సర్వాః శాంతాం దృష్ట్వా తథాగతామ్।
సహభర్త్రా విశాలాక్షీం ప్రీత్యాఽఽనందమ్ ఉపాగమన్। 29

భర్తతోగూడి ఆ విధముగా విచ్చేసిన విశాలాక్షియగు శాంతను జూచి అంతఃపురకాంతలందఱును ఎంతగానో సంబరపడిరి. (29)

పూజ్యమానా చ తాభిః సా రాజ్ఞా చైవ విశేషతః।
ఉవాస తత్ర సుఖితా కంచిత్కాలం సహర్త్విజా। 30

అంతఃపుర స్త్రీలును, జనకుడైన దశరథరాజు ఆ శాంతాదేవిని బంధుమర్యాదలతో గౌరవించిరి. ఆమెయు తనభర్తయగు ఋశ్యశృంగునితో అచట కొంతకాలము గడిపెను. (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకాదశస్సర్గః *(11)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదునొకొండవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

12. పన్నెండవసర్గము

అశ్వమేధయాగమునకు ఏర్పాట్లు చేయుటకై దశరథునిఆదేశము.

తతః కాలే బహుతిథే కస్మింశ్చిత్ సుమనోహరే।
వసంతే సమనుప్రాప్తే రాజ్ఞో యష్టుం మనోఽభవత్। 1

ఋశ్యశృంగుడు అయోధ్యకు వచ్చిన పిమ్మట చాలా కాలమునకు మనోహరమైన ఒకానొక వసంత - ఋతు ప్రారంభమున (చైత్రశుద్ధపూర్ణిమనాడు) దశరథమహారాజు అశ్వమేధయాగమును ప్రారంభించుటకై సంకల్పించెను. (1)

తతః ప్రసాద్య శిరసా తం విప్రం దేవవర్ణినమ్।
యజ్ఞాయ వరయామాస సంతానార్థం కులస్య వై। 2

పిమ్మట దశరథమహారాజు దివ్యతేజశ్శాలియైన ఋశ్యశృంగమహామునికి శిరసాప్రణమిల్లి, ఆయన అనుగ్రహమును పొందెను. పుత్రసంతానప్రాప్తిద్వారా వంశాభివృద్ధి కొఱకై (చేయబడు) యజ్ఞమునకు ప్రధాన - ఋత్విజునిగా ఉండుటకై ఆయనను అభ్యర్థించెను. (2)

తథేతి చ స రాజానమ్ ఉవాచ చ సుసత్కృతః।
సంభారాః సంభ్రియంతాం తే తురగశ్చ విముచ్యతామ్। 3

ఋత్విజునిగా అభ్యర్థింపబడిన ఋశ్యశృంగుడు అందులకు సమ్మతించి, "యజ్ఞద్రవ్యములను సిద్ధము చేయింపుడు. యాగాశ్వమును విడిచిపెట్టుడు" అని రాజుతో పలికెను. (3)

తతో రాజాఽబ్రవీద్వాక్యం సుమంత్రం మంత్రిసత్తమమ్।
సుమంత్రావాహయ క్షిప్రమ్ ఋత్విజో బ్రహ్మవాదినః। 4

సుయజ్ఞం వామదేవం చ జాబాలిమ్ అథ కాశ్యపమ్।
పురోహితం వసిష్ఠం చ యే చాన్యే ద్విజసత్తమాః। 5

అంతట దశరథుడు మంత్రిముఖ్యుడైన సుమంత్రుని ఇట్లు ఆదేశించెను. "సుమంత్రా! వేదపండితులును, ఋత్విజులును ఐన సుయజ్ఞుని, వామదేవుని, జాబాలిని, కాశ్యపుని, పురోహితుడైన వసిష్ఠుని, అట్లే తదితర ద్విజోత్తములను శీఘ్రముగా వెంటగొని రమ్ము." అని (4-5)

తతః సుమంత్రస్త్వరితం గత్వా త్వరితవిక్రమః।
సమానయత్ స తాన్ విప్రాన్ సమస్తాన్ వేదపారగాన్। 6

అనంతరము శీఘ్రగమనుడైన సుమంత్రుడు త్వరిత్వరగా వెళ్ళి, వేదపారంగతులైన ఆ బ్రాహ్మణోత్తములను అందఱిని వెంటబెట్టుకొని వచ్చెను. (6)

తాన్ పూజయిత్వా ధర్మాత్మా రాజా దశరథ స్తదా।
ధర్మార్థసహితం యుక్తం శ్లక్ష్ణం వచన మబ్రవీత్। 7

ధర్మాత్ముడైన దశరథమహారాజు వారిని పూజించి, ధర్మార్థసాధనకు ఉపయుక్తములగు మధురవచనములను పలికెను. (7)

మమ లాలప్యమానస్య పుత్త్రార్థం నాస్తి వై సుఖమ్।
తదర్థం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ। 8

తదహం యష్టు మిచ్ఛామి శాస్త్రదృష్టేన కర్మణా।
ఋషిపుత్త్రప్రభావేన కామాన్ ప్రాప్స్యామి చాప్యహమ్। 9

"పుత్త్రుల కొఱకై తపనతో తహతహలాడుచున్న నాకు మనశ్శాంతియే కఱవైనది. అందులకై అశ్వమేధ యాగమును చేయుటకు సంకల్పించితిని. ఆ యజ్ఞమును విధివిధానముగా చేయగోరుచున్నాను. ఋశ్యశృంగుని ప్రభావముచేత నా కోరికలు సిద్ధించును." (8-9)

తతః సాధ్వితి తద్వాక్యం బ్రాహ్మణాః ప్రత్యపూజయన్।
వసిష్ఠప్రముఖాః సర్వే పార్థివస్య ముఖాచ్చ్యుతమ్। 10

ఋశ్యశృంగపురోగాశ్చ ప్రత్యూచుః నృపతిం తదా।
సంభారాః సంభ్రియంతాం తే తురగశ్చ విముచ్యతామ్। 11

సర్వథా ప్రాప్స్యసే పుత్త్రాం శ్చతురో౽మితవిక్రమాన్।
యస్య తే ధార్మికీ బుద్ధిః ఇయం పుత్త్రార్థమాగతా। 12

పిమ్మట వసిష్ఠుడుమొదలగు బ్రాహ్మణోత్తము లందఱును రాజు పలికిన మాటలను విని, 'బాగు బాగు' అని, అభినందించిరి. ఋశ్యశృంగుడుమొదలగు విప్రులు రాజుగారితో "యాగమునకు అవసరమైన వస్తువులను తెప్పింపుడు, యజ్ఞాశ్వమును విడిచి పెట్టుడు. పుత్త్రప్రాప్తికై అశ్వమేధయాగమును చేయవలెనను నిశ్చయసంకల్పము నీకు కలిగినందువలన అమితపరాక్రమశాలురైన నలుగురు కుమారులను నీవు పొందగలవు." అని సాదరముగా పలికిరి. (10-12)

తతః ప్రీతో౽భవద్రాజా శ్రుత్వా తద్ద్విజభాషితమ్।
అమాత్యాం శ్చాబ్రవీద్రాజా హర్షేణేదం శుభాక్షరమ్। 13

గురూణాం వచనాచ్ఛీఘ్రం సంభారాః సంభ్రియంతు మే।
సమర్థాధిష్ఠితశ్చాశ్వః సోపాధ్యాయో విముచ్యతామ్। 14

బ్రాహ్మణులు పలికిన ఆ మాటలను విని దశరథుడు మిక్కిలి సంతసించెను. పిమ్మట మహారాజు ఆనందముతో మంత్రులను ఉద్దేశించి, ఈ శుభవచనములను పలికెను. "గురువుల ఆదేశానుసారము యజ్ఞసామగ్రిని తెప్పింపుడు. నలుగురు ఋత్విజులు ముందుసాగిపోవుచుండగా, సమర్థులైన (నాలుగువందలమంది)యోధులరక్షణలో యజ్ఞహయమును విడిచిపెట్టుడు. (13-14)

సరయ్వాశ్చోత్తరే తీరే యజ్ఞభూమి ర్విధీయతామ్।
శాంతయశ్చాభివర్ధంతాం యథాకల్పం యథావిధి। 15

శక్యః ప్రాప్తుమ్ అయం యజ్ఞః సర్వేణాపి మహీక్షితా।
నాపరాధో భవేత్ కష్టో యద్యస్మిన్ క్రతుసత్తమే। 16

ఛిద్రం హి మృగయంతే౽త్ర విద్వాంసో బ్రహ్మరాక్షసాః।
నిహతస్య చ యజ్ఞస్య సద్యః కర్తా వినశ్యతి। 17

తద్యథా విధిపూర్వం మే క్రతురేష సమాప్యతే।
తథా విధానం క్రియతాం సమర్థాః కరణేష్విహ। 18

సరయూనదికి ఉత్తరతీరమున యజ్ఞభూమిని సిద్ధపఱచుడు. క్రమము తప్పకుండా శాస్త్రోక్తముగా విఘ్ననివారకములైన శాంతికర్మలను జరిపింపుడు. ఈ అశ్వమేధమహాయజ్ఞమును ఆచరించుటలో కష్టములుగాని, అపచారములుగాని సంభవించు అవకాశమే లేకున్నచో సామాన్యులైన రాజులు అందఱునూ ఈ యజ్ఞమును చేయుటకు పూనుకొనియుండెడివారే. విద్వాంసులైన బ్రహ్మరాక్షసులు యజ్ఞకార్యమునందలి దోషములను వెదకుచుందురు. వారు యజ్ఞమును భంగపఱచుటకు యత్నించుచుందురు. యజ్ఞమునకు విఘ్నము కలిగినచో వెంటనే కర్త నశించును. నేను సంకల్పించిన ఈ అశ్వమేధయాగము ఎట్టిలోపములు (దోషములు) లేకుండా యథావిధిగా పరిసమాప్తమగునట్లు చూడుడు. కార్యనిర్వహణము నందు మీరు మిక్కిలి సమర్థులు గదా! (15-18)

తథేతి చ తతః సర్వే మంత్రిణః ప్రత్యపూజయన్।
పార్థివేంద్రస్య తద్వాక్యం యథాజ్ఞప్తమ్ ఆకుర్వత। 19

తతో ద్విజాస్తే ధర్మజ్ఞమ్ అస్తువన్ పార్థివర్షభమ్।
అనుజ్ఞాతాస్తతః సర్వే పునర్జగ్ముః యథాగతమ్। 20

గతేష్వథ ద్విజాగ్ర్యేషు మంత్రిణస్తాన్ నరాధిపః।
విసర్జయిత్వా స్వం వేశ్మ ప్రవివేశ మహాద్యుతిః। 21

ఆ మంత్రులందఱును మహారాజు యొక్క ఆజ్ఞలను విని, "ప్రభువులు ఆదేశించినట్లే", అని ఆయనను ప్రశంసించుచు తదాజ్ఞలను నిర్వర్తించిరి. ఆ బ్రాహ్మణోత్తములందఱును ధర్మజ్ఞుడైన మహారాజును కొనియాడిరి. ఆయన అనుజ్ఞను గైకొని వారు అందఱును తమతమనివాసములకేగిరి. (19-20)

విప్రులందఱును వెళ్లినపిమ్మట మిక్కిలి తేజశ్శాలియైన దశరథుడు మంత్రులనందఱిని పంపివైచి, తాను తన ప్రాసాదమునకు వెళ్లెను. (21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ద్వాదశస్సర్గః *(12)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పన్నెండవసర్గము సమాప్తము

-- * * * --

13. పదుమూడవసర్గము

అశ్వమేధయాగమునకు సన్నాహములు - దశరథుడు సపరివారముగా యజ్ఞశాలలో ప్రవేశించి, దీక్షను గైకొనుట.

పునః ప్రాప్తే వసంతే తు పూర్ణః సంవత్సరోఽభవత్।
ప్రసవార్థం గతో యష్టుం హయమేధేన వీర్యవాన్। 1

అభివాద్య వసిష్ఠం చ న్యాయతః పరిపూజ్య చ।
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం ప్రసవార్థం ద్విజోత్తమమ్। 2

యజ్ఞో మే క్రియతాం బ్రహ్మన్ యథోక్తం మునిపుంగవ।
యథా న విఘ్నః క్రియతే యజ్ఞాంగేషు విధీయతామ్। 3

భవాన్ స్నిగ్ధః సుహృన్మహ్యం గురుశ్చ పరమో మహాన్।
వోఢవ్యో భవతాచైవ భారో యజ్ఞస్య చోద్యతః। 4

తథేతి చ స రాజానమ్ అబ్రవీద్ద్విజసత్తమః।
కరిష్యే సర్వ మేవైతత్ భవతా యత్ సమర్థితమ్। 5

యజ్ఞాశ్వమును వదలిన ఒకసంవత్సరముతరువాత మఱల వసంతఋతువు ప్రారంభమాయెను. అంతవఱకును యజ్ఞమునకుముందు నిర్వహింపవలసిన విధులనన్నింటిని[1] దశరథుడు పూర్తిచేసెను. పిదప కార్యదక్షుడైన ఆ మహారాజు సంతానార్థము యజ్ఞము చేయుటకై యాగశాలలో ప్రవేశించెను. (1)

ఆ రాజు వసిష్ఠమహర్షికి అభివాదనమొనర్చి, విధి విధానముగా ఆయనకు పూజలు సలిపెను. పిమ్మట ఆ విప్రోత్తమునితో వినయముగా ఇట్లు పలికెను "ఓ బ్రహ్మర్షీ! మాకు సంతానమును ప్రసాదించునట్టి యజ్ఞమును విధ్యుక్తముగా నిర్వహింపజేయుడు. రాక్షసులచే విఘ్నములు కలుగకుండునట్లుగా ఎట్టిలోపము లేకుండునట్లుగా చూడగలరు. పూజ్యులైన మీరు మాకు ఆప్తమిత్రులు, శ్రేయోభిలాషులు, ఋషిసత్తములు, అంతే గాదు పరమగురువులు. కావున ఈ యజ్ఞ నిర్వహణభారము అంతయును మీదే. (2-4)

అంతట ఆ వసిష్ఠమహాముని మహారాజుతో "అట్లే మీరు కోరినరీతిగనే యజ్ఞకార్యములనన్నింటిని నిర్వహించెదను." అని నుడివెను. (5)

1) దీక్షకుదిగిన మొదటిచైత్రపూర్ణిమనాడు 'సాంగ్రహణేష్టి' నిర్వహింపబడును. మఱునాడు బ్రహ్మౌదన, మేధ్యాశ్వబంధన, స్నపన, ప్రోక్షణ, నియోజనాదికృత్యములు నలుగురు ఋత్విజులచే ఆచరింపబడును. ఆపిమ్మట నిత్యము సావిత్రాది కర్మలు అనుష్ఠింపబడుచుండును.

తతో௨బ్రవీద్ద్విజాన్ వృద్ధాన్ యజ్ఞకర్మసు నిష్ఠితాన్।
స్థాపత్యే నిష్ఠితాం శ్చైవ వృద్ధాన్ పరమధార్మికాన్। 6

కర్మాంతికాన్ శిల్పకరాన్ వర్ధకీన్ ఖనకానపి।
గణకాన్ శిల్పినశ్చైవ తథైవ నటనర్తకాన్। 7

తథా శుచీన్ శాస్త్రవిదః పురుషాన్ సుబహుశ్రుతాన్।
యజ్ఞకర్మ సమీహంతాం భవంతో రాజశాసనాత్। 8

ఇష్టకా బహుసాహస్రీ శీఘ్రమ్ ఆనీయతామితి।
ఔపకార్యాః క్రియంతాం చ రాజ్ఞాం బహుగుణాన్వితాః। 9

బ్రాహ్మణావసథా శ్చైవ కర్తవ్యాశ్శతశశ్శుభాః।
భక్ష్యాన్నపానైః బహుభిః సముపేతాః సునిష్ఠితాః। 10

తథా పౌరజనస్యాపి కర్తవ్యా బహువిస్తరాః।
ఆవాసా బహుభక్ష్యా వై సర్వకామైః ఉపస్థితాః। 11

తథా జానపదస్యాపి జనస్య బహుశోభనమ్।
దాతవ్యమన్నం విధివత్ సత్కృత్య న తు లీలయా। 12

సర్వవర్ణా యథా పూజాం ప్రాప్నువంతి సుసత్కృతాః।
న చావజ్ఞా ప్రయోక్తవ్యా కామక్రోధవశాదపి। 13

యజ్ఞకర్మసు యే వ్యగ్రాః పురుషాశ్శిల్పినస్తథా।
తేషామపి విశేషేణ పూజా కార్యా యథాక్రమమ్। 14

తే చ స్యుః సంభృతాః సర్వే వసుభిర్భోజనేన చ।
యథా సర్వం సువిహితం న కించిత్ పరిహీయతే। 15

తథా భవంతః కుర్వంతు ప్రీతిస్నిగ్ధేన చేతసా।
తత స్సర్వే సమాగమ్య వసిష్ఠమ్ ఇదమబ్రువన్। 16

యథోక్తం తత్ సువిహితం న కించిత్ పరిహీయతే।
యథోక్తం తత్ కరిష్యామో న కించిత్ పరిహాస్యతే। 17

తతః సుమంత్రమాహూయ వసిష్ఠో వాక్యమబ్రవీత్।
నిమంత్రయస్వ నృపతీన్ పృథివ్యాం యే చ ధార్మికాః। 18

పిమ్మట వసిష్ఠుడు యజ్ఞకర్మలయందు రాజుచే నియుక్తులైన బ్రాహ్మణోత్తములను, వాస్తుశాస్త్రమునందు సమర్థులైనవారిని, ధార్మికోత్తములైన పెద్దలను, యజ్ఞపరిసమాప్తివఱకు కార్యనిర్వహణలో నిమగ్నులై యుండువారిని, ఇటుకలుమున్నగు వాటిని సిద్ధపఱచు వారిని, స్రుక్స్రువాది-ఉపకరణములను చేయు వడ్రంగులను, బావులను త్రవ్వువారిని, లేఖకులను, శిల్పులను, చిత్రకారులను, రసభావములను చక్కగా అభినయించు నటులను, నర్తకులను, సచ్చరిత్రగల శాస్త్రజ్ఞులను, శాస్త్రములలోను, అనుభవమునందును ఆరితేఱిన వారిని పిలిపించి, వారితో ఇట్లనెను. "మీరందఱును రాజాజ్ఞను శిరసావహించి యజ్ఞకార్యములలో నిమగ్నులు కండు. వేలకొలది ఇటుకలను వెంటనే తెప్పింపుడు. యజ్ఞమునకు వచ్చెడి రాజులకై మిక్కిలి ఎత్తైన విశాలమైన భవనములను నిర్మింపుడు. బ్రాహ్మణులకై వందలకొలది చక్కని గృహములను ఏర్పఱచుడు. అవి గాలులకును, వానలకును తట్టుకొనునట్లు దృఢముగా ఉండవలెను, అందు వివిధములైన భక్ష్యాన్నపానములను సమకూర్పుడు. (6-10)

అట్లే పురజనులకును, జానపదులకును నివాస యోగ్యములైన గృహములను నిర్మించి, అనేకవిధములైన తినుబండారములను, సర్వసౌకర్యములను విస్తారముగా సమకూర్చవలెను. ఏ మాత్రమూ అనాదరమును చూపక మర్యాదగా వారికి భోజనసత్కారములను చేయవలెను. (11-12)

అన్నివర్ణములవారికిని తగువిధముగా ఆదరసత్కారములను చేయవలెను. కామక్రోధములకు లోనై ఎవ్వరినీ చిన్నబుచ్చరాదు. యజ్ఞమునకు సంబంధించిన పనులలో నిరతులైన శిల్పులను, తదితరులను వయస్సును, అర్హతలను పాటించుచు గౌరవింప వలెను. వారిని అందఱిని ధనముతో మృష్టాన్నభోజనములతో సంతృప్తిపఱచవలెను. అన్ని కార్యములను చక్కగా అనుష్ఠింపవలెను. ఏ విషయమునందునూ ఎట్టిలోపమూ రారాదు. ముఖ్యమైన మాట- ఈ పనులను అన్నింటిని మీరందఱును నిండు మనస్సుతో ప్రేమతో ఆచరింపుడు." (13-15)

వారందఱును కలిసి ముక్తకంఠముతో వసిష్ఠునితో ఇట్లు పలికిరి. "ఇంతవఱకును ఎట్టిలోటును రానీయక మీ ఆదేశముల ప్రకారమే చేసితిమి. ఇక మీదటగూడ మీ ఆజ్ఞలను ఏ లోపమూ వాటిల్లకుండా పాటించెదము." (16-17)

పిమ్మట వసిష్ఠమహర్షి సుమంత్రుని పిలిపించి ఇట్లు పలికెను. "ఈభూమండలమునగల ధార్మికులైన రాజులను పెద్దసంఖ్యలో బ్రాహ్మణులను, క్షత్రియులను, వైశ్యులను,

బ్రాహ్మణాన్ క్షత్రియాన్ వైశ్యాన్ శూద్రాంశ్చైవ సహస్రశః।
సమానయస్వ సత్కృత్య సర్వదేశేషు మానవాన్। 19

మిథిలాధిపతిం శూరం జనకం సత్యవిక్రమమ్।
నిష్ఠితం సర్వశాస్త్రేషు తథా వేదేషు నిష్ఠితమ్। 20

తమానయ మహాభాగం స్వయమేవ సుసత్కృతమ్।
పూర్వసంబంధినం జ్ఞాత్వా తతః పూర్వం బ్రవీమి తే। 21

తథా కాశీపతిం స్నిగ్ధం సతతం ప్రియవాదినమ్।
వయస్యం రాజసింహస్య స్వయమేవానయస్వ హ। 22

తథా కేకయరాజానం వృద్ధం పరమధార్మికమ్।
శ్వశురం రాజసింహస్య సపుత్రం త్వమిహానయ। 23

అంగేశ్వరం మహాభాగం రోమపాదం సుసత్కృతమ్।
వయస్యం రాజసింహస్య సమానయ యశస్వినమ్। 24

ప్రాచీనాన్ సింధుసౌవీరాన్ సౌరాష్ట్రేయాంశ్చ పార్థివాన్।
దాక్షిణాత్యాన్ నరేంద్రాంశ్చ సమస్తానానయస్వ హ। 25

సంతి స్నిగ్ధాశ్చ యే చాన్యే రాజానః పృథివీతలే।
తానానయ యథా క్షిప్రం సానుగాన్ సహబాంధవాన్। 26

వసిష్ఠవాక్యం తచ్ఛ్రుత్వా సుమంత్రః త్వరితస్తదా।
వ్యాదిశత్ పురుషాంస్తత్ర రాజ్ఞామ్ ఆనయనే శుభాన్। 27

స్వయమేవ హి ధర్మాత్మా ప్రయయౌ మునిశాసనాత్।
సుమంత్రః త్వరితో భూత్వా సమానేతుం మహీక్షితః। 28

తే చ కర్మాంతికాః సర్వే వసిష్ఠాయ చ ధీమతే।
సర్వం నివేదయంతి స్మ యజ్ఞే యదుపకల్పితమ్। 29

తతః ప్రీతో ద్విజశ్రేష్ఠః తాన్ సర్వాన్ ఇదమబ్రవీత్।
అవజ్ఞయా న దాతవ్యం కస్యచిల్లీలయాఽపి వా।
అవజ్ఞయా కృతం హన్యాత్ దాతారం నాత్ర సంశయః। 30

తతః కైశ్చిదహోరాత్రైః ఉపయాతా మహీక్షితః।
బహూని రత్నాన్యాదాయ రాజ్ఞో దశరథస్య వై। 31

శూద్రులను ఆహ్వానింపుము. అన్ని దేశములనుండియు జనులను సాదరముగా ఆహ్వానింపుము. (18-19)

మిథిలాధిపతి యైన జనకమహారాజు శూరుడు, సత్యసంధుడు, సర్వశాస్త్రములయందును వేదములలోను నిష్ఠాగరిష్ఠుడు, మహాపురుషుడు, కనుక స్వయముగా వెళ్ళి, ఆయనను సగౌరవముగా ఆహ్వానింపుము. ఇంతకుముందు ఆయనతో గల అనుబంధమునుబట్టి, మొట్టమొదట ఆయననుగూర్చి తెలుపుచుంటిని. (20-21)

అట్లే సంతతము మధురభాషియు, రాజుగారికి ఆప్త మిత్రుడును ఐన కాశీరాజును స్వయముగా పిలువుము. పరమ ధార్మికుడును, పెద్దవాడును, రాజుగారికి మామయు ఐన కేకయరాజును ఆయన సుతుని స్వయముగా ఆహ్వానింపుము. అంగదేశాధిపతియు, సత్పురుషుడును, పూజ్యుడును, గొప్ప కీర్తిప్రతిష్ఠలు గలవాడును, దశరథునకు మిత్రుడును ఐన రోమపాదుని సాదరముగా ఆహ్వానింపుము. ప్రాచీనులైన సింధు, సౌవీర, సౌరాష్ట్ర దేశాధిపతులను, దక్షిణదేశములప్రభువులను అందఱిని దూతలద్వారా ఆహ్వానింపుము. ఇంకను ఈ భూమండలమున దశరథునకు మిత్రులైన రాజులను అందఱిని పరివారములతో బంధువులతోగూడ వచ్చునట్లు వీలైనంత త్వరగా ఆహ్వానింపుము. (22-26)

వసిష్ఠుని ఆదేశమును అనుసరించి సుమంత్రుడు సమస్త రాజులను ఆహ్వానించుటకై అంతరంగికులైన పురుషులను వెంటనే ఆయాదేశములకు పంపెను. (27)

బుద్ధిశాలియైన సుమంత్రుడు వసిష్ఠమహర్షి ప్రత్యేకముగా పేర్కొనిన మహీపాలురను అందఱిని ఆయనసూచనమేరకు స్వయముగా తీసికొనివచ్చుటకై వెంటనే బయలు దేఱెను. (28)

యజ్ఞమునకు సంబంధించిన పనులను నిర్వహించెడి వారందఱును (శిల్పకారాదులు) అంతవఱకును తాము పూర్తిచేసిన కార్యములను అన్నింటినిగూర్చి ధీశాలియైన వసిష్ఠమునికి నివేదించిరి. అందులకు ఆ విప్రోత్తముడు సంతుష్టుడై వారందఱితో ఇట్లు పలికెను. "ఎవ్వరికైనను ఏదైనను ఇచ్చునప్పుడు అనాదరమును చూపరాదు, పరిహాసము చేయరాదు. చులకనభావముతో చేసిన దానమువలన దాతకు హాని కలుగును. ఇందులకు సందేహము లేదు." (29-30)

అంతట కొన్ని దినములపిమ్మట రాజులందఱును శ్రేష్ఠములైన రత్నములను, మణులను, ముత్యములను, పగడములను, అమూల్యములైన వస్త్రాభరణములను, చందనాదిపరిమళద్రవ్యములను దశరథమహారాజునకు కానుకలుగా ఇచ్చుటకై తీసికొని వచ్చిరి. (31)

తతో వసిష్ఠః సుప్రీతో రాజానమిదమబ్రవీత్। 32

ఉపయాతా నరవ్యాఘ్ర రాజానస్తవ శాసనాత్।
మయాఽపి సత్కృతాః సర్వే యథార్హం రాజసత్తమాః। 33

యజ్ఞీయం చ కృతం రాజన్ పురుషైస్సుసమాహితైః।
నిర్యాతు చ భవాన్ యష్టుం యజ్ఞాయతనమంతికాత్। 34

సర్వకామైరుపహృతైః ఉపేతం వై సమంతతః।
ద్రష్టుమర్హసి రాజేంద్ర మనసేవ వినిర్మితమ్। 35

తథా వసిష్ఠవచనాత్ ఋశ్యశృంగస్య చోభయోః।
శుభే దివసనక్షత్రే నిర్యాతో జగతీపతిః। 36

తతో వసిష్ఠప్రముఖాః సర్వ ఏవ ద్విజోత్తమాః।
ఋశ్యశృంగం పురస్కృత్య యజ్ఞకర్మారభంస్తదా। 37

యజ్ఞవాటగతా స్సర్వే యథాశాస్త్రం యథావిధి।
శ్రీమాంశ్చ సహపత్నీభీ రాజాదీక్షాముపావిశత్। 38

వసిష్ఠుడు రాజులరాకకు సంతుష్టుడై దశరథునితో ఇట్లు పల్కెను. "ఓ మహారాజా! మీ ఆహ్వానమును అనుసరించి, రాజులు అందఱును వచ్చేసిరి. ఆ మహారాజులందఱికిని తగినరీతిగా అతిథిసత్కారములను జరిపితిని. నియుక్తులైన కార్యకర్తలందఱును యజ్ఞమునకు అవసరమైన సమస్త వస్తువులను సమకూర్చిరి. తీసికొని రాబడిన ఆ యజ్ఞోప కరణములన్నియును యాగశాలలో తగిన ప్రదేశములలో ఉంచబడినవి. సమీపముననే యున్న ఈశాలకు యజ్ఞమును ఆచరించుటకై విచ్చేయుడు. ఓ రాజేంద్రా! సంకల్పమాత్రమున అతిశీఘ్రముగ నిర్మింపబడిన ఈ శాలను తిలకింపుడు". (32-35)

ఋశ్యశృంగవసిష్ఠుల ఆదేశానుసారము మంగళకరమైన తిథివారనక్షత్రములతోగూడిన సుముహూర్తమున దశరథ మహారాజు శంఖదుందుభి మృదంగాది మంగళవాద్యములు మ్రోగుచుండగా వేదపండితులస్వస్తివాచనములతో రాజభవనము నుండి యజ్ఞశాలకు బయలుదేఱెను. (36)

అంతట వసిష్ఠుడు మొదలైన బ్రాహ్మణోత్తములెల్లరును ఋశ్యశృంగుని ముందుంచుకొని యజ్ఞవాటికకు చేరిరి. పిమ్మట యజ్ఞకర్తయైన దశరథుడు, ఋత్విక్కులు మొదలగు వారందఱును శాస్త్రోక్తముగా యథాక్రమముగా యజ్ఞకర్మలను ఆరంభించిరి. (37)

సకలైశ్వర్యసంపన్నుడైన దశరథమహారాజు ధర్మపత్నులతో గూడి, యజ్ఞవాటికను ప్రవేశించెను. పిమ్మట అతడు శాస్త్ర ప్రకారము విధివిధానముగా యజ్ఞదీక్షను స్వీకరించెను. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే త్రయోదశస్సర్గః (13)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదుమూడవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

14. పదునాల్గవసర్గము

దశరథుడు అశ్వమేధయాగమును చేయుట.

అథ సంవత్సరే పూర్ణే తస్మిన్ ప్రాప్తే తురంగమే।
సరయ్వాశ్చోత్తరే తీరే రాజ్ఞో యజ్ఞోఽభ్యవర్తత। 1

యజ్ఞాశ్వమును విడిచిపెట్టిన పిమ్మట అది ఒక సంవత్సరకాలమునకు తిరిగివచ్చెను. అనంతరము సరయూనదికి ఉత్తరతీరమున రాజు యజ్ఞమును ప్రారంభించెను. (1)

ఋశ్యశృంగం పురస్కృత్య కర్మ చక్రుః ద్విజర్షభాః।
అశ్వమేధే మహాయజ్ఞే రాజ్ఞోఽస్య సుమహాత్మనః। 2

కర్మ కుర్వంతి విధివత్ యాజకా వేదపారగాః।
యథావిధి యథాన్యాయం పరిక్రామంతి శాస్త్రతః। 3

ప్రవర్గ్యం శాస్త్రతః కృత్వా తథైవోపసదం ద్విజాః।
చక్రుశ్చ విధివత్ సర్వమ్ అధికం కర్మ శాస్త్రతః। 4

అభిపూజ్య తతో హృష్టాః సర్వే చక్రుః యథావిధి।
ప్రాతస్సవనపూర్వాణి కర్మాణి మునిపుంగవాః। 5

ఐంద్రశ్చ విధివద్దత్తో రాజా చాభిష్టుతోఽనఘః।
మాధ్యందినం చ సవనం ప్రావర్తత యథాక్రమమ్। 6

తృతీయసవనం చైవ రాజ్ఞోఽస్య సుమహాత్మనః।
చక్రుస్తే శాస్త్రతో దృష్ట్వా తథా బ్రాహ్మణపుంగవాః। 7

న చాహుతమభూత్ తత్ర స్ఖలితం వాపి కించన।
దృశ్యతే బ్రహ్మవత్ సర్వం క్షేమయుక్తం హి చక్రిరే। 8

న తేష్వహస్సు శ్రాంతో వా క్షుధితో వాపి దృశ్యతే।
నావిద్వాన్ బ్రాహ్మణస్తత్ర నాశతానుచరస్తథా। 9

బ్రాహ్మణా భుంజతే నిత్యం నాథవంతశ్చ భుంజతే।
తాపసా భుంజతే చాపి శ్రమణా భుంజతే తథా। 10

వృద్ధాశ్చ వ్యాధితాశ్చైవ స్త్రియో బాలాస్తథైవ చ।
అనిశం భుంజమానానాం న తృప్తిరుపలభ్యతే। 11

దీయతాం దీయతామన్నం వాసాంసి వివిధాని చ।
ఇతి సంచోదితాస్తత్ర తథా చక్రురనేకశః। 12

ఋశ్యశృంగుని ప్రధాన - ఋత్విజునిగా జేసికొని, బ్రహ్మ స్థానమున ఆయనను ఆసీనునిగావించి, ఆయన పర్యవేక్షణమున ద్విజోత్తములు ప్రజ్ఞాశాలియైన దశరథునిఅశ్వమేధయాగమునకు సంబంధించినకార్యములను నిర్వర్తింపసాగిరి. (2)

వేదములయందును, వేదార్థములయందును ఆరితేఱిన ఋత్విజులు విధ్యుక్తముగా, యజ్ఞవిధులను ఆచరించుచుండిరి. వేదోక్తరీతిగా మీమాంసాశాస్త్రమును, కల్పసూత్రములను, అనుసరించి వారు యజ్ఞకార్యములను నిర్వహించుచుండిరి. (3)

ఋత్విజులు ప్రవర్గ్యబ్రాహ్మణమున చెప్పబడిన 'ప్రవర్గ్య కర్మలను' అట్లే 'ఉపసదము' అను 'ఇష్టి' కార్యములను వేద, మీమాంసా, కల్పసూత్రములను అనుసరించి ఆచరించిరి. ఇంకను ఉపదేశశాస్త్రముకంటె అధికమైన 'అతిదేశ' శాస్త్రమువలన లభ్యమైన సమస్త కర్మలను శాస్త్రోక్తముగా నిర్వహించిరి. (4)

ఆ ఋత్విజులెల్లరును మిక్కిలిసంతోషముతో విధ్యుక్తముగా బహిష్పవమానాది సూక్తములతో ఆయా కర్మాధిష్ఠాన దేవతలను పూజించిరి. పిమ్మట వారు ప్రవర్గ్య- ఉపసదనకార్యముల ముగింపుసమయమున ప్రాతస్సవన- మాధ్యందినసవన తృతీయసవన కర్మలను అనుష్ఠించిరి. (5)

ఇంద్రునకు విధ్యుక్తములైన హవిస్సులు సమర్పింపబడినవి- సోమలతను కల్యమునందుంచి, దానికి నలుదిక్కుల బ్రహ్మ, అధ్వర్యువు, హోత, ఉద్గాత అను నలుగురు ఋత్విజులును చేరి, మంత్రములను పఠించుచు సోమరసమును సిద్ధపఱచిరి. పిమ్మట యథాక్రమముగా మాధ్యందినసవనము ఆచరింపబడెను.

అట్లే మిక్కిలి ధర్మాత్ముడైన దశరథునితృతీయసవనమును గూడ ఆ బ్రాహ్మణోత్తములు శాస్త్రోక్తముగా ఆచరించిరి. (6-7)

ఆ యజ్ఞకార్యములలో ఏ హోమమూ విడిచిపెట్టబడలేదు. ఒక హోమమునకు మాఱుగా మఱియొక హోమము చేయుట జరుగలేదు. హోమప్రక్రియలో ఏ మాత్రమూ లొసగులు దొర్లలేదు. హోమాదికము అంతయు మంత్రపూర్వకముగా నిర్విఘ్నముగా ఆచరింపబడినది. (8)

ఆ యజ్ఞము జరిగిన దినములలో అచట ఆకలి దప్పులతో బాధపడినవారు లేనేలేరు. అక్కడికి వచ్చిన ప్రతి బ్రాహ్మణుడును విద్వాంసుడే. ప్రతి బ్రాహ్మణునకును (గురువునకును) శిష్యులు గాని, అనుచరులును గాని, వంద సంఖ్యకు తక్కువ గాకుండా ఉండిరి. ప్రతిదినము బ్రాహ్మణులు మొదలుకొని అన్నివర్ణములవారును తృప్తిగా భుజించుచుండిరి. ఇంకను తాపసులును, సన్న్యాసులును అచట ఆతిథ్యమును స్వీకరించుచుండిరి. వృద్ధులును, రోగగ్రస్తులును, స్త్రీలును, బాలబాలికలును అచటికి వచ్చి భుజించుచుండిరి. తాను

అన్నకూటాశ్చ బహవో దృశ్యంతే పర్వతోపమాః।
దివసే దివసే తత్ర సిద్ధస్య విధివత్తదా। 13

నానాదేశా దనుప్రాప్తాః పురుషాః స్త్రీగణా స్తథా।
అన్నపానైః సువిహితాస్తస్మిన్ యజ్ఞే మహాత్మనః। 14

అన్నం హి విధివత్ స్వాదు ప్రశంసంతి ద్విజర్షభాః।
అహో తృప్తాః స్మ భద్రం తే ఇతి శుశ్రావ రాఘవః। 15

స్వలంకృతాశ్చ పురుషా బ్రాహ్మణాన్ పర్యవేషయన్।
ఉపాసతే చ తానన్యే సుమృష్టమణికుండలాః। 16

కర్మాంతరే తదా విప్రా హేతువాదాన్ బహూనపి।
ప్రాహుః స్మ వాగ్మినో ధీరాః పరస్పరజిగీషయా। 17

దివసే దివసే తత్ర సంస్తరే కుశలా ద్విజాః।
సర్వకర్మాణి చక్రుస్తే యథాశాస్త్రం ప్రచోదితాః। 18

నాషడంగవిదత్రాసీన్నావ్రతో నాబహుశ్రుతః।
సదస్యాస్తస్య వై రాజ్ఞో నావాదకుశలా ద్విజాః। 19

ప్రాప్తే యూపోచ్ఛ్రయే తస్మిన్ షడ్బైల్వాః ఖాదిరా స్తథా।
తావంతో బిల్వసహితాః పర్ణినశ్చ తథాపరే। 20

శ్లేష్మాతకమయస్త్వేకో దేవదారుమయస్తథా।
ద్వావేవ విహితౌ తత్ర బాహువ్యస్తపరిగ్రహౌ। 21

అనుకొన్నంత మంది అతిథులు రాలేదేమోనని భావించుచు దశరథుడు తృప్తిచెందకుండెను. "అందరికిని భోజన పదార్థములను వడ్డింపుడు, వడ్డింపుడు, విశిష్టములగు వస్త్రములను దానము చేయుడు" అని మంత్రులు ఆజ్ఞలను ఇచ్చుచుండగా అచటివారు ఎల్లరకును అన్నవస్త్రములను ఒసంగుచుండిరి. పాకశాస్త్రప్రకారము ప్రతిదినము సిద్ధపఱచబడిన భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్యములతో గూడిన అన్నరాసులు పర్వతప్రమాణములో అచట కన్పట్టుచుండెను. ఆ మహారాజుగారియజ్ఞమును చూచుటకై వివిధప్రదేశముల నుండి స్త్రీలు, పురుషులు వచ్చిసిరి. వారందఱికిని షడ్రసోపేతములైన భోజనములను ఏర్పాటు చేసిరి. 'మధురమైన భోజన పదార్థములు, అపూర్వమైన అతిథిమర్యాదలు మమ్ము ఎంతగానో సంతృప్తిపఱచినవి. మీకు శుభమగు గాక.' - అని బ్రాహ్మణోత్తములప్రశంసావచనములను దశరథుడు వినెను. (9-15)

చక్కగా వస్త్రాభరణములనుధరించి పురుషులు బ్రాహ్మణులకు భక్ష్యాన్నపానాదులను వడ్డించిరి. ప్రకాశించుచున్న మణి కుండలములనుదాల్చిన మఱి కొందఱు అతిథిసేవలలో వారికి సహాయపడుచుండిరి. (16)

వాక్చతురులును, ప్రజ్ఞాశీలురును ఐన బ్రాహ్మణులు హోమకార్యములమధ్య విరామసమయములలో ఒకరినొకరు జయింపవలెనను ఉత్సాహముతో హేతుబద్ధములైన అనేకవైదికచర్చలను గావించుచుండిరి.[1] (17)

ఆ యజ్ఞమునందు ప్రతిదినము సమర్థులైన బ్రాహ్మణులు సవనత్రయాదిసర్వకర్మలను వసిష్ఠాదిమహర్షులప్రేరణచే శాస్త్రోక్తముగా ఆచరించుచుండిరి. (18)

ఆ దశరథమహారాజుగారియజ్ఞసభలో ఆసీనులైయున్న బ్రాహ్మణోత్తములందఱును శిక్షావ్యాకరణాది షడంగములలో ఆరితేఱిన వారే, వ్రతనిష్ఠాపరులే, పెక్కు శాస్త్రములలో పారంగతులే, శాస్త్రచర్చలలో సమర్థులే. (19)

ఆ యజ్ఞమునందు యూపస్తంభములను నిలబెట్టవలసిన సమయము రాగా ఆఱు మారేడు యూపస్తంభములు, చంద్ర స్తంభములు ఆఱు, అట్లే ఆఱు మోదుగస్తంభములు, విరిగి చెట్టు స్తంభమొకటి, దేవదారు వృక్షస్తంభములు రెండు నిలబెట్ట బడినవి. ప్రతి రెండు యూపస్తంభముల మధ్య బారడేసి దూరము ఉండును. (20-21)

1) ప్రాతస్సవనమునకును, మాధ్యాహ్నిక సవనమునకును, తృతీయ సవనమునకును మధ్య విరామసమయములందును. అప్పుడు వైదిక చర్చలు జరుగుచుండును.

కారితాః సర్వ ఏవైతే శాస్త్రజ్ఞైర్యజ్ఞకోవిదైః।
శోభార్థం తస్య యజ్ఞస్య కాంచనాలంకృతాభవన్। 22

ఏకవింశతియూపాస్తే ఏకవింశత్యరత్నయః।
వాసోభిరేకవింశద్భిః ఏకైకం సమలంకృతాః। 23

విన్యస్తా విధివత్ సర్వే శిల్పిభిః సుకృతా దృఢాః।
అష్టాశ్రయస్సర్వ ఏవ శ్లక్ష్ణరూపసమన్వితాః। 24

ఆచ్ఛాదితాస్తే వాసోభిః పుష్పైర్గంధైశ్చ భూషితాః।
సప్తర్షయో దీప్తిమంతో విరాజంతే యథా దివి। 25

ఇష్టకాశ్చ యథాన్యాయం కారితాశ్చ ప్రమాణతః।
చితోఽగ్నిర్బ్రాహ్మణైస్తత్ర కుశలైః శుల్బకర్మణి। 26

స చిత్యో రాజసింహస్య సంచితః కుశలైర్ద్విజైః।
గరుడో రుక్మపక్షో వై త్రిగుణోఽష్టాదశాత్మకః। 27

నియుక్తాస్తత్ర పశవః తత్తదుద్దిశ్య దైవతమ్।
ఉరగాః పక్షిణశ్చైవ యథాశాస్త్రం ప్రచోదితాః। 28

శామిత్రే తు హయస్తత్ర తథా జలచరాశ్చ యే।
ఋత్విగ్భిస్సర్వమేవైతన్నియుక్తం శాస్త్రతస్తదా। 29

పశూనాం త్రిశతం తత్ర యూపేషు నియతం తదా।
అశ్వరత్నోత్తమం తత్ర రాజ్ఞో దశరథస్య చ। 30

ఈ యూపస్తంభములన్నియును యజ్ఞశాస్త్రజ్ఞులచే (యజ్ఞములను నడిపించగల అనుభవజ్ఞులచే) యజ్ఞశోభలను ఇనుమడింపజేయుటకై బంగారు తొడుగులతో అలంకరింప జేయబడినవి. (22)

నిల్పబడిన యూపస్తంభములు ఇరువదియొక్కటి - ప్రతి యూపస్తంభము ఇరువదియొక్క మూరల పొడవున (అరత్ని=మూర) రూపొందింపబడినది. ప్రతి స్తంభమును వేర్వేఱుగా వస్త్రములతో అలంకరించిరి. (23)

ఈ యూపస్తంభములన్నింటిని హెచ్చుతగ్గులు లేకుండ చక్కగా, దృఢముగా, బిల్లులు మొదలగు లోపములు లేకుండా, ఎనిమిదేసి అంచులతో నునుపుగా, చూడముచ్చటగా శిల్పులు సిద్ధపఱచిరి. అవి శాస్త్రోక్తముగా స్థాపింపబడెను. అవి వస్త్రములచే కప్పబడెను. పూవులచే గంధములచే అలంకరింపబడెను. ఆకాశమున సప్తర్షులవలె అవి దేదీప్యమానములై విరాజిల్లుచుండెను. (24-25)

ఇటుకలు శాస్త్రోక్తప్రమాణములో సిద్ధపఱచబడినవి. యజ్ఞవేదికల నిర్మాణములయందు దక్షులైన బ్రాహ్మణులచే అగ్నివేదికలు నిర్మింపబడినవి. (26)

దశరథమహారాజు ఆచరించుచున్న యజ్ఞమునందు యజ్ఞనిర్వహణదక్షులైన బ్రాహ్మణులు శాస్త్రోక్తముగా అగ్నివేదికను నిర్మించిరి. ఇది రెండుతెక్కలను, తోకనుచాచి, తూర్పుముఖముగా క్రిందికి చూచుచున్న గరుత్మంతుని ఆకృతిలోనుండెను. బంగారు ఇటుకలతో నిర్మింపబడుటవలన అది గరుడునిసువర్ణమయమైన ఱెక్కలవలె శోభిల్లుచుండెను. సాధారణముగా ఈ హోమవేదిక ఆఱువరుసలు కలిగి యుండును, కాని అశ్వమేధయాగములో ఇది మూడురెట్లు అనగా పదునెనిమిది వరుసలు కల్గియుండును. కనుక ఈ గరుడాకృతిగల అగ్నివేదిక పదునెనిమిది వరుసలతో ఒప్పుచుండెను. (27)

అచట శాస్త్రప్రకారము పశువులు, పాములు, పక్షులు ఆయా దేవతలను ఉద్దేశించి యూపస్తంభములకు కట్టి వేయబడినవి. (పాములు, పక్షులు పంజరములలో ఉంచబడినవి.) (28)

యజ్ఞముయొక్క శామిత్రకర్మయందు హయమును, తాబేలు మొదలగు జలజంతువులను, ఋత్విజులు శాస్త్రవిధిని అనుసరించి యూపస్తంభములకు బంధించిరి. ఆ స్తంభములకు మూడువందల పశువులు కట్టివేయబడినవి. ఆ దశరథుని ఉత్తమాశ్వముగూడ స్తంభమునకు బంధింపబడినది. (29-30)

కౌసల్యా తం హయం తత్ర పరిచర్య సమంతతః।
కృపాణైర్విశశాసైనం త్రిభిః పరమయా ముదా। 31

పతత్రిణా తదా సార్ధం సుస్థితేన చ చేతసా।
అవసద్రజనీమేకాం కౌసల్యా ధర్మకామ్యయా। 32

హోతాఽధ్వర్యుస్తథోద్గాతా హస్తేన సమయోజయన్।
మహిష్యా పరివృత్త్యా చ వావాతాం చ తథాపరామ్। 33

పతత్రిణస్తస్య వపాముద్ధృత్య నియతేంద్రియః।
ఋత్విక్ పరమసంపన్నః శ్రపయామాస శాస్త్రతః। 34

ధూమగంధం వపాయాస్తు జిఘ్రతి స్మ నరాధిపః।
యథాకాలం యథాన్యాయం నిర్ణుదన్ పాపమాత్మనః। 35

హయస్య యాని చాంగాని తాని సర్వాణి బ్రాహ్మణాః।
అగ్నౌ ప్రాస్యంతి విధివత్ సమంత్రాః షోడశర్త్విజః। 36

ప్లక్షశాఖాసు యజ్ఞానామ్ అన్యేషాం క్రియతే హవిః।
అశ్వమేధస్య యజ్ఞస్య వైతసో భాగ ఇష్యతే। 37

త్ర్యహోఽశ్వమేధ స్సంఖ్యాతః కల్పసూత్రేణ బ్రాహ్మణైః।
చతుష్టోమమ్అహస్తస్య ప్రథమం పరికల్పితమ్। 38

ఉక్థ్యం ద్వితీయం సంఖ్యాతమ్ అతిరాత్రం తథోత్తరమ్।
కారితాస్తత్ర బహవో విహితాః శాస్త్రదర్శనాత్। 39

జ్యోతిష్టోమాయుషీ చైవమ్ అతిరాత్రౌ వినిర్మితౌ।
అభిజిద్విశ్వజిచ్చైవమ్ అప్తోర్యామో మహాక్రతుః। 40

కౌసల్య, సుమిత్ర, కైకేయి అను దశరథుని భార్యలు ముగ్గురు ఆ యజ్ఞాశ్వమునకు పూర్తిగా పరిచర్యలు చేసి, దానికి సవ్యాపసవ్యములుగా ప్రదక్షిణమొనర్చి, సంతోషముతో దానిపై బంగారుసూదులతో మూడు గుర్తులు పెట్టిరి. పట్టమహిషియైన కౌసల్యాదేవి ధర్మసిద్ధికొఱకు స్థిరమైన చిత్తముతో అశ్వసమీపమున ఒక రాత్రి నివసించెను. (31-32)

దశరథమహారాజు శాస్త్రవిధిననుసరించి దక్షిణగా పట్టమహిషిని బ్రహ్మయను ఋత్విజునకు, వావాతను హోతకును, పరివృత్తిని ఉద్గాతకును, పాలాకలిని అధ్వర్యునకును ఇచ్చెను.[1] పిమ్మట ఆ నలుగురు ఋత్విజులు వారిని పశువులవలె చేతులతో తాకిరి. అనంతరము రాజు ఆ ఋత్విజులకు ప్రత్యామ్నాయ ద్రవ్యములను ఇచ్చి, పట్టమహిషి మొదలగు నలుగురిని తిరిగి గ్రహించెను. (33)

జితేంద్రియుడును, ప్రయోగనిపుణుడును ఐన ఋత్విజుడు అశ్వకందమును (పెన్నేరు గడ్డను) గైకొని శాస్త్రప్రకారము దానిని వండెను. దశరథుడు హోమసమయమున శాస్త్రోచితముగా తనపాపములను తొలగించుకొనుటకై దానియొక్క పొగను వాసన చూచెను. (34-35)

బ్రాహ్మణోత్తములైన పదునాఱుమంది ఋత్విజులు ఆ అశ్వమేధయాగమునకు సమకూర్చబడిన హవ్యద్రవ్యములను మంత్రములను పఠించుచు అగ్నిలో వ్రేల్చిరి. (36)

అశ్వమేధేతరయజ్ఞములయందు 'హవిస్సును' జువ్విచెట్ల కొమ్మలయందు ఉద్దిచేయుదురు. కాని అశ్వమేధ యజ్ఞము యొక్క హవిస్సులను ప్రబ్బలి చెట్లయందుంచి సంస్కరించెదరు. (37)

వేదభాగములైన బ్రాహ్మణములలోని, కల్పసూత్రముల ననుసరించి అశ్వమేధయజ్ఞము మూడు దినములలో నిర్వర్తింపవలసి యున్నది. మొదటి దినమున చేయబడు కార్యక్రమము 'చతుష్టోమము' అనబడును. రెండవ దినమున చేయబడు యజ్ఞకార్యమును 'ఉక్థ్యము' అనియు, మూడవ దినమున ఆచరింపబడు హోమకలాపమును 'అతిరాత్రము' అనియు పేర్కొనిరి. ఇంకను ఈ అశ్వమేధమున శాస్త్రోక్తము లైన పెక్కు ఇతరక్రతువులనుగూడ దశరథుడు జరిపించెను. (38-39)

శాస్త్రోక్తముగా దశరథుడు జ్యోతిష్టోమము, ఆయుర్యాగము అతిరాత్రములు రెండు, అభిజిత్తు, విశ్వజిత్తు, అప్తోర్యామము అను ఆఱు విధములగు క్రతువులను ఆచరించెను. (40)

1) మహిషి = పట్టపురాణి. వావాత =భోగిని. పరివృత్తి = ఉపేక్షిత. పాలాకలి = పాత్రప్రద.

ప్రాచీం హోత్రే దదౌ రాజా దిశం స్వకులవర్ధనః।
ఆధ్వర్యవే ప్రతీచీం తు బ్రహ్మణే దక్షిణాం దిశమ్। 41

ఉద్గాత్రే చ తథోదీచీం దక్షిణైషా వినిర్మితా।
అశ్వమేధే మహాయజ్ఞే స్వయంభూవిహితే పురా। 42

క్రతుం సమాప్య తు తదా న్యాయతః పురుషర్షభః।
ఋత్విగ్భ్యో హి దదౌ రాజా తాం ధరాం క్రతువర్ధనః। 43

ఋత్విజ స్త్వబ్రువన్ సర్వే రాజానం గతకల్మషమ్।
భవానేవ మహీం కృత్స్నా మ్ ఏకో రక్షితుమర్హతి। 44

న భూమ్యా కార్య మస్మాకం న హి శక్తాః స్మ పాలనే।
రతాః స్వాధ్యాయకరణే వయం నిత్యం హి భూమిప। 45

నిష్క్రయం కించిదేవేహ ప్రయచ్ఛతు భవానితి।
మణిరత్నం సువర్ణం వా గావో యద్వా సముద్యతమ్।
తత్ప్రయచ్ఛ నరశ్రేష్ఠ ధరణ్యా న ప్రయోజనమ్। 46

ఏవ ముక్తో నరపతిః బ్రాహ్మణై ర్వేదపారగైః। 47

గవాం శతసహస్రాణి దశ తేభ్యో దదౌ నృపః।
దశకోటీ స్సువర్ణస్య రజతస్య చతుర్గుణమ్। 48

ఋత్విజశ్చ తతః సర్వే ప్రదదు స్సహితా వసు।
ఋశ్యశృంగాయ మునయే వసిష్ఠాయ చ ధీమతే। 49

తతస్తే న్యాయతః కృత్వా ప్రవిభాగం ద్విజోత్తమాః।
సుప్రీతమనసః సర్వే ప్రత్యూచుః ముదితా భృశమ్। 50

తతః ప్రసర్పకేభ్యస్తు హిరణ్యం సుసమాహితః।
జాంబూనదం కోటిసంఖ్యం బ్రాహ్మణేభ్యో దదౌ తదా। 51

దరిద్రాయ ద్విజాయాథ హస్తాభరణముత్తమమ్।
కస్మైచిద్యాచమానాయ దదౌ రాఘవనందనః। 52

దశరథమహారాజు తనవంశాభివృద్ధికై 'హోత' అను ఋత్విజునకు తూర్పుదిశనున్న భూమిని, 'అధ్వర్యువు' అను ఋత్విజునకు పడమరనున్నభూమిని, 'బ్రహ్మ' స్థానమునందున్న ఋత్విజునకు దక్షిణమునందున్న భూమిని, 'ఉద్గాత' అను ఋత్విజునకు ఉత్తర దిశయందున్నభూమిని దక్షిణలుగా ఇచ్చెను. అశ్వమేధ యజ్ఞమునకు సంబంధించిన ఈ విధులను పూర్వము 'స్వయంభువు' ఐన బ్రహ్మయే తెలిపియుండెను. (41-42)

దశరథమహారాజు క్రతువు ముగిసినపిమ్మట శాస్త్రప్రకారము క్రతుఫలాభివృద్ధికై ఈ విధముగా ఋత్విజులకు భూదానములను ఒసంగెను. అంతట ఋత్విజులు అందఱును యజ్ఞముద్వారా పవిత్రుడైన ఆ రాజుగారితో "ఈ సమస్త భూమండలమును పరిరక్షించుటకు నీవే సమర్థుడవు. మాకు భూమితో పనిలేదు. దానిని పండించుటలో గాని, రక్షించుటలో గాని మేము అశక్తులము. నిత్యము నిరంతరము మేము వేదశాస్త్రములను అధ్యయనము చేయుచుయుండే నిరతులము. ఓ రాజా! ఈ దానభూములకుమాఱుగా కొంతధనమును మీరే ఇప్పింపుడు. ఓ మహారాజా! శ్రేష్ఠములైన మణులను గాని, బంగారమును గాని, గోవులను గాని లేక సిద్ధముగా ఉన్న ఏ వస్తువులనైనను మాకు దయచేయుము. భూమివలన మాకు ప్రయోజనమేమి ?" అని పలికిరి. (43-46)

వేదవేత్తలైన బ్రాహ్మణులు ఇట్లు పలుకగా మహారాజు వారికి పదిలక్షల గోవులను, పదికోట్ల బంగారునాణెములను, మఱియు దక్షిణలకు ప్రత్యామ్నాయముగా నలుబది కోట్ల వెండి నాణెములను ఒసంగెను. (47-48)

ఆ ఋత్విజులందఱును కూడి తమకు దక్షిణలుగా లభించిన సంపదలను ధీశాలురైన వసిష్ఠునకును, ఋశ్యశృంగ మహర్షికిని సమర్పించిరి. ఆ ఇరువురును ఆ దక్షిణలను ఋత్విజులకు యథోచితముగా పంచియిచ్చిరి- అప్పుడా బ్రాహ్మణోత్తము లందఱును ప్రసన్నచిత్తులై "మేమెంతయు సంతుష్టులము ఐతిమి " అని పలికిరి. (49-50)

అనంతరము దశరథుడు యాగమును చూచుటకై వచ్చిన బ్రాహ్మణులకు మేలైన కోటి బంగారునాణెములను శ్రద్ధాదరములతో సమర్పించెను. (51)

ఇట్లు కోశాగారమునగల ద్రవ్యమునంతయును పూర్తిగా దానముచేసిన పిమ్మట నిర్ధనుడైన ఒక బ్రాహ్మణుడు అచటికి అర్థియై విచ్చేయగా దశరథుడు అతనికు తన ముంజేతి కంకణమును దానము చేసెను. (52)

తతః ప్రీతేషు నృపతిః ద్విజేషు ద్విజవత్సలః।
ప్రణామమ్ అకరోత్ తేషాం హర్షపర్యాకులేక్షణః। 53

సమృద్ధిగా దక్షిణలు లభింపగా బ్రాహ్మణులు మిక్కిలి సంతృప్తిచెందిరి. బ్రాహ్మణులయెడ భక్తితత్పరుడైన ఆ రాజు ఆనందబాష్పములను రాల్చుచు వారికి నమస్కరించెను. (53)

తస్యాశిషోఽథ విధివత్ బ్రాహ్మణైః సముదీరితాః।
ఉదారస్య నృవీరస్య ధరణ్యాం ప్రణతస్య చ। 54

భూమిపై సాగిలబడి నమస్కరించుచున్న ఉదారుడైన ఆ మహారాజును బ్రాహ్మణోత్తములు సంప్రదాయ బద్ధముగా వేదమంత్రములతో ఆశీర్వదించిరి. (54)

తతః ప్రీతమనా రాజా ప్రాప్య యజ్ఞమనుత్తమమ్।
పాపాపహం స్వర్నయనం దుష్కరం పార్థివర్షభైః। 55

పుత్త్రప్రాప్తికి ప్రతిబంధకములైన పాపములను తొలగించునదియు, పుత్త్రలాభముద్వారా స్వర్గమును ప్రాప్తింపజేయునదియు, సామాన్యులైన రాజులు చేయుటకు అసాధ్యమైనదియు ఐన ఉత్తమోత్తమమైన అశ్వమేధయజ్ఞమును ఆచరించి, దశరథుడు మిక్కిలి సంతుష్టుడాయెను. (55)

తతోఽబ్రవీత్ ఋశ్యశృంగం రాజా దశరథ స్తదా।
కులస్య వర్ధనం త్వం తు కర్తుమ్ అర్హసి సువ్రత। 56

పుత్త్రప్రాప్తికై సుమంత్రుడు తెలిపిన క్రతువును మనస్సునందుంచుకొని, దశరథమహారాజు ఋశ్యశృంగునితో "ఓ తపోధనా! వంశాభివృద్ధినిగూర్చి పుత్త్రులను పొందుటకై చేయవలసిన క్రతువును నిర్వహించుటకు మీరే సమర్థులు" అని అభ్యర్థించెను. (56)

తథేతి చ స రాజానమ్ ఉవాచ ద్విజసత్తమః।
భవిష్యంతి సుతా రాజం శ్చత్వార స్తే కులోద్వహాః। 57

అందులకు ఋశ్యశృంగుడు సమ్మతించి "రాజా! నీకు వంశోద్ధారకులైన పుత్త్రులు నలుగురు కలుగుదురు" అని పలికెను. (57)

స తస్య వాక్యం మధురం నిశమ్య
ప్రణమ్య తస్మై ప్రయతో నృపేంద్రః।
జగామహర్షం పరమం మహాత్మా
తమ్ఋశ్యశృంగం పునరప్యువాచ। 58

ఋశ్యశృంగుడు పలికిన మధురవచనములను విని, మహారాజు ప్రశాంతచిత్తుడై పరమానందముతో ఆయనకు ప్రణమిల్లెను. పుత్త్రప్రాప్తికై క్రతునిర్వహణమునకు ఆ తపస్విని మరల అభ్యర్థించెను. (58)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే చతుర్దశస్సర్గః (14)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదునాల్గవసర్గము సమాప్తము

-- * * * --

15. పదునైదవ సర్గము

రావణసంహారమునకై దేవతలు విష్ణువును ప్రార్థించుట.

మేధావీ తు తతో ధ్యాత్వా స కించిదిదముత్తరమ్।
లబ్ధసంజ్ఞః తత స్తం తు వేదజ్ఞో నృపమబ్రవీత్। 1

ప్రజ్ఞావంతుడును, అథర్వణాదివేదములయందు పండితుడును ఐన ఋశ్యశృంగమహర్షి దశరథునకు మాట ఇచ్చిన పిమ్మట తనబాధ్యతనుగూర్చి ఒక్క క్షణమాలోచించెను. పిదప కర్తవ్యము స్ఫురింపగా ఆయన ఆ మహారాజునకు ఇట్లు ప్రత్యుత్తరమునిచ్చెను. (1)

ఇష్టిం తేహం కరిష్యామి పుత్రీయాం పుత్రకారణాత్।
అథర్వశిరసి ప్రోక్తైః మంత్రైః సిద్ధాం విధానతః। 2

తతః ప్రాక్రమదిష్టిం తాం పుత్రీయాం పుత్రకారణాత్।
జుహావ చాగ్నౌ తేజస్వీ మంత్రదృష్టేన కర్మణా। 3

తతో దేవా స్సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః।
భాగప్రతిగ్రహార్థం వై సమవేతా యథావిధి। 4

తాస్సమేత్య యథాన్యాయం తస్మిన్ సదసి దేవతాః।
అబ్రువన్ లోకకర్తారం బ్రహ్మాణం వచనం మహత్। 5

భగవన్ త్వత్ప్రసాదేన రావణో నామ రాక్షసః।
సర్వాన్ నో బాధతే వీర్యాత్ శాసితుం తం న శక్నుమః। 6

త్వయా తస్మై వరో దత్తః ప్రీతేన భగవన్ పురా।
మానయంతశ్చ తం నిత్యం సర్వం తస్య క్షమామహే। 7

ఉద్వేజయతి లోకాం స్త్రీన్ ఉచ్ఛ్రితాన్ ద్వేష్టి దుర్మతిః।
శక్రం త్రిదశరాజానం ప్రధర్షయితుమిచ్ఛతి। 8

ఋషీన్ యక్షాన్ సగంధర్వాన్ అసురాన్ బ్రాహ్మణాం స్తథా।
అతిక్రామతి దుర్ధర్షో వరదానేన మోహితః। 9

నైనం సూర్యః ప్రతపతి పార్శ్వే వాతి న మారుతః।
చలోర్మిమాలీ తం దృష్ట్వా సముద్రోఽపి న కంపతే। 10

తన్మహన్నో భయం తస్మాత్ రాక్షసాద్ఘోరదర్శనాత్।
వధార్థం తస్య భగవన్నుపాయం కర్తుమర్హసి। 11

ఏవముక్త స్సురై స్సర్వైః చింతయిత్వా తతోఽబ్రవీత్।
హంతాయం విదితస్తస్య వధోపాయో దురాత్మనః। 12

తేన గంధర్వయక్షాణాం దేవదానవరక్షసామ్।
అవధ్యోఽస్మీతి వాగుక్తా తథేత్యుక్తం చ తన్మయా। 13

"ఓ రాజా! నీకు పుత్రులు కలుగుటకై 'అథర్వశిరస్సు' అను వేదభాగమునందు పేర్కొనబడిన మంత్రములతో విద్యుక్తముగా 'పుత్రకామేష్టి' అను క్రతువును నిర్వహింపెదను." (2)

అనంతరము ఆ ఋషి 'పుత్రకామేష్టి' యాగమును ప్రారంభించెను. ఆ తేజశ్శాలి వేదమంత్రములను పఠించుచు అగ్నికి ఆహుతులను సమర్పించెను. (3)

పిమ్మట బ్రహ్మాదిదేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు తమతమ హవిర్భాగములను గ్రహించుటకై యథాక్రమముగా యజ్ఞశాలయందు ప్రత్యక్షమైరి. (4)

దేవతలు అందఱును క్రమముగా సదస్సునకు చేరి, సృష్టికర్తయైన బ్రహ్మదేవునితో ఇట్లు విన్నవించుకొనిరి. (5)

ఓ దేవా! నీవు అనుగ్రహించిన వరప్రభావమున రావణుడు అను రాక్షసుడు తనపరాక్రమముచే మమ్ములను చిత్రహింసలపాలు చేయుచున్నాడు. అతనిని అదుపుచేయుటకు మేము అశక్తులము. హే భగవన్! పూర్వము అతనితపస్సునకు మెచ్చి, నీవు ఆయనకు వరమును ప్రసాదించితివి. దానిని గౌరవించుచు అతడొనర్చు దుండగములను అన్నింటిని మేము ఓర్చుకొనుచున్నాము. ఆ దుర్మార్గుడు వరగర్వముతో ముల్లోకములను బాధించుచున్నాడు. ఉన్నతులైన దిక్పాలురను ద్వేషించుచున్నాడు. స్వర్గాధిపతియైన ఇంద్రునిసైతము రాజ్యభ్రష్టుని గావింపజూచుచున్నాడు. అతడు వరగర్వితుడై కన్నుమిన్ను గానక ఎదురులేనివాడై ఋషులను, యక్షులను, గంధర్వులను, అసురులను, అట్లే బ్రాహ్మణులను మిక్కిలి హింసించుచున్నాడు. (6-9)

రావణుడు క్రీడాపర్వతమున విహరించునప్పుడు అతనికి భయపడి, సూర్యుడు తనకిరణములవేడిని తగ్గించుచున్నాడు. వాయువుగూడ భయముతో అతనిసమీపమున తీవ్రముగా వీచుటలేదు. ఉన్నతతరంగములతోనుండు సముద్రుడు అతనికి భయపడి చలించుట లేదు – ఓ మహాత్మా! భయంకరాకారుడైన ఆరాక్షసునకు భీతిల్లి, మేము గడగడలాడుచున్నాము. కావున వానిని హతమొనర్చునుపాయమును మీరే ఆలోచింపుడు." (10-11)

దేవతలు తనను ఇట్లు ప్రార్థింపగా బ్రహ్మదేవుడు కొంత తడవు ఆలోచించి వారితో ఇట్లనెను. "భళా! ఆ దుర్మార్గుని చంపునుపాయము స్ఫురించినది. (12)

"గంధర్వులచేగాని, యక్షులచేగాని, దేవతలచేగాని, దానవులచేగాని, రాక్షసులచేగాని నాకు చావు లేకుండునట్లు వరమిమ్ము" అని రావణుడు అర్థించెను. నేను "అట్లే" అని యుంటిని.

నాకీర్తయదవజ్ఞానాత్ తద్రక్షో మానుషాంస్తదా।
తస్మాత్ స మానుషాద్వధ్యో మృత్యుర్నాన్యోఽస్య విద్యతే। 14

ఏతచ్ఛ్రుత్వా ప్రియం వాక్యం బ్రహ్మణా సముదాహృతమ్।
సర్వే మహర్షయో దేవాః ప్రహృష్టాస్తేఽభవం స్తదా। 15

ఏతస్మిన్నంతరే విష్ణుః ఉపయాతో మహాద్యుతిః।
శంఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః। 16

బ్రహ్మణా చ సమాగమ్య తత్ర తస్థౌ సమాహితః।
తమబ్రువన్ సురాః సర్వే సమభిష్టూయ సన్నతాః। 17

త్వాం నియోక్ష్యామహే విష్ణో లోకానాం హితకామ్యయా।
రాజ్ఞో దశరథస్య త్వమ్ అయోధ్యాధిపతేః ప్రభోః। 18

ధర్మజ్ఞస్య వదాన్యస్య మహర్షిసమతేజసః।
తస్య భార్యాసు తిసృషు హ్రీశ్రీకీర్త్యుపమాసు చ। 19

విష్ణో పుత్రత్వ మాగచ్ఛ కృత్వాఽఽత్మానం చతుర్విధమ్।
తత్ర త్వం మానుషో భూత్వా ప్రవృద్ధం లోకకంటకమ్।
అవధ్యం దైవతై ర్విష్ణో సమరే జహి రావణమ్। 20

స హి దేవాంశ్చ గంధర్వాన్ సిద్ధాంశ్చ మునిసత్తమాన్।
రాక్షసో రావణో మూర్ఖో వీర్యోత్సేకేన బాధతే। 21

ఋషయశ్చ తతస్తేన గంధర్వాప్సరసస్తథా।
క్రీడంతో నందనవనే క్రూరేణ కిల హింసితాః। 22

వధార్థం వయ మాయాతాః తస్య వై మునిభిః సహ।
సిద్ధగంధర్వయక్షాశ్చ తత స్త్వాం శరణం గతాః। 23

త్వం గతిః పరమా దేవ సర్వేషాం నః పరంతప।
వధాయ దేవశత్రూణాం నృణాం లోకే మనః కురు। 24

ఏవ ముక్తస్తు దేవేశో విష్ణుస్త్రిదశపుంగవః। 25

పితామహపురోగాం స్తాన్ సర్వలోకనమస్కృతః।
అబ్రవీత్ త్రిదశాన్ సర్వాన్ సమేతాన్ ధర్మసంహితాన్। 26

భయం త్యజత భద్రం వో హితార్థం యుధి రావణమ్।
సపుత్రపౌత్రం సామాత్యం సమిత్ర జ్ఞాతి బాంధవమ్।
హత్వా క్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహమ్। 27

ఆ రావణుడు వరమునుకోరెడి సమయమున మనుష్యుల యెడ నాసికిగల చులకన భావముచే వారివలన చావు లేకుండునట్లు అడుగలేదు. కావున మానవుని చేతిలోనే అతని మరణము సంభవము - ఇతరులవలన కాదు." (13-14)

బ్రహ్మదేవుడు పలికిన ప్రీతికరమైన ఈ పలుకులను విని, దేవతలు, మహర్షులు అందఱును ఆనందముతో పొంగిపోయిరి.(15)

ఇంతలో జగన్నాథుడైన శ్రీమహావిష్ణువు శంఖచక్ర గదాపాణియై, పీతాంబరధారియై దివ్యతేజస్సుతో విరాజిల్లుచు యజ్ఞశాలకు అరుదెంచెను. (16)

అంతట మహావిష్ణువు బ్రహ్మతోగూడి అచట ఉపస్థితుడాయెను. పిమ్మట దేవతలందఱును ఆదేవదేవుని సంస్తుతించి, సాగిలబడి మ్రొక్కి, ఇట్లు ప్రార్థించిరి. (17)

"ఓ మహావిష్ణూ! లోకకల్యాణకాంక్షతో నిన్ను మేము ఇట్లు వేడుకొనుచున్నాము. అయోధ్యాధిపతియైన దశరథమహారాజు సర్వసమర్థుడు, ధర్మజ్ఞుడు, ఉదారస్వభావము గలవాడు, మహర్షితో సమానమైన తేజస్సుగలవాడు, అతని ముగ్గురు భార్యలును దక్షకన్యలైన హ్రీ, శ్రీ, కీర్తి అను వారితో సమానలు. వారికి నాలుగురూపములలో పుత్రుడవై కమ్ము. రావణుడు వరప్రభావమున లోకకంటకుడాయెను. అతనిని దేవతలు ఏమ్వరును చంపజాలరు. నీవు మానవుడుగా అవతరించి, యుద్ధమున అతనిని హతమార్చుము (18-20)

రాక్షసుడైన ఆ మూర్ఖరావణుడు పరాక్రమగర్వముతో దేవతలను, గంధర్వులను, సిద్ధులను, మునీశ్వరులను యుక్తాయుక్త వివక్షణ లేకుండ మిక్కిలి బాధించుచున్నాడు. ఆ క్రూరుడు ఋషులను అట్లే నందనవనమున విహరించుచున్న గంధర్వులను, అప్సరసలను హింసించుచున్నాడు. (21-22)

సిద్ధగంధర్వయక్షులును, మేమును మునులతోగూడి ఆక్రూర రావణునిసంహారముకొఱకై ఇచటికి వచ్చి, మిమ్ము శరణు పొందుచున్నాము. ఓ శత్రుభయంకరా! ఓ మహావిష్ణూ! మా అందఱికిని నీవే దిక్కు. కావున దేవతలకు శత్రువులైన రాక్షసులను వధించుటకై మానవుడవై అవతరించుటకు సంకల్పింపుము." (23-24)

బ్రహ్మాదిదేవతలు ఇట్లు ప్రార్థింపగా సకలలోకారాధ్యుడు, దేవదేవుడు ఐన ఆ శ్రీమహావిష్ణువు తనను శరణుజొచ్చిన ఆ బ్రహ్మాదిదేవతలందఱితో ఇట్లు నుడివెను. (25-26)

"భయమును వీడుడు. మీకు భద్రత చేకూరును. క్రూరుడు, దురాత్ముడు, దేవర్షులను బాధించుచున్న వాడు అగు రావణుని, అతనిపుత్రులను, పౌత్రులను, అమాత్యులను, బంధువులను,

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ।
వత్స్యామి మానుషే లోకే పాలయన్ పృథివీ మిమామ్। 28

ఏవం దత్త్వా వరం దేవో దేవానాం విష్ణు రాత్మవాన్।
మానుషే చింతయామాస జన్మభూమిమ్ అథాత్మనః। 29

తతః పద్మపలాశాక్షః కృత్వాత్మానం చతుర్విధమ్।
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్। 30

తదా దేవర్షిగంధర్వాః సరుద్రాః సాప్సరోగణాః।
స్తుతిభిర్దివ్యరూపాభిః తుష్టువుర్మధుసూదనమ్। 31

త ముద్ధతం రావణముగ్రతేజసం
ప్రవృద్ధదర్పం త్రిదశేశ్వరద్విషమ్ ।
విరావణం సాధు తపస్వికంటకం
తపస్వినాముద్ధర తం భయావహమ్ । 32

త మేవ హత్వా సబలం సబాంధవం
విరావణం రావణముగ్రపౌరుషమ్ ।
స్వర్లోకమాగచ్ఛ గతజ్వరశ్చిరం
సురేంద్రగుప్తం గతదోషకల్మషమ్ । 33

మిత్రులను, జ్ఞాతులను అందఱిని లోకహితార్థమై యుద్ధమున హతమార్చెదను. పిమ్మట పదునొకండు వేల సంవత్సరముల కాలము ఈ మానవలోకమున నివసించి ఈ భూమండలమును పరిపాలించెదను." (27-28)

అని, సకల ప్రాణులకును ఆధారమైన దేవదేవుడైన శ్రీమహావిష్ణువు దేవతలకు 'వరమును' అనుగ్రహించి, మానవ లోకమున తాను అవతరింపదగు స్థానమును గూర్చి ఆలోచించెను. (29)

పిమ్మట ఆ రాజీవలోచనుడు తాను దశరథమహారాజునకు నాలుగు రూపములలో పుత్త్రులుగా జన్మించుటకు సంకల్పించెను. (30)

బ్రహ్మరుద్రాదిదేవతలు, ఋషులు, గంధర్వులు, అప్సరసలు దివ్యస్తుతులతో ఆ శ్రీమహావిష్ణువును స్తుతించిరి. (31)

"ఆ రావణుడు సహజముగనే గర్వితుడు. వరప్రభావముచే కన్నుమిన్నుగానక యున్నాడు, ధర్మవిరుద్ధముగా ప్రతాపమును చూపువాడు, దేవేంద్రునకు శత్రువు, లోకములను బాధించువాడు, సత్పురుషులను, మునులను హింసించువాడు, తాపసులకు భయంకరుడు. అట్టి దుష్టుని సంహరింపుము. (32)

క్రూరరాక్షసుడైన ఆ రావణుని, అతనిబంధు మిత్రులను, సైన్యములను, పరివారములను తుదముట్టించి, ఆర్తుల వెతలను బాపుము. పిదప ఓ దేవదేవా! మా బోటివారికి అందరానిదియు, రాగద్వేషములకు తావులేనిదియు ఐన వైకుంఠమునకు చేరుము." (33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచదశస్సర్గః (15)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదునైదవసర్గము సమాప్తము

-- * * * --

16. పదునాఱవసర్గము

యజ్ఞపురుషునిచే దశరథునకు పాయసప్రదానము, దానిని భుజించి కౌసల్య, సుమిత్ర, కైకేయి గర్భములను దాల్చుట.

తతో నారాయణో దేవో నియుక్తః సురసత్తమైః।
జానన్నపి సురానేవం శ్లక్ష్ణం వచనమబ్రవీత్। 1

ఉపాయః కో వధే తస్య రావణస్య దురాత్మనః।
యమహం తం సమాస్థాయ నిహన్యామ్ ఋషికంటకమ్। 2

బ్రహ్మాదిదేవతలు ఇట్లు ప్రార్థింపగా దేవాదిదేవుడైన శ్రీమన్నారాయణుడు తాను సర్వజ్ఞుడయ్యును వారితో మధురముగా ఇట్లు వచించెను. (1)

"ఓ దేవతలారా! దురాత్ముడైన ఆ రావణుని చంపుటకు ఉపాయమును తెలుపుడు. దానిని అనుసరించి, ఆ ఋషికంటకుని హతమార్చెదను. (2)

ఏవ ముక్తాః సురాః సర్వే ప్రత్యూచుః విష్ణు మవ్యయమ్।
మానుషం తను మాస్థాయ రావణం జహి సంయుగే। 3

స హి తేపే తపస్తీవ్రం దీర్ఘకాలమ్ అరిందమ।
యేన తుష్టోఽభవద్బ్రహ్మా లోకకృల్లోకపూర్వజః। 4

సంతుష్టః ప్రదదౌ తస్మై రాక్షసాయ వరం ప్రభుః।
నానావిధేభ్యో భూతేభ్యో భయం నాన్యత్ర మానుషాత్।
అవజ్ఞాతాః పురా తేన వరదానే హి మానవాః। 5

ఏవం పితామహాత్ తస్మాత్ వరం ప్రాప్య స దర్పితః। 6

ఉత్సాదయతి లోకాంస్త్రీన్ స్త్రియశ్చాప్యపకర్షతి।
తస్మాత్ తస్య వధో దృష్టో మానుషేభ్యః పరంతప। 7

ఇత్యేతద్వచనం శ్రుత్వా సురాణాం విష్ణురాత్మవాన్।
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్। 8

స చాప్యపుత్రో నృపతిః తస్మిన్ కాలే మహాద్యుతిః।
అయజత్ పుత్రియా మిష్టిం పుత్రేప్సు రరిసూదనః। 9

స కృత్వా నిశ్చయం విష్ణుః ఆమంత్ర్య చ పితామహమ్।
అంతర్ధానం గతో దేవైః పూజ్యమానో మహర్షిభిః। 10

తతో వై యజమానస్య పావకాదతులప్రభమ్।
ప్రాదుర్భూతం మహద్భూతం మహావీర్యం మహాబలమ్। 11

కృష్ణం రక్తాంబరధరం రక్తాస్యం దుందుభిస్వనమ్।
స్నిగ్ధహర్యక్షతనుజశ్మశ్రుప్రవరమూర్ధజమ్ । 12

శుభలక్షణసంపన్నమ్ దివ్యాభరణభూషితమ్।
శైలశృంగసముత్సేధం దృప్తశార్దూలవిక్రమమ్। 13

దివాకరసమాకారం దీప్తానలశిఖోపమమ్।
తప్తజాంబూనదమయీం రాజతాంతపరిచ్ఛదామ్। 14

నిత్యుడైన శ్రీమహావిష్ణువు యొక్క వచనములకు దేవతలు ఎల్లరును ఇట్లు ప్రత్యుత్తరమిచ్చిరి. "ఓ శత్రుసంహారకా! నీవు మానవుడుగా అవతరించి, యుద్ధమున ఆ రావణుని రూపుమాపుము. పూర్వము అతడు దీర్ఘకాలము తీవ్రముగా తపమొనరించెను. సృష్టికర్తయు, దేవతలలో పెద్దవాడును ఐన బ్రహ్మ వానితపమునకు సంతుష్టుడాయెను. సంతుష్టుడై యున్న బ్రహ్మనుండి 'ఆ రాక్షసుడు' మానవునివలనతప్ప ఏ ఇతరప్రాణినుండియు తనకు మృత్యుభయము లేకుండునట్లు వరమును పొందెను. మానవులయెడ వానికిగల చులకనభావమే అందులకు కారణము. (3-5)

ఈ విధముగా పితామహునివరమువలన గర్వితుడై, ఆ రాక్షసుడు ముల్లోకములను పీడించుచున్నాడు. స్త్రీలను గూడ కించపఱచుచున్నాడు. కావున ఓ అరిసూదనా! మానవుల వలననే అతడు మరణించుట సంభవము. (6-7)

సమస్తప్రాణులకును ఆధారభూతుడైన శ్రీమహావిష్ణువు దేవతల ఈ మాటలను ఆలకించి, దశరథ మహారాజునకు పుత్రుడై జన్మించుటకు నిశ్చయించుకొనెను. (8)

అదే సమయమున మహాపరాక్రమవంతుడు, శత్రుసంహారకుడు ఐన దశరథుడు పుత్రులులేక తపనపడుచుండెను. పుత్రప్రాప్తికై అతడు 'పుత్రకామేష్టి' అను యాగమును ఆచరించెను. (9)

విష్ణుమూర్తి మానవుడుగా అవతరించుటకు నిశ్చయించుకొనెను. పిమ్మట దేవతల, మహర్షుల పూజలను అందుకొని, బ్రహ్మదేవుని వీడ్కొని అంతర్ధానమయ్యెను. (10)

దశరథుని యొక్క ఆ యజ్ఞకుండమునుండి సాటిలేని తేజస్సులతోగూడిన ఒక దివ్యపురుషుడు ప్రత్యక్షమాయెను. అతడు మహాబలపరాక్రమసంపన్నుడు. కృష్ణవర్ణముతో విరాజిల్లుచున్నవాడు. అతడు ఎఱుపు వస్త్రములను ధరించి యుండెను. అతనిముఖము ఎఱ్ఱగానుండెను. అతనికంఠస్వరము దుందుభిధ్వనివలె గంభీరమైనది, అతనిశరీరముపైగల రోమములు, మీసములు, కేశములు సింహపుజూలువలె మృదువుగానుండెను. అతడు శుభలక్షణసంపన్నుడు, దివ్యాభరణభూషితుడు, గిరిశిఖరమువలె ఉన్నతమైనవాడు, మదించిన పెద్దపులివలె భయంకరుడు, సూర్యతేజస్సుతో ప్రకాశించుచున్నవాడు, ప్రజ్వలించుచున్న అగ్నిశిఖలవలె వెలుగొందుచున్నవాడు, అట్టి దివ్యపురుషుడు విపులమైన, అశ్చర్యమును గొలుపు ఒక బంగారు పాత్రను స్వయముగా

దివ్యపాయససంపూర్ణాం పాత్రీం పత్నీమివ ప్రియామ్।
ప్రగృహ్య విపులాం దోర్భ్యాం స్వయం మాయామయీమివ। 15

సమవేక్ష్యాబ్రవీద్వాక్యమ్ ఇదం దశరథం నృపమ్।
ప్రాజాపత్యం నరం విద్ధి మామిహాభ్యాగతం నృప। 16

తతః పరం తదా రాజా ప్రత్యువాచ కృతాంజలిః।
భగవన్ స్వాగతం తేఽస్తు కిమహం కరవాణి తే। 17

అథో పునరిదం వాక్యం ప్రాజాపత్యో నరోఽబ్రవీత్।
రాజన్నర్చయతా దేవాన్ అద్య ప్రాప్తమ్ ఇదం త్వయా। 18

ఇదం తు నృపశార్దూల పాయసం దేవనిర్మితమ్।
ప్రజాకరం గృహాణ త్వం ధన్యమ్ ఆరోగ్యవర్ధనమ్। 19

భార్యాణామ్ అనురూపాణామ్ అశ్నీతేతి ప్రయచ్ఛ వై।
తాసు త్వం ప్రాప్స్యసే పుత్రాన్ యదర్థం యజసే నృప। 20

తథేతి నృపతిః ప్రీతః శిరసా ప్రతిగృహ్య తామ్।
పాత్రీం దేవాన్నసంపూర్ణాం దేవదత్తాం హిరణ్మయీమ్। 21

అభివాద్య చ తద్భూతమ్ అద్భుతం ప్రియదర్శనమ్।
ముదా పరమయా యుక్తః చకారాభిప్రదక్షిణమ్। 22

తతో దశరథః ప్రాప్య పాయసం దేవనిర్మితమ్।
బభూవ పరమప్రీతః ప్రాప్య విత్తమివాధనః। 23

తతస్తదద్భుతప్రఖ్యం భూతం పరమభాస్వరమ్।
సంవర్తయిత్వా తత్కర్మ తత్రైవాంతరధీయత। 24

హర్షరశ్మిభిరుద్ద్యోతం తస్యాంతఃపురమాబభౌ।
శారదస్యాభిరామస్య చంద్రస్యేవ నభోఽంశుభిః। 25

సోఽంతఃపురం ప్రవిశ్యైవ కౌసల్యామ్ ఇదమబ్రవీత్।
పాయసం ప్రతిగృహ్ణీష్వ పుత్రీయం త్విదమాత్మనః। 26

కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా।
అర్ధాదర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిపః। 27

కైకేయ్యై చావశిష్టార్ధం దదౌ పుత్రార్థకారణాత్।
ప్రదదౌ చావశిష్టార్ధం పాయసస్యామృతోపమమ్। 28

ప్రియపత్నినివలె ప్రేమతో రెండుచేతులతో పట్టుకొనియుండెను. వెండిమూతగల ఆ బంగారుపాత్ర దివ్యమైన పాయసముతో నిండియుండెను. (11-15)

ఆ దివ్యపురుషుడు దశరథమహారాజుతో "ఓ రాజా! నేను బ్రహ్మదేవుడు పంపగా ఇచ్చటికి వచ్చితిని" - అని పలికెను. తదనంతరము ఆ రాజు అంజలి ఘటించి "ఓ మహాత్మా! నీకు స్వాగతము. నా కర్తవ్యమును తెలుపుము" అని పలికెను.(16-17)

పిమ్మట బ్రహ్మపంపున వచ్చిన ఆ దివ్యపురుషుడు మరల ఇట్లు వచించెను. "ఓ రాజా! అశ్వమేధయాగము, పుత్రకామేష్టి అను వాటిద్వారా నీవు దేవతలను సంతుష్టులను గావించితివి. వారిఅనుగ్రహముతో ఇది లభించినది. ఓనరేంద్రా! ఇది దివ్యమైన పాయసము, సంపత్కరము, ఆరోగ్యమును వృద్ధి చేయునది, అంతేగాదు, ఇది సంతానమును గూడ ప్రసాదించును. దీనిని స్వీకరింపుము. ఈ పాయసమును నీ ప్రియపత్నులకిచ్చి, భుజింపవలసినదిగా వచింపుము. దీనిని సేవించుటవలన యజ్ఞ ఫలముగా నీ భార్యలకు పుత్రసంతానము కలుగును."(18-20)

అనంతరము రాజు 'అట్లే' అని పలికి, పరమప్రీతుడై, దివ్య పాయసముతో నిండి, దేవదత్తమైన ఆ బంగారు పాత్రను శిరముపై గ్రహించెను. అద్భుతముగా దర్శనీయుడైయున్న ఆ దివ్యపురుషునకు పరమానందముతో ప్రదక్షిణనమస్కారములనొనర్చెను.(21-22)

దశరథమహారాజు దేవతలు అనుగ్రహించిన ఆ దివ్య పాయసమునుపొంది, నిర్ధనుడు ఒక నిధిని పొందినట్లుగా మహానందభరితుడాయెను. (23)

పాయసప్రదానకార్యమును ముగించుకొని, అద్భుతాకారముతో దివ్యతేజస్సుతో విరాజిల్లుచున్న ఆ మహాపురుషుడు వెంటనే అంతర్ధానమాయెను. (24)

సంతానదాయకమైన దివ్యపాయసము లభించుటవలన అంతఃపురస్త్రీలందరును మిక్కిలి సంతోషముతో ప్రసన్న ముఖకాంతులతో, శరత్కాలమునందు ఆహ్లాదకరమైన చంద్రకిరణములతో ప్రకాశించు ఆకాశమువలె తేజరిల్లిరి.(25)

దశరథుడు అంతఃపురమున ప్రవేశించి, కౌసల్య మొదలగు రాణులతో "మనకు పుత్రులను ప్రసాదించు ఈ పాయసమును స్వీకరింపుడు" అని పలికెను. (26)

ఆ మహారాజు కౌసల్యాదేవికి అమృతతుల్యమగు ఆ పాయసములో సగభాగమును ఇచ్చెను - మిగిలిన సగములో అర్ధభాగమును (1/4) సుమిత్రాదేవికి ఇచ్చెను. మిగిలిన పావు (1/4) భాగములో సగభాగమును (1/8) కైకేయికి ఒసగెను-

అనుచింత్య సుమిత్రాయై పునరేవ మహీపతిః।
ఏవం తాసాం దదౌ రాజా భార్యాణాం పాయసం పృథక్। 29

మిగిలిన సగము (1/8) భాగమును మరల సుమిత్రకు ఇచ్చెను- ఈ విధముగా పుత్రసంతానప్రాప్తికై పాయసమును ముగ్గురు రాణులకు విడివిడిగా పంచెను. (27-29)

తా స్త్వేతత్ పాయసం ప్రాప్య నరేంద్రస్యోత్తమాః స్త్రియః।
సమ్మానం మేనిరే సర్వాః ప్రహర్షోదితచేతసః। 30

ఆ ముగ్గురు రాణులును దశరథునినుండి పాయసమును స్వీకరించి, అది తమకు జరిగిన సమ్మానమని (మహా భాగ్యముగా) భావించి, సంతోషముతో పొంగిపోయిరి. (30)

తతస్తు తాః ప్రాశ్య తదుత్తమస్త్రియో
మహీపతేః ఉత్తమపాయసం పృథక్ ।
హుతాశనాదిత్యసమానతేజసోఽ-
చిరేణ గర్భాన్ ప్రతిపేదిరే తదా । 31

తతస్తు రాజా ప్రసమీక్ష్య తాః స్త్రియః
ప్రరూఢగర్భాః ప్రతిలబ్ధమానసః ।
బభూవ హృష్ట స్త్రిదివే యథా హరిః
సురేంద్ర సిద్ధర్షి గణాభిపూజితః । 32

పిమ్మట దశరథమహారాజుయొక్క ప్రియపత్నులు ముగ్గురును ఆ దివ్యపాయసమును ఎవరిభాగమును వారు భుజించి, అగ్నివలె, సూర్యునివలె తేజోమూర్తులై విరాజిల్లిరి. అచిరకాలముననే వారు గర్భవతులైరి. తదనంతరము దశరథుడు గర్భవతులైన తనభార్యలను జూచి, స్వస్థచిత్తుడై, స్వర్గమునందు ఇంద్రాదిదేవతలచే, సిద్ధులచే, ఋషిగణములచే పూజింపబడిన విష్ణువువలె సంతోషించెను. (31-32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షోడశస్సర్గః *(16)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదునాఱవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

17. పదునేడవసర్గము

బ్రహ్మయొక్క ప్రేరణప్రభావమున దేవతలఅంశలతో భల్లూక, వానరవీరులు జన్మించుట.

పుత్రత్వం తు గతే విష్ణౌ రాజ్ఞస్తస్య మహాత్మనః।
ఉవాచ దేవతాః సర్వాః స్వయంభూర్భగవానిదమ్। 1

మహాత్ముడైన దశరథమహారాజునకు పుత్రుడుగా అవతరించుటకు శ్రీ మహావిష్ణువు సంకల్పించిన పిమ్మట భవిష్యత్పరిణామములను ఎఱింగిన బ్రహ్మదేవుడు దేవతలందఱితో ఇట్లనుడివెను. (1)

సత్యసంధస్య వీరస్య సర్వేషాం నో హితైషిణః।
విష్ణోః సహాయాన్ బలినః సృజధ్వం కామరూపిణః। 2

"ఓ దేవతలారా! సత్యసంధుడు, మహావీరుడు, మన అందఱికిని హితాభిలాషియు ఐన విష్ణువునకు కామరూపులును, బలశాలురును ఐన సహాయకులను సృజింపుడు. (2)

మాయావిదశ్చ శూరాంశ్చ వాయువేగసమాన్ జవే।
నయజ్ఞాన్ బుద్ధిసంపన్నాన్ విష్ణుతుల్యపరాక్రమాన్। 3

అసంహార్యానుపాయజ్ఞాన్ దివ్యసంహననాన్వితాన్।
సర్వాస్త్రగుణసంపన్నాన్ అమృతప్రాశనానివ। 4

అద్భుతమైన శక్తిగలవారును, మహావీరులును, వాయువువలె మిక్కిలి వేగముగలవారును, యుక్తిశాలురును, ప్రజ్ఞాశాలురును, పరాక్రమమున విష్ణువుతో సమానులును, అవధ్యులును, సామదానభేదదండోపాయములను ఎఱిగినవారును, సింహపరాక్రమముగలవారును, సమస్తమైన అస్త్రశస్త్రములను ప్రయోగించుటలో నిపుణులును, అమృతపానము చేసిన వారివలె మరణము లేనివారును, మీవలె పరాక్రమవంతులును అగు పుత్రులను అప్సరసలు, ముఖ్యగంధర్వ స్త్రీలు, యక్షవనితలు,

అప్సరస్సు చ ముఖ్యాసు గంధర్వీణాం తనూషు చ
(యక్షపన్నగకన్యాసు ఋక్షవిద్యాధరీషు చ।
కిన్నరీణాంచ గాత్రేషు వానరీణాం తనూషుచ)
సృజధ్వం హరిరూపేణ పుత్రాంస్తుల్యపరాక్రమాన్। 5

పూర్వమేవ మయా సృష్టో జాంబవాన్ ఋక్షపుంగవః।
జృంభమాణస్య సహసా మమ వక్త్రాదజాయత। 6

తే తథోక్తా భగవతా తత్ప్రతిశ్రుత్య శాసనమ్।
జనయామాసురేవంతే పుత్రాన్ వానరరూపిణః। 7

ఋషయశ్చ మహాత్మానః సిద్ధవిద్యాధరోరగాః।
చారణాశ్చ సుతాన్ వీరాన్ ససృజుః వనచారిణః। 8

వానరేంద్రం మహేంద్రాభమ్ ఇంద్రో వాలినమూర్జితమ్।
సుగ్రీవం జనయామాస తపనః తపతాం వరః। 9

బృహస్పతి స్త్వజనయత్ తారం నామ మహాహరిమ్।
సర్వవానరముఖ్యానాం బుద్ధిమంతమ్ అనుత్తమమ్। 10

ధనదస్య సుతః శ్రీమాన్ వానరో గంధమాదనః।
విశ్వకర్మాత్వజనయత్ నళం నామ మహాహరిమ్। 11

పావకస్య సుతః శ్రీమాన్ నీలోఽగ్ని సదృశప్రభః।
తేజసా యశసా వీర్యాత్ అత్యరిచ్యత వానరాన్। 12

రూపద్రవిణసంపన్నౌ అశ్వినౌ రూపసమ్మతౌ।
మైందం చ ద్వివిదం చైవ జనయామాసతుః స్వయమ్। 13

వరుణో జనయమాస సుషేణం వానరర్షభమ్।
శరభం జనయామాస పర్జన్యస్తు మహాబలమ్। 14

మారుత స్యాత్మజః శ్రీమాన్ హనుమా న్నామ వీర్యవాన్।
వజ్రసంహననోపేతో వైనతేయసమో జవే।
సర్వవానరముఖ్యేషు బుద్ధిమాన్ బలవానపి। 15

తే సృష్టా బహుసాహస్రా దశగ్రీవవధే రతాః। 16

అప్రమేయబలావీరా: విక్రాంతాః కామరూపిణః।
మేరుమందరసంకాశా వపుష్మంతో మహాబలాః।
ఋక్షవానరగోపుచ్ఛాః క్షిప్రమేవాభిజజ్ఞిరే। 17

నాగకన్యలు, ఋక్ష, విద్యాధరయువతులు, కిన్నరమహిళలు, వానరస్త్రీలు మున్నగు వారియందు వానర రూపములతో సృజింపుడు. (3-5)

పూర్వమే జాంబవంతుడను ఋక్షరాజును నేను సృష్టించి యుంటిని. నేను ఒకపరి ఆవులించినప్పుడు అతడు నా నోటి నుండి వెలువడెను." బ్రహ్మదేవుడు ఇట్లు పలుకగా ఆయన ఆజ్ఞ మేరకు దేవతలు వానరరూపములలో పుత్రులను బడసిరి. మహాత్ములైన ఋషులు సిద్ధులు, విద్యాధరులు, నాగులు, చారణులు, వానర భల్లూకవీరులను పుత్రులనుగా పొందిరి. (6-8)

ఇంద్రుడు మహేంద్రపర్వతమువలె మిక్కిలి దృఢమైన (బలమైన) దేహముగలవాడును, వానరశ్రేష్ఠుడును ఐన వాలికి జన్మనిచ్చెను. తపింపజేయువారిలో శ్రేష్ఠుడైన సూర్యుడు సుగ్రీవునిజన్మకు కారణమయ్యెను. (9)

వానరులందరిలో ముఖ్యుడును, ప్రజ్ఞాశాలియు, మిక్కిలి ఉత్తముడును ఐన 'తారుడు' అను కపివరుడు బృహస్పతి వలన కలిగెను. (10)

శ్రీమంతుడైన 'గంధమాదనుడు' అను వానరుడు కుబేరుని వలన కలిగెను. విశ్వకర్మవలన 'నలుడు' అను వానరోత్తముడు జన్మించెను. అతడు సర్వకార్యములను నిర్వహించుటలో దక్షుడు. ఉత్తమ లక్షణములు గల 'నీలుడు' అను వానరుడు అగ్నిదేవుని వలన కలిగెను. అతడు అగ్నివలె భాసిల్లువాడు, వానరులందరిలోను మిక్కిలి తేజస్వి, కీర్తిప్రతిష్ఠలుగలవాడు, పరాక్రమశాలి. (11-12)

ప్రశస్తమైన రూపములుగల మైందుడు, ద్వివిదుడు అను వానరులు సౌందర్యసంపన్నులైన అశ్వినీదేవతల మానసపుత్రులు. వరుణుడు సుషేణుడను వానరునకును, పర్జన్యుడు (వర్షాధిదేవత) మహాబలశాలియైన శరభునకును జన్మనిచ్చెను. (13-14)

సర్వశుభలక్షణసంపన్నుడును, వానరప్రముఖుడును ఐన హనుమంతుడు వాయుదేవునికుమారుడు. అతడు వజ్రము వలె అభేద్యమైన శరీరముగలవాడు, గరుత్మంతునివలె వేగగమనుడు. వానర ప్రముఖులలో గొప్పప్రజ్ఞాశాలి, మిక్కిలి బలవంతుడు. (15)

ఈ విధముగా వేలకొలది వానరులు, భల్లూక (ఎలుగుబంటి) జాతివారు, గోపుచ్ఛ (కొండముచ్చు) జాతివారు వివిధదేవతల సంతానమై జన్మించిరి. వారు రావణసంహారమునందు ఆసక్తి గలవారు, సాటిలేని బలపరాక్రమములుగలవారు, మహావీరులు, కామరూపులు, మేరుమందరపర్వతములవలె దృఢమైన విశాల శరీరములు గలవారు. (16-17)

యస్య దేవస్య యద్రూపం వేషో యశ్చ పరాక్రమః।
అజాయత సమస్తేన తస్య తస్య సుతః పృథక్। 18

గోలాంగూలీషు చోత్పన్నాః కేచిత్ సమ్మతవిక్రమాః।
ఋక్షీషు చ తథా జాతా వానరాః కిన్నరీషు చ। 19

దేవా మహర్షిగంధర్వాః తార్క్ష్యా యక్షా యశస్వినః।
నాగాః కింపురుషాశ్చైవ సిద్ధవిద్యాధరోరగాః। 20

బహవో జనయామాసుః హృష్టాస్తత్ర సహస్రశః।
వానరాన్ సుమహాకాయాన్ సర్వాన్ వై వనచారిణః। 21

అప్సరస్సు చ ముఖ్యాసు తథా విద్యాధరీషు చ।
నాగకన్యాసు చ తథా గంధర్వీణాం తనూషు చ। 22

కామరూపబలోపేతా యథాకామం విచారిణః।
సింహశార్దూలసదృశా దర్పేణ చ బలేన చ। 23

శిలాప్రహరణాః సర్వే సర్వే పాదపయోధినః।
నఖదంష్ట్రాయుధాః సర్వే సర్వే సర్వాస్త్రకోవిదాః। 24

విచాలయేయుః శైలేంద్రాన్ భేదయేయుః స్థిరాన్ ద్రుమాన్।
క్షోభయేయుశ్చ వేగేన సముద్రం సరితాం పతిమ్। 25

దారయేయుః క్షితిం పద్భ్యామ్ ఆప్లవేయుర్మహార్ణవమ్।
నభఃస్థలం విశేయుశ్చ గృహ్ణీయురపి తోయదాన్। 26

గృహ్ణీయురపి మాతంగాన్ మత్తాన్ ప్రవ్రజతో వనే।
నర్దమానాశ్చ నాదేన పాతయేయుర్విహంగమాన్। 27

ఈదృశానాం ప్రసూతాని హరీణాం కామరూపిణామ్।
శతం శతసహస్రాణి యూథపానాం మహాత్మనామ్। 28

తే ప్రధానేషు యూథేషు హరీణాం హరియూథపాః।
బభూవుర్యూథపశ్రేష్ఠా వీరాంశ్చాజనయన్ హరీన్। 29

అన్యే ఋక్షవతః ప్రస్థాన్ ఉపతస్థుః సహస్రశః।
అన్యే నానావిధాన్ శైలాన్ భేజిరే కాననాని చ। 30

ఈ వానరాది ప్రముఖులందఱును తమకు జన్మలనిచ్చిన దేవతల యొక్క విలక్షణమైన రూపములను, వేషములను, పరాక్రమములను కలిగియుండిరి. (18)

గోపుచ్ఛ (కొండముచ్చు) జాతియందును, భల్లూక (ఎలుగుబంటి) జాతియందును, కిన్నర జాతియందును జన్మించిన వానరాది ప్రముఖులు ప్రసిద్ధ పరాక్రమశాలురు. (19)

వాసిగాంచిన దేవతలు, మహర్షులు, గంధర్వులు, గరుడ జాతివారు, యక్షులు, ఐరావతాది గజజాతివారు, వాసుకిప్రభృతి సర్పజాతివారు, కింపురుషులు, సిద్ధులు, విద్యాధరులు, రామావతారమునకు మిక్కిలి సంబరపడినవారై, ఆ సమయమున ప్రసిద్ధమైన అప్సరసలయందును, విద్యాధరస్త్రీలయందును, నాగకన్యలయందును, అట్లే గంధర్వకాంతలయందును వేలకొలది వానరులను సృజించిరి. వారందఱును మహాకాయులు, వనసంచారులు, వన్యఫలములను కందమూలములను భుజించువారు. (20-22)

ఈ వానరవీరులందఱును తాము కోరుకొనిన రూపములను బలములను పొందగలవారు, స్వేచ్ఛగా ఎచ్చటికైనను సంచరింప గలవారు, సింహశార్దూలములవలె గంభీరులు, బలసంపన్నులు. వారు శత్రువులపై కొండఱాళ్లను విసరివేయగలరు, మహా వృక్షములను పెకలించి ప్రయోగింపగలరు. వారికి గోళ్లు కోఱలు ఆయుధములు. దైవాంశసంభూతులగుటవలన వారు వివిధాస్త్రములను ప్రయోగించుటలోను ఎదుర్కొనుటలోను దక్షులు. మహాపర్వతములనుసైతము చలింప జేయగలరు. స్థిరమైన పెనువృక్షములనుగూడ పెకలించి వేయగలరు. నదులకు భర్తయైన సముద్రమునుసైతము తమబలముచే కల్లోలపఱచగలరు. పాదఘట్టనలతో భూమండలమును బ్రద్దలుగావింపగలరు. మహాసముద్రములనుగూడ లంఘింప గలరు, ఆకాశమునకు ఎగురగలరు. మేఘములను పట్టగలరు. వనమునందు వేగముగా సాగిపోవుచున్న మదపుటేనుగులను గూడ పట్టుకొనగలరు. ఆకాశమున విహరించుచున్న పక్షులను సైతము తమ గర్జనలతో పడగొట్టగలరు. (23-27)

కామరూపులును, మహాత్ములును, సేనానాయకులును ఐన ఇట్టివానరులసంఖ్య కోట్లకు చేరెను. (28)

ఆ వానరులలో ప్రముఖులైనవారు వానరప్రధానసేనలకు నాయకశ్రేష్ఠులైరి. వారును వానరవీరులను సృజించిరి. (29)

వేలకొలదివానరులు కొంతమంది 'ఋక్షవంతము' అను పర్వతముయొక్క సానువులయందు నివసింపసాగిరి. మఱికొంతమంది నానావిధములగు కొండలను, అడవులను ఆశ్రయించిరి. (30)

సూర్యపుత్రం చ సుగ్రీవం శక్రపుత్రం చ వాలినమ్।
భ్రాతరావుపతస్థుస్తే సర్వ ఏవ హరీశ్వరాః। 31

సూర్యునిఅంశతో బుట్టిన సుగ్రీవుడు, ఇంద్రునిఅంశతో జన్మించిన వాలి అను ఇరువురును సోదరులు (ఋక్షరజుని కుమారులు). వానర వీరులందఱును ఈ ఇరువురు సోదరులను, నలుని, నీలుని, హనుమంతుని, మఱియు ఇతరవానర ప్రముఖులను ఆశ్రయించియుండిరి. వారందఱును గరుత్మంతునితో సమానమైన బలముగలవారు, యుద్ధవిశారదులు. వారు వనములలో సంచరించుచు తమ బలపరాక్రమములచే సింహములను, పెద్దపులులను, మహాసర్పములను సైతము పీడింపగల సమర్థులు. (31-32)

నలం నీలం హనూమంతమ్ అన్యాంశ్చ హరియూథపాన్।
తే తార్క్ష్యబలసంపన్నాః సర్వే యుద్ధవిశారదాః।
విచరంతో ఽర్దయన్ దర్పాత్ సింహవ్యాఘ్రమహోరగాన్। 32

తాంశ్చ సర్వాన్ మహాబాహుః వాలీ విపులవిక్రమః।
జుగోప భుజవీర్యేణ ఋక్షగోపుచ్ఛవానరాన్। 33

తైరియం పృథివీ శూరైః సపర్వతవనార్ణవా।
కీర్ణా వివిధసంస్థానైః నానావ్యంజనలక్షణైః। 34

తైర్మేఘబృందాచలకూటకల్పైః
మహాబలైః వానరయూథపాలైః।
బభూవ భూర్భీమశరీరరూపైః
సమావృతా రామసహాయహేతోః। 35

దృఢమైన బాహువులుగలవాడును, అమిత పరాక్రమశాలియు ఐన వాలి ఆ భల్లూకములకును కొండముచ్చులకును, వానరులకును ప్రభువై, తన భుజబలముచేత వారిని పాలించుచుండెను. వివిధములైన ఆకారములతోనున్న శరీరములు గలవారును, పలువిధములైన లక్షణములుగలవారును ఐన ఆ వానరవీరులు పర్వతములతో, అడవులతో, సముద్రములతో గూడిన భూమండలమంతటిని వ్యాపించి యుండిరి. మేఘసమూహములవలెను, పర్వతశిఖరములవలెను మిక్కిలి ఉన్నతులైన వారును, మిగుల బలశాలురును, భయంకరములైన రూపములు, శరీరములు గలవారును ఐన ఆ వానరసేనానాయకులు శ్రీరామునకు సహాయపడుటకై ఈ భూమండలమునందు అంతటను నిండియుండిరి. (33-35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తదశస్సర్గః ***(17)***

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు పదునేడవసర్గము సమాప్తము

-- * * * --

18. పదునెనిమిదవసర్గము

శ్రీరామావతారఘట్టము - విశ్వామిత్రునిఆగమనము.

నిర్వృత్తే తు క్రతౌ తస్మిన్ హయమేధే మహాత్మనః।
ప్రతిగృహ్య సురా భాగాన్ ప్రతిజగ్ముః యథాగతమ్। 1

మహాత్ముడైన దశరథమహారాజు ప్రారంభించిన అశ్వమేధ, పుత్రకామేష్టి క్రతువులు ముగిసినవి - దేవతలు అందఱును తమ తమ హవిర్భాగములను స్వీకరించి, స్వస్థానములకు చేరిరి. (1)

సమాప్తదీక్షానియమః పత్నీగణసమన్వితః।
ప్రవివేశ పురీం రాజా సభృత్యబలవాహనః। 2

యజ్ఞదీక్షానియమములు పూర్తికాగానే సేవకులు, సైనికులు, వాహనములు వెంటరాగా రాజు రాణులతోగూడి పురమున ప్రవేశించెను. (2)

యథార్హం పూజితాస్తేన రాజ్ఞా వై పృథివీశ్వరాః।
ముదితాః ప్రయయుర్దేశాన్ ప్రణమ్య మునిపుంగవమ్। 3

యజ్ఞమునకు విచ్చేసిన దేశాధిపతులందఱిని దశరథుడు వారివారి యోగ్యతలననుసరించి సమ్మానించెను. వారును మిక్కిలి సంతోషించి, వసిష్ఠమహర్షికి నమస్కరించి, తమ తమ దేశములకు బయలుదేఱిరి. (3)

శ్రీమతాం గచ్ఛతాం తేషాం స్వపురాణి పురాత్తతః।
బలాని రాజ్ఞాం శుభ్రాణి ప్రహృష్టాని చకాశిరే। 4

గతేషు పృథివీశేషు రాజా దశరథస్తదా।
ప్రవివేశ పురీం శ్రీమాన్ పురస్కృత్య ద్విజోత్తమాన్। 5

శాంతయా ప్రయయౌ సార్ధమ్ ఋశ్యశృంగస్సుపూజితః।
అన్వీయమానో రాజ్ఞాఽథ సానుయాత్రేణ ధీమతా। 6

ఏవం విసృజ్య తాన్ సర్వాన్ రాజా సంపూర్ణమానసః।
ఉవాస సుఖితస్తత్ర పుత్త్రోత్పత్తిం విచింతయన్। 7

తతో యజ్ఞే సమాప్తే తు ఋతూనాం షట్ సమత్యయుః।
తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ। 8

నక్షత్రేఽదితిదైవత్యే స్వోచ్చసంస్థేషు పంచసు।
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతావిందునా సహ। 9

ప్రోద్యమానే జగన్నాథం సర్వలోకనమస్కృతమ్।
కౌసల్యాఽజనయద్రామం సర్వలక్షణ సంయుతమ్। 10

విష్ణోరర్ధం మహాభాగం పుత్త్రమ్ ఐక్ష్వాకువర్ధనమ్।
కౌసల్యా శుశుభే తేన పుత్త్రేణామితతేజసా।
యథా వరేణ దేవానామ్ అదితిర్వజ్రపాణినా। 11

భరతో నామ కైకేయ్యాం జజ్ఞే సత్యపరాక్రమః।
సాక్షాద్విష్ణోశ్చతుర్థాంశః సర్వైః సముదితో గుణైః। 12

అథ లక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రాఽజనయత్ సుతౌ।
వీరౌ సర్వాస్త్రకుశలౌ విష్ణోరర్ధసమన్వితౌ। 13

అయోధ్యనుండి తమనగరములకు వెళ్ళుచున్న శ్రీమంతులైన ఆ రాజులయొక్క సైనికులు దశరథుడొసంగిన వస్త్రాభరణములకు సంతసించినవారై చక్కగా భాసిల్లిరి. (4)

రాజులందఱును వెళ్ళినపిమ్మట శుభలక్షణసంపన్నుడైన దశరథుడు వశిష్ఠాదిమహర్షులు ముందునకు సాగి పోవుచుండగా పురమున ప్రవేశించెను. (5)

నగరప్రవేశానంతరము దశరథుడు ఋశ్యశృంగుని సాదరముగా పూజించెను. పిమ్మట ఆ మహర్షి తన భార్యయైన శాంతతోగూడి ప్రయాణమయ్యెను. ధీశాలియైన రోమపాదుడు ఆయనను సపరివారముగా అనుసరించెను. వారినందఱిని దశరథుడు కొంత దూరము అనుసరించి, వీడ్కొలిపెను. (6)

దశరథమహారాజు వచ్చినవారినందఱిని వీడ్కొలిపి, మిక్కిలి ఆనందించెను. అనంతరము పుత్త్రప్రాప్తిని గూర్చి ఆలోచించుచు హాయిగా నివసింపసాగెను. (7)

యజ్ఞము ముగిసిన పిమ్మట ఒక సంవత్సరకాలము గడచెను. పండ్రెండవ మాసమున చైత్రశుద్ధ నవమినాడు పునర్వసు నాల్గవపాదమున కర్కాటక లగ్నమున కౌసల్యాదేవియందు శ్రీరామచంద్రప్రభువు ఉదయించెను. ఆ సమయమున సూర్యుడు, అంగారకుడు, గురుడు, శుక్రుడు, శని అను ఐదు గ్రహములును తమ ఉచ్చస్థానములయందు అనగా క్రమముగా మేష, మకర, కర్కాటక, మీన, తులారాసులయందు ఉండిరి, కర్కాటక రాశియందు గురుచంద్రులు కలిసియుండిరి. బుధాదిత్యులు మేషమునందుండిరి. జగన్నాథుడును, అన్ని లోకములవారిచే నమస్కరింపబడువాడును, సర్వశుభలక్షణ సంపన్నుడును, మహాభాగ్యశాలియు విష్ణ్వంశసంభూతుడును, ఇక్ష్వాకువంశవర్ధనుడు ఐన శ్రీరాముని పుత్త్రునిగాగన్న కౌసల్యాదేవి ఎంతయు ధన్యురాలు. (8-10)

కౌసల్యాదేవి తనతపఃఫలముగా, చేతియందు వజ్రరేఖలు గలవాడును, మహాతేజశ్శాలియు ఐన శ్రీరాముని పుత్త్రునిగా పొందెను. దేవతలలో శ్రేష్ఠుడును, వజ్రాయుధమును చేతియందు ధరించువాడును ఐన ఇంద్రుని పుత్త్రునిగా పొందిన అదితివలె ఆమె ఎంతయు శోభిల్లెను. (11)

సత్యవాక్పరిపాలకుడును, సర్వసద్గుణసంపన్నుడును, విష్ణువు యొక్క చతుర్థాంశమైన వాడును అగు భరతుడు కైకేయి యందు జన్మించెను. (12)

భరతజననానంతరము వీరులును, వివిధములైన అస్త్ర ప్రయోగములయందు నిపుణులును, విష్ణ్వంశలలో ఒప్పెడి వారును ఐన లక్ష్మణశత్రుఘ్నులు అను కవలలను సుమిత్రాదేవి కనెను. (13)

శ్రీరాముని జన్మలగ్నకుండలి

	మేష	వృషభ	మిథున
శు	ర,బు		
	చైత్ర శుద్ధ నవమి, పునర్వసు 4వ పాదము కర్కాటక లగ్నము		గు,చం / ల
కు			
		శ	

1) శ్లోకములు 8,9
2) రాజ్య(10వ)స్థానమున పాపగ్రహములు -
3) రవి, కుజ, గురు, శుక్ర, శనులు ఉచ్చస్థానములలో గలరు.[1]
4) బుధాదిత్యయోగము.
5) గురుచంద్రయోగము.
6) సుఖ(4వ) స్థానమున శని, చంద్రుడు స్వక్షేత్రములో

భరతుని జన్మలగ్నకుండలి

	మేష	వృషభ	మిథున
శు / ల	ర, బు		
	చైత్రశుద్ధ దశమి, పుష్యమి మీన లగ్నము		చం, గు
కు			
		శ	

1) శ్లోకము. 14
2) కుటుంబ (2వ) స్థానమున పాపగ్రహములు
3) రవి, కుజ, గురు, శుక్ర, శనులు ఉచ్చస్థానములలో
4) బుధాదిత్య యోగము
5) గురు చంద్రయోగము
6) అష్టమ శని, చంద్రుడు స్వక్షేత్రములో

లక్ష్మణ శత్రుఘ్నుల జన్మలగ్నకుండలి

	మేష	వృషభ	మిథున
శు	ర, బు		
	చైత్రశుద్ధ దశమి, ఆశ్లేష, కర్కాటక లగ్నము		గు,చం / ల
కు			
		శ	

1) శ్లోకము 15
2) రాజ్య(10వ) స్థానమున పాపగ్రహములు
3) రవి, కుజ, గురు, శుక్ర, శనులు ఉచ్చస్థానములలో-
4) బుధాదిత్య యోగము
5) గురు చంద్రయోగము
6) సుఖ(4వ) స్థానమున శని, చంద్రుడు స్వక్షేత్రములో

(1) రామలక్ష్మణ భరతశత్రుఘ్నుల జననకాలములయందు రవి, కుజ, గురు, శుక్ర, శనులు వారివారి ఉచ్చ రాసులలో ఉండిరి. తత్ఫలమ్ - "పంచోచ్చే లోకనాయకః -" అని జ్యోతిషశాస్త్ర ప్రమాణము - కనుక శ్రీరాముడు లోకనాయకుడు - అనగా 'జగత్ప్రభువు'గా వాసిగాంచెను. తక్కిన వారును జగత్ప్రసిద్ధులైరి.

పుష్యే జాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః। 14

సార్పే జాతౌ తు సౌమిత్రీ కుళీరేఽభ్యుదితే రవౌ।
రాజ్ఞః పుత్త్రా మహాత్మానః చత్వారో జజ్ఞిరే పృథక్। 15

గుణవంతోఽనురూపాశ్చ రుచ్యా ప్రోష్ఠపదోపమాః।
జగుః కలం చ గంధర్వా ననృతుశ్చాప్సరోగణాః। 16

దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిశ్చ ఖాచ్చ్యుతా। 17

ఉత్సవశ్చ మహానాసీత్ అయోధ్యాయాం జనాకులః।
రథ్యాశ్చ జనసంబాధా నటనర్తకసంకులాః।
గాయనైశ్చ విరావిణ్యో వాదనైశ్చ తథాఽపరైః। 18

ప్రదేయాంశ్చ దదౌ రాజా సూతమాగధవందినామ్।
బ్రాహ్మణేభ్యో దదౌ విత్తం గోధనాని సహస్రశః। 19

అతీత్యైకాదశాహం తు నామకర్మ తథాఽకరోత్।
జ్యేష్ఠం రామం మహాత్మానం భరతం కైకయీసుతమ్। 20

సౌమిత్రిం లక్ష్మణమితి శత్రుఘ్నమ్ అపరం తథా।
వసిష్ఠః పరమప్రీతో నామాని కృతవాంస్తదా। 21

బ్రాహ్మణాన్ భోజయామాస పౌరాన్ జానపదానపి।
అదదాత్ బ్రాహ్మణానాం చ రత్నౌఘమ్ అమితం బహు।
తేషాం జన్మక్రియాదీని సర్వకర్మాణ్యకారయత్। 22

భరతుడు పుష్యమీ నక్షత్రయుక్త మీనలగ్నము నందు చైత్రశుద్ధ దశమినాడు జన్మించెను. అతడు గురువు యొక్క క్షేత్రమైన మీన లగ్నమునందు జన్మించుటవలన ప్రసన్నమైన బుద్ధిగలవాడయ్యెను. లక్ష్మణశత్రుఘ్నులు ఆశ్లేషానక్షత్రయుక్త కర్కాటకలగ్నమునందు చైత్రశుద్ధ దశమి గడియలలో జన్మించిరి. ఐదు (రవి, కుజ, గురు, శుక్ర, శని) గ్రహములు ఉచ్చరాసులలో ఉన్నప్పుడు ఈ నలుగురి జననములు సంభవించెను. (14-15)

దశరథునకు కలిగిన నలుగురు కుమారులును అన్ని విధములుగను ఆయనకు తగినవారు. వారిలో ప్రతి యొక్కరును వేర్వేరుగా విశిష్టములైన గుణములు గలవారు. పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర నక్షత్రములవలె వారు భాసిల్లుచుండిరి. రామాదులజననకాలమున గంధర్వులు అవ్యక్తమధురముగా గానముచేసిరి, అప్సరసలు కనులపండువుగా నృత్యములు చేసిరి, చక్కగా దేవదుందుభులు మ్రోగెను. ఆకాశమునుండి పుష్పవృష్టి కురిసెను. (16-17)

దశరథమహారాజునకు పుత్త్రులుకలిగిన సంతోష సమయమున అయోధ్యయందంతటను ఉత్సవములు జరిగినవి. అందు ప్రజలెల్లరును అత్యుత్సాహముతో పాల్గొనిరి. రాజవీథులన్నియును కోలాహలముతో నిండిపోయెను. నటీనటులఅభినయప్రదర్శనములతోడను, నర్తకులయొక్క నృత్యవినోదములతోడను విలసిల్లెను. గానవాద్య గోష్ఠులతోడను వందిమాగధుల స్తోత్రపాఠములతోడను ప్రతిధ్వనించెను. (18)

రాజు పౌరాణికులకును, వందిమాగధులకును పారితోషికములను ఇచ్చెను. బ్రాహ్మణోత్తములకు వేలకొలది గోవులను, ధనకనకవస్తువాహనములను దానము చేసెను. (19)

పుత్త్రులు జన్మించిన పదకొండు దినముల పిమ్మట దశరథుడు వారికి జాతకర్మనామకరణోత్సవములను నిర్వహించెను. కులపురోహితుడైన వసిష్ఠుడు ఉత్తమ గుణములు గల జ్యేష్ఠకుమారునకు 'రాముడు' అనియు, కైకేయిసుతునకు 'భరతుడు' అనియు, సుమిత్రా పుత్త్రులకు లక్ష్మణుడు, శత్రుఘ్నుడు అనియు నామకరణములు చేసెను.[1] (20-21)

రాజు బ్రాహ్మణులను, పురజనులను, గ్రామవాసులను మృష్టాన్నభోజనములతో సంతృప్తిపఱచెను. ఇంకను బ్రాహ్మణోత్తములకు బహువిధములగు రత్నములను పుష్కలముగా బహూకరించెను. పిమ్మట దశరథుడు తన నలుగురు పుత్త్రులకును అన్నప్రాశన చౌలోపనయనాది సంస్కారములను సకాలమున జరిపించెను. (22)

1) తన సద్గుణములచే అందరిని ఆనందింపజేయువాడు రాముడు. శ్రీరాముని వనవాసకాలమున రాజ్యభారమును వహించువాడు భరతుడు. రాముని సేవించుటను గొప్పసంపదగా భావించువాడు లక్ష్మణుడు. శత్రువులను హతమొనర్చువాడు శత్రుఘ్నుడు. వారిపేర్లలోగల వైశిష్ట్యము ఇదియే.

తేషాం కేతు రివ జ్యేష్ఠో రామో రతికరః పితుః।
బభూవ భూయో భూతానాం స్వయంభూ రివ సమ్మతః। 23

ఆ రాజకుమారులలో పెద్దవాడైన రాముడు ధ్వజపతాకము వలె వంశప్రతిష్ఠను ఇనుమడింపజేయుచు తండ్రికి మిక్కిలి సంతోషమును గూర్చుచుండెను. మఱియు సమస్తప్రాణులకు శ్రీమహావిష్ణువువలె ఎంతయు ప్రేమపాత్రుడయ్యెను. (23)

సర్వే వేదవిదః శూరాః సర్వే లోకహితే రతాః।
సర్వే జ్ఞానోపసంపన్నాః సర్వే సముదితా గుణైః। 24

ఆ రాజకుమారులందఱును వేదశాస్త్రములను అభ్యసించిరి. ధనుర్విద్యయందు ఆరితేఱిరి. ప్రజలహితమునందే ఆసక్తి గలవారైరి. వారందఱును విజ్ఞానఖనులు, సకలసద్గుణ సంపన్నులు. (24)

తేషామపి మహాతేజా రామస్సత్యపరాక్రమః।
ఇష్టః సర్వస్య లోకస్య శశాంక ఇవ నిర్మలః। 25

గజస్కంధేఽశ్వపృష్ఠే చ రథచర్యాసు సమ్మతః।
ధనుర్వేదేచ నిరతః పితృశుశ్రూషణే రతః। 26

రఘువంశజులలో మహాతేజశ్శాలియైన శ్రీరాముడు అమోఘమైన పరాక్రమముగలవాడు. సమస్తప్రజలకును పూర్ణచంద్రునివలె ఆహ్లాదకరుడు. రాముడు ఏనుగునెక్కియు, అశ్వమును అధిరోహించియు, రథమునందుండియు యుద్ధమొనర్చుటలో కుశలుడు. ధనుర్విద్యయందు నిరతుడు. సర్వదా తల్లిదండ్రుల సేవలలో నిమగ్నుడై యుండెడివాడు. (25-26)

బాల్యాత్ ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మివర్ధనః।
రామస్య లోకరామస్య భ్రాతుర్జ్యేష్ఠస్య నిత్యశః। 27

సర్వప్రియకరస్తస్య రామస్యాపి శరీరతః।
లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిఃప్రాణ ఇవాపరః। 28

ప్రజలను ఆనందింపజేయునట్టి అన్నయగు రామునియందు లక్ష్మణుడు బాల్యమునుండియు భక్తితత్పరుడు- నిత్యము ఆయనను సేవించుటయే ఒక మహాభాగ్యముగా తలంచువాడు. రామసేవలయందే నిరతుడగు లక్ష్మణుడు తనసుఖములను ఏమాత్రము పట్టించుకొనక త్రికరణశుద్ధిగా ఆ రామునకు అంకితభావముతో అన్నివిధములుగ ప్రియమును గూర్చుచుండువాడు. అతడు రామునకు బహిఃప్రాణము. (27-28)

న చ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః।
మృష్ట మన్న ముపానీతమ్ అశ్నాతి న చ తం వినా। 29

పురుషోత్తముడైన శ్రీరాముడును లక్ష్మణుడు తనచెంత లేనిచో నిద్రపోయెడివాడు కాడు. తల్లి కౌసల్య తీసికొనివచ్చిన కమ్మనిభోజనపదార్థములను అతడు తోడుగాలేనిచో భుజించెడివాడుగాడు. అనగా రాముడు క్షణకాలమైనను లక్ష్మణుని విడిచియుండెడివాడు కాడు. (29)

యదా హి హయమారూఢో మృగయాం యాతి రాఘవః।
తదైనం పృష్ఠతోఽభ్యేతి సధనుః పరిపాలయన్। 30

రాముడు అశ్వమునెక్కి వేటకు వెళ్లునప్పుడు లక్ష్మణుడు ధనుస్సును చేబూని, ఆతనిని కాపాడుచు వెంటనడిచెడివాడు. (30)

భరత స్యాపి శత్రుఘ్నో లక్ష్మణావరజో హి సః।
ప్రాణైః ప్రియతరో నిత్యం తస్య చాసీత్ తథా ప్రియః। 31

లక్ష్మణునకు తమ్ముడైన శత్రుఘ్నుడును అతనివలె సేవా స్వభావము గలవాడు. అతడు భరతునకు ప్రాణములకంటెను ప్రియమైనవాడు. అట్లే శత్రుఘ్నుడును భరతునిపై ఎనలేని ప్రేమను కలిగియుండెను. (31)

స చతుర్భిర్మహాభాగైః పుత్రైః దశరథః ప్రియైః।
బభూవ పరమప్రీతో దేవైరివ పితామహః। 32

చక్కనిశుభలక్షణసంపన్నులగు తననలుగురు ప్రియపుత్రులతోగూడిన దశరథుడు ఇంద్ర, యమ, వరుణ, కుబేరులు అను నలుగురు దిక్పాలురతోగూడిన బ్రహ్మదేవుని వలె పరమానందభరితుడాయెను. (32)

తే యదా జ్ఞానసంపన్నాః సర్వే సముదితా గుణైః।
హ్రీమంతః కీర్తిమంతశ్చ సర్వజ్ఞా దీర్ఘదర్శినః। 33

తేషామేవంప్రభావాణాం సర్వేషాం దీప్తతేజసామ్।
పితా దశరథో హృష్టో బ్రహ్మా లోకాధిపో యథా। 34

తే చాపి మనుజవ్యాఘ్రా వైదికాధ్యయనే రతాః।
పితృశుశ్రూషణరతా ధనుర్వేదే చ నిష్ఠితాః। 35

అథ రాజా దశరథః తేషాం దారక్రియాం ప్రతి।
చింతయామాస ధర్మాత్మా సోపాధ్యాయః సబాంధవః। 36

తస్య చింతయమానస్య మంత్రిమధ్యే మహాత్మనః।
అభ్యాగచ్ఛన్ మహాతేజా విశ్వామిత్రో మహామునిః। 37

స రాజ్ఞో దర్శనాకాంక్షీ ద్వారాధ్యక్షాన్ ఉవాచ హ।
శీఘ్రమాఖ్యాత మాం ప్రాప్తం కౌశికం గాధినస్సుతమ్। 38

తచ్ఛ్రుత్వా వచనం త్రాసాత్ రాజ్ఞో వేశ్మ ప్రదుద్రువుః।
సంభ్రాంతమనసః సర్వే తేన వాక్యేన చోదితాః। 39

తే గత్వా రాజభవనం విశ్వామిత్రమ్ ఋషిం తదా।
ప్రాప్తమావేదయామాసుః నృపాయైక్ష్వాకవే తదా। 40

తేషాం తద్వచనం శ్రుత్వా సపురోధాః సమాహితః।
ప్రత్యుజ్జగామ తం హృష్టో బ్రహ్మాణమివ వాసవః। 41

తం దృష్ట్వా జ్వలితం దీప్త్యా తాపసం సంశితవ్రతమ్।
ప్రహృష్టవదనో రాజా తతోఽర్ఘ్యమ్ ఉపహారయత్। 42

స రాజ్ఞః ప్రతిగృహ్యార్ఘ్యం శాస్త్రదృష్టేన కర్మణా।
కుశలం చావ్యయం చైవ పర్యపృచ్ఛన్ నరాధిపమ్। 43

ఆ నలుగురు రాజకుమారులును వివిధశాస్త్రజ్ఞాన సంపన్నులై సకలసద్గుణములతో అలరారుచు మిక్కిలి వాసిగాంచిరి. ఎట్టి పరిస్థితులయందును పొరపాటునైనను అకృత్యములకు పాల్పడెడువారు కారు, లౌకిక ప్రజ్ఞానిధులు, దూరదృష్టిగలవారు. ఇట్లు ప్రతిభాశాలురు, తేజోమూర్తులు ఐన తనకుమారులను జూచి, దశరథుడు జగత్సృష్టికర్తయైన బ్రహ్మవలె ఆనందించెను. (33-34)

పురుషశ్రేష్ఠులైన ఆరాజకుమారులు వేదవేదాంగస్మృతి పురాణేతిహాసాదులను శ్రద్ధగా అధ్యయనము చేయుచుండిరి. తల్లిదండ్రులను పరమప్రీతితో సేవించుచుండిరి. ధనుర్వేదము నందు నిష్ణాతులగుచుండిరి. (35)

ధర్మాత్ముడైన దశరథమహారాజు యుక్తవయస్కులైన తనపుత్రులకు అన్నివిధముల తగుజోడైన కన్యలతో వివాహములు జరిపించుటకై గురువులతోను, బంధువులతోను బాగుగా ఆలోచింపసాగెను. (36)

మహాత్ముడైన దశరథుడు మంత్రులు మొదలగువారితో గూడి పుత్రులవివాహవిషయములను ఆలోచించుచుండగా మహా తేజశ్శాలియైన విశ్వామిత్ర మహర్షి అచటికి విచ్చేసెను. (37)

రాజును దర్శింపగోరినవాడై ఆ ముని ద్వారపాలకులతో 'నేను గాధిరాజకుమారుడను, కుశికుని వంశమువాడను. నాపేరు విశ్వామిత్రుడు, నారాకను మీ రాజుగారికి వెంటనే తెల్పుడు" - అని పలికెను. (38)

విశ్వామిత్రునిమాటలను విని, ఆ ద్వారపాలకులు కలవరపడి, భయముతో రాజభవనమునకు పరుగెత్తిరి. (39)

వారు రాజప్రాసాదమునకు చేరి, విశ్వామిత్రమహర్షి రాకనుగూర్చి ఇక్ష్వాకువంశజుడైన దశరథమహారాజునకు నివేదించిరి. (40)

ఆ ద్వారపాలకులు తెలిపిన వార్తను విని, దశరథుడు సంతసించినవాడై, పురోహితులను వెంటదీసికొని, బ్రహ్మకడకు ఇంద్రునివలె ఆ మహర్షికి ఎదురేగెను. (41)

కఠోరనియమములను పాటించుచు బ్రహ్మతేజస్సుతో వెలుగొందుచున్న ఆ విశ్వామిత్రమహర్షిని గాంచి రాజు మిక్కిలి సంతోషించెను. పిమ్మట ఆయనకు అర్ఘ్యపాద్యాది సత్కారములను జరిపెను. (42)

ఆ మహర్షి శాస్త్రోక్తవిధులతో రాజుగారు సమర్పించిన అర్ఘ్యపాద్యాది సత్కారములను స్వీకరించెను. పిదప అతడు మహారాజుతో కుశలప్రశ్నలు గావించెను. (43)

పురే కోశే జనపదే బాంధవేషు సుహృత్సు చ।
కుశలం కౌశికో రాజ్ఞః పర్యపృచ్ఛత్ సుధార్మికః। 44

అపి తే సన్నతాః సర్వే సామంతా రిపవో జితాః।
దైవం చ మానుషం చాపి కర్మ తే సాధ్వనుష్ఠితమ్। 45

వసిష్ఠం చ సమాగమ్య కుశలం మునిపుంగవః।
ఋషీంశ్చాన్యాన్ యథాన్యాయం మహాభాగానువాచ హ। 46

తే సర్వే హృష్టమనసః తస్య రాజ్ఞో నివేశనమ్।
వివిశుః పూజితాస్తత్ర నిషేదుశ్చ యథార్హతః। 47

అథ హృష్టమనా రాజా విశ్వామిత్రం మహామునిమ్।
ఉవాచ పరమోదారో హృష్టస్తమభిపూజయన్। 48

యథాఽమృతస్య సంప్రాప్తిః యథా వర్షమనూదకే।
యథా సదృశదారేషు పుత్త్రజన్మాఽప్రజస్య చ। 49

ప్రణష్టస్య యథా లాభో యథా హర్షో మహోదయే।
తథైవాగమనం మన్యే స్వాగతం తే మహామునే। 50

కం చ తే పరమం కామం కరోమి కిము హర్షితః।
పాత్రభూతోఽసి మే బ్రహ్మన్ దిష్ట్యా ప్రాప్తోఽసి కౌశిక। 51

అద్య మే సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్।
పూర్వం రాజర్షిశబ్దేన తపసా ద్యోతితప్రభః। 52

బ్రహ్మర్షిత్వ మనుప్రాప్తః పూజ్యోఽసి బహుధా మయా।
త దద్భుత మిదం బ్రహ్మన్ పవిత్రం పరమం మమ। 53

శుభక్షేత్రగతశ్చాహం తవ సందర్శనాత్ ప్రభో।
బ్రూహి యత్ ప్రార్థితం తుభ్యం కార్య మాగమనం ప్రతి। 54

ఇచ్ఛామ్యనుగృహీతోఽహం త్వదర్థపరివృద్ధయే। 55

కార్యస్య న విమర్శం చ గంతుమర్హసి కౌశిక।
కర్తా చాహమశేషేణ దైవతం హి భవాన్ మమ। 56

మమ చాయమనుప్రాప్తో మహానభ్యుదయో ద్విజ।
తవాగమనజః కృత్స్నో ధర్మశ్చానుత్తమో మమ। 57

ధార్మికోత్తముడైన విశ్వామిత్రుడు "ఓ రాజా! నీ పురము, ధనాగారము, కోసలదేశము, బంధుమిత్రులు కుశలమే గదా? సామంతరాజులందఱును నీ అదుపులో ఉన్నారా? శత్రువులనందఱిని జయించితివా? యజ్ఞాదిదైవకార్యములు, అతిథిసత్కారాదులు చక్కగా సాగుచున్నవి గదా ?" అని దశరథుని పరామర్శించెను. (44-45)

పిమ్మట ఆ మునీశ్వరుడు వసిష్ఠుని సమీపించి, ఆయనతో కుశలప్రశ్నలు గావించెను. ఇంకను మహాత్ములైన వామదేవాది మునులనుగూడ అతడు యథోచితముగ పరామర్శించెను. ఈ విధముగా విశ్వామిత్రునిచే గౌరవింపబడినవారై వారందఱును ఎంతగానో సంతసించిరి. పిమ్మట అందఱును రాజసభా భవనమును ప్రవేశించి, తమతమ యోగ్యతల ప్రకారము అచట ఆసీనులైరి. (46-47)

మిక్కిలి ఉదారస్వభావముగల దశరథమహారాజు పులకితగాత్రుడై, ఉప్పొంగినమనస్సుతో విశ్వామిత్ర మహర్షిని స్తుతించుచు ఇట్లనెను. "ఓ మహర్షీ! అమృతము లభించినట్లును, నీళ్లు లేనిచోట వర్షము కురిసినట్లును, సంతానములేని వానికి ధర్మపత్నియందు పుత్త్రులు కలిగినట్లును, నష్టపోయిన వానికి నిధులు లభించినట్లును, పుత్త్రులవివాహాది మహోత్సవముల యందు సంతోషము వెల్లువికినట్లును మీ ఆగమనము మాకు మహానందమును గూర్చినది. మీకు స్వాగతము. (48-50)

ఓ ధర్మాత్మా! బ్రహ్మర్షీ! మీరు ఇచ్చటికి వచ్చుట మా అదృష్టము - ధన్యుడనైతిని. మీ అభీష్టమేమి? అందులకై నేనేమి చేయువలెను? దానమును గొనుటకు మీరెంతయు పాత్రులు. నేడు నాజన్మ సఫలమైనది - నా జీవితము చరితార్థమైనది. పూర్వము రాజర్షిగా వాసిగాంచితిరి - అనంతరము తపఃప్రభావమున బ్రహ్మర్షిత్వమును సాధించితిరి- కనుక మీరు మాకు బహుధా పూజ్యులు. ఓ బ్రహ్మర్షీ! అద్భుతమైన మీ ఆగమనము నన్ను అబ్బురపఱచినది. మా గృహము పావనమైనది - ప్రభూ! మీ శుభసందర్శనము వలన నేను కృతార్థుడనైతిని. మీరు ఏ కార్యనిమిత్తమై ఇచ్చటికి వచ్చితిరో తెల్పుడు. మీ కార్యమును నెరవేర్చుటకై సిద్ధముగా ఉన్నాను. అనుగ్రహింపుడు. (51-55)

ఓ కౌశికా! కార్యవిషయమున సందేహమును పెట్టుకొనవలదు. మీరు పూజ్యులైన అతిథులు, కావున గృహస్థుడనైన నాకు దైవసమానులు - మీ కార్యమును నేను నెరవేర్చెదను. ఓ బ్రహ్మర్షీ! మీ ఆగమనమువలన నేను ఆచరించిన సమస్త ధర్మములును ఫలించినవి- నేను అదృష్టవంతుడను." (56-57)

ఇతి హృదయసుఖం నిశమ్య వాక్యం
శ్రుతిసుఖమాత్మవతా వినీతముక్తమ్ ।
ప్రథితగుణయశా గుణైర్విశిష్టః
పరమఋషిః పరమం జగామ హర్షమ్ ॥ 58

అర్థవంతములైన దశరథుని మృదుమధురవచనములు విశ్వామిత్రునకు వీనులవిందొనర్చినవి. హృదయమునకు అహ్లాదమును గూర్చినవి. అంతట ఉత్తమోత్తమగుణములచే ఖ్యాతికెక్కినవాడును, శమదమాదివిశిష్టగుణసంపన్నుడును ఐన విశ్వామిత్రమహర్షి పరమానందభరితుడాయెను. (58)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే అష్టాదశస్సర్గః (18)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పదునెనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

19. పందొమ్మిదవసర్గము

యజ్ఞసంరక్షణార్థమై శ్రీరాముని పంపుమని విశ్వామిత్రుని అభ్యర్థనము.

తచ్ఛ్రుత్వా రాజసింహస్య వాక్యమ్ అద్భుతవిస్తరమ్ ।
హృష్టరోమా మహాతేజా విశ్వామిత్రోఽభ్యభాషత ॥ 1

సదృశం రాజశార్దూల తవైతద్భువి నాన్యథా ।
మహావంశప్రసూతస్య వసిష్ఠవ్యపదేశినః ॥ 2

యత్తు మే హృద్గతం వాక్యం తస్య కార్యస్య నిశ్చయమ్ ।
కురుష్వ రాజశార్దూల భవ సత్యప్రతిశ్రవాః ॥ 3

అహం నియమమాతిష్ఠే సిద్ధ్యర్థం పురుషర్షభ ।
తస్య విఘ్నకరౌ ద్వౌ తు రాక్షసౌ కామరూపిణౌ ॥ 4

వ్రతే మే బహుశశ్చీర్ణే సమాప్త్యాం రాక్షసావిమౌ ।
మారీచశ్చ సుబాహుశ్చ వీర్యవంతౌ సుశిక్షితౌ ॥ 5

తౌ మాంసరుధిరౌఘేణ వేదిం తామభ్యవర్షతామ్ ।
అవధూతే తథాభూతే తస్మిన్ నియమనిశ్చయే ॥ 6

కృతశ్రమో నిరుత్సాహః తస్మాద్దేశాదపాక్రమే ।
న చ మే క్రోధముత్స్రష్టుం బుద్ధిర్భవతి పార్థివ ।
తథాభూతా హి సా చర్యా న శాపస్తత్ర ముచ్యతే ॥ 7

స్వపుత్రం రాజశార్దూల రామం సత్యపరాక్రమమ్ ॥ 8

కాకపక్షధరం శూరం జ్యేష్ఠం మే దాతుమర్హసి ।
శక్తో హ్యేష మయా గుప్తో దివ్యేన స్వేన తేజసా ॥ 9

మహాతేజస్వియైన విశ్వామిత్రుడు దశరథమహారాజు యొక్క అద్భుతమైన ఆ వినమ్రవచనములను విని, పులకితగాత్రుడై ఆయనతో ఇట్లు నుడివెను. (1)

"ఓ రాజశేఖరా! నీవు ప్రసిద్ధమైన ఇక్ష్వాకువంశమున జన్మించినవాడవు. వసిష్ఠమహర్షియొక్క ఉపదేశములను అందినవాడవు. కనుక నీవు ఇట్లు మాట్లాడుటయే యుక్తము. నేను సంకల్పించిన కార్యమును తెల్పెదను. దానిని ఆచరింపుము. నీవు ఆడినమాట తప్పకుము. (2-3)

ఒక లక్ష్యసిద్ధికై నేను యజ్ఞదీక్షను చేపట్టితిని. కామరూపులైన ఇద్దరు రాక్షసులు దానికి విఘ్నములు కలిగించుచున్నారు- నేను ఆచరించుచున్న యజ్ఞము దాదాపు పూర్తియగుచుండగా సుశిక్షితులై, పరాక్రమవంతులైన మారీచుడు, సుబాహువు అను ఇరువురు రాక్షసులు మాంసఖండములను రక్తములను యజ్ఞవేదికపై వర్షించుచున్నారు. నియమనిష్ఠలతో నేను ఆచరించుచున్న యజ్ఞము ఆ విధముగా విఘ్నములకు గురియగుచున్నది- నా శ్రమయంతయు వృథాయగుచున్నది. కనుక ఉత్సాహమును కోల్పోయి, నా ఆశ్రమమునుండి నేను ఇచటికి వచ్చితిని. ఓ భూపతీ! అట్లు విఘ్నములను కల్గించుచున్నను వారిపై కోపమును ప్రకటించుటకు గాని, వారిని శపించుటకు గాని యజ్ఞదీక్షలోనున్న నాకు యుక్తము కాదుగదా! (4-7)

ఓ నరేంద్రా! సత్యపరాక్రముడు, కాకపక్షధరుడు (జులపాల జుట్టు గలవాడు), శూరుడు, నీ కుమారులలో పెద్దవాడు ఐన శ్రీరాముని నావెంట పంపుము. ఈ రాముడు నా అండదండలతో తనదివ్యమైన తేజఃప్రభావమున యాగమునకు విఘ్నములను కలిగించు ఆ రాక్షసులను సంహరించుటకు

రాక్షసా యే వికర్తారః తేషామపి వినాశనే।
శ్రేయశ్చాస్మై ప్రదాస్యామి బహురూపం న సంశయః॥ 10

త్రయాణామపి లోకానాం యేన ఖ్యాతిం గమిష్యతి।
న చ తౌ రామమాసాద్య శక్తౌ స్థాతుం కథంచన॥ 11

న చ తౌ రాఘవా దన్యో హంతుమ్ ఉత్సహతే పుమాన్।
వీర్యోత్సిక్తౌ హి తౌ పాపౌ కాలపాశవశంగతౌ॥ 12

రామస్య రాజశార్దూల న పర్యాప్తౌ మహాత్మనః।
న చ పుత్త్రకృతస్నేహం కర్తుమ్ అర్హసి పార్థివ॥ 13

అహం తే ప్రతిజానామి హతౌ తౌ విద్ధి రాక్షసౌ।
అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్।
వసిష్ఠోఽపి మహాతేజా యేచేమే తపసి స్థితాః॥ 14

యది తే ధర్మలాభం చ యశశ్చ పరమం భువి।
స్థిరమ్ ఇచ్ఛసి రాజేంద్ర రామం మే దాతుమర్హసి॥ 15

యది హ్యనుజ్ఞాం కాకుత్స్థ దదతే తవ మంత్రిణః।
వసిష్ఠప్రముఖాః సర్వే తతో రామం విసర్జయ॥ 16

అభిప్రేతమ్ అసంసక్తమ్ ఆత్మజం దాతుమర్హసి।
దశరాత్రం హి యజ్ఞస్య రామం రాజీవలోచనమ్॥ 17

నాత్యేతి కాలో యజ్ఞస్య యథాఽయం మమ రాఘవ।
తథా కురుష్వ భద్రం తే మా చ శోకే మనః కృథాః॥ 18

ఇత్యేవముక్త్వా ధర్మాత్మా ధర్మార్థసహితం వచః।
విరరామ మహాతేజా విశ్వామిత్రో మహామునిః॥ 19

స తన్నిశమ్య రాజేంద్రో విశ్వామిత్రవచః శుభమ్।
శోకమ్ అభ్యగమత్ తీవ్రం వ్యషీదత భయాన్వితః॥ 20

ఇతి హృదయమనోవిదారణం
మునివచనం తదతీవ శుశ్రువాన్ ।
నరపతిరభవన్మహాన్ మహాత్మా
వ్యథితమనాః ప్రచచాల చాసనాత్ ॥ 21

సమర్థుడు- నా వెంటవచ్చి యాగమును సంరక్షించుటవలన రామునకు పెక్కువిధములగు శ్రేయస్సులు సమకూరును. అందులకు సందేహము లేదు. (8-10)

ఈయనఖ్యాతి ముల్లోకముల యందును వ్యాపించును. ఏ విధముగనైనను ఆ రాక్షసులు రాముని ఎదుర్కొని నిలువ జాలరు. శ్రీరాముడుతప్ప మఱియొకడు ఎవ్వడును వారిని చంపజాలడు. ఓ మహారాజా! ఆ రాక్షసులు బలగర్వముచే పెక్కు పాపకృత్యములను చేసియున్నారు - అందువలన వారికి చావు దగ్గరపడినది. వారు ఏ విధముగను రామునిముందు నిలువజాలరు. (11-12)

ఓ రాజా! పుత్త్రవాత్సల్యకారణముగ రామునిశక్తి సామర్థ్యములను నీవు తక్కువగా పరిగణింపవలదు. నేను ప్రతిజ్ఞాపూర్వకముగ చెప్పుచున్నాను- ఆ మారీచసుబాహువులు రామునిచేతిలో మరణించినట్లే భావింపుము- మహాత్ముడైన శ్రీరాముడు సాటిలేని పరాక్రమముగలవాడు. ఆ విషయమును నేను బాగుగా ఎఱుగుదును. నేనేగాదు మీ పురోహితుడును, మహాతేజస్వియు ఐన వసిష్ఠమహర్షియు ఎఱుగును - అంతేగాదు తపోధనులైన ఈ వామదేవాదిమహర్షులును ఎఱుగుదురు. ఓ రాజేంద్రా! ఈ లోకమున స్థిరమైన కీర్తి ప్రతిష్ఠలను, ధర్మవృద్ధిని నీవు కోరుకొనుచున్నచో శ్రీరాముని నావెంట పంపుము. ఓ కాకుత్స్థా! నీ మంత్రివర్యులు, వసిష్ఠుడు మొదలగు మునీశ్వరులును సమ్మతించిన పిమ్మటనే శ్రీరాముని నాతో పంపింపుము. (13-16)

రాజీవలోచనుడైన నీ ప్రియపుత్త్రుడగు శ్రీరాముని పది దినములపాటు యాగరక్షణార్థమై వెంటనే నాతో పంపుము- ఇదియే నా అభీష్టము. ఓ దశరథ మహారాజా! నీ మాత్రము విలంబములేకుండా నాయజ్ఞము సకాలములో పూర్తి యగునట్లు చూడుము- నీకు మేలగుగాక- మనస్సున కలత చెందకుము." (17-18)

ధర్మాత్ముడును, మహాతేజశ్శాలియు ఐన విశ్వామిత్రమహర్షి ఇట్లు ధర్మార్థసహితములైన వచనములను పలికి మిన్నకుండెను. ఆ మహారాజు విశ్వామిత్రుడు పలికిన శ్రేయస్కర వచనములను విని, తీవ్రమైన శోకమునకు గురియై, భయముతో క్రుంగిపోయెను. (19-20)

విశ్వామిత్రునివచనములు దశరథునిహృదయమును, మనస్సును మిక్కిలికలచివేసెను. అప్పుడతడు అంతులేని మనస్తాపమునకు లోనై, తన ఆసనమునందే మిగుల చలించిపోయెను. (21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకోనవింశస్సర్గః (19)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు పందొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

20. ఇరువదియవసర్గము

దశరథుడు విశ్వామిత్రునివెంట శ్రీరాముని పంపుటకు తనఅశక్తతను ప్రకటించుట.

తచ్ఛ్రుత్వా రాజశార్దూలో విశ్వామిత్రస్య భాషితమ్।
ముహూర్త మివ నిస్సంజ్ఞః సంజ్ఞావానిదమబ్రవీత్॥ 1

ఊనషోడశవర్షో మే రామో రాజీవలోచనః।
న యుద్ధయోగ్యతామస్య పశ్యామి సహ రాక్షసైః॥ 2

ఇయ మక్షౌహిణీ పూర్ణా యస్యాహం పతిరీశ్వరః।
అనయా సంవృతో గత్వా యోద్ధాహం తైర్నిశాచరైః॥ 3

ఇమే శూరాశ్చ విక్రాంతా భృత్యా మేఽస్త్ర విశారదాః।
యోగ్యా రక్షోగణైర్యోద్ధుం న రామం నేతుమర్హసి॥ 4

అహమేవ ధనుష్పాణిః గోప్తా సమరమూర్ధని।
యావత్ ప్రాణాన్ ధరిష్యామి తావద్యోత్స్యే నిశాచరైః॥ 5

నిర్విఘ్నా వ్రతచర్యా సా భవిష్యతి సురక్షితా।
అహం తత్రాగమిష్యామి న రామం నేతుమర్హసి॥ 6

బాలో హ్యకృతవిద్యశ్చ న చ వేత్తి బలాబలమ్।
న చాస్త్రబలసంయుక్తో న చ యుద్ధ విశారదః॥ 7

న చాసౌ రక్షసాం యోగ్యః కూటయుద్ధా హి తే ధ్రువమ్।
విప్రయుక్తో హి రామేణ ముహూర్తమపి నోత్సహే।
జీవితుం మునిశార్దూల న రామం నేతు మర్హసి॥ 8

యది వా రాఘవం బ్రహ్మన్ నేతుమిచ్ఛసి సువ్రత।
చతురంగ సమాయుక్తం మయా చ సహితం నయ॥ 9

షష్టిర్వర్షసహస్రాణి మమ జాతస్య కౌశిక।
దుఃఖేనోత్పాదితశ్చాయం న రామం నేతుమర్హసి॥ 10

చతుర్ణా మాత్మజానాం హి ప్రీతిః పరమికా మమ।
జ్యేష్ఠం ధర్మప్రధానం చ న రామం నేతుమర్హసి॥ 11

దశరథమహారాజు ఆ విశ్వామిత్రునిమాటలను విని, క్షణకాలముపాటు నిశ్చేష్టుడయ్యెను. పిమ్మట అతడు స్పృహను పొంది మునితో ఇట్లనెను. (1)

"రాజీవలోచనుడైన నా రాముడు పదునాఱేండ్ల వయస్సు గూడ నిండనివాడు. కనుక ఇట్టి చిఱుతప్రాయమున ఆ క్రూర రాక్షసులతో ఇతడు యుద్ధముచేయగలడని నేను అనుకొనను. ఇదిగో! ఈ అక్షౌహిణీసేనకు నేను అధిపతిని, ఈ సైన్యముతో వచ్చి, నేను ఆ నిశాచరులతో పోరాడుదును. ఈ నా భటులు శూరులు, మొక్కవోని పరాక్రమశాలురు. వివిధాస్త్రములను ప్రయోగించుటలో నేర్పరులు, రాక్షసులతో యుద్ధముచేయగల సమర్థులు. దయచేసి శ్రీరామునిమాత్రము కోరవలదు. (2-4)

నేనే ధనుర్బాణములను చేతబట్టి నీ యాగసంరక్షణము చేయగలను. యుద్ధరంగమున సేనలకు నాయకత్వము వహించి, నా బొందిలో ప్రాణములున్నంతవఱకును ఆ రాక్షసులతో పోరుసల్పెదను. నేనే అచటికి వచ్చెదను. నీ యజ్ఞవ్రతదీక్ష సురక్షితముగా నిర్విఘ్నముగా పూర్తియగునట్లు చేయుదును. కనుక రాముని పంపవలసినదిగా అడుగవలదు. (5-6)

రాముడు పసివాడు. ఇంకను ధనుర్విద్యను పూర్తిగా నేర్వలేదు. శత్రువులబలాబలములను గుర్తింపజాలడు. అస్త్రములను ప్రయోగించుట అంతగా ఎఱుగడు. యుద్ధములలో ఆరితేఱినవాడుకాడు. ఆ రాక్షసులందఱును కపటయుద్ధమున నిగ్గుదేలినవారు. కనుక వారితో యుద్ధము చేయుటకు ఇతడు చాలడు. ఓ మునీశ్వరా! శ్రీరామునిసంగతి అట్లుండనిండు. రామునినెడబాసి ఒక్క క్షణకాలమైనను నేను బ్రతుకజాలను. కనుక ఆ పసివానిని కోరవద్దు. (7-8)

యజ్ఞవ్రతమును చేపట్టిన ఓ బ్రహ్మర్షీ! తప్పనిసరిగా రాముని వెంటగొనిపోదలచినచో నేనును చతురంగబలములతో వచ్చెదను. అనుమతింపుడు. నాకు అఱువదివేల సంవత్సరముల వయస్సు నిండిన పిమ్మట ఉపవాసదీక్షాదిక్లేశములకోర్చి (అశ్వమేధ, పుత్రకామేష్టి) యజ్ఞములను ఆచరించిన ఫలితముగా మా నోములపంటగా ఈ రాముడు మాకు కలిగెను. కనుక ఈ పసిబాలుని మీరు కోరవలదు. (9-10)

నా నలుగురు కుమారులలో రామునిపైన నాకు అత్యంతమైన ప్రేమ - పైగా అతడు జ్యేష్ఠుడు - కనుక ధర్మాత్ముడైన రాముని తీసికొని వెళ్లవలదు. (11)

కిం వీర్యా రాక్షసాస్తే చ కస్య పుత్త్రాశ్చ కే చ తే।
కథంప్రమాణాః కే చైతాన్ రక్షంతి మునిపుంగవ। 12

కథం చ ప్రతికర్తవ్యం తేషాం రామేణ రక్షసామ్।
మామకైర్వా బలైః బ్రహ్మన్ మయా వా కూటయోధినామ్। 13

సర్వం మే శంస భగవన్ కథం తేషాం మయా రణే।
స్థాతవ్యం దుష్టభావానాం వీర్యోత్సిక్తా హి రాక్షసాః। 14

తస్య తద్వచనం శ్రుత్వా విశ్వామిత్రోఽభ్యభాషత। 15

పౌలస్త్యవంశప్రభవో రావణో నామ రాక్షసః।
స బ్రహ్మణా దత్తవరః త్రైలోక్యం బాధతే భృశమ్। 16

మహాబలో మహావీర్యో రాక్షసైః బహుభిర్వృతః।
శ్రూయతే హి మహావీర్యో రావణో రాక్షసాధిపః। 17

సాక్షాద్వైశ్రవణభ్రాతా పుత్త్రోవిశ్రవసోమునేః।
యదా స్వయం న యజ్ఞస్య విఘ్నకర్తా మహాబలః। 18

తేన సంచోదితౌ ద్వౌ తు రాక్షసౌ సుమహాబలౌ।
మారీచశ్చ సుబాహుశ్చ యజ్ఞవిఘ్నం కరిష్యతః। 19

ఇత్యుక్తో మునినా తేన రాజోవాచ మునిం తదా।
న హి శక్తోఽస్మి సంగ్రామే స్థాతుం తస్య దురాత్మనః। 20

స త్వం ప్రసాదం ధర్మజ్ఞ కురుష్వ మమ పుత్త్రకే।
మమ చైవాల్పభాగ్యస్య దైవతం హి భవాన్ గురుః। 21

దేవదానవగంధర్వా యక్షాః పతగపన్నగాః।
న శక్తా రావణం సోఢుం కిం పునర్మానవా యుధి। 22

స హి వీర్యవతాం వీర్యమ్ ఆదత్తే యుధి రాక్షసః।
తేన చాహం న శక్తోఽస్మి సంయోద్ధుం తస్య వా బలైః।
సబలో వా మునిశ్రేష్ఠ సహితో వా మమాత్మజైః। 23

కథమప్యమరప్రఖ్యం సంగ్రామాణామ్ అకోవిదమ్।
బాలం మే తనయం బ్రహ్మన్ నైవ దాస్యామి పుత్త్రకమ్। 24

ఓ మునీశ్వరా ! ఆ రాక్షసులెవరు? వారిపరాక్రమము ఎట్టిది? వారు ఎవరికుమారులు? వారిఆకారములెట్టివి? వారికి ఎవరిఅండగలదు? ఓ బ్రహ్మర్షీ! కపటయుద్ధములో దిట్టలైన ఆ రాక్షసులను నేను గాని, నా సేనలుగాని, రాముడుగాని ఎట్లు ఎదుర్కొనవలెను? ఓ మహాత్మా! ఆ రాక్షసులు పరాక్రమముచే విఱ్ఱవీగుచున్నవారుగదా! ఆ దుష్టాత్ములను నేను ఎట్లు నిలువవలెను? అంతయును నాకు విశదపఱచుము." (12-14)

దశరథునివచనములను విని, విశ్వామిత్రుడు ఇట్లు పలికెను. (15)

"రావణుడు అను రాక్షసుడు పౌలస్త్యవంశమున జన్మించెను. అతడు మిక్కిలి బలవంతుడు, గొప్ప పరాక్రమశాలి. అతనికి పెక్కు రాక్షసబలములు గలవు. పైగా అతడు బ్రహ్మనుండి అసాధారణ వరములను పొందెను. అతడు ఆ వరగర్వముచే ముల్లోకములను బాధించుచున్నాడు. రాక్షసరాజైన ఆ రావణుడు 'విశ్రవసుడు' అను ముని యొక్క పుత్త్రుడు, కుబేరుని సోదరుడు, మహావీరుడు - అని ప్రతీతి. యజ్ఞమునకు విఘ్నములను కల్గించుట చిన్న పనిగా భావించి, అందు అతడు స్వయముగా పాల్గొనుట లేదు. కాని అతనిచే ప్రేరితులైన మారీచుడు సుబాహువు అను మహాబలశాలురైన రాక్షసులు యజ్ఞమునకు విఘ్నములను కలిగించుచున్నారు." (16-19)

విశ్వామిత్ర మహర్షి ఇట్లనుడువగా దశరథుడు ఆ మునితో ఇట్లనెను. "రణరంగమున ఆ దుర్మార్గుని ప్రతిఘటించి నిలుచుట నా వలన కాని పని. ఓ మునీశ్వరా! మీ ఆజ్ఞను పాలింపలేని దురదృష్టవంతుడను నేను. నాకు గురువు, దైవము మీరే. కనుక పసివాడైన నా పుత్త్రుని మీరే అనుగ్రహింపవలెను. (20-21)

దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, గరుత్మంతుడు, నాగులు మొదలగు వారెవ్వరును సంగ్రామరంగమున రావణుని ఎదుర్కొనలేరు - ఇంక మానవుల విషయము చెప్పనేల? ఆ రావణుడు రణభూమియందు ప్రతివీరుల యొక్క బలపరాక్రమములను హరించివేయును. కావున ఓ మునిపుంగవా! నేను నా సైన్యములతో కూడిగాని, పుత్త్ర సహితుడనై గాని అతనిని, అతని బలములను ఎదుర్కొనుటకు అశక్తుడను. (22-23)

ఓ బ్రహ్మర్షీ! నా కుమారుడు దైవసమానుడు (పూర్తిగా అమాయకుడు) యుద్ధవిద్యలయందు ఆరితేఱినవాడు కాడు. పైగా బాలుడు - కావున అతనిని నేను పంపజాలను. (24)

అథ కాలోపమౌ యుద్ధే సుతౌ సుందోపసుందయోః।
యజ్ఞవిఘ్నకరౌ తౌ తే నైవ దాస్యామి పుత్రకమ్॥ 25

మారీచశ్చ సుబాహుశ్చ వీర్యవంతౌ సుశిక్షితౌ।
తయోరన్యతరేణాహం యోద్ధా స్యాం ససుహృద్గణః॥ 26

ఇతి నరపతిజల్పనాత్ ద్విజేంద్రం
కుశికసుతం సుమహాన్ వివేశ మన్యుః।
సుహుత ఇవ సమిద్భిరాజ్యసిక్తః
సమభవదుజ్జ్వలితో మహర్షివహ్నిః॥ 27

యజ్ఞమునకు విఘ్నములను కలిగించుచున్న ఆ మారీచ సుబాహువులు సుందోపసుందుల కుమారులు, యుద్ధమున వారు యమునితో సమానులు. కనుక నా ముద్దులబిడ్డను మీవెంట పంపజాలను. మారీచసుబాహువులు మిక్కిలి పరాక్రమశాలురు, కదనరంగమున కాకలుదీరినవారు. వారిలో ఒక్కనితో సైతము నా మిత్రులతో గూడినవాడనై నేను యుద్ధము చేయజాలను." (25-26)

బ్రాహ్మణోత్తముడును, కుశికువంశమువాడును, మహాపురుషుడునునైన విశ్వామిత్రుడు అసంగతములైన దశరథునిమాటలకు ఆగ్రహోదగ్రుడాయెను - సమిధలతో, ఆజ్యాహుతులతో ప్రజ్వరిల్లిన అగ్నివలె ఆ మహర్షి మండిపడెను - (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే వింశస్సర్గః (20)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదియవసర్గము సమాప్తము

-- * * * --

21. ఇరువదియొకటవసర్గము

విశ్వామిత్రుడు క్రుద్ధుడగుట - వసిష్ఠుని ఉపదేశము - దశరథుని అంగీకారము.

తచ్ఛ్రుత్వా వచనం తస్య స్నేహపర్యాకులాక్షరమ్।
సమన్యుః కౌశికో వాక్యం ప్రత్యువాచ మహీపతిమ్॥ 1

పూర్వమర్థం ప్రతిశ్రుత్య ప్రతిజ్ఞాం హాతుమిచ్ఛసి।
రాఘవాణామ్ అయుక్తోఽయం కులస్యాస్య విపర్యయః॥ 2

యదీదం తే క్షమం రాజన్ గమిష్యామి యథాగతమ్।
మిథ్యాప్రతిజ్ఞః కాకుత్స్థ సుఖీ భవ సబాంధవః॥ 3

తస్య రోషపరీతస్య విశ్వామిత్రస్య ధీమతః।
చచాల వసుధా కృత్స్నా వివేశ చ భయం సురాన్॥ 4

త్రస్తరూపం తు విజ్ఞాయ జగత్ సర్వం మహాన్ ఋషిః।
నృపతిం సువ్రతో ధీరో వసిష్ఠో వాక్యమబ్రవీత్॥ 5

దశరథుడు ఇటూ దిక్కుతోచని వాడై పుత్రవాత్సల్యముతో తడబడుచు పలికిన మాటలను విశ్వామిత్రుడు విని, కుపితుడై రాజుతో ఇట్లు నుడివెను. (1)

"ఓ రాజా! నా అభ్యర్థనను నెరవేర్తునని మాట ఇచ్చితివి. ఇప్పుడు ఆ మాట తప్పుటకు సిద్ధపడుచున్నావు - ఇట్లు ప్రతిజ్ఞాభంగమునకు ఒడిగట్టుట రఘువంశజులకు తగదు- ఇట్లు చేయుట మీ వంశమునకే కళంకము. ఓ దశరథా! ఇట్లు మాటతప్పుట నీకు యుక్తముగా అనిపించినచో నేను వచ్చిన దారినే (రిక్తహస్తములతో) వెళ్లెదను. కకుత్స్థవంశమున బుట్టిన నీవు మాట తప్పితివి. సరే! నీవు నీ వారితో గూడి సుఖముగానుండుము." (2-3)

సృష్టికి ప్రతిసృష్టిచేయగల ప్రజ్ఞాశాలియైన ఆ విశ్వామిత్రుడు కోపోద్రిక్తుడు కాగా భూమండలమంతయు కంపించెను. దేవతలు భయగ్రస్తులైరి. (4)

నిష్ఠాగరిష్ఠుడును, ధీరుడును, మహానుభావుడును ఐన వసిష్ఠమహర్షి జగత్తంతయు భయముతో చలించుటను గమనించి దశరథునితో ఇట్లనెను. (5)

ఇక్ష్వాకూణాం కులే జాతః సాక్షాద్ధర్మ ఇవాపరః।
ధృతిమాన్ సువ్రతః శ్రీమాన్ న ధర్మం హాతుమర్హసి। 6

త్రిషు లోకేషు విఖ్యాతో ధర్మాత్మా ఇతి రాఘవ।
స్వధర్మం ప్రతిపద్యస్వ నాధర్మం వోఢుమర్హసి। 7

సంశ్రుత్యైవం కరిష్యామీత్యకుర్వాణస్య రాఘవ।
ఇష్టాపూర్తవధో భూయాత్ తస్మాద్రామం విసర్జయ। 8

కృతాస్త్రమ్ అకృతాస్త్రం వా నైనం శక్ష్యంతి రాక్షసాః।
గుప్తం కుశికపుత్రేణ జ్వలనేనామృతం యథా। 9

ఏష విగ్రహవాన్ ధర్మ ఏష వీర్యవతాం వరః।
ఏష బుద్ధ్యాఽధికో లోకే తపసశ్చ పరాయణమ్। 10

ఏషోఽస్త్రాన్ వివిధాన్ వేత్తి త్రైలోక్యే సచరాచరే।
నైనమన్యః పుమాన్ వేత్తి న చ వేత్స్యంతి కేచన। 11

న దేవా నర్షయః కేచిత్ నాసురా న చ రాక్షసాః।
గంధర్వయక్షప్రవరాః సకిన్నరమహోరగాః। 12

సర్వాస్త్రాణి కృశాశ్వస్య పుత్రాః పరమధార్మికాః।
కౌశికాయ పురాదత్తా యదారాజ్యం ప్రశాసతి। 13

తేఽపి పుత్రాః కృశాశ్వస్య ప్రజాపతిసుతాసుతాః।
నైకరూపా మహావీర్యా దీప్తిమంతో జయావహాః। 14

జయా చ సుప్రభా చైవ దక్షకన్యే సుమధ్యమే।
తే సువాతేఽస్త్రశస్త్రాణి శతం పరమభాస్వరమ్। 15

పంచాశతం సుతాన్ లేభే జయా నామ పరాన్ పురా।
వధాయాసురసైన్యానామ్ అమేయాన్ కామరూపిణః। 16

సుప్రభాఽజనయచ్చాపి పుత్రాన్ పంచాశతం పునః।
సంహారాన్ నామ దుర్ధర్షాన్ దురాక్రామాన్ బలీయసః। 17

"ఓ రాజా! నీవు వాసికెక్కిన ఇక్ష్వాకువంశమున జన్మించితివి. ధర్మమూర్తివి, ధైర్యశాలివి. సత్యవ్రతమును పాలించువాడవు. సర్వశుభలక్షణములు గలవాడవు. కనుక నీవు ధర్మహానికి తలపడవలదు- ఓ రఘువంశజా! ముల్లోకముల లోను నీవు ధర్మాత్ముడవుగా వాసిగాంచిన వాడవు. స్వధర్మమును (ఆడినమాట తప్పకుండుటను) ఆచరింపుము. అధర్మమునకు పాల్పడవలదు. (6-7)

ఓ రఘువంశోద్భవా! 'మీకార్యము నెరవేర్తును' అని ప్రతిజ్ఞ చేసి, ఆ మాటను నిలబెట్టుకొననివానికి అశ్వమేధయాగఫలము, బావులు, చెఱువులు త్రవ్వించుట మొదలగు ధర్మకార్యములను ఆచరించిన ఫలమూ నశించును. కావున విశ్వామిత్రమహర్షి వెంట శ్రీరాముని పంపుము. రాముడు అస్త్రవిద్యలలో ఆరితేఱిన వాడైనను కాకున్నను విశ్వామిత్రునిసంరక్షణలో ఉన్నంతవఱకును అగ్నిరక్షణలోనున్న అమృతమునువలె ఆయనను రాక్షసులేమియు చేయజాలరు. (8-9)

ఈ విశ్వామిత్రమహర్షి ఆకృతిదాల్చిన ధర్మము. గొప్ప శక్తిసామర్థ్యములు గలవాడు, మిక్కిలి ప్రజ్ఞాశాలి. ఈ లోకము నందలి తాపసులలో మేటియైనవాడు. (10)

వివిధాస్త్రప్రయోగములను ఎఱిగినవాడితడు. చరాచరాత్మకము లైన ఈ మూడు లోకములయందును ఈయనతో సాటియైన అస్త్రప్రయోగకుశలుడు మఱియొకడు లేనేలేడు, ఇకముందు ఎవ్వరును ఉండబోరు. దేవతలు, ఋషులు, అసురులు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, కిన్నరులు, నాగులు మొదలగువారిలో ఎవ్వరును విశ్వామిత్రునితో సమానమైన అస్త్రప్రయోగనిపుణులు లేరు. (11-12)

పూర్వము విశ్వామిత్రుడు రాజ్యమును పరిపాలించుచుండగా కృశాశ్వుడను ప్రజాపతి పరమధార్మికులైన తనకుమారులను అస్త్రరూపములలో ఆయనకు (విశ్వామిత్రునకు) ఇచ్చివేసెను. కృశాశ్వుని యొక్క కొడుకులు దక్షప్రజాపతియొక్క దౌహిత్రులు. వారు పెక్కురూపములుగలవారు. మహావీరులు, తేజశ్శాలురు. జయమును గూర్చువారు. (13-14)

జయ, సుప్రభ అను దక్షకన్యలు సుందరాంగులు. వారు ప్రకాశవంతములైన, శత్రుసంహారకములైన నూఱు అస్త్ర శస్త్రములను, సృష్టించిరి. అసురసైన్యములను సంహరించుటకై 'జయ' అనునామె మిక్కిలి శక్తిసంపన్నులు, కామరూపులు, శ్రేష్ఠులు ఐన ఏబది మంది కుమారులను కనెను. 'సుప్రభ' అనునామెయు 'సంహారులు' అను పేరుగల ఏబదిమంది పుత్రులనుగనెను. వారు జయింపశక్యముగానివారు. అమోఘ పరాక్రమశాలురు. మిక్కిలి బలవంతులు. (15-17)

తాని చాస్త్రాణి వేత్త్యేష యథావత్ కుశికాత్మజః।
అపూర్వాణాం చ జననే శక్తో భూయస్సధర్మవిత్। 18

ఏవంవీర్యో మహాతేజా విశ్వామిత్రో మహాయశాః।
న రామగమనే రాజన్ సంశయం కర్తుమర్హసి। 19

తేషాం నిగ్రహణే శక్తః స్వయం చ కుశికాత్మజః।
తవ పుత్రహితార్థాయ త్వామ్ ఉపేత్యాభియాచతే। 20

ఇతి మునివచనాత్ ప్రసన్నచిత్తో
రఘువృషభస్తు ముమోద భాస్వరాంగః।
గమనమభిరురోచ రాఘవస్య
ప్రథితయశాః కుశికాత్మజాయ బుద్ధ్యా। 21

కుశికుని పుత్రుడైన ఈ విశ్వామిత్రుడు ఆ అస్త్రముల నన్నింటిని పూర్తిగా ఎఱుగును. అంతేగాదు. ధర్మాత్ముడైన ఇతడు అపూర్వములైన అస్త్రములనుగూడ సృష్టింపగలడు. ఇట్టి ప్రతిభామూర్తియైన విశ్వామిత్రుడు గొప్పవీరుడు, మిక్కిలి వాసికెక్కినవాడు. కావున ఓ రాజా! ఈయనవెంట శ్రీరాముని పంపుటకు సందేహింపవలదు. విశ్వామిత్రుడు స్వయముగనే ఆ రాక్షసులను నిగ్రహింపగలసమర్థుడు. నీ కుమారునకు మేలుచేకూర్చుటకై నీకడకువచ్చి, నిన్ను ఇట్లు అభ్యర్థించుచున్నాడు." (18-20)

వసిష్ఠమహర్షి యొక్క హితవచనములకు రఘువంశజుడైన దశరథుడు ప్రసన్నచిత్తుడై, మిక్కిలి పొంగిపోయెను- సూక్ష్మబుద్ధియైన ఆ రాజు విశ్వామిత్రునివెంట శ్రీరాముని పంపుటకు మనస్ఫూర్తిగా అంగీకరించెను. (21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకవింశస్సర్గః *(21)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదియొకటవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

22. ఇరువదిరెండవసర్గము

రామలక్ష్మణులు విశ్వామిత్రునివెంటనడచుట - ఆయననుండి 'బల' 'అతిబల' విద్యలను గ్రహించుట.

తథా వసిష్ఠే బ్రువతి రాజా దశరథస్సుతమ్।
ప్రహృష్టవదనో రామమ్ ఆజుహావ సలక్ష్మణమ్। 1

కృతస్వస్త్యయనం మాత్రా పిత్రా దశరథేన చ।
పురోధసా వసిష్ఠేన మంగళైరభిమంత్రితమ్। 2

స పుత్రం మూర్ధ్న్యుపాఘ్రాయ రాజా దశరథః ప్రియమ్।
దదౌ కుశికపుత్రాయ సుప్రీతేనాంతరాత్మనా। 3

తతో వాయుః సుఖస్పర్శో విరజస్కో వవౌ తదా।
విశ్వామిత్రగతం దృష్ట్వా రామం రాజీవలోచనమ్। 4

పుష్పవృష్టి ర్మహ త్యాసీత్ దేవదుందుభి నిస్స్వనైః।
శంఖదుందుభినిర్ఘోషః ప్రయాతే తు మహాత్మని। 5

వసిష్ఠునిహితవచనములకు దశరథునిముఖము వికసించెను. పిమ్మట అతడు తనకుమారులైన రామలక్ష్మణులను పిలిపించెను. (1)

తల్లి కౌసల్యయు, తండ్రి దశరథుడును శ్రీరాముని ఆశీర్వదించిరి. పురోహితుడైన వసిష్ఠుడు వేదోక్తముగా మంగళాశీస్సులను పలికెను. దశరథమహారాజు తన ముద్దుబిడ్డడైన రాముని మూర్ధమును ఆఘ్రాణించి ప్రసన్నమైన మనస్సుతో అతనిని విశ్వామిత్రునకు అప్పగించెను. (2-3)

ఆ సమయమున విశ్వామిత్రునిప్రక్కన చేరియున్న రాజీవలోచనుడైన రాముని జూచి, వాయువు వారికి సుఖస్పర్శ గలిగించుచు దుమ్ములేకుండ వీచెను. మహాత్ముడైన శ్రీరాముడు విశ్వామిత్రునితోగూడి వెళ్లుచుండగా చక్కగా పూలవాన గురిసెను. దేవదుందుభులు, శంఖములు మధురముగా ధ్వనించెను. (4-5)

విశ్వామిత్రో యయావగ్రే తతో రామో ధనుర్ధరః।
కాకపక్షధరో ధన్వీ తం చ సౌమిత్రిరన్వగాత్। 6

కలాపినౌ ధనుష్పాణీ శోభయానౌ దిశో దశ।
విశ్వామిత్రం మహాత్మానం త్రిశీర్షావివ పన్నగౌ। 7

అనుజగ్మతురక్షుద్రౌ పితామహమివాశ్వినౌ।
తదా కుశికపుత్రం తు ధనుష్పాణీ స్వలంకృతౌ। 8

బద్ధగోధాంగుళిత్రాణౌ ఖడ్గవంతౌ మహాద్యుతీ।
కుమారౌ చారువపుషౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ। 9

అనుయాతౌ శ్రియా దీప్తౌ శోభయేతామ్ అనిందితౌ।
స్థాణుం దేవమివాఽచింత్యం కుమారావివ పావకీ। 10

అధ్యర్ధయోజనం గత్వా సరయ్వా దక్షిణే తటే।
రామేతి మధురాం వాణీం విశ్వామిత్రోఽభ్యభాషత। 11

గృహాణ వత్స సలిలం మాఽభూత్ కాలస్య పర్యయః।
మంత్రగ్రామం గృహాణ త్వం బలామ్ అతిబలాం తథా। 12

న శ్రమో న జ్వరో వా తే న రూపస్య విపర్యయః।
న చ సుప్తం ప్రమత్తం వా ధర్షయిష్యంతి నైరృతాః। 13

న బాహ్వోః సదృశో వీర్యే పృథివ్యామ్ అస్తి కశ్చన।
త్రిషు లోకేషు వై రామ న భవేత్ సదృశస్తవ। 14

న సౌభాగ్యే న దాక్షిణ్యే న జ్ఞానే బుద్ధినిశ్చయే।
నోత్తరే ప్రతివక్తవ్యే సమో లోకే తవానఘ। 15

విశ్వామిత్రుడు ముందు సాగిపోవుచుండగా జులపాలజుట్టు గల శ్రీరాముడు ధనుర్ధారియై ఆయునను అనుసరించెను.[1] లక్ష్మణుడును ధనువును చేబట్టి రామునివెంట నడిచెను - ఆ రామలక్ష్మణులు అమ్ముల పొదులను, ధనుస్సులను ధరించి, తమ తమ శోభలతో అన్నిదిక్కులకును వెలుగులను విరజిమ్ముచుండిరి. అటునిటు తూణీరములను, ధనుస్సును దాల్చి, వారు మూడు తలల సర్పములవలె భాసిల్లుచుండిరి. చక్కని సౌందర్యముతో పరాక్రమముతో ఒప్పుచు వారు అశ్వినీ దేవతలు బ్రహ్మనువలె మహాత్ముడైన విశ్వామిత్రుని అనుసరించిరి. ఆ రామలక్ష్మణులు చక్కగా అలంకృతులై ధనుర్ధారులైయుండిరి. (6-8)

వారు ఉడుముచర్మముతో నిర్మితములైన తొడుగులను చేతులకు ధరించియుండిరి. ఖడ్గధారులై, అపూర్వశోభలతో విలసిల్లుచుండిరి. రాజకుమారులు, సోదరులు, సద్గుణశోభితులు అగు ఆ రామలక్ష్మణులు విశిష్టకాంతులతో, అగ్నిసంభవులైన స్కంద, విశాఖులు వాఙ్మనస్సులకు అందని శివునిని వలె కుశికపుత్రుడైన విశ్వామిత్రుని అనుసరించుచు ఆయునను శోభిల్లజేసిరి. (9-10)

విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో గూడి సరయూనదికి దక్షిణతీరమున ఒకటిన్నరయోజనములదూరము ప్రయాణము చేసిన పిమ్మట 'రామా'! అని మధురముగా సంబోధించి ఇట్లనెను. "నాయనా! ఈ నీటిని గ్రహించి, ఆలసింపక ఆచమనమొనర్చుము. 'బల' 'అతిబల' అను మంత్రములను ఉపదేశించెదను, స్వీకరింపుము.[2] ఈ మంత్రప్రభావమున నీకు అలసటగాని, ఆకలిదప్పులబాధలుగాని ఉండవు, నీ రూపకాంతులు తఱుగవు. నీవు నిదురించుచున్నను, ఏమఱుపాటున ఉన్నను రాక్షసులు నిన్నేమియు చేయజాలరు. ఈ మంత్రప్రభావమున నీ బాహుబలమును ఎదుర్కొన గలవాడు ఈ భూమండలమున ఎవ్వడును ఉండడు. ఈ భూలోకముననేగాదు ముల్లోకములయందును నీకెవ్వరును సాటిరారు. (11-14)

ఓ పుణ్యాత్ముడా! సౌందర్యమునగాని, సామర్థ్యమునగాని, విషయగ్రహణమునందుగాని, చక్కగా కార్యనిశ్చయమును చేయుటలోగాని, ప్రత్యుత్తరమును ఇచ్చుటలోగాని, లోకము నందు నీతో సమానుడు ఎవ్వడును లేడు - 'బల' 'అతిబల'

1) వెడలెను కోదండపాణి - - - - ॥ త్యాగరాజు ॥ - సంకీర్తనావళి - పుట - 69.

2) విశ్వామిత్రుడు చిన్నారులైన రామలక్ష్మణులకు అలసట, ఆకలిదప్పులు కలుగకుండుటకై 'బల' 'అతిబల' అను మంత్రములను ఉపదేశింపదలచెను.

ఏత ద్విద్యాద్వయే లబ్ధే భవితా నాస్తి తే సమః।
బలాత్వతిబలా చైవ సర్వజ్ఞానస్య మాతరౌ। 16

క్షుత్పిపాసే న తే రామ భవిష్యేతే నరోత్తమ।
బలామ్ అతిబలాం చైవ పఠతః పథి రాఘవ।
గృహాణ సర్వలోకస్య గుప్తయే రఘునందన। 17

విద్యాద్వయమధీయానే యశశ్చాప్యతులం త్వయి।
పితామహసుతే హ్యేతే విద్యే తేజ స్సమన్వితే।
ప్రదాతుం తవ కాకుత్స్థ సదృశ స్త్వం హి ధార్మిక। 18

కామం బహుగుణాః సర్వే త్వయ్యేతే నాత్ర సంశయః।
తపసా సంభృతే చైతే బహురూపే భవిష్యతః। 19

తతో రామో జలం స్పృష్ట్వా ప్రహృష్టవదనశ్శుచిః।
ప్రతిజగ్రాహ తే విద్యే మహర్షేర్భావితాత్మనః। 20

విద్యాసముదితో రామః శుశుభే భూరివిక్రమః।
సహస్రరశ్మిర్భగవాన్ శరదీవ దివాకరః। 21

గురుకార్యాణి సర్వాణి నియుజ్య కుశికాత్మజే।
ఊషుస్తాం రజనీం తత్ర సరయ్వాం సుసుఖం త్రయః। 22

దశరథనృపసూనుసత్తమాభ్యాం
తృణశయనేఽనుచితే సహోషితాభ్యామ్।
కుశికసుతవచోనులాలితాభ్యాం
సుఖమివ సా విబభౌ విభావరీ చ। 23

అను ఈ మహామంత్రములు సమస్తజ్ఞానమునకును మాతృకలు- ఈ రెండు విద్యలును లభించినచో ఇకముందు నీకు దీటైన వాడెవ్వడును ఉండడు. ఓ పురుషోత్తమా! రఘురామా! మార్గమునందు 'బల' 'అతిబల' అను మంత్రములను జపించుచు పయనించినచో నీకు ఆకలిదప్పులబాధలుండవు లోక కల్యాణమునకై ఈ విద్యలను స్వీకరింపుము. ఈ రెండు విద్యలను అభ్యసించినచో నీకు సాటిలేని యశస్సు అబ్బును. ప్రభావాన్వితములైన ఈ రెండు విద్యలును బ్రహ్మదేవుని నుండి ఆవిర్భవించినవి. ధార్మికుడవైన ఓ కాకుత్స్థా! ఈ విద్యలను పొందుటకు నీవే అర్హుడవు. (15-18)

పూర్వోక్తములైన ఉత్తమగుణములన్నియును నీలో సమృద్ధిగా గలవు. ఇందు సందేహము లేదు. తపస్సుద్వారా లభించిన ఈ మంత్రములను నీకు ఉపదేశించుటవలన అవి లోకమున వివిధరూపములలో విస్తృతములగును. (19)

అంతట శ్రీరాముడు ప్రసన్నవదనుడై ఆచమించి, శుచియై, భగవద్ధ్యానపరాయణుడైన విశ్వామిత్రునినుండి 'బల' 'అతిబల' అను విద్యలను గ్రహించెను.[1] (20)

అమితపరాక్రమశాలియైన శ్రీరాముడు ఆ రెండువిద్యలను పొంది, శరత్కాలమునందు సహస్రకిరణుడైన సూర్యభగవానుని వలె విరాజిల్లెను. (21)

రాముడు గురువైన విశ్వామిత్రునకు 'పాదములొత్తుట' మొదలగు సేవలొనర్చెను. పిమ్మట ఆ ముగ్గురును సరయూనదీ తీరమునందే ఆ రాత్రి గడిపిరి. (22)

దశరథమహారాజకుమారులైన ఆ రామలక్ష్మణులు తమకు అలవాటులేని తృణశయ్యపై కలిసిపరుండిరి. ఐనను విశ్వామిత్రుని మధురమైన లాలింపు మాటలతో[2] వారికి ఆ రాత్రి హాయిగా గడచెను. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ద్వావింశస్సర్గః *(22)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదిరెండవసర్గము సమాప్తము

-- * * * --

1) 'బల' 'అతిబల' అను విద్యలను రామునితోబాటు లక్ష్మణుడును గ్రహించినట్లు ఎఱుంగవలెను.

2) జనవెంట - - - - సంకీర్తనావళి - పుట - 49

23. ఇరువదిమూడవసర్గము

విశ్వామిత్రునితోగూడి రామలక్ష్మణులు గంగాసరయూసంగమప్రదేశమునగల పవిత్రాశ్రమమునందు ఒకరాత్రి గడపుట.

ప్రభాతాయాం తు శర్వర్యాం విశ్వామిత్రో మహామునిః।
అభ్యభాషత కాకుత్స్థౌ శయానౌ పర్ణసంస్తరే॥ 1

రాత్రి గడచిన పిమ్మట ప్రభాతవేళ విశ్వామిత్ర మహర్షి తృణశయ్యపై పవళించియున్న రామలక్ష్మణులతో ఇట్లు పలికెను. (1)

కౌసల్యాసుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్॥ 2

'కౌసల్యాదేవి నోములపంటగా ఆమెకు పుత్రుడవై జన్మించిన ఓ రామా! తూర్పు దిక్కున ఉషఃకాంతులు వెలసిల్లుచున్నవి. ఓ పురుషశ్రేష్ఠా! లెమ్ము స్నానసంధ్యావందనాది నిత్యకర్మలను ఆచరింపుము." (2)

తస్యర్షేః పరమోదారం వచః శ్రుత్వా నృపాత్మజౌ।
స్నాత్వా కృతోదకౌ వీరౌ జేపతుః పరమం జపమ్॥ 3

కృతాహ్నికౌ మహావీర్యౌ విశ్వామిత్రం తపోధనమ్।
అభివాద్యాభిసంహృష్టౌ గమనాయాభితస్థతుః॥ 4

విశ్వామిత్ర మహర్షి నుడివిన గంభీరవచనములను పాటించి, వీరులైన ఆ రాజకుమారులు స్నానమొనర్చి, సూర్యునకు అర్ఘ్యప్రదానములను అర్పించిరి. దేవతలకును, ఋషులకును తర్పణములనిచ్చిరి. మంత్రరాజమైన గాయత్రిని జపించిరి. మిక్కిలి పరాక్రమశాలురైన రామలక్ష్మణులు ఈవిధముగా ప్రాతఃకాలకృత్యములైన సంధ్యోపాసనాదులను నిర్వర్తించిరి. పిదప తపోధనుడైన విశ్వామిత్రునకు నమస్కరించి, మిక్కిలి సంతోషముతో ప్రయాణమునకు సన్నద్ధులై ఆయనముందు నిలబడిరి. (3-4)

తౌ ప్రయాతౌ మహావీర్యౌ దివ్యాం త్రిపథగాం నదీమ్।
దదృశాతే తత స్తత్ర సరయ్వాః సంగమే శుభే॥ 5

తత్రాశ్రమపదం పుణ్యం ఋషీణాముగ్రతేజసామ్।
బహువర్షసహస్రాణి తప్యతాం పరమం తపః॥ 6

పిమ్మట గురువుగారివెంట ప్రయాణము చేయుచున్న ఆ మహావీరులు పవిత్రమైన సరయూనది దివ్యమైన గంగానదిలో సంగమించు పుణ్యప్రదేశమును జూచిరి. వారు ఆ నదీసంగమ ప్రదేశమున పవిత్రమైన ఒక ఆశ్రమమును చూచిరి. అచ్చట దివ్యతేజస్సుగల ఋషులు వేలకొలది సంవత్సరములు తీవ్రమైన తపస్సును ఆచరించియుండిరి. (5-6)

తం దృష్ట్వా పరమప్రీతౌ రాఘవౌ పుణ్యమాశ్రమమ్।
ఊచతుస్తం మహాత్మానం విశ్వామిత్రమ్ ఇదం వచః॥ 7

రామలక్ష్మణులు ఆ పవిత్రాశ్రమమును జూచి ఎంతయు సంతసించినవారై, మహాత్ముడైన ఆ విశ్వామిత్రునితో ఇట్లు పలికిరి. (7)

కస్యాయమాశ్రమః పుణ్యః కోన్వస్మిన్ వసతే పుమాన్।
భగవన్ శ్రోతు మిచ్ఛావః పరం కౌతూహలం హి నౌ॥ 8

"ఓ మహాత్మా ! ఈ పుణ్యాశ్రమము ఎవరిది? ఇక్కడ నివసించు మహాపురుషుడెవరు ? ఈ విషయములను అన్నింటిని వినుటకై (తెలిసికొనుటకై) మేము మిక్కిలి కుతూహలముతోనున్నాము." (8)

తయోస్తద్వచనం శ్రుత్వా ప్రహస్య మునిపుంగవః।
అబ్రవీచ్ఛ్రూయతాం రామ యస్యాయం పూర్వ ఆశ్రమః॥ 9

మునీశ్వరుడు వారి మాటలను విని, "ఓ రామా! పూర్వము ఈ ఆశ్రమము ఎవరిదో ? తెలిపెదను వినుడు" - అని చిఱునవ్వుతో పలికెను. (9)

కందర్పో మూర్తిమా నాసీత్ కామ ఇత్యుచ్యతే బుధైః।
తపస్యంతమిహ స్థాణుం నియమేన సమాహితమ్। 10

కృతోద్వాహం తు దేవేశం గచ్ఛంతం సమరుద్గణమ్।
ధర్షయామాస దుర్మేధా హుంకృతశ్చ మహాత్మనా। 11

అవదగ్ధస్య రౌద్రేణ చక్షుషా రఘునందన।
వ్యశీర్యంత శరీరాత్ స్వాత్ సర్వగాత్రాణి దుర్మతేః। 12

తస్య గాత్రం హతం తత్ర నిర్దగ్ధస్య మహాత్మనా।
అశరీరః కృతః కామః క్రోధాద్దేవేశ్వరేణ హ। 13

అనంగ ఇతి విఖ్యాతః తదా ప్రభృతి రాఘవ।
స చాంగవిషయః శ్రీమాన్ యత్రాంగం ప్రముమోచ హ। 14

తస్యాయమాశ్రమః పుణ్యః తస్యేమే మునయః పురా।
శిష్యా ధర్మపరా నిత్యం తేషాం పాపం న విద్యతే। 15

ఇహాద్య రజనీం రామ వసేమ శుభదర్శన।
పుణ్యయోః సరితోర్మధ్యే శ్వస్తరిష్యామహే వయమ్। 16

అభిగచ్ఛామహే సర్వే శుచయః పుణ్యమాశ్రమమ్।
స్నాతాశ్చ కృతజప్యాశ్చ హుతహవ్యా నరోత్తమ। 17

తేషాం సంవదతాం తత్ర తపోదీర్ఘేణ చక్షుషా।
విజ్ఞాయ పరమప్రీతా మునయో హర్షమాగమన్। 18

అర్ఘ్యం పాద్యం తథాతిథ్యం నివేద్య కుశికాత్మజే।
రామలక్ష్మణయోః పశ్చాత్ అకుర్వన్నతిథిక్రియామ్। 19

సత్కారం సమనుప్రాప్య కథాభిరభిరంజయన్।
యథార్హ మజపన్ సంధ్యామ్ ఋషయ స్తే సమాహితాః। 20

తత్ర వాసిభిరానీతా మునిభి స్సువ్రతైః సహ।
న్యవసన్ సుసుఖం తత్ర కామాశ్రమపదే తదా। 21

"సుందరమైన శరీరము గల 'కందర్పుడు' అను వాడు గలడు. అతనిని పండితులు 'కాముడు' అని పిలుతురు. ఒకానొకప్పుడు పరమేశ్వరుడు ఇచ్చట సమాధినిష్ఠుడై అవిచ్ఛిన్నముగా తపమాచరింపుచుండెను. ఆ సమయమున దుర్బుద్ధియైన కాముడు (మన్మథుడు) ఆయనతపస్సునకు భంగము కలిగించెను. అంతట మహాత్ముడైన శివుడు ఆ కామునిపై హుంకరించెను. ఓ రఘునందనా! కుపితుడైన శివునియొక్క కంటిమంటలకు ఆ దుర్మతియొక్క శరీరావయవములు పూర్తిగా దగ్ధములైపోయెను. (10-13)

మహాత్ముడైన పరమేశ్వరుని క్రోధాగ్నికి అతనిశరీరమంతయు భస్మముకాగా అంతట కాముడు అశరీరుడయ్యెను. అది మొదలుకొని మన్మథుడు 'అనంగుడు' అను పేరుతో ప్రసిద్ధుడయ్యెను. మన్మథుడు తనఅంగములను త్యజించిన కారణముగా శ్రీమంతంబగు ఈ దేశము 'అంగదేశము' అని ప్రసిద్ధి వహించెను. ఈ ఆశ్రమప్రదేశమున శివుడు తపస్సు చేసినందున ఇది పవిత్రమైనది. ఈ మునులు శివభక్తులు, నిరంతరము ధర్మపరాయణులు. వారికి ఎట్టి పాపములును అంటవు. (14-15)

పుణ్యాత్ముడవైన ఓ రామా! పవిత్ర గంగాసరయూనదుల సంగమస్థానమునగల ఈ ఆశ్రమమునందే మనము ఈ రాత్రి గడుపుదము. గంగానదిని రేపు దాటుదము. (16)

ఓ నరోత్తమా! మనమందరము శుభ్రముగా స్నానాదికములను నిర్వర్తించి, జపధ్యానములను ముగించుకొని, హోమకార్యములను పూర్తి చేసికొని, ఈ పవిత్రాశ్రమమున ప్రవేశించుదము." (17)

విశ్వామిత్రుడును, రామలక్ష్మణులును ఇట్లు సంభాషించుకొనుచుండగా ఆ ఆశ్రమమునగల మునులు తమతపఃప్రభావమున దూరదృష్టితో వారిఆగమనమును ఎఱింగి, పరమప్రీతితో పులకితులై అచటికి ఏతెంచిరి. (18)

ఆ మునులు విశ్వామిత్రమహర్షికి అర్ఘ్యపాద్యాది - అతిథి సత్కారములను ఆచరించిరి. అనంతరము వారు రామలక్ష్మణులకును అట్లే అతిథిమర్యాదలను పాటించిరి. (19)

విశ్వామిత్రుడును ఆ మునులను కుశలప్రశ్నలతో ఆదరించెను. పిమ్మట వారును కథలతో విశ్వామిత్రాదులను రంజింపజేసిరి. వారందఱును ఏకాగ్రతతో నియమపూర్వకముగా సంధ్యోపాసన గావించిరి. (20)

స్థానికులును, నియమనిష్ఠలతో జీవించువారును ఐన ఆ మునులతోగూడి విశ్వామిత్రరామలక్ష్మణులు ఆ కామాశ్రమమునకు చేరి, ఆ రాత్రిని అక్కడనే హాయిగా గడిపిరి. (21)

కథాభిరభిరామాభిః అభిరామౌ నృపాత్మజౌ।
రమయామాస ధర్మాత్మా కౌశికో మునిపుంగవః। 22

ధర్మాత్ముడైన విశ్వామిత్రమహాముని ముద్దులు మూటగట్టు రాజకుమారులను మనోహరములైన కథలతో రంజింపజేసెను. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే త్రయోవింశస్సర్గః (23)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదిమూడవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

24. ఇరువదినాల్గవసర్గము

గంగాసరయూనదుల సంగమప్రదేశమునుగూర్చియు, మలద కరూశప్రదేశముల ఆవిర్భావమును గురించియు, అచట తాటకనివాసమునుగూర్చియు, విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు తెలుపుట.

తతః ప్రభాతే విమలే కృత్వాహ్నికమ్ అరిందమౌ।
విశ్వామిత్రం పురస్కృత్య నద్యాస్తీరముపాగతౌ। 1

శత్రువులనుపరిమార్పగల రామలక్ష్మణులు స్వచ్ఛమైన సూర్యకాంతులతో నిర్మలముగానున్న ప్రాతఃకాలమునందు సంధ్యోపాసనాది కార్యక్రమములను ముగించుకొనిన వారై, విశ్వామిత్రుని అనుసరించుచు గంగానదీ తీరమునకు చేరిరి. (1)

తే చ సర్వే మహాత్మానో మునయ స్సంశితవ్రతాః।
ఉపస్థాప్య శుభాం నావం విశ్వామిత్రమ్ అథాబ్రువన్। 2

వ్రతనిష్ఠాపరులును, మహాత్ములును ఐన ఆ మునులు అందరును ఒక చక్కని నావను తెప్పించి, విశ్వామిత్ర మహామునితో ఇట్లనిరి. (2)

ఆరోహతు భవాన్ నావం రాజపుత్రపురస్కృతః।
అరిష్టం గచ్ఛ పంథానం మాభూత్ కాలవిపర్యయః। 3

" ఓ మహామునీ! ఈ రాజకుమారులును, మీరును ఈ నావను అధిరోహింపుడు, కాలవిలంబనముగాకుండ శుభముగా, సుఖముగా ప్రయాణము చేయుడు." (3)

విశ్వామిత్రస్తథేత్యుక్త్వా తాన్ ఋషీనభిపూజ్య చ।
తతార సహితస్తాభ్యాం సరితం సాగరంగమామ్। 4

విశ్వామిత్రుడు 'అట్లే' అని పలికి సాదరముగా ఆ మునులను వీడ్కొనెను. అనంతరము అతడు రామలక్ష్మణులతోగూడి సాగరమునకేగిపెడి గంగానదిని దాటెను. (4)

తతః శుశ్రావ వై శబ్దమ్ అతిసంరంభవర్ధితమ్।
మధ్యమాగమ్య తోయస్య సహ రామః కనీయసా। 5

అథ రామస్సరిన్మధ్యే పప్రచ్ఛ మునిపుంగవమ్।
వారిణో భిద్యమానస్య కిమయం తుములో ధ్వనిః। 6

నావ నదియొక్క మధ్యభాగమునకు చేరగనే అలలతాకిడికి చెలరేగిన ఒక మహాధ్వని రామలక్ష్మణులకు వినబడెను. అప్పుడు శ్రీరాముడు "ఈనదీమధ్య భాగమున (గంగాసరయూనదుల) జలతరంగముల ఘర్షణవలన ఉత్పన్నమైన ఈ మహాధ్వనికి కారణమేమి?" అని విశ్వామిత్రమహర్షిని అడిగెను. (5-6)

రాఘవస్య వచః శ్రుత్వా కౌతూహలసమన్వితః।
కథయామాస ధర్మాత్మా తస్య శబ్దస్య నిశ్చయమ్। 7

అంతట ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు శ్రీరాముని మాటలను విని, కుతూహలముతో ఆ శబ్దముయొక్క కారణమును తెలుపసాగెను. (7)

కైలాసపర్వతే రామ మనసా నిర్మితం సరః।
బ్రహ్మణా నరశార్దూల తేనేదం మానసం సరః। 8

"నరశ్రేష్ఠుడవైన ఓ రామా! బ్రహ్మదేవుడు కైలాస పర్వతము నందు తనమనస్సంకల్పముతో ఒక సరస్సును సృష్టించెను. ఆయనమనస్సుచేత నిర్మింపబడినది గాన ఇది 'మానససరస్సు' అను పేరుతో ప్రసిద్ధివహించినది. దీనికే 'బ్రహ్మసరస్సు'

తస్మాత్ సుస్రావ సరసః సాయోధ్యాముపగూహతే।
సరః ప్రవృత్తా సరయూః పుణ్యా బ్రహ్మసరశ్చ్యుతా। 9

తస్యాయమతులః శబ్దో జాహ్నవీమ్ అభివర్తతే।
వారిసంక్షోభజో రామ ప్రణామం నియతః కురు। 10

తాభ్యాం తు తా వుభౌ కృత్వా ప్రణామమ్ అతిధార్మికౌ।
తీరం దక్షిణమాసాద్య జగ్మతుర్లఘువిక్రమౌ। 11

స వనం ఘోరసంకాశం దృష్ట్వా నృపవరాత్మజః।
అవిప్రహతమైక్ష్వాకః పప్రచ్ఛ మునిపుంగవమ్। 12

అహో వన మిదం దుర్గం ఝిల్లికాగణనాదితమ్।
భైరవైః శ్వాపదైః పూర్ణం శకుంతైర్దారుణారుతైః। 13

నానాః ప్రకారైః శకునై వాశ్యద్భిః భైరవస్వనైః।
సింహవ్యాఘ్రవరాహైశ్చ వారణైశ్చోపశోభితమ్। 14

ధవాశ్వకర్ణకకుభైః బిల్వతిందుకపాటలైః।
సంకీర్ణం బదరీభిశ్చ కిన్న్వేతద్దారుణం వనమ్। 15

తమువాచ మహాతేజా విశ్వామిత్రో మహామునిః।
శ్రూయతాం వత్స కాకుత్స్థ యస్యైతద్దారుణం వనమ్। 16

ఏతా జనపదా స్ఫీతా పూర్వమాస్తాం నరోత్తమ।
మలదాశ్చ కరూశాశ్చ దేవనిర్మాణనిర్మితా। 17

పురా వృత్రవధే రామ మలేన సమభిప్లుతమ్।
క్షుధా చైవ సహస్రాక్షం బ్రహ్మహత్యా సమావిశత్। 18

తమింద్రం స్నాపయన్ దేవా ఋషయశ్చ తపోధనాః।
కలశైః స్నాపయామాసుః మలం చాస్య ప్రమోచయన్। 19

ఇహ భూమ్యాం మలం దత్వా దత్వా కారూశమేవ చ।
శరీరజం మహేంద్రస్య తతో హర్షం ప్రపేదిరే। 20

అనియు పేరు. మానస సరస్సు నుండి బయలుదేరి అయోధ్యను కౌగలించుకొని ప్రవహించుచున్నది ఈ సరయూనది. సరస్సునుండి పుట్టినదిగాన దీనికి 'సరయూనది' అని పేరు వచ్చినది. బ్రహ్మసరస్సునుండి ఉద్భవించుటవలన ఇది యెంతయు పవిత్రమైనది. ఈ సరయూనది గంగానదిలో సంగమించునప్పుడు నీటి తరంగములసంఘర్షణవలన సాటిలేని ఈ మహాధ్వని కలిగినది. ఓ రామా! ఈ నదీద్వయ సంగమమునకు శ్రద్ధాదరములతో నమస్కరింపుము. (8-10)

ధర్మవర్తనులైన ఆ రామలక్ష్మణులు ఇరువురును ఆ రెండునదులసంగమమునకు నమస్కరించిరి. పిమ్మట గంగానది యొక్క దక్షిణ తీరమునకు జేరి వేగముగా ముందునకు నడువసాగిరి. ఇక్ష్వాకువంశమున జన్మించిన శ్రీరామచంద్రుడు జనసంచారములేని దట్టముగానున్న ఆ అడవిని గాంచి, మునీశ్వరుని ఇట్లు ప్రశ్నించెను. (11-12)

'అహో! ఈ అడవి చొరరానిదిగానున్నది. కీచురాళ్ళ రొదలతో నిండినది. భయంకరములైన క్రూరమృగములతో వ్యాప్తమైనది. దారుణములైన భాసపక్షులధ్వనులతో ప్రతిధ్వనించు చున్నది. ఈ అరణ్యమునందు భయంకరముగా కూయుచున్న వివిధపక్షులును, సింహ, వ్యాఘ్ర, వరాహములును, ఏనుగులును స్వేచ్ఛగా తిరుగుచున్నవి. చండ్ర, నల్లమద్ది, ఏటిమద్ది చెట్లతోను, మారేడువృక్షములతోను, తుమ్మి, కలిగొట్టు చెట్లతోను, రేగు చెట్లతోడను సంకీర్ణమై భయంకరముగానున్న ఈ కాననము పేరేమి ?" (13-15)

మిక్కిలి తేజస్వియైన విశ్వామిత్రమహాముని శ్రీరామునితో ఇట్లు పలికెను. "నాయనా! ఈ కాఱడవి ఎవరిదో తెల్పెదను వినుము. ఓ నరోత్తమా! పూర్వకాలమున ఇచట 'మలదము' 'కరూశము' అను రెండు దేశములు దేవనిర్మితములై యుండెను. అవి ధనధాన్యసంపదలతో తులతూగుచు జనులతో కలకలలాడుచు ఉండెను. (16-17)

ఓ రామా! పూర్వము ఇంద్రుడు వృత్రాసురుని వధించిన కారణముగా ఆయనకు బ్రహ్మహత్యాపాతకము చుట్టుకొనెను. తత్ఫలితముగా అతడు అపవిత్రుడయ్యెను. ఆయనను ఆకలిదప్పులు బాధింపసాగెను. (18)

దేవతలు, తపోధనులైన ఋషులు ఇంద్రుని గంగా తీర్థోదకముల చేతను, మంత్రపూతములైన కలశోదకములచేతను స్నానము చేయించిరి. దానివలన అతని అపవిత్రతయు, ఆకలిబాధయు తొలగెను. దేవతలు, ఋషులు ఈ ప్రదేశము నందు ఇంద్రుని శరీరమునకు ఏర్పడిన అశుచిత్వమును, ఆయన ఆకలి బాధను పోగొట్టి మిక్కిలి ఆనందించిరి. (19-20)

నిర్మలో నిష్కరూశశ్చ శుచిరింద్రో యదాఽభవత్।
దదౌ దేశస్య సుప్రీతో వరం ప్రభురనుత్తమమ్। 21

ఇమౌ జనపదౌ స్ఫీతౌ ఖ్యాతిం లోకే గమిష్యతః।
మలదాశ్చ కరూశాశ్చ మమాంగమలధారిణౌ। 22

సాధు సాధ్వితి తం దేవాః పాకశాసనమబ్రువన్।
దేశస్య పూజాం తాం దృష్ట్వా కృతాం శక్రేణ ధీమతా। 23

ఏతౌ జనపదౌ స్ఫీతౌ దీర్ఘకాలమరిందమ।
మలదాశ్చ కరూశాశ్చ ముదితౌ ధనధాన్యతః। 24

కస్యచిత్త్వథ కాలస్య యక్షీ వై కామరూపిణీ।
బలం నాగసహస్రస్య ధారయంతీ తదాహ్యభూత్। 25

తాటకా నామ భద్రం తే భార్యా సుందస్య ధీమతః।
మారీచో రాక్షసః పుత్రో యస్యాః శక్రపరాక్రమః। 26

వృత్తబాహుర్మహావీర్యో విపులాస్యతనుర్మహాన్।
రాక్షసో భైరవాకారో నిత్యం త్రాసయతే ప్రజాః। 27

ఇమౌ జనపదౌ నిత్యం వినాశయతి రాఘవ।
మలదాంశ్చ కరూశాంశ్చ తాటకా దుష్టచారిణీ। 28

సేయం పంథాన మావార్య వసత్యధ్యర్ధయోజనే।
అత ఏవ చ గంతవ్యం తాటకాయా వనం యతః। 29

స్వబాహుబలమాశ్రిత్య జహీమాం దుష్టచారిణీమ్।
మన్నియోగాదిమం దేశం కురు నిష్కంటకం పునః। 30

న హి కశ్చిదిమం దేశం శక్నోత్యాగంతుమీదృశమ్।
యక్షిణ్యా ఘోరయా రామ ఉత్సాదితమసహ్యయా। 31

ఏతత్ తే సర్వమాఖ్యాతం యథైతద్దారుణం వనమ్।
యక్ష్యా చోత్సాదితం సర్వమ్ అద్యాపి న నివర్తతే। 32

అపవిత్రతయు, ఆకలిబాధయు తొలగి, శుచియగుటచే ఇంద్రుడు సంతసించి, వెంటనే ఈ దేశమునకు అత్యుత్తమమైన ఒక వరమును ప్రసాదించెను. "నా శరీరమాలిన్యములను గ్రహించిన ఈ రెండు ప్రదేశములు 'మలద' 'కరూశ' అను పేర్లతో ఖ్యాతికెక్కి, ధనధాన్య సంపదలతో తులతూగు చుండును." (21-22)

శక్తిసంపన్నుడైన ఇంద్రుడు ఆ దేశమునకు ఉత్తమ వరమునిచ్చి, ఆదరించుటను (పూజించుటను) జూచి, దేవతలెల్లరును ఆ ఇంద్రుని 'బాగు, బాగు' అని ప్రశంసించిరి. (23)

ఓ శత్రుసంహారకా! రామా! 'మలద' 'కరూశ' అను ఈ ప్రదేశములు ధనధాన్య సంపదలతో, సంతోషముతో చిరకాలము వర్ధిల్లినవి. (24)

కొంతకాలము తరువాత పుట్టినప్పుడే వేయి యేనుగుల బలము గలదియు, కామరూపిణియు ఐన 'తాటక' యను యక్షిణి ఇచట వసించెను. ఆమె బలశాలియైన 'సుందుడు' అనువానికి భార్యయయ్యెను. రామా! భయపడకుము. నీకు క్షేమమగును. ఆ తాటకకు 'మారీచుడు' అను రాక్షసుడు పుత్రుడుగా కలిగెను. అతడు ఇంద్రుని యంతటి పరాక్రమశాలి. (25-26)

అతనిబాహువులు బలిష్ఠములైనవి. అతడు మహావీరుడు. అతనిశరీరము, ముఖము విశాలములైనవి. భయంకరుడైన ఆ మహారాక్షసుడు నిరంతరము ప్రజలను బాధింపసాగెను. (27)

ఓ రామా! దుర్మార్గురాలైన తాటక 'మలద' 'కరూశ' అను ఈ రెండు జనపదములను నిత్యము ధ్వంసమొనర్చుచున్నది. ఇచటికి ఒకటిన్నర యోజనములదూరమున ఆ తాటక ఈ దారిని ఆక్రమించి నివసించుచున్నది. కనుక ఆ తాటకా వనమున్న దారివనే మనము వెళ్లవలెను. నా మాటను పాటించి, నీ బాహుబలముతో దుర్మార్గురాలైన ఆ తాటకను వధింపుము. ఈ దేశమున మునుపటివలె ఎట్టి ఉపద్రవములు లేకుండ జేయుము. సామాన్యులకు ఎదిరింప సాధ్యముగాని ఈ ఘోరరాక్షసి ధ్వంస మొనర్చిన ఈ పుణ్యప్రదేశమునకు ఎవ్వరును రాజాలకున్నారు. కలకలలాడుచున్న ఈ దేశమును తాటక ధ్వంసముగావించిన తీరును, తత్ఫలితముగా ఇది నిర్జనముగా మారిన విధమును పూర్తిగా తెలిపితిని. ఆ తాటక ఇప్పటికిని ఈ అడవిని విడిచిపెట్టలేదు. (28-32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే చతుర్వింశస్సర్గః ***(24)***

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదినాల్గవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

25. ఇరువదిఐదవసర్గము

తాటకజన్మవృత్తాంతము, వివాహము, ఆమె శాపమునకు గురియగుట - 'లోకకంటకురాలైన ఆ తాటకను చంపుము'- అని శ్రీరామునకు విశ్వామిత్రుని ఆదేశము.

అథ తస్యాప్రమేయస్య మునేర్వచనముత్తమమ్।
శ్రుత్వా పురుషశార్దూలః ప్రత్యువాచ శుభాం గిరమ్। 1

అల్పవీర్యా యదా యక్షాః శ్రూయంతే మునిపుంగవ।
కథం నాగసహస్రస్య ధారయత్యబలా బలమ్। 2

ఇత్యుక్తం వచనం శ్రుత్వా రాఘవస్యామితౌజసః।
హర్షయన్ శ్లక్ష్ణయా వాచా సలక్ష్మణమరిందమమ్। 3

విశ్వామిత్రోఽబ్రవీద్వాక్యం శృణు యేన బలోత్తరా।
వరదానకృతం వీర్యం ధారయత్యబలా బలమ్। 4

పూర్వమాసీన్మహాయక్షః సుకేతుర్నామ వీర్యవాన్।
అనపత్యః శుభాచారః స చ తేపే మహత్ తపః। 5

పితామహస్తు సుప్రీతః తస్య యక్షపతేస్తదా।
కన్యారత్నం దదౌ రామ తాటకాం నామ నామతః। 6

దదౌ నాగసహస్రస్య బలం చాస్యాః పితామహః।
నత్వేవ పుత్రం యక్షాయ దదౌ బ్రహ్మ మహాయశాః। 7

తాం తు జాతాం వివర్ధంతీం రూపయౌవనశాలినీమ్।
జంభపుత్రాయ సుందాయ దదౌ భార్యాం యశస్వినీమ్। 8

కస్యచిత్త్వథ కాలస్య యక్షీ పుత్రమ్ అజాయత।
మారీచం నామ దుర్ధర్షం యశ్శాపాద్రాక్షసోఽభవత్। 9

సుందే తు నిహతే రామ సాఽగస్త్యమ్ ఋషిసత్తమమ్।
తాటకా సహపుత్రేణ ప్రధర్షయితుమిచ్ఛతి। 10

భక్షార్థం జాతసంరంభా గర్జంతీ సాభ్యధావత।
ఆపతంతీం తు తాం దృష్ట్వా అగస్త్యో భగవాన్ ఋషిః। 11

సాటిలేని ప్రభావశాలియైన విశ్వామిత్రమహాముని పలికిన ఉత్తమవచనములను విని, పురుషశ్రేష్ఠుడైన రాముడు సముచిత రీతిలో ఇట్లు ప్రశ్నించెను. (1)

"ఓ మునీశ్వరా! యక్షులు అంతగా పరాక్రమవంతులు కారని ప్రతీతి. అబలయైన ఆ తాటక (యక్షిణి) వేయి ఏనుగుల బలము కలిగియుండుట ఎట్లు సంభవము?" (2)

అంతట మిగుల తేజశ్శాలియైన శ్రీరాముని వచనములను విని, సంతోషముతో విశ్వామిత్రుడు శత్రుభయంకరుడైన రాఘవునితో మధురముగా ఇట్లు నుడివెను. "రామా! ఆ అబల అంతటి బలవంతురాలగుటకుగల కారణమును వినుము. వరప్రభావమున ఆమె వేయిఏనుగుల బలమును పొందినది. పూర్వము 'సుకేతుడు' అను ఒక మహాయక్షుడు ఉండెను. అతడు గొప్ప పరాక్రమవంతుడు, సత్ప్రవర్తనగలవాడు, సంతానము లేనివాడు. కావున అతడు తీవ్రమైన తపస్సును ఆచరించెను. (3-5)

అతని తపస్సునకు సంతుష్టుడైన బ్రహ్మదేవుడు ఆ సుకేతునకు ఒక కన్యారత్నమును ప్రసాదించెను. ఆమె పేరు తాటక. కాని సృష్టికర్తగా ప్రసిద్ధికెక్కిన బ్రహ్మ ఆ యక్షునకు పుత్రుని మాత్రము అనుగ్రహింపలేదు. అయితే పితామహుడు ఆ కన్యారత్నమునకు మాత్రము వేయి ఏనుగుల బలమును ఒసంగెను. (6-7)

అట్లు జన్మించిన ఆ తాటక క్రమక్రమముగా పెరిగి పెద్దదై యుక్తవయస్కురాలై, చక్కని రూపశోభలతో విలసిల్లెను. తండ్రియైన సుకేతుడు ఆమెను జంభాసురుని కుమారుడైన సుందునకు ఇచ్చి వివాహము చేసెను. కొంత కాలము తరువాత ఆమె ఒక కుమారుని గనెను. అతని పేరు మారీచుడు. అతడు ఎదిరింపశక్యము గానివాడు. అగస్త్యముని శాపమునకు గురియై రాక్షసుడయ్యెను. (8-9)

ఓ రామా! సుందుడు అగస్త్యునివలన మృతిచెందెను. అప్పుడు తాటక తనకుమారుడైన మారీచునితోగూడి అగస్త్య మహామునిని చంపుటకు పూనుకొనెను. తనభర్తమృతికి కారకుడైన అగస్త్యునియెడ క్రుద్ధురాలై, ఆయనను తినివేయుటకు గర్జించుచు ముందుకు ఉరికెను. కుమారునితో గూడి తన

రాక్షసత్వం భజస్వేతి మారీచం వ్యాజహార సః।
అగస్త్యః పరమక్రుద్ధః తాటకామపి శప్తవాన్। 12

పురుషాదీ మహాయక్షీ విరూపా వికృతాననా।
ఇదం రూపం విహాయాథ దారుణం రూప మస్తు తే। 13

సైషా శాపకృతామర్షా తాటకా క్రోధమూర్ఛితా।
దేశమ్ ఉత్సాదయత్యేనమ్ అగస్త్యచరితం శుభమ్। 14

ఏనాం రాఘవ దుర్వృత్తాం యక్షీం పరమదారుణామ్।
గోబ్రాహ్మణహితార్థాయ జహి దుష్టపరాక్రమామ్। 15

న హ్యేనాం శాపసంసృష్టాం కశ్చిదుత్సహతే పుమాన్।
నిహంతుం త్రిషు లోకేషు త్వామ్ ఋతే రఘునందన। 16

న హి తే స్త్రీవధకృతే ఘృణా కార్యా నరోత్తమ।
చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా। 17

నృశంసమనృశంసం వా ప్రజారక్షణకారణాత్।
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సతా। 18

రాజ్యభారనియుక్తానామ్ ఏష ధర్మః సనాతనః।
అధర్మ్యాం జహి కాకుత్స్థ ధర్మో హ్యస్యా న విద్యతే। 19

శ్రూయతే హి పురా శక్రో విరోచనసుతాం నృప।
పృథివీం హంతు మిచ్ఛంతీం మంథరామభ్యసూదయత్। 20

విష్ణునాపి పురా రామ భృగుపత్నీ దృఢవ్రతా।
అనింద్రం లోకమిచ్ఛంతీ కావ్యమాతా నిషూదితా। 21

మీదికి విజృంభించి వచ్చుచున్న తాటకను జూచి, మహర్షి అగస్త్యభగవానుడు మిక్కిలి క్రుద్ధుడాయెను. 'రాక్షసత్వమును పొందుము' అని ముందుగా మారీచుని శపించెను. పిమ్మట "ఓ తాటకా! నీకు ఈ రూపము పోయి, భయంకర రూపము ప్రాప్తించును. వికారమైన రూపముతో, వికృతమైన ముఖముతో నరమాంస భక్షకురాలివగుదువు." అని అతడు తాటకనుగూడ శపించెను. (10-13)

అట్లు అగస్త్యుని శాపమునకు గురియైన తాటక అందులకు తట్టుకొనలేక క్రోధముతో ఉడికిపోయెను. ఆ కారణముగా తాటక అగస్త్యుడు సంచరించిన ఈ పవిత్ర ప్రదేశమునంతయును ధ్వంసమొనర్చుచున్నది. కనుక ఓ రాఘవా! దుష్ప్రవర్తన గలదియు, మిక్కిలి భయంకరమైనదియు, తన పరాక్రమముచే లోకమునకు ఉపద్రవములను కలిగించుచున్నదియు ఐన ఈ తాటకను హతమార్చి గోవులను కాపాడుము. బ్రాహ్మణులకు హితమును గూర్చుము. ఓ రఘునందనా! శాపమునకు లోనైన ఈ తాటకను చంపుటకు నీవు తప్ప ఈ ముల్లోకములయందెవ్వడును సమర్థుడు కాడు. (14-16)

ఓ నరోత్తమా! 'స్త్రీని చంపుట యెట్లు?' అని ఆమెయెడ కనికరము చూపవద్దు. నాలుగువర్ణముల వారికిని (ప్రజలందరికిని) మేలు చేకూర్చుట రాజకుమారుని కర్తవ్యము. (17)

ధర్మపరిరక్షకుడైన రాజు ప్రజలహితమునకై చేయుకార్యము- అది క్రూరమైనదా! తద్భిన్నమైనదా ? అని చూడరాదు, అది పాపకృత్యమైనను, దోషయుక్తమే యైనను దానిని అవశ్యము ఆచరింపవలసినదే - రాజ్యభారమును మోయు వారికి ఇది విధ్యుక్త (నిత్య) ధర్మము. కనుక ఓ కాకుత్స్థా! అధర్మమునకు ఒడిగట్టిన ఈ తాటకను వధింపుము. ఈమెకృత్యములలో 'ధర్మము' అను మాటకు చోటే లేకున్నది గదా! (18 -19)

ఓ రామా! 'పూర్వము విరోచనుని సుతయైన మంథర యనునామె భూదేవిని చంపుటకు పూనుకొనగా ఆమెను ఇంద్రుడు చంపెను.' అని విందుము. అంతేగాక పూర్వము భృగుపత్నియు, శుక్రాచార్యునితల్లియు ఐన 'ఉశన' అనునామె ఇంద్రాది దేవతలను సంహరించుటకు దృఢవ్రతమును చేపట్టగా విష్ణువు ఆమెను చంపివేసెను.[1] (20-21)

1) 'ఉశన' అను నామె భృగుమహర్షిభార్య. శుక్రాచార్యునకు తల్లి. రాక్షసగురువైన శుక్రుడు దేవతలను శిక్షించుటకై శంకరునిగూర్చి తపస్సు చేయుచుండెను. అదే సమయమున దేవతలచే పీడింపబడిన అసురులు శుక్రుని తల్లియైన 'ఉశన' ను శరణుజొచ్చిరి. ఆమె అసురరక్షణార్థము దేవతలను చంపదలచి దృఢవ్రతమును బూనెను. అపుడు దేవతల ప్రార్థనపై విష్ణువు ఆమెశిరస్సును ఖండించెను.

ఏతైశ్చాన్యైశ్చ బహుభిః రాజపుత్ర మహాత్మభిః।
అధర్మసహితా నార్యో హతాః పురుషసత్తమైః।
తస్మాదేనాం ఘృణాం త్యక్త్వా జహి మచ్ఛాసనాన్నృప। 22

ఓ రాజకుమారా! ఈ విధముగా ఎందఱో మహానుభావులు, సత్పురుషులు అధర్మములకు ఒడిగట్టిన స్త్రీలను వధించిరి. (దీనిని బట్టి అధర్మమునకు పాల్పడినప్పుడు స్త్రీలనుగూడ చంపుట దోషముగాదని స్పష్టమగుచున్నది.) కావున ఓ రామా! కనికరము చూపక నా మాటను పాటించి, దుర్మార్గురాలైన తాటకను వధింపుము." (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే, ఆదికావ్యే బాలకాండే పంచవింశస్సర్గః (25)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదిఐదవసర్గము సమాప్తము

-- * * * --

26. ఇరువదిఆఱవసర్గము

శ్రీరాముడు తాటకను వధించుట.

మునేర్వచనమక్లీబం శ్రుత్వా నరవరాత్మజః।
రాఘవః ప్రాంజలిర్భూత్వా ప్రత్యువాచ దృఢవ్రతః। 1

పితుర్వచననిర్దేశాత్ పితుర్వచనగౌరవాత్।
వచనం కౌశికస్యేతి కర్తవ్యమ్ అవిశంకయా। 2

అనుశిష్టోఽస్మ్యయోధ్యాయాం గురుమధ్యే మహాత్మనా।
పిత్రా దశరథేనాహం నావజ్ఞేయం హి తద్వచః। 3

సోఽహం పితుర్వచః శ్రుత్వా శాసనాత్ బ్రహ్మవాదినః।
కరిష్యామి న సందేహః తాటకావధముత్తమమ్। 4

గోబ్రాహ్మణ హితార్థాయ దేశస్యాస్య సుఖాయ చ।
తవచైవాప్రమేయస్య వచనం కర్తుముద్యతః। 5

ఏవ ముక్త్వా ధనుర్మధ్యే బద్ధ్వా ముష్టిమ్ అరిందమః।
జ్యాశబ్దమ్ అకరోత్ తీవ్రం దిశశ్శబ్దేన నాదయన్। 6

తేన శబ్దేన విత్రస్తాః తాటకావనవాసినః।
తాటకా చ సుసంక్రుద్ధా తేన శబ్దేన మోహితా। 7

మహారాజకుమారుడైన శ్రీరాముడు విశ్వామిత్రమహర్షియొక్క ధైర్యమును గొలుపునట్టి మాటలను విని, దృఢనిశ్చయము గలవాడై, అంజలి ఘటించి, ఆ మునితో ఇట్లనెను. (1)

"గురువర్యా! 'ఈ విశ్వామిత్రులమాటలను నిస్సంశయముగా పాటింపుము' అనునది మా తండ్రిగారి ఆదేశము. వారిఆజ్ఞలను అవశ్యము గౌరవింతును. మహాత్ముడును, మా తండ్రియు ఐన దశరథుడు అయోధ్యలో వసిష్ఠాదిగురువులసమక్షమున నన్ను అట్లు ఆజ్ఞాపించియుండెను. ఆ మాట నాకు ఉల్లంఘింప రానిది. మా తండ్రిగారిఆజ్ఞప్రకారము బ్రహ్మవాదులైన మీశాసనమును తలదాల్చి, నిస్సందేహముగా తాటకను వధించితీరెదను. గోరక్షణమునకును, బ్రాహ్మణులహితము కొఱకును, ఈ దేశముయొక్క సౌఖ్యమునకును మహా మహిమాన్వితులైన మీ వచనమును పాటించుటకు పూనుకొనుచున్నాను." (2-5)

శత్రుమర్దనుడైన శ్రీరాముడు ఇట్లు పలికి, ధనుస్సును పిడికిటబట్టి దిక్కులు పిక్కటిల్లునట్లు ధనుష్టంకారము గావించెను. ఆ వింటినారియొక్క మహాధ్వనికి తాటకావనవాసులందఱును ఎంతయు భయకంపితులైరి. తాటకయు ఆ భీకరధ్వనికి మిక్కిలి క్రుద్ధురాలై దిక్కుతోచనిదాయెను. అయోమయస్థితికి లోనైన ఆ రాక్షసి ఆ శబ్దమును విని, ఆలోచించుచు నలుదిక్కులను పరికించి చూచెను.

తం శబ్దమభినిధ్యాయ రాక్షసీ క్రోధమూర్ఛితా।
శ్రుత్వాచాభ్యద్రవద్వేగాత్ యతశ్శబ్దో వినిస్సృతః। 8

తాం దృష్ట్వా రాఘవః క్రుద్ధాం వికృతాం వికృతాననామ్।
ప్రమాణేనాతివృద్ధాం చ లక్ష్మణం సోఽభ్యభాషత। 9

పశ్య లక్ష్మణ యక్షిణ్యా భైరవం దారుణం వపుః।
భిద్యేరన్ దర్శనాదస్యా భీరూణాం హృదయాని చ। 10

ఏనాం పశ్య దురాధర్షాం మాయాబలసమన్వితామ్।
వినివృత్తాం కరోమ్యద్య హృతకర్ణాగ్రనాసికామ్। 11

న హ్యేనాముత్సహే హంతుం స్త్రీస్వభావేన రక్షితామ్।
వీర్యం చాస్యాగతిం చాపి హనిష్యామీతి మే మతిః। 12

ఏవం బ్రువాణే రామే తు తాటకా క్రోధమూర్ఛితా।
ఉద్యమ్య బాహూ గర్జంతీ రామమేవాభ్యధావత। 13

విశ్వామిత్రస్తు బ్రహ్మర్షిః హుంకారేణాభిభర్త్స్యతామ్।
స్వస్తి రాఘవయోరస్తు జయం చైవాభ్యభాషత। 14

ఉద్ధూన్వానా రజో ఘోరం తాటకా రాఘవావుభౌ।
రజోమోహేన మహతా ముహూర్తం సా వ్యమోహయత్। 15

తతో మాయాం సమాస్థాయ శిలావర్షేణ రాఘవౌ।
అవాకిరత్ సుమహతా తతశ్చుక్రోధ రాఘవః। 16

శిలావర్షం మహత్ తస్యాః శరవర్షేణ రాఘవః।
ప్రతిహత్యోపధావంత్యాః కరౌ చిచ్ఛేద పత్రిభిః। 17

తతశ్ఛిన్నభుజాం శ్రాంతామ్ అభ్యాశే పరిగర్జతీమ్।
సౌమిత్రిరకరోత్ క్రోధాత్ హృతకర్ణాగ్రనాసికామ్। 18

పిమ్మట ఆమె పట్టరాని ఆవేశముతో ఆ శబ్దమువచ్చినదిక్కునకు మిక్కిలి వేగముగా పరుగులు దీసెను. (6-8)

వికారమైన రూపము, వికృతమైన ముఖము గలిగి, మిక్కిలి లావైన, ఎత్తైన శరీరముతో క్రోధోద్వేగముతో వచ్చుచున్న ఆ తాటకను జూచి, ఆ రాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను.(9)

"ఓ లక్ష్మణా! ఈ యక్షిణియొక్క భయంకరమైన వికృతాకారమును చూడుము. ఈమెను చూచినంతటనే పిఱికివారిగుండెలు బ్రద్దలగును. మాయలమారియు, ఎదిరింప శక్యముగాని బలముగలదియు ఐన ఈ తాటక యొక్క ముక్కు చెవులు ఖండించి, ఈమె వెనుదిరిగి పాఱిపోవునట్లు చేసెదను. చూడుము. స్త్రీయగుటవలన ఈమెను చంపుటకు నేను ఇష్టపడుట లేదు. కనుక బ్రతికిపోయినది. ఈమె కాళ్లు, చేతులను నఱికివేసి, ఈమెసామర్థ్యమును, గమనశక్తిని నశింపజేయుట యుక్తమని నాకు తోచుచున్నది." (10-12)

శ్రీరాముడు ఇట్లు పలుకుచుండగా క్రోధముతో ఒడలు మఱచిన తాటక తనభుజములను పైకెత్తి గర్జించుచు రామునిమీదికి విజృంభించెను. (13)

వెంటనే బ్రహ్మర్షియైన విశ్వామిత్రుడు హుంకారముతో తాటకను భయపెట్టి, 'రామలక్ష్మణులకు శుభముగుగాక, జయము కలుగుగాక' అని ఆశీర్వచనము పలికెను. (శ్రీరాముని దివ్యశక్తిని ఎఱింగియు, తాటకయొక్క క్రౌర్యాతిశయమును గమనించి, ఆముని రాఘవులకు ఇట్లు ఆశీస్సులు పలికెను.) (14)

అంతట తాటక రామలక్ష్మణుల పైకి భయంకరముగా ధూళిని ఎగజిమ్ముచు, తీవ్రమైన ఆ దుమ్ము ప్రభావముతో క్షణకాలముపాటు వారికి తోచనిస్థితిని కలిగించెను. ఇంకను ఆ తాటక తనమాయాశక్తిచే వారికి కనబడకుండ ఆ రామలక్ష్మణులపై తీవ్రముగా ఱాళ్లవానను కురిపించెను. అంతట శ్రీరాముడు క్రుద్ధుడై, తనశరపరంపరచే ఆ శిలావర్షమును భగ్నమొనర్చెను. రాఘవుడు తనమీదికి విజృంభించుచున్న తాటకయొక్క చేతులను తనబాణములచే ఖండించెను. ఆ విధముగా చేతులు తెగి, డస్సియున్న తాటక గర్జించుచు తనపైకి వచ్చుచుండగా లక్ష్మణుడు మండిపడినవాడై ఆమె ముక్కు చెవులను కోసివేసెను. (15-18)

కామరూపధరా సద్యః కృత్వా రూపాణ్యనేకశః।
అంతర్ధానం గతా యక్షీ మోహయంతీవ మాయయా।
అశ్మవర్షం విముంచంతీ భైరవం విచచార హ। 19

కామరూపిణియైన ఆ యక్షిణి బహురూపములను పొంది, తనమాయచే వారిని భ్రమపెట్టుటకై యత్నించెను. మఱియు ఆమె వారికి కనబడకుండ ఉండి, భయంకరమైన రాళ్లవానను కురిపించుచు అటు నిటు తిరుగసాగెను. (19)

తతస్తావశ్మవర్షేణ కీర్యమాణౌ సమంతతః।
దృష్ట్వా గాధిసుతః శ్రీమాన్ ఇదం వచనమబ్రవీత్। 20

అన్నివైపులనుండి కురియుచున్న రాళ్లవానలో చిక్కుపడిన రామలక్ష్మణులను జూచి శక్తిమంతుడైన విశ్వామిత్రుడు వారితో ఇట్లు పలికెను. (20)

అలం తే ఘృణయా రామ పాపైషా దుష్టచారిణీ।
యజ్ఞవిఘ్నకరీ యక్షీ పురా వర్ధతి మాయయా। 21

వధ్యతాం తావదేవైషా పురా సంధ్యా ప్రవర్తతే।
రక్షాంసి సంధ్యాకాలేషు దుర్ధర్షాణి భవంతి వై। 22

"ఓ రామా! ఇంతవఱకును ఆమెపై చూపిన జాలి చాలును. ఇక నీకనికరమును చాలింపుము. పాపాత్మురాలైన ఈ యక్షిణి కటికిదుర్మార్గురాలు. ఇదివరలో ఈమె యజ్ఞమునకు విఘ్నములను కలిగించుచువచ్చినది. తనమాయచేత ఈమె బలపడును. ఇదిగో సంధ్యాకాలము సమీపించుచున్నది. ఈ లోపలనే ఈమెను హతమార్చుము. ఏలనన రాక్షసులు సంధ్యాకాలములయందు బలోపేతులగుదురు, అప్పుడు వారిని ఎదుర్కొనుట కష్టము." (21-22)

ఇత్యుక్తస్తు తదా యక్షీమ్ అశ్మవృష్ట్యాభివర్షతీమ్।
దర్శయన్ శబ్దవేధిత్వం తాం రురోధ స సాయకైః। 23

విశ్వామిత్రమునిసూచనను అనుసరించి, రాముడు తన శబ్దవేధి[1] విద్యను ప్రదర్శించుచు బాణములను ప్రయోగించెను. ఎడతెగకుండా తనపై రాళ్లవర్షమును కురిపించుచున్న ఆయక్షిణిని అతడు ఆవిధముగా నిలువరించెను. (23)

సా రుద్ధా శరజాలేన మాయాబలసమన్వితా।
అభిదుద్రావ కాకుత్స్థం లక్ష్మణం చ వినేదుషీ। 24

తామాపతంతీం వేగేన విక్రాంతామ్ అశనీమివ।
శరేణోరసి వివ్యాధ సా పపాత మమార చ। 25

ఆ విధముగా రామబాణములచే అడ్డగింపబడిన తాటక గర్జించుచు తనమాయాబలముతో రామలక్ష్మణులపై దాడి చేయుటకు పరుగులుదీసెను. అట్లు విక్రమించి, పిడుగువలె వేగముగా తనమీదికి దూసికొని వచ్చుచున్న ఆ తాటక వక్షఃస్థలముపై రాముడు బాణముతో కొట్టెను. వెంటనే ఆ యక్షిణి నేలపైబడి ప్రాణములను కోల్పోయెను. రాముడు ఈ విధముగా ఆమెకు ముక్తిని ప్రసాదించెను. (24-25)

తాం హతాం భీమసంకాశాం దృష్ట్వా సురపతిస్తదా।
సాధు సాధ్వితి కాకుత్స్థం సురాశ్చ సమపూజయన్। 26

భయంకరమైన ఆకారముగల తాటక ఆ విధముగా మరణించుట చూచి, ఇంద్రాదిదేవతలు 'బాగు, బాగు' అనుచు శ్రీరాముని మిక్కిలి కొనియాడిరి. (26)

ఉవాచ పరమప్రీతః సహస్రాక్షః పురందరః।
సురాశ్చ సర్వే సంహృష్టా విశ్వామిత్ర మథాబ్రువన్। 27

సహస్రాక్షుడైన ఇంద్రుడును, ఇతరదేవతలు అందఱును పరమప్రీతులై విశ్వామిత్రమహర్షితో ఇట్లనిరి. (27)

మునే కౌశిక భద్రం తే సేంద్రాః సర్వే మరుద్గణాః।
తోషితాః కర్మణానేన స్నేహం దర్శయ రాఘవే। 28

"ఓ విశ్వామిత్రమునీ! నీకు శుభమగుగాక. ఈ తాటక వధవలన ఇంద్రునితోసహా దేవతలందఱును సంతసించిరి. రామలక్ష్మణులపై ప్రేమజూపుము. (28)

1) 'శబ్దవేధివిద్య' యనగా శబ్దము చేయుచున్నవారు కనబడకున్నను, ఆ శబ్దము వచ్చుచున్న దిశను బట్టి వారిని బాణముతో కొట్టగల శక్తి

ప్రజాపతే ర్భృశాశ్వస్య పుత్త్రాన్ సత్యపరాక్రమాన్।
తపోబలభృతాన్ బ్రహ్మన్ రాఘవాయ నివేదయ। 29

పాత్రభూతశ్చ తే బ్రహ్మన్ తవానుగమనే ధృతః।
కర్తవ్యం చ మహత్ కర్మ సురాణాం రాజసూనునా। 30

ఓ బ్రహ్మర్షీ! ప్రజాపతియైన[1] భృశాశ్వునికుమారులు సత్యపరాక్రములు. వారు తపోబలసంపన్నులు. అస్త్రరూపములలో ఉన్నవారిని రాఘవునకు సమర్పింపుము. ఓ మునీ! శ్రీరాముడు స్థిరసంకల్పముతో నీ సేవలొనర్చుచున్నాడు. కావున ఇతడు ఆ అస్త్రములను పొందుటకు పాత్రుడు. ఈ రాజకుమారుడు దేవతలకొఱకై ఒక మహాకార్యమును నిర్వహింపవలసి యున్నది." (29-30)

ఏవ ముక్త్వా సురాః సర్వే హృష్టా జగ్ముర్యథాగతమ్।
విశ్వామిత్రం పురస్కృత్య తతస్సంధ్యా ప్రవర్తతే। 31

దేవతలందఱును ఈ విధముగా పలికి, విశ్వామిత్రుని పూజించి, సంతోషముతో తమతమనివాసముల కరిగిరి. ఇంతలో సంధ్యాసమయమాయెను. (31)

తతో మునివరః ప్రీతః తాటకావధతోషితః।
మూర్ధ్ని రామముపాఘ్రాయ ఇదం వచనమబ్రవీత్। 32

ఇహాద్య రజనీం రామ వసేమ శుభదర్శన।
శ్వః ప్రభాతే గమిష్యామః తదాశ్రమపదం మమ। 33

అంతట ఆ మహర్షి తాటకావధకు సంతుష్టుడయ్యెను. ప్రేమతో రామునిశిరమును మూర్కొనెను. పిదప ఆ రాఘవునితో ఇట్లనెను. "చూడముచ్చటగానున్న ఓ రామా! ఈ రాత్రికి ఇచటనే నివసింతము. రేపు ఉదయముననే బయలుదేఱి మనఆశ్రమమునకు వెళ్లుదము." (32-33)

విశ్వామిత్రవచః శ్రుత్వా హృష్టో దశరథాత్మజః।
ఉవాస రజనీం తత్ర తాటకాయా వనే సుఖమ్। 34

రాముడు విశ్వామిత్రుని మాటలకు సంతసించెను. వారందఱును తాటకావనమునందే ఆ రాత్రి గడపిరి. (34)

ముక్తశాపం వనం తచ్చ తస్మిన్నేవ తదాఽహని।
రమణీయం విబభ్రాజ యథా చైత్రరథం వనమ్। 35

అంతట ఆ వనము శాపవిముక్తమై, ఆనాటినుండియే కుబేరుని ఉద్యానవనమైన చైత్రరథమువలె మనోహరముగా విరాజిల్లెను. (35)

నిహత్య తాం యక్షసుతాం స రామః
ప్రశస్యమానః సురసిద్ధసంఘైః ।
ఉవాస తస్మిన్ మునినా సహైవ
ప్రభాతవేలాం ప్రతిబోధ్యమానః । 36

రాముడు యక్షుడగు సుకేతుని కూతురైన తాటకను చంపి, దేవతలయొక్క, సిద్ధులయొక్క ప్రశంసలను అందుకొనెను. మునీశ్వరునితో, తమ్మునితోగూడి ఆ రాత్రి అచటనే గడిపెను. ప్రాతఃకాలమున మునీశ్వరుడు వారిని మేలుకొల్పెను. (36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షడ్వింశస్సర్గః *(26)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదిఆఱవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

27. ఇరువదిఏడవసర్గము

విశ్వామిత్రుడు శ్రీరామునకు వివిధములగు దివ్యాస్త్రములనొసంగుట.

అథ తాం రజనీముష్య విశ్వామిత్రో మహాయశాః।
ప్రహస్య రాఘవం వాక్యమ్ ఉవాచ మధురాక్షరమ్। 1

మహాయశస్వియైన విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో ఆ రాత్రిని అచటనే గడిపెను. సంతోషముతో మందహాసమొనర్చి, శ్రీరామునితో మృదుమధురముగా ఇట్లు పలికెను. (1)

1) ఈ భృశాశ్వునకు 'కృశాశ్వుడు' అనియు పేరుగలదు-ఇతడు విశ్వామిత్రుని అస్త్రగురువు.

పరితుష్టోఽస్మి భద్రం తే రాజపుత్ర మహాయశః।
ప్రీత్యా పరమయా యుక్తో దదామ్యస్త్రాణి సర్వశః। 2

దేవాసురగణాన్ వాపి సగంధర్వోరగానపి।
యైరమిత్రాన్ ప్రసహ్యాజౌ వశీకృత్య జయిష్యసి। 3

తాని దివ్యాని భద్రం తే దదామ్యస్త్రాణి సర్వశః।
దండచక్రం మహద్దివ్యం తవ దాస్యామి రాఘవ। 4

ధర్మచక్రం తతో వీర కాలచక్రం తథైవ చ।
విష్ణుచక్రం తథాత్యుగ్రమ్ ఐంద్రమస్త్రం తథై వ చ। 5

వజ్రమస్త్రం నరశ్రేష్ఠ శైవం శూలవరం తథా।
అస్త్రం బ్రహ్మశిరశ్చైవ ఐషీకమపి రాఘవ। 6

దదామి తే మహాబాహో బ్రాహ్మమస్త్రమనుత్తమమ్।
గదే ద్వే చైవ కాకుత్స్థ మోదకీ శిఖరీ ఉభే। 7

ప్రదీప్తే నరశార్దూల ప్రయచ్ఛామి నృపాత్మజ।
ధర్మపాశమహం రామ కాలపాశం తథైవ చ। 8

పాశం వారుణ మస్త్రం చ దదామ్యహమనుత్తమమ్।
అశనీ ద్వే ప్రయచ్ఛామి శుష్కార్ద్రే రఘునందన। 9

దదామి చాస్త్రం పైనాకమ్ అస్త్రం నారాయణం తథా।
ఆగ్నేయమస్త్రం దయితం శిఖరం నామ నామతః। 10

వాయవ్యం ప్రథనం నామ దదామి చ తవానఘ।
అస్త్రం హయశిరోనామ క్రౌంచమస్త్రం తథైవ చ।
శక్తిద్వయం చ కాకుత్స్థ దదామి తవ రాఘవ। 11

కంకాళం ముసలం ఘోరం కాపాలమథ కంకణమ్।
ధారయంత్యసురా యాని దదామ్యేతాని సర్వశః। 12

వైద్యాధరం మహాస్త్రం చ నందనం నామ నామతః।
అసిరత్నం మహాబాహో దదామి చ నృపాత్మజ। 13

గాంధర్వ మస్త్రం దయితం మానవం నామ నామతః।
ప్రస్వాపనప్రశమనే దద్మి సౌరం చ రాఘవ। 14

వర్షణం శోషణంచైవ సంతాపనవిలాపనే।
మదనంచైవ దుర్ధర్షం కందర్పదయితం తథా। 15

"లోక ప్రశంసలను అందుకొనుచున్న ఓ రాకుమారా! తాటకవధతో నేను మిక్కిలి సంతుష్టుడనైతిని. నీకు భద్రమగు గాక. వివిధములగు అస్త్రములను నీకు పరమప్రీతితో ఒసంగెదను."(2)

యుద్ధమున నిన్నెదిరించెడివారు ఎంతటి వారైనను, కడకు దేవతలు, అసురులు, గంధర్వులు, నాగులు మొదలగువారు ఎవ్వరైనను నేను ఇచ్చెడి ఈ అస్త్రములచే నీకు వశమగుదురు. వారిని నీవు అవలీలగా జయింపగలవు. నీకు భద్రమగును. ఓ రఘువీరా! దివ్యమైన దండచక్రమును, ధర్మచక్రమును, కాలచక్రమును, తీక్ష్ణమైన విష్ణుచక్రమును, ఇంద్రాస్త్రమును ఒసంగెదను. (3-5)

ఓ నరవరా! మహాబాహూ! వజ్రాస్త్రమును, శివునకు సంబంధించిన మహాశూలమును, బ్రహ్మశిరోనామకాస్త్రమును, ఐషీకాస్త్రమును, ఉత్తమోత్తమమైన బ్రహ్మాస్త్రమును ఇచ్చెదను. ఓ నరశ్రేష్ఠా! రాజకుమారా! మీ ఉభయులకును 'మోదకి' 'శిఖరి' అను దివ్యములైన గదలను అందింతును. (6-7)

ఓ రామా! ధర్మపాశమును, కాలపాశమును, వరుణపాశమును, శక్తిసంపన్నమైన వారుణాస్త్రమును సమకూర్చెదను. 'శుష్కాశని' 'ఆర్ద్రాశని' అను రెండు దివ్యాస్త్రములను, శివునకు సంబంధించిన మహాస్త్రమును, నారాయణాస్త్రమును ఇచ్చెదను. ఓ పుణ్యపురుషా! అగ్నిదేవునకు ప్రియమైన 'శిఖరము' అను పేరుగల ఆగ్నేయాస్త్రమును సమకూర్చెదను. (8-10)

ఓ కాకుత్స్థా! 'ప్రథనము' అను పేరుగల వాయవ్యాస్త్రమును 'హయశిరస్సు' అను పేరుగల అస్త్రమును, క్రౌంచాస్త్రమును, 'విష్ణుశక్తి', 'శివశక్తి' అను శక్తి ద్వయమును నీకొసంగెదను. (11)

రాక్షసులు ధరించునట్టి భయంకరమైన కంకాళము, ముసలము, కాపాలము, కంకణము అను ఈ అస్త్రములను అన్నింటిని ఇచ్చెదను. మహాబాహుడవైన ఓ రాజకుమారా! విద్యాధరులు ప్రయోగించునట్టి 'నందనము' అను మహాస్త్రమును, ఖడ్గరాజమును ఒసంగెదను. ఓ రాఘవా! గంధర్వులకు ప్రియమైన మానవాస్త్రమును, నిద్రను కలిగించునదియు, నిద్రను పోగొట్టునదియు ఐన అస్త్రములను, సౌరాస్త్రమును నీకిచ్చెదను. (12-14)

సుప్రసిద్ధ రాజకుమారుడవైన ఓ నరోత్తమా! వర్షణము, శోషణము, సంతాపనము, విలాపనము అను అస్త్రములను, మఱియు మన్మథునకు ప్రీతికరమైనదియు, ఎవ్వరికిని ఎదిరింప

పైశాచమస్త్రం దయితం మోహనం నామ నామతః।
ప్రతీచ్ఛ నరశార్దూల రాజపుత్ర మహాయశః। 16

తామసం నరశార్దూల సౌమనం చ మహాబల।
సంవర్తంచైవ దుర్ధర్షం మౌసలం చ నృపాత్మజ। 17

సత్యమస్త్రం మహాబాహో తథా మాయాధరం పరమ్।
సౌరం తేజఃప్రభం నామ పరతేజోఽపకర్షణమ్। 18

సౌమ్యాస్త్రం శిశిరం నామ త్వష్టురస్త్రం సుదామనమ్।
దారుణం చ భగస్యాపి శీతేషు మథమానవమ్। 19

ఏతాన్ రామ మహాబాహో కామరూపాన్ మహాబలాన్।
గృహాణ పరమోదారాన్ క్షిప్రమేవ నృపాత్మజ। 20

స్థితస్తు ప్రాఙ్ముఖోభూత్వా శుచిర్మునివరస్తదా।
దదౌ రామాయ సుప్రీతో మంత్రగ్రామమ్ అనుత్తమమ్। 21

సర్వసంగ్రహణం యేషాం దైవతైరపి దుర్లభమ్।
తాన్యస్త్రాణి తదా విప్రో రాఘవాయ న్యవేదయత్। 22

జపతస్తు మునేస్తస్య విశ్వామిత్రస్య ధీమతః।
ఉపతస్థుర్మహార్హాణి సర్వాణ్యస్త్రాణి రాఘవమ్। 23

ఊచుశ్చ ముదితాః సర్వే రామం ప్రాంజలయస్తదా।
ఇమే స్మ పరమోదారాః కింకరాస్తవ రాఘవ। 24

ప్రతిగృహ్య చ కాకుత్స్థః సమాలభ్య చ పాణినా।
మానసా మే భవిష్యధ్వమ్ ఇతి తానభ్యచోదయత్। 25

తతః ప్రీతమనా రామో విశ్వామిత్రం మహామునిమ్।
అభివాద్య మహాతేజా గమనాయోపచక్రమే। 26

శక్యముగానిదియు అగు 'మదనము' అను అస్త్రమును, అట్లే పిశాచములకు ఇష్టమైన 'మోహన' నామకాస్త్రమును గైకొనుము. (15-16)

నరశ్రేష్ఠుడవైన ఓ రాజకుమారా! తామసము, సౌమనము, సంవర్తము, తిరుగులేని మౌసలము అను అస్త్రములను, ఓ మహాబాహూ! సత్యాస్త్రము, శ్రేష్ఠమైన మాయాధరము, శత్రుపరాక్రమమును నిర్వీర్యమొనర్చు సూర్యసంబంధమైన 'తేజఃప్రభ' నామకాస్త్రమును స్వీకరింపుము. (17-18)

మహాబాహూ! ఓ రాకుమారా! సోమదేవతకు సంబంధించిన 'శిశిరము' అను పేరుగల అస్త్రము, విశ్వకర్మ నిర్మితమైన 'సుదారుణాస్త్రము' భగదేవతకు సంబంధించిన దారుణాస్త్రము, మనువునకు చెందిన 'శీతేషువు' అనుఅస్త్రము మొదలగు ఈ అస్త్రములన్నియును కామరూపశక్తి గలవి, మహాబల సంపన్నములు, మిక్కిలి శ్రేష్ఠమైనవి. వీటిని నీవు నానుండి వెంటనే గ్రహింపుము. (19-20)

అంతట విశ్వామిత్రమహర్షి శుచియై, పూర్వాభిముఖుడై, ఆయాఅస్త్రములను వాటికి సంబంధించిన అధిష్ఠాన దేవతామంత్రపూర్వకముగా రామునకు ఇచ్చెను. ఈ అస్త్రములను అన్నింటిని పొందుట దేవతలకుసైతము అసాధ్యము. అట్టి మహాస్త్రములనన్నింటిని ఆ మహాముని శ్రీరామునకు అందించెను. (21-22)

సర్వసమర్థుడైన విశ్వామిత్రమహర్షి అస్త్రమంత్రములను రామునకు ఉపదేశించి, తదధిష్ఠాన దేవతలు ఆయనఆజ్ఞలను అనుసరించునట్లు చేయుటకై వారిని స్మరించుచు జపించుచుండెను. అంతట ఆ మహాస్త్రములన్నియు శ్రీరాముని చేరెను. పిమ్మట ఆ మంత్రాధిష్ఠాన దేవతలందఱును సంతోషముతో శ్రీరామునకు అంజలిఘటించి, ఇట్లనిరి. " ఓ రాఘవా! నిన్ను చేరిన మేమందఱమును త్రికరణశుద్ధిగా నీసేవకులమై యుందుము." (23-24)

శ్రీరాముడు తనకరస్పర్శతో వారిని స్వీకరించి, "స్మరించినంత మాత్రముననే మీరు నన్ను చేరుడు." అని ఆదేశించి వారిని పంపివైచెను. (25)

మిక్కిలి తేజస్వియగు శ్రీరాముడు ప్రసన్నచిత్తుడై లక్ష్మణునితో గూడి విశ్వామిత్రమహామునికి అభివాదనమొనర్చి, ఆ ముని వెంట ప్రయాణమయ్యెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తవింశస్సర్గః (27)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదియేడవసర్గము సమాప్తము

-- * * * --

28. ఇరువదియెనిమిదవసర్గము

విశ్వామిత్రుడు శ్రీరామునకు అస్త్రముల ఉపసంహారమంత్రములను ఉపదేశించుట.

ప్రతిగృహ్య తతోఽస్త్రాణి ప్రహృష్టవదన శ్శుచిః।
గచ్ఛన్నేవ చ కాకుత్స్థో విశ్వామిత్ర మథాబ్రవీత్। 1

గృహీతాస్త్రోఽస్మి భగవన్ దురాధర్షః సురాసురైః।
అస్త్రాణాం త్వహమిచ్ఛామి సంహారం మునిపుంగవ। 2

ఏవం బ్రువతి కాకుత్స్థే విశ్వామిత్రో మహామునిః।
సంహారం వ్యాజహారాథ ధృతిమాన్ సువ్రతశ్శుచిః। 3

సత్యవంతం సత్యకీర్తిం ధృష్టం రభసమేవ చ।
ప్రతిహారతరం నామ పరాఙ్ముఖమవాఙ్ముఖమ్। 4

లక్ష్యాక్షవిషమౌ చైవ దృఢనాభసునాభకౌ।
దశాక్షశతవక్త్రౌ చ దశశీర్షశతోదరౌ। 5

పద్మనాభమహానాభౌ దుందునాభసునాభకౌ।
జ్యోతిషం కృశనం చైవ నైరాశ్యవిమలావుభౌ। 6

యోగంధరహరిద్రౌ చ దైత్యప్రశమనౌ తథా।
(శుచిబాహుర్మహాబాహుః నిష్కలిర్విరుచిస్తథా)।
సార్చిర్మాలీ ధృతిర్మాలీ వృత్తిమాన్ రుచిరస్తథా। 7

పిత్ర్యసౌమనసం చైవ విధూతమకరావుభౌ।
కరవీరకరం చైవ ధనధాన్యౌ చ రాఘవ। 8

కామరూపం కామరుచిం మోహమావరణం తథా।
జృంభకం సర్వనాభం చ సంతానవరణౌ తథా। 9

భృశాశ్వతనయాన్ రామ భాస్వరాన్ కామరూపిణః।
ప్రతీచ్ఛ మమ భద్రం తే పాత్రభూతోఽసి రాఘవ। 10

బాఢ మిత్యేవ కాకుత్స్థః ప్రహృష్టే నాంతరాత్మనా।
జగ్రాహ మంత్రగ్రామం తేఽప్యుపతస్థుశ్చరాఘవమ్। 11

దివ్యభాస్వర దేహాశ్చ మూర్తిమంతః సుఖప్రదాః।
కేచిదంగారసదృశాః కేచిద్ధూమోపమాస్తథా।
చంద్రార్కసదృశాః కేచిత్ ప్రహ్వాంజలిపుటా స్తథా। 12

శ్రీరాముడు శుచియై అస్త్రములను స్వీకరించి మిగుల సంతసించినవాడై, మార్గమధ్యమున వెళ్లుచు విశ్వామిత్రునితో ఇట్లనెను. (1)

"ఓ పూజ్యమహర్షీ! మీ అనుగ్రహమువలన అస్త్రములను బడసితిని. ఇప్పుడు సురాసురులు సైతము నన్నెదుర్కొనజాలరు. ఓ మునీశ్వరా! ఈ అస్త్రములను ఉపసంహరించు విద్యలను గూడ ఉపదేశింపుము. (2)

శ్రీరాముడిట్లు పలుకగా వ్రతనిష్ఠుడు, పవిత్రుడు మహా మునియు ఐన విశ్వామిత్రుడు ఎంతయు సంతసించి, ఆయనకు అస్త్రములను ఉపసంహరించు విద్యలనుగూడ ఉపదేశించెను.(3)

ఓ రామా! సత్యవంతము, సత్యకీర్తి, ధృష్టము, రభసము, ప్రతిహారతరము, పరాఙ్ముఖము, అవాఙ్ముఖము, లక్ష్యాక్షము, విషమము, దృఢనాభము, సునాభకము, దశాక్షము, శతవక్త్రము, దశశీర్షము, శతోదరము, పద్మనాభము, మహానాభము, దుందునాభము, సునాభకము, జ్యోతిషము, కృశనము, నైరాశ్యము, విమలము, యోగంధరము, హారిద్రము, దైత్యము, ప్రశమనము, శుచిబాహువు, మహాబాహువు, నిష్కలి, విరుచి, సార్చిమాలి, ధృతిమాలి, వృత్తిమంతము, రుచిరము, పిత్ర్యసౌమనసము, విధూతము, మకరము, కరవీరకరము, ధనము, ధాన్యము, కామరూపము, కామరుచి, మోహము, ఆవరణము, జృంభకము, సర్వనాభము, సంతానము, వరణము-ఇవియన్నియును ఉపసంహారక విద్యలు. ఓ రామా! ఇంతకు ముందు భృశాశ్వతనయుల అస్త్రరూపమంత్రములను నీకు ఉపదేశించియుంటిని. ఈ సత్యవంతము సత్యకీర్తి మొదలుగునవి లోగడ ఉపదేశింపబడిన దండచక్రాది మంత్రాస్త్రములను ఉపసంహరింపజేయును. వీటిని పొందుటకు నీవు అర్హుడవుగాన గైకొనుము. నీకు భద్రమగుగాక . (4-10)

అంతట రాముడు "అట్లే" అని ప్రసన్నచిత్తుడై ఉపసంహారక మంత్రములను స్వీకరించెను. అవియును శ్రీరాముని జేరెను. (11)

మంత్రస్వీకారానంతరము ఆ మంత్రముల అధిదేవతలు రామునియెదుట సాక్షాత్కరించిరి. వారిదేహములు ఆ దివ్యతేజస్సులతో విలసిల్లుచు కాఠిన్యముగలిగియుండెను. అవి ఆహ్లాదకరములు, వారిలో కొందఱు అగ్నివలెను, కొందఱు, పొగవలెను, మఱికొందఱు సూర్యచంద్రులను బోలియు

రామం ప్రాంజలయో భూత్వా బ్రువన్ మధురభాషిణః।
ఇమే స్మ నరశార్దూల శాధి కిం కరవామ తే। 13

మానసాః కార్యకాలేషు సాహాయ్యం మే కరిష్యథ।
గమ్యతామితి తానాహ యథేష్టం రఘునందనః। 14

అథ తే రామమామంత్ర్య కృత్వాచాపి ప్రదక్షిణమ్।
ఏవమస్త్వితి కాకుత్స్థమ్ ఉక్త్వా జగ్ముర్యథాగతమ్। 15

తతస్తు రామః కాకుత్స్థః శాసనాద్బ్రహ్మవాదినః।
లక్ష్మణాయచ తాన్ సర్వాన్ పరాస్త్రాన్ రఘునందనః।
సంహారాన్ స చ సంహృష్టః శ్రీమాంస్తస్మైన్యవేదయత్। 16

స చ తాన్ రాఘవో జ్ఞాత్వా విశ్వామిత్రం మహామునిమ్।
గచ్ఛన్నేవాథ మధురం శ్లక్ష్ణం వచనమబ్రవీత్। 17

కిన్న్వేతన్మేఘసంకాశం పర్వతస్యావిదూరతః।
వృక్షషండమితో భాతి పరం కౌతూహలం హి మే। 18

దర్శనీయం మృగాకీర్ణం మనోరమమతీవ చ।
నానాప్రకారైః శకునైః వల్గునాదైరలంకృతమ్। 19

నిఃసృతాః స్మ మునిశ్రేష్ఠ కాంతారాద్రోమహర్షణాత్।
అనయాత్వవగచ్ఛామి దేశస్య సుఖవత్తయా।
సర్వం మే శంస భగవన్ కస్యాశ్రమపదంత్విదమ్। 20

సంప్రాప్తా యత్ర తే పాపా బ్రహ్మఘ్నా దుష్టచారిణః।
తవ యజ్ఞస్య విఘ్నాయ దురాత్మానో మహామునే।
భగవన్ తస్య కో దేశః సా యత్ర తవ యాజ్ఞికీ। 21

రక్షితవ్యా క్రియా బ్రహ్మన్ మయా వధ్యాశ్చ రాక్షసాః।
ఏతత్ సర్వం మునిశ్రేష్ఠ శ్రోతుమిచ్ఛామ్యహం ప్రభో। 22

భాసిల్లుచుండిరి. వారు అందఱును అంజలిఘటించి, వినమ్రులై శ్రీరామునితో మధురముగా ఇట్లు భాషించిరి. "ఓ నరోత్తమా! ఇచటనున్న మేమందఱము నీ దాసులము. నీకు ఏమి చేయవలెనో ఆదేశింపుము." (12-13)

అంతట రఘునందనుడు "మీరు నాస్మృతిపథమున మసలుచు కార్యావసరములయందు సహాయపడు చుండుడు. ఇక మీరు మీ అభీష్టస్థానములకు స్వేచ్ఛగా వెళ్లుడు." అని వారితో అనెను. (14)

అంతట వారు 'అట్లే' యని పలికి, శ్రీరామునకు ప్రదక్షిణమొనర్చి, ఆయనయొద్ద సెలవుగైకొని, తమ యథాస్థానములకు చేరిరి. (15)

సర్వశుభలక్షణశోభితుడైన శ్రీరాముడు బ్రహ్మర్షియైన విశ్వామిత్రుని ఆదేశమును అనుసరించి, సర్వశ్రేష్ఠములైన ఆ అస్త్రమంత్రములను, వాటి ఉపసంహారమంత్రములను తమ్ముడైన లక్ష్మణునకు బోధించెను. ఆ రామచంద్రుడు ఉపసంహార మంత్రములను చక్కగా గ్రహించి, పయనించుచునే విశ్వామిత్రమహామునితో మృదుమధురముగా ఇట్లనెను. (16-17)

"ఓ మునీశ్వరా! ఈ ప్రదేశమున పర్వతసమీపమునందు మేఘమండలమువలె వృక్షసమూహము విలసిల్లుచున్నది. దీనినిగూర్చి తెలిసికొనవలెనని నాకు మిక్కిలి కుతూహలముగా నున్నది. ఇది వివిధమృగములతోగూడి మిక్కిలి మనోహరమై, చూడముచ్చటగొలుపుచున్నది. ఇచట నానావిధములైన పక్షుల కిలకిలారావములు వీనులవిందు గావించుచున్నవి. ఈ ప్రదేశము ప్రశాంతమై మిక్కిలి హాయినిగూర్చుచున్నది. కనుక భయంకరమైన అటవీవనమునుండి బయటపడినట్లు తలంచుచున్నాను. ఓ మహాత్మా! ఈ ఆశ్రమము ఎవరిదో వివరముగా తెలుపుడు. (18-20)

ఓ మహామునీ! పాపాత్ములును, బ్రహ్మహత్యలు చేయువారును, దుర్మార్గులును, దురాత్ములును ఐన ఆ రాక్షసులు మీ యజ్ఞకార్యమునకు విఘ్నము కల్గించుటకై వచ్చెడి ప్రదేశమేది? (21)

పూజ్యుడవైన ఓ బ్రహ్మర్షీ! ఆ రాక్షసులను వధించి, మీ యజ్ఞకార్యమును రక్షింపవలసిన ప్రదేశమేది? ఓ మునీశ్వరా! ఈ విషయములను అన్నింటిని వినగోరుచున్నాను. దయతో తెలుపుడు." (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే అష్టావింశస్సర్గః *(28)*

వాల్మీకిమహర్షివిరచితమైన ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదిఎనిమిదవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

29. ఇరువదితొమ్మిదవసర్గము

సిద్ధాశ్రమవృత్తాంతము - విశ్వామిత్రుడు యజ్ఞదీక్షనుగైకొనుట.

అథ తస్యాప్రమేయస్య తద్వనం పరిపృచ్ఛతః।
విశ్వామిత్రో మహాతేజా వ్యాఖ్యాతుమ్ ఉపచక్రమే। 1

ఇహ రామ మహాబాహో విష్ణుర్దేవవరః ప్రభుః।
వర్షాణి సుబహూన్యేవ తథా యుగశతాని చ। 2

తపశ్చరణయోగార్థమ్ ఉవాస సుమహాతపాః।
ఏష పూర్వాశ్రమో రామ వామనస్య మహాత్మనః।
సిద్ధాశ్రమ ఇతి ఖ్యాతః సిద్ధో హ్యత్ర మహాతపాః। 3

ఏతస్మి న్నేవ కాలే తు రాజా వైరోచనిర్బలిః।
నిర్జిత్య దైవతగణాన్ సేంద్రాంశ్చ సమరుద్గణాన్।
కారయామాస తద్రాజ్యం త్రిషు లోకేషు విశ్రుతః। 4

బలేస్తు యజమానస్య దేవాః సాగ్నిపురోగమాః।
సమాగమ్య స్వయం చైవ విష్ణుమ్ ఊచురిహాశ్రమే। 5

బలి ర్వైరోచనిర్విష్ణో యజతే యజ్ఞముత్తమమ్।
అసమాప్తే క్రతౌ తస్మిన్ స్వకార్యమభిపద్యతామ్। 6

యే చైనమభివర్తంతే యాచితార ఇతస్తతః।
యచ్చ యత్ర యథావచ్చ సర్వం తేభ్యః ప్రయచ్ఛతి। 7

స త్వం సురహితార్థాయ మాయాయోగముపాశ్రితః।
వామనత్వం గతో విష్ణో కురు కల్యాణ ముత్తమమ్। 8

సాటిలేని వైభవములుగల శ్రీరామచంద్రుడు ఒక సామాన్యమానవునివలె ఆ వనమునుగూర్చి ఇట్లు ప్రశ్నింపగా, మహాతేజస్వియైన విశ్వామిత్రుడు సమగ్రముగా ఇట్లు తెలుపసాగెను. (1)

మహాబాహువైన ఓ రామా! దేవాదిదేవుడైన శ్రీమహావిష్ణువు వందలకొలదియుగములకాలము లోకకల్యాణముకై తపమాచరించుచు తత్ఫలసిద్ధికై ఇచట నివసించెను. వామనావతారమునకు ముందు మహాత్ముడైన విష్ణువు తపస్సిద్ధిని పొందుటవలనను, మహాతపస్వి కాశ్యపుడు తనతపశ్చర్యకు ఫలసిద్ధినందుట వలనను దీనికి 'సిద్ధాశ్రమము' అని ప్రసిద్ధి యేర్పడెను. (2-3)

విష్ణుతపశ్చర్యాకాలమునందే ప్రహ్లాదునిమనుమడును విరోచనునికుమారుడును ఐన 'బలి చక్రవర్తి' మరుద్గణములను, ఇంద్రాదిదేవతలను జయించి, ముల్లోకములకును రాజై పరిపాలించుచు ప్రసిద్ధికెక్కెను. (4)

'బలి' యజ్ఞము చేయుచుండగా అగ్నిదేవుని ముందుంచుకొని[1] దేవతలు అందఱును ఈ ఆశ్రమమున తపమొనరించుచున్న విష్ణుమూర్తిని చేరి, స్వయముగా ఇట్లు విన్నవించుకొనిరి. (5)

"ఓ మహావిష్ణూ ! విరోచనుని పుత్రుడైన బలిచక్రవర్తి గొప్ప ప్రభావముగల ఒక యజ్ఞమును చేయుచున్నాడు. అది ముగియకముందే ఈ దేవ (మా) కార్యమును నెరవేర్ప వలసినదిగా ప్రార్థన. యజ్ఞముచేయుచున్న బలిచక్రవర్తికడకు అర్థులు (యాచకులు) అన్ని దిక్కులనుండి ప్రవాహముగా వచ్చుచున్నారు. వారు కోరినరీతిగా ధనకనకవస్తువాహనాదుల నెల్లను ఏ మాత్రము వెనుకాడక వెంటనే అతడు వారికి దానముచేయుచున్నాడు. ఓ మహావిష్ణూ! మహామహిమాత్ముడవైన నీవు దేవతలహితముకొఱకై మాయాయోగమును ఆశ్రయించి, వామనుడవై అవతరింపుము. మాకు శుభలాభములను చేకూర్చుము." (వామనుడవై బలికడకు వెళ్లి, దానము పేరుతో అతని రాజ్యమును గైకొని, మాకు ఇమ్ము.) (6-8)

1) "అగ్నిముఖా వై దేవాః" శ్రుతివాక్యమ్ ·
(1) దేవతలు అందఱును అగ్నిదేవునిద్వారా తమహవిర్భాగములను అందుకొనుచుందురు.
(2) దేవతలందఱును అగ్నిని ముందుంచుకొని సాగిపోవుచుందురు.

ఏతస్మిన్నంతరే రామ కాశ్యపోఽగ్నిసమప్రభః।
అదిత్యాసహితో రామ దీప్యమాన ఇవౌజసా। 9

దేవీసహాయో భగవాన్ దివ్యం వర్షసహస్రకమ్।
వ్రతం సమాప్య వరదం తుష్టావ మధుసూదనమ్। 10

తపోమయం తపోరాశిం తపోమూర్తిం తపాత్మకమ్।
తపసా త్వాం సుతప్తేన పశ్యామి పురుషోత్తమమ్। 11

శరీరే తవ పశ్యామి జగత్ సర్వమిదం ప్రభో।
త్వమనాదిరనిర్దేశ్యః త్వామహం శరణం గతః। 12

త మువాచ హరిః ప్రీతః కాశ్యపం ధూతకల్మషమ్।
వరం వరయ భద్రం తే వరార్హోఽసి మతో మమ। 13

తచ్ఛ్రుత్వా వచనం తస్య మారీచః కాశ్యపోఽబ్రవీత్।
అదిత్యా దేవతానాం చ మమ చైవానుయాచతః। 14

వరం వరద సుప్రీతో దాతుమర్హసి సువ్రత।
పుత్రత్వం గచ్ఛ భగవ న్నదిత్యా మమ చానఘ। 15

భ్రాతా భవ యవీయాం స్త్వం శక్రస్యాసురసూదన।
శోకార్తానాం తు దేవానాం సాహాయ్యం కర్తుమర్హసి। 16

అయం సిద్ధాశ్రమో నామ ప్రసాదాత్ తే భవిష్యతి।
సిద్ధేకర్మణి దేవేశ ఉత్తిష్ఠ భగవన్నితః। 17

అథ విష్ణు ర్మహాతేజా అదిత్యాం సమజాయత।
వామనం రూపమాస్థాయ వైరోచని ముపాగమత్। 18

త్రీన్ క్రమానథ భిక్షిత్వా ప్రతిగృహ్య చ మానదః।
ఆక్రమ్య లోకాన్ లోకాత్మా సర్వభూతహితే రతః। 19

"ఓ రామా! ఇంద్రాదిదేవతలు తపోనిష్ఠలోనున్న విష్ణుమూర్తిని ప్రార్థించుసమయముననే అగ్నివలె తేజస్వియైన కశ్యపమహర్షి తనధర్మపత్నియైన అదితితోగూడి తేజోరాశియై వెలుగొందుచుండెను. కశ్యపమహర్షి పత్నీసహితుడై వేయిదివ్యసంవత్సరములు వ్రతమాచరించి, వరప్రదుడైన శ్రీమహావిష్ణువును సంతుష్టునిగావించి ఇట్లు స్తుతించెను. (9-10)

ఓ పురుషోత్తమా ! నీవు తపస్సుద్వారా ఆరాధింపదగిన వాడవు. తపఃఫలమును ప్రసాదించువాడవు. జ్ఞానస్వరూపుడవు. సమస్తకల్యాణగుణములు గలవాడవు. అట్టి నిన్ను ఒక పరమప్రయోజననిమిత్తమై, తపస్సుచే ఆరాధించి, దర్శించుచున్నాను. (11)

ఓ మహాప్రభూ! చేతనాచేతనాత్మకమైన ఈ సమస్త జగత్తును నీయందుజూచుచున్నాను. నీవు ఆద్యంత రహితుడవు, అనిర్వచనీయుడవు. అట్టి నిన్ను శరణుజొచ్చుచున్నాను. (12)

మిగులపవిత్రుడైన ఆ కశ్యపమహర్షితో శ్రీహరి ప్రీతితో ఇట్లనెను. "నీకు శుభమగుగాక, వరమును కోరుకొనుము. అందులకు నీవు అర్హుడవు." (13)

మరీచికుమారుడైన కశ్యపుడు శ్రీహరివచనములను విని, ఇట్లనెను. "వరములను ప్రసాదించు ఓ శ్రీహరీ! అదితియు, నేను, దేవతలును నిన్ను అర్థించుచుంటిమి. సంప్రీతుడవై మాకు వరమును ప్రసాదింపుము. మమ్ము ఆదుకొనగలవాడవు నీవే. ఓ మహాత్మా! ఓ దేవా! నీవు మాకు పుత్రుడవై జన్మింపుము. (14-15)

ఓ అసురసూదనా! ఇంద్రునకు తమ్ముడవు (ఉపేంద్రుడవు) కమ్ము. శోకార్తులైన దేవతలను ఆదుకొనగల శక్తిమంతుడవు నీవే. ఓ దేవదేవా! నీ అనుగ్రహమువలన మా తపస్సులు ఫలించును. నీ సంకల్పమూ నెరవేఱును. కనుక ఈ ప్రదేశము 'సిద్ధాశ్రమము'గా ప్రసిద్ధివహించును. ఇక వామనావతారమునెత్తుటకై సిద్ధము కమ్ము." (16-17)

అంతట మహాశక్తిశాలియైన విష్ణువు అదితియందు పుత్రుడై జన్మించెను. వామనరూపమున బలిచక్రవర్తి కడకు చేరెను. (18)

సమస్తలోకములకును హితముగూర్చు ప్రభువైన శ్రీమహావిష్ణువు అతులప్రభావశాలియయ్యును వామనుడై అభిమానమును పెట్టుకొనక మూడడుగుల మేరకు ధర్మాత్ముడైన బలిని యాచించి, దానముగా స్వీకరించెను.

మహేంద్రాయ పునః ప్రాదాత్ నియమ్య బలిమోజసా।
త్రైలోక్యం స మహాతేజాః చక్రే శక్రవశం పునః। 20

తేనైష పూర్వమాక్రాంత ఆశ్రమః శ్రమనాశనః।
మయాఽపి భక్త్యా తస్యైష వామనస్యోపభుజ్యతే। 21

ఏతమాశ్రమమాయాంతి రాక్షసా విఘ్నకారిణః।
అత్రైవ పురుషవ్యాఘ్ర హంతవ్యా దుష్టచారిణః। 22

అద్య గచ్ఛామహే రామ సిద్ధాశ్రమమ్ అనుత్తమమ్।
తదాశ్రమపదం తాత తవాప్యేతద్యథా మమ। 23

ప్రవిశన్నాశ్రమపదం వ్యరోచత మహామునిః।
శశీవ గతనీహారః పునర్వసుసమన్వితః। 24

తం దృష్ట్వా మునయః సర్వే సిద్ధాశ్రమనివాసినః।
ఉత్పత్యోత్పత్య సహసా విశ్వామిత్రమ్ అపూజయన్। 25

యథార్హం చక్రిరే పూజాం విశ్వామిత్రాయ ధీమతే।
తథైవ రాజపుత్రాభ్యామ్ అకుర్వన్ అతిథిక్రియామ్। 26

ముహూర్తమథ విశ్రాంతౌ రాజపుత్రావరిందమౌ।
ప్రాంజలీ మునిశార్దూలమ్ ఊచతూ రఘునందనౌ। 27

అద్యైవ దీక్షాం ప్రవిశ భద్రం తే మునిపుంగవ।
సిద్ధాశ్రమోఽయం సిద్ధః స్యాత్ సత్యమస్తు వచస్తవ। 28

ఏవముక్తో మహాతేజా విశ్వామిత్రో మహాన్ ఋషిః।
ప్రవివేశ తదా దీక్షాం నియతో నియతేంద్రియః। 29

కుమారావపి తాం రాత్రిమ్ ఉషిత్వా సుసమాహితౌ।
ప్రభాతకాలే చోత్థాయ పూర్వాం సంధ్యామ్ ఉపాస్య చ। 30

పిమ్మట త్రివిక్రముడై ముల్లోకములను వ్యాపించెను. అతడు తనప్రభావముచేత బలిని అదుపుచేసి, వాటిని దేవేంద్రునకు ఇచ్చెను. ఈ విధముగా ఆ దివ్యతేజోమూర్తి (విష్ణువు) ముల్లోకములను మరల ఇంద్రుని అధీనము గావించెను. (19-20)

మహాత్ముడైన వామనుని పాదస్పర్శతో పవిత్రమైన ప్రదేశమిది. అందువలన ఇచట అడుగిడినవారియొక్క సాంసారికబాధలను ఇది దూరమొనర్చును. నేనైతే త్రివిక్రముడైన వామనునియెడగల భక్తిశ్రద్ధలకారణముగ (స్వాశ్రమమును వీడి) ఈ ప్రదేశమును ఆశ్రయించితిని. ఓ నరోత్తమా! విఘ్నకారకులైన రాక్షసులు ఈ ఆశ్రమమునకు వచ్చుచుందురు. ఆ దుర్మార్గులను హతమార్చవలసినది ఈ ప్రదేశముననే. (21-22)

ఓ రామా! పవిత్రమైన ఆ సిద్ధాశ్రమమునకు నేడే వెళ్లుదము. నాయనా! ఆ ఆశ్రమము నాది మాత్రమే గాదు, నీది కూడ. (23)

విశ్వామిత్రమహాముని రామలక్ష్మణులతోగూడి ఆశ్రమమున ప్రవేశించుచు మంచుతొలగి, పునర్వసు నక్షత్రముతోగూడిన చంద్రునివలె విరాజిల్లెను. (24)

ఆ సిద్ధాశ్రమనివాసులైన మునులందఱును విశ్వామిత్ర మహర్షిని జూచి, వెంటనే లేచి, ఆనందముతో సంబరపడిరి. పిమ్మట వారు ముందునకు వచ్చి, వారికి స్వాగత సత్కారములను గావించిరి. (25)

వారు ప్రతిభావంతుడైన విశ్వామిత్రమహామునిని తగిన విధముగా పూజించిరి. అట్లే ఆ రామలక్ష్మణులకును అతిథి మర్యాదలనొనర్చిరి. (26)

శత్రుభయంకరులును, రాజకుమారులును ఐన రామలక్ష్మణులు క్షణకాలముపాటు విశ్రాంతి గైకొనిన పిమ్మట, విశ్వామిత్రమహర్షికి అంజలి ఘటించి ఇట్లు పలికిరి. (27)

"ఓ మునీశ్వరా! నేడే దీక్షను స్వీకరింపుడు. మీ సంకల్పము నెఱవేఱును. రాక్షససంహారము జరిగి తీరును. యజ్ఞము నిర్విఘ్నముగా జరిగి ఫలసిద్ధి కలుగును. దీనికి 'సిద్ధాశ్రమము' అను పేరు సార్థకము అగును. అంతయు శుభమేయగును."(28)

మహాతేజస్వియైన విశ్వామిత్రమహర్షి శ్రీరాముడు పలికిన ఉత్సాహపూరితవచనములను విని, నిశ్చలచిత్తుడై నియమనిష్ఠలతో యజ్ఞదీక్షను స్వీకరించెను. (29)

రామలక్ష్మణులును ప్రశాంతచిత్తులై ఆ రాత్రిని గడపిరి. ఉషఃకాలముననే మేల్కొని, స్నానాదికములనాచరించి, సూర్యునకు అర్ఘ్యప్రదానములనొనర్చిరి. నియమపూర్వకముగా

స్పృష్టోదకౌ శుచీ జప్యం సమాప్య నియమేన చ।
హుతాగ్నిహోత్రమాసీనం విశ్వామిత్రమవందతామ్। 31

గాయత్రీ మంత్రమును జపించి, ప్రాతఃకాలసంధ్యోపాసనను ముగించుకొనిరి, ఇంతలో విశ్వామిత్రుడు ఔపాసనాది - అగ్ని కార్యములను ఆచరించి, ఆసీనుడైయుండగా వారు ఆయన కడకు వచ్చి నమస్కరించిరి. (30-31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకోనత్రింశస్సర్గః ***(29)***

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు ఇరువదితొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

30. ముప్పదియవసర్గము

రామలక్ష్మణులు సుబాహుమారీచాదిరాక్షసులను నిగ్రహించుట - విశ్వామిత్రయాగమును సంరక్షించుట.

అథ తౌ దేశకాలజ్ఞౌ రాజపుత్రావరిందమౌ।
దేశే కాలే చ వాక్యజ్ఞావబ్రూతాం కౌశికం వచః। 1

శత్రుసంహారదక్షులును, దేశకాలములను గుర్తించి, తదనుగుణముగ మాటాడగలవారును ఐన ఆ రామలక్ష్మణులు విశ్వామిత్రునితో ఇట్లనిరి. (1)

భగవన్ శ్రోతుమిచ్ఛావో యస్మిన్ కాలే నిశాచరౌ।
సంరక్షణీయౌ తౌ బ్రహ్మన్ నాతివర్తేత తత్క్షణమ్। 2

"పూజ్యుడవైన ఓ బ్రహ్మర్షీ! ఆ రాక్షసులు యజ్ఞమునకు విఘ్నములను కల్గించుటకై ఎప్పుడు వత్తురో దయతో తెల్పుడు. యజ్ఞసంరక్షణార్థము వారిని నిలువరించుటకై మేము సావధానులమై యుందుము." (2)

ఏవం బ్రువాణౌ కాకుత్స్థౌ త్వరమాణౌ యుయుత్సయా।
సర్వే తే మునయః ప్రీతాః ప్రశశంసుః నృపాత్మజౌ। 3

అద్యప్రభృతి షడ్రాత్రం రక్షతం రాఘవౌ యువామ్।
దీక్షాం గతో హ్యేష మునిః మౌనిత్వం చ గమిష్యతి। 4

ఈ విధముగా పలుకుచు రామలక్ష్మణులు రాక్షసులతో యుద్ధమొనర్చుటకై త్వరపడుచుండిరి. అందులకు అచటి మునులు అందఱును ఎంతయు సంతసించి, ఆ రాకుమారులను ప్రశంసించుచు ఇట్లనిరి, "నేటినుండి ఆఱుదినముల వఱకు విశ్వామిత్రమహర్షి మౌనదీక్షలోనుండును. ఓ రాజకుమారులారా! మీరు సావధానులై ఈ ఆఱుదినములును యజ్ఞమును రక్షించుచుండవలెను." (3-4)

తౌ తు తద్వచనం శ్రుత్వా రాజపుత్రౌ యశస్వినౌ।
అనిద్రౌ షడహోరాత్రం తపోవనమరక్షతామ్। 5

ఉపాసాంచక్రతుర్వీరౌ యత్తౌ పరమధన్వినౌ।
రరక్షతుర్మునివరం విశ్వామిత్రమరిందమౌ। 6

రాజకుమారులలో సుప్రసిద్ధులైన ఆ రామలక్ష్మణులు వారి మాటలను విని, ఆ ఆఱుదినములును రాత్రింబవళ్లు జాగరూకులై తపోవనమును రక్షించుచుండిరి. మహాధనుర్ధారులైన ఆ వీరులు సావధానులై ఆ సమీపముననే నిలిచి, విఘ్నకారకులైన రాక్షసులయొక్క బాధనుండి విశ్వామిత్రమహామునిరక్షణ కార్యములో నిమగ్నులై యుండిరి. (5-6)

అథ కాలే గతే తస్మిన్ షష్ఠేఽహని సమాగతే।
సౌమిత్రిమ్ అబ్రవీద్రామో యత్తో భవ సమాహితః। 7

ఐదుదినములు క్రమముగా యజ్ఞకార్యక్రమములు జరిగెను. పిమ్మట ఆఱవనాడు శ్రీరాముడు లక్ష్మణునితో "ఏమఱుపాటులేక సర్వసన్నద్ధుడవై యుండుము." అని పలికెను. (7)

రామస్యైవం బ్రువాణస్య త్వరితస్య యుయుత్సయా।
ప్రజజ్వాల తతో వేదిః సోపాధ్యాయపురోహితా॥ 8

సదర్భచమసస్రుక్కా ససమిత్కుసుమోచ్చయా।
విశ్వామిత్రేణ సహితా వేదిర్జజ్వాల సర్త్విజా॥ 9

మంత్రవచ్చ యథాన్యాయం యజ్ఞోఽసౌ సంప్రవర్తతే।
ఆకాశే చ మహాన్ శబ్దః ప్రాదురాసీ ద్భయానకః॥ 10

ఆవార్య గగనం మేఘో యథా ప్రావృషి నిర్గతః।
తథా మాయాం వికుర్వాణౌ రాక్షసావభ్యధావతామ్॥ 11

మారీచశ్చ సుబాహుశ్చ తయోరనుచరాశ్చ యే।
ఆగమ్య భీమసంకాశా రుధిరౌఘాన్ అవాసృజన్॥ 12

సా తేన రుధిరౌఘేణ వేదిర్జజ్వాల మండితా।
సహసాభిద్రుతో రామః తానపశ్యత్ తతో దివి॥ 13

తావాపతంతౌ సహసా దృష్ట్వా రాజీవలోచనః।
లక్ష్మణం చాథ సంప్రేక్ష్య రామో వచనమబ్రవీత్॥ 14

పశ్య లక్ష్మణ దుర్వృత్తాన్ రాక్షసాన్ పిశితాశనాన్।
మానవాస్త్రసమాధూతాన్ అనిలేన యథా ఘనాన్॥ 15

కరిష్యామి న సందేహో నోత్సహే హంతు మీదృశాన్।
ఇత్యుక్త్వావచనమ్ రామః చాపే సంధాయవేగవాన్॥ 16

మానవం పరమోదారమ్ అస్త్రం పరమభాస్వరమ్।
చిక్షేప పరమక్రుద్ధో మారీచోరసి రాఘవః॥ 17

స తేన పరమాస్త్రేణ మానవేన సమాహతః।
సంపూర్ణం యోజనశతం క్షిప్తః సాగర సంప్లవే॥ 18

విచేతనం విఘూర్ణంతం శీతేషుబలతాడితమ్।
నిరస్తం దృశ్య మారీచం రామో లక్ష్మణమబ్రవీత్॥ 19

యుద్ధముచేయుటకు త్వరపడుచు శ్రీరాముడు ఇట్లు నుడువుచుండగనే విశ్వామిత్రునితో, ఋత్విజులతో గూడిన యజ్ఞవేదికనుండి అగ్నిజ్వాలలు ఒక్కుమ్మడిగా పైకెగసెను. (వేదికనుండి అగ్నిజ్వాలలు పైకెగయుట రాక్షసులరాకను సూచించు ఉత్పాతము.) (8)

యజ్ఞవేదికసమీపమున విశ్వామిత్రుడు, ఋత్విజులు ఆసీనులై హోమకార్యక్రమములను నిర్వర్తించుచుండిరి. అచట దర్భలు, చమసములు (పానపాత్రలు) స్రుక్కులు (ఆజ్య హోమముచేయుటకు ఉపయోగించు సాధనములు) సమిధలు, అలంకరణకై పుష్పములు మొదలగునవి ఉండెను. ఇంతలో యజ్ఞవేదికనుండి 'ఆహవనీయాగ్ని' జ్వాలలు ఒక్కసారిగా ప్రజ్వరిల్లెను. (9)

యజ్ఞము వేదమంత్రపూర్వకముగా యథాక్రమముగా కొనసాగుచుండెను. ఇంతలో ఆకాశమునుండి భయంకరమైన ఒక మహాశబ్దము బయలుదేరెను. వర్షాకాలమున ఆకాశమును క్రమ్ముకొనుచువచ్చెడి మేఘములవలె రాక్షసులు తమ మాయలను ప్రయోగించుచు పరుగుపరుగున వచ్చిరి. (10-11)

భయంకరులైన మారీచసుబాహువులు, వారి అనుచరులు అచటికి చేరి, కుండపోతగా రక్తమును వర్షించిరి. ఆ రక్త వృష్టితో వేదికయొక్క పరిసరములన్నియును తడిసిపోయెను. తమ్మునితోగూడిన శ్రీరాముడు అట్టివేదికను జూచి క్రుద్ధుడై, వెంటనే ముందునకు దూసికొని వచ్చి, ఆకాశమున నున్న రాక్షసులను గాంచెను. (12-13)

రాజీవలోచనుడైన శ్రీరాముడు ఆ విధముగా వచ్చి పడుచున్న రాక్షసులను గాంచి, లక్ష్మణునివైపు మిక్కిలి సాభిప్రాయముగా జూచి ఇట్లనెను. (14)

"ఓ లక్ష్మణా! వాయువు మేఘములనువలె మాంసభక్షకులు, దురాత్ములు ఐన ఆ రాక్షసులను మానవాస్త్రముతో చెల్లాచెదరుగావించెదను, చూడుము." ఇట్టి పిశితాశనులను సంహరించుటకు ఏమాత్రమూ ఇష్టపడను, అని పలికి శ్రీరాముడు తనచాపమునందు శరమును సంధించెను. మిక్కిలి క్రుద్ధుడైన రాఘవుడు మిగుల శక్తిమంతమై, కాంతులను విరజిమ్ముచున్న మానవాస్త్రమును మారీచుని వక్షస్థలముపై ప్రయోగించెను. (15-17)

ఆ మారీచుడు అమోఘమైన మానవాస్త్రముదెబ్బకు నూరు యోజనముల దూరమున సముద్రజలములలో పడిపోయెను.(18)

'శీతేషువు' అను బలమైన శరాఘాతమునకు గురియైన మారీచుడు స్పృహను కోల్పోయి, గిరగిర తిరుగుచు దూరమునకు కొట్టుకొనిపోవుచుండెను. అట్టి మారీచుని జూచి శ్రీరాముడు

పశ్య లక్ష్మణ శీతేషుం మానవం ధర్మసంహితమ్ ।
మోహయిత్వా నయత్యేనం న చ ప్రాణైర్వ్యయుజ్యత । 20

లక్ష్మణునితో ఇట్లనెను. "ఓ లక్ష్మణా! ధర్మసహితమైన 'శీతేషువు' అను పేరు గల ఈ మానవాస్త్రమును చూడుము. ఇది మారీచుని ప్రాణములను తీయక, స్పృహలేకుండా చేసి వానిని తీసికొని పోవుచున్నది. (19-20)

ఇమానపి వధిష్యామి నిర్ఘృణాన్ దుష్టచారిణః ।
రాక్షసాన్ పాపకర్మస్థాన్ యజ్ఞఘ్నాన్ రుధిరాశనాన్ । 21

ఈ రాక్షసులు కఠినాత్ములు, పాపకర్ములు, యజ్ఞములను ధ్వంసముచేయువారు, రక్తమును త్రాగువారు. అట్టి ఈ దుర్మార్గులనుగూడ వధించెదను." (21)

సంగృహ్యాస్త్రం తతో రామో దివ్యమాగ్నేయమద్భుతమ్ ।
సుబాహూరసి చిక్షేప స విద్ధః ప్రాపతద్భువి । 22

పిమ్మట శ్రీరాముడు అద్భుతము, దివ్యము ఐన ఆగ్నేయాస్త్రమును సంధించి, సుబాహుని యొక్క వక్షస్థలమున గొట్టెను. దానిదెబ్బకు అతడు నేలగూలెను. (22)

శేషాన్ వాయవ్య మాదాయ నిజఘాన మహాయశాః ।
రాఘవః పరమోదారో మునీనాం ముద మావహన్ । 23

స హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందనః ।
ఋషిభిః పూజిత స్తత్ర యథేంద్రో విజయే పురా । 24

మిక్కిలి పరాక్రమశాలియు, సచ్చరిత్రుడును ఐన శ్రీరాముడు మిగిలిన రాక్షసులను సైతము వాయవ్యాస్త్రముతో తుదముట్టించి, మునులకు ముదము చేకూర్చెను. ఈ విధముగ ఆ రఘునందనుడు యజ్ఞమునకు విఘ్నములొనరించు రాక్షసులనందఱిని హతమార్చెను. పూర్వము రాక్షసులను జయించిన ఇంద్రుని వలె శ్రీరాముడు మునీశ్వరులచే పూజలనందుకొనెను. (23-24)

అథ యజ్ఞే సమాప్తే తు విశ్వామిత్రో మహామునిః ।
నిరీతికా దిశో దృష్ట్వా కాకుత్స్థమిదమబ్రవీత్ । 25

కృతార్థోఽస్మి మహాబాహో కృతం గురువచస్త్వయా ।
సిద్ధాశ్రమమిదం సత్యం కృతం రామ మహాయశః । 26

యజ్ఞము నిర్విఘ్నముగా సమాప్తమయ్యెను. అన్నివైపుల నుండియు బాధలు తొలగిపోయెను. అప్పుడు విశ్వామిత్ర మహర్షి శ్రీరామునితో ఇట్లనెను. "ఓ మహాబాహూ! నీవలన నేను కృతార్థుడనైతిని.[1] నీవు మీ నాయనగారికి ఇచ్చినమాటను నిలబెట్టితివి. నీ చర్యతో 'సిద్ధాశ్రమము' అను పేరు ఈ ప్రదేశమునకు సార్థకమైనది. నీ ఖ్యాతి ఇనుమడించినది. (25-26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే త్రింశస్సర్గః *(30)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదియవసర్గము సమాప్తము

-- ❊ ❊ ❊ --

31. ముప్పదియొకటవసర్గము

విశ్వామిత్రుడు - రామలక్ష్మణులు - ఇతరమహర్షులు మిథిలకు బయలుదేరుట.

అథ తాం రజనీం తత్ర కృతార్థౌ రామలక్ష్మణౌ ।
ఊషతుర్ముదితౌ వీరౌ ప్రహృష్టేనాంతరాత్మనా । 1

మహావీరులైన రామలక్ష్మణులు విశ్వామిత్రునియజ్ఞ కార్యమును నిర్విఘ్నముగా నెరవేర్చి, మిగుల సంతసించిరి. అట్లు సంతుష్టాంతరంగులై, వారు ఆ రాత్రి హాయిగా అచటనే విశ్రాంతి గైకొనిరి. (1)

1) అలకలల్లలాడగగని ఆ రామ్ముని యెటుపొంగెనో ॥ అ ॥
చెలువుమీరగను మారీచునిమదమణచువేళ ॥ అ ॥

ప్రభాతాయాం తు శర్వర్యాం కృతపౌర్వాహ్ణికక్రియౌ।
విశ్వామిత్రమృషీం శ్చాన్యాన్ సహితావభిజగ్మతుః। 2

అభివాద్య మునిశ్రేష్ఠం జ్వలంతమివ పావకమ్।
ఊచతుర్మధురోదారం వాక్యం మధురభాషిణౌ। 3

ఇమౌ స్మ మునిశార్దూల కింకరౌ సముపస్థితౌ।
ఆజ్ఞాపయ యథేష్టం వై శాసనం కరవావ కిమ్। 4

ఏవ ముక్తే తత స్తాభ్యాం సర్వ ఏవ మహర్షయః।
విశ్వామిత్రం పురస్కృత్య రామం వచనమబ్రువన్। 5

మైథిలస్య నరశ్రేష్ఠ జనకస్య భవిష్యతి।
యజ్ఞః పరమధర్మిష్ఠః తత్ర యాస్యామహే వయమ్। 6

త్వం చైవ నరశార్దూల సహాస్మాభిర్గమిష్యసి।
అద్భుతం ధనురత్నం చ తత్ర తద్ద్రష్టుమర్హసి। 7

తద్ధి పూర్వం నరశ్రేష్ఠ దత్తం సదసి దైవతైః।
అప్రమేయబలం ఘోరం మఖే పరమభాస్వరమ్। 8

నాస్య దేవా న గంధర్వా నాసురా న చ రాక్షసాః।
కర్తుమారోపణం శక్తా న కథంచన మానుషాః। 9

ధనుష స్తస్య వీర్యం తు జిజ్ఞాసంతో మహీక్షితః।
న శేకు రారోపయితుం రాజపుత్రా మహాబలాః। 10

తద్ధనుర్నరశార్దూల మైథిలస్య మహాత్మనః।
తత్ర ద్రక్ష్యసి కాకుత్స్థ యజ్ఞం చాద్భుతదర్శనమ్। 11

తద్ధి యజ్ఞఫలం తేన మైథిలేనోత్తమం ధనుః।
యాచితం నరశార్దూల సునాభం సర్వదైవతైః। 12

ఆయాగభూతం నృపతేః తస్య వేశ్మని రాఘవ।
అర్చితం వివిధైర్గంధైః ధూపై శ్చాగరుగంధిభిః। 13

తెల్లవారిన పిమ్మట వారు ఉదయకాలస్నానసంధ్యావందనాది క్రియలను ఆచరించిరి. పిమ్మట ఆ ఇరువురును ఋషులతో గూడియున్న విశ్వామిత్రునియెదుట నిలిచిరి. (2)

అగ్నిదేవునివలె వెలుగొందుచున్న ఆ మునివరునకు వారు అభివాదనమొనర్చిరి. మృదుమధురముగా భాషించునట్టి ఆ రామలక్ష్మణులు మహామునితో హృద్యముగా ఇట్లునుడివిరి. "ఓ మునీశ్వరా! మేము మీ సేవకులము. ఎదుట నిలిచి యుంటిమి. ఇంకను ఏమి చేయవలెనో ఆజ్ఞాపింపుడు. మీ ఆనతిని తలదాల్చెదము. (3-4)

ఆ చిన్నారుల పలుకులను విని, విశ్వామిత్రాది మహర్షులు ఇట్లు పలికిరి. " ఓ నరోత్తమా! మిథిలానగరప్రభువైన జనకమహారాజు ఒక యజ్ఞమును సంకల్పించినాడు. అతడు పరమధార్మికుడు. మనమందఱము ఆ యజ్ఞమును జూచుటకై వెళ్లుదము. (5-6)

ఓ నరశ్రేష్ఠా ! నీవుగూడ తమ్మునితోగూడి మాతో రమ్ము. అచ్చట అద్భుతమైన ఒక మహాధనుస్సు గలదు. దానిని నీవును చూడవచ్చును. ఆ ధనువు సాటిలేని శక్తిగలది. శత్రు భయంకరమైనది, మిగుల తేజోవిరాజమానమైనది. ఓ నరశ్రేష్ఠా! దానిని ఒక యజ్ఞసభలో దేవతలు మిథిలాధిపతియైన దేవరాతునకు ఇచ్చిరి.[1] (7-8)

ఈ శివధనుస్సును గంధర్వులు, అసురులు, రాక్షసులు అంతేగాదు దేవతలు సైతము ఎక్కుపెట్టజాలరు - ఇక మానవుల విషయము నుడువవలసిన పనియేమి? ఆ ధనుస్సు యొక్క శక్తిని తెలిసికొనగోరి, మహాబలశాలురైన రాజులును, రాజకుమారులును దానిని ఎక్కుపెట్టుటకు ప్రయత్నించియు విఫలులైరి. (9-10)

కకుత్స్థవంశమున అవతరించిన ఓ మహానుభావా! మిథిలాపతియు, మహాత్ముడును ఐన జనకుని యొక్క చాపమును అచట నీవు చూడగలవు. అద్భుతమైన ఆ యజ్ఞమునుగూడ దర్శింపవచ్చును. మిథిలాధిపతియైన దేవరాతుడు పూర్వము యజ్ఞము చేసినప్పుడు అతడు యజ్ఞఫలమును కోరగా, అప్పుడు దేవతలు బలమైన ముష్టిబంధముగల (సునాభమైన) ఈ శివధనుస్సును ఆయనకు అనుగ్రహించిరి. (11-12)

ఓ రామా! జనకమహారాజభవనమునందు ధనుర్యాగ (ధనురుత్సవ) సమయమున వివిధములైన గంధములతోడను, పుష్పములతోడను, సువాసనగల అగరు ధూపములతోడను ఈ ధనుస్సు అర్చింపబడెను." (13)

1) దేవరాతుడు 'నిమి' వంశమువాడు, శేతునికుమారుడు, దక్షయజ్ఞమును ధ్వంసము చేయునప్పుడు తానుపయోగించిన చాపమును శివుడు దేవతలకిచ్చెను. వారు దానిని దేవరాతునకిచ్చిరి. నాటినుండి ఇతని సంతతివారును దానిని పూజించుచుండిరి. ఈ శివధనుస్సునే శ్రీరాముడు విరిచెను.

ఏవ ముక్త్వా మునివరః ప్రస్థానమకరోత్ తదా।
సర్షిసంఘః సకాకుత్స్థ ఆమంత్ర్య వనదేవతాః। 14

స్వస్తి వోఽస్తు గమిష్యామి సిద్ధ స్సిద్ధాశ్రమాదహమ్।
ఉత్తరే జాహ్నవీతీరే హిమవంతం శిలోచ్చయమ్। 15

ప్రదక్షిణం తతః కృత్వా సిద్ధాశ్రమమనుత్తమమ్।
ఉత్తరాం దిశముద్దిశ్య ప్రస్థాతుముపచక్రమే। 16

తం ప్రయాంతం మునివరమ్ అన్వయాదనుసారిణామ్।
శకటీశతమాత్రం తు ప్రాయేణ బ్రహ్మవాదినామ్॥ 17

మృగపక్షిగణాశ్చైవ సిద్ధాశ్రమనివాసినః।
అనుజగ్ముర్మహాత్మానం విశ్వామిత్రం మహామునిమ్।
నివర్తయామాస తతః పక్షిసంఘాన్ మృగానపి। 18

తే గత్వా దూరమధ్వానం లంబమానే దివాకరే।
వాసం చక్రుర్మునిగణాః శోణాకూలే సమాహితాః। 19

తేఽస్తంగతే దినకరే స్నాత్వా హుతహుతాశనాః।
విశ్వామిత్రం పురస్కృత్య నిషేదురమితౌజసః। 20

రామోఽపి సహ సౌమిత్రిః మునీం స్తానభిపూజ్య చ।
అగ్రతో నిషసాదాథ విశ్వామిత్రస్య ధీమతః। 21

అథ రామో మహాతేజా విశ్వామిత్రం మహామునిమ్।
పప్రచ్ఛ నరశార్దూలః కౌతూహలసమన్వితః। 22

భగవన్ కో న్వయం దేశః సమృద్ధవనశోభితః।
శ్రోతు మిచ్ఛామి భద్రం తే వక్తుమర్హసి తత్త్వతః। 23

చోదితో రామవాక్యేన కథయామాస సువ్రతః।
తస్య దేశస్య నిఖిలమ్ ఋషిమధ్యే మహాతపాః। 24

విశ్వామిత్రమహర్షి ఈ విధముగా పలికి, మునులతోడను, రామలక్ష్మణులతోడను గూడి మిథిలానగరమునకు బయలుదేఱుచు వనదేవతలను ఉద్దేశించి, ఇట్లనెను. " ఓ వనదేవతలారా! మీకు శుభమగుగాక, యజ్ఞమొనర్చి ఫలసిద్ధి నొందితిని. ఈ సిద్ధాశ్రమమునుండి బయలుదేఱి గంగానదికి ఉత్తరతీరమునగల హిమాలయమునకు వెళ్ళుచున్నాను." అని. (హిమాలయమునకు వెళ్ళు దారిలోనే మిథిలా నగరము గలదు.) (14-15)

పిమ్మట ఆ మహాముని మహిమాన్వితమైన సిద్ధాశ్రమమునకు ప్రదక్షిణమొనర్చి, ఉత్తరదిశగా ప్రయాణమును సాగించెను. ఉత్తరదిశగా వెళ్ళుచున్న ఆ మునివరునివెంట బ్రహ్మవేత్తల యొక్క అగ్నిహోత్ర సంభారములతోగూడిన వందశకటములు సాగిపోవుచుండెను. (16-17)

సిద్ధాశ్రమమునందు నివసించుచున్న మృగములు, పక్షులు సైతము మహాత్ముడైన విశ్వామిత్రమహామునిని అనుసరింపగా ఆయన వాటిని వెనుకకు పంపివైచెను. (18)

వారందఱును కొంతదూరము ప్రయాణింపగా సూర్యుడు అస్తమించుసమయమాయెను. అంతట ఆ మునులందఱును శోణనదతీరమునకు చేరి ఆ రాత్రికి అచట బసచేసిరి. (19)

సూర్యుడస్తమించుచుండగా వారు శోణనదజలములలో స్నానములొనర్చి, అగ్నికార్యములను పూర్తిచేసిరి. అనంతరము తేజశ్శాలురైన ఆ మునులు విశ్వామిత్రునితోగూడ ఆసీనులైరి. (20)

రామలక్ష్మణులును ఆ మునులందఱికిని నమస్కరించి, ధీశాలియైన విశ్వామిత్రునియెదుట కూర్చుండిరి. అంతట తేజోమూర్తియైన శ్రీరాముడు కుతూహలముతో విశ్వామిత్ర మహర్షిని ఇట్లు ప్రశ్నించెను. "ఓ మహాత్మా! శోణనదతీరమున దట్టమైన వృక్షములతో శోభిల్లుచున్న ఈ ప్రదేశము ఎవరిది? ఈ విషయమును వినగోరుచున్నాను. దయతో సవిస్తరముగా తెల్పుడు." (21-23)

వ్రతనిష్ఠగలవాడును, మహాతపస్వియు ఐన విశ్వామిత్రుడు శ్రీరాముని ప్రశ్నకు సమాధానముగా ఆ ప్రదేశము యొక్క వృత్తాంతమును మునులందఱును వినుచుండగా ఇట్లు నుడువసాగెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకత్రింశస్సర్గః (31)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదియొకటవసర్గము సమాప్తము

-- * * * --

32. ముప్పదిరెండవసర్గము

కుశనాభునికుమార్తెలవృత్తాంతము.

బ్రహ్మయోనిర్మహానాసీత్ కుశో నామ మహాతపాః।
అక్లిష్టవ్రతధర్మజ్ఞః సజ్జనప్రతిపూజకః। 1

స మహాత్మా కులీనాయాం యుక్తాయాం సుగుణోల్బణాన్।
వైదర్భ్యాం జనయామాస చతుర స్సదృశాన్ సుతాన్। 2

కుశాంబం కుశనాభం చ ఆధూర్తరజసం వసుమ్।
దీప్తియుక్తాన్ మహోత్సాహాన్ క్షత్రధర్మచికీర్షయా। 3

తానువాచ కుశః పుత్రాన్ ధర్మిష్ఠాన్ సత్యవాదినః।
క్రియతాం పాలనం పుత్రా ధర్మం ప్రాప్స్యథ పుష్కలమ్। 4

కుశస్య వచనం శ్రుత్వా చత్వారో లోకసమ్మతాః।
నివేశం చక్రిరే సర్వే పురాణాం నృవరాస్తదా। 5

కుశాంబస్తు మహాతేజాః కౌశాంబీమ్ అకరోత్ పురీమ్।
కుశనాభస్తు ధర్మాత్మా పురం చక్రే మహోదయమ్। 6

ఆధూర్తరజసో రామ ధర్మారణ్యం మహీపతిః।
చక్రే పురవరం రాజా వసుశ్చక్రే గిరివ్రజమ్। 7

ఏషా వసుమతీ రామ వసోస్తస్య మహాత్మనః।
ఏతే శైలవరాః పంచ ప్రకాశంతే సమంతతః। 8

సుమాగధీ నదీ రమ్యా మగధాన్ విశ్రుతా యయౌ।
పంచానాం శైలముఖ్యానాం మధ్యే మాలేవ శోభతే। 9

సైషా హి మాగధీ రామ వసోస్తస్య మహాత్మనః।
పూర్వాభిచరితా రామ సుక్షేత్రా సస్యమాలినీ। 10

"కుశుడు" అను మహానుభావుడు మా వంశమునకు మూలపురుషుడు. అతడు అయోనిజుడు, (బ్రహ్మమానస పుత్త్రుడు) గొప్పతపస్వి. నియమనిష్ఠలతో వ్రతములనాచరించు వాడు. ధర్మములను బాగుగా ఎఱిగిన వాడు, సత్పురుషులను నిత్యము పూజించుచుండువాడు. ఆ మహాత్మునిభార్య పేరు వైదర్భి, ఆమె ఉత్తమవంశసంజాతురాలు, భర్తకు మిక్కిలి అనుకూలవతి. ఆ దంపతులకు కుశాంబుడు, కుశనాభుడు, అధూర్తరజసుడు, వసువు అను నలుగురు కుమారులు కలిగిరి. వారు సద్గుణసంపన్నులు, అన్నివిధముల యోగ్యులు, తల్లిదండ్రులకు దీటైనవారు. (1-3)

అంతేగాదు, ఇంకను వారు మిగులతేజస్వులును, మిక్కిలి ఉత్సాహముగలవారు, ధర్మతత్పరులు, సత్యవచనులు, అట్టి కుమారులను ఉద్దేశించి కుశుడు క్షత్రియధర్మములను బోధింపకోరికతో ఇట్లనెను. "ఓ పుత్త్రులారా! ధర్మమును గూర్చి సమగ్రముగా ఎఱింగి, ప్రజాపాలనచేయుడు." పిమ్మట నరవరులును, ప్రజాభిమానమును చూరగొన్నవారును ఐన ఆ నలుగురుకుమారులును వెంటనే నాలుగుపురములను ఏర్పాటు చేసికొనిరి. (4-5)

మహాతేజస్వియైన కుశాంబుడు 'కౌశాంబీ' పురమును ధర్మాత్ముడైన కుశనాభుడు 'మహోదయము' అను పట్టణమును, రాజకుమారుడైన 'ఆధూర్తరజసుడు' 'ధర్మారణ్యము' అను నగరమును, 'వసువు' అను రాజకుమారుడు 'గిరి వ్రజము' అను మహానగరమును నిర్మింపజేసిరి. ఓ రామా! ప్రస్తుతము మనమున్న ఈ ప్రదేశము మహాత్ముడైన 'వసురాజు' పరిపాలనలోనిది. దీనిచుట్టును ఐదు పెద్ద పర్వతములు విరాజిల్లుచున్నవి. (6-8)

'సుమాగధి' యను నామాంతరము గల 'శోణ' నదము మిక్కిలి రమ్యమైనది. ఇది మగధదేశమునందు అన్నిప్రాంతములలో ప్రవహించుచు ఈ ఐదు పర్వతములమధ్య మాలవలె శోభిల్లుచున్నది. ఓ రామా! ఈ శోణనదమే మహానుభావుడైన వసురాజు (మగధ) రాజ్యమున తూర్పునుండి పడమరకు ప్రవహించుచు తనకు ఇరుపార్శ్వములయందుగల పంటపొలములను సస్యశ్యామలమొనర్చుచున్నది. (9-10)

కుశనాభస్తు రాజర్షిః కన్యాశతమనుత్తమమ్।
జనయామాస ధర్మాత్మా ఘృతాచ్యాం రఘునందన॥ 11

తాస్తు యౌవనశాలిన్యో రూపవత్యః స్వలంకృతాః।
ఉద్యానభూమిమాగమ్య ప్రావృషీవ శతహ్రదాః॥ 12

గాయంత్యో నృత్యమానాశ్చ వాదయంత్యశ్చ సర్వశః।
ఆమోదం పరమం జగ్ముః వరాభరణభూషితాః॥ 13

అథ తాశ్చారుసర్వాంగ్యో రూపేణాప్రతిమా భువి।
ఉద్యానభూమిమాగమ్య తారా ఇవ ఘనాంతరే॥ 14

తాః సర్వగుణసంపన్నా రూపయౌవనసంయుతాః।
దృష్ట్వా సర్వాత్మకో వాయుః ఇదం వచనమబ్రవీత్॥ 15

అహం వః కామయే సర్వా భార్యా మమ భవిష్యథ।
మానుష స్త్యజ్యతాం భావో దీర్ఘమాయురవాప్స్యథ॥ 16

చలం హి యౌవనం నిత్యం మానుషేషు విశేషతః।
అక్షయ్యం యౌవనం ప్రాప్తా అమర్యశ్చ భవిష్యథ॥ 17

తస్య తద్వచనం శ్రుత్వా వాయోరక్లిష్టకర్మణః।
అపహాస్య తతో వాక్యం కన్యాశతమథాఽబ్రవీత్॥ 18

అంత శ్చరసి భూతానాం సర్వేషాం త్వం సురోత్తమ।
ప్రభావజ్ఞాః స్మ తే సర్వాః కిమస్మానవమన్యసే॥ 19

కుశనాభసుతాః సర్వాః సమర్థాస్త్వాం సురోత్తమ।
స్థానాత్ చ్యావయితుం దేవం రక్షామస్తు తపో వయమ్॥ 20

మా భూత్ స కాలో దుర్మేధః పితరం సత్యవాదినమ్।
నావమన్యస్వ ధర్మేణ స్వయంవరముపాస్మహే॥ 21

పితా హి ప్రభురస్మాకం దైవతం పరమం హి నః।
యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి॥ 22

తాసాం తద్వచనం శ్రుత్వా వాయుః పరమకోపనః।
ప్రవిశ్య సర్వగాత్రాణి బభంజ భగవాన్ ప్రభుః॥ 23

ఓ రఘురామా! రాజర్షియైన కుశనాభుడు ధర్మాత్మురాలైన తనభార్యయగు 'ఘృతాచి' యందు నూఱుమంది కన్యా రత్నములను సంతానముగా పొందెను. (11)

ఆ కన్యకామణులు రూప, యౌవన, సౌభాగ్యవతులై, పూవులను, చందనములను, తిలకములుమొదలగువానిని చక్కగా అలంకరించుకొని, వర్షాకాలపు మెఱుపు తీగలవలె ఉద్యానవనమునకు విచ్చేసిరి. చక్కని ఆభరణములను ధరించినవారై, అందఱును గానములతో, నృత్యములతో, వీణాదివాదనములతో పరమానందభరితలైరి. (12-13)

సాటిలేని రూపసౌభాగ్యములుగల ఆ సర్వాంగసుందరులు ఉద్యానవనమునకు వచ్చి, మేఘములమధ్య తారలవలె విరాజిల్లుచుండిరి. సర్వసద్గుణ సంపన్నలైన వారియొక్క రూపవైభవములను, లావణ్యములమినమినలను గాంచి, సర్వత్ర సంచరించు వాయుదేవుడు ముగ్ధుడై వారితో ఇట్లనెను. (14-15)

"నేను మిమ్ము కోరుకొనుచున్నాను. మీరందఱును నన్ను భర్తగా స్వీకరింపుడు. మానవరూపముపై మమకారమును వీడుడు. దీర్ఘాయువును పొందుడు. సహజముగా యౌవనము అస్థిరమైనది. మానవులలో ఇది మిగుల చంచలమైనది. (నన్ను వివాహమాడినచో) మీ యౌవనము అక్షయమగును, మీరు దేవతలు అగుదురు." (16-17)

తిరుగులేనిసంచారశక్తిగల ఆ వాయుదేవుని వచనములను విని, ఆ నూఱుగురు కన్యలు అయునను గేలిసేయుచు ఇట్లనిరి. (18)

" ఓ సురశ్రేష్ఠా! నీవు సమస్త ప్రాణులలో ప్రాణముల రూపమున సంచరించుచుందువు. నీ ప్రభావమును మేమందఱము ఎఱుగుదుము. ఏల మమ్ము అవమానించు చున్నావు? మేము అందఱము కుశనాభుని కుమార్తెలము. దివ్యశక్తిగల నిన్ను నీఅధికారమునుండి తొలగింపగల సామర్థ్యము మాకు గలదు. కాని మా తపశ్శక్తిని కాపాడుకొనుటకై మేము ఆ విధముగా చేయము. (19-20)

ఓ దుర్బుద్ధీ ! మా తండ్రి సత్యవాది. నీవు ఆయనను అవమానింపరాదు. ఆయనవలన నీవు మృత్యుముఖమున పడరాదు. మా తండ్రిగారు నిశ్చయించిన వరునే మేము భర్తగా సేవించెదము. మా తండ్రియే మాకు ప్రభువు, పరమ దైవము. ఆయన మమ్ము ఎవరికి దానము (కన్యాదానము) చేయునో అతడే మాకు భర్తయగును." (21-22)

వాయుదేవుడు వారిమాటలను విని, మిక్కిలి కుపితుడయ్యెను. ఆ ప్రభువు వారిదేహములలో ప్రవేశించి, వారిని గూనివారినిగా జేసెను. (23)

తాః కన్యా వాయునా భగ్నా వివిశుః నృపతేర్గృహమ్।
ప్రాపతన్ భువి సంభ్రాంతాః సలజ్జాః సాశ్రులోచనాః। 24

ఆ కారణముగా వారిదేహములు మూరెడు ప్రమాణమునకు కుదించుకొని పోయెను. వారిగర్వము దెబ్బతినెను. వారు భయవిహ్వలలైరి. ఆ కన్యలు వాయువువలన భంగపడి, రాజభవనమునకు చేరిరి. మఱియు వ్యాకులచిత్తలై, సిగ్గుతో కన్నీరుమున్నీరుగా విలపించుచు నేలపైబడిరి. (24)

స చ తా దయితా దీనాః కన్యాః పరమశోభనాః।
దృష్ట్వా భగ్నాస్తదా రాజా సంభ్రాంత ఇదమబ్రవీత్। 25

అంతట ఆ కుశనాభమహారాజు సహజముగా సౌందర్యవతులైన తనముద్దుబిడ్డలు దీనవదనలై గూనివారై యుండుటను జూచి, ఆశ్చర్యచకితుడై ఇట్లు నుడివెను. (25)

కిమిదం కథ్యతాం పుత్ర్యః కో ధర్మ మవమన్యతే।
కుబ్జాః కేన కృతాః సర్వాః చేష్టంత్యో నాభిభాషథ।
ఏవం రాజా వినిశ్వస్య సమాధిం సందధే తతః। 26

"కుమార్తెలారా! ఇదియేమి? మిమ్మందఱిని కుబ్జలుగా చేసినవారెవరు? ధర్మమును అవమానించినది ఎవరు? తెల్పుడు- మాట్లాడకుండా ఏల నేలపైబడి దొర్లుచున్నారు?" అని పలికి రాజు బాధతో నిట్టూర్చి, వారి సమాధానమును వినుటకు సావధానుడై యుండెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ద్వాత్రింశస్సర్గః *(32)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదిరెండవసర్గము సమాప్తము

-- * * * --

33. ముప్పదిమూడవసర్గము

(బ్రహ్మదత్తుని జన్మవృత్తాంతము - కుశనాభునిపుత్రికలతో ఆయనవివాహము.

తస్య తద్వచనం శ్రుత్వా కుశనాభస్య ధీమతః।
శిరోభి శ్చరణౌ స్పృష్ట్వా కన్యాశతమభాషత। 1

సర్వసమర్థుడైన కుశనాభునిమాటలను విని, ఆ నూఱు మంది కన్యలు తండ్రికి పాదాభివందనమొనర్చి ఇట్లు పలికిరి. (1)

వాయు స్సర్వాత్మకో రాజన్ ప్రధర్షయితుమిచ్ఛతి।
అశుభం మార్గమాస్థాయ న ధర్మం ప్రత్యవేక్షతే। 2

పితృమత్యః స్మ భద్రం తే స్వచ్ఛందే న వయం స్థితాః।
పితరం నో వృణీష్వ త్వం యది నో దాస్యతే తవ। 3

"ఓ మహారాజా! సర్వత్ర సంచరించునట్టి వాయుదేవుడు అపమార్గమును అవలంబించి, మమ్ములను బలాత్కరింప దలచెను. అతడు ధర్మమును పూర్తిగా విస్మరించెను. 'మేము తండ్రిచాటుబిడ్డలము.' పతిని ఎన్నుకొనువిషయమున మేము స్వతంత్రముగా వ్యవహరింపము. మమ్ములను నీకిచ్చి పెండ్లి చేయునేమో వెళ్లి, మా తండ్రిగారినడుగుము.' (అని మేము పలికితిమి.) (2-3)

తేన పాపానుబంధేన వచనం న ప్రతీచ్ఛతా।
ఏవం బ్రువంత్య స్సర్వాః స్మ వాయునా నిహతా భృశమ్। 4

మేమందఱము ఇట్లు పలుకుచుండగా మా మాటలను పట్టించుకొనక "ఆ పాపాత్ముడు మమ్ములను తీవ్రముగా కొట్టెను." (4)

తాసాం తద్వచనం శ్రుత్వా రాజా పరమధార్మికః।
ప్రత్యువాచ మహాతేజాః కన్యాశతమనుత్తమమ్। 5

తేజస్వియు, పరమధార్మికుడును ఐన కుశనాభుడు వారి మాటలను విని, సౌశీల్యవతులైన ఆ కన్యలతో ఇట్లనెను. (5)

క్షాంతం క్షమావతాం పుత్ర్యః కర్తవ్యం సుమహత్కృతమ్।
ఐకమత్యమ్ ఉపాగమ్య కులం చావేక్షితం మమ। 6

అలంకారో హి నారీణాం క్షమా తు పురుషస్య వా।
దుష్కరం తచ్చ యత్ క్షాంతం త్రిదశేషు విశేషతః।
యాదృశీ వః క్షమా పుత్ర్యః సర్వాసామవిశేషతః। 7

"ఓ పుత్రికలారా! క్షమాశీలురు చేయదగిన పనిని మీరు చక్కగా చేసితిరి. ఐకమత్యముతో మెలగి, మన వంశ గౌరవమును నిలబెట్టితిరి. బిడ్డలారా! స్త్రీలకు గాని, పురుషులకు గాని అపరాధులను క్షమించుగుణము కలిగియుండుట యనునది గొప్ప భూషణము. క్షమాగుణమును కలిగియుండుట అరుదైన విషయము. మీరందఱును ఐకమత్యముతో ప్రదర్శించిన క్షమాగుణము దేవతలకును దుష్కరము. (6-7)

క్షమా దానం క్షమా యజ్ఞః క్షమా సత్యం హి పుత్రికాః।
క్షమా యశః క్షమా ధర్మః క్షమయా విష్ఠితం జగత్। 8

కుమార్తెలారా ! పాత్రులకు దానము చేయుటవలనను, సత్యప్రవర్తనవలనను, యజ్ఞములను ఆచరించుట వలనను కలిగెడి మహాఫలములన్నియును క్షమాగుణము కలిగియుండుట వలన లభించును. క్షమయుశస్కరము, పరమధర్మము. ఈ జగత్తంతయు క్షమపైననే నిలిచియున్నది. (8)

విసృజ్య కన్యాః కాకుత్స్థ రాజా త్రిదశవిక్రమః।
మంత్రజ్ఞో మంత్రయామాస ప్రదానం సహ మంత్రిభిః।
దేశకాలౌ ప్రదానస్య సదృశే ప్రతిపాదనమ్। 9

ఓ రామా! దివ్యపరాక్రమశాలియు, తగినవిధముగా నిశ్చయ బుద్ధిగలవాడును ఐన కుశనాభమహారాజు దేశకాలములకు అనుగుణముగా తనవంశమునకు దగినట్లుగా కన్యాదాన విషయమై మంత్రులతో బాగుగా ఆలోచించెను. (9)

ఏతస్మిన్నేవ కాలే తు చూళీ నామ మహామునిః।
ఊర్ధ్వరేతాః శుభాచారో బ్రాహ్మం తప ఉపాగమత్। 10

తప్యంతం తమ్ ఋషిం తత్ర గంధర్వీ పర్యుపాసతే।
సోమదా నామ భద్రం తే ఊర్మిళాతనయా తదా। 11

ఈ కాలమునందే 'చూళి' యను పేరుగల ఒక మహాముని యుండెడివాడు. అతడు ఊర్ధ్వరేతస్కుడు (ఇంద్రియ నిగ్రహము గలవాడు), సదాచారసంపన్నుడు. ఒకానొకప్పుడు అతడు బ్రహ్మను గూర్చి తపస్సు చేయుచుండెను. తపమొనరించుచున్న ఆ ఋషికి ఊర్మిళతనయురాలైన 'సోమద' యను గంధర్వ స్త్రీ సపర్యలు చేయుచుండెను. రామా! ఈ కథను వినుట వలన నీకు శుభమగును. (10-11)

సా చ తం ప్రణతా భూత్వా శుశ్రూషణపరాయణా।
ఉవాస కాలే ధర్మిష్ఠా తస్యాస్తుష్టోఽభవద్గురుః। 12

ఆ సోమద నిత్యము ఆ మహర్షికి నమస్కరించుచు సేవలొనర్చుచుండెను. కొంత కాలము పిమ్మట వర్మదృష్టి గల ఆమెశుశ్రూషలకు ఆ మహాముని సంతుష్టుడాయెను. (12)

స చ తాం కాలయోగేన ప్రోవాచ రఘునందన।
పరితుష్టోఽస్మి భద్రం తే కిం కరోమి తవ ప్రియమ్। 13

ఓ రఘునందనా! సోమద యొక్క సేవలు ఫలించిన సమయమున ఆ 'చూళి' ముని ఆమెతో ఇట్లనెను."నీ సపర్యలకు సంతసించితిని. నీకు శుభమగు గాక. నీకేమి కావలయునో కోరుకొనుము." (13)

పరితుష్టం మునిం జ్ఞాత్వా గంధర్వీ మధురస్వరా।
ఉవాచ పరమప్రీతా వాక్యజ్ఞా వాక్యకోవిదమ్। 14

లక్ష్మ్యా సముదితో బ్రాహ్మ్యా బ్రహ్మభూతో మహాతపాః।
బ్రాహ్మేణతపసా యుక్తం పుత్రమిచ్ఛామి ధార్మిక। 15

తన శుశ్రూషలకు ముని సంతుష్టుడు కాగా ఆ గంధర్వస్త్రీ ఆనందముతో పొంగిపోయెను. పిమ్మట మాటలలోని ఆంతర్యమును గ్రహింపగల ఆ మునితో వాక్చాతుర్యము గల ఆమె, మృదు మధురముగా ఇట్లనెను. ఓ మహామునీ! నీవు తీవ్రమైన తపమొనరించి, బ్రహ్మవర్చస్సుతో వెలుగొందుచు బ్రహ్మతుల్యుడవైతివి. ఓ ధర్మబుద్ధీ! బ్రహ్మజ్ఞానము గల ఒక పుత్రుని నాకు ప్రసాదింపుము. (14-15)

అపతి శ్చాస్మి భద్రం తే భార్యా చాస్మి న కస్యచిత్।
బ్రాహ్మేణోపగతాయాశ్చ దాతుమర్హసి మే సుతమ్। 16

నేను నిష్ఠతో బ్రహ్మచర్యమును ఆచరించుచున్న దానను. పవిత్రురాలను, నేను ఎవ్వరికిని భార్యను కాను, కాబోను. నిన్ను ఆశ్రయించితిని నీ బ్రహ్మతేజస్సు యొక్క ప్రభావమున నాకు ఒక పుత్త్రుని అనుగ్రహింపుము. అందులకు నీవే సమర్థుడవు. నీకు పుణ్యముండును. (16)

తస్యాః ప్రసన్నో బ్రహ్మర్షిః దదౌ పుత్ర మనుత్తమమ్।
బ్రహ్మదత్త ఇతి ఖ్యాతం మానసం చూళినస్సుతమ్। 17

ఆ బ్రహ్మర్షి ఆమెయెడ ప్రసన్నుడై ఉత్తమోత్తముడైన ఒక పుత్త్రుని ప్రసాదించెను. చూళి మహర్షి యొక్క ఆ మానస పుత్త్రుడు 'బ్రహ్మదత్తుడు' అని ఖ్యాతివహించెను. (17)

స రాజా సోమదేయస్తు పురీమధ్యావసత్ తదా।
కాంపిల్యాం పరయా లక్ష్మ్యా దేవరాజో యథా దివమ్। 18

అప్పుడు (కుశనాభుడు తన కుమార్తెల వివాహ విషయమును గూర్చి మంత్రులతో సమాలోచన చేయుచున్న సమయమున) 'సోమద' యొక్క కుమారుడైన బ్రహ్మదత్తుడు అమరావతిని ఇంద్రుడువలె సిరిసంపదలతో తులతూగుచున్న కాంపిల్య నగరమును పరిపాలించుచుండెను. (18)

స బుద్ధిం కృతవాన్ రాజా కుశనాభస్సుధార్మికః।
బ్రహ్మదత్తాయ కాకుత్స్థ దాతుం కన్యాశతం తదా। 19

ఓ రామా! గొప్ప ధర్మబుద్ధిగల కుశనాభమహారాజు తననూఱుగురు కుమార్తెలను బ్రహ్మదత్తునకు ఇచ్చి, వివాహము చేయుటకు నిశ్చయించెను. (19)

తమాహూయ మహాతేజా బ్రహ్మదత్తం మహీపతిః।
దదౌ కన్యాశతం రాజా సుప్రీతేనాంతరాత్మనా। 20

మహాతేజస్వియైన కుశనాభ మహారాజు ఆ బ్రహ్మదత్తుని ఆహ్వానించి, సంతుష్టాంతరంగుడై, తననూఱుమంది కన్యలను (కుమార్తెలను) ఆయనకిచ్చి వివాహమొనర్చెను. (20)

యథాక్రమం తతః పాణిన్ జగ్రాహ రఘునందన।
బ్రహ్మదత్తో మహీపాలః తాసాం దేవపతిర్యథా। 21

ఓ రఘునందనా! అప్పుడు బ్రహ్మదత్తమహారాజు ఇంద్ర వైభవముతో విలసిల్లుచు విధ్యుక్తముగా వరుసగా ఆ వధువుల హస్తములను గ్రహించెను. (వారిని పెండ్లాడెను). (21)

స్పృష్టమాత్రే తతః పాణౌ వికుబ్జా విగతజ్వరాః।
యుక్తాః పరమయా లక్ష్మ్యా బభుః కన్యాశతం తదా। 22

బ్రహ్మదత్తునికర (పాణి) స్పర్శ కలిగినంతనే ఆ నూఱుమంది వధువులగూనిస్థితి మాయమయ్యెను. వారి మనోవ్యథలు తొలగిపోయెను. అంతట వారు నిరుపమాన సౌందర్యములతో విరాజిల్లిరి. (22)

స దృష్ట్వా వాయునా ముక్తాః కుశనాభో మహీపతిః।
బభూవ పరమప్రీతో హర్షం లేభే పునః పునః। 23

తనపుత్రికలు వాయుదేవునిబాధలనుండి (గూని స్థితి నుండి) విముక్తిబొందుటను జూచి, ఆ కుశనాభమహారాజు ఎంతయు సంతసించెను. హర్షాతిరేకముతో పదే పదే పులకితగాత్రుడయ్యెను. (23)

కృతోద్వాహం తు రాజానం బ్రహ్మదత్తం మహీపతిః।
సదారం ప్రేషయామాస సోపాధ్యాయగణం తదా। 24

బ్రహ్మదత్తునితో తనకుమార్తెల వివాహ మహోత్సవమును జరిపిన పిమ్మట, కుశనాభుడు ఆయనను పత్నులతోసహా కాంపిల్యనగరమునకు పంపెను. బ్రహ్మదత్తునివెంట పురోహితులనుగూడ పంపివైచెను. బ్రహ్మదత్తునితల్లియైన 'సోమద' తనకుమారుడు కుశనాభునిపుత్రికలను పెండ్లియాడినందులకును, వారి వైరూప్యములను తొలగించినందులకును

సోమదా౽పి సుసంహృష్టా పుత్రస్య సదృశీం క్రియామ్।
యథాన్యాయం చ గంధర్వీ స్నుషాస్తాః ప్రత్యనందత।
స్పృష్ట్వా స్పృష్ట్వా చ తాః కన్యాః కుశనాభం ప్రశస్య చ। 25

మిగుల సంతోషించెను. వరుసగా తనకోడండ్లను సుకుమారముగా నిమురుచు వారిని అభినందించెను. వారి తండ్రియైన కుశనాభుని ప్రశంసించెను. (24-25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే త్రయస్త్రింశస్సర్గః (33)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదిమూడవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

34. ముప్పదినాల్గవసర్గము

విశ్వామిత్రునిజన్మవృత్తాంతము.

కృతోద్వాహే గతే తస్మిన్ బ్రహ్మదత్తే చ రాఘవ।
అపుత్రః పుత్రలాభాయ పౌత్రీమ్ ఇష్టిమకల్పయత్। 1

ఓ రామా! ఆ బ్రహ్మదత్తుడు వివాహము చేసికొని, కాంపిల్య నగరమునకు వెళ్ళినపిమ్మట అపుత్రుడైన కుశనాభుడు పుత్రప్రాప్తికై 'పుత్రకామేష్టి యాగమును' ఆచరించెను. (1)

ఇష్ట్యాం తు వర్తమానాయాం కుశనాభమహీపతిమ్।
ఉవాచ పరమోదారః కుశో బ్రహ్మసుతస్తదా। 2

బ్రహ్మమానసపుత్రుడును, మిక్కిలి ఉదారుడును ఐన కుశుడు తనకుమారుడైన కుశనాభుడు పుత్రకామేష్టిని చేయుచుండగా ఆయనతో ఇట్లనెను. (2)

పుత్రస్తే సదృశః పుత్ర భవిష్యతి సుధార్మికః।
గాధిం ప్రాప్స్యసి తేన త్వం కీర్తిం లోకే చ శాశ్వతీమ్। 3

ఓ కుమారా! సర్వసద్గుణములచేత నీకు దీటైన, మిక్కిలిధార్మికుడైన 'గాధి' యను పుత్రుడు నీకు కలుగును. అతనివలన నీకీర్తిప్రతిష్ఠలు ఈ లోకమున చిరస్థాయిగా నుండును. (3)

ఏవ ముక్త్వా కుశో రామ కుశనాభం మహీపతిమ్।
జగామాకాశమావిశ్య బ్రహ్మలోకం సనాతనమ్। 4

ఓ రామా! కుశుడు తనపుత్రుడైన కుశనాభునితో ఇట్లు పలికి, ఆకాశమార్గమున శాశ్వతమైన బ్రహ్మలోకమును చేరెను. (4)

కస్యచిత్త్వథ కాలస్య కుశనాభస్య ధీమతః।
జజ్ఞే పరమధర్మిష్ఠో గాధిరిత్యేవ నామతః। 5

కొంతకాలమునకు పిమ్మట జ్ఞానియైన కుశనాభునకు అతనిభార్యయైన 'ఘృతాచి' యందు 'గాధి' యను సుతుడు ఉదయించెను. అతడు మిక్కిలి ధార్మికుడు.(5)

స పితా మమ కాకుత్స్థ గాధిః పరమధార్మికః।
కుశవంశ ప్రసూతో౽స్మి కౌశికో రఘునందన। 6

ఓ రామా! మిక్కిలి ధర్మాత్ముడైన ఆ గాధియే నా తండ్రి. నేను 'కుశ' వంశమునబుట్టితిని. అందువలన నాకు 'కౌశికుడు' అను పేరు ఏర్పడెను. (6)

పూర్వజా భగినీ చాపి మమ రాఘవ సువ్రతా।
నామ్నా సత్యవతీ నామ ఋచీకే ప్రతిపాదితా। 7

ఓ రామా! 'సత్యవతి' అనునామె నాకుఅక్క. ఆమె చక్కని వ్రతనిష్ఠగలది. ఆమెకు ఋచీకునితో పెండ్లి జరిగెను. (7)

సశరీరా గతా స్వర్గం భర్తారమ్ అనువర్తినీ।
కౌశికీ పరమోదారా ప్రవృత్తా చ మహానదీ। 8

మా అక్కయు కుశునివంశమునందే జన్మించినందున ఆమెకు 'కౌశికి' అను పేరుగూడగలదు. ఆమె ఎల్లప్పుడును పతికి అనుకూలవతియై ప్రవర్తించుచుండెడిది. కనుక ఆమె పతిని అనుసరించి సశరీరముగా స్వర్గమునకు చేరెను – పిమ్మట ఆ పరమోదార 'కౌశికి' అను పేరుతో మహానదియై భూతలమున ప్రవహించుచుండెను. (8)

దివ్యా పుణ్యోదకా రమ్యా హిమవంతమ్ ఉపాశ్రితా।
లోకస్య హితకామార్థం ప్రవృత్తా భగినీ మమ। 9

తతోఽహం హిమవత్పార్శ్వే వసామి నిరతః సుఖమ్।
భగిన్యాం స్నేహసంయుక్తః కౌశిక్యాం రఘునందన। 10

సా తు సత్యవతీ పుణ్యా సత్యే ధర్మే ప్రతిష్ఠితా।
పతివ్రతా మహాభాగా కౌశికీ సరితాంవరా। 11

అహం హి నియమాద్రామ హిత్వా తాం సముపాగతః।
సిద్ధాశ్రమమనుప్రాప్య సిద్ధోఽస్మి తవ తేజసా। 12

ఏషా రామ మమోత్పత్తిః స్వస్య వంశస్య కీర్తితా।
దేశస్య చ మహాబాహో యన్మాం త్వం పరిపృచ్ఛసి। 13

గతోఽర్ధరాత్రః కాకుత్స్థ కథాః కథయతో మమ।
నిద్రామభ్యేహి భద్రం తే మాభూద్విఘ్నోఽధ్వనీహ నః। 14

నిష్పందాః తరవస్సర్వే నిలీనా మృగపక్షిణః।
నైశేన తమసా వ్యాప్తా దిశశ్చ రఘునందన। 15

శనై ర్వియుజ్యతే సంధ్యా నభో నేత్రైరివావృతమ్।
నక్షత్రతారాగహనం జ్యోతిర్భిరవభాసతే। 16

ఉత్తిష్ఠతి చ శీతాంశుః శశీ లోకతమోనుదః।
హ్లాదయన్ ప్రాణినాం లోకే మనాంసి ప్రభయా విభో। 17

నైశాని సర్వభూతాని ప్రచరంతి తతస్తతః।
యక్షరాక్షససంఘాశ్చ రౌద్రాశ్చ పిశితాశనాః। 18

ఏవముక్త్వా మహాతేజా విరరామ మహామునిః।
సాధు సాధ్వితి తం సర్వే మునయో హ్యభ్యపూజయన్। 19

కుశికానామ్ అయం వంశో మహాన్ ధర్మపర స్సదా।
బ్రహ్మోపమా మహాత్మానః కుశవంశ్యా నరోత్తమాః। 20

దివ్యమైన ఈ 'కౌశికీనది' రమ్యముగా పుణ్యోదకములతో హిమగిరిని ఆశ్రయించెను. నాసోదరి లోకహితార్థము నదియై ఇట్లు ప్రవర్తించెను. (9)

ఓ రఘునందనా! అందువలన నాసోదరియైన కౌశికి పైగల ప్రేమతో హిమాలయప్రాంతమున నేను సుఖముగా నివసించుచున్నాను. (10)

ఆ సత్యవతి పవిత్రురాలు, సత్యము, ధర్మము ఆమెకు ప్రాణతుల్యములు. ఆమె గొప్పపతివ్రత, మహాత్మురాలు. ఆ కౌశికి నదులలోశ్రేష్ఠమైనది. (11)

ఓ రామా! ఈ క్రతునిర్వహణనిమిత్తమై ఆ ప్రాంతము నుండి ఇచటికి వచ్చితిని. ఈ సిద్ధాశ్రమమునకు ఏతెంచి, నీ పరాక్రమముచే నేను కృతార్థుడనైతిని. (12)

భుజబలశాలివైన ఓ రామా! నీవడిగిన కారణముగా ఈ 'గిరివ్రజ' దేశమునుగూర్చి నీకు తెల్పితిని. ప్రసంగవశమున మా వంశముయొక్క పుట్టుపూర్వోత్తరములనుగూడ సంగ్రహముగా వివరించితిని. (13)

ఓ శ్రీరామా! నా కథాప్రసంగములతో రాత్రి కొంత గడిచినది. రేపటిమనప్రయాణమునకు ఇబ్బంది లేకుండుటకై ఇక నిద్రింపుము. నీకు శుభమగును. (14)

ఓ రఘునందనా! చెట్లు ఏమాత్రమును కదలుట లేదు. మృగములు, పక్షులు అన్నియును ఎక్కడివక్కడ నిద్రలో మునిగియున్నవి. రాత్రియగుటచే దిక్కుల యందంతటను చీకట్లు క్రమ్ముకొనినవి. తిన్నతిన్నగా సంధ్యాకాలము గతించినది. అశ్విని మొదలగు తారలతోడను, ఇతరనక్షత్రముల తోడను వ్యాప్తమైన ఆకాశము జ్యోతిర్మయములైన నేత్రములతో నిండిన దానివలె ప్రకాశించుచున్నది. ఓ రామచంద్రప్రభూ! తనచల్లనికిరణములచే లోకమునందలి చిమ్మచీకట్లను పాఱద్రోలునట్టి చంద్రుడు వెన్నెలకాంతులతో సమస్తప్రాణుల మనస్సులను ఆహ్లాదపఱచుచు ఉదయించుచున్నాడు. (15-17)

రాత్రులయందు సంచరించునట్టి గ్రుడ్లగూబలు మొదలగు ప్రాణులు ఇటునటు తిరుగాడుచున్నవి. మాంసభక్షకులు, భయంకరులు ఐన యక్షరాక్షసులు సంచరించుచున్నారు. (18)

మహాతేజస్వియైన విశ్వామిత్రమహాముని ఈ విధముగా పలికి మిన్నకుండెను. పిమ్మట మునులందఱును 'బాగు, బాగు' అనుచు ఆయనను ఇట్లు ప్రస్తుతించిరి. (19)

"ఓ మునీ! ఈ కౌశికవంశము మిక్కిలి గొప్పది. ఇది ధర్మమునకు ఆటపట్టు. ఈ వంశమున పుట్టిన నరోత్తములందఱును మహానుభావులు, బ్రహ్మతుల్యులు, మహాయశస్వులైన ఓ

విశేషేణ భవానేవ విశ్వామిత్రో మహాయశాః।
కౌశికీ సరితాం శ్రేష్ఠా కులోద్యోతకరీ తవ। 21

విశ్వామిత్రా! కౌశికులందరిలో (మీవంశమువారిలో) నీవెంతయు గొప్పవాడవు. మీ వంశమునకే వన్నెతెచ్చిన 'కౌశికి' సమస్త నదులలో శ్రేష్ఠమైనది." (20-21)

ఇతి తైర్మునిశార్దూలైః ప్రశస్తః కుశికాత్మజః।
నిద్రా ముపాగమచ్ఛ్రీమాన్ అస్తం గత ఇవాంశుమాన్। 22

ఇట్లు ఆ మునీశ్వరులందఱును ప్రస్తుతించిన పిమ్మట మిక్కిలి సంతుష్టుడైన ఆ గాధిసుతుడు అస్తాద్రిని చేరిన సూర్యునివలె నిద్రకుపక్రమించెను. (22)

రామోఽపి సహ సౌమిత్రిః కించిదాగతవిస్మయః।
ప్రశస్య మునిశార్దూలం నిద్రాం సముపసేవతే। 23

అంతట రామలక్ష్మణులు ఇరువురును విశ్వామిత్ర మహాముని యొక్క వైభవమునకు ఆశ్చర్యపడి, ఆ మహర్షిని మెచ్చుకొనిరి. పిమ్మట వారును నిద్రలో మునిగిరి. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే చతుస్త్రింశస్సర్గః (34)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదినాల్గవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

35. ముప్పదిఐదవసర్గము

గంగాపార్వతుల వృత్తాంతములు.

ఉపాస్య రాత్రిశేషం తు శోణాకూలే మహర్షిభిః।
నిశాయాం సుప్రభాతాయాం విశ్వామిత్రోఽభ్యభాషత। 1

సుప్రభాతా నిశా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే।
ఉత్తిష్ఠోత్తిష్ఠ భద్రం తే గమనాయాభిరోచయ। 2

విశ్వామిత్రుడు మహర్షులతోను, రామలక్ష్మణులతోను గూడి మిగిలిన రాత్రిని శోణానదీ తీరమున గడిపెను. ప్రాతఃకాలమున ఆ మహర్షి శ్రీరామునితో ఇట్లనెను. 'ఓ రామా! రాత్రి గడచినది. ప్రాతస్సంధ్యా సమయమాసన్నమైనది. నీకు శుభమగు గాక. మేల్కొనుము. ప్రయాణమునకు సిద్ధము కమ్ము.' (1-2)

తచ్ఛ్రుత్వా వచనం తస్య కృత్వా పౌర్వాహ్ణికీం క్రియామ్।
గమనం రోచయామాస వాక్యం చేద మువాచ హ। 3

అంతట శ్రీరాముడు విశ్వామిత్రుని ప్రబోధమును ఆలకించి, క్రమముగా పూర్వాహ్ణక్రియలను (ప్రాతఃకాల సంధ్యావందనాది నిత్యకృత్యములను) ఆచరించి, ప్రయాణమునకు సిద్ధమై ఇట్లు పల్కెను. (3)

అయం శోణః శుభజలో గాధః పులినమండితః।
కతరేణ పథా బ్రహ్మన్ సంతరిష్యామహే వయమ్। 4

"ఓ బ్రహ్మర్షీ! ఈ శోణనదము స్వచ్ఛములైన జలములతో అటునిటు ఇసుక తిన్నెలతో విలసిల్లుచున్నది. నీరు తరిగి లోతు తక్కువగానున్నది. నావప్రయాణమునకు అనువుగా లేదు. మనము ఏ మార్గమున దీనిని దాటవలెను." (4)

ఏవ ముక్తస్తు రామేణ విశ్వామిత్రోఽబ్రవీదిదమ్।
ఏష పంథా మయోద్దిష్టో యేన యాంతి మహర్షయః। 5

శ్రీరాముడు ఇట్లు పలుకగా విశ్వామిత్రుడు "ఇట్టి పరిస్థితులలో మునీశ్వరులు ప్రయాణించుమార్గమొకటి కలదు. దానిని నేను ఎఱుగుదును." అని నుడివెను. (5)

ఏవ ముక్తాశ్చ ఋషయో విశ్వామిత్రేణ ధీమతా।
పశ్యంతస్తే ప్రయాతా వై వనాని వివిధాని చ। 6

ప్రయాణమార్గములను బాగుగా ఎఱిగిన విశ్వామిత్రుని యొక్క మాటలను విని, ఋషులందఱును ఆయనచూపిన మార్గమున వివిధములగు వనములను దర్శించుచు ప్రయాణమును కొనసాగించిరి. (6)

తే గత్వా దూరమధ్వానం గతేఽర్ధదివసే తదా।
జాహ్నవీం సరితాం శ్రేష్ఠాం దదృశు ర్మునిసేవితామ్। 7

తాం దృష్ట్వా పుణ్యసలిలాం హంససారససేవితామ్।
బభూవుర్ముదితాస్సర్వే మునయః సహరాఘవాః। 8

తస్యాస్తీరే తతశ్చక్రుః త ఆవాసపరిగ్రహమ్।
తతః స్నాత్వా యథాన్యాయం సంతర్ప్య పితృదేవతాః। 9

హుత్వాచైవాగ్నిహోత్రాణి ప్రాశ్య చామృతవద్ధవిః।
వివిశుర్జాహ్నవీతీరే శుచౌ ముదితమానసాః। 10

విశ్వామిత్రం మహాత్మానం పరివార్య సమంతతః।
అథ తత్ర తదా రామో విశ్వామిత్రమథాబ్రవీత్। 11

భగవన్ శ్రోతుమిచ్ఛామి గంగాం త్రిపథగాం నదీమ్।
త్రైలోక్యం కథమాక్రమ్య గతా నదనదీపతిమ్। 12

చోదితో రామవాక్యేన విశ్వామిత్రో మహామునిః।
వృద్ధిం జన్మ చ గంగాయా వక్తుమేవోపచక్రమే। 13

శైలేంద్రో హిమవాన్ నామ ధాతూనామాకరో మహాన్।
తస్య కన్యాద్వయం రామ రూపేణాప్రతిమం భువి। 14

యా మేరుదుహితా రామ తయోర్మాతా సుమధ్యమా।
మేనా మనోరమా దేవీ పత్నీ హిమవతః ప్రియా। 15

తస్యాం గంగేయమభవత్ జ్యేష్ఠా హిమవతస్సుతా।
ఉమా నామ ద్వితీయాఽభూత్ నామ్నా తస్యైవ రాఘవ। 16

అథ జ్యేష్ఠాం సురాస్సర్వే దేవతార్థచికీర్షయా।
శైలేంద్రం వరయామాసుః గంగాం త్రిపథగాం నదీమ్। 17

దదౌ ధర్మేణ హిమవాన్ తనయాం లోకపావనీమ్।
స్వచ్ఛందపథగాం గంగాం త్రైలోక్య హిత కామ్యయా। 18

ప్రతిగృహ్య తతో దేవాః త్రిలోకహితకారిణః।
గంగామాదాయ తేఽగచ్ఛన్ కృతార్థేనాంతరాత్మనా। 19

వారందఱును మధ్యాహ్నసమయమువఱకు చాల దూరము ప్రయాణముచేసి, మునులచే సేవింపబడు పవిత్ర గంగానదిని దర్శించిరి. (7)

హంసలతో, సారస (బెగ్గురు) పక్షులతో అలరారుచున్న ఆ పుణ్యనదినిజూచి విశ్వామిత్రాదిమహర్షులందఱును, రామలక్ష్మణులును ప్రసన్నచిత్తులైరి. (8)

అంతట వారు ఆ గంగాతీరమున ఒకప్రదేశమును శుభ్రపఱచుకొని, నివాసయోగ్యముగా చేసికొనిరి. పిమ్మట ఆ మునులు అందఱును స్నానములనాచరించి, విధ్యుక్తముగా దేవతలకును, ఋషులకును, పితృగణములకును తర్పణములను అర్పించిరి. అగ్నులకు హవిస్సులను సమర్పించిరి. హవిషాన్నమును (యజ్ఞశిష్టాన్నమును) అమృతమునువలె సేవించిరి. పిమ్మట వారందఱును సంతుష్టచిత్తులై, ఆ గంగాతీరమునందే ఒక శుభ్రమైన ప్రదేశమున మహాత్ముడైన విశ్వామిత్రుని చుట్టును చేరి కూర్చుండిరి.పిమ్మట శ్రీరాముడు విశ్వామిత్రమహర్షిని ఇట్లడిగెను. (9-11)

"ఓ మహానుభావా! స్వర్గమర్త్యపాతాళలోకములలో ప్రవహించునట్టి గంగావృత్తాంతమునుగూర్చి వినగోరుచున్నాను. ఇది ముల్లోకములయందును ఎట్లు ప్రవహించినది? ఏ విధముగా సముద్రుని చేరినది ?" (12)

శ్రీరాముని ప్రశ్నకు సమాధానముగా విశ్వామిత్ర మహాముని గంగానదియొక్క పుట్టుపూర్వోత్తరములనుగూర్చి ఇట్లు చెప్ప దొడంగెను. (13)

'హిమాలయము' అను ఒక మహాపర్వతము గలదు. అది గిరులలో శ్రేష్ఠమైనది. ఇనుము, రాగి మొదలగు లోహములకు నెలవైనది. ఓ రామా! ఆ హిమవంతునకు ఇద్దఱుకుమార్తెలు గలరు. వారు సాటిలేని సౌందర్యవతులు. మేరువు యొక్క కూతురైన 'మేన' అను సుందరి ఆ హిమవంతునిభార్య, ఆ ఇరువురు కన్యలకు తల్లి. ఓ రాఘవా! ఆ దంపతుల (మేనా హిమవంతుల) పెద్దకూతురు ఈ గంగాదేవి. వారి యొక్క రెండవకుమార్తెపేరు 'ఉమాదేవి' (పార్వతి) (14-16)

అంతట దేవతలందఱును తమప్రయోజనార్థమై జ్యేష్ఠ కుమార్తెయగు గంగను తమకు అప్పగింపుమని హిమవంతుని వేడుకొనిరి. ధర్మాత్ముడైన హిమవంతుడు లోకపావనియు, నిరాటంకముగ సాగిపోవునదియు ఐన తనకూతురు గంగను ముల్లోకముల హితముకొఱకై వారికి అప్పగించెను. (17-18)

ముల్లోకములకును హితమొనర్చు ఆ దేవతలు గంగను స్వీకరించి, తాము కృతార్థులైనట్లు భావించుచు వెళ్లిపోయిరి. (19)

యా చాన్యా శైలదుహితా కన్యాఽఽసీద్రఘునందన।
ఉగ్రం సా వ్రతమాస్థాయ తపస్తేపే తపోధనా। 20

ఉగ్రేణ తపసా యుక్తాం దదౌ శైలవరస్సుతామ్।
రుద్రాయాప్రతిరూపాయ ఉమాం లోకనమస్కృతామ్। 21

ఏతే తే శైలరాజస్య సుతే లోకనమస్కృతే।
గంగా చ సరితాం శ్రేష్ఠా ఉమాదేవీ చ రాఘవ। 22

ఏతత్తే సర్వమాఖ్యాతం యథా త్రిపథగా నదీ।
ఖం గతా ప్రథమం తాత గతిం గతిమతాంవర। 23

సైషా సురనదీ రమ్యా శైలేంద్రస్య సుతా తదా।
సురలోకం సమారూఢా విపాపా జలవాహినీ। 24

ఓ రఘునందనా! హిమవంతుని రెండవకూతురగు ఉమాదేవి కన్యగానుండియే తపస్వినియై, తీవ్రమైన వ్రతనిష్ఠతో తపమాచరించెను. అంతట హిమవంతుడు లోకవంద్యయు (శివుని పతిగాగోరి) ఉగ్రమైన తపస్సును ఆచరించుచున్నదియు ఐన తన కుమార్తెయగు ఉమాదేవిని పరమేశ్వరునకిచ్చి వివాహము చేసెను. (20-21)

ఓ రాఘవా! హిమవంతుని ఇద్దఱు పుత్రికలును - నదీశ్రేష్ఠయైన గంగయు, పరమశివునిపత్నియైన ఉమాదేవియు- లోక పూజ్యులైరి. (22)

ఓ సుందరగమనా! రామా! గంగానది మొదట ఆకాశమునకు చేరిన కథనంతయును తెల్పితిని. (23)

ఆనాడు హిమవంతునికుమార్తెగా జన్మించి, దివికి జేరిన ఆ సురనదియే రమ్యమై పుణ్యప్రదమైన ఈ గంగానది. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచత్రింశస్సర్గః (35)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదిఐదవసర్గము సమాప్తము

-- * * * --

36. ముప్పదిఆఱవసర్గము

పార్వతీదేవిమహిమ

ఉక్తవాక్యే మునౌ తస్మిన్ ఉభౌ రాఘవలక్ష్మణౌ।
ప్రతినంద్య కథాం వీరౌ ఊచతుర్మునిపుంగవమ్। 1

ధర్మయుక్తమిదం బ్రహ్మన్ కథితం పరమం త్వయా।
దుహితుః శైలరాజస్య జ్యేష్ఠాయా వక్తుమర్హసి। 2

విస్తరం విస్తరజ్ఞోఽసి దివ్యమానుషసంభవమ్।
త్రీన్ పథో హేతునా కేన ప్లావయేల్లోకపావనీ। 3

కథం గంగా త్రిపథగా విశ్రుతా సరిదుత్తమా।
త్రిషు లోకేషు ధర్మజ్ఞ కర్మభిః కైస్సమన్వితా। 4

తథా బ్రువతి కాకుత్స్థే విశ్వామిత్రస్తపోధనః।
నిఖిలేన కథాం సర్వామ్ ఋషిమధ్యే న్యవేదయత్। 5

విశ్వామిత్రుడు ఇట్లు గంగావృత్తాంతమును తెలిపిన పిమ్మట వీరులైన రామలక్ష్మణులు ఇరువురును ఆ కథావిశేషములను మెచ్చుకొనుచు ఆ మునీశ్వరునితో ఇట్లనిరి. (1)

"ఓ మహాత్మా! ఉత్తమోత్తమమును, ధర్మయుక్తము ఐన వృత్తాంతమును మీరు తెల్పితిరి. హిమవంతుని పెద్దకూతురైన గంగాదేవియొక్క గాథను పూర్తిగా ఎఱిగిన వారు మీరే. కావున దివ్యలోకమునందును, మానవ లోకమునందును జరిగిన ఆ నదీ వృత్తాంత విశేషములను విపులముగా వచింపుడు. ఆ లోకపావని మూడు లోకములలో ప్రవహించుటకుగల కారణమేమి ? (2-3)

ఓ ధర్మజ్ఞా ! 'త్రిపథగా' అని ఖ్యాతికెక్కిన ఈ గంగ ఏయే కార్యములవలన ముల్లోకములలో "ఉత్తమనదిగా కీర్తిగాంచినది ?" (4)

శ్రీరాముడు ఇట్లు ప్రశ్నింపగా తపోధనుడైన విశ్వామిత్రుడు గంగానదీగాథను రామలక్ష్మణులకును, మునీశ్వరులకును విపులముగా ఈ విధముగా వివరించెను. (5)

పురా రామ కృతోద్వాహో నీలకంఠో మహాతపాః।
దృష్ట్వా చ స్పృహయా దేవీం మైథునాయోపచక్రమే। 6

శితికంఠస్య దేవస్య దివ్యం వర్షశతం గతమ్।
న చాపి తనయో రామ తస్యామాసీత్ పరంతప। 7

తతో దేవాః సముద్విగ్నాః పితామహపురోగమాః।
యదిహోత్పద్యతే భూతం కస్తత్ ప్రతిసహిష్యతే। 8

అభిగమ్య సురాః సర్వే ప్రణిపత్యేదమబ్రువన్।
దేవదేవ మహాదేవ లోకస్యాస్య హితేరత। 9

సురాణాం ప్రణిపాతేన ప్రసాదం కర్తుమర్హసి।
న లోకా ధారయిష్యంతి తవ తేజః సురోత్తమ। 10

బ్రాహ్మేణ తపసా యుక్తో దేవ్యా సహ తపశ్చర।
త్రైలోక్యహితకామార్థం తేజస్తేజసి ధారయ। 11

దేవతానాం వచః శ్రుత్వా సర్వలోకమహేశ్వరః।
బాఢమిత్యబ్రవీత్ సర్వాన్ పున శ్చేదమువాచ హ। 12

ధారయిష్యామ్యహం తేజః తేజస్యేవ సహోమయా।
త్రిదశాః పృథివీ చైవ నిర్వాణమధిగచ్ఛతు। 13

యదిదం క్షుభితం స్థానాత్ మమ తేజో హ్యనుత్తమమ్।
ధారయిష్యతి కస్తన్మే బ్రువంతు సురసత్తమాః। 14

ఏవ ముక్తాః సురాః సర్వే ప్రత్యూచుః వృషభధ్వజమ్।
యత్తేజః క్షుభితం హ్యేతత్ తద్ధరా ధారయిష్యతి। 15

ఏవ ముక్తః సురపతిః ప్రముమోచ మహీతలే।
తేజసా పృథివీ యేన వ్యాప్తా సగిరికాననా। 16

తతో దేవాః పునరిదమ్ ఊచుశ్చాథ హుతాశనమ్।
ప్రవిశ త్వం మహాతేజో రౌద్రం వాయుసమన్వితః। 17

తదగ్నినా పున ర్వ్యాప్తం సంజాతః శ్వేతపర్వతః।
దివ్యం శరవణం చైవ పావకాదిత్యసన్నిభమ్।
యత్ర జాతో మహాతేజాః కార్తికేయోఽగ్నిసంభవః। 18

అథోమాం చ శివం చైవ దేవాస్సర్షిగణాస్తదా।
పూజయామాసురత్యర్థం సుప్రీతమనస స్తతః। 19

ఓ రామా! పూర్వము నీలకంఠుడు పార్వతీ దేవిని వివాహమాడిన పిమ్మట అతడు మహాతపస్వియైనను తన్ను వరించిన ఆ పార్వతిని జూచి, మన్మథ బాణప్రభావమున ఆమెపై మరులుగొని దాంపత్యసుఖమునకు దిగెను. ఈ విధముగా ఆనందముతో నూఱు దివ్యసంవత్సరములు గడిచెను. ఓ పరంతపా! శ్రీరామా! ఐనను వారికి తనయప్రాప్తి కలుగలేదు. (6-7)

అంతట బ్రహ్మాదిదేవతలు అందఱును 'ఇంత దీర్ఘకాలము పిమ్మట శివపార్వతులకు తనయుడు కలుగుచో ఆ మహాతేజోమూర్తి ప్రభావమునకు లోకము తట్టుకొనగలదా?' అని భీతిల్లిరి. (8)

వారందఱును ఆ మహాదేవునికడకు వచ్చి, ప్రణమిల్లి ఇట్లు పలికిరి. "ఓ దేవదేవా! పరమశివా! లోకహితంకరా! మేమందఱము నీ పాదములను ఆశ్రయించితిమి. మమ్ములను అనుగ్రహింపుము. ఓ సురోత్తమా! నీ తేజఃప్రభావమును కలిగినపుత్రుని ఈ లోకములు భరింపజాలవు. పార్వతీదేవితో గూడి విధ్యుక్తముగా తపస్సు చేయుము. ముల్లోకములమేలు కొఱకై నీ తేజమును నీలోనే నిలుపుము. ఈ లోకములన్నింటిని రక్షింపుము. అంతరింపజేయవద్దు." (9-11)

పరమశివుడు దేవతలమాట విని, "అట్లే" అని పలికి మరల వారితో ఇట్లనెను. "ఓ దేవతలారా! నేను, పార్వతియు మా తేజస్సులను మాలోనే నిలుపుకొందుము. లోకములన్నియును సుఖముగానుండుగాక. (12-13)

ఓ సురశ్రేష్ఠులారా! స్వస్థానమునుండి కదలిన, దుర్భరమైన నా తేజస్సును ఎవరు ధరింపగలరో తెల్పుడు." (14)

అప్పుడు దేవతలు శంకరునితో "స్వస్థానమునుండి కదలిన మీ తేజస్సును భూదేవి ధరింపగలదు" - అని పల్కిరి. (15)

దేవతలపలుకులను విని మహేశ్వరుడు తన తేజస్సును భూమిపై వదలెను. ఆ శివతేజస్సు పర్వతములతో, వనములతో గూడియున్న భూమియందంతటను వ్యాపించెను. (16)

దేవతలు మరల అగ్నిదేవునితో "నీవు వాయుదేవునితో గూడి, శివతేజస్సును ధరింపుము" అని పల్కిరి. (17)

అగ్నిచే వ్యాప్తమైన ఆ శివతేజస్సు శ్వేత పర్వతమాయెను. కొంతకాలమునకు అచ్చట అగ్నిసూర్యులతేజస్సుతో సమానమైన తేజస్సుగల రెల్లుగడ్డి ఏర్పడెను. అచట మహాతేజస్వియైన కుమారస్వామి జన్మించెను. కృత్తికలు పాలిచ్చి పెంచుటచే 'కార్తికేయుడు' అనియు, అగ్నిచే ధరింపబడుట వలన 'అగ్నిసంభవుడు' అనియు, అతడు ప్రసిద్ధిపొందెను. (18)

పిమ్మట దేవతలు, మహర్షులు ప్రసన్నచిత్తులై పార్వతీ పరమేశ్వరులను భక్తిశ్రద్ధలతో పూజించిరి. (19)

అథ శైలసుతా రామ త్రిదశానిదమబ్రవీత్।
సమన్యురశపత్ సర్వాన్ క్రోధసంరక్తలోచనా। 20

ఓ రామా! అంతట పార్వతి దేవతలతో ఇట్లనెను. "ఓ దేవతలారా! నాకు అప్రియమైన పనిని చేసినందులకు తగిన ఫలమును అనుభవింపుడు." అని పలికి, సూర్యతేజస్సుతో వెలుగొందుచున్న పార్వతీ దేవి జలమును చేతబట్టి, కోపముతో కన్నులెఱ్ఱ జేసినదై వారిని అందఱిని శపించెను. (20)

యస్మాన్నివారితా చైవ సంగతిః పుత్రకామ్యయా।
అపత్యం స్వేషు దారేషు తస్మాన్నోత్పాదయిష్యథ। 21

అద్య ప్రభృతి యుష్మాకమ్ అప్రజాః సంతు పత్నయః।
ఏవ ముక్త్వా సురాన్ సర్వాన్ శశాప పృథివీ మపి। 22

"నా పతితోగూడి పుత్రుని పొందవలెననెడి నా కోరికకు అవరోధము కల్గించితిరి. కనుక మీ భార్యలయందు మీకు సంతానము కలుగకుండుగాక. నేటినుండి మీపత్నులు సంతానవతులు కాకుందురుగాక." ఈ విధముగా దేవతలతో నుడివి, భూదేవిని ఇట్లు శపించెను. (21-22)

అవనే నైకరూపా త్వం బహుభార్యా భవిష్యసి। 23

న చ పుత్రకృతాం ప్రీతిం మత్క్రోధకలుషీకృతా।
ప్రాప్స్యసి త్వం సుదుర్మేధే మమ పుత్ర మనిచ్ఛతీ। 24

"దుర్బుద్ధిగల ఓ భూదేవీ! నీవు చౌడునేల మొదలగు వివిధ రూపములను కలిగి యుందువు. నీవు పెక్కుమంది రాజులకు భార్యవు అయ్యెదవు. (పెక్కుమంది రాజులచే పరిపాలింపబడుదువు.) నాకు పుత్రుడు కలుగకుండ అడ్డుపడితివిగాన నా క్రోధమునకు గురియైతివి. నీకును సంతానసుఖసంతోషములు లేకుండుగాక." (23-24)

తాన్ సర్వాన్ వ్రీడితాన్ దృష్ట్వా సురాన్ సురపతి స్తదా।
గమనాయోపచక్రామ దిశం వరుణపాలితామ్। 25

పార్వతీదేవిశాపమునకు గురియై, ఆ దేవతలు అందఱును సిగ్గుపడుచుండుట గమనించి, పరమేశ్వరుడు పశ్చిమదిశగా వెళ్లసాగెను. (25)

స గత్వా తప ఆతిష్ఠత్ పార్శ్వే తస్యోత్తరే గిరేః।
హిమవత్ప్రభవే శృంగే సహ దేవ్యా మహేశ్వరః। 26

ఆ పరమశివుడు హిమవత్పర్వతమునకు ఉత్తరదిశ యందుగల ఒక శిఖరమును జేరి, అచట పార్వతీ దేవితోగూడి, తపస్సుచేయసాగెను. (26)

ఏష తే విస్తరో రామ శైలపుత్ర్యా నివేదితః।
గంగాయాః ప్రభవం చైవ శృణు మే సహలక్ష్మణః। 27

ఓ రామా! ఇంతవఱకును పార్వతీదేవియొక్క వృత్తాంతమును విపులముగా తెలిపితిని. ఇంక గంగాదేవి యొక్క ప్రభావమునుగూర్చి వివరించెదను. నీవును, లక్ష్మణుడును వినుడు. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షట్త్రింశస్సర్గః (36)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదియాఱవసర్గము సమాప్తము

-- * * * --

37. ముప్పదియేడవసర్గము

కుమారస్వామియొక్క జన్మవృత్తాంతము.

తప్యమానే తపో దేవే దేవాస్సర్షిగణాః పురా।
సేనాపతిమ్ అభీప్సంతః పితామహముపాగమన్। 1

పరమేశ్వరుడు ఇట్లు తపస్సు చేయుచుండగా పూర్వము దేవతలు ఋషులతోగూడి, సేనాపతిని గోరుకొనుచు బ్రహ్మదేవునికడకు వెళ్లిరి. (1)

తతోఽబ్రువన్ సురాస్సర్వే భగవంతం పితామహమ్।
ప్రణిపత్య సురాస్సర్వే సేంద్రాస్సాగ్ని పురోగమాః। 2

యో నస్సేనాపతిర్దేవ దత్తో భగవతా పురా।
తపః పరమమాస్థాయ తప్యతే స్మ సహోమయా। 3

యదత్రానంతరం కార్యం లోకానాం హితకామ్యయా।
సంవిధత్స్వ విధానజ్ఞ త్వం హి నః పరమా గతిః। 4

దేవతానాం వచః శ్రుత్వా సర్వలోకపితామహః।
సాంత్వయన్ మధురైర్వాక్యైః త్రిదశానిదమబ్రవీత్। 5

శైలపుత్ర్యా యదుక్తం తత్ న ప్రజాస్స్వంతు పత్నిషు।
తస్యా వచనమక్లిష్టం సత్యమేతన్న సంశయః। 6

ఇయమాకాశగా గంగా యస్యాం పుత్రం హుతాశనః।
జనయిష్యతి దేవానాం సేనాపతిమరిందమమ్। 7

జ్యేష్ఠా శైలేంద్రదుహితా మానయిష్యతి తత్సుతమ్।
ఉమాయాస్తద్బహుమతం భవిష్యతి న సంశయః। 8

తచ్ఛ్రుత్వా వచనం తస్య కృతార్థా రఘునందన।
ప్రణిపత్య సురా స్సర్వే పితామహమపూజయన్। 9

తే గత్వా పర్వతం రామ కైలాసం ధాతుమండితమ్।
అగ్నిం నియోజయామాసుః పుత్రార్థం సర్వదేవతాః। 10

దేవకార్యమిదం దేవ సంవిధత్స్వ హుతాశన।
శైలపుత్ర్యాం మహాతేజో గంగాయాం తేజ ఉత్సృజ। 11

దేవతానాం ప్రతిజ్ఞాయ గంగామభ్యేత్య పావకః।
గర్భం ధారయ వై దేవి దేవతానామ్ ఇదం ప్రియమ్। 12

తస్య తద్వచనం శ్రుత్వా దివ్యం రూపమధారయత్।
దృష్ట్వా తన్మహిమానం స సమంతాదవకీర్యత। 13

సమంతతస్తదా దేవీమ్ అభ్యషించత పావకః।
సర్వస్రోతాంసి పూర్ణాని గంగాయా రఘునందన। 14

ఇంద్రాదిదేవతలు అగ్నిని ముందుంచుకొని, బ్రహ్మదేవునకు ప్రణమిల్లి, ఆయనతో ఇట్లు విన్నవించుకొనిరి. (2)

"ఓ దేవా! పూర్వము మీరు పరమేశ్వరుని మాకు సేనాపతిగా నియమించియుంటిరి. ఆ శంకరుడు ఇప్పుడు పార్వతీదేవితోగూడి హిమవత్పర్వతమున తపమొనరించు చున్నాడు. (3)

కర్తవ్యవిధానమునెఱిగిన ఓ బ్రహ్మదేవా! ఈ (సేనాపతి) విషయమున లోకహితమును గోరి అనంతరకార్యమును గూర్చి ఆలోచింపుడు. ఇప్పుడు మాకు మీరే దిక్కు." (4)

దేవతలప్రార్థనను ఆలకించి, సర్వలోకసృష్టికర్తయైన బ్రహ్మదేవుడు మృదుమధుర వచనములతో వారిని ఓదార్చుచు ఇట్లు పల్కెను. (5)

"పార్వతీదేవిశాపకారణముగా మీకు మీపత్నులయందు సంతానము కలుగు అవకాశము లేదు. ఆమెవచనము తిరుగులేనిది. ఇది ముమ్మాటికిని సత్యము. ఇందు సందేహము లేదు. ఆకాశమున ప్రవహించు ఈగంగాదేవియందు అగ్నిదేవుడు ఒక పుత్రుని పొందగలడు. అతడు దేవసేనాపతియై శత్రుసంహారకుడు కాగలడు. (6-7)

హిమవంతుని పెద్దకూతురైన గంగ ఆ అగ్నిసుతుని (శివతేజఃప్రభావమున అగ్నివలన తనయందు జనించిన సుతుని) ఆదరింపగలదు. అతడు పార్వతీదేవికి మిక్కిలి ప్రీతిపాత్రుడగును. ఇందు సంశయము లేదు." (8)

ఓ రఘునందనా! బ్రహ్మదేవుడు పలికిన ఆ మాటలకు దేవతలందఱును సంతసించి, తాము కృతార్థులైనట్లు భావించిరి. అనంతరము వారు బ్రహ్మదేవునకు ప్రణమిల్లి, పూజించిరి. (9)

అంతట ఆ దేవతలందఱును గైరికాదిధాతువులతో విలసిల్లుచున్న కైలాసపర్వతమునకు చేరి, పుత్రోత్పత్తికై అగ్నిదేవుని నియమించిరి. (10)

"శివతేజమును ధరించిన ఓ అగ్నిదేవా! ఈ దేవకార్యమును నెఱవేర్చుము. శైలపుత్రికయైన గంగయందు ఆ (శివ) తేజస్సును ఉంచుము." అని దేవతలు పలికిరి. (11)

అగ్నిదేవుడు దేవతలతో 'అట్లే' అని పలికి, గంగాదేవి కడకు వెళ్లి "ఓ దేవీ! గర్భమును ధరింపుము, ఇది దేవతలకు హితమొనర్చు కార్యము." అని నుడివెను. (12)

అప్పుడు గంగ ఆయనమాటలను విని దివ్యమైన స్త్రీరూపమును ధరించెను. అగ్ని ఆమె సౌందర్యాతిశయమును జూచి, శివతేజమును ఆమెయందంతటను వ్యాపింపజేసెను. (13)

ఓ రఘునందనా! అగ్ని ఆమెపై వ్యాపింపజేసిన శివతేజముతో గంగాప్రవాహములన్నియును నిండిపోయెను. (14)

తమువాచ తతో గంగా సర్వదేవపురోహితమ్।
అశక్తా ధారణే దేవ తవ తేజస్సముద్ధతమ్।
దహ్యమానాఽగ్నినా తేన సంప్రవ్యథితచేతనా। 15

అథాబ్రవీదిదం గంగాం సర్వదేవహుతాశనః।
ఇహ హైమవతేపాదే గర్భోఽయం సన్నివేశ్యతామ్। 16

శ్రుత్వా త్వగ్నివచో గంగా తం గర్భమతిభాస్వరమ్।
ఉత్ససర్జ మహాతేజః స్రోతోభ్యో హి తదానఘ। 17

యదస్యా నిర్గతం తస్మాత్ తప్తజాంబూనదప్రభమ్। 18

కాంచనం ధరణీం ప్రాప్తం హిరణ్యమమలం శుభమ్।
తామ్రం కార్ష్ణాయసం చైవ తైక్ష్ణ్యాదేవాభ్యజాయత। 19

మలం తస్యాభవత్ తత్ర త్రపుసీసకమేవ చ।
తదేతద్ధరణీం ప్రాప్య నానాధాతురవర్ధత। 20

నిక్షిప్తమాత్రే గర్భే తు తేజోభిరభిరంజితమ్।
సర్వం పర్వతసన్నద్ధం సౌవర్ణమభవద్వనమ్। 21

జాతరూపమితి ఖ్యాతం తదాప్రభృతి రాఘవ।
సువర్ణం పురుషవ్యాఘ్ర హుతాశనసమప్రభమ్।
తృణవృక్షలతాగుల్మం సర్వం భవతి కాంచనమ్। 22

తం కుమారం తతో జాతం సేంద్రాః సహమరుద్గణాః।
క్షీరసంభావనార్థాయ కృత్తికాః సమయోజయన్। 23

తాః క్షీరం జాతమాత్రస్య కృత్వా సమయముత్తమమ్।
దదుః పుత్రోఽయమస్మాకం సర్వాసామితి నిశ్చితాః। 24

తతస్తు దేవతాః సర్వాః కార్తికేయ ఇతి బ్రువన్।
పుత్రస్త్రైలోక్యవిఖ్యాతో భవిష్యతి న సంశయః। 25

తేషాం తద్వచనం శ్రుత్వా స్కన్నం గర్భపరిస్రవే।
స్నాపయన్ పరయా లక్ష్మ్యా దీప్యమానం యథాఽనలమ్। 26

ఆ అగ్నితేజస్సు యొక్క తాపమునకు తట్టుకొనలేకున్న గంగాదేవి సర్వదేవతలకును పురోహితుడైన అగ్నిదేవునితో "క్షణక్షణమునకును బలీయమగుచున్న నీ తేజస్సును ధరింపలేకయున్నాను." అని పలికెను. (15)

సర్వదేవతలకొఱకై సమర్పింపబడెడి ఆహుతులను స్వీకరించునట్టి అగ్నిదేవుడు గంగతో 'ఓ దేవీ! ఈ శ్వేత పర్వతప్రదేశమున నీగర్భమును ఉంచుము.' అని యనెను. (16)

మహాతేజస్వివైన ఓ పుణ్యపురుషా! రామా! గంగాదేవి అగ్నిదేవునిమాటలను పాటించి, మిక్కిలి తేజోరాశియైన ఆ గర్భమును తన ప్రవాహములనుండి అచట వదలెను.(17)

గంగానదిగర్భమునుండి వెడలిన తేజస్సు మేలిమి బంగారమువలె కాంతిమంతమై యుండెను. కనుక ఆ తేజస్సు ఉంచబడిన భూమియు, అచటి వస్తువున్నియును సువర్ణమయములాయెను. ఆ పరిసరములన్నియును రజత (వెండి) మయములై నిరుపమానమైన కాంతితో వెలుగొందెను. ఆ తేజస్సు యొక్క తీక్ష్ణత్వమువలన (క్షారము నుండి) రాగి, ఇనుము పుట్టెను.ఆ రేతస్సు యొక్క మలము తగరము, సీసము ఆయెను. ఈ విధముగా ఆ తేజస్సు భూమిని జేరి, వివిధ ధాతువులుగా రూపొందెను. (18-20)

ఆ గర్భము భూమిపై ఉంచబడగానే దాని తేజఃప్రభావముచే ఆశ్వేతపర్వతమూ, అందలి శరవణమూ (రెల్లుగడ్డి) సువర్ణమయములై తేజరిల్లసాగెను. (21)

పురుషశ్రేష్ఠుడవైన ఓ రామా! అగ్నితో సమానమైన కాంతి గల ఆ బంగారము అప్పటినుండియు 'జాతరూపము' అను పేరుతో ప్రసిద్ధికెక్కెను. అచటి తృణములు, వృక్షములు, లతలు, పొదలు మొదలగునవి అన్నియును స్వర్ణమయములాయెను. (22)

తదనంతరము అచట జన్మించిన కుమారునకు పాలిచ్చి పోషించుటకై, ఇంద్రుడు, మరుద్గణములు మొదలగు దేవతలు ఆఱుమందికృత్తికలను నియోగించిరి. (23)

"ఈ బాలుడు మా అందఱి యొక్క పుత్రుడగును." అని ఆ కృత్తికలు దేవతలతో ఒప్పందము చేసికొనిరి. పిమ్మట ఆ నిశ్చయముతో అప్పుడే పుట్టిన ఆ శిశువునకు పాలియ్యసాగిరి. (24)

అంత దేవతలందఱును "ఈ బాలుడు కార్తికేయుడు అను పేరుతో ముల్లోకములయందును ఖ్యాతికెక్కును. ఇందు సంశయము లేదు." అని పలికిరి. (25)

గంగద్వారా అచటికి చేరిన శివతేజస్సుయొక్క ప్రభావమున పుట్టిన ఆ బాలుడు అగ్నివలె వెలుగొందుచుండెను. దేవతల మాటలను విని, వారిఆదేశమును అనుసరించి, కృత్తికలు

స్కంద ఇత్యబ్రువన్ దేవాః స్కన్నం గర్భపరిస్రవాత్।
కార్తికేయం మహాభాగం కాకుత్స్థ జ్వలనోపమమ్। 27

ఆ బాలకునకు స్నానము చేయించిరి. ఓ కాకుత్స్థా! (ఓ రామా!) గంగాదేవిగర్భమునుండి స్ఖలితుడైనందున దేవతలు అగ్నితుల్యుడై, కారణజన్ముడైన ఆ మహానుభావుని 'స్కందుడు' అని పిలువసాగిరి. కృత్తికలపోషణవలన అతనికి 'కార్తికేయుడు' అనియు పేరు ఏర్పడెను. (26-27)

ప్రాదుర్భూతం తతః క్షీరం కృత్తికానామనుత్తమమ్।
షణ్ణాం షడాననో భూత్వా జగ్రాహ స్తనజం పయః। 28

అప్పుడు ఆ ఆఱుగురు కృత్తికల స్తనములలో సమృద్ధిగా పాలు ఏర్పడెను. ఆఱుముఖములుగలవాడై ఆ బాలుడు ఆ ఆఱుగురినుండి స్తన్యములను గ్రోలెను. (28)

గృహీత్వా క్షీరమేకాహ్నా సుకుమారవపుస్తదా।
అజయత్ స్వేన వీర్యేణ దైత్యసైన్యగణాన్ విభుః। 29

సుకుమారశరీరుడైనను ఆ కుమారస్వామి ఒకదినము మాత్రమే వారినుండి పాలుద్రాగి, మహిమాన్వితుడై అతడు తనపరాక్రమముచేత రాక్షససైన్యములను జయించెను. (29)

సురసేనాగణపతిం తతస్తమతులద్యుతిమ్।
అభ్యషించన్ సురగణాః సమేత్యాగ్ని పురోగమాః। 30

దేవతలు అగ్నిదేవుని నాయకత్వమున సాటిలేని తేజస్వియైన ఆ బాలునికడకు చేరి, అతనిని 'దేవసేనాపతి'గా అభిషేకించిరి. (30)

ఏష తే రామ గంగాయా విస్తరోఽభిహితో మయా।
కుమారసంభవశ్చైవ ధన్యః పుణ్యస్తథైవ చ। 31

ఓ రామా! నేను నీకు గంగా వృత్తాంతమును, కుమార సంభవగాథను విపులముగా దెల్పితిని. పవిత్రమైన ఈ గాథను విన్నవారు ధన్యులగుదురు. (31)

భక్తశ్చ యః కార్తికేయే కాకుత్స్థ భువి మానవః।
ఆయుష్మాన్ పుత్రపౌత్రైశ్చ స్కందసాలోక్యతాం వ్రజేత్। 32

ఓ రామా! కుమారస్వామిపై భక్తిగల మానవుడు ఈ లోకమున దీర్ఘాయుష్మంతుడై, పుత్ర పౌత్రులతో వర్ధిల్లును. తుదకు స్కందసాలోక్యఫలమునుగూడ పొందును. (32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తత్రింశస్సర్గః (37)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదియేడవసర్గము సమాప్తము

-- * * * --

38. ముప్పదిఎనిమిదవసర్గము

సగరునకు పుత్రప్రాప్తి.

తాం కథాం కౌశికో రామే నివేద్య కుశికాత్మజః।
పున రేవాపరం వాక్యం కాకుత్స్థమ్ ఇద మబ్రవీత్। 1

గాధిసుతుడైన విశ్వామిత్రుడు కుమారస్వామిజనన వృత్తాంతముతోగూడిన గంగాగాథను శ్రీరామునకు వివరించిన పిమ్మట' ఇంకను ఆయనతో ఇట్లు చెప్పసాగెను. (1)

అయోధ్యాధిపతిః శూరః పూర్వమాసీన్నరాధిపః।
సగరో నామ ధర్మాత్మా ప్రజాకామస్స చాప్రజః। 2

పూర్వము 'సగరుడు' అను మహారాజు అయోధ్యను పరిపాలించుచుండెను. అతడు మహావీరుడు. ధర్మాత్ముడు, ఆయనకు సంతానము లేకుండుటచే పిల్లలకొఱకై తపన పడుచుండెను. (2)

వైదర్భదుహితా రామ కేశినీ నామ నామతః।
జ్యేష్ఠా సగరపత్నీ సా ధర్మిష్ఠా సత్యవాదినీ। 3

ఓ రామా! విదర్భరాజుయొక్కకుమార్తెయైన 'కేశిని' అనునామె ఆ సగరుని పెద్దభార్య. ఆమె ధర్మనిష్ఠగలది. సత్యవాదిని. (3)

అరిష్టనేమిదుహితా రూపేణాప్రతిమా భువి।
ద్వితీయా సగరస్యాసీత్ పత్నీ సుమతిసంజ్ఞితా॥ 4

తాభ్యాం సహ తతో రాజా పత్నీభ్యాం తప్తవాం స్తపః।
హిమవంతం సమాసాద్య భృగుప్రస్రవణే గిరౌ॥ 5

అథ వర్షశతే పూర్ణే తపసారాధితో మునిః।
సగరాయ వరం ప్రాదాత్ భృగు స్సత్యవతాం వరః॥ 6

అపత్యలాభ స్సుమహాన్ భవిష్యతి తవానఘ।
కీర్తిం చాప్రతిమాం లోకే ప్రాప్స్యసే పురుషర్షభ॥ 7

ఏకా జనయితా తాత పుత్త్రం వంశకరం తవ।
షష్టిం పుత్త్ర సహస్రాణి అపరా జనయిష్యతి॥ 8

భాషమాణం మహాత్మానం రాజపుత్త్ర్యౌ ప్రసాద్య తమ్।
ఊచతుః పరమప్రీతే కృతాంజలిపుటే తదా॥ 9

ఏకః కస్యాస్సుతో బ్రహ్మన్ కా బహూన్ జనయిష్యతి।
శ్రోతుమిచ్ఛావహే బ్రహ్మన్ సత్యమస్తు వచ స్తవ॥ 10

తయో స్తద్వచనం శ్రుత్వా భృగుః పరమధార్మికః।
ఉవాచ పరమాం వాణీం స్వచ్ఛందోఽత్ర విధీయతామ్॥ 11

ఏకో వంశకరో వాస్తు బహవో వా మహాబలాః।
కీర్తిమంతో మహోత్సాహా కా వా కం వర మిచ్ఛతి॥ 12

మునేస్తు వచనం శ్రుత్వా కేశినీ రఘునందన।
పుత్త్రం వంశకరం రామ జగ్రాహ నృపసన్నిధౌ॥ 13

షష్టిం పుత్త్రసహస్రాణి సుపర్ణభగినీ తదా।
మహోత్సాహాన్ కీర్తిమతో జగ్రాహ సుమతిః సుతాన్॥ 14

ప్రదక్షిణమ్ ఋషిం కృత్వా శిరసాఽభి ప్రణమ్య చ।
జగామ స్వపురం రాజా సభార్యో రఘునందన॥ 15

అథ కాలే గతే తస్మిన్ జ్యేష్ఠా పుత్త్రం వ్యజాయత।
అసమంజ ఇతి ఖ్యాతం కేశినీ సగరాత్మజమ్॥ 16

'సుమతి' అనునామె సగరునిరెండవభార్య. ఆమె 'అరిష్టనేమి' అను పేరు గల కశ్యపుని కూతురు. గరుత్మంతుని సోదరి. నిరుపమానసౌందర్యవతి. (4)

ఆ సగరమహారాజు తనఇద్దఱుభార్యలతోగూడి హిమవత్పర్వతమును జేరి, అచటి భృగుప్రస్రవణ గిరియందు తపమాచరించెను. (5)

సగరుడు అచట ఒక నూఱుసంవత్సరములపాటు భృగుమహర్షిని ఆరాధించుచు తపమొనర్చెను. ఆ తపస్సునకు మెచ్చి, సత్యవంతులలో శ్రేష్ఠుడగు ఆ ముని ఆయనకు ఒక వరమును ప్రసాదించెను. (6)

"పుణ్యాత్ముడవైన ఓ మహారాజా! నీకు పెక్కుమంది పుత్త్రులు కలుగుదురు, లోకమున నీ కీర్తి ఇనుమడించును. నాయనా! నీకు ఒక భార్యయందు వంశమునకు వన్నెదెచ్చునట్టి ఒక పుత్త్రుడు ఉదయించును, మఱియొక భార్యయందు అఱువది వేలమంది పుత్త్రులు జన్మింతురు. ఆ రాజపుత్త్రికలు (కేశిని, సుమతి అనువారు) ఆ మహాముని వచనములకు మిగుల సంతసించినవారై, అంజలి ఘటించి ఆయనను ప్రసన్నునిగా జేసికొని ఇట్లు నుడివిరి. (7-9)

"ఓ మహాత్మా! మా ఇద్దఱిలో ఒక్క కుమారుడు కలుగునది ఎవరికి? పెక్కుమంది పుత్త్రులను కనునది ఎవరు? మేము వినగోరుచున్నాము. మీమాట జరిగితీరును." (10)

ఆ ఇద్దఱివినతిని ఆలకించి, పరమధార్మికుడైన భృగుమహర్షి 'పుత్త్రప్రాప్తి విషయమున మీ కోరికను ప్రకటింపుడు. వంశోద్ధారకుడైన కొడుకు మీలో ఎవరికి కావలెను? కీర్తిప్రతిష్ఠలుగలిగి మహాబలశాలురు, మహోత్సాహులు ఐన పెక్కుమందిపుత్త్రులను ఎవరు కోరుకొందురు?' అని మధురముగా అడిగెను. (11-12)

ఓ రఘురామా! భృగుమహర్షియొక్క మాటలను విని, సగరమహారాజసమక్షమున పెద్దభార్యయైన కేశిని "వంశకర్తయైన ఒక కుమారుని కోరెను. సగరుని రెండవ భార్యయు, గరుత్మంతునిసోదరియు ఐన సుమతి మహోత్సాహులును, కీర్తిప్రతిష్ఠలుగలవారును ఐన అఱువది వేలమంది పుత్త్రులను కోరుకొనెను. (13-14)

ఓ రఘునందనా! అనంతరము సగరమహారాజు తన భార్యలతోగూడి భృగుమహర్షికి ప్రదక్షిణనమస్కారములను ఆచరించి, అయోధ్యాపురమునకు చేరెను. (15)

కొంతకాలమునకు సగరునిపెద్దభార్యయగు కేశిని ఒక కుమారుని గనెను. ఆ సగరపుత్త్రుడు 'అసమంజుడు' అను పేరుతో ప్రసిద్ధికెక్కెను. (16)

సుమతిస్తు నరవ్యాఘ్ర గర్భతుంబం వ్యజాయత।
షష్టిః పుత్త్రా స్సహస్రాణి తుంబభేదాద్వినిస్సృతాః। 17

ఘృతపూర్ణేషు కుంభేషు ధాత్ర్యస్తాన్ సమవర్ధయన్।
కాలేన మహతా సర్వే యౌవనం ప్రతిపేదిరే। 18

అథ దీర్ఘేణ కాలేన రూపయౌవనశాలినః।
షష్టిః పుత్త్రసహస్రాణి సగరస్యాభవంస్తదా। 19

స చ జ్యేష్ఠో నరశ్రేష్ఠః సగరస్యాత్మసంభవః।
బాలాన్ గృహీత్వా తు జలే సరయ్వా రఘునందన।
ప్రక్షిప్య ప్రహసన్ నిత్యం మజ్జతస్తాన్ నిరీక్ష్య వై। 20

ఏవం పాపసమాచారః సజ్జనప్రతిబాధకః।
పౌరాణామహితే యుక్తః పుత్త్రో నిర్వాసితః పురాత్। 21

తస్య పుత్త్రోఽంశుమాన్ నామ అసమంజస్య వీర్యవాన్।
సమ్మతః సర్వలోకస్య సర్వస్యాపి ప్రియంవదః। 22

తతః కాలేన మహతా మతి స్సమభిజాయత।
సగరస్య నరశ్రేష్ఠ యజేయమితి నిశ్చితా। 23

స కృత్వా నిశ్చయం రామ సోపాధ్యాయగణ స్తదా।
యజ్ఞకర్మణి వేదజ్ఞో యష్టుం సముపచక్రమే। 24

ఓ నరోత్తమా! రామా! రెండవ భార్యయైన సుమతి గుండ్రని సొరకాయవంటి గర్భపిండమును ప్రసవించెను. ఆ పిండమునుండి అఱువదివేలమందిపుత్త్రులు వెలువడిరి. ఆ కుమారులను దాదులు నేతితోనిండిన కుండలయందు పెంచిరి. కొంతకాలమునకు వారందఱిలో యౌవనము అంకురించెను. క్రమముగా సగరునియొక్క అఱువదివేలమందిసుతులును రూపయౌవనసంపన్నులైరి. (17-19)

ఓ నరోత్తమా! రామా! సగరునిజ్యేష్ఠకుమారుడైన అసమంజుడు నిత్యము నగరములోనిబాలురను సరయూనదికి తీసికొనివెళ్ళి, వారిని జలములలోనికి త్రోసెడివాడు. వారు మునకలు వేయుచుండుట చూచి నవ్వుచు ఆనందించుచుండెడివాడు. (20)

ఇట్లు అసమంజుడు పెక్కు విధములైన (పాపపు) పనులు చేయుచుండెను, సజ్జనులను బాధించుచుండెను. పౌరులకు హానికలిగించుచుండెను. అందువలన సగరుడు ఆ కుమారుని నగరమునుండి వెడలగొట్టెను. (21)

అసమంజునికుమారుడైన అంశుమంతుడు గొప్ప పరాక్రమశాలి. అతడు ప్రజలందఱికిని ప్రీతిపాత్రుడు. అందఱితోడను ప్రియముగా మాటాడుచుండెడివాడు. (22)

ఓ నరశ్రేష్ఠా! కొంతకాలమునకు పిమ్మట సగరమహారాజునకు యజ్ఞము చేయవలయునను సంకల్పము కలిగెను. ఓ రామా! వేదజ్ఞుడైన సగరుడు అట్లు నిర్ణయించుకొని, గురువులతో ఋత్విజులతో గూడి యజ్ఞకార్యమును ఆరంభించెను. (23-24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే అష్టత్రింశస్సర్గః (38)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదియెనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

39. ముప్పదితొమ్మిదవసర్గము

సగరునియజ్ఞము - యజ్ఞాశ్వమును వెదకుట.

విశ్వామిత్రవచః శ్రుత్వా కథాంతే రఘునందనః।
ఉవాచ పరమప్రీతో మునిం దీప్తమివానలమ్। 1

శ్రోతుమిచ్ఛామి భద్రం తే విస్తరేణ కథామిమామ్।
పూర్వకో మే కథం బ్రహ్మన్ యజ్ఞం వై సముపాహరత్। 2

విశ్వామిత్రుడు తెలిపిన యజ్ఞప్రారంభ విషయమును విని, రఘురాముడు మిక్కిలి సంతోషించెను. పిమ్మట అగ్నివలె తేజస్వియైన ఆ మునితో ఇట్లనెను. (1)

"ఓ మహాత్మా! మా వంశమున ప్రముఖుడైన సగరమహారాజు యజ్ఞమును చేసినవిధమును వినగోరు చున్నాను. దయతో విపులముగా వివరింపుడు. మీకు పుణ్యముండును." (2)

విశ్వామిత్రస్తు కాకుత్స్థమ్ ఉవాచ ప్రహసన్నివ।
శ్రూయతాం విస్తరో రామ సగరస్య మహాత్మనః। 3

శంకరశ్వశురో నామ హిమవాన్ అచలోత్తమః।
వింధ్యపర్వతమాసాద్య నిరీక్షేతే పరస్పరమ్। 4

తయోర్మధ్యే ప్రవృత్తోఽభూత్ యజ్ఞస్స పురుషోత్తమ।
స హి దేశో నరవ్యాఘ్ర ప్రశస్తో యజ్ఞకర్మణి। 5

తస్యాశ్వచర్యాం కాకుత్స్థ దృఢధన్వా మహారథః।
అంశుమాన్అకరోత్ తాత సగరస్య మతే స్థితః। 6

తస్య పర్వణి తం యజ్ఞం యజమానస్య వాసవః।
రాక్షసీం తనుమాస్థాయ యజ్ఞీయాశ్వమపాహరత్। 7

హ్రియమాణే తు కాకుత్స్థ తస్మిన్నశ్వే మహాత్మనః।
ఉపాధ్యాయగణాః సర్వే యజమానమథాబ్రువన్। 8

అయం పర్వణి వేగేన యజ్ఞీయాశ్వోఽపనీయతే।
హర్తారం జహి కాకుత్స్థ హయశ్చైవోపనీయతామ్। 9

యజ్ఞచ్ఛిద్రం భవత్యేతత్ సర్వేషామశివాయ నః।
తత్తథా క్రియతాం రాజన్ యథాఽచ్ఛిద్రః క్రతుర్భవేత్। 10

ఉపాధ్యాయవచః శ్రుత్వా తస్మిన్ సదసి పార్థివః।
షష్టిం పుత్రసహస్రాణి వాక్యమేతదువాచ హ। 11

గతిం పుత్రా న పశ్యామి రక్షసాం పురుషర్షభాః।
మంత్రపూతైర్మహాభాగైరాస్థితో హి మహాక్రతుః। 12

తద్గచ్ఛత విచిన్వధ్వం పుత్రకా భద్రమస్తు వః।
సముద్రమాలినీం సర్వాం పృథివీమ్ అనుగచ్ఛత। 13

ఏకైకయోజనం పుత్రా విస్తారమధిగచ్ఛత।
యావత్తురగ సందర్శః తావత్ ఖనత మేదినీమ్। 14

అంతట విశ్వామిత్రుడు (సర్వజ్ఞుడైన రాముడు తెలియని వానివలె ఇట్లు అడుగుచున్నందులకు) చిరునవ్వు చిందించుచు "ఓ రామా! మహాత్ముడైన సగరునియజ్ఞవృత్తాంతమును వివరించెదను వినుము." అని పలికెను. (3)

హిమవంతుడను పర్వతరాజు శంకరునకు మామ. హిమవత్పర్వతమునకును వింధ్యపర్వతమునకును మధ్య ఎత్తైన గిరులు ఎవ్వియును లేకుండుటచే ఆ రెండును పరస్పరము చూచుకొనుచున్నట్లు ఉండెను. ఆ రెండు పర్వతములమధ్యగల ప్రదేశమునందు ఈ యజ్ఞము జరిగెను. ఓ పురుషోత్తమా! 'ఆర్యావర్తము' గా ప్రసిద్ధికెక్కిన ఈ ప్రదేశము యజ్ఞకర్మలకు అనువైనది. నాయనా! రామా! మహారథుడైన అంశుమంతుడు శక్తిమంతములైన ధనుర్బాణములను ధరించి, సగరుని ఆజ్ఞానుసారము ఆయనయజ్ఞాశ్వమును అనుసరించెను. (4-6)

ఇంద్రుడు మాయామయశరీరమును దాల్చి 'ఉక్థ్యము' అను పర్వదినమునందు యజ్ఞమును ఆచరించుచున్న ఆ సగరుని యొక్క యజ్ఞాశ్వమును అపహరించెను. (7)

ఓ రాఘవా! ఆ యజ్ఞాశ్వము అట్లు దొంగిలింపబడగా మహాత్ములైన ఋత్విజులు అందఱును సగరునితో ఇట్లు నుడివిరి. (8)

"కకుత్స్థవంశమునకు చెందిన ఓ సగరా! ఈ పర్వదినమున యజ్ఞాశ్వమును ఎవరో ఇప్పుడే తీసికొనిపోయినారు. ఆ హయమును అపహరించిన వానిని చంపి, దానిని తీసికొని రమ్ము. యజ్ఞమునకు భంగము కలిగినచో మన అందఱికిని అరిష్టము ప్రాప్తించును. కనుక ఓ రాజా! యజ్ఞము నిర్విఘ్నముగా కొనసాగునట్లు చూడుము." (9-10)

సగరమహారాజు ఆ సభలోని ఋత్విజులమాటలను విన్న పిమ్మట, తన అఱువదివేలమంది పుత్రులతో ఇట్లు నుడివెను. (11)

"ఉత్తములైన ఓ కుమారులారా! రాక్షసులయొక్క గమనమును నేను పసిగట్టలేదు. ఈ మహాక్రతువు మంత్రవేత్తలైన మహానుభావులచే నిర్వహింపబడుచున్నది. (అశ్వమును ఎవరు అపహరించిరో తెలియుటలేదు.) కావున ఓ కుమారులారా! (నేను యజ్ఞకార్యములలో నిమగ్నుడనై యున్నాను. అశ్వమును అపహరించిన వారు ఎటు వెళ్లిరో తెలియుదు.) మీరు వెళ్లి దానిని అన్వేషింపుడు. మీకు శుభమగుగాక. సముద్రపర్యంతము వ్యాపించియున్న ఈ సమస్తభూమండలమును వెదకుడు. నాయనలారా! మీలో ఒక్కొక్కడు యోజనవిస్తారభూమిని పంచుకొని అన్వేషింపుడు. ఒక వేళ ఈ భూమండలమున ఆ యజ్ఞాశ్వముయొక్క జాడ తెలియనిచో భూమిని త్రవ్వియైనను అది కనబడునంతవఱకును వెదకుడు. (12-14)

తం చైవ హయహర్తారం మార్గమాణా మమాజ్ఞయా।
దీక్షితః పౌత్త్రసహితః సోపాధ్యాయగణో హ్యహమ్।
ఇహ స్థాస్యామి భద్రం వో యావత్తురగదర్శనమ్। 15

ఇత్యుక్తా హృష్టమనసో రాజపుత్త్రా మహాబలాః।
జగ్ముర్మహీతలం రామ పితు ర్వచనయంత్రితాః। 16

యోజనాయామవిస్తారమ్ ఏకైకో ధరణీతలమ్।
బిభిదుః పురుషవ్యాఘ్ర వజ్రస్పర్శసమైర్నఖైః। 17

శూలైరశనికల్పైశ్చ హలైశ్చాపి సుదారుణైః।
భిద్యమానా వసుమతీ ననాద రఘునందన। 18

నాగానాం వధ్యమానానామ్ అసురాణాం చ రాఘవ।
రాక్షసానాం చ దుర్ధర్షః సత్త్వానాం నినదోఽభవత్। 19

యోజనానాం సహస్రాణి షష్టిం తు రఘునందన।
బిభిదుర్ధరణీం వీరా రసాతలమనుత్తమమ్। 20

ఏవం పర్వతసంబాధం జంబూద్వీపం నృపాత్మజాః।
ఖనంతో నరశార్దూల సర్వతః పరిచక్రముః। 21

తతో దేవాస్సగంధర్వాః సాసురాస్సహపన్నగాః।
సంభ్రాంతమనసః సర్వే పితామహముపాగమన్। 22

తే ప్రసాద్య మహాత్మానం విషణ్ణవదనాస్తదా।
ఊచుః పరమసంత్రస్తాః పితామహముపాగమన్। 23

భగవన్ పృథివీ సర్వా ఖన్యతే సగరాత్మజైః।
బహవశ్చ మహాత్మానో హన్యంతే తలవాసినః। 24

అయం యజ్ఞహరోఽస్మాకమ్ అనేనాశ్వోఽపనీయతే।
ఇతి తే సర్వభూతాని నిఘ్నంతి సగరాత్మజాః। 25

యజ్ఞాశ్వమును అపహరించిన వానిని గూడ అన్వేషించి పట్టుకొనుడు. ఇది నా ఆజ్ఞ. నేను యజ్ఞదీక్షలో ఉన్నాను. కనుక నేనును, యజ్ఞనిర్వహణలో నాకు సహాయకులుగానున్న ఋత్విజులును, పౌత్త్రుడైన అంశుమంతుడును ఈ యజ్ఞవాటిక యందే ఉండవలసియున్నది. అశ్వమునకై వెళ్లుడు. మీ ప్రయత్నము ఫలించుగాక." (15)

ఓ రామా! తండ్రి ఇట్లు పలుకగా మహాబలశాలురైన ఆ రాజకుమారులు మిక్కిలి సంతసించి, తండ్రిగారి ఆదేశమును అనుసరించి, భూమండలమును గాలించుటకు బయలుదేఱిరి. మహాబలసంపన్నులైన ఆ రాజకుమారులు భూమండలమంతయు గాలించినను గుఱ్ఱపుజాడ తెలియలేదు. అంతట ఓ పురుష శ్రేష్ఠా! వారిలో ఒక్కొక్కరు ఒక యోజనవిస్తీర్ణముగల భూతలమును ఎంచుకొని, వజ్రతుల్యములైన తమగోళ్లతో భూమిని త్రవ్వివేసిరి. (16-17)

ఓ రఘునందనా! శూలములతోడను, భీకరములైన నాగళ్లతోడను భూమిని త్రవ్వలు గావించుచుండగా అందుండి ఒక మహానాదము వెలువడెను. ఓ రామా! వారు అట్లు త్రవ్వుచుండగా పాతాళమునగల సర్పములు, అసురులు, రాక్షసులు, తదితరప్రాణులు భరింపరానంతగా గగ్గోలు పెట్టసాగెను. ఓ రఘునందనా! వీరులైన సగరపుత్త్రులు అఱువదివేల యోజనముల విస్తీర్ణముగల భూమండలమును మిక్కిలి లోతుగా పాతాళమువఱకు త్రవ్విరి. (18-20)

ఓ నరోత్తమా! ఆ రాజకుమారులు పర్వతములతో నిండియున్న జంబూద్వీపమును ఇట్లు త్రవ్వుచు అంతటను సంచరించిరి. (21)

అంతట దేవతలు, గంధర్వులు, అసురులు, నాగులు మొదలగు వారందఱును వికలమనస్కులై, బ్రహ్మదేవునికడకు వెళ్లిరి. వారు మిగుల భయకంపితులై దిగులు చెందిన వదనములతో మహాత్ముడైన బ్రహ్మను ప్రసన్నునిగా జేసికొని ఇట్లు విన్నవించుకొనిరి. (22-24)

ఓ పితామహా! సగరునికుమారులు ఈ భూమండలము నంతయును త్రవ్వుచున్నారు. ఆ కారణముగా పాతాళవాసులైన మహాత్ములు పెక్కుమంది హతులగుచున్నారు. "వీడే మన యజ్ఞాశ్వమును అపహరించినవాడు. వీడే మనయజ్ఞమును చెడగొట్టిన వాడు" అని పలుకుచు ఆ సగరపుత్త్రులు సమస్త ప్రాణులను సంహరించుచున్నారు. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకోనచత్వారింశస్సర్గః *(39)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ముప్పదితొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

40. నలుబదియవసర్గము

కపిలునిక్రోధాగ్నిలో సగరునికుమారులు భస్మమగుట.

దేవతానాం వచః శ్రుత్వా భగవాన్ వై పితామహః।
ప్రత్యువాచ సుసంత్రస్తాన్ కృతాంతబలమోహితాన్। 1

య స్యేయం వసుధా కృత్స్నా వాసుదేవస్య ధీమతః।
కాపిలం రూపమాస్థాయ ధారయత్యనిశం ధరామ్।
తస్య కోపాగ్నినా దగ్ధా భవిష్యంతి నృపాత్మజాః। 2

పృథివ్యాశ్చాపి నిర్భేదో దృష్ట ఏవ సనాతనః।
సగరస్య చ పుత్రాణాం వినాశోఽ దీర్ఘజీవినామ్। 3

పితామహవచః శ్రుత్వా త్రయస్త్రింశదరిందమ।
దేవాః పరమసంహృష్టాః పునర్జగ్ముర్యథాగతమ్। 4

సగరస్య చ పుత్రాణాం ప్రాదురాసీన్మహాత్మనామ్।
పృథివ్యాం భిద్యమానాయాం నిర్ఘాతసమనిస్వనః। 5

తతో భిత్త్వా మహీం సర్వే కృత్వా చాపి ప్రదక్షిణమ్।
సహితా సాగరా స్సర్వే పితరం వాక్య మబ్రువన్। 6

పరిక్రాంతా మహీ సర్వా సత్త్వవంతశ్చ సూదితాః।
దేవదానవరక్షాంసి పిశాచోరగకిన్నరాః। 7

న చ పశ్యామహేఽశ్వం తమ్ అశ్వహర్తారమేవ చ।
కిం కరిష్యామ భద్రం తే బుద్ధిరత్ర విచార్యతామ్। 8

తేషాం తద్వచనం శ్రుత్వా పుత్రాణాం రాజసత్తమః।
సమన్యురబ్రవీద్వాక్యం సగరో రఘునందన। 9

భూయః ఖనత భద్రం వో నిర్భిద్య వసుధాతలమ్।
అశ్వహర్తారమాసాద్య కృతార్థాశ్చ నివర్తథ। 10

ఎల్ల ప్రాణులను హింసించుచున్న సగరపుత్రులబలమునకు కలతచెంది, దేవతలు భయభ్రాంతులైరి. వారిమొఱను ఆలకించి, సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు వారితో ఇట్లనెను. (1)

"ఈ భూమండలమంతయును సర్వశక్తిమంతుడైన ఆ శ్రీమహావిష్ణుదేవునిది. ఆయన కపిలమహర్షిగా అవతరించి, నిరంతరము ఈ భూభారమును మోయుచున్నాడు. ఆయన కోపాగ్నికి ఈ సగరకుమారులు భస్మమయ్యెదరు. (2)

భూమండలము ఈ విధముగా త్రవ్వబడుననియు, అల్పాయుష్కులైన సగరపుత్రులు నశింతురనియు ఏనాడో నిర్ణయింపబడినది." (3)

బ్రహ్మదేవునియొక్క ఈ అభయవచనములను విని, ముప్పదిమూడుమంది దేవతలు, (అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, ఇద్దఱు అశ్వనీ దేవతలు) గంధర్వులు మొదలగు వారు మిక్కిలి సంతసించినవారై తమతమ స్థానములకు వెళ్లిపోయిరి. (4)

మహాబలసంపన్నులైన సగరపుత్రులు భూమిని ఇట్లు త్రవ్వుచుండగా వారివినాశనమునకు సూచకముగా పిడుగుపాటు వంటి ఒక మహాధ్వని ఉద్భవించెను. వారందఱును భూమినంతయును త్రవ్వి, ప్రదక్షిణమొనర్చి, తండ్రికడకు వెళ్లి, ఆయనతో ఇట్లు పలికిరి. (5-6)

"సమస్త భూమండలమును గాలించితిమి. బలవంతులైన దేవదానవరాక్షసులను, పిశాచములను, నాగులను, కిన్నరులను మట్టుపెట్టితిమి. అయితే యజ్ఞాశ్వమును గాని, దానిని అపహరించిన వానిని గాని కనుగొనలేక పోయితిమి. బాగుగా ఆలోచించి, మా కర్తవ్యమును తెలుపుడు. మీకు పుణ్యముండును." (7-8)

ఓ రఘునందనా! సగరమహారాజు తనపుత్త్రులమాటలను విని, వారు రిక్తహస్తములతో వచ్చినందులకు కుపితుడై ఇట్లు పలికెను. (9)

"మరల భూమిని త్రవ్వుడు. మీకు శుభమగుగాక. ఈ భూమండలమును భేదించి, అశ్వమును, దానిని అపహరించిన వానిని పట్టుకొని, కృతార్థులై తిరిగిరండు." (10)

పితుర్వచనమాసాద్య సగరస్య మహాత్మనః।
షష్టిః పుత్త్రసహస్రాణి రసాతలమభిద్రవన్। 11

ఖన్యమానే తతస్తస్మిన్ దదృశుః పర్వతోపమమ్।
దిశాగజం విరూపాక్షం ధారయంతం మహీతలమ్। 12

సపర్వతవనాం కృత్స్నాం పృథివీం రఘునందన।
శిరసా ధారయామాస విరూపాక్షో మహాగజః। 13

యదా పర్వణి కాకుత్స్థ విశ్రమార్థం మహాగజః।
ఖేదాచ్చాలయతే శీర్షం భూమికంపస్తదా భవేత్। 14

తం తే ప్రదక్షిణం కృత్వా దిశాపాలం మహాగజమ్।
మానయంతో హి తే రామ జగ్ముర్భిత్త్వా రసాతలమ్। 15

తతః పూర్వాం దిశం భిత్త్వా దక్షిణాం బిభిదుః పునః।
దక్షిణస్యామపి దిశి దదృశుస్తే మహాగజమ్। 16

మహాపద్మం మహాత్మానం సుమహత్ పర్వతోపమమ్।
శిరసా ధారయంతం తే విస్మయం జగ్మురుత్తమమ్। 17

తతః ప్రదక్షిణం కృత్వా సగరస్య మహాత్మనః।
షష్టిః పుత్త్రసహస్రాణి పశ్చిమాం బిభిదుర్దిశమ్। 18

పశ్చిమాయామపి దిశి మహాంతమచలోపమమ్।
దిశాగజం సౌమనసం దదృశుస్తే మహాబలాః। 19

తం తే ప్రదక్షిణం కృత్వా పృష్ట్వా చాపి నిరామయమ్।
ఖనంత స్సముపక్రాంతా దిశం హైమవతీం తతః। 20

ఉత్తరస్యాం రఘుశ్రేష్ఠ దదృశుర్హిమపాండరమ్।
భద్రం భద్రేణ వపుషా ధారయంతం మహీ మిమామ్। 21

సమాలభ్య తతః సర్వే కృత్వా చైనం ప్రదక్షిణమ్।
షష్టిః పుత్త్రసహస్రాణి బిభిదు ర్వసుధాతలమ్। 22

తతః ప్రాగుత్తరాం గత్వా సాగరాః ప్రథితాం దిశమ్।
రోషాదభ్యఖనన్ సర్వే పృథివీం సగరాత్మజాః। 23

తే తు సర్వే మహాత్మానో భీమవేగా మహాబలాః।
దదృశుః కపిలం తత్ర వాసుదేవం సనాతనమ్। 24

మహాత్ముడైన సగరుని మాటలను విని, అతని అఱువది వేలమంది పుత్త్రులు పాతాళలోకమునకు పరుగులు తీసిరి. (11)

అట్లు త్రవ్వుచు, వారు భూతలమును మోయుచున్న, పర్వతప్రమాణములోనున్న 'విరూపాక్షము' అను పేరు గల దిగ్గజమును చూచిరి. (12)

ఓ రఘునందనా! పర్వతములతో వనములతో విలసిల్లుచున్న సమస్త భూ భారమును 'విరూపాక్షము' అను ఆ మహాగజము తన శిరస్సుపై మోయుచుండెను. పర్వకాలములయందు అప్పుడప్పుడు ఆ మహాగజము అలసట తీర్చుకొనుటకై తలను కదలించినప్పుడు భూమి కంపించును. (13-14)

ఓ రామా! వారు ఆ మహాదిగ్గజమునకు ప్రదక్షిణమొనర్చి, పూజించిరి. పిదప వారు భూమిని భేదించుకొనుచు రసాతలమునకు బయలుదేఱిరి. పూర్వదిశను త్రవ్విన పిమ్మట వారు దక్షిణదిశను భేదించిరి. దక్షిణదిశయందును వారు ఒక మహాగజమును దర్శించిరి. (15-16)

పర్వతప్రమాణమున మహాశరీరముగల 'మహాపద్మము' అను దిగ్గజము దక్షిణభూభారమును మోయుచుండగా దాని మహత్స్వరూపమును జూచి వారు విస్మయమును పొందిరి. ఆ దిగ్గజమునకు ప్రదక్షిణ మొనర్చి మహాత్ముడైన సగరుని యొక్క అఱువది వేలమంది పుత్త్రులు పశ్చిమ దిశను భేదించిరి. పశ్చిమ దిశయందు భూభారమును వహించుచున్న 'సౌమనసము' అను పర్వతప్రమాణ శరీరముగల మహాదిగ్గజమును ఆ మహాబలశాలురు చూచిరి. ఆ 'సౌమనస' మహాగజమునకును ప్రదక్షిణము చేసి, కుశలమడిగి, భూమిని త్రవ్వుచు ఉత్తర దిశకు చేరిరి. (17-20)

ఓ రఘురామా! ఉత్తర దిశయందు మంచువలె తెల్లనైన 'భద్రము' అను పేరుగల దిగ్గజము తనబలమైన శరీరముతో ఈ భూభారమును మోయుచుండగా వారు దానిని చూచిరి. ఆ అఱువది వేలమంది రాజకుమారులు దానిని స్పృశించి, ప్రదక్షిణ మాచరించి, భూమిని త్రవ్విరి. పిమ్మట ఆ సగర కుమారులు ప్రసిద్ధమైన ఈశాన్య దిశకు పయనించి, రోషావేశములతో భూమిని త్రవ్విరి. (21-23)

మిక్కిలి వేగగమనులు, మహాబలశాలురు, మహాకాయులు ఐన ఆ రాకుమారులు సనాతనుడును, మహావిష్ణువుయొక్క అవతారమూ ఐన కపిలమహర్షిని గాంచిరి. (24)

హయం చ తస్య దేవస్య చరంతమ్ అవిదూరతః।
ప్రహర్షమతులం ప్రాప్తాః సర్వే తే రఘునందన। 25

తే తం హయహరం జ్ఞాత్వా క్రోధపర్యాకులేక్షణాః। 26

ఖనిత్రలాంగలధరా నానావృక్షశిలాధరాః।
అభ్యధావంత సంక్రుద్ధాః తిష్ఠ తిష్ఠేతి చాబ్రువన్। 27

అస్మాకం త్వం హి తురగం యజ్ఞీయం హృతవానసి।
దుర్మేధస్త్వం హి సంప్రాప్తాన్ విద్ధి నస్సగరాత్మజాన్। 28

శ్రుత్వా తు వచనం తేషాం కపిలో రఘునందన।
రోషేణ మహతాఽఽవిష్టో హుంకారమకరోత్ తదా। 29

తతస్తేనాప్రమేయేణ కపిలేన మహాత్మనా।
భస్మరాశీకృతాః సర్వే కాకుత్స్థ సగరాత్మజాః। 30

ఓ రఘునందనా! మహాత్ముడైన కపిలునిసమీపమున చరించుచున్న గుఱ్ఱమును చూచి, ఆ రాకుమారులందఱును ఎంతయు సంతోషపడిరి. ఆ కపిలుడే యజ్ఞాశ్వమును అపహరించి యుండునని భావించిరి. క్రోధముతో గ్రుడ్డురుముచు, గడ్డపారలను, నాగళ్ళను, వివిధవృక్షములను, శిలలను పట్టుకొని "ఆగుము-ఆగుము" అని పలుకుచు క్రోధావేశములతో ఆ కపిలుని మీదికి పరుగులు తీసిరి. (25-27)

"ఓ దుర్మార్గుడా ! ఇది మా యాగాశ్వము. దీనిని నీవే అపహరించి తెచ్చితివి. ఇక్కడికి వచ్చిన మేమందఱమును సగరపుత్రులమని - యెఱుంగుము" అని పలికిరి. (28)

ఓ రఘురామా! వారిదురుసుమాటలను విని, కపిలుడు అప్పుడు మహారోషావేశముతో హుంకరించెను. (29)

ఓ కాకుత్స్థా! మిక్కిలి మహిమాన్వితుడైన ఆ కపిలుని యొక్క హుంకారమునకు సగరకుమారులు అందఱును భస్మమైపోయిరి. (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే చత్వారింశస్సర్గః (40)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదియవసర్గము సమాప్తము

-- * * * --

41. నలుబదియొకటవసర్గము

అంశుమంతుడు యజ్ఞాశ్వమును తీసికొనివచ్చుట.

పుత్రాంశ్చిరగతాన్ జ్ఞాత్వా సగరో రఘునందన।
నప్తారమబ్రవీద్రాజా దీప్యమానం స్వతేజసా। 1

ఓ రఘురామా! సగరమహారాజు తనపుత్త్రులు ఎంత కాలమునకును మఱలి రాకుండుటచే దిగులుపడి, తేజస్వియై వెలుగొందుచున్న పౌత్త్రుడగు అంశుమంతునితో ఇట్లు నుడివెను. (1)

శూరశ్చ కృతవిద్యశ్చ పూర్వైస్తుల్యోఽసి తేజసా।
పితౄణాం గతిమన్విచ్ఛ యేన చాశ్వోఽపవాహితః। 2

"నాయనా! నీవు శూరుడవు, సమస్తవిద్యలను నేర్చినవాడవు, బలపరాక్రమములలో నీ పినతండ్రులతో సమానుడవు. యజ్ఞాశ్వమునకై వెళ్ళిన నీ పినతండ్రులేమైరో తెలియదు. వారిని, అశ్వమును, దానిని అపహరించిన వానిని వెదకుము. (2)

అంతర్భౌమాని సత్త్వాని వీర్యవంతి మహాంతి చ।
తేషాం త్వం ప్రతిఘాతార్థం సాసిం గృహ్ణీష్వ కార్ముకమ్। 3

అభివాద్యాభివాద్యాంస్త్వం హత్వా విఘ్నకరానపి।
సిద్ధార్థస్సన్ నివర్తస్వ మమ యజ్ఞస్య పారగః। 4

భూమిలోపలనుండు ప్రాణులు మిక్కిలి శక్తిసామర్థ్యములు గలవి, ఆకారములలో పెద్దవి. వాటిని హతమార్చుటకు ఖడ్గమును, ధనుస్సును తీసికొని వెళ్ళుము. నాయనా! పూజ్యులకు నమస్కరింపుము, నీ ప్రయత్నమునకు అడ్డువచ్చువారిని చంపివేయుము. కృతార్థుడవై మఱలి వచ్చి, నాయజ్ఞమును పూర్తి చేయుము." (3-4)

ఏవ ముక్తోఽంశుమాన్ సమ్యక్ సగరేణ మహాత్మనా।
ధనురాదాయ ఖడ్గం చ జగామ లఘువిక్రమః। 5

స ఖాతం పితృభిర్మార్గమ్ అంతర్భౌమం మహాత్మభిః।
ప్రాపద్యత నరశ్రేష్ఠ తేన రాజ్ఞాభిచోదితః। 6

దైత్యదానవరక్షోభిః పిశాచపతగోరగైః।
పూజ్యమానం మహాతేజా దిశాగజమపశ్యత। 7

స తం ప్రదక్షిణం కృత్వా పృష్ట్వాచాపి నిరామయమ్।
పితౄన్ స పరిపప్రచ్ఛ వాజిహర్తారమేవ చ। 8

దిశాగజస్తు తచ్ఛ్రుత్వా ప్రత్యాహాంశుమతో వచః।
అసమంజ కృతార్థస్త్వం సహాశ్వశ్శీఘ్రమేష్యసి। 9

తస్య తద్వచనం శ్రుత్వా సర్వానేవ దిశాగజాన్।
యథాక్రమం యథాన్యాయం ప్రష్టుం సముపచక్రమే। 10

తైశ్చ సర్వైర్దిశాపాలైః వాక్యజ్ఞైర్వాక్యకోవిదైః।
పూజితస్సహయశ్చైవ గంతాసీత్యభిచోదితః। 11

తేషాం తద్వచనం శ్రుత్వా జగామ లఘువిక్రమః।
భస్మరాశీకృతా యత్ర పితరస్తస్య సాగరాః। 12

స దుఃఖవశమాపన్నస్త్వసమంజసుతస్తదా।
చుక్రోశ పరమార్తస్తు వధాత్ తేషాం సుదుఃఖితః। 13

యజ్ఞీయం చ హయం తత్ర చరంతమ్ అవిదూరతః।
దదర్శ పురుషవ్యాఘ్రో దుఃఖశోకసమన్వితః। 14

స తేషాం రాజపుత్రాణాం కర్తుకామో జలక్రియామ్।
సలిలార్థీ మహాతేజా న చాపశ్యత్ జలాశయమ్। 15

విసార్య నిపుణాం దృష్టిం తతోఽపశ్యత్ ఖగాధిపమ్।
పితౄణాం మాతులం రామ సుపర్ణమ్ అనిలోపమమ్। 16

స చైవమబ్రవీద్వాక్యం వైనతేయో మహాబలః।
మా శుచః పురుషవ్యాఘ్ర వధోఽయం లోకసమ్మతః। 17

మహాత్ముడైన సగరునియొక్క పక్కా నిఆదేశమును అనుసరించి, అంశుమంతుడు ధనుస్సు, ఖడ్గమును గ్రహించి, వేగముగా వెళ్లెను. (5)

ఓ నరోత్తమా! శ్రీరామా! సగరునిచే ఆదేశింపబడిన ఆ అంశుమంతుడు, మహాత్ములైన పినతండ్రులు త్రవ్విన భూగర్భమార్గమును అనుసరించెను. (6)

దైత్యులు, దానవులు, రాక్షసులు, పిశాచములు, పక్షులు, నాగులు మొదలగు వారిచే పూజింపబడుచున్న దిగ్గజమును మహాతేజస్వియైన అంశుమంతుడు చూచెను. (7)

అతడు దానికి ప్రదక్షిణమొనర్చి, కుశలమడిగి, తన పినతండ్రులజాడనుగూర్చియు, అశ్వమును అపహరించినవాని ఆచూకీని గూర్చియు వినయముతో ప్రశ్నించెను. (8)

అంతట దిగ్గజము అంశుమంతుడు పలికిన ఆ మాటలను విని, "ఓ అంశుమంతా! నీవు కృతార్థుడవై త్వరలోనే యజ్ఞాశ్వముతో వెళ్లగలవు." అని నుడివెను. (9)

ఆ దిగ్గజము పల్కిన మాటలను విని, అతడు క్రమముగా దిగ్గజములను అన్నింటిని వినయపూర్వకముగా ప్రశ్నించెను. (10)

దేశకాలములకు అనుగుణముగా భాషించుటెరిగిన, ఎదుటి వారి అభిప్రాయమును గుర్తించు ప్రతిభయుగల ఆ దిగ్గజములు అన్నియును అతనిని గౌరవించి, "నీవు యజ్ఞాశ్వముతో త్వరలోనే మీ తాతగారికడకు చేరగలవు" - అని నుడివెను. (11)

త్వరత్వరగా అంశుమంతుడు ఆ దిగ్గజములపలుకులనాలించి, తనపినతండ్రులు భస్మరాశియై పడియున్న చోటికి వెళ్లెను. (12)

అచట తనపినతండ్రులు కనబడకపోవుటచే అంశుమంతుడు మిగుల దుఃఖితుడాయెను. వారిమరణ వార్తను విని, మిక్కిలి పరితపించి ఏడువసాగెను. (13)

దుఃఖశోకములకు లోనైన ఆ నరశ్రేష్ఠుడు అచటికి సమీపముననే అటునిటు తిరుగుచున్న యజ్ఞాశ్వమును చూచెను. (14)

అతడు తనపినతండ్రులకు తర్పణములను ఇచ్చుటకు సంకల్పించెను. అందులకై ఆ తేజస్వి జలమునకై తీక్ష్ణగా అటు నిటు చూచెను. కాని జలాశయము మాత్రము కనబడలేదు. అతడు తననిశితదృష్టిని ప్రసరింపజేయగా తనపినతండ్రులకు మేనమామయు, వాయువేగము గలవాడును, ఖగరాజు ఐన గరుత్మంతుడు కనబడెను. (15-16)

అంతట ఆ మహాబలశాలియైన వైనతేయుడు అతనితో ఇట్లనెను. "ఓ నరోత్తమా! శోకింపకుము. నీ పినతండ్రులమృతి లోకహితమునకే జరిగెను. మహాబలశాలురైన నీ పినతండ్రులు

కపిలే నాప్రమేయేణ దగ్ధా హీమే మహాబలాః।
సలిలం నార్హసి ప్రాజ్ఞ దాతు మేషాం హి లౌకికమ్। 18

గంగా హిమవతో జ్యేష్ఠా దుహితా పురుషర్షభ।
తస్యాం కురు మహాబాహో పితౄణాం తు జలక్రియామ్। 19

భస్మరాశీకృతాన్ ఏతాన్ ప్లావయేల్లోకపావనీ।
తయా క్లిన్నమిదం భస్మ గంగయా లోకకాంతయా।
షష్టిం పుత్రసహస్రాణి స్వర్గలోకం నయిష్యతి। 20

గచ్ఛ చాశ్వం మహాభాగ తం గృహ్య పురుషర్షభ।
యజ్ఞం పైతామహం వీర సంవర్తయితుమర్హసి। 21

సుపర్ణవచనం శ్రుత్వా సోఽంశుమానతివీర్యవాన్।
త్వరితం హయ మాదాయ పునరాయాన్మహాయశాః। 22

తతో రాజానమాసాద్య దీక్షితం రఘునందన।
న్యవేదయద్యథావృత్తం సుపర్ణవచనం తథా। 23

తచ్ఛ్రుత్వా ఘోరసంకాశం వాక్యమంశుమతో నృపః।
యజ్ఞం నిర్వర్తయామాస యథాకల్పం యథావిధి। 24

స్వపురం చాగమచ్ఛ్రీమాన్ ఇష్టయజ్ఞో మహీపతిః।
గంగాయా శ్చాగమే రాజా నిశ్చయం నాధ్యగచ్ఛత। 25

అకృత్వా నిశ్చయం రాజా కాలేన మహతా మహాన్।
త్రింశద్వర్షసహస్రాణి రాజ్యం కృత్వా దివంగతః। 26

మహానుభావుడైన కపిలునికోపాగ్నికి దగ్ధమైరి. వీరికి లౌకిక మర్యాదను అనుసరించి తర్పణములను విడువదగదు.[1] (17-18)

ఓ నరోత్తమా ! గంగానది హిమవంతుని జ్యేష్ఠపుత్రిక. ఓ మహాబాహా! ఆ గంగాజలములయందు నీ పినతండ్రులకు తర్పణములను విడువుము. భస్మరాశిగా మారిన నీ పినతండ్రులను లోకపావనియైన గంగ పవిత్రులను గావించును. పునీతమైన ఆ గంగోదకములచే ఈ భస్మము తడుపబడగా అఱువదివేలమంది రాజకుమారులును స్వర్గమునకు చేరుదురు. (19-20)

వీరుడవైన ఓ మహానుభావా! నరోత్తమా! ఆ అశ్వమును తీసికొనిపొమ్ము. నీ తాతగారియజ్ఞమును పూర్తిచేయుము." (21)

మహాయశస్వి, మిక్కిలి పరాక్రమవంతుడైన ఆ అంశుమంతుడు గరుత్మంతునిమాటలను పాటించి, వెంటనే యజ్ఞాశ్వమును దీసికొని, యజ్ఞభూమికి మఱలెను. (22)

ఓ రఘునందనా! అతడు యజ్ఞదీక్షలోనున్న సగర మహారాజునొద్దకేగి, వైనతేయునిమాటలను యథాతథముగా దెల్పెను. (23)

సగరమహారాజు అంశుమంతుడు తెల్పిన భయంకరమైన పుత్రమరణవార్తను విని దుఃఖించెను. పిమ్మట అతడు యథావిధిగా కల్పోక్తప్రకారము యజ్ఞమును నిర్వర్తించెను. (24)

ఉత్తమగుణములుగల ఆ మహారాజు యజ్ఞమును ముగించుకొని, తననగరమునకు చేరెను. గంగను తీసికొని వచ్చు విషయమున అతడు ఒక నిర్ణయమునకు రాలేక పోయెను. ఇట్లు చాలాకాలము గడచిపోయెను. ఎట్టి నిర్ణయమును చేయకుండగనే సగరమహారాజు ముప్పదివేలసంవత్సరములు రాజ్యమును పాలించి, దివంగతుడాయెను. (25-26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే ఆదికావ్యే బాలకాండే ఏకచత్వారింశస్సర్గః *(41)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదియొకటవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

1) శ్లో॥ చండాలాదుదకాత్ సర్పాత్, వైద్యుతాత్ బ్రాహ్మణాదపి। దంష్ట్రిభ్యశ్చ పశుభ్యశ్చ, మరణం పాపకర్మణామ్॥ (1)
ఉదకం పిండదానంచ, ఏతేభ్యో యద్విధీయతే। నోపతిష్ఠతి తత్సర్వమ్, అంతరిక్షే వినశ్యతి॥ (2)
చండాలుడు, జలములు, సర్పములు, పిడుగుపాటు, బ్రాహ్మణుడు, కోఱలుగల జంతువులు, పశువులు మున్నగు వానివలన మరణించిన పాపాత్ములకు ఒసగిన తర్పణములు, పిండప్రదానములు వారికి చేరక ఆకాశముననే నశించును. (స్మృతి - గోవిందరాజీయ వ్యాఖ్య, 11) సగరపుత్రులు పాపాత్ములు. బ్రాహ్మణుడైన కపిలునివలన వారు మృతిచెందిరి. కనుక వారు తర్పణములకు అర్హులుకారు.

42. నలుబదిరెండవసర్గము

భగీరథుడు గంగానదిని దివినుండి భువికి గొనివచ్చుటకై యత్నించుట.

కాలధర్మం గతే రామ సగరే ప్రకృతీజనాః।
రాజానం రోచయామాసుః అంశుమంతం సుధార్మికమ్। 1

ఓ రామా! సగరుడు స్వర్గస్థుడుకాగా మంత్రులందఱును న్యాయసమ్మతముగా ధర్మబుద్ధిగల అంశుమంతుడే రాజు కావలెను – అని కోరుకొనిరి. (1)

స రాజా సుమహానాసీత్ అంశుమాన్ రఘునందన।
తస్య పుత్రో మహానాసీత్ దిలీప ఇతి విశ్రుతః। 2

ఓ రఘునందనా! అంతట మిక్కిలి ఉత్తముడైన అంశుమంతుడు రాజు అయ్యెను. అతని కుమారుడు దిలీపుడు. అతడు మిక్కిలి సుప్రసిద్ధుడు. (2)

తస్మిన్ రాజ్యం సమావేశ్య దిలీపే రఘునందన।
హిమవచ్ఛిఖరే పుణ్యే తపస్తేపే సుదారుణమ్। 3

అంశుమంతుడు తనకుమారుడైన దిలీపునకు రాజ్యభారమును అప్పగించి. (గంగావతరణార్థమై) పవిత్రమైన హిమవత్పర్వత శిఖరభాగమున తీవ్రమైన తపమును ఆచరించెను. (3)

ద్వాత్రింశచ్చ సహస్రాణి వర్షాణి సుమహాయశాః।
తపోవనం గతో రాజా స్వర్గం లేభే తపోధనః। 4

ఖ్యాతికెక్కినవాడు, తపోధనుడు ఐన అంశుమంతుడు ముప్పదిరెండువేలసంవత్సరములకాలము తపమాచరించి, (గంగను పొందకయే) స్వర్గమును చేరెను. (4)

దిలీపస్తు మహాతేజాః శ్రుత్వా పైతామహం వధమ్।
దుఃఖోపహతయా బుద్ధ్యా నిశ్చయం నాధ్యగచ్ఛత। 5

మిగుల తేజస్వియైన దిలీపుడు తనతాతలయొక్క అకాల మరణవార్తను విని, ఖిన్నుడాయెను. వారికి సద్గతులు కలుగుటకై తనతండ్రి తీవ్రతపమొనర్చియు లక్ష్యము సిద్ధింపకముందే అతడు స్వర్గస్థుడైనందులకు మిక్కిలి చింతాక్రాంతుడై, కర్తవ్యమును నిర్ణయించుకొనలేక పోయెను. (5)

కథం గంగావతరణం కథం తేషాం జలక్రియా।
తారయేయం కథంచైతాన్ ఇతి చింతాపరోఽభవత్। 6

దివినుండి భువికి గంగావతరణమును సాధించుట యెట్లు? గంగోదకములలో పితామహులకు తర్పణములను సమర్పించుట యెట్లు? ఇక వారిని తరింపజేయుట ఎట్లు? అని అతడు తీవ్రముగా ఆలోచింపసాగెను. (6)

తస్య చింతయతో నిత్యం ధర్మేణ విదితాత్మనః।
పుత్రో భగీరథో నామ జజ్ఞే పరమధార్మికః। 7

నిత్యము ధర్మకార్యనిరతుడై, సుప్రసిద్ధుడైన దిలీపుడు తాతలను తరింపజేయు ఆలోచనలలోనే మునిగి యుండెను. కొంత కాలమునకు ఆయనకు 'భగీరథుడు' అను కుమారుడు కలిగెను. అతడు పరమధార్మికుడుగా వాసిగాంచెను. (7)

దిలీపస్తు మహాతేజా యజ్ఞైఃబహుభిరిష్టవాన్।
త్రింశద్వర్షసహస్రాణి రాజా రాజ్యమకారయత్। 8

అగత్వా నిశ్చయం రాజా తేషాముద్ధరణం ప్రతి।
వ్యాధినా నరశార్దూల కాలధర్మమ్ ఉపేయివాన్। 9

ఇంద్రలోకం గతో రాజా స్వార్జితేనైవ కర్మణా।
రాజ్యే భగీరథం పుత్రమ్ అభిషిచ్య నరర్షభః। 10

మిక్కిలి బలపరాక్రమసంపన్నుడైన దిలీపమహారాజు పెక్కు యజ్ఞములను చేసెను. అతడు ముప్పదివేల సంవత్సరములు రాజ్యపరిపాలన చేసెను. ఓ రామా! అతడు తనఅఱువది వేలమంది ముత్తాతలను ఉద్ధరించుటకు తగు నిర్ణయమును తీసికొనలేక పోయెను. ఆ నరేంద్రుడు తనకుమారుడైన భగీరథునకు రాజ్యభారమును అప్పగించి, మనోవ్యాధితో కాలధర్మమునందెను. అతడు తనపుణ్యఫలముచే స్వర్గమునకు చేరెను. (8-10)

భగీరథస్తు రాజర్షిః ధార్మికో రఘునందన।
అనపత్యో మహాతేజాః ప్రజాకామః స చాప్రజః। 11

ఓ రఘురామా! ధార్మికుడును, రాజర్షియు, మిక్కిలి పరాక్రమశాలియు ఐన భగీరథునకు సంతానము లేకుండెను. అతడు పుత్రులకొఱకై తహతహ పడుచుండెను. కాని అతని కోరిక నెఱవేరలేదు. (11)

మంత్రిష్వాధాయ తద్రాజ్యం గంగావతరణే రతః।
స తపో దీర్ఘమాతిష్ఠత్ గోకర్ణే రఘునందన॥ 12

ఊర్ధ్వబాహుః పంచతపా మాసాహారో జితేంద్రియః।
తస్య వర్షసహస్రాణి ఘోరే తపసి తిష్ఠతః॥ 13

అతీతాని మహాబాహో తస్య రాజ్ఞో మహాత్మనః।
సుప్రీతో భగవాన్ బ్రహ్మా ప్రజానాం పతిరీశ్వరః॥ 14

తత స్సురగణైః సార్ధమ్ ఉపాగమ్య పితామహః।
భగీరథం మహాత్మానం తప్యమానమథాబ్రవీత్॥ 15

భగీరథ మహాభాగ ప్రీతస్తేఽహం జనేశ్వర।
తపసా చ సుతప్తేన వరం వరయ సువ్రత॥ 16

తమువాచ మహాతేజాః సర్వలోకపితామహమ్।
భగీరథో మహాభాగః కృతాంజలిరుపస్థితః॥ 17

యది మే భగవన్ ప్రీతో యద్యస్తి తపసః ఫలమ్।
సగరస్యాత్మజాః సర్వే మత్తస్సలిలమాప్నుయుః॥ 18

గంగాయాః సలిలక్లిన్నే భస్మన్యేషాం మహాత్మనామ్।
స్వర్గం గచ్ఛేయురత్యంతం సర్వే మే ప్రపితామహాః॥ 19

దేయా చ సంతతి ర్దేవ నావసీదేత్ కులం చ నః।
ఇక్ష్వాకూణాం కులే దేవ ఏష మేఽస్తు వరః పరః॥ 20

ఉక్తవాక్యం తు రాజానం సర్వలోకపితామహః।
ప్రత్యువాచ శుభాం వాణీం మధురాం మధురాక్షరామ్॥ 21

మనోరథో మహానేష భగీరథ మహారథ।
ఏవం భవతు భద్రం తే ఇక్ష్వాకుకులవర్ధన॥ 22

ఇయం హైమవతీ గంగా జ్యేష్ఠా హిమవత స్సుతా।
తాం వై ధారయితుం శక్తో హరస్తత్ర నియుజ్యతామ్॥ 23

ఓ రఘునందనా! అంతట భగీరథుడు గంగను దివినుండి భువికి అవతరింపజేయు సంకల్పముతో తన రాజ్యభారమును మంత్రులకు అప్పగించి, తపమొనర్చుటకై హిమవత్పర్వత ప్రాంతమునగల గోకర్ణక్షేత్రమునకు వెళ్ళెను. అతడు ఆ క్షేత్రమున మాసమునకు ఒక్కసారిమాత్రమే ఆహారమును దీసికొనుచు జితేంద్రియుడై, ఊర్ధ్వబాహువై, పంచాగ్నులమధ్య[1] దీర్ఘకాలము తపోనిమగ్నుడాయెను. "మహాబాహువైన ఓ రామా! మహాత్ముడైన ఆ భగీరథమహారాజు అట్లు తనతీవ్రమైన తపస్సును కొనసాగించుచుండగా వేలకొలదిసంవత్సరములు గడచిపోయెను. (12-13)

సృష్టికర్తయైన బ్రహ్మదేవుడు అయనతపస్సునకు మిక్కిలి సంప్రీతుడాయెను. పిమ్మట ఆ పితామహుడు దేవతలతోగూడి తపస్వియు, మహాత్ముడునుఐన భగీరథుని యెదుటనిల్చి ఇట్లనుడివెను. (14-15)

"మహానుభావా! ఓ భగీరథమహారాజా! తీవ్రమైన నీతపస్సునకు మెచ్చితిని. ఓ సువ్రతా! వరమును కోరుకొనుము." (16)

మహాభాగుడును, మహాతేజస్వియు ఐన భగీరథుడు అంజలి ఘటించి, ఆ బ్రహ్మదేవునిసమీపమున నిలిచి, ఆయనతో ఇట్లనెను. (17)

"ఓ బ్రహ్మదేవా! నా తపస్సు మీకు తృప్తిని గూర్చినచో ఆ తపఃఫలముగా సగరపుత్త్రులందఱికిని నా జలాంజలులు చేరునట్లు అనుగ్రహింపుడు. ఈ మహాత్ములయొక్క భస్మరాశి గంగాజలములతో తడిసిన పిమ్మట మా ముత్తాతలందఱును శాశ్వతముగా స్వర్గనివాసులగుదురుగాక. ఓ దేవా! మా ఇక్ష్వాకువంశమునకు సంతానమును ప్రసాదింపుము. మావంశము ఇంతటితో ఆగిపోరాదు. ఇదియే నేను కోరు కొను రెండవ వరము." (18-20)

సమస్తలోకములను సృష్టించువాడైన బ్రహ్మ భగీరథుని మాటలను విని, శుభంకరములైన మధురవచనములను ఇట్లు నుడివెను. (21)

"ఓ ఇక్ష్వాకువంశవర్ధనా! మహారథా! భగీరథా! నీ మనోరథము మిక్కిలి ఉత్తమమైనది. అట్లేయగుగాక. నీకు శుభమగుగాక. (22)

ఈ గంగానది హిమవత్పర్వతమునుండి ఉద్భవించినది. ఈమె హిమవంతుని పెద్దకూతురు. ఈమెను ధరించుటకు పరమశివుడు మాత్రమే సమర్థుడు. కనుక ఆయనను

1) గ్రీష్మ-ఋతువునందు తనచుట్టును నాలుగుదిక్కులయందును అగ్నులను ఉంచుకొని, శిరమును పైకెత్తి, సూర్యతేజస్సును జూచుచు చేయు తపస్సును 'పంచాగ్ని మధ్య తపస్సు' అని యందురు. కాళిదాస మహాకవియు కుమారసంభవకావ్యమునందు- పార్వతీదేవి శివుని పతిగా గోరి, పంచాగ్ని మధ్య తపస్సును ఆచరించినట్లు వర్ణించెను.

గంగాయాః పతనం రాజన్ పృథివీ న సహిష్యతి।
తాం వై ధారయితుం వీర నాన్యం పశ్యామి శూలినః। 24

ఆశ్రయింపవలెను. గంగాప్రవాహము యొక్క వేగధాటికి భూమి తట్టుకొనలేదు. ఆ గంగను ధరింపగల శక్తిమంతుడు పరమేశ్వరుడు మాత్రమే. ఇతరులకు అది అసాధ్యము." (23-24)

తమేవముక్త్వా రాజానం గంగాం చాభాష్య లోకకృత్।
జగామ త్రిదివం దేవస్సహ దేవైః మరుద్గణైః। 25

రాజుతో ఇట్లు పలికిన పిమ్మట బ్రహ్మదేవుడు గంగతో "బిడ్డా! ఈ రాజును అనుగ్రహింపుము" అని పలికి దేవతలతోడను, మరుద్గణములతోడను కూడి, స్వర్గమునకు వెళ్లెను. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ద్విచత్వారింశస్సర్గః (42)

వాల్మీకిమహర్షిప్రణీతమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదిరెండవసర్గము సమాప్తము

-- * * * --

43. నలుబదిమూడవసర్గము

గంగావతరణము.

దేవదేవే గతే తస్మిన్ సోఽఙ్గుష్ఠాగ్రనిపీడితామ్।
కృత్వా వసుమతీం రామ సంవత్సరముపాసత। 1

ఊర్ధ్వ బాహుర్నిరాలంబో వాయుభక్షో నిరాశ్రయః।
అచలః స్థాణువత్ స్థిత్వా రాత్రిందివమరిందమ। 2

ఓ రామా! బ్రహ్మదేవుడు వెళ్లిపోయిన పిమ్మట భగీరథుడు భూమిపై బొటనవ్రేలు మోపి నిలబడి ఒక సంవత్సర కాలము శివునిగూర్చి తపస్సు చేసెను. ఓ శత్రుసంహారకా! రామా! అతడు ఊర్ధ్వబాహువై, ఎట్టి ఆలంబనము, ఆశ్రయములేక నిశ్చలుడై, కదలక మెదలక వాయువును ఆహారముగా తీసికొనుచు రాత్రింబవళ్లు తపస్సును ఆచరించుచునే యుండెను. (1-2)

అథ సంవత్సరే పూర్ణే సర్వలోకనమస్కృతః।
ఉమాపతిః పశుపతీ రాజానమ్ ఇదమబ్రవీత్। 3

ఇట్లు ఒక సంవత్సరము గడచినపిమ్మట సర్వలోకపూజ్యుడైన శంకరుడు ఉమతోగూడి ప్రత్యక్షమై, ఆ భగీరథునితో ఇట్లు నుడివెను. (3)

ప్రీతస్తేఽహం నరశ్రేష్ఠ కరిష్యామి తవ ప్రియమ్।
శిరసా ధారయిష్యామి శైలరాజసుతామహమ్। 4

"ఓ నరేంద్రా! నీ తపస్సునకు మెచ్చితిని. నీ కోరికను నెఱవేర్తును. గంగను నా శిరస్సున ధరించెదను." (4)

తతో హైమవతీ జ్యేష్ఠా సర్వలోకనమస్కృతా।
తదా సాతిమహద్రూపం కృత్వా వేగం చ దుస్సహమ్।
ఆకాశాదపతత్‌రామ శివే శివశిరస్యుత। 5

పిమ్మట హిమవంతునిపెద్దకూతురు, సర్వలోకములకును పూజ్యురాలు ఐన గంగానది మహారూపముతో దుస్సహమైన వేగముతో ఆకాశమునుండి పవిత్రమైన శివునిశిరస్సుపై పడెను. (5)

అచింతయచ్చ సా దేవీ గంగా పరమదుర్ధరా।
విశామ్యహం హి పాతాళం స్రోతసా గృహ్య శంకరమ్। 6

ఏ మాత్రము ధరింపశక్యముగాని ఆ గంగాదేవి "నా ప్రవాహముతో శంకరునిగూడ గైకొని, పాతాళమునకు చేరెదను" – అనియనుకొనెను. (6)

తస్యా వలేపనం జ్ఞాత్వా క్రుద్ధస్తు భగవాన్ హరః।
తిరోభావయితుం బుద్ధిం చక్రే త్రిణయనస్తదా। 7

శంకరభగవానుడు గంగాదేవి (నది) యొక్క గర్వమును గమనించెను. పిమ్మట ఆ ముక్కంటి ఆమెగర్వమును అణచివేయుటకు సంకల్పించెను. (7)

సా తస్మిన్ పతితా పుణ్యా పుణ్యే రుద్రస్య మూర్ధని।
హిమవత్ప్రతిమే రామ జటామండలగహ్వరే। 8

ఓ రామా! హిమవత్పర్వతముతో సమానమైనదియు, జటామండలమనెడి గుహలతో ఒప్పుచున్నదియు అగు ఆ శివుని యొక్క పవిత్రమైన శిరస్సున ఆ పుణ్యనది పడెను. (8)

సా కథంచిన్మహీం గంతుం నాశక్నోద్యత్నమాస్థితా।
నైవ నిర్గమనం లేభే జటామండలమోహితా। 9

తత్రైవాబంభ్రమద్దేవీ సంవత్సరగణాన్ బహూన్।
తామపశ్యన్ పునస్తత్ర తపః పరమమాస్థితః। 10

అనేన తోషితశ్చాభూత్ అత్యర్థం రఘునందన।
విససర్జ తతో గంగాం హరో బిందుసరః ప్రతి। 11

తస్యాం విసృజ్యమానాయాం సప్త స్రోతాంసి జజ్ఞిరే।
హ్లాదినీ పావనీ చైవ నళినీ చ తథాఽపరా। 12

తిస్రః ప్రాచీం దిశం జగ్ముః గంగాశ్శివజలా శ్శుభాః।
సుచక్షుశ్చైవ సీతా చ సింధుశ్చైవ మహానదీ। 13

తిస్రస్త్వేతా దిశం జగ్ముః ప్రతీచీం తు శుభోదకాః।
సప్తమీ చాన్వగాత్ తాసాం భగీరథమథో నృపమ్। 14

భగీరథోఽపి రాజర్షిః దివ్యం స్యందనమాస్థితః।
ప్రాయాదగ్రే మహాతేజాః గంగా తం చాప్యనువ్రజత్। 15

గగనాచ్ఛంకరశిరః తతో ధరణిమాశ్రితా।
వ్యసర్పత జలం తత్ర తీవ్రశబ్దపురస్కృతమ్। 16

మత్స్య కచ్ఛప సంఘైశ్చ శింశుమారగణై స్తదా।
పతద్భిః పతితైశ్చాన్యైః వ్యరోచత వసుంధరా। 17

తతో దేవర్షిగంధర్వా యక్షాస్సిద్ధగణాస్తదా।
వ్యలోకయంత తే తత్ర గగనాద్గాం గతాం తథా। 18

విమానైర్నగరాకారైః హయైర్గజవరైస్తదా।
పారిప్లవగతైశ్చాపి దేవతాస్తత్ర విష్ఠితాః। 19

త దద్భుతతమం లోకే గంగాపతనముత్తమమ్।
దిదృక్షవో దేవగణాః సమీయురమితౌజసః। 20

సంపతద్భిస్సురగణైః తేషాం చాభరణౌజసా।
శతాదిత్యమివాభాతి గగనం గతతోయదమ్। 21

శింశుమారోరగగణైః మీనైరపి చ చంచలైః।
విద్యుద్భిరివ విక్షిప్తమ్ ఆకాశమ్ అభవత్తదా। 22

ఆ గంగ ఎంతగా ప్రయత్నించినను భూమిని చేరుటకు అశక్తురాలయ్యెను. శివునిజటాజూటములో చిక్కుకొని, ఆమె అందుండి బయటికి రాలేకపోయెను. (9)

అంతట గంగానది పెక్కు సంవత్సరములపాటు శివుని జడలయందే తిరుగాడుచుండెను. అప్పుడు భగీరథుడు గంగఉనికిని కనుగొనలేక మఱల పరమశివునిగూర్చి తపమాచరింపసాగెను. (10)

ఓ రఘునందనా! శంకరుడు ఆ భగీరథునితపస్సునకు మెచ్చి, గంగను హిమవత్పర్వతమునందలి బ్రహ్మనిర్మితమైన 'బిందుసరోవరము'నందు విడిచెను. (11)

అట్లు విడువబడిన ఆ గంగాప్రవాహము ఏడు పాయలుగా ఏర్పడెను. పవిత్రజలములుగల 'హ్లాదిని' 'పావని' 'నళిని' అను మూడు గంగలు తూర్పుదిశగా ప్రవహించెను. 'సుచక్షువు' 'సీత', 'సింధువు', అను మూడు మహానదులును (మూడు గంగలును) మంగళప్రదములైన జలములతో పశ్చిమదిశగా ప్రవహించినవి. ఆ గంగా ప్రవాహములలో ఏడవది భగీరథ మహారాజును అనుసరించెను. రాజర్షియైన భగీరథుడు ఒక దివ్యరథముపై ముందు ప్రయాణించుచుండగా మహావేగముగల గంగ అతని వెంట ప్రవహించుచుండెను. (12-15)

ఆ గంగాజలములు ఆకాశమునుండి శంకరుని శిరస్సును, అచటినుండి భూమిని చేరునప్పుడు మహా ధ్వనులతో మిక్కిలి వేగముగా ప్రవహించెను. (16)

గంగా ప్రవాహమున సాగివచ్చిన మత్స్యములతోడను తాబేళ్లతోడను, మొసళ్లతోడను, ఇతరజలజంతువులతోడను భూమి మిక్కిలి శోభిల్లెను. (17)

అట్లు దివినుండి భువికి చేరిన గంగను దేవతలు, ఋషులు, గంధర్వులు, సిద్ధులు మొదలగు వారు కనుల పండువుగా గాంచిరి. నగరములవలె విపులముగానున్న విమానములనుండియు, గుఱ్ఱములపైనుండియు, భద్రగజములపై నుండియు ఆ దేవతలుమొదలగు వారు ఆకాశమున నిలిచి, సంభ్రమాశ్చర్యములతో గంగను తిలకించిరి. భూలోకమునందు అత్యద్భుతమైన సర్వోత్తమమైన గంగావతరణదృశ్యమును చూడగోరిన వారై ప్రముఖ దేవతలు అచటికి చేరిరి. (18-20)

మేఘములుతొలగిన గగనము, అచటికివచ్చిచేరుచున్న దేవతాగణముల ఆభరణశోభలతో దేదీప్యమానమై ప్రకాశించుచు వందలకొలది సూర్యులకాంతులతో సదృశమై విరాజిల్లుచుండెను. (21)

అటునిటు సంచరించుచున్న మొసళ్లతోడను, సర్పములతోడను, మీనములతోడను వ్యాప్తమైన ఆకాశము విద్యుత్కాంతుల వలె మిలుమిట్లు గొలుపుచుండెను. (22)

పాండరైస్సలిలోత్పీడైః కీర్యమాణైః సహస్రధా।
శారదాభ్రైరివాకీర్ణం గగనం హంససంప్లవైః। 23

క్వచిద్ద్రుతతరం యాతి కుటిలం క్వచిదాయతమ్।
వినతం క్వచిదుద్భూతం క్వచిద్యాతి శనైః శనైః। 24

సలిలేనైవ సలిలం క్వచిదభ్యాహతం పునః।
ముహు రూర్ధ్వముఖం గత్వా పపాత వసుధాతలమ్। 25

తచ్ఛంకరశిరోభ్రష్టం భ్రష్టం భూమితలే పునః।
వ్యరోచత తదా తోయం నిర్మలం గతకల్మషమ్। 26

తత్ర దేవర్షిగంధర్వా వసుధాతలవాసినః।
భవాంగపతితం తోయం పవిత్రమితి పస్పృశుః। 27

శాపాత్ ప్రపతితా యే చ గగనాద్వసుధాతలమ్।
కృత్వా తత్రాభిషేకం తే బభూవుర్గతకల్మషాః। 28

ధూతపాపాః పునస్తేన తోయేనాథ సుభాస్వతా।
పునరాకాశమావిశ్య స్వాన్ లోకాన్ ప్రతిపేదిరే। 29

ముముదే ముదితో లోకః తేన తోయేన భాస్వతా।
కృతాభిషేకో గంగాయాం బభూవ విగతక్లమః। 30

భగీరథోఽపి రాజర్షిః దివ్యం స్యందనమాస్థితః।
ప్రాయాదగ్రే మహాతేజాః తం గంగా పృష్ఠతోఽన్వగాత్। 31

దేవాః సర్షిగణాః సర్వే దైత్యదానవరాక్షసాః।
గంధర్వయక్షప్రవరాః సకిన్నర మహోరగాః। 32

సర్వాశ్చాప్సరసో రామ భగీరథరథానుగామ్।
గంగామన్వగమన్ ప్రీతాః సర్వే జలచరాశ్చ యే। 33

యతో భగీరథో రాజా తతో గంగా యశస్వినీ।
జగామ సరితాం శ్రేష్ఠా సర్వపాపవినాశినీ। 34

తతో హి యజమానస్య జహ్నో రద్భుత కర్మణః।
గంగా సంప్లావయామాస యజ్ఞవాటం మహాత్మనః। 35

పెక్కురీతుల చిమ్మబడుచున్న తెల్లని నీటినురుగులతో విలసిల్లుచున్న గగనము హంసలగుంపులతోడను, శరత్కాల మేఘములతోడను వ్యాప్తమైనట్లుండెను. (23)

ఆ గంగాప్రవాహము కొన్నిప్రదేశములయందు అతివేగముగను, కొన్నితావులయందు వంకరగను, మఱికొన్నిచోట్ల విశాలముగను, వేఱొకచో పల్లములకు దూకుచును, మఱియొకచో ద్రుళ్లి పడుచును, వేఱొకచో ప్రశాంత గంభీరముగను సాగిపోవుచుండెను.[1] (24)

గాలితాకిడికి తరంగములు మాటిమాటికి ఎగిరి పడుచు నీటితో నీరు కొట్టుకొనుచు నేలపై బడుచుండెను. (25)

శంకరునిశిరస్సునుండి జాలువాఱి భూమిపై దూకుచున్న నీరు మురికితొలగి నిర్మలముగా ప్రకాశించుచుండెను. (26)

దేవతలు, ఋషులు, గంధర్వులు, భూలోకవాసులు "ఈ జలము శివునిశిరస్సునుండి పడినది, కనుక అతి పవిత్రమైనది"- అని తలంచుచు ఆజలములను ఆదరముతో తమశిరములపై చల్లుకొని ఆచమించిరి. (27)

శాపోపహతులై, దివినుండి భువికి చేరినవారుగూడ ఈ గంగలో మునిగి, పాపరహితులైరి. పవిత్రములైన గంగాజలములస్పర్శచే వారు పునీతులై, మఱల ఆకాశ మార్గమున తమ తమ లోకములకు చేరిరి. (28-29)

పవిత్రగంగానదీజలములలో స్నానములొనర్చుటచే అలసటలు తొలగి, జనులు మిగుల సంతోషించిరి. (30)

మహాతేజస్వియు, రాజర్షియు ఐన భగీరథుడు దివ్య రథమును అధిరోహించి, ముందునకు సాగి పోవుచుండగా గంగానది ఆయనను అనుసరించుచుండెను (31)

దేవతలు, ఋషులు, దైత్యులు, దానవులు, రాక్షసులు, గంధర్వులు, యక్షులు, కిన్నరులు, మహానాగులు, అప్సరసలు మొదలగువారందఱును, అట్లే జలచరములన్నియును భగీరథునిరథమును వెన్నంటి ప్రవహించుచున్నగంగానదిని చక్కని ఆనందముతో వెంబడించినవి. సర్వపాపహారిణి యనియు, నదులలో శ్రేష్ఠయనియు వాసికెక్కిన గంగ భగీరథ మహారాజు వెళ్లిన చోట్లకెల్లను తానును వెళ్లుచుండెను. (32-34)

అసాధారణకార్యములను నిర్వహించుటలో సమర్థుడును, మహాత్ముడును ఐన జహ్నుమహర్షి క్రతువును ఆచరించు చుండగా గంగానది ఆయన యజ్ఞవాటికను ముంచివేసెను. (35)

1) ఒక్కొక్కచో సాధ్వివలె గంభీరముగను, వేఱొకచో వెలయాలివలె వక్రమార్గమునను, మఱియొకచోట నర్తకివలె గంతులువేయుచును ఇంకొకచోట విలంబినివలె మందయానమునను ఆ గంగ ప్రయాణించుచుండెను. ముందునకుపాఱునీటిని వెనుకకు మఱలు నీరు తాకునప్పుడు అదమంత్రపుసిరి వచ్చినవానివలె అది మిడిసిపడుచుండెను. అని కొందఱు పండితులు వివరింతురు.

తస్యావలేపనం జ్ఞాత్వా క్రుద్ధో యజ్వా తు రాఘవ।
అపిబచ్చ జలం సర్వం గంగాయాః పరమాద్భుతమ్॥ 36

ఓ రాఘవా! జహ్నుమహర్షి గంగయొక్క అహంకారపూరిత చర్యకు మిక్కిలి క్రుద్ధుడాయెను. పిమ్మట ఆ ముని గంగాజలములనన్నింటిని అత్యద్భుతముగా (ఆశ్చర్యకరముగా) పానము చేసెను. (36)

తతో దేవాః సగంధర్వా ఋషయశ్చ సువిస్మితాః।
పూజయంతి మహాత్మానం జహ్నుం పురుషసత్తమమ్।
గంగాం చాపి నయంతి స్మ దుహితృత్వే మహాత్మనః॥ 37

అంతట దేవతలు, గంధర్వులు, ఋషులు అబ్బురపడి, పురుషశ్రేష్ఠుడు, మహాత్ముడు ఐన జహ్ను మహర్షిని పూజించిరి. గంగాదేవినిగూడ ఆ మహాత్మునకు కుమార్తెగా జేసిరి. (37)

తత స్తుష్టో మహాతేజా శ్రోత్రాభ్యామ్ అసృజత్ పునః।
తస్మాజ్జహ్నుసుతా గంగా ప్రోచ్యతే జాహ్నవీతి చ॥ 38

పిమ్మట ఆ మహాతేజస్వి పరమప్రీతుడై గంగాజలములను తనచెవులద్వారా విడిచిపెట్టెను. అందువలన జహ్నుసుతయైన గంగ అప్పటినుండి 'జాహ్నవి'గా ప్రసిద్ధికెక్కెను. (38)

జగామ చ పునర్గంగా భగీరథరథానుగా।
సాగరం చాపి సంప్రాప్తా సా సరిత్ప్రవరా తదా।
రసాతల ముపాగచ్ఛత్ సిద్ధ్యర్థం తస్య కర్మణః॥ 39

గంగ మరల భగీరథునిరథమును అనుసరించుచు ప్రవహించెను. ఆ నదీమతల్లి సముద్రమునుగూడ చేరెను. అంతేగాక ఆ భగీరథునికార్యసిద్ధికై రసాతలమున (పాతాళమున) గూడ ప్రవేశించెను. (39)

భగీరథోఽపిరాజర్షిః గంగామాదాయ యత్నతః।
పితామహాన్ భస్మకృతాన్ అపశ్యద్దీనచేతనః॥ 40

అథ తద్భస్మనాం రాశిం గంగాసలిలముత్తమమ్।
ప్లావయద్ధూతపాప్మానః స్వర్గం ప్రాప్తా రఘూత్తమ॥ 41

రాజర్షియైన భగీరథుడు పట్టుదలతో గంగను గొని వచ్చి, భస్మరాశిగా మారియున్న తనముత్తాతలను జూచి మిక్కిలి దైన్యమునకు లోనయ్యెను. ఓ రఘురామా! అప్పుడు ఆ భస్మరాశిని పవిత్రమైన గంగాజలములు ముంచివేసెను. అంతట సగరపుత్రులు పాపరహితులై స్వర్గమును పొందిరి. (40-41)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే త్రిచత్వారింశస్సర్గః (43)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదిమూడవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

44. నలుబదినాల్గవసర్గము

భగీరథుడు పవిత్రగంగాజలములతో సగరపుత్రులకు (తన ముత్తాతలకు) పుణ్యలోకములను ప్రాప్తింపజేయుట.

స గత్వా సాగరం రాజా గంగయాఽనుగత స్తదా।
ప్రవివేశ తలం భూమేః యత్ర తే భస్మసాత్ కృతాః॥ 1

ఆ విధముగా గంగ తనను అనుసరించుచుండగా భగీరథమహారాజు పాతాళమున తనముత్తాతలు భస్మరాశిగా పడియున్న ప్రదేశమునకు చేరెను. (1)

భస్మన్యథాప్లుతే రామ గంగాయాస్సలిలేన వై।
సర్వలోకప్రభుర్బ్రహ్మా రాజానమ్ ఇదమబ్రవీత్॥ 2

ఓ రామా! గంగాజలములు ఆ భస్మరాశిని ముంచెత్తినంతనే సృష్టికర్తయైన బ్రహ్మ ప్రత్యక్షమై ఆ మహారాజుతో ఇట్లనెను. (2)

తారితా నరశార్దూల దివంయాతాశ్చ దేవవత్।
షష్టిః పుత్రసహస్రాణి సగరస్య మహాత్మనః॥ 3

సాగరస్య జలం లోకే యావత్ స్థాస్యతి పార్థివ।
సగరస్యాత్మజాస్తావత్ స్వర్గే స్థాస్యంతి దేవవత్॥ 4

"ఓ నరేంద్రా! మహాత్ముడైన సగరుని అరువదివేలమంది కుమారులును ప్రేతత్వమునుండి విముక్తులైరి. వెంటనే వారు దేవతలవలె స్వర్గమును జేరిరి. ఓ రాజా! ఈ లోకమున సాగరజలములున్నంతవరకును సగరుని పుత్రులు దేవతలవలె స్వర్గమున ఉందురు. (3-4)

ఇయం చ దుహితా జ్యేష్ఠా తవ గంగా భవిష్యతి।
త్వత్కృతేన చ నామ్నాఽథ లోకే స్థాస్యతి విశ్రుతా॥ 5

గంగా త్రిపథగా రాజన్ దివ్యా భాగీరథీతి చ।
త్రీన్ పథో భావయంతీతి తతస్త్రిపథగా స్మృతా॥ 6

పితామహానాం సర్వేషాం త్వమత్ర మనుజాధిప।
కురుష్వ సలిలం రాజన్ ప్రతిజ్ఞామపవర్జయ॥ 7

పూర్వకేణ హి తే రాజన్ తేనాతియశసా తదా।
ధర్మిణాం ప్రవరేణాపి నైష ప్రాప్తో మనోరథః॥ 8

తథైవాంశుమతా తాత లోకేఽప్రతిమతేజసా।
గంగాం ప్రార్థయతా నేతుం ప్రతిజ్ఞా నాపవర్జితా॥ 9

రాజర్షిణా గుణవతా మహర్షిసమతేజసా।
మత్తుల్యతపసా చైవ క్షత్రధర్మస్థితేన చ॥ 10

దిలీపేన మహాభాగ తవ పిత్రాఽతితేజసా।
పునర్న శంకితా నేతుం గంగాం ప్రార్థయతాఽనఘ॥ 11

సా త్వయా సమతిక్రాంతా ప్రతిజ్ఞా పురుషర్షభ।
ప్రాప్తోఽసి పరమం లోకే యశః పరమసమ్మతమ్॥ 12

యచ్చ గంగావతరణం త్వయా కృతమరిందమ।
అనేన చ భవాన్ ప్రాప్తో ధర్మస్యాయతనం మహత్॥ 13

ప్లావయస్వ త్వమాత్మానం నరోత్తమ సదోచితే।
సలిలే పురుషవ్యాఘ్ర శుచిః పుణ్యఫలో భవ॥ 14

పితామహానాం సర్వేషాం కురుష్వ సలిలక్రియామ్।
స్వస్తి తేఽస్తు గమిష్యామి స్వం లోకం గమ్యతాం నృప॥ 15

ఇత్యేవ ముక్త్వా దేవేశః సర్వలోకపితామహః।
యథాఽఽగతం తథాగచ్ఛత్ దేవలోకం మహాయశాః॥ 16

భగీరథోఽపి రాజర్షిః కృత్వా సలిలముత్తమమ్।
యథాక్రమం యథాన్యాయం సాగరాణాం మహాయశాః॥ 17

కృతోదకశ్శుచీ రాజా స్వపురం ప్రవివేశ హ।
సమృద్ధార్థో రఘుశ్రేష్ఠ స్వరాజ్యం ప్రశశాస హ॥ 18

ఈ గంగ నీకు పెద్దకూతురు అగును. నీ సాహసకార్య ఫలితముగా నీ పేరుతో గంగ 'భాగీరథి' అనియు, స్వర్గ మర్త్య పాతాళ లోకములయందు (మూడు పథములలో) ప్రవహించుటవలన 'త్రిపథగ' అనియు వాసిగాంచును. (5-6)

ఓ మానవేంద్రా! నీ తాతముత్తాతలందరికిని (పితృ దేవతలందరికిని) తర్పణములను విడిచి, నీ ప్రతిజ్ఞను (పవిత్ర గంగాజలములతో తర్పణములను సమర్పించి, సగరపుత్రులను తరింపజేయుదును-అను ప్రతిజ్ఞను) నిలబెట్టుకొనుము. (7)

ఓ భగీరథమహారాజా! మీ వంశజులలో నీకు పూర్వుడును, మహాయశస్వియు, ధార్మికులలో ప్రముఖుడును ఐన సగర చక్రవర్తికిని ఈ కోరిక నెరవేఱలేదు. నాయనా! అట్లే ఈ లోకమున నిరుపమాన పరాక్రమశాలియైన అంశుమంతుడు 'నేను గంగను ప్రార్థించి, తీసుకొని వచ్చెదను' అని చేసిన ప్రతిజ్ఞయును నెరవేఱలేదు. (8-9)

ఓ పుణ్యాత్మా! మహానుభావా! రాజర్షియు, సద్గుణ సంపన్నుడును, మహర్షులవలె దివ్యతేజస్వియు, తపస్సునందు నాతో సమానుడును, క్షత్రియ ధర్మమునందు నిష్ఠగలవాడును, మిక్కిలి పరాక్రమశాలియును ఐన నీ తండ్రియగు దిలీపుడును గంగను దీసికొని వచ్చుటకై ఎంతయు యత్నించెను. ఐనను కృతకృత్యుడు కాలేక పోయెను. ఆ ఆలోచననే విరమించుకొనెను. (10-11)

ఓ నరేంద్రా! ఆ ప్రతిజ్ఞ నీవలన నెఱవేఱినది. ఆ ఘనకార్యమును సాధించి, నీవు ఈ లోకమున తిరుగులేని యశస్సును సంపాదించితివి. ఓ అరిసూదనా! ఈ గంగావతరణ మహాత్కార్య కారణముగ నీవు గొప్ప ధర్మమును ఆచరించి, సాటిలేని ప్రతిష్ఠను పొందితివి. (12-13)

ఓ రాజశిరోమణీ! ఈ పరమపవిత్రగంగాజలములలో స్నానమాచరింపుము, పునీతుడవై పుణ్యఫలములను పొందుము. నీ పితృదేవతలందరికిని తర్పణాది క్రియలను ఆచరింపుము. రాజా! నీకు శుభమగు గాక, నా సత్య లోకమునకు నేను వెళ్ళెదను. ఇంక నీవును వెళ్లవచ్చును." (14-15)

సర్వలోకములకును సృష్టికర్తయు, మహాయశస్వియు ఐన బ్రహ్మదేవుడు ఇట్లు పలికి, యథాప్రకారము దివ్యలోకమునకు వెళ్లెను. (16)

గొప్ప కీర్తిప్రతిష్ఠలుగలవాడును, రాజర్షియు ఐన భగీరథుడును యథాక్రమముగా శాస్త్రోక్తముగా సగరవంశజులందరికిని జలాంజలులను సమర్పించెను. అట్లు పితృదేవతలఋణమును దీర్చుకొని శుచియై, అతడు తననగరమునకు వచ్చెను. ఓ రామా! అనంతరము భగీరథుడు సర్వసంపదలతో తులతూగుచు తనరాజ్యమును పరిపాలించెను. (17-18)

ప్రముమోద హ లోకస్తం నృపమాసాద్య రాఘవ।
నష్టశోకః సమృద్ధార్థో బభూవ విగతజ్వరః। 19

ఓ రాఘవా! ఆ మహారాజుపరిపాలనలో ప్రజలందఱును ఏమాత్రమును శోకసంతాపములను ఎఱుగక, కొల్లలుగా ఆరోగ్యభాగ్యములతో సంతుష్టాంతరంగులై వర్ధిల్లిరి. (19)

ఏష తే రామ గంగాయా విస్తరోఽభిహితో మయా।
స్వస్తి ప్రాప్నుహి భద్రం తే సంధ్యాకాలోఽతివర్తతే। 20

ఓ రామచంద్రా! ఈ పవిత్ర గంగావతరణవృత్తాంతమును విపులముగా వివరించితిని. నీకు శుభపరంపర ప్రాప్తించుగాక. సంధ్యాకాలము మించుచున్నది. (20)

ధన్యం యశస్య మాయుష్యం పుత్ర్యం స్వర్గ్యమతీవ చ।
యశ్శ్రావయతి విప్రేషు క్షత్రియేష్వితరేషు చ। 21

ప్రీయంతే పితరస్తస్య ప్రీయంతే దైవతాని చ।
ఇదమాఖ్యానమవ్యగ్రో గంగావతరణం శుభమ్। 22

యశ్శృణోతి చ కాకుత్స్థ సర్వాన్ కామానవాప్నుయాత్।
సర్వే పాపాః ప్రణశ్యంతి ఆయుః కీర్తిశ్చ వర్ధతే। 23

బ్రాహ్మణులు, క్షత్రియులు మొదలగు వారందఱికిని ఈ పవిత్రగాథను వివరించినచో వారిజీవితములును ధన్యములగును, వారికి యశస్సు ప్రాప్తించును, ఆయువు పెఱుగును, పుత్త్రులు కలుగుదురు. కడకు స్వర్గప్రాప్తియు చేకూరును. వారియెడ పితృదేవతలు, దేవతలు ప్రసన్నులగుదురు. శుభకరమైన ఈ గంగావతరణగాథను ఏకాగ్రతతో విన్నవారి కోరికలన్నియును తీరును, వారిపాపములన్నియును నశించును. ఆయువు వృద్ధిచెందును, కీర్తిప్రతిష్ఠలు ఇనుమడించును. (21-23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే చతుశ్చత్వారింశస్సర్గః *(44)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదినాల్గవసర్గము సమాప్తము

-- * * * --

45. నలుబదిఐదవసర్గము

క్షీరసాగరమథనము - శివునిచే హాలాహలభక్షణము - అమృతముకొఱకై దేవాసురులసంగ్రామము.

విశ్వామిత్రవచః శ్రుత్వా రాఘవః సహలక్ష్మణః।
విస్మయం పరమం గత్వా విశ్వామిత్రమ్ అథాబ్రవీత్। 1

విశ్వామిత్రుడు మృదువచనములతో వినిపించిన మధుర గాథను విని, లక్ష్మణునితోగూడిన రాముడు అమితాశ్చర్యమునకు లోనై, ఆ మహర్షితో ఇట్లనెను. (1)

అత్యద్భుతమిదం బ్రహ్మన్ కథితం పరమం త్వయా।
గంగావతరణం పుణ్యం సాగరస్యాపి పూరణమ్। 2

"ఓ బ్రహ్మర్షీ! గంగ దివినుండి భువికి అవతరించుట, సాగరమును నింపుట మొదలగు ఘట్టములతో గూడిన ఈ 'గంగావతరణ' కథ అత్యద్భుతమైనది. మిక్కిలి శ్రేష్ఠమైనది, పుణ్యప్రదమైనది." (2)

తస్య సా శర్వరీ సర్వా సహసౌమిత్రిణా తదా।
జగామ చింతయానస్య విశ్వామిత్రకథాం శుభామ్। 3

విశ్వామిత్రుడు వచించిన శుభప్రదమైన ఆ కథను లక్ష్మణునితోగూడి చర్చించుచుండగా రామునకు (వారికి) ఆ రాత్రి తెలియకయే గడచిపోయెను. (3)

తతః ప్రభాతే విమలే విశ్వామిత్రం మహామునిమ్।
ఉవాచ రాఘవో వాక్యం కృతాహ్నికమరిందమః। 4

అనంతరము ప్రశాంతమైన ప్రభాతసమయమున శత్రుసంహారకుడైన రాఘవుడు ఆహ్నికకార్యక్రమములను ముగించుకొనియున్న విశ్వామిత్రమహామునితో ఇట్లు నుడివెను. (4)

గతా భగవతీరాత్రిః శ్రోతవ్యం పరమం శ్రుతమ్।
క్షణభూతేవ నౌ రాత్రిః సంవృత్తేయం మహాతపః।
ఇమాం చింతయతః సర్వాం నిఖిలేన కథాం తవ। 5

తరామ సరితాం శ్రేష్ఠాం పుణ్యాంత్రిపథగాం నదీమ్। 6

నౌ రేషా హి సుఖా స్తీర్ణా ఋషీణాం పుణ్యకర్మణామ్।
భగవంత మిహ ప్రాప్తం జ్ఞాత్వా త్వరిత మాగతా। 7

తస్య తద్వచనం శ్రుత్వా రాఘవస్య మహాత్మనః।
సంతారం కారయామాస సర్షిసంఘస్సరాఘవః। 8

ఉత్తరం తీరమాసాద్య సంపూజ్యర్షిగణం తదా।
గంగాకూలే నివిష్టా స్తే విశాలాం దదృశుః పురీమ్। 9

తతో మునివరస్తూర్ణం జగామ సహ రాఘవః।
విశాలాం నగరీం రమ్యాం దివ్యాం స్వర్గోపమాం తదా। 10

అథ రామో మహాప్రాజ్ఞో విశ్వామిత్రం మహామునిమ్।
పప్రచ్ఛ ప్రాంజలి ర్భూత్వా విశాలామ్ ఉత్తమాం పురీమ్। 11

కతరో రాజవంశోఽయం విశాలాయాం మహామునే।
శ్రోతుమిచ్ఛామి భద్రం తే పరం కౌతూహలం హి మే। 12

తస్య తద్వచనం శ్రుత్వా రామస్య మునిపుంగవః।
ఆఖ్యాతుం తత్సమారేభే విశాలస్య పురాతనమ్। 13

శ్రూయతాం రామ శక్రస్య కథాం కథయతశ్శుభామ్।
అస్మిన్ దేశే తు యద్వృత్తం తదపి శృణు రాఘవ। 14

పూర్వం కృతయుగే రామ దితేః పుత్రా మహాబలాః।
అదితేశ్చ మహాభాగ వీర్యవంతః సుధార్మికాః। 15

తతస్తేషాం నరశ్రేష్ఠ బుద్ధిరాసీన్మహాత్మనామ్।
అమరా అజరా శ్చైవ కథం స్యామ నిరామయాః। 16

"వినదగినవలసిన ఉత్తమగాథను వింటిమి. రాత్రి పవిత్రముగా గడచినది. ఓ తపస్వీ! ఈ కథను పూర్తిగా మననము చేయుచుండుటతో మాకు రాత్రియంతయు క్షణమువలె గడచిపోయినది. (5)

ఓ మునీశ్వరా! నదులలో శ్రేష్ఠమైనదియు, త్రిపథగామినియు ఐన పవిత్రగంగానదిని మనము దాటుదము. నిరంతరము పుణ్యకార్యములయందే నిమగ్నులైయుండు ఋషులయొక్క నావ ఇచటనున్నది. ఇందు చక్కని ఆసనములు ఏర్పఱచబడి యున్నవి. పరమ పూజ్యులైన మీరు ఇచటికి వచ్చినట్లు గ్రహించి, వారు పంపగా నావ త్వరితగతిని ఇచటికి చేరియున్నది." (6-7)

అంతట విశ్వామిత్రుడు మహాత్ముడైన రామునిపలుకులను విని, ఋషులందఱితోడను, రామలక్ష్మణులతోడనుగూడి నదిని దాటెను. (8)

అట్లు ఉత్తరతీరమునకు చేరిన పిమ్మట విశ్వామిత్రుడు తాము నదినిదాటుటకై తోడ్పడిన ఋషులను పూజించెను. పిమ్మట వారు గంగాతీరమున ఒక్క క్షణమాగి 'విశాల' అను నగరమును దర్శించిరి. (9)

అనంతరము విశ్వామిత్రమునీశ్వరుడు రామలక్ష్మణులతోగూడి వెంటనే 'విశాల' నగరమునకు చేరెను. రమ్యమైన ఆ నగరము అమరావతి వలె దివ్యముగా విరాజిల్లుచుండెను. (10)

మిక్కిలి ప్రజ్ఞాశాలియైన శ్రీరాముడు విశ్వామిత్రమహామునికి నమస్కరించి, ఉత్తమమైన విశాలానగరవైభవ విశేషములను గూర్చి తెలుపుడని అభ్యర్థించెను. (11)

"ఓ మహామునీ! ప్రస్తుతము ఈ విశాలానగరమును ఏ రాజవంశము పరిపాలించుచున్నది? దానిని గూర్చివినవలెనని కుతూహలపడుచున్నాను. దయతో తెల్పుడు. మీకు పుణ్యముండును." (12)

అంతట ఆ మునీశ్వరుడు శ్రీరాముని ప్రశ్నను విని, విశాలనగరముయొక్క ప్రాచీనవైభవమునుగూర్చి తెలుపుటకు ఉపక్రమించెను. (13)

"ఓ రామా! శుభకరమైన దేవేంద్రునికథను వివరించెదను వినుము. అట్లే ఈ దేశమున జరిగిన ఒక సంఘటనను గూర్చియు వినుము. (14)

ఓ రామా! మహానుభావా! పూర్వకాలమున కృతయుగము నందు దితిపుత్రులు బలశాలురుగను, అదితి కుమారులు ధర్మబుద్ధిగలిగి మహా పరాక్రమశాలురుగను ఉండిరి.(15)

ఓ నరోత్తమా! మహాత్ములైన ఆ దేవతలకును, దైత్యులకును 'మనకు రోగములు, ముసలితనము, మరణము లేకుండుట యెట్లు ?' అను ఆలోచన కలిగెను. (16)

తేషాం చింతయతాం రామ బుద్ధిరాసీన్మహాత్మనామ్।
క్షీరోదమథనం కృత్వా రసం ప్రాప్స్యామ తత్ర వై। 17

తతో నిశ్చిత్య మథనం యోక్త్రం కృత్వా చ వాసుకిమ్।
మంథానం మందరం కృత్వా మమంథురమితౌజసః। 18

అథవర్షసహస్రేణ యోక్త్రసర్పశిరాంసి చ।
వమంత్యతివిషం తత్ర దదంశుర్దశనైః శిలాః। 19

ఉత్పపాతాగ్నిసంకాశం హాలాహలమహావిషమ్।
తేన దగ్ధం జగత్ సర్వం సదేవాసురమానుషమ్। 20

అథ దేవా మహాదేవం శంకరం శరణార్థినః।
జగ్ముః పశుపతిం రుద్రం త్రాహిత్రాహీతి తుష్టువుః। 21

ఏవముక్తస్తతోదేవైః దేవదేవేశ్వరః ప్రభుః।
ప్రాదురాసీత్ తతోఽత్రైవ శంఖచక్రధరోహరిః। 22

ఉవాచైనం స్మితం కృత్వా రుద్రం శూలభృతం హరిః।
దైవతైర్మథ్యమానే తు యత్పూర్వం సముపస్థితమ్। 23

తత్ త్వదీయం సురశ్రేష్ఠ సురాణామగ్రజోఽసి యత్।
అగ్రపూజామిమాం మత్వా గృహాణేదం విషం ప్రభో। 24

ఇత్యుక్త్వా చ సురశ్రేష్ఠః తత్రైవాంతరధీయత।
దేవతానాం భయం దృష్ట్వా శ్రుత్వా వాక్యంతు శార్ఙ్గిణః। 25

హాలాహలం విషం ఘోరం స జగ్రాహామృతోపమమ్।
దేవాన్ విసృజ్య దేవేశో జగామ భగవాన్ హరః। 26

ఓ రామా ! ఆ మహాత్ములు ఇట్లు ఆలోచించుచుండగా 'క్షీరసాగరమును మథించి, దానినుండి అమృతమును పొందుదము' అను ఉపాయము వారికితట్టెను. (17)

మిక్కిలి శక్తిసంపన్నులైన ఆ దేవదానవులు మందర పర్వతమును కవ్వముగను, వాసుకిని త్రాడుగను జేసికొని, క్షీరసాగరమును చిలికిరి. (18)

ఇట్లు సముద్రమథనము వేయి సంవత్సరములు జరిగిన పిమ్మట కవ్వపు త్రాడుగానున్న వాసుకి విషమును గ్రక్కుచు తనకోఱలచే శిలలను కాటువేయసాగెను. వాసుకికోఱలనుండి అగ్నిజ్వాలలవలె భయంకరమైన హాలాహలమహావిషము బయల్వెడలెను. ఆ విషాగ్ని దేవతలతో, అసురులతో, మనుష్యులతో గూడిన సమస్త జగత్తును దగ్ధమొనర్పసాగెను. (19-20)

అంతట దేవతలందఱును మహాదేవుడైన శంకరుని శరణుజొచ్చి, 'రక్షింపుము, రక్షింపుము' అని వేడుకొనుచు ఆయనను స్తుతించిరి. దేవతలప్రార్థనలను అందుకొని దేవదేవుడైన పరమశివుడు అచట ప్రత్యక్షమాయెను. శంఖ చక్రధారియైన శ్రీహరియు అచటఆవిర్భవించెను. (21-22)

పిమ్మట శ్రీహరి దరహాసముచేయుచు శూలధారియైన శంకరునితో ఇట్లు నుడివెను. 'ఓ సురశ్రేష్ఠా! దేవతలలో నీవు ప్రప్రథముడవు. కావున దేవాసురులు సముద్రమును మథించుచున్నపుడు అందుండి పుట్టిన మొదటివస్తువు నీకే చెందవలయును. అందువలన ఓ ప్రభూ! అగ్రపూజగా భావించి, ఈ విషమును స్వీకరింపుము.' (23-24)

శ్రీహరి ఈ విధముగా పలికి, అప్పుడనే అంతర్హితుడయ్యెను. అంతట ఆ పరమేశ్వరుడు దేవతల భయమును గమనించి, శ్రీహరి యొక్క వాక్యములను ఆలకించి, ఘోరమైన హాలాహల విషమును అమృతమువలె భావించి, స్వీకరించెను. [1](ఆ గరళమును తనకంఠమున నిల్పుకొని ఈశ్వరుడు గరళకంఠుడుగా వాసికెక్కెను.) పిమ్మట ఆయన దేవతలను వీడ్కొని కైలాసమునకేగెను. (25-26)

1) శ్లో॥ నాలం వా పరమోపకారకమిదం త్వేకం పశూనాంపతే!, పశ్యన్ కుక్షిగతాన్, చరాచరగణాన్ బాహ్యస్థితాన్ రక్షితుమ్, సర్వామర్త్యపలాయనౌషధమతిజ్వాలాకరం భీకరమ్, నిక్షిప్తం గరళం గళే, న గిళితం, నోద్గీర్ణమేవ త్వయా॥

ఓ పరమశివా! అమృతముకొఱకై క్షీరసాగరమును మథించునప్పుడు అందుండి జ్వాలలను చిమ్ముచు భయంకరమైన హాలాహలవిషము ఆవిర్భవించినది. ఆ విషప్రభావమునకు తట్టుకొనలేక దేవదానవులు పారిపోసాగిరి. అప్పుడు నీవు ఆ భీకరగరళమును కంఠమున నిలుపుకొని, ఈ బాహ్యజగత్తునగల సమస్త చరాచరప్రాణులను కాపాడితివి. మఱియు ఆ విషమును మ్రింగక నీకుక్షిలోనున్న సకలజీవకోటిని రక్షించితివి. ఈ విధముగా నీవు సమస్తప్రాణికోటికిని మహోపకారమొనర్చితివి. నీ లోకరక్షణరీతికి ఈ యుదాహరణము చాలదా? – శివానందలహరి

తతో దేవాసురాస్సర్వే మమంథూ రఘునందన।
ప్రవివేశాథ పాతాళం మంథానః పర్వతోఽనఘ। 27

ఓ మహాబాహూ! ఓ రఘురామా! అనంతరము దేవాసురులు అందఱును పాలసముద్రమును చిలుకుటలో నిమగ్నులైరి. ఇంతలో కవ్వముగానున్న మందరపర్వతము పాతాళమునకు దిగబడెను. (27)

తతో దేవాస్సగంధర్వాః తుష్టువుర్మధుసూదనమ్।
త్వం గతిస్సర్వభూతానాం విశేషేణ దివౌకసామ్। 28

పాలయాస్మాన్ మహాబాహో గిరిముద్ధర్తుమర్హసి।
ఇతి శ్రుత్వా హృషీకేశః కామఠం రూపమాస్థితః। 29

అప్పుడు దేవదానవులు, గంధర్వులు శ్రీమహావిష్ణువును ఇట్లు స్తుతించిరి. 'ఓ మహాబాహూ! సమస్త ప్రాణులకు నీవే దిక్కు. విశేషించి దేవతలకు నీవే ఆధారము. ఈ మందరపర్వతమును ఉద్ధరించి మమ్ము కాపాడుము.' అంతట శ్రీహరి ఆ దేవాసురులమొఱనాలకించి, లక్షయోజనముల విస్తృతిగల కూర్మరూపమును ధరించెను. (28-29)

పర్వతం పృష్ఠతః కృత్వా శిశ్యే తత్రోదధౌ హరిః।
పర్వతాగ్రంతు లోకాత్మా హస్తేనాక్రమ్య కేశవః।
దేవానాం మధ్యతః స్థిత్వా మమంథ పురుషోత్తమః। 30

అట్లు కూర్మావతారుడైన శ్రీహరి మందరపర్వతమును తనమూపున వహించియు, సముద్రముననే ఆనందముగా శయనించెను.[1] (అప్పుడు ఆయనవీపుపై కవ్వముగాతిరుగుచున్న మందరగిరిస్పర్శ శిశువునకు నిద్రవేళ తల్లినిమురునప్పుడు కలుగుహాయివలె సుఖావహమయ్యెను.) పిమ్మట విశ్వాత్ముడైన కేశవుడు పర్వతమును తనచేతితో పట్టుకొని, దేవతలమధ్య తానొకడై సముద్రమును తానే చిలుకసాగెను. (30)

అథ వర్షసహస్రేణ సదండః సకమండలుః।
పూర్వం ధన్వంతరిర్నామ అప్సరాశ్చ సువర్చసః। 31

అప్సు నిర్మథనాదేవ రసస్తస్మాద్వరస్త్రియః।
ఉత్పేతుర్మనుజశ్రేష్ఠ తస్మాదప్సరసోఽభవన్। 32

ఇట్లు ఇంకను వేయి సంవత్సరములు గడచిన పిమ్మట ధర్మాత్ముడు, ఆయుర్వేదస్వరూపుడు ఐన ఒక మహాపురుషుడు క్షీరసాగరమునుండి ఉద్భవించెను. ఆయన పేరు ధన్వంతరి. ఆయన ఒకచేతిలో దండమును, మఱియొకచేతిలో కమండలువును ధరించియుండెను. ఇంకను ఆ సాగరము నుండి చక్కని వర్చస్సుతో గూడిన అప్సరసలు ఆవిర్భవించిరి. ఓ పురుషశ్రేష్ఠా! రామా! అప్సు = జలములను అనగా క్షీరములను, మథించినప్పుడు ఆ రసము నుండి జన్మించుట వలన ఆ సుందరవనితలకు 'అప్సరసలు' అను ప్రసిద్ధి ఏర్పడెను. (31-32)

షష్టిః కోట్యోఽభవంస్తాసామ్ అప్సరాణాం సువర్చసామ్।
అసంఖ్యేయాస్తు కాకుత్స్థ యాస్తాసాం పరిచారికాః। 33

ఓ కాకుత్స్థా! రామా! ఆ క్షీరసముద్రమునుండి సుందరాంగులైన అప్సరసలు అఱువది కోట్లమంది ఆవిర్భవించిరి. ఇంకను లెక్కలేనంత స్త్రీలు అందుండి పుట్టి వారికి పరిచారికలైరి. (33)

న తాః స్మ ప్రతిగృహ్ణంతి సర్వే తే దేవదానవాః।
అప్రతిగ్రహణాత్ తాశ్చ సర్వాః సాధారణాః స్మృతాః। 34

దేవదానవులలో ఎవ్వరును ఆ అప్సరసలను, వారి పరిచారికలను భార్యలుగా స్వీకరింపలేదు. అందువలన వారందఱును సాధారణస్త్రీలుగా ఉండిపోయిరి. (34)

1) పృష్ఠే భ్రామ్యదమంద మందరగిరిగ్రావాగ్ర కండూయనాత్। నిద్రాలోః కమఠాకృతేర్భగవతః శ్వాసానిలాః పాంతు వః।
యత్సంస్కార కలానువర్తనవశాత్ వేలానిభేనాంభసాం, యాతాయాతమతంద్రితం జలనిధేర్నాద్యాపి విశ్రామ్యతి ॥
శ్రీమద్భాగవతము - ద్వాదశస్కంధము 13వ అధ్యాయము 2వ శ్లోకము -

వరుణస్య తతః కన్యా వారుణీ రఘునందన।
ఉత్పపాత మహాభాగా మార్గమాణా పరిగ్రహమ్॥ 35

ఓ రఘునందనా! జలాధిదేవతయైన వరుణుని యొక్క కూతురు వారుణి. ఆమె మద్యదేవత. చక్కని చుక్క. ఆమె తనను చేపట్టుభర్తను వెదకికొనుచు సముద్రమునుండి బయటికి వచ్చెను. (35)

దితేః పుత్రా న తాం రామ జగృహుర్వరుణాత్మజామ్।
అదితేస్తు సుతా వీర జగృహుస్తామనిందితామ్॥ 36

ఓ రామా! ఓ మహావీరా! దితిపుత్రులు (దైత్యులు) మాత్రము వరుణునికూతురైన ఆ వారుణిని స్వీకరింపలేదు. కాని అదితి పుత్రులు (దేవతలు) మాత్రము అనింద్యయైన (పవిత్రురాలైన) ఆమెను స్వీకరించిరి. (36)

అసురాస్తేన దైతేయాః సురాస్తేనాదితేస్సుతాః।
హృష్టాః ప్రముదితాశ్చాసన్ వారుణీగ్రహణాత్ సురాః॥ 37

సురను (వారుణిని) గ్రహింపకపోవుటచే దైత్యులు అసురులైరి. సురను (వారుణిని) పరిగ్రహించుటవలన దేవతలు సురలైరి. వారు వారుణిని గ్రహించి సంతృప్తులై మిగుల ఆనందించిరి. (37)

ఉచ్చైఃశ్రవా హయశ్రేష్ఠో మణిరత్నం చ కౌస్తుభమ్।
ఉదతిష్ఠన్నరశ్రేష్ఠ తథైవామృతముత్తమమ్॥ 38

ఓ నరశ్రేష్ఠా! రామా! ఆ పాలసముద్రమునుండి 'ఉచ్చైఃశ్రవము' అను ఉత్తమాశ్వము, 'కౌస్తుభము' అను దివ్యమైన మణి, అట్లే ఉత్తమమైన 'అమృతము' బహిర్గతమైనవి. (38)

అథ తస్యకృతే రామ మహానాసీత్ కులక్షయః।
అదితేస్తు తతః పుత్రా దితేః పుత్రానసూదయన్॥ 39

ఓ రామా! అప్పుడు దేవతలు దైత్యులు ఆ అమృతమును పొందుటకై తీవ్రముగా పోట్లాడుకొనిరి. ఆ సందర్భమున దేవతలు పెక్కుమంది అసురులను సంహరించిరి. ఫలితముగా ఉభయపక్షముల వారును కొందఱు నశించిరి. (39)

ఏకతోఽభ్యాగమన్ సర్వే హ్యసురా రాక్షసైస్సహ।
యుద్ధమాసీన్మహాఘోరం వీర త్రైలోక్యమోహనమ్॥ 40

ఓ మహావీరా! ఈ సందర్భముగా దైత్యులు, రాక్షసులు ఒక పక్షమున చేరిరి. దేవతలు మఱియొక పక్షమున నిలిచిరి. ఆ యుభయపక్షములవారికిని ముల్లోకములకును ఆశ్చర్యము గొల్పునట్లు ఘోరయుద్ధము జరిగెను. (40)

యదా క్షయం గతం సర్వం తదా విష్ణుర్మహాబలః।
అమృతం సోఽహరత్ తూర్ణం మాయామాస్థాయమోహినీమ్॥ 41

ఆ రణమున ఉభయపక్షములయందును పెక్కుమంది మృతులైరి. పిమ్మట సర్వశక్తిమంతుడైన శ్రీ మహావిష్ణువు తనమాయాప్రభావముచే జగన్మోహనమైన మోహినీరూపమును దాల్చి, క్షణములో ఆ అమృతకలశమును హస్తగత మొనర్చుకొనెను. (41)

యే గతాభిముఖం విష్ణుమ్ అక్షయం పురుషోత్తమమ్।
సంపిష్టాస్తే తదా యుద్ధే విష్ణునా ప్రభవిష్ణునా॥ 42

శాశ్వతుడు, పురుషోత్తముడు ఐన శ్రీమహావిష్ణువునకు అభిముఖులై కొందఱు దైత్యులు ఆయనను ఎదిరించిరి. వారిని అతడు నుగ్గునుగ్గు గావించెను. (తనను శరణుజొచ్చిన దేవతలను ఆయన ఆదుకొనెను.) (42)

అదితేరాత్మజా వీరా దితేః పుత్రాన్ నిజఘ్నిరే।
తస్మిన్ ఘోరే మహాయుద్ధే దైతేయాదిత్యయోర్భృశమ్॥ 43

దేవతలకును దైత్యులకును మధ్యజరిగిన ఆ ఘోర యుద్ధములో వీరులైన అదితిపుత్రులు (దేవతలు) పెక్కుమంది దితిపుత్రులను (అసురులను) హతమార్చిరి. (43)

నిహత్య దితిపుత్రాంశ్చ రాజ్యం ప్రాప్య పురందరః।
శశాస ముదితో లోకాన్ సర్షిసంఘాన్ సచారణాన్॥ 44

ఇంద్రుడు దైత్యులను సంహరించి, రాజ్యాధికారమును చేపట్టెను. ఋషులు, చారణులు మున్నగు వారితో గూడిన సమస్తలోకములను అతడు సంతోషముతో పరిపాలించెను. (44)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచచత్వారింశస్సర్గః (45)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదియైదవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

46. నలుబదిఆఱవసర్గము

ఇంద్రుని సంహరింపగల పుత్రునిబడయుటకై దితి తపమొనరించుట -
ఇంద్రుడు ఆమెగర్భస్థశిశువును ఏడుముక్కలుచేయుట.

హతేషు తేషు పుత్రేషు దితిః పరమదుఃఖితా।
మారీచం కాశ్యపం రామ భర్తారమ్ ఇదమబ్రవీత్। 1

హతపుత్రాఽస్మి భగవన్ తవ పుత్రైర్మహాబలైః।
శక్రహంతారమిచ్ఛామి పుత్రం దీర్ఘతపోర్జితమ్। 2

సాహం తపశ్చరిష్యామి గర్భం మే దాతుమర్హసి।
ఈశ్వరం శక్రహంతారం త్వ మనుజ్ఞాతు మర్హసి। 3

తస్యాస్తద్వచనం శ్రుత్వా మారీచః కాశ్యప స్తదా।
ప్రత్యువాచ మహాతేజా దితిం పరమదుఃఖితామ్। 4

ఏవం భవతు భద్రం తే శుచిర్భవ తపోధనే।
జనయిష్యసి పుత్రం త్వం శక్రహంతారమాహవే। 5

పూర్ణే వర్షసహస్రే తు శుచిర్యది భవిష్యసి।
పుత్రం త్రైలోక్యభర్తారం మత్తస్త్వం జనయిష్యసి। 6

ఏవ ముక్త్వా మహాతేజాః పాణినా సమమార్జతామ్।
సమాలభ్య తతః స్వస్తి త్యుక్త్వా స తపసే యయౌ। 7

గతే తస్మిన్ నరశ్రేష్ఠ దితిః పరమహర్షితా।
కుశప్లవనమాసాద్య తపస్తేపే సుదారుణమ్। 8

తప స్తస్యాం హి కుర్వంత్యాం పరిచర్యాం చకార హ।
సహస్రాక్షో నరశ్రేష్ఠ పరయా గుణసంపదా। 9

అగ్నిం కుశాన్ కాష్ఠ మపః ఫలం మూలం తథైవ చ।
న్యవేదయత్ సహస్రాక్షో యచ్చాన్యదపి కాంక్షితమ్। 10

గాత్రసంవాహనైశ్చైవ శ్రమాపనయనైస్తథా।
శక్రస్సర్వేషు కాలేషు దితిం పరిచచార హ। 11

ఓ రామా! (క్షీరసాగరమథనసమయమున దేవాసుర యుద్ధమునందు) తనపుత్రులు హతులు కాగా దితి మిక్కిలి దుఃఖితయై, మరీచిమహర్షి కుమారుడును, తనకు భర్తయు ఐన కాశ్యపమహర్షికడకేగి ఇట్లు మొఱపెట్టుకొనెను. (1)

"ఓ మహాత్మా! బలశాలురైన నీ కుమారులు (దేవతలు) నా పుత్రులను (దైత్యులను) వధించిరి. పుత్రశోకముచే నేను విలవిలలాడుచున్నాను. కనుక నేను గొప్పతపస్సు చేసి, ఇంద్రుని చంపగల బలిష్ఠుడైన కుమారుని పొందగోరుచున్నాను. (2)

అందువలన నేను తీవ్రముగా తపమొనర్చుటకు అనుజ్ఞనిమ్ము. ఇంద్రుని సంహరించి, ముల్లోకములను నియంత్రింపగల పుత్రుని ప్రసాదింపుము." (3)

పుత్రదుఃఖముతో పరితపించుచున్న దితియొక్క పలుకులను ఆలకించి, మరీచిపుత్రుడును, మహాతేజస్వియు ఐన కాశ్యప మహాముని ఆమెతో ఇట్లు అభయవచనములను పల్కెను. (4)

"ఓ తపోధనురాలా! అట్లే సుమా. నీకు శుభమగుగాక. పుత్రుడు కలుగువఱకు నీవు పవిత్రతను కాపాడుకొనుచుండుము. యుద్ధమున ఇంద్రుని చంపగల పుత్రుని నీవు పొందగలవు. (5)

వేయిసంవత్సరములు పవిత్రతను నీవు కాపాడు కొనగలిగినచో ముల్లోకములను శాసింపగల పుత్రుడు నావలన నీకు కలుగును." (6)

మహాతేజస్వియైన కాశ్యపుడు తనభార్యయైన దితివీపును తట్టుచు ఆమెను ఓదార్చెను. పిమ్మట ఆమెఉదరమును స్పృశించి 'నీకు పుత్రలాభము కలుగుగాక' అని పలికి ఆ మహర్షి తపస్సొనర్చుటకై వెళ్ళెను. (7)

ఓ నరోత్తమా! ఆ కాశ్యపుడు అట్లు వెళ్ళినతరువాత దితి మిక్కిలి సంతసించి, 'కుశప్లవనము' అను పేరుగల క్షేత్రమును జేరి, తీవ్రముగా తపమాచరించెను. (8)

ఓ నరశ్రేష్ఠా! దితి అట్లు తపమొనరించుచుండగా దేవేంద్రుడు ఆమెకు వినయవిధేయతలతో పరిచర్యలు చేయసాగెను. ఇంద్రుడు ఆమెకు అగ్నిని, కుశలను, సమిధలను, జలములను, కందమూల ఫలములను, ఇంకను వలసిన వాటినన్నింటిని సమయమునకు గుర్తించి సమకూర్చుచుండెను. అతడు వాత్సల్యభావముతో దితికి పాదములొత్తుట మొదలగు పరిచర్యలను, శ్రమను తొలగించుటకై చామరములతో వీచుట మొదలగు సేవలను ఎల్లవేళల ఆచరించుచుండెను. (9-11)

అథ వర్షసహస్రే తు దశోనే రఘునందన।
దితి: పరమసంప్రీతా సహస్రాక్షమ్ అథాబ్రవీత్॥ 12

యాచితేన సురశ్రేష్ఠ తవ పిత్రా మహాత్మనా।
వరో వర్షసహస్రాంతే దత్తో మమ సుతం ప్రతి॥ 13

తప శ్చరంత్యా వర్షాణి దశ వీర్యవతాం వర।
అవశిష్టాని భద్రం తే భ్రాతరం ద్రక్ష్యసే తత:॥ 14

తమహం త్వత్కృతే పుత్ర సమాధాస్యే జయోత్సుకమ్।
త్రైలోక్యవిజయం పుత్రం సహ భోక్ష్యసి విజ్వర:॥ 15

ఏవ ముక్త్వా దితిశ్శక్రం ప్రాప్తే మధ్యం దివాకరే।
నిద్రయాపహృతా దేవీ పాదౌ కృత్వాఽథ శీర్షత:॥ 16

దృష్ట్వా తామశుచిం శక్ర: పాదత: కృతమూర్ధజామ్।
శిర:స్థానే కృతౌ పాదౌ జహాస చ ముమోద చ॥ 17

తస్యాశ్శరీరవివరం వివేశ చ పురందర:।
గర్భం చ సప్తధా రామ బిభేద పరమాత్మవాన్॥ 18

భిద్యమానస్తతో గర్భో వజ్రేణ శతపర్వణా।
రురోద సుస్వరం రామ తతో దితిరబుధ్యత॥ 19

మారుదో మారుదశ్చేతి గర్భం శక్రోఽభ్యభాషత।
బిభేద చ మహాతేజా రుదంతమపి వాసవ:॥ 20

న హంతవ్యో న హంతవ్య ఇత్యేవం దితిరబ్రవీత్।
నిష్పపాత తతశ్శక్రో మాతుర్వచనగౌరవాత్॥ 21

ప్రాంజలిర్వజ్రసహితో దితిం శక్రోఽభ్యభాషత।
అశుచిర్దేవి సుప్తాసి పాదయో: కృతమూర్ధజా॥ 22

ఓ రఘురామా! వేయిసంవత్సరముల తప:కాలములో పది సంవత్సరములకాలము మిగిలియుండగా (అనగా తొమ్మిదివందల తొంబదిసంవత్సరముల కాలము గడిచినపిదప) దేవేంద్రుని సేవలకు దితి మిక్కిలి సంతుష్టురాలై ఆయనతో ఇట్లు నుడివెను. (12)

"ఓ దేవేంద్రా! మహాత్ముడైన నీ తండ్రియగు కశ్యపుని నేను ప్రార్థింపగా ఆయన 'వేయి సంవత్సరముల తపఃఫలముగా నీకొకపుత్రుడు కలుగును' - అని నాకు వరమిచ్చెను. ఓ పరాక్రమశాలీ! నా తపోదీక్షాకాలము ఇంకను పది సంవత్సరములు మిగిలియున్నది. అప్పుడు నీవొక తమ్ముని చూడగలవు, నీకు భద్రమగుగాక. కుమారా! నిన్ను జాతమాత్రగల ఒకపుత్రుని నాకు ప్రసాదింపుమని కాశ్యపుని కోరియుంటిని. ఆ పుత్రుడు నిన్ను జయించుటకు ఉత్సుకుడైనప్పుడు నేనతనిని శాంతపఱతును. అప్పుడతడు నీ యెడల వైరభావమును వీడి భ్రాతృభావమును చూపును. అతడు సాధించిన ముల్లోకాధిపత్యమును అతనితోగూడి నీవును అనుభవింపగలవు." (13-15)

దితి ఇంద్రునితో ఈ విధముగా పలుకుచుండగా ఇంతలో మధ్యాహ్నసమయమయ్యెను. అంతట నిద్రముంచుకొనివచ్చుటచే ఆమె వివశయై తూలిపోసాగెను. అప్పుడామెశిరస్సు పాదములకు తాకెను. ఆమె పగటిపూట నిద్రకు లోనగుట, ఆమె కేశములు పాదధూళిని స్పృశించుట అను దోషముల కారణముగా ఇంద్రుడు ఆమె అశుచియైనట్లు[1] ఎఱింగి, సంతోషముతో దరహాసము చేసెను. (16-17)

శ్రీరామా! పిమ్మట ఇంద్రుడు ఆమెగర్భమున ప్రవేశించి, ధైర్యము వహించి, గర్భస్థశిశువును ఏడు ముక్కలుగా చేసెను. (18)

ఓ రామా! ఇంద్రుడు నూఱంచులుగల తనవజ్రాయుధముతో ఛేదింపగా అది (ఆ శిశువు) బిగ్గరగా ఏడ్చెను. అంతట దితి మేల్కొనెను. అట్లు ఏడ్చుచు గర్భమందున్న శిశువుతో ఇంద్రుడు 'ఏడువకుము, ఏడువకుము' అని పల్కుచు మఱల దానిని ఛేదించెను. అంతట దితి ఇంద్రునితో 'శిశువును చంపకుము, చంపకుము' - అని పలికెను. పిమ్మట ఇంద్రుడు తల్లిమాటలపై గౌరవము ఉంచి గర్భమునందుండి బయటపడెను. (19-21)

వజ్రాయుధమును ధరించియున్న ఇంద్రుడు అంజలి ఘటించి దితితో ఇట్లు నుడివెను. "ఓ దేవీ! పాదములవైపు శిరస్సును

1) మధ్యాహ్నసమయమున నిద్ర క్రమ్ముకొని వచ్చుటచే దితి శయ్యపై పాదములవైపు శిరస్సుంచి నిద్రలో మునిగెను. అప్పుడు ఆమె కేశములు పాదస్థానమునందలి ధూళిస్పర్శకు లోనయ్యెను. ఈ విధముగా దోషద్వయము వాటిల్లెను - అని కొంత మంది వ్యాఖ్యానించిరి.

తదంతర మహం లబ్ధ్వా శక్రహంతార మాహవే।
అభిందం సప్తధా దేవి తన్మే త్వం క్షంతు మర్హసి। 23

ఉంచి నిద్రించుటవలన నీవు అశుచివైతివి. ఈ అవకాశమును జూచుకొని, యుద్ధమున నన్ను చంపనున్న వానిని ఏడు ముక్కలుగా చేసితిని. అమ్మా! నన్ను క్షమింపుము." (22-23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షట్చత్వారింశస్సర్గః (46)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదిఆఱవసర్గము సమాప్తము

— ✳ ✳ ✳ —

47. నలుబదిఏడవసర్గము

సప్తమరుత్తుల వృత్తాంతము – విశాలానగరప్రభువైన 'సుమతి' విశ్వామిత్రునకు ఆదరసత్కారములను ఒనర్చుట.

సప్తధా తు కృతే గర్భే దితిః పరమదుఃఖితా।
సహస్రాక్షం దురాధర్షం వాక్యం సానునయాఽబ్రవీత్। 1

మమాపరాధాద్గర్భోఽయం సప్తధా విఫలీకృతః।
నాపరాధోఽస్తి దేవేశ తవాత్ర బలసూదన। 2

ప్రియం తు కర్తు మిచ్ఛామి మమ గర్భవిపర్యయే।
మరుతాం సప్త సప్తానాం స్థానపాలా భవంత్విమే। 3

వాతస్కంధా ఇమే సప్త చరంతు దివి పుత్రక।
మారుతా ఇతి విఖ్యాతా దివ్యరూపా మమాత్మజాః। 4

బ్రహ్మలోకం చరత్వేక ఇంద్రలోకం తథాపరః।
దివి వాయురితి ఖ్యాతః తృతీయోఽపి మహాయశాః। 5

దితి తనగర్భస్థపిండము ఏడుముక్కలైనందులకు తీరనిదుఃఖమునకు లోనయ్యెను. అప్పుడు ఆమె దుర్జయుడైన సహస్రాక్షునితో ఇట్లు అనునయ వచనములను పల్కెను. (1)

"బలాసురుని హతమార్చిన ఓ దేవేంద్రా! నా అపరాధము వలననే ఈ గర్భస్థపిండము ఏడు శకలములైనది. యథార్థముగా ఇందు నీ తప్పు ఏ మాత్రము లేదు. ఖండితమైన గర్భముయొక్క సప్తమూర్తులు ఏడు లోకములకును పాలకులగుదురు. దివ్య స్వరూపులైన నా కుమారులు ఏడుగురును సప్తవిధవాయువులకు అభిమానదేవతలై, 'మరుత్తులు'(1) అను పేర విఖ్యాతులై దివ్యలోకములయందు సంచరింతురు. (2-4)

వీరిలో ఒకడు బ్రహ్మలోకమునందును, మఱియొకడు ఇంద్రలోకమునందును, ఇంకొకడు మహాయశస్వియై 'వాయువు' అను పేరుతో ప్రసిద్ధుడై అంతరిక్షమునందును సంచరింతురు-

1) శ్లో॥ ఆవహప్రవహాశ్చైవ సంవహశ్చోద్వహస్తథా। వివహాఖ్యః పరివహః పరావహ ఇతిక్రమాత్॥
సప్తైతే మారుత స్కంధా మహర్షిభిరుదాహృతాః। ఆవహోవర్తయేద్వాయుః మేఘోల్కా వృష్టి విద్యుతః॥
వర్తయేత్ ప్రవహశ్చైవ తథా మార్తాండ మండలమ్। సంవహోమారుత స్కంధః తథాశీతాంశు మండలమ్॥
వర్తయేదుద్వహశ్చాపి తథా నక్షత్రమండలమ్। పంచమో వివహాఖ్యశ్చ తథైవ గ్రహమండలమ్॥
సప్తర్షి చక్రం స్వర్గంగాం షష్ఠః పరివహస్తథా। పరావహస్తథా వాయుర్వర్తయేత్ ధ్రువమండలమ్॥ *(గోవిందరాజీయవ్యాఖ్య)*

1) ఆవహము *2)* ప్రవహము *3)* సంవహము *4)* ఉద్వహము *5)* వివహము *6)* పరివహము *7)* పరావహము అను ఏడు మరుత్తులను 'వాతస్కంధములు' అనియు అందురు.

ఆవహము మేఘమండలమునకును, ప్రవహము సూర్యమండలమునకును, సంవహము చంద్రమండలమునకును, ఉద్వహము నక్షత్ర మండలమునకును, వివహము గ్రహమండలమునకును, పరివహము సప్తర్షి మండలమునకును, పరావహము ధ్రువమండలమునకును అధిష్ఠాన దేవతలు.

ఈ మండలక్రమమునే ఆంధ్రమహాభాగవతమునందు పోతనామాత్యుడు - ఇట్లు నేర్కొనెను -

శా॥ ఇంతింతై వటుడింతయై మఱియు దానింతై నభోవీథిపై
నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రునికంతయై ధ్రువునిపైనంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై॥

ఆంధ్రమహాభాగవతము. అష్టమస్కంధము-620

చత్వారస్తు సురశ్రేష్ఠ దిశో వై తవ శాసనాత్।
సంచరిష్యంతు భద్రం తే దేవభూతా మమాత్మజాః।
త్వత్కృతే నైవ నామ్నా చ మారుతా ఇతి విశ్రుతాః। 6

తస్యాస్తద్వచనం శ్రుత్వా సహస్రాక్షః పురందరః।
ఉవాచ ప్రాంజలిర్వాక్యం దితిం బలనిషూదనః। 7

సర్వమేతద్యథోక్తం తే భవిష్యతి న సంశయః।
విచరిష్యంతి భద్రం తే దేవరూపాస్తవాత్మజాః। 8

ఏవం తౌ నిశ్చయం కృత్వా మాతాపుత్రౌ తపోవనే।
జగ్మతుస్త్రిదివం రామ కృతార్థావితి నశ్శ్రుతమ్। 9

ఏష దేశః స కాకుత్స్థ మహేంద్రాధ్యుషితః పురా।
దితిం యత్ర తపస్సిద్ధామ్ ఏవం పరిచచార సః। 10

ఇక్ష్వాకోస్తు నరవ్యాఘ్ర పుత్రః పరమధార్మికః।
అలంబుసాయామ్ ఉత్పన్నో విశాల ఇతి విశ్రుతః। 11

తేన చాసీదిహ స్థానే విశాలేతి పురీ కృతా। 12

విశాలస్య సుతో రామ హేమచంద్రో మహాబలః।
సుచంద్ర ఇతి విఖ్యాతో హేమచంద్రాదనంతరః। 13

సుచంద్రతనయో రామ ధూమ్రాశ్వ ఇతి విశ్రుతః।
ధూమ్రాశ్వతనయశ్చాపి సృంజయ స్సమపద్యత। 14

సృంజయస్య సుతశ్శ్రీమాన్ సహదేవః ప్రతాపవాన్।
కుశాశ్వః సహదేవస్య పుత్రః పరమధార్మికః। 15

కుశాశ్వస్య మహాతేజాః సోమదత్తః ప్రతాపవాన్।
సోమదత్తస్య పుత్రస్తు కాకుత్స్థ ఇతి విశ్రుతః। 16

తస్య పుత్రో మహాతేజాః సంప్రత్యేష పురీ మిమామ్।
ఆవసత్యమరప్రఖ్యః సుమతిర్నామ దుర్జయః। 17

ఇక్ష్వాకోస్తు ప్రసాదేన సర్వే వైశాలికా నృపాః।
దీర్ఘాయుషో మహాత్మానో వీర్యవంతస్సుధార్మికాః। 18

ఓ పురందరా! మిగిలిన నలుగురును నీ ఆజ్ఞానువర్తులై నాలుగు దిశలయందును సంచరింతురు. నీకు శుభమగు గాక. దివ్య స్వరూపులైన నా కుమారులను ఉద్దేశించి నీవు 'మారుదః (ఏడువకుము) మారుదః (ఏడువకుము)' అని పలుకుటచే వారు 'మరుత్తులు' అను పేర వాసికెక్కుదురు." (5-6)

బలాసురసంహారియు, సహస్రాక్షుడును ఐన దేవేంద్రుడు దితియొక్క ఆర్తవచనములను విని అంజలి ఘటించి, ఆమెతో ఇట్లనెను. (7)

"తల్లీ! నీకు భద్రమగు గాక. నీవు చెప్పినదంతయును జరిగితీరును. నీ మనోరథము ఈడేరును. నీ కుమారులు దివ్య స్వరూపులై సంచరింతురు." (8)

ఓ రామా! ఇట్లు ఆ తల్లికొడుకులు ఇరువురును తపోవనమునందు అట్లు నిశ్చయించుకొని, కృతార్థులై స్వర్గమునకు వెళ్లిరని వింటిమి. (9)

ఓ కాకుత్స్థా ! రామా ! ఈ ప్రదేశమునందే పూర్వము దేవేంద్రుడు నివసించి, తపస్సిద్ధురాలైన దితికి పరిచర్యలు సలిపెను. (10)

ఓ నరశ్రేష్ఠా ! ఇక్ష్వాకుమహారాజునకు 'అలంబుస' అను పట్టపురాణి యందు ఒక పుత్రుడు కలిగెను. అతని పేరు విశాలుడు. అతడు పరమధార్మికుడుగా ప్రసిద్ధికెక్కెను. ఆయన పేరుతోనే ఈ ప్రదేశమున 'విశాల' యను నగరము నిర్మింపబడి ప్రఖ్యాతికెక్కెను. ఓ రామా! మిక్కిలి బలశాలియైన హేమచంద్రుడు ఈ విశాలుని కుమారుడు. హేమచంద్రుని అనంతరము అతని పుత్రుడైన సుచంద్రుడును ఘనతవహించెను. విఖ్యాతుడైన ధూమ్రాశ్వుడు ఈ సుచంద్రుని కుమారుడే. ధూమ్రాశ్వునకు కలిగిన తనయుడు సృంజయుడు. పరాక్రమశాలియు, సర్వ శుభలక్షణ సంపన్నుడును ఐన సహదేవుడు సృంజయుని సుతుడు. సహదేవుని పుత్రుడు కుశాశ్వుడు, అతడు పరమ ధార్మికుడు. (11-15)

కుశాశ్వుని కుమారుడైన సోమదత్తుడు ప్రతాపశాలియే గాక మహాతేజస్వి. సోమదత్తుని పుత్రుడు కాకుత్స్థుడు. అతడు ప్రసిద్ధిగన్నవాడు. కాకుత్స్థునికుమారుడు సుమతి. అతడుమహాతేజస్వి. అమరతుల్యుడు, అజేయుడు ఐన 'సుమతి' ఇప్పుడు ఈ నగరమును పరిపాలించుచున్నాడు. (16-17)

'విశాల' నగరమును పరిపాలించిన రాజులందఱును ఈ వంశమునకు మూలపురుషుడైన ఇక్ష్వాకుమహారాజు యొక్క అనుగ్రహముచేతనే దీర్ఘాయుష్మంతులై వర్ధిల్లిరి. వారు అందఱును మహాత్ములు, మిక్కిలి పరాక్రమశాలురు, పరమధార్మికులు.(18)

ఇహాద్య రజనీం రామ సుఖం వత్స్యామహే వయమ్।
శ్వః ప్రభాతే నరశ్రేష్ఠ జనకం ద్రష్టుమర్హసి। 19

ఓ నరోత్తమా! రామా! ఈ రాత్రిని ఇచటనే సుఖముగా గడిపి, రేపు ఉదయముననే జనకమహారాజును దర్శించుటకు వెళ్లుదము. (19)

సుమతిస్తు మహాతేజా విశ్వామిత్రమ్ ఉపాగతమ్।
శ్రుత్వా నరవరశ్రేష్ఠః ప్రత్యుద్గచ్ఛన్మహాయశాః। 20

పూజాం చ పరమాం కృత్వా సోపాధ్యాయస్సబాంధవః।
ప్రాంజలిః కుశలం పృష్ట్వా విశ్వామిత్రమ్ అథాబ్రవీత్। 21

మిగుల పరాక్రమవంతుడును, మహాయశస్వియు ఐన ఆ 'సుమతి' మహారాజు తననగరమునకు విశ్వామిత్ర మహర్షి వచ్చినట్లు ఎఱింగి, ఆయనకు స్వాగతమర్యాదలు నెరపుటకై పురోహితులతో, బంధువులతో గూడి ఎదురేగెను. పిమ్మట సకలమర్యాదలతో ఆయనను పూజించి, అంజలి ఘటించి, కుశల ప్రశ్నలు కావించెను. పిదప విశ్వామిత్రమహర్షితో అతడు ఇట్లనెను. (20-21)

ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే విషయం మునిః।
సంప్రాప్తో దర్శనంచైవ నాస్తి ధన్యతరో మయా। 22

"ఓ మహాత్మా! నన్ను అనుగ్రహింపదలచి మీరు మా దేశమునకు దయతో విచ్చేసితిరి. నేను ధన్యుడనైతిని. మీ దర్శన భాగ్యముగూడ గలిగెను. ఇక నాయంతటి ధన్యుడు ఎవ్వడుండును? (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తచత్వారింశస్సర్గః (47)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదిఏడవసర్గము సమాప్తము

-- * * * --

48. నలుబదిఎనిమిదవసర్గము

అహల్యాశాపవృత్తాంతము.

పృష్ట్వా తు కుశలం తత్ర పరస్పరసమాగమే।
కథాంతే సుమతిర్వాక్యం వ్యాజహార మహామునిమ్। 1

పరస్పరము ఆ ఇరువురి (విశ్వామిత్రమహర్షి, సుమతి మహారాజు) కుశలప్రశ్నలు ముగిసినపిమ్మట, రాజు ఆ మహా మునితో ఇట్లు నుడివెను. (1)

ఇమౌ కుమారౌ భద్రం తే దేవతుల్యపరాక్రమౌ।
గజసింహగతీ వీరౌ శార్దూలవృషభోపమౌ। 2

పద్మపత్రవిశాలాక్షౌ ఖడ్గతూణీధనుర్ధరౌ।
అశ్వినావివ రూపేణ సముపస్థితయౌవనౌ। 3

యదృచ్ఛయైవ గాం ప్రాప్తౌ దేవలోకాదివామరౌ।
కథం పద్భ్యామిహ ప్రాప్తౌ కిమర్థం కస్య వా మునే। 4

ఓ మునీశ్వరా! "ఈ ఇరువురు చిన్నారులును పరాక్రమమున విష్ణుతుల్యులుగ కన్పట్టుచున్నారు. వీరు గాంభీర్యగమనమున గజేంద్రసదృశులు, శత్రుతిరస్కార గమనమునందు సింహ తుల్యులు, భయంకరగమనమున శార్దూలసమానులు, వృషభముల వలె ఠీవిగా నడచువారు, వీరు తామరరేకులవలె విశాలమైన కన్నులుగలవారు. ఖడ్గములను ధనుర్బాణములను ధరించిన వారు, రూపసౌభాగ్యమున అశ్వినీదేవతలవంటివారు. వయసునకు దగినసొగసులతో యౌవనమునందు అడుగిడుచున్నవారు, దివినుండి భువికి ఏతెంచిన దేవతలవలెనున్న వీరు మా భాగ్యవశమున ఇచటికి విచ్చేసిరి. ఓ మునీశ్వరా! తమ సుకుమారమైన పాదములతో ఈ కటికి నేలపై నడచివచ్చుచున్న వీరు ఎవరి కుమారులు? సూర్యచంద్రులు ఆకాశమునవలె

భూషయంతావిమం దేశం చంద్రసూర్యావివాంబరమ్।
పరస్పరస్య సదృశౌ ప్రమాణేంగితచేష్టితైః। 5

కిమర్థం చ నరశ్రేష్ఠౌ సంప్రాప్తౌ దుర్గమే పథి।
వరాయుధధరౌ వీరౌ శ్రోతుమిచ్ఛామి తత్త్వతః। 6

తస్య తద్వచనం శ్రుత్వా యథావృత్తం న్యవేదయత్।
సిద్ధాశ్రమనివాసం చ రాక్షసానాం వధం తథా। 7

విశ్వామిత్రవచః శ్రుత్వా రాజా పరమహర్షితః।
అతిథీ పరమౌ ప్రాప్తౌ పుత్రౌ దశరథస్య తౌ।
పూజయామాస విధివత్ సత్కారార్హౌ మహాబలౌ। 8

తతః పరమ సత్కారం సుమతేః ప్రాప్య రాఘవౌ।
ఉష్య తత్ర నిశామేకాం జగ్మతు ర్మిథిలాం తతః। 9

తాం దృష్ట్వా మునయః సర్వే జనకస్య పురీం శుభామ్।
సాధు సాధ్వితి శంసంతో మిథిలాం సమపూజయన్। 10

మిథిలోపవనే తత్ర ఆశ్రమం దృశ్య రాఘవః।
పురాణం నిర్జనం రమ్యం పప్రచ్ఛ మునిపుంగవమ్। 11

శ్రీమదాశ్రమసంకాశం కిన్న్విదం మునివర్జితమ్।
శ్రోతు మిచ్ఛామి భగవన్ కస్యాయం పూర్వ ఆశ్రమః। 12

తచ్ఛ్రుత్వా రాఘవేణోక్తం వాక్యం వాక్యవిశారదః।
ప్రత్యువాచ మహాతేజా విశ్వామిత్రో మహామునిః। 13

హంత తే కథయిష్యామి శృణు తత్త్వేన రాఘవ।
యస్యైతదాశ్రమపదం శప్తం కోపాన్మహాత్మనా। 14

గౌతమస్య నరశ్రేష్ఠ పూర్వమాసీన్మహాత్మనః।
ఆశ్రమో దివ్యసంకాశః సురైరపి సుపూజితః। 15

వీరు మాదేశమున వెలుగులను విరజిమ్ముచున్నారు. శరీరౌన్నత్యమునందును, దరహాసాదులతో తమలోనిభావములను ప్రకటించుటయందును గమనభాషణములయందును, చూపుల యందును ఒకరికొకరు తీసిపోనివారు. శ్రేష్ఠములైన ఆయుధములను ధరించిన ఈ వీరులు ఈ దుర్గమారణ్యములలో నడచివచ్చుటకు కారణమేమి? ఇంతకును వీరెవరు? ఈ విషయములనన్నింటిని వినగోరుచున్నాను. తెలిపి పుణ్యము గట్టుకొనుడు." (2-6)

ఆ మహారాజుప్రశ్నలకు సమాధానముగా విశ్వామిత్రమహాముని సిద్ధాశ్రమనివాసము, తాటకా మారీచాదిరాక్షసులవధ మున్నుగా గల సమస్త వృత్తాంతములను పూసగ్రుచ్చినట్లు దెలిపెను. (7)

విశ్వామిత్రునివచనములను విని, దశరథునిపుత్త్రులగు రామలక్ష్మణులవంటి మహాత్ములు తనకు అతిథులుగా లభించినందులకు మహారాజు పరమానంద భరితుడాయెను. మహాపరాక్రమవంతులు, సత్కారార్హులు ఐన ఆ రాకుమారులకు విధ్యుక్తముగా పరమసంతోషముతో పూజలు సలిపెను. (8)

రామలక్ష్మణులు సుమతిమహారాజునుండి చక్కని గౌరవ సత్కారములను అందుకొని, ఒక రాత్రి అచట గడపిరి. మఱునాడు వారు విశ్వామిత్రునివెంట మునులతోగూడి మిథిలానగరమునకు బయలుదేఱిరి. మునులందఱును మనోహరమైన జనకునిపురమును జూచి, 'బాగు బాగు' అని కొనియాడుచు ఆ మిథిలకు నమస్కరించిరి. (9-10)

అంతట శ్రీరాముడు మిథిలకు సమీపమునగల వనము నందు ఒక ఆశ్రమమును జూచెను. అది ప్రాచీనమైనదేయైనను మిక్కిలి రమ్యముగా ఉండెను. కాని అది నిర్జనముగా ఉండుటను జూచి శ్రీరాముడు ఆ మహామునితో ఇట్లనుడివెను. (11)

"ఓ మహాత్మా! ఇది పూర్తిగా ఆశ్రమలక్షణములతో కన్పట్టుచున్నది. కాని ఇందు మునులెవ్వరును కనబడుట లేదేమి? పురాతనమైన ఈ ఆశ్రమము ఎవరిదైయుండును? ఈ విషయములను వినగోరుచున్నాను." (12)

మిక్కిలి తేజస్వియు, వాక్చతురుడును ఐన విశ్వామిత్ర మహాముని రాఘవునిప్రశ్నలకు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (13)

'ఓ రామా! భలే! నీవడిగినప్రశ్న ఎంతయుసముచితముగా నున్నది. ఈ ఆశ్రమము ఒక మహాత్ముని కోపకారణముగా శాపమునకు గుఱియైనది. ఆ విషయములను అన్నింటిని తేటతెల్లము గావించెదను' వినుము. (14)

"ఓ నరశ్రేష్ఠా! ఇది మహాత్ముడైన గౌతమమహర్షిఆశ్రమము. ఇది ఒకానొకప్పుడు దివ్యశోభలతో విలసిల్లుచు దేవతల పూజలను సైతము అందుకొనినది. వాసిగాంచిన ఓ రామా!

స చేహ తప ఆతిష్ఠత్ అహల్యాసహితః పురా।
వర్షపూగాననేకాంశ్చ రాజపుత్త్ర మహాయశః। 16

తస్యాంతరం విదిత్వా తు సహస్రాక్షశ్శచీపతిః।
మునివేషధరోఽహల్యామ్ ఇదం వచనమబ్రవీత్। 17

ఋతుకాలం ప్రతీక్షంతే నార్థినస్సుసమాహితే।
సంగమం త్వహ మిచ్ఛామి త్వయా సహ సుమధ్యమే। 18

మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన।
మతిం చకార దుర్మేధా దేవరాజకుతూహలాత్। 19

అథాబ్రవీత్ సురశ్రేష్ఠం కృతార్థేనాంతరాత్మనా।
కృతార్థాస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్రు మితః ప్రభో। 20

ఆత్మానం మాం చ దేవేశ సర్వథా రక్ష మానద। 21

ఇంద్రస్తు ప్రహసన్ వాక్యమ్ అహల్యామ్ ఇదమబ్రవీత్।
సుశ్రోణి పరితుష్టోఽస్మి గమిష్యామి యథాగతమ్। 22

ఏవం సంగమ్య తు తదా నిశ్చక్రామోటజాత్ తతః।
స సంభ్రమాత్ త్వరన్ రామ శంకితో గౌతమం ప్రతి। 23

గౌతమం సదదర్శాథ ప్రవిశంతం మహామునిమ్।
దేవదానవదుర్ధర్షం తపోబలసమన్వితమ్। 24

తీర్థోదకపరిక్లిన్నం దీప్యమానమివానలమ్।
గృహీతసమిధం తత్ర సకుశం మునిపుంగవమ్।
దృష్ట్వా సురపతిః త్రస్తో వివర్ణవదనోఽభవత్। 25

అథ దృష్ట్వా సహస్రాక్షం మునివేషధరం మునిః।
దుర్వృత్తం వృత్తసంపన్నో రోషాద్వచనమబ్రవీత్। 26

మమ రూపం సమాస్థాయ [illegible] దుర్మతే।
అకర్తవ్యమిదం తస్మాత్ విఫలస్త్వం భవిష్యసి। 27

గౌతమేనైవముక్తస్య సరోషేణ మహాత్మనా।
పేతతుర్వృషణౌ భూమౌ సహస్రాక్షస్య తత్‌క్షణాత్। 28

తథా శప్త్వా స వై శక్రమ్ అహల్యామపి శప్తవాన్।
ఇహ వర్షసహస్రాణి బహూని త్వం నివత్స్యసి। 29

పూర్వకాలమున ఆ గౌతమముని తనభార్యయగు అహల్యతోగూడి, ఈ ఆశ్రమమునందు వసించుచు, పెక్కు సంవత్సరములు తపస్సుచేసెను. గౌతమముని ఆశ్రమమున లేనిసమయమును జూచుకొని, శచీపతియైన దేవేంద్రుడు గౌతమఋషివేషములో ఆ ఆశ్రమమునకు వచ్చి, అహల్యతో ఇట్లు పలికెను. (15-17)

"ఓ సుందరీమణీ! కామాతురులు ఋతుకాలమువఱకు ఆగరు. ఓ తరుణీ! నీతో సంగమింపగోరుచున్నాను." (18)

"ఓ రఘునందనా! అహల్య గౌతమముని వేషములో వచ్చినవాడు ఇంద్రుడని తనదివ్యశక్తిచే గుర్తించెను. దేవతలకు ప్రభువైనను ఇంద్రుడు 'ఈ విధముగా పలుకుచున్నాడేమి?' అను విషయము ఆమెబుద్ధికితోచక పెక్కువిధముల ఆలోచించెను.(19)

పిమ్మట ఆమె ఆ అమరేంద్రునితో ఇట్లనెను. 'ఓ సురశ్రేష్ఠా! నా దాంపత్యజీవనమున నేను సంతుష్టురాలను. నీవు ఇచ్చటి నుండి వెంటనే వెళ్లుము. ఓ సురపతీ! అన్ని విధముల నీ-నా గౌరవములను నిలుపుము.' - పిదప ఇంద్రుడు నవ్వుచు "ఓ సుందరీ! నీవిశిష్టరీతికి సంతసించితిని. వచ్చినవిధముగనే వెళ్లెదను.- అని పలికెను. (20-22)

ఓ రామా! ఇట్లామెతో పలికిన పిదప 'గౌతమ ముని వచ్చునను శంకతో భయపడుచు అతడు ఆ పర్ణశాలనుండి త్వరత్వరగా బయటికి వచ్చెను. (23)

ఇంతలో గౌతమమహర్షి పర్ణశాలకు రానే వచ్చెను. తపోబలసంపన్నుడైన ఆ ముని దేవదానవులకును అజేయుడు. తీర్థజలములలో స్నానమొనర్చి, అతడు అగ్నితేజస్సుతో ప్రకాశించుచుండెను. అట్టి ఆ మహర్షి సమిధలను, కుశలను చేతబట్టుకొని, ఆశ్రమమున ప్రవేశించుచుండగా ఆయనను చూడగనే ఇంద్రునిముఖము భయముతో వెలవెలబోయెను. ఉత్తమశీలసంపన్నుడైన గౌతమమహర్షి తనరూపమును ధరించివచ్చిన దుర్వృత్తుడగు ఇంద్రుని చూచి, రోషముతో ఇట్లు పల్కెను. (24-26)

"ఓ దుర్మతీ! నా రూపమును ధరించివచ్చి, అనుచితముగా ప్రవర్తించితివి. అందువలన నీవు విగత వృషణుడవయ్యెదవు."- అని శపించెను. (27)

మహాత్ముడైన గౌతముడు రోషముతో ఇట్లు శపించిన వెంటనే ఇంద్రునివృషణములు నేలపై రాలిపడెను. (28)

అట్లు ఇంద్రునకు శాపము ఇచ్చిన పిమ్మట గౌతముడు అహల్యనుగూడ ఇట్లు శపించెను. "వేలకొలది సంవత్సరములు నీవు అన్నపానాదులు లేక వాయుభక్షణముతో తపించుచు

వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ।
అదృశ్యా సర్వభూతానామ్ ఆశ్రమేఽస్మిన్ నివత్స్యసి। 30

యదాచైతద్వనం ఘోరం రామో దశరథాత్మజః।
ఆగమిష్యతి దుర్ధర్షః తదా పూతా భవిష్యసి। 31

తస్యాతిథ్యేన దుర్వృత్తే లోభమోహవివర్జితా।
మత్సకాశే ముదా యుక్తా స్వం వపుర్ధారయిష్యసి। 32

ఏవ ముక్త్వా మహాతేజా గౌతమో దుష్టచారిణీమ్।
ఇమమాశ్రమముత్సృజ్య సిద్ధచారణసేవితే।
హిమవచ్ఛిఖరే పుణ్యే తపస్తేపే మహాతపాః। 33

ఈ ఆశ్రమమునందే పడియుందువు. భస్మశాయినివై ఎవ్వరికిని కనబడకుండా ఉండెదవు."[1] (29-30)

దశరథుని కుమారుడైన అజేయుడగు శ్రీరాముడు ఈ ఘోరవనమునకు వచ్చినప్పుడు నీవు (రామపాద ధూళిస్పర్శతో శాపవిముక్తిని పొంది) పవిత్రురాలవగుదువు, నిజస్వరూపమును పొందుదువు. ఓ దుర్వర్తనురాలా శ్రీరామునకు అతిథి సత్కారములను నెఱపిన పిమ్మట లోభమోహములు నశించి, సంతోషముతో నన్ను జేరెదవు. (31-32)

మహాతేజస్వియైన గౌతముడు అహల్యతో ఇట్లు పలికిన పిమ్మట ఈ ఆశ్రమమును వీడెను. అనంతరము ఆ మహాతపస్వి సిద్ధులు, చారణులు నివసించునట్టి పవిత్రమైన హిమవత్పర్వత శిఖరములపై (తాను ఇంద్రుని, అహల్యను శపించిన పాపము తొలగుటకై) తపమాచరించెను. (33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే అష్టచత్వారింశస్సర్గః *(48)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబదియెనిమిదవసర్గము సమాప్తము

— * * * —

49. నలుబదితొమ్మిదవసర్గము

అహల్యాశాపవిముక్తి.

అఫలస్తు తత శ్శక్రో దేవాన్ అగ్నిపురోధసః।
అబ్రవీత్ త్రస్తవదనః సర్షిసంఘాన్ సచారణాన్। 1

కుర్వతా తపసో విఘ్నం గౌతమస్య మహాత్మనః।
క్రోధ ముత్పాద్య హి మయా సురకార్యమ్ ఇదం కృతమ్। 2

అఫలోఽస్మి కృత స్తేన క్రోధాత్ సా చ నిరాకృతా।
శాపమోక్షేణ మహతా తపోఽస్యాపహృతం మయా। 3

తస్మాత్ సురవరా స్సర్వే సర్షిసంఘా స్సచారణాః।
సురసాహ్యకరం సర్వే సఫలం కర్తుమర్హథ। 4

వృషణములను కోల్పోయిన ఇంద్రుడు దీనవదనుడై మహర్షులతోడను, చారణులతోడను గూడియున్న అగ్ని మొదలగు దేవతలతో ఇట్లనెను. (1)

"మహాత్ముడైన గౌతమునకు కోపము తెప్పించి, ఆయన తపస్సును భంగపఱచితిని. ఆ విధముగా నేను దేవకార్యమును నెఱవేర్చితిని. గౌతమమునిశాపకారణముగ నేను అఫలుడనైతిని. అహల్య తనభర్తచే నిరాకరింపబడి, ఆకారమును కోల్పోయెను. క్రుద్ధుడైన ఆ ముని మమ్ములను శపించుటచే ఆయనతపశ్శక్తి నష్టమయ్యెను. అందువలన ఓ సమస్తదేవతలారా! మహర్షులారా! చారణులారా! గౌతమమునితపస్సును భంగపఱచి, దేవతలకు సహాయపడిన నాకు మీరందఱును వృషణములు వచ్చునట్లు చేయుడు." (2-4)

1) సాధారణముగా ఇంద్రుడు తన పదవిని నిలుపుకొనుటకై తపమాచరించువారికి కామవికారములను కలిగించుటద్వారా వారితపస్సులను భంగపఱచుటకై అప్సరసలను పంపుచుండెడివాడు. కాని తపశ్శక్తి సంపన్నుడైన గౌతముడు జితేంద్రియుడగుటవలన అతనితపశ్శక్తిని క్షీణింపజేయుటకు అతనికి కోపము పుట్టించుటయుక్తమని ఆ సురపతి భావించెను. అందులకై అతడు ఈపన్నాగమునకు దిగెను. పర్యవసానముగా గౌతముడు కుపితుడై, ఇంద్రుని, అహల్యను శపించుటచే అతని తపోబలముక్షీణించెను. ఇంద్రుని లక్ష్యమునెఱవేఱెను.

శతక్రతోర్వచశ్శ్రుత్వా దేవాస్సాగ్నిపురోగమాః।
పితృదేవానుపేత్యాహుః సహ సర్వైర్మరుద్గణైః। 5

అయం మేషః సవృషణః శక్రో హ్యవృషణః కృతః।
మేషస్య వృషణౌ గృహ్య శక్రాయాశు ప్రయచ్ఛత। 6

అఫలస్తు కృతో మేషః పరాం తుష్టిం ప్రదాస్యతి।
భవతాం హర్షణార్థాయ యే చ దాస్యంతి మానవాః। 7

అగ్నేస్తు వచనం శ్రుత్వా పితృదేవాస్సమాగతాః।
ఉత్పాట్య మేషవృషణౌ సహస్రాక్షే న్యవేశయన్। 8

తదా ప్రభృతి కాకుత్స్థ పితృదేవాః సమాగతాః।
అఫలాన్ భుంజతే మేషాన్ ఫలైస్తేషామ్ అయోజయన్। 9

ఇంద్రస్తు మేషవృషణః తదాప్రభృతి రాఘవ।
గౌతమస్య ప్రభావేన తపసశ్చ మహాత్మనః। 10

తదాగచ్ఛ మహాతేజ ఆశ్రమం పుణ్యకర్మణః।
తారయైనాం మహాభాగామ్ అహల్యాం దేవరూపిణీమ్। 11

విశ్వామిత్రవచః శ్రుత్వా రాఘవ స్సహ లక్ష్మణః।
విశ్వామిత్రం పురస్కృత్య తమాశ్రమ మథావిశత్। 12

దదర్శ చ మహాభాగాం తపసా ద్యోతితప్రభామ్।
లోకైరపి సమాగమ్య దుర్నిరీక్ష్యాం సురాసురైః। 13

ప్రయత్నా న్నిర్మితాం ధాత్రా దివ్యాం మాయామయీ మివ।
సతుషారావృతాం సాభ్రాం పూర్ణచంద్రప్రభామివ।
(ధూమేనాపి పరీతాంగీం దీప్తామ్అగ్నిశిఖామివ)। 14

మధ్యేఽంభసో దురాధర్షాం దీప్తాం సూర్యప్రభా మివ।
సా హి గౌతమవాక్యేన దుర్నిరీక్ష్యా బభూవ హ। 15

ఇంద్రునియొక్కవిన్నపమును ఆలకించి, అగ్ని మొదలగు దేవతలందఱును మరుద్గణములతోగూడి పితృదేవతల కడకేగి, ఇట్లు నుడివిరి. (5)

"గౌతమునిశాపఫలితముగా ఇంద్రుడు వృషణములు లేని వాడయ్యెను. ఈ యజ్ఞమున మీకు సమర్పింపబడిన మేషము (మేకపోతు) యొక్క వృషణములతో ఇంద్రుని సఫలుని గావింపుడు. మానవులు మీసంతోషమునకై అర్పించిన ఈ మేషము వృషణములు లేనిదయ్యును మీకు పూర్తిగా తృప్తిని కల్గింపగలదు." (6-7)

అగ్నిదేవునియొక్క ఆసునయవచనములను విని, అక్కడ చేరియున్న పితృదేవతలందఱును ఆ మేషవృషణములను ఇంద్రునకు అతికించిరి. (8)

ఓ రామా! అప్పటినుండి పితృదేవతలు వృషణహీనములైన మేషములను స్వీకరించుచు వారికి (కర్తలకు) ఫలమును అనుగ్రహించు చుండిరి. (9)

ఓ రాఘవా! మహాత్ముడైన గౌతమునితపఃప్రభావమున అప్పటినుండి ఇంద్రుడు మేషవృషణుడాయెను. (10)

ఓ మహావీరా! అందువలన (అహల్యాశాప విమోచనసమయము ఆసన్నమైనందున) పుణ్యాత్ముడైన గౌతమమునియొక్క ఆశ్రమమున అడుగిడుము. దివ్యసుందరియు, మహాత్మురాలును ఐన ఈ అహల్యను తరింపజేయుము. (ఆమెకు శాపవిముక్తి కలిగింపుము.) (11)

విశ్వామిత్రుని ఆజ్ఞను అనుసరించి, రాముడు లక్ష్మణునితో గూడి, ఆ మహర్షివెంట గౌతమాశ్రమమున ప్రవేశించెను.(12)

పిమ్మట శ్రీరాముడు వాయుభక్షణాది కఠోరదీక్షతో గూడి, తపఃప్రభావమున కాంతిమయముగానున్న ఆ మహాత్మురాలిని (ఆ అహల్యాదేవిని) చూచెను. సృష్టికర్తయైన బ్రహ్మచే ప్రయత్నపూర్వకముగా నిర్మింపబడుటచే ఆమెస్వరూపము దివ్యమై, మాయామయమై (దృశ్యాదృశ్యమై) ఒప్పుచుండెను. వృక్షములచే పుష్పములచే కప్పబడిన ఆమె మంచుచేతను, మేఘములచేతను ఆవరింపబడిన పూర్ణచంద్రప్రభవలె మిలమిల్లుచుండెను. ఇంకను ఆమె నీళ్లలో ప్రతిబింబించుచున్న సూర్యకాంతులవలెను, పొగచే కప్పబడిన అగ్నితేజస్సువలెను తేజరిల్లుచుండెను. గౌతమముని ప్రభావమువలన ఆ అహల్య మానవులకుగాని, కడకు సురాసురులకుగాని దుర్నిరీక్ష్యయై యుండెను. (13-15)

త్రయాణామపి లోకానాం యావద్రామస్య దర్శనమ్।
శాపస్యాంతముపాగమ్య తేషాం దర్శన మాగతా॥ 16

గౌతమమహర్షియొక్క శాపవచనప్రభావముచే ఆమెకు శ్రీరామునిదర్శనమగువఱకును ముల్లోకములకును ఆమె దుర్నిరీక్ష్యయై యుండెను. శ్రీరామునిదర్శనమైనంతనే ఆమెకు శాపవిముక్తి కల్గెను, పిమ్మట వారికి కనబడెను. (16)

రాఘవౌ తు తత స్తస్యాః పాదౌ జగృహతు స్తదా।
స్మరంతీ గౌతమవచః ప్రతిజగ్రాహ సా చ తౌ॥ 17

పాద్యమర్ఘ్యం తథాతిథ్యం చకార సుసమాహితా।
ప్రతిజగ్రాహ కాకుత్స్థో విధిదృష్టేన కర్మణా॥ 18

అప్పుడచటికి వచ్చిన రామలక్ష్మణులు గౌతమమహర్షిపత్ని యొక్క పాదములను సేవించిరి. పిదప ఆమెయు గౌతమముని (తనపతి) వచనములను స్మరించుచు రామలక్ష్మణులకు పాదాభివందన మాచరించెను. అనంతరము అహల్య ఆ రామలక్ష్మణులకు అర్ఘ్యపాద్యాది - అతిథిసత్కారములను నెఱపెను. వారును ఆ మర్యాదలను విధివిధానముగా స్వీకరించిరి. (17-18)

పుష్పవృష్టి ర్మహత్యాసీత్ దేవదుందుభినిస్వనైః।
గంధర్వాప్సరసాం చాపి మహానాసీత్ సమాగమః॥ 19

పిమ్మట దేవతలు దుందుభులను మ్రోగించుచు పుష్పవృష్టిని కురిపించిరి. గంధర్వులు గానమొనర్చిరి. అప్సరసలు నృత్యములు చేసిరి. (19)

సాధు సాధ్వితి దేవాస్తామ్ అహల్యాం సమపూజయన్।
తపోబలవిశుద్ధాంగీం గౌతమస్య వశానుగామ్॥ 20

తనఆశ్రమమునకు శ్రీరాముడు విచ్చేసిన విషయమును గ్రహించి, గౌతమమహర్షియు అచటికి చేరెను. తపోబలముచే పవిత్రురాలై పతిచెంతచేరిన ఆ అహల్యాదేవిని 'బాగు బాగు' అని ప్రశంసించుచు దేవతలు ఆమెను పూజించిరి. (20)

గౌతమోఽపి మహాతేజా అహల్యాసహితస్సుఖీ।
రామం సంపూజ్య విధివత్ తపస్తేపే మహాతపాః॥ 21

మహాతపస్వియు, తేజస్వియు ఐన గౌతముడును అహల్యాసహితుడై విధివిధానముగా భక్తిశ్రద్ధలతో శ్రీరాముని పూజించి, పరమానందభరితుడాయెను. పిమ్మట ఆ ముని ఆ ఆశ్రమమునందే తపోనిమగ్నుడయ్యెను. (21)

రామోఽపి పరమాం పూజాం గౌతమస్య మహామునేః।
సకాశాద్విధివత్ ప్రాప్య జగామ మిథిలాం తతః॥ 22

అంతట శ్రీరామచంద్రుడును శాస్త్రోక్తముగా గౌతమ మహామునియొనర్చిన పూజలను స్వీకరించి, (లక్ష్మణునితో గూడి విశ్వామిత్ర మహర్షి వెంట) మిథిలా నగరమునకు బయలుదేఱెను. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకోనపంచాశస్సర్గః *(49)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు నలుబది తొమ్మిదవ సర్గము సమాప్తము

-- * * * --

50. ఏబదియవసర్గము

విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంటనిడుకొని మిథిలకు ఏతెంచుట - జనకమహారాజుతో సంభాషించుట.

తతః ప్రాగుత్తరాం గత్వా రామస్సౌమిత్రిణా సహ।
విశ్వామిత్రం పురస్కృత్య యజ్ఞవాటమ్ ఉపాగమత్॥ 1

శ్రీరాముడు లక్ష్మణునితోగూడి విశ్వామిత్రమహర్షివెంట ఈశాన్యదిశగా పయనించి, జనకునియొక్క యజ్ఞవాటికకు చేరెను. (1)

రామస్తు మునిశార్దూలమ్ ఉవాచ సహ లక్ష్మణః।
సాధ్వీ యజ్ఞసమృద్ధిర్హి జనకస్య మహాత్మనః॥ 2

లక్ష్మణునితోగూడియున్న రామచంద్రుడు విశ్వామిత్ర మహామునితో ఇట్లనెను. "మహాత్ముడైన జనకుని యజ్ఞ సంభారములు సమృద్ధిగా చక్కగానున్నవి. ఓ మహాత్మా!

బహూనీహ సహస్రాణి నానాదేశనివాసినామ్।
బ్రాహ్మణానాం మహాభాగ వేదాధ్యయనశాలినామ్। 3

ఋషివాటాశ్చ దృశ్యంతే శకటీశతసంకులాః।
దేశో విధీయతాం బ్రహ్మన్ యత్ర వత్స్యామహే వయమ్। 4

రామస్య వచనం శ్రుత్వా విశ్వామిత్రో మహామునిః।
నివేశమకరోద్దేశే వివిక్తే సలిలాయుతే। 5

విశ్వామిత్రమ్ అనుప్రాప్తం శ్రుత్వా స నృపతిస్తదా।
శతానందం పురస్కృత్య పురోహితమనిందితమ్।
ప్రత్యుజ్జగామ సహసా వినయేన సమన్వితః। 6

ఋత్విజోఽపి మహాత్మానస్త్వర్ఘ్యమాదాయ సత్వరమ్।
విశ్వామిత్రాయ ధర్మేణ దదుర్మంత్రపురస్కృతమ్। 7

ప్రతిగృహ్య చ తాం పూజాం జనకస్య మహాత్మనః।
పప్రచ్ఛ కుశలం రాజ్ఞో యజ్ఞస్య చ నిరామయమ్। 8

స తాంశ్చాపి మునీన్ పృష్ట్వా సోపాధ్యాయపురోధసః।
యథాన్యాయం తతః సర్వైః సమాగచ్ఛత్ ప్రహృష్టవత్। 9

అథ రాజా మునిశ్రేష్ఠం కృతాంజలిరభాషత।
ఆసనే భగవానాస్తాం సహైభిర్మునిపుంగవైః। 10

జనకస్య వచః శ్రుత్వా నిషసాద మహామునిః।
పురోధా ఋత్విజశ్చైవ రాజా చ సహ మంత్రిభిః। 11

ఆసనేషు యథాన్యాయమ్ ఉపవిష్టాన్ సమంతతః।
దృష్ట్వా స నృపతిస్తత్ర విశ్వామిత్రమ్ అథాబ్రవీత్। 12

అద్య యజ్ఞసమృద్ధిర్మే సఫలా దైవతైః కృతా।
అద్య యజ్ఞఫలం ప్రాప్తం భగవద్దర్శనాన్మయా। 13

ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే మునిపుంగవ।
యజ్ఞోపసదనం బ్రహ్మన్ ప్రాప్తోఽసి మునిభిస్సహ। 14

ద్వాదశాహం తు బ్రహ్మర్షే శేషమాహుర్మనీషిణః।
తతో భాగార్థినో దేవాన్ ద్రష్టుమ్ అర్హసి కౌశిక। 15

నానాదేశనివాసులు, వేదపండితులు ఐన వేలకొలది బ్రాహ్మణులు ఇచట కలరు. ఈ ప్రదేశము ఋషినివాసముల తోడను, వందలకొలది బండ్లతోను నిండియున్నది. కావున ఓ బ్రహ్మర్షీ! మనము నివసింపదగు ప్రదేశమును నిర్ణయింపుడు." (2-4)

విశ్వామిత్రమహాముని శ్రీరామునిమాటలను ఆలకించి, జలసౌకర్యములుగల ఒక నిర్జనప్రశాంతప్రదేశమును తమకు 'బస' గా నిర్ణయించెను. (5)

అంతట జనకమహారాజు అచటికి విశ్వామిత్రుడు అరుదెంచినట్లుగా విని, వెంటనే తనకు పూజ్యుడు, పురోహితుడు ఐన శతానందమహర్షిని ముందిడుకొని, వినమ్రతతో ఆ ముని కడకు ఏతెంచెను. వెంటనే మహాత్ములైన ఋత్విజులు విశ్వామిత్రమహర్షికి అర్ఘ్యపాద్యాదికములతో విధ్యుక్తముగా అతిథి సత్కారములను నెఱపిరి. (6-7)

విశ్వామిత్రుడు జనకమహారాజొనర్చిన అతిథి మర్యాదలను స్వీకరించి, రాజుగారికుశలమును గూర్చియు, యజ్ఞము నిర్విఘ్నముగా జరుగుచున్న విషయమును గుఱించియు అడిగెను. (8)

పిమ్మట ఆ మహర్షి గురువులు, ఋత్విజులు, పురోహితులు మొదలగు వారితోగూడిన శతానందాది మునులతో కుశల ప్రశ్నలు గావించి, సంతోషముగా వారితో కలిసిమెలిసెను. (9)

అంతట జనకుడు అంజలి ఘటించి, విశ్వామిత్రునితో "మహాత్మా! ఈ మునీశ్వరులతోగూడి ఆసనమును అలంకరింపుడు"- అని పలికెను. (10)

విశ్వామిత్రుడు జనకుని వచనములను విని, ఆసీనుడయ్యెను. పిమ్మట రాజుగూడ పురోహితులతో, ఋత్విజులతో, మంత్రులతోగూడి ఉపవిష్టుడయ్యెను. (11)

అందఱును తమతమ యోగ్యతలననుసరించి ఆసీనులైన పిదప జనకమహారాజు వారినందఱిని కలయజూచి, విశ్వామిత్ర మహర్షితో ఇట్లనుడివెను. (12)

ఓ మహర్షీ! "దైవానుగ్రహముచే నేడు నా యజ్ఞమునకు సమగ్రత చేకూరినది. సాఫల్యము సిద్ధించినది. నేడు మహర్షి సత్తములైన మీ దర్శనము లభించుటయే నా యజ్ఞఫలముగా భావింతును. ఓ మునీశ్వరా! ఓ బ్రహ్మర్షీ! మునీశ్వరులతోగూడి మీరు నన్ననుగ్రహించి ఈ యజ్ఞవాటికకు విచ్చేయుటవలన నేను ధన్యుడనైతిని. (13-14)

ఓ బ్రహ్మర్షీ! యజ్ఞవిదులైన ఋత్విజులు 'ఇక పండ్రెండు దినములకు యజ్ఞము పరిసమాప్తమగును' అని తెల్పిరి- అప్పుడు (యజ్ఞాంతసమయమున) హవిర్భాగములను స్వీకరించుటకై వచ్చెడి దేవతలను మీరును చూడవచ్చును." (15)

ఇత్యుక్త్వా మునిశార్దూలం ప్రహృష్టవదనస్తదా।
పునస్తం పరిపప్రచ్ఛ ప్రాంజలిః ప్రణతో నృపః॥ 16

ఇమౌ కుమారౌ భద్రం తే దేవతుల్యపరాక్రమౌ।
గజసింహగతీ వీరౌ శార్దూలవృషభోపమౌ॥ 17

పద్మపత్రవిశాలాక్షౌ ఖడ్గతూణీధనుర్ధరౌ।
అశ్వినావివ రూపేణ సముపస్థితయౌవనౌ॥ 18

యదృచ్ఛయైవ గాం ప్రాప్తౌ దేవలోకాదివామరౌ।
కథం పద్భ్యామిహ ప్రాప్తౌ కిమర్థం కస్య వా మునే॥ 19

వరాయుధధరౌ వీరౌ కస్య పుత్రౌ మహామునే।
భూషయంతావిమం దేశం చంద్రసూర్యావివాంబరమ్॥ 20

పరస్పరస్య సదృశౌ ప్రమాణేంగితచేష్టితైః।
కాకపక్షధరౌ వీరౌ శ్రోతుమిచ్ఛామి తత్త్వతః॥ 21

తస్య తద్వచనం శ్రుత్వా జనకస్య మహాత్మనః।
న్యవేదయన్మహాత్మానౌ పుత్రౌ దశరథస్య తౌ॥ 22

సిద్ధాశ్రమనివాసంచ రాక్షసానాం వధం తథా।
తచ్చాగమన మవ్యగ్రం విశాలాయాశ్చ దర్శనమ్॥ 23

అహల్యాదర్శనం చైవ గౌతమేన సమాగమమ్।
మహాధనుషి జిజ్ఞాసాం కర్తుమ్ఆగమనం తథా॥ 24

ఏతత్సర్వం మహాతేజా జనకాయ మహాత్మనే।
నివేద్య విరరామాథ విశ్వామిత్రో మహామునిః॥ 25

మునీశ్వరునితో ఇట్లు పలికిన పిమ్మట జనకమహారాజు దోసిలొగ్గి నమస్కరించి, మిక్కిలి సంతోషముతో ఆయనను మరల ఇట్లు ప్రశ్నించెను. (16)

"మీ వెంటనున్న ఈ చిన్నారులు దేవతలతో సమానమైన పరాక్రమముగలవారు, వీరులు, గజసింహ శార్దూలవృషభముల వలె గంభీరగమనులు, తామర రేకులవలె విశాలమైన కన్నులు గలవారు. ఖడ్గములను, తూణీరములను, ధనుర్బాణములను ధరించియున్నవారు. అశ్వినీదేవతలవలె సుందరరూపులు, యౌవనమున అడుగిడుచున్నవారు, దైవవశమున దివినుండి భువికి దిగివచ్చిన దేవతలవలెనున్న వీరు కాలినడకతో వెట్లు వచ్చిరి? ఎందులకు విచ్చేసిరి? ఓ మహర్షీ! వీరు ఎవరివారు? ఓ మహామునీ! ఉత్తమాయుధములను ధరించి యున్న ఈ వీరులు ఎవరి కుమారులు? సూర్యచంద్రులు ఆకాశమునవలె వీరు ఈ దేశమున[1] వెలుగులను నింపు చున్నారు. ప్రమాణమునందును, మనోభావములయందును, చేష్టల యందును ఒకరినొకరి పోలియున్నారు. జులుపాలతో చూడముచ్చటగా నున్న ఈ చిరంజీవులెవరో తెలిసికొన గోరుచున్నాను. దయతో తెలిపి పుణ్యము గట్టుకొనుడు." (17-21)

మహాతేజస్వియైన విశ్వామిత్ర మహాముని మహాత్ముడైన జనకుని వచనములను విని, రామలక్ష్మణులను గూర్చి ఇట్లు వివరించెను. "ఈ మహావీరులు దశరథమహారాజకుమారులు, సిద్ధాశ్రమమున రాక్షసులను వధించి యజ్ఞరక్షణమొనర్చిరి. నిర్భయముగా ప్రయాణము చేసి 'విశాలనగరము'ను దర్శించిరి, పిమ్మట అహల్యకు శాపవిముక్తిని గల్గించి, గౌతముని సేవలను స్వీకరించిరి, దివ్యశక్తి సంపన్నమైన శివధనుస్సును గూర్చి తెలిసికొనగోరి ఇచ్చటికి ఏతెంచిరి." ఆ మహాముని ఈ విశేషములన్నింటిని జనక మహారాజునకు ఎఱింగించి మిన్నకుండెను. (22-25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచాశస్సర్గః (50)

మహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబదియవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

1) "స్వామీ! ఈ బాలకులు శ్రేష్ఠులైన మునికులభూషణులా! లేక రాజకులదీపకులా? లేదా వేదములచే 'నేతి, నేతి' అని వర్ణింపబడిన నిర్గుణ నిరాకార పరబ్రహ్మము యొక్క రెండు సగుణసాకార స్వరూపములా? పరబ్రహ్మస్వరూపులా? దయతో తెలుపుడు. సహజముగా వైరాగ్యపూర్ణమైన నా మనస్సు సైతము వీరిని జూచి 'చంద్రునిజూచిన చకోరమువలె' ముగ్ధమగుచున్నది." "మునీశ్వరా! నిండు మనస్సుతో అడుగుచున్నాను వీరెవరు? ఏమియు దాచక దయతో వివరముగా తెల్పుడు. వీరిని గాంచినపిమ్మట నా మనస్సు ప్రేమపరవశమై బ్రహ్మానందమును గూడ కోరుకొనుట లేదు."- అంతట మునివరుడు నవ్వి, ఇట్లు పలికెను. "రాజా! మీరు లెస్సపలికితిరి. మీ వచనములెన్నడును అసత్యములు కానేరవు. ప్రపంచములోని సమస్త ప్రాణులకును వీరు ప్రియతములు."- మునిపల్కులు విని, శ్రీరాముడు మనస్సులోనే నవ్వుకొనెను. రహస్యమును విప్పవలదనినట్లు సంజ్ఞచేసెను. అపుడు ముని పలికెను. "వీరు రఘుకులశ్రేష్ఠులైన దశరథమహారాజు కుమారులు. నాకు సహాయముగా నుండుటకై పంపబడిరి. రామచరితమానసము - బా.కాం. దోహా 215 తరువాత చౌపాఈ 1-4.

51. ఏబదియొకటవసర్గము

శతానందుడు శ్రీరామునిజూచి పరవశుడగుట - అతడు విశ్వామిత్రుని పూర్వచరిత్రమును తెలుపుట.

తస్య తద్వచనం శ్రుత్వా విశ్వామిత్రస్య ధీమతః।
హృష్టరోమా మహాతేజాః శతానందో మహాతపాః॥ 1

గౌతమస్య సుతో జ్యేష్ఠః తపసా ద్యోతితప్రభః।
రామసందర్శనాదేవ పరం విస్మయమాగతః॥ 2

స తౌ నిషణ్ణౌ సంప్రేక్ష్య సుఖాసీనౌ నృపాత్మజౌ।
శతానందో మునిశ్రేష్ఠం విశ్వామిత్రమథాబ్రవీత్॥ 3

అపి తే మునిశార్దూల మమ మాతా యశస్వినీ।
దర్శితా రాజపుత్రాయ తపో దీర్ఘముపాగతా॥ 4

అపి రామే మహాతేజా మమ మాతా యశస్వినీ।
వన్యైరుపాహరత్ పూజాం పూజార్హే సర్వదేహినామ్॥ 5

అపి రామాయ కథితం యథావృత్తం పురాతనమ్।
మమ మాతుర్మహాతేజో దైవేన దురనుష్ఠితమ్॥ 6

అపి కౌశిక భద్రం తే గురుణా మమ సంగతా।
మమ మాతా మునిశ్రేష్ఠ రామసందర్శనాదితః॥ 7

అపి మే గురుణా రామః పూజితః కుశికాత్మజ।
ఇహాగతో మహాతేజాః పూజాం ప్రాప్తో మహాత్మనః॥ 8

అపి శాంతేన మనసా గురుర్మే కుశికాత్మజ।
ఇహాగతేన రామేణ ప్రయతేనాభివాదితః॥ 9

తచ్ఛ్రుత్వా వచనం తస్య విశ్వామిత్రో మహామునిః।
ప్రత్యువాచ శతానందం వాక్యజ్ఞో వాక్యకోవిదమ్॥ 10

నాతిక్రాంతం మునిశ్రేష్ఠ యత్కర్తవ్యం కృతం మయా।
సంగతా మునినా పత్నీ భార్గవేణేవ రేణుకా॥ 11

తచ్ఛ్రుత్వా వచనం తస్య విశ్వామిత్రస్య భాషితమ్।
శతానందో మహాతేజా రామం వచనమబ్రవీత్॥ 12

గౌతమమునిపెద్దకుమారుడును, తపశ్శక్తితో వెలుగొందుచున్నవాడును, తపోధనుడును, ప్రతిభామూర్తియు ఐన శతానందుడు ప్రజ్ఞాశాలియైన విశ్వామిత్రునిమాటలను విని, (తన తల్లియైన అహల్యాదేవికి శాపవిముక్తిని ప్రసాదించిన మహానుభావుడగు) శ్రీరామచంద్రునిదర్శనమునకు విస్మయముతో పులకితగాత్రుడయ్యెను. (1-2)

ఆ శతానందుడు సమీపముననే సుఖాసీనులైయున్న రాజకుమారులను పరికించిచూచినపిదప, విశ్వామిత్ర మునీశ్వరునితో ఇట్లు నుడివెను. (3)

"ఓ మునీశ్వరా! చాలాకాలమునుండి తపమొనరించుచు శ్రీరామునిదర్శనమునకై నిరీక్షించుచున్న యశస్వినియగు మాతల్లిని ఈ ప్రభువు చూచెనా? ఓ తేజస్వీ! పవిత్రురాలైన మాజనని సమస్త ప్రాణులకును పూజ్యుడైన శ్రీరామునకు కందమూల ఫలములతో అతిథిసత్కారములను కావించెనా? (4-5)

ఓ మహాతేజోమూర్తీ! మాతల్లివిషయమున విధివశమున జరిగిన సంఘటననుగూర్చి శ్రీరామచంద్రునకు పూర్తిగా వివరించితిరా ? (6)

ఓ కౌశికా! నీకు మంగళమగు గాక. ఓ విశ్వామిత్రా! మా జనని అహల్యాదేవి శ్రీరాముని దర్శించి, ఆయనకు ఆతిథ్యమిచ్చిన పిమ్మట పునీతయై, మాతండ్రిని జేరినదా? ఓ కౌశికమహర్షీ! మా తండ్రియైన గౌతమమహాముని శ్రీరామునకు పూజలొనర్చెనా? మా ఆశ్రమమునకు అరుదెంచిన శ్రీరామచంద్రుడు మా తండ్రిగారిని అనుగ్రహించెనా? ఓ కౌశికా! ఆశ్రమమునకు చనుదెంచిన శ్రీరాముడు మా మాతాపితరుల నుండి పూజలను స్వీకరించిన పిదప ప్రశాంతమనస్కుడై వారికి అభివాదనము చేసెనా ?" (7-9)

వాక్చతురుడైన విశ్వామిత్రమహాముని శతానందునిమాటలను విన్నపిమ్మట ఆ వాక్యకోవిదునితో ఇట్లు నుడివెను. (10)

"ఓ మునీశ్వరా! సమయమునకు అనువుగా నా కర్తవ్యమును నేను నిర్వహించితిని. జమదగ్ని రేణుకనువలె గౌతమమహర్షి తనభార్యను (అహల్యను) స్వీకరించెను." (11)

తేజస్సంపన్నుడైన శతానందమహర్షి విశ్వామిత్రుడు పలికిన వచనములను విని, రామునితో ఇట్లనెను. (12)

స్వాగతం తే నరశ్రేష్ఠ దిష్ట్యా ప్రాప్తోఽసి రాఘవ।
విశ్వామిత్రం పురస్కృత్య మహర్షిమ్ అపరాజితమ్। 13

అచింత్యకర్మా తపసా బ్రహ్మర్షిరతులప్రభః।
విశ్వామిత్రో మహాతేజా వేత్స్యేనం పరమాం గతిమ్। 14

నాస్తి ధన్యతరో రామ త్వత్తోఽన్యో భువి కశ్చన।
గోప్తా కుశికపుత్రస్తే యేన తప్తం మహత్తపః। 15

శ్రూయతాం చాభిధాస్యామి కౌశికస్య మహాత్మనః।
యథాబలం యథావృత్తం తన్మే నిగదతః శృణు। 16

రాజాఽభూదేష ధర్మాత్మా దీర్ఘకాలమరిందమః।
ధర్మజ్ఞః కృతవిద్యశ్చ ప్రజానాం చ హితే రతః। 17

ప్రజాపతిసుతస్త్వాసీత్ కుశో నామ మహీపతిః।
కుశస్య పుత్రో బలవాన్ కుశనాభస్సుధార్మికః। 18

కుశనాభసుతస్త్వాసీత్ గాధిరిత్యేవ విశ్రుతః।
గాధేః పుత్రో మహాతేజాః విశ్వామిత్రో మహామునిః। 19

విశ్వామిత్రో మహాతేజాః పాలయామాస మేదినీమ్।
బహువర్షసహస్రాణి రాజా రాజ్యమకారయత్। 20

కదాచిత్తు మహాతేజా యోజయిత్వా వరూథినీమ్।
అక్షౌహిణీపరివృతః పరిచక్రామ మేదినీమ్। 21

నగరాణి చ రాష్ట్రాణి సరితశ్చ తథా గిరీన్।
ఆశ్రమాన్ క్రమశో రామ విచరన్నాజగామ హ। 22

వసిష్ఠస్యాశ్రమపదం నానావృక్షసమాకులమ్।
నానామృగగణాకీర్ణం సిద్ధచారణసేవితమ్। 23

దేవదానవగంధర్వైః కిన్నరైరుపశోభితమ్।
ప్రశాంతహరిణాకీర్ణం ద్విజసంఘనిషేవితమ్। 24

బ్రహ్మర్షిగణసంకీర్ణం దేవర్షిగణసేవితమ్।
తపశ్చరణసంసిద్ధైః అగ్నికల్పైర్మహాత్మభిః। 25

నరశ్రేష్ఠుడవైన ఓ రాఘవా! నీకు స్వాగతము. అజేయుడైన విశ్వామిత్రమహర్షివెంట నీవు ఇచటికి విచ్చేయుట మాభాగ్యవశము. విశ్వామిత్రుడు మహాశక్తిమంతుడు, తపోబలముచే బ్రహ్మర్షియైనవాడు. నిరుపమానతేజశ్శాలి, ఇతని కార్యాలోచనలు ఊహింపనలవికానివి. నీకు పరమ హితకారి. అట్టి ఈ మహాత్మునిగూర్చి నీవు ఎఱుగుదువు గదా! ఓ రామా! నీయంతటి ధన్యుడు ఈ భూమండలమున మఱియొకడు లేడు. ఈ విశ్వామిత్రముని గొప్ప తపశ్శాలి. నీకు రక్షకుడు. మహాత్ముడైన కౌశికునియొక్క తపఃప్రభావమును, చరిత్ర వైభవములను సమగ్రముగా తెలిపెదను. సావధానుడవై వినుము. (13-16)

ఈ విశ్వామిత్రుడు ధర్మజ్ఞుడు, ధర్మాత్ముడు. సమస్తవిద్యలలో ఆఱితేఱినవాడు, శత్రువులను అణచినవాడు, అనుక్షణము ప్రజాక్షేమమునుగోరుచు దీర్ఘకాలము రాజ్యపాలన చేసినవాడు.(17)

కుశుడు అను మహారాజు ప్రజాపతికుమారుడు, అతని పుత్రుడైన కుశనాభుడు ధార్మికుడు, మిక్కిలి బలశాలి. సుప్రసిద్ధుడైన 'గాధి' కుశనాభునిసుతుడు. ఆ గాధినందనుడే మహాతేజస్వియైన ఈ విశ్వామిత్ర మహాముని. (18-19)

మహాబలసంపన్నుడైన విశ్వామిత్రుడు ఈ భూమండలమునకు ప్రభువై వేలకొలదిసంవత్సరములు రాజ్యపాలన గావించెను.(20)

గొప్ప శక్తిశాలియైన విశ్వామిత్రుడు చతురంగ బలములను సమకూర్చుకొని, ఒకానొకప్పుడు ఒక అక్షౌహిణీ సైన్యముతో భూమండలమును చుట్టివచ్చెను. (21)

ఓ రామా! అతడు నగరములను, రాష్ట్రములను, నదులను, పర్వతములను ఆశ్రమములను క్రమముగా దాటుచు వసిష్ఠుని ఆశ్రమమునకు విచ్చేసెను. ఆ ఆశ్రమము వివిధములగు వృక్షములతో కలకలలాడుచుండెను. అచట నానావిధములైన వన్యమృగములు తిరుగాడుచుండెను. అచట సిద్ధులు, చారణులు నివసించుచుండిరి. దేవదానవ గంధర్వులతో కిన్నరులతో అది శోభిల్లుచుండెను. ప్రశాంతముగానున్న ఆ ఆశ్రమమున లేళ్లగుంపులు హాయిగా మసలుచుండెను. పక్షుల కిలకిలారావములతో అది మనోహరముగానుండెను.(22-24)

బ్రహ్మర్షులు, దేవర్షులు అందు తమతపోజీవనవిధానములను కొనసాగించుచుండిరి. అక్కడి ఋషులందఱును తపస్సిద్ధి సంపన్నులు, అగ్నివలె తేజోమూర్తులు. ఆ మహాత్ములలో కొందఱికి జలములు మాత్రమే ఆహారము, మఱి కొందఱి ఆహారము వాయువు మాత్రమే. ఇంకను కొందఱు పండిరాలిన

అబ్భక్షైర్వాయుభక్షైశ్చ శీర్ణపర్ణాశనైస్తథా।
ఫలమూలాశనైర్దాంతైః జితరోషైర్జితేంద్రియైః। 26

ఋషిభిర్వాలఖిల్యైశ్చ జపహోమపరాయణైః।
అన్యైర్వైఖానసైశ్చైవ సమంతాదుపశోభితమ్। 27

వసిష్ఠస్యాశ్రమపదం బ్రహ్మలోకమివాపరమ్।
దదర్శ జయతాం శ్రేష్ఠో విశ్వామిత్రో మహాబలః। 28

ఆకులనుమాత్రమే భుజించుచుందురు. పండ్లు, దుంపలు మాత్రమే కొందఱికి ఆహారము. వారు మనోనిగ్రహము గలవారు, రాగద్వేషములకు అతీతులు, జితేంద్రియులు. (25-26)

బ్రహ్మదేవుని పుత్రులైన వాలఖిల్యులు, వైఖానసులు, అచట జపహోమతత్పరులైయుండిరి. ఆ వసిష్ఠాశ్రమము మఱియొక బ్రహ్మలోకమా అనునట్లు విరాజిల్లుచుండెను. విజేతలలో శ్రేష్ఠుడును, మహా బలశాలియు ఐన విశ్వామిత్రుడు దానిని దర్శించెను. (27-28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకపంచాశస్సర్గః *(51)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబదియొకటవ సర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

52. ఏబదిరెండవసర్గము

వసిష్ఠమహర్షి తన ఆతిథ్యమును స్వీకరింపుమని విశ్వామిత్రుని ఆహ్వానించుట.

స దృష్ట్వా పరమప్రీతో విశ్వామిత్రో మహాబలః।
ప్రణతో వినయాద్వీరో వసిష్ఠం జపతాం వరమ్। 1

స్వాగతం తవ చేత్యుక్తో వసిష్ఠేన మహాత్మనా।
ఆసనం చాస్య భగవాన్ వసిష్ఠో వ్యాదిదేశ హ। 2

ఉపవిష్టాయ చ తదా విశ్వామిత్రాయ ధీమతే।
యథాన్యాయం మునివరః ఫలమూలాన్యుపాహరత్। 3

ప్రతిగృహ్య తు తాం పూజాం వసిష్ఠాద్రాజసత్తమః।
తపోఽగ్నిహోత్రశిష్యేషు కుశలం పర్యపృచ్ఛత। 4

విశ్వామిత్రో మహాతేజా వనస్పతిగణే తథా।
సర్వత్ర కుశలంచాహ వసిష్ఠో రాజసత్తమమ్। 5

సుఖోపవిష్టం రాజానం విశ్వామిత్రం మహాతపాః।
పప్రచ్ఛ జపతాం శ్రేష్ఠో వసిష్ఠో బ్రహ్మణస్సుతః। 6

కచ్చిత్తేకుశలం రాజన్ కచ్చిద్ధర్మేణ రంజయన్।
ప్రజాః పాలయసే వీర రాజవృత్తేనధార్మిక। 7

గొప్పబలసంపన్నుడైన విశ్వామిత్రుడు ఆ ఆశ్రమమును దర్శించి, ఎంతయు సంతసించెను. అనంతరము ఆ మహావీరుడు మహాతపస్వియైన వసిష్ఠునకు ప్రణమిల్లెను. (1)

మహాత్ముడైన వసిష్ఠుడు ఆయనకు స్వాగతసత్కారములను జరిపి, ఆయనను ఉచితాసనమున అలంకరింపజేసెను. (2)

ప్రజ్ఞాశాలియగు విశ్వామిత్రుడు ఆసనమును అధిష్ఠించిన పిమ్మట, శాస్త్రమర్యాదలను అనుసరించి, వసిష్ఠుడు ఆ మహామునికి ఫలమూలాదులతో అతిథిపూజలను నిర్వహించెను. (3)

మహాపరాక్రమశాలియు, రాజశ్రేష్ఠుడును ఐన విశ్వామిత్రుడు వసిష్ఠునినుండి అతిథిసత్కారములను అందుకొనిన పిమ్మట "మీతపశ్చర్యలు, అగ్నికార్యములు నిర్విఘ్నముగా కొనసాగుచున్నవా? మీ శిష్యులు కుశలమే గదా! మీవనవృక్షములు పుష్పఫల శోభితములే గదా!" అని ఆ మహర్షిని ప్రశ్నించెను. అంతట వసిష్ఠుడును ఆ 'అందఱును కుశలమే' అని మహారాజుతో నుడివెను. (4-5)

బ్రహ్మసుతుడును, జపతపస్సంపన్నుడును ఐన వసిష్ఠుడు సుఖాసీనుడైయున్న విశ్వామిత్రమహారాజును ఇట్లడిగెను. (6)

"ఓ మహారాజా! నీవు కుశలమే గదా! ధార్మికుడవైన ఓ వీరా! రాజవృత్తిని[1] అనుసరించి ధర్మముగా ప్రజానురంజకముగా పరిపాలించుచున్నావా? నీ భృత్యులను చక్కగా పోషించుచున్నావా?

1) రాజవృత్తి నాలుగు విధములు. శ్లో॥ న్యాయేనార్జనమర్థస్య వర్ధనం పాలనం తథా । సత్పాత్రే ప్రతిపత్తిశ్చ రాజవృత్తం చతుర్విధమ్ ॥ న్యాయమార్గమున ధనాగారమును నింపుట, దానినివృద్ధిపఱచుట, రక్షించుట, పాత్రులైన వారికి దానమిచ్చుట - అను నాల్గును రాజవృత్తులు. గోవిందరాజీయ వ్యాఖ్య.

కచ్చిత్తే సంభృతా భృత్యాః కచ్చిత్తిష్ఠంతి శాసనే।
కచ్చిత్తే విజితాస్సర్వే రిపవో రిపుసూదన। 8

కచ్చిద్బలేషు కోశేషు మిత్రేషు చ పరంతప।
కుశలం తే నరవ్యాఘ్ర పుత్రపౌత్రే తవానఘ। 9

సర్వత్ర కుశలం రాజా వసిష్ఠం ప్రత్యుదాహరత్।
విశ్వామిత్రో మహాతేజా వసిష్ఠం వినయాన్వితః। 10

కృత్వోభౌ సుచిరం కాలం ధర్మిష్ఠౌ తౌ కథాశ్శుభాః।
ముదా పరమయా యుక్తౌ ప్రీయేతాం తౌ పరస్పరమ్। 11

తతో వసిష్ఠో భగవాన్ కథాంతే రఘునందన।
విశ్వామిత్రమిదం వాక్యమ్ ఉవాచ ప్రహసన్నివ। 12

ఆతిథ్యం కర్తుమిచ్ఛామి బలస్యాస్య మహాబల।
తవ చైవాప్రమేయస్య యథార్హం సంప్రతీచ్ఛ మే। 13

సత్క్రియాం తు భవానేతాం ప్రతీచ్ఛతు మయోద్యతామ్।
రాజాత్వమతిథిశ్రేష్ఠః పూజనీయః ప్రయత్నతః। 14

ఏవముక్తో వసిష్ఠేన విశ్వామిత్రో మహామతిః।
కృతమిత్యబ్రవీద్రాజా ప్రియవాక్యేన మే త్వయా। 15

ఫలమూలేన భగవన్ విద్యతే యత్తవాశ్రమే।
పాద్యే నాచమనీయేన భగవద్దర్శనేన చ। 16

సర్వథా చ మహాప్రాజ్ఞ పూజార్హేణ సుపూజితః।
గమిష్యామి నమస్తేఽస్తు మైత్రేణేక్షస్వ చక్షుషా। 17

ఏవం బ్రువంతం రాజానం వసిష్ఠః పునరేవ హి।
న్యమంత్రయత ధర్మాత్మా పునః పునరుదారధీః। 18

బాఢ మిత్యేవ గాధేయో వసిష్ఠం ప్రత్యువాచ హ।
యథాప్రియం భగవతః తథాస్తు మునిపుంగవ। 19

ఏవ ముక్తో మహాతేజా వసిష్ఠో జపతాం వరః।
ఆజుహావ తతః ప్రీతః కల్మాషీం ధూతకల్మషః। 20

ఏహ్యేహి శబలే క్షిప్రం శృణు చాపి వచో మమ।
సబలస్యాస్య రాజర్షేః కర్తుం వ్యవసితోఽస్మ్యహమ్। 21

వారు రాజశాసనములను బాగుగా నడుపుచున్నారా? ఓ శత్రుమర్దనా! నీ శత్రువులనందఱిని జయించితివా? ఓ పరంతపా! నరశ్రేష్ఠా! పుణ్యమూర్తీ! నీ చతురంగబలములు దృఢముగా ఉన్నవా? నీ ధనాగారములు సురక్షితములేనా? నీ మిత్రులు, పుత్త్రులు, పౌత్త్రులు కుశలమే గదా!" (7-9)

మహాబలశాలియైన విశ్వామిత్రుడు వసిష్ఠమహర్షితో 'అందఱును కుశలమే' అని సవినయముగా పలికెను. (10)

ఆ ధర్మమూర్తులిద్దఱును మిక్కిలి సంతుష్టులై, పరస్పర ప్రీతికరముగా చక్కని కథా ప్రసంగములతో చాల సమయము గడిపిరి. ఫలితముగా వారిలో ఆత్మీయత పెంపొందెను. (11)

ఓ రఘునందనా! కథాప్రసంగముల అనంతరము వసిష్ఠ మహర్షి దరహాసముచేయుచు విశ్వామిత్రునితో ఇట్లనెను. (12)

"ఓ మహాబలశాలీ! సాటిలేనివాడవైన నీకును, నీ చతురంగ బలములకును తగువిధముగా ఆతిథ్యమును ఇయ్యదలచితిని. దయతో స్వీకరింపుడు. పూజ్యుడవైన ఓ మహానుభావా! నేను సంకల్పించిన ఈ అతిథి సత్కారములను గ్రహింపుడు. నీవు మహారాజువు, ఉత్తముడవైన అతిథివి. మాకు అవశ్యము పూజనీయుడవు.' (13-14)

వసిష్ఠుడు ఇట్లు పలికినపిదప ప్రజ్ఞావంతుడగు విశ్వామిత్ర మహారాజు 'మీ ప్రియవచనములే మాకు సంతృప్తిని గూర్చినవి. అవియే మాకు అతిథిసత్కారములు. - ఓ పూజ్యమహర్షీ! మీ దివ్యదర్శనముచేతను పాద్యములతోడను, ఆచమనీయముల తోడను మీఆశ్రమమున లభించు ఫలమూలాదులతోడను, పూజార్హుడవైన నీవు మమ్ము సత్కరించితివి. నీకు నా నమస్కారములు. నాయెడ మిత్రభావమును చూపుము. వెళ్లుటకు నాకనుజ్ఞనిమ్ము.' (15-17)

ఇట్లు పలుకుచున్న మహారాజును ధర్మాత్ముడు, ఉదార బుద్ధిగలవాడు ఐన వసిష్ఠుడు 'తన ఆతిథ్యమును స్వీకరించుటకై' పదే పదే విశ్వామిత్రుని అభ్యర్థించెను. (18)

అంతట గాధినందనుడు వసిష్ఠమహర్షి యొక్క అభ్యర్థనను ఆమోదించుచు "ఓ మునీశ్వరా! మీ ఇష్టానుసారమే కానిండు"- అని పలికెను. (19)

విశ్వామిత్రుడు ఇట్లు పలుకగా తాపసశ్రేష్ఠుడును, మహాతేజస్వియు, మిక్కిలి పుణ్యాత్ముడును ఐన వసిష్ఠుడు సంతసించినవాడై, పలువన్నెలుగల కామధేనువును పిలిచెను. (20)

'చిత్రవర్ణములుగల ఓ కామధేనూ! ఇచటికి త్వరగా రమ్ము. నామాట వినుము. సైన్యములతో, పరివారములతోగూడి వచ్చేసిన ఈ రాజర్షికి తగిన విధముగా భోజనసత్కారములను

భోజనేన మహార్హేణ సత్కారం సంవిధత్స్వ మే।
యస్య యస్య యథాకామం షడ్రసేష్వభిపూజితమ్। 22

తత్సర్వం కామధుక్ క్షిప్రమ్ అభివర్ష కృతే మమ।
రసేనాన్నేన పానేన లేహ్యచోష్యేణ సంయుతమ్।
అన్నానాం నిచయం సర్వం సృజస్వ శబలే త్వర। 23

చేయుదలచితిని. తగు ఏర్పాట్లు చేయుము. ఓ కామధేనూ! నా మాటను నిలుపుటకై ఎవరెవరికి ఏది కావలయునో తదనుగుణముగా షడ్రసోపేతభోజనపదార్థములను సమృద్ధిగా శీఘ్రమే సర్జింపుము. (సమకూర్చుము.) ఓ శబలా! (కామధేనూ) రుచికరములైన అన్నపానములతో, లేహ్య చోష్యములతోగూడిన ఆహారపదార్థములను అన్నింటిని త్వరత్వరగా సృష్టింపుము. (సిద్ధపఱచుము) (21-23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ద్విపంచాశస్సర్గః (52)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబదిరెండవ సర్గము సమాప్తము

-- * * * --

53. ఏబదిమూడవసర్గము

వసిష్ఠమహర్షి విశ్వామిత్రునకు ఆతిథ్యమును ఒసంగుట - కామధేనువును తనకు ఇమ్మని విశ్వామిత్రుడు కోరుట - వసిష్ఠుడు అందులకు నిరాకరించుట.

ఏవముక్తా వసిష్ఠేన శబలా శత్రుసూదన।
విదధే కామధుక్కామాన్ యస్య యస్య యథేప్సితమ్। 1

ఇక్షూన్ మధూం స్తథా లాజాన్ మైరేయాంశ్చ వరాసవాన్।
పానాని చ మహార్హాణి భక్ష్యాం శ్చోచ్చావచాం స్తథా। 2

ఉష్ణాఢ్యస్యౌదనస్యాత్ర రాశయః పర్వతోపమాః।
మృష్టాన్నాని చ సూపాంశ్చ దధికుల్యాం స్తథైవ చ। 3

నానాస్వాదురసానాం చ షాడబానాం తథైవ చ।
భాజనాని సుపూర్ణాని గౌడాని చ సహస్రశః। 4

సర్వమాసీత్ సుసంతుష్టం హృష్టపుష్టజనాయుతమ్।
విశ్వామిత్రబలం రామ వసిష్ఠేనాభితర్పితమ్। 5

విశ్వామిత్రోఽపి రాజర్షిః హృష్టః పుష్టస్తదాఽభవత్।
సాంతఃపురవరో రాజా సబ్రాహ్మణపురోహితః। 6

సామాత్యో మంత్రిసహితః సభృత్యః పూజితస్తదా।
యుక్తః పరమహర్షేణ వసిష్ఠమ్ ఇదమబ్రవీత్। 7

ఓ శత్రుసూదనా! రామచంద్రా! వసిష్ఠునిఅభ్యర్థనమేరకు కామధేనువు విశ్వామిత్రునకును, ఆయన అనుచరులకును వారివారిఅభిరుచులకు తగినట్లుగా భోజనపదార్థములను సమకూర్చెను. (1)

ఆ కామధేనువు చెఱకుగడలను, రసములను, తేనెలను, పేలాలను, మధురపానీయములను, ఆసవములను, శ్రేష్ఠమైన పానకములను, నానావిధములైన భక్ష్యములను సమకూర్చెను. పర్వతప్రమాణములో వేడివేడి అన్నపురాసులు, పాయసములు, సూపములు, పెఱుగులు, పాలు, క్షణములో అచట సమృద్ధిగా సిద్ధమాయెను. నానా విధములైన మధురరసములు, షడ్రసములతోగూడిన భక్ష్యవిశేషములు, పాత్రలనిండా బెల్లపు పాకములతోగూడిన పెక్కు విధములగు తినుబండారములు మొదలగునవి యున్నియును కామధేనుమహిమతో అచట ప్రత్యక్షమయ్యెను. ఓ రామా! వసిష్ఠుడు సాదరముగా సమర్పించిన ఆతిథ్యముతో విశ్వామిత్రుని పరివారములన్నియును మిక్కిలి సంతృప్తిపడెను. (2-5)

వసిష్ఠుని ఆదరాభిమానములకును, క్షణములోసమకూరిన అత్యద్భుతభోజనములకును రాజర్షియైన విశ్వామిత్రుడును ఎంతయు సంతుష్టుడాయెను. రాజుగారిఅంతఃపురజనులు, బ్రాహ్మణులు, పురోహితులు, అమాత్యులు, మంత్రులు, భృత్యులు మొదలగు వారితోగూడిన విశ్వామిత్రప్రభువును వసిష్ఠుడు ఆదరించెను. అంతట పరమానందభరితుడైన విశ్వామిత్రుడు వసిష్ఠమహర్షితో ఇట్లు నుడివెను. (6-7)

పూజితోఽహం త్వయా బ్రహ్మన్ పూజార్హేణ సుసత్కృతః ।
శ్రూయతామభిధాస్యామి వాక్యం వాక్యవిశారద । 8

గవాం శతసహస్రేణ దీయతాం శబలా మమ ।
రత్నం హి భగవన్నేతత్ రత్నహారీ చ పార్థివః । 9

తస్మాన్మే శబలాం దేహి మమైషా ధర్మతో ద్విజ ।
ఏవముక్తస్తు భగవాన్ వసిష్ఠో మునిసత్తమః । 10

విశ్వామిత్రేణ ధర్మాత్మా ప్రత్యువాచ మహీపతిమ్ ।
నాహం శతసహస్రేణ నాపి కోటిశతైర్గవామ్ । 11

రాజన్ దాస్యామి శబలాం రాశిభీ రజతస్య వా ।
న పరిత్యాగమర్హేయం మత్సకాశాదరిందమ । 12

శాశ్వతీ శబలా మహ్యం కీర్తిరాత్మవతో యథా ।
అస్యాం హవ్యం చ కవ్యం చ ప్రాణయాత్రా తథైవ చ । 13

ఆయత్తమగ్నిహోత్రం చ బలిర్హోమస్తథైవ చ ।
స్వాహాకార వషట్కారౌ విద్యాశ్చ వివిధాస్తథా । 14

ఆయత్తమత్ర రాజర్షే సర్వమేతన్న సంశయః ।
సర్వస్వమేతత్ సత్యేన మమ తుష్టికరీ సదా । 15

కారణైర్బహుభీ రాజన్ న దాస్యే శబలాం తవ ।
వసిష్ఠేనైవముక్తస్తు విశ్వామిత్రోఽబ్రవీత్ తతః ।
సంరబ్ధతరమత్యర్థం వాక్యం వాక్యవిశారదః । 16

హైరణ్యకక్ష్యా గ్రైవేయాన్ సువర్ణాంకుశ భూషితాన్ ।
దదామి కుంజరాం స్తేఽహం సహస్రాణి చతుర్దశ । 17

హైరణ్యానాం రథానాం తే శ్వేతాశ్వానాం చతుర్యుజామ్ ।
దదామి తే శతాన్యష్టౌ కింకిణీకవిభూషితాన్ । 18

హయానాం దేశజాతానాం కులజానాం మహౌజసామ్ ।
సహస్రమేకం దశ చ దదామి తవ సువ్రత । 19

నానావర్ణవిభక్తానాం వయఃస్థానాం తథైవ చ ।
దదామ్యేకాం గవాం కోటిం శబలా దీయతాం మమ । 20

"వాక్చతురుడవైన ఓ బ్రహ్మర్షీ! పూజార్హుడవైన నీచేత అతిథిసత్కారములతో ఆదరింపబడితిని. ఇక నా కోరిక వినుడు, ఆలకింపుడు. మీకు లక్షగోవులను సమర్పించెదను. మీ కామధేనువును నాకొసంగుడు. ఓ పూజ్యుడా! ఈ కామధేనువు ఒక గోరత్నము. రత్నములన్నియును రాజునకే చెందును, కనుక అది రాజునే చేరవలయును. అందువలన న్యాయముగా కామధేనువు నాదే. కనుక దీనిని నాకు ఇచ్చివేయుడు." (8-10)

విశ్వామిత్రుడు ఇట్లు పలుకగా ధర్మాత్ముడు, పూజ్యుడు ఐన వసిష్ఠమహాముని ఆ రాజుతో ఇట్లు నుడివెను. "ఓ రాజా! లక్షగోవులనిచ్చినను - అంతేగాదు శతకోటిధేనువులను ఇచ్చినను, అంతమాత్రమే గాదు బంగారు రాసులనిచ్చినను కామధేనువును మాత్రము ఇయ్యజాలను. ఇది నానుండి వేఱుపడుటకు వీలులేదు. (11-12)

ఏలనన మాన్యునకు కీర్తివలె ఈ కామధేనువుతో నాకు విడదీయరాని సంబంధము గలదు. హవ్యకవ్యములకును, అట్లే జీవనయాత్రకును ఇదియే ఆధారము. సాయంప్రాతఃకాలముల యందు చేయు హోమములకును, భూతబలికిని, అట్లే 'దర్శపూర్ణమాసాది' అగ్ని కార్యములకును ఇదియే మూలము. ఈ కామధేనువు యొక్క పాలు, పెరుగు, నేయి మున్నగు వానిని స్వీకరించుట (ఆరగించుట) వలన చిత్తశుద్ధి ఏర్పడును. ప్రాణతృప్తి కలుగును. మనోదేహములకు బలము చేకూరును. 'స్వాహా' 'వషట్' అను మంత్రములు దీని అధీనములోనున్నవి. వేదశాస్త్రాది వివిధవిద్యలకు ఇది పెన్నిధి. వేయేల! ఓ రాజర్షీ! నా సకలకార్యములకును నిస్సంశయముగా ఇదియే ఆధారము. నిజముగా ఇదియే నా సర్వస్వము, ఆనందదాయిని. కనుక ఓ రాజా! ఇంకను పెక్కు కారణములవలన ఈ కామధేనువు నీకు ఇయ్యజాలను." వసిష్ఠమహాముని ఈ విధముగా పలికిన పిమ్మట మాటలనేర్పరియైన విశ్వామిత్రుడు మిక్కిలి కోపోద్రిక్తుడై ఇట్లనెను. (13-16)

"ఓ నిష్ఠాగరిష్ఠుడా! నడుమునందు బంగారు త్రాళ్లతోడను, సువర్ణకంఠాభరణములతోడను, అంకుశములతోడను అలంకృతములైన పదునాలుగువేల ఏనుగులను ఇచ్చెదను. (17)

చిఱుగంటలపట్టెడలతో అలంకరింపబడిన నాలుగేసి శ్వేతాశ్వములను పూన్చిన ఎనిమిదివందల బంగారు రథములను సమర్పించెదను. కాంభోజ, బాహ్లిక దేశములలో పుట్టి గంధర్వజాతికి చెందిన మిక్కిలి బలిష్ఠములగు పదునొకండు వేల గుఱ్ఱములను నీకు ఇచ్చెదను. పలువన్నెలతో ఒకదానికంటె మఱియొకటి మేలైన, వయసులోనున్న ఒకకోటి ఆవులను

యావదిచ్ఛసి రత్నం వా హిరణ్యం వా ద్విజోత్తమ।
తావద్దదామి తత్సర్వం శబలా దీయతాం మమ। 21

ఏవ ముక్తస్తు భగవాన్ విశ్వామిత్రేణ ధీమతా।
న దాస్యామీతి శబలాం ప్రాహ రాజన్ కథంచన। 22

ఏతదేవ హి మే రత్నమ్ ఏతదేవ హి మే ధనమ్।
ఏతదేవ హి సర్వస్వమ్ ఏత దేవ హి జీవితమ్। 23

దర్శశ్చ పూర్ణమాసశ్చ యజ్ఞాశ్చైవాప్తదక్షిణాః।
ఏతదేవ హి మే రాజన్ వివిధాశ్చ క్రియాస్తథా। 24

అదోమూలాః క్రియా స్సర్వా మమ రాజన్ న సంశయః।
బహునా కిం ప్రలాపేన న దాస్యే కామదోహినీమ్। 25

నీకు సమర్పింతును. ఈ కామధేనువునుమాత్రము నాకిమ్ము. ఓ బ్రాహ్మణోత్తమా! నీవు కోరినంత బంగారమును, రత్నాల రాసులను ఇచ్చెదను. ఈ కామధేనువును నాకిమ్ము." (18-21)

ధీశాలియైన విశ్వామిత్రుడు ఇట్లు నుడువగా అంతట వసిష్ఠమహర్షి 'ఓ రాజా! ఎట్టి పరిస్థితిలోను ఈ కామధేనువును నీకు ఇయ్యజాలను' - అని పలికెను. (22)

"ఓ రాజా! ఇదియే నాకు రత్నాలగని. ధననిధి. నా సర్వస్వమూ ఇదియే. అంతేగాదు ఇది నా జీవనాధారము. దర్శ, పూర్ణ మాసాది యాగములను, దక్షిణలతో గూడిన యజ్ఞములను, తదితరవివిధపుణ్యకార్యములను నిర్వహించుటకు ఈ గోవే నాకు ఆధారము. నా ఋషిజీవనసమస్తవిధులకును ఈ కామధేనువే జీవగఱ్ఱ. ఇక పెక్కుమాటలతో పనిలేదు. సకల మనోరథములను ఈడేర్చు ఈ దివ్యధేనువును ఇయ్యనే ఇయ్యను." (23-25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే త్రిపంచాశస్సర్గః (53)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబదిమూడవ సర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

54. ఏబదినాల్గవసర్గము

కామధేనువును తీసికొనిపోవుటకై విశ్వామిత్రుడు తన సేనలను ప్రయోగించుట - వాటిని ఎదుర్కొనుటకై కామధేనువు వసిష్ఠునిఅనుమతితో బలములను సృష్టించుట.

కామధేనుం వసిష్ఠోఽపి యదా న త్యజతే మునిః।
తదాస్య శబలాం రామ విశ్వామిత్రోఽన్వకర్షత। 1

నీయమానా తు శబలా రామ రాజ్ఞా మహాత్మనా।
దుఃఖితా చింతయామాస రుదంతీ శోకకర్శితా। 2

పరిత్యక్తా వసిష్ఠేన కిమహం సుమహాత్మనా।
యాహం రాజభటైర్దీనా హ్రియేయం భృశదుఃఖితా। 3

కిం మయాపకృతం తస్య మహర్షేర్భావితాత్మనః।
యన్మామ్ అనాగసం భక్తామ్ ఇష్టాం త్యజతి ధార్మికః। 4

ఓ రామా! వసిష్ఠమహాముని కామధేనువును తనకిచ్చుటకు నిరాకరింపగా, అంతట విశ్వామిత్రుడు ఆ ధేనువును బలవంతముగా లాగుకొని పోసాగెను. ఓ రఘువరా! మిక్కిలి బలశాలియైన రాజు ఆ విధముగా తీసికొని పోవుచుండగా ఆ కామధేనువు తనలో దుఃఖశోకములు వెల్లుబుకుటతో కన్నీరుగార్చుచు ఇట్లు చింతింపసాగెను. (1-2)

"మహాత్ముడైన వసిష్ఠుడు నన్ను పరిత్యజించెనా యేమి? మిక్కిలి దుఃఖితనై దైన్యమునకు లోనైన నన్ను ఈ రాజభటులు బలవంతముగా ఈడ్చుకొని పోవుచున్నారు. ఈ ధర్మాత్ముని మిక్కిలిభక్తితో సేవించుచుంటిని. ఈయనకు నాపైగల ప్రీతి అపారము. నేను నిరపరాధను. పవిత్రాత్ముడైన ఈ మహర్షి నన్ను త్యజించుచున్నాడు. నేను చేసిన దోషమేమి?

ఇతి సా చింతయిత్వా తు వినిశ్శ్వస్య పునఃపునః।
నిర్ధూయ తాం స్తదా భృత్యాన్ శతశశ్శత్రుసూదన।
జగామానిలవేగేన పాదమూలం మహాత్మనః। 5

శబలా సా రుదంతీ చ క్రోశంతీచేదమబ్రవీత్।
వసిష్ఠస్యాగ్రతః స్థిత్వా మేఘదుందుభిరావిణీ। 6

భగవన్ కిం పరిత్యక్తా త్వయాఽహం బ్రహ్మణస్సుత।
యస్మాద్రాజభృతా మాం హి నయంతే త్వత్సకాశతః। 7

ఏవ ముక్తస్తు బ్రహ్మర్షిః ఇదం వచనమబ్రవీత్।
శోకసంతప్తహృదయాం స్వసారమివ దుఃఖితామ్। 8

న త్వాం త్యజామి శబలే నాఽపి మేఽపకృతం త్వయా।
ఏష త్వాం నయతే రాజా బలాన్మత్తో మహాబలః। 9

న హి తుల్యం బలం మహ్యం రాజా త్వద్య విశేషతః।
బలీ రాజా క్షత్రియశ్చ పృథివ్యాః పతిరేవ చ। 10

ఇయమక్షౌహిణీపూర్ణా సవాజిరథసంకులా।
హస్తిధ్వజసమాకీర్ణా తేనాసౌ బలవత్తరః। 11

ఏవ ముక్తా వసిష్ఠేన ప్రత్యువాచ వినీతవత్।
వచనం వచనజ్ఞా సా బ్రహ్మర్షిమ్ అమితప్రభమ్। 12

న బలం క్షత్రియస్యాహుః బ్రాహ్మణో బలవత్తరః।
బ్రహ్మన్ బ్రహ్మబలం దివ్యం క్షత్రాత్తు బలవత్తరమ్। 13

అప్రమేయబలం తుభ్యం న త్వయా బలవత్తరః।
విశ్వామిత్రో మహావీర్యః తేజస్తవ దురాసదమ్। 14

నియుంక్ష్వ మాం మహాభాగ త్వద్బ్రహ్మబలసంభృతామ్।
తస్య దర్పబలం యత్తన్నాశయామి దురాత్మనః। 15

ఇత్యుక్తస్తు తయా రామ వసిష్ఠ స్సుమహాయశాః।
సృజస్వేతి తదోవాచ బలం పరబలారుజమ్। 16

తస్య తద్వచనం శ్రుత్వా సురభిః సాఽసృజత్ తదా।
తస్యా హుంభారవోత్సృష్టాః పహ్లవా శ్శతశో నృప।
నాశయంతి బలం సర్వం విశ్వామిత్రస్య పశ్యతః। 17

బలం భగ్నం తతో దృష్ట్వా రథేనాక్రమ్య కౌశికః। 18

ఇట్లు చింతించుచు ఆ ధేనువు మాటిమాటికిని నిట్టూర్పులు విడుచుచుండెను. పిమ్మట ఓ రామా! వందల కొలదిగానున్న ఆ సైనికులను విదల్చుకొని, ఆధేనువువాయువేగముతో వెళ్లి, వసిష్ఠమహామునిపాదములనాశ్రయించెను. ఆ కామధేనువు వసిష్ఠునియెదుట నిలిచి ఆర్త స్వరముతో ఏడ్చుచు మేఘ దుందుభి ధ్వనితో ఇట్లు విన్నవించెను. (3-6)

"ఓ బ్రహ్మకుమారా! పూజ్యమహర్షీ! ఈ రాజభటులు నీనుండి నన్ను లాగికొని పోవుచున్నారు. నీవు నన్ను పరిత్యజించితివా ఏమి? (7)

శోకముతో అలమటించుచున్న ఆ ధేనువుయొక్క మొఱవిని, ఆ బ్రహ్మర్షి దుఃఖితురాలైన ఒక సోదరితోవలె ఆశబలతో ఇట్లనెను. "ఓ శబలా! నిన్ను నేను త్యజించుటలేదు. నీవు నాకు ఇసుమంతయు అపకారము చేయలేదు. బలశాలియైన ఈ రాజే బలగర్వముతో మత్తిల్లి,నానుండి బలవంతముగా నిన్ను గొనిపోవుచున్నాడు. ఇతనితో సమానమైన బలము నాకు లేదు. పైగా ఇతడు బలశాలియైన రాజు, క్షత్రియుడు. మీదు మిక్కిలి భూమండలమునకు అధిపతి. (తపోబలముతో రాజును దండింపరాదు.) చతురంగబలసమన్వితమైన ఒక అక్షౌహిణీ సేనతో గూడియున్న ఇతడు మిక్కిలి శక్తిశాలి." (8-11)

వసిష్ఠుని మాటలంతర్యమును గ్రహించి, ఆ కామధేనువు తేజోమూర్తియైన ఆ బ్రహ్మర్షితో సవినయముగా ఇట్లనెను. (12)

"ఓ బ్రహ్మర్షీ! నిజముగా క్షత్రియునిబలము బలమే కాదు. బ్రాహ్మణునిబలమే బలము. అదిమిక్కిలిగొప్పది. అది దివ్యమైనది. క్షత్రియ బలముకంటెను మిన్నయైనది. విశ్వామిత్రుడు మహావీరుడే! కాదనను. కాని నీ తపశ్శక్తి తిరుగులేనిది. సాటిలేని బలశాలివైన నీముందు అతడు బలహీనుడే. ఓ మహాత్మా! నీ బ్రహ్మబలము నన్ను పరిపుష్టమొనర్చినది. నాకు ఆజ్ఞనిమ్ము. ఆ దురాత్ముని బలగర్వమును నేను చిత్తుచేసెదను." (13-15)

ఓ రామా! కామధేనువు ఇట్లు పలుకగా మహాయశస్వియైన వసిష్ఠుడు 'శత్రుబలములను రూపుమాపగల సైన్యమును సృష్టింపుము' అని ఆదేశించెను. ఆ మహర్షిఆదేశమును పాటించి ఆ దివ్యధేనువు సైన్యమును సృజించెను. ఆ ధేనువుయొక్క 'హుంభారవము' నుండి వందలకొలది పహ్లవులు (మ్లేచ్ఛజాతి సైనికులు) బయల్వెడలి విశ్వామిత్రుడు చూచుచుండగనే అతనిబలములనన్నింటిని నశింపజేయసాగిరి. (16-17)

తన బలములన్నియును హతమగుట చూచి విశ్వామిత్రుడు మిక్కిలి క్రుద్ధుడై రథమునధిరోహించెను. పిమ్మట కోపముతో

స రాజా పరమక్రుద్ధో రోషవిస్ఫారితేక్షణః।
పహ్లవాన్ నాశయామాస శస్త్రైరుచ్చావచైరపి। 19

విశ్వామిత్రార్దితాన్ దృష్ట్వా పహ్లవాన్ శతశస్తదా।
భూయ ఏవాసృజత్ కోపాత్ శకాన్ యవనమిశ్రితాన్। 20

తైరాసీత్ సంవృతా భూమిః శకైర్యవనమిశ్రితైః।
ప్రభావద్భిర్మహావీర్యైః హేమకింజల్కసన్నిభైః। 21

దీర్ఘాసిపట్టిశధరైః హేమవర్ణాంబరావృతైః।
నిర్దగ్ధం తద్బలం సర్వం ప్రదీప్తైరివ పావకైః। 22

తతోఽస్త్రాణి మహాతేజా విశ్వామిత్రో ముమోచ హ।
తైస్తైర్యవనకాంభోజాః పహ్లవాశ్చాకులీకృతాః। 23

కన్నులెఱ్ఱజేయుచు వివిధములగు శస్త్రములతో పహ్లవులను హతమార్చెను. వందలకొలది పహ్లవులు విశ్వామిత్రునిచేతిలో మసియైపోగా చూచి, ఆ ధేనువు క్రుద్ధయై, వెంటనే శకులను, యవనులను అసంఖ్యాకముగా సృజించెను. శకులతో యవనులతో ఆ ప్రదేశమంతయు నిండిపోయెను, వారు మహావీరులు, మిక్కిలి ప్రభావశాలురు, సంపెంగకేసరములవలె భాసిల్లుచుండిరి. పొడవైన ఖడ్గములను, కత్తులను ధరించియుండిరి. బంగారువన్నెవస్త్రములను దాల్చియుండిరి. అట్టి ఆసైనికులు విశ్వామిత్రుని బలములనన్నింటిని మహాగ్నిజ్వాలలవలె భస్మమొనర్చిరి. అంతట మహాబలశాలియైన విశ్వామిత్రుడు గొప్ప శక్తిగల అస్త్రములను ప్రయోగింపగా యవనులు, కాంభోజులు, పహ్లవులు అను మ్లేచ్ఛ జాతులవారు చెల్లాచెదరై పోయిరి.(18-23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే చతుఃపంచాశస్సర్గః (54)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబదినాల్గవసర్గము సమాప్తము

-- ✻ ✻ ✻ --

55. ఏబదిఐదవసర్గము

విశ్వామిత్రుడు పరమశివునిఅనుగ్రహముచే అస్త్రబలమును సంపాదించి, వసిష్ఠాశ్రమమును ధ్వంసము గావించుట – వసిష్ఠమహర్షి తన బ్రహ్మదండముతో ఆయనను ఎదుర్కొనుట.

తతస్తాన్ ఆకులాన్ దృష్ట్వా విశ్వామిత్రాస్త్రమోహితాన్।
వసిష్ఠశ్చోదయామాస కామధుక్ సృజ యోగతః। 1

తస్యా హుంభారవాజ్జాతాః కాంభోజా రవిసన్నిభాః।
ఊధసస్త్వథ సంజాతాః పహ్లవాఃశస్త్రపాణయః। 2

యోనిదేశాచ్చ యవనా శకృద్దేశాత్ శకాస్తథా।
రోమకూపేషు చ మ్లేచ్ఛా హారీతాస్సకిరాతకాః। 3

తైస్తైర్నిషూదితం సర్వం విశ్వామిత్రస్య తత్క్షణాత్।
సపదాతిగజం సాశ్వం సరథం రఘునందన। 4

దృష్ట్వానిషూదితం సైన్యం వసిష్ఠేన మహాత్మనా।
విశ్వామిత్రసుతానాం చ శతం నానావిధాయుధమ్।
అభ్యధావత్ సుసంక్రుద్ధం వసిష్ఠం జపతాం వరమ్। 5

హుంకారేణైవ తాన్ సర్వాన్ దదాహ భగవాన్ ఋషిః। 6

విశ్వామిత్రుని అస్త్రప్రభావముచే వ్యాకులపాటునకు లోనైన ఆ సైనికులను చూచి, వసిష్ఠుడు, 'ఓ కామధేనూ! నీ యోగ మహిమచే వీరులైన సైనికులను సృష్టింపుము' అని ఆ ధేనువును ప్రోత్సహించెను. (1)

ఆ ధేనువు 'హుంభారవము' నుండి సూర్యతేజస్సు గల కాంభోజులు, పొదుగునుండి శస్త్రములను ధరించిన పహ్లవులు పుట్టుకొని వచ్చిరి. యోనిప్రదేశమునుండి యవనులు, పురీష ప్రదేశమునుండి శకులు, రోమకూపములనుండి మ్లేచ్ఛులు, హారీతులు, కిరాతులు ఉద్భవించిరి. (2-3)

ఓ రఘునందనా! ఆ పహ్లవాదిసైనికులచే విశ్వామిత్రుని చతురంగబలములన్నియును తత్క్షణమే నేలపాలాయెను. (4)

మహాత్ముడైన వసిష్ఠునికారణముగా తమసైన్యములు అన్నియును మసియైపోగా, విశ్వామిత్రునివందమంది సుతులును మిక్కిలి క్రుద్ధులై వివిధములగు ఆయుధములను చేతబట్టి, తపోధనుడైన వసిష్ఠునిపై దాడిచేసిరి. (5)

పూజ్యుడైన ఆ మహర్షి ఒక్కహుంకారముతో వారిని అందరిని భస్మమొనర్చెను. విశ్వామిత్రుని పుత్రులతోపాటు

తే సాశ్వరథపాదాతా వసిష్ఠేన మహాత్మనా।
భస్మీకృతా ముహూర్తేన విశ్వామిత్రసుతాస్తదా। 7

దృష్ట్వా వినాశితాన్ పుత్రాన్ బలం చ సుమహాయశాః।
సవ్రీడశ్చింతయావిష్టో విశ్వామిత్రోఽభవత్ తదా। 8

సముద్ర ఇవ నిర్వేగో భగ్నదంష్ట్ర ఇవోరగః।
ఉపరక్త ఇవాదిత్యః సద్యో నిష్ప్రభతాం గతః। 9

హతపుత్రబలో దీనో లూనపక్ష ఇవ ద్విజః।
హతదర్పో హతోత్సాహో నిర్వేదం సముపద్యత। 10

స పుత్రమేకం రాజ్యాయ పాలయేతి నియుజ్య చ।
పృథివీం క్షత్రధర్మేణ వనమేవాన్వపద్యత। 11

స గత్వా హిమవత్పార్శ్వం కిన్నరోరగసేవితమ్।
మహాదేవప్రసాదార్థం తపస్తేపే మహాతపాః। 12

కేనచిత్త్వథ కాలేన దేవేశో వృషభధ్వజః।
దర్శయామాస వరదో విశ్వామిత్రం మహాబలమ్। 13

కిమర్థం తప్యసే రాజన్ బ్రూహి యత్ తే వివక్షితమ్।
వరదోఽస్మి వరో యస్తే కాంక్షితస్సోఽభిధీయతామ్। 14

ఏవముక్తస్తు దేవేన విశ్వామిత్రో మహాతపాః।
ప్రణిపత్య మహాదేవమ్ ఇదం వచనమబ్రవీత్। 15

యది తుష్టో మహాదేవ ధనుర్వేదో మమానఘ।
సాంగోపాంగోపనిషదః సరహస్యః ప్రదీయతామ్। 16

యాని దేవేషు చాస్త్రాణి దానవేషు మహర్షిషు।
గంధర్వ యక్ష రక్షస్సు ప్రతిభాంతు మమాఽనఘ। 17

తవ ప్రసాదాద్భవతు దేవదేవ మమేప్సితమ్।
ఏవమస్త్వితి దేవేశో వాక్యముక్త్వా గతస్తదా। 18

ప్రాప్య చాస్త్రాణి రాజర్షిః విశ్వామిత్రో మహాబలః।
దర్పేణ మహతా యుక్తో దర్పపూర్ణోఽభవత్ తదా। 19

వివర్ధమానో వీర్యేణ సముద్ర ఇవ పర్వణి।
హతమేవ తదా మేనే వసిష్ఠమ్ ఋషిసత్తమమ్। 20

వారిచతురంగబలములును మహాత్ముడైన వసిష్ఠునివలన క్షణకాలములో బుగ్గిబూడిపోయెను. (6-7)

తననందనుండికుమారులును, సమస్తబలములును నశించిపోవుటను జూచి, సుప్రసిద్ధుడైన విశ్వామిత్రుడు సిగ్గుపడి మిగుల చింతాక్రాంతుడయ్యెను. సముద్రునివలె అతని వేగము చల్లారెను. అతడు కోఱలుదీసిన పామువలె శక్తి హీనుడాయెను, రాహుగ్రస్తసూర్యునివలె వెంటనే తేజోవిహీనుడయ్యెను. నూఱుమందిపుత్రులును, సమస్త బలములును నశింపగా ఱెక్కలుతెగిన పక్షివలె దీనుడయ్యెను. అతనిగర్వము అణగెను. ఉత్సాహము నీరుగారెను. నిర్వేదము ఆవరించెను.(8-10)

'క్షాత్ర ధర్మమును అనుసరించి, ఈ పుడమిని పాలింపుము' అని విశ్వామిత్రుడు ఒక కుమారునకు రాజ్యభారమును అప్పగించి వనములకేగెను. (11)

కిన్నరులు, నాగులు, సంచరించునట్టి హిమవత్పర్వత ప్రాంతములకు చేరి, ఆ విశ్వామిత్రుడు పరమేశ్వరుని అనుగ్రహమును పొందుటకై తపస్సుచేయసాగెను. (12)

పిమ్మట కొంతకాలమునకు వృషభధ్వజుడు, వరదుడు ఐన పరమశివుడు మిక్కిలి పట్టుదలగల విశ్వామిత్రునకు దర్శనమిచ్చి ఇట్లనెను. "ఓ రాజా! నీవు ఎందులకు తపస్సు చేయుచుంటివి? నీ కోరికను దెలుపుము. నీ యెడ ప్రసన్నుడనైతిని. నీ అభిమతమును ప్రకటింపుము." (13-14)

మహాతపస్వియైన విశ్వామిత్రుడు మహాదేవుని ప్రసన్న వచనములను విని, ఆయనకు ప్రణమిల్లి, ఇట్లు విన్నవించు కొనెను. (15)

ఓ పరమేశ్వరా! నాతపస్సు నీ మెప్పుబడసినచో సాంగోపాంగముగా ధనుర్విద్యను, ఉపనిషద్రహస్యములను నాకు ప్రసాదింపుడు. దేవతలు, దానవులు, మహర్షులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు మొదలగు వారియందుగల అస్త్రపటిమ నాకును అబ్బునట్లు అనుగ్రహింపుడు – ఓ దేవదేవా! ఇదియే నాకోరిక." – అంతట పరమశివుడు 'అట్లేయగుగాక' అని పలికి అంతర్ధానమాయెను. (16-18)

మహాబలశాలియు, రాజర్షియు ఐన విశ్వామిత్రుడు సహజముగనే గర్వముగలవాడు, దివ్యాస్త్రములను పొందుటవలన ఆయనగర్వము ఇంకను అధికమాయెను. (19)

పర్వకాలములయందు సముద్రమువలె పరాక్రమస్ఫూర్తితో అతడు పొంగిపోయెను. అప్పుడతడు "ఇక ఋషీశ్వరుడైన వసిష్ఠుడు హతుడైనట్లే" అని తలపోసెను. (20)

తతో గత్వాఽఽశ్రమపదం ముమోచాస్త్రాణి పార్థివః।
యైస్తత్ తపోవనం సర్వం నిర్దగ్ధం చాస్త్రతేజసా। 21

ఉదీర్యమాణమస్త్రం తత్‌విశ్వామిత్రస్య ధీమతః।
దృష్ట్వా విప్రద్రుతాస్సర్వే మునయ శ్శతశో దిశః। 22

వసిష్ఠస్య చ యే శిష్యాః తథైవ మృగపక్షిణః।
విద్రవంతి భయాద్భీతా నానాదిగ్భ్యః సహస్రశః। 23

వసిష్ఠస్యాశ్రమపదం శూన్యమాసీన్మహాత్మనః।
ముహూర్తమివ నిశ్శబ్దమ్ ఆసీదిరిణసన్నిభమ్। 24

వదతో వై వసిష్ఠస్య మా భైరితి ముహుర్ముహుః।
నాశయామ్యద్య గాధేయం నీహారమివ భాస్కరః। 25

ఏవ ముక్త్వా మహాతేజా వసిష్ఠో జపతాం వరః।
విశ్వామిత్రం తదా వాక్యం సరోషమ్ ఇదమబ్రవీత్। 26

ఆశ్రమం చిరసంవృద్ధం యద్వినాశితవానసి।
దురాచారోఽసి తన్మూఢ తస్మాత్ త్వం న భవిష్యసి। 27

ఇత్యుక్త్వా పరమక్రుద్ధో దండముద్యమ్య సత్వరః।
విధూమమివ కాలాగ్నిం యమదండ మివాపరమ్। 28

పిమ్మట ఆ రాజు వసిష్ఠునిఆశ్రమమునకు వెళ్ళి, తన అస్త్రములను ప్రయోగించెను. ఆ అస్త్రములధాటికి ఆ తపోవనము పూర్తిగా దగ్ధమైపోయెను. శక్తిమంతుడైన విశ్వామిత్రుడు అట్లు అస్త్రములను ప్రయోగించుచుండుట చూచి, మునులందఱును, వసిష్ఠునిశిష్యులును, గుంపులు గుంపులుగా నలుదిక్కులకును పరుగులుదీసిరి. అట్లే వేలకొలది మృగములును, పక్షులును భయభ్రాంతులకు లోనై పాఱిపోయెను. మహాత్ముడైన వసిష్ఠుని ఆశ్రమమునందలి వృక్షములు, పొదలు ధ్వంసముకాగా అది శూన్యమయ్యెను. క్షణములో ఆ ప్రదేశమంతయును ఊసరక్షేత్రమును తలపింపజేసెను. అందు నిశ్శబ్దము తాండవించెను. (21-24)

అంతట వసిష్ఠమహాముని "భయపడకుడు, భయపడకుడు- సూర్యుడు మంచునువలె ఈ క్షణముననే విశ్వామిత్రుని అంతరింపజేసెదను." అని అభయవచనములను పలుకుచున్నను వారు పాఱి పోవుచునే యుండిరి. (25)

జపతపస్సంపన్నుడును, మహాతేజస్వియు ఐన వసిష్ఠుడు క్రుద్ధుడై విశ్వామిత్రునితో ఇట్లు పలికెను. (26)

"ఓ మూర్ఖుడా! ఎంతో కాలమునుండి పూలమొక్కలతో, ఫలవృక్షములతో వృద్ధిపొందుచు కలకలలాడుచున్న ఈ వనవాటికను ధ్వంసమొనర్చిన దురాచారుడవు నీవు. 'ఇక నీకు నూకలు చెల్లినట్లే' - అని పలికి, క్రోధావేశముతో వెంటనే - పొగలేని ప్రళయాగ్నివలెను, మఱియొక యమదండము వలెను ఒప్పుచున్న భయంకరమైన తనబ్రహ్మదండమును చేబూని నిలిచెను. (27-28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచపంచాశస్సర్గః (55)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబదిఐదవ సర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

56. ఏబదిఆఱవసర్గము

విశ్వామిత్రుడు ప్రయోగించిన అస్త్రములను అడ్డుకొనిన వసిష్ఠుడు విమ్మునాపించుట.

ఏవముక్తో వసిష్ఠేన విశ్వామిత్రో మహాబలః।
ఆగ్నేయమస్త్రముత్క్షిప్య తిష్ఠ తిష్ఠేతిచాబ్రవీత్। 1

బ్రహ్మదండం సముత్క్షిప్య కాలదండమివాపరమ్।
వసిష్ఠో భగవాన్ క్రోధాత్ ఇదం వచనమబ్రవీత్। 2

ఇట్లు పలికిన వసిష్ఠునితో బలశాలియైన విశ్వామిత్రుడు ఆగ్నేయాస్త్రమును సంధించి 'నిలువుము నిలువుము' అని హెచ్చరించెను. (1)

అప్పుడు పూజ్యుడైన వసిష్ఠుడు మఱియొక యమదండమా యనునట్లున్న తనబ్రహ్మదండమును పైకెత్తి కోపముతో హుంకరించుచు ఇట్లు నుడివెను. (2)

క్షత్రబంధో స్థితోఽస్మ్యేష యద్బలం తద్విదర్శయ।
నాశయామ్యద్య తే దర్పం శస్త్రస్య తవ గాధిజ। 3

క్వ చ తే క్షత్రియబలం క్వచ బ్రహ్మబలం మహత్।
పశ్య బ్రహ్మబలం దివ్యం మమ క్షత్రియపాంసన। 4

తస్యాస్త్రం గాధిపుత్రస్య ఘోరమాగ్నేయముద్యతమ్।
బ్రహ్మదండేన తచ్ఛాంతమ్ అగ్నేర్వేగ ఇవాంభసా। 5

వారుణం చైవ రౌద్రం చ ఐంద్రం పాశుపతం తథా।
ఐషీకం చాపి చిక్షేప కుపితో గాధినందనః। 6

మానవం మోహనం చైవ గాంధర్వం స్వాపనం తథా।
జృంభణం మాదనం చైవ సంతాపనవిలాపనే। 7

శోషణం దారణం చైవ వజ్రమస్త్రం సుదుర్జయమ్।
బ్రహ్మపాశం కాలపాశం వారుణం పాశమేవ చ। 8

పైనాకాస్త్రం చ దయితం శుష్కార్ద్రే అశనీ ఉభే।
దండాస్త్రమథ పైశాచం క్రౌంచమస్త్రం తథైవ చ। 9

ధర్మచక్రం కాలచక్రం విష్ణుచక్రం తథైవ చ।
వాయవ్యం మథనం చైవ అస్త్రం హయశిరస్తథా। 10

శక్తిద్వయం చ చిక్షేప కంకాళం ముసలం తథా।
వైద్యాధరం మహాస్త్రం చ కాలాస్త్రమథ దారుణమ్। 11

త్రిశూలమస్త్రం ఘోరం చ కాపాలమథ కంకణమ్।
ఏతాన్యస్త్రాణి చిక్షేప సర్వాణి రఘునందన। 12

వసిష్ఠే జపతాం శ్రేష్ఠే తదద్భుతమివాభవత్।
తాని సర్వాణి దండేన గ్రసతే బ్రహ్మణస్సుతః।
తేషు శాంతేషు బ్రహ్మాస్త్రం క్షిప్తవాన్ గాధినందనః। 13

తదస్త్ర ముద్యతం దృష్ట్వా దేవా స్సాగ్ని పురోగమాః। 14

దేవర్షయశ్చ సంభ్రాంతాః గంధర్వా స్సమహోరగాః।
త్రైలోక్యమాసీత్ సంత్రస్తం బ్రహ్మాస్త్రే సముదీరితే। 15

తదప్యస్త్రం మహాఘోరం బ్రాహ్మం బ్రాహ్మేణ తేజసా।
వసిష్ఠో గ్రసతే సర్వం బ్రహ్మదండేన రాఘవ। 16

బ్రహ్మాస్త్రం గ్రసమానస్య వసిష్ఠస్య మహాత్మనః।
త్రైలోక్యమోహనం రౌద్రం రూపమాసీత్ సుదారుణమ్। 17

"ఓ క్షత్రియాధమా! గాధిపుత్రా! ఇదిగో ఇక్కడనేయున్నాను. నీ బలమెంతటిదో చూపుము. నీ శస్త్రగర్వమును ఇప్పుడే అణచెదను. ఓ దుష్టక్షత్రియా! బ్రహ్మబలముముందు క్షత్రియ బలమెంత? దివ్యమైన నా బ్రహ్మబలమును చూడుము."(3-4)

విశ్వామిత్రుడు ప్రయోగించిన ఘోరమైన ఆ ఆగ్నేయాస్త్రము నీటిదెబ్బకు నిప్పువలె వసిష్ఠుని బ్రహ్మదండప్రభావమున నిస్తేజమయ్యెను. అందులకు కుపితుడైన విశ్వామిత్రుడు క్రమముగా వారుణాస్త్రమును, రౌద్రాస్త్రమును, ఐంద్రాస్త్రమును, పాశుపతమును, ఇషీకాస్త్రమును ప్రయోగించెను. (5-6)

ఓ రామా! ఇంకను అతడు మానవము, మోహనము, గాంధర్వము, స్వాపనము, జృంభణము, మాదనము, సంతాపనము, విలాపనము, శోషణము, దారణము, అజేయమైన వజ్రాస్త్రము, బ్రహ్మపాశము, కాలపాశము, వరుణపాశము, పైనాకము, దయితము శుష్కాశని, ఆర్ద్రాశని, దండము, పైశాచము, క్రౌంచము-అను అస్త్రములను ధర్మచక్రమును, కాలచక్రమును, విష్ణుచక్రమును, వాయవ్యము, మథనము, హయశిరము- అను అస్త్రములను ప్రయోగించెను. ఇంకను కంకాళము, ముసలము అను శక్తి ద్వయమును, వైద్యాధరమహాస్త్రమును, దారుణమైన కాలాస్త్రమును, ఘోరమైన త్రిశూలాస్త్రమును, కాపాలము, కంకణము మొదలగు సర్వాస్త్రములను జపనిష్ఠాగరిష్ఠుడైన వసిష్ఠ మహర్షిపై ప్రయోగించెను. బ్రహ్మపుత్రుడైన వసిష్ఠ మహామునియొక్కదండము ఆ అస్త్రములను అన్నింటిని అద్భుతావహముగా కబళించివేసెను. ఆ అస్త్రములన్నియును వమ్మైపోగా అప్పుడు విశ్వామిత్రుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. (7-13)

ఆ బ్రహ్మాస్త్రవిజృంభణమును జూచి, అగ్నిమొదలగుదేవతలు, దేవర్షులు, గంధర్వులు, నాగులు మొదలగువారు భయభ్రాంతులైరి. ఇంకను ముల్లోకములును మిక్కిలి భయములో వణకిపోయెను. ఓ రాఘవా! వసిష్ఠమహర్షి తన బ్రహ్మతేజఃప్రభావమున మిక్కిలి భయంకరమైన ఆ బ్రహ్మాస్త్రమునుగూడ బ్రహ్మదండముచే నిర్వీర్యమొనర్చెను. (14-16)

బ్రహ్మాస్త్రమును కబళించుచున్న మహాత్ముడైన వసిష్ఠుని రౌద్రరూపము చూడశక్యముగానిదై, స్మరించినంత మాత్రమున భయమును గొల్పునదై, ముల్లోకములను మూర్ఛిల్లజేయు చుండెను. మహానుభావుడైన వసిష్ఠుని యొక్క రోమకూపముల

రోమకూపేషు సర్వేషు వసిష్ఠస్య మహాత్మనః।
మరీచ్య ఇవ నిష్పేతుః అగ్నేర్ధూమాకులార్చిషః। 18

ప్రాజ్వలద్బ్రహ్మదండశ్చ వసిష్ఠస్య కరోద్యతః।
విధూమ ఇవ కాలాగ్నిః యమదండ ఇవాపరః। 19

తతోఽస్తువన్ మునిగణా వసిష్ఠం జపతాం వరమ్।
అమోఘం తే బలం బ్రహ్మన్ తేజో ధారయ తేజసా। 20

నిగృహీతస్త్వయా బ్రహ్మన్ విశ్వామిత్రో మహాతపాః।
ప్రసీద జపతాం శ్రేష్ఠ లోకాస్సంతు గతవ్యథాః। 21

ఏవముక్తో మహాతేజాః శమం చక్రే మహాతపాః।
విశ్వామిత్రోఽపి వికృతో వినిశ్వస్యేదమబ్రవీత్। 22

'ధిగ్బలం క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్'।
ఏకేన బ్రహ్మదండేన సర్వాస్త్రాణి హతాని మే। 23

తదేతత్ సమవేక్ష్యాహం ప్రసన్నేంద్రియమానసః।
తపో మహత్ సమాస్థాస్యే యద్వై బ్రహ్మత్వకారణమ్। 24

నుండి పొగతోనిండిన జ్వాలలు గల అగ్నికిరణములు బహిర్గతములగుచున్నట్లు ఉండెను. వసిష్ఠుడు చేతబట్టిన బ్రహ్మదండము పొగలేనిప్రళయాగ్నివలెను, మఱియొక యమదండమురీతిగను ప్రజ్వరిల్లెను. (17-19)

అనంతరము తపోధనుడైన వసిష్ఠుని స్తుతించుచు మునీశ్వరులు ఇట్లు పలికిరి-"ఓ బ్రహ్మర్షీ! నీ బలము అమోఘము. నీ మహిమతో ఈ బ్రహ్మాస్త్రతేజమును ఉపశమింపజేయుము. ఓ పూజ్యుడా! మహాతపశ్శాలియైన విశ్వామిత్రుని నిగ్రహించితివి. ఓ జపశ్రేష్ఠా! శాంతింపుము ప్రసన్నుడవగుము లోకములబాధలను తొలగింపుము." (20-21)

మునులు ఇట్లు వేడుకొనగా మహాతపస్వియు, తేజశ్శాలియు ఐన వసిష్ఠుడు ప్రశాంతచిత్తుడాయెను. వసిష్ఠునిచేతిలో ఓటమిపాలైన విశ్వామిత్రుడు నిట్టూర్చుచు ఇట్లు పలికెను. "ఛీ! క్షత్రియ బలముకూడా ఒక బలమా! బ్రహ్మతేజోబలమే నిజమైన బలము. ఒకే ఒక్క బ్రహ్మదండము నా అస్త్రములను అన్నింటిని నిర్వీర్యము గావించినది. ఇప్పుడు నాకు 'నిజమైన బలమేదో' తేటతెల్లమైనది. బ్రహ్మత్వమును పొందుటకై (బ్రహ్మర్షినగుటకై) క్షత్రియరోషమును పరిత్యజించి, మనస్సును, ఇంద్రియములను నిగ్రహించి, తీవ్రముగా తపస్సును చేసెదను." (22-24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షట్పంచాశస్సర్గః (56)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబదిఆఱవ సర్గము సమాప్తము

-- * * * --

57. ఏబదిఏడవసర్గము

విశ్వామిత్రుడు రాజర్షియగుట - త్రిశంకుమహారాజు సశరీరస్వర్గప్రాప్తికై వసిష్ఠమహర్షిని ప్రార్థించుట
అందులకు ఆయన నిరాకరించుట - పిదప ఆ రాజు ఆయునకుమారులను అభ్యర్థించుట.

తతః సంతప్తహృదయః స్మరన్ నిగ్రహమాత్మనః।
వినిశ్శ్వస్య వినిశ్శ్వస్య కృతవైరో మహాత్మనా। 1

స దక్షిణాం దిశం గత్వా మహిష్యా సహ రాఘవ।
తతాప పరమం ఘోరం విశ్వామిత్రో మహత్ తపః।
ఫలమూలాశనో దాంతః చకార సుమహత్ తపః। 2

అథాస్య జజ్ఞిరే పుత్రాః సత్యధర్మపరాయణాః।
హవిష్యందో మధుష్యందో దృఢనేత్రో మహారథః। 3

ఓ రామా! మహాత్ముడైన వసిష్ఠునితో వైరము పూనుట వలన తనకు కలిగిన పరాభవమును గుర్తుచేసికొనుచు విశ్వామిత్రుడు మిక్కిలి పరితపింపసాగెను. పిదప అతడు పదేపదే నిట్టూర్చుచు పట్టమహిషితోగూడి దక్షిణదిశకు వెళ్లి, ఫలమూలములనుమాత్రమే ఆహారముగా గొనుచు, ఇంద్రియ నిగ్రహముతో మిక్కిలి తీవ్రమైనతపస్సును ఆచరించెను. (1-2)

అక్కడ ఆయునకు హవిష్యందుడు, మధుష్యందుడు, దృఢనేత్రుడు, మహారథుడు అను నలుగురు పుత్రులు కల్గిరి. వారు సత్యవచనులు, ధర్మపరాయణులు. (3)

పూర్ణే వర్షసహస్రే తు బ్రహ్మా లోకపితామహః।
అబ్రవీన్మధురం వాక్యం విశ్వామిత్రం తపోధనమ్। 4

జితా రాజర్షిలోకాస్తే తపసా కుశికాత్మజ।
అనేన తపసా త్వాం తు రాజర్షిరితి విద్మహే। 5

ఏవముక్త్వా మహాతేజా జగామ సహ దైవతైః।
త్రివిష్టపం బ్రహ్మలోకం లోకానాం పరమేశ్వరః। 6

విశ్వామిత్రోఽపి తచ్ఛ్రుత్వా హ్రియా కించిదవాఙ్ముఖః।
దుఃఖేన మహతాఽఽవిష్టః సమన్యురిదమబ్రవీత్। 7

తపశ్చ సుమహత్ తప్తం రాజర్షిరితి మాం విదుః।
దేవాస్సర్షిగణాస్సర్వే నాస్తి మన్యే తపఃఫలమ్। 8

ఇతి నిశ్చిత్య మనసా భూయ ఏవ మహాతపాః।
తపశ్చకార కాకుత్స్థ పరమం పరమాత్మవాన్। 9

ఏతస్మిన్నేవ కాలే తు సత్యవాదీ జితేంద్రియః।
త్రిశంకురితి విఖ్యాత ఇక్ష్వాకుకులవర్ధనః। 10

తస్య బుద్ధిస్సముత్పన్నా యజేయమితి రాఘవ।
గచ్ఛేయం సశరీరేణ దేవానాం పరమాం గతిమ్। 11

స వసిష్ఠం సమాహూయ కథయామాస చింతితమ్।
అశక్యమితి చాప్యుక్తో వసిష్ఠేన మహాత్మనా। 12

ప్రత్యాఖ్యాతో వసిష్ఠేన స యయౌ దక్షిణాం దిశమ్।
తతస్తత్కర్మసిద్ధ్యర్థం పుత్రాంస్తస్య గతో నృపః। 13

వాసిష్ఠా దీర్ఘతపసః తపో యత్ర హి తేపిరే।
త్రిశంకుస్సుమహాతేజాః శతం పరమభాస్వరమ్। 14

వసిష్ఠపుత్రాన్ దదృశే తప్యమానాన్ యశస్వినః।
సోఽభిగమ్య మహాత్మనః సర్వానేవ గురోః సుతాన్। 15

అభివాద్యానుపూర్వ్యేణ హ్రియా కించిదవాఙ్ముఖః।
అబ్రవీత్ సుమహాభాగాన్ సర్వానేవ కృతాంజలిః। 16

అతడు వేయి సంవత్సరములు తీవ్రముగా తపస్సొనర్చిన పిమ్మట సృష్టికర్తయైన బ్రహ్మ ప్రత్యక్షమై మహాతపస్వియైన ఆ విశ్వామిత్రునితో ఇట్లు నుడివెను. (4)

"ఓ కౌశికా! నీవు నీతపశ్శక్తిచే రాజర్షులుపొందెడి లోకములను జయించితివి. నీవు ఆచరించిన ఈ తపశ్చర్యనుబట్టి నిన్ను 'రాజర్షి'గా గుర్తించుచున్నాను." (5)

లోకములను సృష్టించువాడును, మహాతేజస్వియు ఐన బ్రహ్మదేవుడు ఇట్లు పలికినపిదప తనసత్యలోకమునకు వెళ్లెను. ఆయనవెంటవచ్చిన దేవతలును దివికేగిరి. (6)

విశ్వామిత్రుడు బ్రహ్మవచనములను విని, సిగ్గుతో తలవంచుకొనెను. మిక్కిలి తీవ్రమైన దుఃఖమునకులోనై, కోపముతో ఇట్లనుకొనెను. (7)

నేనింతటి తీవ్రమైన తపస్సొనర్చినను సమస్తదేవతలును, ఋషీశ్వరులును నన్ను రాజర్షిగా మాత్రమే గుర్తించిరి. నా తపస్సునకు తగినఫలితము దక్కలేదనియే తలంతును.' (8)

ఓ రామా! మహాతపస్వియైన విశ్వామిత్రుడు ఇట్లు తలపోసి, మునుపటికంటెను తీవ్రముగా తపస్సు చేయనారంభించెను. (9)

ఇదేకాలమున ఇక్ష్వాకువంశప్రముఖుడైన 'త్రిశంకు' మహారాజు వర్ధిల్లుచుండెను. అతడు సత్యవాది, జితేంద్రియుడు, అన్ని విధములుగా ఖ్యాతికెక్కినవాడు. ఓ రఘువరా! 'గొప్ప యజ్ఞములనొనర్చి తత్ప్రభావమున దేవతలకు నివాసభూమియైన స్వర్గమునకు సశరీరముగా వెళ్లవలెను'-అని అతనికి బుద్ధిపుట్టెను. వెంటనే అతడు వసిష్ఠమహర్షిని ఆహ్వానించి, ఆయనకు తనసంకల్పమును తెలిపెను. అంతట మహాత్ముడైన వసిష్ఠుడు 'అది అసాధ్యము'-[1] అని పలికెను. (10-12)

వసిష్ఠుడు తనకోరికను నిరాకరింపగా ఆ రాజు దక్షిణ దిశగా బయలుదేరెను. తనమనోరథసిద్ధికై వసిష్ఠునిపుత్రుల కడకు వెళ్లెను. అచట దీర్ఘకాలమునుండి తపమొనరించుచు తేజోమూర్తులైయున్న నూర్గురు వసిష్ఠపుత్రులను మహాతేజస్వియగు త్రిశంకువు దర్శించెను. (13-14)

అతడు మహాత్ములైన గురుసుతులనందఱిని సమీపించి, క్రమముగా వినయముతో వారికి ప్రణమిల్లెను. పిమ్మట లజ్జతో తలవంచుకొని, అంజలి ఘటించి ఆ మహానుభావులతో ఇట్లు విన్నవించుకొనెను. "మీరు అనన్యశరణ్యులు. ప్రపత్తితో

1) 'అది అసాధ్యము' అనగా-శరీరముతో స్వర్గమునకు పంపుటకు వసిష్ఠమహర్షికి సామర్థ్యము లేదని కాదు, ఆ విధముగా స్వర్గమునకు వెళ్లినవారు లేరనిగాదు - త్రిశంకువునకు అట్టి అర్హత లేదనియే దానిపరమార్థము. 'సశరీర ఏవ స్వర్గం లోకమేతి' అని శ్రుతి ప్రమాణము. గోవిందరాజీయ వ్యాఖ్య

శరణం వః ప్రపద్యేఽహం శరణ్యాన్ శరణాగతః।
ప్రత్యాఖ్యాతోఽస్మి భద్రం వో వసిష్ఠేన మహాత్మనా। 17

యష్టుకామో మహాయజ్ఞం తదనుజ్ఞాతుమర్హథ।
గురుపుత్త్రానహం సర్వాన్ నమస్కృత్య ప్రసాదయే। 18

శిరసా ప్రణతో యాచే బ్రాహ్మణాంస్తపసి స్థితాన్।
తే మాం భవంతస్సిద్ధ్యర్థం యాజయంతు సమాహితాః।
సశరీరో యథాహం హి దేవలోకమవాప్నుయామ్। 19

ప్రత్యాఖ్యాతో వసిష్ఠేన గతిమన్యాం తపోధనాః।
గురుపుత్త్రాన్ ఋతే సర్వాన్ నాహం పశ్యామి కాంచన। 20

ఇక్ష్వాకూణాం హి సర్వేషాం పురోధాః పరమా గతిః। 21

పురోధసస్తు విద్వాంసః తారయంతి సదా నృపాన్।
తస్మాదనంతరం సర్వే భవంతో దైవతం మమ। 22

మిమ్ము శరణుజొచ్చుచున్నాను. నన్నాదుకొనుడు- మీకు పుణ్యముండును. మహాత్ముడైన వసిష్ఠమహర్షిచే నేను నిరాకరింపబడితిని. (15-17)

నేనొక మహాయజ్ఞమును చేయదలచితిని. దానికి మీరు అనుజ్ఞయిండు. గురుపుత్త్రులైన మీ యందఱికిని నమస్కరించి, (మిమ్ము) వేడుకొనుచున్నాను. తపమొనరించుచున్న బ్రహ్మవేత్తలైన మీకు శిరసా ప్రణమిల్లి ప్రార్థించుచున్నాను. నేను సశరీరముగా దేవలోకమును పొందగోరుచున్నాను. నా మనోరథసిద్ధికై పూజ్యులైన మీరు పూనుకొని, నాతో యజ్ఞమును జరిపింపగలరు. (18-19)

ఓ తపోధనులారా! ఈ విషయమున వసిష్ఠమునిచేత నేను తిరస్కరింపబడితిని. యజ్ఞకార్యసిద్ధికై గురుపుత్త్రులైన మిమ్ములను ఆశ్రయించుటతప్ప నాకు మఱియొక మార్గము కన్పించుటలేదు. (20)

ఇక్ష్వాకుప్రభువులందఱికిని పురోహితుడైన వసిష్ఠుడే వారికి పరమగతి. విద్వాంసులైన పురోహితులు రాజులను సర్వదా ఉద్ధరించుచుందురు. మీరు వసిష్ఠుని యంతటివారు. అందువలన పూజ్యులైన మీరే మాకు రక్షకులు. (21-22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తపంచాశస్సర్గః (57)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబదియేడవసర్గము సమాప్తము

-- * * * --

58. ఏబదియెనిమిదవసర్గము

వసిష్ఠునిపుత్త్రులశాపకారణముగా త్రిశంకువు చండాలత్వమును పొందుట -
పిమ్మట అతడు విశ్వామిత్రుని జేరి, మొఱపెట్టుకొనుట.

తత స్త్రిశంకోర్వచనం శ్రుత్వా క్రోధసమన్వితమ్।
ఋషిపుత్త్రశతం రామ రాజానమిదమబ్రవీత్। 1

ప్రత్యాఖ్యాతో హి దుర్బుద్ధే గురుణా సత్యవాదినా।
తం కథం సమతిక్రమ్య శాఖాంతరముపేయివాన్। 2

ఇక్ష్వాకూణాం హి సర్వేషాం పురోధాః పరమో గురుః।
న చాతిక్రమితుం శక్యం వచనం సత్యవాదినః। 3

ఓ శ్రీరామా! త్రిశంకువచనములను వినిన పిమ్మట వసిష్ఠమహర్షిపుత్త్రులు నూఱుగురును మిక్కిలి క్రుద్ధులై, ఆ రాజుతో ఇట్లు నుడివిరి. (1)

"ఓ దుర్బుద్ధీ! సత్యవ్రతుడైన వసిష్ఠుడు నిరాకరింపగా, ఆయనమాటను పెడచెవినిబెట్టి, ఆయనపుత్త్రులమైన మమ్ము ఎట్లు ఆశ్రయించుచుంటివి. ఇక్ష్వాకుప్రభువులందఱికిని పురోహితుడైన వసిష్ఠుడే పరమగురువు. సత్యవాదియైన ఆ మహర్షివచనము అతిక్రమింపరానిది. పరమపూజ్యుడైన ఆ మహర్షి 'నీవు సశరీరముగా దివికేగుట అసాధ్యము'-అని నుడివెనుగదా! అట్టి యజ్ఞమును నీచే మేము ఎట్లు

అశక్యమితిచోవాచ వసిష్ఠో భగవాన్ ఋషిః।
తం వయం వై సమాహర్తుం క్రతుం శక్తాః కథం తవ। 4

బాలిశస్త్వం నరశ్రేష్ఠ గమ్యతాం స్వపురం పునః।
యాజనే భగవాన్ శక్తః త్రైలోక్యస్యాపి పార్థివ।
అవమానం చ తత్కర్తుం తస్య శక్ష్యామహే కథమ్। 5

తేషాం తద్వచనం శ్రుత్వా క్రోధపర్యాకులాక్షరమ్।
స రాజా పునరేవైతాన్ ఇదం వచనమబ్రవీత్। 6

ప్రత్యాఖ్యాతోఽస్మి గురుణా గురుపుత్రైస్తథైవ చ।
అన్యాం గతిం గమిష్యామి స్వస్తి వోఽస్తు తపోధనాః। 7

ఋషిపుత్రాస్తు తచ్ఛ్రుత్వా వాక్యం ఘోరాభిసంహితమ్। 8

శేపుః పరమసంక్రుద్ధాః చండాలత్వం గమిష్యసి।
ఏవ ముక్త్వా మహాత్మానో వివిశుస్తే స్వమాశ్రమమ్। 9

అథ రాత్ర్యాం వ్యతీతాయాం రాజా చండాలతాం గతః।
నీలవస్త్రధరో నీలః పరుషో ధ్వస్తమూర్ధజః।
చిత్యమాల్యానులేపశ్చ ఆయసాభరణోఽభవత్। 10

తం దృష్ట్వా మంత్రిణస్సర్వే త్యక్త్వా చండాలరూపిణమ్।
ప్రాద్రవన్ సహితా రామ పౌరా యేఽస్యానుగామినః। 11

ఏకోహి రాజా కాకుత్స్థ జగామ పరమాత్మవాన్।
దహ్యమానో దివారాత్రం విశ్వామిత్రం తపోధనమ్। 12

విశ్వామిత్రస్తు తం దృష్ట్వా రాజానం విఫలీకృతమ్।
చండాలరూపిణం రామ మునిః కారుణ్యమాగతః। 13

కారుణ్యాత్ స మహాతేజా వాక్యం పరమధార్మికః।
ఇదం జగాద భద్రం తే రాజానం ఘోరరూపిణమ్। 14

జరిపింపగలము? ఓ రాజా! నీవు మూర్ఖుడవు. ఇక నీవు నీ నగరము (ఇంటి) దారి పట్టవచ్చును. పూజ్యుడగు వసిష్ఠుడు ముల్లోకములలో ఎవరిచేనైనను యజ్ఞము చేయింపసమర్థుడు- ఆయన మాటను కాదని మేము నీచేయజ్ఞము జరిపించి, ఆయనను ఎట్లు అవమానింపగలము.? (2-5)

క్రోధావేశముతోపలికిన వారిమాటలను విని, ఆ రాజు మరల వారితో ఇట్లు నుడివెను. "గురువైన వసిష్ఠుడును, అట్లే ఆ గురువుగారిపుత్రులైన మీరును నన్ను తిరస్కరించితిరి. ఓ తపోధనులారా! మీకు శుభమగుగాక. నేను మఱియొకదారి చూచుకొందును." (మఱియొకరిని ఆశ్రయింతును.) (6-7)

సాక్షాత్తు బ్రహ్మపుత్రుడును, కులగురువు ఐన వసిష్ఠుని మాటను త్రోసిపుచ్చుటయేగాక ఆరాజు దురహంకారపూరితుడై 'ఇతరులను ఆశ్రయించెదను' అని పలికిన మాటలను విని, ఆ మహర్షిపుత్రులు మిక్కిలి క్రుద్ధులై 'నీవు చండాలత్వమును పొందుదువుగాక' అని అతనిని శపించిరి. తదనంతరము ఆ మహాత్ములు తమఆశ్రమమునకు చేరిరి. (8-9)

ఋషిపుత్రులు నుడివిన ఘోరశాపవచనములను విని, మిక్కిలి ఖిన్నుడై, ఆ త్రిశంకుప్రభువు తననగరమునకు జేరి చింతింపసాగెను. ఇట్లు ఆ రాత్రి గడచినంతనే రాజు చండాల రూపమును పొందెను. అతడు ధరించిన పీతాంబరము నలుపు రంగుకు మారెను. అతని శరీరముగూడ నల్లనిదై తేజోవిహీన మయ్యెను. కఱకుదనమును పొందెను. కేశములు కురుచవయ్యెను. అతడు శ్మశానమునందలి మాలలను, బూడిదను దాల్చియుండెను. అతని ఆభరణములన్నియును ఇనుపవయ్యెను. ఓ రామా! చండాలరూపమును పొందిన ఆ రాజును జూచి, మంత్రులు అందఱును భయపడి పాఱిపోయిరి. పురజనులును భీతితో వారిని వెన్నంటి పరుగులుదీసిరి. (10-11)

ఓ రాఘవా! ఆ రాజు (త్రిశంకువు) ఒంటరివాడై, రాత్రింబవళ్లు దుఃఖముతో కుమిలిపోవుచున్నను ధైర్యము వహించి, తపోధనుడును, వసిష్ఠునియెడ వైరభావముగలవాడును ఐన విశ్వామిత్రుని కడకు చేరెను. (12)

శ్రీరామా! వసిష్ఠపుత్రులశాపమువలన ఇహపరసుఖములకు దూరమై, చండాలరూపముననున్న ఆ త్రిశంకుని జూచి, విశ్వామిత్రముని అతనిపై జాలిపడెను. (13)

మిక్కిలి ధార్మికుడును, మహాతేజస్వియు ఐన ఆ ముని భయంకరరూపముతోనున్న ఆ రాజును జూచి, కనికరము చూపి. 'నీకు శుభమగుగాక' అనుచు ఇట్లు పలికెను.(14)

కిమాగమనకార్యం తే రాజపుత్ర మహాబల।
అయోధ్యాధిపతే వీర శాపాచ్చండాలతాం గతః। 15

అథ తద్వాక్యమాజ్ఞాయ రాజా చండాలతాం గతః।
అబ్రవీత్ ప్రాంజలిర్వాక్యం వాక్యజ్ఞో వాక్యకోవిదమ్। 16

ప్రత్యాఖ్యాతోఽస్మి గురుణా గురుపుత్రైస్తథైవ చ।
అనవాప్యైవ తం కామం మయా ప్రాప్తో విపర్యయః। 17

సశరీరో దివం యాయామ్ ఇతి మే సౌమ్య దర్శనమ్।
మయా చేష్టం క్రతుశతం తచ్చ నావాప్యతే ఫలమ్। 18

అనృతం నోక్తపూర్వం మే న చ వక్ష్యే కదాచన।
కృచ్ఛ్రేష్వపి గత స్సౌమ్య క్షత్రధర్మేణ తే శపే। 19

యజ్ఞైర్బహువిధై రిష్టం ప్రజా ధర్మేణ పాలితాః।
గురవశ్చ మహాత్మానః శీలవృత్తేన తోషితాః। 20

ధర్మే ప్రయతమానస్య యజ్ఞం చాహర్తుమిచ్ఛతః।
పరితోషం న గచ్ఛంతి గురవో మునిపుంగవ। 21

దైవమేవ పరం మన్యే పౌరుషం తు నిరర్థకమ్।
దైవేనాక్రమ్యతే సర్వం దైవం హి పరమా గతిః। 22

తస్య మే పరమార్తస్య ప్రసాదమభికాంక్షతః।
కర్తుమర్హసి భద్రం తే దైవోపహతకర్మణః। 23

నాన్యాం గతిం గమిష్యామి నాన్యచ్ఛరణమస్తి మే।
దైవం పురుషకారేణ నివర్తయితుమర్హసి। 24

మహాబలశాలివైన ఓ రాజా! నీవు వచ్చిన పనియేమి ? వీరుడవైన ఓ అయోధ్యాపతీ! ఏవరిశాపమువలన నీకు ఈ చండాలత్వము దాపురించినది ? (15)

పెద్దలతో మాట్లాడుటలో కుశలుడైన ఆ రాజు మహర్షి మాటలను విని, అంజలిఘటించి, తనకు చండాలత్వము ప్రాప్తించుటకు కారణమైన శాపమునుగూర్చి వాక్చాతుర్యము గల విశ్వామిత్రునకు ఇట్లు వివరింపసాగెను. (16)

"సశరీర స్వర్గప్రాప్తి కలుగవలెనను నా కోరికను గురువైన వసిష్ఠుడును, ఆయనకుమారులును తిరస్కరించిరి. ఆ కోరిక నెఱవేఱలేదు సరిగదా! దానికి తోడు గురు పుత్రులశాపకారణముగా నాకు ఈ చండాలరూపము ప్రాప్తించినది- ఓ సౌమ్యుడా! ఈ శరీరముతో స్వర్గమును పొందవలెననువాంఛతో నూఱుయజ్ఞములను ఆచరించితిని. ఆ యజ్ఞఫలముగూడ నాకు దక్కలేదు. (17-18)

ఓ మహాత్మా! నా క్షత్రియధర్మముపై ఆన. ఎట్టి క్లిష్ట పరిస్థితులలోను ఇంతవఱకును నేను ఎన్నడును అసత్యమును పలికియుండలేదు. ఇకముందు పలుకబోను. అనేకవిధములగు యజ్ఞములను ఆచరించితిని. ప్రజలను ధర్మమును అనుసరించి పరిపాలించితిని. గురువులును, మహాత్ములును, నా సద్గుణములకును, సదాచారములకును ఎంతయు సంతసించిరి. (19-20)

ఓ మునీశ్వరా! ధర్మమార్గమున సంచరించుచు నేను యజ్ఞముచేయ సంకల్పించితిని. అందులకు వారు సుముఖత చూపలేదు. దీనినిబట్టిచూచినచో 'ఈశ్వరేచ్ఛయే తిరుగు లేనిది. దానిముందు పురుషప్రయత్నము తలవంచవలసినదే. సమస్తమూ దైవాధీనమే. ఇహపర సుఖములన్నింటికిని దైవమే శరణ్యము' అనితెలియుచున్నది. నేను మిక్కిలి ఆర్తుడను. దురదృష్టవంతుడను, నాకు దైవము అనుకూలమగునట్లు చేయుటకు మీరే సమర్థులు, మీకు పుణ్యముండును. ఇంక నేను ఇతరులను ఎవ్వరిని ఆశ్రయింపను. మీరుతప్ప నన్ను ఆదుకొనగలవారు ఎవ్వరునూ లేరు. నాయెడ అనుగ్రహమును చూపి, దైవమును నాకు అనుకూలముగా చేయుటకు అనగా నా అదృష్టమును పండించుటకు మీరే తగుదురు." (21-24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే అష్టపంచాశస్సర్గః (58)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబది ఎనిమిదవ సర్గము సమాప్తము

— * * * —

59. ఏబదితొమ్మిదియవసర్గము

త్రిశంకుని ప్రార్థనపై విశ్వామిత్రుడు 'నిన్ను సశరీరముగా స్వర్గమునకు పంపెదను' - అని అతనికి మాటఇచ్చుట - శిష్యులద్వారా మునులను అందఱిని ఆహ్వానించుట - తన ఆహ్వానమును తిరస్కరించినందులకు ఆతడు వసిష్ఠునిసుతులను, మహోదయుని శపించుట.

ఉక్తవాక్యం తు రాజానం కృపయా కుశికాత్మజః।
అబ్రవీన్మధురం వాక్యం సాక్షాచ్చండాలరూపిణమ్। 1

ఐక్ష్వాక స్వాగతం వత్స జానామి త్వాం సుధార్మికమ్।
శరణం తే భవిష్యామి మా భైషీ నృపపుంగవ। 2

అహమామంత్రయే సర్వాన్ మహర్షీన్ పుణ్యకర్మణః।
యజ్ఞసాహ్యకరాన్ రాజన్ తతో యక్ష్యసి నిర్వృతః। 3

గురుశాపకృతం రూపం యదిదం త్వయి వర్తతే।
అనేన సహ రూపేణ సశరీరో గమిష్యసి। 4

హస్తప్రాప్తమహం మన్యే స్వర్గం తవ నరాధిప।
యస్త్వం కౌశికమాగమ్య శరణ్యం శరణాగతః। 5

ఏవ ముక్త్వా మహాతేజాః పుత్రాన్ పరమధార్మికాన్।
వ్యాదిదేశ మహాప్రాజ్ఞాన్ యజ్ఞసంభారకారణాత్। 6

సర్వాన్ శిష్యాన్ సమాహూయ వాక్య మేతదువాచ హ।
సర్వాన్ ఋషిగణాన్ వత్సా ఆనయధ్వం మమాజ్ఞయా। 7

సశిష్యసుహృదశ్చైవ సర్త్విజస్సుబహుశ్రుతాన్।
యదన్యో వచనం బ్రూయాత్ మద్వాక్యబలచోదితః।
తత్సర్వమఖిలేనోక్తం మమాఖ్యేయమనాదృతమ్। 8

తస్య తద్వచనం శ్రుత్వా దిశో జగ్ముస్తదాజ్ఞయా।
ఆజగ్మురథ దేశేభ్యః సర్వేభ్యో బ్రహ్మవాదినః। 9

తే చ శిష్యాస్సమాగమ్య మునిం జ్వలితతేజసమ్।
ఊచుశ్చ వచనం సర్వే సర్వేషాం బ్రహ్మవాదినామ్। 10

శ్రుత్వా తే వచనం సర్వే సమాయాంతి ద్విజాతయః।
సర్వదేశేషు చాగచ్ఛన్ వర్జయిత్వా మహోదయమ్। 11

వాసిష్ఠం తచ్ఛతం సర్వం క్రోధపర్యాకులాక్షరమ్।
యదాహ వచనం సర్వం శృణు త్వం మునిపుంగవ। 12

ఈ విధముగా అర్థించిన రాజుపై కౌశికునకు జాలి కలిగెను. తనయెదుట చండాలరూపమునున్న ఆ రాజుతో ఋషి ఇట్లు అనునయవచనములను పలికెను. (1)

"నాయనా! ఇక్ష్వాకువంశనరేంద్రా! భయపడకుము. నీవు ధర్మాత్ముడవని నేనెఱుగుదును. నీకు నేను అండగానుందును. ఓ రాజా! యజ్ఞనిర్వహణకు సహాయపడు పుణ్యాత్ములైన మహర్షులనందఱిని ఆహ్వానింతును. అనంతరము నీవు నిశ్చింతగా యజ్ఞము చేయుము. గురుపుత్త్రులశాపమువలన వచ్చిన నీ చండాలరూపము ఇట్లేయున్నచో ఈ రూపముననే నిన్ను సశరీరముగా స్వర్గమునకు చేర్చెదను. (2-4)

ఓ నరేంద్రా! నీవు ఈ కౌశికుని (నా) కడకు వచ్చి, శరణుజొచ్చితివి. కనుక 'ఇక స్వర్గము నీ చేజిక్కినట్లే' యని తలంతును." (5)

మహాతేజస్వియైన విశ్వామిత్రుడు త్రిశంకువుతో ఇట్లు పలికినపిమ్మట ఆముని మిక్కిలి బుద్ధిశాలురును, పరమ ధార్మికులును ఐన తనపుత్త్రులను పిలిచి, 'యజ్ఞమునకు కావలసిన సామగ్రిని సమకూర్చుడు' అని ఆదేశించెను. (6)

పిదప శిష్యులను పిలిచి, వారితో ఇట్లు పల్కెను. "నాయనలారా! సకల - ఋషిగణములను, వారి శిష్యులను, మిత్త్రులను, ఋత్విజులను, సకలవేదశాస్త్రపండితులను నా ఆజ్ఞగా తీసికొనిరండు. నా ఆహ్వానమును అందుకొనిన వారిలో ఎవ్వరైనను ఉపేక్షాభావముతో నిందాపూర్వకముగా పలికినచో వారిమాటలను అన్నింటిని నాకు తెల్పుడు". (7-8)

విశ్వామిత్రునిశిష్యులు ఆయనమాటలను విని, ఆజ్ఞను శిరసా వహించి, అన్ని దిక్కులకును వెళ్ళిరి. ఆహ్వానమును అందుకొనిన బ్రహ్మవాదులు వెంటనే అచటికి విచ్చేసిరి. శిష్యులందఱును మిక్కిలి తేజస్వియైన మునికడకు వచ్చి, బ్రహ్మవేత్తలు పలికిన మాటలను ఆయనకు వినిపించిరి. (9-10)

మీ పిలుపునందుకొని, బ్రాహ్మణోత్తములందఱును వచ్చుచున్నారు. 'మహోదయుడు' - అను మునియును, వసిష్ఠుని కుమారులు నూరుమందియుతప్ప అందఱును విచ్చేయుచున్నారు. ఓ మునీశ్వరా! ఆ వసిష్ఠునికుమారులు కోపముతో పలికిన మాటలనన్నింటిని వినుడు. (11-12)

క్షత్రియో యాజకో యస్య చండాలస్య విశేషతః।
కథం సదసి భోక్తారో హవిస్తస్య సురర్షయః। 13

బ్రాహ్మణా వా మహాత్మానో భుక్త్వా చండాలభోజనమ్।
కథం స్వర్గం గమిష్యంతి విశ్వామిత్రేణ పాలితాః। 14

ఏతద్వచననైష్ఠుర్యమ్ ఊచుః సంరక్తలోచనాః।
వాసిష్ఠా మునిశార్దూల సర్వే తే సమహోదయాః। 15

తేషాం తద్వచనం శ్రుత్వా సర్వేషాం మునిపుంగవః।
క్రోధసంరక్తనయనః సరోషమిదమబ్రవీత్। 16

యే దూషయంత్యదుష్టం మాం తప ఉగ్రం సమాస్థితమ్।
భస్మీభూతా దురాత్మానో భవిష్యంతి న సంశయః। 17

అద్య తే కాలపాశేన నీతా వైవస్వతక్షయమ్।
సప్తజాతిశతాన్యేవ మృతపాస్సంతు సర్వశః। 18

శ్వమాంసనియతాహారా ముష్టికా నామ నిర్ఘృణాః।
వికృతాశ్చ విరూపాశ్చ లోకాననుచరంత్విమాన్। 19

మహోదయస్తు దుర్బుద్ధిః మామదూష్యం హ్యదూషయత్।
దూషితస్సర్వలోకేషు నిషాదత్వం గమిష్యతి। 20

ప్రాణాతిపాతనిరతో నిరనుక్రోశతాం గతః।
దీర్ఘకాలం మమ క్రోధాత్ దుర్గతిం వర్తయిష్యతి। 21

ఏతావదుక్త్వా వచనం విశ్వామిత్రో మహాతపాః।
విరరామ మహాతేజా ఋషిమధ్యే మహామునిః। 22

"యజ్ఞమును చేయువాడు చండాలుడు, చేయించెడివాడు క్షత్రియుడు. అట్టి యజ్ఞమునకు చెందిన హవిస్సులను దేవతలును, ఋషులును ఎట్లు స్వీకరింతురు? విశ్వామిత్రుని ఆదేశమునకు తలయొగ్గి, సదాచారమును విస్మరించి, చండాల భోజనమును స్వీకరించినచో వారు బ్రాహ్మణులేయైనను మహాత్ములేయైనను స్వర్గమునకు ఎట్లు చేరగలరు? ఓ మునివరా! మహోదయుడు, వసిష్ఠసుతులు (మొదలగు) వారందఱును కన్నులెఱ్ఱజేసి, ఇట్లు నిష్ఠురముగా పలికిరి." (13-15)

అంతట విశ్వామిత్రమహర్షి వారిమాటలను విని, క్రోధముతో మండిపడుచు కన్నులెఱ్ఱజేసి, ఇట్లనుడివెను. "తీవ్రముగా తపమునాచరించుచు పవిత్రముగానున్న నన్ను ఈ విధముగా దూషించిన ఆ దురాత్ములందఱును మసియైపోవుదురు. ఇందు సందేహములేదు. నేడే వారందఱును యమపాశముచే నరకమునకు ఈడ్వబడుదురు. ఇంకను ఏడువందలజన్మల వఱకు వారు శవములను భక్షించుచు బ్రతుకుదురు. మఱియు వారు 'ముష్టికులు' అను హీనజాతికి చెందిన క్రూరాత్ములై, కుక్కమాంసమును తినుచు జీవింతురు. వికృతవేషధారులై, నీచములైన మాటలతో చేష్టలతో ఈ లోకమునందు సంచరించుచుందురు. (16-19)

దురాత్ముడైన మహోదయుడు సజ్జనుడనైన నన్ను దూషించెను. కనుక అతడు కిరాతుడై జనులందఱిచే దూషింపబడును. కఠినాత్ముడై, ఎల్లప్పుడు సకలప్రాణులను హింసించుచు, చంపుచు బ్రతుకుచుండును. అతడు నా శాపప్రభావమున చిరకాలము దుర్గతుల పాలగును." (20-21)

మహాతపస్వియు, తేజస్వియు ఐన విశ్వామిత్ర మహాముని ఋషులసమక్షమున ఇట్లు పలికి మిన్నకుండెను. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకోనషష్టితమస్సర్గః (59)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు ఏబది తొమ్మిదియవసర్గము సమాప్తము

-- * * * --

60. అఱువదియవసర్గము

విశ్వామిత్రుడు త్రిశంకువును స్వర్గమునకు పంపుట, ఇంద్రాదులు అతనిని స్వర్గమున ప్రవేశింపనీయక త్రోసివేయుట. విశ్వామిత్రుడు త్రిశంకువుకొఱకు మఱియొకస్వర్గమును సృష్టించి, అందు అతనిని నిలుపుట.

తపోబలహతాన్ కృత్వా వాసిష్ఠాన్ సమహోదయాన్।
ఋషిమధ్యే మహాతేజా విశ్వామిత్రోఽభ్యభాషత। 1

మహాతేజస్వియగు విశ్వామిత్రుడు వసిష్ఠపుత్రులను, మహోదయుని తనతపోబలముచే దెబ్బతీసిన పిమ్మట ఋషులందఱును వినుచుండగా ఇట్లనుడివెను. (1)

అయ మిక్ష్వాకుదాయాదః త్రిశంకురితి విశ్రుతః।
ధర్మిష్ఠశ్చ వదాన్యశ్చ మాం చైవ శరణం గతః। 2

"'త్రిశంకువు' అను పేరుతో సుప్రసిద్ధుడైన ఇతడు ఇక్ష్వాకు వంశజుడు, ధార్మికుడు, దానశీలుడు. పూర్వము క్షత్రియ రూపమున ఉన్నవాడు. ప్రస్తుతము శాపకారణముగ చండాల రూపమును పొందియున్నవాడు. అట్టి ఇతడు సశరీరముగా స్వర్గమునకు జేరి, దానిని వశపఱచుకొనవలయునను కోరికతో నన్ను ఆశ్రయించెను. (2)

తేనానేన శరీరేణ దేవలోకజిగీషయా।
యథాయం స్వశరీరేణ స్వర్గలోకం గమిష్యతి।
తథా ప్రవర్త్యతాం యజ్ఞో భవద్భిశ్చ మయా సహ। 3

యజ్ఞప్రభావమున ఇతడు తన (ఈ) శరీరముతోడనే స్వర్గమునకు చేరునట్లుగా మనము ఒక క్రతువును నిర్వహింపవలెను." (3)

విశ్వామిత్రవచః శ్రుత్వా సర్వ ఏవ మహర్షయః।
ఊచుస్సమేత్య సహితా ధర్మజ్ఞా ధర్మసంహితమ్। 4

అచ్చట చేరియున్న ధర్మజ్ఞులైన ఋషులందఱును విశ్వామిత్రుని మాటలను విని, తమలో తాము ఇట్లు అనుకొనిరి. (4)

అయం కుశికదాయాదో మునిః పరమకోపనః। 5

యదాహ వచనం సమ్యక్ ఏతత్కార్యం న సంశయః।
అగ్నికల్పో హి భగవాన్ శాపం దాస్యతి రోషితః। 6

తస్మాత్ ప్రవర్త్యతాం యజ్ఞః సశరీరో యథా దివమ్।
గచ్ఛేదిక్ష్వాకుదాయాదో విశ్వామిత్రస్య తేజసా।
తథా ప్రవర్త్యతాం యజ్ఞః సర్వే సమధితిష్ఠత। 7

"కుశికవంశజుడైన ఈ విశ్వామిత్రముని ముక్కోపి. ఆయన చెప్పినట్లుగనే చేయుదము. వెనుకాడవలదు. పూజ్యుడైన ఆ మహర్షి నిప్పువంటివాడు, ఆయనకు కోపమువచ్చినచో శపింపగలడు. అందువలన యజ్ఞమును నిర్వహింతము. విశ్వామిత్రునితేజఃప్రభావమున ఇక్ష్వాకువంశమువాడైన ఈ త్రిశంకువు సశరీరుడై స్వర్గమునకు చేరునట్లు క్రతువును నడుపుదము. అందఱును తమతమపనులను ప్రారంభింతురు గాక." (5-7)

ఏవముక్త్వా మహర్షయః చక్రుస్తాస్తాః క్రియాస్తదా।
యాజకశ్చ మహాతేజా విశ్వామిత్రోఽభవత్ క్రతౌ। 8

మహర్షులందఱును తమలో తాము ఇట్లనుకొని, తమతమ పనులను చేయసాగిరి. మహాతేజస్వియగు విశ్వామిత్రుడును ఆ క్రతువునకు యాజకత్వమును వహించెను. (8)

ఋత్విజస్త్వానుపూర్వ్యేణ మంత్రవన్మంత్రకోవిదాః।
చక్రుః కర్మాణి సర్వాణి యథాకల్పం యథావిధి। 9

వేదమంత్రములను బాగుగానేర్చిన ఋత్విజులు క్రమముగా మంత్రయుక్తముగా కల్పోక్తప్రకారము విధ్యుక్తములైన సమస్త కర్మలను ఆచరించిరి. (9)

తతః కాలేన మహతా విశ్వామిత్రో మహాతపాః। 10

చకారావాహనం తత్ర భాగార్థం సర్వదేవతాః।
నాభ్యాగమం స్తదాహూతా భాగార్థం సర్వదేవతాః। 11

అంతట మహాతపస్వియైన విశ్వామిత్రుడు చాలాకాలము మంత్రములను ఆవృత్తిచేయుచు, యజ్ఞహవిర్భాగములను స్వీకరించుటకై సకలదేవతలను ఆవాహనము చేసెను. కాని అప్పుడు ఆహూతులైన దేవతలెవ్వరును హవిర్భాగములకై రారైరి. (10-11)

తతః క్రోధసమావిష్టో విశ్వామిత్రో మహామునిః।
స్రువముద్యమ్య సక్రోధః త్రిశంకుమ్ ఇదమబ్రవీత్। 12

పశ్య మే తపసో వీర్యం స్వార్జితస్య నరేశ్వర।
ఏష త్వాం సశరీరేణ నయామి స్వర్గమోజసా। 13

దుష్ప్రాపం సశరీరేణ దివం గచ్ఛ నరాధిప।
స్వార్జితం కించిదప్యస్తి మయా హి తపసః ఫలమ్।
రాజన్ స్వతేజసా తస్య సశరీరో దివం వ్రజ। 14

ఉక్తవాక్యే మునౌ తస్మిన్ సశరీరో నరేశ్వరః।
దివం జగామ కాకుత్స్థ మునీనాం పశ్యతాం తదా। 15

దేవలోకగతం దృష్ట్వా త్రిశంకుం పాకశాసనః।
సహ సర్వైస్సురగణైః ఇదం వచనమబ్రవీత్। 16

త్రిశంకో గచ్ఛ భూయస్త్వం నాసి స్వర్గకృతాలయః।
గురుశాపహతో మూఢ పత భూమిమవాక్శిరాః। 17

ఏవముక్తో మహేంద్రేణ త్రిశంకురపతత్ పునః।
విక్రోశమానః త్రాహీతి విశ్వామిత్రం తపోధనమ్। 18

తచ్ఛ్రుత్వా వచనం తస్య క్రోశమానస్య కౌశికః।
రోషమాహారయత్ తీవ్రం తిష్ఠ తిష్ఠేతి చాబ్రవీత్। 19

ఋషిమధ్యే స తేజస్వీ ప్రజాపతిరివాపరః।
సృజన్ దక్షిణమార్గస్థాన్ సప్తర్షీన్ అపరాన్ పునః। 20

నక్షత్రమాలామ్ అపరామ్ అసృజత్ క్రోధమూర్ఛితః।
దక్షిణాం దిశమాస్థాయ మునిమధ్యే మహాయశాః। 21

సృష్ట్వా నక్షత్రవంశం చ క్రోధేన కలుషీకృతః।
అన్యమింద్రం కరిష్యామి లోకో వాస్యాదనింద్రకః।
దైవతాన్యపి స క్రోధాత్ స్రష్టుం సముపచక్రమే। 22

తతః పరమసంభ్రాంతాః సర్షిసంఘాః సురాసురాః।
విశ్వామిత్రం మహాత్మానమ్ ఊచుః సానునయం వచః। 23

అంతట విశ్వామిత్రమహాముని కోపముతో ఊగిపోవుచు స్రువమును పైకెత్తి (దేవతలు దానందులకు) మండిపడుచు త్రిశంకువుతో ఇట్లనుడివెను. (12)

"ఓ నరేంద్రా! నా తీవ్రతపశ్శక్తిని చూడుము. ఇదిగో నా తపఃప్రభావమున సశరీరముగా నిన్ను స్వర్గమునకు పంపెదను. ఓ రాజా! దుర్లభమైన స్వర్గమును సశరీరుడవై చేరుము. రాజా! నేను పెక్కు కష్టములకోర్చి సంపాదించిన తపఃఫలము ఏ మాత్రము ఉన్నను తత్ప్రభావమున నీవు సశరీరముగా స్వర్గమును పొందగలవు." (13-14)

ఓ రామా! ఆ మహర్షి అట్లు పలికిన వెంటనే త్రిశంకు ప్రభువు అక్కడి మునులందరును చూచుచుండగా స్వర్గమునకు వెళ్లెను. (15)

స్వర్గలోకమునకు వచ్చిన త్రిశంకువును జూచి, ఇంద్రుడు సర్వదేవతలసమక్షమున ఆయనతో ఇట్లు వచించెను. (16)

"ఓ త్రిశంకూ! మరలిపొమ్ము. మూర్ఖుడా! నీవు గురువుచే శపింపబడితివి. కనుక స్వర్గవాసమునకు అనర్హుడవు. తలక్రిందులుగా భూమిపై పడిపొమ్ము." (17)

దేవేంద్రుడు ఇట్లు తనస్వర్గప్రవేశమును నిరోధింపగా త్రిశంకువు 'రక్షింపుము రక్షింపుము' అని తపోధనుడైన విశ్వామిత్రునకు మొఱపెట్టుకొనుచు దివినుండి భువికి పడిపోవుచుండెను. అంతట దైన్యముతో తనకు మొఱపెట్టుకొనుచున్న త్రిశంకువచనములను విని కౌశికుడు మిక్కిలి క్రుద్ధుడై, 'ఆగుము ఆగుము' అని అతనితో పలికెను. (18-19)

పిమ్మట తేజస్వియైన విశ్వామిత్రుడు తనచుట్టును ఋషులు చేరియుండగా 'మఱియొక సృష్టికర్తయా!' అనునట్లు దక్షిణ మార్గమునందుండునట్లుగా మఱియొక సప్తర్షిమండలమును సృజించెను. (20)

మహాయశస్వియు మునులచే పరివృతుడును ఐన విశ్వామిత్రుడు క్రోధావేశపూరితుడై దక్షిణదిశయందు మఱియొక సప్తవింశతి నక్షత్రమండలమును ఏర్పఱచెను. (21)

ఆ విధముగా నక్షత్రమండలమును సృజించిన పిమ్మట క్రోధాతిరేకముతో బుద్ధివైపరీత్యమునకు లోనైన విశ్వామిత్రుడు 'నేను సృష్టించిన ఈ స్వర్గమునకు మఱియొక ఇంద్రుని సృజించెదను, లేదా ఆ స్వర్గమును ఇంద్రరహితముగా జేసెదను'- అని పలుకుచు క్రోధోద్రేకముతో ఇతరదేవతలను సృష్టించుటకు పూనుకొనెను. (ఈ కృత్రిమ స్వర్గమున త్రిశంకువే ఇంద్రుడు. అతని పరివారమే (అనుచరులే) దేవతలు.) (22)

అప్పుడు సమస్త-ఋషులు, సురాసురులు సంభ్రమాశ్చర్యములకు లోనై, మహాత్ముడగు విశ్వామిత్రుని శాంతపఱచుచు ఇట్లు నుడివిరి. (23)

అయం రాజా మహాభాగ గురుశాపపరిక్షతః।
సశరీరో దివం యాతుం నార్హత్యేవ తపోధన। 24

"ఓ తపోధనా! మహానుభావా! ఈ త్రిశంకుప్రభువు గురువుచే శపింపబడెను. కనుక ఇతడు సశరీరముగా స్వర్గమును చేరుటకు అనర్హుడు." (24)

తేషాం తద్వచనం శ్రుత్వా దేవానాం మునిపుంగవః।
అబ్రవీత్ సుమహద్వాక్యం కౌశిక స్సర్వదేవతాః। 25

ఆ దేవతలమాటలను విన్నపిమ్మట విశ్వామిత్రమహాముని వారితో ఒక ముఖ్యవిషయమును ప్రస్తావించెను. (25)

సశరీరస్య భద్రం వః త్రిశంకోరస్య భూపతేః।
ఆరోహణం ప్రతిజ్ఞాయ నానృతం కర్తుముత్సహే। 26

స్వర్గో౽స్తు సశరీరస్య త్రిశంకోరస్య శాశ్వతః।
నక్షత్రాణి చ సర్వాణి మామకాని ధ్రువాణ్యథ। 27

యావల్లోకా ధరిష్యంతి తిష్ఠంత్వేతాని సర్వశః।
మత్కృతాని సురాస్సర్వే తదనుజ్ఞాతుమర్హథ। 28

"ఓ దేవతలారా! మీకు శుభమగుగాక. 'ఈ త్రిశంకు మహారాజును సశరీరముగా స్వర్గమునకు పంపెదను'-అని ప్రతిజ్ఞచేసియుంటిని. ప్రతిజ్ఞాభంగమునకు ఒడికట్టజాలను. ప్రస్తుతము ఈ త్రిశంకువు సశరీరుడైయున్న అంతరిక్ష ప్రదేశమే ఆయనకు శాశ్వతస్వర్గమగుగాక. నేను సృష్టించిన నక్షత్రములన్నియును స్థిరముగానుండును. లోకములు అన్నియును నిలిచియున్నంతవఱకు నేను సృజించిన వస్తువులన్నియును శాశ్వతముగానుండును. అందులకు సమస్త దేవతలును అనుమతింతురుగాక." (26-28)

ఏవముక్తాస్సురా స్సర్వే ప్రత్యూచుర్మునిపుంగవమ్।
ఏవం భవతు భద్రం తే తిష్ఠంత్వేతాని సర్వశః। 29

గగనే తాన్యనేకాని వైశ్వానరపథాద్బహిః।
నక్షత్రాణి మునిశ్రేష్ఠ తేషు జ్యోతిష్షు జాజ్వలన్। 30

అవాక్ఛిరాస్త్రిశంకుశ్చ తిష్ఠత్వమరసన్నిభః। 31

విశ్వామిత్రుడు ఇట్లు పలుకగా దేవతలు ఆ మునితో ఈ విధముగా నుడివిరి. "ఓ మునివరా! అట్లేకానిండు నీకు శుభమగుగాక. మీరు సృష్టించిన ఈ నక్షత్రములన్నియును ఆకాశమున జ్యోతిశ్చక్రమునకు వెలుపల అంతటను ఉండుగాక - ఆ నక్షత్రములమధ్య ప్రకాశించుచు దేవతలతో సమానుడై, గురువునకు ఒనర్చిన అపచారఫలితముగా త్రిశంకువు అధోముఖుడై యుండుగాక. (29-31)

అనుయాస్యంతి చైతాని జ్యోతీంషి నృపసత్తమమ్।
కృతార్థం కీర్తిమంతం చ స్వర్గలోకగతం యథా। 32

నక్షత్రములు ధ్రువుని అనుసరించినట్లుగా మీచే సృజింపబడిన ఈ నక్షత్రములు స్వర్గమును పొంది, కృతార్థుడై ఖ్యాతివహించిన ఈ నరేంద్రుని అనుసరించును." (32)

విశ్వామిత్రస్తు ధర్మాత్మా సర్వదేవైరభిష్టుతః।
ఋషిభిశ్చ మహాతేజా బాఢమిత్యాహ దేవతాః। 33

పిమ్మట సమస్తదేవతలును, అచటనున్న ఋషులును మహాత్ముడైన విశ్వామిత్రుని ప్రస్తుతించిరి. అంతట ఆ తేజస్వి 'మంచిది. సరే!' అని దేవతలతో నుడివెను. (33)

తతో దేవా మహాత్మానో మునయశ్చ తపోధనాః।
జగ్ముర్యథాగతం సర్వే యజ్ఞస్యాంతే నరోత్తమ। 34

ఓ రామా! విశ్వామిత్రుని యాజమాన్యమున యజ్ఞము పరిసమాప్తమయ్యెను. అనంతరము మహాత్ములైన దేవతలును, తపోధనులైన మునులును తమతమ స్థానములకు బయలుదేఱిరి. (34)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షష్టితమస్సర్గః *(60)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదియవసర్గము సమాప్తము

-- * * * --

61. అఱువదియొకటవసర్గము

విశ్వామిత్రుడు పుష్కరతీర్థమున తపమొనరించుట - అంబరీషుడు శునశ్శేపుని యజ్ఞపశువుగా గొనిపోవుట.

విశ్వామిత్రో మహాత్మాఽథ ప్రస్థితాన్ ప్రేక్ష్య తాన్ ఋషీన్।
అబ్రవీన్నరశార్దూల సర్వాంస్తాన్ వనవాసినః। 1

మహాన్ విఘ్నః ప్రవృత్తోఽయం దక్షిణామాస్థితో దిశమ్।
దిశమన్యాం ప్రపత్స్యామః తత్ర తప్స్యామహే తపః। 2

పశ్చిమాయాం విశాలాయాం పుష్కరేషు మహాత్మనః।
సుఖం తపశ్చరిష్యామః పరం తద్ధి తపోవనమ్। 3

ఏవముక్త్వా మహాతేజాః పుష్కరేషు మహామునిః।
తప ఉగ్రం దురాధర్షం తేపే మూలఫలాశనః। 4

ఏతస్మిన్నేవ కాలే తు అయోధ్యాధిపతిర్నృపః।
అంబరీష ఇతి ఖ్యాతో యష్టుం సముపచక్రమే। 5

తస్య వై యజమానస్య పశుమింద్రో జహార హ।
ప్రణష్టే తు పశౌ విప్రో రాజానమ్ ఇదమబ్రవీత్। 6

పశురద్య హృతో రాజన్ ప్రణష్టస్తవ దుర్నయాత్।
అరక్షితారం రాజానం ఘ్నంతి దోషా నరేశ్వర। 7

ప్రాయశ్చిత్తం మహద్ధ్యేతత్ నరం వా పురుషర్షభ।
ఆనయస్వ పశుం శీఘ్రం యావత్ కర్మ ప్రవర్తతే। 8

ఉపాధ్యాయవచః శ్రుత్వా స రాజా పురుషర్షభః।
అన్వియేష మహాబుద్ధిః పశుం గోభిః సహస్రశః। 9

దేశాన్ జనపదాం స్తాం స్తాన్ నగరాణి వనాని చ।
ఆశ్రమాణి చ పుణ్యాని మార్గమాణో మహీపతిః। 10

స పుత్రసహితం తాత సభార్యం రఘునందన।
భృగుతుంగే సమాసీనమ్ ఋచీకం సందదర్శ హ। 11

ఓ నరవరా! రామా! మహాత్ముడైన విశ్వామిత్రుడు తనఆజ్ఞను అనుసరించివచ్చిన ఋషులందఱును తమతమ నివాసములకు బయలుదేఱివెళ్ళగా, అచటి వనవాసులందఱితో ఇట్లనెను.(1)

"ఓ మహాత్ములారా! ఈ దక్షిణదిశయందు ప్రారంభించిన తపస్సునకు తీవ్రమైన విఘ్నము ఏర్పడినది. కనుక మఱియొక దిశకు పోదము. అచట తపస్సును ఆచరింతము. విశాలమైన పశ్చిమ దిశయందు మూడు బ్రహ్మతీర్థములు గలవు. ఆ పుష్కర తీర్థములయందు చక్కని తపోవనములు గలవు. అచట నిశ్చింతగా తపస్సులను ఆచరింతము." (2-3)

మహాతేజశ్శాలియైన విశ్వామిత్రుడు ఇట్లు పలికి, పశ్చిమ దిశయందుగల పుష్కరతీర్థములకు చేరెను. అచట అతడు ఫలమూలములను ఆహారముగాగొనుచు, ఇతరులకు అశక్యమైన తీవ్రతపస్సును ఆచరించెను. (4)

ఇదే సమయమున అయోధ్యాధిపతిగా విఖ్యాతుడైన అంబరీష మహారాజు ఒకయజ్ఞమును ప్రారంభించెను. (5)

ఇంతలో ఆ అంబరీషుని యజ్ఞపశువును ఇంద్రుడు అపహరించుకొని పోయెను. యజ్ఞపశువు అపహరింపబడగా పురోహితుడు రాజుతో ఇట్లు పలికెను. (6)

'ఓ మహారాజా! మీ ఏమఱుపాటువలన యజ్ఞపశువును ఎవరో దొంగిలించిరి. అది కనబడుట లేదు. యజ్ఞపశువును రక్షింపలేకపోవుటవంటివి మహాదోషములు. అవి యజమానిని హతమార్చును. ఓ నరేంద్రా! ఈ యజ్ఞమును కొనసాగింప వలెనన్న హరింపబడిన యజ్ఞపశువును వెంటనే తెప్పింపుము, లేదా! గోవులను ప్రతిఫలముగానిచ్చి, దానికి ప్రతినిధిగా ఒక నరుని ఏర్పాటుచేయుము. అందులకు ఇదియే ప్రాయశ్చిత్తము."(7-8)

ప్రజ్ఞాశాలియు, మహాపురుషుడును ఐన అంబరీషుడు పురోహితునివచనములను విని, వేలకొలదిగోవులను ప్రతి ఫలముగా ఇచ్చి, ఒక మానవుని యజ్ఞపశువుగా పొందుటకు వెదకనారంభించెను. (9)

క్రమముగా ఆ మహారాజు వివిధములగుదేశములు, గ్రామములు, నగరములు, వనములు, పవిత్రములగు ఆశ్రమములు, మొదలగు వాటియందు యజ్ఞపశుప్రతినిధికై అన్వేషింపసాగెను. (10)

నాయనా! రామా! ఆ రాజు తిన్నగా భృగుతుంగ పర్వతమునకు చేరెను. అచట భార్యాపుత్రులతో సుఖాసీనుడై యున్న ఋచీకమహర్షిని దర్శించెను. (11)

తమువాచ మహాతేజాః ప్రణమ్యాభిప్రసాద్య చ।
బ్రహ్మర్షిం తపసా దీప్తం రాజర్షిరమితప్రభః॥ 12

పృష్ట్వా సర్వత్ర కుశలమ్ ఋచీకం తమిదం వచః।
గవాం శతసహస్రేణ విక్రీణీషే సుతం యది॥ 13

పశోరర్థే మహాభాగ కృతకృత్యోఽస్మి భార్గవ।
సర్వే పరిసృతా దేశా యాజ్ఞియం న లభే పశుమ్।
దాతుమర్హసి మూల్యేన సుతమేకమితో మమ॥ 14

ఏవముక్తో మహాతేజా ఋచీకస్త్వబ్రవీద్వచః।
నాహం జ్యేష్ఠం నరశ్రేష్ఠ విక్రీణీయాం కథంచన॥ 15

ఋచీకస్య వచః శ్రుత్వా తేషాం మాతా మహాత్మనామ్।
ఉవాచ నరశార్దూలమ్ అంబరీషం తపస్వినీ॥ 16

అవిక్రేయం సుతం జ్యేష్ఠం భగవానాహ భార్గవః॥ 17

మమాపి దయితం విద్ధి కనిష్ఠం శునకం నృప।
తస్మాత్ కనీయసం పుత్త్రం న దాస్యే తవ పార్థివ॥ 18

ప్రాయేణ హి నరశ్రేష్ఠ జ్యేష్ఠాః పితృషు వల్లభాః।
మాతౄణాం తు కనీయాంసః తస్మాద్రక్షే కనీయసమ్॥ 19

ఉక్తవాక్యే మునౌ తస్మిన్ మునిపత్న్యాం తథైవ చ।
శునశ్శేఫః స్వయం రామ మధ్యమో వాక్యమబ్రవీత్॥ 20

పితా జ్యేష్ఠమ్ అవిక్రేయం మాతా చాహ కనీయసమ్।
విక్రీతం మధ్యమం మన్యే రాజన్ పుత్త్రం నయస్వ మామ్॥ 21

గవాం శతసహస్రేణ శునశ్శేఫం నరేశ్వరః।
గృహీత్వా పరమప్రీతో జగామ రఘునందన॥ 22

అంబరీషస్తు రాజర్షీ రథమారోప్య సత్వరః।
శునశ్శేఫం మహాతేజా జగామాశు మహాయశాః॥ 23

మిక్కిలి తేజస్వియు, ప్రతిభాశాలియు ఐన ఆ మహారాజు తపస్తేజస్సుతో ప్రకాశించుచున్న ఋచీకునకు నమస్కరించి, ఆయనను ప్రసన్నునిగా జేసికొనెను. కుశలప్రశ్నలన్నియును ముగిసినపిమ్మట రాజు ఆ బ్రహ్మర్షితో ఇట్లనెను. "భృగు వంశజుడవైన ఓ మహానుభావా! నీకు లక్షగోవులను సమర్పించెదను. వాటికి మారుగా యజ్ఞపశువుగా నీ కుమారుని నాకు విక్రయించినచో నేను కృతార్థుడనగుదును. నేను దేశములన్నింటిని గాలించితిని. కాని యజ్ఞపశువు లభింపలేదు. తగినమూల్యమును తీసికొని, నీ కుమారులలో ఒకనిని నాకిమ్ము." (12-14)

అంబరీషునిప్రార్థనను విని, మహాతేజస్వియగు ఋచీకుడు "ఓ నరేంద్రా! నా పెద్దకుమారునిమాత్రము ఏట్టి పరిస్థితులలోను నేను అమ్మజాలను" - అని ప్రత్యుత్తరమిచ్చెను. (15)

ఆ ఋషికుమారులకు జననియు, మహాతపస్వినియు ఐన ఋచీకునిపత్ని ఆ ముని (తనభర్త) పలికిన మాటలను విని, మహారాజైన అంబరీషునితో ఇట్లనెను. (16)

"ఓ రాజా! పూజ్యుడైన భార్గవుడు (నా భర్త) 'పెద్దకుమారుని అమ్మజాలను' అని పలికెను. నాకయితే చిన్నకుమారుడైన శునకుడు ఆరవప్రాణము" - కనుక నా ఋషికుమారుని మాత్రము నీకు ఇయ్యజాలను. (17-18)

రాజా! సాధారణముగా లోకములో తండ్రులకు పెద్ద కుమారులపై ప్రీతిమెండు. తల్లులకు చిన్నకుమారులపై మక్కువ ఎక్కువ. కనుక నేను నా కనిష్ఠపుత్త్రుని ఇయ్యలేను. (19)

ఓ రామా! ఆమునియు, ఆయనపత్నియు ఇట్లు పలికిన పిమ్మట ఆ ఋషికుమారులలో నడిమివాడైన 'శునశ్శేపుడు' స్వయముగా ఇట్లనుడివెను. (20)

"ఓ మహారాజా! మా తండ్రిగారేమో పెద్దకుమారుని అమ్మరు. మా జననియేమో చిన్నవానిని విక్రయింపదు. పరిశేష న్యాయమును అనుసరించి, వారు మధ్యముడనైన నన్ను అమ్మివేసినట్లు తలంతును. కనుక నన్ను గొనిపొమ్ము." (21)

ఓ రఘునందనా! మహారాజు ఋచీకునకు లక్షగోవులను సమర్పించి, పరమసంతోషముతో శునశ్శేపుని స్వీకరించి, గృహోన్ముఖుడయ్యెను. (22)

మహాతేజస్వియు,సుప్రసిద్ధుడును, రాజర్షియు ఐన అంబరీషుడు రథముపై శునశ్శేపుని కూర్చుండబెట్టుకొని, శీఘ్రముగా తననగరమునకు బయలుదేరెను. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకషష్టితమస్సర్గః *(61)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదియొకటవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

62. అఱువదిరెండవసర్గము

శునశ్శేపుడు విశ్వామిత్రునిఅనుగ్రహముతో ప్రాణప్రమాదమునుండి బయటపడుట - ఇంద్రునివలన దీర్ఘాయువుగాంచుట.

శునశ్శేఫం నరశ్రేష్ఠ గృహీత్వా తు మహాయశాః।
వ్యశ్రామ్యత్ పుష్కరే రాజా మధ్యాహ్నే రఘునందన। 1

తస్య విశ్రమమాణస్య శునశ్శేఫో మహాయశాః।
పుష్కరక్షేత్రమాగమ్య విశ్వామిత్రం దదర్శ హ। 2

తప్యంతమ్ ఋషిభి స్సార్ధం మాతులం పరమాతురః।
విషణ్ణవదనో దీనః తృష్ణయా చ శ్రమేణ చ।
పపాతాంకే మునేరాశు వాక్యం చేద ముపాచ హ। 3

న మేఽస్తి మాతా న పితా జ్ఞాతయో బాంధవాః కుతః। 4

త్రాతుమర్హసి మాం సౌమ్య ధర్మేణ మునిపుంగవ।
త్రాతా త్వం హి మునిశ్రేష్ఠ సర్వేషాం త్వం హి భావనః। 5

రాజా చ కృతకార్యః స్యాత్ అహం దీర్ఘాయురవ్యయః।
స్వర్గలోకముపాశ్నీయాం తపస్తప్త్వాహ్యనుత్తమమ్। 6

త్వం మే నాథో హ్యనాథస్య భవ భవ్యేన చేతసా।
పితేవ పుత్రం ధర్మాత్మన్ త్రాతుమర్హసి కిల్బిషాత్। 7

తస్య తద్వచనం శ్రుత్వా విశ్వామిత్రో మహాతపాః।
సాంత్వయిత్వా బహువిధం పుత్రానిదముపాచ హ। 8

యత్కృతే పితరః పుత్రాన్ జనయంతి శుభార్థినః।
పరలోకహితార్థాయ తస్య కాలోఽయ మాగతః। 9

నరశ్రేష్ఠుడవైన ఓ రఘునందనా! సుప్రసిద్ధుడగు అంబరీష మహారాజు శునశ్శేపునివెంటబెట్టుకొని వెళ్లుచు మధ్యాహ్న సమయమగుటచే పుష్కరక్షేత్రసమీపమున విశ్రమించెను. (1)

ఆ మహారాజు విశ్రాంతితీసికొనుచుండగా, వాసిగాంచిన తాను యజ్ఞపశువుగా కొనిపోబడు చున్నందులకు దుఃఖితుడై యున్న శునశ్శేపుడు పుష్కరక్షేత్రమునకు వచ్చెను. అచట ఋషీశ్వరులతోగూడి తపమాచరించుచున్న తనమేనమామయగు విశ్వామిత్రుని జూచెను. మార్గాయాసముచే, దాహముచే దీనుడై బిక్కమొగముతోనున్న శునశ్శేపుడు బావురుమనుచు మేనమామ యొడిలో వాలెను. అనంతరము అతడు ఇట్లనెను. (2-3)

"దయాళుడవైన ఓ మునీశ్వరా! నాకు ఆపదవచ్చిపడినది. తల్లిదండ్రులుగాని, జ్ఞాతులుగాని, బంధువులుగాని నన్ను ఆదుకొనువారుకారైరి. ఇప్పుడిక నాకు మీరే దిక్కు. ధర్మబుద్ధితో నన్ను కాపాడుడు. ఓ మహర్షీ! నీవు అందఱిహితమును గోరువాడవు, రక్షకుడవు. (4-5)

యజ్ఞము పూర్తియై, మహారాజుగారు కృతార్థుడగునట్లుగను. నేను దీర్ఘాయురారోగ్యములు కలవాడనై, ఉత్తమమైన తపస్సును ఆచరించి, స్వర్గలోకమును పొందునట్లుగను దయచూపుడు. ఓ ధర్మాత్మా! నిస్సహాయస్థితిలోనున్న నన్ను పెద్దమనస్సుతో నీవే రక్షింపుము. తండ్రి కుమారునివలె నా పాపఫలితమైన ఈ ఆపదనుండి నన్ను కాపాడుము."(6-7)

మహాతపస్వియైన విశ్వామిత్రుడు శునశ్శేపునిమాటను ఆలకించి, అతనిని పెక్కురీతుల ఓదార్చి, పిమ్మట తన పుత్రులతో ఇట్లనెను. (8)

"పుత్రులారా! తలిదండ్రులు తాము జీవించియున్నంత వఱకు తమమాటను పాటించుటకును, మరణానంతరము తమకు 'పున్నామ' నరకము లేకుండ చేయుటకును, మఱియు పరలోకహితములు చేకూర్చుటకును పుత్రులను బడయు చుందురు. ఇప్పుడు మీకు పుత్రధర్మమును[1] నిర్వహింప వలసిన సమయము ఆసన్నమైనది. (9)

1) శ్లో॥ జీవతో వాక్యకరణాత్, ప్రత్యబ్దం భూరి భోజనాత్। గయాయాం పిండదానేన త్రిభిః పుత్రస్య పుత్రతా॥
తల్లిదండ్రులు బ్రతికియున్నంతకాలము వారు చెప్పినట్లు నడచుకొనుట, మాతాపితరులు మరణించిన పిమ్మట పితృకర్మలనాచరించి, వారికి 'పున్నామ' నరకము లేకుండచేయుట, ప్రతిసంవత్సరము మాతాపితృ శ్రాద్ధములనాచరించుట, గయలో పితృదేవతలకు పిండప్రదానము చేయుట అనునవి పుత్రధర్మములు.

అయం మునిసుతో బాలో మత్తః శరణమిచ్ఛతి।
అస్య జీవితమాత్రేణ ప్రియం కురుత పుత్రకాః। 10

సర్వే సుకృతకర్మాణః సర్వే ధర్మపరాయణాః।
పశుభూతా నరేంద్రస్య తృప్తిమగ్నేః ప్రయచ్ఛత। 11

నాథవాంశ్చ శునశ్శేఫో యజ్ఞశ్చావిఘ్నితో భవేత్।
దేవతాస్తర్పితాశ్చ స్యుః మమచాపి కృతం వచః। 12

మునేస్తు వచనం శ్రుత్వా మధుష్యందాదయస్సుతాః।
సాభిమానం నరశ్రేష్ఠ సలీలమిదమబ్రువన్। 13

కథమాత్మసుతాన్ హిత్వా త్రాయసేఽన్యసుతం విభో।
అకార్యమివ పశ్యామః శ్వమాంసమివ భోజనే। 14

తేషాం తద్వచనం శ్రుత్వా పుత్రాణాం మునిపుంగవః।
క్రోధసంరక్తనయనో వ్యాహర్తుముపచక్రమే। 15

నిస్సాధ్వసమిదం ప్రోక్తం ధర్మాదపి విగర్హితమ్।
అతిక్రమ్య తు మద్వాక్యం దారుణం రోమహర్షణమ్। 16

శ్వమాంసభోజినస్సర్వే వాసిష్ఠా ఇవ జాతిషు।
పూర్ణం వర్షసహస్రం తు పృథివ్యామనువత్స్యథ। 17

కృత్వా శాపసమాయుక్తాన్ పుత్రాన్ మునివరస్తథా।
శునశ్శేఫమ్ ఉవాచార్తం కృత్వా రక్షాం నిరామయమ్। 18

పవిత్రపాశైరాసక్తో రక్తమాల్యానులేపనః।
వైష్ణవం యూపమాసాద్య వాగ్భిరగ్నిముదాహర। 19

ఇమే తు గాథే ద్వే దివ్యే గాయేథా మునిపుత్రక।
అంబరీషస్య యజ్ఞేఽస్మిన్ తతస్సిద్ధిమవాప్స్యసి। 20

కుమారులారా! ఈ ముని బాలకుడు నన్ను శరణుజొచ్చినాడు. ఇతనికి జీవనదానమిచ్చి, (ప్రాణభిక్ష పెట్టి,)మేలు చేయుడు.(10)

నాయనాలారా! మీరు అందఱును సత్కర్మలను ఆచరించు వారు, ధర్మమార్గమును వీడనివారు. కనుక మీలో ఒకరు రాజుగారియజ్ఞపశువై అగ్నిదేవునకు తృప్తినిగూర్చుడు. తత్ఫలితముగా శునశ్శేఫుడు సురక్షితుడగును, యజ్ఞము నిర్విఘ్నముగా పూర్తియగును, దేవతలు అందఱును తృప్తి చెందుదురు. అప్పుడు మీరు నా మాటను పాటించినవారును అగుదురు." (11-12)

నరశ్రేష్ఠుడవైన ఓ రామా! విశ్వామిత్రమునిమాటలను విని, ఆయనపుత్రులైన మధుష్యందుడు మొదలగువారు గర్వముతో పరిహాసముగా ఇట్లునుడివిరి. (13)

"ఓ మహాత్మా! ఇదేమిన్యాయము? భోజనమునందు కుక్క మాంసము పడినచో దానిని భుజించుట అకార్యముగదా. అట్లే తన కుమారులప్రాణములను బలిగానిచ్చి, అన్యునిసుతుని రక్షింపబూనుట అకార్యము." అని మేముతలంతుము. (14)

అంతట విశ్వామిత్రమహర్షి తనపుత్రుల నిరాదరవచనములను విని మిక్కిలి క్రుద్ధుడై, కన్నులెఱ్ఱజేయుచు ఇట్లనెను. (15)

"ఓ దురాత్ములారా! 'తండ్రి' యను గౌరవముగూడ లేకుండ మీరు మాట్లాడితిరి. నా మాటను కాదని ఇట్లు అమర్యాదగా ప్రవర్తించుట పుత్రధర్మమునకు విరుద్ధము, దారుణము. ఇది నాకు దిగ్భ్రమను కలిగించినది. వసిష్ఠ పుత్రులవలె మీరు అందఱును 'ముష్టిక' (చండాల) జాతులలో జన్మించి, కుక్కమాంసమునుతినుచు పూర్తిగా వేయిసంవత్సరములు భూమిపై పడియుండుడు." (16-17)

విశ్వామిత్రమహర్షి అట్లు తనకుమారులను శాపగ్రస్తులను జేసిన పిమ్మట, ఆర్తుడైయున్న శునశ్శేఫునకు మంత్రపూతమైన భస్మమునే రక్షగాయొనర్చి, అభయమిచ్చి ఇట్లు పలికెను. (18)

"ఓ మునికుమారా! అంబరీషుని యజ్ఞమునందు నిన్ను పవిత్రమైన దర్భలత్రాళ్లతో బంధింతురు. ఎఱ్ఱని పూలమాలలతో, చందనాదులతో నిన్ను అలంకరింతురు. అప్పుడు నీవు విష్ణుదేవతాసంబంధమైన యూప స్తంభముకడకు చేరుము. పిమ్మట అగ్నిదేవునకు అభిముఖుడవై నిలిచి, ఇంద్రుని, ఉపేంద్రుని స్తుతింపుము. పిదప వరుసగా నేను ఉపదేశింప బోవు ఇంద్ర-ఉపేంద్ర దివ్యగాథలను గానముచేయుము. అప్పుడు అంబరీషుని ఈ యజ్ఞమునందు నీ మనోరథము సిద్ధించును." (19-20)

శునశ్శేఫో గృహీత్వా తే ద్వే గాథే సుసమాహితః।
త్వరయా రాజసింహం తమ్ అంబరీషమ్ ఉవాచ హ। 21

రాజసింహ మహాసత్త్వ శీఘ్రం గచ్ఛావహే సదః।
నిర్వర్తయస్వ రాజేంద్ర దీక్షాం చ సముపావిశ। 22

శునశ్శేపుడు ఆ రెండు మంత్రములను ఆ మహర్షినుండి శ్రద్ధాదరములతో గ్రహించి, వెంటనే అంబరీషుని కడకేగి, ఆ మహారాజుతో ఇట్లు నుడివెను. "మహాబలశాలివైన ఓ రాజేంద్రా! యజ్ఞసభకు త్వరగా వెళ్లుదము. వెంటనే దీక్షను గైకొని యజ్ఞమును నిర్వర్తింపుము." (21-22)

తద్వాక్యమ్ ఋషిపుత్రస్య శ్రుత్వా హర్షసముత్సుకః।
జగామ నృపతిశ్శీఘ్రం యజ్ఞవాటమ్ అతంద్రితః। 23

అంతట మహారాజు ఋషికుమారునివచనములను విని, జాగుసేయక శీఘ్రముగా తనయజ్ఞవాటికకు చేరెను. (23)

సదస్యానుమతే రాజా పవిత్రకృతలక్షణమ్।
పశుం రక్తాంబరం కృత్వా యూపే తం సమబంధయత్। 24

పిమ్మట మహారాజు సదస్యులఅనుమతితో యజ్ఞపశువైన ఆ మునికుమారునకు దర్భత్రాళ్లను చుట్టి, ఎఱ్ఱనిమాలలతోడను, చందనములతోడను అతనిని అలంకరింపజేసెను. పిమ్మట ఎఱ్ఱనివస్త్రములను ధరింపజేసి, ఆయనను యూపస్తంభమునకు కట్టివేసెను. (24)

స బద్ధో వాగ్భిరగ్ర్యాభిః అభితుష్టావ తౌ సురౌ।
ఇంద్రమ్ ఇంద్రానుజం చైవ యథావన్మునిపుత్రకః। 25

దర్భలత్రాళ్లతో యూపస్తంభమునకు బంధింపబడియున్న ఆ మునికుమారుడు దేవతలైన ఇంద్రుని, ఉపేంద్రుని మహామంత్రములతో శాస్త్రోక్తముగా స్తుతించెను. (25)

తతః ప్రీతస్సహస్రాక్షో రహస్యస్తుతితర్పితః।
దీర్ఘమాయుస్తదా ప్రాదాత్ శునశ్శేఫాయ రాఘవ। 26

ఓ రాఘవా! అంతట మంత్రరహస్యములుగల ఆ స్తుతులకు తృప్తిచెందిన ఇంద్రుడు శునశ్శేపునకు మిక్కిలి సంతోషముతో దీర్ఘాయువును ప్రసాదించెను. (26)

స చ రాజా నరశ్రేష్ఠ యజ్ఞస్య చ సమాప్తవాన్।
ఫలం బహుగుణం రామ సహస్రాక్షప్రసాదజమ్। 27

నరోత్తముడవైన ఓ రామా! ఇంద్రుని అనుగ్రహమువలన ఆ మహారాజు శుభకరములైన యజ్ఞఫలములను పెక్కింటిని పొందెను. (27)

విశ్వామిత్రోఽపి ధర్మాత్మా భూయస్తేపే మహాతపాః।
పుష్కరేషు నరశ్రేష్ఠ దశవర్షశతాని చ। 28

ఓ నరవరా! మహాతపస్వియు, ధర్మాత్ముడును ఐన విశ్వామిత్రుడు పుష్కరక్షేత్రమునందు మఱియొక వేయి సంవత్సరములు తపమాచరించెను. (28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ద్విషష్టితమస్సర్గః (62)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదిరెండవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

63. అఱువదిమూడవసర్గము

విశ్వామిత్రుడు మేనకనుజూచి మరులుగొనుట-ఫలితముగా తపస్సు భంగమగుట -
అతడు మఱల తీవ్రముగా తపస్సు చేసి, మహర్షి యగుట.

పూర్ణే వర్షసహస్రే తు వ్రతస్నాతం మహామునిమ్।
అభ్యాగచ్ఛన్ సురాస్సర్వే తపఃఫలచికీర్షవః। 1

విశ్వామిత్రుడు వేయిసంవత్సరములకాలము తపస్సొనర్చి, దీక్షాంతస్నానము చేయంగా ఆ మహామునికి తపఃఫలమును ప్రసాదించుటకై దేవతలందఱును అచటికి విచ్చేసిరి. (1)

అబ్రవీత్ సుమహాతేజా బ్రహ్మా సురుచిరం వచః।
ఋషిస్త్వమసి భద్రం తే స్వార్జితైః కర్మభిః శుభైః। 2

తమేవముక్త్వా దేవేశః త్రిదివం పునరభ్యగాత్।
విశ్వామిత్రో మహాతేజా భూయస్తేపే మహత్ తపః। 3

తతః కాలేన మహతా మేనకా పరమాప్సరాః।
పుష్కరేషు నరశ్రేష్ఠ స్నాతుం సముపచక్రమే। 4

తాం దదర్శ మహాతేజా మేనకాం కుశికాత్మజః।
రూపేణాప్రతిమాం తత్ర విద్యుతం జలదే యథా। 5

దృష్ట్వా కందర్పవశగో మునిస్తామిదమబ్రవీత్।
అప్సరః స్వాగతం తేఽస్తు వసచేహ మమాశ్రమే। 6

అనుగృహీష్వ భద్రం తే మదనేన సుమోహితమ్।
ఇత్యుక్తా సా వరారోహా తత్ర వాసమథాకరోత్। 7

తస్యాం వసంత్యాం వర్షాణి పంచ పంచ చ రాఘవ।
విశ్వామిత్రాశ్రమే రామ సుఖేన వ్యతిచక్రముః। 8

అథ కాలే గతే తస్మిన్ విశ్వామిత్రో మహామునిః।
సవ్రీడ ఇవ సంవృత్తః చింతాశోకపరాయణః। 9

బుద్ధిర్మునేస్సముత్పన్నా సామర్షా రఘునందన।
సర్వం సురాణాం కర్మైతత్ తపోపహరణం మహత్। 10

అహోరాత్రాపదేశేన గతాస్సంవత్సరా దశ।
కామమోహాభిభూతస్య విఘ్నోఽయం ప్రత్యుపస్థితః। 11

వినిశ్శ్వసన్మునివరః పశ్చాత్తాపేన దుఃఖితః।
భీతా మప్సరసం దృష్ట్వా వేపంతీం ప్రాంజలిం స్థితామ్। 12

మేనకాం మధురైర్వాక్యైః విసృజ్య కుశికాత్మజః।
ఉత్తరం పర్వతం రామ విశ్వామిత్రో జగామ హ। 13

పిమ్మట మహాతేజస్వియైన బ్రహ్మదేవుడు 'ఓ విశ్వామిత్రా! నీకు శుభమగుగాక. నీవు నిష్ఠతో తపోయుక్తమైన శుభకర్మలను చక్కగా ఆచరించితివి. తత్ప్రభావమున ఋషివి ఐతివి. (పూర్వము తపస్సు చేసి రాజర్షివి ఐతివి. ఇప్పుడు దానికంటెను శ్రేష్ఠమైన 'ఋషిత్వము'ను పొందితివి.) అని నుడివి-ఆ పరమేష్ఠి మరల తనలోకమునకు ఏగెను. అంతట తేజోమూర్తియైన విశ్వామిత్రుడు మరల తీవ్రముగా తపమాచరించెను. (2-3)

ఓ శ్రీరామా! కొంతకాలమునకు పిమ్మట అప్సరసలలో మేటియైన 'మేనక' (దేవతలచే పంపబడినదై) అచటికి వచ్చి పుష్కరతీర్థములలో జలకములాడసాగెను. మేఘమండలము మధ్య తళుకులీనుచున్న మెఱుపుతీగవలె నిరుపమానమైన రూపసౌందర్యముతో ఒప్పుచున్న మేనకను మహాతేజస్వియైన ఆ కౌశికుడు గాంచెను. (4-5)

మేనకలావణ్యమును జూచి మరులుగొన్న విశ్వామిత్రుడు ఆమెతో ఇట్లనెను. "ఓ సుందరీ! నీకు స్వాగతము. ఈ నా ఆశ్రమమున వసింపుము. కామపరవశుడనైన నన్ను అనుగ్రహింపుము. నీకు మేలగును." అతడిట్లు పలికిన పిమ్మట ఆ శోభనాంగి ఆ ఆశ్రమమున నివసింపసాగెను. (ఆమె రాకతో విశ్వామిత్రుని తపస్సు ఉట్టికెక్కెను.) ఆ మున్యాశ్రమమునందు మేనక పదిసంవత్సరములపాటు సుఖముగా గడిపెను. (6-8)

ఇట్లు కొంతకాలము గడచిన పిమ్మట దివ్యాంగనా వ్యామోహమువలన తనతపస్సుభంగముకాగా అందులకు విశ్వామిత్రుడు మిక్కిలి సిగ్గుపడి, ఎంతయు చింతిల్లుచు శోకమునకులోనయ్యెను. (9)

ఓ రఘునందనా! అంతట విశ్వామిత్రుడు కోపోద్రిక్తుడై, 'ఇదియంతయును' తీవ్రమైన నాతపశ్శక్తిని వమ్ము చేయుటకై దేవతలు పన్నినపన్నాగము.' అని తలంచెను. 'కామమోహములకు దాసుడనైన నాకు పది సంవత్సరములును ఒక్క దినమువలె గడచిపోయినవి. నా తపస్సునకు తీరని విఘ్నము వాటిల్లినది.' అని వగచెను. (10-11)

అట్లు మునీశ్వరుడు పశ్చాత్తాపముతో దుఃఖితుడయ్యెను పిమ్మట అతడు తనయెదుట భయముతో వణకుచు అంజలి ఘటించి, నిలిచియున్న మేనకను గాంచెను. అప్పుడు అతడు ఆ అప్సరసను మృదుమధురవచనములతో (ఇందు నీ తప్పేమియు లేదు, నేనే కామపరతంత్రుడనై ఈ అపరాధమునకు ఒడిగట్టితిని. అని పలికి) పంపివైచెను. అనంతరము ఆ కౌశికుడు ఉత్తరదిశయందున్న హిమవత్పర్వతమునకు వెళ్లెను. (12-13)

స కృత్వా నైష్ఠికీం బుద్ధిం జేతుకామో మహాయశాః।
కౌశికీ తీరమాసాద్య తపస్తేపే సుదారుణమ్। 14

యశస్వియైన ఆ విశ్వామిత్రుడు వ్రతసమాప్తి పర్యంతము ఇంద్రియనిగ్రహము కలిగియుండుటకై (జితేంద్రియుడగుటకై) కౌశికీనదీతీరమునకు చేరి, దీక్షతో తీవ్రముగా తపస్సొనర్చెను. (14)

తస్య వర్షసహస్రం తు ఘోరం తప ఉపాసతః।
ఉత్తరే పర్వతే రామ దేవతానామ్ అభూద్భయమ్। 15

ఓ రామా! హిమవత్పర్వతముపై విశ్వామిత్రుడు ఆ విధముగా ఘోరమైన తపస్సుచేయుచుండగా వేయి సంవత్సరములు గడచెను. అంతట ఆ తపస్విని జూచి దేవతలందఱును మిగుల కలతచెందిరి. (15)

ఆమంత్రయన్ సమాగమ్య సర్వే సర్షిగణాః సురాః।
మహర్షిశబ్దం లభతాం సాధ్వయం కుశికాత్మజః। 16

అప్పుడు దేవతలెల్లరును ఋషీశ్వరులతోగూడి 'ఈ కౌశికుడు 'మహర్షి బిరుదము' ను పొందుటకు ఎంతయు అర్హుడు' అని భావించి, బ్రహ్మకడకేగి ఆ విషయమును ఆయనకు నివేదించిరి. (16)

దేవతానాం వచః శ్రుత్వా సర్వలోకపితామహః।
అబ్రవీన్మధురం వాక్యం విశ్వామిత్రం తపోధనమ్। 17

సమస్తలోకములను సృజించువాడైన బ్రహ్మదేవుడు దేవతల వచనములను ఆలకించి, తపోధనుడైన విశ్వామిత్రుని ఆశ్రమమునకు విచ్చేసి, మృదుమధురముగా ఆయనతో ఇట్లనెను. (17)

మహర్షే స్వాగతం వత్స తపసోగ్రేణ తోషితః।
మహత్త్వమ్ ఋషిముఖ్యత్వం దదామి తవ కౌశిక। 18

"నాయనా! కౌశికమహర్షీ! నీకు స్వాగతము. నీ తీవ్ర తపస్సునకు మెచ్చితిని. నీవు ఋషులలో ముఖ్యుడవు. నీకు 'మహర్షిత్వము'ను ప్రసాదించుచున్నాను. (నీవు 'మహర్షివి' ఐతివి.)" (18)

బ్రహ్మణస్స వచః శ్రుత్వా సర్వలోకేశ్వరస్య హ।
న విషణ్ణో న సంతుష్టో విశ్వామిత్రస్తపోధనః। 19

ప్రాంజలిః ప్రణతో భూత్వా సర్వలోకపితామహమ్।
ప్రత్యువాచ తతో వాక్యం విశ్వామిత్రో మహామునిః। 20

తపస్సంపన్నుడైన ఆ విశ్వామిత్రుడు సర్వలోకేశ్వరుడైన బ్రహ్మదేవునిపలుకులనాలకించెను. అందులకు అతడు పొంగిపోలేదు, క్రుంగిపోలేదు. పిమ్మట విశ్వామిత్రమహర్షి జగత్సృష్టికర్తయైన బ్రహ్మకు అంజలిఘటించి, నమస్కరించి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (19-20)

మహర్షిశబ్దమతులం స్వార్జితైః కర్మభిశ్శుభైః।
యది మే భగవానాహ తతోఽహం విజితేంద్రియః। 21

"ఓ బ్రహ్మదేవా! నేను దీక్షతో చేసిన తపస్సునకు మెచ్చి, మీరు నాకు 'మహర్షిత్వము' ను అనుగ్రహించితిరి. కనుక నేను జితేంద్రియుడనైనట్లు తలంతును." (21)

తమువాచ తతో బ్రహ్మా న తావత్ త్వం జితేంద్రియః।
యతస్వ మునిశార్దూల ఇత్యుక్త్వా త్రిదివం గతః। 22

అంతట బ్రహ్మదేవుడు విశ్వామిత్రునితో 'ఓ మహర్షీ! ఇంతమాత్రమునకే నీవు జితేంద్రియుడవైనట్లు భావింపవలదు.[1] ఇంకను ప్రయత్నింపుము.' అని పలికి తనలోకమునకు వెళ్లెను. (22)

విప్రస్థితేషు దేవేషు విశ్వామిత్రో మహామునిః।
ఊర్ధ్వబాహు ర్నిరాలంబో వాయుభక్ష స్తపశ్చరన్। 23

దేవతలందఱును వెళ్లిపోయిన పిమ్మట విశ్వామిత్రమహర్షి ఊర్ధ్వబాహుడై, ఆలంబనములేకయే వాయువును మాత్రమే ఆహారముగా గొనుచు తపస్సు చేయసాగెను. ఆ తపస్వి వేసవికాలమునందు (మండుటెండలలో) పంచాగ్ని మధ్యమునను, (అనగా నాలుగువైపుల అగ్నులను, శిరస్సుపై భాగమున సూర్యా

1) శ్లో॥ వికారహేతౌ సతి విక్రియంతే, యేషాం న చేతాంసి త ఏవ ధీరాః॥ (కాళిదాసు శాకుంతలము.)
మనోవికారములను గూర్చు (మనస్సును చలింపజేయునట్టి) బలీయమైన పరిస్థితులెదురైనప్పుడును చలింపక ఉండువాడే జితేంద్రియుడు -

ఘర్మే పంచతపా భూత్వా వర్షాస్వాకాశసంశ్రయః।
శిశిరే సలిలస్థాయీ రాత్ర్యహాని తపోధనః।
ఏవం వర్షసహస్రం హి తపో ఘోరముపాగమత్। 24

తపమును ధరించుచు) వర్షాకాలమున ఎట్టి ఆచ్ఛాదనము లేకుండగను, చలికాలమున నీళ్లలో ఉండియు రాత్రింబవళ్లు తపస్సొనర్చెను. ఈ విధముగా అతడు వేయిసంవత్సరములు ఘోరమైన తపమును ఆచరించెను. (23-24)

తస్మిన్ సంతప్యమానే తు విశ్వామిత్రే మహామునౌ।
సంభ్రమస్సుమహానాసీత్ సురాణాం వాసవస్య చ। 25

విశ్వామిత్రమహాముని కఠోరనియమములతో అట్లు కొనసాగించుచున్న తపస్సును చూచి, ఇంద్రాదిదేవతలు మిక్కిలి భయాందోళనలకు లోనైరి. (25)

రంభామప్సరసం శక్రః సహ సర్వైర్మరుద్గణైః।
ఉవాచాత్మహితం వాక్యమ్ అహితం కౌశికస్య చ। 26

అంతట దేవేంద్రుడు 'రంభ' యను అప్సరసను పిలిపించి, సకలదేవతలసమక్షమున తమహితము కొఱకును, విశ్వామిత్రుని తపస్సును భంగపఱచుటకును తగువిధముగా ఆమెతో ఇట్లనెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే త్రిషష్టితమస్సర్గః (63)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదిమూడవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

64. అఱువదినాల్గవసర్గము

విశ్వామిత్రుని తపస్సును భంగపఱచుటకై ఇంద్రుడు రంభను పంపుట -
విశ్వామిత్రుడు ఆమెను శపించి, మఱల తపోదీక్షలో నిమగ్నుడగుట.

సురకార్యమిదం రంభే కర్తవ్యం సుమహత్ త్వయా।
లోభనం కౌశికస్యేహ కామమోహసమన్వితమ్। 1

ఓ రంభా! తపోదీక్షలోనున్న విశ్వామిత్రుడు కామమోహములకు లోనగునట్లుగా ప్రలోభపెట్టవలసి యున్నది. దేవతలకు హితమునుగూర్చు ఈ మహాత్కార్యమును నిర్వహించుటకు నీవే సమర్థురాలవు. ఇది నీకు కర్తవ్యము. (1)

తథోక్తా సాప్సరా రామ సహస్రాక్షేణ ధీమతా।
వ్రీళితా ప్రాంజలిర్వాక్యం ప్రత్యువాచ సురేశ్వరమ్। 2

ఓ రామా! ప్రతిభాశాలియైన దేవేంద్రుడు ఇట్లు పలుకగా ఆ రంభ సురకార్యమును సాధింపవలసియున్న భయసందేహములకు లోనై, సిగ్గుపడుచు అంజలిఘటించి, ఆ సురరాజునకు ఇట్లు ప్రత్యుత్తరము ఇచ్చెను. (2)

అయం సురపతే ఘోరో విశ్వామిత్రో మహామునిః।
ఘోరముత్స్రజతే క్రోధం మయి దేవ న సంశయః।
తతో హి మే భయం దేవ ప్రసాదం కర్తుమర్హసి। 3

"ఓ దేవేంద్రా! ఈ విశ్వామిత్రమహాముని మిగుల ముక్కోపి. తపస్సును భంగపఱచుటకు పూనుకొనినచో నన్ను అతడు తనక్రోధాగ్నికి గుఱిచేయును- అందులకు సందేహమే లేదు. అందువలన నేను భయపడుచున్నాను. కనుక నన్ను మీరే అనుగ్రహింపగలరు." ఓ రామచంద్రా! భయముతో వ్యాకులయై, వణకుచు, అంజలి ఘటించి ప్రార్థించుచున్న రంభతో ఆ సహస్రాక్షుడు ఇట్లనెను. (3-4)

ఏవముక్త స్తయా రామ రంభయా భీతయా తదా।
తా మువాచ సహస్రాక్షో వేపమానాం కృతాంజలిమ్। 4

మా భైషి రంభే భద్రం తే కురుష్వ మమ శాసనమ్। 5

"ఓ రంభా! భయపడకుము, నీకు అంతయు శుభమే జరుగును. ఇది నా ఆజ్ఞ, అనుసరింపుము (5)

కోకిలో హృదయగ్రాహీ మాధవే రుచిరద్రుమే।
అహం కందర్పసహితః స్థాస్యామి తవ పార్శ్వతః। 6

త్వం హి రూపం బహుగుణం కృత్వా పరమభాస్వరమ్।
తమ్ ఋషిం కౌశికం రంభే భేదయస్వ తపస్వినమ్। 7

సా శ్రుత్వా వచనం తస్య కృత్వా రూపమ్ అనుత్తమమ్।
లోభయామాస లలితా విశ్వామిత్రం శుచిస్మితా। 8

కోకిలస్య తు శుశ్రావ వల్గు వ్యాహరతః స్వనమ్।
సంప్రహృష్టేన మనసా తత ఏనాముదైక్షత। 9

అథ తస్య చ శబ్దేన గీతేనాప్రతిమేన చ।
దర్శనేన చ రంభాయాః మునిః సందేహమాగతః। 10

సహస్రాక్షస్య తత్కర్మ విజ్ఞాయ మునిపుంగవః।
రంభాం క్రోధసమావిష్టః శశాప కుశికాత్మజః। 11

యన్మాం లోభయసే రంభే కామక్రోధజయైషిణమ్।
దశవర్షసహస్రాణి శైలీ స్థాస్యసి దుర్భగే। 12

బ్రాహ్మణః సుమహాతేజాః తపోబలసమన్వితః।
ఉద్ధరిష్యతి రంభే త్వాం మత్క్రోధకలుషీకృతామ్। 13

ఏవముక్త్వా మహాతేజా విశ్వామిత్రో మహామునిః।
అశక్నువన్ ధారయితుం క్రోధం సంతాపమాగతః। 14

తస్య శాపేన మహతా రంభా శైలీ తదాఽభవత్।
వచః శ్రుత్వా తు కందర్పో మహర్షేః స చ నిర్గతః। 15

కోపేన స మహాతేజాః తపోపహరణే కృతే।
ఇంద్రియైరజితై రామ న లేభే శాంతి మాత్మనః। 16

వసంతఋతువునందు వృక్షములు అన్నియును నవపల్లవములతో, పుష్పములతో కనువిందుగావెలయుచుండును. ఆ సమయమున నేను మనోహరమైనకోకిలనై మన్మథునితో గూడి నీచెంతనే యుందును. ఓ రంభా! ఆకర్షణీయమైన రూపమును ధరించి, తపమొనరించుచున్న విశ్వామిత్రమహర్షి చిత్తమును చలింపజేయుము." (6-7)

అంతట రంభ ఇంద్రునిశాసనమును పాటించి, పరమ-ఆకర్షణీయమైన రూపమును దాల్చెను. పిమ్మట ఆ సుందరి చిఱునవ్వులను చిందించుచు విశ్వామిత్రుని ప్రలోభపెట్టసాగెను. (8)

అప్పుడు ఆ మహర్షి మనోహరముగా ఆలపించుచున్న కోకిలయొక్క స్వరమును విని ముగ్ధుడయ్యెను. ఆ సంతోషముతో అచటనున్నరంభను చూచెను. ఆ కోకిల మధురధ్వనిని, రంభయొక్క నిరుపమానగానమును వినుటతోడను, ఎదుటనున్న రంభను చూచుటవలనను ఆయనకు సందేహము కలిగెను. (9-10)

అంతట ఆ మహర్షి అది అంతయును ఇంద్రునిపన్నాగమే యని గ్రహించెను. పిదప అతడు మిక్కిలి క్రుద్ధుడై రంభను శపించెను. (11)

"ఓ రంభా! కామమును క్రోధమును జయింపనిచ్చతో తపస్సుచేయుచున్న నన్ను నీ శృంగారచేష్టలతో, గానముతో ప్రలోభపెట్టజూచితివి. అందువలన ఓ దుష్టురాలా! పదివేల సంవత్సరములు నీవు శిలవై పడియుండుము. (ఇంద్రుని శాసనమును పాటించి, ఈమె ఇట్లు ప్రవర్తించినది. వాస్తవముగా ఇందు ఈమెదోషము ఏమాత్రమూ లేదు- అని భావించి, పశ్చాత్తప్తుడై ఆ ముని ఇట్లనెను.) నా కోపకారణముగా శాపమునకు గుఱియైన నీకు తపోబలసంపన్నుడును, మహాతేజస్వియు ఐన వసిష్ఠుడు విముక్తిని ప్రసాదింపగలడు." (12-13)

ఇట్లు పలికినపిమ్మట మహాతేజస్వియైన విశ్వామిత్రమహర్షి తనకోపమును నిగ్రహించు కొనలేనందులకు మిక్కిలి పరితపించెను. ఆ మహర్షి యొక్క కఠోరశాపప్రభావమున రంభ శిలయయ్యెను. మహర్షి రంభను శపించుచు పలికిన వచనములను విని, ఇంద్రుడును, మన్మథుడును అచటినుండి తిన్నగా వెళ్ళిపోయిరి. (14-15)

ఓ రామా! 'కోపమునకు లోనగుటచే నాతపోబలము క్షీణించెను. ఇంద్రియములేమో ఇంతవఱకును వశముకాలేదు' అను ఆలోచనలో పడిన ఆ మహాతేజస్వియొక్క మనస్సునకు శాంతి కఱవాయెను. (16)

బభూవాస్య మనశ్చింతా తపోపహరణే కృతే।
నైవ క్రోధం గమిష్యామి న చ వక్ష్యే కథంచన। 17

అథవా నోచ్ఛ్వసిష్యామి సంవత్సరశతాన్యపి।
అహం విశోషయిష్యామి హ్యాత్మానం విజితేంద్రియః। 18

తావద్యావద్ధి మే ప్రాప్తం బ్రాహ్మణ్యం తపసార్జితమ్।
అనుచ్ఛ్వసన్నభుంజానః తిష్ఠేయం శాశ్వతీః సమాః।
న హి మే తప్యమానస్య క్షయం యాస్యంతి మూర్తయః। 19

ఏవం వర్షసహస్రస్య దీక్షాం స మునిపుంగవః।
చకారాప్రతిమాం లోకే ప్రతిజ్ఞాం రఘునందన। 20

తపశ్శక్తి తఱిగిపోవుటచే ఆ మహాముని ఇట్లు సంకల్పించెను. "ఇక కోపమునకు ఏ మాత్రమూ తావియ్యను. మననశీలుడనై యుండెదను. వందలకొలది సంవత్సరములు ఊపిరిబిగబట్టి కుంభకములో ఉండెదను. తపోనిష్ఠాఫలముగా నాకు బ్రహ్మత్వము సిద్ధించువఱకును ఇక ఎంతకాలమైనను ఇంద్రియములను అదుపుచేయుచు, గాలిని పీల్చక, ఆహారమును స్వీకరింపక శరీరమును శుష్కింపజేయుదును. నేనెంతగా తపింపజేయుచున్నను నా తపఃప్రభావమున నా శరీరావయవములకు ఎట్టి ప్రమాదమూ ఉండదు." (17-19)

ఓ రఘునందనా! పిమ్మట ఆ మునీశ్వరుడు 'లోకములో కనివిని యెఱుగని విధముగా తపోదీక్షవహింతును' అని ప్రతిజ్ఞచేసెను. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే చతుష్షష్టితమస్సర్గః *(64)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదినాల్గవసర్గము సమాప్తము.

-- * * * --

65. అఱువదిఐదవసర్గము

తూర్పుదిశయందు విశ్వామిత్రుని తపశ్చర్య - అతడు బ్రహ్మర్షియగుట.

అథ హైమవతీం రామ దిశం త్యక్త్వా మహామునిః।
పూర్వాం దిశమనుప్రాప్య తపస్తేపే సుదారుణమ్। 1

మౌనం వర్షసహస్రస్య కృత్వా వ్రతమ్ అనుత్తమమ్।
చకారాప్రతిమం రామ తపః పరమదుష్కరమ్। 2

పూర్ణే వర్షసహస్రే తు కాష్ఠభూతం మహామునిమ్।
విఘ్నైర్బహుభిరాధూతం క్రోధో నాంతరమావిశత్। 3

స కృత్వా నిశ్చయం రామ తప ఆతిష్ఠదవ్యయమ్।
తస్య వర్షసహస్రస్య వ్రతే పూర్ణే మహావ్రతః। 4

భోక్తుమారబ్ధవానన్నం తస్మిన్ కాలే రఘూత్తమ।
ఇంద్రో ద్విజాతిర్భూత్వా తం సిద్ధమన్నమయాచత। 5

ఓ రామా! పిమ్మట ఆ మహాముని ఉత్తరదిశను వీడి, క్రమముగా తూర్పుదిశకుచేరి, తీవ్రముగా తపస్సొనర్చెను. (1)

ఓ రామచంద్రా! ఇంతకుముందు సంకల్పించినరీతిగానే వేయిసంవత్సరములపాటు ఆ మహాముని నిరంతరము మననశీలుడై, మిక్కిలి కష్టసాధ్యమైన తపస్సును సాటిలేని రీతిగా దృఢదీక్షతో ఆచరించెను. (2)

ఆ మునితపస్సు ప్రారంభమై వేయిసంవత్సరములు గడచెను. శరీరము కట్టెవలె అయ్యెను. పెక్కు విఘ్నములు ఎదురయ్యెను. ఐనను ఆయన కోపమునకులోనుకాలేదు. ఓ రామా! ఆ మహర్షి తిరుగులేని తనపట్టుదలను ఏమాత్రము సడలనీయక తపస్సును కొనసాగించెను. (3-4)

ఓ రఘువరా! వేయిసంవత్సరములతపోవ్రతదీక్ష పూర్తి కాగానే ఆ మహర్షి పారణచేయుటకు (భోజనము చేయుటకు) సిద్ధపడెను. ఇంతలో ఇంద్రుడు బ్రాహ్మణవేషధారియై తనకై ఆ సిద్ధాన్నమును కోరెను. (5)

తస్మై దత్వా తదా సిద్ధం సర్వం విప్రాయ నిశ్చితః।
నిశ్శేషితేఽన్నే భగవాన్ అభుక్త్వైవ మహాతపాః। 6

న కించిదవదద్విప్రం మౌనవ్రతముపస్థితః।
అథ వర్షసహస్రం వై నోచ్ఛ్వసన్మునిపుంగవః। 7

తస్యానుచ్ఛ్వసమానస్య మూర్ధ్ని ధూమో వ్యజాయత।
త్రైలోక్యం యేన సంభ్రాంతమ్ ఆదీపితమివాభవత్। 8

తతో దేవాస్సగంధర్వాః పన్నగాసురరాక్షసాః।
మోహితాస్తేజసా తస్య తపసా మందరశ్మయః। 9

కశ్మలోపహతాస్సర్వే పితామహమథాబ్రువన్।
బహుభిః కారణైర్దేవ విశ్వామిత్రో మహామునిః। 10

లోభితః క్రోధితశ్చైవ తపసా చాభివర్ధతే।
న హ్యస్య వృజినం కించిత్ దృశ్యతే సూక్ష్మమప్యథ। 11

న దీయతే యదిత్వస్య మనసా యదభీప్సితమ్।
వినాశయతి త్రైలోక్యం తపసా సచరాచరమ్। 12

వ్యాకులాశ్చ దిశస్సర్వా న చ కించిత్ ప్రకాశతే।
సాగరాః క్షుభితాస్సర్వే విశీర్యంతే చ పర్వతాః। 13

ప్రకంపతే చ పృథివీ వాయుర్వాతి భృశాకులః।
బ్రహ్మన్ న ప్రతిజానీమో నాస్తికో జాయతే జనః। 14

సమ్మూఢమివ త్రైలోక్యం సంప్రక్షుభితమానసమ్।
భాస్కరో నిష్ప్రభశ్చైవ మహర్షేస్తస్య తేజసా। 15

బుద్ధిం న కురుతే యావన్నాశే దేవ మహామునిః।
తావత్ ప్రసాద్యో భగవాన్ అగ్నిరూపో మహాద్యుతిః। 16

కాలాగ్నినా యథా పూర్వం త్రైలోక్యం దహ్యతేఽఖిలమ్।
దేవరాజ్యం చికీర్షేత దీయతామస్య యన్మతమ్। 17

పూజ్యుడైన ఆ మహాతపస్వి మౌనవ్రతమును పాటించుచునే ఆ సిద్ధాన్నమును పూర్తిగా బ్రాహ్మణునకు సమర్పించెను. అంతట విప్రవేషములోనున్న ఇంద్రుడు ఆ అన్నమును నిశ్శేషముగా భుజించెను. ఆ ఋషి తానేమియు భుజింపకయే ఉండిపోయెను. (6)

అనంతరము ఆ మునివరుడు ఉచ్ఛ్వాసనిశ్వాసములను బంధించి, మఱియొక వేయి సంవత్సరములు తపమాచరించెను. ఆ విధముగా శ్వాసను నిరోధించిన ఆయనశిరస్సునుండి అగ్నిపెల్లుబికెను. ఆ అగ్నిప్రభావమునకు ముల్లోకములును దగ్ధమైపోవుచున్నట్లు భ్రాంతికి లోనయ్యెను. (7-8)

అంతట దేవతలు, గంధర్వులు,నాగులు, అసురులు, రాక్షసులు ఆ తపోరూప-అగ్నితాపమునకు వెలవెలబోయినవారై, మూర్ఛితులైరి. (9)

వారందఱును దుఃఖాక్రాంతులై, బ్రహ్మకడకేగి ఇట్లు విన్నవించుకొనిరి. "ఓ పితామహా! అనేకకారణములవలన విశ్వామిత్రమహర్షిని ప్రలోభపఱచుటకును, ఆయనకు కోపముతెప్పించుటకును బహువిధముల ప్రయత్నించితిమి. కాని ఆయన వాటికిలోనుకాలేదు. పైగా ఆయనపట్టుదలవలనతని తపస్సు వృద్ధిచెందుచునే యున్నది. అతనియందు ఇసుమంతయు దోషము కన్పించుట లేదు. (10-11)

మీరు అతనిమనోరథమును ఈడేర్పనిచో అతడు తన తపఃప్రభావముచే చరాచరములతోనిండిన ఈ ముల్లోకములను నశింపజేయుగలడు. ఆ మహర్షితపోమహిమచే దిక్కులన్నియును వ్యాకులపాటునకు లోనగుచున్నవి. జగత్తు అంధకారమయము మగుచున్నది. సముద్రములు కల్లోలితములగుచున్నవి. పర్వతములన్నియును శిథిలములగుచున్నవి. భూమి కంపించుచున్నది. వాయువులు ప్రచండముగా వీచుచున్నవి. జనులు నాస్తికులగుచున్నారు. ఓ బ్రహ్మదేవా! ఏమిచేయుటకును మాకు తోచకున్నది. (12-14)

ఆ మునియొక్క మహాతేజస్సుముందు సూర్యుడును వెలవెలపోవుచున్నాడు. ముల్లోకములలోని ప్రాణులన్నియును మానసికక్షోభకు గురియై, దిక్కుతోచని స్థితికి లోనగుచున్నవి. (15)

ఓ దేవా! పూజ్యుడైన విశ్వామిత్రమహాముని అగ్నితుల్యుడు. ఆ మహాతేజోమూర్తి లోకములను నశింపజేయుటకు సంకల్పింపకముందే ఆయనను అనుగ్రహించుట యుక్తము. పూర్వము ప్రళయాగ్నిలోవలె ఇప్పుడు ఇతనితపోమహిమచే ముల్లోకములు పూర్తిగా దహింపివేయబడుచున్నవి. కనుక ఆమహర్షిఅభిమతమేదైనను, కడకు అతడు దేవరాజ్యమునే కోరినను ఇచ్చివేయుడు" (16-17)

తత స్సురగణాః సర్వే పితామహపురోగమాః।
విశ్వామిత్రం మహాత్మానం మధురం వాక్యమబ్రువన్। 18

బ్రహ్మర్షే! స్వాగతం తేఽస్తు తపసా స్మ సుతోషితాః।
బ్రాహ్మణ్యం తపసోగ్రేణ ప్రాప్తవానసి కౌశిక। 19

దీర్ఘ మాయుశ్చ తే బ్రహ్మన్ దదామి సమరుద్గణః।
స్వస్తి ప్రాప్నుహి భద్రం తే గచ్ఛ సౌమ్య యథాసుఖమ్। 20

పితామహవచః శ్రుత్వా సర్వేషాం చ దివౌకసామ్।
కృత్వా ప్రణామం ముదితో వ్యాజహార మహామునిః। 21

బ్రాహ్మణ్యం యది మే ప్రాప్తం దీర్ఘమాయు స్తథైవ చ।
ఓంకారశ్చ వషట్కారో వేదాశ్చ వరయంతు మామ్। 22

క్షత్రవేదవిదాం శ్రేష్ఠో బ్రహ్మవేదవిదామపి।
బ్రహ్మపుత్త్రో వసిష్ఠో మామ్ ఏవం వదతు దేవతాః। 23

యద్యయం పరమః కామః కృతో యాంతు సురర్షభాః।
తతః ప్రసాదితో దేవైః వసిష్ఠో జపతాం వరః। 24

సఖ్యం చకార బ్రహ్మర్షిః ఏవమస్త్వితి చాబ్రవీత్।
బ్రహ్మర్షిస్త్వం న సందేహః సర్వం సంపత్స్యతే తవ। 25

ఇత్యుక్త్వా దేవతా శ్చాపి సర్వా జగ్ము ర్యథాగతమ్। 26

విశ్వామిత్రోఽపి ధర్మాత్మా లబ్ధ్వా బ్రాహ్మణ్యముత్తమమ్।
పూజయామాస బ్రహ్మర్షిం వసిష్ఠం జపతాం వరమ్।
కృతకామో మహీం సర్వాం చచార తపసి స్థితః। 27

ఏవం త్వనేన బ్రాహ్మణ్యం ప్రాప్తం రామ మహాత్మనా।
ఏష రామ మునిశ్రేష్ఠ ఏష విగ్రహవాంస్తపః। 28

అనంతరము దేవతలందఱును బ్రహ్మదేవునితోగూడి మహాత్ముడైన విశ్వామిత్రునికడకు వెళ్ళి 'బ్రహ్మర్షీ! నీకు స్వాగతము. నీ తపస్సునకు మెచ్చితిమి' - అని మధురముగా పలికిరి. పిమ్మట బ్రహ్మదేవుడు "ఓ కౌశికా! నీ తీవ్రమైన తపఃఫలముగా 'బ్రహ్మత్వము'ను పొందితివి. ఓ బ్రహ్మర్షీ! ఈ దేవతలసమక్షమున నీకు దీర్ఘాయువును ప్రసాదించుచున్నాను. నీకు శుభపరంపర కలుగుగాక. ఓ సౌమ్యుడా హాయిగా వెళ్ళిరమ్ము." (18-20)

పితామహుని ఆశీస్సులను అందుకొని, బ్రహ్మాదిదేవతలకు నమస్కరించి, ఆ మహాముని సంతోషముతో ఇట్లు పలికెను. (21)

"ఓ పితామహా! మీ అనుగ్రహమువలన నాకు బ్రహ్మత్వము (బ్రహ్మర్షిత్వము) దీర్ఘాయువు లభించినవి గావున 'ఓంకారము,' 'వషట్కారము' (యజ్ఞములను చేయించు అర్హత) వేదములు (వేదములను శిష్యులకు బోధించు అధికారము) నాకు లభించుగాక. (22)

ఓ దేవతలారా! క్షత్రియవిద్యలగు ధనుర్వేదాదులకు మూలమైన 'అథర్వవేదము'నందును, బ్రహ్మప్రతిపాదకములైన (భగవంతుని ప్రతిపాదించు) ఋగ్యజుస్సామ వేదములయందును పారంగతుడును, బ్రహ్మదేవునికుమారుడును ఐన వసిష్ఠమహర్షి నన్ను 'బ్రహ్మర్షి'గా పేర్కొను (పిలుచు) నట్లు దయతో అనుగ్రహించి వెళ్ళుదురుగాక." (23)

పిదప దేవతలు జపధ్యానపరులలో ప్రముఖుడైన వసిష్ఠుని ప్రసన్నునిగా జేసికొనిరి. అప్పుడు ఆ వసిష్ఠుడు 'ఏవమస్తు' (అట్లేకానిమ్ము) అనగా యజ్ఞములను చేయించుటకును, శిష్యులకు వేదములను బోధించుటకును నీవు అర్హుడవే. నీవు 'బ్రహ్మర్షివి' ఐతివి. అని విశ్వామిత్రునితో పలికి అతనితో సఖ్యముచేసెను. (24-25)

అంతట దేవతలును 'నీవు నిస్సందేహముగా బ్రహ్మర్షివి. నీవు కోరినవి అన్నియును సమకూరును.' అని పలికి, స్వస్థానములకు వెళ్ళిరి. (26)

ఈ విధముగా ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు ఉత్తమమైన 'బ్రహ్మర్షి' పదవిని పొంది, మంత్రజపతత్పరులలో శ్రేష్ఠుడైన వసిష్ఠుని పూజించెను. సఫలమనోరథుడైన విశ్వామిత్రుడు తపస్సును కొనసాగించుచునే భూమండలమంతయును సంచరించెను. (27)

శతానందమహర్షి ఇంకను ఇట్లు నుడివెను-'ఓ రామా! మహాత్ముడైన విశ్వామిత్రుడు బ్రహ్మర్షియయ్యెను. నిజముగా ఇతడు మునిశ్రేష్ఠుడు, మూర్తీభవించిన తపస్సు, నిరంతరము

ఏష ధర్మపరో నిత్యం వీర్యస్యైష పరాయణమ్।
ఏవ ముక్త్వా మహాతేజా విరరామ ద్విజోత్తమః। 29

శతానందవచః శ్రుత్వా రామలక్ష్మణసన్నిధౌ।
జనకః ప్రాంజలి ర్వాక్య మువాచ కుశికాత్మజమ్। 30

ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే మునిపుంగవ।
యజ్ఞం కాకుత్స్థసహితః ప్రాప్తవానసి ధార్మిక। 31

పావితోఽహం త్వయా బ్రహ్మన్ దర్శనేన మహామునే।
గుణా బహువిధాః ప్రాప్తా స్తవ సందర్శనాన్మయా। 32

విస్తరేణ చ తే బ్రహ్మన్ కీర్త్యమానం మహత్తపః। 33

శ్రుతం మయా మహాతేజో రామేణ చ మహాత్మనా।
సదస్యైః ప్రాప్య చ సదః శ్రుతాస్తే బహవో గుణాః। 34

అప్రమేయం తపస్తుభ్యమ్ అప్రమేయం చ తే బలమ్।
అప్రమేయా గుణా శ్చైవ నిత్యం తే కుశికాత్మజ। 35

తృప్తి రాశ్చర్యభూతానాం కథానాం నాస్తి మే విభో।
కర్మకాలో మునిశ్రేష్ఠ లంబతే రవిమండలమ్। 36

శ్వః ప్రభాతే మహాతేజో ద్రష్టుమర్హసి మాం పునః।
స్వాగతం తపతాం శ్రేష్ఠ మామనుజ్ఞాతు మర్హసి। 37

ధర్మతత్పరుడు, మహాతేజస్వి, పరాక్రమశాలి' అని పలికి, మహాతేజస్వియైన శతానందుడు మిన్నకుండెను.[1] (28-29)

శతానందుడు రామలక్ష్మణులకుతెలిపిన విశ్వామిత్రుని వృత్తాంతమును విని, జనకుడు వారిసమక్షమున కౌశికునకు అంజలి ఘటించి ఇట్లు పలికెను. (30)

"ధర్మాత్మా! ఓ మునీశ్వరా! నాపై అనుగ్రహము ఉంచి, రామలక్ష్మణులను తోడ్కొని, నేను తలపెట్టిన యజ్ఞమునకు దయతో విచ్చేసితిరి. నేను ధన్యుడనైతిని. (31)

ఓ మహాత్మా! బ్రహ్మర్షులలో ఉత్తముడవైన విశ్వామిత్ర మహామునీ! మీ దర్శనముచే నేను పవిత్రుడనైతిని. మీ దివ్యదర్శనప్రభావమున నాకు పెక్కుప్రయోజనములు సమకూరినవి. (32)

మహాతేజస్వివైన ఓ బ్రహ్మర్షీ! శతానందమహర్షిచే విస్తృతముగా ప్రస్తుతింపబడిన మీ మహాతపస్సునుగూర్చి మహాత్ముడైన శ్రీరామునితోపాటు నేనును వింటిని. ఇచట చేరియున్న సత్పురుషులు అందఱును మీ ఉదాత్తగుణములను గూర్చి వినిరి. (33-34)

ఓ విశ్వామిత్రమహర్షీ! అవిచ్ఛిన్నముగా కొనసాగిన మీతపస్సు అద్భుతమైనది, ఊహలకు అందనిది, మీ బలము నిరుపమానము, మీగుణములు 'ఇట్టివి' అని చెప్పుటకు అలవికానివి. (35)

ఓ ప్రభూ! మునివరా! ఆశ్చర్యకరములైన మీకథలను ఎంతగా విన్నను తనివితీరుటలేదు. సూర్యుడు అస్తాద్రిని చేరుచున్నాడు. సంధ్యావందనాదులకు ఇది సమయము. తపోధనులలో శ్రేష్ఠుడవైన ఓ మహాతేజస్వీ! మీకు స్వాగతము. రేపు ప్రాతఃకాలమున మిమ్ము దర్శింతును. ఇప్పుడు వెళ్లుటకు అనుమతిని ఇండు." (36-37)

1) విశ్వామిత్రునివృత్తాంతమువలన వెల్లడియగుచున్న విశేషములు

శతానందుడు తనతల్లియైన అహల్యాదేవికి శాపవిముక్తి లభించినందులకు ఎంతయు సంతసించెను. ఆ శాపవిముక్తినికల్గించినపుణ్యమూర్తి శ్రీరాముడు. దానికి ప్రేరణగూర్చిన మహాత్ముడు విశ్వామిత్రుడు. ఆ ఇరువురును శతానందునకు పరమపూజ్యులు. ఆ పూజ్యభావముతోడనే శతానందుడు తనకు ఉపకారముచేసిన విశ్వామిత్రుని చరిత్రవైభవమును ప్రాసంగికముగా తెలిపెను. తమకు మేలుచేసినవారిని విస్మరింపకయుండుట సత్పురుషులలక్షణము.

(1) కామక్రోధములను జయించుట మిక్కిలి కష్టసాధ్యము.

(2) కామక్రోధములను జయించినవాడే బ్రాహ్మణోత్తముడు (బ్రహ్మజ్ఞాని)

(3) బ్రహ్మజ్ఞానము అబ్బుట అంతసులభముగాదు.

(4) బ్రహ్మవేత్తకు అపచారముచేయువారిప్రయత్నములన్నింటికిని విఘ్నములు ఏర్పడుచునేయుండును. బ్రహ్మజ్ఞానియైన వసిష్ఠునియెడల అపచారము చేయుటవలననే విశ్వామిత్రుని తపస్సునకు పరంపరగా తీవ్రవిఘ్నములు ఏర్పడినవి.

ఏవ ముక్తో మునివరః ప్రశస్య పురుషర్షభమ్।
విససర్జాశు జనకం ప్రీతం ప్రీతమనాస్తదా। 38

జనకుడు ఇట్లుపలుకగా ఆ మునివరుడు మిక్కిలి సంతుష్టుడాయెను. అతడు తనదర్శనమునకు సంతసించిన సత్పురుషుడగు జనకుని మెచ్చుకొనెను. వెళ్లుటకై ఆ రాజునకు వెంటనే అనుజ్ఞను ఇచ్చెను. (38)

ఏవ ముక్త్వా మునిశ్రేష్ఠం వైదేహో మిథిలాధిపః।
ప్రదక్షిణం చకారాశు సోపాధ్యాయస్సబాంధవః। 39

విశ్వామిత్రోఽపి ధర్మాత్మా సహరామస్సలక్ష్మణః।
స్వవాసమభిచక్రామ పూజ్యమానో మహర్షిభిః। 40

మిథిలాధిపతియైన జనకమహారాజు ఆ మహర్షితో అట్లు పలికి, ఆయనఅనుమతిని పొంది, తన పురోహితులతో, బంధువులతోగూడి ఆయనకు ప్రదక్షిణమొనర్చి, తనభవనమునకు వెళ్లెను. ధర్మాత్ముడైన విశ్వామిత్రుడును మహర్షులచే పూజింపబడి, రామలక్ష్మణులతో తననివాసమునకు చేరెను. (39-40)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచషష్టితమస్సర్గః *(65)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదిఐదవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

66. అఱువదిఆఱవసర్గము

జనకుడు శివధనుస్సుచరిత్రమును తెల్పుట, సీతాదేవిని వివాహమాడగోరివచ్చిన రాజకుమారులతీరుతెన్నులను వివరించుట.

తతః ప్రభాతే విమలే కృతకర్మా నరాధిపః।
విశ్వామిత్రం మహాత్మానమ్ ఆజుహావ సరాఘవమ్। 1

మఱునాడు తెల్లవాఱగనే జనకమహారాజు తనప్రాతః కాలనియమములను నిర్వర్తించుకొని, మహాత్ముడైన విశ్వామిత్రుని, రామలక్ష్మణులను ఆహ్వానించెను. (1)

తమర్చయిత్వా ధర్మాత్మా శాస్త్రదృష్టేన కర్మణా।
రాఘవౌ చ మహాత్మానౌ తదా వాక్యమువాచ హ। 2

ధర్మాత్ముడైన జనకమహారాజు విశ్వామిత్రమహర్షిని, మహాత్ములైన రామలక్ష్మణులను విధివిధానముగా పూజించి, ఆ మహర్షితో ఇట్లనుడివెను. (2)

భగవన్ స్వాగతం తేఽస్తు కిం కరోమి తవానఘ।
భవానాజ్ఞాపయతు మామ్ ఆజ్ఞాప్యో భవతా హ్యహమ్। 3

"పూజ్యుడవైన ఓ బ్రహ్మర్షీ! నీకు స్వాగతము. నేను ఏమి చేయవలెనో ఆజ్ఞాపింపుడు. నేను మీ ఆజ్ఞానువర్తిని." (3)

ఏవముక్తస్స ధర్మాత్మా జనకేన మహాత్మనా।
ప్రత్యువాచ మునిర్వీరం వాక్యం వాక్యవిశారదః। 4

మహానుభావుడైన జనకుడు ఇట్లు ప్రార్థింపగా ధర్మజ్ఞుడు, వాక్చతురుడు ఐన విశ్వామిత్రముని ఆ వీరునకు (జనకునకు) ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (4)

పుత్రౌ దశరథస్యేమౌ క్షత్రియౌ లోకవిశ్రుతౌ।
ద్రష్టుకామౌ ధనుశ్శ్రేష్ఠం యదేతత్ త్వయి తిష్ఠతి। 5

ఏతద్దర్శయ భద్రం తే కృతకామౌ నృపాత్మజౌ।
దర్శనాదస్య ధనుషో యథేష్టం ప్రతియాస్యతః। 6

"ఓ రాజా! వీరు దశరథమహారాజకుమారులు. జగత్ప్రసిద్ధులైన క్షత్రియవీరులు. మీకడనున్న శ్రేష్ఠమైన ధనుస్సును చూడగోరుచున్నారు. నీకు శుభమగుగాక. ఆ చాపమును చూపింపుము. ఈ రాజకుమారులు దానిని దర్శించి, తమ ముచ్చటదీర్చుకొని వెళ్లుదురు." (5-6)

ఏవముక్తస్తు జనకః ప్రత్యువాచ మహామునిమ్।
శ్రూయతామస్య ధనుషో యదర్థమిహ తిష్ఠతి। 7

మునివచనములను విని, జనకుడు ఆ ఋషితో ఇట్లు వచించెను. "ఓ మహాత్మా! ఈ విల్లు మాయింట ఉండుటకు గల ప్రయోజనమునుగూర్చి తెల్పెదను-వినుడు. నిమి వంశమున

దేవరాత ఇతి ఖ్యాతో నిమేష్షష్ఠో మహీపతిః।
న్యాసోఽయం తస్య భగవన్ హస్తే దత్తో మహాత్మనా। 8

దక్షయజ్ఞవధే పూర్వం ధనురాయమ్య వీర్యవాన్।
రుద్రస్తు త్రిదశాన్ రోషాత్ సలీలమిదమబ్రవీత్। 9

యస్మాద్భాగార్థినో భాగాన్నాకల్పయత మే సురాః।
వరాంగాణి మహార్హాణి ధనుషా శాతయామి వః। 10

తతో విమనసస్సర్వే దేవా వై మునిపుంగవ।
ప్రసాదయంతి దేవేశం తేషాం ప్రీతోఽభవద్భవః। 11

ప్రీతియుక్తస్స సర్వేషాం దదౌ తేషాం మహాత్మనామ్।
తదేతద్దేవదేవస్య ధనూరత్నం మహాత్మనః।
న్యాసభూతం తదా న్యస్తమ్ అస్మాకం పూర్వకే విభో। 12

అథ మే కృషతః క్షేత్రం లాంగలాదుత్థితా మయా।
క్షేత్రం శోధయతా లబ్ధా నామ్నా సీతేతి విశ్రుతా। 13

భూతలాదుత్థితా సా తు వ్యవర్ధత మమాత్మజా।
వీర్యశుల్కేతి మే కన్యా స్థాపితేయమ్ అయోనిజా। 14

భూతలాదుత్థితాం తాం తు వర్ధమానాం మమాత్మజామ్।
వరయామాసురాగమ్య రాజానో మునిపుంగవ। 15

తేషాం వరయతాం కన్యాం సర్వేషాం పృథివీక్షితామ్।
వీర్యశుల్కేతి భగవన్ న దదామి సుతామహమ్। 16

తత స్సర్వే నృపతయః సమేత్య మునిపుంగవ।
మిథిలామభ్యుపాగమ్య వీర్యజిజ్ఞాసవస్తదా। 17

తేషాం జిజ్ఞాసమానానాం వీర్యం ధనురుపాహృతమ్।
న శేకుర్గ్రహణే తస్య ధనుషస్తోలనేఽపి వా। 18

తేషాం వీర్యవతాం వీర్యమ్ అల్పం జ్ఞాత్వా మహామునే।
ప్రత్యాఖ్యాతా నృపతయః తన్నిబోధ తపోధన। 19

అఖండచక్రవర్తియైన 'దేవరాతుడు' అను మహారాజు మిగుల ఖ్యాతి వహించినవాడు. మహేశ్వరుడు అతనికి ఈ ధనుస్సును 'న్యాసముగా' ఇచ్చెను. పూర్వము దక్షయజ్ఞమును ధ్వంసమొనర్చు సమయమున మహా పరాక్రమశాలియైన శివుడు లీలగా ఈ ధనుస్సును ఎక్కుపెట్టి, క్రుద్ధుడై దేవతలతో ఇట్లనెను. (7-9)

"ఓ దేవతలారా! హవిర్భాగములను కోరుచున్న నాకు వాటిని సమకూర్చని కారణమున మిక్కిలి శ్రేష్ఠములైన మీ శిరస్సులను ఈ ధనుస్సుతో ఖండించెదను." (10)

అంతట దుఃఖితులైన దేవతలందరును ఆ పరమేశ్వరుని ప్రసన్నునిగా జేసికొనుటకై ఆయనను ప్రార్థించిరి. పిమ్మట శివుడు వారియెడ ప్రసన్నుడాయెను. సంతుష్టుడైన ఆ పరమశివుడు ఈ మహాధనుస్సును దేవతలకు కానుకగా ఇచ్చెను. పిమ్మట వారు మా వంశమున పూర్వజుడైన దేవరాతునకు దీనిని న్యాసముగా సమర్పించిరి. (11-12)

ఒకప్పుడు నేను యాగనిమిత్తమై భూమిని దున్నుచుండగా నాగటిచాలునుండి ఒక కన్య వెలువడెను.[1] నాగటిచాలున లభించినందున ఈమె 'సీత' యని ప్రసిద్ధికెక్కెను. (13)

ఈమె భూమినుండియే ఆవిర్భవించినప్పటికిని నేను ఉపచారములను నెరపుటవలన నాకూతురైనది. అయోనిజయైన ఈ కన్యకు పరాక్రమమే శుల్కము. అనగా పరాక్రమవంతుడు మాత్రమే ఈమెను వివాహము చేసికొనుటకు అర్హుడు. (14)

ఓ మునీశ్వరా! భూతలమునుండి, వెలువడి నా కుమార్తెగా పెరిగిపెద్దదైన ఈమెను పరిణయమాడుటకు పెక్కుమంది రాజకుమారులు విచ్చేసిరి. ఓ పూజ్యుడా! నా కుమార్తెను పెండ్లియాడగోరి వచ్చిన ఆ రాజకుమారులు తగుపరాక్రమశాలురు కానందున ఈమెను ఎవ్వరికిని ఈయలేదు. మునివరా! రాజులందరును కలిసి మిథిలకు వచ్చి, ధనుస్సును ఎక్కుపెట్టి తమపరాక్రమమును పరీక్షించుకొనగోరిరి. అట్లు కుతూహలపడిన వారికి ఆ మహాశివధనుస్సు ప్రదర్శింపబడెను. అప్పుడు వారిలో ఎవ్వరును దానిని ఎక్కుపెట్టలేకపోయిరి సరిగదా కనీసము కదల్పుటకైనను సమర్థులు కాలేకపోయిరి. (15-18)

తపోధనుడవైన ఓ మహామునీ! ఆ వచ్చిన రాకుమారులలో పరాక్రమము స్వల్పమని గ్రహించి, వారికి కన్యనిచ్చుటకు నేను సమ్మతింపలేదు. అనంతరము జరిగిన విశేషములను తెలిపెదను వినుము. (19)

1) 'సీత' అనగా నాగటి చాలు – సీతా లాంగల పద్ధతిః-

తతః పరమకోపేన రాజానో మునిపుంగవ।
న్యరుంధన్ మిథిలాం సర్వే వీర్యసందేహమాగతాః। 20

ఆత్మానమవధూతం తే విజ్ఞాయ నృపపుంగవాః।
రోషేణ మహతాఽఽవిష్టాః పీడయన్ మిథిలాం పురీమ్। 21

తతః సంవత్సరే పూర్ణే క్షయం యాతాని సర్వశః।
సాధనాని మునిశ్రేష్ఠ తతోఽహం భృశ దుఃఖితః। 22

తతో దేవగణాన్ సర్వాన్ తపసాఽహం ప్రసాదయమ్।
దదుశ్చ పరమప్రీతాః చతురంగబలం సురాః। 23

తతో భగ్నా నృపతయో హన్యమానా దిశో యయుః।
అవీర్యా వీర్యసందిగ్ధాః సామాత్యాః పాపకర్మణః। 24

తదేతన్మునిశార్దూల ధనుః పరమభాస్వరమ్।
రామలక్ష్మణయోశ్చాపి దర్శయిష్యామి సువ్రత। 25

యద్యస్య ధనుషో రామః కుర్యాదారోపణం మునే। 26

సుతామ్ అయోనిజాం సీతాం దద్యాం దాశరథేరహమ్। 27

అల్పపరాక్రమవంతులైన ఆ రాజులందఱును మిక్కిలి కుపితులై, మిథిలానగరమును ముట్టడించిరి. ఆ మహారాజులు అందఱును పరాక్రమప్రదర్శనమిషతో తమను అవమానించినట్లుగా భావించి, మిగుల రోషావేశపరులై మిథిలావాసులను అన్నివిధముల బాధింపసాగిరి. ఇట్లు ఒకసంవత్సరము గడువగా నా దుర్గరక్షణ సాధనములన్నియు అన్నివిధముల దెబ్బతినెను. ఓ మునీశ్వరా! అందులకు నేను మిగుల వగచితిని. (20-22)

అనంతరము తపస్సుద్వారా నేను దేవతలనందఱిని ప్రసన్నులను జేసికొంటిని. అందులకు సమస్తదేవతలును పరమప్రీతులై నాకు చతురంగబలములను అనుగ్రహించిరి. ఆ రాజులెల్లరును చావుదెబ్బలు తిన్నవారై భంగపాటునకు లోనైరి. అల్పపరాక్రమశాలురై, పాపకర్ములకు ఒడిగట్టిన వారందరును తేజోహీనులై, మంత్రులతోగూడి నలుదిక్కులకును పాఱిపోయిరి. తపస్సంపన్నుడవైన ఓ మునీశ్వరా! మిక్కిలి ప్రభావముగల ఈ ధనుస్సును రామలక్ష్మణులకును చూపెదను. ఓ మహామునీ! శ్రీరాముడు ఈ శివధనుస్సును ఎక్కుపెట్టినచో అయోనిజయైన నా కూతురగు సీతాదేవిని ఈ దాశరథికి సమర్పింపగలను. (24-27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షట్‌షష్టితమస్సర్గః *(66)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదిఆఱవసర్గము సమాప్తము

— * * * —

67. అఱువదిఏడవసర్గము

శ్రీరాముడు శివధనుర్భంగమొనర్చుట - దశరథుని ఆహ్వానించుటకై జనకుడు మంత్రివర్యులను అయోధ్యకు పంపుట.

జనకస్య వచశ్శ్రుత్వా విశ్వామిత్రో మహామునిః।
ధనుర్దర్శయ రామాయ ఇతిహోవాచ పార్థివమ్। 1

తతస్స రాజా జనకః సామంతాన్ వ్యాదిదేశ హ।
ధనురానీయతాం దివ్యం గంధమాల్యవిభూషితమ్। 2

జనకేన సమాదిష్టాః సచివాః ప్రావిశన్ పురీమ్।
తద్ధనుః పురతః కృత్వా నిర్జగ్ముః పార్థివాజ్ఞయా। 3

నృణాం శతాని పంచాశత్ వ్యాయతానాం మహాత్మనామ్।
మంజూషామ్ అష్టచక్రాం తాం సమూహుస్తే కథంచన। 4

విశ్వామిత్రమహాముని జనకునిపలుకులు విని, ఆ మహారాజుతో "శ్రీరామునకు ఆ శివధనుస్సును చూపుము" అనినుడివెను. (1)

అనంతరము ఆ జనకమహారాజు "గంధపుష్పమాలలతో చక్కగా అలంకృతమైయున్న ఆ దివ్యధనుస్సును ఇక్కడికి చేర్పుడు"- అని కార్యదక్షులైనమంత్రులకు ఆజ్ఞ ఇచ్చెను. (2)

ఆ సచివులు జనకునిఆదేశముమేరకు ధనుస్సును భద్రపఱచిన ప్రదేశమున ప్రవేశించిరి. పిమ్మట రాజు ఆజ్ఞాపించిన విధముగా ఆ ధనువును ముందుంచుకొని, బయటికి వెడలిరి. బలిష్ఠులు, దీర్ఘకాయులు ఐన ఐదువేలమంది పురుషులు ఎనిమిది చక్రములశకటముపైగల ఆ ధనుఃపేటికను మిక్కిలి శ్రమతో ఎట్టకేలకు లాగికొనివచ్చిరి. (3-4)

తామాదాయ తు మంజూషామ్ ఆయసీం యత్ర తద్ధనుః।
సురోపమం తే జనకమ్ ఊచు ర్నృపతిమంత్రిణః। 5

ఆ రాజుగారిమంత్రులు ధనుస్సును భద్రపఱచిన ఇనుప పేటికను తీసికొనివచ్చి, దైవతుల్యుడైన జనకమహారాజుతో ఇట్లువచించిరి. (5)

ఇదం ధనుర్వరం రాజన్ పూజితం సర్వరాజభిః।
మిథిలాధిప రాజేంద్ర దర్శనీయం యదిచ్ఛసి। 6

ఓ మహారాజా! ఈ శ్రేష్ఠమైన ధనుస్సు మహామహులైన రాజులందఱినుండియు పూజలను అందుకొనినది. మిథిలాధిపా! రాజేంద్రా! మీరు అభిలషించినట్లు శ్రీరామునకు చూపదగిన ధనువిదియే. (6)

తేషాం నృపో వచః శ్రుత్వా కృతాంజలిరభాషత।
విశ్వామిత్రం మహాత్మానం తావుభౌ రామలక్ష్మణౌ। 7

వారిమాటలను విని, జనకుడు అంజలిఘటించి, మహాత్ముడైన విశ్వామిత్రునితోడను, రామలక్ష్మణులిరువురితోడను ఇట్లు పలికెను. (7)

ఇదం ధనుర్వరం బ్రహ్మన్ జనకైరభిపూజితమ్।
రాజభిశ్చ మహావీర్యైః అశక్తైః పూరితుం పురా। 8

నైతత్ సురగణాస్సర్వే నాసురా న చ రాక్షసాః।
గంధర్వయక్షప్రవరాః సకిన్నరమహోరగాః। 9

క్వ గతిర్మానుషాణాం తు ధనుషోఽస్య ప్రపూరణే।
ఆరోపణే సమాయోగే వేపనే తోలనేఽపి వా। 10

తదేతద్ధనుషాం శ్రేష్ఠమ్ ఆనీతం మునిపుంగవ।
దర్శయైతన్మహాభాగ అనయో రాజపుత్రయోః। 11

"ఓ బ్రహ్మర్షీ! మాపూర్వికులైన మహారాజులందఱును పూజించుచువచ్చిన దివ్యధనువిది. సీతాదేవిని పరిణయమాడగోరిన మహావీరులైన రాజులు ఈ మహాధనుస్సును ఎక్కుపెట్టలేక చతికిలపడిరి. ఈ శివధనుస్సును వంచుటకును, అల్లెత్రాడును కూర్చుటకును, బాణమును సంధించుటకును, అల్లెత్రాడును లాగుటకును, కనీసము దానిని ఎత్తుటకైనను సమస్తదేవతలుగాని, అసురులుగాని, రాక్షసులుగాని, అగ్రశ్రేణికి చెందిన గంధర్వులు, యక్షులు, కిన్నరులు, నాగులుగాని సమర్థులుకాలేకపోయిరి. ఇక సామాన్యులైన మానవులవిషయము చెప్పనేల? మహాత్ముడవైన ఓ మునీశ్వరా! అట్టి మహాశక్తిమంతమైన ధనుస్సు ఇచటికి చేర్చబడినది. ఈ రాజపుత్రులకు దీనిని చూపింపుడు." (8-11)

విశ్వామిత్రస్తు ధర్మాత్మా శ్రుత్వా జనకభాషితమ్।
వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవమబ్రవీత్। 12

ధర్మాత్ముడైన విశ్వామిత్రుడు జనకునిమాటలను విని, "నాయనా! రామా! ఈ ధనుస్సును చూడుము" అని రఘువరునితో అనెను. (12)

బ్రహ్మర్షేర్వచనాద్రామో యత్ర తిష్ఠతి తద్ధనుః।
మంజూషాం తామ్ అపావృత్య దృష్ట్వా ధనురథాబ్రవీత్। 13

అంతట శ్రీరాముడు మహర్షిఆదేశమును అనుసరించి, ఆ ధనుస్సును భద్రపఱచిన పేటికను తెఱచి, ధనువును జూచి, ఇట్లునుడివెను. (13)

ఇదం ధనుర్వరం బ్రహ్మన్ సంస్పృశామీహ పాణినా।
యత్నవాంశ్చ భవిష్యామి తోలనే పూరణేఽపి వా। 14

బాఢమిత్యేవ తం రాజా మునిశ్చ సమభాషత। 15

"ఓ బ్రహ్మర్షీ! ఇప్పుడే ఈ మహాధనుస్సును చేతితో తాకి చూచెదను. దానిని పైకెత్తి, అల్లెత్రాడును సంధించుటకు పూనుకొనెదను." అందులకు జనకుడును, విశ్వామిత్రుడును 'సరే' యని పలికిరి. (14-15)

లీలయా స ధనుర్మధ్యే జగ్రాహ వచనాన్మునేః।
పశ్యతాం నృసహస్రాణాం బహూనాం రఘునందనః।
ఆరోపయిత్వా ధర్మాత్మా పూరయామాస తద్ధనుః। 16

తద్బభంజ ధనుర్మధ్యే నరశ్రేష్ఠో మహాయశాః।
తస్య శబ్దో మహానాసీత్ నిర్ఘాతసమనిస్వనః। 17

అంతట ఆ రఘునందనుడు వేలకొలది సదస్యులు చూచుచుండగా మునిఆజ్ఞను అనుసరించి, ధనుస్సు మధ్యభాగమును అవలీలగా పట్టుకొనెను. ధనుర్విద్యాకుశలుడు, మహాశక్తిమంతుడు ఐన శ్రీరాముని కరస్పర్శ మాత్రముననే ఆ ధనుస్సు వంగెను. అప్పుడు ఆ నరశ్రేష్ఠుడు వింటినారిని సంధించి, దానిని ఆ కర్ణాంతము లాగెను. వెంటనే ఆ విల్లు ఫెళ్లున విఱిగెను. ఆ ధనుర్భంగ ధ్వని పిడుగుపాటువలె భయంకరముగా ఉండెను. (16-17)

భూమికంపశ్చ సుమహాన్ పర్వతస్యేవ దీర్యతః।
నిపేతుశ్చ నరాస్సర్వే తేన శబ్దేన మోహితాః।
వర్జయిత్వా మునివరం రాజానం తౌ చ రాఘవౌ। 18

ప్రత్యాశ్వస్తే జనే తస్మిన్ రాజా విగతసాధ్వసః।
ఉవాచ ప్రాంజలి ర్వాక్యం వాక్యజ్ఞో మునిపుంగవమ్। 19

భగవన్ దృష్టవీర్యో మే రామో దశరథాత్మజః।
అత్యద్భుతమచింత్యం చ న తర్కితమిదం మయా। 20

జనకానాం కులే కీర్తిమ్ ఆహరిష్యతి మే సుతా।
సీతా భర్తారమాసాద్య రామం దశరథాత్మజమ్। 21

మమ సత్యా ప్రతిజ్ఞా చ వీర్యశుల్కేతి కౌశిక।
సీతా ప్రాణై ర్బహుమతా దేయా రామాయ మే సుతా। 22

భవతోఽనుమతే బ్రహ్మన్ శీఘ్రం గచ్ఛంతు మంత్రిణః।
మమ కౌశిక భద్రం తే అయోధ్యాం త్వరితా రథైః। 23

రాజానం ప్రశ్రితై ర్వాక్యైః ఆనయంతు పురం మమ।
ప్రదానం వీర్యశుల్కాయాః కథయంతు చ సర్వశః। 24

మునిగుప్తౌ చ కాకుత్స్థౌ కథయంతు నృపాయ వై।
ప్రీయమాణం తు రాజానమ్ ఆనయంతు సుశీఘ్రగాః। 25

కౌశికశ్చ తథేత్యాహ రాజా చాభాష్య మంత్రిణః। 26

అయోధ్యాం ప్రేషయామాస ధర్మాత్మా కృతశాసనాన్।
యథావృత్తం సమాఖ్యాతుమ్ ఆనేతుం చ నృపం తదా। 27

పర్వతములు బ్రద్దలైనట్లనిపించెను. భూమి కంపించెను. విశ్వామిత్ర మహర్షియు, జనకమహారాజు, నరోత్తములైన రామలక్ష్మణులు తప్ప మిగిలిన వారందఱును ఆ మహాధ్వనికి మూర్ఛిల్లిపడిపోయిరి. (18)

కొంతతడవునకు ఆ జనులందఱును మూర్ఛనుండి తేఱుకొనిరి. 'శ్రీరాముడు శివధనుస్సును ఎక్కుపెట్టునో లేదో? అతడు తనకు అల్లుడు అగునో కాడో' అని కలవరపడుచున్న జనకునియొక్క మనస్సు కుదుటపడెను. పిమ్మట వాక్చతురుడైన ఆ రాజు అంజలిఘటించి విశ్వామిత్రమునితో ఇట్లనెను. (19)

"ఓ మహాత్మా! దశరథునికుమారుడైన శ్రీరాముని దివ్య పరాక్రమమును ప్రత్యక్షముగా చూచితిని. ఇది అత్యద్భుతమైనది. ఊహలకందనిది, ఇట్లు జరుగునని నేను తలంపనేలేదు. అయోనిజయైన నాకూతురు సీత, దశరథునికుమారుడు, రూపగుణసంపన్నుడు ఐన శ్రీరాముని భర్తగా పొంది, మావంశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేయగలదు.(మా వంశమునే తరింప జేయగలదు.) ఓ కౌశికా! 'పరాక్రమవంతునకే సీత భార్యయగును' అను నా ప్రతిజ్ఞ నెఱవేఱినది. నా కూతురు నాకు ప్రాణములకన్న మిన్నయైనది. మా సీతమ్మ శ్రీరామునకే ఇయ్యదగినది.(20-22)

ఓ బ్రహ్మర్షీ! మీ అనుమతియైనచో నా మంత్రులు రథములపై శీఘ్రముగా అయోధ్యకు వెళ్ళెదరు. దీనివలన మీ కీర్తికాంతులు వెల్లివిరియును. (23)

వారు 'వీర్యశుల్క'యైన సీతాదేవి పరిణయ వృత్తాంతమును వినమ్రవచనములతో దశరథమహారాజుగారికి పూసగ్రుచ్చినట్లు తెలిపి, చక్కగా ఆహ్వానించి, ఆ ప్రభువును మా మిథిలానగరమునకు తీసికొనివత్తురు. (24)

మునీశ్వరులైన మీయొక్క రక్షణలో నున్న రామలక్ష్మణులను గూర్చి ఆ మహారాజునకు వివరించి, సంతృప్తిపఱచి, వారు ఆయనను అతిశీఘ్రముగా దీసికొనివత్తురు." (25)

కౌశికుడు అందులకు తన ఆమోదమును తెలిపెను. అంతట జనకమహారాజు మంత్రులను పిలిపించెను. ధర్మాత్ముడైన ఆ రాజు వారికి శుభాహ్వానపత్రికలను అందజేసెను, జరిగిన వృత్తాంతమునంతయును దశరథునకు వివరించుటకును, ఆయనను తోడ్కొనివచ్చుటకును వారిని అయోధ్యకు పంపెను.(26-27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తషష్టితమస్సర్గః *(67)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదియేడవసర్గము సమాప్తము

-- * * * --

68. అఱువదిఎనిమిదవసర్గము

దశరథుడు జనకునిఆహ్వానమును అందుకొనుట - ఆ శుభవార్తను విని, అందఱును ఆనందించుట.

జనకేన సమాదిష్టా దూతాస్తే క్లాంతవాహనాః।
త్రిరాత్ర ముషితా మార్గే తేఽయోధ్యాం ప్రావిశన్ పురీమ్। 1

రాజ్ఞోభవనమాసాద్య ద్వారస్థాన్ ఇదమబ్రువన్।
శీఘ్రం నివేద్యతాం రాజ్ఞే దూతాన్ నో జనకస్య చ।
ఇత్యుక్తా ద్వారపాలాస్తే రాఘవాయ న్యవేదయన్। 2

తే రాజవచనాద్దూతా రాజవేశ్మ ప్రవేశితాః।
దదృశుర్దేవసంకాశం వృద్ధం దశరథం నృపమ్। 3

బద్ధాంజలిపుటాస్సర్వే దూతా విగతసాధ్వసాః।
రాజానం ప్రయతా వాక్యమ్ అబ్రువన్ మధురాక్షరమ్। 4

మైథిలో జనకో రాజా సాగ్నిహోత్రపురస్కృతమ్।
కుశలం చావ్యయం చైవ సోపాధ్యాయపురోహితమ్। 5

ముహు ర్ముహు ర్మధురయా స్నేహసంయుక్తయా గిరా।
జనకస్త్వాం మహారాజ పృచ్ఛతే సపురస్సరమ్। 6

పృష్ట్వా కుశల మవ్యగ్రం వైదేహో మిథిలాధిపః।
కౌశికానుమతే వాక్యం భవంతమ్ ఇదమబ్రవీత్। 7

పూర్వం ప్రతిజ్ఞా విదితా వీర్యశుల్కా మమాత్మజా।
రాజానశ్చ కృతామర్షాః నిర్వీర్యా విముఖీకృతాః। 8

సేయం మమ సుతా రాజన్ విశ్వామిత్రపురస్సరైః।
యదృచ్ఛయాగతై ర్వీరైః నిర్జితా తవ పుత్త్రకైః। 9

తచ్చ రాజన్ ధనుర్దివ్యం మధ్యే భగ్నం మహాత్మనా।
రామేణ హి మహారాజ! మహత్యాం జనసంసది। 10

జనకమహారాజుయొక్క ఆదేశమును అనుసరించి, ఆ దూతలు మూడుదినములు నిర్విరామముగా ప్రయాణము చేసిరి. ఆ దీర్ఘప్రయాణమునకు వారిరథాశ్వములు పూర్తిగా అలసిపోయెను. ఆ విధముగా వారు పయనించి అయోధ్యా నగరమునకు చేరిరి. (1)

అంతట ఆ రాజదూతలు దశరథునిరాజభవనమునకు చేరి, ద్వారపాలకులతో 'మేము జనకమహారాజ దూతలము. ఈ విషయమును మీ రాజుగారికి త్వరగా తెల్పుడు'-అని నుడివిరి. ఆ ద్వారపాలకులు ఈ సంగతిని దశరథునకు నివేదించిరి. పిమ్మట దశరథునిఅనుమతితో ఆ దూతలు రాజభవనమున ప్రవేశించిరి. పిదప వారు దేవతుల్యుడైన వృద్ధుడగు దశరథమహారాజును దర్శించిరి. (2-3)

అంతట రాజుగారిసౌజన్యమునకు వారు ప్రశాంతచిత్తులైరి. పిదప దూతలు అంజలి ఘటించినవారై, వినయపూర్వకముగా రాజుగారితో ఇట్లు మధురవచనములను పలికిరి. (4)

ఓ మహారాజా! మిథిలాప్రభువైన జనకుడు అగ్నిహోత్ర నిరతుడవైన నీక్షేమమును, మీ పురోహితుల, గురువుల, పరివారములక్షేమసమాచారములను సౌహార్దపూర్వకముగా మధురవచనములతో మఱీమఱీ అరసిరి. (5-6)

మిథిలాధిపతియైన జనకుడు మిక్కిలి శ్రద్ధాసక్తులతో మీ క్షేమసమాచారములను అడిగెను. పిమ్మట విశ్వామిత్ర మహర్షి అనుమతితో ఆ ప్రభువు మీకు ఈ సందేశమును పంపెను. (7)

"ఓ మహారాజా! 'నా కుమార్తెయగు సీతాదేవిని పరాక్రమ శాలియైన రాకుమారుడే వివాహమాడుటకు అర్హుడు' అని లోగడనేను చేసిన ప్రతిజ్ఞ మీరు వినియే యుందురు. గర్వోన్మత్తులైన పెక్కుమంది రాజకుమారులు నా ప్రతిజ్ఞను విని వచ్చుటయు, శివధనుస్సును ఎక్కుపెట్టుటలో విఫలురై వారు ఆగ్రహోదగ్రులై వచ్చినదారి పట్టుటయు, మీకు విదితమే యయుండును. నా భాగ్యవశమున విశ్వామిత్ర మహర్షియు, ఆయనవెంట మీ కుమారులైన రామలక్ష్మణులును మిథిలకు విచ్చేసిరి. వీర్యశుల్కయైన నా కూతురు సీతను మహావీరుడైన శ్రీరాముడు గుణప్రభావముచే గెలుచుకొనెను. (8-9)

ఓ దశరథమహారాజా! మహాత్ముడైన శ్రీరాముడు మహా పురుషులసమక్షమున ఆ దివ్యమైన ధనుస్సును భగ్నము

అస్మై దేయా మయా సీతా వీర్యశుల్కా మహాత్మనే।
ప్రతిజ్ఞాం కర్తుమిచ్ఛామి తదనుజ్ఞాతుమర్హసి। 11

సోపాధ్యాయో మహారాజ పురోహితపురస్సరః।
శీఘ్రమాగచ్ఛ భద్రం తే ద్రష్టుమర్హసి రాఘవౌ। 12

ప్రీతిం చ మమ రాజేంద్ర నిర్వర్తయితుమర్హసి।
పుత్రయోరుభయోరేవ ప్రీతిం త్వమపి లప్స్యసే। 13

ఏవం విదేహాధిపతిః మధురం వాక్యమబ్రవీత్।
విశ్వామిత్రాభ్యనుజ్ఞాతః శతానందమతే స్థితః। 14

దూతవాక్యం తు తచ్ఛ్రుత్వా రాజా పరమహర్షితః।
వసిష్ఠం వామదేవం చ మంత్రిణోఽన్యాంశ్చ సోఽబ్రవీత్। 15

గుప్తః కుశికపుత్రేణ కౌసల్యానందవర్ధనః।
లక్ష్మణేన సహ భ్రాత్రా విదేహేషు వసత్యసౌ। 16

దృష్టవీర్యస్తు కాకుత్స్థో జనకేన మహాత్మనా।
సంప్రదానం సుతాయాస్తు రాఘవే కర్తుమిచ్ఛతి। 17

యది వో రోచతే వృత్తం జనకస్య మహాత్మనః।
పురీం గచ్ఛామహే శీఘ్రం మాభూత్ కాలస్య పర్యయః। 18

మంత్రిణో బాఢమిత్యాహుః సహ సర్వైర్మహర్షిభిః।
సుప్రీతశ్చాబ్రవీద్రాజా శ్వో యాత్రేతి స మంత్రిణః। 19

మంత్రిణస్తాం నరేంద్రస్య రాత్రిం పరమసత్కృతాః।
ఊషుస్తే ముదితాస్సర్వే గుణైస్సర్వైస్సమన్వితాః। 20

గావించెను. అందువలన వీర్యశుల్కయైన నా కూతురు సీతను మహావీరుడైన శ్రీరామునకు ఇచ్చి, నా ప్రతిజ్ఞను పాటింప దలచితిని, అనుమతింప ప్రార్థన. (10-11)

ఓ మహారాజా! మీరు గురువులతోడను, పురోహితులు మున్నగువారితోడనుగూడి శీఘ్రముగా విచ్చేయప్రార్థన. మీకు శుభమగుగాక. ఇచట మీరు రామలక్ష్మణులనుగూడ చూడవచ్చును. ఓ రాజేంద్రా! మా ప్రార్థనను మన్నించి మాకు ఆనందమును గూర్పగలరు. మీ ఇరువురు కుమారుల (రామలక్ష్మణుల) మహానందములో మీరును పాలుపంచుకొనవచ్చును.[1] (12-13)

విశ్వామిత్రునిఆజ్ఞను, శతానందునిసూచనను అనుసరించి, మా జనకమహారాజు ఇట్లు మృదుమధురముగా పలికెను."(14)

జనకునిదూతలుపలికిన వచనములను విని, దశరథమహారాజు పరమానందభరితుడై, వసిష్ఠుడు, వామదేవుడు, మంత్రులు మున్నగు వారితో ఇట్లనుడివెను. (15)

"కౌసల్యానందవర్ధనుడైన శ్రీరాముడు సోదరుడైన లక్ష్మణునితోగూడి విశ్వామిత్రమహర్షిరక్షణలో హాయిగానున్నాడు. వారు ఇప్పుడు విదేహరాజ్యములో (మిథిలానగరమున) కలరు. (16)

మహాత్ముడైన జనకుడు శ్రీరాముని పరాక్రమమును స్వయముగా చూచినవాడై, తనసుతయగు సీతను రాఘవునకు ఇచ్చి పెండ్లిచేయుటకు వేడుకపడుచున్నాడు. (17)

మహానుభావుడైన జనకునిసంకల్పము మీకును సమ్మతమైనచో జాగుచేయక వెంటనే మనము ఆ పట్టణమునకు వెళ్లుదము."(18)

మహర్షులు, మంత్రులు మున్నగువారందఱును 'బాగుబాగు' అని ప్రశంసావచనములను పలికిరి. అంతట దశరథుడు పరమానందభరితుడై 'రేపే ప్రయాణము' అని మంత్రులతో నుడివెను. (19)

దశరథమహారాజుయొక్క మంత్రులందఱును సకల సద్గుణసంపన్నులు. వారు రాజుగారిమెప్పును పొందినవారు. పెండ్లిప్రయాణవార్తలను విని, వారు సంతుష్టులై, ఆ రాత్రిని హాయిగా గడిపిరి. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే అష్టషష్టితమస్సర్గః *(68)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదియెనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

1) మీరు ఇచటికి వచ్చినచో మిమ్ములను దర్శించి మేము సంతోషింతుము. సీతను శ్రీరామునకిచ్చి కన్యాదానమొనర్చి, సీతారాములకల్యాణ మహోత్సవమునుజూచి సంబరపడుదుము. 'ఉభయోఃపుత్రయోరేవ ప్రీతిమ్' అనగా శ్రీరామునకు సీతను, లక్ష్మణునకు ఊర్మిళను ఇచ్చి వివాహములను జరిపించి ఆనందింతుము. మావలె మీరును మహానందదాయకములైన ఈ వేడుకలలో పాల్గొని, కుమారులను కోడండ్రను కనులారగాంచి పరమప్రీతిని పొందవచ్చును.

69. అఱువదితొమ్మిదవసర్గము

జనకునిఆహ్వానముమేరకు దశరథమహారాజు సపరివారముగా మిథిలానగరమునకు చేరుట

తతో రాత్ర్యాం వ్యతీతాయాం సోపాధ్యాయస్సబాంధవః।
రాజా దశరథో హృష్టః సుమంత్రమ్ ఇదమబ్రవీత్। 1

అద్య సర్వే ధనాధ్యక్షా ధనమాదాయ పుష్కలమ్।
వ్రజంత్వగ్రే సువిహితా నానారత్నసమన్వితాః। 2

చతురంగబలం చాపి శీఘ్రం నిర్యాతు సర్వశః।
మమాజ్ఞాసమకాలం చ యానయుగ్యమ్ అనుత్తమమ్। 3

వసిష్ఠో వామదేవశ్చ జాబాలిరథ కాశ్యపః।
మార్కండేయస్సుదీర్ఘాయుః ఋషిః కాత్యాయనస్తథా। 4

ఏతే ద్విజాః ప్రయాంత్వగ్రే స్యందనం యోజయస్వ మే।
యథా కాలాత్యయో న స్యాత్ దూతా హి త్వరయంతి మామ్। 5

వచనాత్తు నరేంద్రస్య సా సేనా చతురంగిణీ।
రాజానమ్ ఋషిభిస్సార్ధం వ్రజంతం పృష్ఠతోఽన్వగాత్। 6

గత్వా చతురహం మార్గం విదేహానభ్యుపేయివాన్।
రాజా తు జనకశ్శ్రీమాన్ శ్రుత్వా పూజామకల్పయత్। 7

తతో రాజానమాసాద్య వృద్ధం దశరథం నృపమ్।
జనకో ముదితో రాజా హర్షం చ పరమం యయౌ। 8

ఉవాచ చ నరశ్రేష్ఠో నరశ్రేష్ఠం ముదాన్వితః।
స్వాగతం తే మహారాజ దిష్ట్యా ప్రాప్తోఽసి రాఘవ।
పుత్త్రయో రుభయోః ప్రీతిం లప్స్యసే వీర్యనిర్జితామ్। 9

దిష్ట్యా ప్రాప్తో మహాతేజా వసిష్ఠో భగవాన్ ఋషిః।
సహ సర్వైర్ద్విజశ్రేష్ఠైః దేవైరివ శతక్రతుః। 10

ఆ రాత్రి గడచినపిమ్మట ప్రభాతవేళ దశరథమహారాజు గురువులతో బంధువులతోగూడినవాడై, హర్షోల్లాసములను ప్రకటించుచు సుమంత్రునితో ఇట్లనెను. (1)

"కోశాధికారులు అందఱును సమృద్ధిగా ధనమును దీసికొని, వివిధములగు రత్నములను, బంగారు ఆభరణములు మొదలగు పెండ్లివేడుకలకు కావలసిన సమస్తవస్తువులను సమకూర్చుకొని, సర్వసన్నద్ధులై ముందుగా వెళ్లవలెను. పల్లకీలు మొదలగు వివిధములగు వాహనములతోగూడి, చతురంగబలములు వేగముగా ముందునకు సాగిపోవలెను. ఇది రాజాజ్ఞ. వసిష్ఠమహర్షియు, వామదేవుడును, జాబాలియు, కాశ్యపుడును, చిరంజీవియైన మార్కండేయ మహర్షియు, కాత్యాయనుడును, అట్లే ఈ బ్రాహ్మణోత్తములును తగువిధముగా ముందుభాగమున సాగిపోవుచుందురుగాక. ఏమాత్రమును జాగుచేయక నారథమును సిద్ధపఱచుము. జనకుని దూతలు తొందరపెట్టుచున్నారు." (2-5)

దశరథమహారాజు ఋషులుమున్నగువారితోగూడి ప్రయాణము చేయుచుండగా చతురంగబలములు రాజాజ్ఞను అనుసరించి, ఆయనవెంటనడిచెను. (6)

దశరథుడు తనవారితోగూడి నాలుగుదినములు ప్రయాణము చేసి, మిథిలానగరమునకు చేరెను. సద్గుణసంపన్నుడైన జనకమహారాజు దశరథుని ఆగమనవార్తనువిని ఎదురేగి, వారికి అతిథిసత్కారములను నెఱపెను. దశరథుడు సపరివారముగా విచ్చేసినందులకు జనకుడు మిక్కిలి సంతుష్టుడై, వృద్ధుడైన ఆ మహారాజును సమీపించి, త్వరలో వివాహ శుభకార్యక్రమములు జరుగునని భావించి, తనహర్షమును ప్రకటించెను. (7-8)

పిమ్మట జనకమహారాజు దశరథమహారాజును ఉద్దేశించి సంతోషముతో ఇట్లనెను. "రఘువంశజుడవైన ఓ దశరథ మహారాజా! మీకు స్వాగతము. మీరు ఇచ్చటికి విచ్చేయుట మా అదృష్టవశము. మీకుమారులిరువురును తమ పరాక్రమమును ప్రకటించి, పొందినప్రీతిని మీరును అనుభవింపగలరు. దేవతలతోగూడివచ్చిన ఇంద్రునివలె సమస్తబ్రాహ్మణోత్తములతో గూడి, పూజ్యుడు, మహాతేజస్వియు ఐన వసిష్ఠమహర్షి ఇచటికి విచ్చేయుట మాభాగ్యము. (9-10)

దిష్ట్యా మే నిర్జితా విఘ్నా దిష్ట్యా మే పూజితం కులమ్।
రాఘవైః సహ సంబంధాత్ వీర్యశ్రేష్ఠైర్మహాత్మభిః। 11

శ్వః ప్రభాతే నరేంద్రేంద్ర నిర్వర్తయితుమర్హసి।
యజ్ఞస్యాంతే నరశ్రేష్ఠ వివాహమ్ ఋషిసమ్మతమ్। 12

తస్య తద్వచనం శ్రుత్వా ఋషిమధ్యే నరాధిపః।
వాక్యం వాక్యవిదాం శ్రేష్ఠః ప్రత్యువాచ మహీపతిమ్। 13

ప్రతిగ్రహో దాతృవశః శ్రుతమేతన్మయా పురా।
యథా వక్ష్యసి ధర్మజ్ఞ తత్కరిష్యామహే వయమ్। 14

ధర్మిష్ఠం చ యశస్యం చ వచనం సత్యవాదినః।
శ్రుత్వా విదేహాధిపతిః పరం విస్మయమాగతః। 15

తతః సర్వే మునిగణాః పరస్పర సమాగమే।
హర్షేణ మహతా యుక్తాః తాం నిశామవసన్ సుఖమ్। 16

అథరామో మహాతేజా లక్ష్మణేన సమం యయౌ।
విశ్వామిత్రం పురస్కృత్య పితుః పాదావుపస్పృశన్। 17

రాజా చ రాఘవౌ పుత్త్రౌ నిశామ్య పరిహర్షితః।
ఉవాస పరమప్రీతో జనకేన సుపూజితః। 18

జనకోఽపి మహాతేజాః క్రియాం ధర్మేణ తత్త్వవిత్।
యజ్ఞస్య చ సుతాభ్యాం చ కృత్వా రాత్రిమువాస హ। 19

కన్యాదానమునకు ప్రతిబంధకములైన విఘ్నములన్నియును మా భాగ్యవశమున తొలగిపోయినవి. పరాక్రమవంతులలో శ్రేష్ఠులును, మహానుభావులును ఐన రఘువంశమువారితో బంధుత్వము ఏర్పడుటవలన మా వంశమే పునీతమైనది, దాని ప్రతిష్ఠ ఇనుమడించినది. (11)

ఓ నరవరా! మహారాజా! రేపు ప్రభాతసమయమున దీక్షతో కొనసాగుచున్న నాయజ్ఞము ముగిసినపిమ్మట ఋషులు సమ్మతించిన విధముగా వివాహము జరిపింతము." (12)

ఋషులసమక్షమున జనకుడు పలికినవచనములను విని, వాక్చతురుడైన దశరథుడు మిథిలాధిపతితో ఇట్లనుడివెను. (13)

"ధర్మజ్ఞుడవైన ఓ జనకరాజా! 'దానమును స్వీకరించుట దాతనిర్ణయముపై ఆధారపడియుండును'-[1] అని నేను విని యుంటిని. కావున మీరు సూచించినట్లే కావింతము." (14)

సత్యవచనుడైన దశరథుడు ధర్మయుక్తములును, యశస్కరములును ఐన వచనములను పలుకగా విని, ఆయన వినయమునకు ఆ మిథిలాధిపతి మిక్కిలి అబ్బురపడెను.(15)

అంతట ఆ మునీశ్వరులందఱును పరస్పరము కలిసికొని నందులకు పరమసంతుష్టులై, ఆ రాత్రియంతయును హాయిగా గడిపిరి. (16)

పిమ్మట మహాపరాక్రమశాలియైన శ్రీరాముడు లక్ష్మణునితో గూడి విశ్వామిత్రునివెంట తమ తండ్రియగు దశరథుని కడకు వెళ్ళెను. వారు ఇరువురును తండ్రికి పాదాభివందనమొనర్చిరి. దశరథుడు తనకుద్దరు కుమారులను జూచి మిక్కిలి మురిసి పోయెను. అతడు జనకుని అతిథిసత్కారములకు పరమప్రీతుడై ఆ రాత్రి గడిపెను. (17-18)

మహాతేజస్వియు, బాగుగా ధర్మరహస్యములను ఎఱిగిన వాడును ఐన జనకమహారాజు మిగిలిన యజ్ఞకార్యములను ముగించుకొని, పిమ్మట ఇరువురుకుమార్తెలకు (సీతాదేవికి, ఊర్మిళకు) సంబంధించిన అంకురార్పణము మొదలగు శుభకర్మలను ఆచరించెను, ఆ రాత్రి హాయిగా గడిపెను. (19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకోనసప్తతితమస్సర్గః *(69)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు అఱువదితొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

1) "అడిన్ శ్రీసతికొప్పుపై ---- నాత్మమర్యాదనెజెందుకరంబు క్రిందగుటమీదై నాకరంబుంట మేల్గాదే"
ఆ లక్ష్మీనాథుని (శ్రీమహావిష్ణువు) యొక్క చేయిక్రిందనుండుట నా (మహాదాతయైన బలిచక్రవర్తి) చేయి పైన ఉండుట గొప్పవిషయముగదా! అనగా దానము పుచ్చుకొనువారికంటెను దానముచేయువారిదే (దాతదే)పైచేయి. - ఆంధ్రమహా (పోతన) భాగవతము - 8వ స్కంధము-591వ పద్యము.

70. డెబ్బదియవసర్గము

జనకమహారాజు తనసోదరుడగు కుశధ్వజుని పిలిపించుట - వసిష్ఠుడు ఇక్ష్వాకువంశ చరిత్రమును వివరించుట.

తతః ప్రభాతే జనకః కృతకర్మా మహర్షిభిః।
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః శతానందం పురోహితమ్। 1

భ్రాతా మమ మహాతేజా యవీయానతిధార్మికః।
కుశధ్వజ ఇతి ఖ్యాతః పురీమ్ అధ్యవసత్ శుభామ్। 2

వార్యాఫలక పర్యంతాం పిబన్నిక్షుమతీం నదీమ్।
సాంకాశ్యాం పుణ్యసంకాశాం విమానమివ పుష్పకమ్। 3

తమహం ద్రష్టుమిచ్ఛామి యజ్ఞగోప్తా స మే మతః।
ప్రీతిం సోఽపి మహాతేజా ఇమాం భోక్తా మయా సహ। 4

ఏవముక్తేతు వచనే శతానందస్య సన్నిధౌ।
ఆగతాః కేచిదవ్యగ్రా జనకస్తాన్ సమాదిశత్। 5

శాసనాత్తు నరేంద్రస్య ప్రయయుః శీఘ్రవాజిభిః।
సమానేతుం నరవ్యాఘ్రం విష్ణుమింద్రాజ్ఞయా యథా। 6

సాంకాశ్యాం తే సమాగత్య దదృశుశ్చ కుశధ్వజమ్।
న్యవేదయన్ యథావృత్తం జనకస్య చ చింతితమ్।
తద్వృత్తం నృపతిః శ్రుత్వా దూతశ్రేష్ఠైర్మహాబలైః। 7

ఆజ్ఞయాథ నరేంద్రస్య ఆజగామ కుశధ్వజః।
స దదర్శ మహాత్మానం జనకం ధర్మవత్సలమ్। 8

సోఽభివాద్య శతానందం రాజానం చాపి ధార్మికమ్।
రాజార్హం పరమం దివ్యమ్ ఆసనం చాధ్యరోహత। 9

మఱునాడు ప్రాతఃకాలమున జనకమహారాజు మహర్షుల పర్యవేక్షణమున యజ్ఞకర్మలను ముగించెను. పిమ్మట వాక్చతురుడైన ఆ రాజు పురోహితుడైన శతానందునితో ఇట్లనుడివెను. (1)

"ఓ మహర్షీ! నా తమ్ముడగు కుశధ్వజుడు మహా పరాక్రమశాలి, పరమధార్మికుడుగా ఖ్యాతికెక్కినవాడు. ఇప్పుడతడు ఇక్షుమతీనదీతీరమున గల సాంకాశ్యనగరమున నివసించుచున్నాడు. నలువైపుల బురుజులుగల ఆ నగరమును శత్రువుల నుండి రక్షించుటకై చుట్టును గొప్పయంత్రములు ఏర్పఱుపబడి యున్నవి. ఆ పట్టణము పుష్పక విమానమువలె విస్తృతమైనది, పుణ్యఫలములనిచ్చు అమరావతివలె సుందరమైనది. (2-3)

అతడు సాంకాశ్యనగరమునుండియే నా యజ్ఞమునకు కావలసిన సామగ్రిని పంపి, యాగనిర్వహణకు తోడ్పడెను. ఈ శుభసమయమున సర్వసమర్థుడైన అతడు నా చెంత నుండుట ఎంతేని అవసరము. అతడును నాతోగూడి పెండ్లి వేడుకలలో పాల్గొని మిగుల ఆనందింపగలడు."[1] (4)

జనకుడు శతానందునితో ఇట్లు పలుకుచున్నంతలో కొందఱు ధైర్యోత్సాహములు గలవారు అచటికి వచ్చిసిరి. పిమ్మట ఆ మహారాజు వారిని ఆదేశించెను. ఇంద్రునియాజ్ఞతో ఆయన దూతలు విష్ణుమూర్తికడకేగినట్లు, జనకుని ఆదేశమును అనుసరించి ఆదూతలు కుశధ్వజుని గొనివచ్చుటకై మిక్కిలి వేగముగా సాగిపోగల అశ్వములను అధిరోహించి బయలుదేఱిరి. (5-6)

వారు సాంకాశ్యనగరమును జేరి, కుశధ్వజుని దర్శించిరి. పిదప జనకునిసందేశమును యథాతథముగా ఆయనకు నివేదించిరి. మహాబలశాలురైన ఆ దూతలు తెచ్చినసందేశమును కుశధ్వజుడు సావధానముగా వినెను. జనకునియాజ్ఞమేరకు కుశధ్వజుడు వెంటనే మిథిలకు వచ్చెను. పరమధార్మికుడు, మహాత్ముడు ఐన జనకుని జూచెను. ధర్మస్వరూపుడైన జనకునకును, శతానందమహర్షికిని నమస్కరించి, అతడు వారి అనుమతి గైకొని, రాజోచితమైన శ్రేష్ఠమగు ఒక దివ్యాసనమును అలంకరించెను. (7-9)

1) జనకుడు తనకూతురైన సీతాదేవిని శ్రీరామునకిచ్చి వివాహము చేయుసమయముననే తనతమ్ముడైన కుశధ్వజునియొక్క కుమార్తెలగు ఊర్మిళా మాండవీ శ్రుతకీర్తులను లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకిచ్చి వివాహము జరిపింపవలెనని ఆయనసంకల్పము. కన్యాదాతగా తాను ఆనందించినట్లే, కుశధ్వజుడుగూడ కన్యాదాతయై ఆనందించునని జనకుని భావన.

ఉపవిష్టావుభౌ తౌ తు భ్రాతరావతితేజసా ।
ప్రేషయామాసతుర్వీరౌ మంత్రిశ్రేష్ఠం సుదామనమ్ । 10

గచ్ఛ మంత్రిపతే శీఘ్రమ్ ఐక్ష్వాకుమ్ అమితప్రభమ్ ।
ఆత్మజైః సహ దుర్ధర్షమ్ ఆనయస్వ సమంత్రిణమ్ । 11

ఔపకార్యం స గత్వా తు రఘూణాం కులవర్ధనమ్ ।
దదర్శ శిరసా చైనమ్ అభివాద్యేదమబ్రవీత్ । 12

అయోధ్యాధిపతే వీర వైదేహో మిథిలాధిపః ।
స త్వాం ద్రష్టుం వ్యవసితః సోపాధ్యాయ పురోహితమ్ । 13

మంత్రిశ్రేష్ఠవచః శ్రుత్వా రాజా సర్షిగణస్తదా ।
సబంధురగమత్ తత్ర జనకో యత్ర వర్తతే । 14

స రాజా మంత్రిసహితః సోపాధ్యాయస్సబాంధవః ।
వాక్యం వాక్యవిదాం శ్రేష్ఠో వైదేహమ్ ఇదమబ్రవీత్ । 15

విదితం తే మహారాజ ఇక్ష్వాకుకులదైవతమ్ ।
వక్తా సర్వేషు కృత్యేషు వసిష్ఠో భగవాన్ ఋషిః । 16

విశ్వామిత్రాభ్యనుజ్ఞాతః సహ సర్వైర్మహర్షిభిః ।
ఏష వక్ష్యతి ధర్మాత్మా వసిష్ఠో మే యథాక్రమమ్ । 17

ఏవ ముక్త్వా నరశ్రేష్ఠే రాజ్ఞాం మధ్యే మహాత్మనామ్ ।
తూష్ణీంభూతే దశరథే వసిష్ఠో భగవాన్ ఋషిః ।
ఉవాచ వాక్యం వాక్యజ్ఞో వైదేహం సపురోధసమ్ । 18

అవ్యక్తప్రభవో బ్రహ్మా శాశ్వతో నిత్య అవ్యయః । 19

తస్మాన్మరీచిః సంజజ్ఞే మరీచేః కాశ్యపస్సుతః ।
వివస్వాన్ కాశ్యపాజ్జజ్ఞే మనుర్వైవస్వతః స్మృతః । 20

మనుః ప్రజాపతిః పూర్వమ్ ఇక్ష్వాకుస్తు మనోః సుతః ।
తమిక్ష్వాకుమ్ అయోధ్యాయాం రాజానం విద్ధి పూర్వకమ్ । 21

ఇక్ష్వాకోఽస్తు సుతశ్శ్రీమాన్ కుక్షిరిత్యేవ విశ్రుతః ।
కుక్షేరథాత్మజశ్శ్రీమాన్ వికుక్షిరుదపద్యత । 22

వికుక్షేస్తు మహాతేజా బాణః పుత్రః ప్రతాపవాన్ ।
బాణస్య తు మహాతేజా అనరణ్యః ప్రతాపవాన్ । 23

మిక్కిలి బలశాలురును, వీరులును, ఆసనములను అలంకరించియున్న వారును ఐన ఆ సోదరులు (జనక కుశధ్వజులు) ఇరువురును మహామంత్రియైన సుదామునిని ఇట్లు ఆదేశించి, దశరథుని కడకు పంపిరి. (10)

"ఓ మహామంత్రీ! మిక్కిలి తేజశ్శాలియైన ఇక్ష్వాకువంశజుడగు దశరథునికడకు శీఘ్రముగా వెళ్ళుము. అజేయుడైన ఆ మహారాజును, ఆయనకుమారులను, మంత్రులను తోడ్కొని రమ్ము." (11)

ఆ మంత్రి దశరథునివిడిదికేగి, రఘువంశవర్ధనుడైన ఆ మహారాజును దర్శించి, ఆయనకు శిరసా ప్రణమిల్లి, ఇట్లు నివేదించెను. (12)

"మహావీరుడవైన ఓ అయోధ్యాప్రభూ! మిథిలాధిపతియైన జనకమహారాజు మిమ్ములను, మీ కుమారులను, గురువులను, పురోహితులు మొదలగు వారిని చూడవేడుకపడుచున్నాడు." (13)

మంత్రివర్యునివచనములను విని, దశరథమహారాజు ఋషులు, బంధువులు మొదలగువారితోగూడి జనకునికడకుచేరెను. (14)

వాక్చతురుడైన దశరథుడు మంత్రులతో, గురువులతో, బంధువులతోగూడి వచ్చి విదేహాధిపునితో ఇట్లు నుడివెను. (15)

ఓ జనకమహారాజా! 'ఇక్ష్వాకువంశమువారికి గురువు, పూజ్యుడు ఐన వసిష్ఠమహర్షి మాసమస్తకార్యములను నిర్దేశించు వాడు' అని మీరు ఎఱుగుదురు. (16)

ధర్మజ్ఞుడైన వసిష్ఠమహర్షి విశ్వామిత్రునిఆజ్ఞనుబడసి, మహర్షులందఱితోగూడి మావంశక్రమమును తెలుపగలడు. (17)

నరేంద్రుడైన దశరథుడు రాజుల సమక్షమున, మహాపురుషుల యెదుట ఈ విధముగా పలికి మిన్నకుండగా, వాక్చతురుడును, పూజ్యుడును ఐన వసిష్ఠమహర్షి పురోహితులతోగూడియున్న జనకునితో ఇట్లు పలికెను. (18)

అవ్యక్తమైన పరబ్రహ్మమునుండి బ్రహ్మదేవుడు జన్మించెను. అతడు శాశ్వతుడు, నిత్యుడు, నాశరహితుడు. ఆ బ్రహ్మదేవుని నుండి మరీచి పుట్టెను. మరీచిసుతుడు కాశ్యపుడు. కాశ్యపుని వలన సూర్యుడు (వివస్వంతుడు) జన్మించెను. సూర్యుని కుమారుడు వైవస్వతమనువు. ఈ మనువే మొదటి ప్రజాపతి, అతడు మహారాజు. మనువుపుత్రుడు ఇక్ష్వాకువు. మొదటి అయోధ్యాధిపతి ఈ ఇక్ష్వాకుప్రభువే. 'కుక్షి' యనువాడు ఇక్ష్వాకుపుత్రుడు. అతడు సర్వశుభలక్షణశోభితుడుగా వాసిగాంచెను. సర్వసద్గుణ సంపన్నుడైన 'వికుక్షి' అనువాడు 'కుక్షి' సుతుడు. వికుక్షిసూనుడు బాణుడు. అతడు మిక్కిలి తేజస్వి, ప్రతాపశాలి. మిక్కిలి తేజస్వియు, పరాక్రమశాలియు

అనరణ్యాత్ పృథుర్జజ్ఞే త్రిశంకుస్తు పృథో స్సుతః।
త్రిశంకోరభవత్ పుత్రో ధుంధుమారో మహాయశాః।
ధుంధుమారాన్మహాతేజా యువనాశ్వో వ్యజాయత। 24

యువనాశ్వసుతస్త్వాసీత్ మాంధాతా పృథివీపతిః।
మాంధాతుస్తు సుతశ్శ్రీమాన్ సుసంధిరుదపద్యత। 25

సుసంధేరపి పుత్రౌ ద్వౌ ధ్రువసంధిః ప్రసేనజిత్।
యశస్వీధ్రువసంధిస్తు భరతోనామ నామతః।
భరతాత్తు మహాతేజా అసితోనామ జాతవాన్। 26

యస్యైతే ప్రతిరాజాన ఉదపద్యంత శత్రవః।
హైహయాస్తాలజంఘాశ్చ శూరాశ్చ శశిబిందవః। 27

తాంస్తు స ప్రతియుధ్యన్ వై యుద్ధే రాజా ప్రవాసితః।
హిమవంతమ్ ఉపాగమ్య భృగుప్రస్రవణేఽ వసత్। 28

అసితోఽల్పబలో రాజా మంత్రిభిః సహితస్తదా।
ద్వే చాస్య భార్యే గర్భిణ్యౌ బభూవతురితి శ్రుతమ్। 29

ఏకా గర్భవినాశాయ సపత్న్యై సగరం దదౌ। 30

తతశ్శైలవరం రమ్యం బభూవాభిరతో మునిః।
భార్గవశ్చ్యవనో నామ హిమవంతముపాశ్రితః। 31

తత్రైకా తు మహాభాగా భార్గవం దేవవర్చసమ్।
వవందే పద్మపత్రాక్షీ కాంక్షంతీ సుతమాత్మనః। 32

తమ్ ఋషిం సాభ్యుపాగమ్య కాళిందీ చాభ్యవాదయత్।
స తామభ్యవదద్విప్రః పుత్రేప్సుం పుత్రజన్మని। 33

తవ కుక్షౌ మహాభాగే సుపుత్రస్సుమహాబలః।
మహావీర్యో మహాతేజా అచిరాత్ సంజనిష్యతి। 34

గరేణ సహిత శ్శ్రీమాన్ మాశుచః కమలేక్షణే। 35

చ్యవనం తు నమస్కృత్య రాజపుత్రీ పతివ్రతా।
పతిశోకాతురా తస్మాత్ పుత్రం దేవీ వ్యజాయత। 36

సపత్న్యా తు గరస్తస్యై దత్తో గర్భజిఘాంసయా।
సహ తేన గరేణైవ జాత స్స సగరోఽభవత్। 37

ఐన అనరణ్యుడు బాణునితనూజుడు. అనరణ్యునిఆత్మజుడు పృథువు. పృథువుయొక్క సుతుడు త్రిశంకువు. త్రిశంకువుయొక్క పుత్రుడు ధుంధుమారుడు. ధుంధుమారునికుమారుడు 'యువనాశ్వుడు'. (19-24)

'మాంధాత' అను చక్రవర్తి యువనాశ్వుని కుమారుడు. సద్గుణసంపన్నుడైన 'సుసంధి' మాంధాతసుతుడు. ధ్రువసంధి, ప్రసేనజిత్తు అను ఇరువురును సుసంధి పుత్రులు. ధ్రువసంధిసుతుడు భరతుడు, అతడు మహాయశస్వి. మిక్కిలి పరాక్రమశాలియైన అసితుడు భరతుని తనూజుడు. (25-26)

శూరులైన హైహయ, తాలజంఘ, శశిబిందు వంశములకు చెందిన రాజులు ఈ అసితునకు శత్రువులైరి. అసితుడు యుద్ధమున వారిని ఎదుర్కొనలేక పరాజితుడై, తనరాజ్యమును విడిచిపెట్టిపోయెను. రణరంగమున బలములన్నియు దెబ్బతినగా అసితుడు తనఇరువురు భార్యలతోను, మంత్రులతోను హిమవత్పర్వతమునకు చేరి, భృగుప్రస్రవణమున నివసించుచు అచటనే అతడు కాలధర్మమునందెను. అసితుడు మరణించునప్పటికే అతని ఇద్దరు భార్యలును గర్భవతులైయుండిరి. ఆ ఇరువురిలో ఒక రాణి తనసవతిగర్భమును నశింపజేయుటకై ఆమెకు (కాళిందికి) విషాహారమును ఇచ్చెను. (27-30)

ఆ సమయమున భృగుమహర్షికుమారుడైన చ్యవనముని పర్వతరాజమైన హిమవంతముపైగల ఆదరముతో అచటికి చేరెను. అసితుని భార్యలలో ఉత్తమురాలైన కాళింది పుత్రసంతానమును గోరుచున్నదై దివ్యవర్చస్సుగల చ్యవనునకు నమస్కరించెను. ఆ కాళింది ఆ మహర్షిని శరణుజొచ్చి, ఆయనకు సేవలు చేయసాగెను. (31-32)

అప్పుడు పుత్రసంతానమును గోరుచు తనకు సేవలొనర్చుచున్న ఆ రాణితో ఆ విప్రుడిట్లనెను. "ఓ పుణ్యాత్మురాలా! త్వరలో నీకు ఒక చక్కనికుమారుడు కలుగును. అతడు మహాబలశాలియు, మిక్కిలి పరాక్రమవంతుడును, గొప్పతేజోమూర్తియు అగును. ఓ తల్లీ! అతడు సర్వశక్తిసంపన్నుడు, నీసవతి ప్రయోగించిన విషాహారము నీగర్భస్థశిశువును ఏమియు చేయజాలదు, శోకింపకుము." (33-35)

పతిమృతికై శోకించుచున్నదియు, పతివ్రతయు, రాకుమారియు ఐన ఆ అసితునిభార్య చ్యవనమహర్షిని సేవించి, ఆయన అనుగ్రహమునకు పాత్రురాలై, ఒక పుత్రుని గనెను. కాళిందీదేవిగర్భవిచ్ఛిత్తికై ఆమెసవతి ఆమెకు గరమును (విషాహారమును) ఇచ్చియుండెను. గర(విష) ప్రయోగానంతరము పుట్టిన వాడు గావున అతడు 'సగరుడు' అను పేరుతో ప్రసిద్ధికెక్కెను. (36-37)

సగరస్యాసమంజస్తు అసమంజాత్ తథాంశుమాన్।
దిలీపోఽంశుమతః పుత్త్రో దిలీపస్య భగీరథః। 38

భగీరథాత్ కకుత్స్థశ్చ కకుత్స్థస్య రఘుస్సుతః।
రఘోస్తు పుత్త్రస్తేజస్వీ ప్రవృద్ధః పురుషాదకః। 39

కల్మాషపాదో హ్యభవత్ తస్మాజ్జాతస్తు శంఖణః।
సుదర్శనశ్శంఖణస్య అగ్నివర్ణ స్సుదర్శనాత్। 40

శీఘ్రగస్త్వగ్నివర్ణస్య శీఘ్రగస్య మరుస్సుతః।
మరోః ప్రశుశ్రుక స్త్వాసీత్ అంబరీషః ప్రశుశ్రుకాత్। 41

అంబరీషస్య పుత్త్రోఽభూత్ నహుషః పృథివీపతిః।
నహుషస్య యయాతిస్తు నాభాగస్తు యయాతిజః। 42

నాభాగస్య బభూవాజో అజా ద్దశరథోఽభవత్।
అస్మా ద్దశరథా జ్జాతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ। 43

ఆదివంశ విశుద్ధానాం రాజ్ఞాం పరమధర్మిణామ్।
ఇక్ష్వాకుకుల జాతానాం వీరాణాం సత్యవాదినామ్। 44

రామలక్ష్మణయోరర్థే త్వత్సుతే వరయే నృప।
సదృశాభ్యాం నరశ్రేష్ఠ సదృశే దాతుమర్హసి। 45

సగరునికుమారుడు అసమంజుడు. ఆయనసుతుడు అంశుమంతుడు. ఆయునిపుత్త్రుడు దిలీపుడు. భగీరథుడు దిలీపునికుమారుడు. భగీరథునితనయుడు కకుత్స్థుడు. అతనితనూజుడు రఘుమహారాజు. రఘుమహారాజు యొక్క సూనుడు ప్రవృద్ధుడు. అతడు వసిష్ఠునిశాపమువలన నరమాంసభక్షకుడై రాక్షసుడయ్యెను. అందులకు ప్రతీకారముగా ప్రవృద్ధుడు వసిష్ఠుని శపించుటకై జలములను చేతబట్టెను. భార్య నివారించుటచే ఆ జలములను తనపాదములపై చల్లుకొనుటవలన అతనికి "కల్మాషపాదుడు" అని పేరు ఏర్పడెను. అతని కుమారుడు శంఖణుడు. శంఖణుని పుత్త్రుడు సుదర్శనుడు. ఆయన సుతుడు అగ్నివర్ణుడు. (38-40)

అతని తనూజుడు శీఘ్రగుడు. శీఘ్రగుని సూనుడు మరువు. మరువుయొక్క ఆత్మజుడు ప్రశుశ్రుకుడు. ఆయన పుత్త్రుడు అంబరీషుడు. నహుషమహారాజు అంబరీషుని తనయుడు. నహుషునికొడుకు యయాతి. అతనికుమారుడు నాభాగుడు. ఆయునతనూజుడు అజుడు. అజమహారాజు పుత్త్రుడే దశరథుడు. రామలక్ష్మణులు అను సోదరులిరువురును ఈ దశరథమహారాజు యొక్కతనయులు. (41-43)

ఇక్ష్వాకురాజవంశము మొదటినుండియు అతి పవిత్రమైనది. ఆ వంశమున జన్మించిన రాజులందఱును పరమధార్మికులు, వీరులు, సత్యసంధులు, ఓ రాజా! ఆ మహావంశసంజాతులైన ఈ రామలక్ష్మణులకు మీ కుమార్తెలైన సీతా-ఊర్మిళలను ఇచ్చి వివాహముజరిపించుట ఎంతేని యుక్తము. వంశవైభవము వలనను, సద్గుణసౌశీల్యములచేతను, ఈడుజోడులను బట్టియు, ఈ రాజకుమారులును, మీ కుమార్తెలును పెండ్లియాడుటకు పరస్పరము తగినవారు. (44-45)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తతితమస్సర్గః *(70)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు డెబ్బదియవసర్గము సమాప్తము

-- * * * --

71. డెబ్బదియొకటవసర్గము

జనకమహారాజు దశరథునిసమక్షమున వసిష్ఠునకు తనవంశవృత్తాంతమును పూర్తిగా చెప్పుట-

ఏవం బ్రువాణం జనకః ప్రత్యువాచ కృతాంజలిః।
శ్రోతుమర్హసి భద్రం తే కులం నః పరికీర్తితమ్। 1

ఈ విధముగా పలుకుచున్న వసిష్ఠమహర్షికి నమస్కరించి, జనకుడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "ఓ మహర్షీ! మీకు మంగళమగుగాక. నా మనవిని ఆలకింపుడు. మా వంశముగూడ వాసికెక్కినదే. (1)

ప్రదానే హి మునిశ్రేష్ఠ కులం నిరవశేషతః।
వక్తవ్యం కులజాతేన తన్నిబోధ మహామునే॥ 2

రాజాఽభూత్ త్రిషు లోకేషు విశ్రుతః స్వేన కర్మణా।
నిమిః పరమధర్మాత్మా సర్వసత్త్వవతాం వరః॥ 3

తస్య పుత్రో మిథి ర్నామ మిథిలా యేన నిర్మితా।
ప్రథమో జనకో నామ జనకాదప్యుదావసుః॥ 4

ఉదావసోస్తు ధర్మాత్మా జాతో వై నందివర్ధనః।
నందివర్ధనపుత్రస్తు సుకేతుర్నామ నామతః॥ 5

సుకేతోరపి ధర్మాత్మా దేవరాతో మహాబలః।
దేవరాతస్య రాజర్షేః బృహద్రథ ఇతి స్మృతః॥ 6

బృహద్రథస్య శూరోఽభూత్ మహావీరః ప్రతాపవాన్।
మహావీరస్య ధృతిమాన్ సుధృతిస్సత్యవిక్రమః॥ 7

సుధృతేరపి ధర్మాత్మా ధృష్టకేతు స్సుధార్మికః।
ధృష్టకేతోస్తు రాజర్షేః హర్యశ్వఇతి విశ్రుతః॥ 8

హర్యశ్వస్య మరుః పుత్రో మరోః పుత్రః ప్రతీంధకః।
ప్రతీంధకస్య ధర్మాత్మా రాజా కీర్తిరథస్సుతః॥ 9

పుత్రః కీర్తిరథస్యాపి దేవమీఢ ఇతి స్మృతః।
దేవమీఢస్య విబుధో విబుధస్య మహీధ్రకః॥ 10

మహీధ్రకసుతో రాజా కీర్తిరాతో మహాబలః।
కీర్తిరాతస్య రాజర్షేః మహారోమా వ్యజాయత॥ 11

మహారోమ్ణస్తు ధర్మాత్మా స్వర్ణరోమా వ్యజాయత।
స్వర్ణరోమ్ణస్తు రాజర్షేః హ్రస్వరోమా వ్యజాయత॥ 12

తస్య పుత్రద్వయం జజ్ఞే ధర్మజ్ఞస్య మహాత్మనః।
జ్యేష్ఠోఽహమనుజో భ్రాతా మమ వీరః కుశధ్వజః॥ 13

మాంతు జ్యేష్ఠం పితా రాజ్యే సోఽభిషిచ్య నరాధిపః।
కుశధ్వజం సమావేశ్య భారం మయి వనం గతః॥ 14

వృద్ధే పితరి స్వర్యాతే ధర్మేణ ధురమావహమ్।
భ్రాతరం దేవసంకాశం స్నేహాత్ పశ్యన్ కుశధ్వజమ్॥ 15

ఓ మహామునీ! సద్వంశజుడు (వధువుతండ్రి) కన్యాదాన సమయమున తన వంశవృత్తాంతమును పూర్తిగా వివరించుట సమంజసము గదా! దయతో వినుడు. మా వంశమునకు మూల పురుషుడు 'నిమి' మహారాజు. అతడు తనసత్కార్యములచే ముల్లోకములలోను ప్రసిద్ధికెక్కినవాడు. మిక్కిలి ధర్మాత్ముడు, పరాక్రమశాలురలో మేటి. (2-3)

అతని కుమారుడు 'మిథి', అతడే మిథిలానగర నిర్మాత. మొదటి జనకుడు. ఆయనకుమారుడు ఉదావసుడు. అతని సుతుడు నందివర్ధనుడు. అతడు ధర్మాత్ముడు. నందివర్ధనుని సూనుడు సుకేతుడు. (4-5)

సుకేతునితనయుడు దేవరాతుడు. అతడు పరమధార్మికుడు. మహాబలశాలి. ఆయనపుత్రుడు బృహద్రథుడు. 'రాజర్షి'గా వాసికెక్కినవాడు. బృహద్రథుని కుమారుడు 'మహావీరుడు'. అతడు శూరశిరోమణి, ప్రతాపశాలి. అతనికుమారుడు సుధృతి. అతడు మహాధైర్యశాలి, సత్యపరాక్రముడు. సుధృతియొక్క తనూజుడు ధృష్టకేతువు. అతడు వివిధ ధర్మముల లోతులను ఎఱిగినవాడు, పుణ్యాత్ముడు, రాజర్షి. ధృష్టకేతువుయొక్క తనయుడు హర్యశ్వుడు. అతడు సుప్రసిద్ధుడు. (6-8)

హర్యశ్వునిసుతుడు మరువు. అతనిపుత్రుడు ప్రతీంధకుడు. ప్రతీంధకుని సూనుడుకీర్తిరథమహారాజు. అతడు ధర్మజ్ఞుడు. అతనితనూజుడు దేవమీఢుడు. ఆయనకొడుకు విబుధుడు. విబుధునితనయుడు మహీధ్రకుడు. కీర్తిరాతుడు మహీధ్రకుని సుతుడు. అతడు మహాబలశాలి, రాజర్షి. అతనిపుత్రుడు మహా రోముడు. ఆయనతనూజుడు ధర్మమూర్తియైన స్వర్ణరోముడు. అతడు రాజర్షి. అతనిపుత్రుడు హ్రస్వరోముడు. అతడు మహానుభావుడు. (9-12)

పరమధర్మజ్ఞుడైన హ్రస్వరోముని ఇరువురు కుమారులలో నేను పెద్దవాడను. నాతమ్ముడు కుశధ్వజుడు. అతడు మహావీరుడు. (13)

మాతండ్రియైన హ్రస్వరోమమహారాజు జ్యేష్ఠుడనైన నన్ను రాజ్యాభిషిక్తుని గావించెను. మాతమ్ముడైన కుశధ్వజుని పోషణాది భారమును నాపైనుంచి ఆయన వనములకేగెను. (14)

వృద్ధుడైన మాతండ్రి స్వర్గస్థుడుకాగా నేను రాజ్యభారమును ధర్మబద్ధముగా నిర్వహించుచుంటిని. నాతమ్ముడైన కుశధ్వజుడు నిర్మలహృదయుడు, దేవతుల్యుడు. అతనిని వాత్సల్యముతో చూచుచుంటిని. (15)

కస్యచిత్త్వథ కాలస్య సాంకాశ్యాదగమత్ పురాత్।
సుధన్వా వీర్యవాన్ రాజా మిథిలామ్ అవరోధకః। 16

స చ మే ప్రేషయామాస శైవం ధనురనుత్తమమ్।
సీతా కన్యా చ పద్మాక్షీ మహ్యం వై దీయతామితి। 17

తస్యాప్రదానాద్బ్రహ్మర్షే యుద్ధ మాసీన్మయా సహ।
స హతోఽభిముఖో రాజా సుధన్వా తు మయా రణే। 18

నిహత్య తం మునిశ్రేష్ఠ సుధన్వానం నరాధిపమ్।
సాంకాశ్యే భ్రాతరం వీరమ్ అభ్యషించం కుశధ్వజమ్। 19

కనీయానేష మే భ్రాతా అహం జ్యేష్ఠో మహామునే।
దదామి పరమప్రీతో వధ్వౌ తే మునిపుంగవ।
సీతాం రామాయ భద్రం తే ఊర్మిళాం లక్ష్మణాయ చ। 20

వీర్యశుల్కాం మమ సుతాం సీతాం సురసుతోపమామ్।
ద్వితీయామూర్మిళాం చైవ త్రిర్దదామి న సంశయః। 21

రామలక్ష్మణయో రాజన్ గోదానం కారయస్వ హ। 22

పితృకార్యం చ భద్రం తే తతో వైవాహికం కురు।
మఘాహ్యద్య మహాబాహో తృతీయే దివసే ప్రభో। 23

ఫల్గున్యాముత్తరే రాజన్ తస్మిన్ వైవాహికం కురు।
రామలక్ష్మణయో రాజన్ దానం కార్యం సుఖోదయమ్। 24

కొంతకాలము తరువాత మహావీరుడైన సుధన్వుడను రాజు సాంకాశ్యపురమునుండి మిథిలానగరముపై దాడికిదిగెను. అతడు సర్వశ్రేష్ఠమైన శివధనుస్సును, అందాలరాశియైన నాకూతురు సీతాదేవిని తనకీయవలసినదని నా కడకువార్తను పంపెను. ఓ బ్రహ్మర్షీ! నేను అతనికోరికను మన్నింపనందున అతడు నాతో యుద్ధమునకు దిగెను. ఆ సుధన్వమహారాజు యుద్ధమున నన్నెదిరించి అసువులను కోల్పోయెను. (16-18)

ఓ మునిశ్రేష్ఠా! సుధన్వ భూపతిని సమరభూమికి బలియిచ్చి, వీరుడైన నా తమ్ముడగు కుశధ్వజుని సాంకాశ్యరాజ్యమునకు పట్టాభిషిక్తుని జేసితిని. ఓ మునీశ్వరా! ఇతడు నా తమ్ముడు, నేను జ్యేష్ఠుడను. నేను మిక్కిలి సంతోషముతో ఆ ఇద్దఱు వధువులలో సీతను శ్రీరామునకు, ఊర్మిళను లక్ష్మణునకు ఇచ్చెదను. నీకు మేలు జరుగును. (19-20)

ఓ రాజా! వీర్యశుల్కయు, దివ్యభామినితో సమానురాలును, నా కుమార్తెయు అగు సీతాదేవిని రామచంద్రునకు, రెండవ కుమార్తెయగు ఊర్మిళను లక్ష్మణస్వామికిని తప్పకఇత్తును. అని ముమ్మాఱు పలుకుచున్నాను. ఇందేమాత్రమూ సంశయము లేదు. (21)

ఓ దశరథమహారాజా! రామలక్ష్మణులచే సమావర్తన కార్యక్రమమును (స్నాతకమును) చేయింపుము-నీకు శుభమగుగాక. వివాహమునకు సంబంధించిన నాందీశ్రాద్ధవిధులను నిర్వహింపుము. ఓ మహాబాహూ! ఓ మహారాజా! నేడు మఘానక్షత్రము. నేటినుండి మూడవదినమున ఉత్తరాఫల్గునీ నక్షత్రము. ఆనాడు వివాహకార్యక్రమమును జరిపింపుము. రామలక్ష్మణులకు ముమ్ముందు సుఖసంతోషములు చేకూరుటకు వారిచే గో, భూ, తిల, హిరణ్యాది దానములను బ్రాహ్మణులకు ఇప్పింపుము." (22-24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ఏకసప్తతితమస్సర్గః (71)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు డెబ్బదియొకటవసర్గము సమాప్తము

-- * * * --

72. డెబ్బదిరెండవసర్గము

శ్రీరామలక్ష్మణ భరత శత్రుఘ్నులకు వరుసగా సీతా - ఊర్మిళా మాండవీ శ్రుతకీర్తులను ఇచ్చి వివాహములనొనర్చుటకు నిశ్చయించుట - వివాహములకుముందు నాందీప్రభృతి శుభకార్యములను నిర్వర్తించుట.

తముక్తవంతం వైదేహం విశ్వామిత్రో మహామునిః।
ఉవాచ వచనం వీరం వసిష్ఠసహితో నృపమ్। 1

మహావీరుడైన జనకమహారాజు ఇట్లు పలికిన పిమ్మట విశ్వామిత్రమహాముని వసిష్ఠమహర్షిసమక్షమున ఆ ప్రభువుతో ఇట్లనెను. (1)

అచింత్యాన్యప్రమేయాని కులాని నరపుంగవ।
ఇక్ష్వాకూణాం విదేహానాం నైషాం తుల్యోఽస్తి కశ్చన। 2

సదృశో ధర్మసంబంధః సదృశో రూపసంపదా।
రామలక్ష్మణయో రాజన్ సీతాచోర్మిళయా సహ। 3

వక్తవ్యం చ నరశ్రేష్ఠ శ్రూయతాం వచనం మమ।
భ్రాతా యవీయాన్ ధర్మజ్ఞ ఏష రాజా కుశధ్వజః। 4

అస్య ధర్మాత్మనో రాజన్ రూపేణాప్రతిమం భువి।
సుతాద్వయం నరశ్రేష్ఠ పత్న్యర్థం వరయామహే। 5

భరతస్య కుమారస్య శత్రుఘ్నస్య చ ధీమతః।
వరయామ స్సుతే రాజన్ తయో రర్థే మహాత్మనోః। 6

పుత్రా దశరథస్యేమే రూపయౌవనశాలినః।
లోకపాలోపమాస్సర్వే దేవతుల్యపరాక్రమాః। 7

ఉభయో రపి రాజేంద్ర సంబంధేనానుబధ్యతామ్।
ఇక్ష్వాకోః కులమవ్యగ్రం భవతః పుణ్యకర్మణః। 8

విశ్వామిత్రవచః శ్రుత్వా వసిష్ఠస్య మతే తథా।
జనకః ప్రాంజలి ర్వాక్యమ్ ఉవాచ మునిపుంగవౌ। 9

కులం ధన్యమిదం మన్యే యేషాం నో మునిపుంగవౌ।
సదృశం కులసంబంధం యదాజ్ఞాపయథః స్వయమ్। 10

ఏవం భవతు భద్రం వః కుశధ్వజసుతే ఇమే।
పత్న్యౌ భజేతాం సహితౌ శత్రుఘ్నభరతావుభౌ। 11

ఏకాహ్నా రాజపుత్రీణాం చతసౄణాం మహామునే।
పాణీన్ గృహ్ణంతు చత్వారో రాజపుత్రా మహాబలాః। 12

ఉత్తరే దివసే బ్రహ్మన్ ఫల్గునీభ్యాం మనీషిణః।
వైవాహికం ప్రశంసంతి భగో యత్ర ప్రజాపతిః। 13

ఏవ ముక్త్వావచ స్సౌమ్యం ప్రత్యుత్థాయ కృతాంజలిః।
ఉభౌ మునివరౌ రాజా జనకో వాక్యమబ్రవీత్। 14

"ఇక్ష్వాకు, విదేహ మహారాజులయొక్కవంశములు రెండును సాటిలేనివి, వాటివైభవములు వర్ణింపనలవికానివి. ఆ వంశజులతో సరితూగగల రాజన్యుడెవ్వడును లేడు. (2)

ఓ రాజా! ఈరెండువంశములమధ్య ఏర్పడనున్న వైవాహిక బంధములు అన్నివిధములుగ పరస్పరము తగియున్నవి. రూపలావణ్యవైభవములయందును సీతారాములు, ఊర్మిళా లక్ష్మణులు ఒకరికొకరు తగినవారు. (3)

ఓ నరేంద్రా! నేనొక మాట చెప్పదలచితిని, ఆలకింపుడు. ఓ రాజా! నీ తమ్ముడైన ఈ కుశధ్వజుడు మిక్కిలి ధర్మపరాయణుడు. ఈ ధర్మాత్మునికుమార్తెలు ఇద్దఱును (మాండవీశ్రుతకీర్తులు) నిరుపమాన సౌందర్యవతులు. ఓ నరోత్తమా! ఆ కన్యలిరువురను భరతకుమారునకు, ధీశాలియైన శత్రుఘ్నునకును ఇచ్చి వివాహము జరిపించుటకు అభిలషించుచున్నాము. (4-6)

ఈ దశరథపుత్రులందఱును అపూర్వ రూపయౌవన సంపన్నులు. లోకపాలురతో సాటియైనవారు, దివ్యపరాక్రమశాలురు. ఓ జనకమహారాజా! ఇక్ష్వాకువంశము మిక్కిలి పవిత్రమైనది. పుణ్యకార్యములచే మీ వంశము మహోన్నతమైనది. ఈ వివాహబంధములచే ఉభయవంశములసంబంధములును దృఢపడును." (7-8)

వసిష్ఠునిసమ్మతితోగూడిన విశ్వామిత్రునిమాటలను వినిన పిమ్మట జనకుడు అంజలి ఘటించినవాడై, ఆ ఇరువురు మునీశ్వరులతో ఇట్లనుడివెను. (9)

"ఓ మునీశ్వరులారా! ఇక్ష్వాకువంశముతో మా వంశమునకు వివాహబంధములు (సంబంధ బాంధవ్యములు) ఏర్పడుట ఎంతేని యుక్తమని మీరు ఉభయులు స్వయముగా ఆజ్ఞాపించి యున్నారు. అందువలన మా 'విదేహ' వంశము ధన్యమైనట్లు తలంతును. అట్లేకానిండు. మీకు పుణ్యముండును. కుశధ్వజుని యొక్క ఈ ఇరువురు కుమార్తెలు (మాండవీశ్రుతకీర్తులు) భరతశత్రుఘ్నులకు పత్నులగుదురు గాక. (10-11)

ఓ మహామునీ! మహాపరాక్రమశాలురైన ఈ నలుపురు రాజకుమారులును ఈ నలుగురు రాకుమార్తెలను ఒకేదినమున పరిణయమాడుదురుగాక. ఓ బ్రహ్మర్షీ! నేడు మఘానక్షత్రము. రేపు పూర్వఫల్గునీ (పుబ్బ) నక్షత్రము. ఎల్లుండి ఉత్తరఫల్గునీ నక్షత్రము (ఉత్తర). సంతానప్రదుడైన భగప్రజాపతి 'ఉత్తర' నక్షత్రమునందున్నప్పుడు 'వివాహము జరుపుట ప్రశస్తము' అని పండితులు పేర్కొనిరి." (12-13)

ఇట్లు మృదుమధురముగా పలికి జనకమహారాజు, వినమ్రుడై దోసిలొగ్గి, ఆ మునివరులతో మరల ఇట్లు నుడివెను. (14)

పరో ధర్మఃకృతో మహ్యం శిష్యోఽస్మి భవతోః సదా।
ఇమాన్యాసనముఖ్యాని ఆసాతాం మునిపుంగవౌ। 15

యథా దశరథస్యేయం తథాయోధ్యాపురీ మమ।
ప్రభుత్వే నాస్తి సందేహో యథార్హం కర్తుమర్హథ। 16

తథా బ్రువతి వైదేహే జనకే రఘునందనః।
రాజా దశరథో హృష్టః ప్రత్యువాచ మహీపతిమ్। 17

యువామసంఖ్యేయగుణౌ భ్రాతరౌ మిథిలేశ్వరౌ।
ఋషయో రాజసంఘాశ్చ భవద్భ్యామభిపూజితాః। 18

స్వస్తి ప్రాప్నుహి భద్రం తే గమిష్యామి స్వమాలయమ్।
శ్రాద్ధకర్మాణి సర్వాణి విధాస్యామీతి చాబ్రవీత్। 19

తమాపృష్ట్వా నరపతిం రాజా దశరథస్తదా।
మునీంద్రౌ తౌ పురస్కృత్య జగామాశు మహాయశాః। 20

స గత్వా నిలయం రాజా శ్రాద్ధం కృత్వా విధానతః।
ప్రభాతే కాల్యముత్థాయ చక్రే గోదానముత్తమమ్। 21

గవాం శతసహస్రాణి బ్రాహ్మణేభ్యో నరాధిపః।
ఏకైకశో దదౌ రాజా పుత్రానుద్దిశ్య ధర్మతః। 22

సువర్ణశృంగాస్సంపన్నాః సవత్సాః కాంస్యదోహనాః।
గవాంశతసహస్రాణి చత్వారి పురుషర్షభః। 23

విత్తమన్యచ్చ సుబహు ద్విజేభ్యో రఘునందనః।
దదౌ గోదానముద్దిశ్య పుత్రాణాం పుత్రవత్సలః। 24

స సుతైః కృతగోదానైః వృతస్తు నృపతిస్తదా।
లోకపాలైరివాభాతి వృతః సౌమ్యః ప్రజాపతిః। 25

"నాకు కన్యాదానఫలము లభించుటకు అనువుగా మహోపకారమొనర్చితిరి. ఎల్లప్పుడును నేను మీ అంతేవాసిని(శిష్యుడను). ఓ మునీశ్వరులారా! ఈ ఉన్నతాసనములను అలంకరింపుడు. మీరు మా మిథిలానగరమును దశరథునిఅయోధ్యనువలె భావింపుడు. మిథిలానగరముపై మీకు సర్వాధికారములును గలవు. ఇందేమాత్రమూ సందేహము లేదు. సముచితముగా ఆజ్ఞాపింపుడు." (15-16)

విదేహప్రభువైన జనకుడు ఇట్లు పలుకగా రఘువంశప్రభువైన దశరథుడు మిక్కిలి సంతుష్టుడై ఆయనతో ఇట్లు నుడివెను. (17)

"మిథిలానగరప్రభువులైన మీఇద్దరుసోదరులు మహాసద్గుణసంపన్నులు. మీరు ఋషీశ్వరులను, రాజులను అతిథిసత్కారములతో చక్కగా గౌరవించితిరి. మీకు పెక్కుశుభములు కలుగును. నేను మా విడిదికి చేరెదను. నాందీదేవతా-ఆహ్వానములు మొదలగు వివాహప్రారంభ శుభకార్యములను నిర్వర్తించెదను." (18-19)

అంతట వాసిగాంచిన దశరథమహారాజు జనకమహారాజును వీడ్కొని, వసిష్ఠవిశ్వామిత్రమహర్షులతో గూడి తనవిడిదికి వెళ్ళెను. (20)

దశరథుడు తన నివాసమునకు చేరి, విధివిధానముగా నాందీ కార్యక్రమములను ఆచరించెను. ప్రాతఃకాలమున లేచి, సకాలములో గోదానపూర్వక 'సమావర్తన' కార్యక్రమమును నిర్వర్తించెను. ఆ సందర్భమును పురస్కరించుకొని దశరథుడు తన ఒక్కొక్క కుమారుని పేరుతో ఒక లక్ష గోవులను ధర్మము ననుసరించి, బ్రాహ్మణోత్తములకు దానము చేసెను. పుత్రప్రేమగలవాడును, నరేంద్రుడును ఐన దశరథుడు బంగారు కొమ్ములుగలవియు, సమృద్ధిగా పాలనిచ్చునవియు, దూడలు గలవియు అగు నాలుగులక్షల గోవులను, పాలను పితుకుటకు ఉపయోగపడు కంచుపాత్రలను, ఇంకను పుష్కలముగా ధనమును, ఇతర వస్తువులను పుత్రులసమావర్తన (స్నాతక) కార్యసమయమున బ్రాహ్మణులకు దానముచేసెను. గోదానము లొనర్చి పుత్రులతో గూడినవాడై దశరథుడు లోకపాలురతోగూడి ప్రసన్నచిత్తుడైయున్న ప్రజాపతివలె విలసిల్లుచుండెను. (21-25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే ద్విసప్తతితమస్సర్గః *(72)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు డెబ్బదిరెండవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

73. డెబ్బదిమూడవసర్గము

రామలక్ష్మణభరతశత్రుఘ్నుల వివాహమహోత్సవములు.

యస్మింస్తు దివసే రాజా చక్రే గోదానముత్తమమ్ ।
తస్మింస్తు దివసే శూరో యుధాజిత్ సముపేయివాన్ । 1

పుత్త్రః కేకయరాజస్య సాక్షాద్భరతమాతులః ।
దృష్ట్వా పృష్ట్వా చ కుశలం రాజానమ్ ఇదమబ్రవీత్ । 2

కేకయాధిపతీ రాజా స్నేహాత్ కుశలమబ్రవీత్ ।
యేషాం కుశలకామోఽసి తేషాం సంప్రత్యనామయమ్ । 3

స్వస్రీయం మమ రాజేంద్ర ద్రష్టుకామో మహీపతిః ।
తదర్థముపయాతోఽహమ్ అయోధ్యాం రఘునందన । 4

శ్రుత్వా త్వహమయోధ్యాయాం వివాహార్థం తవాత్మజాన్ ।
మిథిలామ్ ఉపయాతాంస్తు త్వయా సహ మహీపతే ।
త్వరయాఽభ్యుపయాతోఽహం ద్రష్టుకామః స్వసుస్సుతమ్ । 5

అథ రాజా దశరథః ప్రియాతిథిముపస్థితమ్ ।
దృష్ట్వా పరమ సత్కారైః పూజార్హం సమపూజయత్ । 6

తత స్తాముషితో రాత్రిం సహ పుత్త్రైర్మహాత్మభిః । 7

ప్రభాతే పునరుత్థాయ కృత్వా కర్మాణి కర్మవిత్ ।
ఋషీం స్తదా పురస్కృత్య యజ్ఞవాటముపాగమత్ । 8

యుక్తే ముహూర్తే విజయే సర్వాభరణభూషితైః ।
భ్రాతృభిః సహితో రామః కృతకౌతుకమంగళః । 9

వసిష్ఠం పురతః కృత్వా మహర్షీనపరానపి ।
పితుః సమీపమాశ్రిత్య తస్థౌ భ్రాతృభిరావృతః ।
వసిష్ఠో భగవానేత్య వైదేహమిదమబ్రవీత్ । 10

రాజా దశరథో రాజన్ కృతకౌతుకమంగళైః ।
పుత్త్రైః నరవరశ్రేష్ఠదాతారమ్ అభికాంక్షతే । 11

దాతృప్రతిగ్రహీతృభ్యాం సర్వార్థాః ప్రభవంతి హి ।
స్వధర్మం ప్రతిపద్యస్వ కృత్వా వైవాహ్యముత్తమమ్ । 12

దశరథమహారాజు తనకుమారులకు సమావర్తన వ్రతమును నిర్వహించిననాడే శూరుడైన యుధాజిత్తు అచటికి విచ్చేసెను. అతడు కేకయరాజపుత్త్రుడు, భరతునకు స్వయముగా మేనమామ. అతడు దశరథుని దర్శించి, ఆయనతో కుశల ప్రశ్నలు గావించి, పిమ్మట ఇట్లు నుడివెను. (1-2)

"ఓ మహారాజా! మాతండ్రియైన కేకయమహారాజు మీ కుశలసమాచారములను అడిగెను. మీప్రేమాదరములకు పాత్రులైన మాబంధుమిత్త్రులందఱును కుశలమే. రఘువంశము వాడవైన ఓ రాజేంద్రా! నా మేనల్లుడగు భరతుని చూడగోరి మాతండ్రి నన్ను అయోధ్యకు పంపెను. ఓ రాజా! మీరు, మీకుమారులు వివాహనిమిత్తమై మిథిలానగరమునకు చేరినట్లు నాకు అయోధ్యలో తెలిసినది. 'నా మేనల్లుడగు భరతుని వెంటనే చూడవలెను' అను ఆరాటముతో నేను రెక్కలుగట్టుకొని వచ్చి ఇచట వాలితిని. (3-5)

పిదప దశరథమహారాజు తనకడకు విచ్చేసిన ఆదరణీయుడైన ఆ ముఖ్యబంధువునకు చక్కని అతిథిసత్కారములను నెఱపి గౌరవించెను. (6)

అనంతరము దశరథుడు పరాక్రమశాలురైన తన కుమారులతోగూడి ఆ రాత్రిగడపి, ప్రాతఃకాలముననే లేచి విధ్యుక్తకర్మలను ఆచరించెను. పిమ్మట ఋషీశ్వరులను వెంటనిడుకొని, వివాహమహోత్సవశాలకు చేరెను. (7-8)

తగిన శుభప్రదముహూర్తసమయమున శ్రీరాముడు సర్వాభరణభూషితులైన తనతమ్ములతోగూడి రక్షాబంధనాది కార్యక్రమములను ముగించుకొనెను. పిమ్మట వసిష్ఠుని, ఇతర మహర్షులను అనుసరించివచ్చి, సోదరులతో తండ్రిసమీపమున నిలిచెను. (9-10)

పూజ్యుడైన వసిష్ఠమహర్షి జనకునికడకు చేరి, ఇట్లనెను. ఓరాజా! దశరథమహారాజు రక్షాబంధనాది కార్యక్రమములను ముగించుకొనినపుత్త్రులతోగూడి కన్యాదాతవైన నీకొఱకు ఎదురుచూచుచున్నాడు. దానముచేయువాడును, దానిని గ్రహించువాడును పరస్పరసహకారముతో పూనుకొనినప్పుడే సకల కార్యములును సిద్ధించును. కనుక ఉత్తమోత్తమములైన వైవాహికకార్యక్రమములన్నింటిని నిర్వహించి, నీ ప్రతిజ్ఞా ధర్మమును ఆచరింపుము. (11-12)

ఇత్యుక్తః పరమోదారో వసిష్ఠేన మహాత్మనా।
ప్రత్యువాచ మహాతేజా వాక్యం పరమధర్మవిత్। 13

కః స్థితః ప్రతిహారో మే కస్యాజ్ఞా సంప్రతీక్ష్యతే।
స్వగృహే కో విచారోఽస్తి యథారాజ్యమిదం తవ। 14

కృతకౌతుకసర్వస్వా వేదిమూలముపాగతాః।
మమ కన్యా మునిశ్రేష్ఠ దీప్తా వహ్నేరివార్చిషః। 15

సజ్జోఽహం త్వత్ప్రతీక్షోఽస్మి వేద్యామస్యాం ప్రతిష్ఠితః।
అవిఘ్నం కురుతాం రాజా కిమర్థమవలంబతే। 16

తద్వాక్యం జనకేనోక్తం శ్రుత్వా దశరథ స్తదా।
ప్రవేశయామాస సుతాన్ సర్వాన్ ఋషిగణానపి। 17

తతో రాజా విదేహానాం వసిష్ఠమిదమబ్రవీత్।
కారయస్వ ఋషే సర్వమ్ ఋషిభిః సహ ధార్మిక।
రామస్య లోకరామస్య క్రియాం వైవాహికీం విభో। 18

తథే త్యుక్త్వా తు జనకం వసిష్ఠో భగవాన్ ఋషిః।
విశ్వామిత్రం పురస్కృత్య శతానందం చ ధార్మికమ్। 19

ప్రపామధ్యే తు విధివత్ వేదిం కృత్వా మహాతపాః।
అలంచకార తాం వేదిం గంధపుష్పైస్సమంతతః। 20

సువర్ణపాలికాభిశ్చ ఛిద్రకుంభైశ్చ సాంకురైః।
అంకురాఢ్యైశ్శరావై శ్చ ధూపపాత్రై స్సధూపకైః। 21

శంఖపాత్రైః స్రువైః స్రుగ్భిః పాత్రైరర్ఘ్యాభిపూరితైః।
లాజపూర్ణైశ్చ పాత్రీభిః అక్షతైరభిసంస్కృతైః। 22

దర్భైస్సమైస్సమాస్తీర్య విధివన్మంత్రపూర్వకమ్। 23

అగ్నిమాధాయ వేద్యాం తు విధిమంత్రపురస్కృతమ్।
జుహావాగ్నౌ మహాతేజా వసిష్ఠో భగవాన్ ఋషిః। 24

మహానుభావుడైన వసిష్ఠుడు ఇట్లు వచింపగా, సౌజన్యమూర్తియు, మహాతేజస్వియు, పరమధర్మజ్ఞుడును ఐన జనకుడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (13)

"ఓ మునీంద్రా! ఇచ్చట మిమ్ము అడ్డగించెడివారు ఎవ్వరును లేరు. ఎవరిఆజ్ఞకొఱకును ఎదురుచూడవలసిన పనిలేదు. దీనిని మీరాజ్యముగనే భావింపుడు. స్వగృహమున సంకోచమేల? నా కుమార్తెలందఱును వివాహమునకు సంబంధించిన మంగళాచారములను అన్నింటిని ముగించుకొని, వివాహవేదికకు చేరియున్నారు. వారు అందఱును వెలుగులను విరజిమ్ముచున్న అగ్నిజ్వాలలవలె తేజరిల్లుచున్నారు. నేను సర్వసన్నద్ధుడనై మీ కొఱకు నిరీక్షించుచు వేదికకడ నిలిచియున్నాను. ఎట్టి ఆటంకములును లేకుండునట్లుగా జాగుసేయక సర్వకార్యములను నెఱవేర్పుడు." (14-16)

జనకుని ఆదరవచనములను వినినపిమ్మట దశరథుడు తనకుమారులను, ఋషులనందఱిని వివాహమండపమునకు తీసికొనివచ్చెను. అనంతరము విదేహప్రభువు వసిష్ఠునితో ఇట్లుపలికెను. "ధర్మజ్ఞుడవైన ఓ మహర్షీ! ఋషులందఱితోగూడి వివాహకృత్యములను అన్నింటిని జరిపింపుడు. ఓ ప్రభూ! సర్వలోకములను ఆనందింపజేయునట్టి శ్రీరాముని యొక్క వివాహమహోత్సవమును నిర్వహింపుడు." (17-18)

పూజ్యుడైన వసిష్ఠమహర్షి జనకునిప్రార్థనను ఆమోదించి, పరమధార్మికులైన విశ్వామిత్రుని, శతానందుని తోడుగా జేసికొని, వివాహమండపముమధ్య విధ్యుక్తముగా వేదికను నిర్మించెను. ఇంకను ఆ వేదికచుట్టును సుగంధపుష్పములతో అలంకరించెను. (19-20)

బంగారుపాలికలను, యవధాన్యపు మొలకలతోగూడిన చిత్రములైన చిల్లులుగల కడవలను, నవధాన్యములమొలకలతో ఒప్పుచున్న మూకుళ్లను, ధూపములతోగూడిన ధూపపాత్రలను అచట ఉంచిరి. (21)

శంఖాకారములలో ఉన్నపాత్రలను స్రుక్స్రువములను, అర్ఘ్యజలములతోనిండిన పాత్రలను, పేలాలతోకూడిన పాత్రలను, సందర్భానుసారముగా ఉపయుక్తములగు మఱికొన్ని పాత్రలను, పసుపుతో సంస్కరింపబడిన అక్షతలను వేదికపై సిద్ధపఱచిరి. (22)

విధ్యుక్తముగా మంత్రములను పఠించుచు సమానములగు దర్భలను వేదికపైపఱచిరి. శాస్త్రోక్తముగా, మంత్రపూర్వకముగా అగ్నిని తీసికొనిరాగా పూజ్యుడును, మహాతేజస్వియు ఐన వసిష్ఠమహర్షి ఆ అగ్నిని వేల్చెను. (23-24)

శ్రీ సీతారామ కల్యాణమహోత్సవఘట్టః

తత స్సీతాం సమానీయ సర్వాభరణభూషితామ్।
సమక్షమగ్నేస్సంస్థాప్య రాఘవాభిముఖే తదా।
అబ్రవీజ్జనకో రాజా కౌసల్యానందవర్ధనమ్। 25

ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ।
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా। 26

పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా।
ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మంత్రపూతం జలం తదా। 27

సాధు సాధ్వితి దేవానామ్ ఋషీణాం వదతాం తదా।
దేవదుందుభి నిర్ఘోషః పుష్పవర్షో మహానభూత్। 28

ఏవం దత్త్వా తదా సీతాం మంత్రోదకపురస్కృతామ్।
అబ్రవీజ్జనకో రాజా హర్షేణాభి పరిప్లుతః। 29

లక్ష్మణాగచ్ఛ భద్రం తే ఊర్మిళామ్ ఉద్యతాం మయా।
ప్రతీచ్ఛ పాణిం గృహ్ణీష్వ మా భూత్ కాలస్య పర్యయః। 30

త మేవ ముక్త్వా జనకో భరతం చాభ్యభాషత।
గృహాణ పాణిం మాండవ్యాః పాణినా రఘునందన। 31

శత్రుఘ్నం చాపి ధర్మాత్మా అబ్రవీజ్జనకేశ్వరః।
శ్రుతకీర్త్యా మహాబాహో పాణిం గృహ్ణీష్వ పాణినా। 32

శ్రీ సీతారాముల కల్యాణమహోత్సవ ఘట్టము.

అంతట జనకమహారాజు సర్వాలంకార శోభితయైయున్న సీతాదేవిని తీసికొని వచ్చి, అగ్నిసమక్షమున శ్రీరామునకెదురుగా కూర్చుండబెట్టెను. పిమ్మట కౌసల్యానందవర్ధనుడైన రామచంద్రప్రభువుతో ఇట్లనుడివెను. (25)

"సౌందర్యరాశి, సౌకుమార్యనిధి, లావణ్యవతి ఐన ఈ కన్యకామణియే సీత, ఈమె అయోనిజ. మహాతపస్సంపన్నులైన రాజర్షులకు ఆలవాలమూ, కీర్తి ప్రతిష్ఠలకు నిలయమూ ఐన మావంశమునకు ప్రతీక ఈ సీత. నా పుత్రికయైన ఈమె నేటినుండి నీకు సహధర్మచారిణి. ధర్మార్థకామ (పురుషార్థ)ముల ఆచరణలోను, కష్టసుఖములలోను సర్వదా ఈమె నీకు తోడుగానుండును. విద్యుక్తధర్మమును అనుసరించి పాణిగ్రహణము ఒనర్పుము. నీకు శుభమగును. మిక్కిలి ప్రేమానురాగములతో ఈమెను స్వీకరింపుము. (26)

సర్వసౌభాగ్యవతియైన ఈమె పతివ్రతాశిరోమణి. నిరంతరము నీడవలె నిన్ను అనుసరించుచుండును." అని పలుకుచు జనకమహారాజు మంత్రపూతమైన జలమును వదలుచు కన్యాదానము చేసెను. (27)

ఆ కన్యాదానమహోత్సవసమయమున దేవతలును, ఋషీశ్వరులును 'బాగు,బాగు' అని ప్రశంసావచనములను పలికిరి. దేవదుందుభులు మాఱుమ్రోగెను. అద్భుతముగా పూలవానలు కురిసి, మాచువారికి కనువిందుగావించెను. (28)

ఇట్లు మంత్రోదకపూర్వకముగా సీతాదేవిని కన్యాదానమొనర్చిన పిమ్మట జనకమహారాజు హర్షోల్లాసములతో పొంగిపోవుచు ఇట్లు వచించెను. (29)

"ఓ లక్ష్మణా! ఇటు రమ్ము, నీకు ఊర్మిళనిచ్చి కన్యాదానము చేయదలచినాను. వెంటనే కరగ్రహణము చేసి, ఈమెను స్వీకరింపుము. నీకు శుభమగుగాక." ఇట్లు పలికిన పిమ్మట జనకుడు భరతునితో "ఓ రఘునందనా! (భరతా!) మాండవిని పాణిగ్రహణపూర్వకముగా స్వీకరింపుము. అని నుడివెను. పిదప ధర్మజ్ఞుడైన జనకమహారాజు "ఓ శత్రుఘ్నా! శ్రుతకీర్తిని 'కరగ్రహణపూర్వకముగా' గ్రహింపుము." ఓ కాకుత్స్థవంశజులారా! (రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులారా!) శాంతస్వభావులు, సుందరమూర్తులు, సచ్చరిత్రులు, నిష్ఠానియమజీవనులు. మీరందఱును మీమీపత్నులగూడి హాయిగానుండుడు. జనకుడు మంత్రపూతజలములతో (సీతా-ఊర్మిళలను రామలక్ష్మణులకు ఇచ్చి కన్యాదానములు చేసెను. జనకునిఆశీస్సులలో

సర్వే భవంతః సౌమ్యాశ్చ సర్వే సుచరితవ్రతాః।
పత్నీభి స్సంతు కాకుత్స్థా మా భూత్ కాలస్య పర్యయః। 33

జనకస్య వచః శ్రుత్వా పాణీన్ పాణిభి రస్పృశన్।
చత్వారస్తే చతసౄణాం వసిష్ఠస్య మతే స్థితాః। 34

అగ్నిం ప్రదక్షిణీకృత్య వేదిం రాజానమేవ చ।
ఋషీం శ్చైవ మహాత్మానః సభార్యా రఘుసత్తమాః। 35

యథోక్తేన తదా చక్రుర్వివాహం విధిపూర్వకమ్। 36

పుష్పవృష్టి ర్మహత్యాసీత్ అంతరిక్షాత్ సుభాస్వరా।
దివ్యదుందుభినిర్ఘోషైః గీతవాదిత్రనిస్వనైః। 37

ననృతు శ్చాప్సరస్సంఘా గంధర్వాశ్చ జగుః కలమ్।
వివాహే రఘుముఖ్యానాం తదద్భుత మదృశ్యత। 38

ఈదృశే వర్తమానే తు తూర్యోద్ఘుష్టనినాదితే।
త్రిరగ్నిం తే పరిక్రమ్య ఊహుర్భార్యా మహౌజసః। 39

అథోపకార్యాం జగ్ముస్తే సభార్యా రఘునందనాః।
రాజా ప్యనుయయౌ పశ్యన్ సర్షిసంఘస్సబాంధవః। 40

కుశధ్వజుడు మాండవీశ్రుతకీర్తులను భరతశత్రుఘ్నులకిచ్చి కన్యాదానములనొనర్చెను).[1] (30-33)

జనకుని మాటలను పాటించి, ఆ నలుగురు సోదరులును వసిష్ఠునిఆమోదముతో తమతమవధువులకరగ్రహణములను గావించిరి. మహాత్ములైన ఆ నలుగురు రాకుమారులు తమ తమ పత్నులతోగూడి అగ్నికిని, వేదికకును, జనకమహారాజునకును, ఋషులందఱికిని ప్రదక్షిణపూర్వకముగా ప్రణతులనొనర్చిరి. పిమ్మట శాస్త్రోక్తముగా కల్పసూత్రములను అనుసరించి, వివాహకార్యక్రమములను కొనసాగించిరి. (34-36)

రామలక్ష్మణభరతశత్రుఘ్నులు నలుగురును తమతమ వధువులైన సీతా-ఊర్మిళా మాండవీశ్రుతకీర్తుల సుకుమారములైన కరములను గ్రహించుచుండగా అంతరిక్షమునుండి కనుల పండువుగా పుష్పవృష్టికురిసెను. దివ్యదుందుభులు మ్రోగెను. వీణా,వేణు, మృదంగ, తాళములతో మధురగీతములు వీనుల విందుగావినిపించెను. అప్సరసలు గుంపులుగాగూడి నృత్యములు చేసిరి. గంధర్వులు కమ్మగా గానములొనర్చిరి. రఘువంశజుల వివాహమహోత్సవములు అత్యద్భుతముగా జరిగెను. (37-38)

ఈ విధముగా తూర్యాదిమంగళవాద్యములు మ్రోగుచుండగా నృత్తగీతవాద్యధ్వనులమధ్య మిక్కిలి తేజోమూర్తులైన ఆ దంపతులు మూడుపర్యాయములు అగ్నిప్రదక్షిణములను ఆచరించి, వివాహ కార్యక్రమములను నెఱవేర్చిరి. పిమ్మట రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు తమతమవధువులతోగూడి విడిదిగృహములకు చేరిరి. దశరథమహారాజుగూడ ఆ నవ దంపతులను మహానందముతో తనివితీర జూచుచు ఋషులతో, బంధుమిత్రులతో గూడి విడిది భవనమునకు చేరెను. (39-40)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే త్రిసప్తతితమస్సర్గః (73)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు డెబ్బదిమూడవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

1) శ్లో॥ పితా పితామహో భ్రాతా సకుల్యోజననీ తథా కన్యాప్రదః పూర్వనాశే ప్రకృతిస్థః పరః పరః॥ (యాజ్ఞవల్క్యస్మృతి)
కన్యాదానమును సహజముగా తల్లిదండ్రులు చేయవలెను. తండ్రిలేనిచో తాత (తండ్రితండ్రి) నాయనమ్మ ఆ కార్యమును నిర్వహించవలెను. తాతయు లేనిచో అన్నాదిదెలు కన్యను ధారపోయవలెను. వీరు ఎవ్వరు లేనిచో తల్లియైనను కన్యాదానము చేయుటకు అర్హురాలు. అని యాజ్ఞవల్క్యుడు పేర్కొనెను.

74. డెబ్బదినాల్గవసర్గము

విహాహమహోత్సవములు ముగిసిన పిమ్మట దశరథుడు సపరివారముగా అయోధ్యకు బయలుదేఱుట - మార్గమధ్యమున పరశురాముడు ఎదురగుట.

అథ రాత్ర్యాం వ్యతీతాయాం విశ్వామిత్రో మహామునిః।
అపృష్ట్వా తౌ చ రాజానౌ జగామోత్తరపర్వతమ్।
ఆశీర్భిః పూరయిత్వాచ కుమారాంశ్చ స రాఘవాన్। 1

విశ్వామిత్రే గతే రాజా వైదేహం మిథిలాధిపమ్।
ఆపృష్ట్వాఽథ జగామాశు రాజా దశరథః పురీమ్। 2

గచ్ఛంతం తం తు రాజానమ్ అన్వగచ్ఛన్ నరాధిపః।
అథ రాజా విదేహానాం దదౌ కన్యాధనం బహు। 3

గవాం శతసహస్రాణి బహూని మిథిలేశ్వరః।
కంబళానాం చ ముఖ్యానాం క్షౌమకోట్యంబరాణి చ। 4

హస్త్యశ్వరథపాదాతం దివ్యరూపం స్వలంకృతమ్।
దదౌ కన్యాపితా తాసాం దాసీదాసమనుత్తమమ్। 5

హిరణ్యస్య సువర్ణస్య ముక్తానాం విద్రుమస్య చ।
దదౌ పరమసంహృష్టః కన్యాధనమనుత్తమమ్। 6

దత్త్వా బహుధనం రాజా సమనుజ్ఞాప్య పార్థివమ్।
ప్రవివేశ స్వనిలయం మిథిలాం మిథిలేశ్వరః। 7

రాజా ప్యయోధ్యాధిపతిః సహపుత్రైర్మహాత్మభిః।
ఋషీన్ సర్వాన్ పురస్కృత్య జగామ సబలానుగః। 8

గచ్ఛంతం తం నరవ్యాఘ్రం సర్షిసంఘం సరాఘవమ్।
ఘోరాః స్మ పక్షిణో వాచో వ్యాహరంతి తతస్తతః। 9

భౌమాశ్చైవ మృగాః సర్వే గచ్ఛంతి స్మ ప్రదక్షిణమ్।
తాన్ దృష్ట్వా రాజశార్దూలో వసిష్ఠం పర్యపృచ్ఛత। 10

ఆ రాత్రి గడచినపిమ్మట మఱునాడు విశ్వామిత్ర మహాముని రామలక్ష్మణభరతశత్రుఘ్నులను, వారివధువులను ఆశీర్వదించి, దశరథ, జనక మహారాజులను వీడ్కొని, హిమవత్పర్వతమునకు వెళ్లెను. (1)

విశ్వామిత్రమహర్షి వెళ్లిన పిమ్మట, దశరథమహారాజు మిథిలాధిపతియైన జనకుని వీడ్కొని, సపరివారముగా అయోధ్యాపురమునకు బయలుదేఱెను. (2)

అట్లు బయలుదేఱిన దశరథమహారాజును జనకుడు కొంతదూరము అనుసరించెను. విదేహరాజ్యప్రభువైన జనకుడు ఆ నలుగురు వధువులకు అపరిమితముగా ధనమునిచ్చెను. ఇంకను అతడు లక్షలకొలది గోవులను, పెద్దసంఖ్యలో శ్రేష్ఠములైన కంబళములను, మిక్కిలి విలువైన పెక్కు పట్టువస్త్రములను కానుకగా ఇచ్చెను. (3-4)

మఱియు వారివెంట చక్కగా అలంకరింపబడిన బలిష్ఠములైన ఏనుగులను, మేలుజాతిగుఱ్ఱములను, అందమైన రథములను, వీరులైన యోధులను, భక్తివిశ్వాసములుగల దాసదాసీజనములను ఆ ప్రభువు అరణముగా పంపెను. ఇంకను ఆ మిథిలాధిపతి పుష్కలముగా వెండి బంగారములను, ముత్యములను, పగడములను వారికి కన్యాధనముగా సమర్పించెను. మిథిలాధిపతియైన జనక మహారాజు ఇంకను అసంఖ్యాకములైన సంపదలను బహూకరించి, దశరథునిఅనుమతిని పొంది, తనఅంతఃపురమున ప్రవేశించెను. (5-7)

అయోధ్యాధిపతియైన దశరథుడు వీరులైన పుత్త్రుల తోడను, ఋషులందఱితోడను, చతురంగ బలములతోడను, పరివారకులతోడనుగూడి ప్రయాణమును కొనసాగించెను. (8)

ఆ విధముగా దశరథుడు ఋషులతోను, కుమారులతోను వెళ్లుచుండగా అక్కడక్కడ పక్షులు భయంకరమైన శబ్దములను చేయుచుండెను. భూమిపై సంచరించు మృగములన్నియును ప్రదక్షిణపూర్వకముగ తిరుగాడసాగెను. (పక్షులఅఱుపులు అశుభములను, మృగములప్రదక్షిణములు శుభములను సూచించును.) నరేంద్రుడు ఆ శకునములను గమనించి, వసిష్ఠుని ఇట్లు ప్రశ్నించెను. (9-10)

అసౌమ్యాః పక్షిణో ఘోరా మృగాశ్చాపి ప్రదక్షిణాః ।
కిమిదం హృదయోత్కంపి మనో మమ విషీదతి । 11

రాజ్ఞో దశరథస్యైతత్ శ్రుత్వా వాక్యం మహాన్ ఋషిః ।
ఉవాచ మధురాం వాణీం శ్రూయతామ్ అస్య యత్ఫలమ్ । 12

ఉపస్థితం భయం ఘోరం దివ్యం పక్షిముఖాచ్చ్యుతమ్ ।
మృగాః ప్రశమయంత్యేతే సంతాపః త్యజ్యతామయమ్ । 13

తేషాం సంవదతాం తత్ర వాయుః ప్రాదుర్బభూవ హ ।
కంపయన్ పృథివీం సర్వాం పాతయంశ్చ ద్రుమాన్ శుభాన్ । 14

తమసా సంవృతస్సూర్యః సర్వా న ప్రబభుర్దిశః ।
భస్మనాచావృతం సర్వం సంమూఢమివ తద్బలమ్ । 15

వసిష్ఠశ్చర్షయశ్చాన్యే రాజా చ ససుతస్తదా ।
ససంజ్ఞా ఇవ తత్రాసన్ సర్వమన్యద్విచేతనమ్ । 16

తస్మింస్తమసి ఘోరే తు భస్మచ్ఛన్నేవ సా చమూః ।
దదర్శ భీమసంకాశం జటామండలధారిణమ్ । 17

భార్గవం జామదగ్న్యం తం రాజరాజవిమర్దనమ్ ।
కైలాసమివ దుర్ధర్షం కాలాగ్నిమివ దుస్సహమ్ । 18

జ్వలంతమివ తేజోభిః దుర్నిరీక్ష్యం పృథగ్జనైః ।
స్కంధేచాసజ్య పరశుం ధనుర్విద్యుద్గణోపమమ్ ।
ప్రగృహ్య శరముఖ్యం చ త్రిపురఘ్నం యథా శివమ్ । 19

తం దృష్ట్వా భీమసంకాశం జ్వలంత మివ పావకమ్ । 20

వసిష్ఠప్రముఖా విప్రా జపహోమపరాయణాః ।
సంగతా మునయస్సర్వే సంజజల్పురథో మిథః । 21

"ఓ మహర్షీ! ఒకవైపు పక్షుల భయంకరములైన అఱుపులు కర్ణకఠోరముగా వినిపించుచున్నవి. మఱియొక ప్రక్కన మృగములు ప్రదక్షిణముగా సంచరించుచున్నవి. అశుభములను, శుభములను సూచించు ఈ శకునములకారణముగా నా హృదయము కంపించుచున్నది. మనస్సు కలవరపడుచున్నది. దీని అంతరార్థమేమి ? (11)

అంతట వసిష్ఠమహర్షి దశరథుని ఈ మాటలను విని, మృదుమధురముగా ఇట్లు పలికెను. "ఈ శకునముల ఫలితమును వినుము. ఆకాశమునందలి పక్షుల భయంకరములైన అఱుపులు రాబోవు అశుభమును సూచించుచున్నవి. కాని ఈ మృగముల ప్రదక్షిణలు వాటి ఉపశమనమును (ఆ అశుభములు తొలగునని) తెలుపుచున్నవి. కావున కలవరపడవలదు." (12-13)

వారు అట్లు మాట్లాడుకొనుచుండగా భూమిని కంపింపజేయుచు, చక్కని చెట్లను పడగొట్టుచు ఒక పెద్ద సుడిగాలి వీచెను. సూర్యకాంతులను చీకట్లు ఆవరించెను. దిక్కులన్నియు వెలవెలబోయెను. బలములన్నియును దుమ్ము కొట్టుకొని చేష్టలుడిగెను. వసిష్ఠుడు, ఇతరమహర్షులు, దశరథుడు, ఆయనకుమారులు మాత్రము చైతన్యముకలిగి యున్నవారివలె ఉండిరి. మిగిలిన వారందఱును నిశ్చేష్టులై యుండిరి. (14-16)

భయంకరమైన ఆ చిమ్మచీకట్లలో సేనయంతయు భస్మముచే కప్పబడినదాయున్నట్లుండెను. అట్టి సేన జమదగ్ని మహర్షికుమారుడైన పరశురాముని జూచెను. అతడు జటామండలధారియై, ప్రళయకాలరుద్రునివలె భయంకరుడై యుండెను. అతడు రాజవంశములను పరిమార్చినవాడు, కైలాసమువలె దుర్జయుడు, ప్రళయకాలాగ్నివలె దుస్సహుడు, మిగుల ప్రజ్వలించుచున్న అగ్నిజ్వాలలవలె తేజోరాశియై, జనులకు దుర్నిరీక్ష్యుడైయున్నవాడు. అతడు భుజముపై గండ్రగొడ్డలిని పూని, మెఱుపుతీగలవలె మిఱుమిట్లుగొలుపుచున్న ధనుర్బాణములను ధరించి, త్రిపురాంతకుడైన శివునివలె తేజరిల్లుచుండెను. (17-19)

ప్రజ్వరిల్లుచున్న అగ్నివలె భయంకరముగా కన్పట్టుచున్న, ఆ పరశురాముని జూచి, జపహోమతత్పరులైన వసిష్ఠుడు మున్నగు ప్రముఖవిప్రులును, మునులందఱును గుమిగూడి తమలోతాము ఇట్లు చర్చించుకొనసాగిరి. (20-21)

కచ్చిత్ పితృవధామర్షీ క్షత్రం నోత్సాదయిష్యతి।
పూర్వం క్షత్రవధం కృత్వా గతమన్యుర్గతజ్వరః।
క్షత్రస్యోత్సాదనం భూయో న ఖల్వస్య చికీర్షితమ్। 22

'పూర్వము క్షత్రియుడైన కార్తవీర్యార్జునుడు ఇతని తండ్రియైన "జమదగ్నిని" చంపుటచే క్రుద్ధుడైన ఈ పరశురాముడు ఇప్పుడు క్షత్రియులను చంపుటకై రాలేదుగదా! లోగడ ఇతడు క్షత్రియప్రముఖులను హతమార్చి క్రమముగా కోపతాపములు తొలగి శాంతించి యున్నాడు. మరల ఇప్పుడితడు క్షత్రియులను పరిమార్చ వలెనను కోరికతో ఇచటికి రాలేదుగదా!' (22)

ఏవ ముక్త్వాఽర్ఘ్యమాదాయ భార్గవం భీమదర్శనమ్।
ఋషయో రామ రామేతి వచో మధురమబ్రువన్। 23

తమలోతాము ఇట్లు చర్చించుకొనినపిమ్మట ఆ మునులు పరశురాముని పూజించుటకై అర్ఘ్యపాద్యాదిద్రవ్యములను తీసికొనిరి. పిదప 'రామా!రామా!' యని మధురముగా పలుకుచు భీతిని గొల్పుచున్న ఆయనను సమీపించిరి. (23)

ప్రతిగృహ్య తు తాం పూజామ్ ఋషిదత్తాం ప్రతాపవాన్।
రామం దాశరథిం రామో జామదగ్న్యోఽభ్యభాషత। 24

జమదగ్నికుమారుడును, ప్రతాపశాలియు ఐన పరశురాముడు ఋషులపూజలను అందుకొని, దశరథరామునితో ఇట్లు భాషించెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే చతుస్సప్తతితమస్సర్గః (74)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు డెబ్బదినాల్గవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

75. డెబ్బదిఐదవసర్గము

వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టుమని పరశురాముడు శ్రీరాముని ప్రేరేపించుట.

రామ దాశరథే రామ వీర్యం తే శ్రూయతేఽద్భుతమ్।
ధనుషో భేదనంచైవ నిఖిలేన మయా శ్రుతమ్। 1

తదద్భుతమచింత్యం చ భేదనం ధనుషస్త్వయా।
తచ్ఛ్రుత్వాఽహమనుప్రాప్తో ధనుర్గృహ్యాఽపరం శుభమ్। 2

తదిదం ఘోరసంకాశం జామదగ్న్యం మహద్ధనుః।
పూరయస్వ శరేణైవ స్వబలం దర్శయస్వ చ। 3

తదహం తే బలం దృష్ట్వా ధనుషోఽస్య ప్రపూరణే।
ద్వంద్వయుద్ధం ప్రదాస్యామి వీర్యశ్లాఘ్యస్య రాఘవ। 4

ఓ దశరథరామా! నేను నీ పరాక్రమము అద్భుతమైనదని వింటిని. సర్వలోకములలోను ప్రతిధ్వనించిన ధనుర్భంగ ధ్వనినిగూడ పూర్తిగా వింటిని. 'శివధనుస్సును విఱుచుట' అను నీ అద్భుతకృత్యము ఊహింపరానిది. ఆ విషయమును విని, నేను మఱియొక మహాధనుస్సును తీసికొని ఇచ్చటికి వచ్చితిని. ఇదిగో! ఆ ధనుస్సు. ఇది నాతండ్రి జమదగ్నినుండి నాకు లభించినది. భీతిని గొల్పు ఈ మహాధనువును శరముతో సంధించి, నీ బలమును ప్రదర్శింపుము. ఓ రామా! ఈ ధనుస్సును ఎక్కుపెట్టుటలో నీకుగల బలమునుజూచి, వీరులచే ప్రశంసలను అందుకొను నీకు నాతో ద్వంద్వయుద్ధమును అనుగ్రహించెదను. (1-4)

తస్య తద్వచనం శ్రుత్వా రాజా దశరథస్తదా।
విషణ్ణవదనో దీనః ప్రాంజలిర్వాక్యమబ్రవీత్। 5

క్షత్రరోషాత్ ప్రశాంతస్త్వం బ్రాహ్మణశ్చ మహాయశాః।
బాలానాం మమ పుత్త్రాణామ్ అభయం దాతుమర్హసి। 6

పరశురామునివచనములను వినినంతనే దశరథమహారాజు ముఖముపై విషాదము అలముకొనెను. పిమ్మట దైన్యముతో అంజలి ఘటించి, ఇట్లనెను. "ఓ భార్గవరామా! నీకు క్షత్రియులపై గలకోపము చల్లారినది గదా! నీవు బ్రాహ్మణోత్తముడవు, వాసిగాంచినవాడవు. పసిబాలురైన నా పుత్త్రులపై దయజూపుము. నీవు వేదశాస్త్రములను నియమనిష్ఠలతో అధ్యయనముచేయు

భార్గవాణాం కులే జాతః స్వాధ్యాయవ్రతశాలినామ్।
సహస్రాక్షే ప్రతిజ్ఞాయ శస్త్రం నిక్షిప్తవానసి। 7

స త్వం ధర్మపరో భూత్వా కాశ్యపాయ వసుంధరామ్।
దత్త్వా వనముపాగమ్య మహేంద్రకృతకేతనః। 8

మమ సర్వవినాశాయ సంప్రాప్తస్త్వం మహామునే।
న చైకస్మిన్ హతే రామే సర్వే జీవామహే వయమ్। 9

బ్రువత్యేవం దశరథే జామదగ్న్యః ప్రతాపవాన్।
అనాదృత్యైవ తద్వాక్యం రామమేవాభ్యభాషత। 10

ఇమే ద్వే ధనుషీ శ్రేష్ఠే దివ్యే లోకాభివిశ్రుతే।
దృఢే బలవతీ ముఖ్యే సుకృతే విశ్వకర్మణా। 11

అతిసృష్టం సురైరేకం త్ర్యంబకాయ యుయుత్సవే।
త్రిపురఘ్నం నరశ్రేష్ఠ భగ్నం కాకుత్స్థ యత్ త్వయా।
(ఇదం ద్వితీయం దుర్ధర్షం విష్ణోర్దత్తం సురోత్తమైః)। 12

తదిదం వైష్ణవం రామ ధనుః పరమభాస్వరమ్।
సమానసారం కాకుత్స్థ రౌద్రేణ ధనుషా త్విదమ్। 13

తదా తు దేవతాస్సర్వాః పృచ్ఛంతి స్మ పితామహమ్।
శితికంఠస్య విష్ణోశ్చ బలాబలనిరీక్షయా। 14

అభిప్రాయం తు విజ్ఞాయ దేవతానాం పితామహః।
విరోధం జనయామాస తయోస్సత్యవతాం వరః। 15

విరోధే చ మహద్యుద్ధమ్ అభవద్రోమహర్షణమ్।
శితికంఠస్య విష్ణోశ్చ పరస్పరజిగీషిణోః। 16

తదా తు జృంభితం శైవం ధనుర్భీమపరాక్రమమ్।
హుంకారేణ మహాదేవః స్తంభితోఽథ త్రిలోచనః। 17

దేవైస్తదా సమాగమ్య సర్షిసంఘైస్సచారణైః।
యాచితౌ ప్రశమం తత్ర జగ్మతుస్తౌ సురోత్తమౌ। 18

జృంభితం తద్ధనుర్దృష్ట్వా శైవం విష్ణుపరాక్రమైః।
అధికం మేనిరే విష్ణుం దేవాస్సర్షిగణాస్తదా। 19

భృగుమహర్షి వంశమున జన్మించినవాడవు, ఇంద్రునిసమక్షమున ప్రతిజ్ఞాపూర్వకముగ శస్త్రములను త్యజించితివి. అట్టి నీవు ధర్మపరుడవై, కశ్యపమహర్షికి రాజ్యమును ధారవోసి, వనవాసివై, మహేంద్రగిరిపై నివసించుచుంటివి. (5-8)

ఓ మహామునీ! మాకు మహోపద్రవము తెచ్చిపెట్టుటకే నీవు ఇచటికి వచ్చినట్లున్నది. శ్రీరాముడు లేనిచో మేమెవ్వరమూ జీవించియుండజాలము." (9)

దశరథుడు ఇట్లు ప్రాధేయపడుచున్నను పరాక్రమశాలియైన పరశురాముడు ఆయనమాటలను పట్టించుకొనక శ్రీరామునితో ఇట్లనెను. (10)

"ఓ శ్రీరామా! ఈ దివ్యధనుస్సులు రెండును శ్రేష్ఠములైనవి, దృఢమైనవి, శక్తిమంతములైనవి, ప్రముఖమైనవి'-అని ముల్లోకములయందును ఖ్యాతివహించెను. విశ్వకర్మ వీటిని ప్రయత్నపూర్వకముగ నిర్మించెను. (11)

కకుత్స్థవంశజుడవైన ఓ నరేంద్రా! ఒకానొకప్పుడు త్రిపురాసుర సంహారమునకై దేవతలు పరమేశ్వరునకు ఒకధనుస్సును సమర్పించిరి. దానిని నీవు భగ్నమొనర్చితివి. ఈ రెండవ ధనుస్సును దేవతలు శ్రీమహావిష్ణువునకు అర్పించిరి, ఇది తిరుగులేనిది. ఓ రామా! అపూర్వమైన కాంతులతో విలసిల్లు చున్న ఈ వైష్ణవధనుస్సుగూడ శివధనుస్సువలె మిక్కిలి శక్తిమంతమైనది. (12-13)

అప్పుడు దేవతలందఱును శివకేశవుల బలాబలములను ఎఱుంగదలచి, బ్రహ్మనుజేరి 'హరిహరులిరువురిలో 'బలశాలి' ఎవరు ?' అని ప్రశ్నించిరి. (14)

అంతట బ్రహ్మదేవుడు దేవతల ప్రశ్నలోని అంతరార్థమును గమనించి.[1] వారి ఇరువురిమధ్య విరోధమును కలిగించెను. ఆ కారణముగ ఒకరినొకరు జయింపగోరుచున్న హరిహరుల మధ్య అత్యద్భుతమైన సమరము సంభవించెను. అప్పుడు విష్ణువు హుంకరింపగా మిక్కిలి శక్తిమంతమైన శివధనుస్సు నిస్తేజమయ్యెను. మహాదేవుడైన ఆ ముక్కంటియు నిశ్చేష్టుడయ్యెను. అంతట దేవతలందఱును ఋషీశ్వరులతో, చారణులతోగూడి అచటికి చేరి, వారిని ప్రార్థింపగా ఆ హరిహరులు ఇరువురును శాంతించిరి. (15-18)

విష్ణుహుంకారముతో శివధనుస్సు నిస్తేజము అగుటను గాంచి, దేవతలును, ఋషీశ్వరులును 'విష్ణువే అధికుడు'- అని తలంచిరి. (19)

1) (కేవలము మాటలతో 'వీరిద్దరిలో ఎవరు గొప్ప' అనిభావించి, క్రియాద్వారా నిరూపించుటకై ఈవిధానమున)

ధనూ రుద్రస్తు సంక్రుద్ధో విదేహేషు మహాయశాః ।
దేవరాతస్య రాజర్షేః దదౌ హస్తే ససాయకమ్ । 20

ఇదం చ వైష్ణవం రామ ధనుః పరపురంజయమ్ ।
ఋచీకే భార్గవే ప్రాదాత్ విష్ణుస్సన్న్యాసముత్తమమ్ । 21

ఋచీకస్తు మహాతేజాః పుత్రస్యాప్రతికర్మణః ।
పితుర్మమ దదౌ దివ్యం జమదగ్నేర్మహాత్మనః । 22

న్యస్తశస్త్రే పితరి మే తపోబలసమన్వితే ।
అర్జునో విదధే మృత్యుం ప్రాకృతాం బుద్ధిమాస్థితః । 23

వధమప్రతిరూపం తు పితుశ్శ్రుత్వా సుదారుణమ్ ।
క్షత్రముత్సాదయన్ రోషాత్ జాతం జాతమనేకశః । 24

పృథివీం చాఖిలాం ప్రాప్య కాశ్యపాయ మహాత్మనే ।
యజ్ఞస్యాంతే తదా రామ దక్షిణాం పుణ్యకర్మణే । 25

దత్త్వా మహేంద్రనిలయః తపోబలసమన్వితః ।
స్థితోస్మి తస్మింస్తప్యన్ వై సుసుఖం సురసేవితే । 26

అద్యతూత్తమ వీర్యేణ త్వయా రామ మహాబల ।
శ్రుతవాన్ ధనుషో భేదం తతోఽహం ద్రుతమాగతః । 27

తదిదం వైష్ణవం రామ పితృపైతామహం మహత్ ।
క్షత్రధర్మం పురస్కృత్య గృహ్ణీష్వ ధనురుత్తమమ్ । 28

యోజయస్వ ధనుఃశ్రేష్ఠే శరం పరపురంజయమ్ ।
యది శక్నోషి కాకుత్స్థ ద్వంద్వం దాస్యామి తే తతః । 29

మహాదేవుడైన శివుడు అందులకు మిక్కిలి క్రుద్ధుడై, బాణములతోగూడిన ఆ మహాధనువును విదేహప్రభువులలో రాజర్షియైన దేవరాతునిహస్తమున న్యాసముగా ఉంచెను.(20)

ఓ రామా! శత్రుపురములను నశింపజేయునట్టి వైష్ణవ ధనుస్సును శ్రీమహావిష్ణువు భృగువంశజుడైన ఋచీకునికడ ఉత్తమన్యాసముగా ఉంచెను. (21)

మహాతేజస్వియైన ఋచీకుడు ప్రతీకారేచ్ఛలేనివాడును, మహాత్ముడును, తనకు కుమారుడును, నాకు తండ్రియును ఐన జమదగ్నికి ఈ దివ్యధనుస్సును ఒసంగెను. (22)

తపోబలసంపన్నుడైన నాతండ్రి అస్త్రసన్న్యాసము చేసియుండగా కార్తవీర్యార్జునుడు మూర్ఖబుద్ధితో ఆయనను వధించెను. (23)

ఆ కార్తవీర్యార్జునుడు భయంకరముగా, అతిక్రూరముగా మాతండ్రిని వధించినట్లు విని, రోషముతో నేను క్షత్రియులను ఇరువదియొక్క పర్యాయములు పుట్టినవానిని పుట్టినట్లుగా తుదముట్టించితిని. శ్రీరామా! సమస్త భూమండలమును జయించి, యజ్ఞాంతమున పుణ్యకార్యములను చేయువాడును, మహాత్ముడును ఐన కాశ్యపమహర్షికి ఈ భూమండలమును 'దక్షిణ'గా సమర్పించితిని. తపోబలముతో మహేంద్రగిరికి చేరితిని. దేవతలు సంచరించునట్టి ఆ పర్వతమునందు ప్రశాంతముగా తపమొనర్చుచు ఉంటిని. మహావీరుడవైన ఓ రామా! నీ నిరుపమాన పరాక్రమముతో శివధనుస్సును విఱిచినట్లు విని, వెంటనే ఇచ్చటికి వచ్చితిని. (24-27)

ఓ శ్రీరామా! తాతముత్తాతలనుండి నాకు సంక్రమించిన చెక్కుచెదరని ఈ వైష్ణవమహాధనుస్సును క్షత్రియధర్మమును అనుసరించి గ్రహింపుము. ఓ రామా! నీకు శక్తియున్నచో శత్రుపురములను జయించునట్టి బాణమును ఈ మహాధనుస్సునందు సంధింపుము. అప్పుడు నాతో ద్వంద్వయుద్ధము చేయుటకు నిన్ను అనుమతింతును." (28-29)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే పంచసప్తతితమస్సర్గః (75)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు డెబ్బదియైదవసర్గము సమాప్తము

-- * * * --

76. డెబ్బదిఆఱవసర్గము

శ్రీరాముడు వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టుట - వైష్ణవతేజము ఆయునను చేరుట - అతని బాణప్రయోగముతో పరశురామునిపుణ్యరాసులు నశించుట - పరశురాముడు మహేంద్రగిరికి వెళ్లిపోవుట.

శ్రుత్వా చ జామదగ్న్యస్య వాక్యం దాశరథిస్తదా।
గౌరవాద్యంత్రితకథః పితూ రామమ్ అథాబ్రవీత్॥ 1

శ్రుతవానస్మి యత్కర్మ కృతవానసి భార్గవ।
అనురుంధ్యామహే బ్రహ్మన్ పితురానృణ్యమాస్థితః॥ 2

వీర్యహీనమివాశక్తం క్షత్రధర్మేణ భార్గవ।
అవజానాసి మే తేజః పశ్య మేఽద్య పరాక్రమమ్॥ 3

ఇత్యుక్త్వా రాఘవః క్రుద్ధో భార్గవస్య శరాసనమ్।
శరం చ ప్రతిజగ్రాహ హస్తాల్లఘుపరాక్రమః॥ 4

ఆరోప్య సధనూ రామః శరం సజ్యం చకార హ।
జామదగ్న్యం తతో రామం రామః క్రుద్ధోఽబ్రవీ ద్వచః॥ 5

బ్రాహ్మణోఽసీతి పూజ్యో మే విశ్వామిత్రకృతేన చ।
తస్మాచ్ఛక్తో న తే రామ మోక్తుం ప్రాణహరం శరమ్॥ 6

ఇమాం పాదగతిం రామ తపోబలసమార్జితాన్।
లోకానప్రతిమాన్ వా తే హనిష్యామి యదిచ్ఛసి॥ 7

న హ్యయం వైష్ణవో దివ్యః శరః పరపురంజయః।
మోఘః పతతి వీర్యేణ బలదర్పవినాశనః॥ 8

దశరథరాముడు తనతండ్రియెడగల భక్తిగౌరవముల కారణముగ ఇంతవఱకును ఏమియు మాటాడక మిన్నకుండెను. కాని ఇప్పుడు పరశురామునిపలుకులను విన్నపిదప, ఆయునతో క్లుప్తముగా ఇట్లు వచించెను. (1)

"బ్రహ్మర్షివైన ఓ పరశురామా! నీ తండ్రిని వధించిన కార్తవీర్యార్జునునిపై పగదీర్చుకొనుటకై నీవు ఆయునను వధించి, ఇరువదియొక్క మాఱులు దండెత్తి, క్షత్రియవంశములను నిర్మూలించిన విషయమును నేను వినియుంటిని. ఒక వీరుడు చేయదగినపనినే నీవు చేసితివి. అందులకు నిన్ను మెచ్చుకొనుచున్నాను. (2)

ఓ భార్గవా! నన్ను నీవు పరాక్రమములేని వానినిగాను, క్షత్రియధర్మముప్రకారము ధనుస్సునెక్కుపెట్టుట, యుద్ధము చేయుట మున్నగువిషయములయందు అశక్తునిగాను భావించి, అవమానించితివి. దీనిని నేను ఒప్పుకొనను. ఇదిగో ఇప్పుడే నా పరాక్రమమును చూడుము"-అని పలికి సాటిలేని పరాక్రమశాలియైన శ్రీరాముడు క్రుద్ధుడై, పరశురామునిచేతుల నుండి ధనుర్బాణములను గ్రహించెను. (వాటితోపాటు ఆయునలోని వైష్ణవశక్తినిగూడ తనలో చేర్చుకొనెను.) పిమ్మట శ్రీరాముడు ధనుస్సును ఎక్కుపెట్టి, అల్లెత్రాటిపై బాణమును సంధించెను. మఱియు ఆ రఘునరుడు క్రుద్ధుడై భార్గవరామునితో ఇట్లుపలికెను. (3-5)

"నీవు బ్రాహ్మణుడవైనందున నాకు పూజ్యుడవు. మీదు మిక్కిలి పూజ్యుడైన విశ్వామిత్రునకు సోదరియగు సత్యవతికి పౌత్రుడవు. కనుక ఈ శరముతో నీ ప్రాణములను తీయుటకు నేను వెనుకాడుచున్నాను. ఓ పరశురామా! ఒక లోకమునుండి మఱియొక లోకమునకు క్షణములో చేరగల గమనశక్తి (పాదగతి) నీకు గలదు. తపోబలముచే సాధించుకొనిన సాటిలేని పుణ్యలోకములు (పుణ్యరాసులు) నీకు గలవు. ఈ బాణప్రయోగముతో నీ పాదగతిని తొలగింపుమందువా? లేక నీ పుణ్యరాసులను నశింపజేయుమందువా? తెలుపుము. నీవు కోరినరీతిగా జేసెదను. ఏలనన ఈ వైష్ణవబాణము దివ్యమైనది. శత్రుపురములను రూపుమాపునది. శత్రుపక్షమునందలి వీరులయొక్క బలగర్వములను అణచివేయునది. అట్టి ఈ బాణప్రయోగము వ్యర్థము కాదు, కారాదు." (6-8)

వరాయుధధరం రామం ద్రష్టుం సర్షిగణాస్సురాః।
పితామహం పురస్కృత్య సమేతాస్తత్ర సంఘశః। 9

గంధర్వాప్సరసశ్చైవ సిద్ధచారణకిన్నరాః।
యక్షరాక్షసనాగాశ్చ తద్ద్రష్టుం మహదద్భుతమ్। 10

జడీకృతే తదా లోకే రామే వరధనుర్ధరే।
నిర్వీర్యో జామదగ్న్యోఽసౌ రామో రామముదైక్షత। 11

తేజోభిహతవీర్యత్వాత్ జామదగ్న్యో జడీకృతః।
రామం కమలపత్రాక్షం మందం మందమువాచ హ। 12

కాశ్యపాయ మయా దత్తా యదా పూర్వం వసుంధరా।
విషయే మే న వస్తవ్యమ్ ఇతి మాం కాశ్యపోఽబ్రవీత్। 13

సోఽహం గురువచః కుర్వన్ పృథివ్యాం న వసే నిశామ్।
కృతా ప్రతిజ్ఞా కాకుత్స్థ కృతా భూః కాశ్యపస్య హి। 14

తదిమాం త్వం గతిం వీర హంతుం నార్హసి రాఘవ।
మనోజవం గమిష్యామి మహేంద్రం పర్వతోత్తమమ్। 15

లోకాస్త్వప్రతిమా రామ నిర్జితాస్తపసా మయా।
జహి తాన్ శరముఖ్యేన మాభూత్ కాలస్య పర్యయః। 16

అక్షయం మధుహంతారం జానామి త్వాం సురేశ్వరమ్।
ధనుషోఽస్య పరామర్శాత్ స్వస్తి తేఽస్తు పరంతప। 17

ఏతే సురగణాస్సర్వే నిరీక్షంతే సమాగతాః।
త్వామప్రతిమకర్మాణమ్ అప్రతిద్వంద్వమాహవే। 18

శ్రేష్ఠమైన వైష్ణవధనుర్బాణములను ధరించియున్న శ్రీరాముని దర్శించుటకై బ్రహ్మాదిదేవతలు ఋషీశ్వరులతో గుంపులు గుంపులుగా విచ్చేసిరి. గంధర్వులు, అప్సరసలు, సిద్ధులు, చారణులు, కిన్నరులు, యక్షులు, రాక్షసులు, నాగులు మొదలగువారు ఆ అత్యద్భుతదృశ్యమును గాంచుటకై అచటికి చేరిరి. (9-10)

శ్రీరాముడు శ్రేష్ఠమైన ఆ ధనుర్బాణములను ఎక్కుపెట్టినంతనే లోకము స్తబ్ధమాయెను. భార్గవరాముడు వైష్ణవతేజమును కోల్పోయెను.[1] పిమ్మట అతడు ఆశ్చర్యపడుచు శ్రీరాముని జూచెను. పరశురాముడు తనతేజస్సు, పరాక్రమము సన్నగిల్లిపోగా నిశ్చేష్టుడై, రాజీవలోచనుడగు శ్రీరామునితో తిన్నతిన్నగా ఇట్లనెను. (11-12)

"పూర్వము నేను జయించిన సమస్త భూమండలమును కాశ్యపమహర్షికి సమర్పించితిని. అప్పుడామహాముని 'ఇక నీవు నాదేశమున ఉండదగదు' అని నన్ను ఆదేశించెను. అంతట నేను నా గురువుగారిఆజ్ఞను శిరసావహించి, 'ఆయనకు సమర్పించిన ప్రదేశమునందు ఏమాత్రమూ నివసింపను' అని ప్రతిజ్ఞచేసితిని. ఓ వీరా! రాఘవా! అందువలన నీవు నా గమనశక్తినిమాత్రము తొలగింపవలదు. నేను పర్వతరాజమైన మహేంద్రగిరికి మనోవేగముతో ఇప్పుడే వెళ్లెదను. కనుక రామా! నా తపశ్శక్తిచే సాధించిన సాటిలేని పుణ్యలోకములను (పుణ్యరాసులను) అన్నింటిని నీ శరప్రయోగముతో నశింప జేయుము. ఇక ఏ మాత్రమూ జాగుసేయువలదు. (13-16)

ఓ పరంతపా! ఈ మహాధనుస్సును ఎక్కుపెట్టుటచేత, నిత్యుడు, దేవదేవుడు ఐన ఆ శ్రీమహావిష్ణువే నీవని నేను గ్రహించితిని. నీకు మంగళమగుగాక. (17)

రణరంగమున అసహాయశూరుడవు, అద్భుత లీలాసహితుడవు ఐన నిన్ను ఇచటికి విచ్చేసిన ఈ దేవతలందఱును పరమాశ్చర్యముతో దర్శించుచున్నారు. (18)

F.N1*(i) శ్లో॥ తతఃపరశురామస్య దేహాన్నిర్గత్య వైష్ణవమ్। పశ్యతాం సర్వదేవానాం తేజో రామముపావిశత్॥ పురాణాంతర ప్రమాణము. పిమ్మట దేవతలు అందఱును చూచుచుండగా వైష్ణవదివ్యతేజము పరశురామునదేహమునుండి రఘురామునిలో ప్రవేశించెను.

(ii) తావుభావపి పరస్పరస్థితౌ, వర్ధమానపరిహీనతేజసౌ। పశ్యతిస్మ జనతా దినాత్యయే, పార్వణౌ శశిదివాకరావివ॥ కాళిదాస రఘువంశము 11వ సర్గము 82 వ శ్లోకము

శ్రీరాముడు పరశురాముడు ఎదురెదురుగా ఉండిరి. అప్పుడు శ్రీరాముని తేజస్సు వృద్ధినొందుచుండగా ఆయన మోము కలకలలాడెను. పరశురామునిముఖము నిస్తేజమై వెలవెలబోయెను. ఈ దృశ్యము లోకమునకు పండువెన్నెలనాటి సంధ్యాసమయమున ఉదయించుచున్నచంద్రునికోవలెను, అస్తమించుచు నిస్తేజముగుచున్న సూర్యకాంతులను స్ఫురింపజేయుచుండెను. నేడును ఇట్టి దృశ్యము కన్యాకుమారి తీరమున గాంచనగును.

న చేయం మమ కాకుత్స్థ వ్రీడా భవితుమర్హతి।
త్వయా త్రైలోక్యనాథేన యదహం విముఖీకృతః। 19

శరమప్రతిమం రామ మోక్తుమర్హసి సువ్రత।
శరమోక్షే గమిష్యామి మహేంద్రం పర్వతోత్తమమ్। 20

తథా బ్రువతి రామే తు జామదగ్న్యే ప్రతాపవాన్।
రామో దాశరథిః శ్రీమాన్ చిక్షేప శరముత్తమమ్। 21

స హతాన్ దృశ్య రామేణ స్వాన్ లోకాంస్తపసార్జితాన్।
జామదగ్న్యో జగామాశు మహేంద్రం పర్వతోత్తమమ్। 22

తతో వితిమిరాస్సర్వా దిశశ్చోపదిశస్తథా।
సురాః సర్షిగణా రామం ప్రశశంసురుదాయుధమ్। 23

రామం దాశరథిం రామో జామదగ్న్యః ప్రశస్య చ।
తతః ప్రదక్షిణం కృత్వా జగామాత్మగతిం ప్రభుః। 24

ఓ కాకుత్స్థా! ముల్లోకములకును ప్రభుడవైన నీ చేతిలో ఓటమి పాలగుట నాకేమాత్రమూ లజ్జాకరముగాదు. సచ్చరిత్రుడవైన ఓ రామా! తిరుగులేని నీ బాణమును ప్రయోగింపుము. నేను పర్వతోత్తమమైన మహేంద్రగిరికి వెంటనే వెళ్ళెదను." (19-20)

జమదగ్నిసుతుడైన పరశురాముడు ఇట్లు పలుకగా పరాక్రమశాలియు, సర్వశుభలక్షణసంపన్నుడును ఐన దశరథరాముడు ఆ మహాశరమును ప్రయోగించెను. తీవ్రమైన తపస్సుచే తాను సంపాదించుకొనిన పుణ్యలోకములు (పుణ్యరాసులు) అన్నియును శ్రీరాముని బాణప్రయోగముచే నశించిపోవుటనుజూచి, వెంటనే పరశురాముడు పర్వతశ్రేష్ఠమైన మహేంద్రశైలమునకు వెళ్లెను. (21-22)

అనంతరము ఎనిమిదిదిక్కులయందును అలముకొనిన చీకట్లు తొలగిపోయెను. ఆయుధమును ధరించియున్న శ్రీరాముని దేవతలును, ఋషులును ఎంతయు కొనియాడిరి. (23)

జమదగ్నిపుత్త్రుడైన పరశురాముడు మహేంద్రగిరికి బయలుదేఱుటకు ముందుగా దశరథరాముని ప్రశంసించి, ఆయనకు ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి వెళ్లెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే షట్సప్తతితమస్సర్గః (76)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు డెబ్బదిఆఱవసర్గము సమాప్తము

— * * * —

77. డెబ్బదిఏడవసర్గము

దశరథుడు నవవధూవరులతో, పరివారముతో అయోధ్యకు చేరుట - భరతుడు శత్రుఘ్నునితోగూడి మేనమామవెంట తాతగారింటికి వెళ్లుట - రామలక్ష్మణులు మాతాపితరులను, గురువులను సేవించుచు విలసిల్లుచుండుట.

గతే రామే ప్రశాంతాత్మా రామో దాశరథిర్ధనుః।
వరుణాయాప్రమేయాయ దదౌ హస్తే ససాయకమ్। 1

అభివాద్య తతో రామో వసిష్ఠప్రముఖాన్ ఋషీన్।
పితరం విహ్వలం దృష్ట్వా ప్రోవాచ రఘునందనః। 2

జామదగ్న్యో గతో రామః ప్రయాతు చతురంగిణీ।
అయోధ్యాభిముఖీ సేనా త్వయా నాథేన పాలితా। 3

సందిశస్వ మహారాజ సేనాం త్వచ్ఛాసనే స్థితామ్।
శాసనం కాంక్షతే సేనా చాతకాళిర్జలం యథా। 4

పరశురాముడు వెళ్లిన పిమ్మట దశరథరాముడు ప్రసన్నచిత్తుడై ప్రతిభాశాలియైన వరుణదేవునకు ఆ ధనుర్బాణములను న్యాసముగా అప్పగించెను. (1)

పిమ్మట వసిష్ఠుడు మొదలగు మహర్షులు అందఱికిని రఘురాముడు పాదాభివందనమొనర్చి, నివ్వెఱపాటునకు లోనైయున్న తండ్రిని జూచి, ఇట్లునుడివెను. (2)

మహారాజా! "పరశురాముడు వెళ్లిపోయినాడు, కనుక మీ అధీనములో భద్రముగానున్న చతురంగబలములు అయోధ్యాభిముఖముగా ఇక బయలుదేఱవచ్చును. చాతక పక్షులు మేఘజలములకొఱకువలె మన సేనలు మీ ఆజ్ఞకై నిరీక్షించుచున్నవి. అవి సాగిపోవుటకు ఆజ్ఞనిండు. (3-4)

రామస్య వచనం శ్రుత్వా రాజా దశరథస్సుతమ్।
బాహుభ్యాం సంపరిష్వజ్య మూర్ధ్నిచాఘ్రాయ రాఘవమ్। 5

గతో రామ ఇతి శ్రుత్వా హృష్టః ప్రముదితో నృపః।
పునర్జాతం తదా మేనే పుత్రమాత్మానమేవ చ। 6

చోదయామాస తాం సేనాం జగామాశు తతః పురీమ్।
పతాకాధ్వజినీం రమ్యాం తూర్యోద్ఘుష్టనినాదితామ్। 7

సిక్తరాజపథాం రమ్యాం ప్రకీర్ణకుసుమోత్కరామ్।
రాజప్రవేశసుముఖైః పౌరైర్మంగళవాదిభిః। 8

సంపూర్ణాం ప్రావిశద్రాజా జనౌఘైః సమలంకృతామ్।
పౌరైః ప్రత్యుద్గతో దూరం ద్విజైశ్చ పురవాసిభిః। 9

పుత్రైరనుగతః శ్రీమాన్ శ్రీమద్భిశ్చ మహాయశాః।
ప్రవివేశ గృహం రాజా హిమవత్సదృశం పునః।
ననంద సజనో రాజా గృహే కామైః సుపూజితః। 10

కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ సుమధ్యమా।
వధూప్రతిగ్రహే యుక్తా యాశ్చాన్యా రాజయోషితః। 11

తత స్సీతాం మహాభాగామ్ ఊర్మిలాం చ యశస్వినీమ్।
కుశధ్వజసుతే చోభే జగృహుర్నృపపత్నయః। 12

మంగళాలాపనైశ్చైవ శోభితాః క్షౌమవాససః।
దేవతాయతనాన్యాశు సర్వాస్తాః ప్రత్యపూజయన్। 13

అభివాద్యాభివాద్యాంశ్చ సర్వా రాజసుతాస్తదా।
స్వంస్వంగృహమథాసాద్య కుబేరభవనోపమం। 14

దశరథమహారాజు శ్రీరాముని మాటలను విని, ప్రేమతో తనప్రియసుతుని కౌగిలించుకొని, మూర్ధమును ఆఘ్రాణించెను. 'పరశురాముడు వెళ్లిపోయినాడు' అను వచనమును వినినంతనే ఆ దశరథుడు పరమసంతోషముతో పొంగిపోయెను. అంతేగాక తాను, తనకుమారుడైన శ్రీరాముడును మరల జన్మలనెత్తినట్లు తలపోసెను. పిమ్మట దశరథుని ఆజ్ఞలతో ఆ చతురంగబలములన్నియును అయోధ్యాపురికి చేరెను. (5-6)

ఆ పురమునందలి గృహములపై ధ్వజపతాకములు రెపరెపలాడుచు శోభిల్లుచుండెను. తూర్యములు మున్నగు వాద్యధ్వనులతో పురము ప్రతిధ్వనించుచుండెను. రాజవీధుల యందు సుగంధద్రవ్యములకలయంపి చల్లి వాటిపై పలువన్నెల పూవులను అలంకరించుటచే అవి చూడముచ్చటగానుండెను. నూతనవధూవరులను వెంటనిడుకొని, వైభవముతో పురికి ఏతెంచుచున్న దశరథునకు పౌరులందఱును సంతోషముతో వికసన్ముఖులై, జేజేలు కొట్టుచు మంగళాశీర్వచనములతో స్వాగతము పల్కిరి. జనసమూహములతో కిటకిటలాడుచున్న పురవీధులలో దశరథమహారాజు హర్షోల్లాసములతో అడుగిడెను. పురమునందలి ప్రముఖులును, బ్రాహ్మణోత్తములును చాలా దూరమునుండియు రాజునకెదురుగా వచ్చి తమహర్షాతిరేకమును ప్రకటించిరి. (7-9)

శ్రీమంతుడును, మహాయశస్వియు ఐన దశరథమహారాజు సకలసద్గుణసంపన్నులైన పుత్రులు వెంటనుండగా హిమాలయ పర్వతమువలె ఉన్నతమై మనోహరమైన తనప్రాసాదమున ప్రవేశించెను. అంతట అంతఃపురజనులు, ఆత్మీయులు, బంధువులు, మిత్రులు మొదలగు వారందఱును వారిరాకకు ఆనందించి, వారిని భోగ్యవస్తువులతో పూజించిరి. (10)

సౌందర్యవతులైన కౌసల్యా, సుమిత్రా కైకేయులును, ఇతర రాజస్త్రీలును నవవధువులకు ఉపచారములను నడుపుటలో నిమగ్నలైరి. (11)

అనంతరము రాజపత్నులు సౌభాగ్యవతియైన సీతను, యశస్వినియైన ఊర్మిళను, కుశధ్వజ రాజకుమార్తెలైన మాండవీ శ్రుతకీర్తులను అంతఃపురమునందు ప్రవేశపెట్టిరి. (12)

ఆ నవవధువులు చందనాదిసుగంధద్రవ్యములను అలందుకొని, పట్టువస్త్రములను ధరించి శోభిల్లుచు, స్వస్తి వాచనములతో పూజాగృహములయందు అడుగిడి, ఇలవేల్పులను గంధపుష్పాదులతో ఆరాధించిరి. (13)

దైవసేవలు ముగిసినపిమ్మట ఆ రాజకుమార్తెలు నలుగురు పెద్దలైన వారందఱికిని క్రమముగా పాదాభివందనములను

గోభిర్ధనైశ్చ ధాన్యైశ్చ తర్పయిత్వా ద్విజోత్తమాన్।
రేమిరే ముదితాః సర్వా భర్తృభిస్సహితా రహః। 15

కుమారాశ్చ మహాత్మానో వీర్యేణాప్రతిమా భువి।
కృతదారాః కృతాస్త్రాశ్చ సధనాస్ససుహృజ్జనాః। 16

శుశ్రూషమాణాః పితరం వర్తయంతి నరర్షభాః।
కాలేకాలేతు నీతిజ్ఞాః తోషయంతో గురుం గుణైః। 17

కస్యచిత్త్వథ కాలస్య రాజా దశరథస్సుతమ్।
భరతం కైకయీపుత్రమ్ అబ్రవీద్రఘునందనః। 18

అయం కేకయరాజస్య పుత్రో వసతి పుత్రక।
త్వాం నేతుమాగతో వీర యుధాజిన్మాతులస్తవ। 19

ప్రార్థితస్తేన ధర్మజ్ఞ మిథిలాయామహం తథా।
ఋషిమధ్యేతు తస్య త్వం ప్రీతిం కర్తుమిహార్హసి। 20

శ్రుత్వా దశరథస్యైతత్ భరతః కైకయీసుతః।
అభివాద్య గురుం రామం పరిష్వజ్య చ లక్ష్మణమ్।
గమనాయాభిచక్రామ శత్రుఘ్నసహితస్తదా। 21

ఆపృచ్ఛ్య పితరం శూరో రామంచాక్లిష్టకారిణమ్।
మాతౄశ్చాపి నరశ్రేష్ఠః శత్రుఘ్నసహితో యయౌ। 22

గతే తు భరతే రామో లక్ష్మణశ్చ మహాబలః।
పితరం దేవసంకాశం పూజయామాసతుస్తదా। 23

పితు రాజ్ఞాం పురస్కృత్య పౌరకార్యాణి సర్వశః।
చకార రామో ధర్మాత్మా ప్రియాణి చ హితాని చ। 24

మాతృభ్యో మాతృకార్యాణి కృత్వా పరమయంత్రితః।
గురూణాం గురుకార్యాణి కాలే కాలేఽన్వవైక్షత। 25

ఆదరించిరి. వారు కుబేరభవనములను తలపింపజేయునట్టి తమతమ మందిరములకు చేరిరి. పిదప బ్రాహ్మణోత్తములకు గోవులను, ధనధాన్యములను దానమొనర్చి, వారిని సంతృప్తి పఱచిరి. అనంతరము ఆ నవవధువులు ఏకాంతమున తమ భర్తలతో గూడి ఆనందించిరి. (14-15)

లోకమున సాటిలేని పరాక్రమశాలురు, అస్త్రవిద్యా పారంగతులు, మహానుభావులు ఐన రామలక్ష్మణభరత శత్రుఘ్నులు వివాహితులై బంధుమిత్రులతోగూడి సకల సంపదలతో తులతూగుచు హాయిగా ఉండిరి. ఆ నరశ్రేష్ఠులు తల్లిదండ్రులను సేవించుచు వారిని ఆనందింపజేయుచుండెడిరి. వారు నీతిజ్ఞులై తమసద్గుణములచే ఎల్లవేళల గురువుల అభిమానములను చూరగొనుచుండిరి. (16-17)

కొంతకాలమునకుపిమ్మట రఘువంశప్రభువైన దశరథ మహారాజు కైకేయీసుతుడైన భరతునితో ఇట్లనుడివెను. "ఓ వీరకుమారా! కేకయరాజకుమారుడును, నీకు మేనమామయు ఐన ఈ యుధాజిత్తు నిన్ను తీసికొని పోవుటకై వచ్చి ఇచటనేయున్నాడు. మనము మిథిలానగరమున ఉన్నప్పుడు అతడచటికి వచ్చి, ఋషులసమక్షమున నన్ను ప్రార్థించెను. ఓ ధర్మజ్ఞా! మీతాతగారికి ప్రీతిని గూర్చుటకై నీవు మీ మామవెంట అచటికి వెళ్లుము." (18-20)

తండ్రియైన దశరథునిమాటలను పాటించి, భరతుడు తల్లిదండ్రులకును, గురువులకును, అన్నయైన శ్రీరామునకును నమస్కరించి, లక్ష్మణుని ఆలింగనము చేసికొని, తమ్ముడగు శత్రుఘ్నునితోగూడి, తాతగారికడకు వెళ్లుటకు సిద్ధపడెను. (21)

శూరుడును, నరశ్రేష్ఠుడును ఐన భరతుడు శత్రుఘ్న సహితుడై తండ్రియాజ్ఞను గైకొని, ఎవ్వరినీ ఏమాత్రమూ నొప్పింపని శ్రీరాముని అనుమతిని పొంది, ప్రేమమూర్తులైన తల్లులయొద్ద సెలవు దీసికొని ప్రయాణమయ్యెను. (22)

భరతశత్రుఘ్నులు వెళ్లినపిదప, మహాబలశాలురైన రామలక్ష్మణులు దైవసమానులైన తల్లిదండ్రులకు సేవలొనర్చుచుండిరి. (23)

ధర్మాత్ముడైన శ్రీరాముడు తండ్రిఆజ్ఞననుసరించి, పౌరులకు ప్రియమును, హితమును గూర్చునట్టి సమస్తకార్యములను నెఱవేర్చుచుండెను. (24)

వేదములు, ధర్మశాస్త్రములు పేర్కొనిననియమములను పాటించుచు, రామలక్ష్మణులు ఇరువురును మాతృదేవతలకు వలసిన పనులనొనర్చుచుండిరి. మఱియును పరాకులేకుండా సందర్భానుసారముగా గురువులకును శుశ్రూషాదికార్యములను నిర్వర్తించుచుండిరి. (25)

ఏవం దశరథః ప్రీతో బ్రాహ్మణా నైగమాస్తథా।
రామస్య శీలవృత్తేన సర్వే విషయవాసినః। 26

తేషామతియశా లోకే రామస్సత్యపరాక్రమః।
స్వయంభూరివ భూతానాం బభూవ గుణవత్తరః। 27

రామస్తు సీతయా సార్ధం విజహార బహూన్ ఋతూన్।
మనస్వీ తద్గతస్తస్య నిత్యం హృది సమర్పితః। 28

ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి।
గుణాద్రూపగుణాచ్చాపి ప్రీతిర్భూయోఽభ్యవర్ధత। 29

తస్యాశ్చ భర్తా ద్విగుణం హృదయే పరివర్తతే।
అంతర్గతమపి వ్యక్తమ్ ఆఖ్యాతి హృదయం హృదా। 30

తస్య భూయో విశేషేణ మైథిలీ జనకాత్మజా।
దేవతాభిస్సమా రూపే సీతా శ్రీరివ రూపిణీ। 31

తయా స రాజర్షిసుతోఽభిరామయా
సమేయివానుత్తమరాజకన్యయా ।
అతీవ రామః శుశుభేఽతికామయా
విభుశ్శ్రియా విష్ణురివామరేశ్వరః । 32

శ్రీరామునియొక్క సౌశీల్యమునకును, ఉదాత్త ప్రవర్తనకును, సద్గుణములకును దశరథుడు మురిసిపోవుచుండెను. అట్లే బ్రాహ్మణులు, వైశ్యులు మున్నగు దేశవాసులందరును పరమానంద భరితులగుచుండిరి. (26)

మహాయశస్వియు, సత్యపరాక్రముడును ఐన శ్రీరాముడు తనసద్గుణసంపదలచే లోకమునందలి సమస్తప్రాణులకును (సృష్టికర్తయైన) బ్రహ్మదేవునివలె మిక్కిలి ప్రీతిపాత్రుడయ్యెను.(27)

నిర్మలమనస్కుడైన శ్రీరాముని అంతఃకరణమునందు సంతతము సీతయే నెలకొనియుండెను. ఆమెహృదయము నందు సర్వదా శ్రీరామునిరూపమే మెదలుచుండెను. ఇట్లు వారు పరస్పరానురాగములతో పెక్కుకాలము విహరించుచుండిరి. జనకుడు 'వీర్యశుల్క'యగు సీతాదేవిని తనకు జీవిత భాగస్వామినిగా జేసినందున శ్రీరామునకు ఆమె మిక్కిలి ప్రీతిపాత్రురాలయ్యెను. పతిసేవాపరాయణత్వము అనెడి గుణముచేతను, రూపసౌందర్యవైభవమువలనను, అయోనిజయై, ఉత్తమవంశమున పెరిగినకారణమునను శ్రీరామునకు ఆమెపై ప్రేమ దినదిన ప్రవర్ధమానమగుచుండెను. (28-29)

అదేవిధముగా శ్రీరాముడు తనకు భర్తయైనకారణమునను, గుణసౌందర్యాతిశయముచేతను సీతాదేవికి ఆయన (రాముని)పై ప్రేమ రెండింతలయ్యెను. సీతారాములు ఒకరి హృదయమును మఱియొకరు ఎఱిగినవారగుటచే తదనుగుణముగ వారు పరస్పరానురాగములతో మెలగుచుండిరి. (30)

రూపమునందు దివ్యస్త్రీవలెను, సౌందర్యమున లక్ష్మీదేవివలెను ఉన్న జనకునికూతురైన సీత ఆ రాముని హృదయమును విశేషముగా చూఱగొనెను. (31)

రాజర్షియైన దశరథమహారాజపుత్రుడగు శ్రీరాముడు ఉత్తమరాజపుత్రికయు, మనోహారిణియు ఐన సీతాదేవితో గూడి, దేవాదిదేవుడైన శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవితోవలె సకలభోగభాగ్యములతో శోభిల్లుచుండెను. (32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే బాలకాండే సప్తసప్తతితమస్సర్గః (77)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి బాలకాండమునందు డెబ్బదిఏడవసర్గము సమాప్తము

బాలకాండః సమాప్తః - బాలకాండము సమాప్తము

శ్రీ శ్రీ శ్రీ

మంగళమ్ మహత్

-- * * * --

॥ శ్రీరామచంద్రాయ నమః ॥

శ్రీసీతారామాభ్యాం నమః

అయోధ్యాకాండము

1. మొదటిసర్గము

దశరథుడు శ్రీరాముని యువరాజపట్టాభిషిక్తుని గావించుటకై సంకల్పించుట.

గచ్ఛతా మాతులకులం భరతేన తదానఘః।
శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నో నీతః ప్రీతిపురస్కృతః॥ 1

భరతుడు పెద్దలయనుమతి గైకొని, తనమేనమామ ఇంటికి వెళ్లుచు పుణ్యపురుషుడు, జితేంద్రియుడు ఐన శత్రుఘ్నుని పరమప్రీతితో తనవెంట తీసికొనివెళ్లెను. (1)

స తత్ర న్యవసద్భ్రాత్రా సహ సత్కారసత్కృతః।
మాతులేనాశ్వపతినా పుత్రస్నేహేన లాలితః॥ 2

భరతుడు తనమేనమామగృహమున శత్రుఘ్నునితోసహా బంధుమర్యాదలను, ఆదరసత్కారములను పొందుచు అచట హాయిగానుండెను. యుధాజిత్తు[1] శత్రుఘ్నుని పుత్త్ర వాత్సల్యముతో భరతునికంటె మిన్నగా లాలించుచుండెను. (2)

తత్రాపి నివసంతౌ తౌ తర్ప్యమాణౌ చ కామతః।
భ్రాతరౌ స్మరతాం వీరౌ వృద్ధం దశరథం నృపమ్॥ 3

ఆ ఇరువురు సోదరులును మేనమామయింట తమకు నచ్చినరీతిగా ఆహారవిహారములతో, ఆటపాటలతో ఉత్సాహముగా నివసించుచుండిరి. ఐనను వారు వార్ధక్యమునకున్న తమతండ్రియగు దశరథమహారాజును గూర్చి స్మరించుచునే[2] యుండిరి. (3)

రాజాపి తౌ మహాతేజాః సస్మార ప్రోషితౌ సుతౌ।
ఉభౌ భరతశత్రుఘ్నౌ మహేంద్రవరుణోపమౌ॥ 4

సర్వ ఏవ తు తస్యేష్టాః చత్వారః పురుషర్షభాః।
స్వశరీరాద్వినిర్వృత్తాః చత్వార ఇవ బాహవః॥ 5

సత్పుత్త్రలాభముతో నిత్యసంతోషిగానున్న దశరథ మహారాజు ఇంద్రవరుణులవలెనున్న (విడదీయరాని సోదర ప్రేమతోనున్న) తనకుమారులగు భరతశత్రుఘ్నులు ఇరువురు దేశాంతరమునందు ఉండుటచే (తన చెంతలేకుండుటచే) బెంగతో వారిని పదేపదే గుర్తు చేసికొనుచుండెను. తనశరీరమునుండి ఉత్పన్నములైన నాలుగుచేతులవలె దశరథునకు పురుషశ్రేష్ఠులైన తన నలుగురు కుమారులును ఎంతయు ప్రీతిపాత్రులు. (ఇది అభూతోపమ) ఆయనకు అందఱును సమానులే. (4-5)

తేషామపి మహాతేజా రామో రతికరః పితుః।
స్వయంభూరివ భూతానాం బభూవ గుణవత్తరః॥ 6

ఇంద్రాదిదేవతలలో జ్యేష్ఠుడైన 'బ్రహ్మ' ఆయన తండ్రియగు శ్రీమహావిష్ణువునకు ప్రీతిపాత్రుడైనట్లే దశరథునకు తనకుమారులలో పెద్దవాడును మహా పరాక్రమశాలియు, సద్గుణసంపన్నుడును ఐన శ్రీరాముడు మిక్కిలి ప్రీతిపాత్రుడు. (6)

---

1) యుధాజిత్తు ప్రత్యేకముగా అశ్వదళములపై పర్యవేక్షణచేయుచుండువాడగుటచే ఆయనకు 'అశ్వపతి' అనియు నామాంతరముగలదు.

2) తగిన సమయములలో తమతండ్రికి అనువగు (వలసిన) సేవలు చేయలేకపోయితిమే యనియు, పుత్త్రధర్మమును నెఱవేర్పలేక పోవుచుంటిమియనియు భయపడుచున్న ఆ భరతశత్రుఘ్నుల మనస్సులలో తండ్రిని గూర్చిన చింత మెదలుచునే యుండెను.

స హి దేవైరుదీర్ణస్య రావణస్య వధార్థిభిః।
అర్థితో మానుషే లోకే జజ్ఞే విష్ణుః సనాతనః। 7

గర్వోన్మత్తుడైన రావణుని సంహరించుటకై దేవతలు ప్రార్థింపగా నిత్యుడైన[1] శ్రీమహావిష్ణువు మనుష్యలోకమున శ్రీరాముడై అవతరించెను. (7)

కౌసల్యా శుశుభే తేన పుత్త్రేణామితతేజసా।
యథా వరేణ దేవానామ్ అదితిర్వజ్రపాణినా। 8

దేవతలలో ప్రముఖుడైన ఇంద్రుని తనతనయునిగా బొందిన అదితివలె కౌసల్యాదేవి మిక్కిలి పరాక్రమశాలియైన శ్రీరాముని తనపుత్త్రునిగా పొందినదై పరమానంద భరితురాలాయెను. (8)

స హి రూపోపపన్నశ్చ వీర్యవాననసూయకః।
భూమావనుపమః సూనుః గుణైర్దశరథోపమః। 9

శ్రీరాముడు లోకోత్తరసుందరుడు, మహావీరుడు, ఇతరులలోని సుగుణములనే గ్రహించువాడు. సద్గుణములను బట్టి దశరథునివంటివాడు. ఇట్టి సాటిలేని సత్పుత్త్రునిగన్న కౌసల్యాదేవిఅదృష్టమే అదృష్టము. (9)

స తు నిత్యం ప్రశాంతాత్మా మృదుపూర్వం తు భాషతే।
ఉచ్యమానో ఽపి పరుషం నోత్తరం ప్రతిపద్యతే। 10

రఘురాముడు ప్రశాంతచిత్తుడు, మృదుభాషి. కోపమను మాటనే ఎఱుగనివాడు, ఇతరులెవ్వరైనను ఎట్టి పరుషోక్తు లాడినను వాటినేమాత్రమూ పట్టించుకొనడు. అంతేగాదు వారితో మృదువుగా, అనునయపూర్వకముగా మాట్లాడును. యథార్థముగా అతడు తండ్రినిమించిన తనయుడు. (10)

కథంచిదుపకారేణ కృతేనైకేన తుష్యతి।
న స్మరత్యపకారాణాం శతమప్యాత్మవత్తయా। 11

మనస్వియైన శ్రీరాముడు ఏవిధముగనైనను, ఏ రూపముననైనను, ఎవరివలననైనను తనకు ఏ కొంచెము ఉపకారము జరిగినను దానిని కొండంతగా భావించి, మిక్కిలి సంతోషించెడివాడు. ఎవరివలన ఎన్నెన్ని అపకారములు జరిగినను వాటినిగూర్చి ఏమాత్రము పట్టించుకొనెడివాడే గాడు. (11)

శీలవృద్ధైఃజ్ఞానవృద్ధైః వయోవృద్ధైశ్చ సజ్జనైః।
కథయన్నాస్త వై నిత్యమ్ అస్త్రయోగ్యాంతరేష్వపి। 12

రఘునందనుడు అస్త్రాభ్యాసము చేయునప్పటి విరామసమయములయందు మాత్రమేగాక ఎల్లవేళలను సదాచారసంపన్నులతోడను, జ్ఞానవృద్ధులతోడను, వయోవృద్ధుల తోడను, ఇంకను ఇతరసజ్జనులతోడను వివిధ విషయములనుగూర్చి చర్చించుచుండెడివాడు.[2] (12)

బుద్ధిమాన్ మధురాభాషీ పూర్వభాషీ ప్రియంవదః।
వీర్యవాన్ న చ వీర్యేణ మహతా స్వేన విస్మితః। 13

రఘునందనుడు ప్రశస్తమైన బుద్ధిగలవాడు. (జనులు సుఖపడు విషయమునుగూర్చి ఎల్లప్పుడును ఆలోచించుచుండు వాడు). అందఱితో మృదుమధురముగా మాటాడుచుండు వాడు. ఎవ్వరినైనను తానే ముందుగా పలుకరించుచుండు వాడు. శత్రువుల విషయమునను ప్రియవచనములనే పలుకుచుండెడివాడు. శరణాగతులను కాపాడుటకై దుష్టులను అణచివేయువాడు. ఎంతటి దుర్మార్గులైనను తనను ఆశ్రయించినచో వారిని క్షమించువాడు. తాను ఎంతటి పరాక్రమశాలియైనను అవంతయు గర్వపడనివాడు. (13)

1) శ్రీమహావిష్ణువు శాశ్వతుడు, అనగా జననమరణ చక్రమునకు అతీతుడు. ఐనను దుష్టశిక్షణ, శిష్టరక్షణ గావించుచు ధర్మపరిరక్షణ చేయుటకై ఈలోకమున వివిధరీతుల అయిన అవతరించుచుండును. 'అజాయమానో బహుధా విజాయతే' - అనెడు శ్రుతి ప్రమాణము.

2) రాముడు సదాచారసంపన్నులతో మిక్కిలి సూక్ష్మమైన, సున్నితమైన ఆచారవిశేషములనుగూర్చియు, జ్ఞానవృద్ధులతో వేదాంతపరమైన రహస్యములనుగుఱించియు, పెద్దలైన వయోవృద్ధులతో పరంపరగా సాగివచ్చెడి సంప్రదాయవిశేషములను గూర్చియు నిత్యమూ చర్చించుచుండెడివాడు. పిటినిగుఱించి అస్త్రాభ్యాసముచేయునప్పుడు విరామసమయములయందును చర్చలు చేసెడివాడనో - శక్తియుక్త సమయములయందు ఈ చర్చలు చేయు విషయమునుగూర్చి వేఱుగా చెప్పవలసినది యేముండును?

న చానృతకథో విద్వాన్ వృద్ధానాం ప్రతిపూజకః।
అనురక్తః ప్రజాభిశ్చ ప్రజాశ్చాప్యనురంజతే। 14

శ్రీరాముడు ఎట్టిపరిస్థితులలోను అసత్యమును పలికెడివాడుకాడు. సకలవిద్యాపారంగతుడు. సత్పురులకును, జ్ఞానవయోవృద్ధులకును ఎదురేగి వారిని సేవించుచుండువాడు. ప్రజలను వాత్సల్యముతో సంతసింపజేయువాడు. ప్రజలకు ప్రాణతుల్యుడు. (14)

సానుక్రోశో జితక్రోధో బ్రాహ్మణప్రతిపూజకః।
దీనానుకంపీ ధర్మజ్ఞో నిత్యం ప్రగ్రహవాన్ శుచిః। 15

దుఃఖితులను జూచినప్పుడు రామునిహృదయము ద్రవించుచుండెడిది. అతడు క్రోధమును జయించినవాడు. వేదజ్ఞులకు ఎదురుగా వెళ్ళి వారిని పూజించెడివాడు. దీనులను ఆదుకొనువాడు. సామాన్యధర్మములను, విశేషధర్మములను బాగుగా ఎఱిగినవాడు. నిత్యము నియమనిష్ఠలను పాటించుచుండువాడు. కలలోగూడ పరులసొత్తును ఏ మాత్రము ఆశింపనివాడు.[1] (15)

కులోచితమతిః క్షాత్రం ధర్మం స్వం బహుమన్యతే।
మన్యతే పరయా కీర్త్యా మహత్ స్వర్గఫలం తతః। 16

శ్రీరాముడు ఇక్ష్వాకువంశజులకు సహజములైన దయాదాక్షిణ్యములు, శరణాగతరక్షణము, ధర్మైకదృష్టి కలవాడు. దుష్టనిగ్రహము, ప్రజాపరిపాలనము అను క్షత్రియధర్మములను పూర్తిగా పాటించువాడు. 'వర్ణాశ్రమధర్మములను ఆచరించుటవలన కలిగెడి 'కీర్తి' స్వర్గఫలదాయకము' - అని నమ్మి క్షత్రియధర్మములను చక్కగా నెఱవేర్చువాడు. (16)

నాఽశ్రేయసి రతో విద్వాన్ న విరుద్ధకథారుచిః।
ఉత్తరోత్తరయుక్తౌ చ వక్తా వాచస్పతిర్యథా। 17

సదసద్విచక్షణకలవాడగుటచే శ్రీరాముడు ద్యూతము మొదలగు వ్యర్థకార్యములయందు ఎన్నడును ఆసక్తుడు కాడు. ఎన్నడును ధర్మవిరుద్ధములైన నిష్ఠురోక్తులను పలికెడివాడుకాడు. లౌకిక వైదికవిషయములయందు యుక్తియుక్తముగా మాటాడుటలో అతడు బృహస్పతివంటివాడు. (17)

అరోగస్తరుణో వాగ్మీ వపుష్మాన్ దేశకాలవిత్।
లోకే పురుషసారజ్ఞః సాధురేకో వినిర్మితః। 18

రఘునందనుడు మానసికముగా, శారీరకముగా చక్కని ఆరోగ్యము గలవాడు. యువకుడు. ప్రశస్తముగా మాటాడువాడు. దృఢగాత్రుడు. దేశకాలములను ఎఱిగి అధ్యయనాదులను కొనసాగించెడివాడు. ఒక్కసారి చూచినంత మాత్రముననే లోకమునందలి పురుషులహృదయములను (అభిప్రాయములను) సమగ్రముగా ఎఱింగెడువాడు. పరమసాధువు.[2] (అపకారులయెడగూడ సాధుత్వమునే ప్రకటించువాడు) సాటిలేని సద్గుణములుగల మహాపురుషుడు. (18)

స తు శ్రేష్ఠైర్గుణైర్యుక్తః ప్రజానాం పార్థివాత్మజః।
బహిశ్చర ఇవ ప్రాణో బభూవ గుణతః ప్రియః। 19

మహారాజకుమారుడైన శ్రీరాముడు ఉత్తమోత్తమగుణములకు పెన్నిధి. ఆ సద్గుణములకారణముగ ఆయన ప్రజలందఱికిని మిక్కిలి ప్రేమాస్పదుడు. అంతేగాదు, వారికి అతడు బహిఃప్రాణము. (19)

1) శ్లో॥ యోఽర్థే శుచిః స హి శుచిః న మృద్వారిశుచిశ్శుచిః॥ మనుస్మృతి.
ధనవిషయమున పవిత్రముగా ఉండువాడే నిజముగా 'శుచి' యైనవాడు. నీటితో శరీరమాలిన్యములను కడిగివేసికొనినంత మాత్రముననే అతడు పూర్తిగా శుచియైనట్లు తలంపరాదు. బాహ్యశుచిత్వముతో పాటు అంతశ్శుచిత్వముగూడ ముఖ్యము.

2) శ్లో॥ అపకారిషు యస్సాధుః స సాధురితి కీర్తితః।
అపకారము చేయువారియెడగూడ సాధువర్తనముగలవాడే నిజమైన సాధువు.

సమ్యగ్విద్యావ్రతస్నాతో యథావత్ సాంగవేదవిత్।
ఇష్వస్త్రే చ పితుః శ్రేష్ఠో బభూవ భరతాగ్రజః। 20

భరతాగ్రజుడైన రఘురాముడు చక్కగా వేదవేదాంగములను, శాస్త్రములను అధ్యయనము చేసినవాడు, సమావర్తనాది వ్రతములను ఆచరించినవాడు, శస్త్రాస్త్రములను[1] ప్రయోగించుటలో ఇతరధనుర్ధారులకంటె దశరథుడే మిన్న కాగా శ్రీరాముడు ఆయనను మించినవాడు. (20)

కల్యాణాభిజనస్సాధుః అదీనః సత్యవాగృజుః।
వృద్ధైరభివినీతశ్చ ద్విజైః ధర్మార్థదర్శిభిః। 21

ఎట్టి కళంకములును లేనివాడగుటచే శ్రీరాముడు పవిత్రములైన, శుభప్రదములైన, ఉత్తమమాతృపితృ వంశములకు ప్రతీకయైనవాడు, మిక్కిలి క్షోభపడవలసిన పరిస్థితులయందును ఏమాత్రము తొణకనివాడు, అతిక్లిష్ట స్థితులలోను సత్యమునకు కట్టుబడియుండువాడు, ఋజువర్తనముచే దేవతలకును ఆరాధ్యుడు, ధర్మార్థవిషయముల యందు నిష్ణాతులైన బ్రాహ్మణోత్తములకడ సుశిక్షితుడు. (21)

ధర్మకామార్థతత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్।
లౌకికే సమయాచారే కృతకల్పో విశారదః। 22

ధర్మశాస్త్రములలో పేర్కొనబడినరీతిగా ధర్మార్థకామ తత్త్వములను లోతుగానెఱిగి, ఆయాసమయములయందు వాటిని ఆచరించువాడు, గ్రహించిన విషయములను మఱువనివాడు, అనుక్షణము వికసించు ప్రతిభగలవాడు, లోకమునకు ప్రామాణికములైన సమయాచారములను నెలకొల్పిన వాడు, వాటిని ఆచరించి ఆదర్శమూర్తియైనవాడు. (22)

నిభృతః సంవృతాకారో గుప్తమంత్రః సహాయవాన్।
అమోఘక్రోధహర్షశ్చ త్యాగసంయమకాలవిత్। 23

రఘునందనుడు వినయశీలుడు, తనమనస్సులోని అభిప్రాయములను ముఖకవళికలలో బయటపడనీయని వాడు. రహస్యాలోచనలను సమయమువచ్చువఱకు గూఢముగా ఉంచువాడు, సమర్థులైన మంత్రులను కలిగియున్నవాడు, ఆయనకోపముగాని, సంతోషముగాని సత్ఫలములనే ఇచ్చు చుండును. సమయోచితముగా పాత్రులకే దానముచేయు వాడు. ధనమును న్యాయముగా సమకూర్చువాడు. (23)

దృఢభక్తిః స్థిరప్రజ్ఞో నాసద్గ్రాహీ న దుర్వచాః।
నిస్తంద్రిరప్రమత్తశ్చ స్వదోషపరదోషవిత్। 24

శ్రీరాముడు మాతాపితరులయందును, గురువుల యెడను నిశ్చలభక్తిగలవాడు, ఆయనప్రజ్ఞ సాటిలేనిది, దుర్జనులను దఱిచేరనీయనివాడు. సత్సంగములకు నెలవు, సోమరితనముగాని, ఏమఱుపాటుగాని లేనివాడు, లోకము ఇతరులలోపములను మాత్రమే గుర్తించును, రాముడైతే తనలోపములనుగూడ గుర్తించును. (24)

శాస్త్రజ్ఞశ్చ కృతజ్ఞశ్చ పురుషాంతరకోవిదః।
యః ప్రగ్రహానుగ్రహయోః యథాన్యాయం విచక్షణః। 25

రఘురాముడు సర్వశాస్త్రకోవిదుడు, కృతజ్ఞుడు, (ఏవిధముగానైనను, ఏ కొంచెమైనను తనకు ఉపకారము జరిగినచో దానిని మఱువనివాడు.) చూచినంతమాత్రముననే సాధువులను, అసాధువులను సులభముగా గుర్తించువాడు, శాస్త్రమర్యాదను అనుసరించి మిత్రులు మొదలగువారిని స్వీకరించు వాడు, పిదప తగువిధముగా వారిని ఆదుకొనువాడు. (25)

1) అస్త్రములు మంత్రపూర్వకముగా విడువబడునవి. శస్త్రములు మంత్రములు లేకయే ప్రయోగింపబడునవి.

సత్సంగ్రహప్రగ్రహణే స్థానవిన్నిగ్రహస్య చ।
ఆయకర్మణ్యుపాయజ్ఞః సందృష్టవ్యయకర్మవిత్। 26

సజ్జనులను దగ్గరజేర్చుకొనుటలోను, వారికి తోడ్పడుట యందును శ్రీరాముడు కుశలుడు. సమయమెఱిగి దుర్జనులను శిక్షించువాడు, న్యాయసమ్మతముగ ప్రజలను నొప్పింపక (పూవులనుండి తుమ్మెద తేనెను గ్రహించునట్లు) వారినుండి కోశాగారమునకు ధనమును సమకూర్చువాడు. శాస్త్రప్రకారము ఆ ధనమును సముచితముగా వ్యయమొనర్చువాడు.[1] (26)

శ్రైష్ఠ్యం శాస్త్రసమూహేషు ప్రాప్తో వ్యామిశ్రకేషు చ।
అర్థధర్మౌ చ సంగృహ్య సుఖతంత్రో న చాలసః। 27

సకలశాస్త్రములయందును, సంస్కృతాదిభాషలయందు గల కావ్యనాటకాలంకారములయందును రఘువీరుడు కోవిదుడు. ధర్మబద్ధముగా ఆర్జించిన అర్థముపరిధిలో సుఖమును కోరుకొనువాడు, కర్తవ్యకార్యములయందు అలసత్వమునకు తావు ఇచ్చెడివాడు కాడు. (27)

వైహారికాణాం శిల్పానాం విజ్ఞాతార్థవిభాగవిత్।
ఆరోహే వినయే చైవ యుక్తో వారణవాజినామ్। 28

శ్రీరాముడు మనోరంజకములైన సంగీతచిత్రకళల యందును, వీణావేణుమృదంగతాళవిద్యలయందును ఆఱితేఱిన వాడు, ధనమును క్రమపద్ధతి[2] ననుసరించి సద్వినియోగము చేయుట తెలిసినవాడు. ఏనుగులను గుఱ్ఱములను అధిరోహించుట, అదుపుచేయుట, వాటికి శిక్షణ ఇచ్చుట ఎఱిగినవాడు. (28)

ధనుర్వేదవిదాం శ్రేష్ఠో లోకేఽతిరథసమ్మతః।
అభియాతా ప్రహర్తా చ సేనానయవిశారదః।
అప్రధృష్యశ్చ సంగ్రామే క్రుద్ధైరపి సురాసురైః। 29

రఘునందనుడు ధనుర్వేదరహస్యములను బాగుగా తెలిసినవాడు, ధనుర్ధారులలో శ్రేష్ఠుడు, సాటిలేని యోధులైన అతిరథు[3]లచే పూజింపబడువాడు, స్వయముగా తానే శత్రుసేనలకు ఎదురుగా వెళ్లి, ముందు భాగమునచేర్చి వారిని దెబ్బతీసెడివాడు, శత్రువులకంతుపట్టని వ్యూహరచనలుచేసి తనసేనలను కాపాడువాడు, యుద్ధరంగమున క్రోధవివశులై యున్న సురాసురులకు సైతము ఎదిరింపశక్యముగానివాడు. (29)

అనసూయో జితక్రోధో న దృప్తో న చ మత్సరీ।
న చావమంతా భూతానాం న చ కాలవశానుగః। 30

శ్రీరాముడు అసూయ[4] లేనివాడు, కోపమునకులోను కానివాడు, గర్వములేనివాడు, మాత్సర్యమును[5] ఎఱుగనివాడు, ఎట్టివారిని ఏమాత్రమూ అవమానింపనివాడు, సత్త్వరజస్తమో గుణములకు అతీతుడు, శుద్ధసత్త్వస్వభావుడు. (30)

1) శ్లో॥ కచ్చిదాయస్య చార్ధేన చతుర్భాగేన వా పునః। పాదభాగైస్త్రిభిర్వాపి వ్యయస్సంశోధ్యతే బుధైః॥ - మహాభారతము సభాపర్వము 5/71
తెలివిగలవారు ఆదాయములో సగభాగముగాని, పావుభాగముగాని, కడకు ముప్పావుభాగముగాని వ్యయముచేయుదురు. అంతేగాని ఎట్టి పరిస్థితులలోను కోశాగారమునందలి ధనమునకు లోటురానీయరు. (పూర్తిగా వ్యయము చేయరు)

2) శ్లో॥ ధర్మాయ యశసేఽర్థాయ, కామాయ స్వజనాయ చ। పంచధా విభజన్ విత్తం, ఇహాముత్ర చ శోభతే॥ శ్రీమద్భాగవతము 8/19/37
ధనమును ఐదు విధములుగా విభజించి దానధర్మములకును, కీర్తిప్రతిష్ఠలను సమకూర్చు కార్యములకును, వస్తువులు మొదలగువాటికిని, ధర్మబద్ధమైన కోరికలను తీర్చుకొనుటకును, తనకుటుంబసభ్యులఅవసరములకును వినియోగించుట యుక్తము- ఈ పద్ధతి ఇహపరఫలసాధకము.

3) అతిరథుడు = ఒకే సమయమున పెక్కుమందిి వీరకాండ్రతో పోరాడెడియోధుడు.

4) అసూయ = ఇతరులగుణములనుగూడ దోషములుగా భావించుట.

5) మాత్సర్యము = ఇతరుల ఉన్నతిని జూచి ఓర్వలేకుండుట.
న గుణాన్ గుణినో హంతి, స్తౌతి మందగుణానపి। నాన్యదోషేషు రమతే సానసూయా ప్రకీర్తితా॥ అత్రిస్మృతి॥
గుణవంతులనిగుణములలో దోషములను వెదకనివాడు, పరులస్వల్పగుణములనుసైతము ప్రశంసించువాడు, ఇతరులదోషములను చూచి ఆనందింపనివాడు అగునట్టి మనుష్యునిస్వభావమును అనసూయ (దోషదృష్టిలేనివాడు) అనియందురు.

ఏవం శ్రేష్ఠగుణైర్యుక్తః ప్రజానాం పార్థివాత్మజః।
సమ్మతః త్రిషు లోకేషు వసుధాయాః క్షమాగుణైః।
బుద్ధ్యా బృహస్పతేస్తుల్యో వీర్యేణాపి శచీపతేః। 31

తథా సర్వప్రజాకాంతైః ప్రీతిసంజననైః పితుః।
గుణైర్విరురుచే రామో దీప్తః సూర్య ఇవాంశుభిః। 32

తమేవం వ్రతసంపన్నమ్ అప్రధృష్యపరాక్రమమ్।
లోకపాలోపమం నాథమ్ అకామయత మేదినీ। 33

ఏతైస్తు బహుభిర్యుక్తం గుణైరనుపమైః సుతమ్।
దృష్ట్వా దశరథో రాజా చక్రే చింతాం పరంతపః। 34

అథ రాజ్ఞో బభూవైవం వృద్ధస్య చిరజీవినః।
ప్రీతిరేషా కథం రామో రాజా స్యాన్మయి జీవతి। 35

ఏషా హ్యస్య పరా ప్రీతిః హృది సంపరివర్తతే।
కదా నామ సుతం ద్రక్ష్యామ్యభిషిక్తమ్ అహం ప్రియమ్। 36

వృద్ధికామో హి లోకస్య సర్వభూతానుకంపనః।
మత్తః ప్రియతరో లోకే పర్జన్య ఇవ వృష్టిమాన్। 37

యమశక్రసమో వీర్యే బృహస్పతిసమో మతౌ।
మహీధరసమో ధృత్యాం మత్తశ్చ గుణవత్తరః। 38

మహీమహమిమాం కృత్స్నామ్ అధితిష్ఠంతమాత్మజమ్।
అనేన వయసా దృష్ట్వా యథా స్వర్గమవాప్నుయామ్। 39

ఇత్యేతైర్వివిధైస్తైస్తైః అన్యపార్థివదుర్లభైః।
శిష్టైరపరిమేయైశ్చ లోకే లోకోత్తరైర్గుణైః। 40

తం సమీక్ష్య మహారాజో యుక్తం సముదితైశ్శుభైః।
నిశ్చిత్య సచివైః సార్థం యువరాజమ్ అమన్యత। 41

ఆ దశరథమహారాజకుమారుడు ఇట్టి ఉత్తమోత్తమ గుణములను కలిగియున్నందున సమస్తప్రజలకును, అంతేగాదు ముల్లోకములకును పూజ్యుడు, అతడు క్షమాగుణమున భూదేవియంతటివాడు, బుద్ధివైభవమున బృహస్పతి, పరాక్రమమున ఇంద్రునితో సమానుడు. (31)

శ్రీరాముడు సహజసుందరుడు. ఇంకను ఆయన ఉన్నతగుణములు తల్లిదండ్రులకు మాత్రమేగాక సకలజనులకును ప్రీతిపాత్రములు, మనోహరములు. అట్లు సద్గుణములతో, అందచందములతో అలరారెడి ఆ మహారాజసుతుడు సహస్రకిరణములతో ప్రకాశించు సూర్యునివలె విరాజిల్లుచుండెను. (32)

ఇట్లు సద్గుణసంపన్నుడును, ఆశ్రితులను రక్షించుటయే వ్రతముగా గలవాడును, మొక్కవోని పరాక్రమము గలవాడును, దిక్పాలురవలె అందరిని ఆదుకొనుచుండు వాడును ఐన రఘువరుడు తమకు ప్రభువు కావలెనని భూలోక ప్రజలందఱును కోరుకొనుచుండిరి. (33)

ఈ విధముగా సాటిలేని అనేకశుభలక్షణములతో విలసిల్లుచున్న శ్రీరాముని జూచి, శత్రుభయంకరుడైన దశరథుడు ఇట్లు ఆలోచింపసాగెను.(34)

వయోవృద్ధుడును, జ్ఞానవృద్ధుడును ఐన దశరథ మహారాజునకు 'నేను జీవించియుండగనే ఈ రాజ్యమునకు శ్రీరాముడు రాజైనచో ఎంతబాగుండును? అది చూచి నేను సంతోషింతునుగదా!' అను కోరిక కలిగెను. (35)

'నా ప్రియపుత్త్రుడైన రాముని రాజ్యాభిషిక్తునిగా ఎప్పుడు చూడగలనో గదా!' అను గాఢమైనకాంక్ష దశరథుని హృదయమున నిరంతరము మెదలుచుండెను. (36)

శ్రీరాముడు ప్రజలయొక్క అభివృద్ధికై పాటుపడువాడు. సకలప్రాణులయెడ కృపజూపువాడు, వర్షించు మేఘమువలె జనులసంతాపమును రూపుమాపువాడు. వారికి నాకంటెను అతడు ఎక్కువగా ప్రీతిపాత్రుడు. పరాక్రమమున ఇంద్రయములవంటివాడు, బుద్ధికి బృహస్పతి, మేరునగధీరుడు, సద్గుణములచే నన్ను మించినవాడు. అట్టి నాకుమారుడు ఈ సమస్తభూమండలమునకును రాజుకాగా' నేను ఈ వయస్సులో చూచి, స్వర్గసుఖములను పొందెదను. (37-39)

శ్రీరామునిలోని విశిష్టగుణములు అసంఖ్యాకములు, అవి లోకోత్తరములు, ఈ విధమైన ఆయామహోన్నతగుణములు దాగఢాపెట్టి వెదకినను ఇతర రాజులలో కనబడవు. ఇంతవఱకును పేర్కొనబడినవిగాక ఇంకను స్వాభావికములైన పెక్కు కల్యాణగుణములకు కుదురైనవాడు అతడు. అట్టి శుభ లక్షణసంపన్నుడైన కుమారుని జూచి. దశరథమహారాజు మంత్రులతో సమాలోచనలొనర్చి, 'శ్రీరాముని యువరాజును జేయుటకై' నిశ్చయించెను. (40-41)

దివ్యంతరిక్షే భూమౌ చ ఘోరముత్పాతజం భయమ్।
సంచచక్షే చ మేధావీ శరీరే చాత్మనో జరామ్। 42

ఆకాశమునందును, అంతరిక్షమునందును, భూమిపైనను సంభవించుచున్న మిక్కిలి భయంకరములైన ఉత్పాతములను గూర్చియు, తనశరీరముపై ప్రభావమును చూపుచున్న ముసలితనమునుగూర్చియు ప్రజ్ఞాశాలియైన దశరథుడు మంత్రులతో ప్రస్తావించెను. (42)

పూర్ణచంద్రాననస్యాథ శోకాపనుదమాత్మనః।
లోకే రామస్య బుబుధే సంప్రియత్వం మహాత్మనః। 43

'పున్నమినాటి చంద్రునివలె లోకమునకు ఆహ్లాదకరుడును, మిక్కిలి బుద్ధిశాలియు అగు శ్రీరాముడు దేశప్రజలకు అత్యంతసంతోషదాయకుడు. ఆయనపైగల వారికిగల ప్రేమాభిమానములు అపారములు. ఈ పరిస్థితులు నా సంతాపమును తొలగించునవి. కావున శ్రీరాముని పట్టాభిషిక్తుని జేయుట సమంజసమే'- అని దశరథుడు భావించెను. (43)

ఆత్మనశ్చ ప్రజానాం చ శ్రేయసే చ ప్రియేణ చ।
ప్రాప్తకాలేన ధర్మాత్మా భక్త్యా త్వరితవాన్ నృపః। 44

ప్రజలకు సుఖసంతోషములను గూర్చుచు, వారిని రక్షించుట రాజధర్మము. అట్టి ధర్మమునెఱింగిన దశరథుడు 'వయోవృద్ధుడైన తనకు మాత్రమేకాక ప్రజలకును హితమును గూర్చుటకై, ప్రియమును కల్గించుటకై నవయువకుడైన శ్రీరాముని పట్టాభిషిక్తునిజేయుటకు ఇది సరియైన సమయము'-అని భావించి, అందులకై త్వరపడసాగెను. (44)

నానానగరవాస్తవ్యాన్ పృథగ్జానపదానపి।
సమానినాయ మేదిన్యాః ప్రధానాన్ పృథివీపతీన్। 45

వెంటనే ఆ మహారాజు వివిధనగరప్రజలను, ఆయా ప్రదేశములలోనుండు జానపదులను, దేశమునగల ప్రముఖులను, సామంతరాజులను వేర్వేఱుగా రప్పించెను. (45)

న తు కేకయరాజానం జనకం వా నరాధిపః।
త్వరయా చానయామాస పశ్చాత్ తౌ శ్రోష్యతః ప్రియమ్। 46

వ్యవధి తక్కువగానుండుటచే దూరతీరములనున్న భరతునిమాతామహుడైన కేకయప్రభువును, శ్రీరామునకు మామయైన జనకమహారాజును ఆ తొందరలో పిలిపింపలేదు. 'క్రమముగా వారు ఈ శుభవార్తను విని ఆనందింతురు'- అని భావించి, అతడు అట్లుచేసెను. (46)

తాన్ వేశ్మనానాభరణైః యథార్హం ప్రతిపూజితాన్।
దదర్శాలంకృతో రాజా ప్రజాపతిరివ ప్రజాః। 47

ఆహ్వానముపై అయోధ్యకు విచ్చేసినవారికందఱికిని దశరథుడు తగిన విడిదిగృహములను ఏర్పాటుచేసెను. వారిని వివిధాభరణములతో సత్కరించెను. అలంకృతుడైన దశరథుడు బ్రహ్మదేవుడు ప్రజలనువలె ఆహూతులను దర్శించెను. (47)

అథోపవిష్టే నృపతౌ తస్మిన్ పరబలార్దనే।
తతః ప్రవివిశుః శేషా రాజానో లోకసమ్మతాః। 48

అంతట శత్రుభయంకరుడైన ఆ దశరథనరపతి సభలో ఆసీనుడైన పిమ్మట ప్రజానురంజకులైన తక్కిన రాజులందఱును సభలో ప్రవేశించి ఆసనములను అలంకరించిరి. (48)

అథ రాజవితీర్ణేషు వివిధేష్వాసనేషు చ।
రాజానమేవాభిముఖా నిషేదుర్నియతా నృపాః। 49

దశరథునిచే వివిధప్రదేశములలో నియమితులైన ఆ (సామంత) రాజులు తమకై ఏర్పాటుచేయబడిన ఆసనములపై మహారాజునకు అభిముఖముగా కూర్చుండిరి. (49)

స లబ్ధమానై ర్వినయాన్వితైర్నృపైః
పురాలయైర్జానపదైశ్చ మానవైః।
ఉపోపవిష్టైః నృపతిర్వృతో బభౌ
సహస్రచక్షుః భగవానివామరైః। 50

దశరథునినుండి సముచితమైన అతిథిసత్కారములను పొందిన వినయశీలురగు సామంతరాజులు, వివిధనగరములకు చెందిన పురప్రముఖులు, జానపదులు రాజుగారు నుడివెడి వచనములను సావధానముగా ఆలకించుటకై ఆయనకు చేరువగా మిట్టుమిట్టి కూర్చుండిరి. అప్పుడామహారాజు దేవతలచే పరివృతుడైన సకలైశ్వర్యసంపన్నుడగు దేవేంద్రునివలె విరాజిల్లెను. (50)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ప్రథమస్సర్గః *(1)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు మొదటిసర్గము సమాప్తము

— * * * —

2. రెండవసర్గము

శ్రీరాముని యువరాజుగా చేయుటకు ప్రజలు సమ్మతించుట.

తతః పరిషదం సర్వామ్ ఆమంత్ర్య వసుధాధిపః।
హితముద్ధర్షణం చైవమ్ ఉవాచ ప్రథితం వచః। 1

దుందుభిస్వనకల్పేన గంభీరేణానునాదినా।
స్వరేణ మహతా రాజా జీమూత ఇవ నాదయన్। 2

రాజలక్షణయుక్తేన కాంతేనానుపమేన చ।
ఉవాచ రసయుక్తేన స్వరేణ నృపతిః నృపాన్। 3

విదితం భవతామేతత్ యథా మే రాజ్యముత్తమమ్।
పూర్వకైర్మమ రాజేంద్రైః సుతవత్పరిపాలితమ్। 4

సోఽహమిక్ష్వాకుభిస్సర్వైః నరేంద్రైః పరిపాలితమ్।
శ్రేయసా యోక్తుకామోఽస్మి సుఖార్హమఖిలం జగత్। 5

మయాఽప్యాచరితం పూర్వైః పంథానమనుగచ్ఛతా।
ప్రజా నిత్యమనిద్రేణ యథాశక్త్యభిరక్షితాః। 6

ఇదం శరీరం కృత్స్నస్య లోకస్య చరతాహితమ్।
పాండురస్యాతపత్రస్య చ్ఛాయాయాం జరితం మయా। 7

ప్రాప్య వర్షసహస్రాణి బహూన్యాయూంషి జీవతః।
జీర్ణస్యాస్య శరీరస్య విశ్రాంతిమభిరోచయే। 8

రాజప్రభావజుష్టాం హి దుర్వహామ్ అజితేంద్రియైః।
పరిశ్రాంతోఽస్మి లోకస్య గుర్వీం ధర్మధురం వహన్। 9

సోఽహం విశ్రమమిచ్ఛామి పుత్త్రం కృత్వా ప్రజాహితే।
సన్నికృష్టానిమాన్ సర్వాన్ అనుమాన్య ద్విజర్షభాన్। 10

అనుజాతో హి మాం సర్వైః గుణైః జ్యేష్ఠో మమాత్మజః।
పురందరసమో వీర్యే రామః పరపురంజయః। 11

సామంతరాజులు మొదలగువారు అందఱును సుఖాసీనులైన పిమ్మట ఆ అయోధ్యాధిపతి సదస్యులను అందఱిని సంబోధించుచు ఎల్లరకును అపరిమితసంతోషమును గూర్చునట్టి హితకరమైన విషయమును మేఘగర్జనవలె గంభీరమైన స్వరముతో ప్రకటించెను. ఆ ధ్వని దుందుభిస్వనమువలె నలుదెసల ప్రతిధ్వనించుచుండెను. ఆ మహాస్వరము మహారాజస్థాయికి తగినట్లు నిండుగానుండెను. సాటిలేని మృదుమధుర కంఠస్వరముతో దశరథుడు సామంతరాజులు మున్నగు వారిని ఉద్దేశించి ఇట్లు పలికెను. (1-3)

"సజ్జనులారా! విశాలమైన ఈ కోసలరాజ్యము నందలి ప్రజలను మా పూర్వీకులైన 'రఘు' ప్రభృతి మహారాజులు తమకన్నబిడ్డలవలె పరిపాలించిన విషయము మీరందఱును ఎఱిగినదే. ఇక్ష్వాకుమహారాజు, ఆ వంశీయులైన నరేంద్రులు ఈ సమస్తకోసలరాజ్యమును సుభిక్షముగా పరిపాలించిరి. ఆ వంశమువాడనేయైన నేను దీనిని సుఖసంతోషములకు ఆటపట్టుగా చేయుదలచితిని. మా పెద్దలు వేసిన బాటనే ఇంతవఱకును అనుసరించుచు నేనును యథాశక్తి మిక్కిలి జాగరూకుడనై ప్రజలను రక్షించుచువచ్చితిని. (4-6)

సమస్తప్రజలహితముకొఱకు పాటుపడుచు ఈ శ్వేతచ్ఛత్రముయొక్క ఛాయలోనే నా శక్తియుక్తులను పూర్తిగా ధారపోసితిని. పరిపాలనవిధినిర్వహణమునందే నాకు వార్ధక్యము సంక్రమించినది. వేలకొలది (అఱువదివేల) సంవత్సరముల వయస్సుగల నా శరీరము ముసలితనముచే జీర్ణదశకు చేరి, రాజ్యభారమునుండి విశ్రాంతిని గోరుకొనుచున్నది. (7-8)

ప్రజాపాలనబాధ్యతను నిర్వహించుట మిక్కిలి గురుతరమైనది. అది శౌర్యపరాక్రమములుగల ప్రభువులకు మాత్రమే సాధ్యము. విషయసుఖములకు లోనైనవారు ఆ బరువును మోయజాలరు. ధర్మమార్గమున రాజ్యపాలనభారమును వహించి వహించి, నేను అలసిపోయితిని. ఆ విధముగా డస్సిన నేను అంతరంగికులైన ఈ బ్రాహ్మణోత్తములందఱి అనుమతితో ప్రజలశ్రేయస్సుకొఱకు రాజ్యభారమును పుత్త్రునకు అప్పగించి, విశ్రాంతి గైకొనదలచితిని. (9-10)

నా పెద్దకుమారుడైన రాముడు పరాక్రమాది గుణములను బట్టి నాయంతటివాడు. అతడు శత్రునగరములను ధ్వంసమొనర్పగలవాడు, శౌర్యమున ఇంద్రతుల్యుడు. (11)

తం చంద్రమివ పుష్యేణ యుక్తం ధర్మభృతాం వరమ్।
యౌవరాజ్యే నియోక్తాఽస్మి ప్రీతః పురుషపుంగవమ్। 12

అనురూపః స వై నాథో లక్ష్మీవాన్ లక్ష్మణాగ్రజః।
త్రైలోక్యమపి నాథేన యేన స్యాన్నాథవత్తరమ్। 13

అనేన శ్రేయసా సద్యః సంయోజ్యైవమిమాం మహీమ్।
గతక్లేశో భవిష్యామి సుతే తస్మిన్ నివేశ్య వై। 14

యదీదం మేఽనురూపార్థం మయా సాధు సుమంత్రితమ్।
భవంతో మేఽనుమన్యంతాం కథం వా కరవాణ్యహమ్। 15

యద్యప్యేషా మమ ప్రీతిః హితమన్యద్విచింత్యతామ్।
అన్యా మధ్యస్థచింతా హి విమర్దాభ్యధికోదయా। 16

ఇతి బ్రువంతం ముదితాః ప్రత్యనందన్ నృపా నృపమ్।
వృష్టిమంతం మహామేఘం నదంత ఇవ బర్హిణః। 17

స్నిగ్ధోనునాదీ సంజజ్ఞే తత్ర హర్షసమీరితః।
జనౌఘోద్ఘుష్టసన్నాదో విమానం కంపయన్నివ। 18

తస్య ధర్మార్థవిదుషో భావమాజ్ఞాయ సర్వశః।
బ్రాహ్మణా జనముఖ్యాశ్చ పౌరజానపదైస్సహ। 19

సమేత్య మంత్రయిత్వా తు సమతాం గతబుద్ధయః।
ఊచుశ్చ మనసా జ్ఞాత్వా వృద్ధం దశరథం నృపమ్। 20

పుష్యమీనక్షత్రయుక్తచంద్రునివలె దివ్యతేజస్సుతో విలసిల్లుచున్న వాడును, ధార్మికులలో శ్రేష్ఠుడును, నరోత్తముడును ఐన శ్రీరాముని రేపు పుష్యమీనక్షత్రయుక్త సుముహూర్తమున యువరాజపట్టాభిషిక్తునిగా జేసెదను. (12)

సర్వశుభలక్షణసంపన్నుడును, లక్ష్మణాగ్రజుడును ఐన శ్రీరాముడు ఈ కోసలరాజ్యమునకు తగినప్రభువు, అతడు రాజైనచో ముల్లోకములును సురక్షితములగును. నేను చిరకాలము నుండి వహించుచు వచ్చిన ఈ రాజ్యభారమును నా జ్యేష్ఠకుమారుడైన శ్రీరామునిపై ఉంచెదను. తత్ఫలితముగా భూమండలమునకు శ్రేయస్సు చేకూరును, నాకును విశ్రాంతి లభించును. (13-14)

ఈ రామపట్టాభిషేకకార్యమును నిర్వహించుటవలన రాజ్యభారముచే అలసిసొలసియున్ననాకు సముచితమైన ప్రయోజనము చేకూరునని తలచి బాగుగా ఆలోచించి, మీతో ఇట్లు ప్రస్తావించితిని. ఇది మీకు నచ్చినచో నాకు అనుమతినిండు. మఱియు నా కర్తవ్యమును దెల్పుడు. (15)

శ్రీరాముని యువరాజునుజేయుట నాకు ప్రీతికరమైన విషయము ఐనప్పటికిని, ప్రజలకు హితకరమైనది మఱియొకటియున్నచో ఆలోచింపుడు. ఏలనన పక్షపాతరహితులైన మధ్యస్థులు బాగుగా చర్చించి నిర్ణయించిన విషయము ఎక్కువ ప్రయోజనకారిగదా!" (16)

ఈ విధముగా పలుకుచున్న రాజునుజూచి సభలోని సామంతరాజులందఱును సంతసించినవారై, వర్షించుచున్న మేఘమును జూచి 'కేంకారములు' చేయుచున్న నెమళ్లవలె ఆనందముతో దశరథుని అభినందించిరి. (17)

అంతట ఆ సభలోని వారెల్లరును హర్షాతిరేకముతో అభినందనధ్వనులను గావించిరి. వినసొంపుగానున్న ఆ ధ్వనులు రాజభవనగోపురమును కంపింపజేయుచున్నవాయనునట్లు సభయందంతటను మాఱుమ్రోగెను. (18)

సభలోనున్న వసిష్ఠాది బ్రాహ్మణులు, సామంతరాజులు, పురప్రముఖులు, జానపదులు మున్నగు వారందఱును కలిసి, రాజుగారిప్రతిపాదనలోని యుక్తాయుక్తములను చర్చించిరి. ధర్మార్థములను బాగుగా ఎఱింగిన దశరథుని మాటలలోని ఆంతర్యమును వారు గ్రహించిరి. (ధర్మార్థములను ఎఱుంగుటయనగా వార్ధక్యమునందున్న రాజు రాజ్యభారమును యువరాజునకు అప్పగించుట, ప్రజలశ్రేయస్సును విస్మరింపకుండుట) రాజుగారిప్రతిపాదన దేశకాలోచితమైనదని ఏకాభిప్రాయమునకు వచ్చిరి. దీనిని గూర్చి ఎవరికి వారు తమలోతాము ఆలోచించుకొని, తమనిర్ణయమును వృద్ధుడైన దశరథమహారాజునకు ఇట్లు తెలిపిరి. (19-20)

అనేకవర్షసాహస్రో వృద్ధస్త్వమసి పార్థివ।
స రామం యువరాజానమ్ అభిషించస్వ పార్థివమ్। 21

ఇచ్ఛామో హి మహాబాహుం రఘువీరం మహాబలమ్।
గజేన మహతా యాంతం రామం ఛత్రావృతాననమ్। 22

ఇతి తద్వచనం శ్రుత్వా రాజా తేషాం మనఃప్రియమ్।
అజానన్నివ జిజ్ఞాసుః ఇదం వచనమబ్రవీత్। 23

శ్రుత్వైవ వచనం యన్మే రాఘవం పతిమిచ్ఛథ।
రాజానస్సంశయోఽయం మే కిమిదం బ్రూత తత్త్వతః। 24

కథం ను మయి ధర్మేణ పృథివీమ్ అనుశాసతి।
భవంతో ద్రష్టుమిచ్ఛంతి యువరాజం మమాత్మజమ్। 25

తే తమూచుర్మహాత్మానం పౌరజానపదైః సహ।
బహవో నృప కల్యాణా గుణాః పుత్రస్య సంతి తే। 26

గుణాన్ గుణవతో దేవ దేవకల్పస్య ధీమతః।
ప్రియానానందదాన్ కృత్స్నాన్ ప్రవక్ష్యామోఽద్య తాన్శృణు। 27

దివ్యైర్గుణైః శక్రసమో రామః సత్యపరాక్రమః।
ఇక్ష్వాకుభ్యోఽపి సర్వేభ్యో హ్యతిరిక్తో విశాంపతే। 28

రామః సత్పురుషో లోకే సత్యధర్మపరాయణః।
సాక్షాద్రామాద్వినిర్వృత్తో ధర్మశ్చాపి శ్రియా సహ। 29

ప్రజాసుఖత్వే చంద్రస్య వసుధాయాః క్షమాగుణైః।
బుద్ధ్యా బృహస్పతేస్తుల్యో వీర్యే సాక్షాత్ శచీపతేః। 30

"ఓ మహారాజా! వేలకొలది సంవత్సరములవయస్సు గల వృద్ధుడవు నీవు. కనుక రాజ్యమును పాలించుటకు వెంటనే అన్ని విధములుగా అర్హుడైన శ్రీరాముని యువరాజుగా పట్టాభిషిక్తుని గావింపుము. ఆజానుబాహువు, మహాబలసంపన్నుడు, రఘువంశశ్రేష్ఠుడు ఐన శ్రీరాముడు యువరాజ పట్టాభిషిక్తుడై 'శత్రుంజయ' గజమును అధిరోహించి, శ్వేతచ్ఛత్రచ్ఛాయలో పురవీధులలో ఊరేగుచు వచ్చుచుండగా చూచి, ఆనందింపవలెనని మేమందరము మిక్కిలి ఉవ్విళ్లూరుచున్నాము. (21-22)

అంతట దశరథమహారాజు సదస్యులమాటలను విని, వారిమనస్సులలో పొంగిపొరలుచున్న సంతోషమును ఎఱింగియు, మఱల వారిఅభిలాషలను (విడివిడిగా) వారినుండియే వినుటకై, తెలియనివానివలె ఇట్లనెను. (23)

"ఓ రాజులారా! నేను చెప్పిన మాటలను వినినంతనే ఏ మాత్రము మాఱుపల్కక శ్రీరాముని యువరాజుగా కోరుకొనుచుంటిరి. అదిసరే! మొదట నా సందేహమును దీర్చుడు. నాపరిపాలనకు అసంతృప్తులై ఇట్లు కోరుకొనుచుంటిరా? లేక శ్రీరాముని సద్గుణసౌందర్యములప్రభావముననా? యథార్థమును వచింపుడు. నేను ధర్మబద్ధముగా రాజ్యపాలన చేయుచుంటినిగదా! (నా సుఖములను సైతము ఏమాత్రము పట్టించుకొనక మీ రక్షణభారమునే వహించుచు ఇంతవఱకును పాటుపడితినిగదా!) ఐనను 'నాకుమారుడు యువరాజు కావలెనని' మీరు ఎందులకు అభిలషించుచున్నారు?" (24-25)

రాజులు, పౌరులు, జానపదులు మున్నగు వారందఱును మహోదారుడైన ఆ దశరథునితో ఏకగ్రీవముగా ఇట్లు పలికిరి. "మహారాజా! నీకుమారుడు పెక్కు కల్యాణగుణములకు పెన్నిధి. ఓ ప్రభూ! ఉత్తమోత్తమగుణములు గలవాడును, దైవతుల్యుడును, ధీశాలియు ఐన శ్రీరామునియొక్క సద్గుణములనన్నింటిని పూర్తిగా తెల్పెదము వినుము. అవి మిక్కిలి ప్రీతికరములు, ఆనందదాయకములు. (26-27)

ఓ నరేంద్రా! శ్రీరామునిపరాక్రమము అమోఘమైనది. అతడు తన దివ్యగుణములచేత ఇంద్రునితో సమానుడు. ఇక్ష్వాకువంశపురాజులందఱిలో శక్తిసామర్థ్యములచే మిన్నయైనవాడు. ఈ లోకమున రామునివంటి సత్పురుషుడు మఱియొకడు లేడు. అతడు శత్రువులనుగూడ మన్నించువాడు, సత్యధర్మైకనిరతుడు, ధర్మమును, దానిఫలమైన సంపదను, ఈరెంటిని ఒక్క త్రాటిపైన నడిపెడివాడతడు. శ్రీరాముడు చంద్రునివలె ప్రజలకు ఆహ్లాదకరుడు. క్షమాగుణమున భూదేవితో తుల్యుడు, బుద్ధియందు బృహస్పతి. పరాక్రమవిషయమున సాక్షాత్తు ఇంద్రుడే. (28-30)

ధర్మజ్ఞః సత్యసంధశ్చ శీలవాననసూయకః।
క్షాంతః సాంత్వయితా శ్లక్ష్ణః కృతజ్ఞో విజితేంద్రియః। 31

మృదుశ్చ స్థిరచిత్తశ్చ సదా భవ్యోఽనసూయకః। 32

ప్రియవాదీ చ భూతానాం సత్యవాదీ చ రాఘవః।
బహుశ్రుతానాం వృద్ధానాం బ్రాహ్మణానామ్ ఉపాసితా। 33

తేనాస్యేహాతులా కీర్తిః యశస్తేజశ్చ వర్ధతే।
దేవాసురమనుష్యాణాం సర్వాస్త్రేషు విశారదః। 34

సమ్యగ్విద్యావ్రతస్నాతో యథావత్ సాంగవేదవిత్। 35

గాంధర్వే చ భువి శ్రేష్ఠో బభూవ భరతాగ్రజః।
కల్యాణాభిజనః సాధుః అదీనాత్మా మహామతిః। 36

ద్విజైరభివినీతశ్చ శ్రేష్ఠైర్ధర్మార్థనైపుణైః। 37

యదా వ్రజతి సంగ్రామం గ్రామార్థే నగరస్య వా।
గత్వా సౌమిత్రిసహితో నావిజిత్య నివర్తతే। 38

సంగ్రామాత్ పునరాగమ్య కుంజరేణ రథేన వా।
పౌరాన్ స్వజనవన్నిత్యం కుశలం పరిపృచ్ఛతి। 39

పుత్రేష్వగ్నిషు దారేషు ప్రేష్యశిష్యగణేషు చ।
నిఖిలేనానుపూర్వ్యాచ్చ పితా పుత్రానివౌరసాన్। 40

శుశ్రూషంతే చ వశ్శిష్యాః కచ్చిత్ కర్మసు దంశితాః।
ఇతి నః పురుషవ్యాఘ్రః సదా రామోఽభిభాషతే। 41

అతడు సామాన్య ధర్మములను, విశేషధర్మములను బాగుగా ఎఱిగినవాడు, చేసిన ప్రతిజ్ఞలను నిలుపుకొను వాడు. చక్కని సౌశీల్యముగలవాడు, ఇతరులను జూచి అసూయపడనివాడు. అపరాధములనుగూడ క్షమించువాడు. కుపితులను, దుఃఖితులను ఓదార్చువాడు. ఎల్లప్పుడును ప్రియభాషి. ఇతరులు ఒక్కసారి చేసిన స్వల్పమైన ఉపకారమునుగూడ కొండంతలుగా భావించువాడు. జితేంద్రియుడు. (31)

రఘువరుడు మిక్కిలి మెత్తని స్వభావముగలవాడు, స్థిరమైన చిత్తముగలవాడు, భక్తవరదీనుడు, అసూయారహితుడు, అందఱితోడను సత్యమునే ప్రియముగా మాట్లాడువాడు, వేదశాస్త్రాది సకలవిద్యలయందును ఆఱితేఱినవాడు, శీలవయోవృద్ధులు ఐన బ్రాహ్మణోత్తములను సేవించెడివాడు. వృద్ధులను సేవించుటవలన సాటిలేని కీర్తిప్రతిష్ఠలను పొందినవాడు. శత్రువులను పరిమార్చగల శక్తిసామర్థ్యములను కల్గియున్నవాడు. వివిధములగు అస్త్రవిద్యలయందలి కౌశలమువే దేవతలను, అసురులను, మానవులను మించినవాడు, గురుకులములో వసించి అధ్యాపకుల శిక్షణలో వేద, వేదాంగములయందు చక్కగా ఆఱితేఱినవాడు. (32-35)

శ్రీరాముడు సంగీతాదిగాంధర్వవిద్యలయందు లోకోత్తరుడు. అతడు స్వయముగా పవిత్రుడైనందున మాతా పితృవంశములను ఉద్ధరింపగలవాడు. క్లిష్టపరిస్థితులయందుసైతము అతడు ధైర్యముగానుండును. అత్యంత ప్రజ్ఞాశాలి. ధర్మార్థములను గూర్చి వివరించుటలో సమర్థులై, ఉత్తమవంశసంజాతులై గొప్ప విద్యాశీలములు గలిగిన బ్రాహ్మణోత్తములకడ బాగుగ శిక్షణపొందినవాడు. (36-37)

గ్రామములనుగాని, నగరములనుగాని పరిరక్షించుటకై లక్ష్మణునితోగూడి యుద్ధమునకు వెళ్లినప్పుడు రఘువీరుడు విజయముతోడనే తిరిగివచ్చుచుండును. సమరభూమినుండి రథముపైగాని, మదపుటేనుగుపైగాని మఱలివచ్చిన పిమ్మట నిత్యమూ ఆత్మీయతతో పౌరులను పలుకరించి, వారి క్షేమసమాచారములను అడిగితెలిసికొనుచుండును. లోకమర్యాదను అనుసరించి క్రమముగా ఆ పౌరుల భార్యాపుత్రులనుగూర్చియు, వారిఅగ్నికార్యములను గుఱించియు, సేవకులను, శిష్యులను గూర్చియు తండ్రి కొడుకులనువలె ప్రేమతో అందఱి యోగక్షేమములను అరయుచుండును. (38-40)

'మీ శిష్యులెల్లరును సర్వసన్నద్ధులై, మీమీ కార్యక్రమముల కొనసర్చును మిమ్ము సేవించుచున్నారుగదా!' అని నరశ్రేష్ఠుడైన శ్రీరాముడు సర్వదా మమ్ములను అడుగు చుండును. ప్రజలకు ఆపదలు సంభవించినప్పుడు రాముడు వారిదుఃఖములలో

వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః।
ఉత్సవేషు చ సర్వేషు పితేవ పరితుష్యతి। 42

తానును పాలుపంచుకొనుచుండును. వారికి సంతానము కలిగినప్పుడు జరిగెడు అన్ని ఉత్సవములను జూచి, తండ్రివలె తానును మిక్కిలి సంతోషపడుచుండును. (41-42)

సత్యవాదీ మహేష్వాసో వృద్ధసేవీ జితేంద్రియః।
స్మితపూర్వాభిభాషీ చ ధర్మం సర్వాత్మనా శ్రితః। 43

రఘువీరుడు ఎట్టిసంకటములు వచ్చిపడినను ఆడితప్పనివాడు, కోదండమును (ధనుస్సును) ధరించువాడు, పెద్దలకు సేవలొనర్చుచుండును. జితేంద్రియుడు. ఇతరులను ముందుగా చిఱునవ్వుతో పలుకరించువాడు. ఎట్టి క్లిష్టదశయందైనను ధర్మమును వీడనివాడు. (43)

సమ్యగ్యోక్తా శ్రేయసాం చ న విగృహ్యకథారుచిః।
ఉత్తరోత్తరయుక్తౌ చ వక్తా వాచస్పతిర్యథా। 44

శ్రీరాముడు ఎల్లరకును శ్రేయస్సును గూర్చువాడు, ప్రేలాపనలు, వితండవాదములు ఏమాత్రము గిట్టనివాడు, యుక్తిప్రయుక్తులలో బృహస్పతితుల్యుడు. (44)

సుభ్రూరాయతతామ్రాక్షః సాక్షాద్విష్ణురివ స్వయమ్।
రామో లోకాభిరామోఽయం శౌర్యవీర్యపరాక్రమైః। 45

శ్రీరామచంద్రుడు తీరైన కనుబొమలుగలవాడు, విశాలమైన ఎఱ్ఱని కన్నులుగలవాడు, లోకమునకే ముద్దైనవాడు, అతడు శౌర్యవీర్యపరాక్రమములచే సాక్షాత్తుగా ఆ శ్రీమహావిష్ణువే. (45)

ప్రజాపాలనతత్త్వజ్ఞో న రాగోపహతేంద్రియః।
శక్తస్త్రైలోక్యమప్యేకో భోక్తుం కిన్ను మహీమిమామ్। 46

రఘురాముడు ప్రజాపాలనమునకు సంబంధించిన రహస్యములను బాగుగా ఎఱిగినవాడు, క్రోధమునకెన్నడును లోనుకానివాడు, ముల్లోకములనుసైతము పాలింపగలప్రభువు. ఇక ఈ భూమండలవిషయమై చెప్పనేల? (46)

నాస్య క్రోధః ప్రసాదశ్చ నిరర్థోఽస్తి కదాచన।
హంత్యేవ నియమాద్వధ్యాన్ అవధ్యే న చ కుప్యతి। 47

శ్రీరామునికోపముగాని, అనుగ్రహముగాని ఎప్పుడునూ వ్యర్థముగాదు. న్యాయముగా చంపదగినవానిని చంపివేయుతీరును, చంపదగనివానిపై ఆయనకు కోపమేరాదు. (47)

యునక్త్యర్థైః ప్రహృష్టశ్చ తమ్ అసౌ యత్ర తుష్యతి। 48

రఘురాముడు తనసంతోషమునకు కారకుడైన వ్యక్తిపై అనుగ్రహముచూపుచు, వాని అభీష్టముమేరకు అతనికి ధనకనకవస్తువాహనములను ప్రసాదించును. (48)

శాంతైః సర్వప్రజాకాంతైః ప్రీతిసంజననైః నృణామ్।
గుణైర్విరురుచే రామో దీప్తః సూర్య ఇవాంశుభిః। 49

సకలజనులకును మనోహరములైనవియు, మానవులకు ప్రీతిని గూర్చునవియు ఐన శమదమాదిగుణములచే ఒప్పుచున్న శ్రీరాముడు సహస్రకిరణములచే ప్రకాశించుచున్న సూర్యునివలె భాసిల్లుచుండును. (49)

త మేవంగుణసంపన్నం రామం సత్యపరాక్రమమ్।
లోకపాలోపమం నాథమ్ అకామయత మేదినీ। 50

ఈ విధముగా సద్గుణశోభితుడును, అమోఘమైన పరాక్రమముగలవాడును, ఇంద్రాదిలోకపాలురతో తుల్యుడును ఐన, శ్రీరాముని ప్రజలెల్లరును తమప్రభువుగా కోరుకొనుచున్నారు. (50)

వత్సః శ్రేయసి జాతస్తే దిష్ట్యాఽసౌ తవ రాఘవ।
దిష్ట్యా పుత్రగుణైర్యుక్తో మారీచ ఇవ కాశ్యపః। 51

ఓ దశరథమహారాజా! మా భాగ్యవశమున లోకకల్యాణ కారకుడైన శ్రీరాముడు నీకు పుత్రుడై జన్మించెను. మరీచిమహర్షి పుత్రుడైన కాశ్యపమహర్షికివలె ఈయనకు పుత్రునకుండవలసిన (తల్లిదండ్రులను 'పున్నామ' నరకమునుండి రక్షించుటకు తగిన) గుణములన్నియు గలవు. అది నీ అదృష్టము. (51)

బలమారోగ్యమాయుశ్చ రామస్య విదితాత్మనః।
దేవాసురమనుష్యేషు సగంధర్వోరగేషు చ॥ 52

ఆశంసతే జనస్సర్వో రాష్ట్రే పురవరే తథా।
అభ్యంతరశ్చ బాహ్యశ్చ పౌరజానపదో జనః॥ 53

గంధర్వులు, నాగులు, సురాసురులు, మానవులు, ఇతర రాజ్యములలో, నగరములలోగల జనులు, కోసలరాజ్యమునందలి అంతఃపురవాసులు, పురప్రజలు, జానపదులు మున్నగువారు అందఱును చక్కని శీలసంపదలుగల శ్రీరామునకు బలము, ఆయురారోగ్యములు కలుగవలెనని ప్రార్థించుచున్నారు. (52-53)

స్త్రియో వృద్ధాస్తరుణ్యశ్చ సాయం ప్రాతః సమాహితాః।
సర్వాన్ దేవాన్ నమస్యంతి రామస్యార్థే యశస్వినః॥ 54

కోసలదేశమునందలి స్త్రీలు, వృద్ధులు, యువతులు మున్నగువారందఱును అన్నివేళలయందును సర్వసమర్థుడైన శ్రీరాముడు రాజు కావలెనను ఉత్కంఠతో సర్వదేవతలకును మ్రొక్కులిడుచున్నారు. (54)

తేషామాయాచితం దేవ త్వత్ప్రసాదాత్ సమృద్ధ్యతామ్।
రామమిందీవరశ్యామం సర్వశత్రునిబర్హణమ్॥ 55

పశ్యామో యౌవరాజ్యస్థం తవ రాజోత్తమాత్మజమ్॥ 56

ఓ మహారాజా! 'శ్రీరాముడు యువరాజు కావలెను' అని వారు దేవతలకు చెల్లించుచున్న మ్రొక్కులు మీ అనుగ్రహముతో సఫలమగుగాక. ఓ రాజోత్తమా! నల్లగలువ వలె శ్యామవర్ణముగలవాడును, శత్రువులందఱిని తుదముట్టించగల సమర్థుడును, మీ జ్యేష్ఠకుమారుడును ఐన శ్రీరాముని యువరాజపీఠముపై చూచెదముగాక. (55-56)

తం దేవదేవోపమమాత్మజం తే
సర్వస్య లోకస్య హితే నివిష్టమ్।
హితాయ నః క్షిప్రముదారజుష్టం
ముదాఽభిషేక్తుం వరద త్వమర్హసి॥ 57

ఓ ప్రభూ! శ్రీరాముడు దేవతలతో సమానుడు. సర్వలోకముల హితమునే కాంక్షించువాడు. ఔదార్యగుణముతో అలరారువాడు. అట్టి నీకుమారుని మా శ్రేయస్సుకొఱకై వెంటనే సంతోషముతో యువరాజపట్టాభిషిక్తుని గావించి, మా కోర్కెను దీర్పుము." (57)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్వితీయస్సర్గః *(2)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు రెండవసర్గము సమాప్తము

-- * * * --

3. మూడవసర్గము

మహారాజాజ్ఞమేరకు వసిష్ఠుడు సుమంత్రాదులను ఆదేశించుట - దశరథుడు శ్రీరామునకు సూచనలను ఇచ్చుట.

తేషామంజలిపద్మాని ప్రగృహీతాని సర్వశః।
ప్రతిగృహ్యాబ్రవీద్రాజా తేభ్యః ప్రియహితం వచః॥ 1

ఆ సదస్యులందఱును అంజలి ఘటించి వేడుకొనగా దశరథమహారాజు వారిప్రార్థనను ఆలకించి, వారికి ప్రియమైన, హితకరమైన వచనములను ఇట్లు పలికెను. (1)

అహోఽస్మి పరమప్రీతః ప్రభావశ్చాతులో మమ।
యన్మే జ్యేష్ఠం ప్రియం పుత్త్రం యౌవరాజ్యస్థమిచ్ఛథ॥ 2

ఇతి ప్రత్యర్చ్య తాన్ రాజా బ్రాహ్మణానిదమబ్రవీత్।
వసిష్ఠం వామదేవం చ తేషామేవోపశృణ్వతామ్॥ 3

"ఆహా! నాభాగ్యమే భాగ్యము. ప్రియమైన నా జ్యేష్ఠకుమారుని యువరాజుగా మీరుకోరుకొనుట నాకు మిగుల ఆనందదాయకము"- అని పలికి, తనను అభ్యర్థించుచున్న ఆ బ్రాహ్మణులను మధుర వచనములచే సమ్మానించి, సదస్యులుసమక్షమున వసిష్ఠవామదేవాది గురువులతో ఇట్లు వచించెను. (2-3)

చైత్రః శ్రీమానయం మాసః పుణ్యః పుష్పితకాననః।
యౌవరాజ్యాయ రామస్య సర్వమేవోపకల్ప్యతామ్॥ 4

చెట్లు చిగిర్చి పూలతోనిండియుండుటచే ఈ చైత్రమాసము మనోహరమై సర్వశుభావహముగానున్నది. కనుక ఈ సమయము శ్రీరామునియువరాజపట్టాభిషేకమునకు మిక్కిలి అనువైనది. అందువలన తగిన ఏర్పాట్లను పూర్తికావింపుడు. (4)

రాజ్ఞస్తూపరతే వాక్యే జనఘోషో మహానభూత్ ।
శనైస్తస్మిన్ ప్రశాంతే చ జనఘోషే జనాధిపః ।
వసిష్ఠం మునిశార్దూలం రాజా వచనమబ్రవీత్ । 5

అభిషేకాయ రామస్య యత్కర్మ సపరిచ్ఛదమ్ ।
తదద్య భగవన్ సర్వమ్ ఆజ్ఞాపయితుమర్హసి । 6

తచ్ఛ్రుత్వా భూమిపాలస్య వసిష్ఠో ద్విజసత్తమః ।
ఆదిదేశాగ్రతో రాజ్ఞః స్థితాన్ యుక్తాన్ కృతాంజలీన్ । 7

సువర్ణాదీని రత్నాని బలీన్ సర్వౌషధీరపి ।
శుక్లమాల్యాంశ్చ లాజాంశ్చ పృథక్చ మధుసర్పిషీ । 8

అహతాని చ వాసాంసి రథం సర్వాయుధాన్యపి ।
చతురంగబలం చైవ గజం చ శుభలక్షణమ్ । 9

చామరవ్యజనే శ్వేతే ధ్వజం ఛత్రం చ పాండురమ్ ।
శతం చ శాతకుంభానాం కుంభానామగ్నివర్చసామ్ । 10

హిరణ్యశృంగమ్ ఋషభం సమగ్రం వ్యాఘ్రచర్మ చ ।
ఉపస్థాపయత ప్రాతః అగ్న్యగారం మహీపతేః । 11

యచ్చాన్యత్ కించిదేష్టవ్యం తత్సర్వముపకల్ప్యతామ్ । 12

అంతఃపురస్య ద్వారాణి సర్వస్య నగరస్య చ ।
చందనస్రగ్భిరర్చ్యంతాం ధూపైశ్చ ఘ్రాణహారిభిః । 13

ప్రశస్తమన్నం గుణవద్దధిక్షీరోపసేచనమ్ ।
ద్విజానాం శతసాహస్రే యత్ప్రకామమలం భవేత్ । 14

సత్కృత్య ద్విజముఖ్యానాం శ్వః ప్రభాతే ప్రదీయతామ్ ।
ఘృతం దధి చ లాజాశ్చ దక్షిణాశ్చాపి పుష్కలాః । 15

సూర్యేఽభ్యుదితమాత్రే శ్వో భవితా స్వస్తివాచనమ్ ।
బ్రాహ్మణాశ్చ నిమంత్ర్యంతాం కల్ప్యంతామ్ ఆసనాని చ ।
ఆబధ్యంతాం పతాకాశ్చ రాజమార్గశ్చ సిచ్యతామ్ । 16

సర్వే చ తాళావచరా గణికాశ్చ స్వలంకృతాః ।
కక్ష్యాం ద్వితీయామాసాద్య తిష్ఠంతు నృపవేశ్మనః । 17

రాజు ఈ వాక్యములను పలికిన పిమ్మట జనులజయజయధ్వనులు మిన్నుముట్టెను. క్రమముగా ఆ కోలాహలము సద్దుమణిగిన పిమ్మట దశరథమహారాజు వసిష్ఠమహర్షితో ఇట్లనెను. (5)

"ఓ బ్రహ్మర్షీ! శ్రీరామునియువరాజపట్టాభిషేకమునకై, నిర్వహింపవలసిన పనులనుగూర్చియు, సిద్ధపఱచవలసిన సంభారములనుగూర్చియు నేడే ఆజ్ఞాపింపుడు." (6)

బ్రాహ్మణోత్తముడైన వసిష్ఠుడు దశరథునిపలుకులను విని, రాజుగారిసమక్షమున అంజలిఘటించి నిలబడియున్న సుమంత్రాది సచివులను, ఉన్నతాధికారులను ఇట్లు ఆదేశించెను. (7)

"బంగారము, వెండిమొదలగువానిని, వివిధములగు రత్నములను, పూజాద్రవ్యములను, వడ్లు, పెసలు మొదలగు ధాన్యములను, తెల్లని పూలమాలలను, పేలాలను, వేర్వేరు పాత్రలలో తేనెలను, నేతులను, తెల్లనివి అంచులుగలవియైన నూతనవస్త్రములను, రథమును, వివిధాయుధములను, చతురంగ బలములను, శుభలక్షణములుగల భద్రగజమును, వింజామరలను, ధ్వజమును, శ్వేతచ్ఛత్రమును, అగ్నిజ్వాలలవలె తళతళలాడుచున్న నూఱు బంగారుకలశములను, బంగారు తొడుగులుకొమ్ములుగల వృషభమును, పూర్తి వ్యాఘ్రచర్మమును, రాజుగారి అగ్నికార్య గృహసమీపమున రేపటి ప్రాతఃకాలమునకు చేర్చుడు. ఇంకను అవసరమగు గంధపుష్పాదివస్తువులను అన్నింటిని అక్కడ సిద్ధపఱచుడు. (8-12)

సమస్తరాజగృహములద్వారములను, నగరమునందలి సర్వగృహముల వాకిళ్లను ఘుమఘుమలాడు చందనగంధముల పూతలతో, చక్కని పూలమాలలతో అలంకరింపుడు. వాటికి సువాసనలను వెదజల్లు ధూపములను వేయుడు. (13)

వేలకొలది బ్రాహ్మణోత్తములకు సరిపోవునంతగా గడ్డపెరుగుతో గూడిన దధ్యోదనములను, చిక్కని పాలతో సిద్ధమైన పాయసాన్నములను ప్రశస్తములైన ఆహారపదార్థములను సిద్ధమొనర్పుడు. (14)

రేపు ప్రాతఃకాలముననే బ్రాహ్మణోత్తములను మృష్టాన్నములతో సత్కరించి, వారికి సమృద్ధిగా నేయి, పెరుగు, పేలాలు, దక్షిణలు సమర్పింపుడు. (15)

రేపు సూర్యోదయసమయమున స్వస్తివాచనములు జరుగవలెను. కనుక బ్రాహ్మణులను అందఱిని ఆహ్వానింపుడు. వారికి సముచితములైన ఆసనములను ఏర్పాటుచేయుడు. నగరమునందలి ప్రతిగృహముపై పతాకములను ఎగురవేయవలెను. రాజమార్గమున కళాపి చల్లవలెను. (16)

తాళాదివాద్యములయందు కుశలురైన నటులందఱును, చక్కగా అలంకరించుకొనిన వారకాంతలెల్లరును రాజభవనమునందలి రెండవకక్ష్యయందు చేరియుండవలెను. దేవాలయములయందును,

దేవాయతనచైత్యేషు సాన్నభక్ష్యాః సదక్షిణాః।
ఉపస్థాపయితవ్యాః స్యుః మాల్యయోగ్యాః పృథక్పృథక్। 18

దీర్ఘాసిబద్ధా యోధాశ్చ సన్నద్ధా మృష్టవాససః।
మహారాజాంగణం సర్వే ప్రవిశంతు మహోదయమ్। 19

ఏవం వ్యాదిశ్య విప్రౌ తౌ క్రియాస్తత్ర సునిష్ఠితౌ।
చక్రతుశ్చైవ యచ్ఛేషం పార్థివాయ నివేద్య చ। 20

కృతమిత్యేవచాబ్రూతామ్ అభిగమ్య జగత్పతిమ్।
యథోక్తవచనం ప్రీతౌ హర్షయుక్తౌ ద్విజర్షభౌ। 21

తత స్సుమంత్రం ద్యుతిమాన్ రాజా వచనమబ్రవీత్।
రామః కృతాత్మా భవతా శీఘ్రమానీయతామితి। 22

స తథేతి ప్రతిజ్ఞాయ సుమంత్రో రాజశాసనాత్।
రామం తత్రానయాంచక్రే రథేన రథినాం వరమ్। 23

అథ తత్ర సమాసీనాః తదా దశరథం నృపమ్।
ప్రాచ్యోదీచ్యాః ప్రతీచ్యాశ్చ దాక్షిణాత్యాశ్చ భూమిపాః। 24

మ్లేచ్ఛాచార్యాశ్చ యే చాన్యే వనశైలాంతవాసినః।
ఉపాసాంచక్రిరే సర్వే తం దేవా ఇవ వాసవమ్। 25

తేషాం మధ్యే స రాజర్షిః మరుతామివ వాసవః। 26

ప్రాసాదస్థో రథగతం దదర్శాయాంతమాత్మజమ్।
గంధర్వరాజప్రతిమం లోకే విఖ్యాతపౌరుషమ్। 27

దీర్ఘబాహుం మహాసత్త్వం మత్తమాతంగగామినమ్।
చంద్రకాంతాననం రామమ్ అతీవప్రియదర్శనమ్। 28

రూపౌదార్యగుణైః పుంసాం దృష్టిచిత్తాపహారిణమ్।
ఘర్మాభితప్తాః పర్జన్యం హ్లాదయంతమివ ప్రజాః।
న తతర్ప సమాయాంతం పశ్యమానో నరాధిపః। 29

వీధులకూడళ్లయందును, దేవతలను సేవించుటకై అన్నములను మోదకములను నైవేద్యపదార్థములను, పుష్పమాలలను, దక్షిణలను వేర్వేఱుగా సిద్ధముగానుంచవలెను. (17-18)

యోధులెల్లరును పరిశుభ్రమైన వస్త్రములను ధరించి, నడుములయందు పెద్దపెద్ద ఖడ్గములను దాల్చి, రామాభిషేక రూపమైన అభ్యుదయసమయమున మహారాజుగారి భవనప్రాంగణమునందు నిలిచియుండవలెను." (19)

చక్కని నియమనిష్ఠాపరులైన ఆ వసిష్ఠవామదేవులు ఈ విధముగా రాజభవనమునందు పురోహితులు ఆచరింపవలసిన కార్యములను ఆదేశించిరి. రాజుగారిఆమోదముతో దాసదాసీ జనులను అచటికి రప్పించిరి. తాము ఆదేశించిన పనులన్నియును నెఱవేఱినకారణముగా వసిష్ఠవామదేవులు మిక్కిలి హర్షపులకితులై, రాజుగారికడకు చేరి, 'ఓ రాజా! మీ ఆనతిని అనుసరించి పనులన్నియును పూర్తిచేయబడినవి' అని పలికిరి. (20-21)

అంతట మిక్కిలి సంతుష్టుడైయున్న దశరథుడు సుమంత్రునితో "సకల విద్యలలో సుశిక్షితుడైయున్న శ్రీరాముని ఇచటికి వెంటనే తోడ్కొని రమ్ము" అని పలికెను. పిమ్మట సుమంత్రుడు అట్లేయని పలికి, రాజాజ్ఞననుసరించి, రథికులలో మేటియైన శ్రీరాముని రథముపై ఆ సభాభవనముకడకు తీసికొనివచ్చెను. ఇంతలోపల నాలుగుదిక్కులకు సంబంధించిన సామంతరాజులు, మ్లేచ్ఛ ప్రభువులు, వనములకును, పర్వతప్రాంతములకును చెందినవారు అందఱును అయోధ్యకు వచ్చేసిరి. పిదప వారు సభలో ఆసీనులై దేవతలు దేవేంద్రునివలె ఆదశరథుని సేవించిరి. (22-25)

ఆ సామంతాదులమధ్య రాజర్షియైన దశరథుడు దేవతల మధ్య దేవేంద్రునివలె విరాజిల్లుచుండెను. రథముపై వచ్చుచున్న తన కుమారుని అతడు ఆ రాజభవనమునుండియే చూచెను. శ్రీరాముడు శౌర్యపరాక్రమములలో గంధర్వరాజతుల్యుడు. లోకమునందు పౌరుషమున అద్వితీయుడు, దీర్ఘబాహువు, గొప్పబలసంపన్నుడు, మదపుటేనుగువలె గంభీరగమనుడు, చంద్రునివలె మనోహరమైన ముఖసౌందర్యముగలవాడు, చూడముచ్చటైన అందచందములు గలవాడు. రూపసౌభాగ్యముచేతను, ఔదార్యాదిగుణములను బట్టియు సర్వప్రాణులదృష్టిని ఆకర్షించుచు వారిచిత్తములను అపహరించువాడు, ఎండవేడికి గురియైనవారికి మేఘమువలె ప్రజలకు ఆహ్లాదమును గూర్చువాడు. అట్టి శ్రీరాముడు తనకడకు వచ్చుచుండగా తండ్రియగు దశరథుడు ఆయనను అదేపనిగా ఱెప్పలార్పక ఎంతగా చూచుచున్నను తనివితీరకపోయెను. (26-29)

అవతార్య సుమంత్రస్తం రాఘవం స్యందనోత్తమాత్।
పితుస్సమీపం గచ్ఛంతం ప్రాంజలిః పృష్ఠతోఽన్వగాత్। 30

స తం కైలాసశృంగాభం ప్రాసాదం నరపుంగవః।
ఆరురోహ నృపం ద్రష్టుం సహ సూతేన రాఘవః। 31

స ప్రాంజలిరభిప్రేత్య ప్రణతః పితురంతికే।
నామ స్వం శ్రావయన్ రామో వవందే చరణౌ పితుః। 32

తం దృష్ట్వా ప్రణతం పార్శ్వే కృతాంజలిపుటం నృపః।
గృహ్యాంజలౌ సమాకృష్య సస్వజే ప్రియమాత్మజమ్। 33

తస్మై చాభ్యుదితం దివ్యం మణికాంచనభూషితమ్।
దిదేశ రాజా రుచిరం రామాయ పరమాసనమ్। 34

తదాసనవరం ప్రాప్య వ్యదీపయత రాఘవః।
స్వయైవ ప్రభయా మేరుమ్ ఉదయే విమలో రవిః। 35

తేన విభ్రాజితా తత్ర సా సభాఽభివ్యరోచత।
విమలగ్రహనక్షత్రా శారదీ ద్యౌరివేందునా। 36

తం పశ్యమానో నృపతిః తుతోష ప్రియమాత్మజమ్।
అలంకృతమివాత్మానమ్ ఆదర్శతలసంస్థితమ్। 37

స తం సస్మితమాభాష్య పుత్రం పుత్రవతాం వరః।
ఉవాచేదం వచో రాజా దేవేంద్రమివ కాశ్యపః। 38

జ్యేష్ఠాయామసి మే పత్న్యాం సదృశ్యాం సదృశస్సుతః।
ఉత్పన్నస్త్వం గుణశ్రేష్ఠో మమ రామాత్మజః ప్రియః। 39

యతస్త్వయా ప్రజాశ్చేమాః స్వగుణైరనురంజితాః।
తస్మాత్త్వం పుష్యయోగేన యౌవరాజ్యమవాప్నుహి। 40

కామతస్త్వం ప్రకృత్యైవ వినీతో గుణవానసి।
గుణవత్యపి తు స్నేహాత్ పుత్ర వక్ష్యామి తే హితమ్। 41

సుమంత్రుడు చేయూతనిచ్చి శ్రీరాముని ఆ మహారథము నుండి దింపెను. పిదప తండ్రికడకు వెళ్లుచున్న శ్రీరాముని వెంట అతడు ప్రాంజలియై నడచెను. అట్లు సుమంత్రునితో గూడి, నరశ్రేష్ఠుడైన ఆ శ్రీరాముడు దశరథమహారాజును దర్శించుటకై కైలాసశిఖరసదృశమైన రాజప్రాసాదమున అడుగిడెను. పిమ్మట రాఘవుడు అంజలి ఘటించి, తండ్రి సమీపమునకు చేరి, వినమ్రుడై 'రామశర్మనైన నేను మీకు నమస్కరించుచున్నాను'- అని పల్కుచు తండ్రియైన దశరథునకు పాదాభివందనమునాచరించెను. (30-32)

అంతట దశరథుడు ప్రక్కనే అంజలిఘటించి, నమస్కరించుచున్న తనప్రియపుత్రుడగు శ్రీరాముని జూచి, అతనిని తనదగ్గఱకు తీసికొని, మిక్కిలి ప్రేమతో అక్కున జేర్చుకొనెను. (33)

పిమ్మట ఆ మహారాజు ఉన్నతమై, మనోహరమై, మణులు పొదిగిన శ్రేష్ఠమైన బంగారుసింహాసనముమీద శ్రీరాముని ఆసీనుని గావించెను. ఆ శ్రేష్ఠమైన ఆసనమును అలంకరించి, రాఘవుడు తనకాంతిచే ప్రభాతసమయమున స్వచ్ఛమైన సూర్యుడు సౌవర్ణ మేరుపర్వతమును వలె దానిని భాసింపజేసెను. (34-35)

శ్రీరాముని దివ్యతేజస్సుచే ఆ సభాప్రదేశమంతయును శరత్కాలమునందు చంద్రకాంతులచే గ్రహనక్షత్రములతో గూడిన నిర్మలాకాశమువలె విరాజిల్లెను. (36)

చక్కగా అలంకరించుకొనిన జనులు అద్దములో తమ ప్రతిబింబములను జూచుకొని మిక్కిలి ఆనందించినట్లు, అచ్చుగ్రుద్దినట్లు తనవలెనేయున్న ప్రియపుత్రుడైన రాముని జూచి, దశరథుడు ఎంతగానో మురిసిపోయెను. (37)

శ్రీరామునివంటి మహాపురుషునకు తండ్రియైన దశరథుడు పుత్రవంతులలో మేటి. ఆ రాజు తనసుతుని 'రామా!' అని సంబోధించి, చిఱునవ్వును చిందించుచు కశ్యపమహర్షి దేవేంద్రునితో వలె ఇట్లు పలికెను. (38)

ఓ రామా! మీ అమ్మ అన్నివిధములా నాకు తగిన అర్ధాంగి (పట్టమహిషి). ఆమె గుణగణములను, అందచందములను పుణికిపుచ్చుకొని, ఆమె చల్లనికడుపున పుట్టిన నీవు సర్వవిధములా ఆమెకు తగిన తనయుడవు, నాకు ప్రియపుత్రుడవు- నీ సుగుణముల ద్వారా ఈ ప్రజలందఱిని నీవు రంజింపజేసితివి. కనుక పుష్యమీ నక్షత్రమునాడు (చంద్రుడు పుష్యమీ నక్షత్రయుక్తుడైయుండగా) నీవు యువరాజపట్టాభిషిక్తుడవు కమ్ము. ఓ కుమారా! నీవు సహజముగనే వినయసంపన్నుడవు, మిక్కిలి సద్గుణశోభితుడవు. నీవు అట్టివాడవేయైనను నీమీది వాత్సల్యముచే హితకరములైన వచనములను ఒకటిరెండింటిని పలికెదను. (39-41)

భూయో వినయమాస్థాయ భవ నిత్యం జితేంద్రియః।
కామక్రోధసముత్థాని త్యజేథా వ్యసనాని చ। 42

నాయనా! ఇంకను వినయవంతుడవుకమ్ము, ఎల్లప్పుడును జితేంద్రియుడవై మెలగుము. కామమువలనగాని, క్రోధమువే గాని కలుగు వ్యసనములను[1] త్యజింపవలెను. (42)

పరోక్షయా వర్తమానో వృత్త్యా ప్రత్యక్షయా తథా।
అమాత్యప్రభృతీస్సర్వాః ప్రకృతీశ్చానురంజయ। 43

పరోక్షముగా (గూఢచారులద్వారా) నీ రాజ్యవిశేషములను ఇతరరాజ్యముల విషయములను తెలిసికొని, తగినవిధముగా వ్యవహరింపుము. అట్లే ప్రత్యక్షముగా అనగా స్వయముగా ప్రజలనుండియు, తదితరులనుండియు వాస్తవములను ఎఱింగి, రాజ్యపాలన చేయుము. అమాత్యులను, సేనాపతులను పురరక్షకులను, పురవాసులు, జానపదులు మొదలగు ప్రజలందఱిని రంజింపజేయుచు పరిపాలింపుము. (43)

కోష్ఠాగారాయుధాగారైః కృత్వా సన్నిచయాన్ బహూన్।
తుష్టానురక్తప్రకృతిః యః పాలయతి మేదినీమ్। 44

తస్య నందంతి మిత్రాణి లబ్ధ్వాఽమృతమివామరాః।
తస్మాత్ త్వమపి చాత్మానం నియమ్యైవం సమాచర। 45

కోష్ఠాగారములను,[2] ఆయుధాగారములను, ధనధాన్యములతోను,[3] వివిధాయుధములతోను నింపుము. సామంతులు మొదలగు సప్తప్రకృతులకు[4] అనురాగమును పెంచి ఇచ్చుచు రాజ్యమును పాలించు రాజునుజూచి, సామంతాదులు అమృతమును పొందిన అమరులవలె సంతోషింతురు. కనుక నీవును మనోనిగ్రహముతో ఇంతవఱకును తెలిపిన రీతిగా రాజ్యపాలనచేయుము. (44-45)

తచ్ఛ్రుత్వా సుహృదస్తస్య రామస్య ప్రియకారిణః।
త్వరితాః శీఘ్రమభ్యేత్య కౌసల్యాయై న్యవేదయన్। 46

ఆ శ్రీరామునకు ప్రియమిత్రులైనవారు యువరాజపట్టాభిషేక విషయములను విని, వెంటనే శీఘ్రముగా కౌసల్యా భవనమునకు చేరి ఆమెకు ఈ వార్తలను తెలిపిరి. (46)

---

1) శ్లో॥ స్త్రీద్యూత మృగయా మద్య వాక్పారుష్యోగ్రదండతాః। అర్థసందూషణం చేతి రాజ్ఞాం వ్యసనసప్తకమ్॥
స్త్రీలోల్యము, జూదము, వేట, మద్యపానము, పరుషముగా మాట్లాడుట, చిన్నతప్పునకు పెద్దగా దండించుట, డబ్బును పాడుచేయుట, మున్నగునవి రాజులకు సప్తవ్యసనములు.
శ్లో॥ మృగయాఽక్షో దివాస్వాపః పరివాదః స్త్రియో మదః। తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గణః॥
వేట, జూదము, పగలునిద్రించుట, ఇతరులపై నిందలువేయుట, స్త్రీలోల్యము, గర్వితుడగుట, నృత్తమునందును, గీతమునందును, వాద్యముల(మూడింటి) యందును మితిమించిన ఆసక్తి, వ్యర్థముగా తిరుగుట అను పదియును కామమువలన కలుగు వ్యసనములు. (మనుస్మృతి - 7-47).
శ్లో॥ పైశున్యం సాహసం ద్రోహః ఈర్ష్యాసూయార్థదూషణమ్। వాగ్దండయోశ్చ పారుష్యం క్రోధజోఽపి గణోఽష్టకః।
చాడీలుచెప్పుట, సజ్జనులను నిష్కారణముగ నిగ్రహించుట (బంధించుట) ఇతరులకు ద్రోహముతలపెట్టుట, ఇతరులఉన్నతిని జూచి ఈసుచెందుట, ఇతరులగుణములను దోషములుగా చిత్రించుట, సంపదను వృథాచేయుట, కఠినముగా పలుకుట, దండించుట, అను ఎనిమిదియును క్రోధమువలన కలిగెడు వ్యసనములు. (మనుస్మృతి-7-48)

2) వేలు, లక్షల సంఖ్యలో ధాన్యరాసులను నిల్వచేయుటకు అనుకూలముగా నిర్మింపబడిన గోదాములను 'కోష్ఠాగారములు' అని యందురు. ఇంకను నవరత్నములను, వెండి, బంగారములను, విలువైన వివిధములగు వస్త్రములను, అమూల్యములైన ఆభరణములను పూర్తిగా భద్రపఱచుటకై సిద్ధముచేయబడిన భవనములను 'కోశాగారములు' - అని యందురు.

3) సమగ్రముగా తన బలములకన్నింటికిని అవసరమగు శాలలను, అస్త్రాదివివిధములగు ఆయుధములను భద్రపఱచుటకు అనువైన భవనములను 'ఆయుధాగారములు' అనియందురు.

4) శ్లో॥ స్వామ్యమాత్యౌ పురం రాష్ట్రం కోశదండౌ సుహృత్ తథా। సప్తప్రకృతయో హ్యేతాః సప్తాంగం రాజ్యముచ్యతే॥ మనుస్మృతి 9-294
రాజు, అమాత్యులు, దుర్గములోనున్న పురము, దేశము, ధనాగారము, సేనాబలము, మిత్రులు. ఈ ఏడువిధములగు వానిని 'సప్తప్రకృతులు' అనియందురు. రాజ్యమునకు ఈ సప్తాంగములు ప్రాణతుల్యములు.

సా హిరణ్యం చ గాశ్చైవ రత్నాని వివిధాని చ।
వ్యాదిదేశ ప్రియాఖ్యేభ్యః కౌసల్యా ప్రమదోత్తమా। 47

ఈ శుభవార్తలను గొనితెచ్చిన శ్రీరామునిమిత్రులకు వనితారత్నమైన ఆ కౌసల్యాదేవి వెండిబంగారములను, గోవులను, వివిధములగు రత్నములను బహూకరించెను.(47)

అథాఽభివాద్య రాజానం రథమారుహ్య రాఘవః।
యయౌ స్వం ద్యుతిమద్వేశ్మ జనౌఘైః ప్రతిపూజితః। 48

పిమ్మట రఘురాముడు తండ్రియైన దశరథ మహారాజునకు ప్రణమిల్లి, రథమును అధిరోహించి, మార్గమున ప్రజలనుండి గౌరవసమ్మానములను స్వీకరించుచు, కాంతులతో ధగధగలాడుచున్న తనభవనమునకు చేరెను. (48)

తే చాపి పౌరా నృపతేర్వచస్తత్
శ్రుత్వా తదా లాభమివేష్టమాశు।
నరేంద్రమామంత్ర్య గృహాణి గత్వా
దేవాన్ సమానర్చురతిప్రహృష్టాః। 49

ఆ నగరవాసులందఱును రాజుగారిమాటలను విని, 'తమ చిరకాలవాంఛ నెఱవేఱబోవుచున్నది' అని పరమానందభరితులైరి. పిమ్మట రాజుగారియొద్ద సెలవుగైకొని, తమతమయిండ్లకేగిరి. వారు మిక్కిలి హర్షోల్లాసములతో తమకభీష్టమైన 'యువరాజ పట్టాభిషేకము' నిర్విఘ్నముగా కొనసాగుటకై ఇష్టదేవతలను భక్తితో అర్చించిరి. (49)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే తృతీయస్సర్గః *(3)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు మూడవసర్గము సమాప్తము

-- * * * --

4. నాల్గవసర్గము

శ్రీరాముడు కౌసల్యామాతను దర్శించుట. ఆమె తనకుమారుని ఆశీర్వదించుట.

గతేష్వథ నృపో భూయః పౌరేషు సహ మంత్రిభిః।
మంత్రయిత్వా తతశ్చక్రే నిశ్చయజ్ఞః స నిశ్చయమ్। 1

శ్వ ఏవ పుష్యో భవితా శ్వోఽభిషేచ్యస్తు మే సుతః।
రామో రాజీవతామ్రాక్షో యౌవరాజ్య ఇతి ప్రభుః। 2

పౌరులందఱును వెళ్లిన పిమ్మట నిశ్చయజ్ఞుడైన[1] దశరథమహారాజు మంత్రులతో మఱల సమాలోచన చేసి, అతడు తననిర్ణయమును ఇట్లు ప్రకటించెను. "రేపే పుష్యమీనక్షత్రము. కనుక పద్మములవంటి ఎఱ్ఱని కన్నులుగల నా కుమారుడైన శ్రీరాముడు రేపు యువరాజపట్టాభిషిక్తుడుకాగలడు. (1-2)

అథాంతర్గృహమావిశ్య రాజా దశరథస్తదా।
సూతమామంత్రయామాస రామం పునరిహానయ। 3

అంతట దశరథమహారాజు మంత్రులను పంపివైచి, తాను తన అంతఃపురమునకు ఏగెను. పిమ్మట అతడు తనరథసారథికి 'శ్రీరాముని ఇచ్చటికి దీసికొని రమ్ము' - అని ఆజ్ఞయిచ్చెను. (3)

ప్రతిగృహ్య స తద్వాక్యం సూతః పునరుపాయయౌ।
రామస్య భవనం శీఘ్రం రామమానయితుం పునః। 4

ద్వాఃస్థైరావేదితం తస్య రామాయాగమనం పునః।
శ్రుత్వైవ చాపి రామస్తం ప్రాప్తం శంకాన్వితోఽభవత్। 5

అప్పుడు ఆ రథసారథి మహారాజుమాట శిరసావహించి, శ్రీరాముని మఱల గొనివచ్చుటకై వెంటనే బయలుదేఱి, ఆయనభవనమును సమీపించెను. సుమంత్రుని పునరాగమనమునుగూర్చి ద్వారపాలకులు రామునకు నివేదించిరి. సుమంత్రుడు తనమందిరమునకు చేరినట్లు శ్రీరాముడు విని, పట్టాభిషేకమునకు విఘ్నమేదైనా ఏర్పడినదా? లేదా ఏదైననొక ఉపద్రవము సంభవించినదా? అను సందేహములకు గుఱియయ్యెను. (4-5)

1) దేశకాలపరిస్థితులను పూర్తిగా ఎఱిగి, సమయస్ఫూర్తితో సముచితములగు నిర్ణయములను తీసికొనుటలో సర్వసమర్థుడైన వానిని 'నిశ్చయజ్ఞుడు' అని యందురు.

ప్రవేశ్యచైనం త్వరితం రామో వచనమబ్రవీత్।
యదాగమనకృత్యం తే భూయః తద్బ్రూహ్యశేషతః। 6

తమువాచ తతస్సూతో రాజా త్వాం ద్రష్టుమిచ్ఛతి।
శ్రుత్వా ప్రమాణమత్ర త్వం గమనాయేతరాయ వా। 7

ఇతి సూతవచః శ్రుత్వా రామోఽథ త్వరయాన్వితః।
ప్రయయౌ రాజభవనం పునర్ద్రష్టుం నరేశ్వరమ్। 8

తం శ్రుత్వా సమనుప్రాప్తం రామం దశరథో నృపః।
ప్రవేశయామాస గృహం వివక్షుః ప్రియముత్తమమ్। 9

ప్రవిశన్నేవ చ శ్రీమాన్ రాఘవో భవనం పితుః।
దదర్శ పితరం దూరాత్ ప్రణిపత్య కృతాంజలిః। 10

ప్రణమంతం సముత్థాప్య తం పరిష్వజ్య భూమిపః।
ప్రదిశ్య చాస్మై రుచిరమ్ ఆసనం పునరబ్రవీత్। 11

రామ వృద్ధోఽస్మి దీర్ఘాయుః భుక్తా భోగా మయేప్సితాః।
అన్నవద్భిః క్రతుశతైః తథేష్టం భూరిదక్షిణైః। 12

జాతమిష్టమపత్యం మే త్వమద్యానుపమం భువి।
దత్తమిష్టమధీతం చ మయా పురుషసత్తమ। 13

అనుభూతాని చేష్టాని మయా వీర సుఖాన్యపి।
దేవర్షిపితృవిప్రాణామ్ అనృణోఽస్మి తథాఽఽత్మనః। 14

వెంటనే రాముడు సుమంత్రుని తనభవనములోనికి రప్పించి, 'మఱల నీవు ఇచటికి వచ్చిన పనియేమో పూర్తిగా వివరింపుము'- అని అతనితో నుడివెను. (6)

సూతుడు శ్రీరామునివచనములను వినిన పిమ్మట ఆయనతో 'ఓ రామా! మహారాజుగారు మిమ్ములను చూడగోరుచున్నారు. అచటికి వెళ్లుటయా? లేదా? అనునది మీ ఇష్టము' - అని పలికెను. సుమంత్రునిమాటలను వినినంతనే శ్రీరాముడు ఏమాత్రము ఆలసింపక, మఱల మహారాజును దర్శించుటకై రాజభవనమునకు బయలుదేఱెను. (7-8)

శ్రీరాముడు రాజభవనమునకు చేరినట్లు విని, దశరథ మహారాజు ఆయనకు ఒక ప్రియమైన మాటను తెలుపగోరి, అతనిని తనఅంతఃపురమున ప్రవేశపెట్టెను. (9)

సర్వశుభలక్షణసంపన్నుడైన శ్రీరాముడు తండ్రిగారిఅంతఃపురమును ప్రవేశించుచు దూరమునుండియే నమస్కరించి, అంజలి ఘటించినవాడై తండ్రిని దర్శించెను. తన కడకువచ్చి, మఱల ప్రణమిల్లుచున్న శ్రీరాముని లేవనెత్తి, దశరథుడు అతనిని తనఅక్కున జేర్చుకొనెను. పిదప అతనిని ఒక చక్కని ఆసనమున కూర్చుండజేసి, మఱల ఇట్లు పలికెను. (10-11)

"నాయనా! రామా! నాకు వయసుమీఱినది. ధర్మబద్ధములైన సుఖములను అన్నింటిని అనుభవించితిని. మృష్టాన్నదానములతో, భూరిదక్షిణలతో జ్యోతిష్టోమము మొదలుకొని అశ్వమేధము వఱకుగల యజ్ఞములను వందలకొలదిగా ఆచరించితిని. ఇష్టసంతానప్రాప్తిలో నాకలలు పండినవి.(చతుర్విధ పురుషార్థములు సిద్ధించినవి) నేడు ఈ భూమండలమున నీవు సాటిలేనివాడవు. ఓ బంగారుతండ్రీ! వేదశాస్త్రాది విద్యలు నాకు అబ్బినవి. అర్హములైన నిత్యాగ్నిహోత్రములను ఆచరించితిని. ఇష్టవస్తువులను కొల్లలుగా దానముచేసితిని. ఓ వీరా! నా అభిమతములను అన్నింటిని తీర్చుకొంటిని. వందలకొలదియజ్ఞములను ఆచరించుటచే దేవ-ఋణమును, వేదాధ్యయనముచే ఋషి-ఋణమును, సత్సంతానప్రాప్తిచే పితృ-ఋణమును దానధర్మములచే విప్ర-ఋణమును, ధర్మసుఖానుభవముచే ఆత్మ-ఋణమును (ఋణ పంచకమును)[1] తీర్చుకొంటిని. (12-14)

1) పైన ఋణపంచకమును గూర్చి వివరింపబడినది - శ్రుతులలో ప్రస్తావింపబడిన 'ఋణత్రయ' ప్రశస్తిని గూర్చి సూక్ష్మ వివేచనము -

"జాయమానోవై బ్రాహ్మణః త్రిభిర్ఋణవాజాయతే।
బ్రహ్మచర్యేణ - ఋషిభ్యో, యజ్ఞేన దేవేభ్యః, ప్రజయాపితృభ్యః" - ఇతి॥

పుట్టుకతోడనే ద్విజుడు మూడు ఋణములు (ఋణత్రయము) కలిగియుండును. నిర్దుష్టముగా బ్రహ్మచర్యమును పాటించుచు నియమనిష్ఠలతో వేదాదివిద్యలను అభ్యసించినచో ఋషి-ఋణము తీరును. పవిత్రమైన యజ్ఞములను ఆచరించినచో దేవ-ఋణము తీరును. సత్సంతానమును పొందుటచే పితృ-ఋణము తీరును.

న కించిన్మమ కర్తవ్యం తవాన్యత్రాభిషేచనాత్।
అతో యత్ త్వామహం బ్రూయాం తన్మే త్వం కర్తుమర్హసి। 15

అద్య ప్రకృతయః సర్వాః త్వామిచ్ఛంతి నరాధిపమ్।
అత స్త్వాం యువరాజానమ్ అభిషేక్ష్యామి పుత్రక। 16

అపి చాద్యాశుభాన్ రామ స్వప్నే పశ్యామి దారుణాన్।
సనిర్ఘాతా దివోల్కా చ పతతీహ మహాస్వనా। 17

అవష్టబ్ధం చ మే రామ నక్షత్రం దారుణైర్గ్రహైః।
ఆవేదయంతి దైవజ్ఞాః సూర్యాంగారకరాహుభిః। 18

ప్రాయేణ హి నిమిత్తానామ్ ఈదృశానాం సముద్భవే।
రాజా హి మృత్యుమాప్నోతి ఘోరాం వాపదమృచ్ఛతి। 19

తద్యావదేవ మే చేతో న విముంచతి రాఘవ।
తావదేవాభిషించస్వ చలా హి ప్రాణినాం మతిః। 20

అద్య చంద్రోఽభ్యుపగతః పుష్యాత్పూర్వం పునర్వసూ।
శ్వః పుష్యయోగం నియతం వక్ష్యంతే దైవచింతకాః। 21

తతః పుష్యేఽభిషించస్వ మనస్త్వరయతీవ మామ్।
శ్వస్త్వాఽహమ్ అభిషేక్ష్యామి యౌవరాజ్యే పరంతప। 22

తస్మాత్ త్వయాఽద్యప్రభృతి నిశేయం నియతాత్మనా।
సహ వధ్వోపవస్తవ్యా దర్భప్రస్తరశాయినా। 23

సుహృదశ్చాప్రమత్తాస్త్వాం రక్షంత్వద్య సమంతతః।
భవంతి బహువిఘ్నాని కార్యాణ్యేవంవిధాని హి। 24

విప్రోషితశ్చ భరతో యావదేవ పురాదితః।
తావదేవాభిషేకస్తే ప్రాప్తకాలో మతో మమ। 25

కామం ఖలు సతాం వృత్తే భ్రాతా తే భరతః స్థితః।
జ్యేష్ఠానువర్తీ ధర్మాత్మా సానుక్రోశో జితేంద్రియః। 26

కింతు చిత్తం మనుష్యాణామ్ అనిత్యమితి మే మతిః।
సతాం తు ధర్మనిత్యానాం కృతశోభి చ రాఘవ। 27

కనుక నీ పట్టాభిషేకమును నిర్వహించుటతప్ప నాకు మఱియొక కర్తవ్యము ఏదియును మిగిలిలేదు. అందువలన నీవు (నా తృప్తికొఱకు) నేను చెప్పినట్లు చేయుము. (15)

ఓ నాయనా! రాజులు, మంత్రులు మొదలుగాగల ప్రజలందఱును నీవు రాజువు కావలెను అని అభిలషించుచున్నారు. కావున నిన్ను యువరాజునుగా పట్టాభిషిక్తుని చేయుచున్నాను. (16)

ఓ రామా! మఱొక్కమాట. ఈమధ్య కలలో నాకు భయంకరములైన అపశకునములు కనబడుచున్నవి. పిడుగులతోగూడిన ఉల్కలు (తోకచుక్కలు) మహాధ్వనులను గావించుచు పగటిపూటనే నేలపై రాలుచున్నవి. (17)

ఓ రామా! నా జన్మనక్షత్రమున (జన్మరాశియందు) క్రూరగ్రహములైన సూర్యుడు, కుజుడు, రాహువు చేరియున్నారని జ్యోతిశ్శాస్త్రజ్ఞులు తెలుపుచున్నారు. సాధారణముగా ఇట్టి దుర్నిమిత్తములు ఏర్పడినప్పుడు రాజు మరణించుటయో లేక తీరని ఆపదలపాలగుటయో జరుగును. ఓ రఘురామా! ఇప్పటి నా (ఈ) బుద్ధి (సంకల్పము) మారకముందే నీవు యువరాజ పట్టాభిషిక్తుడవు కమ్ము. మానవులకు బుద్ధిచాంచల్యము సహజముగదా! (18-20)

నేడు చంద్రుడు పునర్వసు నక్షత్రమునందున్నాడు. రేపు 'చంద్రుడు పుష్యమీ నక్షత్రమున ఉన్నప్పుడు పట్టాభిషేకము జరుపుట ప్రశస్తము' - అని దైవజ్ఞులు తెలుపుచున్నారు. కావున 'ఓ రామా! పుష్యమీనక్షత్రయుక్తశుభముహూర్తముననే అభిషిక్తుడవు కమ్ము'. ఈ విషయమున నా మనస్సు నన్ను తొందరపెట్టుచున్నది. కనుక రేపే నిన్ను యువరాజపట్టాభిషిక్తునిగా జేయుదును. (21-22)

అందువలన ఇప్పటినుండియే నియమములను పాటించుచు నీవును, మా కోడలు సీతాదేవియును రాత్రివేళ ఉపవాసదీక్షను నడుపుచు దర్భాస్తరణములపై శయనింపవలెను. (23)

సామాన్యముగా ఇట్టి శుభకార్యములకు పెక్కు విఘ్నములు ఎదురగుచుండును. కావున నీ మిత్రులెల్లరును అన్ని విధములుగా అప్రమత్తులై ఇప్పటినుండియే నిన్ను కాపాడుచుందురుగాక. (24)

కేకయరాజ్యమున మాతామహుని (తాతగారి) ఇంటనున్న భరతుడు తిరిగి అయోధ్యకు వచ్చులోపలనే నీవు యువరాజ పట్టాభిషిక్తుడవగుట మేలని నాకు తోచుచున్నది. నీ తమ్ముడైన భరతుడు సర్వదా అన్న అడుగుజాడలలో నడచుకొనువాడు, ధర్మబుద్ధిగలవాడు, దయాళువు, ఇంద్రియనిగ్రహము (సంయమనము) గలవాడు, మీదు మిక్కిలి నిస్సందేహముగా అతడు సత్పురుషుల మార్గమునే అనుసరించువాడు. ఐనను శ్రీరామా! సాధారణముగా మనుష్యుల యొక్క చిత్తములు చంచలములు - ధర్మనిరతులైన సత్పురుషులమనస్సులుగూడ ఒక్కొక్కప్పుడు వేర్వేరు కారణములవలన రాగద్వేషములచే ప్రభావితములగు చుండును. ఇది నా అభిప్రాయము." (25-27)

ఇత్యుక్తస్సోఽభ్యనుజ్ఞాతః శ్వో భావిన్యభిషేచనే।
వ్రజేతి రామః పితరమ్ అభివాద్యాభ్యయాద్గృహమ్। 28

ప్రవిశ్యచాత్మనో వేశ్మ రాజ్ఞోద్దిష్టేఽభిషేచనే।
తత్క్షణేన చ నిర్గమ్య మాతురంతఃపురం యయౌ। 29

తత్ర తాం ప్రవణామేవ మాతరం క్షౌమవాసినీమ్।
వాగ్యతాం దేవతాగారే దదర్శాయాచతీం శ్రియమ్। 30

ప్రాగేవచాగతా తత్ర సుమిత్రా లక్ష్మణస్తదా।
సీతా చానాయితా శ్రుత్వా ప్రియం రామాభిషేచనమ్। 31

తస్మిన్ కాలే హి కౌసల్యా తస్థావామీలితేక్షణా।
సుమిత్రయాఽన్వాస్యమానా సీతయా లక్ష్మణేన చ। 32

శ్రుత్వా పుష్యేణ పుత్త్రస్య యౌవరాజ్యాభిషేచనమ్।
ప్రాణాయామేన పురుషం ధ్యాయమానా జనార్దనమ్। 33

తథా సన్నియమామేవ సోఽభిగమ్యాభివాద్య చ।
ఉవాచ వచనం రామో హర్షయంస్తామిదం తదా। 34

అంబ పిత్రా నియుక్తోఽస్మి ప్రజాపాలనకర్మణి।
భవితా శ్వోఽభిషేకో మే యథా మే శాసనం పితుః। 35

సీతయాప్యుపవస్తవ్యా రజనీయం మయా సహ।
ఏవమ్ ఋత్విగుపాధ్యాయైః సహ మాముక్తవాన్ పితా। 36

యాని యాన్యత్ర యోగ్యాని శ్వో భావిన్యభిషేచనే।
తాని మే మంగళాన్యద్య వైదేహ్యాశ్చైవ కారయ। 37

ఏతచ్ఛ్రుత్వా తు కౌసల్యా చిరకాలాభికాంక్షితమ్।
హర్షబాష్పకలం వాక్యమ్ ఇదం రామమభాషత। 38

వత్స రామ చిరంజీవ హతాస్తే పరిపంథినః।
జ్ఞాతీన్ మే త్వం శ్రియా యుక్తః సుమిత్రాయాశ్చ నందయ। 39

మఱునాడు జరుగనున్న పట్టాభిషేకవిషయములనుగూర్చి తెలిపి, 'నాయనా! రామా! ఇక వెళ్ళుము' అని అనుజ్ఞ ఇచ్చిన పిమ్మట శ్రీరాముడు తండ్రికి ప్రణమిల్లి, తనభవనమునకు చేరెను.(28)

రాముడు తనభవనమున ప్రవేశించెను. పిమ్మట తనతండ్రియగు దశరథుడు సంకల్పించిన యువరాజపట్టాభిషేకమును గూర్చి కౌసల్యామాతకు తెలుపదలచినవాడై తత్క్షణమే బయలుదేఱి, ఆమెయంతఃపురమునకు చేరెను. (29)

అచ్చట కౌసల్యాదేవి వ్రతాచరణమునకు తగిన పట్టువస్త్రములను ధరించి, అంతఃపురమునందలి తనపూజా మందిరమున ఇష్టదైవధ్యానమునందు నిమగ్నయై, శ్రీరామునికై రాజ్యలక్ష్మినిగోరుచు మౌనముగా ప్రార్థించుచుండెను. అట్టి దశలో రఘురాముడు ఆమెను దర్శించెను. (30)

సంతోషకరమైన శ్రీరామునిపట్టాభిషేకవార్తను వినియున్న సుమిత్రాదేవియు, లక్ష్మణుడును, రాముడు రాకముందే అచటికి చేరియుండిరి. సీతాదేవియు దాసీజనమువెంట అచ్చటికి వచ్చియుండెను. (31)

శ్రీరాముడు అచ్చటికి వచ్చునప్పటికే కౌసల్యాదేవి 'తన పుత్త్రుడైన శ్రీరామునకు పుష్యమీనక్షత్రయుక్త సుముహూర్తమున యువరాజపట్టాభిషేకము జరుగును' అని వినియుండెను. సుమిత్రాదేవియు, లక్ష్మణుడును, సీతాదేవియు ఆమెను సేవించుచుండిరి. కౌసల్యాదేవి ప్రాణాయామపూర్వకముగా పురుషోత్తముడైన శ్రీమన్నారాయణుని ధ్యానించుచు కనులు మూసికొనియుండెను. ఆ శ్రీరాముడు నియమనిష్ఠలలోనున్న తల్లిని సమీపించి, ఆమెకు పాదాభివందనమాచరించెను. పిమ్మట అతడు ఆమెకు సంతోషమును గూర్చుచు ఇట్లు పలికెను. (32-34)

"అమ్మా! ప్రజలనుపాలించు బాధ్యతలను చేపట్టవలసినదిగా తండ్రిగారు నన్ను ఆజ్ఞాపించిరి. వారి ఆదేశముననుసరించి, రేపు నాకు యువరాజపట్టాభిషేకము జరుగును. 'నా భార్యయగు సీతయు నేనును నేటి రాత్రి ఉపవసింపవలెను. తండ్రిగారు ఋత్విజులతో, గురువులతో ఆలోచించి ఇచ్చిన ఆదేశమిది.(35-36)

అమ్మా! రేపు జరుగనున్న పట్టాభిషేకమునకు సంబంధించి ఆచరింపదగు (అభ్యంజనాది) మంగళకార్యక్రమములను నాకును, వైదేహికిని నిర్వహింపుము". (37)

అంతట కౌసల్యాదేవి తాను చిరకాలమునుండి అభిలషించుచున్న శ్రీరామపట్టాభిషేకవార్తను విని, ఆనంద బాష్పములను రాల్చుచు రామునితో ఈ విధముగా అవ్యక్త మధురవచనములను పల్కెను (38)

"నా చిన్నారి రామయ్యా! చిరకాలము వర్ధిల్లుము. నీ శత్రువులు నశింతురు గాక. నీవు రాజ్యలక్ష్మిని చేపట్టుము. మనబంధువులందఱిని (నా బంధువులను, సుమిత్రపుట్టి

కల్యాణే బత నక్షత్రే మయి జాతోఽసి పుత్రక।
యేన త్వయా దశరథో గుణైరారాధితః పితా। 40

అమోఘం బత మే క్షాంతం పురుషే పుష్కరేక్షణే।
యేయమిక్ష్వాకురాజ్యశ్రీః పుత్ర త్వాం సంశ్రయిష్యతి। 41

బంధువులను! ఆనందింపజేయుము. నాయనా! ఒక శుభనక్షత్రయుక్త లగ్నమున నీవు నాయందు ఉదయించి, నాకు ఎనలేని సంతోషమును గూర్చితివి. శుభలక్షణసంజాతుడవైన నీయొక్క సద్గుణములకు నీ తండ్రి దశరథుడు ఎంతగానో మురిసిపోవుచున్నాడు. కన్నయ్యా! కమలాక్షుడు, పురుషోత్తముడు ఐన శ్రీమన్నారాయణునిగూర్చి దీక్షతో నేనాచరించిన ఉపవాసవ్రతాదులన్నియును సఫలములైనవి. అందువలననే ఈ ఇక్ష్వాకురాజ్యలక్ష్మి నిన్ను వరింపనున్నది." (39-41)

ఇత్యేవముక్తో మాత్రేదం రామో భ్రాతరమబ్రవీత్।
ప్రాంజలిం ప్రహ్వమాసీనమ్ అభివీక్ష్య స్మయన్నివ। 42

కౌసల్యామాత ఇట్లు ఆశీర్వచనములను పలికిన పిమ్మట, శ్రీరాముడు ప్రక్కనే వినమ్రతతో అంజలి ఘటించి, ఆసీనుడైయున్న సోదరుడగు లక్ష్మణస్వామితో చిఱునవ్వు చిందించుచు ఇట్లు నుడివెను. (42)

లక్ష్మణేమాం మయా సార్థం ప్రశాధి త్వం వసుంధరామ్।
ద్వితీయం మేఽన్తరాత్మానం త్వామియం శ్రీరుపస్థితా। 43

సౌమిత్రే భుంక్ష్వ భోగాం స్త్వమ్ ఇష్టాన్ రాజ్యఫలాని చ।
జీవితం చ హి రాజ్యం చ త్వదర్థమ్ అభికామయే। 44

"ఓ లక్ష్మణా! నీవు నా బహిఃప్రాణము. కావున ఈ కోసల రాజ్యలక్ష్మి నిన్నును చేరినట్లే. కనుక నాతోగూడి, నీవును ఈ వసుధను పాలింపుము. ఓ సౌమిత్రీ! నీకు ఇష్టములైన సకలభోగ్యపదార్థములను అనుభవింపుము. అమూల్యములైన రత్నములను, వస్త్రములను, ఆభరణాదులను పొందుము. ఈ రాజ్యమేగాదు నా ప్రాణములేనీవి. వీటినన్నింటిని నీ కొఱకే కోరుకొనుచున్నాను." (43-44)

ఇత్యుక్త్వా లక్ష్మణం రామో మాతరావభివాద్య చ।
అభ్యనుజ్ఞాప్య సీతాం చ జగామ స్వం నివేశనమ్ । 45

లక్ష్మణునితో ఈ విధముగా పలికిన పిదప, శ్రీరాముడు తల్లులిద్దరికిని పాదాభివందనమునాచరించెను. అనంతరము వారిని, సీతాదేవిని వీడ్కొని అతడు తనభవనమునకు చేరెను. (45)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుర్థస్సర్గః (4)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నాల్గవసర్గము సమాప్తము

-- * * * --

5. ఐదవసర్గము

వసిష్ఠమహర్షి సీతారాములచే ఉపవాసవ్రతదీక్షలను స్వీకరింపజేయుట.

సందిశ్య రామం నృపతిః శ్వో భావిన్యభిషేచనే।
పురోహితం సమాహూయ వసిష్ఠంచేదమబ్రవీత్। 1

మఱునాడు జరుగనున్న పట్టాభిషేకసందర్భముగా ఉపవాసాది నియమములను పాటింపుమనిచెప్పి, దశరథుడు శ్రీరాముని పంపివైచెను. పిమ్మట అతడు వంశగురువైన వసిష్ఠుని పిలిపించి, ఇట్లనెను. (1)

గచ్ఛోపవాసం కాకుత్స్థం కారయాద్య తపోధన।
శ్రీయశోరాజ్యలాభాయ వధ్వా సహ యతవ్రతమ్। 2

"ఓ తపోధనా! నేడు రామభవనమునకు వెళ్లి, సంపదలు, కీర్తిప్రతిష్ఠలు, రాజ్యాధికారము ప్రాప్తించుటకై శ్రీరాముడు మా కోడలగు సీతాదేవితోగూడి, ఉపవాసాదివ్రతనియమములను పాటించునట్లు చేయుము." (2)

తథేతి చ స రాజానమ్ ఉక్త్వా వేదవిదాం వరః।
స్వయం వసిష్ఠో భగవాన్ యయౌ రామనివేశనమ్। 3

పిమ్మట వసిష్ఠుడు రాజుగారితో 'అట్లే' యని పలికెను. అతడు వేదవేత్తలలో శ్రేష్ఠుడు, పూజ్యుడు, మంత్రవిద్యాకుశలుడు మిక్కిలి దృఢమైన వ్రతదీక్షగలవాడు. అట్టి వసిష్ఠుడు శ్రీరామునకు మంత్ర

ఉపవాసయితుం రామం మంత్రవిన్మంత్రకోవిదః।
బ్రాహ్మం రథవరం యుక్తమ్ ఆస్థాయ సుధృతవ్రతః। 4

స రామభవనం ప్రాప్య పాండురాభ్రఘనప్రభమ్।
తిస్రః కక్ష్యా రథేనైవ వివేశ మునిసత్తమః। 5

తమాగతమ్ ఋషిం రామః త్వరన్నివ ససంభ్రమః।
మానయిష్యన్ స మానార్హం నిశ్చక్రామ నివేశనాత్। 6

అభ్యేత్య త్వరమాణశ్చ రథాభ్యాశం మనీషిణః।
తతోఽవతారయామాస పరిగృహ్య రథాత్ స్వయమ్। 7

స చైనం ప్రశ్రితం దృష్ట్వా సంభాష్యాభిప్రసాద్య చ।
ప్రియార్హం హర్షయన్ రామమ్ ఇత్యువాచ పురోహితః। 8

ప్రసన్నస్తే పితా రామ యౌవరాజ్యమవాప్స్యసి।
ఉపవాసం భవానద్య కరోతు సహ సీతయా। 9

ప్రాతస్త్వామభిషేక్తా హి యౌవరాజ్యే నరాధిపః।
పితా దశరథః ప్రీత్యా యయాతిం నహుషో యథా। 10

ఇత్యుక్త్వా స తదా రామమ్ ఉపవాసం యతవ్రతమ్।
మంత్రవత్ కారయామాస వైదేహ్యా సహితం మునిః। 11

తతో యథావద్రామేణ స రాజ్ఞో గురురర్చితః।
అభ్యనుజ్ఞాప్య కాకుత్స్థం యయౌ రామనివేశనాత్। 12

సుహృద్భిస్తత్ర రామోఽపి సహాసీనః ప్రియంవదైః।
సభాజితో వివేశాథ తాననుజ్ఞాప్య సర్వశః। 13

హృష్టనారీనరయుతం రామవేశ్మ తదా బభౌ।
యథా మత్తద్విజగణం ప్రఫుల్లనళినం సరః। 14

స రాజభవనప్రఖ్యాత్ తస్మాద్రామనివేశనాత్।
నిర్గత్య దదృశే మార్గం వసిష్ఠో జనసంవృతమ్। 15

బృందబృందైరయోధ్యాయాం రాజమార్గాః సమంతతః।
బభూవురభిసంబాధాః కుతూహలజనైర్వృతాః। 16

పూర్వకముగా ఉపవాసాదివ్రతదీక్షనిప్పించుటకై బ్రాహ్మణులు ప్రయాణము చేయుటకు అనువైనది, గుఱ్ఱములను పూన్చినది ఐన ఒక గొప్ప రథముపై అధిరోహించి, శ్రీరాముని భవనమునకు బయలుదేఱెను. (3-4)

ఆ మునీశ్వరుడు తెల్లని మేఘమువలె వెలుగులను విరజిమ్ముచున్న శ్రీరామునిభవనమునకు చేరి, ఆ రథముపైననే మూడు కక్ష్యలు దాటి, అందు ప్రవేశించెను. (5)

తనమందిరమునకు విచ్చేసిన పూజ్యుడైన వసిష్ఠమహర్షిని అతిథిమర్యాదలతో సత్కరించుటకై శ్రీరాముడు తత్తరపాటుతో త్వరత్వరగా తన అంతఃపురమునుండి బయటికి వచ్చెను. (6)

పిమ్మట రాముడు విద్వాంసుడైన వసిష్ఠుని యొక్క రథమును శీఘ్రముగా సమీపించి, స్వయముగా ఆయనకు చేయూతనిచ్చి, రథమునుండి క్రిందికి దింపెను. (7)

అట్లు వినమ్రుడై వచ్చిన శ్రీరాముని జూచి, వసిష్ఠమహర్షి కుశలప్రశ్నలతో ప్రసన్నునిగావించెను. ప్రేమపాత్రుడైన ఆయన సంతోషమును ఇనుమడింపజేయుచు అతడు ఇట్లు పలికెను. (8)

"ఓ రామా! మీ తండ్రిగారిఅనుగ్రహకారణముగా నీవు యువరాజపట్టాభిషిక్తుడవు కానున్నావు. కనుక సీతాదేవితోగూడి నీవు ఉపవాసవ్రతదీక్షను పాటింపుము. మీ తండ్రియైన దశరథ మహారాజు, నహుషుడు యయాతికివలె రేపు ఉదయమున నీకు పరమప్రీతితో యౌవరాజ్యపట్టాభిషేకమహోత్సవమును జరుపనున్నాడు"(9-10)

ఆ మహర్షి ఇట్లు పలికి, అప్పుడు సీతారాములకు మంత్ర పూర్వకముగా ఉపవాసాదివ్రతదీక్షలను ఇప్పించెను. (11)

రాజగురువైన వసిష్ఠుడు విధ్యుక్తముగా శ్రీరామునిచే పూజలను అందుకొనెను. పిమ్మట తనవెంట వచ్చుచున్న శ్రీరాముని నిలిపి, ఆయనను వీడ్కొని ఆ భవనమునుండి బయలుదేఱెను. (12)

పిమ్మట శ్రీరాముడును ప్రియభాషణము చేయుచున్న మిత్రులతో ఆసీనుడై, అచట కొంతతడవు గడిపెను. అనంతరము అతడు పెక్కురీతుల వారిచే అభినందింపబడి, వారిని వీడ్కొలిపి, తన అంతఃపురమున ప్రవేశించెను. (13)

ఆ రామమందిరము సంతోషముతో పొంగిపోవుచున్న స్త్రీపురుషులతో నిండియుండెను. అప్పుడది మదించిన పక్షులతోను, చక్కగా వికసించిన పద్మములతోను కలకలలాడుచున్న సరస్సువలె విరాజిల్లుచుండెను. (14)

ఆ వసిష్ఠుడు రాజభవనసదృశమైన ఆ రామమందిరమునుండి బయలుదేఱిన పిమ్మట జనసమ్మర్దముతోనున్న రాజమార్గమును జూచెను. (15)

అయోధ్యానగరమునందలి రాజమార్గములన్నియును శ్రీరాము పట్టాభిషేకమహోత్సవమును చూడవేడుకపడుచున్న జనబృందములతో (ఇసుక వేస్తే రాలనంతగా) క్రిక్కిరిసియుండెను. అచట గుంపులు

జనబృందోర్మిసంఘర్షహర్షస్వనవతస్తదా ।
బభూవ రాజమార్గస్య సాగరస్యేవ నిస్వనః ॥ 17

సిక్తసమ్మృష్టరథ్యా హి తదహర్వనమాలినీ ।
ఆసీదయోధ్యా నగరీ సముచ్ఛ్రితగృహధ్వజా ॥ 18

తదా హ్యయోధ్యానిలయః సస్త్రీబాలాబలో జనః ।
రామాభిషేకమాకాంక్షన్నాకాంక్షదుదయం రవేః ॥ 19

ప్రజాలంకారభూతం చ జనస్యానందవర్ధనమ్ ।
ఉత్సుకోఽభూజ్జనో ద్రష్టుం తమయోధ్యామహోత్సవమ్ ॥ 20

ఏవం తం జనసంబాధం రాజమార్గం పురోహితః ।
వ్యూహన్నివ జనౌఘం తం శనై రాజకులం యయౌ ॥ 21

సితాభ్రశిఖరప్రఖ్యం ప్రాసాదమధిరుహ్య సః ।
సమీయాయ నరేంద్రేణ శక్రేణేవ బృహస్పతిః ॥ 22

తమాగతమభిప్రేక్ష్య హిత్వా రాజాసనం నృపః ।
పప్రచ్ఛ స చ తస్మై తత్ కృతమిత్యభ్యవేదయత్ ॥ 23

తేన చైవ తదా తుల్యం సహాసీనాః సభాసదః ।
ఆసనేభ్యః సముత్తస్థుః పూజయంతః పురోహితమ్ ॥ 24

గురుణా త్వభ్యనుజ్ఞాతో మనుజౌఘం విసృజ్య తమ్ ।
వివేశాంతఃపురం రాజా సింహో గిరిగుహామివ ॥ 25

తదగ్ర్యవేషప్రమదాజనాకులం
మహేంద్రవేశ్మప్రతిమం నివేశనమ్ ।
విదీపయంశ్చారు వివేశ పార్థివః
శశీవ తారాగణసంకులం నభః ॥ 26

గుంపులుగా చేరిన జనులెల్లరును సముద్రతరంగములవలె ఆహమహమికతో ఒకరినొకరు త్రోసికొనుచుండిరి. వారిసంతోష సంభ్రమనాదములతో నిండిన రాజమార్గకోలాహలము సాగరఘోషవలె మిన్నుముట్టుచుండెను. జనులు ఆనాడు నగరమునందలి రాజవీధులను చక్కగా శుభ్రపఱచి, కలయంపిచల్లిరి. అంతటను బారులుతీర్చి పోకచెట్లను, అరటిచెట్లను చూడముచ్చటగా అలంకరించిరి. అన్ని గృహముల మీదను ధ్వజపతాకముల రెపరెపలు కనువిందుగావించుచుండెను. అప్పటి ఆ అయోధ్యావైభవము వర్ణనాతీతము. (16-18)

'మఱునాడు శ్రీరామునకు యువరాజపట్టాభిషేకము జరుగును' అను వార్తను విన్నప్పటినుండియు, అయోధ్యావాసులైన స్త్రీలు, పురుషులు, బాలురు, బాలికలు, వృద్ధులు ఎల్లరును ఆ మహోత్సవమును చూచియానందించుటకై ఉవ్విళ్ళూరుచు, సూర్యోదయమునకై ఎదురుతెన్నులు చూచుచుండిరి. (19)

ప్రజలు తమఇండ్లను, తమను అలంకరించుకొనుటకు దోహదకారియు, వారికి ఆనందాతిశయమును గూర్చునదియు ఐన ఆ అయోధ్యామహోత్సవమును కనులార దర్శించుటకై తహతహపడుచుండిరి. (20)

వసిష్ఠమహర్షి జనసమ్మర్దముతో నిండిన ఆ రాజమార్గమును గాంచుచు, ఆ ప్రజాసమూహమును రెండుగా చీల్చుచున్నవానివలె రథముపై తిన్నగా సాగుచు రాజభవనమునకు చేరెను. తెల్లని మేఘములచే ఆవృతమైన గిరిశిఖరమువలెనున్న రాజభవనమును అధిరోహించి, ఆ వసిష్ఠమహాముని బృహస్పతి దేవేంద్రుని చేరినట్లు దశరథుని సమీపించెను. (21-22)

అట్లు తనకడకు వచ్చిన మునిని చూచి, దశరథుడు తన రాజాసనమునుండి దిగి, ఎదురుగా వచ్చి, 'శ్రీరామునకు ఉపవాస దీక్షను ఇచ్చితిరా'? అని ప్రశ్నించెను. అప్పుడు వసిష్ఠుడు 'అట్లే కావించితిని' అని రాజుతో పలికెను. అప్పుడు దశరథునితోపాటు అచట ఆసీనులైయున్న సభాసదులందఱును ఒక్కుమ్మడిగా తమతమ ఆసనములనుండి లేచి నిలబడి, వసిష్ఠునియెడ గౌరవమును ప్రకటించిరి. గురువుగారినుండి అనుజ్ఞను గైకొని, దశరథమహారాజు సదస్యులనెల్లరను వీడ్కొని, సింహము పర్వతగుహనువలె రాజాంతఃపురమును ప్రవేశించెను. చక్కని వేషములతో ఆభరణములతో మనోహరముగా నున్న సుందరీమణులతో ఆ రాజభవనము నిండియుండెను. అది దేవేంద్రభవనమును తలపించుచు వెలుగులను చిమ్ముచుండెను. అట్టి మహోజ్జ్వలమందిరమున దశరథుడు చంద్రుడు నక్షత్రములతో మిలమిలలాడుచున్న ఆకాశమునవలె ప్రవేశించెను. (23-26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచమస్సర్గః (5)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఐదవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

6. ఆఱవసర్గము

శ్రీరామునిపట్టాభిషేకవార్తను వినినంతనే ప్రజలు సంబరముతో పొంగిపోవుట, పురమంతయును అలంకారములతో మిఱుమిట్లు గొల్పుట.

గతే పురోహితే రామః స్నాతో నియతమానసః।
సహ పత్న్యా విశాలాక్ష్యా నారాయణముపాగమత్॥ 1

ప్రగృహ్య శిరసా పాత్రీం హవిషో విధివత్తదా।
మహతే దైవతాయాజ్యం జుహావ జ్వలితేఽనలే॥ 2

శేషం చ హవిషస్తస్య ప్రాశ్యాశాస్యాత్మనః ప్రియమ్।
ధ్యాయన్ నారాయణం దేవం స్వాస్తీర్ణే కుశసంస్తరే॥ 3

వాగ్యతః సహ వైదేహ్యా భూత్వా నియతమానసః।
శ్రీమత్యాయతనే విష్ణోః శిశ్యే నరవరాత్మజః॥ 4

ఏకయామావశిష్టాయాం రాత్ర్యాం ప్రతివిబుధ్య సః।
అలంకారవిధిం కృత్స్నం కారయామాస వేశ్మనః॥ 5

తత్ర శృణ్వన్ సుఖా వాచః సూతమాగధవందినామ్।
పూర్వాం సంధ్యాముపాసీనో జజాప యతమానసః॥ 6

తుష్టావ ప్రణతశ్చైవ శిరసా మధుసూదనమ్।
విమలక్షౌమసంవీతో వాచయామాస చ ద్విజాన్॥ 7

తేషాం పుణ్యాహఘోషోఽథ గంభీరమధురస్తదా।
అయోధ్యాం పూరయామాస తూర్యఘోషానునాదితః॥ 8

కృతోపవాసం తు తదా వైదేహ్యా సహ రాఘవమ్।
అయోధ్యానిలయః శ్రుత్వా సర్వః ప్రముదితో జనః॥ 9

తతః పౌరజనస్సర్వః శ్రుత్వా రామాభిషేచనమ్।
ప్రభాతాం రజనీం దృష్ట్వా చక్రే శోభయితుం పురీమ్॥ 10

సితాభ్రశిఖరాభేషు దేవతాయతనేషు చ।
చతుష్పథేషు రథ్యాసు చైత్యేష్వట్టాలకేషు చ॥ 11

వసిష్ఠమహర్షి వెళ్లిన పిమ్మట శ్రీరాముడు స్నానకృత్యములను ముగించుకొని, నిశ్చలమనస్కుడై, విశాలాక్షియైన ధర్మపత్నియగు సీతాదేవితోగూడి శ్రీమన్నారాయణుని సేవించెను. పిమ్మట అతడు హవిస్సుతోగూడిన పాత్రను శిరమున దాల్చి, అగ్నికి ప్రదక్షిణనమస్కారములొనర్చి, శ్రీ మహావిష్ణువునుద్దేశించి, జ్వలించుచున్న అగ్నియందు శాస్త్రప్రకారము హోమము చేసెను. (1-2)

దశరథమహారాజకుమారుడైన శ్రీరాముడు తనకు శుభములు చేకూరుటకై సీతాదేవితోగూడి హోమము చేయగామిగిలిన హవిస్సును స్వీకరించెను. పరమదైవమైన శ్రీమహావిష్ణువును ధ్యానించుచు మౌనముగా మనోనిగ్రహముతో దర్శనీయమైన విష్ణుమందిరమున చక్కగా పఱచబడిన దర్భాస్తరణముపై వారు ఇరువురును శయనించిరి. (3-4)

శ్రీరాముడు వేకువజాముననే మేల్కొని, (తన) గృహమునకు పూర్తిగా అలంకారములను చేయించెను. సూతులయొక్క దైవస్తుతులను, వందిమాగధులు నిర్వహించుచున్న స్తుతిపాఠములను, వంశావళికీర్తనలను ఆలకించెను. పిమ్మట అతడు ఏకాగ్రతతో ప్రాతస్సంధ్యాధిదేవతయైన సూర్యుని ఉపాసించుచు గాయత్రీ మంత్రమును జపించెను. (5-6)

సంధ్యోపాసనానంతరము స్వచ్ఛమైన పట్టువస్త్రములను ధరించి, శ్రీరాముడు శ్రీమన్నారాయణుని సాష్టాంగ నమస్కార పూర్వకముగా స్తుతించెను. పిమ్మట బ్రాహ్మణులు శ్రీ సీతారాములను స్వస్తి వచనములతో ఆశీర్వదించిరి. (7)

ఆ బ్రాహ్మణోత్తములయొక్క మధురగంభీరములైన పుణ్యాహవాచనవేదఘోషలు, తూర్యధ్వనులు అయోధ్యయందంతటను మాఱుమ్రోగెను. (8)

సీతాదేవితోగూడి రాముడు ఉపవాసాదిదీక్షలను స్వీకరించినట్లు విని, అయోధ్యావాసులైన జనులందఱును పరమానందభరితులైరి. అనంతరము పురవాసులందఱును శ్రీరామపట్టాభిషేకము జరుగబోవుచున్నదని విని, ప్రభాత సమయముననే వీధులను శుభ్రపఱచిరి. కస్తూరికలయంపి చల్లిరి. రంగవల్లికలను తీర్చిదిద్దిరి. ద్వారతోరణములతో, పూలమాలలతో అలంకరించి పురమును శోభాయమానమొనర్చిరి. (9-10)

తెల్లనిమేఘములచే ఆవృతములైనపర్వతశిఖరములవలె ఎత్తైన దేవాలయములమీదను, వీధుల కూడళ్లయందును,

నానాపణ్యసమృద్ధేషు వణిజామాపణేషు చ।
కుటుంబినాం సమృద్ధేషు శ్రీమత్సు భవనేషు చ। 12

సభాసు చైవ సర్వాసు వృక్షేష్వాలక్షితేషు చ।
ధ్వజాస్సముచ్ఛ్రితాశ్చిత్రాః పతాకాశ్చాభవంస్తదా। 13

నటనర్తకసంఘానాం గాయకానాం చ గాయతామ్।
మనః కర్ణసుఖా వాచః శుశ్రువుశ్చ తతస్తతః। 14

రామాభిషేకయుక్తాశ్చ కథాశ్చక్రుర్మిథో జనాః।
రామాభిషేకే సంప్రాప్తే చత్వరేషు గృహేషు చ। 15

బాలా అపి క్రీడమానా గృహద్వారేషు సంఘశః।
రామాభిషేకసంయుక్తాః చక్రురేవంమిథః కథాః। 16

కృతపుష్పోపహారశ్చ ధూపగంధాధివాసితః।
రాజమార్గః కృతః శ్రీమాన్ పౌరై రామాభిషేచనే। 17

ప్రకాశకరణార్థం చ నిశాగమనశంకయా।
దీపవృక్షాం స్తథా చక్రుః అనురథ్యాసు సర్వశః। 18

అలంకారం పురస్యైవం కృత్వా తత్పురవాసినః।
ఆకాంక్షమాణా రామస్య యౌవరాజ్యాభిషేచనమ్। 19

సమేత్య సంఘశః సర్వే చత్వరేషు సభాసు చ।
కథయంతో మిథస్తత్ర ప్రశశంసుః జనాధిపమ్। 20

అహో మహాత్మా రాజాయమ్ ఇక్ష్వాకుకులనందనః।
జ్ఞాత్వా యో వృద్ధమాత్మానం రామం రాజ్యేఽభిషేక్ష్యతి। 21

సర్వేఽప్యనుగృహీతాః స్మ యన్నో రామో మహీపతిః।
చిరాయ భవితా గోప్తా దృష్టలోకపరావరః। 22

రాజమార్గములయందును, దివ్యభవనములపైనను, కోటబురుజుల మీదను, వివిధములగు వస్తువులతో నిండియున్న విక్రయశాలలపైనను, సకలసంపదలతో తులతూగుచున్న శ్రీమంతులైన గృహస్థుల భవనములమీదను, సకలసభామందిరములపైనను, అత్యున్నతములై, అందరికిని దూరమునుండియే కనబడుచున్న మహావృక్షముల మీదను చిత్రవిచిత్రములగు ధ్వజపతాకములు ఎగురవేయబడెను. ఆ పతాకములధగధగలు కనువిందుగావించుచుండెను. (11-13)

పురమునందలి సమస్తప్రదేశములయందును నటీనటులు ప్రదర్శించు చక్కనివిద్యాకౌశలములును, ఆహ్లాదకరమైన నర్తకుల నాట్యభంగిమలును, గాయనీగాయకులమధురగానములును ప్రజలకు చూడముచ్చటగొల్పుచు, వీనులవిందొనర్చుచు, వారి మనస్సులను దోచుకొనుచుండెను. (14)

పట్టాభిషేకముహూర్తము సమీపించుచుండుటతో శ్రీరామాభిషేక కథలను వనితారత్నములు గృహములలోను, పురపుంగవులు ప్రాంగణములయందును ముచ్చటించుకొనుచు మురిసిపోవుచుండిరి. ఇండ్లముంగిళ్లయందు ఆడుకొనుచున్న బాలబాలికలు సైతము గుంపులుగుంపులుగా చేరి, రామాభిషేకమధురగాథలను పరస్పరము చెప్పుకొనుచుండిరి. (15-16)

రామాభిషేకమహోత్సవమును పురస్కరించుకొని, పౌరులెల్లరును రాజమార్గములయందు రంగురంగుల పూవులను చల్లిరి. ధూపములతో, సుగంధములతో మార్గములన్నింటిని పరిమళములతో గుబాళింపజేసిరి. (17)

వీధులయందు అమర్చబడిన వితానములు, పోకచెట్లు, అరటిచెట్లు మున్నగు వాటి నీడలను (చీకట్లను) తొలగించుటకును మఱియు పట్టాభిషేకానంతరము భద్రగజముపై శ్రీరామునిఊరేగింపు జరుగునప్పుడు ఒకవేళ ప్రొద్దుగ్రుంకినచో ఆ చీకట్లను తొలగించుచు వెలుగులను విరజిమ్ముటకును అన్ని రాజమార్గముల యందును దీపవృక్షములను (వృక్షాకారములో దీపములను) ఏర్పఱచిరి. (18)

పురజనులెల్లరును వైభవోపేతముగా ఇట్లు అయోధ్యా నగరమును అలంకరించి, శ్రీరామునియౌవరాజ్య పట్టాభిషేక (సుముహూర్త)మును కోరుకొనుచున్నవారై, వీధులకూడళ్లయందును సభాభవనములయందును గుమిగూడి, పరస్పరము చర్చించుకొనుచు దశరథమహారాజును ఈ విధముగా కొనియాడుచుండిరి. (19-20)

"ఇక్ష్వాకువంశమునకు వన్నెదెచ్చిన మహానుభావుడగు ఈ దశరథమహారాజు తనవార్ధక్యమును గుర్తించి, శ్రీరాముని యువరాజపట్టాభిషిక్తుని జేయుచున్నాడు. ఇది ఎంతటి గొప్ప విషయము! శ్రీరాముడు లోకులందఱి (సమస్తప్రజల) మంచిచెడ్డలను బాగుగా ఎఱిగినవాడు. అతడు మనకు ప్రభువు కాబోవుచున్నాడు. ఇక అతడు మనకు చిరకాలము రక్షకుడుగానుండును. మనకు అబ్బిన ఈ అదృష్టము దైవానుగ్రహఫలితమే. (21-22)

అనుద్ధతమనా విద్వాన్ ధర్మాత్మా భ్రాతృవత్సలః।
యథా చ భ్రాతృషు స్నిగ్ధః తథాఽస్మాస్వపి రాఘవః। 23

చిరం జీవతు ధర్మాత్మా రాజా దశరథోఽనఘః।
యత్ప్రసాదేనాభిషిక్తం రామం ద్రక్ష్యామహే వయమ్। 24

రఘురాముడు ఏ మాత్రమును గర్వములేనివాడు, విద్వాంసుడు, ధర్మబుద్ధిగలవాడు, సోదరప్రేమకు కుదురైనవాడు, మనలనుగూడ తనసోదరులనువలె ప్రేమతో ఆదరించువాడు. ధర్మాత్ముడైన దశరథమహారాజు యొక్క అనుగ్రహమువలన శ్రీరాముని యువరాజ పట్టాభిషిక్తునిగా చూడబోవుచున్నాము. పుణ్యమూర్తియైన ఆ దశరథమహాప్రభువు కలకాలము వర్ధిల్లుగాక." (23-24)

ఏవంవిధం కథయతాం పౌరాణాం శుశ్రువుస్తదా।
దిగ్భ్యోఽపి శ్రుతవృత్తాంతాః ప్రాప్తా జానపదా జనాః। 25

తే తు దిగ్భ్యః పురీం ప్రాప్తా ద్రష్టుం రామాభిషేచనమ్।
రామస్య పూరయామాసుః పురీం జానపదా జనాః। 26

శ్రీరామపట్టాభిషేకవార్తను ఎఱింగిన వెంటనే నానాదిక్కుల నుండియు వచ్చిన జానపదులు పౌరుల పరస్పరసంభాషణలను అన్నింటిని వినిరి. వారు శ్రీరామపట్టాభిషేకమహోత్సవమును కనులార చూచువేడుకతో నగరమునకు చేరిరి. అప్పుడారామనగరము (అయోధ్య) జానపదులతో కిటకిటలాడెను. (25-26)

జనౌఘైః తైర్విసర్పద్భిః శుశ్రువే తత్ర నిస్స్వనః।
పర్వసూదీర్ణవేగస్య సాగరస్యేవ నిస్స్వనః। 27

నానాదేశములనుండి విచ్చేసిన జనవాహినులసంచారములచే ఆ నగరమునందేర్పడిన మహాధ్వని పర్వదినములయందు ఉత్తుంగతరంగములతో విజృంభించిన సాగరఘోషను తలపించుచుండెను. (27)

తత స్తదింద్రక్షయసన్నిభం పురం
దిదృక్షుభిర్జానపదైరుపాగతైః।
సమంతతః సస్వనమాకులం బభౌ
సముద్రయాదోభిరివార్ణవోదకమ్। 28

ఆ అయోధ్యానగరము మహావైభవోపేతమగు ఇంద్రనగరమైన అమరావతివలె ఒప్పుచుండెను. అది శ్రీరామపట్టాభిషేకదర్శన కుతూహలముతో వచ్చియున్న జానపదులకోలాహలముసవ్వడులతో నిండియుండెను. అప్పుడది తిమి, తిమింగిలాది జలజంతువులచే అల్లకల్లోలమైన సముద్రజలములవలె కన్పట్టుచుండెను. (28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షష్ఠస్సర్గః *(6)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఆఱవసర్గము సమాప్తము

-- * * * --

7. ఏడవసర్గము

కైకేయికి మంథరదుర్బోధ.

జ్ఞాతిదాసీ యతో జాతా కైకేయ్యాస్తు సహోషితా।
ప్రాసాదం చంద్రసంకాశమ్ ఆరురోహ యదృచ్ఛయా। 1

పుట్టింటినుండి మెట్టినింటికి (అయోధ్యకు) కైకేయి వచ్చునప్పుడు ఆమె వెంటవచ్చిన అరణపుదాసి మంథర. ఈమె పుట్టుపూర్వోత్తరములు తెలియరావు.[1] శ్రీరామపట్టాభిషేకముహూర్తమునకు ముందు రాత్రి ఈమె యాదృచ్ఛికముగా అటునిటు తిరుగుచు చంద్రునివలె నిర్మలమైన ప్రాసాదము మీదికి ఎక్కెను. (1)

సిక్తరాజపథాం కృత్స్నాం ప్రకీర్ణకుసుమోత్కరామ్।
అయోధ్యాం మంథరా తస్మాత్ ప్రాసాదాదన్వవైక్షత। 2

అయోధ్యానగరమునందలి రాజవీధులలో కళాపిచల్లి, పూలతో అలంకరింపబడియుండుటను ఆమె ఆ భవనము మీదినుండియే చూచెను. ఆ నగరమునందంతటను శ్రేష్ఠములైన

1) *కైకేయి దాసియైన ఈ మంథర ఎక్కడ పుట్టినది? ఈమెతల్లిదండ్రులెవరు? అనునవి తెలియరావు. పూర్వజన్మలో ఈమె 'దుందుభి'యను ఒక గంధర్వకాంత. రావణుడు పెట్టెడి బాధలకు తట్టుకొనలేక దేవతలు మొఱపెట్టుకొనగా, బ్రహ్మదేవుడే అతని సంహారమునకై కుబ్జరూపమున ఈమెను సృష్టించెను. విధినిర్ణయమును అనుసరించి, ఈమె కైకేయియొక్క మనస్సునందు దురాలోచనలను రేకెత్తించెను.*

పతాకాభిర్వరార్హాభిః ధ్వజైశ్చ సమలంకృతామ్।
వృతాం ఛందపథైశ్చాపి శిరస్స్నాతజనైర్వృతామ్। 3

మాల్యమోదకహస్తైశ్చ ద్విజేంద్రైరభినాదితామ్।
శుక్లదేవగృహద్వారాం సర్వవాదిత్రనిస్వనామ్। 4

సంప్రహృష్టజనాకీర్ణాం బ్రహ్మఘోషాభినాదితామ్।
ప్రహృష్టవరహస్త్యశ్వాం సంప్రణర్దితగోవృషామ్। 5

ప్రహృష్టముదితైః పౌరైః ఉచ్ఛ్రితధ్వజమాలినీమ్।
అయోధ్యాం మంథరా దృష్ట్వా పరం విస్మయమాగతా। 6

ప్రహర్షోత్ఫుల్లనయనాం పాండురక్షౌమవాసినీమ్।
అవిదూరే స్థితాం దృష్ట్వా ధాత్రీం పప్రచ్ఛ మంథరా। 7

ఉత్తమేనాభిసంయుక్తా హర్షేణార్థపరా సతీ।
రామమాతా ధనం కిన్ను జనేభ్యః సంప్రయచ్ఛతి। 8

అతిమాత్రప్రహర్షోఽయం కిం జనస్య చ శంస మే।
కారయిష్యతి కిం వాపి సంప్రహృష్టో మహీపతిః। 9

విదీర్యమాణా హర్షేణ ధాత్రీ తు పరయా ముదా।
ఆచచక్షేఽథ కుబ్జాయై భూయసీం రాఘవశ్రియమ్। 10

శ్వః పుష్యేణ జితక్రోధం యౌవరాజ్యేన రాఘవమ్।
రాజా దశరథో రామమ్ అభిషేచయితాఽనఘమ్। 11

ధాత్ర్యాస్తు వచనం శ్రుత్వా కుబ్జా క్షిప్రమమర్షితా।
కైలాసశిఖరాకారాత్ ప్రాసాదాదవరోహత। 12

సా దహ్యమానా కోపేన మంథరా పాపదర్శినీ।
శయానామేత్య కైకేయీమ్ ఇదం వచనమబ్రవీత్। 13

ఉత్తిష్ఠ మూఢే కిం శేషే భయం త్వామభివర్తతే।
ఉపప్లుతమఘౌఘేన కిమాత్మానం న బుధ్యసే। 14

ధ్వజపతాకములు రెపరెపలాడుచుండెను. చిన్నపెద్దవీధులు సైతము జనసంచారమునకు అనువుగా శుభ్రపరచబడియుండెను. ప్రజలెల్లరును తలంట్లుపోసికొని, అలంకరించుకొని తిరుగుచుండిరి. (2-3)

పూలమాలలు, మధురపదార్థములుగల పళ్ళెములను చేతబట్టి, బ్రాహ్మణులు మంత్రములను పఠించుచుండిరి. వెల్లవేయుటచే దేవాలయములన్నియును స్వచ్ఛముగా ప్రకాశించుచుండెను. వివిధములగు వాద్యఘోషలు అంతటను ప్రతిధ్వనించుచుండెను. సంతోషోత్సాహములతో జనులెల్లరును గుంపులుగా చేరి యుండిరి. వేదఘోషలు మారుమ్రోగుచుండెను. (పశుపక్ష్యాదులకును రామాభిషేకము సంతోషమును గూర్చునదిగావున) ఏనుగులును, గుఱ్ఱములును సంతోషముతోనుండెను. ఆవులు 'అంబా' యనుచుండెను. కోడెలు 'రంకెలు' వేయుచుండెను. స్త్రీ పురుషులు అందఱును మానసోల్లాసముతో పతాకములను ఎగురవేయుచుండిరి. ఇట్లు శోభాయమానముగా ఉన్న అయోధ్యానగరమును జూచి, మంథర మిక్కిలి ఆశ్చర్యచకితయయ్యెను. (4-6)

సమీపమునగల మేడపై శ్రీరాముని పెంచిన దాది నిలబడి యుండెను. స్వచ్ఛమైన పట్టువస్త్రములను ధరించిన ఆమె కనులలో సంతోషము వెల్లివిరియుచుండెను. ఆ దాదినిజూచి మంథర ఇట్లు ప్రశ్నించెను. (7)

"ఓ దాదీ! రామజనని[1] ఏదైననొక మనోరథసిద్ధికై పరమ సంతోషముతో జనులకు దానధర్మములను చేయుచున్నదా? పట్టరాని సంతోషముతో ప్రజలు ఎందుకు పొంగిపోవుచున్నారు? దశరథమహారాజు హర్షాతిరేకముతో ఏదైననొక శుభకార్యమును జరిపింపబోవుచున్నారా? నాకు తెలుపుము." (8-9)

సంతోషముతో ఉక్కిరిబిక్కిరియగుచున్న ఆదాది "మహారాజ్యలక్ష్మి శ్రీరాముని వరింపబోవుచున్నది. శాంతస్వభావుడు, పుణ్యమూర్తి ఐన శ్రీరాముని రేపే పుష్యమీనక్షత్రయుక్త సుముహూర్తమున దశరథమహారాజు యువరాజపట్టాభిషిక్తుని చేయబోవుచున్నాడు." అని ఆ గూనిమంథరకు తెల్పెను.[2] (10-11)

ఆ దాదిమాటలను వినినవెంటనే అసూయతో దహించబడుచు ఆ గూని మంథర కైలాసశిఖరమువలె ఎత్తైన రాజప్రాసాదము నుండి గబగబ క్రిందికి దిగెను. (12)

పాపాత్మురాలైన ఆ మంథర కోపముతో కుతకుతలాడుచు, శయ్యపై పరుండియున్న కైకకడకుచేరి, ఇట్లు నుడివెను. (13)

"ఓ మూఢురాలా! లెమ్ము. ఇంకను పరుండితివేల? భయంకరములైన పెనుఆపదలు, దుఃఖపరంపరలు నిన్ను చుట్టుముట్టబోవుచుండగా తెలిసికొనలేకున్నావు- (14)

1) కౌసల్యాదేవిని పేరుతో పేర్కొనక 'రామమాత' అని అనుటనుబట్టి మంథరకు కౌసల్య పై గల అసూయ వెల్లడియగుచున్నది.
2) దుష్టురాలైన మంథరకు ఇట్టి శుభవార్తను తెల్పగూడదనిగాని, ఆదాది తనసంతోషమును ఆపుకొనలేక తెలిపెను.

అనిష్టే సుభగాకారే సౌభాగ్యేన వికత్థసే।
చలం హి తవ సౌభాగ్యం నద్యాః స్రోత ఇవోష్ణగే। 15

ఏవముక్తా తు కైకేయీ రుష్టయా పరుషం వచః।
కుబ్జయా పాపదర్శిన్యా విషాదమగమత్ పరమ్। 16

కైకేయీత్వబ్రవీత్ కుబ్జాం కచ్చిత్ క్షేమం న మంథరే।
విషణ్ణవదనాం హి త్వాం లక్షయే భృశదుఃఖితామ్। 17

మంథరా తు వచః శ్రుత్వా కైకేయ్యా మధురాక్షరమ్।
ఉవాచ క్రోధసంయుక్తా వాక్యం వాక్యవిశారదా। 18

సా విషణ్ణతరా భూత్వా కుబ్జా తస్యా హితైషిణీ।
విషాదయంతీ ప్రోవాచ భేదయంతీ చ రాఘవమ్। 19

అక్షయ్యం సుమహద్దేవి ప్రవృత్తం త్వద్వినాశనమ్।
రామం దశరథో రాజా యౌవరాజ్యేఽభిషేక్ష్యతి। 20

సాఽస్మ్యగాధే భయే మగ్నా దుఃఖశోకసమన్వితా।
దహ్యమానాఽనలేనేవ త్వద్ధితార్థమ్ ఇహాగతా। 21

తవ దుఃఖేన కైకేయి మమ దుఃఖం మహద్ భవేత్।
త్వద్వృద్ధౌ మమ వృద్ధిశ్చ భవేదత్ర న సంశయః। 22

నరాధిపకులే జాతా మహిషీ త్వం మహీపతేః।
ఉగ్రత్వం రాజధర్మాణాం కథం దేవి న బుధ్యసే। 23

ధర్మవాదీ శఠో భర్తా శ్లక్ష్ణవాదీ చ దారుణః।
శుద్ధభావేన జానీషే తేనైవమతిసంధితా। 24

ఉపస్థితం ప్రయుంజానః త్వయి సాంత్వమనర్థకమ్।
అర్థేనైవాద్య తే భర్తా కౌసల్యాం యోజయిష్యతి। 25

అపవాహ్య స దుష్టాత్మా భరతం తవ బంధుషు।
కాల్యే స్థాపయితా రామం రాజ్యే నిహతకంటకే। 26

"ఓ కైకా! నీ భర్తకు (నీ సవతులందరికంటెను) నీపైననే ఎనలేని ప్రేమయున్నట్లు నీవు భ్రమపడుచున్నావు. కాని ఆయనది కేవలము పలుకుమాత్రమే- నిజముగా ఆయనకు నీపై ఏ మాత్రమును అనురాగములేదు. నీకైనీవు 'నేనెంతో అదృష్టవంతురాలను' అని గొప్పలు చెప్పికొనుచుందువు. వాస్తవముగా నీ అదృష్టము గ్రీష్మకాలమునందు నదీజలములవలె తఱిగిపోవుచున్నది." (15)

పాపాత్మురాలైన ఆ గూనిమంథర రుసరుసలాడుచు ఇట్లు పరుష వచనములు పలుకగా కైక మిక్కిలి విషాదమునకు లోనయ్యెను. (16)

పిమ్మట కైకేయి ఆ కుబ్జతో 'ఓ మంథరా! అశుభమేమియు సంభవింపలేదుగదా! నీ ముఖముపై విషాదచ్ఛాయలు అలముకొని యున్నవి. నీవు మిక్కిలి దుఃఖితురాలవుగా కనబడుచున్నావు కారణమేమి?' అని అడిగెను. (17)

రామపట్టాభిషేకవిషయమునేమెఱుగక పలుకుచున్న కైకేయి యొక్క మధురవచనములను విని, కోపముతో మాటకారియైన మంథర ఇట్లు నుడివెను. (18)

కైకేయి హితమును గోరుచున్న ఆ మంథర ఇంకను విషణ్ణురాలై, ఆ కైకకు మిక్కిలి ఖేదమును గల్గించుచు, ఆమెలో రాముని యెడ వైముఖ్యమును పుట్టించుచు ఇట్లు పలుకసాగెను. (19)

"ఓ దేవీ! దశరథమహారాజు శ్రీరాముని యువరాజ పట్టాభిషిక్తుని చేయబోవుచున్నాడు. నీకు అంతులేని మహావిపత్తు వచ్చిపడనున్నది. నేను ఈ వార్తవినగనే ఇష్టముకాని రామపట్టాభిషేకము జరుగబోవు చున్నందులకును, నీకభిమతమైన భరతపట్టాభిషేకము జరుగనందులకును తీరని దుఃఖమునకు లోనైతిని. అగాధమైన భయమున మునిగితిని. ఆ కారణమున అగ్నితో దహింపబడుచున్న దానివలె విలవిలలాడుచు నీ హితమునుగోరి ఇటువచ్చితిని. (20-21)

ఓ కైకేయీ! నీకేమాత్రము ఆపదవచ్చినను నావేదనకు అంతమే యుండదు - నీకు అభివృద్ధి లభించినచో నా ఆనందమునకు అవధులేయుండవు- ఇది ముమ్మాటికి నిజము- ఓ దేవీ! నీవు మహారాజవంశమున జన్మించినదానవు, అంతేగాదు ఒక మహారాజునకు భార్యవు, రాజధర్మములు ఎంతక్రూరములో ఎఱుగవేమి? నీ భర్త పైకి ధర్మపరాయణవచనములను పలుకుచున్నను యథార్థముగా అతడు నీకు హాని తలపెట్టువాడు. నోటితో ఇచ్చకపుమాటలాడుచునే చాటున కీడుగల్గించువాడు. అట్టి వానిని నీవు సజ్జనునిగా భావించుచుండుట వలన అతడు నిన్ను వంచించుచున్నాడు. సమయానుకూలముగా నీభర్త బుజ్జగింపు మాటలతో నిన్ను తృప్తిపఱచుచు నీకు అనర్థమునే తెచ్చి పెట్టుచున్నాడు. కౌసల్యకు మాత్రము రాజ్యాధికారలాభమునను కట్టబెట్టుచున్నాడు. (22-25)

కపటియైన నీ భర్త భరతుని నీ బంధువుల కడకు (కేకయ రాజ్యమునకు) పంపివైచి, నిష్కంటకమైన కోసలరాజ్యమునకు రేపు ఉదయమే శ్రీరాముని యువరాజునుగా చేయుచున్నాడు- (26)

శత్రుః పతిప్రవాదేన మాత్రేవ హితకామ్యయా।
ఆశీవిష ఇవాంకేన బాలే పరిహృతస్త్వయా। 27

ఓ అమాయికురాలా! దశరథుడు నీకు పతిరూపములోనున్న శత్రువు. ఆ విషయమును గ్రహింపక తల్లివలె ఆయనకు హితము గోరుచు పామును ఒడిలో చేర్చుకొనినట్లు ఆయనను నమ్మి, ప్రేమతో లాలించితివి. (పామును ఎంత ప్రేమతో పెంచినను అది పోషించిన వానిని సైతము కాటువేయునుగదా!) (27)

యథా హి కుర్యాత్ సర్పో వా శత్రుర్వా ప్రత్యుపేక్షితః।
రాజ్ఞా దశరథేనాద్య సపుత్రా త్వం తథా కృతా। 28

ఉపేక్షించినచో (ఏమఱుపాటున ఉన్నచో) సర్పముగాని శత్రువుగాని కాటు వేయునట్లే దశరథమహారాజుగూడ నీకును, నీ కుమారుడైన భరతునకును అపకారమును తలపెట్టినాడు. (28)

పాపేనానృతసాంత్వేన బాలే నిత్యసుఖోచితే।
రామం స్థాపయతా రాజ్యే సానుబంధా హతాహ్యసి। 29

తెలివిలేని ఓ కైకేయీ! అసత్యవాదియు, పాపియు ఐన దశరథుడు కోసలరాజ్యమును శ్రీరామునకు కట్టబెట్టుచున్నాడు. నిత్యము హాయిగాలిక తల్పములపై సకలసుఖములను పొందుటకు అర్హురాలవైన నిన్ను, నీ పుత్రమిత్ర పరివారములను ఇక్కట్లపాలు చేయుచున్నాడు. ఓ కైకేయీ! నీవు సమయోచితముగా సకల కార్యములను సాధించుకొనగల సమర్థురాలవు. ఇప్పుడు నీ హితమును గూర్చి ఆలోచింపుము. దానికిది తగినసమయము. ముందు నిన్ను నీవు కాపాడుకొనుము, అంతేగాదు నీ పుత్రుడైన భరతుని, నన్ను రక్షింపుము"- (29-30)

సా ప్రాప్తకాలం కైకేయి క్షిప్రం కురు హితం తవ।
త్రాయస్వ పుత్రమాత్మానం మాం చ విస్మయదర్శనే। 30

మంథరాయా వచః శ్రుత్వా శయానా సా శుభాననా।
ఉత్తస్థౌ హర్షసంపూర్ణా చంద్రలేఖేవ శారదీ। 31

అంతవఱకును తల్పముపై పరుండియున్న ఆ కైకేయి మంథర మాటలను విని, (శ్రీరామపట్టాభిషేకవార్తకు) పరమానందభరితురాలై[1] శరత్కాలచంద్రరేఖవలె వికసితవదనయై లేచి కూర్చుండెను-మిక్కుటమైన రామపట్టాభిషేకశుభవార్తకు ఆశ్చర్యపడి, సంతోషముతో ఉప్పొంగిపోయిన కైకేయి ఆగూని మంథరకు ఒక విలువైన ఆభరణమును బహూకరించెను. (31-32)

అతీవ సా తు సంహృష్టా కైకేయీ విస్మయాన్వితా।
ఏకమాభరణం తస్యై కుబ్జాయై ప్రదదౌ శుభమ్। 32

వనితారత్నమైన కైకేయి ఆ గూనిమంథరకు ఒక ఆభరణమును కానుకగా ఇచ్చి, మంథరను వింతగా జూచుచు ఆమెతో మఱల ఇట్లు పలికెను. (33)

దత్త్వా త్వాభరణం తస్యై కుబ్జాయై ప్రమదోత్తమా।
కైకేయీ మంథరాం దృష్ట్వా పునరేవాబ్రవీదిదమ్। 33

"ఓ మంథరా! నీవు తెల్పిన ఈ పట్టాభిషేకవిషయము నాకు మిక్కిలి ప్రీతికరమైనది. ఇంతటి సంతోషకరవార్తను తెలిపిన నీకు ఇంతకంటె ఏమి చేయగలను? రామభరతులిద్దఱును నాకు సమానులే.[2] నాకు ఆ ఇరువురిలో ఏమాత్రమును

ఇదం తు మంథరే మహ్యమ్ ఆఖ్యాసి పరమం ప్రియమ్।
ఏతన్మే ప్రియమాఖ్యాతుః కిం వా భూయః కరోమి తే। 34

---

1) దేవతల పన్నాగమువలన మంథర కలుషితబుద్ధియై విపరీతభాషణము చేసినను, ఉత్తమవంశమున పుట్టినదగుటవలన గుణవతియైన కైకేయి శ్రీరామపట్టాభిషేకము తనకును హితకరమైనదేయని భావించి, సంతోషముతో పొంగిపోయెను-

2) భరతుడు తనవివాహానంతరము మేనమామయగు యుధాజిత్తునెంట తాతగారింటికి వెళ్ళి, ఆ కేకయరాజ్యమునందే ఇంతవఱకును నివసించుచుండెను. ఈ పన్నెండు సంవత్సరముల కాలము కైకేయి శ్రీరామునే తనకుమారునిగా భావించి, అల్లారుముద్దుగా లాలించుచువచ్చెను. అందువలన ఆమెకు భరతుడును, శ్రీరాముడును (ఇద్దఱును) సమానులే. ఈ సందర్భమున 'మహాకవి' తులసీదాస్ 'రామచరితమానసము' నందు ఇట్లు పేర్కొనెను. "విధాత నన్ను పుణ్యజీవిగా చూచి, మఱలనాకు మానవజన్మను ప్రసాదించినచో నాకు శ్రీరాముడు కుమారుడూ, సీత కోడలూ కావలెను - శ్రీరాముడు నాకు ప్రాణములకంటెను ఎక్కువ ప్రీతిపాత్రుడు. అతని రాజ్యాభిషేకోత్సవము నిన్ను ఎందుకు క్షోభపెట్టుచున్నది? - (రా. చ. మా. అయోధ్య-కాం. దోహా 14 చౌపాఈ 4).

కైకేయికి శ్రీరామునిపై గల ప్రేమకు ఇది పరాకాష్ఠ.

రామే వా భరతే వాహం విశేషం నోపలక్షయే ।
తస్మాత్తుష్టాఽస్మి యద్రాజా రామం రాజ్యేఽభిషేక్ష్యతి ॥ 35

హెచ్చుతగ్గులు గోచరింపవు. కావున మహారాజు శ్రీరాముని పట్టాభిషిక్తుని చేయుచున్నందులకు నేను ఎంతయు సంతోషపడుచుంటిని. (34-35)

న మే పరం కించిదితస్త్వయా పునః
ప్రియం ప్రియార్హే సువచం వచః పరమ్ ।
తథా హ్యవోచస్త్వమతః ప్రియోత్తరం
పరం వరం తే ప్రదదామి తం వృణు ॥ 36

మిక్కిలి ప్రియమాన్యురాలవైన ఓ మంథరా! నీవు తెల్పిన ఈ శ్రీరామపట్టాభిషేకశుభవార్త నాకు ఎంతో ప్రియమైనది. ఇంతకంటెను సంతోషకరమైన వార్తను నీవును చెప్పజాలవు. ఇంతటి చల్లనివార్తను వినిపించినందులకు నీకు కోరిన వరమును తప్పక ఇచ్చెదను. వెంటనే కోరుకొనుము- (36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తమస్సర్గః (7)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏడవసర్గము సమాప్తము

-- * * * --

8. ఎనిమిదవసర్గము

'శ్రీరాముడు యువరాజైనచో కైకేయి, భరతుడు ఇక్కట్లపాలగుదురు' అని మంథర ఆమెకు పెక్కువిధముల నూరిపోయుట.

మన్థరా త్వభ్యసూయైనామ్ ఉత్సృజ్యాభరణం చ తత్ ।
ఉవాచేదం తతో వాక్యం కోపదుఃఖసమన్వితా ॥ 1

హర్షం కిమిదమస్థానే కృతవత్యసి బాలిశే ।
శోకసాగరమధ్యస్థమ్ ఆత్మానం నావబుధ్యసే ॥ 2

కైకేయి వచనములు తనకు సహింపరానివగుటచే ఆ దుష్ట మంథరలో కోపము, దుఃఖము పొంగిపొరలెను. అప్పుడామె కైకేయి ఇచ్చిన ఆభరణమును దూరముగా విసరికొట్టి, మరల ఆమెతో ఇట్లనెను. "ఓ మూర్ఖురాలా! దుఃఖింపవలసిన సమయములోగూడ నీవు సంతోషపడుచుంటివేల? 'ఇంక నీకు శోకసాగరమే గతి' అను విషయముగూడ నీకు బోధపడుటలేదు- (1-2)

మనసా ప్రహసామి త్వాం దేవి దుఃఖార్దితా సతీ ।
యచ్ఛోచితవ్యే హృష్టాసి ప్రాప్యేదం వ్యసనం మహత్ ॥ 3

శోచామి దుర్మతిత్వం తే కా హి ప్రాజ్ఞా ప్రహర్షయేత్ ।
అరేస్సపత్నీపుత్రస్య వృద్ధిం మృత్యోరివాగతామ్ ॥ 4

ఓ దేవీ! రామాభిషేకరూపమున అంతులేని ఈ ప్రమాదము వచ్చిపడుచున్న ఇట్టి గడ్డుపరిస్థితిలోను నీవు శోకించుటకు మారుగా సంతోషించుచుంటివి. దుఃఖార్తురాలనైన నాకు నీ అజ్ఞానమును జూచి నవ్వువచ్చుచున్నది. నీ తెలివిలేనితనమునకు నేనెంతయు పరితపించుచుంటిని. శత్రువైన సవతికుమారునియొక్క ఉన్నతి మృత్యువువంటిది. దానిని జూచి బుద్ధిగల ఏ ఆడుది సంతోషించును? (3-4)

భరతాదేవ రామస్య రాజ్యసాధారణాద్భయమ్ ।
తద్విచింత్య విషణ్ణాస్మి భయం భీతాద్ధి జాయతే ॥ 5

రాజ్యాధికారమును పొందువిషయమున శ్రీరాముడును, భరతుడును సమానార్హులే - అందువలన భరతుడనిన శ్రీరామునకు భయము, భయగ్రస్తుడైనవాడు తనకు భయకారకుడైన వానికి అపకారము చేయుటకే తలంచుచుండును- (శ్రీరామునకు భరతుడు భయకారకుడు గావున రాజ్యాధికారము చేజిక్కిన పిమ్మట రాముడు భరతునకు తప్పక హానితలపెట్టును.) ఆ కారణమువలననే నేను మిక్కిలి విచారమునకు లోనగుచున్నాను- (5)

లక్ష్మణో హి మహేష్వాసో రామం సర్వాత్మనా గతః ।
శత్రుఘ్నశ్చాపి భరతం కాకుత్స్థం లక్ష్మణో యథా ॥ 6

మహాధనుర్ధారియైన లక్ష్మణుడు ఎల్లప్పుడును త్రికరణశుద్ధిగా రాముని అనుసరించియుండువాడు, రామునకు లక్ష్మణునివలె భరతునకు శత్రుఘ్నుడు సర్వదా అనుచరుడు (ఇరువురకును

ప్రత్యాసన్నక్రమేణాపి భరతస్యైవ భామిని।
రాజ్యక్రమో విప్రకృష్టః తయోస్తావత్ కనీయసోః। 7

విదుషః క్షత్రచారిత్రే ప్రాజ్ఞస్య ప్రాప్తకారిణః।
భయాత్ ప్రవేపే రామస్య చింతయంతీ తవాత్మజమ్। 8

సుభగా ఖలు కౌసల్యా యస్యాః పుత్త్రోఽభిషేక్ష్యతే।
యౌవరాజ్యేన మహతా శ్వః పుష్యేణ ద్విజోత్తమైః। 9

ప్రాప్తాం సుమహతీం ప్రీతిం ప్రతీతాం తాం హతద్విషమ్।
ఉపస్థాస్యసి కౌసల్యాం దాసీవత్ త్వం కృతాంజలిః। 10

ఏవం చేత్ త్వం సహాస్మాభిః తస్యాః ప్రేష్యా భవిష్యసి।
పుత్త్రశ్చ తవ రామస్య ప్రేష్యభావం గమిష్యతి। 11

హృష్టాఃఖలు భవిష్యంతి రామస్య పరమాః స్త్రియః।
అప్రహృష్టా భవిష్యంతి స్నుషాస్తే భరతక్షయే। 12

తాం దృష్ట్వా పరమప్రీతాం బ్రువంతీం మంథరాం తతః।
రామస్యైవ గుణాన్ దేవీ కైకేయీ ప్రశశంస హ। 13

ధర్మజ్ఞో గురుభిర్దాంతః కృతజ్ఞః సత్యవాక్ శుచిః।
రామో రాజ్ఞః సుతో జ్యేష్ఠో యౌవరాజ్యమ్ అతోఽర్హతి। 14

భ్రాతౄన్ భృత్యాంశ్చ దీర్ఘాయుః పితృవత్పాలయిష్యతి।
సంతప్యసే కథం కుబ్జే శ్రుత్వా రామాభిషేచనమ్। 15

భరతశ్చాపి రామస్య ధ్రువం వర్షశతాత్ పరమ్।
పితృపైతామహం రాజ్యమ్ అవాప్తా పురుషర్షభః। 16

రాజ్యాధికారము ఉన్నను వారు అస్వతంత్రులు) అందువలన రామునకు వారివలన భయము లేదు. ఓ భామినీ! శ్రీరాముడు పునర్వసునక్షత్రమునను, భరతుడు పుష్యమీనక్షత్రమునను జన్మించిరి. అందువలన జననక్రమమునుబట్టి రామునితరువాత భరతుడు రాజ్యార్హుడు. పిమ్మట క్రమముగా ఆశ్లేష నక్షత్రమున దశమీతిథియందు పుట్టిన లక్ష్మణశత్రుఘ్నులు కనిష్ఠులగుట వలన 'రాజ్యార్హత' వారికి బహుదూరము. కనుక ముందుగా రామునివలన ప్రమాదము భరతునకే- (6-7)

శ్రీరాముడు సకలశాస్త్రపారంగతుడు, రాజనీతికోవిదుడు. సమయమునకు తగినట్లుగా కార్యములను నిర్వహించుటలో దక్షుడు. కనుక ఆయనవలన నీకుమారునకు ప్రమాదము కలుగునని చింతించుచు నేను వణకిపోవుచున్నాను. రేపు పుష్యమీనక్షత్రయుక్త సుముహూర్తమున బ్రాహ్మణోత్తములు కౌసల్యాదేవిపుత్త్రుని కోసలరాజ్యమునకు యువరాజపట్టాభిషిక్తుని చేయనున్నారు! నిజముగా ఆమె భాగ్యమే భాగ్యము. (8-9)

శ్రీరాముడు యువరాజు అగుటతో రాజ్యాధికారము అంతయును కౌసల్యాదేవిగుప్పిటనే యుండును. 'రాజమాత'గా ఆమె మిక్కిలి ఖ్యాతికెక్కును. సవతులందరిపై ఆమెదే పైచేయి అగును. అప్పుడు నీవు ఆమెకడ దోసిలొగ్గి, దాసివలె ఆమెను సేవింపవలసివచ్చును. (10)

ఇదియే జరిగినచో మాతోగూడ నీవును ఆమెకు దాసివి అగుదువు. అంతేగాదు, రామునకు నీకుమారుడును దాస్యము చేయవలసియుండును. రామునిఅంతఃపురస్త్రీలందఱును సంతోషముతో పొంగిపోవుదురు. భరతునిభవనమునందలి నీకోడలు మొదలగు స్త్రీలెల్లరును (అవమాన భారముతో తలలువంచుకొని) దుఃఖముతో క్రుంగిపోవుదురు." (11-12)

మిక్కిలి దుఃఖితయై నోటికి వచ్చినట్లు హెచ్చుమీఱి దురుసుగా ప్రేలుచున్న మంథరను చూచి, కైకేయీదేవి ఏమాత్రము తొణకక శ్రీరామునిగుణగణములనే ఇట్లు శ్లాఘింపసాగెను. (13)

"శ్రీరాముడు గురువులకడ చక్కగా శిక్షణపొందినవాడు. ధర్మజ్ఞుడు. ఇతరులొనర్చిన స్వల్పమైన ఉపకారమునుసైతము మఱవనివాడు. సత్యమును పలికెడువాడు. పవిత్రుడు, పైగా మహారాజుగారిపెద్దకుమారుడు. అందువలననే అతడు యువరాజపదవికి అర్హుడు. అతడు కలకాలము వర్ధిల్లుచు తనతమ్ములను, అనుచరులను తండ్రివలె వాత్సల్యముతో పాలించువాడు. అట్టి శ్రీరామునిపట్టాభిషేక(శుభ)వార్తను విని, ఓ కుబ్జా! వ్యర్థముగా నీవేల పరితపించుచున్నావు? (14-15)

శ్రీరాముడు కొంతకాలము (కొన్ని వందలసంవత్సరములపాటు) పరిపాలించిన పిమ్మట తాతముత్తాతలనుండి తరతరములుగా వచ్చుచున్న ఈ కోసలరాజ్యమునకు పురుషశ్రేష్ఠుడైన భరతుడే

సా త్వమభ్యుదయే ప్రాప్తే వర్తమానే చ మంథరే।
భవిష్యతి చ కల్యాణే కిమర్థం పరితప్యసే। 17

యథా మే భరతో మాన్యః తథా భూయోఽపి రాఘవః।
కౌసల్యాతోఽతిరిక్తం చ సో ఽనుశుశ్రూషతే హి మామ్। 18

రాజ్యం యది హి రామస్య భరతస్యాపి తత్తథా।
మన్యతే హి యథాత్మానం తథా భ్రాతౄంస్తు రాఘవః। 19

కైకేయ్యా వచనం శ్రుత్వా మంథరా భృశదుఃఖితా।
దీర్ఘముష్ణం వినిశ్వస్య కైకేయీమ్ ఇదమబ్రవీత్। 20

అనర్థదర్శినీ మౌర్ఖ్యాత్ నాత్మానమవబుధ్యసే।
శోకవ్యసనవిస్తీర్ణే మజ్జంతీ దుఃఖసాగరే। 21

భవితా రాఘవో రాజా రాఘవస్యాను యః సుతః।
రాజవంశాత్తు కైకేయి భరతః పరిహాస్యతే। 22

న హి రాజ్ఞస్సుతాః సర్వే రాజ్యే తిష్ఠంతి భామిని।
స్థాప్యమానేషు సర్వేషు సుమహాన్ అనయో భవేత్। 23

తస్మాజ్జ్యేష్ఠే హి కైకేయి రాజ్యతంత్రాణి పార్థివాః।
స్థాపయంత్యనవద్యాంగి గుణవత్స్వితరేష్వపి। 24

అసావత్యంతనిర్భగ్నః తవ పుత్రో భవిష్యతి।
అనాథవత్ సుఖేభ్యశ్చ రాజవంశాచ్చ వత్సలే। 25

సాహం త్వదర్థే సంప్రాప్తా త్వం తు మాం నావబుధ్యసే।
సపత్నివృద్ధౌ యా మే త్వం ప్రదేయం దాతుమిచ్ఛసి। 26

ధ్రువం తు భరతం రామః ప్రాప్య రాజ్యమకంటకమ్।
దేశాంతరం వా నయితా లోకాంతరమథాపి వా। 27

బాల ఏవ హి మాతుల్యం భరతో నాయిత స్త్వయా।
సన్నికర్షాచ్చ సౌహార్దం జాయతే స్థావరేష్వపి। 28

రావగుటకు నిశ్చయము-ఓ మంథరా! ఇప్పుడు శ్రీరామునిపట్టాభిషేక రూపమున శుభపరంపర (అభ్యుదయము) ప్రాప్తింపబోవుచుండగా, భవిష్యత్తులో సంతోషకరముగా భరతుడు రాజు కాబోవుచుండగా నీవెందులకు దుఃఖించెదవు? (16-17)

శ్రీరాముడు భరతునివలె - అంతమాత్రమేగాదు: అతనికంటెను నాకు అత్యంతప్రీతిపాత్రుడు. ఆ రఘురాముడుగూడ తన తల్లియైన కౌసల్యకంటెను నన్నే అధికముగా సేవించుచుండును. రఘునందనుడు తనతమ్ములనుగూడ తనతో సమానముగా చూచుకొనును. ఈ నలుగురు అన్నదమ్ములమధ్యగల సోదరప్రేమ అపూర్వమైనది. కనుక రాజ్యాధికారము రామునిదేయైనను, భరతునిదే యైనను ఒక్కటే. (రాముడు రాజైనను అతనితో సమానముగా భరతుడును సర్వసుఖములనూ అనుభవించును.)" కైకేయి మాటలను విని, మంథర ఇంకను ఎక్కువ దుఃఖితురాలాయెను. ఆమె వేడివేడిట్టూర్పులు విడుచుచు కైకేయితో ఇట్లనుడివెను. (18-20)

ఓ వెఱ్ఱి కైకేయీ! రామునిపట్టాభిషేకము జరిగినచో నీకు అనర్థములే మిగులును. కాని నీ మూర్ఖత్వముచే దానివలన నీకు మేలేకలుగునని భ్రమపడుచున్నావు. అంతులేని ఆపదలతోనిండిన దుఃఖసాగరమున మునుంగబోవుచుండియు నీవు నీదుఃస్థితిని తెలిసికొనలేకయున్నావు (21)

ఓ కైకేయీ! ప్రస్తుతము శ్రీరాముడు రాజైనచో అతనియనంతరము అతనికుమారుడే రాజగును. ఈ కారణమున భరతునకుగాని, అతనిసంతానమునకుగాని భవిష్యత్తులో రాజ్యాధికారమును పొందెడి అవకాశమే శూన్యమగును. (22)

ఓ భామినీ! రాజకుమారులలో అందఱును రాజ్యమునకు ప్రభువులుకాలేరు. అందఱిని సింహాసనమును ఎక్కించుట రాజనీతి విరుద్ధముగదా! అది అనర్థదాయకముగూడ. (23)

ఓ సౌందర్యరాశీ! అందువలన జ్యేష్ఠునితరువాతివారు ఎంతటి గుణవంతులైనను మహారాజులు పెద్దకుమారునకే రాజ్యాధికారమును అప్పగింతురు. (24)

పుత్త్రప్రేమగల ఓకైకేయీ! అదే జరిగితే నీపుత్త్రుడైన ఈ భరతుడు రాజ్యాధికారమునకు దూరమగును- అంతేగాదు దిక్కులేని వానివలె సమస్తసుఖములను కోల్పోవును- నీ ప్రయోజనము కొఱకే నేను ఇక్కడికి వచ్చితిని- ఐనను నామాటలఅంతరార్థమును నీవు గ్రహించుటలేదు. పైగా నీ సవతిఅభివృద్ధివిషయమున నీవు సంతోషపడుచు నాకు బహుమతిని ఇచ్చుచున్నావు. (25-26)

ఎట్టి అడ్డంకులును లేకుండా రాజ్యాధికారమును పొందిన పిమ్మట, శ్రీరాముడు భరతుని మఱియొక దేశమునకో, వేఱొక లోకమునకో పంపించియే తీరును. (27)

భరతుడు బాలుడుగా ఉండగనే అతనిని మేనమామఇంటికి (నీ పుట్టింటికి) పంపించి, నీవు తప్పు చేసితివి. సమీపమున ఉన్నప్పుడు స్థావరములైన వృక్షములపై, తీగలపై, పొదలపైగూడ

భరతస్యాప్యనువశః శత్రుఘ్నోఽపి సమాగతః।
లక్ష్మణో హి యథా రామం తథాసౌ భరతం గతః। 29

శ్రూయతే హి ద్రుమః కశ్చిత్ ఛేత్తవ్యో వనజీవిభిః।
సన్నికర్షాదిషీకాభిః మోచితః పరమాద్భయాత్। 30

గోప్తా హి రామం సౌమిత్రిః లక్ష్మణంచాపి రాఘవః।
అశ్వినోరివ సౌభ్రాత్రం తయోర్లోకేషు విశ్రుతమ్। 31

తస్మాన్న లక్ష్మణే రామః పాపం కించిత్ కరిష్యతి।
రామస్తు భరతే పాపం కుర్యాదితి న సంశయః। 32

తస్మాద్రాజగృహాదేవ వనం గచ్ఛతు తే సుతః।
ఏతద్ధి రోచతే మహ్యం భృశం చాపి హితం తవ। 33

ఏవం తే జ్ఞాతిపక్షస్య శ్రేయశ్చైవ భవిష్యతి।
యదిచేద్భరతో ధర్మాత్ పిత్ర్యం రాజ్యమవాప్స్యతి। 34

స తే సుఖోచితో బాలో రామస్య సహజో రిపుః।
సమృద్ధార్థస్య నష్టార్థో జీవిష్యతి కథం వశే। 35

అభిద్రుతమివారణ్యే సింహేన గజయూథపమ్।
ప్రచ్ఛాద్యమానం రామేణ భరతం త్రాతుమర్హసి। 36

దర్పాన్నిరాకృతా పూర్వం త్వయా సౌభాగ్యవత్తయా।
రామమాతా సపత్నీ తే కథం వైరం న యాతయేత్। 37

యదా హి రామః పృథివీమవాప్స్యతి
ప్రభూతరత్నాకరశైలపత్తనామ్।
తదా గమిష్యస్యశుభం పరాభవం
సహైవ దీనా భరతేన భామిని। 38

అనురాగము ఏర్పడుట సహజముగదా! (భరతుడు తనవెంటనే యున్నచో దశరథునకు అతనిపైనను మిక్కిలి మక్కువయుండెడిది. అట్లే రామభరతులమధ్యగూడ (ప్రేమానురాగములు పరస్పరము వృద్ధిచెందియుండెడివి). భరతునకు విధేయుడైన శత్రుఘ్నుడును అతనితోగూడ వెళ్లినాడు. లక్ష్మణుడు శ్రీరాముని ఆశ్రయించి యున్నట్లుగనే శత్రుఘ్నుడును భరతునిఆశ్రయములో ఉన్నాడు. (శత్రుఘ్నుడు అయోధ్యయందే ఉన్నచో అతడు భరతునిఉన్నతికై ప్రయత్నించియుండెడివాడు). (28-29)

అడవిలోని కట్టెలు కొట్టి, వాటిని అమ్ముకొని జీవించువారు ఒకచెట్టును కొట్టుటకు సిద్ధమైనప్పుడు దాని చుట్టును ముండ్ల పొదలు ఆవరించియుండుటచే ఆ చెట్టును కొట్టుటకు సాధ్యము కాదు. పొదలు సన్నిహితముగా (చుట్టును) ఉండుటచే ఆ చెట్టునకు రక్షణ ఏర్పడి, దానికి ప్రమాదము తొలగిపోవును. లక్ష్మణుని సామీప్యమువలన రామునకు రక్షణ కలిగినట్లే శత్రుఘ్నునితోగూడి ఇచటనేయున్నచో భరతునకును రక్షణ కల్గియుండెడిది. (30)

రామలక్ష్మణులు మిగుల సాన్నిహిత్యముతో కలసిమెలసి యుండుటవలన వారు ఒకరికొకరు రక్షకులైరి. వారి సౌభ్రాత్రము అశ్వినీకుమారులవలె లోకప్రసిద్ధమైనది. (31)

ఆకారణమున శ్రీరాముడు లక్ష్మణునకు ఎట్టి అపకారమును తలపెట్టడు, అతడు భరతునకు కీడు కలిగించుననుటలో సందేహము లేదు. ఈ ప్రమాదము ఉండుటనుబట్టి భరతుడు కేకయరాజ్యమునుండి నేరుగా అడవులకు పోవుటయే సమంజసమని నాకు తోచుచున్నది. ఇది నీకును హితకరమే- అట్లుగాక ధర్మము ననుసరించి దశరథుని యొక్క రాజ్యాధికారము భరతునకే సంక్రమించినచో నీకును, నీ బంధువులకును శ్రేయస్కరమగును. భరతుడు సర్వసుఖములకును అర్హుడేయైనను, అతడు రామునకు సవతితల్లియైన నీకుమారుడగుటవలన అతనికి సహజశత్రువు. సర్వాధికారములుగల రామునియొక్క రాజ్యమున ఎట్టి అధికారములును లేని నీపుత్రుడు ఎట్లు జీవింపగలడు? (32-35)

అడవిలో సింహమువలన భయముతో పారిపోవుచున్న గజరాజువలె శ్రీరామునిచే తిరస్కృతుడు కానున్న భరతుని నీవే రక్షింపవలెను. (36)

'పతియైన దశరథుని ప్రేమకు మిక్కిలి పాత్రురాలను' అను గర్వముచే నీవు రామమాతయగు కౌసల్యను లోగడ తృణీకరించియుంటివి. నీ సవతియగు ఆమె ఆపగను ఇప్పుడు ఎట్లు తీర్చుకొనకయుండును? (37)

ఓ భామినీ! సముద్రములు, పర్వతములు నగరములు గల ఈ విశాలమైన భూమండలమునకు శ్రీరాముడు ప్రభువైనప్పుడు నీవు దీనురాలవై భరతునితోసహా తీరని అవమానముల

యదా హి రామః పృథివీమవాప్స్యతి
ధ్రువం ప్రణష్టో భరతో భవిష్యతి।
అతో హి సంచింతయ రాజ్యమాత్మజే
పరస్య చైవాద్య వివాసకారణమ్॥ 39

పొలగుదువు- రాముడు రాజ్యాధికారమును చేపట్టినంతనే భరతుడు అన్నివిధములుగా చితికిపోవుట తథ్యము. కనుక నీకుమారుడగు భరతునకు రాజ్యాధికారము దక్కునట్లుగను, శత్రువైన రాముడు అడవులపాలగునట్లుగను చూడుము-" (38-39)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టమస్సర్గః (8)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనిమిదవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

9. తొమ్మిదవసర్గము

'శ్రీరాముని వనవాసమునకు పంపుట, భరతుని పట్టాభిషిక్తునిజేయుట' అను రెండువరములను సాధించుకొనుటకై - మంథరప్రేరణచే కైక కోపగృహమున ప్రవేశించుట.

ఏవముక్తా తు కైకేయీ క్రోధేన జ్వలితాననా।
దీర్ఘముష్ణం వినిశ్వస్య మంథరామ్ ఇదమబ్రవీత్॥ 1

ఆద్య రామమితః క్షిప్రం వనం ప్రస్థాపయామ్యహమ్।
యౌవరాజ్యే చ భరతం క్షిప్రమేవాభిషేచయే॥ 2

ఇదం త్విదానీం సంపశ్య కేనోపాయేన మంథరే।
భరతః ప్రాప్నుయాద్రాజ్యం న తు రామః కథంచన॥ 3

ఏవముక్తా తయా దేవ్యా మంథరా పాపదర్శినీ।
రామార్థమ్ ఉపహింసంతీ కైకేయీమ్ ఇదమబ్రవీత్॥ 4

హంతేదానీం ప్రవక్ష్యామి కైకేయి శ్రూయతాం చ మే।
యథా తే భరతో రాజ్యం పుత్త్రః ప్రాప్స్యతి కేవలమ్॥ 5

కిం న స్మరసి కైకేయి స్మరంతీ వా నిగూహసే।
యదుచ్యమానమ్ ఆత్మార్థం మత్తస్త్వం శ్రోతుమిచ్ఛసి॥ 6

మయోచ్యమానం యది తే శ్రోతుం ఛందో విలాసిని।
శ్రూయతామభిధాస్యామి శ్రుత్వా చాపి విమృశ్యతామ్॥ 7

శ్రుత్వైవం వచనం తస్యా మంథరాయాస్తు కైకయీ।
కించిదుత్థాయ శయనాత్ స్వాస్తీర్ణాదిదమబ్రవీత్॥ 8

కథయ త్వం మమోపాయం కేనోపాయేన మంథరే।
భరతః ప్రాప్నుయాద్రాజ్యం న తు రామః కథంచన॥ 9

మంథర ఇట్లు పలుకగా కైకేయి కోపముతో ఉడికిపోవుచు[1] ముఖము జేవురింపగా వేడివేడినిట్టూర్పులు విడుచుచు ఆమెతో ఇట్లనెను. (1)

"నేడే ఈ క్షణముననే శ్రీరాముని వనములకు పంపివైచెదను. వెంటనే భరతుని యువరాజపట్టాభిషిక్తుని గావించెదను. ఓ మంథరా! ఈ రాజ్యాధికారము ఏట్టి పరిస్థితిలోను రామునకు దక్కరాదు. అది భరతునకే ప్రాప్తింపవలెను. తగిన ఉపాయమును ఇప్పుడే ఆలోచింపుము." కైకేయి ఇట్లు పలుకగా పాపాత్మురాలైన మంథర రామపట్టాభిషేకమును చెడగొట్టదలచుచు ఆమెతో ఇట్లు నుడివెను. (2-4)

"ఓ కైకేయీ! నీకుమారుడగు భరతునకుమాత్రమే రాజ్యాధికారము దక్కునట్లు ఉపాయమును ఇప్పుడే తెలిపెదను వినుము- (5)

ఓ కైకేయీ! నీ ప్రయోజనమునుగూర్చి నీవు పెక్కుమారులు ప్రస్తావించుచునర్చిన విషయమును మఱచితివా? మఱచిపోయినట్లు నటించుచుంటివా? లేక నానుండి వినగోరుచుంటివా? ఓ సుందరీ! నేను తెలుపనున్న విషయమును వినుటకు నీవు అభిలషించుచున్నచో- నుడివెదను వినుము. విని బాగుగా ఆలోచింపుము." (6-7)

ఈ విధముగా పలికిన మంథరమాటలను విని, కైకేయి కుతూహలముతో తనతల్పముపైనుండియే కొద్దిగా లేచి, ఆమెతో ఇట్లు పచించెను. (8)

"ఓ మంథరా! ఏదియేమైనను శ్రీరామునకు రాజ్యాధికారము మాత్రము దక్కరాదు. అంతేగాదు భరతునకు యువరాజ పట్టాభిషేకము జరిగియేతీరవలెను. దానికి తగిన ఉపాయమును నాకు తెలుపుము-" (9)

1) కైకేయి శ్రీరామునిసద్గుణములను ఎఱిగినదైనప్పటికిని, తమకార్యమును సాధించుకొనుటకై దేవతలుపన్నిన ఎత్తుగడఫలితముగా మంథరమాటలకు చెవియొగ్గెను. తనకును, తనకుమారునకును దాస్యజీవితము ప్రాప్తించునని వినుటతో ఆమెహృదయము క్షోభకు గురియయ్యెను.

ఏవముక్తా తయా దేవ్యా మంథరా పాపదర్శినీ।
రామార్థముపహింసంతీ కుబ్జా వచనమబ్రవీత్। 10

తవ దైవాసురే యుద్ధే సహ రాజర్షిభిః పతిః।
అగచ్ఛత్ త్వాముపాదాయ దేవరాజస్య సాహ్యకృత్। 11

దిశమాస్థాయ వై దేవి దక్షిణాం దండకాన్ ప్రతి।
వైజయంతమితి ఖ్యాతం పురం యత్ర తిమిధ్వజః। 12

స శంబర ఇతి ఖ్యాతః శతమాయో మహాసురః।
దదౌ శక్రస్య సంగ్రామం దేవసంఘైరనిర్జితః। 13

తస్మిన్ మహతి సంగ్రామే పురుషాన్ క్షతవిక్షతాన్।
రాత్రౌ ప్రసుప్తాన్ ఘ్నంతి స్మ తరసాఽఽసాద్య రాక్షసాః। 14

తత్రాఽకరోన్మహద్యుద్ధం రాజా దశరథస్తదా।
అసురైశ్చ మహాబాహుః శస్త్రైశ్చ శకలీకృతః। 15

అపవాహ్య త్వయా దేవి సంగ్రామాన్నష్టచేతనః।
తత్రాపి విక్షతః శస్త్రైః పతిస్తే రక్షితస్త్వయా। 16

తుష్టేన తేన దత్తౌ తే ద్వౌ వరౌ శుభదర్శనే। 17

స త్వయోక్తః పతిర్దేవి యదేచ్ఛేయం తదా వరౌ।
గృహ్ణీయామితి తత్తేన తథేత్యుక్తం మహాత్మనా। 18

అనభిజ్ఞాహ్యహం దేవి త్వయైవ కథితా పురా।
కథైషా తవ తు స్నేహాత్ మనసా ధార్యతే మయా। 19

రామాభిషేకసంభారాత్ నిగృహ్య వినివర్తయ।
తౌ వరౌ యాచ భర్తారం భరతస్యాభిషేచనమ్।
ప్రవ్రాజనం తు రామస్య త్వం వర్షాణి చతుర్దశ। 20

చతుర్దశ హి వర్షాణి రామే ప్రవ్రాజితే వనమ్।
ప్రజాభావగతస్నేహః స్థిరః పుత్త్రో భవిష్యతి। 21

కైకేయి ఇట్లు పలికిన పిదప, దురాలోచనాపరురాలైన కుబ్జ రామునిపట్టాభిషేకమును భగ్నమొనర్చుటకై ఆలోచించుచు ఇట్లనెను. (10)

"ఓ కైకేయీ! పూర్వము నీపతియైన దశరథుడు దేవాసుర సంగ్రామమునందు దేవేంద్రునకు సహాయపడదలచెను. అప్పుడు నీభర్త తనఅనుచరులైన రాజులను, నిన్ను వెంటనిడుకొని దక్షిణ దిశకు బయలుదేఱెను అతడు తనపరివారములతో దండకారణ్యమున తిమిధ్వజుడు నివసించునట్టి వైజయంతపురమునకు చేరెను. ఆపురము మిగుల ప్రశస్తికెక్కినట్టిది- (11-12)

పెక్కు మాయలను నేర్చిన శంబరాసురుడే ఆ తిమిధ్వజుడు. అతడు దేవతలను అందఱిని జయించి, దేవేంద్రునితో యుద్ధమునకు తలపడెను. ఆ భయంకర సమరమునందు క్షతగాత్రులైన పురుషులు రాత్రివేళ నిద్రించుచుండగా రాక్షసులు అచటికి వచ్చి, వారిని క్రూరముగా చంపి వేయుచుండిరి. (13-14)

అచట మహాబాహువైన దశరథమహారాజునకును రాక్షసులకును ఘోరయుద్ధము జరిగెను- ఆ యుద్ధమున రాక్షసులు ఆయనను తమశస్త్రములతో మిక్కిలి గాయపఱచిరి- ఓదేవీ! రథసారథ్యము వహించుచున్న నీవు యుద్ధమున మూర్ఛితుడైన నీపతిని రణరంగమునకు దూరముగా మఱియొక ప్రదేశమునకు తీసికొని పోయితివి. అక్కడగూడ మహారాజు రాక్షసులశస్త్రములకు గుఱియై గాయపడగా, నీవు ఆయనను వేఱొక చోటికి తీసికొనివెళ్లి, శీతోపచారములతో కాపాడితివి. (15-16)

ఓ సర్వాంగసుందరీ! సమయస్ఫూర్తితో శీతలోపచారములతో తగు విధముగా తనను ఆదుకొనినందులకు నీ భర్త ఎంతయు సంతసించి, నీకు రెండు వరములను ఇచ్చెను. అప్పుడు నీవు 'నాకు ఇష్టము వచ్చినప్పుడు నేను ఆ వరములను కోరుకొందును' అని నీభర్తకు తెల్పియుంటివి. అందులకు ఆమహాత్ముడు సమ్మతించెను. (17-18)

ఓ దేవీ! ఈ వృత్తాంతమును నీవే నాకు చెప్పియుంటివి. అంతవఱకును నాకు ఈ విషయమే తెలియదు. నీమీది అభిమానముతో అప్పటినుండియు దీనిని మఱవక నేను గుర్తు పెట్టుకొని యుంటిని. (19)

ఎట్లైనను నీ భర్తను ఒప్పించి, రామపట్టాభిషేక ప్రయత్నములు ఆగిపోవునట్లు చేయుము- భరతుని యువరాజపట్టాభిషిక్తుని చేయునట్లుగను, శ్రీరాముని పదునాలుగు సంవత్సరములు వనవాసమునకు పంపించునట్లుగను, ఆ రెండు వరములను కోరుకొనుము. (20)

శ్రీరాముడు పదునాలుగుసంవత్సరములు వనవాసము చేసివచ్చెడిలోపల నీకుమారుడు ప్రజలప్రేమానురాగములను చూరగొని, రాజుగా స్థిరపడును. (21)

క్రోధాగారం ప్రవిశ్యాద్య క్రుద్ధేవాశ్వపతేః సుతే।
శేష్వానంతర్హితాయాం త్వం భూమౌ మలినవాసినీ। 22

మాస్మైనం ప్రత్యుదీక్షేథా మాచైనమ్ అభిభాషథాః।
రుదంతీచాపి తం దృష్ట్వా జగత్యాం శోకలాలసా। 23

దయితా త్వం సదా భర్తుః అత్ర మే నాస్తి సంశయః।
త్వత్కృతే స మహారాజో విశేదపి హుతాశనమ్। 24

న త్వాం క్రోధయితుం శక్తో న క్రుద్ధాం ప్రత్యుదీక్షితుమ్।
తవ ప్రియార్థం రాజా హి ప్రాణానపి పరిత్యజేత్। 25

న హ్యతిక్రమితుం శక్తః తవ వాక్యం మహీపతిః।
మందస్వభావే బుధ్యస్వ సౌభాగ్యబలమాత్మనః। 26

మణిముక్తం సువర్ణాని రత్నాని వివిధాని చ।
దద్యాద్దశరథో రాజా మా స్మ తేషు మనఃకృథాః। 27

యౌ తౌ దైవాసురే యుద్ధే వరౌ దశరథోఽదదాత్।
తౌ స్మారయ మహాభాగే సోఽర్థో మా త్వామతిక్రమేత్। 28

యదా తు తే వరం దద్యాత్ స్వయముత్థాప్య రాఘవః।
వ్యవస్థాప్య మహారాజం త్వమిమం వృణుయా వరమ్। 29

రామం ప్రవ్రాజయారణ్యే నవ వర్షాణి పంచ చ।
భరతః క్రియతాం రాజా పృథివ్యాః పార్థివర్షభః। 30

చతుర్దశ హి వర్షాణి రామే ప్రవ్రాజితే వనమ్।
రూఢశ్చ కృతమూలశ్చ శేషం స్థాస్యతి తే సుతః। 31

రామప్రవ్రాజనం చైవ దేవి యాచస్వ తం వరమ్।
ఏవం సిద్ధ్యంతి పుత్త్రస్య సర్వార్థాస్తవ భామిని। 32

అశ్వపతితనయురాలవైన ఓ కైకేయీ! నీవు వెంటనే మలిన వస్త్రములను దాల్చి, కోపగృహమున ప్రవేశింపుము. కటికనేలపై పరుండి, కోపమును నటింపుము- మహారాజు కోపగృహమునకు వచ్చినవెంటనే ఆయనను చూచియు, చూడనట్లు నటింపుము. శోకముతో నేలపై పొర్లుచు ఏడ్చుచుండుము. ఆయనతో మాట్లాడకుము. (22-23)

ఓ దేవీ! నీ భర్తయైన దశరథునకు నీపైగల ప్రేమ అపారము. ఈ విషయమున నాకు ఆవంతయు సందేహము లేదు- ఆ మహారాజు నీకొఱకై అగ్నిలోనైనను దూకును. నీకు కోపమును కల్గించుపనులను ఏ విధముగను చేయజాలడు. నీవు కనులెఱ్ఱజేసినచో తట్టుకొనజాలడు. నీకు తృప్తిని గూర్చుటకై ఆమహారాజు తనప్రాణములను సైతము పరిత్యజించును. అతడు నీవు గీచినగీటు దాటజాలడు- ఓ అమాయకురాలా! ఇప్పుడైనను నీ సౌందర్యప్రభావమును ఎఱుంగుము- (24-26)

ఆ రెండు కోరికల (వరముల) నుండి నీ మనస్సును మళ్లించుటకై రాజు మణులను, ముత్యములను, వెండి బంగారములను, వివిధములగు రత్నములను, అమూల్యములైన ఆభరణములను నీకు ఇయ్యజూపును. కాని ఆ ఆభరణాదులకై ఆశపడవద్దు. (27)

ఓ మహానుభావురాలా! ఆ సురాసుర (శంబరాసుర) యుద్ధమున దశరథుడు నీకు వాగ్దానముచేసిన ఆ రెండువరములను గుర్తుచేయుచునే యుండుము. రాముని వనవాసమునకు పంపుట, భరతుని యువరాజుగా చేయుట అను ఈ రెండువరములను విస్మరింపకుము. (దశరథుడు సత్యసంధుడుగాన వాటిని తప్పక చెల్లించును). ఓ దేవీ! నేలపై పరుండియున్న నిన్ను దశరథుడు స్వయముగా లేవదీసి, బుజ్జగించుచు 'వరములను కోరుకొనుము' అని పలికిన పిమ్మట నీవు ఆ మహారాజును సత్యమునకు కట్టుబడి యుండునట్లు ప్రతిజ్ఞ చేయించి, ఈ రెండువరములను ఈవిధముగా కోరుకొనుము- 'ఓ మహారాజా! శ్రీరాముని పదునాలుగు సంవత్సరములపాటు వనవాసమునకు పంపుము. భరతుని ఈ కోసలదేశమునకు రాజుగా చేయుము.' (28-30)

పదునాలుగు సంవత్సరములకాలము వనములలో నివసించుటకై శ్రీరాముని (అయోధ్యనుండి) పంపినచో, ఈలోపల నీకుమారుడగు భరతుడు ప్రజాభిమానమును చూరగొనుట ద్వారా తనఅధికారమును పునాదులతో నిలుపుకొని, రాజుగా స్థిరపడగలడు. తదుపరికాలములో గూడ అతడు తనపరిపాలనను కొనసాగింపగలడు- (31)

ఓ భామినీ! భరతునకు పట్టముగట్టునట్లు ఒక వరమును గోరుకొనుట- అదిసరే 'రాముని అడవులకు పంపుట' అను రెండవవరమును అడుగుటమాత్రము ఎట్టి పరిస్థితులలోను నీవు విడిచిపెట్టరాదు. అట్లయినప్పుడు మాత్రమే నీ పుత్త్రుడైన భరతునకు సకలప్రయోజనములును సిద్ధించును- (32)

ఏవం ప్రవ్రాజితశ్చైవ రామోఽరామో భవిష్యతి।
భరతశ్చ హతామిత్రః తవ రాజా భవిష్యతి। 33

యేన కాలేన రామశ్చ వనాత్ ప్రత్యాగమిష్యతి।
తేన కాలేన పుత్రస్తే కృతమూలో భవిష్యతి।
సంగృహీత మనుష్యశ్చ సుహృద్భిస్సార్ధమాత్మవాన్। 34

ప్రాప్తకాలం తు తే మన్యే రాజానం వీతసాధ్వసా।
రామాభిషేకసంభారాత్ నిగృహ్య వినివర్తయ। 35

అనర్థమర్థరూపేణ గ్రాహితా సా తతస్తయా।
హృష్టా ప్రతీతా కైకేయీ మంథరామిదమబ్రవీత్। 36

సా హి వాక్యేన కుబ్జాయాః కిశోరీవోత్పథం గతా।
కైకేయీ విస్మయం ప్రాప్తా పరం పరమదర్శనా। 37

కుబ్జే త్వాం నాభిజానామి శ్రేష్ఠాం శ్రేష్ఠాభిధాయినీమ్।
పృథివ్యామసి కుబ్జానామ్ ఉత్తమా బుద్ధినిశ్చయే। 38

త్వమేవ తు మమార్థేషు నిత్యయుక్తా హితైషిణీ।
నాహం సమవబుధ్యేయం కుబ్జే రాజ్ఞశ్చికీర్షితమ్। 39

సంతి దుస్సంస్థితాః కుబ్జా వక్రాః పరమదారుణాః।
త్వం పద్మమివ వాతేన సన్నతా ప్రియదర్శనా। 40

ఉరస్తేఽభినివిష్టం వై యావత్ స్కంధాత్ సమున్నతమ్।
అధస్తాచ్చోదరం శాతం సునాభమివ లజ్జితమ్। 41

పరిపూర్ణం తు జఘనం సుపీనౌ చ పయోధరౌ।
విమలేందుసమం వక్త్రమ్ అహో రాజసి మంథరే। 42

జఘనం తవ నిర్ఘుష్టం రశనాదామశోభితమ్।
జంఘే భృశముపన్యస్తే పాదౌ చాప్యాయతావుభౌ। 43

త్వమాయతాభ్యాం సక్థిభ్యాం మంథరే క్షౌమవాసినీ।
అగ్రతో మమ గచ్ఛంతీ రాజహంసీవ రాజసే। 44

రాముడు అరణ్యములకు పంపబడినట్లయితే వెంటనే అతడు 'అరాముడు' అగును- అనగా ప్రజాభిమానమునకు దూరమగును- అప్పుడు నీ భరతుడు ఎదురులేని (శత్రువులు లేని) రాజగును- శ్రీరాముడు పదునాలుగుసంవత్సరములపాటు వనవాసమును ముగించుకొని వచ్చెడిలోపల ప్రజ్ఞాశాలియైన నీ కుమారుడు ప్రజానురంజకముగా పరిపాలనచేసి వారిఆదరాభిమానములను చూరగొనును. పెక్కుమంది మిత్రులను కూడగట్టుకొనును. తత్ఫలితముగా అతనిరాజ్యాధికారము స్థిరపడును. (33-34)

వరములను కోరుకొనుటకై నీకు ఇదియే తగినసమయము. ఇప్పుడు నీవు నిర్భయముగా పట్టుబట్టి, రామాభిషేక ప్రయత్నముల నుండి మహారాజును మరలింపుము." (35)

మంథర ఈ విధముగా తనమాటలచాతుర్యముచే అనర్థదాయకమైన విషయమునుగూడ ప్రయోజనకారిగా భావించునట్లు కైకేయిబుద్ధిని మార్చివేసెను. ఆ కారణముగా కైకేయికి ఆమె మాటలపై విశ్వాసము కుదురుకొనెను. ఆమె లోలోపల మిక్కిలి సంతసించెను. కైక సహజముగా ప్రజ్ఞావంతురాలేయైనను ఆ కుబ్జమాటలవలలో చిక్కుకొని, ఒక పసిపిల్లవలె దారితప్పి, అనుచితమైన కార్యమును జేయుటకు సిద్ధపడెను. పిమ్మట ఆమె మంథరతెలివితేటలకు మిగుల ఆశ్చర్యపడుచు ఇట్లనెను. (36-37)

"అరో! ఓ కుబ్జా! నీవు ఇంతటి తెలివిగలదానవనియు, ఇంత గొప్పగా మాట్లాడగలదానవనియు ఇంతవఱకును నేను గుర్తింపలేదు సుమా! నిజముగా ఈ లోకమునగల కుబ్జలందఱిలోను కార్యములవిషయమున సరిగా నిశ్చయము చేయుటలో నీవే సమర్థురాలవు. ఓ మంథరా! అనుక్షణము నీవు నా ప్రయోజనముల కొఱకే ఆరాటపడుచుందువు. యథార్థముగా నామేలు కోరెడిదానవు నీవే - నీవు తెల్పకున్నచో రాజుగారిసంకల్పములును, వాటి అంతరార్థములును నాకు తెలిసియుండెడివి కావు- (38-39)

ఓ మంథరా! కుబ్జలలో దాదాపు అందఱును అవయవసౌష్ఠవము లేనివారై వంకరగాను, భయంకరముగను ఉందురు- కాని నీవు మాత్రము గాలికి వంగిన (వాత రోగముతో వంగిన) పద్మము వలె చూడముచ్చటగా నున్నావు. నీ వక్షస్థలము ఎక్కుని బిగువు గలిగి మూపువఱకును వ్యాపించి, మిక్కిలి ఎత్తుగా ఉన్నది. ఆ రొమ్ముక్రింద నున్న ఉదరము నాజూకైన నాభిగలిగి సన్నగా అందముగానున్నను. ఎత్తులో నీ వక్షస్థలముతో పోటీ పడజాలక సిగ్గుతో కృశించియున్నది. నిండైన జఘనముతో, పుష్టములైన స్తనములలో చంద్రునివలె నిర్మలమైన ముఖముతో ఎంతో బాగుగా విరాజిల్లుచున్నావు. (40-42)

నీవు నడుమున ధరించిన ఒడ్డాణపుచిఱుగజ్జెలసవ్వడి వినసొంపుగానున్నది. నీ పిక్కలు పరిపుష్టములైయున్నవి. పొడవైన పాదములు, అనువైన తొడలుగల నీవు పట్టు చీరెగట్టుకొని నాయెదుట నడచుచు ఆడురాజహంసవలె శోభిల్లుచున్నావు. (43-44)

ఆసన్ యాశ్శంబరే మాయాః సహస్రమసురాధిపే।
సర్వాస్త్వయి నివిష్టాస్తా భూయశ్చాన్యాః సహస్రశః। 45

తవేదం స్థగు యద్దీర్ఘం రథఘోణమివాయతమ్।
మతయః క్షత్రవిద్యాశ్చ మాయాశ్చాత్ర వసంతి తే। 46

అత్ర తే ప్రతిమోక్ష్యామి మాలాం కుబ్జే హిరణ్మయీమ్।
అభిషిక్తే చ భరతే రాఘవే చ వనం గతే। 47

జాత్యేన చ సువర్ణేన సునిష్టప్తేన మంథరే।
లబ్ధార్థా చ ప్రతీతా చ లేపయిష్యామి తే స్థగు। 48

ముఖే చ తిలకం చిత్రం జాతరూపమయం శుభమ్।
కారయిష్యామి తే కుబ్జే శుభాన్యాభరణాని చ। 49

పరిధాయ శుభే వస్త్రే దేవతేవ చరిష్యసి। 50

చంద్రమాహ్వయమానేన ముఖేనాప్రతిమాననా।
గమిష్యసి గతిం ముఖ్యాం గర్వయంతీ ద్విషజ్జనమ్। 51

తవాపి కుబ్జాః కుబ్జాయాః సర్వాభరణభూషితాః।
పాదౌ పరిచరిష్యంతి యథైవ త్వం సదా మమ। 52

ఇతి ప్రశస్యమానా సా కైకేయీమ్ ఇదమబ్రవీత్।
శయానాం శయనే శుభ్రే వేద్యామగ్నిశిఖామివ। 53

గతోదకే సేతుబంధో న కల్యాణి విధీయతే।
ఉత్తిష్ఠ కురు కల్యాణి రాజానమ్ అనుదర్శయ। 54

తథా ప్రోత్సాహితా దేవీ గత్వా మంథరయా సహ।
క్రోధాగారం విశాలాక్షీ సౌభాగ్యమదగర్వితా। 55

అనేకశతసాహస్రం ముక్తాహారం వరాంగనా।
అవముచ్య వరార్హాణి శుభాన్యాభరణాని చ। 56

తతో హేమోపమా తత్ర కుబ్జావాక్యవశం గతా।
సంవిశ్య భూమౌ కైకేయీ మంథరామిదమబ్రవీత్। 57

ఇహ వా మాం మృతాం కుబ్జే నృపాయావేదయిష్యసి।
వనం తు రాఘవే ప్రాప్తే భరతః ప్రాప్స్యతి క్షితిమ్। 58

రాక్షసరాజగు శంబరాసురునెరిగిన వేలకొలది మాయలన్నియును నీలోగలవు- అంతే గాదు ఇంకను నీకు తెలిసిన మాయలు కోకొల్లలు - నీగూని రథాగ్రభాగమునగల ముట్టెవలె పెద్దదైనది, విశాలమైనది. సముచితమైన ఆలోచనలకును, రాజనీతులకును, మాయోపాయములకును అది నెలవు. (45-46)

ఓ కుబ్జా! శ్రీరాముడు వనములకు వెళ్లగానే, భరతునకు పట్టాభిషేకమహోత్సవము జరిగిన పిమ్మట నీగూనికి అనువగు బంగారు ఆభరణమును బహూకరించెదను. ఓ మంథరా! నాకు కార్యసిద్ధి కలిగిన పిమ్మట సంతసించి నీగూనికి మంచి గంధములతో లేపనమొనర్చి బాగుగా పుటముపెట్టిన మేలిమి బంగారపు తొడుగుతో దానిని అలంకరించెదను. (47-48)

ఓ కుబ్జా! వివిధరత్నములను పొదిగినట్టి పలువన్నెలతో మిలమిలలాడుచుండెడి బంగారు భూషణమును నీముఖమున తిలకముగా దిద్దెదను. నీకు చక్కని ఆభరణములను చేయించెదను. నీవు మంగళకరములైన వస్త్రములను ధరించి, దివ్యభామినివలె వెలుగొందగలవు- (49-50)

చంద్రునితో పోటీ పడగల సాటిలేని నీముఖసౌందర్యమును జూచి, నీ శత్రువులు అవమానభారముతో తలలు వంచుకొందురు. అప్పుడు నీవు వారిమధ్య గర్వముతో సంచరింపగలవు. (51)

నీతోడి కుబ్జలెల్లరును వివిధములైన ఆభరణములను ధరించినవారై, నిత్యమూ నీవు నాకు పరిచర్యలు చేయుచున్నట్లే వారును నీ పాదములను సేవింతురు-" (52)

స్వచ్ఛమైన సెజ్జపైపరుండి, వేదికయందలి అగ్నివలె తేజరిల్లుచున్న కైక ఈ విధముగా తనను కొనియాడుచుండగా, ఆ మంథర ఆమెతో ఇట్లనెను. (53)

"ఓ సుందరీ! నీరంతయును గతించిన (వెళ్లిపోయిన) పిమ్మట అడ్డుకట్ట వేయుటవలన ప్రయోజనము ఉండదు. ఓ కైకా! లెమ్ము! నేను చెప్పినట్లు చేయుము, నీవు కోపగృహమున రాజురాకకై నిరీక్షించుచుండుము- (54)

సౌందర్యగర్వముచే విఱ్ఱవీగుచున్నదియు, అందమైన కనులుగలదియు నగు కైకను మంథర అట్లు ప్రోత్సహించిన పిమ్మట, ఆమె ఆ కుబ్జతోగూడి కోపగృహమునకు చేరెను. అంతట ఆ సుందరాంగి మిక్కిలి విలువైన తనముత్యాలహారమును, శ్రేష్ఠములైన ఇతరాభరణములను, తీసివేసెను - పిదప బంగారు వన్నెగల ఆ కైక కుబ్జయొక్క మాటలవలలో చిక్కుకొని, నేలపై పరుండినదై ఆ గూనిదానితో ఇట్లనెను. (55-57)

"ఓ మంథరా! శ్రీరాముడు వనములకు వెళ్లవలెను. వెంటనే భరతుడు యువరాజపట్టాభిషిక్తుడు కావలెను- అట్లుకానిచో నేను మరణించుట తథ్యమని రాజుగారికి తెలుపుము. నాకు

న సువర్ణేన మే హ్యర్థో న రత్నైః నచ భోజనైః।
ఏష మే జీవిత స్యాంతో రామో యద్యభిషిచ్యతే। 59

అథో పునస్తాం మహిషీం మహీక్షితో
వచోభిరత్యర్థమహాపరాక్రమైః ।
ఉవాచ కుబ్జా భరతస్య మాతరం
హితం వచో రామముపేత్య చాహితమ్ । 60

ప్రపత్స్యతే రాజ్యమిదం హి రాఘవో
యది ధ్రువం త్వం ససుతా చ తప్స్యసే।
అతో హి కల్యాణి యతస్వ తత్తథా
యథా సుతస్తే భరతోఽభిషేక్ష్యతే । 61

తథాతివిద్ధా మహిషీ తు కుబ్జయా
సమాహతా వాగిషుభిర్ముహుర్ముహుః ।
నిధాయ హస్తౌ హృదయేఽతివిస్మితా
శశంస కుబ్జాం కుపితా పునః పునః । 62

యమస్య వా మాం విషయం గతామితో
నిశామ్య కుబ్జే ప్రతివేదయిష్యసి ।
వనం గతే వా సుచిరాయ రాఘవే
సమృద్ధకామో భరతో భవిష్యతి । 63

అహం హి నైవాస్తరణాని న స్రజో
న చందనం నాంజనపానభోజనమ్ ।
న కించిదిచ్ఛామి న చేహ జీవితం
న చేదితో గచ్ఛతి రాఘవో వనమ్ । 64

అథైతదుక్త్వా వచనం సుదారుణం
నిధాయ సర్వాభరణాని భామినీ ।
అసంవృతామాస్తరణేన మేదినీం
తదాఽధిశిశ్యే పతితేవ కిన్నరీ । 65

ఉదీర్ణసంరంభతమోవృతాననా
తథావముక్తోత్తమమాల్యభూషణా ।
నరేంద్రపత్నీ విమనా బభూవ సా
తమోవృతా ద్యౌరివ మగ్నతారకా । 66

బంగారములతోగాని, రత్నాభరణములతోగాని, కడకు అన్నపానములతో గాని, పనియేలేదు. రాముడు పట్టాభిషిక్తుడైనచో నా పొందిలో ప్రాణములు ఉండవు." (58-59)

పిమ్మట దశరథునకు పట్టమహిషియు, భరతునకు తల్లియు ఐన కైకతో ఆ మంథర వాడియైన, వేడియైన తీవ్రవచనములను పల్కెను. ఆ మాటలు లౌకికదృష్టిలో రామునకు హానిని గూర్చునవి, కైకమ్మకు ప్రియమును గూర్చునవి. (60)

"ఓ సుందరీ! రాజ్యాధికారము రామునకే దక్కినచో నీకును, నీ కుమారునకును తిప్పలు తప్పవు- అందువలన నీపుత్రుడైన భరతుడే పట్టాభిషిక్తుడగునట్లు గట్టిగా పూనుకొనుము." (61)

ఆ విధముగా కుబ్జ ఆమెను పదేపదే రెచ్చగొట్టగా ఆరాణి మిగుల రగిలెను. తనభర్త తనను వంచించినాడని తలచి, ఆమె ఆదుర్దాపై మండిపడెను. గుండెలపై చేతులుంచుకొని, ఆగూనిదానిబుద్ధికుశలతకు ఆశ్చర్యపడుచు ఆమెను పదేపదే మెచ్చుకొనుచు కైక ఇట్లనుచినెను- (62)

"ఓ కుబ్జా! శ్రీరాముడు వనవాసమునకు వెళ్లినచో భరతుని మనోరథము నెఱవేఱును - అది జరుగనిచో నేను యమలోకమునకు చేరుట తథ్యము' అని రాజుగారికి నివేదింపుము. (63)

శ్రీరాముడు ఇచటినుండి అరణ్యములకు వెళ్లనిచో నేను ఆస్తరణములపై పరుండను, హారములను ధరింపను, చందనములను అలదుకొనను, కాటుక పెట్టుకొనను. అన్నపానములను తాకను, దేనినీ కోరను. అంతేగాదు ఇక నా జీవితమునే చాలింతును." (64)

ఆ భామిని (కైక) ఈవిధముగా పరుషోక్తులాడిన పిమ్మట, పూర్తిగా ఆభరణములను అన్నింటిని తీసివేసి, కనీసము ఒక చాపయైననులేక, కటికినేలపై దివినుండి భువికి రాలిన కిన్నరస్త్రీవలె పరుండెను. (65)

మిలమిలలాడుహారములను, ఆభరణములను తొలగించుటచే ఆమెకాంతి తఱిగియుండెను. సైగా సహజముగా ప్రసన్నముగా నుండెడి ఆమెముఖము అంతులేని క్రోధాంధకారముచే ఆవరింపబడియుండెను. అప్పుడామె తారకలు మఱుగునపడగా! చిమ్మచీకట్లు క్రమ్ముకొనిన ఆకాశమువలె నిస్తేజయైయుండెను. (66)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే నవమస్సర్గః (9)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

10. పదియవసర్గము

కోపగృహమున నేలపైబడి దొర్లుచున్న కైకనుజూచి, దశరథుడు మిగుల పరితపించి, ఆమెను పలువిధముల ఓదార్చుట, ఎట్టకేలకు ఆమె కొంత ఊరడిల్లుట.

విదర్శితా యదా దేవీ కుబ్జయా పాపయా భృశమ్।
తదా శేతే స్మ సా భూమౌ దిగ్ధవిద్ధేవ కిన్నరీ॥ 1

పాపాత్మురాలైన మంథరదుర్బోధలకు పూర్తిగా లోనైన ఆ కైక విషముపూసిన బాణముచే కొట్టబడిన కిన్నరస్త్రీవలె నేలపైబడి యుండెను- (1)

నిశ్చిత్య మనసా కృత్యం సా సమ్యగితి భామినీ।
మంథరాయై శనైస్సర్వమ్ ఆచచక్షే విచక్షణా॥ 2

మిక్కిలి తెలివిగల ఆ కైకేయి తనకర్తవ్యమును మనస్సున నిశ్చయించుకొని 'నీవు తెల్పినదంతయు మిక్కిలి సముచితముగా ఉన్నది'- అని మంథరతో నెమ్మదిగా పల్కెను. (2)

సా దీనా నిశ్చయం కృత్వా మంథరావాక్యమోహితా।
నాగకన్యేవ నిశ్వస్య దీర్ఘముష్ణం చ భామినీ।
ముహూర్తం చింతయామాస మార్గమ్ ఆత్మసుఖావహమ్॥ 3

మంథరబోధలకు తలయొగ్గినదై తననిర్ణయము ఫలించునో లేదోయను ఊగిసలాటకారణముగా దీనురాలైయున్న ఆ కైకేయి నాగకన్యవలె వేడినిట్టూర్పులు విడుచుచు, తనకు సుఖావహమైన మార్గమును గూర్చి క్షణకాలముపాటు ఆలోచించెను. (3)

సా సుహృచ్చార్థకామా చ తం నిశమ్య సునిశ్చయమ్।
బభూవ పరమప్రీతా సిద్ధిం ప్రాప్యేవ మంథరా॥ 4

కైకేయికి ఆత్మీయురాలును, ఆమెకార్యసిద్ధిని కోరుచున్నట్టిదియు ఐన మంథర ఆమె (కైక) దృఢ నిశ్చయమును విని, కార్యము సిద్ధించినట్లుగనే భావించి, పరమప్రీతురాలాయెను. (4)

అథ సా రుషితా దేవీ సమ్యక్ కృత్వా వినిశ్చయమ్।
సంవివేశాబలా భూమౌ నివేశ్య భ్రుకుటీం ముఖే॥ 5

ఆ కైకేయి అట్లు బలముగా నిశ్చయించుకొనినపిమ్మట కోపముతో కనుబొమలు ముడివైచినదై, నేలపై పరుండెను. (5)

తతశ్చిత్రాణి మాల్యాని దివ్యాన్యాభరణాని చ।
అపవిద్ధాని కైకేయ్యా తాని భూమిం ప్రపేదిరే॥ 6

తయా తాన్యపవిద్ధాని మాల్యాన్యాభరణాని చ।
అశోభయంత వసుధాం నక్షత్రాణి యథా నభః॥ 7

కైకేయి కోపముతో విసిరికొట్టిన చిత్రములైనహారములు, దివ్యములైన ఆభరణములు అచటినేలపై చెల్లాచెదరుగా పడియుండెను. ఆమె అట్లు పారవైచిన మాలలు, ఆభరణములు అన్నియును, నక్షత్రములు ఆకాశమునందువలె ఆ ప్రదేశమును శోభిల్లజేయుచుండెను. (6-7)

క్రోధాగారే నిపతితా సా బభౌ మలినాంబరా।
ఏకవేణీం దృఢం బద్ధ్వా గతసత్త్వేవ కిన్నరీ॥ 8

మలినవస్త్రమును దాల్చి, కేశములను ఒకే జడగా ముడివైచుకొని, కోపగృహమున పడియున్న ఆ కైక క్రుంగి కృశించి, అచేతన స్థితిలోనున్న కిన్నరాంగనవలె ఒప్పుచుండెను. (8)

ఆజ్ఞాప్య తు మహారాజో రాఘవస్యాభిషేచనమ్।
ఉపస్థానమనుజ్ఞాప్య ప్రవివేశ నివేశనమ్॥ 9

దశరథమహారాజు సుమంత్రుడు మొదలగు సచివులకు శ్రీరామపట్టాభిషేకమునకు సంబంధించిన ఏర్పాట్లవిషయమున ఆజ్ఞలను ఇచ్చెను. తరువాత గురువైన వసిష్ఠునిఅనుజ్ఞనుబడసి, ఆయన తనఅంతఃపురమున ప్రవేశించెను. (9)

అద్య రామాభిషేకో వై ప్రసిద్ధ ఇతి జజ్ఞివాన్।
ప్రియార్హాం ప్రియమాఖ్యాతుం వివేశాంతఃపురం వశీ॥ 10

శ్రీరామునిపట్టాభిషేకవిషయము ఇప్పుడేగదా నిర్ణయింపబడినది ఇంతవఱకును ఈ శుభవార్త అంతఃపురమునందలి రాణులకు తెలియకుండవచ్చును గదా! అని స్వతంత్రుడైన దశరథుడు భావించి, తనకు అత్యంత ప్రీతిపాత్రురాలైన కైకకు ఈ ప్రియవార్తను దెల్పుటకై ఆమె యంతఃపురమున అడుగిడెను. (10)

స కైకేయ్యా గృహం శ్రేష్ఠం ప్రవివేశ మహాయశాః।
పాండురాభ్రమివాకాశం రాహుయుక్తం నిశాకరః॥ 11

స్వచ్ఛమైన మేఘములు గలిగి, రాహుయుక్తమైయున్న ఆకాశమున చంద్రుడు ప్రవేశించినట్లు మహాయశస్వియైన దశరథుడు కైకేయి యొక్క అంతఃపురమున ప్రవేశించెను. (11)

శుకబర్హిణసంఘుష్టం క్రౌంచహంసరుతాయుతమ్।
వాదిత్రరవసంఘుష్టం కుబ్జావామనికాయుతమ్। 12

లతాగృహైశ్చిత్రగృహైః చంపకాశోకశోభితైః।
దాంతరాజతసౌవర్ణవేదికాభిస్సమాయుతమ్। 13

నిత్యపుష్పఫలైర్వృక్షైః వాపీభిశ్చోపశోభితమ్।
దాంతరాజతసౌవర్ణైః సంవృతం పరమాసనైః। 14

వివిధైరన్నపానైశ్చ భక్ష్యైశ్చ వివిధైరపి।
ఉపపన్నం మహార్హైశ్చ భూషితైః త్రిదివోపమమ్। 15

తత్ప్రవిశ్య మహారాజః స్వమంతఃపురమృద్ధిమత్।
న దదర్శ ప్రియాం రాజా కైకేయీం శయనోత్తమే। 16

స కామబలసంయుక్తో రత్యర్థం మనుజాధిపః।
అపశ్యన్ దయితాం భార్యాం పప్రచ్ఛ విషసాద చ। 17

న హి తస్య పురా దేవీ తాం వేలామత్యవర్తత।
న చ రాజా గృహం శూన్యం ప్రవివేశ కదాచన। 18

తతో గృహగతో రాజా కైకేయీం పర్యపృచ్ఛత।
యథాపురమ్ అవిజ్ఞాయ స్వార్థలిప్సుమపండితామ్। 19

ప్రతిహారీత్వథోవాచ సంత్రస్తా సుకృతాంజలిః।
దేవ దేవీ భృశం క్రుద్ధా క్రోధాగారమభిద్రుతా। 20

ప్రతిహార్యా వచః శ్రుత్వా రాజా పరమదుర్మనాః।
విషసాద పున ర్భూయో లుళితవ్యాకులేంద్రియః। 21

తత్ర తాం పతితాం భూమౌ శయానామ్ అతథోచితామ్।
ప్రతప్త ఇవ దుఃఖేన సోఽపశ్యజ్జగతీపతిః। 22

స వృద్ధస్తరుణీం భార్యాం ప్రాణేభ్యోఽపి గరీయసీమ్।
అపాపః పాపసంకల్పాం దదర్శ ధరణీతలే। 23

లతామివ వినిష్కృత్తాం పతితాం దేవతామివ।
కిన్నరీమివ నిర్ధూతాం చ్యుతామ్ అప్సరసం యథా। 24

అచట చిలుకలు, నెమళ్ళు, క్రౌంచపక్షులు, హంసలు మొదలగు వాటికలరవములు వినిపించుచుండెను- వీణావేణుమృదంగవాద్యధ్వనులు వీనులవిందు గావించుచుండెను- గూనివారు, పొట్టివారు వన స్త్రీలు తిరుగాడుచుండిరి. సంపెంగలు, అశోకములతోగూడిన లతాగృహములు, చిత్రగృహములు శోభిల్లుచుండెను. దంతములతో, వెండిబంగారములతో నిర్మితములైన వేదికలు రాజిల్లుచుండెను. దోహదక్రియలతో నిత్యము పుష్పించెడి, ఫలించెడి వృక్షములు, దిగుడుబావులు ఒప్పారుచుండెను. దంతములతో, వెండిబంగారములతో నిర్మింపబడిన ఉన్నతాసనములు అచట అలరారుచుండెను. (12-14)

ఆ ప్రదేశము వివిధములగు అన్నపానములతో, భక్ష్యవిశేషములతో ఘుమఘుమలాడుచుండెను. మిక్కిలి విలువైన ఆభరణములతో అలరారుచున్న కైకగృహము ఒక దివ్యభవనమువలె తేజరిల్లుచుండెను. సకలసంపదలతో తులతూగుచున్న అట్టి అంతఃపురమున దశరథుడు ప్రవేశించెను- కాని శయనమందిరమునందలి తల్పముపై ఆయనకు అత్యంత ప్రియురాలైన కైక కనబడలేదు. (15-16)

ఆ మహారాజు ఉద్దీపనవస్తుదర్శనముచే కామోద్రిక్తుడై, అది రతికి తగినకాలమని భావించెను- తనముద్దులభార్య(కైక) కనబడకుండుటచే అతడు 'ఓకైకా! నీవెక్కడ?' అని పిలిచెను, సమాధానము రాకపోవుటచే చింతాక్రాంతుడయ్యెను- (17)

మున్నెన్నడును ఆకైక ఆసమయమున అట్లుప్రవర్తించి యుండలేదు. రాజెప్పుడును అవిధముగా నిర్మానుష్యముగానున్న ఆశయనమందిరమున ప్రవేశించియుండలేదు. (18)

కైక మూర్ఖత్వముతో స్వప్రయోజనమును సాధింపదలంచి అలిగియున్న సంగతి తెలియక, రాజు ఎప్పటివలెనే ఆమెనుగూర్చి ప్రతీహారిని (ద్వారపాలకురాలిని) అడిగెను. అప్పుడు ఆప్రతీహారి భయముతో వణకుచు అంజలి ఘటించి, 'ప్రభూ! రాణిగారు మిక్కిలి క్రుద్ధురాలై, రుసరుసలాడుచు కోపగృహమునుజేరిరి.'- అని తెలిపెను. (19-20)

ప్రతీహారిమాటలు చెవినిబడగానే రాజుమనసు కలవరపడెను. అతడు ఇంకను విషాదమునకు లోనయ్యెను. ఆయనకాళ్ళు చేతులు తడబడసాగెను. ఇంద్రియములన్నియును వ్యాకులములయ్యెను. (21)

ఆ దశరథమహారాజు రాణిస్థాయికి తగనిరీతిగా కోపగృహమున భూమిపై బడియున్న ఆ కైకేయిని జూచెను. అంతట అతడు దుఃఖభారముతో తపించిపోయెను. (22)

ఏ పాపమునూ ఎఱుగని ఆ వృద్ధభూపతి తాను ప్రాణములకన్న మిన్నగా చూచుకొనుచున్న తనపడుచుభార్య అధర్మముగా అలుక బూని, కటిక నేలపై పడియుండగా దిగులుతో జూచెను. (23)

పూర్తిగా త్రుంచివేయబడి, నేలపాలైన తీగెవలెను, భూమిపై పడి, అశ్రుర్యముగొల్పుచున్నదేవతవలెను, ఆకాశమునుండి విసరివేయబడి, దీనస్థితి యున్న కిన్నరతరుణివలెను, దివినుండి

మాయామివ పరిభ్రష్టాం హరిణీమివ సంయతామ్।
కరేణుమివ దిగ్ధేన విద్ధాం మృగయునా వనే॥ 25

మహాగజ ఇవారణ్యే స్నేహాత్ పరిమమర్శ తామ్।
పరిమృశ్య చ పాణిభ్యామ్ అభిసంత్రస్తచేతసః॥ 26

కామీ కమలపత్రాక్షీమ్ ఉవాచ వనితామిదమ్॥ 27

న తేఽహమభిజానామి క్రోధమ్ ఆత్మని సంశ్రితమ్।
దేవి కేనాభిశప్తాసి కేన వాసి విమానితా॥ 28

యదిదం మమ దుఃఖాయ శేషే కల్యాణి పాంసుషు।
భూమౌ శేషే కిమర్థం త్వం మయి కల్యాణచేతసి॥ 29

భూతోపహతచిత్తేవ మమ చిత్తప్రమాథినీ॥ 30

సంతి మే కుశలా వైద్యాస్త్వభితుష్టాశ్చ సర్వశః।
సుఖితాం త్వాం కరిష్యంతి వ్యాధిమ్ ఆచక్ష్వ భామిని॥ 31

కస్య వా తే ప్రియం కార్యం కేన వా విప్రియం కృతమ్।
కః ప్రియం లభతామద్య కో వా సుమహదప్రియమ్॥ 32

మా రోదీః మా చ కార్షీస్త్వం దేవి సంపరిశోషణమ్।
అవధ్యో వధ్యతాం కో వా కో వా వధ్యో విముచ్యతామ్॥ 33

దరిద్రః కో భవత్వాఢ్యో ద్రవ్యవాన్ వాప్యకించనః॥ 34

అహం చైవ మదీయాశ్చ సర్వే తవ వశానుగాః।
న తే కించిదభిప్రాయం వ్యాహంతుమ్ అహముత్సహే॥ 35

ఆత్మనో జీవితేనాపి బ్రూహి యన్మనసేచ్ఛసి।
బలమాత్మని జానంతీ న మాం శంకితుమర్హసి॥ 36

కరిష్యామి తవ ప్రీతిం సుకృతేనాపి తే శపే॥ 37

యావదావర్తతే చక్రం తావతీ మే వసుంధరా।
ప్రాచీనాః సింధుసౌవీరాః సౌరాష్ట్రా దక్షిణాపథాః॥ 38

వనికి జారి, మాడముచ్చటగా నున్న అప్సరసవలెను, వేటగాని మోహింపజేయుటకై ప్రయోగింపబడి, లక్ష్యమునకు దొరకని మాయవలెను, వలలోచిక్కుకొని, చేష్టలుడిగిన లేడివలెను, అడవిలో వేటగానిచే విషముపూసినబాణముతో కొట్టబడి, సంతాపమునకు గుఱియైన ఆడుఏనుగువలెను ఆకైక చిన్నబోయియుండెను. (24-25)

ఒక మగయేనుగు అరణ్యమున ఆడుఏనుగును తాకినట్లు అతడు ఆమెను ప్రేమతో స్పృశించెను. కామమోహితుడైయున్న దశరథుడు 'ఈమె ఏదైనను కోరుకొనుచున్నదా? లేక అనారోగ్యముపాలైనదా? లేక క్రుద్ధురాలైయున్నదా? ఎందువలన ఇట్లు పడియున్నది?' అని తికమకపడుచు, తనచేతులతో ఆమెను నిమురుచు, కమలలోచన యగు ఆకైకతో ఇట్లునుడివెను. (26-27)

"ఓ దేవీ! నీకు నాపైగల కోపకారణమేమో తెలియదు- నిన్ను ఎవరైనను నిందించిరా? లేక అవమానించిరా? ఓ కల్యాణీ! నీవు ఈ విధముగా దుమ్ములో పండుకొనియుండుటవలన నా మనస్సు మిక్కిలి బాధపడుచున్నది. ఇట్లెందులకు చేసితివి? నీ అభిమతములన్నింటిని తీర్చువాడను నేను ఉండగా దయ్యము పట్టినదానివలె నామనస్సును క్షోభపెట్టుచు ఏల ఇట్లు నేలపై పరుండియుంటివి? (28-30)

ఓ భామినీ! మనకు మంచివైద్యులకు కొదువలేదు. నా పోషణములో వారందఱును మిక్కిలి హాయిగా ఉన్నారు. వారు నీ అనారోగ్యమును తొలగించి, నీకు స్వస్థత చేకూర్చగలరు. ముందుగా నీ వ్యాధియేమో తెల్పుము. నీవు ఎవరికైనను మేలు చేయదలచుకొంటివా? నీకు ఎవరైనను అప్రియము చేసినారా? ఇప్పుడు నేను ఎవరికి లాభమును కలిగింపవలెను? ఎవరిని తీవ్రముగా దండింపవలెను? ఓ దేవీ! నీవు ఏడువకుము. దుర్భరమైన నీపరితాపమును మానుము. ఏ నిర్దోషినైనను వధింపవలెనా? ఉరిశిక్షకు గుఱియైన వారినెవరినైనను విడచి పెట్టవలెనా? తెలుపుము. ఏ దరిద్రునినైనను సంపన్నునిగా చేయవలెనా? లేక ఏ సంపన్నునినైనను నిర్ధనునిగావింపవలెనా? వివరింపుము. (31-34)

నేనును నా వారందఱును నీ అధీనములోని వారము - నీ మనోరథము అదియేదైనను ఎట్టిదైనను, దానిని నేను నిరాకరింపను. నీ మనసులోని మాటను నిస్సంకోచముగా తెలుపుము. నా ప్రాణములనొడ్డియైనను దానిని తీర్చెదను. నాపై నీకుగల అధికారమును నీవు ఎఱుగుదువు. కనుక నీవు నన్ను ఏ మాత్రము సందేహింపరాదు. నా పుణ్యముపై ఆన- నీ ఇష్టమును తప్పక నెఱవేర్తును. (35-37)

ఓ కైకేయీ! సూర్యరశ్మి సోకునంతవఱకుగల భూమండలము అంతయును నా అధీనములోనున్నది - తూర్పునగల దేశములును, సింధుసౌవీరసౌరాష్ట్రములును, దక్షిణాపథమునగల దేశములును,

వంగాంగమగధామత్స్యాః సమృద్ధాః కాశికోసలాః।
తత్ర జాతం బహుద్రవ్యం ధనధాన్యమజాదికమ్। 39

తతో వృణీష్వ కైకేయి యద్యత్ త్వం మనసేచ్ఛసి। 40

కిమాయాసేన తే భీరు ఉత్తిష్ఠోత్తిష్ఠ శోభనే।
తత్త్వం మే బ్రూహి కైకేయి యతస్తే భయమాగతమ్। 41

తత్తే వ్యపనయిష్యామి నీహారమివ రశ్మివాన్। 42

తథోక్తా సా సమాశ్వస్తా వక్తుకామా తదప్రియమ్।
పరిపీడయితుం భూయో భర్తారమ్ ఉపచక్రమే। 43

అంగవంగమగధ మత్స్యదేశములును, కాశీకోసలదేశములును సకలసంపదలతో తులతూగుచున్నవి. ఈ దేశములలోగల పశుసంపదను, ధనధాన్యాదివివిధద్రవ్యములను నీయిష్టానుసారముగా కోరుకొనుము.(38-40)

ఓ భయస్వభావురాలా! భూమిపైబడి పొర్లుచు అయాసపడుట యెందులకు? సుందరీ! లేలెమ్ము. నీభయకారణమును దెల్పుము. సూర్యుడు మంచును పటాపంచలొనర్చునట్లుగా నేను నీభయమును తొలగింతును-" (41-42)

మహారాజు అట్లు పలుకగా కైకేయి కొంతవరకు ఊరడిల్లెను. ఆయనకు అప్రియమైన రామవనవాసాదికవిషయములను దెల్పదలచినదై, మిగుల పీడించుచు ఆయనను ప్రతిజ్ఞారూపమున బంధించుటకై (ఆయనచే ప్రతిజ్ఞ చేయించుటకై) ఇట్లు పలుకసాగెను- (43)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే దశమస్సర్గః *(10)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పదియవసర్గము సమాప్తము

-- * * * --

11. పదునొకొండవసర్గము

కైక దశరథమహారాజును ప్రతిజ్ఞాబద్ధునిగావించి, తన రెండు వరములను కోరుట.

తం మన్మథశరైర్విద్ధం కామవేగవశానుగమ్।
ఉవాచ పృథివీపాలం కైకేయీ దారుణం వచః। 1

నాస్మి విప్రకృతా దేవ కేనచిన్నావమానితా।
అభిప్రాయస్తు మే కశ్చిత్ తమిచ్ఛామి త్వయా కృతమ్। 2

ప్రతిజ్ఞాం ప్రతిజానీష్వ యది త్వం కర్తుమిచ్ఛసి।
అథ తద్వ్యాహరిష్యామి యదభిప్రార్థితం మయా। 3

తామువాచ మహాతేజాః కైకేయీమ్ ఈషదుత్స్మితః।
కామీ హస్తేన సంగృహ్య మూర్ధజేషు శుచిస్మితామ్। 4

అవలిప్తే న జానాసి త్వత్తః ప్రియతమా మమ।
మనుజో మనుజవ్యాఘ్రాత్ రామాదన్యో న విద్యతే। 5

తేనాజయ్యేన ముఖ్యేన రాఘవేణ మహాత్మనా।
శపే తే జీవనార్హేణ బ్రూహి యన్మనసేచ్ఛసి। 6

యం ముహూర్తమపశ్యంస్తు న జీవేయమ్ అహం ధ్రువమ్।
తేన రామేణ కైకేయి శపే తే వచనక్రియామ్। 7

మన్మథ బాణములచే కొట్టబడి, కామవికారములకు లోనైన ఆ మహారాజుతో కైక అతిదారుణముగా ఇట్లు నుడివెను- (1)

ఓ దేవా! నన్నెవ్వరును తిరస్కరింపలేదు, అవమానింపలేదు. నాకొక కోరికగలదు. దానిని నీవే తీర్పవలెను. అట్లు చేయదలచినచో ప్రమాణపూర్వకముగా నాకు మాట ఇమ్ము. అనంతరము నాకోర్కెను వెల్లడింతును. (2-3)

మిక్కిలి కామపరతంత్రుడై ఆతురతతోనున్న దశరథుడు ఆమెశిరస్సును తనఒడిలోనికి చేర్చుకొని, (దేనెల్లప్పుడును నీ ఆజ్ఞానువర్తినే గదా! ఇంక ప్రతిజ్ఞతో పనియేమి? అను భావముతో) ఒకింత దరహాసమొనర్చెను. తన పాలికపాటుమున్నదని చిఱునవ్వుచిందించుచున్న ఆమెయొక్కకేశములను నిమురుచు అతడు ఇట్లు పలికెను- (4)

"ఓ సౌభాగ్యగర్వితా! స్త్రీలలో నీవే నాకు ఎంతయు ప్రియతమురాలవు. పురుషులలో నాకు నరోత్తముడైన రామునికంటెను ప్రియమైనవాడు మఱియొకడు లేడు'- అని నీవెఱుగవా? అజేయుడు, రఘువంశజులలో ప్రముఖుడు, మిక్కిలి బుద్ధిమంతుడు, నాకు ప్రాణములకంటెను మిన్నయైనవాడు ఐన ఆరామునిపై ఒట్టు పెట్టుకొని చెప్పుచున్నాను. నిజముగా నీ మనసులోని కోరికను ప్రకటింపుము. ఓ కైకేయీ! నాచిన్నారి రాముని జూడక ఒక్క క్షణకాలమునాటైనను నేను బ్రతికి

ఆత్మనావాత్మజైశ్చాన్యైః వృణే యం మనుజర్షభమ్।
తేన రామేణ కైకేయి శపే తే వచనక్రియామ్। 8

భద్రే హృదయమప్యేతత్ అనుమృశ్యోద్ధరస్వ మే।
ఏతత్ సమీక్ష్య కైకేయి బ్రూహి యత్ సాధు మన్యసే। 9

బలమాత్మని జానంతీ న మాం శంకితుమర్హసి।
కరిష్యామి తవ ప్రీతిం సుకృతేనాపి తే శపే। 10

సా తదర్థమనా దేవీ తమభిప్రాయమాగతమ్।
నిర్మాధ్యస్థాచ్చ హర్షాచ్చ బభాషే దుస్సహం వచః। 11

తేన వాక్యేన సంహృష్టా తమభిప్రాయమాగతమ్।
వ్యాజహార మహాఘోరమ్ అభ్యాగతమివాంతకమ్। 12

యథా క్రమేణ శపసి వరం మమ దదాసి చ।
తచ్ఛృణ్వంతు త్రయస్త్రింశత్ దేవాఃసాగ్నిపురోగమాః। 13

చంద్రాదిత్యౌ నభశ్చైవ గ్రహా రాత్ర్యహనీ దిశః।
జగచ్చ పృథివీచేయం సగంధర్వా సరాక్షసా। 14

నిశాచరాణి భూతాని గృహేషు గృహదేవతాః।
యాని చాన్యాని భూతాని జానీయుః భాషితం తవ। 15

సత్యసంధో మహాతేజా ధర్మజ్ఞః సుసమాహితః।
వరం మమ దదాత్యేష తన్మే శృణ్వంతు దేవతాః। 16

ఇతి దేవీ మహేష్వాసం పరిగృహ్యాభిశస్య చ।
తతః పరమువాచేదం వరదం కామమోహితమ్। 17

స్మర రాజన్ పురావృత్తం తస్మిన్ దైవాసురే రణే।
తత్ర చాచ్యావయచ్ఛత్రుః తవ జీవితమంతరా। 18

తత్ర చాపి మయా దేవ యత్త్వం సమభిరక్షితః।
జాగ్రత్యా యతమానాయాః తతో మే ప్రదదౌ వరౌ। 19

యుండజాలను. అట్టి రామునిపై ప్రమాణముచేసి నుడువుచున్నాను- రామునికొఱకై నేను నా ప్రాణములను గాని, ఇతరకుమారులను గాని, బంధుమిత్రులనుగాని త్యజించుటకు సిద్ధము - ఆ శ్రీరామునిపై బాసచేసి పలుకుచున్నాను. ఓ కల్యాణీ! కైకేయీ! నాశపథములను గమనింపుము. నా హృదయమును అర్థముచేసికొని, నన్ను ఉద్ధరింపుము. నా త్రికరణశుద్ధిని గుర్తించి, యోగ్యమైనరీతిలో నీ కోరికను వెల్లడింపుము. నీపై నాకుగల గాఢానురాగమును దృష్టిలో పెట్టుకొని, నాపై సందేహమును వీడుము - నా పుణ్యములపై ఆన, నీ కోర్కెను తీర్చి, నీకు ప్రియమును గూర్చెదను." (5-10)

మంథర ఉపదేశించినరీతిగా శ్రీరామునివనవాసము, భరతుని పట్టాభిషేకము జరుగవలెనను సంకల్పముగల ఆ కైక తన అభిప్రాయమునకు అనుగుణముగా దశరథుడు శపథముచేసి, ముందునకు రాగా, తనకుమారునిపైగల పక్షపాతబుద్ధితో సంతోషించుచు ఆయనతో దుస్సహమైన మాటలను ఇట్లు పలికెను. (11)

'నీ మనోరథమును తీర్చెదను' అని ప్రతిజ్ఞ చేసిన దశరథుని మాటలకు సంతుష్టయై, కైక అకస్మాత్తుగా వచ్చి పైబడిన మృత్యువు వలె భయంకరమైన తనఅభిప్రాయమును వెల్లడించెను. (12)

"ఓ మహారాజా! రామునిపైనను, నీ పుణ్యముపైనను ప్రమాణము చేసి, నీవు వరములను ఇచ్చుచున్నావు- నీవు పలికిన ఈ మాటలకు అగ్ని మొదలగు ముప్పదిమూడు(కోట్ల)మంది దేవతలే సాక్షులు. సూర్యచంద్రులు, భూమ్యాకాశములతోగూడిన సమస్తజగత్తు, నవగ్రహములు, రాత్రింబవళ్లు, సకలదిశలు, గంధర్వులు, రాక్షసులు, నిశాచరులు, సమస్తప్రాణులు, గృహదేవతలు, ఇంకను ఇతరభూతములు నీ ప్రతిజ్ఞావచనములను వినియున్నారు. (దీనికి వారు అందఱును సాక్షులు) (13-15)

"ఓ సకలదేవతలారా! సత్యసంధుడు, మిక్కిలి శక్తిసంపన్నుడు, సమస్తధర్మములను ఎఱిగినవాడు ఐన దశరథుడు ఎట్టి ఏమఱుపాటు లేనివాడై, నాకు వరములను ప్రసాదించుచున్నాడు. దీనిని మీరు శ్రద్ధగా విందురుగాక. (గమనింతురుగాక)" అని కైక దేవతలతో పలికి, ఈ సంభాషణమునకు వారిని సాక్షులను గావించెను. (16)

కామమోహితుడై తనకు వరములను ఇచ్చుటకు సిద్ధపడిన మహాధనుర్ధారియైన దశరథుని ఈ విధముగా ప్రతిజ్ఞాబద్ధుని గావించి, కైకేయి ఆయనను ప్రశంసలతో ముంచెత్తి, ఇట్లు నుడివెను. (17)

ఓ రాజా! ఆనాడు దైవాసుర(శంబరాసుర) యుద్ధమున జరిగిన పూర్వగాథను గుర్తుచేసికొనుము. రాత్రివేళ జరిగిన ఆ సమరమున శత్రువుయొక్క బాణములదెబ్బలకు నీవు మూర్ఛిల్లితివి. ఓ ప్రభూ! ఆ సందర్భమున సారథిగా మెలకువతో నున్న నేనే నిన్ను కాపాడితిని. ఆ సంతోషసమయమున నీవు నాకు రెండు వరములను ఇచ్చియుంటివి. ధర్మాత్మా! నీవు ఇచ్చిన ఆ వరములను అప్పుడు

తౌ తు దత్తౌ వరౌ దేవ నిక్షేపౌ మృగయామ్యహమ్।
తవైవ పృథివీపాల సకాశే సత్యసంగర। 20

తత్ ప్రతిశ్రుత్య ధర్మేణ న చేద్దాస్యసి మే వరమ్।
అద్యైవ హి ప్రహాస్యామి జీవితం త్వద్విమానితా। 21

వాఙ్మాత్రేణ తదా రాజా కైకేయ్యా స్వవశే కృతః।
ప్రచస్కంద వినాశాయ పాశం మృగ ఇవాత్మనః। 22

తతః పరమువాచేదం వరదం కామమోహితమ్।
వరౌ యౌ మే త్వయా దేవ తదా దత్తౌ మహీపతే। 23

తౌ తావదహమద్యైవ వక్ష్యామి శృణు మే వచః। 24

అభిషేకసమారంభో రాఘవస్యోపకల్పితః।
అనేనైవాభిషేకేణ భరతో మేఽభిషిచ్యతామ్। 25

యో ద్వితీయో వరో దేవ దత్తః ప్రీతేన మే త్వయా।
తదా దైవాసురే యుద్ధే తస్య కాలోఽయ మాగతః। 26

నవ పంచ చ వర్షాణి దండకారణ్యమాశ్రితః।
చీరాజినజటాధారీ రామో భవతు తాపసః। 27

భరతో భజతామద్య యౌవరాజ్యమ్ అకంటకమ్।
ఏష మే పరమః కామో దత్తమేవ వరం వృణే। 28

అద్యచైవ హి పశ్యేయం ప్రయాంతం రాఘవం వనమ్। 29

స రాజరాజో భవ సత్యసంగరః
కులం చ శీలం చ హి రక్ష జన్మ చ।
పరత్రవాసే హి వదంత్యనుత్తమం
తపోధనాః సత్యవచో హితం నృణామ్। 30

నీకడనే న్యాసముగా ఉంచితిని. ఆ రెండువరములను ఇప్పుడు నేను కోరుకొనుచున్నాను. నీవొసర్చిన ప్రతిజ్ఞకు కట్టుబడి, ధర్మమునననుసరించి, నాకు ఇప్పుడు ఆ వరములను ఈయనిచో నీతిరస్కారమునకు గుఱియైనదాననై, నేను ఈ క్షణముననే నా ప్రాణములను త్యజించెదను." (18-21)

వేటగాని జింకవలె అరచుటచే ఆ శబ్దమునకు ఆకర్షింపబడిన లేడి పరుగుపరుగునవచ్చి వలలో చిక్కుకొని, వినాశమునకు లోనగును- అట్లే దశరథుడు ఇదివరలో తానిచ్చిన వరములను గుర్తుచేయుచు కైక పలికిన మాటలచే ఆమెకు వశుడాయెను. అతడు తనప్రతిజ్ఞననుసరించి, ధర్మమునకు కట్టుబడి, కైక పన్నిన మాయాపాశములలో చిక్కుకొని, ప్రమాదమును కొనితెచ్చుకొనెను. అతడు ఒక్క సారిగా కొయ్యబారెను- (22)

ఆ పిమ్మట కామమోహితుడును, వరములను ఇచ్చిన వాడును ఐన దశరథునితో కైకేయి ఇట్లనెను. "ఓ మహారాజా! అప్పుడు నీవిచ్చిన రెండు వరములను నేను ఇప్పుడే అడుగుచున్నాను, సావధానుడవై ఆలకింపుము. (23-24)

ఓ నాథా! శ్రీరామునికొఱకై ఏర్పాటు చేయబడిన సామగ్రితోడను, సన్నాహములతోడను నేడే నా భరతుని యువరాజపట్టాభిషిక్తుని గావింపుము. ఇది నా మొదటి వరము. (25)

ఓ. దేవా! ఆనాడు దైవాసురసంగ్రామమున నీవు నామీది ప్రేమతో నాకు రెండవవరమును గూడ ఇచ్చియుంటివి. దానిని కోరుకొనుటకును సమయము ఆసన్నమైనది. శ్రీరాముడు నారచీరలు, జింక చర్మమును ధరించి, జటాధారియై, దండకారణ్యమునకు వెళ్లి, తాపసవృత్తిలో అచట పదునాలుగు సంవత్సరములు నివసింపవలెను. ఇది నారెండవ వరము. (26-27)

నేడే భరతునకు ఎదురులేని (శత్రుప్రమాదములేని) యువరాజాధికారము దక్కవలెను- ఇప్పుడే నేను చూచుచుండగనే శ్రీరాముడు వనములకు వెళ్లవలెను- ఇవియే నాఅభీష్టములు- ఇదివఱలో నీవిచ్చిన వరములనే నేను కోరితిని. (28-29)

రాజులకే రాజువైన (మహారాజువైన) నీవు సత్యమునకును, ప్రతిజ్ఞకును కట్టుబడియుండు నీవంశమును, శీలమును రక్షించుకొనుము. నీ జన్మను సార్థకము చేసికొనుము. మానవులకు ఈ లోకము నందును పర(స్వర్గ) లోకమునందును సకలసౌఖ్యములను ప్రసాదించుటకు సత్యవాక్పరిపాలనమే అత్యుత్తమసాధనమని తపోధనులు నుడువుదురు-" (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకాదశస్సర్గః *(11)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పదునొకొండవసర్గము సమాప్తము

-- * * * --

12. పండ్రెండవసర్గము

శ్రీరాముని వనములకు పంపెడి విషయమున దశరథుడు మిగుల పరితపించుచు కైకముందర తన ఆవేదనను ప్రకటించుట.

తతః శ్రుత్వా మహారాజః కైకేయ్యా దారుణం వచః।
చింతామ్ అభిసమాపేదే ముహూర్తం ప్రతతాప చ। 1

అంతట ఆ మహారాజు కైకేయి పలికిన కర్ణకఠోరమైన వచనములను వినినంతనే మిగుల చింతాక్రాంతుడయ్యెను. మఱియు ఒక క్షణకాలముపాటు మిక్కిలి పరితాపమునకు లోనయ్యెను. (1)

కిం ను మే యది వా స్వప్నః చిత్తమోహోఽపి వా మమ।
అనుభూతోపసర్గో వా మనసో వాప్యుపద్రవః।
ఇతి సంచింత్య తద్రాజా నాధ్యగచ్ఛత్ తదా సుఖమ్। 2

'సామాన్యముగా సత్స్వభావముగల కైకేయి రామపట్టాభిషేకమునకు విఘ్నకరముగా' ఇట్లు పలుకుట అసంభవము - కనుక ఇది స్వప్నము గావచ్చును. నిద్రయేలేని నాకు కలవచ్చుటయెట్లు? లేక ఇది నా చిత్తభ్రమ కావచ్చును. భ్రమపడుటకు కారణమేదియు కనబడదు - అందువలన ఇది జన్మాంతరసంఘటనస్మృతియా? జన్మాంతరమునందును ఇట్టిపరిస్థితి అసంభవము- కాబట్టి నామనస్సునకు ఉన్మాదము ఏర్పడినదా?' అని పలు విధముల చింతించుచు రాజు దుఃఖపడసాగెను (2)

ప్రతిలభ్య చిరాత్ సంజ్ఞాం కైకేయీవాక్యతాడితః।
వ్యథితో విక్లబశ్చైవ వ్యాఘ్రీం దృష్ట్వా యథా మృగః। 3

అసంవృతాయామాసీనో జగత్యాం దీర్ఘముచ్ఛ్వసన్।
మండలే పన్నగో రుద్ధో మంత్రైరివ మహావిషః। 4

కైకేయి యొక్క మాటలదెబ్బలకు స్పృహను కోల్పోయిన దశరథుడు కొంతసేపటికి తెప్పరిల్లియు, మరల దుఃఖితుడై, ఆడుపులిని జూచిన లేడివలె గిలగిలలాడెను. పిమ్మట అతడు కటికినేలపై చతికిలబడి, పాములవాడు గీచిన వృత్తాకార మండలమున మంత్రములచే బంధించబడిన మహావిషసర్పము వలె, నిట్టూర్పులు విడువసాగెను. (3-4)

అహో ధిగితి సామర్షో వాచముక్త్వా నరాధిపః।
మోహమాపేదివాన్ భూయః శోకోపహతచేతనః। 5

'ఛీ! ఏమిది?' అని పల్కుచు ఆ మహారాజు శోకభారముచే చైతన్యమును కోల్పోయి, మఱల మూర్ఛితుడాయెను. (5)

చిరేణ తు నృపస్సంజ్ఞాం ప్రతిలభ్య సుదుఃఖితః।
కైకేయీమ్ అబ్రవీత్ క్రుద్ధః ప్రదహన్నివ చక్షుషా। 6

చాలతడవునకు స్పృహరాగా ఆ రాజు ఎంతయు దుఃఖితుడై క్రుద్ధుడై, తనచూపులతో కైకను దహించివేయుచున్నవానివలె చూచుచు ఆమెతో ఇట్లనెను- (6)

నృశంసే దుష్టచారిత్రే కులస్యాస్య వినాశిని।
కిం కృతం తవ రామేణ పాపం పాపే మయాపి వా। 7

యదా తే జననీతుల్యాం వృత్తిం వహతి రాఘవః।
తస్యైవ త్వమనర్థాయ కిం నిమిత్తమిహోద్యతా। 8

'ఓసీ! క్రూరురాలా! దుష్టురాలా! వంశఘాతుకురాలా! పాపాత్మురాలా! రాముడు నీకు చేసిన అపకారమేమి? నేను చేసిన దోషమేమి? ఆ రాఘవుడు అనుక్షణము నిన్ను తల్లినివలె సేవించుచుండువాడు గదా! అట్టి రామునకు కీడుచేయుటకు ఎందులకు పూనుకొంటివి? అట్టి కోరిక కోరుటకు నీకు నోరెట్లువచ్చినది? (7-8)

త్వం మయాఽఽత్మవినాశార్థం భవనం స్వం ప్రవేశితా।
అవిజ్ఞానాన్నృపసుతా వ్యాళీ తీక్ష్ణవిషా యథా। 9

నీవు రాజకుమార్తెవు (ఉత్తమురాలివి) అని తలంచి, నీలో ఇంతవిషమున్నట్లు ఎఱుగక భయంకరమైన ఆడు విషసర్పమును వలె నిన్ను నా భవనమున ప్రవేశపెట్టితిని. ఆ విధముగా నావినాశమును నేనే కోరి తెచ్చుకొంటిని. (9)

జీవలోకో యదా సర్వో రామస్యాహ గుణస్తవమ్।
అపరాధం కముద్దిశ్య త్యక్ష్యామీష్టమహం సుతమ్। 10

లోకమంతయును శ్రీరామునిగుణగణములనే వేనోళ్ల ప్రస్తుతించుచుండగా, అతడు ఏ అపరాధము చేసినాడని నాప్రియసుతుని నేను త్యజింతును? (10)

కౌసల్యాం వా సుమిత్రాం వా త్యజేయమపి వా శ్రియమ్।
జీవితం వాత్మనో రామం న త్వేవ పితృవత్సలమ్। 11

పరా భవతి మే ప్రీతిః దృష్ట్వా తనయమగ్రజమ్।
అపశ్యతస్తు మే రామం నష్టా భవతి చేతనా। 12

తిష్ఠేల్లోకో వినా సూర్యం సస్యం వా సలిలం వినా।
న తు రామం వినా దేహే తిష్ఠేత్తు మమ జీవితమ్। 13

తదలం త్యజ్యతామేష నిశ్చయః పాపనిశ్చయే।
అపి తే చరణౌ మూర్ధ్నా స్పృశామ్యేష ప్రసీద మే। 14

కిమిదం చింతితం పాపే త్వయా పరమదారుణమ్। 15

అథ జిజ్ఞాససే మాం త్వం భరతస్య ప్రియాప్రియే।
అస్తు యత్తత్ త్వయా పూర్వం వ్యాహృతం రాఘవం ప్రతి। 16

స మే జ్యేష్ఠః సుతః శ్రీమాన్ ధర్మజ్యేష్ఠ ఇతీవ మే।
తత్ త్వయా ప్రియవాదిన్యా సేవార్థం కథితం భవేత్। 17

తచ్ఛ్రుత్వా శోకసంతప్తా సంతాపయసి మాం భృశమ్।
ఆవిష్టాసి గృహం శూన్యం సా త్వం పరవశం గతా। 18

ఇక్ష్వాకూణాం కులే దేవి సంప్రాప్తః సుమహానయమ్।
అనయో నయసంపన్నే యత్ర తే వికృతా మతిః। 19

న హి కించిదయుక్తం వా విప్రియం వా పురా మమ।
అకరోస్త్వం విశాలాక్షి తేన న శ్రద్దధామ్యహమ్। 20

నను తే రాఘవస్తుల్యో భరతేన మహాత్మనా।
బహుశో హి సుబాలే త్వం కథాః కథయసే మమ। 21

కౌసల్యనైనను, సుమిత్రనైనను, నా రాజ్యలక్ష్మినైనను త్యజింతును అంతేగాదు కడకు నా ప్రాణములను సైతము పరిత్యజించెదను. కాని పితృవత్సలుడైన శ్రీరామునిమాత్రము విడువజాలను. (11)

నా పెద్దకుమారుడైన శ్రీరాముని జూచినప్పుడు నాకుకలిగెడు సంతృప్తికి మేరయేయుండదు. ఒక్క క్షణమైనను రాముని చూడనిచో నా ప్రాణములే నిలువవు. (12)

సూర్యుడు లేకున్నను ఒకవేళ లోకము మనుగడ సాగించిన సాగించవచ్చును. నీరు లేకున్నను (వానలు పడకున్నను) ఒకవిధముగా పైరు బ్రతికిన బ్రతుకవచ్చును. కాని రాముడు లేకున్నచో మాత్రము నా ఈ దేహములో ప్రాణములుండవు. (13)

ఓ పాపసంకల్పురాలా! ఇంతవఱకును నీవు చేసినవిర్వాకము చాలును. ఇంక శ్రీరాముని వనములకు పంపెడిఆలోచనలను నీమనస్సునుండి తొలగింపుము. శిరసా నీపాదములకు ప్రణమిల్లెదను. ఈ దీనుని కనికరింపుము. ఓ పాపాత్మురాలా! ఇంతటి దారుణమైన దురాలోచన నీ మనస్సునకు ఎట్లు వచ్చినది? (14-15)

భరతునిపై నాకు ప్రేమ యున్నదో లేదో తెలిసికొనగోరుచున్నావా? అయితే సరే! 'భరతుని యువరాజ పట్టాభిషిక్తుని జేయుము' అని మొదటి వరము కోరితివి. అది నాకు సమ్మతమే. ఇదివరలో రామునిగూర్చి 'అతడు పెద్ద కుమారుడు, సర్వశుభలక్షణములు గలవాడు, ధర్మవర్తనులలో ప్రథముడు' అని నాతో నీవు మాటిమాటికి నుడివియుంటివి. ప్రియభాషిణివైన నీవు నాతృప్తి కొఱకై అట్లు చెప్పియుండవచ్చును. లేక నీకు రాముడొనర్చిన సేవలను బట్టి నీవు ఆ విధముగా నుడివియుండవచ్చును. ఇప్పుడు రామపట్టాభిషేకవార్తను వినిన పిమ్మట ఇతరులు చెప్పిన చాడీలకు లొంగి శోకమున మునిగి, ఈ కోపగృహమున ప్రవేశించితివేమో? ఆ కారణముననే నన్ను ఇట్లు మిక్కిలి బాధించుచుంటివి. (16-18)

ఓ దేవీ! ఇంతవఱకును ఇక్ష్వాకుప్రభువులవంశము నీతి నియమములకు నిలయము, పేరుప్రతిష్ఠలకు పెన్నిధి. ఆవంశమున మెట్టిన నీకు ఈ విపరీతబుద్ధి ఎట్లు పుట్టినది? దీనివలన ఆ సద్వంశమునకు గొప్ప అనర్థము సంభవించును - ఇది అనర్థ సూచకము - (19)

ఓ విశాలాక్షీ! ఇంతవఱకును ఎన్నడును నీవు నాకు హితముగాని పనిని చేసియుండలేదు. అప్రియవచనములను పలికియుండలేదు- కనుక నీవు పలికిన ఈమాటలను నేను విశ్వసించుటలేదు. (నన్ను పరీక్షించుటకై ఇట్లనుచున్నావేమో!) (20)

కపటమెఱుగనికైకేయీ! 'బుద్ధిమంతుడైన భరతుడు, శ్రీరాముడు ఇద్దఱును నాకు సమానులే' అని పెక్కు సందర్భములలో కథలు కథలుగా ప్రేమతో నీవు నాతో నుడువుచుండెడిదానవు

తస్య ధర్మాత్మనో దేవి వనే వాసం యశస్వినః।
కథం రోచయసే భీరు నవ వర్షాణి పంచ చ। 22

గదా! ఓ దేవీ! ధర్మాత్ముడును, యశస్వియును ఐన శ్రీరాముడు పదునాలుగుసంవత్సరములకాలము వనములలో నివసించుట నీకు ఎట్లు రుచించుచున్నది? ఈ అకృత్యమునకు ఎట్లు పాల్పడుచుంటివి? అధర్మకార్యముచేయుటకు భయపడు నీ స్వభావము ఏమైనది? (21-22)

అత్యంతసుకుమారస్య తస్య ధర్మే ధృతాత్మనః।
కథం రోచయసే వాసమ్ అరణ్యే భృశదారుణే। 23

రోచయస్యభిరామస్య రామస్య శుభలోచనే।
తవ శుశ్రూషమాణస్య కిమర్థం విప్రవాసనమ్। 24

తాకినంతనే కందిపోయెడి శరీరసౌకుమార్యముగలవాడును, చెక్కుచెదరని ధర్మబుద్ధిగలవాడును ఐన శ్రీరాముడు మిక్కిలి భయంకరమైన అడవులలో నివసింపవలెనని నీవు ఎట్లు అభిలషించుచున్నావు? అందమైన చూపులుగల ఓ దేవీ! ఎల్లరకును ఆనందమునుగూర్చెడి శ్రీరాముడు నిత్యము ప్రీతితో నిన్ను సేవించుచుండెడువాడుగదా! అట్టి నయనాభిరాముని దూరముగా పంపివేయుటకు నీ మనస్సు ఎట్లు అంగీకరించుచున్నది? (23-24)

రామో హి భరతాద్భూయః తవ శుశ్రూషతే సదా।
విశేషం త్వయి తస్మాత్తు భరతస్య న లక్షయే। 25

సర్వదా భరతునికంటెను రాముడే నీకు సపర్యలు చేయుచుండుట నేను గమనించితిని - కాని శ్రీరాముని కంటెను అధికముగా భరతుడు నిన్ను సేవించుచుండుట యథార్థముగా నేను చూడనేలేదు. (25)

శుశ్రూషాం గౌరవంచైవ ప్రమాణం వచనక్రియామ్।
కస్తే భూయస్తరం కుర్యాత్ అన్యత్ర మనుజర్షభాత్। 26

శ్రీరామునివలె నిన్ను సేవించెడువాడుగాని, నీయెడ గౌరవ ప్రపత్తులను చూపెడివాడుగాని, నీయందు పూజ్యభావమును (ప్రమాణబుద్ధిని) కలిగియుండువాడుగాని, నీవు చెప్పినట్లు చేయువాడుగాని మఱియొకడు లేనే లేడు. (26)

బహూనాం స్త్రీసహస్రాణాం బహూనాం చోపజీవినామ్।
పరివాదోఽపవాదో వా రాఘవే నోపపద్యతే। 27

మనకడ వేలకొలదిపరిచారికలు, సేవకులు గలరు - వారిలో ఏ యొక్కరును శ్రీరాముని నిందించుటగాని, ఆయనను గూర్చి అవమానకరముగా మాటాడుటగాని నేనెఱుగను- అనగా శ్రీరాముడు ఎల్లరకును గౌరవార్హుడు. ఇక ఏకారణముచే నేనతనిని అడవులకు పంపవలెను? (27)

సాంత్వయన్ సర్వభూతాని రామః శుద్ధేన చేతసా।
గృహ్ణాతి మనుజవ్యాఘ్రః ప్రియైః విషయవాసినః। 28

నరోత్తముడైన శ్రీరాముడు నిర్మలమైన మనస్సుతో సమస్త ప్రాణులను ఆనందింపజేయుచుండును. దేశప్రజలందఱిని అక్కునజేర్చుకొనుచు వారి అభీష్టములను తీర్చుచుండును. (28)

సత్యేన లోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః।
గురూన్ శుశ్రూషయా వీరో ధనుషా యుధి శాత్రవాన్। 29

రఘువంశసంజాతుడైన శ్రీరాముడు సత్యవచనుడు[1] (స్వర్గాది) సమస్తలోకములయందలి ప్రాణులకు హితమునర్చుచు వారిని స్వాధీనులనుగా చేసికొనును. నిర్ధనులకు ధనధాన్యములను ఒసంగుటద్వారా వారిని ఆదుకొని, వశమునందుంచుకొనును. బహుళముగను సముచితముగా ఉపదేశములను చేయుటలో సమర్థుడైన

1) ఒకానొకప్పుడు భోజమహారాజు తనకు సన్నిహితుడైన మధ్యమవీధిభట్టారకపండితుని ఇట్లు ప్రశ్నించెను- 'రాముడు తననుగూర్చితానే' 'నేను మనుష్యమాత్రుడను' (ఆత్మానం మానుషం మన్యే) అని పేర్కొన్నాడుగదా! మరి 'జటాయువునకు మోక్షమునిచ్చెను' (జటాయుషే మోక్షం దత్తవాన్) అనుట ఎట్లు కుదురును? మోక్షమును ప్రసాదించువాడు భగవంతుడు మాత్రమే గదా! (మోక్షం ఇచ్ఛేత్ జనార్దనాత్ - అని గదా ప్రమాణము) - దీనికి సమాధానముగా 'సత్యేన లోకాన్ జయతి' - రాముడు తనసత్యవచన ప్రభావముచే సర్వలోకములను జయింపగల సమర్థుడు - కనుక అతడు మోక్షమునుగూడ ప్రసాదించెను - అని పండితుడు పలుకగా, రాజు ఆ పండితునకు కొల్లలుగా బహుమానములను ఇచ్చి ఆయనను సత్కరించెను - అను కథ ఇచట స్మరింపదగినది-

సత్యం దానం తపస్త్యాగో మిత్రతా శౌచమార్జవమ్ ।
విద్యా చ గురుశుశ్రూషా ధ్రువాణ్యేతాని రాఘవే । 30

తస్మిన్నార్జవసంపన్నే దేవి దేవోపమే కథమ్ ।
పాపమాశంససే రామే మహర్షిసమతేజసి । 31

న స్మరామ్యప్రియం వాక్యం లోకస్య ప్రియవాదినః ।
స కథం త్వత్కృతే రామం వక్ష్యామి ప్రియమప్రియమ్ । 32

క్షమా యస్మిన్ దమస్త్యాగః సత్యం ధర్మః కృతజ్ఞతా ।
అప్యహింసా చ భూతానాం తమృతే కా గతిర్మమ । 33

మమ వృద్ధస్య కైకేయి గతాంతస్య తపస్వినః ।
దీనం లాలప్యమానస్య కారుణ్యం కర్తుమర్హసి । 34

పృథివ్యాం సాగరాంతాయాం యత్కించిదధిగమ్యతే ।
తత్సర్వం తవ దాస్యామి మా చ త్వాం మన్యురావిశేత్ । 35

అంజలిం కుర్మి కైకేయి పాదౌ చాపి స్పృశామి తే ।
శరణం భవ రామస్య మాఽధర్మో మామిహ స్పృశేత్ । 36

ఇతి దుఃఖాభిసంతప్తం విలపంతమ్ అచేతనమ్ ।
ఘూర్ణమానం మహారాజం శోకేన సమభిప్లుతమ్ । 37

పారం శోకార్ణవస్యాశు ప్రార్థయంతం పునఃపునః ।
ప్రత్యువాచాథ కైకేయీ రౌద్రా రౌద్రతరం వచః । 38

యది దత్త్వా వరౌ రాజన్ పునః ప్రత్యనుతప్యసే ।
ధార్మికత్వం కథం వీర పృథివ్యాం కథయిష్యసి । 39

గురువులను చక్కనిసపర్యలతో తృప్తిపఱచుచుండును, రణరంగమున ధనుష్టంకారముచేతనే శత్రువులను జయించును. సత్యము, దానము, తపస్సు, త్యాగము, మైత్రి, పవిత్రత, ఆర్జవము, విద్య, గురుశుశ్రూష అనునవి శ్రీరామునియందు స్థిరముగా ఉండెడి సద్గుణములు[1]. ఓ దేవీ! ఇట్టి సద్గుణ శోభితుడు, మహర్షులవలె శమదమాదిగుణసంపన్నుడు, దైవతుల్యుడు ఐన అట్టి శ్రీరాముని అడవులకు పంపుమని (పొమ్మని కోరికను) ఎట్లు అడుగు చుంటివి? (29-31)

జనులందరికిని ప్రియమును గల్గించుచు మాట్లాడునట్టి శ్రీరాముని వనములకు పంపుటనుగూర్చి మనస్సునగూడ తలంచజాలను. పరుషముగా మాట్లాడనట్టి నీకొఱకై నా ప్రియపుత్రుడైన రామునితో ఈ అప్రియవచనమును ఎట్లు పలుకగలను? (32)

క్షమ, ఇంద్రియనిగ్రహము, త్యాగము, సత్యము, ధర్మము, కృతజ్ఞత, భూతదయ, మున్నగు సద్గుణములుగల నా రాముడు లేనిచో నాకు రక్షకుడు ఎవరు? (అట్టి రక్షకుని నేను అడవులకు ఎట్లు పంపగలను?) (33)

ఓ కైకేయీ! నేను వృద్ధుడను, జీవితముని చివరిదశకు చేరినవాడను, శోచనీయస్థితిలోనున్నవాడను. దీనముగా విలపించుచున్నవాడను అట్టి నాపై నీవు కనికరముచూపదగును. (34)

సముద్రములవఱకును వ్యాపించియున్న సమస్తభూమండలమున లభించు సకలసంపదలను నీకు సమర్పింతును. రాముని విషయమున క్రోధమును (పట్టుదలను) వీడుము - (35)

ఓ కైకేయీ! చేతులుజోడించి నమస్కరించుచున్నాను. నీ పాదములనుగూడ పట్టుకొందును. రాముని రక్షింపుము. ప్రతిజ్ఞాభంగరూపమైన అధర్మము నన్నంటకుండుగాక- శ్రీరాముడు ఇచటనే ఉండుటకు అతనిని అనుమతింపుము-" (36)

ఈ విధముగా పలుకుచు దశరథుడు దుఃఖాతిరేకముతో కుమిలి పోవుచు విలపింపసాగెను. ఇంకను ఆ రాజు దిక్కుతోచనివాడై, నేలపైబడి అటునిటు పొర్లుచుండెను. ముందు కలుగనున్న రాముని యెడబాటును పదే పదే స్మరించుకొనుచు శోకమగ్నుడగుచుండెను. ఆ దుఃఖసముద్రము నుండి బయటపడుటకై మాటి మాటికి అతడు ఆమెను వేడుకొనుచుండెను. అంతటకైకేయి క్రుద్ధురాలై రౌద్రాకారమును పూని, ఆయనతో ఇంకను కఠినముగా మాట్లాడసాగెను. (37-38)

"ఓ రాజా! నాకిచ్చిన రెండువరములవిషయమున మఱల నీవు ఈ విధముగా పశ్చాత్తాపపడుచున్నచో, నీ ధార్మికత్వమును గూర్చి ఈ భూమండలమున నీవు ఎట్లు సమర్థించుకొనగలవు?

1) సత్యము= మనస్సుచే, వాక్కుచే ఆచరణచే ఒకే విధముగానుండుట - దానము = పరలోక ప్రయోజనము, తపస్సు = శాస్త్రవిహిత భోజనమునుగూడ విరమించుట మున్నగురీతి, త్యాగము = ఐహిక ప్రయోజనము - మైత్రిత = అందరితో సుహృద్భావము, శౌచము = స్నానము చేయుటవలనకలిగెడు దేహశుభ్రత, అంతశ్శుద్ధి, ఆర్జవము = పరచిత్తములకు అనువుగా వర్తించుట, ఋజుత్వము, విద్య = తత్త్వ జ్ఞానము, గురుశుశ్రూష = గురువులకుచేయు పాదసంవాహనాది పరిచర్య.

యదా సమేతా బహవః త్వయా రాజర్షయస్సహ।
కథయిష్యంతి ధర్మజ్ఞ తత్ర కిం ప్రతివక్ష్యసి। 40

ఓ ధర్మజ్ఞా! ఎప్పుడైనను పెక్కుమంది రాజర్షులు నీతోగూడి ధర్మప్రసంగము చేయునపుడు వారు "యుద్ధమున నీకు ఉపకారము చేసిన కైకేయికి నీవు ప్రత్యుపకారమేమి చేసితివి?" అని నిన్నడిగినచో వారికి నీవు ఏమని సమాధానము చెప్పగలవు? (39-40)

యస్యాః ప్రసాదే జీవామి యా చ మామభ్యపాలయత్।
తస్యాః కృతం మయా మిథ్యా కైకేయ్యా ఇతి వక్ష్యసి। 41

యుద్ధమున మూర్ఛితుడవైన నాకు శైత్యోపచారములు చేసి నన్ను ఆమె కాపాడెను. ఆమె సహాయమువలననే నేను జీవించి యున్నాను. అట్టి ఉపకారమొనర్చిన కైకేయికి ఇచ్చిన మాటతప్పితిని-" అని వారితో పలికెదవా? (41)

కిల్బిషత్వం నరేంద్రాణాం కరిష్యసి నరాధిప।
యో దత్త్వా వరమద్యైవ పునరన్యాని భాషసే। 42

ఓ రాజా! అప్పుడు నాకు వరములను ఇచ్చి, ఇప్పుడు మాట మార్చుచున్నావు. దీనివలన (నీయొక్క నీవలన) రాజులందఱును అపకీర్తిపాలగుదురు. (42)

శైబ్యః శ్యేనకపోతీయే స్వమాంసం పక్షిణే దదౌ।
అలర్కః చక్షుషీ దత్త్వా జగామ గతిముత్తమామ్। 43

డేగకును పావురమునకును విరోధము ఏర్పడినప్పుడు శిబిచక్రవర్తి డేగకు తనశరీరమునందలి మాంసమును కోసి ఇచ్చి, పావురమును కాపాడెను[1]. అలర్కుడను మహారాజు అంధుడైన ఒక బ్రాహ్మణునకు నేత్రదానము చేసి, ఆ బ్రాహ్మణుని ఆదుకొని, తాను పరమగతిని పొందెను.[2] (43)

సాగరః సమయం కృత్వా న వేలామతివర్తతే।
సమయం మాఽనృతం కార్షీః పూర్వవృత్తమనుస్మరన్। 44

దేవతల ప్రార్థనను మన్నించి, వారియెదుట చేసిన ప్రతిజ్ఞ ప్రకారము సముద్రుడు నేటికిని చెలియలికట్టను దాటుట లేదు- అట్లే నీవును పూర్వులైన శిబిచక్రవర్తి, అలర్కుడు మొదలగు మాన్యులవృత్తాంతములను స్మరించుచు నీవుచేసిన ప్రతిజ్ఞను వమ్ముచేయవద్దు. (44)

సత్యం ధర్మం పరిత్యజ్య రామం రాజ్యేఽభిషిచ్య చ।
సహ కౌసల్యయా నిత్యం రంతుమిచ్ఛసి దుర్మతే। 45

ఓ దుర్మతీ! చేసిన వాగ్దానమును మఱచి, ధర్మవిరుద్ధముగా రామునకు యువరాజపట్టమును కట్టబెట్టి, కౌసల్యతో నిత్యము సుఖపడుటకు వాంఛించు చున్నావా? (45)

భవత్వధర్మో ధర్మో వా సత్యం వా యది వాఽనృతమ్।
యత్త్వయా సంశ్రుతం మహ్యం తస్య నాస్తి వ్యతిక్రమః। 46

రామునకుగాక భరతునకు పట్టముగట్టుట ధర్మమో అధర్మమో నేనెఱుగను. రాముని వనములకు పంపుమని నేను కోరుట యుక్తమో అయుక్తమో నాకు తెలియదు. నీవు నాకిచ్చిన వాగ్దానమునకు వ్యతిరేకముగా జరుగుటకు మాత్రము వీలులేదు (46)

1) దేవేంద్రుడు, అగ్నిదేవుడు శిబి చక్రవర్తియొక్క ఔదార్యమును పరీక్షింపగోరిరి. వెంటనే ఇంద్రుడు డేగగాను, అగ్ని పావురముగాను మారిరి. పావురమును డేగ తరుముకొనివచ్చుచుండగా అది శిబి చక్రవర్తిని ఆశ్రయించెను. దానిని వెంబడించివచ్చిన డేగ 'ఈ పావురము నా ఆహారము. దీనిని నేను భక్షింతును - కనుక దీనిని విడువుము' - అని అది శిబి చక్రవర్తితో పలికెను. అప్పుడు శిబి చక్రవర్తి పావురము బరువునకు సమానమైన మాంసమును తనశరీరమునుండి కోసి, డేగకిచ్చి, పావురమును రక్షించెను. అపుడు ఇంద్రుడు, అగ్ని తమనిజరూపములను పొంది, శిబిచక్రవర్తియౌదార్యమును భూతదయను కొనియాడి, వారు ఆయనకు వరములనిచ్చిరి.

2) పూర్వము 'అలర్కుడు' అనురాజర్షియుండెను. ఆయనకడకు ఒక అంధుడైన బ్రాహ్మణుడు వచ్చెను. అపుడు రాజు 'నీకేమికావలయునో కోరుకొనుము' అని ఆ విప్రునితో పల్కెను. అంతట ఆ ద్విజుడు 'నేను అంధుడను. నాకు నేత్రదానము చేయుము' - అని అర్థించెను. వెంటనే ఆ అలర్కరాజు తన నేత్రములను ఆ బ్రాహ్మణునకు దానము చేసి, పరమగతిని పొందెను.

అహం హి విషమద్యైవ పీత్వా బహు తవాగ్రతః।
పశ్యతస్తే మరిష్యామి రామో యద్యభిషిచ్యతే। 47

ఏకాహమపి పశ్యేయం యద్యహం రామమాతరమ్।
అంజలిం ప్రతిగృహ్ణంతీం శ్రేయో నను మృతిర్మమ। 48

భరతేనాత్మనా చాహం శపే తే మనుజాధిప।
యథా నాన్యేన తుష్యేయమ్ ఋతే రామవివాసనాత్। 49

ఏతావదుక్త్వా వచనం కైకేయీ విరరామ హ।
విలపంతం చ రాజానం న ప్రతివ్యాజహార సా। 50

శ్రుత్వా తు రాజా కైకేయ్యా వృతం పరమశోభనమ్।
రామస్య చ వనే వాసమ్ ఐశ్వర్యం భరతస్య చ। 51

నాభ్యభాషత కైకేయీం ముహూర్తం వ్యాకులేంద్రియః।
ప్రైక్షతానిమిషో దేవీం ప్రియామ్ అప్రియవాదినీమ్। 52

తాం హి వజ్రసమాం వాచమ్ ఆకర్ణ్య హృదయాప్రియామ్।
దుఃఖశోకమయీం ఘోరాం రాజా న సుఖితోఽభవత్। 53

స దేవ్యా వ్యవసాయం చ ఘోరం చ శపథం కృతమ్।
ధ్యాత్వా రామేతి నిశ్వస్య ఛిన్నస్తరురివాపతత్। 54

నష్టచిత్తో యథోన్మత్తో విపరీతో యథాతురః।
హృతతేజా యథా సర్పో బభూవ జగతీపతిః। 55

దీనయా తు గిరా రాజా ఇతి హోవాచ కైకయీమ్। 56

అనర్థమిమమర్థాభం కేన త్వముపదర్శితా।
భూతోపహతచిత్తేవ బ్రువంతీ మాం న లజ్జసే। 57

శీలవ్యసనమేతత్ తే నాభిజానామ్యహం పురా।
బాలాయాస్తత్త్విదానీం తే లక్షయే విపరీతవత్। 58

కుతో వా తే భయం జాతం యా త్వమేవంవిధం వరమ్। 59

నీవు రామునకే పట్టాభిషేకము చేసినచో నేను ఇప్పుడే నీయెదుటనే, నీవుచూచుచుండగానే కాలకూటవిషమును త్రాగి, చనిపోయెదను. (47)

కౌసల్యాదేవి 'రాజమాత'గా గౌరవమర్యాదములను పొందుచుండగ చూచుచు ఒక్క దినమైనను బ్రతుకజాలను. ఆ దుస్స్థితిని సహించుచు జీవించుటకంటెను నాకు మరణమే మేలు. (48)

"రాముని వనవాసమునకు పంపుటకుదప్ప దేనికిని నేను తృప్తి చెందను. ఈ మాటలను భరతుని మీదను, నా మీదను ఒట్టు పెట్టుకొని చెప్పుచున్నాను." (49)

కైకేయి ఈ విధముగా పలికి మిన్నకుండెను. రాజుగారు ఎంతగా విలపించుచున్నను ఆమె మాఱుమాటాడలేదు. (50)

రామునకు వనవాసము, భరతునకు పట్టాభిషేకము- అనునవి కైకేయికి సంతోషకరములు, దశరథునకు మాత్రము దుఃఖకారకములు. ఆ రెండు వరములను కైకేయినోట విని, అతడు ఏమియు మాట్లాడక క్షణకాలము నిశ్చేష్టుడైయుండెను. పిమ్మట అతడు 'నాకెంతో ప్రియమైన రాణి(కైక)యేనా ఇట్లు అప్రియములను పలుకుచున్నది?' అని విస్మయపడుచు రెప్పవాల్చక ఆమెను చూడసాగెను. (51-52)

వజ్రమువలె కఠినాతికఠినములైనవియు, హృదయవిదారకము లైనవియు, దుఃఖకారకములు, శోక భూయిష్ఠములు ఐనవియు, ఆగు ఆ కర్ణకఠోరవచనములను వినుటతో రాజునకు సుఖశాంతులు కఱవయ్యెను. (53)

రాణియొనర్చిన ఘోరమైన కుటిలప్రయత్నప్రభావమున తాను చేసిన ప్రతిజ్ఞను, కైకచేదరింపును తలంచుకొనుచు, చేయునది లేక రాజు పదేపదే 'రామా! రామా!' అని నిట్టూర్చుచు మొదలునఱికిన చెట్టువలె నేలకొరిగెను. (54)

అంతట ఆ రాజు ఉన్మత్తునివలె వికలమనస్కుడాయెను, సన్నిపాతరోగివలె విపరీతప్రవృత్తి గలవాడయ్యెను, మంత్రబద్ధమైన సర్పమువలె నిశ్చేష్టుడాయెను. (55)

పిమ్మట దశరథుడు కైకతో దీనముగా ఇట్లనుడివెను. "ఓ కైకా! నీకు ఈ విషయములు పైపైన ప్రయోజనకరములుగా అనిపించుచున్నను వాస్తవముగా ఇవి వినాశకారకములు. ఈ దుర్బోధలను నీకు ఎవరు నూరిపోసిరి? నీవు పిశాచముపట్టిన దానివలె నాతో మాట్లాడుచుంటివి. నీకు సిగ్గులేదా? లోగడ నీ చిన్నతనమునందు ఈ దుష్ప్రవృత్తిని నీలో నేనెన్నడును చూడలేదు. ఇప్పుడు ప్రౌఢవయస్సులోనున్న నీలో ఈ విపరీత లక్షణములను చూచుచున్నాను. (56-58)

భరతునిపట్టాభిషేకము, రామునివనవాసము- అను ఈ విధమైన వరములను కోరుటకు కారణమేమి? నీవెందులకు భయపడుచుంటివి? నీవు భయపడవలసిన పనిలేదు. నీ

రాష్ట్రే భరతమాసీనం వృణీషే రాఘవం వనే।
విరసైతేన భావేన త్వమేతే నానృతేన వా।
యది భర్తుః ప్రియం కార్యం లోకస్య భరతస్య చ। 60

నృశంసే పాపసంకల్పే క్షుద్రే దుష్కృతకారిణి।
కిన్ను దుఃఖమలీకం వా మయి రామే చ పశ్యసి। 61

న కథంచిదృతే రామాత్ భరతో రాజ్యమావసేత్।
రామాదపి హితం మన్యే ధర్మతో బలవత్తరమ్। 62

కథం ద్రక్ష్యామి రామస్య వనం గచ్ఛేతి భాషితే।
ముఖవర్ణం వివర్ణం తం యథైవేందుముపప్లుతమ్। 63

తాం హి మే సుకృతాం బుద్ధిం సుహృద్భిస్సహ నిశ్చితామ్।
కథం ద్రక్ష్యామ్యపావృత్తాం పరైరివ హతాం చమూమ్। 64

కిం మాం వక్ష్యంతి రాజానో నానాదిగ్భ్యస్సమాగతాః।
బాలో బతాయమైక్ష్వాకః చిరం రాజ్యమకారయత్। 65

యదా తు బహవో వృద్ధా గుణవంతో బహుశ్రుతాః।
పరిప్రక్ష్యంతి కాకుత్స్థం వక్ష్యామి కిమహం తదా। 66

కైకేయ్యా క్లిశ్యమానేన రామః ప్రవ్రాజితో మయా।
యది సత్యం బ్రవీమ్యేతత్ తదసత్యం భవిష్యతి। 67

కిం మాం వక్ష్యతి కౌసల్యా రాఘవే వనమాస్థితే।
కిం చైనాం ప్రతివక్ష్యామి కృత్వా విప్రియమీదృశమ్। 68

యదా యదా హి కౌసల్యా దాసీవచ్చ సఖీవ చ।
భార్యావద్భగినీవచ్చ మాతృవచ్చోపతిష్ఠతి। 69

ప్రియపుత్రుడైన భరతునకును, నీ భర్తకును, ఈ లోకమునకును (ప్రజలకును) శుభమును కల్గింపదలచినచో నీవు ఈ దుష్ట సంకల్పములను, పాపపు ఆలోచనలను వీడుము. (59-60)

ఓ కఠినాత్మురాలా! పాపసంకల్పము కలదానా! అల్పబుద్ధి గలదానా! దుష్టాత్మురాలా! నావలనగాని, రామునివలనగాని ఏ దుఃఖము కల్గునని తలంచుచుంటివి? ఎట్టి అప్రియము వాటిల్లునని భావించుచుంటివి? (61)

శ్రీరామునికాదని భరతుడు ఏ విధముగను, ఎట్టి పరిస్థితులలోను రాజ్యాధికారమును అంగీకరింపడు. వాస్తవముగా భరతుడు రామునిమించిన ధర్మపరాయణుడని నేననుకొందును (62)

'రామా! వనములకు వెళ్లుము' - అని పలికిన వెంటనే రాహుగ్రస్త చంద్రునివలె ఆయనముఖకాంతి వెలవెలబోవును. అట్టి వివర్ణమైన ముఖమును నేనెట్లు చూడగలను? (63)

ప్రతిభాశాలురైన సచివులతో, గురువులతో బాగుగా చర్చించిన పిమ్మట రామపట్టాభిషేకము నిశ్చయమైనది. శత్రువులచే పరాజితమై, వెనుదిరిగిన సైన్యమువలె, ఆ నిశ్చయము తారుమారగుటను నేనెట్లు చూడగలను? వివిధదిక్కులనుండి వచ్చిన రాజులందఱును 'ఇక్ష్వాకువంశమున బుట్టిన ఈ మూఢుడు ఇంతకాలమువఱకును రాజ్యమును ఎట్లు పరిపాలించెను' అని నిందాపూర్వకముగా నన్నుగూర్చి అనుకొనరా? (64-65)

రేపు ప్రాతఃకాలమున (తెల్లవారగానే) సజ్జనులైన వృద్ధులు, పండితులు 'శ్రీరాముడెక్కడ? ఆయన పట్టాభిషేకము ఎందులకు ఆగిపోయినది?' అని నన్ను నిలదీసి అడిగినచో వారికి నేనేమని సమాధానము చెప్పగలను? (66)

కైకేయి చేసిన యొత్తిడికిలోనై శ్రీరాముని అడవులకు పంపితిని - అని నేను వారికి చెప్పినచో, నేను పలికిన వరములను నిలబెట్టుకొననివాడనుఅగుదునేమోగాని, "శ్రీరాముని యువరాజ పట్టాభిషిక్తుని చేయుచున్నాను' - అని అందఱినడుమ పలికిన మాటనుమాత్రము తప్పినవాడనగుదునుగదా! (67)

'మీరు శ్రీరాముని వనములకు ఎందులకు పంపితిరి? అతడు మీకు చేసిన అపకారమేమి?' అని కౌసల్య నన్ను ప్రశ్నించినచో - ఇట్టి అప్రియకార్యమొనర్చిన నేను ఆమెకు ఏమని సమాధానము చెప్పగలను? (68)

కౌసల్యాదేవి పట్టపురాణియయ్యును దాసివలె నాకు పరిచర్యలు చేయుచుండును. ద్యూతక్రీడాది సందర్భములలో నాకు నెచ్చెలివలె వ్యవహరించును. ధర్మానుష్ఠానసమయముల యందు భార్యవలె సహకరించును. సుమిత్రాదులను నేను పెండ్లియాడినపుడు ఆమె నన్ను సోదరివలె లాలించెను. శరీర పోషణాది విషయములయందు తల్లివలె నాయెడవాత్సల్యమును

సతతం ప్రియకామా మే ప్రియపుత్త్రా ప్రియంవదా।
న మయా సత్కృతా దేవీ సత్కారార్హా కృతే తవ। 70

ఇదానీం తత్ తపతి మాం యన్మయా సుకృతం త్వయి।
అపథ్యవ్యంజనోపేతం భుక్తమన్నమివాతురమ్। 71

విప్రకారం చ రామస్య సంప్రయాణం వనస్య చ।
సుమిత్రా ప్రేక్ష్య వై భీతా కథం మే విశ్వసిష్యతి। 72

కృపణం బత వైదేహీ శ్రోష్యతి ద్వయమప్రియమ్।
మాం చ పంచత్వమాపన్నం రామం చ వనమాశ్రితమ్। 73

వైదేహీ బత మే ప్రాణాన్ శోచంతీ క్షపయిష్యతి।
హీనా హిమవతః పార్శ్వే కిన్నరేణేవ కిన్నరీ। 74

న హి రామమహం దృష్ట్వా ప్రవిశంతం మహావనే।
చిరం జీవితుమాశంసే రుదంతీం చాపి మైథిలీమ్। 75

సా నూనం విధవా రాజ్యం సపుత్త్రా కారయిష్యసి।
న హి ప్రవ్రాజితే రామే దేవి జీవితుముత్సహే। 76

సతీం త్వామహమత్యంతం వ్యవస్యామ్యసతీం సతీమ్।
రూపిణీం విషసంయుక్తాం పీత్వేవ మదిరాం నరః। 77

అనృతైర్బహు మాం సాంత్వైః సాంత్వయంతీస్మ భాషసే।
గీతశబ్దేన సంరుధ్య లుబ్ధో మృగమివావధీః। 78

అనార్య ఇతి మామార్యాః పుత్త్రవిక్రాయికం ధ్రువమ్।
ధిక్కరిష్యంతి రథ్యాసు సురాపం బ్రాహ్మణం యథా। 79

ప్రవర్తించును - ఆమె ఎల్లప్పుడు నా హితమునే కోరునది- నాకు శ్రీరామునివంటి ప్రియపుత్త్రుని ప్రసాదించినది.[1] సర్వదా నాతో ప్రియముగా మాటాడుచుండునది- ఇట్టి సద్గుణములచే సత్కారార్హురాలైన ఆ దేవిని నీ కారణముగా సత్కరింపక, ఉపేక్షించితిని. (69-70)

నీపైగల ప్రేమాతిశయముచే నీకు ఎంతయో ఉపకారము చేసితిని. ఒకవిధముగా అది నేనాచరించిన మహాపరాధము. అపథ్యాహారమును భుజించిన రోగిని అది బాధించునట్లు నీకు నేనొనర్చిన ఉపకారము ఈ నాడు నన్ను పీడించుచున్నది. (71)

శ్రీరాముని యువరాజపట్టాభిషేకము నిలిపివేయబడి నేను ఆయనను అడవులకు పంపుటను జూచి, సుమిత్ర "మున్ముందు నా కుమారులకును ఏగతి పట్టునో?" అని భయపడును - ఇంక నన్ను నమ్మనే నమ్మదు- (72)

శ్రీరాముడు అడవులకు వెళ్లుటయు జరిగినచో నేను మరణించుట తథ్యము - అయ్యయ్యో! దుఃఖకరములైన ఈ రెండు వార్తలను సీతాదేవి ఒకే సారి వినవలసివచ్చును. ఎంతటి దారుణవిషయమిది? (73)

శ్రీరాముడు వనములకు వెళ్లుటయే తటస్థించినచో ఆయన ఎడబాటును తట్టుకొనలేక సీతాదేవి, హిమవత్పర్వత ప్రాంతమున కిన్నరునకు దూరమైన కిన్నరివలె విలవిలలాడును. ఆ దుస్థితిని జూడజాలక నా ప్రాణములు గాలిలో కలిసిపోవుట మాత్రము నిజము. (74)

శ్రీరాముడు భయంకరమైన వనములకు వెళ్లుచుండుటను, పతియెడబాటునకు ఓర్చుకొనలేక సీత విలపించుచుండుటను చూచిన పిమ్మట ఇక నాలో జీవితేచ్ఛయే మిగులదు. (75)

ఓ కైకేయీ! శ్రీరాముడు వనములకు వెళ్లుటయే జరిగినచో నాలో బ్రతుకుమీదిఆశయే అంతరించును. ఇది నిశ్చయము. అప్పుడు విధవవైన నీవు నీ పుత్త్రునితోగూడి రాజ్యమును యథేచ్ఛగా ఏలుకొనవచ్చును సుమా! (76)

చూచుటకింపైన మద్యమును త్రాగి, ఆ పిమ్మట తనలో వికారములు మొదలగుట చూచి, మానవుడు అది విషపూరితమని తెలిసికొనును. అట్లే మొదట నేను నీరూపసౌభాగ్యమునుజూచి, 'నీవు సత్ప్రవర్తనగలదానవు' అని భ్రమపడితిని- ఇప్పుడు నీ దుష్ప్రవర్తనచేత నీలో ఇంత విషమున్నదని తెలిసిపోయినది - నీవు తేనెపూసినకత్తివని గ్రహించితిని (77)

మెత్తనిమాటల ఇచ్చకపుమాటలతో నన్ను బుజ్జగించుచు మాట్లాడితివి. కిరాతుడు ఆకర్షణీయమైన సంగీతముతో లేడిని వశపఱచుకొని, బంధించి వధించినట్లు, నీవు నన్ను చంపుచుంటివి. (78)

"దశరథుడు కైకేయీసౌందర్యవ్యామోహములోబడి, పుత్త్రుని అమ్ముకొనిన 'పాపి' " అని వీధులలోని జనులెల్లరును మద్యపానము చేసిన బ్రాహ్మణుని నిందించినట్లు నన్ను తూలనాడుదురు. (79)

1) శ్లో॥ కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ, రూపేచలక్ష్మీ, క్షమయాధరిత్రీ।
భోజ్యేషు మాతా, శయనేషు రంభా। షట్ధర్మయుక్తా సహధర్మపత్నీ॥ (నీతిశాస్త్రము)
ఉత్తమురాలైన ఇల్లాలు, పనులుచేయునప్పుడు దాసివలెను, ఆలోచనలలో మంత్రివలెను, రూపసౌభాగ్యమునందు లక్ష్మీదేవివలెను, ఓర్పునందు భూదేవివలెను, భోజనమువిషయమున తల్లివలెను, శయనమందిరమున రంభవలె ఒప్పుచు భర్తకు సర్వదా సుఖానందములను గూర్చుచుండును.

అహో దుఃఖమ్ అహో కృచ్ఛ్రం యత్ర వాచః క్షమే తవ।
దుఃఖమేవంవిధం ప్రాప్తం పురాకృతమివాశుభమ్। 80

అయ్యో! ఎంతటి దుఃఖము వచ్చిపడినది? అయ్యయ్యో! ఎట్టి కష్టము ప్రాప్తించినది? నీ మాటలకు చెవియొగ్గినందువలననే ఇట్టి ఆపదలు దాపురించినవి. ఇదియంతయు నా పురాకృత పాపములఫలమే. (80)

చిరం ఖలు మయా పాపే త్వం పాపేనాభిరక్షితా।
అజ్ఞానాదుపసంపన్నా రజ్జురుద్బంధినీ యథా। 81

ఓ పాపాత్మురాలా! నా దురదృష్టవశమున అజ్ఞానముచే నిన్ను ఇంతకాలము కాపాడుచువచ్చితిని. ఇప్పుడు నీవు నా పాలిట ఉరిత్రాడువైతివి. (81)

రమమాణస్త్వయా సార్ధం మృత్యుం త్వాం నాభిలక్షయే।
బాలో రహసి హస్తేన కృష్ణసర్పమివాస్పృశమ్। 82

'సర్పము(ప్రమాదకారి)' అని యెఱుంగని బాలుడు ఒక నల్లత్రాచుపై చేయివేసినట్లు, నీవు నన్ను కబళించుటకై వచ్చిన మృత్యువువని తెలిసికొనలేక నేను ఇంతకాలము నీతో క్రీడించుచు వచ్చితిని. (82)

మయా హ్యపితృకః పుత్రః స మహాత్మా దురాత్మనా।
తం తు మాం జీవలోకోఽయం నూనమ్ ఆక్రోష్టుమర్హతి। 83

దుష్టుడనైన నా కారణముగ నేను జీవించియుండగనే మహాత్ముడైన నా పుత్రుడు తండ్రిలేని వాడగుచున్నాడు. అనగా తండ్రి అండదండలకు నోచుకొనని వాడగుచున్నాడు. అట్టి నన్ను ఈ లోకము ఎంతగానిందించినను తప్పు లేదు. (83)

బాలిశో బత కామాత్మా రాజా దశరథో భృశమ్।
యః స్త్రీకృతే ప్రియం పుత్రం వనం ప్రస్థాపయిష్యతి। 84

వ్రతైశ్చ బ్రహ్మచర్యైశ్చ గురుభిశ్చోపకర్శితః।
భోగకాలే మహత్ కృచ్ఛ్రం పునరేవ ప్రపత్స్యతే। 85

'కామాతురుడై, ఒక స్త్రీ (కైక) నిమిత్తముగా మిక్కిలి ప్రీతిపాత్రుడైన పుత్రుని అడవుల పాలు చేయుచున్న దశరథమహారాజు నిజముగా మూర్ఖుడే సుమా! అని లోకము నాపై దుమ్మెత్తిపోయును. నియమనిష్ఠలతో వేదశాస్త్రములను అధ్యయనము చేయుటచేతను, బ్రహ్మచారిధర్మములను ఆచరించుటవలనను, గురువులశిక్షణలో వారినిర్దేశములను పాటించుటవలనను రాముడెంతయు కృశించియున్నాడు. ఇప్పుడు గృహస్థాశ్రమమునందు సుఖపడవలసిన సమయమున అతడు మరల గొప్ప కష్టములనే పొందవలసి వచ్చుచున్నది. (84-85)

నాలం ద్వితీయం వచనం పుత్రో మాం ప్రతిభాషితుమ్।
స వనం ప్రవ్రజేత్యుక్తో బాఢమిత్యేవ వక్ష్యతి। 86

'నాయనా! వనములకు వెళ్లుము' అను మాట నానోటరాగానే నా చిన్నారిరాముడు మారుమాటాడక 'సరే' యని పల్కును. (86)

యది మే రాఘవః కుర్యాత్ వనం గచ్ఛేతి చోదితః।
ప్రతికూలం ప్రియం మే స్యాత్ నతు వత్సః కరిష్యతి। 87

శుద్ధభావో హి భావం మే న తు జ్ఞాస్యతి రాఘవః।
స వనం ప్రవ్రజేత్యుక్తో బాఢమిత్యేవ వక్ష్యతి। 88

'వనవాసమునకు పొమ్ము' అని నేను ఆదేశించినప్పుడు 'నేను పోజాలను'- అని రాముడు మాఱుపల్కిన బాగుండును. అదియే నాకు కావలసినదికూడ. కాని నా రాముడు అట్లు చేయనేచేయుడు. రాముడు నిష్కల్మషహృదయుడు. (అతడు వనములకు వెళ్లకుండుటయే నా కిష్టము అను) నా మనసులోని అంతర్యమును అతడెఱుగడు! 'వనములకు వెళ్లుము' - అని నేను పలుకగానే అతడు 'అట్లే' అని వచించును. (87-88)

రాఘవే హి వనం ప్రాప్తే సర్వలోకస్య ధిక్కృతమ్।
మృత్యురక్షమణీయం మాం నయిష్యతి యమక్షయమ్। 89

రాఘవుడు అడవులకు వెళ్లిన మఱుక్షణమే జనులందఱును నన్ను 'ఛీ' కొట్టుదురు. ఏ విధముగను క్షమార్హుడనుగాని నన్ను మృత్యువు వెంటనే యమసదనమునకు గొనిపోవును. (89)

మృతే మయి గతే రామే వనం మనుజపుంగవే।
ఇష్టే మమ జనే శేషే కిం పాపం ప్రతిపత్స్యసే। 90

శ్రీరాముడు అడవులకు వెళ్లినమఱుక్షణమే నేను మృతిచెందుట తథ్యము. అనంతరము నాకు ఆత్మీయులైన కౌసల్య, సుమిత్ర మొదలగు వారిని నీవు ఎట్టి ఇక్కట్లపాలుజేసెదవోగదా? (90)

కౌసల్యాం మాం చ రామం చ పుత్త్రౌ చ యది హాస్యతి।
దుఃఖాన్యసహతీ దేవీ మామేవానుమరిష్యతి। 91

రాముడు అరణ్యములపాలైన వెంటనే నా బొందిలో అసువులు మిగులవు. ఈ దుస్థితికి తట్టుకొనలేక కౌసల్యయు కన్ను మూయును. రాముడు దూరముకాగా తండ్రి పరలోకమునకేగగా లక్ష్మణ శత్రుఘ్నులును మృత్యులోకమునకు జేరుదురు. ఇట్టి కల్లోల పరిస్థితికి తాళజాలక సుమిత్రాదేవియు నన్నే అనుసరించి మృత్యువాతబడుట నిజము. (91)

కౌసల్యాం చ సుమిత్రాం చ మాం చ పుత్త్రైస్త్రిభిస్సహ।
ప్రక్షిప్య నరకే సా త్వం కైకేయి సుఖితా భవ। 92

ఓ కైక నన్ను, కౌసల్యను, సుమిత్రను, ముగ్గురు కొడుకులను నరకయాతనలకు గురిచేసి, ఈ రాజ్యమున నీవే హాయిగా ఉండుము. (92)

మయా రామేణ చ త్యక్తం శాశ్వతం సత్కృతం గుణైః।
ఇక్ష్వాకుకులమక్షోభ్యమ్ ఆకులం పాలయిష్యసి। 93

ఇక్ష్వాకురాజ్యము సకలసద్గుణములకు ఆలవాలము. ఇది సత్కార్యములకు పెన్నిధి. ఇంతవఱకును ఎట్టి క్షోభలకును గురికాక చిరకాలమునుండియు ఇది సుఖ శాంతులతో వర్ధిల్లుచున్నది. వనవాసకారణముగా రాముడు దీనికి దూరమగును, నన్ను మృత్యువు కబళించుటవలన రాజ్యమునకు నాతో సంబంధము తెగిపోవును. ఇక నీ మూలముగా ఇది అల్లకల్లోలమగును– ఈ పుణ్యమంతయు నీకే దక్కును - ఇట్టి రాజ్యమును ఇంక నీవే ఏలుకొనుము. (93)

ప్రియం చేద్భరతస్యైతత్ రామప్రవ్రాజనం భవేత్।
మా స్మ మే భరతః కార్షీత్ ప్రేతకృత్యం గతాయుషః। 94

రామునివనవాసము నిజముగా భరతునకుగూడ ప్రియమే యగుచో నేను మరణించిన పిమ్మట నా ఉత్తరక్రియలను అతడు చేయరాదు. (94)

హంతానార్యే మమామిత్రే సకామా భవ కైకయి।
మృతే మయి గతే రామే వనం పురుషపుంగవే। 95

సేదానీం విధవా రాజ్యం సపుత్త్రా కారయిష్యసి। 96

దుష్టురాలవైన ఓ కైకేయీ! పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముడు అడవులకు వెళ్ళిన వెంటనే నన్ను మృత్యువు కబళించును. అప్పుడు నీ కోరిక నెఱవేఱును, నీపగ తీరును. మనసు చల్లబడును. విధవవైన నీవు నీ పుత్త్రునితోగూడి ఈ రాజ్యమును ఏలుకొందువుగాక! (95-96)

త్వం రాజపుత్త్రీవాదేన న్యవసో మమ వేశ్మని।
అకీర్తిశ్చాతులా లోకే ధ్రువః పరిభవశ్చ మే।
సర్వభూతేషు చావజ్ఞా యథా పాపకృతస్తథా। 97

ఓ కైకేయీ! నీవు రాజపుత్త్రివైన కారణముగా నాభవనమున నివసించితివి. లోకమున పాపాత్మునకు సర్వజన సమక్షమున అవమానము కల్గునట్లు నీ కారణముగా నాకు నలుగురిలో అంతులేని అపకీర్తి, తీరని పరాభవము తప్పవు (97)

కథం రథైర్విభుర్యాత్వా గజాశ్వైశ్చ ముహుర్ముహుః।
పద్భ్యాం రామో మహారణ్యే వత్సో మే విచరిష్యతి। 98

ప్రభువై ఎల్లప్పుడును రథములపైనను, గజములమీదను, అశ్వములపైనను సంచరింపవలసిన నా ముద్దులపట్టియైన శ్రీరాముడు మహారణ్యమున కాలినడకతో ఎట్లు సంచరింపగలడు? (98)

యస్య త్వాహారసమయే సూదాః కుండలధారిణః।
అహంపూర్వాః పచంతి స్మ ప్రశస్తం పానభోజనమ్। 99

స కథన్ను కషాయాణి తిక్తాని కటుకాని చ।
భక్షయన్ వన్యమాహారం సుతో మే వర్తయిష్యతి। 100

మహారాజకుమారుడైన శ్రీరామునకు భోజనసమయమునందు కుండలములను ధరించిన వంటవారు అహమహమికతో (ఒకరితో మఱియొకరు పోటీపడుచు) ఆయురారోగ్యములకు అనువైన పుష్టికరమైన ప్రశస్తమైన అన్నపానములను సిద్ధపఱచుచుందురు. ఇపుడు షడ్రసోపేతముగా భోజనముచేయు నా తనయుడు వగరు, చేదు, కారము రుచులతోగూడిన వన్యాహారములను స్వీకరించుచు ఎట్లు జీవింపగలడు? (99-100)

మహార్హవస్త్రసంవీతో భూత్వా చిరసుఖోషితః।
కాషాయపరిధానస్తు కథం భూమౌ నివత్స్యతి। 101

రాముడు అమూల్యములైన మేలివస్త్రములను ధరించుచు ఎల్లప్పుడును సుఖముగా చక్కని ఆస్తరణములపై హాయిగానుండెడి వాడు. అతడు కాషాయాంబరములను ధరించుచు (అరణ్యములో) నేలపై ఎట్లు పరుండగలడు? (101)

కస్త్వేతద్దారుణం వాక్యమ్ ఏవంవిధమచింతితమ్ ।
రామస్యారణ్యగమనం భరతస్యాభిషేచనమ్ । 102

ధిగస్తు యోషితో నామ శఠాః స్వార్థపరాః సదా ।
న బ్రవీమి స్త్రియః సర్వా భరతస్యైవ మాతరమ్ । 103

అనర్థభావేఽర్థపరే నృశంసే
మమానుతాపాయ నివిష్టభావే ।
కిమప్రియం పశ్యసి మన్నిమిత్తం
హితానుకారిణ్యథవాపి రామే । 104

పరిత్యజేయుః పితరో హి పుత్రాన్
భార్యాః పతీంశ్చాపి కృతానురాగాః ।
కృత్స్నం హి సర్వం కుపితం జగత్ స్యాత్
దృష్ట్వైవ రామం వ్యసనే నిమగ్నమ్ । 105

అహం పునర్దేవకుమారరూపమ్
అలంకృతం తం సుతమావ్రజంతమ్ ।
నందామి పశ్యన్నపి దర్శనేన
భవామి దృష్ట్వా చ పునర్యువేవ । 106

వినాపి సూర్యేణ భవేత్ ప్రవృత్తిః
అవర్షతా వజ్రధరేణ వాపి ।
రామం తు గచ్ఛంతమితః సమీక్ష్య
జీవేన్న కశ్చిత్త్వితి చేతనా మే । 107

వినాశకామామ్ అహితామమిత్రామ్
ఆవాసయం మృత్యుమివాత్మనస్త్వామ్ ।
చిరం బతాంకేన ధృతాసి సర్పీ
మహావిషా తేన హతోఽస్మి మోహాత్ । 108

మయా చ రామేణ చ లక్ష్మణేన
ప్రశాస్తు హీనో భరతస్త్వయా సహ ।
పురం చ రాష్ట్రం చ నిహత్య బాంధవాన్
మమాహితానాం చ భవాభిహర్షిణీ । 109

'రాముని అరణ్యములకు పంపవలెననియు, భరతుని పట్టాభిషిక్తుని జేయువలెననియు,' ఈ విధముగా దారుణవిషయములను నీకు ఎవరు తలకెక్కించిరి? (102)

'ఛీ! స్త్రీలందఱును కపటబుద్ధితో హాని గూర్చువారే, వారు ఎల్లప్పుడును పూర్తిగా స్వార్థపరాయణులే-' అని లోకములో ప్రతీతి. అయితే 'స్త్రీలందఱును ఇట్టివారే అని నేనను. (కౌసల్యాదిశ్రేష్ఠ స్త్రీలకు ఇది వర్తించదు.) కాని భరతుని తల్లియైన కైకవిషయమున మాత్రము ఇది నూటికినూఱుపాళ్లు నిజము. (103)

ఓ క్రూరురాలా! నీ స్వప్రయోజనముకొఱకు ఇతరులకు హానిగూర్చుటకు నీవు ఎంతకైనను తెగింతువు. నన్ను తపింపజేయుటకే నీవు ఈయింట కాలుమోపితివి. ఎల్లప్పుడును నీహితమునే గోరు రామునివలనగాని, నా వలనగాని నీకు ఎట్టి ప్రమాదము కల్గునని శంకించు చున్నావు? (104)

శ్రీరాముడు ఆపదలపాలగుట చూచి, ఆయనపై భక్తిశ్రద్ధలు గలవారు అందఱును ఆయనవెంట వనములకు బయలుదేఱుదురు- తండ్రులు తాము ఎంతగానో ప్రేమించుచున్న కుమారులనైనను, అట్లే భార్యలు భర్తలనుగూడ త్యజించి వెళ్లుటకును వెనుకాడరు. అంతే గాదు ఈ చరాచరజగత్తు అంతయును విపరీత పరిణామములకు లోనగును- (105)

(నా స్వభావము లోకసాధారణస్థితికి భిన్నమైనది.) నేనైతే సహజసుందరుడు, చంద్రబింబమువంటి మోముగల నారాముడు పట్టువస్త్రములను, ఆభరణములను ధరించి మదపుటేనుగువలె గంభీరముగా నడచుచు వచ్చుచున్నట్లు ఊహాలలో దర్శించినను సంబరపడుదును. ఇంక ప్రత్యక్షముగా చూచినచో నా ఆనందమునకు అవధులే యుండవు. అప్పుడు నేను వృద్ధత్వమును మఱచి యువకుడనైపోవుదును. (106)

సూర్యకాంతి లేకున్నను జనులమనుగడ సాగుచునే యుండునేమో? ఇంద్రుడు వర్షములను కురిపింపకున్నను ప్రజలు జీవింతురేమో?- కాని రాముడు వనములకు వెళ్లుచుండగా చూచినచో ఏ యొక్కడును జీవింపజాలడు - ఇక నా విషయము చెప్పనేల? (107)

ఓసీ! నీవు నా చావును కోరెడిదానవు. నాకు కీడునే తలపెట్టుదానవు. నీవు నా పాలిటి శత్రువువు. మృత్యుదేవతవు- అట్టి నిన్ను నాయింట వసింపజేసితిని. నా మోహకారణముగా ఇంతకాలమునుండియు మహా విషసర్పమువంటి నిన్ను నాయొడిలో నుంచుకొంటిని. ఫలితముగా నేను చావును కొనితెచ్చుకొంటిని. భరతుడు రామలక్ష్మణులను, నన్నును దూరము చేసికొని, బంధువులనందఱిని హతమొనర్చి, ఈ అయోధ్యానగరమును, కోసలదేశమును నీతోగూడి హాయిగా ఏలుకొనుగాక. ఆ విధముగా నా శత్రువులను సంతోషపెట్టెదవుగాక. (108-109)

నృశంసవృత్తే వ్యసనప్రహారిణి
ప్రసహ్య వాక్యం యదిహాద్య భాషసే ।
న నామ తే కేన ముఖాత్ పతంత్యధో
విశీర్యమాణా దశనాః సహస్రధా ॥ 110

ఓ క్రూరప్రవృత్తిగలకైకా! రాముని అడవులకు పంపలేక నేను విలవిలలాడుచుంటిని. అట్టి నా పరిస్థితి గమనింపక, నన్ను తృణీకరించి, పదే పదే నీ మాటల ఈటెలతో పొడుచుచు నన్ను ఇప్పుడిట్లు బాధించుచున్నావు. ఇట్లు దుర్భాషలాడు నీనోటి నుండి దంతములు ముక్కలు ముక్కలై ఏల నేల రాలకున్నవి? నీ నోరు ఏల పడిపోకున్నది? (110)

న కించిదాహాఽహితమప్రియం వచో
న వేత్తి రామః పరుషాణి భాషితుమ్ ।
కథన్ను రామేహ్యభిరామవాదిని
బ్రవీషి దోషాన్ గుణనిత్యసమ్మతే ॥ 111

శ్రీరాముడు ఎవ్వరితోడను అహితములైన, అప్రియములైన వచనములను పలుకడు. అతడు ఎన్నెన్నడైనను పల్లెత్తుమాట అనియెఱుగడు. అతనికి పరుషముగా మాట్లాడుటయే తెలియదు. అతడు సద్గుణములగని. ఎల్లప్పుడును అందఱికిని ప్రియముగాపల్కుచు పలుకుచుండువాడు. అతనిని అందఱును గౌరవించుచుందురు. అట్టి రామునిపై దోషారోపణ ఎట్లు చేయగల్గుచున్నావు? (111)

ప్రతామ్య వా ప్రజ్వల వా ప్రణశ్య వా
సహస్రశో వా స్ఫుటితా మహీం వ్రజ ।
న తే కరిష్యామి వచస్సుదారుణమ్
మమాహితం కేకయరాజపాంసని ॥ 112

కేకయరాజవంశమున చెడబుట్టినదానా! నీవు క్రుంగికృశించినను, కోపముతో మండిపోయినను, నశించినను, కడకు వేయిముక్కలై నేలకొరిగినను నాకే మాత్రము ఇష్టములేని ఈ దారుణ కృత్యమును చేయనే చేయను. (112)

క్షురోపమాం నిత్యమసత్ప్రియంవదామ్
ప్రదుష్టభావాం స్వకులోపఘాతినీమ్ ।
న జీవితుం త్వాం విషహేఽమనోరమామ్
దిధక్షమాణాం హృదయం సబంధనమ్ ॥ 113

నీవు కత్తివలె బాధించుదానవు. అనుక్షణము ఇచ్చకపు మాటలాడుదానవు. మిక్కిలి దురాత్మురాలవు. నీవు వంశమునకే కళంకము తెచ్చెడి దానవు. అందఱి మనస్సులను నొప్పించుదానవు. నా హృదయమును పూర్తిగా దహించి వేయుచుంటివి. అట్టి నీవు బ్రతికియుండుటకంటెను చచ్చిపోవుటయే మేలు. (113)

న జీవితం మేఽస్తి పునః కుతః సుఖమ్
వినాత్మజేనాత్మవతః కుతో రతిః ।
మమాహితం దేవి న కర్తుమర్హసి
స్పృశామి పాదావపి తే ప్రసీద మే ॥ 114

ఓ దేవీ! నాకు బ్రతుకు మీద ఆశయేలేదు. ఇక సుఖమెక్కడిది? ఒక వేళ జీవించియున్నను తనయుడు దూరమైనప్పుడు ఆనందము ఎట్లుండును? నీ కాళ్లుపట్టుకొందును, నాకు కీడు తలపెట్టవద్దు. కనికరింపుము, ప్రసన్నురాలవు కమ్ము." (114)

స భూమిపాలో విలపన్ననాథవత్
స్త్రియా గృహీతో హృదయేఽతిమాత్రయా ।
పపాత దేవ్యాశ్చరణౌ ప్రసారితౌ
ఉభావసంస్పృశ్య యథాతురస్తథా ॥ 115

భర్తపై ఏ మాత్రము గౌరవములేని కైకకు వశుడైన ఆ మహారాజు దిక్కులేనివానివలె విలపింపసాగెను. మఱియు అతడు కైకేయికాళ్లకు నమస్కరింపబోయెను. అప్పుడామె తన కాళ్లను దూరముచేసెను. అంతట రాజు వాటిని తాకకయే రోగివలె నేలపై పడిపోయెను. (115)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్వాదశస్సర్గః *(12)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పండ్రెండవసర్గము సమాప్తము

-- * * * --

13. పదుమూడవసర్గము

'శ్రీరాముని వనవాసమునకుపంపెడి యోచనను మానుము' - అని దశరథుడు కైకను వేడుకొనుట.

అతదర్హం మహారాజం శయానమ్ అతథోచితమ్।
యయాతిమివ పుణ్యాంతే దేవలోకాత్ పరిచ్యుతమ్। 1

అనర్థరూపాఽసిద్ధార్థా హ్యభీతా భయదర్శినీ।
పునరాకారయామాస తమేవ వరమంగనా। 2

ఆ విధముగా పరితపించుటయు, అట్లు నేలపై పడియుండుటయు మహారాజైన దశరథునకు ఏ మాత్రమూ తగినవట్టివిగావు. కాని పుత్రుడు దూరమగునని శోకాతిరేకమునకు గురియై, ఆ రాజు పుణ్యము క్షీణింపగా దేవలోకమునుండి భూలోకమునకు పడిపోయిన యయాతి[1] వలె నేలపై పడెను - అనర్థములకు మూలహేతువైనదియు, తనపనులు నెఱవేఱనిదియు, లోకాపవాదమునకు వెఱవనిదియు అగు కైక దశరథునిపరితాపమును (భయమును) పట్టించుకొనకయే తనవరములను మఱల రాజునకు వినిపింపసాగెను. (1-2)

త్వం కత్థసే మహారాజ సత్యవాదీ దృఢవ్రతః।
మమ చేమం వరం కస్మాత్ విధారయితుమిచ్ఛసి। 3

"ఓ మహారాజా! నేను సత్యవాదిని, దృఢవ్రతుడను' అని గొప్పలు చెప్పుకొనుచుంటివే! కాని, నీవు వాగ్దానము చేసినరీతిగా ఈ నావరములను ఇచ్చుటకు ఏల వెనుకాడుచుంటివి?" (3)

ఏవముక్తస్తు కైకేయ్యా రాజా దశరథస్తదా।
ప్రత్యువాచ తతః క్రుద్ధో ముహూర్తం విహ్వలన్నివ। 4

కైకేయి ఈ విధముగా పలుకగా అప్పుడు దశరథమహారాజు క్షణకాలము మూర్ఛితుడయ్యెను. తేఱుకొనిన పిమ్మట అతడు క్రుద్ధుడై ఆమెతో ఇట్లనెను. (4)

మృతే మయి గతే రామే వనం మనుజపుంగవే।
హంతానార్యే మమామిత్రే సకామా సుఖినీ భవ। 5

"నరోత్తముడైన రాముడు వనములకు బయలువెడలిన వెంటనే నా ప్రాణములు పోవుట తథ్యము. అయ్యో! ఓ దుష్టురాలా! నా పాలిటి శత్రువువైన నీవు నీ కోరికలు నెఱవేఱగా అప్పుడు హాయిగా నుండుము. (5)

స్వర్గేఽపి ఖలు రామస్య కుశలం దైవతైరహమ్।
ప్రత్యాదేశాదభిహితం ధారయిష్యే కథం బత। 6

నేను స్వర్గస్థుడనైనచో అచ్చటనూ దేవతలు శ్రీరాముని క్షేమసమాచారములనుగూర్చి అడుగుచు 'ఓ మూఢుడా! ఒక స్త్రీమూలముగా సద్గుణనిధియైన నీకుమారుని వనములకు ఎట్లు పంపితివి?' అని నన్ను నిందించుచు పల్కినచో ఆ మాటలకు ఎట్లు తట్టుకొనగలను? - కనుక స్వర్గమునందును నాకు సుఖము దక్కదు. (6)

కైకేయ్యాః ప్రియకామేన రామః ప్రవ్రాజితో మయా।
యది సత్యం బ్రవీమ్యేతత్ తదసత్యం భవిష్యతి। 7

'కైకేయిని తృప్తి పఱచుటకై శ్రీరాముని వనములకు పంపితిని'- అని నేను వాస్తవమునే వెల్లడించినచో- 'శ్రీరాముని యువరాజపట్టాభిషిక్తుని గావింపెదను' అని నిండు సభలో నేను చేసిన ప్రకటన కల్లగాదా? (7)

అపుత్రేణ మయా పుత్రః శ్రమేణ మహతా మహాన్।
రామో లబ్ధో మహాబాహుః స కథం త్యజ్యతే మయా। 8

చాలాకాలమువఱకు సంతానములేని నేను మిక్కిలి శ్రమలకోర్చి, యజ్ఞయాగాదులు చేయగా, మహాత్ముడు, ఆజానుబాహువు ఐన ఈ శ్రీరాముడు నాకు పుత్రుడుగా లభించెను. అట్టి చిన్నారిని నేను ఎట్లు విడిచియుండగలను? (8)

---

1) యయాతి చంద్రవంశపురాజు, నహుషునికుమారుడు, ఇతనితల్లి ప్రియంవద - ఇతడు తీవ్రతపస్సు చేసి, దేవలోకమునకేగెను- ఇతడు దేవలోకమునందలి ఋషులతపస్సును చులకనచేయుచు మాట్లాడెను అందులకు ఇంద్రుడు కుపితుడై యయాతిని స్వర్గలోకభ్రష్టుని గావించెను.

శూరశ్చ కృతవిద్యశ్చ జితక్రోధో క్షమాపరః।
కథం కమలపత్రాక్షో మయా రామో వివాస్యతే। 9

రాముడు మహావీరుడు. సకలవిద్యాసంపన్నుడు. కోపము నెఱుగనివాడు. క్షమాగుణముగలవాడు. తామరరేకులవలె విశాలమైన కనులుగలవాడు. అట్టి వానిని నేను వనములకు ఎట్లు పంపగలను? (9)

కథమిందీవరశ్యామం దీర్ఘబాహుం మహాబలమ్।
అభిరామమహం రామం ప్రేషయిష్యామి దండకాన్। 10

శ్రీరాముడు నల్లకలువవలె శ్యామవర్ణముగలవాడు. పొడవైన చేతులుగలవాడు. మహాబలశాలి. చూడముచ్చటైనవాడు. అట్టి నా ముద్దులపట్టిని దండకారణ్యములకు ఎట్లు పంపగలను?(10)

సుఖానాముచితస్యైవ దుఃఖైరనుచితస్య చ।
దుఃఖం నామానుపశ్యేయం కథం రామస్య ధీమతః। 11

రాముడు మొదటి నుండియు సుఖములలోనే పెఱిగినవాడు. కష్టమనునదియే ఎఱుగడు. ప్రతిభాశాలియైన రాముడు అడవులలో ఇడుములపాలైనచో నేను ఎట్లు ఓర్చుకొనగలను? (11)

యది దుఃఖమకృత్వాఽద్య మమ సంక్రమణం భవేత్।
అదుఃఖార్హస్య రామస్య తతః సుఖమవాప్నుయామ్। 12

సుఖభోగికలలో తేలియాడు (సుఖార్హుడైన) శ్రీరామునకు ఏమాత్రము దుఃఖము అంటకుండజేసి, నేనిప్పుడే మృతి చెందినచో[1] నాకు స్వర్గసుఖములు తప్పక లభించును. (12)

నృశంసే పాపసంకల్పే రామం సత్యపరాక్రమమ్।
కిం విప్రియేణ కైకేయి ప్రియం యోజయసే మమ। 13

అకీర్తిరతులా లోకే ధ్రువః పరిభవశ్చ మే। 14

పాపసంకల్పములపుట్టయైన క్రూరాత్మురాలా! ఓ కైకేయీ! దుష్టశిక్షణ శిష్టరక్షణలకై తనపరాక్రమమును ప్రదర్శించునట్టి నా ప్రియుడైనరాముని వెట్టుబట్టి దండకారణ్యములకు పంపి, నీ వేమిబావుకొనదలచితివి? దీనివలన లోకమునందు నాకు అంతులేని అపకీర్తి, పరాభవము తప్పవు." (13-14)

తథా విలపతస్తస్య పరిభ్రమితచేతసః।
అస్తమభ్యగమత్ సూర్యో రజనీ చాభ్యవర్తత। 15

దశరథుడు వికలమనస్కుడై, అట్లు విలపించుచుండగా ఆ దృశ్యమును చూడలేక సూర్యుడస్తమించెను. చీకట్లు అలముకొనెను. (15)

సా త్రియామా తథార్తస్య చంద్రమండలమండితా।
రాజ్ఞో విలపమానస్య న వ్యభాసత శర్వరీ। 16

చంద్రశోభలతో విలసిల్లుచు మూడుజాములప్రొద్దుగలిగి, దీర్ఘమైనదయ్యు, ఆ రాత్రి ఆర్తితో కుమిలిపోవుచు విలపించుచున్న దశరథునకు మాత్రము అంధకారమయముగానే తోచెను- అనగా ఆ రాత్రి అతనికి ఏమాత్రమూ సంతోషమును కలిగించనే లేదు.(16)

తథైవోష్ణం వినిశ్వస్య వృద్ధో దశరథో నృపః।
విలలాపార్తవద్దుఃఖం గగనాసక్తలోచనః। 17

వృద్ధుడైన దశరథమహారాజు వేడినిట్టూర్పులను విడుచుచు ఏమియుతోచనివాడై, రోగగ్రస్తునివలె, కన్నులప్పగించి ఆకాశము వైపు చూచుచు వినువారికి సైతము దుఃఖముకలుగునట్లుగా బిగ్గరగా ఏడ్చెను (17)

న ప్రభాతం త్వయేచ్ఛామి నిశే నక్షత్రభూషణే।
క్రియతాం మే దయా భద్రే మయాఽయం రచితోఽంజలిః। 18

అథవా గమ్యతాం శీఘ్రం నాహమిచ్ఛామి నిర్ఘృణామ్।
నృశంసాం కైకయీం ద్రష్టుం యత్కృతే వ్యసనం మహత్। 19

'చుక్కలతో ఒప్పుచు, మంగళకరమైన ఓ రాత్రీ! నీకు చేతులెత్తి మ్రొక్కుచున్నాను. తెల్లవాఱనీయకుము. నన్ను కనికరింపుము. లేదా త్వరగా తెల్లవాఱనిమ్ము. ఈ కైకేయి పాడుముఖమును ఇంక నేను చూడదలచుకొనలేదు. ఈమెది ఱాతిగుండె. దయయను మాటయేయెఱుగదు. ఈ క్రూరాత్మురాలు నాకు అంతులేని ఆపదలను తెచ్చిపెట్టినది.' (18-19)

1) సంక్రమణం = తృణజలూకాన్యాయమున ఒక దేహమునుండి మఱియొక దేహమును పొందుట - పంచత్వము / మరణము.
తృణజలూక = గడ్డిపైదిరుగు జలగవంటి పురుగు.
తృణజలూకా న్యాయము:- గడ్డిపురుగు ప్రాకునపుడు మఱియొక తృణమును (గడ్డిపరకను) పట్టుకొనకుండా పూర్వతృణమును విడువనివిధము- (జీవుడు దేహాంతరమును (మఱియొక దేహమును) చూచుకొనకుండా పూర్వదేహమును విడువడనుట సూచితము.)

ఏవముక్త్వా తతో రాజా కైకేయీం సంయతాంజలిః।
ప్రసాదయామాస పునః కైకేయీం చేదమబ్రవీత్। 20

రాజనీతిజ్ఞుడైన దశరథుడు ఇట్లు నుడివి, కైకేయియెదుట ప్రాంజలియై, ఆమెను ప్రసన్నురాలిని గావించుకొనుటకై మరలనిట్లు ప్రార్థింపసాగెను (20)

సాధువృత్తస్య దీనస్య త్వద్గతస్య గతాయుషః।
ప్రసాదః క్రియతాం దేవి భద్రే రాజ్ఞో విశేషతః। 21

'ఓ దేవీ! నేను మృదుస్వభావముగలవాడను. దీనుడను. నిన్నే శరణుజొచ్చినవాడను, ఆయువు దగ్గరపడినవాడను. పైగా మహారాజును, ఓ మంగళప్రదురాలా! నా పై దయజూపుము (21)

శూన్యేన ఖలు సుశ్రోణి మయేదం సముదాహృతమ్।
కురు సాధు ప్రసాదం మే బాలే సహృదయా హ్యసి। 22

ఓ సుందరాంగీ! మనస్సు పనిచేయక నేనేమేమో పలికితిని. వాటిని పట్టించుకొనకుము. ఓ బాలా! నీవు సహృదయురాలవు. నన్నింతయు అనుగ్రహింపుము. (22)

ప్రసీద దేవి రామో మే త్వద్దత్తం రాజ్యమవ్యయమ్।
లభతామసితాపాంగే యశః పరమవాప్నుహి। 23

ఓ రాణీ! కృపజూపుము. నీకు నేను వరముగా ఇచ్చిన రాజ్యమును పూర్తిగా రామునకప్పగింపుము. అప్పుడతడు దానికి రాజగును. ఓ విశాలాక్షీ! నీకు ఎనలేని కీర్తి కలుగును- (23)

మమ రామస్య లోకస్య గురూణాం భరతస్య చ।
ప్రియమేతద్గురుశ్రోణి కురు చారుముఖేక్షణే। 24

ఓ సర్వాంగసుందరీ! శ్రీరామునకు రాజ్యమును అప్పగించుట నాకేగాదు సమస్తప్రజలకును, గురువులందఱికిని, కడకు భరతునకును ఇష్టమైన విషయము. కనుక అట్లు చేయుము. (24)

విశుద్ధభావస్య హి దుష్టభావా
తామ్రేక్షణస్యాశ్రుకలస్య రాజ్ఞః।
శ్రుత్వా విచిత్రం కరుణం విలాపం
భర్తుర్నృశంసా న చకార వాక్యమ్। 25

నిర్మలమైన మనస్సుగలవాడును, కన్నులు ఎఱ్ఱబాఱియున్నవాడును, సంతతధారగా కన్నీరుపెట్టుచున్నవాడును, తనకు భర్తయునైన ఆరాజు దీనముగా పలుకుచున్న విలాపవచనములను వినియు, దురాలోచనలలోమునిగిన ఆ క్రూరాత్మురాలు వినియు మాటాడక మిన్నకుండెను (25)

తతః స రాజా పునరేవ మూర్ఛితః
ప్రియామతుష్టాం ప్రతికూలభాషిణీమ్।
సమీక్ష్య పుత్రస్య వివాసనం ప్రతి
క్షితౌ విసంజ్ఞో నిపపాత దుఃఖితః। 26

దశరథుడు ఆమెను ఒప్పించుటకై నయాన భయాన ఎన్ని విధములు ఎంతగానో చెప్పిచూచెను. ఐనను ఆమె ఎంతకును తృప్తిచెందక ప్రతికూలముగా భాషించుచుండెను. అది గమనించి, తన ప్రియపుత్రుడైన రామునివనవాసమునుగూర్చి పదే పదే తలంచుచు, ఏమి చేయుటకును తోచకున్నవాడై, నిశ్చేష్టుడై, అతడు అంతులేని దుఃఖములో పడిపోయెను. (26)

ఇతీవ రాజ్ఞో వ్యథితస్య సా నిశా
జగామ ఘోరం శ్వసతో మనస్వినః।
విబోధ్యమానః ప్రతిబోధనం తదా
నివారయామాస స రాజసత్తమః। 27

మనస్సునందే కుమిలిపోవుచు భయంకరముగా నిట్టూర్పుచున్న దశరథునకు ఆ రాత్రియట్లోగడచెను. వేకువజామున రాజును మేల్కొలుపుటకై శంఖపటహవీణారవములు, వైతాళికుల జయజయారావములు' మొదలుకాగా ఆ నరేంద్రుడు వాటిని నివారింపజేసెను. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రయోదశస్సర్గః *(13)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పదుమూడవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

14. పదునాల్గవసర్గము

'ఇచ్చినమాటను నిలబెట్టుకొనుము' - అని కైకేయి దశరథమహారాజును ఒత్తిడిచేయుట. వసిష్ఠాదులు రాజదర్శనమునకై వేచియుండుట - శ్రీరాముని తీసికొనివచ్చుటకై కైకేయి సుమంత్రుని ఆదేశించుట.

పుత్రశోకార్దితం పాపా విసంజ్ఞం పతితం భువి।
వివేష్టమానమ్ ఉదీక్ష్య సైక్ష్వాకమ్ ఇదమబ్రవీత్। 1

పాపం కృత్వేవ కిమిదం మమ సంశ్రుత్య సంశ్రవమ్।
శేషే క్షితితలే సన్నః స్థిత్యాం స్థాతుం త్వమర్హసి। 2

ఆహుః సత్యం హి పరమం ధర్మం ధర్మవిదో జనాః।
సత్యమాశ్రిత్య హి మయా త్వం చ ధర్మం ప్రచోదితః। 3

సంశ్రుత్య శైబ్యః శ్యేనాయ స్వాం తనుం జగతీపతిః।
ప్రదాయ పక్షిణే రాజన్ జగామ గతిముత్తమామ్। 4

తథా హ్యలర్కస్తేజస్వీ బ్రాహ్మణే వేదపారగే।
యాచమానే స్వకే నేత్రే ఉద్ధృత్యాఽవిమనా దదౌ। 5

సరితాం తు పతిః స్వల్పాం మర్యాదాం సత్యమన్వితః।
సత్యానురోధాత్ సమయే స్వాం వేలాం నాతివర్తతే। 6

సత్యమేకపదం బ్రహ్మ సత్యే ధర్మః ప్రతిష్ఠితః।
సత్యమేవాక్షయా వేదాః సత్యేనైవాప్యతే పరమ్। 7

సత్యం సమనువర్తస్వ యది ధర్మే ధృతా మతిః।
సఫలః స వరో మేఽస్తు వరదో హ్యసి సత్తమ। 8

ధర్మస్యేహాభికామార్థం మమ చైవాభిచోదనాత్।
ప్రవ్రాజయ సుతం రామం త్రిః ఖలు త్వాం బ్రవీమ్యహమ్। 9

సమయం చ మమార్యేమం యది త్వం న కరిష్యసి।
అగ్రతస్తే పరిత్యక్తా పరిత్యక్ష్యామి జీవితమ్। 10

పుత్రశోకముచే విలవిలలాడుచు, స్పృహలేనివాడై, భూమిపై అటునిటు పొరలుచున్న ఆ ఇక్ష్వాకువంశప్రభువును జూచి, ఆ పాపాత్మురాలు ఇట్లు పలికెను. (1)

"వరములనిచ్చెదనని ప్రతిజ్ఞ చేసి, ఇప్పుడు ఏదియో పాపము చేసినవానివలె పశ్చాత్తాపపడుచు, ఈ విధముగా నేలపైబడి పొర్లుచుంటివేల? ప్రతిజ్ఞను నిలబెట్టుకొని, నీ మర్యాదను కాపాడుకొనుము- (2)

'సత్య పాలనమే పరమధర్మము' అని ధర్మజ్ఞులైన పెద్దలు పలుకుచుందురు. నేనును ఆ సత్యమార్గమును అనుసరించియే నీ ధర్మమును నిర్వర్తింపుమని కోరుచున్నాను. (3)

ఓరాజా! శిబిచక్రవర్తియు తాను చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి, డేగకు తనశరీరమాంసమును కోసియిచ్చి, ఉత్తమగతిని పొందెను. అట్లే ధర్మజ్ఞుడైన అలర్కమహారాజుగూడ వేదపండితుడైన బ్రాహ్మణుడు యాచింపగా ప్రసన్నచిత్తుడై, తన రెండు నేత్రములను పెకలించి, ఆయనకు దానము చేసెను. (4-5)

ఓరాజా! సత్యసంధుడైన సముద్రుడు తానొసర్చిన వాగ్దానమునకు కట్టుపడి, పర్వదినములలో తరంగములు ఉవ్వెత్తుగా వచ్చి పడుచున్నప్పుడును, తన చెలియలికట్టను కించిత్తైనను దాటడు. (6)

'సత్యము' అను పదము పరబ్రహ్మస్వరూపము, ధర్మాచరణమునకు సత్యమేమూలము. వేదములన్నియును సత్యమునే ప్రతిపాదించుచున్నవి- పరమార్థమైన మోక్షము సత్యమువలననే ప్రాప్తించును. సజ్జనులలో ఉత్తముడైనవాడా! నీవు ధర్మము తప్పనివాడవే యనిచో నీ సత్యప్రతిజ్ఞను పాటింపుము- అప్పుడు నావరములు సఫలములు అగును- నీవు వరముదవని ప్రసిద్ధికెక్కిన వాడవుగదా! (7-8)

ధర్మాభివృద్ధికై పాటుపడుట మహారాజువైన నీవిధి. పైగా నేనుగూడ అందులకై నిన్ను ప్రోత్సహించుచుంటిని. కావున సుకుమారుడైన రాముని వనవాసమునకు పంపుము- ఈ మాటను ముమ్మాఱు (పదే పదే) నొక్కి వక్కాణించుచున్నాను- (9)

నీవు నాకు ఇచ్చిన వాగ్దానమును అనుసరించి, నేడే (ఇప్పుడే) శ్రీరాముని వనమునకు పంపనిచో నీ ఉపేక్షకు గురియైన నేను నీయెదుటనే నా ప్రాణములను త్యజింతును-" (10)

ఏవం ప్రచోదితో రాజా కైకేయ్యా నిర్విశంకయా।
నాశకత్ పాశమున్మోక్తుం బలిరింద్రకృతం యథా। 11

కైకేయి ముందువెనుకలు ఆలోచింపక, జంకుగొంకులు లేనిదై, ఇట్లు ఒత్తిడిచేయుటవలన రాజు సత్యపాశమునుండి బయటపడుటకు, వామనునకు ఇచ్చిన వాగ్దానపాశమునుండి బయటపడలేని బలిచక్రవర్తివలె, అశక్తుడాయెను.[1] (11)

ఉద్భ్రాంతహృదయశ్చాపి వివర్ణవదనోఽభవత్।
స ధుర్యో వై పరిస్పందన్ యుగచక్రాంతరం యథా। 12

కాడికిని చక్రములకును మధ్యన చేరి, అటు ముందునకును ఇటువెనుకకును పోలేక తికమక పడుచున్న వృషభమువలె ఆ దశరథుడు డోలాయమానస్థితిలో భ్రాంతచిత్తుడై, హృదయవేదనకు లోనయ్యెను. అతనిముఖము వన్నెతఱిగియుండెను. (12)

విహ్వలాభ్యాం చ నేత్రాభ్యామ్ అపశ్యన్నివ భూమిపః।
కృచ్ఛ్రాద్ధైర్యేణ సంస్తభ్య కైకేయీమ్ ఇదమబ్రవీత్। 13

అంతట దశరథుని కన్నులు అశ్రుపూర్ణములై బరువెక్కి యుండుటచే అతడు మసకదృష్టితో చూచుచు, అతికష్టముమీద ధైర్యము తెచ్చుకొని, దుఃఖమును దిగమ్రింగుచు కైకేయితో ఇట్లు పల్కెను- (13)

యస్తే మంత్రకృతః పాణిః అగ్నౌ పాపే మయా ధృతః।
తం త్యజామి స్వజం చైవ తవ పుత్త్రం త్వయా సహ। 14

"ఓ పాపాత్మురాలా! నాడు వివాహసమయమున అగ్నిసాక్షిగా మంత్రసంస్కారముచే పునీతమైన నా చేతితో నీ పాణిగ్రహించి యుంటిని. నేడు అట్టి నీపాణిని, నిన్నును త్యజించుచున్నాను. అంతేగాదు నావలన నీకు పుట్టిన పుత్త్రుని (భరతుని) గూడ వదలివేయుచున్నాను. (14)

ప్రయాతా రజనీ దేవి సూర్యస్యోదయనం ప్రతి।
అభిషేకం గురుజనః త్వరయిష్యతి మాం ధ్రువమ్। 15

రామాభిషేకసంభారైః తదర్థముపకల్పితైః।
రామః కారయితవ్యో మే మృతస్య సలిలక్రియామ్। 16

త్వయా సపుత్త్రయా నైవ కర్తవ్యా సలిలక్రియా।
వ్యాహంతాస్యశుభాచారే యది రామాభిషేచనమ్। 17

న చ శక్నోమ్యహం ద్రష్టుం దృష్ట్వా పూర్వం తథా సుఖమ్।
హతహర్షం నిరానందం పునర్జనమవాఙ్ముఖమ్। 18

ఓ దేవీ! దాదాపు రాత్రి గడచిపోయినది. (తెల్లవాఱుచున్నది) సూర్యోదయమైనంతనే వసిష్ఠుడుమొదలగు గురువులు పట్టాభిషేకమునకై సమకూర్చబడిన సమస్తవస్తువులతో వచ్చి, శ్రీరాముని పట్టాభిషిక్తుని జేయుటకై నన్ను తొందరపెట్టెదరు. ఆ పట్టాభిషేకము ఆగిపోయినచో మృతుడనైన నా ఉత్తర (సలిల) క్రియలు నాటితో జరుగును. ఓ దురాచారపరురాలా! శ్రీరాముని పట్టాభిషేకమును నీవు చెడగొట్టినచో నా అంత్య (సలిల) క్రియలు శ్రీరాముడే నిర్వహింపగలడు- నీకుగాని, నీ కుమారుడైన భరతునకు గాని అందు పాల్గొనుటకు ఏ మాత్రమూ అధికారము ఉండదు - ఇంతకుముందు శ్రీరామునిపట్టాభిషేకవార్త విని, సంతోషముతో పొంగిపోయి, జనులు సుఖానందడోలికలలో తేలియాడుచుండగా (వారిని) జూచితిని. ఇప్పుడు ఈ విధముగా ఆ పట్టాభిషేకము ఆగిపోయినచో వారిలో హర్షానందములు కనుమఱుగైపోవును. దుఃఖముతో విముఖులైయున్న వారిముఖములను నేను చూడజాలను." (15-18)

తాం తథా బ్రువతస్తస్య భూమిపస్య మహాత్మనః।
ప్రభాతా శర్వరీ పుణ్యా చంద్రనక్షత్రశాలినీ। 19

మహాత్ముడైన దశరథమహారాజు ఆమెతో అట్లు పలుకుచుండగనే చంద్రునితో నక్షత్రములతో రాణిల్లుచున్న పవిత్రమైన ఆ రాత్రి తెల్లవాఱెను. (19)

తతః పాపసమాచారా కైకేయీ పార్థివం పునః।
ఉవాచ పరుషం వాక్యం వాక్యజ్ఞా రోషమూర్ఛితా। 20

దురాలోచనాపరురాలును, పాతకారిణియు ఐన కైక రాజు పల్కులకు క్రోధముతో మండిపడుచు ఆయనతో పరుషముగా మఱల ఇట్లు నుడివెను. (20)

1) బలిచక్రవర్తి స్వర్గమును ఆక్రమించెను, అప్పుడు రాజ్యభ్రష్టుడైన ఇంద్రునియొక్క ప్రార్థనపై శ్రీమహావిష్ణువు వామనరూపమున యజ్ఞము చేయుచున్న బలికడకు వచ్చెను. మూడడుగులమేరకు దానమునిమ్మని వామనుడు కోరగా బలిచక్రవర్తి అందులకు సమ్మతించి, 'అట్లే' యని అతనికి 'వాగ్దానము' చేసెను - పిమ్మట ఆ బలి తనవాగ్దానపాశమునకు కట్టుబడి, చేయునదిలేక (వామనుని ప్రభావమునకు తాళలేక) స్వర్గమును వీడి, పాతాళమును జేరెను-

కి మిదం భాషసే రాజన్ వాక్యం గరరుజోపమమ్।
ఆనాయయితుమక్లిష్టం పుత్రం రామమిహార్హసి। 21

స్థాప్య రాజ్యే మమ సుతం కృత్వా రామం వనేచరమ్।
నిస్సపత్నాం చ మాం కృత్వా కృతకృత్యో భవిష్యసి। 22

స నున్న ఇవ తీక్ష్ణేన ప్రతోదేన హయోత్తమః।
రాజా ప్రచోదితోఽభీక్ష్ణం కైకేయీమ్ ఇదమబ్రవీత్। 23

ధర్మబంధేన బద్ధోఽస్మి
నష్టా చ మమ చేతనా ।
జ్యేష్ఠం పుత్రం ప్రియం రామం
ద్రష్టుమిచ్ఛామి ధార్మికమ్ । 24

తతః ప్రభాతాం రజనీమ్ ఉదితే చ దివాకరే।
పుణ్యే నక్షత్రయోగే చ ముహూర్తే చ సమాహితే। 25

వసిష్ఠో గుణసంపన్నః శిష్యైః పరివృతస్తదా।
ఉపగృహ్యాశు సంభారాన్ ప్రవివేశ పురోత్తమమ్। 26

సిక్తసమ్మార్జితపథాం పతాకోత్తమభూషితామ్।
విచిత్రకుసుమాకీర్ణాం నానాస్రగ్భిర్విరాజితామ్। 27

సంహృష్టమనుజోపేతాం సమృద్ధవిపణాపణామ్।
మహోత్సవసమాకీర్ణాం రాఘవార్థే సముత్సుకామ్। 28

చందనాగరుధూపైశ్చ సర్వతః ప్రతిధూపితామ్।
తాం పురీం సమతిక్రమ్య పురందరపురోపమామ్। 29

దదర్శాంతఃపురం శ్రేష్ఠం నానాద్విజగణాయుతమ్।
పౌరజానపదాకీర్ణం బ్రాహ్మణైరుపశోభితమ్।
యజ్ఞవిద్భిః సుసంపూర్ణం సదస్యైః పరమద్విజైః। 30

తదంతఃపురమాసాద్య వ్యతిచక్రామ తం జనమ్।
వసిష్ఠః పరమప్రీతః పరమర్షిభిరావృతః। 31

స త్వపశ్యద్వినిష్క్రాంతం సుమంత్రం నామ సారథిమ్।
ద్వారే తు రాజసింహస్య సచివం ప్రియదర్శనమ్। 32

తమువాచ మహాతేజాః సూతపుత్రం విశారదమ్।
వసిష్ఠః క్షిప్రమాచక్ష్వ నృపతేర్మామిహాగతమ్। 33

"ఓ రాజా! విషవ్యాధిరోగివలె ఎందులకిట్లు పిచ్చిగా మాట్లాడుచున్నావు? పునరాలోచన చేయక వెంటనే రాముని ఇచటికి రప్పింపుము. నా భరతుని రాజ్యాభిషిక్తునిజేయుము. శ్రీరాముని వనములకుపంపుము. నాకు శత్రువులు లేకుండ జేయుము. అప్పుడు నీవు కృతార్థుడవుకాగలవు." (21-22)

ఒక ఉత్తమాశ్వమును తీక్ష్ణమైన కొరడాతో కొట్టినట్లు కైకేయి తనసూటిపోటిమాటలతో రాజును శీఘ్రముగా నొప్పించెను- అప్పుడతడు ఆమెతో ఇట్లనెను. (23)

"నేను ధర్మపాశముతో బంధింపబడితిని. (ఇచ్చిన మాటకు కట్టుబడిపోయితిని.) నా బుద్ధి ఏమాత్రము పని చేయుట లేదు. రాముడు ధర్మబుద్ధిగలవాడు. పెద్దకుమారుడు, అట్టి నా ముద్దులపట్టిని చూడగోరుచున్నాను" (24)

ఇంతలో రాత్రిగడచెను. సూర్యుడు ఉదయించెను. శుభ నక్షత్రముతో గూడిన (పట్టాభిషేక) సుముహూర్తము దగ్గఱపడెను. సద్గుణసంపన్నుడైన వసిష్ఠమహర్షి తనశిష్యులతోగూడి, అభిషేక సామాగ్రిని సమకూర్చుకొని, వెంటనే తనఆశ్రమమునుండి బయలుదేఱి, అయోధ్యానగరమున ప్రవేశించెను. (25-26)

ఆ నగరవీధులను శుభ్రముగా ఊడ్చి, కలయంపి చల్లిరి. చక్కని ధ్వజపతాకములతో వాటిని అలంకరించిరి. అందు అంతటను రంగురంగుల పూవులను చల్లిరి. అనేకవిధములగు పూలతోరణములను గట్టిరి. జనులందఱును ఆనందముతో గుంపులుగుంపులుగా తిరుగుచుండిరి. అన్ని అంగళ్లలోను క్రయవిక్రయవస్తువులు సమృద్ధిగా ఉండెను. శ్రీరామునిపట్టాభిషేకమహోత్సవమును దర్శించుటకై ప్రజలెల్లరును వీధులలో ఉత్సాహముతో క్రిక్కిరిసియుండిరి. చందనములతో, అగరుధూపములతో నగరము అంతయును పరిమళభరితమైయుండెను. ఇట్టి వైభవములతో ఇంద్రునినగరమైన 'అమరావతి'ని తలపించుచున్న అయోధ్యాపురియందు క్రమక్రమముగా ముందునకుసాగుచు శిష్యపరివృతుడైన వసిష్ఠుడు మనోహరమైన అంతఃపురమును దర్శించెను. అచట వివిధములగు ధ్వజపతాకములు రెపరెపలాడుచుండెను. పురజనులు, పల్లెవాసులు గుంపులుగుంపులుగా చేరియుండిరి. ఆ ప్రదేశము బ్రాహ్మణులతో చక్కగా అలరారుచుండెను. యజ్ఞవిదులు, సభార్హులు ఐన బ్రాహ్మణోత్తములతో అది నిండియుండెను. (27-30)

అంతట వసిష్ఠుడు మహర్షులతోగూడి అంతఃపురసమీపమునకు చేరి, జనప్రదేశమును దాటుచు ముందునకుసాగెను. ఇంతలో రాజుగారిసచివుడు, రథసారథియు ఐన సుమంత్రుడు చక్కని వేషభూషణములను ధరించి, రాజాంతఃపురమునుండి వెలుపలికి వచ్చుచుండగా వసిష్ఠమహాముని ద్వారముకడ ఆయనను చూచెను. పిమ్మట మహాతేజస్వియైన వసిష్ఠుడు కార్యదక్షుడైన సుమంత్రునితో "నేనిచటికి వచ్చినట్లుగా రాజుగారికి శీఘ్రముగా విన్నవింపుము" - అని పలికెను- (31-33)

ఇమే గంగోదకఘటాః సాగరేభ్యశ్చ కాంచనాః।
ఔదుంబరం భద్రపీఠమ్ అభిషేకార్థమాహృతమ్। 34

సర్వబీజాని గంధాశ్చ రత్నాని వివిధాని చ।
క్షౌద్రం దధి ఘృతం లాజా దర్భాః సుమనసః పయః। 35

అష్టౌ చ కన్యా రుచిరా మత్తశ్చ వరవారణః।
చతురశ్వో రథః శ్రీమాన్ నిస్త్రింశో ధనురుత్తమమ్। 36

వాహనం నరసంయుక్తం ఛత్రం చ శశిసన్నిభమ్।
శ్వేతే చ వాలవ్యజనే భృంగారశ్చ హిరణ్మయః। 37

హేమదామపినద్ధశ్చ కకుద్మాన్ పాండురో వృషః।
కేసరీ చ చతుర్దంష్ట్రో హరిశ్రేష్ఠో మహాబలః। 38

సింహాసనం వ్యాఘ్రతనుః సమిద్ధశ్చ హుతాశనః।
సర్వవాదిత్రసంఘాశ్చ వేశ్యాశ్చాలంకృతాః స్త్రియః। 39

ఆచార్యా బ్రాహ్మణా గావః పుణ్యాశ్చ మృగపక్షిణః।
పౌరజానపదశ్రేష్ఠా నైగమాశ్చ గణైస్సహ। 40

ఏతే చాన్యే చ బహవః ప్రీయమాణాః ప్రియంవదాః।
అభిషేకాయ రామస్య సహ తిష్ఠంతి పార్థివైః। 41

త్వరయస్వ మహారాజం యథా సముదితేఽహని।
పుష్యే నక్షత్రయోగే చ రామో రాజ్యమవాప్నుయాత్। 42

ఇతి తస్య వచః శ్రుత్వా సూతపుత్రో మహాత్మనః।
స్తువన్ నృపతిశార్దూలం ప్రవివేశ నివేశనమ్। 43

తం తు పూర్వోదితం వృద్ధం ద్వారస్థా రాజసమ్మతమ్।
న శేకురభిసంరోద్ధుం రాజ్ఞః ప్రియచికీర్షవః। 44

స సమీపస్థితో రాజ్ఞః తామవస్థామ్ అజజ్ఞివాన్।
వాగ్భిః పరమతుష్టాభిః అభిష్టోతుం ప్రచక్రమే। 45

తతః సూతో యథాకాలం పార్థివస్య నివేశనే।
సుమంత్రః ప్రాంజలిర్భూత్వా తుష్టావ జగతీపతిమ్। 46

యథా నందతి తేజస్వీ సాగరో భాస్కరోదయే।
ప్రీతః ప్రీతేన మనసా తథాఽఽనందఘనః స్వతః। 47

"పట్టాభిషేకముకొఱకై సముద్రజలములతో, గంగాది నదీజలములతో నిండిన బంగారుకలశములు ఇవిగో - ఇది మేడిచెక్కలతో సిద్ధపఱచబడిన భద్రపీఠము- వివిధములగు ధాన్యములు, గంధములు, నానావిధరత్నములు, తేనెలు, పెరుగులు, నేతులు, పేలాలు, దర్భలు, పూవులు, పాలు తీసికొని రాబడినవి. (34-35)

అందమైన ఎనిమిదిమంది కన్యలు, మదించిన భద్రగజము, నాలుగు గుఱ్ఱములను పూన్చిన అందమైన రథము, రాజఖడ్గము, మేలైన ధనుస్సు, బోయీలుమోయుచున్న పల్లకీ, చంద్రునివలె మనోహరమైన గొడుగు, తెల్లని రెండు వింజామరలు, బంగారు పాత్ర, బంగారుగొలుసులతో అలంకరింపబడినమూపురముగల తెల్లని వృషభము, నాలుగు కోఱలుగల సింహము, మిక్కిలి బలిష్ఠమైన మహాశ్వము తీసికొనిరాబడినవి. (36-38)

సింహాసనము, పెద్దపులిచర్మము, ప్రజ్వలితాగ్ని, వీణావేణు మృదంగతాళవాద్యసమూహములు, వేశ్యాస్త్రీగణము, చక్కగా అలంకరించుకొనిన సుందరీమణులు, ఆచార్యులైన బ్రాహ్మణులు, పవిత్రములైన గోవులు, మృగములు, పక్షులు, ప్రముఖులైన పురజనులు, జానపదులు, వర్తకులు, శిల్పులు ఇచటికి విచ్చేసిరి- (39-40)

వీరేగాక ఇంకను పెక్కుమంది ప్రియభాషులు శ్రీరాముని పట్టాభిషేకమునకై వచ్చి, సామంతరాజులతోగూడి కూర్చొని యున్నారు. మహారాజును తొందరపెట్టుము. ఈ శ్రేయస్కరమైన దినమున పుష్యమీనక్షత్రయుక్త శుభముహూర్తమునందు శ్రీరాముడు యువరాజపట్టాభిషిక్తుడు కావలసియున్నది." (41-42)

మహాత్ముడైన వసిష్ఠునియొక్క ఆదేశమునందుకొని, సుమంత్రుడు 'మహారాజునకు జయము' అని పలుకుచు ఆయనమందిరమున ప్రవేశించెను. (43)

వృద్ధుడైన సుమంత్రుడు రాజమందిరమున ప్రవేశించునప్పుడు 'ఈయనను ఎవ్వరును ఆపరాదు'- అనునది రాజాజ్ఞ. అందువలన రాజునకు మేలు గోరువారైన ద్వారపాలకులు ఆ సుమంత్రుని నిరోధింపలేదు. సుమంత్రుడు రాజును సమీపించి, ఆయనపరిస్థితి తెలియనివాడగుటచే ఎప్పటివలె ఆయనను సంతోషకరములగు మాటలతో కొనియాడసాగెను. (44-45)

అంతట రథసారథియైన సుమంత్రుడు రాజమందిరమున దోసిలొగ్గినిలిచినవాడై, ప్రాతఃకాలమునకు తగినట్లు మహారాజును ఇట్లు ప్రశంసించెను. "రాజా! శుభ (పర్వ) దినములలో[1] చంద్రోదయమును జూచి, తేజస్వియైన సముద్రుడు ఉవ్వెత్తు తరంగములతో ఉప్పొంగునట్లు సహజముగా ఆనందఘనుడవైన నీవు (నీ పుత్రుడైన శ్రీరామునిపట్టాభిషేకసందర్భమున) నిండుమనస్సుతో పరమానందమును పొందుము- (46-47)

1) భాస్కరః: (1) తన తీక్ష్ణ కిరణకాంతులతో లోకమును ప్రకాశింపజేయువాడు- సూర్యుడు, (2) తన అమృతకిరణములతో చల్లనివెన్నెలలను విరజిమ్ముచు లోకమును ఆహ్లాదపఱచువాడు చంద్రుడు. సముద్రుని పుత్రుడు చంద్రుడు. చంద్రో (పుత్రో) దయమును జూచి సముద్రుడు ఉప్పొంగుచుండును.

ఇంద్రమస్యాం తు వేళాయామ్ అభితుష్టావ మాతలిః।
సో౽జయద్దానవాన్ సర్వాం స్తథా త్వాం బోధయామ్యహమ్। 48

వేదాస్సహాంగవిద్యాశ్చ యథాహ్యాత్మభువం విభుమ్।
బ్రహ్మాణం బోధయంత్యద్య తథా త్వాం బోధయామ్యహమ్। 49

ఆదిత్యస్సహ చంద్రేణ యథా భూతధరాం శుభామ్।
బోధయత్యద్య పృథివీం తథా త్వాం బోధయామ్యహమ్। 50

ఉత్తిష్ఠాశు మహారాజ కృతకౌతుకమంగళః।
విరాజమానో వపుషా మేరోరివ దివాకరః। 51

సోమసూర్యౌ చ కాకుత్స్థ శివవైశ్రవణావపి।
వరుణశ్చాగ్నిరింద్రశ్చ విజయం ప్రదిశంతు తే। 52

గతా భగవతీ రాత్రిః కృతం కృత్యమిదం తవ।
బుధ్యస్వ నృపశార్దూల కురు కార్యమనంతరమ్। 53

ఉదతిష్ఠత రామస్య సమగ్రమభిషేచనమ్।
పౌరజానపదైశ్చాపి నైగమైశ్చ కృతాంజలిః। 54

స్వయం వసిష్ఠో భగవాన్ బ్రాహ్మణైస్సహ తిష్ఠతి।
క్షిప్రమాజ్ఞాప్యతాం రాజన్ రాఘవస్యాభిషేచనమ్। 55

యథా హ్యపాలాః పశవో యథా సేనా హ్యనాయకా।
యథా చంద్రం వినా రాత్రిః యథా గావో వినా వృషమ్। 56

ఏవం హి భవితా రాష్ట్రం యత్ర రాజా న దృశ్యతే। 57

ఇతి తస్య వచః శ్రుత్వా సాంత్వపూర్వమివార్థవత్।
అభ్యకీర్యత శోకేన భూయ ఏవ మహీపతిః। 58

తతస్స రాజా తం సూతం సన్నహర్షస్సుతం ప్రతి।
శోకరక్తేక్షణః శ్రీమాన్ ఉద్వీక్ష్యోవాచ ధార్మికః।
వాక్యైస్తు ఖలు మర్మాణి మమ భూయో నికృంతసి। 59

సుమంత్రః కరుణం శ్రుత్వా దృష్ట్వా దీనం చ పార్థివమ్।
ప్రగృహీతాంజలిః కించిత్ తస్మాద్దేశాదపాక్రమత్। 60

ఈ ప్రభాతసమయమునందే ఇంద్రునిరథసారథియైన మాతలి దేవేంద్రుని ప్రస్తుతించెను- తత్ప్రభావమున ఇంద్రుడు దానవులందరిని జయించెను- అట్లే నిన్ను నేను ప్రస్తుతించుచు మేల్కొలుపుచున్నాను. నీవును ఆ ఇంద్రునివలె శుభపరంపరలతో పురోగమింతువు. స్వయంభువు, సృష్టికర్తయును ఐన బ్రహ్మదేవుని వేదవేదాంగాదిచతుర్దశవిద్యలు మేల్కొలుపురీతిగా నేను నిన్ను మేల్కొలుపుచున్నాను. సూర్యచంద్రులు సకలప్రాణికోటితోనిండిన ఈ భూమండలమును జాగృతమొనర్చునట్లుగా ఓ రాజా! నిన్ను నేను మేల్కొలుపుచున్నాను. (48-50)

ఓ మహారాజా! త్వరగా లెమ్ము. పట్టాభిషేకోత్సవసమయమునకు తగిన మంగళాచారములను పూర్తిచేయుము. వస్త్రభూషణములతో శోభిల్లుచు సింహాసనమును అలంకరింపుము. అప్పుడు మీరు మేరుశిఖరముపై విరాజిల్లు సూర్యునివలె ప్రకాశించెదరు. (51)

ఓ రాజా! సూర్యచంద్రులు, పరమశివుడు, కుబేరుడు, వరుణుడు, అగ్ని, దేవేంద్రుడు మున్నగు దేవతలు నీకు విజయమును ప్రసాదింతురుగాక. (52)

ఓ రాజేంద్రా! సకలశుభములను చేకూర్చు రాత్రి గడచినది. మీయాదేశానుసారము పట్టాభిషేకకార్యములను అన్నింటిని పూర్తిచేసితిమి. త్వరగా జాగృతివహించి, అనంతరకృత్యములకు సిద్ధపడుము- (53)

శ్రీరామునిపట్టాభిషేకమునకు ముందుగా చేయవలసిన పనులన్నియును పూర్తియైనవి. పురజనులు, జానపదులు, ప్రముఖులైన వ్యాపారులు అంజలిఘటించి వేచియున్నారు. ఓ రాజా! పూజ్యుడైన వసిష్ఠమహర్షి బ్రాహ్మణోత్తములతోగూడి ద్వారముకడ నిలిచియున్నాడు. కావున శ్రీరామునిపట్టాభిషేకకార్యమును ప్రారంభించుటకు త్వరగా ఆజ్ఞయొసంగుడు. (54-55)

రాజులేనిసమయమున ఆరాజ్యము కాపరిలేని పశువులవలెను, నాయకుడులేని సేనవిధముగను, చంద్రుడులేని రాత్రిరీతిగను, వృషభములేని గోవులవలెను వెలవెలబోవును. (దిక్కులేనిదగును)." ఆ సుమంత్రునియొక్క అర్థవంతములైన అనునయవచనములను విని, ఆ మహారాజు ఇంకను శోకాకులుడయ్యెను- (56-58)

ఆసమయమున రాజు పుత్త్రునివిడబాటును ఊహించుకొనుచు మనశ్శాంతిని కోల్పోయియుండెను. దుర్భరమైన శోకకారణముగా అతనికన్నులు ఎఱ్ఱబాఱియుండెను. ధర్మాత్ముడును, శ్రీమంతుడును ఐన ఆ మహారాజు ఒక్కసారి తలపైకెత్తి సుమంత్రునిపై దృష్టిని నిల్పి 'ఇంతవఱకును కైకేయి మాటలపోటులకు గాయపడిన నా హృదయమును 'పుండుమీద కారము చల్లినట్లు' నీ మాటలు ఇంకను బాధించుచున్నవి.' అని ఆయనతో పలికెను. (59)

సుమంత్రుడు దశరథునిదైన్యవచనములను విని, దుఃఖితుడైయున్న ఆ ప్రభువునుజూచి, వినయముతో చేతులు జోడించినవాడై తానున్న ప్రదేశమునుండి ఒకఅడుగు వెనుకకు వేసెను. (60)

యదా వక్తుం స్వయం దైన్యాత్ న శశాక మహీపతిః।
తదా సుమంత్రం మంత్రజ్ఞా కైకేయీ ప్రత్యువాచ హ। 61

మిక్కిలి దైన్యమునకులోనైన ఆ మహారాజు జరిగిన సంగతులను స్వయముగా తెల్పుటకు అశక్తుడగుటచే, కార్యసాధకురాలైన కైకేయి సుమంత్రునితో ఇట్లు నుడివెను. (61)

సుమంత్ర రాజా రజనీం రామహర్షసముత్సుకః।
ప్రజాగరపరిశ్రాంతో నిద్రయా వశమేయివాన్। 62

తద్గచ్ఛ త్వరితం సూత రాజపుత్రం యశస్వినమ్।
రామమానయ భద్రం తే నాత్ర కార్యా విచారణా। 63

"ఓ సుమంత్రా! రాత్రియంతయును రాజు రామాభిషేక సంతోషముతో మేల్కొనియుండుటచే, ఇప్పుడు గాఢనిద్రలో మునిగియున్నాడు. ఓ సూతా! అందువలన యశస్వియైన రాముని కడకు త్వరగా వెళ్లి, ఆ రాజపుత్రుని తోడ్కొని రమ్ము. నీకు భద్రమగుగాక. ఇక్కడ నీవు విచారింపవలసినపని ఇంకనేమియు లేదు-" అని ఆజ్ఞాపించెను- (62-63)

అశ్రుత్వా రాజవచనం కథం గచ్ఛామి భామిని।
తచ్ఛ్రుత్వా మంత్రిణో వాక్యం రాజా మంత్రిణమబ్రవీత్।
సుమంత్ర రామం ద్రక్ష్యామి శీఘ్రమానయ సుందరమ్। 64

అంతట సుమంత్రుడు 'ఓదేవీ! రాజుగారి ఆజ్ఞలేకుండ నేను వెళ్లుటయెట్లు'? అని కైకతో అనెను. అప్పుడు ఆసుమంత్రుని వచనములను వినిన దశరథమహారాజు అతనితో "ఆ అందాల రాముని వెంటనే తీసికొనిరమ్ము. నాప్రియసుతుని నేను చూడదలచితిని" - అని పల్కెను. (64)

స మన్యమానః కల్యాణం హృదయేన ననంద చ।
నిర్జగామ చ సంప్రీత్యా త్వరితో రాజశాసనాత్। 65

సుమంత్రశ్చింతయామాస త్వరితం చోదితస్తయా।
వ్యక్తం రామాభిషేకార్థమ్ ఇహాయాస్యతి ధర్మవిత్। 66

పిదప సుమంత్రుడు 'అంతయు శుభమేజరుగును'-అని తలంచుచు ఆనందించెను. వెంటనే అతడు రాజాజ్ఞను తలదాల్చి, శ్రీరాముని భవనమునకు బయలుదేరెను. వెళ్లుచు శ్రీరాముని పట్టాభిషేకమునకై కైకేయి తొందరపెట్టుచున్నదనియు, ధర్మజ్ఞుడైన శ్రీరాముడు ఇచటికి తప్పక రాగలడనియు అతడు భావించెను. (65-66)

ఇతి సూతో మతిం కృత్వా హర్షేణ మహతా వృతః।
నిర్జగామ మహాబాహూ రాఘవస్య దిదృక్షయా। 67

మహాబాహువైన సుమంత్రుడు అట్లుతలపోసి, మిక్కిలి సంతోషముతో శ్రీరామునిదర్శనమునకై వెడలెను. (67)

సాగరహ్రదసంకాశాత్ సుమంత్రోఽంతఃపురాచ్ఛుభాత్।
నిష్క్రమ్య జనసంబాధం దదర్శ ద్వారమగ్రతః। 68

సముద్రమునందలి ఒక మడుగువలెనున్న అయోధ్యానగరము నందలి ఆ అందమైన అంతఃపురమునుండి అతడు బయటికి వచ్చి, ద్వారముకడచేరియున్న జనసమూహామును జూచెను- (68)

తతః పురస్తాత్ సహసా వినిర్గతో
మహీపతీన్ ద్వారగతో విలోకయన్ ।
దదర్శ పౌరాన్ వివిధాన్ మహాధనాన్
ఉపస్థితాన్ ద్వారముపేత్య విష్ఠితాన్ । 69

త్వరగా అంతఃపురమునుండి బయటపడిన సుమంత్రుడు ద్వారమునొద్ద మొదట సామంతరాజులను గాంచెను - పిమ్మట వివిధవర్గములకు చెందిన పౌరులను, కానుకలతో సిద్ధముగా నున్న సంపన్నులను జూచెను- (69)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుర్దశస్సర్గః (14)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పదునాల్గవసర్గము సమాప్తము.

-- * * * --

15. పదునైదవసర్గము

సుమంత్రుడు శ్రీరామునిమందిరమున ప్రవేశించుట.

తే తు తాం రజనీముష్య బ్రాహ్మణా వేదపారగాః।
ఉపతస్థురుపస్థానం సహ రాజపురోహితాః। 1

వేదపారంగతులైన బ్రాహ్మణులు ఆ రాత్రి గడపినపిదప, రాజవంశపురోహితుడైన వసిష్ఠునితోగూడి, సమీపముననేయున్న పట్టాభిషేకమండపమునకు చేరిరి. (1)

అమాత్యా బలముఖ్యాశ్చ ముఖ్యా యే నిగమస్య చ।
రాఘవస్యాభిషేకార్థే ప్రీయమాణాస్తు సంగతాః। 2

మంత్రులు, సేనానాయకులు, సంపన్నులైన వర్తకులు, పౌర ప్రముఖులు మున్నగువారందఱును రామపట్టాభిషేకమహోత్సవమును దర్శించుటకై సంబరపడుచు అచట సమావేశమైరి. (2)

ఉదితే విమలే సూర్యే పుష్యే చాభ్యాగతేఽహని।
లగ్నే కర్కటకే ప్రాప్తే జన్మ రామస్య చ స్థితే।
అభిషేకాయ రామస్య ద్విజేంద్రైః ఉపకల్పితమ్। 3

సూర్యుడు పూర్తిగా ఉదయించెను- ఆ దినమున పుష్యమీ నక్షత్రము వచ్చెను. శ్రీరామునిజన్మరాశియైన కర్కాటకలగ్నము నందు ఆయనకు యువరాజపట్టాభిషేకమహోత్సవమును జరుపుటకు బ్రాహ్మణోత్తములు నిశ్చయించి, సమస్తసంభారములతో సిద్ధముగా నుండిరి. (3)

కాంచనా జలకుంభాశ్చ భద్రపీఠం స్వలంకృతమ్।
రథశ్చ సమ్యగాస్తీర్ణో భాస్వతా వ్యాఘ్రచర్మణా। 4

బంగారు జలపాత్రలు, చక్కగా అలంకరింపబడిన భద్రపీఠము, చక్కని పులితోలు పఱచబడిన రథము సిద్ధముచేయబడినవి- (4)

గంగాయమునయోః పుణ్యాత్ సంగమాదాహృతం జలమ్।
యాశ్చాన్యాః సరితః పుణ్యా హ్రదాః కూపాస్సరాంసి చ। 5

గంగాయమునలసంగమప్రదేశమైన ప్రయాగయందలి పవిత్ర జలములు పునీతములైన ఇతరనదీజలములు, పెద్దపెద్దమడుగులు, బావులు, సరస్సులు మొదలగు వానియందలి పుణ్యజలములు తీసికొనిరాబడినవి- (5)

ప్రాగ్వాహాశ్చోర్ధ్వవాహాశ్చ తిర్యగ్వాహాస్సమాహితాః।
తాభ్యశ్చైవాహృతం తోయం సముద్రేభ్యశ్చ సర్వశః। 6

తూర్పువైపుగా ప్రవహించు గోదావరి, కృష్ణ, కావేరి మొదలగు నదులజలములు, నైమిశారణ్యాది పుణ్యక్షేత్రములయందు పైకి వెల్లుబుకుచున్న బ్రహ్మావర్త, రుద్రావర్తాది సరస్సులయందలి పవిత్రజలములు, దక్షిణమునుండి ఉత్తరమునకు అడ్డముగా ప్రవహించు గండకీప్రభృతి నదీజలములు, నలువైపులగల ప్రసిద్ధ సముద్రజలములు తీసికొనిరాబడెను. (6)

సలాజాః క్షీరిభిశ్ఛన్నా ఘటాః కాంచనరాజతాః।
పద్మోత్పలయుతా భాంతి పూర్ణాః పరమవారిణా। 7

క్షౌద్రం దధి ఘృతం లాజా దర్భాః సుమనసః పయః।
వేశ్యాశ్చైవ శుభాచారాః సర్వాభరణభూషితాః। 8

అచట బంగారు వెండి పాత్రలలో పేలాలను, పవిత్ర జలములను నింపియుంచిరి- అకలంకములైన రావి యాకులు, మేడి ఆకులు, తామరాకులు, కలువపత్రములు కప్పబడియుండుటచే అవి మనోహరముగానుండెను. అక్కడ తేనె, పెరుగు, నేయి, అవాలు, దర్భలు, పూవులు, పాలు సిద్ధముగా ఉంచబడెను. వివిధాభరణములను అలంకరించుకొని, సదాచారములను నడుపు దేవదాసీలు అచటికి చేరియుండిరి. (7-8)

చంద్రాంశువికచప్రఖ్యం కాంచనం రత్నభూషితమ్।
సజ్జం తిష్ఠతి రామస్య వాలవ్యజనముత్తమమ్। 9

రామునికొఱకై శ్రేష్ఠమైన వింజామరము సిద్ధముగానుంచబడినది. దానిపిడి బంగారముతో నిర్మింపబడి, రత్నములు పొదుగబడి యుండెను - అది గుబురుగానుండి చంద్రకిరణశోభలను వెలార్చు చుండెను. దానిపై సుగంధపుష్పములను అలంకరించిరి- (9)

చంద్రమండలసంకాశమ్ ఆతపత్రం చ పాండురమ్।
సజ్జం ద్యుతికరం శ్రీమదభిషేకపురస్కృతమ్। 10

శ్రీరామపట్టాభిషేకమునకై చంద్రమండలమువలెను స్వచ్ఛమైన కాంతులను విరజిమ్ముచున్న శ్వేతచ్ఛత్రము గంధపుష్పాదులతో అలంకృతమై, కనువిందుగావించుచుండెను- (10)

పాండురశ్చ వృషస్సజ్జః పాండురోఽశ్వశ్చ సుస్థితః।
ప్రసృతశ్చ గజః శ్రీమాన్ ఔపవాహ్యః ప్రతీక్షతే। 11

చక్కగా అలంకరింపబడిన తెల్లనివృషభము, శ్వేతాశ్వము, రాజు అధిష్ఠింపదగిన శుభలక్షణములుగల భద్రగజము యువరాజు కొఱకై నిరీక్షించుచుండెను. (11)

అష్టౌ చ కన్యా మాంగల్యాః సర్వాభరణభూషితాః।
వాదిత్రాణి చ సర్వాణి వందినశ్చ తథాపరే। 12

మంగళప్రదలైన ఎనిమిదిమంది కన్యలు వివిధాభరణములను చక్కగా అలంకరించుకొనియుండిరి. సకలవాద్యములును సిద్ధముగ ఉండెను. వందిమాగధులు మొదలగు వారు సర్వసన్నద్ధులై యుండిరి. (12)

ఇక్ష్వాకూణాం యథా రాజ్యే సంభ్రియేతాభిషేచనమ్।
తథా జాతీయమాదాయ రాజపుత్త్రాభిషేచనమ్। 13

తే రాజవచనాత్ తత్ర సమవేతా మహీపతిమ్।
అపశ్యంతోఽబ్రువన్ కో ను రాజ్ఞో నః ప్రతివేదయేత్। 14

న పశ్యామశ్చ రాజానమ్ ఉదితశ్చ దివాకరః।
యౌవరాజ్యాభిషేకశ్చ సజ్జో రామస్య ధీమతః। 15

ఇతి తేషు బ్రువాణేషు సార్వభౌమాన్ మహీపతీన్।
అబ్రవీత్ తానిదం సర్వాన్ సుమంత్రో రాజసత్కృతః। 16

రామం రాజ్ఞో నియోగేన త్వరయా ప్రస్థితోఽస్మ్యహమ్।
పూజ్యా రాజ్ఞో భవంతస్తు రామస్య చ విశేషతః। 17

అయం పృచ్ఛామి వచనాత్ సుఖమాయుష్మతామహమ్।
రాజ్ఞః సంప్రతిబుద్ధస్య యచ్చాగమనకారణమ్। 18

ఇత్యుక్త్వాంతఃపురద్వారమ్ ఆజగామ పురాణవిత్।
సదాఽసక్తం చ తద్వేశ్మ సుమంత్రః ప్రవివేశ హ। 19

తుష్టావాస్య తదా వంశం ప్రవిశ్య స విశాంపతేః।
శయనీయం నరేంద్రస్య తదాఽఽసాద్య వ్యతిష్ఠత। 20

సోఽత్యాసాద్య తు తద్వేశ్మ తిరస్కరణిమంతరా।
ఆశీర్భిర్గుణయుక్తాభిః అభితుష్టావ రాఘవమ్। 21

సోమసూర్యౌ చ కాకుత్స్థ శివవైశ్రవణావపి।
వరుణశ్చాగ్నిరింద్రశ్చ విజయం ప్రదిశంతు తే। 22

గతా భగవతీ రాత్రిః కృతం కృత్యమిదం తవ।
బుధ్యస్వ నృపశార్దూల కురు కార్యమనంతరమ్। 23

బ్రాహ్మణా బలముఖ్యాశ్చ నైగమాశ్చాగతా నృప।
దర్శనం తేఽభికాంక్షంతే ప్రతిబుధ్యస్వ రాఘవ!। 24

స్తువంతం తం తదా సూతం సుమంత్రం మంత్రకోవిదమ్।
ప్రతిబుధ్య తతో రాజా ఇదం వచనమబ్రవీత్। 25

రామమానయ సూతేతి యదస్యభిహితో మయా।
కిమిదం కారణం యేన మమాజ్ఞా ప్రతిహన్యతే। 26

ఇక్ష్వాకుమహారాజులపట్టాభిషేకములకు అర్హమైన (వలయు) సమస్తవస్తువులను సమకూర్చునట్లే రామపట్టాభిషేకమును పురస్కరించుకొని, కానుకలుగా బహూకరించుటకై సామంతరాజులు అమూల్యములైన రత్నములను, వజ్రవైడూర్యములను గైకొని, రాజాజ్ఞమేరకు అచటికి చేరియుండిరి. కాని వారు రాజుగారిని గానక నివ్వెఱపడుచు, 'మనరాకనుగూర్చి మహారాజుగారికి ఎవరు తెల్పుదురు?' అని తమలో తాము అనుకొనసాగిరి. (13-14)

'సూర్యోదయము మాత్రము ఐనది. కాని ఇంతవఱకును మహారాజుగారి దర్శనములేదు- బుద్ధిమంతుడైన శ్రీరామునియొక్క యువరాజపట్టాభిషేకమునకు తగిన సన్నాహములు పూర్తియైనవి' అని అనుకొనుచున్న సమస్త సార్వభౌములతో, సామంతరాజులతో రాజుగారి అంతరంగికుడైన సుమంత్రుడు ఇట్లనుడివెను- (15-16)

మహారాజుగారిఆదేశానుసారము శ్రీరాముని గొనివచ్చుటకై నేను శీఘ్రముగా వెళ్ళుచున్నాను- మీరందరును దశరథులవారికిని, అందును విశేషముగా శ్రీరామునకును గౌరవార్హులు- ఆయుష్మంతులైన మీరు స్వయముగా రాజుగారి క్షేమసమాచారములను గూర్చి అడిగినట్లుగా ఆయన పూర్తిగా మేల్కొనిన పిదప తెల్పెదను - మఱియు ఆయన ఇచటికి రాకుండుటకుగల కారణమును గూడ అడిగి తెలిసికొందును- (17-18)

సామంతరాజులవృత్తాంతములను సాంగోపాంగముగాఎఱింగిన సుమంత్రుడు ఈ విధముగా పలికి, అంతఃపురద్వారముకడకు మరలి వచ్చి, తనకు ఎప్పుడును అడ్డులేని ఆ భవనములో ప్రవేశించెను. (19)

పిమ్మట అతడు ఆ మహారాజుయొక్క వంశావళిని కీర్తించెను. క్రమముగా ఆయన శయనమందిరమునకు చేరి, అచట నిలచెను. అనంతరము ఆమందిరములోని సెజ్జకు చేరువగానున్న తెరను సమీపించి, అతడు గుణగణప్రశంసలతోగూడిన ఆశీస్సులతో దశరథుని ప్రస్తుతించెను. (20-21)

'ఓ కాకుత్స్థా! సూర్యచంద్రులు, పరమశివుడు, కుబేరుడు, వరుణుడు, అగ్ని, ఇంద్రుడు నీకు విజయమును ప్రసాదింతురుగాక. సుఖశాంతులనుగూర్చునట్టి రాత్రి గడచినది, మీయాదేశానుసారము చేయవలసిన పనులనన్నింటిని మేము ఆచరించితిమి- ఓ మహారాజా! మేల్కొనుడు, అనంతరకార్యములను నిర్వర్తింపుడు. ఓ రాజా! బ్రాహ్మణులును, సైనికప్రముఖులును, వ్యాపారులును వచ్చేసి, మీ దర్శనమునకై నిరీక్షించుచున్నారు. కనుక దయతో మేల్కొనుడు. రాజ్యతంత్రమునుగూర్చిన ఆలోచనలలో నిపుణుడైన సుమంత్రుడు కావించిన స్తుతులను గ్రహించి, దశరథుడు ఆ సుమంత్రునితో ఇట్లు పలికెను. (22-25)

"ఓ సూతుడా! శ్రీరాముని ఇచటికి దీసికొని రమ్ము" అని నేను ఇంతకు ముందు చెప్పియుంటిని గదా! అతడు నా ఆజ్ఞను ఏల ఉల్లంఘించుచున్నాడు?" అని రాజు తనలో తాను

స చైవ సంప్రసుప్తోహమ్ ఆనయేహాశు రాఘవమ్।
ఇతి రాజా దశరథః సూతం తత్రాన్వశాత్ పునః। 27

స రాజవచనం శ్రుత్వా శిరసా ప్రతిపూజ్య తమ్।
నిర్జగామ నృపావాసాత్ మన్యమానః ప్రియం మహత్। 28

ప్రపన్నో రాజమార్గం చ పతాకాధ్వజశోభితమ్।
హృష్టః ప్రముదితస్సూతో జగామాశు విలోకయన్। 29

స సూతస్తత్ర శుశ్రావ రామాధికరణాః కథాః।
అభిషేచనసంయుక్తాః సర్వలోకస్య హృష్టవత్। 30

తతో దదర్శ రుచిరం కైలాసశిఖరప్రభమ్।
రామవేశ్మ సుమంత్రస్తు శక్రవేశ్మ సమప్రభమ్। 31

మహాకవాటవిహితం వితర్దిశతశోభితమ్।
కాంచనప్రతిమైకాగ్రం మణివిద్రుమతోరణమ్। 32

శారదాభ్రఘనప్రఖ్యం దీప్తం మేరుగుహోపమమ్।
మణిభిర్వరమాల్యానాం సుమహద్భిరలంకృతమ్। 33

ముక్తామణిభిరాకీర్ణం చందనాగరుధూపితమ్।
గంధాన్ మనోజ్ఞాన్ విసృజత్ దార్దరం శిఖరం యథా। 34

సారసైశ్చ మయూరైశ్చ వినదద్భిర్విరాజితమ్।
సుకృతేహామృగాకీర్ణం సుకీర్ణం భక్తిభిస్తథా। 35

మనశ్చక్షుశ్చ భూతానామ్ ఆదదత్ తిగ్మతేజసా।
చంద్రభాస్కరసంకాశం కుబేరభవనోపమమ్। 36

మహేంద్రధామప్రతిమం నానాపక్షిసమాకులమ్।
మేరుశృంగసమం సూతో రామవేశ్మ దదర్శ హ। 37

తర్కించుకొనెను." 'నేను నిద్రించుటలేదు. శ్రీరాముని ఇచటికి త్వరగా పిల్చుకొని రమ్ము-' అని మహారాజు మఱల సూతుని ఆజ్ఞాపించెను. (26-27)

అప్పుడాసుమంత్రుడు రాజాజ్ఞను తలదాల్చి, ఆయనకు శిరసు వంచి నమస్కరించెను. గొప్పశుభకార్యము జరుగబోవుచున్నదని తలంచుచు ఆరాజభవనమునుండి అతడు బయలుదేఱెను. (28)

రాజభక్తితత్పరుడైన సుమంత్రుడు ధ్వజపతాకములతో శోభిల్లుచున్న రాజమార్గమునజాచుచు, సంతుష్టాంతరంగుడై, వెంటనే శ్రీరామునిభవనమునకు బయలుదేఱెను. (29)

ఆ రథసారథి మార్గమున సాగిపోవుచు, అక్కడక్కడ ప్రజలు అందఱును శ్రీరామునిగూర్చియు, రామపట్టాభిషేకమును గుఱించియు ముగ్గడించుకొనుచున్న కథలను గాథలను సంతోషముతో వినెను. (30)

అనంతరము సుమంత్రుడు కైలాసశిఖరమువలె కాంతులను విరజిమ్ముచు, ఇంద్రభవనమువలె సుశోభితమై మనోహరముగా నున్న శ్రీరామునియంతఃపురమును దర్శించెను. (31)

ఆ భవనమునకు గొప్పద్వారములు అమర్చబడినవి. అసంఖ్యాకములైన వేదికలు అందముశోభిల్లుచున్నవి. బంగారువిగ్రహములు ముఖ్య శిఖరములపై అలరారుచున్నవి. బహిర్ద్వారములయందు మణుల, పవడముల తోరణములు రాజిల్లుచున్నవి. ఆ భవనము శరత్కాల మేఘములవలె స్వచ్ఛముగా ప్రకాశించుచున్నది. మేరుపర్వతగుహ వలె ఒప్పుచున్నది. ప్రసిద్ధములైన, మేలైన మణులమాలలతో అలంకరింపబడినది. ముత్యములతో, మణులతో వ్యాప్తమైయున్నది- చందనములతో, అగరుధూపములతో గుబాళించుచున్నది. ఆ ప్రాసాదము మలయపర్వతసమీపమునందలి దర్దరము అను చందనగిరిశిఖరమువలె అన్నిదిక్కులకును సుగంధములను విరజిమ్ముచున్నది. (32-34)

బెగ్గురుపక్షులకలరవములు, నెమళ్లక్రేంకారములు ఆభవన వైభవమును ఇనుమడింపజేయుచుండెను. బంగారము, వెండి మున్నగు ధాతువులచే చక్కగా శ్రద్ధతో నిర్మింపబడిన కృత్రిమ హరిణములస్వరూపములతో అది నిండియుండెను. గోడలమీదను, స్తంభములపైనను అందమైన నగిషీలు చెక్కబడియుండెను. ఆ భవనము తనఉత్కృష్టశోభలతో సమస్తప్రాణులమనస్సులను ఆకర్షించుచు తనకముచ్చటగొల్పుచుండెను. సూర్యచంద్ర తేజస్సులతో విరాజిల్లుచు అది కుబేరభవనమును మఱపించుచుండెను- (35-36)

అది దేవేంద్రభవనమువలెమెఱసిపోవుచుండెను. వివిధజాతి పక్షులకలరవములతో మనోహరముగానుండెను- మేరుశిఖరమువలె సమున్నతమై ఒప్పుచున్న ఆ శ్రీరామునిభవనమునుసుమంత్రుడు కన్నులార గాంచెను. పెక్కుమంది ప్రజలు ఆ భవనసమీపమున

ఉపస్థితైస్సమాకీర్ణం జనైరంజలికారిభిః।
ఉపాదాయ సమాక్రాంతైః తథా జానపదైర్జనైః। 38

రామాభిషేకసుముఖైః ఉన్ముఖైః సమలంకృతమ్।
మహామేఘసమప్రఖ్యమ్ ఉదగ్రం సువిభూషితమ్। 39

నానారత్నసమాకీర్ణం కుబ్జకైరాతకావృతమ్। 40

స వాజియుక్తేన రథేన సారథిః
నరాకులం రాజపథం విలోకయన్ ।
వరూథినా రామగృహాభిపాతినా
పురస్య సర్వస్య మనాంసి రంజయత్ । 41

తత స్సమాసాద్య మహాధనం మహత్
ప్రహృష్టరోమా స బభూవ సారథిః ।
మృగైర్మయూరైశ్చ సమాకులోల్బణం
గృహం వరార్హస్య శచీపతేరివ । 42

స తత్ర కైలాసనిభాః స్వలంకృతాః
ప్రవిశ్య కక్ష్యాః త్రిదశాలయోపమాః ।
ప్రియాన్ నరాన్ రామమతే స్థితాన్ బహూన్
అపోహ్య శుద్ధాంతముపస్థితో రథీ । 43

స తత్ర శుశ్రావ చ హర్షయుక్తా
రామాభిషేకార్థకృతా జనానామ్ ।
నరేంద్రసూనోః అభిమంగళార్థాః
సర్వస్యలోకస్య గిరః ప్రహృష్టః । 44

మహేంద్రసద్మప్రతిమం తు వేశ్మ
రామస్య రమ్యం మృగపక్షిజుష్టమ్ ।
దదర్శ మేరోరివ శృంగముచ్చం
విభ్రాజమానం ప్రభయా సుమంత్రః । 45

ఉపస్థితైరంజలికారకైశ్చ
సోపాయనైర్జానపదైశ్చ మర్త్యైః ।
కోట్యాపరార్ధైశ్చ విముక్తయానైః
సమాకులం ద్వారపథం దదర్శ । 46

తతో మహామేఘమహీధరాభం
ప్రభిన్నమత్యంకుశమప్రసహ్యామ్ ।
రామోపవాహ్యం రుచిరం దదర్శ
శత్రుంజయం నాగముదగ్రకాయమ్ । 47

గుంపులుగా చేరి, చేతులు మోడ్చియుండిరి - కానుకలనుగొనివచ్చిన పల్లెప్రజలతో ఆ ప్రదేశము అంతయును క్రిక్కిరిసియుండెను. (37-38)

శ్రీరామునిపట్టాభిషేకమునకై ఉవ్విళ్లూరుచున్న ఆ జానపదుల సంబరములు చెప్పనలవిగానివైయుండెను- ఆ ప్రాసాదము మహామేఘసదృశమై సమున్నతమై, మేలైన రత్నకాంతులతో శోభిల్లుచుండెను- ఆ ప్రదేశమున గూనివారును చిన్న చిన్న శరీరములు గలవారును చేరియుండిరి. (39-40)

సుమంత్రునిరథమునకు చక్కనిగుఱ్ఱములు పూన్చబడియుండెను. ఆ రథముయొక్క వైకల్పు మనోజ్ఞముగానుండెను. అట్టి రథముపైనెక్కి, ఆ సారథి శ్రీరామభవనమునకు వెళ్లుచు, రాజమార్గమునగల ప్రజలను సంతోషముతో చూచుచు, అచట చేరినవారిమనస్సులను రంజింపజేసెను. (41)

నరశ్రేష్ఠుడైన శ్రీరామునియొక్కభవనము మహదైశ్వర్య సంపన్నమైన దేవేంద్రభవనమును తలపించుచుండెను. ప్రాంగణము నందలి లేళ్లసంచారములు, నెమళ్లనృత్యభంగిమలు కనువిందు గావించుచుండెను. అట్టి భవనమును సమీపించి, సుమంత్రుడు దాని అందచందములకు ముగ్ధుడయ్యెను. (42)

ఆప్రాసాదమునందలి కక్ష్యలు (లోపలి భాగములు) చక్కగా అలంకృతములై, కైలాసశిఖరములవలె ఉన్నతములై, స్వర్గభవనముల వలె ఆకర్షణీయములైయుండెను, సుమంత్రుడు ఆ కక్ష్యలలో ప్రవేశించి, ముందునకు సాగుచు, రామునకు ప్రీతిపాత్రులై అయననే స్మరించుచున్న అచటిప్రజలను అధిగమించుచు, తిన్నగా అంతఃపురమును సమీపించెను. ప్రజలెల్లరును శ్రీరామపట్టాభిషేక సందర్భమును పురస్కరించుకొని, మానవాళికిని, రాజకుమారుడైన శ్రీరామునకును. శుభపరంపరలను గోరుచు, సంతోషకరములైన వచనములను పలుకుచుండిరి - సుమంత్రుడు ఆ శుభ ప్రసంగములను విని, సంతోషముతో పొంగిపోయెను. (43-44)

అంతట సుమంత్రుడు మహేంద్రునిప్రాసాదముతో తుల్యమై రమ్యమైనశ్రీరామభవనమును దర్శించెను. అచట లేళ్లు, పక్షులు విహరించుచుండెను. అది మేరు శిఖరమువలె ఉన్నతమై, కాంతులను విరజిమ్ముచుండెను. (45)

అసంఖ్యాకులైన గ్రామీణజనులు కానుకలను దీసికొనివచ్చిరి, వారు తమవాహనములను దూరమున వదలి, ద్వారసమీపమునకు చేరి, అంజలిఘటించి, శ్రీరామదర్శనమునకై వేచియుండిరి- వారి కోలాహలముతో నిండిన ఆ ద్వారమార్గమును సుమంత్రుడు గాంచెను- (46)

అచట సుమంత్రుడు శ్రీరాముడుఅధిష్ఠించునట్టి 'శత్రుంజయము' అను పేరుగల భద్రగజమును దర్శించెను, అది గొప్పమేఘము వలెను, మహాపర్వతమువలెను సమున్నతమై, బలిష్ఠమైయుండెను- అది మదధారలను స్రవింపజేయుచుండెను, అంకుశమునకును లొంగనిదై, మహాకాయుశోభితమైన ఆ శత్రుంజయము దర్శనీయముగానుండెను- (47)

స్వలంకృతాన్ సాశ్వరథాన్ సకుంజరాన్
అమాత్యముఖ్యాన్ శతశశ్చ వల్లభాన్ ।
వ్యపోహ్య సూతః సహితాన్ సమంతతః
సమృద్ధమంతఃపురమావివేశ ॥ 48

తదద్రికూటాచలమేఘసన్నిభమ్
మహావిమానోత్తమవేశ్మ సంఘవత్ ।
అవార్యమాణః ప్రవివేశ సారథిః
ప్రభూతరత్నం మకరో యథార్ణవమ్ ॥ 49

రథాశ్వగజబలములతో గూడినవారై, చక్కగా అలంకరించుకొని యున్న అమాత్యముఖ్యులు అచ్చట చేరియుండిరి - రాజునకు ప్రీతిపాత్రులైన ప్రముఖులును వారితో గూడియుండిరి. సుమంత్రుడు వారినందఱిని అధిగమించి, అంతఃపురమున ప్రవేశించెను. ఆ అంతఃపురము సర్వసంపదలతో తులతూగుచుండెను. ఆ శ్రీరామచంద్రుని అంతఃపురము పర్వతశిఖరములతో తుల్యమై నిశ్చలముగానున్న మేఘమువలె అలరారుచుండెను. అది పెక్కు భవనసమూహములతో గూడియుండెను. అట్టి ఆ అంతఃపురమున సుమంత్రుడు రత్నాకరమైన సముద్రమున మొసలివలె అడ్డు లేనివాడై ప్రవేశించెను. (48-49)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచదశస్సర్గః *(15)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పదునైదవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

16. పదునాఱవసర్గము

శ్రీరాముడు రథముపై దశరథునిమందిరమునకు బయలుదేఱుట.

స తదంతఃపురద్వారం సమతీత్య జనాకులమ్ ।
ప్రవివిక్తాం తతః కక్ష్యామ్ ఆససాద పురాణవిత్ ॥ 1

ప్రాసకార్ముకబిభ్రద్భిః యువభిః మృష్టకుండలైః ।
అప్రమాదిభిరేకాగ్రైః స్వనురక్తైః అధిష్ఠితామ్ ॥ 2

రాజవంశములపుట్టుపూర్వోత్తరములను బాగుగానెఱిగిన సుమంత్రుడు జనకోలాహలముతో నిండిన అంతఃపురద్వారమును అధిగమించి, జనసమ్మర్దములేని లోపలికక్ష్యలో ప్రవేశించెను. శ్రీరామునియెడల ప్రేమానురాగములుగలయువకులు ఈటెలను చేతబట్టి, ధనుర్ధారులై, ఆ కక్ష్యలను కావలాకాయుచుండిరి. వారు మేలిమిబంగారుకుండలములను ధరించి, ఏమఱుపాటులేక ఏకాగ్రచిత్తులై, అచట నిలిచి, రక్షణకార్యములలో నిమగ్నులై యుండిరి. (1-2)

తత్ర కాషాయిణో వృద్ధాన్ వేత్రపాణీన్ స్వలంకృతాన్ ।
దదర్శ విష్ఠితాన్ ద్వారి స్త్ర్యధ్యక్షాన్ సుసమాహితాన్ ॥ 3

అచట కాషాయవస్త్రములను ధరించి, చిత్రవిచిత్రములైన కంచుకములనుదాల్చిన వృద్ధులు వేత్ర (దండ) హస్తులై యుండిరి. వారు అంతఃపురస్త్రీలరక్షణకొఱకు నియుక్తులై, సర్వసన్నద్ధులై, ద్వారముకడ ఆసీనులైయుండిరి. అట్టివారి నందఱిని సుమంత్రుడు గాంచెను- (3)

తే సమీక్ష్య సమాయాంతం రామప్రియచికీర్షవః ।
సహసోత్పతితాః సర్వే స్వాసనేభ్యః ససంభ్రమాః ॥ 4

అచటివారందఱును తమతమవిధులద్వారా శ్రీరామునకు ప్రియమును గూర్చువారు. వారందఱును అంతఃపురములోనికి వచ్చుచున్న సుమంత్రునిగాంచి, తమ తమ స్థానముల నుండి సాదరముగా తటాలున లేచి నిలబడిరి. (4)

తానువాచ వినీతాత్మా సూతపుత్రః ప్రదక్షిణః ।
క్షిప్రమాఖ్యాత రామాయ సుమంత్రో ద్వారి తిష్ఠతి ॥ 5

రాజకార్యములలో నిగ్గుదేలిన సుమంత్రుడు వారితో "శ్రీరాముని కొఱకై సుమంత్రుడు ద్వారముకడ నిరీక్షించుచున్నట్లు విన్నవింపుడు" - అని సవినయముగా తెల్పెను. (5)

తే రామముపసంగమ్య భర్తుః ప్రియచికీర్షవః।
సహభార్యాయ రామాయ క్షిప్రమేవాభిచక్షిరే। 6

ప్రతివేదితమాజ్ఞాయ సూతమభ్యంతరం పితుః।
తత్రైవానాయయామాస రాఘవప్రియకామ్యయా। 7

తం వైశ్రవణసంకాశమ్ ఉపవిష్టం స్వలంకృతమ్।
దదర్శ సూతః పర్యంకే సౌవర్ణే సోత్తరచ్ఛదే। 8

వరాహరుధిరాభేణ శుచినా చ సుగంధినా।
అనులిప్తం పరార్ధ్యేన చందనేన పరంతపమ్। 9

స్థితయా పార్శ్వతశ్చాపి వాలవ్యజనహస్తయా।
ఉపేతం సీతయా భూయః చిత్రయా శశినం యథా। 10

తం తపంతమివాదిత్యమ్ ఉపపన్నం స్వతేజసా।
వవందే వరదం వందీ వినయజ్ఞో వినీతవత్। 11

ప్రాంజలిస్తు సుఖం పృష్ట్వా విహారశయనాసనే।
రాజపుత్రమువాచేదం సుమంత్రో రాజసత్కృతః। 12

కౌసల్యాసుప్రజా రామ ! పితా త్వాం ద్రష్టుమిచ్ఛతి।
మహిష్యా సహ కైకేయ్యా గమ్యతాం తత్ర మా చిరమ్। 13

ఏవముక్తస్తు సంహృష్టో నరసింహో మహాద్యుతిః।
తతః సమ్మానయామాస సీతామ్ ఇదమువాచ హ। 14

దేవి! దేవశ్చ దేవీ చ సమాగమ్య మదంతరే।
మంత్రయేతే ధ్రువం కించిత్ అభిషేచనసంహితమ్। 15

లక్షయిత్వా హ్యభిప్రాయం ప్రియకామా సుదక్షిణా।
సంచోదయతి రాజానం మదర్థం మదిరేక్షణే!। 16

సా ప్రహృష్టా మహారాజం హితకామానువర్తినీ।
జననీ చార్థకామా మే కేకయాధిపతేః సుతా। 17

దిష్ట్యా ఖలు మహారాజో మహిష్యా ప్రియయా సహ।
సుమంత్రం ప్రాహిణోత్ దూతమ్ అర్థకామకరం మమ। 18

నిరంతరము ప్రభుహితమునకే పాటుపడునట్టి ఆ ద్వారరక్షకులు రాముని సమీపించి, సీతాదేవితో గూడియున్న ఆ ప్రభువునకు సుమంత్రునిరాకనుగూర్చి తెలిపిరి. (6)

ద్వారరక్షకులు తీసికొనివచ్చిన సమాచారమును అందుకొని, శ్రీరాముడు తనతండ్రికి ప్రీతిని గూర్చుటకై ఆయనకు అంతరంగిక సేవకుడైన సుమంత్రుని తనఅంతఃపురములోనికి రప్పించెను. (7)

చక్కని వస్త్రాభరణములను దరించి, మృదువైన ఆస్తరణములతో గూడిన బంగారుపర్యంకముపై ఆసీనుడై కుబేరునివలె విలసిల్లుచున్న శ్రీరాముని ఆసుమంత్రుడు చూచెను. (8)

సీతాదేవికరస్పర్శచే పవిత్రమై, పరిమళములను వెదజల్లుచున్న శ్రేష్ఠమైన ఎఱ్ఱచందనమును అతడు పూసికొనియుండెను. వింజామరతో సేవించుచు సీతాదేవి ఆయనప్రక్కనే యుండెను. సీతాదేవితోగూడిన ఆ రాముడు (చైత్ర శుద్ధ పూర్ణిమ నాడు) చిత్రయనుతారతో (చిత్తానక్షత్రముతో) గూడిన పూర్ణచంద్రుని వలె శోభిల్లుచుండెను - శత్రుభయంకరుడైన ఆ శ్రీరాముని సుమంత్రుడు దర్శించెను. (9-10)

నిరుపమానముగా ప్రకాశించుచున్న సూర్యునివలె తన దివ్యతేజస్సుతో విరాజిల్లు శ్రీరామునకు వినయసంపన్నుడైన సుమంత్రుడు వినమ్రుడై నమస్కరించెను. (11)

దశరథునిఆదరసత్కారములకుపాత్రుడైన సుమంత్రుడు హాయిగా తల్పముపై కూర్చొనియున్న శ్రీరామునితో కుశలప్రశ్నలు గావించి, చేతులు మోడ్చి ఇట్లనెను - (12)

"కౌసల్యాదేవియొక్క ముద్దులపట్టివైన ఓ శ్రీరామా! మీ తండ్రియైన దశరథుడు రాణియైన కైకేయీదేవితో గూడి, మిమ్ము చూడగోరుచున్నాడు. ఆలసింపక త్వరగా వెళ్లుదము-" (13)

దివ్యతేజస్సుతో విరాజిల్లుచున్న శ్రీరాముడు సుమంత్రుని వచనములను విని, మిక్కిలి సంతుష్టుడై, ఆయనను సమ్మానించెను. పిదప సీతాదేవితో ఇట్లు నుడివెను. (14)

ఓ దేవీ! మాతండ్రియు, కైకేయీమాతయు కలిసి, నా పట్టాభిషేక విషయమై ఏదో ఆలోచించుచున్నట్లు కనబడుచున్నది. ఇది నిశ్చయము- (15)

ఓ విశాలాక్షీ! సర్వసమర్థురాలైన కైకేయితల్లి నా హితమును గోరినదై, వృద్ధుడైన మహారాజుగారిఅభిప్రాయమును గుర్తించి, నా పట్టాభిషేకవిషయమున ఆయనను ప్రోత్సహించియుండవచ్చును. కేకయరాజుగారి కూతురైన ఆ కైకేయిమాత లోకకళ్యాణమును, నా ప్రయోజనమును కోరుచు సంతోషముతో రాజుగారిని అనుసరించుచున్నది. (16-17)

మహారాజు తనకు ఇష్టురాలైన కైకేయీదేవితోగూడియున్నవాడై, నా అభీష్టమును నెరవేర్పగల సుమంత్రుని దూతగా ఇచటికి పంపెను. ఇది మనఅదృష్టము. (18)

యాదృశీ పరిషత్తత్ర తాదృశో దూత ఆగతః।
ధ్రువమద్యైవ మాం రాజా యౌవరాజ్యేఽభిషేక్ష్యతి। 19

హంత! శీఘ్రమితో గత్వా ద్రక్ష్యామి చ మహీపతిమ్।
సహ త్వం పరివారేణ సుఖమాస్స్వ రమస్వ చ। 20

పతిసమ్మానితా సీతా భర్తారమ్ అసితేక్షణా।
ఆద్వారమ్ అనువవ్రాజ మంగళాన్యభిదధ్యుషీ। 21

రాజ్యం ద్విజాతిభిర్జుష్టం రాజసూయాభిషేచనమ్।
కర్తుమర్హతి తే రాజా వాసవస్యేవ లోకకృత్। 22

దీక్షితం వ్రతసంపన్నం వరాజినధరం శుచిమ్।
కురంగశృంగపాణిం చ పశ్యంతీ త్వాం భజామ్యహమ్। 23

పూర్వాం దిశం వజ్రధరో దక్షిణాం పాతు తే యమః।
వరుణః పశ్చిమామాశాం ధనేశస్తూత్తరాం దిశమ్। 24

అథ సీతామనుజ్ఞాప్య కృతకౌతుకమంగళః।
నిశ్చక్రామ సుమంత్రేణ సహ రామో నివేశనాత్। 25

పర్వతాదివ నిష్క్రమ్య సింహో గిరిగుహాశయః।
లక్ష్మణం ద్వారి సోఽపశ్యత్ ప్రహ్వాంజలిపుటం స్థితమ్। 26

అథ మధ్యమకక్ష్యాయాం సమాగమ్య సుహృజ్జనైః।
స సర్వానర్థినో దృష్ట్వా సమేత్య ప్రతినంద్య చ। 27

తతః పావకసంకాశమ్ ఆరురోహ రథోత్తమమ్।
వైయాఘ్రం పురుషవ్యాఘ్రో రాజతం రాజనందనః। 28

మేఘనాదమసంబాధం మణిహేమవిభూషితమ్।
ముష్ణంతమివ చక్షూంషి ప్రభయా మేరువర్చసమ్। 29

అక్కడ నున్న పరిషత్తులందును నా హితమును గోరువారే. వారికి తగినదూతయే ఇచటికివచ్చినాడు, నేడే నిశ్చయముగా రాజు నన్ను యువరాజపట్టాభిషిక్తునిజేయును. (19)

భళీ! ఇదిగో! ఇప్పుడేవెళ్ళి, రాజగారిని దర్శించెదను. నీవు పరిచారికలతోగూడి ఆటపాటలతో ఆనందింపుము. (20)

శ్రీరాముడు ప్రియవచనములతో సీతాదేవికి ఎనలేని సంతోషమును గూర్చెను- అమెయు తనమాటలతో ఆయనకు ప్రియమును కలిగించుచు ద్వారమువరకు ఆయనను అనుసరించెను- మనస్సులో ఆయనకు శుభములను గోరుకొనుచు ఆమె తనపతితో ఇట్లనెను. (21)

"బ్రాహ్మణోత్తములపర్యవేక్షణలతో, సూచనలతో, పవిత్ర సేవలతో ఈ రాజ్యము సుసంపన్నముగావర్ధిల్లుచు వచ్చినది. వారి ఆశీస్సులతో యువరాజపట్టాభిషేకము జరుగబోవుచున్నది. బ్రహ్మదేవుడు ఇంద్రునకువలె మహారాజు మున్ముందు నీకు యువరాజపట్టాభిషేకమును చేయును. అప్పుడు నీవు వ్రతదీక్షితుడవై కృష్ణాజినమును ధరించి, శుచివైయుండుము, జింకకొమ్మును చేతబట్టియుండుము. అట్టి నిన్ను దర్శించుచు నేను నీకు సేవలొనర్తును. తూర్పుదిశయందు ఇంద్రుడును, దక్షిణదిశయందు యముడును పశ్చిమదిశయందు వరుణుడును ఉత్తరదిశయందు కుబేరుడును నీ రాజ్యమును రక్షించుచుందురు"- (22-24)

పట్టాభిషేకమును పురస్కరించుకొని మంగళస్నానాదులను ముగించుకొనిన శ్రీరాముడు సీతాదేవిని వీడ్కొని, సుమంత్రునితో గూడి, తనభవనమునుండి బయలుదేరెను- (25)

పర్వతగుహలో శయనించుచున్న సింహము అందుండి బయటికి వచ్చినట్లు శ్రీరాముడు తనమందిరము నుండి బయటికి వచ్చెను. అప్పుడు అతడు ద్వారముకడ వినమ్రుడై అంజలిఘటించి యున్న లక్ష్మణుని చూచెను. (26)

పిమ్మట శ్రీరాముడు మధ్యమకక్ష్యనచట చేరియున్న మిత్రులను గలిసికొనెను. అనంతరము అతడు తన పట్టాభిషేకమహోత్సవమును దర్శింపవచ్చిన జనులనుజూచి, వారినమస్కారములను అందుకొని వారిని అభినందించెను. పిదప నరశ్రేష్ఠుడైన రాజకుమారుడగు రఘురాముడు పులిచర్మము ఆస్తరణముగా గలిగి, అగ్నివలె ప్రకాశించుచున్న ఉత్తమరజత (వెండి) రథమును అధిరోహించెను. (27-28)

ఆ రథముయొక్క సవ్వడి మేఘగర్జనవలె గంభీరముగా నుండెను. అది మిక్కిలి విశాలముగా ఉండెను, మణులుచెక్కిన బంగారు (రేకుల) తో అలంకరించబడియుండెను. అది మేరుపర్వతకాంతులతో భాసిల్లుచు చూచువారికన్నులకు మిఱుమిట్లుగొల్పుచుండెను. ఆ రథమునకు పూన్చిన గుఱ్ఱములు బలిష్ఠములైయుండుటచే గున్నయేనుగులను

కరేణుశిశుకల్పైశ్చ యుక్తం పరమవాజిభిః।
హరియుక్తం సహస్రాక్షో రథమింద్ర ఇవాశుగమ్।
ప్రయయౌ తూర్ణమాస్థాయ రాఘవో జ్వలితః శ్రియా। 30

స పర్జన్య ఇవాకాశే స్వనవానభినాదయన్।
నికేతాన్నిర్యయౌ శ్రీమాన్ మహాభ్రాదివ చంద్రమాః। 31

ఛత్రచామరపాణిస్తు లక్ష్మణో రాఘవానుజః।
జుగోప భ్రాతరం భ్రాతా రథమాస్థాయ పృష్ఠతః। 32

తతో హలహలాశబ్దః తుములః సమజాయత।
తస్య నిష్క్రమమాణస్య జనౌఘస్య సమంతతః। 33

తతో హయవరా ముఖ్యా నాగాశ్చ గిరిసన్నిభాః।
అనుజగ్ముస్తదా రామం శతశోఽథ సహస్రశః। 34

అగ్రతశ్చాస్య సన్నద్ధాః చందనాగరుభూషితాః।
ఖడ్గచాపధరాః శూరా జగ్మురాశంసవో జనాః। 35

తతో వాదిత్రశబ్దాశ్చ స్తుతిశబ్దాశ్చ వందినామ్।
సింహనాదాశ్చ శూరాణాం తదా శుశ్రువిరే పథి। 36

హర్మ్యవాతాయనస్థాభిః భూషితాభిస్సమంతతః।
కీర్యమాణః సుపుష్పౌఘైః యయౌ స్త్రీభిరరిందమః। 37

రామం సర్వానవద్యాంగ్యో రామపిప్రీషయా తతః।
వచోభిరగ్ర్యైః హర్మ్యస్థాః క్షితిస్థాశ్చ వవందిరే। 38

నూనం నందతి తే మాతా కౌసల్యా మాతృనందన!।
పశ్యంతీ సిద్ధయాత్రం త్వాం పిత్ర్యం రాజ్యమవస్థితమ్। 39

సర్వసీమంతినీభ్యశ్చ సీతాం సీమంతినీవరామ్।
అమన్యంత హి తా నార్యో రామస్య హృదయప్రియామ్। 40

తయా సుచరితం దేవ్యా పురా నూనం మహత్తపః।
రోహిణీవ శశాంకేన రామసంయోగమాప యా। 41

ఇతి ప్రాసాదశృంగేషు ప్రమదాభిర్నరోత్తమః।
శుశ్రావ రాజమార్గస్థః ప్రియా వాచ ఉదాహృతాః। 42

తలపించుచుండెను. చక్కని అశ్వములను పూన్చుటచే వేగముగా సాగిపోగల రథమును అధిష్ఠించిన సహస్రాక్షుడైన ఇంద్రునివలె, మనోహరమైన తనుశోభలతో విరాజిల్లుచున్న శ్రీరాముడు తన మహారథముపై ఆసీనుడై వెంటనే బయలుదేరెను. (29-30)

మనోహరముగానున్న ఆ రథము గర్జించుచున్నమేఘమువలె దిక్కులను ప్రతిధ్వనింపజేయుచుండెను. ఆ రథమును అధిష్ఠించి, మహామేఘమునుండి వెలువడిన చంద్రునివలె శ్రీరాముడు తన భవనమునుండి బయటికి వచ్చెను. (31)

శ్రీరామునితమ్ముడైన లక్ష్మణుడు ఛత్రమును, వింజామరను చేబూని, రథముపై అన్నకు వెనుక భాగమున నిలిచి, ఆయనను సేవించుచుండెను. (32)

రాముడు అట్లు వెళ్లుచుండగా జనులయొక్క కలకలధ్వనులు ఆ ప్రాంతమునందంతటను నిండెను. (33)

అనంతరము అసంఖ్యాకములైన జాత్యశ్వములు, కొండల వంటి ఏనుగులు రామునిరథమును అనుసరించినవి- (34)

చందనము, అగరు మొదలగుసుగంధద్రవ్యములను అలదుకొనిన వారు, కవచములను, ఖడ్గములను, ధనుస్సులను ధరించిన శూరులు, రామునకు మంగళ సూచకముగా జయజయ ధ్వానములు చేయుచున్న జనులు ఆయునకు ముందు భాగమున నడచుచుండిరి. రాజమార్గమున శ్రీరాముడు రథముపై సాగిపోవుచుండగా వీణావేణు మృదంగితాళధ్వనులు, వందిమాగధులస్తుతివాచకములు, శూరులసింహనాదములు అచటివారందరికిని ఆనందమును గూర్చినవి- (35-36)

శ్రీరాముడు ముందునకు సాగిపోవుచుండగా చక్కని వస్త్రాభరణములను ధరించిన సుందరీమణులు తమభవనముల కిటికీలనుండి పరిమళభరితములైన పుష్పములను చల్లుచుండిరి. చక్కనిచుక్కలైన ఆ తరుణీమణులు మేడలపైనుండియు, ధరణిపై నుండియు రాముని సంతోషపఱచుచు మృదుమధుర వచనములతో ఇట్లు స్తుతింపసాగిరి- (37-38)

" మాతృమూర్తికి సంతోషమును గూర్చు ఓ రామా ! నీ సిద్ధయాత్ర సఫలమగుగాక - తండ్రిరాజ్యమునకు యువరాజు వగుచున్న నిన్ను జూచుచు తల్లి కౌసల్య ఎంతేని మురిసిపోవును సుమా ! " (39)

ఆ స్త్రీలందఱును 'శ్రీరామునిప్రాణేశ్వరియైన సీతాసాధ్వి వనితామణులందఱిలోను ఉత్తమురాలు' అని భావించిరి- (40)

ఆ సీతాదేవి పూర్వము నిజముగానే గొప్పగా తపమాచరించి యుండవచ్చును. తత్ఫలితముగా ఆమె చంద్రునకు రోహిణి వలె శ్రీరామునకు అర్ధాంగియైనది' అని, మేడలపైనున్న స్త్రీలందఱును పలికిన ప్రియవచనములను రాజమార్గమున వెళ్లుచున్న పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముడు వినెను. (41-42)

స రాఘవస్తత్ర కథాప్రపంచాన్
శుశ్రావ లోకస్య సమాగతస్య ।
ఆత్మాధికారా వివిధాశ్చ వాచః
ప్రహృష్టరూపస్య పురోజనస్య । 43

ఇతరప్రదేశములనుండివచ్చిన జానపదులు, పురజనులు తనను గూర్చియు, తన పట్టాభిషేకమును గుఱించియు సంతోషముతో సంభాషించుకొనుచున్న కథలను, గాథలను, ప్రియవచనములను శ్రీరాముడు ఆలకించెను- (43)

ఏష శ్రియం గచ్ఛతి రాఘవోఽద్య
రాజప్రసాదాద్విపులాం గమిష్యన్ ।
ఏతే వయం సర్వసమృద్ధకామా
యేషామయం నో భవితా ప్రశాస్తా । 44

ఈ రాముడు నేడే మహారాజుగారిఅనుగ్రహముతో విశాలమైన కోసలరాజ్యలక్ష్మిని పొందబోవుచున్నాడు. ఈ మహానుభావుడు మనకు పాలకుడు కానున్నాడు. ఇక మనకోరికలన్నియును నెఱవేఱి తీరును - (44)

లాభో జనస్యాస్య యదేష సర్వం
ప్రపత్స్యతే రాష్ట్రమిదం చిరాయ ।
న హ్యప్రియం కించన జాతు కశ్చిత్
పశ్యేన్న దుఃఖం మనుజాధిపేఽస్మిన్ । 45

శ్రీరాముడు ఈ దేశమును చిరకాలము పాలించుటయే జరిగినచో ఈ జగత్తునందలి జనులందఱికిని అనంతమైన లాభములు చేకూరును. అతనిపరిపాలనలో ఎన్నడును ఎవ్వరికిని కొంచెముగూడ అప్రియముగాని, దుఃఖముగాని సంభవింపనే సంభవింపదు- (45)

స ఘోషవద్భిశ్చ హయైర్మతంగైః
పురస్సరైః స్వస్తికసూతమాగధైః ।
మహీయమానః ప్రవరైశ్చ వాదకైః
అభిష్టుతో వైశ్రవణో యథా యయౌ । 46

శ్రీరామునిరథమునకు ముందుభాగమున సాగుచున్న గుఱ్ఱములు సకిలించుచుండెను- ఏనుగులు ఘీంకరించుచుండెను. స్తుతిపాఠములతో సూతులు, జయజయధ్వానములతో వందిజనులు నడుచుచుండగా మాగధులు వంశబిరుదావళిని ప్రస్తుతించుచుండిరి- వాద్యబృందములతో గాయకులు శ్రీరాముని గుణగణములను కీర్తించుచుండిరి- ఇట్టి జేజేలకోలాహలములమధ్య శ్రీరాముడు కుబేరునివలె వైభవముతో ముందునకు సాగెను- (46)

కరేణుమాతంగరథాశ్వసంకులం
మహాజనౌఘప్రతిపూర్ణచత్వరమ్ ।
ప్రభూతరత్నం బహుపుణ్యసంచయం
దదర్శ రామో రుచిరం మహాపథమ్ । 47

రాజమార్గము ఆడు ఏనుగులతో, మదపుటేనుగులతో, రథములతో, హయములతో క్రిక్కిరిసియుండెను. వీథుల కూడళ్లన్నియు ప్రవాహముగావచ్చుచున్న జనసమూహములతో కిటకిటలాడుచుండెను - అమూల్యరత్నరాసులతోను, వివిధ విక్రయవస్తువులతోను అంగడులు కలకలలాడుచుండెను. అట్టి మనోహరమైన రాజమార్గమును జూచుచు శ్రీరాముడు సాగిపోవుచుండెను- (47)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షోడశస్సర్గః *(16)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పదునాఱవసర్గము సమాప్తము

-- ✱ ✱ ✱ --

17. పదునేడవసర్గము

శ్రీరాముడు రాజవీథులనుదాటుచు మహారాజప్రాసాదమున ప్రవేశించుట.

స రామో రథమాస్థాయ సంప్రహృష్టసుహృజ్జనః ।
పతాకాధ్వజసంపన్నం మహార్హాగరుధూపితమ్ ।
అపశ్యన్నగరం శ్రీమాన్ నానాజనసమాకులమ్ । 1

సర్వశుభలక్షణములతో విలసిల్లుచున్న ఆ శ్రీరాముడు రథముపై ఆసీనుడై, మిత్రులను, జనులను సంతోషపెట్టుచు సాగిపోవుచుండెను. అతడు ధ్వజపతాకములరెపరెపలతో, మేలైన అగరుధూపములగుబాళింపులతో, నానాజనుల సమ్మర్దముతో దర్శనీయముగానున్న ఆ నగరమును చూచి, ఆనందించెను- (1)

స గృహైరభ్రసంకాశైః పాండురైరుపశోభితమ్।
రాజమార్గం యయౌ రామో మధ్యేనాగరుధూపితమ్। 2

చందనానాం చ ముఖ్యానామ్ అగరూణాం చ సంచయైః।
ఉత్తమానాం చ గంధానాం క్షౌమకౌశాంబరస్య చ। 3

అవిద్ధాభిశ్చ ముక్తాభిః ఉత్తమైః స్ఫాటికైరపి।
శోభమానమసంబాధైః తం రాజపథముత్తమమ్। 4

సంవృతం వివిధైః పణ్యైః భక్ష్యైరుచ్చావచైరపి।
దదర్శ తం రాజపథం దివి దేవపథం యథా। 5

దధ్యక్షతహవిర్లాజైః ధూపైరగరుచందనైః।
నానామాల్యోపగంధైశ్చ సదాఽభ్యర్చితచత్వరమ్। 6

ఆశీర్వాదాన్ బహూన్ శృణ్వన్ సుహృద్భిః సముదీరితాన్।
యథార్హం చాపి సంపూజ్య సర్వానేవ నరాన్ యయౌ। 7

పితామహైరాచరితం తథైవ ప్రపితామహైః।
అద్యోపాదాయ తం మార్గమ్ అభిషిక్తోఽనుపాలయ। 8

యథా స్మ లాలితాః పిత్రా యథా పూర్వైః పితామహైః।
తతః సుఖతరం రామే వత్స్యామః సతి రాజని। 9

అలమద్య హి భుక్తేన పరమార్థైరలం చ నః।
యథా పశ్యామ నిర్యాంతం రామం రాజ్యే ప్రతిష్ఠితమ్। 10

తతో హి నః ప్రియతరం నాన్యత్ కించిద్భవిష్యతి।
యథాఽభిషేకో రామస్య రాజ్యేనామితతేజసః। 11

ఏతాశ్చాన్యాశ్చ సుహృదామ్ ఉదాసీనః కథాశ్శుభాః।
ఆత్మసంపూజనీః శృణ్వన్ యయౌ రామో మహాపథమ్। 12

న హి తస్మాన్మనః కశ్చిత్ చక్షుషీ వా నరోత్తమాత్।
నరః శక్నోత్యపాక్రష్టుమ్ అతిక్రాంతేఽపి రాఘవే। 13

ఆకాశమును తాకుచు తెల్లనికాంతులను విరజిమ్ముచున్న మేడలతో అలరారుచు రాజమార్గము అగరు ధూపపరిమళములతో వ్యాప్తమైయుండెను. అట్టిరాజవీథియందు శ్రీరాముడు వెళ్లుచుండెను. ఉత్తమమైన చందనములు, అగరుధూపవస్తువులు, మేలైన సుగంధద్రవ్యములు తెల్లని పట్టువస్త్రములు, ఇతరములగు పట్టువస్త్రములు, రంధ్రములువేయబడని మంచిముత్యములు, స్వచ్ఛమైన స్ఫటికములు, వివిధములగు భక్ష్యములు, రంగురంగుల పుష్పములు మొదలగు వస్తువులతో నిండి, విశాలములైన అంగళ్లతో ఒప్పుచున్న ఆ రాజమార్గము ఆకాశమునందలి దేవపథమువలె విరాజిల్లుచుండెను. అట్టి రాజవీథిని శ్రీరాముడు తిలకించెను. (2-5)

అందలి భవనములముంగిళ్లన్నియు పెరుగు, అక్షతలు, హవిస్సులు, పేలాలు, ధూపములు, అగరుచందనములు, వివిధములగు మాలలు, గంధములు మొదలగు వానితో అలంకరింపబడి యుండెను. అట్టి రాజమార్గములో పెక్కుమంది మిత్రుల ఆశీర్వచనములను వినుచు, శ్రీరాముడు వారిని అందఱిని తగిన విధముగా ఆదరాభిమానములతో గౌరవించుచువెళ్లెను- (6-7)

అప్పుడువారు " ఓ రామా! నీవు రాజ్యపట్టాభిషిక్తుడవై, మీ తాతముత్తాతలు వేసిన బాటలలో సాగుచు, మమ్ము పరిపాలింపుము." అని పలికిరి. (8)

దశరథునిపాలనలోను, వారికి పూర్వులైన తాతముత్తాతల పరిపాలనలోను వారిలాలనలతో మనము సుఖముగా జీవించితిమి. ఇక శ్రీరాముని ఏలుబడిలో ఇంకను సుఖముగా హాయిగా జీవించెదము. రాముడు యువరాజపట్టాభిషిక్తుడై, ఊరేగింపుతో కనువిందుగానించుచు వెళ్లునప్పుడు ఆయనను దర్శించెడి మన భాగ్యమేభాగ్యము. ఇక మనకు ఐహికభోగములతో గాని, పరమార్థలాభములతోగాని, (స్వర్గాది- ఆ ముష్మికలాభములతో గాని) పనియేయుండదు. అమితతేజస్వియైన శ్రీరాముడు రాజ్యాధికారమును స్వీకరించుటకై జరిగెడు ఈ పట్టాభిషేక మహోత్సవము మనకు బ్రహ్మానందదాయకము. అంతకంటెను ప్రియమైనది, ఆనందదాయకమైనది మఱియొకటి ఉండబోదు." తనను ప్రశంసించుచు మిత్రులు పలుకుచున్న శుభకరములైన ఈ మాటలను, ఇంకను ఇతరకథలను వినుచును శ్రీరాముడు ఉదాసీనుడై (నిర్వికారుడై, ఏ మాత్రము పొంగకనివాడై) ఆ రాజపథమున ముందునకు సాగెను. (9-12)

శ్రీరాముడు తాను ఉన్నప్రదేశమును దాటి, చూపులకు అందనంతదూరముగా ముందునకు వెళ్లినప్పటికిని పురుషులలో ఏ ఒక్కడును తన మనస్సునుగాని, చూపులనుగాని ఆయన నుండి మఱల్ప లేకుండెను. ఇక స్త్రీలవిషయము చెప్పనేల? (13)

యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి।
నిందితః స వసేల్లోకే స్వాత్మాఽప్యేనం విగర్హతే। 14

సర్వేషాం హి స ధర్మాత్మా వర్ణానాం కురుతే దయామ్।
చతుర్ణాం హి వయఃస్థానామ్ తేన తే తమనువ్రతాః। 15

చతుష్పథాన్ దేవపథాన్ చైత్యాన్యాయతనాని చ।
ప్రదక్షిణం పరిహరన్ జగామ నృపతేస్సుతః। 16

స రాజకులమాసాద్య మేఘసంఘోపమైః శుభైః।
ప్రాసాదశృంగైః వివిధైః కైలాసశిఖరోపమైః। 17

ఆవారయద్భిర్గగనం విమానైరివ పాండురైః।
వర్ధమానగృహైశ్చాపి రత్నజాలపరిష్కృతైః। 18

తత్పృథివ్యాం గృహవరం మహేంద్రభవనోపమమ్।
రాజపుత్రః పితుర్వేశ్మ ప్రవివేశ శ్రియా జ్వలన్। 19

స కక్ష్యా ధన్విభిర్గుప్తాః తిస్రోఽతిక్రమ్య వాజిభిః।
పదాతిరపరే కక్ష్యే ద్వే జగామ నరోత్తమః। 20

స సర్వాః సమతిక్రమ్య కక్ష్యా దశరథాత్మజః।
సన్నివర్త్య జనం సర్వం శుద్ధాంతం పునరభ్యగాత్। 21

తతః ప్రవిష్టే పితురంతికం తదా
జనః స సర్వో ముదితో నృపాత్మజే ।
ప్రతీక్షతే తస్య పునశ్చ నిర్గమం
యథోదయం చంద్రమసః సరిత్పతిః । 22

రాముని చూడనివాడును, రాముని దృష్టికిరానివాడును (రామునిచే చూడబడనివాడును) నిజముగా దురదృష్టవంతుడు. అట్టి వానిని లోకము నిందించును (లోకనిందకు గురియగును). అంతే గాదు అట్టి స్థితిలో, వాడు తనను తానే నిందించుకొనును[1]- (రాముని ధ్యానించని వాడును రాముని అనుగ్రహమునకు నోచుకొనని వాడును ఐన వ్యక్తియొక్క జన్మవ్యర్థము- అని దీనిఅంతరార్థము). (14)

ధర్మాత్ముడైన ఆ శ్రీరాముడు సమస్తజనుల (ప్రాణుల) యందును వారు ఏవయస్సులలోనున్నను వారిపై కృపజూపును. ఇది ఆయనసహజస్వభావము- వారును ఆయనయెడల భక్తిశ్రద్ధలు కలిగియుందురు - నాలుగువీధులకూడళ్లను, దేవాలయములను, చైత్యవృక్షస్థానములను, సభామందిరములను ప్రదక్షిణపూర్వకముగా దాటి, శ్రీరాముడు మహారాజుమందిరమును సమీపించెను. (15-16)

రాజపుత్రుడైన ఆ శ్రీరాముడు మనోహరమైన మేనికాంతులతో రాజిల్లుచు, తండ్రియగు దశరథుని ప్రాసాదమున ప్రవేశించెను. అది భూమండలమున అత్యుత్తమమై, దేవేంద్ర భవనముతో తులతూగుచుండెను. ఆప్రాసాద(భవన)ము యొక్క శిఖరములు మేఘబృందములవలె శుభాకారములు గలిగియుండెను. కైలాసశిఖరములవలె వివిధాకృతులు గలిగియుండెను, తెల్లని విమానములవలె ఆకాశమును కప్పివేయుచుండెను, రత్నములు పొదిగిన కిటికీలతో ఒప్పుచున్న 'వర్ధమాన' గృహములచే ఆ భవనము ఆవృతమైయుండెను. (17-19)

శ్రీరాముడు రథారూఢుడై ఆ భవనమునందు ధనుర్ధారులు రక్షించుచున్న మూడు కక్ష్యలను దాటెను. పిదప అతడు రెండు కక్ష్యలవఱకు పాదచారియై వెళ్లెను. కక్ష్యలను అన్నింటిని దాటిన పిమ్మట తనవెంటవచ్చిన వారిని అందరిని అచట ఆపి, శ్రీరాముడు రాజాంతఃపురమున అడుగిడెను - (20-21)

శ్రీరాముడు అంతఃపురమున ప్రవేశించి, తండ్రికడకు వెళ్లిన పిమ్మట ఆయనవెంటవచ్చిన అనుచరులందఱును ఆయనరాకకై (తిరిగి వచ్చుటకై) చంద్రోదయముకొఱకు సముద్రునివలె నిరీక్షింపసాగిరి. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తదశస్సర్గః (17)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పదునేడవసర్గము సమాప్తము

-- * * * --

1) శ్లో॥ శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనమ్। అర్చనం, వందనం, దాస్యం, సఖ్యమాత్మనివేదనమ్॥
శ్రీమద్భాగవతమ్
అనునీనవవిధ భక్తిరీతులన్నింటిలోను 'ధ్యానము' అంతస్స్యూతమైయుండును. నిరంతరము భగవంతుని ధ్యానించువాడు తప్పక తదనుగ్రహమునకు పాత్రుడగును. అట్లుగాక విషయలోలుడై, ఇంద్రియార్థములకై ప్రాకులాడుచుండువాడు, దైవచింతనకు దూరమై 'ఆత్మహాతి' యగును -.
అట్లే రాముని ధ్యానింపనివాడు రాముని కటాక్షమునకు నోచుకొనడు- అప్పుడు వానిజీవితము లోకనింద్యమగును - అంతేగాదు వాడు తనపతనమునకు తానే కారకుడగును - అంతర్యామియైన భగవంతుడు అట్టి పాపిష్ఠునకు ముక్తిని ప్రసాదింపడు -

18. పదునెనిమిదవసర్గము

శ్రీరాముడు తనతండ్రియైన దశరథునిదైన్యస్థితికి కారణమడుగుట. కైక తనకు మహారాజు ఇచ్చిన రెండు వరములనుగూర్చి వివరించుట. 1) శ్రీరాముని వనవాసము 2) భరతునకు పట్టాభిషేకము జరుగవలెనని తెలుపుట.

స దదర్శాసనే రామో విషణ్ణం పితరం శుభే।
కైకేయీసహితం దీనం ముఖేన పరిశుష్యతా॥ 1

స పితుశ్చరణౌ పూర్వమభివాద్య వినీతవత్।
తతో వవందే చరణౌ కైకేయ్యాః సుసమాహితః॥ 2

రామేత్యుక్త్వా చ వచనం బాష్పపర్యాకులేక్షణః।
శశాక నృపతిర్దీనో నేక్షితుం నాభిభాషితుమ్॥ 3

తదపూర్వం నరపతేః దృష్ట్వా రూపం భయావహమ్।
రామోఽపి భయమాపన్నః పదా స్పృష్ట్వేవ పన్నగమ్॥ 4

ఇంద్రియైరప్రహృష్టైస్తం శోకసంతాపకర్శితమ్।
నిశ్శ్వసంతం మహారాజం వ్యథితాకులచేతసమ్॥ 5

ఊర్మిమాలినమక్షోభ్యం క్షుభ్యంతమివ సాగరమ్।
ఉపప్లుతమివాదిత్యమ్ ఉక్తానృతమ్ ఋషిం యథా॥ 6

అచింత్యకల్పం హి పితుః తం శోకముపధారయన్।
బభూవ సంరబ్ధతరః సముద్ర ఇవ పర్వణి॥ 7

చింతయామాస చ తదా రామః పితృహితే రతః।
కింస్విదద్యైవ నృపతిః న మాం ప్రత్యభినందతి॥ 8

అన్యదా మాం పితా దృష్ట్వా కుపితోఽపి ప్రసీదతి।
తస్య మామద్య సంప్రేక్ష్య కిమాయాసః ప్రవర్తతే॥ 9

స దీన ఇవ శోకార్తో విషణ్ణవదనద్యుతిః।
కైకేయీమ్ అభివాద్యైవ రామో వచనమబ్రవీత్॥ 10

కచ్చిన్మయా నాపరాద్ధమ్ అజ్ఞానాద్యేన మే పితా।
కుపితస్తన్మమాచక్ష్వ త్వం చైవైనం ప్రసాదయ॥ 11

అప్రసన్నమనాః కిన్ను సదా మాంప్రతి వత్సలః।
వివర్ణవదనో దీనో న హి మామభిభాషతే॥ 12

అప్పుడు దశరథుడు మిక్కిలి శుష్కించినముఖముతో దీనుడైయుండెను. శ్రీరాముడు చక్కని బంగారుతల్పముపై కూర్చొనియున్న తండ్రిని దర్శించెను - కైకేయీ దేవియు ఆయన ప్రక్కనే యుండెను- (1)

ఆ శ్రీరాముడు తండ్రిని చూడగనే వినమ్రుడై, మొదట ఆయనకు పాదాభివందనమును ఆచరించెను. పిమ్మట సావధానుడై తల్లి కైకేయి పాదములకును నమస్కరించెను -(2)

దీనుడైయున్న దశరథునినోట తండ్రీ! 'రామా' అనెడి మాట వెలువడినంతనే ఆయనకనులు అశ్రుపూరితములయ్యెను. పిమ్మట గొంతు పెగలకపోయెను, కనులు చూడలేకపోయెను- (3)

ఇదివఱలో ఎన్నడును చూడని దశరథునిభయావహరూపమును జూచి, స్థితప్రజ్ఞుడైన శ్రీరాముడును దిగ్భ్రాంతికి లోనయ్యెను. అంతట అతడు పామును త్రొక్కిన వానివలె భయగ్రస్తుడాయెను. అప్పుడు దశరథునిఇంద్రియములలో ఎట్టి సంతోషచిహ్నములునూ కానరాకుండెను. అతడు శోకపరితాపములతో కృశించియుండెను నిట్టూర్పులు విడుచుచుండెను. ఎప్పుడును క్షోభకుగుఱికాని సాగరము ఎత్తైన తరంగములతో క్షోభించుచున్నట్లును, రాహుగ్రస్తుడైన సూర్యునివలెను, ఆడినమాట తప్పిన ఋషీశ్వరునివలెను ఆ మహారాజు మిక్కిలి వ్యాకులచిత్తుడై యుండెను. (4-6)

ఊహలకు అందని ఆ దశరథునిశోకపరిస్థితికి విచారపడుచు, పర్వకాలములయందు సముద్రునివలె శ్రీరాముడు కలవరపాటునకు లోనయ్యెను (7)

తండ్రిక్షేమమునే కోరుకొనుచుండు శ్రీరాముడు అప్పుడు ఇట్లాలోచింపసాగెను. ' ఈనాడు మహారాజు నన్ను చూచియు పలుకరింపకుండుటకు కారణమేమైయుండును? ఇదివఱలో ఆయన కోపములోనున్నను నన్ను జూచిన వెంటనే సంతోషమును ప్రకటించు చుండెడివాడు - ఇప్పుడు అతడు నన్ను జూచి, మానసిక క్షోభకు లోనగుచున్నాడేమి?" (8-9)

పిమ్మట రాముడు దీనునివలె శోకములో పరితపించుచు, ముఖకాంతి తరిగినవాడై, కైకేయికి నమస్కరించి, ఆమెతో ఇట్లు నుడివెను - (10)

"అమ్మా! మాతండ్రి కుపితుడైయున్నట్లు కనబడుచున్నాడు. పొరపాటుననైనను నావలన ఏదైననొక అపరాధము జరుగలేదు గదా! దయతో తెల్పుము. అయినను నీవే ప్రసన్నునిగావింపుము- ఎల్లప్పుడును నాపై వాత్సల్యమును కురిపించుచుండు నాతండ్రి ఇప్పుడు అప్రసన్నచిత్తముతో దీనుడైయున్నాడు, ముఖము

శారీరో మానసో వాపి కచ్చిదేనం న బాధతే।
సంతాపో వాఽభితాపో వా దుర్లభం హి సదా సుఖమ్। 13

కచ్చిన్న కించిద్భరతే కుమారే ప్రియదర్శనే।
శత్రుఘ్నే వా మహాసత్త్వే మాతౄణాం వా మమాశుభమ్। 14

అతోషయన్మహారాజమ్ అకుర్వన్ వా పితుర్వచః।
ముహూర్తమపి నేచ్ఛేయం జీవితుం కుపితే నృపే। 15

యతోమూలం నరః పశ్యేత్ ప్రాదుర్భావమిహాత్మనః।
కథం తస్మిన్ న వర్తేత ప్రత్యక్షే సతి దైవతే। 16

కచ్చిత్తే పరుషం కించిత్ అభిమానాత్ పితా మమ।
ఉక్తో భవత్యా కోపేన యత్రాస్య లులితం మనః। 17

ఏతదాచక్ష్వ మే దేవి! తత్త్వేన పరిపృచ్ఛతః।
కిన్నిమిత్తమపూర్వోఽయం వికారో మనుజాధిపే। 18

ఏవ ముక్తా తు కైకేయీ రాఘవేణ మహాత్మనా।
ఉవాచేదం సునిర్లజ్జా ధృష్టమాత్మహితం వచః। 19

న రాజా కుపితో రామ! వ్యసనం నాస్య కించన।
కించిన్మనోగతం త్వస్య త్వద్భయాన్నాభిభాషతే। 20

ప్రియం త్వామప్రియం వక్తుం వాణీ నాస్యోపవర్తతే।
తదవశ్యం త్వయా కార్యం యదనేనాశ్రుతం మమ। 21

ఏష మహ్యం వరం దత్త్వా పురా మామభిపూజ్య చ।
స పశ్చాత్ తప్యతే రాజా యథాఽన్యః ప్రాకృతస్తథా। 22

అతిసృజ్య దదానీతి వరం మమ విశాంపతిః।
స నిరర్థం గతజలే సేతుం బంధితుమిచ్ఛతి। 23

ధర్మమూలమిదం రామ! విదితం చ సతామపి।
తత్సత్యం న త్యజేద్రాజా కుపితః త్వత్కృతే యథా। 24

వెలవెలబోవుచున్నది- కనీసము నాతో మాట్లాడుటయునులేదు, ఇట్లుండుటకు కారణమేమి? శారీరకముగా గాని, మానసికముగా గాని ఆయనకు ఎట్టి బాధయు కలుగలేదుగదా! ఆధి (మనోబాధ) వ్యాధులకు (దేహబాధలకు) లోనైనవారికి సుఖము శూన్యముగదా! చూడముచ్చటగానుండు చిన్నారి భరతునకు గాని, శక్తిశాలియైన చిట్టి తమ్ముడు శత్రుఘ్నునకుగాని, పూజ్యురాండ్రైన మాతృమూర్తులలో ఏ ఒక్కరికిగాని ఎట్టి కష్టమూ కలుగలేదు గదా? నేను మహారాజునకు అసంతుష్టికల్గించుట వలనగాని ఆయనమాటను జవదాటుట వలనగాని ఆయన కినుక బూనియున్నచో ఇక ఒక్క క్షణకాలమైనను నేను జీవించియుండుట వ్యర్థము - (11-15)

ప్రతివ్యక్తికిని జన్మనిచ్చిన తండ్రి ప్రత్యక్షదైవమే - అట్టితండ్రి సజీవుడైయుండగా ఆయనకు అనుకూలముగా ప్రవర్తించుటయే ప్రతిఒక్కరికిని కర్తవ్యము. (16)

ఓ దేవీ! నీవు అభిమానము (గర్వము)తోగాని, కోపముతో గాని పరుషముగా మాట్లాడి మాతండ్రిమనస్సును గాయపఱచలేదుగదా! మునుపు ఎన్నడునూ లేని ఈ మార్పు (ఈ దైన్యము, కినుక) మహారాజులో కలుగుటకు కారణమేమి? నేను వేదనతో అడుగుచుంటిని. వాస్తవమును దెలుపుము." (17-18)

మహాత్ముడైన శ్రీరాముడు ఇట్లు అర్థింపగా, తనతప్పును కప్పిపుచ్చుకొనుచు, కైక తనకోరికకు అనుకూలముగా పూర్తిగా సిగ్గువిడిచి, రామునితో ఇట్లు కల్లబొల్లిమాటలను పల్కెను. (19)

"ఓ రామా! మహారాజునకు కోపమేమియులేదు. ఆయనకు మానసికమైన, లేక శారీరకమైన బాధయు లేదు. ఆయన మనస్సులో ఏదో ఒక కోరికయున్నది (అందులకు నీవేమందువో యని) దానిని వెల్లడించుటకు జంకుచున్నాడు. (20)

ఆయనకు నీవు ఎంతో ప్రియమైనవాడవు. అట్టినీతో అప్రియవచనము పలుకుటకు ఆయనకు నోరాడుటలేదు. ప్రతిజ్ఞాపూర్వకముగా ఆయన నాకొకమాట (వరము) ఇచ్చియున్నాడు. ఆ పని నీవలననే సాధ్యము - ఈ మహారాజు లోగడ నాపైగల ఆదరాభిమానములతో నాకొకవరమిచ్చియుండెను. ఇప్పుడు ఆ విషయమున ఒక పామరునివలె పశ్చాత్తాపపడుచున్నాడు. "పూర్వము ఈ నరేంద్రుడు ప్రమాణపూర్వకముగా నాకు వరమును ఇచ్చియుండెను. ఇప్పుడు దానిని పరిహరించుటకు (దాని నుండి తప్పించుకొనుటకు) వ్యర్థముగా ప్రయత్నించుచున్నాడు. నీరంతయు (జారి) పోయినపిమ్మట (నీరులేని చెఱువునకు) అడ్డుకట్టవేయుటకు పూనుకొనుట వ్యర్థముగదా! (21-23)

ఓ రామా! ఈ జగత్తునకు సత్యపాలనధర్మమే మూలము- ఇది సత్పురుషులు (పెద్దలు) అందరును ఆమోదించిన (ఎఱిగిన) విషయము. అయితే ఈమహారాజు నీ ప్రయోజనము

యది తద్వక్ష్యతే రాజా శుభం వా యది వాఽశుభమ్।
కరిష్యసి తతస్సర్వమ్ ఆఖ్యాస్యామి పునస్త్వహమ్। 25

యదిత్వభిహితం రాజ్ఞా త్వయి తన్న విపత్స్యతే।
తతోఽహమభిధాస్యామి న హ్యేష త్వయి వక్ష్యతి। 26

ఏతత్తు వచనం శ్రుత్వా కైకేయ్యా సముదాహృతమ్।
ఉవాచ వ్యథితో రామః తాం దేవీం నృపసన్నిధౌ। 27

అహో! ధిఙ్నార్హసే దేవి వక్తుం మామ్ ఈదృశం వచః।
అహం హి వచనాద్రాజ్ఞః పతేయమపి పావకే।
భక్షయేయం విషం తీక్ష్ణం మజ్జేయమపి చార్ణవే। 28

నియుక్తో గురుణా పిత్రా నృపేణ చ హితేన చ। 29

తద్బ్రూహి వచనం దేవి రాజ్ఞో యదభికాంక్షితమ్।
కరిష్యే ప్రతిజానే చ రామో ద్విర్నాభిభాషతే। 30

తమార్జవసమాయుక్తమ్ అనార్యా సత్యవాదినమ్।
ఉవాచ రామం కైకేయీ వచనం భృశదారుణమ్। 31

పురా దైవాసురే యుద్ధే పిత్రా తే మమ రాఘవ।
రక్షితేన వరౌ దత్తౌ సశల్యేన మహారణే। 32

తత్ర మే యాచితో రాజా భరతస్యాభిషేచనమ్।
గమనం దండకారణ్యే తవ చాద్యైవ రాఘవ। 33

యది సత్యప్రతిజ్ఞం త్వం పితరం కర్తుమిచ్ఛసి।
ఆత్మానం చ నరశ్రేష్ఠ! మమ వాక్యమిదం శృణు। 34

సన్నిదేశే పితుస్తిష్ఠ యథాఽనేన ప్రతిశ్రుతమ్।
త్వయాఽరణ్యం ప్రవేష్టవ్యం నవ వర్షాణి పంచ చ। 35

భరతశ్చాభిషిచ్యేత యదేతదభిషేచనమ్।
త్వదర్థే విహితం రాజ్ఞా తేన సర్వేణ రాఘవ। 36

సప్త సప్త చ వర్షాణి దండకారణ్యమాశ్రితః।
అభిషేకమిమం త్యక్త్వా జటాచీరధరో వస। 37

కొఱకై ఆ సత్యరూపధర్మమును ఉల్లంఘించుటకై నాపై రుసరుసలాడుచున్నాడు. ఆయన ఆ ధర్మమును పాటించునట్లు నీవే చూడవలెను. "రాజు చెప్పదలచుకొనిన విషయము (రాజుమనోగతము) అది శుభమేయైనను అశుభమేయైనను, దానిని నేను తప్పక పాటింతును" అని నీవు బాసచేసినచో - ఆ విషయమును పూర్తిగా నేను నీకు వివరింతును. (24-25)

రాజుమనసులోనిమాట (రాజు నాకు ఇచ్చిన మాట) నీవలన వమ్ముకానిచో (నీవు పాటించుటకు సిద్ధమైనచో) అప్పుడు దానిని నీకు తెల్పెదను. అతడు దానిని నీతో స్వయముగా చెప్పజాలడు." కైకేయి (తనను విశ్వసించక) పలికిన ఈ మాటలను విని, శ్రీరాముడు మిక్కిలి నొచ్చుకొనెను. పిమ్మట అతడు రాజుసమక్షముననే ఆ దేవితో ఇట్లు నుడివెను. (26-27)

"ఓ దేవీ! నీవు నాతో ఇట్టిమాటలు పలుకదగదు. ఇట్లు నుడువుట నాకే సిగ్గుచేటు. రాజాజ్ఞయైనచో అగ్నిలోనైనను దూకెదను. నాతండ్రియే నాకు గురువు, పాలకుడు (శాసించువాడు) హితుడు- అన్నియును. ఆతడాదేశించినచో తీవ్రమైన విషమును సైతము త్రాగెదను, అగాధమైన సముద్రమునందైనను పడిపోయెదను- ఓ దేవీ! రాజుకోరికయేమో తెలుపుము - దానిని తప్పక ఆచరింతునని ప్రతిజ్ఞ చేయుచున్నాను. రాముడు ఆడినమాట తప్పడు. (28-30)

ఋజువర్తనుడును, సత్యమునకు కట్టుబడియుండువాడును ఐన రామునితో అధర్మపరురాలైన కైకేయి మిక్కిలి పరుషములైన వచనములను ఇట్లు నుడివెను. (31)

"ఓ రఘురామా! పూర్వము దేవాసురులకు జరిగిన మహాసంగ్రామమునందు శత్రువులయొక్క బాణములు గ్రుచ్చుకొని మీ తండ్రి మూర్ఛితుడు అయ్యెను. ఆ స్థితిలో ఆయనను నేను కాపాడితిని. అప్పుడు ఆయన ప్రసన్నుడై, ధనుర్బాణములసాక్షిగా నాకు రెండు వరములను ఇచ్చెను. (32)

ఓ రామా! (1) భరతుడు పట్టాభిషిక్తుడగుట (2) నేడే నీవు దండకారణ్యమునకు వెళ్లుట - అను రెండు వరములను ఇప్పుడు ఈ రీతిగా నేను కోరితిని. (33)

ఓ నరశ్రేష్ఠా! మీతండ్రిచేసిన సత్యప్రతిజ్ఞను నిలబెట్టదలచినచో, నీవు ఆడితప్పనివాడవైనచో నేను చెప్పుచున్న మాటలను వినుము- ఓ రామా! మీ తండ్రి ఆజ్ఞకు కట్టుబడియుండుము. ఆయన చేసిన ప్రతిజ్ఞమేరకు నీవు పదునాలుగు సంవత్సరములకాలము వనవాసము చేయుము- రాజు నీ పట్టాభిషేకముకొఱకై సమకూర్చిన సమస్తసామగ్రితోడనే భరతునకు పట్టాభిషేకమును జరుపవలెను- నీవు ఈ పట్టాభిషేకకార్యమును త్యజించి, జటావల్కలములను ధరించి, పదునాలుగు వత్సరములకాలము దండకారణ్యమున వసింపుము. (34-37)

భరతః కోసలపురే ప్రశాస్తు వసుధామిమామ్।
నానారత్నసమాకీర్ణాం సవాజిరథకుంజరామ్॥ 38

వివిధరత్న సంపదలతో విలసిల్లు చున్నదియు, చతురంగ బలములతో సురక్షితముగానున్నదియు అగు ఈ కోసలరాజ్యమును భరతుడు పరిపాలించుగాక - (38)

ఏతేన త్వాం నరేంద్రోఽయం కారుణ్యేన సమాప్లుతః।
శోకసంక్లిష్టవదనో న శక్నోతి నిరీక్షితుమ్॥ 39

ఈ రెండువరములను ఇచ్చినకారణముగా ఈ మహారాజు నీమీదిప్రేమాతిశయముచే శోకమున కుమిలిపోవుచు వాడిపోయినముఖముతో నీవైపు చూడలేకున్నాడు- (39)

ఏతత్ కురు నరేంద్రస్య వచనం రఘునందన!।
సత్యేన మహతా రామ! తారయస్వ నరేశ్వరమ్॥ 40

ఓ రఘునందనా! ఈ మహారాజుమాటను నిలబెట్టుము. నీ సత్యవ్రత ప్రభావముతో ఈ నరేశ్వరుని (అసత్య దోషమునుండి) తరింపజేయుము." (40)

ఇతీవ తస్యాం పరుషం వదంత్యాం
న చైవ రామః ప్రవివేశ శోకమ్ ।
ప్రవివ్యథే చాపి మహానుభావో
రాజా తు పుత్రవ్యసనాభితప్తః ॥ 41

ఇట్లు కైకేయి పెక్కు, పరుషవచనములను పలుకుచున్నప్పటికిని శ్రీరాముడు ఏ మాత్రమూ శోకమునకులోనుకాలేదు - (అనగా రాముని ముఖకాంతి తగ్గలేదు-) ఎట్టి వికారములకునులోను గాక నిశ్చలుడైయున్న శ్రీరాముని జూచి, మహానుభావుడైన మహారాజు పుత్రునికి కలుగనున్న ఆపదలను దలచుకొని, శోకసంతప్తుడై కుమిలిపోసాగెను. (41)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టాదశస్సర్గః (18)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పదునెనిమిదవసర్గము సమాప్తము.

— ❋ ❋ ❋ —

19. పందొమ్మిదవసర్గము

శ్రీరాముని వనగమనమునకై కైక ఆయనను తొందరపెట్టుట, దశరథునకు, తల్లి కైకేయికిని ప్రణమిల్లి, శ్రీరాముడు కౌసల్యామాత మందిరమునకు చేరుట.

తదప్రియమమిత్రఘ్నో వచనం మరణోపమమ్।
శ్రుత్వా న వివ్యథే రామః కైకేయీం చేదమబ్రవీత్॥ 1

కైక పలికినమాటలు మిక్కిలి అప్రియములు, లోకదృష్టిలో మృత్యువుతో సమానములు- అనగా సామాన్య మానవుడు వాటిని వినినచో వానిగుండె బ్రద్దలగును- కాని కామక్రోధాది- అరిషడ్వర్గమును జయించిన శ్రీరాముడు ఆమాటలను వినియును ఏమాత్రము వ్యథచెందక ఆమెతో ఇట్లనెను. (1)

ఏవమస్తు గమిష్యామి వనం వస్తుమ్ అహంత్వితః।
జటాజినధరో రాజ్ఞః ప్రతిజ్ఞామనుపాలయన్॥ 2

ఇదం తు జ్ఞాతుమిచ్ఛామి కిమర్థం మాం మహీపతిః।
నాభినందతి దుర్ధర్షో యథాపురమరిందమః॥ 3

మన్యుర్న చ త్వయా కార్యో దేవి! బ్రూమి తవాగ్రతః।
యాస్యామి భవ సుప్రీతా వనం చీరజటాధరః॥ 4

"అమ్మా! నీవు చెప్పినట్లే చేయుదును. రాజాజ్ఞను శిరసావహించుచు ఈ అయోధ్యానగరమును వీడి, జటావల్కలధారినై వనవాసమునకు వెళ్లెదను. కాని ఎదురులేనివాడును. శత్రుసంహారసమర్థుడును ఐన మహారాజు నా స్వభావమును ఎఱిగియు, ఎప్పటివలె నన్ను ప్రియవచనములతో పలుకరించుటలేదు కారణమేమో తెలిసికొనగోరుచున్నాను- అమ్మా! నీ సమక్షముననే మనవిచేయుచున్నాను. జటాధారినై నారచీరలను ధరించి, వనములకేగెదను. ఇంక నీవు కోపమును వీడుము, ప్రసన్నురాలవుకమ్ము. (2-4)

హితేన గురుణా పిత్రా కృతజ్ఞేన నృపేణ చ।
నియుజ్యమానో విస్రబ్ధః కిం న కుర్యామహం ప్రియమ్॥ 5

కృతజ్ఞతగల మహారాజు నాకు హితుడు, గురుడు, తండ్రి. అట్టివాడు ఆజ్ఞాపించుచుండగా విశ్వాసపాత్రుడనై, నేను ఆయనకు ప్రియమైన కార్యమును ఏల చేయను? మహారాజు

అలీకం మానసం త్వేకం హృదయం దహతీవ మే।
స్వయం యన్నాహ మాం రాజా భరతస్యాభిషేచనమ్। 6

అహం హి సీతాం రాజ్యం చ ప్రాణానిష్టాన్ ధనాని చ।
హృష్టో భ్రాత్రే స్వయం దద్యాం భరతాయాప్రచోదితః। 7

కిం పునర్మనుజేంద్రేణ స్వయం పిత్రా ప్రచోదితః।
తవ చ ప్రియకామార్థం ప్రతిజ్ఞామనుపాలయన్। 8

తదాశ్వాసయ హీమం త్వం కిన్విదం యన్మహీపతిః।
వసుధాసక్తనయనో మందమశ్రూణి ముంచతి। 9

గచ్ఛంతు చైవానయితుం దూతాః శీఘ్రజవైర్హయైః।
భరతం మాతులకులాత్ అద్యైవ నృపశాసనాత్। 10

దండకారణ్యమేషోఽహమ్ ఇతో గచ్ఛామి సత్వరః।
అవిచార్య పితుర్వాక్యం సమా వస్తుం చతుర్దశ। 11

సా హృష్టా తస్య తద్వాక్యం శ్రుత్వా రామస్య కైకయీ।
ప్రస్థానం శ్రద్దధానా హి త్వరయామాస రాఘవమ్। 12

ఏవం భవతు యాస్యంతి దూతాః శీఘ్రజవైర్హయైః।
భరతం మాతులకులాత్ ఉపావర్తయితుం నరాః। 13

తవ త్వహం క్షమం మన్యే నోత్సుకస్య విలంబనమ్।
రామ! తస్మాదితః శీఘ్రం వనం త్వం గంతుమర్హసి। 14

వ్రీడాన్వితః స్వయం యచ్చ నృపస్త్వాం నాభిభాషతే।
నైతత్ కించిన్నరశ్రేష్ఠ! మన్యురేషోఽపనీయతామ్। 15

యావత్ త్వం న వనం యాతః పురాదస్మాదభిత్వరన్।
పితా తావన్న తే రామ! స్నాస్యతే భోక్ష్యతేఽపి వా। 16

ధిక్! కష్ట మితి నిశ్వస్య రాజా శోకపరిప్లుతః।
మూర్ఛితో న్యపతత్ తస్మిన్ పర్యంకే హేమభూషితే। 17

రామోఽప్యుత్థాప్య రాజానం కైకేయ్యాభిప్రచోదితః।
కశయేవాహతో వాజీ వనం గంతుం కృతత్వరః। 18

తదప్రియమనార్యాయా వచనం దారుణోదయమ్।
శ్రుత్వా గతవ్యథో రామః కైకేయీం వాక్యమబ్రవీత్। 19

భరతునిపట్టాభిషేకమునుగూర్చి స్వయముగా నాకు తెలుపలేదు. ఆ విషయమే నా మనసును క్షోభపెట్టి, హృదయమును దహించి వేయుచున్నది. (5-6)

సోదరుడైన భరతునికొఱకై నేను రాజ్యమునేగాదు, అత్యంత ప్రీతికరములైన ప్రాణములను, సంపదలను కడకు సీతనుసైతము ఎవ్వరును అడుగకుండగనే స్వయముగా సంతోషముతో తప్పక ఇచ్చివేయుదును. ఇంక మహారాజైన నాతండ్రి నీకు ప్రియమును గూర్చుటకై ప్రతిజ్ఞచేసి, అందులకై తానే నన్నడిగినచో ఆయనమాటను నేనెట్లు పాటింపకుందును? (శ్రీరామునకు భరతునిపైగల సోదరప్రేమ ఎంత అపూర్వమైనది?) (7-8)

కనుక ఈయనను (తండ్రిగారిని) నీవు ఓదార్చుము. అయ్యో! ఇదియేమి? మహారాజు నేలపైపు చూచుచు తిన్నగా కన్నీరు కార్చుచున్నాడు? (9)

రాజశాసనమును అనుసరించి, భరతుని అతనిమేనమామ యింటినుండి గొనివచ్చుటకై మిక్కిలి వడిగల గుఱ్ఱములపై దూతలు నేడే వెళ్ళుదురు గాక- (10)

ఏమీ సంకోచములేకుండ తండ్రియాజ్ఞను శిరసావహించి, నేను ఇప్పుడే ఇటునుండి ఇట్లే పదునాలుగు సంవత్సరములు వనవాసముచేయుటకై దండకారణ్యమునకు వెళ్ళెదను." (11)

శ్రీరాముని మాటలకు సంతసించి, కైకేయి ఆయనవనవాస ప్రయాణమునకు తహతహపడుచున్నదై, ఆతనిని తొందరపెట్టుచు ఇట్లనెను. (12)

"ఓ రామా! అట్లే కానిమ్ము. మేనమామయింటినుండి భరతుని గొనివచ్చుటకై వడిగలగుఱ్ఱములపై దూతలు వెళ్ళెదరు. వనవాసమునకు స్వయముగా సుముఖుడవైయున్న నీవు జాగుచేయుట తగదని నేననుకొందును. కావున ఇక్కడినుండి ఇప్పుడే నీవు వనములకు బయలుదేఱుట మంచిది. (13-14)

ఓ నరశ్రేష్ఠా! రాజు స్వయముగా నీతో మాట్లాడుటకు సిగ్గుపడుచున్నాడు. ఈ విషయము (ఆయన నీతో మాట్లాడకుండుట) అంత ముఖ్యమైనదిగాదు. ఈ విచారమును నీ మనస్సునుండి తీసివేయుము. - ఓ రామా! శీఘ్రముగా బయలుదేఱుము. ఈ నగరమునుండి నీవు వనములకు వెళ్ళనంతవఱకును నీ తండ్రి స్నానము చేయుడు. అన్నపానములను ముట్టడు"- (15-16)

అంతట "ఛీ! ఎంత కష్టము వచ్చిపడినది"- అని నిట్టూర్చి, రాజు మూర్ఛితుడై, తనబంగారుపర్యంకముపై పడిపోయెను. (17)

అప్పుడు శ్రీరాముడు మహారాజును లేవదీసి కూర్చుండబెట్టెను. కొరడాతో గుఱ్ఱమును అదలించినట్లు కైకేయి తనను ప్రేరేపింపగా అతడు వనగమనమునకు త్వరపడసాగెను. (18)

దుష్టురాలైన కైకేయి పలికిన దారుణమైన, అప్రియమైన వచనములను వినియు, రాముడు ఏ మాత్రము వ్యథచెందక, ఆమెతో ఇట్లు నుడివెను. (19)

నాహమర్థపరో దేవి! లోకమావస్తుముత్సహే।
విద్ధి మామ్ ఋషిభిస్తుల్యం కేవలం ధర్మమాస్థితమ్। 20

యదత్రభవతః కించిత్ శక్యం కర్తుం ప్రియం మయా।
ప్రాణానపి పరిత్యజ్య సర్వథా కృతమేవ తత్। 21

న హ్యతో ధర్మచరణం కించిదస్తి మహత్తరమ్।
యథా పితరి శుశ్రూషా తస్య వా వచనక్రియా। 22

అనుక్తోఽప్యత్రభవతా భవత్యా వచనాదహమ్।
వనే వత్స్యామి విజనే వర్షాణీహ చతుర్దశ। 23

న నూనం మయి కైకేయి కించిదాశంససే గుణమ్।
యద్రాజానమవోచస్త్వం మమేశ్వరతరా సతీ। 24

యావన్మాతరమాపృచ్ఛే సీతాం చానునయామ్యహమ్।
తతోఽద్యైవ గమిష్యామి దండకానాం మహద్వనమ్। 25

భరతః పాలయేద్రాజ్యం శుశ్రూషేచ్చ పితుర్యథా।
తథా భవత్యా కర్తవ్యం స హి ధర్మః సనాతనః। 26

స రామస్య వచః శ్రుత్వా భృశం దుఃఖహతః పితా।
శోకాదశక్నువన్ బాష్పం ప్రరురోద మహాస్వనమ్। 27

వందిత్వా చరణౌ రామో విసంజ్ఞస్య పితుస్తదా।
కైకేయ్యాశ్చాప్యనార్యాయా నిష్పపాత మహాద్యుతిః। 28

స రామః పితరం కృత్వా కైకేయీం చ ప్రదక్షిణమ్।
నిష్క్రమ్యాంతఃపురాత్ తస్మాత్ దదర్శ స్వం సుహృజ్జనమ్। 29

తం బాష్పపరిపూర్ణాక్షః పృష్ఠతోఽనుజగామ హ।
లక్ష్మణః పరమక్రుద్ధః సుమిత్రానందవర్ధనః। 30

అమ్మా! నాకు రాజ్యకాంక్షలేదు. నేను ఇచటనే ఉండి పౌరులనని ఆసించుటయులేదు- కేవలము ధర్మమునే ఆశ్రయించియున్న నన్ను ఋషితుల్యునిగా ఎఱుంగుము. పూజ్యుడైన మాతండ్రికి ఏ కొంచెముగానైనను ప్రియమును చేయుగల్గియున్నచో ప్రాణములను ఒడ్డియైనను అన్నివిధములుగా దానిని చేసియే తీరెదను. (20-21)

తండ్రికి శుశ్రూషచేయుట, ఆయనిఆజ్ఞలను పాటించుట అను వాటికంటె మించిన ధర్మాచరణము మానవులకు మఱియొకటి లేనే లేదు. (22)

పూజ్యుడైన నా తండ్రి స్వయముగా నన్ను ఆదేశింపకున్నను, మీరు చెప్పినారు గదా! అది చాలును. నేను పదునాలుగు సంవత్సరములు నిర్జనవనప్రదేశమున తప్పక నివసించెదను. (23)

ఓ కైకేయీమాతా! నన్ను శాసించుటకు నీకు పూర్తిగా అధికారమున్నది. నీ యాజ్ఞయెట్టిదైనను దానిని నేను శిరసావహింతును. నీవు స్వయముగా నాకు చెప్పక రాజుతో నుడివి, ఆయనకు కష్టము కలిగించితివి. దీనినిబట్టి నీవు నా గుణములను నిజముగా గ్రహించినట్లు లేదు. (24)

అమ్మా! కౌసల్యామాతకడ సెలవుగైకొని, సీతను అనునయించి వచ్చెదను. నాకు ఇంత మాత్రము గడువునిమ్ము అనంతరము నేడే దట్టమైన దండకారణ్యమునకు[1] వెళ్లెదను. (25)

ఈ రాజ్యమును భరతుడు పాలింపగలడు. మఱియు అతడు తండ్రిగారికి సేవలు చేయునట్లును జూడుము. ఇదియే సనాతన ధర్మము." (26)

అప్పుడు తండ్రియైన దశరథుడు శ్రీరామునివచనములను విని, మిక్కిలి దుఃఖమున మునిగిపోయెను. శోకభారముచే కన్నీరు కార్చుచు, ఏమియు మాట్లాడలేక వెక్కివెక్కి యేడ్చెను. (27)

మహాతేజస్వియైన శ్రీరాముడు స్పృహానుకోల్పోయియున్న తండ్రిచరణములకు నమస్కరించెను. పిదప అధర్మమునకు ఒడిగట్టిన కైకేయి పాదములకును ప్రణమిల్లెను - అట్లు తండ్రికిని, కైకకును ప్రదక్షిణమొనర్చిన పిమ్మట ఆ అంతఃపురమునుండి అతడు బయటికి వచ్చి, తన మిత్రులనుగాంచెను. (28-29)

జరిగిన పరిణామములకు శోకముతో కన్నుల నీరునిండిన వాడై, సుమిత్రాదేవి కుమారుడగు లక్ష్మణుడు మిక్కిలి క్రుద్ధుడై అన్నయగు రాముని వెన్నంటి నడచెను. (30)

1) 'దండుడు' అను వాడు ఇక్ష్వాకుమహారాజుకుమారుడు. ఇతడు దుష్టుడు. బాల్యమున ఆటలలోగూడ ఇతడు తోడిబాలురను మిక్కిలి హింసించుచుండువాడు. ఇతనిదుశ్చేష్టలకారణముగా ఇతనిని తండ్రి తననగరమునుండి వెడలగొట్టి వింధ్యపర్వతమునకు పంపెను- వింధ్యపర్వతమునకు దక్షిణమున ఇతడు 'మధుమంతము' అను పురమును నిర్మించుకొని, ఆ ప్రాంతమును పరిపాలించెను. రాక్షసులతో చెలిమి చేయుచుశుక్రాచార్యునికడ ఇతడు విద్యను అభ్యసించెను. ఇతడు శుక్రాచార్యుని కూతురగు, 'అరజ'ను గాంచి కామాతురుడై, గురుపుత్రిక అనియు చూడక, బలవంతముగా ఆమెతోరమించెను. ఏడ్చుచు తనకడకు వచ్చిన తనపుత్రికయగు 'అరజ'వలన విషయము తెలిసి, శుక్రుడు కుపితుడై, ఈతనిపురముచుట్టును నూరుయోజనముల మేరకు మట్టి వర్షించునట్లు శపించెను. ఈతనిపురము మట్టిఅడుగున బడుటతో ఆ ప్రదేశమంతయును అరణ్యముగా మారెను. దండునిపేరుతో అది 'దండకారణ్యము'గా ప్రసిద్ధికెక్కెను.

అభిషేచనికం భాండం కృత్వా రామః ప్రదక్షిణమ్।
శనైర్జగామ సాపేక్షో దృష్టిం తత్రావిచాలయన్। 31

శ్రీరాముడు "ఇప్పుడు ఈ సంభారములతోడనే నా ప్రియసోదరుడైన భరతునకు పట్టాభిషేకము జరుగుగాక" - అని భావించుచు పట్టాభిషేకమునకై సిద్ధపఱచబడిన మంగళద్రవ్యములకు ప్రదక్షిణమొనర్చెను. పిదప వాటివైపే చూడక తిన్నగా అచటినుండి కదలెను. (31)

న చాస్య మహతీం లక్ష్మీం రాజ్యనాశోఽపకర్షతి।
లోకకాంతస్య కాంతత్వాత్ శీతరశ్మేరివ క్షపా। 32

పట్టాభిషేకము ఆగిపోవుటవలన శ్రీరాముని ముఖశోభ కించిత్తైనను తగ్గలేదు. శ్రీరాముడు తనసహజ సౌందర్యశోభలచే లోకములకే ఆనందదాయకుడు. కనుక చంద్రుని సహజకాంతిని రాత్రి తగ్గింపలేనట్లు పట్టాభిషేకము జరుగకపోవుటవలన ఆయనముఖకాంతి ఏమాత్రము తఱుగలేదు.[1] (32)

న వనం గంతుకామస్య త్యజతశ్చ వసుంధరామ్।
సర్వలోకాతిగస్యేవ లక్ష్యతే చిత్తవిక్రియా। 33

రాజ్యాధికారమును త్యజించుచు వనగమనమునకు సుముఖుడై యున్న శ్రీరామునకు జీవన్ముక్తు (త్రిగుణాతీతు)డైనయోగికి వలె ఎట్టి మనోవికారమూ కలుగలేదు.[2] (33)

ప్రతిషిధ్య శుభం ఛత్రం వ్యజనే చ స్వలంకృతే।
విసర్జయిత్వా స్వజనం రథం పౌరాంస్తథా జనాన్। 34

ధారయన్ మనసా దుఃఖమ్ ఇంద్రియాణి నిగృహ్య చ।
ప్రవివేశాత్మవాన్ వేశ్మ మాతురప్రియశంసివాన్। 35

స్థితప్రజ్ఞుడైన శ్రీరాముడు శుభప్రదమైన శ్వేతచ్ఛత్రమును, చక్కగా అలంకరింపబడిన వింజామరలను వలదని వారించెను. మిత్రులను, రథమును, పౌరులను, తదితరజానపదులను పంపివైచెను. తన వనగమనమువలన దుఃఖార్తులైన ఆత్మీయులను జూచి, తనలో పెల్లుబికిన దుఃఖమును తనలోనే దిగమ్రింగుకొనెను. ఇంద్రియములను నిగ్రహించుకొనెను. తన తల్లికి అప్రియమైనను ఈ వార్తను ఆమెకు తెలుపదలచినవాడై అతడు కౌసల్యాదేవి అంతఃపురమున ప్రవేశించెను. (34-35)

సర్వో హ్యభిజనః శ్రీమాన్ శ్రీమతః సత్యవాదినః।
నాలక్షయత రామస్య కించిదాకారమాననే। 36

పట్టాభిషేకమును జూచుటకై చక్కగా ముస్తాబైవచ్చిన ఆత్మీయులు, ఉత్తమగుణములు గలిగినవాడును, సత్యవాదియు ఐన శ్రీరామునిముఖమున (దుఃఖసూచకమైన)ఎట్టి మార్పును గమనింపలేదు. (36)

ఉచితం చ మహాబాహుః న జహౌ హర్షమాత్మనః।
శరదస్సముదీర్ణాంశుః చంద్రస్తేజ ఇవాత్మజమ్। 37

శరత్కాలమునందు పున్నమినాడు పదునాఱుకళలతో ప్రకాశించుచున్న చంద్రుని ఆయనసహజకాంతి (పండువెన్నెల) విడువనట్లు, మహాబాహువైన శ్రీరామునినుండి ఆయన విషయమున సహజమైన సంతోషము ఏమాత్రము తొలగలేదు. ఆ మహాత్మునివిషయమున అట్లుజరుగుట సముచితమే. (37)

వాచా మధురయా రామః సర్వం సమ్మానయన్ జనమ్।
మాతుస్సమీపం ధీరాత్మా ప్రవివేశ మహాయశాః। 38

ధీరుడు, మహాయశస్వియు ఐన శ్రీరాముడు తనసరసన గల జనులనందఱిని మృదుమధురవచనములతో సంతోషపఱచుచు, తిన్నగా తల్లియొద్దకు చేరెను. (38)

1) లోకకాంతః = సకలలోకములకును ప్రభువు. (శ్రీమహావిష్ణువు) శ్రీరాముడు శ్రీమహావిష్ణువుయొక్క అవతారము. సమస్తలోకములకును ప్రభువైన శ్రీరామునకు కేవలము కోసలరాజ్యాధికారము ప్రత్యక్షముగా లేకుండుటవలనవచ్చెడిలోటు ఏమియు ఉండదు గదా!

2) శ్లో॥ ప్రసన్నతాం యా న గతాభిషేకతః తథా న మమ్లే వనవాసదుఃఖతః।
ముఖాంబుజశ్రీ రఘునందనస్య మే సదాస్తు సా మంజులమంగళప్రదా ॥ 2 ॥
రఘువంశమునకు ఆనందప్రదుడైన శ్రీరామచంద్రునియొక్క ముఖకమలశోభ రాజ్యాభిషేకవార్తను విని, పెంపుగనూలేదు, అట్లే వనవాసక్లేశములకు తఱుగనూలేదు. సర్వకాలసర్వావస్థలయందును ఒకేరీతిగావెలసిల్లు ఆయనముఖకాంతులు సర్వదా నాకు శుభములను కూర్చుగాక. (రా.మా.భగవన్మతి-2)

తం గుణైః సమతాం ప్రాప్తో భ్రాతా విపులవిక్రమః।
సౌమిత్రిరనువవ్రాజ ధారయన్ దుఃఖమాత్మజమ్॥ 39

ప్రవిశ్య వేశ్మాతిభృశం ముదాఽన్వితం
సమీక్ష్య తాం చార్థవిపత్తిమాగతామ్।
న చైవ రామోఽత్ర జగామ విక్రియాం
సుహృజ్జనస్యాత్మవిపత్తిశంకయా॥ 40

సోదరుడైన శ్రీరామునివలె సుఖదుఃఖములను సమానముగా భావించువాడును, మహాపరాక్రమశాలియు ఐన లక్ష్మణుడు తనలోని దుఃఖమును నిగ్రహించుకొనుచు అన్నను అనుసరించెను. శ్రీరాముడు అడుగిడు సమయమున మాతృమందిరమంతయును మిక్కిలి సంతోషముతో నిండియుండెను. హఠాత్తుగా వచ్చిపడిన ఈ ఆపదనుగూర్చి విన్నచో అచ్చటి సుహృజ్జనుల (ఆత్మీయుల) ప్రాణములకు ముప్పువాటిల్లునని అతడు శంకించెను. అందువలన అతడు తనముఖమున ఎట్టి వికారమునకును తావీయలేదు. (39-40)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనవింశస్సర్గః *(19)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు పందొమ్మిదవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

20. ఇరువదియవసర్గము

శ్రీరాముడు తన వనవాసవార్తను కౌసల్యామాతకు తెల్పుట - అంతట ఆమె తీరని దుఃఖమునకుగురియై, ఆక్రందించుచు తన వేదనను శ్రీరామునకు తెల్పుట.

తస్మింస్తు పురుషవ్యాఘ్రే నిష్క్రామతి కృతాంజలౌ।
ఆర్తశబ్దో మహాన్ జజ్ఞే స్త్రీణామంతఃపురే తదా॥ 1

నరశ్రేష్ఠుడైన ఆ రాముడు తండ్రికి నమస్కరించి, అచటి (కైకేయిమందిరము) నుండి తల్లియగు కౌసల్యాదేవి భవనమునకు బయలుదేరెను. ఇంతలో స్త్రీలఅంతఃపురమునుండి గొప్ప ఆర్తనాదము వినబడెను. (1)

కృత్యేష్వచోదితః పిత్రా సర్వస్యాంతఃపురస్య చ।
గతిర్యః శరణం చాపి స రామోఽద్య ప్రవత్స్యతి॥ 2

కౌసల్యాయాం యథా యుక్తో జనన్యాం వర్తతే సదా।
తథైవ వర్తతేఽస్మాసు జన్మప్రభృతి రాఘవః॥ 3

న క్రుధ్యత్యభిశప్తోఽపి క్రోధనీయాని వర్జయన్।
క్రుద్ధాన్ ప్రసాదయన్ సర్వాన్ స ఇతోఽద్య ప్రవత్స్యతి॥ 4

"తండ్రి ఆదేశింపకయున్నను శ్రీరాముడు తనకుతానుగా (స్వయముగా) అంతఃపురమునకు సంబంధించిన కార్యములను అన్నింటిని నెఱవేర్చుచు మనకు సంరక్షకుడుగా ఉండెడివాడు. అట్టి రాఘవుడు ఇప్పుడు వనములకు వెళ్లనున్నాడు. పుట్టినప్పటి నుండియు కన్నతల్లియగు కౌసల్యయెడ మసలుకొనిన తీరుగనే మనవిషయమునగూడ రఘువరుడు ప్రవర్తించుచువచ్చెను. ఎవరు ఎంతగా పరుషవచనములను పలికినను శ్రీరాముడు వారిని పల్లెత్తుమాటగూడ అనియెఱుగడు. ఇతరులకు ఎప్పుడైనను కోపము కలుగునట్లుగా మాటాడడు. అట్టి పనులను చేయడు. అంతేగాదు అతడు క్రుద్ధులైనవారినందఱిని శాంతపఱచుచు ప్రసన్నవదనుడై యుండెడివాడు. అయ్యో! అట్టి (మన) రాముడు నేడే ఇచటినుండి అరణ్యములకు వెళ్లిపోవుచున్నాడు. (2-4)

అబుద్ధిర్బత నో రాజా జీవలోకం చరత్యయమ్।
యో గతిం సర్వభూతానాం పరిత్యజతి రాఘవమ్॥ 5

ఇతి సర్వా మహిష్యస్తా వివత్సా ఇవ ధేనవః।
పతిమాచుక్రుశుశ్చైవ సస్వరం చాపి చుక్రుశుః॥ 6

అయ్యో! మనరాజు దశరథునిబుద్ధి దెబ్బతినినట్లున్నది. సర్వప్రాణులకును దిక్కైన శ్రీరాముని అడవులపాలుచేయుచున్నాడు. ఈవిధముగా ఇతడు సమస్తజీవకోటిని పరితాపములకు గుఱిచేయుచున్నాడు" - అని అంతఃపురమునందలి రాణులందఱును లేగదూడలను ఎడబాయుచున్న ధేనువులవలె దుఃఖముతో బిగ్గరగా ఏడ్చుచు, రాజును నిందింపసాగిరి. (5-6)

స హి చాంతఃపురే ఘోరమ్ ఆర్తశబ్దం మహీపతిః।
పుత్త్రశోకాభిసంతప్తః శ్రుత్వా వ్యాలీయతాఽఽసనే॥ 7

పుత్త్రశోకముతో కుమిలిపోవుచున్న ఆ మహారాజు అంతఃపురము నందలి బాధాకరమైన ఆ రోదనధ్వనులను విని, దుర్భరమైన దుఃఖముతో తల్పమునందే ముఖమును దాచుకొనెను. (7)

రామస్తు భృశమాయస్తో నిశ్శ్వసన్నివ కుంజరః।
జగామ సహితో భ్రాత్రా మాతురంతఃపురం వశీ॥ 8

అంతట శ్రీరాముడు ఆ అంతఃపురమునందలి రోదన ధ్వనులు చెవికిసోకినంతనే చలించి, ఏనుగువలె నిట్టూర్చెను. పిమ్మట తనమనస్సును నిగ్రహించుకొని, తమ్ముడైన లక్ష్మణునితోగూడి, కౌసల్యాదేవిఅంతఃపురమునకు చేరెను. (8)

సోఽపశ్యత్ పురుషం తత్ర వృద్ధం పరమపూజితమ్।
ఉపవిష్టం గృహద్వారి తిష్ఠతశ్చాపరాన్ బహూన్॥ 9

అంతఃపురద్వారముకడ మిక్కిలి పూజ్యుడైన ఒకవృద్ధుడు కూర్చొనియుండెను. శ్రీరాముడు అతనిని, ఇంకను అచట కూర్చొనియున్న ఇతరులను చూచెను. (9)

దృష్ట్వైవ తు తదా రామం తే సర్వే సహసోత్థితాః।
జయేన జయతాం శ్రేష్ఠం వర్ధయంతి స్మ రాఘవమ్॥ 10

అప్పుడు అచట ఉన్నవారందఱును శ్రీరామునిజూచిన వెంటనే లేచినిలబడి, 'మహానుభావుడైన శ్రీరాముడు వర్ధిల్లుగాక'- అనుచు జయజయధ్వనులు చేయసాగిరి. (10)

ప్రవిశ్య ప్రథమాం కక్ష్యాం ద్వితీయాయాం దదర్శ సః।
బ్రాహ్మణాన్ వేదసంపన్నాన్ వృద్ధాన్ రాజ్ఞాఽభిసత్కృతాన్॥ 11

ప్రణమ్య రామస్తాన్ విప్రాన్ తృతీయాయాం దదర్శ సః।
స్త్రియో వృద్ధాస్తథా బాలా ద్వారరక్షణతత్పరాః॥ 12

అంతట శ్రీరాముడు మొదటికక్ష్యను దాటి, రెండవ కక్ష్య యందున్న వేదపండితులైన వృద్ధబ్రాహ్మణులను దర్శించెను. వారందఱును రాజుచే బాగుగా సత్కరింపబడినవారు. పిమ్మట అతడు ఆ విప్రులకు నమస్కరించి, ముందునకుసాగి, మూడవ కక్ష్యయందు ద్వారరక్షణ తత్పరలైయున్న యువతులను, వృద్ధస్త్రీలను గాంచెను. (11-12)

వర్ధయిత్వా ప్రహృష్టాస్తాః ప్రవిశ్య చ గృహం స్త్రియః।
న్యవేదయంత త్వరితా రామమాతుః ప్రియం తదా॥ 13

అచటి ఆ యువతులు, వృద్ధస్త్రీలు రాముని గాంచి, మిక్కిలి సంతోషపూర్వకముగా జయజయ ధ్వనులతో శుభాశీస్సులు పలికి, త్వరత్వరగా కౌసల్యామందిరమునకు ఏగిరి, వారు ఆ రాము జననికి ప్రియమైన రాముని ఆగమనవార్తను నివేదించిరి. (13)

కౌసల్యాపి తదా దేవీ రాత్రిం స్థిత్వా సమాహితా।
ప్రభాతే త్వకరోత్ పూజాం విష్ణోః పుత్త్రహితైషిణీ॥ 14

సా క్షౌమవసనా హృష్టా నిత్యం వ్రతపరాయణా।
అగ్నిం జుహోతి స్మ తదా మంత్రవత్ కృతమంగళా॥ 15

కౌసల్యాదేవియు నియమనిష్ఠలతో ఆ రాత్రిని గడిపెను. ప్రభాతసమయమున పుత్త్రునిహితమునుగోరుచు శ్రీమహావిష్ణువును ఆరాధించెను. పట్టువస్త్రములను ధరించియున్న ఆ కౌసల్య ప్రసన్నచిత్తముతో నిరంతరము వ్రతపరాయణురాలై యుండెను. అప్పుడామె మంగళకార్యములను నిర్వర్తింపజేసి, మంత్రపూర్వకముగా బ్రాహ్మణులచే హోమవిధులను జరిపించుచుండెను. (14-15)

ప్రవిశ్య చ తదా రామో మాతురంతఃపురం శుభమ్।
దదర్శ మాతరం తత్ర హావయంతీం హుతాశనమ్।
దేవకార్యనిమిత్తం చ తత్రాపశ్యత్ సముద్యతమ్॥ 16

దధ్యక్షతం ఘృతం చైవ మోదకాన్ హవిషస్తథా॥ 17

లాజాన్ మాల్యాని శుక్లాని పాయసం కృసరం తథా।
సమిధః పూర్ణకుంభాశ్చ దదర్శ రఘునందనః॥ 18

ఆ సమయమున శ్రీరాముడు తల్లియొక్క మంగళకరమైన అంతఃపురమున ప్రవేశించెను. అచట అగ్నికార్యములను జరిపించుచున్న తల్లిని దర్శించెను. దైవారాధననిమిత్తమై సిద్ధపఱచబడియున్న పెరుగు, నెయ్యి, మోదకములు, అక్షతలు మొదలగు హోమద్రవ్యములను గాంచెను. ఇంకను రఘునందనుడు పేలాలను, తెల్లనిపూవులను, పాయసమును, నువ్వులఅన్నములను, అట్లే సమిధలను, పూర్ణకుంభములను చూచెను. (16-18)

తాం శుక్లక్షౌమసంవీతాం వ్రతయోగేన కర్శితామ్।
తర్పయంతీం దదర్శాద్భిః దేవతాం దేవవర్ణినీమ్॥ 19

వ్రతనియమములను పాటించుచుండుటచే కౌసల్యాదేవి కృశించి యుండెను. ఆమె తెల్లని పట్టువస్త్రములను దాల్చి, దేవతవలె శోభిల్లుచు తమఆరాధ్యదైవమైన విష్ణువును జలాభిషేకములతో తృప్తిపఱచుచు సేవించుచుండెను. అట్టి కౌసల్యామాతను రాఘవుడు దర్శించెను. (19)

సా చిరస్యాత్మజం దృష్ట్వా మాతృనందనమాగతమ్।
అభిచక్రామ సంహృష్టా కిశోరం బడబా యథా। 20

స మాతరమభిక్రాంతామ్ ఉపసంగృహ్య రాఘవః।
పరిష్వక్తశ్చ బాహుభ్యామ్ ఉపాఘ్రాతశ్చ మూర్ధని। 21

తమువాచ దురాధర్షం రాఘవం సుతమాత్మనః।
కౌసల్యా పుత్రవాత్సల్యాత్ ఇదం ప్రియహితం వచః। 22

వృద్ధానాం ధర్మశీలానాం రాజర్షీణాం మహాత్మనామ్।
ప్రాప్నుహ్యాయుశ్చ కీర్తిం చ ధర్మం చోపహితం కులే। 23

సత్యప్రతిజ్ఞం పితరం రాజానం పశ్య రాఘవ!।
అద్యైవ హి త్వాం ధర్మాత్మా యౌవరాజ్యేఽభిషేక్ష్యతి। 24

దత్తమాసనమాలభ్య భోజనేన నిమంత్రితః।
మాతరం రాఘవః కించిత్ వ్రీడాత్ ప్రాంజలిరబ్రవీత్। 25

స స్వభావవినీతశ్చ గౌరవాచ్చ తదా నతః।
ప్రస్థితో దండకారణ్యమ్ ఆప్రష్టుమ్ ఉపచక్రమే। 26

దేవి! నూనం న జానీషే మహద్భయముపస్థితమ్।
ఇదం తవ చ దుఃఖాయ వైదేహ్యా లక్ష్మణస్య చ। 27

గమిష్యే దండకారణ్యం కిమనేనాసనేన మే।
విష్టరాసనయోగ్యో హి కాలోఽయం మాముపస్థితః। 28

చతుర్దశ హి వర్షాణి వత్స్యామి విజనే వనే।
కందమూలఫలైర్జీవన్ హిత్వా మునివదామిషమ్। 29

భరతాయ మహారాజో యౌవరాజ్యం ప్రయచ్ఛతి।
మాం పునర్దండకారణ్యే వివాసయతి తాపసమ్। 30

స షట్చాష్టౌ చ వర్షాణి వత్స్యామి విజనే వనే।
ఆసేవమానో వన్యాని ఫలమూలైశ్చ వర్తయన్। 31

అంతట కౌసల్య తనకు ఆనందదాయకుడైన శ్రీరాముడు చాలకాలమునకు తనకడకు రాగా సంతోషముతో పొంగిపోయెను. పిదప ఆమె ఒక ఆడుగుఱ్ఱము తనకిశోరమును (పిల్లను) జేరినట్లు ప్రేమతో తనకుమారుని సమీపించెను. (20)

అప్పుడు ఆరాఘవుడు తనకు ఎదురుగా వచ్చిన తల్లికి పాదాభివందనమాచరించెను. ఆమె కుమారుని అక్కునజేర్చుకొని మక్కువతో మూర్ధమును ఆఘ్రాణించెను. పిమ్మట కౌసల్యాదేవి అసహాయశూరుడైన తనకుమారుడగు శ్రీరామచంద్రునిపైగల పుత్రవాత్సల్యముతో ఆయనకు ప్రియమును హితమును గూర్చుచు ఇట్లు నుడివెను. (21-22)

"ఓ కుమారా! వృద్ధులును, ధర్మమూర్తులును, మహాత్ములును ఐన రాజర్షులవలె దీర్ఘాయువును, ఘనకీర్తిని, ఇక్ష్వాకు వంశోచితమైన ఉదాత్తధర్మమును పొందుదువుగాక – ఓ రాఘవా! సత్యసంధుడైన మీతండ్రియగు మహారాజును దర్శింపుము. ఆధర్మాత్ముడు నేడే నిన్ను యువరాజపట్టాభిషిక్తునిగావించును." (23-24)

పిమ్మట ఆమె "నాయనా! భోజనము చేయుము" అని పలుకగా రాఘవుడు భోజనాసనమును స్పృశించి, తనవనగమనమును గూర్చి తల్లితో తెల్పుటకు బిడియపడుచు (సంకోచించుచు) అంజలిఘటించెను. సహజముగనే వినయశీలియైన ఆరాముడు తాను దండకారణ్యమునకు బయలుదేఱుచున్నవాడగుటచే తల్లిపైగల గౌరవముతో ఆమె అనుజ్ఞ గైకొనదలచి వినమ్రుడై, ఇట్లు పలుకనారంభించెను. (25-26)

"అమ్మా! గొప్ప భయావహస్థితి (ముప్పు) ఏర్పడినది. నిజముగా నీవు తెలిసికొనలేకున్నావు. ఈ వార్త నీకును, వైదేహికిని, ప్రియమైన లక్ష్మణునకును దుఃఖమును కలిగింపనున్నది. (వినుము తెల్పెదను) (27)

దండకారణ్యమునకు వెళ్లుచున్న నాకు ఈ రత్నాసనముతో పనియేమి? నేను దర్భాసనము (విష్టరాసనము)[1] పై కూర్చుండ వలసిన సమయము ఆసన్నమైనది. నేను రాజభోగములను[2] త్యజించి, కందమూలములను తినుచు మునులవలె నిర్జనమైన వనమునందు పదునాలుగు సంవత్సరములపాటు నివసింపవలసి యున్నది. మహారాజు భరతుని యువరాజపట్టాభిషిక్తునిగా జేయును. ఆయన నన్నుమాత్రము దండకారణ్యమున మునివృత్తితో నివసింపవలసినదిగా ఆజ్ఞాపించెను. (28-30)

నేను నిర్జనారణ్యప్రదేశమున పదునాలుగు సంవత్సరముల కాలము అడవులలో లభించు ఫలమూలములను సేవించుచు, వానప్రస్థునివలె కాలము గడుపుదును". (31)

1) విష్టరము = దర్భాసనము. 25 దర్భలతో ఏర్పఱచబడునది దర్భాసనము. 50 దర్భలతో సిద్ధముచేయబడునది బ్రహ్మాసనము. "పంచాశద్భిర్భవేద్బ్రహ్మా తదర్ధేన తు విష్టరమ్" ఇతిస్మృతేః - గోవిందరాజీయవ్యాఖ్య.
2) ఆమిషం హిత్వా = రాజభోగములను త్యజించి

సా నికృత్తేవ సాలస్య యష్టిః పరశునా వనే।
పపాత సహసా దేవీ దేవతేవ దివశ్చ్యుతా। 32

ఆ మాటలను వినినంతనే ఆ కౌసల్యాదేవి అరణ్యమున గండ్రగొడ్డలిచే నఱకబడిన మద్దిచెట్టుయొక్క కాండమువలెను, దివినుండి భువికి జాఱిన దేవతవలెను క్షణములో నేలపై పడిపోయెను. (32)

తామదుఃఖోచితాం దృష్ట్వా పతితాం కదళీమివ।
రామస్తూత్థాపయామాస మాతరం గతచేతసమ్। 33

అట్టి తీవ్రమైన దుఃఖమునకు తట్టుకొనలేక మూర్ఛిల్లి, అరటిబోదెవలె నేలపైబడియున్న కౌసల్యామాతను శ్రీరాముడు లేవనెత్తెను. (33)

ఉపావృత్యోత్థితాం దీనాం బడబామివ వాహితామ్।
పాంసుకుంఠితసర్వాంగీం విమమర్శ చ పాణినా। 34

బరువును మోయలేక చతికిలబడి, శ్రమనివారణకై అటునిటు పొర్లిలేచిన ఆడుగుఱ్ఱమువలె దూళిధూసరితయై, దీనయైయున్న తల్లియొక్క శరీరమును శ్రీరాముడు చేతితో నిమిరెను. (34)

సా రాఘవముపాసీనమ్ అసుఖార్తా సుఖోచితా।
ఉవాచ పురుషవ్యాఘ్రమ్ ఉపశృణ్వతి లక్ష్మణే। 35

కౌసల్యాదేవిజీవితము సుఖములకు లోటులేనట్టిది. ఐనను ప్రస్తుతము ఆమె తీరనిదుఃఖమునకు లోనై తనచెంతనేయున్న నరశ్రేష్ఠుడగు శ్రీరామునితో ఇట్లు పల్కెను. ఆ మాటలు చేరువలోనున్న లక్ష్మణునకును వినబడుచుండెను. (35)

యది పుత్త్ర! న జాయేథా మమ శోకాయ రాఘవ।
న స్మ దుఃఖమతో భూయః పశ్యేయమహమప్రజాః। 36

ఏక ఏవ హి వంధ్యాయాః శోకో భవతి మానసః।
అప్రజాఽస్మీతి సంతాపో న హ్యన్యః పుత్త్ర! విద్యతే। 37

న దృష్టపూర్వం కల్యాణం సుఖం వా పతిపౌరుషే।
అపి పుత్త్రే తు పశ్యేయమ్ ఇతి రామాఽఽస్థితం మయా। 38

సా బహూన్యమనోజ్ఞాని వాక్యాని హృదయచ్ఛిదామ్।
అహం శ్రోష్యే సపత్నీనామ్ అవరాణాం వరా సతీ। 39

అతో దుఃఖతరం కిం ను ప్రమదానాం భవిష్యతి।
మమ శోకో విలాపశ్చ యాదృశోఽయమనంతకః। 40

"నాయనా! రామా! నీవు నాకు జన్మింపకున్నచో ఇప్పుడు ఈ పుత్త్రుని యెడబాటుదుఃఖమునకు గుఱియయ్యెడిదానను గాను. అప్పుడు నాకు సంతానములేదను దుఃఖము మాత్రమే మిగిలియుండెడిది. దానికంటెను ఈ పుత్త్రునియెడబాటు దుఃఖము మిక్కిలి దుర్భరమైనది - గొడ్రాలికి 'తనకు సంతానము కలుగకపోయెనే?' అను మనస్తాపమొక్కటి తప్ప మఱియొక దుఃఖము ఉండదు. ఓ రాఘవా! భర్త అధికారమునందు పట్టమహిషి (పెద్దభార్య)గా ఆభరణాది - ఐశ్వర్యలాభములనుగాని, పతియొక్క ఆదరాభిమానములతోగూడిన గొప్ప సుఖములనుగాని ఇంతవఱకును పొందియుండలేదు. ఇక పుత్త్రుడు అధికారములో నుండగానైనను అట్టి కోరికలు తీరవచ్చునను ఆశతో జీవించుచుంటిని. అట్టి నేను రాజునకు పెద్దభార్యను (రాణిని) ఐయుండియు, ఇకమీదట నిరంతరము సూటిపోటి మాటలతో నామనస్సును గాయపఱచునట్టి నాకంటె చిన్నవారైన సవతుల యొక్క పెక్కు పరుషవచనములను వినవలసివచ్చును. సవతులతో మాటలుపడుటకంటె స్త్రీలకు బాధాకరమైనది మఱియొకటి ఏమియుండును? అంతులేని నా ఈ శోకము, విలాపము ఇట్టిది, ఇంతటిది అని చెప్పుటకు శక్యముగాదు. (36-40)

త్వయి సన్నిహితేఽప్యేవమ్ అహమాసం నిరాకృతా।
కిం పునః ప్రోషితే తాత! ధ్రువం మరణమేవ మే। 41

నీవు ఇక్కడ ఉన్నప్పుడే నేను ఇట్టి నిరాదరణకు లోనైతిని. నాయనా! నీవు దూరమైనచో ఇక చెప్పవలసినదియేమి? అప్పుడు నాకు మరణము తథ్యము. (41)

అత్యంతం నిగృహీతాఽస్మి భర్తుర్నిత్యమతంత్రితా।
పరివారేణ కైకేయ్యాః సమా వాఽప్యథవాఽవరా। 42

ఇంతవఱకును నేను భర్తయొక్క గర్హింపులకును, ఉపేక్షలకును మాత్రమే గుఱియైతిని. ఆయన నన్ను కైకేయియొక్క పరిచారికలతో సమానముగనో , వారికంటెను హీనముగనో చూచెను. (42)

యో హి మాం సేవతే కశ్చిత్ అథవాప్యనువర్తతే।
కైకేయ్యాః పుత్రమన్వీక్ష్య స జనో నాభిభాషతే। 43

ఇప్పుడు నన్ను సేవించువారును, నాతో ప్రియముగా మాట్లాడువారును నీవు (ఇటనుండి అడవులకు) వెళ్లిన పిమ్మట, కైకేయి యొక్క పుత్రుని (భరతుని) జూచి, భయపడి వారు నాతో పలుకుటకును జంకుదురు. (43)

నిత్యక్రోధతయా తస్యాః కథం ను ఖరవాది తత్।
కైకేయ్యా వదనం ద్రష్టుం పుత్ర! శక్ష్యామి దుర్గతా। 44

కుమారా! కోపస్వభావముగల కైకేయి ఎల్లప్పుడును పరుషముగా మాటాడుచుండును. అట్టి ఆమెముఖమును నిస్సహాయస్థితిలో నున్న నేను ఎట్లు చూడగలను? (44)

దశ సప్త చ వర్షాణి తవ జాతస్య రాఘవ।
ఆసితాని ప్రకాంక్షంత్యా మయా దుఃఖపరిక్షయమ్। 45

ఓ రాఘవా! నీవు యువరాజువైనచో నాకష్టములు అన్నియు కడతేరునని ఆసించి, నీవు జన్మించినప్పటి (నీ ఉపనయనము జరిగినప్పటి) నుండియు ఈ పదునేడు సంవత్సరములు[1] నిరీక్షించుచువచ్చితిని. (45)

తదక్షయం మహద్దుఃఖం నోత్సహే సహితుం చిరమ్।
విప్రకారం సపత్నీనామ్ ఏవం జీర్ణాఽపి రాఘవ। 46

ఓ రఘునందనా! ఇంతవఱకును సవతులసూటిపోటిమాటల వలనకల్గిన దుఃఖకారణముగ నేను మానసికముగా క్రుంగికృశించి యుంటిని. ఇక చిరకాలము వారితిరస్కారములవలన కలుగు తీవ్రదుఃఖమును నేనెంతమాత్రము భరింపజాలను. (46)

అపశ్యంతీ తవ ముఖం పరిపూర్ణశశిప్రభమ్।
కృపణా వర్తయిష్యామి కథం కృపణజీవికామ్। 47

ఉపవాసైశ్చ యోగైశ్చ బహుభిశ్చ పరిశ్రమైః।
దుఃఖం సంవర్ధితో మోఘం త్వం హి దుర్గతయా మయా। 48

నిండుచంద్రునివలె ఆహ్లాదకరమైన నీముఖశోభను చూడకుండ దీనురాలనై నేను దుఃఖమయమైన జీవితమును ఎట్లుగడుపగలను? బహువ్రతములకోర్చి, ఉపవాసములొనర్చి, దేవతలను ధ్యానించి, ఆరాధించి, నోములునోచి, నిన్నుగని, ప్రేమతో పెంచితిని. నేను దురదృష్టవంతురాలను అగుటవలన నీవు అరణ్యములకు వెళ్లుటతో అవియన్నియును వ్యర్థములే యగుచున్నవి. ఇంక నాకు మిగిలియున్నది తీరనిదుఃఖము మాత్రమే. (47-48)

స్థిరం తు హృదయం మన్యే మమేదం యన్న దీర్యతే।
ప్రావృషీవ మహానద్యాః స్పృష్టం కూలం నవాంభసా। 49

'వర్షాకాలమునందు కుంభవృష్టివలన క్రొత్తనీటితో పొంగిపొరలుచున్న ప్రవాహపువాటికి మహానదీతటములు తెగిపోవును. కాని ఇంతటి దుర్భరమైన దుఃఖవార్తయొక్క ఆటుపోట్లకు గుఱియయ్యును నాహృదయముమాత్రము బ్రద్దలగుటలేదు. కనుక నాగుండె గట్టిది." – అని నేను తలంచుచున్నాను. (49)

మమైవ నూనం మరణం న విద్యతే
న చావకాశోఽస్తి యమక్షయే మమ।
యదంతకోఽద్యైవ న మాం జిహీర్షతి
ప్రసహ్య సింహో రుదతీం మృగీమివ। 50

ప్రాణభీతిచే ఏడ్చుచున్నను లేడిని సింహము బలవంతముగా లాగుకొనిపోవును. కాని యముడు మాత్రము నాప్రాణములను హరించుకొనిపోవుటకు ఇష్టపడుటలేదు. ఏలనన యమలోకమున గూడ నాకు చోటులేదేమో? కనుక నిజముగా నాకు మరణమే లేనట్లున్నది. (50)

1) ద్విజులకు (బ్రాహ్మణక్షత్రియవైశ్యులకు) బ్రహ్మోపదేశకారణముగ ఉపనయనము రెండవజన్మ. విశ్వామిత్రుడు దశరథునికడకు వచ్చునాటికి శ్రీరాముడు ఊనషోడశవర్షప్రాయుడు. అనగా పదునారు సంవత్సరముల లోపు వయస్సువాడు. 'గర్భైకాదశేషు రాజన్యమ్' - అనునది ఉపనయనవిషయమున శాస్త్రోక్తి. అనగా క్షత్రియునకు 'శిశువు తల్లికడుపున పడినది మొదలుకొని పదునొకొండవ సంవత్సరమున ఉపనయనము చేయవలయును. కావున 'శ్రీరామునకు యువరాజపట్టాభిషేకము జరుపవలెను' - అను సంకల్పము (మాతృగర్భస్థకాలమును తగ్గించిన పిమ్మట) ఆయన 27వ ఏట జరిగినది - అనగా ఆయనకు ఉపనయనానంతరము 17 సంవత్సరములకు యువరాజ పట్టాభిషేకమహోత్సవము నిర్వహించుటకు నిర్ణయము జరిగినదన్నమాట. అందువలననే కౌసల్యాదేవి 'దశ సప్త చ వర్షాణి తవ జాతస్య రాఘవ' అని యున్నది.

స్థిరం హి నూనం హృదయం మమాయసం
న భిద్యతే యద్భువి నావదీర్యతే ।
అనేన దుఃఖేన చ దేహమర్పితం
ధ్రువం హ్యకాలే మరణం న విద్యతే ॥ 51

ఇదం తు దుఃఖం యదనర్థకాని మే
వ్రతాని దానాని చ సంయమాశ్చ హి ।
తపశ్చ తప్తం యదపత్యకారణాత్
సునిష్ఫలం బీజమివోప్తమూషరే ॥ 52

యది హ్యకాలే మరణం స్వయేచ్ఛయా
లభేత కశ్చిద్గురుదుఃఖకర్శితః ।
గతాహమద్యైవ పరేతసంసదం
వినా త్వయా ధేనురివాత్మజేన వై ॥ 53

అథాపి కిం జీవితమద్య మే వృథా
త్వయా వినా చంద్రనిభాననప్రభ! ।
అనువ్రజిష్యామి వనం త్వయైవ గౌః
సుదుర్బలా వత్సమివానుకాంక్షయా ॥ 54

భృశమసుఖమమర్షితా తదా
బహు విలలాప సమీక్ష్య రాఘవమ్ ।
వ్యసనముపనిశామ్య సా మహత్
సుతమివ బద్ధమవేక్ష్య కిన్నరీ ॥ 55

మర్త్యురమైన ఇంతటి కష్టము వచ్చిపడినను నాహృదయము పగిలిపోవుటలేదు. నేలపై పడిగూడ నాశరీరము ముక్కలు కాలేదు. ఆ రెండును ఇనుముతో చేయబడినవే. కనుక నాకు అకాలమరణములేదనుట నిశ్చయము. (51)

సంతానప్రాప్తికై నేను నోచిన నోములు, చేసిన దానములు, ఒనర్చిన ధ్యానాదులు, ఆచరించిన తపస్సులు, ఈ సంఘటన కారణముగా చవిటినేలలో నాటిన విత్తనములవలె నిష్ఫలములైనవి. దూడకు దూరమైనగోవువలె నీకు దూరమైనచో (నీయెడబాటునకు గురియైనచో) నేను జీవింపజాలను. తీవ్రమైన దుఃఖముల తాకిడికి తట్టుకొనలేని స్థితిలో ఉన్నవాడెవ్వడైను స్వేచ్ఛగా అకాల మరణమును పొందగల్గినచో నేనును యమలోకమున (మృత్యుముఖమున) చేరియుండెడిదానను. (52-53)

చంద్రునివంటి ముఖకాంతులుగల ఓ కుమారా! స్వేచ్ఛా (అకాల) మరణము నాకు అసంభవము అనప్పుడు ఇక నీకు దూరమై (నీయెడబాటునకులోనై) నేను జీవించుటయే వ్యర్థం. కావున వాత్సల్య కారణముగా విడిచిఉండలేని (ధైర్యము సడలిన) గోవు లేగనువలె, నేనును నిన్ననుసరించి, వనములకు వచ్చెదను." (54)

కౌసల్యాదేవి సత్యప్రతిజ్ఞుడైన (ఇచ్చినమాటతప్పని) శ్రీరాముని గూర్చి, (ఒక్కక్షణము) ఆలోచించెను. రాముడు అరణ్యములకు వెళ్ళినచో ఇక్కడ సపత్నులవలన తనకు ఎదురగు దుఃఖ (క్లిష్ట) పరిస్థితులను సమీక్షించెను. పర్యవసానముగా తనకు సంభవింప నున్న ఆ తీవ్రదుఃఖములకు తాను తట్టుకొనలేనని గ్రహించెను. అట్టిస్థితిలో బంధింపబడిన సుతునిజూచి దుఃఖితయైన కిన్నరస్త్రీవలె ఆమె భోరుమనుచు మిక్కిలి విలపించెను. (55)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే వింశస్సర్గః *(20)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదియవసర్గము సమాప్తము

-- * * * --

21. ఇరువదియొకటవసర్గము

'వనములకు వెళ్లవలదు' - అని లక్ష్మణుడును, కౌసల్యాదేవియు శ్రీరాముని ఒత్తిడిచేయుట - 'పితృవాక్య పరిపాలనము పరమధర్మము' అని శ్రీరాముడు వారికి నచ్చజెప్పి, తాను వనములకు వెళ్లుటకే నిశ్చయించుకొనుట.

తథా తు విలపంతీం తాం కౌసల్యాం రామమాతరమ్।
ఉవాచ లక్ష్మణో దీనః తత్కాలసదృశం వచః। 1

న రోచతే మమాప్యేతత్ ఆర్యే! యద్రాఘవో వనమ్।
త్యక్త్వా రాజ్యశ్రియం గచ్ఛేత్ స్త్రియా వాక్యవశంగతః। 2

శ్రీరామజననియైన ఆ కౌసల్యాదేవి ఆ విధముగా పరితపించు చుండగా లక్ష్మణుడు దైన్యముతో సముయోచితముగా ఇట్లు పలికెను. (1)

"ఓ పూజ్యురాలా! అమ్మా! ఒక కుటిలాత్మురాలియొక్క మాటలలో చిక్కుకొని, రఘువరుడు రాజ్యాధికారమును త్యజించి, 'వనములకు వెళ్లుట' నాకును సమ్మతముకాదు. మహారాజ

విపరీతశ్చ వృద్ధశ్చ విషయైశ్చ ప్రధర్షితః।
నృపః కిమివ న బ్రూయాత్ చోద్యమానః సమన్మథః। 3

నాస్యాపరాధం పశ్యామి నాపి దోషం తథావిధమ్।
యేన నిర్వాస్యతే రాష్ట్రాత్ వనవాసాయ రాఘవః। 4

న తం పశ్యామ్యహం లోకే పరోక్షమపి యో నరః।
స్వమిత్రోఽపి నిరస్తోఽపి యోఽస్య దోషముదాహరేత్। 5

దేవకల్పమ్ ఋజుం దాంతం రిపూణామపి వత్సలమ్।
అవేక్షమాణః కో ధర్మం త్యజేత్ పుత్రమకారణాత్। 6

తదిదం వచనం రాజ్ఞః పునర్బాల్య ముపేయుషః।
పుత్రః కో హృదయే కుర్యాత్ రాజవృత్తమనుస్మరన్। 7

యావదేవ న జానాతి కశ్చిదర్థమిమం నరః।
తావదేవ మయా సార్ధమ్ ఆత్మస్థం కురు శాసనమ్। 8

మయా పార్శ్వే సధనుషా తవ గుప్తస్య రాఘవ!।
కస్సమర్థోఽధికం కర్తుం కృతాంతస్యేవ తిష్ఠతః। 9

నిర్మనుష్యామిమాం కృత్స్నామ్ అయోధ్యాం మనుజర్షభ!।
కరిష్యామి శరైస్తీక్ష్ణైః యది స్థాస్యతి విప్రియే। 10

భరతస్యాథ పక్ష్యో వా యో వాఽస్య హితమిచ్ఛతి।
సర్వానేతాన్ వధిష్యామి మృదుర్హి పరిభూయతే। 11

ప్రోత్సాహితోఽయం కైకేయ్యా స దుష్టో యది నః పితా।
అమిత్రభూతో నిస్సంగం వధ్యతాం బధ్యతామపి। 12

గురోరప్యవలిప్తస్య కార్యాకార్యమ్ అజానతః।
ఉత్పథం ప్రతిపన్నస్య కార్యం భవతి శాసనమ్। 13

బలమేష కిమాశ్రిత్య హేతుం వా పురుషర్షభ!।
దాతుమిచ్ఛతి కైకేయ్యై రాజ్యం స్థితమిదం తవ। 14

త్వయా చైవ మయా చైవ కృత్వా వైరమనుత్తమమ్।
కాఽస్య శక్తిః శ్రియం దాతుం భరతాయారిశాసన। 15

వృద్ధుడు, పైగా విషయలోలుడై కామవికారములకు లోనైయున్నవాడు. అందువలన బుద్ధివైపరీత్యమునకు గురియైనాడు. ఈ స్థితిలో కైకేయి దుర్బోధలకు వశుడైయున్న ఆ మహారాజు ఇంతకంటె ఏమి మాట్లాడగలడు? శ్రీరాముడు ఈ రాజ్యమునుండి వనములకు పంపబడుటకుగల కారణమేదియు నాకు కనబడుటలేదు. అతడెట్టి రాజద్రోహమునకును ఒడిగట్టలేదు, ఎట్టిఅపరాధమునూ చేయలేదు. రామునియెడ శత్రుభావముగలవానినిగాని, రామునిచే నిరాదరింప (తప్పుచేయుటచే శిక్షింప) బడినవానినిగాని, ఈలోకమున ఎవ్వడైనను 'ఆయనచేసిన దోషము ఇది' అని రామునిపరోక్షమునసైతము పల్కినవానినిగాని నేను ఇంతవఱకును చూడలేదు. (2-5)

శ్రీరాముడు దైవతుల్యుడు, త్రికరణశుద్ధిగలవాడు, (ఋజువర్తనుడు) ఇంద్రియనిగ్రహముగలవాడు, శత్రువులకును ప్రియుమైనవాడు, ధర్మమూర్తి, ధర్మబుద్ధి గలవాడెవ్వడైనను ఇట్టి గుణవంతుడైన పుత్రుని నిష్కారణముగా త్యజించునా? (6)

మఱల బాల్యమును పొందినవానివలె వివక్షణాజ్ఞానము లేనట్టి రాజుయొక్క ఈ మాటను రాజనీతినెఱిగిన ఏ కుమారుడు పాటించును?" (7)

(పిదప లక్ష్మణుడు శ్రీరామునితో ఇట్లనెను) "ఓ రఘునందనా! ఈ వనవాసవిషయము ఎవ్వరికిని తెలియక ముందే (లోకమున పొక్కకమునుపే) నా సహాయముతో ఈ రాజ్యాధికారమును చేజిక్కించుకొనుము. అన్నా! ధనుర్ధారినై నేను నీ ప్రక్కన నిలిచి, నీకు అండగా ఉండగా, యుద్ధసన్నద్ధుడవై మహాకాలునివలె స్థిరముగా నున్న నిన్ను ఎదిరింపగలవాడెవ్వడు? ఓ నరశ్రేష్ఠా! రామా! మనకు వ్యతిరేకముగా ఎవ్వరైనను అడ్డువచ్చినచో నా వాడిబాణములచే ఈ అయోధ్యను పూర్తిగా నిర్మానుష్యమొనర్చెదను. (8-10)

ఈ విషయమున భరతునిపక్షమువహించువారిని లేక అతని హితముగోరువారిని - అందఱిని మట్టుపెట్టెదను. ఏలనన మెత్తని వారిని అందఱును మొత్తుదురుగదా![1] (11)

కైకేయి ప్రేరణకారణముగా మనతండ్రి దుష్టుడై, మనకు శత్రువైనచో అతనిపై మమకారము వీడి (తండ్రియని చూడక) ఆయనను చంపుటగాని, కనీసము బంధించుటగాని చేయవలెను. తండ్రియే (గురువే) యైనను గర్వితుడై యుక్తాయుక్త వివక్షణను కోల్పోయి, పెడదారి పట్టినప్పుడు అతనిని శాసించియే తీరవలెను.(12-13)

ఓ నరోత్తమా! రామా! నీకుచెందిన ఈ రాజ్యమును రాజు ఏవరిబలమును జూచుకొని, ఏ కారణముగా కైకేయికి కట్టబెట్ట జూచుచున్నాడు? (14)

ఓ అరిసూదనా! నీతోడను, నాతోడను ఇంతటి తీవ్రవైరమును బూని, భరతునకు రాజ్యమును అప్పగించుటకు ఈయనకు ఎన్ని గుండెలు?" (15)

1) శ్రీరామునిపైగల ప్రేమకారణముగా లక్ష్మణుడు ఆవేశపూరితుడై ఇట్లు పల్కెను. అంతేగాని ఆయన మాట్లాడవలసినతీరు తెలియనివాడై గాదు, ధర్మమును ఎఱుగనివాడూగాదు. తండ్రిపైనను, భరతునియెడలను అదరాభిమానములేనివాడూగాదు.

అనురక్తోఽస్మి భావేన భ్రాతరం దేవి! తత్త్వతః।
సత్యేన ధనుషా చైవ దత్తేనేష్టేన తే శపే। 16

(పిదప లక్ష్మణుడు కౌసల్యతో ఇట్లనుడివెను.) "ఓ తల్లీ! అన్నయగు శ్రీరామునియెడ నిజముగా నాకు గల ప్రేమ అపారము. అతడు నాకు ప్రాణతుల్యుడు. నా ధనుస్సుపైనను, దాన ధర్మములు, దైవసేవలు మొదలగు పవిత్ర కార్యములమీదను 'ఒట్టుపెట్టుకొని' చెప్పుచున్నాను. (16)

దీప్తమగ్నిమరణ్యం వా యది రామః ప్రవేక్ష్యతి।
ప్రవిష్టం తత్ర మాం దేవి! త్వం పూర్వమవధారయ। 17

అమ్మా! ప్రజ్వరిల్లుచున్న అగ్నిలోగాని, మహారణ్యములోగాని ప్రవేశించుటకు శ్రీరాముడు సిద్ధమైనచో అతనికంటె ముందుగనే అందు నేనుందును. ఈ మాట ముమ్మాటికిని నిజమని నమ్ముము. (17)

హరామి వీర్యాద్దుఃఖం తే తమస్సూర్య ఇవోదితః।
దేవీ పశ్యతు మే వీర్యం రాఘవశ్చైవ పశ్యతు। 18

ఓ జననీ! ఉదయించుచున్న సూర్యుడు చీకట్లను రూపుమాపునట్లు నేను నా శక్తిసామర్థ్యములతో నీ దుఃఖమును తొలగింతును. నీవును, శ్రీరాముడును నా పరాక్రమమును చూతురుగాక." (18)

ఏతత్తు వచనం శ్రుత్వా లక్ష్మణస్య మహాత్మనః।
ఉవాచ రామం కౌసల్యా రుదంతీ శోకలాలసా। 19

మహాత్ముడును, రామభక్తితత్పరుడునైన లక్ష్మణుడు పలికిన ఈ మాటలను వినిన పిమ్మట కౌసల్యాదేవి అంతులేని శోకముతో ఏడ్చుచు శ్రీరామునితో ఇట్లనెను. (19)

భ్రాతుస్తే వదతః పుత్ర! లక్ష్మణస్య శ్రుతం త్వయా।
యదత్రానంతరం కార్యం కురుష్వ యది రోచతే। 20

"కుమారా! నీతమ్ముడైన లక్ష్మణుడు పలికిన మాటలను అన్నింటిని నీవును వింటివిగదా! ఇక అనంతరకార్యమును నీయిష్టానుసారముగా నడిపింపుము. (20)

న చాధర్మ్యం వచః శ్రుత్వా సపత్న్యా మమ భాషితమ్।
విహాయ శోకసంతప్తాం గంతుమర్హసి మామితః। 21

నాయనా! నాసవతియగు కైకేయి పలికిన అధర్మవచనములను విని, శోకమున మునిగియున్న నన్ను ఇచట విడిచి, నీవు (అరణ్యములకు) వెళ్లుట యుక్తముగాదు. (21)

ధర్మజ్ఞ! యది ధర్మిష్ఠో ధర్మం చరితుమిచ్ఛసి।
శుశ్రూష మామిహస్థస్త్వం చర ధర్మమనుత్తమమ్। 22

కుమారా! నీవు ధర్మములను బాగుగా ఎఱిగినవాడవు. ధర్మమూర్తివి. నీవు ధర్మమును ఆచరింపదలచినచో ఇచటనే యుండి నన్ను సేవింపుము. ఆ విధముగా మాతృసేవారూపమున[1] ఉత్తమ ధర్మమును ఆచరింపుము. (22)

శుశ్రూషుర్జననీం పుత్ర! స్వగృహే నియతో వసన్।
పరేణ తపసా యుక్తః కాశ్యపస్త్రిదివం గతః। 23

నాయనా! కశ్యపునిపుత్రులలో ఒకడు ఇంటనేయుండి, నియమనిష్ఠాజీవనుడై, 'మాతృసేవ' యనెడి మహాతపస్సును జేసి, తత్ఫలితముగా సద్గతినిపొందెను. (23)

యథైవ రాజా పూజ్యస్తే గౌరవేణ తథాహ్యహమ్।
త్వాం నాహమనుజానామి న గంతవ్యమితో వనమ్। 24

మహారాజు గౌరవపూర్వకముగా నీకు పూజ్యుడైనట్లే నీ తల్లినైన నేనును నీకు పూజ్యురాలను. నీ వనవాసమునకు నేను అనుమతింపను. కనుక నీవు వనములకు వెళ్లరాదు. (24)

త్వద్వియోగాన్న మే కార్యం జీవితేన సుఖేన వా।
త్వయా సహ మమ శ్రేయః తృణానామపి భక్షణమ్। 25

రామా! నీవు నా కనులయెదుట లేనప్పుడు నాకు సుఖమెక్కడిది? ఆ స్థితిలో నేను జీవించియుండవలసిన పనియేమి? నీతోగూడి నేనును వనములలో కందమూలములను భక్షించుచు కాలము గడుపుటయే నాకు మేలు. (25)

యది త్వం యాస్యసి వనం త్యక్త్వా మాం శోకలాలసాం।
అహం ప్రాయమిహాసిష్యే న హి శక్ష్యామి జీవితుమ్। 26

శోకముతో కుమిలిపోవుచున్న నన్ను విడిచి, నీవు వనములకు వెళ్లినచో నేను ప్రాయోపవేశము చేసెదను. ఏలనన నీవిచట లేనిచో నేను జీవించియుండజాలను. (26)

1) 'పిత్రోర్మాతా గరీయసీ' - లోకములో అందఱికంటెను తల్లియే పూజ్యురాలు.

తత స్త్వం ప్రాప్స్యసే పుత్త్ర! నిరయం లోకవిశ్రుతమ్।
బ్రహ్మహత్యామివాధర్మాత్ సముద్రస్సరితాం పతిః। 27

విలపంతీం తథా దీనాం కౌసల్యాం జననీం తతః।
ఉవాచ రామో ధర్మాత్మా వచనం ధర్మసంహితమ్। 28

నాస్తి శక్తిః పితుర్వాక్యం సమతిక్రమితుం మమ।
ప్రసాదయే త్వాం శిరసా గంతుమిచ్ఛామ్యహం వనమ్। 29

ఋషిణా చ పితుర్వాక్యం కుర్వతా వ్రతచారిణా।
గౌర్హతా జానతా ధర్మం కండునాఽపి విపశ్చితా। 30

అస్మాకం చ కులే పూర్వం సగరస్యాజ్ఞయా పితుః।
ఖనద్భిః సాగరైర్భూమిమ్ అవాప్తః సుమహాన్ వధః। 31

జామదగ్న్యేన రామేణ రేణుకా జననీ స్వయమ్।
కృత్తా పరశునాఽరణ్యే పితుర్వచనకారిణా। 32

ఏతైరన్యైశ్చ బహుభిః దేవి! దేవసమైః కృతమ్।
పితుర్వచనమక్లీబం కరిష్యామి పితుర్హితమ్। 33

న ఖల్వేతన్మయైకేన క్రియతే పితృశాసనమ్।
ఏతైరపి కృతం దేవి! యే మయా తవ కీర్తితాః। 34

నాహం ధర్మమపూర్వం తే ప్రతికూలం ప్రవర్తయే।
పూర్వైరయమభిప్రేతో గతో మార్గోఽనుగమ్యతే। 35

తదేతత్తు మయా కార్యం క్రియతే భువి నాన్యథా।
పితుర్హి వచనం కుర్వన్ న కశ్చిన్నామ హీయతే। 36

కుమారా! తల్లికి దుఃఖము కలిగించుటద్వారా అధర్మమును ఆచరించి, నదీనాథుడైన సముద్రుడు లోకప్రసిద్ధమైన బ్రహ్మహత్య వలన కలుగు నరకయాతనకు గుఱియయ్యెను.[1] నీవును నన్ను దుఃఖములపాలు చేసి అరణ్యములకు వెళ్ళినచో సముద్రునివలె నీకును దుఃఖములు సంభవించును." (27)

ఆ విధముగా కౌసల్యామాత దైన్యముతో విలపించుచుండగా ధర్మాత్ముడైన శ్రీరాముడు ధర్మబద్ధముగా ఆమెతో ఇట్లు నుడివెను. (28)

"అమ్మా! తండ్రి ఆజ్ఞను జవదాటుటకు నేను అశక్తుడను. శిరసా నీకు ప్రణమిల్లుచున్నాను. నేను వనములకు వెళ్ళుటకే సిద్ధముగా ఉన్నాను. దయతో అనుమతింపుము. 'కండుడు' అను మహర్షి గొప్పవిద్వాంసుడు, వ్రతదీక్షాదక్షుడు. ధర్మ రహస్యములను బాగుగా ఎఱిగినవాడు. ఐనను తండ్రియాజ్ఞను తలదాల్చి గోహత్యను గావించెను. (నా వనవాసము తండ్రి యాజ్ఞగదా!) (29-30)

పూర్వము మనవంశమునకే చెందిన సగరునిపుత్త్రులైన సాగరులు తమతండ్రిఆనతిని అనుసరించి భూమిని త్రవ్వుచు మృత్యువుపాలైరి. (శిరోధార్యమైన తండ్రియాజ్ఞను పాటించుటకై వారు ప్రాణములను ఆహుతియొనర్చిన పుణ్యమూర్తులు) (31)

జమదగ్నికుమారుడైన పరశురాముడు తండ్రియానతి మేరకు తనతల్లియైన రేణుకాదేవిశిరమును అరణ్యమునందు స్వయముగా గండ్రగొడ్డలితో ఖండించెను (నఱికివేసెను) అంతేగాదు వీరవలెనే దైవతుల్యులైన (ధర్మజ్ఞులైన) తదితరులు పెక్కుమంది తండ్రులఆజ్ఞలను అనుసరించి నడుచుకొనిరి. పితరాజ్ఞ కాదనరానిది. కావున మా పితృపాదుల తృప్తికై (హితమునకై) నేను వనములకేగెదను. (32-33)

అమ్మా! తండ్రియాజ్ఞ యెట్టిదైనను దానిని పరిపాలించు వారిలో కేవలము నేనొక్కడను మాత్రమేగాదు, నేను పేర్కొనిన ఈ మహాత్ములందఱును గలరు. (34)

తల్లీ! నేను అనుసరించుచున్న ఈ పద్ధతి పూర్వులు ఆచరింపనిదియూ గాదు, పూర్వాచారమునకు విరుద్ధమూగాదు. ఏమాటను కాదనుటయూగాదు-ధర్మాత్ములైన ప్రాచీనులందఱును దీనిని అంగీకరించిరి. వారిమార్గమునే నేనును అనుసరించు చున్నాను. (35)

జననీ! ఈ లోకమున ప్రతివ్యక్తియు పితృవాక్యపరిపాలన చేసియేతీరవలెను. అందులకు విరుద్ధముగా నేనేమియును చేయుటలేదు. తండ్రిమాటను శిరసావహించిన వాడెవ్వడును ధర్మమునుండి పతనము కాడు." (36)

1) ఒకానొక కల్పమునందు సముద్రుడు తనతల్లిని దుఃఖములపాలుచేసెను. ఆతడు ఈ అధర్మకార్యము ఆచరించినందువలన 'పిప్పలాదుడు' - అను మహర్షి సముద్రుని శిక్షించుటకై అతనిపై ఒక 'కృత్య'ను ప్రయోగించెను. దానివలన సముద్రుడు నరకయాతనలను అనుభవించవలసి వచ్చెను.

తామేవముక్త్వా జననీం లక్ష్మణం పునరబ్రవీత్ ।
వాక్యం వాక్యవిదాం శ్రేష్ఠః శ్రేష్ఠః సర్వధనుష్మతామ్ । 37

తవ లక్ష్మణ! జానామి మయి స్నేహమనుత్తమమ్ ।
విక్రమం చైవ సత్త్వం చ తేజశ్చ సుదురాసదమ్ । 38

మమ మాతుర్మహద్దుఃఖమ్ అతులం శుభలక్షణ! ।
అభిప్రాయమవిజ్ఞాయ సత్యస్య చ శమస్య చ । 39

ధర్మో హి పరమో లోకే ధర్మే సత్యం ప్రతిష్ఠితమ్ ।
ధర్మసంశ్రితమేతచ్చ పితుర్వచనముత్తమమ్ । 40

సంశ్రుత్య చ పితుర్వాక్యం మాతుర్వా బ్రాహ్మణస్య వా ।
న కర్తవ్యం వృథా వీర! ధర్మమాశ్రిత్య తిష్ఠతా । 41

సోఽహం న శక్ష్యామి పితుః నియోగమతివర్తితుమ్ ।
పితుర్హి వచనాద్వీర! కైకేయ్యాఽహం ప్రచోదితః । 42

తదేతాం విసృజానార్యాం క్షత్రధర్మాశ్రితాం మతిమ్ ।
ధర్మమాశ్రయ మా తైక్ష్ణ్యం మద్బుద్ధిరనుగమ్యతామ్ । 43

తమేవముక్త్వా సౌహార్దాత్ భ్రాతరం లక్ష్మణాగ్రజః ।
ఉవాచ భూయః కౌసల్యాం ప్రాంజలిః శిరసా నతః । 44

అనుమన్యస్వ మాం దేవి! గమిష్యంతమితో వనమ్ ।
శాపితాఽసి మమ ప్రాణైః కురు స్వస్త్యయనాని మే । 45

తీర్ణప్రతిజ్ఞశ్చ వనాత్ పునరేష్యామ్యహం పురీమ్ ।
యయాతిరివ రాజర్షిః పురా హిత్వా పునర్దివమ్ । 46

శోకః సంధార్యతాం మాతః హృదయే సాధు మా శుచః ।
వనవాసాదిహైష్యామి పునః కృత్వా పితుర్వచః । 47

త్వయా మయా చ వైదేహ్యా లక్ష్మణేన సుమిత్రయా ।
పితుర్నియోగే స్థాతవ్యమ్ ఏష ధర్మః సనాతనః । 48

ధనుర్ధారులందరిలో అగ్రేసరుడును, సముచితముగా మాట్లాడుటలో కుశలుడును ఐన శ్రీరాముడు తన తల్లితో ఇట్లు నుడివిన పిమ్మట లక్ష్మణునితో ఈ విధముగా పలికెను. (37)

"నాయనా! లక్ష్మణా! నాపై నీకు గల ప్రేమ అపారము. నీ బలపరాక్రమములు నిరుపమానములు. నీ తేజస్సు తిరుగులేనిది. వీటన్నింటినీ నేను ఎఱుగుదును. శుభలక్షణములుగల ఓ సోదరా! నామీది ప్రేమకారణముగా మాతృమూర్తి నా సత్యనిష్ఠను, చిత్తస్థైర్యమును విస్మరించి, ఆమె అంతులేనిదుఃఖమునకు లోనగు చున్నది. కాని వాటినన్నింటిని ఎఱింగియు నీవును ఇట్లు పలుకుచుంటివేల? (38-39)

లోకమున పురుషార్థములలో ధర్మము అగ్రగణ్యము (ప్రధానము) సత్యమునకు ధర్మమే ఆధారము. అత్యుత్తమమైన ఈ పితృాజ్ఞ ధర్మసమ్మతమైనది. (40)

ధర్మనిరతుడైనవాడెవ్వడైనను తండ్రి, తల్లి, బ్రాహ్మణుడు ఆదేశించిన పిమ్మట వారిఆదేశమును పాటించియే తీరవలెను. (41)

ధర్మబద్ధుడనైన నేను తండ్రియాజ్ఞను జవదాటజాలను. ఓ వీరా! మనతండ్రి చేసిన వాగ్దానమును అనుసరించియే కైకేయి నాకు వనవాసమును విధించినది. ధర్మమునకు విరుద్ధమైన దుష్ట రాజనీతిని ("తండ్రిని వధించియైనను రాజ్యాధికారమును పొందవలెను"-అను క్రూరమార్గమును) వీడుము. తీవ్రతను మాని ధర్మమును ఆశ్రయింపుము. నేను చెప్పిన ధర్మమార్గమును గ్రహింపుము." (42-43)

శ్రీరాముడు తమ్ముడైన లక్ష్మణునితో వాత్సల్యపూర్వకముగా ఇట్లు వచించిన పిమ్మట అతడు కౌసల్యామాతకు శిరసువంచి ప్రణమిల్లి, అంజలి ఘటించి మరల ఇట్లు నుడివెను. (44)

"తల్లీ! నాప్రాణములపై ఆన. నేను వనములకు వెళ్ళుట తథ్యము. అందులకు నన్ను అనుమతింపుము. నాకు శుభాశీస్సులను ప్రసాదింపుము. (45)

యయాతి స్వర్గమును వీడి, మరల స్వర్గమును జేరినట్లు నా ప్రతిజ్ఞను నెఱవేర్చుకొని, (పదునాలుగు సంవత్సరముల పాటు వనవాసమును ముగించుకొని) నేను తిరిగి అయోధ్యకు వచ్చెదను. (46)

ఓ జననీ! నీ హృదయమునుండి శోకమును పూర్తిగా తొలగింపుము. (శోకమును త్యజించి నిగ్రహముతోనుండుము.) ఇక ఏ మాత్రము దుఃఖింపకుము. ఏలనన తండ్రి ఆజ్ఞానుసారము వనవాసమును ముగించుకొని, అచటినుండి మరల నేను అయోధ్యకు వచ్చెదను. (47)

తల్లీ! నీవును, నేనును, వైదేహియు, లక్ష్మణుడును, తల్లి సుమిత్రాదేవియు తండ్రిగారి ఆజ్ఞను తలదాల్చవలసినవారమే. 'ఇదియే సనాతన ధర్మము'. (48)

అంబ! సంహృత్య సంభారాన్ దుఃఖం హృది నిగృహ్య చ।
వనవాసకృతా బుద్ధిః మమ ధర్మ్యాఽనువర్త్యతామ్॥ 49

ఏతద్వచస్తస్య నిశమ్య మాతా
సుధర్మ్యమవ్యగ్రమవిక్లబం చ ।
మృతేవ సంజ్ఞాం ప్రతిలభ్య దేవీ
సమీక్ష్య రామం పునరిత్యువాచ ॥ 50

అమ్మా! అభిషేకద్రవ్యములను దూరమునర్చుము. హృదయము నందలి దుఃఖమును నిగ్రహించుకొనుము. ధర్మసమ్మతమైన నా వనవాసనిశ్చయమును ఆమోదింపుము. నన్ను ఆశీర్వదింపుము." రాముడు ఏమాత్రము వ్యాకులపాటులేక, దృఢనిశ్చయముతో ధర్మసమ్మతముగా పలుకగా, అతని వచనములను సావధానముగా వినిన పిమ్మట కౌసల్యామాత పూర్తిగా స్పృహలోనికి వచ్చెను. అప్పుడామె రామునివైపు చూచి అతనితో మరల ఇట్లు వచించెను. (49-50)

యథైవ తే పుత్త్ర! పితా తథాఽహం
గురుస్స్వధర్మేణ సుహృత్తయా చ ।
న త్వాఽనుజానామి న మాం విహాయ
సుదుఃఖితామర్హసి గంతుమేవమ్ ॥ 51

"కుమారా! స్వధర్మమునుబట్టియు, సౌహార్దమును (ప్రేమాదరములను) అనుసరించియు నీకు నీ తండ్రివలె నేనును ఆదరణీయురాలను. నీ వనవాసగమనమునకు నేను అనుమతింపను. దుఃఖమున మునిగి యున్న నన్ను ఈ విధముగా వదలివెళ్ళుట నీకు తగదు. (51)

కిం జీవితేనేహ వినా త్వయా మే
లోకేన వా కిం స్వధయాఽమృతేన ।
శ్రేయో ముహూర్తం తవ సన్నిధానం
మమేహ కృత్స్నాదపి జీవలోకాత్ ॥ 52

నాయనా! శ్రీరామా! నీవు నా యెదుట లేనప్పుడు నాకు ఈ జీవితముతో గాని, స్వజనులతోగాని ఏమి ప్రయోజనము? పితృలోకమున ప్రాప్తించు స్వధతోగాని, స్వర్గప్రాప్తివలన లభించు అమృతముతోగాని ఏమి లాభము? (ఇహపరలోకసౌఖ్యములతో నాకు పనిలేదు) సమస్తప్రాణికోటివలనను, రాజ్యసంపదలచేత లభించు సర్వసుఖములకంటెను క్షణకాలమైనను నీవు నా కడ నుండుట మిక్కిలి ఆనందదాయకము." (52)

నరైరివోల్కాభిరపోహ్యమానో
మహాగజోఽధ్వానమనుప్రవిష్టః ।
భూయః ప్రజజ్వాల విలాపమేనం
నిశమ్య రామః కరుణం జనన్యాః ॥ 53

కారడవులలో వేటగాండ్రు తమ సాధనములతో అడ్డగించు చున్నను ఒక మహాగజము తాను వెళ్ళుచున్నమార్గమును విడువక పురోగమించుచున్నట్లు, శ్రీరాముడు తల్లియొక్క కరుణాపూరిత విలాపవచనములను వినియు, తనదృఢసంకల్పమును ఏమాత్రము వీడలేదు. (53)

స మాతరం చైవ విసంజ్ఞకల్పామ్
ఆర్తం చ సౌమిత్రిమభిప్రతప్తమ్ ।
ధర్మే స్థితో ధర్మ్యమువాచ వాక్యం
యథా స ఏవార్హతి తత్ర వక్తుమ్ ॥ 54

ధర్మనిష్ఠాపరుడైన ఆ రాముడు నిస్పృహాకులయైయున్న తల్లి తోడను, ఆర్తితో మిక్కిలి పరితపించుచున్న లక్ష్మణునితోడను ఇట్లు ధర్మవచనములను పలికెను. ఆ పలికినతీరు స్థితప్రజ్ఞుడైన శ్రీరామునకే చెల్లును. (54)

అహం హి తే లక్ష్మణ! నిత్యమేవ
జానామి భక్తించ పరాక్రమం చ ।
మమ త్వభిప్రాయమసన్నిరీక్ష్య
మాత్రా సహాభ్యర్దసి మాం సుదుఃఖమ్ ॥ 55

"ఓ లక్ష్మణా! అనుక్షణము నీవు నాయెడ కలిగియుండు భక్తిప్రపత్తులను, నీ పరాక్రమమును నేను ఎఱుగుదును. నా అభిప్రాయమును (నా మాటల అంతరార్థమును) సరిగా గ్రహింపక నీవును (నా) తల్లివలె నాకు ఎందుకు వ్యథ కల్గించుచున్నావు? (55)

ధర్మార్థకామాః ఖలు తాత! లోకే
సమీక్షితా ధర్మఫలోదయేషు ।
తే తత్ర సర్వే స్యురసంశయం మే
భార్యేవ వశ్యాఽభిమతా సుపుత్త్రా ॥ 56

నాయనా! లక్ష్మణా! ధర్మార్థకామఫలములన్నియును ధర్మమును ఆచరించుటవలననే సిద్ధించును. ఇందు సంశయములేదు. ధర్మము ధర్మపత్నివంటిది. అనుకూలవతియైన భార్యవలన ధర్మార్థకామములు మూడును నెఱవేఱును. ఆమె ధర్మపత్నిగా అతిథిసత్కారములు మొదలగు ధర్మకార్యాచరణములకు తోడ్పడును. ప్రియపత్నిగా ఆయన కోరికలను ఈడేర్చును. పుత్త్రవతియై ఉత్తమలోక ప్రాప్తికి సాధకురాలగును. (56)

యస్మింస్తు సర్వే స్యురసన్నివిష్టా
ధర్మో యతః స్యాత్ తదుపక్రమేత ।
ద్వేష్యో భవత్యర్థపరో హి లోకే
కామాత్మతా ఖల్వపి న ప్రశస్తా । 57

ధర్మార్థకామఫలములు అభిలషణీయములే - కాని అవి ధర్మవిరుద్ధములైనపుడు వాటిని పరిత్యజింపవలెను. కేవలము అర్థపరాయణము (ధనార్జనకై ప్రాకులాడుట) ద్వేషింపదగినది. అట్లే కామాతురత్వము నిందార్హము. కావున ధర్మపరమైన కార్యమునే ఆచరింపవలెను. (57)

గురుశ్చ రాజా చ పితాచ వృద్ధః
క్రోధాత్ ప్రహర్షాద్యది వా౽పి కామాత్ ।
యద్వ్యాదిశేత్ కార్యమవేక్ష్య ధర్మం
కస్తన్న కుర్యాదనృశంసవృత్తిః । 58

మహారాజు మనకంటెను పెద్దవాడు. (జ్ఞానవృద్ధుడు వయోవృద్ధుడు). పైగా అతడు మనకు తండ్రి, అంతేగాదు గురువు గూడ. కావున అతడు మనకు మాన్యుడు. ఆయన క్రోధమువలన గాని, సంతోషాతిరేకముచేగాని, కామప్రవృత్తిచేగాని ఆదేశించిన కార్యము అది ఎట్టిదైనను దానిని మనము ఆచరింపవలసినదే. అట్లు చేయకుండుట అధర్మము, మహాదోషము. (58)

న వై న శక్నోమి పితుః ప్రతిజ్ఞామ్
ఇమామకర్తుం సకలాం యథావత్ ।
స హ్యావయోస్తాత గురుర్నియోగే
దేవ్యాశ్చ భర్తా స గతిస్స ధర్మః । 59

అట్టి నేను (ధర్మాచరణమునకు కట్టుబడిన నేను) 'భరతుని పట్టాభిషేకము, నావనవాసము' అను వరదానరూపమైన తండ్రిగారిప్రతిజ్ఞను అతిక్రమించుటకు అశక్తుడను. అనగా వారి ప్రతిజ్ఞను తప్పక ఆచరింతును. ఆయన నాకును, భరతునకును, కౌసల్యామాతకును (మన అందరికిని) ప్రభువు, గతి. కనుక ఆయనఆజ్ఞ మనకు శిరోధార్యము. (59)

తస్మిన్ పునర్జీవతి ధర్మరాజే
విశేషతః స్వే పథి వర్తమానే ।
దేవీ మయా సార్ధమితో౽పగచ్ఛేత్
కథంస్విదన్యా విధవేవ నారీ । 60

ధర్మాత్ముడైన దశరథమహారాజు జీవించియే యున్నాడు. విశేషించి ఆయన తనధర్మమార్గమున ప్రవర్తించుచున్నాడు. ఇట్టి పరిస్థితిలో భర్తలేని ఒక సాధారణస్త్రీవలె ఆమె నాతోగూడి ఇచటినుండి వనములకు వచ్చుట ఎట్లు సంభవము?" (60)

సా మా౽నుమన్యస్వ వనం వ్రజంతం
కురుష్వ నః స్వస్త్యయనాని దేవి! ।
యథా సమాప్తే పునరావ్రజేయం
యథా హి సత్యేన పునర్యయాతిః । 61

"అమ్మా! సుమంగళివి, పతిసేవాపరాయణవు వగు నీవు నావనగమనమునకు అనుమతింపుము. మాకు శుభాశీస్సులను ఇమ్ము. వనవాసదీక్ష ముగియగనే యయాతి తన సత్యప్రభావముచే మరల స్వర్గమునకు చేరినట్లు నేను అయోధ్యకు రాగలను. (61)

యశో హ్యహం కేవలరాజ్యకారణాత్
న పృష్ఠతః కర్తుమలం మహోదయమ్ ।
అదీర్ఘకాలేన తు దేవి! జీవితే
వృణే౽వరామద్య మహీమధర్మతః । 62

మాతా! కేవలము రాజ్యాధికారముకొఱకు మహాఫలస్వరూపమైన కీర్తిప్రతిష్ఠలను పోగొట్టుకొనజాలను. జీవితము క్షణికము. ధర్మము శాశ్వతము. అందువలన నేడు అధర్మమార్గమున తుచ్ఛమైన ఈ రాజ్యమును నేను కోరను". (62)

ప్రసాదయన్ నరవృషభస్సమాతరం
పరాక్రమాజ్జిగమిషురేవ దండకాన్ ।
అథానుజం భృశమనుశాస్య దర్శనం
చకార తాం హృది జననీం ప్రదక్షిణమ్ । 63

నరశ్రేష్ఠుడైన శ్రీరాముడు దండకారణ్యములకు వెళ్లుటకే నిశ్చయించుకొనినవాడై నిబ్బరముతో తల్లిని ప్రసన్నురాలినిగా జేసికొనుచు, ధర్మస్వరూపమును, దానిరహస్యములను తల్లికిని, లక్ష్మణునకును, విపులముగా వివరించెను. పిదప అతడు తన హృదయమునందే తల్లికి ప్రణతులు చెల్లించెను. (63)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకవింశస్సర్గః (21)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదిఒకటవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

22. ఇరువదిరెండవసర్గము

'యువరాజ పట్టాభిషేకము ఆగిపోవుట - వనవాసము ప్రాప్తించుట - అనునవి దైవికములే - ఈ రెండును నాకు సమానములే' అని శ్రీరాముడు లక్ష్మణునితో పల్కుట - మఱియు కైకేయియెడ గౌరవభావమును ప్రకటించుట.

అథ తం వ్యథయా దీనం సవిశేషమమర్షితమ్।
శ్వసంతమివ నాగేంద్రం రోషవిస్ఫారితేక్షణమ్। 1

ఆసాద్య రామః సౌమిత్రిం సుహృదం భ్రాతరం ప్రియమ్।
ఉవాచేదం సధైర్యేణ ధారయన్ సత్త్వమాత్మవాన్। 2

నిగృహ్య రోషం శోకం చ ధైర్యమాశ్రిత్య కేవలమ్।
అవమానం నిరస్యేమం గృహీత్వా హర్షముత్తమమ్। 3

ఉపక్లృప్తం హి యత్కించిత్ అభిషేకార్థమద్య మే।
సర్వం విసర్జయ క్షిప్రం కురు కార్యం నిరత్యయమ్। 4

సౌమిత్రే! యోఽభిషేకార్థే మమ సంభారసంభ్రమః।
అభిషేకనివృత్త్యర్థే సోఽస్తు సంభారసంభ్రమః। 5

యస్యా మదభిషేకార్థే మానసం పరితప్యతే।
మాతా మే సా యథా న స్యాత్ సవిశంకా తథా కురు। 6

తస్యాః శంకామయం దుఃఖం ముహూర్తమపి నోత్సహే।
మనసి ప్రతిసంజాతం సౌమిత్రేఽహముపేక్షితుమ్। 7

న బుద్ధిపూర్వం నాబుద్ధం స్మరామీహ కదాచన।
మాతౄణాం వా పితుర్వాఽహం కృతమల్పం చ విప్రియమ్। 8

సత్యః సత్యాభిసంధశ్చ నిత్యం సత్యపరాక్రమః।
పరలోకభయాద్భీతో నిర్భయోఽస్తు పితా మమ। 9

తస్యాఽపి హి భవేదస్మిన్ కర్మణ్యప్రతిసంహృతే।
సత్యం నేతి మనస్తాపః తస్య తాపస్తపేచ్చ మామ్। 10

శ్రీరాముని యువరాజపట్టాభిషేకమునకు విఘ్నము ఏర్పడిన కారణముగా సౌమిత్రి మానసికవ్యధతో దైన్యము వహించియుండెను. అతడు అసహనముతో ఊగిపోవుచుండెను. మహాసర్పమువలె బుసలుకొట్టుచుండెను. రోషముతో అతనికనులు ఎఱుపెక్కెను. అట్టి లక్ష్మణుని దరిజేరి, మనోనిగ్రహముగల శ్రీరాముడు ధైర్యము వహించి, ఏ విధముగను తొణకక బెణకక, తనకు ప్రేమపాత్రుడైన అనుంగుతమ్మునితో ఇట్లు నుడివెను. (1-2)

"సోదరా! లక్ష్మణా! తండ్రిగారిపైగల రోషమును, నావనగమన కారణముగా నీలో పెల్లుబికిన శోకమును విడనాడుము. ధైర్యమును వహింపుము. జరిగిన సంఘటలను అవమానముగా భావింపకుము. సత్యపరిపాలనతో తండ్రిని తరింపజేయుదుమని సంతోషమును పొందుము. నేడు నా రాజ్యాభిషేకనిమిత్తమై సిద్ధపఱచబడిన సామగ్రిని వెంటనే తొలగింపుము. నా ప్రయాణమునకు ఎట్టి ఆటంకములును లేకుండ చూడుము. (3-4)

నాయనా! సౌమిత్రీ! ఇంతవఱకును రాజ్యాభిషేకనిర్వహణకై సాధనసామగ్రిని సమకూర్చుటలో సాటిలేని ఉత్సాహమును చూపితివి. ఇప్పుడు నా వనగమనమునకై ఏర్పాట్లు చేయుటలోగూడ అట్టియుత్సాహమునే ప్రదర్శింపుము. (5)

సోదరా! నా రాజ్యాభిషేకవిషయమున కైకేయిమాతయొక్క మనస్సులోని పరితాపమును తొలగింపుము. ఆమెలో ఎట్టి సందేహమూ[(1)] విచారమూ లేకుండునట్లు చేయుము. మనస్సులోని శంకలకారణముగా ఆమె దుఃఖపడుటను నేను ఒక్కక్షణముగూడ సహింపలేను. ఉపేక్షింపజాలను. (6-7)

బుద్ధిపూర్వకముగాగాని, తెలియకగాని తల్లులకైనను, తండ్రికైనను ఏ విధముగను ఎప్పుడైనను రవ్వంత అప్రియమును సైతము చేసియెఱుగను. (8)

పరలోకభీతికలవాడైన నాతండ్రి ఆడినమాటతప్పనివాడై, అమోఘపరాక్రమశాలియై, సత్యవచనుడగుటచే నిర్భయముగా జీవించుచుండుగాక. (9)

ఈ పట్టాభిషేకకార్యము ఆగిపోకయున్నచో కైకేయికి తానిచ్చిన వాగ్దానము (తన సత్యప్రతిజ్ఞ) భంగమైనదని దశరథమహారాజునకు మనస్తాపము కలుగును. అదియు పరితాపము నన్ను తపింపజేయును.

1) (i) రాముడు తండ్రి ఇచ్చిన వచనములకు కట్టుబడియుండునో, లేదో! అని కైకేయిమనస్సున శంక-అకారణముగా భరతునియువరాజ పట్టాభిషేకము జరుగునో? జరుగదో? అని ఆమెకు దుఃఖము - 'ఈ శంకాదుఃఖములకు చోటులేకుండా చేయుము' - అని లక్ష్మణునకు రాముని సూచన. (ii) భరతుడు యువరాజైనచో నాగతియేమగునో యని కౌసల్యాదేవిమనస్సులో శంక,-వనవాసమున రాముడు కష్టములు అనుభవింపనున్నందులకును, పుత్రునియెడబాటునకును ఆ తల్లికి దుఃఖము-కౌసల్యకు ఎదురుకానున్న ఆ శంకా కారణముగను దుఃఖములను తొలగింపుమని సౌమిత్రికి శ్రీరాముని హితబోధ.

అభిషేకవిధానం తు తస్మాత్ సంహృత్య లక్ష్మణ! ।
అన్వగేవాహమిచ్ఛామి వనం గంతుమితః పునః । 11

మమ ప్రవ్రాజనాదద్య కృతకృత్యా నృపాత్మజా ।
సుతం భరతమవ్యగ్రమ్ అభిషేచయితా తతః । 12

మయి చీరాజినధరే జటామండలధారిణి ।
గతేఽరణ్యం చ కైకేయ్యా భవిష్యతి మనస్సుఖమ్ । 13

బుద్ధిః ప్రణీతా యేనేయం మనశ్చ సుసమాహితమ్ ।
తం తు నార్హామి సంక్లేష్టుం ప్రవ్రజిష్యామి మా చిరమ్ । 14

కృతాంతస్త్వేవ సౌమిత్రే! ద్రష్టవ్యో మత్ప్రవాసనే ।
రాజ్యస్య చ వితీర్ణస్య పునరేవ నివర్తనే । 15

కైకేయ్యాః ప్రతిపత్తిర్హి కథం స్యాన్మమ పీడనే ।
యది భావో న దైవోఽయం కృతాంతవిహితో భవేత్ । 16

జానాసి హి యథా సౌమ్య న మాతృషు మమాంతరమ్ ।
భూతపూర్వం విశేషో వా తస్యా మయి సుతేఽపి వా । 17

సోఽభిషేకనివృత్త్యర్థైః ప్రవాసార్థైశ్చ దుర్వచైః ।
ఉగ్రైర్వాక్యైరహం తస్యా నాన్యద్దైవాత్ సమర్థయే । 18

కథం ప్రకృతిసంపన్నా రాజపుత్రీ తథాగుణా ।
బ్రూయాత్ సా ప్రాకృతేవ స్త్రీ మత్పీడాం భర్తృసన్నిధౌ । 19

ఓ లక్ష్మణా! అందువలన (పైకారణముల వలన) నా అభిషేక కార్యక్రమమును మానుకొని, వెంటనే ఈ నగరమునుండి వనములకు వెళ్ళవలెనని తలంచుచున్నాను. (10-11)

నేను వనములకు వెళ్ళినచో తన ప్రయత్నమున కృతకృత్యురాలైన కైకేయిదేవి వెంటనే నేడే ఎట్టి తత్తరపాటూ లేకుండా నిశ్చింతగా తనకుమారుడైన భరతుని పట్టాభిషిక్తునిగావించును. (12)

నేను నారచీరలను ధరించి, జటాజూటధారినై వనములకు వెళ్ళగా, ఆమెమనస్సు చల్లబడును. (13)

తండ్రియైన దశరథుడు కైకేయికిచేసిన తనప్రతిజ్ఞకు కట్టుబడి, నా అరణ్యవాసవిషయమున ఎట్టకేలకు ఒక దృఢనిశ్చయమునకు వచ్చెను. మనస్సును స్థిరపఱచుకొనెను. ఈ విషయమున ఆయనను కష్టపెట్టరాదు. కనుక వనములకు వెళ్ళెదను. ఇక ఏమాత్రము ఆలసింపరాదు. (14)

ఓ సౌమిత్రీ! రాజ్యాధికారము నాచేతికి చిక్కినట్లే చిక్కి, జారిపోవుటకును, నా వనవాసప్రాప్తికిని దైవమే కారణము. ఇందు కైకేయిదోషము ఏమాత్రమూ లేదు. ఇది ముమ్మాటికిని విధివిలాసమే. అట్లు కానిచో నన్ను అడవులకు పంపవలెననెడి బుద్ధి ఆమెకు ఎట్లు పుట్టెడిది? (15-16)

ఓ సౌమ్యుడా! తల్లులయెడ నాకుగల ప్రేమాభిమానములలో హెచ్చుతగ్గులు లేవు. నాకు వారందఱును సమానమే. ఇంతవఱకును వారియెడ నాకు ఏమాత్రము భేదబుద్ధిలేదు. అట్లే కైకేయి తల్లి ఇంతకుముందు ఎన్నడును నాపైగాని, తనకుమారుడైన భరతునిపైగాని భేదభావము చూపియెఱుగదు. వీటినన్నింటిని నీవును ఎఱుగుదువు. (17)

నాయువరాజపట్టాభిషేకము ఆగిపోవునట్లుగను, నాకు వనవాసము ప్రాప్తించునట్లుగను, ఆ కైకేయి పలికిన తీవ్రమైన దుర్వచనములు ఆమె బుద్ధిపూర్వకముగా నుడివినవిమాత్రముగావు. అవియన్నియును విధిప్రేరితములు. కనుక వీటన్నింటికిని దైవమే తప్ప మఱివేఱొక కారణము లేదని తలంతును.[1] (18)

కైకేయి మిక్కిలి సాధుస్వభావముగలది, ఉత్తమరాజవంశమున జన్మించినది. వాత్సల్యము మొదలగు సద్గుణములతో విలసిల్లునది. అట్టి ఆ ఉత్తమురాలు ప్రాకృతస్త్రీవలె (దుష్టస్వభావముగలిగి, నీచవంశమున జన్మించిన, గుణహీనయైన ఒక క్షుద్రస్త్రీవలె) ఎట్లు మాట్లాడును? అదియునూ ఇతరులసమక్షమున గాని, ఇతరులద్వారా గాని కాక, పతిసమక్షముననే స్వయముగా, పైగా అత్యంత ప్రేమపాత్రుడనైన నాకు కీడుతలపెట్టుము ఇట్టి అప్రియవచనములను ఎట్లు మాట్లాడును? (19)

1) సుఖస్య దుఃఖస్య న కోఽపి దాతా పరో దదాతీతి కుబుద్ధిరేషా ।
అహం కరోమీతి వృథాభిమానః స్వకర్మసూత్రగ్రథితో హి లోకః ॥ అధ్యాత్మరామాయణము 6 - 6
జనులకు కలిగెడి సుఖదుఃఖములకు ఇతరులు ఎవ్వరును కారకులుకారు. అవి పరులవలన కలుగుచున్నవనుకొనుట సరికాదు. 'జనులకు ఈ సుఖదుఃఖములను కలిగించుచున్నది నేనే.' అని ఎవ్వరైనను విఱ్ఱవీగుట దురహంకారము. తాముచేసికొనిన సుకృత దుష్కృతములవలననే అవి వారికి ప్రాప్తించుచున్నవి.

యదచింత్యం తు తద్దైవం భూతేష్వపి న హన్యతే।
వ్యక్తం మయి చ తస్యాం చ పతితో హి విపర్యయః। 20

విధివిలాసము ఊహించుటకు అలవికానిది. అది మానవులకే గాదు దేవతలకును నివారింపశక్యముగానిది. ఆ విధివైపరీత్యమే నాపైనను, ఆమె మీదను పడినదనుట యుక్తము. తత్ప్రభావమున కైకేయిబుద్ధి మారిపోయినది (నా చేతికి చిక్కిన రాజ్యాధికారము జారిపోయినది.) (20)

కశ్చ దైవేన సౌమిత్రే! యోద్ధుముత్సహతే పుమాన్।
యస్య న గ్రహణం కించిత్ కర్మణోఽన్యత్ర దృశ్యతే। 21

ఓ లక్ష్మణా! విధినిర్ణయముప్రకారము కర్మఫలమును అనుభవించుటతప్ప ఆ విధిని (దైవమును) నిగ్రహించెడి ఉపాయము ఏదియును లేదు. కనుక దైవమును ఎదుర్కొనుటకు ఎవరు సాహసింతురు? (21)

సుఖదుఃఖే భయక్రోధౌ లాభాలాభౌ భవాభవౌ।
యచ్చ కించిత్ తథా భూతం నను దైవస్య కర్మ తత్। 22

సమస్తప్రాణులకు కలిగెడి సుఖదుఃఖములకును, శాంతి క్షోభములకును, లాభనష్టములకును, ఉత్పత్తి వినాశములకును (జననమరణములకును) కారణములను ఊహింపజాలము. ఇవియన్నియును విధినిర్ణయములే. (22)

ఋషయోఽప్యుగ్రతపసో దైవేనాభిప్రపీడితాః।
ఉత్సృజ్య నియమాంస్తీవ్రాన్ భ్రశ్యంతే కామమన్యుభిః। 23

తీవ్రముగా తపమొనరించు ఋషులుసైతము దైవోపహతులై, కామక్రోధములకు లోనై, తమ కఠోరనియమములకు తిలోదకములిచ్చి భ్రష్టులగుదురు. (23)

అసంకల్పితమేవేహ యదకస్మాత్ ప్రవర్తతే।
నివర్త్యారంభమారబ్ధం నను దైవస్య కర్మ తత్। 24

ప్రయత్నపూర్వకముగా ఆరంభించిన కార్యములు ఆగిపోవుట, అనుకొనని విధముగా అకస్మాత్తుగా నూతనసంఘటనలు తటస్థించుట - ఇవియన్నియును దైవనిర్ణయఫలితములే గదా! (24)

ఏతయా తత్త్వయా బుద్ధ్యా సంస్తభ్యాత్మానమాత్మనా।
వ్యాహతేఽప్యభిషేకే మే పరితాపో న విద్యతే। 25

తస్మాదపరితాపః సన్ త్వమప్యనువిధాయ మామ్।
ప్రతిసంహారయ క్షిప్రమ్ ఆభిషేచనికీం క్రియామ్। 26

ఈ విధముగ తాత్త్వికదృష్టితో నా అంతఃకరణమును (మనస్సును) నేను నిగ్రహించుకొనుటవలన నా పట్టాభిషేకము ఆగిపోయినను నాకు ఎట్టి పరితాపమూ కలుగుటలేదు. అందువలన నీవును నావలెనే పరితాపమును త్యజింపుము-పట్టాభిషేకమునకు సంబంధించిన ప్రక్రియనంతయును వెంటనే నిలిపివేయుము. (25-26)

ఏభిరేవ ఘటైః సర్వైః అభిషేచనసంభృతైః।
మమ లక్ష్మణ! తాపస్యే వ్రతస్నానం భవిష్యతి। 27

అథవా కిం మమైతేన రాజద్రవ్యమయేన తు।
ఉద్ధృతం మే స్వయం తోయం వ్రతాదేశం కరిష్యతి। 28

ఓ లక్ష్మణా! పట్టాభిషేకముకొఱకై పూర్ణజలకలశములు ఇచట సిద్ధపఱచబడియున్నవి. అవి నా తపోవ్రత దీక్షాస్నానములకు ఉపయోగపడగలవు. అది సరిగాదు రాజ్యపట్టాభిషేకనిమిత్తమై రాజద్రవ్యముతో సమకూర్చబడిన ఈ కలశజలములతో నాకేమి పని?[1] నేను స్వయముగా బావులనుండి తోడుకొనిన జలములతో నాతపోవ్రతస్నానములను ఆచరించుటయే యుక్తము. (27-28)

మా చ లక్ష్మణ! సంతాపం కార్షీర్లక్ష్మ్యా విపర్యయే।
రాజ్యం వా వనవాసో వా వనవాసో మహోదయః। 29

ఓ సౌమిత్రీ! నాకు రాజ్యలక్ష్మి (రాజ్యాధికారము) దక్కనందులకు నీవు ఏమాత్రమూ పరితపింపవలదు. నాకు రాజ్యాధికారమైనను వనవాసమైనను సమానమే. తఱచిచూచినచో వనవాసమే నాకు మహాఫలము-సంతోషదాయకము (వనములలో రాజ్యపాలనక్లేశములుండవు. మీదుమిక్కిలి ప్రకృతిసౌందర్య దర్శనభాగ్యము అచట లభించును.) (29)

1) 'రాజ్యాభిషేకనిమిత్తమై ఏర్పఱచబడిన కలశజలములతో తాపసవ్రతస్నానములను ఆచరించినను రాజ్యకాంక్షతో శ్రీరాముడు స్నానములను ఆచరించుచున్నాడు' - అను శంక కైకేయికి కలుగవచ్చును. కనుక అట్టి సందేహములకే తావులేకుండ శ్రీరాముడు ఆ జలములతో స్నానము చేయుట మానుకొనెను.

న లక్ష్మణాస్మిన్ ఖలు కర్మవిఘ్నే
మాతా యవీయస్యతిశంకనీయా ।
దైవాభిపన్నా హి వదత్యనిష్టం
జానాసి దైవం చ తథా ప్రభావమ్ । 30

"తమ్ముడా! లక్ష్మణా! నా పట్టాభిషేకము ఆగిపోవుటకు పినతల్లియైన కైకేయియే కారణము-అని తలంపవలదు. విధిప్రేరణవలననే ఆమె అట్లు మాట్లాడినది. దైవశక్తి యెంతటిదో నీవును ఎఱుగుదువుగదా!" (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్వావింశస్సర్గః (22)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదిరెండవసర్గము సమాప్తము

-- ※ ※ ※ --

23. ఇరువదిమూడవసర్గము

శ్రీరామునిపైగల అపారమైన భక్తికారణముగా లక్ష్మణుడు సాహసవచనములను పలుకుట - రాముడు తన దృఢసంకల్పమును వెల్లడించుట.

ఇతి బ్రువతి రామే తు లక్ష్మణోఽధశ్శిరా ముహుః ।
శ్రుత్వా మధ్యం జగామేవ మనసా దుఃఖహర్షయోః । 1

శ్రీరాముడు దైవశక్తిప్రభావమునుగూర్చియు, ధర్మాచరణ ప్రాముఖ్యమును గుఱించియు పదేపదే నొక్కిచెప్పుచుండగా లక్ష్మణుడు నతముఖుడై వినుచు, మనస్సున దుఃఖహర్షములమధ్య నలిగిపోవుచున్నట్లుండెను.[1] (శ్రీరాముడు ధర్మమునకు కట్టుబడియున్నందులకు హర్షము, రాజ్యమును త్యజించుచున్నందులకు దుఃఖము) (1)

తదా తు బద్ధ్వా భ్రుకుటిం భ్రువోర్మధ్యే నరర్షభః ।
నిశశ్వాస మహాసర్పో బిలస్థ ఇవ రోషితః । 2

అప్పుడు దుఃఖహర్షములమధ్య ఊగిసలాటకు గుఱియైన లక్ష్మణస్వామి నొసట బొమముడివైచి, పుట్టలోనున్న మహాసర్పమువలె రోషముతో బుసలుకొట్టసాగెను. (2)

తస్య దుష్ప్రతివీక్షం తద్భ్రుకుటీసహితం తదా ।
బభౌ క్రుద్ధస్య సింహస్య ముఖస్య సదృశం ముఖమ్ । 3

కనుబొమలుముడిచియున్న అతనిముఖము క్రోధముతో రెచ్చిపోయిన సింహముయొక్క ముఖమువలె దుర్నిరీక్ష్యమై (చూడశక్యముగానిదై) యుండెను. (3)

అగ్రహస్తం విధున్వంస్తు హస్తిహస్తమివాత్మనః ।
తిర్యగూర్ధ్వం శరీరే చ పాతయిత్వా శిరోధరామ్ ।
అగ్రాక్ష్ణా వీక్షమాణస్తు తిర్యగ్భ్రాతరమబ్రవీత్ । 4

అప్పుడు లక్ష్మణుడు తనకుడిచేతిని (హస్తాగ్రమును) ఏనుగుతొండమువలె విదల్చుచుండెను. మెడను క్రిందికిని, పైకిని, ప్రక్కలకును త్రిప్పసాగెను. అతడు శ్రీరాముని ఓరగాజూచుచు ఇట్లు పలికెను. (4)

అస్థానే సంభ్రమో యస్య జాతో వై సుమహానయమ్ ।
ధర్మదోషప్రసంగేన లోకస్యానతిశంకయా । 5

"శూరుడైన క్షత్రియులలో శ్రేష్ఠుడవైన ఓ రామా! 'తండ్రి ఆదేశమును అనుసరింపనిచో ధర్మహాని కలుగుననియు, 'అధర్మవర్తనుడు రాజైనచో ధర్మపాలన ఎట్లు కొనసాగును?' అని లోకము శంకించుననియు, నీవు ధర్మమును అతిక్రమించినచో లోకముగూడ నిన్ను అనుసరించి అధర్మమార్గము పట్టుననియు, ధర్మము అవహేళనపాలై నిరాదరింపబడినచో లోకము నశించును-అనియు భావించి, నీవు వనములకు వెళ్లుటకై అనవసరముగా మిగుల తొందరపడుచున్నావు-నీవు మహాశూరుడవు. ఎన్నడును ఏ మాత్రము తొట్రుపాటునకు లోనుకానివాడవు. అట్టి నీవంటివాడు శక్తిహీనమైన దైవమును సర్వసమర్థమైన దానివిగా ప్రశంసించుట

1) శ్లోకమునందలి 'ఇవ' శబ్దప్రయోగము హర్షశోకములమధ్య నలిగిపోవుచున్న లక్ష్మణునియొక్క మానసిక-ఆందోళన స్థితికి అద్దముపట్టుచున్నది.

కథం హ్యేతదసంభ్రాంతః త్వద్విధో వక్తుమర్హతి।
యథా దైవమశౌండీరం శౌండీర! క్షత్రియర్షభ!। 6

కిం నామ కృపణం దైవమ్ అశక్తమభిశంససి।
పాపయోస్తే కథం నామ తయోశ్శంకా న విద్యతే। 7

సంతి ధర్మోపధాః శ్లక్ష్ణా ధర్మాత్మన్! కిం న బుధ్యసే।
తయోస్సుచరితం స్వార్థం శాఠ్యాత్ పరిజిహీర్షతోః। 8

యది నైవం వ్యవసితం స్యాద్ధి ప్రాగేవ రాఘవ!।
తయోః ప్రాగేవ దత్తశ్చ స్యాద్వరః ప్రకృతశ్చ సః। 9

లోకవిద్విష్టమారబ్ధం త్వదన్యస్యాభిషేచనమ్।
నోత్సహే సహితుం వీర! తత్ర మే క్షంతుమర్హసి। 10

యేనైవమాగతా ద్వైధం తవ బుద్ధిర్మహామతే।
న హి ధర్మో మమ ద్వేష్యః ప్రసంగాద్యస్య ముహ్యసి। 11

కథం త్వం కర్మణా శక్తః కైకేయీవశవర్తినః।
కరిష్యసి పితుర్వాక్యమ్ అధర్మిష్ఠం విగర్హితమ్। 12

యద్యయం కిల్బిషాద్భేదః కృతోఽప్యేవం న గృహ్యతే।
జాయతే తత్ర మే దుఃఖం ధర్మసంగశ్చ గర్హితః। 13

మనసాఽపి కథం కామం కుర్యాస్త్వం కామవృత్తయోః।
తయోస్త్వహితయోర్నిత్యం శత్ర్వోః పిత్రభిధానయోః। 14

తగదు. (శౌర్యహీనుడు, క్షత్రియాధముడు, పిఱికిపందయగు వాడు మాత్రమే ఈ అసమర్థదైవమును అనుసరించును.) (5-6)

అన్నయ్యా! దీనమైన ఆ అసమర్థదైవమును నీవు ఎందులకు ప్రశంసించుచున్నావు? 'పాపకృత్యములకు పాల్పడిన ఆ కైకేయీ దశరథులే అధర్మవర్తనులు' - అనెడి భావము నీకేల కలుగుటలేదు? (7)

ధర్మాత్ముడవైన ఓ రామా! లోకమున ధర్మమును అడ్డుపెట్టుకొని, తమతప్పులను కప్పిపుచ్చుకొను వయవంచకులు ఎందఱోగలరు. వారినిగూర్చి నీవెఱుగవా? కైకేయీదశరథులు నీకు ద్రోహమును తలపెట్టి నిన్ను అడవులకు పంపుటకై స్వార్థపూరితమైన పన్నాగమును పన్నిన విషయమును నీవు గుర్తింపలేదా? (8)

అగ్రజా! నీకు పట్టాభిషేకమును తలపెట్టకముందే ఆ యిరువురును ఈ ద్రోహచింతన చేసియుండవచ్చును. అట్లుకానిచో దశరథుడు కైకేయికి ఈ వరములను ఎప్పుడో ఇచ్చియుండవచ్చును గదా! వాటిని ఇప్పుడు త్రవ్వి బయటికి తీయవలసిన పనియేమి? కనుక ఇది నిజముగా వారి కుతంత్రమే.[1] (9)

ఓ మహావీరా! జ్యేష్ఠుడవైన నిన్నుగాదని లోకవిరుద్ధముగా కనిష్ఠుడైన (చిన్నవాడైన) మఱియొకనికి అనగా భరతునకు పట్టముగట్టుట నేను ఏమాత్రము సహింపజాలను. అందులకు నన్ను క్షమింపుము. (10)

ఓ ప్రజ్ఞాశాలీ! నాయనగారిసంకల్పమునుసరించి నీవు పట్టాభిషిక్తుడవగుటకు సిద్ధపడితివి. కాని ఆ తండ్రియే వరములమిషతో నిన్ను అడవులపాలు చేయుచుండగా - 'పిత్రాజ్ఞను పాటించుట ధర్మము' అనియు, అట్లుచేయకుండుట 'దోషము' అనియు నీబుద్ధిని మార్చుకొంటివి. ఇది ధర్మమేగాదు-దీనికి నేను అంగీకరింపను. (11)

రామా! కైకేయివశవర్తియైయున్న తండ్రి ధర్మబద్ధముగాని, గర్హింపదగిన ఆదేశమును (వనములకు వెళ్లుము అను ఆజ్ఞను) ఇచ్చుచున్నాడు. నీవు దానిని ఎదుర్కొనగలసమర్థుడవేయైనను, ఆ ఆజ్ఞను ఎందులకు పాటింపదలచుచుంటివి? (12)

'ఈ కపటప్రయత్నమంతయును వారు పాపబుద్ధితో చేయుచున్నట్టిదే' అని నీవు గ్రహింపకపోవుట నాకు బాధ కలిగించుచున్నది. ఇట్టి కపటప్రయత్నమును ధర్మమని భావించి-దానికి తలయొగ్గుట నింద్యము. (13)

కైకేయీదశరథులు ఇరువురును స్వార్థప్రవృత్తి గలిగియున్నారు. వారు నీకు అహితమునే కోరుచున్నారు. (వారు నీహితమును కోరుటలేదు). వారు తల్లిదండ్రులనుపేరుమాత్రముననున్న శత్రువులు. అట్టివారికోర్కెను మన్నించుటకు నీవు మానసికముగాగూడ ఇష్టపడరాదు. (14)

1) 'భరతునకు అవశ్యముగా రాజ్యమును కట్టబెట్టవలెను' ఇది ఆ కైకేయీదశరథులఏకైకలక్ష్యము-కాని 'జ్యేష్ఠుడైన రాముని కాదని, భరతుని రాజ్యాభిషిక్తునిచేయుటను లోకము సమ్మతింపదు.' అని భావించి, శ్రీరాముని పట్టాభిషేకమును ప్రకటించి, ఈ వరములనెపముతో వనములకు శ్రీరాముని పంపుటకును, భరతునకు రాజ్యమును అప్పగించుటకును ఆ ఇరువురును కలిసి పన్నిన పన్నాగమిది-అని లక్ష్మణుని అభిప్రాయము.

యద్యపి ప్రతిపత్తిస్తే దైవీచాపి తయోర్మతమ్।
తథా హ్యుపేక్షణీయం తే న మే తదపి రోచతే। 15

విక్లబో వీర్యహీనో యః సదైవమనువర్తతే।
వీరాః సంభావితాత్మానో న దైవం పర్యుపాసతే। 16

దైవం పురుషకారేణ యస్సమర్థః ప్రబాధితుమ్।
న దైవేన విపన్నార్థః పురుషః సోఽవసీదతి। 17

ద్రక్ష్యంతి త్వద్య దైవస్య పౌరుషం పురుషస్య చ।
దైవమానుషయోరద్య వ్యక్తా వ్యక్తిర్భవిష్యతి। 18

అద్య మత్పౌరుషహతం దైవం ద్రక్ష్యంతి వై జనాః।
యద్దైవాదాహతం తేఽద్య దృష్టం రాజ్యాభిషేచనమ్। 19

అత్యంకుశమివోద్దామం గజం మదబలోద్ధతమ్।
ప్రధావితమహం దైవం పౌరుషేణ నివర్తయే। 20

లోకపాలాః సమస్తాస్తే నాద్య రామాభిషేచనమ్।
నచ కృత్స్నాస్త్రయో లోకా విహన్యుః కిం పునః పితా। 21

యైర్వివాసస్తవారణ్యే మిథో రాజన్! సమర్థితః।
అరణ్యే తే వివత్స్యంతి చతుర్దశ సమాస్తథా। 22

అహం తదాశాం ఛేత్స్యామి పితుస్తస్యాశ్చ యా తవ।
అభిషేకవిఘాతేన పుత్రరాజ్యాయ వర్తతే। 23

మద్బలేన విరుద్ధాయ న స్యాద్దైవబలం తథా।
ప్రభవిష్యతి దుఃఖాయ యథోగ్రం పౌరుషం మమ। 24

ఊర్ధ్వం వర్షసహస్రాంతే ప్రజాపాల్యమనంతరమ్।
ఆర్యపుత్త్రాః కరిష్యంతి వనవాసం గతే త్వయి। 25

అన్నా! నీ పట్టాభిషేకమునకు భంగము కలిగించుట, నిన్ను వనములకు పంపుట-అనునవి వారు బుద్ధిపూర్వకముగా చేసినవి కావు. అవి దైవికములే అని నీవు భావించుచున్నప్పటికిని అది సరికాదు. కనుక అది ఉపేక్షణీయము. అది నాకేమాత్రము నచ్చదు. (15)

పిఱికివారు, పరాక్రమహీనులు మాత్రమే దైవమును ఆశ్రయింతురు. పరాక్రమశాలురు, లోకముచే గౌరవింపదగిన వీరులు దైవముమీద ఆధారపడరు. వారు స్వప్రయత్నములకే ప్రాముఖ్యమిత్తురు. (16)

కేవలము దైవముమీద ఆధారపడక స్వశక్తిచే స్వయంకృషితో తనకార్యమును సాధించుకొనగల సమర్థుడు దైవికముగా (అనుకోనివి) విఘ్నములు ఎదురైనను నిరాశచెందడు, బాధపడడు. (17)

దైవశక్తి-పురుషునిసామర్థ్యము-ఈరెండింటిలో ఏది గొప్పదియో నేడు లోకులు గమనింతురు. 'దైవము-మనుష్యుడు', వీరిలో బలవంతులెవరో? బలహీనులెవరో? ఇప్పుడు తేటతెల్లమగును. (18)

నీ రాజ్యాభిషేకమును భంగపఱచిన ఆ దైవమే నా పౌరుషము ముందు నేడు తలవంచును. ఇప్పుడిది లోకమునకు వెల్లడియగును. మదబలముచే గర్వించి, గొలుసులను త్రెంచుకొని, అంకుశమునకును లొంగక, స్వైరవిహారముతో పరుగులుదీయుచున్న మదపుటేనుగును వలె నేడు నా పౌరుషముతో దైవమును దారికి తెచ్చెదను. (19-20)

సమస్త దిక్పాలురును అంతేగాదు ముల్లోకములలోని సాటిలేని మహావీరులెల్లరును ఏకమైవచ్చినను నేడు ఈ రామునిపట్టాభిషేకమును ఆపజాలరు. ఇక ఈ తండ్రిగారొక లెక్కయా? ఓ రాజా! (రామా!) నేడు రహస్యముగా నీవనవాసమునకు కుతంత్రములను పన్నినవారే పదునాలుగుసంవత్సరములు అడవులలో నివసింపవలసి వచ్చును.[1] (21-22)

రామా! నీ పట్టాభిషేకమునకు విఘాతము కలిగించుటద్వారా తనకుమారుడైన భరతునకు రాజ్యసింహాసనమును కట్టబెట్టజూచిన కైకేయియొక్క దురాశను, ఆమెను సంతృప్తిపఱచవలెననెడి రాజుయొక్క ఆశను నేను వమ్ముగావించెదను. (23)

అన్నా! బలశాలినైన నన్ను ఎదిరించినవాడు తీవ్రమైన నా పౌరుషముయొక్కవాటికి అంతులేని దుఃఖములలో మునుగక తప్పదు. అప్పుడు దైవముగూడ వానిని రక్షింపజాలదు- (24)

ఓ రామా! నీవు ఈ రాజ్యమును ప్రజానురంజకముగా వేలకొలది సంవత్సరములు పరిపాలింపుము- నీవు వానప్రస్థాశ్రమమున అడుగిడిన పిమ్మట నీ కుమారులు (ఆర్యపుత్రులు) ఈరాజ్యపరిపాలన చేయుదురు. (25)

1) శ్రీరాముడు రాజ్యపట్టాభిషిక్తుడగుట తథ్యము - దానిని ఎవ్వరును ఆపజాలరు. ఇప్పుడు ఆయనవనవాసమునకు కుట్రపన్నినవారే రాముడు రాజైనపిమ్మట పదునాలుగుసంవత్సరములు అడవులపాలుగాక తప్పదు- అని లక్ష్మణుని నిశ్చితాభిప్రాయము.

పూర్వం రాజర్షివృత్త్యా హి వనవాసో విధీయతే।
ప్రజా నిక్షిప్య పుత్రేషు పుత్రవత్ పరిపాలనే। 26

పూర్వము రాజర్షులు(తమ వృద్ధావస్థయందు) ప్రజలను కన్నబిడ్డల వలె పరిపాలించుటకై రాజ్యభారమును తమపుత్రులపై ఉంచి, వారు వానప్రస్థాశ్రమమును స్వీకరించి, వనవాసము చేయుచుండెడి వారు. ఇది పరంపరగా సాగివచ్చుచున్న ఆచారము- (ప్రజాక్షేమమునకై రాజ్యభారమును వహించుచునే ఋషులవలె ఆధ్యాత్మిక జీవనమును కొనసాగించుచుండువారు రాజర్షులు) (26)

న చేద్రాజన్యనేకాగ్రే రాజ్యవిభ్రమశంకయా।
నైవమిచ్ఛసి ధర్మాత్మన్! రాజ్యం రామ! త్వమాత్మని। 27

ప్రతిజానే చ తే వీర! మా భూవం వీరలోకభాక్।
రాజ్యం చ తవ రక్షేయమ్ అహం వేలేవ సాగరమ్। 28

ధర్మాత్ముడవైన ఓ శ్రీరామా! దశరథమహారాజు ప్రాచీనరాజుల మర్యాదను అనుసరించి, వానప్రస్థాశ్రమమును స్వీకరించుచు మీకురాజ్యభారమును అప్పగింపవలెను. ఆయన ఆజ్ఞ చేయునప్పుడు రాజ్యపాలనమును మీరు స్వీకరించినచో రాజ్యమున (ప్రజలలో) భేదభావములు ఏర్పడవచ్చునని (మీరు) శంకింపవచ్చును. అట్టి శంకలతో మీకు పనియేలేదు- 'సముద్రమును చెలియలికట్టకాపాడుచుండునట్లు నేను మీకు అండగానుండి రాజ్యమును రక్షించుచుందును. ఇది నా ప్రతిజ్ఞావచనము- నా శపథమును ఉల్లంఘించినచో నేను వీరస్వర్గమును పొందుటకు అనర్హుడనగుదును. (27-28)

మంగళైరభిషించస్వ తత్ర త్వం వ్యాపృతో భవ।
అహమేకో మహీపాలాన్ అలం వారయితుం బలాత్। 29

అన్నా! మంగళద్రవ్యయుక్తముగా పవిత్రజలములతో (పసిష్ఠాదిమహర్షులఆశీస్సులతో) నీవు పట్టాభిషిక్తుడవు కమ్ము. పట్టాభిషేకకార్యమునందు నీవు మనస్సును నిలుపుము. దీనికి సమ్మతింపక భూపతులెవ్వరైనను యుద్ధమునకు దిగినచో పరాక్రమముతో వారిఅటకట్టించుటకు నేను ఒక్కడనే చాలుదును. (29)

న శోభార్థా విమౌ బాహూ న ధనుర్భూషణాయ మే।
నాఽసిరాబంధనార్థాయ న శరాః స్తంభహేతవః।
అమిత్రదమనార్థం మే సర్వమేతచ్చతుష్టయమ్। 30

నా బాహువులు అలంకార ప్రాయములుగావు. నేను ధనుస్సును ఆభరణముగా చేతధరింపలేదు- శోభకొఱకై కటిభాగమున ఖడ్గమును దాల్చలేదు. వేడుకగా తూణీరమున బాణములను చేర్చలేదు- శత్రునిర్మూలనము కొఱకే నేను ఈనాల్గింటిని కల్గియుంటిని- (30)

న చాహం కామయేఽత్యర్థం యః స్యాత్ శత్రుర్మతో మమ।
అసినా తీక్ష్ణధారేణ విద్యుచ్చలితవర్చసా।
ప్రగృహీతేన వై శత్రుం వజ్రిణం వా న కల్పయే। 31

నా పరాక్రమమును పరీక్షించుటకై ఎవ్వరైనను నన్ను ఎదిరించినచో శత్రువులుగా భావించి, వారిని పరిమార్చెదను. ఎదిరించిన ఆ శత్రువు వజ్రాయుధమును ధరించినవాడైన ఇంద్రుడేయైనను విద్యుత్కాంతులవలె మెఱపులను విరజిమ్మునట్టి నానిశితకరవాలముచే, నాశనముగావించెదను. (31)

ఖడ్గనిష్పేషనిష్పిష్టైః గహనా దుశ్చరా చ మే।
హస్త్యశ్వనరహస్తోరుశిరోభిర్భవితా మహీ। 32

యుద్ధమునకై సమరభూమికి చేరిన ఏనుగులు, అశ్వములు, సైనికులు మొదలగు బలములను నా ఖడ్గధాటికి గురిచేసి, వాటిని నుగ్గునుగ్గుగావింతును. అంతట ముక్కలుముక్కలైన ఆ బలములతొండములతో కాళ్లతో శిరస్సులతో ఈ రణరంగమంతయు నిండిపోవును. అప్పుడానేలయంతయు దుర్గమమైన అరణ్యమువలె కాలుమోపరానిదియగును- (32)

ఖడ్గధారాహతా మేఽద్య దీప్యమానా ఇవాద్రయః।
పతిష్యంతి ద్విపా భూమౌ మేఘా ఇవ సవిద్యుతః। 33

నా ఖడ్గధారకు గురియైన శత్రుగజములు రక్తసిక్తములైన తనువులతో నేలగూలుచు, అవి మండుచున్న కొండలవలెను, మెఱపులతోగూడిన మేఘములవలెను ఒప్పుచుండును. (33)

బద్ధగోధాంగుళిత్రాణే ప్రగృహీతశరాసనే।
కథం పురుషమానీ స్యాత్ పురుషాణాం మయి స్థితే। 34

చేతులకు ఉడుముకవచములను ధరించి, ధనుస్సును చేబూని, రణరంగమున నేను నిలిచియుండగా 'పురుషులలో నేను వీరుడను' అని చెప్పికొనగలమొనగాడు ఎవ్వడుండును? (34)

బహుభిశ్చైకమత్యస్యన్నేకేన చ బహూన్ జనాన్।
వినియోక్ష్యామ్యహం బాణాన్ నృవాజిగజమర్మసు। 35

నేను పెక్కుబాణములను చేబూని ఒక్కొక్కవీరుని, ఒక్కొక్క బాణముతో పెక్కుమంది యోధులను హతమార్చెదను. అట్లే భటుల, అశ్వముల, ఏనుగుల ఆయువుపట్టులయందు శరములను ప్రయోగించి, వాటిని నేలగూల్చెదను- (35)

అద్య మేఽస్త్రప్రభావస్య ప్రభావః ప్రభవిష్యతి।
రాజ్ఞశ్చాప్రభుతాం కర్తుం ప్రభుత్వం చ తవ ప్రభో। 36

ఓ ప్రభూ! దశరథమహారాజుయొక్క ప్రభుత్వమును తొలగించుటకును, నీ ప్రభుత్వమును నెలకొల్పుటకును ఇంక నా అస్త్రశక్తిప్రభావము ప్రకటితమగును. ఇప్పుడు ఈ విధముగా లక్ష్మణుని శక్తిసామర్థ్యములు వెల్లడియగును. (36)

అద్య చందనసారస్య కేయూరామోక్షణస్య చ।
వసూనాం చ విమోక్షస్య సుహృదాం పాలనస్య చ। 37

అనురూపావిమౌ బాహూ రామ! కర్మ కరిష్యతః।
అభిషేచనవిఘ్నస్య కర్తౄణాం తే నివారణే। 38

ఈ బాహువులు చందనలేపనములకును, భుజకీర్తులను ధరించుటకును, సంపదలను దానధర్మములు చేయుటకును, దుష్టులనుండి సజ్జనులను కాపాడుటకును ఉపయుక్తములగుచు వచ్చినవి. కాని అవి నేడు నీ పట్టాభిషేకమును భంగపఱచెడివారి పనిబట్టుటకు వినియోగపడును. (37-38)

బ్రవీహి కోఽద్యైవ మయా వియుజ్యతాం
తవాసుహృత్ప్రాణయశస్సుహృజ్జనైః।
యథా తవేయం వసుధా వశే భవేత్
తథైవ మాం శాధి తవాస్మి కింకరః। 39

హే ప్రభో! నేను నీ దాసుడను - నీ ఏ శత్రువు యొక్క ప్రాణములను తీయవలెనో, వారిమిత్రులను ఎవరిని హతమార్చవలెనో, ఏ వైరులకీర్తిప్రతిష్ఠలను రూపుమాపవలెనో తెలుపుము. ఈ భూమండలము నీకు వశమగుటకు నేనేమి చేయవలెనో శాసింపుము.[1] (39)

విమృజ్య బాష్పం పరిసాంత్వ్య చాసకృత్
స లక్ష్మణం రాఘవవంశవర్ధనః।
ఉవాచ పిత్రోః వచనే వ్యవస్థితం
నిబోధ మామేవ హి సౌమ్య! సత్పథః। 40

రఘువంశవర్ధనుడైన శ్రీరాముడు లక్ష్మణునిమాటలను విని, అతనికన్నీరు తుడిచి, పెక్కువిధముల ఓదార్చి, అతనితో ఇట్లు నుడివెను. 'నాయనా! లక్ష్మణా! తల్లిదండ్రులఆజ్ఞలను త్రికరణశుద్ధిగా పాటించు వానినిగా నన్నెఱుంగుము. ఇదియే సత్పురుషుల మార్గము-' (40)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రయోవింశస్సర్గః (23)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదిమూడవసర్గము సమాప్తము

— * * * —

24. ఇరువదినాల్గవసర్గము

"నన్నును నీవెంట తీసికొనిపొమ్ము" - అని కౌసల్య శ్రీరాముని కోరుట - "నీవు మహారాజునకు సేవలు చేయుచు ఇచట ఉండుటయే ధర్మము" - అని అతడు ఆమెకు నచ్చజెప్పుట.

తం సమీక్ష్య త్వవహితం పితుర్నిర్దేశపాలనే।
కౌసల్యా బాష్పసంరుద్ధా వచో ధర్మిష్ఠమబ్రవీత్। 1

తండ్రియాజ్ఞను పాటించుటకు కృతనిశ్చయుడైయున్న శ్రీరాముని మనోభావములను గుర్తించినదై, కౌసల్యా దేవి సంతతధారగా కన్నీరు గార్చుచు గద్గదస్వరముతో ధర్మయుక్తముగా ఇట్లు పల్కెను. (1)

1) లక్ష్మణస్వామి వచనములలో వాడి, వేడి కన్పించుచున్నను, అవియన్నియును రామభక్తికారణముగా ప్రకటితములే. రాముడనిన సౌమిత్రికి పంచప్రాణములు. అయనకు ఏకొంచెము నొప్పికల్గినను ఇతడు తట్టుకొనలేడు. ఇట్టి లక్ష్మణుడు శ్రీరాముని పట్టాభిషేకము భంగముగుచుండగా ఏమి ఓర్చుకొనగలడా? అందువలన ఇతడు (సౌమిత్రి) అట్లు పలికెను. దీనినిబట్టి లక్ష్మణునకు శ్రీరామునిపైగల అపారమైన భక్తి వెల్లడియగుచున్నది.

అదృష్టదుఃఖో ధర్మాత్మా సర్వభూతప్రియంవదః।
మయి జాతో దశరథాత్ కథమ్ ఉంఛేన వర్తయేత్। 2

యస్య భృత్యాశ్చ దాసాశ్చ మృష్టాన్యన్నాని భుంజతే।
కథం స భోక్ష్యతే నాథో వనే మూలఫలాన్యయమ్। 3

క ఏతత్ శ్రద్దధేత్ శ్రుత్వా కస్య వా న భవేద్భయమ్।
గుణవాన్ దయితో రాజ్ఞా రాఘవో యద్వివాస్యతే। 4

నూనం తు బలవాన్ లోకే కృతాంతః సర్వమాదిశన్।
లోకే రామాభిరామస్త్వం వనం యత్ర గమిష్యసి। 5

అయం తు మామాత్మభవః తవాదర్శనమారుతః।
విలాపదుఃఖసమిధో రుదితాశ్రుహుతాహుతిః। 6

చింతాబాష్పమహాధూమః తవాదర్శనచిత్తజః।
కర్శయిత్వా భృశం పుత్ర! నిశ్వాసాయాససంభవః। 7

త్వయా విహీనామిహ మాం శోకాగ్నిరతులో మహాన్।
ప్రధక్ష్యతి యథా కక్షం చిత్రభానుర్హిమాత్యయే। 8

కథం హి ధేనుః స్వం వత్సం గచ్ఛంతం నానుగచ్ఛతి।
అహం త్వాఽనుగమిష్యామి యత్ర పుత్ర! గమిష్యసి। 9

తథా నిగదితం మాత్రా తద్వాక్యం పురుషర్షభః।
శ్రుత్వా రామోఽబ్రవీద్వాక్యం మాతరం భృశదుఃఖితామ్। 10

కైకేయ్యా వంచితో రాజా మయి చారణ్యమాశ్రితే।
భవత్యా చ పరిత్యక్తో న నూనం వర్తయిష్యతి। 11

భర్తుః కిల పరిత్యాగో నృశంసః కేవలం స్త్రియాః।
స భవత్యా న కర్తవ్యో మనసాఽపి విగర్హితః। 12

యావజ్జీవతి కాకుత్స్థః పితా మే జగతీపతిః।
శుశ్రూషా క్రియతాం తావత్ స హి ధర్మస్సనాతనః। 13

"దశరథునివలన నాకడుపునబుట్టిన శ్రీరాముడు ఏనాడునూ దుఃఖమునే యెఱుగడు, అతడు మిక్కిలి ధర్మబుద్ధిగలవాడు, అందఱితోడను ప్రియముగా సంభాషించువాడు. అట్టి సుకుమారుడు అడవులలో ఉంఛవృత్తితో[1] ఎట్లు జీవింపగలడు? (2)

శ్రీరామునిసేవకులు, భటులు మృష్టాన్నభోజనములతో ఇచట హాయిగా కాలముగడుపుచుందురు. వారి యజమానియైన శ్రీరాముడు వనములలో కందమూల ఫలములను భక్షించుచు ఎట్లు జీవింపగలడు? సద్గుణములకు గని, ఎల్లరకును ప్రాణతుల్యుడు ఐన రాముని ఈనాడు మహారాజు అడవులకు పంపుచున్నవార్తను విని, ఎవరు నమ్మెదరు? ఈ వార్త ఎవరికి భయమును కలిగింపదు? (3-4)

లోకమునందందఱికిని ఆనందదాయకుడవు (రాజకుమారుడవు) ఐన ఓరామా! నీవును వనవాసము చేయువలసివచ్చుట నిజముగా దైవికము. దీనినిబట్టి చూచినచో లోకమున ఎల్లరకును సుఖదుఃఖములను గూర్చుటలో తిరుగులేనట్టి దైవమే బలవత్తరమని స్పష్టమగుచున్నది. 'కుమారా! రామా! నీ యెడబాటువలన కలిగెడి శోకాగ్ని నామనస్సునుండియే పుట్టును. నీ ఆగమన (నీవు ఎప్పుడు వత్తువాయను) చింతయే నా చిత్తమున ఆ శోకాగ్ని ఏర్పడుటకు హేతువు. నా నిట్టూర్పులవలన కలిగెడి ఆయాసమువలన ఆ అగ్ని సంభవించును. నీవు కనబడక పోవుట (నీ అదర్శనము) అనెడి వాయువు దానిని (ఆ శోకాగ్నిని) ప్రజ్వరిల్ల జేయును. నా విలాపదుఃఖములే ఆ అగ్నికి సమిధలు. నేను ఏడ్చుటవలన సంతతధారగా స్రవించెడి నా అశ్రువులే దానికి (ఆజ్య) ఆహుతులు - నా చింతా బాష్పములే (బాష్పము = డగ్గుత్తిక, వెగటని గొంతు) ఆ శోకాగ్నినుండి బయల్వెడలెడు మహాధూమములు. గ్రీష్మ కాలమునందలి దావాగ్ని ఎండిన పొదలనువలె ఆ శోకాగ్ని నన్ను ఎంతయు కృశింపజేసి, మలమలమాడ్చివేయును. (5-8)

పుత్రా! ముందునకు సాగిపోవుచున్న తన దూడవెంట పాడియావు వెళ్లకేతీరా? నీవు వెళ్లెడిచోటికి (అడవులకు) నేనును నిన్ను అనుసరించి వచ్చెదను." (9)

పురుషశ్రేష్ఠుడైన రాముడు తల్లి పలికిన ఆ మాటలను విని, మిక్కిలి దుఃఖితురాలైయున్న తన జననితో ఇట్లనెను- (10)

"మహారాజు కైకేయిచే వంచితుడాయెను. నేను అరణ్యములకు వెళ్లుచున్నాను. నీవుగూడ ఆయనకు తోడునీడగా ఇచట ఉండనిచో ఆయన నిశ్చయముగా జీవించియుండజాలడు- (11)

అమ్మా! స్త్రీ భర్తను త్యజించుట క్రూరమైన కార్యముగదా! నింద్యమైన ఆలోచనను నీమనస్సునకు రానీయకుము- నా తండ్రియైన దశరథమహారాజు జీవించియున్నంతవఱకును ఆయనకు నీవు సేవలొనర్చుచునే యుండవలెను. ఇదియే సనాతన ధర్మము." (12-13)

1) ఉంఛవృత్తి = దైవవశమున నేలపై రాలిన గింజలతో కడుపునింపుకొనుట - అడవులలో లభించిన ఫలమూలాదులను భక్షించుచు జీవించుట-

ఏవముక్తాతు రామేణ కౌసల్యా శుభదర్శనా।
తథేత్యువాచ సుప్రీతా రామమక్లిష్టకారిణమ్। 14

ఏవముక్తస్తు వచనం రామో ధర్మభృతాం వరః।
భూయస్తామబ్రవీద్వాక్యం మాతరం భృశదుఃఖితామ్। 15

మయా చైవ భవత్యా చ కర్తవ్యం వచనం పితుః।
రాజా భర్తా గురుః శ్రేష్ఠః సర్వేషామీశ్వరః ప్రభుః। 16

ఇమాని తు మహారణ్యే విహృత్య నవ పంచ చ।
వర్షాణి పరమప్రీతః స్థాస్యామి వచనే తవ। 17

ఏవముక్తా ప్రియం పుత్త్రం బాష్పపూర్ణాననా తదా।
ఉవాచ పరమార్తా తు కౌసల్యా పుత్త్రవత్సలా। 18

ఆసాం రామ! సపత్నీనాం వస్తుం మధ్యే న మే క్షమం।
నయ మామపి కాకుత్స్థ! వనం వన్యాం మృగీం యథా।
యది తే గమనే బుద్ధిః కృతా పితురపేక్షయా। 19

తాం తథా రుదతీం రామో రుదన్ వచనమబ్రవీత్। 20

జీవంత్యా హి స్త్రియా భర్తా దైవతం ప్రభురేవ చ।
భవత్యా మమ చైవాద్య రాజా ప్రభవతి ప్రభుః। 21

న హ్యనాథా వయం రాజ్ఞా లోకనాథేన ధీమతా।
భరతశ్చాపి ధర్మాత్మా సర్వభూతప్రియంవదః।
భవతీమనువర్తేత స హి ధర్మరతస్సదా। 22

యథా మయి తు నిష్క్రాంతే పుత్త్రశోకేన పార్థివః।
శ్రమం నావాప్నుయాత్ కించిత్ అప్రమత్తా తథా కురు। 23

దారుణశ్చాప్యయం శోకో యథైనం న వినాశయేత్।
రాజ్ఞో వృద్ధస్య సతతం హితం చర సమాహితా। 24

వ్రతోపవాసనిరతా యా నారీ పరమోత్తమా।
భర్తారం నానువర్తేత సా తు పాపగతిర్భవేత్। 25

భర్తృశుశ్రూషయా నారీ లభతే స్వర్గముత్తమమ్।
అపి యా నిర్నమస్కారా నివృత్తా దేవపూజనాత్। 26

శ్రీరాముడు ఇట్లు పలికిన పిమ్మట ధర్మాత్మురాలైన కౌసల్యాదేవి "నాయనా! అట్లే" అని ఎవ్వరినీ నొప్పించక మృదువుగా మసలుకొనునట్టి తన తనయునితో నుడివెను. (14)

ధర్మమార్గులలో మేటియైన శ్రీరాముడు తల్లిఆమోద వచనములను వినిన పిదప, శోకమగ్నమైయున్న యామెతో మరల ఇట్లు పలికెను. (15)

"తల్లీ! దశరథమహారాజు అందరికిని ప్రభువు. ఆయన సర్వసమర్థుడు, శ్రేష్ఠుడు. నీకు భర్త, నాకు తండ్రి. కనుక ఆ మహానుభావుని ఆజ్ఞలు (వచనములు) నాకును, పూజ్యురాలవైన నీకును శిరోధార్యములు. (16)

అమ్మా! ఈ పదునాలుగు సంవత్సరముల కాలము వనములలో ప్రశాంతముగా గడిపి వచ్చిన అనంతరము, నీ మాటలను సంతోషముతో పాటింతును." (17)

శ్రీరాముడు ఇట్లు వచింపగా పుత్త్రవాత్సల్యముగల కౌసల్యాదేవి పట్టరాని దుఃఖముతో బొటబొట కన్నీరు గార్చుచు తనయనుంగు తనయునితో ఇట్లు నుడివెను. (18)

"కకుత్స్థవంశజుడవైన ఓరామా! (నీవు నా కనులయెదుట లేకుండా) ఈ సవతులనడుమ నేనిచట ఉండజాలను. తండ్రికోరిక ననుసరించి నీవు వెళ్లుటకే నిశ్చయించుకొనినచో నన్నుగూడ నీ వెంట తీసికొని పొమ్ము. నేనచట నీసమీపమున వనజీవనమునకు అలవాటుపడిన హరిణివలె ప్రశాంతముగా ఉందును." (19)

ఆ విధముగా కుమిలిపోవుచున్న తల్లిని జూచి, తానును దుఃఖితుడై, శ్రీరాముడు ఆమెతో ఇట్లు పలికెను. "జీవితపర్యంతము స్త్రీకి పతియే దైవము, ప్రభువు. కనుక అమ్మా! మహారాజు నేడు నిన్నును, నన్నును శాసింపగల స్వామి- ఆయన అశేషప్రజలకును దిక్కైనవాడు, ప్రజ్ఞాశాలి, ఆ మహారాజే మనఅందరికిని అండ. భరతుడును ధర్మాత్ముడు, అందరితోడను మృదుమధురముగా మాట్లాడువాడు. ధర్మనిరతుడైన అతడు నీకు విధేయుడై అనవరతము నిన్ను అనుసరించియేయుండును. ఇది నా పరమవిశ్వాసము. (20-22)

నేను అయోధ్యను విడిచివెళ్లినపిదప రాజు పుత్త్రశోకముతో పరితపించకుండా నీవు ఆయనను జాగ్రత్తగా చూచుకొనుచుండుము. దుర్భరమైన ఈ శోకము వృద్ధుడైన మహారాజును క్రుంగదీయకుండా అనుక్షణమూ అప్రమత్తురాలవై ఆయనను సేవించుచుండుము. వ్రతములను, ఉపవాసములను ఎంతగా ఆచరించినను, నలుగురిలో 'ఉత్తమురాలు'గా గొప్ప ఖ్యాతి వహించినను, భర్తను అనుసరించుచు ఆయనకు సేవలు చేయనిచో ఆ స్త్రీకి పాపగతులు తప్పవు. (నరకము తప్పదు) దేవతలను పూజింపకున్నను, పూజ్యులైన బ్రాహ్మణులు మొదలగువారిని గౌరవింపకున్నను భర్తకు శుశ్రూషలు చేసినచో ఆ ఇల్లాలికి ఉత్తమమైన స్వర్గగతులు ప్రాప్తించును. (23-26)

శుశ్రూషామేవ కుర్వీత భర్తుః ప్రియహితే రతా।
ఏష ధర్మః పురా దృష్టో లోకే వేదే శ్రుతః స్మృతః। 27

అగ్నికార్యేషు చ సదా సుమనోభిశ్చ దేవతాః।
పూజ్యాస్తే మత్కృతే దేవి! బ్రాహ్మణాశ్చైవ సువ్రతాః। 28

ఏవం కాలం ప్రతీక్షస్వ మమాగమనకాంక్షిణీ।
నియతా నియతాహారా భర్తృశుశ్రూషణే రతా। 29

ప్రాప్స్యసే పరమం కామం మయి ప్రత్యాగతే సతి।
యది ధర్మభృతాం శ్రేష్ఠో ధారయిష్యతి జీవితమ్। 30

ఏవముక్తా తు రామేణ బాష్పపర్యాకులేక్షణా।
కౌసల్యా పుత్రశోకార్తా రామం వచనమబ్రవీత్। 31

గమనే సుకృతాం బుద్ధిం న తే శక్నోమి పుత్రక!।
వినివర్తయితుం వీర నూనం కాలో దురత్యయః। 32

గచ్ఛ పుత్ర! త్వమేకాగ్రో భద్రం తేఽస్తు సదా విభో!।
పునస్త్వయి నివృత్తే తు భవిష్యామి గతక్లమా। 33

ప్రత్యాగతే మహాభాగే కృతార్థే చరితవ్రతే।
పితురానృణ్యతాం ప్రాప్తే త్వయి లప్స్యే పరం సుఖమ్। 34

కృతాంతస్య గతిః పుత్ర! దుర్విభావ్యా సదా భువి।
యస్త్వాం సంచోదయతి మే వచ ఆచ్ఛిద్య రాఘవ!। 35

గచ్ఛేదానీం మహాబాహో! క్షేమేణ పునరాగతః।
నందయిష్యసి మాం పుత్ర! సామ్నా వాక్యేన చారుణా। 36

అపీదానీం సకాలఃస్యాత్ వనాత్ ప్రత్యాగతం పునః।
యత్త్వాం పుత్రక! పశ్యేయం జటావల్కలధారిణమ్। 37

భర్తకు ప్రియమును, హితమును గూర్చుచు శ్రద్ధాసక్తులతో ఆయనను సేవించుటయే ప్రతివనితకును కర్తవ్యము- ఇదియే సనాతనధర్మము- ప్రాచీనకాలమునుండియు ఇది లోకమున ఆచరింపబడుచున్నది. ఇది వేదవిహితము, శాస్త్రసమ్మతము (27)

అమ్మా! నా క్షేమమునకై శాంతిహోమములద్వారా దేవతలను ఆరాధింపుము. (అర్ఘ్య పాద్యములతో) గంధపుష్పములతో బ్రాహ్మణోత్తములను పూజింపుము. (28)

తల్లీ! నియమజీవనముతో, సాత్త్వికాహారవిధానములతో మసలుకొనుచు, పతిసేవాపరాయణవై కాలముగడుపుచుండుము. నేను వనవాసమును ముగించుకొని, తిరిగి వచ్చువఱకు ఓపికతో నిరీక్షించుచుండుము. (29)

అమ్మా! ధార్మికులలో శ్రేష్ఠుడైన మహారాజు (నేను వచ్చు వఱకును) తనజీవితమును సుఖశాంతులతో గడుపునట్లు చూచుకొనుచుండుము. త్వరలో నావనవాసమును ముగించుకొని రానేవత్తును- అప్పుడు నీకు పరమసౌఖ్యములబ్బును." (30)

శ్రీరాముని ఈ వచనములను విన్న పిమ్మట పుత్రశోకార్తితో నున్న కౌసల్యాదేవి కన్నీరుమున్నీరుగా దుఃఖించుచు తనకుమారునితో ఇట్లనెను. (31)

"నాయనా! 'వనములకు తప్పక వెళ్ళితీరవలయును'- అను దృఢనిశ్చయమునుండి నిన్ను మఱల్చుటకు నాకు శక్తి చాలకున్నది. వీరా! నిజముగా విధినిర్ణయము అతిక్రమింపరానిది- (32)

కుమారా! సరే! జాగ్రతగా (నిశ్చింతగా) వెళ్లిరమ్ము. నీకు శుభములు కలుగుగాక. నీవు సర్వసమర్థుడవు. నీవు వనముల నుండి క్షేమముగా మఱలి వచ్చిన పిదపగాని నా ఈ దుఃఖము చల్లారదు. (33)

ఓ శ్రీరామా! నీవు వనవాసవ్రతమును ముగించుకొని, చరితార్థుడవై వచ్చినచో మిక్కిలి సౌభాగ్యశాలివై (కీర్తి ప్రతిష్ఠలతో) తిరిగి ('తండ్రియాదేశమును పాటించుట' ద్వారా) నీవు తండ్రిని ఋణవిముక్తునిగావించినవాడవు అగుదువు. అప్పుడు నా మనసుకుదుటబడును. నాకు శాంతి చేకూరును. (34)

నాయనా! రాఘవా! లోకమున ఎప్పుడేమిజరుగునో తెలియదు. విధినిర్ణయము అనూహ్యము- ఆ విధియే నా మాటను కాదని నిన్ను వనవాసమునకు ప్రేరేపించుచున్నది. (35)

నా చిన్నారి రాఘవా! మహాబాహా! ఇప్పుడికవెళ్ళిరమ్ము. కుమారా! క్షేమముగా తిరిగివచ్చినపిమ్మట మధురమైన నీ అనునయవచనములతో నన్ను ఆనందింపజేయుదువుగాక- జటావల్కలములను దాల్చినవాడవై, వనవాసమును పూర్తిచేసికొని వచ్చిన నిన్ను తనివిదీర చూచెడిభాగ్యము నాకు ఎన్నటికో ఏమో? అది ఇప్పుడేయైనచో ఎంతబాగుండును?" (36-37)

తథాహి రామం వనవాసనిశ్చితం
సమీక్ష్య దేవీ పరమేణ చేతసా ।
ఉవాచ రామం శుభలక్షణం వచో
బభూవ చ స్వస్త్యయనాభికాంక్షిణీ ॥ 38

వనములకు వెళ్లుటకే నిశ్చయించుకొనియున్న రామునిని ఆ కౌసల్య తదేకదృష్టితో జూచెను. ఆయనకు శుభపరంపరలను గోరుచు ఆ దేవి శుభలక్షణసంపన్నుడైన శ్రీరామునితో పాదరముగా ఆశీర్వదించెను. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుర్వింశస్సర్గః (24)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదినాల్గవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

25. ఇరువదిఐదవసర్గము

వనవాసమునకు బయలుదేఱనున్న శ్రీరామునకు కౌసల్యాదేవి శుభాశీస్సులను ఒసంగుట.

సాఽపనీయ తమాయాసమ్ ఉపస్పృశ్య జలం శుచిః ।
చకార మాతా రామస్య మంగళాని మనస్వినీ ॥ 1

నిర్మలమైన మనస్సుగల ఆ కౌసల్యామాత దుఃఖమును వీడి, పవిత్రజలములను ఆచమించి శుచియై, రామునకు శుభాశీస్సులను పలికెను. (1)

న శక్యసే వారయితుం గచ్ఛేదానీం రఘూత్తమ! ।
శీఘ్రం చ వినివర్తస్వ వర్తస్వ చ సతాం క్రమే ॥ 2

"ఓ రఘురామా! ఇప్పుడు నిన్ను ఆపుట అసాధ్యము. ఇక వెళ్లుము. శీఘ్రముగా (పదునాలుగు సంవత్సరములు ముగిసిన వెంటనే) మఱలిరమ్ము. సత్పురుషులమార్గమున ప్రవర్తింపుము. (2)

యం పాలయసి ధర్మం త్వం ధృత్యా చ నియమేన చ ।
స వై రాఘవశార్దూల! ధర్మస్త్వామ్ అభిరక్షతు ॥ 3

ఓ రఘువంశోత్తమా! నిండుమనస్సుతో నియమపూర్వకముగా నీవు అనుసరించు ధర్మమే నిన్ను నిరంతరము కాపాడుచుండుగాక- (3)

యేభ్యః ప్రణమసే పుత్ర! చైత్యేష్వాయతనేషు చ ।
తే చ త్వామభిరక్షంతు వనే సహ మహర్షిభిః ॥ 4

నాయనా! వనవాససమయమున చతుష్పథములయందును (నాలుగుమార్గములకూడలియందును) దేవాలయములయందును నీచే ప్రణతులు అందుకొను దేవతలు, మహర్షులు నిన్ను రక్షించుచుందురుగాక- (4)

యాని దత్తాని తేఽస్త్రాణి విశ్వామిత్రేణ ధీమతా ।
తాని త్వామభిరక్షంతు గుణైః సముదితం సదా ॥ 5

ధీశాలియైన విశ్వామిత్రమహర్షి నీకొసంగిన అస్త్రములన్నియును సద్గుణసంపన్నుడవైన నిన్ను సర్వదా ఆదుకొనుచుండుగాక- (5)

పితృశుశ్రూషయా పుత్ర మాతృశుశ్రూషయా తథా ।
సత్యేన చ మహాబాహో! చిరంజీవాభిరక్షితః ॥ 6

సమిత్కుశపవిత్రాణి వేద్యశ్చాయతనాని చ ।
స్థండిలాని చ చిత్రాణి శైలా వృక్షాః క్షుపా హ్రదాః ।
పతంగాః పన్నగాః సింహాః త్వాం రక్షంతు నరోత్తమ ॥ 7

కుమారా! ఓ మహావీరా! కలకాలము వర్ధిల్లుచుండుము. నీవు ఒనర్చిన మాతాపితృసేవలు, నీసత్యబలము నీకు రక్షగానుండును. ఓ నరశ్రేష్ఠా! సమిధలు, దర్భలు, పవిత్రములు, అగ్నివేదికలు, దేవాలయములు, చిత్రవిచిత్రములైన దేవపూజాస్థలములు, పర్వతములు, వృక్షములు, మొక్కలు, మడుగులు, పక్షులు, సర్పములు, సింహములు మొదలగువవి అన్నియును వనమున నిన్ను రక్షించుచుండుగాక- (6-7)

స్వస్తి సాధ్యాశ్చ విశ్వే చ మరుతశ్చ మహర్షయః ।
స్వస్తి ధాతా విధాతా చ స్వస్తి పూషా భగోఽర్యమా ॥ 8

సాధ్యులు (దివ్యజాతులవారు) విశ్వేదేవతలు, మరుత్తులు, ధాత, విధాత అను దేవతలు, పూషుడు, భగుడు, అర్యముడు అను ఆదిత్యులు లోకపాలురు, ఇంద్రాదిసమస్తదేవతలు నీకు శుభములను చేకూర్చుచుందురుగాక. వసంతాది - ఋతువులు,

లోకపాలాశ్చ తే సర్వే వాసవప్రముఖాస్తథా।
ఋతవశ్చైవ పక్షాశ్చ మాసాస్సంవత్సరాః క్షపాః। 9

దినాని చ ముహూర్తాశ్చ స్వస్తి కుర్వంతు తే సదా।
స్మృతి ర్ధృతిశ్చ ధర్మశ్చ పాంతు త్వాం పుత్ర సర్వతః। 10

స్కందశ్చ భగవాన్ దేవః సోమశ్చ స బృహస్పతిః।
సప్తర్షయో నారదశ్చ తే త్వాం రక్షంతు సర్వతః। 11

యాశ్చాపి సర్వతః సిద్ధాః దిశశ్చ సదిగీశ్వరాః।
స్తుతా మయా వనే తస్మిన్ పాంతు త్వాం పుత్ర! నిత్యశః। 12

శైలాః సర్వే సముద్రాశ్చ రాజా వరుణ ఏవ చ।
ద్యౌరంతరిక్షం పృథివీ నద్యః సర్వాః తథైవ చ। 13

నక్షత్రాణి చ సర్వాణి గ్రహాశ్చ సహదేవతాః।
అహోరాత్రే తథా సంధ్యే పాంతు త్వాం వనమాశ్రితమ్। 14

ఋతవశ్చైవ షట్ పుణ్యా మాసాః సంవత్సరాస్తథా।
కలాశ్చ కాష్ఠాశ్చ తథా తవ శర్మ దిశంతు తే। 15

మహావనే విచరతో మునివేషస్య ధీమతః।
తవాదిత్యాశ్చ దైత్యాశ్చ భవంతు సుఖదాః సదా। 16

రాక్షసానాం పిశాచానాం రౌద్రాణాం క్రూరకర్మణామ్।
క్రవ్యాదానాం చ సర్వేషాం మాభూత్ పుత్రక తే భయమ్। 17

ప్లవగా వృశ్చికా దంశా మశకాశ్చైవ కాననే।
సరీసృపాశ్చ కీటాశ్చ మా భూవన్ గహనే తవ। 18

మహాద్విపాశ్చ సింహాశ్చ వ్యాఘ్రా ఋక్షాశ్చ దంష్ట్రిణః।
మహిషాః శృంగిణో రౌద్రా న తే ద్రుహ్యంతు పుత్రక! 19

నృమాంసభోజనా రౌద్రా యే చాన్యే సత్త్వజాతయః।
మా చ త్వాం హింసిషుః పుత్ర మయా సంపూజితాస్త్విహ। 20

అగమాస్తే శివాః సంతు సిధ్యంతు చ పరాక్రమాః।
సర్వసంపత్తయే రామ! స్వస్తిమాన్ గచ్ఛ పుత్రక! 21

శుక్లకృష్ణపక్షములు, చైత్రాదిమాసములు, ప్రభవాదిసంవత్సరములు, దివారాత్రములు, ముహూర్తములు నీకు సర్వదా సుఖావహములు అగుచుండుగాక. నాయనా! స్మృతి (ధ్యానము) ధృతి (ఏకాగ్రత) ధర్మము అన్ని విధములుగా నిన్ను బ్రోచుచుండుగాక. (8-10)

పూజ్యుడైన కుమారస్వామి, చంద్రభగవానుడు, బృహస్పతి, సప్తర్షులు, దేవర్షినారదుడు అన్నివిధముల నిన్ను రక్షించుచుందురు గాక. (11)

కుమారా! సుప్రసిద్ధులైన సిద్ధగణములవారు, దిశలు, దిక్పాలురు. నాస్తుతులనందుకొనినవారందఱును అచట వనములలో నిన్ను నిరంతరము రక్షించుచుందురుగాక- (12)

సమస్తకులపర్వతములు, సముద్రములు, కుబేరుడు, వరుణదేవుడు, ఆకాశము, అంతరిక్షము, భూమి, అట్లే సకలనదులు, నక్షత్రములు, సమస్తగ్రహములు, గ్రహాభిమానదేవతలు, దివారాత్రములు, ఉభయసంధ్యాదేవతలును వనవాసివైయున్న నిన్ను రక్షించుచుందురుగాక- (13-14)

పవిత్రమూర్తులైన ఋతు, మాస, సంవత్సరములఅధిదేవతలు, కళలు, కాష్ఠలు (కాష్ఠ = 18 రెప్పపాట్ల కాలము, కళ = 30 కాష్ఠల కాలము) ఇవియన్నియును నీకు సుఖకరములు అగుగాక- (15)

ధీశాలివైన నీవు మునివేషధారివై, మహారణ్యములలో సంచరించునప్పుడు ద్వాదశాదిత్యులు, దైత్యులు అనవరతము నీకు సుఖసంతోషములను గూర్చుచుందురుగాక. (16)

కుమారా! భయంకరాకారులును, క్రూరకర్ములును, మాంసభక్షకులును ఐన రాక్షసులవలనను, పిశాచములవలనను (అచట) నీకు ఎట్టి భయమూ లేకుండుగాక- (17)

భయంకరమైన ఆ అరణ్యమునందు వానరములు, తేళ్లు, అడవిఈగలు, దోమలు, కొండచిలువలు, ఇతర కీటకములు మున్నగునవి నిన్ను హింసింపకుండుగాక- (18)

నాయనా! అడవియేనుగులు, సింహములు, పెద్దపులులు, ఎలుగుబంట్లు, కోఱలుగల దుష్టమృగములు, అడవిదున్నలు, భయంకరములైన కొమ్ములజంతువులు అక్కడ నిన్ను బాధింపకుండుగాక. (19)

నరమాంసమును భక్షించునట్టి ఇతరములగు క్రూరమృగములు నిన్ను హింసింపకుండుగాక. నిన్ను కాపాడుటకై వివిధ దేవతలను, సమస్త ప్రాణులను ఇక్కడినుండియే నేను వేడుకొనుచున్నాను. నాయనా! రామచంద్రా! నీవు శుభస్వరూపుడవు. మార్గములన్నియును నీకు సుఖకరములు అగుగాక. (నీ ప్రయాణములన్నియును హాయిగా సాగుగాక.) నీ పరాక్రమములు సఫలములుఅగుగాక- అచట నీకు వన్యఫలమూలములకు లోటులేకుండుగాక - ఇక నీవు వెళ్లిరమ్ము. (20-21)

స్వస్తి తేఽ స్త్వంతరిక్షేభ్యః పార్థివేభ్యః పునః పునః।
సర్వేభ్యశ్చైవ దేవేభ్యో యే చ తే పరిపంథినః। 22

అంతరిక్షమున చరించు ప్రాణులవలనగాని, భూమిపై జీవించు వివిధజంతువులవలనగాని, అంతటను విహరించు సమస్తదేవతల వలనగాని, నీయెడ శత్రుభావము కలిగియుండువారివలన గాని నీకు ఎట్టి హానియు కలుగకుండుగాక, సకలశుభములును చేకూరుగాక. (22)

గురుస్సోమశ్చ సూర్యశ్చ ధనదోఽథ యమస్తథా।
పాంతు త్వామర్చితా రామ! దండకారణ్యవాసినమ్। 23

దేవతలకు గురువైన బృహస్పతియు, సూర్యచంద్రులును, కుబేరుడును, యముడును, నా పూజలను అందుకొనినవారై, దండకారణ్యవాసివైన నిన్ను రక్షించుదురుగాక. (23)

అగ్నిర్వాయుస్తథా ధూమో మంత్రాశ్చర్షిముఖాచ్చ్యుతాః।
ఉపస్పర్శనకాలే తు పాంతు త్వాం రఘునందన! 24

ఓ రఘునందనా! అగ్ని, వాయువు, అట్లే ధూమము, ఋషులు ప్రవచించినమంత్రములు స్నాన - ఆచమన కాలములయందు నిన్ను కాపాడుచుండుగాక. (24)

సర్వలోకప్రభుర్బ్రహ్మా భూతభర్తా తథర్షయః।
యే చ శేషాః సురాస్తే త్వాం రక్షంతు వనవాసినమ్। 25

సర్వలోకములకును ప్రభువైన పరమశివుడు, సృష్టికర్తయైన బ్రహ్మయు, సమస్తప్రాణులకు పోషకుడు ఐన నారాయణుడు, అట్లే ఋషులు వనవాససమయమున నీకు రక్షకులైయుందురు గాక." (25)

ఇతి మాల్యైః సురగణాన్ గంధైశ్చాపి యశస్వినీ।
స్తుతిభిశ్చానురూపాభిః ఆనర్చాఽఽయతలోచనా। 26

మిక్కిలి కీర్తిప్రతిష్ఠలు గలదియు, విశాలలోచనయు ఐన కౌసల్యాదేవి ఇట్లు తలపోసి, పూవులతోడను, చందనాదుల తోడను, అనురూపములగు స్తుతులతోడను సకలదేవతలను ఆరాధించెను. (26)

జ్వలనం సముపాదాయ బ్రాహ్మణేన మహాత్మనా।
హావయామాస విధినా రామమంగళకారణాత్। 27

శ్రీరామునకు శుభపరంపరలు చేకూరుటకై ఆదేవి బ్రాహ్మణోత్తములచే అగ్నిని ప్రతిష్ఠింపజేసి, విధ్యుక్తముగా హోమములను ఆచరింపజేసెను. (27)

ఘృతం శ్వేతాని మాల్యాని సమిధః శ్వేతసర్షపాన్।
ఉపసంపాదయామాస కౌసల్యా పరమాంగనా। 28

మహిళామణియైన కౌసల్యాదేవి హోమముచేయుటకు వలసిన నేతిని, తెల్లని దండలను, సమిధలను, తెల్ల ఆవాలను సిద్ధము చేయించెను. (28)

ఉపాధ్యాయః సవిధినా హుత్వా శాంతిమనామయమ్।
హుతహవ్యావశేషేణ బాహ్యం బలిమకల్పయత్। 29

పురోహితుడు శ్రీరాముని ఆరోగ్యభాగ్యములకై ఉపద్రవములను నివారింపజేయు శాంతి హోమములను విధ్యుక్తముగా ఆచరించెను. పిమ్మట అతడు హోమముచేయగా మిగిలియున్న సామగ్రితో బాహ్యప్రదేశమున బలిప్రక్రియను నిర్వహించెను. (29)

మధుదధ్యక్షతఘృతైః స్వస్తివాచ్య ద్విజాం స్తతః।
వాచయామాస రామస్య వనే స్వస్త్యయనక్రియాః। 30

ఆ దేవి స్వస్తిపుణ్యాహవాచనములను నిర్వహించునట్టి బ్రాహ్మణోత్తములకు తేనె, పెరుగు, నేయి మొదలగు వానిని అక్షతపూర్వకముగా సమర్పించెను. అనంతరము వారు శ్రీరామునకు వనములో సర్వవిధశుభములు చేకూరుటకై స్వస్తిపూర్వకముగా వేదమంత్రములను పఠించిరి. (30)

తత స్తస్మై ద్విజేంద్రాయ రామమాతా యశస్వినీ।
దక్షిణాం ప్రదదౌ కామ్యం రాఘవం చేదమబ్రవీత్। 31

పిమ్మట యశస్వినియైన రామజనని బ్రాహ్మణోత్తముడైన ఆ పురోహితునకు సంతృప్తికరముగా దక్షిణాతాంబూలములను సమర్పించెను. తదుపరి ఆమె శ్రీరామునకు శుభాశీస్సులను ఒసంగెను. (31)

యన్మంగళం సహస్రాక్షే సర్వదేవనమస్కృతే।
వృత్రనాశే సమభవత్ తత్తే భవతు మంగళమ్। 32

"నాయనా! రామచంద్రా! వృత్రాసురసంహారసందర్భమున సర్వదేవతావంద్యుడైన దేవేంద్రునకు లభించిన మంగళాశీస్సులన్నియును (శుభపరంపరలన్నియును) నీకును ప్రాప్తించుగాక. (32)

యన్మంగళం సుపర్ణస్య వినతాఽకల్పయత్ పురా।
అమృతం ప్రార్థయానస్య తత్తే భవతు మంగళమ్। 33

అమృతమును తీసికొనివచ్చుసందర్భమున గరుత్మంతుడు వినతామాతనుండి పొందిన మంగళములన్నియును నీకు ప్రాప్తించుగాక- (33)

అమృతోత్పాదనే దైత్యాన్ ఘ్నతో వజ్రధరస్య యత్।
అదితిర్మంగళం ప్రాదాత్ తత్తే భవతు మంగళమ్। 34

అమృతములభించుటకై దైత్యులను హతమార్చిన మహేంద్రునకు అదితి ప్రసాదించిన సమస్తమంగళములును నీకు అబ్బుగాక- (34)

త్రీన్ విక్రమాన్ ప్రక్రమతో విష్ణోరమితతేజసః।
యదాసీన్మంగళం రామ! తత్తే భవతు మంగళమ్। 35

కుమారా! శ్రీరామా! మూడడుగులతో భూమ్యాకాశములను ఆక్రమించి, బలిచక్రవర్తిని సుతలలోకమునకు అధిపతినిజేసిన మహాతేజస్వియగు శ్రీ మహావిష్ణువునకు అబ్బిన శుభములన్నియును నీకు లభించుగాక- (35)

ఋతవస్సాగరా ద్వీపా వేదా లోకా దిశశ్చ తే।
మంగళాని మహాబాహో! దిశంతు తవ సర్వదా। 36

ఓ మహాబాహూ! ఋతువులు, సాగరములు, ద్వీపములు, వేదములు, సమస్తలోకములు, దశదిశలు ఇవియన్నియును నీకు శుభపరంపరలను ప్రసాదించు గాక-" (36)

ఇతి పుత్త్రస్య శేషాంశ్చ కృత్వా శిరసి భామినీ।
గంధైశ్చాపి సమాలభ్య రామమాయతలోచనా। 37

ఓషధీం చాపి సిద్ధార్థాం విశల్యకరణీం శుభామ్।
చకార రక్షాం కౌసల్యా మంత్రైరభిజజాప చ। 38

విశాలనేత్రయైన కౌసల్యాదేవి శ్రీరాముని ఇట్లు ఆశీర్వదించి, శిరమున మంత్రాక్షతలను ఉంచెను. అతనికి గంధమాల్యములను అలంకరించెను. సకలకార్యసిద్ధిప్రదమైన 'విశల్యకరణి' యను ఓషధిలో తనయునకు రక్షాబంధనమునర్చెను. సందర్భశుద్ధిగా పవిత్రమంత్రములను జపించెను. (37-38)

ఉవాచాతిప్రహృష్టేవ సా దుఃఖవశవర్తినీ।
వాఙ్మాత్రేణ న భావేన వాచా సంసజ్జమానయా। 39

మనస్సున ఎంతో దుఃఖము అలముకొనియున్నను దానిని కనబడనీయక, రామునిసంతృప్తికై బయటికి సంతోషమును ప్రకటించుచు తొట్రుపాటుతో ఆమె ఇట్లు పలికెను. (39)

ఆనమ్య మూర్ధ్ని చాఘ్రాయ పరిష్వజ్య యశస్వినీ।
అవదత్ పుత్త్ర! సిద్ధార్థో గచ్ఛ రామ! యథాసుఖమ్। 40

యశస్వినియైన కౌసల్యామాత వినమ్రుడైన శ్రీరాముని మూర్ధమును మూర్కొని, తనయుని తనహృదయమునకు హత్తుకొనెను. పిమ్మట ఆమె 'నాయనా! సఫలమనోరథుడవై సుఖముగా వెళ్ళిరమ్ము' అని ఆత్మీయముగా వచించెను. (40)

అరోగం సర్వసిద్ధార్థమ్ అయోధ్యాం పునరాగతమ్।
పశ్యామి త్వాం సుఖం వత్స! సుస్థిరం రాజవర్త్మని। 41

ప్రణష్టదుఃఖసంకల్పా హర్షవిద్యోతితాననా।
ద్రక్ష్యామి త్వాం వనాత్ప్రాప్తం పూర్ణచంద్రమివోదితమ్। 42

భద్రాసనగతం రామ! వనవాసాదిహాగతమ్।
ద్రక్ష్యామి చ పునస్త్వాం తు తీర్ణవంతం పితు ర్వచః। 43

"వత్సా! శ్రీరామా! వనవాసానంతరము నీవు ఆరోగ్యభాగ్యములతో సకలార్థసిద్ధితో తప్పక అయోధ్యకు మఱలి వత్తువు. పిమ్మట రాజ్యపాలనమున సుస్థిరుడవైయున్న నిన్ను నేను చూచెదను. వనములనుండి తిరిగివచ్చి, పున్నమనాటి నిండుచంద్రునివలెనున్న నిన్ను దర్శించుటతో నా దుఃఖములు, విచారములు అన్నియును దూరమగును. నాలో ఆనందము వెల్లివిరియును. నాయనా! రఘువరా! తండ్రియాజ్ఞను పాలించి, వనవాసమునుండి ఇచటికి మఱలివచ్చి, సింహాసనమును అధిష్ఠించిన నిన్ను పరమానందముతో తిలకింతును. (41-43)

మంగళైరుపసంపన్నో వనవాసాదిహాగతః।
వధ్వా మమ చ నిత్యం త్వం కామాన్ సంవర్ధయాహి భో। 44

నాయనా! సరే! వెళ్ళుము. వనములనుండి తిరిగివచ్చి, శుభంకరములైన వస్త్రాభరణములను ధరించి, నిత్యము నా కోడలైన సీతాదేవిమనోరథములను నెఱవేర్చుచుండుము. (44)

మయార్చితా దేవగణాః శివాదయో
మహర్షయో భూతమహాసురోరగాః।
అభిప్రయాతస్య వనం చిరాయ తే
హితాని కాంక్షంతు దిశశ్చ రాఘవ! । 45

కుమారా! శ్రీరామచంద్రా! నేనారాధించిన శంకరుడు మొదలగు దేవతలు, మహర్షులు, భూతగణములు, నాగ దేవతలు, సమస్త దిశలు (దిక్పాలురు) వనములకు వెళ్ళుచున్న నీకు సర్వదా హితములను గూర్చుచుండురుగాక." (45)

ఇతీవ చాఽశ్రుప్రతిపూర్ణలోచనా
సమాప్య చ స్వస్త్యయనం యథావిధి ।
ప్రదక్షిణం చైవ చకార రాఘవం
పునః పునశ్చాపి నిపీడ్య సస్వజే ॥ 46

కౌసల్యాదేవి ఈ విధముగా పలికి అశ్రుపూర్ణలోచనయై, విధ్యుక్తముగా స్వస్తివాచనకార్యక్రమములను పూర్తిచేసెను. పిమ్మట శ్రీరామునకు ప్రదక్షిణమొనర్చి, పదేపదే తనయుని తనహృదయమునకు హత్తుకొనెను. (46)

తథాతు దేవ్యా చ కృతప్రదక్షిణో
నిపీడ్య మాతుశ్చరణౌ పునః పునః ।
జగామ సీతానిలయం మహాయశాః
స రాఘవః ప్రజ్వలితః స్వయా శ్రియా ॥ 47

అట్లు తనకు ప్రదక్షిణమొనర్చిన తల్లియొక్క చరణములకు శ్రీరాముడు నిండుభక్తితో ప్రణమిల్లెను. పిమ్మట వాసిగాంచిన ఆ రాఘవుడు స్వీయ (సహజమైన) శోభలతో విలసిల్లుచున్నవాడై, సీతాదేవిసదనమునకు వెళ్లెను. (47)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచవింశస్సర్గః (25)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదిఐదవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

26. ఇరువదిఆఱవసర్గము

శ్రీరాముడు రాజలాంఛనములు లేకుండవచ్చుటకుగల కారణములను సీతాదేవి అడుగుట - శ్రీరాముడు తనవనవాసవిషయములను వివరించి, పిదప రాజకుటుంబసభ్యులతో ఆమె మసలుకొనవలసినరీతిని దెల్పుట.

అభివాద్య తు కౌసల్యాం రామస్సంప్రస్థితో వనమ్।
కృతస్వస్త్యయనో మాత్రా ధర్మిష్ఠే వర్త్మని స్థితః। 1

విరాజయన్ రాజసుతో రాజమార్గం నరైర్వృతమ్।
హృదయాన్యామమంథేవ జనస్య గుణవత్తయా। 2

వైదేహీ చాపి తత్సర్వం న శుశ్రావ తపస్వినీ।
తదేవ హృది తస్యాశ్చ యౌవరాజ్యాభిషేచనమ్। 3

దేవకార్యం స్వయం కృత్వా కృతజ్ఞా హృష్టచేతనా।
అభిజ్ఞా రాజధర్మాణాం రాజపుత్రం ప్రతీక్షతే। 4

ప్రవివేశాథ రామస్తు స్వం వేశ్మ సువిభూషితమ్।
ప్రహృష్టజనసంపూర్ణం హ్రియా కించిదవాఙ్ముఖః। 5

ధర్మమార్గానువర్తనుడైన శ్రీరాముడు తల్లి కౌసల్యాదేవి నుండి మంగళాశీస్సులను స్వీకరించి, ఆమెకు ప్రణమిల్లి, వనవాసనిమిత్తమై అచటినుండి బయలుదేఱెను. అనంతరము తనను దర్శింపవచ్చిన పౌరులచే క్రిక్కిరిసియున్న రాజమార్గమున ఆ రాజకుమారుడు ప్రవేశించెను. ఆయనరాకతో ఆరాజవీథి యెంతయు శోభాయమానమయ్యెను. తారుమారైన ఆ విచిత్రపరిస్థితులలో సద్గుణములపెన్నిధియైన శ్రీరాముని జూచి, ఆ ప్రజలహృదయములు మిగుల మథనపడెను. శ్రీరామపట్టాభిషేకార్థము ఉపవాసాదినియమములను పాటించుచున్న విదేహనందినియైన సీతాదేవికి ఈ విషయములన్నియును (యువరాజపట్టాభిషేకము ఆగిపోవుట. శ్రీరాముడు వనవాసమునకై బయలుదేఱుట మొదలగునవి) ఏమాత్రము తెలియవు. కనుక ఆమె తనహృదయమున పట్టాభిషేకము జరుగబోవుచున్నట్లుగనే భావించుచుండెను. పట్టాభిషేకమహోత్సవమును పురస్కరించుకొని కర్తవ్యములను, రాజధర్మములను బాగుగా తెలిసినట్టి సీతాదేవి శ్రద్ధతో స్వయముగా దైవసేవలను పూర్తిచేసెను. అనంతరము ఆమె తనభర్తరాకకై మిగుల సంతోషముతో నిరీక్షించుచుండెను. ఇంతలో శ్రీరాముడు తనమందిరమున ప్రవేశించెను. ఆభవనము చక్కగా అలంకరింపబడియుండెను. అచట చేరిన జనులెల్లరును సంతోషముతో మురిసిపోవుచుండిరి. శ్రీరాముడుమాత్రము లజ్జతో కొద్దిగా అవనతముఖుడైయుండెను. (1-5)

అథ సీతా సముత్పత్య వేపమానా చ తం పతిమ్।
అపశ్యత్ శోకసంతప్తం చింతావ్యాకులితేంద్రియమ్। 6

అంతట సీతాదేవి ఆసనమునుండి లేచి, మిగుల సంతాపముతో చింతానిమగ్నుడైయున్నట్లు కనబడుచున్న తనభర్తను జూచి మిక్కిలి చలించి పోయెను. (6)

తాం దృష్ట్వా స హి ధర్మాత్మా న శశాక మనోగతమ్।
తం శోకం రాఘవః సోఢుం తతో వివృతతాం గతః। 7

వివర్ణవదనం దృష్ట్వా తం ప్రస్విన్నమ్ అమర్షణమ్।
ఆహ దుఃఖాభిసంతప్తా కిమిదానీమ్ ఇదం ప్రభో। 8

అద్య బార్హస్పతః శ్రీమాన్ ఉక్తః పుష్యోఽను రాఘవ।
ప్రోచ్యతే బ్రాహ్మణైః ప్రాజ్ఞైః కేన త్వమసి దుర్మనాః। 9

న తే శతశలాకేన జలఫేననిభేన చ।
ఆవృతం వదనం వల్గు ఛత్రేణాపి విరాజతే। 10

వ్యజనాభ్యాం చ ముఖ్యాభ్యాం శతపత్రనిభేక్షణమ్।
చంద్రహంసప్రకాశాభ్యాం వీజ్యతే న తవాననమ్। 11

వాగ్మినో వందినశ్చాపి ప్రహృష్టాస్త్వాం నరర్షభ!।
స్తువంతో నాత్ర దృశ్యంతే మంగళైః సూతమాగధాః। 12

న తే క్షౌద్రం చ దధి చ బ్రాహ్మణా వేదపారగాః।
మూర్ధ్ని మూర్ధాభిషిక్తస్య దధతి స్మ విధానతః। 13

న త్వాం ప్రకృతయః సర్వాః శ్రేణీముఖ్యాశ్చ భూషితాః।
అనువ్రజితుమిచ్ఛంతి పౌరజానపదాస్తథా। 14

చతుర్భిర్వేగసంపన్నైః హయైః కాంచనభూషితైః।
ముఖ్యః పుష్యరథో యుక్తః కిం న గచ్ఛతి తేఽగ్రతః। 15

న హస్తీ చాగ్రతః శ్రీమాన్ తవ లక్షణపూజితః।
ప్రయాణే లక్ష్యతే వీర! కృష్ణమేఘగిరిప్రభః। 16

న చ కాంచనచిత్రం తే పశ్యామి ప్రియదర్శన!।
భద్రాసనం పురస్కృత్య యాంతం వీరపురస్కృతమ్। 17

అభిషేకో యథా సజ్జః కిమిదానీమిదం తవ।
అపూర్వో ముఖవర్ణశ్చ న ప్రహర్షశ్చ లక్ష్యతే। 18

ధర్మాత్ముడైన ఆ రాఘవుడు వణకిపోవుచున్న ఆ సీతాదేవిని జూచి, తనమనస్సులోని శోకావేశమును అణుకొనలేకపోయెను. అందువలన దానిని బహిర్గతమొనర్చెను. ఆయనముఖము వెలవెలబోయియుండెను, శరీరమంతయు చెమర్చి యుండెను. చేతికందిన రాజ్యాభిషేకము జారిపోయిన విషయమును, తన వనవాసముయొక్కసంగతిని సీతకు చెప్పుట యెట్లు? అని పరిపరివిధముల ఆలోచించుచు అతడు దుఃఖమును నిగ్రహించుకొనలేకపోయెను. అట్టి స్థితిలోనున్న పతిని జూచి, సీత పరితపించుచు "స్వామీ! ఈ శుభసమయమున ఇట్టి మీవిచారమునకు కారణమేమి?" అని ప్రశ్నించెను. (7-8)

"ఓ ప్రభూ! నేడు పుష్యమినక్షత్రయుక్తకర్కాటకరాశియందు బృహస్పతి ఉచ్చలోనున్న శుభదినము. ఇది పట్టాభిషేకమునకు అనువైనదని బ్రాహ్మణోత్తములు నుడివియున్నారుగదా! ఇక మీకు ఈ విచారమెందులకు? నూరు ఊచలు గలదియు, తెల్లని నీటినురుగువలె మిలమిల్లాడుచున్నదియు అగు ఛత్రము యొక్క మర్యాదలతో మనోహరమైన మీముఖము విరాజిల్లుట లేదేమి? పద్మముల వలె విశాలమైన నేత్రములుగల మీవదనమును చంద్రహంసకాంతులను విరజిమ్ముచుండెడి వింజామరలు సేవించుచుండుటలేదేమి? (9-11)

ఓ నరోత్తమా! వాక్చాతురులైన సూతులు, వందిమాగధులు మిక్కిలి ప్రసన్నులై, మంగళకరములైన వచనములతో నేడు మిమ్ము స్తుతించుచు కనబడుటలేదేమి? (12)

వేదపండితులైన బ్రాహ్మణోత్తములు పట్టాభిషిక్తుడవు కాబోవుచున్న మీశిరస్సుపై విధ్యుక్తముగా తేనె, పెరుగు మొదలగు వాటితో గూడిన పవిత్రజలములతో అభిషేకించుటలేదేమి?(13)

మంత్రులు, సేనాపతులు, పురప్రముఖులు, అట్లే పౌరులు, జానపదులు వస్త్రాలంకారశోభితులై మిమ్ము అనుసరించివచ్చుట లేదేమి? (14)

బంగారు తొడుగులతో అలంకరింపబడినవి, మిక్కిలి వేగముగలవి ఐన నాలుగు గుఱ్ఱములను పూన్చిన శ్రేష్ఠమైన పుష్యరథము (పూలతో అలంకరింపబడిన ఉత్సవరథము) నేడు మీ ముందుభాగమున సాగివచ్చుట లేదేమి? (15)

ఓ మహావీరా! సర్వశుభలక్షణములతో కనువిందుగావించుచు పర్వతమువలె ఉన్నతమై, మేఘమువలె నల్లనై విలసిల్లుచుండెడి భద్రగజము మీ ఉత్సవయాత్రలో మీకు ముందుభాగమున నడచి వచ్చుచుండుట లేదేమి? (16)

ప్రియదర్శనుడవైన ఓ మహావీరా! మీఅగ్రభాగమున వీరయోధులు బంగారముతో చిత్రవిచిత్రముగా నిర్మింపబడిన సింహాసనమును వహించుచు సాగివచ్చుచుండుట లేదేమి? (17)

పట్టాభిషేకసన్నాహములన్నియు పూర్తియైనవిగదా! ఇట్టి సమయమున మీముఖము ప్రసన్నతను వీడి, వివర్ణమైయున్నదేమి? ఇట్టి స్థితిని మున్నెన్నడును నేను చూచియుండలేదు-" (18)

ఇతీవ విలపంతీం తాం ప్రోవాచ రఘునందనః।
సీతే! తత్రభవాంస్తాతః ప్రవ్రాజయతి మాం వనమ్। 19

కులే మహతి సంభూతే! ధర్మజ్ఞే! ధర్మచారిణి!।
శృణు జానకి! యేనేదం క్రమేణాభ్యాగతం మమ। 20

రాజ్ఞా సత్యప్రతిజ్ఞేన పిత్రా దశరథేన చ।
కైకేయ్యై మమ మాత్రే తు పురా దత్తౌ మహావరౌ। 21

తయాఽద్య మమ సజ్జేఽస్మిన్ అభిషేకే నృపోద్యతే।
ప్రచోదితః స సమయో ధర్మేణ ప్రతినిర్జితః। 22

చతుర్దశ హి వర్షాణి వస్తవ్యం దండకే మయా।
పిత్రా మే భరతశ్చాపి యౌవరాజ్యే నియోజితః।
సోఽహం త్వామాగతో ద్రష్టుం ప్రస్థితో విజనం వనమ్। 23

భరతస్య సమీపే తు నాహం కథ్యః కదాచన। 24

బుద్ధియుక్తా హి పురుషా న సహంతే పరస్తవమ్।
తస్మాన్న తే గుణాః కథ్యా భరతస్యాగ్రతో మమ। 25

నాపి త్వం తేన భర్తవ్యా విశేషేణ కదాచన।
అనుకూలతయా శక్యం సమీపే త్వస్య వర్తితుమ్। 26

తస్మై దత్తం నృపతినా యౌవరాజ్యం సనాతనమ్।
స ప్రసాద్యస్త్వయా సీతే! నృపతిశ్చ విశేషతః। 27

అహం చాపి ప్రతిజ్ఞాం తాం గురోః సమనుపాలయన్।
వనమద్యైవ యాస్యామి స్థిరా భవ మనస్విని!। 28

యాతే చ మయి కల్యాణి! వనం మునినిషేవితమ్।
వ్రతోపవాసరతయా భవితవ్యం త్వయాఽనఘే। 29

కాల్యముత్థాయ దేవానాం కృత్వా పూజాం యథావిధి।
వందితవ్యో దశరథః పితా మమ నరేశ్వరః। 30

ఇట్లు పెక్కువిధములుగా పరితాపవచనములను పలుకుచున్న సీతాదేవితో రఘునందనుడు - "సీతా! పూజ్యులైన తండ్రిగారు నన్ను వనములకు పంపబోవుచున్నారు. (19)

ఓ జానకీ! నీవు గొప్పవంశమున జన్మించితివి. మిగుల ధర్మజ్ఞురాలవు. మిక్కిలి ధర్మాచరణపరాయణవు. నా వనవాస కారణములను క్రమముగా తెల్పెదను వినుము. (20)

సత్యసంధుడైన మా తండ్రి దశరథమహారాజు పూర్వము కైకేయిమాతకు రెండు వరములను ఇచ్చియుండెను.(21)

రాజుగారి ఆదేశముపై నేడు నా యువరాజపట్టాభిషేకమునకు తగిన సన్నాహములు పూర్తిచేయబడియుండెను. ఇంతలో ఆమె 'తొగడ నాకు వాగ్దానము చేసిన రెండు వరములను ఇమ్ము' అని రాజును ఒత్తిడి చేసెను. ధర్మము నెపముతో ఆయనను తనమాటకు కట్టుబడియుండునట్లుగా చేసెను. (22)

మా తండ్రియైన దశరథమహారాజు ఆమెమాటకు కట్టుబడి, భరతుడు యువరాజపట్టాభిషిక్తుడగునట్లుగను, నేను దండకారణ్యములలో పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయునట్లుగను ఆదేశించెను. రాజాజ్ఞను తలదాల్చి నేను నిర్జనారణ్యములకు బయలుదేరుచు నిన్ను చూడవచ్చితిని. భరతుని సమీపమున ఎన్నడును నన్ను ప్రశంసింపవలదు. పరులు, అధికారము గల పురుషులు తమయెదుట ఇతరులను ప్రశంసించినచో సహింపజాలరు. కనుక భరతునిముందు నాగుణములనుగూర్చి ప్రస్తావింపరాదు సుమా! (23-25)

సీతా! నీవు భరతునివిషయంలో సాధారణబంధురీతిలో మసలుకొనుము. ఊర్కిళ్ళాప్రతికీర్తులకంటె మించిన మర్యాదలను నీవు ఆశింపరాదు. తోడివారిమధ్య అనుకూలవతివై మెలగుము. మహారాజు వంశపరంపరగా వచ్చుచున్న ఈ రాజ్యము యొక్క యువరాజాధికారమును భరతునకు ఇచ్చివేసెను. కనుక ఓ వైదేహీ! యువరాజైన భరతునియెడను, విశేషించి మహారాజుగారి పట్లను ఆదరములో ప్రవర్తింపుము. (27)

నేనుమాత్రము మా తండ్రిగారి ప్రతిజ్ఞను త్రికరణశుద్ధిగా పాటించుచు, నేడే వనములకు వెళ్లబోవుచున్నాను. నీవు నాయందే అనురాగము గలిగి, దృఢమైన మనస్సుతో (మనస్సును చిక్కబట్టుకొని) ఓరిమితోనుండుము. (28)

పరమపవిత్రమైన ఓ కల్యాణీ! నేను మునులతో (వారి ఆశ్రమములతో) విలసిల్లుచుండెడి వనములకు వెళ్లిన పిమ్మట, నీవు వ్రతోపవాస నియమములను ఆచరించుచు మసలుకొనుము. (29)

నీవు ఉషఃకాలముననే మేల్కొని, యథావిధిగా దైవపూజ లొనర్చుచుండుము. మా తండ్రియైన దశరథమహారాజును వినమ్రతతో ఆదరపూర్వకముగా సేవించుచుండుము. మా తల్లియైన కౌసల్యాదేవి కడువృద్ధురాలు. పైగా నేను సమక్షమున

మాతా చ మమ కౌసల్యా వృద్ధా సంతాపకర్శితా।
ధర్మమేవాగ్రతః కృత్వా త్వత్తస్సమ్మానమర్హతి॥ 31

లేనందువన ఆమె సంతాపమునకు గురియగును. ధర్మజ్ఞురాలవైన నీవు (నేను ఎదురుగాలేనిలోటును రానీయకుండా) ఆమెను ఓదార్చుచు సేవించుచుండుము. (30-31)

వందితవ్యాశ్చ తే నిత్యం యాశ్శేషా మమ మాతరః।
స్నేహప్రణయసంభోగైః సమా హి మమ మాతరః॥ 32

భ్రాతృపుత్రసమౌ చాపి ద్రష్టవ్యౌ చ విశేషతః।
త్వయా భరతశత్రుఘ్నౌ ప్రాణైః ప్రియతరౌ మమ॥ 33

తక్కిన తల్లులును తమప్రేమసౌహార్దములను, ఆలనపాలనలను కౌసల్యామాతవలెనే నాపై ప్రసరింపజేసిరి. కావున వారందరును నిరంతరము నీచేత పూజింపదగినవారే- భరతశత్రుఘ్నులు నాకు ప్రాణములకంటెను ప్రీతిపాత్రులు. కావున నీవు వారిని తోబుట్టువులవలెను, పుత్రులవలెను మిక్కిలి వాత్సల్యముతో ఆదరించుచుండుము. (32-33)

విప్రియం న చ కర్తవ్యం భరతస్య కదాచన।
స హి రాజా ప్రభుశ్చైవ దేశస్య చ కులస్య చ॥ 34

యువరాజైన భరతుడు నేటినుండి (మన)దేశమునకును, కుటుంబమునకును సర్వాధికారి. (ప్రభువు) కావున అతనికి ఎన్నడునూ అప్రియమును కలిగింపరాదు. (34)

ఆరాధితా హి శీలేన ప్రయత్నైశ్చోపసేవితాః।
రాజానః సంప్రసీదంతి కుప్యంతి చ విపర్యయే॥ 35

రాజుల మనోభావములను గుర్తించి, వారికి అనుకూలముగా ప్రవర్తించుచు, అలసటయెఱుగని రీతిగా గౌరవముతో వారిని సేవించుచుండవలెను. అప్పుడు వారు మిక్కిలి ప్రసన్నులైయుందురు. లేనిచో వారు కినుకవహింతురు. (35)

ఔరసానపి పుత్రాన్ హి త్యజంత్యహితకారిణః।
సమర్థాన్ సంప్రగృహ్ణంతి జనానపి జనాధిపాః॥ 36

రాజులు తమకు కీడుతలపెట్టినవారు కన్నకొడుకులేయైనను వారిని పరిత్యజింతురు (శిక్షింతురు). తమకు మేలు చేసినవారు (అనుకూలముగా ప్రవర్తించెడివారు) సామాన్యజనులైనను వారిని చేరదీసి ఆదుకొందురు- (36)

సా త్వం వసేహ కల్యాణి! రాజ్ఞః సమనువర్తినీ।
భరతస్య రతా ధర్మే సత్యవ్రతపరాయణా॥ 37

ఓ కల్యాణీ! నీ సతీధర్మమును పాటించుచు, సత్యవ్రతమునందు నిరతురాలవైయుండుము. యువరాజైన భరతునకు అనుకూలముగా ప్రవర్తించుచు నీవు ఇచటనే యుండుము. (37)

అహం గమిష్యామి మహావనం ప్రియే!
త్వయా హి వస్తవ్యమిహైవ భామిని!।
యథా వ్యలీకం కురుషే న కస్యచిత్
తథా త్వయా కార్యమిదం వచో మమ॥ 38

ప్రియమైన ఓ సీతా! నేను దండకారణ్యమునకు వెళ్లెదను- ఓ సుందరీ! నీవు ఈ అయోధ్యలో ఉండుము. ఎవ్వరికిని అప్రియమును కల్గింపక (ఎవ్వరినీనొప్పింపక) నా ఈ మాటలను పాటింపుము." (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షడ్వింశస్సర్గః *(26)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదిఆఱవసర్గము సమాప్తము

— ＊ ＊ ＊ —

27. ఇరువదిఏడవసర్గము

'నేనును మీవెంట అరణ్యములకు వచ్చెదను' - అని సీతాదేవి శ్రీరామునితో పలు విధములుగా ప్రార్థించుట.

ఏవ ముక్తా తు వైదేహీ ప్రియార్హా ప్రియవాదినీ।
ప్రణయాదేవ సంక్రుద్ధా భర్తారమిదమబ్రవీత్॥ 1

సీతాదేవి సహజముగా ప్రియభాషిణి. అంతేగాదు ఆమె పతి యొక్క ప్రేమకు ఎంతయు పాత్రురాలు. శ్రీరాముని మాటలు తనకు అప్రియములై తనమనస్సును ఎంతగానో నొప్పించుటచే మిగుల క్రుద్ధయయ్యెను. ఆయనపైగల ప్రేమకారణముగా ఆమె తనభర్తతో ఇట్లుపలికెను. (1)

కిమిదం భాషసే రామ! వాక్యం లఘుతయా ధ్రువమ్।
త్వయా యదపహాస్యం మే శ్రుత్వా నరవరాత్మజ!। 2

వీరాణాం రాజపుత్త్రాణాం శస్త్రాస్త్రవిదుషాం నృప।
అనర్హమ్ అయశస్యంచ నశ్రోతవ్యం త్వయేరితమ్। 3

ఆర్యపుత్త్ర! పితా మాతా భ్రాతా పుత్త్రస్తథా స్నుషా।
స్వాని పుణ్యాని భుంజానాః స్వం స్వం భాగ్యముపాసతే। 4

భర్త్తుర్భాగ్యం తు భార్యైకా ప్రాప్నోతి పురుషర్షభ!।
అతశ్చైవాహమాదిష్టా వనే వస్తవ్యమిత్యపి। 5

న పితా నాత్మజో నాత్మా న మాతా న సఖీజనః।
ఇహ ప్రేత్య చ నారీణాం పతిరేకో గతిస్సదా। 6

యది త్వం ప్రస్థితో దుర్గం వనమద్యైవ రాఘవ!।
అగ్రతస్తే గమిష్యామి మృద్నంతీ కుశకంటకాన్। 7

ఈర్ష్యారోషౌ బహిష్కృత్య భుక్తశేషమివోదకమ్।
నయ మాం వీర! విస్రబ్ధః పాపం మయి న విద్యతే। 8

ప్రాసాదాగ్రైర్విమానైర్వా వైహాయసగతేన వా।
సర్వావస్థాగతా భర్తుః పాదచ్ఛాయా విశిష్యతే। 9

"ఓ రామా! ఇదేమిటి? ఇంతచులకనముగా ఇట్లు అర్థరహితము లైన మాటలు పలుకుచున్నావు? మునుపెన్నడును ఇట్టి మాటలు నీనోటినుండి వచ్చియుండలేదు. రాజకుమారుడవైన నీవు ఇట్లు పలుకరాదు- నీ మాటలు ఒక స్త్రీనైన నాకును నవ్వుపుట్టించు చున్నవి. ఓ నరోత్తమా! నీవు పలికిన ఈ వచనములు శస్త్రాస్త్రవిదులు, వీరులు ఐన రాజకుమారులు పలుకదగినవి కానేకావు- పైగా వారికి ఇవి అప్రతిష్ఠను తెచ్చిపెట్టును- కనుక ఇవి వినదగినవియును గావు (పాటింపదగినవియునుగావు). (2-3)

ఓ ఆర్యపుత్త్రా! తండ్రి, తల్లి, సోదరులు, పుత్త్రులు, అల్లే కోడలు మొదలగు వారందరును తాము చేసికొనిన పాపపుణ్యకర్మల ఫలములను తప్పక పొందెదరు. తమతమ శుభాశుభకర్మఫలములను వారే అనుభవింపవలెనుగాని ఇతరులు గాదు. (4)

ఓ పురుషశ్రేష్ఠా! భార్య భర్తకు అర్ధాంగి. కావున భర్తయొక్క భాగ్యఫలములను పొందుటకు భార్యయు అర్హురాలు. అందువలన 'వనములలో నివసింపుము' అని మహారాజు మీకిచ్చిన ఆదేశము మీ భార్యనైన నాకును వర్తించును. కనుక మీతోగూడి నేనును వనవాసము చేయవలసియున్నది- (5)

ఇహలోకమునందును పరలోకమునందును సతులకు పతియేగతి. కాబట్టి తండ్రిగాని, తల్లిగాని, తనయులుగాని, సఖులు గాని, కడకు తనశరీరము గాని తోడుగానుండుట జరుగదు. ఓ రఘూత్తమా! మీరు ఇప్పుడే దుర్గమారణ్యమునకు బయలుదేరినచో నేనును మీతోగూడి వచ్చెదను. ఆ అరణ్యములో నేను మీముందు భాగమున నడచుచు, దర్భలను, ముండ్లను (కంటకములను)[1] తొలగించుచు, మీ మార్గమును చదునుచేయుచు, సుగమ మొనర్చెదను. (6-7)

ఓ మహావీరా! ఈర్ష్యారోషములను త్యజించి[2] దాహబాధానివారణకై బాటసారి తాను త్రాగగామిగిలిన జలమును తనవెంట తీసికొని వెళ్లినట్లు నిస్సంకోచముగా నన్ను నీవెంట గొనిపొమ్ము- నన్ను ఇచట వదలి వెళ్లుటకు నేను చేసిన పాపమేమియును లేదు- (8)

సమస్తసుఖములకును నిలయమైన రాజభవనములలో నివసించుటకంటెను, స్వర్గాదిలోకములలో విమానములలో విహరించుట కంటెను, అష్టైశ్వర్యసంపదలతో అంబరమున హాయిగా సంచరించుట కంటెను ఎన్ని కష్టములు అనుభవింపవలసివచ్చినను పతి అడుగుజాడలలో సాగిపోవుటయే సతికి సుఖప్రదము, శుభప్రదము, ధర్మసమ్మతము. (9)

1) కంటకములను తొలగించుచు- అనుటలో విజ్ఞులు ఈ విశేషమును తెల్పుదురు. "స్వామీ! మీ కంటెను ముందుగా నేను లంకకు చేరి, లోకకంటకుడైన రావణాసురుని తుదముట్టించుటకై మీకు మార్గమును సుగమమొనర్చెదను." ఇది అందలి విశేషము-
2) సీతను (స్త్రీని) తన వెంటగొనిపోవుటవలన అడవులలో ఆమెను రక్షించువిషయము కలిగెడు అసహనమే ఈర్ష్య - సీత తన మాటను కాదని తనవెంటవచ్చుటకై పట్టుబట్టుచున్నందులకు ఆమెయెడ కలుగుకోపమే రోషము-

అనుశిష్టాఽస్మి మాత్రా చ పిత్రా చ వివిధాశ్రయమ్।
నాఽస్మి సంప్రతి వక్తవ్యా వర్తితవ్యం యథా మయా। 10

అహం దుర్గం గమిష్యామి వనం పురుషవర్జితమ్।
నానామృగగణాకీర్ణం శార్దూలవృకసేవితమ్। 11

సుఖం వనే నివత్స్యామి యథైవ భవనే పితుః।
అచింతయంతీ త్రీన్ లోకాన్ చింతయంతీ పతివ్రతమ్। 12

శుశ్రూషమాణా తే నిత్యం నియతా బ్రహ్మచారిణీ।
సహ రంస్యే త్వయా వీర! వనేషు మధుగంధిషు। 13

త్వం హి శక్తో వనే కర్తుం రామ! సంపరిపాలనమ్।
అన్యస్యాపి జనస్యేహ కిం పునర్మమ మానద! 14

సహ త్వయా గమిష్యామి వనమద్య న సంశయః।
నాహం శక్యా మహాభాగ! నివర్తయితుముద్యతా। 15

ఫలమూలాశనా నిత్యం భవిష్యామి న సంశయః।
న తే దుఃఖం కరిష్యామి నివసంతీ సహ త్వయా। 16

ఇచ్ఛామి సరితశ్శైలాన్ పల్వలాని వనాని చ।
ద్రష్టుం సర్వత్ర నిర్భీతా త్వయా నాథేన ధీమతా। 17

హంసకారండవాకీర్ణాః పద్మినీః సాధుపుష్పితాః।
ఇచ్ఛేయం సుఖినీ ద్రష్టుం త్వయా వీరేణ సంగతా। 18

అభిషేకం కరిష్యామి తాసు నిత్యం యతవ్రతా।
సహ త్వయా విశాలాక్ష! రంస్యే పరమనందినీ। 19

ఏవం వర్షసహస్రాణాం శతం వాఽహం త్వయా సహ।
వ్యతిక్రమం న వేత్స్యామి స్వర్గోఽపి న హి మే మతః। 20

భర్తతోగూడి మసలుకొనువిషయమున మా తల్లిదండ్రులు నాకు చక్కగా బోధచేసిరి. అట్లే అత్తమామలయెడలను, తోడివారి తోడను తదితరులవిషయమునను ప్రవర్తించుటనుగూర్చి వారికడ నేను సుశిక్షితురాలను. 'ఎవరియెడల ఎట్లు ప్రవర్తింపవలెను' అను విషయమున ఇప్పుడు నాకు ప్రత్యేకముగా బోధింపవలసిన అవసరమేలేదు. (10)

జనసంచారమేలేక, వివిధమృగములతో నిండి, పెద్ద పులులు, తోడేళ్లు మొదలగు క్రూరమృగములు సంచరించునట్టి కీకారణ్యముల యందును మీవెంట నేను నిర్భయముగా నడువగలను. (11)

పుట్టింటిలోవలెనే వనములలోను నేను సుఖముగానుందును. అట్టి సౌభాగ్యముముందు త్రిలోకైశ్వర్యములుసైతము దిగదుడుపే. అచట నిరంతరము పతిసేవించుచు ఆ సేవలయందే నిమగ్నురాలనై యుందును. (12)

ఓ మహావీరా! నియమనిష్ఠలతో బ్రహ్మచర్యమును పాటించుచు నేను నిత్యము మీకు శుశ్రూషలు చేయుచుందును. పుష్పశోభితమైన వనములయందు మీతో విహరించుచు అచట సంతోషముగా నుందును. (13)

అందరిని గౌరవించువాడా! వనములలో నివసించు మునీశ్వరులు మున్నగు వారినందరినీ బాగుగా రక్షింపగల సమర్థుడవు నీవు - ఇంక అచట నారక్షణ విషయమై చెప్పనేల? (14)

ఓ మహాత్మా! ఇప్పుడు నీతోగూడి నేను వనములకు బయలుదేరు చున్నాను. ఇందు సందేహమునకు తావులేదు. వనగమనమునకు ఉద్యుక్తురాలనైన నన్ను ఏవిధముగను నివారింపరాదు. (15)

ఆర్యా! అన్నపానాదులవిషయమున మీకు నేను ఎట్టి కష్టములనూ కలిగింపను. మీతోపాటు నిశ్శంకోచముగా కందమూలఫలములను ఆహారముగా స్వీకరించుచు గడిపెదను. (16)

స్వామీ! నీవు ధీశాలివి. నానాథుడవైన నీవు నావెంటనుండగా అంతటను నిర్భయముగా సంచరించుచు, నదీతీరములను, పర్వత ప్రాంతములను, నీటిమడుగులను, వివిధములగు వనములను దర్శింపగోరుచున్నాను. (17)

నాథా! వీరుడవైన నీతోగూడి, హంసలతో, జలకుక్కుటములతో ఒప్పుచు, చక్కగా వికసించిన పుష్పములతో విలసిల్లుచు, కనువిందు గావించుచుండెడి పద్మసరస్సులను హాయిగా చూడవేడుక పడుచున్నాను. (18)

ఓ విశాలాక్షా! నేను నిరంతరము మీ పాదపద్మములయందే అనురక్తురాలనై యుందును. ఆ సరోవరములలో మీతోగూడి జలకములాడుచు పరమానందముతో విహరించెదను. (19)

ఈ విధముగా నేను మీతోగూడి విహరించుచు వందలవేల కొలదిసంవత్సరములైనను ఒక్కక్షణమువలె గడిపెదను. ఇక పదునాలుగుసంవత్సరములు ఒకలెక్కయా? ఇంతకుమించి స్వర్గసుఖములనైనను నేను ఆశింపను- (20)

స్వర్గేఽపి చ వినా వాసో భవితా యది రాఘవ।
త్వయా మమ నరవ్యాఘ్ర! నాహం తమపి రోచయే। 21

ఓ నరోత్తమా! మీరులేకుండా స్వర్గవాససుఖములు లభించినను వాటికి నేను ఇష్టపడను. మీవెంట ఉండుట తప్ప ఇంక నాకేదియు అక్కఱలేదు. (21)

అహం గమిష్యామి వనం సుదుర్గమం
మృగాయుతం వానరవారణైర్యుతమ్।
వనే నివత్స్యామి యథా పితుర్గృహే
తవైవ పాదావుపగృహ్య సంయతా। 22

ఓ ప్రాణనాథా! వేలకొలదిమృగములతో, వానరములతో, ఏనుగులతో క్రిక్కిరిసి యుండెడి దట్టమైన దుర్గమారణ్యములకు మీతో వచ్చెదను. అచట నియమపాలనముతో మీచరణములను సేవించుచు, మాతండ్రిగారి గృహమునందువలె సుఖముగానుండెదను- (22)

అనన్యభావామనురక్తచేతసం
త్వయా వియుక్తాం మరణాయ నిశ్చితామ్।
నయస్వ మాం సాధు కురుష్వ యాచనాం
న తే మయాఽతో గురుతా భవిష్యతి। 23

స్వామీ! నా హృదయమునందు మిమ్మే పూర్తిగా నిలుపుకొనియున్నాను. మీయందే బద్ధానురాగను. నీవు నాకు దూరమైనచో నేను మరణించుట తథ్యము. నాప్రార్థనను మన్నించి, నన్ను నీవెంట తీసికొనిపొమ్ము. నేను అచట నీకు ఏవిధముగను భారము కాను." (23)

తథా బ్రువాణామపి ధర్మవత్సలో
న చ స్మ సీతాం నృవరో నినీషతి।
ఉవాచ చైనాం బహు సన్నివర్తనే
వనే నివాసస్య చ దుఃఖితాం ప్రతి। 24

సీతాదేవి ఈవిధముగా పలుకుచున్నను, వనములలో ఎదురగు కష్టములకు ఆమెను గురిచేయుటకు ఇష్టపడనివాడై, ధర్మవత్సలుడైన శ్రీరాముడు ఆమెను తనవెంట దండకారణ్యమునకు తీసికొనిపోవుటకు విముఖత కలిగియుండెను. వనగమనేచ్ఛ నుండి సీతాదేవిని మఱలించుటకై నరశ్రేష్ఠుడగు రఘువరుడు అచట తటస్థించు కష్టములను గూర్చి ఆమెకు ఇట్లు వివరింపసాగెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తవింశస్సర్గః *(27)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదియేడవసర్గము సమాప్తము.

-- * * * --

28. ఇరువదియెనిమిదవసర్గము

వనవాసమునందలి కష్టములనుగూర్చి శ్రీరాముడు సీతాదేవికి వివరించుట.

స ఏవం బ్రువతీం సీతాం ధర్మజ్ఞో ధర్మవత్సలః।
న నేతుం కురుతే బుద్ధిం వనే దుఃఖాని చింతయన్। 1

సాంత్వయిత్వా పునస్తాం తు బాష్పదూషితలోచనామ్।
నివర్తనార్థే ధర్మాత్మా వాక్యమేతదువాచ హ। 2

సీతాదేవిపలుకులు ధర్మసమ్మతములేయని యెఱింగియు, ధర్మవత్సలుడైన శ్రీరాముడు ఆమెపైగల ప్రేమకారణముగా వనములలో సంభవించు ఇడుములనుగూర్చి ఆలోచించుచు, ఆమెను తనవెంట తీసికొని వెళ్ళుటకు సిద్ధపడకుండెను. అంతట ఆ ధర్మాత్ముడు కన్నీరు మున్నీరుగా విలపించుచున్న ఆమెను ఓదార్చుచు, ఆమెవనవాససంకల్పమును మార్చుటకై మఱల ఆమెతో ఇట్లు పలుకసాగెను. (1-2)

సీతే! మహాకులీనాఽసి ధర్మే చ నిరతా సదా।
ఇహాఽఽచరస్వ ధర్మం త్వం మా యథా మనసస్సుఖమ్। 3

సీతే! యథా త్వాం వక్ష్యామి తథా కార్యం త్వయాఽబలే!।
వనే దోషా హి బహవో వదతస్తాన్ నిబోధ మే। 4

"ఓ సీతా! నీవు ఉత్తమవంశమున జన్మించితివి. ఎల్లప్పుడును ధర్మాచరణమునందే నిరతురాలవు. కనుక నీవు ఇచటనేయుండి నీ ధర్మములను ఆచరించుచుండుము. తొందరపాటుతోగూడిన దుఃఖావేశపుఆలోచనలకు తావీయకుము. ఓ జానకీ! ఓ అబలా! (నీసుఖశాంతులకై) నేను నుడువుచున్న నామాటలను వినుము. (నేను చెప్పినట్లు నడచుకొనుము). వనములలో పెక్కుకష్టములు ఎదురగుచుండును. వాటినిగూర్చి చెప్పెదను గ్రహింపుము. (3-4)

సీతే! విముచ్యతామేషా వనవాసకృతా మతిః।
బహుదోషం హి కాంతారం వనమిత్యభిధీయతే। 5

హితబుద్ధ్యా ఖలు వచో మయైతదభిధీయతే।
సదా సుఖం న జానామి దుఃఖమేవ సదా వనమ్। 6

గిరినిర్ఝరసంభూతా గిరికందరవాసినామ్।
సింహానాం నినదా దుఃఖాః శ్రోతుం దుఃఖమతో వనమ్। 7

క్రీడమానాశ్చ విస్రబ్ధా మత్తాః శూన్యే మహామృగాః।
దృష్ట్వా సమభివర్తంతే సీతే దుఃఖమతో వనమ్। 8

సగ్రాహాః సరితశ్చైవ పంకవత్యః సుదుస్తరాః।
మత్తైరపి గజైర్నిత్యమ్ అతో దుఃఖతరం వనమ్। 9

లతాకంటకసంకీర్ణాః కృకవాకూపనాదితాః।
నిరపాశ్చ సుదుర్గాశ్చ మార్గా దుఃఖమతో వనమ్। 10

సుప్యతే పర్ణశయ్యాసు స్వయం భగ్నాసు భూతలే।
రాత్రిషు శ్రమఖిన్నేన తస్మాద్దుఃఖతరం వనమ్। 11

అహోరాత్రం చ సంతోషః కర్తవ్యో నియతాత్మనా।
ఫలైర్వృక్షావపతితైః సీతే! దుఃఖతరమ్ వనమ్। 12

ఉపవాసశ్చ కర్తవ్యో యథా ప్రాణేన మైథిలి!।
జటాభారశ్చ కర్తవ్యో వల్కలాంబరధారిణా। 13

దేవతానాం పితౄణాం చ కర్తవ్యం విధిపూర్వకమ్।
ప్రాప్తానామతిథీనాం చ నిత్యశః ప్రతిపూజనమ్। 14

కార్యస్త్రిరభిషేకశ్చ కాలే కాలే చ నిత్యశః।
చరతా నియమేనైవ తస్మాద్దుఃఖతరం వనమ్। 15

ఉపహారశ్చ కర్తవ్యః కుసుమైః స్వయమాహృతైః।
ఆర్షేణ విధినా వేద్యాం బాలే! దుఃఖమతో వనమ్। 16

ఓ సీతా! (నావెంట) వనములకు రావలెనను ఈ సంకల్పమును విడిచిపెట్టుము. దుర్గమారణ్యములలోని జీవనము పెక్కుకష్టములతో గూడినది. ఇది అనుభవజ్ఞులమాట. నీ హితమును గోరియే ఈ మాటలను నీకు చెప్పుచుంటిని. వనజీవనమున ఎన్నడును సుఖము లభింపదు. నిరంతరము అది దుఃఖములకు నిలయము- పర్వతముల నుండి దూకుచుండునట్టి సెలయేళ్లజోరులును, కొండగుహలలో నివసించుచుండెడి సింహగర్జనలును వినుటకు భయంకరముగానుండి గుండెలను అదరజేయుచుండును. కనుక వనవాసము దుఃఖమయము. నిర్జనారణ్యములయందు స్వేచ్ఛగా విహరించుచు మత్తిల్లిన సింహములు, పెద్దపులులు, మొదలగు క్రూరమృగములు మనలను జూచి, చంపుటకై వచ్చి మీదబడుచుండును. కనుక సీతా! వనములు దుఃఖభూయిష్ఠములు (5-8)

అడవులలోని నదులన్నియును మొసళ్లతోను, బురదలతోను నిండి, దాటుటకు వీలులేకుండును. అంతేగాక అచటి మదపుటేనుగులు స్వేచ్ఛగా తిరుగాడుచు భయమును గొల్పుచుండును. అరణ్యములు కష్టములకు ఆలవాలములు. అడవులలో దారులకు అడ్డముగా తీగలు అల్లుకొనియుండును, త్రోవలలోని ముళ్లు కాళ్లకు గ్రుచ్చుకొని బాధ కల్గించుచుండును. అడవికోళ్లు భయంకరముగా కూయుచుండును. దాహబాధ తీర్చుకొనుటకు అచట ఒక్కచుక్క నీరుగూడ దొరకదు. దారులన్నియును అడుగుపెట్టుటకు వీలులేకుండ ఉండును. కనుక వనవాసము దుఃఖములకు నెలవు. (9-10)

వనములయందు నివసించువారికి అచట పర్యంకములు ఉండవు. నేలమీదనే పరుండవలెను. హంసతూలికాతల్పములుండవు పండి రాలిన ఆకులపైననే శయనింపవలెను. రాత్రులయందే విశ్రాంతికి అవకాశము దొరకును- కనుక వనజీవనము దుఃఖ పూరితమైనది. (11)

అచట షడ్రసోపేతమైన భోజనపదార్థములుండవు. చెట్లనుండి రాలిన పండ్లను మాత్రమే భుజించుచు, రాత్రింబవళ్లు నియమ జీవనమును (మఱియే ఇతరపదార్థములను ఆశింపక) గడపవలెను. ఓ మిథిలారాజకుమారీ! వనవాసమున యథాశక్తి ఉపవాసములతోడనే గడుపవలెను, శిరమున జటాభారమును వహింపవలెను, నారచీరలనే ధరింపవలెను. ఇదియే అచటి జీవనవిధానము- (12-13)

దేవతలను, పితృదేవతలను, ఆయాసమయములయందు విచ్చేసిన అతిథిదేవతలను యథావిధిగా నిత్యము పూజింపవలెను. ప్రతిదినము ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము (మూడువేళల యందును) నియమపూర్వకముగా స్నానాదులనాచరించుచు నిష్ఠాజీవనమును కొనసాగింపవలెను. అందువలన వనవాసము క్లేశములతో నిండినది సుమా! (14-15)

ఓ అమాయకురాలా! స్వయముగా శ్రమపడితీసికొనివచ్చిన పూవులతో, ఋషిప్రోక్తముగా, విధివిధానముగా వేదిక యందు దైవారాధన చేయవలెను. బలివిధులను నడుపవలయును ఓ మైథిలీ!

యథా లబ్ధేన కర్తవ్యః సంతోషస్తేన మైథిలి।
యతాహారైర్వనచరైః నిత్యం దుఃఖమతో వనమ్। 17

అతీవ వాతాస్తిమిరం బుభుక్షా చాత్ర నిత్యశః।
భయాని చ మహాంత్యత్ర తతో దుఃఖతరం వనమ్। 18

సరీసృపాశ్చ బహవో బహురూపాశ్చ భామిని।
చరంతి పృథివీం దర్పాత్ తతో దుఃఖతరం వనమ్। 19

నదీనిలయనాః సర్పాః నదీకుటిలగామినః।
తిష్ఠంత్యావృత్య పంథానం తతో దుఃఖతరం వనమ్। 20

పతంగా వృశ్చికాః కీటాః దంశాశ్చ మశకైస్సహ।
బాధంతే నిత్యమబలే సర్వం దుఃఖమతో వనమ్। 21

ద్రుమాః కంటకినశ్చైవ కుశకాశాశ్చ భామిని।
వనే వ్యాకులశాఖాగ్రాః తేన దుఃఖతరం వనమ్। 22

కాయక్లేశాశ్చ బహవో భయాని వివిధాని చ।
అరణ్యవాసే వసతో దుఃఖమేవ తతో వనమ్। 23

క్రోధలోభౌ విమోక్తవ్యౌ కర్తవ్యా తపసే మతిః।
న భేతవ్యం చ భేతవ్యే నిత్యం దుఃఖమతో వనమ్। 24

తదలం తే వనం గత్వా క్షమం న హి వనం తవ।
విమృశన్నిహ పశ్యామి బహుదోషకరం వనమ్। 25

వనం తు నేతుం న కృతా మతిస్తదా
బభూవ రామేణ యథా మహాత్మనా ।
న తస్య సీతా వచనం చకార తత్
తతోఽబ్రవీద్రామమిదం సుదుఃఖితా । 26

లభించిన ఫలాదులను మాత్రమే నియమపూర్వకముగ భుజించుచు, వనవాసులు నిత్యము తృప్తితో మనుగడసాగింపవలెను. అందువలన అరణ్య జీవితము దుఃఖకారకము- (16-17)

ఓ రాకుమారీ! అచట వీచెడి పెనుగాలులకు తట్టుకొనుట అసాధ్యము. చిమ్మచీకట్లతోగూడిన దీర్ఘములైన రాత్రులు భయావహములు. నిత్యము అచట ఆకలిబాధకు ఓర్చుకొనుట ఎంతేని కష్టము- ఇంతయేందులకు? వనవాసజీవితము మిక్కిలి భయంకరమైనది, దుస్సహమైనది- (18)

ఓ భామినీ! వివిధాకారములుగల పెక్కు విషసర్పములు బుసలు గొట్టుచు అచటి నేలపై అనుక్షణము తిరుగుచునే యుండును. ఇట్టి వాటికి తట్టుకొనుట యెంతయు కష్టము. (19)

నదులను ఆశ్రయించి జీవించు మహాసర్పములు నదులవలె వంకరటింకరగా ప్రాకుచు దారులకు అడ్డముగా చేరి, ప్రమాదకరములై యుండును. ఓ అబలా! వీటిసంగతి సరేసరి - ఇంకను అచట సంచరించెడి మిడుతలు, తేళ్లు, ముండ్రగబ్బలు, విషపుపురుగులు, అడవి-ఈగలు, దోమలు మొదలగువాటిబాధ చెప్పనలవిగానిది. వనవాసమున సర్వదా ఆ క్లేశములను భరించుట మిగుల కష్టము- (20-21)

అడవులలో ముండ్లచెట్లు, మొనదేలిన దర్భలు, రెల్లుగడ్డి మొదలగువాటివలన కలుగు కష్టములకు అంతేయుండదు. అరణ్యములలో నివసించువారు పెక్కువిధములగు శారీరిక క్లేశములను, నానాప్రకారములైన భయంకరపరిస్థితులను ఎదుర్కొనవలసియుండును. కనుక వనజీవనము మిక్కిలి దుర్భరము- క్రోధలోభములను పరిత్యజించి, తపోనియమనిరతులై, అచట జీవింపవలెను- అనుక్షణము భయంకరపరిస్థితులు ఎదురగుచున్నను నిర్భయముగానుండవలెను. ఆలోచించినకొలదియు వనవాసమున ఇంకను ఎన్నియో కష్టములే తోచుచున్నవి. కనుక ఓ మైథిలీ! సుకుమారివైన నీకు దుర్భరమైన వనజీవనము ఏ మాత్రమూ తగదు. అందువలన నీవు వనగమనాభిలాషను విడనాడుటయే మంచిది." (22-25)

'మహాత్ముడైన శ్రీరాముడు తనను వనములకు తీసికొని వెళ్లుటకు ఇష్టపడుటలేదు'- అను విషయమును సీతాదేవి గ్రహించెను. కాని ఆయనమాటలను ఆమోదింపక ఆమె కడుదుఃఖితయై, ఆ రఘురామునితో ఇంకను ఇట్లు పలికెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టావింశస్సర్గః *(28)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదియెనిమిదవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

29. ఇరువదితొమ్మిదవసర్గము

'అన్ని పరిస్థితులలోను భార్య భర్తను అనుసరించుటయే యుక్తము' - అని పలికి సీతాదేవి పతివెంట వనములకు వెళ్ళుటకు సిద్ధపడుట.

ఏతత్తు వచనం శ్రుత్వా సీతా రామస్య దుఃఖితా।
ప్రసక్తాశ్రుముఖీ మందమ్ ఇదం వచనమబ్రవీత్। 1

ఇట్లు శ్రీరామచంద్రుడు పలికిన సాంత్వనవచనములను విని, సీతాదేవి మిగుల దుఃఖితురాలై కన్నీరు గార్చుచు తిన్నతిన్నగా ఆయనతో ఈ విధముగా పలికెను. (1)

యే త్వయా కీర్తితా దోషా వనే వస్తవ్యతాం ప్రతి।
గుణానిత్యేవ తాన్ విద్ధి తవ స్నేహపురస్కృతాన్। 2

"నాథా! ఇంతవఱకును మీరు వనవాసమున తటస్థించు పెక్కు కష్టనష్టములనుగూర్చి బహురీతుల వివరించితిరి- నిజమే. కాని ప్రేమపూర్ణమైన మీ సాహచర్యప్రభావమున అవియన్నియును నాకు సుఖావహములేయగును. వాటినన్నింటిని మీ కృపతో నేను అవలీలగా అధిగమింతును- ఈ విషయమును సావధానముగా గ్రహింపుడు- (2)

మృగాః సింహా గజాశ్చైవ శార్దూలాశ్శరభాస్తథా।
పక్షిణః సృమరాశ్చైవ యే చాన్యే వనచారిణః। 3

అదృష్టపూర్వరూపత్వాత్ సర్వే తే తవ రాఘవ!।
రూపం దృష్ట్వాఽపసర్పేయుః భయే సర్వే హి బిభ్యతి। 4

వనవాససమయమున మృగములు, సింహములు, మదపుటేనుగులు, పెద్దపులులు, శరభమృగములు (ఎనిమిది కాళ్ళ మృగములు) అట్లే హింసాత్మకములైన పక్షులు, అడవిదున్నలు, (సవరపుమెకములు) ఇంకను వనమున సంచరించు ఇతరక్రూరమృగములు మనకు ఎదురుపడవచ్చును. కాని అవియన్నియును మునుపెన్నడును నిన్ను చూచియుండనందున నీ రూపమును గాంచి, భయముతో తొలగి పాఱిపోవును. (3-4)

త్వయా చ సహ గంతవ్యం మయా గురుజనాజ్ఞయా।
త్వద్వియోగేన మే రామ! త్యక్తవ్యమిహ జీవితమ్। 5

ప్రభూ! మాతండ్రి జనకుడు కన్యాదానసమయమున నన్ను మీకు సహధర్మచారిణిగా అప్పగించెను. కనుక నేను మీతోగూడి చరించుటకై వనములకు వచ్చుటయే ధర్మము. అంతేగాక ఆలుమగలబంధము విడదీయరానిది. అందువలన దశరథమహారాజు వనవాసమునకై మీకిచ్చిన ఆదేశము నాకును వర్తించును. మీకు దూరముగా ఇచటనే యుండవలసివచ్చినచో నేను నా జీవితమును చాలించుటయే యుక్తము- (5)

న చ మాం త్వత్సమీపస్థామ్ అపి శక్నోతి రాఘవ!।
సురాణామీశ్వరః శక్రః ప్రధర్షయితుమోజసా। 6

పతిహీనా తు యా నారీ న సా శక్ష్యతి జీవితుమ్।
కామమేవంవిధం రామ! త్వయా మమ విదర్శితమ్। 7

ఓ రఘువరా! నేను మీ రక్షణలో మీ చెంతనుండగా మహాశక్తిసంపన్నుడు, దేవతలకు ప్రభువునైన మహేంద్రుడు సైతము నాకు ఎట్టిహానియు తలపెట్టజాలడు. ఓ రామచంద్రా! ఏ సతియైనను పతికి దూరముగానుండి జీవించుట దుర్భరము. అశక్యము. కనుక నీవు నాకు చేయుచున్న ఈ హితబోధలు ఇక చాలును. (6-7)

అథ చాపి మహాప్రాజ్ఞ! బ్రాహ్మణానాం మయా శ్రుతమ్।
పురా పితృగృహే సత్యం వస్తవ్యం కిల మే వనే। 8

లక్షణిభ్యో ద్విజాతిభ్యః శ్రుత్వాఽహం వచనం పురా।
వనవాసకృతోత్సాహా నిత్యమేవ మహాబల!। 9

ఆదేశో వనవాసస్య ప్రాప్తవ్యస్స మయా కిల।
సా త్వయా సహ తత్రాహం యాస్యామి ప్రియ! నాన్యథా। 10

ఓ మహాప్రాజ్ఞా! అంతేగాదు. మఱియొక విషయమునుగూడ తెల్పెదను. మాజనకునింటనుండగా దైవజ్ఞులైన బ్రాహ్మణోత్తములు 'ఈ జానకికి వనవాసము తప్పదు' అని పలుకుటను నేను వినియుంటిని. ఓ మహావీరా! ఇంకను సాముద్రికశాస్త్రజ్ఞులైన బ్రాహ్మణులును 'ఈమె వనవాసజీవితమునందు ఉత్సాహము గలది' అని నుడువగా నేను వింటిని - అది సత్యము. ఓ నాథా! నా వనవాసవిషయమున బ్రాహ్మణోత్తములు పలికిన శాస్త్రప్రమాణ వచనములు ఏదేనియొకనాడు నిజముకావలసియేయున్నవి. కనుక నేను మీతోగూడి వనములకు వచ్చుచున్నాను. ఒంటరిగా వెళ్ళుట

కృతాదేశా భవిష్యామి గమిష్యామి సహ త్వయా।
కాలశ్చాయం సముత్పన్నః సత్యవాగ్భవతు ద్విజః। 11

వనవాసేఽభిజానామి దుఃఖాని బహుధా కిల।
ప్రాప్యంతే నియతం వీర! పురుషైరకృతాత్మభిః। 12

కన్యయా చ పితుర్గేహే వనవాసః శ్రుతో మయా।
భిక్షిణ్యాః సాధువృత్తాయా మమ మాతురిహాగ్రతః। 13

ప్రసాదితశ్చ వై పూర్వం త్వం వై బహువిధం ప్రభో!।
గమనం వనవాసస్య కాంక్షితం హి సహ త్వయా। 14

కృతక్షణాఽహం భద్రం తే గమనం ప్రతి రాఘవ।
వనవాసస్య శూరస్య చర్యా హి మమ రోచతే। 15

శుద్ధాత్మన్ ప్రేమభావాద్ధి భవిష్యామి వికల్మషా।
భర్తారమ్ అనుగచ్ఛంతీ భర్తా హి మమ దైవతమ్। 16

ప్రేత్యభావేఽపి కల్యాణః సంగమో మే సహ త్వయా। 17

శ్రుతిర్హి శ్రూయతే పుణ్యా బ్రాహ్మణానాం యశస్వినామ్।
ఇహ లోకే చ పితృభిః యా స్త్రీ యస్య మహామతే!।
అద్భిర్దత్తా స్వధర్మేణ ప్రేత్యభావేఽపి తస్య సా। 18

ఏవ మస్మాత్ స్వకాం నారీం సువృత్తాం హి పతివ్రతామ్।
నాభిరోచయసే నేతుం త్వం మాం కేనేహ హేతునా। 19

భక్తాం పతివ్రతాం దీనాం మాం సమాం సుఖదుఃఖయోః।
నేతుమర్హసి కాకుత్స్థ! సమానసుఖదుఃఖినీమ్। 20

యది మాం దుఃఖితామేవం వనం నేతుం న చేచ్ఛసి।
విషమగ్నిం జలం వాఽహమ్ ఆస్థాస్యే మృత్యుకారణాత్। 21

లేదుగదా - జ్యోతిష, సాముద్రిక శాస్త్రప్రమాణములను అనుసరించి, నేను వనవాసము చేయవలసియేయున్నది. అందులకు సమయము గూడ ఆసన్నమైనది. కావున మీతోగూడి నేనును వనములకు వత్తును. బ్రాహ్మణోత్తములభవిష్యవాణియు సత్యమగును. వనవాసమున ఎదురగు వివిధములగు దుఃఖములను అన్నింటిని నేను బాగుగా ఎఱుగుదును. ముందుగా అచటికష్టములు తెలియనివారికి మాత్రమే అవి బాధాకరములు. నావంటి వారికికావు. (8-12)

నేను మాతండ్రియింట కన్యగా ఉన్నప్పుడు ప్రశాంత జీవనము గడిపెడి ఒకభిక్షుకి మాకడకు వచ్చెను. ఆమె మా తల్లిసమక్షముననే నా వనవాసమును గూర్చి ప్రస్తావింపగా నేను వినియుంటిని. ఓ మహాప్రభూ! నేను ఇక్కడికి వచ్చిన పిమ్మటగూడ లోగడ పెక్కుపర్యాయములు 'కొంతకాలము గంగాతీరమునగల వనములయందు మీతోగూడి గడుపవలెను' అను నా కోరికను మీకు తెలిపియుంటిని. అందులకు మీరును ఆమోదించియుంటిరి. (13-14)

ఓ రఘునందనా! నాటినుండియు నేను వనగమనవార్తకై నిరీక్షించుచుంటిని. మిదుమిక్కిలి వనవాససమయమున శూరుడవైన నీకు సేవలొనర్చుచుండుట నాకు ఎంతేని ఇష్టము- కావున ఓ స్వామీ! నన్ను నీవెంట వచ్చుటకు అనుమతింపుము. నీకు పుణ్యముండును. (15)

ఓ పుణ్యాత్మా! నాపతివైన నిన్ను ప్రేమాదరములతో అనుసరించుచు సేవించుచుండుటవలన నా దోషములన్నియు తొలగి, పవిత్రురాలను అగుదును. ఏలనన నాకు పతియే ప్రత్యక్ష దైవము. పరలోకమునందును నీ సాంగత్యమే (నీ సాహచర్యమే) నాకు శుభప్రదము. (16-17)

ఓ మహాత్మా! వాసిగాంచిన బ్రాహ్మణోత్తములు పేర్కొనెడి శ్రుతిప్రమాణానుసారము 'తల్లిదండ్రులు మున్నగువారిచే (కన్యాదాతలచే) దానజలపూర్వకముగా తమతమవర్ణధర్మములను అనుసరించి, అప్పగింపబడిన వధువు ఆ పురుషునకు (వరునకు) ఈ లోకమునందే గాక పరలోకమునందును చెందును-'(18)

ప్రభూ! ఇట్టి ప్రబలమైన శ్రుతిప్రమాణమునమసరించి, మాతండ్రి జనకుడు దానజలపూర్వకముగా నన్ను నీకు ధారపోసెను. నేను సౌశీల్యవతిని. పతిసేవాపరాయణను, నీకు అర్ధాంగిని. అట్టి నన్ను నీవెంట గొనిపోవుటకు ఎందులకు ఇష్టపడుటలేదు? నేను నీయందు భక్తిశ్రద్ధలుగలదానను, పతివ్రతను. నేను నీవెంట వచ్చుటకై దీనురాలనై వేడుకొనుచున్నాను. నీ సుఖదుఃఖములలో భాగస్వామిని నేను. ఓ కాకుత్స్థా! వనవాస సమయమున కష్టసుఖములను రెండింటినీ నేను సమానముగనే భావింతును. అట్టి నన్ను నీవెంట దీసికొని వెళ్లుటయే సముచితము- (19-20)

దుఃఖితనై ఇంతగా ప్రాధేయపడుచున్న నన్ను నీవెంటగొని పోవుటకు నీవు సమ్మతింపనిచో నేను విషమును త్రాగిగాని, అగ్నిలో ప్రవేశించిగాని, నీటమునిగిగాని మృత్యుదేవతయొడిని చేరెదను."

ఏవం బహువిధం తం సా యాచతే గమనం ప్రతి।
నానుమేనే మహాబాహుః తాం నేతుం విజనం వనమ్॥ 22

ఏవముక్తా తు సా చింతాం మైథిలీ సముపాగతా।
స్నాపయంతీవ గాముష్ణైః అశ్రుభిర్నయనచ్యుతైః॥ 23

చింతయంతీం తథా తాం తు నివర్తయితుమాత్మవాన్।
తామ్రోష్ఠీం స తదా సీతాం కాకుత్స్థో బహ్వసాంత్వయత్॥ 24

'వనములకు నన్ను నీవెంటగొనిపొమ్ము' అనుచు సీతాదేవి ఎంతగా (ఎన్ని విధముల) ప్రతిమాలినను మహాబాహుడైన ఆ శ్రీరాముడు ఆమెను నిర్జనారణ్యములకు గొనిపోవుటకు సమ్మతింపలేదు. (21-22)

వనవాసమునకు తనను గొనిపోవుటకు రాముడు నిరాకరింపగా మిక్కిలి చింతాక్రాంతయైన మైథిలి తనకనులనుండి స్రవించుచున్న వేడివేడి దుఃఖాశ్రువులతో నేలను తడుపుచున్నదాయనునట్లు విలపించెను. (23)

అట్లు మిగుల వగచుచున్న ఆ సీతాదేవిని వనగమనసంకల్పము నుండి మరలించుటకై ప్రజ్ఞాశాలియైన శ్రీరాముడు పెక్కురీతుల ఆమెను ఓదార్చెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనత్రింశస్సర్గః (29)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఇరువదితొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

30. ముప్పదియవసర్గము

సీతాదేవి తనవెంట వనములకు వచ్చుటకు శ్రీరాముడు సమ్మతించుట. అతడు మాతాపితృసేవల ప్రాముఖ్యమును, పరమార్థమును వివరించుట.

సాంత్వ్యమానా తు రామేణ మైథిలీ జనకాత్మజా।
వనవాసనిమిత్తాయ భర్తారమ్ ఇదమబ్రవీత్॥ 1

సా తముత్తమసంవిగ్నా సీతా విపులవక్షసమ్।
ప్రణయాచ్చాభిమానాచ్చ పరిచిక్షేప రాఘవమ్॥ 2

కిం త్వాఽమన్యత వైదేహః పితా మే మిథిలాధిపః।
రామ! జామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహమ్॥ 3

అనృతం బత లోకోఽయమ్ అజ్ఞానాద్యద్ధి వక్ష్యతి।
తేజో నాస్తి పరం రామే తపతీవ దివాకరే॥ 4

కిం హి కృత్వా విషణ్ణస్త్వం కుతో వా భయమస్తి తే।
యత్ పరిత్యక్తుకామస్త్వం మామనన్యపరాయణామ్॥ 5

ద్యుమత్సేనసుతం వీర! సత్యవంతమనువ్రతామ్।
సావిత్రీమివ మాం విద్ధి త్వమాత్మవశవర్తినీమ్॥ 6

శ్రీరాముడెంతగా ఓదార్చినను జనకపుత్రికయైన మైథిలి అందులకు సమ్మతింపక తనవనవాసవిషయమై భర్తతో మరల ఇట్లు నుడివెను. (1)

తనకెదురైన విషమపరిస్థితికి సీతాదేవి కంపించిపోవుచున్నదై, భర్తపై తనకుగల ప్రేమాతిరేకముచేతను, (తన నాథుడే తనను ఇట్లు దూరముగా ఉంచునా? యను) కినుకతోడను విశాలవక్షఃస్థలము గల ఆ రఘువరుని గట్టిగా నిలదీసెను. "ఓ రామా! నన్ను ఇచటనే వీడి, నీవు వనవాసమునకు వెళ్లినట్లు మా తండ్రియు, మిథిలాధిపతియు ఐన జనకమహారాజునకు తెలిసినచో 'నా అల్లుడు ఆకారమున పురుషుడయ్యును, స్వభావముచే 'స్త్రీ' అని నన్ను గూర్చి తలంచునోయేమో? (2-3)

ఓ రామా! నన్ను నీవెంట వనములకు గొనిపోనిచో 'రాముడు పరాక్రమహీనుడు'-అని లోకులు భావింపవచ్చును. అప్పుడు వారు 'ప్రకాశించుచున్న సూర్యునిలో ఉన్నట్లుగా రామునిలో తేజస్సులేదు'- అని పలుకవచ్చును గూడ. అది వారి అజ్ఞానమునే సూచించును. అది అనృతమేయైనను నాకు మిగుల బాధాకరము. (4)

స్వామీ! నీవు నీమనములో ఏదియో 'గిలి' పెట్టుకొని బాధపడుచున్నావు. ఏమిటది? నీ భయమునకు కారణమేమి? నిన్నే ఆశ్రయించుకొనియున్న నన్ను ఎందులకు ఇచటనే వదలివెళ్లదలచినావు? ఓ మహావీరా! పతివ్రతయైన సావిత్రి ద్యుమత్సేనునికుమారుడైన సత్యవంతునియనుగామినియైన రీతిగా నేనును నీయాజ్ఞలకు

న త్వహం మనసాఽప్యన్యం ద్రష్టాఽస్మి త్వదృతేఽనఘ! ।
త్వయా రాఘవ! గచ్ఛేయం యథాఽన్యా కులపాంసనీ । 7

స్వయం తు భార్యాం కౌమారీం చిరమధ్యుషితాం సతీమ్ ।
శైలూష ఇవ మాం రామ! పరేభ్యో దాతుమిచ్ఛసి । 8

యస్య పథ్యం చ రామాఽఽత్థ యస్య చార్థేఽవరుధ్యసే ।
త్వం తస్య భవ వశ్యశ్చ విధేయశ్చ సదాఽనఘ! । 9

స మామనాదాయ వనం న త్వం ప్రస్థాతుమర్హసి ।
తపో వా యది వాఽరణ్యం స్వర్గో వా స్యాత్ సహ త్వయా । 10

న చ మే భవితా తత్ర కశ్చిత్ పథి పరిశ్రమః ।
పృష్ఠతస్తవ గచ్ఛంత్యా విహారశయనేష్వివ । 11

కుశకాశశరేషీకా యే చ కంటకినో ద్రుమాః ।
తూలాజినసమస్పర్శా మార్గే మమ సహ త్వయా । 12

మహావాతసముద్ధూతం యన్మామవకరిష్యతి ।
రజో రమణ! తన్మన్యే పరార్ధ్యమివ చందనమ్ । 13

శాద్వలేషు యథా శిశ్యే వనాంతే వనగోచర! ।
కుథాస్తరణతల్పేషు కిం స్యాత్ సుఖతరం తతః । 14

పత్రం మూలం ఫలం యత్ త్వమ్ అల్పం వా యది వా బహు ।
దాస్యసి స్వయమాహృత్య తన్మేఽమృతరసోపమమ్ । 15

న మాతుర్న పితుస్తత్ర స్మరిష్యామి న వేశ్మనః ।
ఆర్తవాన్యుపభుంజానా పుష్పాణి చ ఫలాని చ । 16

అధీనురాలను.' అని యెంచుటగుము. ఓ పుణ్యాత్మా! ఏ విధముగను వంశమునకు అపకీర్తి తెచ్చెడిదానను గాను. మనసున నిరంతరము నిన్నే ధ్యానించుచుందును. నిన్ను తప్ప మఱియొక పురుషుని గూర్చి తలంపనే తలంపను. కావున నీవెంటనే వచ్చెదను. (5-7)

ఓ రామా! నేను నీ ధర్మపత్నిని, నీ ఆశ్రయమున ఉన్నదానను. యౌవనవతిని, పైగా ఇంతవఱకును నీతో కాపురము చేయుచున్నదానను. అట్టి నన్ను ఒక నటునివలె పరులకు అప్పగింపజూతువా? (8)

ఓ పుణ్యపురుషా! "మా తల్లిదండ్రుల హితము కొఱకై నీవు ఇచటనే యుండి వారికి సేవలు చేయుచుండుము. నా వెంట వనములకు రావలదు"-అని పలుకుటకంటెను నీవే వారికి విధేయుడవై ఇచట నుండుట యుక్తముగదా! నేనును నిన్ను అనుసరింతును. లేదా! నా హితమును గోరియే నా క్షేమముకొఱకే నన్నిచట ఉండుమని కోరియున్నచో నాకు నచ్చని నా మాట వినుము ఇచటనే యుండుము. లేదా! భరతుని పట్టాభిషేక నిమిత్తమై అతని హితముకొఱకై నీవు వనములకు వెళ్లుము, నన్నిచట ఉండుమనుటకంటెను నీవే యిచట ఉండి ఆయనకు అనుకూలుడవై అతనికి తోడ్పడుట మంచిదిగదా! అప్పుడు నేనును నిన్ను అనుసరించుచుందును. (9)

ధర్మజ్ఞుడవైన నీవు నన్ను నీవెంటనిడుకొనకుండా ఒంటరిగా వనములకు వెళ్లుట ఏమాత్రము తగదు. నేను నీదానను. తపశ్చర్యకైనను, వనవాసమునకైనను, కడకు స్వర్గగమనమునకైనను నేను నీవెంటనే యుందును. నీయడుగుజాడలలో వనములలో సంచరించుచున్నప్పుడును నాకు మార్గాయాసము ఏమాత్రమూ కలుగదు, నీతోడి విహార శయనాదులయందువలె సుఖముగా ఉందును. (10-11)

వనములలో సంచరించుచున్నప్పుడు మార్గమునందుగల దర్భలు, రెల్లుగడ్డి, ముండ్లదుబ్బులు, ముండ్లపొదలు, ముండ్లచెట్లు సైతము నీ సాహచర్యప్రభావమున దూది, జింకచర్మము మున్నగు వానివలె సుఖస్పర్శనే గూర్చును. అవి నాకు ఏమాత్రమును బాధాకరములు గావు. (12)

ప్రాణేశ్వరా! సుడిగాలులకు ఉవ్వెత్తుగా లేచివచ్చి పైబడిన దుమ్ములకును నేనేమియు బాధపడను. వాటిని నేను మేలైన చందనములవలె భావింతును. (13)

నాథా! నీతోగూడి వనమునందు పచ్చికబయళ్లపై పరుండినను అవి నాకు చిత్రకంబళములతోగూడిన తల్పములకంటెను మిక్కిలి సుఖమునే గూర్చును. (14)

స్వామీ! నీవు స్వయముగా తెచ్చియిచ్చిన ఆకులు, కంద మూలములు, పండ్లు మొదలగునవి ఏవైనను కొంచెముగానైనను, సమృద్ధిగానైనను నాకు అవి అమృతతుల్యములే-వనవాసమునందు తల్లిదండ్రులను గూర్చిగాని, భవనసుఖములను గుఱించిగాని ఎన్నడును స్మరింపనే స్మరింపను. ఆయా ఋతువులలో లభించు పుష్పములను, ఫలములనే స్వీకరించెదను. (15-16)

న చ తత్ర గతః కించిత్ ద్రష్టుమర్హసి విప్రియమ్।
మత్కృతే న చ తే శోకో న భవిష్యామి దుర్భరా। 17

యస్త్వయా సహ స స్వర్గో నిరయో యస్త్వయా వినా।
ఇతి జానన్ పరాం ప్రీతిం గచ్ఛ రామ! మయా సహ। 18

అథ మామేవమవ్యగ్రాం వనం నైవ నయిష్యసి।
విషమద్యైవ పాస్యామి మావిశం ద్విషతాం వశమ్। 19

పశ్చాదపి హి దుఃఖేన మమ నైవాస్తి జీవితమ్।
ఉజ్ఝితాయాస్త్వయా నాథ! తదైవ మరణం వరమ్। 20

ఇమం హి సహితుం శోకం ముహూర్తమపి నోత్సహే।
కిం పునర్దశవర్షాణి త్రీణి చైకం చ దుఃఖితా। 21

ఇతి సా శోకసంతప్తా విలప్య కరుణం బహు।
చుక్రోశ పతిమాయస్తా భృశమాలింగ్య సస్వరమ్। 22

సా విద్ధా బహుభిర్వాక్యైః దిగ్ధైరివ గజాంగనా।
చిరసన్నియతం బాష్పం ముమోచాగ్నిమివారణిః। 23

తస్యాః స్ఫటికసంకాశం వారిసంతాపసంభవమ్।
నేత్రాభ్యాం పరిసుస్రావ పంకజాభ్యామివోదకమ్। 24

తచ్చైవామలచంద్రాభం ముఖమాయతలోచనమ్।
పర్యశుష్యత బాష్పేణ జలోద్ధృతమివాంబుజమ్। 25

తాం పరిష్వజ్య బాహుభ్యాం విసంజ్ఞామివ దుఃఖితామ్।
ఉవాచ వచనం రామః పరివిశ్వాసయంస్తదా। 26

న దేవి! తవ దుఃఖేన స్వర్గమప్యభిరోచయే।
న హి మేఽస్తి భయం కించిత్ స్వయంభోరివ సర్వతః। 27

తవ సర్వమభిప్రాయమ్ అవిజ్ఞాయ శుభాననే!।
వాసం న రోచయేఽరణ్యే శక్తిమానపి రక్షణే। 28

వనవాసమున నీకేమాత్రము ప్రతికూలముగా మసలుకొనను. నానిమిత్తమై నీవేమియు కష్టపడవలసినపనియుండదు. నేను నీకు ఏవిధముగను భారముకాను. నాథా! నీతోగూడి అరణ్యమున నున్నను అది నాకు స్వర్గమే. నీకు దూరముగా రాజభవనమున నున్నను అది నాకు నరకమే. మనస్ఫూర్తిగా పలుకుచున్న ఈ నామాటలను నమ్ము, నన్ను మిక్కిలి అనురాగముతో నీవెంట దీసికొనిపొమ్ము. (17-18)

నేను వనజీవనమునకు ఏవిధముగనూ వెనుకాడను. నీతో నన్ను తీసికొని వెళ్లనిచో ఈ క్షణముననే విషమునైనను త్రాగెదను గాని, పరులపంచలో మాత్రము ఉండజాలను. (19)

ప్రభూ! నీవు నన్ను ఇచటనే విడిచి, వనములకు వెళ్లినచో, ఆ పిమ్మటనైనను దుర్భరమైన నీయెడబాటు కారణముగా నేను జీవించియుండుట అసంభవము. కనుక ఇప్పుడే నీయెదుటనే ప్రాణములనువీడుట మేలు. స్వామీ! నీకుదూరమై ఈ విరహబాధను ఒక్క క్షణకాలమైనను భరింపజాలను. ఇక దుర్భరదుఃఖముతో పదునాలుగు సంవత్సరములు ఎట్లు గడపగలను?" (20-21)

ఈ విధముగా ఆ సీతాదేవి మిక్కిలి దీనముగా చాలతడవు విలపించి, శోకసంతప్తయై పతిని గాఢముగా కౌగిలించుకొని, బిగ్గరగా వెక్కివెక్కి యేడ్చెను. (22)

విషము పూసిన బాణములచే దెబ్బతినిన ఆడు ఏనుగువలె, ఇంతకుముందు శ్రీరాముడు పలికిన మాటలకు సీతాదేవి యొక్క మతిమెత్తని హృదయము తీవ్రముగా గాయపడెను. అందువలన బాగుగా తరచబడిన అరణినుండి వెలువడిన అగ్నివలె, ఇంత వఱకును అపుకొనిన దుఃఖాశ్రువులు ఆదీనురాలికనులనుండి వెల్లుబికెను. దుర్భరమైనశోకకారణముగా ఆమెనేత్రములనుండి స్రవించుచున్న వేడిబాష్పములు స్ఫటికములవలె స్వచ్ఛములై, పద్మములనుండి జాలువాఱెడి మకరందబిందువులవలె ఒప్పారు చుండెను. (23-24)

విశాలములైన నేత్రములతో శోభిల్లుచు, పున్నమనాటి నిండు చంద్రునివలె మనోహరముగానుండెడి ఆమెముఖము సంతాప కారణముగా ఏర్పడిన వేడివలన, నీటినుండి బయటికి తీసిన పద్మమువలె వాడిపోయెను. (25)

అంతట శ్రీరాముడు దుఃఖముచే వివశయైయున్న ఆ సీతాదేవిని తనకౌగిటజేర్చుకొని, బాగుగా ఓదార్చుచు ఆమెతో ఇట్లు నుడివెను. "ఓ దేవీ! నీదుఃఖమునకు హేతువైనచో స్వర్గముగూడ నాకు రుచింపదు. బ్రహ్మదేవునివలె నేనును ఎవ్వరికిని ఏమాత్రమూ భయపడను. (26-27)

ఓ సుందరీ! అరణ్యములలో నిన్ను కాపాడుటకు నేను సర్వవిధములుగా శక్తిగలవాడనే, ఐనను వనవాసవిషయమున నీ మనసులోని అభిప్రాయమును పూర్తిగా గుర్తింపనందున నేనందులకు సుముఖతను చూపకుంటిని. (28)

యత్సృష్టాఽసి మయా సార్ధం వనవాసాయ మైథిలి।
న విహాతుం మయా శక్యా కీర్తిరాత్మవతా యథా। 29

ఓ మైథిలీ! నాతోగూడి వనవాసముచేయుటకే బ్రహ్మ నిన్ను సృష్టించెనుగాబోలు. అట్లైనచో ఆత్మాభిమానముగలవాడు కీర్తిని విడనాడలేనట్లు నేను నిన్ను త్యజింపజాలను. (29)

ధర్మస్తు గజనాసోరు! సద్భిరాచరితః పురా।
తం చాహమనువర్తేఽద్య యథా సూర్యం సువర్చలా। 30

ఓ శుభాంగీ! పతిసమేతముగా వనములయందు నివసించుట ప్రాచీనులైన రాజర్షులును పాటించినట్టి ధర్మమే. ఆ ధర్మమును అనుసరించి, నేనును నీతోగూడి వనవాసమును నడిపెదను. సువర్చల సూర్యునివలె నీవు నన్ను అనుసరింపుము. (30)

న ఖల్వహం న గచ్ఛేయం వనం జనకనందిని!।
వచనం తన్నయతి మాం పితుః సత్యోపబృంహితమ్। 31

ఏష ధర్మస్తు సుశ్రోణి! పితుర్మాతుశ్చ వశ్యతా।
అతశ్చ తం వ్యతిక్రమ్య నాహం జీవితుముత్సహే। 32

ఓ జానకీ! మా తండ్రియొక్క సత్యవాక్పరిపాలనమే నన్ను అడవులకు నడుపుచున్నది. కనుక నేను వనవాసమునకు వెళ్ళకుండుట యనునది ఎట్టి పరిస్థితులలోను సంభవముగాదు. వెళ్ళియే తీరవలెను. ఓ సుందరీ! తల్లిదండ్రులకు విధేయుడనై వారియాజ్ఞలను పాలించుటయే నాధర్మము. అందువలన నాయందిలో ప్రాణములున్నంత వఱకును ఆ ధర్మమును అతిక్రమింపను. (31-32)

అస్వాధీనం కథం దైవం ప్రకారైరభిరాధ్యతే।
స్వాధీనం సమతిక్రమ్య మాతరం పితరం గురుమ్। 33

ప్రత్యక్షదైవస్వరూపులై ఎదుటనున్న తల్లిదండ్రులను, గురువును కాదని, ఎదుటలేని దైవమును పెక్కురీతుల ఆరాధించుట ఎట్లు? అనగా ఎదుట కనబడని దైవమును పెక్కురీతుల ఆరాధించుటకంటెను, ప్రత్యక్షదైవస్వరూపులైన మాతాపితరులను, గురువును సేవించుట యుక్తముగదా! అట్లుచేయుటవలన భగవంతుడుగూడ ప్రసన్నుడగును. (33)

యత్త్రయం తత్త్రయో లోకాః పవిత్రం తత్సమం భువి।
నాన్యదస్తి శుభాపాంగే! తేనేదమభిరాధ్యతే। 34

తల్లియు, తండ్రియు, గురువు-ఈ ముగ్గురును ముల్లోకములకును ప్రతినిధులు. వీరికి శుశ్రూషలు ఒనర్చినచో ముల్లోకములలోని సమస్త దేవతలను ఆరాధించిన ఫలములు లభించును. ఈ త్రయముతో (ఈ ముువ్వురితో) సరితూగగలది, పవిత్రమైనది మఱియొకటి ఈ లోకమున లేనేలేదు. ఈ త్రయ (మువ్వురి) సేవ పవిత్రము.[1] అనగా సంసారబాధానివారకము. కనుక మాతాపితృ గురువులను ఆరాధించుటయే (సేవలొనర్చుటయే) ఉత్తమోత్తమ ధర్మము. (34)

న సత్యం దానమానౌ వా న యజ్ఞాశ్చాప్తదక్షిణాః।
తథా బలకరాస్సీతే! యథా సేవా పితుర్హితా। 35

మాతాపితృసేవలు మిక్కిలి హితకరములు. అనంతశుభ ఫలప్రదములు. అంతేగాదు ఇహలోక సుఖములనేగాక అవి పరలోకలాభములనుసైతము సమకూర్చును. సత్యపాలనము, దానమానములు, భూరిదక్షిణలతోగూడిన యజ్ఞాచరణములు మొదలగువాటిఫలములుగూడ వాటికి సాటిరావు. (35)

స్వర్గో ధనం వా ధాన్యం వా విద్యాః పుత్త్రాః సుఖాని చ।
గురువృత్త్యనురోధేన న కించిదపి దుర్లభమ్। 36

మాతాపితృగురువులను సేవించువారికిని, వారిని వినేయతతో అనుసరించువారికిని ధనధాన్యములు, వివిధవిద్యలు, పుత్త్రులు, సమస్తసుఖములు, కడకు స్వర్గలాభములును కరతలామలకములు. కనుక అట్టివారికి ప్రాప్తింపని లాభములేయుండవు. (36)

దేవగంధర్వగోలోకాన్ బ్రహ్మలోకాం స్తథాఽపరాన్।
ప్రాప్నువంతి మహాత్మానో మాతాపితృపరాయణాః। 37

దృఢదీక్షతో నిరంతరము మాతాపితృసేవానిరతులైన మానవులు క్రమముగా దేవలోకమును, గంధర్వలోకమును, గోలోకమును, సత్యలోకమును, తదితర మహాలోకములను పొందుదురు. (37)

1) పవిః = మహాభయంకరమైన సంసారము. త్రాయతే = రక్షించునది. పవిత్రము = పవినుండి అనగా సంసారభయమునుండి, దాని బాధలనుండి రక్షించునది. 'పవిత్రాత్త్రేమహాభయే' అనునది ప్రామాణిక వచనము.

స మాం పితా యథా శాస్తి సత్యధర్మపథే స్థితః।
తథా వర్తితుమిచ్ఛామి స హి ధర్మః సనాతనః। 38

మమ సన్నామలిప్సేతే! త్వాం నేతుం దండకావనమ్।
వసిష్యామీతి సా త్వం మామ్ అనుయాతుం సునిశ్చితా। 39

సా హి సృష్టాఽనవద్యాంగి! వనాయ మదిరేక్షణే!।
అనుగచ్ఛస్వ మాం భీరు! సహధర్మచరీ భవ। 40

సర్వథా సదృశం సీతే! మమ స్వస్య కులస్య చ।
వ్యవసాయమ్ అతిక్రాంతా కాంతే! త్వమతిశోభనమ్। 41

ఆరభస్వ శుభశ్రోణి! వనవాసక్షమాః క్రియాః।
నేదానీం త్వదృతే సీతే! స్వర్గోఽపి మమ రోచతే। 42

బ్రాహ్మణేభ్యశ్చ రత్నాని భిక్షుకేభ్యశ్చ భోజనమ్।
దేహి చాశంసమానేభ్యః సంత్వరస్వ చ మా చిరమ్। 43

భూషణాని మహార్హాణి వరవస్త్రాణి యాని చ।
రమణీయాశ్చ యే కేచిత్ క్రీడార్థాశ్చాప్యుపస్కరాః। 44

శయనీయాని యానాని మమ చాన్యాని యాని చ।
దేహి స్వభృత్యవర్గస్య బ్రాహ్మణానామ్ అనంతరమ్। 45

అనుకూలం తు సా భర్తుః జ్ఞాత్వా గమనమాత్మనః।
క్షిప్రం ప్రముదితా దేవీ దాతుమేవోపచక్రమే। 46

తతః ప్రహృష్టా ప్రతిపూర్ణమానసా
యశస్వినీ భర్తురవేక్ష్య భాషితమ్ ।
ధనాని రత్నాని చ దాతుమంగనా
ప్రచక్రమే ధర్మభృతాం మనస్వినీ । 47

సత్యసంధుడు, ధర్మవర్తనుడు ఐన మా తండ్రియొక్క యూదేశానుసారము నేను ప్రవర్తింతును. అది సర్వోత్తమమైన (పరంపరగా వచ్చుచున్న) ధర్మమార్గము గదా! (38)

ఓ సీతా! నీ మనసులోని అంతర్యమును గమనింపనందున నిన్ను నావెంట దండకారణ్యములకు గొనిపోవుటకు సిద్ధపడకుంటిని. ఇప్పుడు నీవు నాతో "ఏది ఏమైనను నీతోగూడి నేను వనవాసముచేయుదును" అని పలుకుచు నావెంటవచ్చుటకు దృఢనిశ్చయముగలదానవైయుంటివి. ఓ శుభాంగీ! నీవు నాతో వనములలో గడుపుటకై జన్మించితివిగాన నావెంట రమ్ము - ఓ బేలా! నన్ను అనుసరించుచు పతివ్రతాధర్మములను నెఱపుచుండుము. (39-40)

ఓ ప్రాణేశ్వరీ! సీతా! నీవు నాతో వనములకు వచ్చుటకై తీసికొనిన దృఢనిర్ణయము మన ఉభయవంశములకును అన్నివిధములుగా తగినట్టిది. ఓ సుందరీ! వనవాసప్రయాణమునకు ముందుగా ఆచరింపవలసిన దానాదిక్రియలను ప్రారంభింపుము. యథార్థముగా నీవు నావెంటలేనిచో స్వర్గముగూడ నాకు రుచింపదు. (41-42)

ఓ సాధ్వీ! బ్రాహ్మణోత్తములకు రత్నాభరణాదులను దానము చేయుము. అర్థులైనవచ్చిన యాచకులను అన్నపానాదులతో సంతృప్తులను గావింపుము. త్వరపడుము, ఆలసింపకుము. (43)

ఓ సీతా! మనకిద్దరికిని సంబంధించిన మిక్కిలి విలువైన నగలను, అమూల్యములైన పట్టుపీతాంబరములను, వెండి బంగారములతో నిర్మితములై, మనోహరములైన క్రీడాపరికరములను, మంచములను, తల్పములను, వాహనములను, ఇంకను తదితరములైన వస్తువులను బ్రాహ్మణులకు ఒసంగిన పిమ్మట దాసదాసీజనములకు ఇచ్చివేయుము." (44-45)

అంతట సీతాదేవి తనవనగమనమునకు భర్త అనుకూలుడై యున్నట్లు తెలిసికొని, ఎంతయు సంతోషించెను. వెంటనే ఆమె దానధర్మములకు ఉపక్రమించెను. యశస్విని ఐన ఆ సీతాదేవి పతియొక్క ఆమోదవచనములకు సంతోషముతో మిగుల పొంగిపోయినదై, ధనధాన్యములను, రత్న రాసులను ధార్మికులకు నిండుమనస్సుతో ఒసంగసాగెను. (46-47)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రింశస్సర్గః *(30)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదియవసర్గము సమాప్తము

-- * * * --

31. ముప్పదియొకటవసర్గము

"మీవెంట వనములకు నన్నును అనుమతింపుము." అని లక్ష్మణుడు శ్రీరాముని ప్రార్థించుట - ఎట్టకేలకు శ్రీరాముడు అందులకు అనుమతించుట - అన్న సూచనపై లక్ష్మణుడు వసిష్ఠునిఆశ్రమమునందున్న దివ్యాయుధములను తీసికొనివచ్చుట.

ఏవం శ్రుత్వా తు సంవాదం లక్ష్మణః పూర్వమాగతః।
బాష్పపర్యాకులముఖః శోకం సోఢుమశక్నువన్। 1

కౌసల్యాదేవి గృహమునుండి శ్రీరామునివెన్వెంటవచ్చియున్న లక్ష్మణుడు సీతారాములసంవాదమును పూర్తిగావిని, తాను తన యన్ననెంట వనములకు వెళ్ళుటయెట్లాయని మిక్కిలి వ్యాకులపాటునకు

స భ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః।
సీతామువాచాతియశా రాఘవం చ మహావ్రతమ్। 2

యది గంతుం కృతా బుద్ధిః వనం మృగగజాయుతమ్।
అహం త్వానుగమిష్యామి వనమగ్రే ధనుర్ధరః। 3

మయా సమేతోఽరణ్యాని బహూని విచరిష్యసి।
పక్షిభిర్మృగయూథైశ్చ సంఘుష్టాని సమంతతః। 4

న దేవలోకాక్రమణం నామరత్వమహం వృణే।
ఐశ్వర్యం వాపి లోకానాం కామయే న త్వయా వినా। 5

ఏవం బ్రువాణః సౌమిత్రిః వనవాసాయ నిశ్చితః।
రామేణ బహుభిస్సాంత్వైః నిషిద్ధః పునరబ్రవీత్। 6

అనుజ్ఞాతశ్చ భవతా పూర్వమేవ యదస్మ్యహమ్।
కిమిదానీం పునరిదం క్రియతే మన్నివారణమ్। 7

యదర్థం ప్రతిషేధో మే క్రియతే గంతుమిచ్ఛతః।
ఏతదిచ్ఛామి విజ్ఞాతుం సంశయోఽయం మమానఘ! 8

తతోఽబ్రవీన్మహాతేజా రామో లక్ష్మణమగ్రతః।
స్థితం ప్రాగ్గామినం వీరం యాచమానం కృతాంజలిమ్। 9

స్నిగ్ధో ధర్మరతో వీరః సతతం సత్పథే స్థితః।
ప్రియః ప్రాణసమో వశ్యో భ్రాతా చాసి సఖా చ మే। 10

మయాఽద్య సహ సౌమిత్రే! త్వయి గచ్ఛతి తద్వనమ్।
కో భజిష్యతి కౌసల్యాం సుమిత్రాం వా యశస్వినీమ్। 11

అభివర్షతి కామైర్యః పర్జన్యః పృథివీమివ।
స కామపాశపర్యస్తో మహాతేజా మహీపతిః। 12

సా హి రాజ్యమిదం ప్రాప్య నృపస్యాశ్వపతేస్సుతా।
దుఃఖితానాం సపత్నీనాం న కరిష్యతి శోభనమ్। 13

న స్మరిష్యతి కౌసల్యాం సుమిత్రాం చ సుదుఃఖితామ్।
భరతో రాజ్యమాసాద్య కైకేయ్యాం పర్యవస్థితః। 14

లోనయ్యెను. అతడు (లక్ష్మణుడు) ఆ దుఃఖమునకు తట్టుకొనలేనివాడై అన్నయగు శ్రీరాముని పాదములపై వ్రాలెను. పిమ్మట అతడు సీతాదేవిని ప్రార్థించి, వనవాసవ్రతదీక్షను వహించియున్న రాఘవుని ప్రసన్నునిగాజేసికొనుటకై ఇట్లు నుడివెను. (1-2)

"అన్నా! క్రూరమృగములతో, ఏనుగులగుంపులతో నిండియుండెడి వనములకు వెళ్ళుటకే నీవు నిశ్చయించుకొనియున్నచో నేనును నీతో వచ్చెదను. నానావిధములగు పక్షులకూతలతో, దుష్టమృగ సమూహముల అఱపులతో ప్రతిధ్వనించుచుండెడి మహారణ్యముల యందు నేను ధనుస్సును చేతబట్టి సావధానుడనై, మీ వెంట నడుచుచుండగా అంతటను మీరు సంచరింపవచ్చును. (3-4)

స్వామీ! నీవెంట ఉండి నిన్ను సేవించుభాగ్యమునకు దూరమైనచో త్రిలోకాధిపత్యము లభించినను నాకు అక్కఱ లేదు. జననమరణ రాహిత్యమునుగూడ నేను కోరుకొనను. అంతేగాదు పరమపద ప్రాప్తినైనను నేను వాంఛింపను." (5)

అన్నతోగూడి వనవాసమునకు వెళ్ళుటకు నిశ్చయించికొనినవాడై లక్ష్మణుడు ఇట్లు వచింపగా శ్రీరాముడు పెక్కువిధముల ఓదార్చుచు అతనిని వారింపజూచెను. అప్పుడు లక్ష్మణుడు మరల ఇట్లువచించెను. (6)

"అన్నయ్యా! సర్వకాలసర్వావస్థలయందును నీకు తోడుగానుండుటకు ఇంతకుముందే నన్ను అనుమతించియుంటివిగదా! ఇప్పుడీవిధముగా నన్ను నివారించుటకు కారణమేమి? నావలన ఏదైన నొక అపరాధము జరిగినదా? నీవెంట రాగోరుచున్న నన్ను ఏల నిషేధించుచున్నావు? తెలియగోరుచున్నాను. దయతో తెల్పుము." మఱియు వీరుడైన లక్ష్మణుడు ఎదుటనిలిచి, కృతాంజలియై, "సోదరా! వనములలో నీముందు భాగమున నడచుచుండుటకు నీతో వచ్చుటకు అనుమతింపుము"- అని ప్రార్థించుచుండగా అతనితో మహాపరాక్రమశాలియగు శ్రీరాముడు ఇట్లు పలికెను. (7-9)

"లక్ష్మణా! నా తమ్ముడవైన నీవు మెత్తని స్వభావముగల వాడవు. ధర్మనిరతుడవు, నిరంతరము సన్మార్గమున ప్రవర్తించు వాడవు, నాకు ప్రాణములవలె ప్రీతిపాత్రుడవు, సఖుడవు, పైగా నా ఆజ్ఞలను పాలించుచు నా ఆధీనములోనుండువాడవు. ఓ సౌమిత్రీ! నీవు నావెంట వనములకు వచ్చినచో మతిమెత్తని హృదయముగల కౌసల్యామాతను, తల్లి సుమిత్రాదేవిని ఇచట సేవించుచుండు వారెవరు? మిక్కిలి తేజశ్శాలియైన మహారాజు, వరుణదేవుడు భూమిని సస్యశ్యామల మొనర్చునట్లుగా, ప్రజల కోర్కెలను తీర్చుచుండెడివాడు. అట్టి ఆ మహారాజు ప్రస్తుతము కైకేయికి ఇచ్చిన వరములకు కట్టుబడి, ఆమెవశములోనున్నాడు. అశ్వపతిసుతయైన ఆ కైకేయియు రాజ్యాధికారమును చేతబట్టి దుఃఖములకు లోనైయుండు సపత్నులక్షేమములను పట్టించుకొనదు. (10-13)

కైకేయిచలువవలన యువరాజైన భరతుడు కౌసల్యా సుమిత్రామాతల కష్టములనుగూర్చి తలంపకపోవచ్చును. కనుక ఓ లక్ష్మణా! నీవు రాజానుగ్రహమును పొందిగాని, లేక స్వయముగా

తామార్యాం స్వయమేవేహ రాజానుగ్రహణేన వా।
సౌమిత్రే! భర కౌసల్యామ్ ఉక్తమర్థమిమం చర। 15

ఏవం మమ చ తే భక్తిః భవిష్యతి సుదర్శితా।
ధర్మజ్ఞ గురుపూజాయాం ధర్మశ్చాప్యతులో మహాన్। 16

ఏవం కురుష్వ సౌమిత్రే! మత్కృతే రఘునందన!।
అస్మాభిర్విప్రహీణాయా మాతుర్నో న భవేత్ సుఖమ్। 17

ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః శ్లక్ష్ణయా గిరా।
ప్రత్యువాచ తదా రామం వాక్యజ్ఞో వాక్యకోవిదమ్। 18

తవైవ తేజసా వీర! భరతః పూజయిష్యతి।
కౌసల్యాం చ సుమిత్రాం చ ప్రయతో నాత్ర సంశయః। 19

కౌసల్యా బిభృయాదార్యా సహస్రమపి మద్విధాన్।
యస్యాః సహస్రం గ్రామాణాం సంప్రాప్తముపజీవినామ్। 20

తదాత్మభరణే చైవ మమ మాతుస్తథైవ చ।
పర్యాప్తా మద్విధానాం చ భరణాయ యశస్వినీ। 21

కురుష్వ మామనుచరం వైధర్మ్యం నేహ విద్యతే।
కృతార్థోఽహం భవిష్యామి తవచార్థః ప్రకల్పతే। 22

ధనురాదాయ సశరం ఖనిత్రపిటకాధరః।
అగ్రతస్తే గమిష్యామి పంథానమనుదర్శయన్। 23

ఆహరిష్యామి తే నిత్యం మూలాని చ ఫలాని చ।
వన్యాని యాని చాన్యాని స్వాహారాణి తపస్వినామ్। 24

గాని పూజ్యురాలైన తల్లి కౌసల్యయొక్క, సుమిత్రామాతయొక్క ఆలన పాలన చూచుచుండుము. ఈ నా సూచనలను పాటింపుము. ఓ ధర్మజ్ఞా! నేను చెప్పిన ప్రకారము ఆచరించినచో నాయెడ నీకు గల భక్తిశ్రద్ధలు వెల్లడియగును. అంతేగాక తల్లిదండ్రులను సేవించుట యనెడి సాటిలేని ఒక మహాధర్మమును ఆచరించిన వాడవును అగుదువు. (14-16)

రఘువంశజుడవైన ఓ లక్ష్మణా! మీవదినె సీతాదేవియు, నేనును దూరమైనచో (మాయెడబాటు కారణముగా) దుఃఖితురాలైన కౌసల్యామాతకు సుఖము ఎట్లు కల్గును? కావున నీవు మాకు మాఱుగా ఇచటనేయుండి నేను చెప్పినరీతిగా ఆమెను సేవింపుము." (17)

శ్రీరాముడు ఇట్లు పలికిన పిమ్మట మాటకారియైన లక్ష్మణుడు మాటలఅంతర్యమును గుర్తింపగల తన అన్నతో మృదుమధురముగా ఇట్లు నుడివెను. (18)

"ఓ మహావీరా! నీ తేజఃప్రభావముచే భరతుడుగూడ నీవలెనే కౌసల్యామాతను, తల్లి సుమిత్రాదేవిని భక్తిశ్రద్ధలతో సేవింపగలడు. ఇందులకు సందేహములేదు. (19)

కౌసల్యామాతను ఆశ్రయించిన వారిని పోషించుటకై ఆమెఅధీనములో వేయి గ్రామములు ఉన్నవి. కనుక ఆమె నావంటివారిని వేలసంఖ్యలో పోషింపగలదు. అందువలన దానధర్మములలో వాసికెక్కిన తల్లి కౌసల్యాదేవి తనను తాను పోషించుకొనుటయేగాక మాతల్లిని, ఇంకను పెక్కుమందిని పోషింపగల సమర్థురాలు. (20-21)

అన్నా! నీఅనుచరునిగా వనవాసమునకు నన్ను అనుమతింపుము. నన్ను నీవెంటగొనిపోవుట ఏమాత్రము ధర్మవిరుద్ధముగాదు. మీకు ఎట్టి శ్రమయును లేకుండ ఫలమూలాదులను తెచ్చియిచ్చుచుండగలను. ఆ విధముగా మీ వనవాసము సుఖముగా సాగును. (మీకు సేవలొనర్చుచు) [1]నేను కృతార్థుడనగుదును. (22)

స్వామీ! ధనుర్బాణములను ధరించి, పలుగును, చిన్న గంపను తీసికొని, దారిచూపుచు మీ ముందు భాగమున నడచుచుందును.[2] నియమజీవనమును కొనసాగించుచు తాపసులకును, వనవాసులకును అనువగు కందమూలఫలములను, వనములలో లభించుఇతరములైన ఆహారపదార్థములను అచట మీకు

1) జ్యేష్ఠోపితృసమః' అని ఆర్యోక్తి. అనగా అన్న తండ్రితో సమానుడు. కావున పితృతుల్యుడైన శ్రీరాముని సేవించుట తనధర్మమని లక్ష్మణుడు భావించెను. అతడు ఆ విధముగా తనజన్మము సార్థకము చేసికొనదలచెను. కనుక లక్ష్మణుడు అభ్యర్థించుటయు, రాముడు అందులకు అనుమతించుటయు ధర్మసమ్మతమే.

2) క్రూరమృగాదిబాధలను నివారించుటకై ధనుర్బాణములు. కందమూలములను త్రవ్వి తీయుటకును, వానిని సరివేయుటకును పలుగు, గంప ఉపయుక్తములగును.

భవాంస్తు సహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే।
అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చ తే। 25

రామస్త్వనేన వాక్యేన సుప్రీతః ప్రత్యువాచ తమ్।
వ్రజాఽఽపృచ్ఛస్వ సౌమిత్రే! సర్వమేవ సుహృజ్జనమ్। 26

యే చ రాజ్ఞో దదౌ దివ్యే మహాత్మా వరుణః స్వయమ్।
జనకస్య మహాయజ్ఞే ధనుషీ రౌద్రదర్శనే। 27

అభేద్యే కవచే దివ్యే తూణీ చాక్షయసాయకౌ।
ఆదిత్యవిమలౌ చోభౌ ఖడ్గౌ హేమపరిష్కృతౌ। 28

సత్కృత్య నిహితం సర్వమ్ ఏతదాచార్యసద్మని।
స త్వమాయుధమాదాయ క్షిప్రమావ్రజ లక్ష్మణ!। 29

స సుహృజ్జనమామంత్ర్య వనవాసాయ నిశ్చితః।
ఇక్ష్వాకుగురుమామంత్ర్య జగ్రాహాయుధముత్తమమ్। 30

తద్దివ్యం రాజశార్దూలః సత్కృతం మాల్యభూషితమ్।
రామాయ దర్శయామాస సౌమిత్రిః సర్వమాయుధమ్। 31

తమువాచాత్మవాన్ రామః ప్రీత్యా లక్ష్మణమాగతమ్।
కాలే త్వమాగతః సౌమ్య! కాంక్షితే మమ లక్ష్మణ!। 32

అహం ప్రదాతుమిచ్ఛామి యదిదం మామకం ధనమ్।
బ్రాహ్మణేభ్యస్తపస్విభ్యః త్వయా సహ పరంతప!। 33

వసంతీహ దృఢం భక్త్యా గురుషు ద్విజసత్తమాః।
తేషామపి చ మే భూయః సర్వేషాం చోపజీవినామ్। 34

వసిష్ఠపుత్రం తు సుయజ్ఞమార్యం
త్వమానయాశు ప్రవరం ద్విజానామ్।
అభిప్రయాస్యామి వనం సమస్తాన్
అభ్యర్చ్య శిష్టాన్ అపరాన్ ద్విజాతీన్। 35

సమకూర్చుచుందును. వదినెయు, నీవును పర్వతసానువులయందు విహరించునప్పుడును, మేల్కొని యున్నప్పుడును, నిదురించుచున్నప్పుడును (సర్వకాల సర్వావస్థలయందును) మీకు సకలోపచారములను చేయుచుందును." (23-25)

లక్ష్మణుడు పలికిన ఈ మాటలకు ప్రసన్నుడైన శ్రీరాముడు అతనితో ఇట్లు పలికెను. "ఓ సౌమిత్రీ! నీవు వెళ్లి సుమిత్రామాత మొదలగు ఆత్మీయులకు నీ వనవాస ప్రయాణమును గూర్చి తెల్పి, వారి ఆమోదమును బడయుము. (26)

ఓ సౌమిత్రీ! చూచెడివారికి భయమును గొల్పెడి రెండు దివ్య ధనుస్సులను, శత్రువులకు దుర్భేద్యములైన రెండు కవచములను, అక్షయములైన బాణములుగల రెండు తూణీరములను, బంగారు పిడులతో ఒప్పుచు సూర్యతేజస్సుతో మిలమిల్లాడెడి రెండు ఖడ్గములను, మహానుభావుడైన వరుణుడు జనకుని మహాయజ్ఞ సమయమున మనకు ఇచ్చియుండెను. పూజార్హమై అవి వసిష్ఠమహర్షి మందిరమున ఉంచబడినవి. ఓ లక్ష్మణా! ఆ ఆయుధములను అన్నింటిని దీసికొని త్వరగా ఇచటికి విచ్చేయుము." (27-29)

వనవాసప్రయాణమునకు సంసిద్ధుడైన లక్ష్మణుడు తన సుహృజ్జనులనుండి ఆమోదమును బడసెను. ఇక్ష్వాకువంశగురువైన వసిష్ఠునిగృహమునకేగి, ఉత్తమములైన అచటి ఆయుధములను, గురువులఅనుమతితో గ్రహించెను. పిమ్మట ఉత్తమరాజకుమారుడైన లక్ష్మణస్వామి సర్వాలంకారశోభలతో రాజపూజలనందుకొనిన ఆ దివ్యాయుధములను అన్నింటిని దీసికొని వచ్చి శ్రీరామునకు చూపించెను. (30-31)

అంతట బుద్ధిశాలియైన శ్రీరాముడు తనకడకు విచ్చేసిన ఆ లక్ష్మణునితో సంతోషముగా ఇట్లనుడివెను. "సౌమ్యుడవైన ఓ లక్ష్మణా! భళే! నేను అనుకొనినరీతిగా సకాలములో నీవు ఇచటికి వచ్చితివి. ఓ పరంతపా! నాకడనున్న ఈ ధనమునంతయును సీతాగూడి, తపస్వులైన బ్రాహ్మణోత్తములకు ఇచ్చివేయదలచుచున్నాను. గురువుల యెడ గాఢమైన భక్తిశ్రద్ధలు గలిగి, నిత్యము వారిని సేవించెడి బ్రాహ్మణశ్రేష్ఠులకును, ఇంకను నన్ను ఆశ్రయించుకొనియున్న వారందఱికిని ఈ సంపదను పంచియియ్యగోరుచున్నాను. (32-34)

ఓ సౌమిత్రీ! బ్రాహ్మణోత్తములలో ప్రముఖుడును, వసిష్ఠమహర్షి పుత్రుడును, పూజ్యుడును ఐన సుయజ్ఞుని, శిష్టాచారసంపన్నులైన ఇతరబ్రాహ్మణులను తోడ్కొని రమ్ము. నేను వారినందఱిని

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకత్రింశస్సర్గః *(31)*

వాల్మీకిమహర్షివిరచితమైన ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదియొకటవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

32. ముప్పదిరెండవసర్గము

శ్రీరాముడు వసిష్ఠునికుమారుడైన సుయజ్ఞునకును, ఇతరబ్రాహ్మణోత్తములకును సంతృప్తికరముగా కానుకలనొసంగుట - గర్గవంశమువాడైన త్రిజటునకు కోరుకొనిన రీతిగా గోసంపదను ఇచ్చుట.

తతశ్శాసనమాజ్ఞాయ భ్రాతుః శుభతరం ప్రియమ్।
గత్వా స ప్రవివేశాశు సుయజ్ఞస్య నివేశనమ్। 1

అంతట లక్ష్మణుడు శుభప్రదమైన, అన్నయిచ్చిన ఆదేశమును ప్రియముగా శిరసావహించి, వెంటనే బయలుదేఱి, గురుపుత్రుడైన సుయజ్ఞునిమందిరమున ప్రవేశించెను. (1)

తం విప్రమగ్న్యగారస్థం వందిత్వా లక్ష్మణోఽబ్రవీత్।
సఖేఽభ్యాగచ్ఛ పశ్య త్వం వేశ్మ దుష్కరకారిణః। 2

ఆ సమయమున విప్రవరుడైన సుయజ్ఞుడు అగ్నిశాలయందు ఆసీనుడైయుండెను. లక్ష్మణుడు ఆయునకు ప్రణమిల్లి ఇట్లు పలికెను. "మిత్రమా! ఇతరులకు అసాధ్యమైన కార్యములను ఆచరించునట్టి శ్రీరామచంద్రుని దర్శించుటకై ఆయున యింటికి వెళ్ళుదము. రమ్ము". (2)

తతస్సంధ్యాముపాస్యాశు గత్వా సౌమిత్రిణా సహ।
జుష్టం తత్ ప్రావిశల్లక్ష్మ్యా రమ్యం రామనివేశనమ్। 3

పిమ్మట సుయజ్ఞుడు మాధ్యాహ్నికసంధ్యోపాసనాది కృత్యములను ముగించుకొని, వెంటనే లక్ష్మణునితో బయలుదేఱి, లక్ష్మికి నిలయమై, మనోహరమైన శ్రీరాముని భవనమునకు విచ్చేసెను. (3)

తమాగతం వేదవిదం ప్రాంజలిః సీతయా సహ।
సుయజ్ఞమభిచక్రామ రాఘవోఽగ్నిమివార్చితమ్। 4

జాతరూపమయైర్ముఖ్యైః అంగదైః కుండలైశ్శుభైః।
సహేమసూత్రైర్మణిభిః కేయూరైర్వలయైరపి। 5

అన్యైశ్చ రత్నైర్బహుభిః కాకుత్స్థః ప్రత్యపూజయత్।
సుయజ్ఞం స తదోవాచ రామః సీతాప్రచోదితః। 6

తనకడకు విచ్చేసిన వేదజ్ఞుడైన సుయజ్ఞునకు శ్రీరాముడు సీతాసహితుడై ఎదురేగి, అంజలిఘటించి, ఆయునను సుఖాసీనుని గావించెను. పిమ్మట అతడు ఆమునిసుతునికి అగ్నిదేవునకువలె పూజలొనర్చెను. బంగారముతో చేయబడిన దండకడియములను చక్కనికుండలములను, సువర్ణసూత్రమున కూర్చబడిన మణుల హారములను, భుజకీర్తులను చేతికడియములను, ఇంకను నానావిధములగు రత్నములను సమర్పించి, సుయజ్ఞుని సత్కరించెను. పిదప సీతాదేవి ప్రోత్సాహముతో శ్రీరామచంద్రుడు ఆయునితో ఇట్లుపలికెను. (4-6)

హారం చ హేమసూత్రం చ భార్యాయై సౌమ్య! హారయ।
రశనాం చాధునా సీతా దాతుమిచ్ఛతి తే సఖే!। 7

అంగదాని విచిత్రాణి కేయూరాణి శుభాని చ।
ప్రయచ్ఛతి సఖే! తుభ్యం భార్యాయై గచ్ఛతీ వనమ్। 8

పర్యంకమగ్ర్యాస్తరణం నానారత్నవిభూషితమ్।
తమపీచ్ఛతి వైదేహీ ప్రతిష్ఠాపయితుం త్వయి। 9

"నిర్మలహృదయముగల ఓ మిత్రమా! సీతాదేవి నావెంట వనములకు బయలుదేఱుచున్నది. ఈ సందర్భమును పురస్కరించుకొని, ఆమె నీధర్మపత్నికొఱకై హారమును, కంఠాభరణమును, ఒడ్డాణమును ఇయ్యనున్నది. ఇంకను ఆమె కొఱకై దండకడియములను, చక్కని శిల్పముగల అందమైన కేయూరములను, సమర్పింపనున్నది. వాటిని స్వీకరింపుము. మఱియు వివిధములగు రత్నములతో అలంకృతమై, చక్కని వస్త్రముతో కప్పబడిన పాన్పును మా జానకి మీకు ప్రదానము చేయుచున్నది. సాదరముగా గ్రహింపుము. (7-9)

నాగశ్శత్రుంజయో నామ మాతులోఽయం దదౌ మమ।
తం తే గజసహస్రేణ దదామి ద్విజసత్తమ!। 10

ఓ బ్రాహ్మణోత్తమా! మా మేనమామ 'శత్రుంజయము' అను ఒక మహాగజమును నాకు ఇచ్చియుండెను. దానిని, దానితోపాటు ఇంకను వేయి బంగారునాణెములను నీకు సమర్పించుచున్నాను. స్వీకరింపుము. (10)

ఇత్యుక్తస్స హి రామేణ సుయజ్ఞః ప్రతిగృహ్య తత్।
రామలక్ష్మణసీతానాం ప్రయుయోజాఽశిషశ్శుభాః। 11

శ్రీరాముడు ఇట్లు ప్రీతిపూర్వకముగా సమర్పించిన కానుకలను, సాదరముగా అప్పగించిన శత్రుంజయమును స్వీకరించి, సుయజ్ఞుడు ఆ సీతారామలక్ష్మణులకు శుభాశీస్సులను ఒసంగెను. (11)

అథ భ్రాతరమవ్యగ్రం ప్రియం రామః ప్రియంవదః।
సౌమిత్రిం తమువాచేదం బ్రహ్మేవ త్రిదశేశ్వరమ్॥ 12

అగస్త్యం కౌశికం చైవ తావుభౌ బ్రాహ్మణోత్తమౌ।
అర్చయాఽహూయ సౌమిత్రే! రత్నైస్సస్యమివాంబుభిః॥ 13

తర్పయస్వ మహాబాహో! గోసహస్రైశ్చ మానద।
సువర్ణై రజతైశ్చైవ మణిభిశ్చ మహాధనైః॥ 14

కౌసల్యాం చ య ఆశీర్భిః భక్తః పర్యుపతిష్ఠతి।
ఆచార్యః తైత్తిరీయాణామ్ అభిరూపశ్చ వేదవిత్॥ 15

తస్య యానం చ దాసీశ్చ సౌమిత్రే! సంప్రదాపయ।
కౌశేయాని చ వస్త్రాణి యావత్ తుష్యతి స ద్విజః॥ 16

సూతశ్చిత్రరథశ్చార్యః సచివస్సుచిరోషితః।
తోషయైనం మహార్హైశ్చ రత్నైర్వస్త్రైర్ధనైస్తథా॥ 17

పశుకాభిశ్చ సర్వాభిః గవాం దశశతేన చ।
యే చేమే కఠకాలాపా బహవో దండమాణవాః॥ 18

నిత్యస్వాధ్యాయశీలత్వాత్ నాన్యత్ కుర్వంతి కించన।
అలసా స్వాదుకామాశ్చ మహతాం చాపి సమ్మతాః।
తేషామశీతియానాని రత్నపూర్ణాని దాపయ॥ 19

శాలివాహసహస్రం చ ద్వే శతే భద్రకాంస్తథా।
వ్యంజనార్థం చ సౌమిత్రే! గోసహస్రముపాకురు॥ 20

మేఖలీనాం మహాసంఘః కౌసల్యాం సముపస్థితః।
తేషాం సహస్రం సౌమిత్రే! ప్రత్యేకం సంప్రదాపయ॥ 21

అంబా యథా చ సా నందేత్ కౌసల్యా మమ దక్షిణామ్।
తథా ద్విజాతీన్ సర్వాంస్తాన్ లక్ష్మణార్చయ సర్వశః॥ 22

తతః స పురుషవ్యాఘ్రః తద్ధనం లక్ష్మణః స్వయమ్।
యథోక్తం బ్రాహ్మణేంద్రాణామ్ అదదాద్ధనదో యథా॥ 23

అథాఽబ్రవీద్బాష్పకలాన్ తిష్ఠతశ్చోపజీవినః।
స ప్రదాయ బహుద్రవ్యమ్ ఏకైకస్యోపజీవనమ్॥ 24

పిమ్మట ప్రియభాషియైన శ్రీరాముడు ఏకాగ్రతతో నిలిచియున్న ప్రియసోదరుడైన లక్ష్మణునితో బ్రహ్మదేవుడు ఇంద్రునితోవలె ఇట్లు పలికెను. (12)

ఓ సౌమిత్రీ! బ్రాహ్మణశ్రేష్ఠులైన అగస్త్యుని, విశ్వామిత్రుని సాదరముగా ఆహ్వానించి, వారిని భక్తిశ్రద్ధలతో పూజింపుము. ఓ మహాబాహో! ఆ మహామహులకు వేలకొలది పాడియావులను, వెండి బంగారములను, ఆభరణములను, రత్నరాసులను, ధనధాన్యములను సమృద్ధిగా సమర్పించి, వర్షజలములు పైరులను ఆనందింపజేసినట్లుగా, వారిని సంతృప్తులను గావింపుము. (13-14)

యజుర్వేదమునందలి తైత్తిరీయవిభాగములను బాగుగా అధ్యయనము చేసిన వేదపండితులగు బ్రాహ్మణోత్తములు మిక్కిలి శక్తిసంపన్నులు, చక్కని వాక్శుద్ధి గలవారు. వారు నిత్యము కౌసల్యామాతకు శుభాశీస్సులను ఒసంగుచుందురు. వారు దానములను పుచ్చుకొనుటకు పాత్రులు. కనుక వారికి సంతృప్తి కలుగునట్లుగా కనకవస్తువాహనములను, దాసదాసీజనములను, పట్టువస్త్రములను కోశాగారమునుండి ఇప్పింపుము. (15-16)

చిత్రరథుడను మంత్రి సుమంత్రునివలె రాజవంశమునకు ఎంతయు నమ్మకస్థుడు. అతడు చిరకాలమునుండియు రాజకుటుంబమునకు సేవలొనర్చుచున్నవాడు, గౌరవార్హుడు. కనుక అమూల్యములైన రత్నములను, వస్త్రములను, ధనధాన్యములను, వేలకొలది గోవులను, వివిధములగు ఇతరపశుసంపదలను బహూకరించి, అతనిని తృప్తిపఱచుము. (17)

కఠశాఖకును, కలాపశాఖకును చెందిన వేదభాగములను పఠించుచు మోదుగుదండములను ధరించుచుండెడి కొందఱు బ్రహ్మచారులుగలరు. నిత్యము వేదాధ్యయనమును చేయుచుండుటయే వారిపని. వారు మఱియొక పనిని దేనినీ చేయరు. వారికి సాత్త్వికములైన రసపదార్థములే ఇష్టము. పెద్దలుగూడ వారిని గౌరవింతురు. వారికి ఎనుబదిబండ్ల రత్నములను, ధాన్యములనుమోయునట్టి వేయివృషభములను, పొలములను దున్నెడి రెండువందల ఎద్దులను, అట్లే పాలు, పెరుగు, నేయి మొదలగు వ్యంజనములకై వేయిగోవులను ఇప్పింపుము. (18-20)

ఓ సౌమిత్రీ! మౌంజీధారులైన బ్రహ్మచారులు పెక్కుమంది కౌసల్యామాతను ఆశ్రయించుకొనియున్నారు. వారిలో ఒక్కొక్కరికి వేయేసి ఆవులను ఇప్పింపుము. (21)

నేను ఇచ్చెడి కానుకలను జూచి, ఆ కౌసల్యామాత ఆనందించు రీతిగా ఆ బ్రాహ్మణులనందఱిని అన్నివిధములుగా సత్కరింపుము. నరోత్తముడైన శ్రీరామునియొక్క ఆదేశానుసారము లక్ష్మణుడు స్వయముగా కుబేరునివలె బ్రాహ్మణోత్తములకు ఆయా సంపదలను ఇచ్చివేసెను. (22-23)

దగ్గుత్తికతో కన్నీరు గార్చుచు తనయెదుట నిలబడియున్న తన ఆశ్రితులలో ప్రతివ్యక్తికిని పదునాలుగు సంవత్సరములవఱకును భుక్తికై చాలునంతగా ద్రవ్యమును ఇచ్చి, శ్రీరాముడు వారితో

లక్ష్మణస్య చ యద్వేశ్మ గృహం చ యదిదం మమ।
అశూన్యం కార్యమేకైకం యావదాగమనం మమ। 25

ఇత్యుక్త్వా దుఃఖితం సర్వం జనం తముపజీవినమ్।
ఉవాచేదం ధనాధ్యక్షం ధనమానీయతామితి। 26

తతోఽస్య ధనమాజహ్రుః సర్వమేవోపజీవినః।
స రాశిస్సుమహాంస్తత్ర దర్శనీయో హ్యదృశ్యత। 27

తతస్స పురుషవ్యాఘ్రః తద్ధనం సహ లక్ష్మణః।
ద్విజేభ్యో బాలవృద్ధేభ్యః కృపణేభ్యో హ్యదాపయత్। 28

తత్రాసీత్ పింగళో గార్గ్యః త్రిజటో నామ వై ద్విజః।
ఉంఛవృత్తిర్వనే నిత్యం ఫాలకుద్దాలలాంగలీ। 29

తం వృద్ధం తరుణీ భార్యా బాలానాదాయ దారకాన్।
అబ్రవీత్ బ్రాహ్మణం వాక్యం దారిద్ర్యేణాభిపీడితా। 30

అపాస్య ఫాలం కుద్దాలం కురుష్వ వచనం మమ।
రామం దర్శయ ధర్మజ్ఞం యది కించిదవాప్స్యసి। 31

స భార్యావచనం శ్రుత్వా శాటీమాచ్ఛాద్య దుశ్ఛదామ్।
స ప్రాతిష్ఠత పంథానం యత్ర రామనివేశనమ్। 32

భృగ్వంగిరసమం దీప్త్యా త్రిజటం జనసంసది।
ఆపంచమాయాః కక్ష్యాయా నైనం కశ్చిదవారయత్। 33

స రాజపుత్రమాసాద్య త్రిజటో వాక్యమబ్రవీత్।
నిర్ధనో బహుపుత్రోఽస్మి రాజపుత్ర! మహాయశః!।
ఉంఛవృత్తిర్వనే నిత్యమ్ ప్రత్యవేక్షస్వ మామితి। 34

తమువాచ తతో రామః పరిహాససమన్వితమ్। 35

గవాం సహస్రమప్యేకం న తు విశ్రాణితం మయా।
పరిక్షిపసి దండేన యావత్ తావదవాప్స్యసి। 36

స శాటీం త్వరితః కట్యాం సంభ్రాంతః పరివేష్ట్య తామ్।
ఆవిద్ధ్య దండం చిక్షేప సర్వప్రాణేన వేగితః। 37

స తీర్త్వా సరయూపారం దండస్తస్య కరాచ్చ్యుతః।
గోవ్రజే బహుసాహస్రే పపాతోక్షణసన్నిధౌ। 38

ఇట్లు పల్కెను. "లక్ష్మణుని గృహమును, ఈ నాభవనమును విడిచిపెట్టివెళ్లకుండ ఎప్పటివలెనే శుభ్రముగానుంచుడు. నేను వచ్చెడివరకును వాటిని కాపాడుచుండుడు." (24-25)

తనవనవాసగమనకారణముగా దుఃఖమున మునిగియున్న ఆశ్రితజనముతో ఇట్లు పలికిన పిమ్మట శ్రీరాముడు 'కోశాగారమున గల నా ధనమునంతయును తెప్పింపుము'-అని కోశాధిపతిని ఆదేశించెను. పిమ్మట సేవకులు శ్రీరామునిధనమునంతయును దీసికొనివచ్చి అచట కుప్పపోసిరి. ఆ మహాధనరాశిని అచటివారు వేడుకతో దర్శించిరి. (26-27)

అంతట శ్రీరాముడు లక్ష్మణునితోగూడి ఆ ధనమునంతయును బ్రాహ్మణులకును, బాలురకును, వృద్ధులకును, దీనులకును పంచియిచ్చెను. (28)

ఆ అయోధ్యా సమీపముననే పింగళవర్ణ కేశములుగల ఒకానొక బ్రాహ్మణుడు నివసించుచుండెను. ఆయన పేరు త్రిజటుడు. గర్గవంశమువాడైన అతడు నాగలికఱ్ఱను, ఒక చిన్నగునపమును, నాగలిఆకారముగల ఒక సాధనమును (చిల్లకఱ్ఱను) చేతధరించి, నిత్యము ఉంఛవృత్తితో జీవించుచుండెడివాడు. (29)

తరుణియైన ఆయన భార్య దారిద్ర్యబాధకు తట్టుకొనలేనిదై పసివారైన తనకొడుకులను తనకడకు చేర్చుకొని, వృద్ధబ్రాహ్మణుడైన తన భర్తకు ఇట్లు ఉపాయమునుచెప్పెను. (30)

"స్వామీ! నాగలికఱ్ఱను, పలుగును, నాగలిని ప్రక్కనబెట్టుము. నామాటను పాటింపుము. ధర్మజ్ఞుడైన శ్రీరాముని దర్శించినచో మనకు కొంత మేలు కలుగును." భార్యమాటలను విన్నవెంటనే అతడు చినిగిన వస్త్రమును కప్పుకొని, రాముని భవనమును చేరుటకై దారిబట్టెను. (31-32)

భృగుమహర్షివలె, అంగిరసమహామునిరీతి తేజోవిరాజమానుడైన ఆ త్రిజటుడు జనసమూహముమధ్యగా వచ్చుచుండగా ఐదవ కక్ష్యవఱకును అతనిని ఎవ్వరును నివారింపలేదు. అప్పుడు ఆ త్రిజటుడు శ్రీరాముని సమీపించి ఆయనకిట్లు విన్నవించెను. "వాసిగాంచిన ఓ రాజకుమారా! నేను కటికపేదను. అధిక సంతానముగలవాడను. నిత్యము వనములలో తిరుగుచు ఉంఛవృత్తితో కుటుంబపోషణ చేసికొనుచున్నవాడను. దయతో నన్ను ఆదుకొనుము." (33-34)

అప్పుడు శ్రీరాముడు దరహాసమొనర్చి ఆయనతో ఇట్లనెను. "ఓ విప్రోత్తమా! నేను మీకు వేయిగోవులను ఇచ్చినను తక్కువయే. నీవు నీ చేతికఱ్ఱను ఎంతవఱకు విసరగలవో అంతవఱకును పట్టెడిగోవులసమూహమును నీకు సమర్పించెదను." (35-36)

వెంటనే అతడు తన ఉత్తరీయమును నడుమునకు బిగించి, తన చేతిలోని దండమును గిరగిర త్రిప్పుచు బలముకొలది వేగముగా దానిని విసరివేసెను. అతడు విసరిన ఆ కఱ్ఱ సరయూనదిని దాటి, ఆవలి తీరమున వేలకొలది గోవులుగలగోష్ఠము చివర ఒకవృషభము కడ పడెను. (37-38)

తం పరిష్వజ్య ధర్మాత్మా ఆతస్మాత్ సరయూతటాత్।
ఆనయామాస తా గోపైః త్రిజటస్యాశ్రమం ప్రతి। 39

ధర్మాత్ముడైన శ్రీరాముడు ఆ బ్రాహ్మణుని హృదయమునకు హత్తుకొని, సరయూనదియొక్క ఆవలితీరమునగల వేలకొలది గోవులను గోపాలురను వెంటనిచ్చి త్రిజటుని ఆశ్రమమునకు పంపించెను. (39)

ఉవాచ స తతో రామః తం గార్గ్యమభిసాంత్వయన్।
మన్యుర్న ఖలు కర్తవ్యః పరిహాసో హ్యయం మమ। 40

ఇదం హి తేజస్తవ యద్దురత్యయం
తదేవ జిజ్ఞాసితుమిచ్ఛతా మయా ।
ఇమం భవానర్థమభిప్రచోదితో
వృణీష్వ కిం చేదపరం వ్యవస్యతి । 41

బ్రవీమి సత్యేన న తేఽస్తి యంత్రణా
ధనం హి యద్యన్మమ విప్రకారణాత్।
భవత్సు సమ్యక్ ప్రతిపాదనేన తత్
మయాఽర్జితం ప్రీతియశస్కరం భవేత్ । 42

పిమ్మట శ్రీరాముడు ఆ విప్రుని ఓదార్పుచు ఇట్లు పలికెను. "పరిహాస సూచకమైన నా పరిహాసమునకు నీవు అన్యథా భావింప వలదు. తిరుగులేని నీశక్తిని తెలియగోరి, దండమును విసరుటకై నిన్ను ప్రేరేపించితిని. ఇంకను ఏమైన కావలసియున్నచో కోరుకొనుము. నేను నిజముగా పలుకుచుంటిని, సంకోచ పడవలదు. నాయొద్దనున్న ధనమంతయును విప్రోత్తముల ఉపయోగార్థమే సమకూర్పబడినది. మీవంటి సత్పురుషులకు త్రికరణశుద్ధిగా దానము చేసినచో నాకు తృప్తికలుగును, కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించును." (40-42)

తతః సభార్యః త్రిజటో మహాముని:
గవామనీకం ప్రతిగృహ్య మోదితః ।
యశోబలప్రీతిసుఖోపబృంహిణీః
తదాఽఽశిషః ప్రత్యవదన్మహాత్మనః । 43

స చాపి రామః ప్రతిపూర్ణమానసో
మహద్ధనం ధర్మబలైరుపార్జితమ్ ।
నియోజయామాస సుహృజ్జనేఽచిరాత్
యథార్హసమ్మానవచఃప్రచోదితః । 44

అంతట త్రిజటమహాముని అసంఖ్యాకములైన గోవులను స్వీకరించి, పత్నీసమేతుడై, మిక్కిలి సంతసించెను. పిమ్మట ఆ బ్రాహ్మణోత్తముడు ఉదారహృదయుడైన శ్రీరామునకు యశస్సు, బలము, ప్రీతి, సుఖము వృద్ధిచెందునట్లు ఆశీస్సులను పలికెను. పిమ్మట శ్రీరాముడు మిక్కిలి ప్రసన్నచిత్తుడై, ధర్మబద్ధముగా సముపార్జించిన ఆ మహాధనమును సముచితములైన మర్యాదా వచనములతో సుహృజ్జనులకేలుకొఱకై వినియోగించెను. (43-44)

ద్విజః సుహృద్భృత్యజనోఽథవా తదా
దరిద్రభిక్షాచరణశ్చ యోఽభవత్ ।
న తత్ర కశ్చిన్న బభూవ తర్పితో
యథార్హ సమ్మాననదానసంభ్రమైః । 45

ఆ సందర్భమున శ్రీరాముడొనర్చిన సమ్మానములతో, దానధర్మములతో, ఆదరసత్కారములతో తృప్తిచెందని బ్రాహ్మణులు, సుహృదులు, సేవకులు, దరిద్రులు, యాచకులు లేనేలేరు. అనగా అందఱును మిగుల సంతుష్టులైరి. (45)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్వాత్రింశస్సర్గః *(32)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదిరెండవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

33. ముప్పదిమూడవసర్గము

శ్రీరాముడుతన తండ్రియగు దశరథుని దర్శించుటకై సీతాలక్ష్మణులతోగూడి బయలుదేఱుట - నగరవాసులు వారినిజూచి దుఃఖితులగుట.

దత్త్వా తు సహ వైదేహ్యా బ్రాహ్మణేభ్యో ధనం బహు।
జగ్మతుః పితరం ద్రష్టుం సీతయా సహ రాఘవౌ। 1

సీతారామలక్ష్మణులు బ్రాహ్మణోత్తములకు విరివిగా ధనధాన్యములను ఒసంగి, తండ్రియైన దశరథమహారాజును దర్శించుటకై బయలుదేఱిరి. (1)

తతో గృహీతే దుష్ప్రేక్షే త్వశోభేతాం తదాయుధే।
మాలాదామభిరాబద్ధే సీతయా సమలంకృతే। 2

రామలక్ష్మణులు శత్రుభయంకరములైన ధనుస్సులను, ఖడ్గములను ధరించియుండిరి. ఆ ఆయుధములను సీతాదేవి

తతః ప్రాసాదహర్మ్యాణి విమానశిఖరాణి చ।
అధిరుహ్య జనః శ్రీమాన్ ఉదాసీనో వ్యలోకయత్। 3

చందనపుష్పమాలాదులచే అలంకరించుటవలన అవి చక్కగా శోభిల్లుచుండెను. అప్పుడు బాగుగా అలంకరించుకొనియున్న జనులు రాజప్రాసాదములమీదను, సంపన్నులభవనములపైనను, ఏడంతస్తుల మేడల మీదను చేరి, వారిని లోలోన చూచి దుఃఖితులైరి. (2-3)

న హి రథ్యాః స్మ శక్యంతే గంతుం బహుజనాకులాః।
ఆరుహ్య తస్మాత్ ప్రాసాదాన్ దీనాః పశ్యంతి రాఘవమ్। 4

పదాతిం వర్జితచ్ఛత్రం రామం దృష్ట్వా జనాస్తదా।
ఊచుర్బహువిధా వాచః శోకోపహతచేతసః। 5

జనులతో క్రిక్కిరిసియున్న రాజమార్గములయందు కాలు మోపుటకును వీలులేకుండెను. అందువలన పౌరులెల్లరును గృహముల మీదికెక్కి దీనవదనములతో శ్రీరాముని చూడసాగిరి. ఛత్రచామరములు లేకుండా కాలినడకన సాగిపోవుచున్న శ్రీరామునిజూచి ప్రజలు శోకమున మునింగిరి. అప్పుడు వారు తమలోతాము పెక్కురీతుల ఇట్లు మాట్లాడుకొనిరి. (4-5)

యం యాంతమనుయాతి స్మ చతురంగబలం మహత్।
తమేకం సీతయా సార్ధమ్ అనుయాతి స్మ లక్ష్మణః। 6

"ఎల్లప్పుడును శ్రీరామునివెంట చతురంగబలములు వైభవోపేతముగా నడచుచుండెడివి. మరి ఇప్పుడైతే ఒంటరిగా వచ్చుచున్న శ్రీరాముని వెనుక సీతాలక్ష్మణులు మాత్రమే కనబడుచున్నారు. (6)

ఐశ్వర్యస్య రసజ్ఞస్సన్ కామినాం చైవ కామదః।
నేచ్ఛత్యేవానృతం కర్తుం పితరం ధర్మగౌరవాత్। 7

శ్రీరాముడు ఐశ్వర్యసుఖానుభవములలో ఓలలాడినవాడే యైనను, అర్థులకు కొల్లలుగా దానధర్మములనొనర్చిన శ్రీమంతుడే యైనప్పటికిని తండ్రికడ విధేయుడై నడచుకొనినవాడు, ఆయన మాటను జవదాటనివాడు అగుటచే తండ్రివాగ్దానమును నిలుపుటకై అతడు వనవాసమునకు సిద్ధ(ఇష్ట)పడుచున్నాడు. (7)

యా న శక్యా పురా ద్రష్టుం భూతైరాకాశగైరపి।
తామద్య సీతాం పశ్యంతి రాజమార్గగతా జనాః। 8

ఆకాశమున విహరించెడి సిద్ధులు మున్నగు దివ్యజాతుల వారుగాని, భూమిపై సంచరించెడి మానవులుగాని (రాకుమారి, కలవారికోడలు ఐన) సీతాదేవిని ఇంతవఱకును చూచియే యెఱుగరు. కాని ఇప్పుడు ఈ విధముగా నాథునివెంట నడచి వచ్చుచున్న సీతాదేవిని రాజమార్గములయందున్న ప్రజలు ఎల్లరును చూడగలుగు చున్నారు. (8)

అంగరాగోచితాం సీతాం రక్తచందనసేవినీమ్।
వర్షముష్ణం చ శీతం చ నేష్యంత్యాశు వివర్ణతామ్। 9

సహజముగా సీతాదేవి చక్కని మైపూతలకు అర్హురాలు. ఆమె నేటివఱకును ఎఱ్ఱచందనము మొదలగు అంగరాగములతో శోభిల్లుచుండెను. కాని ఇక మీదట వనవాసమున చలితీవ్రతకు, వేడిగాలులకు, వర్షబాధకు గురియై ఆమెముఖము వాడిపోవును, వన్నె తఱిగిపోవును. (9)

అద్య నూనం దశరథః సత్త్వమావిశ్య భాషతే।
న హి రాజా ప్రియం పుత్రం వివాసయితుమిచ్ఛతి। 10

నిజముగా నేడు దశరథమహారాజును ఏదో పిశాచము ఆవేశించినట్లున్నది. అందువలన అతడు ఇట్లు అనుచితముగా మాట్లాడుచున్నాడు. లేనిచో తనసహజస్థితిలోనున్న ఏరాజైనను తనగారాలపట్టిని ఇంటినుండి వెడలగొట్టునా? (10)

నిర్గుణస్యాపి పుత్రస్య కథం స్యా ద్విప్రవాసనమ్।
కిం పునర్యస్య లోకోఽయం జితో వృత్తేన కేవలమ్। 11

ఆనృశంస్యమనుక్రోశః శ్రుతం శీలం దమశ్శమః।
రాఘవం శోభయంత్యేతే షడ్గుణాః పురుషోత్తమమ్। 12

కొడుకు ఎంత చెడ్డవాడైనను తండ్రి అతనిని ఇంటినుండి వెళ్లగొట్టుటకు సాహసింపడు. ఇంక తన చక్కని సత్ప్రవర్తనచేత లోకము మెప్పునుగూడ పొందిన శ్రీరామునివిషయమై చెప్పనేల? అహింసాస్వభావము, భూతదయ, విజ్ఞానము, సత్స్వభావము, ఇంద్రియసంయమనము, మనోనిగ్రహము అను ఆఱు ఉత్తమ గుణములకును శ్రీరాముడు ఆటపట్టు. అందువలననే అతడు పురుషోత్తముడు." (11-12)

తస్మాత్ తస్యోఽపఘాతేన ప్రజాః పరమపీడితాః।
ఔదకానీవ సత్త్వాని గ్రీష్మే సలిలసంక్షయాత్। 13

పీడయా పీడితం సర్వం జగదస్య జగత్పతేః।
మూలస్యేవోపఘాతేన వృక్షః పుష్పఫలోపగః। 14

మూలం హ్యేష మనుష్యాణాం ధర్మసారో మహాద్యుతిః।
పుష్పం ఫలం చ పత్రం చ శాఖాశ్చాస్యేతరే జనాః। 15

తే లక్ష్మణ ఇవ క్షిప్రం సపత్న్యః సహ బాంధవాః।
గచ్ఛంతమనుగచ్ఛామో యేన గచ్ఛతి రాఘవః। 16

ఉద్యానాని పరిత్యజ్య క్షేత్రాణి చ గృహాణి చ।
ఏకదుఃఖసుఖా రామమ్ అనుగచ్ఛామ ధార్మికమ్। 17

సముద్ధృతనిధానాని పరిధ్వస్తాజిరాణి చ।
ఉపాత్త ధనధాన్యాని హృతసారాణి సర్వశః। 18

రజసాఽభ్యవకీర్ణాని పరిత్యక్తాని దైవతైః।
మూషకైః పరిధావద్భిః ఉద్బిలైరావృతాని చ। 19

అపేతోదకధూమాని హీనసమ్మార్జనాని చ।
ప్రణష్ట బలికర్మేజ్యా మంత్రహోమజపాని చ। 20

దుష్కాలేనేవ భగ్నాని భిన్నభాజనవంతి చ।
అస్మత్త్యక్తాని వేశ్మాని కైకేయీ ప్రతిపద్యతామ్। 21

వనం నగరమేవాస్తు యేన గచ్ఛతి రాఘవః।
అస్మాభిశ్చ పరిత్యక్తం పురం సంపద్యతాం వనమ్। 22

బిలాని దంష్ట్రిణఃసర్వే సానూని మృగపక్షిణః।
త్యజంత్వస్మద్భయాద్భీతా గజాస్సింహా వనాన్యపి। 23

అస్మత్త్యక్తం ప్రపద్యంతాం సేవ్యమానం త్యజంతు చ।
తృణమాంసఫలాదానాం దేశం వ్యాళమృగద్విజమ్। 24

అట్టి సద్గుణసంపన్నుడైన శ్రీరామునియొక్క రాజ్యాభిషేకము భంగమైనందులకును, అతడు అరణ్యములపాలగుచున్నందులకును తట్టుకొనలేక ప్రజలు వేసవికాలమున నీరింకిపోయిన మడుగుల లోని జలజంతువులవలె దిక్కుతోచక గిలగిలలాడుచున్నారు. (13)

వృక్షముయొక్క మూలమును ఛేదించినచో ఆకులు, పూవులు, పండ్లు మున్నగునవి అన్నియును వాడిపోవునట్లు, జగత్పతియైన శ్రీరామునకు వచ్చిపడిన ఆపదకు జగమంతయు తల్లడిల్లినది. (14)

మహాతేజోరాశియు, ధర్మస్వరూపుడును ఐన శ్రీరామచంద్రుడే సమస్తమానవులకును (ప్రాణికోటికిని) ఆధారము. వృక్షమునకు కొమ్మలు, ఆకులు, పూవులు, ఫలములవలె జనులందఱును (సమస్త ప్రాణులును) శ్రీరామునకు చెందినవారే. (15)

రాముని అనుసరించి వెళ్లుచున్న లక్ష్మణునివలె మనము, మనభార్యాపుత్రులు, బంధుమిత్రులు-అందఱమూ శ్రీరాముని అడుగుజాడలలో నడచెదము. (16)

మనము మనతోటలను, పొలములను, ఇండ్లను పరిత్యజించి (ఈ బంధములను త్రెంచుకొని) సుఖదుఃఖములనాటనే పంచి, ధర్మమూర్తియైన శ్రీరాముని అనుసరించి వెళ్లుదము. (17)

మనము విడిచిపెట్టి వెళ్లిపోయిన పిమ్మట మన ఇండ్లన్నియును శూన్యములగును. నిధులను దొంగలు త్రవ్వుకొని పోవుదురు. ముంగిళ్లన్నియును చెత్తచెదారములతో నిండిపోవును. గృహముల లోని ధనధాన్యములు, పశువులు, మంచములు, పరుపులు మొదలగునవి చోరులపాలగును. ఇండ్లు వాకిళ్లు పూర్తిగా దుమ్ము కొట్టుకొని పోవును. పూజామందిరములు పాడుబడును, అవి ఎలుకలతో, పాటికలుగులతో నిండిపోవును. ఊడ్చిసేళ్లు చల్లెడివారు లేక పూజాదూపములులేక అవి బూజుపట్టి పోవును. బలికర్మలు, పూజాపురస్కారములు, మంత్రోపాసనలు, హోమకార్యములు, జపతపములు మున్నగునవి మచ్చుకైనను కానరావు. ఇండ్లలోని పాత్రలన్నియును ఛిన్నాభిన్నములగును. కఱవుకాటకములు తాండవించినట్లుగా పాడుబడియుండు ఈ ప్రదేశములను కైకేయి యేలుకొనుగాక. (18-21)

శ్రీరాముడు నివసించునది అరణ్యమేయైనను మనపాలిటికి అది అయోధ్యానగరమేయగును. మనము విడిచివెళ్లుటతో పాడుబడి యుండెడి ఈ నగరము (జనసంచారములేక) అడవియే యగును. శ్రీరాముని అనుసరించి మనము అడుగిడుటతో అడవులలోని ఏనుగులు, సింహములు, ప్రాణభయముతో పాఱిపోవును. పాములు పుట్టలను, మృగములు, పక్షులు పర్వతప్రాంతములను వీడి ప్రాణభీతితో పఱుగులుదీయును. (22-23)

మనము నివసింపబోవు వనములను అవి (మృగములు, పక్షులు మొదలగునవి) త్యజించును. మనము త్యజించెడి అయోధ్యానగరము నందు అవి విహరించును. గడ్డితో జీవించెడి లేళ్లు మొదలగు

ప్రపత్స్యతాం హి కైకేయీ సపుత్రా సహ బాంధవైః।
రాఘవేణ వనే సర్వే వయం వత్స్యామ నిర్వృతాః॥ 25

ఇత్యేవం వివిధా వాచో నానాజనసమీరితాః।
శుశ్రావ రామః శ్రుత్వా చ న విచక్రేఽస్య మానసమ్॥ 26

స తు వేశ్మ పితుర్దూరాత్ కైలాసశిఖరప్రభమ్।
అభిచక్రామ ధర్మాత్మా మత్తమాతంగవిక్రమః॥ 27

వినీతవీరపురుషం ప్రవిశ్య తు నృపాలయమ్।
దదర్శావస్థితం దీనం సుమంత్రమవిదూరతః॥ 28

ప్రతీక్షమాణోఽపి జనం తదార్తమ్
అనార్తరూపః ప్రహసన్నివాథ ।
జగామ రామః పితరం దిదృక్షుః
పితుర్నిదేశం విధివచ్చికీర్షుః ॥ 29

తత్పూర్వమైక్ష్వాకసుతో మహాత్మా
రామో గమిష్యన్ వనమార్తరూపమ్ ।
వ్యతిష్ఠత ప్రేక్ష్య తదా సుమంత్రం
పితుర్మహాత్మా ప్రతిహారణార్థమ్ ॥ 30

పితుర్నిదేశేన తు ధర్మవత్సలో
వనప్రవేశే కృతబుద్ధినిశ్చయః ।
స రాఘవః ప్రేక్ష్య సుమంత్రమబ్రవీత్
నివేదయస్వాగమనం నృపాయ మే ॥ 31

వానితో, మాంసమును తిని బ్రతికెడి పెద్దపులులు మున్నగువానితో, ఫలములతో పొట్టపోసికొను కాకులు మొదలగువానితో నిండియుండెడు ఈ అయోధ్యను కైకేయి కొడుకుతో, బంధు మిత్రులతో గూడి యేలుకొనుగాక, మనము అందరము రామునితో గూడి వనములలో హాయిగా కాలముగడుపుదము." (24-25)

అచట చేరిన వివిధవర్గముల ప్రజలు ఇట్లు మాట్లాడుకొనుచున్న వచనములను వినియు రాముడు ఎట్టి వికారములకును లోనుకాలేదు. (26)

మదగజమువలె మిగుల పరాక్రమశాలియు, ధర్మస్వరూపుడును ఐన శ్రీరాముడు కైలాసశిఖరమువలె విరాజిల్లుచున్న తండ్రి (రాజ) భవనమును దూరమునుండియే చూచి, క్రమముగా దానిని సమీపించెను. (27)

అంతట రాముడు వినమ్రులగు వీరపురుషులతోగూడిన ఆరాజభవనమున ప్రవేశించి, సమీపముననే దీనవదనుడై నిలిచియున్న సుమంత్రునిగాంచెను. (28)

అచటివారెల్లరును దుఃఖమున మునిగియుండిరి. శ్రీరాముడు వారిని చూచియు, ఎట్టి వికారమునకును లోనుగాలేదు. అతడు తండ్రి యాజ్ఞను యథావిధిగా పాలింపదలచినవాడై, ఆయనను చూచుటకై తన సహజమైన ప్రసన్నవదనముతో ముందునకుసాగెను. (29)

ఇక్ష్వాకువంశప్రముఖుడైన దశరథమహారాజుయొక్క కుమారుడును, మిక్కిలి ధైర్యశాలియు, బుద్ధిమంతుడును ఐన శ్రీరాముడు వనములకు వెళ్లబోవుచున్నవాడై, ముందుగా తనరాకనుగూర్చి తండ్రికి తెలుపుటకై దుఃఖమగ్నుడైయున్న సుమంత్రునిగాంచి యచట నిలిచెను. (30)

ధర్మాచరణమున నిరతుడైయుండు శ్రీరాముడు తండ్రియాదేశమును శిరసావహించి, వనవాసము చేయుటకు నిశ్చయించుకొనినవాడై, సుమంత్రునుద్దేశించి 'నారాకను మహారాజునకు నివేదింపుము' అని నుడివెను. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రయస్త్రింశస్సర్గః (33)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదిమూడవసర్గము సమాప్తము

-- * * * --

34. ముప్పదినాల్గవసర్గము

వనవాసమునకు సిద్ధపడిన శ్రీరామునివిషయమున దశరథుడు కడు దుఃఖితుడగుట - శ్రీరాముడు తండ్రిని పలువిధముల ఓదార్చి, ఆయననుండి సెలవుగైకొనుట.

తతః కమలపత్రాక్షః శ్యామో నిరుపమో మహాన్।
ఉవాచ రామస్తం సూతం పితురాఖ్యాహి మామితి॥ 1

అందమైన కనులుగలవాడును, సాటిలేని సౌందర్యముగలవాడును, మహాపురుషుడును, ఐన శ్యామసుందరుడగు రాముడు 'నేను ఇచటికివచ్చియున్నట్లుగా మా తండ్రిగారికి నివేదింపుము'-అని ఆ సుమంత్రునితో పలికెను. (1)

స రామప్రేషితః క్షిప్రం సంతాపకలుషేంద్రియః।
ప్రవిశ్య నృపతిం సూతో నిశ్శ్వసంతం దదర్శ హ। 2

ఉపరక్తమివాదిత్యం భస్మచ్ఛన్నమివానలమ్।
తటాకమివ నిస్తోయమ్ అపశ్యజ్జగతీపతిమ్। 3

ఆలోక్య తు మహాప్రాజ్ఞః పరమాకులచేతసమ్।
రామమేవానుశోచంతం సూతః ప్రాంజలిరాసదత్। 4

తం వర్ధయిత్వా రాజానం పూర్వం సూతో జయాశిషా।
భయవిక్లబయా వాచా మందయా శ్లక్ష్ణమబ్రవీత్। 5

అయం స పురుషవ్యాఘ్రో ద్వారి తిష్ఠతి తే సుతః।
బ్రాహ్మణేభ్యో ధనం దత్త్వా సర్వం చైవోపజీవినామ్। 6

స త్వాం పశ్యతు భద్రం తే రామః సత్యపరాక్రమః।
సర్వాన్ సుహృద ఆపృచ్ఛ్య త్వామిదానీం దిదృక్షతే। 7

గమిష్యతి మహారణ్యం తం పశ్య జగతీపతే!।
వృతం రాజగుణైః సర్వైః ఆదిత్యమివ రశ్మిభిః। 8

స సత్యవాదీ ధర్మాత్మా గాంభీర్యాత్ సాగరోపమః।
ఆకాశ ఇవ నిష్పంకో నరేంద్రః ప్రత్యువాచ తమ్। 9

సుమంత్రానయ మే దారాన్ యే కేచిదిహ మామకాః।
దారైః పరివృతః సర్వైః ద్రష్టుమిచ్ఛామి ధార్మికమ్। 10

సోఽంతఃపురమతీత్యైవ స్త్రియస్తా వాక్యమబ్రవీత్।
ఆర్యాహ్వయతి వో రాజా గమ్యతాం తత్ర మా చిరమ్। 11

ఏవ ముక్తాః స్త్రియః సర్వాః సుమంత్రేణ నృపాజ్ఞయా।
ప్రచక్రముస్తద్భవనం భర్తురాజ్ఞాయ శాసనమ్। 12

అర్ధసప్తశతాస్తాస్తు ప్రమదాః తామ్రలోచనాః।
కౌసల్యాం పరివార్యాథ శనైర్జగ్ముః ధృతవ్రతాః। 13

ఆగతేషు చ దారేషు సమవేక్ష్య మహీపతిః।
ఉవాచ రాజా తం సూతం సుమంత్రాఽఽనయ మే సుతమ్। 14

స సూతో రామమాదాయ లక్ష్మణం మైథిలీం తదా।
జగామాభిముఖస్తూర్ణం సకాశం జగతీపతేః। 15

స రాజా పుత్రమాయాంతం దృష్ట్వా దూరాత్ కృతాంజలిమ్।
ఉత్పపాతాసనాత్ తూర్ణమ్ ఆర్తః స్త్రీజనసంవృతః। 16

దుఃఖముచే మనస్సు కలతచెందియున్న ఆ సుమంత్రుడు రామాజ్ఞను తలదాల్చి, వెంటనే లోనికేగి, శోకముచే నిట్టూర్పులు విడుచుచున్న దశరథమహారాజును దర్శించెను. (2)

అప్పుడు ఆ మహారాజు రాహుగ్రస్తుడైన సూర్యునివలెను, భస్మముచే కప్పబడిన అగ్నివలెను, నీరులేని చెఱువువలెను తేజోవిహీనుడై యుండెను. (3)

మిక్కిలి వ్యాకులచిత్తుడై, అనుక్షణము శ్రీరామునే స్మరించుచున్న రాజునుగాంచి, ప్రజ్ఞాశాలియగు సుమంత్రుడు అంజలిఘటించి నిలిచెను. అంతట అతడు ముందుగా రాజుగారికి జయవచనములను బలికి, ఆయన పరిస్థితికి భయపడుచు ఆయనతో తిన్నగా మృదువుగా ఇట్లునుడివెను. (4-5)

రాజా! "పురుషశ్రేష్ఠుడైన నీకుమారుడగు శ్రీరాముడు బ్రాహ్మణులకును, తనసేవకులకును ధనములనొసంగి ఇచటికి వచ్చి, ఇదిగో ద్వారము కడ నిలిచియున్నాడు. మీకు శుభమగుగాక. తిరుగులేని పరాక్రమశాలియైన శ్రీరాముడు తనమిత్రులందఱిని వీడ్కొని వచ్చినాడు. మిమ్ము దర్శింపగోరుచున్నాడు. మీ ఆజ్ఞయైనచో ఆయన ఇచ్చటికి రాగలడు. ఓ మహారాజా! తనవేలకొలది కిరణములచే ప్రకాశించు సూర్యునివలె సకలరాజలక్షణములచే విలసిల్లుచున్న శ్రీరాముడు అరణ్యములకు వెళ్లుచు ఇచటికి వచ్చియున్నాడు. అతనిని చూడుము" (6-8)

సత్యసంధుడు, ధర్మనిరతుడు ఐన దశరథుడు ఆకాశమువలె స్వచ్ఛమైనవాడు, సముద్రునివలె గంభీరుడు. అట్టి ఆ మహారాజు సుమంత్రునితో ఇట్లు నుడివెను. (9)

"సుమంత్రా! ఈ భవనమునగల నా భార్యలను అందఱిని ఇచటికి దీసికొని రమ్ము. వారితోగూడి నేను ధర్మమూర్తియైన శ్రీరాముని చూడగోరుచున్నాను." (10)

అంతట సుమంత్రుడు ఆ అంతఃపురమునుండి వెళ్లి, రాణులతో "రాజుగారు మిమ్ములను అందఱిని పిలుచుచున్నారు. వెంటనే మీరు అచటికి విచ్చేయుడు." అని పలికెను. (11)

రాజాజ్ఞను అనుసరించి, సుమంత్రుడు ఇట్లు తెలుపగా, రాణులందఱును రాజుయొక్క ఆజ్ఞను తలదాల్చి, దశరథుని భవనమునకు బయలుదేఱిరి. రాముని వనవాసవార్తకు తట్టుకొనలేక దుఃఖకారణముగా ఆ స్త్రీలకన్నులు ఎఱుపెక్కియుండెను. అట్టి మూడువందల ఏబదిమంది స్త్రీలు నియమనిష్ఠలతో కౌసల్యాదేవిని అనుసరించి, తిన్నగా ఆ భవనమునకు చేరిరి. అట్లు విచ్చేసిన భార్యలను అందఱిని పరిశీలనగా జూచి, ఆరాజు "సుమంత్రా! నాకుమారుని తోడ్కొని రమ్ము" అని పలికెను. (12-14)

అప్పుడు ఆ సుమంత్రుడు సీతారామలక్ష్మణులను తీసికొనివచ్చి, రాజునకు అభిముఖుడై ఆయనకు చేరువగా నిలిచెను. (15)

అంజలి ఘటించి నమస్కరించుచు వచ్చుచున్న తనకుమారుడగు శ్రీరాముని జూచి, దుఃఖార్తుడై, స్త్రీలచే పరివృతుడైయున్న ఆ మహారాజు వెంటనే తనఆసనమునుండి లేచెను. శ్రీరాముని జూచుటతోడనే

సోఽభిదుద్రావ వేగేన రామం దృష్ట్వా విశాంపతిః।
తమసంప్రాప్య దుఃఖార్తః పపాత భువి మూర్ఛితః। 17

తం రామోఽభ్యపతత్ క్షిప్రం లక్ష్మణశ్చ మహారథః।
విసంజ్ఞమివ దుఃఖేన సశోకం నృపతిం తదా। 18

స్త్రీసహస్రనినాదశ్చ సంజజ్ఞే రాజవేశ్మని।
హాహా రామేతి సహసా భూషణధ్వనిమూర్ఛితః। 19

తం పరిష్వజ్య బాహుభ్యాం తావుభౌ రామలక్ష్మణౌ।
పర్యంకే సీతయా సార్ధం రుదంతః సమవేశయన్। 20

అథ రామో ముహూర్తేన లబ్ధసంజ్ఞం మహీపతిమ్।
ఉవాచ ప్రాంజలిర్భూత్వా శోకార్ణవపరిప్లుతమ్। 21

ఆపృచ్ఛే త్వాం మహారాజ! సర్వేషామీశ్వరోఽసి నః।
ప్రస్థితం దండకారణ్యం పశ్య త్వం కుశలేన మామ్। 22

లక్ష్మణం చానుజానీహి సీతా చాన్వేతి మాం వనమ్।
కారణైర్బహుభిస్తథ్యైః వార్యమాణౌ న చేచ్ఛతః। 23

అనుజానీహి సర్వాన్నః శోకముత్సృజ్య మానద!
లక్ష్మణం మాం చ సీతాం చ ప్రజాపతిరివ ప్రజాః। 24

ప్రతీక్షమాణమవ్యగ్రమ్ అనుజ్ఞాం జగతీపతేః।
ఉవాచ రాజా సంప్రేక్ష్య వనవాసాయ రాఘవమ్। 25

అహం రాఘవ! కైకేయ్యా వరదానేన మోహితః।
అయోధ్యాయాస్త్వమేవాద్య భవ రాజా నిగృహ్య మామ్। 26

ఏవముక్తో నృపతినా రామో ధర్మభృతాం వరః।
ప్రత్యువాచాంజలిం కృత్వా పితరం వాక్యకోవిదః। 27

భవాన్ వర్షసహస్రాయ పృథివ్యా నృపతే! పతిః।
అహం త్వరణ్యే వత్స్యామి న మే కార్యం త్వయాఽనృతమ్। 28

నవ పంచ చ వర్షాణి వనవాసే విహృత్య తే।
పునః పాదౌ గ్రహీష్యామి ప్రతిజ్ఞాంతే నరాధిప! 29

ఆ మహారాజు అతనికెదురుగా వేగముగా నడచెను. శోకమున మునిగియున్న ఆరాజు రాముని జేరకముందే స్పృహను కోల్పోయి నేలపైబడెను. (16-17)

శోకముచే క్రుంగిపోవుచు, దుఃఖభారముచే స్పృహదప్పియున్న రాజును లేవదీయుటకై శ్రీరాముడును, మహారథుడైన లక్ష్మణుడును త్వరత్వరగా పరుగెత్తుకొనివచ్చిరి. (18)

అంతట అచటి వేలకొలది స్త్రీలు 'అయ్యోరామా! అయ్యోరామా!' అని గగ్గోలు పెట్టసాగిరి. వారిహాహాకారములును, ఆభరణముల ధ్వనులును ఆరాజగృహమునందంతటను నిండిపోయెను. (19)

వెంటనే రామలక్ష్మణులిద్దఱును తండ్రిని కౌగిలించుకొనిరి. వారు దుఃఖించుచు సీతతో గూడి, ఆ మహారాజును ప్రక్కపై పరుండబెట్టిరి. (20)

ఒక్క క్షణకాలమునకు మహారాజు మూర్ఛనుండి తేఱుకొనెను. శోకసముద్రమున మునిగియున్న తనతండ్రితో శ్రీరాముడు అంజలి ఘటించి ఇట్లనెను. (21)

"ఓ మహారాజా! మీరు మా అందఱికిని ప్రభువులు. అందువలన నేను మీకు విన్నవించుకొనుచున్నాను. వనవాసార్థమై దండకారణ్యములకు వెళ్లు నన్ను మీ చల్లని చేతులతో దీవించి పంపుడు. లక్ష్మణుడును, సీతయు వనములకు నన్ను అనుసరింపగోరుచున్నారు. ఎన్ని విధములుగా వారించినను వారు వినుటలేదు. కావున వారినిగూడ అనుమతింపుడు. బ్రహ్మదేవుడు తన సంతానమైన సనకాదులను తపోవనములకు అనుమతించినట్లుగా నాకును, లక్ష్మణునకును, సీతకును (మా ముగ్గురికిని) వనవాసమునకు నిర్విచారముగా అనుజ్ఞయిండు. మాకై మీరు ఏమాత్రమూ దుఃఖింపవలదు." (22-24)

వనప్రయాణమునకు మహారాజుయొక్క ఆజ్ఞకై నిర్వికారుడై (ఎట్టి తొట్రుపాటూ లేక) నిరీక్షించుచున్న శ్రీరాముని జూచి, ఆ ప్రభువు (దశరథుడు) ఇట్లు పలికెను. "ఓ రఘురామా! కైకేయికి ఇచ్చిన వరములకారణముగా నేను మోసపోయితిని. నా మాటను త్రోసిపుచ్చి (నన్ను బంధించి) నీవే స్వయముగా కోసలరాజ్యాధిపత్యమును చేపట్టుము." (25-26)

మహారాజు ఇట్లు పలుకగా ధర్మాత్ములలో అగ్రగణ్యుడును, మాటనేర్పరియు ఐన శ్రీరాముడు దోసిలొగ్గి, తండ్రితో ఈ విధముగా నుడివెను. (27)

"ఓ మహారాజా! వేలకొలది సంవత్సరముల (ఎన్ని సంవత్సరముల) వఱకైనను (ఎల్లకాలము) మీరే ఈ రాజ్యమునకు పరిపాలకులు. మీ మాటను వమ్ముచేయుట నాకు ధర్మముగాదు. అందువలన నేను అరణ్యములలో నివసించెదను. ఓ ప్రభూ! పదునాలుగు సంవత్సరములపాటు వనములలో విహరించుచు గడిపి, మీ ఆజ్ఞను పాలించిన పిమ్మట, తిరిగి మీ పాదములచెంతచేరి, మీకు సేవలొనర్చెదను." (28-29)

రుదన్నార్తః ప్రియం పుత్రం సత్యపాశేన సంయతః।
కైకేయ్యా చోద్యమానస్తు మిథో రాజా తమబ్రవీత్ । 30

అంతట దశరథమహారాజు సత్యపాశముచే బంధింపబడి (సత్యవచనమునకు కట్టుబడినవాడగుటచేతను, 'నీవు లోగడ పలికిన మాటప్రకారము శ్రీరాముని ఇప్పుడే వనములకు పంపుము' అనుచు-కైకేయి రహస్యముగా ఒత్తిడి చేయుటవలనను, దుఃఖముతో ఏడ్చుచు అతనితో ఇట్లు నుడివెను. (30)

శ్రేయసే వృద్ధయే తాత! పునరాగమనాయ చ।
గచ్ఛస్వారిష్టమవ్యగ్రః పంథానమకుతోభయమ్ । 31

న హి సత్యాత్మనస్తాత! ధర్మాభిమనసస్తవ।
వినివర్తయితుం బుద్ధిః శక్యతే రఘునందన! । 32

అద్య త్విదానీం రజనీం పుత్ర! మా గచ్ఛ సర్వథా।
ఏకాహదర్శనేనాపి సాధు తావచ్చరామ్యహమ్ । 33

మాతరం మాం చ సంపశ్యన్ వసేమామద్య శర్వరీమ్।
తర్పితస్సర్వకామైస్త్వం శ్వః కాలే సాధయిష్యసి । 34

"నాయనా! రామా! నీవు వెళ్లిరమ్ము. నీకు శుభములు, లాభములు చేకూరుగాక. నీప్రయాణములు శుభముగా, సుఖముగా సాగుగాక. అరణ్యములలో నీకు ఏ జంతువులవలనను, ఎవరిచేతను భయప్రమాదములు కలుగకుండుగాక. క్షేమముగా తిరిగి రమ్ము. ఓ రఘురామా! నీవు సత్యశీలుడవు, ధర్మనిరతుడవు. కనుక నిన్ను ఈ సంకల్పమునుండి మఱల్చుట అశక్యము. కాని కుమారా! ప్రస్తుతము ఈ రాత్రి ముగియువఱకైనను ఇచటనే యుండుము. ఈ ఒక్క రోజైనను నిన్ను జూచుచు సుఖముగా గడిపెదను. నేను, మీఅమ్మయును నిన్ను గూడి తృప్తిగా మానసోల్లాసములతో ఈ రాత్రియంతయు గడిపెదము. నీవు రేపు వెళ్లవచ్చును. (31-34)

దుష్కరం క్రియతే పుత్ర! సర్వథా రాఘవ! త్వయా।
మత్ప్రియార్థం ప్రియాంస్త్యక్త్వా యద్యాసి విజనం వనమ్ । 35

నాయనా! రఘునందనా! నామాటను నిలుపుటద్వారా నాకు తృప్తిని గూర్చుటకై ఆత్మీయులనందఱిని వీడి, నిర్జనారణ్యములకు వెళ్లుచున్నావు. అన్నివిధములుగా (ఎవ్వరికిని సాధ్యముగాని) ఈ దుష్కరకార్యమును నీవు చేయుచున్నావు. (35)

న చైతన్మే ప్రియం పుత్ర! శపే సత్యేన రాఘవ!।
ఛన్నయా చలితస్త్వస్మి స్త్రియా ఛన్నాగ్నికల్పయా । 36

ఓ రాఘవా! నీవనవాసగమనము నాకేమాత్రము సమ్మతము గాదు. ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. ఇది నిజము. కుటిలస్వభావమును మనసున దాచుకొనినదియు, బూడిదచే కప్పబడియున్న నిప్పువంటిదియు (తేనెపూసిన కత్తివంటిదియు) ఐన కైకేయికారణముగా మోసమునకులోనైతిని. (36)

వంచనా యా తు లబ్ధా మే తాం త్వం నిస్తర్తుమిచ్ఛసి।
అనయా వృత్తసాధిన్యా కైకేయ్యాఽభిప్రచోదితః । 37

లోకసాధారణస్థితిలో నేను ఆమెకు రెండు వరములను ఇచ్చియుంటిని. కాని ఆమె ఆ వరములకు 1. భరతుని యువరాజును చేయుట, 2. నిన్ను వనవాసమునకు పంపుట- అను రూపములనిచ్చి నన్ను మోసగించినది. ఆ విధముగా నేను ఆమెవల్లాగమున చిక్కుపడితిని. వంశాచారములను మంటగలుపుచున్న ఈ కైకేయిచే ప్రేరితుడవైన నీవు ఈ సంకటపరిస్థితినుండి నన్ను బయటపడవేయుటకై (నా వాగ్దానమును నిలబెట్టుటకై) ఆమె కోరికను దీర్చుటకు సిద్ధపడితివి. (37)

న చైతదాశ్చర్యతమం యస్త్వం జ్యేష్ఠస్సుతో మమ।
అపానృతకథం పుత్ర! పితరం కర్తుమిచ్ఛసి । 38

అథ రామస్తథా శ్రుత్వా పితురార్తస్య భాషితమ్।
లక్ష్మణేన సహ భ్రాత్రా దీనో వచనమబ్రవీత్ । 39

నాయనా! రామా! వయస్సుచే మాత్రమే గాక గుణములచేతను నా జ్యేష్ఠపుత్రుడవైన నీవు నన్ను (తండ్రిని) సత్యసంధునిగా జేయుటకై ఈ వనవాసభారమును నీ భుజములపై వేసికొంటివి. ఇది ముమ్మాటికి నిజము. ఇందు ఆశ్చర్యపడవలసినది ఏమియులేదు." సోదరుడైన లక్ష్మణునితో గూడియున్న శ్రీరాముడు తనతండ్రి ఆర్తితో పలికిన మాటలను విని, దీనముగా[1] ఆయనతో ఇట్లు నుడివెను. (38-39)

1) తండ్రికోరినరీతిగా ఒక్కరోజైనను ఆయనతో గడిపి, ఆయనను తృప్తిపఱచుటకు నోచుకొనకుంటినే-అని దీనుడై రాముడు వేదనపడెను.

ప్రాప్స్యామి యానద్య గుణాన్ కో మే శ్వస్తాన్ ప్రదాస్యతి।
అపక్రమణ మే వాతః సర్వకామైరహం వృణే। 40

ఇయం సరాష్ట్రా సజనా ధనధాన్యసమాకులా।
మయా విసృష్టా వసుధా భరతాయ ప్రదీయతామ్। 41

వనవాసకృతా బుద్ధిః న చ మేఽద్య చలిష్యతి। 42

యస్తుష్టేన వరో దత్తః కైకేయ్యై వరద! త్వయా।
దీయతాం నిఖిలేనైవ సత్యస్త్వం భవ పార్థివ! 43

అహం నిదేశం భవతో యథోక్తమనుపాలయన్।
చతుర్దశసమా వత్స్యే వనే వనచరైస్సహ। 44

మా విమర్శో వసుమతీ భరతాయ ప్రదీయతామ్।
న హి మే కాంక్షితం రాజ్యం సుఖమాత్మని వా ప్రియమ్।
యథానిదేశం కర్తుం వై తవైవ రఘునందన! 45

అపగచ్ఛతు తే దుఃఖం మాఽభూర్బాష్పపరిప్లుతః।
న హి క్షుభ్యతి దుర్ధర్షః సముద్రః సరితాం పతిః। 46

నైవాహం రాజ్యమిచ్ఛామి న సుఖం న చ మైథిలీమ్।
నైవ సర్వానిమాన్ కామాన్ న స్వర్గం నైవ జీవితమ్। 47

త్వామహం సత్యమిచ్ఛామి నానృతం పురుషర్షభ!
ప్రత్యక్షం తవ సత్యేన సుకృతేన చ తే శపే। 48

న చ శక్యం మయా తాత! స్థాతుం క్షణమపి ప్రభో।
న శోకం ధారయస్వేమం న హి మేఽస్తి విపర్యయః। 49

అర్థితో హ్యస్మి కైకేయ్యా వనం గచ్ఛేతి రాఘవ!
మయా చోక్తం వ్రజామీతి తత్సత్యమ్ అనుపాలయే। 50

మా చోత్కంఠాం కృథా దేవ! వనే రంస్యామహే వయమ్।
ప్రశాంతహరిణాకీర్ణే నానాశకునినాదితే। 51

పితా హి దైవతం తాత! దేవతానామపి స్మృతమ్।
తస్మాద్దైవతమిత్యేవ కరిష్యామి పితుర్వచః। 52

నేను నేడు ఇచటనే యుండి వివిధభోగములను అనుభవించుటకు కోరికపడినను, రేపటినుండి అవి అక్కడ (అరణ్యములలో) లభింపవుగదా! కనుక అన్ని కోరికలనుండియు మరలుటకే అనగా కోరికలన్నింటిని ప్రక్కన బెట్టి ఇప్పుడే వనములకు వెళ్లుటకు నేను ఇష్టపడుదును. (40)

ఈ కోసలరాజ్యము పెక్కురాష్ట్రములతో విలసిల్లుచున్నది, సజ్జనులతో కలకలలాడుచున్నది. ధనధాన్యములతో సుసంపన్నమైనది. అట్టి ఈ వసుధను నేను కోరుకొనుటలేదు. దీనిని భరతునకే ఇచ్చివేయుడు. నేను వనగమనమునకే దృఢముగా నిశ్చయించుకొంటిని. (ఈ క్షణిక భోగములకై) నాబుద్ధి ఏమాత్రము చలింపదు. (41-42)

ఓ వరదా! నీవు కైకేయీమాతకు మిక్కిలి సంతోషముతో వాగ్దానము చేసినప్రకారము ఆవరములను సమగ్రముగా ఇచ్చివేయుము. ఓ మహారాజా! నీవు సత్యసంధుడవు కమ్ము. మీ యాదేశమును శిరసావహించుచు పదునాలుగు సంవత్సరములు వనములలో తాపసులతో గడిపెదను. రఘువంశభూషణా! ఓ మహారాజా! విచారపడవలదు. రాజ్యాధికారమును భరతునకు అప్పగింపుము. ఆత్మసంతుష్టికై గానీ, ఆత్మీయులను తృప్తిపఱచుటకై గానీ నేనెన్నడునూ రాజ్యమును ఆశింపనేరను. మీ ఆదేశమును పాలించుటయే నాకర్తవ్యము. (43-45)

తండ్రీ! నదీనాథుడైన సముద్రుడు ఎదిరింప శక్యముగానివాడు. అతడు ఎన్నడును క్షోభకు గురికాడు (చెలియలికట్టను దాటడు) అట్లే భూపతివైన నీవును దుఃఖమునకు లోనుకారాదు. కంటతడిపెట్టవద్దు. (46)

ఓ మహాపురుషా! నేను రాజ్యమును కోరను, సుఖములను ఆశింపను. లౌకికములైన ఈ భోగములెవ్వియును నాకక్కఱలేదు. స్వర్గసుఖములను సైతము నేను కాంక్షింపను. సీతపైగాని, కడకు జీవితము మీదగానీ నాకు ఆసక్తిలేదు. నీవు సత్యసంధుడవై వాసికెక్కుటయే నాయేకైకవాంఛ. ఏదియేమైనను అసత్యవచనుడవు కారాదు. ప్రత్యక్షదైవమైన నీ సన్నిధిలో నిజముగా నా పుణ్యకర్మలపై ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. తండ్రీ! ఓమహారాజా! ఈ నగరమునందు నేను ఇంకొక్కక్షణమైనను నిలువరాదు. ఈ నా నిర్ణయము తిరుగులేనిది. నీవు ఇట్లు శోకింపరాదు. (47-49)

'ఓ రామా! నీవు వనములకు వెళ్లుము' అని కైకేయి నన్ను అర్థించినది. 'సరే! వెళ్లెదను'- అనినేను ఆమెకు మాట ఇచ్చితిని. ఆ ప్రతిజ్ఞను నేను పాటింతును. (50)

ఓ ప్రభూ! నీవు ఏవిధముగను బెంగపెట్టుకొనరాదు. హరిణముల సంచారములచే ప్రశాంతముగను, పక్షులకిలకిలారావములతో మనోహరముగను ఉండెడి వనములలో మేము హాయిగా నివసింతుము. తండ్రియే 'పరమదైవము' అని శాస్త్రప్రమాణము. కావున తండ్రిమాటను దైవశాసనముగా తలంచి దానిని తలదాల్చుచున్నాను. (51-52)

చతుర్దశసు వర్షేషు గతేషు నరసత్తమ।
పునర్ద్రక్ష్యసి మాంప్రాప్తం సంతాపోఽయంవిముచ్యతామ్। 53

యేన సంస్తంభనీయోఽయం సర్వో బాష్పగళో జనః।
స త్వం పురుషశార్దూల! కిమర్థం విక్రియాం గతః। 54

పురం చ రాష్ట్రం చ మహీ చ కేవలా
మయా నిసృష్టా భరతాయ దీయతామ్।
అహం నిదేశం భవతోఽనుపాలయన్
వనం గమిష్యామి చిరాయ సేవితుమ్ । 55

మయా నిసృష్టాం భరతో మహీమిమాం
సశైలషండాం సపురాం సకాననామ్ ।
శివాం సుసీమామ్ అనుశాస్తు కేవలం
త్వయా యదుక్తం నృపతే! తథాఽస్తు తత్। 56

న మే తథా పార్థివ! ధీయతే మనో
మహత్సు కామేషు న చాత్మనః ప్రియే।
యథా నిదేశే తవ శిష్టసమ్మతే
వ్యపైతు దుఃఖం తవ మత్కృతేఽనఘ। 57

తదద్య నైవానఘ! రాజ్యమవ్యయం
న సర్వకామాన్ న సుఖం న మైథిలీమ్।
న జీవితం త్వామనృతేన యోజయన్
వృణీయ సత్యం వ్రతమస్తు తే తథా । 58

ఫలాని మూలాని చ భక్షయన్ వనే
గిరీంశ్చ పశ్యన్ సరితః సరాంసి చ ।
వనం ప్రవిశ్యైవ విచిత్రపాదపం
సుఖీ భవిష్యామి తవాస్తు నిర్వృతిః । 59

ఏవం స రాజా వ్యసనాభిపన్నః
శోకేన దుఃఖేన చ తామ్యమానః ।
ఆలింగ్య పుత్రం సువినష్టసంజ్ఞో
మోహం గతో నైవ చిచేష్ట కించిత్ । 60

దేవ్యస్తతః సంరురుదుః సమేతాః
తాం వర్జయిత్వా నరదేవపత్నీమ్ ।
రుదన్ సుమంత్రోఽపి జగామ మూర్ఛాం
హాహాకృతం తత్ర బభూవ సర్వమ్ । 61

ఓ మహాపురుషా! పదునాలుగుసంవత్సరములు ముగియగనే నేను తిరిగి వచ్చెదను. అప్పుడు నన్ను చూడవచ్చును. కనుక ఈ సంతాపమును వీడుము. (53)

ఓ నరశ్రేష్ఠా! దుఃఖాతిరేకముచే గొంతుపెగలక మూగబోయియున్న ఈ జనులకు ధైర్యము చెప్పవలసిన మీరే ఇట్లు నీరుగారిపోయినచో నెట్లు? (54)

రాజా! ఈ అయోధ్యానగరమును, ఈ కోసలరాజ్యమును, సుసంపన్నమైన ఈ నేలను వీడి వెళ్లుచున్నాను. వీటిని భరతునకు అప్పగింపుము. నేను నీ ఆజ్ఞను అనుసరించుచు పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయుటకై వెళ్లుదును. (55)

ఓ ప్రభూ! ఈ కోసలవసుంధర అందమైన నగరములతో అలరారుచున్నది. ఉన్నతములైన పర్వతపంక్తులతో విరాజిల్లుచున్నది. దట్టమైన అడవులతో దిట్టముగానున్నది, సురక్షితములైన ఎల్లలతో భద్రభూమియై యున్నది. ఇట్టి వసుధను నేను వీడివెళ్లుచున్నాను. ఈ సమస్తరాజ్యమును భరతుడు ఏలుకొనుగాక. నీ యాదేశము ప్రకారము భరతుడు రాజ్యమును పాలించుటయు నేను వనవాసము చేయుటయు జరుగుగాక. (56)

ఓ మహారాజా! ధర్మబద్ధమైన నీ ఆదేశమును పాలించుటయందే నా మనస్సు దృఢముగా నెలకొనియున్నది. అందువలన అది బలీయమైన విషయభోగములవైపు మరలుట లేదు, ఆత్మీయులైన వారికై ఆరాటపడుట లేదు. ఓపుణ్యపురుషా! నాకొఱకై నీవు దుఃఖింపవలదు. (57)

ఓ పుణ్యాత్మా! నేడు నీ వాగ్దానమును భంగపఱచుచు సువిశాలమైన ఈ రాజ్యమునుగాని, వివిధములైన భోగములను గాని, సుఖములనుగాని, జానకినిగాని, కడకు నా ప్రాణములను గాని నేను కోరనేకోరను, నీ సత్యవ్రత విజయమునే నేను వాంఛింతును. అది యట్లయగుగాక. (58)

చిత్ర విచిత్రములైన వృక్షములతో విలసిల్లెడి వనములయందు ప్రవేశించి, ఫలమూలములను భుజించుచు, అచటి పర్వతములను, నదీ ప్రవాహములను, సరోవరతీరములను గాంచుచు అచట హాయిగా ఉందును. కనుక నీవును ఇచట మనస్తాపమునువీడి శాంతచిత్తుడవై ఉండుము." (59)

శ్రీరాముడు ఇట్లు పలుకగా పుత్రవియోగబాధను భరింపలేక దశరథుడు శారీరికముగా కృశించుచు, మానసికముగా క్రుంగిపోవుచు తీరని బాధకు లోనయ్యెను. వెంటనే అతడు శ్రీరాముని తన హృదయమునకు హత్తుకొని, మోహవివశుడై స్పృహను కోల్పోయి నిశ్చేష్టుడయ్యెను. ఒక్క కైకేయితప్ప అక్కడ చేరియున్న రాణులందఱును ఒక్కుమ్మడిగా బోరున ఏడ్చిరి. సుమంత్రుడును ఏడ్చుచు మూర్ఛపోయెను. ఆ మందిరమంతయు హాహాకారములతో నిండెను. (60-61)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుస్త్రింశస్సర్గః (34)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదినాల్గవసర్గము సమాప్తము

-- * * * --

35. ముప్పదిఐదవసర్గము

సుమంత్రుడు కైకేయిని హెచ్చరించుచు ఆమెకు హితబోధచేయుట.

తతో నిర్ధూయ సహసా శిరో నిశ్శ్వస్య చాసకృత్।
పాణౌ పాణిం వినిష్పిష్య దంతాన్ కటకటాప్య చ। 1

లోచనే కోపసంరక్తే వర్ణం పూర్వోచితం జహత్।
కోపాభిభూతస్సహసా సంతాపమశుభం గతః। 2

మనః సమీక్షమాణశ్చ సూతో దశరథస్య సః।
కంపయన్నివ కైకేయ్యా హృదయం వాక్యశైశ్శితైః। 3

వాక్యవజ్రైరనుపమైః నిర్భిందన్నివ చాశుగైః।
కైకేయ్యాః సర్వమర్మాణి సుమంత్రః ప్రత్యభాషత। 4

యస్యాస్తవ పతిస్త్యక్తో రాజా దశరథః స్వయమ్।
భర్తా సర్వస్య జగతః స్థావరస్య చరస్య చ।
నహ్యకార్యతమం కించిత్ తవ దేవీహ విద్యతే। 5

పతిఘ్నీం త్వామహం మన్యే కులఘ్నీమపి చాంతతః। 6

యన్మహేంద్రమివాజయ్యం దుష్ప్రకంప్యమివాచలమ్।
మహోదధిమివాక్షోభ్యం సంతాపయసి కర్మభిః। 7

మావమంస్థా దశరథం భర్తారం వరదం పతిమ్।
భర్తురిచ్ఛా హి నారీణాం పుత్త్రకోట్యా విశిష్యతే। 8

యథావయో హి రాజ్యాని ప్రాప్నువంతి నృపక్షయే।
ఇక్ష్వాకుకులనాథేఽస్మిన్ తల్లోపయితుమిచ్ఛసి। 9

రాజా భవతు తే పుత్త్రో భరతశ్శాస్తు మేదినీమ్।
వయం తత్ర గమిష్యామో యత్ర రామో గమిష్యతి। 10

న హి తే విషయే కశ్చిత్ బ్రాహ్మణో వస్తుమర్హతి।
తాదృశం త్వమమర్యాదమ్ అద్య కర్మ చికీర్షసి। 11

దశరథునిరథసారథియైన సుమంత్రుడు మూర్ఛనుండి తేఱుకొనినపిదప పట్టరాని కోపముతో ఊగిపోయెను. శిరస్సును అటునిటు కదల్చెను. పదేపదే నిట్టూర్చెను. ఆవేశమును అపుకొనలేక ఒక చేతిలో మఱియొక చేతిని ఉంచి, వాటిని పిండినట్లు చేసెను. పండ్లుపటపట కొఱికెను. కన్నులెఱ్ఱజేసెను. మనస్సు ఉడికిపోవుచుండుటచే అతనిదేహకాంతి మాఱెను. పొంగిపొరలుచున్న పరితాపమును అపుకొనలేక అతడు కోపోద్రిక్తుడాయెను. కైకేయినిర్దాక్షిణ్యధోరణికి లోలోన అతడు మండిపడుచుండెను. అతడు తనవాడియైన మాటలబాణములతో ఆ కైకేయి హృదయమును ముక్కలుముక్కలుగ చేయసాగెను. ఆమెగుండెకు తూట్లు పడునట్లుగా అతడు పలుకుచున్న తీవ్రవచనములు వజ్రములవలె కఠినములై ఆమెనసాళమునకు అంటుచుండెను. (1-4)

"ఓ కైకేయీ! దశరథమహారాజు నీకు మాత్రమే గాదు, సహజముగా ఈ జగత్తునందలి సకలచరాచర ప్రాణులకును నాథుడు. అట్టి మహాప్రభువును తృణీకరించి, ఇట్టి ఘోరకృత్యమునకు పాల్పడితివి. నీవు ఇంతకంటెను చేయగలిగిన దుష్కార్యము ఏమియుండును? దీనినిబట్టి చూడగా నీవు పతిఘ్నివే గాదు ఈ ఇక్ష్వాకువంశమునే పూర్తిగా రూపుమాపెదవని నేను తలంతును. దేవేంద్రునివలె అజేయుడును, మేరునగధీరుడును (మేరు పర్వతమువలె చలింపనివాడును) మహాసముద్రమువలె గంభీరుడును (మహాసముద్రమువలె క్షోభకు గురికానివాడును) ఐన దశరథ మహారాజును నీకుటిలచేష్టలతో పరితపింపజేసితివి. (5-7)

ఓ దేవీ! దశరథమహారాజు నీకు పతి. అతడు నిన్ను అన్ని విధములుగా పోషించువాడు, కోరిన వరములను ఇచ్చెడివాడు. అట్టి ప్రభువును నీవు అవమానింపదగదు. స్త్రీలకు కోటిమంది పుత్త్రులకంటెను భర్తను అనుసరించుటయే శ్రేయస్కరము. రాజు పరలోకగతుడైనచో అతనికుమారులలో జ్యేష్ఠుడు రాజగుట ఈ ఇక్ష్వాకువంశసంప్రదాయము. పరంపరగా వచ్చుచున్న ఈ ఆచారమును దశరథమహారాజు జీవించియుండగనే మంటగలుప బూనుకొంటివి. (8-9)

నీకుమారుడైన భరతుడు రాజై ఈనేలను ఏలుకొనుగాక. శ్రీరాముడు వెళ్లెడి వనములకే ఆయనను అనుసరించి మేమును వెళ్ళెదము. (10)

ఇట్టి పరిస్థితులలో నీ రాజ్యమున ఏ బ్రాహ్మణుడును నివసింప జాలడు. అట్టి దుఃస్థితిని ఏర్పఱచుటకై నీవు పూనుకొను చుంటివి. (11)

అయోధ్యావాసినః పౌరాః యే చ జానపదా జనాః।
నూనం సర్వే గమిష్యామో మార్గం రామనిషేవితమ్। 12

త్యక్తా యా బాంధవైఃసర్వైః బ్రాహ్మణైస్సాధుభిస్సహ।
కా ప్రీతి రాజ్యలాభేన తవ దేవి! భవిష్యతి। 13

ఆశ్చర్యమివ పశ్యామి యస్యాస్తే వృత్తమీదృశమ్।
ఆచరంత్యా న వివృతా సద్యో భవతి మేదినీ। 14

మహాబ్రహ్మర్షిజుష్టా వా జ్వలంతో భీమదర్శనాః।
ధిగ్వాగ్దండా న హింసంతి రామ ప్రవ్రాజనే స్థితామ్। 15

ఆమ్రం ఛిత్వా కుఠారేణ నింబం పరిచరేత్తు యః।
యశ్చైనం పయసా సించేత్ నైవాస్య మధురో భవేత్। 16

అభిజాతం హి తే మన్యే యథా మాతుస్తథైవ చ।
న హి నింబాత్ స్రవేత్ క్షౌద్రం లోకే నిగదితం వచః। 17

తవ మాతురసద్గ్రాహం విద్మః పూర్వం యథా శ్రుతమ్। 18

పితుస్తే వరదః కశ్చిత్ దదౌ వరమనుత్తమమ్।
సర్వభూతరుతం తస్మాత్ సంజజ్ఞే వసుధాధిపః।
తేన తిర్యగ్గతానాం చ భూతానాం విదితం వచః। 19

తతో జృంభస్య శయనే విరుతాద్భూరివర్చసః।
పితుస్తే విదితో భావః స తత్ర బహుధాఽహసత్। 20

తత్ర తే జననీ క్రుద్ధా మృత్యుపాశమభీప్సతీ।
హాసం తే నృపతే! సౌమ్య! జిజ్ఞాసామీతి చాబ్రవీత్। 21

నృపశ్చోవాచ తాం దేవీం దేవి! శంసామి తే యది।
తతో మే మరణం సద్యో భవిష్యతి న సంశయః। 22

మాతా తే పితరం దేవి! తతః కేకయమబ్రవీత్।
శంస మే జీవ వా? మా వా? న మామపహసిష్యసి। 23

ప్రియయా చ తథోక్తస్సన్ కేకయః పృథివీపతిః।
తస్మై తం వరదాయార్థం కథయామాస తత్త్వతః। 24

అయోధ్యలోని పౌరులు, రాజ్యములోని ఇతరజానపదులు మొదలగువారితోగూడి మేమందరమును శ్రీరాముని మార్గమున నడిచెదము. ఓ దేవీ! బంధుమిత్రులు, బ్రాహ్మణులు, సాధువులు, మున్నగువారు నీరాజ్యమును వదలివెళ్ళెదరు. అట్టి రాజ్యమువలన నీకేమి లాభము? నీవు ఇట్లు అధర్మమునకు ఒడిగట్టుచున్నను ఈ నేల ఏల బ్రద్దలగుటలేదు? అని నాకు ఆశ్చర్యము కలుగుచున్నది. శ్రీరాముని నిర్దాక్షిణ్యముగా వనములపాలుచేయుచున్న నిన్ను వసిష్ఠాదిమహర్షులు తమధిక్కారములచే, భయంకరమైన శాపాయుధములచే ఏల దహించివేయుటలేదు? ఇదియును నాకు ఆశ్చర్యమును గొల్పుచున్నది. (12-15)

తియ్యని పండ్లను ఇచ్చునట్టి మామిడిచెట్టును (ఏమాత్రమూ ఆలోచించక) గొడ్డలితో నరికివేసి, వేపచెట్టు పాదునకు పాలుపోసి పెంచినను అది (ఆ వేపచెట్టు) చేదు పండ్లనే ఇచ్చునుగాని మధుర ఫలములను ఈయదుగదా! (అట్లే సుగుణములకు నిధియైన శ్రీరామునియొక్క పట్టాభిషేకమును వరములనెపముతో భంగపఱచి, ఆయనను వనములకు పంపి, దుష్టురాలైన కైకేయికి ప్రీతి గూర్చినచో ఆమె దుర్బుద్ధి మారునా?) (16)

ఓ కైకేయీ! 'వేపచెట్టునుండి తేనెగారదు'-అనునది లోకోక్తి. అట్లే నీతల్లియొక్క (దుష్ట) స్వభావమే (మూర్ఖపుపట్టుదలయే) నీకును వచ్చినది. (17)

మీతల్లిమూర్ఖపు పట్టుదలనుగూర్చి ఇదివరకే మేము ఎఱుగుదుము. ఒకానొక గంధర్వయోగి మీ తండ్రికి శ్రేష్ఠమైన ఒక వరమును ప్రసాదించియుండెను. దాని ప్రభావమున ఆ మహారాజు సమస్తప్రాణుల అఱపులను, వాటి భావములను గ్రహింపగలడు. అతడు పశుపక్ష్యాదులభాషలనుగూడ అవగాహన చేసికొనగలడు. ఒకనాడు చక్కని వర్చస్సుగల మీతండ్రియొక్క పాన్పుదగ్గర ఒక పక్షులజంట మాట్లాడుకొనుచుండగా దాని భావమును ఎఱింగి అతడు రెండు మూడు పర్యాయములు నవ్వెను. చావు దగ్గరపడిన మీతల్లి అతడు (మీతండ్రి) తనను జూచి (గేలిచేయుచు) నవ్వుచున్నాడని భావించి, మిక్కిలి కుపితయయ్యెను. వెంటనే ఆమె రాజుతో "ఓ సౌమ్యా! మీరు ఎందులకు నవ్వుచున్నారు? కారణము తెల్పుడు" అని పలికెను. (18-21)

అప్పుడామహారాజు తనభార్యతో "ఓ దేవీ! దానినిగూర్చి నేను నీకు వివరించినచో మఱుక్షణమే నాకు మరణము సంభవించుట తథ్యము. ఇందు సందేహము లేదు" అని నుడివెను. (22)

ఓ కైకేయీ! అప్పుడు మీతల్లి మీతండ్రియైన కేకయ రాజుతో "నీవు జీవించియుందువో లేదో?-అది నాకు తెలియదు. నన్ను మాత్రము గేలిచేయబోకుము. నీవు నవ్విన కారణమును తెల్పుము" అని వచించెను. (23)

తనభార్య ఇట్లు పలికిన పిమ్మట కేకయమహారాజు తనకు వరమును ప్రసాదించిన ఆ గంధర్వయోగికి జరిగిన విషయము నంతయును వివరించెను. (24)

తత స్స వరదస్సాధూ రాజానం ప్రత్యభాషత।
యదిత్వం శంససే రాజన్ మరణం తే ధ్రువం భవేత్।
మ్రియతాం ధ్వంసతాం వేయం మాకృథా స్త్వం మహీపతే!। 25

స తచ్ఛ్రుత్వా వచస్తస్య ప్రసన్నమనసో నృపః।
మాతరం తే నిరస్యాశు విజహార కుబేరవత్। 26

తథా త్వమపి రాజానం దుర్జనాచరితే పథి।
అసద్గ్రాహమిమం మోహాత్ కురుషే పాపదర్శిని!। 27

సత్యశ్చాద్య ప్రవాదోఽయం లౌకికః ప్రతిభాతి మా।
పితౄన్ సమనుజాయంతే నరా మాతరమంగనాః। 28

నైవం భవ గృహాణేదం యదాహ వసుధాధిపః।
భర్తురిచ్ఛాముపాస్యేహ జనస్యాస్య గతిర్భవ। 29

మా త్వం ప్రోత్సాహితా పాపైః దేవరాజసమప్రభమ్।
భర్తారం లోకభర్తారమ్ అసద్ధర్మముపాదధాః। 30

న హి మిథ్యాప్రతిజ్ఞాతం కరిష్యతి తవానఘః।
శ్రీమాన్ దశరథో రాజా దేవి! రాజీవలోచనః। 31

జ్యేష్ఠో వదాన్యః కర్మణ్యః స్వధర్మపరిరక్షితా।
రక్షితా జీవలోకస్య బలీ రామోఽభిషిచ్యతామ్। 32

పరివాదో హి తే దేవి! మహాన్ లోకే చరిష్యతి।
యది రామోవనం యాతి విహాయ పితరం నృపమ్। 33

స రాజ్యం రాఘవః పాతు భవ త్వం విగతజ్వరా।
న హి తే రాఘవాదన్యః క్షమః పురవరే వసేత్। 34

రామే హి యౌవరాజ్యస్థే రాజా దశరథో వనమ్।
ప్రవేక్ష్యతి మహేష్వాసః పూర్వవృత్తమ్ అనుస్మరన్। 35

ఇతి సాంత్వైశ్చ తీక్ష్ణైశ్చ కైకేయీం రాజసంసది।
సుమంత్రః క్షోభయామాస భూయ ఏవ కృతాంజలిః। 36

అంతట వరమునిచ్చిన ఆ సాధువు రాజుతో ఇట్లు పలికెను. "ఓ రాజా! నీవీవిషయమును ఆమెకు తెల్పినచో నీకు చావు తప్పదు. ఆమె మరణించినను, లేక ఏమైనను ఈ రహస్యమును తెలుపవలదు." (25)

అంతట మీతండ్రి ప్రసన్నచిత్తుడైన ఆసాధువు యొక్క మాటలను పాటించి, మీతల్లి కోరికను త్రోసిపుచ్చి, కుబేరునివలె హాయిగానుండెను. (26)

ఓ దుర్మార్గురాలా! నీవు నీతల్లివలెనే పెడదారిపట్టుచు అజ్ఞానవశమున ఈ దశరథమహారాజువిషయమున మొండిపట్టుదలను ప్రదర్శించుచున్నావు. 'తండ్రులలక్షణములను కొడుకులు, తల్లుల లక్షణములను కుమార్తెలు కలిగియుందురు'-అను లోకోక్తి నిజమేయని నాకనిపించుచున్నది. (27-28)

నీతల్లివలె నీవును మూర్ఖురాలవు కావలదు. ఇదివరలో మహారాజు చెప్పిన మాటను పాటింపుము. (శ్రీరాముని యువరాజ పట్టాభిషిక్తునిగా చేయుటకు) పతికోరికను గౌరవింపుము. ఈ ప్రజలకు ఏడుగడగా నిలువుము. (29)

దశరథమహారాజు సమస్తప్రజలకును రక్షకుడు. అంతేగాదు అతడు వైభవమున దేవేంద్రునితో సమానుడు. నీవు పాపబుద్ధి గలదానవై, అట్టి మహారాజుచే అధర్మకార్యములను (జ్యేష్ఠుని అరణ్యములకు పంపుట, చిన్నవానిని యువరాజుగా జేయుట) చేయింపవలదు. (30)

ఓ కైకేయీ! దశరథమహారాజు పుణ్యపురుషుడు. (ఆడినమాట తప్పనివాడు) కొల్లలుగా సంపదలుగలవాడు, రాజీవలోచనుడు. అతడు తనప్రతిజ్ఞను (నీకిచ్చిన మాటను) వమ్ముకానీయడు. (31)

జ్యేష్ఠుడైన శ్రీరాముడు మిక్కిలి ఔదార్యముగలవాడు, సదాచారనిరతుడు, క్షత్రియధర్మమును కాపాడువాడు, అంతేగాదు సమస్తప్రాణులను కన్నబిడ్డలవలె రక్షించువాడు. మిక్కిలి బలశాలి, అట్టి శ్రీరామచంద్రుని పట్టాభిషిక్తుని గావింపుము. (32)

ఓదేవీ! శ్రీరాముడు తనతండ్రియగు దశరథమహారాజు మొదలగు ఆత్మీయులందరిని వీడి, వనవాసమునకు వెళ్లినచో నీవు ఈ లోకమున తీవ్రమైన అపవాదమునకు గురియగుదువు. (33)

ఆ శ్రీరాముడే ఈరాజ్యమును పాలించును. నీవు మనస్తాపమును వీడుము. రాముడుదప్ప మఱియొకడు ఈకోసలను పాలించుటకు సమర్థుడు కాడు. శ్రీరాముడు యువరాజపట్టాభిషిక్తుడైనపిదప దశరథమహారాజు ధనుర్ధారియై, ఇక్ష్వాకువంశమర్యాదను అనుసరించుచు వనములకు వెళ్లును." (వానప్రస్థాశ్రమమును స్వీకరించును) (34-35)

ఇట్లు సుమంత్రుడు రాజసమక్షమున పదేపదే సాంత్వన వచనములతోడను, తీవ్రమైన హెచ్చరికలతోడను కైకేయిని కలతచెందునట్లు చేసి, కృతాంజలియై నిలబడెను. (36)

నైవ సా క్షుభ్యతే దేవీ న చ స్మ పరిదూయతే।
న చాస్యా ముఖవర్ణస్య విక్రియా లక్ష్యతే తదా ॥ 37

ఆ కైకేయి ఆతనిమాటలను ఏమాత్రమూ చెవినోకనేయులేదు. మనసున పరితపించనూలేదు. ఆమె ముఖమున కించిత్తుగానైనను మార్పుకనబడలేదు. (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచత్రింశస్సర్గః (35)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదిఐదవసర్గము సమాప్తము

-- * * * --

36. ముప్పదిఆఱవసర్గము

శ్రీరాముడు వనవాసమును సుఖముగా గడపుటకై, ఆయనవెంట పరివారమును పదార్థములను పంపుమని దశరథుడు సుమంత్రుని ఆదేశించుట. అందులకు కైకేయి అభ్యంతరము చెప్పుట - వృద్ధమంత్రి సిద్ధార్థుడు కైకేయికి హితము పలుకుట.

తత స్సుమన్త్రమైక్ష్వాకః పీడితో౽త్ర ప్రతిజ్ఞయా।
సబాష్పమతినిశ్శ్వస్య జగాదేదం పునః పునః॥ 1

సూత! రత్నసుసంపూర్ణా చతుర్విధబలా చమూః।
రాఘవస్యానుయాత్రార్థం క్షిప్రం ప్రతివిధీయతామ్॥ 2

రూపాజీవాశ్చ వాదిన్యో వణిజశ్చ మహాధనాః।
శోభయంతు కుమారస్య వాహినీం సుప్రసారితాః॥ 3

యే చైనముపజీవంతి రమతే యైశ్చ వీర్యతః।
తేషాం బహువిధం దత్వా తానప్యత్ర నియోజయ॥ 4

ఆయుధాని చ ముఖ్యాని నాగరాశ్శకటాని చ।
అనుగచ్ఛంతు కాకుత్స్థం వ్యాధాశ్చారణ్యగోచరాః॥ 5

నిఘ్నన్ మృగాన్ కుంజరాంశ్చ పిబంశ్చారణ్యకం మధు।
నదీశ్చ వివిధాః పశ్యన్ న రాజ్యస్య స్మరిష్యతి॥ 6

ధాన్యకోశశ్చ యః కశ్చిత్ ధనకోశశ్చ మామకః।
తౌ రామమనుగచ్ఛేతాం వసంతం నిర్జనే వనే॥ 7

యజన్ పుణ్యేషు దేశేషు విసృజం శ్చాప్తదక్షిణాః।
ఋషిభిశ్చ సమాగమ్య ప్రవత్స్యతి సుఖం వనే॥ 8

భరతశ్చ మహాబాహుః అయోధ్యాం పాలయిష్యతి।
సర్వకామైః సహ శ్రీమాన్ రామః సంపాధ్యతామితి॥ 9

సుమంత్రుడు నయాన భయాన ఎంతగా చెప్పినను కైకేయి మాటువిన్కనందున దశరథుడు తనప్రతిజ్ఞకు (వరముల పరిణామములకు) మిక్కిలి వగచుచు, నిట్టూర్పులు కంట తడి బెట్టిన సుమంత్రునితో మఱల మఱల ఇట్లు పలికెను. (1)

"ఓసుమంత్రా! రత్నములతో సుసంపన్నమైన చతురంగబలములను రామునిసేవలకై వెంటనే ఆయనతో పంపుము. మఱియు ఆసేనలతోగూడ నర్తకీమణులను, చతురోక్తులు పలుకువారిని, మిగుల సంపన్నులైన వ్యాపారులను వినోదార్థమై పంపించుము. (2-3)

శ్రీరామునకు తోడుగానుండుటకును, మల్లయుద్ధప్రదర్శనాదులతో ఆయనకు ఆహ్లాదమును గూర్చుటకును తగినవారికి పలు విధములైన సువర్ణములను, రత్నములను, వస్త్రాదులను బహూకరించి, వారిని ఆసేనలవెనుక నడిపింపుము. (4)

ముఖ్యములైన ఆయుధములను, నగరవాసులను, ఆహార పదార్థములతోగూడిన బండ్లను, అడవులలో మార్గములను జూపునట్టి ఆటవికులను శ్రీరామునకు తోడుగ పంపుము. (5)

శ్రీరాముడు అడవులలో క్రూరమృగములను, ఏనుగులను వేటాడుచు అచట లభించెడి తేనెలను త్రాగుచు, వివిధ నదీ ప్రవాహములను దర్శించుచు, రాజ్యసుఖములనుగూర్చి అచట తలంపడు. (6)

నిర్జనారణ్యములలో నివసించెడి రామునకై నిద్దులపైనను, ఒంటిలు మున్నగువానిపైనను, నా ధనధాన్యములను పంపుము. అట్లొనర్చినచో వనవాసకాలమున శ్రీరాముడు ఆయా పుణ్యస్థలములయందు యజ్ఞములను ఆచరించుచు, ఋత్విజులు మున్నగువారికి యజ్ఞదక్షిణలను ఇచ్చుచు, ఋషులను సేవించుచు అచట సుఖముగానుండగలడు. (7-8)

మిగుల బాహుబలముగల భరతుడు ఈ అయోధ్యను పాలింప గలడు. శుభలక్షణసంపన్నుడైన శ్రీరామునకు సమస్తపదార్థములను సమకూర్పుడు." (9)

ఏవం బ్రువతి కాకుత్స్థే కైకేయ్యా భయమాగతమ్।
ముఖం చాప్యగమచ్ఛోషం స్వరశ్చాపి న్యరుధ్యత। 10

సా విషణ్ణా చ సంత్రస్తా ముఖేన పరిశుష్యతా।
రాజానమేవాభిముఖీ కైకేయీ వాక్యమబ్రవీత్। 11

రాజ్యం గతజనం సాధో! పీతమండాం సురామివ।
నిరాస్వాద్యతమం శూన్యం భరతో నాభిపత్స్యతే। 12

కైకేయ్యాం ముక్తలజ్జాయాం వదంత్యామతిదారుణమ్।
రాజా దశరథో వాక్యమ్ ఉవాచాయతలోచనామ్। 13

వహంతం కిం తుదసి మాం నియుజ్య ధురిమాఽహితే।
అనార్యే! కృత్యమారబ్ధం కిం న పూర్వముపారుధః। 14

తస్యైతత్ క్రోధసంయుక్తమ్ ఉక్తం శ్రుత్వా వరాంగనా।
కైకేయీ ద్విగుణం క్రుద్ధా రాజానమిదమబ్రవీత్। 15

తవైవ వంశే సగరో జ్యేష్ఠపుత్త్రముపారుధత్।
అసమంజ ఇతి ఖ్యాతం తథాఽయం గంతుమర్హతి। 16

ఏవ ముక్తో ధిగిత్యేవ రాజా దశరథోఽబ్రవీత్।
వ్రీళితశ్చ జన స్సర్వః సా చ తం నావబుధ్యత। 17

తత్ర వృద్ధో మహామాత్రః సిద్ధార్థో నామ నామతః।
శుచిర్బహుమతో రాజ్ఞః కైకేయీమిదమబ్రవీత్। 18

అసమంజో గృహీత్వా తు క్రీడతః పథి దారకాన్।
సరయ్వాః ప్రక్షిపన్నప్సు రమతే తేన దుర్మతిః। 19

తం దృష్ట్వా నాగరాస్సర్వే క్రుద్ధా రాజానమబ్రువన్।
అసమంజం వృణీష్వైకమ్ అస్మాన్ వా రాష్ట్రవర్ధన! 20

తానువాచ తతో రాజా కిన్నిమిత్తమిదం భయమ్।
తాశ్చాపి రాజ్ఞా సంపృష్టా వాక్యం ప్రకృతయోఽబ్రువన్। 21

దశరథుడు ఇట్లుపలుకగా కైకేయికి భయము పట్టుకొనెను. ఆమెముఖము వెలవెలబోయెను. గొంతు పెగలదాయెను. (10)

అప్పుడా కైకేయి విచారగ్రస్తురాలై, భయముతో, వాడిపోయిన ముఖముతో రాజునకు ఎదురుగా నిలిచి, ఇట్లు మాట్లాడెను. (11)

"ఓ మహాసాధూ! ఇతరులు మద్యమును పూర్తిగా త్రాగివేసిన పిమ్మట శూన్యమైయున్న సురాపాత్రవలె అనుభవింపదగిన వస్తువులు ఏమియు లేకుండా నిర్జనమైన రాజ్యము భరతునకు అక్కఱలేదు." అని కన్నులు పెద్దవిగాజేసి, సిగ్గువిడిచి, నోటికివచ్చినట్లు మాట్లాడుచున్న కైకేయితో దశరథమహారాజు ఇట్లు పలికెను. (12-13)

ఓసి దుర్మార్గురాలా! నీవు శ్రీరాముని వనవాసకార్యభారమును నాపై మోపి, ఆభారమును నేను మోయుచుండగా నన్ను నీమాటల ములుకులతో ఇట్లు ఎందుకు పొడుచుచున్నావు? నీచురాలా! నీవు ఇప్పుడు చేయుచున్న ప్రతిబంధక విషయమును[1] వరములను అడుగునప్పుడే ఏల ప్రస్తావింపలేదు? (14)

వరాంగనయైన (వరములను కోరిన) ఆ కైకేయి క్రోధముతో దశరథుడు పలికిన మాటలను విని, తన పన్నాగమును దెబ్బ తీయుచున్నాడని భావించెను. వెంటనే ఆమె ఇబ్బడిముబ్బడి కోపముతో ఆయనతో ఇట్లు పలికెను. (15)

"అయ్యా! నీ వంశమువాడేయైన సగరుడు తనజ్యేష్ఠపుత్రుడైన అసమంజుని దేశమునుండి వెడలగొట్టెను. అట్లే ఇతనిని వనవాసమునకు పంపుటయుచితమే." కైక ఇట్లు పలుకగా దశరథమహారాజు 'ఛీ!' అని ఆమెను ఛీదరించుకొనెను. అచటనున్న జనులందఱును సిగ్గుతో తలవంచుకొనిరి. అంతమంది యెదుట ఇట్టి ఛీదరింపులకు గుఱియైనప్పటికిని ఆమెకు చీమకుట్టినట్లైనను లేకుండెను. (16-17)

ఆ సమయమున సిద్ధార్థుడు అను ఒక వృద్ధమంత్రి అచట ఉండెను. అతడు కపటమెఱుగనివాడు, రాజమన్ననలను చూరగొన్నవాడు. ఆ వృద్ధసచివుడు కైకేయితో ఇట్లనెను. (18)

"అసమంజుడు వీథులలో ఆడుకొనుచున్న బాలురను దీసికొనివెళ్ళి, వారిని సరయూనదీజలములలో ముంచుచుండెడివాడు. అప్పుడు వారు ఉక్కిరిబిక్కిరై (ఊపిరాడక) గిలగిలలాడుచుండగా చూచి, ఆ దుర్మతి ఆనందించుచుండెడివాడు. ఆ అసమంజుని ఆగడములను చూచి క్రుద్ధులైన పౌరులందఱును సగరునికడకు వెళ్ళి, "రాష్ట్రప్రజలను కాపాడునట్టి ఓ రాజా! (అసమంజుడు పెట్టెడి బాధలకు మేము తట్టుకొనలేకున్నాము. కనుక) అసమంజుడు గాని మేముగాని ఎవరో ఒకరమే ఈ నగరమున ఉండవలెను. తెల్పుము." అని విన్నవించుకొనిరి. (19-20)

అంతట ఆ రాజు "మీ భయమునకు కారణమేమి?" అని యడుగగా ఆ ప్రజలు ఆయనతోనిట్లనిరి. (21)

1) ఓకైకా! నీవు వరములను కోరునప్పుడు 'శ్రీరాముని వనములకు పంపెడిసమయమున అతనివెంట సైన్యములనుగాని, ఆహారపదార్థములనుగాని, పంపకూడదు?' అను నిబంధనలను విధింపలేదుగదా? ఇప్పుడు ఏల అడ్డు చెప్పుచున్నావు?

క్రీడతస్త్వేష నః పుత్రాన్ బాలానుద్భ్రాంతచేతసః।
సరయ్వాం ప్రక్షిపన్ మౌర్ఖ్యాత్ అతులాం ప్రీతిమశ్నుతే। 22

స తాసాం వచనం శ్రుత్వా ప్రకృతీనాం నరాధిపః।
తం తత్యాజాహితం పుత్రం తాసాం ప్రియచికీర్షయా। 23

తం యానం శీఘ్రమారోప్య సభార్యం సపరిచ్ఛదమ్।
యావజ్జీవం వివాస్యోఽయమ్ ఇతి స్వానన్వశాత్ పితా। 24

స ఫాలపిటకం గృహ్య గిరిదుర్గాణ్యలోడయత్।
దిశస్సర్వాస్త్వనుచరన్ స యథా పాపకర్మకృత్। 25

ఇత్యేనమత్యజద్రాజా సగరో వై సుధార్మికః।
రామః కిమకరోత్ పాపం యేనైవముపరుధ్యతే। 26

నహి కంచన పశ్యామో రాఘవస్యాగుణం వయమ్।
దుర్లభో హ్యస్య నిరయః శశాంకస్యేవ కల్మషమ్। 27

అథవా దేవి! దోషం త్వం కంచిత్ పశ్యసి రాఘవే।
తమద్య బ్రూహి తత్త్వేన తతో రామో వివాస్యతామ్। 28

అదుష్టస్య హి సంత్యాగః సత్పథే నిరతస్య చ।
నిర్దహేదపి శక్రస్య ద్యుతిం ధర్మనిరోధనాత్। 29

తదలం దేవి! రామస్య శ్రియా విహతయా త్వయా।
లోకతోఽపి హి తే రక్ష్యః పరివాదః శుభాననే!। 30

శ్రుత్వా తు సిద్ధార్థవచో రాజా శ్రాంతతరస్వనః।
శోకోపహతయా వాచా కైకేయీమిదమబ్రవీత్। 31

ఏతద్వచో నేచ్ఛసి పాపవృత్తే!
హితం న జానాసి మమాఽఽత్మనో వా ।
ఆస్థాయ మార్గం కృపణం కుచేష్టా
చేష్టా హి తే సాధుపథాదపేతా । 32

అనువ్రజిష్యామ్యహమద్య రామం
రాజ్యం పరిత్యజ్య సుఖం ధనం చ ।
సహైవ రాజ్ఞా భరతేన చ త్వం
యథాసుఖం భుంక్ష్వ చిరాయ రాజ్యమ్। 33

"ప్రభూ! మతి తప్పిన ఈ అసమంజుడు వీధులలో ఆడుకొను మన్న మా కుమారులను (బాలురను) తీసికొని వెళ్లి, మూర్ఖత్వముతో సరయూనదిలో ముంచుచు వేడుకగా ఆనందించుచున్నాడు." (22)

అంతట ఆ మహారాజు ఆ ప్రజలమొఱలను ఆలకించి, వారికి ప్రియమును గూర్చదలచినవాడై, ప్రజాకంటకుడు, దుష్టుడునైన తనపుత్రుని త్యజించెను. (23)

"అసమంజుని అతనిభార్యతో, కట్టుబట్టలతో వెంటనే రథముపై నెక్కించి, జీవితాంతము దేశమునుండి బహిష్కరింపుడు." అని సగరుడు తన సేవకులను ఆదేశించెను. (24)

ఆ అసమంజుడు ఒక పాపాత్మునివలె గునపమును, గంపను చేతబట్టి, నలుదెసల దిరుగుచు కందమూలములకై కొండలలోను, కోనలలోను త్రవ్వసాగెను. (25)

ధార్మికుడైన సగరుడు ఈ విధముగా దుష్టుడైన ఆ అసమంజుని వనములకు పంపివైచెను. అదియుక్తమే. కాని శ్రీరాముని అడవులకు పంపుటకు అతడు చేసిన పాపమేమి? (26)

ఎంతగా వెదకి చూచినను శ్రీరామునిలో ఒక్క చిన్నదోషము గూడ కనబడదు. ఆ చంద్రునిలో ఒక చిన్న మచ్చయైనను కలదేమో గాని ఈ శ్రీరామచంద్రునిజీవితములో మాత్రము ఇసుమంతయును లోపము లేదు. (27)

ఓ దేవీ! నిజముగా శ్రీరామునిలో ఏదైననొకదోషము నీకు కనబడినచో దానిని ఇప్పుడే చెప్పుము. వెంటనే ఆయనను అడవులకు పంపుదము. నిరంతరము సన్మార్గమున ప్రవర్తించు శిష్టుని (ఉత్తమపురుషుని) దేశబహిష్కృతునిగాచేయుట ధర్మవిరుద్ధము. అది ఒక మహాపచారము. అట్టి అపచారమునకు ఒడిగట్టినవాడు అతడు ఇంద్రుడైనను సరే అతనివైభవము బుగ్గిపాలుగాక తప్పదు. (28-29)

ఓ దేవీ! శ్రీరాముని విషయమున ఇంతవఱకును నీవు చేసిన నిర్వాకము చాలును. ఆయన పట్టాభిషేకమునకు విఘాతమును కలిగింపవలదు. లోకాపవాదమునుండియైనను నిన్ను నీవు రక్షించుకొనుట మంచిది గదా!" శోకముతో క్రుంగిపోయి దీనాలుగా పడియున్న దశరథమహారాజు మంత్రియగు సిద్ధార్థునిమాటలను విని, దీనమైన స్వరమున కైకేయితో ఇట్లు పలికెను. (30-31)

"ఓ దురాచారురాలా! ఈ సిద్ధార్థుని పలుకులు నీకు రుచించుట లేదా? నాకును నీకును ఏది హితమో తెలిసికొనలేకున్నావా? సత్పురుషుల మార్గమును వీడి, పెడదారిపట్టి, దుష్కృత్యములకు పాల్పడుచున్నావు." రాజ్యాధికారమును, సుఖసంపదలను విడనాడి, నేనును నేడే శ్రీరామునితో అడవులకు వెళ్లెదను. ఇక నీవును, నీభరతుడును ఈ రాజ్యమును మీ ఇష్టమువచ్చినట్లుగా మీరు కోరినంత కాలము హాయిగా ఏలుకొనుడు." (32-33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షట్త్రింశస్సర్గః *(36)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదిఆఱవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

37. ముప్పదిఏడవసర్గము

కైకేయి స్వయముగా తెచ్చియిచ్చిన నార్చీరములను రామలక్ష్మణులు ధరించుట. సీతాదేవి నారచీరలను ధరించునప్పుడు అచటనున్న అంతఃపురస్త్రీలు దుఃఖపడుట. ఈ సందర్భమున వసిష్ఠుడు కైకేయిని మందలించుట.

మహామాత్రవచః శ్రుత్వా రామో దశరథం తదా।
అభ్యభాషత వాక్యం తు వినయజ్ఞో వినీతవత్॥ 1

అంతట వినయవిధేయతలుగల శ్రీరాముడు మంత్రులలో వృద్ధుడైన సిద్ధార్థునివచనములను విని, తనతండ్రియగు దశరథునితో వినమ్రుడై ఇట్లనుడివెను. (1)

త్యక్తభోగస్య మే రాజన్! వనే వన్యేన జీవతః।
కిం కార్యమనుయాత్రేణ త్యక్తసంగస్య సర్వతః॥ 2

యో హి దత్త్వా ద్విపశ్రేష్ఠం కక్ష్యాయాం కురుతే మనః।
రజ్జుస్నేహేన కిం తస్య త్యజతః కుంజరోత్తమమ్॥ 3

"ఓ మహారాజా! సర్వసుఖములను పరిత్యజించితిని, వనములలో ఫలమూలములే నాకు ఆహారము, అన్ని విషయములయందును ఆసక్తిని వీడనాడిన నాకు ఈ చతురంగబలాదులతో పనియేమి? శ్రేష్ఠమైన గజమును దానము చేసినవాడు దానినడుమునకు కట్టిన త్రాడుపై మోహపడుట వ్యర్థము, ఒక మహాగజమునే త్యజించిన వానికి దానిత్రాడుపై ఆసక్తియెందులకు? (2-3)

తథా మమ సతాం శ్రేష్ఠ! కిం ధ్వజిన్యా జగత్పతే!।
సర్వాణ్యేవానుజానామి చీరాణ్యేవాఽఽనయంతు మే॥ 4

ఓ జగత్పతీ! సజ్జనశిరోమణీ! అట్లే మీరు నావెంట పంపదలచుకొనిన సేనలు, వస్తువాహనములు, ధనధాన్యములు మొదలగునవి నాకెందులకు? వాటినన్నింటిని భరతునకే ఇచ్చి వేయుచున్నాను. సేవకులు నాకొఱకై నార్చీరములను తెచ్చి ఇచ్చిన చాలును. (4)

ఖనిత్రపిటకే చోభే సమానయత గచ్ఛతః।
చతుర్దశ వనే వాసం వర్షాణి వసతో మమ॥ 5

పదునాలుగుసంవత్సరములకాలము వనములలో నివసించుటకై వెళ్ళుచున్ననాకు ఒక పలుగును, గంపను ఇప్పించిన చాలును." (5)

అథ చీరాణి కైకేయీ స్వయమాహృత్య రాఘవమ్।
ఉవాచ పరిధత్స్వేతి జనౌఘే నిరపత్రపా॥ 6

అంతట కైకేయి నారచీరలను స్వయముగా తీసికొనివచ్చి, సిగ్గుసిగ్గులులేక జనులసమక్షమున "ఇదిగో వీటిని ధరింపుము." అని శ్రీరామునితో పలికెను. (6)

స చీరే పురుషవ్యాఘ్రః కైకేయ్యాః ప్రతిగృహ్య తే।
సూక్ష్మవస్త్రమవక్షిప్య మునివస్త్రాణ్యవస్త హ॥ 7

లక్ష్మణశ్చాపి తత్రైవ విహాయ వసనే శుభే।
తాపసాచ్ఛాదనే చైవ జగ్రాహ పితురగ్రతః॥ 8

అప్పుడు మానవోత్తముడైన శ్రీరాముడు కైకేయినుండి నారచీరలను గ్రహించెను. పిమ్మట అతడు తాను ధరించియున్న మేలి వస్త్రముల స్థానమున మునివస్త్రములను దాల్చెను. అచటనేయున్న లక్ష్మణుడును తనపట్టువస్త్రములకు మాఱుగా తనతండ్రియెదుటనే తాపసులు ధరించునట్టి నారచీరలను ధరించెను. (7-8)

అథాత్మపరిధానార్థం సీతా కౌశేయవాసినీ।
సమీక్ష్య చీరం సంత్రస్తా పృషతీ వాగురామివ॥ 9

పట్టువస్త్రములను దాల్చెడి సీతాదేవి తాను ధరించుటకై తీసికొనిరాబడిన నారచీరలను గాంచి, వలను జూచిన లేడివలె మిక్కిలి భయపడెను. (9)

సా వ్యపత్రపమాణేవ ప్రతిగృహ్య చ దుర్మనాః।
కైకేయ్యాః కుశచీరే తే జానకీ శుభలక్షణా॥ 10

అశ్రుసంపూర్ణనేత్రా చ ధర్మజ్ఞా ధర్మదర్శినీ।
గంధర్వరాజప్రతిమం భర్తారమిదమబ్రవీత్॥ 11

అంతట శుభలక్షణసంపన్నురాలైన జానకి మిక్కిలి కలవరపాటునకు లోనై, కైకేయి తీసికొనివచ్చిన నార్చీరములను గ్రహించి (వాటిని ధరించుట ఎట్లు? అని) మిగుల సిగ్గుపడెను. పాతివ్రత్యధర్మములను ఎఱింగి, వాటిని బాగుగా ఆచరించునట్టి సీతాదేవి దుఃఖాశ్రువులు స్రవించుచుండగా గంధర్వరాజు (చిత్రరథుని) వలె ఒప్పుచున్న తన భర్తయగు శ్రీరామునితో ఇట్లు పలికెను. (10-11)

కథం ను చీరం బధ్నంతి మునయో వనవాసినః।
ఇతి హ్యకుశలా సీతా సా ముమోహ ముహుర్ముహుః॥ 12

"వనములలో నివసించునట్టి మునిపత్నులు ఈ నారచీరలను ఎట్లు ధరింతురోగదా!" అనియనుచు నార్చీరములను ధరించుట యెఱుగని ఆ జానకి మిగుల సిగ్గుపడెను. అట్టి చీరను ధరించుట

కృత్వా కంఠే చ సా చీరమ్ ఏకమాదాయ పాణినా।
తస్థౌ హ్యకుశలా తత్ర వ్రీళితా జనకాత్మజా। 13

తస్యాస్తత్ క్షిప్రమాగమ్య రామో ధర్మభృతాం వరః।
చీరం బబంధ సీతాయాః కౌశేయస్యోపరి స్వయమ్। 14

రామం ప్రేక్ష్య తు సీతాయా బధ్నంతం చీరముత్తమమ్।
అంతఃపురగతా నార్యో ముముచుర్వారి నేత్రజమ్। 15

ఊచుశ్చ పరమాయస్తా రామం జ్వలితతేజసమ్।
వత్స! నైవం నియుక్తేయం వనవాసే మనస్వినీ। 16

పితుర్వాక్యానురోధేన గతస్య విజనం వనమ్।
తావద్దర్శనమస్యాం నః సఫలం భవతు ప్రభో!। 17

లక్ష్మణేన సహాయేన వనం గచ్ఛస్వ పుత్రక!।
నేయమర్హతి కల్యాణీ వస్తుం తాపసవద్వనే। 18

కురు నో యాచనాం పుత్ర! సీతా తిష్ఠతు భామినీ।
ధర్మనిత్యః స్వయం స్థాతుం న హీదానీం త్వమిచ్ఛసి। 19

తాసామేవంవిధా వాచః శృణ్వన్ దశరథాత్మజః।
బబంధైవ తదా చీరం సీతయా తుల్యశీలయా। 20

చీరే గృహీతే తు తయా సమీక్ష్య నృపతేర్గురుః।
నివార్య సీతాం కైకేయీం వసిష్ఠో వాక్యమబ్రవీత్। 21

అతిప్రవృత్తే! దుర్మేధే! కైకేయి! కులపాంసని!।
వంచయిత్వా చ రాజానం న ప్రమాణేఽవతిష్ఠసే। 22

న గంతవ్యం వనం దేవ్యా సీతయా శీలవర్జితే!।
అనుష్ఠాస్యతి రామస్య సీతా ప్రకృతమాసనమ్। 23

ఆత్మా హి దారాః సర్వేషాం దారసంగ్రహవర్తినామ్।
ఆత్మేయమితి రామస్య పాలయిష్యతి మేదినీమ్। 24

అథ యాస్యతి వైదేహీ వనం రామేణ సంగతా।
వయమప్యనుయాస్యామః పురంచేదం గమిష్యతి। 25

అంతపాలాశ్చ యాస్యంతి సదారో యత్ర రాఘవః।
సహోపజీవ్యం రాష్ట్రం చ పురం చ సపరిచ్ఛదమ్। 26

భరతశ్చ సశత్రుఘ్నః చీరవాసా వనేచరః।
వనే వసంతం కాకుత్స్థమ్ అనువత్స్యతి పూర్వజమ్। 27

క్రొత్తయగుటచే ఆమె ఒక చీరను కంఠము చుట్టును ధరించి, మునీయొక్క చీరను చేతబట్టుకొని సిగ్గుపడుచు నిలబడెను. ధార్మికోత్తముడైన శ్రీరాముడు వెంటనే సీతకడకు చేరి, ఆమె చేతిలోని చీరను దీసికొని, దానిని ఆమె పట్టుచీరపైననే కట్టెను. అట్లు శ్రీరాముడు సీతాదేవికి వల్కలమును కట్టుచుండగా జూచి, ఆ అంతఃపురస్త్రీలందఱును కంటనీరు పెట్టిరి. అట్లు దుఃఖితలైయున్న ఆ స్త్రీలందఱును తేజశ్శాలియైన రామునితో ఇట్లనిరి. "నాయనా! మీతండ్రి ఈ సుకుమారికి వనవాసమును విధింపలేదుగదా! (12-16)

మీ తండ్రిగారి ఆజ్ఞను పాటించి, వనవాసమును ముగించుకొని నీవు తిరిగివచ్చెడివఱకు ఈమెను మేము జాగ్రత్తగా చూచుకొందుము. ఆ విధముగా మాజన్మలు సఫలములగును. నాయనా! ఓరామా! లక్ష్మణునితోడుగాజేసుకొని, నీవు వనములకు వెళ్ళుము. కాని ఈ సీతాదేవి మిగుల సుకుమారి. తాపసులవలె వనములలో ఈమె నివసింపజాలదు. నాయనా! రామా! ధర్మనిరతుడవైన నీవు పితృవచనపాలనమునకే కట్టుబడి ఇచట (ఈ అయోధ్యలో) ఉండుటకు ఇష్టపడకుంటివి. మా ప్రార్థనను మన్నించి, సీతాదేవినైనను ఇచట ఉండనిమ్ము." (17-19)

అంతట దశరథునిపుత్రుడు (శ్రీరాముడు) ఆ అంతఃపుర కాంతలు ఎంతగా ప్రాధేయపడుచున్నను, వారిమాటలను పట్టించుకొనక తనవలె ధర్మశీలయైన సీతాదేవికి ఆ వల్కలములను ధరింపజేసెను. రాజగురువైన వసిష్ఠుడు ఆవిధముగా నారచీరలను ధరించియున్న సీతాదేవిని జూచి, ఆమెను నివారించి, కైకేయితో ఇట్లనెను. (20-21)

"ఓ దుష్టురాలా! వంశమర్యాదలను మంటగలుపుచున్న ఓ కైకేయీ! నీవు హద్దుమీఱి ప్రవర్తించుచున్నావు. మహారాజును మోసగించుటయే గాక నీవు ఆడిన ప్రతిజ్ఞకుగూడ కట్టుబడి యుండుట లేదు. (22)

ఓ దురాచారపరురాలా! సీతాదేవి వనములకు పోనక్కఱ లేదు. శ్రీరామునకు మాఱుగా ఆమె ఆ సింహాసనమును అధిష్ఠింప గలదు. (23)

ప్రతిగృహస్థునకును అర్ధాంగి (అతని ధర్మపత్ని) ఆత్మవంటిది. కనుక శ్రీరామునకు సీతాదేవి ఆత్మ. అందువలన ఆయనస్థానమున తత్ప్రతినిధిగా ఉండి ఆమె పరిపాలన చేయగలదు. (24)

సీతాదేవియు శ్రీరామునితోగూడి అడవులకు వెళ్ళుటయే సంభవించినచో మేమును వారితో వెళ్ళెదము. అంతేగాదు ఈ పురజనులందఱును వెళ్ళెదరు. (25)

సీతారాములు నివసించు ప్రదేశమే అయోధ్య. కనుక దండనాయకులు (సామంతరాజులు) రాజును ఆశ్రయించుకొని జీవించు పురజనులు, దాసదాసీజనులు ధనధాన్యములతో, వస్తు వాహనాదులతో అచటికి చేరెదరు. (26)

అంతేగాదు భరతశత్రుఘ్నులును నారచీరలను దాల్చి వనచరులై తమ అన్నయైన శ్రీరాముడు నివసించు ప్రదేశమునకు వెళ్ళి, ఆయనతోగూడి అచటనే నివసింతురు. (27)

తతశ్శూన్యాం గతజనాం వసుధాం పాదపైః సహ।
త్వమేకా శాధి దుర్వృత్తా ప్రజానామహితే స్థితా। 28

న హి తద్భవితా రాష్ట్రం యత్ర రామో న భూపతిః।
తద్వనం భవితా రాష్ట్రం యత్ర రామో నివత్స్యతి। 29

న హ్యదత్తాం మహీం పిత్రా భరతః శాస్తుమర్హతి।
త్వయి వా పుత్రవద్వస్తుం యది జాతో మహీపతేః। 30

యద్యపి త్వం క్షితితలాత్ గగనం చోత్పతిష్యసి।
పితృవంశచరిత్రజ్ఞః సోఽన్యథా న కరిష్యతి। 31

తత్త్వయా పుత్రగర్ధిన్యా పుత్రస్య కృతమప్రియమ్।
లోకే హి స న విద్యేత యో న రామమనువ్రతః। 32

ద్రక్ష్యస్యద్యైవ కైకేయి! పశువ్యాళమృగద్విజాన్।
గచ్ఛతస్సహ రామేణ పాదపాంశ్చ తదున్ముఖాన్। 33

అథోత్తమాన్యాభరణాని దేవి!
దేహి స్నుషాయై వ్యపనీయ చీరమ్ ।
న చీరమస్యాః ప్రవిధీయతేతి
న్యవారయత్ తద్వసనం వసిష్ఠః । 34

ఏకస్య రామస్య వనే నివాసః
త్వయా వృతః కేకయరాజపుత్రి ।
విభూషితేయం ప్రతికర్మనిత్యా
వసత్వరణ్యే సహ రాఘవేణ । 35

యానైశ్చ ముఖ్యైః పరిచారకైశ్చ
సుసంవృతా గచ్ఛతు రాజపుత్రీ ।
వస్త్రైశ్చ సర్వైః సహితైర్విధానైః
నేయం వృతా తే వరసంప్రదానే । 36

తస్మిం స్తథా జల్పతి విప్రముఖ్యే
గురౌ నృపస్యాప్రతిమప్రభావే ।
నైవ స్మ సీతా వినివృత్తభావా
ప్రియస్య భర్తుః ప్రతికారకామా । 37

ఓ కైకేయీ! నీ ప్రవర్తన దుష్టమైనది. నీవు ప్రజలను ఇక్కట్లపాలు చేయుచున్నదానవు. ప్రజలందఱును వెళ్లిపోయిన పిమ్మట చెట్లుచేమలే మిగిలియున్న ఈ భూమిని ఏకాకివై నీవే యేలుకొనుము. (28)

శ్రీరాముని పరిపాలనకు నోచుకొనని ఆ రాజ్యము రాజ్యమే గాదు. రాముడు నివసించు ప్రదేశము వనమేయైనను అదియే రాజ్యమగును. (29)

భరతుడు దశరథునివలన జన్మించినవాడు. కావున, తండ్రి తనకు ప్రీతిపూర్వకముగా అప్పగింపని రాజ్యమును అతడు ఏలుకొనుటకు 'ససేమిరా' ఒప్పుకొనడు. పైగా ఆ భరతుడు నీసుతుడనిగా ఇచట ఉండుటకు ఏమాత్రము ఇష్టపడడు. (30)

నీవు ఈ భూతలమునుండి గగనమునకు ఎగురగలిగినను (నీవు ఎంతగా నేలవిడిచి సాము చేసినను) పితృ (ఇక్ష్వాకు) వంశము యొక్క ఆచార వ్యవహారములను బాగుగా ఎఱిగిన భరతుడు మాత్రము తండ్రికి విరుద్ధముగా ప్రవర్తింపడు. (31)

ఓ కైకేయీ! నీకు నీకొడుకుపైగల పిచ్చిమమకారముకొలదీ అతనికి అప్రియకార్యమునే చేయుచున్నావు. ఏలనన ఈ లోకమున శ్రీరామునకు విధేయుడు కానివాడు లేనేలేడు. (32)

ఓ కైకేయీ! వనములకు బయలుదేఱుచున్న శ్రీరాముని వెంట పశువులు, పాములు, మృగములు, పక్షులు వెళ్లుచుండుటను నీవు నేడే చూడగలవు. అంతేగాదు చిగుళ్లతో, మొగ్గలతో, పూవులతో నిండియుండెడి వృక్షములు సైతము వాడిపోయిన ముఖములతో అతడు వెళ్లుచున్న మార్గమునే చూచుచుండును. ఈ దృశ్యమును గూడ నీవు కాంచగలవు. (33)

కనుక ఓ దేవీ! నీ కోడలైన సీతాదేవికి ఈ నారచీరలను తీసివేసి, అమూల్యములైన వస్త్రములను ఆభరణములను ఇమ్ము. ఈమెకు వల్కలములను ఇచ్చుట పద్ధతిగాదు"-ఇట్లు పలికి వసిష్ఠమహర్షి జానకీవల్కలధారణమును నివారించెను. (34)

"ఓ కేకయరాజకుమారీ! నీవు శ్రీరామునకు ఒక్కనికే వనవాసమును కోరియుంటివి (సీతకుగాదు). కనుక ఈ జానకి నిత్యము వస్త్రాలంకారభూషితయై వనమున శ్రీరామచంద్రునితోగూడియుండును. నీవు వరములను కోరునప్పుడు సీతావనవాసమునుగూర్చి ప్రస్తావింపనేలేదు. కనుక ఈ రాజకుమారి (మైథిలి) వస్త్రములతో, సకలసౌకర్యములతో, ముఖ్యులైన పరిచారకులతోగూడి వాహనముపై వెళ్లుగాక." (35-36)

బ్రాహ్మణోత్తముడు, సాటిలేని మహిమగలవాడు, రాజగురువు ఐన వసిష్ఠమహర్షి ఇట్లు పలుకుచున్నను సీతాదేవిమాత్రము వేషభూషణములపై ఆసక్తి చూపక తనకు ప్రాణతుల్యుడైన శ్రీరామునితో సమానముగా నారచీరలనే ధరించెను. (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తత్రింశస్సర్గః *(37)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదియేడవసర్గము సమాప్తము

-- * * * --

38. ముప్పదియెనిమిదవసర్గము

సీతాదేవిచే నారచీరలను ధరింపజేసినందులకు దశరథుడు కైకను మందలించుట - శ్రీరాముడు తండ్రిని ఊరడించుట.

తస్యాం చీరం వసానాయాం నాథవత్యామనాథవత్।
ప్రచుక్రోశ జనస్సర్వో ధిక్ త్వాం దశరథంత్వితి। 1

సీతాదేవి తనపతియగు శ్రీరామునివిమక్షమునసే ఒక నిస్సహాయురాలివలె నారచీరలను ధరించెను. ఆ దృశ్యమును జూచి, అచటివారు దశరథుని 'ఛీ' కొట్టుచు ఈసడించిరి. (1)

తేన తత్ర ప్రణాదేన దుఃఖిత స్స మహీపతిః।
చిచ్ఛేద జీవితే శ్రద్ధాం ధర్మే యశసి చాత్మనః। 2

అప్పుడు అచటి వారిగగ్గోలునకును, ఈసడింపులకును తట్టుకొనలేక దశరథుడు మిక్కిలి దుఃఖించెను. తత్ప్రభావముతో ఆరాజునకు తనధర్మము మీదను, కీర్తిప్రతిష్ఠలయెడలను, కడకు జీవితముపైనను విరక్తికలిగెను. (2)

స నిశ్వస్యోష్ణమైక్ష్వాకః తాం భార్యామిదమబ్రవీత్।
కైకేయి! కుశచీరేణ న సీతా గంతుమర్హతి। 3

సుకుమారీ చ బాలా చ సతతం చ సుఖోచితా।
నేయం వనస్య యోగ్యేతి సత్యమాహ గురుర్మమ। 4

ఆ మహారాజు వేడినిట్టూర్పులు విడుచుచు తనభార్యతో ఇట్లనెను. "ఓ కైకేయీ!" 'ఈ జానకి వల్కలములను ధరించుట యుక్తముగాదు. ఈమె మిక్కిలి సుకుమారి, అమాయికురాలు, నిరంతరము సుఖములలో పుట్టిపెఱిగినది. ఈమె వనవాస జీవితమునకు ఏమాత్రము తగదు.' - అని మాగురువు వసిష్ఠమహర్షి చెప్పినమాట ముమ్మాటికి సత్యము. (3-4)

ఇయం హి కస్యాపకరోతి కించిత్
తపస్వినీ రాజవరస్య కన్యా ।
యా చీరమాసాద్య జనస్య మధ్యే
స్థితా విసంజ్ఞా శ్రమణీవ కాచిత్ । 5

ఈ సీతాదేవి పరమధార్మికుడైన జనకుని గారాలబిడ్డ, ఆదరముతో లాలింపబడినది. అంతేగాదు పతివ్రతా శిరోమణి, అట్టి ఉత్తమురాలు ఈ విధముగ ఒక సన్న్యాసినివలె ఈ జనులమధ్య నారచీరలను ధరించి నిలిచియున్నది. ఇంతకును ఈమె ఎవరికైనను, ఏకొంచెముగానైనను చేసిన అపకారమేమి? (5)

చీరాణ్యపాస్యాజ్జనకస్య కన్యా
నేయం ప్రతిజ్ఞా మమ దత్తపూర్వా ।
యథాసుఖం గచ్ఛతు రాజపుత్రీ
వనం సమగ్రా సహ సర్వరత్నైః । 6

ఈ జనకమహారాజుకూతురు (జానకి) ముందుగా ఈ వల్కలములను త్యజింపవలెను. వీటిని ధరించు విషయమును నా ప్రతిజ్ఞలో నేను ప్రస్తావింపలేదు. కనుక ఈ రాజకుమారి అమూల్యములైన వస్త్రములతో, వివిధములగు రత్నాభరణములతో హాయిగా వనములకు వెళ్ళును. (6)

అజీవనార్హేణ మయా నృశంసా
కృతా ప్రతిజ్ఞా నియమేన తావత్ ।
త్వయా హి బాల్యాత్ ప్రతిపన్నమేతత్
తన్మాం దహేద్వేణుమివాత్మపుష్పమ్ । 7

కైకా! నేను ఇక జీవించియుండుటయే వ్యర్థము. నేను నీకుటిలవచనములలో చిక్కుకొని, క్రూరమైన ప్రతిజ్ఞ చేసితిని. ఇది నేనుచేసిన మహాపరాధము. మూర్ఖురాలవైన నీవు నా ప్రతిజ్ఞను ఒక ఆయుధముగా ఉపయోగించుకొని, భరతునకు రాజ్యమును కట్టబెట్టుటకును, శ్రీరాముని వనములకు పంపుటకును పూనుకొంటివి. మిదుమిక్కిలి సీతచే నారచీరలను ధరింజేయుటకు సిద్ధపడితివి. వెదురుగడను దానిపుష్పమే ఛేదించునట్లు[1] నేను చేసిన పాపమే (ప్రతిజ్ఞయే) ఇప్పుడు నన్ను దహించివేయుచున్నది. (7)

రామేణ యది తే పాపే! కించిత్ కృతమశోభనమ్।
అపకారః క ఇహ తే వైదేహ్యా దర్శితోఽధమే! । 8

ఓ పాపాత్మురాలా! ఒకవేళ శ్రీరాముడు నీకు ఏమైనను అపకారము చేసియున్నచో అతనికి వనవాసమును విధించుట యుక్తముకావచ్చును. కాని ఓ నీచురాలా! వైదేహికి ఈ శిక్ష విధించుటకు ఆమె నీకు చేసిన అపకారమేమి? (8)

1) అలిః కులీ కర్కటీ వేణు రంభా వినాశకాలే ఫలముద్వహంతి. తేలు, ఎండ్రకాయ, పీత గర్భమును దాల్చుట వాటి మృత్యువునకే. అనగా తేలు, ఎండ్రకాయ, పీత ప్రసవించిన వెంటనే మృతిచెందును-వెదురు, అరటి పుష్పించుట వాటి వినాశనమునకే-అనగా పుష్పించిన పిమ్మట అవి నష్టిచెందవు. ఆ పూవులతోడనే అవి అంతరించును.

మృగీవోత్ఫుల్లనయనా మృదుశీలా తపస్వినీ।
అపకారం కమివ తే కరోతి జనకాత్మజా। 9

నను పర్యాప్తమేతత్ తే పాపే! రామవివాసనమ్।
కిమేభిః కృపణైర్భూయః పాతకైరపి తే కృతైః। 10

ప్రతిజ్ఞాతం మయా తావత్ త్వయోక్తం దేవి! శృణ్వతా।
రామం యదభిషేకాయ త్వమిహాగతమబ్రవీః। 11

తత్త్వేతత్ సమతిక్రమ్య నిరయం గంతుమిచ్ఛసి।
మైథిలీమపి యా హి త్వమ్ ఈక్షసే చీరవాసినీమ్। 12

ఇతీవ రాజా విలపన్మహాత్మా
శోకస్య నాంతం స దదర్శ కించిత్ ।
భృశాతురత్వాచ్చ పపాత భూమౌ
తేనైవ పుత్రవ్యసనేన మగ్నః । 13

ఏవం బ్రువంతం పితరం రామః సంప్రస్థితో వనమ్।
అవాక్శిరసమాసీనమ్ ఇదం వచనమబ్రవీత్। 14

ఇయం ధార్మిక! కౌసల్యా మమ మాతా యశస్వినీ।
వృద్ధా చాక్షుద్రశీలా చ న చ త్వాం దేవ! గర్హతే। 15

మయా విహీనాం వరద! ప్రపన్నాం శోకసాగరమ్।
అదృష్టపూర్వవ్యసనాం భూయస్సమ్మంతుమర్హసి। 16

పుత్రశోకం యథా నర్ఛేత్ త్వయా పూజ్యేన పూజితా।
మాం హి సంచింతయంతీ సా త్వయి జీవేత్తపస్వినీ। 17

ఇమాం మహేంద్రోపమ జాతగర్ధినీం
తథా విధాతుం జననీం మమార్హసి ।
యథా వనస్థే మయి శోకకర్శితా
న జీవితం న్యస్య యమక్షయం వ్రజేత్। 18

హరిణీవలె విశాలములైన నేత్రములుగలదియు, మృదుస్వభావము గలదియు (కలలో సైతము ఇతరులకు అపకారము తలపెట్టనిదియు) ధర్మచారిణియు అగు ఈ జానకి ఇక్కడ నీకు ఏమి అపకారము చేసినది? (9)

ఓ దుష్టురాలా! నీవరప్రాప్తికి 'రాముని వనవాసమునకు పంపుట' యను ఆ ఒక్క పాపకృత్యమే చాలును. ఇంకను సీతచే వల్కలములను ధరింపజేయుట, అనగా అడవులకు పంపుటవంటి ఈ దుష్కృత్యములను చేసి, నీపాపములబరువును ఏల పెంచుకొనుచున్నావు? (10)

ఓ దేవీ! శ్రీరాముడు తన పట్టాభిషేకమహోత్సవసందర్భముగా ఇచటికి వచ్చినప్పుడు అతనితో "రామా! నీవు ఈ పట్టాభిషేకోత్సవమును మానుకొని, జటావల్కలములను ధరించి, దండకారణ్యములలో పదునాలుగు సంవత్సరములు నివసింపుము." అని నీవు పల్కగా నేను వినియుంటిని. నీవు కోరినదియు నేను ప్రతిజ్ఞ చేసినదియు అంతమాత్రమే-అంతటితో ఆగక జానకిచేగూడ నారచీరలను ధరింపజేసి, ఇంకను నీవు నరకమునకు పోదలచితివా?"(11-12)

దశరథమహారాజు ఇట్లు విలపించుచు అంతులేని శోకమున మునిగిపోవుచుండెను. వనములకు వెళ్ళుచున్న పుత్రునియెడబాటునకు తట్టుకొనలేక అతడు తీవ్రబాధకు లోనై, నేలపై పడిపోయెను. (13)

ఈ విధముగా గోడుగోడుమనుచు తలను వ్రేలాడవేసికొని నేలపై కూర్చొనియున్న తండ్రితో వనములకు బయలుదేరుచున్న శ్రీరాముడు ఇట్లు నుడివెను. (14)

"ఓ ధర్మజ్ఞా! ఓ దేవా! మిగుల పేరుప్రతిష్ఠలుగల మాతల్లి కౌసల్యాదేవి ఇదిగో ఇచటనే యున్నది. ఈమె కడు వృద్ధురాలు, ఉత్తమశీలవతి. ఈమె ఎన్నడును మిమ్ము నిందించి యెరుగదు. ఓ మహాత్మా! నా నిమిత్తమై ఈమె శోకసాగరమున మునిగియున్నది. ఇంతకుముందు ఎట్టి దుఃఖములనూ కనివిని యెరుగదు. కనుక నేనులేని కొఱతను దీర్చుచు ఈమెను ఆదరముతో ఓదార్చుచుండుము. (15-16)

పుత్రుని (నా) యెడబాటువలన కలుగు దుఃఖము దూరమగునట్లుగా ఈమెను నీవు ఆదరింపుము. తండ్రీ! నిన్నుజూచుచు నీ ప్రేమాదరములలో మునిగి, నన్నుగూర్చి చింతించుట మానివేయునట్లుగా ఈమెను సంతోషపఱచుచుండుము. (17)

ఇంద్రునితో సమానుడవైన ఓ మహారాజా! నాతల్లి కౌసల్యాదేవి యొక్క పుత్రప్రేమ అగాధమైనది. నేను వనములకు వెళ్ళినచో నాయెడబాటుబాధను భరింపలేక ఈమె మృత్యువాతబడెడి ప్రమాదముగూడ గలదు. కావున నీవెల్లవేళల కనుసన్నలతో ఈమె దుఃఖమును తుడిచివేయుచు ఈమెను కాపాడెడిభారము నీదే."(18)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టత్రింశస్సర్గః *(38)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదియెనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

39. ముప్పదితొమ్మిదవసర్గము

దశరథునివిలాపము - ఆయనఆజ్ఞపై పరిచారకులు సీతాదేవికి ఆభరణాదులను తెచ్చియిచ్చుట - కౌసల్యాదేవి సీతమ్మకు పతివ్రతాధర్మములను దెల్పుట.

రామస్య తు వచః శ్రుత్వా మునివేషధరం చ తమ్।
సమీక్ష్య సహ భార్యాభీ రాజా విగతచేతనః॥ 1

నైనం దుఃఖేన సంతప్తః ప్రత్యవైక్షత రాఘవమ్।
నచైనమ్ అభిసంప్రేక్ష్య ప్రత్యభాషత దుర్మనాః॥ 2

స ముహూర్తమివాసంజ్ఞో దుఃఖితశ్చ మహీపతిః।
విలలాప మహాబాహూ రామమేవానుచింతయన్॥ 3

మన్యే ఖలు మయా పూర్వం వివత్సా బహవః కృతాః।
ప్రాణినో హింసితా వాఽపి తస్మాదిదముపస్థితమ్॥ 4

న త్వేవానాగతే కాలే దేహాత్ చ్యవతి జీవితమ్।
కైకేయ్యా క్లిశ్యమానస్య మృత్యుర్మమ న విద్యతే॥ 5

యోఽహం పావకసంకాశం పశ్యామి పురతః స్థితమ్।
విహాయ వసనే సూక్ష్మే తాపసాచ్ఛాదమాత్మజమ్॥ 6

ఏకస్యాః ఖలు కైకేయ్యాః కృతేఽయం క్లిశ్యతే జనః।
స్వార్థే ప్రయతమానాయాః సంశ్రిత్య నికృతిం త్విమామ్॥ 7

ఏవ ముక్త్వా తు వచనం బాష్పేణ పిహితేక్షణః।
రామేతి సకృదేవోక్త్వా వ్యాహర్తుం న శశాక హ॥ 8

సంజ్ఞాం తు ప్రతిలభ్యైవ ముహూర్తాత్ స మహీపతిః।
నేత్రాభ్యామ్ అశ్రుపూర్ణాభ్యాం సుమంత్రమిదమబ్రవీత్॥ 9

ఔపవాహ్యం రథం యుక్త్వా త్వమాయాహి హయోత్తమైః।
ప్రాపయైనం మహాభాగమ్ ఇతో జనపదాత్ పరమ్॥ 10

ఏవమన్యే గుణవతాం గుణానాం ఫలముచ్యతే।
పిత్రా మాత్రా చ యత్ సాధుః వీరో నిర్వాస్యతే వనమ్॥ 11

భార్యలతోగూడియున్న దశరథమహారాజు శ్రీరాముడు నుడివిన మాటలను విని, మునివేషమును ధరించియున్న అతనినిజూచి, నిశ్చేష్టుడాయెను. (1)

దుఃఖభారముచే కనులలో నీరు నిండియున్నందున ఆ రాజు శ్రీరాముని స్పష్టముగా చూడలేకపోయెను. ఒకవేళ అతికష్టముమీద చూచినను, మనస్సు పనిచేయకుండుటచే అతడు తనపుత్రునితో మాట్లాడలేకపోయెను. (2)

మహాబాహువైన ఆరాజు మిగులదుఃఖితుడై, క్షణకాలముపాటు స్పృహలేనివాడై, రామునే స్మరించుచు విలపించుచుండెను. (3)

'ఇదివరలో నేను పెక్కుమందికి పుత్రవియోగదుఃఖమును కలిగించియుండవచ్చును. అట్లే ఎన్నో ప్రాణులను హింసించి యుంటినో ఏమో? ఆ పాపఫలితమే నాకు ఇప్పుడు ఈ విధముగా కొడిసికొట్టి యుండవచ్చును. (4)

కైకేయికారణముగా దుర్భరపరిస్థితులలో ఇంతగా నలిగి పోవుచున్నను నాప్రాణములు పోవుటలేదు. అగ్నివలె మహాతేజస్వియైన కన్నకొడుకు మెత్తని పట్టు (రాజ) వస్త్రములను పరిత్యజించి, తాపస వస్త్రములను (నార్చీరములను) దాల్చి, (వనములకు బయలుదేఱుచు) నాయెదుట నిలబడియుండగా చూచుచున్నను అసువులు నన్ను వీడుటలేదు. దీనినిబట్టి చూడగా 'తగిన సమయము వచ్చెడి వఱకును ప్రాణములు ఈ బొందిని విడిచిపోవు' అను మాట స్పష్టము. (5-6)

మొండిపట్టుదలతో స్వార్థముతో ప్రాకులాడుచున్న ఒక్కకైకేయి కారణముగా ఈ జనులెల్లరును విలవిలలాడుచున్నారు.' దశరథుడు ఈ విధముగా పలుకుటతో అతనికన్నీరు మున్నీరయ్యెను. ఇంద్రియములు శిథిలములయ్యెను. ఒక్కమారు 'రామా!' అని పలుకునంతలో ఆయనకంఠము మూగబోయెను. (7-8)

ఎట్టకేలకు ఒక్కక్షణకాలముతరువాత స్పృహరాగా, ఆరాజు దుఃఖాశ్రువులను స్రవింపజేయుచునే సుమంత్రునితో ఇట్లనెను. (9)

"ప్రయాణము చేయుటకు అనువైన రథమునకు మేలుజాతి గుఱ్ఱములను పూన్చి తీసికొని రమ్ము. దానిపై ఈ శ్రీరాముని (మహానుభావుని) అధిష్ఠింపజేసి, గ్రామముల పొలిమేరల (అడవుల) వఱకు దీసికొని వెళ్లుము. (10)

సత్పురుషులు, సద్గుణవంతులు ఐన కుమారులను కొంతమంది తల్లిదండ్రులు (తమ స్వార్థమునకై) వివిధ కారణములచే ఇండ్ల నుండి (దేశమునుండి) బయటికి వెళ్లగొట్టుదురు. (వనములపాలు చేయుచుందురు) దీనినిబట్టి చూచినచో గుణవంతులైన వారి సద్గుణములకు ఫలమిట్టిదియే"-అని తోచును. (11)

రాజ్ఞో వచనమాజ్ఞాయ సుమంత్రః శీఘ్రవిక్రమః।
యోజయిత్వాఽఽయయౌ తత్ర రథమశ్వైరలంకృతమ్। 12

అంతట సుమంత్రుడు రాజాజ్ఞను శిరసావహించి, వేగముగా వెళ్ళి, చక్కగా అలంకరింపబడిన రథమునకు అశ్వములను పూన్చి, తీసికొనివచ్చెను. (12)

తం రథం రాజపుత్త్రాయ సూతః కనకభూషితమ్।
ఆచచక్షేఽంజలిం కృత్వా యుక్తం పరమవాజిభిః। 13

బంగారముచే అలంకృతమైన రథమునకు ఉత్తమాశ్వములను పూన్చి, తీసికొని వచ్చిన సుమంత్రుడు అంజలి ఘటించినవాడై, "రాజపుత్త్రుని ప్రయాణమునకు రథము సిద్ధముగా ఉన్నది" అని రాజుతో నుడివెను. (13)

రాజా సత్వరమాహూయ వ్యాపృతం విత్తసంచయే।
ఉవాచ దేశకాలజ్ఞం నిశ్చితం సర్వతః శుచిమ్। 14

దేశకాలపరిస్థితులను గ్రహించుచు ప్రవర్తించువాడును, నిశ్చయశక్తిగలవాడును, అన్నివిధములుగా నీతిమంతుడును ఐన కోశాధికారిని వెంటనే పిలిపించి, దశరథమహారాజు అతనితో ఇట్లు పచించెను. (14)

వాసాంసి చ మహార్హాణి భూషణాని వరాణి చ।
వర్షాణ్యేతాని సంఖ్యాయ వైదేహ్యాః క్షిప్రమానయ। 15

నరేంద్రేణైవముక్తస్తు గత్వా కోశగృహం తతః।
ప్రాయచ్ఛత్ సర్వమాహృత్య సీతాయై సమమేవ తత్। 16

"సీతాదేవి ధరించుటకు యోగ్యమైన, అమూల్యములైన వస్త్రములను, ఆభరణములను పదునాలుగు సంవత్సరముల వఱకు సరిపోవునట్లుగా వెంటనే తీసికొని రమ్ము"-మహారాజు ఇట్లు ఆజ్ఞాపింపగా ఆ కోశాధిపతి వెంటనే ధనాగారమునకు వెళ్ళి, వలసిన వస్త్రాభరణములను తీసికొని వచ్చి, వాటిని సీతాదేవికి సమర్పించెను. (15-16)

సా సుజాతా సుజాతాని వైదేహీ ప్రస్థితా వనమ్।
భూషయామాస గాత్రాణి తైర్విచిత్రైర్విభూషణైః। 17

శ్రీరామునితో (పతితో) వనములకు బయలుదేఱుచున్న ఆ అయోనిజ (సీతాదేవి) చక్కగా పరిపుష్టములైన తనఅవయవములకు చిత్రవిచిత్రములైన ఆ ఆభరణములను అలంకరించుకొనెను. (17)

వ్యరాజయత వైదేహీ వేశ్మ తత్సువిభూషితా।
ఉద్యతోఽంశుమతః కాలే ఖం ప్రభేవ వివస్వతః। 18

ఉదయించుచున్న సూర్యకిరణములకాంతి ఆకాశమును వలె చక్కగా అలంకృతయైయున్న సీతాదేవి ఆ మందిరమును ప్రకాశింపజేసెను. (18)

తాం భుజాభ్యాం పరిష్వజ్య శ్వశ్రూః వచనమబ్రవీత్।
అనాచరంతీం కృపణం మూర్ధ్న్యుపాఘ్రాయ మైథిలీమ్। 19

వనములకు వెళ్ళుచును దైన్యమునకు తావీయక నిండుగా నున్న ఆ సీతాదేవిని అత్తగారైన కౌసల్యాదేవి అక్కున జేర్చుకొని, ఆమె శిరమును మూర్కొని ఇట్లు నుడివెను. (19)

అసత్యస్సర్వలోకేఽస్మిన్ సతతం సత్కృతాః ప్రియైః।
భర్తారం నానుమన్యంతే వినిపాతగతం స్త్రియః। 20

ఏష స్వభావో నారీణామ్ అనుభూయ పురా సుఖమ్।
అల్పామప్యాపదం ప్రాప్య దుష్యంతి ప్రజహత్యపి। 21

"అమ్మా! పాతివ్రత్యమును ఆదరింపని స్త్రీలు తమభర్తలు నిరంతరము తమను ఎంత ప్రేమతో చూచుకొనుచున్నను, పతులు ఒడుదుడుకులకు లోనైనప్పుడు వారిని చులకనగా చూతురు. లోగడ భర్తలు తమను ఎంతగా సుఖపెట్టినను, వారికి స్వల్పమైన ఆపద వచ్చిపడినచో స్త్రీలు తమపతులను దూషింతురు, అంతే గాదు వారిని త్యజించుటకును వెనుకాడరు. సాధారణముగా స్త్రీలస్వభావమిది. (20-21)

అసత్యశీలా వికృతా దుర్గ్రాహ్యహృదయాస్సదా।
యువత్యః పాపసంకల్పాః క్షణమాత్రాద్విరాగిణః। 22

దుష్టాలోచనలుగల యువతులు సర్వదా కపటవచనములను పలుకుచుందురు, కోపతాపాదివికారములకు లోనగుచుందురు. వారి మనస్సులలోగల భావములు దుర్గ్రాహ్యములు, వారు చిన్న చిన్న సంఘటనలకే పతులపై అలుకవహించి, వారికి దూరమగుదురు. అట్టి స్త్రీలకు భర్తయొక్క ఆభిజాత్యము (గొప్ప వంశమున జన్మించుట) గాని, అతడు చేసిన ఉపకారములుగాని, అతని యొక్క విద్యావైభవములుగాని, అతడు తెచ్చిపెట్టిన వస్త్రాభరణాదులు

న కులం న కృతం విద్యాం న దత్తం నాపి సంగ్రహమ్।
స్త్రీణాం గృహ్ణాతి హృదయమ్ అనిత్యహృదయా హి తాః। 23

సాధ్వీనాం హి స్థితానాం తు శీలే సత్యే శ్రుతే శమే।
స్త్రీణాం పవిత్రం పరమం పతిరేకో విశిష్యతే। 24

స త్వయా నావమంతవ్యః పుత్త్రః ప్రవ్రాజితో మమ।
తవ దైవతమస్త్వేష నిర్ధనః సధనోఽపి వా। 25

విజ్ఞాయ వచనం సీతా తస్యా ధర్మార్థసంహితమ్।
కృతాంజలిరువాచేదం శ్వశ్రూమభిముఖే స్థితామ్। 26

కరిష్యే సర్వమేవాహమ్ ఆర్యా యదనుశాస్తి మామ్।
అభిజ్ఞాస్మి యథా భర్తుః వర్తితవ్యం శ్రుతం చ మే। 27

న మామసజ్జనేనార్యా సమానయితుమర్హతి।
ధర్మాద్విచలితుం నాహమ్ అలం చంద్రాదివ ప్రభా। 28

నాతంత్రీ వాద్యతే వీణా నాచక్రో వర్తతే రథః।
నాపతిస్సుఖమేధేత యా స్యాదపి శతాత్మజా। 29

మితం దదాతి హి పితా మితం మాతా మితం సుతః।
అమితస్య హి దాతారం భర్తారం కా న పూజయేత్। 30

సాఽహమేవంగతా శ్రేష్ఠా శ్రుతధర్మపరావరా।
ఆర్యే! కి మవమన్యేఽహం స్త్రీణాం భర్తా హి దైవతమ్। 31

గాని, ప్రేమతో అతడు తనను చేపట్టిన రీతిగాని జ్ఞాపకమునకే యుండవు. ఏలనన వారిస్వభావములు చంచలములు. వారికి పతికంటెను సంపదలే ముఖ్యము. అంతేగాదు 'స్థూణానిఖనన'[1] న్యాయమున వారు ప్రాతవిషయములను త్రవ్వుచు భర్తతో ఎల్లప్పుడును గిల్లికజ్జములాడుచుందురు. (22-23)

సాధ్వీమణులరీతి దీనికి పూర్తిగా భిన్నముగానుండును. వారు తమవంశమర్యాదలకు తగినట్లుగా ప్రవర్తింతురు. గురువుల (పెద్దల) ఉపదేశములను అనుసరించి నడచుకొందురు, శాంత స్వభావము కలిగియుందురు. వారికి పతియే దైవము. వారి జీవితములు పరమపవిత్రములు. (24)

వనములకు పంపబడుచున్న నా కుమారుని నీవు ఎల్లప్పుడును భక్తిగౌరవములతో చూచుకొనుచుండుము. సంపన్నుడైనను, నిర్ధనుడైనను ఇతడే నీకు పరమదైవము." (25)

ఆ కౌసల్యాదేవి పలికిన ధర్మసమ్మతములైన ప్రయోజనకరములైన మాటలఅంతరార్థమును గ్రహించినదై, సీతాదేవి తనకు ఎదురుగా నున్న అత్తగారికి ప్రణమిల్లి, ఆమెతో ఇట్లనెను. (26)

"పూజ్యురాలా! పతియెడ మెలగవలసిన విషయమున మా తల్లిదండ్రులు ఉపదేశింపగా సావధానముగా విని, వాటిని గ్రహించి యుంటిని. ఇప్పుడు మీరు బోధించిన (పతిసేవాది) సమస్త విషయములను తప్పక ఆచరింతును. ఓ దేవీ! నన్ను అనార్యనుగా భావింపవలదు. చంద్రునినుండి వెన్నెల వేఱుకానట్లు నేనును ధర్మపథమునకు దూరముకాబోను. తంత్రులు లేనిదే వీణమ్రోగదు. చక్రములు లేనిదే రథము కదలదు. అట్లే వందమంది కుమారులతల్లియైనను ఆపడతి పతికి దూరముగానున్నచో నిజమైన సుఖములకు నోచుకొనదు. (27-29)

ఏ సతికైనను తండ్రిగాని, తల్లిగాని, కడకు తనకడుపున బుట్టిన పుత్త్రులుగాని పరిమితముగా మాత్రమే తోడ్పడగలరు. కానీ భర్త మాత్రము ఆమెకు అపరిమితముగా ఐహికములైన సుఖసంతోషములను గూర్చుటయే గాక పారమార్థిక లాభములనుగూడ సంధియిచ్చును. కనుక ఏ సతి తనపతిని గౌరవింపదు? (30)

ఓ పూజ్యురాలా! ఈ విధముగా నేను పతివ్రతాధర్మములను ఆశ్రయించినదానను. పెద్దలు బోధించిన సామాన్యధర్మములను, విశేషధర్మములను శ్రద్ధగా విని, వాటిని అవగాహన చేసికొనిన దానను. అట్టి నేను నాభర్తను ఏల నిరాదరింతును? ఎట్లు చులకన చేయుదును? స్త్రీలకు పతియే ప్రత్యక్షదైవము గదా!" (31)

1) స్థూణానిఖననన్యాయము- స్థూణా=స్తంభము, గుంజ, నిఖననము=పాతుట
గుంజను(స్తంభమును) పాతునప్పుడు పెక్కుపర్యాయములు నేలను త్రవ్వుచు గుంజను (స్తంభమును) అటునిటు కదల్చుచుందురు. పోట్లాడుస్వభావముగలవారు తాము మాట్లాడుచున్న విషయమునకు సంబంధములేకుండా ప్రాతవిషయములను పదేపదే త్రవ్వుచు ఎదుటివారిని నొప్పించుచుందురు. ఎంతకును వారు తమ మొండివాదమును వీడరు. ఇది దుష్టుల లక్షణము- దీనినే 'స్థూణానిఖనన న్యాయము'- అనియందురు.

సీతాయా వచనం శ్రుత్వా కౌసల్యా హృదయంగమమ్।
శుద్ధసత్త్వా ముమోచాశ్రు సహసా దుఃఖహర్షజమ్॥ 32

తాం ప్రాంజలి రభిక్రమ్య మాతృమధ్యేఽతిసత్కృతామ్।
రామః పరమధర్మజ్ఞో మాతరం వాక్యమబ్రవీత్॥ 33

అంబ! మా దుఃఖితా భూస్త్వం పశ్య త్వం పితరం మమ।
క్షయో హి వనవాసస్య క్షిప్రమేవ భవిష్యతి॥ 34

సుప్తాయాస్తే గమిష్యంతి నవవర్షాణి పంచ చ।
సా సమగ్రమిహ ప్రాప్తం మాం ద్రక్ష్యసి సుహృద్వృతమ్॥ 35

ఏతావదభినీతార్థమ్ ఉక్త్వా స జననీం వచః।
త్రయశ్శతశతార్ధాశ్చ దదర్శావేక్ష్య మాతరః॥ 36

తాశ్చాపి స తథైవార్తా మాతౄర్దశరథాత్మజః।
ధర్మయుక్తమిదం వాక్యం నిజగాద కృతాంజలిః॥ 37

సంవాసాత్ పరుషం కించిత్ అజ్ఞానాద్వాఽపి యత్కృతమ్।
తన్మే సమనుజానీత సర్వాశ్చామంత్రయామి వః॥ 38

వచనం రాఘవస్యైతత్ ధర్మయుక్తం సమాహితమ్।
శుశ్రువుస్తాః స్త్రియస్సర్వాః శోకోపహతచేతసః॥ 39

జజ్ఞేఽథ తాసాం సన్నాదః క్రౌంచీనామివ నిస్స్వనః।
మానవేంద్రస్య భార్యాణామ్ ఏవం వదతి రాఘవే॥ 40

మురజపణవమేఘఘోషవత్
దశరథవేశ్మ బభూవ యత్పురా।
విలపితపరిదేవనాకులం
వ్యసనగతం తదభూత్ సుదుఃఖితమ్॥ 41

శుద్ధసాత్త్వికగుణశోభితయైన కౌసల్యాదేవి సీతాసాధ్వి పలికిన ఆహ్లాదకరవచనములను విని, వెంటనే దుఃఖముతో, సంతోషముతో అశ్రువులను స్రవింపజేసెను. (శ్రీరాముడు వనములకు వెళ్లుచున్నందులకు దుఃఖాశ్రువులను, సీతాదేవి మిగుల ఆహ్లాదకర వచనములను పలికినందులకు ఆనందాశ్రువులను రాల్చెను). (32)

పరమధర్మాత్ముడైన శ్రీరాముడు తల్లులందరిలో మిగుల సత్కారములను పొందుచున్న కౌసల్యామాతకు ప్రదక్షిణ పూర్వకముగా నమస్కరించి, ఆమెతో ఇట్లు నుడివెను. (33)

"అమ్మా! దుఃఖమును వీడుము. మా తండ్రిని జాగ్రత్తగా చూచుకొనుము. నా వనవాసకాలము ఒక గడియవలె ముగియ గలదు. (34)

తల్లీ! నీవు ఒక రాత్రి నిద్రించిలేచెడి లోపల (కనులు మూసి తెఱచునంతలో) ఈ పదునాలుగు సంవత్సరములును ముగియును. తండ్రిగారి ఆజ్ఞను పాలించి, సీతాలక్ష్మణులతోగూడి వచ్చి నీయెదుట వాలెదను. కనుక త్వరలోనే మమ్ముజూచి నీవు ఆనందింపగలవు." (35)

ఆ రాముడు సారభూతముగా, సంక్షిప్తముగా తల్లితో ఇట్లు పలికిన పిమ్మట ఒక్క క్షణమాలోచించి, తక్కిన మూడువందల యేబదిమంది తల్లులను గాంచెను. పిమ్మట ఆ దశరథరాముడు కౌసల్యామాతవలెనే విలపించుచున్న ఆ తల్లులందఱికిని నమస్కరించి, ధర్మబద్ధముగా ఇట్లు నుడివెను. (36-37)

"తల్లులారా! ఒకేచోట మనమందఱము కలిసిమెలిసియుండుట వలనగాని, (చిరకాల పరిచయప్రభావమునగాని) తెలియకగాని మీకు నేనేదైనను కష్టము కలిగించియున్నచో నన్ను మన్నింపుడు. మీయందఱినుండి సెలవుదీసికొనుచున్నాను." (38)

శ్రీరాముడు ధర్మయుక్తముగా, అర్థవంతముగా పలికిన వచనములను విని, ఆ తల్లులందఱును పూర్తిగా దుఃఖమున మునిగి మిగుల విలపించిరి. దశరథమహారాజు యొక్క ఆ భార్యలందఱును శ్రీరామునివచనములకు తల్లడిల్లుచు చేసినగగ్గోలు ఆడు క్రౌంచపక్షుల అఱపులవలె ఒప్పారెను. (39-40)

నేటివఱకును మేఘనాదములవంటి మృదంగముల, తప్పెటల ధ్వనులతో మార్మ్రోగుచుండెడి దశరథునిభవనము ఇప్పుడు దుఃఖమగ్నులైయున్న ఆ స్త్రీలయొక్క ఏడుపులతో, పెడబొబ్బలతో నిండిపోయెను. (41)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనచత్వారింశస్సర్గః *(39)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ముప్పదితొమ్మిదవసర్గము సమాప్తము

— * * * —

40. నలుబదియవసర్గము

సీతారామలక్ష్మణులు మాతాపితరులకు నమస్కరించుట - సుమిత్రాదేవి లక్ష్మణునకు హితోక్తులు పల్కుట - వారు అందఱును రథమును ఎక్కగా సుమంత్రుడు ఆ రథమును అడవులవైపుగా వేగముతో నడుపుట.

అథ రామశ్చ సీతా చ లక్ష్మణశ్చ కృతాంజలిః।
ఉపసంగృహ్య రాజానం చక్రుర్దీనాః ప్రదక్షిణమ్। 1

అంతట సీతారామలక్ష్మణులు, తల్లిదండ్రులసేవలకు దూరమగుచున్నందులకు దీనులై, మహారాజునకు ప్రదక్షిణపూర్వకముగా పాదాభివందనమొనర్చిరి. (1)

తం చాపి సమనుజ్ఞాప్య ధర్మజ్ఞః సీతయా సహ।
రాఘవశ్శోకసమ్మూఢో జననీమ్ అభ్యవాదయత్। 2

తండ్రియనుజ్ఞనుబడసిన పిమ్మట ధర్మజ్ఞుడైన శ్రీరాముడు శోకాకులుడై సీతతోగూడి, కౌసల్యామాత పాదములకు ప్రణమిల్లెను. (2)

అన్వక్షం లక్ష్మణో భ్రాతుః కౌసల్యామ్ అభ్యవాదయత్।
అథ మాతుస్సుమిత్రాయాః జగ్రాహ చరణౌ పునః। 3

తం వందమానం రుదతీ మాతా సౌమిత్రిమబ్రవీత్।
హితకామా మహాబాహుం మూర్ధ్న్యుపాఘ్రాయ లక్ష్మణమ్। 4

అన్న ప్రణమిల్లినతరువాత లక్ష్మణుడు కౌసల్యాదేవికి నమస్కరించెను. పిదప అతడు కన్నతల్లి సుమిత్రాదేవి పాదములపై వ్రాలెను. మహాబాహువు, తనగారాలబిడ్డడు ఐన లక్ష్మణకుమారుడు తనకు నమస్కరించుచుండగా చూచి లేవనెత్తి, ఆ సుమిత్రామాత అతనిశిరమును మూర్కొని, ప్రేమాశ్రువులను రాల్చుచు అతనికిట్లు హితోక్తులు పల్కెను. (3-4)

సృష్టస్త్వం వనవాసాయ స్వనురక్తః సుహృజ్జనే।
రామే ప్రమాదం మా కార్షీః పుత్ర! భ్రాతరి గచ్ఛతి। 5

వ్యసనీ వా సమృద్ధో వా గతిరేష తవానఘ।
ఏష లోకే సతాం ధర్మో యజ్జ్యేష్ఠవశగో భవేత్। 6

"కుమారా!లక్ష్మణా! మిత్రులయెడ (సుహృజ్జనులపై) నీకుగల అనురాగము అపారము. (శ్రీరామునియందు నీకుగల భక్తి గాఢమైనది) వనవాసమున శ్రీరాముని సేవించుటకొఱకే నీవు నాకడుపున ఉదయించితివి. అస్తు - శ్రీరాముడు అరణ్యములలో సాగిపోవుచున్నప్పుడు ఆయనరక్షణవిషయమున నీవు సావధానుడవై యుండుము. అందు ఏమాత్రము ఏమఱుపాటు రానీయకుము.[1] ఓ పుణ్యాత్ముడా! ఆపదలయందును, సంపదలయందును (కష్టసుఖములలో రెండింటను) ఈ శ్రీరాముని అనుసరించుటయే నీ కర్తవ్యము. అన్నయొక్క అడుగుజాడలలో సాగిపోవుట అనుజుల ధర్మము.[2,3] ఇదియే లోకమున సత్పురుషులు ఆచరించెడి పద్ధతి. (5-6)

1) లోకరక్షణార్థమై కౌసల్యాదేవిగర్భమున అవతరించినవాడు ఆ శ్రీరాముడు. సుహృజ్జనసేవలో నీవు ఆ ఆవిశేషుడవే. కనుక నీవు ఆయన అడుగుజాడలలో సాగుచు ఆయనను సేవించుటకే విధివిలాసమున నీవు నాకడుప పుత్రుడవైతివి. శ్రీరామునియెడ సీతను, నీపై ఆ రఘువరునకునుగల ప్రేమానురాగములు అపూర్వములు, ఆదర్శప్రాయములు. వాటినన్నింటిని అటుండనిమ్ము, రామగమనసమయమున ఆయనదర్శనానందమున మునిగి, ఆయనరక్షణకార్యమునకు లోపమును రానీయకుము. ఆ ధర్మాత్మునిరక్షణసేవలకే నీ అనువర్తనము-అందులకు నేను ఆమోదించుచున్నాను.

2) జ్యేష్ఠ పిత్సమః - అన్న తండ్రితో సమానుడు. కనుక జ్యేష్ఠుని అనుసరణము పరమకర్తవ్యము, పైగా పరమార్థదాయకము.

3) ఈసందర్భమున మహాకవి తులసీదాసు రామచరితమానసమున ఇట్లు పేర్కొనెను.

ఛం- ఉపదేసు యహు జేహిఁ తాత తుమ్హరే రామ సియ సుఖ పావహీఁ। పితు మాతు ప్రియ పరివార పుర సుఖ సురతి బన బిసరావహీఁ॥
తులసీ ప్రభుహి సిఖ దేఇ ఆయసు దీన్హ పుని ఆసిష దఈ। రతి హోఉ అబిరల అమల సియ రఘుబీర పద నిత నిత నఈ॥

నాయనా! నీవు తోడుగా ఉండుటవలన సీతారాములు సుఖముగా ఉండవలెను. వారు తల్లిదండ్రులను, ప్రియపరివారమును, నగరసుఖములను మఱచిపోవలెను. ఇదియే నా ఉపదేశము." తులసీదాసు చెప్పుచున్నారు ఈ విధముగా సుమిత్రాదేవి మన లక్ష్మణస్వామికి ఉపదేశించి, వనవాసగమనమునకు అతనిని అనుమతించెను. "శ్రీ సీతారాములచరణములపై నీ విశుద్ధ ప్రగాఢప్రేమ నిత్యనూతనముగా ఉండుగాక" అని దీవించెను. అయోధ్యాకాండము - దోహా.75 లో భాగముగ ఛంద్.

ఇదం హి వృత్త ముచితం కులస్యాస్య సనాతనమ్।
దానం దీక్షా చ యజ్ఞేషు తనుత్యాగో మృధేషు చ। 7

దీక్షవహించి యజ్ఞములను ఆచరించుట, త్యాగబుద్ధితో దానధర్మములను ఒనర్చుట, స్వామికొఱకై ప్రాణములకు తెగించి యుద్ధముచేయుట అనునవి పరంపరగా మనవంశమున సాగి వచ్చుచున్న ఉత్తమ సంప్రదాయములు." (7)

లక్ష్మణం త్వేవ ముక్త్వా సా సంసిద్ధం ప్రియరాఘవమ్।
సుమిత్రా గచ్ఛ గచ్ఛేతి పునః పునరువాచ తమ్। 8

శ్రీరామునియెడ అత్యంతభక్తి ప్రపత్తులుగల లక్ష్మణుడు ఆయనవెంట వనములకు వెళ్ళుటకు సర్వసన్నద్ధుడైయుండగా అతనితో సుమిత్రామాత "నీవు వనములకు తప్పక వెళ్ళుము" అని ప్రోత్సహించుచు మఱల నిట్లనెను. (8)

రామం దశరథం విద్ధి మాం విద్ధి జనకాత్మజామ్।
అయోధ్యామ్ అటవీం విద్ధి గచ్ఛ తాత! యథాసుఖమ్। 9

"నాయనా! లక్ష్మణా! శ్రీరాముని నీతండ్రియగు దశరథునిగా భావింపుము. సీతాదేవిని నన్నుగా (తల్లిగా) తలంపుము. అడవిని అయోధ్యగా భావింపుము. నీవు హాయిగ వెళ్ళిరమ్ము."[1] (9)

తతస్సుమంత్రః కాకుత్స్థం ప్రాంజలిర్వాక్యమబ్రవీత్।
వినీతో వినయజ్ఞశ్చ మాతలిర్వాసవం యథా। 10

నీతికోవిదుడైన సుమంత్రుడు శ్రీరామునిసమక్షమున అంజలి ఘటించినవాడై నిలిచి, దేవేంద్రునితో మాతలివలె సవినయముగా నిట్లనెను. (10)

రథమారోహ భద్రం తే రాజపుత్ర! మహాయశః।
క్షిప్రం త్వాం ప్రాపయిష్యామి యత్ర మాం రామ! వక్ష్యసి। 11

"సుప్రసిద్ధుడవైన ఓ రాజకుమారా! ఓ శ్రీరామా! నీకు జయమగు గాక. త్వరగా రథమును అధిరోహింపుము. నీయాజ్ఞానుసారము నిన్ను తగిన ప్రదేశమునకు చేర్చెదను. (11)

చతుర్దశ హి వర్షాణి వస్తవ్యాని వనే త్వయా।
తాన్యుపక్రమితవ్యాని యాని దేవ్యాసి చోదితః। 12

కైకేయీదేవి ప్రేరణమేరకు నీవు పదునాలుగు సంవత్సరముల కాలము వనవాసము చేయవలసియున్నది. కావున ఆ దీక్షను నేడే (ఇప్పటినుండియే) ప్రారంభించుట యుక్తము. (12)

తం రథం సూర్యసంకాశం సీతా హృష్టేన చేతసా।
ఆరురోహ వరారోహా కృత్వాలంకారమాత్మనః। 13

మిగుల సౌందర్యవతియైన సీతాదేవి వస్త్రాభరణములను ధరించి, సూర్యతేజస్సుతో సమానముగా వెలుగొందుచున్న ఆ మహారథమును అధిరోహించెను. (13)

అథో జ్వలనసంకాశం చామీకరవిభూషితమ్।
తమారురుహతుస్తూర్ణం భ్రాతరౌ రామలక్ష్మణౌ। 14

బంగారుతొడుగులతో అగ్నికాంతులను విరజిమ్ముచున్న ఆ రథమును సోదరులైన రామలక్ష్మణులు శీఘ్రముగా (వెంటనే) అధిరోహించిరి. (14)

వనవాసం హి సంఖ్యాయ వాసాంస్యాభరణాని చ।
భర్తారమనుగచ్ఛంత్యై సీతాయై శ్వశురో దదౌ। 15

భర్తను అనుసరించి వనములకు వెళ్ళుచున్న సీతాదేవి కొఱకు దశరథమహారాజు పదునాలుగు సంవత్సరములవఱకు సరిపోవునట్లుగా తగినన్ని వస్త్రములను, ఆభరణములను ఇచ్చి యుండెను. వాటిని సుమంత్రుడు రథముపై చేర్చెను. (15)

తథైవాయుధజాలాని భ్రాతృభ్యాం కవచాని చ।
రథోపస్థే ప్రతిన్యస్య సచర్మ కఠినం చ తత్। 16

అట్లే ఆ ఇరువురి సోదరులకొఱకై ఆయుధములను, కవచములను, డాళ్ళను, ఇనుపపలుగును, గంపను అతడు రథముపై వెనుకభాగమున ఉంచెను. (16)

సీతాతృతీయానారూఢాన్ దృష్ట్వా ధృష్టమచోదయత్।
సుమంత్రః సమ్మతానశ్వాన్ వాయువేగసమాన్ జవే। 17

సీతారామలక్ష్మణులు రథమును ఎక్కిన పిమ్మట సుమంత్రుడు ప్రజలు దారి ఇచ్చునట్లు వారిని హెచ్చరించుచు వాయువేగముతో సాగిపోగల ఆ ఉత్తమాశ్వములను చకచక తోలెను. (17)

1) దశము=పక్షి, రథము=వాహనము, పక్షి (గరుత్మంతుడు) వాహనముగాగలవాడు శ్రీ మహావిష్ణువు, శ్రీరాముడు, దశరథుడు అనగా శ్రీమహావిష్ణువు - అని యెఱుంగుము.
మా = లక్ష్మీదేవి, తల్లి- సీతాదేవి సాక్షాత్తుగా ఆ లక్ష్మీదేవియేయని తెలిసికొనుము.
అయోధ్య=దేవతలకుగాని, రాక్షసులకుగాని, ఎట్టివారికిని జయింపశక్యము గానిది- అనగా అది 'అపరాజిత' అను పేరు గల వైకుంఠమే. కనుక శ్రీరామునిపాదస్పర్శతో పవిత్రమగు ఆఅడవిని అయోధ్యనుగా (వైకుంఠముగా) భావింపుము.

ప్రతియాతే మహారణ్యం చిరరాత్రాయ రాఘవే।
బభూవ నగరే మూర్ఛా బలమూర్ఛా జనస్య చ। 18

శ్రీరాముడు దీర్ఘకాలవనవాసమునకై బయలుదేఱగా నగరము నందలి స్త్రీలు, పురుషులు, బాలబాలికలు, వృద్ధులు అందఱును మిక్కిలి దుఃఖముతో మూర్ఛిల్లిరి. పట్టాభిషేకోత్సవమును చూడ వచ్చిన జానపదులెల్లరును స్పృహదప్పిరి. అశ్వగజాదిబలములును మూర్ఛిల్లినవి. (18)

తత్సమాకులసంభ్రాంతం మత్తసంకుపితద్విపమ్।
హయశింజితనిర్ఘోషం పురమాసీన్మహాస్వనమ్। 19

అప్పుడు ఆ పురమంతయు కోపముతో రెచ్చిపోయిన మదపుటేనుగులఘీంకారములతోడను, పరితాపముతో ఇటునటు సంచరించుచున్న గుఱ్ఱములసకిలింపులతోడను, వాటిభూషణముల రవములతోడను మాఱుమ్రోగెను. ఈవిధముగా పురమునందలి కోలాహలప్రభావమున అచటిజనులమనస్సులకు దిక్కుతోచని స్థితి యేర్పడెను, చెవులు దిమ్మెక్కెను. (19)

తతస్సబాలవృద్ధా సా పురీ పరమపీడితా।
రామమేవాభిదుద్రావ ఘర్మార్తా సలిలం యథా। 20

గ్రీష్మతాపమునకు దప్పిగొన్నవారు నీటికై పరుగెత్తినట్లు నగరమునందలి ఆబాలగోపాలము రామవిరహదుఃఖభారముచే శ్రీరామునిరథమువెంట పరుగులుదీసిరి. (20)

పార్శ్వతః పృష్ఠతశ్చాపి లంబమానా సదున్ముఖాః।
బాష్పపూర్ణముఖాః సర్వే తమూచుః భృశనిస్వనాః। 21

ఆ పౌరులలో కొందఱు శ్రీరామునిరథమునకు ఇరుప్రక్కలను, వెనుకభాగమునను వ్రేలాడసాగిరి. వారు కన్నీరు మున్నీరుగా విలపించుచు ముఖములను పైకెత్తి సూతునితో బిగ్గఱగా ఇట్లనిరి. (21)

సంయచ్ఛ వాజినాం రశ్మీన్ సూత! యాహి శనైశ్శనైః।
ముఖం ద్రక్ష్యామ రామస్య దుర్దర్శం నో భవిష్యతి। 22

"ఓ రథసారథీ! గుఱ్ఱముల కళ్లెములను కొంచెములాగిపట్టుము. రథమును మెల్లదిగా పోనిమ్ము. కనులార శ్రీరాముని దర్శింతుము. మరల ఆయనదర్శనభాగ్యము మాకు ఎప్పుడబ్బునో యేమో? (22)

ఆయసం హృదయం నూనం రామమాతురసంశయమ్।
యద్దేవగర్భప్రతిమే వనం యాతి న భిద్యతే। 23

నిస్సంశయముగా శ్రీరామునితల్లియైన కౌసల్యాదేవి హృదయము ఇనుమువలె కఠినమైనది. ఆమెది ఱాతిగుండె. ఏలనన దేవకుమారునివలె ముద్దులొలుకు కన్నకొడుకు అడవులపాలగుచున్నను అయ్యో! పాపము ఆమె హృదయము ముక్కలుకాలేదు గదా! (23)

కృతకృత్యా హి వైదేహీ ఛాయేవానుగతా పతిమ్।
న జహాతి రతా ధర్మే మేరుమ్ అర్కప్రభా యథా। 24

అహో! లక్ష్మణ! సిద్ధార్థః సతతం ప్రియవాదినమ్।
భ్రాతరం దేవసంకాశం యస్త్వం పరిచరిష్యసి। 25

మహత్యేషా హి తే సిద్ధిః ఏషచాభ్యుదయో మహాన్।
ఏష స్వర్గస్య మార్గశ్చ యదేనమనుగచ్ఛసి। 26

ధర్మనిరతురాలైన వైదేహి తనపతియైన శ్రీరాముని ఆయన నీడవలె అనుసరించుచున్నది. సూర్యకాంతి మేరుపర్వతమును వలె ఆమె తనరాముని వీడకున్నది. నిజముగా ఆమె కృతార్థురాలు. లక్ష్మణా! యథార్థముగా నీవు ధన్యుడవు. ప్రియభాషియు, దైవతుల్యుడును ఐన అన్నను నిరంతరము సేవించు భాగ్యము నీకు అబ్బినది. నీవు శ్రీరామునిననుసరించి వెళ్లుట నిజముగా పెక్కు జన్మలలో చేసికొనిన పుణ్యములఫలము. ఇది ఒక గొప్పఅదృష్టము. మోక్షప్రాప్తికి మార్గము". (24-26)

ఏవం వదన్త స్తే సోఢుం న శేకుర్బాష్పమాగతమ్।
నరాస్తమనుగచ్ఛంతః ప్రియమిక్ష్వాకునందనమ్। 27

ఈ విధముగా పలుకుచు ఆ పౌరులు తమకు ప్రాణతుల్యుడైన ఆ ఇక్ష్వాకుప్రభువును (శ్రీరాముని) అనుసరించుచునేయుండిరి, కాని వారు సంతతధారగా ప్రవహించుచున్న తమదుఃఖాశ్రువులను మాత్రము ఆపుకొనలేకుండిరి. (27)

అథ రాజా వృతః స్త్రీభిః దీనాభిర్దీనచేతనః।
నిర్జగామ ప్రియం పుత్రం ద్రక్ష్యామీతి బ్రువన్ గృహాత్। 28

అంతట స్త్రీలు దైన్యముతో చుట్టును చేరియుండగా, దీనుడై పడియున్న మహారాజు 'నా కన్నతండ్రి శ్రీరాముని చూచెదను' అని పల్కుచు భవనమునుండి బయటికి వచ్చెను. (28)

శుశ్రువే చాగ్రతః స్త్రీణాం రుదంతీనాం మహాస్వనః।
యథా నాదః కరేణూనాం బద్ధే మహతి కుంజరే। 29

బంధింపబడిన ఒక మహాగజము ఆడుఏనుగులవిలాపమును వలె ఆ మహారాజు తనయెదుట జేరి ఏడ్చుచున్న స్త్రీలరోదన ధ్వనులను వినెను. (29)

పితా హి రాజా కాకుత్స్థః శ్రీమాన్ సన్నస్తదాఽభవత్।
పరిపూర్ణః శశీ కాలే గ్రహేణోపప్లుతో యథా। 30

శ్రీరామునకు తండ్రియు, కకుత్స్థవంశజుడును ఐన దశరథ మహారాజు సహజముగా తేజస్వియేయైనను దుఃఖగ్రస్తుడై యున్నందున గ్రహణకాలమున రాహుగ్రస్తుడైన నిండుచంద్రుని వలె అప్పుడు తేజోవిహీనుడైయుండెను. (30)

స చ శ్రీమానచింత్యాత్మా రామో దశరథాత్మజః।
సూతం సంచోదయామాస త్వరితం వాహ్యతామితి। 31

శుభలక్షణసంపన్నుడును, దశరథునికుమారుడును ఐన శ్రీరాముడు అసమానధైర్యశాలియయ్యును దూరమునుండియే తండ్రిదైన్యమును గమనించి, 'రథమును త్వరగా పోనిమ్ము' అని సూతుని తొందరపెట్టసాగెను. (31)

రామో యాహీతి తం సూతం తిష్ఠేతి స జనస్తదా।
ఉభయం నాశకత్ సూతః కర్తుమధ్వని చోదితః। 32

ఒక ప్రక్కన శ్రీరాముడు 'రథమును త్వరగా నడుపుము', అనియు, మఱియొక ప్రక్కన ప్రజలు 'రథమును ఆపుమాపుము'- అనియును సూతుని ఒత్తిడిచేయుచుండగా-రథసారథియైన సుమంత్రుడు – అప్పుడు ఎవరిమాటను పాటింపవలెనో తెలియక ఊగిసలాటకు లోనయ్యెను. (32)

నిర్గచ్ఛతి మహాబాహౌ రామే పౌరజనాశ్రుభిః।
పతితైః అభ్యవహితం ప్రశశామ మహీరజః। 33

మహాబాహువైన శ్రీరాముడు ముందునకు సాగిపోవుచుండుటచే పౌరులు తమదుఃఖాశ్రువులను ఆపుకొనలేకుండిరి. రథచక్రముల తాకిడికి చెలరేగినదుమ్ములు ప్రజలకన్నీటిప్రవాహములకు తడిసి, అణగిపోవుచుండెను. (33)

రుదితాశ్రుపరిద్యూనం హాహాకృతమచేతనమ్।
ప్రయాణే రాఘవస్యాసీత్ పురం పరమపీడితమ్। 34

సుస్రావ నయనైః స్త్రీణామ్ అస్రమాయాససంభవమ్।
మీనసంక్షోభచలితైః సలిలం పంకజైరివ। 35

శ్రీరామునివనప్రస్థానకారణముగా పురప్రజలెల్లరును మిక్కిలి పరితాపమునకు లోనైరి. హాహాకారములతో వారు అచేతనులైరి. వారికన్నీటిజలముచే ఆ నగరమంతయు తడిసిపోయెను. సరస్సులలోని చేపలగంతులతో బాగుగా కదలిన కమలముల నుండి జాలువారుచున్న నీటిబిందువులవలె స్త్రీలనయనముల నుండి దుఃఖాశ్రువులు స్రవించుచుండెను. (34-35)

దృష్ట్వా తు నృపతిః శ్రీమాన్ ఏకచిత్తగతం పురమ్।
నిపపాతైవ దుఃఖేన హతమూల ఇవ ద్రుమః। 36

పురజనులందఱును ఒక్కుమ్మడిగా వ్యాకులచిత్తులగుట గాంచి దశరథమహారాజు దుఃఖాయాసముతో స్పృహదప్పి మొదలునఱికిన చెట్టువలె నేలపై కూలిపోయెను. (36)

తతో హలహలాశబ్దో జజ్ఞే రామస్య పృష్ఠతః।
నరాణాం ప్రేక్ష్య రాజానం సీదంతం భృశదుఃఖితమ్। 37

దుర్భరదుఃఖముతో కృశించియున్న మహారాజునుగాంచి, శ్రీరాముని రథమునకు వెనుకభాగమునగల ప్రజలెల్లరును హాహాకారములు చేసిరి. (37)

హా రామేతి జనాః కేచిత్ రామమాతేతి చాపరే।
అంతఃపురం సమృద్ధం చ క్రోశంతః పర్యదేవయన్। 38

అచటచేరియున్న జనులలో కొందఱు 'అయ్యో!రామా!' అనియును, మఱికొందఱు 'అయ్యో! కౌసల్యాదేవీ! అనియును గుండెలను బాదుకొనుచు ఏడ్చిరి. అంతఃపురజనులును ఆక్రందనలు చేసిరి. (38)

అన్వీక్షమాణో రామస్తు విషణ్ణం భ్రాంతచేతసమ్।
రాజానం మాతరం చైవ దదర్శానుగతా పథి। 39

రథముపై వెళ్లుచున్న శ్రీరాముడు ఒక్కసారి వెనుదిరిగి చూచెను. అప్పుడు విషాదవదనులై, భ్రాంతచిత్తులై తనవైపునకు వచ్చుచున్న తల్లియు, తండ్రియు ఆయనకు కనబడిరి. (39)

స బద్ధ ఇవ పాశేన కిశోరో మాతరం యథా।
ధర్మపాశేన సంక్షిప్తః ప్రకాశం నాభ్యుదైక్షత॥ 40

పదాతినౌ చ యానార్హౌ అదుఃఖార్హౌ సుఖోచితౌ।
దృష్ట్వా సంచోదయామాస శీఘ్రం యాహీతి సారథిమ్॥ 41

న హి తత్పురుషవ్యాఘ్రో దుఃఖదం దర్శనం పితుః।
మాతుశ్చ సహితుం శక్తః తోత్త్రార్దిత ఇవ ద్విపః॥ 42

ప్రత్యగారమివాయాంతీ వత్సలా వత్సకారణాత్।
బద్ధవత్సా యథా ధేనూ రామమాతాఽభ్యధావత॥ 43

తథా రుదంతీం కౌసల్యాం రథం తమనుధావతీమ్।
క్రోశంతీం రామ రామేతి హా సీతే! లక్ష్మణేతిచ॥ 44

రామలక్ష్మణసీతార్థం స్రవంతీం వారి నేత్రజమ్।
అసకృత్ ప్రైక్షత స తాం నృత్యంతీమివ మాతరమ్॥ 45

తిష్ఠేతి రాజా చుక్రోశ యాహి యాహీతి రాఘవః।
సుమంత్రస్య బభూవాత్మా చక్రయోరివ చాంతరా॥ 46

నాశ్రౌషమితి రాజానమ్ ఉపాలబ్ధోఽపి వక్ష్యసి।
చిరం దుఃఖస్య పాపిష్ఠమ్ ఇతి రామః తమబ్రవీత్॥ 47

రామస్య స వచః కుర్వన్ అనుజ్ఞాప్య చ తం జనమ్।
వ్రజతోఽపి హయాన్ శీఘ్రం చోదయామాస సారథిః॥ 48

న్యవర్తత జనో రాజ్ఞో రామం కృత్వా ప్రదక్షిణమ్।
మనసాప్యశ్రువేగైశ్చ న న్యవర్తత మానుషమ్॥ 49

యమిచ్ఛేత్ పునరాయాంతం నైనం దూరమనువ్రజేత్।
ఇత్యమాత్యా మహారాజమ్ ఊచుర్దశరథం వచః॥ 50

త్రాడుచే కట్టబడిన గుఱ్ఱపుపిల్ల తనతల్లిని చూడలేనట్లు ధర్మపాశబద్ధుడైన శ్రీరాముడు దుఃఖవివశులైయున్న తనతల్లిదండ్రులను సూటిగా చూడలేకపోయెను. ఎల్లప్పుడును సుఖములనే తప్ప దుఃఖములనుమాటనే ఎఱుగనివారును, సర్వదా వాహనములపై సంచరించెడివారును ఐన తనమాతాపితరులు నేలపైనడచివచ్చు చుండగా జూచి, శ్రీరాముడు 'రథమును త్వరగా నడుపుము' అని సారథిని తొందరపెట్టెను. (40-41)

అంకుశముచే పొడవబడుచున్న ఏనుగువలె నరోత్తముడైన శ్రీరాముడు తల్లిదండ్రుల దుర్భరదుఃఖమును జూచి తట్టుకొనలేక పోయెను. (42)

లేగదూడపై మరులుగొని, ఇంటిముఖముపట్టిన పాడియావు కట్టివేయబడియున్న తనదూడను జూచి పరుగులుదీసినట్లు రామజనని (కౌసల్యాదేవి) తన అనుంగుపట్టిని జూచుటకై పరుగెత్తెను. (43)

అట్లు విలపించుచు రథమువెంట పరుగిడుచున్న కౌసల్యాదేవి 'హా! రామా! హా! సీతా! హా! లక్ష్మణా!' -అని ఆక్రోశింపసాగెను. ఆమె సీతారామలక్ష్మణులనిమిత్తమై కన్నీరుగార్చుచు నాట్యము చేయు చున్నదా? యనునట్లు ఇటునటు పోవుచుండెను. అట్టి స్థితిలోనున్న తనతల్లిని శ్రీరాముడు పరికించి, పరికించి చూచెను. (44-45)

'ఆగుమాగుము' అని దశరథమహారాజు గట్టిగా అరుచుచుండెను. 'పోనిమ్ము, పోనిమ్ము' అనుచు శ్రీరాముడు ఎంతయు తొందర పెట్టుచుండెను. అప్పుడు సుమంత్రునిమనస్సు రథముయొక్క ముందు వెనుక చక్రముల మధ్య చిక్కుపడిన పురుషునివలె సంకట స్థితికి లోనయ్యెను. అంతట శ్రీరాముడు ఆ సుమంత్రునితో "నీవు తిరిగి రాజుకడకు వచ్చినప్పుడు- 'నామాటను ఎందులకు పాటింపలేదు'- అని రాజు అడిగినచో - నేను వినలేదు'-[1] అని చెప్పవచ్చును- ఏలనన 'ఇట్టి దుఃఖస్థితిలోనున్నవారిని ఎక్కువకాలము ఓదార్చుటకు ఇది సమయముగాదు'. అని పలికెను. (46-47)

పిమ్మట సుమంత్రుడు శ్రీరామునిఆజ్ఞను పాటించుచు, వెంట వచ్చుచున్న జనులను సమ్మతింపజేసి, గుఱ్ఱములను ఇంకను వేగముగా తోలెను. (48)

దశరథునిఅంతఃపురజనులు మనస్సునందే శ్రీరామునకు ప్రదక్షిణనమస్కారములను ఒనర్చి, ఎట్టకేలకు మరలిరి. కాని వారు రామునియందు లగ్నమైన తమమనస్సులను ఏమాత్రము మరల్చుకొనలేకపోయిరి. వారు అశ్రుధారలను సైతము ఆపుకొనలేక పోయిరి. (49)

రాజోచితకర్తవ్యములను, శాస్త్రమర్యాదలను బాగుగా ఎఱిగిన మంత్రులు "మహారాజా! ఆత్మీయులు తిరిగి మనలను చేరవలయునని కోరుకొందుము- అట్టివారిని ఎక్కువ దూరము అనుసరింపరాదు గదా!" అని దశరథునకు విన్నవించిరి. (50)

1) నేను వినలేదు = నిజమే నేను (మీ ఆజ్ఞను) పాటింపలేదు.

తేషాం వచః సర్వగుణోపపన్నం
ప్రస్విన్నగాత్రః ప్రవిషణ్ణరూపః ।
నిశమ్య రాజా కృపణః సభార్యో
వ్యవస్థితస్తం సుతమీక్షమాణః ॥ 51

అప్పుడు దశరథునిశరీరము చెమర్చియుండెను. అతని శరీరమంతయు మిక్కిలి వాడిపోయియుండెను. సందర్భమునకు అనువుగా మంత్రులమాటలను విని, అత్యంత దీనావస్థలోనున్న ఆ మహారాజు రాణులతోగూడి తనపుత్రునివైపే చూచుచు అచటనే నిలబడిపోయెను. (51)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చత్వారింశస్సర్గః (40)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదియవసర్గము సమాప్తము

-- * * * --

41. నలుబదియొకటవసర్గము

శ్రీరాముని వనగమనమునకు మిగుల దిగులుపడి, అయోధ్యానగరమంతయును ఆర్తనాదములతో నిండిపోవుట.

తస్మింస్తు పురుషవ్యాఘ్రే వినిర్యాతి కృతాంజలౌ ।
ఆర్తశబ్దో హి సంజజ్ఞే స్త్రీణామంతఃపురే మహాన్ ॥ 1

పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముడు అంతఃపురమునకు వెలుపల చేరియున్న తల్లులకును, తండ్రికిని నమస్కరించి వెళ్లిన పిమ్మట దశరథునితో వచ్చియున్న అంతఃపురస్త్రీలయొక్క తీవ్రములైన ఆర్తనాదములు మిన్నుముట్టెను. (1)

అనాథస్య జనస్యాస్య దుర్బలస్య తపస్వినః ।
యో గతిః శరణం చాసీత్ స నాథః క్వను గచ్ఛతి ॥ 2

శ్రీరాముడు దిక్కులేనివారికి దిక్కైనవాడు. బలహీనులకు అండయైన వాడు, దుఃఖార్తుల కన్నీటిని తుడుచువాడు. మా అందరికిని సర్వవిధములుగా రక్షకుడు అట్టి ఆ ప్రభువు ఎక్కడికి పోవుచున్నాడో గదా! అని వారు ఏడ్చుచు పలుకసాగిరి. (2)

న క్రుధ్యత్యభిశప్తోఽపి క్రోధనీయాని వర్జయన్ ।
క్రుద్ధాన్ ప్రసాదయన్ సర్వాన్ సమదుఃఖః క్వ గచ్ఛతి ॥ 3

కౌసల్యాయాం మహాతేజా యథా మాతరి వర్తతే ।
తథా యో వర్తతేఽస్మాసు మహాత్మా క్వ ను గచ్ఛతి ॥ 4

కైకేయ్యా క్లిశ్యమానేన రాజ్ఞా సంచోదితో వనమ్ ।
పరిత్రాతా జనస్యాస్య జగతః క్వ ను గచ్ఛతి ॥ 5

శ్రీరాముడు తనను ఎవరు ఎంతగా నిందించినను వారియెడ రవ్వంతయు కోపమును వహింపడు, ఇతరులకు కోపము కలుగునట్లు ఎన్నడును మాట్లాడడు, తనమీద కుపితులైనవారినందరిని ప్రసన్నులను గావించుచుండును, ఇతరుల దుఃఖములలో తానును పాలుపంచుకొనుచుండును. అట్టి మా శ్రీరాముడు ఎచ్చటికి వెళ్లుచున్నాడు? తేజశ్శాలియైన ఆ మహాత్ముడు తనకన్నతల్లియగు కౌసల్యాదేవిని వలెనే మమ్ములను ప్రేమాదరములతో గౌరవించుచుండెడివాడు. అట్టి మా రామప్రభువు వెళ్లుట ఎక్కడికి? కైకేయి కారణముగా క్లిష్టపరిస్థితులలో చిక్కుపడిన మహారాజు ఈ లోకమునందలి ప్రజలందరికిని ఆర్తత్రాణపరాయణుడైన శ్రీరాముని అడవులపాలు గావించెను. ఇప్పుడు ఆ స్వామి ప్రయాణము ఎక్కడికి? (3-5)

అహో! నిశ్చేతనో రాజా జీవలోకస్య సంప్రియమ్ ।
ధర్మ్యం సత్యవ్రతం రామం వనవాసే ప్రవత్స్యతి ॥ 6

ఇతి సర్వా మహిష్యస్తా వివత్సా ఇవ ధేనవః ।
రురుదుశ్చైవ దుఃఖార్తాః సస్వరం చ విచుక్రుశుః ॥ 7

శ్రీరామచంద్రుడు సమస్తప్రాణులకును ప్రీతిని గూర్చువాడు. ధర్మాత్ముడు, సత్యవ్రతమును పాటించువాడు, అట్టి రామప్రభువును మహారాజు మతితప్పినవాడై వనవాసనిమిత్తముగా మనకు దూరము చేయుచున్నాడు." అని ఆ రాజపత్నులందరును లేగదూడలకు దూరమైన గోవులవలె దుఃఖముచే కుమిలిపోవుచు ఏడ్చిరి, బిగ్గరగా పెడబొబ్బలు పెట్టిరి. (6-7)

స తమంతఃపురే ఘోరమ్ ఆర్తశబ్దం మహీపతిః ।
పుత్రశోకాభిసంతప్తః శ్రుత్వా చాసీత్ సుదుఃఖితః ॥ 8

పుత్రునియెడబాటునకు మిగుల విలవిలలాడుచున్న మహారాజు అంతఃపురమున చెలరేగిన భయంకరమైన ఆ ఆర్తధ్వనులను విని, ఇంకను దుఃఖముతో క్రుంగిపోయెను. (8)

నాగ్నిహోత్రాణ్యహూయంత నాపచన్ గృహమేధినః।
అకుర్వన్నప్రజాః కార్యం సూర్యశ్చాంతరధీయత। 9

వ్యసృజన్ కబళాన్ నాగా గావో వత్సాన్ న పాయయన్।
పుత్త్రం ప్రథమజం లబ్ధ్వా జననీ నాభ్యనందత। 10

త్రిశంకుర్లోహితాంగశ్చ బృహస్పతిబుధావపి।
దారుణాః సోమమభ్యేత్య గ్రహాస్సర్వే వ్యవస్థితాః। 11

నక్షత్రాణి గతార్చీంషి గ్రహాశ్చ గతతేజసః।
విశాఖాస్తు సధూమాశ్చ నభసి ప్రచకాశిరే। 12

కాళికానిలవేగేన మహోదధిరివోత్థితః।
రామే వనం ప్రవ్రజితే నగరం ప్రచచాల తత్। 13

దిశః పర్యాకులాః సర్వాః తిమిరేణేవ సంవృతాః।
న గ్రహో నాపి నక్షత్రం ప్రచకాశే న కించన। 14

అకస్మాన్నాగరస్సర్వో జనో దైన్యముపాగమత్।
ఆహారే వా విహారే వా న కశ్చిదకరోన్మనః। 15

శోకపర్యాయసంతప్తః సతతం దీర్ఘముచ్ఛ్వసన్।
అయోధ్యాయాం జనస్సర్వః శుశోచ జగతీపతిమ్। 16

బాష్పపర్యాకులముఖో రాజమార్గగతో జనః।
న హృష్టో లక్ష్యతే కశ్చిత్ సర్వః శోకపరాయణః। 17

న వాతి పవనశ్శీతో న శశీ సౌమ్యదర్శనః।
న సూర్యస్తపతే లోకం సర్వం పర్యాకులం జగత్। 18

అనర్థినస్సుతాః స్త్రీణాం భర్తారో భ్రాతరస్తథా।
సర్వే సర్వం పరిత్యజ్య రామమేవాన్వచింతయన్। 19

పురమంతయు రామవిరహబాధకు లోనైయుండుటచే పౌరుల నిత్యకార్యకలాపములన్నియును ఒక్కసారిగా స్తంభించిపోయినవి. నిత్యాగ్నిహోత్రులు (నిత్యము నిష్ఠతో హోమకార్యములను ఆచరించువారు) అగ్నికార్యములకు దిగలేదు. గృహస్థులఇండ్లలోని మహిళలు పొయ్యిలు వెలిగింపలేదు. చేతులాడకపోవుటచే ప్రజలు నిశ్చేష్టులైయుండిరి. వేయేల? లోకమునకు వెలుగులను విరజిమ్మెడి ఆ సూర్యుడే ఈ బాధకు తట్టుకొనలేక వెలవెలబోవుచు అస్తంగతుడయ్యెను. ఏనుగులు తాము తినబోవుచున్న ఆహారమును నేలకు జార్చినవి. పాడియావులు తమలేగలఆకలిమాటనే మఱచి, వాటికి పాలిచ్చుట మానివేసెను. తొలికాన్పునందే పండంటి కొడుకును గన్న తల్లియు సంతోషమునకు నోచుకొనకుండెను. (9-10)

త్రిశంకువు, అంగారకుడు, బృహస్పతి, బుధుడు, ఇట్లే తక్కిన గ్రహములు అన్నియును (శుక్ర, శని, రాహుకేతువులు) వక్రగతిలో చంద్రునిజేరి, క్రూరులైరి. నక్షత్రములు తేజస్సును కోల్పోయెను. గ్రహములు కాంతితఱిగియుండెను. కోసలదేశనక్షత్రమైన విశాఖ పొగచే ఆవరింపబడి నిస్తేజమయ్యెను. (11-12)

రాముడు వనములకు వెళ్లినపిమ్మట ఆకాశమున మేఘములు క్రమ్ముకొని, పెను (హోరు) గాలులు తీవ్రముగా వీచుచున్నప్పుడు ఎగసిపడు అలలతోగూడిన సముద్రమువలె, అయోధ్యానగరమంతయు సంక్షోభమునకు గుఱియాయెను. (ప్రజలెల్లరును సంక్షోభమున మునిగిరి). (13)

అన్నిదిక్కులయందును చిమ్మచీకట్లు క్రమ్ముకొనగా, ప్రజలందఱును వ్యాకులపాటునకు లోనైరి. ఆదిత్యాదిగ్రహములును, అశ్విన్యాదినక్షత్రములును తేజోవిహీనములయ్యెను. (14)

అకస్మాత్తుగా పౌరులందఱిని దైన్యమావరించెను. పౌరులలో ఏ యొక్కరికిని ఆహారవిహారములమీదికి మనసే పోకుండెను. (15)

అయోధ్యలోని ప్రజలెల్లరును ఎడతెగని దుఃఖభారముతో నిరంతరము నిట్టూర్పులు విడుచుచు దశరథమహారాజుయొక్క దురవస్థను గూర్చియే దురపిల్లసాగిరి. (16)

రాజవీథులలోని జనులందఱును కన్నీరుమున్నీరుగా విలపించుచు, శోకముతో కుమిలిపోవుచుండిరి. ఒక్కరి ముఖమునందైనను సంతోషపు పొలకువయే లేకుండెను. (17)

గాలులు చల్లదనమును కోల్పోయెను. చంద్రుడు సౌమ్యలక్షణమునకు దూరమాయెను. సూర్యతాపము సన్నగిల్లెను. జగత్తంతయు క్షోభమున మునింగెను. (18)

పిల్లలు పాలు (తల్లిపాలు) త్రాగుటమానిరి. సతీపతులు అన్యోన్యసుఖానుభూతులమాట మఱచిరి. సోదరులు పరస్పరప్రేమానురాగముల ప్రసక్తి ప్రక్కన బెట్టిరి. అందఱును తమఅన్నింటిని వీడి, శ్రీరాముని ధ్యాసలోనే మునిగిపోయిరి. (19)

యే తు రామస్య సుహృదః సర్వే తే మూఢచేతసః।
శోకభారేణ చాక్రాంతాః శయనం న జహుస్తదా॥ 20

శ్రీరామునిమిత్రులందఱును మతులుపోయినవారై, శోకభారమున (దిగులుతో)మంచమువట్టిరి. వారికదలికలే ఆగిపోయెను. (20)

తత స్త్వయోధ్యా రహితా మహాత్మనా
పురందరేణేవ మహీ సపర్వతా।
చచాల ఘోరం భయశోకపీడితా
సనాగయోధాశ్వగణా ననాద చ॥ 21

మహాత్ముడైన శ్రీరాముడు లేకుండుటచే తీవ్రభయశోకములు అలముకొనగా అయోధ్య, ఇంద్రునిభయకారణముగా పర్వతములతో గూడిన భూమివలె ఎంతయు చలించెను. మఱియు అది యోధులరోదనధ్వనులతో, గజాశ్వములదుఃఖనాదములతో ప్రతిధ్వనించెను. (21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకచత్వారింశస్సర్గః (41)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదియొకటవసర్గము సమాప్తము

— * * * —

42. నలుబదిరెండవసర్గము

దుఃఖితుడైన దశరథుడు తనభవనమునకు చేరుట - అనంతరము అతడు కౌసల్యామందిరమున ప్రవేశించి, విలపించుట.

యావత్తు నిర్యతస్తస్య రజోరూపమదృశ్యత।
నైవేక్ష్వాకువరస్తావత్ సంజహారాత్మచక్షుషీ॥ 1

వనములకు జనుచున్న శ్రీరామునియొక్క రథచక్రముల వేగమునకు పైకెగిరినధూళి కనబడుచున్నంతవఱకును దశరథ మహారాజు ఆవైపునే వీక్షించుచు తనచూపులను మఱల్పకుండెను. (1)

యావద్రాజా ప్రియం పుత్రం పశ్యత్యత్యంతధార్మికమ్।
తావద్వ్యవర్ధతేవాస్య ధరణ్యాం పుత్రదర్శనే॥ 2

న పశ్యతి రజోఽప్యస్య యదా రామస్య భూమిపః।
తదాఽఽర్తశ్చ విషణ్ణశ్చ పపాత ధరణీతలే॥ 3

రథధూళినిగాంచుచు మహారాజు మిక్కిలి ధర్మాత్ముడైన తన అనుంగుపుత్త్రునే (శ్రీరామునే) చూచుచున్నట్లు తలంచుచు, మడమలెత్తి, భూమిమీద వ్రేళ్లపైనిలబడి ఆ వైపునకే నిక్కినిక్కి చూడసాగెను. ఆ ధూళిపైతము కనుచూపుమేరలో కనబడకుండపోవుటతో మహారాజు ఆర్తితో అలమటించుచు నేలపై పడిపోయెను. (2-3)

తస్య దక్షిణమన్వాగాత్ కౌసల్యా బాహుమంగనా।
వామం చాస్యాన్వగాత్ పార్శ్వం కైకేయీ భరతప్రియా॥ 4

అప్పుడు కౌసల్యాదేవి రాజును లేవనెత్తుటకై ఆయన కుడిభుజమును పట్టుకొనెను. భరతునితల్లియైన కైకేయియు సహాయపడుటకై వచ్చి, ఆయనయెడమ ప్రక్కకు చేరెను. (4)

తాం నయేన చ సంపన్నో ధర్మేణ వినయేన చ।
ఉవాచ రాజా కైకేయీం సమీక్ష్య వ్యథితేంద్రియః॥ 5

సహజముగా నీతివేత్తయు, ధర్మాత్ముడును, సదాచార సంపన్నుడును ఐన దశరథమహారాజు కైకేయిని చూచిన వెంటనే క్రుద్ధుడై, మండిపడుచు ఆమెతో ఇట్లు నుడివెను. (5)

కైకేయి! మా మమాంగాని స్ప్రాక్షీ స్త్వం దుష్టచారిణీ!।
న హి త్వాం ద్రష్టుమిచ్ఛామి న భార్యా న చ బాంధవీ॥ 6

యే చ త్వామనుజీవంతి నాహం తేషాం న తే మమ।
కేవలార్థపరాం హి త్వాం త్యక్తధర్మాం త్యజామ్యహమ్॥ 7

"ఓ కైకా! ఇక నన్ను తాకకుము. నాకు నీముఖమును చూపకుము. దుష్టురాలవైన నీవు నాభార్యవుగావు. కనీసము బంధువుగాడ కావు. అంతేగాదు నిన్ను ఆశ్రయించుకొని జీవించుచున్న వారికి నేను ప్రభువునుగాను, వారు నాకు పరిజనులూ గారు. నీవు కేవలము ధనాశతో (రాజ్యకాంక్షతో) ధర్మమును త్యజించితివి. కనుక అధర్మపరురాలవైన నిన్ను నేను త్యజించుచున్నాను. అగ్నిసాక్షిగా నిన్ను పెండ్లియాడితిని. నీతోగూడి అగ్నికి ప్రదక్షిణము

అగృహ్ణాం యచ్చ తే పాణిమ్ అగ్నిం పర్యణయం చ యత్।
అనుజానామి తత్సర్వమ్ అస్మిన్ లోకే పరత్ర చ। 8

భరత శ్చేత్ ప్రతీతః స్యాత్ రాజ్యం ప్రాప్యేదమవ్యయమ్।
యన్మే స దద్యాత్ పిత్రర్థం మాం మా తద్దత్తమాగమత్। 9

అథ రేణుసముధ్వస్తం సముత్థాప్య నరాధిపమ్।
న్యవర్తత తదా దేవీ కౌసల్యా శోకకర్శితా। 10

హత్వేవ బ్రాహ్మణం కామాత్ స్పృష్ట్వాగ్నిమివ పాణినా।
అన్వతప్యత ధర్మాత్మా పుత్రం సంచింత్య తాపసమ్। 11

నివృత్త్యైవ నివృత్త్యైవ సీదతో రథవర్త్మసు।
రాజ్ఞో నాతిబభౌ రూపం గ్రస్తస్యాంశుమతో యథా। 12

విలలాప చ దుఃఖార్తః ప్రియం పుత్రమనుస్మరన్।
నగరాంతమ్ అనుప్రాప్తం బుద్ధ్వా పుత్రమ్ అథాబ్రవీత్। 13

వాహనానాం చ ముఖ్యానాం వహతాం తం మహాత్మజమ్।
పదాని పథి దృశ్యంతే స మహాత్మా న దృశ్యతే। 14

యః సుఖేషూపధానేషు శేతే చందనరూషితః।
వీజ్యమానో మహార్హాభిః స్త్రీభిర్మమ సుతోత్తమః। 15

స నూనం క్వచిదేవాద్య వృక్షమూలముపాశ్రితః।
కాష్ఠం వా యది వాఽశ్మానమ్ ఉపధాయ శయిష్యతే। 16

ఉత్థాస్యతి చ మేదిన్యాః కృపణః పాంసుకుంఠితః।
వినిశ్శ్వసన్ ప్రస్రవణాత్ కరేణూనామివర్షభః। 17

ద్రక్ష్యంతి నూనం పురుషా దీర్ఘబాహుం వనేచరాః।
రామముత్థాయ గచ్ఛంతం లోకనాథమనాథవత్। 18

సా నూనం జనకస్యేష్టా సుతా సుఖసదోచితా।
కంటకాక్రమణాక్రాంతా వనమద్య గమిష్యతి। 19

చేసితిని. హద్దుమీఱిన నీ దుశ్చర్యలమూలముగా నేటినుండి నేను ఐహికముగా ఆముష్మికముగా నీతోగల ఆ బంధములన్నింటిని త్రెంచుకొనుచున్నాను. (6-8)

ఈ అఖండకోసలరాజ్యమునకు అధర్మమార్గమున అధిపతియై, భరతుడు సంతసించినచో నేను మృతిచెందిన తరువాత అతడు సమర్పించు పిండోదకములు నాకుచెందకుండుగాక". (9)

శోకమగ్నురాలైయున్న కౌసల్యాదేవి నేలపై దుమ్ముకొట్టుకొని పడియున్న మహారాజును లేవనెత్తి, ఆయనతోగూడి గృహోన్ముఖురాలయ్యెను. (10)

ధర్మాత్ముడైన ఆ దశరథుడు మునివేషధారియైన పుత్త్రుడగు శ్రీరాముని అనుక్షణము స్మరించుచు బుద్ధిపూర్వకముగా బ్రహ్మహత్య చేసినవానివలెను, నిప్పుకణములను చేతితో తాకినవానివలెను, పరితపించుచుండెను. (11)

గృహోన్ముఖుడైన మహారాజు మాటిమాటికిని వెనుకకు మఱలి (శ్రీరాముడువెళ్ళిన) రథమార్గములవైపు చూచుచు నిల్చుటచే ఆ నృపతియొక్క రూపము రాహుగ్రస్తమైన సూర్యబింబమువలె వన్నెతఱిగియుండెను. (అతడు తనబాధను ఎవ్వరికిని తెలుపుకొనలేకుండెను.) (12)

శోకాతురుడైన ఆ రాజు తనఅనుంగుపట్టిని అనవరతము స్మరించుచు కుమిలిపోవుచుండెను. శ్రీరాముడు నగరముయొక్క పొలిమేరలకు చేరినట్లు తెలియగా ఇట్లు పలికెను. (13)

"నాకుమారుని గొనిపోయిన రథాశ్వములజాడలు త్రోవలో కనబడుచున్నవిగాని ఆ మహాత్ముడు మాత్రము కనబడుటలేదు. ఇచట నా ముద్దులకుమారుడు మంచిగంధములను అలదుకొని, మెత్తని దిండ్లుగల హంసతూలికాతల్పములపై సుఖముగా శయనించుచుండెడివాడు. అప్పుడు చక్కని పరిచారికలు వింజామరలు వీచుచుండగా ఆయన హాయిని అనుభవించుచుండెడివాడు. ఇప్పుడతడు చెట్లనీడలను ఆశ్రయించి, ఒక మొద్దునో, ఱాతినో తలగడగా చేసికొని పండుకొనవలసియుండును. (14-16)

సెలయేటి సమీపమున (స్నానానంతరము దుమ్ముకొట్టుకొనియున్న) గజరాజువలె, నేలపై పండుకొనియుండుటచే దుమ్ముకొట్టుకొని, వన్నెతగ్గియున్న శ్రీరాముడు నిట్టూర్చుచు నిద్రనుండి లేచును. దీర్ఘబాహువు, జగత్ప్రభువు ఐన శ్రీరాముడు నిద్రలేచి ఒక దిక్కులేనివానివలె వెళ్ళుచుండగా వనములలో నివసించువారు చూచెదరు. ఇది నిశ్చయము. (17-18)

జనకుని గారాలబిడ్డయు, మిక్కిలి సుకుమారియు ఐన సీతాదేవి నిజముగా నేడు వనములలోని ముండ్లబాటలలో నడచుచున్నప్పుడు ఆమె వ్యథకుగుఱికావచ్చును. యథార్థముగా ఆమెకు అడవులు క్రొత్త. (అడవులలో ఆమెకాలుమోపియే యెఱుగదు)

అనభిజ్ఞా వనానాం సా నూనం భయముపైష్యతి।
శ్వాపదానర్దితం శ్రుత్వా గంభీరం రోమహర్షణమ్। 20

సకామా భవ కైకేయి! విధవా రాజ్యమావస।
న హి తం పురుషవ్యాఘ్రం వినా జీవితుముత్సహే। 21

ఇత్యేవం విలపన్ రాజా జనౌఘే నాభిసంవృతః।
అపస్నాతఇవారిష్టం ప్రవివేశ పురోత్తమమ్। 22

శూన్యచత్వరవేశ్మాంతాం సంవృతాపణదేవతామ్।
క్లాంతదుర్బలదుఃఖార్తాం నాత్యాకీర్ణమహాపథామ్। 23

తామవేక్ష్య పురీం సర్వాం రామమేవానుచింతయన్।
విలపన్ ప్రావిశద్రాజా గృహం సూర్య ఇవాంబుదమ్। 24

మహాహ్రదమివాక్షోభ్యం సుపర్ణేన హృతోరగమ్।
రామేణ రహితం వేశ్మ వైదేహ్యా లక్ష్మణేన చ। 25

అథ గద్గదశబ్దస్తు విలపన్ మనుజాధిపః।
ఉవాచ మృదుమందార్థం వచనం దీనమస్వరమ్। 26

కౌసల్యాయా గృహం శీఘ్రం రామమాతుర్నయంతు మామ్।
న హ్యన్యత్ర మమాశ్వాసో హృదయస్య భవిష్యతి। 27

ఇతి బ్రువంతం రాజానమ్ అనయన్ ద్వారదర్శినః।
కౌసల్యాయా గృహం తత్ర న్యవేశ్యత వినీతవత్। 28

తతస్తస్య ప్రవిష్టస్య కౌసల్యాయా నివేశనమ్।
అధిరుహ్యాపి శయనం బభూవ లులితం మనః। 29

పుత్రద్వయవిహీనం చ స్నుషయాపి వివర్జితమ్।
అపశ్యద్భవనం రాజా నష్టచంద్రమివాంబరమ్। 30

తచ్చ దృష్ట్వా మహారాజో భుజముద్యమ్య వీర్యవాన్।
ఉచ్చైః స్వరేణ చుక్రోశ హా! రాఘవ! జహాసి మామ్। 31

హఠాత్తుగా గగుర్పాటును గల్గించెడి పెద్దపులులగాండ్రింపులు మొదలగు దుష్టమృగముల అరపులకు ఆమె భయకంపిత యగుచుండును. (19-20)

ఓ కైకేయీ! పురుషశ్రేష్ఠుడైన నా రాముడు లేకుండా నేను జీవించియుండజాలను (నా మరణము తథ్యము) అప్పుడు నీ కోరికలు అన్నియును ఈడేరును. ఈ రాజ్యమున నీవు విధవవై పడియుండుము." (21)

జనులతోగూడి గృహోన్ముఖుడై వచ్చుచున్న ఆ దశరథుడు ఈ విధముగా విలపించుచు మృతస్నాతుడైనవాడు అపవిత్ర గృహమునప్రవేశించినట్లు, (దుఃఖ మగ్నుడైయున్నవాడు అశాంతి మందిరమున ప్రవేశించునట్లు)ఆ అయోధ్యలో అడుగిడెను.(22)

ప్రజలెల్లరును శ్రీరాముని వెంటవెళ్లియుండుటచే అయోధ్యలోని వీధులకూడలులు, ఇండ్లముంగిళ్లు, లోగిళ్లు (ఇంటిలోపలి భాగములు) శూన్యములైయుండెను. అంగళ్లు, దేవాలయములు మూయబడియుండెను. ఇండ్లలో మిగిలియున్న దుర్బలులైన వృద్ధులు, బాలబాలికలు దుఃఖార్తులైయుండిరి. రాజవీధులలో అక్కడక్కడ ఒకరిద్దరు తప్ప జనసంచారమేలేకుండెను. దశరథుడు అట్టి అయోధ్యానగరమును వీక్షించుచు, విలపించుచు సూర్యుడు మబ్బులలో చేరినట్లు తనమందిరమున ప్రవేశించెను. (23-24)

సీతారామలక్ష్మణులు లేని ఆ రాజభవనము గరుత్మంతుడు సర్పములను తీసికొని పోగా మిగిలియున్న నిశ్చలమైన సరస్సువలె ఒప్పుచుండెను. (25)

గద్గదికతో (తడబడుమాటలతో) విలపించుచున్న ఆ మహారాజు మృదువుగా, అస్పష్టముగా పెదవులను మాత్రమే కదల్చుచు దీనముగా అచటి ద్వారపాలకులతో ఇట్లనెను. (26)

"రామజననియైన కౌసల్యయొక్క మందిరమునకు నన్ను గొనిపొండు. మఱియొకచోట ఎక్కడనూ నా మనసునకు ఊరట లభింపదు. (వేఱొకచోట నామనస్సుకుదుటబడదు.)" (27)

మహారాజు ఇట్లు పలికినంతనే ద్వారపాలకులు ఆ ప్రభువును కౌసల్యాదేవిమందిరమునకు చేర్చి, వినయపూర్వకముగా ఆయనను అచట పరుండబెట్టిరి. కౌసల్యాభవనమునకు చేరి, తల్పముపై శయనించియున్నను ఆ మహారాజుమనస్సు ప్రశాంతికి నోచుకొనలేదు. (28-29)

కుమారులు రామలక్ష్మణులును, కోడలు సీతయు లేని ఆ భవనము దశరథమహారాజునకు చంద్రుడు, నక్షత్రములు లేని ఆకాశమువలె కన్పట్టెను. (చంద్రుడు చుక్కలు లేని చీకటి రాత్రిగా తోచెను.) పరాక్రమశాలియైన మహారాజు నిస్తేజమై తోచుచున్న ఆ భవనమును జూచి, చేతులుచాచి నాయనా! రామా! మాతాపితరులను (నన్ను, కౌసల్యను) విడిచిపెట్టి వెళ్లితివా? (మరల నీదర్శన భాగ్యమెప్పుడో? ఏమో?) అని బిగ్గరగా

సుఖితా బత తం కాలం జీవిష్యంతి నరోత్తమాః।
పరిష్వజంతో యే రామం ద్రక్ష్యంతి పునరాగతమ్॥ 32

వాపోయెను. శ్రీరాముడు తనవనవాసమును ముగించుకొని వచ్చెడి వఱకు ఈ పదునాలుగు సంవత్సరములకాలము జీవించి యుండి, ఆయనను దర్శించువారిభాగ్యమే భాగ్యము. ఆయన ఆలింగనసుఖములను పొందెడివారిఅదృష్టమే అదృష్టము. నాకు ఆయోగము ఉన్నదో లేదో? (30-32)

అథ రాత్ర్యాం ప్రపన్నాయాం కాలరాత్ర్యామివాత్మనః।
అర్ధరాత్రే దశరథః కౌసల్యామిదమబ్రవీత్॥ 33

రామం మేఽనుగతా దృష్టిః అద్యాపి న నివర్తతే।
న త్వాం పశ్యామి కౌసల్యే! సాధు మాం పాణినా స్పృశ॥ 34

నాడు చీకటిపడినంతనే ఆరాత్రి మహారాజునకు కాళరాత్రిగా తోచెను. అర్ధరాత్రివేళ దశరథుడు కౌసల్యాదేవితో ఇట్లు పలికెను. "నా ప్రాణేశ్వరీ! ఓ కౌసల్యా! నా దృష్టియంతయు గుణసాగరుడైన శ్రీరాముని అనుసరించి, అటే వెళ్ళిపోయినది. ఎంతగా ప్రయత్నించినను అది ఇటు మఱలుటలేదు. (నా ధ్యాసయంతయు శ్రీరామునితో నిండిపోయినది, ఆ రామధ్యాస నన్ను వీడుటలేదు.) అందువలన నా దృష్టి పనిచేయుటయే లేదు. నీవు ఇచటనే ఉన్నను నిన్ను గుర్తుపట్టలేకున్నాను. కనుక నీచేతితో ఒక్కసారి నన్ను స్పృశింపుము. (నీకరస్పర్శ శ్రీరాముడు నన్ను స్పృశించినంతగా నాకు ఆనందమును గూర్చును, నీవు శ్రీరామునిజననివిగదా!). (33-34)

తం రామమేవానువిచింతయంతం
సమీక్ష్య దేవీ శయనే నరేంద్రమ్ ।
ఉపోపవిశ్యాధికమార్తరూపా
వినిశ్శ్వసంతీ విలలాప కృచ్ఛ్రమ్ ॥ 35

తల్పముపై పరుండి, అనుక్షణము శ్రీరామునే స్మరించుచున్న మహారాజును జూచి, కౌసల్యాదేవి ఆయనప్రక్కన కూర్చుండి శోకమూర్తియై, నిట్టూర్పులు విడుచుచు ఎంతయు విలపించెను. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్విచత్వారింశస్సర్గః (42)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదిరెండవసర్గము సమాప్తము

— * * * —

43. నలుబదిమూడవసర్గము

పుత్రునియెడబాటునకు గుఱియైన కౌసల్యాదేవి తనపతిసమక్షమున విలపించుట.

తతస్సమీక్ష్య శయనే సన్నం శోకేన పార్థివమ్।
కౌసల్యా పుత్రశోకార్తా తమువాచ మహీపతిమ్॥ 1

పుత్రదుఃఖముతో కృశించి, శయ్యపై పండుకొనియున్న మహారాజును గాంచి, కౌసల్య తాను శోకార్తయై ఆయనతో ఇట్లనెను. (1)

రాఘవే నరశార్దూలే విషముప్త్వా విజిహ్మగా।
విచరిష్యతి కైకేయీ నిర్ముక్తేవ హి పన్నగీ॥ 2

"సర్పమువలె కుటిలగతిగల కైకేయి ధర్మాత్ముడైన శ్రీరాముని యెడ తనవిషమును వెళ్ళగ్రక్కినదై, ఇప్పుడు కుబుసమును విడిచిన ఆడుపామువలె క్రొత్తరూపముతో స్వేచ్ఛగా సంచరించును. (2)

వివాస్య రామం సుభగా లబ్ధకామా సమాహితా।
త్రాసయిష్యతి మాం భూయో దుష్టాహిరివ వేశ్మని॥ 3

అందగత్తెయైన ఆ కైకేయి శ్రీరాముని వనములకు బంపి, తన కోర్కెలను దీర్చుకొనినది. అంతటితో ఆగక ఇంటిలో దూరిన విషసర్పమువలె ఆమె నన్ను ఇంకను వేధింపగలదు. (3)

అథ స్మ నగరే రామః చరన్ భైక్షం గృహే వసేత్।
కామకారో వరం దాతుమ్ అపి దాసం మమాత్మజమ్॥ 4

భరతునకు రాజ్యాధికారమును కట్టబెట్టుట ఆవశ్యకమే (తప్పనిసరియే) యైనచో కానిండు. అంతేగాదు భరతుడు కోరినట్లుగా అతనికి సేవలుచేయుచు నాకుమారుడు (శ్రీరాముడు) ఇచట దాసుడై ఉండవలసి వచ్చినను అది నాకు సమ్మతమే, వనవాసము కంటెను అదిమేలుగదా! అప్పుడు నా తనయుడు భిక్షమెత్తుకొని జీవించుచునైనను నా కండ్లముందర తిరుగుచు ఇచటనే నివసించు చుండెడివాడు గదా! (4)

పాతయిత్వా తు కైకేయ్యా రామం స్థానాద్యథేష్టతః।
ప్రదిష్టో రక్షసాం భాగః పర్వణీవాఽఽహితాగ్నినా॥ 5

ఆహితాగ్ని (నిత్యము హోమవిధులను ఆచరించువాడు) దర్శపూర్ణమాసాదిక్రతువులయందు దేవతలకు అర్పింపవలసిన హవిర్భాగములను రాక్షసులకు చెందజేసినట్లుగా, నీవు కైకేయియొక్కదికారణముగా ముందు వెనుకలాలోచింపక, రామునకు దక్కవలసిన రాజ్యాధికారమును అతనికి గాకుండా అమర్యాదగా భరతునకు కట్టబెట్టితివి. శ్రీరామునకేమో రాక్షసనివాసమైన (రాక్షసభాగమైన) అరణ్యమును అప్పగించితివి. (5)

గజరాజగతిర్వీరో మహాబాహుర్ధనుర్ధరః।
వన మావిశతే నూనం సభార్యః సహ లక్ష్మణః॥ 6

గజరాజువలె గంభీరముగా నడచువాడును, మహాబాహువు, వీరుడు ఐన శ్రీరాముడు ధనుర్ధారియై, సీతాలక్ష్మణ సహితుడై నిశ్చయముగా వనములలో ప్రవేశించియుండును. (6)

వనే త్వదృష్టదుఃఖానాం కైకేయ్యాఽనుమతే త్వయా।
త్యక్తానాం వనవాసాయ కాన్వవస్థా భవిష్యతి॥ 7

ఇచట సుకుమారముగా పెరిగిన సీతారామలక్ష్మణులు 'కష్టములు' అను మాటనే యెఱుగరు. అట్టివారిని కైకేయివరములనెపముతో అడవులపాలుచేసితివి. వారు అచట ఎట్టి అవస్థలు పడవలసి వచ్చునోయేమో? (7)

తే రత్నహీనాస్తరుణాః ఫలకాలే వివాసితాః।
కథం వత్స్యంతి కృపణాః ఫలమూలైః కృతాశనాః॥ 8

సుఖభోగములను అనుభవింపవలసిన వయసులో ఉన్న సీతారామలక్ష్మణులను అడవులకు పంపితివి. ఇప్పుడు వారికి శయ్యాసనాదివస్తువాహనములే లేవు. కనుక వారు అడవులలో తృణశయ్యలపై పరుండుచు ఫలమూలములతోడనే కడుపు నింపుకొనుచు ఎట్లుందురోగదా! (8)

అపీదానీం స కాలస్స్యాత్ మమశోకక్షయశ్శివః।
సభార్యం యత్ సహ భ్రాత్రా పశ్యేయమిహ రాఘవమ్॥ 9

సీతాలక్ష్మణులతోగూడి, శ్రీరాముడు ఇచటికి మఱల వచ్చిన శుభసమయముననే నాశోకము చల్లారును. అది ఇంతలో సంభవమగునా? (9)

శ్రుత్వైవోపస్థితౌ వీరౌ కదాఽయోధ్యా గమిష్యతి।
యశస్వినీ హృష్టజనా సూచ్ఛ్రితధ్వజమాలినీ॥ 10

సీతారామలక్ష్మణులు వనవాసమును ముగించుకొని వచ్చినచో, ఆ వార్తను వినినంతనే వాసిగాంచిన ఈ అయోధ్యయందలి ప్రజలెల్లరును పట్టరానిసంతోషముతో పొంగిపోవుదురు. ఈ నగరమునందంతటను ఇక్ష్వాకువంశ (కోసలరాజ్య) ధ్వజపతాకములు రెపరెపలాడును. ఆ శుభసమయము ఎప్పుడు ఆసన్నమగునో గదా! (10)

కదా ప్రేక్ష్య నరవ్యాఘ్రౌ అరణ్యాత్ పునరాగతౌ।
నందిష్యతి పురీ హృష్టా సముద్ర ఇవ పర్వణి॥ 11

నరశ్రేష్ఠులైన రామలక్ష్మణులు సీతతోగూడి అరణ్యముల నుండి ఇచటికి విచ్చేసినప్పుడు వారిని కనులారగాంచిన పౌరుల సంతోషములు పర్వదినమున సముద్రతరంగములవలె మిన్నంటును. ఆ సుముహూర్తము ఎప్పుడు ప్రాప్తించునో గదా! (11)

కదాఽయోధ్యాం మహాబాహుః పురీం వీరః ప్రవేక్ష్యతి।
పురస్కృత్య రథే సీతాం వృషభో గోవధూమివ॥ 12

ఆజానుబాహువు, మహావీరుడు ఐన శ్రీరాముడు ఆవుతో వృషభము వలె, సీతతోగూడి రథముపై అయోధ్యాపురియందు ఎప్పుడు ప్రవేశించునో యేమో! (12)

కదా ప్రాణిసహస్రాణి రాజమార్గే మమాఽఽత్మజౌ।
లాజైరవకిరిష్యంతి ప్రవిశంతావరిందమౌ॥ 13

శత్రుసంహారకులైన నాకుమారులగు రామలక్ష్మణులు (అయోధ్యా) రాజవీధులలో ప్రవేశించినప్పుడు అచట చేరియున్న వేలకొలదిపౌరులు ఆనందముతో వారిపై లాజలు (పేలాలు) చల్లెడి శుభసమయము ఎప్పుడు వచ్చునోగదా! (13)

ప్రవిశంతౌ కదాఽయోధ్యాం ద్రక్ష్యామి శుభకుండలౌ।
ఉదగ్రాయుధనిస్త్రింశౌ సశృంగావివ పర్వతౌ। 14

చక్కని కర్ణకుండలములను ధరించినవారై, ఉన్నతములైన ధనుస్సులను, ఖడ్గములను చేబట్టి, శిఖరములతో గూడిన పర్వతముల వలె ఒప్పుచు, రామలక్ష్మణులు అయోధ్యలో ప్రవేశించుచుండగా చూచెడి భాగ్యము ఎప్పటికి సమకూరునో యేమో! (14)

కదా సుమనసః కన్యా ద్విజాతీనాం ఫలాని చ।
ప్రదిశంత్యః పురీం హృష్టాః కరిష్యంతి ప్రదక్షిణమ్। 15

సీతారామలక్ష్మణులరాకతో మిగుల సంతసించిన కన్యలు బ్రాహ్మణోత్తములకు పూవులను, పండ్లను సమర్పించుచు, అయోధ్యాపురికి ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించు శుభదినము ఎప్పటికి వచ్చునో గదా! (15)

కదా పరిణతో బుద్ధ్యా వయసా చామరప్రభః।
అభ్యుపైష్యతి ధర్మజ్ఞః త్రివర్షఇవ లాలయన్। 16

పరిణతిచెందిన ప్రజ్ఞాశాలియు, (జ్ఞానవృద్ధుడును) దేవతల వలె నిత్యయౌవనశోభలను కలిగియుండువాడును, ధర్మజ్ఞుడును ఐన శ్రీరాముడు మూడు సంవత్సరముల చిన్నారివలె ముద్దు మురిపెములను గూర్చుచు నాయొడికి ఎప్పుడు చేరునోగదా! (ఇది కౌసల్యాదేవి అమృతవాత్సల్యమునకు మచ్చుతునక). (16)

నిస్సంశయం మయా మన్యే పురా వీర! కదర్యయా।
పాతుకామేషు వత్సేషు మాతౄణాం శాతితాః స్తనాః। 17

ఓ రాజా! నేను పూర్వజన్మలో పాలుద్రాగుటకై ఆరాటముతో తల్లుల పొదుగులను జేరిన దూడలను ఆ తల్లులనుండి వేఱుచేసిన క్రూరాత్మురాలనై (కసాయి దాననై) యుందును. లేనిచో నాకు ఈ దుర్గతిపట్టదు. ఇది నిశ్చయముసుమా! (17)

సాఽహం గౌరివ సింహేన వివత్సా వత్సలా కృతా।
కైకేయ్యా పురుషవ్యాఘ్ర! బాలవత్సేవ గౌర్బలాత్। 18

ఓ నరోత్తమా! రాజా! లేగదూడకు తల్లియైన గోవునకువలె నాకును పుత్రుడనిన ప్రాణము. క్రూరజంతువైన సింహము లేగదూడ నుండి ఆవునువలె దుష్టకైకేయి బలాత్కారముగా నన్ను నాపుత్రుని నుండి దూరము చేసినది. (18)

నహి తావద్గుణైర్జుష్టం సర్వశాస్త్రవిశారదమ్।
ఏకపుత్రా వినా పుత్రమ్ అహం జీవితుముత్సహే। 19

నా శ్రీరాముడు సర్వశాస్త్రకోవిదుడు, సకలసద్గుణముల పెన్నిధి. నాకు అతడు ఒక్కడే కొడుకు. అట్టి నా ముద్దులపట్టికి దూరముగా నేను బ్రతుకజాలను. (19)

న హి మే జీవితే కించిత్ సామర్థ్యమిహ కల్ప్యతే।
అపశ్యంత్యాః ప్రియం పుత్రం మహాబాహుం మహాబలమ్। 20

ఆజానుబాహువు, మిక్కిలి పరాక్రమశాలి ఐన నా అనుంగు కుమారుని చూడకుండా జీవింపగలశక్తి నాకు ఏమాత్రమూ లేదు. (20)

అయం హి మాం దీపయతే సముత్థితః
తనూజశోకప్రభవో హుతాశనః।
మహీమిమాం రశ్మిభిరుద్ధతప్రభో
యథా నిదాఘే భగవాన్ దివాకరః। 21

గ్రీష్మకాలమునందు తీక్ష్ణప్రతాపముతోనుండు సూర్యభగవానుడు తనవేడికిరణములచే భూమిని తపింపజేయునట్లు పుత్రుని యెడబాటువలన కలిగిన ఈ శోకాగ్ని నన్ను తీవ్రముగా దహించి వేయుచున్నది. (21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రిచత్వారింశస్సర్గః (43)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదిమూడవసర్గము సమాప్తము

-- * * * --

44. నలుబదినాల్గవసర్గము

శోకభారముతో మిగుల కుమిలిపోవుచున్న కౌసల్యాదేవిని సుమిత్రాదేవి
యుక్తి యుక్తములైన తన చల్లని మాటలతో ఓదార్చుట - ఆమె ఊరడిల్లుట.

విలపంతీం తథా తాం తు కౌసల్యాం ప్రమదోత్తమామ్।
ఇదం ధర్మే స్థితా ధర్మ్యం సుమిత్రా వాక్యమబ్రవీత్। 1

ఉత్తమవనితయైన కౌసల్యాదేవి అట్లు విలపించుచుండగా విశిష్టధర్మములను ఎఱింగిన సుమిత్రాదేవి ధర్మబద్ధములైన వచనములను ఈ విధముగా పలికెను. (1)

తవార్యే సద్గుణైర్యుక్తః పుత్త్రః స పురుషోత్తమః।
కిం తే విలపితే నైవం కృపణం రుదితేన వా। 2

"ఓ పూజ్యురాలా! నీతనయుడైన శ్రీరాముడు సకలసద్గుణ సంపన్నుడు. అతడొకమహాపురుషుడు. అట్టి మహాత్మునికొఱకు కేవలము పుత్త్రభావముతో ఇట్లు దీనముగా విలపించుటయు, ఏడ్చుటయు ఉచితముగాదు. (2)

యస్తవార్యే గతః పుత్త్రః త్యక్త్వా రాజ్యం మహాబలః।
సాధు కుర్వన్ మహాత్మానం పితరం సత్యవాదినమ్। 3

శిష్టైరాచరితే సమ్యక్ శశ్వత్ ప్రేత్య ఫలోదయే।
రామో ధర్మే స్థితః శ్రేష్ఠో న స శోచ్యః కదాచన। 4

వర్తతే చోత్తమాం వృత్తిం లక్ష్మణోఽస్మిన్ సదాఽనఘః।
దయావాన్ సర్వభూతేషు లాభస్తస్య మహాత్మనః। 5

ఓ పూజ్యురాలా! నీకుమారుడు మిక్కిలి బుద్ధిబలము గలవాడు, ధర్మాత్ముడు. అతడు మహాత్ముడైన తన తండ్రిని సత్యవాదిని జేయుటకై (ఆయనమాటను నిలుపుటకై) వనములకు వెళ్లెను. ఇది సర్వదా సత్పురుషులు ఆచరించెడి చక్కని మార్గము. ఇది ఇహపరలోకములయందును సత్ఫలములను ఇచ్చును. ధర్మమునకు కట్టుబడెడువాడు, శ్రేష్ఠుడు[1] ఐన శ్రీరామునికొఱకై ఇక ఎన్నడును విచారింపదగదు. సమస్తప్రాణులయందును దయజూపుచుండెడి పవిత్రుడైన లక్ష్మణుడు రామునియెడ భక్తిప్రపత్తులుగలవాడు. సత్ప్రవర్తనతో ఎల్లప్పుడును అన్నను అనుసరించుచుండుట అతనికి సహజలక్షణము. మహాత్ముడైన శ్రీరామునకుతోడుగా ఉండుటవలన లక్ష్మణునకు శ్రీరాముని సేవించెడి భాగ్యము దక్కును. లక్ష్మణునకు ఇది విశేషలాభము. (3-5)

అరణ్యవాసే యద్దుఃఖం జానతీ వై సుఖోచితా।
అనుగచ్ఛతి వైదేహీ ధర్మాత్మానం తవాత్మజమ్। 6

విదేహప్రభువు (జనకుని) యొక్క కూతురైన సీతాదేవి హాయిగా సుఖజీవితమును గడుపవలసియున్నది. కాని ఆమె పతిసేవాపరాయణయగుటచే వనవాసమున పెక్కు కష్టములు ఉండునని తెలిసియు నీకు కుమారుడును, తనకు భర్తయు ఐన ఆ మహాత్ముని (శ్రీరాముని) అనుసరించివెళ్లినది. (స్త్రీలకు పతియే ప్రత్యక్షదైవముగదా!) (6)

కీర్తిభూతాం పతాకాం యో లోకే భ్రమయతి ప్రభుః।
ధర్మసత్యవ్రతధనః కిం న ప్రాప్తస్తవాత్మజః। 7

నీ సుతుడైన శ్రీరాముడు ధర్మాచరణమునందును, సత్యవ్రతమును పాటించుటలోను సాటిలేనివాడు. అవి ఆమహాపురుషుని సహజ సంపదలు కావున ఆయన కీర్తిపతాక లోకమున ఎల్లప్పుడును ఎగురుచునే యుండును. ఇంక ఆయన పొందవలసినదేముండును? (ఆయనకు ఏమిలోటు?) కనుక ఆయనకై శోకింపదగదు. (7)

వ్యక్తం రామస్య విజ్ఞాయ శౌచం మాహాత్మ్యముత్తమమ్।
న గాత్రమంశుభిస్సూర్యః సంతాపయితుమర్హతి। 8

శ్రీరామునియొక్క త్రికరణశుద్ధిని (పవిత్రతను) తిరుగులేని గొప్పదనమును (నిరుపమానమహత్త్వమును) ఎఱిగిన సూర్యుడు తనకిరణములచే ఆయనశరీరమునకు ఏమాత్రమూ బాధను కలిగింపడు.[2] ఇది తథ్యము. (8)

1) శ్రీరాముడు శ్రేష్ఠపురుషుడు. సత్యవాక్పరిపాలనము, తండ్రిమాటను శిరసావహించుట అనునవి ఆయనకు పరమాదర్శములు. ఈ ఆదర్శములను లోకమునకు చాటుటకై ఆ మహాపురుషుడు అట్లు స్వయముగా తానాచరించిచూపెను.

* యద్యదాచరతిశ్రేష్ఠః తత్తదేవేతరోజనః। స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥ భగవద్గీత 3-21
శ్రేష్ఠుడైన పురుషునిఆచరణమునే ఇతరులును అనుసరింతురు. అతడు నిలిపిన ప్రమాణమునే లోకులందఱును పాటించెదరు.

2) భీషోదేతి సూర్యః = శ్రీమహావిష్ణువుయొక్క అవతారమైన శ్రీరామునకు భయపడి, సూర్యుడు (యుక్తముగా) తగినంతగా ప్రకాశించును. తైత్తిరీయోపనిషత్తు ఆనందవల్లి - 8వ మంత్రము.

శివః సర్వేషు కాలేషు కాననేభ్యో వినిస్సృతః।
రాఘవం యుక్తశీతోష్ణః సేవిష్యతి సుఖోఽనిలః। 9

శ్రీరాముడు అరణ్యములలో నివసించునప్పుడు వాయువు తన సంచారముతో వసంతాది ఋతువులయందును ఆయా ఋతుకాలములకు తగినట్లుగా చల్లదనమును వెచ్చదనమును గూర్చుచు, [1]ఆయనకు సుఖముగా నుండునట్లు (ఆయనను) సేవించుచుండును.(9)

శయానమనఘం రాత్రౌ పితేవాభిపరిష్వజన్।
రశ్మిభిః సంస్పృశన్ శీతైః చంద్రమాహ్లాదయిష్యతి। 10

రాత్రివేళలలో శయనించియున్న శ్రీరాముని చంద్రుడు తన చల్లనికిరణములచే స్పృశించుచు, తండ్రి తనకుమారుని అక్కున చేర్చుకొనినట్లు ఆయనకు సుఖమును గలిగించుచుండును.(10)

దదౌ చాస్త్రాణి దివ్యాని యస్మై బ్రహ్మా మహౌజసే।
దానవేంద్రం హతం దృష్ట్వా తిమిధ్వజసుతం రణే। 11

స శూరః పురుషవ్యాఘ్రః స్వబాహుబలమాశ్రితః।
అసంత్రస్తోఽప్యరణ్యస్థో వేశ్మనీవ నివత్స్యతి। 12

శంబరాసురునకుగల మఱియొక పేరు తిమిధ్వజుడు. అతడు దశరథునకు శత్రువు. తిమిధ్వజుని కుమారుని శ్రీరాముడు వధించెను. అందులకు సంతోషించి, బ్రహ్మదేవుడు శ్రీరామచంద్రునకు దివ్యాస్త్రములను ఒసంగెను. దివ్యాస్త్రసంపన్నుడును, నరశ్రేష్ఠుడును ఐన ఆ మహాత్ముని బాహుబలము తిరుగులేనిది. అందువలన అతడు అరణ్యమున సైతము స్వగృహమునందువలె ప్రశాంతముగా నిర్భయముగా నివసింపగలడు. (11-12)

యస్యేషుపథమాసాద్య వినాశం యాంతి శత్రవః।
కథం న పృథివీ తస్య శాసనే స్థాతుమర్హతి। 13

దేవీ! శ్రీరాముడు వనవాసమును అనాయాసముగనే పూర్తిచేయును. పిదప ఆయనబాణముల (మార్గమున)కు ఎదురుగా నిల్చినశత్రువు ఎంతటివాడైనను నేలపాలుగాక తప్పదు. వనవాసానంతరము శ్రీరాముడే ఈ భూమండలమును శాసింపగలడు. (13)

యా శ్రీః శౌర్యం చ రామస్య యా చ కల్యాణసత్త్వతా।
నివృత్తారణ్యవాసః స క్షిప్రం రాజ్యమవాప్స్యతి। 14

సూర్యస్యాపి భవేత్ సూర్యో హ్యగ్నేరగ్నిః ప్రభోః ప్రభుః।
శ్రియః శ్రీశ్చ భవేదగ్ర్యా కీర్త్యాః కీర్తిః క్షమాక్షమా। 15

దైవతం దైవతానాం చ భూతానాం భూతసత్తమః।
తస్య కే హ్యగుణా దేవి! రాష్ట్రే వాప్యథవా పురే। 16

అద్భుతమైన తేజస్సు, సాటిలేని శౌర్యపరాక్రమములు, ప్రశస్తములైన శుభలక్షణములు మున్నగువాటి కారణముగా శ్రీరాముడే తనవనవాసము ముగిసిన పిమ్మట రాజ్యాధికారమును చేపట్టగలడు. ఇతడు సూర్యుని మించిన తేజస్వి, అగ్నియొక్క దాహశక్తి ఈయన ముందు నిలువజాలదు, లోకమునగల ప్రభువులకే ప్రభువైనవాడితడు, సంపదలకు పెన్నిధి, కీర్తికి వన్నెదెచ్చువాడు, సమస్తప్రాణులకు భూమి ఆధారముకాగా ఆ భూదేవికి ఇతడు ఆధారము. అనగా సమస్తభూమండలమూ ఈయనపాలనలో సురక్షితముగానుండును. ఇతడు భాగ్యవంతులకే భాగ్యప్రదాత. సమస్తప్రాణులలో మేలుబంతి, సర్వసద్గుణనిధానమైన ఇట్టి మహాపురుషునకు అరణ్యమైనను, నగరమైనను ఒక్కటియే, ఎచ్చటనున్నను ఈయనకు ఏలోటూ ఉండదు.[2] (14-16)

2) భీషాస్మాద్వాతః పవతే - శ్రీమన్నారాయణుని అవతారమైన శ్రీరామునకు భయపడి, వాయువు కాలోచితముగ చల్లదనమును వెచ్చదనమును ప్రసరింపజేయుచుండును. తైత్తిరీయోపనిషత్తు. ఆనందవల్లి – 8వ మంత్రము.

3) శ్రీమహావిష్ణువు యొక్క అవతారమే ఈ శ్రీరాముడు. సకలలోకములకును వెలుగులను ఇచ్చెడివాడు సూర్యుడుకాగా అతనిని ఇతడు ప్రకాశింపజేయును. 'తమేవభాంతమనుభాతి సర్వమ్' అనిగదా శ్రుతి ప్రమాణము. సమస్తమును దహింపజేయగల అగ్నికి అదాహకశక్తిని ప్రసాదించువాడు ఇతడే, 'అహం వైశ్వానరో భూత్వా' అనునది ప్రమాణవచనము. ముల్లోకములలోని సర్వనియంతలును ఇతనిఅధీనములోని వారు – కనుక ఇతడు ప్రభువులకు ప్రభువు. విష్ణ్వంశతో ఒప్పుచుండువాడుగాన (సంపదలకు) సత్త్వమును గూర్చువాడు ఇతడు. ఆ లక్ష్మీదేవియే గదా! ఈ సీత - రాఘవత్వే భవేత్ సీతా- అనునది ప్రాజ్ఞవచనము. 'తస్యనామ మహద్యశః' అను ప్రమాణమునుబట్టి ఇతడు కీర్తికే కీర్తిదాయకుడు. క్షమా=భూదేవి. సర్వమునకు ఆధారము ఈ భూదేవి. ఇతడు భూమీపతి, (నారాయణుడు శ్రీభూనీళలకు పతిగదా!) బ్రహ్మాది దేవతలకును ఇతడు పరమదైవము. సమస్తభూతము (ప్రాణు)ల ఉనికికిని ఇతడే ఆధారము. ఈయనలో ఏ అవగుణములకును చోటులేదు-సర్వవ్యాపకుడైన వాడు ఆ శ్రీమహావిష్ణువు. ఆయనయే ఈ శ్రీరాముడై అవతరించినప్పుడు ఈయనకు 'ఇది నగరము' 'ఇది అరణ్యము'-అను భేదము ఎట్లుండును.

పృథివ్యా సహ వైదేహ్యా శ్రియా చ పురుషర్షభః।
క్షిప్రం తిసృభిరేతాభిః సహ రామోఽభిషేక్ష్యతే। 17

దుఃఖజం విసృజంత్యస్రం నిష్క్రామంతమ్ ఉదీక్ష్య యమ్।
అయోధ్యాయాం జనాస్సర్వే శోకవేగసమాహతాః। 18

కుశచీరధరం దేవం గచ్ఛంతమపరాజితమ్।
సీతేవానుగతా లక్ష్మీః తస్య కిం నామ దుర్లభమ్। 19

ధనుర్గ్రహవరో యస్య బాణఖడ్గాస్త్రభృత్ స్వయమ్।
లక్ష్మణో వ్రజతి హ్యగ్రే తస్య కింనామ దుర్లభమ్। 20

నివృత్తవనవాసం తం ద్రష్టాఽసి పునరాగతమ్।
జహి శోకం చ మోహం చ దేవి! సత్యం బ్రవీమి తే। 21

శిరసా చరణావేతౌ వందమానమనిందితే।
పునర్ద్రక్ష్యసి కల్యాణి! పుత్త్రం చంద్రమివోదితమ్। 22

పునః ప్రవిష్టం దృష్ట్వా తమ్ అభిషిక్తం మహాశ్రియమ్।
సముత్స్రక్ష్యసి నేత్రాభ్యాం క్షిప్రమానందజం పయః। 23

మా శోకో దేవి! దుఃఖం వా న రామే దృశ్యతేఽశివమ్।
క్షిప్రం ద్రక్ష్యసి పుత్త్రం త్వం ససీతం సహలక్ష్మణమ్। 24

త్వయా శేషో జనశ్చైవ సమాశ్వాస్యో యదాఽనఘే।
కిమిదానీమిదం దేవి! కరోషి హృది విక్లబమ్। 25

నార్హా త్వం శోచితుం దేవి! యస్యాస్తే రాఘవస్సుతః।
న హి రామాత్ పరో లోకే విద్యతే సత్పథే స్థితః। 26

అభివాదయమానం తం దృష్ట్వా ససుహృదం సుతమ్।
ముదాఽశ్రు మోక్ష్యసే క్షిప్రం మేఘలేఖేవ వార్షికీ। 27

పుత్త్రస్తే వరదః క్షిప్రమ్ అయోధ్యాం పునరాగతః।
పాణిభ్యాం మృదుపీనాభ్యాం చరణౌ పీడయిష్యతి। 28

మహాపురుషుడైన శ్రీరాముడు అతిత్వరలో భూదేవి, సీతాదేవి, విజయలక్ష్మి అను ముగ్గురితో పట్టాభిషిక్తుడు కాగలడు. అనగా విజయలక్ష్మితో, సీతాదేవితోగూడి శ్రీరాముడు శీఘ్రముగనే అయోధ్యకు చేరును. వెంటనే ఈ భూమండలమునకు అతడు ప్రభువగును. (17)

అయోధ్యావాసులందఱును వనములకు వెళ్ళుచున్న శ్రీరాముని గాంచి, దుఃఖభారముతో క్రుంగిపోవుచు కన్నీరుమున్నీరుగా విలపింపసాగిరి. పరాజయమును ఎఱుగని శ్రీరాముడు నారచీరలను దాల్చి, వనమునకు వెడలుచుండగా సాక్షాత్తుగా లక్ష్మీదేవియే సీతాదేవి రూపములో ఆయనను అనుసరించెను. అట్టి మహాపురుషునకు సాధ్యము కానిదేమి? (18-19)

ధనుర్ధారులలో శ్రేష్ఠుడైన లక్ష్మణుడు బాణములను, ఖడ్గమును ధరించి, స్వయముగా శ్రీరామునకు ముందుభాగమున నడచుచుండగా ఇంక ఆ ప్రభువునకు కొదువయేమి? (20)

ఓ దేవీ! శ్రీరాముడు తనవనవాసదీక్షను ముగించుకొని, త్వరలోనే తప్పక తిరిగివచ్చి నిన్ను చేరును. ఇది ముమ్మాటికి తథ్యము. కనుక నీవు శోకమోహములను వీడుము. ఇక ఏ మాత్రము విచారింపవలదు. (21)

ఓ పూజ్యురాలా! ఓ కల్యాణీ! ఉదయించుచున్న చంద్రునివలె ఆహ్లాదమును గూర్చుచు, నీ చరణముల చెంత మోకరిల్లి నమస్కరించుచుండెడి శ్రీరామచంద్రుని మరల నీవు చూడగలవు. (22)

ఓ దేవీ! త్వరలోనే మన శ్రీరామచంద్రుడు అయోధ్యకు విచ్చేయును, సింహాసనమునధిష్ఠించి, రాజ్యలక్ష్మిని చేపట్టును. అట్టి శుభసమయమున నీ నేత్రములనుండి వెల్లుబికి వచ్చు ఆనందాశ్రువులతో ఆయనను నీవు అభిషేకింతువు. (23)

సోదరీ! శ్రీరామునకు ఎట్టి ఆపదయు వాటిల్లదు. కనుక మనోవ్యథను మానుము. ఇక శోకముతో పనియేలేదు. అతిశీఘ్రముగా సీతాలక్ష్మణసమేతుడై విచ్చేయు శ్రీరాముని నీవు చూడగలవు. (24)

ఓ పుణ్యాత్మురాలా! దేవీ! ఈ ఆపద సమయములో అశేష జనావళికన్నీటిని తుడిచి, ఓదార్చవలసిన నీవే ఇట్లు కలతచెంది, దుఃఖముతో క్రుంగిపోయినచో ఇక చెప్పవలసినదేమి? (25)

ఓ దేవీ! ఈ లోకమున శ్రీరామునివంటి సత్పురుషుడు వేఱేలేడు. అట్టి రామునిగన్న తల్లివి నీవు. కావున నీవు దుఃఖించుట ఎంతమాత్రము తగదు. (26)

అట్టి మహాత్ముడైన నీసుతుడు తనఆత్మీయులతోగూడి, నీచరణములకు ప్రణమిల్లుచుండగా జూచి, వెంటనే సకాలమున వర్షించు మేఘములవలె నీవు ఆనందాశ్రువులను స్రవింపజేయగలవు. (27)

ఎల్లరకోర్కెలను ఈడేర్చునట్టి నీకుమారుడు అయోధ్యకు తిరిగివచ్చిన వెంటనే తన ఘనబాహువులతో మృదువుగా నీ పాదములొత్తగలడు. (28)

అభివాద్య నమస్యంతం శూరం ససుహృదం సుతమ్ ।
ముదాఽస్రైః ప్రోక్ష్యసి పునః మేఘరాజిరివాచలమ్ ॥ 29

మహావీరుడైన శ్రీరాముడు తనవారితో గూడి, నీకు పాదాభివందనము ఆచరించుచుండగా పర్వతముపై మేఘపంక్తి తొలకరిజల్లులు చల్లునట్లుగా ఆయనపై నీవు నీ ఆనందబాష్పములను చిలుకగలవు." (29)

ఆశ్వాసయంతీ వివిధైశ్చ వాక్యైః
వాక్యోపచారే కుశలాఽనవద్యా ।
రామస్య తాం మాతరమేవముక్త్వా
దేవీ సుమిత్రా విరరామ రామా ॥ 30

సుమిత్రాదేవి ఎదుటివారిహృదయములను (భావములను) గుర్తించి, వారికి ఊరటగూర్చుటలో మేటి, సమయస్ఫూర్తి గలిగి మాట్లాడుటలో ఆమె కడు నేర్పరి. పూజ్యురాలైన లక్ష్మణమాత శ్రీరామజననియైన కౌసల్యాదేవిని పలువిధముల ఓదార్చుచు ఇట్లు పలికి మిన్నకుండెను. (30)

నిశమ్య తల్లక్ష్మణమాతృవాక్యం
రామస్య మాతుర్నరదేవపత్న్యాః ।
సద్యశ్శరీరే విననాశ శోకః
శరద్గతో మేఘ ఇవాల్పతోయః ॥ 31

దశరథమహారాజుయొక్క పట్టమహిషియు, శ్రీరామునకు తల్లియు ఐన కౌసల్యాదేవి లక్ష్మణజననియైన సుమిత్రాదేవియొక్క ఉపశమన వచనములకు ఊరడిల్లెను. ఆమెలోని శోకము శరత్కాలమేఘమునందలి జలమువలె అదృశ్యమాయెను. ఆమెమనస్సు కుదుటబడెను. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుశ్చత్వారింశస్సర్గః (44)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదినాల్గవసర్గము సమాప్తము

-- * * * --

45. నలుబదిఐదవసర్గము

"మీరు అయోధ్యకు మరలిపొండు." అని శ్రీరాముడు తనను అనుసరించివచ్చుచున్న ప్రజలకు హితవుపలుకుట - మీరే అయోధ్యకు మరలిరండు. లేదా మేము మీవెంట వచ్చుటకు అనుమతింపుడు" - అని విప్రోత్తములు శ్రీరాముని వేడుకొనుట.

అనురక్తా మహాత్మానం రామం సత్యపరాక్రమమ్ ।
అనుజగ్ముః ప్రయాంతం తం వనవాసాయ మానవాః ॥ 1

మహాబాహువైన శ్రీరాముడు తండ్రిమాటను నిలబెట్టుటకై దీక్షవహించి, వనవాసమునకు వెళ్ళుచుండగా అయోధ్యావాసులెల్లరును భక్తివిశ్వాసములతో ఆయనను అనుసరించిరి. (1)

నివర్తితేఽపి చ బలాత్ సుహృద్వర్గే చ రాజని ।
నైవ తే సన్న్యవర్తంత రామస్యానుగతా రథమ్ ॥ 2

అయోధ్యానిలయానాం హి పురుషాణాం మహాయశాః ।
బభూవ గుణసంపన్నః పూర్ణచంద్ర ఇవ ప్రియః ॥ 3

త్వరలో మనకడకు నీవు తిరిగి రావలెను-అని కోరుకొనువారు తమ ఆత్మీయులను ఎక్కువ దూరము అనుసరింపరాదు"- అను నియమప్రకారమైనను దశరథమహారాజు, ఇతర- అంతఃపురజనులు అతికష్టముమీద వెనుదిరిగిరి. కాని శ్రీరాముని రథమువెంట పరుగిడు అయోధ్యవాసులు మాత్రము తమయిండ్లకు మరలి రాలేదు. ఏలనన సద్గుణసంపన్నుడుగా వాసికెక్కిన శ్రీరాముడు అయోధ్యానగరపౌరులందరికిని నిండుపున్నమినాటి చంద్రుని వలె ఎంతయు ఆహ్లాదకరుడు. (2-3)

స యాచ్యమానః కాకుత్స్థః స్వాభిః ప్రకృతిభిస్తదా ।
కుర్వాణః పితరం సత్యం వనమేవాన్వపద్యత ॥ 4

తన అయోధ్యావాసులు "రామా! మరలుము, మరలుము"- అని ఎంతగా ప్రార్థించుచున్నను వినక, శ్రీరాముడు తనతండ్రి మాటను నిల్పుటకై వనాభిముఖుడై ముందునకు సాగెను. (4)

అవేక్షమాణః సస్నేహం చక్షుషా ప్రపిబన్నివ ।
ఉవాచ రామః స్నేహేన తాః ప్రజాః స్వాః ప్రజా ఇవ ॥ 5

శ్రీరాముడు తనను అనుసరించివచ్చుచున్న ప్రజలను కరుణాపూరిత నయనములతో త్రాగుచున్న వానివలె జూచుచు, వారిని తన కన్నబిడ్డలవలె భావించుచు వాత్సల్యముతో ఇట్లు నుడివెను. (5)

యా ప్రీతిర్బహుమానశ్చ మయ్యయోధ్యానివాసినామ్ ।
మత్ప్రియార్థం విశేషేణ భరతే సా నివేశ్యతామ్ ॥ 6

"ఓ పౌరులారా! మీరందఱును నాపై ఇంతటి ప్రేమాదరములను చూపుచున్నందులకు సంతోషము. కాని ఇంతకంటెను రెట్టింపు ఆదరాభిమానములను భరతునిపై చూపుడు. అప్పుడు నాకు ఇంకను ఎక్కువ సంతోషముకల్గును. (6)

స హి కల్యాణచారిత్రః కైకేయ్యానందవర్ధనః।
కరిష్యతి యథావద్వః ప్రియాణి చ హితాని చ। 7

జ్ఞానవృద్ధో వయోబాలో మృదుర్వీర్యగుణాన్వితః।
అనురూపస్స వో భర్తా భవిష్యతి భయాపహః। 8

స హి రాజగుణైర్యుక్తో యువరాజః సమీక్షితః।
అపి చాపి మయా శిష్టైః కార్యం వో భర్తృశాసనమ్। 9

న చ తప్యేద్యథా చాసౌ వనవాసం గతే మయి।
మహారాజస్తథా కార్యో మమ ప్రియచికీర్షయా। 10

యథా యథా దాశరథిః ధర్మ ఏవాస్థితోఽభవత్।
తథా తథా ప్రకృతయో రామం పతిమకామయన్। 11

బాష్పేణ పిహితం దీనం రామః సౌమిత్రిణా సహ।
చకర్షేవ గుణైర్బద్ధ్వా జనం పురనివాసినమ్। 12

తే ద్విజాస్త్రివిధం వృద్ధా జ్ఞానేన వయసౌజసా।
వయఃప్రకంపశిరసో దూరాదూచురిదం వచః। 13

వహంతో జవనా రామం భో భో జాత్యాస్తురంగమాః।
నివర్తధ్వం న గంతవ్యం హితా భవత భర్తరి। 14

కర్ణవంతి హి భూతాని విశేషేణ తురంగమాః।
యూయం తస్మాన్నివర్తధ్వం యాచనాం ప్రతివేదితాః। 15

ధర్మతః స విశుద్ధాత్మా వీరః శుభదృఢవ్రతః।
ఉపవాహ్యస్తు వో భర్తా నాపవాహ్యః పురాద్వనమ్। 16

ఏవమార్తప్రలాపాంస్తాన్ వృద్ధాన్ ప్రలపతో ద్విజాన్।
అవేక్ష్య సహసా రామో రథాదవతతార హ। 17

పద్భ్యామేవ జగామాథ ససీతస్సహ లక్ష్మణః।
సన్నికృష్టపదన్యాసో రామో వనపరాయణః। 18

కైకేయీదేవికుమారుడైన ఆ భరతుడు మిగుల ఉత్తముడు. అతడు మీకు తగినంతగా ప్రీతిని గూర్చుచు మేలు చేయగలడు. అతడు వయస్సున చిన్నవాడేయైనను మిక్కిలి జ్ఞానసంపన్నుడు. మృదుస్వభావముగలవాడు, పరాక్రమశాలి, సద్గుణనిధి. అతడు మీకు తగినప్రభువుకాగలడు. ఆయన పాలనలో మీరు నిర్భయముగా నుండవచ్చును. (7-8)

భరతుడు రాజోచితలక్షణములు విశేషముగా గలవాడు. అందువలననే మహారాజు ఆయనను యువరాజుగా గావించుటకు నిర్ణయించెను. కావున నేనును లక్ష్మణశత్రుఘ్నాదులును, మీరును, రాజశాసనమును శిరసావహింపవలసియున్నది. నేను వనములకు వెళ్లినపిదప మహారాజుగారి మనస్సునకు ఊరట గల్గునట్లు, ఆయనకు అనువుగా మసలుకొనుడు. అదినాకు తృప్తిని గల్గించును. (9-10)

శ్రీరాముడు పితృవాక్యపరిపాలనయందే స్థిరచిత్తుడై, అందులకు అనుగుణముగా ప్రజలకు ఎంతగానో హితవచనములను పలికెను. కాని వారుమాత్రము తమమనస్సులలో శ్రీరాముడే తమకు రాజుగావలెనని కోరుకొనుచుండిరి. (11)

లక్ష్మణసహితుడైన శ్రీరాముడు పురజనులను అందఱిని త్రాళ్లతో కట్టివేసినట్లుగా తనగుణప్రభావములచే బంధించెను. అప్పుడు వారు పెల్లుబుకుచున్న అశ్రుధారలతో దీనవదనులై యుండిరి. (రామలక్ష్మణుల గుణప్రభావములచే ఆకర్షితులై, పౌరులు ఏమియు పలుకజాలక మిన్నకుండిరి.) (12)

ఆ పౌరులలోని బ్రాహ్మణులు జ్ఞానసంపన్నులు, వయోవృద్ధులు, తపోబలముగలవారు. ముసలివారగుటచే వారిశిరములు వణుకుచుండెను. దూరమునుండియే వారు ఇట్లు పలికిరి. (13)

"శ్రీరాముని రథమును వేగముగా లాగికొనిపోవుచున్న ఓ మేలుజాతి గుఱ్ఱములారా! మీరు వనములకు వెళ్లవద్దు. స్వామి హితమునకై వెనుకకు మఱలుడు. పశుపక్ష్యాదుల వినికిడిశక్తి బలమైనది. అందునా అశ్వముల(మీ) శ్రవణశక్తి ఇంకను గొప్పది. కనుక ఓ అశ్వములారా! మఱల మిమ్ము ప్రార్థించుచున్నాము. మీరు నగర మార్గమునకు మఱలుడు. (14-15)

ప్రభువైన శ్రీరాముడు ధర్మాత్ముడు. ఆయన మనస్సు నిర్మలమైనది. (ఆయన చల్లనిమనస్సుగలవాడు) బలమైన ధర్మనిష్ఠ గలవాడు. మహావీరుడు. అట్టి మహాపురుషుని వనములనుండి పురమునకు చేర్చవలెనే గాని, నగరమునుండి వనములకు గొనిపోరాదు." (16)

ఈ విధముగా ఆర్తితో విలపించుచు అర్థించుచున్న ఆ వృద్ధ బ్రాహ్మణులను గాంచి, శ్రీరాముడు వెంటనే రథమునుండి క్రిందికి దిగెను. (17)

వనవాసదీక్షాబద్ధుడైయున్న శ్రీరాముడు బ్రాహ్మణోత్తముల వచనములను విన్నపిదపగూడ రథముపై వెళ్లుట ఉచితముగాదని తలంచినవాడై, సీతాలక్ష్మణులతోగూడి రథమునుండి దిగెను. ఆ విప్రులు తమను చేరువలకు దిన్నగా నడువసాగెను. (18)

ద్విజాతీంస్తు పదాతీంస్తాన్ రామశ్చారిత్రవత్సలః।
న శశాక ఘృణాచక్షుః పరిమోక్తుం రథేన సః। 19

దయామయుడును, ఆదర్శవర్తనుడును ఐన శ్రీరాముడు పాదచారులైవచ్చుచున్న ఆ ద్విజోత్తములను వీడి, రథముపై వెళ్ళజాలక పోయెను. (19)

గచ్ఛంతమేవ తం దృష్ట్వా రామం సంభ్రాంతచేతసః।
ఊచుః పరమసంతప్తా రామం వాక్యమిదం ద్విజాః। 20

తండ్రియాజ్ఞను నెఱవేర్చుటకై స్థిరనిశ్చయముతో వనములకు జనుచున్న శ్రీరామునిగాంచి, ఆ ద్విజులు నివ్వెఱపోయిరి. పిదప వారు మిక్కిలి పరితపించినవారై శ్రీరామునితో ఇట్లు నుడివిరి. (20)

బ్రాహ్మణ్యం సర్వ మేతత్ త్వాం బ్రహ్మణ్య మనుగచ్ఛతి।
ద్విజస్కంధాధిరూఢాస్త్వామ్ అగ్నయోఽప్యనుయాంత్యమీ। 21

"రఘునందనా! నీవు బ్రాహ్మణహితైషివి. కనుక ఈ బ్రాహ్మణ సమాజమంతయును నిన్ననుసరించివచ్చును. అంతేగాదు ఈ అగ్నిహోత్రములుగూడబ్రాహ్మణుల భుజస్కంధములను అధిష్ఠించి నీవెంటవచ్చును. (మేము నిత్యాగ్నిహోత్రులము. కావున మా అగ్నిహోత్రములను దీసికొని నీ వెంట నడతుము.) (21)

వాజపేయసముత్థాని ఛత్రాణ్యేతాని పశ్య నః।
పృష్ఠతోఽనుప్రయాతాని మేఘానివ జలాత్యయే। 22

వాజపేయయాగము చేయుటవలన మాకు ఛత్రములు లభించినవి. శరత్కాలమేఘములవలె తెల్లనైన ఈ గొడుగులుగూడ మావెంట వచ్చుచున్నవి. చూడుము. (22)

అనవాప్తాతపత్రస్య రశ్మిసంతాపితస్య తే।
ఏభిశ్ఛాయాం కరిష్యామః స్వైశ్ఛత్రైర్వాజపేయికైః। 23

గొడుగులు లేనందువలన నీవు సూర్యకిరణములతాపమునకు గుఱియగుచున్నారు. వాజపేయ యాగములవలన మాకు లభించిన ఈ ఛత్రములతో మేము నీకు నీడను కల్పింతుము. (23)

యా హి నస్సతతం బుద్ధిః వేదమంత్రానుసారిణీ।
త్వత్కృతే సా కృతా వత్స! వనవాసానుసారిణీ। 24

నాయనా! ఇంతవఱకును మా బుద్ధి అనవరతము వేదమంత్రముల పఠనపాఠనముల (పఠించుట, నేర్పుట) యందే నిమగ్నమైయున్నది. కాని నేటినుండి అది నీవెంట వనవాసమునే కోరుకొనుచున్నది. (24)

హృదయేష్వేవ తిష్ఠంతి వేదా యే నః పరం ధనమ్।
వత్స్యంత్యపి గృహేష్వేవ దారాశ్చారిత్రరక్షితాః। 25

వేదములే మాకు సర్వసంపదలుగదా! వాటిని మీరు వీడివచ్చుట యెట్లు? గృహస్థులైన మీరు మీభార్యల రక్షణబాధ్యతలను పరిత్యజించివచ్చినచో వారి గతియేమి?' అని నీవు మమ్ము ప్రశ్నింప వచ్చును. ఆ సందేహమునకు ఏమాత్రము తావులేదు. మా పాలిట మహాసంపదలైన వేద(శాస్త్ర)ములు మాహృదయములయందే యున్నవి. కనుక అవి సురక్షితములు. ఇక మాధర్మపత్నుల విషయము. వారు పతివ్రతలు, కావున వారి పాతివ్రత్యములే వారికి భద్రకవచములు. (25)

న పునర్నిశ్చయః కార్యః త్వద్గతౌ సుకృతా మతిః।
త్వయి ధర్మవ్యపేక్షే తు కిం స్యాద్ధర్మమపేక్షితుమ్। 26

మేమును నిన్ను అనుసరించి వనములకు వచ్చుటకే నిశ్చయించుకొంటిమి. ఈ నిర్ణయమునకు తిరుగులేదు. నీవు పితృవాక్యపరిపాలనరూపమైన ధర్మమునే పాటించుచు ముందునకు సాగుచున్నప్పుడు మాకు ఇతర ధర్మమీమాంసములతో పనియేమి? (నిన్ననుసరించుటయే మాకు పరమధర్మము). (26)

యాచితో నో నివర్తస్వ హంసశుక్లశిరోరుహైః।
శిరోభిర్నిభృతాచార మహీపతనపాంసులైః। 27

ధర్మాచరణమునందే స్థిరముగా నిలిచియుండువాడా! మేము తలలునెఱసిన వృద్ధులము, ఈ నేలపై పొగిలపడి నీకు నమస్కరించు చున్నాము.[1] మా ప్రార్థనను మన్నించి అయోధ్యకు మరలిరమ్ము. నాయనా! ఇక్కడికి వచ్చిన బ్రాహ్మణులలో పెక్కుమంది 'నీవు

1) నా విష్ణుః పృథివీపతిః = విష్ణువుయొక్క అంశను కలిగియున్నవాడే రాజు (పాలకుడు) అగును. అనగా ప్రతి భూపతి (పాలకుని)లోను విష్ణ్వంశయుండితీరును. కావున ప్రభువు బ్రాహ్మణులకును వంద్యుడు. శ్రీరాముడు ఆ మహావిష్ణువు యొక్క అవతారమే గనుక ఇచట దీనిని గూర్చి ప్రత్యేకముగా చెప్పవలసినదియేమున్నది.?

బహూనాం వితతా యజ్ఞా ద్విజానాం య ఇహాగతాః।
తేషాం సమాప్తిరాయత్తా తవ వత్స! నివర్తనే॥ 28

అయోధ్యకు రావలెనను కోరికతో యజ్ఞకార్యములను తలపెట్టియున్నారు. నీవు (ఇప్పుడు) అయోధ్యకు మఱలివచ్చుటతో వారిప్రయత్నములు సఫలములగును. (27-28)

భక్తిమంతి హి భూతాని జంగమాజంగమాని చ।
యాచమానేషు రామ! త్వం భక్తిం భక్తేషు దర్శయ॥ 29

ఓ రామా! కేవలము మానవులే గాక ఈ లోకమునందలి చరాచరప్రాణులన్నియును నీయందు భక్తిశ్రద్ధలు గలిగియున్నవి. నీవు మఱలి వచ్చుటకై ఎంతగానో ఆరాటపడుచు అర్థించుచున్న ఆ ప్రాణులను నీవు కనికరింపుము. (29)

అనుగంతుమ్ అశక్తా స్త్వాం మూలైరుద్ధతవేగినః।
ఉన్నతా వాయువేగేన విక్రోశంతీవ పాదపాః॥ 30

మహోన్నతములైన వృక్షములు సైతము వెంటనే నీవు అయోధ్యకు మఱలుటకై ఎంతయు తపనపడుచు నిన్ననుసరింపజూచుచున్నవి. కాని వేళ్లు (వేర్లు) మాత్రము వాటిని కదలనిచ్చుటలేదు. వేయునదిలేక ఆ చెట్లు పెనుగాలులతో శుతిగలిపి నీకొఱకై బిగ్గరగా ఏడ్చుచున్నవి. (30)

నిశ్చేష్టాహారసంచారా వృక్షైకస్థానవిష్ఠితాః।
పక్షిణోఽపి ప్రయాచంతే సర్వభూతానుకంపినమ్॥ 31

ఓ రఘురామా! నీవనగమనకారణముగా పక్షులన్నియును దిగులుచెంది, ఆహారసంపాదనమునకును ప్రయత్నింపక (ఆకలిదప్పులను మఱచి) చెట్లకొమ్మలపై అచ్చటచ్చటచేరి, దైన్యముతోనున్నవి. సకలప్రాణులయెడను దయాపరుడవైన నీవు అయోధ్యకు మఱలుటకై అవి తమఆఱుపులద్వారా నీకు మొఱపెట్టుకొనుచున్నవి." (31)

ఏవం విక్రోశతాం తేషాం ద్విజాతీనాం నివర్తనే।
దదృశే తమసా తత్ర వారయంతీవ రాఘవమ్॥ 32

వనవాసమునకై వెళ్లుచున్న శ్రీరాముని అయోధ్యకు మఱలించుటకై ఆబ్రాహ్మణులందఱును ప్రాధేయపడుచు గగ్గోలుపెట్టుచుండగా, ఇంతలో తమసానదియు శ్రీరాముని వారించుటకై అడ్డునిల్చినదా యనునట్లు అచట కన్పట్టెను. (32)

తతః సుమంత్రోఽపి రథాద్విముచ్య
శ్రాంతాన్ హయాన్ సంపరివర్త్య శీఘ్రమ్।
పీతోదకాం స్తోయపరిప్లుతాంగాన్
అచారయద్వై తమసా విదూరే॥ 33

సుమంత్రుడుగూడ రథము తమసానదీతీరమునకు చేరగనే, ప్రయాణశ్రమచే అలసియున్న గుఱ్ఱములను రథమునుండి విప్పి, వాటిని అటునిటు త్రిప్పెను. స్వభావమును అనుసరించి, అవి భూమిపై పొరలాడెను. పిమ్మట అతడు నీరుత్రాగించి, ఒడలు కడిగి, మేయుటకై వాటిని తమసానదీతీరమున వదలెను. (33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచచత్వారింశస్సర్గః (45)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదిఐదవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

46. నలుబదిఆఱవసర్గము

సీతారామలక్ష్మణులు ప్రజలతోగూడి తమసానదీతీరమున ఒకరాత్రి విడిదిచేయుట
ప్రజలకు తెలియకుండా వారు రథమునెక్కి, తమసానదిని దాటివెళ్లుట.

తతస్తు తమసాతీరం రమ్యమాశ్రిత్య రాఘవః।
సీతాముద్వీక్ష్య సౌమిత్రిమ్ ఇదం వచనమబ్రవీత్॥ 1

అంతట వారందఱును మనోహరమైన తమసానదీతీరమున విడిసిరి. పిమ్మట శ్రీరాముడు ఒకసారి సీతాదేవివైపు చూచి, లక్ష్మణునితో ఇట్లనెను. (1)

ఇయమద్య నిశా పూర్వా సౌమిత్రే! ప్రస్థితా వనమ్।
వనవాసస్య భద్రం తే స నోత్కంఠితుమర్హసి॥ 2

"ఓ లక్ష్మణా! నీకు శుభమగుగాక- నేడు మనవనవాసమున మొదటిరాత్రి సమీపించినది. ఇది గడచినట్లే (ఒక దినముగడచి పోయినట్లే) యని తలంపుము. అతిసుకుమారియైన సీత వనములలో కాలినడకతో ఎట్లు పోగోపోగలదు? అని దిగులుచెందకుము. (2)

పశ్య శూన్యాన్యరణ్యాని రుదంతీవ సమంతతః।
యథానిలయమాయద్భిః నిలీనాని మృగద్విజైః। 3

అద్యాయోధ్యా తు నగరీ రాజధానీ పితుర్మమ।
సస్త్రీపుంసాగతానస్మాన్ శోచిష్యతి న సంశయః। 4

అనురక్తా హి మనుజా రాజానం బహుభిర్గుణైః।
త్వాం చ మాం చ నరవ్యాఘ్ర! శత్రుఘ్నభరతౌ తథా। 5

పితరం చానుశోచామి మాతరం చ యశస్వినీమ్।
అపివాఽంధౌ భవేతాం తు రుదంతౌ తావభీక్ష్ణశః। 6

భరతః ఖలు ధర్మాత్మా పితరం మాతరం చ మే।
ధర్మార్థకామసహితైః వాక్యైరాశ్వాసయిష్యతి। 7

భరతస్యానృశంసత్వం విచింత్యాహం పునః పునః।
నానుశోచామి పితరం మాతరం చాపి లక్ష్మణ! 8

త్వయా కార్యం నరవ్యాఘ్ర! మామనువ్రజతా కృతమ్।
అన్వేష్టవ్యా హి వైదేహ్యా రక్షణార్థే సహాయతా। 9

అద్భిరేవ తు సౌమిత్రే! వత్స్యామ్యద్య నిశామిమామ్।
ఏతద్ధి రోచతే మహ్యం వన్యేఽపి వివిధే సతి। 10

ఏవ ముక్త్వా తు సౌమిత్రిం సుమంత్రమపి రాఘవః।
అప్రమత్తస్త్వమశ్వేషు భవ సౌమ్యేత్యువాచ హ। 11

సోఽశ్వాన్ సుమంత్రః సంయమ్య సూర్యేఽస్తం సముపాగతే।
ప్రభూతయవసాన్ కృత్వా బభూవ ప్రత్యనంతరః। 12

ఉపాస్య తు శివాం సంధ్యాం దృష్ట్వా రాత్రిముపస్థితామ్।
రామస్య శయనం చక్రే సూతః సౌమిత్రిణా సహ। 13

ఓ సౌమిత్రీ! వెలవెలబోవుచున్న ఈ అరణ్యప్రదేశములను ఒక్కసారి చూడుము. ఇప్పుడిప్పుడే ఈ సాయంకాలమున మృగములు, పక్షులు అడవిని తమతమ స్థానములకు చేరుచున్నవి. ఆ అడవులతో నిండిన ఈ వనములు మనవేషపరిస్థితులను జూచి, ఏడ్చుచున్నవా యనునట్లున్నవి. (3)

మనతండ్రిగారిరాజధానియైన అయోధ్యానగరమునందలి స్త్రీపురుషులందఱును మనయెడబాటునకు తట్టుకొనలేక ఎంతయు శోకించుచుందురు. ఇందు సందేహములేదు. పురుషశ్రేష్ఠా! అయోధ్యావాసులెల్లరును పలుసద్గుణములకారణముగా మహారాజుగారి యెడలను, నాయందును, నీయందును, భరతశత్రుఘ్నులపట్లను అనురక్తులైయున్నారు. (4-5)

పలువురిచే మెప్పుపొందిన ఉత్తమురాలగు కౌసల్యామాతయును, తండ్రి దశరథుడును మనకొఱకై యేడ్చియేడ్చి ఏమైపోవుదురోయేమో? అని నాకు వేదనకలుగుచున్నది. కాని ఆ దిగులు మనకక్కఱయే లేదు. ఏలనన ధర్మాత్ముడైన భరతుడు అచటనేయున్నాడు. అతడు మాతాపితరులైన కౌసల్యాదశరథులను ధర్మార్థకామ యుక్తముగా[1] వారిని సేవించుచు, చక్కని సాంత్వనవచనములతో వారికి ఊరటగూర్పగలడు. ఓ లక్ష్మణా! భరతునిమృదుస్వభావమును, సౌశీల్యమును పదేపదే గుర్తుచేసికొనుటవలన నామనస్సునకు దిటవుకలిగినది. కనుక తల్లిదండ్రులవిచారణవిషయమున ఇంక నేను చింతింపవలసిన పనియేలేదు. (6-8)

ఓ నరశ్రేష్ఠా! లక్ష్మణా! నీవు నన్ను అనుసరించి వచ్చి, ఒక మంచిపనియే చేసితివి. లేనిచో సీతాదేవిరక్షణ విషయమున సహాయమునకై మఱియొక మార్గమును అన్వేషింపవలసి వచ్చెడిది. (9)

ఓ సౌమిత్రీ! ఇచట తినుటకు పెక్కువిధములైన వన్య పదార్థములున్నను జలాహారముతోడనే ఈ రాత్రిని గడపదలచితిని. వనవాసము ప్రారంభమైన మొదటిదినము అగుటవలనను, ఇది పుణ్యతీర్థము (క్షేత్రము) ఐనందునను ఇట్లు చేయుటయే యుక్తమని నాకు తోచుచున్నది." (10)

లక్ష్మణునితో ఇట్లు పలికిన పిమ్మట శ్రీరాముడు సుమంత్రునితో "అయ్యా! గుఱ్ఱములను జాగ్రత్తగా చూచుకొనుము"- అని నుడివెను. (11)

ఆసుమంత్రుడు సూర్యాస్తమయమున రథాశ్వములను కట్టివేసి, పచ్చిమేతవేసి, సమీపముననే వాటిని కనిపెట్టుకొని యుండెను, పిమ్మట అతడు శుభకరమైన సంధ్యోపాసనను విధ్యుక్తముగా నెఱపెను, రాత్రియగుట వలన లక్ష్మణునిసహాయముతో అతడు శ్రీరామునకై శయ్యను ఏర్పఱచెను. (12-13)

1) పుత్రునియెడబాటుకారణముగా దుఃఖితులైయున్న పెద్దలను సేవించు విషయమున పుత్రధర్మములను, వారి ప్రయోజనమును, వారి అభిరుచులను, ఆకాంక్షలను ఎఱింగి, ఉపచారములను నడుపుటయే -ధర్మార్థకామయుక్తముగ సేవించుట యనబడును.

తాం శయ్యాం తమసాతీరే వీక్ష్య వృక్షదలైః కృతామ్।
రామః సౌమిత్రిణా సార్ధం సభార్యః సంవివేశ హ। 14

తమసానదీతీరమున సుమంత్రుడు చెట్లఆకులతో ఏర్పఱచిన శయ్యను పరిశీలించిచూచి, శ్రీరాముడు సీతతో లక్ష్మణునితోగూడి దానిపై కూర్చుండెను. (14)

సభార్యం సంప్రసుప్తం తం భ్రాతరం వీక్ష్య లక్ష్మణః।
కథయామాస సూతాయ రామస్య వివిధాన్ గుణాన్। 15

వదినెయగు సీతాదేవియు, అన్నయైన శ్రీరామచంద్రుడును బడలియున్నందున గాఢనిద్రలో మునిగియుండుటను గమనించిన లక్ష్మణుడు శ్రీరాముని గుణగణములనుగూర్చి సుమంత్రునకు వివరింపసాగెను. (15)

జాగ్రతో హ్యేవ తాం రాత్రిం సౌమిత్రేః ఉదితో రవిః।
సూతస్య తమసాతీరే రామస్య బ్రువతో గుణాన్। 16

సౌమిత్రియు, రథసారథియగు సుమంత్రుడును ఆ రాత్రియంతయు మేల్కొనియుండియే శ్రీరాముని గుణవైభవములను గూర్చి మాట్లాడుకొనుచుండిరి. ఇంతలో సూర్యోదయమయ్యెను. (తెల్లవారెను) (16)

గోకులాకులతీరాయాః తమసాయా విదూరతః।
అవసత్ తత్ర తాం రాత్రిం రామః ప్రకృతిభిస్సహ। 17

తమసానదీతీరమున దరికి చేరువగా ఆవులమందలు నివసించుచుండెను. ఆ విధముగా పునీతమైన ఆప్రదేశమున శ్రీరాముడు తన పౌరులతో ఆ రాత్రి గడపెను. (17)

ఉత్థాయ చ మహాతేజాః ప్రకృతీస్తా నిశామ్య చ।
అబ్రవీద్భ్రాతరం రామో లక్ష్మణం పుణ్యలక్షణమ్। 18

మహాతేజస్వియైన శ్రీరామచంద్రుడు ఉషఃకాలముననే మేల్కొని, ప్రయాణశ్రమచే డస్సి, మైమఱచి నిదురించుచున్న పౌరులను గమనించి, శుభలక్షణసంపన్నుడైన తమ్ముడగు లక్ష్మణునితో ఇట్లనెను. (18)

అస్మద్వ్యపేక్షాన్ సౌమిత్రే! నిరపేక్షాన్ గృహేష్వపి।
వృక్షమూలేషు సంసుప్తాన్ పశ్య లక్ష్మణ సాంప్రతమ్। 19

యథైతే నియమం పౌరాః కుర్వంత్యస్మన్నివర్తనే।
అపి ప్రాణా నసిష్యంతి న తు త్యక్ష్యంతి నిశ్చయమ్। 20

"సోదరా! లక్ష్మణా! చెట్లక్రిందబడి నిదురించుచున్న ఈ ప్రజలను జూడుము. వీరందఱును మనయెడలగల అపేక్షతో తమభార్యాపుత్త్రాదులనుసైతము ఉపేక్షించి, మనవెంట ఇచటికి వచ్చిరి. వీరు మనలను అయోధ్యకు మఱలించుకొని పోవుటకే గట్టిపట్టుదలతో నున్నారు. అందులకై వీరు తమప్రాణములను విడుచుటకైనను సిద్ధముగానున్నారు. కాని తమ నిశ్చయమును మాత్రము వదలిపెట్టునట్లు లేరు. (19-20)

యావదేవ తు సంసుప్తాః తావదేవ వయం లఘు।
రథమారుహ్య గచ్ఛామః పంథానమకుతోభయమ్। 21

అతో భూయోఽపి నేదానీమ్ ఇక్ష్వాకుపురవాసినః।
స్వపేయురనురక్తా మాం వృక్షమూలాని సంశ్రితాః। 22

వీరు నిద్రనుండి మేల్కొనకముందే మనము రథమునెక్కి, ఎవ్వరును పసిగట్టలేని మార్గమున వేగముగా సాగిపోవుదము. అట్లుచేసినచో మనయందు అనురక్తులైయున్న ఈ అయోధ్యాపురవాసులకు మనవెంట వచ్చెడి అవకాశమూ ఉండదు. వారికి చెట్లుచేమలనాశ్రయించి నిదురింపవలసిన ఈ అవస్థయూ తప్పును. (21-22)

పౌరా హ్యాత్మకృతాద్దుఃఖాత్ విప్రమోచ్యా నృపాత్మజైః।
న తే ఖల్వాత్మనా యోజ్యా దుఃఖేన పురవాసినః। 23

ప్రజలదుఃఖములను తొలగించుట రాజకుమారుల ధర్మము. అంతేగాదు తమకారణముగా ప్రజలు ఎట్టి దుఃఖములపాలుగాకుండ జూచుటయు వారి కర్తవ్యము." (23)

అబ్రవీల్లక్ష్మణో రామం సాక్షాద్ధర్మమివ స్థితమ్।
రోచతే మే తథా ప్రాజ్ఞ! క్షిప్రమారుహ్యతామితి। 24

అంతట లక్ష్మణుడు సాక్షాత్తు ధర్మస్వరూపుడైన శ్రీరామునితో "అన్నా! నీవు అన్నియు తెలిసినవాడవు. నీవు చెప్పినది యుక్తముగా నున్నది. వెంటనే రథమును అధిరోహించి వెళ్లుదము" అని నుడివెను. (24)

అథ రామోఽబ్రవీత్ శ్రీమాన్ సుమంత్రం యుజ్యతాం రథః।
గమిష్యామి తతోఽరణ్యం గచ్ఛ శీఘ్రమితః ప్రభో! 25

అనంతరము ఉచితజ్ఞుడైన శ్రీరాముడు సుమంత్రునితో "ఆర్యా! వెంటనే వెళ్లి రథమును సిద్ధమొనర్చుము, మనము త్వరగా వనములకు పోవలెను"-అని పలికెను. (25)

సూతస్తతః సంత్వరితః స్యందనం తైర్హయోత్తమైః।
యోజయిత్వాఽథ రామాయ ప్రాంజలిః ప్రత్యవేదయత్। 26

అయం యుక్తో మహాబాహో! రథస్తే రథినాం వర!।
త్వమారోహస్వ భద్రం తే ససీతః సహలక్ష్మణః। 27

తం స్యందనమధిష్ఠాయ రాఘవః సపరిచ్ఛదః।
శీఘ్రగామాకులావర్తాం తమసామ్ అతరన్నదీమ్। 28

స సంతీర్య మహాబాహుః శ్రీమాన్ శివమకంటకమ్।
ప్రాపద్యత మహామార్గమ్ అభయం భయదర్శినామ్। 29

మోహనార్థం తు పౌరాణాం సూతం రామోఽబ్రవీద్వచః।
ఉదఙ్ముఖః ప్రయాహి త్వం రథమాస్థాయ సారథే। 30

ముహూర్తం త్వరితం గత్వా నివర్తయ రథం పునః।
యథా న విద్యుః పౌరా మాం తథా కురు సమాహితః। 31

రామస్య వచనం శ్రుత్వా తథా చక్రే స సారథిః।
ప్రత్యాగమ్య చ రామస్య స్యందనం ప్రత్యవేదయత్। 32

తౌ సంప్రయుక్తం తు రథం సమాస్థితౌ
తదా ససీతౌ రఘువంశవర్ధనౌ ।
ప్రచోదయామాస తతస్తురంగమాన్
స సారథిర్యేన పథా తపోవనమ్ । 33

తతస్సమాస్థాయ రథం మహారథః
ససారథిర్దాశరథిర్వనం యయౌ ।
ఉదఙ్ముఖం తం తు రథం చకార స
ప్రయాణమాంగల్యనిమిత్తదర్శనాత్ । 34

అంతట సుమంత్రుడు ఒక్క క్షణములో రథమునకు గుఱ్ఱములను పూన్చి, శ్రీరామునకు నమస్కరించి, ఇట్లు విన్నవించెను. (26)

"బాహుబలసంపన్నుడవైన ఓ మహావీరా! నీకు శుభమగుగాక. రథము సిద్ధముగానున్నది. సీతాలక్ష్మణులతోగూడి వెంటనే దీనిని అధిరోహింపుము." (27)

పిమ్మట శ్రీరాముడు ధనుఃకవచాదులనుదాల్చి, సీతాలక్ష్మణులతో గూడి, రథమునెక్కెను. సుడులు దిరుగుచు, పరవళ్లుత్రొక్కుచు ప్రవహించుచున్న తమసానదియొక్క ఆవలితీరమునకు చేరెను. మహాబాహువు, తేజశ్శాలియునైన శ్రీరాముడు తనవారితో రథము నుండి దిగెను. పిమ్మట దుష్టమృగాదుల భయములేనిదియు, ముండ్లు ముక్కలులేనిదియు, అనుకూలమైనదియు అగు మహామార్గమును అనుసరించెను. (28-29)

అప్పుడు ప్రజలను మభ్యపెట్టుటకై [1](ప్రజలు గ్రహింప లేకుండుటకై) శ్రీరాముడు సుమంత్రునితో "ఓ సారథీ! నీవు త్వరగా రథమునెక్కి, ఉత్తరదిశగా (అయోధ్య వైపుగా) బయలుదేఱుము. కొంతదూరము అటు వేగముగా పోనిచ్చి, మఱల రథమునిటు త్రిప్పుము. ఇట్లు చేసినచో ప్రజలు నాజాడను (నాగమనమార్గమును) తెలిసికొనజాలరు. కావున జాగ్రత్తగా అట్లు చేయుము."(30-31)

శ్రీరామునిఆదేశమును అనుసరించి, సుమంత్రుడు అట్లే గావించెను. మఱల మఱియొక మార్గమున ఆయనను జేరి, శ్రీరాముని ప్రయాణమునకై అచట రథమును సిద్ధముగానుంచెను. (32)

రఘువంశవర్ధనులైన ఆ రామలక్ష్మణులు సీతాదేవితో గూడి (తిరిగివచ్చి) సిద్ధముగానున్న ఆ రథమునెక్కిరి. పిమ్మట ఆ సారథి తపోవనమార్గమున అశ్వములను నడిపించెను. (33)

అంతట సారథి శుభశకునసూచకముగా రథమును ఉత్తరాభిముఖముగా నిలబెట్టెను. పిమ్మట మహారథియైన శ్రీరాముడు తన వారితోగూడి రథముపై వనములకు బయలుదేఱెను. (34)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షట్చత్వారింశస్సర్గః *(46)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదిఆఱవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

1) మభ్యపెట్టుట. అనగా వంచించుట. అది రాముని ఉద్దేశ్యముగాదు. ఇచట శ్రీరాముడు 'ప్రజాచికిత్సాన్యాయము' ను అనుసరించె నన్నట్లు గ్రహింపవలెను. రోగికి చక్కని ఆరోగ్యమునుగూర్చులక్ష్యముతో అతనిప్రాణమునకు వైద్యుడు శస్త్రచికిత్స చేయును. కత్తులతో కోయునప్పుడు తాత్కాలికముగా రోగికి కొంతబాధకలిగినను, ఆ చికిత్సద్వారా ప్రాణబాధపూర్తిగా తొలగిపోవుటచే అతడు ఆరోగ్యవంతుడై జీవించియున్నంతవఱకును హాయిగానుండును. అట్లే ప్రజలను మభ్యపెట్టి శ్రీరాముడు వనములకు వెళ్ళినచో వారు గత్యంతరములేక తిరిగి అయోధ్యకు చేరుదురు. అప్పుడు వారికి వనజీవనబాధలు తప్పును, వారు భార్యాపుత్రులతో గూడి సుఖముగా జీవింతురు.

47. నలుబదిఏడవసర్గము

ప్రజలు నిద్రనుండి మేల్కొనిన పిమ్మట శ్రీరాముడు కన్పింపకపోవుటచే కొంతసేపు లికమకపడుట - పిట్టకేలకు వారు అయోధ్యకు చేరుట - వెలవెలబోవుచున్న ఆ నగరమును జూచి, వారు మిగుల దుఃఖపడుట.

ప్రభాతాయాం తు శర్వర్యాం పౌరాస్తే రాఘవం వినా।
శోకోపహతనిశ్చేష్టా బభూవుర్హతచేతసః। 1

శోకజాశ్రుపరిద్యూనా వీక్షమాణాః తతస్తతః।
ఆలోకమపి రామస్య న పశ్యంతి స్మ దుఃఖితాః। 2

తే విషాదార్తవదనా రహితాస్తేన ధీమతా।
కృపణాః కరుణా వాచో వదంతి స్మ మనస్వినః। 3

ధిగస్తు ఖలు నిద్రాం తాం యయాఽపహృతచేతసః।
నాద్య పశ్యామహే రామం పృథూరస్కం మహాభుజమ్। 4

కథం నామ మహాబాహుః స తథాఽవితథక్రియః।
భక్తం జనం పరిత్యజ్య ప్రవాసం రాఘవో గతః। 5

యో నస్సదా పాలయతి పితా పుత్త్రానివౌరసాన్।
కథం రఘూణాం స శ్రేష్ఠః త్యక్త్వా నో విపినం గతః। 6

ఇహైవ నిధనం యామో మహాప్రస్థానమేవ వా।
రామేణ రహితానాం హి కిమర్థం జీవితం హి నః। 7

సంతి శుష్కాణి కాష్ఠాని ప్రభూతాని మహాంతి చ।
తైః ప్రజ్వాల్య చితాం సర్వే ప్రవిశామోఽథ పావకమ్। 8

కిం వక్ష్యామో మహాబాహుః అనసూయః ప్రియంవదః।
నీతః సరాఘవోఽస్మాభిః ఇతివక్తుం కథం క్షమమ్। 9

సా నూనం నగరీ దీనా దృష్ట్వాఽస్మాన్ రాఘవం వినా।
భవిష్యతి నిరానందా సస్త్రీబాలవయోధికా। 10

రాత్రి గడచినది. సూర్యోదయమైనది. అంతట పౌరులు మేల్కొనిరి. అచట శ్రీరాముడు కనబడకుండుటచే వారు శోకముతో నిశ్చేష్టులై నీరుగారిపోయిరి. వారు దుఃఖభారముచే కన్నీరుగార్చుచు శ్రీరామునికొఱకై అటునిటువెదకిరి. ఎంత గాలించిగాలించిచూచినను ఆ ప్రభువుయొక్క రథచక్రములగుర్తులుసైతము కనబడకపోవుటచే వారు మిగుల ఖిన్నులైరి. (1-2)

ధీశాలియైన శ్రీరామునియొక్క దర్శనభాగ్యమునకు దూరమగుటచే ఆ పౌరులముఖములు విషాదముతో వెలవెలబోయెను. సున్నితమైన మనస్సులుగల ఆనగరవాసులు దీనులై, దిగులుపడుచు ఒకరితోనొకరు ఇట్లు మాట్లాడుకొనసాగిరి. (3)

"ఛీ ఈ పాడునిద్రమత్తులోబడి, మహాభుజబలశాలియు, విశాలవక్షస్స్థలముగలవాడును ఐన శ్రీరాముని నేడు దర్శింపలేకపోయితిమి. నిజముగా ఇది మనదురదృష్టము. (4)

అమోఘకార్యకారుడు, అజానుబాహువు ఐన రాముడు భక్తులమైన మనలను ఇట్లు పరిత్యజించి, ఎట్లువెడలెను? (5)

ఆ రఘువంశశిరోమణి మనలను నిరంతరము కన్నబిడ్డలనువలె కాపాడుచుండెడివాడు. అట్టి ఆ తండ్రి మనలను ఇట్లు దిక్కులేని వారినిగాజేసి అరణ్యములకు ఎట్లు పోగలిగెను? (6)

ఇక మనము ఇక్కడే ప్రాయోపవేశముచేసి, అసువులను విడెదము. లేదా! మరణదీక్షతో ఉత్తరాభిముఖులమై వెళ్లెదము. రామునకు దూరమై మనము జీవించి ప్రయోజనమేమి? అట్లుగానిచో ఇదిగో! ఇక్కడనే పెద్దపెద్ద ఎండిన కట్టెలు బోలెడు పడియున్నవి. వాటికి నిప్పంటించి, ఆచితిమంటలలో మనము ప్రవేశింతము. (7-8)

శ్రీరాముడెక్కడ? అని అయోధ్యలోని వారడిగినచో వారికి మనము ఏమనిచెప్పగలము? 'అజానుబాహువు, అసూయను ఎఱుగనివాడు, ఎల్లప్పుడును ప్రియముగా మాటాడువాడు ఐన శ్రీరాముని అడవులలో విడిచి వచ్చితిమి'. అని వారితో ఎట్లు చెప్పగలము? (9)

అయోధ్యలోని బాలబాలికలు, స్త్రీపురుషులు, వృద్ధులు మున్నగువారందఱును శ్రీరాముడులేని మనలను జూచి ఎంతయు విస్మయమొందుదురు. వారిఆనందములు అదృశ్యములగును. ఇది తథ్యము. (10)

నిర్యాతాస్తేన వీరేణ సహ నిత్యం జితాత్మనా।
విహీనా స్తేన చ పునః కథం పశ్యామ తాం పురీమ్॥ 11

"మనోనిగ్రహముగలవాడును, మహావీరుడును ఐన శ్రీరాముని అనుసరించి మనము వనములకు బయలుదేరితిమి. ఇప్పుడు శ్రీరాముడు లేకుండ మనము మరల అయోధ్యకు వెళ్ళి, అచటి వారికి మనముఖములను ఎట్లు చూపగలము?" (11)

ఇతీవ బహుధా వాచో బాహుముద్యమ్య తే జనాః।
విలపంతి స్మ దుఃఖార్తా వివత్సా ఇవ ధేనవః॥ 12

ఇట్లు ఆ అయోధ్యాప్రజలు పలువిధముల వాపోవుచు చేతులుచాచి, లేగదూడలకు దూరమైన పాడియావులవలె దుఃఖార్తులై విలపించిరి. (12)

తతో మార్గానుసారేణ గత్వా కించిత్ క్షణం పునః।
మార్గనాశాద్విషాదేన మహతా సమభిప్లుతాః॥ 13

వారు ఎట్టకేలకు రథచక్రములజాడలను అనుసరించి, ఒక క్షణకాలముపాటు ముందునకు సాగిరి. కానీ కొంతదూరముపోయిన పిమ్మట ఆ రథమార్గము గుర్తుపట్టలేని స్థితిలో ఉండుటచే వారు అంతులేని విషాదమున మునిగిపోయిరి. (13)

రథస్య మార్గనాశేన న్యవర్తంత మనస్వినః।
కిమిదం కిం కరిష్యామో దైవేనోపహతా ఇతి॥ 14

తతో యథాగతేనైవ మార్గేణ క్లాంతచేతసః।
అయోధ్యామగమన్ సర్వే పురీం వ్యథితసజ్జనామ్॥ 15

శ్రీరామునిరథము వెళ్ళిన దారిని సరిగా గుర్తింపలేక పోవుటచే దిక్కుతోచని ఆ ప్రజలు "ఇదియేమిటి? మనము విధివంచితులమైతిమి. ఇప్పుడేమి చేయగలము?" అని అనుకొనుచు తిరుగుముఖముపట్టిరి. వారి చిత్తములు వికలములై యుండెను. వనములకువెళ్ళినమార్గమును అనుసరించియే వారు తిరిగి అయోధ్యకు చేరిరి. అప్పుడు అయోధ్యలోని జనులెల్లరును వ్యథిత హృదయులైయుండిరి. (14-15)

ఆలోక్య నగరీం తాం చ క్షయవ్యాకులమానసాః।
అవర్తయంత తేఽశ్రూణి నయనైః శోకపీడితైః॥ 16

అట్టినగరమును జూచి వారు మనస్తాపమునకు లోనైరి. కన్నులు వాచిపోవునట్లుగా వారు కన్నీరు మున్నీరుగా విలపించిరి. (16)

ఏషా రామేణ నగరీ రహితా నాతిశోభతే।
ఆపగా గరుడేనేవ హ్రదాదుద్ధృతపన్నగా॥ 17

"మడుగులోని సర్పములు (జలజంతువులు) అన్నియును గరుత్మంతునకు ఆహారమైపోగా, కళతప్పియున్న జలాశయము (నది) వలె శ్రీరాముడు లేని ఆ నగరము శోభావిహీనమైయున్నది." అని వారు తలంచిరి. (17)

చంద్రహీనమివాకాశం తోయహీనమివార్ణవమ్।
అపశ్యన్నిహతానందం నగరం తే విచేతసః॥ 18

చంద్రుడు లేని ఆకాశమువలెను, నీరింకిపోయిన సముద్రమువలెను తేజోరహితమైయున్న ఆ నగరమును జూచి వారు నిశ్చేష్టులైపోయిరి. (18)

తే తాని వేశ్మాని మహాధనాని
దుఃఖేన దుఃఖోపహతా విశంతః।
నైవ ప్రజజ్ఞుః స్వజనం జనం వా
నిరీక్షమాణాః ప్రవినష్టహర్షాః॥ 19

తీవ్రదుఃఖముతో దురపిల్లుచున్న ప్రజలదీనస్థితికి వారి ఆనందములు ఆవిరైపోయెను. ఇండ్లలో సంపదలు కొల్లలుగా ఉన్నను అవి వారిదుఃఖములను తొలగింపలేకుండెను. అట్టి శోకస్థితిలో వారు తమయెదుటనున్న వ్యక్తులలో తమవారెవరో, ఇతరులెవరో గుర్తింపలేకుండిరి. (19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తచత్వారింశస్సర్గః (47)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదియేడవసర్గము సమాప్తము

— * * * —

48. నలుబదిఎనిమిదవసర్గము

శ్రీరామునివీడి అయోధ్యకు తిరిగివచ్చిన పురుషులను వారిపత్నులు నిందించుట - ఆ నగరస్త్రీలు సీతారాములకై విలపించుట.

తేషా మేవం విషణ్ణానాం పీడితానామతీవ చ।
బాష్పవిప్లుతనేత్రాణాం సశోకానాం ముమూర్షయా॥ 1

అనుగమ్య నివృత్తానాం రామం నగరవాసినామ్।
ఉద్గతానీవ సత్త్వాని బభూవురమనస్వినామ్॥ 2

స్వం స్వం నిలయమాగమ్య పుత్త్రదారైః సమావృతాః।
అశ్రూణి ముముచుస్సర్వే బాష్పేణ పిహితాననాః॥ 3

న చాహృష్యన్ న చామోదన్ వణిజో న ప్రసారయన్।
న చాశోభన్త పణ్యాని నాపచన్ గృహమేధినః॥ 4

నష్టం దృష్ట్వా నాభ్యనందన్ విపులం వా ధనాగమమ్।
పుత్త్రం ప్రథమజం లబ్ధ్వా జననీ నాభ్యనందత॥ 5

గృహే గృహే రుదంత్యశ్చ భర్తారం గృహమాగతమ్।
వ్యగర్హయంత దుఃఖార్తా వాగ్భిః తోత్త్రైరివ ద్విపాన్॥ 6

కిం ను తేషాం గృహైః కార్యం కిం దారైః కిం ధనేన వా।
పుత్త్రైర్వా కిం సుఖైర్వాపి యే న పశ్యంతి రాఘవమ్॥ 7

ఏకస్సత్పురుషో లోకే లక్ష్మణస్సహ సీతయా।
యోఽనుగచ్ఛతి కాకుత్స్థం రామం పరిచరన్ వనే॥ 8

ఆపగాః కృతపుణ్యాస్తాః పద్మిన్యశ్చ సరాంసి చ।
యేషు స్నాస్యతి కాకుత్స్థో విగాహ్య సలిలం శుచి॥ 9

శ్రీరాముని అనుసరించి వనములకు వెళ్లియు, విధిలేక మరలి వచ్చిన ఆ అయోధ్యానగరవాసులు ఎక్కిలి విషాదగ్రస్తులైయుండిరి. శోకపీడితులై కన్నీరుమున్నీరుగా పరితపించుచుండిరి. రామునకు దూరముగా బ్రతికియుండుటకంటెను మరణించుటయే యుక్తమని తలపోయుచుండిరి. ధైర్యమును కోల్పోయి దిగాలు పడియుండుటచే వారు జీవచ్ఛవములుగానుండిరి. (ప్రాణములను కోల్పోయిన వారివలెనుండిరి.) వారందఱును తమతమ ఇండ్లకు చేరి, భార్యాపుత్త్రులతో కలిసికొనిరి. ఐనను వారు దుఃఖాతిరేకస్థితినుండి బయటపడలేక జేవురించిన ముఖములతో కన్నీరుకార్చుచునే యుండిరి. (1-3)

ఆప్తమిత్రులు వచ్చి పలుకరించినను ఆగ్యనాస్థులముఖములలో సంతోషచిహ్నములే కనబడకుండెను. అపూర్వవస్తువులు ప్రాప్తించినను వారు మోదమును పొందుటలేదు. ఇంకను వారు నిత్యకార్యకలాపములనిర్వహణకు దిగకుండిరి. కొనువారులేక అంగళ్లన్నియు బోసిపోయియుండెను. ఇండ్లలో శుభకార్యములకు పూనుకొనకుండిరి. ఇంతయేల వంటవార్పులకును దిగకుండిరి. (4)

పోయిన వస్తువాహనములు మరల లభించినను, సమృద్ధిగా సంపదలు వచ్చిపడినను వారిలో సంతోషమే కలుగుటలేదు. మొదటి కాన్పులోనే పండువంటికొడుకు పుట్టినను ఆ తల్లిముఖమున ఆనందము కన్పింపకుండెను. (5)

శ్రీరాముడు లేకుండా ఇండ్లకుచేరిన తమభర్తలను జూచి, ఇల్లాండ్రందఱును మిగుల వగచిరి. అంతేగాక వారు దుఃఖార్తలై, మావటీవాండ్రు అంకుశములతో ఏనుగులను పొడిచినట్లు తీవ్రమైన సూటిపోటిమాటలతో తమభర్తలను దూసిపోసిరి. (6)

"శ్రీరామునిదర్శనమునకు నోచుకొననివారికి ఈ ఇండ్లు వాకిళ్లతో పనియేమి? భార్యాపుత్త్రులెందులకు? ధనధాన్యములతో ఏమి ప్రయోజనము? సుఖభోగముల ప్రసక్తియేల? అంతేగాదు ఈ జీవితముతోమాత్రము వారికి ఏమి పని? (7)

ఈ లోకములో 'లక్ష్మణస్వామి' ఒక్కడే సత్పురుషుడు. సీతారాముల వెంట వనములకు వెళ్లి, నిరంతరము వారికి అచట పరిచర్యలు చేయుచున్న భాగ్యశాలిగదా [1]అతడు. (8)

వనవాససమయమున కాకుత్స్థుడైన శ్రీరాముడు సీతాదేవితో గూడి పవిత్రనదీజలములలో, పద్మసరస్సులలో స్నానముల నాచరించును. ఆ పుణ్యదంపతులస్పర్శతో పునీతమైన ఆనదుల భాగ్యమే భాగ్యము, ఆ పద్మ సరస్సులఅదృష్టమే అదృష్టము. (9)

1) ఏమి దివ్య పరిచర్యసేయు సౌమిత్రి మును । తపమేమి చేసెనో తెలియగా ॥ (శ్రీరామ దయచూడు) సంకీర్తనావళి-పుట 49.

శోభయిష్యంతి కాకుత్స్థమ్ అటవ్యో రమ్యకాననాః।
ఆపగాశ్చ మహానూపాః సానుమంతశ్చ పర్వతాః। 10

కాననం వాపి శైలం వా యం రామోఽభిగమిష్యతి।
ప్రియాతిథిమివ ప్రాప్తం నైనం శక్ష్యంత్యనర్చితుమ్। 11

విచిత్రకుసుమాపీడా బహుమంజరిధారిణః।
రాఘవం దర్శయిష్యంతి నగా భ్రమరశాలినః। 12

అకాలే చాపి ముఖ్యాని పుష్పాణి చ ఫలాని చ।
దర్శయిష్యంత్యనుక్రోశాత్ గిరయో రామమాగతమ్। 13

ప్రస్రవిష్యంతి తోయాని విమలాని మహీధరాః।
విదర్శయంతో వివిధాన్ భూయశ్చిత్రాంశ్చ నిర్ఝరాన్।
పాదపాః పర్వతాగ్రేషు రమయిష్యంతి రాఘవమ్। 14

యత్ర రామో భయం నాత్ర నాస్తి తత్ర పరాభవః।
స హి శూరో మహాబాహుః పుత్రో దశరథస్య చ। 15

పురా భవతి నో దూరాత్ అనుగచ్ఛామ రాఘవమ్। 16

పాదచ్ఛాయా సుఖా భర్తుః తాదృశస్య మహాత్మనః।
స హి నాథో జనస్యాస్య స గతిస్స పరాయణమ్। 17

వయం పరిచరిష్యామః సీతాం యూయం తు రాఘవమ్।
ఇతి పౌరస్త్రియో భర్తౄన్ దుఃఖార్తాస్తత్తదబ్రువన్। 18

యుష్మాకం రాఘవోఽరణ్యే యోగక్షేమం విధాస్యతి।
సీతా నారీ జనస్యాస్య యోగక్షేమం కరిష్యతి। 19

కోన్వనే నాప్రతీతేన సోత్కంఠితజనేన చ।
సంప్రీయేతాఽమనోజ్ఞేన వాసేన హృతచేతసా। 20

కైకేయ్యా యది చేద్రాజ్యం స్యాదధర్మ్యమనాథవత్।
న హి నో జీవితేనార్థః కుతః పుత్రైః కుతో ధనైః। 21

చక్కని లతావృక్షములతోడను, పొదలతోడను నిండిన ఆ అరణ్యప్రదేశములు, నిర్మలజలశోభితములైన నదులు, మనోహరమైన సానువులతో రంజిల్లుచున్న పర్వతములు సీతారాములను ఆనందింపజేయుచుండును. (10)

శ్రీరాముడు కాలుమోపిన ప్రదేశము అది కొండయేయైనను, కాననమేయైనను ఆయనను ఒక పూజ్యుడైన అతిథిగా భావించి, చక్కని ఆదరసత్కారములతో సేవించును, తరించును. (11)

చిత్రవిచిత్రములైన పుష్పకిరీటములను, నానావిధములగు పూలగుత్తులను ధరించి, తుమ్మెదలగుంపులతో శోభిల్లుచున్న వృక్షములు తమ అందచందములతో శ్రీరాముని సంతోషపెట్టు చుండును. (12)

శ్రీరాముడు తమకడకు విచ్చేసినప్పుడు పర్వతములు అకాలము నందైనను (ఋతుధర్మమునుబట్టి అది అనుకూలమైన కాలము కాకున్నను) అత్యావశ్యకములగు పూవులను, పండ్లను భక్తిశ్రద్ధలతో (తమ కడనున్న మొక్కలద్వారా, వృక్షములద్వారా) ఆయనకొఱకై సమకూర్చును. (13)

వనములలోని గిరులు వివిధములగు సెలయేళ్లను చిత్ర విచిత్రములుగా ప్రవహింపజేయుచు, సీతారామలక్ష్మణులకు అవసరమునకు అనువుగా నిర్మలజలములను అందించును. కొండలపై గల వృక్షములు అటునిటు కదలుచు చల్లని గాలులతో వారికి హాయినిగూర్చును. (14)

దశరథమహారాజకుమారుడైన శ్రీరాముడు మిగుల భుజబలము గలవాడు. మహావీరుడు. ఆయన ఉన్నచోట ఏప్రాణికిని భయము ఉండదు. ఎవ్వరికిని అవమానము కలుగదు. అతడు ఎక్కువ దూరము వెళ్లకముందే ఆయునను మనము చేరుదము. (15-16)

అట్టి మహాత్ముడైన ప్రభువుయొక్క అడుగుజాడలను అనుసరించుటయే మనకు శ్రేయస్కరము. మన అందఱికిని అతడే రక్షకుడు, శరణ్యుడు, పరమాశ్రయుడు. (17)

మేము సీతాదేవికిని, మీరు శ్రీరామునకును సేవలు చేయుదము. ఆ అడవులలో మీ యందఱి యోగక్షేమములను ఆ రఘురాముడు చూచుకొనును. మా మంచిచెడ్డలను ఆ సీతామాత చూడగలదు." అని దుఃఖార్తులైయున్న అనగరస్త్రీలు తమభర్తలతో నుడివిరి. (18-19)

ప్రస్తుతపరిస్థితులలో ఈ నగరము సజ్జనులకు నివాసయోగ్యము గాదు. ఇచటివారందఱు శ్రీరామునిపై బెంగపెట్టుకొని యున్నారు. ఇచటి వాతావరణమంతయును చికాకును కలిగించునదిగా ఉన్నది. ఇచ్చటనేయున్నచో మనకు మనశ్శాంతి కఱవగును. ఇట్టి చోట నివసించుటకు ఎవడు ఇష్టపడును? (20)

ఈ రాజ్యముపై అధికారము కైకేయిచేజిక్కినచో ఈ దేశము దిక్కులేనిదై, ఇందు అధర్మము తాండవించును. ఇట్టిచోట జీవించుట నిరర్థకము, రక్షణ లేనట్టి ఈరాజ్యమున ఇక పుత్త్రులతోగాని, సంపదలతోగాని పనియేమి? (21)

యయా పుత్త్రశ్చ భర్తా చ త్యక్తావైశ్వర్యకారణాత్।
కం సా పరిహరేదన్యం కైకేయీ కులపాంసనీ। 22

రాజ్యకాంక్షతో భర్తను కీలుబొమ్మనుగాజేసికొని, కౌసల్యాదేవి పుత్త్రుడైన శ్రీరాముని వనములపాలుచేసి, ఆ కైకేయి ఇక్ష్వాకు వంశమునకే మచ్చదెచ్చినది. అట్టి దుర్మార్గురాలు ఇంక ఎవరిని విడిచిపెట్టును? (22)

కైకేయ్యా న వయం రాజ్యే భృతకా నివసేమ హి।
జీవంత్యా జాతు జీవంత్యః పుత్త్రైరపి శపామహే। 23

కైకేయి జీవించియుండునంతకాలము ఆమెపరిపాలనలో సేవకులమై ఏమాత్రము సుఖముగా బ్రతికియుండజాలము- ఇది మా పిల్లలపై ఒట్టుపెట్టుకొని చెప్పుచున్న మాట. (23)

యా పుత్త్రం పార్థివేంద్రస్య ప్రవాసయతి నిర్ఘృణా।
కస్తాం ప్రాప్య సుఖం జీవేత్ అధర్మ్యాం దుష్టచారిణీమ్। 24

కఠినాత్ముకురాలైన ఆ కైకేయి అధర్మముగా దశరథమహారాజు యొక్క అనుంగుపుత్త్రుడైన శ్రీరాముని వనములకు పంపెను. అట్టి దుర్మార్గురాలిపరిపాలనలో ఎవరుమాత్రము సుఖపడగలరు? (24)

ఉపద్రుతమిదం సర్వమ్ అనాలంబమనాయకమ్।
కైకేయ్యా హి కృతే సర్వం వినాశముపయాస్యతి। 25

కైకేయివలన ఈ రాజ్యప్రజలందఱును ఇక్కట్లపాలగుచు నిరాశ్రయులై, దిక్కులేనివారైపోవుదురు. ఆమెకారణముగా ఈ రాజ్యమంతయు సర్వనాశనము కాగలదు. (25)

న హి ప్రవ్రజితే రామే జీవిష్యతి మహీపతిః।
మృతే దశరథే వ్యక్తం విలాపస్తదనంతరమ్। 26

శ్రీరాముడు వనవాసగతుడైనచో దశరథమహారాజు జీవించి యుండుట దుర్లభము. దశరథుడు మరణించిన పిమ్మట ఇచట వినిపించుచుండునవి విలాపములు మాత్రమే. ఇది తథ్యము. (26)

తే విషం పిబతాఽలోడ్య క్షీణపుణ్యాః సుదుర్గతాః।
రాఘవం వాఽనుగచ్ఛధ్వమ్ అశ్రుతిం వాఽపి గచ్ఛత। 27

మీ అదృష్టములు అడుగంటినవి, దుర్గతులు వచ్చిపడినవి, కనుక ఇప్పుడు మీరు శ్రీరాముని అనుసరించి వనములకు వెళ్లుడు, లేదా! కైకపేరుగూడా వినబడనిచోటికి చేరుడు, లేనిచో విషపానముతో జీవయాత్రను ముగింపుడు. (27)

మిథ్యాప్రవ్రాజితో రామః సభార్యస్సహలక్ష్మణః।
భరతే సన్నిసృష్టాః స్మః సౌనికే పశవో యథా। 28

కైకేయికుట్రకారణముగా సీతారామలక్ష్మణులు వనములపాలైరి. కసాయివానిచేతికి చిక్కిన పశువులవలె మనము భరతుని పాలబడుదుము. (28)

పూర్ణచంద్రాననః శ్యామో గూఢజత్రురరిందమః।
ఆజానుబాహుః పద్మాక్షో రామో లక్ష్మణపూర్వజః। 29

పూర్వాభిభాషీ మధురః సత్యవాదీ మహాబలః।
సౌమ్యశ్చ సర్వలోకస్య చంద్రవత్ ప్రియదర్శనః। 30

నూనం పురుషశార్దూలో మత్తమాతంగవిక్రమః।
శోభయిష్యత్యరణ్యాని విచరన్ స మహారథః। 31

లక్ష్మణునకు అన్నయైన శ్రీరామచంద్రునిముఖము పున్నమనాటి చంద్రునివలె ఆహ్లాదకరమైనది. అతడు శ్యామసుందరుడు. పరిపుష్టము లైన భుజసంధులు గలవాడు, శత్రుభయంకరుడు, ఆజానుబాహువు, కమలనేత్రుడు, వ్యక్తులు కలిసినప్పుడు సౌహార్దముతో ముందుగా భాషించువాడు. మృదుభాషి. సత్యవచనుడు. మిక్కిలి బలశాలి. మృదువైన స్వభావముగలవాడు, ఆయనదర్శనము చంద్రదర్శనము వలె ఆనందదాయకము, గజరాజువలె మిక్కిలి శక్తిసంపన్నుడు. వేయేల? అతడు ఒక మహాపురుషుడు. ఆ మహారథుడు సంచరించుట వలన ఆ అరణ్యములశోభలు ఇనుమడించును." (29-31)

తాస్తథా విలపంత్యస్తు నగరే నాగరస్త్రియః।
చుక్రుశుర్దుఃఖసంతప్తా మృత్యోరివ భయాగమే। 32

ఆ అయోధ్యానగరమునందలి స్త్రీలందఱును అట్లు విలపించుచు అవసానదశలో మృత్యువునకు భయపడుచున్న వారివలె దుఃఖముతో కుమిలిపోవుచున్నవారై, పెడబొబ్బలు పెట్టుచు ఏడువసాగిరి. (32)

ఇత్యేవం విలపంతీనాం స్త్రీణాం వేశ్మసు రాఘవమ్।
జగామాస్తం దినకరో రజనీ చాభ్యవర్తత। 33

ఇట్లు స్త్రీలందఱును తమఇండ్లలో శ్రీరాముని స్మరించుచు విలపించుచుండిరి. ఇంతలో సూర్యుడు అస్తమించెను, చీకట్లు అలముకొనెను. (33)

నష్టజ్వలనసంపాతా ప్రశాంతాధ్యాయసత్కథా।
తిమిరేణాభిలిప్తేవ సా తదా నగరీ బభౌ। 34

అందఱును శ్రీరాముని విడబాటువలన దుఃఖమున మునిగి యుండుటచే అయోధ్యయందలి యేయింటిలోను అగ్నికార్యములు నడచుటయే లేదు. వేదాధ్యయనములు, పురాణప్రవచనములు జరుగుటయే లేదు. ఆ పురమంతయు చీకట్లతో పూయబడినట్లు నిస్తేజమైయుండెను. (34)

ఉపశాంతవణిక్పణ్యా నష్టహర్షా నిరాశ్రయా।
అయోధ్యా నగరీ చాసీత్ నష్టతారమివాంబరమ్। 35

వ్యాపారములు అంగళ్లు అన్నియును మూతపడుటచే జనసంచారము లేకుండెను. ఎక్కడ చూచినను ప్రజలముఖములలో విషాదముతో తప్ప నవ్వులు కనబడుటలేదు. శ్రీరాముడు దూరమైనందున ఆ అయోధ్యాపురము చుక్కలులేని ఆకాశమువలె తేజోవిహీనమై యుండెను. (35)

తథా స్త్రియో రామనిమిత్తమాతురా
యథా సుతే భ్రాతరి వా వివాసితే ।
విలప్య దీనా రురుదుర్విచేతసః
సుతైర్హి తాసామధికో హి సోఽభవత్ । 36

అచటి స్త్రీలందఱును కన్నబిడ్డలో, తోబుట్టువులో దూరమైనట్లు శ్రీరాముని యెడబాటువలన వ్యాకులపాటునకు లోనైరి. వారికి శ్రీరాముడు తమసంతానముకంటెను, సోదరులకంటెను ప్రీతిపాత్రుడు, ఆత్మీయుడు. అందువలన వారు ఆయనకై దైన్యముతో విలపించుచు స్పృహను కోల్పోయిరి. (36)

ప్రశాంత గీతోత్సవనృత్తవాదనా
వ్యపాస్తహర్షా పిహితాపణోదయా ।
తదా హ్యయోధ్యా నగరీ బభూవ సా
మహార్ణవస్సంక్షపితోదకో యథా । 37

నిన్నమొన్నటివఱకును అతివైభవముగా జరుగుచుండెడి సంగీత సభలు, ఉత్సవములు, నృత్యప్రదర్శనలు, వాద్యగోష్ఠులు ఎక్కడికక్కడ ఆగిపోయినవి. సంతోషములు దూరమై, వారి ముఖములు చిన్నబోయి యున్నవి. అంగళ్లన్నియును మూయబడుటచే వీధులన్నియును వెలవెలబోవుచున్నవి. అందువలన అయోధ్యానగరము నీరింకిపోయిన మహాసముద్రమువలె శూన్యమై కన్పట్టుచుండెను. (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టచత్వారింశస్సర్గః *(48)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదియెనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

49. నలుబదితొమ్మిదవసర్గము

సీతారాములను వనములపాలుచేసినందులకు పల్లెప్రజలు కైకేయీదశరథులను తప్పుపట్టుట -
సీతారామలక్ష్మణులు గోమతీనదిని దాటి, స్యందికా (సఈ) నదియొక్క ఆవలితీరమునకు చేరుట.

రామోఽపి రాత్రిశేషేణ తేనైవ మహదంతరమ్।
జగామ పురుషవ్యాఘ్రః పితురాజ్ఞామ్ అనుస్మరన్। 1

పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముడు వేకువజామున తమసానదీతీరమున ప్రజలను విడిచిపెట్టివెళ్లినపిదప, తండ్రియాజ్ఞను గుర్తుచేసికొనుచు సీతాలక్ష్మణులతోగూడి, వనములవైపుగా చాలదూరము ప్రయాణముచేసెను. (1)

తథైవ గచ్ఛతస్తస్య వ్యపాయాద్రజనీ శివా।
ఉపాస్య స శివాం సంధ్యాం విషయాంతం వ్యగాహత। 2

శ్రీరాముని ప్రయాణము ఇట్లుకొనసాగుచుండగా ఇంతలో శుభోదయమయ్యెను. అంతట శ్రీరాముడు పవిత్రమైన ప్రాతస్సంధ్యోపాసనను ముగించుకొని, కోసలదేశమునకు దక్షిణమున గల వివిధజనపదములను దాటుచు ముందునకు సాగెను. (2)

గ్రామాన్ వికృష్టసీమాంతాన్ పుష్పితాని వనాని చ।
పశ్యన్నతియయౌ శీఘ్రం శనైరివ హయోత్తమైః।
శృణ్వన్ వాచో మనుష్యాణాం గ్రామసంవాసవాసినామ్। 3

రథాశ్వములు తిన్నగా నడచుచుండగా, శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి, గ్రామములను, విత్తనములను వేయుటకై దున్ని సిద్ధపఱచబడియున్న పొలములను, చక్కగా పుష్పించియున్న వనములను తిలకించుచు ప్రయాణమును కొనసాగించుచుండెను.

రాజానం ధిగ్దశరథం కామస్య వశమాస్థితమ్।
హా నృశంసాఽద్య కైకేయీ పాపా పాపానుబంధినీ। 4

తీక్ష్ణా సంభిన్నమర్యాదా తీక్ష్ణకర్మణి వర్తతే। 5

యా పుత్రమీదృశం రాజ్ఞః ప్రవాసయతి ధార్మికమ్।
వనవాసే మహాప్రాజ్ఞం సానుక్రోశం జితేంద్రియమ్। 6

కథం నామ మహాభాగా సీతా జనకనందినీ।
సదా సుఖేష్వభిరతా దుఃఖాన్యనుభవిష్యతి। 7

అహో! దశరథో రాజా నిస్స్నేహః స్వసుతం ప్రియమ్।
ప్రజానామనఘం రామం పరిత్యక్తుమిహేచ్ఛతి। 8

ఏతా వాచో మనుష్యాణాం గ్రామసంవాసవాసినామ్।
శృణ్వన్నతియయౌ వీరః కోసలాన్ కోసలేశ్వరః। 9

తతో వేదశ్రుతిం నామ శివవారివహాం నదీమ్।
ఉత్తీర్యాభిముఖః ప్రాయాత్ అగస్త్యాధ్యుషితాం దిశమ్। 10

గత్వా తు సుచిరం కాలం తతఃశివజలాం నదీమ్।
గోమతీం గోయుతానూపామ్ అతరత్ సాగరంగమామ్। 11

గోమతీం చా వ్యతిక్రమ్య రాఘవః శీఘ్రగైర్హయైః।
మయూరహంసాభిరుతాం తతార స్యందికాం నదీమ్। 12

స మహీం మనునా రాజ్ఞా దత్తామిక్ష్వాకవే పురా।
స్ఫీతాం రాష్ట్రావృతాం రామో వైదేహీమన్వదర్శయత్। 13

సూత ఇత్యేవ చాభాష్య సారథిం తమభీక్ష్ణశః।
హంసమత్తస్వరః శ్రీమాన్ ఉవాచ పురుషర్షభః। 14

కదాఽహం పునరాగమ్య సరయ్వాః పుష్పితే వనే।
మృగయాం పర్యటిష్యామి మాత్రా పిత్రా చ సంగతః। 15

నాత్యర్థమభికాంక్షామి మృగయాం సరయూవనే।
రతిర్హ్యేషాఽతులా లోకే రాజర్షిగణసమ్మతా। 16

అప్రయాణసమయమున గ్రామీణులు అనుకొనుచున్న మాటలు ఆయన వినబడెను. "ఛీ! దశరథమహారాజు కామమునకు దాసుడై యెంతపని చేసినాడు? అయ్యయ్యో! కైకేయిది జాలిగుండె. ఆమె పాపాత్మురాలు, ఆమెచేయు పాపములకు అంతులేకున్నది. మహారాజ కుమారుడైన శ్రీరాముడు పరమధార్మికుడు, ఆయన గొప్ప ప్రజ్ఞాశాలి, దయాళువు, జితేంద్రియుడు. అట్టి సత్పురుషుని అడవులకు బంపి, ఆ క్రూరాత్మురాలు లోకమర్యాదలను మంటగలిపినది. ఆమె దుష్కృత్యములకు నిజముగా ఇదే పరాకాష్ఠ. (3-6)

జనకమహారాజుయొక్క గారాలపట్టి, మహాసాధ్వియైన సీతాదేవి సుఖములలో పుట్టిపెరిగినది. ఆమె వనవాసక్లేశములకు ఎట్లు తట్టుకొనగలదు? (7)

అయ్యో! దశరథమహారాజు దయమాలినవాడై, తనకులమంగు సుతుడు, ప్రజలకు ప్రాణతుల్యుడు, పుణ్యాత్ముడు ఐన శ్రీరాముని అరణ్యములపాలు చేసినాడు. ఇట్లు చేయుటకు ఆయనకు మనసు ఎట్లొప్పినది?" (8)

ఈ విధముగా గ్రామీణులు, పల్లెప్రజలు అనుకొనుచున్న మాటలను వినుచు, మహావీరుడైన ఆ ప్రభువు కోసలభూములను దాటి ముందునకు సాగెను. (9)

పిమ్మట శ్రీరాముడు పవిత్రజలములతో ప్రవహించుచున్న 'వేదశ్రుతి' యను పేరుగల నదిని దాటి, అగస్త్యమహర్షి నివసించునట్టి దక్షిణదిశకు ప్రయాణించెను. అతడు ఇట్లు కొంతకాలము ప్రయాణముచేసి, గోమతినదీతీరమునకు చేరెను. అందలి జలములు స్వచ్ఛమైనవి, పరిసరములలో నివసించు గోవుల పాదధూళితో ఆనదీతటములు పునీతములైనవి. ఆ గోమతి సాగరమున సంగమించును. రఘురాముడు అట్టి గోమతీనదిని దాటి, గుఱ్ఱములు వడివడిగా సాగుచుండగా, నెమళ్ళు, హంసలు మొదలగువాటి కలరవములతో నిండిన స్యందికా (నది) నది ఆవలితీరమునకు చేరెను. (10-12)

ధనధాన్యసంపదలతో తులతూగుచు, పెక్కు జనపదములతో విలసిల్లుచున్న ఆ ప్రదేశమును శ్రీరాముడు సీతాదేవికి చూపించెను. పూర్వము మనుప్రభువు ఇక్ష్వాకుమహారాజునకు ఇచ్చియున్న ప్రదేశము ఇదియే. (13)

అంతట సద్గుణసంపన్నుడును, పురుషశ్రేష్ఠుడును ఐన శ్రీరాముడు 'సూత' అని పదేపదే సంబోధించుచు, మదించిన హంసలవలె మృదుమధుర స్వరముతో సారథిని ఉద్దేశించి, ఇట్లు పలికెను. (14)

"ఓ సుమంత్రా! మరల నాకు తల్లిదండ్రులదర్శనభాగ్యము ఎప్పుడు కలుగునో గదా! సరయూనదీ తీరప్రాంతములలోగల ఈ పుష్పవనములలో వినోదముగా విహరించెడి వేటాడు అవకాశము ఎప్పుడు లభ్యునోగదా! కాని ఈ సరయూతీరములయందలి వనములలో వేటాడుటకై నాకు బలీయమైన కాంక్షలేదు. అయితే ప్రత్యేకమైన ఈ వినోదక్రీడమాత్రము లోకమున మహారాజులకు ఇష్టము. (15-16)

రాజర్షీణాం హి లోకేఽస్మిన్ రత్యర్థం మృగయా వనే।
కాలే వృతాం తాం మనుజైః ధన్వినామభికాంక్షితామ్। 17

వనములలో వేటాడుట ఈ లోకమున రాజర్షులకు ఒక వినోదక్రీడగా ప్రచలితమైనది. కనుక మనువంశతిద్వారా ప్రారంభమైన ఈ వినోదక్రీడ క్రమముగా ఇతరధనుర్ధారులకుగూడ అభీష్టమాయెను. (17)

స తమధ్వానమైక్ష్వాకః సూతం మధురయా గిరా।
తం తమర్థమ్ అభిప్రేత్య యయౌ వాక్యముదీరయన్। 18

ఇక్ష్వాకువంశజుడైన ఆ శ్రీరాముడు వివిధములగు విషయములను గూర్చి ఆసుమంత్రునకు మృదుమధురముగా వివరించుచు మార్గమున ముందునకు సాగెను. (18)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనపంచాశస్సర్గః (49)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నలుబదితొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * —

50. ఏబదియవసర్గము

కోసలదేశపుపొలిమేరలకు చేరినపిమ్మట శ్రీరాముడు అయోధ్యకు నమస్కరించుట. అనంతరము వారు గంగాతీరమునగల శృంగిబేరపురమునకు చేరుట గుహుడు వారికి సేవలొనర్చుట - సీతారామలక్ష్మణులు గారచెట్టును ఆశ్రయించి ఆ రాత్రిని అచట గడుపుట.

విశాలాన్ కోసలాన్ రమ్యాన్ యాత్వా లక్ష్మణపూర్వజః।
అయోధ్యాభిముఖో ధీమాన్ ప్రాంజలిర్వాక్యమబ్రవీత్। 1

ధీశాలియైన శ్రీరాముడు విశాలములై మనోహరములైన కోసలదేశపు పొలిమేరలకు చేరి, అయోధ్యవైపునకు మంజలి నమస్కరించుచు ఇట్లు నుడివెను. (1)

ఆపృచ్ఛే త్వాం పురిశ్రేష్ఠే కాకుత్స్థపరిపాలితే।
దైవతాని చ యాని త్వాం పాలయంత్యావసంతి చ। 2

"కాకుత్స్థ వంశజులచే పరిపాలింపబడుచున్న ఓ అయోధ్యా మహానగరమా! ఈ దేశమున సుప్రతిష్ఠితులై, రక్షించుచున్న దేవతలను, నిన్ను నా వనప్రయాణమునకై అనుజ్ఞ ఈయవలసినదిగా వినమ్రముగా వేడుకొనుచున్నాను. (2)

నివృత్తవనవాసస్త్వామ్ అనృణో జగతీపతేః।
పునర్ద్రక్ష్యామి మాత్రా చ పిత్రా చ సహ సంగతః। 3

నేను వనవాసమును ముగించుకొని, మహారాజుగారి ఋణమును దీర్చుకొని, మరల నిన్ను దర్శింతును. అప్పుడు తల్లిదండ్రులను చేరి, వారిని సేవింతును." (3)

తతో రుధిరతామ్రాక్షో భుజముద్యమ్య దక్షిణమ్।
అశ్రుపూర్ణముఖో దీనోఽబ్రవీజ్జానపదం జనమ్। 4

ఎఱుపెక్కి అందమైన కనులుగల శ్రీరాముడు కుడిచేతిని పైకెత్తి కంట తడిబెట్టుచు పొంగిపొఱలి వచ్చుచున్న దుఃఖముతో జానపదులను ఉద్దేశించి ఇట్లు పలికెను. (4)

అనుక్రోశో దయాచైవ యథార్హం మయి వః కృతః।
చిరం దుఃఖస్య పాపీయో గమ్యతామర్థసిద్ధయే। 5

"మీరు పెక్కు శ్రమలకోర్చి నాయందు దయతో మిగుల అదరాభిమానములను చూపి, తోడ్పడితిరి. అందులకు కృతజ్ఞుడను. నావలన మీరు మిగుల కష్టములను సహించితిరి. కనుక మీరు మీమీపనులలో నిమగ్నులు కండు." (5)

తేఽభివాద్య మహాత్మానం కృత్వా చాపి ప్రదక్షిణమ్।
విలపంతో నరా ఘోరం వ్యతిష్ఠంత క్వచిత్ క్వచిత్। 6

అంతట ఆ జానపదులు మహాత్ముడైన శ్రీరామునకు ప్రదక్షిణ పూర్వకముగా ప్రణమిల్లిరి. అనంతరము వారు వెక్కివెక్కి యేడ్చుచు రాముని దర్శించు కోరికతో ఎక్కడివారక్కడ నిలిచిపోయిరి. (6)

తథా విలపతాం తేషామ్ అతృప్తానాం చ రాఘవః।
అచక్షుర్విషయం ప్రాయాత్ యథాఽర్కః క్షణదాముఖే। 7

వారు శ్రీరాముని ఎంతగాదర్శించినను తనివిదీరక విలపించుచు నిలుచుండిరి. అప్పుడు శ్రీరాముడు తన ప్రయాణమును కొనసాగించుచు ప్రదోషకాలమున సూర్యునివలె ఆ పల్లెప్రజలకనుచూపుమేరకు అందనంత దూరమునకు వెళ్ళిపోయెను. (7)

తతో ధాన్యధనోపేతాన్ దానశీలజనాన్ శివాన్।
అకుతశ్చిద్భయాన్ రమ్యాన్ చైత్యయూపసమావృతాన్। 8

శ్రీరాముడు ప్రయాణముచేయుచున్న ఆ కోసలప్రదేశములు అన్నియును ధనధాన్యసంపదలతో వెల్లివిరియుచుండెను. అచటి ప్రజలు ఎల్లరును ఉదారముగా దానధర్మములను చేయుచుండెడివారు.

ఉద్యానామ్రవనోపేతాన్ సంపన్నసలిలాశయాన్।
తుష్టపుష్టజనాకీర్ణాన్ గోకులాకులసేవితాన్। 9

లక్షణీయాన్ నరేంద్రాణాం బ్రహ్మఘోషాభినాదితాన్।
రథేన పురుషవ్యాఘ్రః కోసలానత్యవర్తత। 10

ఆ ప్రదేశములన్నియును పరిశుభ్రముగా ఉండెను. అచటివారు నిర్భయముగా జీవించుచుండిరి. అవి దేవాలయములతోడను, యజ్ఞములకు సంబంధించిన యూపస్తంభములతోను ఒప్పుచు రమ్యముగా ఉండెను. అచటి ఉద్యానవనములు, మామిడితోపులు, చక్కని జలాశయములు ఆ జనపదములకు శోభలను గూర్చుచుండెను. అచటివారు అందరును పుష్టకాయులై సంతోషముతో జీవించుచుండిరి. ఆ ప్రదేశములన్నియును ఆవులమందలతో అలరారుచుండెను. ఆ పల్లెలన్నియును ప్రభువులసంరక్షణలో సురక్షితములై యుండెను. నిరంతరము అవి వేదఘోషలతో ప్రతిధ్వనించుచుండెను. అట్టి సుసంపన్నములైన, కోసలప్రదేశములను అన్నింటిని అధిగమించి పురుషశ్రేష్ఠుడైన ఆ శ్రీరాముడు రథముపై వెళ్లిపోవుచుండెను. (8-10)

మధ్యేన ముదితం స్ఫీతం రమ్యోద్యానసమాకులమ్।
రాజ్యం భోగ్యం నరేంద్రాణాం యయౌ ధృతిమతాం వరః। 11

మహాధైర్యవంతులలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు కోసలదేశపు పొలిమేరలనుదాటినపిమ్మట సర్వవిధములుగా సుసంపన్నమైన ఒక దేశమునకు మధ్య (నడిమి) భాగముద్వారా ప్రయాణముచేసెను. ఆదేశము సుఖసంతోషములకు నెలవైనది, మిక్కిలి విశాలమైనది, అది కనువిందుగావించు ఉద్యానవనములతో విలసిల్లుచుండెను, అది సామంతరాజులచే అనుభవింప (పాలింప) బడుచుండెను.(11)

తత్ర త్రిపథగాం దివ్యాం శివతోయామశైవలామ్।
దదర్శ రాఘవో గంగాం పుణ్యామ్ ఋషినిషేవితామ్। 12

ఆ దేశమున త్రిపథగామినియైన (స్వర్గమర్త్యపాతాళలోకములలో ప్రవహించునట్టిదియైన) దివ్య గంగానది ప్రవహించుచుండెను. ఏమాత్రము నాచులేనిదై, నిర్మలజలములతో రమ్యమై, మహర్షులచే సేవింపబడుచున్న ఆ పవిత్రగంగానదిని శ్రీరాముడు దర్శించెను.(12)

ఆశ్రమైరవిదూరస్థైః శ్రీమద్భిః సమలంకృతామ్।
కాలేఽప్సరోభిర్హృష్టాభిః సేవితాంభోహ్రదాం శివామ్। 13

ఆ పవిత్రగంగానదీసమీపమునగల ఋషులఆశ్రమములు దర్శనీయములై యుండెను. అచ్చటచ్చట ఆ నదీతీరమునగల స్నానఘట్టములలో అప్సరసలు అప్పుడప్పుడు సంతోషముతో జలక్రీడలు సలుపుచుందురు. (13)

దేవదానవగంధర్వైః కిన్నరైరుపశోభితామ్।
నానాగంధర్వపత్నీభిః సేవితాం సతతం శివామ్। 14

దేవతలు, దానవులు, గంధర్వులు, కిన్నరులు, వివిధ గంధర్వ జాతులకు చెందిన స్త్రీలు మొదలగువారు తమకు అనుకూలరీతిలో నిర్మలగంగాజలములలో స్నానపానములొనర్చుచు విహరించుచుందురు. వారివిహారములచేతన ఆనదీతీరములశోభలు ఇనుమడించు చుండును. (14)

దేవాఽఽక్రీడశతాకీర్ణాం దేవోద్యానశతాయుతామ్।
దేవార్థమాకాశగమాం విఖ్యాతాం దేవపద్మినీమ్। 15

జగత్ప్రసిద్ధమైన ఆ నదీతీరములయందు దేవతలు విహరించుటకు అనువుగా చక్కని క్రీడాపర్వతములు, రమ్యములైన ఉద్యానవనములు అసంఖ్యాకముగా అలరారుచుండెను. ఆ నది దివ్యపద్మములతో విలసిల్లుచు దేవతలకొఱకై ఆకాశమున ప్రవహించి "ఆకాశగంగ"గా వాసిగాంచెను. (15)

జలాఘాతాట్టహాసోగ్రాం ఫేననిర్మలహాసినీమ్।
క్వచిద్వేణీకృతజలాం క్వచిదావర్తశోభితామ్। 16

అట్టహాసములతోగూడిన ఆ గంగానదీజలపాతములశబ్దములు భయమును గొలుపుచుండెను. నిర్మల తరంగములపైగల నురుగులు ఆ నదియొక్క చిఱునవ్వులను ప్రదర్శించుచుండెను. అక్కడక్కడ వేణి ప్రవాహంపు ఆవర్తములు ఆ నదియొక్క జడలుగా శోభిల్లుచుండెను. ఆ నదిలోని సుడిగుండములు మోదముప్పటగా నుండెను. (16)

క్వచిత్ స్తిమితగంభీరాం క్వచిద్వేగజలాకులామ్।
క్వచిత్ గంభీరనిర్ఘోషాం క్వచిద్భైరవనిస్స్వనామ్। 17

దేవసంఘాప్లుతజలాం నిర్మలోత్పలశోభితామ్।
క్వచిదాభోగపులినాం క్వచిన్నిర్మలవాలుకామ్। 18

హంససారససంఘుష్టాం చక్రవాకోపకూజితామ్।
సదామత్తైశ్చ విహగైః అభిసన్నాదితాంతరామ్।
క్వచిత్తీరరుహైర్వృక్షైః మాలాభిరుపశోభితామ్। 19

క్వచి త్ఫుల్లోత్పలచ్ఛన్నాం క్వచిత్పద్మవనాకులామ్।
క్వచిత్కుముదషండైశ్చ కుట్మలైరుపశోభితామ్। 20

నానాపుష్పరజోధ్వస్తాం సమదామివ చ క్వచిత్।
వ్యపేతమలసంఘాతాం మణినిర్మలదర్శనామ్। 21

దిశాగజైర్వనగజైః మత్తైశ్చ వరవారణైః।
దేవోపవాహ్యైశ్చ ముహుః సన్నాదితవనాంతరామ్। 22

ప్రమదామివ యత్నేన భూషితాం భూషణోత్తమైః।
ఫలైః పుష్పైః కిసలయైః వృతాం గుల్మైర్ద్విజైస్తథా। 23

శింశుమారైశ్చ నక్రైశ్చ భుజంగైశ్చ నిషేవితామ్।
విష్ణుపాదచ్యుతాం దివ్యామ్ అపాపాం పాపనాశినీమ్।
తాం శంకరజటాజూటాత్ భ్రష్టాం సాగరతేజసా। 24

సముద్రమహిషీం గంగాం సారసక్రౌంచనాదితామ్।
ఆససాద మహాబాహుః శృంగిబేరపురం ప్రతి। 25

తామూర్మికలిలావర్తామ్ అన్వవేక్ష్య మహారథః।
సుమంత్రమబ్రవీత్ సూతమ్ ఇహైవాద్య వసామహే। 26

ఆ నది కొన్నిచోట్ల స్తిమితముగా గంభీరముగను, కొన్నితావుల ఉవ్వెత్తుతరంగములతో వేగముగను ప్రవహించుచుండెను. కొన్ని ప్రదేశములయందు ఆ నదీతరంగధ్వనులు మృదంగవాదములను తలపింపజేయుచుండెను. కొన్నిచోట్ల ఆ నది పిడుగులుపడినట్లు భయంకరధ్వనులను కావించుచుండెను. (17)

ఆ నదీతీరములయందుగల కొన్ని ఘట్టములలో దేవతలు మునకలు వేయుచుండిరి. కొన్ని ప్రదేశములు నల్లకలువలతో శోభిల్లుచుండెను. ఆ నదీతీరములు విశాలమైన మెత్తని ఇసుకతిన్నెలతో విలసిల్లుచుండెను. (18)

అది హంసలధ్వనులతోడను, బెగ్గురుపక్షులకలకలములతోడను, చక్రవాకములకూజితములతోడను, మదించిన పక్షుల రవముల తోడను వింతగొలుపుచుండెను. తీరములయందలి వృక్షములపంక్తులు ఆ నదికి మాలలుగా శోభిల్లుచుండెను. బాగుగా వికసించిన కలువలు, విప్పారిన పద్మములు అచటచట దట్టముగా అలముకొనియుండుటచే కొన్నితావులయందు నదీజలములు కనబడకుండెను. కొన్నిచోట్ల ఆ నది తెల్లకలువలతోడను, ఎఱ్ఱదామరలతోడను, మొగ్గలతోడను మనోహరముగా నుండెను. (19-20)

కొన్నితావులు పుప్పొడులతో నిండియుండెను. మరికొన్ని ప్రదేశములు మత్తిల్లిన మగువవలె మందగమనముగలవైయుండెను. ఆ నది మాలిన్యరహితమై మణులవలె స్వచ్ఛ(నిర్మల)మైన జలములతో దర్శనీయముగానుండెను. (21)

దిగ్గజములు, మదించిన అడవియేనుగులు, దేవతలకు వాహనములైన గజరాజులు ఆ గంగాజలములలో దిగి మాటిమాటికిని ఘీంకారములు సలుపుచుండుటచే అచటి వనములు అన్నియును ప్రతిధ్వనించు చుండెను. (22)

పల్లవములు ఫలపుష్పములుగల వృక్షములతోడను, పొదలతోడను, పక్షులతోడను విలసిల్లుచున్న తీరములుగల ఆ గంగానది ప్రయత్నపూర్వకముగా చక్కని ఆభరణములను అలంకరించుకొనియున్న అతివవలె అలరారుచుండెను. (23)

ఆనది పాదములుగల జలజంతువుల తోడను, మొసళ్లతోడను, సర్పములతోడను గూడియుండెను. విష్ణుపాదమునుండి అవతరించుటచే అది పవిత్రమైనది. అంతేగాక తనజలములలో స్నానమొనర్చువారి పాపములను అది కడిగివేయును. సగరవంశజుడైన భగీరథుని తపోమహిమచే ఆ గంగ పరమశివుని జటాజూటమునుండి భువికి జేరి లోకపావనియైనది. (24)

సముద్రునిపట్టమహిషియైన ఆ గంగానదియందు బెగ్గురు పక్షులు, క్రౌంచపక్షులు కలరవములు చేయుచు తిరుగాడుచుండెను. మహాబాహువైన శ్రీరాముడు గంగానదీతీరమునకు చేరెను. ఆ నదీ తీరముననే శృంగిబేరపురము గలదు. (25)

మహారథుడైన ఆ రఘురాముడు సుడులుదిరుగుచున్న జలములతో తరంగములతో ఒప్పుచున్న ఆనదిని వీక్షించి, రథసారథియైన సుమంత్రునితో ఇట్లనెను. 'నేడు మనము ఇచ్చటనే నివసింతము.

అవిదూరాదయం నద్యా బహుపుష్పప్రవాళవాన్।
సుమహానింగుదీవృక్షో వసామోఽత్రైవ సారథే!। 27

ద్రక్ష్యామః సరితాం శ్రేష్ఠాం సమ్మాన్యసలిలాం శివామ్।
దేవదానవగంధర్వమృగమానుషపక్షిణామ్। 28

లక్ష్మణశ్చ సుమంత్రశ్చ బాఢమిత్యేవ రాఘవమ్।
ఉక్త్వా తమింగుదీవృక్షం తదోపయయతుర్హయైః। 29

రామోఽభియాయ తం రమ్యం వృక్షమ్ ఇక్ష్వాకునందనః।
రథాదవతరత్ తస్మాత్ సభార్యః సహలక్ష్మణః। 30

సుమంత్రోఽప్యవతీర్యాస్మాత్ మోచయిత్వా హయోత్తమాన్।
వృక్షమూలగతం రామమ్ ఉపతస్థే కృతాంజలిః। 31

తత్ర రాజా గుహో నామ రామస్యాఽఽత్మసమస్సఖా।
నిషాదజాత్యో బలవాన్ స్థపతిశ్చేతి విశ్రుతః। 32

స శ్రుత్వా పురుషవ్యాఘ్రం రామం విషయమాగతమ్।
వృద్ధైః పరివృతోఽమాత్యైః జ్ఞాతిభిశ్చాప్యుపాగతః। 33

తతో నిషాదాధిపతిం దృష్ట్వా దూరాదుపస్థితమ్।
సహ సౌమిత్రిణా రామః సమాగచ్ఛత్ గుహేన సః। 34

తమార్తః సంపరిష్వజ్య గుహో రాఘవమబ్రవీత్।
యథాఽయోధ్యా తథేయం తే రామ కిం కరవాణి తే। 35

ఈదృశం హి మహాబాహో! కః ప్రాప్స్యత్యతిథిం ప్రియమ్। 36

తతో గుణవదన్నాద్యమ్ ఉపాదాయ పృథగ్విధమ్।
అర్ఘ్యం చోపానయత్ క్షిప్రం వాక్యం చేదమువాచ హ। 37

స్వాగతం తే మహాబాహో! తవేయమఖిలా మహీ।
వయం ప్రేష్యా భవాన్ భర్తా సాధు రాజ్యం ప్రశాధి నః। 38

భక్ష్యం భోజ్యం చ పేయం చ లేహ్యం చేదముపస్థితమ్।
శయనాని చ ముఖ్యాని వాజినాం ఖాదనం చ తే। 39

గుహ మేవం బ్రువాణం తు రాఘవః ప్రత్యువాచ హ।
అర్చితాశ్చైవ హృష్టాశ్చ భవతా సర్వథా వయమ్।
పద్భ్యామభిగమాచ్చైవ స్నేహసందర్శనేన చ। 40

ఓ సారథీ! ఈ నదీసమీపముననే ఒక పెద్ద గారవృక్షముగలదు. అది చిగురుటాకులతో పెక్కు పుష్పములతోగూడి శోభిల్లుచున్నది. ఆ చెట్టునీడలో నివసించుదము. పవిత్రములైన మధురజలములు గలదియు, దేవ, దానవ, గంధర్వులచేతను మానవాళిచేతను, మృగముల చేతను, పక్షులచేతను సేవింపబడుచున్నదియు అగు ఈ మహానదిని మనము దర్శింతము." (26-28)

అంతట లక్ష్మణుడును, సుమంత్రుడును ఆ రఘునందనుని మాటలకు తలలూపి, రథమును గారచెట్టు కడకు చేర్చిరి. (29)

రమ్యమైన ఆ చెట్టునీడలో ఆగిన అరథము నుండి శ్రీరాముడు సీతా లక్ష్మణులతోగూడి క్రిందికి దిగెను. (30)

సుమంత్రుడుగూడ రథమునుండి దిగి, ఆ ఉత్తమాశ్వములను రథమునుండి విప్పెను. పిదప అతడు చెట్టుక్రింద చేరియున్న శ్రీరామునకు నమస్కరించుచు ఆయనసమీపమున నిలబడెను. (31)

'గుహుడు' అనునతడు ఆ ప్రదేశమునకు అధిపతి, అతడు శ్రీరామునకు భక్తుడు, ఆత్మీయుడు, మిత్రుడు, నిషాదజాతివాడు. చతురంగబలములుగలవాడు. ఉత్తమపరిపాలకుడుగా పరమభక్తుడుగా వాసిగాంచిన వాడు. (32)

మహాపురుషుడైన శ్రీరాముడు తనదేశమునకు విచ్చేసినవార్తను విని, అతడు వృద్ధులతో, మంత్రులతో, తనజాతివారితోగూడి ఆయనను సమీపించెను. (33)

పిమ్మట శ్రీరాముడు తనకడకు వచ్చుచున్న నిషాదరాజైన గుహుని దూరమునుండియే చూచి, లక్ష్మణునితో గూడి ఎదురేగి, అతనిని కలిసికొనెను. (34)

అంతట గుహుడు నారచీరలను ధరించియున్న శ్రీరాముని చూచి సంతప్తుడై, ఆయనను కౌగిలించుకొని, ఇట్లనెను. "ప్రభూ! ఈ రాజ్యము మీకు అయోధ్యవంటిది. నేను మీసేవకుడను. ఏమిచేయవలెనో తెలుపుడు. ఓ మహాబాహూ! మీవంటి ప్రియమైన అతిథి ఎవరికి లభించును.?" (35-36)

అనంతరము ఆ గుహుడు వెంటనే వివిధములైన రుచికరములగు అన్నపానీయములను తెప్పించెను, ఆ స్వామికి అర్ఘ్యపాద్యాది సత్కారములను నెఱపెను, పిదప ఆయనతో ఇట్లనెను. (37)

"ఓ మహాబాహూ! మీకు స్వాగతము, ఈ రాజ్యమంతయును మీదే. మీరు మాకు ప్రభువులు, మేము పరిచారకులము. కావున సాదరముగా ఈ రాజ్యమును పరిపాలింపుడు. భక్ష్యములు (అన్నము మొదలగునవి) భోజ్యములు, (పాయసాదులు) పానకములు మొదలగునవియును, లేహ్యములును ఇచట సిద్ధముగానున్నవి. అందఱును ఆరగింపుడు. చక్కని శయ్యలు ఏర్పాటు చేయబడినవి. గుఱ్ఱములకు గడ్డి మొదలగు ఆహారపదార్థములు సిద్ధమొనర్పబడినవి." (38-39)

ఈ విధముగా పలుకుచున్న గుహునితో శ్రీరాముడిట్లనెను. "ఓ మిత్రమా! నీవు కాలినడకతో ఇంతదూరము వచ్చి, స్నేహ సద్భావములను ప్రకటించితివి. నీవు చూపిన ఆదరాభిమానములే మాకు సకలసత్కారములు. పూర్తిగా ప్రసన్నులమైతిమి." (40)

భుజాభ్యాం సాధుపీనాభ్యాం పీడయన్ వాక్యమబ్రవీత్। 41

దిష్ట్యా త్వాం గుహ! పశ్యామి హ్యరోగం సహ బాంధవైః।
అపి తే కుశలం రాష్ట్రే మిత్రేషు చ ధనేషు చ। 42

యత్త్విదం భవతా కించిత్ ప్రీత్యా సముపకల్పితమ్।
సర్వం తదనుజానామి న హి వర్తే ప్రతిగ్రహే। 43

కుశచీరాజినధరం ఫలమూలాశినం చ మామ్।
విద్ధి ప్రణిహితం ధర్మే తాపసం వనగోచరమ్। 44

అశ్వానాం ఖాదనేనాహమ్ అర్థీ నాన్యేన కేనచిత్।
ఏతావతాఽత్ర భవతా భవిష్యామి సుపూజితః। 45

ఏతే హి దయితా రాజ్ఞః పితుర్దశరథస్య మే।
ఏతైః సువిహితైరశ్వైః భవిష్యామ్యహమర్చితః। 46

అశ్వానాం ప్రతిపానం చ ఖాదనం చైవ సోఽన్వశాత్।
గుహస్తత్రైవ పురుషాం స్త్వరితం దీయతామితి। 47

తతశ్చీరోత్తరాసంగః సంధ్యామన్వాస్య పశ్చిమామ్।
జలమేవాదదే భోజ్యం లక్ష్మణేనాఽఽహృతం స్వయమ్। 48

తస్య భూమౌ శయానస్య పాదౌ ప్రక్షాళ్య లక్ష్మణః।
సభార్యస్య తతోఽభ్యేత్య తస్థౌ వృక్షముపాశ్రితః। 49

గుహోఽపి సహ సూతేన సౌమిత్రిమనుభాషయన్।
అన్వజాగ్రత్ తతో రామమ్ అప్రమత్తో ధనుర్ధరః। 50

తథా శయానస్య తతోఽస్య ధీమతో
యశస్వినో దాశరథేర్మహాత్మనః।
అదృష్టదుఃఖస్య సుఖోచితస్య సా
తదా వ్యతీయాయ చిరేణ శర్వరీ। 51

పిదప శ్రీరాముడు బలమైన తనబాహువులతో గుహుని కౌగిలించుకొని ఇట్లు పలికెను. "ఓ మిత్రమా! నీవును, నీబంధువులును క్షేమముగా నున్నందులకు నాకు సంతోషము. నీ రాష్ట్రప్రజలు, నీమిత్రులు, నీధనసంపదలు భద్రమేగదా! మీరు ఆదరాభిమానములతో మాకై ఈ అన్నపానాదులను సమకూర్చినందులకు సంతోషించు చున్నాను. కాని వీటిని నేను ప్రతిగ్రహింపజాలను. ఏలనన ప్రస్తుతము నేను పితృవాక్యపరిపాలన ధర్మమునకు బద్ధుడనై వనములయందు తాపసిగానున్నాను. కనుక నారచీరలు, మృగచర్మమును ధరించియుంటిని. ఫలమూలాదులే నాకు ఆహారములు, దీనిని గమనింపుము. (41-44)

మీరు సమకూర్చిన పదార్థములలో అశ్వగ్రాసమును మాత్రము స్వీకరింతును. మిగిలిన వాటితో పనిలేదు. మీరు అన్యథా భావింపవలదు. ఇప్పుడు ఈ మాత్రపు మీ సహకారమే మాకు ఒక గొప్ప సత్కారము. మాతండ్రియైన దశరథమహారాజునకు ఈ అశ్వములు మిక్కిలి ఇష్టమైనవి. ఇవి హాయిగానుండునట్లు పోషణ జరిగినచో అది మాకు జరిగిన చక్కని సత్కారమేయగును." (45-46)

పిదప ఆ గుహుడు 'ఈ అశ్వములకు కావలసిన గ్రాసమును, నీటిని వెంటనే ఏర్పాటుచేయుడు' అని తనఅనుచరులను ఆజ్ఞాపించెను. (47)

అనంతరము శ్రీరాముడు తనవల్కలమును (నారచీరను) ఉత్తరీయముగా ధరించి, సాయంసంధ్యోపాసనను పూర్తిచేసెను. లక్ష్మణుడు స్వయముగా తీసికొనివచ్చిన జలమును ఆహారముగా స్వీకరించెను. (48)

పిమ్మట లక్ష్మణుడు శ్రీరామునకు పాదప్రక్షాళనమొనర్చెను. పిదప శ్రీరాముడు ఆచమనము చేసి, నేలమీద తృణశయ్యపై భార్యతోగూడి శయనించెను. అప్పుడు వారికి కొంతదూరముగా ఒక చెట్టుకడ లక్ష్మణుడు నిలబడియుండెను. (49)

గుహుడును ధనుర్ధారియై, సుమంత్రునితో గూడి, లక్ష్మణునితో సంభాషించుచు, శ్రీరామునిరక్షణ విషయమున అప్రమత్తుడై, ఆ రాత్రియంతయు [1]మేల్కొనియుండెను. (50)

ధీశాలియు, పేరు ప్రతిష్ఠలుగలవాడును, మహాత్ముడును ఐన శ్రీరాముడు సుఖములలో పుట్టిపెరిగినవాడు, దుఃఖమనుమాటయే యెఱుగనివాడు. అట్టి అతడు నేలమీద తృణశయ్యపై పరుండుటచే (నిద్రపట్టక) ఆయనకు ఆరాత్రి దీర్ఘముగా తోచెను. (51)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచాశస్సర్గః *(50)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదియవసర్గము సమాప్తము

-- * * * --

1) కోసలదేశమునుదాటినపిమ్మట శ్రీసీతారామలక్ష్మణులకు ఇది మొదటిరాత్రి. వారు తమ 14 సంవత్సరములవనవాసదీక్షను ముగించుకొని, మరల అయోధ్యకుచేరెడివఱకును లక్ష్మణుడు నిద్రాహారములను మానివైచి, సీతారాములను సేవించుచువచ్చెను. ఆ లక్ష్మణస్వామియొక్క సేవాతత్పరతయు, దీక్షాదక్షతలును అట్టివి.

51. ఏబదియొకటవసర్గము

నిషాదరాజుసమక్షమున లక్ష్మణుని పరితాపము.

తం జాగ్రతమదంభేన భ్రాతురర్థాయ లక్ష్మణమ్।
గుహస్సంతాపసంతప్తో రాఘవం వాక్యమబ్రవీత్॥ 1

ఇయం తాత సుఖా శయ్యా త్వదర్థమ్ ఉపకల్పితా।
ప్రత్యాశ్వసిహి సాధ్వస్యాం రాజపుత్ర్ర యథాసుఖమ్॥ 2

ఉచితోఽయం జనస్సర్వః క్లేశానాం త్వం సుఖోచితః।
గుప్త్యర్థం జాగరిష్యామః కాకుత్స్థస్య వయం నిశామ్॥ 3

నహి రామాత్ ప్రియతమో మమాస్తి భువి కశ్చన।
బ్రవీమ్యేతదహం సత్యం సత్యేనైవ చ తే శపే॥ 4

అస్య ప్రసాదాదాశంసే లోకేఽస్మిన్ సుమహద్యశః।
ధర్మావాప్తించ విపులామ్ అర్థావాప్తిం చ కేవలామ్॥ 5

సోఽహం ప్రియసఖం రామం శయానం సహ సీతయా।
రక్షిష్యామి ధనుష్పాణిః సర్వతో జ్ఞాతిభిస్సహ॥ 6

నహి మేఽవిదితం కించిత్ వనేఽస్మింశ్చరతస్సదా।
చతురంగం హ్యపి బలం సుమహత్ ప్రసహేమ హి॥ 7

లక్ష్మణస్తం తదోవాచ రక్ష్యమాణాస్త్వయానఘ।
నాత్ర భీతా వయం సర్వే ధర్మమేవానుపశ్యతా॥ 8

కథం దాశరథౌ భూమౌ శయానే సహ సీతయా।
శక్యా నిద్రా మయా లబ్ధుం జీవితం వా సుఖాని వా॥ 9

యో న దేవాసురైస్సర్వైః శక్యః ప్రసహితుం యుధి।
తం పశ్య సుఖసంవిష్టం తృణేషు సహ సీతయా॥ 10

యో మంత్రతపసా లబ్ధో వివిధైశ్చ పరిశ్రమైః।
ఏకో దశరథస్యైష పుత్త్రస్సదృశలక్షణః॥ 11

శ్రీరామునిపై గల సహజానురాగముచే లక్ష్మణుడు తనఅన్న రక్షణవిషయమున కడుజాగరూకుడై ఆరాత్రియందు మేల్కొనియుండెను. (ఒక రాజకుమారుడైన) శ్రీరామునియొక్క ఈ కష్టదశను జూచి, గుహుడు మిగుల సంతప్తుడై లక్ష్మణునితో ఇట్లు పలికెను. (1)

"నాయనా! ఓ రాజకుమారా! నీకొఱకై ఈ చక్కనిశయ్య ఏర్పఱచబడినది. దీనిపై హాయిగా విశ్రమింపుము. ఇక్కడనున్న మేమందఱము మీ సేవకులము. వనవాసులముగావున ఎట్టి కష్టములకైనను తట్టుకొనగలము. కాని నీవు సుఖముగా పెఱిగినవాడవు. కనుక విశ్రమింపుము. మేమందఱమును శ్రీరాముని రక్షణకై ఈ రాత్రియంతయు మెలకువతోనుండెదము. (2-3)

ఈలోకమున నాకు రామునికంటె ప్రియమైనవాడు మఱియొకడు లేనే లేడు. ఇది యథార్థము. దైవసాక్షిగా చెప్పుచున్నాను. (4)

నాకు శ్రీరామునిఅనుగ్రహము ఒక్కటియున్న చాలును. తదనుగ్రహప్రభావమున నాకు ఈలోకమున శాశ్వతమైన కీర్తియు, పరమధర్మప్రాప్తియు, అపారమైన ధనసంపదలు లభ్యును. (5)

నేను శ్రీరామునకు ప్రియమిత్రుడను. ఆయనఅనుగ్రహమును కోరుకొనుచున్నవాడను. శయనించుచున్న ఈ సీతారాములరక్షణవిషయమున నేను నావారితోగూడి, ధనుర్ధారినై అన్నివిధముల జాగరూకుడనైయుందును. (6)

ఈ అడవియందులంతటను నేను సంచరించియుంటిని. ఇందునాకు తెలియనిదేలేదు. ఎంతటి చతురంగబలములు వచ్చి మీద బడినను వాటిని మేము నిలువరింపగలము." (7)

అంతట లక్ష్మణుడు ఆ గుహునితో ఇట్లనెను. "ఓ పుణ్యపురుషా! ధర్మాత్ముడవైన నీవు మమ్ములను రక్షించుచునేయున్నావు. ఈ విషయమున మాకెట్టిభయముూలేదు. (8)

సీతారాములు ఈ విధముగా నేలపై శయనించి యుండగా నాకు నిద్రయెట్లు పట్టును? మనస్సునకు ఊరటయెట్లు చేకూరును? సుఖాలోచనలు ఎట్లు వచ్చును? (9)

దేవాసురులందఱు కలిసియైనను యుద్ధరంగమున శ్రీరాముని ఎదుర్కొనజాలరు. అంతటి మహావీరుడు గూడ నేడు గడ్డిపరకల సెజ్జనే సుఖతల్పముగా భావించి, సీతాదేవితో గూడి శయనించి యున్నాడు, చూడుము. (10)

దశరథమహారాజు గాయత్రి మొదలగు మంత్రజపములు చేయుటచేతను, చాంద్రాయణాదివ్రతములను, గొప్పగొప్పతపస్సులను ఆచరించుటవలనను, పుత్రకామేష్టి మొదలగు యజ్ఞములనొనర్చిన కారణముననూ ఆయనకు శ్రీరాముడు పుత్త్రుడుగా లభించెను.

అస్మిన్ ప్రవ్రాజితే రాజా న చిరం వర్తయిష్యతి।
విధవా మేదినీ నూనం క్షిప్రమేవ భవిష్యతి॥ 12

వినద్య సుమహానాదం శ్రమేణోపరతాః స్త్రియః।
నిర్ఘోషోపరతం చాతో మన్యే రాజనివేశనమ్॥ 13

కౌసల్యా చైవ రాజా చ తథైవ జననీ మమ।
నాశంసే యది జీవంతి సర్వే తే శర్వరీమిమామ్॥ 14

జీవేదపి హి మే మాతా శత్రుఘ్నస్యాన్వవేక్షయా।
తద్దుఃఖం యత్తు కౌసల్యా వీరసూర్వినశిష్యతి॥ 15

అనురక్తజనాకీర్ణా సుఖా లోకప్రియావహా।
రాజవ్యసనసంస్పృష్టా సా పురీ వినశిష్యతి॥ 16

కథం పుత్రం మహాత్మానం జ్యేష్ఠం ప్రియమపశ్యతః।
శరీరం ధారయిష్యంతి ప్రాణా రాజ్ఞో మహాత్మనః॥ 17

వినష్టే నృపతౌ పశ్చాత్ కౌసల్యా వినశిష్యతి।
అనంతరం చ మాతాఽపి మమ నాశముపైష్యతి॥ 18

అతిక్రాంతమతిక్రాంతమ్ అనవాప్య మనోరథమ్।
రాజ్యే రామమనిక్షిప్య పితా మే వినశిష్యతి॥ 19

సిద్ధార్థాః పితరం వృత్తం తస్మిన్ కాలేఽప్యుపస్థితే।
ప్రేతకార్యేషు సర్వేషు సంస్కరిష్యంతి భూమిపమ్॥ 20

రమ్యచత్వరసంస్థానాం సువిభక్తమహాపథామ్।
హర్మ్యప్రాసాదసంపన్నాం గణికావరశోభితామ్॥ 21

అన్ని లక్షణములచేతను ఆ మహారాజునకు సదృశుడే ఈతడు. శ్రీరాముడనెడి ఆ ప్రభువునకు ఎంతో కష్టము. ఆ ప్రభువు వనవాసి యైన పుత్రునియెడబాటునకు తట్టుకొనలేక ఎక్కువకాలము జీవింపజాలడు. ఫలితముగా ఈ భూమండలము (కోసలదేశము) దిక్కులేనిదియగును. (11-12)

ఓ నిషాదరాజా! శ్రీరాముడు వనములకు ఏతెంచుటతో అయోధ్య లోని అంతఃపురస్త్రీలందఱును బిగ్గరగా ఏడ్చి, అలసిపోయి నిద్రించుందురు. అందువలన శబ్దరహితమై రాజభవనమునందంతటను నిశ్శబ్దము ఆవరించి యుండునని తలంతును. (13)

రామజనని కౌసల్యాదేవియు, మహారాజు దశరథుడును, నా తల్లి సుమిత్రాదేవియు, వీరందఱును ఈ రాత్రివఱకు జీవించి యుందురోలేదో? చెప్పజాలను. ఒకవేళ సుమిత్రామాత శత్రుఘ్నుని కొఱకైనను జీవించియుండుట సంభవమేమోగాని వీరపుత్రునిగన్న కౌసల్యాజనని మరణించుననెడి ఆలోచన మాత్రము నన్ను పెక్కిలి క్రుంగదీయుచున్నది. (14-15)

అయోధ్యాప్రజలందఱును మహారాజుపై గాఢమైన అనురాగములు గలవారే. ఆ నగరము ఎల్లరకును సుఖసంతోషములను గూర్చునది. రాజు మృతిచెందినచో ఆ నగరవాసులు అందఱును పెక్కురీతుల వ్యథచెందుదురు. పరిణామమున ఆపురము నిర్మానుష్యమగును. సద్గుణసంపన్నుడును, జ్యేష్ఠుడును అగు ప్రియసుతుడు కనుల యెదుటలేక దూరముగా వెళ్ళిపోయినచో మహాత్ముడైన (సుతిమెత్తని మనస్సుగలవాడైన) దశరథమహారాజుయొక్క ప్రాణములు ఆయన శరీరమున ఎట్లు నిలిచియుండగలవు? (16-17)

మహారాజు (దశరథుడు) తన ప్రాణములను వీడినచో వెంటనే కౌసల్యామాతయు అసువులను కోల్పోవును. అనంతరము మాతల్లి సుమిత్రాదేవియు వారినేయనుసరించును. (18)

మాతండ్రి దశరథుడు శ్రీరామునియువరాజపట్టాభిషిక్తుని గావింపదలచియు, తనప్రయత్నము భంగమగుటచే మనోరథము నెఱవేఱకపోవుటచే, (అయ్యో! శ్రీరాముని అభివృద్ధినిగూర్చి నేను గన్నకలలన్నియును కల్లలైపోయెనేయని) అతడు మిగుల కుమిలి పోవుచు దివంగతుడగును. (19)

మాతండ్రి అట్లు మరణించుటయే సంభవించినచో ఆ సమయమున అయోధ్యసమీపమున ఉండి మహారాజునకు సమస్తప్రేతసంస్కారములను ఆచరించునట్టివారే (భరతాదులే) వాస్తవముగా కృతార్థులు, వారే అదృష్టవంతులు. మేము అభాగ్యమునకు నోచుకొనలేదు. (20)

ఆ అయోధ్యానగరము చూడముచ్చటైన వీధులకూడళ్లతోడను, ఇండ్లముంగిళ్లతోడను అలరారుచుండును. అందలి రాజమార్గములు విశాలములై, చక్కగా రూపుదిద్దుకొని, గృహాపంక్తులతో విరాజిల్లు చుండును. అందు సంపన్నుల హర్మ్యములు, దేవమందిరములు, రాజభవనములు కనువిందుగావెలుగుచుండును. ఆ పురము

రథాశ్వగజసంబాధాం తూర్యనాదవినాదితామ్।
సర్వకల్యాణసంపూర్ణాం హృష్టపుష్టజనాకులామ్। 22

ఆరామోద్యానసంపన్నాం సమాజోత్సవశాలినీమ్।
సుఖితా విచరిష్యంతి రాజధానీం పితుర్మమ। 23

అపి జీవేద్దశరథో వనవాసాత్ పునర్వయమ్।
ప్రత్యాగమ్య మహాత్మానమ్ అపి పశ్యేమ సువ్రతమ్। 24

అపి సత్యప్రతిజ్ఞేన సార్ధం కుశలినా వయమ్।
నివృత్తే వనవాసేఽస్మిన్ అయోధ్యాం ప్రవిశేమ హి। 25

పరిదేవయమానస్య దుఃఖార్తస్య మహాత్మనః।
తిష్ఠతో రాజపుత్రస్య శర్వరీ సాఽత్యవర్తత। 26

తథాహి సత్యం బ్రువతి ప్రజాహితే
నరేంద్రపుత్రే గురుసౌహృదాద్గుహః ।
ముమోచ బాష్పం వ్యసనాభిపీడితో
జ్వరాతురో నాగ ఇవ వ్యథాతురః । 27

ఎల్లప్పుడును దేవదాసీగణములనృత్యగానవినోదములతో శోభిల్లుచుండును. అచటివీధులు అటునిటు సంచరించుచున్న రథములతో, అశ్వములతో, గజములతో నిండియుండును. ఆ పట్టణము వివిధ వాద్యనాదములతో మేళతాళములతో ప్రతిధ్వనించుచుండును. కల్యాణోత్సవములు, పుత్రజన్మాది మహోత్సవములు మున్నగు వేడుకలతో కలకలలాడుచుండును. అందరి ప్రజలు చక్కని శరీరపుష్టి గలిగి, ఆరోగ్యభాగ్యములతో, సుఖశాంతులతో వర్ధిల్లుచుందురు. అచటి పుష్పవాటికలు, ఉద్యానవనములు, క్రీడా మైదానములు మనోహరముగానుండును. సమాజమునకు సంబంధించిన హరికథలు, పురాణప్రవచనములు, నాటకప్రదర్శనములు ఆ పురజనులకు వినోద విలాసములను, మనోవికాసమును గూర్చుచుండును. మాతండ్రిగారి రాజధానియైన అట్టి అయోధ్యానగరమునందు సుఖసంతోషములతో జీవించు ప్రజలభాగ్యమే భాగ్యము. (21-23)

మేము మావనవాసదీక్షను ముగించుకొని తిరిగి వచ్చువఱకును, మాతండ్రి దశరథుడు జీవించియుండునా? సత్యవ్రతుడైన ఆ మహాత్మునిదర్శనభాగ్యము మరల మాకు అబ్బునా? (24)

శ్రీరామునివనవాసవ్రతము ముగిసిన పిమ్మట, మేము అయోధ్యను చేరునప్పటికి సత్యసంధుడగు దశరథమహారాజు క్షేమముగా ఉండునా? మరల ఆయనను చూచెడి అదృష్టము మాకుపట్టునా?" (25)

మహాత్ముడును, రాజకుమారుడును ఐన లక్ష్మణస్వామి ఈ విధముగా దుఃఖార్తుడై పరితపించుచుండగా ఆరాత్రి గడచిపోయెను. ప్రజలమేలుకొఱకై పాటుపడెడు రాజపుత్రుడగు లక్ష్మణుడు అన్నయగు శ్రీరామచంద్రునిపైగల అనురాగకారణమున ఈ విధముగా వాస్తవ విషయములను వివరించుచుండెను. ఆ పలుకులను వినుచున్న నిషాదరాజగు గుహుడు దుఃఖపీడితుడై, జ్వరబాధకులోనైన గజరాజువలె మిక్కిలి వ్యాకులపాటుతో కన్నీరు కార్చెను. (26-27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకపంచాశస్సర్గః *(51)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదియొకటవసర్గము సమాప్తము

-- * * * --

52. ఏబదిరెండవసర్గము

శ్రీరాముని సూచనపై గుహుడు నావను సిద్ధము చేయించుట - పిమ్మట రఘువరుడు సుమంత్రునకు నచ్చజెప్పి అతనిని వీడ్కొనుట -వారు నావను ఎక్కి గంగను దాటునప్పుడు సీతాదేవి గంగను పూజించుట - వారు ఆవలితీరమునకు చేరి వత్సదేశమున ప్రవేశించుట

ప్రభాతాయాం తు శర్వర్యాం పృథువక్షా మహాయశాః ।
ఉవాచ రామః సౌమిత్రిం లక్ష్మణం శుభలక్షణమ్। 1

రాత్రి గడచిన పిమ్మట సుప్రభాతవేళ, విశాలవక్షస్థలశోభితుడును, మిక్కిలి వాసిగాంచినవాడును అగు శ్రీరాముడు సుమిత్రాదేవికుమారుడును, సకలశుభలక్షణములుగలవాడును ఐన లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (1)

భాస్కరోదయకాలోఽయం గతా భగవతీ నిశా।
అసౌ సుకృష్ణో విహగః కోకిలస్తాత! కూజతి। 2

బర్హిణానాం చ నిర్ఘోషః శ్రూయతాం నదతాం వనే।
తరామ జాహ్నవీం సౌమ్య! శీఘ్రగాం సాగరంగమామ్। 3

"నాయనా! శుభప్రదమైన రాత్రి ముగిసినది. ఇది సూర్యోదయసమయము. నల్లని పక్షియైన ఈ కోకిల కంఠధ్వనిని వినిపించుచున్నది. వనమున నాట్యములు చేయుచున్న నెమళ్ల క్రేంకారములు వినబడుచున్నవి. ఓ సౌమ్యుడా! సముద్రమున గలియుటకై పరుగిడుచున్న ఈ గంగానదిని దాటి ఆవలి తీరమునకు చేరుదము. తగిన ఏర్పాట్లను చూడుము (2-3)

విజ్ఞాయ రామస్య వచః సౌమిత్రిర్మిత్రనందనః।
గుహమామంత్ర్య సూతం చ సోఽతిష్ఠద్ భ్రాతురగ్రతః। 4

శ్రీరాముని ఆదేశవచనములను గ్రహించి, మిత్రులకు ఆనందమును గూర్చువాడైన లక్ష్మణుడు, నిషాదరాజైన గుహుని, రథసారథియైన సుమంత్రుని పిలిచి 'అన్నగారి మాటలను మీరును విన్నారుగదా!' అని పలికి, తాను అగ్రజునియెదుట నిలిచెను. (4)

స తు రామస్య వచనం నిశమ్య ప్రతిగృహ్య చ।
స్థపతిస్తూర్ణమాహూయ సచివానిదమబ్రవీత్। 5

శ్రీరాముని పలుకులను విన్న ఆ గుహుడు వాటిని శిరోధార్యములుగా భావించెను. వెంటనే అతడు తన సచివులను పిలిచి వారితో ఇట్లనెను.(5)

అస్య వాహనసంయుక్తాం కర్ణగ్రాహవతీం శుభామ్।
సుప్రతారాం దృఢాం తీర్థే శీఘ్రం నావముపాహర। 6

"చక్కని చుక్కాని కలిగి కర్ణధారి (చుక్కాని పట్టువాని)తో గూడినదియు, భద్రమైనదియు, దృఢముగానున్నట్టిదియు, ప్రయాణము చేయువారిని క్షేమముగా గమ్యమునకు చేర్చగలదియు అగు ఒకమంచి నావను శ్రీరామునినిమిత్తమై రేవునందు సిద్ధముగానుంచుడు." (6)

తం నిశమ్య సమాదేశం సహామాత్యగణో మహాన్।
ఉపోహ్య రుచిరాం నావం గుహాయ ప్రత్యవేదయత్। 7

అంతట గుహునిముఖ్యసచివులు అతనిఆదేశమును శిరసావహించి, వెంటనే అందమైన ఒక నావను రేవునకు చేర్చి, ఆ విషయమును గుహునకు నివేదించిరి. (7)

తతస్స ప్రాంజలిర్భూత్వా గుహో రాఘవమబ్రవీత్।
ఉపస్థితేఽయం నౌర్దేవ! భూయః కిం కరవాణి తే। 8

తవామరసుతప్రఖ్య! తర్తుం సాగరగాం నదీమ్।
నౌరియం పురుషవ్యాఘ్ర! తాం త్వమారోహ సువ్రత। 9

అప్పుడుగుహుడు శ్రీరామునికడ ప్రాంజలియై నిలిచి, ఇట్లనుడివెను. "స్వామీ! రేవులో నావ సిద్ధముగానున్నది. ఇంకను మీకొఱకై ఏమిచేయవలెనో తెలుపుము. దివ్యతేజస్సుగల! ఓ నరశ్రేష్ఠుడా! పితృవాక్యపరిపాలనవ్రతమును ఆచరించుచున్న ఓ రామా! సముద్రపర్యంతము ప్రవహించుచున్న ఈ గంగానదిని దాటుటకై నావ సిద్ధపఱుపబడినది. దయతో దానిని అధిరోహింపుడు.(8-9)

అథోవాచ మహాతేజా రామో గుహమిదం వచః।
కృతకామోఽస్మి భవతా శీఘ్రమారోప్యతామితి। 10

అంతట మహాతేజస్వియైన శ్రీరాముడు గుహునితో "నాకు చక్కగా సహాయపడితివి. ఈ ధనుస్సు, గంప మొదలగువానిని నావలోనికి చేర్చుము." అని పలికెను. (10)

తతః కలాపాన్ సన్నహ్య ఖడ్గౌ బద్ధ్వా చ ధన్వినౌ।
జగ్మతుర్యేన తౌ గంగాం సీతయా సహ రాఘవౌ। 11

పిదప ఆ రామలక్ష్మణులు కవచములను, తూణీరములను ధరించి, నడుములకు ఖడ్గములను కట్టుకొని, ధనుర్ధారులై, సీతాదేవితో గూడి గంగానదిరేవునకు చేరిరి. (11)

రామమేవ తు ధర్మజ్ఞమ్ ఉపగమ్య వినీతవత్।
కిమహం కరవాణీతి సూతః ప్రాంజలిరబ్రవీత్। 12

అప్పుడు సుమంత్రుడు ధర్మజ్ఞుడైన శ్రీరాముని కడకుచేరి, వినయముతో నమస్కరించి, "నేను ఏమిచేయవలయునో సెలవిండు" అనియనెను. (12)

తతోఽబ్రవీద్దాశరథిస్సుమంత్రం
స్పృశన్ కరేణోత్తమదక్షిణేన ।
సుమంత్ర! శీఘ్రం పునరేవ యాహి
రాజ్ఞస్సకాశే భవచాప్రమత్తః । 13

నివర్తస్వేత్యువాచైనమ్ ఏతావద్ధి కృతం మమ।
రథం విహాయ పద్భ్యాం తు గమిష్యామో మహావనమ్। 14

పిదప శ్రీరాముడు తనకుడిచేతితో సుమంత్రుని తనువును స్పృశించుచు ఇట్లు పలికెను. "ఓ సుమంత్రా! వెంటనే మఱల రాజుగారి కడకు వెళ్లుము. అచట అప్రమత్తుడవై ఉండుము. రాజాజ్ఞమేరకు మేము ఇంతవఱకును (ఈ గంగాతీరమువఱకును) రథముపై ప్రయాణము చేసితిమి. ఇక ఇక్కడనుండి రథమును వీడి కాలినడకతో వనములకు వెళ్లుదుము. నీవు మఱలివెళ్లుము." (13-14)

అథార్తనం త్వభ్యనుజ్ఞాతమ్ అవేక్ష్యాఽఽర్తస్స సారథిః।
సుమంత్రః పురుషవ్యాఘ్రమ్ ఐక్ష్వాకమిదమబ్రవీత్॥ 15

నాతిక్రాంతమిదం లోకే పురుషేణేహ కేనచిత్।
తవ సభ్రాతృభార్యస్య వాసః ప్రాకృతవద్వనే॥ 16

న మన్యే బ్రహ్మచర్యేఽస్తి స్వధీతే వా ఫలోదయః।
మార్దవార్జవయోర్వాపి త్వాం చేద్వ్యసనమాగతమ్॥ 17

సహ రాఘవ! వైదేహ్యా భ్రాత్రా చైవ వనే వసన్।
త్వం గతిం ప్రాప్స్యసే వీర! త్రీన్ లోకాంస్తు జయన్నివ॥ 18

వయం ఖలు హతా రామ! యే త్వయా హ్యుపవంచితాః।
కైకేయ్యా వశమేష్యామః పాపాయా దుఃఖభాగినః॥ 19

ఇతి బ్రువన్నాత్మసమం సుమంత్రః సారథిస్తథా।
దృష్ట్వా దూరగతం రామం దుఃఖార్తో రురుదే చిరమ్॥ 20

తతస్తు విగతే బాష్పే సూతం స్పృష్టోదకం శుచిమ్।
రామస్తు మధురం వాక్యం పునః పునరువాచ తమ్॥ 21

ఇక్ష్వాకూణాం త్వయా తుల్యం సుహృదం నోపలక్షయే।
యథా దశరథో రాజా మాం న శోచేత్ తథా కురు॥ 22

శోకోపహతచేతాశ్చ వృద్ధశ్చ జగతీపతిః।
కామభారావసన్నశ్చ తస్మాదేతద్బ్రవీమి తే॥ 23

యద్యదాజ్ఞాపయేత్ కించిత్ స మహాత్మా మహీపతిః।
కైకేయ్యాః ప్రియకామార్థం కార్యం తదవికాంక్షయా॥ 24

ఏతదర్థం హి రాజ్యాని ప్రశాసతి నరేశ్వరాః।
యదేషాం సర్వకృత్యేషు మనో న ప్రతిహన్యతే॥ 25

యద్యథా స మహారాజో నాలీకమధిగచ్ఛతి।
న చ తామ్యతి దుఃఖేన సుమంత్ర కురు తత్తథా॥ 26

అయోధ్యకు మరలివెళ్ళుటకై తనను శ్రీరాముడు ఆదేశింపగా రథసారథియైన ఆ సుమంత్రుడు వ్యాకులచిత్తుడై పురుషశ్రేష్ఠుడైన ఆ రఘునందనునితో ఇట్లు పలికెను. (15)

"ఓ రామా! సోదరుడగు లక్ష్మణునితోడను, భార్యయగు సీతాదేవితోడను నీవు ఒక సామాన్యమానవునివలె వనవాసము చేయవలసి వచ్చినది. ఇది విధివిలాసము. దీనిని ఈ లోకమున ఎవ్వడును అతిక్రమింపజాలడు. బ్రహ్మచర్యవ్రతపాలనము, వేదశాస్త్రాధ్యయనము, మృదుస్వభావము, ఋజువర్తనము సత్ఫలదాయకములని శాస్త్రములు చెప్పుచున్నవి. కాని ఈ శుభలక్షణములన్నియు కలిగిన మీరు ఈ వనవాసదుఃఖములకు లోనైతిరి. దీనినిబట్టి చూడగా అవి ఎంతవరకు సత్ఫలములను ఇచ్చునవియో తెలియలేకున్నాను. (16-17)

మహావీరుడవైన ఓ రాఘవా! జనకునికూతురగు సీతాదేవితో, సోదరుడగు లక్ష్మణునితోగూడి తండ్రిమాటను నిలుపుటకై ఇట్లు వనములలో నివసించుటవలన ముల్లోకములను జయించిన వానివలె (వామనావతారమున ముల్లోకములను ఆక్రమించిన శ్రీమహావిష్ణువువలె) కీర్తిగాంచెదవు. (18)

ఓ రామా! మేము ఎంతయు దురదృష్టవంతులము. మీరును మమ్ములను దూరముచేయుచున్నారు. ఇంక మేము పాపాత్మురాలైన కైకేయికడ అణగిమణగి పడియుండి, దుఃఖములను అనుభవింపవలసి యున్నది" అని తనకు ప్రాణతుల్యుడైన శ్రీరామునితో పలుకుచు, సారథియైన సుమంత్రుడు తనను వీడి, దూరముగా వెళ్ళుచున్న శ్రీరామునిజూచి, దుఃఖార్తుడై, చాలసేపు కన్నీరు మున్నీరుగా విలపించెను. (19-20)

కొంతతడవునకు సుమంత్రుడు కన్నీటిని ఆపుకొని, ముఖము కడుగుకొని ఆచమించెను. పిమ్మట అతనితో శ్రీరాముడు పదేపదే మధురముగా ఇట్లు పలికెను. (21)

'ఓ సుమంత్రా! నాదృష్టిలో ఇక్ష్వాకువంశజులకు నీవంటిమిత్రుడు మఱియొకడు లేడు. కావున నాగుఱించిన దశరథునిదుఃఖమును తొలగించుభారము నీదే. ఆ మహారాజు వృద్ధుడు, పైగా ఆయన విఫలమనోరథుడై (ఆయన సంకల్పించిన రాజ్యాభిషేకము భంగమగుటచే) శోకభారముచే క్రుంగిపోయియున్నాడు. అందువలన నేను ఇంతగా చెప్పుచుంటిని. (22-23)

మహాత్ముడైన దశరథమహారాజు కైకేయిని సంతోషపెట్టుటకై ఏయే పనులను అప్పగించునో వాటినన్నింటిని సాదరముగా నిర్వహింపుము. ఇదియే నాప్రార్థన. (24)

రాజులు తమఅభీష్టములు నిర్విఘ్నముగా నెఱవేఱుటకే రాజ్యపాలన చేయుచుందురు. (25)

ఓ సుమంత్రా! ఆ మహారాజునకు ఏమాత్రము అప్రియము కలుగకుండునట్లుగను, ఆయన దుఃఖితుడు కాకుండునట్లుగను చూడుము. (26)

అదృష్టదుఃఖం రాజానం వృద్ధమార్యం జితేంద్రియమ్।
బ్రూయాస్త్వమభివాద్యైవ మమ హేతోరిదం వచః। 27

నైవాహమనుశోచామి లక్ష్మణో న చ మైథిలీ।
అయోధ్యాయాశ్చ్యుతాశ్చేతి వనే వత్స్యామహేతి చ। 28

చతుర్దశసు వర్షేషు నివృత్తేషు పునః పునః।
లక్ష్మణం మాం చ సీతాం చ ద్రక్ష్యసి క్షిప్రమాగతాన్। 29

ఏవముక్త్వా తు రాజానం మాతరం చ సుమంత్ర మే।
అన్యాశ్చ దేవీః సహితాః కైకేయీం చ పునః పునః। 30

ఆరోగ్యం బ్రూహి కౌసల్యామ్ అథ పాదాభివందనమ్।
సీతాయా మమ చాఽఽర్యస్య వచనాల్లక్ష్మణస్య చ। 31

బ్రూయాశ్చాపి మహారాజం భరతం క్షిప్రమానయ।
ఆగతశ్చాపి భరతః స్థాప్యో నృపమతే పదే। 32

భరతం చ పరిష్వజ్య యౌవరాజ్యేఽభిషిచ్య చ।
అస్మత్ సంతాపజం దుఃఖం న త్వామభిభవిష్యతి। 33

భరతశ్చాపి వక్తవ్యో యథా రాజని వర్తసే।
తథా మాతృషు వర్తేథా సర్వాస్వేవావిశేషతః। 34

యథా చ తవ కైకేయీ సుమిత్రా చ విశేషతః।
తథైవ దేవీ కౌసల్యా మమ మాతా విశేషతః। 35

తాతస్య ప్రియకామేన యౌవరాజ్యమపేక్షతా।
లోకయోరుభయోశ్శక్యం నిత్యదా సుఖమేధితుమ్। 36

నివర్త్యమానో రామేణ సుమంత్రశ్శోకకర్శితః।
తత్సర్వం వచనం శ్రుత్వా స్నేహాత్ కాకుత్స్థమబ్రవీత్। 37

యదహం నోపచారేణ బ్రూయాం స్నేహాదవిక్లబః।
భక్తిమానితి తత్తావత్ వాక్యం త్వం క్షంతుమర్హసి। 38

కథం హి త్వద్విహీనోఽహం ప్రతియాస్యామి తాం పురీమ్।
తవ తావద్వియోగేన పుత్రశోకాకులామివ। 39

సరామమపి తావన్మే రథం దృష్ట్వా తదా జనః।
వినా రామం రథం దృష్ట్వా విదీర్యేతాపి సా పురీ। 40

జితేంద్రియుడును, పూజ్యుడును, ఇంతవఱకును దుఃఖమును ఎఱుగనివాడును, వృద్ధుడును ఐన మహారాజునకు నాకుమాఱుగా పాదాభివందనమొనర్చి, ఆయనతో ఈ మాటలను పలుకుము. (27)

"అయోధ్యను వీడి, వనములలో నివసింపవలసి వచ్చినందులకు నేనుగాని, లక్ష్మణుడుగాని, సీతాదేవిగాని (మేమెవ్వరమూ) బాధపడుటలేదు. పదునాలుగు సంవత్సరముల వనవాసదీక్షను పూర్తిచేసికొని, వెంటనే నేనును, లక్ష్మణుడును, సీతాదేవియు తిరిగివచ్చి మీ సమక్షమున వాలుదుము. అప్పుడు మీరు మమ్ములను తనివిదీర చూడగలరు." అని మహారాజుతో పలుకుము. ఓ సుమంత్రా! మాతల్లిదండ్రులతోడను, ఇతరమాతలతోడను, ఆ కైకేయితోడను, 'పరిక్షేమసమాచారములనుగూర్చి అడిగినట్లు' తెలుపుము. నేనును, సీతయు, చిన్నారి లక్ష్మణుడును కౌసల్యామాతకు పాదాభివందనములను ఆచరించినట్లు వచింపుము. (28-31)

మహారాజుగారికిని మేము నమస్కరించినట్లు నుడువుము. వెంటనే తాతగారి ఇంటినుండి భరతుని అయోధ్యకు తీసికొనిరమ్ము. రాజుగారి అభీష్టానుసారము అతనిని యువరాజ పట్టాభిషిక్తుని గావింపుము. యువరాజైన భరతుని హృదయమునకు హత్తుకొని ఆనందింపుము. ఆ సంతోషముతో ఈ దుఃఖము (మేము దూరమగుట వలన కలిగినదుఃఖము) తొలగిపోవును." (32-33)

పిదప భరతునితో ఇట్లనుము. "మహారాజునందువలెనే తల్లులందఱి యెడల (తారతమ్యములను చూపక) సమానగౌరవముతో ప్రవర్తింపుము. నీతల్లియగు కైకేయినివలెనే సుమిత్రా మాతను, మా జనని కౌసల్యాదేవిని విశేషముగా ఆదరింపుము. (34-35)

తండ్రిగారిఅభీష్టానుసారము నీవు యువరాజువై రాజకార్యములను నెఱవేర్చుచుండుము. దానివలన ఇహ పరలోకసుఖములు నీకు విరివిగా లభించును." (36)

'అయోధ్యకు మఱలివెళ్లుము' అనుచు శ్రీరాముడు పలికిన మాటలను పూర్తిగావినినంతనే సుమంత్రుడు మిక్కిలి దిగులుపడెను. పిమ్మట శ్రీరామునిపైగల ప్రేమాతిశయముచే అతడిట్లు పల్కెను. "రామా! నీమీది చనవుకొలది ఇప్పుడు నీతో పలుకుచున్న మాటలలో నమ్రతలోపించినను, లోకమర్యాదకు భంగము ఏర్పడినను నేను నీ భక్తుడనుగాన ఆ దృష్టితో నన్ను క్షమింపుము. నీయెడబాటువలన అయోధ్యానగరము పుత్రునికోల్పోయిన తల్లివలె వ్యాకులపాటునకు లోనైనది. నీవు లేకుండా అట్టి అయోధ్యకు నేను ఎట్లు వెళ్ళగలను? (37-39)

అచటినుండి బయలుదేఱి వచ్చునప్పుడు అయోధ్యాపురవాసులు శ్రీరామునితో శోభిల్లుచున్న ఈ రథమును జూచిరి. నేనొక్కడనే మఱలివెళ్లినచో నీవు లేని ఈ రథమునుజూచి ఆ ప్రజలు గుండెపగులుదురు. (40)

దైన్యం హి నగరీ గచ్ఛేత్ దృష్ట్వా శూన్యమిమం రథమ్।
సూతావశేషం స్వం సైన్యం హతవీరమివాఽఽహవే। 41

శ్రీరాముడు లేకుండా ఒక్కసారథితో మాత్రమే కూడియున్న ఈ శూన్యరథమునుజూచి, రణరంగమున నాయకుని కోల్పోయిన సైన్యమువలె అయోధ్యానగరము దిక్కులేనిదై దైన్యమునకు లోనగును. (41)

దూరేఽపి నివసంతం త్వాం మానసేనాగ్రతః స్థితమ్।
చింతయంత్యోఽద్య నూనం త్వాం నిరాహారాఃకృతాఃప్రజాః। 42

నీవు దూరముగానున్నను, ప్రజలు నిన్ను తమహృదయములలో నిలుపుకొనియున్నందున, నీవు వారియెదుటనేయున్నట్లు తలపోయుచుందురు. వారు ఎల్లప్పుడును నీధ్యానలోనేయుందురుగాన వారికి ఆకలిదప్పులే పట్టవు. (42)

దృష్టం తద్ధి త్వయా రామ! యాదృశం త్వత్ప్రవాసనే।
ప్రజానాం సంకులం వృత్తం త్వచ్ఛోకక్లాంతచేతసామ్। 43

ఆర్తనాదో హి యః పౌరైః ముక్తస్త్వద్విప్రవాసనే।
సరథం మాం నిశామ్యైవ కుర్యుః శతగుణం తతః। 44

ఓ రామా! నీవు వనవాసమునకు బయలుదేరునప్పుడు నీయెడబాటునకు తట్టుకొనలేక ప్రజలు వ్యాకులచిత్తులై పడిన క్షోభను నీవును చూచియుంటివి గదా! నీవు లేకుండా నేనొక్కడనే రథముతో మరలి వెళ్ళినచో, ప్రజలు దానిని జూచి నాడు (నీవనప్రయాణసమయమున) చేసిన ఆర్తనాదములకంటెను నేడు నూఱురెట్లుగా హాహాకారములు సలుపుదురు. (43-44)

అహం కించాపి వక్ష్యామి దేవీం తవ సుతో మయా।
నీతోఽసౌ మాతులకులం సంతాపం మాకృథా ఇతి। 45

అసత్యమపి నైవాహం బ్రూయాం వచనమీదృశమ్।
కథమప్రియమేవాహం బ్రూయాం సత్యమిదం వచః। 46

'ఓ దేవీ! నీకుమారుని మేనమామ ఇంటికి తీసికొనివెళ్ళితిని, సంతాపమును వీడుము', అని నీతల్లియైన కౌసల్యాదేవితో నేను చెప్పుదునా? కాని ఇట్టి అసత్యవచనమునుమాత్రము నేను పలుకజాలను. అట్లే నిన్ను అరణ్యములలో విడిచివచ్చితిని' అనుమాట సత్యమేయైనను అది ఆమెకు అప్రియమగును. సత్యమేగదా! యని అట్టి అప్రియవచనమును పలుకుటయెట్లు? [1] (45-46)

మమ తావన్నియోగస్థాః త్వద్బంధుజనవాహినః।
కథం రథం త్వయా హీనం ప్రవక్ష్యంతి హయోత్తమాః। 47

నా అదుపులోనున్న ఈ ఉత్తమాశ్వములు నీవుగాని, నీ ఆత్మీయులైన సీతాలక్ష్మణులుగాని (నీవంశజులుగాని) రథమునందున్నప్పుడే దానిని లాగును. ఇప్పుడు నీవు (మీరెవ్వరును) లేకుండా అవి ఈ రథమును అయోధ్యకు ఎట్లు తీసికొనిపోవును? (47)

తం న శక్ష్యామ్యహం గంతుమ్ అయోధ్యాం త్వదృతేఽనఘ।
వనవాసానుయానాయ మా మనుజ్ఞాతుమర్హసి। 48

ఓ పుణ్యపురుషా! అందువలన నీవు లేకుండా నేను అయోధ్యకు వెళ్ళజాలను. నీవెంట వనములకు వచ్చుటకు అనుమతింపుము. (48)

యది మే యాచమానస్య త్యాగమేవ కరిష్యసి।
సరథోఽగ్నిం ప్రవేక్ష్యామి త్యక్తమాత్ర ఇహ త్వయా। 49

ఇట్లు ప్రార్థించుచున్నను నన్ను నీవెంట రానీయనిచో, మీరు నన్ను వీడి వెళ్ళిన మఱుక్షణముననే ఇచట రథముతోగూడ నేను అగ్నిలో ప్రవేశించెదను. (49)

భవిష్యంతి వనే యాని తపోవిఘ్నకరాణి తే।
రథేన ప్రతిబాధిష్యే తాని సత్త్వాని రాఘవ! 50

ఓ రఘురామా! వనమునందు నీతపోదీక్షకు పెక్కు అడవిజంతువులు ఆటంకము కలిగింపవచ్చును. నేను రథారూఢుడనై వాటినన్నింటిని పారద్రోలెదను. (50)

త్వత్కృతే చ మయాఽఽప్తం రథచర్యాకృతం సుఖమ్।
ఆశంసే త్వత్కృతేనాహం వనవాసకృతం సుఖమ్। 51

నీవు యువరాజువైనచో ఆ రథమును నడిపి, ఎంతయో ఆనందింపవలెనని ఆశపడితిని. కాని నాకు ఆభాగ్యము దక్కలేదు. అయితే ఈ వనవాసనిమిత్తముననైనను నీవు ముందునడచుచు మిమ్ము సేవించుచు ఆనందింప గోరుచున్నాను. (నీవు అనుగ్రహించినచో నీవెంటవచ్చి మిమ్ము సేవించుచు ఆనందింపవలెనని ఆశించుచున్నాను.) (51)

1) సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్, న బ్రూయాత్ సత్యమప్రియమ్।
ప్రియంచ నానృతం బ్రూయాత్, ఏషధర్మః సనాతనః॥ (నీతిశాస్త్రము).
సత్యమును పలుకవలెను, ప్రియవచనమును నుడువవలెను. సత్యమేగదాయని అప్రియవచనమును పలుకరాదు. ప్రియమునుగూర్చునదేయైనను అసత్యమును వచింపరాదు. ఇదియే సనాతనధర్మము.

ప్రసీదేచ్ఛామి తేఽరణ్యే భవితుం ప్రత్యనంతరః।
ప్రీత్యాఽభిహితమిచ్ఛామి భవ మే ప్రత్యనంతరః। 52

ఇమే చాపి హయా వీర! యది తే వనవాసినః।
పరిచర్యాం కరిష్యంతి ప్రాప్స్యంతి పరమాం గతిమ్। 53

తవ శుశ్రూషణం మూర్ధ్నా కరిష్యామి వనే వసన్।
అయోధ్యాం దేవలోకం వా సర్వథా ప్రజహామ్యహమ్। 54

నహి శక్యా ప్రవేష్టుం సా మయాఽయోధ్యా త్వయావినా।
రాజధానీ మహేంద్రస్య యథా దుష్కృతకర్మణా। 55

వనవాసే క్షయం ప్రాప్తే మమైష హి మనోరథః।
యదనేన రథేనైవ త్వాం వహేయం పురీం పునః। 56

చతుర్దశ హి వర్షాణి సహితస్య త్వయా వనే।
క్షణభూతాని యాస్యంతి శతసంఖ్యాఽన్యతోఽన్యథా। 57

భృత్యవత్సల! తిష్ఠంతం భర్తృపుత్త్రగతే పథి।
భక్తం భృత్యం స్థితం స్థిత్యాం త్వం న మాం హాతుమర్హసి। 58

ఏవం బహువిధం దీనం యాచమానం పునః పునః।
రామో భృత్యానుకంపీ తు సుమంత్రమిదమబ్రవీత్। 59

జానామి పరమాం భక్తిం మయి తే భర్తృవత్సల!।
శృణు చాపి యదర్థం త్వాం ప్రేషయామి పురీమితః। 60

నగరీం త్వాం గతం దృష్ట్వా జననీ మే యవీయసీ।
కైకేయీ ప్రత్యయం గచ్ఛేత్ ఇతి రామో వనం గతః। 61

పరితుష్టా హి సా దేవీ వనవాసం గతే మయి।
రాజానం నాతిశంకేత 'మిథ్యావాదీ' తి ధార్మికమ్। 62

ఏష మే ప్రథమః కల్పో యదంబా మే యవీయసీ।
భరతారక్షితం స్ఫీతం పుత్త్రరాజ్యమ్ అవాప్నుయాత్। 63

మమ ప్రియార్థం రాజ్ఞశ్చ సరథస్త్వం పురీం వ్రజ।
సందిష్టశ్చాపి యాన్ సర్వాన్ తాంస్తాన్ బ్రూయాస్తథా తథా। 64

ప్రభూ! మీ ప్రక్కనేయుండి మిమ్ము సేవించుటకై నేను కుతూహల పడుచున్నాను. అనుగ్రహింపుడు. 'ఓ సుమంత్రా! నీవు నా సమీపవర్తివై యుండుము.' అని మీరు నన్ను ప్రీతితో ఆదేశించుటకై వేడుకొను చున్నాను. (52)

ఓ మహావీరా! నీ అనుగ్రహమున్నచో వనవాససమయమున ఈ అశ్వములుగూడ నీకు పరిచర్యలొనర్చి, తరింపగలవు. (53)

స్వామీ! వనమునందు మీతోగూడి నివసించుచు, మీ ఆజ్ఞలను తలదాల్చి మీకు ఉపచారములను చేయగలను. ఆభాగ్యమును పొందుటకై అయోధ్యనేగాదు కడకు ఆదేవలోకమునుగూడ పరిత్యజించుటకు నేను సిద్ధమే. (54)

దురాచారపరుడు దేవేంద్రుని రాజధానియందు (స్వర్గమునందు) ప్రవేశింపలేనట్లు నీవు లేని అయోధ్యలో నేను అడుగిడజాలను. (55)

స్వామీ! వనవాసదీక్ష ముగియగనే ఈ రథముమీదనే నిన్ను అయోధ్యానగరమునకు తీసికొని వెళ్లవలెనని నా అభిలాష. (56)

వనవాసమున నేను నీవెంటనున్నచో పదునాలుగుసంవత్సరములును క్షణములవలె (క్షణములో) గడచిపోవును. లేనిచో దుఃఖభారమువలన ఆ పదునాలుగుసంవత్సరములకాలమే పదునాలుగువందలసంవత్సర కాలముగా బరువైపోవును. (57)

ఓ భక్తవత్సలా! నీవు మా మహారాజుగారికుమారుడవు. వనవాసమున నిన్ను సేవించుచు నీవెంట ఉండువాడను. నేను నీ భక్తుడను, భృత్యుడను, సేవాధర్మమును నడుపుచుండువాడను. కనుక నీవు నన్ను విడిచి వెళ్లవలదు (దయతో నన్ను నీవెంట రానిమ్ము.)"(58)

ఇట్లు సుమంత్రుడు పదేపదే పరిపరివిధముల వేడుకొనుచుండగా సహజముగా భృత్యులను కనికరించెడి శ్రీరాముడు అతనితో ఇట్లనెను. (59)

"ఓ ప్రభుసేవాపరాయణా! నాపై నీకుగల సాటిలేనిభక్తిని నేను ఎఱుంగుదును. అయితే నిన్ను అయోధ్యకు పంపుటలోగల కారణములను తెల్పెదను వినుము. (60)

ఓ సుమంత్రా! నీవు ఒక్కడవే అయోధ్యకు వెళ్లినచో నిన్ను జూచి, నాకు పినతల్లియైన కైకేయి 'నిజముగనే శ్రీరాముడు వనములకు చేరినాడు' అని పూర్తిగా నమ్మును. నేను వనములకు చేరినందులకు ఆదేవి మిగుల పొంగిపోవును. అంతేగాక ధర్మాత్ముడైన మహారాజు మిథ్యా (అసత్య) వాదికాడని గ్రహించును. (సత్యసంధుడని తెలిసికొనును.) నాకు చిన్నమ్మయైన కైకేయి తనపుత్త్రుడైన భరతునిపాలనలో సురక్షితముగానున్న ఆ విశాల రాజ్యముపై తనఅధికారమును నెలపును. నిన్ను అయోధ్యకు పంపుటలో నా ప్రధాన లక్ష్యము ఇదియే. (61-63)

నా తృప్తికొఱకై నీవు కోసలరాజధానియైన అయోధ్యకు ఈ రథముపై వెళ్లుము. నీకు నేను తెలిపిన విషయములను అన్నింటిని యథాతథముగా మహారాజు మొదలగు వారికి వివరింపుము." (64)

ఇత్యుక్త్వా వచనం సూతం సాంత్వయిత్వా పునః పునః।
గుహం వచనమక్లీబో రామో హేతుమదబ్రవీత్। 65

నేదానీం గుహ! యోగ్యోఽయం వాసో మే సజనే వనే।
అవశ్యం హ్యాశ్రమే వాసః కర్తవ్యస్తద్గతో విధిః। 66

సోఽహం గృహీత్వా నియమం తపస్విజనభూషణమ్।
హితకామః పితుర్భూయః సీతాయా లక్ష్మణస్య చ।
జటాః కృత్వా గమిష్యామి న్యగ్రోధక్షీర మానయ। 67

తత్క్షీరం రాజపుత్రాయ గుహః క్షిప్రముపాహరత్।
లక్ష్మణస్యాత్మనశ్చైవ రామస్తేనాకరోజ్జటాః। 68

దీర్ఘబాహుర్నరవ్యాఘ్రో జటిలత్వమధారయత్। 69

తౌ తదా చీరవసనౌ జటామండలధారిణౌ।
అశోభేతామ్ ఋషిసమౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ। 70

తతో వైఖానసం మార్గమ్ ఆస్థితస్సహలక్ష్మణః।
వ్రతమాదిష్టవాన్ రామః సహాయం గుహమబ్రవీత్। 71

అప్రమత్తో బలే కోశే దుర్గే జనపదే తథా।
భవేథా గుహ! రాజ్యం హి దురారక్షతమం మతమ్। 72

తతస్తం సమనుజ్ఞాయ గుహమిక్ష్వాకునందనః।
జగామ తూర్ణమవ్యగ్రః సభార్యః సహలక్ష్మణః। 73

స తు దృష్ట్వా నదీతీరే నావమిక్ష్వాకునందనః।
తితీర్షుః శీఘ్రగాం గంగామ్ ఇదం లక్ష్మణమబ్రవీత్। 74

ఆరోహ త్వం నరవ్యాఘ్ర! స్థితాం నావమిమాం శనైః।
సీతాం చారోపయాఽన్వక్షం పరిగృహ్య మనస్వినీమ్। 75

స భ్రాతుః శాసనం శ్రుత్వా సర్వమప్రతికూలయన్।
ఆరోప్య మైథిలీం పూర్వమ్ ఆరురోహాఽఽత్మవాంస్తతః। 76

ఇట్లు పలికి దృఢనిశ్చయముగల శ్రీరాముడు రథసారథియైన సుమంత్రుని పెక్కువిధముల ఓదార్చెను. పిమ్మట అతడు గుహునితో యుక్తియుక్తముగా ఇట్లు నుడివెను. (65)

"ఓ నిషాదరాజా! ప్రస్తుతము జనసమ్మర్దముగల ఈ ప్రదేశములో నేను ఉండదగదు. తండ్రియాజ్ఞను[1] అనుసరించి, నేను ఆశ్రమమున నివసింపవలసియున్నది. (66)

కనుక తండ్రిగారికి ఇహపరలోకలాభములు ప్రాప్తించుటకై నేను తాపసులు పాటించునట్టి భూశయనము, ఫలమూలములను ఆహారముగా గొనుట, మున్నగు నియమములను స్వీకరించి, సీతాలక్ష్మణుల సహకారముతో జడలను ధరించి వనములకు వెళ్లెదను. కావున వెంటనే మఱ్ఱిపాలను తెప్పింపుము. (67)

రామాజ్ఞను అనుసరించి, గుహుడు వెనువెంటనే మఱ్ఱిపాలను తెప్పించెను. పిమ్మట శ్రీరాముడు ఆ పాలతో తనకును, లక్ష్మణునకును, జడలను సిద్ధపఱచెను. దీర్ఘబాహువు, నరశ్రేష్ఠుడును ఐన శ్రీరాముడు జటాధారియయ్యెను. (68-69)

అంతట అన్నదమ్ములైన ఆ రామలక్ష్మణులు నారచీరలను జడలను ధరించినవారై ఋషులవలె శోభిల్లిరి. (70)

పిమ్మట శ్రీరాముడు లక్ష్మణసహితుడై విఖనసమహర్షి ప్రతిపాదించిన మార్గమున వానప్రస్థాశ్రమమును ఆశ్రయించి, గంగ నదిని దాటించుటకై గుహుని సహాయమును కోరెను. (71)

ఓ నిషాదరాజా! చతురంగబలములు, కోశాగారము, దుర్గము, దేశము అను ఈయన్నింటిరక్షణమున జాగరూకుడవై యుండుము. రాజ్యమును పరిరక్షించుకొనుట మిక్కిలి కష్టసాధ్యమైన విషయము సుమా!" (72)

పిమ్మట ఇక్ష్వాకువంశజుడైన శ్రీరాముడు గుహుని వీడ్కొని, సీతాలక్ష్మణులతో గూడి, ఎట్టివ్యాకులపాటూ లేకుండా వెంటనే బయలుదేఱెను. (73)

అనంతరము శ్రీరాముడు నదీతీరమునగల పడవనుజూచి, పరవళ్లుద్రొక్కుచు ప్రవహించుచున్న గంగానదిని దాటగోరినవాడై, లక్ష్మణునితో ఇట్లు పలికెను. (74)

"ఓ నరశ్రేష్ఠా! నావసిద్ధముగానున్నది. దానిని గట్టిగా పట్టుకొని, భయ స్వభావురాలైన సీతను నెమ్మదిగా! నావమీదికి చేర్చుము, పిదప నీవును పడవను ఎక్కుము." (75)

అంతట వినయశోభితుడైన లక్ష్మణుడు రాముని ఆదేశమును విని, దానిని యథాతథముగా అనుసరించుచు ముందుగా సీతాదేవిని తిన్నగా నావలోనికి చేర్చి ఆమెను కూర్చుండబెట్టెను. అనంతరము తానును ఆ పడవను ఎక్కెను. (76)

1) శ్లో॥ సప్త సప్త చ వర్షాణి దండకారణ్యమాశ్రితః। అభిషేకమిమం త్యక్త్వా జటాజినధరో వస॥
ఈ యువరాజపట్టాభిషేకమును త్యజింపుము. జడలను, నార చీరలను ధరింపుము. దండకారణ్యమునకు వెళ్లి, అచట పదునాలుగు సంవత్సరముల కాలము నివసింపుము. (ఆశ్రమవాసము చేయుము) - అని మా తండ్రియగు దశరథునిమాటగా కైకేయీదేవి ఆదేశించియుండెను.

అథాఽఽరురోహ తేజస్వీ స్వయం లక్ష్మణపూర్వజః।
తతో నిషాదాధిపతిః గుహో జ్ఞాతీనచోదయత్। 77

అటుపిమ్మట తేజస్వియైన శ్రీరాముడు స్వయముగా ఆనావలోనికి ఎక్కెను. పిదప నిషాదరాజైన గుహుడు 'నావను ఆవలి తీరమునకు నడుపుడు' అని తన వారిని ఆదేశించెను. (77)

రాఘవోఽపి మహాతేజా నావమారుహ్య తాం తతః।
బ్రహ్మవత్ క్షత్రవచ్చైవ జజాప హితమాత్మనః। 78

నావను ఎక్కిన పిమ్మట మహాతేజోమూర్తియైన శ్రీరామచంద్రుడు బ్రాహ్మణులును, క్షత్రియులును జపింపదగినదియు, తనకు హితకరమైనదియు అగు 'దైవీం నావమ్' అను మంత్రమును జపించెను. (78)

ఆచమ్య చ యథాశాస్త్రం నదీం తాం సహ సీతయా।
ప్రాణమత్ ప్రీతిసంహృష్టో లక్ష్మణశ్చామితప్రభః। 79

సీతారామలక్ష్మణులు శాస్త్రమర్యాదను అనుసరించి, ఆచమించి, ఆ పవిత్రగంగానదికి ప్రీతితో నమస్కరించిరి. (79)

అనుజ్ఞాయ సుమంత్రం చ సబలం చైవ తం గుహమ్।
ఆస్థాయ నావం రామస్తు చోదయామాస నావికాన్। 80

అంతట శ్రీరాముడు సుమంత్రునకును, సేనాసహితుడైన గుహునకును వెళ్లుటకనుజ్ఞయిచ్చెను. పిదప అతడు స్థిమితముగా అందుకూర్చొని, 'ఇక నావను సాగిపోనిండు' అని నావికులను ఆదేశించెను. (80)

తతస్తైః చోదితా సా నౌః కర్ణధారసమాహితా।
శుభస్ఫ్యవేగాభిహతా శీఘ్రం సలిలమత్యగాత్। 81

వెంటనే నావికులు పడవను నడుపసాగిరి. కర్ణధారి (చుక్కాని పట్టువాడు) చుక్కాని త్రిప్పుచు సురక్షితముగా పడవను సరియగు మార్గమున పోనిచ్చుచుండెను. నావికులు బలమైనతెడ్లను వేగముగా వేయుచుండుటచే పడవ ఆ ప్రవాహజలములలో చాలదూరము దాటిపోయెను. (81)

మధ్యం తు సమనుప్రాప్య భాగీరథ్యాస్త్వనిందితా।
వైదేహీ ప్రాంజలిర్భూత్వా తాం నదీమిదమబ్రవీత్। 82

పడవ గంగానదీ ప్రవాహముయొక్క మధ్యభాగమునకు చేరినప్పుడు పూజ్యురాలైన సీతాదేవి దోసిలియొగ్గి గంగాదేవిని ఇట్లు ప్రార్థించెను. (82)

పుత్రో దశరథస్యాయం మహారాజస్య ధీమతః।
నిదేశం పారయిత్వేమం గంగే! త్వదభిరక్షితః। 83

చతుర్దశ హి వర్షాణి సమగ్రాణ్యుష్య కాననే।
భ్రాత్రా సహ మయా చైవ పునః ప్రత్యాగమిష్యతి। 84

తత స్త్వాం దేవి! సుభగే! క్షేమేణ పునరాగతా।
యక్ష్యే ప్రముదితా గంగే! సర్వకామసమృద్ధినీ। 85

"ఓ గంగాదేవీ! ఇతడు ధీశాలియైన దశరథమహారాజు యొక్క పుత్రుడు. తండ్రియాదేశమును అనుసరించి వనవాసదీక్షితుడై యున్నాడు. నీచే సురక్షితుడైన ఈయన నాతోడను, తన తమ్ముడగు లక్ష్మణుని తోడను గూడి, పూర్తిగా పదునాలుగుసంవత్సరముల కాలమును వనములలో గడపి మరల తిరిగిరాగలడు. మహిమాన్వితురాలవైన ఓ గంగాదేవీ! మావనవాస జీవితమును ప్రశాంతముగా ముగించుకొని, సఫలమనోరథనై, క్షేమముగా తిరిగివచ్చునప్పుడు సంతోషముతో నిన్ను పూజింతును. (83-85)

త్వం హి త్రిపథగా దేవి! బ్రహ్మలోకం సమీక్షసే।
భార్యా చోదధిరాజస్య లోకేఽస్మిన్ సంప్రదృశ్యసే। 86

ఓ దేవీ! నీవు స్వర్గ మర్త్య పాతాళలోకములలో ప్రవహించి, 'త్రిపథగ' అను పేరుతో సుప్రసిద్ధురాలవైతివి. బ్రహ్మయొక్క కమండలువునందు ద్రవ (జల) రూపమునయుండి విష్ణుపాదస్పర్శను నోచుకొని, ఆలోకమును దర్శించిన పవిత్రురాలవు. అంతేగాక నీవు ఈ లోకమునకు దిగివచ్చి, సాగరప్రభువునకు భార్యవై మాకు దర్శనమిచ్చిన మహాత్మురాలవు. (86)

సా త్వాం దేవి! నమస్యామి ప్రశంసామి చ శోభనే!।
ప్రాప్తరాజ్యే నరవ్యాఘ్రే శివేన పునరాగతే। 87

గవాం శతసహస్రాణి వస్త్రాణ్యన్నం చ పేశలమ్।
బ్రాహ్మణేభ్యః ప్రయచ్ఛామి తవ ప్రియచికీర్షయా। 88

శుభస్వరూపురాలవైన ఓ గంగాదేవీ! మహాపురుషుడైన శ్రీరాముడు క్షేమముగా వనవాసమును ముగించుకొని, అయోధ్యాధిపతియైన పిమ్మట నేను నిన్ను మరల దర్శించి, ప్రణమిల్లుదు, ప్రస్తుతించెదను. అంతేగాదు నీకు సంతృప్తిని గూర్చుటకై బ్రాహ్మణోత్తములకు లక్షగోవులను, అమూల్యములైన వస్త్రములను సమర్పించి, కమ్మని పదార్థములతో వారికి అన్నదానముచేసెదను. (87-88)

సురాఘటసహస్రేణ మాంసభూతౌదనేన చ।
యక్ష్యే త్వాం ప్రయతా దేవి! పురీం పున రుపాగతా। 89

యాని త్వత్తీరవాసీని దైవతాని వసంతి చ।
తాని సర్వాణి యక్ష్యామి తీర్థాన్యాయతనాని చ। 90

పునరేవ మహాబాహుః మయా భ్రాత్రా చ సంగతః।
అయోధ్యాం వనవాసాత్తు ప్రవిశత్వనఘోఽనఘే! 91

తథా సంభాషమాణా సా సీతా గంగామనిందితా।
దక్షిణా దక్షిణం తీరం క్షిప్రమేవాభ్యుపాగమత్। 92

తీరం తు సమనుప్రాప్య నావం హిత్వా నరర్షభః।
ప్రాతిష్ఠత సహ భ్రాత్రా వైదేహ్యా చ పరంతపః। 93

అథాబ్రవీన్మహాబాహుః సుమిత్రానందవర్ధనమ్।
భవ సంరక్షణార్థాయ సజనే విజనేఽపి వా। 94

అవశ్యం రక్షణం కార్యమ్ అదృష్టే విజనే వనే।
అగ్రతో గచ్ఛ సౌమిత్రే! సీతా త్వామనుగచ్ఛతు। 95

పృష్ఠతోఽహం గమిష్యామి త్వాం చ సీతాం చ పాలయన్।
అన్యోన్యస్యేహ నో రక్షా కర్తవ్యా పురుషర్షభ! 96

న హి తావదతిక్రాంతా సుకరా కాచన క్రియా।
అద్య దుఃఖం తు వైదేహీ వనవాసస్య వేత్స్యతి। 97

ప్రణష్టజనసంబాధం క్షేత్రారామవివర్జితమ్।
విషమం చ ప్రపాతం చ వనమద్య ప్రవేక్ష్యతి। 98

శ్రుత్వా రామస్య వచనం ప్రతస్థే లక్ష్మణోఽగ్రతః।
అనంతరం చ సీతాయా రాఘవో రఘునందనః। 99

ఓ దేవీ! దేవతలకును దుర్లభమైన[1] అసంఖ్యాకములైన మధుర పదార్థములను, సామాన్యముగా మహారాజులకునైతము అసాధ్యములైన భూములను, అన్నవస్త్రములను దానముచేయుచు దృఢసంకల్పముతో నిన్ను ఆరాధింతును. నాయెడ ప్రసన్నురాలవు కమ్ము. నీ తీరముల యందు సుప్రతిష్ఠితులైయున్న సమస్తదేవతలను, అందునెలకొని యున్న మణికర్ణికాది పవిత్రఘట్టములను, కాశీ మొదలగు క్షేత్రములను సేవించెదను. (89-90)

ఓ పూజ్యురాలా! మహాబాహువు, పుణ్యపురుషుడువైన నాపతిదేవుడు నాతోడను, తన తమ్ముడైన లక్ష్మణునితోడను గూడి వనవాస-అనంతరము అయోధ్యకు చేరునట్లు అనుగ్రహింపుము." (91)

పతికి అనుకూలవతియైన సీతాసాధ్వి గంగాదేవిని ఇట్లు ప్రార్థించు చుండెను. ఇంతలో నావ దక్షిణతీరమునకు చేరెను. నావ ఒడ్డునకు చేరగనే శత్రుభయంకరుడైన శ్రీరాముడు సీతాలక్ష్మణసమేతుడై నావనుండి దిగి, వనములకు బయలుదేరెను. (92-93)

అంతట మిక్కిలి భుజబలశాలియైన శ్రీరాముడు సౌమిత్రితో ఇట్లనెను. "ఓ లక్ష్మణా! జనసంచారముగల ప్రదేశములయందును, నిర్జనప్రాంతములయందును నీవు రక్షణవిషయమున సావధానుడవై యుండుము. ఓ సౌమిత్రీ! జనులజాడయేలేని ఈ క్రొత్త ప్రదేశముల యందు మిక్కిలి జాగరూకులమై రక్షణకార్యభారమును నిర్వహించు చుండవలెను. నీవు ముందు నడచుచుండుము. నీవెనువెంట సీత నడచును. నిన్ను, సీతను, కాపాడుచు మీ వెనుక నేను అడుగిడుచుందును. శుభలక్షణములుగల ఓ తమ్ముడా! ఇచట మనము పరస్పరము రక్షించుకొనుచుండవలెను. (94-96)

ఇంతవఱకును నిజమైన క్లిష్టపరిస్థితులు ఏవియును ఎదురు కాలేదు. ఇక మీదట అట్టి సంఘటనలు తటస్థపడవచ్చును. నేటినుండి సీతాదేవికి వనవాసక్లేశములు ఎట్లుండునో తెలియవచ్చును. (97)

ఇచటి వనములలో జనసంచారమే యుండదు. పంటపొలములే కన్పింపవు. విహరించుటకు ఉద్యానవనములు ఉండవు. దారులన్నియును ఎగుడుదిగుడుగానుండును. ప్రమాదకరములైన గుంతలు ఉండును. నేటినుండి ఇట్టివనములలో సీత అడుగిడబోవుచున్నది. (98)

అన్నఆదేశమును శిరసావహించి, లక్ష్మణుడు ముందు నడచు చుండెను. పిమ్మట సీతాదేవియు, ఆమెవెంట శ్రీరాముడును నడువసాగిరి. (99)

1) "సురాఘటసహస్రేణ" అను సమాసమునకు-సురేషుదేవేషు, సఘటంతే=సనంతి ఇత్యర్థః తేషాంసహస్రం, తేన-సహస్రసంఖ్యాకసురదుర్లభపదార్థేన-దేవతలకును దుర్లభమైన అసంఖ్యాక మధురపదార్థములతో-అని యర్థము-అట్లే-'మాంస భూతౌదనేన' అను సమాసమునకు-మా=నాస్తి, అంసో=రాజభాగో యస్యాంసా ఏవభూః= పృథ్వీచ, ఫలం=వస్త్రంచ, ఓదనంచ-ఏతేషాం సమాహారః, అనగా సామాన్యముగా మహారాజులకు సైతము అసాధ్యములైన భూ-వస్త్ర-అన్న దానములతో-అని యర్థము.

గతం తు గంగాపరపారమాశు
రామం సుమంత్రః ప్రతతం నిరీక్ష్య ।
అధ్వప్రకర్షాద్వినివృత్తదృష్టిః
ముమోచ బాష్పం వ్యథితస్తపస్వీ ॥ 100

శ్రీరాముడు తనవారితో గంగానదియావలితీరమున వన ప్రయాణము చేయుచుండగా వారికనబడునంతవఱకును సుమంత్రుడు తెప్పవాల్చక వారిని చూచుచునేయుండెను. వారు తనచూపులకు అందనంతదూరమునకు వెళ్ళిపోయిన పిమ్మట అతడు తన దృష్టిని అటునుండి మఱల్చి, మిక్కిలి పరితపించుచు వ్యాకులచిత్తుడై కన్నీరు కార్చెను. (100)

స లోకపాలప్రతిమప్రభావవాన్
తీర్త్వా మహాత్మా వరదో మహానదీమ్ ।
తత స్సమృద్ధాన్ శుభసస్యమాలినః
క్రమేణ వత్సాన్ ముదితానుపాగమత్ ॥ 101

దిక్పాలురవలె ప్రతిభాశాలియు, ప్రజలఅభీష్టములను తీర్చువాడును, మహాత్ముడును ఐన శ్రీరాముడు గంగానదిని దాటి, క్రమముగా వత్సరాజ్యవనప్రదేశములలోని ప్రయాగసమీపమున ప్రవేశించెను. అది చక్కని పైరుపంటలతో కలకలలాడుచుండెను. ఆ వత్సదేశ ప్రజలు అందఱును సకలసంపదలతో తులతూగుచు మిక్కిలి సంతోషముతో జీవించుచుండిరి. (101)

తౌ తత్ర హత్వా చతురో మహామృగాన్
వరాహ మృశ్యం పృషతం మహారురుమ్ ।
ఆదాయ మేధ్యం త్వరితం బుభుక్షితౌ
వాసాయ కాలే యయతుర్వనస్పతిమ్ ॥ 102

రామలక్ష్మణులిరువురును ఆ వనములలో క్షత్రియధర్మమును అనుసరించి, (ఆశ్రమవాసులకు హానిని గూర్చునట్టి) అడవిపందులు, మనుబోతులు, కొమ్ములదుప్పులు, 'చారలదుప్పులు, అను చతుర్విధమృగములను వేటాడిరి, సాయంసమయమున పవిత్రమైన కందమూలఫలములను తీసికొనివచ్చి, సీతతోగూడి ఒక చెట్టునీడకు చేరిరి. (102)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్విపంచాశస్సర్గః *(52)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదిరెండవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

53. ఏబదిమూడవసర్గము

నేను నాకన్నతల్లి (కౌసల్యామాత) సేవలకు దూరమైతిని, కనీసము నీవైనను అయోధ్యకు వెళ్లి ఆ లోటునుదీర్చుము' - అని శ్రీరాముడు లక్ష్మణునితో బల్కుట - అందులకు లక్ష్మణుడు విముఖత తెల్పుట - అన్నను, వదినెను సేవించుచు వనములలోనే యుందునని, అతడు శ్రీరామునకు నచ్చజెప్పుట.

స తం వృక్షం సమాసాద్య సంధ్యామన్వాస్య పశ్చిమామ్ ।
రామో రమయతాం శ్రేష్ఠ ఇతి హోవాచ లక్ష్మణమ్ ॥ 1

ఆనందింపజేయువారిలో అత్యంతశ్రేష్ఠుడైన శ్రీరాముడు ఆ వృక్షమూలమును ఆశ్రయించి, సాయంసంధ్యోపాసన గావించి, లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (1)

అద్యేయం ప్రథమా రాత్రిః యాతా జనపదాద్బహిః ।
యా సుమంత్రేణ రహితా తాం నోత్కంఠితుమర్హసి ॥ 2

"ఓ లక్ష్మణా! జనపదములను (పల్లెలను) దాటి వచ్చిన మొదటిరాత్రి ఇదియే. సుమంత్రుని వీడ్కొనిన పిమ్మట మనము గడపబోవు మొదటి రాత్రియు ఇదియే. ఐనను నీవు ఏవిధముగను బెంగపెట్టుకొన వలదు. (2)

జాగర్తవ్యమ్ అతంద్రిభ్యామ్ అద్యప్రభృతి రాత్రిషు ।
యోగక్షేమం హి సీతాయా వర్తేతే లక్ష్మణాఽఽవయోః ॥ 3

రాత్రిం కథంచిదేవేమాం సౌమిత్రే! వర్తయామహే ।
ఉపావర్తామహే భూమౌ ఆస్తీర్య స్వయమార్జితైః ॥ 4

ఓ లక్ష్మణా! సీతాదేవియొక్క రక్షణభారము మనయిద్దరిది. కనుక నేటినుండి ఏమాత్రమూ ఏమఱుపాటులేక రాత్రివేళలయందును జాగరూకులమై యుండవలెను. కనుక ఓ సౌమిత్రీ! ఈ రాత్రిని ఏదేని యొకవిధముగా ఇచ్చటనే గడుపుదము. ఈనేలపై మనము స్వయముగా సిద్ధపఱుచుకొనిన తృణశయ్యలపై శయనింతము." (3-4)

స తు సంవిశ్య మేదిన్యాం మహార్హశయనోచితః।
ఇమాః సౌమిత్రయే రామో వ్యాజహార కథాః శుభాః॥ 5

ధ్రువమద్య మహారాజో దుఃఖం స్వపితి లక్ష్మణ!।
కృతకామా తు కైకేయీ తుష్టా భవితుమర్హతి॥ 6

సా హి దేవీ మహారాజం కైకేయీ రాజ్యకారణాత్।
అపి న చ్యావయేత్ ప్రాణాన్ దృష్ట్వా భరతమాగతమ్॥ 7

అనాథశ్చ హి వృద్ధశ్చ మయా చైవ వినాకృతః।
కిం కరిష్యతి కామాత్మా కైకేయీవశమాగతః॥ 8

ఇదం వ్యసనమాలోక్య రాజ్ఞశ్చ మతివిభ్రమమ్।
కామ ఏవార్థధర్మాభ్యాం గరీయానితి మే మతిః॥ 9

కో హ్యవిద్వానపి పుమాన్ ప్రమదాయాః కృతే త్యజేత్।
ఛన్దానువర్తినం పుత్త్రం తతో మామివ లక్ష్మణ!॥ 10

సుఖీ బత! సభార్యశ్చ భరతః కేకయీసుతః।
ముదితాన్ కోసలానేకో యో భోక్ష్యత్యధిరాజవత్॥ 11

స హి సర్వస్య రాజ్యస్య ముఖమేకం భవిష్యతి।
తాతే చ వయసాఽతీతే మయి చారణ్యమాస్థితే॥ 12

అర్థధర్మౌ పరిత్యజ్య యః కామమనువర్తతే।
ఏవమాపద్యతే క్షిప్రం రాజా దశరథో యథా॥ 13

మన్యే దశరథాన్తాయ మమ ప్రవ్రాజనాయ చ।
కైకేయీ సౌమ్య! సంప్రాప్తా రాజ్యాయ భరతస్య చ॥ 14

అపీదానీం న కైకేయీ సౌభాగ్యమదమోహితా।
కౌసల్యాం చ సుమిత్రాం చ సంప్రబాధేత మత్కృతే॥ 15

మా స్మ మత్కారణాద్దేవీ సుమిత్రా దుఃఖమావసేత్।
అయోధ్యామిత ఏవ త్వం కాల్యే ప్రవిశ లక్ష్మణ!॥ 16

అహమేకో గమిష్యామి సీతయా సహ దణ్డకాన్।
అనాథాయా హి నాథస్త్వం కౌసల్యాయా భవిష్యసి॥ 17

పట్టుపరుపులపై హాయిగా శయనింపవలసిన శ్రీరాముడు నేలపై కల్పించుకొనిన తృణశయ్యపై చేరి, లక్ష్మణునితో ఈ (కొన్ని) మంచి మాటలను చెప్పదొడంగెను. (5)

"నాయనా! లక్ష్మణా! మహారాజు ఈ సమయమున నిజముగా మిక్కిలి పరితపించుచు (నేలపై) పడియుండవచ్చును. కైకేయిమాత్రము తనకోరికలు తీరినందున చాలాసంతుష్టురాలైయుండవచ్చును. అంతేగాదు తాతగారికడనుండి అయోధ్యకుచేరిన భరతునిజూచి, (భరతుడు వచ్చిన పిమ్మట) ఆ కైకేయి కోసలరాజ్యమున తన అధికారమును పదిలపఱచుకొనుటకై మహారాజు ప్రాణములను తీయదుగదా! (మహారాజును వేధింపదుగదా!) (6-7)

మహారాజును ఆదుకొనువారు ఇప్పుడు ఎవ్వరును లేరు. పైగా అతడు వృద్ధుడు. నానుండి దూరము చేయబడినాడు. నన్ను యువరాజ పట్టాభిషిక్తుని చేయవలెననెడి కోరిక ఆయనమనస్సులోనే మిగిలిపోయినది. ఇప్పుడతడు కైకేయిచేతిలోని కీలుబొమ్మ. ఇట్టి స్థితిలో పాపము అతడేమి చేయగలడు? (8)

అనూహ్యముగా వచ్చిపడిన ఈ సంకటములను, మహారాజు యొక్క నిస్సహాయస్థితిని పరిశీలించి చూడగా ధర్మార్థములకంటెను కామముదే పైచేయియని నాకు అనిపించుచున్నది. (9)

ఓ లక్ష్మణా! 'తాను చెప్పినట్లునడచుకొను పుత్త్రుని ఎంతటి మూర్ఖుడైనను ఒక స్త్రీ మాటలు విని నన్నువలె పరిత్యజించునా?'(10)

సుఖసంతోషములతో హాయిగా జీవించుచున్న ప్రజలుగల విశాల కోసలదేశమునకు మహారాజై భరతుడు భార్యతో గూడి సర్వసుఖములనూ అనుభవింపనున్నాడు. నిజముగా ఆ కైకేయీ సుతుడు ఎంతటి భాగ్యశాలియో గదా! మహారాజేమో వయస్సుమళ్లిన వృద్ధుడు, నేనేమో అడవులపాలయితిని. కనుక అతడొక్కడే సమస్త రాజ్యమునకును, తిరుగులేని ప్రభువు కాగలడు. (11-12)

పురుషార్థములలో అతిముఖ్యములైన ధర్మార్థములను గాలికి వదలి, కామపరతంత్రుడైయుండువాడు దశరథమహారాజువలె ఇట్లు ఇడుముల పాలగును. ఇది నిజము. (13)

నాయనా! నన్ను అరణ్యములకు పంపుటకును, దశరథమహారాజును మృత్యుదేవతకు అప్పగించుటకును, తనకుమారుడైన భరతుని ఈ కోసలకు రాజును గావించుటకును కైకేయి అయోధ్యలో అడుగిడినట్లు నేను తలంతును. (14)

కైకేయి రాజ్యాధికారము (సౌభాగ్యము) ప్రాప్తించుటచే గర్వితయై, మంచిచెడ్డలను మఱచినదై, నానిమిత్తముగా ఇప్పుడు కౌసల్యాజననిని, సుమిత్రామాతను యాతనలకు గుఱిచేయదుగదా! (15)

ఓ లక్ష్మణా! నాకారణముగా తల్లి సుమిత్రాదేవికి దుఃఖములు (కష్టములు) కలుగకుండుగాక. అందువలన నీవు పరిస్థితులను గ్రహించి రేపువేకువజాముననే ఇచటినుండి బయలుదేఱి, అయోధ్యకు చేరుటయుక్తము. సీతతో గూడి నేనొక్కడనే దండకారణ్యములకు వెళ్లెదను. ఆత్మీయతతో ఓదార్చువారు లేక పరితపించుచుండు కౌసల్యామాతకు నీవలన కొంత ఊరటకల్గును. (16-17)

క్షుద్రకర్మా హి కైకేయీ ద్వేష్యమన్యాయ్యమాచరేత్।
పరిదద్యా హి ధర్మజ్ఞే భరతే మమ మాతరమ్॥ 18

దుర్మార్గురాలైన కైకేయి అందరును నొచ్చుకొనురీతిగా (అందరును అసహ్యపడు విధముగా) కౌసల్యామాతను అవమానములపాలు చేయవచ్చును. కనుక ఆమెరక్షణభారమును ధర్మాత్ముడైన భరతుని మీద ఉంచుము. (18)

నూనం జాత్యంతరే కస్మిన్ స్త్రియః పుత్రైర్వియోజితాః।
జనన్యా మమ సౌమిత్రే! తస్మాదేతదుపస్థితమ్॥ 19

ఓ సౌమిత్రీ! మాతల్లి కౌసల్యాదేవి (తన) పూర్వజన్మలలో నిజముగా తల్లికొడుకులను ఎడబాపియుండవచ్చును. అందువలననే ఆమెకు ఈ జన్మలో ఇట్టి దుస్థితి తటస్థించినదికాబోలు.[1] (19)

మయా హి చిరపుష్టేన దుఃఖసంవర్ధితేన చ।
విప్రాయుజ్యత కౌసల్యా ఫలకాలే ధిగస్తు మామ్॥ 20

కన్నతల్లి కౌసల్యాదేవి పెక్కు శ్రమలకోర్చి, తన చేతులమీదుగా ఎంతోకాలము నన్ను సుకుమారముగా పెంచి పెద్దచేసినది. ఆమె కష్టములు ఫలించుతరుణమున [2](నేను ఆమెకు సేవలుచేయవలసిన సమయము ఆసన్నముకాగా ఇప్పుడు) ఆమెకు నేను దూరమైతిని. ఛీ! నేను కన్నతల్లికి సేవలు చేయలేకపోయితిని. (20)

మాస్మ సీమంతినీ కాచిత్ జనయేత్ పుత్రమీదృశమ్।
సౌమిత్రే! యోఽహమంబాయా దద్మి శోకమనంతకమ్॥ 21

ఓ సౌమిత్రీ! కన్నతల్లి కౌసల్యాదేవికి నేను అంతులేని శోకమునే మిగిల్చితిని. అందువలన మాతాపితృసేవాభాగ్యములకు నోచుకొనని నావంటివానికి ఏసాధ్వియు జన్మనియ్యరాదు. (21)

మన్యే ప్రీతివిశిష్టా సా మత్తో లక్ష్మణ శారికా।
యస్యాస్తచ్ఛ్రూయతే వాక్యం శుకపాదమరేర్దశ॥ 22

కౌసల్యామాతపై నాకంటెను ఆమె పోషణలో పెఱిగిన గోరువంకకే ప్రేమ ఎక్కువ యని నేను తలంతును. ఏలనన ఆ గోరువంక అచటి చిలుకతో "ఓ చిలుకా! నీవు శత్రువుయొక్క పాదమును కొఱుకుము"-(తల్లి కౌసల్యయొక్క శత్రుభావము వహించి యున్న కైకేయి పాదమును కొఱికివేయుము.) అని పిల్లినపుడుతో పలుకుచుండెడిది. అమ్మ ఆ మాటను వినుచుండెడిది. అమ్మమీద మిగులప్రేమగలది యగుటచేతనే ఆ గోరువంక అట్లు పల్కుచుండెడిది. ఒక పక్షియైన గోరువంకయు తనను పెంచిపోషించిన కౌసల్యామాతపైగల ప్రేమతో ఆమెకు అపకారము తలపెట్టిన కైకయెడ తనతీవ్ర కోపమును ఇట్లు ప్రకటించినది. నేను ఆమెకు కొడుకునైయుండియు ఆమెకు ద్రోహము చేయుటకు ఒడిగట్టిన కైకను పల్లెత్తు మాటయు అనకుంటినిగదా! (22)

శోచంత్యాశ్చాల్పభాగ్యాయా న కించిదుపకుర్వతా।
పుత్రేణ కిమపుత్రాయా మయా కార్యమరిందమ!॥ 23

ఓ శత్రుసూదనా! నావంటి పుత్రుని కలిగియుండియు తల్లి కౌసల్యాదేవి పుత్రులులేనిదానివలె విలపించుచున్న దురదృష్టవంతురాలు. ఇట్టి దుఃఖస్థితిలో ఏమాత్రమూ తోడ్పడలేని నేను ఆమెకు పుత్రుడనై యుండియు ఏమి ప్రయోజనము? (23)

అల్పభాగ్యా హి మే మాతా కౌసల్యా రహితా।
మయా శేతే పరమదుఃఖార్తా పతితా శోకసాగరే॥ 24

నేను వనములకుజేరి కౌసల్యామాతకుదూరమైతిని. అందువలన ఆమె అంతులేని దుఃఖములకు లోనైనది. నిజముగా ఆమె ఎంతయు దురదృష్టవంతురాలు. ఆమె యిప్పటికిని శోకసాగరమున మునిగి, అందే పడియుండును. (24)

1) అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్।
ఎవ్వరైనను తాముచేసిన పుణ్యకర్మలకును, పాపకార్యములకును తగిన ఫలములను అనుభవింపక తప్పదు. అనునది భారతీయతత్త్వమునకు మూలసూత్రము.

2) 'మాతృశుశ్రూషణమేవ పుత్రోత్పత్తిఫలమ్' -తల్లి దండ్రులకు వారిపుత్రులవలన సేవలు లభించుటయే వారు ఆ పుత్రులను గన్నందులకు నిజమైన ఫలము. తల్లిదండ్రులకు సేవలొనర్చుటయే తనయులకు ముఖ్యకర్తవ్యము.

ఏకో హ్యహమయోధ్యాం చ పృథివీం చాపి లక్ష్మణ।
తరేయమిషుభిః క్రుద్ధో నను వీర్యమకారణమ్॥ 25

ఓ లక్ష్మణా! నిజముగా నేను కుపితుడనైనచో ఒక్కడనే ధనుర్బాణములను చేతబట్టి ఆ అయోధ్యనేగాదు సమస్త భూమండలమును వశము చేసికొనగలను. కాని అకారణముగా పరాక్రమమును ప్రకటించుట తగదుగదా! (25)

అధర్మభయభీతశ్చ పరలోకస్య చానఘ!।
తేన లక్ష్మణ! నాద్యాహమ్ ఆత్మానమభిషేచయే॥ 26

ఓ పుణ్యపురుషా! లక్ష్మణా! అధర్మమునకు భయపడియు, పరలోకభీతికారణమునను నేను వెనుకాడుచుంటిని. అందువలన నేడు నాయువరాజ పట్టాభిషేకమును గూర్చి తలంపనైతిని." (26)

ఏతదన్యచ్చ కరుణం విలప్య విజనే వనే।
అశ్రుపూర్ణముఖో రామో నిశి తూష్ణీముపావిశత్॥ 27

శ్రీరాముడు లక్ష్మణునితో ఆ నిర్జనవనమునందు ఇట్లు పరిపరి విధములుగ కరుణాపూరితవచనములను పలికి, కన్నీరు పెట్టుచు మిన్నకుండెను. (27)

విలప్యోపరతం రామం గతార్చిషమివానలమ్।
సముద్రమివ నిర్వేగమ్ ఆశ్వాసయత లక్ష్మణః॥ 28

ఈ విధముగా విలపించి యూరకున్న శ్రీరాముడు మంటలు చల్లారిన అగ్నివలెను, అలలు శాంతించిన సముద్రునిరీతిగను ఒప్పుచుండెను. అట్టి అన్నను లక్ష్మణుడు ఓదార్చసాగెను. (28)

ధ్రువమద్య పురీ రాజన్ అయోధ్యాఽఽయుధినాం వర!।
నిష్ప్రభా త్వయి నిష్క్రాంతే గతచంద్రేవ శర్వరీ॥ 29

"ధనుర్ధారులలో మేటివైన ఓ ప్రభూ! నీవు అయోధ్యను వీడి వచ్చిన పిమ్మట నేడు ఆ పురము చంద్రుడు (వెన్నెల) లేని రాత్రివలె నిజముగా తేజోవిహీనమైయుండును. (29)

నైతదౌపయికం రామ! యదిదం పరితప్యసే।
విషాదయసి సీతాం చ మాం చైవ పురుషర్షభ!॥ 30

న చ సీతా త్వయా హీనా న చాహమపి రాఘవ!।
ముహూర్తమపి జీవావో జలాన్మత్స్యావివోద్ధృతౌ॥ 31

ఓ రామా! ఓ పురుషోత్తమా! నీవు ఇట్లు పరితపించుట ఏమాత్రము తగదు. నీవు ఈ విధముగా శోకించుచున్నచో సీతాదేవికిని, నాకును బాధగానుండును. ఓ రాఘవా! నీకు దూరమై (నీవు ఎదురుగా లేనిచో) సీతాదేవిగాని, నేనుగాని నీటినుండి బయటపడవేసిన చేపలవలె గిలగిలలాడుదుము. క్షణకాలముగూడ జీవింపజాలము. (30-31)

న హి తాతం న శత్రుఘ్నం న సుమిత్రాం పరంతప।
ద్రష్టుమిచ్ఛేయమద్యాహం స్వర్గం వాఽపి త్వయా వినా॥ 32

ఓ శత్రుదమనా! నీవు లేనిచో తండ్రియైన దశరథమహారాజును గాని, తోబుట్టువైన శత్రుఘ్నునిగాని, కడకు కన్నతల్లియైన సుమిత్రాదేవిని గాని చూడగోరను. ఇంతయేల నీవు లేని స్వర్గము గూడ నాకు అక్కఱలేదు." (32)

తతస్తత్ర సుఖాసీనౌ నాతిదూరే నిరీక్ష్య తామ్।
న్యగ్రోధే సుకృతాం శయ్యాం భేజాతే ధర్మవత్సలౌ॥ 33

అనంతరము అచట కూర్చొనియున్న ధర్మాత్ములైన సీతారాములు ఆ సమీపముననే మఱ్ఱిచెట్టుక్రింద లక్ష్మణుడు ఏర్పఱచిన చక్కని తృణశయ్యను జూచి, వారు దానిపై పరుండిరి. (33)

స లక్ష్మణస్యోత్తమపుష్కలం వచో
నిశమ్య చైవం వనవాసమాదరాత్।
సమాస్సమస్తా విదధే పరంతపః
ప్రపద్య ధర్మం సుచిరాయ రాఘవః॥ 34

అంతట శత్రుభయంకరుడైన శ్రీరాముడు సాదరముగా లక్ష్మణుడు పలికిన సముచితవచనములను అన్నింటిని సావధానముగా వినెను. తాను పదునాలుగువత్సరములు వానప్రస్థధర్మములను పాటించుచు వనవాసము చేయుటకు నిశ్చయించుకొనెను. వనములలో తనతో గూడియుండుటకు లక్ష్మణుని అనుమతించెను. (34)

తతస్తు తస్మిన్ విజనే వనే తదా
మహాబలౌ రాఘవవంశవర్ధనౌ।
న తౌ భయం సంభ్రమమభ్యుపేయతుః
యథైవ సింహౌ గిరిసానుగోచరౌ॥ 35

పిమ్మట రఘువంశవర్ధనులు, మహాబలశాలురువైన ఆ రామలక్ష్మణులు ఆ నిర్జనవనప్రదేశమున ఎట్టిభయముగాని, తొట్రుపాటుగాని లేకుండ పర్వతసానువులయందు స్వేచ్ఛగా తిరుగాడు సింహములవలె సంచరించుచుండిరి. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రిపంచాశస్సర్గః (53)

వాల్మీకిమహర్షిసరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదిమూడవసర్గము సమాప్తము

— * * * —

54. ఏబదినాలుగవసర్గము

శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై భరద్వాజాశ్రమమునకు చేరుట. ఆ మహర్షి వారికి అతిథిసత్కారములను నెరపుట. వారి వనవాసదీక్షకు చిత్రకూటము అనువైనదిగా తెల్పుట.

తే తు తస్మిన్ మహావృక్షే ఉషిత్వా రజనీం శివామ్।
విమలేఽభ్యుదితే సూర్యే తస్మాద్దేశాత్ ప్రతస్థిరే। 1

యత్ర భాగీరథీం గంగాం యమునాఽభిప్రవర్తతే।
జగ్ముస్తం దేశముద్దిశ్య విగాహ్య సుమహద్వనమ్। 2

తే భూమిభాగాన్ వివిధాన్ దేశాంశ్చాపి మనోరమాన్।
అదృష్టపూర్వాన్ పశ్యంతః తత్ర తత్ర యశస్వినః। 3

యథా క్షేమేణ గచ్ఛన్ స పశ్యంశ్చ వివిధాన్ ద్రుమాన్।
నివృత్తమాత్రే దివసే రామః సౌమిత్రిమబ్రవీత్। 4

ప్రయాగమభితః పశ్య సౌమిత్రే ధూమమున్నతమ్।
అగ్నేర్భగవతః కేతుం మన్యే సన్నిహితో మునిః। 5

నూనం ప్రాప్తాః స్మ సంభేదం గంగాయమునయోర్వయమ్।
తథా హి శ్రూయతే శబ్దో వారిణో వారిఘట్టితః। 6

దారూణి పరిభిన్నాని వనజైః ఉపజీవిభిః।
భరద్వాజాశ్రమే చైతే దృశ్యంతే వివిధా ద్రుమాః। 7

ధన్వినౌ తౌ సుఖం గత్వా లంబమానే దివాకరే।
గంగాయమునయోస్సంధౌ ప్రాపతుర్నిలయం మునేః। 8

రామస్త్వాశ్రమమాసాద్య త్రాసయన్ మృగపక్షిణః।
గత్వా ముహూర్తమధ్వానం భరద్వాజముపాగమత్। 9

తతస్త్వాశ్రమమాసాద్య మునేర్దర్శనకాంక్షిణౌ।
సీతయాఽనుగతౌ వీరౌ దూరాదేవావతస్థతుః। 10

స ప్రవిశ్య మహాత్మానమ్ ఋషిం శిష్యగణైర్వృతమ్।
సంశితవ్రతమేకాగ్రం తపసా లబ్ధచక్షుషమ్। 11

హుతాగ్నిహోత్రం దృష్ట్వైవ మహాభాగం కృతాంజలిః।
రామ స్సౌమిత్రిణా సార్ధం సీతయా చాభ్యవాదయత్। 12

సీతారామలక్ష్మణులు ఆవృక్షమూలమున ప్రశాంతముగా ఆరాత్రిని గడిపి, సూర్యుడు ఉదయింపగనే సుప్రభాతవేళ ఆ ప్రదేశము నుండి బయలుదేఱిరి. (1)

భగీరథునివలన భూమికి దిగివచ్చిన గంగానదియు, యమునయు సంగమించుప్రదేశమైన ప్రయాగక్షేత్రమును చేరుటకై వారు దట్టమైన అడవులమీదుగా ముందునకు సాగిరి. వారు ఇంతకుముందెప్పుడును చూచి యెఱుగని పల్లెదేశములందలి వివిధమనోహర ప్రదేశములను, అందలి చక్కని దృశ్యములను గాంచుచు, అచ్చటచ్చట స్థానికుల ఆదరసత్కారములను స్వీకరించుచు, తమ ప్రయాణములను కొనసాగించుచుండిరి. (2-3)

వారు క్షేమముగా పయనించుచు మార్గమధ్యమున బాగుగా పుష్పించిన వివిధములగు మహావృక్షములను తిలకించుచుండిరి. మధ్యాహ్నానంతరము శ్రీరాముడు సౌమిత్రితో ఇట్లు నుడివెను (4)

"ఓ సౌమిత్రీ! ప్రయాగపరిసర ప్రదేశములలో పూజ్యుడైన అగ్నిదేవుని యొక్క ధ్వజమాయునట్లు ఒప్పుచున్న ఆ ఎత్తైన పొగను జూడుము. భరద్వాజమహర్షియు ఈ సమీపముననే యుండునని తలంతును. మనము నిజముగనే గంగాయమునా నదులసంగమ ప్రదేశమునకు చేరితిమి. అదిగో ఆ రెండు నదీప్రవాహముల సంగమమువలన ఏర్పడుచున్న జలఘర్షణశబ్దములు వినబడుచున్నవి. (5-6)

అడవులలో లభించు వస్తువులతో జీవించువారు నఱికిన కొయ్యలు ఇవిగో ఇచట కనబడుచున్నవి. భరద్వాజాశ్రమముచెంత అట్లు నఱుకబడిన వివిధవృక్షములును దర్శనమిచ్చుచున్నవి."

ధనుర్ధారులైన రామలక్ష్మణులు ఇట్లు సంభాషించుకొనుచు సూర్యాస్తమయసమయమున గంగాయమునాసంగమప్రదేశమున గల భరద్వాజాశ్రమమునకు చేరిరి. (7-8)

ధనుర్ధారులైయున్న ఆ అన్నదమ్ములను జూచి, ఆ యాశ్రమ సమీపమునగల మృగములును, పక్షులును భీతిల్లినవి. వారు ఒక క్షణకాలముపాటు నడచి భరద్వాజుని చెంతకు చేరిరి. (9)

ఆయాశ్రమమునకుజేరిన రామలక్ష్మణులు భరద్వాజమహర్షిని దర్శింపగోరినవారై సీతతోగూడి, ఆ మునీశ్వరునకు కొంతదూరమున నిలబడిరి. (10)

(శిష్యులద్వారా తమరాకను తెలియజేసి, ఆ మహర్షియనుమతిని పొందిన పిదప) వారు ఆ పర్ణశాలలో ప్రవేశించిరి. మహాత్ముడైన ఆ భరద్వాజమహాముని శిష్యపరివృతుడై, తీవ్రమైన వ్రతదీక్షలో ఏకాగ్రచిత్తుడైయుండెను. తపశ్శక్తిచే పొందిన దివ్యదృష్టివలన అతడు భూతభవిష్యద్వర్తమానములను ఎఱుంగగలిగియుండెను. సాయంకాలపు అగ్నికార్యములను నిర్వర్తించియున్న ఆ మహానుభావుని జూచి, వెంటనే సీతాలక్ష్మణసమేతుడైన శ్రీరాముడు అంజలి ఘటించి ఆయనకు ప్రణమిల్లెను. (11-12)

న్యవేదయత చాత్మానం తస్మై లక్ష్మణపూర్వజః।
పుత్రౌ దశరథస్యావాం భగవన్ రామలక్ష్మణౌ। 13

భార్యా మమేయం వైదేహీ కల్యాణీ జనకాత్మజా।
మాం చానుయాతా విజనం తపోవనమనిందితా। 14

పిత్రా ప్రవ్రాజ్యమానం మాం సౌమిత్రిరనుజః ప్రియః।
అయమన్వగమద్భ్రాతా వనమేవ దృఢవ్రతః। 15

పిత్రా నియుక్తా భగవన్ ప్రవేక్ష్యామః తపోవనమ్।
ధర్మమేవ చరిష్యామః తత్ర మూలఫలాశనాః। 16

తస్య తద్వచనం శ్రుత్వా రాజపుత్రస్య ధీమతః।
ఉపానయత ధర్మాత్మా గామర్ఘ్యముదకం తతః। 17

నానావిధానన్నరసాన్ వన్యమూలఫలాశ్రయాన్।
తేభ్యో దదౌ తప్తతపా వాసం చైవాభ్యకల్పయత్। 18

మృగపక్షిభిరాసీనో మునిభిశ్చ సమంతతః।
రామమాగతమభ్యర్చ్య స్వాగతేనాహ తం మునిః। 19

ప్రతిగృహ్య చ తామర్చామ్ ఉపవిష్టం స రాఘవమ్।
భరద్వాజోఽబ్రవీద్వాక్యం ధర్మయుక్తమిదం తదా। 20

చిరస్య ఖలు కాకుత్స్థ! పశ్యామి త్వామిహాగతమ్।
శ్రుతం తవ మయా చేదం వివాసనమకారణమ్। 21

అవకాశో వివిక్తోఽయం మహానద్యోః సమాగమే।
పుణ్యశ్చ రమణీయశ్చ వసత్విహ భవాన్ సుఖమ్। 22

ఏవముక్తస్తు వచనం భరద్వాజేన రాఘవః।
ప్రత్యువాచ శుభం వాక్యం రామః సర్వహితే రతః। 23

భగవన్నిత ఆసన్నః పౌరజానపదో జనః,
సుదర్శమిహ మాం ప్రేక్ష్య మన్యేఽహమిమమాశ్రమమ్, 24

ఆగమిష్యతి వైదేహీం మాం చాపి ప్రేక్షకో జనః,
అనేన కారణేనాహమ్ ఇహ వాసం న రోచయే, 25

ఏకాంతే పశ్య భగవన్ ఆశ్రమస్థానముత్తమమ్,
రమేత యత్ర వైదేహీ సుఖార్హా జనకాత్మజా, 26

పిమ్మట శ్రీరాముడు తమనుగూర్చి ఆ మహర్షికి ఇట్లు తెలిపెను. "ఓ పూజ్యమహామునీ! మేము దశరథమహారాజు పుత్రులము, రామలక్ష్మణులము. ఈ సాధ్వి నా భార్య. పేరు వైదేహి, జనక మహారాజు కూతురు. ఈ ఉత్తమురాలు నన్ను అనుసరించి, ఈ నిర్జనవనప్రదేశములకు వచ్చినది. (13-14)

తండ్రియాజ్ఞను అనుసరించి, వనవాస నిమిత్తమై నేను ఇటువచ్చు చుండగాజూచి, నా అనుంగుతమ్ముడైన ఈ లక్ష్మణుడు నన్ను అనుసరించుటకే గట్టిగా నిశ్చయించుకొని, ఇట్లు నావెంట వచ్చెను. ఓ మహాత్మా! తండ్రిఆదేశముప్రకారము తపోవనములయందు ప్రవేశింపనున్నాము. కందమూలఫలములనే భుజించుచు వానప్రస్థ ధర్మమును ఆచరించెదము". (15-16)

అంతట ధర్మాత్ముడైన ఆముని ధీమంతుడును, రాజకుమారుడును ఐన శ్రీరామునివచనములను విని, గోవును, అర్ఘ్యజలములను తెప్పించి, వారికి భక్తిశ్రద్ధలతో అతిథిసత్కారములను నెఱపెను. పిమ్మట ఆ మహాతపస్వి వారికి ఇంకను వనములలో లభించు వివిధములగు ఫలమూలాదులతోగూడిన ఆహారపదార్థములను, మధురపానీయములను సమకూర్చెను. ఆత్మీయతతో వారికి నివాసమును ఏర్పఱచెను. (17-18)

మృగములతోడను, పక్షులతోడను, మునీశ్వరులతోడను పరివృతుడై ఆసీనుడైయున్న ఆ భరద్వాజమహాముని తనకడకు విచ్చేసిన శ్రీరామునకు స్వాగతపూర్వకముగా అతిథిపూజోపచారములను నిర్వహించెను. ఆతిథ్యమును స్వీకరించి, ఆసీనుడైయున్న శ్రీరామునితో భరద్వాజుడు ఇట్లు ధర్మవచనములను పలికెను. (19-20)

"ఓ కాకుత్స్థా! రామా! ఎంతో కాలమునుండి నీదర్శనభాగ్యమునకై నిరీక్షించుచుంటిని. ఈనాటికి నీరాకతో అది ఫలించినది. నీయందుఎట్టి దోషములేకున్నను నీవు వనవాసముచేయవలసి వచ్చినట్లు నేను వినియున్నాను. (21)

ఇది గంగాయమునానదులు కలియు ప్రసిద్ధక్షేత్రము మిక్కిలి పవిత్రమైనది, మనోహరమైనది. ఈ ప్రశాంతప్రదేశమున మీరు హాయిగా ఉండవచ్చును." (22)

రఘువంశజుడును, సకలప్రాణులహితమును కోరెడివాడును ఐన శ్రీరాముడు భరద్వాజమహర్షిపలుకులను వినిన పిమ్మట ఆయనతో సముచితముగా ఇట్లు నుడివెను. (23)

"ఓ పూజ్యమహర్షీ! ఇచటికి సమీపమునగల కోసలదేశపురజనులు, జానపదులు, నేను ఈ ఆశ్రమముననున్నట్లు ఎఱింగి, సులభముగా దర్శింపవచ్చునను కుతూహలముతో నన్నును, సీతాదేవిని చూడ గోరుదురు. అందులకై వారు తఱచుగా ఇచటికి వచ్చిపోవుచుందురు. కావున ఇచట మేము నివసించుట యుక్తముగాదని తలంతును. కావున ఓ మహాత్మా! జనులకు అందుబాటులోనుండని, ఆశ్రమ వాసమునకు అనువైన ఒక మంచి ప్రదేశమునుగూర్చి ఆలోచించి తెల్పుడు. సుకుమారముగా పెరిగిన ఈ జానకికి అట్టిప్రదేశమున హాయిగా ఉండగలదు." (24-26)

ఏతచ్ఛ్రుత్వా శుభం వాక్యం భరద్వాజో మహామునిః।
రాఘవస్య తతో వాక్యమ్ అర్థగ్రాహకమబ్రవీత్। 27

శ్రీరాముడు యుక్తియుక్తముగా పలికిన మాటలను విని, భరద్వాజ మహాముని శ్రీరాముని అభిప్రాయమునకు తగినట్లుగా ఇట్లనెను. (27)

దశక్రోశ ఇతస్తాత! గిరిర్యత్ర నివత్స్యసి।
మహర్షి సేవితః పుణ్యః సర్వతః సుఖదర్శనః। 28

గోలాంగూలానుచరితో వానరర్క్షనిషేవితః।
చిత్రకూట ఇతి ఖ్యాతో గంధమాదనసన్నిభః। 29

"నాయనా! శ్రీరామా! ఇక్కడికి పదిక్రోసుల[1] దూరములో 'చిత్రకూటము' అను పవిత్రమైన పర్వతప్రదేశముగలదు. దర్శనీయమైన ఆ ప్రదేశమున మహర్షులు నివసించుచుందురు. అది మీనివాసమునకు తగిన చోటు. అచట వానరములు, కొండముచ్చులు, ఎలుగుబంట్లు తిరుగుచుండును. అది గంధమాదన పర్వతమువలె మనోహరమైనది. (28-29)

యావతా చిత్రకూటస్య నరః శృంగాణ్యవేక్షతే।
కల్యాణాని సమాధత్తే న పాపే కురుతే మనః। 30

చిత్రకూటగిరిశృంగములను చూచుచున్నంత కాలమునంతను (చిత్రకూటమున నివసించుచున్నంతవఱకును) అచటివారికి పుణ్యకార్యఫలములు లభించుచునేయుండును. (అనగా వారు పుణ్యకార్యములనే చేయుచుందురు.) వారి మనస్సులకు పాపపు ఆలోచనలేరావు. (30)

ఋషయస్తత్ర బహవో విహృత్య శరదాం శతమ్।
తపసా దివమారూఢాః కపాలశిరసా సహ। 31

పెక్కుమంది మహర్షులు ఆ చిత్రకూటమున నివసించుచు, వందలకొలది సంవత్సరములు తపస్సు లొనర్చుటచే ఆ ప్రదేశము పునీతమైనది. ఆ స్థలమహిమచే వారితపస్సులును సిద్ధించినవి. అంతమాత్రమేగాదు వారిందఱును బ్రహ్మరంధ్రమును ఛేదించుకొని అర్చిర్మార్గముద్వారా దివ్యధామమును పొందగలిగిరి. (31)

ప్రవివిక్తమహం మన్యే తం వాసం భవతస్సుఖమ్।
ఇహ వా వనవాసాయ వస రామ! మయా సహ। 32

ఓ రామా! మీ ఏకాంత వాసమునకు ఆ ప్రదేశము ఎంతయు అనుకూలము. అచట మీరు మిక్కిలి సుఖముగా ఉండవచ్చును. లేనిచో మీవనవాసమును నాతోగూడి ఈ ఆశ్రమముననే గడుపగలరు." (32)

స రామం సర్వకామైస్తం భరద్వాజః ప్రియాతిథిమ్।
సభార్యం సహ చ భ్రాత్రా ప్రతిజగ్రాహ ధర్మవిత్। 33

ధర్మజ్ఞుడైన ఆభరద్వాజమహాముని ఇట్లు పలికి, తనకు ప్రియమును గూర్చు అతిథులగు శ్రీరామునకును, సీతాదేవికిని, లక్ష్మణస్వామికిని, చక్కని అతిథిసత్కారములతో ఉపచారములనొనర్చెను. వారికి సంతృప్తినిగల్గించెను. (33)

తస్య ప్రయాగే రామస్య తం మహర్షిముపేయుషః।
ప్రపన్నా రజనీ పుణ్యా చిత్రాః కథయతః కథాః। 34

భరద్వాజమహర్షియు, ఆయనచెంత కూర్చొనియున్న శ్రీరాముడును చిత్రకథాసంభాషణలు చేయుచుండిరి. ఇంతలో ప్రశాంతిని గూర్చుచు రాత్రియయ్యెను. (34)

సీతాతృతీయః కాకుత్స్థః పరిశ్రాంతః సుఖోచితః।
భరద్వాజాశ్రమే రమ్యే తాం రాత్రిమవసత్ సుఖమ్। 35

సుఖముగా పెరిగిన సీతారామలక్ష్మణులు ప్రయాణశ్రమచే అలసిపోయియుండిరి. అందువలన వారు మనోహరమైన ఆభరద్వాజ మహర్షిఆశ్రమమున ఆరాత్రిని సంతోషముగా గడపిరి. (35)

ప్రభాతాయాం రజన్యాం తు భరద్వాజముపాగమత్।
ఉవాచ నరశార్దూలో మునిం జ్వలితతేజసమ్। 36

రాత్రి గడిచి, తెల్లవారగనే నరశ్రేష్ఠుడైన శ్రీరాముడు మహాతేజస్వియైన భరద్వాజమునిని సమీపించి, ఆయనతో ఇట్లనెను. (36)

1) 'దశక్రోశః'-ఇచట ఏకశేషద్వంద్వవిధిని అనుసరించి, దశచ, దశచ, దశచ = దశ అని వివరించినచో, ఈ 'దశక్రోశ' సమాసపదమునకు ముప్పదిక్రోసులు అను అర్థమును గ్రహింపవచ్చును. ఒక క్రోసుఅనగా రెండుమైళ్లు. 30×2 = 60 మైళ్లు - వెరసి ప్రయాగనుండి చిత్రకూటమునకు 60 మైళ్లదూరము ఉన్నట్లుతెలియును. ఇప్పటివారి దూరమానమునుబట్టి ఈరెండింటిమధ్యదూరము ఎనుబదిమైళ్లుగా పేర్కొనబడుచున్నది. ఆనాటివారి దూరమానమునకును ఆధునికుల దూరమానమునకునుగల తేడాలవలన ఈ20 మైళ్లభేదమును సర్దుకొనవచ్చును. లేదా ప్రయాగమునుండి చిత్రకూటప్రారంభప్రదేశమునకు అనాడు అఱువది (60) మైళ్లదూరమేయుండియుండవచ్చును.

శర్వరీం భగవన్నద్య సత్యశీల! తవాశ్రమే।
ఉషితాః స్మేహ వసతిమ్ అనుజానాతు నో భవాన్। 37

"సత్యశీలుడవైన ఓ మహాత్మా! మీ ఆశ్రమమున ఒక రాత్రిని గడపితిమి. ఇంతకుముందు మీరు సూచించిన ఆ ప్రదేశమునకు వెళ్ళుటకై ఇంక మీరు మాకు అనుమతినిండు." (37)

రాత్ర్యాం తు తస్యాం వ్యుష్టాయాం భరద్వాజోఽబ్రవీదిదమ్।
మధుమూలఫలోపేతం చిత్రకూటం వ్రజేతి హ। 38

వాసమౌపయికం మన్యే తవ రామ! మహాబల!।
నానానగగణోపేతః కిన్నరోరగసేవితః। 39

మయూరనాదాభిరుతో గజరాజనిషేవితః।
గమ్యతాం భవతా శైలః చిత్రకూట స్స విశ్రుతః।
పుణ్యశ్చ రమణీయశ్చ బహుమూలఫలాయుతః। 40

రాత్రి గడచిన పిదప, ఆ సుప్రభాతసమయమున భరద్వాజమహర్షి శ్రీరామునితో ఇట్లు నుడివెను. "ఓ రామా! ఈ సమీపముననే చిత్రకూటపర్వతము గలదు. అది మధురములైన ఫలములతోడను, కందమూలములతోడను ఒప్పుచున్నది. అచటికి వెళ్ళుడు. ఓ పరాక్రమశాలీ! మీరు నివసించుటకు అది మిగుల అనుకూలప్రదేశము. అచట చక్కని నీడనిచ్చు వివిధములగు మహావృక్షములుగలవు. ఆ ప్రదేశమున కిన్నరులు, నాగజాతివారు సంచరించుచుందురు. నెమళ్ళు మనోహరముగా క్రేంకారములు చేయుచుండును. మహాగజములు తిరుగుచుండును. ఆ ప్రదేశము పవిత్రము, మనోజ్ఞము. అక్కడ కందమూలఫలములు సమృద్ధిగా లభించును. మీరు వాసిగాంచిన ఆ చిత్రకూటపర్వతమునకు వెళ్ళుడు. (38-40)

తత్ర కుంజరయూథాని మృగయూథాని చాభితః।
విచరంతి వనాంతేఽస్మిన్ తాని ద్రక్ష్యసి రాఘవ!। 41

ఓ రఘునందనా! ఆ పరిసరప్రదేశములలో ఏనుగుల సమూహములు, లేళ్ళగుంపులు చూడముచ్చటగొలుపునట్లుగా సంచరించుచు మిమ్ము ఆనందింపజేయుగలవు. (41)

సరిత్ప్రస్రవణప్రస్థాన్ దరీకందరనిర్ఝరాన్।
చరతస్సీతయా సార్ధం నందిష్యతి మనస్తవ। 42

అచటి పర్వతసానువులను, మందాకినీనదీతీరములను, సెక్కుజలపాతములను, నానావిధములగు గుహలను, సెలయేళ్ళను మీరు దర్శింప వచ్చును. నీవును, సీతాదేవియు విహరించువేళ ఆ ప్రదేశము అంతయు మీ మనస్సులకు ఆహ్లాదకరముగానుండును. (42)

ప్రహృష్ట కోయష్టిక కోకిలస్వనైః।
వినాదితం తం వసుధాధరం శివమ్।
మృగైశ్చ మత్తైర్బహుభిశ్చ కుంజరైః।
సురమ్యమాసాద్య సమావసాశ్రమమ్। 43

మంగళకరమైన ఆ పర్వతము సంతోషముతో పొంగిపోవుచున్న టిట్టిభములరవములతో, కోకిలలస్వరములతో ప్రతిధ్వనించుచుండును. హరిణములతోడను, మదగజములగుంపులతోడను మిక్కిలి రమణీయముగానుండు ఆ ఆశ్రమమునకు చేరి, అచట నివసింపుడు. (43)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుఃపంచాశస్సర్గః (54)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదినాలుగవసర్గము సమాప్తము

-- * * * --

55. ఏబదిఐదవసర్గము

సీతారామలక్ష్మణులు యమునానదిని దాటుట.

ఉషిత్వా రజనీం తత్ర రాజపుత్రావరిందమౌ।
మహర్షిమభివాద్యాథ జగ్మతుస్తం గిరిం ప్రతి। 1

శత్రుసంహారకులైన రామలక్ష్మణులు ప్రయాగక్షేత్రమునందలి భరద్వాజాశ్రమమున ఆరాత్రి గడపి, మరునాడు ఉదయమున ఆ మహర్షికి నమస్కరించి, ఆయన అనుమతితో వారు చిత్రకూట పర్వతమునకు బయలుదేరిరి. అంతట ప్రయాణమునకు ఉద్యుక్తులైన సీతారాములకు ఆ మహాముని శుభాశీస్సులను పలికెను. అనంతరము ఆ ముని తండ్రి కుమారులననుసరించునట్లుగా వారిని కొంతదూరమనుసరించి,

తేషాం చైవ స్వస్త్యయనం మహర్షిస్స చకార హ।
ప్రస్థితాంశ్చైవ తాన్ ప్రేక్ష్య పితా పుత్త్రానివాన్వగాత్। 2

తతః ప్రచక్రమే వక్తుం వచనం స మహామునిః।
భరద్వాజో మహాతేజా రామం సత్యపరాక్రమమ్। 3

గంగాయమునయోస్సంధిమ్ ఆసాద్య మనుజర్షభౌ।
కాళిందీమనుగచ్ఛేతాం నదీం పశ్చాన్ముఖాశ్రితామ్। 4

అథాఽఽసాద్య తు కాళిందీం శీఘ్రస్రోతసమాపగామ్।
తస్యాస్తీర్థం ప్రచరితం పురాణం ప్రేక్ష్య రాఘవౌ। 5

తత్ర యూయం ప్లవం కృత్వా తరతాంశుమతీం నదీమ్।
తతో న్యగ్రోధమాసాద్య మహాంతం హరితచ్ఛదమ్। 6

వివృద్ధం బహుభి ర్వృక్షైః శ్యామం సిద్ధోపసేవితమ్।
తస్మై సీతాంజలిం కృత్వా ప్రయుంజీతాశిషశ్శివాః। 7

సమాసాద్య తు తం వృక్షం వసేద్వాఽతిక్రమేత వా।
క్రోశమాత్రం తతో గత్వా నీలం ద్రక్ష్యథ కాననమ్। 8

పలాశబదరీమిశ్రం రమ్యం వంశైశ్చ యామునైః।
స పంథాశ్చిత్రకూటస్య గతః సుబహుశో మయా। 9

రమ్యో మార్దవయుక్తశ్చ వనదావైర్వివర్జితః।
ఇతి పంథానమావేద్య మహర్షి స్స న్యవర్తత।
అభివాద్య తథే త్యుక్త్వా రామేణ వినివర్తితః। 10

ఉపావృత్తే మునౌ తస్మిన్ రామో లక్ష్మణమబ్రవీత్।
కృతపుణ్యాః స్మ సౌమిత్రే! మునిర్యన్నోఽనుకంపతే। 11

ఇతి తౌ పురుషవ్యాఘ్రౌ మంత్రయిత్వా మనస్వినౌ।
సీతామేవాగ్రతః కృత్వా కాళిందీం జగ్మతుర్నదీమ్। 12

అథాఽసాద్య తు కాళిందీం శీఘ్రస్రోతోవహాం నదీమ్।
చింతామాపేదిరే సర్వే నదీజలతితీర్షవః। 13

తౌ కాష్ఠసంఘాటమథో చక్రతుస్సుమహాప్లవమ్।
శుష్కైర్వంశై స్సమాస్తీర్ణమ్ ఉశీరైశ్చ సమావృతమ్। 14

వెళ్లవలసిన మార్గములను గూర్చియు, తీసికొనవలసిన జాగ్రత్తలను గుఱించియు వారికి తెలిపెను. (1-2)

పిమ్మట మిక్కిలి తేజోమూర్తియైన భరద్వాజమహర్షి సత్యపరాక్రముడైన శ్రీరామునితో ఇట్లు నుడువదొడంగెను. (3)

"ఓ నరశ్రేష్ఠులారా! గంగాయమునాసంగమప్రదేశమునకు చేరి, అచటినుండి పశ్చిమాభిముఖులై యమునానదీ తీరమును అనుసరించి ప్రయాణము చేయుడు. (4)

ఓ రామలక్ష్మణులారా! వేగముగా ప్రవహించునట్టి ఆ యమునకు చేరి, ఆ నదీతీరమున జనులందరును సంచరించునట్టి ప్రాచీనమైన తీర్థము (రేవు)ను చూడుడు. జనుల అడుగుజాడలను బట్టి అరేవును గుర్తింపుడు. ఒక తెప్పను సిద్ధపఱచుకొని, దానిద్వారా ఆ యమునా నదిని దాటుడు. యమునకు ఆవలితీరమున 'శ్యామము' అను పేరుగల ఒక మఱ్ఱిచెట్టుగలదు. పచ్చని ఆకులుగల్గి, ఏపుగా పెఱిగిన ఆచెట్టుచుట్టును పెక్కువృక్షములు గలవు. ఆ వృక్షచ్ఛాయలో పెక్కుమంది సిద్ధులు నివసించుచుందురు. సీతాదేవి ఆ వృక్షమునకు నమస్కరించి, శుభాశీస్సులను పొందవలెను. (5-7)

ఆ వృక్షసమీపమునకు చేరిన పిమ్మట మీరు అక్కడ కొంతతడవు ఉండి సేదదీర్చుకొనవచ్చును. లేదా మీరు అచటినుండి ఒక క్రోసెడు దూరము వెళ్లినచో నల్లని ఒక దట్టమైన అడవి వచ్చును. ఆ అరణ్యము మోదుగు, అందుగు, రేగుచెట్లతో నిండియుండును. యమునా నదీతీరమునగల వెదుళ్లపొదలతో అది రమణీయముగా నుండును. అచటినుండి చిత్రకూటము చేరుటకు చక్కని మార్గము గలదు. ఆ దారిలో నేను పెక్కు పర్యాయములు ప్రయాణము చేసియుంటిని. (8-9)

ఆ మార్గము మెత్తని ఇసుక కలదై ప్రయాణమునకు అనువుగను, చూచుటకు అందముగను ఉండును. ఆ దారిలో దావాగ్నిబాధయుండదు." ఇట్లు మార్గనిర్దేశముచేసి, ఆ మహర్షి వెనుకకు మఱలుటకై ఆగెను. అప్పుడు శ్రీరాముడు 'అట్లే' యని పలికి, మహర్షికి నమస్కరించి, 'అయ్యా మీరు ఇంక మీ ఆశ్రమమునకు వెళ్లుడు' - అని పల్కెను. (10)

ఆ మహర్షి ఆశ్రమాభిముఖముగా తిరిగివెళ్లిన పిమ్మట, శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లనెను. 'ఓ సౌమిత్రీ! మనము ఆ మహర్షి దయకు పాత్రులమై కృతార్థులమైతిమి. (11)

ఈ విధముగా మాట్లాడుచు నరశ్రేష్ఠులు, మహాత్ములు ఐన ఆ రామలక్ష్మణులు, ముందు సీతాదేవి నడచుచుండగా యమునా నదీతీరమునకు చేరిరి. (12)

మిక్కిలి వేగముగా ప్రవహించుచున్న యమునానదీతీరమునకు చేరిన పిమ్మట 'ఈ నదిని దాటుటయెట్లు?' అని వారు ఆలోచనలో పడిరి. (13)

అంతట రామలక్ష్మణులు ఎండిన వెదురుకఱ్ఱలను పఱచి, వట్టివేళ్ల తడకలతో చేర్చి, ఆకఱ్ఱలతో ఒక పెద్ద తెప్పను సిద్ధపఱచిరి. (14)

తతో వేతసశాఖాశ్చ జంబూశాఖాశ్చ వీర్యవాన్।
చకార లక్ష్మణశ్ఛిత్త్వా సీతాయా స్సుఖమాసనమ్। 15

తత్ర శ్రియమివాచింత్యాం రామో దాశరథిః ప్రియామ్।
ఈషత్ సంలజ్జమానాం తామ్ అధ్యారోపయత ప్లవమ్। 16

పార్శ్వే చ తత్ర వైదేహ్యా వసనే భూషణాని చ।
ప్లవే కఠినకాజం చ రామశ్చక్రే సహాయుధైః। 17

ఆరోప్య సీతాం ప్రథమం సంఘాటం పరిగృహ్య తౌ।
తతః ప్రతేరతుర్యత్తౌ వీరౌ దశరథాత్మజౌ। 18

కాళిందీమధ్యమాయాతా సీతా త్వేనామవందత।
స్వస్తి దేవి! తరామి త్వాం పారయేన్మే పతిర్వ్రతమ్। 19

యక్ష్యే త్వాం గోసహస్రేణ సురాఘటశతేన చ।
స్వస్తి ప్రత్యాగతే రామే పురీమ్ ఇక్ష్వాకుపాలితామ్। 20

కాళిందీమథ సీతా తు యాచమానా కృతాంజలిః।
తీరమేవాభిసంప్రాప్తా దక్షిణం వరవర్ణినీ। 21

తతః ప్లవేనాంశుమతీం శీఘ్రగామూర్మిమాలినీమ్।
తీరజైర్బహుభిర్వృక్షైః సంతేరుః యమునాం నదీమ్। 22

తే తీర్ణాః ప్లవముత్సృజ్య ప్రస్థాయ యమునావనాత్।
శ్యామం న్యగ్రోధమాసేదుః శీతలం హరితచ్ఛదమ్। 23

న్యగ్రోధం తముపాగమ్య వైదేహీ వాక్యమబ్రవీత్। 24

నమస్తేఽస్తు మహావృక్ష! పారయేన్మే పతిర్వ్రతమ్।
కౌసల్యాం చైవ పశ్యేయం సుమిత్రాం చ యశస్వినీమ్।
ఇతి సీతాఽంజలిం కృత్వా పర్యగచ్ఛద్వనస్పతిమ్। 25

అవలోక్య తతస్సీతామ్ ఆయాచంతీమనిందితామ్।
దయితాం చ విధేయాం చ రామో లక్ష్మణమబ్రవీత్। 26

సీతామాదాయ గచ్ఛ త్వమ్ అగ్రతో భరతాగ్రజ।
పృష్ఠతోఽహం గమిష్యామి సాయుధో ద్విపదాం వర! 27

యద్యత్ ఫలం ప్రార్థయతే పుష్పం వా జనకాత్మజా।
తత్తత్ ప్రదద్యా వైదేహ్యా యత్రాఽస్యా రమతే మనః। 28

అనంతరము శక్తిమంతుడైన లక్ష్మణుడు నీటిప్రబ్బలి కొమ్మలను, నేరేడుకొమ్మలను నరికితెచ్చి, సీతాదేవికొఱకై ఒక చక్కని ఆసనమును ఏర్పాటు చేసెను. (15)

లక్ష్మీదేవివలె అద్భుతసౌందర్యవతియు, కొద్దిగా బిడియ పడుచున్నదియు, తనకు ఇష్టురాలును ఐన ఆ సీతాదేవిని శ్రీరాముడు ఆ తెప్పమీదికి చేర్చెను. పిమ్మట శ్రీరాముడు సీతాదేవికి పార్శ్వ భాగమున ఆమెవస్త్రాభరణములను, పలుగు గంపలను, ఆయుధములను తెప్పమీదికి చేర్చెను. (16-17)

అనంతరము వీరులైన ఆ రామలక్ష్మణులు తెప్పను గట్టిగా పట్టుకొని, మొదట సీతాదేవిని ఎక్కించి, పిదప తాము ఎక్కి, సావధానముగా తెప్పను నడుపుచు ఆ నదిని దాటిరి. (18)

ఆ తెప్ప యమునా నదీమధ్యభాగమునకు చేరగనే సీతాదేవి ఆ నదికి నమస్కరించి, ఇట్లు ప్రార్థించెను. "ఓ దేవీ! నీ ప్రవాహమును దాటుచున్నాము. ఎల్లరకును మంగళమగుగాక. నీ అనుగ్రహముతో నా పతిదేవుని వనవాసదీక్ష నిర్విఘ్నముగా పూర్తియగుగాక. శ్రీరాముడు ఇక్ష్వాకువంశజులరాజధానియైన అయోధ్యకు క్షేమముగా తిరిగి చేరినచో నీకు వేలకొలది గోవులను, వందలకొలది దివ్యనైవేద్యములను సమర్పింతును." సుందరీమణియైన సీతాదేవి అంజలిఘటించి, ఆ నదీమతల్లిని ప్రార్థించుచు ఆవలి (దక్షిణ) తీరమునకు చేరెను. (19-21)

అంతట వారు తరంగములతో పరవళ్ళుద్రొక్కుచు ప్రవహించుచున్న యమునానదిని ఆ తెప్ప సహాయముతో దాటిరి. ఆ నదీతీరమున నానావిధములగు వృక్షములు శోభిల్లుచుండెను. (22)

ఆ నదిని దాటిన పిమ్మట వారు ఆ తెప్పను వీడి, యమునా తీరవనముమీదుగా ప్రయాణముచేసి, పచ్చని ఆకులతో, చల్లని నీడలతో విలసిల్లుచున్న ఒక నల్లని మఱ్ఱిచెట్టుకడకు చేరిరి. ఆ వృక్షముక్రిందికి చేరినపిదప సీతాదేవి ఆ వృక్షమును ఇట్లు ప్రార్థించెను. (23-24)

"ఓ వృక్షరాజమా! నీకు నమస్కారము. నీచలువతో నాభర్తయొక్క వనవాసవ్రతము నిరంతరాయముగా పూర్తియగుగాక. అనంతరము మిక్కిలి పేరు ప్రతిష్ఠలుగల కౌసల్యాదేవిని, సుమిత్రాదేవిని మేము దర్శింతుము." అని సీతాదేవి కృతాంజలియై, ఆ మహావృక్షమునకు ప్రదక్షిణమొనర్చెను. (25)

తనకు ప్రాణతుల్యయు, విధేయురాలును, లోకపూజ్యురాలును ఐన సీతాదేవి వృక్షరాజమునకు తనమనోరథమును నివేదించుచుండగా చూచి, శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లు పలికెను. (26)

"ఓ నరశ్రేష్ఠా! లక్ష్మణా! నీవు సాయుధుడవై, సీతాదేవికి ముందు భాగమున నడుచుచుండుము. ఆమెవెనుక ధనుర్ధారినై నేను నడచుచుందును. సీతాదేవికోరికమేరకు ఫలములను, పుష్పములను, ఆమె మనసుపడిన తదితర వస్తువులను ఆమెకు సమకూర్చవలెను. (27-28)

గచ్ఛతోఽస్తు తయోర్మధ్యే బభూవ జనకాత్మజా।
మాతంగయోర్మధ్యగతా శుభా నాగవధూ రివ। 29

ఏకైకం పాదపం గుల్మం లతాం వా పుష్పశాలినీమ్।
అదృష్టపూర్వాం పశ్యంతీ రామం పప్రచ్ఛ సాఽబలా। 30

రమణీయాన్ బహువిధాన్ పాదపాన్ కుసుమోత్కటాన్।
సీతావచనసంరబ్ధ ఆనయామాస లక్ష్మణః। 31

అట్లు వెళ్లుచున్న రామలక్ష్మణులకు మధ్యనున్న జానకి రెండు మదగజములనడుమనున్న ఆడు ఏనుగువలె శోభిల్లుచుండెను. ఇదివరలో చూడనట్టి మొక్కగాని, పూలపొదగాని, పూవులతో కలకలలాడుచున్న తీగగాని కనబడినప్పుడు సీతాదేవి వాటిపై తనఅభిలాషను పతికి తెలుపుచుండెను. సీత కోరిన వెంటనే లక్ష్మణుడు పూవులతో నిలసిల్లుచున్న రమణీయములైన నానావిధములగు మొక్కలను తీసికొని వచ్చుచుండెను (29-31)

విచిత్రవాలుకజలాం హంససారసనాదితామ్।
రేమే జనకరాజస్య తదా ప్రేక్ష్య సుతా నదీమ్। 32

జనకమహారాజుకూతురగు ఆ సీతాదేవి చక్కని ఇసుకతిన్నెలతో, జలములతో విలసిల్లుచు, హంసల, బెగ్గురుపక్షుల కలరవములతో ఒప్పారుచు ఉన్న ఆ యమునానదిని జూచి మిగుల ఆనందించెను. (32)

క్రోశమాత్రం తతో గత్వా భ్రాతరౌ రామలక్ష్మణౌ।
బహూన్ మేధ్యాన్ మృగాన్ హత్వా చేరతుర్యమునావనే। 33

సోదరులైన ఆ రామలక్ష్మణులు అచటినుండి ఒక క్రోసెడు దూరము వెళ్లి, ఆ ప్రదేశమున పవిత్రములైన అశ్వకందములను, మధురములైన ఫలమూలములను[1] సేకరించి, యమునానదీ తీరమున వాటిని భక్షించిరి. (33)

విహృత్య తే బర్హిణపూగనాదితే
శుభే వనే వానరవారణాయుతే ।
సమం నదీవప్రముపేత్య సమ్మతం
నివాసమాజగ్మురదీనదర్శనాః । 34

పిదప వారు నెమళ్లగుంపులమధురనాదములతోడను, వానరముల, గజముల సంచారములతోడను ఒప్పుచున్న సుందరవనప్రదేశమున విహరించిరి. అనంతరము యమునానదీతీరమున ఒక సమతల ప్రదేశమునకు చేరి, అందరికిని సమ్మతముగుటచే వారు ఏమాత్రము దైన్యములేనివారై, అచట నివసించిరి. (34)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచపంచాశస్సర్గః (55)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదిఐదవసర్గము సమాప్తము

-- * * * --

56. ఏబదిఆఱవసర్గము

చిత్రకూటమున లక్ష్మణుడు కుటీరములను నిర్మించుట - వాస్తుపూజలఅనంతరము సీతారామలక్ష్మణులు అందు ప్రవేశించుట.

అథ రాత్ర్యాం వ్యతీతాయామ్ అవసుప్తమనంతరమ్।
ప్రబోధయామాస శనైః లక్ష్మణం రఘునందనః। 1

ఆరాత్రి గడచిన పిమ్మట శ్రీరాముడు తాను నిద్రనుండిలేచి, అచట పండుకొనియున్న లక్ష్మణుని తిన్నగా జాగృతునిగావించి ఇట్లు పలికెను. (1)

సౌమిత్రే! శృణు వన్యానాం వల్గు వ్యాహరతాం స్వనమ్।
సంప్రతిష్ఠామహే కాలః ప్రస్థానస్య పరంతప!। 2

"శత్రుదమనుడవైన ఓ లక్ష్మణా! వనములలో నివసించు చిలుకలు, కోకిలలు, గోరువంకలు మొదలగు పక్షులమధురస్వరములను వినుము. ప్రయాణమునకు ఇది తగినసమయము. కనుక ఇచటి నుండి బయలుదేఱుదము." (2)

స సుప్తః సమయే భ్రాత్రా లక్ష్మణః ప్రతిబోధితః।
జహౌ నిద్రాం చ తంద్రీం చ ప్రసక్తం చ పథి శ్రమమ్। 3

ఇంతవఱకును కునికిపాటులోనున్న ఆ లక్ష్మణుడు సమయమును గుర్తించి, అన్న హెచ్చరికతో అతడు జాగరూకుడై లేచెను. ప్రయాణపు బడలికను తీర్చుకొనెను. (3)

1) మేధ్యాన్=పవిత్రములైన, మృగాన్=అశ్వకందములను, హత్వా=ఆహృత్య=సేకరించి, చేరతుః=భక్షించిరి, మదనపాలనిఘంటువు ఆధారముగా ఈఅర్థవివరణచేయబడినది-

తత ఉత్థాయ తే సర్వే స్పృష్ట్వా నద్యాః శివం జలమ్।
పంథానమ్ ఋషిణాఽఽదిష్టం చిత్రకూటస్య తం యయుః। 4

తతః సంప్రస్థితః కాలే రామః సౌమిత్రిణా సహ।
సీతాం కమలపత్రాక్షీమ్ ఇదం వచనమబ్రవీత్। 5

ఆదీప్తా నివ వైదేహి! సర్వతః పుష్పితాన్ నగాన్।
స్వైః పుష్పైః కింశుకాన్ పశ్య మాలినశ్శిశిరాత్యయే। 6

పశ్య భల్లాతకాన్ ఫుల్లాన్ నరైరనుపసేవితాన్।
ఫలపత్రైరవనతాన్ నూనం శక్ష్యామి జీవితుమ్। 7

పశ్య ద్రోణప్రమాణాని లంబమానాని లక్ష్మణ।
మధూని మధుకారీభిః సంభృతాని నగే నగే। 8

ఏష క్రోశతి నత్యూహః తం శిఖీ ప్రతికూజతి।
రమణీయే వనోద్దేశే పుష్పసంస్తరసంకటే। 9

మాతంగయూథానుసృతం పక్షిసంఘానునాదితమ్।
చిత్రకూటమిమం పశ్య ప్రవృద్ధశిఖరం గిరిమ్। 10

సమభూమితలే రమ్యే ద్రుమైర్బహుభిరావృతే।
పుణ్యే రంస్యామహే తాత! చిత్రకూటస్య కాననే। 11

తతస్తౌ పాదచారేణ గచ్ఛంతౌ సహ సీతయా।
రమ్యమాసేదతుః శైలం చిత్రకూటం మనోరమమ్। 12

తం తు పర్వతమాసాద్య నానాపక్షిగణాయుతమ్।
బహుమూలఫలం రమ్యం సంపన్నసరసోదకమ్। 13

మనోజ్ఞోఽయం గిరిః సౌమ్య! నానాద్రుమలతాయుతః।
బహుమూలఫలో రమ్యః స్వాజీవః ప్రతిభాతి మే। 14

మునయశ్చ మహాత్మానో వసంత్యస్మిన్ శిలోచ్చయే।
అయం వాసో భవేత్ తావత్ అత్ర సౌమ్య! రమేమహి। 15

ఇతిసీతా చ రామశ్చ లక్ష్మణశ్చ కృతాంజలిః।
అభిగమ్యాఽఽశ్రమం సర్వే వాల్మీకిమ్ అభివాదయన్। 16

వారందఱును లేచి, యమునానదియొక్క పవిత్రజలములలో స్నానాదికములను ముగించుకొనిరి. పిదప వారు భరద్వాజమహర్షి తెలిపిన మార్గమున ఆ చిత్రకూటపర్వతమునకు బయలుదేఱిరి. ప్రభాత కాలమున సీతారామలక్ష్మణులు ప్రయాణమును కొనసాగించుచుండిరి. అప్పుడు శ్రీరాముడు కమలపత్రాక్షియైన సీతతో ఇట్లనెను. (4-5)

"ఓ వైదేహీ! వసంత-ఋతువునందు చక్కగా పుష్పించియున్న మోదుగు చెట్లను చూడుము. అవి తమ పూవులనే మాలలుగా ధరించినట్లున్నవి. ఆ పుష్పములు తమ అరుణకాంతులతో ప్రజ్వలించు చున్నట్లున్నవి. ఇదిగో! ఈ నల్లజీడిచెట్లను గాంచుము. ఇవి నిండుగా పుష్పించియున్నవి. ఇవి పత్రశోభితములై, పండ్లబరువుచే వంగియున్నవి. ఇది దుర్గమప్రదేశమగుటచే ఇచట ఈ ఫలములను అనుభవించువారు ఎవ్వరును లేరు. కావున ఈ పండ్లను తినుచు ఇచట మనజీవితమును గడుపవచ్చును." (6-7)

"ఓ లక్ష్మణా! ప్రతివృక్షముమీదను తేనెటీగలచే సిద్ధపఱచబడిన పెద్ద పెద్ద తేనెపట్టులు గలవు. అవి ద్రోణప్రమాణములలో వ్రేలాడుచున్నవి. గమనింపుము. (8)

ఈ వనప్రదేశము మిగుల రమణీయముగానున్నది. చెట్లనుండి రాలిన పూవులన్నియును నేలను కప్పివేసియున్నవి. చాతకపక్షుల కూజితములకు నెమళ్లు తమ క్రేంకారములతో ప్రత్యుత్తరము ఇచ్చుచున్నట్లు ఉన్నవి. (9)

ఓ లక్ష్మణా! మిక్కిలి ఎత్తైన శిఖరములుగల ఈ చిత్రకూట పర్వతమును చూడుము. ఇది ఏనుగుల గుంపులతోనిండియున్నది. పక్షి సమూహముల కలరవములతో ప్రతిధ్వనించుచున్నది. (10)

నాయనా! సౌమిత్రీ! పవిత్రమైన ఈ చిత్రకూటకాననమునందు ఈ సమతలభూమి వివిధవృక్షములతో ఆవృతమై మిగుల రమ్యముగా ఉన్నది. ఇచట మనము హాయిగా నివసింతము." (11)

పిదప ఆ రామలక్ష్మణులు సీతతోగూడి, కాలినడకతో చూడ ముచ్చటగా మనోరంజకముగానున్న చిత్రకూటశైలమును చేరిరి. (12)

ఆ పర్వతము నానావిధములైన పక్షులగుంపులతో అలరారు చుండెను. అనేకములగు కందమూలఫలములతో ఒప్పుచుండెను. మధురములైన జలములతో సుసంపన్నమైయుండెను. అచటికిచేరిన పిమ్మట శ్రీరాముడు సౌమిత్రితోనిట్లనెను. "ఓ సౌమ్యా! చక్కని చెట్లతో, అందమైన తీగలతో, కందమూల ఫలములతో కనువిందుగావించుచున్న ఈ పర్వతము మనకు నివాసయోగ్యమైనదిగా కనిపించుచున్నది. ఓ సౌమ్యుడా! మహాత్ములైన మునీశ్వరులు ఈ కొండపై నివసించు చుందురు. కనుక ఈ ప్రదేశమును ఆవాసముగాజేసికొని, మనము ఇచట నివసింతము." పిదప సీతారామలక్ష్మణులు వాల్మీకి మహర్షి ఆశ్రమమునకేగి,[1] దోసిలియొగ్గి, ఆ మునీశ్వరునకు ప్రణమిల్లిరి. (13-16)

1) వాల్మీకిమహర్షిఆశ్రమము తమసానదీ తీరమున ఉన్నట్లును, రామాయణకావ్యరచన అచటనే ప్రారంభింపబడినట్లును బాలకాండమున పేర్కొనబడినది. కాని వాల్మీకి ఆశ్రమము చిత్రకూటమున ఉన్నట్లు ఈ శ్లోకము తెల్పుచున్నది. భరతుని ఆగమనము వఱకును ఆ మహర్షి చిత్రకూటముననే యుండి, ఆ తరువాత అతడు తమసానదీతీరమున నివసించినట్లు గ్రహింపవలెను. గోవిందరాజీయ వ్యాఖ్య.

తాన్ మహర్షిః ప్రముదితః పూజయామాస ధర్మవిత్।
ఆస్యతామితి చోవాచ స్వాగతం తు నివేద్య చ। 17

ధర్మాత్ముడైన వాల్మీకిమహర్షి సీతారామలక్ష్మణులరాకకు మిగుల సంతసించి, "మీకు స్వాగతము, విచ్చేయుడు, ఆసీనులుకండు" అని పలుకుచు వారికి ఆదరసత్కారములను నెఱపెను. (17)

తతోఽబ్రవీన్మహాబాహుః లక్ష్మణం లక్ష్మణాగ్రజః।
సన్నివేద్య యథాన్యాయమ్ ఆత్మానమ్ ఋషయే ప్రభుః। 18

పిదప మహాబాహుడైన శ్రీరామచంద్రప్రభువు వాల్మీకిమహర్షితో "మహాత్మా! నేను దశరథమహారాజు కుమారుడను, శ్రీరాముడను. ఇతడు నాతమ్ముడు లక్ష్మణుడు. ఈమె నాభార్య సీతాదేవి, జనకమహారాజు కూతురు. మాతండ్రి వనవాసమునకు పంపగా మేము ఇచటికి వచ్చితిమి" అని పరిచయవాక్యములను పలికిన పిదప లక్ష్మణునితో ఇట్లనెను. (18)

లక్ష్మణాఽఽనయ దారూణి దృఢాని చ వరాణి చ।
కురుష్వాఽఽవసథం సౌమ్య! వాసే మేఽభిరతం మనః। 19

తస్య తద్వచనం శ్రుత్వా సౌమిత్రిః వివిధాన్ ద్రుమాన్।
ఆజహార తతశ్చక్రే పర్ణశాలామరిందమః। 20

"సౌమ్యుడవైన ఓ లక్ష్మణా! దృఢమైన శ్రేష్ఠమైన కొన్ని నేరేడు కఱ్ఱలను తీసికొనిరమ్ము. కుటీరమును నిర్మింపుము. ఇచట నివసింప వలెనని నేను తలంచుచున్నాను." - అన్నయగు శ్రీరాముని ఆదేశమును అందుకొని, శత్రుదమనుడైన లక్ష్మణుడు వెంటనే వివిధములగు చెట్లకొమ్మలను (కఱ్ఱలను), ఆకులను తీసికొని వచ్చి, ఒక పర్ణశాలను (కుటీరమును) నిర్మించెను. (19-20)

తాం నిష్ఠితాం బద్ధకటాం దృష్ట్వా రామః సుదర్శనామ్।
శుశ్రూషమాణమేకాగ్రమ్ ఇదం వచనమబ్రవీత్। 21

ఆ కుటీరము బలమైన తడకలతో, గోడలతో లోపల, బయటకూడ సుస్థిరముగా నిర్మింపబడినది. వానలకును, ఎండకును తట్టుకొనునట్లు పైకప్పు ఆకులతో నిర్మింపబడినది. అందముగా కుదురుకొనిన ఆ కుటీరమును జూచి, శ్రీరాముడు ఎంతయు సంతసించెను. ఏకాగ్రచిత్తముతో తనను సేవించుచు, తరువాతి ఆదేశముకొఱకు ఎదురుచూచుచున్న లక్ష్మణునితో శ్రీరాముడు ఇట్లునుడివెను. (21)

ఐణేయం మాంసమాహృత్య శాలాం యక్ష్యామహే వయం।
కర్తవ్యం వాస్తుశమనం సౌమిత్రే! చిరజీవిభిః। 22

"ఓ సౌమిత్రీ! దీర్ఘాయురారోగ్యములకొఱకై క్రొత్త (నిర్మింపబడిన) ఇంటిలో ప్రవేశించువారు వాస్తుశాంతి[1] తప్పక చేయవలెను. కనుక నీవు గజకందము[2] అను దుంపను తీసికొని రమ్ము. పిమ్మట వాస్తుపూజ చేసి పర్ణశాలలో ప్రవేశింతము.(22)

---

1) వాస్తు= గృహము, వాస్తుపూజ=గృహపూజ
శ్లో॥ ధిష్ణ్యం ధామనికేతనం చ సదనం వస్త్వంచ వాస్తు క్షయమ్॥ తత్త్వదీపికా
దీర్ఘాయురారోగ్యములు ప్రాప్తించుటకై వాస్తుపూజ చేయవలెను.
శ్లో॥ న చ వ్యాధిభయం తస్య నచ బంధుజనక్షయః॥ జీవేద్వర్షశతం స్వర్గకల్పమేవం వసేన్నరః॥
(బ్రహ్మాండపురాణము) గోవిందరాజీయవ్యాఖ్య.
వాస్తుపూజ చేసినవారికి వ్యాధిభయము ఉండదు. ఆత్మీయులు, బంధువులు క్షేమముగా ఉందురు. కలకాలము ఆయురారోగ్యభాగ్యములు కల్గియుందురు. వారిజీవితములు హాయిగా సుఖసంతోషములతో గడచును. బోధాయనుడు మొదలగు మహర్షులు అందఱును 'ఈ వాస్తుపూజ అవశ్యకర్తవ్యము' అని తెల్పిరి.
నూతనగృహనిర్మాణము జరుపునప్పుడు చీమలు మొదలగు పెక్కు ప్రాణులు చనిపోవుచుండును. ఆ పాపపరిహారముకొఱకును, వాటి ఆత్మశాంతినిమిత్తముగను, అచటి అధిష్ఠానదేవతలయొక్క అనుగ్రహప్రాప్తికిని వాస్తుపూజను విధిగా ఆచరింపవలెను. దానివలన ఆగృహమున నివసించువారు సంతోషముతో ఆయురారోగ్యములతో వర్ధిల్లుచుందురు.

2) గజకందము-వివరణము
'ఐణేయమ్ మాంసమ్' = 'గజకందము'-అను దుంప. ఇచట ఈయర్థమునే గ్రహింపవలెను. ఏలనన శ్రీరాముడు' **ఫలాని మూలాని చ భక్షయన్ వనే,** నేను వనవాసమున ఫలమూలములనే భక్షింతును' *(అయోధ్యాకాండము-సర్గ34, శ్లోకము.59)* **'ధర్మమేవాచరిష్యామః తత్రమూలఫలాశనాః'** 'వనవాసము చేయునపుడు కందమూలఫలములను భక్షించుచు ధర్మాచరణమును గావించుచుందుము.'*(అయోధ్య-54-16)* అని ప్రస్తావించియుండెను. రామోద్విర్నాభిభాషతే - రాముడు ఆడినమాటతప్పడు - అని ప్రతిజ్ఞచేసియుండెను సుమా!

మృగం హత్వాఽఽనయ క్షిప్రం లక్ష్మణేహ శుభేక్షణ! ।
కర్తవ్యః శాస్త్రదృష్టో హి విధిర్ధర్మమనుస్మర । 23

భ్రాతుర్వచనమాజ్ఞాయ లక్ష్మణః పరవీరహా ।
చకార స యథోక్తం చ తం రామః పునరబ్రవీత్ । 24

ఐణేయం శ్రపయస్వైతత్ శాలాం యక్ష్యామహే వయమ్ ।
త్వర సౌమ్య ముహూర్తోఽయం ధ్రువశ్చ దివసోఽప్యయమ్ । 25

స లక్ష్మణః కృష్ణమృగం హత్వా మేధ్యం ప్రతాపవాన్ ।
అథ చిక్షేప సౌమిత్రిః సమిద్ధే జాతవేదసి । 26

తం తు పక్వం సమాజ్ఞాయ నిష్టప్తం ఛిన్నశోణితమ్ ।
లక్ష్మణః పురుషవ్యాఘ్రమ్ అథ రాఘవమబ్రవీత్ । 27

అయం సర్వః సమస్తాంగః శృతః కృష్ణమృగో మయా ।
దేవతాం దేవసంకాశ! యజస్వ కుశలో హ్యసి । 28

రామః స్నాత్వా తు నియతో గుణవాన్ జప్యకోవిదః ।
సంగ్రహేణాకరోత్ సర్వాన్ మంత్రాన్ సత్రావసానికాన్ । 29

ఇష్ట్వా దేవగణాన్ సర్వాన్ వివేశావసథం శుచిః ।
బభూవ చ మనోహ్లాదో రామస్యామితతేజసః । 30

వైశ్వదేవబలిం కృత్వా రౌద్రం వైష్ణవమేవ చ ।
వాస్తుసంశమనీయాని మంగళాని ప్రవర్తయన్ । 31

జపం చ న్యాయతః కృత్వా స్నాత్వా నద్యాం యథావిధి ।
పాపసంశమనం రామః చకార బలిముత్తమమ్ । 32

ఓ శుభేక్షణా! లక్ష్మణా! వెంటనే 'గజకందము'[1] అను దుంపను త్రవ్వుకొని రమ్ము. శాస్త్రోక్తవిధులను ఆచరించుట మనకర్తవ్యము. విద్యుక్తధర్మమును విస్మరింపరాదు సుమా!" (23)

శత్రుసంహారకుడైన లక్ష్మణుడు అన్నయాజ్ఞమేరకు గృహశాంతికై 'గజకందము' మున్నగువస్తువులను సమకూర్చెను. పిదప శ్రీరాముడు తమ్మునితో ఇట్లనెను. (24)

"ఈ 'గజకందము'ను పక్వమొనర్పుము. పర్ణశాలకు సంబంధించిన అధిష్ఠానదేవతలను పూజింతము. త్వరపడుము, ఇది శుభముహూర్తము. ఈదినము ధ్రువసంజ్ఞకము.[2] కనుక సుముహూర్తమున గృహశాంతిచేయవలెను." (25)

అంతట కార్యశూరుడైన లక్ష్మణుడు ప్రజ్వలించుచున్న అగ్నితో పవిత్రమైన 'నల్లని గజకందము'ను[3] పక్వమొనర్చెను. రక్తవికారరోగములను రూపుమాపు[4] గజకందము బాగుగా పక్వమైనట్లు అతడు పురుషశ్రేష్ఠుడైన శ్రీరామునితో ఇట్లు పలికెను. (26-27)

సడలిన శరీరావయవములను అన్నింటిని పరిపుష్టమొనర్చునట్టి[5] ఈ నల్లని గజకందమును పూర్తిగా తప్త(పక్వ)మొనర్చితిని. దేవతాసముడవైన ఓ రామా! వాస్తుదేవతను పూజింపుము. ఈ కార్యము మనకు శుభప్రదము. (28)

జపతపములలో ఆరితేరినవాడును, సద్గుణసంపన్నుడును ఐన శ్రీరాముడు నియమనిష్ఠలతో స్నాతుడై, వాస్తుపూజాసమయమున ఆవశ్యకములగు మంత్రములను అన్నింటిని సంగ్రహముగా పఠించి, వాస్తుపూజను పూర్తిచేసెను. సమస్తదేవగణములను అర్చించెను. శుచియై పర్ణశాలలో ప్రవేశించెను. మిగుల తేజస్వియగు శ్రీరామునకు ఈ ప్రక్రియ మిక్కిలి ఆహ్లాదమును గూర్చెను. (29-30)

పిమ్మట శ్రీరాముడు వైశ్వదేవబలికార్యమును, రుద్రయాగమును, వైష్ణవయాగమును నిర్వర్తించి, గ్రహారిష్టములు తొలగుటకై పుణ్యాహవాచన శాంతిజపములు మున్నగువానిని పఠించెను. అనంతరము విద్యుక్తముగా నదీజలములలో స్నానమొనర్చి, శ్రీరాముడు 'గాయత్రి' మొదలగు మంత్రములను జపించెను. పిదప పంచసూనాదిసమస్త దోషములపరిహారమునకై ఉత్తమములైన బలిహోమములను నిర్వహించెను. (31-32)

1) మృగము=గజకందము (మదనపాలనిఘంటువు.)
2) శ్లో॥ ఉత్తరాత్రయరోహిణ్యో భాస్కరశ్చ ధ్రువం' స్థిరమ్. ముహూర్త చింతామణి
ఉత్తరాత్రయము (ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర), రోహిణీ నక్షత్రములతోగూడిన ఆదివారము 'ధ్రువము' సంజ్ఞయు 'స్థిరము' అని వ్యవహరింపబడును. గృహశాంతికి ఇది శ్రేష్ఠమైనది.
3) కృష్ణమృగము= త్రవ్వితీయబడిన గజకందము
4) ఛిన్నశోణితమ్=రక్తహీనతవలన వచ్చెడి సమస్తరోగములను రూపుమాపునది-గజకందము. నిష్టప్తమ్=చక్కగా కాచబడినది.
5) సమస్తాంగః సమ్యక్ భవంతి అస్తాని (అంగాని) యేన సః సమస్తాంగః సడలిన శరీరావయవములను అన్నింటికిని పరిపుష్టిని గూర్చునది.

వేదిస్థలవిధానాని చైత్యాన్యాయతనాని చ।
ఆశ్రమస్యానురూపాణి స్థాపయామాస రాఘవః। 33

అనంతరము శ్రీరాముడు ఆ పర్ణశాలకు తగినవిధముగా బలిహరణాదివేదికలను, గణేశాదిదేవతాచైత్యములను, విష్ణువు మొదలగు దేవతలమందిరములను ఏర్పఱచి, అందు ఆయా దేవతలను ప్రతిష్ఠించెను. (33)

వన్యైర్మాల్యైః ఫలైర్మూలైః పక్వైర్మాంసైర్యథావిధి।
అద్భిర్జపైశ్చ వేదోక్తైః దర్భైశ్చ ససమిత్కుశైః। 34

తౌ తర్పయిత్వా భూతాని రాఘవౌ సహ సీతయా।
తదా వివిశతుః శాలాం సుశుభాం శుభలక్షణౌ। 35

పిమ్మట శుభలక్షణములుగల ఆ రామలక్ష్మణులు వనములలో లభించు పూలమాలలు, బాగుగా పక్వమునకు వచ్చిన ఫలమూలాది పదార్థములు, పవిత్రజలములు, వేదోక్తములైన జపములు, దర్భలు, సమిధలు, కుశలు మొదలగు వానితో సకలభూతములను తృప్తిపఱచి, సీతాదేవితో గూడి, శుభంకరమైన ఆ పర్ణశాలలో ప్రవేశించిరి. (34-35)

తాం వృక్షపర్ణచ్ఛదనాం మనోజ్ఞాం
యథాప్రదేశం సుకృతాం నివాతామ్।
వాసాయ సర్వే వివిశుః సమేతాః
సభాం యథా దేవగణాః సుధర్మామ్। 36

ఆ కుటీరము అనువైన స్థలమునందు నిర్మింపబడినది, చెట్ల ఆకులచే కప్పబడినది, తీవ్రమైన గాలులకును తట్టుకొనియుండునట్లుగా ఏర్పఱుపబడినది. అట్టి మనోహరమైన పర్ణశాలలో నివసించుటకై ఇంద్రసభలో దేవతలవలె సీతారామలక్ష్మణులు ఒక్కసారిగా అందుప్రవేశించిరి. (36)

అనేకనానామృగపక్షిసంకులే
విచిత్రపుష్పస్తబకైః ద్రుమైర్యుతే।
వనోత్తమే వ్యాళమృగానునాదితే
తదా విజహ్రుః సుసుఖం జితేంద్రియాః। 37

ఆ మహావనమునందు వివిధములగు మృగములు, పక్షులు గుంపులుగుంపులుగా తిరుగుచుండెను. అందు రంగురంగుల పూలగుత్తులతో నిండిన వృక్షములు సమృద్ధిగానుండెను. అది మదపుటేనుగుల ఘీంకారములతోడను, మృగముల అఱపులతోడను ప్రతిధ్వనించుచుండెను. అట్టివనమునందు జితేంద్రియులైన సీతారామలక్ష్మణులు హాయిగా విహరించుచుండిరి. (37)

సురమ్యమాసాద్య తు చిత్రకూటం
నదీం చ తాం మాల్యవతీం సుతీర్థామ్।
ననంద హృష్టో మృగపక్షిజుష్టాం
జహౌ చ దుఃఖం పురవిప్రవాసాత్। 38

చక్కని సోపానములతో, స్నానఘట్టములతో, మధురజలములతో ఒప్పుచున్న మందాకినీనదీతీరమునగల రమణీయమైన చిత్రకూట పర్వతమునందు అనేకములైన పక్షులు ఆనందముతో కేరింతలు కొట్టుచుండెను. అట్టి నదీపర్వతసమీపమునజేరి శ్రీరామచంద్రుడు పరమసంతుష్టుడాయెను. అయోధ్యానగరమునకు దూరమైన కారణముగా దానియెడబాటువలన కలిగిన తనదుఃఖమునే మఱచిపోయెను. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షట్పంచాశస్సర్గః (56)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదిఆఱవసర్గము సమాప్తము

-- * * * --

57. ఏబదిఏడవసర్గము

అయోధ్యకుచేరిన సుమంత్రుడు దశరథుని దర్శించి, శ్రీరాముడు తెల్పినవిషయములను వివరించుట - అప్పుడు ఆ మహారాజు కౌసల్య మొదలగు రాణులు, అంతఃపురస్త్రీలు ఆర్తనాదములతో శోకమున మునుంగుట.

కథయిత్వా సుదుఃఖార్తః సుమంత్రేణ చిరం సహ।
రామే దక్షిణకూలస్థే జగామ స్వగృహం గుహః। 1

శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి గంగానదిఆవలి (దక్షిణ) తీరమునకు చేరి, అచటినుండి ప్రయాణమైన పిమ్మట వారు కన్పించుచున్నంతవఱకు గుహుడును, సుమంత్రుడును చూచుచునే యుండిరి. శ్రీరాముని గుణగణములనుగూర్చి వారు చాలసేపు సంభాషించుకొనిరి. పిదప గుహుడు సుమంత్రునితోగూడి గంగానది ఈవలి (ఉత్తర) తీరమునుండి స్వగృహమునకు చేరెను. (1)

భరద్వాజాభిగమనం ప్రయాగే చ సహాసనమ్।
ఆగిరేర్గమనం తేషాం తత్రస్థైరభిలక్షితమ్। 2

అనుజ్ఞాతః సుమంత్రోఽథ యోజయిత్వా హయోత్తమాన్।
అయోధ్యామేవ నగరీం ప్రయయౌ గాఢదుర్మనాః। 3

సీతారామలక్ష్మణులు గంగను దాటి ప్రయాగకు చేరి, భరద్వాజ మహర్షిని దర్శించుట, ఆ మహాముని వారికి ఆతిథ్యమిచ్చుట, అనంతరము వారు యమునానదిని దాటి చిత్రకూటపర్వతమునకు చేరుట మున్నగు విషయములను అన్నింటిని గుహుడు తన గూఢచారులద్వారా తెలిసికొనెను. ఈ విషయములను పూర్తిగా గుహుని వలన యెఱింగి, సుమంత్రుడు ఆయననుండి సెలవు తీసికొని, అశ్వములను రథమునకు పూన్చి, మిక్కిలి దుఃఖముతో అయోధ్యానగరమునకు బయలుదేఱెను. (2-3)

స వనాని సుగంధీని సరితశ్చ సరాంసి చ।
పశ్యన్నతియయౌ శీఘ్రం గ్రామాణి నగరాణి చ। 4

అతడు సువాసనలు వెదజల్లుచున్న వనములను, నదులను, సరస్సులను చూచుచు, గ్రామములను, నగరములను దాటుచు, వేగముగా తనప్రయాణమును కొనసాగించెను. (4)

తతః సాయాహ్నసమయే తృతీయేఽహని సారథిః।
అయోధ్యాం సమనుప్రాప్య నిరానందాం దదర్శ హ। 5

స శూన్యామివ నిశ్శబ్దాం దృష్ట్వా పరమదుర్మనాః।
సుమంత్రశ్చింతయామాస శోకవేగసమాహతః। 6

సుమంత్రుడు శృంగిబేరపురమునుండి బయలుదేఱిన మూడవ రోజు సాయంసమయమున అయోధ్యకు చేరి, శ్రీరాముడు లేనందున చిన్నబోయియున్న ఆ నగరమును దర్శించెను. మిగుల దుఃఖితుడై యున్న అతడు జనులకదలికలులేక మూగబోయియున్న ఆ నగరమును జూచి, అంతులేనిశోకమునకు లోనై ఇట్లు ఆలోచింప దొడంగెను. (5-6)

కచ్చిన్న సగజా సాశ్వా సజనా సజనాధిపా।
రామసంతాపదుఃఖేన దగ్ధా శోకాగ్నినా పురీ। 7

అయోధ్యాపురము నిన్నమొన్నటివఱకును 'గజాశ్వములతో, ప్రజలతో, మహారాజులతో ఎల్లప్పుడును కలకలలాడుచుండెడిది. అది నేడు శ్రీరామునియెడబాటుదుఃఖమువలన కలిగిన శోకాగ్నిచే దగ్ధమైపోయినదా! యేమి? (7)

ఇతి చింతాపరః సూతో వాజిభిః శీఘ్రపాతిభిః।
నగరద్వారమాసాద్య త్వరితః ప్రవివేశ హ। 8

సుమంత్రుడు ఈ విధముగా చింతించుచు, గుఱ్ఱములను వడివడిగా నడిపించుచు నగరద్వారమును జేరెను. జనులకంటబడినచో సీతారాములెక్కడ? అనుచు వారు ఏమడుగుదురో? వారికి తాను ఏమి చెప్పవలెనోయేమో? అను ఆతురతతో అతడు త్వరత్వరగా నగరములోనికి ప్రవేశించెను. (8)

సుమంత్రమభియాంతం తం శతశోఽథ సహస్రశః।
క్వ రామ ఇతి పృచ్ఛంతః సూతమభ్యద్రవన్నరాః। 9

నగరములోపలికి వడివడిగా వచ్చుచున్న సుమంత్రుని జూచి, ప్రజలు వందలవేలకొలదిగా 'రాముడెక్కడ? రాముడెక్కడ? సీతమ్మయెక్కడ? లక్ష్మన్న ఎక్కడ? అనుచు అతనివెంట పరుగులుదీసిరి. (9)

తేషాం శశంస గంగాయామ్ అహమాపృచ్ఛ్య రాఘవమ్।
అనుజ్ఞాతో నివృత్తోఽస్మి ధార్మికేణ మహాత్మనా। 10

తే తీర్ణా ఇతి విజ్ఞాయ బాష్పపూర్ణముఖా జనాః।
అహో ధిగితి నిశ్శ్వస్య హా! రామేతి చ చుక్రుశుః। 11

"నేను సీతారామలక్ష్మణులవెంట గంగాతీరమువఱకు వెళ్ళితిని. అచట ధర్మాత్ముడైన ఆ ప్రభువు సుమంత్రా! నీవింక తిరిగి అయోధ్యకు వెళ్లుము" - అనియనుచు పదేపదే నన్ను ఒత్తిడి చేయుటవలన - నేను అచటినుండి మఱలి, ఇచటికి చేరితిని." అని సుమంత్రుడు వారికి తెలిపెను. 'సీతారామలక్ష్మణులు గంగానదిని దాటి వెళ్లిరి'-అని యెఱింగి జనులు కన్నీరు గార్చుచు, అయ్యోరీ! అని నిట్టూర్చుచు రామా!రామా! యనుచు బిగ్గఱగా ఆక్రందనలు చేసిరి. (10-11)

శుశ్రావ చ వచస్తేషాం బృందం బృందం చ తిష్ఠతామ్।
హతాః స్మ ఖలు యేనేహ పశ్యామ ఇతి రాఘవమ్। 12

'మఱల శ్రీరాముని దర్శనభాగ్యమునకు నోచుకొనని మనము ఇచట బ్రతికియుండియు చచ్చినవారితో సమానులమే'- అని జనులు గుంపులు గుంపులుగా చేరి, అనుకొనుచున్న మాటలను సుమంత్రుడు వినెను. (12)

దానయజ్ఞవివాహేషు సమాజేషు మహత్సు చ।
న ద్రక్ష్యామః పునర్జాతు ధార్మికం రామమంతరా। 13

కిం సమర్థం జనస్యాస్య కిం ప్రియం కిం సుఖావహమ్।
ఇతి రామేణ నగరం పితృవత్ పరిపాలితమ్। 14

వాతాయనగతానాం చ స్త్రీణామ్ అన్వంతరాపణమ్।
రామశోకాభితప్తానాం శుశ్రావ పరిదేవనమ్। 15

స రాజమార్గమధ్యేన సుమంత్రః పిహితాననః।
యత్ర రాజా దశరథః తదేవోపయయౌ గృహమ్। 16

సోఽవతీర్య రథాచ్ఛీఘ్రం రాజవేశ్మ ప్రవిశ్య చ।
కక్ష్యాః సప్తాభిచక్రామ మహాజనసమాకులాః। 17

హర్మ్యైర్విమానైః ప్రాసాదైః అవేక్ష్యాథ సమాగతమ్।
హాహాకారకృతా నార్యో రామాదర్శనకర్శితాః। 18

ఆయతైర్విమలైర్నేత్రైః అశ్రువేగపరిప్లుతైః।
అన్యోఽన్యమభివీక్షంతే వ్యక్తమ్ ఆర్తతరాః స్త్రియః। 19

తతో దశరథస్త్రీణాం ప్రాసాదేభ్యస్తతస్తతః।
రామశోకాభితప్తానాం మందం శుశ్రావ జల్పితమ్। 20

సహ రామేణ నిర్యాతో వినా రామమిహాగతః।
సూతః కిన్నామ కౌసల్యాం శోచంతీం ప్రతివక్ష్యతి। 21

"దానకార్యములయందును, యజ్ఞకర్మలయందును, వివాహ మహోత్సవములయందును, సామాజికమహాసదస్సులలోను ఇంతవఱకును శ్రీరాముని ఉనికి చూచుచుండెడివారము.[1] కాని వానాదికార్యక్రమములలో ఎప్పుడైనను మనము ఆయునను ఇకమీదట చూడలేమేమో? వేటివలన ప్రజలకు క్షేమలాభములు కలుగును? వారికి ఎట్లు ప్రీతి చేకూరును? వారికి సుఖములను గూర్చు మార్గమేమి? ఆరామప్రభువు ప్రజలను కన్నబిడ్డలవలె ఆదుకొనుచుండెడివాడు. ఆయునను ఇక చూడజాలమేమో? అని ప్రజలు అనుకొనుచున్న మాటలను సుమంత్రుడు వినెను. (13-14)

నగరవీథులకు ఇరుపైపులగల భవనములలోని కిటికీలకడ చేరి, స్త్రీలు రామునిఎడబాటునకు దుఃఖితలై విలపించుచుండిరి. సుమంత్రుడు రథముపై ఆ వీథులలో సాగిపోవునప్పుడు వారి విలాపములను వినెను. (15)

సుమంత్రుడు రాజమార్గమున సాగిపోవుచు దుఃఖితులైయున్న ప్రజలను చూడలేక సిగ్గుతో తనముఖమును చాటుచేసికొని, నేరుగా దశరథమహారాజభవనమునకు చేరెను. (16)

అతడు వెంటనే రథమునుండి దిగి, రాజభవనమున ప్రవేశించెను. రాజదర్శనమునకై తహతహలాడుప్రముఖులతో నిండియున్న ఏడు కక్ష్యలను అతడు అధిగమించెను. (17)

సంపన్నులభవనములలోను, పెద్దపెద్ద మేడలలోను, రాజ ప్రాసాదములలోనుగల స్త్రీలందఱును రామునిదర్శనము లేనందున దుఃఖముతో కృశించియున్నవారై, ఒంటరిగా వచ్చిన సుమంత్రుని జూచి హాహాకారములు చేసిరి. నిర్మలములై, విశాలములైన వారి నేత్రములనుండి సంతతధారగా అశ్రువులు ప్రవహించుచుండెను. వారు తమఆర్తిని మాటలద్వారా వ్యక్తము చేయజాలక దుఃఖభారముతో ఒకరిముఖమును మఱియొకరు చూచుకొనుచుండిరి. (18-19)

ఆయా ప్రాసాదములలో రామవిరహశోకముతో మిక్కిలి పరితపించి యున్న దశరథుని సతులు (అంతఃపురస్త్రీలు) అందఱును మందస్వరముతో మాట్లాడుకొనుటను ఆ సుమంత్రుడు వినెను. (20)

"శ్రీరామునితోగూడి వెళ్లిన సుమంత్రుడు ఆ ప్రభువు లేకుండ తాను ఒక్కడే తిరిగివచ్చెను. అతిదీనముగా విలపించుచున్న కౌసల్యాదేవికి అతడు ఏమిప్రత్యుత్తరము ఈయగలడు? తాను

1) దేశ, కాల, పాత్రములనుబట్టి దానకార్యక్రమములను నడిపించుటకును, న్యాయముగా ఆర్జించిన సంపదలతో యజ్ఞములను ఆచరింపజేయుటకును, యజ్ఞక్రియలయందలి సందేహములను నివారించుటకును, అందు విస్మృతములైన విషయములను గుర్తుచేయుటకును శ్రీరాముడు తోడ్పడుచుండెడివాడు. వివాహములయందు వధూవరులకు సంబంధించిన రెండు పక్షములవారికిని సామరస్యములను పదిలపఱచుటకును, ఏపక్షమువారికైనను అసమ్మతి కలిగినప్పుడు ధర్మబద్ధముగా వస్త్రవాహనాది సమర్పణలతో వారితేడాలను తొలగించుటకును, కార్యలోపములు రాకుండా వాటిని ఆచరింపజేయుటకును సహాయపడుచుండెడివాడు. సామాజిక కార్యక్రమములయందును, మహాసభలయందును, దీర్ఘయాగములయందును, సందర్భానుసారముగా ఏర్పడిన హఠాత్సంఘటనలయందును శ్రీరాముడు తానుగా నిలబడి వాటినన్నింటిని ధర్మబద్ధముగా నడిపించుచుండెడివాడు. ఆ విధముగాగూడ అప్పుడప్పుడు ప్రజలకు శ్రీరాముని దర్శనభాగ్యములభించుచుండెడిది.

యథా చ మన్యే దుర్జీవమ్ ఏవం న సుకరం ధ్రువమ్।
ఆచ్ఛిద్య పుత్రే నిర్యాతే కౌసల్యా యత్ర జీవతి। 22

సత్యరూపం తు తద్వాక్యం రాజ్ఞః స్త్రీణాం నిశామయన్।
ప్రదీప్తమివ శోకేన వివేశ సహసా గృహమ్। 23

స ప్రవిశ్యాష్టమీం కక్ష్యాం రాజానం దీనమాతురమ్।
పుత్రశోకపరిద్యూనమ్ అపశ్యత్ పాండురే గృహే। 24

అభిగమ్య తమాసీనం నరేంద్రమ్ అభివాద్య చ।
సుమంత్రో రామవచనం యథోక్తం ప్రత్యవేదయత్। 25

స తూష్ణీమేవ తచ్ఛ్రుత్వా రాజా విభ్రాంతచేతనః।
మూర్ఛితో న్యపతద్భూమౌ రామశోకాభిపీడితః। 26

తతోఽంతఃపురమావిద్ధం మూర్ఛితే పృథివీపతౌ।
ఉద్ధృత్య బాహూ చుక్రోశ నృపతౌ పతితే క్షితౌ। 27

సుమిత్రయా తు సహితా కౌసల్యా పతితం పతిమ్।
ఉత్థాపయామాస తదా వచనం చేదమబ్రవీత్। 28

ఇమం తస్య మహాభాగ! దూతం దుష్కరకారిణః।
వనవాసాదనుప్రాప్తం కస్మాన్న ప్రతిభాషసే। 29

అద్యేమమనయం కృత్వా వ్యపత్రపసి రాఘవ!।
ఉత్తిష్ఠ సుకృతం తేఽస్తు శోకే న స్యాత్ సహాయతా। 30

దేవ! యస్యా భయాద్రామం నానుపృచ్ఛసి సారథిమ్।
నేహ తిష్ఠతి కైకేయీ విస్రబ్ధం ప్రతిభాష్యతామ్। 31

సా తథోక్త్వా మహారాజం కౌసల్యా శోకలాలసా।
ధరణ్యాం నిపపాతాశు బాష్పవిప్లుతభాషిణీ। 32

ఏవం విలపతీం దృష్ట్వా కౌసల్యాం పతితాం భువి।
పతిం చావేక్ష్య తాః సర్వాః సుస్వరం రురుదుః స్త్రియః। 33

అనుమతింపక పోయినను కన్నకొడుకు వనములకు వెళ్లిపోగా తీవ్ర దుఃఖమునకులోనైన కౌసల్యాదేవి అసువులను వీడలేక కొనయూపిరితో జీవించుచున్నది. నిజముగా ఇట్టిస్థితి ఎవ్వరికైనను దుష్కరమని తలంతుము"-అని దశరథుని భార్యలు (అంతఃపురస్త్రీలు) ఎల్లరును అనుకొను యథార్థవచనములను వినుచు సుమంత్రుడు శోకముతో ప్రజ్వరిల్లుచున్నట్లున్న ఆ రాజగృహమున త్వరగా ప్రవేశించెను. (21-23)

అంతట సుమంత్రుడు ఎనిమిదవ కక్ష్యలో ప్రవేశించి మహారాజును గాంచెను. ఆ ప్రభువు దుఃఖితుడై, పుత్రశోకముచే కృశించియున్నవాడై, దీనుడైయుండెను. ఆమందిరమంతయును కళతప్పియుండెను. పిమ్మట అతడు అచట ఆసీనుడైయున్న మహారాజునకు ప్రణమిల్లెను. శ్రీరామచంద్రుడునుడివిన మాటలను యథాతథముగా ఆ ప్రభువునకు వినిపించెను. (24-25)

పిదప ఆ మహారాజు, సుమంత్రునిద్వారా రామవచనములను మౌనముగా వినిన పిమ్మట ఆయనమనస్సు విభ్రాంతికి లోనయ్యెను. అతడు రామవిరహముతో దుఃఖిల్లుచు స్పృహను కోల్పోయి నేలపై పడిపోయెను. (26)

మహారాజు అట్లు మూర్ఛిల్లుటచే అంతఃపురములోనివారు అందఱును ఒక్కసారిగా గొల్లుమనిరి. అతడు నేలపై పడిపోవుటచే వారు చేతులు చాచి బిగ్గఱగా శోకించిరి. (27)

అంతట కౌసల్యాదేవి సుమిత్రతో గూడి నేలపై పడియున్న తనపతిని లేవనెత్తి, కూర్చుండబెట్టి, ఇట్లు నుడివెను. (28)

"ఓ మహాత్మా! రాజ్యాధికారమును త్యజించి వనములకు వెళ్లుట ఒక దుష్కరకార్యము. అట్టి అసాధ్యమైన వనవాసదీక్షను చేపట్టిన శ్రీరామునియొక్కదూత ఇతడు. ఆయననుండి సందేశమును గొనివచ్చిన ఈ సుమంత్రునితో ఏలమాట్లాడరు? ఓ మహారాజా! ధర్మాత్ముడైన పుత్త్రుని (శ్రీరాముని) వనవాసమునకు పంపుట అధర్మము. అట్టి అన్యాయమునకు ఒడిగట్టి (అట్టి అకృత్యము నొనర్చి) ఇప్పుడు సిగ్గు (బాధ)పడిన లాభమేమి? లెండు. మీకు సత్యపాలనపుణ్యముమాత్రము తప్పక దక్కును. ఇప్పుడు మీరు శోకించుటవలన ఎట్టి ప్రయోజనమూ ఉండదు. (29-30)

ఓ పతిదేవా! బహుశః కైకేయికి భయపడి, శ్రీరామునిక్షేమ సమాచారములను సుమంత్రుని అడుగుటలేదు కాబోలు? కాని ప్రస్తుతము ఆ కైకేయి ఇచటలేదు. కనుక మీరు నిర్భయముగా మాట్లాడవచ్చును." (31)

ఆ కౌసల్యాదేవి మహారాజుతో అట్లు పల్కిన పిమ్మట శోక విహ్వలయయ్యెను. అందువలన ఆమె గొంతు పెగలక కన్నీరు గార్చుచు భూమిపై పడిపోయెను. (32)

ఈ విధముగా విలపించుచు నేలపై పడియున్న కౌసల్యను, మూర్ఛితుడైయున్న మహారాజును చూచి, అచట చేరియున్న రాణులు అందఱును వారిచుట్టును మూగి బిగ్గఱగా ఏడ్చిరి. (33)

తతస్తమంతఃపురనాదముత్థితం
సమీక్ష్య వృద్ధాస్తరుణాశ్చ మానవాః ।
స్త్రియశ్చ సర్వా రురుదుః సమంతతః
పురం తదాసీత్ పునరేవ సంకులమ్ ॥ 34

అంతఃపురమునుండి వెలరేగిన ఆ ఆర్తనాదములను వినినతోడనే నగరమునందలి వృద్ధులు, యువతీయువకులు, స్త్రీలు మున్నగు వారందఱును బోరున ఏడువసాగిరి. వేయేల అంతట ఆ నగర మంతయును ఇంకను శోకసాగరమున మునింగెను. (34)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తపంచాశస్సర్గః (57)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదిఏడవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

58. ఏబదిఎనిమిదవసర్గము

సీతారామ లక్ష్మణులు వనములలో ఎట్లు నివసించుచున్నారు? వారు నన్నుగూర్చి ఏమి పల్కిరి? - అని దశరథుడు సుమంత్రుని అడుగుట - సుమంత్రుడు వారినిగూర్చి మహారాజునకు విశదపఱచుట.

ప్రత్యాశ్వస్తో యదా రాజా మోహాత్ ప్రత్యాగతః పునః ।
అథాఽఽజుహావ తం సూతం రామవృత్తాంతకారణాత్ ॥ 1

కొంతసేపటికి స్పృహరాగా, ఆ దశరథమహారాజు ఊరడిల్లినవాడై, శ్రీరామువృత్తాంతమును తెలిసికొనుటకై, ఆ సుమంత్రుని తనచెంతకు పిలిచెను. (1)

అథసూతో మహారాజం కృతాంజలిరుపస్థితః ।
రామమేవానుశోచంతం దుఃఖశోకసమన్వితమ్ ॥ 2

వృద్ధం పరమసంతప్తం నవగ్రహమివ ద్విపమ్ ।
వినిశ్శ్వసంతం ధ్యాయంతమ్ అస్వస్థమివ కుంజరమ్ ॥ 3

అప్పుడే పట్టుబడి, తన యూథపతిని ధ్యానించుచు మిక్కిలి సంతాపమునకు గుఱియై, అస్వస్థతతో నిట్టూర్పుచున్న ఏనుగువలె దశరథమహారాజు నిరంతరము శ్రీరామునే స్మరించుచు దుఃఖశోకములతో కుమిలిపోవుచుండెను. అట్టి మహారాజును సమీపించి, సుమంత్రుడు అంజలి ఘటించి నిలబడెను. (2-3)

రాజా తు రజసా సూతం ధ్వస్తాంగం సముపస్థితమ్ ।
అశ్రుపూర్ణముఖం దీనమ్ ఉవాచ పరమార్తవత్ ॥ 4

దుమ్ముకొట్టుకొనియున్న శరీరముగలిగి, దీనుడై, కన్నీరు మున్నీరుగా విలపించుచు తనను సమీపించిన సూతునితో (సుమంత్రునితో) మిక్కిలి ఆర్తికిలోనైన మహారాజు ఇట్లనెను. (4)

క్వను వత్స్యతి ధర్మాత్మా వృక్షమూలముపాశ్రితః ।
సోఽత్యంతసుఖితః సూత! కిమశిష్యతి రాఘవః ॥ 5

"ఓ సుమంత్రా! ధర్మాత్ముడైన రాఘవుడు మిగుల సుకుమారుడు, లాలనతో, ముద్దుమురిపెములతో సుఖములలో పెరిగినవాడు. అతడిప్పుడు ఏ చెట్టును ఆశ్రయించినాడు? ఏమి తిని జీవించుచున్నాడు? (5)

దుఃఖస్యానుచితో దుఃఖం సుమంత్ర! శయనోచితః ।
భూమిపాలాత్మజో భూమౌ శేతే కథమనాథవత్ ॥ 6

ఓ సుమంత్రా! దుఃఖమనుమాటనే ఎఱుగని రాజకుమారుడైన నారాముడు ఇప్పుడుఅచట కష్టములకు ఎట్లు ఓర్చుకొనుచున్నాడు? హంసతూలికాతల్పములపై శయనించు నాముద్దులపట్టి కటికి నేలపై దిక్కులేనివానివలె ఎట్లు పండుకొనుచున్నాడు? (6)

యం యాంత మనుయాంతి స్మ పదాతిరథకుంజరాః ।
స వత్స్యతి కథం రామో విజనం వనమాశ్రితః ॥ 7

ఎల్లప్పుడును శ్రీరామునకు చతురంగబలములు తోడుగానుండెడివి. ఇప్పుడతడు నిర్జనవనములలో ఎట్లు నివసించుచున్నాడు? (7)

వ్యాలైర్మృగైరాచరితం కృష్ణసర్పనిషేవితమ్ ।
కథం కుమారౌ వైదేహ్యా సార్ధం వన ముపస్థితౌ ॥ 8

సుకుమార్యా తపస్విన్యా సుమంత్ర! సహ సీతయా ।
రాజపుత్రౌ కథం పాదైః అవరుహ్య రథాద్గతౌ ॥ 9

వనములలో పెద్దపులులు మొదలగు క్రూరమృగములు సంచరించుచుండును, ప్రమాదకరమైన నల్లత్రాచులు తిరుగాడుచుండును. అట్టి భయంకరములైన అరణ్యములలో సీతాదేవితోగూడి రామలక్ష్మణులు ఎట్లు ఉండగలుగుచున్నారు? ఓ సుమంత్రా! సుకుమారియు, దైవసేవాతత్పరయు ఐన సీతతోగూడి రాజకుమారులైన రామలక్ష్మణులు రథమునుండి దిగి, పాదచారులై ఎట్లు తిరుగగలుగుచున్నారు? (8-9)

సిద్ధార్థః ఖలు సూత! త్వం యేన దృష్టౌ మమాత్మజౌ।
వనాంతం ప్రవిశంతౌ తా అశ్వినావివ మందరమ్। 10

కిమువాచ వచో రామః కిమువాచ చ లక్ష్మణః।
సుమంత్ర! వనమాసాద్య కిమువాచ చ మైథిలీ। 11

ఆసితం శయితం భుక్తం సూత! రామస్య కీర్తయ।
జీవిష్యామ్యహమేతేన యయాతిరివ సాధుషు। 12

ఇతి సూతో నరేంద్రేణ చోదితః సజ్జమానయా।
ఉవాచ వాచా రాజానం సబాష్పపరిరబ్ధయా। 13

అబ్రవీన్మాం మహారాజ! ధర్మమేవానుపాలయన్।
అంజలిం రాఘవః కృత్వా శిరసాఽభిప్రణమ్య చ। 14

సూత! మద్వచనాత్ తస్య తాతస్య విదితాత్మనః।
శిరసా వందనీయస్య వంద్యౌ పాదౌ మహాత్మనః। 15

సర్వ మంతఃపురం వాచ్యం సూత! మద్వచనాత్ త్వయా।
ఆరోగ్యమవిశేషేణ యథార్హంచాభివాదనమ్। 16

మాతా చ మమ కౌసల్యా కుశలం చాభివాదనమ్।
అప్రమాదం చ వక్తవ్యా బ్రూయాశ్చైనామిదం వచః। 17

ధర్మనిత్యా యథాకాలమ్ అగ్న్యగారపరా భవ।
దేవి! దేవస్య పాదౌ చ దేవవత్ పరిపాలయ। 18

అభిమానం చ మానం చ త్యక్త్వా వర్తస్వ మాతృషు।
అనురాజానమార్యాం చ కైకేయీమంబ! కారయ। 19

కుమారే భరతే వృత్తిః వర్తితవ్యా చ రాజవత్।
అర్థజ్యేష్ఠా హి రాజానో రాజధర్మమనుస్మర। 20

మందరపర్వతవనములలో ప్రవేశించు అశ్వినీకుమారులవలె మా రామలక్ష్మణులు మహారణ్యములలో ప్రవేశించుచుండగా నీవు స్వయముగా చూచితివి. నిజముగా నీవు ధన్యాత్ముడవు సుమా!(10)

ఓ సుమంత్రా! అడవులలో అడుగిడునప్పుడు మా రాముడు ఏమనినుడివెను? ఇంతకును లక్ష్మణుడేమి పల్కెను.? వారిమాటలు సరే! మా కోడలు మైథిలి ఏమనివచించెను.? (11)

ఓ సుమంత్రా! శ్రీరాముడు దేనిపై ఆసీనుడగుచున్నాడు? ఎట్లు శయనించుచున్నాడు? అతనిఆహారవిహారములెట్టివి? ఈ విషయములను వివరింపుము! స్వర్గమునుండి భ్రష్టుడైన యయాతి ఇంద్రుని అనుగ్రహముతో సాధుపురుషుల సాంగత్య ప్రభావమున అతడు దుఃఖవిముక్తిని పొందెను. [1]అట్లే శ్రీరామునికథాశ్రవణముతో నేను శోకవిముక్తుడనయ్యెదను." (12)

మహారాజు ఇట్లు కోరినపిమ్మట సుమంత్రుడు కన్నీరు కార్చుచు, డగ్గుత్తికతో మాటలు తడబడుచుండగా ఆయనతో ఇట్లు నుడివెను. (13)

ఓ మహారాజా! శ్రీరాముడు ధర్మబద్ధముగా చేతులుజోడించి, మీకు శిరసాప్రణమిల్లుచు నాతో ఇట్లు పలికెను. (14)

"ఓ సుమంత్రా! ఆత్మజ్ఞానియు, మహాత్ముడును, పూజ్యుడును ఐన మాతండ్రిగారిపాదములకు నాసాష్టాంగనమస్కారములను తెలుపుము. అంతఃపురములోని తల్లులందఱికిని తగిన విధముగా నేను నమస్కరించినట్లు పలుకుచు, వారికి మా క్షేమసమాచారములను గూర్చి పూర్తిగా వివరింపుము. (15-16)

మాతల్లి కౌసల్యాదేవికి నాప్రణామములను దెలుపుము. మేమందఱము క్షేమముగా ఉన్నట్లును, శ్రద్ధాభక్తులతో ధర్మమును పాటించుచున్నట్లుగను వివరించి, ఆమెకు నావిన్నపమును ఇట్లు నివేదనజేయుము- అమ్మా! నీవు నిరంతరము ధర్మతత్పరురాలవై యుండుము. అగ్నికార్యములన్నియును తగిన సమయములలో జరుగునట్లు చూచుచుండుము. మహారాజును దైవముగా భావించుచు ఆయనచరణములను సేవించుచుండుము. తల్లీ! నేను పట్టమహిషిని, అందఱికంటెను పెద్దదానను'-అని తలపోయక తల్లులందఱిని సమానముగా చూచుకొనుచు వారితో కలిసిమెలసి యుండుము. పూజ్యురాలైన కైకేయీదేవినిగూడ రాజుగారితో సమానముగా గౌరవింపుము. రాజు(భరతుడు) వయస్సుచే చిన్నవాడేయైనను రాజ్యాధికారమునుబట్టి (సర్వసంపదలు కల్గియున్నందున) అందఱికిని ఆదరణీయుడే. కనుక రాజధర్మమును అనుసరించి (యువరాజైన) భరతకుమారునియెడ రాజునందువలె ప్రవర్తింపుము.' (17-20)

1) యయాతి చంద్రవంశపురాజు, నహుషునికుమారుడు. ఇతని తల్లి ప్రియంవద. ఇతడు వనములలో తీవ్రముగా తపమొనర్చి, తన తపోమహిమచే స్వర్గమునకు ఏగెను. ఇంద్రుడు ఇతనితపస్సునకు మెచ్చుకొనెను. ఇవటి వారితపస్సు నాతపస్సుతో సాటికాదు గదా! అని యయాతి గర్వముతో పలికెను. అందులకు కుపితుడైన ఇంద్రుడు అతనిని స్వర్గభ్రష్టుని గావించెను. పిదప ఇంద్రుని యనుగ్రహముతో యయాతి సాధువుల మధ్యపడెను. వారి సాంగత్య ప్రభావమున అతడు దుఃఖవిముక్తుడయ్యెను.

భరతః కుశలం వాచ్యో వాచ్యో మద్వచనేన చ।
సర్వాస్వేవ యథాన్యాయం వృత్తిం వర్తస్వ మాతృషు। 21

వక్తవ్యశ్చ మహాబాహుః ఇక్ష్వాకుకులనందనః।
పితరం యౌవరాజ్యస్థో రాజ్యస్థమ్ అనుపాలయ। 22

అతిక్రాంతవయా రాజా మా స్మైనం వ్యవరోరుధః।
కుమారరాజ్యే జీవ త్వం తస్యైవాజ్ఞాప్రవర్తనాత్। 23

అబ్రవీచ్చాపి మాం భూయో భృశమశ్రూణి వర్తయన్।
మాతేవ మమ మాతా తే ద్రష్టవ్యా పుత్రగర్ధినీ। 24

ఇత్యేవం మాం మహారాజ! బ్రువన్నేవ మహాయశాః।
రామో రాజీవతామ్రాక్షో భృశమశ్రూ ణ్యవర్తయత్। 25

లక్ష్మణస్తు సుసంక్రుద్ధో నిశ్శ్వసన్ వాక్యమబ్రవీత్।
కేనాయమపరాధేన రాజపుత్రో వివాసితః। 26

రాజ్ఞా తు ఖలు కైకేయ్యా లఘుత్వాశ్రిత్య శాసనమ్।
కృతం కార్యమకార్యం వా వయం యేనాభిపీడితాః। 27

యది ప్రవ్రాజితో రామో లోభకారణకారితమ్।
వరదాననిమిత్తం వా సర్వథా దుష్కృతం కృతమ్। 28

ఇదం తావద్యథాకామమ్ ఈశ్వరస్య కృతే కృతమ్।
రామస్య తు పరిత్యాగే న హేతుముపలక్షయే। 29

అసమీక్ష్య సమారబ్ధం విరుద్ధం బుద్ధిలాఘవాత్।
జనయిష్యతి సంక్రోశం రాఘవస్య వివాసనమ్। 30

అహం తావన్మహారాజే పితృత్వం నోపలక్షయే।
భ్రాతా భర్తా చ బంధుశ్చ పితా చ మమ రాఘవః। 31

సర్వలోకప్రియం త్యక్త్వా సర్వలోకహితే రతమ్।
సర్వలోకోఽనురజ్యేత కథం త్వాఽనేన కర్మణా। 32

సర్వప్రజాభిరామం హి రామం ప్రవ్రాజ్య ధార్మికమ్।
సర్వలోకం విరుధ్యేమం కథం రాజా భవిష్యసి। 33

ఓ సుమంత్రా! మా కుశలవార్తను భరతునకును దెలుపుము. ఇంకను ఆయనతో 'తల్లులందరియెడ ధర్మబద్ధముగా సముచితముగా మసలుకొనుము. వారిని భక్తిశ్రద్ధలతో సేవించుచుండుము. బాహుబలసంపన్నుడవు, ఇక్ష్వాకువంశవర్ధనుడవు, యువరాజువు ఐన నీవు మహారాజైన మనతండ్రిని గౌరవముతో చూచుకొనుచుండుము. వయోవృద్ధుడైన ఆ ప్రభువునకు అవరోధములను కలిగింపకుము. ఆయనఆజ్ఞలను తలదాల్చి, మసలుకొనుచు నీవు యువరాజుగా సమస్తభోగానుభవములతో కలకాలము వర్ధిల్లుము.'- అని నామాటగా అతనికి తెలుపుము." (21-23)

ఇంకను శ్రీరాముడు కన్నీరుగార్చుచు నాతో 'మిక్కిలి పుత్రప్రేమ గల నాతల్లి నాకేగాక నీకును తల్లిగా భావించి, ఆమెను భక్తిశ్రద్ధలతో చూచుకొనుము.' అని పలికెను. (24)

ఓ మహారాజా! మహాయశస్వియు, రాజీవలోచనుడును ఐన శ్రీరాముడు నాతో ఈ విధముగా పలుకుచునే సంతతధారగా కన్నీరుగార్చెను. (25)

ఓ రాజా! లక్ష్మణుడు మాత్రము మిక్కిలి క్రుద్ధుడై నిట్టూర్పులు విడుచుచు ఇట్లు నుడివెను. "ఓ సుమంత్రా! రాజకుమారుడైన శ్రీరాముని అడవులపాలు చేయుటకు అతడు చేసిన అపరాధమేమి? రాజు కైకేయియొక్క తుచ్ఛమైన దుర్బోధలు విని, ఏమాత్రము ఆలోచింపక వెంటనే చేయరాని పనిని చేసెను. దానివలన మేము కష్టాలపాలైతిమి. (26-27)

శ్రీరామునివనములకు పంపుటకుగల కారణము కైకేయియొక్క లోభగుణము కావచ్చును, లేదా రాజు ఆమెకిచ్చిన వరములైనను గావచ్చును. కారణము ఏదైనను ఇది శ్రీరామునియెడ ఒనర్చిన మహాపచారము. (28)

మహారాజు తనఆజ్ఞకు తిరుగులేదని ఇట్లు చేసెనా? లేక విధినిర్ణయమే ఇట్లున్నదా? ఏదియేమైనను శ్రీరాముని వనములకు పంపుటమాత్రము నాదృష్టిలో సముచితముగాదు. మహారాజు తొందరపాటుతో యుక్తాయుక్తవివక్షణలేక లోకవిరుద్ధముగా శ్రీరాముని అరణ్యములకు పంపెను. కావుననే అతడు ఇట్లు పరితపించుచున్నాడు. నేను మాత్రము మహారాజును ఇక తండ్రిగా గౌరవింపను. నాకు సోదరుడైనను, ప్రభువైనను, బంధువైనను, కడకు తండ్రియైనను, అన్నియును శ్రీరాముడే. (29-31)

శ్రీరాముడు సమస్తలోకముల హితమునందే ఆసక్తుడైయుండువాడు. కనుక అతడు సర్వలోకములకును ప్రియమైనవాడు. అట్టి శ్రీరాముని అకారణముగా వనములకు పంపుటయనెడి క్రూరకర్మమొనర్చి, ఆ మహారాజు సర్వలోకములకును అప్రియుడాయెను. అట్టి ఆ రాజును లోకమెట్లు మెచ్చుకొనును? (32)

ధర్మాత్ముడును, సమస్తప్రజలమనస్సులకు ఆహ్లాదమును గూర్చువాడును ఐన శ్రీరాముని లోకధర్మమునకు విరుద్ధముగా అడవులకుపంపి ఆ రాజు ప్రజలమనస్సులకును బాధగూర్చెను. ప్రజారంజకుడే రాజుగాని, ప్రజాబాధకుడు రాజెట్లగును? కనుక అతడు రాజుగా ఉండదగడు." (33)

జానకీ తు మహారాజ! నిశ్శ్వసంతీ తపస్వినీ।
భూతోపహతచిత్తేవ విష్ఠితా విస్మితా స్థితా। 34

అదృష్టపూర్వవ్యసనా రాజపుత్రీ యశస్వినీ।
తేన దుఃఖేన రుదతీ నైవ మాం కించిదబ్రవీత్। 35

ఉద్వీక్షమాణా భర్తారం ముఖేన పరిశుష్యతా।
ముమోచ సహసా బాష్పం మాం ప్రయాంతముదీక్ష్య సా। 36

తథైవ రామోఽశ్రుముఖః కృతాంజలిః
స్థితోఽభవల్లక్ష్మణబాహుపాలితః।
తథైవ సీతా రుదతీ తపస్వినీ
నిరీక్షతే రాజరథం తథైవ మామ్। 37

ఓ మహారాజా! జనకునికూతురైన సీతాదేవిమాత్రము మిక్కిలి పరితపించుచు నిట్టూర్చుచు, నిశ్చేష్టురాలైయుండిపోయెను. భూతము ఆవహించిన దానివలె ఆమె తనఉనికిని తానే మఱచియుండెను. దుఃఖములను ఏ మాత్రము ఎఱుగనిది ఆరాజకుమారి. ఆ సాధ్వి తనపతికి సంభవించిన కష్టములను జూచి, వగచుచుండెను. ఆమె నాతో ఏమియు పలుకక మిన్నకుండెను. (34-35)

నగరప్రయాణమునకు సిద్ధమగుచున్న నన్నుజూచి, ఆమె చిన్నవోయిన ముఖముతో భర్తవైపు వీక్షించుచు[1] వెంటనే కంటతడిపెట్టెను. (36)

నేను బయలుదేఱుసమయమున శ్రీరాముడు చేతులు జోడించి నిలబడియుండెను. ఆయనముఖమున అశ్రుధారలు స్రవించుచుండెను. లక్ష్మణుడు ప్రక్కన చేరియుండెను. సాధ్వి సీతాదేవి పరితపించుచు, ఏడ్చుచు, రాజరథమును, నన్నును పదేపదే చూచుచుండెను. (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టపంచాశస్సర్గః (58)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదియెనిమిదవసర్గము సమాప్తము

-- ✳ ✳ ✳ --

59. ఏబదితొమ్మిదవసర్గము

శ్రీరాముడులేని అయోధ్యా దైన్యస్థితిని సుమంత్రుడు దశరథునకు వర్ణించిచెప్పుట. పిమ్మట దశరథమహారాజు మిగుల విలపించుట.

[ఇతి బ్రువంతం తం సూతం సుమంత్రం మంత్రిసత్తమమ్
బ్రూహి శేషం పునరితి రాజా వచనమబ్రవీత్

తస్య తద్వచనం శ్రుత్వా సుమంత్రో బాష్పవిక్లబః
కథయామాస భూయోఽపి రామసందేశవిస్తరమ్

జటాః కృత్వా మహారాజ! చీరవల్కలధారిణౌ
గంగాముత్తీర్య తౌ వీరౌ ప్రయాగాభిముఖౌ గతౌ

అగ్రతో లక్ష్మణో యాతః పాలయన్ రఘునందనమ్
అనంతరం చ సీతాథ రాఘవో రఘునందనః
తాం తథా గచ్ఛతో దృష్ట్వా నివృత్తోఽస్మ్యవశస్తదా]

(మంత్రివర్యుడును, రథసారథియు ఐన సుమంత్రుడు రామవృత్తాంతమును ఇట్లు చెప్పెను. అంతట మహారాజు 'ఇంకను విశేషములను దెలుపుము' అని అతనిని కోరెను. ఆ విధముగా రాజు కోరగా సుమంత్రుడు కన్నీరుగార్చుచు మఱల తొట్రుపడుచు రామునిసందేశమును వివరముగా తెలిపెను. "ఓ మహారాజా! రామలక్ష్మణులు జటాధారులై నారచీరలను దాల్చి, గంగానదిని దాటిన పిమ్మట ఆ వీరులు ప్రయాగవైపుగా ప్రయాణము చేసిరి. అన్నయగు రామునకు సేవలొనర్చుచు, లక్ష్మణుడు దారితీయుచు ముందు భాగమున నడచుచుండెను. అనంతరము సీతాదేవియు, ఆమె వెనుక శ్రీరాముడును నడువసాగిరి. వారు అట్లు వెళ్లుచుండగా జూచి, (వారి పరిస్థితిని జూచి తట్టుకొనలేక) వివశుడనై మఱలి వచ్చితిని.)[2]

1) ఆత్మీయుడై తోడునీడగా ఉండెడి సుమంత్రుడు ఇక వెళ్లుచున్నాడు. ఆ సారథి రాజరథముతో వెళ్లినపిమ్మట కారడవులలో కటిక నేలపై ముండ్లబాటలలో కాలినడకతో మీరు ఎట్లు సంచరింపగలరు? స్వామీ! అనుభావముతో ఆమె తనభర్తవైపు జూచుచు కన్నీరు కార్చెను.

2) ఈ నాలుగు శ్లోకములను వ్యాఖ్యాతలు విడిచిపెట్టినను ఇవి పెక్కు ప్రాచీనప్రతులలో ఉన్నందువలన ముద్రాపకులు వీటిని తమగ్రంథములలో ముద్రించిరి. కావున ఈ శ్లోకములు అనువదింపబడెను.

మమ త్వశ్వా నివృత్తస్య న ప్రావర్తంత వర్త్మని।
ఉష్ణమశ్రు ప్రముంచంతో రామే సంప్రస్థితే వనమ్। 1

ఉభాభ్యాం రాజపుత్రాభ్యామ్ అథ కృత్వాఽహమంజలిమ్।
ప్రస్థితో రథమాస్థాయ తద్దుఃఖమపి ధారయన్। 2

గుహేన సార్ధం తత్రైవ స్థితోఽస్మి దివసాన్ బహూన్।
ఆశయా యది మాం రామః పునః శబ్దాపయేదితి। 3

విషయే తే మహారాజ! రామవ్యసనకర్శితాః।
అపి వృక్షాః పరిమ్లానాః సపుష్పాంకురకోరకాః। 4

ఉపతప్తోదకా నద్యః పల్వలాని సరాంసి చ।
పరిశుష్కపలాశాని వనాన్యుపవనాని చ। 5

న చ సర్పంతి సత్త్వాని వ్యాళా న ప్రచరంతి చ।
రామశోకాభిభూతం తత్ నిష్కూజమభవద్వనమ్। 6

లీనపుష్కరపత్రాశ్చ నరేంద్ర! కలుషోదకాః।
సంతప్తపద్మాః పద్మిన్యో లీనమీనవిహంగమాః। 7

జలజాని చ పుష్పాణి మాల్యాని స్థలజాని చ।
నాద్య భాంత్యల్పగంధీని ఫలాని చ యథాపురమ్। 8

అత్రోద్యానాని శూన్యాని ప్రలీనవిహగాని చ।
న చాభిరామానారామాన్ పశ్యామి మనుజర్షభ!। 9

ప్రవిశంతమయోధ్యాం మాం న కశ్చిదభినందతి।
నరా రామమపశ్యంతో నిశ్శ్వసంతి ముహుర్ముహుః। 10

శ్రీరాముడు అట్లు వనములకు వెళ్లిన పిమ్మట నేను ఆ ఇరువురు రాజకుమారులకును అంజలిఘటించి, దుస్సహమైన వారియెడబాటు బాధను దిగమ్రింగుచు ఎట్టకేలకు రథమునెక్కి, నగరమువైపు అశ్వములను మఱల్చితిని. కాని ఆ గుఱ్ఱములు శ్రీరామునిపై గల మక్కువచే దుఃఖముతో బాధతో వేడి కన్నీరు కార్చుచు నామాట వినవయ్యెను. అవి దారిబట్టి ముందునకు అడుగే వేయకుండెను. (1-2)

'శ్రీరాముడు తనతోగూడియుండుటకు నన్ను వనచరులద్వారా ఆహ్వానించునేమో?' అనెడి ఆశతో నేను గుహునితో గూడి అచట (శృంగిబేరపురమున) కొన్నిదినములు[1] ఉంటిని. (3)

ఓ మహారాజా! నీ (ఈ కోసల) రాజ్యమునందలి చిగురుటాకులతో, మొగ్గలతో, పూవులతో లతలతో గూడిన వృక్షములు శ్రీరాముని ఎడబాటునకు తట్టుకొనలేక కళదప్పినవి, వాడిపోయినవి. (4)

రామునివిరహబాధకులోనై నదులు, చిన్నచిన్న గుంటలు, పెద్దపెద్ద సరస్సులు మొదలగు వాటిలోని జలములు బాగుగా వేడెక్కినవి. వనములయందలి, ఉపవనములలోని ఆకులన్నియు ఎండిపోయినవి. అడవిజంతువులుగాని, క్రూరమృగములుగాని ఆహారమునకైనను కదలుటలేదు. రామునికై శోకములో మునిగి యున్నందున పక్షులన్నియు కూయుట మానినవి. (5-6)

ఓ మహారాజా! జలాశయములలోని నీరంతయు కలుషితమైనది. వాటిలోగల కమలపత్రములు, తామరతీగలు వాడిపోయినవి. అందలి మత్స్యముల, జలపక్షులచేష్టలు ఉడిగినవి. (7)

జలములలోని పుష్పములు, (కమలములు) స్థలములపై పుట్టి పెఱిగిన మొక్కలపూలసంపత్తులు, ఫలములు ఎప్పటివలె సువాసనలను వెదజల్లుటలేదు. (8)

ఓనరేంద్రా! ఇచటి ఉద్యానవనములలో జనసంచారమేలేదు. ఇందలి చిలుకలు, గోరువంకలు, కోకిలలు మొదలగు పక్షులన్నియును ఆకులలో అణిగిమణిగియున్నవి. ఉద్యానవనములన్నియును ఎప్పటివలె కలకలలాడుటలేదు. (9)

తిరిగి అయోధ్యలో ప్రవేశించునప్పుడు రథమున ఒంటరిగానున్న నన్ను చూచియు జనులు పలుకరింపనేలేదు. శ్రీరామునిదర్శన భాగ్యములేక వారు మాటిమాటికి నిట్టూర్పులువిడుచుచుండిరి. (10)

1) ఈశ్లోకమున 'దివసాన్ బహూన్' అని పేర్కొనబడినది. ఒకటి ఏకవచనము, రెండు ద్వివచనము, మూడుగాని, అపైనగాని, బహువచనము. బహువచనమున ప్రారంభసంఖ్య మూడు. సంఖ్యను పేర్కొనక బహువచనమును పేర్కొనినప్పుడు ఆ సంఖ్యను 'మూడు' గా నిర్ణయింతురు. దీనిని 'కపింజలన్యాయము' అనియందురు. కనుక కపింజలన్యాయమును అనుసరించి అచట సుమంత్రుడు గుహునితో మూడు దినములు గడిపినట్లు కొందరు నిర్ణయింతురు.
వాస్తవముగా ఐదు దినములు ఉన్నట్లుగా కనబడుచున్నది. సీతారామలక్ష్మణులు చిత్రకూటపర్వతమునకు చేరిన సమాచారమును గుహునకు అతని గూఢచారులు తెలిపిరి. అంతవఱకును సుమంత్రుడు అచటనే ఉండెను. గంగాతీరమున మఱ్ఱిచెట్టుకడ ఒక దినము, భరద్వాజాశ్రమమున ఒకరోజు, యమునాతీరమున ఒక దినము, చిత్రకూటపర్వతమున ప్రవేశించుటకు ఒక దినము, వారలు తిరిగివచ్చుటకు మఱియొక రోజు మొత్తము ఐదు దినములు – దీనినిబట్టి సుమంత్రుడు ఐదు దినములు గుహునితో అచట ఉన్నట్లు స్పష్టమగుచున్నది.

దేవ! రాజరథం దృష్ట్వా వినా రామమిహాఽఽగతమ్।
దుఃఖాదశ్రుముఖః సర్వో రాజమార్గగతో జనః। 11

హర్మ్యైర్విమానైః ప్రాసాదైః అవేక్ష్య రథమాగతమ్।
హాహాకారకృతా నార్యో రామాదర్శనకర్శితాః। 12

ఆయతైర్విమలైర్నేత్రైః అశ్రువేగపరిప్లుతైః।
అన్యోన్యమభివీక్షంతేఽవ్యక్త మార్తతరాః స్త్రియః। 13

నామిత్రాణాం న మిత్రాణామ్ ఉదాసీనజనస్య చ।
అహమార్తతయా కించిత్ విశేషముపలక్షయే। 14

అప్రహృష్టమనుష్యా చ దీననాగతురంగమా।
ఆర్తస్వరపరిమ్లానా వినిశ్శ్వసితనిస్వనా। 15

నిరానందా మహారాజ! రామప్రవ్రాజనాతురా।
కౌసల్యా పుత్త్రహీనేవ అయోధ్యా ప్రతిభాతి మా। 16

సూతస్య వచనం శ్రుత్వా వాచా పరమదీనయా।
బాష్పోపహతయా రాజా తం సూతమిదమబ్రవీత్। 17

కైకేయ్యా వినియుక్తేన పాపాభిజనభావయా।
మయా న మంత్రకుశలైః వృద్ధైస్సహ సమర్థితమ్। 18

న సుహృద్భిర్న చామాత్యైః మంత్రయిత్వా న నైగమైః।
మయాఽయమర్థస్సమ్మోహాత్ స్త్రీహేతోః సహసా కృతః। 19

భవితవ్యతయా నూనమ్ ఇదం వా వ్యసనం మహత్।
కులస్యాస్య వినాశాయ ప్రాప్తం సూత! యదృచ్ఛయా। 20

సూత! యద్యస్తి తే కించిల్మయాతు సుకృతం కృతమ్।
త్వం ప్రాపయాశు మాం రామం ప్రాణాః సంత్వరయంతి మామ్। 21

యద్యద్యాపి మమైవాజ్ఞా నివర్తయతు రాఘవమ్।
న శక్ష్యామి వినా రామం ముహూర్తమపి జీవితుమ్। 22

అథవాఽపి మహాబాహుః గతో దూరం భవిష్యతి।
మామేవ రథమారోప్య శీఘ్రం రామాయ దర్శయ। 23

ఓ మహారాజా! రాజవీథులలోని జనులెల్లరును శ్రీరాముడులేని రాజరథమును జూచి, దుఃఖముగ్నులగుచు కంటతడిపెట్టిరి. (11)

హర్మ్యములనుండియు, భవనములనుండియు, రాజప్రాసాదముల నుండియు స్త్రీలు వీథులలో సాగివచ్చుచున్న రథమును జూచి, శ్రీరామునిదర్శనముకానందున దుఃఖితలై, హాహాకారములు సలిపిరి. దుఃఖార్తలైన ఆ స్త్రీలందఱును విశాలములై నిర్మలములైన తమ నేత్రములనుండి కన్నీరు కార్చుచు, తమదుఃఖములను ప్రకటింపజాలక పరస్పరము ముఖములను చూచుకొనుచు ఉండిపోయిరి. (12-13)

నా మిత్రులు, ఉదాసీనులు (మధ్యస్థులు) అందఱును మాత్రమే గాక నా శత్రువులు సైతము ఆర్తితో అల్లాడుచుండిరి. వారి శోకములో నాకు ఎట్టి భేదమూ కన్పింపనేలేదు. (14)

ఓ మహారాజా! అయోధ్యలోని మనుష్యులందఱును, సంతోషమునకు దూరమైరి. ఇచటి ఏనుగులు, గుఱ్ఱములు దుఃఖముతో దీనవదనములతోనున్నవి. నగరమంతయును ఆర్తనాదములతో దీర్ఘనిఃశ్వాసములతో నిండియున్నది. శ్రీరామునివనవాసముచే వ్యాకులితమైన అయోధ్య పుత్త్రుని యెడబాటునకులోనైన కౌసల్యాదేవి వలె ఆనందమును కోల్పోయియుండుటను నేను గమనించితిని." (15-16)

రథసారథియైన సుమంత్రుని మాటలను విన్న పిమ్మట దశరథుడు కన్నీరుగార్చుచు, మిక్కిలి దీనస్వరముతో అతనితో ఇట్లు నుడివెను. (17)

"దుష్టస్వభావము, దుష్కులప్రాదుర్భావముగలదియు ఐన కైకేయి ఈ విషయమున నన్ను మిక్కిలి యొత్తిడి చేసినది. ఈ సందర్భమున ఆలోచనాపరులైన పెద్దలనుగాని, మిత్రులనుగాని, అమాత్యులను గాని, వేదశాస్త్రపండితులనుగాని, మేధావులైన పురప్రముఖులను గాని సంప్రదింపనైతిని. స్త్రీవ్యామోహములో పడి తొందరపాటుతో ఈ దుష్కార్యమునకు ఒడిగట్టితిని. (18-19)

ఓ సుమంత్రా! ఇట్లు జరుగవలసియున్నది కాబోలు, అందువలననే వంశకీర్తి ప్రతిష్ఠలనే వెల్గుతీయగల ఈ పిడుగుపాటు వంటి విపత్తు వచ్చిపడినది. ఓ సూతా! నేనిదివరలో నీకు ఏమైనను ఉపకారము (మేలు) చేసియున్నచో నన్ను శీఘ్రముగా రామునికడకు చేర్చుము. అతనిని చూచుటకై నాప్రాణములు ఆరాటపడుచున్నవి. ఇప్పటికిని (ఇట్టి విపత్కర పరిస్థితులలోగూడ) ఈ రాజ్యమున నాఆజ్ఞ చెల్లుబడియగుచున్నట్లయితే నామాట విని, వెంటనే ఇచటికి శ్రీరామునితోడ్కొనిరమ్ము. శ్రీరాముని చూడకుండా ఒక్క క్షణకాలమైనను నేను జీవింపజాలను. (20-22)

అట్లుగానిచో నన్నే రథముపై అచటికి తీసికొనివెళ్లి, నాకు శ్రీరాముని జూపింపుము. ఏలనన మహాబాహువైన శ్రీరాముడు ఇప్పటికే చాలాదూరము వెళ్లియుండును. (23)

వృత్తదంష్ట్రో మహేష్వాసః క్వాసౌ లక్ష్మణపూర్వజః।
యది జీవామి సాధ్వేనం పశ్యేయం సీతయా సహ। 24

వక్కని పలువరుసగలవాడును, మహాధనుర్ధారియు, లక్ష్మణునకు అన్నయు ఐన శ్రీరాముడు ఇప్పుడు ఎచ్చట ఉన్నాడు? సీతతో సహా అతనిని చూడగలిగినచో నేను జీవింపగలను. (24)

లోహితాక్షం మహాబాహుమ్ ఆముక్తమణికుండలమ్।
రామం యది న పశ్యేయం గమిష్యామి యమక్షయమ్। 25

ఎఱ్ఱని జీరలతోగూడిన కన్నులుగలవాడును, ఆజానుబాహువు, మణికుండలములను ధరించినవాడును ఐన శ్రీరాముని చూడజాలనిచో నేను అసువులను కోల్పోవుట తథ్యము. (25)

అతో ను కిం దుఃఖతరం యోఽహమ్ ఇక్ష్వాకునందనమ్।
ఇమామవస్థామాపన్నో నేహ పశ్యామి రాఘవమ్। 26

ఇట్టి అవస్థకు గుఱియై, ఆసన్నమరణుడనైయున్న నేను ఇప్పుడు ఇక్ష్వాకువంశోద్భవుడైన శ్రీరాముని చూచుటకు నోచుకొననిచో ఇంతకంటెను దుఃఖకరమైనదేముండును? (26)

హా రామ! రామానుజ! హా! హా వైదేహి! తపస్విని!।
న మాం జానీత దుఃఖేన మ్రియమాణమనాథవత్। 27

ఓ రామా! ఓ సీతా సాధ్వీ! ఓ లక్ష్మణా! నేను ఇచట దుఃఖమున మునిగి, దిక్కులేనివానివలె మరణించుచున్న విషయము మీకు తెలియదుగదా!" (27)

స తేన రాజా దుఃఖేన భృశమర్పితచేతనః।
అవగాఢః సుదుష్పారం శోకసాగరమబ్రవీత్। 28

మహారాజు ఇట్లు పలుకుచు దుఃఖభారముచే క్రుంగి, నిశ్చేష్టుడాయెను. అపారమైన శోకసాగరమున మునిగి, అతడు కౌసల్యతో ఈ విధముగా పలికెను. (28)

రామశోకమహావేగః సీతావిరహపారగః।
శ్వసితోర్మిమహావర్తో బాష్పఫేనజలావిలః। 29

బాహువిక్షేపమీనౌఘో విక్రందితమహాస్వనః।
ప్రకీర్ణకేశశైవాలః కైకేయీబడబాముఖః। 30

మమాశ్రువేగప్రభవః కుబ్జావాక్యమహాగ్రహః।
వరవేలో నృశంసాయా రామప్రవ్రాజనాయతః। 31

యస్మిన్ బత నిమగ్నోఽహం కౌసల్యే! రాఘవం వినా।
దుస్తరో జీవతా దేవి! మయాఽయం శోకసాగరః। 32

"ఓ కౌసల్యా! శ్రీరాముడు దూరమగుటచే నేను మహాశోకసాగరమున మునిగితిని. నేను జీవించియుండగా ఈదుఃఖమునుండి బయటపడుట అసాధ్యము. రామునియెడబాటువలనకలిగిన దుఃఖముచే ఈ శోకసాగరము విస్తృతమగుచున్నది. ఇది సీతావిరహమునెడి ఆవలి తీరమువఱకు వ్యాపించినది, నిట్టూర్పులే ఇందలి తరంగములు, సుడిగుండములు, కన్నీరనెడి నురుగుతోను, నీటితోను ఇది అల్లకల్లోలమైయున్నది. చేతులకదలికలే ఇందలి మీనసంచారములు, ఆక్రందనలే మహాఘోషలు, చిక్కుపడియున్న కేశములే ఇందు నాచుతీగలు. కైకేయియనెడి బడబాగ్నియే నా శోకాశ్రువేగమునకు మూలహేతువు. కుబ్జ (మంథర) యొక్క దుర్బోధలే ఇందలి పెద్దమొసళ్లు. క్రూరాత్మురాలైన కైకేయి యొక్క వరములే దీనికి తీరములు. శ్రీరాముని వనవాసముచే ఈశోకసాగరము ఇంకను విశాలమగుచున్నది. (29-32)

అశోభనం యోఽహమిహాద్య రాఘవం
దిదృక్షమాణో న లభే సలక్ష్మణమ్ ।
ఇతీవ రాజా విలపన్మహాయశాః
పపాత తూర్ణం శయనే స మూర్ఛితః । 33

నేనిచట సీతారామలక్ష్మణులను చూడగోరుచున్నాను. కాని నా పాపఫలితముగా ఆ భాగ్యము నాకు అబ్బునట్లులేదు." అని విలపించుచు మిక్కిలి యశస్వియైన మహారాజు వెంటనే మూర్ఛితుడై శయ్యపై పడిపోయెను. (33)

ఇతి విలపతి పార్థివే ప్రణష్టే
కరుణతరం ద్విగుణం చ రామహేతోః।
వచనమనునిశమ్య తస్య దేవీ
భయమగమత్ పునరేవ రామమాతా । 34

శ్రీరామునియెడబాటుకారణముగా మహారాజు మిగుల విలపించుచు మూర్ఛితుడగుటను జూచి, రెట్టింపు ఆవేదనతో ఆయన పల్కిన దయనీయవచనములను విని, రామజననియైన కౌసల్యాదేవి చింతియు భయుపడెను. (34)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనషష్టితమస్సర్గః (59)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఏబదితొమ్మిదవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

60. అఱువదియవసర్గము

సుతునియెడబాటునకు తట్టుకొనలేక విలపించుచున్న కౌసల్యాదేవిని సుమంత్రుడు ఓదార్చుట.

తతో భూతోపసృష్టేవ వేపమానా పునః పునః।
ధరణ్యాం గతసత్త్వేవ కౌసల్యా సూతమబ్రవీత్। 1

నయ మాం యత్ర కాకుత్స్థః సీతా యత్ర చ లక్ష్మణః।
తాన్ వినా క్షణమప్యత్ర జీవితుం నోత్సహే హ్యహమ్। 2

నివర్తయ రథం శీఘ్రం దండకాన్ నయ మామపి।
అథ తాన్ నానుగచ్ఛామి గమిష్యామి యమక్షయమ్। 3

బాష్పవేగోపహతయా స వాచా సజ్జమానయా।
ఇదమాశ్వాసయన్ దేవీం సూతః ప్రాంజలిరబ్రవీత్। 4

త్యజ శోకం చ మోహం చ సంభ్రమం దుఃఖజం తథా।
వ్యవధూయ చ సంతాపం వనే వత్స్యతి రాఘవః। 5

లక్ష్మణశ్చాపి రామస్య పాదౌ పరిచరన్ వనే।
ఆరాధయతి ధర్మజ్ఞః పరలోకం జితేంద్రియః। 6

విజనేఽపి వనే సీతా వాసం ప్రాప్య గృహేష్వివ।
విస్రంభం లభతేఽభీతా రామే సంన్యస్తమానసా। 7

నాస్యా దైన్యం కృతం కించిత్ సుసూక్ష్మమపి లక్ష్యతే।
ఉచితేవ ప్రవాసానాం వైదేహీ ప్రతిభాతి మా। 8

నగరోపవనం గత్వా యథా స్మ రమతే పురా।
తథైవ రమతే సీతా నిర్జనేషు వనేష్వపి। 9

బాలేవ రమతే సీతాఽఽబాలచంద్రనిభాననా।
రామా రామే హ్యదీనాత్మా విజనేఽపి వనే సతీ। 10

అనంతరము కౌసల్యాదేవి భూతము ఆవరించినదానివలె పదే పదే వణకుచు ప్రాణములు లేనిదానివలె నేలపైబడి, ఆ సారథితో ఇట్లనెను. (1)

"ఓ సుమంత్రా! సీతారామలక్ష్మణులు లేనిదే నేను ఒక్క క్షణముగూడ జీవింపజాలను. కనుక వారు ఉన్న ప్రదేశమునకు నన్ను చేర్చుము. కావున నీవు వెంటనే రథమును మఱల్పుము, నన్నును దండకారణ్యములకు తీసికొనిపొమ్ము. వారు నా ఎదుట లేనిచో నేను మరణించుట తథ్యము." (2-3)

కౌసల్యాదేవి పలికిన దైన్యవచనములను విని, సుమంత్రుడు మిగుల దుఃఖితుడాయెను, అంతట అతడు భయశోకాదులకు లోనై, అంజలిఘటించి, సంతతధారగా కన్నీరు గార్చుచు, ఆమెను ఓదార్చుచు డగ్గుత్తికతో ఇట్లు నుడివెను. (4)

"ఓ దేవీ! రఘురాముడు ఎట్టి దిగులునూ పెట్టుకొనక దండకారణ్యము నందు ప్రశాంతముగా నివసించుచున్నాడు. కాబట్టి నీవును 'అచట శ్రీరామునకు ఏమగునో?' అను బెంగను పెట్టుకొనవద్దు. ఆయన యెడబాటువలన కలిగిన దుఃఖమును, వ్యాకులపాటును త్యజింపుము. నీవు ఆయనకై ఏమాత్రమూ పరితపింపవలదు. (5)

జితేంద్రియుడును, ధర్మజ్ఞుడును ఐన లక్ష్మణుడు వనమునందు నిరంతరము శ్రీరామునకు పాదసేవలొనర్చుచు, పరమార్థఫలములను సాధించుచున్నాడు. సీతాదేవి ఎల్లప్పుడును తనమనస్సును శ్రీరాముని యందే లగ్నమొనర్చుచున్నది. కనుక ఆమె నిర్జనారణ్యమున ఉన్నప్పటికిని అంతఃపురమునందువలెనే నిర్భయముగా మసలుకొనుచు శ్రీరాముని ప్రేమానురాగములను పొందుచున్నది.[1] (6-7)

సీతాదేవిలో వనవాసపరమైన దైన్యము ఏమాత్రమూ కనబడుట లేదు. పైగా వనవాసమునకు అలవాటు పడిన వారివలె ఆమె నిశ్చింతగానున్నది. ఆమె ఇదివరలో నగరోద్యాన వనములలో హాయిగా సంచరించిన విధముగనే ఇప్పుడు జనసంచారమేలేని అడవులయందును సంతోషముగనే యున్నది. (8-9)

పూర్ణిమనాటి చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖవికాసము గల సీతామహాసాధ్వి తనమనస్సును రామునియందే నిల్పినదై, ఆ నిర్జనవనములయందును ఒక బాలికవలె (దైన్యమునకు తావీయక) హాయిగా ఆనందించుచున్నది. (10)

1) రమణుడు చెంతనుండిన అరణ్యములే అపరంజిమేడలౌ,
రమణుడులేక మేడలె అరణ్యములౌ ------ ఇకనేమి జానకీ
రమణీమణి రాణివాసము - ఇది 'కరుణశ్రీ' రచితమైన 'ఊర్మిళ' ఖండికలోనిది.

తద్గతం హృదయం హ్యస్యాః తదధీనం చ జీవితమ్।
అయోధ్యాఽపి భవేత్ తస్యా రామహీనా తథా వనమ్। 11

పథి పృచ్ఛతి వైదేహీ గ్రామాంశ్చ నగరాణి చ।
గతిం దృష్ట్వా నదీనాం చ పాదపాన్ వివిధానపి। 12

రామం వా లక్ష్మణం వాపి పృష్ట్వా జానాతి జానకీ।
అయోధ్యా క్రోశమాత్రే తు విహారమివ సంశ్రితా। 13

ఇదమేవ స్మరామ్యస్యాః సహసైవోపజల్పితమ్।
కైకేయీసంశ్రితం వాక్యం నేదానీం ప్రతిభాతి మా। 14

ధ్వంసయిత్వా తు తద్వాక్యం ప్రమాదాత్ పర్యుపస్థితమ్।
హ్లాదనం వచనం సూతో దేవ్యా మధురమబ్రవీత్। 15

అధ్వనా వాతవేగేన సంభ్రమేణాఽఽతపేన చ।
న విగచ్ఛతి వైదేహ్యాః చంద్రాంశుసదృశీ ప్రభా। 16

సదృశం శతపత్రస్య పూర్ణచంద్రోపమప్రభమ్।
వదనం తద్వదాన్యాయా వైదేహ్యా న వికంపతే। 17

అలక్తరససరక్తాభా అలక్తరసవర్జితా।
అద్యాపి చరణౌ తస్యాః పద్మకోశసమప్రభౌ। 18

నూపురోద్ఘుష్టహేలేవ ఖేలం గచ్ఛతి భామినీ।
ఇదానీమపి వైదేహీ తద్రాగాన్న్యస్తభూషణా। 19

గజం వా వీక్ష్య సింహం వా వ్యాఘ్రం వా వనమాశ్రితా।
నాహారయతి సంత్రాసం బాహూ రామస్య సంశ్రితా। 20

సీతాదేవిహృదయము శ్రీరామునియందే నిమగ్నమైయున్నది. ఆమెజీవితము తనభర్తకే అంకితమొనర్చినది. అందువలన శ్రీరాముని వెంటనున్న ఆమెకు ఆ వనములు అయోధ్యవలెనే సుఖదాయకములుగానున్నవి. రాముడు తనసమీపమున లేనిచో ఆమెకు అయోధ్యయు వనముతో సమానముగా ఉండెడిది. (11)

సీతాదేవి అరణ్యములోనున్నను అయోధ్యకు ఒక క్రోసెడు దూరమునగల ఉద్యానవనములో విహరించుచున్నట్లు భావించుచున్నది. ఇంకను ఆమె తనమార్గమున కనబడిన గ్రామములు, నగరములు, వివిధములగు వృక్షములు మున్నగు వాటినిగూర్చి శ్రీరాముని గాని, లక్ష్మణునిగాని ఉత్సాహముతో అడిగి తెలిసికొనుచున్నది. (12-13)

సీతాదేవినిగూర్చి నాకు ఇంతమాత్రమే జ్ఞాపకమున్నది. ఆమె కైకేయినిగూర్చి యేదియో నుడివినది. కాని అవి నాకు స్ఫురణలో లేవు. కైకేయిని గూర్చి సీతాదేవి పలికిన మాటలు ఏమఱుపాటున తన నోటిదాకావచ్చినను సుమంత్రుడు (వాటిని కౌసల్యాదేవికి తెలుపుట ఉచితముగాదని భావించి) వాటిని కప్పిపుచ్చి, కౌసల్యాదేవికి ఆహ్లాదమును గూర్చుమాటలనే మధురముగా పలికెను. (14-15)

ప్రయాణశ్రమచే బడలియున్నను, తీవ్రమైన గాలులకు, ఎండలకు లోనైనను, పెద్దపులులు మొదలగు క్రూరమృగములను చూచుటచే వ్యాకులపడినను చంద్రకిరణములవలె ఆహ్లాదకరమైన ఆమెశరీరకాంతి ఏమాత్రము వసివాడలేదు. (16)

మధురభాషిణియైన సీతాదేవియొక్కముఖము వికసితకమలము వలె సుందరమై, పూర్ణచంద్రునివలె ఆహ్లాదకరమై యొప్పుచుండెను. అట్టి ఆమె ముఖసౌందర్యముగాని, కాంతిగాని అవంతయును చెక్కుచెదరలేదు. (17)

సీతాదేవిపాదములు సహజముగనే ఎల్లప్పుడును లత్తుకరస శోభలతో (ఎఱ్ఱనికాంతులతో) విలసిల్లుచుండును. వనవాసజీవితమున ఆమె తనపాదములకు లత్తుకరసమును పూసికొనకున్నను (పారాణి దిద్దుకొనకున్నను) అడవులలో సంచరించుచున్నను ఆమె కాళ్లపైని కెందామర (మెట్టతామర) శోభలు ఇప్పటికిని కొంచెముగూడ తగ్గలేదు. (18)

మిక్కిలి సుందరియైన సీతాదేవి ఆభరణములను ధరింపకయున్నను శ్రీరామునిపైగల అనురాగముచే ఆయనను ప్రసన్నుని గావించుకొనుటకై, ఇప్పటికిని నూపురములను (కాలిఅందెలను) ధరించిన దానివలె విలాసముగా నడచుచున్నది. (19)

సీతాదేవి శ్రీరామునిబాహుబలముపై విశ్వాసముంచి, వనవాసము చేయుచున్నది. అందువలన వనములలో సంచరించుచున్నప్పుడు ఏనుగులు, సింహములు, పెద్దపులులు మొదలగు అడవిజంతువులు ఏవి కనబడినను ఆమె కించిత్తైనను భయపడుటలేదు. (20)

న శోచ్యాస్తే న చాత్మానః శోచ్యో నాపి జనాధిపః।
ఇదం హి చరితం లోకే ప్రతిష్ఠాస్యతి శాశ్వతమ్। 21

ఓ కౌసల్యాదేవీ! సీతారామలక్ష్మణులకొఱకై మీరు ఏమాత్రము దిగులుపడవలదు. అంతేగాదు. మీ గుఱించిగాని, మహారాజుగారిని గూర్చిగాని చింతింపవలసిన పనియేలేదు. పితృవాక్యపరిపాలన రూపమైన శ్రీరాముని చరిత్రము ఈ లోకమున శాశ్వతముగా, ఆచంద్రార్కముగా నిలిచియుండును. (21)

విధూయ శోకం పరిహృష్టమానసా
మహర్షియాతే పథి సువ్యవస్థితాః।
వనేరతా వన్యఫలాశనాః పితుః
శుభాం ప్రతిజ్ఞాం పరిపాలయంతి తే। 22

ఆ సీతారామలక్ష్మణులు ఏమాత్రమును శోకింపక, ప్రసన్నచిత్తులై, మహర్షులమార్గమును అనుసరించుచున్నారు. వారు వన్యఫలములనే (కందమూలఫలములనే) సంతోషముతో స్వీకరించుచు తండ్రిగారి సత్యప్రతిజ్ఞను నెఱవేర్చుచున్నారు." (22)

తథాపి సూతేన సుయుక్తవాదినా
నివార్యమాణా సుతశోకకర్శితా।
న చైవ దేవీ విరరామ కూజితాత్
ప్రియేతి పుత్త్రేతి చ రాఘవేతి చ। 23

సుమంత్రుడు యుక్తియుక్తములైన వచనములతో ఎంతగా ఊరడించుచున్నను సుతునియెడబాటుశోకముతో మిగుల కృశించియున్న ఆ కౌసల్యాదేవి "ఓ ముద్దులకుమరా! ఓ రఘురామా!" అని వాపోవుచు తన పరితాపమును వీడలేదు. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షష్టితమస్సర్గః (60)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదియవసర్గము సమాప్తము

— * * * —

61. అఱువదియొకటవసర్గము

శ్రీరామునియెడబాటు దుఃఖమును భరింపలేక కౌసల్యాదేవి దశరథుని నిష్ఠురోక్తులాడుట.

వనం గతే ధర్మపరే రామే రమయతాం వరే।
కౌసల్యా రుదతీ స్వార్తా భర్తారమిదమబ్రవీత్। 1

సకలప్రాణులను ఆనందింపజేయువారిలో శ్రేష్ఠుడును, ధర్మనిరతుడును ఐన శ్రీరాముడు వనవాసమునకు వెళ్ళగా మిగుల దుఃఖితురాలై ఏడ్చుచు కౌసల్యాదేవి తనభర్తతో ఇట్లు నుడివెను. (1)

యద్యపి త్రిషు లోకేషు ప్రథితం తే మహద్యశః।
సానుక్రోశో వదాన్యశ్చ ప్రియవాదీ చ రాఘవః। 2

"ఓ మహారాజా! 'రఘువంశజుడైన దశరథుడు మిక్కిలి దయాళువు, ఉదారపురుషుడు, ప్రియభాషి' అని ముల్లోకములయందును మీ ఘనకీర్తి వ్యాపించినది. ఐనను శ్రీరాముని అడవులకు పంపి, అంతకు మించిన అపకీర్తిని మూటగట్టుకొంటిరి. (2)

కథం నరవరశ్రేష్ఠ! పుత్త్రౌ తౌ సహ సీతయా।
దుఃఖితౌ సుఖసంవృద్ధౌ వనే దుఃఖం సహిష్యతః। 3

సా నూనం తరుణీ శ్యామా సుకుమారీ సుఖోచితా।
కథముష్ణం చ శీతం చ మైథిలీ ప్రసహిష్యతే। 4

ఓ నరశ్రేష్ఠా! సుఖములలో పుట్టిపెఱిగిన రామలక్ష్మణులు దుఃఖములపాలై సీతతోగూడి, అడవులలో కష్టములను ఎట్లు సహించుచున్నారో యేమో! యౌవనమున అడుగిడిన సీతాదేవి మిక్కిలి సుకుమారి. సుఖములను అనుభవింపవలసిన ఈ తరుణములో ఆ జనకనందిని తీవ్రమైన చలికి, వేడికి అచట ఎట్లు తట్టుకొనగలదు? (3-4)

భుక్త్వాఽశనం విశాలాక్షీ సూపదంశాన్వితం శుభమ్।
వన్యం నైవారమాహారం కథం సీతోపభోక్ష్యతే। 5

విశాలాక్షియైన సీతాదేవి ఇచట రుచికరములైన శాకపాకములతో కమ్మని భోజనపదార్థములను ఆరగించుచుండెడిది. అట్టి శుభాంగి ఇప్పుడచట అడవులలో లభించు నెవ్వడిబియ్యపు (నివ్వరిధాన్యపు) అన్నమును ఎట్లు భుజింపగలదు? (5)

గీతవాదిత్రనిర్ఘోషం శ్రుత్వా శుభమనిందితా।
కథం క్రవ్యాదసింహానాం శబ్దం శ్రోష్యత్యశోభనమ్। 6

గీతావాద్యమృదంగతాళములతోగూడిన కమ్మనిసంగీతమును వినుచు ఆనందించుచుండెడిది ఆ సీతాసాధ్వి. ఇప్పుడు ఆమె అరణ్యములలో పచ్చిమాంసములను తినెడి సింహములు మొదలగు క్రూరమృగములభయంకర శబ్దములకు ఎట్లు ఓర్చుకొనగలదు? (6)

మహేంద్రధ్వజసంకాశః క్వను శేతే మహాభుజః।
భుజం పరిఘసంకాశమ్ ఉపధాయ మహాబలః। 7

ఇంద్రధనుస్సువలె సమస్తజనులకును ఆనందమును గూర్చునట్టి శ్రీరాముడు మహాభుజబలము గలవాడు, మిక్కిలి పరాక్రమశాలి. మెత్తని తలగడలపై శిరస్సునుంచి హాయిగా శయనించుచుండెడి ఆరాముడు ఇప్పుడు బలమైన తనచేతినే దిండుగా జేసికొని ఎట్లు నిద్రింపగలడు? (7)

పద్మవర్ణం సుకేశాంతం పద్మనిశ్వాసముత్తమమ్।
కదా ద్రక్ష్యామి రామస్య వదనం పుష్కరేక్షణమ్। 8

శ్రీరాముని ముఖకాంతి తామరరేకులశోభలను వెల్లివిరియజేయుచుండును. ఆయనముఖముపైభాగమున నిలిచిల్లు ముంగురులు చూడముచ్చటగానుండును. ఆతనినిశ్వాసములలో పద్మపరిమళములు ప్రసరించుచుండును. కమలములవంటి ఆయన కనులు దర్శనీయములు. అట్టి నా చిన్నారి రామునిముఖమును చూచెడి భాగ్యము మరల నాకు ఎప్పుడు కల్గునోగదా! (8)

వజ్రసారమయం నూనం హృదయం మే న సంశయః।
అపశ్యంత్యా న తం యద్వై ఫలతీదం సహస్రధా। 9

వాస్తవముగా నాహృదయము వజ్రములసారముతో నిర్మితమైనది. అనగా వజ్రముకంటెను కఠినాతికఠినమైనది. ఇందులకు సందేహము లేదు. అట్లుగానిచో నా ముద్దులపట్టిని చూడని నాహృదయము ఇప్పటికే వేయి ముక్కలైయుండెడిది. (9)

యత్త్వయాఽకరుణం కర్మ వ్యపోహ్య మమ బాంధవాః।
నిరస్తాః పరిధావంతి సుఖార్హాః కృపణా వనే। 10

ఓ రాజా! నీవు కైకేయిచెప్పుడుమాటలను విని ఏమాత్రము ముందువెనుకలు ఆలోచింపక, జాలిలేనివాడవై నా ఆత్మీయులైన సీతారామలక్ష్మణులను అడవులపాలు చేసితివి. సుఖార్హులైన ఆ చిన్నారులు నీకారణముగా ఇప్పుడు అరణ్యములలో దీనులై తిరుగుచున్నారు. (10)

యది పంచదశే వర్షే రాఘవః పున రేష్యతి।
జహ్యాద్రాజ్యం చ కోశం చ భరతో నోపలక్ష్యతే। 11

శ్రీరాముడు పదునాలుగుసంవత్సరములవనవాసదీక్షను ముగించుకొని, పదునైదవ సంవత్సరమున తిరిగివచ్చిన పిమ్మట గూడ భరతుడు ఆయనకు రాజ్యమును, కోశ(ధనా)గారమును అప్పగించునని గట్టిగా చెప్పుటకు వీలులేదు. ఒకవేళ భరతుడు రాజ్యాధికారమును అన్నకు అప్పగించినను దానిని శ్రీరాముడు స్వీకరింపడు. (11)

భోజయంతి కిల శ్రాద్ధే కేచిత్ స్వానేవ బాంధవాన్।
తతః పశ్చాత్ సమీక్షంతే కృతకార్యా ద్విజర్షభాన్। 12

తత్ర యే గుణవంతశ్చ విద్వాంసశ్చ ద్విజాతయః।
న పశ్చాత్ తేఽభిమన్యంతే సుధామపి సురోపమాః। 13

బ్రాహ్మణేష్వపి తృప్తేషు పశ్చాద్భోక్తుం ద్విజర్షభాః।
నాభ్యుపైతుమలం ప్రాజ్ఞాః శృంగచ్ఛేదమివర్షభాః। 14

శ్రాద్ధకార్యములను నిర్వహించెడివారిలో కొందరు ఆ శ్రాద్ధవిధులు ముగిసిన పిమ్మట ముందుగా తమబంధువులభోజనమును జరిపింతురు. పిమ్మట బ్రాహ్మణోత్తములను భోజనములకు ఆహ్వానింతురు. అట్టి సందర్భములలో గుణవంతులు, విద్వాంసులు, దేవతాసములైన బ్రాహ్మణులు (ఇతరులు భుజించిన పిమ్మట) తమకు అమృతమును (అమృతతుల్యపదార్థములను) వడ్డించినను వాటిని స్వీకరింపరు. తమకంటెముందుగా భుజించినవారు బ్రాహ్మణులేయైనను ఆ భుక్తశేషమును ప్రాజ్ఞులు, నిష్ఠాపరులైన బ్రాహ్మణోత్తములు భుజింపరు. వృషభములు శృంగచ్ఛేదమునువలె వారు భుక్తశేషమును తినుటను అమర్యాదగా భావింతురు. (12-14)

ఏవం కనీయసా భ్రాత్రా భుక్తం రాజ్యం విశాంపతే।
భ్రాతా జ్యేష్ఠో వరిష్ఠశ్చ కిమర్థం నావమంస్యతే। 15

ఓ మహారాజా! బ్రాహ్మణోత్తములు భుక్తశేషమునువలె తమ్ముడనుభవించిన రాజ్యమును సద్గుణశ్రేష్ఠుడైన అన్న ఎట్లు స్వీకరించును? (ఎట్టి పరిస్థితులలోను స్వీకరింపడు.) (15)

న పరేణాహృతం భక్ష్యం వ్యాఘ్రః ఖాదితుమిచ్ఛతి।
ఏవమేతన్నరవ్యాఘ్రః పరలీఢం న మన్యతే। 16

తోడేళ్లు, నక్కలు మొదలగు ఇతరజంతువులు ముట్టిన ఆహార పదార్థములను భుజించుటకు పెద్దపులి ఇష్టపడదు. అట్లే ఇతరులు (భరతుడు) అనుభవించిన రాజ్యమును పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముడు స్వీకరింపడు. (16)

హవిరాజ్యం పురోడాశాః కుశా యూపాశ్చ ఖాదిరాః।
నైతాని యాతయామాని కుర్వంతి పునరధ్వరే। 17

హవిస్సాన్నము, నేయి, పిష్టము మొదలగు పురోడాశద్రవ్యములు, దర్భలు, చండ్ర, మోదుగు మొదలగు మొద్దులతో నిర్మింపబడిన యూపస్తంభములు మున్నగువానిని ఒక యజ్ఞమునందు ఉపయోగించిన పిమ్మట విజ్ఞులు వాటిని మఱియొక యజ్ఞమునందు వాడరు. (17)

తథా హ్యాత్తమిదం రాజ్యం హృతసారాం సురామివ।
నాభిమంతుమలం రామో నష్టసోమమివాధ్వరమ్। 18

నిస్సారమైన సురను (మద్యమును) ఎవ్వరును ముట్టరు. యజ్ఞము నందలి సోమరసమును ఒకరు ఆస్వాదించినచో దానిని మఱియొకరు రుచిచూడరు. అట్లే భరతుడు అనుభవించిన రాజ్యమును శ్రీరాముడు ఎన్నటికిని చేపట్టడు. (18)

నైవంవిధమసత్కారం రాఘవో మర్షయిష్యతి।
బలవానివ శార్దూలో వాలధేరవమర్శనమ్। 19

బలిష్ఠమైన పెద్దపులి తనతోకను ఎవ్వరైనను తాకినచో సహింపనట్లు శ్రీరాముడు ఈ విధమైన అవమానమును సహింపడు. (19)

నైతస్య సహితా లోకా భయం కుర్యుర్మహామృధే।
అధర్మం త్విహ ధర్మాత్మా లోకం ధర్మేణ యోజయేత్। 20

లోకములన్నియు కట్టగట్టుకొని వచ్చి యుద్ధమున ఎదిరించినను శ్రీరాముడు భయపడడు. ఆ ధర్మాత్ముడు అధర్మమార్గమున సంచరించు ఈ లోకమును ధర్మమార్గమున నడపును. అట్టి రాముడు స్వయముగా అధర్మమును ఆచరింపడు గదా! కనుక కపటోపాయములచే రాజ్యమును ఆయనకు దక్కకుండాచేసినను పితృవాక్యపరిపాలన రూపధర్మమునకు కట్టుబడి ఆయన దానిని ఎదిరింపలేదు. (20)

నన్వసౌ కాంచనైర్బాణైః మహావీర్యో మహాభుజః।
యుగాంత ఇవ భూతాని సాగరానపి నిర్దహేత్। 21

ప్రళయకాలాగ్ని సమస్తప్రాణులను భస్మమొనర్చునట్లు మహావీరుడును, గొప్పభుజబలశాలియు ఐన శ్రీరాముడు తలచుకొనినచో తన బంగారు(వాడియైన)బాణములతో సముద్రములనన్నింటిని దహించివేయగలడు. (21)

స తాదృశః సింహబలో వృషభాక్షో నరర్షభః।
స్వయమేవ హతః పిత్రా జలజేనాఽఽత్మజో యథా। 22

శ్రీరాముడు సింహమువలె పరాక్రమశాలి, వృషభమువలె విశాల నేత్రుడు, నరశ్రేష్ఠుడు. అట్టి రఘురాముడు పెద్దచేపచేతిలో దాని పిల్లలు (పిల్లచేపలు) హతమైనట్లు, తండ్రివైన నీచే వంచితుడాయెను. సనాతనధర్మము వేదసమ్మతమైనది, శాస్త్రప్రోక్తమైనది. అది అవిచ్ఛిన్నముగా ద్విజులచే (బ్రాహ్మణ క్షత్రియవైశ్యులచే) ఆచరింప బడుచున్నది. శ్రీరాముడు ధర్మనిరతుడు. అట్టివానిని నీవు అడవులకు పంపితివి. ఇట్లుచేయుట ధర్మబద్ధమేనా? (22-23)

ద్విజాతిచరితో ధర్మః శాస్త్రదృష్టః సనాతనః।
యది తే ధర్మనిరతే త్వయా పుత్రే వివాసితే। 23

ఓ మహారాజా! రక్షణ విషయమున స్త్రీకి పతియేగతి. అతడు ఆదుకొననప్పుడు ఆమెను రక్షింపవలసినవాడు కుమారుడే. పుత్రుని వలనను రక్షణకఱవైనప్పుడు ఆమెను ఆదుకొనవలసిన వారు జ్ఞాతులే. అనగా ఆమె తల్లిదండ్రులు మొదలగువారే. ఈ మూడు మార్గములలో ఆలంబనము దొరకనియప్పుడు ఆమెకు మఱియొక (నాల్గవ) దారియేలేదు. నీవు ఆ కైకేయి చేతిలో కీలుబొమ్మవగుట

గతిరేకా పతిర్నార్యా ద్వితీయా గతిరాత్మజః।
తృతీయా జ్ఞాతయో రాజన్ చతుర్థీ నేహ విద్యతే। 24

తత్ర త్వం చైవ మే నాస్తి రామశ్చ వనమాశ్రితః।
న వనం గంతు మిచ్ఛామి సర్వథా నిహతా త్వయా। 25

వలన రక్షణకై నేను నీమీద ఆధారపడుట వ్యర్థం. కుమారుడైన శ్రీరాముడేమో వనములపాలైనాడు. దూరమై పోయినందున నన్ను ఆదుకొనుటకు అతడు లేడైరి. నిన్ను (పతిని) విడచి వనములకు వెళ్లుటకు నేను ఇష్టపడను. నీవు నన్ను అన్నివిధములుగా ఇట్లు మృతప్రాయను జేసితివి. (24-25)

హతం త్వయా రాజ్య మిదం సరాష్ట్రం
హత స్తథాఽఽత్మా సహ మంత్రిభిశ్చ।
హతా సపుత్రాఽస్మి హతాశ్చ పౌరాః
సుతశ్చ భార్యా చ తవ ప్రహృష్టౌ । 26

నీవు శ్రీరాముని అడవులకు పంపి, ఈ కోసలరాజ్యమునే దిక్కులేనిదానినిజేసితివి. నీమిత్రులు పాలించు సామంతరాజ్యముల మనుగడనే శూన్యమొనర్చితివి. నీవలన బంధుమిత్రులు, మంత్రులు దిక్కులేనివారైరి. నాకును, నారామునకును (సీతారామలక్ష్మణులకును) అండలేకుండజేసితివి. పౌరులు జీవచ్ఛవములుగా మిగిలిరి. కడకు నీవును ఏకాకివైపోయితివి. ఫలితముగా నీకుమారుడైన భరతుడు, నీభార్య కైకేయి మాత్రమే సంతోషపడుచుండిరి." (26)

ఇమాం గిరం దారుణశబ్దసంశ్రితాం
నిశమ్య రాజాఽపి ముమోహ దుఃఖితః।
తత స్స్వశోకం ప్రవివేశ పార్థివః
స్వదుష్కృతం చాపి పునస్తదా స్మరన్ । 27

అంతట ఆ మహారాజు కౌసల్యపలికిన దారుణవచనములను విని, మిగుల దుఃఖితుడై "హా!రామా!" యని వాపోవుచు స్పృహలేనివాడాయెను. అనంతరము ఆ ప్రభువు తానొనర్చిన ఈ తప్పిదములను, ఇట్టిదుఃఖమునకు కారణమైన తనదుష్కృత్యమును (ఋషిపుత్రుడైన శ్రవణకుమారుని చంపుటను) పదే పదే స్మరించుచు శోకమున మునింగెను. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకషష్టితమస్సర్గః (61)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదియొకటవసర్గము సమాప్తము

-- * * * --

62. అఱువదిరెండవసర్గము

కౌసల్యపల్కిన పరుషోక్తులకు దశరథుడు ఖిన్నుడగుట - అట్లు తొందరపడి మాట్లాడినందులకు ఆమె పశ్చాత్తాపపడుట.

ఏవం తు క్రుద్ధయా రాజా రామమాత్రా సశోకయా।
శ్రావితః పరుషం వాక్యం చింతయామాస దుఃఖితః। 1

రామజననియైన కౌసల్య తనకు పుట్టిన దుఃఖమును తెచ్చిపెట్టిన ఆ దశరథమహారాజుపై మండిపడుచు క్రుద్ధురాలై పలికిన పరుష వచనములను విని, ఆ ప్రభువు మిగుల కుమిలిపోయెను. 'కౌసల్య పలుకులు సత్యములు. ఇతరులెవ్వరును చేయని అపరాధములను నేనొర్చితిని. ఇప్పుడు నేను చేయవలసినదేమి?' అని అతడు ఇట్లు చింతింపసాగెను. (1)

చింతయిత్వా స చ నృపో ముమోహ వ్యాకులేంద్రియః।
అథ దీర్ఘేణ కాలేన సంజ్ఞామాప పరంతపః। 2

స సంజ్ఞాముపలభ్యైవ దీర్ఘముష్ణం చ నిశ్శ్వసన్।
కౌసల్యాం పార్శ్వతో దృష్ట్వా పునశ్చింతాముపాగమత్। 3

ఈ అనర్థములకు కారణము ఏమైయుండును? అని చింతామగ్నుడైన ఆదశరథుడు చింతయు వ్యాకులపాటునకు లోనై తెలివితప్పి పడిపోయెను. చాలాసేపటికి అతడు స్పృహలోనికి వచ్చెను. పిమ్మట తానుచేసిన దుష్కృత్యము జ్ఞప్తికిరాగా వేడినిట్టూర్పులు విడుచుచు తనప్రక్కనేయున్న కౌసల్యాదేవిని జూచి, మఱల ఆలోచింపదొడంగెను.[1] (2-3)

1) శ్లో॥ అత్యుత్కటైః పుణ్యపాపైః ఇహైవ ఫలమశ్నుతే॥ ఎవరైనను తాము చేసికొనిన వివిధములగు అనంతమైన పుణ్యపాపముల ఫలములను ఈ జన్మలోనే అనుభవించుట జరుగును.
శ్లో॥ అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్॥ తామొనర్చిన పుణ్యపాపకృత్యముల ఫలితములను ఎవ్వరైనను అనుభవింపక తప్పదు. అను శాస్త్రవచనమును స్మరించుచు దశరథుడు చింతింపసాగెను.

తస్య చింతయమానస్య ప్రత్యభాత్కర్మ దుష్కృతమ్।
యదనేన కృతం పూర్వమ్ అజ్ఞానాచ్ఛబ్దవేధినా। 4

అమనాస్తేన శోకేన రామశోకేన చ ప్రభుః।
ద్వాభ్యామపి మహారాజః శోకాభ్యామన్వతప్యత। 5

దహ్యమానః స శోకాభ్యాం కౌసల్యామాహ భూపతిః।
వేపమానోఽంజలిం కృత్వా ప్రసాదార్థమవాఙ్ముఖః। 6

ప్రసాదయే త్వాం కౌసల్యే! రచితోఽయం మయాఽంజలిః।
వత్సలా చానృశంసా చ త్వం హి నిత్యం పరేష్వపి। 7

భర్తా తు ఖలు నారీణాం గుణవాన్ నిర్గుణోఽపి వా।
ధర్మం విమృశమానానాం ప్రత్యక్షం దేవి! దైవతమ్। 8

సా త్వం ధర్మపరా నిత్యం దృష్టలోకపరావరా।
నార్హసే విప్రియం వక్తుం దుఃఖితాఽపి సుదుఃఖితమ్। 9

తద్వాక్యం కరుణం రాజ్ఞః శ్రుత్వా దీనస్య భాషితమ్।
కౌసల్యా వ్యసృజద్బాష్పం ప్రణాళీవ నవోదకమ్। 10

సా మూర్ధ్ని బద్ధ్వా రుదతీ రాజ్ఞః పద్మమివాంజలిమ్।
సంభ్రమాదబ్రవీత్ త్రస్తా త్వరమాణాక్షరం వచః। 11

ప్రసీద శిరసా యాచే భూమౌ నిపతితాఽస్మి తే।
యాచితాస్మి హతా దేవ! క్షంతవ్యాఽహం న హి త్వయా। 12

నైషా హి సా స్త్రీ భవతి శ్లాఘనీయేన ధీమతా।
ఉభయోర్లోకయోర్వీర! పత్యా యా సంప్రసాద్యతే। 13

జానామి ధర్మం ధర్మజ్ఞ! త్వాం జానే సత్యవాదినమ్।
పుత్రశోకార్తయా తత్తు మయా కిమపి భాషితమ్। 14

శోకో నాశయతే ధైర్యం శోకో నాశయతే శ్రుతమ్।
శోకో నాశయతే సర్వం నాస్తి శోకసమో రిపుః। 15

ఇట్లు చింతాక్రాంతుడైన ఆ మహారాజునకు 'తొగడ శబ్దభేది బాణముద్వారా తెలియక తానొనర్చిన (ముని పుత్త్రుడైన శ్రవణ కుమారుని చంపిన) దుష్కృత్యము' స్ఫురణకు వచ్చెను. (4)

శ్రీరామునియెడబాటుశోకమునకు తోడుగా ఇదివఱలో తానొనర్చిన దుష్కృత్యభారము వచ్చి పైబడుటచే ఆ ప్రభువు వికలమనస్కుడాయెను. తత్ప్రభావమున శోకము రెట్టింపుకాగా అతడు మిక్కిలి పరితపింపసాగెను. (5)

శోకాగ్నిచే దహింపబడుచున్న ఆరాజు వణకిపోవుచు కౌసల్యాదేవిని ప్రసన్నురాలినిగాజేసికొనుటకై అవనతవదనుడై, చేతులుజోడించి, ఆమెతో ఇట్లనెను. (6)

"ఓ కౌసల్యా! అంజలి ఘటించి, నిన్ను వేడుకొనుచున్నాను. ప్రసన్నురాలవగుము. నీవు ఇతరులయెడలను (ప్రతికూలుర యందును) వాత్సల్యముతో దయచూపుచుందువు. ఇక నీపతినైన నాయెడ ఈ కాఠిన్యమెందులకు? ఓ దేవీ! భర్త గుణవంతుడైనను, గుణహీనుడేయైనను ధర్మ నిరతిగల స్త్రీలకు అతడే ప్రత్యక్షదైవము గదా! నీవు సర్వదా ధర్మతత్పరురాలవు. లోకమున జరుగు మంచి చెడ్డలు బాగుగా ఎఱిగినదానవు. నీవు ఇంతగా తీరనిదుఃఖమునకు గుఱియైనను నీవలెనే దుఃఖితుడనైయున్న నన్ను ఇట్లు తూలనాడుట న్యాయమా? నన్ను కనికరింపుము". (7-9)

దుఃఖితుడైయున్న మహారాజుయొక్క దీనాలాపములను వినగానే, దోనెలనుండి వర్షధారలవలె కౌసల్యాదేవి కనులనుండి అశ్రుధారలు స్రవించెను. (10)

అంతట కౌసల్యాదేవి అధర్మభయముతో ఏడ్చుచు, పద్మము వలెనున్న మహారాజు దోసిలిని తనచేతులతో పట్టుకొనెను. పిమ్మట వాటిని తనశిరస్సున జేర్చుకొని, తత్తఱపాటుతో తడబడుచు ఆమె తనపతితో ఇట్లనెను. (11)

"ఓ దేవా! నేను నేలపై సాగిలబడి మీకు శిరసా ప్రణమిల్లుచున్నాను. అనుగ్రహింపుడు. మీరు నాపతిదేవులు. నన్ను ఇట్లు యాచించుట నాకు మరణముతో సమానము. మీతో పరుషముగా పలికి మహాపరాధమొనర్చితిని. అందులకై నేను క్షంతవ్యురాలను కాను. ఓ వీరా! ప్రశంసార్హుడు, ప్రజ్ఞాశాలియు ఐన పతిచే బ్రతిమలాడించుకొను స్త్రీ ఇహపరలోకములకును చెడును. (బ్రతికియున్నంతకాలము నలుగురిచే నిందింపబడుచుండును, మరణానంతరము నరక యాతనలకు గుఱియగును.) (13)

ఓ ధర్మాత్మా! నాకు ధర్మముతెలియకపోలేదు. మీరు సత్య సంధులనియు ఎఱుగుదును. పుత్త్రశోకార్తనైయుండుటవలన నేను అట్లు అనుచితముగా పలికితిని. శోకమున మునిగినవారు ధైర్యమును కోల్పోవుదురు. అట్టి స్థితిలో వారిజ్ఞానము అడుగంటును. శోకము సర్వనాశనమునకును మూలము. శోకమునకు మించిన శత్రువేలేదు. హఠాత్తుగా శత్రువుచేతిలో ఎంతటి దెబ్బతిన్నను తట్టుకొనవచ్చును. కాని దైవవశమున ఆకస్మికముగా స్వల్పశోకమునకు

శక్య ఆపతితః సోఢుం ప్రహారో రిపుహస్తతః।
సోఢుమాపతితః శోకః సుసూక్ష్మోఽపి న శక్యతే। 16

వనవాసాయ రామస్య పంచరాత్రోఽద్య గణ్యతే।
యః శోకహతహర్షాయాః పంచవర్షోపమో మమ। 17

తం హి చింతయమానాయాః శోకోఽయం హృది వర్ధతే।
నదీనామివ వేగేన సముద్రసలిలం మహత్। 18

ఏవం హి కథయంత్యాస్తు కౌసల్యాయాః శుభం వచః।
మందరశ్మిరభూత్ సూర్యో రజనీచాభ్యవర్తత। 19

తథా ప్రసాదితో వాక్యైః దేవ్యా కౌసల్యయా నృపః।
శోకేన చ సమాక్రాంతో నిద్రాయా వశమేయివాన్। 20

గుణికైనను దానినుండి బయటపడుట కష్టము. ధర్మజ్ఞులును, ధర్మార్థసంశయములను తొలగింపగలవారును, వేదశాస్త్ర కోవిదులును ఐన యతీశ్వరులుసైతము శోకమునకు లోనైనచో వికలమనస్కులై, మోహములో పడిపోవుదురు. అట్టిస్థితిలో నేనెంత? దయతో నా అపరాధమును మన్నింపుడు. (14-16)

శ్రీరాముడు వనములకు వెళ్ళిన పిమ్మట ఐదురాత్రులు గడచినవి. శోకమున తల్లడిల్లుచున్న నాకు ఆ ఐదు దినములే ఐదు సంవత్సరములుగా అనిపించుచున్నవి. (17)

అనుక్షణము శ్రీరామునే చింతించుచున్న నాహృదయమున, నదులు వేగముగా వచ్చిపడుచుండుటచే సముద్రజలములవలె శోకము ఉప్పొంగుచున్నది." (18)

ఈ విధముగా కౌసల్యాదేవి వినమ్రభావములతోగూడిన అనునయవచనములను దశరథునితో పలుకగా ఆయనమనస్సు కుదుటబడెను. అంతట సూర్యకాంతులు తగ్గిపోయెను. రాత్రివేళ ప్రారంభమగుచుండెను. కౌసల్యాదేవి మాటలకు ఊరటచెందిన ఆ ప్రభువు క్రమముగా నిద్రలో మునింగెను. (19-20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్విషష్టితమస్సర్గః *(62)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదిరెండవసర్గము సమాప్తము

-- ⁕ ⁕ ⁕ --

63. అఱువదిమూడవసర్గము

తాను యువకుడుగా ఉన్నప్పుడు శబ్దభేదిబాణముతో ఒక మునిబాలుని చంపిన విషయమును దశరథుడు కౌసల్యకు తెలుపుట.

ప్రతిబుద్ధో ముహూర్తేన శోకోపహతచేతనః।
అథ రాజా దశరథః స చింతామభ్యపద్యత। 1

రామలక్ష్మణయోశ్చైవ వివాసాద్వాసవోపమమ్।
ఆవివేశోపసర్గస్తం తమః సూర్య మివాఽసురమ్। 2

సభార్యే నిర్గతే రామే కౌసల్యాం కోసలేశ్వరః।
వివక్షురసితాపాంగాం స్మృత్వా దుష్కృతమాత్మనః। 3

స రాజా రజనీం షష్ఠీం రామే ప్రవ్రాజితే వనమ్।
అర్ధరాత్రే దశరథః సంస్మరన్ దుష్కృతం కృతమ్। 4

స రాజా పుత్రశోకార్తః స్మృత్వా దుష్కృతమాత్మనః।
కౌసల్యాం పుత్రశోకార్తామ్ ఇదం వచనమబ్రవీత్। 5

ఆ దశరథమహారాజు కొంతతడవునకు మేల్కొని శోకవ్యాకులుడై చింతింపసాగెను. (1)

రామలక్ష్మణులు వనవాసమునకు వెళ్ళిన పిమ్మట, ఇంద్రతుల్యుడైన ఆ దశరథమహారాజును, రాహువునకు సంబంధించిన చీకటి సూర్యుని కప్పివేసినట్లుగా, శోకము ఆవరించెను. (2)

సీతతోగూడి శ్రీరాముడు అడవులకు వెళ్ళిన పిమ్మట దశరథమహారాజు, తానొనర్చిన దుష్కార్యమును జ్ఞప్తికి దెచ్చుకొని, ఆ విషయమునుగూర్చి కోపమును వీడిన కౌసల్యతో ఇట్లు చెప్పదలంచెను. (3)

శ్రీరాముడు అరణ్యములకు వెళ్ళిన ఆఱవనాడు అర్ధరాత్రివేళ ఆరాజు తానిదివరలో చేసిన అపరాధమును గూర్చి పదేపదే స్మరించుకొనుచుండెను. (4)

పుత్రశోకార్తుడైన ఆ మహారాజు తనదుష్కృత్యమును గుర్తునకు దెచ్చుకొని, సుతునియెడబాటు కారణముగా పరితపించుచున్న కౌసల్యాదేవితో ఇట్లు నుడువసాగెను. (5)

యదాచరతి కల్యాణి! శుభం వా యదివాఽశుభమ్।
తదేవ లభతే భద్రే! కర్తా కర్మజమాత్మనః। 6

గురులాఘవమర్థానామ్ ఆరంభే కర్మణాం ఫలమ్।
దోషం వా యో న జానాతి స బాల ఇతి హోచ్యతే। 7

కశ్చిదామ్రవణం ఛిత్త్వా పలాశాంశ్చ నిషించతి।
పుష్పం దృష్ట్వా ఫలే గృధ్నుః స శోచతి ఫలాగమే। 8

అవిజ్ఞాయ ఫలం యో హి కర్మత్వేవానుధావతి।
స శోచేత్ ఫలవేలాయాం యథా కింశుకసేచకః। 9

సోఽహమామ్రవణం ఛిత్త్వా పలాశాంశ్చ న్యషేచయమ్।
రామం ఫలాగమే త్యక్త్వా పశ్చాత్ శోచామి దుర్మతిః। 10

లబ్ధశబ్దేన కౌసల్యే! కుమారేణ ధనుష్మతా।
కుమారః శబ్దవేధీతి మయా పాపమిదం కృతమ్। 11

త దిదం మేఽనుసంప్రాప్తం దేవి! దుఃఖం స్వయంకృతమ్।
సమ్మోహాదిహ బాలేన యథా స్యాద్భక్షితం విషమ్। 12

యథాఽన్యః పురుషః కశ్చిత్ పలాశైర్మోహితో భవేత్।
ఏవం మమాఽప్యవిజ్ఞాతం శబ్దవేధ్యమయం ఫలమ్। 13

దేవ్యనూఢా త్వమభవో యువరాజో భవామ్యహమ్।
తతః ప్రావృడనుప్రాప్తా మనస్సంహర్షిణీ మమ। 14

ఉపాస్య హి రసాన్ భౌమాన్ తప్త్వా చ జగదంశుభిః।
పరేతాచరితాం భీమాం రవిరావిశతే దిశమ్। 15

"ఓ కల్యాణీ! మానవుడు తానుచేసికొనిన పుణ్యపాపకృత్యముల ఫలితముగా తగినరీతిగా సుఖదుఃఖములను పొందును. (6)

మనుష్యుడు తాను ఏదైననొక కార్యమునకు పూనుకొనినప్పుడు దానివలన కలుగు ఫలితము మంచిదైనను, లేక చెడుదైనను, అది అధికమా? లేక స్వల్పమా? అనుదానిని గుర్తింపనివాడు మూర్ఖుడు. (7)

ఒకానొకడు పూవులు పూయుకాలమున మామిడితోపును, మోదుగుచెట్లను చూచెను. సన్న పూతగల మామిడి వృక్షములు చిన్నచిన్న పండ్లను ఇచ్చుననియు, పెద్దపెద్దపూవులుగల మోదుగులు మహాఫలములను ఇచ్చుననియు భ్రమపడి, మామిడిచెట్లను నఱికివేసి, మోదుగుపాదులకు నీరు పెట్టెను. ఫలించుకాలమురాగా అల్పములైన మోదుగుకాయలను జూచి అతడు తనఅజ్ఞానమునకు దుఃఖపడెను. మనుష్యుడు తాను చేయు దుష్కార్యములఫలములను ఎఱుంగక వరుసగా వాటిని చేయుచునేయుండును. పిదప వాటిఫలితములను అనుభవింపవలసివచ్చినప్పుడు మోదుగుచెట్లకు నీరు పోసినవానివలె పశ్చాత్తాపపడును. (8-9)

మామిడివృక్షములను ఛేదించి, మోదుగు పాదులకు నీరు పోసెడి మూర్ఖులలో నేనొకడను. కైకేయికి ప్రియమును గూర్చుటకై శ్రీరాముని యువరాజపట్టాభిషేకమును నిలిపివేసితిని, ఫలమును పొందబోవు (అనువైన) సమయమున శ్రీరాముని దూరముచేసికొని, ఇప్పుడు పశ్చాత్తాపపడుచుంటిని. (10)

నేను యుక్తవయస్సులో ఉన్నప్పుడు 'ఈ రాజకుమారుడు శబ్దమునుబట్టి తనబాణప్రయోగముతో లక్ష్యము ఛేదింపగలసమర్థుడు, అని వాసికెక్కితిని. ఆ వయస్సులో నేను ధనుర్ధారినై ఒక మహాపాపకృత్యమును ఒనర్చితిని. (11)

ఓ దేవీ! అజ్ఞానకారణముగా ఈలోకమున మూర్ఖుడు విషమును భక్షించి ప్రమాదమునకు గుఱియైనట్లు స్వయంకృతాపరాధము వలన నేను పుత్త్రునియెడబాటుదుఃఖమును కొనితెచ్చుకొంటిని. అజ్ఞానియైన ఒక పురుషుడు పెద్దపెద్ద పూవులుగల మోదుగు చెట్లను జూచి మహాఫలములు లభించునని భ్రమపడి, కడకు నష్టపోయినట్లు నేనును ఒక మహాలాభమును ఆశించి, శబ్దమును బట్టి లక్ష్యమును ఛేదించుటకై బాణప్రయోగము చేయుటవలన ఇంతటి దుష్ఫలితము ప్రాప్తించునని యెఱుంగక తీరని వ్యథకు గుఱియైతిని. (12-13)

ఓ దేవీ! అప్పటికి మనవివాహము జరుగలేదు. నేను యువరాజుగా ఉంటిని. ఇంతలో నామనస్సును ఆహ్లాదపఱచు వర్షఋతువు వచ్చినది. (14)

అంతట సూర్యుడు తనకిరణములచే భూమిలోని తేమను గ్రహించి జగత్తును తపింపజేసి, ప్రేతలు సంచరించెడి దక్షిణదిశకు చేరెను. అనగా దక్షిణాయనము ప్రారంభమాయెను. (15)

ఉష్ణమంతర్దధే సద్యః స్నిగ్ధా దదృశిరే ఘనాః।
తతో జహృషిరే సర్వే భేకసారంగబర్హిణః। 16

క్లిన్నపక్షోత్తరాః స్నాతాః కృచ్ఛ్రాదివ పతత్రిణః।
వృష్టివాతావధూతాగ్రాన్ పాదపానభిపేదిరే। 17

పతితేనాంభసా ఛన్నః పతమానేన చాసకృత్।
ఆబభౌ మత్తసారంగః తోయరాశిరివాచలః। 18

పాండురారుణవర్ణాని స్రోతాంసి విమలాన్యపి।
సుస్రువుర్గిరిధాతుభ్యః సభస్మాని భుజంగవత్। 19

తస్మిన్నతిసుఖే కాలే ధనుష్మానిషుమాన్ రథీ।
వ్యాయామకృతసంకల్పః సరయూమన్వగాం నదీమ్। 20

నిపానే మహిషం రాత్రౌ గజం వాఽభ్యాగతం నదీమ్।
అన్యం వా శ్వాపదం కంచిత్ జిఘాంసురజితేంద్రియః। 21

అథాంధకారే త్వశ్రౌషం జలే కుంభస్య పూర్యతః।
అచక్షుర్విషయే ఘోషం వారణస్యేవ నర్దతః। 22

తతోఽహం శరముద్ధృత్య దీప్తమాశీవిషోపమమ్।
శబ్దం ప్రతి గజప్రేప్సుః అభిలక్ష్యత్వపాతయమ్। 23

అముంచం నిశితం బాణమ్ అహమాశీవిషోపమమ్।
తత్ర వాగుషసి వ్యక్తా ప్రాదురాసీద్వనౌకసః।
హా హేతి పతతస్తోయే బాణాభిహతమర్మణః। 24

తస్మిన్ నిపతితే బాణే వాగభూత్ తత్ర మానుషీ।
కథమస్మద్విధే శస్త్రం నిపతేత్తు తపస్విని। 25

ప్రవివిక్తాం నదీం రాత్రౌ ఉదాహారోఽహమాగతః।
ఇషుణాఽభిహతః కేన కస్య వా కిం కృతం మయా?। 26

వెంటనే ఎండవేడిమి చల్లారెను. పిమ్మట మేఘములు చల్లదనమును గూర్చుచు దర్శనమిచ్చెను. అంతట కప్పలు, లేళ్లు, చాతకములు, నెమళ్లు సంతోషముతో పొంగిపోయెను. (16)

వర్షజలములకు పక్షులరెక్కలపైభాగములు తడిసినవి. అందువలన అవి స్నానము చేసినట్లైనవి. మహావృక్షముల కొమ్మలన్నియును వానకు తడిసి గాలికి అటునిటు ఊగిపోవుచుండెను. తడియుటచే బరువెక్కిన రెక్కలతో పక్షులు అతికష్టముమీద ఆ కొమ్మలపై చేరుచుండెను. మదించిన ఏనుగులుగల పర్వతము కుండపోతలో కురిసిన, కురియుచున్న వర్షధారలచే కప్పబడి, అలలు ఆగిన సముద్రమువలె భాసిల్లుచుండెను. (17-18)

కొండమీది ప్రవాహములు సహజముగా స్వచ్ఛములేయైనను వివిధవర్ణముల ధాతువులతో కలియుటవలన వాటిలో కొన్ని తెల్లగను మఱికొన్ని ఎఱ్ఱగను, ఇంకను కొన్ని దావాగ్ని భస్మములతోగూడియు, రంగురంగుల పాములవలె ఒప్పుచు వంకరటింకరలుగా ప్రవహించు చుండెను. అంతవఱకును ఆ ప్రవాహములు నిర్మలముగానుండెను. వర్షాకాలము రాగానే కలుగిపోయిన అరుణధాతువులతోగూడిన జలములతో అవి వేర్వేఱు మార్గములద్వారా ప్రవహించుచుండెను. ఆహ్లాదకరమైన ఆ కాలములో వేటాడెడి అభిలాషతో ధనుర్బాణములను ధరించి, రథముపై సరయూనదీతీరమునకు చేరితిని. రాత్రివేళ నీరుత్రాగుటకై నదీతీరమునకు వచ్చునట్టి అడవిదున్ననుగాని, ఏనుగునుగాని, మఱియేదైననొక క్రూరమృగమునుగాని ఇంద్రియ చాపల్యముతో చంపదలచినవాడనై అచట ఒక రహస్య (ఏకాంత) ప్రదేశమున విల్లు ఎక్కుపెట్టి పొంచియుంటిని. (19-21)

ఆ సమయమున అంతటను చిమ్మచీకట్లు క్రమ్ముకొనియుండెను. నీటిలో కడవను ముంచుచున్న ధ్వని నాకు వినబడెను. చీకటియగుట వలన అదేవు నాకు కనబడకుండెను. కాని అధ్వని ఏనుగు నీరు త్రాగుచున్నప్పుడు కలిగెడు ధ్వనిగా నాకు తోచెను. (22)

అప్పుడు ఆ యేనుగును చంపదలచి, శబ్దమును లక్ష్యముగా జేసికొని, విషసర్పమువలె భయంకరమైన బాణమును ఎక్కుపెట్టి, ప్రయోగించితిని. నిశితమైన ఆ బాణము ఉషఃకాలమున ఆయువు పట్టున తాకుటచే నీటిలోపడిపోవుచున్న ఒక వనవాసి యొక్క నోటినుండియే కాబోలు 'హాహాకారములు' వెలువడెను. (23-24)

ఆ బాణము తగులగానే అచటినుండి ఒక మనుష్యుని మాటలు ఇట్లు వినవచ్చెను. 'ఎవ్వరికిని అపకారము తలపెట్టని నావంటితాపసిపైన ఈ శస్త్రప్రయోగము ఎట్లుజరిగెను? ఏమాత్రము జనసంచారమే లేని ఈ నదీతీరమున అపరరాత్రివేళ నీటికొఱకై ఇచటికి వచ్చితిని. నన్ను ఈ బాణముతో కొట్టినదెవరు? నేను ఎవరికి ఏమి అపకారము చేసితిని? (25-26)

ఋషేర్హి న్యస్తదండస్య వనే వన్యేన జీవతః।
కథం ను శస్త్రేణ వధో మద్విధస్య విధీయతే। 27

జటాభారధరస్యైవ వల్కలాజినవాససః।
కో వధేన మమార్థీ స్యాత్ కిం వాఽస్యాపకృతం మయా?। 28

ఏవం నిష్ఫలమారబ్ధం కేవలానర్థసంహితమ్।
న కశ్చిత్ సాధు మన్యేత యథైవ గురుతల్పగమ్। 29

నాహం తథాఽనుశోచామి జీవితక్షయమాత్మనః।
మాతరం పితరం చోభా అనుశోచామి మద్వధే। 30

త దేతన్మిథునం వృద్ధం చిరకాలభృతం మయా।
మయి పంచత్వమాపన్నే కాం వృత్తిం వర్తయిష్యతి। 31

వృద్ధౌ చ మాతాపితరౌ అహం చైకేషుణా హతః।
కేన స్మ నిహతాః సర్వే సుబాలేనాఽకృతాత్మనా। 32

తాం గిరం కరుణాం శ్రుత్వా మమ ధర్మానుకాంక్షిణః।
కరాభ్యాం సశరం చాపం వ్యథితస్యాపతద్భువి। 33

త స్యాహం కరుణం శ్రుత్వా నిశి లాలపతో బహు।
సంభ్రాంతః శోకవేగేన భృశమాసం విచేతనః। 34

తం దేశమహమాగమ్య దీనసత్త్వః సుదుర్మనాః।
అపశ్యమిషుణా తీరే సరయ్వాః తాపసం హతమ్। 35

అవకీర్ణజటాభారం ప్రవిద్ధకలశోదకమ్।
పాంసుశోణితదిగ్ధాంగం శయానం శల్యపీడితమ్। 36

స మాముద్వీక్ష్య నేత్రాభ్యాం త్రస్తమస్వస్థచేతసమ్।
ఇత్యువాచ తతః క్రూరం దిధక్షన్నివ తేజసా। 37

కిం తవాపకృతం రాజన్ వనే నివసతా మయా।
జిహీర్షురంభో గుర్వర్థం యదహం తాడితస్త్వయా। 38

ఏకేన ఖలు బాణేన మర్మణ్యభిహతే మయి।
ద్వావంధౌ నిహతౌ వృద్ధౌ మాతా జనయితా చ మే। 39

నేను త్రికరణశుద్ధిగా (ఏవిధముగను) ఎవ్వరికిని ఎట్టిహానిని కల్గింపనివాడను. ఈ వనమున లభించు కందమూలఫలములతో నిత్యజీవితమును కొనసాగించు ఋషికుమారుడను. అట్టి నావంటి వానిని శస్త్రముతో వధించుటకు కారణమేమి? నేను జడలను ధరించువాడను, వల్కలములను, మృగచర్మమును దాల్చువాడను, అట్టి నన్ను వధించినచో ఎవరికి ఏమిలాభము? వీనికి (ఈ బాణమును ప్రయోగించినవానికి) నేను చేసిన ద్రోహమేమి? ఇట్లు నిష్కారణముగా చంపుటవలన ఎవరికిని ఎట్టిలాభమూ చేకూరదు సరిగదా! పైగా అనర్థమే సంభవించును. గురువునకు ద్రోహముచేసినవానివలె మహాపాపియైన ఇట్టివానిని ఎవ్వడును సాధువుగా తలంపడు. (27-29)

నేను నామరణమునుగూర్చి అంతగా బాధపడుటలేదు. నేను మరణించినచో నాతల్లిదండ్రులు ఏమైపోవుదురో? అని నాతపన. ఆ వృద్ధదంపతులను ఎంతోకాలమునుండి సేవించుచు వచ్చితిని. నేను ఇట్లు మృతిచెందినచో వారిగతియేమగును? (వారికి దిక్కెవ్వరు?) నేను ప్రాణములను కోల్పోయినచో వారును అసువులను వీడుట తథ్యము. ఇట్లు నన్నును, ముసలివారైన నాతలిదండ్రులను నిశ్చయబుద్ధిలేక ఒకే ఒక్కబాణముతో హతమార్చిన ఆ పరమమూర్ఖుడు ఎవ్వడోగదా!" (30-32)

ధర్మపరిరక్షణకై తపనపడునేను ఆ దీనాలాపనములను వినగానే మిగుల వ్యథచెందితిని. అంతట ధనుర్బాణములు నాచేతులనుండి జారి నేలపై పడిపోయినవి. (33)

ఇట్లు ఆ అర్ధరాత్రివేళ హృదయవిదారకముగా మిగుల విలపించుచున్న అతనిదీనవచనములను విని, శోకాతిరేకముతో దిక్కుతోచనివాడనై ఎంతయు నిశ్చేష్టుడనైతిని. (34)

పిమ్మట నేను కాలుచేతులాడక మిక్కిలి వికలమనస్కుడనై ఆ ప్రదేశమునకు చేరితిని. అంతట సరయూనదీతీరమున నాబాణపు దెబ్బకు గురియైన ఒక ఋషికుమారుని జూచితిని. (35)

అప్పుడతని జడలు (కేశములు) అన్నియును చెదరియుండెను. జలపాత్ర దూరముగా పడియుండెను. అతనిశరీరము దుమ్ము కొట్టుకొని రక్తసిక్తమైయుండెను. బాణముయొక్క దెబ్బకు అతడు క్రిందబడియుండెను. (36)

నేను భయముతో వ్యాకులచిత్తుడనై అచటి చేరగా అతడు తీవ్రమైన తేజస్సుగల చూపులతో నన్ను దహించివేయుచున్నట్లుగా చూచి, క్రూరముగా నాతో ఇట్లనెను. (37)

"ఓ మహారాజా! నేను ఈ వనములో నివసించుచుంటిని, నాతల్లిదండ్రుల దాహము తీర్చునిమిత్తముగా జలమును గొనిపోవుటకై ఈ తీరమునకు వచ్చితిని. నేను మీకు చేసిన అపకారమేమి? ఎందులకై నన్ను బాణముతో కొట్టితిరి? ఒకే ఒక్కబాణముతో నాఆయువుపట్టుపై దెబ్బతీసితిరి. ఈ దెబ్బతో (నేను మృతిచెందుట వలన) అంధులును, వృద్ధులును ఐన నాతల్లిదండ్రులు ఇద్దఱును మరణింతురు. ఇది తథ్యము. (38-39)

తౌ కథం దుర్బలావంధౌ మత్ప్రతీక్షౌ పిపాసితౌ।
చిరమాశాకృతాం తృష్ణాం కష్టాం సంధారయిష్యతః। 40

న నూనం తపసో వాఽస్తి ఫలయోగః శ్రుతస్య వా।
పితా యన్మాం న జానాతి శయానం పతితం భువి। 41

జానన్నపి చ కిం కుర్యాత్ అశక్తిరపరిక్రమః।
భిద్యమానమివాశక్తః త్రాతుమన్యో నగో నగమ్। 42

పితు స్త్వ మేవ మే గత్వా శీఘ్రమాచక్ష్వ రాఘవ!।
న త్వామనుదహేత్ క్రుద్ధో వనం వహ్నిరివైధితః। 43

ఇయమేకపదీ రాజన్ యతో మే పితురాశ్రమః।
తం ప్రసాదయ గత్వా త్వం న త్వాం స కుపితః శపేత్। 44

విశల్యం కురు మాం రాజన్ మర్మ మే నిశితశ్శరః।
రుణద్ధి మృదు సోత్సేధం తీరమంబురయో యథా। 45

సశల్యః క్లిశ్యతే ప్రాణైః విశల్యో వినశిష్యతి।
ఇతి మామవిశచ్చింతా తస్య శల్యాపకర్షణే। 46

దుఃఖితస్య చ దీనస్య మమ శోకాతురస్య చ।
లక్షయామాస హృదయే చింతాం మునిసుత స్తదా। 47

తామ్యమాన స్స మాం కృచ్ఛ్రాత్ ఉవాచ పరమార్థవత్।
సీదమానో వివృత్తాంగో వేష్టమానో గతః క్షయమ్। 48

సంస్తభ్య శోకం ధైర్యేణ స్థిరచిత్తో భవామ్యహమ్।
బ్రహ్మహత్యాకృతం పాపం హృదయాదపనీయతామ్। 49

న ద్విజాతిరహం రాజన్ మాభూత్ తే మనసో వ్యథా।
శూద్రాయామస్మి వైశ్యేన జాతో జనపదాధిప!। 50

వారు మిక్కిలి శక్తిహీనులు, గ్రుడ్డివారు, దప్పిగొని నాకై నిరీక్షించుచున్నవారు, వారికుమారుడనైన నేను జలమును తీసికొనివచ్చి తమదాహమును తీర్తునని గంపెడాశతో ఎదురు చూచుచున్నారు. వారు తీవ్రమైన తమదాహబాధను ఎట్లు ఓర్చుకొనుచున్నారో గదా! నేను ఈవిధముగా నేలకొరిగిపడియున్నసంగతి మాతండ్రికి తెలియదు. దీనినిబట్టి నేనార్చిన తపస్సునకుగాని, చేసిన వేదశాస్త్రముల అధ్యయనమునకుగాని ఫలితములేదని తెలియుచున్నది.(40-41)

ఒకవేళ నా ఈ విపత్కరపరిస్థితిని ఎఱిగినను అతడు ఏమిచేయగలడు? నఱుకబడుచున్న ఒక చెట్టును మఱియొక చెట్టు కాపాడలేనట్లు, కాలు కదుపలేని ఆ దుర్బలుడు నన్ను ఎట్లు రక్షింపగలడు? (42)

ఓ దశరథ మహారాజా! వెంటనే నీవు మాతండ్రికడకు వెళ్లి, జరిగిన వృత్తాంతమును ఆయనకు దెలుపుము. లేనిచో ఆ మహర్షి క్రుద్ధుడై, చెలరేగిన దావాగ్ని అడవినివలె నిన్ను దహించి వేయును. (43)

ఓ రాజా! ఈదారిలో ఇచటికి సమీపముననే మాతండ్రి ఆశ్రమము గలదు. శీఘ్రముగా అచటికివెళ్లి, ఆయనను ప్రసన్నుని జేసికొనుము. లేనిచో అతడు కుపితుడై నిన్ను శపింపగలడు.(44)

ఓ మహారాజా! ఎత్తైన, మెత్తని నదీతీరమును వేగముగా సాగిపోవుచున్న ప్రవాహము కోసివేయురీతిగా నీవు ప్రయోగించిన ఈ వాడియైన బాణము నాఆయువుపట్టును మిక్కిలి పీడించుచున్నది. కనుక వెంటనే ఈబాణమును నాశరీరమునుండి తీసివేయుము." (45)

"బాణమును తొలగింపనిచో అతని ప్రాణములు విలవిలలాడును, తీసివేసినచో అతడు బ్రతుకజాలడు. బాణమును తొలగించు విషయమున ఈ సందేహము నన్ను వేధించుచున్నది. ఇప్పుడు నేనేమిచేయవలయును?" (46)

ఈ విధముగా దుఃఖించుచు, శోకమగ్నుడనై దైన్యములోనున్న నాహృదయమునందలి చింతను ఆ మునిసుతుడు గ్రహించెను. అప్పుడామునిబాలునిఅవయవములన్నియును శిథిలములగుచుండెను. అతడు మెలికలు తిరిగిపోవుచుండెను, నేలపై అటునిటు పొర్లుచుండెను. క్రమముగా అతనిపరిస్థితి దిగజాఱుచుండెను. అతడు ఆ విధముగా మరణోన్ముఖుడై పరితపించుచు, మిగుల ఆర్తికి లోనైనవానివలె అతికష్టముమీద నాతో ఇట్లనెను. (47-48)

"ఓ మహారాజా! నామాటను ఆలకింపుము. నేను ధైర్యము వహించి, శోకమును నిగ్రహించుకొని, స్థిరచిత్తుడనగుచున్నాను. (పూర్తిగా స్పృహకలిగియున్నాను) నేను బ్రాహ్మణుడనుకాను. వైశ్యునివలన శూద్రస్త్రీయందు జన్మించినవాడను. కనుక బ్రహ్మహత్యాపాపము మీకు అంటదు. ఆ భావమును మీహృదయము నుండి తొలగింపుడు. మనోవ్యథకు ఏమాత్రము గుఱికావలదు." (49-50)

ఇతీవ వదతః కృచ్ఛ్రాత్ బాణాభిహతమర్మణః।
విఘూర్ణతో విచేష్టస్య వేపమానస్య భూతలే। 51

తస్య త్వాతామ్యమానస్య తం బాణమ్ అహముద్ధరమ్।
స మాముద్వీక్ష్య సంత్రస్తో జహౌ ప్రాణాంస్తపోధనః। 52

జలార్ద్రగాత్రం తు విలప్య కృచ్ఛ్రాత్
మర్మవ్రణం సంతతముచ్ఛ్వసంతమ్ ।
తతస్సరయ్వాం తమహం శయానం
సమీక్ష్య భద్రేఽస్మి భృశం విషణ్ణః । 53

ఆయువుపట్టున బాణము గ్రుచ్చుకొనుటవలన అతికష్టము మీద అతడు ఇంతమాత్రము పలుకగలిగెను. అతని కనులు బైర్లుక్రమ్ముచుండెను. భూమిపై అటునిటు దొర్లుచుండెను. అతని అవయవములు ముడుచుకొనిపోవుచుండెను. అట్లు పరితపించిపోవుచున్న అతని శరీరమునుండి నేను బాణమును లాగివేసితిని. అప్పుడా తపోధనుడు నన్ను జూచి భయపడుచు ప్రాణములను విడిచెను. (51-52)

ఓ కౌసల్యా! నీటిలో పడిపోవుటవలన అతని శరీరము పూర్తిగా తడిసియుండెను. ఆయువుపట్టున దెబ్బతగులుటవలన అతడు మిక్కిలి ప్రయాసతో మాటిమాటికి నిట్టూర్చుచు విలపించుచు మృతిచెందెను. అంతట సరయూనదీ తీరమున మృతుడైపడియున్న ఆమునిపుత్త్రుని జూచి, నేను మిక్కిలి విషాదమునకు గురియైతిని. (53)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రిషష్టితమస్సర్గః *(63)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదిమూడవసర్గము సమాప్తము

— * * * —

64. అఱువదినాల్గవసర్గము

మునిబాలకుని చంపిన కారణముగా తనకు ప్రాప్తించిన శాపమునుగూర్చి దశరథుడు కౌసల్యకు తెల్పుట - పిమ్మట పుత్త్రదుఃఖముతో అతడు మరణించుట.

వధమప్రతిరూపం తు మహర్షేస్తస్య రాఘవః।
విలపన్నేవ ధర్మాత్మా కౌసల్యాం పునరబ్రవీత్। 1

తదజ్ఞానాన్మహత్ పాపం కృత్వాఽహం సంకులేంద్రియః।
ఏకస్త్వచింతయం బుద్ధ్యా కథం ను సుకృతం భవేత్। 2

తతస్తం ఘటమాదాయ పూర్ణం పరమవారిణా।
ఆశ్రమం తమహం ప్రాప్య యథాఖ్యాతపథం గతః। 3

తత్రాహం దుర్బలావంధౌ వృద్ధావపరిణాయకౌ।
అపశ్యం తస్య పితరౌ లూనపక్షావివ ద్విజౌ। 4

తన్నిమిత్తాభిరాసీనౌ కథాభిరపరిక్రమౌ।
తామాశాం మత్కృతే హీనావుదాసీనావనాథవత్। 5

శోకోపహతచిత్తశ్చ భయసంత్రస్తచేతనః।
తచ్చాఽఽశ్రమపదం గత్వా భూయః శోకమహం గతః। 6

ధర్మాత్ముడైన ఆదశరథమహారాజు ఆ మునిబాలునియొక్క మిక్కిలి బాధాకరమైన మృతిని జ్ఞప్తికిదెచ్చుకొని, ఎంతయు విలపించుచు మఱల కౌసల్యతోనిట్లనెను. (1)

"ఓ దేవీ! అజ్ఞానవశమున నేను ఇట్టి మహాపాపముచేయుటచే నా ఇంద్రియములన్నియును వ్యాకులపాటునకు లోనయ్యెను. 'మునికుమారుని చంపిన ఈ మహాపాతకమునుండి విముక్తుడనగుట యెట్లు?' అని నేను ఒంటరిగా నాలోనేను ఆలోచింపసాగితిని. (2)

అనంతరము నేను అచటి పాత్రలో నీరు నింపుకొని, దానిని దీసికొని, మునిపుత్త్రుడు తెలిపిన బాటనుబట్టి తిన్నగా ఆ ఆశ్రమమునకు చేరితిని. (3)

ఆ ఆశ్రమమునందు ఆ ఋషికుమారుని తల్లిదండ్రులను జూచితిని. వారు బలహీనులు, వృద్ధులు, అంధులు, వారు ఱెక్కలు తెగిన పక్షులవలె ఎటూకదలలేక ఒకచోట పడియుండిరి. అటునిటు కదలక తమకుమారునిగూర్చియే మాట్లాడుకొనుచు అతనిరాకకై వారు నిరీక్షించుచుండిరి. నాకారణముగా వారి ఆశలు అడియాశలాయెను. అది తెలియక (వారిసుతుడు మరణించినట్లు ఎఱుంగక) అనాథల వలెవారు ఉదాసీనులైయుండిరి. (4-5)

మునికుమారుని చంపినందున మొదట నేను శోకముతో దురపిల్లుచుంటిని. నాఅకృత్యమునకు ఆతలిదండ్రులు ఏమని శపింతురోయని నామనస్సు తీవ్రమైన భయమునకు లోనయ్యెను. ఆశ్రమమున అడుగుపెట్టి వారిని చూచినంతనే నేను ఇంకను శోకగ్రస్తుడనైతిని. (6)

పదశబ్దం తు మే శ్రుత్వా మునిర్వాక్యమభాషత।
కిం చిరాయసి మే పుత్ర! పానీయం క్షిప్రమానయ। 7

యన్నిమిత్తమిదం తాత! సలిలే క్రీడితం త్వయా।
ఉత్కంఠితా తే మాతేయం ప్రవిశ క్షిప్రమాశ్రమమ్। 8

యద్వ్యలీకం కృతం పుత్ర! మాత్రా తే యది వా మయా।
న తన్మనసి కర్తవ్యం త్వయా తాత! తపస్వినా। 9

త్వం గతిస్త్వగతీనాం చ చక్షుస్త్వం హీనచక్షుషామ్।
సమాసక్తాస్త్వయి ప్రాణాః కిం త్వం నో నాభిభాషసే। 10

మునిమవ్యక్తయా వాచా తమహం సజ్జమానయా।
హీనవ్యంజనయా ప్రేక్ష్య భీతభీత ఇవాబ్రువమ్। 11

మనసః కర్మచేష్టాభిః అభిసంస్తభ్య వాగ్బలమ్।
ఆచచక్షే త్వహం తస్మై పుత్రవ్యసనజం భయమ్। 12

క్షత్రియోఽహం దశరథో నాహం పుత్రో మహాత్మనః।
సజ్జనావమతం దుఃఖమ్ ఇదం ప్రాప్తం స్వకర్మజమ్। 13

భగవన్! చాపహస్తోఽహం సరయూతీరమాగతః।
జిఘాంసుః శ్వాపదం కంచిత్ నిపానే చాగతం గజమ్। 14

తతశ్శ్రుతో మయా శబ్దో జలే కుంభస్య పూర్యతః।
ద్విపోఽయ మితి మత్వాఽయం బాణేనాభిహతో మయా। 15

గత్వా నద్యాస్తతస్తీరమ్ అపశ్యమిషుణా హృది।
వినిర్భిన్నం గతప్రాణం శయానం భువి తాపసమ్। 16

భగవన్! శబ్దమాలక్ష్య మయా గజజిఘాంసునా।
విసృష్టోఽంభసి నారాచః తతస్తే నిహతస్సుతః। 17

తతస్తస్యైవ వచనాత్ ఉపేత్య పరితప్యతః।
స మయా సహసా బాణ ఉద్ధృతో మర్మతస్తదా। 18

స చోద్ధృతేన బాణేన తత్రైవ స్వర్గమాస్థితః।
భవంతౌ పితరౌ శోచన్ అంధావితి విలప్య చ। 19

అజ్ఞానాద్భవతః పుత్రః సహసాఽభిహతో మయా।
శేషమేవం గతే యత్ స్యాత్ తత్ప్రసీదతు మే మునిః। 20

స తచ్ఛ్రుత్వా వచః క్రూరం మయోక్తమఘశంసినా।
నాశకత్ తీవ్రమాయాసమ్ అకర్తుం భగవాన్ ఋషిః। 21

నాఅడుగుల చప్పుడు విని, ఆముని ఇట్లు పలికెను. 'నాయనా! కుమారా! ఇంత ఆలస్యముచేసితివేల? త్వరగా నీటిని తెమ్ము, దాహము తీర్చుకొందుము. జలక్రీడలాడుటకై వెళ్ళి, నీవు ఇంత ఆలస్యము చేసినందులకు మీతల్లి నీకై తహతహపాటుతో ఎదురుచూచుచున్నది. మాకడకు త్వరగా రమ్ము, కుమారా! నేనుగాని, మీఅమ్మగాని నీకేమైనను అప్రియమొనర్చితిమా? మావలన ఏకొంచెముగానైనను అపరాధము జరిగినదా? అట్లు జరిగియున్నచో దానిని నీవు మనస్సులో పెట్టుకొనవద్దు. నీవు తపస్విగదా! మా సమస్త ప్రాణములనూ నీపై నిలుపుకొనియుంటిమి. ఇంతకునూ నీవు మాట్లాడవేమి?" (7-10)

ఆ మునిని చూడగనే నాకు మిక్కిలి భయముకలిగెను. నా నాలుక తడబడసాగెను. ఎట్టకేలకు మాటలను దిగమ్రింగుచు అస్పష్టముగా ఆయనతో ఇట్లు పలికితిని. (11)

నామనస్సునందలి భయమును, మాటలతడబాటును బయట పడనీయక నిగ్రహించుకొంటిని. బాధాకరమైన ఆతనికుమారుని మరణవార్తనుగూర్చి తిన్నతిన్నగా చెప్పదొడంగితిని. (12)

"ఓమహాత్మా! నేను మీపుత్రుడనుగాను, క్షత్రియుడను, నాపేరు దశరథుడు. నేను సత్పురుషులు నిందించునటువంటి శోచనీయమైన ఒక దుష్కృత్యమొనర్చితిని. (13)

ఓపూజ్యుడా! నేను ధనుర్బాణములను ధరించి, ఈ సరయూ తీరమునకు వచ్చితిని. నీరుత్రాగుటకై తీరమునకు చేరు ఏనుగును గాని, క్రూరమృగమునుగాని, వేటాడదలచితిని. కొంతతడవునకు నీటిలో కడవను ముంచు (బుడబుడ)శబ్దము నాకు వినబడెను. ఆ శబ్దమునుబట్టి ఒక ఏనుగు నీరు త్రాగుచున్నదని తలంచితిని. వెంటనే దానిపై శబ్దభేది బాణమును ప్రయోగించితిని. (14-15)

పిమ్మట ఆనదీతీరమునకు వెళ్ళి అచట ఒక తాపసిని చూచితిని. అతని వక్షస్స్థలమున బాణము గ్రుచ్చుకొనియుండెను. అతడు కొనఊపిరితో కొట్టుమిట్టాడుచు భూమిపై పడియుండెను. (16)

ఓ మహాత్మా! ఏనుగును చంపదలచిన నేను శబ్దమునుబట్టి బాణమును విడిచితిని. కాని ఆబాణము దెబ్బకు నీకుమారుని ప్రాణములు అస్తుబట్టెను. గాయపడి పరితపించుచున్న నీపుత్రుని సూచనను అనుసరించి, ఆయువుపట్టున గ్రుచ్చుకొనియున్న ఆ బాణమును తొలగించితిని. నేను ఆ శరమును తీసివేయగా 'అయ్యో! అంధులైన నాతలిదండ్రులు ఏమై పోవుదురోగదా!' అని విలపించుచు అతడు అచటనే స్వర్గస్థుడాయెను. (17-19)

నాఅజ్ఞానమువలన నేను మీసుతునిమృతికి కారణమైతిని. అయ్యా! జరిగినదిఇది. ఇక మీదట నన్ను అనుగ్రహించెదరో? శపించెదరో? మీ దయ. (20)

నేనొనర్చిన ఆదుష్కృత్యమునుగూర్చి పశ్చాత్తాపపడుచు పలికిన క్రూరవచనములను ఆ పూజ్యమహర్షి వినెను. అందువలన అతడు నాకు తీవ్రమైన దుఃఖమును కల్గింపకుండా ఉండలేకపోయెను. (అనగా శపించుటకు సంసిద్ధుడాయెను.) (21)

స బాష్పపూర్ణవదనో నిశ్శ్వసన్ శోకకర్శితః।
మామువాచ మహాతేజాః కృతాంజలిముపస్థితమ్। 22

యద్యేతదశుభం కర్మ న త్వం మే కథయేః స్వయమ్।
ఫలేన్మూర్ధా స్మ తే రాజన్! సద్యః శతసహస్రధా। 23

క్షత్రియేణ వధో రాజన్ వానప్రస్థే విశేషతః।
జ్ఞానపూర్వం కృతః స్థానాత్ చ్యావయేదపి వజ్రిణమ్। 24

సప్తధా తు ఫలేన్మూర్ధా మునౌ తపసి తిష్ఠతి।
జ్ఞానాద్విసృజతః శస్త్రం తాదృశే బ్రహ్మవాదిని। 25

అజ్ఞానాద్ధి కృతం యస్మాత్ ఇదం తేనైవ జీవసి।
అపి హ్యద్య కులం న స్యాత్ ఇక్ష్వాకూణాం కుతో భవాన్। 26

నయ నౌ నృప! తం దేశమ్ ఇతి మాం చాభ్యభాషత।
అద్య తం ద్రష్టుమిచ్ఛావః పుత్రం పశ్చిమదర్శనమ్। 27

రుధిరేణావసిక్తాంగం ప్రకీర్ణాజినవాససమ్।
శయానం భువి నిస్సంజ్ఞం ధర్మరాజవశం గతమ్। 28

అథాహమేకస్తం దేశం నీత్వా తౌ భృశదుఃఖితౌ।
అస్పర్శయమహం పుత్రం తం మునిం సహ భార్యయా। 29

తౌ పుత్రమాత్మనః స్పృష్ట్వా తమాసాద్య తపస్వినౌ।
నిపేతతుః శరీరేఽస్య పితా చాస్యేదమబ్రవీత్। 30

నాభివాదయసే మాఽద్య న చ మామభిభాషసే।
కిం ను శేషే తు భూమౌ త్వం వత్స! కిం కుపితో హ్యసి। 31

న త్వహం తే ప్రియః పుత్ర! మాతరం పశ్య ధార్మిక!
కిం ను నాలింగసే పుత్ర! సుకుమార! వచో వద। 32

కస్య వాఽపరరాత్రేఽహం శ్రోష్యామి హృదయంగమమ్।
అధీయానస్య మధురం శాస్త్రం వాఽన్యద్విశేషతః। 33

కో మాం సంధ్యాముపాస్యైవ స్నాత్వా హుతహుతాశనః।
శ్లాఘయిష్యత్యుపాసీనః పుత్రశోకభయార్దితమ్। 34

కందమూలఫలం హృత్వా కో మాం ప్రియమివాతిథిమ్।
భోజయిష్యత్యకర్మణ్యమ్ అప్రగ్రహమనాయకమ్। 35

అప్పుడు నేను దోసిలొగ్గి, ఆయనయెదుట నిలబడితిని. అంతట ఆమహాతేజస్వి మిగులవగచుచు, నిట్టూర్పుచు, కన్నీరుమున్నీరుగా విలపించుచు నాతో ఇట్లనెను. (22)

"ఓ రాజా! నీవు చేసిన ఈ మహాపాపకృత్యమునుగూర్చి స్వయముగా నాకు చెప్పియుండనిచో నీతల వేలకొలది వ్రక్కలై యుండెడిది. ఓ ప్రభూ! క్షత్రియుడు బుద్ధిపూర్వకముగా వానప్రస్థుని చంపియున్నచో అతడు ఇంద్రునియంతటి వాడైనను పదవీభ్రష్టుడు కాకతప్పదు. (23-24)

తపమొనరించుచున్న మునిపైగాని, అట్టి బ్రహ్మచారిపైగాని బుద్ధిపూర్వకముగా బాణముప్రయోగించినచో ఆపాపియొక్క తల ముక్కలు ముక్కలగును. ఈ దుష్కృత్యమును నీవు తెలియక చేసితివి గాన బ్రతికిపోయితివి. అట్లు గాక నీవు దీనిని తెలిసిచేసి యున్నచో నీవేగాదు నీఇక్ష్వాకువంశమే నశించియుండెడిది. (25-26)

"ఓమహారాజా! మా పుత్రుని చూడగోరుచున్నాము. అతడు పడియున్నచోటికి వెంటనే మమ్ములను తీసికొనిపొమ్ము. మాకు చివరిచూపైనను దక్కును. (27)

మిగులదుఃఖించుచున్న ఆ దంపతులను నేనొక్కడనే ఆ సరయూ తీరమునకు తీసికొని వెళ్లితిని. ఆ తీరమున చచ్చి నేలపై పడియున్న మునిబాలునిశరీరాంగములన్నియును రక్తసిక్తములైయుండెను. అతడు ధరించిన మృగచర్మము, వస్త్రములు చెదరియుండెను. ఆబాలునిశరీరమును మునిదంపతులు స్పృశించునట్లు చేసితిని. ఆమునిదంపతులు తమపుత్రునికడకుచేరి, అతనిని స్పృశించుచు దుఃఖమును ఆపుకొనలేక ఆయిరువురును అతని కళేబరముపైబడిరి. పిమ్మట తండ్రి విలపించుచు ఇట్లు పలికెను. (28-30)

"నాయనా! నీవు నాకు నమస్కరించుటలేదేమి? ఇప్పుడు నాతో మాట్లాడవేమి? ఇట్లు నేలపై పండుకొనియుంటివేల? మాపైన నీకేమైన కోపమా? కుమారా! ఓ బుద్ధిమంతుడా! నీకు నాపైన ప్రేమలేనిచో కనీసము నీతల్లినైనను చూడుము. నాయనా! నన్ను కౌగిలించుకొనవేమి ? ఓ. సుకుమారా! ఒక్కసారి మాటాడుము. (31-32)

ఈ ఉషఃకాలమున హృదయంగమముగా, మధురముగా పఠించుచున్న శాస్త్రములనుగాని, విశేషముగా పురాణేతిహాసములను గాని, ఇంక ఎవరినోటవిందును? స్నానసంధ్యాదికములను, అగ్నికార్యమును ముగించుకొని, నా సమీపమునకూర్చుండి, పుత్రశోకమున మునిగియున్న నన్ను ఇంక ఎవరు ఓదార్చగలరు? నేను కర్మానుష్ఠానములను స్వయముగా నిర్వహింపలేనివాడను, నివ్వెరధాన్యమును (అడవి బియ్యమును) సంపాదించి తీసికొని రాలేనివాడను, దిక్కులేనివాడనై పడియున్నవాడను. అట్టినన్ను ప్రియమైన అతిథిగా గౌరవించి, నాకై కందమూలఫలములను దెచ్చి, ఇకమీదట నాకు భోజనము పెట్టువారెవ్వరు? (33-35)

ఇమామంధాం చ వృద్ధాం చ మాతరం తే తపస్వినీమ్।
కథం వత్స! భరిష్యామి కృపణాం పుత్రగర్ధినీమ్। 36

పుత్రా! పంచప్రాణములను నీపైననే పెట్టుకొని, అనుక్షణము నీకై పరితపించుచున్న నీతల్లి ఇదిగో! ఇచటనే యున్నది. ఈమె అంధురాలు, పైగా వృద్ధురాలు, ఇట్టి దీనురాలిని నేనెట్లు భరింపగలను? (36)

తిష్ఠ మాం మాగమః పుత్ర! యమస్య సదనం ప్రతి।
శ్వో మయా సహ గంతాసి జనన్యా చ సమేధితః। 37

ఉభావపి చ శోకార్తా అనాథౌ కృపణౌ వనే।
క్షిప్రమేవ గమిష్యావః త్వయా హీనౌ యమక్షయమ్। 38

కుమారా! ఆగుమాగుము, ఇప్పుడే పరలోకయాత్రకై తొందరపడకుము. రేపు నీవూ, నేనూ, మీతల్లి అందఱమూ కలిసి వెళ్లుదము. నీయెడబాటుకారణముగా మేమిద్దఱము శోకమున మునింగి, దీనులమైయుంటిమి. ఈ వనమున దిక్కులేనివారమైతిమి. కావున ఇప్పుడే మేము ఇరువురము నీతోగూడి యమలోకమునకు చేరెదము. (37-38)

తతో వైవస్వతం దృష్ట్వా తం ప్రవక్ష్యామి భారతీమ్।
క్షమతాం ధర్మరాజో మే బిభృయాత్ పితరావయమ్। 39

అచటికిచేరినపిమ్మట యముని దర్శించి, ఆయనతో ఇట్లు నుడివెదను. 'ఓ యమధర్మరాజా! నాఅపరాధమును క్షమింపుము. నాపుత్రుని విడువుము. తల్లిదండ్రులమైన మమ్ము అతడు పోషింపగలడు. (39)

దాతుమర్హతి ధర్మాత్మా లోకపాలో మహాయశాః।
ఈదృశస్య మమాక్షయ్యామ్ ఏకామభయదక్షిణామ్। 40

ఆయముడు ధర్మాత్ముడు, లోకపాలుడు, మిక్కిలికీర్తికెక్కిన వాడు, ఇట్లు అనాథుడనై పడియున్న నాకు అతడు శాశ్వత అభయదానమును అనుగ్రహింపగలడు. (40)

అపాపోఽసి యదా పుత్ర! నిహతః పాపకర్మణా।
తేన సత్యేన గచ్ఛాఽఽశు యే లోకాః శస్త్రయోధినామ్। 41

యాంతి శూరా గతిం యాం చ సంగ్రామేష్వనివర్తినః।
హతాస్త్వభిముఖాః పుత్ర! గతిం తాం పరమాం వ్రజ। 42

ఓ కుమారా! నీవు ఏపాపమూ ఎఱుగనివాడవు. పాపాత్ముడైన దశరథునిచేతిలో హతుడవైతివి. అందువలన శస్త్రయోధులు (మృతులైన పిమ్మట) చేరెడి ఉత్తమలోకములు నీకును ప్రాప్తించును. ప్రమాణముచేసి చెప్పుచున్నాను. నేను పలికిన ఈమాట ముమ్మాటికిని సత్యము. నాయనా! రణరంగమున వెన్నుచూపక, శత్రువును ఎదిరించి, అసువులుబాసిన శూరులుచేరెడి పుణ్యలోకములను నీవును పొందుదువు.[1] (41-42)

యాం గతిం సగరః శైబ్యో దిలీపో జనమేజయః।
నహుషో ధుంధుమారశ్చ ప్రాప్తాస్తాం గచ్ఛ పుత్రక। 43

ఓపుత్రా! సగరమహారాజు, శిబిచక్రవర్తి, దిలీపప్రభువు, జనమేజయభూపతి, నహుషమహీపాలుడు, ధుంధుమారుడు[2] మొదలగు సత్పురుషులు పొందినలోకములకు నీవునుచేరుదువు. (43)

యా గతిః సర్వసాధూనాం స్వాధ్యాయాత్ తపసా చ యా।
యా భూమిదస్యాహితాగ్నేః ఏకపత్నీవ్రతస్య చ। 44

గోసహస్రప్రదాతౄణాం యా యా గురుభృతామపి।
దేహన్యాసకృతాం యా చ తాం గతిం గచ్ఛ పుత్రక। 45

ఓతనయా! వేదశాస్త్రములను అధ్యయనముచేసిన సత్పురుషులకును తపోధనులైన సాధుజనులకును, భూదానముచేసిన మహాపురుషులకును, నిత్యము హోమకార్యములను నిర్వహించెడి నిష్ఠాపరులకును, ఏకపత్నీవ్రతులకును, వేలకొలదిగా గోదానములనొనర్చిన మహాదాతలకును, గురువులకు శుశ్రూషలుచేసినవారికిని, గంగాయమునాది పవిత్రనదీసంగమతీర్థములలో సంకల్పపూర్వకముగా దేహత్యాగము చేసిన సిద్ధపురుషులకును లభించు పుణ్యలోకములు నీకును ప్రాప్తించును. (44-45)

1) శ్లో॥ ద్వావిమౌ పురుషౌ లోకే సూర్యమండలభేదినౌ। పరివ్రాడ్యోగయుక్తశ్చ రణేచాభిముఖో హతః॥
ఈలోకమున యోగాభ్యాసనిరతుడైన యతీశ్వరుడును (తపస్వియు) రణరంగమున శత్రువును ఎదిరించి, బాణములచే నిహతుడైన వీరుడును ఈ ఇద్దరు పురుషులు సూర్యమండలముద్వారా పుణ్యలోకములకుచేరుదురు. గోవిందరాజీయ వ్యాఖ్య.

2) ధుంధుమారుడు. ఇతడు బృహదశ్వునికుమారుడు. సహజముగా ఇతనిపేరు కువలాశ్వుడు. ఉత్తంకునితపస్సునకు భంగము కలిగించుచున్న 'ధుంధువు' అను రాక్షసుని చంపుటచే ఇతనికి ధుంధుమారుడు అనుపేరు వచ్చెను.

నహిత్వస్మిన్ కులే జాతో గచ్ఛత్యకుశలాం గతిమ్।
స తు యాస్యతి యేన త్వం నిహతో మమ బాంధవః। 46

ఏవం స కృపణం తత్ర పర్యదేవయతాసకృత్।
తతోఽస్మై కర్తుముదకం ప్రవృత్తః సహ భార్యయా। 47

స తు దివ్యేన రూపేణ మునిపుత్రః స్వకర్మభిః।
స్వర్గమధ్యారుహత్ క్షిప్రం శక్రేణ సహ ధర్మవిత్। 48

ఆబభాషే చ తౌ వృద్ధౌ సహ శక్రేణ తాపసః।
ఆశ్వాస్య చ ముహూర్తం తు పితరౌ వాక్యమబ్రవీత్। 49

స్థానమస్మి మహత్ ప్రాప్తో భవతోః పరిచారణాత్।
భవంతావపి చ క్షిప్రం మమ మూలముపైష్యతః। 50

ఏవముక్త్వా తు దివ్యేన విమానేన వపుష్మతా।
ఆరురోహ దివం క్షిప్రం మునిపుత్రో జితేంద్రియః। 51

స కృత్వాథోదకం తూర్ణం తాపసః సహ భార్యయా।
మామువాచ మహాతేజాః కృతాంజలిముపస్థితమ్। 52

అద్యైవ జహి మాం రాజన్ మరణే నాస్తి మే వ్యథా।
యచ్ఛరేణైకపుత్రం మాం త్వమకార్షీరపుత్రకమ్। 53

త్వయా తు యదవిజ్ఞానాత్ నిహతో మే సుతః శుచిః।
తేన త్వామభిశప్స్యామి సుదుఃఖమతిదారుణమ్। 54

పుత్రవ్యసనజం దుఃఖం యదేతన్మమ సాంప్రతమ్।
ఏవం త్వం పుత్రశోకేన రాజన్ కాలం కరిష్యసి। 55

అజ్ఞానాత్తు హతో యస్మాత్ క్షత్రియేణ త్వయా మునిః।
తస్మాత్ త్వాం నావిశత్యాశు బ్రహ్మహత్యా నరాధిప! 56

త్వామప్యేతాదృశో భావః క్షిప్రమేవ గమిష్యతి।
జీవితాంతకరో ఘోరో దాతారమివ దక్షిణా। 57

ఏవం శాపం మయి న్యస్య విలప్య కరుణం బహు।
చితామారోప్య దేహం తన్మిథునం స్వర్గమభ్యయాత్। 58

తపోనిష్ఠగలవారు జన్మించిన మనవంశమున పుట్టినవాడు ఎట్టి పరిస్థితులలోను అశుభస్థితికిగురికాడు. అనగా సద్గతినేపొందును. కాని ఋషి (నా) పుత్రుడనైన నిన్నువంపినవాడే దుర్గతిపాలగును." ఇట్లు ఆబాలునితండ్రి పుత్రశోకముతో కన్నీరుమున్నీరుగా విలపించెను. అనంతరము అతడు భార్యతోగూడి మృతుడైన తన పుత్రునకు సద్గతులుగలుగుటకై జలాంజలులను సమర్పించెను. (46-47)

ధర్మాత్ముడైన ఆ మృతబాలుడు (తానుజీవించియున్నంత వఱకును) పుణ్యకార్యములప్రభావమున దివ్యస్వరూపమును ధరించి, ఇంద్రునితోగూడి వెంటనే స్వర్గమునకు చేరెను. (మునిబాలునిగొని పోవుటకై ఇంద్రుడు స్వయముగావచ్చెనని గ్రహింపవలెను.) (48)

ఇంద్రునితోగూడిన ఆ మునిపుత్రుడు వృద్ధులైన తన తల్లిదండ్రులను క్షణకాలముపాటు ఓదార్చి, పిమ్మట వారితో ఇట్లు పలికెను. (49)

"భక్తిశ్రద్ధలతో మీకు పరిచర్యలుచేయుటవలన నాకు దివ్య స్థానములభించినది. మీఱిద్దఱును వెంటనే నాసమీపమునకు చేరుదురు." (50)

జితేంద్రియుడైన ఆమునిపుత్రుడు ఈవిధముగా పలికి, ప్రశస్తమైన (చక్కని) ఆకారముగల దివ్యవిమానముద్వారా శీఘ్రముగా స్వర్గమును చేరెను. (51)

పిమ్మట మహాతేజశ్శాలియైన ఆముని భార్యతోగూడి వెంటనే కుమారునకు జలతర్పణములను గావించెను. అంతట ఆయన సమీపముననే అంజలి ఘటించి, యున్న నాతో అతడిట్లనెను. (52)

ఓరాజా! నాఒక్కగానొక్కకొడుకును నీబాణముతో చంపి, నన్ను సంతానహీనునిగావించితివి. ఇంక ఆలస్యమెందులకు? నేడే ఆబాణముతోనే నన్నును హతమార్చుము. ఇప్పుడు నాకు చావంటే బాధలేదు. (53)

అజ్ఞానవశముననేయైనను నీవు నిరపరాధియైన నాకుమారుని చంపితివి. కావున నీకు మిక్కిలి దుఃఖముకలుగునట్లు దారుణమైన శాపమునిత్తును. ఇప్పుడు నన్ను అంతులేని పుత్రదుఃఖమునకు గురిచేసితివి. రాజా! ఇట్లే నీవును పుత్రశోకమునకులోనై మరణింతువు. (54-55)

ఓమహారాజా! క్షత్రియుడవైన నీవు అజ్ఞానకారణముగా వైశ్య వంశమునకుచెందిన మునిబాలకుని చంపితివి. అందువలన నిన్ను బ్రహ్మహత్యాపాతకము అంటదు. ఐనప్పటికిని ప్రాణాంతకమైన భయంకరమగు ఇట్టి పుత్రశోకరూపదుఃస్థితి సత్పాత్రునకు దానము చేసినవానికి ఆ దక్షిణాఫలమువలె, నీకు వెంటనే (ఈజన్మయందే) కలుగును." (56-57)

ఈవిధముగా అతడు నన్ను శాపమునకు గురిచేసినపిమ్మట, ఆదంపతులు కడుదీనముగా మిగులవిలపించిరి. కొంతతడవునకు వారు దేహములను చితాగ్నికి ఆహుతియొనర్చి, స్వర్గస్థులైరి. (58)

తదేతచ్చింతయానేన స్మృతం పాపం మయా స్వయమ్।
తదా బాల్యాత్ కృతం దేవి! శబ్దవేధ్యనుకర్షిణా। 59

తస్యాయం కర్మణో దేవి! విపాకః సముపస్థితః।
అపథ్యైః సహ సంభుక్తే వ్యాధిరన్నరసే యథా। 60

తస్మాన్మామాగతం భద్రే! తస్యోదారస్య తద్వచః।
యదహం పుత్రశోకేన సంత్యక్ష్యామ్యద్య జీవితమ్। 61

చక్షుర్భ్యాం త్వాం న పశ్యామి కౌసల్యే! సాధు మాం స్పృశ।
ఇత్యుక్త్వా స రుదంస్త్రస్తో భార్యామాహ చ భూమిపః। 62

ఏతన్మే సదృశం దేవి! యన్మయా రాఘవే కృతమ్।
సదృశం తత్తు తస్యైవ యదనేన కృతం మయి। 63

దుర్వృత్తమపి కః పుత్రం త్యజేద్భువి విచక్షణః।
కశ్చ ప్రవ్రాజ్యమానో వా నాసూయేత్ పితరం సుతః। 64

యది మాం సంస్పృశేద్రామః సకృదద్య లభేత వా।
యమక్షయమనుప్రాప్తా ద్రక్ష్యంతి నహి మానవాః। 65

చక్షుషా త్వాం న పశ్యామి స్మృతిర్మమ విలుప్యతే।
దూతా వైవస్వతస్యైతే కౌసల్యే! త్వరయంతి మామ్। 66

అతస్తు కిం దుఃఖతరం యదహం జీవితక్షయే।
న హి పశ్యామి ధర్మజ్ఞం రామం సత్యపరాక్రమమ్। 67

తస్యాదర్శనజః శోకః సుతస్యాప్రతికర్మణః।
ఉచ్ఛోషయతి మే ప్రాణాన్ వారి స్తోకమివాతపః। 68

న తే మనుష్యా దేవాస్తే యే చారుశుభకుండలమ్।
ముఖం ద్రక్ష్యంతి రామస్య వర్షే పంచదశే పునః। 69

ఓదేవీ! నాచిఱువయస్సున అజ్ఞానమువలన స్వయముగా శబ్దవేధిబాణమును ప్రయోగించి, మునిబాలుని చంపిన దుష్కార్యము నేడు పుత్రునియెడబాటుదుఃఖమునకులోనైన ఈసమయమున నాకు జ్ఞప్తికివచ్చినది. ఓకౌసల్యా! అనారోగ్యకరములైన పదార్థములతో అన్నమునుతిన్నవానిని కాలాంతరమున రోగము పీడించునట్లు నేను ఆనాడుచేసిన దుష్కర్మఫలము నన్ను ఈనాడు వేధించు చున్నది. నాడు ఆమహాత్ముడు నాకిచ్చినశాపఫలితమును నేడు అనుభవించుచున్నాను. అందువలన పుత్రశోకముతో నేడు నాజీవితమును చాలింతును. (59-61)

ఓకౌసల్యా! నాదృష్టిమందగించినది. నిన్ను స్పష్టముగా చూడలేకున్నాను. నన్ను ఒకసారి స్పృశింపుము." అనిపలికి, ఆరాజు భయపడినవాడై ఏడ్చుచు ఆమెతో మరల ఇట్లనెను. (62)

"ఓదేవీ! శ్రీరామునకు పట్టాభిషేకమొనర్చి, రాజ్యాధికారమును అప్పగింపవలసిన యదనున అట్లుచేయకపోగా మిదుమిక్కిలి నిష్కారణముగా ఆరాముని నేను అడవులపాలుచేయుటయనునది నిజముగా నాకు తగనిపని. ధర్మాత్ముడైన శ్రీరాముడు పితృ వాక్యమును శిరసావహించి, మాఱుపలుకక తదనుగుణముగా నడుచుకొనుట అతనికే తగును. (63)

కొడుకు ఎంతటి దుర్మార్గుడైనను తెలివిగలయేతండ్రి అతనిని పరిత్యజించును? (కుమారుడు ధర్మాత్ముడైనను అతనినిదూరము చేసికొనిన మూర్ఖుడైన తండ్రినినేనొక్కడనే) ఇంటినుండి వెడల గొట్టబడిన యేసుతుడు తనతండ్రిని ద్వేషింపకుండును? (తనను అడవులపాలుచేసినను తండ్రిని పల్లెత్తుమాట అనని మహాత్ముడు శ్రీరాముడు ఒక్కడే) (64)

నేను మరణించులోపల నారాముడు ఒక్కసారి నన్నుస్పృశించుట గాని కనీసము కనబడుటగాని జరిగిన ఎంతబాగుండును? లోకములో మరణించినవారు ఎవ్వరును తిరిగి తమఆత్మీయులను చూడలేరుగదా! (65)

ఓ కౌసల్యా! నాచూపు నన్నుగిల్లినది, నిన్ను స్పష్టముగా చూడ లేకున్నాను. నాజ్ఞాపకశక్తి నశించుచున్నది. ఇదిగో! ఈయమదూతలు నన్నుతొందరపెట్టుచున్నారు. నా ప్రాణములు పోవులోపల, ధర్మజ్ఞుడు, సత్యపరాక్రముడు ఐన శ్రీరాముని చూచెడి అదృష్టము నాకులేదుగదా! ఇక ఇంతకంటెను తీరని దుఃఖము ఏముండును? (66-67)

తీవ్రమైనయెండ స్వల్పమైన నీటిని హరించివేయునట్లు నామాటను జవదాటని శ్రీరామునియెడబాటుదుఃఖము నాప్రాణములను తోడివేయుచున్నది. (68)

పదునాలుగుసంవత్సరములవనవాసదీక్షను ముగించుకొని, పదునైదవసంవత్సరమున శ్రీరాముడు తిరిగివచ్చినప్పుడు చక్కని కుండలములతో శోభిల్లెడి అతనిసుందరముఖమును చూడగల్గెడి

పద్మపత్రేక్షణం సుభ్రు! సుదంష్ట్రం చారునాసికమ్।
ధన్యా ద్రక్ష్యంతి రామస్య తారాధిపనిభం ముఖమ్। 70

సదృశం శారదస్యేందోః ఫుల్లస్య కమలస్య చ।
సుగంధి మమ నాథస్య ధన్యా ద్రక్ష్యంతి తన్ముఖమ్। 71

నివృత్త వనవాసం తమ్ అయోధ్యాం పునరాగతమ్।
ద్రక్ష్యంతి సుఖినో రామం శుక్రం మార్గగతం యథా। 72

కౌసల్యే! చిత్తమోహేన హృదయం సీదతీవ మే।
వేదయే న చ సంయుక్తాన్ శబ్దస్పర్శరసానహమ్। 73

చిత్తనాశాద్విపద్యంతే సర్వాణ్యేవేంద్రియాణి మే।
క్షీణస్నేహస్య దీపస్య సంసక్తా రశ్మయో యథా। 74

అయమాత్మభవశ్శోకో మామనాథమచేతనమ్।
సంసాదయతి వేగేన యథా కూలం నదీరయః। 75

హా రాఘవ! మహాబాహో! హా మమాయాసనాశన!।
హా పితృప్రియ! మే నాథ! హాఽద్య క్వాసి గతస్సుత!। 76

హా కౌసల్యే! నశిష్యామి హా సుమిత్రే! తపస్విని!।
హా నృశంసే! మమామిత్రే! కైకేయి! కులపాంసని!। 77

ఇతి రామస్య మాతుశ్చ సుమిత్రాయాశ్చ సన్నిధౌ।
రాజా దశరథశ్శోచన్ జీవితాంతముపాగతమ్। 78

యదా తు దీనం కథయన్ నరాధిపః
ప్రియస్య పుత్త్రస్య వివాసనాతురః ।
గతేఽర్ధరాత్రే భృశదుఃఖపీడితః
తదా జహౌ ప్రాణముదారదర్శనః । 79

వారు మానవమాత్రులుగారు. వారు నిజముగా దేవతలే. తామర రేకులవంటి కనులతో, చక్కని కనుబొమలతో అందమైన పలువరుసతో, మూడముచ్చటగొల్పునాసికతో విలసిల్లెడి శ్రీరామునిముఖము నిండుచంద్రునివలె ఆహ్లాదకరమైనది. అట్టి రఘువరునిమోమును దర్శించెడివారు ఎంతయు ధన్యాత్ములు. (69-70)

నాచిన్నారిరామునివదనము శరత్కాలమునందలి చంద్రునివలె మనోజ్ఞమైనది. బాగుగా వికసించిన కమలమువలెంగి సువాసనలను వెదజల్లునది. అట్టి ముఖమును చూడగల్గువారు నిజముగా కృతార్థులు. (71)

వనవాసానంతరము అయోధ్యకు వచ్చేసిన శ్రీరాముడు మార్గానంతరము శుక్రునివలె తేజరిల్లుచుండగా ఆయనను దర్శించెడివారిభాగ్యమేభాగ్యము. యథార్థముగా వారి ఆనందమే ఆనందము. (72)

ఓకౌసల్యా! తీరనిపుత్త్రదుఃఖముచే నామనస్సు వికలమైనది. నాహృదయము శిథిలముగుచున్నట్లున్నది. జ్ఞానేంద్రియములతో[1] గూడియున్నను శబ్దస్పర్శరూప రసగంధముల అనుభవము నాకు కల్గుటలేదు. (73)

నూనె ఐపోవుటవలన దీపకాంతులు అరిపోయినట్లు, నాచిత్తము దెబ్బతినుటవలన ఇంద్రియములన్నియును పనిచేయుటలేదు. (74)

వేగముగా సాగిపోవు నదీప్రవాహము దరులనుకోసివేయునట్లు నాలో కట్టలుతెంచుకొనివచ్చుచున్న పుత్త్రశోకము నన్ను దిక్కులేనివానినిగా, నిశ్చేష్టునిగా చేయుచున్నది. (75)

అయ్యో! కుమారా! రాఘవా! మహాబాహూ! నాకష్టములను తొలగించువాడా! తండ్రికిఅండయైనవాడా! నాగారాలతండ్రీ! నన్ను ఇచట దిక్కులేనివానినిజేసి ఎక్కడికివెళ్లితివి? (76)

అయ్యో! దీనురాలవైన ఓ కౌసల్యా! ఓ సుమిత్రా! అయ్యో! క్రూరురాలవూ, నాపాలిటిశత్రువువూ, వంశనాశకురాలవూఐన ఓకైకేయీ! నేను ఈ లోకమును విడివెళ్లుచున్నాను. (77)

దశరథమహారాజు కౌసల్యాసుమిత్రల సన్నిధియందు ఇట్లు శోకించుచు తనువును చాలించెను. (78)

ప్రియపుత్త్రునివనవాసకారణముగా శోకమున మునింగిన దశరథుడు ఈవిధముగా దీనాలాపములను పలుకుచు అర్ధరాత్రి దాటిన పిమ్మట మిగుల దుఃఖపీడితుడై ప్రాణములనువీడెను. (79)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుష్షష్టితమస్సర్గః (64)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదినాల్గవసర్గము సమాప్తము

-- * * * --

1) కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము అనునవి జ్ఞానేంద్రియములు. కన్నురూపమును, ముక్కు వాసనను, చెవిశబ్దమును, నాలుకరుచిని, చర్మము స్పర్శను తెలిసికొనును. ఇప్పుడు ఆ జ్ఞానేంద్రియములు తమపనులను చేయలేకున్నవి.

65. అఱువదిఐదవసర్గము

దశరథమహారాజుమృతికి విలవిలలాడుచు కౌసల్య మొదలగు అంతఃపురస్త్రీలు అందఱును ఏడ్చుట.

అథ రాత్ర్యాం వ్యతీతాయాం ప్రాతరేవాపరేఽహని।
వందినః పర్యుపాతిష్ఠన్ తత్పార్థివనివేశనమ్। 1

సూతాః పరమసంస్కారా మంగళాశ్చోత్తమశ్రుతాః।
గాయకాః స్తుతిశీలాశ్చ నిగదంతః పృథక్ పృథక్। 2

రాజానం స్తువతాం తేషామ్ ఉదాత్తాభిహితాశిషామ్।
ప్రాసాదాభోగవిస్తీర్ణః స్తుతిశబ్దో హ్యవర్తత। 3

తతస్తు స్తువతాం తేషాం సూతానాం పాణివాదకాః।
అపదానాన్యుదాహృత్య పాణివాదాన్ అవాదయన్। 4

తేన శబ్దేన విహగాః ప్రతిబుద్ధా విసస్వనుః।
శాఖాస్థాః పంజరస్థాశ్చ యే రాజకులగోచరాః। 5

వ్యాహృతాః పుణ్యశబ్దాశ్చ వీణానాం చాపి నిస్వనాః।
ఆశీర్గేయం చ గాథానాం పూరయామాస వేశ్మ తత్। 6

తతశ్శుచిసమాచారాః పర్యుపస్థానకోవిదాః।
స్త్రీవర్షవరభూయిష్ఠా ఉపతస్థుర్యథా పురమ్। 7

హరిచందనసంపృక్తమ్ ఉదకం కాంచనైర్ఘటైః।
ఆనిన్యుః స్నానశిక్షాజ్ఞా యథాకాలం యథావిధి। 8

మంగళాలంభనీయాని ప్రాశనీయాన్యుపస్కరాన్।
ఉపానిన్యుస్తథాప్యన్యాః కుమారీబహులాః స్త్రియః। 9

సర్వలక్షణసంపన్నం సర్వం విధివదర్చితమ్।
సర్వం సుగుణలక్ష్మీవత్ తద్బభూవాభిహారికమ్। 10

రాత్రిగడచినపిమ్మట మఱునాటి ప్రాతఃకాలమున, మహారాజును, ఆయనవంశమును స్తుతించు వందిమాగధులును, వ్యాకరణ శాస్త్రసంస్కారముగల సూతులును, సంగీతకుశలురైన గాయకులును తమతమరీతులను అనుసరించి వేర్వేఱుగా మహారాజును స్తుతించుటకై ఆయనమందిరమునకు చేరిరి. (1-2)

ఉచ్చైస్స్వరముతో ఆశీర్వాదములను పలుకుచు రాజును స్తుతించుచున్నట్టి వందిమాగధులు మొదలగువారి శబ్దములు రాజప్రాసాదముల యందు అంతటను ప్రతిధ్వనించెను. (3)

సూతులు మొదలగువారు తమస్తుతిపాఠములను గానము చేయుచుండగా ఇంతలో అచటికి పాణివాదకులు (చేతులతో తాళమువేయువారు) వచ్చేసిరి. వారు మహారాజు నెఱపిన ఘనకార్యములను గూర్చి లయాన్వితముగా కీర్తించిరి. (4)

ప్రాసాదములఆవరణములయందలి పక్షులును, భవనముల యందలి పంజరములలోగల పెంపుడుపక్షులును స్తుతిపాఠకుల శబ్దములకు మేల్కొని, కూయసాగెను. (5)

బ్రాహ్మణులవేదపఠనములతోగూడిన స్వస్తివాచనములును, శ్రావ్యమైన వీణానాదములును, దశరథునియొక్క ఉదాత్తగాథలకు సంబంధించిన గేయములును, ఆశీర్వచనములును ఆమందిరమున నిండిపోయెను. (6)

సంప్రదాయపద్ధతులను ఎఱిగిన నపుంసకులు, సమయాను కూలముగా వివిధసేవలొనర్చుటలో ఆరితేఱినస్త్రీలు, కంచుకులు పెద్దసంఖ్యలో ఎప్పటివలె అచటికిచేరిరి. (7)

రాజునకు, రాణులుమున్నగువారికి స్నానవిధులను నడిపించుటలో అనుభవజ్ఞులైనవారు కాలోచితముగా, యథావిధిగా, సుగంధ జలములతో (పన్నీటితో) నిండిన బంగారుకలశములను దీసికొని అచటికివచ్చిరి. (8)

పెక్కుమందికన్యకలతోగూడిన ఇతరస్త్రీలు తలంటుస్నానములకు ఉపయుక్తములగు మంగళకరములైన నూనెలు, నలుగుపిండ్లు మొదలగుద్రవ్యములను, శుభస్పర్శకై గోవులు మున్నగువానిని, త్రాగుటకై గంగాజలములను, నారికేళ, జీరకాదిద్రవ్యములను, అలంకారములకై అద్దములు, వస్త్రములు, ఆభరణములు, పూవులు మొదలగువానిని తీసికొనివచ్చిరి. (9)

దశరథునిమందిరమునకు తీసికొనిరాబడిన ఆభిహారికములు (ప్రాతఃకాలమున రాజులకొఱకై తీసికొనిరాబడు మంగళద్రవ్యములు) సర్వశుభలక్షణములుగలిగియున్నవి. ఆయా విధులకు అనుకూలమైనవి ప్రశంసార్హములు, ఉత్తమగుణములతో విలసిల్లుచున్నవి. (1[illegible]

తత్తు సూర్యోదయం యావత్ సర్వం పరిసముత్సుకమ్।
తస్థావనుపసంప్రాప్తం కింస్విదిత్యుపశంకితమ్। 11

అథ యాః కోసలేంద్రస్య శయనం ప్రత్యనంతరాః।
తాః స్త్రియస్తు సమాగమ్య భర్తారం ప్రత్యబోధయన్। 12

తథాప్యుచితవృత్తాస్తా వినయేన నయేన చ।
నహ్యస్య శయనం స్పృష్ట్వా కించిదప్యుపలేభిరే। 13

తాః స్త్రియస్స్వప్నశీలజ్ఞాః చేష్టాసంచలనాదిషు।
తా వేపథుపరీతాశ్చ రాజ్ఞః ప్రాణేషు శంకితాః।
ప్రతిస్రోతఃతృణాగ్రాణాం సదృశం సంచకాశిరే। 14

అథ సంవేపమానానాం స్త్రీణాం దృష్ట్వా చ పార్థివమ్।
యత్తదాశంకితం పాపం తస్య జజ్ఞే వినిశ్చయః। 15

కౌసల్యా చ సుమిత్రా చ పుత్రశోకపరాజితే।
ప్రసుప్తే న ప్రబుద్ధ్యేతే యథా కాలసమన్వితే। 16

నిష్ప్రభా చ వివర్ణా చ సన్నా శోకేన సన్నతా।
న వ్యరాజత కౌసల్యా తారేవ తిమిరావృతా। 17

కౌసల్యాఽనంతరం రాజ్ఞః సుమిత్రా తదనంతరమ్।
న స్మ విభ్రాజితే దేవీ శోకాశ్రులులితాననా। 18

తే చ దృష్ట్వా తథా సుప్తే ఉభే దేవ్యౌ చ తం నృపమ్।
సుప్తమేవోద్గతప్రాణమ్ అంతఃపురమదృశ్యత। 19

తతః ప్రచుక్రుశుర్దీనాః సస్వరం తా వరాంగనాః।
కరేణవ ఇవారణ్యే స్థానప్రచ్యుతయూథపాః। 20

తాసామ్ ఆక్రందశబ్దేన సహసోద్గతచేతనే।
కౌసల్యా చ సుమిత్రా చ త్యక్తనిద్రే బభూవతుః। 21

సూర్యోదయమగుచున్నప్పటికే పరిజనులందఱును మహారాజు సేవలకై మిగుల ఉత్సాహముతో సర్వసన్నద్ధులై అచటికి చేరిరి. కాని అంతఃపురమున దశరథుడు శయ్యామందిరమునుండి బయటికి రాకుండుటచే 'రాజుగారు ఇప్పటివఱకును బయటికి రాకపోవుటకు కారణమేమైయుండును? అని శంకించుచు వారు అచటనే నిలిచిరి. (11)

దశరథమహారాజునకు సన్నిహితులైన ఆస్త్రీలందఱును ఆయన కడకేగి, ఆప్రభువును మేల్కొల్పుటకై వినయముగా సముచితముగా మృదువచనములను పలికిరి. (12)

ఆస్త్రీలు సముచితముగా ప్రవర్తించుచు, వినయముతో, నేర్పుతో తల్పమును కదుపుచు ఆప్రభువును మేల్కొల్పుటకు ఎంతగానో ప్రయత్నించిరి. ఐనప్పటికిని ఆరాజు నిద్రనుండి లేవకుండుటచే అందులకుగల కారణము వారికి బోధపడకుండెను. వారు నిద్రించుచున్న వ్యక్తులపరిస్థితులను బాగుగా ఎఱిగినవారు. అప్పుడు వారు రాజుగారిహృదయస్పందనను, నాడిని పరీక్షించి చూచిరి. ఆయనకాలుసేతులు కదలకుండుటను, శ్వాసక్రియజరుగకుండుటను గమనించి, వారు చలించిపోయిరి. రాజుగారిప్రాణములు పోయినవేమో? అనివారికి శంకగలిగెను. ప్రవాహమునకు ఎదురుగానున్న గడ్డిపరకల కొనలవలె వారు కంపించిరి. (13-14)

మహారాజుగారినిశ్చేష్టస్థితికి సందేహముతో వణికిపోవుచున్న ఆస్త్రీలు ఆయనను పరికించి చూచినపిమ్మట వారిసందేహము తొలగిపోయెను. 'రాజుగారు మరణించినట్లే' అను నిశ్చయమునకు వచ్చిరి. (15)

పుత్త్రులయెడబాటుశోకమున మునిఁగిన కౌసల్యాసుమిత్రలు ఆసమయమున మృతిచెందినవారివలె గాఢనిద్రలో పడియుండుట వలన మేల్కొనలేదు. (16)

నిద్రించుచున్న ఆకౌసల్యాదేవి కాంతిహీనయై పూర్వశోభను కోల్పోయియుండెను. శోకముచే కృశించి, క్రుంగిపోయియుండెను. ఆమె చీకట్లు కప్పబడినతారవలె కళదప్పియుండెను. (17)

దశరథమహారాజుప్రక్కన కౌసల్యాదేవియు, ఆమెసమీపమున సుమిత్రాదేవియుఉండిరి. ఆరాణులు ఇరువురును నిద్రలోమునిగి శోభావిహీనలైయుండిరి. వారిముఖములపై శోకాశ్రువులు చారికలు కట్టియుండెను. (18)

నిద్రించుచున్న రాణులిద్దఱినీ, రాజునూ చూచి, ఆ అంతఃపుర స్త్రీలు రాజు నిద్రలోనే మరణించియుండునని తలంచిరి. (19)

అరణ్యములో తమకునాయకుడైన గజరాజు తమనివాస స్థానమునకు దూరమైనప్పుడు ఆక్రందించుచున్న ఆడుఏనుగుల వలె ఆ అంతఃపురస్త్రీలు ఎలుగెత్తి దీనముగా ఏడువసాగిరి. ఆస్త్రీల యొక్క రోదనధ్వనులకు నిద్రాభంగముకాగా కౌసల్యాసుమిత్రలు తటాలున మేల్కొనిరి. (20-21)

కౌసల్యా చ సుమిత్రా చ దృష్ట్వా స్పృష్ట్వా చ పార్థివమ్।
హా నాథేతి పరిక్రుశ్య పేతతుర్ధరణీతలే। 22

అంతట కౌసల్యయు, సుమిత్రయు రాజునుజూచి, ఆయనను స్పృశించి, 'అయ్యో! జీవితేశ్వరా!' అనియేడ్చుచు వారు నేలపై పడిపోయిరి. (22)

సా కోసలేంద్రదుహితా వేష్టమానా మహీతలే।
న బభ్రాజ రజోధ్వస్తా తారేవ గగనాచ్చ్యుతా। 23

దుఃఖాతిరేకముచే కౌసల్యాదేవి నేలపై అటునిటుపొరలసాగెను. దుమ్ముకొట్టుకొనియున్న ఆమెశరీరము ఆకాశమునుండి రాలిపడిన తారవలె వన్నెకోల్పోయియుండెను. (23)

నృపే శాంతగుణే జాతే కౌసల్యాం పతితాం భువి।
అపశ్యం స్తాః స్త్రియస్సర్వా హతాం నాగవధూమివ। 24

రాజుయొక్క శరీరము చల్లబడగా అనగా రాజుమరణింపగా, దెబ్బతినిన ఆడుసర్పమువలె నేలపైబడియున్న కౌసల్యాదేవిని ఆ అంతఃపురస్త్రీలు చూచిరి. (24)

తతస్సర్వా నరేంద్రస్య కైకేయీప్రముఖాః స్త్రియః।
రుదంత్యః శోకసంతప్తా నిపేతుర్గతచేతనాః। 25

తరువాత అచటికిచేరిన కైకేయి మొదలగు దశరథమహారాజ పత్నులు అందఱును శోకసంతాపములకులోనై, ఏడ్చుచు అచేతనలై పడిపోయిరి. (25)

తాభి స్స బలవాన్ నాదః క్రోశంతీభిరనుద్రుతః।
యేన స్థిరీకృతం భూయః తద్గృహం సమనాదయత్। 26

కౌసల్యమొదలగురాణుల ఆక్రందనధ్వనులకు కైకేయీప్రభృతుల ఏడుపులు పెడబొబ్బలు తోడుకాగా ఆరాజభవనమంతయును మఱల ఒకసారి దద్దరిల్లిపోయెను. (26)

తచ్చ సంత్రస్తసంభ్రాంతం పర్యుత్సుకజనాకులమ్।
సర్వతస్తుములాక్రందం పరితాపార్తబాంధవమ్। 27

సద్యో నిపతితానందం దీనవిక్లబదర్శనమ్।
బభూవ నరదేవస్య సద్మ దిష్టాంతమీయుషః। 28

మహారాజు మరణించుటతో ఆమందిరము భయముతో, తత్తఱపాటుతో కలతచెందిన పరిజనులతో నిండిపోయెను. అన్ని వైపులనుండియు భరింపరాని రోదనధ్వనులు వినవచ్చుచుండెను. రాజబంధువులు ఎల్లరును ఆర్తులై పరితపించుచుండిరి. ఆభవనమంతయును ఆనందశూన్యమై, దీనులతో, దుఃఖితులతో నిండిపోయెను. (27-28)

అతీతమాజ్ఞాయ తు పార్థివర్షభం
యశస్వినం సంపరివార్య పత్నయః ।
భృశం రుదంత్యః కరుణం సుదుఃఖితాః
ప్రగృహ్య బాహూ వ్యలపన్ననాథవత్ । 29

మిగుల వాసిగాంచిన ఆనరేంద్రుడు దివంగతుడైనట్లు యెఱింగి, అతనిపత్నులందఱును మిక్కిలి దుఃఖితలై ఆయనచుట్టునుజేరి బోరున ఏడువసాగిరి. వారు ఒకరిచేతులు మఱియొకరుపట్టుకొని (దుఃఖముతో ఒకరినొకరికౌగిలించుకొని) దిక్కులేనివారివలె దీనముగా విలపింపసాగిరి. (29)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచషష్టితమస్సర్గః (65)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదిఐదవసర్గము సమాప్తము

— * * * —

66. అఱువదిఆఱవసర్గము

మహారాజుమృతికి దుఃఖసంతప్తలైన కౌసల్యాది - అంతఃపురస్త్రీలు కైకేయిని నిందించుట - మంత్రులు దశరథునికళేబరమును తైలద్రోణియందు భద్రపఱచుట - నగరము వెలవెలబోవుట.

తమగ్నిమివ సంశాంతమ్ అంబుహీనమివార్ణవమ్।
హతప్రభమివాఽఽదిత్యం స్వర్గస్థం ప్రేక్ష్య పార్థివమ్। 1

కౌసల్యా బాష్పపూర్ణాక్షీ వివిధం శోకకర్శితా।
ఉపగృహ్య శిరో రాజ్ఞః కైకేయీం ప్రత్యభాషత। 2

అప్పుడు అసువులువీడిన ఆమహారాజు ఆఱిపోయినఅగ్నివలెను, నీరింకిపోయిన సముద్రమువలెను, కాంతిహీనుడైన సూర్యునివలెను తేజోవిహీనుడైయుండెను. అవిరముగా నిర్జీవుడైయున్న తనపతిని జూచి, కౌసల్య పరిపరివిధముల శోకించుచు కన్నీరుకార్చుచుండెను. ఆమె తనపతిదేవుని (రాజుయొక్క) శిరస్సును ఒడిలోచేర్చుకొని కైకేయితో ఇట్లుపలికెను. (1-2)

సకామా భవ కైకేయి! భుంక్ష్వ రాజ్యమకంటకమ్।
త్యక్త్వా రాజానమేకాగ్రా నృశంసే! దుష్టచారిణి!। 3

ఓ క్రూరురాలా! దుర్మార్గురాలా! కైకేయీ! నీకోరికలు ఈడేరినవి గదా! రాజును వదిలించుకొంటివి. ఇక నీకు అడ్డుచెప్పెడివారెలేరు. ఈరాజ్యమును నీవెత్తినగొట్టుకొనుము. ఈరాజ్య భోగములను నీఇష్టమువచ్చినట్లు అనుభవింపుము. (3)

విహాయ మాం గతో రామో భర్తా చ స్వర్గతో మమ।
విపథే సార్థహీనేవ నాహం జీవితుముత్సహే। 4

నారాముడు నన్నువీడి, అడవులపాలాయెను. భర్తస్వర్గమునకేగెను. దుర్గమమైన మార్గములో ఆత్మీయులందఱును వదిలిపెట్టిపోగా నిస్సహాయురాలైన అబలవలె ఒంటరిగా మిగిలిపోయితిని. నాలో జీవితేచ్ఛయే నశించినది. (4)

భర్తారం తం పరిత్యజ్య కా స్త్రీ దైవతమాత్మనః।
ఇచ్ఛేజ్జీవితుమన్యత్ర కైకేయ్యాస్త్యక్తధర్మణః। 5

నారీధర్మమును గాలికి వదిలిన కైకేయితప్ప, దైవతుల్యుడైన తనభర్తను పరిత్యజించి, ఈలోకములో ఏస్త్రీ జీవింపగోరును? (5)

న లుబ్ధో బుధ్యతే దోషాన్ కింపాకమివ భక్షయన్।
కుబ్జానిమిత్తం కైకేయ్యా రాఘవాణాం కులం హతమ్। 6

లోభియైనవాడు ధనాశవలన ఇతరులచే విషమిశ్రితాహారమును తినిపించుటకును వెనుకాడడు. దానిని ఏమాత్రము దోషముగా భావింపడు. అట్లే కుబ్జనిమిత్తకారణమున ఈకైకేయి మహోన్నతమైన రఘువంశమునకే చిచ్చుపెట్టినది. (6)

అనియోగే నియుక్తేన రాజ్ఞా రామం వివాసితమ్।
సభార్యం జనకః శ్రుత్వా పరితప్స్యత్యహం యథా। 7

ఓకైకేయీ! నీవు నాడు వరములను కోరునప్పుడు వాటిని స్పష్టముగా పేర్కొనక, ఇప్పుడు ఆవరములసాకుతో మహారాజును అడ్డుపెట్టుకొని భార్యతోసహా శ్రీరాముని అడవులకు పంపితివి. ఈసమాచారమును వినినచో జనకమహారాజు నావలెనే మిగుల దుఃఖితుడగును. (7)

స మామనాథాం విధవాం నాద్య జానాతి ధార్మికః।
రామః కమలపత్రాక్షో జీవనాశమితో గతః। 8

నేడు ఇచట మహారాజు మరణించియున్నాడు. నేను రక్షకుడులేని అనాథనైయుంటిని. కమలపత్రాక్షుడు, ధర్మాత్ముడునైన శ్రీరాముడు (దూరముగానుండుటచే) ఈవిషయములను ఎఱుగడు. (8)

విదేహరాజస్య సుతా తథా సీతా తపస్వినీ।
దుఃఖస్యానుచితా దుఃఖం వనే పర్యుద్విజిష్యతి। 9

జనకమహారాజుసుతయు, పతిసేవయే తపస్సుగా భావించెడి సాధ్వియునైన సీతాదేవి వనవాసదుఃఖములపాలగుట తగదు. ఇప్పుడామెయు వనములలో దుఃఖములను అనుభవించుచు ఉద్విగ్నురాలగును. (9)

నదతాం భీమఘోషాణాం నిశాసు మృగపక్షిణామ్।
నిశమ్య నూనం సంత్రస్తా రాఘవం సంశ్రయిష్యతి। 10

రాత్రివేళలలో అరచుచున్న మృగములయొక్క, పక్షులయొక్క భయంకరధ్వనులను విని. ఆ సీతాదేవి భయపడి తప్పక శ్రీరాముని ఆశ్రయించును. అనగా ఆమె తనభర్తయొడికిచేరును. (10)

వృద్ధశ్చైవాల్పపుత్త్రశ్చ వైదేహీమనుచింతయన్।
సోఽపి శోకసమావిష్టో నను త్యక్ష్యతి జీవితమ్। 11

జనకమహారాజు కడువృద్ధుడు. పుత్త్రసంతతిలేనివాడు. అతడు సీతాదేవినే అనుక్షణము స్మరించుచు అంతులేని శోకమునకు గుఱియైనవాడై తప్పక ప్రాణములను విడుచును. (11)

సాఽహమద్యైవ దిష్టాంతం గమిష్యామి పతివ్రతా।
ఇదం శరీరమాలింగ్య ప్రవేక్ష్యామి హుతాశనమ్। 12

పతివ్రతనైనట్టి[1] నేను మృతిచెందిన ఈ మహారాజుతో నేడే సహగమనముచేసెదను. ఆయనదేహముతోపాటు నాతనువును గూడ చితాగ్నికి ఆహుతిగావించెదను. (12)

1) శ్లో॥ ఆర్తార్తే ముదితే హృష్టా ప్రోషితే మలినా కృశా మృతే మ్రియేత యా పత్యౌ సా స్త్రీ జ్ఞేయా పతివ్రతా॥ భర్తలవడను తనలవడగను, ఆయనసంతోషమునే తనసంతోషముగను భావించుచు, భార్య భర్తదేశాంతరమునయున్నప్పుడు సాధారణవస్త్రములను ధరించుచు ఆయనకై పరితపించుచుండవలెను. భర్తమృతిచెందినచో ఆమె ఆయనతో సహగమనముచేయవలెను. ఈవిషయములను ఎఱింగి తగువిధముగా ప్రవర్తించెడిస్త్రీ పతివ్రత. – గోవిందరాజీయవ్యాఖ్య

తాం తతస్సంపరిష్వజ్య విలపంతీం తపస్వినీమ్।
వ్యపనీయ సుదుఃఖార్తాం కౌసల్యాం వ్యావహారికాః। 13

తైలద్రోణ్యామథామాత్యాః సంవేశ్య జగతీపతిమ్।
రాజ్ఞః సర్వాణ్యథా౽౽దిష్టాః చక్రుః కర్మాణ్యనంతరమ్। 14

న తు సంకలనం రాజ్ఞో వినా పుత్త్రేణ మంత్రిణః।
సర్వజ్ఞాః కర్తుమీషుస్తే తతో రక్షంతి భూమిపమ్। 15

తైలద్రోణ్యాం తు సచివైః శాయితం తం నరాధిపమ్।
హా మృతో౽యమితి జ్ఞాత్వా స్త్రియస్తాః పర్యదేవయన్। 16

బాహూనుద్యమ్య కృపణా నేత్రప్రస్రవణైర్ముఖైః।
రుదంత్యః శోకసంతప్తాః కృపణం పర్యదేవయన్। 17

హా మహారాజ! రామేణ సతతం ప్రియవాదినా।
విహీనాః సత్యసంధేన కిమర్థం విజహాసి నః। 18

కైకేయ్యా దుష్టభావాయా రాఘవేణ వియోజితాః।
కథం పతిఘ్న్యా వత్స్యామః సమీపే విధవా వయమ్। 19

స హి నాథః సదా౽స్మాకం తవ చ ప్రభురాత్మవాన్।
వనం రామో గతః శ్రీమాన్ విహాయ నృపతిశ్రియమ్। 20

త్వయా తేన చ వీరేణ వినా వ్యసనమోహితాః।
కథం వయం నివత్స్యామః కైకేయ్యా చ విదూషితాః। 21

యయా తు రాజా రామశ్చ లక్ష్మణశ్చ మహాబలః।
సీతయా సహ సంత్యక్తాః సా కమన్యం న హాస్యతి। 22

తా బాష్పేణ చ సంవీతాః శోకేన విపులేన చ।
వ్యవేష్టంత నిరానందా రాఘవస్య వరస్త్రియః। 23

నిశా చంద్రవిహీనేవ స్త్రీవ భర్తృవివర్జితా।
పురీ నారాజతా౽యోధ్యా హీనా రాజ్ఞా మహాత్మనా। 24

పతికళేబరముపైబడి మిగులదుఃఖముతో విలపించుచున్న ఆ కౌసల్యాసాధ్విని అచటిపరిచారికలు దూరముగా తీసికొనివెళ్లిరి. అంతట వసిష్ఠాదులఆదేశానుసారము అమాత్యులు ఆరాజుగారి కళేబరమును తైలద్రోణియందు (నూనెతోనింపబడిన తొట్టియందు) ఉంచిరి. పిమ్మట వారు ఆ శవమును భద్రపఱచుటమొదలుకొని సమస్త రాజకీయకార్యక్రమములను నిర్వర్తించిరి. (13-14)

ధర్మములను బాగుగా ఎఱిగిన మంత్రులు పుత్త్రులెవ్వరును దగ్గఱలేకుండ రాజకళేబరమునకు దహనసంస్కారములను జరిపించుటకు ఇష్టపడక, దానిని కాపాడుచుండిరి. (15)

మంత్రులు ఆ రాజుశవమును తైలద్రోణియందు (నూనె తొట్టియందు) ఉంచుటచూచి, అచటి అంతఃపురస్త్రీలు అందఱును 'అయ్యో! రాజా! స్వర్గమునకేగితివా ?' అనుచు మిక్కిలిగొల్లుమని యేడ్చిరి. వారినేత్రములనుండి అవిచ్ఛిన్నముగా కన్నీరుస్రవించుచుండెను. అంతట వారు దైన్యముతో చేతులుచాచి, శోకముతో బిగ్గఱగాఏడ్చుచు మృతుడైపడియున్న రాజునుగూర్చి పరితపింపసాగిరి. (16-17)

"అయ్యో! మహారాజా! సత్యసంధుడు, ఎల్లప్పుడును ప్రియముగా మాటాడువాడునైన శ్రీరాముని దూరముచేసికొని, దుర్భరమైన దుఃఖమునకు లోనైయుంటిమి. ప్రభూ! ఈస్థితిలో నీవుగూడ మమ్మునీడి స్వర్గస్థుడవైతివా? శ్రీరామునియెడబాటునకు లోనగుటయేగాక ఇప్పుడు మేము పతిమృతితో అనాథలమైతిమి. ఈస్థితిలో భర్తను పొట్టనబెట్టుకొన్న దుష్టాత్మురాలగు ఈకైకెముందర మేమెట్లు జీవింపగలము? (18-19)

సర్వసమర్థుడును, బుద్ధిమంతుడును, సకలసద్గుణసంపన్నుడును ఐన శ్రీరాముడు మాకును, నీకును కొండంత అండగా ఉండెడివాడు. అట్టి ఆ మహాత్ముడు ఈ రాజ్యలక్ష్మిని త్యజించి వనములపాలాయెను. ఆ మహావీరుడునులేక, మీరునులేక దుఃఖములపాలైన మేము కైకేయి ఈసడింపులను సహించుచు ఇచట ఎట్లు బ్రతుకగలము? ఆ దుష్టకైకేయి బలశాలురైన రామలక్ష్మణులను, సీతాదేవిని అరణ్యములకు పంపివేసెను. అంతేగాక రాజునైతే నరానరిపరలోకమునకే చేర్చెను. ఇక ఆ దుర్మార్గురాలు మాలో ఎవరినిమాత్రము విడిచిపెట్టును? (20-22)

ఆవిధముగ పతివిహీనలందఱును కన్నీరుగార్చుచు అంతులేని శోకముతో నేలపైబడి అటునిటు పొర్లసాగిరి. వారిలో ఆనందము అడుగంటెను. (23)

మహాత్ముడైన దశరథరాజును పోగొట్టుకొనిన ఆ అయోధ్యానగరము పతినికోల్పోయిన సతివలెను, చంద్రుడులేని రాత్రివలెను వెలవెలబోవుచుండెను. (24)

బాష్పపర్యాకులజనా హాహాభూతకులాంగనా ।
శూన్యచత్వరవేశ్మాంతా న బభ్రాజ యథా పురమ్ ॥ 25

ఆ పురమునందలి జనులెల్లరును కన్నీరుమున్నీరుగా విలపించుచు, వ్యాకులపాటునకు లోనైయుండిరి. గృహిణులందఱును హాహాకారములు చేయుచుండిరి. వీథులకూడళ్లన్నియును జనసంచారములేక శూన్యములైయుండెను. ఇండ్లముంగిళ్లన్నియును ఊడ్చెడివారు, కలాపిచల్లెడివారు, ముగ్గులుపెట్టువారునులేక చెత్తచెదారములతో నిండి చిందరవందరగానుండెను. ఈవిధముగా పురమంతయును పూర్వశోభను కోల్పోయియుండెను. (25)

గతే తు శోకాత్ త్రిదివం నరాధిపే
మహీతలస్థాసు నృపాంగనాసు చ ।
నివృత్తచారః సహసా గతో రవిః
ప్రవృత్తచారా రజనీ హ్యుపస్థితా ॥ 26

దశరథమహారాజు పుత్రశోకముతో దివంగతుడయ్యెను. రాజపత్నులందఱును దుఃఖముతో నేలపైపొరలాడుచుండిరి. సూర్యుడు తనకిరణములను ప్రసరింపజేయుటమాని అస్తమించెను. చీకట్లను వ్యాపింపజేయుచు రాత్రి రానేవచ్చెను. (26)

ఋతే తు పుత్రాద్దహనం మహీపతేః
న రోచయంతే సుహృదః సమాగతాః ।
ఇతీవ తస్మిన్ శయనే న్యవేశయన్
విచింత్య రాజానమచింత్యదర్శనమ్ ॥ 27

'ఆ సమయమున పుత్రులు చెంతలేనందున రాజశవమునకు దహనసంస్కారములను జరిపించుటకు అచటికి విచ్చేసిన బంధుమిత్రులు ఇష్టపడరు' - అనితలంచి, అమూల్యమైన రాజుగారిపరిస్థితిని గమనించి, అమాత్యులు ఆశవమును తైలద్రోణిలో భద్రపఱచిరి. (27)

గతప్రభా ద్యౌరివ భాస్కరం వినా
వ్యపేతనక్షత్రగణేవ శర్వరీ ।
పురీ బభాసే రహితా మహాత్మనా
న చాస్రకంఠాకులమార్గచత్వరా ॥ 28

మహాత్ముడైన దశరథుడు మరణించుటతో జనులెల్లరును దుఃఖితులై, నోటమాటరాక కన్నీరుగార్చుచు రాజవీథులలో, కూడళ్లలో చేరియుండిరి. అప్పుడానగరము సూర్యుడులేని ఆకాశమువలెను, చంద్రుడు, నక్షత్రములులేని రాత్రివలెగా తేజోవిహీనమై యుండెను. (28)

నరాశ్చ నార్యశ్చ సమేత్య సంఘశో
విగర్హమాణా భరతస్య మాతరమ్ ।
తదా నగర్యాం నరదేవసంక్షయే
బభూవురార్తా న చ శర్మ లేభిరే ॥ 29

నగరమునందలిస్త్రీలు, పురుషులు గుంపులు గుంపులుగాచేరి, భరతునితల్లియైన కైకేయిని తిట్టిపోయుచుండిరి. మహారాజుమృతి కారణముగా అయోధ్యానగరవాసులందఱును మిగులదుఃఖార్తులై మనశ్శాంతిని కోల్పోయిరి. (29)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షట్షష్టితమస్సర్గః *(66)*

వాల్మీకిమహర్షివిరచితమైన ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదిఆఱవసర్గము సమాప్తము

-- * * * --

67. అఱువదిఏడవసర్గము

రాజులేని రాజ్యమున ఏర్పడు అల్లకల్లోలపరిస్థితులనుగూర్చి మార్కండేయాది-ఋషులు వసిష్ఠమహామునికి వివరించుట.

ఆక్రందితనిరానందా సాస్రకంఠజనాకులా ।
అయోధ్యాయామవతతా సా వ్యతీయాయ శర్వరీ ॥ 1

అయోధ్యయందలి ప్రజలకు ఆరాత్రి ఏడుపులు పెడబొబ్బలతోనే గడచినది. ఎవరిముఖములలోను ఆనందముయొక్క జాడయే కనబడకుండెను. కన్నీరుగార్చుచు దుఃఖమునకులోనైయుండుటచే వారిగొంతులు పెగలకుండెను, మనుష్యులు కలవరపాటునకు గుఱియైయుండెను. అందఱును దుఃఖసంతప్తులైయుండుటచే వారికి ఆరాత్రి క్షణమొకయుగముగాగడచెను. (1)

వ్యతీతాయాం తు శర్వర్యామ్ ఆదిత్యస్యోదయే తతః ।
సమేత్య రాజకర్తారః సభామీయుర్ద్విజాతయః ॥ 2

ఆరాత్రిగడచిన పిమ్మట సూర్యోదయానంతరము రాజకార్యములను నిర్వహించెడి బ్రాహ్మణులుఅందఱును సభజేసిరి. (2)

మార్కండేయోఽథ మౌద్గల్యో వామదేవశ్చ కాశ్యపః।
కాత్యాయనో గౌతమశ్చ జాబాలిశ్చ మహాయశాః। 3

ఏతే ద్విజా స్సహామాత్యైః పృథగ్వాచముదీరయన్।
వసిష్ఠ మేవాభిముఖాః శ్రేష్ఠం రాజపురోహితమ్। 4

అతీతా శర్వరీ దుఃఖం యా నో వర్షశతోపమా।
అస్మిన్ పంచత్వమాపన్నే పుత్త్రశోకేన పార్థివే। 5

స్వర్గతశ్చ మహారాజో రామశ్చారణ్యమాశ్రితః।
లక్ష్మణశ్చాపి తేజస్వీ రామేణైవ గతస్సహ। 6

ఉభౌ భరతశత్రుఘ్నౌ కేకయేషు పరంతపౌ।
పురే రాజగృహే రమ్యే మాతామహనివేశనే। 7

ఇక్ష్వాకూణామిహాద్యైవ కశ్చిద్రాజా విధీయతామ్।
అరాజకం హి నో రాష్ట్రం న వినాశమవాప్నుయాత్। 8

నారాజకే జనపదే విద్యున్మాలీ మహాస్వనః।
అభివర్షతి పర్జన్యో మహీం దివ్యేన వారిణా। 9

నారాజకే జనపదే బీజముష్టిః ప్రకీర్యతే।
నారాజకే పితుః పుత్త్రో భార్యా వా వర్తతే వశే। 10

నారాజకే ధనం చాస్తి నాస్తి భార్యాప్యరాజకే।
ఇదమత్యాహితం చాన్యత్ కుతస్సత్యమరాజకే। 11

నారాజకే జనపదే కారయంతి సభాం నరాః।
ఉద్యానాని చ రమ్యాణి హృష్టాః పుణ్యగృహాణి చ। 12

నారాజకే జనపదే యజ్ఞశీలా ద్విజాతయః।
సత్రాణ్యన్వాసతే దాంతా బ్రాహ్మణాః సంశితవ్రతాః। 13

నారాజకే జనపదే మహాయజ్ఞేషు యజ్వనః।
బ్రాహ్మణా వసుసంపూర్ణా విసృజంత్యాప్తదక్షిణాః। 14

నారాజకే జనపదే ప్రభూతనటనర్తకాః।
ఉత్సవాశ్చ సమాజాశ్చ వర్ధంతే రాష్ట్రవర్ధనాః। 15

నారాజకే జనపదే సిద్ధార్థా వ్యవహారిణః।
కథాభిరనురజ్యంతే కథాశీలాః కథాప్రియైః। 16

మార్కండేయుడు, మౌద్గల్యుడు, వామదేవుడు, కాశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, జాబాలిమొదలగు సుప్రసిద్ధ బ్రాహ్మణోత్తములందఱును అమాత్యులతోగూడి, రాజపురోహితుడు, మునిశ్రేష్ఠుడునైన వసిష్ఠమహర్షి సమక్షమున తమతమ సూచనలను ఇట్లు వినిపించిరి. (3-4)

"ఈమహారాజు పుత్త్రశోకముతో మృతిచెందుటవలన దుఃఖభారముతో మనకు ఈరాత్రి నూఱుసంవత్సరములవలె గడచినది. మహారాజేమో దివికేగెను. శ్రీరాముడు అడవులపాలాయెను, తేజస్వియైన లక్ష్మణుడైతే అన్నయగు శ్రీరాముని అనుసరించెను. శత్రుభయంకరులైన భరత శత్రుఘ్నులు ఇరువురును కేకయరాజ్యములోని 'రాజగృహము' అను పేరుగల రమ్యమైన పురమునందలి తాతగారి (మాతామహుని) ఇంటిలో ఉండిపోయిరి. (5-7)

రాజులేని రాష్ట్రమున అల్లకల్లోలములు చెలరేగును. అట్లుగాకుండుటకై (రాజ్యము సురక్షితముగానుండుటకై) నేడే ఈ అయోధ్యకు (కోసల రాజ్యమునకు) ఇక్ష్వాకువంశజులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులలో ఒకరిని రాజుగా పట్టాభిషిక్తుని గావింపవలెను. (8)

రాజులేని రాజ్యమున మెఱుపులతో, ఉఱుములతో గూడి మేఘములు భూమిపై బాగుగా (చాలినంతగా) వర్షింపవు. పిడికిళ్లతో విత్తనములను చల్లుటజరుగదు. (వ్యవసాయము దెబ్బతినును.) పుత్త్రులు తండ్రిమాట వినరు. భార్య భర్తమాటను పాటింపదు. సంపదలకు రక్షణయుండదు. భార్యయు అడ్డుఆదుపులు లేక తిరుగుచుండును. (దంపతుల అన్యోన్యానురాగములు సన్నగిల్లును.) మిగులభయానకపరిస్థితులు ఏర్పడును. సత్యమునకు నిలువనీడయేయుండదు. క్రయవిక్రయాదుల యందు నీతినిజాయితీలు ఉండవు. (9-11)

రాజులేనిదేశమున ప్రజలు మనసులునిలకడలేక సభలను, సమావేశములను నిర్వహింపరు. వృక్షములను నఱికివేయుదురను భయముతో చక్కని ఉద్యానవనములనుపెంచరు. దుర్గనిర్మాణ భయముతో జనులు, సత్రములను, దేవమందిరములను నిర్మించుటకు ఉత్సాహముచూపరు. యజ్ఞములను చేయుటలో, చేయించుటలో శ్రద్ధాసక్తులుగలవారును, ఇంద్రియనిగ్రహము గలవారును, వేదపండితులును, వ్రతనిష్ఠాగరిష్ఠులునువైన ఋత్విజులు నిష్ఫలభయముచే యజ్ఞములజోలికేపోరు. ఒకవేళ ధనసంపన్నులైన బ్రాహ్మణోత్తములు ఎవరైన గొప్పగొప్పయజ్ఞములను నిర్వహించినను వారు ఋత్విజులకు తృప్తికరముగా దక్షిణలను ఇయ్యరు. (12-14)

రాజులేనిరాష్ట్రమున (రాజ్యమున) ప్రజలకు మనోవికాసమును కలిగించుటద్వారా దేశాభివృద్ధికితోడ్పడునట్టి నటన, నాట్యము, నృత్యము, సంగీతసాహిత్యములు మొదలగు లలితకళలు అడుగంటును. దేవోత్సవములు, తీర్థయాత్రలు మున్నగు సామాజికకార్యక్రమములు కుంటుపడును. వ్యవహారవ్యవిక్కులకు న్యాయస్థానములను ఆశ్రయింపగా అచట వారికి న్యాయముజరుగదు. క్రయవిక్రయాదులు న్యాయబద్ధముగా కొనసాగవు. చక్కని హరికథలను, పురాణేతిహాసములకు సంబంధించిన

నారాజకే జనపదే ఉద్యానాని సమాగతాః।
సాయాహ్నే క్రీడితుం యాంతి కుమార్యో హేమభూషితాః। 17

నారాజకే జనపదే వాహనైః శీఘ్రగామిభిః।
నరా నిర్యాంత్యరణ్యాని నారీభిస్సహ కామినః। 18

నారాజకే జనపదే ధనవంతః సురక్షితాః।
శేరతే వివృతద్వారాః కృషిగోరక్షజీవినః। 19

నారాజకే జనపదే బద్ధఘంటా విషాణినః।
అటంతి రాజమార్గేషు కుంజరాః షష్టిహాయనాః। 20

నారాజకే జనపదే శరాన్ సతతమస్యతామ్।
శ్రూయతే తలనిర్ఘోష ఇష్వస్త్రాణాముపాసనే। 21

నారాజకే జనపదే వణిజో దూరగామినః।
గచ్ఛంతి క్షేమమధ్వానం బహుపణ్యసమాచితాః। 22

నారాజకే జనపదే చరత్యేకచరో వశీ।
భావయన్నాత్మనాఽఽత్మానం యత్రసాయంగృహో మునిః। 23

నారాజకే జనపదే యోగక్షేమం ప్రవర్తతే।
నచా ప్యరాజకే సేనా శత్రూన్ విషహతే యుధి। 24

నారాజకే జనపదే హృష్టైః పరమవాజిభిః।
నరాః సంయాంతి సహసా రథైశ్చ పరిమండితాః। 25

నారాజకే జనపదే నరాః శాస్త్రవిశారదాః।
సంవదంతోఽవతిష్ఠంతే వనేషూపవనేషు చ। 26

మధురగాథలను బాగుగాచెప్పగలవారుగాని, భక్తిశ్రద్ధలతో విని ఆనందించువారుగాని ఉండరు. బంగారు ఆభరణములను ధరించినకన్యలు సాయంసమయములయందు విహరించుటకై దొంగల భయమువలన ఉద్యానవనములకు రారు. (15-17)

రాజులేని దేశమున ప్రమాదముసంభవించునను భయముతో రసికులైన పురుషులు వేగముగా సాగిపోవురథములపై తమ ప్రియురాండ్రతోగూడి వనవిహారములకువెళ్లరు. దొంగలభయము కారణముగా ధనవంతులుగాని, వ్యవసాయము, వ్యాపారము వృత్తిగాగల సంపన్నులుగాని సురక్షితముగా జీవింపజాలరు. అంతేగాక వారు రాత్రులయందు ఇండ్లతలుపులు తెఱచి, నిర్భయముగా నిద్రింపలేరు. మెడలలోగంటలుకట్టబడినవి, బలిష్ఠమైన దంతములు గలవియైన అఱువది సంవత్సరముల వయస్సుగల ఏనుగులు కిరాతుల భయముతో రాజమార్గములలో సంచరింపవు. (18-20)

బాణప్రయోగములను, అస్త్రవిద్యలను అభ్యసించుసమయమున నిరంతరము శరములను సంధించువారియొక్క అఱచేతులచప్పుడులు వినబడవు. (రాజ్యమునందలి అల్లకల్లోల పరిస్థితుల కారణముగా విలువిద్యల అభ్యాసములు సక్రమముగా, నిరంతరాయముగా కొనసాగవు.) వ్యాపారనిమిత్తమై సుదూరప్రదేశములకు వెళ్లెడివర్తకులు విలువిదములైన విక్రయవస్తువులను తీసికొనివెళ్లునప్పుడు దోపిడి దొంగలకారణముగా వారి ప్రయాణములకు భద్రతకఱవగును. ఎవ్వరితోడుతో పనిలేక ఒంటరిగా సంచరించుచు సాయంకాలమగువేళ భిక్షను స్వీకరించువాడును, ఇంద్రియనిగ్రహముగలవాడును, ఎల్లప్పుడును పరమాత్మయందే మనస్సు నిలుపుచుండువాడును (నిరంతరము పరమాత్మనే స్మరించుచుండువాడును) ఐన మునీశ్వరుడు అలజడులుగల దేశమున ఎచ్చటికిని కదలడు.[1] (21-23)

రాజులేనిరాజ్యమున అందఱియోగక్షేమములు[2] దెబ్బతినును. కట్టుబాట్లుసడలి, క్రమశిక్షణలోపించుటచే రణరంగమున సైనికులు శత్రువులను జయింపజాలరు. బాగుగా బంగారునగలను ధరించినప్పుడు పురుషులుసైతము మానసోల్లాసమునకై (వినోదమునకై) మేలుజాతి గుఱ్ఱములపైగాని రథములపైగాని వనవిహారములకైవెళ్లుటకు సాహసింపరు. శాస్త్రములలో ఆరితేఱిన పండితులు శాంతి కొఱవడుటచే మున్యాశ్రమప్రదేశములయందుగాని, ఉపవనములయందుగాని శాస్త్రచర్చలుచేయరు. (24-26)

1) "అష్టమాస ఏకాకీ యతిశ్చరేత్." అను శ్రుతివచనమును అనుసరించి, యతీశ్వరుడు సంవత్సరములో ఎనిమిదినెలలు సంచరించుచునేయుండును. అతడు ఒక్కొక్క రాత్రిని ఒక్కొక్కచోట గడుపుచు తిరుగుచుండును. అతడు సంచరించునపుడు సాయంకాలమగుచోట ఆగి, అచటి సజ్జనులు సమర్పించెడి భిక్షను స్వీకరించును. ఆరాత్రికి అచటనుండి, మఱునాడు ఆప్రదేశమును వీడి, వెళ్లిపోవుచుండును. అందువలననే 'సాయంగృహోమునిః' అని పేర్కొనుట జరిగినది. దేశమున కల్లోలములు ఏర్పడినప్పుడు భిక్షను ఏర్పాటుచేసెడువారు ఉండరుగాన అతడు ఎటూకదలక తన సంచారమునే మానుకొనును.

2) "అలబ్ధలాభో యోగః, లబ్ధస్య పరిపాలనం క్షేమః" అంతవఱకులేని వస్తువులు(సంపదలు) లభించుటయోగము, ఆవస్తువులను (సంపదలను) రక్షించుకొనుటక్షేమము. పరమాత్మను నమ్ముకొని ఆయనను పరమభక్తితో సేవించినవారి యోగక్షేమములను ఆభగవంతుడే వహించుచుండును. 'యోగక్షేమం వహామ్యహమ్' అనిగదా! గీతోక్తి.

నారాజకే జనపదే మాల్యమోదక దక్షిణాః।
దేవతాభ్యర్చనార్థాయ కల్ప్యంతే నియతైర్జనైః। 27

నారాజకే జనపదే చందనాగరురూషితాః।
రాజపుత్త్రా విరాజంతే వసంత ఇవ శాఖినః। 28

యథా హ్యనుదకా నద్యో యథా వాఽప్యతృణం వనమ్।
అగోపాలా యథా గావః తథా రాష్ట్రమరాజకమ్। 29

ధ్వజో రథస్య ప్రజ్ఞానం ధూమో జ్ఞానం విభావసోః।
తేషాం యో నో ధ్వజో రాజా స దేవత్వమితో గతః। 30

నారాజకే జనపదే స్వకం భవతి కస్యచిత్।
మత్స్యా ఇవ నరా నిత్యం భక్షయంతి పరస్పరమ్। 31

యే హి సంభిన్నమర్యాదా నాస్తికాః ఛిన్నసంశయాః।
తేఽపి భావాయ కల్పంతే రాజదండనిపీడితాః। 32

యథా దృష్టిః శరీరస్య నిత్యమేవ ప్రవర్తతే।
తథా నరేంద్రో రాష్ట్రస్య ప్రభవః సత్యధర్మయోః। 33

రాజా సత్యం చ ధర్మశ్చ రాజా కులవతాం కులమ్।
రాజా మాతా పితా చైవ రాజా హితకరో నృణామ్। 34

యమో వైశ్రవణః శక్రో వరుణశ్చ మహాబలః।
విశేష్యంతే నరేంద్రేణ వృత్తేన మహతా తతః। 35

అహో తమ ఇవేదం స్యాత్ న ప్రజ్ఞాయేత కించన।
రాజా చేన్నభవేల్లోకే విభజన్ సాధ్వసాధునీ। 36

జీవత్యపి మహారాజే తవైవ వచనం వయమ్।
నాతిక్రమామహే సర్వే వేలాం ప్రాప్యేవ సాగరః। 37

రాజులేని రాష్ట్రమున ఏకాగ్రచిత్తులైనవారుగూడ దేశవాతావరణము కలుషితమగుటతో దేవతలను ఆరాధించుటకై పూలమాలలను, పాయసాదినైవేద్యములను కానుకలను సమకూర్చజాలరు. సర్వదా వసంత-ఋతువున చిగుళ్లతో పూలతో కమనీయముగానుండు వృక్షములవలె విరాజిల్లెడి రాజకుమారులు దేశపరిస్థితులు తారుమారుగుటచే సంతోషమునకు దూరమై సుగంధలేపనములను నిరాదరింతురు. రాజులేని రాజ్యము నీరులేనినదులవంటిది, చెట్లుచేమలులేని (చెట్లెండిపోయిన) వనమువంటిది. గోపాలురులేని గోసమూహమువంటిది. (27-29)

రథము ఎవరిదోగుర్తించుటకు ధ్వజము (పతాకము) సంకేతము. ధూమము అగ్నిఉనికిని తెలుపును. మనకును (ప్రజలకును) మన దేశముయొక్క ఔన్నత్యమునకును మహారాజు ప్రతీక. అట్టిమన దశరథమహాప్రభువు దివంగతుడైనాడు. రాజులేని రాజ్యమున వ్యక్తులకును వారిసస్తువాహనాది వివిధసంపదలకును రక్షణకఱవగును. పెద్దచేపలు చిన్నచేపలను తినివేయునట్లుగా బలవంతులు (దుష్టశక్తులు) బలహీనులను దోచుకొందురు. ప్రభువులేని దేశమున ప్రజలు జాతిమర్యాదలను, వర్ణాశ్రమధర్మములను ఉల్లంఘింతురు. ఇంతవఱకును రాజదండనములకు భయపడియుండునాస్తికులు ఈపరిస్థితిని అదనుగా దీసికొని, శాసనభయములేక విశృంఖలముగా ప్రవర్తింతురు. (30-32)

సమస్తప్రాణులకును దృష్టి (నేత్రములు) శరీరప్రమాదములను నివారించుచు రక్షణను కల్పించును. అట్లే రాజు దేశప్రజలలో సత్యప్రవర్తనను, ధర్మమార్గమును నెలకొల్పును. వాటిని పరిరక్షించును. సత్యధర్మములకు రాజేమూలస్తంభము. అతడే కులాచారములను (జాతిధర్మములను) చక్కగాప్రవర్తిల్లచేయువాడు. ప్రజలకు తల్లిదండ్రులవలె సర్వహితములను గూర్చువాడు ప్రభువే. సాటిలేని సత్ప్రవర్తనగలిగిన మహారాజు యమునివలె (సమవర్తియై) ఎట్టి పక్షపాతములేక దోషులను దండించును. కుబేరునిరీతిగా ప్రజలకు వివిధసంపదలను సమకూర్చును. ఇంద్రునివలె చక్కని పరిపాలనను అందించును. శక్తిశాలియైన వరుణునివలె సదాచార నియమములను పరిరక్షించును. వేయేల రాజు ఆదర్శప్రాయముగా నడచుకొనుచు ఇంద్రయమకుబేరవరుణులను మించినవాడై ప్రజలకు ఏడుగడ (అన్నివిధములుగ అండగానుండువాడు) అగును. (33-35)

ధర్మాధర్మవిచక్షణగలిగినరాజు ప్రజలకుమంచిచెడ్డలను విడమఱచిచెప్పి, వారిని వివేకముగలవారినిజేయును. అట్టిరాజు లేనినాడు ప్రజలు అయోమయస్థితిలోబడి దిక్కుతోచనివారు అగుదురు. (36)

ఓ వసిష్ఠమహర్షీ! మహారాజుగారు జీవించియున్నప్పుడును మేముఅందరమును సముద్రము చెలియలికట్టనువలె మీఆజ్ఞను అతిక్రమించెడివారముకాము(ఎల్లప్పుడు మీఆజ్ఞనే పాటించు చుండెడివారము.) (37)

స వస్త్వవేక్ష్య ద్విజవర్య వృత్తం
నృపం వినా రాజ్యమరణ్యభూతమ్ ।
కుమారమిక్ష్వాకుసుతం వదాన్యం
త్వమేవ రాజానమిహాభిషించ ॥ 38

ఓ బ్రహ్మర్షీ! మేతోమేము ఇంతవఱకును విన్నవించుకొనిన విషయములను (రాజులేనిచో రాజ్యమున ఏర్పడు అల్లకల్లోల పరిస్థితులను) బాగుగా పరిశీలించి, 'ప్రభువులేని దేశము అడవిగా మారును'-అను అంశమును దృష్టిలోపెట్టుకొని, ఇక్ష్వాకువంశజులైన దశరథునిసుతులలో ఉదారుడైనవానిని ఈకోసలదేశమునకు రాజుగా పట్టాభిషిక్తునిగావింపుము." అని మార్కండేయుడు మొదలగు ఋషులు వసిష్ఠమహర్షికి విన్నవించిరి. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తషష్టితమస్సర్గః (67)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదిఏడవసర్గము సమాప్తము

-- * * * --

68. అఱువదిఎనిమిదవసర్గము

వసిష్ఠునిఆజ్ఞమేరకు దూతలు భరతశత్రుఘ్నులను తీసికొనివచ్చుటకై వడిగల గుఱ్ఱములనెక్కి, కేకయనగరమునకు చేరుట.

తేషాం హి వచనం శ్రుత్వా వసిష్ఠః ప్రత్యువాచ హ।
మిత్రామాత్యగణాన్ సర్వాన్ బ్రాహ్మణాంస్తానిదం వచః॥ 1

యదసౌ మాతులకులే పురే రాజగృహే సుఖీ।
భరతో వసతి భ్రాత్రా శత్రుఘ్నేన సమన్వితః॥ 2

తచ్ఛీఘ్రం జవనా దూతా గచ్ఛంతు త్వరితైర్హయైః।
ఆనేతుం భ్రాతరౌ వీరౌ కిం సమీక్షామహే వయమ్॥ 3

గచ్ఛంత్వితి తతస్సర్వే వసిష్ఠం వాక్యమబ్రువన్।
తేషాం తద్వచనం శ్రుత్వా వసిష్ఠో వాక్యమబ్రవీత్॥ 4

ఏహి సిద్ధార్థ! విజయ! జయంతాశోక! నందన!।
శ్రూయతామితి కర్తవ్యం సర్వానేవ బ్రవీమి వః॥ 5

పురం రాజగృహం గత్వా శీఘ్రం శీఘ్రజవైర్హయైః।
త్యక్తశోకైరిదం వాచ్యః శాసనాద్భరతో మమ॥ 6

పురోహితస్త్వాం కుశలం ప్రాహ సర్వే చ మంత్రిణః।
త్వరమాణశ్చ నిర్యాహి కృత్యమాత్యయికం త్వయా॥ 7

మా చాస్మై ప్రోషితం రామం మా చాస్మై పితరం మృతమ్।
భవంతః శంసిషుర్గత్వా రాఘవాణామిమం క్షయమ్॥ 8

మార్కండేయాది ఋత్విజులవచనములను ఆలకించిన పిమ్మట వసిష్ఠమహర్షి, అచ్చటచేరియున్న మిత్రులు, ప్రముఖులైన మంత్రులు, బ్రాహ్మణులు మొదలగువారిని అందఱిని ఉద్దేశించి, ఇట్లుపల్కెను. (1)

"ప్రస్తుతము భరతుడు తనసోదరుడైన శత్రుఘ్నునితోగూడి (కేకయరాజ్యమున) 'రాజగృహము' అనునగరమునందలి మేనమామగారి యింట హాయిగానివసించుచున్నాడు. (2)

అందువలన వీరులైన ఆభరతశత్రుఘ్నులను దీసికొనివచ్చుటకై వేగముగా సాగిపోగలగుఱ్ఱములపై త్వరగావెళ్లగలదూతలను అచటికి పంపవలెను. (మహారాజుగారే భరతుని యువరాజుగా జేయుటకు నిశ్చయించియుండిరిగదా!) ఇప్పుడు మనము ప్రత్యేకముగా ఆలోచింపవలసినదియేమున్నది. (3)

వసిష్ఠునిసూచనను వారందఱును ఆమోదించిరి. పిమ్మట ఆ మహాముని దూతలతో ఇట్లనెను. "ఓ సిద్ధార్థా! విజయా! జయంతా! అశోకా! నందనా! ఇటురండు. మీరందఱును చేయవలసిన పని తెలిపెదను, వినుడు. వెంటనే మీరు శీఘ్రముగా సాగిపోగల గుఱ్ఱములపై 'రాజగృహము'నకు వెళ్లుడు. నామమాత్రముగనైనను మీముఖములపై శోకచిహ్నములను కనబడనీయక నా ఆజ్ఞగా ఈమాటను భరతునకుదెల్పుడు. 'ఓభరతా! వంశపురోహితుడైన వసిష్ఠమహర్షియు, మంత్రులందఱును, నీక్షేమసమాచారములను గూర్చి అడిగిరి. త్వరగా నీవొకపనిచేయవలసియున్నది. శీఘ్రముగా బయలుదేఱిరావలయును.' మీరు అక్కడికి వెళ్లినపిమ్మట శ్రీరాముని వనవాసవిషయమునుగాని, దశరథమహారాజుమరణ వార్తనుగాని ఆయనకు తెలుపరాదు. రఘువంశజులకు ఎదురైన ఈఆపదనుగూర్చియు ప్రస్తావింపరాదు. (4-8)

కౌశేయాని చ వస్త్రాణి భూషణాని వరాణి చ।
క్షిప్రమాదాయ రాజ్ఞశ్చ భరతస్య చ గచ్ఛత। 9

దత్తపథ్యశనా దూతా జగ్ముః స్వం స్వం నివేశనమ్।
కేకయాంస్తే గమిష్యంతో హయానారుహ్య సమ్మతాన్। 10

తతః ప్రాస్థానికం కృత్వా కార్యశేషమనంతరమ్।
వసిష్ఠేనాభ్యనుజ్ఞాతా దూతాః సంత్వరితా యయుః। 11

న్యంతేనాపరతాలస్య ప్రలంబస్యోత్తరం ప్రతి।
నిషేవమాణాస్తే జగ్ముః నదీం మధ్యేన మాలినీమ్। 12

తే హస్తినపురే గంగాం తీర్త్వా ప్రత్యఙ్ముఖా యయుః।
పాంచాలదేశమాసాద్య మధ్యేన కురుజాంగలమ్। 13

సరాంసి చ సుపూర్ణాని నదీశ్చ విమలోదకాః।
నిరీక్షమాణాస్తే జగ్ముః దూతాః కార్యవశాద్ద్రుతమ్। 14

తే ప్రసన్నోదకాం దివ్యాం నానావిహగసేవితామ్।
ఉపాతిజగ్ముర్వేగేన శరదండాం జనాకులామ్। 15

నికూలవృక్షమాసాద్య దివ్యం సత్యోపయాచనమ్।
అభిగమ్యాభివాద్యం తం కులింగాం ప్రావిశన్ పురీమ్। 16

అభికాలం తతః ప్రాప్య తే బోధిభవనాచ్చ్యుతామ్।
పితృపైతామహీం పుణ్యాం తేరురిక్షుమతీం నదీమ్। 17

అవేక్ష్యాంజలిపానాంశ్చ బ్రాహ్మణాన్ వేదపారగాన్।
యయుర్మధ్యేన బాహ్లీకాన్ సుదామానం చ పర్వతమ్। 18

విష్ణోః పదం ప్రేక్షమాణా విపాశాం చాపి శాల్మలీమ్।
నదీర్వాపీస్తటాకాని పల్వలాని సరాంసి చ। 19

కేకయరాజుకొఱకును, భరతశత్రుఘ్నులకొఱకును పట్టు వస్త్రములను అమూల్యములైన ఆభరణములను కానుకలుగా తీసికొని, వెంటనే వెళ్ళుడు." (9)

పిమ్మట కేకయరాజ్యమునకు వెళ్ళబోవుచున్న ఆదూతలు తమ దారిబత్తెములను తీసికొని, వేగమునకును, ప్రయాణశ్రమలకును తట్టుకొనగల్గిన గుఱ్ఱములను అధిరోహించి, తమప్రయాణములను గూర్చి కుటుంబసభ్యులకుదెల్పుటకై స్వగృహములకువెళ్ళిరి. (10)

వసిష్ఠునిఆజ్ఞతో ఆదూతలు ప్రయాణమునకు సంబంధించిన పనులను అన్నింటిని ముగించుకొని, త్వరత్వరగా బయలుదేఱిరి. వారు అపరతాలపర్వతముయొక్క దక్షిణభాగముచివరి వఱకు ప్రయాణముచేసి, అచ్చట మాలినీ నదీతీరమునుదాటి, ప్రలంబగిరి ఉత్తరభాగమునకుచేరి, అటనుండి పడమటిదిశగా ప్రయాణించిరి. (11-12)

ఆదూతలు హస్తినాపురసమీపమున గంగానదినిదాటి, అక్కడి నుండి పశ్చిమాభిముఖులై, కురుజాంగలదేశముమీదుగా పాంచాల దేశముచేరిరి. అనంతరము వారు వికసించిన పద్మములుగల నిండైన సరస్సులను, నిర్మలజలములుగల నదులను జూచుచు కార్యముయొక్క యొత్తిడికారణముగా శీఘ్రముగ వెళ్ళిరి. (13-14)

వారు స్వచ్ఛములును, మధురములును ఐన జలములుగలదియు, వివిధములగు పక్షులచే సేవింపబడుచున్నదియు, జనులసంచారము గలదియునైన శరదండానదినిదాటి వేగముగా వెళ్ళిరి. (15)

శరదండానదికి పశ్చిమతీరమున దివ్యమైన ఒక 'వృక్షము'గలదు. అది ఒకదేవతకు ఆవాసస్థానము, దానినిపూజించినవారికోర్కెలు అన్నియును సఫలమగుచుండుటవలన దానికి 'సత్యోపయాచనము' అని ప్రసిద్ధి ఏర్పడినది. దూతలు ఆవృక్షమునకు ప్రదక్షిణ పూర్వకముగా నమస్కరించి, అనంతరము 'కులింగాపురి' ని జేరిరి. (16)

వారు కులింగాపురసమీపమునగల 'అభికాలము' అను గ్రామమునకు చేరి, 'ఇక్షుమతి' అను పవిత్రనదిని దాటిరి. అది 'బోధిభవనము' అను పర్వతమునపుట్టి ప్రవహించుచున్నది. ఆప్రదేశములన్నియును ఇక్ష్వాకుప్రభువుల పరిపాలనలోనివే. (17)

ఆ ఇక్షుమతీతీరమున ప్రతిదినము ఒక దోసెడునీటిని మాత్రమే త్రాగి, తపస్సుచేయుచుండెడి వేదపండితులైన బ్రాహ్మణులను వారు దర్శించిరి. పిమ్మట వారు బాహ్లీక దేశమధ్యభాగమునగల 'సుదామ' పర్వతమునకు జేరిరి. (18)

ఆదూతలు సుదామపర్వతశిఖరముపైగల విష్ణుపాదక్షేత్రమును, ఆపర్వతమును ఆనుకొని ప్రవహించుచున్న విపాశ[1] (వ్యాస-బియాస్) నదిని, దానితీరముననున్న శాల్మలీవృక్షములను దర్శించిరి. వారు క్రమముగా ముందునకుసాగుచు వివిధనదులను, దిగుడుబావులను,

1) ఈ నదియందు స్నానమొనర్చిన వారి సంసారపాశములను ఇది త్రెంచివేయును- కనుక ఈ నదికి విపాశ అనుపేరు ఏర్పడినట్లు ప్రతీతి.

పశ్యంతో వివిధాంశ్చాపి సింహవ్యాఘ్రమృగద్విపాన్।
యయుః పథాఽతిమహతా శాసనం భర్తురీప్సవః। 20

తే శ్రాంతవాహనా దూతా వికృష్టేన పథా తతః।
గిరివ్రజం పురవరం శీఘ్రమాసేదురంజసా। 21

భర్తుః ప్రియార్థం కులరక్షణార్థం
భర్తుశ్చ వంశస్య పరిగ్రహార్థమ్ ।
అహేడమానాస్త్వరయా స్మ దూతాః
రాత్ర్యాం తు తే తత్పురమేవ యాతాః। 22

చెఱువులను, చిన్నచిన్నగుంటలను, సరస్సులను, అట్లే సింహములు, పెద్దపులులు, జింకలు, ఏనుగులుమొదలగు వనజంతువులను జూచుచు, రాజాజ్ఞను పాలించు ఇచ్ఛతో విశాలములైన మార్గములలో పయనించిరి. (19-20)

సుదూరప్రయాణములచే ఆదూతలగుఱ్ఱములు అలసిపోయి యుండెను. ఐనను వారు మిక్కిలిశీఘ్రముగా కేకయరాజ్యమునకు నగరమైన గిరివ్రజపురమునుచేరిరి. మృతుడైన దశరథునిఆత్మశాంతి కొఱకును, ఇక్ష్వాకువంశజుల రక్షణకొఱకును, ఆ ప్రభువులవంశము యొక్క పేరుప్రతిష్ఠలను నిల్పుటకును ఆ దూతలు ఆదరాభిమానములతో రాత్రివేళయైనప్పటికిని ఆపురమున త్వరత్వరగా ప్రవేశించిరి. (21-22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టషష్టితమస్సర్గః (68)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదియెనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

69. అఱువదితొమ్మిదవసర్గము

తనకు దుస్స్వప్నమురాగా భరతుడు చింతాక్రాంతుడగుట - దానినిగూర్చి అతడు తనమిత్రులకుదెల్పుట.

యామేవ రాత్రిం తే దూతాః ప్రవిశంతి స్మ తాం పురీమ్।
భరతేనాపి తాం రాత్రిం స్వప్నో దృష్టోఽయమప్రియః। 1

వ్యుష్టామేవ తు తాం రాత్రిం దృష్ట్వా తం స్వప్నమప్రియమ్।
పుత్రో రాజాధిరాజస్య సుభృశం పర్యతప్యత। 2

తప్యమానం సమాజ్ఞాయ వయస్యాః ప్రియవాదినః।
ఆయాసం హి వినేష్యంతః సభాయాం చక్రిరే కథాః। 3

వాదయంతి తథా శాంతిం లాసయంత్యపి చాపరే।
నాటకాన్యపరే ప్రాహుః హాస్యాని వివిధాని చ। 4

స తైర్మహాత్మా భరతః సఖిభిః ప్రియవాదిభిః।
గోష్ఠీహాస్యాని కుర్వద్భిః న ప్రాహృష్యత రాఘవః। 5

తమబ్రవీత్ ప్రియసఖో భరతం సఖిభిర్వృతమ్।
సుహృద్భిః పర్యుపాసీనః కిం సఖే! నానుమోదసే। 6

ఏవం బ్రువాణం సుహృదం భరతః ప్రత్యువాచ హ।
శృణు త్వం యన్నిమిత్తం మే దైన్యమ్ ఏతదుపాగతమ్। 7

వసిష్ఠమహర్షి పంపినదూతలు గిరివ్రజపురమున (కేకయరాజు యొక్క నగరమున) ప్రవేశించినరాత్రియందే భరతుడు ఒక దుఃస్వప్నమునుగాంచెను. రాత్రిగడచి, తెల్లవాఱుచుండగా (వేకువజామున) వచ్చిన అప్రియమైన ఆస్వప్నమునకు దశరథమహారాజుపుత్త్రుడైన భరతుడు మిక్కిలి మానసికవేదనను అనుభవించెను. చింతాగ్రస్తుడై యున్న అతనితీరును గమనించి, ఆయనప్రియమిత్రులు అతని మనోవేదనను తొలగించుటకై సభను ఏర్పాటుచేసి, కథలు చెప్పసాగిరి. (1-3)

భరతునకు మనశ్శాంతిని గూర్చుటకై వారు వీణావేణు నాదములను వినిపించిరి. కొందఱు మనోహరములైన వివిధములగు నృత్తములను, నృత్యములను, రసరంజకములైన నాటికలను, నాటకములను ప్రదర్శించిరి. హాస్యప్రసంగములనుగావించిరి. కాని రఘువంశశ్రేష్ఠుడు, మహాత్ముడు ఐన ఆ భరతుడు తన ప్రియమిత్రులు వినోదార్థము హాస్యప్రసంగాదికార్యక్రమములు ఎన్ని నిర్వహించినను, తనవిచారమునుండి బయటపడకుండెను. అప్పుడు సఖులమధ్య ఆసీనుడైయున్న భరతునితో ఒక ప్రియసఖుడు 'మిత్రమా! స్నేహితులందఱును నీచుట్టును చేరి యున్నప్పటికిని నీవు సంతోషింపవేల?' అని ప్రశ్నించెను. (4-6)

ఇట్లు పలుకుచున్న ఆ సఖునకు భరతుడు ఈవిధముగా ప్రత్యుత్తరమిచ్చెను. "మిత్రమా! నాఈదైన్యస్థితికిగల కారణమును తెల్పెదను వినుము. కలలో నాతండ్రికనబడెను. ఆయనశరీరము

స్వప్నే పితరమద్రాక్షం మలినం ముక్తమూర్ధజమ్।
పతంతమద్రిశిఖరాత్ కలుషే గోమయహ్రదే। 8

ప్లవమానశ్చ మే దృష్టః స తస్మిన్ గోమయహ్రదే।
పిబన్నంజలినా తైలం హసన్నపి ముహుర్ముహుః। 9

తతస్తిలౌదనం భుక్త్వా పునః పునరధశ్శిరాః।
తైలేనాభ్యక్తసర్వాంగః తైలమేవావగాహత। 10

స్వప్నే చ సాగరం శుష్కం చంద్రం చ పతితం భువి।
ఉపరుద్ధాం చ జగతీం తమసేవ సమావృతామ్। 11

ఔపవాహ్యస్య నాగస్య విషాణం శకలీకృతమ్।
సహసా చాపి సంశాంతం జ్వలితం జాతవేదసమ్। 12

అవతీర్ణాం చ పృథివీం శుష్కాంశ్చ వివిధాన్ ద్రుమాన్।
అహం పశ్యామి విధ్వస్తాన్ సధూమాంశ్చాపి పర్వతాన్। 13

పీఠే కార్ష్ణాయసే చైనం నిషణ్ణం కృష్ణవాససమ్।
ప్రహసంతి స్మ రాజానం ప్రమదాః కృష్ణపింగళాః। 14

త్వరమాణశ్చ ధర్మాత్మా రక్తమాల్యానులేపనః।
రథేన ఖరయుక్తేన ప్రయాతో దక్షిణాముఖః। 15

ప్రహసంతీవ రాజానం ప్రమదా రక్తవాసినీ।
ప్రకర్షంతీ మయా దృష్టా రాక్షసీ వికృతాననా। 16

ఏవమేతన్మయా దృష్టమ్ ఇమాం రాత్రిం భయావహామ్।
అహం రామోఽథవా రాజా లక్ష్మణో వా మరిష్యతి। 17

నరో యానేన యః స్వప్నే ఖరయుక్తేన యాతి హి।
అచిరాత్ తస్య ధూమాగ్రం చితాయాం సంప్రదృశ్యతే। 18

ఏతన్నిమిత్తం దీనోఽహం తన్న వః ప్రతిపూజయే।
శుష్యతీవ చ మే కంఠో న స్వస్థమివ మే మనః। 19

న పశ్యామి భయస్థానం భయం చైవోపధారయే।
భ్రష్టశ్చ స్వరయోగో మే ఛాయా చోపహతా మమ। 20

జుగుప్సన్నివ చాఽత్మానం న చ పశ్యామి కారణమ్। 21

మలినమైయుండెను. కేశములు చెదరియుండెను, అతడు పర్వత శిఖరమునుండి కలుషితమైన గోమయముతోగూడిన ఒక మడుగులో పడుచుండుటచూచితిని. (7-8)

ఆయన ఆ ఆవుపేడమడుగులో కప్పవలె ఈదులాడుచుండెను. అతడు పదేపదే నవ్వుచు దోసిలితో తైలమును త్రాగుచుండెను. ఆయన నువ్వులఅన్నమునుతినుచుండెను. ఆయన శరీరమంతయును నూనెఅంటుకొనియుండెను. అతడు తలక్రిందులుగా పదేపదే నూనెలో మునకలువేయుచుండెను. (9-10)

ఆ స్వప్నమునందే నీరింకిపోయియున్న సముద్రమును, ఆకాశమునుండి భూమిపైపడుచున్న చంద్రుని చూచితిని. చీకట్లు క్రమ్ముకొనియుండుటచే నాకు భూమి కనబడకుండెను. (11)

రాజవాహనమైన భద్రగజముయొక్క దంతము ముక్కలుముక్కలై యుండుటను, ఉవ్వెత్తుగా ప్రజ్వరిల్లిన అగ్ని చల్లారిపోవుటను గాంచితిని. భూమిక్రుంగిపోవుటను, చెట్లన్నియు ఎండిపోయియుండుటను, పర్వతములు భ్రష్టమైపోవుచుండగా వాటినుండి తెలుపుతెలుపుగా పొగలువచ్చుటను చూచితిని. (12-13)

మా తండ్రి నల్లనివస్త్రములను ధరించి, నల్లని ఇనుపపీటపై కూర్చొనియుండెను. నల్లగా, పచ్చగానున్న స్త్రీలు అతనినిజూచి నవ్వుచుండుటను దర్శించితిని. ధర్మాత్ముడైన మా తండ్రి ఎఱ్ఱని దండలతో, మైపూతలతో ఒప్పుచు, మిగులవేగముగా సాగిపోగల గాడిదలను పూన్చినరథముపై దక్షిణాభిముఖముగా త్వరత్వరగా వెళ్లుచుండుట చూచితిని. (14-15)

వికారమైన ముఖముగల ఒక రాక్షసస్త్రీ రక్తవస్త్రములను దాల్చి, రాజునుజూచినవ్వుచు, ఆయనను లాగుచుండుటను గమనించితిని. (16)

ఈవిధముగా ఈరాత్రియందు వేకువజామున భయంకరమైన ఒక కలగంటిని. దీని ఫలితముగా నేనో, రాముడో, మహారాజో, లక్ష్మణుడో మరణించుట తథ్యము. (17)

కలలో ఒకవ్యక్తి మిగుల వడిగాపోగల గాడిదలనుపూన్చిన రథముపై వెళ్లుచున్నట్లు కనబడినచో, అతడు త్వరలో మరణించును. అతనిచితినుండి లేచెడిపొగలను లోకము చూచుటయు సంభవించును. (18)

నాకు ఈకలవచ్చిన కారణముగా నన్ను దైన్యము ఆవరించినది. అందువలన నేను మిమ్ములను ఆదరింపనైతిని. నాకంఠము మూగపోయినది, మనస్సు కలతచెందినది. నేను భయమునకు లోనైతిని, దానికి కారణమేమో తెలియుటలేదు. నానోట మాట వచ్చుట లేదు. ఆ కారణముగా కృశించిపోవుచున్నాను. నాపై నాకే రోత కలుగుచున్నది. అందులకు హేతువేమో తెలియదు. (19- 21)

ఇమాం హి దుస్స్వప్నగతిం నిశామ్య తామ్
అనేకరూపామ్ అవితర్కితాం పురా ।
భయం మహత్ తద్ధృదయాన్న యాతి మే
విచింత్య రాజానమచింత్యదర్శనమ్ ॥ 22

ఇట్టి వివిధదృశ్యములుగల పిచ్చిపిచ్చి కలలనుగూర్చి ఇదివఱలో నేను ఎన్నడును తలంచియుండలేదు. స్వప్నమున జూచిన, అనూహ్యమైన రాజుగారి దుఃస్థితిని తలంచుకొని, మిగుల భయగ్రస్తుడనైతిని. ఆ భయము ఇప్పటికిని నాహృదయము నుండి తొలగిపోవుటలేదు. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనసప్తతితమస్సర్గః (69)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు అఱువదితొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

70. డెబ్బదియవసర్గము

అయోధ్యనుండివచ్చిన దూతలు వసిష్ఠునిఆదేశమును భరతునకు దెల్పుట - భరతుడు శత్రుఘ్నునితోగూడి మాతామహునిఆజ్ఞదీసికొని అయోధ్యకు బయలుదేఱుట.

భరతే బ్రువతి స్వప్నం దూతాస్తే క్లాంతవాహనాః ।
ప్రవిశ్యాసహ్యపరిఖం రమ్యం రాజగృహం పురమ్ ॥ 1

సమాగమ్య తు రాజ్ఞా చ రాజపుత్త్రేణచార్చితాః ।
రాజ్ఞః పాదౌ గృహీత్వా తు తమూచుర్భరతం వచః ॥ 2

భరతుడు ఇట్లు తన స్వప్నవృత్తాంతమునుగూర్చి తనమిత్రులకు వివరించుచుండగా(అయోధ్యనుండివచ్చిన) ఆ దూతలు దుర్భేద్యమైన పురద్వారముగల 'రాజగృహము' అనుపేరుగల రమ్యమైన నగరమున ప్రవేశించిరి. వారిగుఱ్ఱములు అలసియుండెను. తమ కడకు విచ్చేసిన ఆ దూతలను కేకయమహారాజు, ఆయన కుమారుడైన యుధాజిత్తు ఆదరసత్కారములతోగౌరవించిరి. ఆదూతలు అయోధ్యకు రాజుకానున్న భరతునిపాదములకు నమస్కరించి, ఆయనతో ఇట్లనిరి. (1-2)

పురోహితస్త్వాం కుశలం ప్రాహ సర్వే చ మంత్రిణః ।
త్వరమాణశ్చ నిర్యాహి కృత్యమాత్యయికం త్వయా ॥ 3

"నాయనా! ఓభరతా! వంశపురోహితుడైన వసిష్ఠమహర్షియు మంత్రులందఱును నీక్షేమసమాచారములను గూర్చి ప్రస్తావించిరి. అయోధ్యలో మీరు అత్యవసరముగా నిర్వహింపవలసిన కార్యము గలదు. కనుక మీరు వెంటనే బయలుదేఱుడు. (3)

ఇమాని చ మహార్హాణి వస్త్రాణ్యాభరణాని చ ।
పరిగృహ్య విశాలాక్ష! మాతులస్య చ దాపయ ॥ 4

ఓ రాజకుమారా! అమూల్యములైన ఈ వస్త్రాభరణములను స్వీకరింపుడు. వీటిని మీతాతగారికిని, మేనమామకును సమర్పింపుడు. (4)

అత్ర వింశతికోట్యస్తు నృపతేర్మాతులస్య తే ।
దశకోట్యస్తు సంపూర్ణాః తథైవ చ నృపాత్మజ! ॥ 5

ఓరాజపుత్త్రా! ఈవస్త్రాభరణాదులలో ఇరువదికోట్ల రూప్యముల విలువగలవి మీతాతగారికిని, పదికోట్ల విలువగలవి మీమేనమామ గారికిని ఉద్దేశింపబడినవి. (5)

ప్రతిగృహ్య తు తత్సర్వం స్వనురక్తః సుహృజ్జనే ।
దూతానువాచ భరతః కామైః సంప్రతిపూజ్య తాన్ ॥ 6

బంధుమిత్రులయెడ మిగుల ప్రేమానురాగములుగల భరతుడు ఆకానుకలను అన్నింటిని స్వీకరించి, మహారాజునకును, మేనమామకును వాటిని అర్పించెను. పిమ్మట అతిథిసత్కారములతో, మృష్టాన్న భోజనములతో ఆదూతలను సంతృప్తిపఱచెను. (6)

కచ్చిత్ సుకుశలీ రాజా పితా దశరథో మమ! ।
కచ్చిచ్చారోగతా రామే లక్ష్మణేచ మహాత్మని! ॥ 7

ఆర్యా చ ధర్మనిరతా ధర్మజ్ఞా ధర్మదర్శినీ ।
అరోగాచాపి కౌసల్యా మాతా రామస్య ధీమతః ॥ 8

కచ్చిత్ సుమిత్రా ధర్మజ్ఞా జననీ లక్ష్మణస్య యా ।
శత్రుఘ్నస్య చ వీరస్య సాఽరోగాచాపి మధ్యమా ॥ 9

మాతండ్రియైన దశరథమహారాజుకుశలమేనా? మహాత్ములైన రామలక్ష్మణులు క్షేమమేగదా? ధీమంతుడైన రామునియొక్క జననియు, ధర్మమును బాగుగాఎఱింగి, దానిని ఆచరించునదియు, ప్రజలలో ధర్మమునే (గుణములనే) దర్శించునదియు, పూజ్యురాలును ఐన కౌసల్యాదేవి క్షేమమేగదా ? వీరులైన లక్ష్మణశత్రుఘ్నుల యొక్క తల్లియు, ధర్మజ్ఞురాలును మాముగ్గురు తల్లులలో మధ్యస్థయు

ఆత్మకామా సదా చండీ క్రోధనా ప్రాజ్ఞమానినీ।
అరోగ్గా చాపి మే మాతా కైకేయీ కిమువాచ హ। 10

ఏవముక్తాస్తు తే దూతా భరతేన మహాత్మనా।
ఊచుః సప్రశ్రయం వాక్యమ్ ఇదం తం భరతం తదా। 11

కుశలాస్తే నరవ్యాఘ్ర! యేషాం కుశలమిచ్ఛసి।
శ్రీశ్చ త్వాం వృణుతే పద్మా యుజ్యతాం చాపి తే రథః। 12

భరతశ్చాపి తాన్ దూతాన్ ఏవముక్తోఽభ్యభాషత।
ఆపృచ్ఛేఽహం మహారాజం దూతాః సంత్వరయంతి మామ్। 13

ఏవ ముక్త్వా తు తాన్ దూతాన్ భరతః పార్థివాత్మజః।
దూతైః సంచోదితో వాక్యం మాతామహమువాచ హ। 14

రాజన్! పితుర్గమిష్యామి సకాశం దూతచోదితః।
పునరప్యహమేష్యామి యదా మే త్వం స్మరిష్యసి। 15

భరతేనైవ ముక్తస్తు నృపో మాతామహస్తదా।
తమువాచ శుభం వాక్యం శిరస్యాఘ్రాయ రాఘవమ్। 16

గచ్ఛ తాతానుజానే త్వాం కైకేయీ సుప్రజాస్త్వయా।
మాతరం కుశలం బ్రూయాః పితరం చ పరంతప। 17

పురోహితం చ కుశలం యే చాన్యే ద్విజసత్తమాః।
తౌ చ తాత! మహేష్వాసౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ। 18

తస్మై హస్త్యుత్తమాంశ్చిత్రాన్ కంబలానజినాని చ।
అభిసత్కృత్య కైకేయో భరతాయ ధనం దదౌ। 19

రుక్మనిష్కసహస్రే ద్వే షోడశాశ్వశతాని చ।
సత్కృత్య కైకయీపుత్రం కేకయో ధనమాదిశత్। 20

తథాఽమాత్యానభిప్రేతాన్ విశ్వాస్యాంశ్చ గుణాన్వితాన్।
దదావశ్వపతిః క్షిప్రం భరతాయానుయాయినః। 21

ఐరావతానైంద్రశిరాన్ నాగాన్ వై ప్రియదర్శనాన్।
ఖరాన్ శీఘ్రాన్ సుసంయుక్తాన్ మాతులోఽస్మై ధనం దదౌ। 22

ఐన సుమిత్రాదేవి కుశలమేగదా? స్వార్థపరురాలును, ఉగ్రస్వభావము గలదియు, కోపిష్ఠియు, అందరిలో తానే తెలివిగలదానను- అని భావించునదియు ఐన మాతల్లి కైకేయికి ఎట్టి ఆపదయు లేదుగదా? ఆమె యేమని చెప్పిపంపినది?" (7-10)

మహాత్ముడైన భరతుడు ఈవిధముగా అడిగిన పిమ్మట ఆ దూతలు సవినయముగా అతనితో ఇట్లు పలికిరి. (11)

'ఓ నరోత్తమా! అందరును క్షేమమే. పద్మహస్తయైన లక్ష్మీదేవి (రాజ్యలక్ష్మి) నిన్ను వరించుచున్నది. వెంటనే రథమును అధిరోహించి, బయలుదేఱుము.' (12)

దూతలు ఇట్లు పలికిన పిదప భరతుడు వారితో ఈవిధముగా నుడివెను. "సరే! నా అయోధ్యాప్రయాణమునకు దూతలు నన్ను తొందరపెట్టుచున్నారు. 'మీయాజ్ఞయేమి?' అని రాజుగారిని అడిగెదను." (13)

రాజకుమారుడైన భరతుడు దూతలతో ఇట్లు పలికి, వారి ప్రోత్సాహముతో మాతామహుడైన కేకయరాజునకు ఇట్లు విన్నవించెను. (14)

"ఓ మహారాజా! దూతలసందేశమును అనుసరించి, నేను మా తండ్రి గారికడకు వెళ్లెదను. మీరు నన్ను స్మరించినప్పుడు నేను మీకడకు వచ్చివాలెదను". (15)

భరతుని అభ్యర్థనను విన్న పిమ్మట, అతని మాతామహుడగు కేకయరాజు రఘువరుడైన ఆ భరతుని మూర్ధమును మూర్కొని, అతనితో ఇట్లు శుభవచనములను పలికెను. (16)

"నాయనా! కైకేయి యనుంగుపుత్రా! సంతోషముగా వెళ్లిరమ్ము. ఓ పరంతపా! మీ తల్లిదండ్రుల క్షేమమును గూర్చి అడిగినట్లు తెల్పుము. కులపురోహితుడైన వసిష్ఠమహర్షి మున్నగు బ్రాహ్మణోత్తముల కుశలములను అడిగినట్లు నుడువుము. నాయనా! గొప్పధనుర్ధారులు, మీసోదరులు అగు రామలక్ష్మణులను గూడ అడిగినట్లు చెప్పుము. (17-18)

పిమ్మట కేకయమహారాజు ఆ భరతునకు భద్రగజములను, చిత్రములైన కంబళములను, మృగచర్మములను, ధనమును ఇచ్చి ప్రశంసాపూర్వకముగా సత్కరించెను. ఇంకను అతనికి రెండువేల బంగారు నాణెములను, పదునాఱువందల గుఱ్ఱములను, ఇతరసంపదలను బహూకరించెను. అట్లే ఆ కేకయప్రభువు తనకు ఇష్టులును, విశ్వాసపాత్రులును, గుణవంతులును ప్రాణములను ఒడ్డియైనను యజమానిని రక్షించువారును ఐన అంగరక్షకులను భరతునకు అనుయాయులనుగా వెంటనే సమర్పించెను. (19-21)

పిమ్మట మేనమామయైన యుధాజిత్తు, ఇరావత్పర్వతమున పుట్టినవియు, ఇంద్రశిరగిరియందు జన్మించినవియు అగు అందమైన ఏనుగులను, సుశిక్షితములై, వేగముగా నడువగల గుఱ్ఱములను భరతునకు కానుకలుగా ఇచ్చెను. ఇంకను అతడు అంతఃపురమునందు చక్కని శిక్షణతో పెంచబడినవియు, పెద్దపులులవలె

అంతఃపురేఽతిసంవృద్ధాన్ వ్యాఘ్రవీర్యబలాన్వితాన్।
దంష్ట్రాఽఽయుధాన్ మహాకాయాన్ శునశ్చోపాయనం దదౌ॥ 23

బలపరాక్రమములుగలవియు, వాడికోఱలేఆయుధములుగా గలవియు, దృఢమైన శరీరములుగలవియు ఐన శునకములను (వేటకుక్కలను) భరతునకు బహుమతిగా ఇచ్చెను. (22-23)

స దత్తం కేకయేంద్రేణ ధనం తన్నాభ్యనందత।
భరతః కైకయీపుత్రో గమనత్వరయా తదా॥ 24

అంతట కైకేయికుమారుడైన భరతుడైతే అప్పుడు అయోధ్యకు త్వరగావెళ్లవలసియుండుటచే కేకయరాజు, అతనికుమారుడు యుధాజిత్తు ఇచ్చినకానుకలను స్వీకరింపలేదు. (24)

బభూవ హ్యస్య హృదయే చింతా సుమహతీ తదా।
త్వరయా చాపి దూతానాం స్వప్నస్యాపి చ దర్శనాత్॥ 25

తనకువచ్చిన దుస్స్వప్నకారణమునను, దూతలు తొందరపెట్టు చుండుటచేతను భరతునిహృదయము అంతులేని చింతకు లోనయ్యెను. (25)

స స్వవేశ్మ వ్యతిక్రమ్య నరనాగాశ్వసంవృతమ్।
ప్రపేదే సుమహచ్ఛ్రీమాన్ రాజమార్గమనుత్తమమ్॥ 26

మిక్కిలి శుభలక్షణసంపన్నుడైన భరతుడు తనవిడిది భవనమునకు వెళ్లి, అచట మాతామహి (అమ్మమ్మ) మొదలగు వారిఅనుమతిగైకొని, పిమ్మట చతురంగబలములతోగూడి చక్కని రాజమార్గమును అనుసరించెను. (26)

అభ్యతీత్య తతోఽపశ్యత్ అంతఃపురముదారధీః।
తతస్తద్భరతః శ్రీమాన్ ఆవివేశానివారితః॥ 27

బుద్ధిమంతుడును శుభలక్షణసంపన్నుడునైన భరతుడు ఆరాజమార్గమునుదాటి, రాజప్రాసాదములలోని ఒక మహాభవనమును జూచెను. వెంటనే అతడు అందుప్రవేశించెను. అప్పుడు అతనిని ఎవ్వరును నివారింపలేదు. (27)

స మాతామహమాపృచ్ఛ్య మాతులం చ యుధాజితమ్।
రథమారుహ్య భరతః శత్రుఘ్నసహితో యయౌ॥ 28

పిదప ఆభరతుడు శత్రుఘ్నసహితుడై, మాతామహుడైన కేకయ రాజు (తాత) అనుమతిని, మేనమామయైన యుధాజిత్తుయొక్క ఆమోదమును బడసి, రథముపైనెక్కి అయోధ్యకు బయలుదేఱెను.

రథాన్ మండలచక్రాంశ్చ యోజయిత్వా పరశ్శతమ్।
ఉష్ట్రగోఽశ్వఖరైర్భృత్యా భరతం యాంతమన్వయుః॥ 29

రథముపై భరతుడు వెళ్లుచుండగా, భృత్యులు రత్నములు పొదిగిన శతాధికరథములను సమకూర్చుకొని, ఒంటెలు, వృషభములు, గుఱ్ఱములు మున్నగు బలములతో ఆయనను అనుసరించిరి. (28-29)

బలేన గుప్తో భరతో మహాత్మా
సహార్యకస్యాఽఽత్మసమైరమాత్యైః।
ఆదాయ శత్రుఘ్నమపేతశత్రుః
గృహాద్యయౌ సిద్ధ ఇవేంద్రలోకాత్॥ 30

మిక్కిలి ధైర్యశాలియు శత్రువులులేనివాడునుఐన భరతుడు అంగరక్షకులు వెంటనుండగా చతురంగబలములరక్షణలో శత్రుఘ్నునితోగూడినవాడై, ఇంద్రలోకమునుండి వెడలిన సిద్ధుని వలె మాతామహుని (తాతగారి) ఇంటినుండి బయలుదేఱెను. (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తతితమస్సర్గః (70)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదియవసర్గము సమాప్తము

-- * * * --

71. డెబ్బదియొకటవసర్గము

భరతుడు రథాసీనుడై కేకయరాజ్యమునుండి బయలుదేఱి, పల్లెలను, కొండలను, నదులను దాటుచు అయోధ్యను జేరుట - అతడు ఆ నగరమునందలి దుస్స్థితినిజూచి కలతచెందుట.

స ప్రాఙ్ముఖో రాజగృహాత్ అభినిర్యాయ రాఘవః।
తతః సుదామాం ద్యుతిమాన్ సంతీర్యావేక్ష్య తాం నదీమ్॥ 1

మిగులపరాక్రమశాలియైన ఆభరతుడు 'రాజగృహ' నగరమునుండి బయలుదేఱి, తూర్పుముఖముగా పయనించెను.[1] పిమ్మట అతడు 'సుదామా' నదిని దర్శించి, దానిని దాటెను. అనంతరము సద్గుణ

1) అయోధ్యనుండి గుఱ్ఱములపై బయలుదేఱిన దూతలు త్వరగా భరతునిజేరుటకై పగ్గిరిత్రోవను ఆశ్రయించి, కొండలను, గుట్టలను దాటుచు, మహారణ్యములద్వారా పయనించి, శీఘ్రముగా గిరివ్రజపురమునుజేరిరి. కాని భరతుడుమాత్రము చతురంగబలములతోగూడి ప్రయాణముచేయుచుండుటవలన దూతలు వచ్చినమార్గమునగాక వేఱొకవిశాలమైన మార్గమును ఆశ్రయించి, అయోధ్యకు చేరెను. కనుక ఈమార్గమునగల వేర్వేఱుగ్రామములపేర్లు నదీపర్వతనామములు ప్రత్యేకముగా పేర్కొనబడినవి.

హ్లాదినీం దూరపారాం చ ప్రత్యక్ స్రోతస్తరంగిణీమ్।
శతద్రూమతరచ్ఛ్రీమాన్ నదీమిక్ష్వాకునందనః। 2

ఏలాధానే నదీం తీర్త్వా ప్రాప్య చాపరపర్పటాన్।
శిలామాకుర్వతీం తీర్త్వా ఆగ్నేయం శల్యకర్తనమ్। 3

సత్యసంధః శుచిశ్శ్రీమాన్ ప్రేక్షమాణః శిలావహామ్।
అత్యయాత్ స మహాశైలాన్ వనం చైత్రరథం ప్రతి। 4

సరస్వతీం చ గంగాం చ యుగ్మేన ప్రతిపద్య చ।
ఉత్తరం వీరమత్స్యానాం భారుండం ప్రావిశద్వనమ్। 5

వేగినీం చ కులింగాఖ్యాం హ్లాదినీం పర్వతావృతామ్।
యమునాం ప్రాప్య సంతీర్ణో బలమాశ్వాసయత్ తదా। 6

శీతీకృత్య తు గాత్రాణి క్లాంతానామాశ్వాస్య వాజినః।
తత్ర స్నాత్వా చ పీత్వా చ ప్రాయాదాదాయ చోదకమ్। 7

రాజపుత్త్రో మహారణ్యమ్ అనభీక్ష్ణోపసేవితమ్।
భద్రో భద్రేణ యానేన మారుతః ఖమివాత్యయాత్। 8

భాగీరథీం దుష్ప్రతరామ్ అంశుధానే మహానదీమ్।
ఉపాయాద్రాఘవస్తూర్ణం ప్రాగ్వటే విశ్రుతే పురే। 9

స గంగాం ప్రాగ్వటే తీర్త్వా సమాయాత్ కుటికోష్ఠికామ్।
సబలస్తాం స తీర్త్వాఽథ సమాయాద్ధర్మవర్ధనమ్। 10

తోరణం దక్షిణార్ధేన జంబూప్రస్థముపాగమత్।
వరూథం చ యయౌ రమ్యం గ్రామం దశరథాత్మజః। 11

తత్ర రమ్యే వనే వాసం కృత్వాఽసౌ ప్రాఙ్ముఖో యయౌ।
ఉద్యానమ్ ఉజ్జిహానాయాః ప్రియకా యత్ర పాదపాః। 12

సంపన్నుడైన ఆభరతుడు వరుసగా విశాలమైన **'హ్లాదిని'** నదిని, పశ్చిమదిశగాప్రవహించెడి **శతద్రూ (సట్లెజ్)** నదమును దాటెను. (1-2)

ఏలాధాననగరసమీపమునగల **శతద్రు**నదమునుదాటిన పిమ్మట, అతడు **'అపరపర్పటములు'** అను ప్రదేశములకుచేరి, రాళ్లను ఆకర్షించునట్టి **శిలావహానదిని** దాటి, అచటికి ఆగ్నేయదిశలోనున్న **శల్యకర్తన** నగరమునకుజేరెను. (3)

సత్యసంధుడు, పవిత్రుడు, శ్రీమంతుడు ఐన భరతుడు **'శిలావహ'** నదినిజూచుచు, దారిలోనున్న మహాపర్వతములనుదాటుచు **చైత్రరథవనమునకు** చేరెను. (4)

అనంతరము అతడు పశ్చిమదిశగాప్రవహించు **సరస్వతీనదియు, గంగానదియొక్క** పాయయు కలియుప్రదేశమునుజేరెను. పిమ్మట అచటికి ఉత్తరదిశనగల **వీరమత్స్యదేశములమీదుగా భారుండ వనమున** ప్రవేశించెను. (5)

మిక్కిలివేగముగా ప్రవహించునట్టిదియు, పర్వతములచే ఆవరింపబడి, ఆహ్లాదకరముగానున్నట్టిదియు ఐన **'కులింగము'** అనుపేరుగల **యమునానదిని** దాటి, ఎండలకుడస్సియున్న తన సైన్యమును ఆ యమునానదీతీరమున విశ్రమింపజేసెను. (6)

ప్రయాణశ్రమచే మిగుల అలసియున్న గుఱ్ఱములను కడిగించి, వాటికి సరియగుగ్రాసమును, నీటిని సమకూర్చి, చెట్లనీడలలో వాటిని విశ్రమింపజేసెను. పిమ్మట ఆత్మీయులందరితో తాను స్నానపానములను ముగించుకొని, ప్రయాణసమయమున దాహము తీర్చుకొనుటకై కొంతనీటినిదీసికొని, ముందునకుసాగెను. (7)

మంగళకరుడైన రాజకుమారుడగు భరతుడు జనసంచారము లేని దుర్గమారణ్యములను సురక్షితమైన రథముపై ఆకాశమును వాయువువలె అధిగమించి వెళ్లెను. (8)

అనంతరము అతడు **అంశుధాన**నగరమునుజేరెను. అచట తమకు అనువగు రేవులేకుండుటచే సైన్యములతో ఆగంగా మహానదినిదాటుట అసాధ్యమనియెఱింగి, వెంటనే సుప్రసిద్ధమైన రేవుపట్టణమగు **ప్రాగ్వటనగరము**నకుచేరెను. (9)

చతురంగబలములతో గూడియున్న ఆభరతుడు 'ప్రాగ్వట' నగరసమీపమున గంగానదినిదాటి, **కుటికోష్ఠికానదిని** సమీపించెను. పిమ్మట దానినిగూడ దాటి **'ధర్మవర్ధనము'** అనుగ్రామమును జేరెను. (10)

అచటినుండి భరతుడు **తోరణగ్రామమునకు** దక్షిణమున గల **జంబూప్రస్థ**గ్రామమునకుచేరెను. అనంతరము అతడు రమణీయమైన **'వరూథము'** అను ప్రసిద్ధగ్రామమునకు చేరెను. అచట మనోజ్ఞమైన ఒక వనమునందు ఆరాత్రిగడపెను. అనంతరము అచటినుండి తూర్పుదిశగా కదలి, ఉజ్జిహానగరసమీపమునగల ఒక వనమునకు చేరెను. ఆవనమునందు కదంబవృక్షములు సమృద్ధిగానుండెను. (11-12)

పాలాంస్తు ప్రియకాన్ ప్రాప్య శీఘ్రానాస్థాయ వాజినః।
అనుజ్ఞాప్యాథ భరతో వాహినీం త్వరితో యయౌ॥ 13

ఆ కడిమిచెట్లతోపును జేరినపిమ్మట సైనికులతో 'నేను ముందుగా వెళ్లెదను. మీరు తిన్నగా రండు'. అని పలికి తాను జవనాశ్వములను పూన్చినరథముపై త్వరత్వరగాసాగిపోయెను. (13)

వాసం కృత్వా సర్వతీర్థే తీర్త్వా చోత్తానికాం నదీమ్।
అన్యా నదీశ్చ వివిధాః పార్వతీయైస్తురంగమైః॥ 14

హస్తిపృష్ఠకమాసాద్య కుటికామత్యవర్తత।
తతార చ నరవ్యాఘ్రో లౌహిత్యే స కపీవతీమ్॥ 15

అతడు 'సర్వతీర్థ' గ్రామమున ఒక రాత్రివసించి, పిమ్మట పర్వతప్రాంతములలో పుట్టిపెరిగిన గుఱ్ఱములసాయముతో 'ఉత్తానికా' నదిని, తదితరనదులను దాటెను. నరశ్రేష్ఠుడైన భరతుడు 'హస్తిపృష్ఠక' గ్రామమునుచేరి, కుటికానదినిదాటెను. అనంతరము 'లౌహిత్య' గ్రామమునుచేరి, 'కపీవతి' నదిని అతిగమించెను. (14-15)

ఏకసాలే స్థాణుమతీం వినతే గోమతీం నదీమ్।
కళింగనగరే చాపి ప్రాప్య సాలవనం తదా॥ 16

భరతః క్షిప్రమాగచ్ఛత్ సుపరిశ్రాంతవాహనః।
వనం చ సమతీత్యాశు శర్వర్యామరుణోదయే।
అయోధ్యాం మనునా రాజ్ఞా నిర్మితాం సందదర్శ హ॥ 17

తాం పురీం పురుషవ్యాఘ్రః సప్తరాత్రోషితః పథి।
అయోధ్యామగ్రతో దృష్ట్వా సారథిం వాక్యమబ్రవీత్॥ 18

అతడు త్వరత్వరగా 'ఏకసాల' గ్రామమున 'స్థాణుమతి' నదిని, 'వినత' అనుగ్రామసమీపమున 'గోమతి' నదినిదాటి, కళింగనగరమువొద్ద ఒక మద్దిచెట్లతోపున ప్రవేశించి, అశ్వములు అలసిపోవుటచూచి, అచట సేదదీర్చెను. పిమ్మట ఆవనమునువీడి, ఆరాత్రియంతయు వేగముగా ప్రయాణముచేసి, మనుప్రభువుచే నిర్మితమైన అయోధ్యను దర్శించెను. నరశ్రేష్ఠుడైన ఆభరతుడు మార్గమున ఏకధాటిగా ఏడుదినములు ప్రయాణముచేసి, ఎనిమిదవనాడు అరుణోదయసమయమున ఎదురుగానున్న ఆఅయోధ్యాపురమును జూచి, సారథితో ఇట్లనియెను. (16-18)

ఏషా నాతిప్రతీతా మే పుణ్యోద్యానా యశస్వినీ।
అయోధ్యా దృశ్యతే దూరాత్ సారథే పాండుమృత్తికా॥ 19

యజ్వభిర్గుణసంపన్నైః బ్రాహ్మణైర్వేదపారగైః।
భూయిష్ఠమృద్ధైరాకీర్ణా రాజర్షిపరిపాలితా॥ 20

"ఓ సారథీ! ఇదిగో! దూరమున కన్పించుచున్న ఈఅయోధ్యానగరమును చూడుము. అందు సద్గుణశోభితులు, వేదపండితులు ఐన బ్రాహ్మణోత్తములు నిత్యము యజ్ఞయాగములను నిర్వహించుచుందురు. ఇది మిక్కిలి ధనసంపన్నులచే నిండియుండును. దీనిని ఇక్ష్వాకువంశజులైన పెక్కుమంది రాజర్షులు పరిపాలించిరి. ఆవిధముగా ఖ్యాతివహించి, చక్కని ఉద్యానవనములతో కలకలలాడుచుండెడి ఈఅయోధ్యానగరము తెల్లని గోడలతో నేడు వెలవెలబోవుచున్నది. (19-20)

అయోధ్యాయాం పురా శబ్దః శ్రూయతే తుములో మహాన్।
సమంతాన్నరనారీణాం తమద్య న శృణోమ్యహమ్॥ 21

అయోధ్యానగరమునందు అంతటను పూర్వము స్త్రీపురుషుల కలకలలో పెద్దగా సవ్వడులు వినబడుచుండెడివి. కాని నేడు ఆధ్వనులు వినబడుటలేదు. (21)

ఉద్యానాని చ సాయాహ్నే క్రీడిత్వోపరతైర్నరైః।
సమంతాత్ పరిధావద్భిః ప్రకాశంతే మమాన్యథా।
తాన్యద్యానురుదంతీవ పరిత్యక్తాని కామిభిః॥ 22

అరణ్యభూతేవ పురీ సారథే ప్రతిభాతి మే॥ 23

సాయంకాలముకాగానే జనులు ఉద్యానవనములకుచేరి, అచట స్వేచ్ఛగా రాత్రియంతయు వినోదక్రీడలునలిపి, తెల్లవారిన పిమ్మట వారందఱును తమతమ ఇండ్లకు పరుగులుదీయుచు ఉండెడివారు. అప్పటి ఆ ఉద్యానవనశోభలు అపూర్వములు, కానినేడు అవి నాకు మఱియొకవిధముగా కనబడుచున్నవి. నేడవి రసికజనుల విహారములు లేక ఏడ్చుచున్నట్లుగానున్నవి. ఇప్పుడు ఈపురము నాకు పాడుబడిన అరణ్యమువలె నిర్జనమై గోచరించుచున్నది. (22-23)

న హ్యత్ర యానైర్దృశ్యంతే న గజైర్న చ వాజిభిః।
నిర్యాంతో వాఽభియాంతో వా నరముఖ్యా యథాపురమ్॥ 24

ఈపురమునందు శిబికాదివాహనములు, ఏనుగులు, అశ్వములు, పురప్రముఖులు ఇదివఱలోవలె రాకపోకలు సాగించుచున్నట్లు కనబడుటలేదు. (24)

ఉద్యానాని పురా భాంతి మత్తప్రముదితాని చ।
జనానాం రతిసంయోగేష్వత్యంతగుణవంతి చ। 25

తాన్యేతాన్యద్య పశ్యామి నిరానందాని సర్వశః।
స్రస్తపర్ణైరనుపథం విక్రోశద్భిరివ ద్రుమైః। 26

నాద్యాపి శ్రూయతే శబ్దో మత్తానాం మృగపక్షిణామ్।
సంరక్తాం మధురాం వాణీం కలం వ్యాహరతాం బహు। 27

చందనాగరుసంపృక్తో ధూపసమ్మూర్ఛితోఽతులః।
ప్రవాతి పవనః శ్రీమాన్ కిన్ను నాద్య యథాపురమ్। 28

భేరీమృదంగవీణానాం కోణసంఘట్టితః పునః।
కిమద్య శబ్దో విరతః సదాఽదీనగతిః పురా। 29

అనిష్టాని చ పాపాని పశ్యామి వివిధాని చ।
నిమిత్తాన్యమనోజ్ఞాని తేన సీదతి మే మనః। 30

సర్వథా కుశలం సూత! దుర్లభం మమ బంధుషు।
తథాహ్యసతి సమ్మోహే హృదయం సీదతీవ మే। 31

విషణ్ణః శ్రాంతహృదయః త్రస్తః సంలులితేంద్రియః।
భరతః ప్రవివేశాఽఽశు పురీమిక్ష్వాకుపాలితామ్। 32

ద్వారేణ వైజయంతేన ప్రావిశత్ శ్రాంతవాహనః।
ద్వాఃస్థైరుత్థాయ విజయం పృష్టస్తైః సహితో యయౌ। 33

స త్వనేకాగ్రహృదయో ద్వాఃస్థం ప్రత్యర్చ్య తం జనమ్।
సూతమ్ అశ్వపతేః క్లాంతమ్ అబ్రవీత్ తత్ర రాఘవః। 34

క్రమముగా పండ్లను, చిగురుటాకులను, పూదేనెలను ఆస్వాదించుటచే మత్తిల్లిన చిలుకలు, కోకిలలు, తుమ్మెదలు మొదలగువాటితో లోగడ పురమునందలి ఉద్యానవనములు కోళాహలముతో ఆహ్లాదకరముగా నుండెడివి. ఇంకను అవి జనులయొక్క క్రీడావినోదములకును, విహారములకును అనువుగా వివిధములగు పూపొదరిండ్లతోను, దిగుడుబావులతోడను, క్రీడాపర్వతములతోడను చూడముచ్చటగా నుండెడివి. నేడు ఆ ఉద్యానవనములయందలి చెట్లు సమీపమున గల మార్గములలో ఆకులను రాల్చుచు, ఏడ్చుచున్నట్లుండుటచే అవి (ఆఉద్యానవనములు) పూర్తిగా ఆనందశూన్యములై కన్పట్టు చున్నవి. (25-26)

సూర్యోదయము అయినప్పటికిని, ఇష్టమైన పండ్లను భుజించుచు మదించిన క్రీడామృగములయొక్క, శుకశారికాదిపక్షులయొక్క, రాగయుక్తములై అవ్యక్తమధురములగు కలకలారావములు ఏమాత్రము వినిపించుటయేలేదు. (27)

చందనము, అగరు సువాసనలతో గుబాళించుచు, సాటిలేని విధముగా హాయిని గొల్పెడివాయువులు ఎప్పటివలె నేడు ప్రసరించుట లేదేమి? కారణమేమైయుండును? (28)

కఱ్ఱలతో భేరీలను మ్రోగించుటవలనను, హస్తతలములతో మృదంగములను వాయించుటవలనను, వ్రేళ్లతో వీణాతంత్రులను మీటుటవలనను కలిగెడి లయతోగూడిన మధురనాదములు ఇదివఱలోవలె నిరంతరము వినిపించుటలేదేమి? (29)

చూచుటతోడనే దుఃఖమును కల్గించునవి, ఇష్టములుకానివి, అశుభసూచకములు, క్రూరములు ఐన అపశకునములు కనవచ్చు చుండుటచే నామనస్సు మిగుల కలతచెందుచున్నది. (30)

ఓసారథీ! నాఆత్మీయులకు ఏదేని ఒకరీతిగా తీరనికీడు సంభవించినట్లు నాకు అనిపించుచున్నది. కారణము తెలియక యున్నను నామనస్సుమాత్రము ఎంతయు ఖేదపడుచున్నది." (31)

భరతుడు మనస్సున ఖిన్నుడైయుండెను. అతనిగుండె బరువెక్కి యుండెను. మిక్కిలిభయమునకులోనైయుండెను. అతడు ఇంద్రియములక్షోభకు గురియైయుండెను. ఇట్టియవస్థలో అతడు ఆతురతతో ఇక్ష్వాకుప్రభువులరాజధానియైన అయోధ్యానగరమున ప్రవేశించెను. (32)

భరతునిరథాశ్వములు అలసియుండెను. అతడు నగరమునకు పశ్చిమదిశయందున్న 'వైజయంతము' అను ద్వారమున ప్రవేశించెను. వెంటనే అచటి ద్వారపాలకులు లేచి నిలబడి భరతునకు జయధ్వానములు చేసిరి. పిమ్మట అతడు వారితో కలిసివెళ్లెను. (33)

వ్యాకులపాటునకులోనైయున్న భరతుడు తనవెంటనున్న ద్వారపాలకులను గౌరవపూర్వకముగా వెనుకకుపంపి, అలసియున్న రథసారథితో (అశ్వపతిపంపగా తనవెంటవచ్చిన రథసారథితో) ఇట్లుపల్కెను. (34)

కిమహం త్వరయాఽఽనీతః కారణేన వినానఘ!।
అశుభాశంకి హృదయం శీలం చ పతతీవ మే। 35

శ్రుతా నో యాదృశాః పూర్వం నృపతీనాం వినాశనే।
ఆకారాంస్తానహం సర్వాన్ ఇహ పశ్యామి సారథే!। 36

సమ్మార్జనవిహీనాని పరుషాణ్యుపలక్షయే।
అసంయతకవాటాని శ్రీవిహీనాని సర్వశః। 37

బలికర్మవిహీనాని ధూపసమ్మోదనేన చ।
అనాశితకుటుంబాని ప్రభాహీనజనాని చ।
అలక్ష్మీకాని పశ్యామి కుటుంబిభవనాన్యహమ్। 38

అపేతమాల్యశోభాని హ్యసమ్మృష్టాజిరాణి చ।
దేవాగారాణి శూన్యాని న చాభాంతి యథాపురమ్। 39

దేవతార్చాః ప్రవిద్ధాశ్చ యజ్ఞగోష్ఠ్యస్తథావిధాః।
మాల్యాపణేషు రాజంతే నాద్య పణ్యాని వా తథా। 40

దృశ్యంతే వణిజోఽప్యద్య న యథాపూర్వమత్ర వై।
ధ్యానసంవిగ్నహృదయా నష్టవ్యాపారయంత్రితాః। 41

దేవాయతనచైత్యేషు దీనాః పక్షిగణాస్తథా।
మలినం చాశ్రుపూర్ణాక్షం దీనం ధ్యానపరం కృశమ్। 42

స స్త్రీపుంసం చ పశ్యామి జనముత్కంఠితం పురే। 43

ఇత్యేవ ముక్త్వా భరతః సూతం తం దీనమానసః।
తాన్యరిష్టాన్యయోధ్యాయాం ప్రేక్ష్య రాజగృహం యయౌ। 44

తాం శూన్యశృంగాటక వేశ్మరథ్యాం
రజోఽరుణద్వారకవాటయంత్రామ్ ।
దృష్ట్వా పురీమింద్రపురప్రకాశాం
దుఃఖేన సంపూర్ణతరో బభూవ । 45

"ఓ పుణ్యాత్ముడా! వసిష్ఠమహర్షి ఇంత త్వరగా నన్ను ఇచటికి పిలిపించుటకుగల కారణమేమైయుండును? నాహృదయము కీడును శంకించుచున్నది. ఎన్నడును దైన్యమును ఎఱుగని నాస్వభావము ధైర్యమునుకోల్పోవుచున్నది. (35)

ఓ సారథీ! మహారాజులు మరణించినప్పుడు ఏర్పడు పరిస్థితులను గూర్చి లోగడ నేను వినియుంటిని. అట్టి చిహ్నములన్నియును ఇప్పుడు ఇచట నాకు కనబడుచున్నవి. ఇచట గృహస్థులఇండ్లన్నియును శోభావిహీనములైయున్నవి. ముంగిళ్లను ఎవ్వరును శుభ్రపఱచినట్లు లేదు. అవియన్నియును చూచుటకు వికారముగా ఉన్నవి. వాకిండ్లను ఎవ్వరును మూసివేయులేదు. ఇండ్లన్నియును అన్నివిధములుగా కళదప్పియున్నవి. ఏ యింటిలోను బలికర్మలను ఆచరించినట్లు కనబడదు. ధూపసుగంధములవాసనలే లేవు. కుటుంబముల లోనివారందఱును భోజనములను మాని, కృశించినట్లున్నారు. ప్రజలందఱును అమూల్యములైన వస్తువులను కోల్పోయినట్లు దిగులుతో ఉన్నారు. దుఃఖకారణముగా ఇచటివారు తమఇండ్లలో వంటలుచేయుట మానివైచిరాయేమి? (36-38)

ఎప్పటివలె దేవమందిరములద్వారములను ఎచ్చటను పూలమాలలతో అలంకరింపనేలేదు. వీటిప్రాంగణములను ఊడ్చుటగాని, కళాపి చల్లుటగాని జరుగలేదు. ఈ దేవాలయములలో జనులెవ్వరును కనబడుటలేదు. ఇవియన్నియును పూర్వశోభనుకోల్పోయి యున్నవి. (39)

దేవపూజలు అడుగంటినట్లున్నవి. అట్లే యజ్ఞసభలు జరుగుచున్నట్లులేవు. పూలఅంగళ్లలో పూవులుగాని, దండలు గాని కన్పించుటయేలేదు. వర్తకులు పూర్వమువలె ఉత్సాహవంతులై కనబడుటలేదు. వ్యాపారములలో నష్టములపాలై దెబ్బతిన్నవారి వలె తీరనివిచారములో మునిగియున్నట్లున్నారు. (40-41)

దేవాలయములయందును, చైత్యములయందునుగల పక్షులన్నియును దిగులుతోనున్నవి. పురమునందలి స్త్రీపురుషులు అందఱును మలినవస్త్రములను ధరించి, కన్నీరుగార్చు చున్నారు. వీరు అందఱును దీనవదనులై, చింతాక్రాంతులై, కృశించి, ఎవరికొఱకోఎదురుచూచుచున్నట్లు ఉన్నారు." (42-43)

అయోధ్యలో అపశకునములనుగాంచిన భరతుడు మిగుల కలతచెందిన మనస్సుగలవాడై సూతునితో ఇట్లుపలికిన పిమ్మట రాజభవనమునకు చేరెను. (44)

అయోధ్యానగరము ఎల్లప్పుడును దేవేంద్రునిరాజధానియైన అమరావతివలె వైభవముతో విలసిల్లుచుండెడిది. నేడు అందలి వీధులకూడళ్లు, ఇండ్లు, రాజమార్గములు జనశూన్యములై యున్నవి. గృహద్వారములన్నియును దుమ్ముకొట్టుకొని ఎఱ్ఱబాఱి యున్నవి. ఈవిధముగా కళాకాంతులు దప్పియున్న అయోధ్యను జూచి భరతుడు పూర్తిగా దుఃఖమున మునిగెను. (45)

బహూని పశ్యన్ మనసో౽ప్రియాణి
యాన్యన్యదా నాస్య పురే బభూవుః ।
అవాక్శిరా దీనమనా న హృష్టః
పితుర్మహాత్మా ప్రవివేశ వేశ్మ । 46

భరతుడు తాను ఇదివఱకు అయోధ్యలో ఎన్నడును కనివిని యెఱుగని అప్రియదృశ్యములను, అశుభసూచకములైన శకునములను చూచెను. సహజముగా గుండెనిబ్బరముగలవాడేయైనను అతడు ఈకారణముగా ఉత్సాహమును కోల్పోయి, దీనమనస్కుడై, తలవంచుకొనినవాడై తండ్రిమందిరమున ప్రవేశించెను. (46)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకసప్తతితమస్సర్గః (71)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదియొకటవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

72. డెబ్బదిరెండవసర్గము

తనతల్లియగు కైకేయిద్వారా తండ్రియగు దశరథుని మరణవార్తను,
సీతారామలక్ష్మణులవనవాసవృత్తాంతమును విని, భరతుడు మిగుల పరితపించుట.

అపశ్యంస్తు తతస్తత్ర పితరం పితురాలయే।
జగామ భరతో ద్రష్టుం మాతరం మాతురాలయే। 1

రాజభవనమున తనతండ్రియగు దశరథుడు కనబడకపోవుటచే భరతుడు వెంటనే తనతల్లియగు కైకేయీదేవిని దర్శించుటకై ఆమెభవనమునకువెళ్లెను. (1)

అనుప్రాప్తం తు తం దృష్ట్వా కైకేయీ ప్రోషితం సుతమ్।
ఉత్పపాత తదా హృష్టా త్యక్త్వా సౌవర్ణమాసనమ్। 2

ఇంతవఱకును మాతామహుని (కేకయరాజు) కడనున్న భరతుడు తనదగ్గఱకురాగా కైకేయి అతనినిజూచి పట్టలేనిఆనందముతో బంగారుసింహాసనమునుండి ఒక్కయుదుటున లేచెను. (2)

స ప్రవిశ్యైవ ధర్మాత్మా స్వగృహం శ్రీవివర్జితమ్।
భరతః ప్రతిజగ్రాహ జనన్యాశ్చరణౌ శుభౌ। 3

ధర్మాత్ముడైన ఆభరతుడు కళావిహీనమైయున్న తనమాతృగృహమున ప్రవేశించి, తల్లియొక్క శుభచరణములకు ప్రణమిల్లెను. (3)

సా తం మూర్ధన్యుపాఘ్రాయ పరిష్వజ్య యశస్వినమ్।
అంకే భరతమారోప్య ప్రష్టుం సముపచక్రమే। 4

అంతట కైకేయి తేజస్వియైన ఆభరతుని అక్కునజేర్చుకొని, శిరమును మూర్కొని, అతనిని ఒడిలో కూర్చుండబెట్టుకొని, ఇట్లు ప్రశ్నింపసాగెను. (4)

అద్య తే కతిచిద్రాత్ర్యః చ్యుతస్యా౽ర్యకవేశ్మనః।
అపి నాధ్వశ్రమః శీఘ్రం రథేనా౽పతతస్తవ। 5

నాయనా! భరతా! పూజ్యులైన తాతగారియింటినుండి బయలుదేఱి ఎన్నిదినములుగడిచినవి? రథముపై వేగముగా పయనించుటచే నీవు త్రోవలో అంతగా అలసిపోలేదుగదా? (5)

ఆర్యకస్తే సుకుశలీ యుధాజిన్మాతులస్తవ।
ప్రవాసాచ్చ సుఖం పుత్ర సర్వం మే వక్తుమర్హసి। 6

మీతాతయైన కేకయమహారాజు, మేనమామ యుధాజిత్తు కుశలమేగదా? కుమారా! తాతగారియింట సుఖముగనేయుంటివి గదా? అన్నియును పూసగ్రుచ్చినట్లుచెప్పుము. (6)

ఏవం పృష్టస్తు కైకేయ్యా ప్రియం పార్థివనందనః।
ఆచష్ట భరతః సర్వం మాత్రే రాజీవలోచనః। 7

తల్లి కైకేయి తనను ఇట్లు అడిగిన పిమ్మట రాజకుమారుడు, కమలాక్షుడు ఐన భరతుడు కేకయరాజ్యమున తాతగారియింట తన అనుభవములను అన్నింటిని యథాతథముగ ఆమెకు ఇట్లు వివరించెను. (7)

అద్య మే సప్తమీ రాత్రిః చ్యుతస్యా౽౽ర్యకవేశ్మనః।
అంబాయాః కుశలీ తాతో యుధాజిన్మాతులశ్చ మే। 8

"అమ్మా! నేను తాతగారియింటినుండి బయలుదేఱి నేటికి ఏడురాత్రులు గడచినవి. అక్కడ తాతగారు, నామేనమామ యుధాజిత్తు మొదలగువారు అందఱును కుశలమే. (8)

యన్మే ధనం చ రత్నం చ దదౌ రాజా పరంతపః।
పరిశ్రాంతం పథ్యభవత్ తతో౽హం పూర్వమాగతః। 9

శత్రుభయంకరుడైన కేకయమహారాజు (తాత) గారు నాకు సమృద్ధిగా ధనమును, రత్నములను మొదలగువానిని కానుకలుగా ఇచ్చిరి. అవియన్నియును వాహనములపైవచ్చుచు దారిలోనున్నవి.

రాజవాక్యహరైర్దూతైః త్వర్యమాణోఽహమాగతః।
యదహం ప్రష్టుమిచ్ఛామి తదంబా వక్తుమర్హతి। 10

శూన్యోఽయం శయనీయస్తే పర్యంకో హేమభూషితః।
న చాయమిక్ష్వాకుజనః ప్రహృష్టః ప్రతిభాతి మా। 11

రాజా భవతి భూయిష్ఠమ్ ఇహాంబాయా నివేశనే।
త మహం నాద్య పశ్యామి ద్రష్టుమిచ్ఛన్నిహాగతః। 12

పితుర్గ్రహీష్యే చరణౌ తం మమాఽఽఖ్యాహి పృచ్ఛతః।
ఆహోస్విదంబ! జ్యేష్ఠాయాః కౌసల్యాయా నివేశనే। 13

తం ప్రత్యువాచ కైకేయీ ప్రియవద్ఘోరమప్రియమ్।
అజానంతం ప్రజానంతీ రాజ్యలోభేన మోహితా। 14

యా గతిః సర్వభూతానాం తాం గతిం తే పితా గతః।
రాజా మహాత్మా తేజస్వీ యాయజూకః సతాం గతిః। 15

తచ్ఛ్రుత్వా భరతో వాక్యం ధర్మాభిజనవాన్ శుచిః।
పపాత సహసా భూమౌ పితృశోకబలార్దితః। 16

హా హతోఽస్మీతి కృపణాం దీనాం వాచముదీరయన్।
నిపపాత మహాబాహుః బాహూ విక్షిప్య వీర్యవాన్। 17

తతః శోకేన సంవీతః పితుర్మరణదుఃఖితః।
విలలాప మహాతేజా భ్రాంతాకులితచేతనః। 18

ఏతత్ సురుచిరం భాతి పితుర్మే శయనం పురా।
శశినేవామలం రాత్రౌ గగనం తోయదాత్యయే। 19

తదిదం న విభాత్యద్య విహీనం తేన ధీమతా।
వ్యోమేవ శశినా హీనమ్ అప్శుష్క ఇవ సాగరః। 20

బాష్పముత్సృజ్య కంఠేన స్వార్తః పరమపీడితః।
ప్రచ్ఛాద్య వదనం శ్రీమద్వస్త్రేణ జయతాం వరః। 21

నాకొఱకువచ్చినదూతలు నన్నుతొందరపెట్టుటచే అశ్వముల వాహనములను తీవ్రగా రావలసినదనిచెప్పి, నేను ముందుగా వచ్చితిని. నేను ఇప్పుడు నిన్నుకొన్నివిషయములనుగూర్చి అడిగెదను. వాటిని గురించి నాకు దెల్పుము. (9-10)

తల్లీ! సుఖావహమైన నీబంగారుతల్పము తండ్రిగారులేకుండా శూన్యముగానున్నదేమి? మహారాజుగారి పరిజనులు ఎల్లరును సంతోషముగాలేరేమి? నాతండ్రియైన దశరథమహారాజు నాతల్లివైన నీయొక్కభవనమునందే ఎక్కువగా నివసించుచుండునుగదా? ఆయనను దర్శించు నిమిత్తముగనే నేడు నేను ఇచటికివచ్చితిని. ఆయన ఇక్కడ కనబడడేమి? నాతండ్రి ఎక్కడున్నాడో తెలుపుము. ఆయనపాదములకు నమస్కరింతును. నాపెద్దతల్లియైన కౌసల్యాదేవి యింటిలోఉన్నాడా ఏమి?" (11-13)

రాజ్యలోభముచే మోహమునకులోనైయున్న ఆకైకేయి భయంకరమైన, అప్రియమైన దశరథునిమరణవార్తను తాను ప్రియమైనదానినిగా భావించుచు ఏమియుఎఱుగని భరతునకు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (14)

"నాయనా! భరతా! నీతండ్రియైన దశరథమహారాజు గొప్ప మహాత్ముడు, మిగులపరాక్రమశాలి, యజ్ఞాచరణశీలుడు, సత్పురుషుల పాలిటిపెన్నిధి. సమస్తప్రాణులును పొందెడి పరమగతియే నీతండ్రికిని ప్రాప్తించెను." (15)

భరతుడు ధర్మప్రసిద్ధిచే ఉత్తమమైన ఇక్ష్వాకువంశమున జన్మించినవాడు, ఆయనహృదయము పవిత్రమైనది. అతడు తల్లిపలికిన ఆఘోరవార్తనువిని, దారుణమైన పితృశోకమునకు లోనై తటాలున నేలపైకూలెను. 'హా హతోఽస్మి' (అయ్యో! తండ్రీ! నన్ను వదలి వెళ్లితివా?) అను దయనీయమైన, దీనమైనవాక్యము పలుకుచు విలపింపసాగెను. మిక్కిలి భుజబలముగలవాడును, పరాక్రమశాలియునైన భరతుడు చేతులను నేలకు కొట్టుచు నేలపైబడి దొర్లసాగెను. (16-17)

పిమ్మట మహాతేజస్వియైన భరతుడు పితృమరణవార్తను విని, దుర్భరమైన దుఃఖమునకు లోనై, కలతచెందిన మనస్సుతో శోకాక్రాంతుడై విలపించెను. (18)

నాతండ్రిగారి చక్కని శయ్య ఇంతకుముందు శరత్కాలము నందు పూర్ణచంద్రునితో విలసిల్లుచున్న నిర్మలాకాశమువలె ఉండెడిది. అయ్యో! ఆతల్పమే నేడు ధీశాలియైన మహారాజు లేనందున చంద్రుడులేని ఆకాశమువలెను, నీరెండిపోయిన సముద్రమురీతిగాను వెలవెలబోవుచున్నది. (19-20)

విజేతలలో శ్రేష్ఠుడైన ఆభరతుడు అంతులేని దుఃఖమునకు లోనైనవాడై, అందమైన తనముఖమును వస్త్రముతో కప్పుకొని, కన్నీరుగార్చుచు బిగ్గఱగా ఏడువసాగెను. (21)

తమార్తం దేవసంకాశం సమీక్ష్య పతితం భువి।
నికృత్తమివ సాలస్య స్కంధం పరశునా వనే। 22

మాతా మాతంగసంకాశం చంద్రార్కసదృశం భువః।
ఉత్థాపయిత్వా శోకార్తం వచనం చేదమబ్రవీత్। 23

ఉత్తిష్ఠోత్తిష్ఠ కిం శేషే రాజపుత్ర! మహాయశః!।
త్వద్విధా న హి శోచంతి సంతః సదసి సమ్మతాః। 24

దానయజ్ఞాధికారా హి శీలశ్రుతివచోనుగా।
బుద్ధిస్తే బుద్ధిసంపన్న! ప్రభేవార్కస్య మందిరే। 25

స రుదిత్వా చిరం కాలం భూమౌ విపరివృత్య చ।
జననీం ప్రత్యువాచేదం శోకైర్బహుభిరావృతః। 26

అభిషేక్ష్యతి రామం ను రాజా యజ్ఞం ను యక్ష్యతే।
ఇత్యహం కృతసంకల్పో హృష్టో యాత్రామయాసిషమ్। 27

తదిదం హ్యన్యథా భూతం వ్యవదీర్ణం మనో మమ।
పితరం యో న పశ్యామి నిత్యం ప్రియహితే రతమ్। 28

అంబ! కేనాత్యగాద్రాజా వ్యాధినా మయ్యనాగతే।
ధన్యా రామాదయః సర్వే యైః పితా సంస్కృతః స్వయమ్। 29

న నూనం మాం మహారాజః ప్రాప్తం జానాతి కీర్తిమాన్।
ఉపజిఘ్రేద్ధి మాం మూర్ధ్ని తాతః సన్నమ్య సత్వరమ్। 30

క్వ స పాణిః సుఖస్పర్శః తాతస్యాక్లిష్టకర్మణః।
యేన మాం రజసా ధ్వస్తమ్ అభీక్ష్ణం పరిమార్జతి। 31

యో మే భ్రాతా పితా బంధుః యస్య దాసోఽస్మి ధీమతః।
తస్య మాం శీఘ్రమాఖ్యాహి రామస్యాక్లిష్టకర్మణః। 32

అప్పుడు దేవతుల్యుడును, గజమువలెగంభీరుడును, సూర్యుని వలె ప్రతాపశాలియు, చంద్రునివలె ఆహ్లాదకరుడును, గండ్రగొడ్డలి చేత నఱకబడిన సాలవృక్షముయొక్క మ్రానువలె నేలపైబడియున్న వాడును, దుఃఖముతో కుమిలిపోవుచున్నవాడును ఐన ఆ భరతకుమారుని కైకేయి లేవనెత్తి యిట్లు నుడివెను. (22-23)

రాజకుమారా! లెమ్ము, ఓయశస్వీ! నీవు నేలపైబడి ఇట్లు పొరలు చుంటివేల? నలుగురిచేతను గౌరవింపబడు నీవంటి సత్పురుషులు ఇట్లుదుఃఖింపరు. (24)

ఓకుమారా! ప్రజ్ఞాశాలీ! నీబుద్ధి సదాచారములను, వేదమార్గమును అనుసరించునట్టిది. అది దానయజ్ఞాదులను నిర్వహించుటకు యోగ్యమైనది. తీవ్రమైన సూర్యకాంతివలె అది నిశితమైనది." (25)

భరతుడు పొంగిపొఱలివచ్చుచున్న దుఃఖముతో భూమిపై అటునిటుపొరలాడుచు చాలతడవు వెక్కివెక్కి ఏడ్చెను. అనంతరము అతడు కొంతనిబ్బరము తెచ్చుకొని, తల్లితో ఇట్లు పలికెను. (26)

"మహారాజు శ్రీరామునకు యువరాజ పట్టాభిషేకమునైనను సంకల్పించియుండవచ్చును. లేదా! తానే ఒక యజ్ఞమును చేయుటకు తలపెట్టియైనను ఉండవచ్చును. అందులకే నన్ను త్వరగా అయోధ్యకు రమ్మని పిలిపించుచున్నాడేమో? అని భావించి, సంతోషముతో నేను ఇచటికివచ్చితిని. (27)

నేను అచట అనుకొన్నదియొకటి. ఇచట జరిగినది వేఱొకటి. నాఆశలు అన్నియును తారుమారైనవి. నాగుండె పగిలిపోయినది. అనుక్షణము నాపై ప్రేమానురాగములనుజూపుచు నాహితమును గోరెడి నాతండ్రి నాకు కనబడరాయెను. అమ్మా! నేను వచ్చెడి లోపలనే తండ్రిగారిని కబళించిన ఆమహావ్యాధి ఏమిటి? మరణ కాలమున ఆయనయొద్దనుండి. ఆయనకు అంత్యసంస్కారములను నిర్వహించిన ఆ రామాదిసోదరులందఱును నిజముగా ధన్యాత్ములు గదా! (28-29)

సహజముగా నేను నాన్నగారిదగ్గఱకుచేరినప్పుడు ఆయన నన్నుచేరదీసి నాశిరస్సును మూర్కొనుచుండెడివాడు. కాని ఇప్పుడు నేను ఆయనసమీపమునకు చేరినను మృతుడైయుండుటచే ఆయన నన్ను గుర్తించుటయే జరుగదుగదా? (30)

ఎట్టిక్లిష్టకార్యములనైనను అవలీలగా సాధించెడి నాతండ్రి దుమ్ముకొట్టుకొనియున్న నాశరీరమును తనచేతితో శుభ్రపఱచు చుండెడివాడు. అప్పుడు ఆయనచేతిసుఖస్పర్శ నాకెంతో హాయిగ నుండెడిది. ఇప్పుడు ఆచేయి ఎక్కడ? (ఆయనచేతి సుఖస్పర్శను పొందెడిభాగ్యము నాకు ఇంక కలుగదుగదా?) (31)

అద్భుతమైన కార్యములనుసైతము అవలీలగా సాధించునట్టి ప్రజ్ఞామూర్తియగు శ్రీరాముడు నాకు అన్నమాత్రమేగాదు, తండ్రి, బంధువు, సర్వస్వమూ అతడే. నేను ఆయనదాసుడను. నేను ఇచటికి చేరినట్లుగా (వచ్చియున్నట్లుగా) వెంటనే ఆయనకు తెలుపుము. (32)

పితా హి భవతి జ్యేష్ఠో ధర్మమార్యస్య జానతః।
తస్య పాదౌ గ్రహీష్యామి స హీదానీం గతిర్మమ॥ 33

ధర్మవిద్ధర్మనిత్యశ్చ సత్యసంధో దృఢవ్రతః।
ఆర్యః కిమబ్రవీద్రాజా పితా మే సత్యవిక్రమః॥ 34

పశ్చిమం సాధు సందేశమ్ ఇచ్ఛామి శ్రోతుమాత్మనః।
ఇతి పృష్టా యథాతత్త్వం కైకేయీ వాక్యమబ్రవీత్॥ 35

రామేతి రాజా విలపన్ హా సీతే! లక్ష్మణేతి చ।
స మహాత్మా పరం లోకం గతో గతిమతాం వరః॥ 36

ఇమాం తు పశ్చిమాం వాచం వ్యాజహార పితా తవ।
కాలధర్మపరిక్షిప్తః పాశైరివ మహాగజః॥ 37

సిద్ధార్థాస్తే నరా రామమ్ ఆగతం సీతయా సహ।
లక్ష్మణం చ మహాబాహుం ద్రక్ష్యంతి పునరాగతమ్॥ 38

తచ్ఛ్రుత్వా విషసాదైవ ద్వితీయాఽప్రియశంసనాత్।
విషణ్ణవదనో భూత్వా భూయః పప్రచ్ఛ మాతరమ్॥ 39

క్వచేదానీం స ధర్మాత్మా కౌసల్యానందవర్ధనః।
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చ సమం గతః॥ 40

తథా పృష్టా యథాతత్త్వమ్ ఆఖ్యాతుముపచక్రమే।
మాతాఽస్య సుమహద్వాక్యం విప్రియం ప్రియశంకయా॥ 41

స హి రాజసుతః పుత్ర! చీరవాసా మహావనమ్।
దండకాన్ సహ వైదేహ్యా లక్ష్మణానుచరో గతః॥ 42

తచ్ఛ్రుత్వా భరతస్త్రస్తో భ్రాతుశ్చారిత్రశంకయా।
స్వస్య వంశస్య మాహాత్మ్యాత్ ప్రష్టుం సముపచక్రమే॥ 43

కచ్చిన్న బ్రాహ్మణధనం హృతం రామేణ కస్యచిత్।
కచ్చిన్నాఢ్యో దరిద్రో వా తేనాపాపో విహింసితః॥ 44

కచ్చిన్న పరదారాన్ వా రాజపుత్రోఽభిమన్యతే।
కస్మాత్ స దండకారణ్యే భ్రూణహేవ వివాసితః॥ 45

అన్న (జ్యేష్ఠసోదరుడు) తండ్రితోసమానుడు. ధర్మమును బాగుగా ఎఱిగిన ఆ శ్రీరాముని పాదములకు నేను ప్రణమిల్లుదును. ఇప్పుడు ఆధర్మాత్ముడే నాకుపరమగతి. (33)

నా తండ్రి ధర్మవేత్త, నిత్యము ధర్మమును ఆచరించువాడు, సత్యమునకు కట్టుబడియుండువాడు, దృఢసంకల్పుడు, పూజ్యుడు, తిరుగులేని పరాక్రమముగలవాడు. అట్టి నాతండ్రి అవసానదశలో ఆయన నాకొఱకై ఇచ్చినసందేశమును వినగోరుచున్నాను." అని ప్రశ్నించిన భరతునితో కైకేయి జరిగిన వాస్తవమును ఇట్లు చెప్పెను. (34-35)

"సమస్తప్రాణులలో శ్రేష్ఠుడు, మహాత్ముడు ఐన ఆమహారాజు 'హా!రామా!అయ్యో!సీతా!నాయనా!లక్ష్మణా!' అని విలపించుచు స్వర్గస్థుడాయెను. త్రాళ్లచే బంధింపబడిన మహాగజమువలె మృత్యుపాశబద్ధుడైన నీతండ్రి చివరిగా ఈమాటలను పలికెను. 'మహాబాహువైన శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి (వనవాసము నుండి) తిరిగివచ్చినపుడు వారిని చూచినవారే నిజముగా ధన్యాత్ములు.' (36-38)

కైకేయి మఱొక అప్రియవార్తను పలుకగావినిన పిమ్మట, భరతుని ముఖమున మిగుల విషాదచ్ఛాయలు క్రమ్ముకొనగా అతడు తల్లిని మఱల ఇట్లడిగెను. (39)

"కౌసల్యాదేవిసుతుడు, ధర్మాత్ముడుఐన శ్రీరాముడు సీతాదేవితో లక్ష్మణునితోగూడి ఇట్టిక్లిష్టపరిస్థితిలో (తండ్రిమరణించియున్న ఈదుస్థితిలో) ఎక్కడికివెళ్లెను?" (40)

భరతుడు ఇట్లు ప్రశ్నింపగా అతనితల్లి కైకేయి (లోకమునకు) మిగుల అప్రియమైన శ్రీరాముని వనవాసవృత్తము భరతునకు ప్రియమునుగూర్చునని తలంచి, దానిని యథాతథముగ చెప్పుటకు ఉపక్రమించెను. (41)

"కుమారా! రాజసుతుడైన శ్రీరాముడు నారచీరలను ధరించినవాడై, సీతాలక్ష్మణులు తనను అనుసరింపగా వారితోగూడి అతడు దండకారణ్యములకువెళ్లెను." (42)

ఆమాటలను విని భరతుడు మిక్కిలి చలించిపోయెను. అప్పుడతడు 'తన ఇక్ష్వాకువంశమున పుట్టినవారందఱును అనాచారములను నిరసించెడివారు, సదాచారములను పాటించెడివారు, అట్టి పరంపరలోనివాడైన శ్రీరాముడు ఏదైనా అకృత్యమునకు పాల్పడినాడా?' అని శంకించి, తల్లిని ఇట్లు ప్రశ్నింపసాగెను. (43)

"శ్రీరాముడు ఏకారణముచేతనైనను బ్రాహ్మణధనమును అపహరించినాడాయేమి? ఏపాపమూ ఎఱుగని సంపన్నునిగానీ! దరిద్రునిగానీ హింసించినాడాయేమి? ఆయనమనస్సు ఏపరసతిపైనైనను పడినదాయేమి? భ్రూణ[1] హత్య చేసినవానివలె అతడు దండకారణ్యములకు పంపబడెను ?" (44-45)

1) భ్రూణ=గర్భవతి, భ్రూణము= గర్భము, గర్భస్థశిశువు, భ్రూణహత్య=గర్భమునుపోగొట్టుట, గర్భస్థశిశువును చంపుట, భ్రూణహుడు=భ్రూణహత్యచేసినవాడు, భ్రూణహత్యచేయుట మహాపాపము.

అథాస్య చపలా మాతా తత్ స్వకర్మ యథాతథమ్।
తేనైవ స్త్రీస్వభావేన వ్యాహర్తుముపచక్రమే। 46

అంతట చపలచిత్తయైన కైకేయి తనస్త్రీస్వభావమును అనుసరించి, జరిగిన వృత్తాంతమును ఉన్నది ఉన్నట్లుగా అతనికి వివరింపమొదలిడెను. (46)

ఏవ ముక్తా తు కైకేయీ భరతేన మహాత్మనా।
ఉవాచ వచనం హృష్టా మూఢా పండితమానినీ। 47

'నేను చాలా తెలివిగలదానను' అని గర్వపడుచుండు నదియు, మూర్ఖురాలును ఐన కైకేయి తనకుమారుడైన భరతునియొక్క ప్రశ్నలకు సమాధానముగా సంతోషముతో ఇట్లు పలుకసాగెను. (47)

న బ్రాహ్మణధనం కించిత్ హృతం రామేణ కస్యచిత్।
కశ్చిన్నాఢ్యో దరిద్రో వా తేనాఽపాపో విహింసితః।
న రామః పరదారాంశ్చ చక్షుర్భ్యామపి పశ్యతి। 48

మయా తు పుత్ర శ్రుత్వైవ రామస్యైవాభిషేచనమ్।
యాచితస్తే పితా రాజ్యం రామస్య చ వివాసనమ్। 49

స స్వవృత్తిం సమాస్థాయ పితా తే తత్ తథాఽకరోత్।
రామశ్చ సహ సౌమిత్రిః ప్రేషితస్సీతయా సహ। 50

"కుమారా! శ్రీరాముడు ఏబ్రాహ్మణునిసొత్తునూ ఏకొంచెము గూడ అపహరింపలేదు. ఏదోషమునూచేయని ధనికునిగానీ, దరిద్రుని గానీ అతడు హింసింపనేలేదు. అతడు పరసతిని కన్నెత్తియైనను చూడడు. నాయనా! భరతా! పితండ్రియైన మహారాజు శ్రీరామునకు యువరాజపట్టాభిషేకమునుచేయుటకు సంకల్పించెను. వెంటనే ఆవార్త నాకుతెలిసెను. అప్పుడు నేను లోగడ నీతండ్రి నాకు వాగ్దానముచేసియున్న వరద్వయమును అనుసరించి, 'శ్రీరాముని వనవాసమునకు పంపవలసినదిగాను, నీకు యువరాజపట్టాభిషేకమును చేయువలసినదిగను' మహారాజును కోరితిని. అప్పుడు నీతండ్రి తన సత్యప్రతిజ్ఞను (వాగ్దానమును) నిలబెట్టుకొనుటకై శ్రీరాముని అడవులకు పంపెను. అప్పుడు సీతాదేవియు, లక్ష్మణుడును ఆయనను అనుసరించివెళ్లిరి. (48-50)

తమపశ్యన్ ప్రియం పుత్త్రం మహీపాలో మహాయశాః।
పుత్త్రశోకపరిద్యూనః పంచత్వముపపేదివాన్। 51

మిక్కిలి ఖ్యాతివహించిన ఆమహారాజు తన ప్రియపుత్త్రుడైన శ్రీరాముడు కనులముందర కనబడకపోవుటచే పుత్త్రశోకమువలన మిగులపరితప్తుడై, స్వర్గస్థుడాయెను. (51)

త్వయా త్విదానీం ధర్మజ్ఞ రాజత్వమవలంబ్యతామ్।
త్వత్కృతే హి మయా సర్వమ్ ఇదమేవంవిధం కృతమ్। 52

రాజనీతిజ్ఞుడవైన ఓభరతా! నీకొఱకై ఈవిధముగా ఈ సమస్త కార్యమునూ నేనే నిర్వహించితిని. కనుక నీవు మహారాజపదవిని చేపట్టుము. (52)

మా శోకం మా చ సంతాపం ధైర్యమాశ్రయ పుత్త్రక।
త్వదధీనా హి నగరీ రాజ్యం చైతదనామయమ్। 53

ఓపుత్త్రా! నీవు శోకసంతాపములను వీడుము. ధైర్యమును వహింపుము. ఈఅయోధ్యానగరమునకును, నిష్కంటకమైన ఈకోసల రాజ్యమునకును ఇక నీవే అధిపతివి. (53)

తత్పుత్త్ర! శీఘ్రం విధినా విధిజ్ఞైః
వసిష్ఠముఖ్యైః సహితో ద్విజేంద్రైః।
సంకాల్య రాజానమదీనసత్త్వమ్
ఆత్మానముర్వ్యామభిషేచయస్వ। 54

నాయనా! భరతా! అందువలన బాగుగా విధివిధానములను ఎఱిగిన వసిష్ఠమహర్షి మొదలగు ప్రముఖులైన బ్రాహ్మణోత్తములతో గూడి, సాటిలేని పరాక్రమశాలియైన నీతండ్రియగు మహారాజునకు అంత్యసంస్కారములను నెఱపుము. వెంటనే ఈకోసల రాజ్యసింహాసనమున పట్టాభిషిక్తుడవుకమ్ము." (54)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్విసప్తతితమస్సర్గః (72)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదిరెండవసర్గము సమాప్తము

-- * * * --

73. డెబ్బదిమూడవసర్గము

భరతుడు కైకేయిపై కోపపడుట.

శ్రుత్వా తు పితరం వృత్తం భ్రాతరౌ చ వివాసితౌ।
భరతో దుఃఖసంతప్త ఇదం వచనమబ్రవీత్। 1

కిం ను కార్యం హతస్యేహ మమ రాజ్యేన శోచతః।
విహీనస్యాథ పిత్రా చ భ్రాత్రా పితృసమేన చ। 2

దుఃఖే మే దుఃఖమకరోః వ్రణే క్షారమివాదధాః।
రాజానం ప్రేతభావస్థం కృత్వా రామం చ తాపసమ్। 3

కులస్య త్వమభావాయ కాలరాత్రిరివాఽఽగతా।
అంగారముపగూహ్య స్మ పితా మే నావబుద్ధవాన్। 4

మృత్యుమాపాదితో రాజా త్వయా మే పాపదర్శిని।
సుఖం పరిహృతం మోహాత్ కులేఽస్మిన్ కులపాంసని। 5

త్వాం ప్రాప్య హి పితా మేఽద్య సత్యసంధో మహాయశాః।
తీవ్రదుఃఖాభిసంతప్తో వృత్తో దశరథో నృపః। 6

వినాశితో మహారాజః పితా మే ధర్మవత్సలః।
కస్మాత్ ప్రవ్రాజితో రామః కస్మాదేవ వనం గతః। 7

కౌసల్యా చ సుమిత్రా చ పుత్రశోకాభిపీడితే।
దుష్కరం యది జీవేతాం ప్రాప్య త్వాం జననీం మమ। 8

నను త్వార్యోఽపి ధర్మాత్మా త్వయి వృత్తిమనుత్తమామ్।
వర్తతే గురువృత్తిజ్ఞో యథా మాతరి వర్తతే। 9

తథా జ్యేష్ఠా హి మే మాతా కౌసల్యా దీర్ఘదర్శినీ।
త్వయి ధర్మం సమాస్థాయ భగిన్యామివ వర్తతే। 10

తస్యాః పుత్రం కృతాత్మానం చీరవల్కలవాససమ్।
ప్రస్థాప్య వనవాసాయ కథం పాపే! న శోచసి। 11

సోదరులైన రామలక్ష్మణులును, సీతాదేవియు వనములపాలైన తీరును, తండ్రియైన దశరథుడు మృతుడైన వృత్తాంతమును విని, భరతుడు మిగుల దుఃఖముతో కుమిలిపోయెను. అప్పుడు అతడు తల్లికైకేయితో ఇట్లు పలికెను. (1)

నేను తండ్రినికోల్పోయి, తండ్రితో సమానుడైన అన్నయగు శ్రీరామునకు దూరమై, ఇప్పుడుశోకమున మునిగియుంటిని. అట్టిదురదృష్టవంతుడనైన నాకు ఇంక ఈరాజ్యముతో పనియేమి? మహారాజును పొట్టనబెట్టుకొంటివి. శ్రీరాముని అడవులపాలు చేసితివి. పుండుమీదకారముచల్లినట్లు నన్ను పిడతెగని దుఃఖములకు గురిచేసితివి. (2-3)

నీవు ఈ ఇక్ష్వాకువంశమును నశింపజేయుటకు కాళరాత్రివై దాపురించితివి. నీవు ఇంతటి దుర్మార్గురాలవనితెలియక నిన్ను గట్టుకొని మాతండ్రి మండుచున్నకొఱవిని కౌగిలించుకొనినాడు. (4)

ఓపాపాత్మురాలా! మా మహారాజును మృత్యువుకౌగిటజేర్చిన పుణ్యమునీదే. ఓకులకళంకితా! ఈవంశమువారి సుఖములను శాశ్వతముగా నేలపాలుచేసితివి. (5)

సత్యసంధుడు, మహాయశస్వి ఐన నాతండ్రి దశరథమహారాజు నిన్ను గట్టుకొనిననేరమునకు నేడు తీవ్రమైన దుఃఖమున క్రుంగిపోయి, ప్రాణములను కోల్పోయినాడు. (6)

ధర్మపరిరక్షణమే పరమావధిగాగల నాతండ్రి దశరథమహారాజును ఎందులకు హతమార్చితివి? నీవు నాఅన్నయగు శ్రీరాముని ఇంటి నుండి ఎందులకు వెడలగొట్టితివి? అతనిని అడవులపాలుచేయుటకు హేతువేమి? నీవు వ్యర్థముగా ఈపాడుపనిచేసితివి. (7)

పుత్రశోకమునకు గురియై, కుమిలిపోవుచున్న కౌసల్యామాతయు, తల్లి సుమిత్రాదేవియు నాతల్లివైన నీయొక్క పంచనజేరి ఇంక బ్రతికియుండుట దుష్కరము. (8)

మా అన్న శ్రీరాముడు ధర్మాత్ముడు. పెద్దలకు సేవలొనర్చుటలో నిగ్గుదేలినవాడు. అతడు తనతల్లియగు కౌసల్యాదేవిని సేవించినట్లే నీవిషయమునగూడ చక్కనిగౌరవాదరములతో ప్రవర్తించుచుండెడివాడుగదా? అట్లే దూరదృష్టిగల మాపెద్దతల్లి కౌసల్యామాతయు ధర్మబుద్ధితో నిన్ను తనసోదరినివలె చూచుకొనుచుండెడిది గదా? (9-10)

ఓపాపాత్మురాలా! అట్టి ఉత్తమురాలైన కౌసల్యాదేవియొక్క తనయుడును, మహాత్ముడును ఐన శ్రీరాముని నారచీరలను ధరింపజేసి, వనవాసమునకు పంపితివి. ఇప్పుడైనను నీకు ఏమాత్రమూ విచారముకలుగుటలేదా? (11)

అపాపదర్శినం శూరం కృతాఽఽత్మానం యశస్వినమ్।
ప్రవ్రాజ్య చీరవసనం కిం ను పశ్యసి కారణమ్। 12

శ్రీరాముడు అందఱిలోను (నీలోగూడ) మంచినే చూచెడివాడు. మహాశూరుడు. ధర్మాత్ముడు. సజ్జనులలో వాసిగన్నవాడు. అట్టి సత్పురుషుని నారచీరలతో వనములకు పంపి ఏమి బావుకొనదలచితివి? (12)

లుబ్ధాయా విదితో మన్యే న తేఽహం రాఘవమ్ ప్రతి।
తథా హ్యనర్థో రాజ్యార్థం త్వయాఽఽనీతో మహానయమ్। 13

శ్రీరామునియెడ నేను ఎట్టి భక్తివిశ్వాసములను కలిగియున్నవాడనో అత్యాశాపరురాలవైన నీవు ఎఱుగవు. అందువలననే రాజ్యలోభముచే నీవు ఈ గొప్ప అనర్థమును తెచ్చిపెట్టితివని నేను తలంతును. (13)

అహం హి పురుషవ్యాఘ్రౌ అపశ్యన్ రామలక్ష్మణౌ।
కేన శక్తిప్రభావేన రాజ్యం రక్షితుముత్సహే। 14

తం హి నిత్యం మహారాజో బలవంతం మహాబలః।
అపాశ్రితోఽభూద్ధర్మాత్మా మేరుర్మేరువనం యథా। 15

పురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణులే నాకు నిజముగా శక్తిప్రదాతలు. అట్టి మహాత్ముల అండదండలు లేకుండా (వారు ప్రత్యక్షముగా కనబడకుండా) రాజ్యమును రక్షింపగలశక్తి నాకు ఎక్కడిది? అంతేగాదు ధర్మాత్ముడును, మహాబలశాలియును ఐన దశరథమహారాజునకును శక్తిశాలియైన ఆ శ్రీరాముడే సర్వదా పరమాశ్రయుడు. (ఆ మహారాజు తన ఇహపరలోకసుఖములకు ఆ శ్రీరామునే ఆశ్రయించెడివాడు.) మేరుపర్వతము తనరక్షణకొఱకు తనచుట్టును వ్యాపించియున్న మేరువనముపైవలె ఆ మహారాజు తనరక్షణకై రామునిమీదనే ఆధారపడుచుండెడివాడు. (14-15)

సోఽహం కథమిమం భారం మహాధుర్యసముద్ధృతమ్।
దమ్యో ధురమివాఽఽసాద్య వహేయం కేన చౌజసా। 16

బలిష్ఠమైన వృషభము మోయగల కాడిబరువును ఒక లేగదూడ మోయలేనట్లు మహాకార్యధురంధరుడైన దశరథమహారాజు వహించిన ఈ రాజ్యభారమును నేను నిర్వహింపజాలను. బాలుడనైన నాకు అదియెట్లు సాధ్యమగును? నాకాశక్తియెక్కడిది? (16)

అథ వా మే భవేచ్ఛక్తిః యోగైర్బుద్ధిబలేన వా।
సకామాం న కరిష్యామి త్వామహం పుత్రగర్ధినీమ్। 17

పలువిధములైన ఉపాయములవలనగాని, బుద్ధిబలముచేగాని ఈ రాజ్యమును పాలింపగలశక్తి నాకు ఒకవేళ లభించినను కేవలము పుత్రవ్యామోహముచే రాజ్యాధికారమునకై ఆరాటపడిన నీకోర్కెను దీర్చుటకు నేను 'ససేమిరా' అంగీకరింపను. (17)

న మే వికాంక్షా జాయేత త్యక్తుం త్వాం పాపనిశ్చయామ్।
యది రామస్య నాపేక్షా త్వయి స్యాన్మాతృవత్ సదా। 18

శ్రీరామునకు నీయందు మాతృభక్తిలేకున్నచో పాపాత్మురాలవైన నిన్ను త్యజించుటకు నేను ఏమాత్రమును వెనుకాడెడివాడను గాను. (నీవు పాపాత్మురాలవైనను శ్రీరామునకు నీపై మాతృభావము ఉన్నందున నిన్ను నేను త్యజింపలేకున్నాను.) (18)

ఉత్పన్నా తు కథం బుద్ధిః తవేయం పాపదర్శిని।
సాధుచారిత్రవిభ్రష్టే పూర్వేషాం నో విగర్హితా। 19

సన్మార్గమును విడనాడిన ఓ పాపాత్మురాలా! జ్యేష్ఠునికాదని కనిష్ఠునకు (చిన్నవానికి) రాజ్యాధికారమును అప్పగింపవలెననెడి దుర్బుద్ధి నీకు ఎట్లు కలిగినది? మన పూర్వులు దానిని సర్వదా గర్హించిరి. (19)

అస్మిన్ కులే హి పూర్వేషాం జ్యేష్ఠో రాజ్యేఽభిషిచ్యతే।
అపరే భ్రాతరస్తస్మిన్ ప్రవర్తంతే సమాహితాః। 20

ఈ ఇక్ష్వాకువంశమున మనపూర్వులందఱును జ్యేష్ఠునకే రాజ్యాధికారమును[1] అప్పగించుచువచ్చిరి. అదియే మనవంశ సంప్రదాయము. తక్కిన సోదరులు ఎల్లరును ఆ పెద్దవానికి విధేయులై, అతనిని అనుసరించుచుండెడివారు. (20)

1) జ్యేష్ఠ ఏవ తు గృహ్ణీయాత్ పిత్ర్యం ధనమశేషతః। శేషాః తముపజీవేయుః యథైవ పితరం తథా॥ - మనుస్మృతి
పిత్రార్జితములైన (రాజ్యమును) సంపదలను అన్నింటిని పెద్దవాడే (జ్యేష్ఠుడే) గ్రహింపవలెను. ఇతరులు (తమ్ములు) తండ్రివలె అతనిని గౌరవించుచు, అతనికి విధేయులై నడచుకొనవలెను.

న హి మన్యే నృశంసే! త్వం రాజధర్మమవేక్షసే।
గతిం వా న విజానాసి రాజవృత్తస్య శాశ్వతీమ్। 21

ఓ క్రూరాత్మురాలా! పరంపరగా వచ్చుచున్న రాజధర్మములను నీవు ఎఱుగవని నేను తలంతును. ఒకవేళ ఆ రాజధర్మము (కొంత) తెలిసినను నీకు దానియందు ఆదరభావములేదని నేను అనుకొందును. (21)

సతతం రాజవృత్తే హి జ్యేష్ఠో రాజ్యేఽభిషిచ్యతే।
రాజ్ఞామేతత్ సమం తత్ స్యాత్ ఇక్ష్వాకూణాం విశేషతః। 22

జ్యేష్ఠుడు రాజ్యాభిషిక్తుడగుటయే అవిచ్ఛిన్నముగా వచ్చుచున్న రాజధర్మము. ఇది రాజులందఱికిని సమానముగా వర్తించును. ఇక్ష్వాకుప్రభువులు దీనిని విశేషముగా (విధిగా) పాటింతురు. (22)

తేషాం ధర్మైకరక్షాణాం కులచారిత్రశోభినామ్।
అత్ర చారిత్రశౌండీర్యం త్వాం ప్రాప్య వినివర్తితమ్। 23

ధర్మరక్షణకై దీక్షవహించినవారును, వంశచరిత్రలచే వాసికెక్కినవారునైన ఇక్ష్వాకుప్రభువుల సచ్చరిత్రగౌరవము ఈసందర్భమున నీవలన దెబ్బతినినది. (భ్రష్టమైనది.) (23)

తవాపి సుమహాభాగా జనేంద్రాః కులపూర్వగాః।
బుద్ధేర్మోహః కథమయం సంభూతస్త్వయి గర్హితః। 24

నీవు జన్మించిన కేకయవంశమునకుచెందిన పూర్వరాజులు గూడ సచ్చరిత్రగలవారే. కానీ నింద్యమైన ఈబుద్ధిమోహము నీకు ఎట్లుదాపురించినది? (24)

న తు కామం కరిష్యామి తవాహం పాపనిశ్చయే!।
త్వయా వ్యసనమారబ్ధం జీవితాంతకరం మమ। 25

ఓపాపబుద్ధిగలదానా! నేను మాత్రము నీకోర్కెను నెఱవేర్పను (రాజ్యాధికారమును చేపట్టను.) నీవు పూనుకొనిన ఈకార్యము నాజీవితమునకే ముప్పునుగూర్చును. (25)

ఏష త్విదానీమేవాహమ్ అప్రియార్థం తవానఘమ్।
నివర్తయిష్యామి వనాత్ భ్రాతరం స్వజనప్రియమ్। 26

నీకు అప్రియమేయైనను నేనుచేయబోవుచున్న కార్యమును గూర్చి వినుము. నేను ఇప్పుడే వెళ్లి, పుణ్యపురుషుడు, ఆత్మీయులందఱికిని ప్రియమైనవాడునైన సోదరుడగు శ్రీరాముని వనమునుండి తీసికొనివచ్చెదను. (26)

నివర్తయిత్వా రామం చ తస్యాహం దీప్తతేజసః।
దాసభూతో భవిష్యామి సుస్థితేనాంతరాత్మనా। 27

శ్రీరాముని దీసికొనివచ్చిన పిమ్మట మహాతేజస్వియైన ఆ మహాత్మునకు నేను దాసుడనగుదును. ఇది త్రికరణశుద్ధిగా తీసికొనిన నానిర్ణయము". (27)

ఇత్యేవముక్త్వా భరతో మహాత్మా
ప్రియేతరైః వాక్యగణైస్తుదంస్తామ్ ।
శోకాతురశ్చాపి ననాద భూయః
సింహో యథా పర్వతగహ్వరస్థః । 28

మహాత్ముడైన భరతుడు తనమాటలఈటెలతో ఆమెకు వ్యథగూర్చుచు ఇట్లుపలికెను. పిమ్మట శోకాతురుడై, అతడు పర్వతగుహలోని సింహమువలె గర్జించెను. (28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రిసప్తతితమస్సర్గః(73)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదిమూడవసర్గము సమాప్తము

— * * * —

74. డెబ్బదినాల్గవసర్గము

భరతుడు కైకేయిని దూషించుట.

తాం తథా గర్హయిత్వా తు మాతరం భరతస్తదా।
రోషేణ మహతాఽఽవిష్టః పునరేవాబ్రవీద్వచః। 1

భరతుడు ఆవిధముగా తనతల్లిని నిందించిన పిమ్మట మిక్కిలి క్రుద్ధుడై ఆమెతో మరల ఇట్లనెను. (1)

రాజ్యాద్భ్రంశస్వ కైకేయి! నృశంసే! దుష్టచారిణి!।
పరిత్యక్తా చ ధర్మేణ మా మృతం రుదతీ భవ। 2

"క్రూరురాలా! దుర్మార్గురాలా! ఓకైకేయీ! నీవు ధర్మభ్రష్టురాలవు. కనుక ఈరాజ్యమునుండి వెడలిపొమ్ము. మృత్యువుపాలైన రాజు కొఱకు నీవు ఏడువవద్దు. నేను మరణించినట్లు భావించి నీ జీవితాంతము ఏడువుము. (2)

కిం ను తేఽదూషయద్రాజా రామో వా భృశధార్మికః।
యయోర్మృత్యుర్వివాసశ్చ త్వత్కృతే తుల్యమాగతౌ। 3

భ్రూణహత్యామసి ప్రాప్తా కులస్యాస్య వినాశనాత్।
కైకేయి! నరకం గచ్ఛ మా చ భర్తుః సలోకతామ్। 4

యత్ త్వయా హీదృశం పాపం కృతం ఘోరేణ కర్మణా।
సర్వలోకప్రియం హిత్వా మమాప్యాపాదితం భయమ్। 5

త్వత్కృతే మే పితా వృత్తో రామశ్చారణ్యమాశ్రితః।
అయశో జీవలోకే చ త్వయాఽహం ప్రతిపాదితః। 6

మాతృరూపే! మమామిత్రే! నృశంసే! రాజ్యకాముకే!।
న తేఽహమభిభాష్యోఽస్మి దుర్వృత్తే! పతిఘాతిని!। 7

కౌసల్యా చ సుమిత్రా చ యాశ్చాన్యా మమ మాతరః।
దుఃఖేన మహతాఽఽవిష్టాః త్వాం ప్రాప్య కులదూషిణీమ్। 8

న త్వమశ్వపతేః కన్యా ధర్మరాజస్య ధీమతః।
రాక్షసీ తత్ర జాతాఽసి కులప్రధ్వంసినీ పితుః। 9

యత్ త్వయా ధార్మికో రామో నిత్యం సత్యపరాయణః।
వనం ప్రస్థాపితో దుఃఖాత్ పితా చ త్రిదివం గతః। 10

యత్ ప్రధానాఽసి తత్ పాపం మయి పిత్రా వినాకృతే।
భ్రాతృభ్యాం చ పరిత్యక్తే సర్వలోకస్య చాప్రియే। 11

కౌసల్యాం ధర్మసంయుక్తాం వియుక్తాం పాపనిశ్చయే!।
కృత్వా కం ప్రాప్స్యసే త్వద్య లోకం నిరయగామిని!। 12

కిం నావబుధ్యసే క్రూరే! నియతం బంధుసంశ్రయమ్।
జ్యేష్ఠం పితృసమం రామం కౌసల్యాయాఽఽత్మసంభవమ్। 13

దశరథమహారాజు పరమధర్మాత్ముడు. శ్రీరామచంద్రుడైతే సాక్షాత్తుగా ధర్మస్వరూపుడే. అట్టి సత్పురుషులు నీకు చేసిన అపకారమేమి? (వారు నీదోషగుణములను గూర్చిగాని, నీదుశ్చరిత్రమును గుఱించిగాని నిందించిరా?) శ్రీరామునేమో అడవులపాలుచేసితివి. మా తండ్రిగారినేమో పరాశరపరలోకములకే పంపితివి. (3)

ఓ కైకేయీ! ఈ వంశవినాశనమునకే కారకురాలవై, నీవు భ్రూణహత్యాతుల్యమైన మహాపాపమును నీతలపైకి ఎత్తుకొంటివి. ఇంక నీకు నరకమేగతి. తండ్రిగారికి ప్రాప్తించిన స్వర్గమైతే నీకు దక్కదు. నీవు సకలప్రాణులకును ప్రేమపాత్రుడైన శ్రీరాముని వనవాసమునకు పంపుట, నాతండ్రిని పరలోకమునకుచేర్చుట అను ఘోరకార్యములను చేయుటద్వారా మహాపాపమునకు ఒడిగట్టితివి. ఈఘోరపాపఫలము నిన్నేగాక నీకొడుకునైనందులకు నన్నును వెంటాడునేమోయని భయముగుచున్నది. (4-5)

నీకారణముగా నాతండ్రిమృత్యుముఖమునచేరినాడు. నీవలననే శ్రీరాముడు అడవులదారిపట్టినాడు. నీనిమిత్తముగనే ఈలోకమున నేను అపకీర్తిపాలైతిని. నీవు నాకు తల్లిరూపమున నున్న శత్రువువు. క్రూరురాలవు, రాజ్యలోభముతో మంచిపెద్దలను మఱచినదానవు. దుర్వృత్తురాలవు. అంతేగాదు పతిహత్యకు పాల్పడినదానవు. అందువలన ఇక నీతో నేను మాటాడను. (6-7)

వంశమునకే మచ్చదెచ్చిన నీకారణముగా కౌసల్య, సుమిత్ర మొదలగు తల్లులందఱును మహాదుఃఖమున కుములిపోవుచుండిరి. అశ్వపతి(కేకయ)మహారాజు గొప్పధర్మప్రభువు. మిగుల బుద్ధిమంతుడు. నీవు ఆయనవంశమున చెడబుట్టితివి. పుట్టిన వంశమునకే మచ్చ(కళంకము) తెచ్చిన రాక్షసివి నీవు. కనుక 'ఆయనకూతురును' అని చెప్పుకొను అర్హతనే నీవు కోల్పోయితివి. పరమధార్మికుడు, సర్వదా సత్యనిరతుడు ఐన శ్రీరాముని నీవు అడవులలో పడవేసితివి. ఆవిధముగా నాతండ్రిని పుత్రదుఃఖమున ముంచి ఆయనప్రాణములనే బలిదీసికొంటివి. నీవు చేసిన ఈపాడుపనులవలన నేను తండ్రిలేనివాడనైతిని. సోదరులకు దూరమైతిని. లోకనిందకు గుఱియైతిని. అందఱికిని అప్రియుడనైతిని. (8-11)

ఓ పాపాత్మురాలా! నిత్యము ధర్మపరాయణయైన కౌసల్యాదేవికి పుత్రునిమండియెడబాటు గూర్చితివి. పతివియోగమును గల్గించి ఆమెకు వైధవ్యమును తెచ్చిపెట్టితివి. ఇట్టి దుర్మార్గురాలవైన నీకు ఇంక ఏలోకముప్రాప్తించును? నీవు నరకమునకే అర్హురాలవు. (12)

ఓ మూర్ఖురాలా! కౌసల్యాతనయుడైన శ్రీరాముడు నాకు అన్న (జ్యేష్ఠుడు) తండ్రివంటివాడు. జితేంద్రియుడు. బంధువులకు పెన్నిధి. అట్టి మహానుభావునిగూర్చి నీవెఱుగవా? (13)

అంగప్రత్యంగజః పుత్రో హృదయాచ్చాపి జాయతే।
తస్మాత్ ప్రియతమో మాతుః ప్రియత్వాన్న తు బాంధవః। 14

అన్యదా కిల ధర్మజ్ఞా సురభిః సురసమ్మతా।
వహమానౌ దదర్శోర్వ్యాం పుత్రౌ విగతచేతసౌ। 15

తావర్ధదివసే శ్రాంతౌ దృష్ట్వా పుత్రౌ మహీతలే।
రురోద పుత్రశోకేన బాష్పపర్యాకులేక్షణా। 16

అధస్తాద్వ్రజతస్తస్యాః సురరాజ్ఞో మహాత్మనః।
బిందవః పతితా గాత్రే సూక్ష్మాః సురభిగంధినః। 17

ఇంద్రోఽప్యశ్రునిపాతం తం స్వగాత్రే పుణ్యగంధినమ్।
సురభిం మన్యతే దృష్ట్వా భూయసీం తాం సురేశ్వరః। 18

నిరీక్షమాణః శక్రస్తాం దదర్శ సురభిం స్థితామ్।
ఆకాశే విష్ఠితాం దీనాం రుదంతీం భృశదుఃఖితామ్। 19

తాం దృష్ట్వా శోకసంతప్తాం వజ్రపాణిర్యశస్వినీమ్।
ఇంద్రః ప్రాంజలిరుద్విగ్నః సురరాజోఽబ్రవీద్వచః। 20

భయం కచ్చిన్న చాస్మాసు కుతశ్చిద్విద్యతే మహత్।
కుతో నిమిత్తః శోకస్తే బ్రూహి సర్వహితైషిణి!। 21

ఏవ ముక్తాతు సురభిః సురరాజేన ధీమతా।
ప్రత్యువాచ తతో ధీరా వాక్యం వాక్యవిశారదమ్। 22

శాంతం పాపం న వః కించిత్ కుతశ్చిదమరాధిప!।
అహం తు మగ్నౌ శోచామి స్వపుత్రౌ విషమే స్థితౌ। 23

తల్లియొక్క (ఆపాదమస్తకమువఱకుగల) అన్ని అవయవములలో ప్రవహించెడి రక్తములో పాలుపంచుకొనుచు, ఆమె హృదయ సంస్కారములనుగ్రహించి,[1] (హృదయమునందలి ఆత్మస్థాన పవిత్రతను పొంది) ఆమె తనువునుండి పుత్రుడు జన్మించును. ఈవిధముగా జన్మనిచ్చిన తల్లికి పుత్రుడు ప్రాణతుల్యుడు. అందువలన జననికి పుత్రుడు ప్రియతముడు. తక్కిన బంధువులందఱును ఆమెకు అతనితరువాతివారే. (14)

పూర్వము ఒకానొకప్పుడు ధర్మజ్ఞురాలును (భూమిని దున్నునప్పుడు కలిగెడి కష్టములను ఎఱిగినదియు) దేవతలందఱిచే పూజింపబడునదియునైన కామధేనువు తన పుత్రులు (వృషభములు) భూలోకమున కాడినిమోయుచు పొలమును దున్నుచు వ్యవసాయ శ్రమచే స్పృహదప్పియుండగాచూచెను. (15)

ఆకామధేనువు తన ఇరువురుపుత్రులు (రెండువృషభములు) భూలోకమున మధ్యాహ్నమువఱకు పొలముదున్ని అలసిపోయి యుండుటచూచి, పుత్రశోకముతో కన్నీరుగార్చుచు ఏడువసాగెను. అదేసమయమున మహాత్ముడైన దేవేంద్రుడు ఆ ధేనువుయొక్క క్రిందిభాగమున వెళ్లుచుండెను. అప్పుడు ఏడ్చుచున్న ఆధేనువు యొక్క, కొన్ని కన్నీటిబిందువులు (సువాసనలుగల ఆ కన్నీటి చుక్కలు) ఆ ఇంద్రునిదేహముపైబడెను. (16-17)

అంతట దేవతల ప్రభువైన ఆఇంద్రుడు తన శరీరముపైబడిన ఆ పవిత్ర పరిమళజలబిందువులనుజూచి, అవి శ్రేష్ఠమైన కామధేనువునకు సంబంధించినవేయని తలంచెను. (18)

అప్పుడు ఇంద్రుడు ఆకాశమువైపు పరికించి చూడగా అచట నిలబడియున్న కామధేనువు కనిపించెను. అది మిగుల దైన్యముతో దుఃఖించుచు ఏడ్చుచుండెను. దేవతలకు ప్రభువు, వజ్రపాణియు ఐన ఇంద్రుడు లోకప్రసిద్ధిగన్నకామధేనువు ఆవిధముగా శోక సంతాపమునకు గుఱియైయుండుటజూచి, వెంటనే ఉద్విగ్నుడై, చేతులు జోడించి, ఆ ధేనువుతో ఇట్లు పలికెను. (19-20)

ఎల్లరకును హితమును గూర్చునట్టి ఓగోమాతా! మాదేవతలలో ఎవరినుండియైనను తీవ్రమైన భయంకర పరిస్థితి నీకు ఎదురు కాలేదుగదా? ఇంతటినీ నీశోకమునకు కారణమేమి? తెల్పుము. (21)

ధీశాలియైన దేవేంద్రుడు ఇట్లు అడుగగా అంతట ధీరురాలైన కామధేనువు వాక్యవిశారదుడైన ఆ ఇంద్రునితో ఇట్లనుడివెను.(22)

"ఓదేవేంద్రా! పాపము శమించుగాక. మీలో ఎవరినుండియును నాకు భయపడవలసిన పరిస్థితులు కలుగలేదు. నాపుత్రులైన వృషభములు సంకటపరిస్థితులలో పడి దుఃఖమగ్నులైయున్నారు. అందులకై నేను బాధపడుచున్నాను. ఓసురప్రభూ! సహజముగనే ఈ వృషభములు బక్కచిక్కియున్నవి. అదిగాక ఆయుకొనువారులేక అలమటించు

1) "అంగాదంగాత్ సంభవసి, హృదయాదధిజాయసే, ఆత్మావై పుత్రనామాసి" - శ్రుతివచనము.
యదేతద్రేతః ఏదేతత్ సర్వేభ్యోఽంగేభ్యః తేజస్సంభూతమ్- శ్రుతిప్రమాణము.

ఏతా దృష్ట్వా కృశా దీనా సూర్యరశ్మిప్రతాపితా।
అర్ద్యమానా బలీవర్దా కర్షకేణ సురాధిప!। 24

మమ కాయాత్ ప్రసూతా హి దుఃఖితా భారపీడితా।
యా దృష్ట్వా పరితప్యేఽహం నాస్తి పుత్త్రసమః ప్రియః। 25

యస్యాః పుత్త్రసహస్రైస్తు కృత్స్నం వ్యాప్తమిదం జగత్।
తాం దృష్ట్వా రుదతీం శక్రో న సుతాన్మన్యతే పరమ్। 26

సదాఽప్రతిమవృత్తాయా లోకధారణకామ్యయా।
శ్రీమత్యా గుణనిత్యాయాః స్వభావపరివేషయా। 27

యస్యాః పుత్త్రసహస్రాణి సాఽపి శోచతి కామధుక్।
కిం పునర్యా వినా రామం కౌసల్యా వర్తయిష్యతి। 28

ఏకపుత్త్రా చ సాధ్వీ చ వివత్సేయం త్వయా కృతా।
తస్మాత్ త్వం సతతం దుఃఖం ప్రేత్య చేహ చ లప్స్యసే। 29

అహం హ్యపచితిం భ్రాతుః పితుశ్చ సకలామిమామ్।
వర్ధనం యశసశ్చాపి కరిష్యామి న సంశయః। 30

ఆనాయయిత్వా తనయం కౌసల్యాయా మహాబలమ్।
స్వయమేవ ప్రవేక్ష్యామి వనం మునినిషేవితమ్। 31

న హ్యహం పాపసంకల్పే! పాపే! పాపం త్వయా కృతమ్।
శక్తో ధారయితుం పౌరైః అశ్రుకంఠైర్నిరీక్షితః। 32

సా త్వమగ్నిం ప్రవిశ వా స్వయం వా దండకాన్ విశ।
రజ్జుం బధాన వా కంఠే నహి తేఽన్యత్ పరాయణమ్। 33

అహమప్యవనిం ప్రాప్తే రామే సత్యపరాక్రమే।
కృతకృత్యో భవిష్యామి విప్రవాసితకల్మషః। 34

చున్నవి. పైగా ఎండకు సుడిగొట్టుకొనియున్నవి. మీదుమిక్కిలి దయలేనిరైతుచేతిలోబడి వ్యవసాయ పరిశ్రమచే డస్సియున్నవి. ఇట్టి నాపుత్త్రులదుస్థితిని జూచి, వగచుచున్నాను, నాకడుపునబుట్టిన తనుకుమారులు అంతులేని ఈబరువును మోయలేక దుఃఖమున క్రుంగిపోవుచున్నారు. వారియవస్థను జూచి, నాలో దుఃఖము పొంగి పొఱలుచున్నది. తల్లికి పుత్త్రుడు ప్రాణతుల్యుడు గదా! ఆమెకు అతనికంటె ప్రియమైనవాడు ఎవ్వడును ఉండడు. (23-25)

ఆకామధేనువుయొక్క పుత్త్రులు (వృషభములు) అసంఖ్యాకముగా ఈ ప్రపంచమునందు అంతటను వ్యాపించియున్నారు. ఐనను ఇద్దఱు పుత్త్రులు మిగులశ్రమకు గుఱియగుటవలన కామధేనువు ఏడ్చుటనుజూచి, ఇంద్రుడు 'లోకమున పుత్త్రునికంటె ప్రియమైన వాడు వేఱొకడు ఉండడు' అని తలంచెను. (26)

కామధేనువు లోకహితమునకు పాటుపడునది. అందఱియెడల సమభావముతో ప్రవర్తించు లక్షణము గలది. సకలసంపదలకు పెన్నిధియైనది, సద్గుణములకు నెలవైనది (సద్గుణములను విడువనిది) స్త్రీస్వభావమునుబట్టి సంతానముపై మమకారము గలది. అట్టి ఆ కామధేనువు తనకు వేలకొలది పుత్త్రులున్నను ఒక ఇరువురి పుత్త్రులకై ఇంతగా పరితపించుచున్నది. ఇంక ఏకైక పుత్త్రుడైన శ్రీరామునియొక్క ఎడబాటునకు కౌసల్యామాత ఎట్లు తట్టుకొనగలదు?(27-28)

ఒక్కగానొక్క కొడుకుగల కౌసల్యాసాధ్విని పుత్త్రశోకమునకు గుఱిచేసితివి. అందువలన నీవు ఈ లోకమునందేగాక పరలోకము నందును శాశ్వతముగా దుఃఖములపాలగుదువు- (29)

నేను అన్నయైన శ్రీరామునకు ఈ రాజ్యమును అప్పగించి, ఆయునకు సేవలొనర్చుచను, తండ్రిగారికి ఊర్ధ్వలోకలాభమునకై అంత్యసంస్కారములను నడుపుదును. త్రికరణశుద్ధిగా చెప్పుచున్నాను, ఇందు సంశయమునకు తావులేదు దీనివలన నీ మూలమున నాకు వచ్చిన కళంకము తొలగును. నాకు కీర్తి ప్రతిష్ఠలు అబ్బును- (30)

మహాబలశాలియు, కౌసల్యాతనయుడునగు శ్రీరాముని ఇచటికి రప్పించి రాజ్యమునుఅప్పగించి నేనే స్వయముగా మునీశ్వరులు నివసించెడి వనములకు వెళ్లుదును- (31)

దుష్టసంకల్పములుగల ఓ పాపాత్మురాలా! ప్రజలు దుఃఖముతో గొంతు పెగలనివారై, కన్నీరుగార్చుచు నన్ను చూచుచుండగా నీవు నా నెత్తిపై మోపిన ఈ పాపభారమును నేను మోయజాలను- ఇట్టి పాపాలకు ఒడిగట్టిన నీవు నీకై నీవే దండకారణ్యముల దారిబట్టుట మంచిది, లేదా అగ్నిలో దూకిగాని, మెడకు ఉరివేసికొనిగాని మరణింపుము. నీకు వేఱేగతి లేదు.(32-33)

నిరుపమాన పరాక్రమశాలియైన శ్రీరాముడు రాజ్యాధికారమును చేపట్టగా నా ఈ కళంకము తొలగి పోవును. అప్పుడు నేను కృతార్థుడను కాగలను-" (34)

ఇతి నాగ ఇవారణ్యే తోమరాంకుశచోదితః।
పపాత భువి సంక్రుద్ధో నిశ్శ్వసన్నివ పన్నగః। 35

భరతుడు ఈ విధముగా పలుకుచు, దెబ్బతిని, రెచ్చిపోయి, బుసలు కొట్టుచున్న పామువలె నిట్టూర్పులు విడుచుచు, తోమరముతో అంకుశముతో పీడింపబడిన ఏనుగువలె నేలపై పడిపోయెను-(35)

సంరక్తనేత్రః శిథిలాంబరస్తథా
విధూతసర్వాభరణః పరంతపః।
బభూవ భూమౌ పతితో నృపాత్మజః
శచీపతేః కేతురివోత్సవక్షయే। 36

అంతట పరంతపుడైన భరతునియొక్క కన్నులు ఎఱ్ఱబాఱెను, ధరించియున్న వస్త్రములు చెదరెను, ఆభరణములు అన్నియు చెల్లాచెదరాయెను. అప్పుడారాజకుమారుడు, ఉత్సవములు ముగిసినపిమ్మట దించి వేయబడిన ఇంద్రధ్వజమువలె నేలపై బడెను- (36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుస్సప్తతితమస్సర్గః (74)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదినాల్గవసర్గము సమాప్తము

-- * * * --

75. డెబ్బదిఐదవసర్గము

కౌసల్యాదేవిసమక్షమున భరతుడు శపథపూర్వకముగా శ్రీరాముని వనములకు పంపుటలో తాను నిర్దోషినని ఒట్టుపెట్టుకొని తెల్పుట.

దీర్ఘకాలాత్ సముత్థాయ సంజ్ఞాం లబ్ధ్వా చ వీర్యవాన్।
నేత్రాభ్యామ్ అశ్రుపూర్ణాభ్యాం దీనాముద్వీక్ష్య మాతరమ్।
సోఽమాత్యమధ్యే భరతో జననీమ్ అభ్యకుత్సయత్। 1

(భరతుని రాకను ఎఱింగి, సుమంత్రుడు మొదలగు మంత్రులు అందఱును కైకేయి భవనమునకు విచ్చేసిరి.) - చాలాసేపటికి స్పృహరాగా ఆ వీరుడు లేచి కూర్చుండెను. తనప్రయత్నము వినలముగులచే ఆకైక దీనవదనయై కన్నీరుగార్చుచుండెను. అప్పుడతడు తల్లిని జూచి మంత్రులసమక్షమున ఆమెను నిందించుచు వారితో ఇట్లు పలికెను- (1)

రాజ్యం న కామయే జాతు మంత్రయేనాపి మాతరమ్।
అభిషేకం న జానామి యోఽభూద్రాజ్ఞా సమీక్షితః।
విప్రకృష్టే హ్యహం దేశే శత్రుఘ్న సహితోఽవసమ్। 2

"మంత్రులారా! నేను ఎన్నడును ఈ రాజ్యాధికారమును ఆశించియుండలేదు. దానినిగూర్చి, తల్లితో ఆలోచనయుచేసి యుండలేదు. మహారాజు నా రాజ్యాభిషేకమునుగుఱించి చేసిన నిర్ణయమును నేను ఎఱుగనే యెఱుగను. ఏలనవగా నేను, శత్రుఘ్నుడు చాలకాలమునుండియు ఈ దేశములోనే లేము, మా తాతగారి ఇంటనుంటిమి- (2)

వనవాసం న జానామి రామస్యాహం మహాత్మనః।
వివాసనం వా సౌమిత్రేః సీతాయాశ్చ యథాఽభవత్। 3

మహాత్ముడైన శ్రీరామునివనవాసమునుగూర్చి నాకు ఏమియు తెలియదు. లక్ష్మణుడును, సీతాదేవియు ఆయనను అనుసరించి అడవులకు వెళ్లిన సంగతియే నేనెఱుగను." (3)

తథైవ క్రోశతస్తస్య భరతస్య మహాత్మనః।
కౌసల్యా శబ్దమాజ్ఞాయ సుమిత్రామిదమబ్రవీత్। 4

మహాత్ముడగు ఆభరతుడు ఈ విధముగా గగ్గోలుపెట్టుచుండగా ఆ కంఠధ్వనిని విన్న కౌసల్య సుమిత్రతో ఇట్లు నుడివెను. (4)

ఆగతః క్రూరకార్యాయాః కైకేయ్యా భరతః సుతః।
తమహం ద్రష్టుమిచ్ఛామి భరతం దీర్ఘదర్శినమ్। 5

"క్రూరకర్మురాలైన కైకేయియొక్క కుమారుడగు భరతుడు వచ్చినట్లున్నాడు. అతడు దూరదృష్టి గలవాడు. కనుక అతనిని చూడగోరుచున్నాను." (5)

ఏవముక్త్వా సుమిత్రాం సా వివర్ణా మలినా కృశా।
ప్రతస్థే భరతో యత్ర వేపమానా విచేతనా। 6

కౌసల్యాదేవి సుమిత్రతో ఇట్లు పలికి, భరతుని జూచుటకై అతడున్న ప్రదేశమునకు బయలుదేఱెను. ఆమె తనువు వన్నెదఱిగి యుండెను, వస్త్రములు, కేశములు మలినములై, ఆమె క్రుంగి కృశించి యుండెను. దుఃఖముతో వణకిపోవుచు ఆమె పరధ్యానములో నుండెను. (6)

స తు రామానుజశ్చాపి శత్రుఘ్నసహితస్తదా।
ప్రతస్థే భరతో యత్ర కౌసల్యాయా నివేశనమ్। 7

తతశ్శత్రుఘ్నభరతౌ కౌసల్యాం ప్రేక్ష్య దుఃఖితౌ।
పర్యష్వజేతాం దుఃఖార్తాం పతితాం నష్టచేతనామ్।
రుదంతౌ రుదతీం దుఃఖాత్ సమేత్యార్యాం మనస్వినీమ్। 8

భరతం ప్రత్యువాచేదం కౌసల్యా భృశదుఃఖితా। 9

ఇదం తే రాజ్యకామస్య రాజ్యం ప్రాప్తమకంటకమ్।
సంప్రాప్తం బత కైకేయ్యాః శీఘ్రం క్రూరేణ కర్మణా। 10

ప్రస్థాప్య చీరవసనం పుత్రం మే వనవాసినమ్।
కైకేయీ కం గుణం తత్ర పశ్యతి క్రూరదర్శినీ। 11

క్షిప్రం మామపి కైకేయీ ప్రస్థాపయితుమర్హతి।
హిరణ్యనాభో యత్రాస్తే సుతో మే సుమహాయశాః। 12

అథవా స్వయమేవాహం సుమిత్రానుచరా సుఖమ్।
అగ్నిహోత్రం పురస్కృత్య ప్రస్థాస్యే యత్ర రాఘవః। 13

కామం వా స్వయమేవాద్య తత్ర మాం నేతుమర్హసి।
యత్రాసౌ పురుషవ్యాఘ్రః పుత్రో మే తప్యతే తపః। 14

ఇదం హి తవ విస్తీర్ణం ధనధాన్యసమాచితమ్।
హస్త్యశ్వరథసంపూర్ణం రాజ్యం నిర్యాతితం తయా। 15

ఇత్యాదిబహుభిర్వాక్యైః క్రూరైః సంభర్త్సితోఽనఘః।
వివ్యథే భరతస్తీవ్రం వ్రణే తుద్యేవ సూచినా। 16

పపాత చరణౌ తస్యాః తదా సంభ్రాంతచేతనః।
విలప్య బహుధాఽసంజ్ఞో లబ్ధసంజ్ఞః తతఃస్థితః। 17

ఏవం విలపమానాం తాం భరతః ప్రాంజలిస్తదా।
కౌసల్యాం ప్రత్యువాచేదం శోకైర్బహుభిరావృతామ్। 18

ఆర్యే! కస్మాదజానంతం గర్హసే మామకిల్బిషమ్।
విపులాం చ మమ ప్రీతిం స్థిరాం జానాసి రాఘవే। 19

శ్రీరామునితమ్ముడైన ఆ భరతుడు శత్రుఘ్నునితోగూడి కౌసల్యాదేవి మందిరమునకు బయలుదేఱెను. అప్పుడు వారు దురవస్థకు గుఱియైయున్న కౌసల్యామాతను దూరమునుండియే చూచి మిగుల దుఃఖితులైరి. పూజ్యురాలును, ఉదారహృదయయు ఐన ఆ కౌసల్యాదేవి శోకవివశయై ఆక్రందించుచు పడియుండగా జూచి, వారును శోకసంతప్తులై ఆమెను కౌగిలించుకొని, వెక్కి వెక్కి యేడువసాగిరి. దుఃఖమగ్నయైయున్న ఆ రామజనని అప్పుడు భరతునితో ఇట్లు పలికెను- (7-9)

"అయ్యా! భరతా! క్రూరకర్మురాలైన నీ తల్లి కైకేయి వరముల పేరుతో శ్రీరాముని వనములకు పంపినది. రాజ్యాధికారమునకై ఎదురుచూచుచున్న నీ కొఱకై నిష్కంటకమైన రాజ్యమును సంపాదించిపెట్టినది. నా కుమారుడైన శ్రీరామునిచే నారచీరలను ధరింపజేసి, అతనిని అడవులపాలు చేసినది. దానివలన ఆమె ఏమి బావుకొనదలచినదో నాకు తెలియదు. నా కుమారుడు (శ్రీరాముడు) మిగుల యశస్వి, అతడు బొడ్డున బంగారమును పెట్టుకొని పుట్టిన గొప్ప అదృష్టవంతుడు. కనుక మీ తల్లియైన కైకేయి, నన్నును అతడు ఉన్నచోటికే పంపుట ఎంతేని తగినపని. ఈ సమస్తరాజ్యాధికారమూ ఆమె చేతిలోనే యున్నది గదా! ఆమె ఆ విధముగా జేసి, పుణ్యెమును మూటగట్టుకొనుట ఎంతయు సముచితము. (10-12)

అట్లుగానిచో సుమిత్ర తోడురాగా నేనే స్వయముగా అగ్నిహోత్రమును దీసికొని, రాముడున్న అడవులకు వెళ్లెదను. లేదా నీకు ఇష్టమైనచో పురుషశ్రేష్ఠుడైన ఆ రాముడు తపస్సు చేయుచున్న ప్రదేశమునకు నీవే నన్ను స్వయముగా చేర్పుము. (13-14)

ధనధాన్యసంపదలచే తులతూగుచు, రథాశ్వగజ బలములతో సమృద్ధమై, సువిశాలమైన ఈ కోసలరాజ్యము ఆకైకేయి ద్వారా నీకు లభ్యమైనది." ఈ విధముగ కఠినాతికఠినములైన పెక్కు మాటలను కౌసల్యాదేవి భరతునితో పల్కెను. ఏ పాపమూ ఎఱుగని ఆ మహాత్ముడు ఆమె పలుకులకు వ్రణముపై సూదులతో గ్రుచ్చినంతగా బాధపడెను. (15-16)

పిదప భరతుడు మానసికముగా తత్తరపాటునకులోనై, వెంటనే కౌసల్యాదేవి పాదములపైబడెను. అతడు పెక్కురీతుల విలపించి, కడకు స్పృహను కోల్పోయెను. కొంతసేపటికి అతడు స్పృహలోనికి వచ్చెను. (17)

అంతులేని పరితాపమునకులోనైయున్న కౌసల్యాదేవికి అపుడు అతడు అంజలిఘటించెను. అపరిమితమైన శోకభారముతో కుమిలి పోవుచున్న ఆ కౌసల్యాదేవికి భరతుడు ఇట్లు విన్నవించెను. (18)

"ఓ పూజ్యురాలా! నేను ఈ పట్టాభిషేకమునుగూర్చి ఏ మాత్రము ఎఱుగను. నేను సర్వదా నిరపరాధిని. శ్రీరామునియెడ నాకుగల అనంతమైన, చెక్కుచెదరని భక్తివిశ్వాసములను నీవును ఎఱుగుదువు. ఏపాపమునూ ఎఱుగని నన్ను ఏలనిందించుచుంటివి? (19)

కృతా శాస్త్రానుగా బుద్ధిః మాభూత్ తస్య కదాచన।
సత్యసంధః సతాం శ్రేష్ఠో యస్యాఽఽర్యోఽనుమతే గతః। 20

శ్రీరాముడు సత్యనిరతుడు. అతడు సజ్జనులలో శ్రేష్ఠుడు. అంతేగాదు అతడు ఎల్లరకును పూజ్యుడు. అట్టి మహాత్ముని అడవుల పాలు చేయుటకు అనుమతించిన వారిబుద్ధి శాస్త్రవిరుద్ధమైనది, దుష్టమైనది- అమ్మా! శ్రీరాముని వనములకు పంపుటలో నా ప్రమేయము ఏమియునులేదు. (20)

ప్రైష్యం పాపీయసాం యాతు సూర్యం చ ప్రతి మేహతు।
హంతు పాదేన గాం సుప్తాం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 21

కారయిత్వా మహత్ కర్మ భర్తా భృత్యమనర్థకమ్।
అధర్మోయోఽస్య సోఽస్యాస్తుయస్యాఽఽ ర్యోఽనుమతేగతః। 22

అమ్మా! పూజ్యుడైన అన్నయ్యను వనవాసమునకు పంపించుటలో నాకు ప్రమేయము ఉన్నచో మిగుల పాపాత్మునకు సేవ చేయవలసిన గతి నాకు పట్టునుగాక. సూర్యునకు ఎదురుగా నిలిచి, మలమూత్రములను విసర్జించిన వానికి కలిగెడి పాపము నాకు చుట్టుకొనుగాక- అంతేగాదు నిద్రించుచున్న గోవును కాలితో తన్నిన పాపము నాకు అంటుగాక. ఒక యజమాని తనభృత్యుని చేత ఇబ్బడి ముబ్బడిగా పని చేయించుకొని, వానికి ఇయ్యవలసిన శ్రమఫలమును (కూలి ధనమును) ఇయ్యక ఎగగొట్టినచో అప్పుడు ఆ యజమానికి చుట్టుకొను పాపము నాకు ప్రాప్తించుగాక. (21-22)

పరిపాలయమానస్య రాజ్ఞో భూతాని పుత్రవత్।
తత స్తం ద్రుహ్యతాం పాపం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 23

తల్లీ! మహాత్ముడైన అన్నకు వనవాసమును కల్గించుటలో నా జోక్యమున్నచో ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలించెడి రాజునకు ద్రోహము తలపెట్టినవానికి ప్రాప్తించెడిదుర్గతి నాకు పట్టుగాక. (23)

బలిషడ్భాగముద్ధృత్య నృపస్యారక్షతః ప్రజాః।
అధర్మో యోఽస్య సోఽస్యాస్తు యస్యాఽఽర్యోఽనుమతే గతః। 24

మాతా! ధర్మాత్ముడైన అన్నను అడవుల పాలుచేయుటలో నా సమ్మతియున్నచో, ప్రజల ఆదాయములో ఆఱవభాగమును 'పన్ను' గా స్వీకరించినరాజు వారి బాగోగులను విస్మరించినచో ఆయనకు పట్టెడి దుర్గతి నాకు కలుగుగాక- (24)

సంశ్రుత్య చ తపస్విభ్యః సత్రే వై యజ్ఞదక్షిణామ్।
తాం విప్రలపతాం పాపం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 25

జననీ! పుణ్యపురుషుడైన అన్నకు వనవాసమును కల్గించుటలో నా ప్రమేయము ఉన్నచో, ఉపవాసాది వ్రతనియమములను పాటించుచు యజ్ఞనిర్వహణమునకుతోడ్పడుచున్న ఋత్విజులకు రాజు యజ్ఞదక్షిణను ప్రకటించి, ఆడిన మాటను తప్పినచో అతనిని చుట్టుకొనెడిపాపము నన్ను చుట్టుకొనుగాక- (25)

హస్త్యశ్వరథసంబాధే యుద్ధే శస్త్రసమాకులే।
మాస్మకార్షీత్ సతాం ధర్మం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 26

ఉపదిష్టం సుసూక్ష్మార్థం శాస్త్రం యత్నేన ధీమతా।
స నాశయతు దుష్టాత్మా యస్యాఽఽర్యోఽనుమతే గతః। 27

అమ్మా! సత్పురుషులలో శ్రేష్ఠుడైన అన్నయగు శ్రీరాముని వనవాసగతుని జేయుటలో నేను భాగస్వామిని ఐనచో, రథాశ్వగజ బలములు సమృద్ధిగా ఉన్నప్పటికిని, శస్త్రములు కొల్లలుగా ఉన్నను యోధుడు వీరధర్మమును విస్మరించి, రణరంగమున వెన్నుచూపినచో అతనికి పట్టెడి దుర్గతి నాకు కలుగుగాక. ప్రజ్ఞాశాలియైన గురువు వాత్సల్యముతో పూనికవహించి, శాస్త్రార్థములను, వాటిరహస్యములను బాగుగా నూరి పోసినను, అశ్రద్ధవలన వాటిని విస్మరించిన (మఱచి పోయిన) దుష్టుడు పొందెడి గతికి నేను పోవుదునుగాక. (26-27)

మా చ తం వ్యూఢబాహ్వంసం చంద్రార్కసమతేజసమ్।
ద్రాక్షీద్రాజ్యస్థమాసీనం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 28

బలిష్ఠములైన బాహువులుగలవాడును, సూర్యచంద్రులవలె మహాతేజస్వియు ఐన శ్రీరాముడు రాజ్యాధికారమును చేపట్టి, సింహాసనమును అలంకరించియుండగా చూచెడివాడు అదృష్టవంతుడు, అట్టి ఆయనయొక్క దర్శనభాగ్యమునకు నోచుకొననివాడు దురదృష్టవంతుడు. తల్లీ! పురుషశ్రేష్ఠుడైన అన్నను అరణ్యములకు పంపుటలో నాకు ప్రమేయము ఉన్నచో అట్టి దురదృష్టవంతునకు పట్టెడి గతి నాకు పట్టుగాక- (28)

పాయసం కృసరం ఛాగం వృథా సోఽశ్నాతు నిర్ఘృణః।
గురూంశ్చాప్యవజానాతు యస్యాఽఽర్యోఽనుమతే గతః। 29

గాశ్చ స్పృశతు పాదేన గురూన్ పరివదేత్ స్వయమ్।
మిత్రే ద్రుహ్యేత సోఽత్యంతం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 30

విశ్వాసాత్ కథితం కించిత్ పరివాదం మిథః క్వచిత్।
వివృణోతు స దుష్టాత్మా యస్యాఽఽర్యోఽనుమతే గతః। 31

అకర్తా హ్యకృతజ్ఞశ్చ త్యక్తాత్మా నిరపత్రపః।
లోకే భవతు విద్వేష్యో యస్యాఽఽర్యోఽనుమతే గతః। 32

పుత్త్రైర్దారైశ్చ భృత్యైశ్చ స్వగృహే పరివారితః।
స ఏకో మృష్టమశ్నాతు యస్యాఽఽర్యోఽనుమతే గతః। 33

అప్రాప్య సదృశాన్ దారాన్ అనపత్యః ప్రమీయతామ్।
అనవాప్య క్రియాం ధర్మ్యాం యస్యార్యోఽనుమతే గతః। 34

మాఽఽత్మనః సంతతిం ద్రాక్షీత్ స్వేషు దారేషు దుఃఖితః।
ఆయుః సమగ్రమప్రాప్య యస్యాఽఽర్యోఽనుమతే గతః। 35

రాజస్త్రీబాలవృద్ధానాం వధే యత్ పాపముచ్యతే।
భృత్యత్యాగే చ యత్ పాపం తత్ పాపం ప్రతిపద్యతామ్। 36

లాక్షయా మధుమాంసేన లోహేన చ విషేణ చ।
సదైవ బిభృయాద్భృత్యాన్ యస్యాఽఽర్యోఽనుమతే గతః। 37

మహానుభావుడైన శ్రీరాముని అడవులకు పంపుటలో నా పాత్ర ఏమైనను ఉన్నచో, పాయసమును, నూవుల అన్నమును (పులగమును), మేకపాలను దేవతలకు, పితృదేవతలకు, అతిథి - అభ్యాగతులకును అర్పించకుండా తినెడి మూర్ఖుడైన తిండిపోతునకును, గురువులను అవమానించెడి బుద్ధిహీనునకును ఏర్పడెడి దుర్గతి నాకు పట్టుగాక- (29)

అమ్మా! మహాత్ముడైన శ్రీరాముని అరణ్యములపాలు చేయుటలో నా జోక్యమున్నచో, గోమాతలను కాళ్లతో తన్నెడి దుష్టునకును, స్వయముగా గురువులను (తల్లి, తండ్రి, గురువు మొదలగు పెద్దలను) నిందించెడి మూర్ఖునకును, మిత్రద్రోహమునకు ఒడిగట్టెడు నీచునకును చుట్టుకొను పాపము నాకు అంటునుగాక. రహస్యముగా ఉంచదగిన లోకాపవాదమును తనపైగల విశ్వాసముతో ఎవ్వరైనను తనకు తెల్పినప్పుడు దానిని రహస్యముగా ఉంచక ఇతరులకు తెలిపెడి మూర్ఖునకు వచ్చెడి పాపము నాకు కలుగుగాక. మేలుచేసినవారికి ప్రత్యుపకారము చేయనివాడును, కృతఘ్నుడును, సజ్జనులచే వెలివేయుబడినవాడును, వ్యామోహకారణముగా తప్పు చేయుటకు సిగ్గుపడని వాడును, లోకులందఱిచే ద్వేషింపదగిన వాడునగు దుర్మార్గునకు పట్టుగతి నాకు పట్టుగాక- (30-32)

తల్లీ! ధర్మాత్ముడైన శ్రీరామునివనవాసవిషయమున నాజోక్యము ఉన్నచో, తనయింటిలో భార్యాపుత్త్రులు ఇతరపరిజనులు తనతో చేరియున్నను వారికి ఎవ్వరికిని పెట్టక తానొక్కడే షడ్రసోపేతముగా భుజించెడివాడు పొందునట్టి పాపమును నేను పొందుదును గాక. (33)

జననీ! మహానుభావుడైన శ్రీరాముని వనవాసమునకు పంపుటలో నాకు ప్రమేయమున్నచో, తగిన భార్యను చేపట్టక, అగ్నిహోత్రాది ధర్మకార్యములను అనుష్ఠింపనివాడై, సంతానహీనుడుగా మరణించెడి వానికి చుట్టుకొనుపాపము నాకు చుట్టుకొనుగాక- (34)

మాతా! సత్పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముని అడవులకు పంపుటలో నా సమ్మతి యున్నచో, తన ధర్మపత్నియందు సంతతిని పొందనివాడై, అల్పాయుష్కుతో మరణించెడువానికి కలుగు దుర్గతి నాకు కలుగుగాక. (35)

జననీ! ధర్మాత్ముడగు శ్రీరాముని అరణ్యములపాలు చేయుటలో నాజోక్యము ఉన్నచో, రాజును, స్త్రీలను, బాలబాలికలను, వృద్ధులను చంపుటవలన కలిగెడి పాపమూ, అట్లే విశ్వాసపాత్రులైన సేవకులను మధ్యలోనే తొలగించుటవలన కలిగెడి పాపమూ నాకు అంటుగాక (36)

అమ్మా! ధర్మనిరతుడైన శ్రీరాముని అడవులకు పంపుటలో నా పాత్రయున్నచో, అమ్మగూడని లక్కను, తేనె, మాంసము, లోహము, విషము మున్నగు నిషిద్ధవస్తువులను విక్రయించి, భార్యాపుత్త్రులను

సంగ్రామే సముపోఢే స్మ శత్రుపక్షభయంకరే।
పలాయమానో వధ్యేత యస్యాఽఽర్యోఽనుమతే గతః। 38

కపాలపాణిః పృథివీమ్ అటతాం చీరసంవృతః।
భిక్షమాణో యథోన్మత్తో యస్యాఽఽర్యోఽనుమతే గతః। 39

పానే ప్రసక్తో భవతు స్త్రీష్వక్షేషు చ నిత్యశః।
కామక్రోధాభిభూతస్తు యస్యాఽఽర్యోఽనుమతే గతః। 40

మా స్మ ధర్మే మనో భూయాత్ అధర్మం సునిషేవతామ్।
అపాత్రవర్షీ భవతు యస్యాఽఽర్యోఽనుమతే గతః। 41

సంచితాన్యస్య విత్తాని వివిధాని సహస్రశః।
దస్యుభిర్విప్రలుప్యంతాం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 42

ఉభే సంధ్యే శయానస్య యత్ పాపం పరికల్ప్యతే।
తచ్చ పాపం భవేత్ తస్య యస్యాఽఽర్యోఽనుమతే గతః। 43

యదగ్నిదాయకే పాపం యత్ పాపం గురుతల్పగే।
మిత్రద్రోహే చ యత్ పాపం తత్ పాపం ప్రతిపద్యతామ్। 44

దేవతానాం పితౄణాం చ మాతాపిత్రోస్తథైవ చ।
మా స్మ కార్షీత్ స శుశ్రూషాం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 45

పోషించుకొనువాడు పొందెడి పాపమును నేను పొందుదును గాక. ఉభయశత్రుపక్షములమధ్య ఘోరముగాపోరు సాగుచున్న సమయమున వెన్నుచూపి, పారిపోవుచు చంపబడువాడు పోయెడి లోకములకు నేను పోవుదునుగాక- (37-38)

మాతా! మహాత్ముడైన శ్రీరాముని వనవాసమునకు పంపుటలో నాకు ప్రమేయము ఉన్నచో మాసిపోయి, చినిగియున్న వస్త్రములను ధరించి, పుఱ్ఱెను చేత పట్టుకొని, బిచ్చమెత్తుకొనుచు ఉన్మత్తుని వలె తిరిగెడువాని గతి నాకు పట్టుగాక- (39)

తల్లీ! పుణ్యాత్ముడైన శ్రీరాముని అరణ్యములకు పంపుటలో నాకు ఏమాత్రమైనను భాగమున్నచో, కామక్రోధములకు వశుడై, మద్యపానము, స్త్రీసంగమము, ద్యూతక్రీడలు మున్నగు వానియందు సర్వదా ఆసక్తుడైయుండెడివానికి పట్టుదుర్గతి నాకు పట్టుగాక. ధర్మకార్యములయందు మనసుపెట్టనివాడును, సర్వదా అకృత్యములకే పాల్పడుచుండువాడును, అర్హతలను ఎఱుగక అడ్డదిడ్డముగా దానములను చేయువాడును పొందు దుర్గతికి నేను పోవుదునుగాక- (40-41)

మాతా! అక్రమమార్గముద్వారా (పాపపుపద్ధతులద్వారా) కూడబెట్టిన వానియొక్క, వేలకొలది సంపదలు సమూలముగా (దొంగలు దోచుకొనుట ద్వారా, అగ్ని పాలగుట వలన, వరదల మూలమునను) నశించును[1]- అతనిపాపకృత్యముల ఫలితమది.అట్లే మహాపురుషుడైన శ్రీరాముని అడవులకు పంపుటలో నా సమ్మతి యున్నచో నేను చేసికొన్న పూర్వపుణ్యమేదైనను ఉన్నచో అది నశించుటయే గాక, నాకు నరకబాధలు ప్రాప్తించుగాక- (42)

జననీ! ధర్మస్వరూపుడైన శ్రీరాముని వనములకు పంపుటలో నా ప్రమేయము ఉన్నచో, సూర్యభగవానుడు ఉదయించునప్పుడును, అస్తమించు సమయమునను (ఉభయసంధ్యాసమయముల యందును) నిద్రించుచుండు సోమరికివలె నాకు మహాపాపములు అంటుగాక. మాతా! ధర్మనిరతుడైన శ్రీరాముని అడవులపాలు చేయుటలో నాకు భాగమున్నచో పరులఇండ్లకు నిప్పుపెట్టినవానికి వలెను, గురువునకు ద్రోహము తలపెట్టినవానికి వలెను, మిత్రునకు ద్రోహము చేసినవానికివలెను నాకు మహాపాపములు చుట్టుకొనుగాక- (43-44)

అమ్మా! ధర్మ స్వరూపుడైన శ్రీరాముని వనములకు పంపించుటలో నా పాత్రయున్నచో, దేవతలను సేవింపని (ఆరాధింపని) వానికి వలెను (దేవతలను తిరస్కరించుట, దూషించుట చేసినవానివలె) తల్లిదండ్రులు జీవించియున్నప్పుడు వారికి సేవలు చేయనివానివలెను, మాతా పితరులు స్వర్గస్థులైనపిమ్మట వారికి శ్రాద్ధకర్మలు చేయని వానివలెను నేను పాపకూపములలో పడిపోవుదునుగాక- (45)

1) అన్యాయార్జితం విత్తం సహమూలం వినశ్యతి. నీతి శాస్త్రము; అక్రమ (పాపపు) పద్ధతులద్వారా కూడ బెట్టిన సంపదలు సమూలముగా నశించును.

స తాం లోకాత్ సతాం కీర్త్యాత్ సంజుష్టాత్ కర్మణ స్తథా।
భ్రశ్యతు క్షిప్రమద్యైవ యస్యాఽఽర్యోఽనుమతే గతః। 46

తల్లీ! మహానుభావుడైన శ్రీరాముని వనవాసమునకు పంపించుటలో నా ప్రమేయము ఉన్నచో ఎప్పుడును సత్పురుషులను దర్శింపని వారికీవలెను, సాధువర్తనులను శ్లాఘింపని వారికీ వలెను, సజ్జనులను సేవింపని వారికీ వలెను నాకు వెంటనే, ఇప్పుడే దుర్గతులు ప్రాప్తించును గాక- (46)

అపాస్య మాతృశుశ్రూషామ్ అనర్థే సోఽవతిష్ఠతామ్।
దీర్ఘబాహుర్మహావక్షా యస్యాఽఽర్యోఽనుమతే గతః। 47

జనయిత్రీ! నిత్యమూ భక్తిశ్రద్ధలతో ఆచరింపవలసిన మాతాపితృ దేవతలసేవలు మానివైచి, అధర్మమార్గమున ఊరేగెడువారికి దుర్గతులు తప్పవు. అట్టి మహాత్ముడు, దీర్ఘబాహువు, విశాలవక్షుడు ఐన శ్రీరాముని వనములపాలు చేయుటలో నాకుభాగమున్నచో నాకు ఆదుర్గతులు ప్రాప్తించునుగాక. (47)

బహుపుత్త్రో దరిద్రశ్చ జ్వరరోగసమన్వితః।
స భూయాత్ సతతం క్లేశీ యస్యాఽఽర్యోఽను మతే గతః। 48

జననీ! పూర్వజన్మలలో మహాపాపములను చేసికొనిన వారు ఈ జన్మలో దరిద్రులైపుట్టుటయు, పెక్కుమంది పిల్లలు గలవారగుటయు, మఱియు వారు జ్వరపీడితులై, భయంకరమైన రోగముల పాలగుటయు సంభవించును. ఆ విధముగా వారు ఈ జన్మలోనే నరకబాధలు అనుభవింతురు. మహాపురుషుడైన శ్రీరాముని అడవులకు పంపించుటలో నేను భాగస్వామిని ఐనచో వారికివలె నాకు నరకయాతనలు ప్రాప్తించుగాక. (48)

ఆశామాశంసమానానాం దీనానామూర్ధ్వచక్షుషామ్।
అర్థినాం వితథాం కుర్యాత్ యస్యాఽఽర్యోఽనుమతే గతః। 49

అమ్మా! పూజ్యుడైన శ్రీరాముని అరణ్యములకు పంపుటలో నాకును ప్రమేయమున్నచో, దఱిచేరి ప్రస్తుతించెడి వారి యొక్క ఆశలను, ఉన్నతాసనములపై కూర్చున్న దాతలయొక్క వదనములను వీక్షించుచు ఊర్ధ్వముఖులై నిరీక్షించుచున్న దీనులయొక్క ఆశలను, చెంత నిలబడి వేడుకొనుచున్న అర్థులయొక్క ఆశలను వమ్ముచేసెడి లోభులకు పట్టు దుర్గతి నాకు పట్టుగాక- (49)

మాయయా రమతాం నిత్యం పరుషః పిశునోఽశుచిః।
రాజ్ఞో భీతస్త్వధర్మాత్మా యస్యాఽఽర్యోఽనుమతే గతః। 50

మాతా! సత్పురుషులలో శ్రేష్ఠుడైన శ్రీరాముని అడవులకు పంపించుటలో నాకొక్కమున్నచో, ఎల్లప్పుడును పరుషముగా మాట్లాడుచు, ఇతరులపై చాడీలు చెప్పుచు, పవిత్రతలేక రాజు తనకు ఏ శిక్ష విధించునోయని భయపడుచు, అధర్మమార్గమున పరులను వంచించుచు బ్రతికెడువానికి అంటెడు పాపములు నాకు అంటునుగాక- (50)

ఋతుస్నాతాం సతీం భార్యామ్ ఋతుకాలానురోధినీమ్।
అతివర్తేత దుష్టాత్మా యస్యాఽఽర్యోఽనుమతే గతః। 51

ధర్మదారాన్ పరిత్యజ్య పరదారాన్ నిషేవతామ్।
త్యక్తధర్మరతిర్మూఢో యస్యాఽఽర్యోఽనుమతే గతః। 52

తల్లీ! ధర్మనిరతుడైన శ్రీరాముని వనవాసమునకు పంపించుటలో నా పాత్రయున్నచో, ఋతుకాలనియమములను పాటించి, ఋతు (శుద్ధి) స్నానము చేసినయనంతరము పతివ్రతయైన భార్య తనకడకు వచ్చినప్పుడు ఆమె కోర్కెను తిరస్కరించు దుష్టునకువలె నాకు మహాపాపములు కలుగును గాక. ధర్మార్థ కామములవిషయమున ఆమెతోడిదే నాజీవితము అని పది మందిలో వాగ్దానము చేసి[1], పెండ్లియాడిన ధర్మపత్నిని కాదని, పరస్త్రీలతో సుఖించుచు ధర్మమార్గమును వీడిన (ఆడిన మాట తప్పిన) మూఢునకు వలె నాకు దుర్గతులు ప్రాప్తించును గాక-(51-52)

1) కన్యాదాత వరుని అడుగుట 'ధర్మేచ, అర్థేచ, కామేచ త్వయా ఏషా నాఽతిచరితవ్యా'- (వరుని వాగ్దానము) నాఽతిచరామి.

విప్రలుప్తప్రజాతస్య దుష్కృతం బ్రాహ్మణస్య యత్।
తదేవ ప్రతిపద్యేత యస్యాఽఽర్యోఽనుమతే గతః। 53

జననీ! పూర్వజన్మలో అన్నదానాదులను చేయకుండుట, స్త్రీలను వేధించుట మున్నగు దుష్కృత్యములను చేయుటవలన బ్రాహ్మణుడు (బ్రాహ్మణుడు మొదలగువారు) ఈ జన్మలో సంతతిని కోల్పోవును. ధర్మనిరతుడైన శ్రీరాముని వనవాసమునకు పంపుటలో నా ప్రమేయము ఉన్నచో ఆ సంతానహీనుడైన బ్రాహ్మణునకువలె నాకు దుర్గతి ప్రాప్తించునుగాక- (53)

పానీయదూషకే పాపం తథైవ విషదాయకే।
యత్తదేకః స లభతాం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 54

అమ్మా! మహాత్ముడైన శ్రీరాముని అడవులకు పంపించుటలో నా జోక్యము ఉన్నచో, పానీయములను (త్రాగుటకు అనువగు నిర్మల జలములను) పాడు (మురికి) చేయు వానికిని, ఇతరులను చంపదలచి, వారిపై విషప్రయోగము చేయు వానికిని చుట్టుకొను పాపము నాకు చుట్టుకొనుగాక- (54)

బ్రాహ్మణాయోద్యతాం పూజాం విహంతు కలుషేంద్రియః।
బాలవత్సాం చ గాం దోగ్ధుం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 55

తల్లీ! మహానుభావుడైన శ్రీరాముని అరణ్యములదారి పట్టించుటలో నా పాత్రయున్నచో, బ్రాహ్మణోత్తమునకై సిద్ధము చేయబడిన పూజను భంగపఱచెడు కలుషితేంద్రియునకు (దుష్టమనస్కునకు) వలెను, లేగదూడకు మిగులకుండ తల్లి యావుపొదుగునుండి పూర్తిగా పాలు పిండుకొనెడు లోభికివలెను నాకు దుర్గతులు ప్రాప్తించుగాక- (55)

తృష్ణార్తం సతి పానీయే విప్రలంభేన యోజయేత్।
లభేత తస్య యత్ పాపం యస్యాఽఽర్యోఽనుమతే గతః। 56

మాతా! ధర్మస్వరూపుడైన శ్రీరాముని వనములకు పంపించుటలో నా ప్రమేయము ఉన్నచో, త్రాగుటకు అనువగు నిర్మలజలములు (మంచి నీళ్ళు) ఉన్నను, దప్పిగొని వచ్చినవానియొక్క దాహము తీర్పక అసత్యములు పలికెడు వంచకునకు పట్టెడు దుర్గతి నాకు పట్టుగాక- (56)

భక్త్యా వివదమానేషు మార్గమాశ్రిత్య పశ్యతః।
తస్య పాపేన యుజ్యేత యస్యాఽఽర్యోఽనుమతే గతః। 57

జనయిత్రీ! పూజ్యుడైన శ్రీరాముని అడవులపాలుచేయుటలో నాకును భాగము ఉన్నచో, వాదియు, ప్రతివాదియు (ఇద్దరు వ్యక్తులు) వివాదపడుచుండగా, వారిలో ఒకరిపై పక్షపాతమువహించి, వానిని గెలిపించుటకై అక్రమముగా మాట్లాడెడు పాపాత్మునకు వలె నాకు దుర్గతి ప్రాప్తించునుగాక-"[1] (57)

విహీనాం పతిపుత్రాభ్యాం కౌసల్యాం పార్థివాత్మజః।
ఏవమాశ్వాసయన్నేవ దుఃఖార్తో నిపపాత హ। 58

రాజకుమారుడైన భరతుడు పతిహీనయై, పుత్రునియెడబాటుతో శోకార్తయైయున్న కౌసల్యాదేవిని ఇట్లు పరిపరివిధముల ఓదార్చుచు దుఃఖమునకు తట్టుకొనలేక నేలపై పడిపోయెను- (58)

తథా తు శపథైః కష్టైః శపమానమచేతనమ్।
భరతం శోకసంతప్తం కౌసల్యా వాక్యమబ్రవీత్। 59

ఆ విధముగా తీవ్రమైన శపథములను చేయుచు, ఒట్టు మీద ఒట్టు పెట్టుకొనుచు శోకసంతప్తుడై, స్పృహదప్పి పడియున్న భరతునితో కౌసల్యాదేవి ఇట్లు నుడివెను- (59)

మమ దుఃఖమిదం పుత్ర భూయః సముపజాయతే।
శపథైః శపమానో హి ప్రాణానుపరుణత్సి మే। 60

"నాయనా! భరతా! నీపలుకులవలన ఇప్పుడు నాలోనిదుఃఖము ఇంకను ఇనుమడించుచున్నది. ఇటు తీవ్రమైన శపథములను చేయుము. ఒట్టుపెట్టుకొనుటద్వారా నీవు నాకు కొంత ఊరట గూర్చితివి. పోవుచున్న నా ప్రాణములను నీ మాటలతో కొంతవఱకు నిలబెట్టితివి. (60)

1) ఆవేదనతో శపథములు చేయునపుడు వానిలో కొన్ని పునరుక్తులుగా అనిపించినచో దుఃఖములో అట్లు జరుగుట లోకసహజమేయని తలంపవలెను.

దిష్ట్యా న చలితో ధర్మాత్ ఆత్మా తే సహలక్ష్మణః।
వత్స! సత్యప్రతిజ్ఞో మే సతాం లోకానవాప్స్యసి। 61

ఇత్యుక్త్వా చాంకమానీయ భరతం భ్రాతృవత్సలమ్।
పరిష్వజ్య మహాబాహుం రురోద భృశదుఃఖితా। 62

ఏవం విలపమానస్య దుఃఖార్తస్య మహాత్మనః।
మోహాచ్చ శోకసంరోధాత్ బభూవ లుళితం మనః। 63

లాలప్యమానస్య విచేతనస్య
ప్రణష్టబుద్ధేః పతితస్య భూమౌ ।
ముహుర్ముహుర్నిశ్శ్వసతశ్చ ఘర్మం
సా తస్య శోకేన జగామ రాత్రిః । 64

కుమారా! నా అదృష్టవశమున నీవు ధర్మమార్గమును వీడలేదు. నీవు సత్యప్రతిజ్ఞుడవు (ఆడిన మాటతప్పని వాడవు.) కావున నీవును లక్ష్మణునివలె సత్పురుషులలో శ్రేష్ఠుడవగుదువు-" (61)

మిగుల దిగులుతోనున్న ఆ కౌసల్యాదేవి ఇట్లు పలికిన పిమ్మట అన్నయగు శ్రీరామచంద్రునిపై ప్రేమాదరములుగల భరతుని తనయొడిలోనికి దీసికొని, ఆ మహాబాహువును కౌగిలించుకొని, ఇంకను ఏడువసాగెను. (62)

మహాత్ముడైన భరతుడు దుఃఖార్తుడై ఇట్లు విలపించుచుండగా మోహమువలనను, అంతులేని శోకకారణమునను అతని మనస్సు మిక్కిలి కలవరపాటునకు లోనయ్యెను- (63)

ఇట్లు విలపించుచు స్పృహదప్పి నేలపై బడియున్న ఆ భరతునకు బుద్ధి పనిచేయకుండెను. అతడు మాటిమాటికిని వేడినిట్టూర్పులు విడుచుచుండెను. ఆ రాత్రియంతయును ఇట్లు అతనికి శోకములోనే గడచిపోయెను. (64)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచసప్తతితమస్సర్గః (75)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదిఐదవసర్గము సమాప్తము

-- * * * --

76. డెబ్బదిఆఱవసర్గము

భరతుడు తనతండ్రియగు దశరథునకు అంత్యక్రియలొనర్చుట.

తమేవం శోకసంతప్తం భరతం కైకయీసుతమ్।
ఉవాచ వదతాం శ్రేష్ఠో వసిష్ఠః శ్రేష్ఠవాగృషిః। 1

అలం శోకేన భద్రం తే రాజపుత్ర! మహాయశః!।
ప్రాప్తకాలం నరపతేః కురు సంయానముత్తమమ్। 2

వసిష్ఠస్య వచః శ్రుత్వా భరతో ధారణాం గతః।
ప్రేతకార్యాణి సర్వాణి కారయామాస ధర్మవిత్। 3

ఉద్ధృతం తైలసంరోధాత్ స తు భూమౌ నివేశితమ్।
ఆపీతవర్ణవదనం ప్రసుప్తమివ భూపతిమ్। 4

సంవేశ్య శయనే చాగ్ర్యే నానారత్నపరిష్కృతే।
తతో దశరథం పుత్రో విలలాప సుదుఃఖితః। 5

కైకేయిసుతుడగు భరతుడు శోకముతో కుమిలిపోవుచుండగా, మాటాడుటలో నేర్పరి, బ్రహ్మర్షులలో శ్రేష్ఠుడైన వసిష్ఠమహర్షి అతనితో ఇట్లు నుడివెను. (1)

"ఓ రాజకుమారా! మహాయశస్వీ! ఇది శోకమునకు సమయము గాదు, శోకింపవలదు. నీకు మేలుకలుగుగాక, ఇక మహారాజునకు ఉత్తమగతులు కలుగుటకై అంత్యక్రియలు జరుపవలసిన సమయమిది. కర్తవ్యమునకు సిద్ధపడుము." (2)

అంతట ధర్మజ్ఞుడైన భరతుడు వసిష్ఠునివచనములను విని, మనస్సును కుదుటబఱచుకొనెను. అనంతరము అతడు తండ్రియగు దశరథునకు విధ్యుక్తముగా ప్రేతసంస్కారములను ప్రారంభించెను. దశరథునికళేబరమును తైలద్రోణినుండి తీసి, భూమిపై ఉంచిరి. చాలకాలము నూనెతొట్టిలోనుండుటవలన శవముయొక్కముఖము పాలిపోయియుండెను. అవయవములు శిథిలముకాకుండుటవలన చూచెడి వారికి రాజు నిద్రించుచున్నట్లు కనబడుచుండెను. అనంతరము శవమునకు స్నానాదిసంస్కారములను ముగించి, రత్నములను తాపిన పాడెపై దానిని పరుండబెట్టిరి. పిమ్మట భరతకుమారుడు మిగుల దుఃఖితుడై తండ్రిని గూర్చి ఇట్లు విలపింపసాగెను. (3-5)

కిం తే వ్యవసితం రాజన్ ప్రోషితే మయ్యనాగతే।
వివాస్య రామం ధర్మజ్ఞం లక్ష్మణం చ మహాబలమ్। 6

క్వ యాస్యసి మహారాజ! హిత్వేమం దుఃఖితం జనమ్।
హీనం పురుషసింహేన రామేణాక్లిష్టకర్మణా। 7

యోగక్షేమం తు తే రాజన్! కోఽస్మిన్ కల్పయితా పురే।
త్వయి ప్రయాతే స్వస్తాత! రామే చ వనమాశ్రితే। 8

విధవా పృథివీ రాజన్! త్వయా హీనా న రాజతే।
హీనచంద్రేవ రజనీ నగరీ ప్రతిభాతి మా। 9

ఏవం విలపమానం తం భరతం దీనమానసమ్।
అబ్రవీద్వచనం భూయో వసిష్ఠస్తు మహామునిః। 10

ప్రేతకార్యాణి యాన్యస్య కర్తవ్యాని విశాంపతేః।
తాన్యవ్యగ్రం మహాబాహో! క్రియంతామ్ అవిచారితమ్। 11

తథేతి భరతో వాక్యం వసిష్ఠస్యాభిపూజ్య తత్।
ఋత్విక్పురోహితాచార్యాన్ త్వరయామాస సర్వశః। 12

యే త్వగ్నయో నరేంద్రస్య చాగ్న్యగారాద్బహిష్కృతాః।
ఋత్విగ్భిర్యాజకైశ్చైవ తేఽహ్రియంత యథావిధి। 13

శిబికాయామథాఽఽరోప్య రాజానం గతచేతసమ్।
బాష్పకంఠా విమనసః తమూహుః పరిచారకాః। 14

హిరణ్యం చ సువర్ణం చ వాసాంసి వివిధాని చ।
ప్రకిరంతో జనా మార్గం నృపతేరగ్రతో యయుః। 15

చందనాగరునిర్యాసాన్ సరళం పద్మకం తథా।
దేవదారూణి చాఽఽహృత్య క్షేపయంతి తథాఽపరే। 16

గంధానుచ్చావచాం శ్చాన్యాన్ తత్ర గత్వాఽథ భూమిపమ్।
తతస్సంవేశయామాసుః చితామధ్యే తమృత్విజః। 17

"ఓ తండ్రీ! నేను మాతాతగారింటినుండి (కేకయరాజ్యము నుండి) తిరిగిరాకముందే ధర్మజ్ఞుడైన శ్రీరాముని, మహాబలశాలియైన లక్ష్మణుని వనములకు పంపి, నీవు ఇట్లు స్వర్గప్రయాణమునకు ఎందులకు నిర్ణయించుకొంటివి? (6)

ఓ మహారాజా! ఎంతటి గొప్పకార్యములనైనను అవలీలగా సాధించునట్టి పురుషసింహుడైన శ్రీరాముని ఎడబాసి, దుఃఖితుడైన ఈ సేవకుని (నన్ను) ఇచట దిక్కులేని వానినిగా జేసి, అయ్యో! ఎచటికి వెళ్లుదువు? (7)

ఓ మహారాజా! నాయనా! నీవేమో స్వర్గస్థుడవైతివి. శ్రీరాముడేమో వనములకు జేరెను. నీవు నిన్నటివరకు పాలించిన ఈ అయోధ్యాపుర ప్రజలయొక్క యోగక్షేమములను ఇక చూచువారెవరు? (8)

ఓ మహారాజా! నీవులేకపోవుటచే ఈ రాజ్యము దిక్కులేనిదై, (అనాథయై) కళావిహీనమైయున్నది. నేడు ఈ పురము నాకు చంద్రుడులేని రాత్రివలె తోచుచున్నది-" (9)

దిక్కుతోచనివాడై (దీనుడై) ఇట్లు విలపించుచున్న ఆభరతునితో వసిష్ఠ మహాముని మరల ఇట్లు పలికెను. (10)

"ఓ మహాబాహూ! మహారాజుగారికై ఆచరింపవలసిన ప్రేత కార్యములను నిర్విచారముగా ప్రశాంతముగా నిర్వహింపుము". (11)

అంతట భరతుడు 'అట్లే' యని పలికి, వసిష్ఠునివచనములను తలదాల్చి, ఋత్విజులను, పురోహితులను, ఆచార్యులను[1] అందరిని అన్ని విధములుగా ప్రేరేపించెను. (12)

ఋత్విజులు, యాజకులు మహారాజుగారిఅగ్నిశాలనుండి గార్హపత్యా- అగ్నులను బయటికి దీసికొని వచ్చి, యథావిధిగా హోమములను నెఱపిరి. (13)

పిమ్మట పరిచారకులు మహారాజుశవమును పల్లకీలో శ్మశాన భూమికి తీసికొని వెళ్లిరి. ఆ సమయమున వారికంఠములు గద్గదములాయెను, కనులనుండి అశ్రువులు ధారలుగట్టెను, మనస్సులు వికలములయ్యెను. (14)

అప్పుడు పురజనులు ఆ మార్గమునందు వివిధములగు వస్త్రములనువిరచుచు, వెండి, బంగారుపూవులను వెదజల్లుచు, ఆ శవయాత్రలో ముందుభాగమున నడచిరి. (15)

ఆ శవమును శ్మశానమునకు చేర్చిన పిమ్మట 'చితి' సిద్ధపఱచబడెను ఆ చితియందు జనులు చందనపు చెక్కలను, అగరుముక్కలను, గుగ్గిలుపుల్లలను, సరళ, పద్మక, దేవదారు చెక్కలను ఉంచిరి. కొందఱు ఇంకను పలువిధములగు సుగంధ ద్రవ్యములను చల్లిరి. పిమ్మట ఋత్విజులు రాజశవమును పల్లకీ నుండి బయటికి దీసి దానిని చితిపై ఉంచిరి. (16-17)

1) ఋత్విజః= యజ్ఞకర్మణి వృతాః = యజ్ఞాదికర్మలను నిర్వహింపజేయువారు. పురోహితాః = పురోహితవరత్వేన శాంతి పౌష్టికాది క్రియాప్రవర్తకాః = శాంతి ప్రవర్తకములైన క్రియాకలాపములను నడిపించువారు. పురోహితులు. ఆచార్యాః = వసిష్ఠ వామ దేవాదయః = వేదధర్మవిదులను నిర్వహింపజేయుటలో కుశలురు.

తథా హుతాశనం దత్త్వా జేపుస్తస్య తమృత్విజః।
జగుశ్చ తే యథాశాస్త్రం తత్ర సామాని సామగాః॥ 18

అనంతరము ఋత్విజులు వేదమంత్రములను పఠించుచుండగా, ఉద్గాతలు సామగానములు చేయుచుండగా భరతుడు చితికి నిప్పంటించెను. (18)

శిబికాభిశ్చ యానైశ్చ యథార్హం తస్య యోషితః।
నగరాన్నిర్యయుస్తత్ర వృద్ధైః పరివృతాస్తదా॥ 19

ప్రసవ్యం చాపి తం చక్రుః ఋత్విజోఽగ్నిచితం నృపమ్।
స్త్రియశ్చ శోకసంతప్తాః కౌసల్యాప్రముఖాస్తదా॥ 20

పిమ్మట కౌసల్యాదిరాజపత్నులు వృద్ధులైన పరిచారకులతో గూడి, తమతమ అర్హతలను అనుసరించి, పల్లకీలలోను, రథాదులపైనను అప్పుడు శ్మశానమునకు చేరిరి. పిదపవారు అశ్వమేధాది యజ్ఞములను ఆచరించిన ఆ మహారాజుయొక్క శవమునకు సవ్యాపసవ్యములుగా ప్రదక్షిణలను ఒనర్చిరి. అట్లే ఋత్విజులును ఆ చితికి ప్రదక్షిణములను గావించిరి. (19-20)

క్రౌంచీనామివ నారీణాం నినాదస్తత్ర శుశ్రువే।
ఆర్తానాం కరుణం కాలే క్రోశంతీనాం సహస్రశః॥ 21

ఆ సమయమున దీనముగా ఏడ్చుచున్న వేలకొలది స్త్రీల ఆర్తనాదములు క్రౌంచపక్షులఆఱుపులవలె వినబడెను- (21)

తతో రుదంత్యో వివశా విలప్య చ పునః పునః।
యానేభ్యః సరయూతీరమ్ అవతేరుర్వరాంగనాః॥ 22

శోకవివశలై వెక్కివెక్కియేడ్చుచున్న ఆ రాజపత్నులు ఎంతయు విలపించుచు తమతమ వాహనములపై సరయూనదీ తీరమునకుచేరి, (వాహనముల నుండి) క్రిందికి దిగిరి. (22)

కృత్వోదకం తే భరతేన సార్ధం
నృపాంగనా మంత్రిపురోహితాశ్చ।
పురీం ప్రవిశ్యాశ్రుపరీతనేత్రాః
భూమౌ దశాహం వ్యనయంత దుఃఖమ్॥ 23

అంతట ఆరాజపత్నులును, మంత్రులును, పురోహితులును భరతునితోగూడి నదీజలముల తర్పణములను విడచిరి. పిమ్మట అందఱును కన్నీరు గార్చుచు నగరమున ప్రవేశించిరి. తరువాత పదిదినములవఱకును నిత్యము నేలపై శయనించుచు.[1] దుఃఖమును దిగమ్రింగుచు అంత్యక్రియలను నెఱపిరి. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షట్సప్తతితమస్సర్గః (76)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదిఆఱవసర్గము సమాప్తము

-- * * * --

77. డెబ్బదిఏడవసర్గము

భరతశత్రుఘ్నులు తమతండ్రికి అగ్నిసంస్కారములుచేసిన ప్రదేశమునకుచేరి విలపించుట.

తతో దశాహేఽతిగతే కృతశౌచో నృపాత్మజః।
ద్వాదశేఽహని సంప్రాప్తే శ్రాద్ధకర్మాణ్యకారయత్॥ 1

పదిదినములు గడచిన పిమ్మట పదునొకండవదినమున భరతుడు శుచియై, శుద్ధి పుణ్యాహవాచనక్రియను ఆచరించెను- పన్నెండవదినమున షోడశము, సపిండీకరణము మొదలగు శ్రాద్ధకర్మలను అతడు నిర్వహించెను. (1)

బ్రాహ్మణేభ్యో దదౌ రత్నం ధనమన్నం చ పుష్కలమ్।
వాసాంసి చ మహార్హాణి రత్నాని వివిధాని చ॥ 2

భరతుడు బ్రాహ్మణులకు రత్నములను, ధనములను, అమూల్యములైన వస్త్రములను, వివిధములగు రత్నాభరణములను ఒసంగెను. సమృద్ధిగా అన్నదానములను గావించెను. (2)

1) ప్రేతతో (శవముతో) సహా అగ్నులను వెలుపలికి దీసికొని వచ్చుట. శవమునకు స్నానాది సంస్కారములను నడపుట, దానిని శ్మశానమునకు చేర్చుట. శవమును చితిపై ఉంచుట. మంత్రపూర్వకముగా చితికి నిప్పు అంటించుట. దానికి ప్రదక్షిణములను ఒనర్చుట. నదీజలములలో తర్పణములను అర్పించుట. పదిదినములు ముగియు వఱకు మృతాశౌచమును పాటించుట. భూమిపై శయనించుట మొదలగునవి ఉత్తరక్రియలలోని కొన్నియంశములు-

బాస్తికం బహుశుక్లం చ గాశ్చాపి శతశస్తదా।
దాసీదాసం చ యానం చ వేశ్మాని సుమహాంతి చ।
బ్రాహ్మణేభ్యో దదౌ పుత్త్రో రాజ్ఞస్తస్యౌర్ధ్వదైహికమ్। 3

తతః ప్రభాతసమయే దివసేఽథ త్రయోదశే।
విలలాప మహాబాహుః భరతః శోకమూర్ఛితః।
శబ్దాపిహితకంఠస్తు శోధనార్థముపాగతః। 4

చితామూలే పితుర్వాక్యమ్ ఇదమాహ సుదుఃఖితః। 5

తాత! యస్మిన్ నిసృష్టోఽహం త్వయా భ్రాతరి రాఘవే।
తస్మిన్ వనం ప్రవ్రజితే శూన్యే త్యక్తోఽస్మ్యహం త్వయా। 6

యస్యా గతిరనాథాయాః పుత్త్రః ప్రవ్రాజితో వనమ్।
తామంబాం తాత! కౌసల్యాం త్యక్త్వా త్వం క్వ గతో నృప। 7

దృష్ట్వా భస్మారుణం తచ్చ దగ్ధాస్థిస్థానమండలమ్।
పితుః శరీరనిర్వాణం నిష్టనన్ విషసాద సః। 8

స తు దృష్ట్వా రుదన్ దీనః పపాత ధరణీతలే।
ఉత్థాప్యమానః శక్రస్య యంత్రధ్వజ ఇవ చ్యుతః। 9

అభిపేతుస్తతః సర్వే తస్యామాత్యాః శుచివ్రతమ్।
అంతకాలే నిపతితం యయాతిమ్ ఋషయో యథా। 10

శత్రుఘ్నశ్చాపి భరతం దృష్ట్వా శోకపరిప్లుతమ్।
విసంజ్ఞో న్యపతద్భూమౌ భూమిపాలమ్ అనుస్మరన్। 11

ఉన్మత్త ఇవ నిశ్చేతా విలలాప సుదుఃఖితః।
స్మృత్వా పితుర్గుణాంగాని తాని తాని తదా తదా। 12

మంథరాప్రభవస్తీవ్రః కైకేయీగ్రాహసంకులః।
వరదానమయోఽక్షోభ్యోఽమజ్జయచ్ఛోకసాగరః। 13

ఆ రాజకుమారుడు మహారాజునకు ఉత్తమగతులు కలుగుటకై విప్రోత్తములకు ఇంకను మిక్కిలి తెల్లని ఉన్నిశాలువలను వేలకొలది గోవులను, దాసదాసీజనములను, వస్తువాహనములను, అందమైన గృహములను దానము చేసెను. (3)

పిమ్మట పదుమూడవదినమున ప్రాతఃకాలసమయమున మహాబాహువైన భరతుడు శోకవివశుడై విలపింపసాగెను. దుఃఖభారముచే అతనికంఠము పెగలకయుండెను. అస్థిసంచయనార్థము శ్మశానమునకు వెళ్లి, తండ్రి యొక్క చితిప్రదేశమును సమీపించి, దుఃఖముతో మిగుల వాపోయెను. (4-5)

'తండ్రీ! నీవు నన్ను మా అన్నయైన శ్రీరామునిచేతిలో పెట్టితివి. అతడిప్పుడు వనవాసియైయున్నాడు. నన్నిక్కడ ఒంటరివానినిజేసి, నీవేమో స్వర్గస్థుడవైతివి. ఇప్పుడు నాకు దిక్కెవ్వరు? (6)

తండ్రీ! కౌసల్యాదేవికి శ్రీరాముడు ప్రాణతుల్యుడు. అతడే ఆమెకు ఆధారము. అతనిని నీవు అడవులపాలు చేసితివి. ఆమె ఇప్పుడు అండలేనిదయ్యెను. ఆ కౌసల్యామాతను వీడి, ఆమెను అనాథనుగా జేసి, నీవు ఎక్కడికి వెళ్లితివి? (7)

భరతుడు తండ్రిశవము దహనమైన ప్రదేశమును గాంచెను. అది అగ్నిజ్వాలలప్రభావమున ఎఱ్ఱగా కనబడుచు బూడిదతో నిండియుండెను- కాలిపోయిన ఎముకలు అచట చెల్లాచెదరుగా పడియుండెను. తండ్రి కళేబరము దహనమొనర్చిన అస్థలమును చూచి, అతడు బిగ్గఱగా ఏడ్చుచు దుఃఖమగ్నుడయ్యెను. (8)

చితిప్రదేశమును చూడగానే ఆ భరతుడు దీనముగా ఏడ్చుచు, యంత్రబద్ధమైన ఇంద్రునిధ్వజము పైకి ఎత్తబడుచు జాఱిపోయి క్రిందబడినట్లు, నేలపై బడిపోయెను- (యంత్రము పడిపోవుటతో యంత్రాధారమునున్న ధ్వజము పడిపోవును - అట్లే మహారాజ పతనముతో భరతునిగుండె జారిపోయి, అతడు నేలపై బడెను-) (9)

పుణ్యము క్షీణించిన పిమ్మట స్వర్గమునుండి క్రిందబడిన యయాతిని అతని దౌహిత్రుడైన అష్టకుడు మొదలగు రాజర్షులందఱును సమీపించినట్లు శుచివ్రతుడైన భరతునియొద్దకు అతనిఅమాత్యులందఱును వచ్చిచేరిరి. (10)

శత్రుఘ్నుడును శోకమున మునిఁగియున్న భరతుని జూచి, పదే పదే మహారాజును స్మరించుచు, స్పృహ దప్పి, నేలపై బడెను. (11)

పిమ్మట తనతండ్రి, ప్రేమతో తనలాలనపాలనలు చూచిన సమయములను అతడు జ్ఞప్తికి దెచ్చుకొని, అప్పుడప్పుడు ఆయన విశిష్టగుణములను స్మరించుచు మిగులదుఃఖితుడై, ఉన్మత్తుని వలె నిశ్చేష్టుడై విలపింపసాగెను- (12)

వరదానములతోగూడిన ఈ శోకసాగరము మనలను అందఱినీ ముంచివేసినది - దీనికి మూలము మంథర. కైకేయియను మొసలి దీనిని అల్లకల్లోలపఱచినది. - దీనిని అతిగమించుట అసాధ్యము- (13)

సుకుమారం చ బాలం చ సతతం లాలితం త్వయా।
క్వ తాత! భరతం హిత్వా విలపంతం గతో భవాన్। 14

నను భోజ్యేషు పానేషు వస్త్రేష్వాభరణేషు చ।
ప్రవారయసి నః సర్వాన్ తన్నః కోఽన్యః కరిష్యతి। 15

అవదారణకాలే తు పృథివీ నావదీర్యతే।
యా విహీనా త్వయా రాజ్ఞా ధర్మజ్ఞేన మహాత్మనా। 16

పితరి స్వర్గమాపన్నే రామే చారణ్యమాశ్రితే।
కిం మే జీవితసామర్థ్యం ప్రవేక్ష్యామి హుతాశనమ్। 17

హీనో భ్రాత్రా చ పిత్రా చ శూన్యామిక్ష్వాకుపాలితామ్।
అయోధ్యాం న ప్రవేక్ష్యామి ప్రవేక్ష్యామి తపోవనమ్। 18

తయోర్విలపితం శ్రుత్వా వ్యసనం చాన్వవేక్ష్య తత్।
భృశమార్తతరా భూయః సర్వ ఏవానుగామినః। 19

తతో విషణ్ణౌ విశ్రాంతౌ శత్రుఘ్నభరతావుభౌ।
ధరణ్యాం సంవ్యచేష్టేతాం భగ్నశృంగావివర్షభౌ। 20

తతః ప్రకృతిమాన్ వైద్యః పితురేషాం పురోహితః।
వసిష్ఠో భరతం వాక్యమ్ ఉత్థాప్య తమువాచ హ। 21

త్రయోదశోఽయం దివసః పితుర్వృత్తస్య తే విభో।
సావశేషాస్థినిచయే కిమిహ త్వం విలంబసే। 22

త్రీణి ద్వంద్వాని భూతేషు ప్రవృత్తాన్యవిశేషతః।
తేషు చాపరిహార్యేషు నైవం భవితుమర్హసి। 23

సుమంత్రశ్చాపి శత్రుఘ్నః ఉత్థాప్యాభిప్రసాద్య చ।
శ్రావయామాస తత్త్వజ్ఞః సర్వభూతభవాభవౌ। 24

ఉత్థితౌ చ నరవ్యాఘ్రౌ ప్రకాశేతే యశస్వినౌ।
వర్షాతపపరిక్లిన్నౌ పృథగింద్రధ్వజావివ। 25

ఓ తండ్రీ! సుకుమారుడును, బాలుడును, అనుక్షణము నీచే లాలింపబడినవాడును అగు భరతుడు నీకొఱకై విలపించు చున్నాడు. అట్టి అనుంగుపుత్రుని వీడి, నాయనా! నీవు ఎక్కడికి వెళ్లితివి? భోజనసమయములయందు నీవు మాచే కొసరి కొసరి తినిపించెడివాడవు. పానీయములను త్రాగించెడివాడవు. మమ్ములను అడిగి, మాకు నచ్చిన వస్త్రాభరణములను మాచే ధరింపజేసెడి వాడవు. మాకిప్పుడు అంత గారాబముతో ఎవరు విచారణ చేయుదురు? (14-15)

మహాత్ముడవు, ధర్మజ్ఞుడవు, ఐన నీ వంటి మహారాజును కోల్పోయిన ఈ తరుణమున భూమండలము బ్రద్దలుకావలసి యున్నది- కానీ అట్లు జరుగకపోవుట ఆశ్చర్యకరము. (16)

తండ్రి స్వర్గమునకు చేరినాడు, అన్నయగు శ్రీరాముడు వనములను ఆశ్రయించినాడు. ఇక నేను ఎట్లు జీవింపగలను? కనుక అగ్నిలో ప్రవేశించెదను. (17)

తండ్రిని కోల్పోయితిని, అన్నకు దూరమైతిని - ఇక్ష్వాకు మహారాజులు పాలించిన ఈ అయోధ్య పాడుబడినది. ఇంక ఈ అయోధ్యలో అడుగుపెట్టను. తపోవనములకు ఏగెదను." (18)

అప్పుడు భరతశత్రుఘ్నులవిలాపములను విని, వారిఅంతులేని బాధను కనులార చూచి, వారి అనుచరులందఱును అందులకు తట్టుకొనలేక మఱల తీరని దుఃఖమునకు లోనైరి. (19)

అంతట ఆ భరతశత్రుఘ్నులు ఇరువురును విషాదగ్రస్తులై మిగుల అలసిపోయిన వారై, కొమ్ములు విఱిగిన వృషభములవలె నేలపైబడి పొర్లాడసాగిరి. (20)

దైవీప్రకృతి(సత్త్వభావము) గలవాడును, సర్వజ్ఞుడును, వీరి తండ్రికి పురోహితుడును ఐన వసిష్ఠమహర్షి భరతుని లేవనెత్తి అతనితో ఇట్లనెను. (21)

"ఓ ప్రభూ! భరతా! ఇది మీ తండ్రిగారిదహనసంస్కారములు జరిగిన పదుమూడవదినము. ఇప్పుడు అస్థిసంచయనము చేయవలసి యున్నది. అందులకు ఆలస్యము చేయుచుంటివేల? (22)

ఓభరతా! 'ఆకలిదప్పులు, శోకమోహములు, జరామరణములు' అను ఈ మూడు ద్వంద్వములను సమస్తప్రాణులును పొంది తీరవలసినదే. అనివార్యములైన వీటివిషయమున నీవు ఇట్లు శోకింపదగదు. (23)

తత్త్వజ్ఞుడైన సుమంత్రుడుగూడ శత్రుఘ్నుని లేవనెత్తి, సకలప్రాణులకును జననమరణములు అనివార్యములని బోధించెను. ఆ విధముగా అనునయవాక్యములతో అతనిమనస్సును కుదుటబఱచెను. (24)

సుప్రసిద్ధులును, నరశ్రేష్ఠులును, ఐన ఆ భరతశత్రుఘ్నులు లేచి, ఊరట చెందినవారై, ఎండకు ఎండి, వానలకు తడిసిన వేర్వేఱు ఇంద్రధ్వజములవలె శోభిల్లిరి. (25)

సాశ్రూణి పరిమృద్నంతౌ రక్తాక్షౌ దీనభాషిణౌ।
అమాత్యాస్త్వరయంతి స్మ తనయౌ చాపరాః క్రియాః। 26

ఆ ఇరువురు రాజకుమారులును ఏడ్చియేడ్చియుండుటచే వారి కన్నులు ఎఱ్ఱబాఱియుండెను. వారు కన్నీటిని తుడుచుకొనుచు దీనముగా భాషించుచుండిరి. అప్పుడు ఇంకను మిగిలియున్న అగ్నిసంచయనాది కార్యములను నిర్వహించుటకై ఆ రాజకుమారులను అమాత్యులు తొందరపెట్టసాగిరి. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తసప్తతితమస్సర్గః (77)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదిఏడవసర్గము సమాప్తము

— * * * —

78. డెబ్బదిఎనిమిదవసర్గము

శత్రుఘ్నుడు మంథరను శిక్షించుట.

అథ యాత్రాం సమీహంతం శత్రుఘ్నో లక్ష్మణానుజః।
భరతం శోకసంతప్తమ్ ఇదం వచనమబ్రవీత్। 1

దశరథమహారాజునకు అపరక్రియలు ఆచరించిన పిమ్మట భరతుడు ఆ దుఃఖమునుండి తేరుకొనలేకయుండెను. అప్పుడతడు శ్రీరామునియొద్దకు వెళ్లుటకు ఉద్యుక్తుడాయెను. అట్టి స్థితిలో లక్ష్మణుని తమ్ముడైన శత్రుఘ్నుడు అతనితో ఇట్లు నుడివెను- (1)

గతిర్యః సర్వభూతానాం దుఃఖే కిం పునరాత్మనః।
స రామః సత్త్వసంపన్నః స్త్రియా ప్రవ్రాజితో వనమ్। 2

"అన్నా! సకలప్రాణులఆపదలను తొలగించి, వారిని కాపాడగల సమర్థుడు శ్రీరాముడు. ఇక అతడు మనలను ఆదుకొను విషయము చెప్పనేల? అట్టి మహాసత్త్వసంపన్నుడైన శ్రీరాముని ఒక అబల అడవులకు పంపెనే. నిజముగా ఇది మిగుల దుఃఖకరము- (2)

బలవాన్ వీర్యసంపన్నో లక్ష్మణో నామ యోఽప్యసౌ।
కిం న మోచయతే రామం కృత్వా స్మ పితృనిగ్రహమ్। 3

బలశాలియు, పరాక్రమసంపన్నుడును అగు లక్ష్మణునియంతటి వాడు ఎదుటనేయుండియు, తండ్రిని ఎదిరించియైనను, శ్రీరామునకు తటస్థించిన ఈ సంకటస్థితిని ఏందులకు తొలగింపలేదు? ఇదియును ఆశ్చర్యమును కలిగించుచున్నది- (3)

పూర్వమేవ తు నిగ్రాహ్యః సమవేక్ష్య నయానయౌ।
ఉత్పథం యః సమారూఢో రాజా నార్యా వశం గతః। 4

మహారాజు ఒక స్త్రీకి వశుడై తప్పుదారిని పట్టుచున్నప్పుడు లక్ష్మణుడు ముందుగనే న్యాయాన్యాయములను గమనించి అతని ఆటను కట్టింపవలసియుండెనుగదా!" (4)

ఇతి సంభాషమాణే తు శత్రుఘ్నే లక్ష్మణానుజే।
ప్రాగ్ద్వారేఽభూత్ తదా కుబ్జా సర్వాభరణభూషితా। 5

లిప్తా చందనసారేణ రాజవస్త్రాణి బిభ్రతీ।
వివిధం వివిధైస్తైస్తైః భూషణైశ్చ విభూషితా। 6

మేఖలాదామభిశ్చిత్రైః అన్యైశ్చ శుభభూషణైః।
బభాసే బహుభిర్బద్ధా రజ్జుబద్ధేవ వానరీ। 7

లక్ష్మణునితమ్ముడైన శత్రుఘ్నుడు రోషముతో ఇట్లు పలుకుచుండగా, ఇంతలో ఒంటినిండా సొమ్ములు పెట్టుకొనియున్న గూనిమంథర అచటికి వచ్చి, తూర్పు వాకిట నిలబడి యుండెను. ఆమె మేలైన మంచి గంధములను పూసికొనియుండెను. రాణులు మాత్రమే ధరింపదగిన అమూల్యవస్త్రములను (కైకేయి బహూకరింపగా) ఆమె ధరించియుండెను. రత్నములు పొదిగిన బంగారు ఆభరణములను అన్ని అవయవములయందును పెట్టుకొనియుండెను. నడుమునకు చిత్రవిచిత్రములైన ఒడ్డాణములను, ఇంకను వివిధములైన స్వర్ణాభరణములను ధరించియున్న ఆ కుబ్జ త్రాడులతో కట్టబడిన ఆడుకోతివలె ఒప్పుచుండెను. (5-7)

తాం సమీక్ష్య తదా ద్వాఃస్థాః సుభృశం పాపకారిణీమ్।
గృహీత్వాఽకరుణాం కుబ్జాం శత్రుఘ్నాయ న్యవేదయన్। 8

అంతట ద్వారపాలకులు మిగుల పాపాత్మురాలును, కఠినాత్మురాలును ఐన ఆ మంథరను జూచి, ఆమెను తీసికొని వచ్చి శత్రుఘ్నునకు ఇట్లు నివేదించిరి. (8)

యస్యాః కృతే వనే రామో న్యస్తదేహశ్చ వః పితా।
సేయం పాపా నృశంసా చ తస్యాః కురు యథామతి। 9

"అయ్యా! ఈమె కారణముగనే శ్రీరాముడు వనములకు వెళ్లెను, పితృశ్రీ దశరథమహారాజు దేహమును చాలించెను. ఇట్టి పాపాత్మురాలును, క్రూరురాలును ఐన ఈ గూనిమంథరను మీయిష్టమువచ్చినట్లు చేయుడు. (మీ యిష్టప్రకారము శిక్షింపుడు.)" (9)

శత్రుఘ్నశ్చ తదాజ్ఞాయ వచనం భృశదుఃఖితః।
అంతఃపురచరాన్ సర్వాన్ ఇత్యువాచ ధృతవ్రతః। 10

నియమనిష్ఠుడును, మిగులదుఃఖితుడును ఐయున్న శత్రుఘ్నుడు ఆద్వారపాలకులమాటలను వినిన పిమ్మట, అచటనున్న అంతఃపురవాసులను అందఱిని ఉద్దేశించి ఇట్లు నుడివెను. (10)

తీవ్రముత్పాదితం దుఃఖం భ్రాతౄణాం మే తథా పితుః।
యయా సేయం నృశంసస్య కర్మణః ఫలమశ్నుతామ్। 11

"ఈమె మాతండ్రిగారికిని, అట్లే మాసోదరులందఱికిని తీరని దుఃఖమును తెచ్చిపెట్టినది. కనుక ఈ దుర్మార్గురాలు తన దుష్కర్మలకు తగినఫలమును అనుభవించితీరవలసినదే-" (11)

ఏవముక్తా తు తేనాఽఽశు సఖీజనసమావృతా।
గృహీతా బలవత్ కుబ్జా సా తద్గృహమనాదయత్। 12

శత్రుఘ్నుడిట్లుపలికి, తోడిదాసీజనములతో గూడియున్న ఆకుబ్జను గట్టిగా పట్టుకొనెను. అప్పుడు ఆదాసి భయముతో బిగ్గఱగా గోలపెట్టెను. దాని అఱుపులతో ఆభవనమంతయును ప్రతిధ్వనించెను. (12)

తతః సుభృశసంతప్తః తస్యాః సర్వః సఖీజనః।
క్రుద్ధమాజ్ఞాయ శత్రుఘ్నం విపలాయత సర్వశః। 13

అప్పుడు ఆ కుబ్జయొక్క తోడిదాసీజనములందఱును భయాందోళనలకు లోనైరి. పిమ్మట వారు క్రుద్ధుడైయున్న శత్రుఘ్నుని జూచి, ఎటువారటు పాఱిపోయిరి. (13)

ఆమంత్రయత కృత్స్నశ్చ తస్యాః సర్వసఖీజనః।
యథాఽయం సముపక్రాంతో నిశ్శేషాన్ నః కరిష్యతి। 14

పిదప ఆ సఖీజనులందఱును, ఒకచోటచేరి 'ఇతడు మంథరను పట్టుకొనినతీరు చూడగా ఆమెనేగాదు మనలో ఎవ్వరిని ప్రాణములతో వదలిపెట్టునట్లులేడు' అని తమలో తాము అనుకొనిరి. (14)

సానుక్రోశాం వదాన్యాం చ ధర్మజ్ఞాం చ యశస్వినీమ్।
కౌసల్యాం శరణం యామ సా హి నోఽస్తు ధ్రువా గతిః। 15

'ఇప్పుడు మనము వెంటనే కౌసల్యాదేవి కడకువెళ్లి, ఆమెను శరణుగోరుదము- ఆమె మిగుల కనికరముగల గొప్ప ఇల్లాలు, మృదుమధురభాషిణి. ధర్మజ్ఞురాలుగా పేరు ప్రతిష్ఠలు గాంచినది. వాస్తవముగా ఇప్పుడు మనయందఱికిని ఆమెయే దిక్కు' (15)

స చ రోషేణ తామ్రాక్షః శత్రుఘ్నః శత్రుతాపనః।
విచకర్ష తదా కుబ్జాం క్రోశంతీం ధరణీతలే। 16

తస్యా హ్యాకృష్యమాణాయా మంథరాయాస్తత స్తతః।
చిత్రం బహువిధం భాండం పృథివ్యాం తద్వ్యశీర్యత। 17

శత్రువులను రూపుమాపువాడైన ఆ శత్రుఘ్నుడు రోషముతో కన్నులెఱ్ఱజేసినవాడై, ఏడ్చుచు మొత్తుకొనుచున్న ఆ గూనిదానిని నేలపై ఈడ్చుకొనుచు వచ్చెను. అతడు ఆ గూని మంథరను అట్లు లాగికొనివచ్చుచుండగా ఆమె ధరించి యున్న చిత్ర విచిత్రములగు ఆభరణములు అన్నియును నేలపై చెల్లాచెదరుగా పడిపోయెను. (16-17)

తేన భాండేన సంస్తీర్ణం శ్రీమద్రాజనివేశనమ్।
అశోభత తదా భూయః శారదం గగనం యథా। 18

అంతటను చెల్లాచెదరై పడియున్న ఆభరణములతో విలసిల్లుచున్న ఆ రాజభవనము శరత్కాలమునందు మిలమిలలాడుచుండెడి నక్షత్రములతో విరాజిల్లుచున్న ఆకాశమువలె శోభిల్లుచుండెను- (18)

స బలీ బలవత్ క్రోధాత్ గృహీత్వా పురుషర్షభః।
కైకేయీమభినిర్భర్త్స్య బభాషే పరుషం వచః। 19

మిగుల బలశాలియు, నరశ్రేష్ఠుడును ఐన శత్రుఘ్నుడు మిక్కిలి రోషముతో మంథరను వేగముగా ఈడ్చుకొని పోవుచుండగా, ఆమెను విడిపించుటకై కైకేయి అచటికి వచ్చెను. అప్పుడతడు ఆమెను ధిక్కరించుచు కఠోరవచనములను పల్కెను. (19)

తైర్వాక్యైః పరుషైర్దుఃఖైః కైకేయీ భృశదుఃఖితా।
శత్రుఘ్నభయసంత్రస్తా పుత్రం శరణమాగతా। 20

శత్రుఘ్నుడు క్రోధావేశముతో తీవ్రముగా పలికిన కఠిన వచనములను భరింపలేక, కైకేయి కడు దుఃఖితయయ్యెను. అంతేగాక ఇంకను అతడు తనను ఏమిచేయునోయని తలంచి, ఆమె మిగుల భయకంపితయై తనకుమారుడగు భరతుని శరణుజొచ్చెను. (20)

తాం ప్రేక్ష్య భరతః క్రుద్ధం శత్రుఘ్నమ్ ఇదమబ్రవీత్।
అవధ్యాః సర్వభూతానాం ప్రమదాః క్షమ్యతామితి। 21

అంతట భరతుడు తనను శరణుజొచ్చిన ఆ కైకేయిని గాంచి, క్రుద్ధుడైయున్న శత్రుఘ్నునితో 'ఈమెను క్షమింపుము. ఎవ్వరును స్త్రీలను చంపుటతగదు'. అనినుడివెను. (21)

హన్యామహమిమాం పాపాం కైకేయీం దుష్టచారిణీమ్।
యది మాం ధార్మికో రామో నాసూయేన్మాతృఘాతకమ్। 22

"కైకేయి కడుదుష్టురాలు. ఎంతయు పాపాత్మురాలు. కనుక ఆమెను నేనే చంపవలసియుండెను. కానీ ధర్మాత్ముడైన శ్రీరాముడు 'ఇతడు మాతృహంతకుడు' అని నన్ను నిందించునను భయమునతో నేను అట్లు చేయలేదు. (22)

ఇమామపి హతాం కుబ్జాం యది జానాతి రాఘవః।
త్వాం చ మాం చ హి ధర్మాత్మా నాభిభాషిష్యతే ధ్రువమ్। 23

ఈకుబ్జనైనను మనము చంపినచో, ధర్మాత్ముడైన శ్రీరాముడు ఆ వార్తను విని, నీతోగాని, నాతోగాని మాట్లాడుటమానివేయును. ఇది తథ్యము సుమా!" (23)

భరతస్య వచః శ్రుత్వా శత్రుఘ్నో లక్ష్మణానుజః।
న్యవర్తత తతో రోషాత్ తాం ముమోచ చ మంథరామ్। 24

భరతునిహితవచనములను విని పిమ్మట లక్ష్మణునితమ్ముడైన శత్రుఘ్నునిరోషము చల్లారెను. పిదప అతడు మంథరను విడిచి పెట్టెను. (24)

సా పాదమూలే కైకేయ్యా మంథరా నిపపాత హ।
నిశ్శ్వసంతీ సుదుఃఖార్తా కృపణం విలలాప చ। 25

అప్పుడు ఆమంథర కైకేయి పాదములపై బడెను. పిదప ఆమె మిగుల దుఃఖార్తయై, నిట్టూర్చుచు దీనముగా విలపించెను (25)

శత్రుఘ్నవిక్షేపవిమూఢసంజ్ఞాం
సమీక్ష్య కుబ్జాం భరతస్య మాతా।
శనైస్సమాశ్వాసయదార్తరూపాం
క్రౌంచీం విలగ్నామివ వీక్షమాణామ్। 26

శత్రుఘ్నునిచేతిలో దెబ్బతినిన కుబ్జ నిశ్చేష్టురాలాయెను. అప్పుడు భరతునితల్లియైన కైకేయి ఆమెను జూచి తిన్నతిన్నగా ఓదార్చుచు ఆమెను వ్యూహాలోనికి దీసికొని వచ్చెను. అంతట ఆ గూనిది వలలో చిక్కుకొనిన ఆడు క్రౌంచపక్షివలె ఆర్తురాలై భయముతో ఆమెవైపు చూడసాగెను- (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టసప్తతితమస్సర్గః (78)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదియెనిమిదవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

79. డెబ్బదితొమ్మిదవసర్గము

మంత్రులు మొదలగువారు రాజ్యాధికారమును చేపట్టుమని భరతుని ప్రార్థించుట - 'ఈ రాజ్యమునకు శ్రీరాముడే ప్రభువు' - అని భరతుడు ప్రకటించుట.

తతః ప్రభాతసమయే దివసే చ చతుర్దశే।
సమేత్య రాజకర్తారో భరతం వాక్యమబ్రువన్। 1

అనంతరము పదునాల్గవదినమున ప్రభాతవేళ రాజకార్యములను నిర్వహించునట్టి మంత్రివర్యులు ఒకచోట సమావేశమై భరతునితో ఇట్లునుడివిరి. (1)

గతో దశరథః స్వర్గం యో నో గురుతరో గురుః।
రామం ప్రవ్రాజ్య వై జ్యేష్ఠం లక్ష్మణం చ మహాబలమ్। 2

త్వమద్య భవ నో రాజా రాజపుత్ర మహాయశః।
సంగత్యా నాపరాధ్నోతి రాజ్యమేతదనాయకమ్। 3

"మహాయశస్వివైన ఓ రాజకుమారా! మనకు పరమగురువైన దశరథమహారాజు తనజ్యేష్ఠకుమారుడైన శ్రీరాముని, మహాబలశాలియైన లక్ష్మణుని వనములకు పంపి, తాను స్వర్గస్థుడాయెను. ఇప్పుడు ఈ రాజ్యమునకు రాజు ఎవ్వరును లేరు. కనుక ఈ రాజ్యాధికారమును మీరే స్వీకరింపవలెను. మహారాజే స్వయముగా మీ అన్నయగు శ్రీరాముని వనవాసమునకు ఆజ్ఞాపించి, రాజ్యాధికారమును మీకు ఏర్పాటు చేసెను. కావున మీరు రాజగుట న్యాయసమ్మతమే. మీరు రాజ్యాధికారమును స్వీకరించుట ఎవరికిని బాధాకరముగాదు. (2-3)

అభిషేచనికం సర్వమ్ ఇదమాదాయ రాఘవ।
ప్రతీక్షతే త్వాం స్వజనః శ్రేణయశ్చ నృపాత్మజ॥ 4

రాజ్యం గృహాణ భరత పితృపైతామహం ధ్రువమ్।
అభిషేచయ చాత్మానం పాహి చాస్మాన్ నరర్షభ॥ 5

అభిషేచనికం భాండం కృత్వా సర్వం ప్రదక్షిణమ్।
భరతస్తం జనం సర్వమ్ ప్రత్యువాచ ధృతవ్రతః॥ 6

జ్యేష్ఠస్య రాజతా నిత్యమ్ ఉచితా హి కులస్య నః।
నైవం భవంతో మాం వక్తుమ్ అర్హంతి కుశలా జనాః॥ 7

రామః పూర్వో హి నో భ్రాతా భవిష్యతి మహీపతిః।
అహం త్వరణ్యే వత్స్యామి వర్షాణి నవ పంచ చ॥ 8

యుజ్యతాం మహతీ సేనా చతురంగమహాబలా।
ఆనయిష్యా మ్యహం జ్యేష్ఠం భ్రాతరం రాఘవం వనాత్॥ 9

అభిషేచనికం చైవ సర్వమేతదుపస్కృతమ్।
పురస్కృత్య గమిష్యామి రామహేతోర్వనం ప్రతి॥ 10

తత్రైవ తం నరవ్యాఘ్రమ్ అభిషిచ్య పురస్కృతమ్।
ఆనేష్యామి తు వై రామం హవ్యవాహమివాధ్వరాత్॥ 11

న సకామాం కరిష్యామి స్వామిమాం మాతృగంధినీమ్।
వనే వత్స్యామ్యహం దుర్గే రామో రాజా భవిష్యతి॥ 12

క్రియతాం శిల్పిభిః పంథాః సమాని విషమాణి చ।
రక్షిణశ్చానుసంయాంతు పథి దుర్గవిచారకాః॥ 13

ఏవం సంభాషమాణం తం రామహేతోః నృపాత్మజమ్।
ప్రత్యువాచ జనః సర్వః శ్రీమద్వాక్యమనుత్తమమ్॥ 14

ఏవం తే భాషమాణస్య పద్మా శ్రీరుపతిష్ఠతామ్।
యస్త్వం జ్యేష్ఠే నృపసుతే పృథివీం దాతుమిచ్ఛసి॥ 15

అనుత్తమం తద్వచనం నృపాత్మజ
ప్రభాషితం సంశ్రవణే నిశమ్య చ।
ప్రహర్షజాస్తం ప్రతి బాష్పబిందవో
నిపేతురార్యాననేత్రసంభవాః॥ 16

రాజకుమారా! రఘువంశజా! ఓ భరతా! మంత్రులు మొదలగు స్వజనులు, పురప్రముఖులు, అభిషేకసామగ్రిని తీసికొనవచ్చి, నీకై ఎదురుచూచుచున్నారు. ఓ నరశ్రేష్ఠా! భరతా! నీ తాతముత్తాతల నుండి వచ్చుచున్న ఈ రాజ్యమును ఆవశ్యముగా స్వీకరింపుము, వెంటనే రాజ్యాభిషిక్తుడవు కమ్ము. మమ్ములను రక్షింపుము." (4-5)

నిష్ఠాగరిష్ఠుడైన భరతుడు ఆ మాటలను విని, పట్టాభిషేకమునకై తీసికొని రాబడిన కలశములుమొదలగు సమస్తవస్తువులకును ప్రదక్షిణమొనర్చి, అచట చేరియున్న వారితో ఇట్లుపలికెను. (6)

'జ్యేష్ఠునకు రాజ్యాధికారమును అప్పగించుట పరంపరగా వచ్చుచున్న మనవంశాచారము. కనుక అనుభవజ్ఞులును, పెద్దలును ఐన మీరు నాతో ఇట్లు పలుకుట ఏ మాత్రమూ తగదు. (7)

కనుక మా సోదరులలో పెద్దవాడైన శ్రీరాముడే ఈ రాజ్యమునకు రాజుకాగలడు. ఆయనకుమారుగా నేను పదునాలుగు సంవత్సరములు వనవాసము చేసెదను. చతురంగబలములతోగూడిన మహాసేనను సిద్ధపఱచుడు. జ్యేష్ఠసోదరుడైన శ్రీరాముని వనములనుండి అయోధ్యకు తీసికొని రాగలను. (8-9)

పట్టాభిషేకమునకు సంబంధించిన సమస్తవస్తువులను, సాధనములను దీసికొని, శ్రీరామునికొఱకై వనమునకు వెళ్లెదను. పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముని అచటనే పూజించి, పట్టాభిషిక్తుని గావించి, యాగశాలనుండి త్రేతాగ్నినివలె శ్రీరాముని ఇచటికి గొనివచ్చెదను. (10-11)

ఈ కైకేయి పేరునకుమాత్రమే నాకు తల్లి. ఈమెలో మాతృభావము లేశమైనను లేదు. ఈమెకోరికను నెఱవేఱనీయను. ఈ రాజ్యమునకు శ్రీరాముడే రాజుకాగలడు. నేను మాత్రము అకాఅడవులలో నివసించెదను. (12)

శిల్పులు ముందుగావెళ్లి, ఎగుడుదిగుడుగానుండెడి బాటలను సమముగా చేయుదురుగాక. అడవులబాటలను బాగుగా ఎఱిగిన వారు రక్షకులుగా మనవెంటవత్తురుగాక." (13)

శ్రీరాముని నిమిత్తమై ఇట్లు మాట్లాడుచున్న రాజకుమారుడగు భరతునితో అచట చేరియున్నవారందఱును మిగుల సముచితము లైన వచనములను ఇట్లు పలికిరి. (14)

"నాయనా! రాజకుమారులలో జ్యేష్ఠుడైన శ్రీరామునకు రాజ్యమును సమర్పించుటకు అభిలషించుచు నీవు ఎంతో చక్కని మాటలను పలికితివి- అందువలన నీకు సకలసంపదలును అబ్బును" (15)

రాజకుమారుడైన భరతుడు నుడివిన పలుకులన్నియు ఆణిముత్యములే. వాటిని విని, అచటి పెద్దలందఱును మిక్కిలి సంతసించిరి. అప్పుడు పూజ్యులైన ఆ ప్రముఖులనేత్రములనుండి ఆనందబాష్పములు జలజలరాలెను. (16)

ఊచుస్తే వచనమిదం నిశమ్య హృష్టాః
సామాత్యాః సపరిషదో వియాతశోకాః ।
పంథానం నరవర! భక్తిమాన్ జనశ్చ
వ్యాదిష్టస్తవ వచనాచ్చ శిల్పివర్గః ॥ 17

వనమునుండి శ్రీరాముని దీసికొనిరావలెననెడి భరతుని సంకల్పమును, అందులకై అతడు పలికిన చల్లని మాటలను వినిన అమాత్యులును, సభలోనున్న పెద్దలును మిగుల ఆనందించిరి. అంతట వారిదుఃఖములు మటుమాయమయ్యెను. అప్పుడు వారు భరతునితో 'ఓ మహాపురుషా! నీ ఆదేశముప్రకారము మార్గములను బాగుచేయుటకై శిల్పులను, రక్షణవిషయములను జూచుకొనుటకై భక్తిశ్వాసములుగల భటులను నియమించితిమి' అని పలికిరి. (17)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనాశీతితమస్సర్గః (79)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు డెబ్బదితొమ్మిదవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

80. ఎనుబదియవసర్గము

భరతుని ఆదేశానుసారము శ్రీరామునికడకు వెళ్లుటకై సచివులు చక్కని మార్గములను ఇంకను వలసిన ఏర్పాట్లను పూర్తిచేయించుట.

అథ భూమిప్రదేశజ్ఞాః సూత్రకర్మవిశారదాః ।
స్వకర్మాభిరతాః శూరాః ఖనకా యంత్రకాస్తథా ॥ 1

కర్మాంతికాః స్థపతయః పురుషా యంత్రకోవిదాః ।
తథా వర్ధకయశ్చైవ మార్గిణో వృక్షతక్షకాః ॥ 2

కూపకారాః సుధాకారా వంశకర్మకృతస్తథా ।
సమర్థా యే చ ద్రష్టారః పురతస్తే ప్రతస్థిరే ॥ 3

స తు హర్షాత్ తముద్దేశం జనౌఘో విపులః ప్రయాన్ ।
అశోభత మహావేగః సముద్ర ఇవ పర్వణి ॥ 4

తే స్వవారం సమాస్థాయ వర్త్మకర్మాణి కోవిదాః ।
కరణైర్వివిధోపేతైః పురస్తాత్ సంప్రతస్థిరే ॥ 5

లతావల్లీశ్చ గుల్మాంశ్చ స్థాణూనశ్మన ఏవ చ ।
జనాస్తే చక్రిరే మార్గం ఛిందంతో వివిధాన్ ద్రుమాన్ ॥ 6

అవృక్షేషు చ దేశేషు కేచిద్వృక్షానరోపయన్ ।
కేచిత్ కుఠారైష్టంకైశ్చ దాత్రైశ్ఛిందన్ క్వచిత్ క్వచిత్ ॥ 7

పిమ్మట నేలయొక్క మిట్టపల్లములను బాగుగా ఎఱిగినవారును, సూత్రములతో భూమిసమతలమును కొలిచెడివారును, నేలను త్రవ్వెడు వారును, యంత్రములను ఉపయోగించెడివారును, కార్మికులును, శిల్పులును, యంత్రప్రయోగములను ఎఱిగిన పురుషులును, వడ్రంగులును, బాటలను వేసెడువారును, త్రోవలకు అడ్డముగానున్న చెట్లను నఱికెడువారును, బావులను త్రవ్వెడివారును, సున్నములను వేయువారును, వెదురుపనులను చేసెడువారును, సమర్థులైన పర్యవేక్షకులును, మున్నుగాగల స్వకర్మాభిరతులైన కార్యశూరులు ముందుగా బయలుదేఱిరి. (1-3)

మార్గమును సమతలముగా జేయునట్టి అపారమైన జనసమూహము అప్పటివఱకు దుఃఖముతోనున్నను రామదర్శనకుతూహలకారణముగా హర్షముతో పురోగమించుచుండెను. ఆ సమూహము పున్నమినాడు తరంగములతో పొంగిపోవుచున్న సముద్రమువలె శోభిల్లుచుండెను. (4)

మార్గనిర్మాణములయందు నిపుణులైనట్టివారు తమతమ జట్టులను కూడదీసికొని, తమకు కావలసిన వివిధములగు పరికరములతో ముందునకు సాగిపోవుచుండిరి. వారు మార్గములకు అడ్డముగానున్న చెట్లను, చెట్లకొమ్మలను, తీగలను, మొండిపొదలను, నఱికివేయుచు, పెద్దపెద్ద బండలను తొలగించుచు, చిన్నచిన్న గుబురుటాల్లను ఏఱిపాఱవేయుచు మార్గములను చక్కబఱచిరి. (5-6)

కొందఱు వృక్షములు లేనిచోట్ల మార్గములకు రెండువైపులను చెట్లను నాటుచుండిరి. మఱికొందఱు బాటలకు అవరోధముగానున్నకంపచెట్లను గొడ్డళ్లతో నఱికివేయుచు, పెద్ద పెద్దబండలను సమ్మెటలతో ముక్కలుగావించుచు, కొడవళ్లతో గడ్డిమొక్కలను కోసివేయుచు దారులను సరిచేయుచుండిరి. (7)

అపరే వీరణస్తంబాన్ బలినో బలవత్తరాః।
విధమంతి స్మ దుర్గాణి స్థలాని చ తతస్తతః॥ 8

అపరేఽపూరయన్ కూపాన్ పాంసుభిశ్శ్వభ్రమాయతమ్।
నిమ్నభాగాంస్తతః కేచిత్ సమాంశ్చక్రుః సమంతతః॥ 9

బబంధుర్బంధనీయాంశ్చ క్షోద్యాన్ సంచుక్షుదుస్తదా।
బిభిదుర్భేదనీయాంశ్చ తాంస్తాన్ దేశాన్ నరాస్తదా॥ 10

అచిరేణైవ కాలేన పరివాహాన్ బహూదకాన్।
చక్రుర్బహువిధాకారాన్ సాగరప్రతిమాన్ బహూన్॥ 11

నిర్జలేషు చ దేశేషు ఖానయామాసురుత్తమాన్।
ఉదపానాన్ బహువిధాన్ వేదికాపరిమండితాన్॥ 12

ససుధాకుట్టిమతలః ప్రపుష్పితమహీరుహః।
మత్తోద్ఘుష్టద్విజగణః పతాకాభిరలంకృతః॥ 13

చందనోదకసంసిక్తో నానాకుసుమభూషితః।
బహ్వశోభత సేనాయాః పంథాః సురపథోపమః॥ 14

ఆజ్ఞాప్యాథ యథాఽఽజ్ఞప్తియుక్తాస్తేఽధికృతా నరాః।
రమణీయేషు దేశేషు బహుస్వాదుఫలేషు చ॥ 15

యో నివేశస్త్వభిప్రేతో భరతస్య మహాత్మనః।
భూయస్తం శోభయామాసుః భూషాభిర్భూషణోపమమ్॥ 16

నక్షత్రేషు ప్రశస్తేషు ముహూర్తేషు చ తద్విదః।
నివేశాన్ స్థాపయామాసుః భరతస్య మహాత్మనః॥ 17

బహుపాంసుచయాశ్చాపి పరిఖాపరివారితాః।
తత్రేంద్రకీలప్రతిమాః ప్రతోలీవరశోభితాః॥ 18

బలశాలురైన మఱికొందఱు లోతుగాన్రేళ్లునునట్టి రెల్లుగడ్డి మొదలగు మొండి దుబ్బులను చేతులతో పెకలించి, వాటిని కాల్చి వేయుచుండిరి. అక్కడక్కడ ఎగుడుదిగుడు స్థలములను చదును చేయుచుండిరి. మఱికొందఱు లోతైన పెద్దపెద్ద గుంటలను, గోతులను మట్టితో పూడ్చివేయుచుండిరి. పల్లపు ప్రదేశములను అంతటను సమముగా చేయుచుండిరి. (8-9)

కొంతమంది జలప్రవాహములపై వంతెనలను ఏర్పాటు చేసిరి, కంకరఱాళ్లను పొడిపొడి గావించుచు ఆ ప్రదేశములను సుగమములు గావించుచుండిరి. దారికి అడ్డుగానున్న మడుగుల జలములను తొలగించుటకై వాటిగట్లను తెగగొట్టిరి. ఈ విధముగా వేర్వేఱు ప్రదేశములలో అవసరములను అనుసరించి ఆయా పనులను నిర్వర్తించిరి. (10)

స్వల్పములైన జలములుగల ప్రదేశములకు చుట్టును కట్టలను నిర్మించి, జలములు ఎక్కువగా నిలబడునట్లు చేసి, మెట్లతో పెద్ద పెద్ద తటాకములను ఏర్పాటు చేసిరి. వారు స్వల్ప కాలములోనే వేర్వేఱు ఆకారములలో ఎక్కు సరోవరములను నిర్మించిరి. అవి లోతుగా విశాలముగానుండుటచే సముద్రమువలె కన్పట్టు చుండెను. నీరు దొరకని ప్రదేశములలో వివిధములగు చక్కని దిగుడుబావులను త్రవ్విరి. గజాశ్వములు నీరు త్రాగుటకును అనువగు సరోవరములను నిర్మించిరి. వాటి పక్కన విశ్రాంతి దీసికొనుటకు అనుకూలముగా వేదికలను సిద్ధపఱచిరి. (11-12)

సేనలు నడచుమార్గము గచ్చుతో (సున్నము, ఇసుకలతో) ఏర్పఱచబడెను దానికి ఇరువైపులయందుగల చెట్లు పూవులతో కలకలలాడుచుండెను. బాగుగా మత్తిల్లియున్న పక్షులు కలకలారావములు చేయుచుండెను. ఆ దారి పతాకములతో అలంకృతమై యుండెను. మార్గమంతయును చందనజలములతో తడుపబడియుండెను. అంతటను వివిధములగు పూవులు వెదజల్లబడియుండెను. అందువలన అది దివ్యమార్గమువలె శోభిల్లుచుండెను. (13-14)

మార్గమధ్యములో విడిదిగృహములను ఏర్పఱచుటకు నియమితులైన అధికారులు కార్యకుశలురైన సేవకులద్వారా అచ్చటచ్చట వాటిని నిర్మింపజేసిరి. ఆ ప్రదేశములు రుచికరములైన ఫలములతోగూడి రమణీయముగానుండెను. మహాత్ముడైన భరతుని యొక్క అభిరుచికి తగినట్లుగా అవి వివిధాలంకారశోభితములై యుండెను. (15-16)

వాస్తుశాస్త్రజ్ఞులైన జ్యోతిషపండితులు ప్రశస్తనక్షత్రములతో గూడిన ముహూర్తములయందు మహాపురుషుడైన భరతునకును, ఆతనిసేనలకును, పరివారములకును అనువుగా వేర్వేఱు శిబిరములను నిర్మింపజేసిరి. (17)

మార్గమధ్యమున సిద్ధపఱచబడిన ఆ విశ్రాంతిగృహములు ఇంద్రునినగరమైన అమరావతివలె శోభిల్లుచుండెను. వాటిచుట్టును కందకములు ఏర్పఱచబడెను. అచట ఇంద్రకీలాద్రి

ప్రాసాదమాలావితతాః సౌధప్రాకారసంవృతాః ।
పతాకాశోభితాః సర్వే సునిర్మితమహాపథాః । 19

విసర్పద్భిరివాఽఽకాశే విటంకాగ్రవిమానకైః ।
సముచ్ఛ్రితైర్నివేశాస్తే బభుః శక్రపురోపమాః । 20

జాహ్నవీం తు సమాసాద్య వివిధద్రుమకాననామ్ ।
శీతలామలపానీయాం మహామీనసమాకులామ్ । 21

స చంద్రతారాగణమండితం యథా
నభః క్షపాయామమలం విరాజతే ।
నరేంద్రమార్గః స తథావ్యరాజత
క్రమేణ రమ్యః శుభశిల్పినిర్మితః । 22

ఎతె ఎత్తైన భవనపంక్తులు ఒప్పారుచుండెను. ఆ వీటివీధులు చక్కగా తీర్చిదిద్దబడియుండెను. అందలి రాజభవనములును, దేవతా మందిరములును చక్కని ప్రాకారములతో విలసిల్లుచుండెను. దారులవెంట పతాకములు రెపరెపలాడుచుండెను. ఆ భవనములు ఎత్తైన శిఖరములు గలిగి పావురముల గూళ్లతో ఒప్పుచుండెను. (18-20)

నానావిధములైన వృక్షవనములతోను, చల్లని నిర్మల జలములతోను, నిండియుండి, పెద్ద పెద్ద చేపలతో వ్యాప్తమై యున్న గంగానది యొక్క తీరమువఱకు నిర్మింపబడిన ఆరాజమార్గము మిక్కిలి రమణీయముగానుండెను. అది సమర్థులైన శిల్పులచే నిర్మింపబడినది. రాత్రులయందు నక్షత్రములతో, చంద్రునితో శోభిల్లుచున్న నిర్మలాకాశమువలె అది తేజరిల్లుచుండెను. (21-22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అశీతితమస్సర్గః (80)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదియవసర్గము సమాప్తము.

— ❋ ❋ ❋ —

81. ఎనుబదియొకటవసర్గము

వసిష్ఠమహర్షి పిలుపుపై భరతశత్రుఘ్నులు, మంత్రులు మొదలగు ప్రముఖులు సభాభవనమునకు విచ్చేయుట.

తతో నాందీముఖీం రాత్రిం భరతం సూతమాగధాః ।
తుష్టువుర్వాగ్విశేషజ్ఞాః స్తవైర్మంగళసంహితైః । 1

సువర్ణకోణాభిహతః ప్రాణదద్యామదుందుభిః ।
దధ్ముః శంఖాంశ్చ శతశో నాదాంశ్చోచ్చావచస్వరాన్ । 2

స తూర్యఘోషః సుమహాన్ దివమాపూరయన్నివ ।
భరతం శోకసంతప్తం భూయః శోకైరరంధ్రయత్ । 3

తతః ప్రబుద్ధో భరతః తం ఘోషం సన్నివర్త్య చ ।
నాహం రాజేతి చాప్యుక్త్వా శత్రుఘ్నమిదమబ్రవీత్ । 4

పశ్య శత్రుఘ్న! కైకేయ్యా లోకస్యాపకృతం మహత్ ।
విసృజ్య మయి దుఃఖాని రాజా దశరథో గతః । 5

తస్యైషా ధర్మరాజస్య ధర్మమూలా మహాత్మనః ।
పరిభ్రమతి రాజశ్రీః నౌరివాకర్ణికా జలే । 6

శ్రీరాముని గొనివచ్చుటకు అభ్యుదయసూచకమైన ఆ రాత్రియందు (తెల్లవాఱుజామున) చక్కగా మాటాడుటలో నేర్పరులైన స్తుతిపాఠకులు, వందిమాగధులు మంగళకరములైన స్తోత్రములతో భరతుని నుతించిరి. (1)

బంగారువాదనదండములతో జాములను సూచించునగారాలను మ్రోగించిరి. వందలకొలది శంఖములను పూరించిరి. వివిధ వాద్యములద్వారా మధురధ్వనులను గావించిరి. (2)

ఆ మహాతూర్యనాదములు భూమ్యాకాశములయందంతటను నిండెను. దుఃఖితుడైయున్న భరతుడు ఆ ధ్వనులను విని ఇంకను క్రుంగిపోయెను - ఆ వాద్యములధ్వనులకు భరతుడు మేల్కొని, 'నేను రాజునుగాను' - అని పలుకుచు ఆ వాద్యధ్వనులను నిలిపివేయించెను. పిదప శత్రుఘ్నునితో అతడిట్లనెను. (3-4)

"ఓ శత్రుఘ్నా! కైకేయి లోకమునకు ఎంత అపకారము చేసినదో చూడుము. దశరథమహారాజు ఈ దుఃఖములబరువును నా పై మోపి తనత్రోవన తాను పోయెను. (5)

ఈ రాజ్యము ధర్మమునకు కుదురైనది. మహాత్ముడు, ధర్మప్రభువు ఐన దశరథునియొక్క ఈ రాజ్యలక్ష్మి ఇప్పుడు జలములలో కర్ణధారి (చుక్కాని పట్టెడు వాడు) లేని నావవలె కొట్టుమిట్టాడుచున్నది. (6)

యో హి నః సుమహాన్ నాథః సోఽపి ప్రవ్రాజితో వనమ్।
అనయా ధర్మముత్సృజ్య మాత్రా మే రాఘవః స్వయమ్। 7

మనకు జ్యేష్ఠభ్రాత (పెద్దన్న)యును, స్వామియును, సంరక్షకుడును ఐన రఘునరుని నా తల్లి కైకేయి ధర్మమును గాలికివదలి అడవులపాలు చేసెను." (7)

ఇత్యేవం భరతం ప్రేక్ష్య విలపంతం విచేతనమ్।
కృపణం రురుదుః సర్వాః సస్వరం యోషితస్తదా। 8

శత్రుఘ్నునితో ఇట్లు పలుకుచు, మిగుల విలపించుచు, దీనుడై, నిశ్చేష్టుడైయున్న భరతుని జూచి, అంతఃపురస్త్రీలు అందఱును అపుడు బిగ్గఱగా ఏడ్చిరి. (8)

తథా తస్మిన్ విలపతి వసిష్ఠో రాజధర్మవిత్।
సభామిక్ష్వాకునాథస్య ప్రవివేశ మహాయశాః। 9

శాతకుంభమయీం రమ్యాం మణిరత్నసమాకులామ్।
సుధర్మామివ ధర్మాత్మా సగణః ప్రత్యపద్యత। 10

స కాంచనమయం పీఠం సుఖాస్తరణసంవృతమ్।
అధ్యాస్త సర్వవేదజ్ఞో దూతాననుశశాస చ। 11

భరతుడు ఇట్లు విలపించుచున్న సమయమున రాజధర్మములను బాగుగా ఎఱిగిన సుప్రసిద్ధుడగు వసిష్ఠమహర్షి రాజ (ఇక్ష్వాకు ప్రభువుల) సభాభవనమున ప్రవేశించెను. బంగారముతో నిర్మింపబడి, మణిరత్నములతో పొదుగబడియున్న ఆ రమణీయ సభాభవనము ఇంద్రసభయైన 'సుధర్మ' ను తలపించుచుండెను. ధర్మాత్ముడైన వసిష్ఠమహాముని శిష్యులతోగూడి అందు ప్రవేశించెను. సర్వవేదధర్మములను ఎఱిగిన ఆమహర్షి మెత్తని ఆస్తరణములతో గూడిన బంగారుపీఠమున ఆసీనుడయ్యెను. పిమ్మట అతడు దూతలకు ఇట్లు ఆజ్ఞలనిచ్చెను. (9-11)

బ్రాహ్మణాన్ క్షత్రియాన్ వైశ్యాన్ అమాత్యాన్ గణవల్లభాన్।
క్షిప్రమానయతావ్యగ్రాః కృత్యమాత్యయికం హి నః। 12

సరాజభృత్యం శత్రుఘ్నం భరతం చ యశస్వినమ్।
యుధాజితం సుమంత్రం చ యే చ తత్ర హితా జనాః। 13

"మీరు కడుజాగరూకులై, బ్రాహ్మణోత్తములను, క్షత్రియ ప్రముఖులను, వైశ్యప్రవరులను, రాజభటులు వెంట నడచుచుండగ యశస్వియైన భరతుని, శత్రుఘ్నుని, భరతునిమేనమామయగు యుధాజిత్తును, సుమంత్రుని, ఇంకను మనశ్రేయోభిలాషులైన పౌరజనులను ఈ సభకు దీసికొని రండు. వారితో మాకు ఇచట అత్యవసరమైన పనియున్నది." (12-13)

తతో హలహలాశబ్దః సుమహాన్ సముపద్యత।
రథైరశ్వైర్గజైశ్చాపి జనానామ్ ఉపగచ్ఛతామ్। 14

పిదప రథములతోను, గుఱ్ఱములపైనను, ఏనుగులమీదను సభాభవనమునకు ఏతెంచుచున్నవారియొక్క కోలాహలధ్వనులు గొప్పగావినవచ్చెను. (14)

తతో భరతమాయాంతం శతక్రతుమివామరాః।
ప్రత్యనందన్ ప్రకృతయో యథా దశరథం తథా। 15

దేవతలు ఇంద్రుని ప్రస్తుతించునట్లుగా, అమాత్యులు మొదలగు వారందఱును సభామందిరమునకు విచ్చేయుచున్న భరతుని, పూర్వము దశరథునివలె అభినందించిరి. (15)

హ్రద ఇవ తిమినాగసంవృతః
స్తిమితజలో మణిశంఖశర్కరః।
దశరథసుతశోభితా సభా
సదశరథేవ బభౌ యథాపురా। 16

నిశ్చలముగానున్న జలములతో, తిమింగిలములు, ఏనుగులు మొదలగు జలజంతువులతో, మణులతో, శంఖములతో, ఇసుక తిన్నెలతో అలరారుచున్న ఒకమడుగువలె ఆ సభాభవనము[1] ఒప్పుచుండెను. దశరథుని సుతుడైన భరతునితో గూడియున్న ఆ సభావేదిక పూర్వము దశరథునితో విలసిల్లుచున్నట్లుగనే రాజిల్లుచుండెను. (16)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకాశీతితమస్సర్గః (81)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదియొకటవసర్గము సమాప్తము

— * * * —

1) ఇచట సభాభవనము ఉపమేయము, హ్రదము (జలాశయము) ఉపమానము - జలాశయమునందు తిమింగిలాదులు సహజముగనే యుండును - ఈ సభాభవనమునందలి కంబళ్లపై జలములు ఉన్నట్లును, అందు తిమింగిలములు, ఏనుగులు మున్నగు జలజంతువులు విలసిల్లుచున్నట్లును చిత్రింపబడినవి. ఆ కంబళ్లపై రత్నములు పొదుగబడియున్నవి. శంఖములు చిత్రింపబడియున్నవి. అవి బంగారు రజస్సుతో ఒప్పుచు ఇసుకతిన్నెలభ్రాంతిని గల్గించుచున్నవి. ఈ విధముగా వర్ణింపబడిన ఈ సభాభవనవైభవము అపూర్వము.

82. ఎనుబదిరెండవసర్గము

శ్రీరాముని అయోధ్యకు గొనివచ్చుటకై భరతుడు తననిర్ణయమును నిండుసభలో ప్రకటించుట.
ఆయన ఆదేశముప్రకారము సచివులు ప్రయాణసన్నాహములు గావించుట.

తామార్యగణసంపూర్ణాం భరతః ప్రగ్రహాం సభామ్।
దదర్శ బుద్ధిసంపన్నః పూర్ణచంద్రో నిశామివ॥ 1

ఆసనాని యథాన్యాయమ్ ఆర్యాణాం విశతాం తదా।
వస్త్రాంగరాగప్రభయా ద్యోతితా సా సభోత్తమా॥ 2

సా విద్వజ్జనసంపూర్ణా సభా సురుచిరా తదా।
అదృశ్యత ఘనాపాయే పూర్ణచంద్రేవ శర్వరీ॥ 3

రాజ్ఞస్తు ప్రకృతీః సర్వాః సమగ్రాః ప్రేక్ష్య ధర్మవిత్।
ఇదం పురోహితో వాక్యం భరతం మృదుచాబ్రవీత్॥ 4

తాత! రాజా దశరథః స్వర్గతో ధర్మమాచరన్।
ధనధాన్యవతీం స్ఫీతాం ప్రదాయ పృథివీం తవ॥ 5

రామస్తథా సత్యధృతిః సతాం ధర్మమనుస్మరన్।
నాజహాత్ పితురాదేశం శశీ జ్యోత్స్నామివోదితః॥ 6

పిత్రా భ్రాత్రా చ తే దత్తం రాజ్యం నిహతకంటకమ్।
తద్భుంక్ష్వ ముదితామాత్యః క్షిప్రమేవాభిషేచయ॥ 7

ఉదీచ్యాశ్చ ప్రతీచ్యాశ్చ దాక్షిణాత్యా శ్చ కేవలాః।
కోట్యాపరాంతాః సాముద్రా రత్నాన్యభిహరంతు తే॥ 8

తచ్ఛ్రుత్వా భరతో వాక్యం శోకేనాభిపరిప్లుతః।
జగామ మనసా రామం ధర్మజ్ఞో ధర్మకాంక్షయా॥ 9

స బాష్పకలయా వాచా కలహంసస్వరో యువా।
విలలాప సభామధ్యే జగర్హే చ పురోహితమ్॥ 10

చరితబ్రహ్మచర్యస్య విద్యాస్నాతస్య ధీమతః।
ధర్మే ప్రయతమానస్య కో రాజ్యం మద్విధో హరేత్॥ 11

పూర్ణచంద్రుడు గురుశుక్రాదిగ్రహములతోగూడిన రాత్రినివలె, ప్రజ్ఞాశాలియైనభరతుడు పూజ్యులైన వసిష్ఠాదిమహామహులతోగూడి, నియమనిబంధనలతో విలసిల్లుచున్న ఆసభను దర్శించెను. (1)

అచటిపెద్దలందఱును తమతమ అర్హతలను అనుసరించి ఆయా ఆసనములను అలంకరించియుండిరి. వారివస్త్రశోభలతో అంగరాగముల (మైపూతల) కాంతులతో ఆసభ చక్కగా తేజరిల్లుచుండెను. (2)

వర్షాకాలము ముగిసినపిమ్మట శరదృతువునందు పూర్ణచంద్రుని శోభలతో విరాజిల్లెడి రాత్రివలె విద్వాంసులతో నిండి కలకలలాడు చున్న ఆసభ దర్శనీయముగానుండెను. (3)

ధర్మవేత్తయు, రాజపురోహితుడుఅగు వసిష్ఠుడు సభలోని అమాత్యులు మొదలగువారినందఱిని సమగ్రముగా కలయజూచి, భరతునితో ఇట్లు మృదువచనములను పలికెను. (4)

"నాయనా! భరతా! మీతండ్రియైన దశరథమహారాజు ధర్మబద్ధముగా తఃకోసలదేశమును పెద్దకాలము పరిపాలించి, ధనధాన్యసంపదలతో తులతూగుచుండెడి ఈవిశాలరాజ్యమును నీకు అప్పగించి, తాను స్వర్గస్థుడాయెను. (5)

సత్యసంధుడైన శ్రీరాముడు పరంపరగా వచ్చుచున్న సత్పురుషుల (పెద్దల) సంప్రదాయములను పాటించుచు, ఉదయించిన చంద్రుడు వెన్నెలను విడువనట్లు, తాను తండ్రియాదేశమును త్రోసిపుచ్చక దానిని అనుసరించెను. (6)

భరతా! ఈరాజ్యమును మీతండ్రియైన దశరథమహారాజు నీకు అప్పగించినాడు, అన్నయగు శ్రీరాముడు దానిని ఆమోదించి నాడు. ఈరాజ్యమునిష్కంటకమైనది. (శత్రుబాధలులేనిది.) వెంటనే రాజ్యాభిషిక్తుడవై దీనిని పాలింపుము. మంత్రులును సంతసింతురు. మనరాజ్యమునకు నలుదిక్కులయందుగల సామంతరాజులును, అపరాంతదేశవాసులైన యవనులును, సముద్రద్వీపవాసులైన రాజులును కోట్లకొలదిరత్నములను నీకు కానుకలుగా ఇచ్చెదరు. (7-8)

ధర్మజ్ఞుడైన (వంశసంప్రదాయమును అనుసరించి, సోదరులలో జ్యేష్ఠుడు రాజగుటధర్మమని తలంచిన) భరతుడు వసిష్ఠుని వచనములను విని, శోకమున మునింగెను. పిమ్మట అతడు శ్రీరాముడే ప్రభువు కావలెననుకోరికతో మనస్సునందు ఆయనను స్మరించుచు శరణుజొచ్చెను. (9)

యువకుడైన ఆభరతుడు సభామధ్యమున కన్నీరుగార్చుచు అవ్యక్త మధురస్వరముతో విలపించుచు, పురోహితుని మాటకు 'ఊ కొట్టక' లేక వినమ్రుడై ఇట్లు పలికెను. (10)

ఓ గురువర్యా! శ్రీరాముడు బ్రహ్మచర్యనిష్ఠాగరిష్ఠుడు, సకల విద్యలలో ఆరితేఱినవాడు, ఎల్లప్పుడును ధర్మమును ఆచరించుట యందే నిరతుడు. అట్టి ప్రజ్ఞాశాలియైన శ్రీరామునిరాజ్యమును పొందుటకు నావంటివాడు ఎట్లుఅర్హుడగును? (11)

కథం దశరథాజ్జాతో భవేద్రాజ్యాపహారకః।
రాజ్యం చాహం చ రామస్య ధర్మం వక్తుమిహార్హసి। 12

జ్యేష్ఠః శ్రేష్ఠశ్చ ధర్మాత్మా దిలీపనహుషోపమః।
లబ్ధుమర్హతి కాకుత్స్థో రాజ్యం దశరథో యథా। 13

అనార్యజుష్టమస్వర్గ్యం కుర్యాం పాపమహం యది।
ఇక్ష్వాకూణామహం లోకే భవేయం కులపాంసనః। 14

యద్ధి మాత్రా కృతం పాపం నాహం తదపి రోచయే।
ఇహస్థో వనదుర్గస్థం నమస్యామి కృతాంజలిః। 15

రామమేవానుగచ్ఛామి రాజా స ద్విపదాం వరః।
త్రయాణామపి లోకానాం రాజ్యమర్హతి రాఘవః। 16

తద్వాక్యం ధర్మసంయుక్తం శ్రుత్వా సర్వే సభాసదః।
హర్షాన్ముముచురశ్రూణి రామే నిహితచేతసః। 17

యది త్వార్యం న శక్ష్యామి వినివర్తయితుం వనాత్।
వనే తత్రైవ వత్స్యామి యథాఽఽర్యో లక్ష్మణస్తథా। 18

సర్వోపాయం తు వర్తిష్యే వినివర్తయితుం బలాత్।
సమక్షమార్యమిశ్రాణాం సాధూనాం గుణవర్తినామ్। 19

విష్టికర్మాంతికాః సర్వే మార్గశోధకరక్షకాః।
ప్రస్థాపితా మయా పూర్వం యాత్రాఽపి మమ రోచతే। 20

ఏవముక్త్వా తు ధర్మాత్మా భరతో భ్రాతృవత్సలః।
సమీపస్థమువాచేదం సుమంత్రం మంత్రకోవిదమ్। 21

తూర్ణముత్థాయ గచ్ఛ త్వం సుమంత్ర మమ శాసనాత్।
యాత్రామాజ్ఞాపయ క్షిప్రం బలం చైవ సమానయ। 22

ఓ మహామునీ! దశరథమహారాజుయొక్క కుమారుడనైన నేను జ్యేష్ఠుని రాజ్యమును ఎట్లు అపహరింపగలను? ఈ రాజ్యము శ్రీరామునిది. నేనును ఆయనవాడనే. కనుక ఈ విషయమును మనస్సునందు ఉంచుకొని, ఈ నిండుసభలో ధర్మమునకు భంగము వాటిల్లకుండ మీరు పలుకుట యుక్తముగదా! (12)

శ్రీరాముడు వయసులో నాకంటె పెద్దవాడు. అంతేగాదు అతడు గుణములచేతను శ్రేష్ఠుడు. సూర్యవంశజుడైన దిలీపునివలె మహాపురుషుడు, చంద్రవంశమువాడైన నహుషునివలె ఉదాత్తుడు. కనుక ఈ రాజ్యమును పాలించుటకు దశరథమహారాజువలె అతడే అర్హుడు. (13)

శ్రీరాముని రాజ్యమును నేను స్వీకరించుట ఒక మహాపచారము. ఈ అకృత్యమునకు నేను ఒడిగట్టినచో అది నన్ను నరకమున పడవేయును. అంతేగాదు అప్పుడు నేను ఇక్ష్వాకువంశమునకే తీరని కళంకమును తెచ్చినవాడనగుదును. నీచుడుమాత్రమే ఇట్టి పాపమునకు ఒడిగట్టును. (14)

నా తల్లి చేసిన ఈ మహాపాపకృత్యమును నేను ఎన్నటికిని అంగీకరింపను. కాఱడవులలో నున్న మహాత్ముడైన ఆ శ్రీరామప్రభువునకు నేను ఇచటినుండియే ప్రణమిల్లుచున్నాను. (15)

నేను శ్రీరామునే అనుసరింతును. నరోత్తముడైన ఆ శ్రీరాముడే ఈ రాజ్యమునకు రాజు. అంతేగాదు అతడు ముల్లోకములకును ప్రభువుకాదగినవాడు." (16)

అంతట సభలోనున్నవారు అందఱును భరతుడు పలికిన ధర్మబద్ధములైన వచనములను విని, ఆనందాశ్రువులను రాల్చిరి. వారు శ్రీరామునియందే లగ్నమనస్కులైరి. (17)

అంతట భరతుడు సభాసదులతో మఱల ఇట్లు పల్కెను. "పూజ్యుడైన శ్రీరాముని వనములనుండి అయోధ్యకు మఱలింపజాలనిచో ధర్మనిరతుడైన లక్ష్మణునివలె నేనును అన్నను సేవించుచు అచటనే యుండెదను. ఈ సభలో ఆసీనులైయున్న మీరు సద్గుణసంపన్నులు, సాధువర్తనులు, ఆర్యులు. మీరందఱును నాతోగూడి వనములకు రండు. ఆ మహానుభావుని దీసికొనివచ్చుటకై మీ సమక్షముననే అన్నివిధములుగా ప్రయత్నింతును. (18-19)

మార్గములను సరిచేయుటకును, రక్షణకార్యములను చూచుటకును అర్హులైన స్వచ్ఛంద జానపదకార్మికులు అందఱును ఇంతకుముందే పంపబడిరి. నేనును శ్రీరామునికడకు వెళ్ళుటకే ఇష్టపడుచున్నాను." (20)

ధర్మాత్ముడును, సోదరప్రేమగలవాడునునైన భరతుడు సదస్యులతో ఇట్లు పలికిన పిమ్మట, తనసమీపముననేయున్న, రాజ్యతంత్రములలో ఆరితేఱిన సుమంత్రునితో ఇట్లునుడివెను. (21)

"ఓ సుమంత్రా! మీరు వెంటనే ఇచటినుండి బయలుదేఱుడు. 'అందఱును వనయాత్రకు సిద్ధముకావలెను' అని నా ఆజ్ఞగా తెల్పుడు. చతురంగబలములను సిద్ధపఱచుడు." (22)

ఏవముక్తః సుమంత్రస్తు భరతేన మహాత్మనా।
హృష్టస్తదాఽఽదిశత్ సర్వం యథాసందిష్టమిష్టవత్। 23

తాః ప్రహృష్టాః ప్రకృతయో బలాధ్యక్షా బలస్య చ।
శ్రుత్వా యాత్రాం సమాజ్ఞప్తాం రాఘవస్య నివర్తనే। 24

తతో యోధాంగనాః సర్వా భర్తౄన్ సర్వాన్ గృహే గృహే।
యాత్రాగమనమాజ్ఞాయ త్వరయంతి స్మ హర్షితాః। 25

తే హయైర్గోరథైః శీఘ్రైః స్యందనైశ్చ మహాజవైః।
సహ యోధైర్బలాధ్యక్షా బలం సర్వమచోదయన్। 26

సజ్జం తు తద్బలం దృష్ట్వా భరతో గురుసన్నిధౌ।
రథం మే త్వరయస్వేతి సుమంత్రం పార్శ్వతోఽబ్రవీత్। 27

భరతస్య తు తస్యాజ్ఞాం ప్రతిగృహ్య చ హర్షితః।
రథం గృహీత్వా ప్రయయౌ యుక్తం పరమవాజిభిః। 28

స రాఘవః సత్యధృతిః ప్రతాపవాన్
బ్రువన్ సుయుక్తం దృఢసత్యవిక్రమః।
గురుం మహారణ్యగతం యశస్వినం
ప్రసాదయిష్యన్ భరతోఽబ్రవీత్ తదా। 29

తూర్ణం సముత్థాయ సుమంత్ర! గచ్ఛ
బలస్య యోగాయ బలప్రధానాన్ ।
ఆనేతుమిచ్ఛామి హి తం వనస్థం
ప్రసాద్య రామం జగతో హితాయ । 30

స సూతపుత్రో భరతేన సమ్యక్
ఆజ్ఞాపితః సంపరిపూర్ణకామః ।
శశాస సర్వాన్ ప్రకృతిప్రధానాన్
బలస్య ముఖ్యాంశ్చ సుహృజ్జనం చ । 31

తతః సముత్థాయ కులే కులే తే
రాజన్యవైశ్యా వృషలాశ్చ విప్రాః ।
అయూయుజన్నుష్ట్రఖరాన్ రథాంశ్చ
నాగాన్ హయాంశ్చైవ కులప్రసూతాన్ । 32

మహానుభావుడైన భరతుడు సుమంత్రునితో ఇట్లుపలికెనుగా అందులకు అతడు సంతసించినవాడై, భరతునిఆదేశానుసారము, అందఱికిని ప్రియమైన ఆ ఆజ్ఞను వెంటనే ప్రకటించెను. (23)

'శ్రీరామచంద్రుని తిరిగి అయోధ్యకుతీసికొనివచ్చుటకై భరతుడు వెళ్లుచున్నాడు. సైన్యముగూడ ఆయనవెంటవెళ్లుటకు ఆజ్ఞలు ఇయ్యబడినవి.' అను సమాచారమునువిని, ప్రజలును, సేనాపతులును ఎంతయు సంతసించిరి. (24)

భరతుడు ఆదేశించిన వనయాత్రవిషయమును ఎఱింగి, ప్రతిగృహమునందును వీరనారీమణులు ఎల్లరును మిగులసంతసించినవారై, తమభర్తలను ప్రయాణమునకై తొందరపెట్టసాగిరి. (25)

అంతట ఆసేనాపతులు మనోవేగముతోపోగిపోగల అశ్వములతోను, ఎద్దులబండ్లతోను, రథములతోను, కాల్బలములతోను వెంటనే బయలుదేఱవలసినదిగా తమసేనలను ఆజ్ఞాపించిరి. (26)

భరతుడు సర్వసన్నద్ధముగానున్న బలములనుజూచి, గురువైన వసిష్ఠమహర్షి సన్నిధిలో ప్రక్కనేయున్న సుమంత్రునితో 'వెంటనే నారథమునుగూడ సిద్ధపఱుచుడు' అని పలికెను. (27)

అంతట భరతునిఆజ్ఞను శిరసావహించి, సుమంత్రుడు మిగుల హర్షముతో ఉత్తమాశ్వములను పూన్చినరథమును తీసికొనివచ్చెను. అప్పుడు దృఢమైన నిశ్చయముగలవాడును, పరాక్రమశాలియు, సత్యనిరతుడును, సముచితరీతిగా మాట్లాడుచున్నవాడునునైన భరతుడు మహారణ్యములలోనున్న యశస్వియగు తనఅన్నను ప్రసన్నునిజేసికొని, తీసికొనువచ్చువిషయమున సుమంత్రునితో ఇట్లునుడివెను. (28-29)

ఓసుమంత్రా! వెంటనే బయలుదేఱి, సేనాపతులకడకువెళ్లి, 'వనములకు రేపే బయలుదేఱుటకు బలములను సిద్ధముగా నుంచుడు' అని వారితో తెల్పుము. వనములలోనున్న శ్రీరాముని ప్రసన్నునిగాజేసికొని, లోకహితార్థమై ఆయనను ఇచటికి తీసికొని రావలెను-అని నాగట్టికోరిక. (30)

భరతుడు ఇచ్చిన చక్కనిఆజ్ఞలను స్వీకరించి, సుమంత్రుడు తనమనోరథము నెఱవేఱినట్లుగా తలంచెను. పిదప అతడు పురప్రముఖులకును, సేనానాయకులకును, మిత్రులకును భరతుని ఆదేశములను వినిపించెను. (31)

అపుడు ప్రతిగృహమునందలి బ్రాహ్మణాదిసర్వవర్ణముల వారును నడుముబిగించి, వేగముగా పోగిపోగల మేలుజాతికిచెందిన గుఱ్ఱములను, ఏనుగులను, ఒంటెలను, రథములను సిద్ధపఱచిరి. ఇంటింటను ఒకేమాట 'మనము శ్రీరామునికడకువెళ్లవలెను- ఆప్రభువును ఇచటికి తీసికొనిరావలెను.'[1] (32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్వ్యశీతితమస్సర్గః (82)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదిరెండవసర్గము సమాప్తము

-- * * * --

1) సీతమ్మ మాఅమ్మ - శ్రీరాముడు మాకుతండ్రి - 'సంకీర్తనావళి' -

83. ఎనుబదిమూడవసర్గము

శ్రీరామునిగొనివచ్చుటకై భరతుడు తనపరివారములతో అయోధ్యావాసులతో, బయలుదేఱుట - వారు గంగాతీరమునగల శృంగిబేరపురమునకు చేరుట.

తత స్సముత్థితః కాల్యమ్ ఆస్థాయ స్యందనోత్తమమ్ ।
ప్రయయౌ భరతః శీఘ్రం రామదర్శనకాంక్షయా । 1

పిమ్మట భరతుడు ఉషఃకాలముననే మేల్కొని, శ్రీరాముని శీఘ్రముగా దర్శింపవలెనను కోరికతో ఉత్తమమైన రథమును అధిరోహించి, బయలుదేఱెను. మంత్రులు, పురోహితులు మొదలగువారు అందఱును సూర్యునిరథముతో సమానమగు రథములకు మేలుజాతి గుఱ్ఱములను పూన్చి, వాటిని అధిరోహించి, భరతునకు ముందుభాగమున ప్రయాణించుచుండిరి. (1-2)

అగ్రతః ప్రయయుస్తస్య సర్వే మంత్రిపురోధసః ।
అధిరుహ్య హయైర్యుక్తాన్ రథాన్ సూర్యరథోపమాన్ । 2

నవనాగసహస్రాణి కల్పితాని యథావిధి ।
అన్వయుర్భరతం యాంతమ్ ఇక్ష్వాకుకులనందనమ్ । 3

ఇక్ష్వాకుకులనందనుడగు భరతుని ఆదేశమును అనుసరించి, సిద్ధపఱచబడిన తొమ్మిదివేల ఏనుగులు రథముపై పయనించుచున్న అతనిని అనుసరించుచుండెను. (3)

షష్టి రథసహస్రాణి ధన్వినో వివిధాయుధాః ।
అన్వయుర్భరతం యాంతం రాజపుత్త్రం యశస్వినమ్ । 4

వాసికెక్కినవాడును, రాజకుమారుడును ఐన భరతుడు రథముపై ముందుగా సాగిపోవుచుండగా వివిధాయుధములుగల విలుకాండ్రు అఱువదివేలరథములతో ఆయనవెంట ప్రయాణించుచుండిరి. (4)

శతం సహస్రాణ్యశ్వానాం సమారూఢాని రాఘవమ్ ।
అన్వయుర్భరతం యాంతం సత్యసంధం జితేంద్రియమ్ । 5

సత్యనిరతుడును, జితేంద్రియుడును, రఘువంశమువాడును ఐన భరతుడు రథారూఢుడై పయనించుచుండగా లక్షమంది ఆశ్వికులు తమతమగుఱ్ఱములపై ఆయనను అనుసరించుచుండిరి. (5)

కైకేయీ చ సుమిత్రా చ కౌసల్యా చ యశస్వినీ ।
రామానయనసంహృష్టా యయుర్యానేన భాస్వతా । 6

వాసిగాంచిన కౌసల్యయు, కైకేయీసుమిత్రలును శ్రీరాముని గొనివచ్చుటకై జరుగుచున్నయాత్రకు మిగుల సంతసించిరి. ఆయాత్రలో తామును పాల్గొనదలచి, వారు సముచితములైన వాహనములపై బయలుదేఱిరి. (6)

ప్రయాతాశ్చార్యసంఘాతా రామం ద్రష్టుం సలక్ష్మణమ్ ।
తస్యైవ చ కథాశ్చిత్రాః కుర్వాణా హృష్టమానసాః । 7

పిదప బ్రాహ్మణాది త్రివర్ణములవారును రామలక్ష్మణుల జూచువేడుకతో భరతునివెంట సాగిపోవుచు ఆ సోదరుల అద్భుత గాథలను తమలోతాము ప్రస్తావించుకొనుచు ఆనందమున పొంగిపోవుచుండిరి. (7)

మేఘశ్యామం మహాబాహుం స్థిరసత్త్వం దృఢవ్రతమ్ ।
కదా ద్రక్ష్యామహే రామం జగతః శోకనాశనమ్ । 8

దృష్ట ఏవ హి నః శోకమ్ అపనేష్యతి రాఘవః ।
తమః సర్వస్య లోకస్య సముద్యన్నివ భాస్కరః । 9

(వారిలోవారు ఇట్లు మాట్లాడుకొనుచుండిరి.) శ్రీరాముడు జగదానందకారకుడు, మేఘశ్యామసుందరుడు ఆజానుబాహువు, స్థితప్రజ్ఞుడు, దృఢదీక్షగలవాడు. అట్టి మహాత్ముని ఎప్పుడు చూడగలమోగదా! సూర్యుడు ఉదయించుచునే లోకములచీకట్లను అన్నింటిని పాఱద్రోలునట్లు, మనకు ఆయనదర్శనము ఐనంతనే ఆయనచూపులు మనశోకతాపములను అంతరింపజేయును. మనలో ఆనందమే మిగులును. (8-9)

ఇత్యేవం కథయంతస్తే సంప్రహృష్టాః కథాః శుభాః ।
పరిష్వజానాశ్చాన్యోఽన్యం యయుర్నాగరికా జనాః । 10

ఆ అయోధ్యాపురవాసులు ఈవిధముగా సీతారాములపవిత్రకథలను చెప్పికొనుచు, సంతోషముతో పరస్పరము కౌగిలించుకొనుచు, తమ ప్రయాణములను కొనసాగించుచుండిరి. (10)

యే చ తత్రాపరే సర్వే సమ్మతా యే చ నైగమాః ।
రామం ప్రతి యయుర్హృష్టాః సర్వాః ప్రకృతయ స్తథా । 11

ఇంకను శ్రీరామునకు ప్రీతిపాత్రులైన వణిక్ప్రముఖులు అట్టి పురజనులు మొదలగువారు అందఱును మహానందముతో శ్రీరాముని దర్శించుటకై బయలుదేఱిరి. (11)

మణికారాశ్చ యే కేచిత్ కుంభకారాశ్చ శోభనాః।
సూత్రకర్మకృతశ్చైవ యే చ శస్త్రోపజీవినః। 12

మాయూరకాః క్రాకచికా రోచకా వేధకాస్తథా।
దంతకారాః సుధాకారాః తథా గంధోపజీవినః। 13

సువర్ణకారాః ప్రఖ్యాతాః తథా కంబళధావకాః।
స్నాపకోచ్ఛాదకా వైద్యా ధూపకాః శౌండికాస్తథా। 14

రజకాస్తున్నవాయాశ్చ గ్రామఘోషమహత్తరాః।
శైలూషాశ్చ సహ స్త్రీభిః యయుః కైవర్తకాస్తథా। 15

సమాహితా వేదవిదో బ్రాహ్మణా వృత్తసమ్మతాః।
గోరథైర్భరతం యాంతమ్ అనుజగ్ముః సహస్రశః। 16

సువేషాః శుద్ధవసనాః తామ్రమృష్టానులేపనాః।
సర్వే తే వివిధైర్యానైః శనైర్భరతమన్వయుః। 17

ప్రహృష్టముదితా సేనా సాఽన్వయాత్ కైకయీసుతమ్।
భ్రాతురానయనే యాంతం భరతం భ్రాతృవత్సలమ్। 18

తే గత్వా దూరమధ్వానం రథయానాశ్వకుంజరైః।
సమాసేదుస్తతో గంగాం శృంగిబేరపురం ప్రతి। 19

యత్ర రామసఖో వీరో గుహో జ్ఞాతిగణైర్వృతః।
నివసత్యప్రమాదేన దేశం తం పరిపాలయన్। 20

ఉపేత్య తీరం గంగాయాః చక్రవాకైరలంకృతమ్।
వ్యవాతిష్ఠత సా సేనా భరతస్యానుయాయినీ। 21

నిరీక్ష్యానుగతాం సేనాం తాం చ గంగాం శివోదకామ్।
భరతః సచివాన్ సర్వాన్ అబ్రవీద్వాక్యకోవిదః। 22

నివేశయత మే సైన్యమ్ అభిప్రాయేణ సర్వతః।
విశ్రాంతాః ప్రతరిష్యామః శ్వ ఇదానీమిమాం నదీమ్। 23

దాతుం చ తావదిచ్ఛామి స్వర్గతస్య మహీపతేః।
ఔర్ధ్వదేహనిమిత్తార్థమ్ అవతీర్యోదకం నదీమ్। 24

తస్యైవం బ్రువతోఽమాత్యాః తథేత్యుక్త్వా సమాహితాః।
న్యవేశయంస్తాం ఛందేన స్వేన స్వేన పృథక్ పృథక్। 25

మణులను సానబట్టువారును, పనితనముగల కుమ్మరివారును, నూలువడికి బట్టలునేయువారును, ఆయుధములను సిద్ధపఱచి జీవించువారును, నెమలిఈకలతో గొడుగులను, విసనకఱ్ఱలను నిర్మించువారును, ఱంపములతో చందనపుచెక్కలను కోయువారును, మణులకును, ముత్యములకును రంధ్రములనుచేసెడివారును, గోడలను, వేదికలను అలంకరించువారును, ఏనుగుదంతములతో వేర్వేఱువస్తువులను నిర్మించువారును, సున్నపుపనిచేయువారును, సుగంధవస్తువులను సిద్ధపఱచి, వాటిని అమ్ముకొని జీవించెడివారును, ప్రసిద్ధులైన బంగారపు పనివారును, కంబళ్లను శుభ్రపఱచువారును, వేడినీళ్లతో స్నానములుచేయించువారును, వైద్యులును, సుగంధధూపములను వేయువారును, మధువులను విక్రయించువారును, చాకలివారును, కుట్టుపనులను చేయువారును, గ్రామములను, గోశాలలను రక్షించువారును, నటీనటులును, జాలరులును ఈయాత్రలో పాల్గొనిరి. ఇంకను నిశ్చలమనస్కులును, సదాచారులును, వేదవిదులును ఐన వేలకొలది బ్రాహ్మణులు ఎద్దులబండ్లనెక్కి భరతుని అనుగమించిరి. ఆ విధముగా అయోధ్యానగరమంతయు కదలెను. (12-16)

వీరు అందఱును శుభ్రమైన వస్త్రములను ధరించి, ఎఱ్ఱని అంగరాగములను పూసికొని, చక్కగా అలంకరించుకొనియుండిరి. వీరు వేర్వేఱువాహనములపై తిన్నగా భరతుని అనుసరించిరి. (17)

మిగులసోదరప్రేమగలవాడును, కైకేయీసుతుడును ఐన భరతుడు అన్నయగు శ్రీరాముని తీసికొనివచ్చుటకై వెళ్లుచుండగా సైనికులు మిగులసంతోషముతో ఆయనను అనుగమించిరి. (18)

ఆసైనికులు రథములపై, బండ్లపై, గుఱ్ఱములపై, ఏనుగులపై చాలదూరము ప్రయాణముచేసి, శృంగిబేరపురసమీపమునగల గంగాతీరమునకు చేరిరి. ఆపురమును శ్రీరామునిమిత్రుడైన గుహుడు తనవారితోగూడి ఎవరివలనను నెట్టి ప్రమాదములేకుండా జాగరూకుడై పరిపాలించుచు అందునివసించుచుండెను. (19-20)

భరతుని అనుగమించుచు పయనించుచున్న ఆసేన చక్రవాకములు గుంపులుగట్టియున్న ఆగంగాతీరమునకుచేరి అచట విడిసెను. (21)

పవిత్రజలములతోగూడిన గంగానదినిజూచి, తనసేన మిగుల డస్సియుండుటను గమనించి, వాక్యచతురుడైన భరతుడు తన మంత్రులందఱితో ఇట్లు పలికెను. (22)

"మీ ఇష్టానుసారము ఈప్రదేశములలో మనసైన్యములను నిలిపియుంచుడు. ప్రస్తుతము విశ్రాంతితీసికొందము. రేపుగంగానదిని దాటుదము. స్వర్గస్థుడైన దశరథమహారాజునకు పుణ్యలోకములు ప్రాప్తించుటకై గంగాజలములలోనికిదిగి, జలతర్పణములను విడువగోరుచున్నాను."[1] (23-24)

భరతుడు ఈవిధముగా పలికినపిమ్మట మంత్రులు అందఱును 'తథాస్తు' అనిపలికి, ఆయనఆజ్ఞను తలదాల్చిరి. సైన్యములను అన్నింటిని వారివారిఇష్టానుసారము వేర్వేఱు ప్రదేశములలో నిలిపిరి. (25)

1) పవిత్ర తీర్థక్షేత్రములకు (జీవనదీతీరములకు) చేరినప్పుడు పితృదేవతలకు ఉత్తమగతులు ప్రాప్తించుటకై తర్పణములను, శ్రాద్ధవిధులను ఆచరించుట అనూచానముగా వచ్చుచున్న భారతీయసంప్రదాయము - కనుక ఇది అందఱికిని కర్తవ్యము.

నివేశ్య గంగామను తాం మహానదీం
చమూం విధానైః పరిబర్హశోభినీమ్ ।
ఉవాస రామస్య తదా మహాత్మనో
విచింతయానో భరతో నివర్తనమ్ ॥ 26

అంతట భరతుడు గుడారములువేయుటకు సంబంధించిన పరికరములుగల ఆసేనను మహానదియైన గంగాతీరమున విడిది చేయించి, మహాత్ముడైన శ్రీరాముని తీసికొనివచ్చు ఉపాయములను గూర్చి ఆలోచించుచు అచట వసించెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్ర్యశీతితమస్సర్గః (83)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదిమూడవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

84. ఎనుబదినాల్గవసర్గము

గుహుడు భరతునిరాకలోని ఆంతర్యము తెలియక 'యుద్ధసన్నద్ధులైయుండుడు' అని తనవారిని ఆదేశించుట. భరతునిభావమును గ్రహించుటకై అతడు కానుకలతో ఎదురేగి, వారిని తనపురమునకు ఆహ్వానించుట.

తతో నివిష్టాం ధ్వజినీం గంగామన్వాశ్రితాం నదీమ్ ।
నిషాదరాజో దృష్ట్వైవ జ్ఞాతీన్ సంత్వరితోఽబ్రవీత్ ॥ 1

అంతట నిషాదరాజైన గుహుడు గంగానదీతీరమున విడిసియున్న భరతునిసేనను గాంచి, తొట్రుపడుచు తనసహచరులతో ఇట్లు పలికెను. (1)

మహతీయమితః సేనా సాగరాభా ప్రదృశ్యతే ।
నాస్యాంతమధిగచ్ఛామి మనసాఽపి విచింతయన్ ॥ 2

"ఓసోదరులారా! ఇదిగో ఈశృంగిబేరపురసమీపమున విడిసియున్న ఈమహాసేననుచూడుడు. ఇది అపారమైన ఒక మహాసముద్రము వలె కన్పట్టుచున్నది. ఇంతటి విశాలమైన సేనను నేను మనస్సున సైతము ఊహించియెఱుగను. (2)

యథా తు ఖలు దుర్బుద్ధిః భరతః స్వయమాగతః ।
స ఏష హి మహాకాయః కోవిదారధ్వజో రథే ॥ 3

రథముపై ఎగురుచు కనబడుచున్న ఆకోవిదారధ్వజము ఇక్ష్వాకు ప్రభువులచిహ్నము. దీనినిబట్టి ఆ రథమునందున్నవాడు భరతుడే యనుట నిశ్చయము. అతడు దుర్బుద్ధితో ఇటు వచ్చియుండును. (కోవిదారము=ఎఱ్ఱకాంచనము.) (3)

బంధయిష్యతి వా దాశాన్ అథవాఽస్మాన్ వధిష్యతి ।
అథ దాశరథిం రామం పిత్రా రాజ్యాద్వివాసితమ్ ॥ 4

సంపన్నాం శ్రియమన్విచ్ఛన్ తస్య రాజ్ఞః సుదుర్లభామ్ ।
భరతః కైకయీపుత్త్రో హంతుం సమధిగచ్ఛతి ॥ 5

"దశరథమహారాజుయొక్క రాజ్యలక్ష్మి సుసంపన్నమైనది, సామాన్యులకు అది సుదుర్లభమైనది. దానిని ఈ కైకేయీసుతుడు శాశ్వతముగా తనహస్తగతముచేసికొనదలచినట్లున్నాడు. అందులకై ఆ భరతుడు శ్రీరాముని దాసులమైన మనలను తనసేనాబలములతో బంధించుటగాని, చంపుటగాని చేయును. పిమ్మట ఆ శ్రీరాముని అడ్డునుగూడ తొలగించుకొని, తన కోర్కెనుదీర్చుకొనదలచి నట్లున్నాడు. అందులకే అతడు ఇటు వచ్చినట్లున్నాడు"- అని నేను తలంతును. (4-5)

భర్తా చైవ సఖా చైవ రామో దాశరథిర్మమ ।
తస్యార్థకామాః సన్నద్ధా గంగాఽనూపే ప్రతిష్ఠత ॥ 6

దాశరథియైన ఆశ్రీరాముడు నాకు పరమమిత్రుడు, ప్రభువు, కనుక అతనిహితమునుగోరి మీరు అస్త్రశస్త్రములతో సన్నద్ధులై గంగాతీరమున నిలిచియుండుడు. (6)

తిష్ఠంతు సర్వే దాశాశ్చ గంగామన్వాశ్రితా నదీమ్ ।
బలయుక్తా నదీరక్షా మాంసమూలఫలాశనాః ॥ 7

నావాం శతానాం పంచానాం కైవర్తానాం శతం శతమ్ ।
సన్నద్ధానాం తథా యూనాం తిష్ఠంత్విత్యభ్యచోదయత్ ॥ 8

కందమూలములను, ఫలములను భుజించునట్టివారును, రేవులను రక్షించువారును ఐన పల్లెయోధులు తమబలములతో గంగానదీతీరమున నిలిచి, అచటనుండవలెను. మనకడ ఐదువందల నావలుగలవు. ఒక్కొక్కనావపై వందేసి యువయోధులు (జాలరి జాతివారు) యుద్ధసన్నద్ధులై నిలిచియుండవలెను." - అని గుహుడు అందఱిని ఆదేశించెను. (7-8)

యదా తుష్టస్తు భరతో రామస్యేహ భవిష్యతి।
సేయం స్వస్తిమతీ సేనా గంగామద్య తరిష్యతి। 9

ఇత్యుక్త్వోపాయనం గృహ్య మత్స్యమాంసమధూని చ।
అభిచక్రామ భరతం నిషాదాధిపతిర్గుహః। 10

తమాయాంతం తు సంప్రేక్ష్య సూతపుత్రః ప్రతాపవాన్।
భరతాయాచచక్షేఽథ వినయజ్ఞో వినీతవత్। 11

ఏష జ్ఞాతిసహస్రేణ స్థపతిః పరివారితః।
కుశలో దండకారణ్యే వృద్ధో భ్రాతుశ్చ తే సఖా। 12

తస్మాత్ పశ్యతు కాకుత్స్థ! త్వాం నిషాదాధిపో గుహః।
అసంశయం విజానీతే యత్ర తౌ రామలక్ష్మణౌ। 13

ఏతత్తు వచనం శ్రుత్వా సుమంత్రాద్భరతః శుభమ్।
ఉవాచ వచనం శీఘ్రం గుహః పశ్యతు మామితి। 14

లబ్ధ్వాఽభ్యనుజ్ఞాం సంహృష్టో జ్ఞాతిభిః పరివారితః।
ఆగమ్య భరతం ప్రహ్వః గుహో వచనమబ్రవీత్। 15

నిష్కుటశ్చైవ దేశోఽయం వంచితాశ్చాపి తే వయమ్।
నివేదయామస్తే సర్వే స్వకే దాసకులే వస। 16

అస్తి మూలం ఫలం చైవ నిషాదైః సముపాహృతమ్।
ఆర్ద్రం చ మాంసం శుష్కం చ వన్యం చోచ్చావచం మహత్। 17

ఒకవేళ భరతుడు శ్రీరామునకు సంతోషమునుగూర్చువాడై ఇటువచ్చుచున్నచో నేడు ఈసేన సురక్షితముగా గంగానదిని దాటగలదు." (9)

నిషాదరాజైనగుహుడు తన అనుచరులకు ఇట్లు ఆజ్ఞలను ఇచ్చెను. పిదప అతడు కండచక్కెరలను,[1] పండ్లరసములను,[2] మధువులను (తేనెలను), పట్టువస్త్రములు మున్నగు కానుకలను తీసికొని, భరతునికడకు స్వయముగా వెళ్లెను. (10)

పరాక్రమశాలియు, వినయశీలియు, రథసారథియునైన సుమంత్రుడు తమకడకు వచ్చుచున్న ఆగుహునిజూచి, భరతునితో ఇట్లు వినమ్రుడై ఇట్లు పలికెను. (11)

"ఓ కకుత్స్థవంశతిలకా! భరతా! "మనకడకు వచ్చుచున్న ఈవృద్ధుడు నిషాదరాజు, శృంగిబేరపురమునకు (ఈప్రదేశమునకు) ప్రభువు. ఇతనిపేరు గుహుడు. ఇతనికడ వేలకొలది పరివారములుగలవు. ఇతడు మీఅన్నయైన శ్రీరామునకు ఆప్తమిత్రుడు. దండకారణ్యములయందు సంచరించుటలో ఆరితేరినవాడు. రామలక్ష్మణులున్న ప్రదేశము బాగుగా తెలిసినవాడు. అందువలన ఈనిషాదరాజు మిమ్ముదర్శించుటకు అనుమతింపుడు." (12-13)

అప్పుడు భరతుడు, సుమంత్రుడు పలికిన సంతోషకరము లైన వచనములనువిని, 'నిషాదరాజైన గుహుడు వెంటనేనన్ను కలిసికొనవచ్చును' - అని అతనితో చెప్పెను. (14)

భరతుని అనుమతి లభించుటతో గుహుడు సంతుష్టుడై, తన వారితోగూడి భరతునిజేరెను. పిమ్మట అతడు ఆయనకు ప్రణమిల్లి ఇట్లు విన్నవించెను. (15)

ఓ మహారాజా! ఈప్రదేశము మీవిహారవనమువంటిది. మీరాక మాకు ముందుతెలియనందున మేము మీకు తగినసేవలు చేయలేకపోయితిమి. ముందుగా తెలిసియున్నచో ఎదురుగావచ్చి సాదరముగా, మీకు స్వాగతసత్కారములను జరిపియుండెడివారము. మేము అందరము మీదాసులము. ఈనివాసమునందుండుట సమ్మతింపుడు. (16)

ప్రభూ! ఈఫలమూలాదులు మీరు ఆరగించుటకై అర్పింపబడినవి. వీటిలో కొన్నిపండ్లు ఇప్పుడేతెచ్చినవి, రసయుక్తములైనవి. మరికొన్ని ఎండుద్రాక్షాదిఫలములు. వీటితోబాటు ఫలరసములుగూడ సిద్ధముగా నున్నవి. ఇవిమాత్రమేగాక ఇంకను వివిధములైన వన్యపదార్థములును గలవు. వీటిని అన్నింటిని మానిషాదులే ప్రేమతో తీసికొనివచ్చినారు.

1) మత్స్యండీ = కండచక్కెర-ఇచట 'మత్స్యండీ' అను శబ్దమునకు మారుగా 'మత్స్య' శబ్దము ప్రయోగింపబడినది. 'నామైక దేశే నామగ్రహణం' అను న్యాయమును అనుసరించి, పదములోని విభాగమును ప్రయోగించినను ఆపదమును పూర్తిగా గ్రహింపవచ్చును.

2) మాంసము (మాంసఫలము) = కళింగపండు, పుచ్చకాయ మొదలగుపండ్లు, పండ్లరసములు.

ఆశంసే స్వాశితా సేనా వత్స్యతీమాం విభావరీమ్।
అర్చితో వివిధైః కామైః శ్వః ససైన్యో గమిష్యసి ॥ 18

దయతో స్వీకరింపుడు. "మీసేన మాఆతిథ్యమును స్వీకరించి, ఈరాత్రివి ఇక్కడనే గడుపవలెనని మాకోరిక. మీరు సేనాసహితముగా నేడు మా ఆతిథమర్యాదలను తనివిదీర అందుకొని, రేపు వెళ్లవచ్చును." (17-18)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతురశీతితమస్సర్గః (84)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదినాల్గవసర్గము సమాప్తము

— * * * —

85. ఎనుబదిఐదవసర్గము

భరతగుహులఆత్మీయసంభాషణము - దుఃఖమగ్నుడైన భరతుని గుహుడు ఓదార్చుట.

ఏవముక్తస్తు భరతో నిషాదాధిపతిం గుహమ్।
ప్రత్యువాచ మహాప్రాజ్ఞో వాక్యం హేత్వర్థసంహితమ్॥ 1

నిషాదరాజైన గుహుడు ఇట్లు విన్నవించిన పిమ్మట మిక్కిలి ప్రతిభామూర్తియైన భరతుడు ప్రయోజనకరములైన మాటలను సహేతుకముగా అతనితో ఇట్లు పలికెను. (1)

ఊర్జితః ఖలు తే కామః కృతో మమ గురోః సఖే।
యో మే త్వమీదృశీం సేనామ్ ఏకోఽభ్యర్చితుమిచ్ఛసి॥ 2

"సోదరా! నీవు మా అన్నయైన శ్రీరామునకు పరమమిత్రుడవు. అపారమైన ఈసేనకు అతిథిసత్కారములను జరుపదలచితివి. ఈ నీఅభిలాష ప్రశంసనీయమైనది, ఇదీ అపూర్వమైనది. నీకోరికనెఱవేఱినట్లే తలంపుము. నీభక్తిశ్రద్ధలే, ప్రియవచనములే నాకు సంతృప్తిని గూర్చినవి." (2)

ఇత్యుక్త్వా తు మహాతేజా గుహం వచనముత్తమమ్।
అబ్రవీద్భరతః శ్రీమాన్ నిషాదాధిపతిం పునః॥ 3

మిక్కిలితేజస్వియు, శుభలక్షణసంపన్నుడును ఐన భరతుడు గుహునితో ఇట్లు పలికినపిమ్మట మఱల ఆనిషాదరాజుతో మృదుమధురముగా ఇట్లనెను. (3)

కతరేణ గమిష్యామి భరద్వాజాశ్రమం గుహ!।
గహనోఽయం భృశం దేశో గంగానూపో దురత్యయః॥ 4

"ఓ నిషాదరాజా! ఈప్రదేశమంతయును గంగాజలప్రవాహములతో నిండియున్నది. కనుక దీనిని దాటుట అసాధ్యము. దట్టమైన ఈ అరణ్యములలో కాలుమోపుటయే కష్టము. కావున భరద్వాజముని ఆశ్రమమునకు వెళ్లుటకు అనువగుమార్గమేది?" (4)

తస్య తద్వచనం శ్రుత్వా రాజపుత్రస్య ధీమతః।
అబ్రవీత్ ప్రాంజలిర్వాక్యం గుహో గహనగోచరః॥ 5

ధీశాలియు, రాజకుమారుడును ఐన భరతునివచనములను విని, అడవిదారులను గుర్తించి సంచరించుటలో సమర్థుడైన గుహుడు ఆయనకు నమస్కరించి ఇట్లు నుడివెను. (5)

దాశాస్త్వాఽనుగమిష్యంతి ధన్వినః సుసమాహితాః।
అహం చానుగమిష్యామి రాజపుత్ర! మహాయశః॥ 6

"వాసిగాంచిన ఓ రాజకుమారా! నేను నీకు తోడుగా వచ్చెదను. విలుకాండ్రైన పల్లెయోధులు సర్వసన్నద్ధులై మనలను అనుసరింతురు. (6)

కచ్చిన్న దుష్టో వ్రజసి రామస్యాక్లిష్టకర్మణః।
ఇయం తే మహతీ సేనా శంకాం జనయతీవ మే॥ 7

శ్రీరాముడు ఎవ్వరికిని కీడు తలపెట్టని సత్పురుషుడు. అట్టి ఉత్తమసోదరుని దర్శించుటకై వెళ్లుచున్నప్పుడు మీకు ఇట్టి మహాసైన్యముతో పనియేమి? నాకు బోధపడుటలేదు. నా శంకను తొలగింపుడు." (7)

తమేవమభిభాషంతం ఆకాశ ఇవ నిర్మలః।
భరతః శ్లక్ష్ణయా వాచా గుహం వచనమబ్రవీత్॥ 8

ఇట్లు పలుకుచున్న ఆగుహునితో ఆకాశమువలె స్వచ్ఛమైన మనస్సుగలవాడగు భరతుడు ఏమాత్రము తొణకనివాడై మధురముగా ఇట్లుపలికెను? (8)

మాభూత్ స కాలో యత్ కష్టం న మాం శంకితుమర్హసి।
రాఘవః స హి మే భ్రాతా జ్యేష్ఠః పితృసమో మతః। 9

తం నివర్తయితుం యామి కాకుత్స్థం వనవాసినమ్।
బుద్ధిరన్యా న తే కార్యా గుహ! సత్యం బ్రవీమి తే। 10

స తు సంహృష్టవదనః శ్రుత్వా భరతభాషితమ్।
పునరేవాబ్రవీద్వాక్యం భరతం ప్రతి హర్షితః। 11

ధన్యస్త్వం న త్వయా తుల్యం పశ్యామి జగతీతలే।
అయత్నాదాగతం రాజ్యం యస్త్వం త్యక్తుమిహేచ్ఛసి। 12

శాశ్వతీ ఖలు తే కీర్తిః లోకాననుచరిష్యతి।
యస్త్వం కృచ్ఛ్రగతం రామం ప్రత్యానయితుమిచ్ఛసి। 13

ఏవం సంభాషమాణస్య గుహస్య భరతం తదా।
బభౌ నష్టప్రభః సూర్యో రజనీచాభ్యవర్తత। 14

సన్నివేశ్య స తాం సేనాం గుహేన పరితోషితః।
శత్రుఘ్నేన సహ శ్రీమాన్ శయనం పునరాగమత్। 15

రామచింతామయః శోకో భరతస్య మహాత్మనః।
ఉపస్థితో హ్యనర్హస్య ధర్మప్రేక్షస్య తాదృశః। 16

అంతర్దాహేన దహనః సంతాపయతి రాఘవమ్।
వనదాహాభిసంతప్తం గూఢోఽగ్నిరివ పాదపమ్। 17

ప్రస్రుతః సర్వగాత్రేభ్యః స్వేదం శోకాగ్నిసంభవమ్।
యథా సూర్యాంశుసంతప్తో హిమవాన్ ప్రస్రుతో హిమమ్। 18

ధ్యాననిర్దరశైలేన వినిశ్శ్వసితధాతునా।
దైన్యపాదపసంఘేన శోకాయాసాధిశృంగిణా। 19

"ఓ నిషాదరాజా! అట్టి దుష్కాలము (శ్రీరామునకు అపకారము చేయు సంకల్పము కలుగునట్టి దుష్కాలము) నాకెప్పుడును తటస్థపడకుండుగాక. నావిషయమున నీవు ఇట్లు శంకించుట ఏమాత్రము తగదు. ఆ రఘువరుడు నాకుజ్యేష్ఠసోదరుడు. ఆయనను నేను తండ్రితో సమానునిగా భావింతును. (9)

ఓగుహుండా! కకుత్స్థవంశజుడైన శ్రీరాముని వనములనుండి అయోధ్యకు తీసికొనివచ్చుటకై వెళ్లుచున్నాను. కనుక నీవు మఱియొక విధముగా తలంపవలసిన పనియేలేదు. నేను పలుకుచున్నది ముమ్మాటికిని సత్యము." (10)

భరతునిమాటలను విని, ఆ గుహుండు పరమానందభరితుడాయెను. మఱల అతడు ఆ ప్రభువుతో సంతోషముగా ఇట్లు పలికెను. (11)

"ఓభరతకుమారా! నిజముగా నీవు ధన్యుడవు. అప్రయత్నముగా ప్రాప్తించిన మహారాజ్యమును త్యజించుటకు సిద్ధపడుచున్నావు. వాస్తవముగా ఈభూమండలమున నీతో సాటియగువాడు ఎవ్వడును లేడు. (12)

ఓభరతా! కష్టాలపాలైన శ్రీరాముని అయోధ్యకు దీసికొని వచ్చుటకు అభిలషించుచున్నావు. దీనివలన నీకీర్తి చిరస్థాయిగా నుండును." (13)

ఈవిధముగా గుహుండు భరతునితో సంభాషించుచుండగా సూర్యుడు అస్తమించెను. చీకట్లు అలముకొనెను. (14)

శుభలక్షణసంపన్నుడైన భరతుడు గుహునిసమాగమముతో సంతుష్టుడై, తనసేనకు విశ్రమించుటకై ఆజ్ఞయిచ్చెను. పిదప అతడు శత్రుఘ్నునితోగూడి మఱల తనశిబిరమునకుచేరెను. (15)

భరతుడు ధర్మనిరతుడు. సహజముగా శోకము అట్టి మహాత్ముని తాకుటయు అసంభవము. ఐనప్పటికిని శ్రీరామునకు సంభవించిన ఆపదముగూర్చి ఆలోచించుటచే అతనిమనస్సు అంతులేని దుఃఖమునకు గుఱియాయెను. (16)

కాఱుచిచ్చుచే మోడువాఱినవృక్షమును దానిలోపల ఉన్న అగ్ని (కోటరాగ్ని) దానిని ఇంకను తప్తమొనర్చును. అట్లే దశరథుని మృతిచే దుఃఖమగ్నుడైయున్న భరతుని శ్రీరామునివియోగాగ్ని ఇంకను శోకమునకు గుఱిచేసెను. (17)

సూర్యకిరణములవేడివలన హిమవత్పర్వతముమీది మంచు కఱిగి నీరుగా ప్రవహించినట్లు, భరతుని శోకాగ్నికారణముగా అతని అన్నిఅవయవములనుండియు స్వేదము ధారలుగట్టెను. (18)

కైకేయీసుతుడైన భరతుడు అంతులేని దుఃఖమనెడి పర్వతముతో ఆక్రమింపబడియుండెను. ఈ దుఃఖపర్వతము శ్రీరాముని గూర్చిన నిరంతరధ్యానము అనెడి కఠినమైన శిలలతోగూడినది, నిట్టూర్పులనెడి గైరికాది ధాతువులతో నెలసిల్లునది, దైన్యమనెడి వృక్షములతో నిండినది. శోకము, ఆయాసము, మనస్తాపము అనెడి శిఖరములతో

ప్రమోహానంతసత్త్వేన సంతాపౌషధివేణునా।
ఆక్రాంతో దుఃఖశైలేన మహతా కైకయీసుతః। 20

వినిశ్శ్వసన్ వై భృశదుర్మనాస్తతః
ప్రమూఢసంజ్ఞః పరమాపదం గతః।
శమం న లేభే హృదయజ్వరార్దితో
నరర్షభో యూథగతో(1) యథర్షభః। 21

గుహేన సార్ధం భరతః సమాగతో
మహానుభావః సజనః సమాహితః।
సుదుర్మనాస్తం భరతం తదా పునః
గుహః సమాశ్వాసయదగ్రజం ప్రతి। 22

ఒప్పునది, ప్రమోహమనెడి జంతుజాలములతో ఒప్పారునది, అంతరింద్రియముల, బాహ్యేంద్రియముల సంతాపములనెడి ఓషధులతో, వెదుళ్లతో రాజిల్లునది. (19-20)

నరశ్రేష్ఠుడైన భరతుడు దిక్కుతోచనివాడై నిట్టూర్పులు విడుచుచుండెను, అతనిమనస్సు మిక్కిలి కలవరపాటునకు లోనయ్యెను. అతడు ఏమియుచేయలేని అవస్థలో మునిగిపోయెను. మనస్తాప ప్రభావమున అతడు ప్రశాంతికి దూరమాయెను. అప్పటి అతనిమానసికస్థితి తనగుంపునుండి వేఱైన వృషభమువలె నుండెను. (21)

మహానుభావుడైన భరతుడు ఏకాగ్రచిత్తుడై, (రామధ్యాన పరాయణుడై) పరివారసహితుడై గుహునితోఁగలిసెను. ఇంకను అతడు శ్రీరామునివలనైన శోకమునుండి బయటపడలేకయుండెను. అట్టిస్థితిలో తనకంటె చిన్నవాడైన భరతుని గుహుడు పలువిధముల ఓదార్చెను. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచాశీతితమస్సర్గః (85)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదిఐదవసర్గము సమాప్తము

-- * * * --

86. ఎనుబదిఆఱవసర్గము

శ్రీరామునిపై లక్ష్మణునకుగల భక్తిభావమునుగూర్చి గుహుడు భరతునకు వివరించుట.

ఆచచక్షేఽథ సద్భావం లక్ష్మణస్య మహాత్మనః।
భరతాయాప్రమేయాయ గుహో గహనగోచరః। 1

తం జాగ్రతం గుణైర్యుక్తం శరచాపాసిధారిణమ్।
భ్రాతృగుప్త్యర్థమత్యంతమ్ అహం లక్ష్మణమబ్రువమ్। 2

ఇయం తాత! సుఖా శయ్యా త్వదర్థముపకల్పితా।
ప్రత్యాశ్వసిహి శేష్వాస్యాం సుఖం రాఘవనందన!। 3

ఉచితోఽయం జనః సర్వో దుఃఖానాం త్వం సుఖోచితః।
ధర్మాత్మన్! తస్య గుప్త్యర్థం జాగరిష్యామహే వయమ్। 4

న హి రామాత్ ప్రియతరో మమాస్తి భువి కశ్చన।
మోత్సుకోఽభూః బ్రవీమ్యేతత్ అప్యసత్యం తవాగ్రతః। 5

అస్య ప్రసాదాదాశంసే లోకేఽస్మిన్ సుమహద్యశః।
ధర్మావాప్తిం చ విపులామ్ అర్థావాప్తిం చ కేవలామ్। 6

గుహునకు అరణ్యసంచారము ఉగ్గుపాలతోనేర్చిన విద్య. అట్టి నిషాదరాజు మహాత్ముడైన లక్ష్మణునియొక్క ఉత్తమస్వభావమును గూర్చి అప్రమేయుడైన భరతునకు తెలుపదొడంగెను. (1)

"లక్ష్మణుడు తనఅన్నయగు శ్రీరాముని కాపాడుటకై ఒకచేత ధనుర్బాణములను, మఱియొకచేత ఖడ్గమును ధరించుచు మిగుల అప్రమత్తుడైయుండెడివాడు. అతనికి శ్రీరామునియందుగల భక్తి శ్రద్ధలు అపారములు. అట్టి సౌమిత్రితో నేను ఒకప్పుడు ఇట్లు పలికి యుంటిని. (2)

'నాయనా! లక్ష్మణా! నేను నీకొఱకై ఈమెత్తనిశయ్యను సిద్ధపఱచితిని. ఓ రఘునందనా! దీనిపై శయనించి, హాయిగా విశ్రాంతిగైకొనుము. ఓ ధర్మాత్మా! నేనును, నాఅనుచరులును ఎట్టి ఆటుపోట్లకైనను తట్టుకొనగలము. కాని నీవు సుఖములలోనే పుట్టిపెరిగినవాడవు. శ్రీరాముని రక్షణకై నేను మేల్కొనియుందును. (3-4)

స్వామీ! శ్రీరామునిరక్షణవిషయమై నీవు ఎట్టిదిగులును చెందవలదు. ఈజగత్తులో నాకు శ్రీరామునికంటె ప్రియమైనవాడు మఱియొకడు లేనేలేడు. నామాట ముమ్మాటికిని సత్యము. (5)

శ్రీరామునిఅనుగ్రహమువలన ఈలోకమున నాకు కీర్తిప్రతిష్ఠలును, ఐహికములైన ధర్మార్థకామలాభములును, మోక్షప్రాప్తియు కలుగునని ఆశించుచున్నాను. (6)

1) యూథగతః = యూథాత్ నిర్గతః. అయూథగతః = యూథాత్ భ్రష్టః

సోఽహం ప్రియసఖం రామం శయానం సహ సీతయా।
రక్షిష్యామి ధనుష్పాణిః సర్వైః స్వైః జ్ఞాతిభిస్సహ। 7

న హి మేఽవిదితం కించిత్ వనేఽస్మింశ్చరతః సదా।
చతురంగం హ్యపి బలం ప్రసహేమ వయం యుధి। 8

ఏవమస్మాభిరుక్తేన లక్ష్మణేన మహాత్మనా।
అనునీతా వయం సర్వే ధర్మమేవానుపశ్యతా। 9

కథం దాశరథౌ భూమౌ శయానే సహ సీతయా।
శక్యా నిద్రా మయా లబ్ధుం జీవితం వా సుఖాని వా। 10

యో న దేవాసురైః సర్వైః శక్యః ప్రసహితుం యుధి।
తం పశ్య గుహ! సంవిష్టం తృణేషు సహ సీతయా!। 11

మహతా తపసా లబ్ధో వివిధైశ్చ పరిశ్రమైః।
ఏకో దశరథస్యైష పుత్త్రః సదృశలక్షణః। 12

అస్మిన్ ప్రవ్రాజితే రాజా న చిరం వర్తయిష్యతి।
విధవా మేదినీ నూనం క్షిప్రమేవ భవిష్యతి। 13

వినద్య సుమహానాదం శ్రమేణోపరతాః స్త్రియః।
నిర్ఘోషోపరతం నూనమ్ అద్య రాజనివేశనమ్। 14

కౌసల్యా చైవ రాజా చ తథైవ జననీ మమ।
నాశంసే యది జీవేయుః సర్వే తే శర్వరీమిమామ్। 15

జీవేదపి హి మే మాతా శత్రుఘ్నస్యాన్వవేక్షయా।
దుఃఖితా యా తు కౌసల్యా వీరసూర్వినశిష్యతి। 16

అతిక్రాంతమతిక్రాంతమ్ అనవాప్య మనోరథమ్।
రాజ్యే రామమనిక్షిప్య పితా మే వినశిష్యతి। 17

సిద్ధార్థాః పితరం వృత్తం తస్మిన్ కాలే హ్యుపస్థితే।
ప్రేతకార్యేషు సర్వేషు సంస్కరిష్యంతి భూమిపమ్। 18

అట్టి నేను ధనుర్బాణములను ధరించినవాడనై నా అనుచరులందఱితో గూడి, నాకు ప్రియమిత్రుడును, సీతాదేవితోగూడి శయనించియున్న వాడును అగు ఆ రామచంద్రుని అన్నివిధములుగా రక్షించుచుండెదను. (7)

ఈ పరిసరారణ్యములలో నేనెల్లప్పుడును సంచరించుచుందును. కనుక ఈ అడవిదారులన్నియును నాకు కొట్టినపిండి. యుద్ధమే తటస్థించినచో చతురంగబలములనుసైతము ఒక్కుమ్మడిగా మేము ఎదుర్కొనగలము.' (8)

నేను ఇట్లు పలికిన పిమ్మట మహాత్ముడును, ధర్మనిరతుడును ఐన లక్ష్మణుడు మాకందఱికిని నచ్చజెప్పుచు మాతో ఇట్లనుడివెను. (9)

'ఓ నిషాదరాజా! సీతాదేవితోగూడి శ్రీరాముడు నేలపై శయనించి యుండగా నాకు నిద్రయెట్లువచ్చును? అన్నపానాదులు ఎట్లు రుచించును? సుఖభోగముల ఆలోచనలుసైతము ఎట్లుకల్గును? (10)

ఓ గుహుడా! దేవాసురులు అందఱు కలిసివచ్చినను యుద్ధమున శ్రీరాముని ఎదుర్కొనజాలరు. అట్టి మహావీరుడు సీతాదేవితో గూడి తృణశయ్యపై పరుండియున్నాడు-చూడుము. (11)

మహాతపస్సులకు ఫలముగా, వివిధములగు పెక్కు యజ్ఞయాగాదులను నిర్వహించినకారణముగా, దశరథమహారాజునకు తనకుసాటిరాగల మహాపురుషలక్షణములు గల శ్రీరాముడు జ్యేష్ఠపుత్త్రుడుగా లభించినాడు. అట్టి ఈ రాముడు వనములకు చేరుటవలన ఆ మహారాజు ఇంక ఎంతోకాలముజీవింపజాలడు. ఫలితముగా ఈ కోసలదేశము అతిత్వరలో అనాథయగునని నేను తలంచుచున్నాను. (12-13)

ఓ నిషాదరాజా! అంతఃపురస్త్రీలు నిశ్చయముగా బిగ్గఱగా ఏడ్చియేడ్చి, అలసిపోయి, వారు తమ ఏడ్పులను మానియుందురు. ఇప్పుడు నిజముగా ఆ రాజభవనమునందు ఆ హాహాకారధ్వనులన్నియును ఆగిపోయియుండును. దశరథమహారాజు, కౌసల్యామాతయు మాతల్లియైన సుమిత్రాదేవియు ఈ రాత్రివఱకైనను జీవించి యుందురో లేదో నేను చెప్పజాలను. మాతల్లియైన సుమిత్రాదేవి మాత్రము శత్రుఘ్నుని చూచుకొనుటకైనను జీవించియుండుట సంభవము కావచ్చును. కాని! వీరమాతయైన కౌసల్యాదేవిమాత్రము పుత్త్రశోకముతో కృశించి కృశించి తనువు చాలించుట తథ్యము. (14-16)

మహారాజునకు 'శ్రీరాముని పట్టాభిషిక్తుని'ని జేయవలయును అను తీవ్రమైన అభిలాషయుండెడిది. అది నెఱవేఱకపోవుటచే ఆయన 'అయ్యో! నేననుకొనినదంతయును తలక్రిందులైనది.' అని విలపించుచు ప్రాణములను కోల్పోయియుండును. (17)

మహారాజు మరణించుటయే సంభవించినచో ఆ సమయమున అచటనుండి ఆయనకు అంత్యక్రియలను, ఇతర సంస్కారములను భరతశత్రుఘ్నులు మొదలగువారు నిర్వహింతురు. నిజముగా వారే ధన్యాత్ములు. (18)

రమ్యచత్వరసంస్థానాం సువిభక్తమహాపథామ్।
హర్మ్యప్రాసాదసంపన్నాం సర్వరత్నవిభూషితామ్॥ 19

గజాశ్వరథసంబాధాం తూర్యనాదవినాదితామ్।
సర్వకల్యాణసంపూర్ణాం హృష్టపుష్టజనాకులామ్॥ 20

ఆరామోద్యానసంపూర్ణాం సమాజోత్సవశాలినీమ్।
సుఖితా విచరిష్యంతి రాజధానీం పితుర్మమ॥ 21

అపి సత్యప్రతిజ్ఞేన సార్ధం కుశలినా వయమ్।
నివృత్తే సమయే హ్యస్మిన్ సుఖితాః ప్రవిశేమ హి॥ 22

పరిదేవయమానస్య తస్యైవం సుమహాత్మనః।
తిష్ఠతో రాజపుత్రస్య శర్వరీ సాఽత్యవర్తత॥ 23

ప్రభాతే విమలే సూర్యే కారయిత్వా జటా ఉభౌ।
అస్మిన్ భాగీరథీతీరే సుఖం సంతారితౌ మయా॥ 24

జటాధరౌ తౌ ద్రుమచీరవాససౌ
మహాబలౌ కుంజరయూథపోపమౌ।
వరేషుచాపాసిధరౌ పరంతపౌ
వ్యవేక్షమాణౌ సహ సీతయా గతౌ॥ 25

ఓ నిషాదరాజా! మాతండ్రిగారు బ్రతికియున్నచో మా అయోధ్యా నగరవైభవము వర్ణనాతీతముగానుండును. ఆనగరమునందలి ఇండ్లముంగిళ్లన్నియును చూడముచ్చటగొల్పుచుండును. అందలి రాజమార్గములన్నియును వేర్వేఱుగా చక్కగా ఏర్పాటు చేయబడియుండును. అచటి సంపన్నులహర్మ్యములును, దేవమందిరములును, రాజప్రాసాదములును కనువిందుగావించు చుండును. ఆనగరము వివిధములగు రత్నతోరణములతోడను, అమూల్యములగు శ్రేష్ఠవస్తువులతోడను అలంకృతమైయుండును. అది గజయూథములతోడను, అశ్వసమూహములతోడను, రథపంక్తులతోడను నిరంతరము క్రిక్కిరిసియుండును. అందు తూర్యములు మున్నగు వాద్యములనాదములు ప్రతిధ్వనించుచుండును. నృత్యగీతాది వినోదకార్యక్రమములు జరుగుచుండును. ఆనగరము మంగళకరములైన వస్తువులతో విరాజిల్లుచు దర్శనీయముగా నుండును. ప్రజలందఱును బలిష్ఠులై ఆయురారోగ్యములతో వర్ధిల్లుచుందురు. అందలి పుష్పవాటికలు, ఉపవనములు, ఉద్యానవనములు సుసంపన్నములై కలకలలాడుచుండును. నిత్యమూ నిర్వహింపబడుచుండెడి సామాజికములైన ఉత్సవములును, ఊరేగింపులును మానసోల్లాసమును గూర్చుచుండును. ఆ మహారాజుగారిపర్యవేక్షణలో ఆనగరపౌరులందఱును అందు సుఖశాంతులతో హాయిగా సంచరించుచుందురు. (19-21)

శ్రీరాముడు వనవాసదీక్షను ముగించుకొని, క్షేమముగా తిరిగి వెళ్లునప్పుడు మేము ఆయనతోగూడి సుఖముగా అయోధ్యలో ప్రవేశింపగలమా?' (22)

రాజకుమారుడును, మహాత్ముడునువైన ఆలక్ష్మణుడు ఈవిధముగా చింతించుచుండగనే ఆరాత్రియంతయుగడచిపోయెను. (23)

సూర్యుడు ఉదయింపగానే ప్రాతఃకాలమున ఈగంగాతీరమునందు మఱ్ఱిపాలతో రామలక్ష్మణులకు జటలను ఏర్పాటుచేయించి, నేను వారిని ఈనదిని దాటించితిని. (24)

జటాధారులును, వల్కలములను ధరించినవారును, మిక్కిలి బలశాలురును, శత్రుసంహారకులును ఐన రామలక్ష్మణులు రెండు భద్రగజములవలె శోభిల్లుచుండిరి. పిమ్మట మేలైన ధనుర్బాణములను, ఖడ్గములను ధరించి, సీతాదేవితోగూడి వారు సావధానముగా ముందునకుసాగిరి." (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షడశీతితమస్సర్గః (86)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదిఆఱవసర్గము సమాప్తము

-- * * * --

87. ఎనుబదియేడవసర్గము

సీతారామలక్ష్మణులు వనవాసదీక్షను స్వీకరించినతీరును విని భరతుడు దుఃఖితుడై మూర్ఛిల్లుట. కౌసల్యాదిమాతలు ఆయనను ఓదార్చుట - గంగాతీరమున గారచెట్టుక్రింద సీతారామలక్ష్మణులు ఒక రాత్రిని గడపిన విధానమును గుహుడు భరతునకు వివరించుట.

గుహస్య వచనం శ్రుత్వా భరతో భృశమప్రియమ్।
ధ్యానం జగామ తత్రైవ యత్ర తచ్ఛ్రుతమప్రియమ్॥ 1

శ్రీరాముడు జటాధారియగుట, నారచీరలను ధరించుట మున్నగు అప్రియవచనములను గుహునివలనవిని, భరతుడు మిగుల చింతాక్రాంతుడాయెను. పూర్తిగా వనవాసదీక్షను చేపట్టిన సత్యవ్రతుడగు శ్రీరాముడు తనవిన్నపమును మన్నించునా? అయోధ్యకు మరలివచ్చునా? అను సంశయములోపడి, అతడు మిగుల దిగులుచెందెను. (1)

సుకుమారో మహాసత్త్వః సింహస్కంధో మహాభుజః।
పుండరీకవిశాలాక్షః తరుణః ప్రియదర్శనః॥ 2

ప్రత్యాశ్వస్య ముహూర్తం తు కాలం పరమదుర్మనాః।
పపాత సహసా తోత్రైః హృద్యతివిద్ధ ఇవ ద్విపః॥ 3

భరతుడు సుకుమారుడేయైనను మహాబలశాలి, సింహముతో సమానమైన మూపును, బలిష్ఠములైన భుజములును గలవాడు, వికసించిన కమలములవలె విశాలములైన నేత్రములుగల యువకుడు, సుందరుడు. అట్టి భరతుడు క్షణకాలము తేరుకొనియుండి, వెంటనే తీవ్రమైన మనస్తాపమునకు గురియై, అంకుశముతో పొడువబడిన ఏనుగువలె వ్యథితుడై మూర్ఛితుడాయెను. (నేలపైబడెను.) (2-3)

తదవస్థం తు భరతం శత్రుఘ్నోఽనంతరస్థితః।
పరిష్వజ్య రురోదోచ్చైః విసంజ్ఞః శోకకర్శితః॥ 4

అంతట భరతునకు ప్రక్కనేయున్న శత్రుఘ్నుడు అతనిపరిస్థితిని గమనించి, వెంటనే అతనిని హృదయమునకు హత్తుకొని, బిగ్గరగా ఏడ్చుచు, శోకాతిరేకముతో స్పృహను కోల్పోయెను. (4)

తతః సర్వాః సమాపేతుః మాతరో భరతస్య తాః।
ఉపవాసకృశా దీనా భర్తృవ్యసనకర్శితాః॥ 5

తాశ్చ తం పతితం భూమౌ రుదంత్యః పర్యవారయన్।
కౌసల్యా త్వనుసృత్యైనం దుర్మనాః పరిషస్వజే॥ 6

పిమ్మట భరతునితల్లులందఱును అచటికి వచ్చిరి. వారు పతివియోగదుఃఖములకు లోనైయుండిరి. ఉపవాసములచే కృశించి, దైన్యముతోనుండిరి. వారందఱును భూమిపైపడియున్న భరతుని చుట్టుముట్టిరి, ఏడువసాగిరి. కౌసల్యహృదయముమాత్రము తీవ్రదుఃఖముతో నిండిపోయెను. అప్పుడు ఆమె మిక్కిలివేదనగాచేరి, అతనిని అక్కునచేర్చుకొనెను. (5-6)

వత్సలా స్వం యథా వత్సమ్ ఉపగూహ్య తపస్వినీ।
పరిపప్రచ్ఛ భరతం రుదంతీ శోకలాలసా॥ 7

లేగదూడపై మిగులుగొన్న ఆవు దానికడకుచేరి, ప్రేమతోనాకినట్లు మిక్కిలి పరితపించియున్న కౌసల్యాదేవి శోకమగ్నయై ఏడ్చుచు భరతునితో ఇట్లనుడివెను. (7)

పుత్ర! వ్యాధిర్న తే కచ్చిత్ శరీరం పరిబాధతే।
అద్య రాజకులస్యాస్య త్వదధీనం హి జీవితమ్॥ 8

త్వాం దృష్ట్వా పుత్ర! జీవామి రామే సభ్రాతృకే గతే।
వృత్తే దశరథే రాజ్ఞి నాథ ఏకస్త్వమద్య నః॥ 9

"నాయనా! భరతా! ఇంతలోనే ఇట్లైతివేమి? నీకు ఏమైనను అనారోగ్యబాధ ఏర్పడలేదుగదా? ఈ ఇక్ష్వాకురాజవంశముయొక్క మనుగడ అంతయు నేడు నీమీదనే ఆధారపడియున్నది. కుమారా! శ్రీరాముడు లక్ష్మణునితో వనమునకేగెను. దశరథమహారాజు మృత్యుముఖమున చేరెను. ఇక ఇప్పుడు నీవు ఒక్కడవే మాకు దిక్కు. నిన్నుజూచుకొని నేను ప్రాణములను నిక్కబట్టుకొనియున్నాను. (8-9)

కచ్చిన్న లక్ష్మణే పుత్ర! శ్రుతం తే కించిదప్రియమ్।
పుత్రే వా హ్యేకపుత్రాయాః సహభార్యే వనం గతే॥ 10

ఓపుత్రా! లక్ష్మణునివిషయమునగాని, భార్యతోగూడి వనములకేగిన నాయేకైకకుమారుడగు శ్రీరామునివిషయమునగాని ఏదైనను ఒక అప్రియసమాచారమును వింటివా? (10)

స ముహూర్తం సమాశ్వస్య రుదన్నేవ మహాయశాః।
కౌసల్యాం పరిసాంత్వ్యేదం గుహం వచనమబ్రవీత్॥ 11

అంతట మహాయశస్వియైన భరతుడు ఒక క్షణకాలముపాటు తన్నుతాను తమాయించుకొని, ఏడ్చుచునే, 'అమ్మా! దిగులుచెందకుము. నేనట్టి అప్రియవార్తను వినలేదు' అని పలికి, కౌసల్యాదేవిని ఊరడించెను. అనంతరము అతడు నిషాదరాజైన గుహుని ఇట్లడిగెను. (11)

భ్రాతా మే క్వావసద్రాత్రౌ క్వ సీతా క్వచ లక్ష్మణః।
అస్వపచ్ఛయనే కస్మిన్ కిం భుక్త్వా గుహ! శంస మే। 12

సోఽబ్రవీద్భరతం హృష్టో నిషాదాధిపతిర్గుహః।
యద్విధం ప్రతిపేదే చ రామే ప్రియహితేఽతిథౌ। 13

అన్నముచ్చావచం భక్ష్యాః ఫలాని వివిధాని చ।
రామాయాభ్యవహారార్థం బహుచోపహృతం మయా। 14

తత్ సర్వం ప్రత్యనుజ్ఞాసీత్ రామఃసత్యపరాక్రమః।
న తు తత్ప్రత్యగృహ్ణాత్ స క్షత్రధర్మమనుస్మరన్। 15

న హ్యస్మాభిః ప్రతిగ్రాహ్యం సఖే! దేయం తు సర్వదా।
ఇతి తేన వయం రాజన్ అనునీతా మహాత్మనా। 16

లక్ష్మణేన సమానీతం పీత్వా వారి మహాయశాః।
ఔపవాస్యం తదాఽకార్షీత్ రాఘవః సహ సీతయా। 17

తతస్తు జలశేషేణ లక్ష్మణోఽప్యకరోత్ తదా।
వాగ్యతాస్తే త్రయః సంధ్యాం సముపాసత సంహితాః। 18

సౌమిత్రిస్తు తతః పశ్చాత్ అకరోత్ స్వాస్తరం శుభమ్।
స్వయమానీయ బర్హీంషి క్షిప్రం రాఘవకారణాత్। 19

తస్మిన్ సమావిశద్రామః స్వాస్తరే సహ సీతయా।
ప్రక్షాళ్య చ తయోః పాదౌ అపచక్రామ లక్ష్మణః। 20

ఏతత్ తదింగుదీమూలమ్ ఇదమేవ చ తత్ తృణమ్।
యస్మిన్ రామశ్చ సీతా చ రాత్రిం తాం శయితావుభౌ। 21

నియమ్య పృష్ఠే తు తలాంగుళిత్రవాన్
శరైః సుపూర్ణామిషుధీ పరంతపః।
మహద్ధనుః సజ్యముపోహ్య లక్ష్మణో
నిశామతిష్ఠత్ పరితోఽస్య కేవలమ్। 22

తత స్త్వహం చోత్తమచాపబాణధృత్
స్థితోఽభవం తత్ర స యత్ర లక్ష్మణః।
అతంద్రిభిర్జ్ఞాతిభిరాత్తకార్ముకైః
మహేంద్రకల్పం పరిపాలయంస్తదా। 23

"ఓ గుహుండా! ఆరాత్రివేళ మాఅన్నయగు శ్రీరాముడును, వదినె సీతాదేవియు, సోదరుడు లక్ష్మణుడును ఎక్కడ నివసించిరి? వారు భుజించిన ఆహారమేమి? ఏట్టిశయ్యపై నిద్రించిరి? వీటినన్నింటిని నాకు వివరముగా తెలుపుము." (12)

అప్పుడు నిషాదాధిపతియైన గుహుడు మిక్కిలి సంతసించినవాడై, తనకు ఎంతయు హితుడును, అతిథియు ఐన శ్రీరామునకు తాను ఒనగూర్చిన అతిథిమర్యాదలను గూర్చి భరతునకు ఇట్లు తెలిపెను. (13)

'అయ్యా! పలువిధములగు అన్నములను, వివిధములగు అపూపాది భక్ష్యములను, నానావిధఫలములను, శ్రీరామునకు భోజనార్థము సమృద్ధిగా సమకూర్చితిని. సత్యపరాక్రముడైన శ్రీరాముడు వాటినన్నింటిని ప్రేమతో ఆదరించెనుగాని, క్షత్రియధర్మమును అనుసరించి, వాటిలో దేనినీ స్వీకరింపలేదు. ఓరాజా! పిమ్మట ఆమహానుభావుడు 'మిత్రమా! మావంటి క్షత్రియులు ఇతరులకు ఇచ్చెదరేగాని, ఎవరినుండియు, ఏవస్తువునూ స్వీకరింపరు'-అని పలికి మాకు నచ్చజెప్పెను. (14-16)

పిమ్మట లక్ష్మణుడు తీసికొనివచ్చిన జలములనుమాత్రమే స్వీకరించి, సీతారాములు ఆరాత్రిని ఉపవాసముతో గడిపిరి. సీతారాములు త్రాగగా మిగిలిన జలములను పుచ్చుకొని, లక్ష్మణుడును ఉపవసించెను. జలములను త్రాగుటకుముందే ఆముగ్గురును మౌనముగా ఏకాగ్రచిత్తులై సంధ్యోపాసనగావించిరి. ఆపిమ్మట సౌమిత్రి వెంటనే స్వయముగా కుశలనుదెచ్చికొని వచ్చి, వాటితో శ్రీరామునికొఱకై పవిత్రమైన ఒక చక్కనిశయ్యను ఏర్పాటుచేసెను. (17-19)

పిదప లక్ష్మణుడు స్వయముగా శ్రీరాముని పాదములనుకడిగెను. అనంతరము సీతాదేవి తనపాదములను కడుగుకొనుచుండగా అతడు ఆమెపాదములపై జలములనుంచెను. అంతట శ్రీరాముడు సీతాదేవితోగూడి ఆ చక్కని శయ్యపై శయనించెను, లక్ష్మణుడు వారికి కొంచెముదూరముగావెళ్లి, అచటనిలబడెను. సీతారాములు ఇరువురును ఇదిగో! ఈ గారచెట్టుక్రిందనే ఈ తృణశయ్యపైననే ఆ రాత్రి పరుండిరి. (20-21)

శత్రుదమనుడైన లక్ష్మణుడు చేతులకును, వ్రేళ్లకును రక్షణకవచములను, వీపుభాగమున ఇరువైపులబాణములతో నిండిన అమ్ములపొదులను ధరించెను. అతడు అల్లెత్రాడును సంధించిన మహాధనుస్సును చేతబట్టుకొని, ఆరాత్రియంతయు వారిరక్షణార్థము ప్రదక్షిణపూర్వకముగా చుట్టును తిరుగుచుండెను. పిమ్మట మహేంద్రునితో సమానుడగు శ్రీరామునియొక్క రక్షణకార్యమున నేను మేలైనధనుర్బాణములను ధరించి, లక్ష్మణునకు తోడుగా ఉంటిని, నాఅనుచరులును విల్లంబులను చేబూని, అప్రమత్తులై మాకు బాసటగా నిలిచిరి. (22-23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తాశీతితమస్సర్గః (87)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదిఏడవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

88. ఎనుబదిఎనిమిదవసర్గము

మహారాజసుఖములకు అర్హులైన సీతారాములు కటికినేలమీద, తృణశయ్యపై శయనించినారని విని, భరతుడు మిగుల ఖిన్నుడగుట.

తచ్ఛ్రుత్వా నిపుణం సర్వం భరతః సహ మంత్రిభిః।
ఇంగుదీమూలమాగమ్య రామశయ్యామవేక్ష్య తామ్। 1

అబ్రవీజ్జననీః సర్వా ఇహ తేన మహాత్మనా।
శర్వరీ శయితా భూమౌ ఇదమస్య విమర్దితమ్। 2

మహాభాగకులీనేన మహాభాగేన ధీమతా।
జాతో దశరథేనోర్వ్యాం న రామః స్వప్తుమర్హతి। 3

అజినోత్తరసంస్తీర్ణే వరాస్తరణసంచయే।
శయిత్వా పురుషవ్యాఘ్రః కథం శేతే మహీతలే। 4

ప్రాసాదాగ్రవిమానేషు వలభీషు చ సర్వదా।
హైమరాజతభౌమేషు వరాస్తరణశాలిషు। 5

పుష్పసంచయచిత్రేషు చందనాగరుగంధిషు।
పాండురాభ్రప్రకాశేషు శుకసంఘరుతేషు చ। 6

ప్రాసాదవరవర్యేషు శీతవత్సు సుగంధిషు।
ఉషిత్వా మేరుకల్పేషు కృతకాంచనభిత్తిషు। 7

గీతవాదిత్రనిర్ఘోషైః వరాభరణనిస్స్వనైః।
మృదంగవరశబ్దైశ్చ సతతం ప్రతిబోధితః। 8

వందిభిర్వందితః కాలే బహుభిః సూతమాగధైః।
గాథాభిరనురూపాభిః స్తుతిభిశ్చ పరంతపః। 9

అశ్రద్ధేయమిదం లోకే న సత్యం ప్రతిభాతి మా।
ముహ్యతే ఖలు మే భావః స్వప్నోఽయమితి మే మతిః। 10

గుహుడు పలికిన వచనములను అన్నింటిని భరతుడు సావధానముగా విని, మంత్రులతోగూడి, గారచెట్టుకడకువెళ్లి, శ్రీరాముడు పరుండిన ఆశయ్యను దర్శించి, అతడు తన తల్లులందఱితో ఇట్లు నుడివెను. "ఆమహానుభావుడు ఆరాత్రి పరుండిన ప్రదేశము ఇదియే. ఇవి ఆయన శయనింపగా ఆ శయ్యపై ఏర్పడిన గుర్తులు." (1-2)

దశరథమహారాజు వాసిగాంచిన ఇక్ష్వాకురాజవంశమున జన్మించినవాడు, మహానుభావుడు, ప్రజ్ఞాశాలి, అట్టి ప్రభువునకు పుత్త్రుడైన శ్రీరాముడు ఈ కటికినేలపై పరుండుట ఏమాత్రమును తగదు. (3)

సుకుమారమైన పరుపులపై మిక్కిలి మృదువైన జింకచర్మముల ఆస్తరణములతో కప్పబడిన మేలైన తల్పములపై హాయిగా శయనించిన ఆ నరశ్రేష్ఠుడు ఈనేలపై ఎట్లు పరుండెనోగదా? (4)

శ్రీరాముడు శయనించిన తల్పములు, విహరించిన ప్రాసాదములు అత్యద్భుతములు, సకలసుఖోచితములు, నిరుపమానములు. ఆప్రాసాదముల పైభాగమునగల శ్రేష్ఠములైన భవనములయందును. అట్టాలికలయందును ఎల్లప్పుడును అతడు శయనించువాడు. ఆ భవనముల భూభాగములు వెండిబంగారములతో నిర్మితములైనవి. అందలి శయ్యలు మిగులమృదువైనవి, శ్రేష్ఠమైనవి. అందు అలంకృతములైన రంగురంగుల పూవులు ఆ భవనములకు విచిత్రశోభలను సంతరించుచుండును. నిరంతరము అచట చందనాగరుపరిమళములు గుబాళించుచుండును. అవి తెల్లని మేఘములవలె స్వచ్ఛములైన కాంతులను వెదజల్లుచుండును. చిలుకలకలకలారావములు వినసొంపుగానుండును. అవి చల్లదనమును గూర్చుచు కర్పూరవాసనలను ప్రసరింపజేయుచుండును. అవి బంగారుగోడలతో మేరుపర్వతమువలె మహోన్నతములై అలరారుచుండును. (5-7)

కమ్మని సంగీతస్వరములతోడను, శ్రావ్యములైన వీణావేణు నాదములతోడను, పరిచారికలయొక్క కాలియందెల రవళులచేతను కరకంకణములరవములచేతను, ఆభరణములసవ్వడులతోడను, చెవులకింపైన మృదంగములలయవిన్యాసములతోడను అతడు నిద్రనుండి మేల్కొనుచుండువాడు. అతడు మేల్కొను సమయమున వందిగణములు స్తుతించుచుండెడివి. సూతులు మాగధులు సమయమునకు తగిన కథలను, గాథలను వినిపించుచుండెడివారు. అట్టి సుఖవైభవములలో ఓలలాడిన శ్రీరాముడు ఈకటికినేలపై పరుండుట ఎంతటి బాధాకరము? (8-9)

అట్టి మహానుభావుడైన శ్రీరాముడు ఇట్లు ఇక్కట్లపాలగుట లోకమున నమ్మదగిన విషయమేగాదు. ఇది నాకు సత్యముగా తోచుటలేదు. నేను దిగ్భ్రాంతికి గుఱియైతినోయేమో? దీనిని నేను ఒక కలగా తలంతును. (10)

న నూనం దైవతం కించిత్ కాలేన బలవత్తరమ్।
యత్ర దాశరథీ రామో భూమావేవ శయీత సః। 11

దశరథమహారాజకుమారుడైన శ్రీరామునియంతటివాడు ఇట్టికటిక నేలపై పరుండుటనుబట్టి చూడగా నిజముగా కాలమే బలవత్తరమైనది, దానికిమించిన దైవము మఱియొకటిలేదనుట స్పష్టము. (11)

విదేహరాజస్య సుతా సీతా చ ప్రియదర్శనా।
దయితా శయితా భూమౌ స్నుషా దశరథస్య చ। 12

జనకమహారాజుగారాలపట్టియు, దశరథమహారాజుకోడలును, శ్రీరామునిప్రియపత్నియు ఐన సుకుమారియగు సీతాదేవి ఈనేలపై పరుండవలసివచ్చుట ఆ కాలప్రభావముచేతనేగదా! (12)

ఇయం శయ్యా మమ భ్రాతుః ఇదం హి పరివర్తితమ్।
స్థండిలే కఠినే సర్వం గాత్రైః విమృదితం తృణమ్। 13

మాఅన్న శ్రీరాముడు పండుకొనినశయ్య ఇదియే. విశ్రాంతికై ఆయన పండుకొనినప్పుడు అటునిటు పొర్లిన గుర్తులు ఇదిగో ఇవియే. ఈకఠినభూమిపై ఆయన శయనింపగా ఆయన శరీరముయొక్క ఒత్తిడికి నలిగిపోయిన తృణములు ఇచటనే పడియున్నవి. (13)

మన్యే సాభరణా సుప్తా సీతాఽస్మిన్ శయనోత్తమే।
తత్ర తత్ర హి దృశ్యంతే సక్తాః కనకబిందవః। 14

ఇచట అక్కడక్కడ బంగారుకణములు అంటుకొనియున్నవి. దానినిబట్టి చూచినచో ఆభరణములతోనున్న సీతాదేవి ఈపవిత్ర శయ్యపై పరుండియున్నట్లు తలంతును. (14)

ఉత్తరీయమిహాఽఽసక్తం సువ్యక్తం సీతయా తదా।
తథా హ్యేతే ప్రకాశంతే సక్తాః కౌశేయతంతవః। 15

ఈకుశలలో అక్కడక్కడ కొన్నిపట్టుదారములు చిక్కుకొని మిలమిల మెఱయుచున్నవి. ఇవి సీతాదేవి అప్పుడు ధరించిన పట్టు-ఉత్తరీయపు పోగులేయని స్పష్టమగుచున్నది. (15)

మన్యే భర్తుః సుఖా శయ్యా యేన బాలా తపస్వినీ।
సుకుమారీ సతీ దుఃఖం న విజానాతి మైథిలీ। 16

హా హంతాఽస్మి నృశంసోఽహం యత్సభార్యః కృతే మమ।
ఈదృశీం రాఘవః శయ్యామ్ అధిశేతే హ్యనాథవత్। 17

బాలయు, సుకుమారియు, తపస్వినియు, మహాసాధ్వియు ఐన సీతాదేవి ఈకఠినశయ్యపై పరుండినను ఆమెకు కష్టమనిపించి యుండదు. ఏలనన ఏసతియైనను భర్తతోగూడి పరుండినప్పుడు, ఆ శయ్య కఠినముగానున్నను, మృదువుగానున్నను, అది ఆమెకు హాయిగనేయుండును. ఛీ నాబ్రతుకు వ్యర్థము. నేనెంతయుక్రూరుడను. ఏలనన శ్రీరాముడు భార్యతోగూడి దిక్కులేనివానివలె ఇట్టి శయ్యపై పరుండవలసివచ్చుట నాకారణముననేగదా! (16-17)

సార్వభౌమకులే జాతః సర్వలోకస్య సమ్మతః।
సర్వలోకప్రియస్త్యక్త్వా రాజ్యం సుఖమనుత్తమమ్। 18

కథమిందీవరశ్యామో రక్తాక్షః ప్రియదర్శనః।
సుఖభాగీ న దుఃఖార్హః శయితో భువి రాఘవః। 19

శ్రీరాముడు ఒక అసాధారణమహాపురుషుడు. చక్రవర్తుల వంశమున జన్మించినవాడు. సమస్తజనులఆదరాభిమానములను చూరగొన్నవాడు, ఎల్లరకును ఇష్టుడు, శ్యామసుందరగాత్రుడు, ఎఱ్ఱని నేత్రములుగలవాడు. దర్శనీయుడు, సుఖములలో పుట్టిపెరిగినవాడు. దుఃఖమనుమాటనే యెఱుగనివాడు, అట్టి మహాపురుషుడు సర్వ సుఖములకును ఆలవాలమైన ఒక మహారాజ్యమును త్యజించి, అడవుల దారిబట్టి, ఇట్టి కటికనేలపై పరుండుట విధివైపరీత్యము. (18-19)

ధన్యః ఖలు మహాభాగో లక్ష్మణః శుభలక్షణః।
భ్రాతరం విషమే కాలే యో రామమనువర్తతే। 20

శుభలక్షణములుగలవాడును, మహాత్ముడును ఐన లక్ష్మణుడు ఈకష్టకాలమునందు అన్నయగు శ్రీరాముని అనుసరించుచు, ఆయనను సేవించుచున్నాడు. వాస్తవముగా అతడు ఎంతయు ధన్యాత్ముడుగదా! (20)

సిద్ధార్థా ఖలు వైదేహీ పతిం యాఽనుగతా వనమ్।
వయం సంశయితాః సర్వే హీనాస్తేన మహాత్మనా। 21

పతిదేవుని అనుసరించి వనములకువెళ్ళిన వైదేహి నిజముగా ఎంతయుకృతార్థురాలు. మేము ఆయనకు దూరమై సంశయాత్ముల మైతిమి. (మాసేవలను శ్రీరాముడు అంగీకరించునా? లేదా? - అని సంశయమునకులోనైతిమి. (21)

ఆకర్ణధారా పృథివీ శూన్యేవ ప్రతిభాతి మా।
గతే దశరథే స్వర్గం రామే చారణ్యమాశ్రితే। 22

శ్రీరాముడు అడవులపాలైయుండుటవలనను, దశరథమహారాజు పరలోకగతుడగుటచేతను ఈకోసలరాజ్యము సమర్థుడైన పాలకుడులేక దిక్కులేనిదై నాకు శూన్యముగా కన్పించుచున్నది. (22)

న చ ప్రార్థయతే కశ్చిత్ మనసాపి వసుంధరామ్।
వనేఽపి వసతస్తస్య బాహువీర్యాభిరక్షితామ్। 23

శ్రీరాముడు వనములలోనున్నను ఆయనబాహుబలము ఈకోసల రాజ్యమును రక్షించుచున్నంతవఱకును (ఆయన అనుగ్రహము దీనిపై ప్రసరించుచున్నంతవఱకును) ఎవ్వడును మనస్సులోనైనను దీనినిపొందుటకై ఆశపడడు. (దీనివైపు కన్నెత్తియైనను చూడజాలడు). (23)

శూన్యసంవరణారక్షామ్ అయంత్రితహయద్విపామ్।
అపావృతపురద్వారాం రాజధానీమరక్షితామ్। 24

అప్రహృష్టబలాం న్యూనాం విషమస్థామనావృతామ్।
శత్రవో నాభిమన్యంతే భక్ష్యాన్ విషకృతానివ। 25

రాజధానియైన అయోధ్యానగరమునకు సరియగుప్రాకారరక్షణ లేకున్నను, అశ్వములు, గజములు యుద్ధమునకు సిద్ధముగా అదుపుగలిగిలేకయున్నను, పురద్వారములు తెఱవబడియున్నను, సేనలలో హర్షోత్సాహములు కొఱవడినను, రక్షణలోపముచే గడ్డుపరిస్థితులు ఏర్పడినను, నగరమునకు వెలుపల ఎట్టి ఆవరణములు లేకున్నను దీనిపై శ్రీరాముని అనుగ్రహము ఉన్నంత వఱకు విషపూరితములైన భక్ష్యములనువలె శత్రువులు దీనిని కోరుకొనరు. (24-25)

అద్య ప్రభృతి భూమౌ తు శయిష్యేఽహం తృణేషు వా।
ఫలమూలాశనో నిత్యం జటాచీరాణి ధారయన్। 26

తస్యార్థముత్తరం కాలం నివత్స్యామి సుఖం వనే।
తం ప్రతిశ్రవమాముచ్య నాస్య మిథ్యా భవిష్యతి। 27

నేటినుండి నేనును ప్రతిదినము జటావల్కలములనే ధరించెదను. కందమూలఫలములనే ఆహారముగా స్వీకరింతును. నేలపైగాని, తృణశయ్యపైగాని పరుండెదను. శ్రీరామునకు మాఱుగా ఆ వనవాసదీక్షను నేను పాటింతును. ఆ పదునాలుగు సంవత్సరములలో మిగిలినకాలమును నేను వనములలో హాయిగా గడుపుదును. రామునిప్రతిజ్ఞయు వృథాకాదు. (26-27)

వసంతం భ్రాతురర్థాయ శత్రుఘ్నో మాఽనువత్స్యతి।
లక్ష్మణేన సహాత్వార్యో హ్యయోధ్యాం పాలయిష్యతి। 28

అన్నకొఱకై నేను వనవాసముచేయుచున్నప్పుడు శత్రుఘ్నుడును నాకు తోడుగా ఉండును. శ్రీరాముడు లక్ష్మణునితోగూడి అయోధ్యకుచేరి, రాజ్యభారమును నిర్వహించును. (28)

అభిషేక్ష్యంతి కాకుత్స్థమ్ అయోధ్యాయాం ద్విజాతయః।
అపి మే దేవతాః కుర్యుః ఇమం సత్యం మనోరథమ్। 29

అయోధ్యయందు బ్రాహ్మణోత్తములందఱును కకుత్స్థవంశజుడైన శ్రీరాముని పట్టాభిషిక్తుని గావింతురుగాక. ఈ నాకోరికను దేవతలు సఫలముచేయుదురా? (29)

ప్రసాద్యమానః శిరసా మయా స్వయం
బహుప్రకారం యది నాభిపత్స్యతే।
తతోఽనువత్స్యామి చిరాయ రాఘవం
వనే వసన్ నార్హతి మాముపేక్షితుమ్। 30

నా ఈ అభ్యర్థనను మన్నించుటకై శిరసా ప్రణమిల్లి ఆయనను ఎంతగానో వేడుకొందును. నేను ఎన్నివిధములుగా (అయోధ్యకు మఱలిరమ్మని) బ్రతిమాలినను అందులకు ఆయన అంగీకరింపనిచో నేనును ఆయనతోపాటు దీక్షముగియువఱకును వనములలోనేయుందును. అప్పుడాయన నాకోరికను కాదనడు. (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టాశీతితమస్సర్గః (88)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదిఎనిమిదవసర్గము సమాప్తము

— * * * —

89. ఎనుబదితొమ్మిదవసర్గము

భరతుడు గుహుని సహకారముతో సపరివారముగా గంగానదిని దాటుట - పిమ్మట భరద్వాజాశ్రమమునకు చేరుట.

వ్యుష్య రాత్రిం తు తత్రైవ గంగాకూలే స రాఘవః।
భరతః కాల్యముత్థాయ శత్రుఘ్నమిదమబ్రవీత్। 1

రఘువంశజుడైన ఆభరతుడు గంగానదీతీరమునందే (శ్రీరాముడు శయనించినప్రదేశమునందే) ఆరాత్రి గడపి, ఉషఃకాలమునందే మేల్కొని, శత్రుఘ్నునితో ఇట్లనెను. (1)

శత్రుఘ్నోత్తిష్ఠ కిం శేషే నిషాదాధిపతిం గుహమ్।
శీఘ్రమానయ భద్రం తే తారయిష్యతి వాహినీమ్। 2

"ఓ శత్రుఘ్నా! నీకు భద్రమగుగాక, లెమ్ము, ఉషఃకాలమైనది. ఇంకను నిద్రించుచుంటివేల? నిషాదరాజైన గుహుని తీసికొనిరమ్ము. అతడు నావలపై మనసేనను నదిని దాటింపగలడు." (2)

జాగర్మి నాహం స్వపిమి తమేవాఽఽర్యం విచింతయన్।
ఇత్యేవమబ్రవీద్భ్రాత్రా శత్రుఘ్నోఽపి ప్రచోదితః। 3

భరతుడిట్లు పలికిన పిమ్మట సోదరుడగు శత్రుఘ్నుడు, అతనితో 'అన్నా! నేను నిద్రించుటలేదు. నేనును నీవలెనే పూజ్యుడైన శ్రీరాముని స్మరించుచు రాత్రియంతయు మేల్కొనియేయున్నాను.' అని పలికెను. (నిజముగా వీరిభ్రాతృప్రేమ లోకమునకే ఆదర్శప్రాయము.) (3)

ఇతి సంవదతోరేవమ్ అన్యోన్యం నరసింహయోః।
ఆగమ్య ప్రాంజలిః కాలే గుహో భరతమబ్రవీత్। 4

నరశ్రేష్ఠులైన ఆ భరతశత్రుఘ్నులు ఇరువురును ఇట్లు సంభాషించుకొనుచుండగా గుహుడచ్చటికి విచ్చేసి, చేతులు జోడించి, భరతునితో ఇట్లనుడివెను. (4)

కచ్చిత్ సుఖం నదీతీరేఽవాత్సీః కాకుత్స్థ! శర్వరీమ్।
కచ్చిత్ తే సహసైన్యస్య తావత్ సర్వమనామయమ్। 5

"రాజకుమారా! భరతా! ఈగంగాతీరమునందు రాత్రియంతయు మీరు సుఖముగా గడపితిరా? మీకును, మీసేనలకును ఎట్టి ఇబ్బందియు కలుగలేదుగదా! మీరెల్లరును కుశలమేగదా!" (5)

గుహస్య తత్తు వచనం శ్రుత్వా స్నేహాదుదీరితమ్।
రామస్యానువశో వాక్యం భరతోఽపీదమబ్రవీత్। 6

గుహుడు మిక్కిలి ఆదరముతో పలికిన వచనములను విని, శ్రీరామునిధ్యానములో మునిగియున్న భరతుడు అతనితో ఇట్లు పలికెను. (6)

సుఖా నః శర్వరీ రాజన్! పూజితాశ్చాపి తే వయమ్।
గంగాం తు నౌభిర్బహ్వీభిః దాశాః సంతారయంతు నః। 7

"ఓ నిషాదరాజా! ఈరాత్రి మాకు హాయిగానే గడచినది. మీ ఆదరాభిమానములలో మాకుసంతృప్తి కలిగినది. మీనావికులు తగినన్ని నావలద్వారా మాసేనలను నదిని దాటించుటకై ఏర్పాట్లు చేయుదురు." (7)

తతో గుహః సంత్వరితం శ్రుత్వా భరతశాసనమ్।
ప్రతి ప్రవిశ్య నగరం తం జ్ఞాతిజనమబ్రవీత్। 8

భరతునిఆజ్ఞను గుహుడు సావధానముగావినెను. వెంటనే అతడు త్వరత్వరగా మరల శృంగిబేరపురమునకు వెళ్ళి, అచటి తన అనుచరులతో ఇట్లుపలికెను. (8)

ఉత్తిష్ఠత ప్రబుధ్యధ్వం భద్రమస్తు చ వః సదా।
నావః సమనుకర్షధ్వం తారయిష్యామ వాహినీమ్। 9

"ఓ ఆత్మీయులారా! లెండు, సావధానులుకండు. మీకు సర్వదా శుభములు కలుగుగాక. నావలను రేవులకు చేర్చుడు. భరతుని సేనలను గంగానదిఆవలితీరమునకు చేర్చుదము. (9)

తే తథోక్తాః సముత్థాయ త్వరితా రాజశాసనాత్।
పంచనావాం శతాన్యాశు సమానిన్యుః సమంతతః। 10

నిషాదరాజైన గుహునియొక్క ఆజ్ఞలననుసరించి, నావికులందరును వెంటనేలేచి, త్వరత్వరగా ఐదువందలనావలను వరుసగా నదీతీరమున ఒక్కచోటికి చేర్చిరి. (10)

అన్యాః స్వస్తికవిజ్ఞేయా మహాఘంటాధరా వరాః।
శోభమానాః పతాకాభిః యుక్తవాలాః సుసంహతాః। 11

ఇవియేగాక 'స్వస్తికము' అనుపేరుగల మఱికొన్ని నావలు అచటికి చేర్చబడినవి. 'స్వస్తిక' చిహ్నములను కలిగియుండుటవలన వాటికి ఆపేరు వచ్చెను. వాటిని సులభముగా గుర్తింపవచ్చును. ఆ శ్రేష్ఠములైన నౌకలు పతాకములతో శోభిల్లుచుండెను. వాటికి పెద్దపెద్దగంటలను నిర్మించిరి. బంగారుచిత్రములు కలిగియున్నందున అవి చూడముచ్చటగా నుండెను. అనుకూల వాయుప్రసారమునకై అవి గవాక్షములు కలిగియుండెను. ఎట్టి ఆటుపోట్లకైనను తట్టుకొనునట్లుగా అవి దృఢముగా సిద్ధపఱచబడియుండెను. (11)

తతః స్వస్తికవిజ్ఞేయాం పాండుకంబళసంవృతామ్।
సనందిఘోషాం కల్యాణీం గుహో నావముపాహరత్।
తామారురోహ భరతః శత్రుఘ్నశ్చ మహాబలః। 12

అప్పుడు గుహుడు 'స్వస్తిక' నావలలో ఒకదానిని అచటికి తీసికొని వచ్చెను. దానిపై తెల్లని కంబళము కప్పబడియుండెను. అందు ప్రయాణముచేయువారికి ఉల్లాసమునుగూర్చుటకై ఆనావకు చిఱుమువ్వలు కట్టబడియుండెను. అది దర్శనీయముగానుండెను. దానిని మహాబలశాలురైన భరతుడును, శత్రుఘ్నుడును అధిరోహించిరి. (12)

కౌసల్యా చ సుమిత్రా చ యాశ్చాన్యా రాజయోషితః।
పురోహితశ్చ తత్పూర్వం గురవో బ్రాహ్మణాశ్చ యే।
అనంతరం రాజదారాః తథైవ శకటాపణాః। 13

అందఱికంటెను (భరతశత్రుఘ్నులకంటెను) ముందుగా వసిష్ఠాదిగురువులును, తక్కిన బ్రాహ్మణోత్తములును పురోహితుడును నావలపైనెక్కిరి. భరతశత్రుఘ్నులధిరోహించిన పిమ్మట రాజపత్నులైన కౌసల్యయు, సుమిత్రయు, కైకేయియు, ఇతర రాజస్త్రీలును నావలపై చేరిరి. అనంతరము శకటములను, వాణిజ్యవస్తువులను వేర్వేఱు నావలపై ఎక్కించిరి. (13)

ఆవాసమాదీపయతాం తీర్థం చాప్యవగాహతామ్।
భాండాని చాదదానానాం ఘోషస్త్రిదివమస్పృశత్। 14

సైనికులు నదీతీరమున తాము విడిసిన ప్రదేశములకు నిప్పంటించి[1] తమ వస్తువులతో నావలపైకి చేరిరి. కొందఱు నావలను ఎక్కుటకై త్వరత్వరగా రేవులకు చేరుచుండిరి. కొంతమంది తమతమఉపకరణములను 'ఇవినావి, ఇవినావి' అని బిగ్గరగా పలుకుచు వాటితో నావలలో ఎక్కుచుండిరి. అప్పుడు ఏర్పడిన ఆకోలాహలధ్వనులు మిన్నంటుచుండెను. (14)

పతాకిన్యస్తు తా నావః స్వయం దాశైరధిష్ఠితాః।
వహంత్యో జనమారూఢం తదా సంపేతురాశుగాః। 15

నారీణామభిపూర్ణాస్తు కాశ్చిత్ కాశ్చిచ్చ వాజినామ్।
కాశ్చిదత్ర వహంతి స్మ యానయుగ్యం మహాధనమ్। 16

ఆనావలన్నింటిపై పతాకములు రెపరెపలాడుచుండెను. అంతట నావికులును ఆపడవలపై ఎక్కిరి. పిదపవారు జనులతో కిటకిటలాడుచున్న ఆనావలను వేగముగా నడుపసాగిరి. వాటిలో పెక్కునావలు స్త్రీలతోనిండియుండెను. మఱికొన్ని నావలు యుద్ధాశ్వములకే పరిమితములయ్యెను. మఱికొన్నినావలు బండ్లను, రథములను, వాటినిలాగు ఎద్దులను, గుఱ్ఱములను వహించుచుండెను. ఈబండ్లలో అమూల్యములైన రత్నములు మొదలగునవి నింపబడియుండెను. (15-16)

తాః స్మ గత్వా పరం తీరమ్ అవరోప్య చ తం జనమ్।
నివృత్తాః కాండచిత్రాణి క్రియంతే దాశబంధుభిః। 17

క్రమముగా ఆ నావలన్నియును ఆవలితీరమునకు చేరి, జనులను వాహనాదులన్నింటిని అచటదించి, తిరిగివచ్చినవి. ఆ సమయమున నావికులు పడవలతో చిత్రవిచిత్రములైన విన్యాసములను గావించిరి. (17)

సవైజయంతాస్తు గజా గజారోహప్రచోదితాః।
తరంతః స్మ ప్రకాశంతే సధ్వజా ఇవ పర్వతాః। 18

పతాకములతో శోభిల్లుచున్న భద్రగజములు మావటివాండ్ర ప్రేరణతో గంగానదిని దాటినవి. ఆసమయమున అవి ఱెక్కలుగల పర్వతములవలె విరాజిల్లినవి. (18)

1) శత్రువులకు తమరహస్యసమాచారములు తెలియకుండుటకును, తమఅవసరములు తీఱినపిమ్మట ప్రయాణసమయమున వస్తువులబరువులను తగ్గించుకొనుటకును సైనికులు తమనివాసప్రదేశములకు నిప్పుపెట్టిపోవుచుండుట ఒక ఆచారము. అవిధముగాచేసినచో విజయలక్ష్మి తమనే వరించుననియు వారివిశ్వాసము.

నావస్త్వారురుహుశ్చాన్యే ప్లవైస్తేరుస్తథాపరే।
అన్యే కుంభఘటైస్తేరుః అన్యే తేరుశ్చ బాహుభిః। 19

భరతునివెంటవచ్చినవారిలో కొందఱు పడవలపైనను, మఱికొందఱు తెప్పలపైనను, వేఱొకకొందఱు కుంభములసహాయముననుఁ, ఇంకొక కొందఱు నీటిలో స్వయముగా బాహువులతో ఈదుచును ఆ నదిని దాటిరి. (19)

సా పుణ్యా ధ్వజినీ గంగాం దాశైః సంతారితా స్వయమ్।
మైత్రే ముహూర్తే ప్రయయౌ ప్రయాగవనముత్తమమ్। 20

నదీజలస్నానాదులచే పవిత్రమైన ఆసేన నావికులసహాయముతో గంగానదినిదాటెను. వెంటనే భరతాదులు సేనతోగూడి అచటినుండి భరద్వాజాశ్రమమునకు మైత్రముహూర్తమున[1] బయలుదేఱిరి. (20)

ఆశ్వాసయిత్వా చ చమూం మహాత్మా
నివేశయిత్వా చ యథోపజోషమ్ ।
ద్రష్టుం భరద్వాజమృషిప్రవర్యమ్
ఋత్విగ్వృతః సన్ భరతః ప్రతస్థే । 21

మహాత్ముడైన భరతుడు సేనకు ఊరటగూర్చి, అనువైన (సుఖముగానుండు) ప్రదేశమున దానిని ప్రవేశపెట్టి, వయోవృద్ధుడును, ఋషిశ్రేష్ఠుడును ఐన భరద్వాజమునిని దర్శించుటకై వసిష్ఠాది ఋత్విజులతోగూడి, ఆయనకడకు కాలినడకతో వెళ్లెను. (21)

స బ్రాహ్మణస్యాశ్రమమభ్యుపేత్య
మహాత్మనో దేవపురోహితస్య ।
దదర్శ రమ్యోటజవృక్షషండం
మహద్వనం విప్రవరస్య రమ్యమ్ । 22

మహాత్ముడును, దేవపురోహితుడును[2] బ్రాహ్మణోత్తముడును ఐన భరద్వాజునియొక్క ఆశ్రమమును భరతుడు దర్శించెను. అందలి పర్ణశాలలు చూడముచ్చటగానుండెను. ఆ ఆశ్రమము అంతయును, కనువిందుగావించెడి వృక్షములతో అలరారుచుండెను. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోననవతితమస్సర్గః (89)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు ఎనుబదితొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

90. తొంబదియవసర్గము

భరతుడు భరద్వాజుని దర్శించుట - 'శ్రీరాముని అయోధ్యకు తోడ్కొనివెళ్లుటకై తాను వచ్చినట్లు' అతడు ఆ మహర్షికి విన్నవించుకొనుట.

భరద్వాజాశ్రమం దృష్ట్వా క్రోశాదేవ నరర్షభః।
బలం సర్వమవస్థాప్య జగామ సహ మంత్రిభిః। 1

పద్భ్యామేవ హి ధర్మజ్ఞో న్యస్తశస్త్రపరిచ్ఛదః।
వసానో వాససీ క్షౌమే పురోధాయ పురోధసమ్। 2

రాజకుమారుడైన ఆ భరతుడు ఒకక్రోసెడు దూరమునుండియే భరద్వాజాశ్రమమునుజూచి, తనబలములను అన్నింటిని అచటనే నిలిపెను. పిమ్మట ధర్మజ్ఞుడైన అతడు శస్త్రములను, ఆభరణములను విసర్జించి, పట్టువస్త్రములను ధరించెను. పురోహితుడైన వసిష్ఠుడు ముందునడుచుచుండగా అతడు మంత్రులతోగూడి కాలినడకతో ఆయునను అనుసరించెను. (1-2)

తతః సందర్శనే తస్య భరద్వాజస్య రాఘవః।
మంత్రిణస్తానవస్థాప్య జగామానుపురోహితమ్। 3

ఆశ్రమములో ప్రవేశింపగా కొలదిదూరములో వారికి భరద్వాజమహర్షి కనబడుచుండెను. అప్పుడు భరతుడు తనతోగూడియున్న మంత్రులను అచట ఆపి, తాను పురోహితునివెంట ముందునకు నడచెను. (3)

---

1) పగటిసమయము ముప్పది(30) గడియలు. ఆగడియలను పదునైదు (15) భాగములుచేయగా ఒక్కొక్కముహూర్తసమయము రెండు (2) గడియలు అగును. అట్టిముహూర్తములలో మూడవ (3)దియైన 'మైత్ర' ముహూర్తమున (అనగా నాల్గుగడియలు దాటిన తరువాత ఆఱుగడియలలోపల) వారు ప్రయాగకు బయలుదేఱిరి. గడియకు 24 నిముషములు. అనగా ఒక్కొక్క ముహూర్తసమయము 48 నిముషములు.

2) దేవతలపురోహితుడు (గురువు) బృహస్పతి. ఆబృహస్పతి కుమారుడు భరద్వాజుడు. కనుక ఇతడును అతని తండ్రివలె 'దేవపురోహితుడు' గా పేర్కొనబడినాడు.

వసిష్ఠమథ దృష్ట్వైవ భరద్వాజో మహాతపాః।
సంచచాలాఽఽసనాత్ తూర్ణం శిష్యానర్ఘ్యమితి బ్రువన్। 4

సమాగమ్య వసిష్ఠేన భరతేనాభివాదితః।
అబుధ్యత మహాతేజాః సుతం దశరథస్య తమ్। 5

తాభ్యామర్ఘ్యం చ పాద్యం చ దత్త్వా పశ్చాత్ ఫలాని చ।
ఆనుపూర్వ్యాచ్చ ధర్మజ్ఞః పప్రచ్ఛ కుశలం కులే। 6

అయోధ్యాయాం బలే కోశే మిత్రేష్వపి చ మంత్రిషు।
జానన్ దశరథం వృత్తం న రాజానముదాహరత్। 7

వసిష్ఠో భరతశ్చైనం పప్రచ్ఛతురనామయమ్।
శరీరేఽగ్నిషు వృక్షేషు శిష్యేషు మృగపక్షిషు। 8

తథేతి తత్ ప్రతిజ్ఞాయ భరద్వాజో మహాతపాః।
భరతం ప్రత్యువాచేదం రాఘవస్నేహబంధనాత్। 9

కిమిహాగమనే కార్యం తవ రాజ్యం ప్రశాసతః।
ఏతదాచక్ష్వ మే సర్వం నహి మే శుధ్యతే మనః। 10

సుషువే యమ్ అమిత్రఘ్నం కౌసల్యాఽఽనందవర్ధనమ్।
భ్రాత్రా సహ సభార్యో యః చిరం ప్రవ్రాజితో వనమ్। 11

నియుక్తః స్త్రీనియుక్తేన పిత్రా యోఽసౌ మహాయశాః।
వనవాసీ భవేతీహ సమాః కిల చతుర్దశ। 12

కచ్చిన్న తస్యాపాపస్య పాపం కర్తుమిహేచ్ఛసి।
అకంటకం భోక్తుమనా రాజ్యం తస్యానుజస్య చ। 13

ఏవ ముక్తో భరద్వాజం భరతః ప్రత్యువాచ హ।
పర్యశ్రునయనో దుఃఖాత్ వాచా సంసజ్జమానయా। 14

హతోఽస్మి యది మామేవం భగవానపి మన్యతే।
మత్తో న దోషమాశంకే నైవం మామనుశాధి హి। 15

న చైతదిష్టం మాతా మే యదవోచన్మదంతరే।
నాహమేతేన తుష్టశ్చ న తద్వచనమాదదే। 16

ఇంతలో మహాతపస్వియైన భరద్వాజముని, వసిష్ఠమహర్షినిచూచి, వెంటనే ఆసనమునుండిలేచి, శిష్యులతో 'అర్ఘ్యపాద్యములను తీసికొనిరండు'-అని పలుకుచు ఆ మహర్షిని సమీపించెను. అప్పుడు వసిష్ఠుడును, భరతుడును తమ తమ ప్రవరలను (గోత్రములను, నామధేయాదులను) తెలుపుకొనుచు ఆయనకు నమస్కరించిరి. భరద్వాజుడు అతనిని దశరథపుత్త్రునిగా ఎఱింగెను. (4-5)

పిమ్మట ధర్మజ్ఞుడైన భరద్వాజుడు వారిద్దఱిని అర్ఘ్యపాద్యములతో గౌరవించి, వారికి ఫలములను సమర్పించెను. క్రమముగా వారితో కుశలప్రశ్నలుగావించెను. అయోధ్యలోని బలములను, ధనాగారమును, మిత్రులను, మంత్రులనుగూర్చి ఆమహర్షి అడిగితెలిసికొనెను. దశరథునిమృతినిగూర్చి తెలిసియున్నందున అతడు ఆ ప్రస్తావన చేయలేదు. (6-7)

అనంతరము వసిష్ఠుడును, భరతుడును ఆ మహామునియొక్క ఆరోగ్యభాగ్యములను, అగ్నికార్యములను, వృక్షసంపదను, శిష్యులను, మృగములను, పక్షులనుగూర్చి (క్షేమసమాచారములను) అడిగి తెలిసికొనిరి. (8)

'ఇక్కడ అంతాకుశలమే' అనిపలికి, ఆభరద్వాజమహాముని శ్రీరాముని పైగల ఆదరాభిమానములవలన భరతునితో ఇట్లనెను. (9)

"ఓ భరతా! రాజ్యపాలనచేయుచున్న నీవు ఇచటికివచ్చుటకుగల కారణమేమి? ఆవిషయమును పూర్తిగా తెలుపుము. అప్పుడుగాని నామనసు కుదుటబడదు. (10)

కౌసల్యాదేవి బంగారుకడుపున పుట్టిన శ్రీరాముడు ఎల్లరకును ఆనందమును గూర్చువాడు, శత్రువులను రూపుమాపువాడు. అతడు తమ్ముడగు లక్ష్మణునితో, భార్యయగు సీతాదేవితోగూడి వనవాసమునకు పంపబడెను. స్త్రీ (కైకేయి) కారణమున నీతండ్రియగు దశరథుడు 'పదునాలుగు సంవత్సరములు వనములలో నివసింపుము' అని ఆమహాయశస్విని (శ్రీరాముని) నియోగించెను. తిరుగులేని విధముగా రాజ్యపాలనచేయుదలచినవాడవై ఏపాపమూ ఎఱుగని ఆ శ్రీరామునకును, అతనితమ్ముడగు లక్ష్మణునకును అపకారము చేయదలంచుచున్నావా యేమి?" (11-13)

భరద్వాజమహర్షి ఇట్లుపలికిన పిమ్మట భరతుడు దుఃఖమగ్నుడై, సంతతధారగా కన్నీరుగార్చుచు, మాటలు తడబడుచుండగా ఆమునికి ఇట్లు ప్రత్యుత్తరమును ఇచ్చెను. (14)

"ఓ మహామునీ! పూజ్యులైన (భూతభవిష్యద్వర్తమానములను ఎఱిగిన) మీరుగూడ ఇట్లు భావించినచో ఇకనేను జీవించుటయే వ్యర్థము. ముమ్మాటికిని నాలో ఏదోషమూలేదని తలంతును. మీరు ఇట్లు శాసించుట (అనుట) తగదు. నేను అయోధ్యలో లేనప్పుడు నాతల్లికైకేయి చేసినపనిఇది. ఆమె ఇట్లుచేయుట నాకు ఏమాత్రమూ సమ్మతముగాదు. ఇందులకు నేను సంతోషపడుటలేదు. అంతేగాదు మిక్కిలి దుఃఖపడుచున్నాను. ఆమెమాటను నేను ఆదరించుటలేదు. నరశ్రేష్ఠుడైన ఆశ్రీరాముని వేడుకొని, ప్రసన్నునిగాచేసికొని,

అహం తు తం నరవ్యాఘ్రమ్ ఉపయాతః ప్రసాదకః।
ప్రతినేతుమయోధ్యాం చ పాదౌ తస్యాభివందితుమ్॥ 17

త్వం మామేవం గతం మత్వా ప్రసాదం కర్తుమర్హసి।
శంస మే భగవన్! రామః క్వ సంప్రతి మహీపతిః॥ 18

వసిష్ఠాదిభి ఋత్విగ్భిః యాచితో భగవాంస్తతః।
ఉవాచ తం భరద్వాజః ప్రసాదాద్భరతం వచః॥ 19

త్వయ్యేతత్ పురుషవ్యాఘ్ర! యుక్తం రాఘవవంశజే।
గురువృత్తిర్దమశ్చైవ సాధూనాంచానుయాయితా॥ 20

జానే చైతన్మనఃస్థం తే దృఢీకరణమస్త్వితి।
అపృచ్ఛం త్వాం తథాఽత్యర్థం కీర్తిం సమభివర్ధయన్॥ 21

జానే చ రామం ధర్మజ్ఞం ససీతం సహ లక్ష్మణమ్।
అసౌ వసతి తే భ్రాతా చిత్రకూటే మహాగిరౌ॥ 22

శ్వస్తు గంతాసి తం దేశం వసాద్య సహ మంత్రిభిః।
ఏతన్మే కురు సుప్రాజ్ఞ! కామం కామార్థకోవిద!॥ 23

తత స్తథేత్యేవముదారదర్శనః
ప్రతీతరూపో భరతోఽబ్రవీద్వచః ।
చకార బుద్ధిం చ తదా తదాశ్రమే
నిశానివాసాయ నరాధిపాత్మజః ॥ 24

ఆయనను మరల అయోధ్యకు గొనిపోవుటకును, అచట ఆయన పాదములకు నమస్కరించుచు సేవలొనర్పదలచియు నేనిటువచ్చితిని. (15-17)

ఓపూజ్యమహర్షీ! నేనిటువచ్చిన ఉద్దేశ్యము ఇదియే. దీనిని గ్రహించి, నాపై కృపజూపుడు. మహారాజైన శ్రీరాముడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడో దయతో తెల్పుడు." (18)

అంతట వసిష్ఠుడుమొదలగు ఋత్విజులెల్లరును 'ఓమహామునీ! ఇందు భరతునిదోషము ఇసుమంతయునులేదు. దయతో ఆయనను అనుగ్రహింపుడు' అని ఆయనను ప్రార్థించిరి. అప్పుడు ఆమహర్షి భరతునియెడ ప్రసన్నుడై, ఆయనతో ఇట్లనుడివెను. (19)

"ఓ నరోత్తమా! నీవు పెట్టుకొనినలక్ష్యము, దానికై నీపూనికయు సముచితములు. గురుజనులసేవ, ఇంద్రియనిగ్రహము, సజ్జనులను అనుసరించుట-అను మూడు లక్షణములును రఘువంశమున జన్మించిన నీకే చెల్లును. నీమనస్సులోని సత్సంకల్పమును నేను ఎఱుగుదును. అది ఇంకను నీలో దృఢపడుగాక. నీకీర్తి అంతటను వ్యాపించుటకై నిన్ను ఇట్లు ప్రశ్నించితిని. (20-21)

ధర్మజ్ఞుడైన శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి నివసించుచున్న ప్రదేశమును నేను ఎఱుగుదును. ప్రస్తుతము వారు చిత్రకూట మహాపర్వతప్రదేశమునందు వసించుచున్నారు. (22)

ఓ ప్రాజ్ఞుడా! కామార్థములను బాగుగా ఎఱిగినవాడా! శ్రీరాముని కడకు రేపువెళ్లవచ్చును. మంత్రులు మొదలగువారందఱితో నేటికి ఇక్కడ ఉండుము. నా ఈకోరికను చెల్లింపుము. (23)

రాజకుమారుడును, సహృదయుడును, సచ్చరిత్రుడును ఐన భరతుడు 'ఓమునీశ్వరా! మీ ఆజ్ఞను శిరసావహింతును.' అని పలికి, ఆరాత్రికి ఆ ఆశ్రమమునందే గడుపుటకు నిశ్చయించెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే నవతితమ స్సర్గః *(90)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదియవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

91. తొంబదియొకటవసర్గము

భరతునకును, ఆయనపరివారములకును భరద్వాజుడు దివ్యములగు పదార్థములతో ఆతిథ్యమొసంగుట - అందఱును పరమానందభరితులగుట.

కృతబుద్ధిం నివాసాయ తత్రైవ స మునిస్తదా।
భరతం కైకయీపుత్రమ్ ఆతిథ్యేన న్యమంత్రయత్॥ 1

అబ్రవీద్భరతస్త్వేనం నన్విదం భవతా కృతమ్,
పాద్యమర్ఘ్యం తథాఽఽతిథ్యం వనే యదుపపద్యతే॥ 2

కైకేయిపుత్త్రుడైన భరతుడు ఆ ఆశ్రమమున నివసించుటకు తన సమ్మతిని దెల్పగా, భరద్వాజమహర్షి ఆతనిని సపరివారముగా అతిథిమర్యాదలను స్వీకరించుటకు ఆహ్వానించెను. (1)

అంతట భరతుడు 'ఓమునీశ్వరా! అర్ఘ్యపాద్యాదులతో, వనములలోలభించు ఫలమూలాదులతో మీరు ఇదివఱకే మాకు అతిథిసత్కారములను నెఱపియుంటిరిగదా!' అనిపలికెను. (2)

అథోవాచ భరద్వాజో భరతం ప్రహసన్నివ।
జానే త్వాం ప్రీతిసంయుక్తం తుష్యేస్త్వం యేన కేనచిత్। 3

సేనాయాస్తు తవైతస్యాః కర్తుమిచ్ఛామి భోజనమ్।
మమ ప్రీతిర్యథారూపా త్వమర్హో మనుజర్షభ! 4

కిమర్థం చాపి నిక్షిప్య దూరే బలమిహాగతః।
కస్మాన్నేహోపయాతోఽసి సబలః పురుషర్షభ! 5

భరతః ప్రత్యువాచేదం ప్రాంజలిస్తం తపోధనమ్।
ససైన్యో నోపయాతోఽస్మి భగవన్! భగవద్భయాత్। 6

రాజ్ఞా చ భగవన్నిత్యం రాజపుత్త్రేణ వా సదా।
యత్నతః పరిహర్తవ్యా విషయేషు తపస్వినః। 7

వాజిముఖ్యా మనుష్యాశ్చ మత్తాశ్చ వరవారణాః।
ప్రచ్ఛాద్య భగవన్! భూమిం మహతీమనుయాంతి మామ్। 8

తే వృక్షానుదకం భూమిమ్ ఆశ్రమేషూటజాంస్తథా।
న హింస్యురితి తేనాహమ్ ఏకఏవ సమాగతః। 9

ఆనీయతామితః సేనేత్యాజ్ఞప్తః పరమర్షిణా।
తతః స చక్రే భరతః సేనాయాః సముపాగమమ్। 10

అగ్నిశాలాం ప్రవిశ్యాథ పీత్వాఽపః పరిమృజ్య చ।
ఆతిథ్యస్య క్రియాహేతోః విశ్వకర్మాణమాహ్వయత్। 11

ఆహ్వయే విశ్వకర్మాణమ్ అహం త్వష్టారమేవ చ।
ఆతిథ్యం కర్తుమిచ్ఛామి తత్ర మే సంవిధీయతామ్। 12

ఆహ్వయే లోకపాలాంస్త్రీన్ దేవాన్ శక్రముఖాంస్తథా।
ఆతిథ్యం కర్తుమిచ్ఛామి తత్ర మే సంవిధీయతామ్। 13

ప్రాక్స్రోతసశ్చ యా నద్యః ప్రత్యక్స్రోతస ఏవ చ।
పృథివ్యామంతరిక్షే చ సమాయాంత్వద్య సర్వశః। 14

పిదప భరద్వాజుడు దరహాసముచేయుచు భరతునితో ఇట్లనెను. "ఓ భరతా! నీవు నాయెడ ఆదరాభిమానములుగలవాడవు, కనుక నేను స్వల్పమైన ఆతిథ్యమును ఇచ్చినను నీవు సంతోషపడుదువని నేనెఱుంగుదును. ఓ నరశ్రేష్ఠా! నీకును నీసేనాపరివారములకును విందుచేయదలచితిని. కనుక నాసంతృప్తికొఱకై నీవు ఈ ఆతిథ్యమును స్వీకరింపుము. (3-4)

ఓ నరోత్తమా! నీసేనాపరివారములను దూరముగా ఉంచి వచ్చితివేల? నీవు ఇచటికి నీబలములతోగూడి రాకుండుటకు గలకారణమేమి"? (5)

అంతట భరతుడు చేతులుజోడించి, ఆమునీశ్వరునితో ఇట్లు నుడివెను. "ఓ మహర్షీ! మీ ఆశ్రమవిధులకు భంగము కలుగునేమో! యను భయముతో నాసేనాపరివారములను ఇచటికి తీసికొని రాలేదు. (6)

ఓ పూజ్యమహర్షీ! రాజులుగాని, రాజకుమారులుగాని ఏదేశము నందైనను సర్వదా తాపసులకు దూరముగా ఉండుటకు ప్రయత్నింపవలెను. పరివారములతో, సైన్యములతో వారికడకుపోరాదు. ఏలనన వారిప్రశాంతతకును, తపశ్చర్యలకును భంగము కలిగింపరాదుగదా! (7)

ఓ మహామునీ! మేలుజాతిగుఱ్ఱములు, కాల్బలములు, మదపుటేనుగులు, నేలనంతయు కప్పివేయుచు (వేలసంఖ్యలో) నావెంట వచ్చుచున్నవి. అవి ఇచటికి చేరినచో మీ ఆశ్రమమునందలి వృక్షములకును, జలాశయములకును, పర్ణశాలలకును, ఈప్రశాంత ప్రదేశమునకును హానికలుగునని, వాటిని దూరముగానుంచి, నేను ఒక్కడనే ఇచటికి వచ్చితిని." (8-9)

'సేనను ఇచటికి చేర్చుము'-అని భరద్వాజుడు ఆజ్ఞాపింపగా, వెంటనే భరతుడు తనసేనను ఆ ఆశ్రమసమీపమునకు రప్పించెను. (10)

అంతట భరద్వాజమహర్షి అగ్నిశాలలో ప్రవేశించి, ఆచమనముచేసి, పెదవులను తుడుచుకొనెను. పిదప అతడు అతిథిసత్కారములను నిర్వహించుటకై విశ్వకర్మను ఆహ్వానించెను. (11)

"భరతునకును, అతనిసేనాపరివారములకును అతిథి సత్కారములను చేయగోరుచున్నాను. గృహనిర్మాణాదులయందు సమర్థుడైన విశ్వకర్మను ఆహ్వానించుచున్నాను. అతడు ఇచటికి వచ్చి, వారికై తగిన ఏర్పాట్లను చేయునుగాక. భరతాదులకు ఆతిథ్యమును ఈయదలచితిని. అందులకై ఇంద్ర, యమ, వరుణ, కుబేరులను ఆహ్వానించుచున్నాను. వారు ఇచటికి విచ్చేసి, నాకుతోడ్పడుదురుగాక. (12-13)

భూమిపైనను, ఆకాశమునందును తూర్పుగా ప్రవహించు నదులను, పడమరదిశగా సాగిపోవు నదములను ఆహ్వానించుచున్నాను. అవి యన్నియును ఇచటికి విచ్చేయుగాక. కొన్నిప్రవాహములు ఖర్జూరాది ఫలరసములను, మఱికొన్ని ప్రవాహములు చక్కగా సిద్ధపఱచబడిన

అన్యాః స్రవంతు మైరేయం సురామన్యాః సునిష్ఠితామ్।
అపరాశ్చోదకం శీతమ్ ఇక్షుకాండరసోపమమ్॥ 15

ఆహ్వయే దేవగంధర్వాన్ విశ్వావసుహహాహుహూన్।
తథైవాప్సరసో దేవీః గంధర్వీశ్చాపి సర్వశః॥ 16

ఘృతాచీమథ విశ్వాచీం మిశ్రకేశీమలంబుసామ్।
నాగదంతాం చ హేమాం చ హిమామద్రికృతస్థలామ్॥ 17

శక్రం యాశ్చోపతిష్ఠంతి బ్రహ్మాణం యాశ్చ యోషితః।
సర్వాస్తుంబురుణా సార్ధమ్ ఆహ్వయే సపరిచ్ఛదాః॥ 18

వనం కురుషు యద్దివ్యం వాసో భూషణపత్రవత్।
దివ్యనారీఫలం శశ్వత్ తత్కౌబేరమిహైతు చ॥ 19

ఇహ మే భగవాన్ సోమో విధత్తామన్నముత్తమమ్।
భక్ష్యం భోజ్యంచ చోష్యంచ లేహ్యంచ వివిధం బహు॥ 20

విచిత్రాణిచ మాల్యాని పాదపప్రచ్యుతాని చ।
సురాదీని చ పేయాని మాంసాని వివిధాని చ॥ 21

ఏవం సమాధినా యుక్తః తేజసాఽప్రతిమేన చ।
శిక్షాస్వరసమాయుక్తం తపసా చాబ్రవీన్మునిః॥ 22

మనసా ధ్యాయతస్తస్య ప్రాఙ్ముఖస్య కృతాంజలేః।
ఆజగ్ముస్తాని సర్వాణి దైవతాని పృథక్ పృథక్॥ 23

మలయం దర్దురం చైవ తతః స్వేదనుదోఽనిలః।
ఉపస్పృశ్య వవౌ యుక్త్యా సుప్రియాత్మా సుఖః శివః॥ 24

తతోఽభ్యవర్తంత ఘనా దివ్యాః కుసుమవృష్టయః।
దివ్యదుందుభిఘోషశ్చ దిక్షు సర్వాసు శుశ్రువే॥ 25

ప్రవవుశ్చోత్తమా వాతా ననృతుశ్చాప్సరోగణాః।
జగుశ్చ దేవగంధర్వా వీణాః ప్రముముచుః స్వరాన్॥ 26

ఇక్షురసాములను ప్రవహింపజేయు గాక. మఱికొన్ని నదులు చెఱకురసముల వలె సుమధురములైన చల్లని జలములను సమకూర్చుగాక. (14-15)

ఇంకను గానవినోదములకై విశ్వావసువు, హాహా, హూహూ మొదలగు దేవగంధర్వులను, అట్లే దేవజాతికిని, గంధర్వజాతికిని చెందిన అప్సరసలను అందఱిని ఆహ్వానించుచున్నాను. మఱియు మహేంద్రగిరియందు మయుడు నిర్మించిన ప్రదేశములలో నివసించు నట్టి ఘృతాచి, విశ్వాచి, మిశ్రకేశి, అలంబుస, నాగదంత, హేమ, హిమ మొదలగు అప్సరసలను ఆహ్వానించుచున్నాను. (16-17)

ఇంతేగాక ఇంద్రసభలోనుండు రంభ, ఊర్వశి, మేనక మున్నగు వారిని, బ్రహ్మలోకమునందుండు అప్సరసలను, వీణావాదనకుశలుడైన తుంబురుని ఆహ్వానించుచున్నాను. వారందఱును అలంకారసామగ్రి తోడను, నృత్య, గీతాదులకు అవసరమగు ఉపకరణములతోడను విచ్చేయుదురుగాక. (18)

ఉత్తరకురుభూములయందు కుబేరునకు చెందిన 'చైత్రరథము' అను దివ్యవనము ఇచటికి విచ్చేయుగాక. అది ఎల్లప్పుడును వస్త్రములు, భూషణములే పత్రములుగా గలది. దివ్యస్త్రీలే ఫలములుగా గలది. (ఆ చైత్రరథవనమునందు ఎల్లప్పుడును అమూల్యములైన వస్త్రా-భరణములను ధరించెడి దివ్యస్త్రీలు విహరించుచుందురు.) (19)

పూజ్యుడైన (ఓషధులకు అధిపతియైన) చంద్రుడు భక్ష్యముల తోడను, భోజ్యముల (అన్నాదుల)తోడను, చోష్యములతోడను, లేహ్యములతోడను గూడిన పలువిధములైన శాకపాకములను, అమృతాన్నములను నాఆతిథులకొఱకు సమకూర్చునుగాక. ఇంకను ఆతడు వృక్షములనుండి అప్పుడే తెంపిన పూవులతో సిద్ధములైన మాలికలను, తేనె మున్నగు పానీయములను, వివిధములగు పండ్ల గుజ్జులను సిద్ధపఱచునుగాక." (20-21)

ఉత్తమవ్రతపాలనకుశలుడును, నిరుపమాన తేజశ్శాలియు ఐన భరద్వాజమహర్షి ఏకాగ్రచిత్తుడై, శిక్షా, వ్యాకరణశాస్త్రములలో తెలుపబడిన స్వరములతో అందఱినిగూర్చి ఆహ్వానమంత్రములను పఠించెను. (22)

ఆ భరద్వాజమహర్షి ప్రాఙ్ముఖుడై, అంజలిఘటించి, మనస్సున ఇట్లు ధ్యానింపగా ఆయాదేవతలందఱును వేర్వేఱుగా అచటికి విచ్చేసిరి. (23)

మలయ, దర్దుర పర్వతములమీదుగా చల్లని వాయువులు హాయిని గొల్పుచు తిన్నతిన్నగా వీచెను. అవి తాకినంతనే తనువులపైగల స్వేదములు తొలగిపోవుచుండగా మిగుల సుఖముగానుండెను. (24)

ఆ పరిసరములయందు అంతటను దివ్యములైన పుష్పవర్షములు ఎడతెరపిలేకుండ కురిసెను. అన్నిదిక్కులనుండియు దేవదుందుభులధ్వనులు శ్రావ్యముగా వినిపించెను. (25)

సుగంధవాయువులు సుఖకరముగా వీచినవి. అప్సరసలు చక్కగా నృత్యములొనర్చిరి. దేవగంధర్వులు గానములను ఆలపించిరి.

స శబ్దో ద్యాం చ భూమిం చ ప్రాణినాం శ్రవణాని చ।
వివేశోచ్చారితః శ్లక్ష్ణః సమో లయగుణాన్వితః। 27

తస్మిన్నుపరతే శబ్దే దివ్యే శ్రోత్రసుఖే నృణామ్।
దదర్శ భారతం సైన్యం విధానం విశ్వకర్మణః। 28

బభూవ హి సమా భూమిః సమంతాత్ పంచయోజనా।
శాద్వలైర్బహుభిశ్ఛన్నా నీలవైదూర్యసన్నిభైః। 29

తస్మిన్ బిల్వాః కపిత్థాశ్చ పనసా బీజపూరకాః।
ఆమలక్యో బభూవుశ్చ చూతాశ్చ ఫలభూషణాః। 30

ఉత్తరేభ్యః కురుభ్యశ్చ వనం దివ్యోపభోగవత్।
ఆజగామ నదీ దివ్యా తీరజైర్బహుభిర్వృతా। 31

చతుశ్శాలాని శుభ్రాణి శాలాశ్చ గజవాజినామ్।
హర్మ్యప్రాసాదసంబాధాః తోరణాని శుభాని చ। 32

సితమేఘనిభం చాపి రాజవేశ్మ సుతోరణమ్।
దివ్యమాల్యకృతాకారం దివ్యగంధసముత్క్షితమ్। 33

చతురశ్రమసంబాధం శయనాసనయానవత్।
దివ్యైః సర్వరసైర్యుక్తం దివ్యభోజనవస్త్రవత్।
ఉపకల్పితసర్వాన్నం ధౌతనిర్మలభాజనమ్। 34

క్లృప్తసర్వాసనం శ్రీమత్స్వాస్తీర్ణశయనోత్తమమ్।
ప్రవివేశ మహాబాహుః అనుజ్ఞాతో మహర్షిణా।
వేశ్మ తద్రత్నసంపూర్ణం భరతః కైకయీసుతః। 35

అనుజగ్ముశ్చ తం సర్వే మంత్రిణః సపురోహితాః।
బభూవుశ్చ ముదా యుక్తా దృష్ట్వా తం వేశ్మసంవిధిమ్। 36

వీణానాదములు మధురముగా వినిపించినవి. ఆసంగీతనాదములు భూమ్యాకాశములయందు అంతటను వ్యాపించెను. అవి సమస్త ప్రాణులకర్ణములకును విందుగావించెను. అవి మంద్ర, మధ్య, తారస్థాయులలో వివిధస్వరప్రస్తారములతోగూడి, లయబద్ధములై వినసొంపుగాఉండెను. (26-27)

అక్కడి వారికెల్లరకును వీనులవిందుగావించిన మధురగానములు ఆగగానే భరతునిసైనికులకు విశ్వకర్మశిల్పనిర్మాణము కనువిందు గావించెను. ఆ ఆశ్రమమునకు అన్నిదిక్కులయందును ఐదు యోజనముల వఱకు భూమి సమతలమాయెను. దానిపై నీలవైదూర్య మణులకాంతులను విరజిమ్ముచు పెక్కువిధములైన పచ్చికబయళ్లు ఏర్పడెను. ఆప్రదేశమునందు అంతటను అక్కడక్కడ మారేడు చెట్లు, వెలగచెట్లు, పనసవృక్షములు, మాదీఫలవృక్షములు, ఉసిరిక వృక్షములు, మేలైన మామిడిచెట్లు మధురఫలభరితములై శోభిల్లెను. ఉత్తరదిశయందుగల కురుభూములనుండి దివ్యభోగసామగ్రితో గూడిన 'చైత్రరథము' అను కుబేరుని వనము అచటికి చేరెను. అట్లే దివ్యనదులన్నియును ఆయాతీరములయందుగల వివిధ వృక్షములతో దర్శనీయములై వచ్చేసెను. (28-31)

స్వచ్ఛముగానున్న నాలుగిండ్లభవంతులు, ఏనుగులకును, గుఱ్ఱములకును వేర్వేఱుశాలలు, ఒకదానికిమించియొకటి చేరువగా మేడలు, రాజభవనములు నిర్మితములైనవి. అవియన్నియును చక్కని తోరణములతో అలంకృతములైయున్నవి. (32)

అచట ఒక చక్కని రాజభవనము నిర్మింపబడినది. అది తెల్లని మేఘమువలె విలసిల్లుచున్నది. దాని ముఖద్వారము దివ్యమాలలతో అలంకృతమై, మనోహరముగా నున్నది. అది సువాసనలతోగుబాళించు చున్నది. చతురస్రాకారములో విశాలముగానున్న ఆభవనమున శయనతల్పములు, చక్కని ఆసనములు, వాహనములు ఏర్పఱచబడి యున్నవి. అందు షడ్రసములతోగూడిన దివ్యభోజనపదార్థములు సిద్ధపఱచబడియున్నవి. అచట దివ్యములైన వస్త్రములు ఉంచబడినవి. అందు రుచికరములైన అన్నములు, వివిధపదార్థములు సిద్ధముగానున్నవి. అందలి పాత్రలన్నియును తెల్లని కాంతులతో స్వచ్ఛములై విలసిల్లుచున్నవి. స్నానములకును, భోజనములకును అనువగు ఆసనములు ఏర్పఱచబడినవి. మనోజ్ఞములైన మెత్తని పఱుపులతోగూడిన శయ్యలు అందుసిద్ధముగానున్నవి. అంతట కైకేయిసుతుడును, మహాబాహువు, ఐన భరతుడు భరద్వాజమహర్షి అనుమతితో వివిధరత్నములతో తాపబడిన ఆరాజభవనమునందు ప్రవేశించెను. (33-35)

పిమ్మట మంత్రులు, పురోహితులు, అందఱును భరతునివెంట అందు ప్రవేశించిరి. వారందఱును ఆభవననిర్మాణవైభవమును జూచి అందులకు ఎంతయు సంతసించి, అబ్బురపడిరి. (36)

తత్ర రాజాసనం దివ్యం వ్యజనం ఛత్రమేవ చ।
భరతో మన్త్రిభిః సార్ధమ్ అభ్యవర్తత రాజవత్। 37

ఆసనం పూజయామాస రామాయాభిప్రణమ్య చ।
వాలవ్యజనమాదాయ న్యషీదత్ సచివాసనే। 38

అనుపూర్వ్యాన్నిషేదుశ్చ సర్వే మన్త్రిపురోహితాః।
తతః సేనాపతిః పశ్చాత్ ప్రశాస్తా చ నిషేదతుః। 39

తతస్తత్ర ముహూర్తేన నద్యః పాయసకర్దమాః।
ఉపాతిష్ఠంత భరతం భరద్వాజస్య శాసనాత్। 40

తాసాముభయతః కూలం పాండుమృత్తికలేపనాః।
రమ్యాశ్చావసథా దివ్యా బ్రహ్మణస్తు ప్రసాదజాః। 41

తేనైవ చ ముహూర్తేన దివ్యాఽఽభరణభూషితాః।
ఆగుర్వింశతిసాహస్రా బ్రహ్మణా ప్రహితాః స్త్రియః। 42

సువర్ణమణిముక్తేన ప్రవాళేన చ శోభితాః।
ఆగుర్వింశతిసాహస్రాః కుబేరప్రహితాః స్త్రియః। 43

యాభిర్గృహీతః పురుషః సోన్మాద ఇవ లక్ష్యతే।
ఆగుర్వింశతిసాహస్రా నందనాదప్సరోగణాః। 44

నారదస్తుమ్బురుర్గోపః ప్రవరాః సూర్యవర్చసః।
ఏతే గంధర్వరాజానో భరతస్యాగ్రతో జగుః। 45

అలంబుసా మిశ్రకేశీ పుండరీకాఽథ వామనా।
ఉపానృత్యంస్తు భరతం భరద్వాజస్య శాసనాత్। 46

యాని మాల్యాని దేవేషు యాని చైత్రరథే వనే।
ప్రయాగే తాన్యదృశ్యంత భరద్వాజస్య తేజసా। 47

బిల్వా మార్దంగికా ఆసన్ శమ్యా గ్రాహా విభీతకాః।
అశ్వత్థా నర్తకాశ్చాసన్ భరద్వాజస్య శాసనాత్। 48

తతః సరళతాలాశ్చ తిలకా నక్తమాలకాః।
ప్రహృష్టాస్తత్ర సంపేతుః కుబ్జా భూత్వాఽథ వామనాః। 49

శింశుపామలకీజంబ్వో యాశ్చాన్యాః కాననేషు తాః।
మాలతీ మల్లికా జాతిః యాశ్చాన్యాః కాననే లతాః। 50

భరతుడు అచటనెలకొల్పబడియున్న రాజసింహాసనమును, దివ్యములైన ఛత్రచామరములను గాంచెను. అప్పుడతడు వాటిని శ్రీరామునిగా భావించి, మంత్రులతోగూడి, వాటికి ప్రదక్షిణమొనర్చెను. అనంతరము అతడు ఆ సింహాసనమున శ్రీరాముడు ఉన్నట్లు భావించి, దానికి నమస్కరించి, పూజించెను. పిదప వింజామరను చేతబట్టి అతడు మంత్రి కూర్చుండదగిన ఆసనమును అలంకరించెను. (37-38)

తరువాత క్రమముగా పురోహితులు, మంత్రులు, అందరును తమతమయర్హతలననుసారము ఆసనములపై కూర్చుండిరి. పిమ్మట సేనాపతియు, తరువాత శిబిరాధికారియు ఆసీనులైరి. (39)

అనంతరము భరద్వాజమహర్షియొక్క ఆదేశమునననుసరించి, మధురములైన పాలతోనిండిన నదులన్నియును క్షణకాలములో భరతునిచెంత చేరినవి. (40)

ఆనదులయొక్క ఉభయతీరములయందును తెల్లని మృత్తికతో పూయబడినవియు, రమ్యములైనవియు అగు గృహములు బ్రహ్మర్షియైన భరద్వాజుని అనుగ్రహముతో ఆవిర్భవించినవి. అదేసమయమున దివ్యాభరణములను ధరించిన ఇరువదివేలమంది అప్సరసలు బ్రహ్మదేవుడు పంపగా అచటికి విచ్చేసిరి. (41-42)

బంగారు ఆభరణములను, మణిహారములను, ముత్యాల గొలుసులను, పవడముల పేరులను ధరించిన ఇరువదివేలమంది అప్సరసలు కుబేరుని ఆదేశముతో అచటికి విచ్చేసిరి. నందన (ఇంద్రుని) వనమునుండియు ఇరువదివేలమంది అప్సరసలు విచ్చేసిరి. ఆ అప్సరసలయొక్క స్పర్శమాత్రముననే పురుషులు పరవశులై పోవుచుండిరి. (43-44)

సూర్యకాంతులతో వెలుగొందుచున్న నారదుడు,[1] తుంబురుడు గోపుడు అను ఈముగ్గురు గంధర్వరాజులును వచ్చి, భరతుని యెదుట గీతములను ఆలపించిరి. అలంబుస, మిశ్రకేశి, పుండరీక, వామన అను అప్సరసలు భరద్వాజుని ఆజ్ఞమేరకు భరతుని సమీపమున నృత్యములను ఒనర్చిరి. (45-46)

నందన (ఇంద్రుని) వనమునందలి పూవులును, చైత్రరథ (కుబేరుని) వనమునందలి పుష్పములును భరద్వాజుని మహిమ వలన ప్రయాగయందు వెల్లివిరిసినవి. (47)

భరద్వాజునిఆదేశమునననుసరించి, మారేడుచెట్లు మృదంగ ధ్వనులుగావించుచుండెను. తాండ్రచెట్లు తాళశబ్దములను వినిపించు చుండెను. రావిచెట్లు నృత్యప్రదర్శనములను నెరపుచుండెను. (48)

దేవదారువృక్షములు, తాళవృక్షములు, ఎఱ్ఱగోరంటచెట్లు కానుగ చెట్లు అంతఃపురమునందుండెడి గూనివారుగను, పొట్టివారుగను మారి, సంతోషముతో అచటికి చేరినవి. (49)

అడవులయందలి శింశుప, ఉసిరిక, నేరేడు మొదలగుచెట్లును, మాలతి, మల్లిక, జాజి మున్నగులతలును స్త్రీరూపమున భరద్వాజాశ్రమమునకు చేరి ఇట్లు పలికెను. "మధు(తేనెను)పానముచేసెడి

1) నారదో బ్రహ్మపుత్త్రాదన్యః ఈ నారదుడు బ్రహ్మదేవునికుమారుడుకాడు. ఇతడు మరియొకడు; తుంబురుని సహాధ్యాయుడు. గోవిందరాజీయమ్

ప్రమదా విగ్రహం కృత్వా భరద్వాజాశ్రమేఽవదన్।
సురాః సురాపాః పిబత పాయసం చ బుభుక్షితాః।
మాంసాని చ సుమేధ్యాని భక్ష్యంతాం యావదిచ్ఛథ। 51

ఉచ్ఛాద్య స్నాపయంతి స్మ నదీతీరేషు వల్గుషు।
అప్యేకమేకం పురుషం ప్రమదాః సప్తచాష్టచ। 52

సంవాహంత్యః సమాపేతుః నార్యో రుచిరలోచనాః।
పరిమృజ్య తథాఽన్యోన్యం పాయయంతి వరాంగనాః। 53

హయాన్ గజాన్ ఖరానుష్ట్రాన్ తథైవ సురభేః సుతాన్।
అభోజయన్ వాహనపాః తేషాం భోజ్యం యథావిధి। 54

ఇక్షూంశ్చ మధులాజాంశ్చ భోజయంతి స్మ వాహనాన్।
ఇక్ష్వాకువరయోధానాం చోదయంతో మహాబలాః। 55

నాశ్వబంధోఽశ్వ మాజానాన్ న గజం కుంజరగ్రహః।
మత్తప్రమత్తముదితా చమూః సా తత్ర సంబభౌ। 56

తర్పితాః సర్వకామైస్తే రక్తచందనరూషితాః।
అప్సరోగణసంయుక్తాః సైన్యా వాచముదైరయన్। 57

నైవాయోధ్యాం గమిష్యామో న గమిష్యామ దండకాన్।
కుశలం భరతస్యాస్తు రామస్యాస్తు తథా సుఖమ్। 58

ఇతి పాదాతయోధాశ్చ హస్త్యశ్వారోహబంధకాః।
అనాథాస్తం విధిం లబ్ధ్వా వాచమేతాముదైరయన్। 59

సంప్రహృష్టా వినేదుస్తే నరాః తత్ర సహస్రశః।
భరతస్యానుయాతారః స్వర్గోఽయమితి చాబ్రువన్। 60

నృత్యంతి స్మ హసంతి స్మ గాయంతి స్మ చ సైనికాః।
సమంతాత్ పరిధావంతి మాల్యోపేతాః సహస్రశః। 61

తతో భుక్తవతాం తేషాం తదన్నమమృతోపమమ్।
దివ్యానుద్వీక్ష్య భక్ష్యాంస్తాన్ అభవద్భక్షణే మతిః। 62

ప్రేష్యాశ్చేట్యశ్చ వధ్వశ్చ బలస్థాశ్చ సహస్రశః।
బభూవుస్తే భృశం దృప్తాః సర్వే చాహతవాససః। 63

వారు తనివిదీర మధువులను (తేనెలను) సేవింపుడు. ఆకలిగొన్న వారు కడుపునిండా పాయసములను త్రాగుడు. ఇంకను మధురము లైన ఫలములును, ఫలరసములునుగలవు. వాటిని ఆస్వాదింపుడు. ఎవరియిష్టానుసారము వారు స్వీకరింపవచ్చును." (50-51)

అందమైన కనులుగల ఏడెనిమిదిమందిస్త్రీలు అచటికివచ్చి, ఒక్కొక్క పురుషుని రమ్యమైన నదీతీరమునకుగొనిపోయి, నలుగులుపెట్టి, ఒడలుపిసికి స్నానము చేయించిరి. అప్పుడాపురుషులబడలికలు తీరెను. ఆ రమణీమణులు శరీరములు తుడిచి, వారిచే పాలుమొదలగువాటిని త్రాగించిరి. (52-53)

వాహనసంరక్షకులు గుఱ్ఱములకును, ఏనుగులకును, కంచర గాడిదలకును, ఒంటెలకును, కోడెదూడలకును చక్కనిమేతలను ఏర్పఱచి, వాటిచే తినిపించిరి. (54)

ఋషిప్రభావముతో అచటికిచేరిన మిక్కిలిబలశాలురగు వాహనసంరక్షకులు శ్రేష్ఠులైన ఇక్ష్వాకుయోధులయొక్క గజాది వాహనములపై నిమురుచు చెఱకుగడలను, మధుమిశ్రితములైన పేలాలను వాటిచే తినిపించిరి. (55)

మత్తుపదార్థములను మితిమీఱి సేవించి, ఒడలుమఱచి, భోగ్యవస్తువులను అనుభవించుటవలన పరవశులైయున్న సైనికులు తమతమ అశ్వములను, గజములను గుర్తింపలేకపోయిరి. (56)

ఎఱ్ఱచందనములను అలందుకొని, ఇష్టమైన సకలపదార్థములతో సంతృప్తులై, అప్సరసలతోగూడియున్న ఆసైనికులు ఇట్లు పలుక సాగిరి. "మేము ఇక అయోధ్యకును వెళ్లము, దండకారణ్యములకును పోము. శ్రీరాముని దర్శనమునకై భరతునివెంట వచ్చినకారణమున మేము ఈస్వర్గసుఖములను అనుభవించుచున్నాము. కనుక శ్రీరాముడును, భరతుడును ఎక్కడివారక్కడ క్షేమముగా ఉందురుగాక." (57-58)

కాల్బలములవారును, గజారోహకులును, అశ్వారోహకులును, వాటిసంరక్షకులును ఇట్టి సత్కారములనుపొంది, అదుపు చేయువారులేక ఇట్లు పలుకదొడంగిరి. (59)

"వేలకొలదిగాగల భరతుని అనుయాయులు అందఱును ఇచటి వైభవములకు సంతోషపరవశులై 'స్వర్గమంటే ఇదే' అని బిగ్గఱగా కేకలువేయసాగిరి." (60)

మెడలలో పూలదండలను ధరించియున్న వేలకొలదిగాగల ఆసైనికులు నవ్వుకొనుచు పాడుచుండిరి, ఆడుచుండిరి, అంతటను పరుగులుదీయుచుండిరి. (61)

ఇంతవఱకును ఆసైనికులు (అచటివారు) అమృతతుల్యము లైన భక్ష్యభోజ్య చోష్య లేహ్యాది-పలువిధములైన కమ్మని పదార్థములను తనివిదీర తినియుండిరి. కాని ఘుమఘుమలాడుచు ఎదురుగా కనబడుచున్న మధురపదార్థములను చూచినపిమ్మట ఇంకను వాటిని తినవలెనని వారికి నోరూరుచుండెను. (62)

వేలసంఖ్యలోనున్న దాసదాసీజనులు, యోధులు, వారిపత్నులు అందఱును నూతనవస్త్రములను ధరించి, మిక్కిలి సంతృప్తులై యుండిరి. (63)

కుంజరాశ్చ ఖరోష్ట్రాశ్చ గోఽశ్వాశ్చ మృగపక్షిణః।
బభూవుః సుభృతాస్తత్ర నాన్యో హ్యన్యమకల్పయత్। 64

నాఽశుక్లవాసా స్తత్రాఽసీత్ క్షుధితో మలినోఽపి వా।
రజసా ధ్వస్తకేశో వా నరః కశ్చిదదృశ్యత। 65

ఆజైశ్చాపి చ వారాహైః నిష్ఠానవరసంచయైః।
ఫలనిర్యూహసంసిద్ధైః సూపైర్గంధరసాన్వితైః। 66

పుష్పధ్వజవతీః పూర్ణాః శుక్లస్యాన్నస్య చాభితః।
దదృశుర్విస్మితాస్తత్ర నరా లౌహీః సహస్రశః। 67

బభూవుర్వనపార్శ్వేషు కూపాః పాయసకర్దమాః।
తాశ్చ కామదుఘా గావో ద్రుమాశ్చాసన్ మధుస్స్రుతః। 68

వాప్యో మైరేయపూర్ణాశ్చ మృష్టమాంసచయైర్వృతాః।
ప్రతప్తపిఠరైశ్చాపి మార్గమాయూరకౌక్కుటైః। 69

పాత్రీణాం చ సహస్రాణి స్థాలీనాం నియుతాని చ।
న్యర్బుదాని చ పాత్రాణి శాతకుంభమయాని చ। 70

స్థాల్యః కుంభ్యః కరంభ్యశ్చ దధిపూర్ణాః సుసంస్కృతాః।
యౌవనస్థస్య గౌరస్య కపిత్థస్య సుగంధినః। 71

హ్రదాః పూర్ణా రసాలస్య దధ్నః శ్వేతస్య చాపరే।
బభూవుః పాయసస్యాన్యే శర్కరాయాశ్చ సంచయాః। 72

కల్కాంశ్చూర్ణకషాయాంశ్చ స్నానాని వివిధాని చ।
దదృశుర్భాజనస్థాని తీర్థేషు సరితాం నరాః। 73

శుక్లాన్ అంశుమతశ్చాపి దంతధావనసంచయాన్।
శుక్లాంశ్చందనకల్కాంశ్చ సముద్గేష్వవతిష్ఠతః। 74

దర్పణాన్ పరిమృష్టాంశ్చ వాససాం చాపి సంచయాన్।
పాదుకోపానహాశ్చైవ యుగ్మాని చ సహస్రశః। 75

అచటనున్న ఏనుగులు, గుఱ్ఱములు, కంచరగాడిదలు, ఒంటెలు, వృషభములు, సైనికులు తమక్రీడావినోదములకై తీసికొని వచ్చిన మృగములు, పక్షులు మొదలగునవియన్నియును అచటి ఆహారపదార్థములతో సంతృప్తిచెందుచు ఇతరాపేక్షలేక హాయిగానుండెను. (64)

అచట ఉన్నవారిలో ఎవ్వరును శుభ్రమైన వస్త్రములను ధరింపనివారుగాని, ఆకలితోఉన్నవారుగాని, మురికిగానున్నవారుగాని, దుమ్ముకొట్టుకొని మాసియున్న కేశములుగలవారుగాని లేకుండిరి. (65)

వాము, వరాహకందము (తుంగముస్తెలు) శ్రేష్ఠములైన వ్యంజనములు, ఫలములచే సిద్ధమైన రసములు, ఘుమఘుమ లాడుచున్న రసములతోగూడిన వివిధములగు సూపములు (పప్పులు), మల్లెపూలవంటి తెల్లని అన్నములు మొదలగువాటితో నిండిన బంగారుపాత్రలు అచట సిద్ధముగానుండెను. ఆపాత్రలపై పుష్పములు చక్కగా అలంకరింపబడియుండెను. భరతునివెంట వచ్చినవారు సంభ్రమాశ్చర్యములతో ఆపాత్రలనుజూచిరి. (66-67)

అచటివనములసమీపమునగల బావులు మధురపాయసములతో నిండియుండెను. అచటిఆవులు కామధేనువులవలె కోరినకోర్కెలను తీర్చుచుండెను. చెట్లన్నియును తేనెలకు ఆటపట్టులై యుండెను. (68)

బావులనిండ ఖర్జూరరసపానీయములను, గజకందములతో, అశ్వకందములతో బాగుగావండిన పదార్థములను, ఇంకను ఇతరములగు వంటకములను కుండలలో నింపి ఆ బావులకడ ఏర్పాటుచేయుట జరిగినది. (69)

అన్నముతో నిండిన వేలకొలదిపాత్రలు, లక్షలాదివ్యంజనముల పాత్రలు, కోట్లకొలది భోజనపాత్రలు, అచట ఉంచబడినవి. ఇవి యన్నియును బంగారుపాత్రలే. చక్కగా శుభ్రపఱచబడిన గిన్నెలు, చిన్నపాత్రలు, వెడల్పైన ముఖముగల పాత్రలు పెరుగులతో నిండియున్నవి. ఒకజాముక్రింద సిద్ధపరచబడిన మజ్జిగలు వెలగపండువాసనలతో మడుగులుగా ఏర్పడియున్నవి. జీలకఱ్ఱ మొదలగువానితో కలుపబడిన మజ్జిగలు, తెల్లని పెరుగులు, చిక్కనిపాలుగల కుండములు వేర్వేఱుగా సిద్ధమైనవి. ఇంకను అచట వివిధములగు పాయసములు, చక్కెరరాసులు సిద్ధముగానున్నవి. (70-72)

స్నానముచేయువారికొఱకు నదీతీరములయందు వేర్వేఱు పాత్రలలో ఉసిరికపొడులు, ఇతరసుగంధితచూర్ణములు, కషాయములు, మొదలగునవి సిద్ధమైయుండెను. వాటితోపాటు దంతధావనమునకు ఉపయోగపడు తెల్లనికూర్చలు, పండ్లపొడులు, సమకూర్చబడినవి. వేర్వేఱు పాత్రలలో చందనపంకములు సిద్ధముగానున్నవి. ఇంతేగాక పెక్కుస్వచ్ఛమైన అద్దములు, గుట్టలు గుట్టలుగా వస్త్రములు, వేలకొలది పాదరక్షలు, అచట సిద్ధముగానుండెను.

ఆంజనీః కంకతాన్ కూర్చాన్ శస్త్రాణి చ ధనూంషి చ ।
మర్మత్రాణాని చిత్రాణి శయనాన్యాసనాని చ । 76

ప్రతిపానహ్రదాన్ పూర్ణాన్ ఖరోష్ట్రగజవాజినామ్ ।
అవగాహ్య సుతీర్థాంశ్చ హ్రదాన్ సోత్పలపుష్కరాన్ । 77

ఆకాశవర్ణప్రతిమాన్ స్వచ్ఛతోయాన్ సుఖప్లవాన్ ।
నీలవైడూర్యవర్ణాంశ్చ మృదూన్యవససంచయాన్ । 78

నిర్వాపార్థాన్ పశూనాం తే దదృశుస్తత్ర సర్వశః । 79

వ్యస్మయంత మనుష్యాస్తే స్వప్నకల్పం తదద్భుతమ్ ।
దృష్ట్వాఽఽతిథ్యం కృతం తాదృక్ భరతస్య మహర్షిణా । 80

ఇత్యేవం రమమాణానాం దేవానామివ నందనే ।
భరద్వాజాశ్రమే రమ్యే సా రాత్రిర్వ్యత్యవర్తత । 81

ప్రతిజగ్ముశ్చ తా నద్యో గంధర్వాశ్చ యథాగతమ్ ।
భరద్వాజమనుజ్ఞాప్య తాశ్చ సర్వా వరాంగనాః । 82

తథైవ మత్తా మదిరోత్కటా నరాః
తథైవ దివ్యాగరుచందనోక్షితాః ।
తథైవ దివ్యా వివిధాః స్రగుత్తమాః
పృథక్ ప్రకీర్ణా మనుజైః ప్రమర్దితాః । 83

కాటుకబరిణెలు, దువ్వెనలు, కూర్చలు, శస్త్రములు, ధనుస్సులు, మర్మస్థానములను రక్షించు కవచములు(కౌపీనములు), ఇంకను చిత్రవిచిత్రములైన పరుపులు, ఆసనములు అచట సిద్ధపఱచబడి యున్నవి. (73-76)

అచటివారందఱును చక్కని నీటిమడుగులను జూచిరి. అవి కంచరగాడిదలు, ఒంటెలు, ఏనుగులు, గుఱ్ఱములు మొదలగు జంతువులు మేతమేసిన పిమ్మట నీరుత్రాగుటకు వీలుగా ఉన్నవి. పశువులు దిగి స్నానముచేయుటకు అనువుగా ఉన్నవి. కలువలతో, కమలములతో నిండియున్న ఆకొలనులసొగసులు మిగుల అద్భుతముగా నున్నవి. ఆ మడుగులలోని జలములు ఆకాశమువలె నిర్మలములై ఈదులాడుటకు అనుకూలముగా ఉన్నవి. ఆ జలాశయముల చుట్టును 'యవస' గడ్డితోగూడిన పచ్చికబయళ్లు నీలవైడూర్యమణుల శోభలతో విలసిల్లుచున్నవి. ఆయాజంతువులు మేయుటకును, విశ్రాంతితీసికొనుటకును అనువుగా అవి మిక్కిలి మృదువుగా ఉన్నవి. (77-79)

భరతునకును, ఆయనపరివారములకును భరద్వాజమహర్షి జరిపిన అతిథిసత్కారములు నిరుపమానములై అత్యద్భుతముగా ఉండెను. వాటిని స్వానుభవముతో చూచి ఆనందించినవారు 'ఇది నిజమా లేక కలయా' అనియనుకొనుచు ఆశ్చర్యమున మునిగిపోయిరి. (80)

అతిథులందఱును నందనవనమునందు దేవతలవలె మనోహరమైన భరద్వాజాశ్రమమునందు క్రీడావిహారములతో ఆనందించుచు ఆ రాత్రిగడపిరి. (81)

నదులు, గంధర్వజాతివారు, అప్సరసలు మున్నగువారందఱును భరద్వాజమహర్షి అనుమతిని పొంది, తమతమ ప్రదేశములకు వెళ్లిపోయిరి. (82)

తెల్లవాఱినప్పటికిని మదిరాపానముచేసినవారిమత్తు వీడలేదు. వారు తమశరీరములకు అలదుకొనిన దివ్యములైన అగరుచందన లేపనములును అట్లేయున్నవి. వారు ధరించిన వివిధదివ్యపుష్ప మాలికలన్నియును వారు అటునిటుపొర్లుటచే నలిగి, వేర్వేఱుగా చెల్లాచెదరై పడియున్నవి. (83)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకనవతితమస్సర్గః (91)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదియొకటవసర్గము సమాప్తము

-- * * * --

92. తొంబదిరెండవసర్గము

భరద్వాజమహర్షిఅనుమతితో భరతుడు సపరివారముగా చిత్రకూటమునకు బయలుదేఱుట.

తతస్తాం రజనీమ్ వ్యుష్య భరతః సపరిచ్ఛదః ।
కృతాతిథ్యో భరద్వాజం కామాదభిజగామ హ । 1

భరతుడు భరద్వాజమహర్షి ఇచ్చిన ఆతిథ్యమును సపరివారముగా స్వీకరించి, ఆరాత్రి హాయిగా అచటగడపెను. శ్రీరాముని దర్శింపవలెనను కాంక్షతో అతడు వేకువజాముననేలేచి, ప్రయాణసన్నద్ధుడై, మహర్షిఅనుమతిని పొందుటకై ఆయనకడకువచ్చెను. (1)

తమ్ ఋషిః పురుషవ్యాఘ్రం ప్రాంజలిం ప్రేక్ష్య చాఽఽగతమ్।
హుతాగ్నిహోత్రో భరతం భరద్వాజోఽభ్యభాషత। 2

కచ్చిదత్ర సుఖా రాత్రిః తవాస్మద్విషయే గతా।
సమగ్రస్తే జనః కచ్చిత్ ఆతిథ్యే శంస మేఽనఘ!। 3

తమువాచాంజలిం కృత్వా భరతోఽభిప్రణమ్య చ।
ఆశ్రమాదభినిష్క్రాంతమ్ ఋషిమ్ ఉత్తమతేజసమ్। 4

సుఖోషితోఽస్మి భగవన్ సమగ్రబలవాహనః।
తర్పితః సర్వకామైశ్చ సామాత్యో బలవత్త్వయా। 5

అపేతక్లమసంతాపాః సుభిక్షాః సుప్రతిశ్రయాః।
అపి ప్రేష్యానుపాదాయ సర్వే స్మ సుసుఖోషితాః। 6

ఆమంత్రయేఽహం భగవన్! కామం త్వామ్ ఋషిసత్తమ!।
సమీపం ప్రస్థితం భ్రాతుః మైత్రేణేక్షస్వ చక్షుషా। 7

ఆశ్రమం తస్య ధర్మజ్ఞ! ధార్మికస్య మహాత్మనః।
ఆచక్ష్వ కతమో మార్గః కియానితి చ శంస మే। 8

ఇతి పృష్టస్తు భరతం భ్రాతృదర్శనలాలసమ్।
ప్రత్యువాచ మహాతేజా భరద్వాజో మహాతపాః। 9

భరతార్ధతృతీయేషు యోజనేష్వజనే వనే।
చిత్రకూటో గిరిస్తత్ర రమ్యనిర్దరకాననః। 10

ఉత్తరం పార్శ్వమాసాద్య తస్య మందాకినీ నదీ।
పుష్పితద్రుమసంఛన్నా రమ్యపుష్పితకాననా। 11

అనంతరం తత్సరితః చిత్రకూటశ్చ పర్వతః।
తయోః పర్ణకుటీ తాత! తత్ర తౌ వసతో ధ్రువమ్। 12

నరశ్రేష్ఠుడైన భరతుడు మహర్షికడకు వచ్చేసి, ప్రాంజలియై నిలబడెను. అగ్నికార్యములను ముగించుకొనియున్న ఆ మహాముని తనయెదుటనున్న ఆ రాజకుమారునిజూచి ఇట్లనుడివెను. (2)

"ఓ పుణ్యాత్మా! మా ఆశ్రమమున ఈ రాత్రి మీకు హాయిగా గడచినదా? మీ వారందఱును మా ఆతిథ్యమునకు సంతుష్టులే గదా! తెలుపుము." (3)

ఉత్తమతేజస్వియైన ఆ మహర్షి (కౌసల్యాదులకును దర్శనమిచ్చుటకై) తన ఆశ్రమమునుండి వెలుపలికిరాగా భరతుడు ఆయనకు సాష్టాంగ ప్రణామములను ఆచరించి, దోసిలొగ్గినవాడై, ఇట్లనెను. (4)

"ఓ పూజ్యమహర్షీ! మీ ఆశ్రమమునందు నేను, నా పరివారములు, వాహనములతో ఈ రాత్రి సుఖముగానుంటిమి. మీరు సమకూర్చిన అతిథిమర్యాదలతో నేను, నా అమాత్యులు, బలములు పూర్తిగా తృప్తిచెందితిమి. (5)

మీరు ఏర్పఱచిన వసతిగృహములలో నాకును, నా పరివారములకును బడలికలుతీఱినవి, సంతాపములు తొలగినవి. మీ యనుగ్రహముతో కమ్మని అన్నపానములను ఆరగించితిమి. మేమందఱమును ఇచట సుఖముగా గడపితిమి. (6)

ఓ పూజ్యమునీశ్వరా! మీకడ సెలవుదీసికొనుటకై వచ్చితిని. మా అన్నగారికడకు బయలుదేఱెదను. మీ వాత్సల్యదృష్టిని నాపై ప్రసరింపజేయుము నాకు అనుజ్ఞయిండు. (7)

ఓ ధర్మజ్ఞా! ధర్మనిరతుడును, మహాత్ముడును, ఐన శ్రీరాముని యొక్క ఆశ్రమము ఎక్కడఉన్నదో తెలుపుడు. అచటికి వెళ్ళుటకు మార్గమేమి? ఇచటికి అదియెంతదూరము? దయతో విపులముగా వివరింపుడు." (8)

అన్నను దర్శించుటకై తహతహపడుచున్న భరతుడు ఇట్లు ప్రార్థింపగా మహాతేజస్వియు, తపస్వియు ఐన భరద్వాజమహర్షి అతనితో ఇట్లనుడివెను. (9)

ఓ భరతా! ఈ ప్రయాగకు రెండున్నర యోజనముల (దశక్రోశ)[1] దూరములో చిత్రకూటపర్వతముగలదు. అచటి సెలయేళ్ళు, వనములు రమణీయముగానుండును. అచటివనములలో మునీశ్వరులుతప్ప మఱియెవ్వరును సంచరింపరు. ఆగిరికి ఉత్తరభాగమున 'మందాకిని' అను పేరుగల ఒకనదిగలదు. ఆనదియొక్క ఉభయతీరములును బాగుగా పుష్పించిన వృక్షములతోను, పుష్పకాననములతోను దర్శనీయములై విలసిల్లుచుండును. నాయనా! భరతా! ఆ మందాకినికి ఆవలివైపున చిత్రకూటపర్వతముగలదు. ఆరెండింటి మధ్య శ్రీరాముని పర్ణకుటీరముగలదు. అందు రామలక్ష్మణులు నివసించుచుందురు. ఇది నిశ్చయము. (10-12)

1) 'దశక్రోశ'-ఇచట ఏకశేషద్వంద్వవిధిని అనుసరించి, దశచ, దశచ, దశచ = దశ అని వివరించినచో, ఈ 'దశక్రోశ' సమాసపదమునకు ముప్పదిక్రోసులు అను అర్థమును గ్రహింపవచ్చును. ఒక క్రోసుఅనగా రెండుమైళ్ళు. 30×2 = 60 మైళ్ళు - వెరశి ప్రయాగనుండి చిత్రకూటమునకు 60 మైళ్ళదూరము ఉన్నట్లుతెలియును. ఇప్పటివారి కొలమానమునుబట్టి ఈ రెండింటిమధ్యదూరము ఎనుబదిమైళ్ళుగా పేర్కొనబడుచున్నది. ఆనాటివారి కొలమానమునకును ఆధునికుల కొలమానమునకునుగల తేడాలవలన ఈ 20 మైళ్ళభేదమును సర్దుకొనవచ్చును. లేదా ప్రయాగనుండి చిత్రకూటప్రారంభప్రదేశమునకు ఆనాడు అఱువది (60) మైళ్ళదూరమేయుండియుండవచ్చును.

దక్షిణేనైవ మార్గేణ సవ్యదక్షిణమేవ వా।
గజవాజిరథాకీర్ణాం వాహినీం వాహినీపతే।
వాహయస్వ మహాభాగ! తతో ద్రక్ష్యసి రాఘవమ్। 13

"ఓ మహాభాగా! యమునానదియొక్క దక్షిణతీరమును అనుసరించి వెళ్లినచో రెండుత్రోవలు కనిపించును. ఓ సర్వసైన్యాధ్యక్షా! ఆరెండింటిలో ఎడమవైపున దక్షిణదిశగాపోవు (నైరృతి) మార్గమున నీ చతురంగబలములను నడిపింపుము. అనంతరము నీకు శ్రీరాముని దర్శనము శీఘ్రముగా కాగలదు." (13)

ప్రయాణమితి తచ్ఛ్రుత్వా రాజరాజస్య యోషితః।
హిత్వా యానాని యానార్హా బ్రాహ్మణం పర్యవారయన్। 14

అప్పుడు కౌసల్యాది దశరథమహారాజపత్నులు ప్రయాణ వార్తను విని, వాహనములపై వెళ్లదగినవారైనను, వారు తమ వాహనములనుండి దిగి, భరద్వాజమహర్షికి ప్రదక్షిణనమస్కారముల నొనర్చిరి. (14)

వేపమానా కృశా దీనా సహ దేవ్యా సుమిత్రయా।
కౌసల్యా తత్ర జగ్రాహ కరాభ్యాం చరణౌ మునేః। 15

కౌసల్యాదేవి శ్రీరామునియెడబాటువలనను, పతివియోగమువలనను కృశించి, దీనురాలై యుండెను. పైగా వార్ధక్యకారణమున ఆమె వణకిపోవుచుండెను. అట్టి కౌసల్యాదేవి సుమిత్రాదేవితోగూడి భరద్వాజమహర్షిపాదములకు ప్రణమిల్లెను. (15)

అసమృద్ధేన కామేన సర్వలోకస్య గర్హితా।
కైకేయీ తస్య జగ్రాహ చరణౌ సవ్యపత్రపా। 16

తం ప్రదక్షిణమాగమ్య భగవంతం మహామునిమ్।
అదూరాద్భరతస్యైవ తస్థౌ దీనమనాస్తదా। 17

భరతునిపట్టాభిషిక్తునిచేయవలెనను తనకోరిక నెఱవేఱక పోవుటయేగాక నలుగురిలో నవ్వులపాలగుటచే కైకేయి మిగుల క్రుంగిపోవుచున్నది. దానికితోడుగా లోకనింద ఆమెను ఇంకను క్రుంగదీయుచున్నది. అందువలన ఆమె సిగ్గుతో తలయెత్తుకొనలేక ముఖమును నేలకువంచుకొని, భరద్వాజమహర్షి పాదములకు ప్రణమిల్లినది. పూజ్యుడైన ఆమహర్షికి ప్రదక్షిణమొనర్చి, ముఖమువెల్లవిచ్చి, ఆ దీనురాలైన కైకేయి భరతుని ప్రక్కనచేరి నిలబడినది. (16-17)

తతః పప్రచ్ఛ భరతం భరద్వాజో దృఢవ్రతః।
విశేషం జ్ఞాతుమిచ్ఛామి మాతౄణాం తవ రాఘవ! 18

అంతట భరద్వాజమహర్షి తాను సర్వజ్ఞుడైనప్పటికిని భరతునితో 'ఓ రాఘవా! మీతల్లులనుగూర్చి విశేషముగా తెలిసికొనగోరుచున్నాను'-అని పలికెను. (18)

ఏవముక్తస్తు భరతో భరద్వాజేన ధార్మికః।
ఉవాచ ప్రాంజలిర్భూత్వా వాక్యం వచనకోవిదః। 19

మహర్షి ఇట్లు అడుగగా ధర్మాత్ముడును మాటాడుటలో నేర్పరియు ఐన భరతుడు ఆమహామునికి నమస్కరించి, ఇట్లు వచించెను. (19)

యా మిమాం భగవన్! దీనాం శోకానశనకర్శితామ్।
పితుర్హి మహిషీం దేవీం దేవతామివ పశ్యసి। 20

ఏషా తం పురుషవ్యాఘ్రం సింహవిక్రాంతగామినమ్।
కౌసల్యా సుషువే రామం ధాతారమ్ అదితి ర్యథా। 21

"ఓ పూజ్యమహర్షీ! మాతండ్రియైన దశరథమహారాజునకు పట్టమహిషియు, పట్టరానిదుఃఖముచేతను, ఉపవాసముల వలనను మిగులకృశించి, మీసమక్షమున నిలిచియున్న ఈదీనురాలు కౌసల్యాదేవి. నరోత్తముడును, సింహవిక్రమముతో వేగగమనుడును ఐన శ్రీరామునకు, వామనునకు (విష్ణువునకు) అదితివలె ఈమె కన్నతల్లి. (20-21)

అస్యా వామభుజం శ్లిష్టా యైషా తిష్ఠతి దుర్మనాః।
ఇయం సుమిత్రా దుఃఖార్తా దేవీ రాజ్ఞశ్చ మధ్యమా।
కర్ణికారస్య శాఖేవ శీర్ణపుష్పా వనాంతరే। 22

ఏతస్యాస్తు సుతౌ దేవ్యాః కుమారౌ దేవవర్ణినౌ।
ఉభౌ లక్ష్మణశత్రుఘ్నౌ వీరౌ సత్యపరాక్రమౌ। 23

వణకుచున్న కౌసల్యాదేవికి ఊతగా ఆమెయెడమభుజమును అనుకొని, దుఃఖార్తయై నిలిచియున్న ఈమె మహారాజుగారి రెండవ భార్యయగు సుమిత్రాదేవి. ఈమె ఎట్టి ఆభరణములను ధరింపనిదై, వనమునందు పుష్పములన్నియును రాలిపోయిన గన్నేరుకొమ్మవలె బిక్కచిక్కియున్నది. అశ్వినీదేవతలవలె సుకుమారులును, మిగుల పరాక్రమశాలురును, మహావీరులును ఐన లక్ష్మణశత్రుఘ్నులు ఇరువురును ఈసాధ్వికుమారులే. (22-23)

యస్యాః కృతే నరవ్యాఘ్రౌ జీవనాశమితో గతౌ।
రాజా పుత్త్రవిహీనశ్చ స్వర్గం దశరథో గతః। 24

క్రోధనామకృతప్రజ్ఞాం దృప్తాం సుభగమానినీమ్।
ఐశ్వర్యకామాం కైకేయీమ్ అనార్యామార్యరూపిణీమ్। 25

మమైతాం మాతరం విద్ధి నృశంసాం పాపనిశ్చయామ్।
యతో మూలం హి పశ్యామి వ్యసనం మహదాత్మనః। 26

ఇత్యుక్త్వా నరశార్దూలో బాష్పగద్గదయా గిరా।
స నిశశ్వాస తామ్రాక్షో నాగః క్రుద్ధ ఇవ శ్వసన్। 27

భరద్వాజో మహర్షిస్తం బ్రువంతం భరతం తథా।
ప్రత్యువాచ మహాబుద్ధిః ఇదం వచనమర్థవత్। 28

న దోషేణావగంతవ్యా కైకేయీ భరత! త్వయా।
రామప్రవ్రాజనం హ్యేతత్ సుఖోదర్కం భవిష్యతి। 29

దేవానాం దానవానాం చ ఋషీణాం భావితాత్మనామ్।
హితమేవ భవిష్యద్ధి రామప్రవ్రాజనాదిహ। 30

అభివాద్య తు సంసిద్ధః కృత్వా చైనం ప్రదక్షిణమ్।
ఆమంత్ర్య భరతః సైన్యం యుజ్యతామిత్యచోదయత్। 31

తతో వాజిరథాన్ యుక్త్వా దివ్యాన్ హేమపరిష్కృతాన్।
అధ్యారోహత్ ప్రయాణార్థీ బహూన్ బహువిధో జనః। 32

గజకన్యా గజాశ్చైవ హేమకక్ష్యాః పతాకినః।
జీమూతా ఇవ ఘర్మాంతే సఘోషాః సంప్రతస్థిరే। 33

వివిధాన్యపి యానాని మహాంతి చ లఘూని చ।
ప్రయయుః సుమహార్హాణి పాదైరేవ పదాతయః। 34

అథ యానప్రవేకైస్తు కౌసల్యాప్రముఖాః స్త్రియః।
రామదర్శనకాంక్షిణ్యః ప్రయయుర్ముదితాస్తదా। 35

వాసమీపమున ఇచటనిలబడియున్న ఈమెయే నాతల్లియగు కైకేయి. ఈమె మిగులక్రోధస్వభావురాలు, వివేకశూన్యురాలు, తానే గొప్పసుందరిననీ, ఐశ్వర్యవంతురాలనని గర్వపడుచుండునది, రాజ్యలోభముగలది, ఐశ్వర్యదాహముగలది. రూపమునుబట్టి (పైపైన) ఉత్తమురాలుగా కన్పించుచున్నను ఆ అర్హతలులేనట్టిది, క్రూరాత్మురాలు, పాపబుద్ధిగలది. ఈమె కారణముననే నరశ్రేష్ఠులైన రామలక్ష్మణులు దుష్టరాక్షసులతో నిండిన దండకారణ్యముల పాలైరి. ఈమెవలననే మాతండ్రి దశరథమహారాజు పుత్త్రుని యెడబాటునకు గురియై పరలోకగతుండయ్యెను. నా ఇక్కట్లకు అన్నింటికిని ఈమెయే మూలము." (24-26)

నరశ్రేష్ఠుడైన భరతుడు కన్నీరుగార్చుచు, తడబడుచు ఈవిధముగా పలికి, క్రోధకారణముగా కన్నులు ఎఱ్ఱబారినవాడై, దెబ్బతినిన త్రాచుపామువలె బుసలుకొట్టుచు నిట్టూర్పులు విడిచెను. (27)

ఈవిధముగా పలుకుచున్న భరతునితో శ్రీరామవనవాస ప్రయోజనమును బాగుగా ఎఱిగిన భరద్వాజమహర్షి అర్థయుక్తముగా ఇట్లనుడివెను. (28)

"ఓ భరతా! నీవు కైకేయిని తప్పుపట్టవద్దు. ఆమెదోషము ఏమియులేదు. శ్రీరామునివనవాసము భవిష్యత్తులో ఎల్లరకును సుఖశాంతులను వర్ధిల్లజేయును. శ్రీరాముడు దండకారణ్యములకు చేరుటవలన దేవతలకును, దానవులకును, భగవద్ధ్యానరతులైన మహర్షులకును, ఈజగత్తునకును హితమే జరుగును."[1] (29-30)

అంతట భరతుడు శ్రీరామునినివాసప్రదేశమును, అచటికి వెళ్లుమార్గములను మహర్షివలనఎఱింగి, ఆయనఆశీస్సులను గైకొని, వెళ్లుటకు అనుమతినిపొందెను. పిమ్మట అతడు ప్రయాణమునకు సిద్ధముకావలసినదిగా సైన్యమును ఆదేశించెను. (31)

వెంటనే వివిధవర్గములవారును ప్రయాణసన్నద్ధులై, బంగారు ఆభరణములతో అలంకరింపబడిన, దివ్యములైన పెక్కుగుఱ్ఱములను, రథములను సిద్ధపఱచి, వాటిని అధిరోహించిరి. (32)

ఆడుఏనుగులకును, మగఏనుగులకును నడుములకు బంగారుత్రాళ్లు కట్టబడియుండెను. వాటిపై పతాకములను ఎగురవేసిరి. ఆ ఏనుగులన్నియును వర్షాకాలప్రారంభమున మేఘములు గర్జించునట్లు ఘీంకారనాదములను గావించుచు అచటినుండి బయలుదేఱెను. (33)

అమూల్యములైనవి, చిన్నవి, పెద్దవివైన వివిధములగు వాహనములపై యోధులు ఎల్లరును బయలుదేఱిరి. కాల్బలముల వారు కాలినడకతో వారిని అనుసరించిరి. (34)

పిమ్మట కౌసల్యాదేవి మొదలగురాణులు సముచితములైన వాహనములను ఎక్కి, శ్రీరాముని దర్శింపవలెననెడి ఉత్సాహముతో సంతోషపడుచు అచటినుండి ప్రయాణమైరి. (35)

1) 'ఈ సందర్భమున తులసీదాసమహాకవి' రామచరితమానసమునందు పేర్కొనినవాక్యములు గమనింపదగియున్నవి.
నీ తల్లి చేసిన కృత్యమునకు నీవు చింతింపకుము. నాయనా! వాస్తవముగా ఇందులో కైకేయి దోషముకూడ లేదు. ఆమెబుద్ధిని సరస్వతీదేవి కలుషితమొనర్చినది. కాని భరతా! ఇప్పుడు నీవు చేసినపని మిక్కిలి ఉత్తమమైనది. సముచితమైనది. రఘునాథుని చరణములపై భక్తి కలుగుటయే సమస్త శుభములకు మూలము. రా - చ - మా. అయోధ్య. కాం - దోహా 206,207

చంద్రార్కతరుణాభాసాం నియుక్తాం శిబికాం శుభామ్।
ఆస్థాయ ప్రయయౌ శ్రీమాన్ భరతః సపరిచ్ఛదః। 36

సా ప్రయాతా మహాసేనా గజవాజిరథాకులా।
దక్షిణాం దిశమావృత్య మహామేఘఇవోత్థితః। 37

వనాని తు వ్యతిక్రమ్య జుష్టాని మృగపక్షిభిః।
గంగాయాః పరవేలాయాం గిరిష్వపి నదీషుచ। 38

సా సంప్రహృష్టద్విపవాజియోధా
విత్రాసయంతీ మృగపక్షి సంఘాన్ ।
మహద్వనం తత్ప్రతిగాహమానా
రరాజ సేనా భరతస్య తత్ర । 39

శుభలక్షణసంపన్నుడైన భరతుడు వసిష్ఠాదిమహర్షుల ఆమోదముతో, ఉదయించుచున్న సూర్యచంద్రులకాంతులతో విలసిల్లుచున్న పల్లకినెక్కి, తనపరివారములతోగూడి బయలుదేఱెను. గజయూథములతో, అశ్వములసమూహములతో, వరుసలుదీఱిన రథములతోగూడిన ఆమహాసేన దక్షిణదిశగాకదలి, దట్టమైన మేఘములవలె బయలుదేఱెను. ఆసేన గంగానదియొక్క పశ్చిమభాగమునగల పర్వతములయందును, నదీతీరప్రదేశములయందును మధ్య మధ్య ఆగుచు, మృగములతో, పక్షులతో నిండిన వనములను దాటుచు ముందునకుసాగెను. (36-38)

గజాశ్వయోధులతోగూడిన ఆభరతునిసేన చక్కగా శోభిల్లుచు మహోత్సాహముతో సాగిపోవుచుండగా, పరిసరములలోని మృగములును, పక్షులును భీతిల్లుచుండెను. క్రమముగా ఆసేన ఒక మహావనమున ప్రవేశించెను. (39)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్వినవతితమస్సర్గః (92)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదిరెండవసర్గము సమాప్తము

-- * * * --

93. తొంబదిమూడవసర్గము

భరతుడు తన పరివారములతోగూడి, వనప్రదేశములఅందచందములను దర్శించుచు ముందునకు సాగుట పొగలుపైకిలేచుచున్న ప్రదేశమును గమనించుట.

తయా మహత్యా యాయిన్యా ధ్వజిన్యా వనవాసినః।
అర్దితా యూథపా మత్తాః సయూథాః సంప్రదుద్రువుః। 1

అట్లు వనములలో ప్రయాణముచేయుచున్న మహాసేనను జూచి భీతిల్లిన మదపుటేనుగులు మున్నగు వన్యమృగములు తమగుంపులతోగూడి, పరుగులుదీసినవి. (1)

ఋక్షాః పృషతసంఘాశ్చ రురవశ్చ సమంతతః।
దృశ్యంతే వనరాజీషు గిరిష్వపి నదీషు చ। 2

ఎలుగుబంట్లు, చుక్కలదుప్పులు, చుక్కలులేనిదుప్పులు వనములయందును, పర్వతములయందును, నదీతీరములయందును ఆసేననుజూచుచు బిత్తరచూపులతో నిలబడిపోయినవి. (2)

స సంప్రతస్థే ధర్మాత్మా ప్రీతో దశరథాత్మజః।
వృతో మహత్యా నాదిన్యా సేనయా చతురంగయా। 3

రథచక్రములసవ్వడులతో, ఏనుగులఘీంకారములతో, గుఱ్ఱముల సకిలింపులతో, కాల్బలముల కోలాహలములతో ఒప్పుచున్న ఆమహాసేనతో పరివృతుడై, ధర్మాత్ముడును, దశరథునిసుతుడును ఐన ఆభరతుడు త్వరలో సీతారాములదర్శనము కానున్నదను సంతోషముతో సాగిపోవుచుండెను. (3)

సాగరౌఘనిభా సేనా భరతస్య మహాత్మనః।
మహీం సంఛాదయామాస ప్రావృషి ద్యామివాంబుదః। 4

మహాత్ముడైన భరతునిసేన సాగరమువలె అపారమై, వర్షాకాలము నందు మేఘసముదాయము ఆకాశమునువలె భూమిని కప్పివేసెను. (4)

తురంగౌఘైరవతతా వారణైశ్చ మహాజవైః।
అనాలక్ష్యా చిరం కాలం తస్మిన్ కాలే బభూవ భూః। 5

నిరంతరము అశ్వములు, గజములు ఏమాత్రము ఎడము లేకుండా అమితవేగముతో సాగిపోవుచుండగా ఆసమయమున ఎంతసేపటికిని భూమికొంచెముగూడ కనబడకుండెను. (5)

స యాత్వా దూరమధ్వానం సుపరిశ్రాంతవాహనః।
ఉవాచ భరతః శ్రీమాన్ వసిష్ఠం మంత్రిణాం వరమ్। 6

ఎంతోదూరము ఏకధాటిగా వేగముగా పయనించుచుండుటచే భరతునిసేనలు, వాహనములు అన్నియును మిగుల అలసిపోయెను. అప్పుడు భరతుడు పరిస్థితిని గమనించి, చక్కని సమయస్ఫూర్తి ఆలోచనాశక్తి కలవారిలో మేటియైన వసిష్ఠమహామునితో ఇట్లనెను. (6)

యాదృశం లక్ష్యతే రూపం యథా చైవ శ్రుతం మయా।
వ్యక్తం ప్రాప్తాః స్మ తం దేశం భరద్వాజో௨ యమబ్రవీత్। 7

అయం గిరిశ్చిత్రకూట ఇయం మందాకినీ నదీ।
ఏతత్ ప్రకాశతే దూరాత్ నీలమేఘనిభం వనమ్। 8

గిరేః సానూని రమ్యాణి చిత్రకూటస్య సంప్రతి।
వారణైరవమృద్యంతే మామకైః పర్వతోపమైః। 9

ముంచంతి కుసుమాన్యేతే నగాః పర్వతసానుషు।
నీలా ఇవాతపాపాయే తోయం తోయధరా ఘనాః। 10

కిన్నరాచరితం దేశం పశ్య శత్రుఘ్న! పర్వతమ్।
మృగైః సమంతాదాకీర్ణం మకరైరివ సాగరమ్। 11

ఏతే మృగగణా భాంతి శీఘ్రవేగాః ప్రచోదితాః।
వాయుప్రవిద్ధాః శరది మేఘరాజిరివాంబరే। 12

కుర్వంతి కుసుమాపీడాన్ శిరస్సు సురభీనమీ।
మేఘప్రకాశైః ఫలకైః దాక్షిణాత్యా యథా నరాః। 13

నిష్కూజమివ భూత్వేదం వనం ఘోరప్రదర్శనమ్।
అయోధ్యేవ జనాకీర్ణా సంప్రతి ప్రతిభాతి మా। 14

ఖురైరుదీరితో రేణుః దివం ప్రచ్ఛాద్య తిష్ఠతి।
తం వహత్యనిలః శీఘ్రం కుర్వన్నివ మమ ప్రియమ్। 15

స్యందనాంస్తురగోపేతాన్ సూతముఖ్యైరధిష్ఠితాన్।
ఏతాన్ సంపతతః శీఘ్రం పశ్య శత్రుఘ్న! కాననే। 16

ఏతాన్ విత్రాసితాన్ పశ్య బర్హిణః ప్రియదర్శనాన్।
ఏతమావిశతః శీఘ్రమ్ అధివాసం పతత్రిణః। 17

అతిమాత్రమయం దేశో మనోజ్ఞః ప్రతిభాతి మా।
తాపసానాం నివాసో௨యం వ్యక్తం స్వర్గపథో యథా। 18

"ఓ మహాముని! భరద్వాజమహర్షి తెలిపిన ప్రదేశము ఇదియేయని తోచుచున్నది. ఆయన చెప్పిన గుర్తులన్నియును ఈ ప్రదేశమున కనబడుచున్నవి. కనుక ఇప్పుడు మనము చిత్రకూటమునకును మందాకినికిని మధ్యగల ప్రదేశమునకు చేరినట్లు తలంచుచున్నాను. (7)

అదిగో! అదియే చిత్రకూటపర్వతము. ఇదిగో! ఇదియే మందాకినీ నది. దూరముగానున్న ఆ పర్వత సమీపమునగల వనము నీలమేఘ సమూహమువలె గన్పట్టుచున్నది. పర్వతములవలె ఒప్పుచున్న మన ఏనుగులు ఇప్పుడు రమ్యములైన చిత్రకూటపర్వతసానువులపై నడచుచున్నవి. వర్షాకాలప్రారంభసమయమున సజలములైన నీలమేఘములు జలములను వర్షించునట్లు ఈ (వకుళ) వృక్షములు పర్వతసానువులపై పుష్పములను వర్షించుచున్నవి." (8-10)

"ఓ శత్రుఘ్నా! ఎల్లప్పుడును కిన్నరులు విహరించెడి భూమియిది. మొసళ్ళచే నిండియున్న సాగరమువలె ఈ ప్రదేశము అంతయును మృగములచే వ్యాప్తమైయున్నది. మన సైనికుల కదలికలచే భయపడిన మృగముల గుంపులన్నియును శరత్కాలమునందు ఆకాశమున వాయువుచే తరుమబడిన మేఘములవలె పరుగులుదీయుచున్నవి. (11-12)

దక్షిణదేశమునందలి నారీమణులు నీలమేఘములవలెనున్న తమ నల్లని కొప్పులపై పుష్పములను ధరించినట్లుగా పర్వతసానువుల యందుగల ఈ వృక్షములు తమ నల్లని శాఖలపై పరిమళభరితములైన పుష్పములను ధరించియున్నవి. (13)

పూర్వము ఈ వనప్రదేశము జనసంచారములేక నిశ్శబ్దమై మిగుల భయంకరముగానుండెడిది. కాని ఇప్పుడు ఇది అసంఖ్యాకులైన మనవారితో నిండియుండుటచే కలకలలాడుచు నాకు అయోధ్యను స్ఫురింపజేయుచున్నది. (14)

గుఱ్ఱముల గిట్టలచే ఎగురగొట్టబడిన దుమ్ము ఆకాశమును, వనమును కప్పివేయుచున్నది. కాని వాయువు నాకు ప్రియమును కల్గించుటకా (శ్రీరాముని దర్శనమును కల్గించుటకా) యనునట్లు ఆ దుమ్మును మఱియొకచోటికి తీసికొనిపోవుచున్నది. (15)

ఓ శత్రుఘ్నా! ఈ రథములకు మేలుజాతిగుఱ్ఱములు పూన్చబడియున్నవి. వీటిపై సమర్థులైన సారథులు అధిష్ఠించియుండిరి. కావున ఇవియిప్పుడు ఈ వనమున రాముని త్వరగా దర్శింపవలెననెడి కుతూహలముతో శీఘ్రముగా వెళ్ళుచున్నవి. ఈ రథములను ఒకపర్యాయము పరికించిచూడుము. (16)

అందమైన తెక్కలుగలిగి, కనువిందుగావించుచున్న ఈ నెమళ్ళు మనపరివారము కోలాహలములకు భయపడి, ఈ పర్వతమునందుగల తమ తమ నివాసప్రదేశములకు త్వరత్వరగా పరుగిడుచున్నవి. ఒక్కసారి వాటివైపు చూడుము. (17)

ఈ ప్రదేశము అత్యంతము మనోహరముగా కన్పట్టుచున్నది. తాపసులకు నివాసస్థానమైయున్న ఈ ప్రదేశము నిజముగా స్వర్గమునకు మార్గమే. (18)

మృగా మృగీభిః సహితా బహవః పృషతా వనే।
మనోజ్ఞరూపా లక్ష్యంతే కుసుమైరివ చిత్రితాః। 19

పూవులతో అలంకరింపబడినవాయునట్లు చారలుగల పెక్కు దుప్పులు ఈవనమున ఆడులేళ్లతోగూడి విహరించుచు మనోజ్ఞముగా కన్పట్టుచున్నవి. (19)

సాధు సైన్యాః ప్రతిష్ఠంతాం విచిన్వంతు చ కాననే।
యథా తౌ పురుషవ్యాఘ్రౌ దృశ్యేతే రామలక్ష్మణౌ। 20

పురుషశ్రేష్ఠులైన ఆరామలక్ష్మణులు కనబడునంతవఱకును మనసైనికులు ఈఅడవియందంతటను తిరుగుచు బాగుగా వెదకుదురుగాక." (20)

భరతస్య వచః శ్రుత్వా పురుషాః శస్త్రపాణయః।
వివిశుస్తద్వనం శూరా ధూమం చ దదృశుస్తతః। 21

తే సమాలోక్య ధూమాగ్రమ్ ఊచుర్భరతమాగతాః।
నామనుష్యే భవత్యగ్నిః వ్యక్తమత్రైవ రాఘవౌ। 22

భరతునిఆదేశమును అందుకొని శస్త్రములను చేబట్టిన పెక్కుమంది వీరులు ఆవనమునందు ప్రవేశించిరి. వారు తమఅన్వేషణలో కొంత దూరమువెళ్లిన పిమ్మట వారికి మఱికొంతదూరమున పొగలు కన్పించెను. వారు ఆపొగలజాడలను గమనించిన పిదప భరతునికడకునచ్చి ఇట్లుపలికిరి. "ఓ ప్రభూ! మాకు పొగలు కనబడినవి. పొగలున్నచోట అగ్ని ఉండును. మనుష్యులు లేనిచోట అగ్నిఉండుట అసంభవము. కనుక అచట రామలక్ష్మణులు ఉండియుండవచ్చునని మా తలంపు." (21-22)

అథ నాఽత్ర నరవ్యాఘ్రౌ రాజపుత్రౌ పరంతపౌ।
అన్యే రామోపమాః సంతి వ్యక్తమత్ర తపస్వినః। 23

నరశ్రేష్ఠులును, శత్రుభయంకరులును, మహారాజకుమారులును ఐన రామలక్ష్మణులు ఒకవేళ అక్కడలేకున్నచో శ్రీరామునివలె తేజోమూర్తులైన తాపసులుమాత్రము అచట తప్పకయుందురు." (23)

తచ్ఛ్రుత్వా భరతస్తేషాం వచనం సాధుసమ్మతమ్।
సైన్యానువాచసర్వాంస్తాన్ అమిత్రబలమర్దనః। 24

సజ్జనులు మెచ్చదగిన, వారిమాటలను వినినపిమ్మట శత్రుమర్దనుడైన భరతుడు సైనికులనందఱిని ఉద్దేశించి ఇట్లుపలికెను. (24)

యత్తా భవంతస్తిష్ఠంతు నేతో గంతవ్యమగ్రతః।
అహమేవ గమిష్యామి సుమంత్రో గురురేవ చ। 25

ఏవముక్తాస్తతః సర్వే తత్ర తస్థుః సమంతతః।
భరతో యత్ర ధూమాగ్రం తత్ర దృష్టిం సమాదధాత్। 26

"ప్రశాంతముగా మీరు ఇచటనేయుండుడు. ఇక్కడినుండి ముందుకు కదలకుడు. సుమంత్రునితో, గురువైన వసిష్ఠునితో గూడి నేనే వెళ్లెదను." -భరతుని ఆజ్ఞను శిరసావహించి, వారందఱును అచటనేయుండిరి. భరతుడు ఆపొగలజాడలపైననే తనదృష్టినినిల్పెను. (25-26)

వ్యవస్థితా యా భరతేన సా చమూః
నిరీక్షమాణాఽపి చ ధూమమగ్రతః।
బభూవ హృష్టా న చిరేణ జానతీ
ప్రియస్య రామస్య సమాగమం తదా। 27

భరతునిఆజ్ఞానుసారము ఆ సైనికులు అచటనేయుండిపోయిరి. పిదప వారు ఆ ధూమశిఖలపైనే చూచుచు 'అతిత్వరలో శ్రీరాముని దర్శింపగలము' అని ఉవ్విళ్లూరుచు సంతోషముతో నిరీక్షింపసాగిరి. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రిణవతితమస్సర్గః (93)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదిమూడవసర్గము సమాప్తము

-- * * * --

94. తొంబదినాల్గవసర్గము

శ్రీరాముడు సీతాదేవితోగూడి చిత్రకూటపర్వతప్రదేశమున విహరించుచు ఆ వనశోభలను వర్ణించిచెప్పుట.

దీర్ఘకాలోషితస్తస్మిన్ గిరౌ గిరివనప్రియః।
వైదేహ్యాః ప్రియమాకాంక్షన్ స్వంచ చిత్తం విలోభయన్। 1

శ్రీరామునకు గిరులను దర్శించుటయందును, వనములలో విహరించువిషయమునను మక్కువ ఎక్కువ. సీతాలక్ష్మణులతో గూడి శ్రీరాముడు ఆ చిత్రకూటపర్వతమునందు చాలకాలము గడిపెను. పిదప ఒకనాడు అమరతుల్యుడైన ఆ రఘురాముడు విదేహరాజకుమారియైన సీతాదేవికి ప్రియమును గూర్చుటకును,

అథ దాశరథిశ్చిత్రం చిత్రకూటమదర్శయత్।
భార్యామమరసంకాశః శచీమివ పురందరః। 2

న రాజ్యాద్భ్రంశనం భద్రే! న సుహృద్భిర్వినా భవః।
మనో మే బాధతే దృష్ట్వా రమణీయమిమం గిరిమ్। 3

పశ్యేమమచలం భద్రే! నానాద్విజగణాయుతమ్।
శిఖరైః ఖమివోద్విద్ధైః ధాతుమద్భిర్విభూషితమ్। 4

కేచిద్రజతసంకాశాః కేచిత్ క్షతజసన్నిభాః।
పీతమాంజిష్ఠవర్ణాశ్చ కేచిన్మణివరప్రభాః। 5

పుష్యార్కకేతకాభాశ్చ కేచిజ్జ్యోతీరసప్రభాః।
విరాజంతేఽచలేంద్రస్య దేశా ధాతువిభూషితాః। 6

నానామృగగణద్వీపితరక్ష్వృక్షగణైర్వృతః ।
అదుష్టైర్భాత్యయం శైలో బహుపక్షిసమాయుతః। 7

ఆమ్రజంబ్వసనైర్లోధ్రైః పియాలైః పనసైర్ధవైః।
అంకోలైర్భవ్యతినిశైః బిల్వతిందుకవేణుభిః। 8

కాశ్మర్యరిష్టవరుణైః మధూకైస్తిలకైస్తథా।
బదర్యామలకైర్నీపైః వేత్రధన్వనబీజకైః। 9

పుష్పవద్భిః ఫలోపేతైః ఛాయావద్భిర్మనోరమైః।
ఏవమాదిభిరాకీర్ణః శ్రియం పుష్యత్యయం గిరిః। 10

శైలప్రస్థేషు రమ్యేషు పశ్యేమాన్ రోమహర్షణాన్।
కిన్నరాన్ ద్వంద్వశో భద్రే రమమాణాన్ మనస్వినః। 11

శాఖావసక్తాన్ ఖడ్గాంశ్చ ప్రవరాణ్యంబరాణి చ।
పశ్య విద్యాధరస్త్రీణాం క్రీడోద్దేశాన్ మనోరమాన్। 12

ఆవిధముగా తాను ఆనందించుటకును, ఇంద్రుడు శచీదేవికివలె చిత్రవిచిత్రములైన చిత్రకూటపర్వతశోభలను ఆమెకు చూపుచు ఇట్లు నుడివెను. (1-2)

"ఓ శుభాంగీ! రాజ్యాధికారము నాకు దూరమైనప్పటికిని, హితైషులైన మిత్రులు నాకు చేరువలో లేనప్పటికిని, ఈ చిత్రకూటమునందలి రమణీయ దృశ్యములను చూచుచు ఆనందించుటలో నిమగ్నమైన నా మనస్సును ఆవిషయములు ఏవియు కలవరపెట్టుటలేదు. (3)

ఓ సుందరీ! ఈ చిత్రకూటపర్వతముయొక్క అందచందములపై ఒక్కసారి నీ దృష్టిని ప్రసరింపజేయుము. ఇందు వివిధములగు పక్షులు మధురధ్వనులు గావించుచున్నవి. దీని యొత్తైన శిఖరములు ఆకసమును తాకుచున్నవి. ఆ శిఖరములనుండి జాలువాఱుచున్న గైరికాదిధాతువులు కనువిందు గావించుచున్నవి. (4)

గైరికాదిధాతువులచే రమ్యముగానున్న గిరిశిఖరములలో కొన్ని ప్రదేశములు మిగుల స్వచ్ఛములై అలరారుచున్నవి. కొన్ని వెండివంటి కాంతులతో విలసిల్లుచున్నవి. కొన్ని ఎఱుపుతోగూడిన పసుపువన్నెతో రాజిల్లుచున్నవి. కొన్ని ఇంద్రనీలమణులకాంతులతో విరాజిల్లుచున్నవి. కొన్ని పుష్యరాగములవలె శోభిల్లుచున్నవి. కొన్ని స్ఫటికములవలె తెల్లనైనవి. కొన్ని కొంచెముగా తెలుపువన్నె గలిగియున్నవి. కొన్ని నక్షత్రములవలె తళుకులీనుచున్నవి. కొన్ని పాదరసమువలె ఒప్పుచున్నవి. (5-6)

ఈ పర్వతమునందు నానావిధములగు మృగములు సంచరించుచున్నవి. బహువిధములైన పక్షులగుంపులు నివసించుచున్నవి. పెద్దపులులు, చిఱుతపులులు, ఎలుగుబంట్లు మొదలగు క్రూరమృగములు సైతము మునుల ప్రభావముచే తమ హింసాప్రవృత్తిని విడనాడి తిరుగాడుచున్నవి. అందువలన ఈ శైలము ప్రశాంతముగా ఆహ్లాదకరమై యొప్పుచున్నది. (7)

ఈ పర్వతము మామిడి, నేరేడు, వేగిస, లొద్దుగువెట్లతోడను, మోరటి, పనస, చంద్రచెట్లతోడను, ఊడుగు, గజపిప్పలి, నెమ్మి, మారేడు, తుమ్మిచెట్లతోడను, వెదుళ్లపొదలతోడను, టేకు, వేప, ఉలిమిరి, ఇప్ప, తిలక వృక్షములతోడను, రేగు, ఉసిరిక, మంకెనచెట్లతోడను, వేత్రవృక్షములతోడను, ఏఱుమద్ది, దానిమ్మ మొదలగు వివిధ వృక్షములతోడనుగూడి నేత్రపర్వమై యొప్పుచున్నది. ఈ వృక్షములు పుష్పఫలభరితములై చూడముచ్చటగానున్నవి. తమ చల్లని నీడలతో ప్రాణికోటికి హాయిని గొలుపుచున్నవి. ఈవిధముగా ఈ పర్వతము అత్యద్భుతశోభలతో అలరారుచున్నది. (8-10)

ఓ కల్యాణీ! ఆహ్లాదకరమైన కొండచరియలయందు పరస్పర ప్రేమానురాగములతో జంటలు జంటలుగా విహరించుచు, చూచెడివారికి గగుర్పాటుగూర్చుచున్న ఈ కిన్నరజాతివారిని జూడుము. (11)

విద్యాధరయువతులు చెట్లకొమ్మలపైనుంచిన, ఖడ్గములను, అమూల్యములైన వస్త్రములను వారు విహరించుచున్న సుందర ప్రదేశములను దర్శింపుము. (12)

జలప్రపాతైరుద్భేదైః నిష్యందైశ్చ క్వచిత్ క్వచిత్।
స్రవద్భిర్భాత్యయం శైలః స్రవన్మద ఇవ ద్విపః॥ 13

ఈపర్వతమునపై కొన్నిచోట్ల జలపాతములు పైనుండి క్రిందికి దూకుచున్నవి. మఱికొన్నిచోట్ల భూమిని చీల్చుకొనుచు నీటిఊటలు స్రవించుచున్నవి. అక్కడక్కడ చిన్నచిన్న ప్రవాహములు కనువిందు గావించుచున్నవి. వివిధ ప్రవాహములతోగూడిన ఈపర్వతము మదధారలను స్రవించుచున్న మత్తగజమువలె విరాజిల్లుచున్నది. (13)

గుహాసమీరణో గంధాన్ నానాపుష్పభవాన్ వహన్।
ఘ్రాణతర్పణమభ్యేత్య కం నరం న ప్రహర్షయేత్॥ 14

వివిధములగు పూలవాసనలను మోసికొనుచు ఈకొండగుహల నుండి వచ్చుచున్నవాయువులు ఘ్రాణతర్పణమొనర్చుచున్నవి. ఈసుగంధములకు ఆనందింపనివారు ఎవ్వరు? (14)

యదీహ శరదోఽనేకాః త్వయా సార్ధమనిందితే!।
లక్ష్మణేన చ వత్స్యామి న మాం శోకః ప్రధక్ష్యతి॥ 15

ఓ సర్వాంగసుందరీ! ఈవనమునందు ఆనందప్రదమైన సీతాహచర్యమువలనను, భక్తిప్రపత్తులతోగూడిన లక్ష్మణునిసేవలతోను పెక్కు సంవత్సరములు హాయిగాగడపినచో అయోధ్యానగరమును త్యజించుటవలన గలిగిన దుఃఖము నన్నేమాత్రము బాధింపదు. (15)

బహుపుష్పఫలే రమ్యే నానాద్విజగణాయుతే।
విచిత్రశిఖరే హ్యస్మిన్ రతవానస్మి భామిని!॥ 16

ఓభామినీ! ఈపర్వతశిఖరములు చిత్రవిచిత్రములుగానున్నవి. ఇందలి వృక్షములు పుష్పఫలభరితములై రమణీయముగానున్నవి. నానావిధములైన పక్షులకు ఇది ఆటపట్టైయున్నది. ఆహ్లాదకరమైన ఈపర్వతము నామనస్సును దోచుకొనుచున్నది. (16)

అనేన వనవాసేన మయా ప్రాప్తం ఫలద్వయమ్।
పితుశ్చానృణతా ధర్మే భరతస్య ప్రియం తథా॥ 17

ఓజానకీ! వనవాసముచేయుటవలన తండ్రిఆదేశమును పాటించుట ద్వారా పితృఋణమును దీర్చుకొనుట, తమ్ముడైన భరతునకు ప్రియమును చేకూర్చుట అను రెండు ఫలములు నాకు దక్కినవి. (17)

వైదేహి! రమసే కచ్చిత్ చిత్రకూటే మయా సహ।
పశ్యంతీ వివిధాన్ భావాన్ మనోవాక్కాయసంయతాన్॥ 18

ఓవైదేహీ! మనోవాక్కాయములకు ఆహ్లాదమునుగూర్చుచున్న పలువిధములగు ఈమనోజ్ఞ దృశ్యములను ఈచిత్రకూటపర్వతమున నాతోగూడి విహరించుచు నీవును దర్శించుచుంటివి. ... నీవును ఆనందించుచున్నావు గదా! (18)

ఇదమేవామృతం ప్రాహూ రాజ్ఞి! రాజర్షయః పరే।
వనవాసం భవార్థాయ ప్రేత్య మే ప్రపితామహాః॥ 19

ఓరాణీ! మావంశమునకు మూలపురుషులైన మనువు మొదలగు రాజర్షులు నియమపూర్వకముగా వనవాసముచేసినచో అమృతత్వము లభించునని తెలిపియుండిరి. కనుక దీనివలన తనువులను చాలించిన పిమ్మట పరమపదములభించును. (19)

శిలాః శైలస్య శోభంతే విశాలాః శతశోఽభితః।
బహులా బహులైర్వర్ణైః నీలపీతసితారుణైః॥ 20

ఈపర్వతమునకు నలుదిక్కులగల విశాలములైన వందలకొలది శిలలు నీలము, పసుపు, తెలుపు, ఎఱుపు మొదలగు పలురంగులతో బహువిధములుగా విలసిల్లుచున్నవి. (20)

నిశి భాంత్యచలేంద్రస్య హుతాశనశిఖా ఇవ।
ఓషధ్యః స్వప్రభాలక్ష్మ్యా భ్రాజమానాః సహస్రశః॥ 21

ఈమహాపర్వతముమీద అద్భుతమైన తమసహజకాంతులతో ప్రకాశించుచున్న వేలకొలది ఓషధులు రాత్రులయందు అగ్నిజ్వాలలవలె వెలుగులను వెదజల్లుచున్నవి. (21)

కేచిత్ క్షయనిభా దేశాః కేచిదుద్యానసన్నిభాః।
కేచిదేకశిలా భాంతి పర్వతస్యాస్య భామిని!॥ 22

ఓసుందరీ! ఈగిరియందు కొన్నితావులలోగల గుహాలు పలు సౌకర్యములతో గృహములవలె నివాసయోగ్యములుగానున్నవి. కొన్నిప్రదేశములు సంపెంగ, మాలతిమొదలగు పూలచెట్లతో విలసిల్లుచు ఉద్యానవనములవలె విహరించుటకు అనువుగానున్నవి. కొన్నిచోట్ల ఒకేశిలతో ఇది ఎంతోదూరము వ్యాపించియున్నది. (22)

భిత్త్వేవ వసుధాం భాతి చిత్రకూటః సముత్థితః।
చిత్రకూటస్య కూటోఽసౌ దృశ్యతే సర్వతః శుభః॥ 23

అద్భుతమైన ఈమహాపర్వతము భూతలమును చీల్చుకొనివచ్చినట్లు అనిపించుచున్నది. అత్యున్నతమైన ఈగిరిశిఖరము సర్వమనోహరముగా విరాజిల్లుచున్నది. (23)

కుష్ఠపున్నాగస్థగరభూర్జపత్రోత్తరచ్ఛదాన్ ।
కామినాం స్వాస్తరాన్ పశ్య కుశేశయదళాయుతాన్ ॥ 24

మృదితాశ్చాపవిద్ధాశ్చ దృశ్యంతే కమలస్రజః ।
కామిభిర్వనితే! పశ్య ఫలాని వివిధాని చ ॥ 25

ఓ రమణీ! విలాసస్త్రీపురుషులశయ్యలపై ఉత్పలపత్రములు, పున్నాగపత్రములు, దవనపత్రములు, భూర్జపత్రములు మొదలగునవి పఱచబడినవి. వాటిపై తామరాకులు కప్పబడినవి. ఒకసారి అటువైపు చూడుము. ఇంకను వారు ఉపయోగించిన కమలహారములు నలిగి అచటనే పడియున్నవి. అట్లే వారు కొంతరుచిచూచి, వదలివేసిన పండ్లుగూడ కనబడుచున్నవి. వాటిని నీవు గమనించితివా? (24-25)

వస్వౌకసారాం నళినీమ్ అత్యేతీవోత్తరాన్ కురూన్ ।
పర్వతశ్చిత్రకూటోఽసౌ బహుమూలఫలోదకః ॥ 26

ఈచిత్రకూటపర్వతము రుచికరములైన కందమూలఫలములతోను, నిర్మలమధురజలములతోడను మిగులసంపన్నమైయున్నది. అందువలన, ఈగిరిరాజము ఇంద్రునినగరమైన 'అమరావతి'ని, కుబేరుని పట్టణమైన 'అలకాపురి'ని, మానస(సౌగంధిక) సరోవరమును ఉత్తరకురుభూములను త్రోసిరాజని విరాజిల్లుచున్నది. (26)

ఇమంతు కాలం వనితే! విజహ్రివాన్
త్వయా చ సీతే! సహ లక్ష్మణేన చ ।
రతిం ప్రపత్స్యే కులధర్మవర్ధినీం
సతాం పథి స్వైర్నియమైః పరైః స్థితః ॥ 27

ఓ ప్రాణేశ్వరీ! శ్రేష్ఠములైన వనవాసనియమములను పాటించుచు సత్పురుషులమార్గమున మసలుచు నీతోను, లక్ష్మణునితోడను ఈపదునాలుగు సంవత్సరములకాలమును సంతోషముగా గడిపెదను. దానివలన మనవంశకీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించును. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుర్ణవతితమస్సర్గః (94)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదినాల్గవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

95. తొంబదిఐదవసర్గము

శ్రీరాముడు సీతాదేవికి మందాకినీ నదీతీరములమనోహరదృశ్యములను చక్కగా వివరించుట.

అథ శైలాద్వినిష్క్రమ్య మైథిలీం కోసలేశ్వరః ।
అదర్శయచ్ఛుభజలాం రమ్యాం మందాకినీం నదీమ్ ॥ 1

అంతట కోసలప్రభువైన శ్రీరాముడు సీతాదేవితోగూడి చిత్రకూటమునుండి వెడలెను. క్రమముగా ఆ మహాపురుషుడు మందాకినీతీరమునకు చేరి, పవిత్రజలములతో మనోజ్ఞముగానున్న ఆ నదిని ఆమెకు చూపించెను. (1)

అబ్రవీచ్చ వరారోహాం చారుచంద్రనిభాననామ్ ।
విదేహరాజస్య సుతాం రామో రాజీవలోచనః ॥ 2

కమలాక్షుడైన శ్రీరాముడు నిండుపున్నమనాటి చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖముగలదియు, ఒప్పులకుప్పయు ఐన విదేహరాజకుమారియగు సీతాదేవితో ఇట్లనెను. (2)

విచిత్రపులినాం రమ్యాం హంససారససేవితామ్ ।
కమలైరుపసంపన్నాం పశ్య మందాకినీం నదీమ్ ॥ 3

నానావిధైస్తీరరుహైః వృతాం పుష్పఫలద్రుమైః ।
రాజంతీం రాజరాజస్య నళినీమివ సర్వతః ॥ 4

"ఓసీతా! రమ్యమైన ఈమందాకినీనదిని దర్శింపుము. ఈనదీతీరములు చిత్రవిచిత్రములైన ఇసుకతిన్నెలతో అలరారుచున్నవి. ఇందుహంసలు, బెగ్గురుపక్షులు విహరించుచున్నవి. ఇందలి కమలములశోభలు అపూర్వములు. తీరములయందలి నానావిధములగు వృక్షములు పూవులతో, పండ్లతో విరాజిల్లుచు, నదికే వన్నెదెచ్చుచున్నవి. కుబేరునియొక్క 'సౌగంధిక' సరస్సువలె ఇది వెలుగులను వెదజల్లుచున్నది. (3-4)

మృగయూథనిపీతాని కలుషాంభాంసి సాంప్రతమ్ ।
తీర్థాని రమణీయాని రతిం సంజనయంతి మే ॥ 5

ఈనదీజలములు నిర్మలములు, మధురములు, తీరములు రమణీయములు. లేళ్లగుంపులువచ్చి, ఈమధురజలములను తనివితీరత్రాగి, మిగుల ఆనందించుచున్నవి. అవి నీళ్లలోనికి దిగినప్పుడు జలములు కుంకుమరంగునకుమారుచున్నవి. ఈదృశ్యములన్నియు నాకు ముచ్చటగొలుపుచున్నవి. (5)

జటాజినధరాః కాలే వల్కలోత్తరవాససః।
ఋషయ స్త్వవగాహంతే నదీం మందాకినీం ప్రియే। 6

ఆదిత్యముపతిష్ఠంతే నియమాదూర్ధ్వబాహవః।
ఏతే పరే విశాలాక్షి! మునయః సంశితవ్రతాః। 7

మారుతోద్ధూతశిఖరైః ప్రనృత్త ఇవ పర్వతః।
పాదపైః పత్రపుష్పాణి సృజద్భిరభితో నదీమ్। 8

క్వచిన్మణినికాశోదాం క్వచిత్ పులినశాలినీమ్।
క్వచిత్ సిద్ధజనాకీర్ణాం పశ్య మందాకినీం నదీమ్। 9

నిర్ధూతాన్ వాయునా పశ్య వితతాన్ పుష్పసంచయాన్।
పోప్లూయమానానపరాన్ పశ్య త్వం జలమధ్యగాన్। 10

తాంశ్చాతివల్గువచసో రథాంగాహ్వయనా ద్విజాః।
అధిరోహంతి కల్యాణి! వికూజంతః శుభా గిరః। 11

దర్శనం చిత్రకూటస్య మందాకిన్యాశ్చ శోభనే।
అధికం పురవాసాచ్చ మన్యే చ తవ దర్శనాత్। 12

విధూతకలుషైః సిద్ధైః తపోదమశమాన్వితైః।
నిత్యవిక్షోభితజలాం విగాహస్వ మయా సహ। 13

సఖీవచ్చ విగాహస్వ సీతే! మందాకినీం నదీమ్।
కమలాన్యవమజ్జంతీ పుష్కరాణి చ భామిని! 14

త్వం పౌరజనవద్వ్యాలాన్ అయోధ్యామివ పర్వతమ్।
మన్యస్వ వనితే! నిత్యం సరయూవదిమాం నదీమ్। 15

లక్ష్మణశ్చాపి ధర్మాత్మా మన్నిదేశే వ్యవస్థితః।
త్వం చానుకూలా వైదేహి! ప్రీతిం జనయథో మమ। 16

ఉపస్పృశం స్త్రిషవణం మధుమూలఫలాశనః।
నాయోధ్యాయై న రాజ్యాయ స్పృహయేఽద్య త్వయాసహ। 17

ఓ ప్రాణేశ్వరీ! శ్రేష్ఠములైన నారచీరలను ధరించి, జడలను, జింకచర్మములను దాల్చిన ఋషీశ్వరులు తమనియమములను అనుసరించి, తగినకాలములందు ఈమందాకినీ నదిలో మునకలు వేయుచుందురు. ఓవిశాలాక్షీ! మఱికొంతమంది మునులు తీవ్రమైన నియమములను పాటించుచు భుజములను పైకెత్తి, దీక్షతో సూర్య భగవానుని ఉపాసించుచుందురు. (6-7)

గిరిశిఖరములపై గల చెట్లకొమ్మలు గాలికి అతివేగముగా అటునిటు ఊగుచున్నవి. ఆవృక్షములపూవులు, ఆకులు నదికి ఇరువైపుల రాలుచున్నవి. ఈస్థితిలో పర్వతమే నృత్యముచేయుచున్నదా? అనునట్లు తోచుచున్నది. (8)

ఓజానకీ! మనోహరమైన ఈనదీదృశ్యములనుచూడుము. కొన్నితావులయందు జలములు స్వచ్ఛములై మణులవలె భాసిల్లుచున్నవి. కొన్ని ప్రదేశములయందు ఎత్తైన ఇసుకతిన్నెలు కనులకు శోభగొలుపుచున్నవి. కొన్నిచోట్ల సిద్ధపురుషులు గుంపులుగుంపులుగాచేరి, స్నానములను గావించుచున్నారు. (9)

ఓవైదేహీ! అటుచూడుము. గాలికి వృక్షములనుండి రాలిపడిన కొన్నిపూవులు నదియొక్క రెండుతీరములయందును వ్యాపించియున్నవి. మఱికొన్ని పుష్పములు నీటిలోపడి తేలియాడుచున్నవి. (10)

ఓకల్యాణీ! చక్రవాకపక్షులు (ఆడు, మగపక్షులు) పరస్పరానురాగములను ప్రకటించుకొనుచు మధురముగా కలరవములను గావించుచు, నదీతీరములయందుగల పుష్పరాశులపై చేరుచున్నవి. (11)

ఓనిర్మలస్వభావురాలా! నీవు నాప్రక్కనేయుండుటవలన చిత్రకూట పర్వతమునందలి మధురదృశ్యములు, మందాకినీతీరమునందలి రమ్యప్రదేశములు అయోధ్యాపురముకంటెను అధికముగా నన్ను అలరింపజేయుచున్నవి. (12)

ఓరమణీ! జితేంద్రియులును, పుణ్యాత్ములును, తపస్సంపన్నులును ఐన సిద్ధపురుషులు ఈనదీజలములయందు స్నానములను ఆచరించుచుండుటచే ఇవి మిగుల పునీతములైనవి. కనుక నీవు నాతోగూడి ఈపవిత్రజలములలో స్నానమాచరింపుము. (13)

ఓసుందరీ! నీవు నీసఖీమణులతో క్రీడించునట్లుగనే ఎఱ్ఱని, తెల్లని పద్మములను ఈమందాకినీనదీజలములలో ముంచుచు జలక్రీడలు సల్పుము. (14)

ఓవనితా! ఈవనమునందు సంచరించుజంతువులను పురజనులను వలె భావింపుము. ఈచిత్రకూటపర్వతమును అయోధ్యగా తలంపుము. ఈమందాకినీనదిని సరయూనదిగా చూచుకొనుము. (15)

ఓవైదేహీ! ధర్మాత్ముడైన లక్ష్మణుడు నాకనుసన్నలలో మెలగుచు సేవలొనర్చుచున్నాడు. నీవు నాకు అనుకూలవతివైన సహధర్మచారిణివి. మీరు ఇరువురును నాకు ఎంతయు ప్రీతిని గూర్చుచున్నారు. (16)

ఓమైథిలీ! నీతోగూడి త్రిసంధ్యలయందును స్నానమాచరించుచున్నాను. కమ్మని కందమూలములను ఆరగించుచున్నాను. అందువలన అయోధ్యగాని, కోసలరాజ్యముగాని నాతలంపునకే వచ్చుటలేదు. (17)

ఇమాం హి రమ్యాం మృగయూథశాలినీం
నిపీతతోయాం గజసింహవానరైః ।
సుపుష్పితైః పుష్పధరైరలంకృతాం
న సో౽స్తి యః స్యాదగతక్లమః సుఖీ ॥ 18

ఈ మందాకినీనది తెల్లగులువుల సమూహములతో రమణీయముగా ఉన్నది. ఏనుగులు, సింహములు, వానరములు ఇందలి మధుర జలములను త్రాగుచు పరస్పరవైరములను మాని, ప్రశాంతముగా జీవించుచున్నవి. చక్కగా వికసించిన పూలచెట్లతో ఈనదీతీరములు మిక్కిలి శోభాయమానముగా ఉన్నవి. ఈనదీజలములలో స్నానము చేసినవారికిని, ఈవృక్షచ్ఛాయలలో విశ్రాంతిగైకొనినవారికిని శ్రమలు మటుమాయమగును. ఆనందములు వెల్లివిరియును. ఇది తథ్యము.' (18)

ఇతీవ రామో బహుసంగతం వచః
ప్రియాసహాయః సరితం ప్రతి బ్రువన్ ।
చచార రమ్యం నయనాంజనప్రభం
స చిత్రకూటం రఘువంశవర్ధనః ॥ 19

రఘువంశవర్ధనుడైన శ్రీరాముడు ఇట్లు మందాకినీనదినిగూర్చి అనేకవిధములుగా వర్ణించుచు, సీత తనకు తోడుగానుండగా కాటుకవంటి కాంతులతో విరాజిల్లుచున్న ఆచిత్రకూటపర్వతమునందు విహరించెను. (19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచనవతితమస్సర్గః (95)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదియైదవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

96. తొంబదిఆఱవసర్గము

అడవి మృగముల అలజడులనుజూచిన శ్రీరాముడు 'అందులకు కారణముతెలిసికొనుము' అని లక్ష్మణునకు ఆదేశించుట భరతుడు సైన్యములతో అడవికివచ్చినట్లు గమనించి, అతనిపై లక్ష్మణుడు కారాలు మిరియాలు నూఱుచు ఆవ్వేశంతో పల్కుట.

తాం తథా దర్శయిత్వా తు మైథిలీం గిరినిమ్నగామ్ ।
నిషసాద గిరిప్రస్థే సీతాం మాంసేన ఛందయన్ ॥ 1

మిథిలానగరప్రభువుయొక్క కూతురైన సీతాదేవికి అవిధముగా మందాకినీనదిని చూపించి, శ్రీరామచంద్రుడు భార్యాసమేతుడై, ఆ పర్వతసమతలప్రదేశమున కూర్చుండెను. పిమ్మట అతడు తాపసులకు భోజ్యమైన ఫలమూలములగుజ్జుతో ఆమెకు తృప్తికలుగునట్లు ఇట్లు లాలింపసాగెను. (1)

ఇదం మేధ్యమిదం స్వాదు నిష్టప్తమిదమగ్నినా ।
ఏవమాస్తే స ధర్మాత్మా సీతయా సహ రాఘవః ॥ 2

"ప్రాణేశ్వరీ! 'ఈఫలములు మిక్కిలి పవిత్రములైనవి, మధురములైనవి. ఈకందమూలములు అగ్నిపై చక్కగాకాల్చబడినవి'- అని ధర్మాత్ముడైన రఘునందనుడు సీతాదేవితో పలికెను. (2)

తథా తత్రా౽సతస్తస్య భరతస్యోపయాయినః ।
సైన్యరేణుశ్చ శబ్దశ్చ ప్రాదురాస్తాం నభస్పృశౌ ॥ 3

ఏతస్మిన్నంతరే త్రస్తాః శబ్దేన మహతా తతః ।
అర్దితా యూథపా మత్తాః సయూథా దుద్రువుర్దిశః ॥ 4

సీతారాములు ఇరువురును ఆ పర్వతప్రదేశమున కూర్చొనియుండగా అచటికి చేరుచున్న భరతునిసేనల సవ్వడులును, వాటిపాదములతాకిడిచే పైకెగసిన దుమ్ములును ఆకాశమునుతాకుచు ఒక్కసారిగా ప్రకటితములయ్యెను. ఇంతలో ఆమహాసేనలయొక్క కోలాహలధ్వనులకు వనమునందలి మదపుటేనుగులు బెదరినవి. అవి మిగులవ్యాకులపడి తమతమ గుంపులతో నలుదెసలకును పరుగులుదీసినవి. (3-4)

స తం సైన్యసముద్భూతం శబ్దం శుశ్రావ రాఘవః ।
తాంశ్చ విప్రద్రుతాన్ సర్వాన్ యూథపానన్వవైక్షత ॥ 5

అంతట శ్రీరాముడు ఆసైన్యములకదలికలచే ఏర్పడిన గొప్ప కలకలధ్వనులను వినెను. మఱియు అతడు భయముతో పరుగులిడుచున్న గజేంద్రములను గమనించెను. (5)

తాంశ్చ విద్రవతో దృష్ట్వా తం చ శ్రుత్వా చ నిస్వనమ్ ।
ఉవాచ రామః సౌమిత్రిం లక్ష్మణం దీప్తతేజసమ్ ॥ 6

పరుగులుదీయుచున్న గజములనుజూచి, ఆ కోలాహల ధ్వనులను విని, శ్రీరాముడు మహాతేజస్వియు, సుమిత్రానందనుడును అగు లక్ష్మణునితో ఇట్లనుడివెను. (6)

హంత లక్ష్మణ! పశ్యేహ సుమిత్రాసుప్రజాస్త్వయా।
భీమస్తనితగంభీరః తుములః శ్రూయతే స్వనః। 7

"సుమిత్రానందనుడవైన ఓలక్ష్మణా! ఏమాశ్చర్యము! మేఘగర్జనవలె భయంకరమైన, గంభీరమైన మహాధ్వని ఇపటికి వినబడుచున్నది. గమనింపుము. (7)

గజయూథాని వాఽరణ్యే మహిషా వా మహావనే।
విత్రాసితా మృగాః సింహైః సహసా ప్రద్రుతా దిశః। 8

అరణ్యమునందలి ఏనుగులగుంపులును, మహావనమునందలి (అడవి) దున్నపోతులును, లేళ్లసమూహములును, సింహములును మిక్కిలిభయమునకు లోనై నలుదెసలకును అతివేగముగా పరుగెత్తుచున్నవి. (8)

రాజా వా రాజమాత్రో వా మృగయామటతే వనే।
అన్యద్వా శ్వాపదం కించిత్ సౌమిత్రే! జ్ఞాతుమర్హసి। 9

ఓసౌమిత్రీ! ఎవరైనను ఒక రాజుగాని, రాజకుమారుడుగాని ఈవనమునందు వేటాడుటకై వచ్చినాడా? లేదా ఏవైనను పెద్దపులులు మొదలగు క్రూరమృగములు ఈసమీపమున తిరుగుచున్నవా? తెలిసికొనుము. (9)

సుదుశ్చరో గిరిశ్చాయం పక్షిణామపి లక్ష్మణ!।
సర్వమేతద్యథాతత్త్వమ్ అచిరాత్ జ్ఞాతుమర్హసి। 10

ఓలక్ష్మణా! ఈపర్వతప్రదేశమునకు అలవాటుపడిన పక్షులు సైతము ఇచట సంచరించుట అసాధ్యము. (ఇతరక్రూర జంతువులుగాని, రాజులుగాని ఇచట కాలుమోపుట యెట్లు సంభవము?) కనుక ఈవిషయములను అన్నింటిని యథార్థముగా (పూర్తిగా)వెంటనే తెలిసికొనుము." (10)

స లక్ష్మణః సంత్వరితః సాలమారుహ్య పుష్పితమ్।
ప్రేక్షమాణో దిశః సర్వాః పూర్వాం దిశముదైక్షత। 11

ఉదఙ్ముఖః ప్రేక్షమాణో దదర్శ మహతీం చమూమ్।
రథాశ్వగజసంబాధాం యత్తైర్యుక్తాం పదాతిభిః। 12

శ్రీరాముని ఆజ్ఞానుసారము ఆ లక్ష్మణుడు వెంటనే బాగుగా పుష్పించియున్న ఒక మద్దిచెట్టుపైకి ఎక్కెను. అన్నిదిక్కులను పరిశీలించుచు ప్రత్యేకముగా తూర్పుదిశవైపు పరికించి చూచెను. పిదప అతడు ఉత్తరదిశయందు తనదృష్టిని నిల్పిచూడగా ఆయనకు ఒకమహాసేన కన్పించెను. అది రథాశ్వగజబలములతో నిండి యుండెను. ఇంకను సర్వసన్నద్ధములైన కాల్బలములును అందు గోచరించెను. (11-12)

తామశ్వగజసంపూర్ణాం రథధ్వజవిభూషితామ్।
శశంస సేనాం రామాయ వచనంచేదమబ్రవీత్। 13

వెంటనే యతడు చతురంగబలములతోగూడిన ఆసేనను గూర్చియు, రథములపై ఎగురుచున్న ధ్వజపతాకములను గుఱించియు శ్రీరామునకు సూచనప్రాయముగాదెలిపి, అనంతరము ఇట్లువివరింపదొడంగెను. (13)

అగ్నిం సంశమయత్వార్యః సీతా చ భజతాం గుహామ్।
సజ్యం కురుష్వ చాపం చ శరాంశ్చ కవచం తథా। 14

"అన్నా!శ్రీరామా! నిత్యాగ్నిహోత్రములను చల్లార్చుము. (హోమ ధూమములజాడలనుబట్టి శత్రుసేనలు ఇటురావచ్చును.) వదినెయగుసీతాదేవిని ఒక సురక్షితమైన గుహలో భద్రముగా నుంచుము. వింటినారిని సంధింపుము. ధనుర్బాణములతో కవచధారివై సిద్ధముగానుండుము." (14)

తం రామః పురుషవ్యాఘ్రో లక్ష్మణం ప్రత్యువాచ హ।
అంగావేక్షస్వ సౌమిత్రే! కస్యేమాం మన్యసే చమూమ్। 15

అంతట నరశ్రేష్ఠుడైన శ్రీరాముడు ఆ లక్ష్మణునితో 'ఓసౌమిత్రీ! ఆసేన ఎవరిదోయేమో? బాగుగా పరిశీలించి గుర్తింపుము.' అని పలికెను. (15)

ఏవముక్తస్తు రామేణ లక్ష్మణో వాక్యమబ్రవీత్।
దిధక్షన్నివ తాం సేనాం రుషితః పావకో యథా। 16

శ్రీరాముడు ఇట్లుపలికిన పిమ్మట లక్ష్మణుడు మిగులకోపోద్రిక్తుడై, అగ్నివలె మండిపడుచు, ఆసేనను దహించివేయనున్నాడాయనునట్లు చూచుచు అన్నతో ఇట్లనెను. (16)

సంపన్నం రాజ్యమిచ్ఛంస్తు వ్యక్తం ప్రాప్యాభిషేచనమ్।
ఆవాం హంతుం సమభ్యేతి కైకేయ్యా భరతః సుతః। 17

"ఈసేన క్రూరాత్మురాలైన కైకేయియొక్క సుతుడగు భరతునిదే. అతడు అయోధ్యలో రాజ్యాభిషిక్తుడై, తన రాజ్యాధికారమును నిష్కంటకమొనర్చుకొనుటకై (జ్ఞాతులమైన) మనలను చంపుటకై ఇటు వచ్చుచున్నాడు. (17)

ఏష వై సుమహాన్ శ్రీమాన్ విటపీ సంప్రకాశతే।
విరాజత్యుద్గతస్కంధం కోవిదారధ్వజో రథే। 18

భజంత్యేతే యథాకామమ్ అశ్వానారుహ్య శీఘ్రగాన్।
ఏతే భ్రాజంతి సంహృష్టా గజానారుహ్య సాదినః। 19

గృహీతధనుషౌ చావాం గిరిం వీర! శ్రయావహై।
అథవేహైవ తిష్ఠావః సన్నద్ధావుద్యతాయుధౌ। 20

అపి నౌ వశమాగచ్ఛేత్ కోవిదారధ్వజో రణే। 21

అపి ద్రక్ష్యామి భరతం యత్కృతే వ్యసనం మహత్।
త్వయా రాఘవ! సంప్రాప్తం సీతయా చ మయా తథా। 22

యన్నిమిత్తం భవాన్ రాజ్యాత్ చ్యుతో రాఘవ! శాశ్వతాత్।
సంప్రాప్తోఽయమరిర్వీర! భరతో వధ్య ఏవ మే। 23

భరతస్య వధే దోషం నాహం పశ్యామి రాఘవ!।
పూర్వాపకారిణాం త్యాగే న హ్యధర్మో విధీయతే। 24

పూర్వాపకారీ భరతః త్యక్తధర్మశ్చ రాఘవ!।
ఏతస్మిన్ నిహతే కృత్స్నామ్ అనుశాధి వసుంధరామ్। 25

అద్య పుత్రం హతం సంఖ్యే కైకేయీ రాజ్యకాముకా।
మయా పశ్యేత్ సుదుఃఖార్తా హస్తిభగ్నమివ ద్రుమమ్। 26

కైకేయీం చ వధిష్యామి సానుబంధాం సబాంధవామ్।
కలుషేణాద్య మహతా మేదినీ పరిముచ్యతామ్। 27

అద్యేమం సంయతం క్రోధమ్ అసత్కారం చ మానద!।
మోక్ష్యామి శత్రుసైన్యేషు కక్షేష్వివ హుతాశనమ్। 28

అద్యైతచ్చిత్రకూటస్య కాననం నిశితైః శరైః।
ఛిందన్ శత్రుశరీరాణి కరిష్యే శోణితోక్షితమ్। 29

శరైర్నిర్భిన్నహృదయాన్ కుంజరాంస్తురగాంస్తథా।
శ్వాపదాః పరికర్షంతు నరాంశ్చ నిహతాన్ మయా। 30

ఇదిగో! సేనకు ముందుభాగమున శోభాసంపన్నమగు బలమైన మ్రానుగల ఒక కోవిదారవృక్షము కనబడుచున్నది. దానిసమీపమునగల రథముపై కోవిదారవృక్షచిహ్నముగల ధ్వజము శోభిల్లుచున్నది. (18)

ఇదిగో! త్వరగాపరుగెత్తగల గుఱ్ఱములనెక్కి, అశ్వికులు ఇటువచ్చుచున్నారు. అట్లే మదపుటేనుగులను అధిరోహించి, గజయోధులును ఉత్సాహముతో ఇటే వచ్చుచున్నారు. (19)

మహావీరుడవైన ఓ అన్నా! మనము ధనుర్ధారులమై, పర్వత శిఖరముమీదికి చేరుదము. లేదా! కవచములను, అస్త్రశస్త్రములను ధరించి, సర్వసన్నద్ధులమై ఇచటనే యుందము. (20)

ఓ సోదరా! యుద్ధరంగమున ఈ 'కోవిదార' ధ్వజము మన వశమగునా? అట్లే! నీకును, సీతాదేవికిని, నాకును ఇట్టి మహా కష్టములను తెచ్చిపెట్టిన భరతుని చూడగలమా? (21-22)

ఓ రఘునందనా! ఇతనిమూలముననేగదా! నీవు రాజ్యాధికారమును శాశ్వతముగా కోల్పోవుటజరిగినది. అట్టి శత్రువైన భరతుడు ఇప్పుడు మనచేజిక్కినాడు. ఇంక నాచేతిలో అతనికి చావుతప్పదు. (23)

ఓ రఘువీరా! 'భరతుని చంపుట దోషముగా నేను తలంపను'. ఏలనన ఇదివఱలో మహాపకారము చేసినవారిని వధించుట అధర్మముకాదుగదా! (24)

ఓ రఘువీరా! భరతుడు లోగడ మనకు తీరని అపకారము చేసినవాడు. కావున అతనిని చంపి, నీవు సమస్తకోసలరాజ్యమును ఏలుకొనుము. (25)

ఏనుగుబారినబడి, నేలగూలినచెట్టువలె, నేడు యుద్ధరంగమున భరతుడు నాచేతిలోహతుడగుట తథ్యము. అట్లు మృతుడైన కుమారునిజూచి, అంతులేని రాజ్యకాంక్షగల కైకేయి క్రుళ్లిక్రుళ్లి ఏడ్చును. (26)

నేడే కైకేయిని, ఆమెతో అనుబంధముగల మంథరాదులను అందఱిని వధించితీరెదను. ఆమెకారణముగా ఎంతయు కలుషితమైన ఈ భూమండలమునకు పాపవిముక్తి కలిగించెదను. (27)

గౌరవమును ఇచ్చెడివాడా! శ్రీరామా! నేటివఱకును ఎన్నో అవమానములను భరించితిమి. నాలో రగుల్కొనుచున్న కోపాగ్నిని అదుపుచేసికొనుచు వచ్చితిని. ఇక ఊరకున్నచో లాభములేదు. అగ్నిచే ఎండుగడ్డివలె నాకోపాగ్నిచే ఈ శత్రుసైన్యమును భస్మమొనర్చెదను. (28)

నేడు శత్రుశరీరములను నావాడిబాణములచే చీల్చివైచుచు ఈ చిత్రకూటకాననమును రక్తసిక్తమొనర్చెదను. (29)

నేడు ఏనుగులకుంభస్థలములను, గుఱ్ఱములగుండెలను నానిశితబాణములచే చీల్చిచెండాడెదను, కాల్బలములను హతమార్చెదను. ఆ మాంసఖండములను పెద్దపులులు మున్నగు క్రూరజంతువులు లాగికొనిపోవుగాక. (30)

శరాణాం ధనుషశ్చాహమ్ అనృణోఽస్మి మహామృధే।
ససైన్యం భరతం హత్వా భవిష్యామి న సంశయః। 31

ఇచట జరుగనున్న యుద్ధమున సైన్యములతోగూడ భరతుని వధియించి, నా ధనుర్బాణముల ఋణమును దీర్చుకొందును. ఇందు సందేహములేదు. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షణ్ణవతితమస్సర్గః (96)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదిఆఱవసర్గము సమాప్తము

-- * * * --

97. తొంబదిఏడవసర్గము

భరతునియెడ కుపితుడైయున్న లక్ష్మణుని శ్రీరాముడు చల్లబఱచుట.

సుసంరబ్ధం తు సౌమిత్రిం లక్ష్మణం క్రోధమూర్ఛితమ్।
రామస్తు పరిసాంత్వ్యాథ వచనం చేదమబ్రవీత్। 1

భరతునివిషయమున సుమిత్రాసుతుడైన లక్ష్మణుడు కోపముతో ఊగిపోవుచుండుట గమనించి, శ్రీరాముడు అతనిని శాంతపఱచుచు ఇట్లు పలికెను. (1)

కిమత్ర ధనుషా కార్యమ్ అసినా వా సచర్మణా।
మహేష్వాసే మహాప్రాజ్ఞే భరతే స్వయమాగతే। 2

"నాయనా! మహాధనుర్ధారియు, మిగుల ప్రాజ్ఞుడును ఐన భరతుడు స్వయముగా ఇటువచ్చుచున్నప్పుడు మనకు ధనుర్బాణములతో గాని, డాలుతోగాని, ఖడ్గముతోగాని పనియేమి? (2)

పితుః సత్యం ప్రతిశ్రుత్య హత్వా భరతమాగతమ్।
కిం కరిష్యామి రాజ్యేన సాపవాదేన లక్ష్మణ!। 3

ఓ లక్ష్మణా! మనతండ్రిని సత్యసంధునిగా నిలుపుటకై (ఆయన మాటనునిలుపుటకై) నేను మాట ఇచ్చియుంటిని. ఇప్పుడు మన కడకువచ్చిన భరతుని చంపినచో మనకు అపవాదమే మిగులును. అట్టిరాజ్యముతో మనకేమిపని? (3)

యద్ద్రవ్యం బాంధవానాం వా మిత్రాణాం వా క్షయే భవేత్।
నాహం తత్ ప్రతిగృహ్ణీయాం భక్షాన్ విషకృతానివ। 4

ఓ లక్ష్మణా! బంధువులుగాని, మిత్రులుగాని నశించుటవలన లభించెడి ద్రవ్యము (సంపద, రాజ్యముమొదలగునవి) విషపూరితములైన భక్ష్యములతో సమానము. అట్టి దానిని నేను ఎన్నడును స్వీకరింపను. (4)

ధర్మమర్థం చ కామం చ పృథివీం చాపి లక్ష్మణ!।
ఇచ్ఛామి భవతామర్థే హ్యేతత్ ప్రతిశృణోమి తే। 5

భ్రాతౄణాం సంగ్రహార్థం చ సుఖార్థం చాపి లక్ష్మణ!।
రాజ్యమప్యహమిచ్ఛామి సత్యేనాఽఽయుధమాలభే। 6

ఓ లక్ష్మణా! ధర్మార్థకామములనుగాని, కడకు ఈ రాజ్యమును గాని మీ అందఱినిమిత్తముగనే కోరుచున్నాను. ఈ మాటను నేను నీముందు శపథముచేసి చెప్పుచున్నాను. నేను సోదరుల కొఱకే ధనమును సంపాదింతును. ఈ రాజ్యమునైనను వారి సుఖార్థమే కోరుచున్నాను. నా ఆయుధములమీద ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. (5-6)

నేయం మమ మహీ సౌమ్య! దుర్లభా సాగరాంబరా।
నహీచ్ఛేయమధర్మేణ శక్రత్వమపి లక్ష్మణ!। 7

ఓ సౌమ్యుడా! నేను కోరుకొన్నచో సముద్రములవఱకును వ్యాపించియున్న ఈ సమస్తభూమండలమూ నాకు దుర్లభము గాదు (ఈ భూమండలము అంతయును నా చేతిలోనేయున్నట్లు తలంపుము) కాని అధర్మముగా ఇంద్రపదవి వచ్చినను దానికి నేను ఇష్టపడను. (7)

యద్వినా భరతం త్వాం చ శత్రుఘ్నం చాపి మానద!।
భవేన్మమ సుఖం కించిత్ భస్మ తత్ కురుతాం శిఖీ। 8

ఓ మానదా! భరతునకును, నీకును, శత్రుఘ్నునకును లేని సుఖము నాకుమాత్రము ఎందులకు? అదికాల్పనా? (8)

మన్యేఽహమాగతోఽయోధ్యాం భరతో భ్రాతృవత్సలః।
మమ ప్రాణాత్ ప్రియతరః కులధర్మమనుస్మరన్। 9

శ్రుత్వా ప్రవ్రాజితం మాం హి జటావల్కలధారిణమ్।
జానక్యా సహితం వీర! త్వయా చ పురుషర్షభ!। 10

స్నేహేనాఽఽక్రాంతహృదయః శోకేనాకులితేంద్రియః।
ద్రష్టుమభ్యాగతో హ్యేష భరతో నాన్యథాఽఽగతః। 11

అంబాం చ కైకేయీం రుష్య పరుషం చాప్రియం వదన్।
ప్రసాద్య పితరం శ్రీమాన్ రాజ్యం మే దాతుమాగతః। 12

ప్రాప్తకాలం యదేషోఽస్మాన్ భరతో ద్రష్టుమిచ్ఛతి।
అస్మాసు మనసాఽప్యేష నాప్రియం కించిదాచరేత్। 13

విప్రియం కృతపూర్వం తే భరతేన కదా ను కిమ్।
ఈదృశం వా భయం తేఽద్య భరతం యోఽత్ర శంకసే। 14

న హి తే నిష్ఠురం వాచ్యో భరతో నాప్రియం వచః।
అహం హ్యప్రియముక్తః స్యాం భరతస్యాప్రియే కృతే। 15

కథం ను పుత్రాః పితరం హన్యుః కస్యాంచిదాపది।
భ్రాతా వా భ్రాతరం హన్యాత్ సౌమిత్రే! ప్రాణమాత్మనః। 16

యది రాజ్యస్య హేతోస్త్వమ్ ఇమాం వాచం ప్రభాషసే।
వక్ష్యామి భరతం దృష్ట్వా రాజ్యమస్మై ప్రదీయతామ్। 17

ఉచ్యమానోఽపి భరతో మయా లక్ష్మణ! తత్త్వతః।
రాజ్యమస్మై ప్రయచ్ఛేతి బాఢమిత్యేవ వక్ష్యతి। 18

తథోక్తో ధర్మశీలేన భ్రాత్రా తస్య హితే రతః।
లక్ష్మణః ప్రవివేశేవ స్వాని గాత్రాణి లజ్జయా। 19

తద్వాక్యం లక్ష్మణః శ్రుత్వా వ్రీడితః ప్రత్యువాచ హ।
త్వాం మన్యే ద్రష్టుమాయాతః పితా దశరథః స్వయమ్। 20

ఓ నరశ్రేష్ఠా! వీరా! భరతుని సోదరప్రేమ నిరుపమానమైనది. అతడు నాకు ప్రాణములకంటెను ఎక్కువప్రీతిపాత్రుడు. నేను జటావల్కలములను ధరించి, జానకితోడను, నీతోడనుగూడి వనములకు వచ్చిన సంగతి అతనికి తనమేనమామ ఇంటినుండి అయోధ్యకుచేరినప్పుడు తెలిసియుండవచ్చును. అప్పుడతడు నాపైగల ప్రేమాతిరేకముచే ఎట్టరాని శోకముతో మిగులదుఃఖితుడై యుండవచ్చును. వంశమర్యాదను అనుసరించి, నన్నుజూచుటకై అతడు ఇచటికి వచ్చుచుండవచ్చును. 'అతనిరాకకు మఱియొక కారణము ఉండదు'-అని నేను తలంతును. ఇది నాపరమ విశ్వాసము. (9-11)

శుభలక్షణసంపన్నుడైన భరతుడు క్రుద్ధుడై, తనతల్లియైన కైకేయితో పరుషములైన అప్రియవచనములను పలికి యుండవచ్చును. పిమ్మట తండ్రిని ప్రసన్నునిజేసికొని, రాజ్యమును నాకు అప్పగించుటకై ఇచటికి వచ్చుచున్నాడేమో? (12)

భరతుడు ఈసమయమున మనలను చూచుటకై ఇచటికి వచ్చుట ఎంతయు సముచితము. మనకు అపకారము చేయవలయునని అతడు మనస్సులోనైతము అనుకొనడు. (13)

ఓ లక్ష్మణా! భరతుడు ఇదివఱలో నీకు ఎప్పుడైనను అపకారము చేసియున్నాడా? లేక అతనికారణముగా నీకు ఎప్పుడైనను భయముకలిగియున్నదా? నీవు ఇప్పుడు భరతుని శంకించుటకు గలకారణమేమి? భరతుడు ఇక్కడికి వచ్చినప్పుడు నీవు అతనితో పరుషముగాగాని, అప్రియముగాగాని పలుకరాదు. అట్లుపలికినచో ఆమాటలను నీవు నన్నుగూర్చి పల్కినట్లే భావింతును. (14-15)

ఓ సౌమిత్రీ! ఎట్టి ఆపదలువచ్చిపడినను పుత్త్రులు తండ్రిని ఎట్లుచంపగలరు? అట్లే! ఒక సోదరుడు ప్రాణతుల్యుడైన తనసోదరుని ఎట్లుచంపును? (16)

రాజ్యమునకు ఆశపడి నీవు ఇట్టికఠోరవచనములను పలుకుచున్నచో ఆ రాజ్యమును నీకే ఇమ్మని భరతునితో నుడివెదను లెమ్ము. 'రాజ్యమును ఇతనికే (లక్ష్మణునకే) ఇమ్ము'-అని నేను అన్నంతమాత్రముననే, వెంటనే భరతుడు 'సరే' అనుచు నామాటను పాటించితీరును." (17-18)

ధర్మపరాయణుడైన శ్రీరాముడు ఇట్లుపలుకగా, స్వార్థరహితుడైన లక్ష్మణుడు అన్నహితమునే కోరెడివాడు గనుక వెంటనే సిగ్గుతో తలవంచుకొనెను. అతని అవయవములన్నియును ముడుచుకొని పోయెను. (19)

శ్రీరాముని మాటలను విని, మిగుల సిగ్గుపడిన లక్ష్మణుడు రామునితో "అన్నా! నిన్నుజూచుటకై మనతండ్రియగు దశరథుడే స్వయముగా వచ్చుచున్నట్లు తలంతును" అని నుడివెను. (20)

ప్రేక్షితం లక్ష్మణం దృష్ట్వా రాఘవః ప్రత్యువాచ హ।
ఏష మన్యే మహాబాహుః ఇహాస్మాన్ ద్రష్టుమాగతః। 21

అథవా నౌ ధ్రువం మన్యే మన్యమానః సుఖోచితౌ।
వనవాసమనుధ్యాయ గృహాయ ప్రతినేష్యతి। 22

ఇమాం వాఽప్యేష వైదేహీమ్ అత్యంతసుఖసేవినీమ్।
పితా మే రాఘవః శ్రీమాన్ వనాదాదాయ యాస్యతి। 23

ఏతౌ తౌ సంప్రకాశేతే గోత్రవంతౌ మనోరమౌ।
వాయువేగసమౌ వీర! జవనౌ తురగోత్తమౌ। 24

స ఏష సుమహాకాయః కంపతే వాహినీముఖే।
నాగః శత్రుంజయో నామ వృద్ధస్తాతస్య ధీమతః। 25

న తు పశ్యామి తచ్ఛత్రం పాండురం లోకసత్కృతమ్।
పితుర్దివ్యం మహాబాహో! సంశయో భవతీహ మే। 26

వృక్షాగ్రాదవరోహ త్వం కురు లక్ష్మణ! మద్వచః।
ఇతీవ రామో ధర్మాత్మా సౌమిత్రిం తమువాచ హ। 27

అవతీర్య తు సాలాగ్రాత్ తస్మాత్ స సమితింజయః।
లక్ష్మణః ప్రాంజలిర్భూత్వా తస్థౌ రామస్య పార్శ్వతః। 28

భరతేనాపి సందిష్టా సమ్మర్దో న భవేదితి।
సమంతాత్ తస్య శైలస్య సేనావాసమకల్పయత్। 29

అధ్యర్ధమిక్ష్వాకుచమూః యోజనం పర్వతస్య సా।
పార్శ్వే న్యవిశదావృత్య గజవాజిరథాకులా। 30

సా చిత్రకూటే భరతేన సేనా
ధర్మం పురస్కృత్య విధూయ దర్పమ్।
ప్రసాదనార్థం రఘునందనస్య
విరాజతే నీతిమతా ప్రణీతా। 31

సిగ్గుతో తలవంచుకొనియున్న లక్ష్మణునిజూచి, శ్రీరాముడు ఇట్లనుడివెను. "లక్ష్మణా! మహాబాహువైన ఈభరతుడు మనలను చూడగోరియే ఇచటికి వచ్చుచున్నట్లు నేను తలంతును. లేదా 'మనము సుఖములలో పుట్టిపెరిగినవారము, ఈవనవాసక్లేశములకు తట్టుకొననివారము'. అనితలచి, మిక్కిలి సుగుణసంపన్నుడైన మనతండ్రి దశరథమహారాజు మనలను తప్పక ఇంటికి (అయోధ్యకు) తీసికొని వెళ్లుటకై ఇచటికి వచ్చుచున్నట్లు భావింతును. కనీసము మిగుల సుకుమారియగు ఈసీతాదేవినైనను అతడు తీసికొని వెళ్లవచ్చును. (21-23)

ఓవీరా! ఇదిగో! చూడుము. మేలుజాతికిచెందిన రెండు ఉత్తమాశ్వములు మనకు కనబడుచున్నవి. అవి చూడముచ్చటగా నున్నవి, వాయువేగముతో పరుగెత్తగలవి, ఆసేనకు ముందుభాగమున 'శత్రుంజయము' అను ఒక మహాగజము నడచివచ్చుచున్నది. అది అత్యున్నతమై, బలిష్ఠమైయున్నది. గజపరిపాలనాదక్షుడైన మనతండ్రి దీనికిస్వామి. (24-25)

ఓమహాబాహూ! లక్ష్మణా! తండ్రిగారిశ్వేతచ్ఛత్రముమాత్రము కనబడుటలేదు. అదిలోకోత్తరమైనది, దివ్యమైనది. కనుక ఈవిషయమున నాకొకసందేహము కలుగుచున్నది. (26)

ఓలక్ష్మణా! నామాటవిని, నీవు చెట్టుపైనుండి క్రిందికి దిగుము." అని ధర్మాత్ముడైన శ్రీరాముడు పలికెను. (27)

సమరయోధుడైన లక్ష్మణుడు ఆమద్దిచెట్టునుండి క్రిందికి దిగి, దోసిలొగ్గినవాడై శ్రీరాముని ప్రక్కననిలబడెను. (28)

అంతట భరతుడు "మనవలన శ్రీరాముని ఆశ్రమమునకు ఎట్టి ఇబ్బందియు కలుగకూడదు." అని సైనికులను ఆజ్ఞాపించెను. ఆయనఆదేశానుసారము వారు ఆపర్వతముచుట్టును నివాసమును ఏర్పఱచుకొనిరి. గజాశ్వరథబలములతోగూడిన భరతునిసైన్యము ఆపర్వతముచుట్టును ఒకటిన్నర యోజనములదూరము వ్యాపించి యుండెను. (29-30)

నీతిజ్ఞుడు, ధర్మనిరతుడు ఐన భరతుడు శ్రీరాముని అనుగ్రహమును పొందుటకై, వినమ్రుడై విచ్చేసెను. ఆయన వెంటవచ్చిన సేనయు చిత్రకూటపరిసరములలో క్రమశిక్షణతో నెలకొనెను. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తనవతితమస్సర్గః *(97)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదిఏడవసర్గము సమాప్తము

— * * * —

98. తొంబదిఎనిమిదవసర్గము

భరతుడు శ్రీరామునిదర్శనమునకై ఆరాటపడుట - ఆ మహాత్మునిఆశ్రమము కనబడినంతనే ఆనందించుట.

నివేశ్య సేనాం తు విభుః పద్భ్యాం పాదవతాం వరః।
అభిగంతుం స కాకుత్స్థమ్ ఇయేష గురువర్తకమ్॥ 1

నివిష్టమాత్రే సైన్యే తు యథోద్దేశం వినీతవత్।
భరతో భ్రాతరం వాక్యం శత్రుఘ్నమిదమబ్రవీత్॥ 2

క్షిప్రం వనమిదం సౌమ్య! నరసంఘైః సమంతతః।
లుబ్ధైశ్చ సహితైరేభిః త్వమన్వేషితుమర్హసి॥ 3

గుహో జ్ఞాతిసహస్రేణ శరచాపాసిధారిణా।
సమన్వేషతు కాకుత్స్థౌ అస్మిన్ పరివృతః స్వయమ్॥ 4

అమాత్యైః సహ పౌరైశ్చ గురుభిశ్చ ద్విజాతిభిః।
వనం సర్వం చరిష్యామి పద్భ్యాం పరివృతః స్వయమ్॥ 5

యావన్న రామం ద్రక్ష్యామి లక్ష్మణం వా మహాబలమ్।
వైదేహీం వా మహాభాగాం న మే శాంతిర్భవిష్యతి॥ 6

యావన్న చంద్రసంకాశం ద్రక్ష్యామి శుభమాననమ్।
భ్రాతుః పద్మపలాశాక్షం న మే శాంతిర్భవిష్యతి॥ 7

యావన్న చరణౌ భ్రాతుః పార్థివవ్యంజనాన్వితౌ।
శిరసా ధారయిష్యామి న మే శాంతిర్భవిష్యతి॥ 8

యావన్న రాజ్యే రాజార్హః పితృపైతామహే స్థితః।
అభిషేకజలక్లిన్నో న మే శాంతిర్భవిష్యతి॥ 9

సిద్ధార్థః ఖలు సౌమిత్రిః యశ్చంద్రవిమలోపమమ్।
ముఖం పశ్యతి రామస్య రాజీవాక్షం మహాద్యుతి॥ 10

కృతకృత్యా మహాభాగా వైదేహీ జనకాత్మజా।
భర్తారం సాగరాంతాయాః పృథివ్యా యాఽనుగచ్ఛతి॥ 11

నరశ్రేష్ఠుడును, ప్రతిభాశాలియు ఐన ఆభరతుడు, సేనను నిలువువేసి, తండ్రిఆజ్ఞను అనుసరించి వనవాసము చేయుచున్న శ్రీరామునికడకు కాలినడకతో వెళ్లుటకు నిశ్చయించుకొనెను. (1)

భరతునిఆదేశానుసారము, సైన్యము వినమ్రభావముతో ఆగిపోగా, అతడు తనతమ్ముడగు శత్రుఘ్నునితో ఇట్లు నుడివెను. (2)

"నాయనా! మనవారితోపాటు నిషాదులనుతోడుగా తీసికొని, ఈవనమునందంతటను శ్రీరాముని వెదకుటకై వెంటనే పూనుకొనుము. (3)

ధనుర్బాణములను, ఖడ్గములను ధరించిన అసంఖ్యాకులైన తనయనుచరులతోగూడి, నిషాదరాజైన గుహుడును స్వయముగా ఈవనమున రామలక్ష్మణులను అన్వేషించును. (4)

నేనును అమాత్యులతో, పౌరులతో, గురుజనులతో, బ్రాహ్మణోత్తములతోగూడి, స్వయముగా ఈవనమునందు వారిని వెదకుటకై నలుదెసలను పాదచారినై సంచరింపగలను. (5)

అన్నయగు శ్రీరాముని, మహాబలశాలియగు లక్ష్మణుని, మహానుభావురాలగు సీతాదేవిని దర్శించునంతవఱకును నామనస్సు కుదుటపడదు. (6)

తామరరేకులవంటి కన్నులుగలవాడును, చంద్రునివలె ఆహ్లాదకరుడును అగు శ్రీరామచంద్రునియొక్క ప్రసన్నముఖమును విలోకించునంతవఱకును నామనస్సు కుదుటపడదు. (7)

వజ్రాయుధము, ధ్వజము, పద్మము, అంకుశము, అమృతకలశము మొదలగు రాజచిహ్నములుగల అన్నయొక్క పాదపద్మములకు శిరసా ప్రణమిల్లునంతవరకును నాకు శాంతి లభింపదు. (8)

రాజ్యార్హుడైన శ్రీరాముడు పట్టాభిషేకమును జరుపుకొని, తాతముత్తాతలనుండి వచ్చుచున్న కోసలరాజ్యసింహాసనమును అధిష్ఠించునంతవఱకును నామనస్సునకు ఊరట కలుగదు. (9)

శ్రీరామచంద్రునిముఖము చంద్రునివలె మనోహరమైనది, పద్మములవలె విశాలములైన నేత్రములుగలది, దివ్యకాంతులతో అలరారునది. అట్టి సుందరముఖమును నిత్యము దర్శించుచుండెడి సౌమిత్రి భాగ్యమే భాగ్యము. (10)

మహాత్మురాలును, జనకమహారాజుకుమార్తెయును ఐన వైదేహి సముద్రములే ఎల్లలుగాగల ఈసమస్తభూమండలమునకును ప్రభువైన తనభర్తను అనుసరించుచున్నది, అందువలన ఆమె యెంతయు ధన్యురాలు. (11)

సుభగశ్చిత్రకూటోఽసౌ గిరిరాజోపమో గిరిః।
యస్మిన్ వసతి కాకుత్స్థః కుబేర ఇవ నందనే। 12

సహజముగనే చిత్రవిచిత్రములైన శిఖరములుగలదియగుటచే చిత్రకూటము పర్వతరాజమైన హిమవత్పర్వతముతో సదృశమైనది, మిగుల రమణీయమైనది. ఆనందదాయకమైన చైత్రరథము[1] నందు కుబేరునివలె ఇందు కకుత్స్థవంశజుడైన శ్రీరాముడు నివసించుచుండుటచే ఈగిరియొక్క అందచందములు ఇనుమడించుటయేగాక దీని ఉనికి సార్థకమగుచున్నది. (12)

కృతకార్యమిదం దుర్గం వనం వ్యాళనిషేవితమ్।
యదధ్యాస్తే మహాతేజా రామః శస్త్రభృతాం వరః। 13

ఈగిరివనమున కాలసర్పములు, క్రూరమృగములు నివసించుచుండుటచే ఇది చొరరానిదైనప్పటికిని ధనుర్ధారులలో శ్రేష్ఠుడును, మహాపరాక్రమశాలియు ఐన శ్రీరాముడు దీనిని ఆదరించి, ఇచట ఉండుటచే దీని ఉనికి చరితార్థమైనది. దీని ప్రాశస్త్యము పెరిగినది." (13)

ఏవముక్త్వా మహాతేజా భరతః పురుషర్షభః।
పద్భ్యామేవ మహాబాహుః ప్రవివేశ మహద్వనమ్। 14

స తాని ద్రుమజాలాని జాతాని గిరిసానుషు।
పుష్పితాగ్రాణి మధ్యేన జగామ వదతాం వరః। 15

స గిరేశ్చిత్రకూటస్య సాలమాసాద్య పుష్పితమ్।
రామాశ్రమగతస్యాగ్నేః దదర్శ ధ్వజముచ్ఛ్రితమ్। 16

పురుషశ్రేష్ఠుడును, మహాతేజస్వియు, మిక్కిలి భుజబలము గలవాడును ఐన భరతుడు శత్రుఘ్నునితో ఈవిధముగా పలికి, కాలినడకతో మిగుల దట్టమైన చిత్రకూటారణ్యమున ప్రవేశించెను. మాటాడుటలో నేర్పరియైన ఆ భరతుడు గిరిసానువులయందు పుట్టి పెరిగినవియు, రంగురంగుల పూవులతో రాణిల్లుచున్నవియు అగు మహావృక్షముల మధ్యగా సాగిపోవుచుండెను. కొంతదూరము ముందునకు నడచిన పిమ్మట ఆ భరతుడు ఆ చిత్రకూట వనమునందు బాగుగా పుష్పించియున్న ఒక మద్దిచెట్టుపైకి ఎక్కెను. అచటినుండి అతడు శ్రీరాముని ఆశ్రమమునందు పైకెగసిన హోమాగ్నిధూమములను దర్శించెను. (14-16)

తం దృష్ట్వా భరతః శ్రీమాన్ ముమోద సహ బాంధవః।
అత్ర రామ ఇతి జ్ఞాత్వా గతః పారమివాంభసః। 17

అంతట సర్వశుభలక్షణసంపన్నుడైన భరతుడు ఆ పొగలను గమనించి, 'ఇచటనే శ్రీరాముడు నివసించుచున్నాడు'- అని భావించి, అపారమైన జలనిధినుండి ఈదుకొనుచు తీరము చేరిన వానివలె ఆత్మీయులతోగూడి సంతోషించెను. (17)

సచిత్రకూటే తు గిరౌ నిశమ్య
రామాశ్రమం పుణ్యజనోపపన్నమ్ ।
గుహేన సార్ధం త్వరితో జగామ
పునర్నివేశ్యైవ చమూం మహాత్మా । 18

మహాత్ముడైన భరతుడు చిత్రకూటపర్వతమునందు మహర్షులకు ఆశ్రయస్థానమైన శ్రీరామునిఆశ్రమమును దర్శించెను. శ్రీరాముని నివాసమును వెదకుటలో నిమగ్నమైయున్న సేనను ఒకచోటనిలిపి, అతడు శత్రుఘ్నునితో, గుహునితోగూడి త్వరత్వరగా ఆశ్రమదిశగా సాగెను. (18)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టనవతితమస్సర్గః *(98)*

వాల్మీకిమహర్షిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదియెనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

99. తొంబదితొమ్మిదవసర్గము

శ్రీరామ భరతులసమాగమము.

నివిష్టాయాం తు సేనాయామ్ ఉత్సుకో భరతస్తదా।
జగామ భ్రాతరం ద్రష్టుం శత్రుఘ్నమ్ అనుదర్శయన్। 1

సేనలను అన్నింటిని ఆశ్రమసమీపమున ఒకచోటనిలిపిన పిమ్మట, భరతుడు అన్నయైన శ్రీరాముని దర్శింపవలెనను ఉత్సాహముతో శత్రుఘ్నునకు ఆశ్రమచిహ్నములను చూపించుచు దానిని సమీపించెను. (1)

1) చైత్రరథము = కుబేరునివిహారవనము

ఋషిం వసిష్ఠం సందిశ్య మాతౄర్మే శీఘ్రమానయ।
ఇతి త్వరితమగ్రే స జగామ గురువత్సలః। 2

సుమన్త్రస్త్వపి శత్రుఘ్నమ్ అదూరాదన్వపద్యత।
రామదర్శనజస్తర్షో భరతస్యేవ తస్య చ। 3

గచ్ఛన్నేవాథ భరతః తాపసాలయసంస్థితామ్।
భ్రాతుః పర్ణకుటీం శ్రీమాన్ ఉటజం చ దదర్శ హ। 4

శాలాయాస్త్వగ్రతస్తస్యా దదర్శ భరత స్తదా।
కాష్ఠాని చావభగ్నాని పుష్పాణ్యుపచితాని చ। 5

స లక్ష్మణస్య రామస్య దదర్శాఽశ్రమమీయుషః।
కృతం వృక్షేష్వభిజ్ఞానం కుశచీరైః క్వచిత్ క్వచిత్। 6

దదర్శ చ వనే తస్మిన్ మహతః సంచయాన్ కృతాన్।
మృగాణాం మహిషాణాం చ కరీషైః శీతకారణాత్। 7

గచ్ఛన్నేవ మహాబాహుః ద్యుతిమాన్ భరతస్తదా।
శత్రుఘ్నం చాబ్రవీద్ధృష్టః తానమాత్యాంశ్చ సర్వశః। 8

మన్యే ప్రాప్తాః స్మ తం దేశం భరద్వాజో యమబ్రవీత్।
నాతిదూరే హి మన్యేఽహం నదీం మందాకినీమితః। 9

ఉచ్చైర్బద్ధాని చీరాణి లక్ష్మణేన భవేదయమ్।
అభిజ్ఞానకృతః పంథా వికాలే గంతుమిచ్ఛతా। 10

ఇదం చోదాత్తదంతానాం కుంజరాణాం తరస్వినామ్।
శైలపార్శ్వే పరిక్రాంతమ్ అన్యోఽన్యమ్ అభిగర్జతామ్। 11

యమేవాధాతుమిచ్ఛంతి తాపసాః సతతం వనే।
తస్యాసౌ దృశ్యతే ధూమః సంకులః కృష్ణవర్త్మనః। 12

గురుభక్తితత్పరుడైన భరతుడు 'మాతల్లులను త్వరగా తీసికొని రండు' - అని వసిష్ఠమహర్షికి విన్నవించుకొని, తాను త్వరత్వరగా ముందునకు సాగెను. (2)

ఆభరతునివలెనే మిక్కుటమైన రామదర్శనకాంక్షగల సుమంత్రుడును శత్రుఘ్నుని అనుసరించివెళ్లెను. (3)

పరమానందభరితుడైయున్న భరతుడు ముందునకు నడచుచు ఋషీశ్వరులఆశ్రమములవలె నెలకొల్పబడియున్న అన్నగారిపర్ణకుటీరమును దానిప్రక్కనేయున్న ఒక చిన్న పూరింటిని దర్శించెను. (4)

అప్పుడు భరతునకు ఆపర్ణశాలయొక్క ముందుభాగమున హోమముకొఱకును, రాత్రివేళలయందు నెగళ్లువేయుటకొఱకును సిద్ధపఱచబడిన కట్టెపుల్లలు కనవచ్చెను. పిదప అచట పూజకొఱకై సమకూర్చబడిన పుష్పములు అతనికి దర్శనమిచ్చెను. (5)

రామలక్ష్మణులు జలాశయాదులకు రాకపోకలు సాగించునప్పుడు తమగుర్తుకొఱకై వృక్షములపై అక్కడక్కడ కుశలతోడను, నారచీరలతోడను కొన్ని చిహ్నములను ఏర్పఱచుకొనిరి. ఆ వృక్షముల నన్నింటిని భరతుడు శ్రద్ధగా గమనించెను. (6)

ఆవనమునందు చలిబాధను నివారించుకొనుటకై దున్నలయొక్క, ఆవులయొక్క పేడలతో సిద్ధపఱచబడిన పెద్దపెద్ద పిడకల రాసులను అతడు చూచెను. (7)

అప్పుడు మహాబాహువు, మిగులతేజస్వియుఐన భరతుడు నడచివెళ్లుచునే ఎంతయు ప్రసన్నవదనుడై శత్రుఘ్నునితోడను, సుమంత్రుడు మొదలగు మంత్రులతోడను ఇట్లనెను. (8)

"భరద్వాజమహర్షి సూచించిన ప్రదేశమునకు మనము చేరినట్లే యున్నాము. మందాకినీనదియు ఇచటికి సమీపముననేయున్నట్లు తోచుచున్నది. ఎత్తైనప్రదేశములలో చెట్లకొమ్మలకు కట్టబడిన వల్కలములు కనబడుచున్నవి. వికాలమునందైనను, (సాయంకాలాదుల యందును) ఫలమూలములను, జలాదులను గొనివచ్చుటకై వెళ్లవచ్చునప్పుడు దారిగుర్తులకై లక్ష్మణుడే ఇట్లుచేసియుండవచ్చును. కనుక ఈచిహ్నములనుబట్టి వెళ్లినచో మనము శ్రీరాముని ఆశ్రమమునకు తప్పకచేరెదము. (9-10)

గొప్పగొప్పదంతములుగలిగి, వేగముగా సాగిపోగల అడవి యేనుగులు కోపాతిరేకముతో ఘీంకరించుచు, పరస్పరము పోట్లాడుకొనుచు ఈపర్వతప్రాంతమున సంచరించుచుండును. కనుక అటువెళ్లరాదని సూచించెడి ఈగుర్తులను లక్ష్మణుడే ఏర్పఱచియుండును. (11)

ఈఆశ్రమసమీపమునగల వనమునందు నిత్యాగ్నిహోత్రులైన తాపసులు ప్రాతఃకాలమునందును, సాయం సమయమునందును హోమకార్యములనిమిత్తమై అగ్నిని రక్షించుకొనుచుందురు. మనకు కనబడుచున్న ఈదట్టమైన పొగలన్నియును ఆఅగ్నులకు సంబంధించినదే యైయుండును. (12)

అత్రాహం పురుషవ్యాఘ్రం గురుసంస్కారకారిణమ్।
ఆర్యం ద్రక్ష్యామి సంహృష్టో మహర్షిమివ రాఘవమ్॥ 13

నరశ్రేష్ఠుడును, మహర్షివలె ఉత్తమసంస్కారములుగలవాడును, పూజ్యుడును ఐన శ్రీరాముని ఇచట మిగుల సంతోషముతో దర్శింతును." (13)

అథ గత్వా ముహూర్తం తు చిత్రకూటం స రాఘవః।
మందాకినీమనుప్రాప్తః తం జనం చేదమబ్రవీత్॥ 14

పిమ్మట ఆభరతుడు మందాకినీనదీతీరమునగల చిత్రకూట పర్వతసమీపమునకు క్షణకాలములో చేరి, తనతోడివారితో ఇట్లు నుడివెను. (14)

జగత్యాం పురుషవ్యాఘ్రః ఆస్తే వీరాసనే రతః।
జనేంద్రో నిర్జనం ప్రాప్య ధిఙ్మే జన్మ సజీవితమ్॥ 15

"ఈజగత్తున నరశ్రేష్ఠుడైన, మహాప్రభువగు శ్రీరాముడు నాకారణమున, జనసంచారములేని ఈవనములకుజేరి, వీరాసనమున[1] స్థితుడైయున్నాడు. అయ్యో! నాజన్మము, జీవితము వ్యర్థములే గదా! (15)

మత్కృతే వ్యసనం ప్రాప్తో లోకనాథో మహాద్యుతిః।
సర్వాన్ కామాన్ పరిత్యజ్య వనే వసతి రాఘవః॥ 16

నాకు రాజ్యమును కట్టబెట్టదలచి, నాతల్లియైన కైకేయియొనర్చిన కుట్రఫలితముగా మహాతేజస్వియు, జగత్ప్రభువు ఐన శ్రీరాముడు ఇడుములపాలైనాడు. అతడు సర్వసుఖములను పరిత్యజించి, ఈవనమునందు నివసించుచున్నాడు. (16)

ఇతి లోకసమాక్రుష్టః పాదేష్వద్య ప్రసాదయన్।
రామస్య నిపతిష్యామి సీతాయా లక్ష్మణస్య చ॥ 17

ఈవిధముగా నేను లోకనిందకు గురియైతిని. కనుక నేను శ్రీరాముని ప్రసన్నునిగాజేసికొనుటకై అతనిపాదములపై వ్రాలెదను. పిదప సీతాదేవిపాదములకు మోకరిల్లెదను, లక్ష్మణునిఅడుగులకు మ్రొక్కెదను." (17)

ఏవం స విలపంస్తస్మిన్ వనే దశరథాత్మజః।
దదర్శ మహతీం పుణ్యాం పర్ణశాలాం మనోరమామ్॥ 18

ఈవిధముగా దశరథసుతుడైన ఆ భరతుడు గోడుగోడున విలపించుచు ఆ వనమునందు పవిత్రమై, మనోహరమైన ఒక పెద్ద పర్ణశాలనుజూచెను. (18)

సాలతాలాశ్వకర్ణానాం పర్ణైర్బహుభిరావృతామ్।
విశాలాం మృదుభిస్తీర్ణాం కుశైర్వేదిమివాధ్వరే॥ 19

శక్రాయుధనికాశైశ్చ కార్ముకైర్భారసాధనైః।
రుక్మపృష్ఠైర్మహాసారైః శోభితాం శత్రుబాధకైః॥ 20

ఆకుటీరము మద్దీ, నల్లమద్దీ తాటిచెట్లఆకులతో చక్కగా కప్పబడియుండెను. అందువలన ఆపర్ణశాల మృదువైన కుశలతో కప్పబడిన యజ్ఞవేదికవలె విలసిల్లుచుండెను. అందు వజ్రాయుధముతో సదృశములైన మహాధనుస్సులు విలసిల్లుచుండెను. అవి గురుతరము లైన కార్యములను సాధించుటలో సమర్థములు, అవి వెనుక భాగములయందు బంగారుపూతలుగలిగియుండెను. అవి సముచితప్రమాణము గలిగి, శత్రువులను నిర్మూలింపగల ప్రముఖ సాధనములు. (19-20)

అర్కరశ్మిప్రతీకాశైః ఘోరైస్తూణీగతైః శరైః।
శోభితాం దీప్తవదనైః సర్పైర్భోగవతీమివ॥ 21

అచటి తూణీరములలోని బాణములు సూర్యకిరణముల వలె తీక్ష్ణముగా ప్రకాశించుచుండెను. అట్టి భయంకరములైన శరములతోగూడిన ఆపర్ణశాల మెఱయుచు భీకరముగానున్న సర్పములచే గూడిన భోగవతివలె ఒప్పుచుండెను. (21)

మహారజతవాసోభ్యామ్ అసిభ్యాం చ విరాజితామ్।
రుక్మబిందువిచిత్రాభ్యాం చర్మభ్యాం చాపి శోభితామ్॥ 22

గోధాంగులిత్రైరాసక్తైః చిత్రైః కాంచనభూషితైః।
అరిసంఘైరనాధృష్యాం మృగైః సింహగుహామివ॥ 23

అచట మేలిమిబంగారుఒఱలుగల రెండు ఖడ్గములును, బంగరు ముక్కలతో చిత్రవిచిత్రముగా మెఱయుచున్న రెండు డాలులును ఆ పర్ణశాలశోభను ఇనుమడింపజేయుచుండెను. బంగారు నగిషీలతో చిత్రవిచిత్రములుగా ఒప్పుచు, ఉడుముచర్మముతో సిద్ధపఱచబడిన వ్రేళ్లకవచములు[2] అక్కడ వ్రేలాడుచుండెను. ఈవిధముగా పర్ణశాల అడవిమృగములకు ప్రవేశింపరాని సింహగుహవలె శత్రువులకు చొఱరానిదై, అజేయమైయుండెను. (22-23)

1) కుడిమోకాలిపై ఎడమపాదమును ఉంచి కూర్చుండుటను 'వీరాసనము' అనియందురు.
2) అంగులిత్రములు = వ్రేళ్లకవచములు. వింటినారిని సంధించునపుడు రాపిడిబాధలేకుండుటకై వ్రేళ్లకుధరించెడి (ఉడుము చర్మముతో నిర్మించిన) సాధనములు.

ప్రాగుదక్ప్రవణాం వేదిం విశాలాం దీప్తపావకామ్।
దదర్శ భరతస్తత్ర పుణ్యాం రామనివేశనే। 24

నిరీక్ష్య స ముహూర్తం తు దదర్శ భరతో గురుమ్।
ఉటజే రామమాసీనం జటామండలధారిణమ్। 25

తం తు కృష్ణాజినధరం చీరవల్కలవాససమ్।
దదర్శ రామమాసీనం అభితః పావకోపమమ్। 26

సింహస్కంధం మహాబాహుం పుండరీకనిభేక్షణమ్।
పృథివ్యాః సాగరాంతాయా భర్తారం ధర్మచారిణమ్। 27

ఉపవిష్టం మహాబాహుం బ్రహ్మాణమివ శాశ్వతమ్।
స్థండిలే దర్భసంస్తీర్ణే సీతయా లక్ష్మణేన చ। 28

తం దృష్ట్వా భరతః శ్రీమాన్ దుఃఖశోకపరిప్లుతః।
అభ్యధావత ధర్మాత్మా భరతః కేకయీసుతః। 29

దృష్ట్వైవ విలలాపాఽఽర్తో బాష్పసందిగ్ధయా గిరా।
అశక్నువన్ ధారయితుం ధైర్యాద్వచనమబ్రవీత్। 30

యస్సంసది ప్రకృతిభిః భవేద్యుక్త ఉపాసితుమ్।
వన్యైర్మృగైరుపాసీనః సోఽయమాస్తే మమాగ్రజః। 31

వాసోభిర్బహుసాహస్రైః యో మహాత్మా పురోచితః।
మృగాజినే సోఽయమిహ ప్రవస్తే ధర్మమాచరన్। 32

అధారయద్యో వివిధాః చిత్రాః సుమనసస్సదా।
సోఽయం జటాభారమిమం వహతే రాఘవః కథమ్। 33

యస్య యజ్ఞైర్యథోద్దిష్టైః యుక్తో ధర్మస్య సంచయః।
శరీరక్లేశసంభూతం స ధర్మం పరిమార్గతే। 34

చందనేన మహార్హేణ యస్యాంగముపసేవితమ్।
మలేన తస్యాంగమిదం కథమార్యస్య సేవ్యతే। 35

మన్నిమిత్తమిదం దుఃఖమ్ ప్రాప్తో రామః సుఖోచితః।
ధిక్జీవితం నృశంసస్య మమ లోకవిగర్హితమ్। 36

ఇత్యేవం విలపన్ దీనః ప్రస్విన్నముఖపంకజః।
పాదావప్రాప్య రామస్య పపాత భరతో రుదన్। 37

భరతుడు ఆ శ్రీరాముని పర్ణశాలయందు పవిత్రమైన ఒక విశాలవేదికను గాంచెను. అది ఈశాన్యదిశయందు కొంతపల్లముగా నుండి, అగ్నిజ్వాలలతో వెలుగొందుచుండెను. (24)

అంతట భరతుడు ఒక క్షణకాలముపాటు పర్ణశాలను పరికించి చూచి, అచట పూజ్యుడును, జటామండలధారియు అగు శ్రీరాముడు ఆసీనుడైయుండగా దర్శించెను. అప్పుడు ఆ ప్రభువు నారచీరలను ధరించి, జింకచర్మమును ఉత్తరీయముగాదాల్చి, సుఖాసీనుడై, ఎదురుగా అగ్నితేజస్సుతో వెలుగొందుచుండెను. (25-26)

సముద్రములవఱకును వ్యాపించియున్న సమస్తభూమండలమునకు స్వామియు, ధర్మాత్ముడును, మహాబాహువు ఐన శ్రీరాముడు శాశ్వతుడైన పరమాత్మవలె వేదికపైగల కుశాసనముపై సీతాలక్ష్మణులతోగూడి కూర్చొనియుండెను. ఆ స్వామి సింహమువలె ఎత్తైన భుజములతో, పద్మములవలె మనోహరములైన చూపులతో ప్రసన్నుడైయుండెను. (27-28)

వినయసంపన్నుడైన భరతుడు ఆయనను చూచిన వెంటనే శోకమోహములలో మునింగెను. పిమ్మట ధర్మాత్ముడైన ఆ కైకేయీ సుతుడు వేగముగా ఆ ప్రభువుకడకు పరుగెత్తెను. (29)

భరతుడు అన్నను చూచినంతనే పెల్లుబికిన దుఃఖముతో విలపింపసాగెను. ఎంతగా ప్రయత్నించినను సంతతధారగా ప్రవహించుచున్న దుఃఖాశ్రువులను అపుకొనలేక, అతడు గద్గదస్వరముతో ఇట్లు పలికెను. (30)

"నిండుసభలో పురజనులచేతను, మంత్రులచేతను సేవాసత్కారములను అందుకొనవలసియున్న మాఅన్న నేడు ఇచట ఈ వన్యమృగములచే సేవింపబడుచున్నాడు. అమూల్యములైన పట్టుపీతాంబరములను ధరించుచుండవలసిన ఈ మహాత్ముడు నేడు ఇచట పితృవాక్యపరిపాలనధర్మమును ఆచరించుచు మృగచర్మమును ధరించియున్నాడు. (31-32)

ఇదివఱలో ఈ రాఘవుడు తనశిరమున నానావిధములైన చిత్రవిచిత్రములగు పూవులను ధరించుచుండెడివాడు. ఇప్పుడు ఇతడు ఈ జటాభారమును ఎట్లు మోయుచున్నాడో గదా? (33)

ఎట్టి శ్రమయులేకుండ శాస్త్రోక్తములైన యజ్ఞములను ఒనర్చుచు ధర్మమును ఆచరించుచుండెడి శ్రీరాముడు ఇప్పుడు ఈ వనమున శరీరశ్రమతోగూడిన తపోవిధులను పాటించుచున్నాడు. (34)

అత్యుత్తమములగు చందనాదిలేపములకు యోగ్యమైన ఈ ప్రభువుశరీరము నేడు ధూళిని ఎట్లు భరించుచున్నది?(35)

వివిధసుఖములను అనుభవించుచు హాయిగా ఉండవలసిన శ్రీరాముడు నానిమిత్తముగా ఇట్టి ఇడుములకు లోనైనాడు. అయ్యో! నేనెంతటి క్రూరాత్ముడను? నాజీవితము లోకనింద్యము, వ్యర్థము." (36)

భరతుడు ఈ విధముగా విలపించుచు పట్టరానిదుఃఖమునకు లోనయ్యెను. పద్మమువంటి అతనిముఖము స్వేదజలములతో తడిసిపోయెను. శ్రీరాముని పాదములను చేరకముందే ఏడ్చుచు అతడు నేలపై పడిపోయెను. (37)

దుఃఖాభితప్తో భరతో రాజపుత్త్రో మహాబలః।
ఉక్త్వాఽఽర్యేతి సకృద్దీనం పునర్నోవాచ కించన। 38

మహారాజకుమారుడును, బలశాలియునైన భరతుడు అంతులేని దుఃఖముతో కుమిలిపోవుచున్నవాడై, దీనస్వరముతో ఒక్కసారి 'స్వామీ!' అని పలికెను. పిమ్మట అతని గొంతు పెగలదయ్యెను. (38)

బాష్పాపిహితకంఠశ్చ ప్రేక్ష్య రామం యశస్వినమ్।
ఆర్యేత్యేవాథ సంక్రుశ్య వ్యాహర్తుం నాఽశకత్ తదా। 39

మహాత్ముడైన శ్రీరాముని జూడగనే భరతునకు కన్నీరు మున్నీరయ్యెను. అతని కంఠము రుద్ధమాయెను. ఎట్టకేలకు అతడు 'అన్నా!' అని బిగ్గఱగా పలికెను. పిదప అతడు ఏమియు మాటాడలేకపోయెను. (39)

శత్రుఘ్నశ్చాపి రామస్య వవందే చరణౌ రుదన్।
తావుభౌ స సమాలింగ్య రామశ్చాశ్రూణ్యవర్తయత్। 40

శత్రుఘ్నుడును ఏడ్చుచు శ్రీరాముని పాదములకు ప్రణమిల్లెను. శ్రీరాముడు ఆఇరువురిని లేవనెత్తి అక్కునజేర్చుకొనెను. అంతట శ్రీరామునినేత్రములనుండియు అశ్రువులు ధారలుగట్టెను. (40)

తతః సుమంత్రేణ గుహేన చైవ
సమీయతూ రాజసుతావరణ్యే ।
దివాకరశ్చైవ నిశాకరశ్చ
యథాఽంబరే శుక్రబృహస్పతిభ్యామ్ । 41

పిమ్మట రాజకుమారులైన ఆరామలక్ష్మణులు, ఆకాశమున సూర్యచంద్రులు శుక్ర బృహస్పతులను కలిసినట్లు ఆవనమున సుమంత్రునితోను, గుహునితోను కూడిరి. (41)

తాన్ పార్థివాన్ వారణయూథపాభాన్
సమాగతాంస్తత్ర మహత్యరణ్యే ।
వనౌకసస్తేఽపి సమీక్ష్య సర్వే
ఽశ్రూణ్యముంచన్ ప్రవిహాయ హర్షమ్। 42

మదపుటేనుగులవలె గంభీరమూర్తులైన ఆనలుగురు రాజకుమారులును ఆ మహారణ్యమునందు చేరియున్నదృశ్యము జూచి, వనవాసులైన ఋషీశ్వరులు మున్నగు వారందఱును హర్షమును వీడి, శోకముతో కంటతడిబెట్టిరి. (42)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనశతతమస్సర్గః *(99)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు తొంబదితొమ్మిదవసర్గము సమాప్తము

-- * * * --

100. నూఱవసర్గము

కుశలప్రశ్నలరూపములో శ్రీరాముడు భరతునకు రాజనీతిధర్మములను బోధించుట.

జటిలం చీరవసనం ప్రాంజలిం పతితం భువి।
దదర్శ రామో దుర్దర్శం యుగాంతే భాస్కరం యథా। 1

కథంచిదభివిజ్ఞాయ వివర్ణవదనం కృశమ్।
భ్రాతరం భరతం రామః పరిజగ్రాహ బాహునా। 2

ఆఘ్రాయ రామస్తం మూర్ధ్ని పరిష్వజ్య చ రాఘవః।
అంకే భరతమారోప్య పర్యపృచ్ఛత్ సమాహితః। 3

నారచీరలను ధరించి, జటాధారియై, భూమిపై సాగిలబడి నమస్కరించుచు, ప్రళయకాలమున సూర్యునివలె దీనావస్థలో నున్న భరతుని శ్రీరాముడు చూచెను. ముఖమున చిన్నెదఱిగి, కృశించియున్న సోదరుడగు భరతుని ఎట్టకేలకు గుర్తించి, శ్రీరాముడు అతనిని తనచేతులలోనికి తీసికొనెను. పిమ్మట రఘురాముడు భరతుని కౌగిలించుకొని, శిరస్సును మూర్కొనెను. అనంతరము అతనిని తనయొడిలోనికి చేర్చుకొని, సాదరముగా శ్రీరాముడు ఇట్లు కుశల ప్రశ్నలుగావించెను. (1-3)

క్వను తేఽభూత్ పితా తాత! యదరణ్యం త్వమాగతః।
న హి త్వం జీవతస్తస్య వనమాగంతుమర్హసి। 4

"నాయనా! భరతా! తండ్రిగారెక్కడ? నీవు అక్కడ ఆయనకు సేవలొనర్చుచు ఉండక ఇట్లు ఈఅరణ్యములకు ఏలవచ్చితివి?(4)

చిరస్య బత పశ్యామి దూరాద్భరతమాగతమ్।
దుష్ప్రతీకమరణ్యేఽస్మిన్ కిం తాత! వనమాగతః। 5

అహో! మాతామహుని (కేకయమహారాజుయొక్క) గృహమునకు వెళ్ళినపిమ్మట ఎంతో కాలమునకు ఇంతదూరము ఈఅడవికి విచ్చేసిన భరతుని నేడు చూచుచున్నాను. గుర్తుపట్టలేనంతగా ఇతడు మిగుల బక్కచిక్కియున్నాడు. నాయనా! భరతా! ఈవనములకు ఎందులకై వచ్చితివి? (5)

కచ్చిద్ధారయతే తాత! రాజా యత్ త్వమిహాగతః।
కచ్చిన్న దీనః సహసా రాజా లోకాంతరం గతః। 6

కచ్చిత్ సౌమ్య! న తే రాజ్యం భ్రష్టం బాలస్య శాశ్వతమ్। 7

కచ్చిత్ శుశ్రూషసే తాత పితరం సత్యవిక్రమమ్। 8

నాయనా! భరతా! మహారాజుగారు కుశలమేగదా? ఒకవేళ మనతండ్రి దుఃఖభారముచే పరలోకగతుడుకాలేదుగదా? సౌమ్యుడా! నీవు బాలుడవగుటచే మనకు వంశపరంపరగా వచ్చుచున్న ఈరాజ్యము అన్యాక్రాంతముకాలేదుగదా? సత్యసంధుడైన తండ్రిగారికి నిత్యము సేవలొనర్చుచున్నావు గదా? ఇంతకును నీవు ఇచటికి ఎందులకు వచ్చితివి? (6-8)

కచ్చిత్ దశరథో రాజా కుశలీ సత్యసంగరః।
రాజసూయాశ్వమేధానామ్ ఆహర్తా ధర్మనిశ్చయః। 9

ధర్మనిరతుడై రాజసూయ-అశ్వమేధాదిక్రతువులను ఆచరించిన సత్యప్రతిజ్ఞుడగు దశరథమహారాజు కుశలమేగదా? (9)

స కచ్చిద్బ్రాహ్మణో విద్వాన్ ధర్మనిత్యో మహాద్యుతిః।
ఇక్ష్వాకూణాముపాధ్యాయో యథావత్ తాత! పూజ్యతే। 10

నాయనా! బ్రాహ్మణోత్తముడును, అన్నివిద్యలలో ఆరితేరిన వాడును, ధర్మాత్ముడును, బ్రహ్మతేజస్సంపన్నుడును, ఇక్ష్వాకు వంశజులకు గురువునగు వసిష్ఠమహర్షి విశిష్టమైన గౌరవాదరములతో పూజలను అందుకొనుచున్నాడా? (10)

సా తాత కచ్చిత్ కౌసల్యా సుమిత్రా చ ప్రజావతీ।
సుఖినీ కచ్చిదార్యా చ దేవీ నందతి కైకయీ। 11

దుఃఖితయైయున్న కౌసల్యామాత ఇప్పుడు నెమ్మదిగా ఉన్నదా? సత్సంతానవతియైన తల్లి సుమిత్రాదేవి కుశలమేగదా? పూజ్యురాలైన కైకేయీజనని ఆనందించుచున్నదా? (11)

కచ్చిద్వినయసంపన్నః కులపుత్రో బహుశ్రుతః।
అనసూయురనుద్రష్టా సత్కృతస్తే పురోహితః। 12

మనపురోహితుడు అహంకారమును ఎఱుగనివాడు, ఉత్తమవంశమున జన్మించిన వాడు, సమస్తవిద్యలను నేర్చినవాడు, ఇతరులయెడ దోషదృష్టి లేనివాడు, ఎల్లరకును మార్గదర్శకుడు అట్టి మహానుభావుని నీవు ఆదరించుచున్నావుగదా? (12)

కచ్చిదగ్నిషు తే యుక్తో విధిజ్ఞో మతిమాన్ ఋజుః।
హుతం చ హోష్యమాణం చ కాలే వేదయతే సదా। 13

హోమవిధులను బాగుగా ఎఱిగినవారు, ప్రతిభాశాలురు, ఋజువర్తనులు ఐన బ్రాహ్మణులు హోమకార్యములను నిర్వహించుటకు నీచే నియుక్తులై, చేయబడిన హోమములనుగూర్చియు చేయవలసిన హోమములను గుఱించియు ఎప్పటికప్పుడు నీకు తెలియజేయుచున్నారుగదా? (13)

కచ్చిద్దేవాన్ పితౄన్ మాతౄః గురూన్ పితృసమానపి।
వృద్ధాంశ్చ తాత! వైద్యాంశ్చ బ్రాహ్మణాంశ్చాభిమన్యసే। 14

నాయనా! యజ్ఞములయందు ఆహుతులను సమర్పించుట ద్వారా, ఆరాధించుటద్వారా దేవతలను, ఆజ్ఞలను పాటించుటచే, సేవలొనర్చుటచే తల్లిదండ్రులను, బహుమతులను ఇచ్చుటద్వారా భృత్యులను, అభిమతములను అనుసరించి ప్రవర్తించుటద్వారా గురువులను, ధనసహాయముద్వారా జ్ఞాతులను, వినయవిధేయతలతో నమస్కరించుటద్వారా జ్ఞాన, శీల, వయోవృద్ధులను, ధనదానాదులతో సంతోషపఱచుచు వైద్యులను, విద్వాంసులను, బ్రాహ్మణోత్తములను ఆదరించుచున్నావుగదా? (14)

ఇష్వస్త్రవరసంపన్నమ్ అర్థశాస్త్రవిశారదమ్।
సుధన్వానముపాధ్యాయం కచ్చిత్ త్వం తాత! మన్యసే। 15

భరతా! శస్త్రాస్త్రములను ప్రయోగించుటలో సమర్థుడును, వివిధ నీతిశాస్త్రములలో పండితుడునునైన 'సుధన్వుడు' అను పేరుగల ఆచార్యుని గౌరవించుచున్నావుగదా? (15)

కచ్చిదాత్మసమాః శూరాః శ్రుతవంతో జితేంద్రియాః।
కులీనాశ్చేంగితజ్ఞాశ్చ కృతాస్తే తాత! మంత్రిణః। 16

నాయనా! విశ్వాసపాత్రులును, నీతోసమానులైన ధీరులును, రాజనీతిశాస్త్రమున ఆఱితేఱినవారును, ప్రలోభములకు లొంగని వారును, ఉత్తమవంశమున పుట్టినవారును, నీమనస్సును ఎఱిగి ప్రవర్తించువారును ఐన సత్పురుషులను మంత్రులనుగా నియమించితివి గదా? ఓ భరతా! సమస్తశాస్త్రములను నేర్చిన వారును, విషయములను

మన్త్రో విజయమూలం హి రాజ్ఞాం భవతి రాఘవ!।
సుసంవృతో మన్త్రధరైః అమాత్యైః శాస్త్రకోవిదైః। 17

కచ్చిన్నిద్రావశం నైషీః కచ్చిత్ కాలే ప్రబుధ్యసే।
కచ్చిచ్చాపరరాత్రేషు చింతయస్యర్థనైపుణమ్। 18

కచ్చిన్మంత్రయసే నైకః కచ్చిన్న బహుభిస్సహ।
కచ్చిత్ తే మంత్రితో మంత్రో రాష్ట్రం న పరిధావతి। 19

కచ్చిదర్థం వినిశ్చిత్య లఘుమూలం మహోదయమ్।
క్షిప్రమారభసే కర్తుం న దీర్ఘయసి రాఘవ!। 20

కచ్చిత్ తే సుకృతాన్యేవ కృతరూపాణి వా పునః।
విదుస్తే సర్వకార్యాణి న కర్తవ్యాని పార్థివాః। 21

కచ్చిన్న తర్కైర్యుక్త్యా వా యే చాప్యపరికీర్తితాః।
త్వయా వా తవవామాత్యైః బుధ్యతే తాత! మంత్రితమ్। 22

కచ్చిత్ సహస్రాన్మూర్ఖాణామ్ ఏకమిచ్ఛసి పండితమ్।
పండితో హ్యర్థకృచ్ఛ్రేషు కుర్యాన్నిఃశ్రేయసం మహత్। 23

సహస్రాణ్యపి మూర్ఖాణాం యద్యుపాస్తే మహీపతిః।
అథవాప్యయుతాన్యేవ నాస్తి తేషు సహాయతా। 24

ఏకోఽప్యమాత్యో మేధావీ శూరో దక్షో విచక్షణః।
రాజానం రాజపుత్రం వా ప్రాపయేన్మహతీం శ్రియమ్। 25

కచ్చిన్ముఖ్యా మహత్స్వేవ మధ్యమేషు చ మధ్యమాః।
జఘన్యాస్తు జఘన్యేషు భృత్యాః కర్మసు యోజితాః। 26

అమాత్యాన్ ఉపధాతీతాన్ పితృపైతామహాన్ శుచీన్।
శ్రేష్ఠాన్ శ్రేష్ఠేషు కచ్చిత్ త్వం నియోజయసి కర్మసు। 27

గోప్యముగా ఉంచగలవారును ఐన మంత్రులచే బాగుగా రక్షింపబడిన రహస్యాలోచనలే రాజులయొక్క విజయమునకు మూలములు సుమా. నాయనా! నీవు నిద్రకు (విపరీతముగా నిద్రపోవుటకు) వశమగుటలేదు గదా? సకాలములో నిద్రనుండి మేల్కొనుచున్నావుగదా? వేకువజాముననే కర్తవ్యములనుగూర్చి ఆలోచించుచున్నావు గదా? రాజ్యమునకు సంబంధించిన రహస్యాలోచనలనుగూర్చి నీవు ఒక్కడవుమాత్రమే ఆలోచించుటలేదుగదా? అట్లనియెక్కువమందితో మంత్రాంగమును నెఱపవుగదా? నీవు కావించిన రహస్యచర్చలు రాజ్యమును దాటిపోవుట లేదుగదా? (శత్రురాజులకు చేరుటలేదుగదా! బయటికి పొక్కుట లేదుగదా?) (16-19)

నాయనా స్వల్పమైన సాధనసంపత్తితో అధికమైన లాభములను చేకూర్చుకార్యములను నిశ్చయించిన పిదప విళంబనమూ చేయక, వాటిని వెంటనే ప్రారంభించుచున్నావుగదా? (20)

భరతా! నీవు చేపట్టిన కార్యములలో పూర్తియైనవియు, దాదాపు పూర్తికానున్నవియు మాత్రమే సామంతరాజులకు తెలియుచున్నవి గదా? ముప్ముందు నిర్వహింపదలచిన కార్యములనుగూర్చి వారికి తెలియుటలేదుగదా? (21)

నాయనా! నిశ్చయింపబడిన కార్యములను నీవుగాని, నీమంత్రులు గాని ప్రకటింపకముందే ఇతరులు చర్చలద్వారా గాని, ఇతరములైన ఉపాయములచేగాని, ఊహలచేగాని తెలిసికొనుట లేదుగదా?(22)

భరతా! నీవు పెక్కుమంది మూర్ఖులతో చర్చించుటగాక సమస్త విషయములను ఎఱిగిన ఒక్కపండితునితో మాత్రమే మంత్రాంగమును నెఱపుచున్నావుగదా? ఏలనన కార్యముల యందు చిక్కులు ఎదురైనప్పుడు ఒక్కపండితుడు మాత్రమే సరియగు సూచనలను ఇచ్చి, గొప్ప శ్రేయస్సును కలిగించుటకు తోడ్పడగలడు. (23)

ఏప్రభువైనను మూర్ఖులకు వేయిమందికి - అంతమాత్రమే గాదు పదివేలమందికి ఆశ్రయమిచ్చినను సమయము వచ్చినప్పుడు వారివలన ఒనగూడు ప్రయోజనము శూన్యము. (24)

ఎదుటివారి అభిప్రాయములను బాగుగా గుర్తింపగలవాడును (మేధావియు) స్థిరబుద్ధియు, సముచితముగా ఆలోచించుటలో సమర్థుడును ఐన అమాత్యుడు ఒక్కడైనను రాజునకును, రాజపుత్రునకును మహాసంపదలను లభింపజేయగలడు. (25)

ఉన్నతశ్రేణికి చెందినవారిని గొప్పగొప్ప కార్యములయందును, మధ్యస్థాయికి చెందినవారిని సామాన్యకార్యములయందును, నిమ్నస్థాయివారిని స్వల్పకార్యములయందును భృత్యులనుగా నియమించుచున్నావుగదా? (26)

ప్రలోభములకు లొంగనివారును, తరతరములనుండి ఉన్నత పదవులను అలంకరించుచు వచ్చినవారును, త్రికరణశుద్ధి గలవారును, ఉత్తమోత్తములును ఐన వ్యక్తులను ముఖ్యకార్యములయందు అమాత్యులనుగా నియమించుచున్నావుగదా? (27)

కచ్చిన్నోగ్రేణ దండేన భృశముద్వేజితప్రజమ్।
రాష్ట్రం తవానుజానంతి మంత్రిణః కైకయీసుత!। 28

కచ్చిత్ త్వాం నావజానంతి యాజకాః పతితంయథా।
ఉగ్రప్రతిగ్రహీతారం కామయానమివ స్త్రియః। 29

ఉపాయకుశలం వైద్యం భృత్యసందూషణే రతమ్।
శూరమైశ్వర్యకామం చ యో న హంతి స వధ్యతే। 30

కచ్చిద్ధృష్టశ్చ శూరశ్చ మతిమాన్ ధృతిమాన్ శుచిః।
కులీనశ్చానురక్తశ్చ దక్షః సేనాపతిః కృతః। 31

బలవంతశ్చ కచ్చిత్ తే ముఖ్యా యుద్ధవిశారదాః।
దృష్టాపదానా విక్రాంతాః త్వయా సత్కృత్య మానితాః। 32

కచ్చిద్బలస్య భక్తం చ వేతనం చ యథోచితమ్।
సంప్రాప్తకాలం దాతవ్యం దదాసి న విలంబసే। 33

కాలాతిక్రమణాచ్చైవ భక్తవేతనయోర్భృతాః।
భర్తుః కుప్యంతి దుష్యంతి సోఽనర్థః సుమహాన్ స్మృతః। 34

కచ్చిత్ సర్వేఽనురక్తాస్త్వాం కులపుత్రాః ప్రధానతః।
కచ్చిత్ప్రాణాంస్తవార్థేషు సంత్యజంతి సమాహితాః। 35

కచ్చిజ్జానపదో విద్వాన్ దక్షిణః ప్రతిభానవాన్।
యథోక్తవాదీ దూతస్తే కృతో భరత! పండితః। 36

కచ్చి దష్టాదశాన్యేషు స్వపక్షే దశ పంచ చ।
త్రిభిస్త్రిభిరవిజ్ఞాతైః వేత్సి తీర్థాని చారకైః। 37

ఓ భరతా! రాజ్యమునందలి ప్రజలను ఉద్విగ్నులను చేయు తీవ్రదండనలను విధింపకుండ మంత్రులు నిన్ను నివారించుచున్నారు గదా? (28)

అక్రమమార్గములద్వారా ధనమును సంపాదించి, యజ్ఞములను చేయుటకు పూనుకొనిన పతితుని సదాచారసంపన్నులైన ఋత్విజులు తిరస్కరింతురు, బలాత్కారమునకు పూనుకొనిన కాముకుని స్త్రీలు ఏవగింతురు. అట్లే శిక్షార్హులుకానివారినుండి దండోపాయముతో శిక్షారనమును (జరిమానాను) గ్రహించుటకు సిద్ధపడినచో నిన్ను ప్రజలు తిరస్కరింతురు. నీవు అట్లు చేయుటలేదుగదా? – అనగా ఓ భరతా! ప్రజలకు అవమానము కలుగునట్లుగా అన్యాయముగా నీవు వారినుండి సుంకములను గ్రహించుటలేదుగదా? (29)

'సామదానాది చతురుపాయములలో నేర్పరియయ్యును, కుటిలరాజనీతిలో ఆరితేరినవాడును, విశ్వాసపాత్రులైన భృత్యులను తొలగించుటయందే నిమగ్నుడును, పాత్యలకు వెనుకాడనివాడును, రాజ్యాక్రమణకాంక్షగలవాడును ఐన పురుషుని వధింపనిచో రాజు అతనిచేతనే నిహతుడగును – లేదా రాజ్యభ్రష్టుడగును. (30)

రాజసత్కారములతో సంతుష్టుడైయుండువాడును, శత్రువులను నిగ్రహింపగల సమర్థుడును, సేనావ్యూహములయందు చతురుడును, విపత్కరపరిస్థితులయందు ధైర్యముగానుండువాడును, పవిత్రముగా నుండెడివాడును, సద్వంశమున జన్మించినవాడును, రాజభక్తిగల వాడును, యుద్ధకార్యకుశలుడును ఐన వానిని సేనాపతిగా నియమించితివిగదా? (31)

ఓ భరతా! నీ సేనలోని ప్రముఖయోధులు మిగులబలశాలురు, రణమొనర్చుటలో సమర్థులు, పరాక్రమవంతులు ఐన వారేనా? వారు బలపరీక్షలలో నెగ్గినవారేనా? వారిని నీవు పారితోషికములతో సత్కరించుచున్నావా? భటులకు ఇచ్చెడి జీతబత్తెములవిషయమున కాలాతిక్రమణము జరిగినచో వారు రాజునెడ కుపితులై ఆయనను దూలనాడుదురు. అది పెక్కు అనర్థములకు దారితీయును.(32-34)

మంత్రులు మొదలగు ప్రధానాధికారులు అందఱును ఉత్తమ వంశములయందు జన్మించినవారేనా? వారు నీయెడ భక్తిశ్రద్ధలు గల్గియుందురా? వారు నీకొఱకై ప్రాణములనొడ్డుటకైనను సిద్ధపడుదురా? (35)

స్వదేశీయులును, ఇతరులభావములను గ్రహింపగలవారును, కార్యదక్షులును, సమయస్ఫూర్తిగలవారును, రాజసందేశములను యథాతథముగ తెలుపగలవారును, యుక్తాయుక్తవిచక్షణ గలవారును ఐన పురుషులనే విదేశములకు దూతలనుగా వినియోగించుచున్నావా?(36)

పరదేశములవిషయమున పద్దెనిమిదిమంది చొప్పున ఆయా తీర్థములవారిని, (రాజకార్యములను నిర్వహించెడివారిని) స్వదేశ విషయమున పదునైదుమంది తీర్థములవారిని గుర్తించి, వారిలో ప్రతిముగ్గురిపైనను ఒక్కొక్క గూఢచారిని నియమించి,

కచ్చిద్వ్యపాస్తానహితాన్ ప్రతియాతాంశ్చ సర్వదా।
దుర్బలాననవజ్ఞాయ వర్తసే రిపుసూదన!। 38

కచ్చిన్న లోకాయతికాన్ బ్రాహ్మణాంస్తాత! సేవసే।
అనర్థకుశలాహ్యేతే బాలాః పండితమానినః। 39

ధర్మశాస్త్రేషు ముఖ్యేషు విద్యమానేషు దుర్బుధాః।
బుద్ధిమాన్వీక్షికీం ప్రాప్య నిరర్థం ప్రవదంతి తే। 40

వీరైరధ్యుషితాం పూర్వమ్ అస్మాకం తాత! పూర్వకైః।
సత్యనామాం దృఢద్వారాం హస్త్యశ్వరథసంకులామ్। 41

బ్రాహ్మణైః క్షత్రియైర్వైశ్యైః స్వకర్మనిరతైః సదా।
జితేంద్రియైర్మహోత్సాహైః వృతామార్యైః సహస్రశః। 42

ప్రాసాదైర్వివిధాకారైః వృతాం వైద్యజనాకులామ్।
కచ్చిత్ సముదితాం స్ఫీతామ్ అయోధ్యాం పరిరక్షసి। 43

ఆ తీర్థములవారి కార్యకలాపములను ఎప్పటికప్పుడు నిశితముగా పర్యవేక్షించుచున్నావా?[1] (37)

శత్రుసంహారకుడవైన ఓ భరతా! దేశమునుండి వెడలగొట్టబడిన శత్రువులు తిరిగి (యుద్ధమునకు) వచ్చినచో నీవు వారిని బలహీనులనుగా తలచి, ఉపేక్షించుటలేదుగదా? (38)

నాయనా! నాస్తికులైన బ్రాహ్మణులను నీవు చేరదీయుటలేదుగదా? ఏలనన వారు ఇతరులబుద్ధులను పరమాత్మనుండి దూరముచేయుటలో కడునేర్పరులు. వాస్తవముగా వారు అజ్ఞానులైనను తమను తాము గొప్పపండితులుగా భావింతురు. వేదముల, ధర్మశాస్త్రముల, పురాణేతిహాసముల విషయములయందు వారిబుద్ధి వెడమార్గము పట్టుచుండును. ప్రత్యక్షప్రమాణములనే ఆశ్రయించి, వారు ప్రయోజనము లేనట్టి శుష్కవాదములను జేయుచుందురు. (39-40)

భరతకుమారా! మనపూర్వులు అసహాయశూరులు. వారికి నెలవైనట్టిదే మన అయోధ్యానగరము శత్రుదుర్భేద్యమైనది. సార్థక నామధేయము గలది. బలునైనములయందుమగల ద్వారద్వారములు మిక్కిలి దృఢమైనవి. అది రథాశ్వగజబలములతో సర్వదా నిండియుండును. ఆపురమునందు వేలసంఖ్యలోగల బ్రాహ్మణులును, క్షత్రియులును, వైశ్యులును నిరంతరము తమతమ ధర్మకర్మలయందు నిరతులై యుందురు. వారు జితేంద్రియులు, వారికార్యోత్సాహములు నిరుపమానములు. కనుక వారు ఎల్లరును పూజ్యులు. అందలి వివిధాకారములుగల రాజభవనములు, మందిరములు ఆ నగరశోభను ఇనుమడింపజేయుచుండును. అది యోగ్యులైనను అసంఖ్యాకులైన విద్వాంసులతో కలకలలాడుచుండును. అది సమృద్ధిసంపదలకును నెలవైనది. అందలి ప్రజలసుఖసంతోషములకు అవధియుండదు. అట్టి అయోధ్యానగరమును నీవు చక్కగా పరిరక్షించుచున్నావు గదా? (41-43)

1) తీర్థములవారు = రాజకార్యములను నిర్వహించెడివారు.
అష్టాదశ తీర్థములవారు -
మంత్రి పురోహితయువరాజసేనాపతి దౌవారికాంతర్వంశిక కారాగారాధికృతార్థసంచయకృత్ కార్యనియోజక ప్రాడ్వివాక సేనానాయక నగరాధ్యక్ష కర్మాంతిక సభ్య (సభాధ్యక్ష) ధర్మాధ్యక్షదండపాల దుర్గపాల రాష్ట్రాంతపాలాః ।
శ్లో॥ చారాన్ విచారయేత్, తీర్థేష్వాత్మనశ్చ పరస్యచ పాషండాదీన్ అవిజ్ఞాతాన్, అన్యోఽన్యమితరైరపి ।
మంత్రిణం యువరాజంచ, హిత్వాస్వేషుపురోహితమ్ ।
పరదేశములయందలి పద్దెనిమిదిమంది తీర్థములవారు (1) మంత్రి, (2) పురోహితుడు, (3) యువరాజు, (4) సేనాపతి, (5) ద్వారపాలకుడు, (6) అంతఃపురాధ్యక్షుడు, (7) కారాగార-అధ్యక్షుడు, (8) కోశాధ్యక్షుడు, (ధనాగారాధిపతి), (9) రాజాజ్ఞలను ఉద్యోగులకు అందించువాడు, (10) ప్రాడ్వివాకులు, (వాదప్రతివాదవిషయములను ప్రశ్నించువారు.), (11) సేనానాయకుడు, (సైనికులకు జీతబత్తెములు, అవసరమగువస్తువులు మొదలగు వానిని పంచెడివాడు.) (12) నగరాధ్యక్షుడు, (రాత్రింబవళ్లు నగరద్వారములు, ప్రాకారములు మొదలగువాటి రక్షణకై ఏర్పాట్లు చేయువాడు), (13) కర్మాంతికుడు, (సైనికులకు తప్ప, మిగిలిన ఉద్యోగులకు వేతనములను పంచియిచ్చెడివాడు.), (14) సభ్యుడు = సభాధ్యక్షుడు (రాజసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను చూచుచుండెడివాడు), (15) ధర్మాధ్యక్షుడు, (స్థిరచరాస్తుల వివాదములను చట్టబద్ధముగా పరిష్కరించుచుండువాడు), (16) దండపాలుడు, (దొంగతనము మున్నగునేరములు చేసినవారికి రాజాజ్ఞప్రకారము శిక్షలను విధించుచుండువాడు.), (17) దుర్గపాలుడు, (గిరి, జల, వన-ఆది దుర్గముల రక్షణకై తగిన వ్యవస్థను నడుపుచుండెడివాడు), (18) రాష్ట్రసీమాపాలుడు, (దేశముయొక్క సరిహద్దులను అన్నిదిక్కులనుండియు కాపాడుచుండువాడు).
స్వదేశమున మంత్రులు పురోహితులు, యువరాజు తప్ప తక్కిన పదునైదుమంది తీర్థములవారిపైగూఢచారులను నియమింపవలెను.

కచ్చిచ్చైత్యశతైర్జుష్టః సునివిష్టజనాకులః।
దేవస్థానైః ప్రపాభిశ్చ తటాకైశ్చోపశోభితః। 44

ప్రహృష్టనరనారీకః సమాజోత్సవశోభితః।
సుకృష్టసీమా పశుమాన్ హింసాభిః పరివర్జితః। 45

అదేవమాతృకో రమ్యః శ్వాపదైః పరివర్జితః।
పరిత్యక్తో భయైః సర్వైః ఖనిభిశ్చోపశోభితః। 46

వివర్జితో నరైః పాపైః మమ పూర్వైః సురక్షితః।
కచ్చిజ్జనపదః స్ఫీతః సుఖం వసతి రాఘవ! 47

కచ్చిత్ తే దయితాః సర్వే కృషిగోరక్షజీవినః।
వార్తాయాం సంశ్రితస్తాత! లోకో హి సుఖమేధతే। 48

తేషాం గుప్తిపరీహారైః కచ్చిత్ తే భరణం కృతమ్।
రక్ష్యా హి రాజ్ఞా ధర్మేణ సర్వే విషయవాసినః। 49

కచ్చిత్ స్త్రియః సాంత్వయసి కచ్చిత్ తాశ్చ సురక్షితాః।
కచ్చిన్న శ్రద్దధాస్యాసాం కచ్చిద్గుహ్యం న భాషసే। 50

కచ్చిన్నాగవనం గుప్తం కచ్చిత్ తే సంతి ధేనుకాః।
కచ్చిన్న గణికాశ్వానాం కుంజరాణాం చ తృప్యసి। 51

కచ్చి ద్దర్శయసే నిత్యం మనుష్యాణాం విభూషితమ్।
ఉత్థాయోత్థాయ పూర్వాహ్ణే రాజపుత్త్ర! మహాపథే। 52

నాయనా! భరతా! మనకోసలదేశము అశ్వమేధాదిమహాయజ్ఞములను ఆచరించిన పవిత్రప్రదేశములుగలది. తరతరాలప్రజలకు అమరభోగ్య భాగ్యములను కొల్లలుగా పంపిణీచేయుచున్న దివ్యభూమి అది. ప్రజలకు భక్తిప్రపత్తులను పెంపొందజేయు దేవాలయములు అందు కోకొల్లలు. బాటసారులదాహములనుదీర్చుచు వారికి హాయినిగూర్చెడి చలివేంద్రములు అందు అసంఖ్యాకములు. అందలి తటాకములు ప్రజలస్నానపానాది అవసరములను దీర్చుచు కనువిందుగావించుచుండును. స్త్రీపురుషులెల్లరును సుఖసంతోషములతో హాయిగా నుందురు. ధర్మనిర్ణయసభలతోడను, సమాజమునకు సంబంధించిన ఉత్సవములతోడను అది విలసిల్లుచుండును. పంటభూములతోడను, పశుసంపదతోడను వర్ధిల్లుచుండునది. ఎట్టి హింసాకృత్యములకును అచట తావు ఉండదు. (అందలి ప్రజలు మద్యమాంసములను ఏమాత్రమును ముట్టరు.) వర్షములమీదమాత్రమే ఆధారపడక ఇతరనదీజలసౌకర్యములతో సస్యశ్యామలమై అది రమణీయముగా ఒప్పుచుండును. పెద్దపులులు మొదలగు క్రూరజంతువులబాధలు లేనట్టిది. అగ్నిభయము, చోరభయము మొదలగుబాధలకు అందు చోటులేదు. అది వివిధఖనిజసంపదలకు కాణాచి. అందు పాపకృత్యములను చేసెడివారు మచ్చునకైనను కానరారు. అది మన పూర్వుల రక్షణలో సురక్షితముగానున్నది. అట్టి కోసలదేశమునందలి ప్రజలు ధనధాన్యసంపదలతో తులతూగుచు సుఖశాంతులతో వర్ధిల్లుచున్నారుగదా? (44-47)

వ్యవసాయము, పశుపాలనము, వాణిజ్యము మొదలగు వృత్తులతో జీవించువైశ్యులు నీకు ప్రీతిపాత్రులైయున్నారా? ఏలనన క్రయవిక్రయాది వ్యాపారములవృద్ధివలననేగదా దేశము సుఖశాంతులతో వర్ధిల్లునది? (48)

ఆ వైశ్యులకు ఇష్టములను గూర్చుచు, ఎదురైన ఆపదలను నివారించుచు వారినందఱిని బాగుగా రక్షించుచున్నావుగదా? ఏలనన దేశప్రజలను అందఱిని చక్కగా రక్షించుట రాజధర్మము సుమా! ఓ భరతా! నీ అంతఃపురస్త్రీలు సంతోషముతోనుండునట్లు విచారించుచు వారిరక్షణాభారమును పూర్తిగా వహించుచున్నావుగదా? వారిని పూర్తిగా విశ్వసించుటలేదుగదా? రహస్య విషయములను వారికి తెలుపుటలేదుగదా? (49-50)

ఏనుగులవనమును చక్కగా రక్షించుచున్నావా? (లేనిచో వాటిని అపహరించుకొనిపోవుదురు.) అసంఖ్యాకములైన పాడియావులను పోషించుచున్నావా? ఆడుఏనుగులను, మగఏనుగులను, అశ్వములను పోషించుచు వాటిసంఖ్యను పెంచుచున్నావుగదా? (51)

ఓ రాజకుమారా! నీవు ప్రతిదినము ప్రాతఃకాలముననే లేచి, చక్కగా అలంకరించుకొని, రాజమార్గమునందు పౌరులకు దర్శనమిచ్చుచున్నావుగదా? (52)

కచ్చిన్న సర్వే కర్మాంతాః ప్రత్యక్షాస్తేఽవిశంకయా।
సర్వే వా పునరుత్సృష్టా మధ్యమేవాత్ర కారణమ్। 53

నీరాజ్యములోని ఉద్యోగులందఱును బెదురుగొంకులులేక నిన్ను పూర్తిగా సమీపించుటలేదుగదా? లేక వారెల్లరును మిగుల భయపడుచు నీకు దూరముగా ఉండుటలేదుగదా? ఉద్యోగుల విషయమున మధ్యేమార్గమును అవలంబించుటయే శ్రేయస్కరము. అనగా వారికి పూర్తిగా చనవు ఇచ్చుటగాని, వారిని పొత్తిగా దూరమున ఉంచుటగాని తగదు. (53)

కచ్చిత్ సర్వాణి దుర్గాణి ధనధాన్యాయుధోదకైః।
యంత్రైశ్చ పరిపూర్ణాని తథా శిల్పిధనుర్ధరైః। 54

నాయనా! నీదుర్గములన్నియును ధనధాన్యములతోడను, అస్త్రశస్త్రములతోడను, జలములతోడను, యంత్రములతోడను, శిల్పులతోడను, (యంత్రనిపుణులతోడను) ధనుర్ధారులైన యోధుల తోడను ఒప్పుచున్నవిగదా? (54)

ఆయస్తే విపులః కచ్చిత్ కచ్చిదల్పతరో వ్యయః।
అపాత్రేషు న తే కచ్చిత్ కోశో గచ్ఛతి రాఘవ। 55

ఓభరతా! నీరాజ్యాదాయము పుష్కలముగానున్నదా? ధన (కోశ) వ్యయము (ఆదాయమునకులోబడి) పరిమితముగానున్నదా? ధనమును అపాత్రులకై వినియోగించుటలేదుగదా? (నట, నర్తక గాయకులు మొదలగువారికై విచ్చలవిడిగా వ్యయముగుటలేదు గదా?) (55)

దేవతార్థే చ పిత్రర్థే బ్రాహ్మణాభ్యాగతేషు చ।
యోధేషు మిత్రవర్గేషు కచ్చిద్గచ్ఛతి తే వ్యయః। 56

నీకోశాగారమునందలి ధనము దైవకార్యములకును, మాతాపితృ సేవలకును, బ్రాహ్మణోత్తములకును, అభ్యాగతులకును (భోజన సమయమునకు వచ్చిన అతిథులకును) యోధులకును, మిత్రులకును వినియోగపడుచున్నదా? (56)

కచ్చిదార్యో విశుద్ధాత్మా క్షారితశ్చోరకర్మణా।
అపృష్టః శాస్త్రకుశలైః న లోభాద్వధ్యతే శుచిః। 57

సజ్జనులు, ఉత్తమస్వభావముగలవారు, త్రికరణశుద్ధిగలవారు దొంగతనము మొదలగు నేరారోపణలకులోనైనప్పుడు న్యాయశాస్త్ర నిపుణులచేత లోతుగా విచారణ చేయింపకయే లోభవశమున వారికి శిక్షలు విధించుటలేదుగదా? (57)

గృహీతశ్చైవ పృష్టశ్చ కాలే దృష్టః సకారణః।
కచ్చిన్న ముచ్యతే చోరో ధనలోభాన్నరర్షభ। 58

ఓరాజకుమారా! దొంగతనము చేయుసమయమున చూడబడిన వాడును, చౌర్యముచేసి పట్టుబడినవాడును, అధికారులు ప్రశ్నించినప్పుడు దొరకిపోయినవాడును, దొంగిలించిన ధనముతో చిక్కినవాడును-ఇట్టి పెక్కుకారణములచే నేరములు ఋజువైనను అట్టిచోరుని ధనలోభముచే విడిచిపెట్టుటలేదుగదా? (58)

వ్యసనే కచ్చిదాఢ్యస్య దుర్గతస్య చ రాఘవ।
అర్థం విరాగాః పశ్యంతి తవామాత్యా బహుశ్రుతాః। 59

ఓభరతా! ధనికునివిషయమునగాని, నిర్ధనునివిషయమునగాని ఏదైననొకవివాదము ఏర్పడినప్పుడు న్యాయశాస్త్రనిపుణులైన నీమంత్రులు ధనలోభముచేగాని, పక్షపాతబుద్ధిచేగాని వ్యవహరించుట లేదుగదా? (59)

యాని మిథ్యాభిశస్తానాం పతంత్యస్రాణి రాఘవ।
తాని పుత్రాన్ పశూన్ ఘ్నంతి ప్రీత్యర్థమనుశాసతః। 60

ఓభరతకుమారా! నిర్దోషులు అసత్యములైన నేరారోపణములకు గుఱియైనప్పుడు రాజు వాస్తవములను తెలిసికొనక తనకు తిరుగు లేదుగదాయని ఆ నిరపరాధులను ఇష్టమువచ్చినట్లు శిక్షింపరాదు. అట్లు శిక్షించినచో ఆ నిర్దోషులు అవమానభారమున కన్నీరుకార్తురు. ఆ దుఃఖార్తులకన్నీరు ఆరాజుయొక్క పుత్త్రులను, పశుసంపదలను, సమస్తమును నశింపజేయును. (60)

కచ్చిద్వృద్ధాంశ్చ బాలాంశ్చ వైద్యముఖ్యాంశ్చ రాఘవ।
దానేన మనసా వాచా త్రిభిరేతైర్బుభూషసే। 61

నాయనా! భరతా! వృద్ధులును బాలురును, విద్వాంసులును నిన్నుకలిసినప్పుడు వారికి ఇష్టమైన వస్తువులను బహూకరించుచు, మిత్రభావముతోడను, ఊరటగూర్చెడి మృదుమధురవచనముల తోడను వారిని మంచిచేసికొనుచున్నావా? (61)

కచ్చిద్గురూంశ్చ వృద్ధాంశ్చ తాపసాన్ దేవతాతిథీన్।
చైత్యాంశ్చ సర్వాన్ సిద్ధార్థాన్ బ్రాహ్మణాంశ్చ నమస్యసి। 62

భరతా! గురువులకును, వృద్ధులకును, తాపసులకును, దేవతలకును, అతిథులకును, దేవమందిరములలోగల మహావృక్షములకును, అన్నివిధములుగా కృతార్థులైన బ్రాహ్మణోత్తములందఱికిని నమస్కరించుచున్నావా? (62)

కచ్చిదర్థేన వా ధర్మమ్ అర్థం ధర్మేణ వా పునః।
ఉభౌ వా ప్రీతిలోభేన కామేన చ న బాధసే। 63

నాయనా! ధర్మాచరణమునకు అనువగు పూర్వాహ్ణసమయమున అర్థార్జనకు పూనుకొని, ధర్మలోపము కావించుటలేదుగదా? అర్థార్జనకు అనుకూలమైన అపరాహ్ణ సమయమున ధర్మకార్యములలో మునిగి అర్థార్జనకు భంగము కలిగించుటలేదుగదా? సుఖాభిలాష కారణముగా సాయంకాలమున ధర్మార్థములు రెండింటికిని హాని కలిగించుటలేదు గదా?)[1] (63)

కచ్చిదర్థం చ ధర్మం చ కామం చ జయతాం వర!
విభజ్య కాలే కాలజ్ఞ! సర్వాన్ వరద! సేవసే। 64

విజేతలలో శ్రేష్ఠుడా! కాలోచితముగా కార్యములను ఆచరించుట ఎఱిగినవాడా! ఓ వరదా! ధర్మాచరణమునకును, అర్థార్జనమునకును, కామానుభవములకును సముచితసమయములను విభజించుకొని, తగినసమయములలో ధర్మార్థకామములను నడపుచున్నావుగదా?(64)

కచ్చిత్ తే బ్రాహ్మణాః శర్మ సర్వశాస్త్రార్థకోవిదాః।
ఆశంసంతే మహాప్రాజ్ఞ! పౌరజానపదైః సహ। 65

ఓ మహాప్రాజ్ఞా! సమస్తశాస్త్రములను, వాటివిశేషములను బాగుగా ఎఱిగిన బ్రాహ్మణోత్తములు పౌరులతోడను, జానపదులతోడను గూడి, నీశ్రేయోలాభములనే అభిలషించుచున్నారు గదా?(65)

నాస్తిక్యమనృతం క్రోధం ప్రమాదం దీర్ఘసూత్రతామ్।
అదర్శనం జ్ఞానవతామ్ ఆలస్యం పంచవృత్తితామ్। 66

ఏకచింతనమర్థానామ్ అనర్థజ్ఞైశ్చ మంత్రణమ్।
నిశ్చితానామనారంభం మంత్రస్యాపరిరక్షణమ్। 67

మంగళస్యాఽప్రయోగం చ ప్రత్యుత్థానం చ సర్వతః।
కచ్చిత్ త్వం వర్జయస్యేతాన్ రాజదోషాంశ్చతుర్దశ। 68

ఓ భరతా! నాస్తికత్వము, అబద్ధములాడుట, క్రోధము, ఏమఱుపాటు, కర్తవ్యములను ఉపేక్షించుచు కాలయాపనచేయుట, జ్ఞానులను దర్శింపకుండుట, సోమరితనము, పంచేంద్రియములకు వశుడైయుండుట, రాజకార్యములవిషయమున మంత్రులతో చర్చింపక తాను ఒక్కడే ఆలోచించుట, విషయములయెడ అవగాహన లేనివారితో సమాలోచనచేయుట, నిశ్చయించిన పనులను వెంటనే ప్రారంభింపకయుండుట, రహస్యవిషయములను దాచలేకపోవుట, మంగళకరములైన ఆచారములను పాటింపకుండుట, పెక్కుమంది శత్రువులపై ఒకే సమయమున దండెత్తుట- అను ఈపదునాలుగు పనులను రాజు చేయరాదు. నీవు ఈరాజదోషములను పరిత్యజించు చున్నావుగదా? (66-68)

1) నీవు ఆర్జించిన సంపదను (ద్రవ్యమును) ఇతరులకు ఉపయోగపడునట్లుచేయుట ధర్మము. ఈ ధర్మాచరణము వలన మోక్షముగూడ లభించును. అట్లుగాక ఆ అర్థమును స్వసుఖలాభములకై వినియోగించుకొనుట అధర్మము. దానివలన అధోగతిప్రాప్తించును. ధర్మకార్యములనెపముతో కామ్యకర్మములను చేయుటగాని, ఆ సంపదలను వ్యసనములకై వృథాచేయుటగాని మిగులదోషము-. కనుక నీవు ధర్మార్థకార్యములను స్వార్థబుద్ధితో గాక, పరోపకారదృష్టితో ఆచరించుచున్నావుగదా?

దశపంచ చతుర్వర్గాన్ సప్తవర్గం చ తత్త్వతః।
అష్టవర్గం త్రివర్గం చ విద్యాస్తిస్రశ్చ రాఘవ!। 69

ఇంద్రియాణాం జయం బుద్ధ్వా షాడ్గుణ్యం దైవమానుషమ్
కృత్యం వింశతివర్గం చ తథా ప్రకృతిమండలమ్। 70

యాత్రాదండవిధానం చ ద్వియోనీ సంధివిగ్రహౌ।
కచ్చిదేతాన్ మహాప్రాజ్ఞ! యథావదనుమన్యసే। 71

మహాప్రాజ్ఞా! భరతా! (1) దశవర్గము, (2) పంచవర్గము (3) చతుర్వర్గము, (4) సప్తవర్గము, (5) అష్టవర్గము, (6) త్రివర్గము, (7) మూడువిద్యలు (తిస్రోవిద్యాః), బుద్ధిద్వారా ఇంద్రియములను జయించుట, (8) ఆఱుగుణములు (షాడ్గుణ్యము), (9) దైవీ మానుష బాధలు, (10) రాజు ఆచరింపవలసిన కృత్యములు, (11) వింశతి వర్గము, (12) ప్రకృతి మండలము, (13) యాత్ర (దండయాత్రలు), (14) దండవిధానము (వ్యూహరచనలు), (15) సంధివిగ్రహములు అను రెండుకారణములు. వీటి అన్నింటిపై నీవు తగిన శ్రద్ధచూపుచున్నావా? వీటిలోని దోషవర్గములను త్యజించి, గుణవర్గములను మాత్రమే గ్రహించుచున్నావా?(69-71)

---

1) దశవర్గము
శ్లో॥ మృగయాక్షో దివాస్వాపః పరివాదః స్త్రియోమదః । తౌర్యత్రికం వృథాట్యాచ కామజోదశకోగుణః ॥ మనుస్మృతి ॥
వేట, జూదము, పగటిపూటనిద్రించుట, ఇతరులను నిందించుట, స్త్రీవ్యామోహము, మద్యపానము, నృత్య, గీత, వాద్యములయందు అమితాసక్తి, వ్యర్థముగా తిరుగుట - అను ఈపదింటికిని దశవర్గము అనిపేరు. ఈపదింటిని త్యజింపవలెను.

2) పంచవర్గము (పంచదుర్గములు)
శ్లో॥ ఔదకం పార్వతం వార్క్షమ్ ఐరిణం ధాన్వనం తథా । శస్త్రం ప్రశస్తమతిభిః దుర్గం దుర్గోపచింతకైః ॥ మనుస్మృతి ॥
జలదుర్గము, పర్వతదుర్గము, వృక్షదుర్గము, ఐరిణదుర్గము (చౌటిపఱ్ఱలతో గూడినదుర్గము) ధాన్వదుర్గము (ఎడారిదుర్గము) ప్రకృతిసిద్ధములైన ఈఐదుదుర్గములను రాజు సమయోచితముగా ఉపయోగించుకొనుచు ఆత్మరక్షణ చేసికొనుచుండవలెను.

3) చతుర్వర్గము (చతుర్విధమిత్రులు)
శ్లో॥ సామ, దానంచ, భేదశ్చ దండశ్చేతి చతుర్విధమ్ ॥
సామ, దాన, భేద, దండోపాయములు - మఱియు
శ్లో॥ ఔరసం తంతుసంబంధం తథా వంశక్రమాగతమ్ । రక్షితం వ్యసనేభ్యశ్చ మిత్రం జ్ఞేయం చతుర్విధమ్ ॥
ఇతి చతుర్విధమిత్రాణి – కామందకః – రక్తసంబంధముతో ఏర్పడినవారు, వివాహాదిసంబంధముతో కలిసినవారు, వంశక్రమాగతముగా ఉండెడివారు, ఆపదల (వ్యసనముల) నుండి రక్షించినవారు - ఈనాలుగు విధములవారును చతుర్విధమిత్రులు.

4) సప్తవర్గము (సప్తాంగములు)
శ్లో॥ స్వామ్యమాత్యాశ్చ రాష్ట్రంచ. దుర్గం కోశో బలం సుహృత్ । పరస్పరోపకారీదం రాజ్యం సప్తాంగముచ్యతే ॥
రాజు, మంత్రి, రాష్ట్రము, దుర్గములు, (కోటలు) ధనాగారము, చతుర్విధసేనలు, మిత్రులు - అను ఈఏడింటిని సప్తవర్గము అని వ్యవహరింతురు. రాజ్యమునకు ఇవి సప్తాంగములు-పరస్పరోపకారకములు.

5) అష్టవర్గము
శ్లో॥ పైశున్యం సాహసం ద్రోహం ఈర్ష్యాసూయార్థదూషణమ్ । వాగ్దండయోశ్చ పారుష్యం క్రోధజోఽపి గుణోఽష్టకః ॥
చాడీలుచెప్పుట, తొందరపాటు, ద్రోహచింతన, ఓర్వలేనితనము, మంచిగుణములనుసైతము దోషములుగా చిత్రించుట, కఠినముగా మాట్లాడుట, నిష్కారణముగా శిక్షించుట (చిన్నతప్పునకు పెద్దగా శిక్షించుట) ఈఎనిమిదింటిని 'అష్టవర్గము' అని యందురు. ఇవి క్రోధమువలన కలుగును. వీటిని త్యజింపవలెను.

6) త్రివర్గము
ధర్మార్థకామములను 'త్రివర్గము' అని వ్యవహరింతురు. ఈపురుషార్థములను సాధింపవలెను. లేదా ఉత్సాహశక్తి, ప్రభుశక్తి, మంత్రశక్తి, ఈమూడింటిని తెలిసియుండవలెను.
శ్లో॥ క్షయః స్థానం చ వృద్ధిశ్చ త్రివర్గో నీతివేదినామ్ ॥
శత్రువులయొక్క, ఉనికి, వృద్ధి, క్షయము - వీటిని గమనించుచుండవలెను. లేదా
శ్లో॥ వస్తుష్వశక్యేషు సముద్యమశ్చ, శక్యేషు మోహాదసముద్యమశ్చ । శక్యేష్వకాలేషు సముద్యమశ్చ త్రిధైవ కార్యం వ్యసనం వదంతి ॥ ఇతి కామందకః ॥
అసాధ్యమైన కార్యములకు పూనుకొనుట, సాధ్యమైన కార్యములవిషయమున అవి తనకు అసాధ్యములని భ్రమపడి వాటికి ప్రయత్నింపకుండుట, సాధ్యములైన కార్యములకు అకాలములయందు యత్నించుట. అనుమూడును త్రివిధకార్యవ్యసనములు. వీటిని పరిత్యజింపవలెను.

7) మూడు విద్యలు-త్రయీ, వార్తా, దండనీతులు
ఋగ్యజుస్సామవేదములకు 'త్రయి' అని వ్యవహారప్రసిద్ధి. కృషి గోరక్షాదులు 'వార్త'లో అంతర్భాగములు. 'దండనీతి,' అనగా నీతిశాస్త్రము.

8) ఆఱుగుణములు (షాడ్గుణ్యము) సంధి, విగ్రహ, యానాసనద్వైధీభావ సమాశ్రయాః ॥ ఇతిషాడ్గుణ్యమ్
శత్రువుతో ఒడంబడిక చేసికొనుటయే సంధి. రిపువిరోధము విగ్రహము, శత్రువుపై దండెత్తివెళ్లుట యానము, అనుకూలకాలమునకై ఎదురుచూచుట ఆసనము, బలహీనులు బలవంతులు అని ఇద్దరు శత్రువులతో మాటలతో సంధిగా ఉండుట ద్వైధీభావము-బలవంతుని ఆశ్రయించుట సమాశ్రయము- అనునవియే ఆఱుగుణములు.

9) దైవమానుషబాధలు-దైవికబాధలు, మానుషబాధలు ఐదేసి విధములు.
శ్లో ॥ హుతాశనో జలం వ్యాధిః దుర్భిక్షం మరణం తథా । ఇతి పంచవిధం దైవం, మానుషం వ్యసనం పరమ్ ॥
ఆయుక్తకేభ్యశ్చోరేభ్యః పరేభ్యో రాజవల్లభాత్ । పృథివీపతిలోభాచ్చ, వ్యసనం పంచధాభవేత్ ॥ కామందకీయే ॥
అగ్నిబాధ, వరదలు, వ్యాధులు, కఱవుకాటకములు, మరణము - అను ఐదును దైవిక బాధలు. అధికారులు, దొంగలు, శత్రువులు, రాజునకు సన్నిహితులు, దురాశాపరుడైన రాజు - ఈఐదువిధముల వారివలన వచ్చెడిబాధలు మానుషబాధలు.

10) రాజులు ఆచరించవలసిన కృత్యము:
శ్లో ॥ అలబ్ధవేతనోలుబ్ధో, మానీచాప్యవమానితః క్రుద్ధశ్చకోపితోఽకస్మాత్ తథాభీతశ్చభీషితః
యథాభిలషితైః కామైః భింద్యాదేతాంశ్చతుర్విధాన్ ॥ కామందకీయే ॥
శత్రుపక్షమునందలి - వేతనములుదొరకని లుబ్ధులను, అవమానింపబడిన అభిమానవంతులను, అకారణముగా యజమాని కోపమునకు గుఱియైనవారిని, బెదరింపబడిన భీరులను (ఈనాల్గువిధములవారిని) వారిఅభిమతములను తీర్చుచు తనవైపునకులాగుకొనుట రాజకృత్యము.

11) వింశతి వర్గము
శ్లో ॥ బాలో వృద్ధో దీర్ఘరోగీ తథాజ్ఞాతి బహిష్కృతః । భీరుకో భీరుజనకో లుబ్ధోలుబ్ధజనస్తథా ॥
విరక్త ప్రకృతిశ్చైవ విషయేష్వతిసక్తిమాన్ । అనేక చిత్తమంత్రశ్చ దేవబ్రాహ్మణ నిందకః ॥
దైవోపహతకశ్చైవ దైవచింతక ఏవచ । దుర్భిక్ష వ్యసనోపేతః బలవ్యసన సంకులః ॥
అదేశస్థోబహురిపుః యుక్తోఽకాలేనయశ్చ సః । సత్యధర్మవ్యపేతశ్చ వింశతిః పురుషా అమీ ॥
ఏతైస్సంధిం నకుర్వీత విగృహ్ణీయాత్తు కేవలమ్ ॥ కామందకీయే
బాలుడు, వృద్ధుడు, దీర్ఘరోగి, బంధువులచే బహిష్కరింపబడినవాడు, పిఱికివాడు, పిఱికివారైన జనులు గలవాడు, లోభి, దురాశాపరులకు ఆశ్రయమిచ్చెడివాడు, మంత్రి, సేనాపతి మొదలగువారిని సంతృప్తి పఱచనివాడు, విషయాసక్తుడు, చంచలచిత్తులయొక్క సూచనలను గ్రహించువాడు, దేవతలను, బ్రాహ్మణులను నిందించువాడు, దైవానుగ్రహమునకు దూరమైనవాడు, అదృష్టమును నమ్ముకొని పురుషప్రయత్నముచేయనివాడు, దుర్భిక్ష పీడితుడు, చిక్కులపాలైన సేన గలవాడు, స్వదేశమును వీడినవాడు, పెక్కుమందిశత్రువులు గలవాడు, కాలము అనుకూలింపనివాడు, సత్యధర్మములను పాటింపనివాడు-అను ఈ ఇరువదివిధములవారితో రాజు సంధిచేసికొనరాదు.

12) ప్రకృతి మండలము, ద్వాదశమండలము.
శ్లో ॥ అమాత్య రాష్ట్ర దుర్గాణి కోశోదండశ్చ పంచమః । ఏతాః ప్రకృతయః తద్‌జ్ఞైర్విజిగీషోరుదాహృతాః ।
అమాత్యులు, రాష్ట్రము, దుర్గములు, కోశము, దండము-అను ఈఐదును ప్రకృతులు. తనరాజ్యమును విస్తరింపజేయవలయుననెడి కోరికగల రాజు విజిగీషువు. అతడును అతనిచుట్టును పదునొకండుగురురాజులును కలిసి మండలము అని వ్యవహరింపబడుదురు. మధ్య విజిగీషువు, అతనికి ముందుభాగమున శత్రువు, మిత్రుడు, శత్రుమిత్రుడు, మిత్రశత్రువు, శత్రుమిత్రమిత్రుడు- అను ఐదుగురును, వెనుకభాగమున పార్ష్ణిగ్రాహుడు, (దాడిచేయబోవుచున్న రాజునకు వెనుకవైపున కాచుకొనియున్న శత్రువు.) ఆక్రందుడు, పార్ష్ణిగ్రాహాసారుడు, ఆక్రందాసారుడు-అనునలుగురును. పార్శ్వమునందు, మధ్యస్థుడు, వారికి వెలుపలనున్నవాడు ఉదాసీనుడు- ఈపండ్రెండుమందిని ద్వాదశమండలము-అనియందురు.

13) యాత్ర - (శత్రువుపైదండయాత్రలు)

14) దండవిధానము (వ్యూహరచనలు) సప్తవ్యూహములు వీనిని సప్తవర్గము-అనియువ్యవహరింతురు.
శ్లో ॥ శ్యేన సూచీచ వజ్రశ్చ శకటోమకరస్తథా । దండాఖ్యః పద్మనామాచవ్యూహాః సప్త ప్రధానతః ॥
గరుడవ్యూహము, సూచీవ్యూహము, వజ్రవ్యూహము,
శకటవ్యూహము, మకరవ్యూహము, దండవ్యూహము, పద్మవ్యూహము - అని వ్యూహములు ఏడు విధములు.

15) సంధి విగ్రహములు - ఇవి శత్రువుతో నడచుకొనదగిన విషయములను తెల్పును.

మంత్రిభి స్త్వం యథోద్దిష్టైః చతుర్భిస్త్రిభి రేవ వా।
కచ్చిత్ సమస్తైర్వ్యస్తైశ్చ మంత్రం మంత్రయసే మిథః। 72

ఓ భరతా! రాజనీతిశాస్త్రమును అనుసరించి, నలుగురు-లేక-ముగ్గురు మంత్రులతో విడివిడిగాగాని-లేక-అందరితో కలిసిగాని రహస్య సమాలోచనలను చేయుచున్నావా? (72)

కచ్చిత్ తే సఫలా వేదాః కచ్చిత్ తే సఫలాః క్రియాః।
కచ్చిత్ తే సఫలా దారాః కచ్చిత్ తే సఫలం శ్రుతమ్। 73

నాయనా! వేదోక్తధర్మములను ఆచరించుచు నీవు కృతకృత్యుడవు అగుచున్నావా? నీ అగ్నిహోత్రాది-అనుష్ఠానములన్నియును సఫలీకృతములగుచున్నవా? నీ భార్య అనుకూలవతియై నిన్ను సేవించుచు సంతానవతియైనదా? నీ శాస్త్రజ్ఞానము నీలో వినయాది సద్గుణములను పెంపొందించుచున్నదా?*(1) (73)

కచ్చిదేషైవ తే బుద్ధిః యథోక్తా మమ రాఘవ!।
ఆయుష్యా చ యశస్యా చ ధర్మకామార్థసంహితా। 74

ఓ భరతా! నేను చెప్పినట్లు ధర్మములను ఆచరించుటకును, ధర్మమార్గమున సంపదలను ఆర్జించుటకును, ధర్మార్థములకు అనుగుణముగా సుఖములను అనుభవించుటకును ఉపయోగపడును. అవిరముగా నీకు ఆయుర్వృద్ధి కలుగును, నీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించును. (74)

యాం వృత్తిం వర్తతే తాతో యాం చ నః ప్రపితామహాః।
తాం వృత్తిం వర్తసే కచ్చిత్ యా చ సత్పథగా శుభా। 75

నాయనా! మనతండ్రియు, తాతముత్తాతలును ఆచరించిన ధర్మమును పాటించుచు నీవు రాజ్యపాలనమును ఒనర్చుచున్నావా? అదియే సత్పురుషులు అనుసరింపవలసిన మార్గము. అది సర్వశుభంకరము. (75)

కచ్చిత్ స్వాదు కృతం భోజ్యమ్ ఏకో నాశ్నాసి రాఘవ!।
కచ్చిదాశంసమానేభ్యో మిత్రేభ్యః సంప్రయచ్ఛసి। 76

భరతా! రుచికరములైన భోజనపదార్థములను, సంపదలను నీవు ఒక్కడవు మాత్రమే అనుభవించుటలేదుగదా? వాటిని కోరుకొనెడి బంధుమిత్రులకును నీవు పంచియిచ్చుచున్నావుగదా? (76)

రాజా తు ధర్మేణ హి పాలయిత్వా
మహామతిర్దండధరః ప్రజానామ్ ।
అవాప్య కృత్స్నాం వసుధాం యథావత్
ఇతశ్చ్యుతః స్వర్గముపైతి విద్వాన్ । 77

రాజనీతిధర్మజ్ఞుడైన మహారాజు ఆత్మజ్ఞానియై న్యాయదండమును చేబూని (న్యాయమార్గమును అనుసరించి) ప్రజలను ధర్మబద్ధముగా పరిపాలించినచో పూర్వరాజులకువలె సమస్తభూమండలము అతనికి వశమగును, తత్ఫలితముగా అతడు తనువును వీడినపిమ్మట స్వర్గమునకు చేరును. (77)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే శతతమస్సర్గః (100)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూఱవసర్గము సమాప్తము

-- * * * --

101. నూటయొకటవసర్గము

దశరథమహారాజు స్వర్గస్థుడైనట్లు భరతుడు శ్రీరామునకు తెల్పుట. 'అయోధ్యకువచ్చి రాజ్యాధికారమును చేపట్టుము' అని అతడు తనఅన్నను అభ్యర్థించుట.

రామస్య వచనం శ్రుత్వా భరతః ప్రత్యువాచ హ।
కిం మే ధర్మాద్విహీనస్య రాజధర్మః కరిష్యతి। 1

శ్రీరాముడు పలికిన మాటలను విని, భరతుడు ఇట్లనుడివెను. "అన్నా! నిన్ను (శ్రీరాముని) సేవించుటయే నాకు పరమధర్మము. దానికి దూరమైనప్పుడు నాకు ఇతరరాజధర్మములతో పనియేమి? (1)

శాశ్వతోఽయం సదా ధర్మః స్థితోఽస్మాసు నరర్షభ!।
జ్యేష్ఠపుత్రే స్థితే రాజన్! న కనీయాన్ నృపో భవేత్। 2

ఓనరోత్తమా! రాజా! కుమారులలో (అన్నదమ్ములలో) పెద్దవాడు ఉండగా కనిష్ఠుడు (చిన్నవాడు) రాజుకాజాలడు. ఇదియే మన వంశమున పరంపరగా వచ్చుచున్న స్థిరమైన ధర్మము. (2)

*1) అగ్నిహోత్రఫలావేదాః, వృత్తభుక్తఫలం ధనమ్। రతిపుత్రఫలాదారాః, శీలవృత్తఫలం శ్రుతమ్। మహాభారతే
వేదములను నేర్చినందులకు అగ్నికార్యములను ఆచరించుచు సత్ఫలితములను పొందుటయే ఫలము. ధనసంపద లభించినందులకు వాటిని అనుభవించుట, పాత్రులైన వారికి దానముచేయుటయే ఫలములు. పెండ్లియైనందులకు భార్యవలన సుఖములను అనుభవించుచు, సంతానమును పొందుటయే ఫలము. శాస్త్రజ్ఞానము సంపాదించినందులకు ఫలము చక్కని శీలమును కలిగియుండుట, సదాచారమునందు ప్రవర్తించుట.

న సమ్బుద్ధాం మయా సార్ధమ్ అయోధ్యాం గచ్ఛ రాఘవ! ।
అభిషేచయ చాత్మానం కులస్యాస్య భవాయ నః । 3

రాజానం మానుషం ప్రాహుః దేవత్వే సమ్మతో మమ ।
యస్య ధర్మార్థసహితం వృత్తమాహురమానుషమ్ । 4

కేకయస్థే చ మయి తు త్వయి చారణ్యమాశ్రితే ।
దివమార్యో గతో రాజా యాయజూకః సతాం మతః । 5

నిష్క్రాంతమాత్రే భవతి సహసీతే సలక్ష్మణే ।
దుఃఖశోకాభిభూతస్తు రాజా త్రిదివమభ్యగాత్ । 6

ఉత్తిష్ఠ పురుషవ్యాఘ్ర క్రియతాముదకం పితుః ।
అహం చాయం చ శత్రుఘ్నః పూర్వమేవ కృతోదకౌ । 7

ప్రియేణ కిల దత్తం హి పితృలోకేషు రాఘవ! ।
అక్షయ్యం భవతీత్యాహుః భవాంశ్చైవ పితుః ప్రియః । 8

త్వామేవ శోచంస్తవ దర్శనేప్సుః
త్వయ్యేవ సక్తామనివర్త్య బుద్ధిమ్ ।
త్వయా విహీనస్తవ శోకరుగ్ణః
త్వాం సంస్మరన్నస్తమితః పితా తే । 9

ఓ రఘునందనా! జ్యేష్ఠపుత్త్రుడవైనట్టి నీవు సర్వసంపదలతో విలసిల్లుచున్న అయోధ్యకు నాతోగూడ రమ్ము. మనవంశ ప్రతిష్ఠకై (వంశక్షేమమునకై) కోసలరాజ్యమునకు పట్టాభిషిక్తుడవు కమ్ము. (3)

సామాన్యజనులు రాజును మానవమాత్రునిగా భావింతురు. కాని ధర్మార్థవిషయములలో మానవాతీతమైన ఆచరణగల ప్రభువు (అనగా నీవు) నాదృష్టిలో ప్రత్యక్షదైవమే. (4)

మనతండ్రి దశరథమహారాజు అశ్వమేధాదియజ్ఞములను ఆచరించినవాడు, సత్పురుషుల గౌరవాదరములను పొందినవాడు, పూజ్యుడు. అట్టి ప్రభువు, నేను కేకయరాజ్యమున నామాతామహుని ఇంటనుండగా, నీవు అరణ్యములకు చేరినపిమ్మట, స్వర్గస్థుడాయెను. (5)

సీతాదేవితో, లక్ష్మణునితోగూడి నీవు అయోధ్యను వీడి, వనములకు బయలుదేరగానే మహారాజు దుఃఖాతిరేకమునకు తట్టుకొనలేక పరలోకగతుడాయెను. (6)

ఓ పురుషోత్తమా! అగ్రజా! లెమ్ము. తండ్రిగారికి తిలోదకములను సమర్పింపుము. నేనును, శత్రుఘ్నుడును ఇంతకుముందే పితృతర్పణములను కావించియుంటిమి. (7)

ఓ శ్రీరామా! ప్రియమైన పుత్త్రుడు తిలాంజలులను సమర్పించినచో పితృదేవతలకు అక్షయపుణ్యఫలములు లభించునని పెద్దలు వచింతురు. మనతండ్రికి నీవు ప్రాణతుల్యుడవుగదా? (8)

మనతండ్రి నీయెడబాటు కారణముగా నిన్ను గురించి శోకసంతప్తుడాయెను. నిన్నుచూడవలెనను తపనతో ఆయన తన బుద్ధిని నీనుండి మరల్పలేక, దుఃఖముతో విలవిలలాడుచు, నిన్నే స్మరించుచు అస్తమించెను. (9)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోత్తరశతతమస్సర్గః (101)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటయొకటవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

102. నూటరెండవసర్గము

శ్రీరాముడు తనతండ్రిమృతికి విలపించుట - ఆయనకు పిండోదకములను సమర్పించుట. జనులందఱును త్వరత్వరగా ఆశ్రమమునకువచ్చి శ్రీరాముని దర్శించుట.

తాం శ్రుత్వా కరుణాం వాచం పితుర్మరణసంహితామ్ ।
రాఘవో భరతేనోక్తాం బభూవ గతచేతనః । 1

తం తు వజ్రమివోత్సృష్టమ్ ఆహవే దానవారిణా ।
వాగ్వజ్రం భరతేనోక్తమ్ అమనోజ్ఞం పరంతపః । 2

ప్రగృహ్య బాహూ రామో వై పుష్పితాగ్రో యథాద్రుమః ।
వనే పరశునా కృత్తః తథా భువి పపాత హ । 3

భరతుడు తెలిపిన దుఃఖకరమైన తన తండ్రిమరణవార్తను విని, శ్రీరాముడు నిశ్చేష్టుడాయెను. (1)

యుద్ధమున రాక్షసులచే పోరు సల్పుచు ఇంద్రునిచే ప్రయోగింపబడిన వజ్రాయుధమువలె భరతుని నోటవెలువడిన వచనవజ్రము శ్రీరాముని హృదయమును నొప్పించెను. హృదయవిదారకమైన ఆ వార్తను వినగానే శత్రుభయంకరుడైన శ్రీరాముడు తన రెండు చేతులను పైకెత్తి 'అయ్యో! తండ్రీ! మమ్ము వీడి ఎక్కడికి వెళ్లితివి'? అని పలుకుచు బాగుగా పుష్పించిన ఒక మహావనవృక్షము గొడ్డలిచే ఖండింపబడి, నేలగూలినట్లు భూమిపై పడిపోయెను. (భరతుడు కనబడగానే శ్రీరాముడు పుష్పించిన వృక్షమువలె ప్రసన్నవదనుడయ్యెను. కాని తండ్రి మృతివార్తను వినగానే నఱుకబడిన చెట్టువలె అతడు నేలవ్రాలెను)(2-3)

తథా నిపతితం రామం జగత్యాం జగతీపతిమ్।
కూలఘాతపరిశ్రాంతం ప్రసుప్తమివ కుంజరమ్। 4

భ్రాతరస్తే మహేష్వాసం సర్వతః శోకకర్శితమ్।
రుదంతః సహ వైదేహ్యా సిషిచుః సలిలేన వై। 5

స తు సంజ్ఞాం పునర్లబ్ధ్వా నేత్రాభ్యామస్రముత్సృజన్।
ఉపాక్రామత కాకుత్స్థః కృపణం బహు భాషితుమ్। 6

స రామః స్వర్గతం శ్రుత్వా పితరం పృథివీపతిమ్।
ఉవాచ భరతం వాక్యం ధర్మాత్మా ధర్మసంహితమ్। 7

కిం కరిష్యామ్యయోధ్యాయాం తాతే దిష్టాం గతిం గతే।
కస్తాం రాజవరాద్ధీనామ్ అయోధ్యాం పాలయిష్యతి। 8

కిం ను తస్య మయా కార్యం దుర్జాతేన మహాత్మనః।
యో మృతో మమ శోకేన మయా చాపి న సంస్కృతః। 9

అహో భరత! సిద్ధార్థో యేన రాజా త్వయాఽనఘ!।
శత్రుఘ్నేన చ సర్వేషు ప్రేతకృత్యేషు సత్కృతః। 10

నిష్ప్రధానామనేకాగ్రాం నరేంద్రేణ వినాకృతామ్।
నివృత్తవనవాసోఽపి నాయోధ్యాం గంతుముత్సహే। 11

సమాప్తవనవాసం మామ్ అయోధ్యాయాం పరంతప!।
కో ను శాసిష్యతి పునః తాతే లోకాంతరం గతే। 12

పురా ప్రేక్ష్య సువృత్తం మాం పితా యాన్యాహ సాంత్వయన్।
వాక్యాని తాని శ్రోష్యామి కుతః శ్రోత్రసుఖాన్యహమ్। 13

ఏవముక్త్వా స భరతం భార్యామభ్యేత్య రాఘవః।
ఉవాచ శోకసంతప్తః పూర్ణచంద్రనిభాననమ్। 14

సీతే! మృతస్తే శ్వశురః పిత్రా హీనోఽసి లక్ష్మణ।
భరతో దుఃఖమాచష్టే స్వర్గతం పృథివీపతిమ్। 15

తతో బహుగుణం తేషాం బాష్పో నేత్రేష్వజాయత।
తథా బ్రువతి కాకుత్స్థే కుమారాణాం యశస్వినామ్। 16

తతస్తే భ్రాతరః సర్వే భృశమాశ్వాస్య రాఘవమ్।
అబ్రువన్ జగతీభర్తుః క్రియతాముదకం పితుః। 17

జగత్ప్రభువైన శ్రీరాముడు ఇట్లు నేలపై పడియుండగా తన దంతములచే నదీతటములను కూలద్రోసి, అలిసిపోయి నిద్రించిన మదపుటేనుగువలె అతడు భాసిల్లెను - శోకముచే కృశించియున్న మహాధనుర్ధారియగు శ్రీరామునిచుట్టును జేరి, సీతాదేవియు, ముగ్గురు సోదరులును ఏడ్చుచు తమ దుఃఖాశ్రువులచే ఆయన శరీరమును పూర్తిగా తడిపిరి. (4-5)

అంతట ఆ రాముడు క్రమముగా స్పృహలోనికివచ్చి, కన్నీరు పెట్టుచు, దీనముగా పెక్కు రీతుల విలపింపసాగెను. తండ్రియైన దశరథ మహారాజు దివంగతుడైన వార్తను విని, ధర్మాత్ముడైన ఆ శ్రీరామచంద్రుడు భరతునితో ధర్మబద్ధముగా ఇట్లనుడివెను.(6-7)

"సోదరా! తండ్రి కాలముచేసిన పిమ్మట అయోధ్యకు చేరి, ఇప్పుడు అచట నేను ఏమి చేయుగలను? రాజశ్రేష్ఠుడైన ఆ మహాత్ముని కోల్పోయి, అనాథయైన ఆ అయోధ్యను ఇప్పుడు ఎవరు పరిపాలింపగలరు? (8)

కటకటా! నా యెడబాటువలన కలిగిన దుఃఖముచే తండ్రి అసువులను వీడెను. అంతిమదర్శనమునకుగాని, ఆయనకు అంత్యక్రియలనుచేయుటకుగాని నేను నోచుకొనకపోయితిని. నా వలన ఆ మహాత్మునకు ఏమి ప్రయోజనము జరిగినది? నిజముగా నేను దురదృష్టవంతుడను. (9)

ఓ పుణ్యాత్ముడా! భరతా! నీవు శత్రుఘ్నునితోగూడి తండ్రిగారికి సమస్తమైన అంత్యసంస్కారములను నెరపి, ఆయనను సేవించితివి. ఆవిధముగా పితృ ఋణము తీర్చుకొంటివి. కనుక నిజముగా నీవు ధన్యాత్ముడవు. (10)

దశరథమహారాజును కోల్పోయిన నేటిఅయోధ్య పరిపాలకుడులేక దిక్కులేనిదై, వ్యాకులపాటునకు లోనైయున్నది. అట్టి అయోధ్యను చేరుటకు నా వనవాసము ముగిసిన పిమ్మట సైతము నామనస్సొప్పదు. (11)

ఓ పరంతపా! తండ్రియేమో పరలోకగతుడైనాడు. నేను వనవాసానంతరము అయోధ్యకు చేరినను నాకచట కర్తవ్యమును బోధించు వారెవరు? (12)

ఇదివరలో మనతండ్రి తనఆజ్ఞను శిరసావహించుచుండెడి నాప్రవర్తనను గమనించి, నాకు సంతృప్తిని గూర్చుచు పెక్కు సద్వచనములను నాతో నుడువుచుండెడివాడు. వీనులవిందుగానుండెడి అట్టి శుభవచనములను ఇపుడు నాకు ఎవరు తెలుపగలరు?"(13)

భరతునితో ఈ విధముగా పలికిన పిమ్మట శ్రీరాముడు శోకమున మునింగినవాడై, పూర్ణచంద్రబింబమువలె ఆహ్లాదకరమైన ముఖముగల సీతాదేవికడకు చేరి, ఆమెతో ఇట్లు పలికెను. (14)

ఓ సీతా! మిగులవాత్సల్యముతో నిన్ను ఆదరించుచుండెడి నీ మామగారు దివికేగిరి. ఓ లక్ష్మణా! మనము తండ్రి లేనివారమైతిమి. మహారాజు స్వర్గస్థుడైన ఈదుఃఖవార్తనుగూర్చి భరతుడు తెలిపినాడు.(15)

శ్రీరాముడు ఆ దుఃఖవార్తను ఇట్లు తెలుపుచుండగా ఉత్తమ రాజకుమారులుగా వాసిగాంచిన ఆ సోదరులయొక్క నేత్రములనుండి పొంగి పొరలివచ్చిన అశ్రువులు సంతతధారగా ప్రవహించెను. (16)

పిమ్మట ఆ సోదరులందఱును దుఃఖితుడైయున్న శ్రీరాముని మిగుల ఓదార్చి 'అన్నా! మహాప్రభువైన తండ్రిగారికి జలతర్పణములను ఆచరింపుము' అనిపలికిరి. (17)

సా సీతా శ్వశురం శ్రుత్వా స్వర్గలోకగతం నృపమ్।
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యామ్ అశకన్నేక్షితుం పతిమ్। 18

సాంత్వయిత్వా తు తాం రామో రుదంతీం జనకాత్మజామ్।
ఉవాచ లక్ష్మణం తత్ర దుఃఖితో దుఃఖితం వచః। 19

ఆనయేంగుదిపిణ్యాకం చీరమాహర చోత్తరమ్।
జలక్రియార్థం తాతస్య గమిష్యామి మహాత్మనః। 20

సీతా పురస్తాద్వ్రజతు త్వమేనామభితో వ్రజ।
అహం పశ్చాద్గమిష్యామి గతిర్హ్యేషా సుదారుణా। 21

తతో నిత్యానుగస్తేషాం విదితాత్మా మహామతిః।
మృదుర్దాంతశ్చ శాంతశ్చ రామే చ దృఢభక్తిమాన్। 22

సుమంత్రస్తైః నృపసుతైః సార్ధమాశ్వాస్య రాఘవమ్।
అవాతారయదాలంబ్య నదీం మందాకినీం శివామ్। 23

తే సుతీర్థాం తతః కృచ్ఛ్రాత్ ఉపాగమ్య యశస్వినః।
నదీం మందాకినీం రమ్యాం సదా పుష్పితకాననామ్। 24

శీఘ్రస్రోతసమాసాద్య తీర్థం శివమకర్దమమ్।
సిషిచుస్తూదకం రాజ్ఞే తత్రైతత్ తే భవత్వితి। 25

ప్రగృహ్య చ మహీపాలో జలపూరితమంజలిమ్।
దిశం యామ్యామభిముఖో రుదన్ వచనమబ్రవీత్। 26

ఏతత్ తే రాజశార్దూల విమలం తోయమక్షయమ్।
పితృలోకగతస్యాద్య మద్దత్తముపతిష్ఠతు। 27

తతో మందాకినీతీరాత్ ప్రత్యుత్తీర్య స రాఘవః।
పితుశ్చకార తేజస్వీ నివాపం భ్రాతృభిః సహ। 28

ఐంగుదం బదరీమిశ్రం పిణ్యాకం దర్భసంస్తరే।
న్యస్య రామః సుదుఃఖార్తో రుదన్ వచనమబ్రవీత్। 29

తనకత్యంత పూజ్యుడును, మామగారును ఐన దశరథమహారాజ స్వర్గస్థుడైన వార్తను విన్న సీతాదేవియొక్క కనులలో అశ్రువులు నిండెను. ఫలితముగా ఆమె తనభర్తను స్పష్టముగా చూడలేక పోయెను. (18)

అట్లు ఏడ్చుచున్న జానకిని దుఃఖమగ్నుడైయున్న శ్రీరాముడు ఊరడించెను- పిమ్మట అతడు అత్యంతదుఃఖితుడైయున్న లక్ష్మణునితో ఇట్లనెను. (19)

"ఓ లక్ష్మణా! గారచెట్టువిత్తనములతెలికపిండిని తీసికొనిరమ్ము. వస్త్రమును, ఉత్తరీయమును తెమ్ము. మహాత్ముడైన మనతండ్రికి జలతర్పణములను సమర్పించుటకై వెళ్లుదము. ముందు భాగమున సీత నడచుచుండును. ఆమె వెనుక నీవు నడువుము. నీ వెనుక నేను వచ్చెదను. ఇట్టి శోకసమయములయందు ఇదియే పరిపాటి.(20-21)

అనంతరము ఆ రాజకుమారులను నిరంతరము అనుసరించి యుండువాడును, బుద్ధిశాలియు, గొప్ప ఆలోచనాశక్తిగలవాడును, మృదుస్వభావుడును, ఇంద్రియనిగ్రహముగలవాడును, శ్రీరామునియెడ గాఢమైన భక్తిగలవాడును ఐన సుమంత్రుడు శ్రీరాముని, ఆయన తమ్ములను ఓదార్చి, చేయూతనిచ్చుచు వారిని పవిత్రమైన మందాకినీనదీతీరమునకు చేర్చెను. (22-23)

ఆనదీతీర్థములు (రేవులు) అన్నియును మిగుల దర్శనీయములు. ఆతీరములయందుగల సమస్తవృక్షములు ఎల్లప్పుడును పుష్పించుచు చూడముచ్చట గొల్పుచుండును. తీవ్రమైన వేగముతో ప్రవహించునవి ఆ నదీజలములు. అందలి రేవులు ఏ మాత్రము బురదలేనివి, నిర్మలజలములతో సుసంపన్నములైనవి. దుఃఖమగ్నులైన ఆ సీతారామలక్ష్మణులు తడబడుచు తీరమునకు చేరిన పిమ్మట, ఆ పవిత్రజలములలో పుణ్యస్నానములను ఒనర్చిరి. పిదప వారు 'తండ్రీ! ఈ జలములు నీకు తృప్తిని గూర్చుగాక'- అనియనుచు వారు మహారాజునకు జలతర్పణములను సమర్పించిరి.(24-25)

అంతట శ్రీరామచంద్రప్రభువు జలములను దోసిటబట్టి, తండ్రికి తనపైగల ప్రేమవాత్సల్యములను స్మరించుచు, దక్షిణాభిముఖుడై, 'నాయెడబాటును భరింపజాలక తండ్రిఅసువులనువీడెనుగదా'యని దుఃఖించుచు - 'ఓరాజ శిరోమణీ! నేను నేడు సమర్పించుచున్న ఈ నిర్మలజలములు పితృలోకగతుడవైన నీకు నిరంతరము చెందు చుండుగాక- అని పల్కి, తర్పణములను సమర్పించెను.(26-27)

నదీజలమునుండి ఒడ్డునకు చేరిన పిమ్మట, తేజశ్శాలియైన ఆ శ్రీరాముడు తనతమ్ములతోగూడి, తండ్రికి తిలతర్పణపూర్వకముగా పిండప్రదానములను కావించెను. (28)

శ్రీరాముడు రేగుపండ్లతో కలిపిన గారపిండి ముద్దలను సిద్ధపఱచి, వాటిని దర్భలపైనుంచెను. పిమ్మట అతడు దుఃఖార్తుడై తండ్రిని ఉద్దేశించి, ఇట్లు పలికెను. (29)

ఇదం భుంక్ష్వ మహారాజ! ప్రీతో యదశనా వయమ్।
యదన్నః పురుషో భవతి తదన్నాస్తస్య దేవతాః। 30

తతస్తేనైవ మార్గేణ ప్రత్యుత్తీర్య నదీతటాత్।
ఆరురోహ నరవ్యాఘ్రో రమ్యసానుం మహీధరమ్। 31

తతః పర్ణకుటీద్వారమ్ ఆసాద్య జగతీపతిః।
పరిజగ్రాహ బాహుభ్యామ్ ఉభౌ భరతలక్ష్మణౌ। 32

తేషాం తు రుదతాం శబ్దాత్ ప్రతిశ్రుత్కోఽభవద్గిరౌ।
భ్రాతౄణాం సహ వైదేహ్యాః సింహానామివ నర్దతామ్। 33

మహాబలానాం రుదతాం కుర్వతాముదకం పితుః।
విజ్ఞాయ తుములం శబ్దం త్రస్తా భరతసైనికాః। 34

అబ్రువంశ్చాపి రామేణ భరతః సంగతో ధ్రువమ్।
తేషామేవం మహాన్ శబ్దః శోచతాం పితరం మృతమ్। 35

అథ వాసాన్ పరిత్యజ్య తం సర్వేఽభిముఖాః స్వనమ్।
అప్యేకమనసో జగ్ముః యథాస్థానం ప్రధావితాః। 36

హయైరన్యే గజైరన్యే రథైరన్యే స్వలంకృతైః।
సుకుమారాస్తథైవాన్యే పద్భిరేవ నరా యయుః। 37

అచిరప్రోషితం రామం చిరవిప్రోషితం యథా।
ద్రష్టుకామో జనస్సర్వో జగామ సహసాఽఽశ్రమమ్। 38

భ్రాతౄణాం త్వరితాస్తత్ర ద్రష్టుకామాః సమాగమమ్।
యయుర్బహువిధైర్యానైః ఖురనేమిస్వనాకులైః। 39

సా భూమిర్బహుభిర్యానైః ఖురనేమిసమాహతా।
ముమోచ తుములం శబ్దం ద్యౌరివాభ్రసమాగమే। 40

"ఓ మహారాజా! నిత్యమూమేము భుజించెడి ఆహారమునే ఇప్పుడునీకు సమర్పించుచున్నాము. దీనిని మీరు ఆరగింపుడు. (స్వీకరింపుడు). మానవులు తాము స్వీకరించెడి ఆహారపదార్థములనే దేవతలకు భక్తితో నివేదనగావింతురు గదా! (వారు వాటిని ఆదరముతో స్వీకరింతురుగదా!) (30)

అటుపిమ్మట నరశ్రేష్ఠుడైన శ్రీరాముడు తాను నదీతీరమునకు వెళ్ళిన మార్గముద్వారానే తిరిగి ఒడ్డుపైకి వచ్చి, రమ్యములైన చరియలుగల చిత్రకూటపర్వతముమీదికి తిన్నగా చేరెను.(31)

తదనంతరము జగత్ప్రభువైన శ్రీరాముడు పర్ణశాలాద్వారముకడకు చేరి, భరతలక్ష్మణులను ఇరువురిని కౌగిలించుకొని ఏడువసాగెను.(32)

వైదేహితో సహా ఆ సోదరులు అందఱును ఏడ్చుచుండగా ఆరోదన ధ్వనులు సింహగర్జనలవలె ఆ పర్వతమున ప్రతిధ్వనించెను.(33)

తండ్రికి జలాంజలులను సమర్పించి, పితృవియోగదుఃఖముతో ఆ మహాబలశాలురు ఏడ్చుచుండగా, ఆ సమీపముననున్న భరతుని సైనికులు ఆ రోదనధ్వనులను విని, వారు మిగుల భయపడిరి. పిమ్మట వారు తమలో తాము ఇట్లు అనుకొనిరి. 'దీనిని బట్టి చూడగా భరతుడు శ్రీరామచంద్రుని కలిసికొనినాడనుట నిశ్చయము. దివంగతుడైన తండ్రికై ఆ సోదరులు దుఃఖభారముతో కావించుచున్న రోదనధ్వనులే ఇవి-' (34-35)

పిదప ఆ సైనికులు అందఱును తాము బసచేసియున్న ప్రదేశములను వీడి, ఒకే ఆలోచన (సంకల్పము)గలవారై, ఆ శబ్దము వినవచ్చిన దిక్కునకు అభిముఖులై, పరుగులు దీయుచు (త్వరత్వరగా) ఆ ధ్వని (ఏర్పడిన) స్థానమునకు చేరిరి. (36)

వారుగాక సుకుమారులైన కొందఱు గుఱ్ఱములమీదను, మఱికొందఱు ఏనుగులనెక్కియు, ఇంకను కొందఱు బాగుగా అలంకరింపబడిన రథములను అధిష్ఠించియు, అట్లే మిగిలినవారు కాలినడకతోను పయనించిరి. (37)

శ్రీరాముడు కొలదికాలము క్రిందటనే ప్రవాసమునకు వచ్చినను, ఆయనకు దూరమై ఎంతో కాలము గడచినట్లు ఆ జనులందఱును పరితపించుచుండిరి. కనుక వారు ఆయనను దర్శింపగోరి, తహతహపాటుతో వేగముగా ఆ ఆశ్రమమునకు చేరిరి. (38)

ఆ నలుగురుసోదరులసమాగమమును చూడవలెననెడి కుతూహలముతో వారు గుఱ్ఱపుగిట్టలధ్వనులతో, రథచక్రముల సవ్వడులతో సంకులముగానున్న వివిధములైన వాహనములపై అచటికి చేరిరి. (39)

వివిధములగు వాహనములు, గుఱ్ఱములగిట్టలు, రథచక్రముల అంచులు బలముగా తాకుటచే, మేఘములు క్రమ్మి గర్జించునపుడు ఆకాశమునందువలె భూమినుండి తీవ్రమైన ధ్వనులు బయలు దేరెను. (40)

తేన విత్రాసితా నాగాః కరేణుపరివారితాః।
ఆవాసయంతో గంధేన జగ్మురన్యద్వనం తతః। 41

వరాహవృకసంఘాశ్చ మహిషాః సర్పవానరాః।
వ్యాఘ్రగోకర్ణగవయా విత్రేసుః పృషతైః సహ। 42

రథాంగసాహ్వా నత్యూహా హంసాః కారండవాః ప్లవాః।
తథా పుంస్కోకిలాః క్రౌంచా విసంజ్ఞా భేజిరే దిశః। 43

తేన శబ్దేన విత్రస్తై: ఆకాశం పక్షిభిర్వృతమ్।
మనుష్యైరావృతా భూమిః ఉభయం ప్రబభౌ తదా। 44

తతస్తం పురుషవ్యాఘ్రం యశస్వినమరిందమమ్।
ఆసీనం స్థండిలే రామం దదర్శ సహసా జనః। 45

విగర్హమాణః కైకేయీం సహితో మంథరామపి।
అభిగమ్య జనో రామం బాష్పపూర్ణముఖోఽభవత్। 46

తాన్ నరాన్ బాష్పపూర్ణాక్షాన్ సమీక్ష్యాథ సుదుఃఖితాన్।
పర్యష్వజత ధర్మజ్ఞః పితృవన్మాతృవచ్చ సః। 47

స తత్ర కాంశ్చిత్ పరిషస్వజే నరాన్
నరాశ్చ కేచిత్తు తమభ్యవాదయన్ ।
చకార సర్వాన్ సవయస్యబాంధవాన్
యథార్హమాసాద్య తదా నృపాత్మజః । 48

స తత్ర తేషాం రుదతాం మహాత్మనాం
భువం చ ఖం చానునినాదయన్ స్వనః।
గుహా గిరీణాం చ దిశశ్చ సంతతం
మృదంగఘోషప్రతిమః ప్రశుశ్రువే । 49

ఆ సంకులధ్వనికి అచటి ఏనుగులన్నియును మిగుల భయపడినవి. అంతట మగయేనుగులు ఆడు ఏనుగులతోగూడి తమమదజలములచే ఆ వనప్రదేశమును సువాసితమొనర్చుచు మఱియొక వనమునకు వెళ్ళిపోయినవి. ఆశబ్దమును విని, అడవి పందులు, తోడేళ్ళు, అడవిదున్నలు, సర్పములు, కోతులు, పెద్దపులులు, ఆవులవంటి చెవులుగల జంతువులు, అడవియెద్దులు, చుక్కలజింకలు మొదలగునవి మిగుల భయభ్రాంతములైనవి. చక్రవాకపక్షులు, నీటికోళ్ళు, హంసలు, బెగ్గురుపక్షులు, బలిసిన కొంగలు, మగకోకిలలు, క్రౌంచపక్షులు, మిక్కిలి భీతిల్లినవై నలుదెసలకును పాఱిపోయినవి. (41-43)

ఆ మహాధ్వనికి భయపడి, పక్షులన్నియును ఆకాశమునకెగిరి, అందంతటను వ్యాపించినవి. మనుష్యులచే భూమి యంతయు వ్యాప్తమైనది. భూమ్యాకాశములు ఆ విధముగా ఒప్పారినవి. (44)

నరశ్రేష్ఠుడును, సుప్రసిద్ధుడును, శత్రుసంహారదక్షుడును ఐన శ్రీరాముడు వేదికపైగల దర్భాసనముమీద కూర్చొనియుండగా, అచటికి చేరిన జనులందఱును ఆయనను దర్శించిరి. (45)

కైకేయిని, మంథరను నిందించుచున్న ఆజనులు శ్రీరాముని సమీపింపగనే వారిముఖములు కన్నీటితో తడిసి పోయెను. (46)

దుఃఖితులై కన్నీరుమున్నీరుగా విలపించుచు తనకడకువచ్చిన ఆజనులను గాంచి, ధర్మజ్ఞుడైన ఆరాముడు వారిని తనతల్లిదండ్రులను వలె అక్కున జేర్చుకొనెను. (47)

రాజకుమారుడైన ఆ శ్రీరాముడు తనకడకు వచ్చిన జనులలో కొందఱిని కౌగిలించుకొనెను. ఆ వచ్చిన వారిలో కొందఱు ఆయనకు ప్రణమిల్లిరి. పిదప ఆ రామువుడు తన్ను జేరిన బంధుమిత్రులకు సముచితస్వాగతమర్యాదలను నెఱపి, వారిని సముచితరీతిలో గౌరవించెను. (48)

ఆసమయమున అట్లు విలపించుచున్న ఆమహాత్ములరోదన ధ్వని భూమ్యాకాశములయందును, పర్వత గుహలలోను సకల దిశలయందును ప్రతిధ్వనించెను. అప్పుడాస్వనము మృదంగ ఘోషతుల్యమై అలరారెను. (49)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్వ్యుత్తరశతతమస్సర్గః (102)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటరెండవసర్గము సమాప్తము

— * * * —

103. నూటమూడవసర్గము

కౌసల్యాదేవి వసిష్ఠునితో, తోడిరాజపత్నులు మున్నగువారితోగూడి మందాకినీ తీరమునకు జేరుట. అచట రాముడొనర్చిన పితృశ్రాద్ధక్రియల చిహ్నములనుగాంచి దుఃఖించుట - అందఱును చిత్రకూటమునందలి ఆశ్రమమున సీతారామాదులను కలిసికొనుట.

వసిష్ఠః పురతః కృత్వా దారాన్ దశరథస్య చ।
అభిచక్రామ తం దేశం రామదర్శనతర్షితః। 1

వసిష్ఠమహర్షి దశరథమహారాజుసతులను ముందుంచుకొని, త్వరగా శ్రీరాముని దర్శింపవలెనెడి తహతహతో ఆ పర్ణశాలా ప్రదేశమునకు వచ్చెను (1)

రాజపత్న్యశ్చ గచ్ఛంత్యో మందం మందాకినీం ప్రతి।
దదృశుస్తత్ర తత్తీర్థం రామలక్ష్మణసేవితమ్। 2

కౌసల్యా బాష్పపూర్ణేన ముఖేన పరిశుష్యతా।
సుమిత్రామబ్రవీద్దీనా యాశ్చాన్యా రాజయోషితః। 3

ఇదం తేషామనాథానాం క్లిష్టమక్లిష్టకర్మణామ్।
వనే ప్రాక్కేవలం తీర్థం యే తే నిర్విషయీకృతాః। 4

ఇతః సుమిత్రే! పుత్రస్తే సదా జలమతంద్రితః।
స్వయం హరతి సౌమిత్రిః మమ పుత్రస్య కారణాత్। 5

జఘన్యమపి తే పుత్రః కృతవాన్ న తు గర్హితః।
భ్రాతుర్యదర్థసహితం సర్వం తద్విహితం గుణైః। 6

అద్యాయమపి తే పుత్రః క్లేశానామతథోచితః।
నీచానర్థసమాచారం సజ్జం కర్మ ప్రముంచతు। 7

దక్షిణాగ్రేషు దర్భేషు సా దదర్శ మహీతలే।
పితురింగుదిపిణ్యాకం న్యస్తమాయతలోచనా। 8

తం భూమౌ పితురార్తేన న్యస్తం రామేణ వీక్ష్య సా।
ఉవాచ దేవీ కౌసల్యా సర్వా దశరథస్త్రియః। 9

ఇదమిక్ష్వాకునాథస్య రాఘవస్య మహాత్మనః।
రాఘవేణ పితుర్దత్తం పశ్యతైతద్యథావిధి। 10

తస్య దేవసమానస్య పార్థివస్య మహాత్మనః।
నైతదౌపయికం మన్యే భుక్తభోగస్య భోజనమ్। 11

చతురంతాం మహీం భుక్త్వా మహేంద్రసదృశో విభుః।
కథ మింగుదిపిణ్యాకం స భుంక్తే వసుధాధిపః। 12

కౌసల్యాదిరాజపత్నులు తిన్నగా సాగిపోవుచు మందాకినీనదిని, అచట సీతారామలక్ష్మణులు స్నానాదికృత్యములను ఆచరించిన రేవును దర్శించిరి. (2)

అప్పుడు కౌసల్యాదేవిముఖము వాడిపోయి, కన్నీటితో తడిసి యుండెను. అంతట ఆమె సుమిత్రతోను, దీనవదనలైయున్న ఇతర రాజపత్నులతోడను ఇట్లు నుడివెను. (3)

"మనరామలక్ష్మణులు ఎన్నడును ఎవ్వరికిని ఎట్టి హానిని తలపెట్టనివారు. అట్టివారు రాజ్యమునుండి వెడలగొట్టబడిరి. వారు ఈ దుర్గమారణ్యములలో అనాథలవలె కాలముగడపుచున్నారు. వారు ఆశ్రయించెడి రేవు ఇదియే - ఓ సుమిత్రా! అలుపెఱుగని నీ కుమారుడు లక్ష్మణుడు నిరంతరము ఈ రేవు కడకు వచ్చి, నా సుతుడైన శ్రీరామునికొఱకై స్వయముగా నీటినిగొని పోవుచుండును. నీ కుమారుడు స్వల్పములైన సేవాకార్యములను (నిమ్నశ్రేణికి చెందిన సేవకులు చేసెడి కార్యములను) చేయుచున్నను అతని గొప్పదనమునకు ఏలోటునూరాదు. ఏలనన పితృతుల్యుడును, సద్గుణ రాశియునైన అన్నకు ప్రయోజనములను గూర్చు చిన్నపనులైనను అవి గౌరవప్రదములే గదా! నిష్ప్రయోజనమైన పనులు అతిగొప్పవైనను గర్హణీయములే సుమా- (4-6)

నేడు నీకుమారుడు పెక్కు కష్టములకోర్చుకొనుచు ఇట్టి పనులను చేయుచున్నాడు. సుకుమారముగా పెరిగిన అతడు ఇట్టి కార్యములను చేయవలసివచ్చుట పూర్తిగా అనుచితము. ఐతే ఒకవేళ భరతుని ప్రార్థనను మన్నించి, శ్రీరాముడు అయోధ్యకు విచ్చేసి, కోసలరాజ్య పాలనమును స్వీకరించినచో నీకుమారునకు ఈ సేవాకార్యనిర్వహణము నుండి విముక్తి కల్గును." (7)

విశాలలోచనయైన కౌసల్యాదేవి క్రమముగా ముందునకు సాగుచు భూమిపై దక్షిణాగ్రములుగాగల దర్భలపై శ్రీరాముడు పితృకార్యములకై ఉంచిన గారపిండిపిండములను గాంచెను. (8)

ఆ కౌసల్యాదేవి దుఃఖితుడైన శ్రీరాముడు పితృదేవతలకై (తండ్రికై) భూమిపై ఉంచిన ఆ పిండములను జూచి, దశరథుని యొక్క పత్నులందఱిని ఉద్దేశించి ఇట్లు పలికెను. (9)

"సోదరీమణులారా! ఇక్ష్వాకువంశప్రభువైన మహాత్ముడగు దశరథుని ఉద్దేశించి పితృకర్మలనిమిత్తమై శ్రీరాముడు విధ్యుక్తముగా సమర్పించిన పిండములివి, వీటిని దర్శింపుడు. (10)

దైవతుల్యుడైన ఆ మహారాజు అద్భుతభోగములను అనుభవించిన మహానుభావుడు. అట్టి ప్రభువునకు ఇది తగిన భోజనమని నేను అనుకొనను. (11)

సముద్రములే ఎల్లలుగాగల ఈ సమస్తభూమండలమునందలి సకలభోగములను అనుభవించి, ఆప్రభువు దేవేంద్రునితో సమానుడుగా వెలుగొందెను. అట్టి మహారాజు ఈ గారపిండి ముద్దలను ఎట్లు ఆరగింపగలడు? (12)

అతో దుఃఖతరం లోకే న కించిత్ ప్రతిభాతి మా।
యత్ర రామః పితుర్దద్యాత్ ఇంగుదిక్షోదమృద్ధిమాన్। 13

రామేణేంగుదిపిణ్యాకం పితుర్దత్తం సమీక్ష్య మే।
కథం దుఃఖేన హృదయం న స్ఫోటతి సహస్రధా। 14

శ్రుతిస్తు ఖల్వియం సత్యా లౌకికీ ప్రతిభాతి మా।
యదన్నః పురుషో భవతి తదన్నాస్తస్య దేవతాః। 15

ఏవమార్తాం సపత్న్యస్తా జగ్మురాశ్వాస్య తాం తదా।
దదృశుశ్చాశ్రమే రామం స్వర్గచ్యుతమివామరమ్। 16

సర్వభోగైః పరిత్యక్తం రామం సంప్రేక్ష్య మాతరః।
ఆర్తా ముముచురశ్రూణి సస్వరం శోకకర్శితాః। 17

తాసాం రామః సముత్థాయ జగ్రాహ చరణాన్ శుభాన్।
మాతౄణాం మనుజవ్యాఘ్రః సర్వాసాం సత్యసంగరః। 18

తాః పాణిభిః సుఖస్పర్శైః మృద్వంగుళితలైః శుభైః।
ప్రమమార్జూ రజః పృష్ఠాత్ రామస్యాయతలోచనాః। 19

సౌమిత్రిరపి తాః సర్వా మాతౄః సంప్రేక్ష్య దుఃఖితః।
అభ్యవాదయతాసక్తం శనై రామాదనంతరమ్। 20

యథా రామే తథా తస్మిన్ సర్వా వవృతిరే స్త్రియః।
వృత్తిం దశరథాజ్జాతే లక్ష్మణే శుభలక్షణే। 21

సీతాఽపి చరణాంస్తాసామ్ ఉపసంగృహ్య దుఃఖితా।
శ్వశ్రూణామశ్రుపూర్ణాక్షీ సా బభూవాగ్రతః స్థితా। 22

తాం పరిష్వజ్య దుఃఖార్తా మాతా దుహితరం యథా।
వనవాసకృశాం దీనాం కౌసల్యా వాక్యమబ్రవీత్। 23

విదేహరాజస్య సుతా స్నుషా దశరథస్య చ।
రామపత్నీ కథం దుఃఖం సంప్రాప్తా నిర్జనే వనే। 24

పద్మమాతపసంతప్తం పరిక్లిష్టమివోత్పలమ్।
కాంచనం రజసా ధ్వస్తం క్లిష్టం చంద్రమివాంబుదైః। 25

సకలైశ్వర్యములకును కుదురైన రాజవంశమునందు జన్మించిన శ్రీరాముడు తనతండ్రికి ఈ గారపిండి ముద్దలను సమర్పింపవలసివచ్చెనుగదా! లోకమున ఇంతకంటెను మించిన దుఃఖకరమైనవిషయము ఏముండును? (13)

శ్రీరాముడు తనతండ్రికై గారపిండిపిండములను సమర్పించియుండుటను చూచియు, దుఃఖభారముచే నా హృదయము ముక్కలు ముక్కలై పోవుట లేదేమి? (14)

'మానవులు తాము భుజించెడి ఆహారమునే దేవతలకు నైవేద్యము'గావింతురు.' అను శ్రుతివచనము లోకప్రసిద్ధము. అది సత్యమనియే నాకు తోచుచున్నది." (15)

ఈ విధముగా శోకార్తయైయున్న కౌసల్యాదేవిని ఆమెసవత్నులు ఓదార్చి, తిన్నగా ముందునకు సాగిరి. పిదప వారందఱును ఆశ్రమమును చేరి, శ్రీరాముని దర్శించిరి. అప్పుడు అతడు దివినుండి భువికి అవతరించిన దైవమువలె భాసిల్లుచుండెను (16)

సమస్తభోగములను విడనాడిన శ్రీరామచంద్రుని గాంచి, శోకముతో కృశించియున్న ఆ తల్లులు అందఱును ఆర్తితో అలమటించుచు కన్నీరు మున్నీరుగా వెక్కివెక్కి ఏడువసాగిరి. (17)

నరశ్రేష్ఠుడును, సత్యసంధుడును ఐన శ్రీరాముడు ఆ మాతృమూర్తులను అందఱిని చూడగనే తనఆసనముమండి లేచెను. పిమ్మట అతడు వారిపవిత్రపాదములకు వరుసగా ప్రణమిల్లెను. (18)

విశాలనేత్రలైన ఆరాజమాతలు (ఆతల్లులు) తమ చల్లని చేతులతో, మృదువైన వ్రేళ్లతో శ్రీరామునివీపుపై నిమురుచు, అందలి ధూళిని తుడిచివేసిరి. (19)

శ్రీరాముడు వారికి నమస్కరించిన పిమ్మట లక్ష్మణుడును ఆ తల్లులందఱిని జూచి, కడు దుఃఖితుడై, తానును వినమ్రుడై, భక్తిశ్రద్ధలతో వారికి వరుసగా ప్రణమిల్లెను. (20)

శుభలక్షణసంపన్నుడును, దశరథాత్మజుడును ఐన లక్ష్మణుని విషయమునగూడ ఆ తల్లులందఱును శ్రీరామునియందువలె ప్రేమాదరములతో తమఆప్యాయతను ప్రకటించిరి. (21)

తదనంతరము సీతాదేవియు మిగుల దుఃఖితయై, కన్నీరు గార్చుచు తనఅత్తగార్లపాదములకు ప్రణమిల్లి, వారియెదుట నిలబడెను. (22)

వనవాసముచే కృశించియున్నదియు, దీనవదనయు ఐన ఆ సీతాదేవినిజూచి కౌసల్యాదేవి దుఃఖార్తయై, తల్లి తనకన్నబిడ్డనువలె హృదయమునకు హత్తుకొని, ఆమెతో ఇట్లనెను. (23)

"అమ్మా! సీతా! నీవు జనకమహారాజుకుమార్తెవు, దశరథప్రభువునకు కోడలివి. శ్రీరామునిధర్మపత్నివి. అట్టి నీకు ఈ నిర్జనవనమున ఎంతటి దుఃఖము ప్రాప్తించినది? ఓ వైదేహీ! నీ ముఖము ఎండతీవ్రతకు వాడిపోయిన కమలము వలెను,

ముఖం తే ప్రేక్ష్య మాం శోకో దహత్యగ్నిరివాఽఽశ్రయమ్।
భృశం మనసి వైదేహి! వ్యసనారణిసంభవః। 26

బ్రువంత్యామేవమార్తాయాం జనన్యాం భరతాగ్రజః।
పాదావాసాద్య జగ్రాహ వసిష్ఠస్య చ రాఘవః। 27

పురోహితస్యాగ్నిసమస్య వై తదా
బృహస్పతేరింద్ర ఇవామరాధిపః।
ప్రగృహ్య పాదౌ సుసమృద్ధతేజసః
సహైవ తేనోపవివేశ రాఘవః। 28

తతో జఘన్యం సహితైః సమంత్రిభిః
పురప్రధానైశ్చ సహైవ సైనికైః।
జనేన ధర్మజ్ఞతమేన ధర్మవాన్
ఉపోపవిష్టో భరతస్తదాఽగ్రజమ్। 29

ఉపోపవిష్టస్తు తదా స వీర్యవాన్
తపస్వివేషేణ సమీక్ష్య రాఘవమ్।
శ్రియా జ్వలంతం భరతః కృతాంజలిః
యథా మహేంద్రః ప్రయతః ప్రజాపతిమ్। 30

కిమేష వాక్యం భరతోఽద్య రాఘవం
ప్రణమ్య సత్కృత్య చ సాధు వక్ష్యతి।
ఇతీవ తస్యార్యజనస్య తత్త్వతో
బభూవ కౌతూహలముత్తమం తదా। 31

స రాఘవః సత్యధృతిశ్చ లక్ష్మణో
మహానుభావో భరతశ్చ ధార్మికః।
వృతాః సుహృద్భిశ్చ విరేజురధ్వరే
యథా సదస్యైః సహితాస్త్రయోఽగ్నయః। 32

నలిగిపోయిన కలువవలెను, దుమ్ముకొట్టుకొనిన బంగారమువలెను, మేఘములచే కప్పబడిన చంద్రునివలెను కాంతి తఱిగియున్నది- ఆ విధముగా చిన్నబోయియున్న నీ ముఖమును జూచిన పిమ్మట నా మనోవ్యథయనెడి అరణినుండి పుట్టిన శోకాగ్ని, అగ్ని కఱ్ఱను కాల్చివేయునట్లు నన్ను మిగుల దహించివేయుచున్నది." (24-26)

తనతల్లియైన కౌసల్యాదేవి శోకార్తయై ఇట్లు విలపించుచుండగా భరతునిఅన్నయైన శ్రీరాముడు వసిష్ఠుని చెంతచేరి, ఆయన పాదములకు ప్రణమిల్లెను- (27)

దేవతలకు ప్రభువైన ఇంద్రుడు బృహస్పతికి నమస్కరించినట్లు, అగ్నిజ్వాలలవలె దివ్యతేజస్సులతో విరాజిల్లుచున్నవాడును, వంశపురోహితుడును ఐన వసిష్ఠమహర్షియొక్కపాదములకు ప్రణమిల్లి, పిమ్మట శ్రీరాముడు ఆ మహామునితో గూడ అచటనే కూర్చొనెను. (28)

వసిష్ఠుడును, శ్రీరాముడును ఆసీనులైన పిదప ధర్మాత్ముడైన భరతుడు తనవెంటవచ్చిన మంత్రులు, పురప్రముఖులు, సైనికులు, ధర్మమును బాగుగా ఎరిగిన ఇతరజనులు మున్నగు వారితో గూడి, తనయన్నయగు శ్రీరామునిచెంతకూర్చుండెను. (29)

పరాక్రమశాలియగు భరతుడు తనఅన్నసమీపమున కూర్చొనిన పిదప, తాపసివేషములో దివ్యతేజస్సుతో ప్రకాశించుచున్న శ్రీరాముని జూచెను. అనంతరము బ్రహ్మదేవునిసమక్షమున ఇంద్రునివలె అతడు అగ్రజుని యెదుట వినయముతో చేతులు జోడించి ప్రణమిల్లెను. (30)

భరతుడు శ్రీరామునకు సగౌరవముగా నమస్కరించిన పిమ్మట అతడు తనఅన్నతో ఏయే సాధువచనములను పల్కునోగదా! అని అచట చేరియున్న సత్పురుషులహృదయములలో కుతూహలము వెల్లువిరిసెను. (31)

సత్యసంధుడైన ఆ రాముడును, మహానుభావుడైన లక్ష్మణుడును, ధర్మాత్ముడైన భరతుడును, తమ బంధుమిత్రులతో గూడినవారై, యజ్ఞశాలయందు సదస్యులతో ఒప్పుచున్న త్రేతాగ్నులవలె విరాజిల్లిరి. (32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్ర్యుత్తరశతతమస్సర్గః *(103)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటమూడవసర్గము సమాప్తము

— ❋ ❋ ❋ —

104. నూటనాల్గవసర్గము

'అయోధ్యకు విచ్చేసి, రాజ్యపాలనమును స్వీకరింపుము' - అని భరతుడు శ్రీరాముని అభ్యర్థించుట - తండ్రియాజ్ఞను పాలించుటయే తనకు శ్రేయస్కరము, కర్తవ్యము - అని శ్రీరాముడు అతనికి తెల్పుట.

తం తు రామః సమాజ్ఞాయ భ్రాతరం గురువత్సలమ్।
లక్ష్మణేన సహ భ్రాత్రా ప్రష్టుం సముపచక్రమే। 1

కి మేతదిచ్ఛేయమహం శ్రోతుం ప్రవ్యాహృతం త్వయా।
యస్మాత్ త్వమాగతో దేశమ్ ఇమం చీరజటాజినీ। 2

కిన్నిమిత్తమిమం దేశం కృష్ణాజినజటాధరః।
హిత్వా రాజ్యం ప్రవిష్టస్త్వం తత్సర్వం వక్తుమర్హసి। 3

ఇత్యుక్తః కైకయీపుత్రః కాకుత్స్థేన మహాత్మనా।
ప్రగృహ్య బలవద్భూయః ప్రాంజలిర్వాక్యమబ్రవీత్। 4

ఆర్యం తాతః పరిత్యజ్య కృత్వా కర్మ సుదుష్కరమ్।
గతస్స్వర్గం మహాబాహుః పుత్రశోకాభిపీడితః। 5

స్త్రియా నియుక్తః కైకేయ్యా మమ మాత్రా పరంతప!।
చకార సుమహత్ పాపమ్ ఇదమాత్మయశోహరమ్। 6

సా రాజ్యఫలమప్రాప్య విధవా శోకకర్శితా।
పతిష్యతి మహాఘోరే నిరయే జననీ మమ। 7

తస్య మే దాసభూతస్య ప్రసాదం కర్తుమర్హసి।
అభిషించస్వ చాద్యైవ రాజ్యేన మఘవానివ। 8

ఇమాః ప్రకృతయః సర్వా విధవా మాతరశ్చ యాః।
త్వత్సకాశమనుప్రాప్తాః ప్రసాదం కర్తుమర్హసి। 9

తదానుపూర్వ్యా యుక్తం చ యుక్తం చాత్మని మానద!।
రాజ్యం ప్రాప్నుహి ధర్మేణ సకామాన్ సుహృదః కురు। 10

భవత్వవిధవా భూమిః సమగ్రా పతినా త్వయా।
శశినా విమలేనేవ శారదీ రజనీ యథా। 11

ఏభిశ్చ సచివైః సార్ధం శిరసా యాచితో మయా।
భ్రాతుః శిష్యస్య దాసస్య ప్రసాదం కర్తుమర్హసి। 12

సోదరుడగు లక్ష్మణునితోగూడిన శ్రీరాముడు తనకత్యంత ప్రేమాస్పదుడును, తనయందు భక్తిశ్రద్ధలుగలవాడును ఐన భరతుని ప్రియవచనములతో ఓదార్చుచు ఇట్లు ప్రశ్నించెను. (1)

"నాయనా! భరతా! నీవు రాజ్యమును వీడి, కృష్ణాజినమును జటావల్కలములను దాల్చి ఈ ప్రదేశమునకు వచ్చిన కారణమేమి? ఈ వనములో ప్రవేశించుటకుగల హేతువేమి? ఈ విషయములను అన్నింటిని వినగోరుచున్నాను- సవిస్తరముగా తెల్పుము." (2-3)

మహాత్ముడైన శ్రీరాముడు ఇట్లు పలికినపిమ్మట భరతుడు పొంగిపొరలి వచ్చుచున్న తనదుఃఖమును బలవంతముగా అణచుకొనుచు, ప్రాంజలియై ఇట్లు వచించెను. (4)

"ఓ పూజ్యుడా! మహాబాహువైన మనతండ్రి ఒక స్త్రీకారణముగా నిన్ను వనములకు పంపి, జ్యేష్ఠునకు అర్హమైన రాజ్యమును కనిష్ఠునకు కట్టబెట్టజూచినాడు. ఇట్లు తగనిపని చేసి, పుత్రశోకమునకు తట్టుకొనలేక అతడు స్వర్గస్థుడైనాడు. (5)

ఓ శత్రుసంహారకా! ఆయనభార్యయు, నాకు తల్లియు ఐన కైకేయి ప్రోద్బలముచే మనతండ్రి ఈ ఘోరకార్యమునకు పాల్పడినాడు. ఈ పాపకృత్యము ఆయనకీర్తిప్రతిష్ఠలను దెబ్బతీయునది- (6)

నా తల్లికి ఆమె ఆశించినరీతిగా రాజ్యలాభములు దక్కలేదు సరిగదా తీరని వైధవ్యము మాత్రము ప్రాప్తించినది.- ఫలితముగా శోకమున కృశించిపోవుచున్నది- ఈ కారణముగా ఆమె మహాఘోరనరకమున పడిపోవుట తథ్యము. (7)

అన్నా! నీ దాసుడనై ఇచటికి విచ్చేసిన నన్ను అనుగ్రహింపుము. సురపురికి ఇంద్రునివలె కోసలరాజ్యమునకు నీవు పట్టాభిషిక్తుడవు కమ్ము. మంత్రులు మొదలగు ఈ ప్రజలెల్లరును, భర్తను కోల్పోయిన తల్లులందఱును నీ సమీపమునకు విచ్చేసిరి. ఈ అందఱియెడలను ప్రసన్నుడవు కమ్ము. ఇతరులకోర్కెలను మన్నించెడి ఓ మహాత్మా! జ్యేష్ఠుడవైన కారణమున ఈ రాజ్యపాలనమునకు నీవే అర్హుడవు. న్యాయముగా ఈ కోసలరాజ్యము నీకే చెందవలెను. దీనిని పాలించుటకు నీవు సమర్థుడవు. ధర్మమునననుసరించి, రాజ్యమును స్వీకరింపుము. బంధుమిత్రులకోరికలను ఈడేర్పుము. (8-10)

స్వచ్ఛమైన చంద్రకాంతులతో (పండువెన్నెలలతో) శరద్రాత్రి వలె, నీ వంటి ప్రభువును పొందుటవలన ఈ సమస్తభూమి (ఈరాజ్యము) సనాథయై శోభిల్లును. (11)

ఈ మంత్రులందఱితోగూడి నేను శిరసాప్రణమిల్లి నిన్ను వేడుకొనుచున్నాను- నేను నీకు తమ్ముడను, శిష్యుడను, దాసుడను- కనుక నీవు రాజ్యాభిషిక్తుడవై నన్ను అనుగ్రహింపుము. (12)

తదిదం శాశ్వతం పిత్ర్యం సర్వం ప్రకృతిమండలమ్।
పూజితం పురుషవ్యాఘ్ర! నాతిక్రమితుమర్హసి। 13

ఏవముక్త్వా మహాబాహుః సబాష్పః కైకయీసుతః।
రామస్య శిరసా పాదౌ జగ్రాహ విధివత్ పునః। 14

తం మత్తమివ మాతంగం నిఃశ్వసంతం పునః పునః।
భ్రాతరం భరతం రామః పరిష్వజ్యేదమబ్రవీత్। 15

కులీనః సత్త్వసంపన్నః తేజస్వీ చరితవ్రతః।
రాజ్యహేతోః కథం పాపమ్ ఆచరేత్ త్వద్విధో జనః। 16

న దోషం త్వయి పశ్యామి సూక్ష్మమప్యరిసూదన!।
న చాపి జననీం బాల్యాత్ త్వం విగర్హితుమర్హసి। 17

కామకారో మహాప్రాజ్ఞ! గురూణాం సర్వదాఽనఘ!।
ఉపపన్నేషు దారేషు పుత్రేషు చ విధీయతే। 18

వయమస్య యథా లోకే సంఖ్యాతాః సౌమ్య! సాధుభిః।
భార్యాః పుత్రాశ్చ శిష్యాశ్చ త్వమను జ్ఞాతుమర్హసి। 19

వనే వా చీరవసనం సౌమ్య! కృష్ణాజినాంబరమ్।
రాజ్యే వాఽపి మహారాజో మాం వాసయితుమీశ్వరః। 20

యావత్ పితరి ధర్మజ్ఞే గౌరవం లోకసత్కృతమ్।
తావద్ధర్మభృతాం శ్రేష్ఠ జనన్యామపి గౌరవమ్। 21

ఏతాభ్యాం ధర్మశీలాభ్యాం వనం గచ్ఛేతి రాఘవ!।
మాతాపితృభ్యాముక్తోఽహం కథమన్యత్ సమాచరే। 22

త్వయా రాజ్యమయోధ్యాయాం ప్రాప్తవ్యం లోకసత్కృతమ్।
వస్తవ్యం దండకారణ్యే మయా వల్కలవాససా। 23

ఏవం కృత్వా మహారాజో విభాగం లోకసన్నిధౌ।
వ్యాదిశ్య చ మహాతేజా దివం దశరథో గతః। 24

ఓ నరశ్రేష్ఠా! మంత్రులు మొదలుకొని ఈ ప్రజలు ఎల్లరును మనవంశమువారిని పరంపరగా సేవించుచున్నారు. వీరు మనతండ్రి కాలమునగూడ కలరు- వీరందఱిని మనము మొదటినుండియు గౌరవించుచు వచ్చితిమి- కనుక వీరి ప్రార్థనను నీవు త్రోసిపుచ్చరాదు-" (13)

భరతుడు ఇట్లు పలికి, చేతులు జోడించి, కన్నీరుగార్చుచు మఱల శ్రీరాముని పాదములకు శిరసా మోకరిల్లెను. (14)

మదపుటేనుగువలె పదేపదే నిట్టూర్పులు విడుచుచున్న సోదరుడగు భరతుని కౌగిలించుకొని, శ్రీరాముడు అతనితో ఇట్లనెను. (15)

"ఓ భరతా! నీవు ఉత్తమవంశమున పుట్టినవాడవు. సత్త్వగుణ సంపన్నుడవు. బలశాలివి. సత్ప్రవర్తనగలవాడవు. అట్టి నీవంటివాడు రాజ్యముకొఱకై పాపములకు ఎట్లు ఒడిగట్టును? (పాపములకు ఎన్నడును పాల్పడడు) (16)

ఓ అరిసూదనా! నీలో దోషము ఆవంతయు నాకు కన్పించుటలేదు. అజ్ఞానవశముననైనను తల్లిని నీవు నిందింపరాదు. (17)

ఓ బుద్ధిశాలీ! ఓ పుణ్యాత్ముడా! తమకు ఇష్టమైన స్త్రీలయెడలను, పుత్త్రులవిషయమునను, తనను ఆశ్రయించియున్న శిష్య దాసాదుల యెడలను పెద్దలకు సర్వాధికారములుండును. వారిని తమ ఇష్టానుసారము ఆజ్ఞాపింపవచ్చును- (18)

నాయనా! లోకమున సర్వసాధారణముగా భార్యాపుత్త్రుల విషయమునను శిష్యులవిషయమునను సత్పురుషులు చెప్పిన ఈ మాటలు దశరథునిపుత్త్రులమైన మనవిషయమునను వర్తించును- అని నీవు తెలిసికొనుము. (19)

ఓ బుద్ధిమంతుడా! కోసలప్రభువైన దశరథమహారాజు నారచీరలను, మృగచర్మమును ధరింపజేసి, నన్ను వనములలోనైనను ఉంచవచ్చును. లేదా రాజ్యసింహాసనముమీదనైనను కూర్చుండబెట్ట వచ్చును. ఆయనకు ఈ రెండింటివిషయమునను సర్వాధికారములు గలవు. (20)

ధర్మవేత్తలలో శ్రేష్ఠుడవైన ఓ భరతా! లోకమర్యాదను అనుసరించి, తండ్రియెడ చూపెడి గౌరవమునే తల్లివిషయమునను చూపవలెను. (తండ్రినివలెనే తల్లినిగూడ గౌరవింపవలెను) (21)

ఓ భరతా! 'ధర్మశీలురైన తలిదండ్రులు ఇద్దఱును 'వనములకు వెళ్లుము'- అని నన్ను ఆజ్ఞాపించిరి. వారిఆజ్ఞనుకాదని నేను మఱియొక విధముగా ఎట్లు చేయుదును? లోకకల్యాణముకొఱకై నీవు అయోధ్యలోనే యుండి రాజ్యపాలన చేయవలెను. నేనేమో వల్కలములను ధరించి, దండకారణ్యమునందే వసింపవలెను. (22-23)

తేజశ్శాలియైన దశరథమహారాజు పురప్రముఖులసమక్షమున మనఇద్దఱికిని ఈ విధముగా వేర్వేఱు ఆజ్ఞలను ఒసంగి, పిదప స్వర్గస్థుడాయెను. (24)

స చ ప్రమాణం ధర్మాత్మా రాజా లోకగురుస్తవ।
పిత్రా దత్తం యథాభాగమ్ ఉపభోక్తుం త్వమర్హసి। 25

చతుర్దశసమాః సౌమ్య! దండకారణ్యమాశ్రితః।
ఉపభోక్ష్యే త్వహం దత్తం భాగం పిత్రా మహాత్మనా। 26

యదబ్రవీన్మాం నరలోకసత్కృతః
పితా మహాత్మా విబుధాధిపోపమః ।
తదేవ మన్యే పరమాత్మనో హితం
న సర్వలోకేశ్వరభావమవ్యయమ్ । 27

లోకపూజ్యుడు, ధర్మాత్ముడు ఐన ఆ మహారాజే నీకు పరమప్రమాణము. కావున నీవు ఆయనయొక్క ఆజ్ఞను శిరసావహించి తీరవలెను. తండ్రిగారునీకిచ్చిన భాగమును (రాజ్యమును) నీవు అనుభవింపవలెను. (25)

నాయనా! మహాత్ముడైన తండ్రిగారు నాకు ఇచ్చిన భాగమును నేను అనుభవింతును - కనుక ఆయనఆదేశముమేరకు దండకారణ్యమును ఆశ్రయించినవాడనై పదునాలుగుసంవత్సరముల కాలమును గడపెదను. మనతండ్రియైన దశరథమహారాజు ఈ మానవలోకమున పూజ్యుడు, దేవేంద్రునితో సమానుడు. అట్టి మహాత్ముడు ఇచ్చిన ఆజ్ఞయే నాకు పరమహితము - సమస్త లోకములఅధికారమునైనను నాకు శ్రేయస్కరముగాదు -అని నేను తలంతును. (26-27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతురుత్తరశతతమస్సర్గః (104)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటనాల్గవసర్గము సమాప్తము

— * * * —

105. నూటఐదవసర్గము

'అన్నా! అయోధ్యను పాలించుటకు నీవే అర్హుడవు' అని భరతుడు శ్రీరామునకు విన్నవించుకొనుట - 'జననమరణములు అనివార్యములు కావున తండ్రిమృతికై చింతింపకుము. - అని పలుకుచు శ్రీరాముడు "మనకు తండ్రి ఆజ్ఞ శిరోధార్యము" - అని హితవు పలుకుట.

తతః పురుషసింహానాం వృతానాం తైః సుహృద్గణైః।
శోచతామేవ రజనీ దుఃఖేన వ్యత్యవర్తత। 1

రజన్యాం సుప్రభాతాయాం భ్రాతరస్తే సుహృద్వృతాః।
మందాకిన్యాం హుతం జప్యం కృత్వా రామముపాగమన్। 2

పురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు బంధుమిత్రులను గూడి, పితృవియోగదుఃఖముతో పరితపించుచుండగా ఆ రాత్రి గడచెను. తెల్లవాఱగనే ఆ సోదరులందఱును బంధుమిత్రసహితులై మందాకినీ జలములలో స్నానములనాచరించి, తత్తీరమున జప హోమాదులను నెఱపిరి. పిమ్మట భరతాదులు శ్రీరాముని చెంతకుచేరిరి. (1-2)

తూష్ణీం తే సముపాసీనా న కశ్చిత్ కించిదబ్రవీత్।
భరతస్తు సుహృన్మధ్యే రామం వచనమబ్రవీత్। 3

అనంతరము వారందఱును సుఖాసీనులై మౌనముగానుండిరి. ఎవ్వరునూ ఏమియును మాటాడకుండిరి- కాని భరతుడు మాత్రము మిత్రుల సమక్షమున శ్రీరామునితో ఇట్లు నుడివెను. (3)

సాంత్వితా మామికా మాతా దత్తం రాజ్యమిదం మమ।
తద్దదామి తవైవాహం భుంక్ష్వ రాజ్యమకంటకమ్। 4

"సోదరా! మా తల్లిని సంతృప్తిపఱచుటకై తండ్రిగారు నాకు ఈరాజ్యము ఇచ్చివేసిరి. నా అధీనములోని ఈ నిష్కంటకరాజ్యమును నీకు సమర్పించుచున్నాను. దీనిని నీవు పాలింపుము. (4)

మహతేవాఽంబువేగేన భిన్నః సేతుర్జలాగమే।
దురావారం త్వదన్యేన రాజ్యఖండమిదం మహత్। 5

వర్షాకాలమునందలి వరదలవేగమునకు తెగిపోయిన అడ్డుకట్టవలెనున్న ఈ విశాలరాజ్యభాగమును రక్షించుటకు నీకుదప్ప మఱియెవ్వరికిని సాధ్యముగాదు. (5)

గతిం ఖర ఇవాశ్వస్య తార్క్ష్యస్యేవ పతత్రిణః।
అనుగంతుం న శక్తిర్మే గతిం తవ మహీపతే। 6

ఓ ప్రభూ! అశ్వగమనము గాడిదకు కుదురనట్లు గరుత్మంతుని ఆకాశయానము సామాన్య పక్షికి సాధ్యము కానట్లు నీ గతిని (పరిపాలనారీతిని) అనుసరించుటకు (నీవలె రాజ్యపాలనము చేయుటకు) నాకు శక్తి చాలదు (నాకు అసాధ్యము). (6)

సుజీవం నిత్యశస్తస్య యః పరైరుపజీవ్యతే।
రామ! తేన తు దుర్జీవం యః పరానుపజీవతి। 7

యథా తు రోపితో వృక్షః పురుషేణ వివర్ధితః।
హ్రస్వకేన దురారోహో రూఢస్కంధో మహాద్రుమః। 8

స యదా పుష్పితో భూత్వా ఫలాని న విదర్శయేత్।
స తాం నానుభవేత్ ప్రీతిం యస్య హేతోః ప్రరోపితః। 9

ఏషోపమా మహాబాహో! తమర్థం వేత్తుమర్హసి।
యది త్వమస్మాన్ ఋషభో భర్తా భృత్యాన్ న శాధి హి। 10

శ్రేణయస్త్వాం మహారాజ! పశ్యన్త్వగ్ర్యాశ్చ సర్వశః।
ప్రతపంతమివాదిత్యం రాజ్యే స్థితమరిందమమ్। 11

తవానుయానే కాకుత్స్థ! మత్తా నర్దంతు కుంజరాః।
అంతఃపురగతా నార్యో నందంతు సుసమాహితాః। 12

తస్య సాధ్విత్యమన్యంత నాగరా వివిధా జనాః।
భరతస్య వచః శ్రుత్వా రామం ప్రత్యనుయాచతః। 13

తమేవం దుఃఖితం ప్రేక్ష్య విలపంతం యశస్వినమ్।
రామః కృతాత్మా భరతం సమాశ్వాసయదాత్మవాన్। 14

నాఽఽత్మనః కామకారోఽస్తి పురుషోఽయమనీశ్వరః।
ఇతశ్చేతరతశ్చైనం కృతాంతః పరికర్షతి। 15

ఓ రఘురామా! ఇతరులకు ఆశ్రయమిచ్చి, నిత్యమూ వారిని చక్కగా ఆదుకొనువానిజీవితము సర్వోత్తమమైనది. ఇతరులపై ఆధారపడి జీవించువాని జీవితము అధమము- కావున ఉత్తమస్థాయికి చెందిన నీవు రాజ్యమును పాలించుటయే శ్రేష్ఠము. (7)

ఓ మహాబాహూ! ఒక పురుషుడు సత్ఫలములను ఆశించి, ఒక మొక్కను నాటును. అతని పోషణలో అది పెరిగిపెద్దదగును. క్రమముగా దానిబోదె మిగుల లావెక్కి, అది ఒక మహావృక్షమగును. కడకు పొట్టివారు ఎక్కలేని స్థాయికి అది ఎదుగును. అది బాగుగా పుష్పించినను ఫలములను ఇయ్యనిచో (ఫలించనిచో) దానిని నాటిన పురుషునియొక్క లక్ష్యమే దెబ్బతినును. సరిగదా అతడు అసంతృప్తికిని గురియగును. సర్వసమర్థుడవైన నీవు రాజవై నిభృత్యులమైన మమ్ము శాసింపనిచో (పరిపాలింపనిచో) ఈ (వృక్షమునకు సంబంధించిన) ఉదాహరణము ఇచట మనకు అన్వయించును. (అనగా దశరథమహారాజు లోకకల్యాణార్థము సకలసద్గుణసంపన్నుడవైన నిన్ను పుత్రునిగా పొంది, ఒక ఉదాత్తలక్ష్యముతో పెంచి పెద్దచేసెను. నీ చక్కని పరిపాలనలో ప్రజలు బాగుగా సుఖింతురని ఆశించి, నిన్ను రాజ్యపట్టాభిషిక్తుని చేయబూనెను. కాని నీవు పరిపాలనభారమును వహింపనిచో ఆయనలక్ష్యము సిద్ధింపదు, భృత్యులమైన మాకు సుఖలాభములు దుర్లభములగును) (8-10)

ఓ మహాప్రభూ! శత్రుసంహారసమర్థుడవైన నీవు రాజ్యసింహాసనమును అధిష్ఠించి, మిక్కిలి వేడికిరణములతో వెలుగొందుచున్న సూర్యునివలె భాసిల్లుచుండగా, వివిధవర్గములకు చెందిన పౌరులు, ప్రధానపురుషులు నిన్నుజూచి పరమానందభరితులగుదురు. (11)

ఓ కకుత్స్థవంశభూషణా! నీవు అయోధ్యకు విచ్చేయు సమయమున మదగజములు తమఘీంకారములతో నిన్ను ఆహ్వానించును. అంతఃపురస్త్రీలందఱును సర్వసన్నద్ధలై ప్రసన్నముఖలై నిన్ను అభినందింతురు." (12)

'అయోధ్యకు వచ్చి, రాజ్యపరిపాలనను చేపట్టుము'- అని భరతుడు శ్రీరాముని ప్రార్థించుచుండగా అచట చేరియున్న వివిధ వర్గములకు చెందిన ప్రజలందఱును 'బాగు బాగు' అని ప్రశంసావచనములను పల్కిరి. (13)

మిక్కిలి దుఃఖితుడై విలపించుచున్న ఆభరతుని జూచి, నిశ్చయబుద్ధిగలవాడును, మిగుల ధైర్యశాలియు ఐన శ్రీరాముడు అతనిని ఎంతయు ఓదార్చెను. (14)

ఓ సోదరా! ఏ వ్యక్తికైనను దైవమువలె స్వాతంత్ర్యముగాని, ఇష్టము వచ్చినట్లు ప్రవర్తింపగల శక్తిగాని ఉండవు- దైవమే అతనిని ఇటునటు లాగుచుండును- విధి బలీయము సుమా! (15)

సర్వే క్షయాంతా నిచయాః పతనాంతాః సముచ్ఛ్రయాః।
సంయోగా విప్రయోగాంతా మరణాంతం చ జీవితమ్। 16

యథా ఫలానాం పక్వానాం నాన్యత్ర పతనాద్భయమ్।
ఏవం నరస్య జాతస్య నాన్యత్ర మరణాద్భయమ్। 17

యథాఽగారం దృఢస్థూణం జీర్ణం భూత్వాఽవసీదతి।
తథైవ సీదంతి నరా జరామృత్యువశంగతాః। 18

అత్యేతి రజనీ యా తు సా న ప్రతినివర్తతే।
యాత్యేవ యమునా పూర్ణా సముద్రముదకాకులమ్। 19

అహోరాత్రాణి గచ్ఛంతి సర్వేషాం ప్రాణినామిహ।
ఆయూంషి క్షపయంత్యాశు గ్రీష్మే జలమివాంశవః। 20

ఆత్మానమనుశోచ త్వం కిమన్యమనుశోచసి।
ఆయుస్తే హీయతే యస్య స్థితస్య చ గతస్య చ। 21

సహైవ మృత్యుర్వ్రజతి సహ మృత్యుర్నిషీదతి।
గత్వా సుదీర్ఘమధ్వానం సహ మృత్యుర్నివర్తతే। 22

గాత్రేషు వలయః ప్రాప్తాః శ్వేతాశ్చైవ శిరోరుహాః।
జరయా పురుషో జీర్ణః కిం హి కృత్వా ప్రభావయేత్। 23

నందంత్యుదిత ఆదిత్యే నందంత్యస్తమితే రవౌ।
ఆత్మనో నావబుధ్యంతే మనుష్యా జీవితక్షయమ్। 24

హృష్యంత్యృతుముఖం దృష్ట్వా నవం నవమిహాగతమ్।
ఋతూనాం పరివర్తేన ప్రాణినాం ప్రాణసంక్షయః। 25

యథా కాష్ఠం చ కాష్ఠం చ సమేయాతాం మహార్ణవే।
సమేత్య చ వ్యపేయాతాం కాలమాసాద్య కంచన। 26

కూడబెట్టిన వివిధసంపదలు అన్నియును నశించునవియే. లౌకికములైన ఔన్నత్యములన్నియును పతనముగునవియే. పుత్రమిత్ర కళత్రాది సంబంధములన్నియును తెగిపోవునట్టివే. ఎంతటి ఉన్నతస్థితిలో జీవించువారికైనను మరణము తప్పదు. ఈ లౌకికబంధములన్నియును విడిపోవునవియే. (16)

బాగుగా పండిన ఫలములకు పడిపోవుట కంటె వేఱొక గతి లేదు. అట్లే పుట్టిన ప్రతివ్యక్తికిని మరణము తప్పదు. (17)

దృఢమైన స్తంభములతో నిర్మించిన భవనముసైతము క్రమముగా శిథిలమై అది ఎప్పటికైనను పడిపోవుట సహజము. అట్లే మానవులు ఎంతటి వారైనను క్రమముగా ముసలివారై, మృత్యుముఖమునజేరి నశించుట అనివార్యము. (18)

జలములతో నిండిన యమునానదియు అపారజలనిధికి చేరిన పిమ్మట మరలి రాజాలదు. అట్లే గడచిపోయిన రాత్రి మరలి రాదు. (19)

ఈ లోకమున పగళ్లు, రాత్రులు క్రమముగా గడచిపోవుచునే యుండును. గ్రీష్మకాలమున సూర్యకిరణములు జలములనువలె అవి సకలప్రాణులయొక్క ఆయువులను నశింపజేయుచుండును. (20)

ఓ భరతా! నీవు ఆత్మోద్ధరణనుగూర్చి ఆలోచింపుము. ఇతరులకై ఏల విచారపడెదవు. ఎవ్వడైనను నిలిచియున్నను సాగిపోవుచున్నను అతనిఆయువు క్షీణించుచునే యుండును. (21)

మృత్యువు ఎల్లప్పుడును మనతోడనేయుండును. అది అన్ని వేళలయందును (నీడవలె) మనలను వెంటాడుచునే యుండును. మనము దీర్ఘయాత్ర చేసినను (మరణించినను, మరల జన్మించునప్పుడు) అది మనతో గూడి మఱల వచ్చుచుండును. (కనుక సమస్త ప్రాణులకును మృత్యువు అనివార్యము) (22)

శరీరములయందు ముడుతలు ఏర్పడుచుండుట సహజము. తలవెంట్రుకలు నెరసిపోవుచుండుట అనివార్యము. వార్ధక్యముచే పురుషుడు కృశించిపోవుచుండుట ప్రకృతిసిద్ధము. మానవుడు వీటిని ఏయుపాయముచే తప్పించుకొనగలడు? (23)

జనులు సూర్యుడు ఉదయించినంతనే ధనార్జనకు సమయమైనదని సంతోషింతురు. అట్లే సూర్యుడు అస్తమించినను కామోపభోగములకు అనుకూల సమయము ప్రాప్తించెనని వారు పొంగిపోవుదురు. కాని వారు తమఆయువు ప్రతిదినము క్షీణించిపోవుచున్నదని యింతమాత్రము ఎఱుంగరు - (24)

వసంతాది-ఋతువులు ప్రారంభమైనప్పుడు, అవి ఇదివఱలో ఎన్నడును రానట్లుగను, ఇప్పుడే క్రొత్తగా వచ్చినట్లుగను భావించి, జనులు సంతోషించుచుందురు. కాని ఋతువులయొక్క రాకపోకలవలన కాలము జరిగిపోవుచున్నట్లును, ఫలితముగా తమ ఆయుర్దాయము క్షీణించుచున్నట్లుగను వారు గుర్తింపరు- (25)

మహాసముద్రమునందు ఒక కట్టెతో మఱియొక కట్టె కలిసి పోవును. కొంతకాలమునకు అవి వేఱైపోవుచుండును- అట్లే సంపదలు, భార్యాపుత్రులు, బంధువులు (యజమానితో) కలిసి

ఏవం భార్యాశ్చ పుత్రాశ్చ జ్ఞాతయశ్చ వసూని చ।
సమేత్య వ్యవధావంతి ధ్రువో హ్యేషాం వినాభవః। 27

నాత్ర కశ్చిద్యథాభావం ప్రాణీ సమభివర్తతే।
తేన తస్మిన్ న సామర్థ్యం ప్రేతస్యాస్త్యనుశోచతః। 28

యథా హి సార్థం గచ్ఛంతం బ్రూయాత్ కశ్చిత్ పథిస్థితః।
అహమప్యాగమిష్యామి పృష్ఠతో భవతామితి। 29

ఏవం పూర్వైర్గతో మార్గః పితృపైతామహో ధ్రువః।
తమాపన్నః కథం శోచేత్ యస్య నాస్తి వ్యతిక్రమః। 30

వయసః పతమానస్య స్రోతసో వాఽనివర్తినః।
ఆత్మా సుఖే నియోక్తవ్యః సుఖభాజః ప్రజాః స్మృతాః। 31

ధర్మాత్మా సశుభైః కృత్స్నైః క్రతుభిశ్చాప్తదక్షిణైః।
ధూతపాపో గతః స్వర్గం పితా నః పృథివీపతిః। 32

భృత్యానాం భరణాత్ సమ్యక్ ప్రజానాం పరిపాలనాత్।
అర్థాదానాచ్చ ధర్మేణ పితా నః త్రిదివం గతః। 33

కర్మభిస్తు శుభైరిష్టైః క్రతుభిశ్చాప్తదక్షిణైః।
స్వర్గం దశరథః ప్రాప్తః పితా నః పృథివీపతిః। 34

ఇష్ట్వా బహువిధైర్యజ్ఞై భోగాంశ్చావాప్య పుష్కలాన్।
ఉత్తమం చాయురాసాద్య స్వర్గతః పృథివీపతిః। 35

ఆయురుత్తమమాసాద్య భోగానపి చ రాఘవః।
స న శోచ్యః పితా తాత! స్వర్గతః సత్కృతః సతామ్। 36

జీవించుచుందురు. కాలక్రమమున విడిపోవుచుందురు- వీరియొక్క సంయోగవియోగములు లోకసహజములు (26-27)

లోకమున ఏ ప్రాణియైనను సమయము ఆసన్నమైనప్పుడు జననమరణములను తప్పించుకొనజాలదు. కనుక మరణించినవారికై శోకించువాడుగూడ తనమరణమును నివారింప సమర్థుడుగాడు. (28)

దారిబట్టి పోవుచున్న వ్యాపారులతో, యాత్రికులతో ఎవడైననొకబాటసారి 'మీ వెనుక నేనును వచ్చెదను' - అని పలుకుచు వారిని అనుసరించుచుండును. అట్లే మనపూర్వులైన తాతముత్తాతలు వెళ్లిన మార్గమును మనము అనుసరించి నడచుట తథ్యము. దీనిని అతిక్రమించుటకు ఎట్టి ఉపాయములేదు. కావున ఎవ్వరును ఇతరులకొఱకై దుఃఖించుట తగదు. (29-30)

నదీప్రవాహములు వెనుకకు మఱలిరానట్లే నిత్యము తఱిగి పోవుచుండు వయస్సు తిరిగిరాదు. అది క్రమముగా క్షీణించుచునే యుండును. ఈ రహస్యమును ఎఱింగి, ఆత్మోద్ధరణమునకు సాధనమైన ధర్మమార్గమును అనుసరింపవలెను. ఏలనన జనులెల్లరును ఇహపరలోకసుఖములను కోరుకొనుచుందురు గదా! (31)

మనతండ్రి ధర్మాత్ముడు. అతడు భూరిదక్షిణలను సమర్పించి, పవిత్రములైన వివిధములగు సమస్తయజ్ఞములను ఆచరించి పునీతుడయ్యెను. పిమ్మట ఆ మహారాజు స్వర్గమునకేగెను. (32)

మనతండ్రి పాత్రులైన భృత్యులకు సంతృప్తికరముగా పరిపోషణ భారమును నిర్వహించెను. ప్రజలను కన్నబిడ్డలనువలె వాత్సల్యముతో పరిపాలించెను. ధర్మమార్గములో ధనాగారమును నింపెను. ఆ విధముగా జీవించి ఆ పుణ్యాత్ముడు దివంగతుడాయెను. (33)

ఆ మహారాజు తనకును, ప్రజలకును మిగుల ఇష్టములు, ప్రయోజనకరములు ఐన తటాకాదులను మహానిధులయందు నిర్మింపజేసెను. ఋత్విజులు మొదలగువారికి విరివిగా దక్షిణ తాంబూలాదులను ఒసంగి, పెక్కు క్రతువులను నిర్వహించెను. ఈ విధముగా మనతండ్రియైన దశరథప్రభువు తనజీవితమును కొనసాగించి, కడకు అమరపురికేగెను. (34)

ఇంకను ఆ మహాప్రభువు పలువిధములగు యాగములను నడిపెను. సముచితరీతిలో పుష్కలముగా భోగభాగ్యములను అనుభవించెను. దీర్ఘాయురారోగ్యములతో వర్ధిల్లి, అతడు తన జీవయాత్రను ముగించుకొని, స్వర్గమునలంకరించెను. (35)

నాయనా! భరతా! రఘువంశశిరోమణియు, పూజ్యుడును ఐన మనతండ్రి తనకు పూర్వులైన రాజులకంటెను ఉత్తమమైన జీవితమును దీర్ఘకాలము గడపి, చక్కనిఆరోగ్య భాగ్యములతో వర్ధిల్లెను. సత్పురుషులసత్కారములను పొందుచు కడకు అతడు పరమపదించెను. అందువలన ఆ పుణ్యపురుషునికొఱకై మనము శోకింపదగదు. (36)

స జీర్ణం మానుషం దేహం పరిత్యజ్య పితా హి నః।
దైవీమ్ ఋద్ధిమనుప్రాప్తో బ్రహ్మలోకవిహారిణీమ్। 37

మనతండ్రియైన ఆ మహారాజు శిథిలమైన తనమానవదేహమును పరిత్యజించి, బ్రహ్మలోకమున విహరించుటకు అనువైన దివ్యదేహమును, తదితరములైన దైవీసంపదలను పొందెను. (37)

తం తు నైవంవిధః కశ్చిత్ ప్రాజ్ఞః శోచితుమర్హతి।
త్వద్విధో మద్విధశ్చాపి శ్రుతవాన్ బుద్ధిమత్తరః। 38

వేదశాస్త్రజ్ఞానసంపన్నుడును, మిగుల ప్రజ్ఞాశాలియు ఐన ప్రాజ్ఞుడెవ్వడును మనవలె ఈ విధముగ దుఃఖింపరాదు (దుఃఖింపడు) (38)

ఏతే బహువిధాః శోకా విలాపరుదితే తథా।
వర్జనీయా హి ధీరేణ సర్వావస్థాసు ధీమతా। 39

ధీరుడును, ప్రజ్ఞాశాలియు ఐన పురుషుడు ఎవ్వడైనను ఎట్టి క్లిష్ట పరిస్థితులయందైనను (తండ్రి మరణించుట, నేను వనవాసము చేయవలసి వచ్చుట మున్నగు కష్ట సమయములయందును) ఈ విధముగా విలపించుట, ఏడ్చుట చేయరాదు. (39)

న స్వస్థో భవ మాశోచీః యాత్వా చాఽఽవసతాం పురీమ్।
తథా పిత్రా నియుక్తోఽసి వశినా వదతాం వర!। 40

వాక్చాతుర్యముగల ఓ భరతుడా! నీవు దుఃఖింపకుము, మనస్సును కుదుటపఱచుకొనుము. అయోధ్యకు వెళ్లి, రాజ్యాధికారమును స్వీకరింపుము సర్వాధికారియైన ఆ మహారాజు నిన్ను ఆ విధముగనే ఆదేశించియుండెను. (40)

యత్రాహమపి తేనైవ నియుక్తః పుణ్యకర్మణా।
తత్రైవాహం కరిష్యామి పితురార్యస్య శాసనమ్। 41

ఓ భరతా! పుణ్యాత్ముడైన ఆ మహారాజు పదునాలుగు సంవత్సరములకాలము వనములలో నివసింపుము - అని నన్ను ఆదేశించి యుండెను. కనుక ఆయనఆజ్ఞను శిరసావహించుచు నేను ఇచటనే యుండెదను. (41)

న మయా శాసనం తస్య త్యక్తుం న్యాయ్యమరిందమ!।
తత్ త్వయాఽపి సదా మాన్యం స వై బంధుః స నః పితా। 42

నాయనా! శత్రుసంహారకా! నేను తండ్రిగారిశాసనమును ఉల్లంఘించుట ధర్మముగాదు. (దానిని నేను త్రికరణశుద్ధిగా తలదాల్చెదను.) నీకును ఆయనశాసనము గౌరవింపదగినది. (ఆయన ఆజ్ఞను నీవును పాటింపుము.) అతడు మనకు జన్మనిచ్చిన వాడు, పరమబంధువు. (42)

తద్వచః పితురేవాహం సమ్మతం ధర్మచారిణామ్।
కర్మణా పాలయిష్యామి వనవాసేన రాఘవ!। 43

ఓ భరతా! తండ్రిగారివచనము ధర్మమును పాటించువారికి శిరోధార్యము- కావున నేను ఆయనఆదేశమును పాలించుచు వనవాసము చేసెదను. (43)

ధార్మికేణానృశంసేన నరేణ గురువర్తినా।
భవితవ్యం నరవ్యాఘ్ర! పరలోకం జీగీషతా। 44

ఓ నరశ్రేష్ఠా! పరలోకసుఖములను కోరుకొను పురుషుడు ఎవ్వడైనను ధర్మబుద్ధిగలవాడు, దయాళువు, పెద్దల ఆజ్ఞలను శిరసావహించువాడు ఐయుండవలెను - అప్పుడు మాత్రమే అతడు ఆముష్మిక(పరలోక) సుఖలాభములకు అర్హుడగును- (44)

ఆత్మానమనుతిష్ఠ త్వం స్వభావేన నరర్షభ!।
నిశామ్యతు శుభం వృత్తం పితుర్దశరథస్య నః। 45

ఓ నరోత్తమా! మనతండ్రియైన దశరథమహారాజుయొక్క పవిత్రాచరణమును దృష్టిలో ఉంచుకొని, నీ ధార్మికస్వభావముద్వారా నీ ఆత్మోన్నతికి పాటుపడుము - కనుక రాజ్యభారమును వహింపుము." (45)

ఇత్యేవముక్త్వా వచనం మహాత్మా
పితుర్నిదేశప్రతిపాలనార్థమ్ ।
యవీయసం భ్రాతరమర్థవచ్చ
ప్రభుర్ముహూర్తాద్విరరామ రామః । 46

సర్వసమర్థుడును, మహాత్ముడును ఐన శ్రీరాముడు తనతమ్ముడగు భరతునితో 'తండ్రియాజ్ఞను తలదాల్చుము'- అని అర్థవంతములైన వచనములను పలికి, ఒక క్షణకాలముపాటు మౌనము వహించెను- (46)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచోత్తరశతతమస్సర్గః (105)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటఐదవసర్గము సమాప్తము

— * * * —

106. నూటఆఱవసర్గము

ఆయోధ్యకు విచ్చేయుమని భరతుడు శ్రీరాముని పరిపరివిధముల వేడుకొనుట.

ఏవముక్త్వా తు విరతే రామే వచనమర్థవత్।
తతో మందాకినీతీరే రామం ప్రకృతివత్సలమ్।
ఉవాచ భరతశ్చిత్రం ధార్మికో ధార్మికం వచః। 1

కో హి స్యాదీదృశో లోకే యాదృశస్త్వమరిందమ।
న త్వాం ప్రవ్యథయేద్దుఃఖం ప్రీతిర్వా న ప్రహర్షయేత్। 2

సమ్మతశ్చాసి వృద్ధానాం తాంశ్చ పృచ్ఛసి సంశయాన్। 3

యథా మృతస్తథా జీవన్ యథాఽసతి తథా సతి।
యస్యైష బుద్ధిలాభః స్యాత్ పరితప్యేత కేన సః। 4

పరావరజ్ఞో యశ్చ స్యాత్ తథా త్వం మనుజాధిప।
స ఏవం వ్యసనం ప్రాప్య న విషీదితుమర్హతి। 5

అమరోపమసత్త్వస్త్వం మహాత్మా సత్యసంగరః।
సర్వజ్ఞః సర్వదర్శీ చ బుద్ధిమాంశ్చాసి రాఘవ! 6

న త్వామేవంగుణైర్యుక్తం ప్రభవాభవకోవిదమ్।
అవిషహ్యతమం దుఃఖమ్ ఆసాదయితుమర్హతి। 7

ప్రోషితే మయి యత్ పాపం మాత్రా మత్కారణాత్ కృతమ్।
క్షుద్రయా తదనిష్టం మే ప్రసీదతు భవాన్ మమ। 8

ధర్మబంధేన బద్ధోఽస్మి తేనేమాం నేహ మాతరమ్।
హన్మి తీవ్రేణ దండేన దండార్హాం పాపకారిణీమ్। 9

కథం దశరథాజ్జాతః శుద్ధాభిజనకర్మణః।
జానన్ ధర్మమధర్మిష్ఠం కుర్యాం కర్మ జుగుప్సితమ్। 10

శ్రీరాముడు ఈవిధముగా అర్థవంతములైన వచనములను పలికి, మిన్నకున్న పిమ్మట, ధర్మాత్ముడైన భరతుడు ప్రజావత్సలుడైన శ్రీరామునితో మందాకినీనదీతీరమున ధర్మబద్ధముగా ఇట్లు వచించెను. (1)

ఓ శత్రుసూదనా! నీవు దుఃఖములకు క్రుంగిపోవు, సంతోషములకు పొంగిపోవు. ఈలోకమున నీవంటివాడు ఎవడుండును? వేదవిదులైన పెద్దలకునైతము మాన్యుడవైనను (సర్వజ్ఞుడవైనను) ఒక సామాన్యునివలె నీవు వారికడ సంశయములను ప్రస్తావించుచుందువు. (2-3)

మనుజుడు మరణించినవానివిషయమున రాగద్వేషములను కలిగియుండనట్లే, జీవించియున్న వానియెడ గూడ రాగద్వేషములను కల్గియుండరాదు. అతనికి వస్తువులు లేనప్పుడు వాటిపై ఆసక్తి యుండనట్లే, అవి ఉన్నప్పుడుగూడ అతడు వాటివిషయమున ఆసక్తి చూపరాదు. ఇది వివేకవంతునిలక్షణము. ఇట్టి వివేకి దేనికై పరితపించును? దేనికిని పరితపించడు. కనుక నీవు పేర్కొనిన రీతిగా నాకు ఏ విషయమునను లేశమాత్రమూ పరితాపము ఉండదు. (4)

ఓ మహాప్రభూ! నీవలె ఆత్మానాత్మజ్ఞానముగలవాడు (సదసద్వివక్షణగలవాడు) ఎన్నడును ఎట్టి కష్టములకు లోనైనను దుఃఖింపడు- (5)

ఓ రఘువరా! నీవు దేవతలవలె సత్త్వగుణసంపన్నుడవు. మిగుల ధైర్యశాలివి. సత్యసంధుడవు. సర్వజ్ఞుడవు. సర్వసాక్షివి. ప్రతిభాశాలివి. జననమరణరహస్యములను ఎఱిగినవాడవు. ఈ విధముగా ఉదాత్త గుణశోభితుడవైన నిన్ను ఎట్టి దుర్భరములైన దుఃఖములునూ తాకజాలవు- ఎట్టి బాధలకునూ నీవు చలింపవు. (6-7)

నేను పరదేశమునందు(మాతామహునియింట) ఉండగా అల్పజ్ఞురాలైన నాతల్లి నానిమిత్తమై ఈ పాపకార్యమునకు ఒడిగట్టెను. ఇది నాకు ఏంతమాత్రమును సమ్మతముగాదు. కనుక ఆమెను క్షమించి, నాయెడ ప్రసన్నుడవు కమ్ము. (8)

తల్లియెంతటి దుష్టురాలైనను ఆమెను చంపుట ధర్మముగాదు. నేను ధర్మబద్ధుడను. అందువలన మహాపాపకార్యమొనర్చిన నాతల్లి తీవ్రమైన మరణదండనమునకు అర్హురాలేయైనను నేను అట్లు చేయుటలేదు. (9)

దశరథమహారాజు ఉత్తమవంశమున జన్మించినవాడు. పవిత్ర కార్యములను ఒనర్చినవాడు. అట్టి మహాత్ముని పుత్త్రుడనైన నేను ధర్మాధర్మములను ఎఱింగియు, లోకనింద్యమైన అధర్మకార్యమును (మాతృవధను) ఎట్లు చేయుదును? (10)

గురుః క్రియావాన్ వృద్ధశ్చ రాజా ప్రేతః పితేతి చ।
తాతం న పరిగర్హేయం దైవతం చేతి సంసది। 11

దశరథమహారాజు పవిత్రములైన యజ్ఞకర్మలను ఆచరించిన వాడు. వృద్ధుడు. నాకు తండ్రి. గురువు. దైవతుల్యుడు. ఇప్పుడు అతడు పరలోకగతుడు. కనుక అట్టిసత్పురుషుని ఈ నిండుసభలో ఏవిధముగానూ నిందింపను. (11)

కో హి ధర్మార్థయోర్హీనమ్ ఈదృశం కర్మ కిల్బిషమ్।
స్త్రియాః ప్రియం చికీర్షుస్సన్ కుర్యాద్ధర్మజ్ఞ! ధర్మవిత్। 12

అంతకాలే హి భూతాని ముహ్యంతీతి పురా శ్రుతిః।
రాజ్ఞైవం కుర్వతా లోకే ప్రత్యక్షం సా శ్రుతిః కృతా। 13

ఓ ధర్మజ్ఞా! రామా! ధర్మాధర్మములను ఎఱిగినవాడెవ్వడైనను ఒక స్త్రీని సంతృప్తి పఱచుటకై ధర్మార్థములకు విరుద్ధముగా ఇంతటి పాపకృత్యమునకు ఒడిగట్టునా? అవసానదశయందు జనులబుద్ధి మోహమునకు గుఱియగు చుండునని లోకోక్తి ప్రాచీనకాలమునుండియు వినవచ్చుచున్నది. మహారాజు ఇట్టి అధర్మకార్యమునర్చి ఆ లోకోక్తిని నిజము చేసెను. (12-13)

సాధ్వర్థమభిసంధాయ క్రోధాన్మోహాచ్చ సాహసాత్।
తాతస్య యదతిక్రాంతం ప్రత్యాహరతు తద్భవాన్। 14

ఓ రఘురామా! కైకేయిపట్లగల కోపమువలన గాని, రాజునకు ఆమెపైగల వ్యామోహకారణమునగాని, లేక ముందువెనుకలను చూడక తొందరపడుటవలనగాని, మనతండ్రి ధర్మమును ఉల్లంఘించియుండెను. లోకహితమును గోరి, పూజ్యుడవైన నీవు ఆయనదోషమును సవరింప వచ్చునుగదా! (14)

పితుర్హి సమతిక్రాంతం పుత్రో యః సాధు మన్యతే।
తదపత్యం మతం లోకే విపరీతమతోఽన్యథా। 15

'తండ్రిచేసిన పొరపాటును సవరించుటకు పూనుకొనువాడే నిజమైన పుత్రుడు. అట్లు చేయకుండుట యుక్తముకాదు.' - అనునది లోకభావన- (15)

తదపత్యం భవానస్తు మా భవాన్ దుష్కృతం పితుః।
అభిపత్తా కృతం కర్మ లోకే ధీరవిగర్హితమ్। 16

రామా! నీవు అట్టి ఉత్తమపుత్రుడవుగనే యుండుము. మన తండ్రి చేసిన కార్యము ధర్మవిరుద్ధము. ధీరులు దానిని మెచ్చరు. అది లోకనింద్యము. కనుక నీవు అట్టి అనుచిత కర్మను (ఆదేశమును) అనుసరింపవలదు. (16)

కైకేయీం మాం చ తాతం చ సుహృదో బాంధవాంశ్చ నః।
పౌరజానపదాన్ సర్వాన్ త్రాతు సర్వమిదం భవాన్। 17

నాతల్లియైన కైకేయిని, నన్ను, మనతండ్రిని, బంధుమిత్రులను, పౌరులను, పల్లెవాసులను - ఒకరేమిటి? అందఱిని కాపాడుటకు నీవే సర్వసమర్థుడవు. కనుక నా ప్రార్థనను మన్నింపుము. (17)

క్వ చారణ్యం క్వ చ క్షాత్రం క్వ జటాః క్వ చ పాలనమ్।
ఈదృశం వ్యాహతం కర్మ న భవాన్ కర్తుమర్హతి। 18

ఓ ప్రభూ! వనవాసమెక్కడ? క్షాత్రధర్మమెక్కడ? జటాధారణ మెక్కడ? పరిపాలనము ఎక్కడ? ఇట్టి పరస్పర విరుద్ధములైన కర్మలను నీవంటి పూజ్యుడు ఆచరింపదగడు. (18)

ఏష హి ప్రథమో ధర్మః క్షత్రియస్యాభిషేచనమ్।
యేన శక్యం మహాప్రాజ్ఞ! ప్రజానాం పరిపాలనమ్। 19

ఓ సర్వజ్ఞా! ప్రజలను రంజింపజేయుచు చక్కగా పరిపాలింపగల క్షత్రియునకు 'అతడు రాజ్యపట్టాభిషిక్తుడగుటయే' మొదటి ధర్మము. (19)

కశ్చ ప్రత్యక్షముత్సృజ్య సంశయస్థమలక్షణమ్।
ఆయతిస్థం చరేద్ధర్మం క్షత్రబంధురనిశ్చితమ్। 20

ప్రజాపాలనరూపమైన క్షత్రియధర్మము ప్రత్యక్షఫలములను ఇచ్చునది. అటు ప్రభువునకును, ఇటు ప్రజలకును సుఖలాభములను చేకూర్చునది. ఏదుముక్కిలి అది పరలోకశ్రేయస్సును కల్గించునది. తాపసవృత్తి క్లేశములతో కూడుకొనినది. దానిఫలముగూడ సంశయాత్మకము, అనిశ్చితము - అదియును కాలాంతరమున ఎప్పుడో లభించునది - ఉత్తమ క్షత్రియుడు సుఖలాభములనుగూర్చు రాజ్యపాలనమును త్యజించి, తాపసవృత్తిని చేపట్టునా? (20)

అథ క్లేశజమేవ త్వం ధర్మం చరితుమిచ్ఛసి।
ధర్మేణ చతురో వర్ణాన్ పాలయన్ క్లేశమాప్నుహి। 21

ఓ రామా! క్లేశములను కల్గించు కార్యములద్వారా ధర్మమును ఆచరించుటయే నీకు సమ్మతమైనచో, ధర్మబద్ధముగా నాలుగు వర్ణములవారిని పరిపాలించుటయు క్లేశకార్యమే - కావున నీవు అయోధ్యకు వచ్చి అట్టి క్లేశకార్యములనే ఆచరింపుము. (21)

చతుర్ణామాశ్రమాణాం హి గార్హస్థ్యం శ్రేష్ఠమాశ్రమమ్।
ప్రాహుర్ధర్మజ్ఞ! ధర్మజ్ఞాః తం కథం త్యక్తుమర్హసి। 22

ధర్మములను బాగుగా ఎఱిగిన ఓ రామా! బ్రహ్మచర్యము, గార్హస్థ్యము (గృహస్థాశ్రమము), వానప్రస్థము, సన్న్యాసము అను నాల్గు ఆశ్రమములలో గృహస్థాశ్రమము మిగుల శ్రేష్ఠమైనదని ధర్మజ్ఞులు తెలుపుచుందురు. అట్టి ఉత్తమమైన దానిని ఎట్లు త్యజింతువు? 22)

శ్రుతేన బాలః స్థానేన జన్మనా భవతో హ్యహమ్।
స కథం పాలయిష్యామి భూమిం భవతి తిష్ఠతి। 23

ఓ రఘువరా! శాస్త్రజ్ఞానమును బట్టియు, జన్మక్రమమును అనుసరించియు నేను నీకంటెను చిన్నవాడను. కావున పెద్దవాడవైన నీవు ఉండగా నేను మనకోసలరాజ్యమును ఎట్లు పరిపాలింపగలను? (23)

హీనబుద్ధిగుణో బాలో హీనః స్థానేన చాప్యహమ్।
భవతా చ వినాభూతో న వర్తయితుముత్సహే। 24

అన్నయ్యా! ప్రతిభయందును, సుగుణసంపదయందును బాలుడనైన నేను నీకు సాటిరాను. నాస్థానముగూడ నీతరువాతిదే. నీవు లేకుండ (నీకు దూరమయి) జీవించుటయు కష్టమే - ఇక రాజ్యపాలనము ఎట్లు చేయగలను? (24)

ఇదం నిఖిలమవ్యగ్రం రాజ్యం పిత్ర్యమకంటకమ్।
అనుశాధి స్వధర్మేణ ధర్మజ్ఞ! సహ బాంధవైః। 25

ఓ ధర్మజ్ఞా! మనతాతముత్తాలనుండి వచ్చుచున్న ఈ కోసలరాజ్యము శత్రుబాధలేనిదై మిగుల ప్రశాంతముగానున్నది. కాబట్టి బంధుమిత్రులతోగూడి ఈరాజ్యమును క్షత్రియధర్మమును అనుసరించి, నీవే చక్కగా పరిపాలింపుము. (25)

ఇహైవ త్వాఽభిషించంతు సర్వాః ప్రకృతయః సహ।
ఋత్విజః సవసిష్ఠాశ్చ మంత్రవన్మంత్రకోవిదాః। 26

ఓ రామా! ప్రజలు, మంత్రులు మున్నగువారి సమక్షమున మంత్రకోవిదులైన ఋత్విజులు వసిష్ఠమహర్షితోగూడి వేదమంత్రములతో నిన్ను ఇచటనే పట్టాభిషిక్తుని గావింతురు (26)

అభిషిక్తస్త్వమస్మాభిః అయోధ్యాం పాలనే వ్రజ।
విజిత్య తరసా లోకాన్ మరుద్భిరివ వాసవః। 27

ఓ రఘువరా! దేవతలచే అభిషిక్తుడైన ఇంద్రునివలె నీవును మాచే అభిషిక్తుడవై, నీ పరాక్రమముచే సమస్తలోకములను జయించి, ప్రజాపాలన మొనర్చుటకై అయోధ్యకు విచ్చేయుము. (27)

ఋణాని త్రీణ్యపాకుర్వన్ దుర్హృదః సాధు నిర్దహన్।
సుహృదస్తర్పయన్ కామైః త్వమేవాత్రానుశాధి మామ్। 28

శ్రీరామా! దేవతల, ఋషుల, పితరుల ఋణములను తీర్చుచును, శత్రువులను పూర్తిగా పరిమార్చుచును, సంతృప్తి కలుగునట్లుగా మిత్రులకోర్కెలను తీర్చుచును, నీ ప్రజాపరిపాలనలో నా సేవలను అనుమతింపుము. (28)

అద్యాఽఽర్య! ముదితాః సంతు సుహృదస్తేఽభిషేచనే।
అద్య భీతాః పలాయంతాం దుర్హృదస్తే దిశో దశ। 29

ఆర్యా! నేడు నీవు పట్టాభిషిక్తుడవైన పిమ్మట మిత్రులందఱును ఎంతయు సంతోషించెదరు, అట్లే శత్రువులెల్లరును మిగుల భీతిల్లి, దశదిశలకు పాఱిపోవుదురు. (29)

ఆక్రోశం మమ మాతుశ్చ ప్రమృజ్య పురుషర్షభ!
అద్య తత్రభవంతం చ పితరం రక్ష కిల్బిషాత్। 30

ఓ మహాపురుషా! నేడు నాకును, మాతల్లికిని వచ్చిన కళంకమును తొలగించి, పూజ్యుడైన మనతండ్రికి లోకనిందనుండి విముక్తిని గల్గింపుము. (30)

శిరసా త్వాఽభియాచేఽహం కురుష్వ కరుణాం మయి।
బాంధవేషు చ సర్వేషు భూతేష్వివ మహేశ్వరః। 31

ఓ రామా! శిరసాప్రణమిల్లి నిన్ను అర్థించుచున్నాను ఆ పరమేశ్వరుడు సకలప్రాణులను అనుగ్రహించునట్లు, నీవు నన్నును, సమస్తబంధుమిత్రులను దయజూడుము.- (31)

అథైతత్ పృష్ఠతః కృత్వా వనమేవ భవానితః।
గమిష్యతి గమిష్యామి భవతా సార్ధమప్యహమ్। 32

ఓ అగ్రజా! పూజ్యుడవైననీవు నామనవిని ఆలకింపక, వనములకే నడచినచో నేనును నీ వెన్వెంటనే వత్తును-'' (32)

తథాహి రామో భరతేన తామ్యతా
ప్రసాద్యమానః శిరసా మహీపతిః ।
న చైవ చక్రే గమనాయ సత్త్వవాన్
మతిం పితుస్తద్వచనే వ్యవస్థితః ॥ 33

భరతుడు వినమ్రుడై కడుదుఃఖముతో ఎంతగా ప్రాధేయపడినను సత్త్వగుణసంపన్నుడైన శ్రీరామచంద్రప్రభువు అయోధ్యకు మఱలివెళ్లుటకు ఏమాత్రము అంగీకరింపలేదు. అతడు తండ్రి ఆదేశమునకే కట్టుబడియుండెను. (33)

తదద్భుతం స్థైర్యమవేక్ష్య రాఘవే
సమం జనో హర్షమవాప దుఃఖితః ।
న యాత్యయోధ్యామితి దుఃఖితోఽభవత్
స్థిరప్రతిజ్ఞత్వమవేక్ష్య హర్షితః ॥ 34

శ్రీరామునియందలి అద్భుతమైన ఆ మనస్స్థైర్యమును జూచి, అచటి జనులందఱును ఒకేసారి శోకమునకును, హర్షమునకును లోనైరి. ఆయన అయోధ్యకు మఱలిరానందులకు వారిని దుఃఖము ఆవరించెను. ఆతడు తాను చేసిన ప్రతిజ్ఞకును మఱియు రాజు యొక్క ఆదేశమునకును కట్టుబడి స్థిరముగా నిలబడినందుకు వారిని సంతోషము క్రమ్ముకొనెను. (34)

తమృత్విజో నైగమయూథవల్లభాః
తదా విసంజ్ఞాశ్రుకలాశ్చ మాతరః ।
తథా బ్రువాణం భరతం ప్రతుష్టువుః
ప్రణమ్య రామం చ యయాచిరే సహ ॥ 35

ఋత్విజులును, పురప్రముఖులును, గణనాయకులును, నిః స్పృహతో కన్నీరు గార్చుచున్న తల్లులును శ్రీరామునితో అట్లు పలుకుచున్న భరతుని మిగుల ప్రశంసించిరి. పిదప వారందఱును శ్రీరామునకు ప్రణమిల్లి, అయోధ్యకు వచ్చి, ప్రజలను పాలింప వలసినదిగా అభ్యర్థించిరి. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షడుత్తరశతతమస్సర్గః (106)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటఆఱవసర్గము సమాప్తము

-- * * * --

107. నూటఏడవసర్గము

'మనతండ్రిని సత్యసంధునిజేయుటయే మనకర్తవ్యము'. కనుక నీవు రాజ్యపాలన గావింపుము - నేను వనవాసము చేసెదను.' - అని శ్రీరాముడు భరతునితో పల్కుట.

పునరేవం బ్రువాణం తం భరతం లక్ష్మణాగ్రజః ।
ప్రత్యువాచ తతః శ్రీమాన్ జ్ఞాతిమధ్యేఽభిసత్కృతః ॥ 1

బంధుమిత్రులమధ్య భరతుడు పదేపదే ప్రార్థనాపూర్వకముగా ఎంతగా అభ్యర్థించుచున్నను సర్వశుభలక్షణసంపన్నుడును, లక్ష్మణునకు అన్నయును ఐన శ్రీరాముడు అతనికి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (1)

ఉపపన్నమిదం వాక్యం యత్ త్వమేవమభాషథాః ।
జాతః పుత్రో దశరథాత్ కైకేయ్యాం రాజసత్తమాత్ ॥ 2

"సోదరా! భరతా! రాజశిరోమణియైన దశరథునివలన కైకేయీ దేవియందు కలిగిన పుత్రుడవునీవు. నీవు పలికిన వచనములన్నియును నీవంటివానికి తగినట్లుగానే యున్నవి. (2)

పురా భ్రాతః పితా నః స మాతరం తే సముద్వహన్ ।
మాతామహే సమాశ్రౌషీత్ రాజ్యశుల్కమనుత్తమమ్ ॥ 3

దైవాసురే చ సంగ్రామే జనన్యై తవ పార్థివః ।
సంప్రహృష్టో దదౌ రాజా వరమారాధితః ప్రభుః ॥ 4

"సోదరా! పూర్వము మనతండ్రి మీతల్లి కైకేయిని వివాహము చేసికొను సందర్భమున 'కైకేయీదేవియందు కల్గిన పుత్రునకే రాజ్యాధికారమును ఇత్తును' అని మీ మాతామహున (తాత)కు మాట ఇచ్చెను. ఆపిమ్మట దేవాసురులకు జరిగిన యుద్ధమున మీ తల్లి చేసిన సేవలకు మహారాజు మిగుల సంతుష్టుడై, ఆమెకు రెండు వరములను ఇత్తునని వాగ్దానము చేసెను. (3-4)

తతః సా సంప్రతిశ్రావ్య తవ మాతా యశస్వినీ ।
అయాచత నరశ్రేష్ఠం ద్వౌ వరౌ వరవర్ణినీ ॥ 5

తవ రాజ్యం నరవ్యాఘ్ర! మమ ప్రవ్రాజనం తథా ।
తౌ చ రాజా తదా తస్యై నియుక్తః ప్రదదౌ వరౌ ॥ 6

ఓ నరోత్తమా! వాసిగాంచినదియు, ఉత్తమమహిళయు ఐన నీ జనని మహారాజుచే ఒట్టు పెట్టించుకొని, నిన్ను రాజ్యాభిషిక్తుని జేయుట, నన్ను వనవాసమునకు పంపుట, అను రెండు వరములను ఆయనను అడిగెను. అందులకు ఆ మహారాజు సమ్మతించి, ఆమెకు ఆ రెండు వరములను ఇచ్చెను. (5-6)

తేన పిత్రాఽహమప్యత్ర నియుక్తః పురుషర్షభ।
చతుర్దశ వనే వాసం వర్షాణి వరదానికమ్। 7

ఓ నరశ్రేష్ఠా! భరతా! ఈవిధముగా మనతండ్రి వరదానరూపమున 'పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయుము'- అని నన్ను ఆజ్ఞాపించెను. (7)

సోఽహం వనమిదం ప్రాప్తో నిర్జనం లక్ష్మణాన్వితః।
సీతయా చాప్రతిద్వంద్వః సత్యవాదే స్థితః పితుః। 8

కనుక ఆయనఆజ్ఞకు బద్ధుడనై నేను సీతాలక్ష్మణసహితుడనై, ఈ నిర్జనవనమునకు వచ్చితిని. ఈ విషయమున నన్ను ఎవ్వరును నివారింపజాలరు- సత్యసంధుడైన తండ్రిమాటను నిలుపుటకై నేను ఇచటనే యుందెదను. (8)

భవానపి తథేత్యేవ పితరం సత్యవాదినమ్।
కర్తుమర్హసి రాజేంద్ర క్షిప్రమేవాభిషేచనాత్। 9

ఓ రాజేంద్రా! భరతా! నీవును తండ్రిమాటను శిరసావహించి, శీఘ్రముగా రాజ్యాభిషిక్తుడవు కమ్ము. తండ్రిని సత్యసంధునిగా జేయుము. నీవు అట్లు చేయుటయే సముచితము- (9)

ఋణాన్మోచయ రాజానం మత్కృతే భరత! ప్రభుమ్।
పితరంచాపి ధర్మజ్ఞం మాతరం చాభినందయ। 10

ఓ భరతా! నామాటను పాటించి, కైకేయీదేవిఋణమునుండి మహారాజునకు విముక్తిని గలిగింపుము. ఆయనకు నరకప్రాప్తి లేకుండ చేయుము, ఇట్లొనర్చి తల్లినిగూడ సంతోషపెట్టుము. (10)

శ్రూయతే హి పురా తాత శ్రుతిర్గీతా యశస్వినా।
గయేన యజమానేన గయేష్వేవ పితౄన్ ప్రతి। 11

నాయనా! భరతా! పూర్వకాలమున సుప్రసిద్ధుడైన గయుడు గయాక్షేత్రమున పితృదేవతలను ఉద్దేశించి, యజ్ఞము చేయుచు ఇట్లు నుడివినట్లు ప్రతీతి. (11)

పున్నామ్నో నరకాద్యస్మాత్ పితరం త్రాయతే సుతః।
తస్మాత్ పుత్త్ర ఇతి ప్రోక్తః పితౄన్యత్పాతి వా సుతః। 12

" 'పున్నామ' నరకమునుండి మాతాపితరులను ఉద్ధరించువాడే పుత్త్రుడు. అతడు తల్లిదండ్రులను అన్ని విధములుగా కాపాడును. అనగా అతడు శ్రాద్ధకర్మలను ఆచరించి, వారికి ఉత్తమగతులను ప్రాప్తింపజేయును. (12)

ఏష్టవ్యా బహవః పుత్త్రా గుణవంతో బహుశ్రుతాః।
తేషాం వై సమవేతానామ్ అపి కశ్చిద్గయాం వ్రజేత్। 13

శాస్త్రజ్ఞాన సంపన్నులును, గుణవంతులును ఐన పెక్కుమంది పుత్త్రులు కల్గునట్లు కోరుకొనవలెను- అట్లు కల్గిన సుతులలో ఒక్కడైనను గయాక్షేత్రమునకు వెళ్లి, అచట పితృదేవతలకు శ్రాద్ధములను ఆచరించుటజరుగవచ్చును.[1] (13)

ఏవం రాజర్షయః సర్వే ప్రతీతా రాజనందన!।
తస్మాత్ త్రాహి నరశ్రేష్ఠ! పితరం నరకాత్ ప్రభో!। 14

నరశ్రేష్ఠుడవైన ఓ రాజకుమారా! రాజర్షులందఱును ఈ విధముగా ఆచరించి, పితృదేవతలను తరింపజేసినట్లు ప్రసిద్ధి- కావున ఓ ప్రభూ! నీవును మనతండ్రిని నరకప్రాప్తినుండి ఉద్ధరింపుము. (14)

అయోధ్యాం గచ్ఛ భరత! ప్రకృతీరనురంజయ।
శత్రుఘ్నసహితో వీర! సహ సర్వైర్ద్విజాతిభిః। 15

వీరుడవైన ఓ భరతా! శత్రుఘ్నునితోను, ద్విజులు మున్నగు వారిందఱితోనుగూడి అయోధ్యకు వెళ్ళుము. ప్రజానురంజకముగా రాజ్యపాలనచేయుము. (15)

ప్రవేక్ష్యే దండకారణ్యమ్ అహమప్యవిలంబయన్।
ఆభ్యాం తు సహితో రాజన్! వైదేహ్యా లక్ష్మణేన చ। 16

ఓ రాజా! ఇంక నేనును ఈ సీతాలక్ష్మణులిరువురితోగూడి శీఘ్రముగా దండకారణ్యమున ప్రవేశింతును. (16)

త్వం రాజా భరత! భవ స్వయం నరాణాం
వన్యానామహమపి రాజరాణ్మృగాణామ్ ।
గచ్ఛ త్వం పురవరమద్య సంప్రహృష్టః
సంహృష్టస్త్వహమపి దండకాన్ ప్రవేక్ష్యే । 17

ఓ భరతా! నీవు ప్రజలందఱికిని ప్రభుడవుగమ్ము. నేను సమస్త వన్యమృగములకును మహారాజును అగుదును. నీవు ఇప్పుడే సంతోషముతో అయోధ్యకు వెళ్లుము. నేను దండకారణ్యములో తృప్తిగా అడుగిడుదును- (17)

1) శ్లో॥ జీవతో వాక్యకరణాత్, ప్రత్యబ్దం భూరిభోజనాత్। గయాయాం పిండదానేన త్రిభిః పుత్త్రస్య పుత్త్రతా॥
తల్లిదండ్రులు బ్రతికియున్నంతకాలము వారిమాటలను పాటించి నడచుకొనుట, వారుమరణించిన పిమ్మట, ప్రతిసంవత్సరము వారికి శ్రాద్ధకార్యములను నిర్వహించుచుండుట, గయా క్షేత్రమునందు పితృదేవతలకు పిండప్రదానములను ఆచరించుట - అను మూడు కార్యములను నిర్వహించుట పుత్త్రుని కర్తవ్యము.

ఛాయాం తే దినకరభాః ప్రబాధమానం
వర్షత్రం భరత! కరోతు మూర్ధ్ని శీతామ్ ।
ఏతేషామహమపి కాననద్రుమాణాం
ఛాయాం తామతిశయినీం సుఖీ శ్రయిష్యే । 18

ఓ భరతా! సూర్యునివేడికిరణములు నీ శిరస్సుపై బడి బాధింపకుండా చత్రము చల్లని నీడను ఇచ్చి, నిన్ను ఆదుకొనును. నేనును సూర్యకిరణములబాధ లేకుండ ఈ అరణ్యవృక్షములయొక్క దట్టమైన నీడను ఆశ్రయించుచు హాయిగానుందును- (18)

శత్రుఘ్నః కుశలమతిస్తు తే సహాయః
సౌమిత్రిర్మమ విదితః ప్రధానమిత్రమ్ ।
చత్వారస్తనయవరా వయం నరేంద్రం
సత్యస్థం భరత! చరామ మా విషాదమ్ । 19

ఓ భరతా! బుద్ధిమంతుడైన శత్రుఘ్నుడు నీకు తోడుగా ఉండును. సుప్రసిద్ధుడు, సుమిత్రాసుతుడు ఐన లక్ష్మణుడు నాకు ప్రధానసహాయకుడుగానుండును. ఈ విధముగా మన నలుగురము మహారాజుగారిని సత్యసంధునిగా చేయుదము. ఇక నీవు దుఃఖింపకుము. (19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తోత్తరశతతమస్సర్గః (107)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటఏడవసర్గము సమాప్తము

-- * * * --

108. నూటఎనిమిదవసర్గము

జాబాలి శ్రీరామునకు నాస్తికవాదమును వినిపించుట - రాజ్యపాలనము చేయుమని నుడువుట.

ఆశ్వాసయంతం భరతం జాబాలిర్బ్రాహ్మణోత్తమః ।
ఉవాచ రామం ధర్మజ్ఞం ధర్మాపేతమిదం వచః । 1

ధర్మజ్ఞుడైన శ్రీరాముడు ఈవిధముగా భరతుని ఓదార్చుచుండగా బ్రాహ్మణోత్తముడైన జాబాలి ధర్మవిరుద్ధముగా ఆయనతో ఇట్లు పలుకదొడంగెను. (1)

సాధు రాఘవ! మాభూత్ తే బుద్ధిరేవం నిరర్థికా ।
ప్రాకృతస్య నరస్యేవ హ్యార్యబుద్ధేర్మనస్వినః । 2

కః కస్య పురుషో బంధుః కిమాప్యం కస్య కేనచిత్ ।
యదేకో జాయతే జంతుః ఏక ఏవ వినశ్యతి । 3

తస్మాన్మాతా పితా చేతి రామ! సజ్జేత యో నరః ।
ఉన్మత్త ఇవ స జ్ఞేయో నాస్తి కశ్చిద్ధి కస్యచిత్ । 4

"ఓ రఘురామా! నీవు చెప్పినవిషయము బాగుగనేయున్నది. కాని నీవంటి ప్రజ్ఞాశాలి, మనోబలముగలవాడు ఒక అజ్ఞానివలె ఇట్టి నిరర్థకమైన ఆలోచనలను మనస్సునకు రానీయరాదు. ఈ లోకములో ఎవరు ఎవరికి బంధువులు. ఎవరివలన ఎవరికి లాభము? ఏప్రాణియైనను ఒంటరిగానే పుట్టును. ఒంటరిగానే మరణించును. కనుక రామా! ఇతడు నా తండ్రియనియు, ఈమె నాతల్లియనియు మమకారములను పెట్టుకొనువానిని పిచ్చివానినిగా భావింపవలెను. ఏలనన ఈ ప్రపంచమున ఎవ్వరును ఎవ్వరికిని ఏమియూ కారు- (2-4)

యథా గ్రామాంతరం గచ్ఛన్ నరః కశ్చిత్ క్వచిద్వసేత్ ।
ఉత్సృజ్య చ తమావాసం ప్రతిష్ఠేతాపరేఽహని । 5

ఏవమేవ మనుష్యాణాం పితా మాతా గృహం వసు ।
ఆవాసమాత్రం కాకుత్స్థ! సజ్జంతే నాత్ర సజ్జనాః । 6

రామా! ఒకడు వేఱొకగ్రామమునకు వెళ్ళుచు త్రోవలో ఏదేని యొక స్థలమునందు ఒకరాత్రి బసచేయును. తెల్లవారినపిమ్మట అతడు ఆస్థానమును వీడి, ముందునకుసాగును. ఓ కాకుత్స్థా! అదే విధముగా తల్లిదండ్రులతోడను, గృహ, సంపదలతోడను మనుష్యులకుగల సంబంధములన్నియును క్షణికములే. కనుక సజ్జనులు వాటియందు ఆసక్తులుకారు. (5-6)

పిత్ర్యం రాజ్యం పరిత్యజ్య స నార్హసి నరోత్తమ! ।
ఆస్థాతుం కాపథం దుఃఖం విషమం బహుకంటకమ్ । 7

సమృద్ధాయామయోధ్యాయామ్ ఆత్మానమభిషేచయ ।
ఏకవేణీధరా హి త్వాం నగరీ సంప్రతీక్షతే । 8

కనుక ఓ నరశ్రేష్ఠా! ఈ వనవాసజీవితము మిగుల దుఃఖకరమైనది. ఇందలి త్రోవలు ఎత్తుపల్లములతో, ముండ్లతో కూడియుండును. నీవంటివాడు తండ్రినుండి ప్రాప్తించిన రాజ్యమును వదలి, ఇట్టి క్లిష్ట మార్గమును ఆశ్రయించుట తగదు. దేశాంతరమునకున్న భర్తకొఱకు నిరీక్షించుచు వ్రతపరాయణురాలైన స్త్రీవలె అయోధ్యానగరదేవత నీకొఱకై నిరీక్షించుచున్నది. కావున సకలసంపదలతో తులతూగుచున్న అయోధ్యకు వెళ్లి, రాజ్యపట్టాభిషిక్తుడవు కమ్ము. (7-8)

రాజభోగానను భవన్ మహార్హాన్ పార్థివాత్మజ!।
విహర త్వమయోధ్యాయాం యథా శక్రస్త్రివిష్టపే। 9

న తే కశ్చిద్దశరథః త్వం చ తస్య న కశ్చన।
అన్యో రాజా త్వమన్యస్స తస్మాత్ కురు యదుచ్యతే। 10

బీజమాత్రం పితా జంతోః శుక్లం రుధిరమేవ చ।
సంయుక్తమ్ ఋతుమన్మాత్రా పురుషస్యేహ జన్మ తత్। 11

గతః స నృపతిస్తత్ర గంతవ్యం యత్ర తేన వై।
ప్రవృత్తిరేషా మర్త్యానాం త్వం తు మిథ్యా విహన్యసే। 12

అర్థధర్మపరా యే యే తాంస్తాన్ శోచామి నేతరాన్।
తే హి దుఃఖమిహ ప్రాప్య వినాశం ప్రేత్య భేజిరే। 13

అష్టకా పితృదైవత్యమ్ ఇత్యయం ప్రసృతో జనః।
అన్నస్యోపద్రవం పశ్య మృతో హి కిమశిష్యతి। 14

యది భుక్తమిహాన్యేన దేహమన్యస్య గచ్ఛతి।
దద్యాత్ ప్రవసతః శ్రాద్ధం న తత్ పథ్యశనం భవేత్। 15

దానసంవననా హ్యేతే గ్రంథా మేధావిభిః కృతాః।
యజస్వ దేహి దీక్షస్వ తపః తప్యస్వ సంత్యజ। 16

స నాస్తి పరమిత్యేవ కురు బుద్ధిం మహామతే।
ప్రత్యక్షం యత్తదాతిష్ఠ పరోక్షం పృష్ఠతః కురు। 17

స తాం బుద్ధిం పురస్కృత్య సర్వలోకనిదర్శినీమ్।
రాజ్యం త్వం ప్రతిగృహ్ణీష్వ భరతేన ప్రసాదితః। 18

ఓ రాజకుమారా! స్వర్గమున దేవేంద్రునివలె నీవు అయోధ్యయందు దివ్యభోగములను అనుభవించుచు హాయిగా విహరించుచుండుము. (9)

దశరథుడు నీకు ఏమియుకాడు. నీవు అతనికి ఏమియు కావు. ఆ రాజు వేరు, నీవు వేరు. అందువలన నేను చెప్పిన విధముగా చేయుము- (10)

ప్రాణిపుట్టుకకు తండ్రి నిమిత్తకారణము మాత్రమే. వాస్తవముగా ఋతుమతియైన స్త్రీగర్భమునందు శుక్రశోణితములకలయికవలన శిశువు జన్మించును. (11)

దశరథమహారాజు తాను చేరవలసిన చోటికే చేరినాడు. ఇది సమస్త ప్రాణులకును సహజము. నీవు అనవసరముగా బాధపడుచున్నావు. (12)

అందుబాటులోనున్న సుఖభోగములను అనుభవింపక, కేవలము ధర్మాచరణమునందును, ధనార్జనయందును మునిగియుండు వారిపై నాకు జాలి కలుగుచుండును. ఇతరుల (కామపరతంత్రుల) విషయమున గాదు. పిలనన వారు (ధర్మపరాయణులు) ధర్మాచరణము పేరుతో బ్రతికియున్నంతకాలము దుఃఖములనే అనుభవించి, కడకు మట్టిపాలగుచుందురు. (13)

ఈ లోకమున జనులు అష్టకాశ్రాద్ధములను, ఆబ్దిక శ్రాద్ధములను నిర్వహించుచు ఆ అన్నము పితృదేవతలకు చెందుచుండునని నమ్ముదురు. కాని బాగుగా విచారించి చూచినచో అన్నము ఇచ్చటనే నశించునుగదా! మృతి మృతులైనవారు ఎట్లు భుజింతురు? (14)

ఒకరు భుజించిన ఆహారము మఱియొకరి శరీరమునకు చేరినచో దూరదేశములకు వెళ్లెడి వారికై శ్రాద్ధములను పెట్టవలెను. అప్పుడు వారికి దారిబత్తెములతో అవసరముండదు. (15)

'దేవతలను ఆరాధింపుము, దానములను చేయుము, దీక్షతో యజ్ఞములను నిర్వహింపుము, తపములను ఆచరింపుము. ఇల్లు వాకిలి వదిలి, సన్న్యాసమును స్వీకరింపుము' మున్నగు విషయములతో గూడిన గ్రంథములను ఇతరుల సంపదలను అపహరించుటలో ఆరితేఱినవారు జనులమనస్సులను దానధర్మములవైపు మఱలించుటకై రచించిరి. (16)

ఓ బుద్ధిశాలీ! 'తండ్రిమాట జవదాటరానిది' అని విశ్వసించవెడి నీవు ఈ లోకముతప్ప మఱియొకలోకములేదని నమ్ముము. ప్రత్యక్షముగానున్న రాజ్యలాభములను అనుభవింపుము. పరోక్షమైన (పారలౌకిక) లాభములను విశ్వసింపకుము. (17)

ఓ రామా! 'ఇహ (ఈ)లోక సుఖములే శాశ్వతములు. పరలోకము -అనునది లేనేలేదు'- అను సత్పురుషుల ప్రమాణమును అనుసరించుము - భరతుడు ప్రాధేయపడుచున్నట్లుగా కోసలరాజ్యమును గ్రహింపుము"- (18)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టోత్తరశతతమస్సర్గః (108)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటఎనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

109. నూటతొమ్మిదవసర్గము

జాబాలియొక్క నాస్తికవాదమును ఖండించుచు శ్రీరాముడు సత్యముయొక్క వైశిష్ట్యమును పేర్కొనుట.

జాబాలేస్తు వచః శ్రుత్వా రామః సత్యాత్మనాం వరః।
ఉవాచ పరయా భక్త్యా స్వబుద్ధ్యా చావిపన్నయా। 1

సత్యపరాక్రముడైన శ్రీరాముడు జాబాలి పలికిన మాటలనువిని, తననిశ్చయాత్మకబుద్ధితో ఆలోచించి, వేదశాస్త్రములప్రమాణదృష్టితో ఇట్లు నుడివెను. (1)

భవాన్ మే ప్రియకామార్థం వచనం యదిహోక్తవాన్।
అకార్యం కార్యసంకాశమ్ అపథ్యమ్ పథ్యసమ్మితమ్। 2

"ఓ విప్రోత్తమా! నన్ను సంతోషపెట్టుటకై నీవు కొన్ని మాటలను పలికితివి. అవి కర్తవ్యములుగా కన్పించుచున్నను వాస్తవముగా చేయదగనివి, హితకరములుగా భాసించుచున్నను నిజముగా అవి అనర్థదాయకములే- (2)

నిర్మర్యాదస్తు పురుషః పాపాచారసమన్వితః।
మానం న లభతే సత్సు భిన్నచారిత్రదర్శనః। 3

ధర్మమును, వేదమర్యాదలను త్యజించినవాడు, పాపకార్యములయందే ప్రవృత్తుడగును. అతనిఆచారములు, ఆలోచనలు వేదశాస్త్రములకు విరుద్ధములుగా ఉండును. కావున సత్పురుషులు ఎవ్వరును అతనిని గౌరవింపరు. (3)

కులీనమకులీనం వా వీరం పురుషమానినమ్।
చారిత్రమేవ వ్యాఖ్యాతి శుచిం వా యది వాఽశుచిమ్। 4

మనుష్యుడు ఉత్తమవంశమున జన్మించినవాడా? హీనవంశమున పుట్టినవాడా? అతడు వీరుడా? అట్లు నటించువాడా? పవిత్రుడా? అపవిత్రుడా? అను విషయములను అతనిప్రవర్తనయే తెలుపుచుండును. (4)

అనార్యస్త్వార్యసంకాశః శౌచాద్ధీనస్తథా శుచిః।
లక్షణ్యవదలక్షణ్యో దుశ్శీలః శీలవానివ। 5

నీవు తెలిపిన ఆచారవ్యవహారములుగలవాడు శ్రేష్ఠుడుగా కనిపించినను అతడు అనార్యుడే, పైకి పవిత్రుడుగా కనబడుచున్నను అపవిత్రుడే, ఉత్తమలక్షణములు కలవానివలె భాసిల్లుచున్నను అవలక్షణములుగలవాడే, సచ్ఛీలుడుగా గోచరించుచున్నను దుశ్శీలుడే (5)

అధర్మం ధర్మవేషేణ యదీమం లోకసంకరమ్।
అభిపత్స్యే శుభం హిత్వా క్రియావిధివివర్జితమ్। 6

కశ్చేతయానః పురుషః కార్యాకార్యవిచక్షణః।
బహుమంస్యతి మాం లోకే దుర్వృత్తం లోకదూషణమ్। 7

నీవు తెల్పిన ఈ ఉపదేశము ధర్మవేషమును దాల్చిన అధర్మము. ఇది వర్ణసాంకర్యమునకు దారితీయును. నేను దీనిని (ఈ అధర్మమార్గమును) స్వీకరింపను. వేదోక్తములైన శుభకర్మలను అనుష్ఠింపక, ధర్మవిరుద్ధములైన కార్యములను ఆచరించినచో కర్తవ్యమును, అకర్తవ్యమును బాగుగా ఎఱిగిన బుద్ధిమంతుడైన వాడు ఎవ్వడును నన్ను శ్రేష్ఠునిగా గౌరవించడు? అట్టి స్థితిలో లోకము నన్ను దురాచారపరునిగను, కళంకితునిగను భావించును. (6-7)

కస్య ధాస్యామ్యహం వృత్తం కేన వా స్వర్గమాప్నుయామ్।
అనయా వర్తమానో హి వృత్త్యా హీనప్రతిజ్ఞయా। 8

స్వయముగా నేను చేసిన ప్రతిజ్ఞను నేనే ఉల్లంఘించి, నీవు చెప్పిన ప్రకారము ప్రవర్తించినచో సత్ప్రవర్తనము గూర్చి ఎవరికైనను నేను ఎట్లు ఉపదేశించగలను? ఏ విధముగా స్వర్గమును పొందగలను? (8)

కామవృత్తస్త్వయం లోకః కృత్స్నః సముపవర్తతే।
యద్వృత్తాః సంతి రాజానః తద్వృత్తాః సంతి హి ప్రజాః। 9

నీవు చెప్పిన రీతిగా నేను నడుచుకొనినచో నేను ధర్మమును తప్పి, విచ్చలవిడిగా ప్రవర్తించినవాడను అగుదును. అప్పుడు నన్ను జూచి, ఈ లోకమంతయును అట్లే ప్రవర్తించును. ఏలనన పాలకుల (రాజుల) ప్రవర్తననే ప్రజలును అనుసరింతురుగదా? (యథారాజా తథాప్రజా - అనిగదా ఆర్యోక్తి). (9)

సత్యమేవానృశంసం చ రాజవృత్తం సనాతనమ్।
తస్మాత్ సత్యాత్మకం రాజ్యం సత్యే లోకః ప్రతిష్ఠితః। 10

ఋషయశ్చైవ దేవాశ్చ సత్యమేవ హి మేనిరే।
సత్యవాదీ హి లోకేఽస్మిన్ పరమం గచ్ఛతి క్షయమ్। 11

ఉద్విజంతే యథా సర్పాన్ నరాదనృతవాదినః।
ధర్మః సత్యం పరో లోకే మూలం స్వర్గస్య చోచ్యతే। 12

సత్యమేవేశ్వరో లోకే సత్యం పద్మాశ్రితా సదా।
సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్। 13

దత్తమిష్టం హుతం చైవ తప్తాని చ తపాంసి చ।
వేదాః సత్యప్రతిష్ఠానాః తస్మాత్ సత్యపరో భవేత్। 14

ఏకః పాలయతే లోకమ్ ఏకః పాలయతే కులమ్।
మజ్జత్యేకో హి నిరయే ఏకః స్వర్గే మహీయతే। 15

సోఽహం పితుర్నియోగం తు కిమర్థం నానుపాలయే।
సత్యప్రతిశ్రవః సత్యం సత్యేన సమయీకృతః। 16

నైవ లోభాన్న మోహాద్వా న హ్యజ్ఞానాత్ తమోఽన్వితః।
సేతుం సత్యస్య భేత్స్యామి గురోః సత్యప్రతిశ్రవః। 17

అసత్యసంధస్య సతః చలస్యాస్థిరచేతసః।
నైవ దేవా న పితరః ప్రతిచ్ఛంతీతి నః శ్రుతమ్। 18

ప్రత్యగాత్మమిమం ధర్మం సత్యం పశ్యామ్యహం స్వయమ్।
భారః సత్పురుషాచీర్ణః తదర్థమభిమన్యతే। 19

క్షాత్రం ధర్మమహం త్యక్ష్యే హ్యధర్మం ధర్మసంహితమ్।
క్షుద్రైర్నృశంసైర్లుబ్ధైశ్చ సేవితం పాపకర్మభిః। 20

పరంపరగా వచ్చుచున్న ఈ రాజధర్మము సత్యస్వరూపము. ఇందు క్రౌర్యమునకు చోటులేదు. రాజు సత్యప్రవర్తనుడు ఐనచో రాజ్యములోని ప్రజలందరును సత్యమార్గముననే ప్రవర్తింతురు. ఏలనన లోకమంతయును సత్యము మీదనే ఆధారపడియున్నది. (సత్యే లోకః ప్రతిష్ఠితః) (10)

ఋషీశ్వరులును, దేవతలును సత్యమే మిగుల శ్రేష్ఠమైనదని తలంతురు (సత్యప్రవర్తనులనే గౌరవింతురు). ఈ లోకమున సత్యవాదియే పరమధామమును (ఉన్నత స్థితికి) చేరును. (11)

జనులు సర్పమును జూచి భయపడునట్లు అసత్యవాదియైన పురుషునకు భీతిల్లెదరు. ఈ లోకమున ధర్మమునకు సత్యమే పరాకాష్ఠ. స్వర్గప్రాప్తికి అదియే మూలము. (12)

లోకమున సత్యమే భగవత్స్వరూపము. సంపదలన్నియును సత్యముమీదనే ఆధారపడియుండును. అన్నింటికిని సత్యమే మూలము. సత్యముకంటెను శ్రేష్ఠమైనది మఱియొకటి లేనేలేదు. (13)

దానధర్మములు, యజ్ఞములు, హోమకార్యములు, వ్రతములు, తపస్సులు, వేదములు మున్నగునవి అన్నియును సత్యముపైననే ఆధారపడియున్నవి. కావున లోకమంతయును సత్యమార్గముననే ఆశ్రయింపవలెను. (14)

సత్యమును ఆశ్రయించి, తదనుగుణముగా ప్రవర్తించువాడు ఈ లోకమునకే ప్రభువగును, అతడు వంశమును ఉద్ధరింపగలవాడు అగును- అట్టి వానికే స్వర్గప్రాప్తి కలుగును - అసత్యమునకు పాల్పడినవానికి నరకయాతనలు తప్పవు- (15)

నేను సత్యమునకు కట్టుబడినవాడను, తండ్రిమాటను సత్యము చేసెదనని (నిలబెట్టెదనని) సత్యప్రమాణమును చేసినవాడను. అట్టినేను తండ్రిమాటను ఎట్లు జవదాటగలను? (16)

మొదట సత్యపాలన చేయుదునని ప్రతిజ్ఞ చేసియుంటిని. ఇప్పుడు రాజ్యలోభమువలన గాని, ఆత్మీయులయెడగల మోహమువేగాని, అజ్ఞానకారణమునగాని వివేకమును కోల్పోయి, తండ్రి చేసిన సత్య ప్రతిజ్ఞను నేను భంగపఱచను. (17)

'తాను చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడక, ధర్మభ్రష్టుడైన చంచల చిత్తముగలవాడు సమర్పించిన హవ్యకవ్యాదులను దేవతలు, పితృదేవతలు స్వీకరింపరు'- అని వింటిమి. (18)

ఈ సత్యరూపధర్మము ఎల్లరకును శ్రేయోదాయకమనియు, ఇది సమస్త ధర్మములలో శ్రేష్ఠమైనదనియు, నేను త్రికరణశుద్ధిగా నమ్ముదును. అందుకొఱకై సత్పురుషులవలె నేనును జటావల్కములను దాల్చి, తాపసధర్మమును అనుసరించెదను. (19)

ప్రజాక్షేమము దృష్టిలో రాజ్యాధికారమును చేపట్టుట ధర్మముగ కన్పట్టుచున్నను, తండ్రియాజ్ఞను ఉల్లంఘించి, చేసిన ప్రతిజ్ఞను విడనాడి, నేను రాజ్యపాలనమును స్వీకరించుట ముమ్మాటికిని అధర్మము. అట్టి అధర్మ కృత్యమునకు నీచులు, క్రూరులు, లోభులు, పాపాత్ములుమాత్రమే పాల్పడుదురు. కావున మీరుతెల్పినరీతిగా అట్టి విపరీతధర్మమును నేను ఆచరింతును. (20)

కాయేన కురుతే పాపం మనసా సంప్రధార్య చ।
అనృతం జిహ్వయా చాహ త్రివిధం కర్మపాతకమ్। 21

భూమిః కీర్తిర్యశో లక్ష్మీః పురుషం ప్రార్థయంతి హి।
స్వర్గస్థం చానుపశ్యంతి సత్యమేవ భజేత తత్। 22

శ్రేష్ఠం హ్యనార్యమేవ స్యాత్ యద్భవానవధార్య మామ్।
ఆహ యుక్తికరై ర్వాక్యైః ఇదం భద్రం కురుష్వ హ। 23

కథం హ్యహం ప్రతిజ్ఞాయ వనవాసమిమం గురోః।
భరతస్య కరిష్యామి వచో హిత్వా గురోర్వచః। 24

స్థిరా మయా ప్రతిజ్ఞాతా ప్రతిజ్ఞా గురుసన్నిధౌ।
ప్రహృష్యమాణా సా దేవీ కైకేయీ చాభవత్ తదా। 25

వనవాసం వసన్నేవం శుచిర్నియతభోజనః।
మూలైః పుష్పైః ఫలైః పుణ్యైః పితౄన్ దేవాంశ్చ తర్పయన్। 26

సంతుష్టపంచవర్గోఽహం లోకయాత్రాం ప్రవర్తయే।
అకుహః శ్రద్దధానస్సన్ కార్యాకార్యవిచక్షణః। 27

కర్మభూమిమిమాం ప్రాప్య కర్తవ్యం కర్మ యచ్ఛుభమ్।
అగ్నిర్వాయుశ్చ సోమశ్చ కర్మణాం ఫలభాగినః। 28

శతం క్రతూనామాహృత్య దేవరాట్ త్రిదివం గతః।
తపాంస్యుగ్రాణి చాస్థాయ దివం యాతా మహర్షయః। 29

అమృష్యమాణః పున రుగ్రతేజా
నిశమ్య తం నాస్తికవాక్యహేతుమ్ ।
అథాబ్రవీత్ తం నృపతేస్తనూజో
విగర్హమాణో వచనాని తస్య । 30

మనుజుడు తాను చేయబోవు పాపకృత్యమునుగూర్చి మొట్టమొదట తనమనస్సులో నిశ్చయించుకొనును. పిదప దానికొఱకై నోటిద్వారా అసత్యములను పల్కును. కడకు శరీరము ద్వారా ఆ పాపకృత్యమును చేయును - పాపకార్యము ఒక్కటియేయైనను దానిని మూడు విధములుగా జేయుటచే పాపఫలము మూడింతలుగా నుండును. (21)

రాజ్యము (గృహాదులు), దానధర్మములవలన వచ్చినకీర్తి, పరాక్రమముచే లభించెడి యశస్సు, సంపదలు మొదలగునవి అన్నియును సత్యవచనుడైన పురుషునిచేరుటకు కాంక్షించుచుండును. అతడు స్వర్గస్థుడైనను ఆయనవైపే చూచుచుండును- కావున ఎల్లరును సత్యమునే ఆశ్రయింపవలెను- (22)

'ఓ జాబాలీ! పూజ్యుడవైన నీవు సయుక్తికములైన మాటలతో రాజ్యమును పాలించుటయే హితకరము - కావున దానిని స్వీకరింపుము' అనివాక్కి చెప్పితివి. ఈయుపదేశము చూచుటకు శ్రేష్ఠమైనదిగా కన్పించుచున్నను సత్పురుషులు దీనిని ఆదరింపరు. ఏలనన ఇది సత్యధర్మములకు విరుద్ధమైనది. (23)

నేను వనములకు వెళ్లెదనని తండ్రిగారియెదుట ప్రతిజ్ఞ చేసియుంటిని. ఇప్పుడు ఆయనమాటను త్రోసిపుచ్చి, భరతుని ప్రార్థనను ఎట్లు మన్నింతును. (24)

తండ్రిగారిసమక్షమున నేను చేసిన ప్రతిజ్ఞ తిరుగులేనిది. ఆ సమయమున అచటనేయున్న కైకేయీదేవిగూడ అందులకు ఎంతయు సంతోషించినది. (25)

నేను అంతశ్శుచిని, బాహ్యశుచిని పాటించుచుందును. జితేంద్రియుడనై పవిత్రములైన కందమూలఫలపుష్పములచే దేవతలను, పితృదేవతలను సంతృప్తులను గావించుచుందును. నియమితములైన ఆహారపదార్థములను భుజించుచుందును- నిష్కపటములైన శ్రద్ధాభక్తులతో కార్యాకార్యవిచక్షణ గలిగి, వనములలో నివసించుచు జీవయాత్రను గడపుచుందును. (26-27)

ఈ కర్మభూమిలో జన్మించినవారెల్లరును శుభకర్మలను ఆచరించియే తీరవలెను. ఆ కర్మాచరణప్రభావముతో వారు అత్యంతశుభఫలములను పొందుదురు. అగ్నియు, వాయువు, సోముడు తమతమశుభకర్మలను ఆచరించుటవలననే ఉత్తమ ఫలములను (తమతమపదవులను) పొందిరి. నందయజ్ఞములను ఆచరించిన ఫలితముగనే దేవేంద్రునకు స్వర్గాధిపత్యములభించెను. మహర్షులు తీవ్రములైన తపస్సులనొనర్చిన కారణముగనే దివ్యలోకములలో సంచరింపగలిగిరి." (28-29)

మహాతేజస్వియు, రాజకుమారుడును ఐన శ్రీరాముడు నాస్తిక సిద్ధాంతమునకు సంబంధించిన జాబాలి పలుకులను విని, వాటిని సహింపనివాడై, అతనివచనములను ఖండించుచు ఇట్లనుడివెను. "సత్యమును పలుకుట, ధర్మమును ఆచరించుట, పరాక్రమమును

సత్యం చ ధర్మం చ పరాక్రమం చ
భూతానుకంపాం ప్రియవాదితాం చ ।
ద్విజాతి దేవాతిథిపూజనం చ
పంథానమాహుః త్రిదివస్య సంతః ॥ 31

తేనైవమాజ్ఞాయ యథావదర్థమ్
ఏకోదయం సంప్రతిపద్య విప్రాః ।
ధర్మం చరంతః సకలం యథావత్
కాంక్షంతి లోకాగమమప్రమత్తాః ॥ 32

నిందామ్యహం కర్మ పితుః కృతం తత్
యస్త్వామగృహ్ణాద్ విషమస్థబుద్ధిమ్ ।
బుద్ధ్యాఽనయైవంవిధయా చరంతం
సునాస్తికం ధర్మపథాదపేతమ్ ॥ 33

యథా హి చోరః స తథా హి బుద్ధః
తథాగతం నాస్తికమత్ర విద్ధి ।
తస్మాద్ధి యః శంక్యతమః ప్రజానాం
న నాస్తికేనాభిముఖో బుధః స్యాత్ ॥ 34

త్వత్తో జనాః పూర్వతరే వరాశ్చ
శుభాని కర్మాణి బహూని చక్రుః ।
జిత్వా సదేమం చ పరం చ లోకం
తస్మాద్ద్విజాః స్వస్తి హుతం కృతం చ ॥ 35

ధర్మే రతాః సత్పురుషైః సమేతాః
తేజస్వినో దానగుణప్రధానాః ।
అహింసకా వీతమలాశ్చ లోకే
భవంతి పూజ్యా మునయః ప్రధానాః ॥ 36

ఇతి బ్రువంతం వచనం సరోషం
రామం మహాత్మానమదీనసత్త్వమ్ ।
ఉవాచ తథ్యం పునరాస్తికం చ
సత్యం వచః సానునయం చ విప్రః ॥ 37

న నాస్తికానాం వచనం బ్రవీమ్యహం
న నాస్తికోఽహం న చ నాస్తి కించన ।
సమీక్ష్య కాలం పునరాస్తికోఽభవం
భవేయ కాలే పునరేవ నాస్తికః ॥ 38

ప్రదర్శించుట, భూతదయ కలిగియుండుట, ప్రియముగా మాట్లాడుట, బ్రాహ్మణోత్తములను, దేవతలను, అతిథులను పూజించుట మొదలగునవి స్వర్గమునకు మార్గములని సత్పురుషులు పేర్కొనిరి. (30-31)

విప్రోత్తములు సత్పురుషులయొక్క ఈ వచనములను ఆకళింపు చేసికొని, ధర్మస్వరూపమును గ్రహించిరి. వారు ఈ సిద్ధాంతమును ఏకగ్రీవముగా ఆమోదించిరి. మఱియు వారు తమతమ వర్ణాశ్రమములకు అనుగుణముగా ఆయాధర్మములను సావధానులై ఆచరించుచు, ఉత్తమలోకప్రాప్తిని కాంక్షించుచుందురు. (32)

నీబుద్ధి పెడత్రోవబట్టినది. నీవు వేదవిరుద్ధమైన మార్గమును అవలంబించితివి. నీవు పచ్చినాస్తికుడవు, ధర్మమార్గమునకు ఎంతయు దూరమైతివి. ఇట్లు చార్వాకమతప్రచారమునకు పూనుకొనిన నిన్ను మా తండ్రిగారు తనకడకు చేరదీసి, యాజకునిగా జేసిరి. అట్టి కృత్యమును నేను నిందించుచున్నాను. (33)

చోరునివలె వేదధర్మవిరోధియైనవాడు ఎంతటి జ్ఞానియైనను దండింపదగినవాడే. ఈ విషయమున అతనిని నాస్తికునిగా పరిగణింపవలెను. ప్రజలచే సమాజమున అతడు శంకింపదగినవాడు. కావున ఏపండితుడును అట్టి వానితో (నాస్తికునితో) మాటాడరాదు, ఎట్టి సంబంధమునూ పెట్టుకొనరాదు- (34)

నీకంటెను ప్రాచీనులైన బ్రాహ్మణోత్తములు ఇహపరలోకముల సుఖములను ఆశింపక, వైదికధర్మములను బాగుగా ఎఱింగి, పెక్కు శుభకర్మలను ఆచరించిరి. అందువలన వారు అనుసరించిన మార్గముననే ఇప్పటి విప్రులు వేదములను ప్రమాణముగా స్వీకరించి, స్వస్తి (అహింస, సత్యము మున్నగు) హుతం (యజ్ఞయాగాది) కృతం (తపోదాన పరోపకారాది,) కార్యములను నిర్వహించు చున్నారు. (35)

తేజోమూర్తులును, అత్యంతదానపరులును, ఏవిధముగను ప్రాణిహింసచేయనివారును, ఎట్టి కళంకమూ లేని వారును ఐన మునీశ్వరులు సత్పురుషులతోగూడి, వైదికధర్మనిరతులై లోకమున పూజ్యులు అగుచున్నారు." (36)

సహజముగనే విశాలహృదయుడును, సత్త్వగుణసంపన్నుడును, మహాత్ముడును ఐన శ్రీరాముడు కోపముతో ఇట్లు పలుకుచుండగా విప్రుడైన జాబాలి వాస్తవములును, సత్పురుషులకు హితమును గూర్చునవియు, ఆస్తిక బుద్ధిని దృఢపఱచునవియు ఐన వచనములను మఱల వినయపూర్వకముగా ఇట్లు నుడివెను. (37)

ఓ రామా! నేను నాస్తికులవచనములను పలుకుటలేదు. నేను ఏమాత్రమూ నాస్తికుడనుకాను. పరలోకము లేదనుట సరికాదు. కాల పరిస్థితులనుబట్టి నేను మఱల ఆస్తికుడను ఐతిని. లోక వ్యవహారములను బట్టి అవసరమగుచో మఱల నాస్తికుడనూ అగుదును (నాస్తికునివలెనూ మాట్లాడుదును). (38)

స చాపి కాలోఽయముపాగతః శనైః
యథా మయా నాస్తికవాగుదీరితా ।
నివర్తనార్థం తవ రామ కారణాత్
ప్రసాదనార్థం చ మయైతదీరితమ్ ॥ 39

ఓ రామా! నాస్తికవాదులవలె మాట్లాడవలసిన పరిస్థితులు ఏర్పడుటచే నేను అట్లు నాస్తికవచనములను పలికితిని. నిన్ను ప్రసన్నునిగా చేసికొనుటకును, మఱియు నిన్ను అయోధ్యకు మఱలించుటకొఱకును నేను ఆ విధముగా వచించితిని. కావున అట్లు పలికినందులకు నన్ను క్షమింపుము. (39)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే నవోత్తరశతతమస్సర్గః (109)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటతొమ్మిదవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

110. నూటపదవసర్గము

వసిష్ఠుడు శ్రీరాముని వంశక్రమమును వివరించి, కోసలరాజ్యపరిపాలనను చేపట్టుమని ఆ ప్రభువును కోరుట.

క్రుద్ధమాజ్ఞాయ రామం తు వసిష్ఠః ప్రత్యువాచహ।
జాబాలిరపి జానీతే లోకస్యాస్య గతాగతిమ్। 1

నివర్తయితుకామస్తు త్వామేతద్వాక్యముక్తవాన్।
ఇమాం లోకసముత్పత్తిం లోకనాథ! నిబోధ మే। 2

శ్రీరాముడు క్రుద్ధుడైయుండుటను గమనించి, వసిష్ఠుడు ఆయనతో ఇట్లు వచించెను. "నాయనా! రఘునందనా! జనులు ఈ లోకమునుండి పరలోకములకు వెళ్లుటను, తిరిగి వచ్చుటను జాబాలియు ఎఱుగును. కనుక అతడు నాస్తికుడుకాడు. ఓ లోకనాథా! నిన్ను ఈవనములనుండి అయోధ్యకు మఱలించుటకై అతడిట్లు పలికెను. ఈలోకములయొక్క ఆవిర్భావమును గూర్చి తెలిపెదను వినుము- (1-2)

సర్వం సలిలమేవాసీత్ పృథివీ యత్ర నిర్మితా।
తతః సమభవద్బ్రహ్మా స్వయంభూర్దైవతైః సహ।
స వరాహస్తతో భూత్వా ప్రోజ్జహార వసుంధరామ్। 3

అసృజచ్చ జగత్ సర్వం సహపుత్రైః కృతాత్మభిః। 4

సృష్టిప్రారంభసమయమున లోకమంతయును జలమయమై యుండెను. అందుండియే భూమండలము ఏర్పడెను. పిమ్మట స్వయంభువుఐన బ్రహ్మదేవుడు దేవతలతోగూడి ఆవిర్భవించెను. విష్ణుస్వరూపుడైన ఆ బ్రహ్మయే వరాహరూపమున ప్రకటితుడై, జలమగ్నమైయున్న పృథ్విని ఉద్ధరించెను. పిదప అతడు పవిత్రాత్ములైన పుత్త్రులతో సహా ఈ జగత్తును సృష్టించెను. (3-4)

ఆకాశప్రభవో బ్రహ్మా శాశ్వతో నిత్య అవ్యయః।
తస్మాన్మరీచిః సంజజ్ఞే మరీచేః కాశ్యపః సుతః। 5

వివస్వాన్ కాశ్యపాజ్జజ్ఞే మనుర్వైవస్వతః సుతః।
స తు ప్రజాపతిః పూర్వమ్ ఇక్ష్వాకుస్తు మనోః సుతః। 6

ఆకాశస్వరూపుడైన పరబ్రహ్మపరమాత్మనుండి బ్రహ్మదేవుడు ప్రాదుర్భవించెను. అతడు శాశ్వతుడు, నిత్యుడు, నాశరహితుడు. ఆయననుండి మరీచి జన్మించెను. మరీచికుమారుడే కశ్యపుడు. కాశ్యపునినుండి వివస్వంతుడు (సూర్యుడు) ఆవిర్భవించెను. ఆయనసుతుడే వైవస్వతమనువు. అతడే మొదటి ప్రజాపతి. ఆమనువుసుతుడు ఇక్ష్వాకుప్రభువు. (5-6)

యస్యేయం ప్రథమం దత్తా సమృద్ధా మనునా మహీ।
తమిక్ష్వాకుమయోధ్యాయాం రాజానం విద్ధి పూర్వకమ్। 7

ఇక్ష్వాకోస్తు సుతః శ్రీమాన్ కుక్షిరేవేతి విశ్రుతః।
కుక్షేరథాత్మజో వీరో వికుక్షిరుదపద్యత। 8

సర్వసంపదలతో నిండిన ఈ భూమండలమును వైవస్వతమనువు ఇక్ష్వాకునకు అప్పగించెను. ఆ విధముగా అతడు అయోధ్యకు మొదటిప్రభువు అయ్యెను. ఇక్ష్వాకు కుమారుడైన 'కుక్షి' సర్వ శుభలక్షణసంపన్నుడు, సుప్రసిద్ధుడు. కుక్షిపుత్త్రుడైన 'వికుక్షి' మహావీరుడు. (7-8)

వికుక్షేస్తు మహాతేజా బాణః పుత్త్రః ప్రతాపవాన్।
బాణస్య తు మహాబాహుః అనరణ్యో మహాయశాః। 9

వికుక్షిసుతుడైన 'బాణుడు' మహాతేజస్వి, ప్రతాపశాలి. ఆ బాణునిసూనుడే అనరణ్యుడు. అతడు మహాయశస్వి, గొప్ప భుజబలముగలవాడు. సత్పురుషులలో శ్రేష్ఠుడైన ఆ అనరణ్యుడు

నానావృష్టిర్బభూవాస్మిన్ న దుర్భిక్షం సతాం వరే।
అనరణ్యే మహారాజే తస్కరో నాపి కశ్చన। 10

అనరణ్యాన్మహాబాహుః పృథూ రాజా బభూవ హ।
తస్మాత్ పృథోర్మహారాజః త్రిశంకురుదపద్యత।
స సత్యవచనాద్వీరః సశరీరో దివం గతః। 11

త్రిశంకోరభవత్ సూనుః ధుంధుమారో మహాయశాః।
ధుంధుమారాన్మహాతేజా యువనాశ్వో వ్యజాయత। 12

యువనాశ్వసుతః శ్రీమాన్ మాంధాతా సమపద్యత।
మాంధాతుస్తు మహాతేజాః సుసంధిరుదపద్యత। 13

సుసంధేరపి పుత్రౌ ద్వౌ ధ్రువసంధిః ప్రసేనజిత్।
యశస్వీ ధ్రువసంధేస్తు భరతో రిపుసూదనః। 14

భరతాత్తు మహాబాహోః అసితో నామ జాయత।
యస్యైతే ప్రతిరాజాన ఉదపద్యంత శత్రవః।
హైహయాస్తాలజంఘాశ్చ శూరాశ్చ శశిబిందవః। 15

తాంస్తు సర్వాన్ ప్రతివ్యూహ్య యుద్ధే రాజా ప్రవాసితః।
స చ శైలవరే రమ్యే బభూవాభిరతో మునిః। 16

ద్వే చాస్య భార్యే గర్భిణ్యౌ బభూవతురితి శ్రుతిః।
ఏకా గర్భవినాశాయ సపత్న్యై సగరం దదౌ। 17

భార్గవశ్చ్యవనో నామ హిమవంతముపాశ్రితః।
తమ్ ఋషిం సముపాగమ్య కాళిందీ త్వభ్యవాదయత్। 18

స తామభ్యవదద్విప్రో వరేప్సుం పుత్రజన్మని।
పుత్రస్తే భవితా దేవి! మహాత్మా లోకవిశ్రుతః।
ధార్మికశ్చ సుశీలశ్చ వంశకర్తాఽరిసూదనః। 19

కృత్వా ప్రదక్షిణం హృష్టా మునిం తమనుమాన్య చ।
పద్మపత్రసమానాక్షం పద్మగర్భసమప్రభమ్।
తతః సా గృహమాగమ్య దేవీ పుత్రం వ్యజాయత। 20

సపత్న్యా తు గరస్తస్యై దత్తో గర్భజిఘాంసయా।
గరేణ సహ తేనైవ జాతః స సగరోఽభవత్। 21

స రాజా సగరో నామ యః సముద్రమఖానయత్।
ఇష్ట్వా పర్వణి వేగేన త్రాసయంతమిమాః ప్రజాః। 22

మహారాజై పరిపాలించుచున్నప్పుడు అనావృష్టిగాని, కఱవు కాటకములుగాని, చోరభయములుగాని లేకుండెను. (9-10)

ఆ అనరణ్యుని పుత్రుడే మహాబాహువైన పృథుమహారాజు. త్రిశంకుమహారాజు ఆ పృథుచక్రవర్తియొక్క కుమారుడు. సత్యవచనుడు, వీరుడు ఐన త్రిశంకుప్రభువు విశ్వామిత్రునితపః ప్రభావమున సశరీరముగా స్వర్గమునకు వెళ్లెను. (11)

త్రిశంకుప్రభువుయొక్క సుతుడు ధుంధుమారుడు. అతడు మిగుల సుప్రసిద్ధుడు. అతనిసుతుడు మహాపరాక్రమశాలియైన యువనాశ్వుడు. (12)

సర్వశుభలక్షణసంపన్నుడైన మాంధాత ఈ యువనాశ్వుని కుమారుడు. ఆ మాంధాతయొక్క సుతుడు సుసంధి. అతడు మిగుల తేజస్వి. ధ్రువసంధి, ప్రసేనజిత్తు అనువారు సుసంధియొక్క తనయులు. యశస్వియైన ధ్రువసంధియొక్క తనూజుడు భరతుడు. అతడు శత్రుభయంకరుడు. (13-14)

మహాబాహువైన భరతునివలన 'అసితుడు' అనువాడు జన్మించెను. అతనికి శూరులైన హైహయులు, తాలజంఘులు, శశిబిందువులు అను సామంతరాజులు శత్రువులైరి. వారినందఱిని ఎదుర్కొనుటకు సేనావ్యూహమును రచించి, యుద్ధమున స్థిరముగా నిలిచినను, శత్రువుల ధాటికి తట్టుకొనలేక అసితుడు యుద్ధమున పరాజితుడయ్యెను. పిమ్మట అతడు రమణీయమైన హిమవత్పర్వతమునకు చేరి, అచట ఏకాగ్రచిత్తుడై భగవద్ధ్యానమున మునింగెను. (15-16)

అప్పటికే అతనిభార్యలు ఇరువురును గర్భవతులైయుండిరి. వారిలో ఒకతె సవతియైన కాళిందియొక్క గర్భనివృత్తికై ఆమెకు గరళమును(విషాహారమును) ఇచ్చెను- (17)

భృగువంశమువాడైన చ్యవనమహర్షి హిమవత్పర్వతముమీద నివసించుచుండెను. అసితునిభార్యయైన కాళిందీదేవి ఆ మహర్షికడకేగి, ఆయనకు నమస్కరించెను- అప్పుడా మహర్షి పుత్ర సంతానమును కోరుకొనుచున్న ఆ మహారాణితో "ఓ దేవీ! నీకు పుత్రుడు కలుగును. అతడు ధర్మాత్ముడు, సుశీలుడు, మహాత్ముడై లోకమున వాసికెక్కును. అతడు శత్రువులను అందఱిని రూపుమాపి, వంశకర్తయు అగును. (18-19)

అంతట ఆమె మిగుల సంతసించినదై, ఆ మునికి ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి, భక్తితో పూజించెను. అనంతరము ఆమె తనభవనమునకు చేరి, ఒక పుత్రుని గనెను. అతడు తామరరేకులవంటి కన్నులు గలిగి, బ్రహ్మతేజస్సుతో వెలుగొందుచుండెను. కాళిందీదేవి గర్భనివృత్తికై ఆమెకు సవతి గరళ(విష) ప్రయోగము చేసినను, ఆమెకు కలిగిన బాలుడు గరళము(విషము) తోడనే పుట్టియున్నందున అతనికి 'సగరుడు' అనుపేరు ఏర్పడెను. (20-21)

ఆ సగరమహారాజు పర్వదినమున యజ్ఞదీక్ష వహించి, ఆహరింపబడిన తనయజ్ఞాశ్వముకొఱకై కుమారులద్వారా సముద్రమును త్రవ్వించెను. ఆనీటి వేగమునకు ప్రజలెల్లరును భీతిల్లిరి. (22)

అసమంజస్తు పుత్రోఽభూత్ సగరస్యేతి నః శ్రుతమ్।
జీవన్నేవ స పిత్రా తు నిరస్తః పాపకర్మకృత్। 23

అంశుమానితి పుత్రోఽభూత్ అసమంజస్య వీర్యవాన్।
దిలీపోఽంశుమతః పుత్రో దిలీపస్య భగీరథః। 24

భగీరథాత్ కకుత్స్థస్తు కాకుత్స్థా యేన విశ్రుతాః।
కకుత్స్థస్య తు పుత్రోఽభూత్ రఘుర్యేన తు రాఘవాః। 25

రఘోస్తు పుత్రస్తేజస్వీ ప్రవృద్ధః పురుషాదకః।
కల్మాషపాదః సౌదాస ఇత్యేవం ప్రథితో భువి। 26

కల్మాషపాదపుత్రోఽభూత్ శంఖణస్త్వితి విశ్రుతః।
యస్తు తద్వీర్యమాసాద్య సహ సైన్యో వ్యనీనశత్। 27

శంఖణస్య తు పుత్రోఽభూత్ శూరః శ్రీమాన్ సుదర్శనః।
సుదర్శనస్యాగ్నివర్ణో హ్యగ్నివర్ణస్య శీఘ్రగః। 28

శీఘ్రగస్య మరుః పుత్రో మరోః పుత్రః ప్రశుశ్రుకః।
ప్రశుశ్రుకస్య పుత్రోఽభూత్ అంబరీషో మహాద్యుతిః। 29

అంబరీషస్య పుత్రోఽభూత్ నహుషః సత్యవిక్రమః।
నహుషస్య చ నాభాగః పుత్రః పరమధార్మికః। 30

అజ శ్చ సువ్రత శ్చైవ నాభాగస్య సుతావుభౌ।
అజస్యైవ చ ధర్మాత్మా రాజా దశరథః సుతః। 31

తస్య జ్యేష్ఠోఽసి దాయాదో రామ ఇత్యభివిశ్రుతః।
తద్గృహాణ స్వకం రాజ్యమ్ అవేక్షస్వ జనం నృప!। 32

ఇక్ష్వాకూణాం హి సర్వేషాం రాజా భవతి పూర్వజః।
పూర్వజే నావరః పుత్రో జ్యేష్ఠో రాజ్యేఽభిషిచ్యతే। 33

స రాఘవాణాం కులధర్మమాత్మనః
సనాతనం నాద్య విహంతుమర్హసి ।
ప్రభూతరత్నామ్ అనుశాధి మేదినీం
ప్రభూతరాష్ట్రాం పితృవన్మహాయశః । 34

ఆ సగరునకు అసమంజుడు అను పుత్రుడును ఉండెను. అతడు పాపకర్మలు చేయుచుండుటవలన బ్రతికియుండగనే సగరుడు అతనిని దేశమునుండి వెళ్లగొట్టెను. (23)

అసమంజుని కుమారుడు అంశుమంతుడు. అతడు పరాక్రమశాలి. అంశుమంతునితనయుడు దిలీపుడు. అతనిసుతుడు భగీరథుడు. భగీరథునివలన కకుత్స్థుడు జన్మించెను. అందుచే అతనితరువాతి వంశమువారికి కాకుత్స్థులు అనుపేరు వచ్చెను. ఆ కకుత్స్థునికుమారుడు రఘుమహారాజు. ఆ మహాపురుషుని వలన ఈ వంశమువారు 'రాఘవులు' అనియు వ్యవహరింపబడిరి. (24-25)

రఘుమహారాజుయొక్క సుతుడు కల్మాషపాదుడు. అతడు పెఱిగిపెద్దవాడై శాపవశమున నరమాంస భక్షకుడయ్యెను. అతడే సౌదాసుడను పేరుతో ప్రసిద్ధికెక్కెను. (26)

సుప్రసిద్ధుడైన శంఖణుడు కల్మాషపాదునిపుత్రుడు. అతడు గొప్ప పరాక్రమశాలియేయైనను యుద్ధమున అతడును, అతని సైనికులు నశించిరి. (27)

శంఖణునిసూనుడు సుదర్శనుడు. అతడు శూరుడు. శుభలక్షణ సంపన్నుడు. సుదర్శనునిసుతుడు అగ్నివర్ణుడు. అతనివలన శీఘ్రగుడు జన్మించెను. శీఘ్రగునిసుతుడు మరువు. అతనిపుత్రుడు ప్రశుశ్రుకుడు. ఆ ప్రశుశ్రుకునితనయుడు మహాతేజస్వియైన అంబరీషుడు (28-29)

అంబరీషునికుమారుడు నహుషుడు. అతడు సత్యపరాక్రముడు. నహుషునితనూజుడు నాభాగుడు. అతడు పరమధార్మికుడు. నాభాగునకు అజుడు, సువ్రతుడు అను ఇరువురు కుమారులు కలిగిరి. అజునికుమారుడే దశరథమహారాజు. అతడు ధర్మాత్ముడు- (30-31)

ఓ ప్రభూ! ఆ దశరథునిజ్యేష్ఠపుత్రుడవైన నీవు 'శ్రీరాముడు' అను పేరుతో ప్రసిద్ధికెక్కితివి. ఈ కోసలరాజ్యము నీది. దీనిని గ్రహించి, ప్రజలను పరిపాలింపుము. (32)

ఇక్ష్వాకువంశజులందరిలోను పెద్దవాడు (జ్యేష్ఠుడు) రాజగుట సంప్రదాయము- జ్యేష్ఠుడు ఉండగా చిన్నవాడు రాజు కారాదు. అందువలన జ్యేష్ఠుడవైన నీవు పట్టాభిషిక్తుడవు కావలెను. (33)

ఓ మహాయశస్వీ! శ్రీరామా! పరంపరగా వచ్చుచున్న రఘువంశీయుల ఈ ధర్మమును నీవు విస్మరింపరాదు. విశాలమైన, సర్వసంపదలకు ఆలవాలమైన ఈ రాజ్యమును పితంఢ్రివలె నీవును పరిపాలింపుము. (34)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే దశోత్తరశతతమస్సర్గః (110)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపదియవసర్గము సమాప్తము

-- * * * --

111. నూటపదునొకొండవసర్గము

'అయోధ్యకు తిరిగిరమ్ము' - అని వసిష్ఠుడు ఎంతగా చెప్పినను - శ్రీరాముడు తండ్రియాజ్ఞను పాలించుటకే దృఢముగా నిలబడుట - ఆ కారణముగా భరతుడు నిరాహారదీక్షకు సిద్ధపడుట - శ్రీరాముడు ఆతనిని సముదాయించుట.

వసిష్ఠస్తు తదా రామమ్ ఉక్త్వా రాజపురోహితః।
అబ్రవీద్ధర్మసంయుక్తం పునరేవాపరం వచః॥ 1

రాజపురోహితుడైన వసిష్ఠమహర్షి శ్రీరామునితో ఇట్లు పలికిన పిమ్మట ఆయనతో ధర్మబద్ధములైన వచనములను ఇంకను ఇట్లనుడివెను. (1)

పురుషస్యేహ జాతస్య భవంతి గురవస్త్రయః।
ఆచార్య శ్చైవ కాకుత్స్థ! పితా మాతా చ రాఘవ!॥ 2

పితా హ్యేనం జనయతి పురుషం పురుషర్షభ!।
ప్రజ్ఞాం దదాతి చాచార్యః తస్మాత్ స గురురుచ్యతే॥ 3

కకుత్స్థవంశశిరోమణీ! రఘునందనా! జన్మించిన ప్రతివ్యక్తికిని ఆచార్యుడు, తండ్రి, తల్లి అని ముగ్గురు గురువులు ఉందురు. ఓ నరోత్తమా! జన్మనిచ్చిన తల్లితండ్రులు మొదటి గురువులు. సకలశాస్త్రములను బోధించి, జ్ఞాననేత్రమును ప్రసాదించిన ఆచార్యుడు తల్లిదండ్రులకంటెను శ్రేష్ఠుడైన గురువు- (2-3)

సోఽహం తే పితురాచార్యః తవ చైవ పరంతప!।
మమ త్వం వచనం కుర్వన్ నాఽతివర్తేః సతాం గతిమ్॥ 4

ఇమా హి తే పరిషదః శ్రేణయశ్చ ద్విజాస్తథా।
ఏషు తాత! చరన్ ధర్మం నాతివర్తేః సతాం గతిమ్॥ 5

వృద్ధాయా ధర్మశీలాయా మాతుర్నార్హస్యవర్తితుమ్।
అస్యాస్తు వచనం కుర్వన్ నాఽతివర్తేః సతాం గతిమ్॥ 6

ఓ పరంతపా! నేను నీకేగాదు నీతండ్రికిని ఆచార్యుడను (గురువును) కనుక నీవు నా మాట వినుము. సత్సంప్రదాయమును పాటింపుము. నాయనా! రామా! సభాసదులు, బ్రాహ్మణోత్తములు, పౌరజనులు ఇచట చేరియున్నారు. వీరిని పరిపాలించుట నీధర్మము. ఈ సన్మార్గమును వీడకుము. వృద్ధురాలును, ధర్మపరాయణురాలును ఐన నీతల్లిమాటను కాదనుట తగదు. ఆమెమాటను పాటింపుము. సత్పురుషులమార్గమును ఉల్లంఘింపకుము. ఆమెమాటను పాటించినచో సత్సంప్రదాయమును నిల్పినవాడవు అగుదువు. (4-6)

భరతస్య వచః కుర్వన్ యాచమానస్య రాఘవ!।
ఆత్మానం నాతివర్తేస్త్వం సత్యధర్మపరాక్రమ!॥ 7

సత్యమునకుకట్టుబడి, ధర్మమును ఆచరించుటయందు సమర్థుడవైన ఓరామా! నిన్నువేడుకొనుచున్న భరతుని పలుకులను మన్నింపుము. క్షత్రియులకు సహజమైన ప్రజాపాలన ధర్మమును ఆచరించినచో నీవు నీ స్వధర్మమును పాటించినవాడవు అగుదువు. (7)

ఏవం మధురముక్తస్తు గురుణా రాఘవః స్వయమ్।
ప్రత్యువాచ సమాసీనం వసిష్ఠం పురుషర్షభః॥ 8

తనకు గురువైన ఆవసిష్ఠమహర్షి మధురముగా ఇట్లు పలికిన పిమ్మట ఆసీనుడైయున్న ఆమునీశ్వరునితో పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముడు ఈ విధముగా నుడివెను. (8)

యన్మాతాపితరౌ వృత్తం తనయే కురుతః సదా।
న సుప్రతికరం తత్తు మాత్రా పిత్రా చ యత్కృతమ్॥ 9

యథాశక్తిప్రదానేన స్నాపనోచ్ఛాదనేన చ।
నిత్యం చ ప్రియవాదేన తథా సంవర్ధనేన చ॥ 10

"తల్లిదండ్రులు తమసంతానమునకు జన్మను ఇచ్చుటయేగాక తమశక్తికి తగినట్లుగా అన్నవస్త్రములను సమకూర్చెదరు. వారికి నలుగులుపెట్టి స్నానము చేయించెదరు. నిద్రపుచ్చెదరు.[1] ప్రేమతో మాట్లాడెదరు. ప్రాణముకు యెత్తుగా వారిని పెంచిపెద్దచేసెదరు. ఇట్లు తల్లిదండ్రులు తమకు చేసినసేవలఋణమును తీర్చుకొనుట ఎట్టివారికైనను అసాధ్యము. (9-10)

స హి రాజా జనయితా పితా దశరథో మమ।
ఆజ్ఞాతం యన్మయా తస్య న తన్మిథ్యా భవిష్యతి॥ 11

నా తండ్రిదశరథ మహారాజు నాకు జన్మనిచ్చినవాడు. కావున ఆయన నాకు ఇచ్చిన ఆదేశము వమ్ముకారాదు." (11)

ఏవముక్తస్తు రామేణ భరతః ప్రత్యనంతరమ్।
ఉవాచ పరమోదారః సూతం పరమదుర్మనాః॥ 12

శ్రీరాముడు ఇట్లు పలుకగా మృదుస్వభావముగల భరతుడు ఎంతయు నిస్పృహకు లోనయ్యెను. పిమ్మట తనసమీపముననే కూర్చొనియున్న సుమంత్రునితో ఇట్లు పలికెను. (12)

1) 'జో అచ్యుతానంద జోజోముకుందా! రార! పరమానంద రామగోవిందా!' సంకీర్తనావళి -

ఇహ మే స్థండిలే శీఘ్రం కుశానాస్తర సారథే।
ఆర్యం ప్రత్యుపవేక్ష్యామి యావన్మే న ప్రసీదతి। 13

అనాహారో నిరాలోకో ధనహీనో యథా ద్విజః।
శేష్యే పురస్తాచ్ఛాలాయా యావన్న ప్రతియాస్యతి। 14

స తు రామమవేక్షంతం సుమంత్రం ప్రేక్ష్య దుర్మనాః।
కుశోత్తరముపస్థాప్య భూమావేవాఽఽస్తరత్ స్వయమ్। 15

తమువాచ మహాతేజా రామో రాజర్షిసత్తమః।
కిం మాం భరత! కుర్వాణం తాత! ప్రత్యుపవేక్ష్యసి। 16

బ్రాహ్మణో హ్యేకపార్శ్వేన నరాన్ రోద్ధుమిహార్హతి।
న తు మూర్ధాభిషిక్తానాం విధిః ప్రత్యుపవేశనే। 17

ఉత్తిష్ఠ నరశార్దూల! హిత్వైతద్దారుణం వ్రతమ్।
పురవర్యామితః క్షిప్రమ్ అయోధ్యాం యాహి రాఘవ! 18

ఆసీనస్త్వేవ భరతః పౌరజానపదం జనమ్।
ఉవాచ సర్వతః ప్రేక్ష్య కిమార్యం నానుశాసథ। 19

తే తమూచుర్మహాత్మానం పౌరజానపదా జనాః।
కాకుత్స్థమభిజానీమః సమ్యగ్వదతి రాఘవః। 20

ఏషోఽపి హి మహాభాగః పితుర్వచసి తిష్ఠతి।
అత ఏవ న శక్తాః స్మో వ్యావర్తయితుమంజసా। 21

తేషామాజ్ఞాయ వచనం రామో వచనమబ్రవీత్।
ఏవం నిబోధ వచనం సుహృదాం ధర్మచక్షుషామ్। 22

ఏతచ్చైవోభయం శ్రుత్వా సమ్యక్ సంపశ్య రాఘవ!।
ఉత్తిష్ఠ త్వం మహాబాహో! మాం చ స్పృశ తథోదకమ్। 23

అథోత్థాయ జలం స్పృష్ట్వా భరతో వాక్యమబ్రవీత్।
శృణ్వంతు మే పరిషదో మంత్రిణః శ్రేణయస్తథా। 24

న యాచే పితరం రాజ్యం నానుశాసామి మాతరమ్।
ఆర్యం పరమధర్మజ్ఞం నానుజానామి రాఘవమ్। 25

"ఓ సుమంత్రా! ఈ భూమిపై దర్భలను పరువుము. అగ్రజుడు నాయెడ ప్రసన్నుడగునంతవరకును ఆయనకడ్డముగా ఇచటనే కూర్చుని యుందును. ధనవంతునకు అప్పు ఇచ్చినిర్ధనుడైన బ్రాహ్మణుడు వానినుండి తనధనమును రాబట్టుకొనుటకై వానిగృహద్వారముకడ అన్నపానీయములను మాని పరుండినట్లు శ్రీరాముడు అయోధ్యకు మఱలివచ్చునంతవరకు నిరాహారదీక్షను బూని, ముఖమున ముసుగు ధరించి, ఇచటనే పడియుండెదను." (13-14)

ఈ మాటలను విన్న సుమంత్రుడు శ్రీరామునిఆజ్ఞకై నిరీక్షించుచు అచటనే నిలబడి పోయెను. అతనిపరిస్థితిని గమనించి, మిన్న్నువాకు లోనైయున్న భరతుడు దర్భాసనమును తానే తెప్పించుకొని, దానిపై కూర్చుండెను. (15)

అంతట రాజర్షిశిరోమణియు, మహాతేజస్వియు ఐన శ్రీరాముడు భరతుని ఓదార్చుచు ఇట్లు నుడివెను. "నాయనా! భరతా! నీవు నన్ను అడ్డగించుటకు నీకు నేను చేసిన అపకారమేమి? బ్రాహ్మణుడు ఒక ప్రక్కకు వాలి పరుండి, అన్యాయమునకు పాల్పడిన వారిని అడ్డగించుట యుక్తమే. కాని పట్టాభిషిక్తులుకానున్న క్షత్రియులు ఇట్లు అడ్డగించుట తగదు. కావున సోదరా! నీవు ఇట్లుచేయరాదు. (16-17)

నరశ్రేష్ఠుడవైన ఓ భరతా! ఈ కఠోరవ్రతమును మానుము. లెమ్ము. ఇచటినుండి మహానగరమైన అయోధ్యకు బయలు దేఱుము"- (18)

ఈ మాటలను వినియు, అచటనే కూర్చొనియున్న భరతుడు అచట చేరియున్న పౌరులను, పల్లెవాసులను ఒకపరి పరికించిచూచి, 'ప్రభువునకు మీరేల నచ్చజెప్పరు'?- అని వారితో నుడివెను. (19)

అప్పుడు ఆ పౌరులు, జానపదులు మహాత్ముడైన భరతునితో "సత్యసంధుడైన శ్రీరామునిగూర్చి మేము బాగుగా ఎఱుగుదుము. ఆయన పలుకుచున్నది యుక్తమే- మహానుభావుడైన శ్రీరాముడు తండ్రియాదేశమును పాలించుటకే స్థిరముగా నిలబడియున్నాడు. అందువలన వెంటనే ఆయనను అయోధ్యకు మఱలించుటకు మేము అశక్తులము" - అని పల్కిరి. (20-21)

ఆప్రజలవచనములసారాంశమును గ్రహించిన శ్రీరాముడు ఇట్లుపలికెను- "ఓ భరతా! ధర్మదృష్టిగల ఈ సుహృదులవచనములను గ్రహింపుము. ఓ మహాబాహో! రాఘవా! నా మాటలను, ఈ పౌరుల పలుకులను శ్రద్ధగా ఆలకించి, వాటిని అవగాహన చేసికొనుము. లెమ్ము, నన్నును, జలములను స్పృశింపుము." (22-23)

పిమ్మట భరతుడు లేచి, జలమును తాకి ఇట్లు పలికెను. "ఓ సభాసదులారా! మంత్రులారా! పౌరులారా! ఆలకింపుడు. రాజ్యముకొఱకై నేను మాతండ్రిని ఎన్నడును యాచించి యెఱుగను. ఈ విషయమై నేను మా తల్లితో ఏ మాత్రమును ప్రస్తావించి యుండలేదు. పరమధర్మజ్ఞుడైన శ్రీరామునివనవాసవిషయమున

యది త్వవశ్యం వస్తవ్యం కర్తవ్యం చ పితుర్వచః।
అహమేవ నివత్స్యామి చతుర్దశ సమా వనే। 26

ధర్మాత్మా తస్య తథ్యేన భ్రాతుర్వాక్యేన విస్మితః।
ఉవాచ రామః సంప్రేక్ష్య పౌరజానపదం జనమ్। 27

విక్రీతమాహితం క్రీతం యత్ పిత్రా జీవతా మమ।
న తల్లోపయితుం శక్యం మయా వా భరతేన వా। 28

ఉపధిర్న మయా కార్యో వనవాసే జుగుప్సితః।
యుక్తముక్తం చ కైకేయ్యా పిత్రా మే సుకృతం కృతమ్। 29

జానామి భరతం క్షాంతం గురుసత్కారకారిణమ్।
సర్వమేవాత్ర కల్యాణం సత్యసంధే మహాత్మని। 30

అనేన ధర్మశీలేన వనాత్ ప్రత్యాగతః పునః।
భ్రాత్రా సహ భవిష్యామి పృథివ్యాః పతిరుత్తమః। 31

వృతో రాజా హి కైకేయ్యా మయా తద్వచనం కృతమ్।
అనృతాన్మోచయానేన పితరం తం మహీపతిమ్। 32

నా ప్రమేయము ఏమాత్రమును లేదు- తండ్రి ఆదేశానుసారము వనవాసముచేయుట తప్పనిసరియైనచో అపదునాలుగు సంవత్సరముల కాలము ఆయనకుమాఱుగా నేనే వనములలో నివసింతును." (24-26)

ధర్మాత్ముడైన శ్రీరాముడు తమ్మునియథార్థవచనములకు ఆశ్చర్యపడి. పౌరులను జానపదులను పరికించిచూచి, వారితో ఇట్లు పలికెను. (27)

"తండ్రిగారు జీవించియుండగా చేసిన అమ్మకము, కుదువపెట్టుట, కొనుట మొదలగు వాటిని నేనుగాని, భరతుడు గాని మార్చుటకు వలనుపడదు. నాకు మాఱుగా నా ప్రతినిధి వనవాసము చేయుటకు నేను ఇష్టపడను- వీలున్న సమర్థుడైనవాడు ప్రతినిధితో పనిచేయించుట లోకనింద్యము- కైకేయి కోరినది యుక్తమే- మా తండ్రి ఆమెకు వరములను ఇచ్చుటయు మంచిపనే- భరతునిగూర్చి నేను బాగుగా ఎఱుగుదును. అతడు క్షమాశీలుడు. పెద్దలను సత్కరించెడివాడు- సత్యసంధుడును మహాత్ముడును ఐన ఇతనిలో అన్నియు శుభలక్షణములేగలవు. పదునాలుగు సంవత్సరములగడువు ముగించుకొని, వనములనుండి తిరిగి వచ్చిన పిమ్మట ధర్మస్వభావముగల ఈ సోదరునితోగూడి ఈ రాజ్యమును చక్కగా ఏలగలను." (28-31)

"ఓ భరతా! కైకేయి మహారాజును వరములనడిగెను. ప్రభువు వాటిని ఆమోదించెను. ఆయనమాటలను పాటించుచు వనవాసము చేయుచున్నాను- నీవును అయోధ్యాధిపతియైన మనతండ్రిమాటలను తలదాల్చి ఆయనకు అసత్యదోషము అంటకుండ చేయుము"- (32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకాదశోత్తరశతతమస్సర్గః (111)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపదునొకొండవసర్గము సమాప్తము

— ✻ ✻ ✻ —

112. నూటపడ్రెండవసర్గము

శ్రీరామభరతులకలయికను జూచి ఋషీశ్వరులందఱును పొంగిపోవుట - భరతునిప్రార్థనపై శ్రీరాముడు తన పాదుకలను ఆయనకు ఒసంగుట - పిమ్మట అతడు అందఱికిని వీడ్కోలు పలుకుట.

తమప్రతిమతేజోభ్యాం భ్రాతృభ్యాం రోమహర్షణమ్।
విస్మితాః సంగమం ప్రేక్ష్య సమవేతా మహర్షయః। 1

నిరుపమానతేజోమూర్తులైన సోదరులగు శ్రీరామభరతులయొక్క అన్యోన్యానురాగములతోగూడిన కలయికను జూచి, అచట చేరియున్న మహర్షులందఱును సంతోషముతో గగుర్పాటునొందినవారై, మిగుల ఆశ్చర్యపడిరి. (1)

అంతర్హితాస్త్వృషిగణాః సిద్ధాశ్చ పరమర్షయః।
తౌ భ్రాతరౌ మహాత్మానౌ కాకుత్స్థౌ ప్రశశంసిరే। 2

అంతకుముందే అచట అంతరిక్షమున అదృశ్యముగానున్న ఋషీశ్వరులు, రాజర్షులు, సిద్ధులు మొదలగు దివ్యజాతులవారు, దివ్య-ఋషులు మున్నగువారు కకుత్స్థవంశజులైన మహాత్ములగు ఆ సోదరులిరువురిని ఇట్లు శ్లాఘింపసాగిరి. (2)

స ధన్యో యస్య పుత్రౌ ద్వౌ ధర్మజ్ఞౌ ధర్మవిక్రమౌ।
శ్రుత్వా వయం హి సంభాషామ్ ఉభయోః స్పృహయామహే। 3

"ధర్మములను బాగుగా ఎఱింగి, వాటిని ఆచరించువారిలో శ్రేష్ఠులైన ఈ రాజకుమారులను ఇరువురినిగన్న ఆ దశరథుడు ఎంతయు ధన్యుడు.[1] ఈ ఇరువురియొక్క చక్కని సంభాషణలను విని, సంతోషముతో పొంగి పోవుచుంటిమి. అంతేగాదు నిరుపమానములైన వారిఅన్యోన్యప్రేమానురాగములు, రాజ్యాదిసంపదలయెడ ఆ యువకుల నిరాసక్తి మిగుల ఆశ్చర్యమును గొల్పుచున్నవి. వారిమధురవచనములను ఇంకను పదేపదే వినవలెనని మిక్కిలి కుతూహలపడుచున్నాము." (3)

1) ఓ రామా! రారా! యింత భిక్ష తపమేమి చేసెనో దశరథుడు .... సంకీర్తనావళి -

తతస్త్వృషిగణాః క్షిప్రం దశగ్రీవవధైషిణః।
భరతం రాజశార్దూలమ్ ఇత్యూచుః సంగతా వచః। 4

కులే జాత! మహాప్రాజ్ఞ! మహావృత్త! మహాయశః!।
గ్రాహ్యం రామస్య వాక్యం తే పితరం యద్యవేక్షసే। 5

సదాఽనృణమిమం రామం వయమిచ్ఛామహే పితుః।
అనృణత్వాచ్చ కైకేయ్యాః స్వర్గం దశరథో గతః। 6

ఏతావదుక్త్వా వచనం గంధర్వాః సమహర్షయః।
రాజర్షయశ్చైవ తదా సర్వే స్వాం స్వాం గతిం గతాః। 7

హ్లాదితస్తేన వాక్యేన శుభేన శుభదర్శనః।
రామః సంహృష్టవదనః తాన్ ఋషీనభ్యపూజయత్। 8

త్రస్తగాత్రస్తు భరతః స వాచా సజ్జమానయా।
కృతాంజలిరిదం వాక్యం రాఘవం పునరబ్రవీత్। 9

రాజధర్మమనుప్రేక్ష్య కులధర్మానుసంతతిమ్।
కర్తుమర్హసి కాకుత్స్థ! మమ మాతుశ్చ యాచనామ్। 10

రక్షితుం సుమహద్రాజ్యమ్ అహమేకస్తు నోత్సహే।
పౌరజానపదాంశ్చాపి రక్తాన్ రంజయితుం తథా। 11

జ్ఞాతయశ్చ హి యోధాశ్చ మిత్రాణి సుహృదశ్చ నః।
త్వామేవ ప్రతికాంక్షంతే పర్జన్యమివ కర్షకాః। 12

ఇదం రాజ్యం మహాప్రాజ్ఞ! స్థాపయ ప్రతిపద్య హి।
శక్తిమానసి కాకుత్స్థ! లోకస్య పరిపాలనే। 13

ఇత్యుక్త్వా న్యపతద్భ్రాతుః పాదయోర్భరత స్తదా।
భృశం సంప్రార్థయామాస రామమేవ ప్రియంవదః। 14

తమంకే భ్రాతరం కృత్వా రామో వచనమబ్రవీత్।
శ్యామం నలినపత్రాక్షం మత్తహంసస్వరః స్వయమ్। 15

ఆగతా త్వామియం బుద్ధిః స్వజా వైనయికీ చ యా।
భృశముత్సహసే తాత! రక్షితుం పృథివీమపి। 16

దశగ్రీవుడైన రావణునివధ శీఘ్రముగా జరుగవలెనని అభిలషించు చున్న ఋషీశ్వరులు మొదలగువారందఱును రాజశ్రేష్ఠుడైన భరతునితో ఏకగ్రీవముగా ఇట్లు పలికిరి. (4)

"ఓ భరతా! నీవు సద్వంశమున జన్మించినవాడవు. సమస్త ధర్మములను చక్కగా ఎఱిగినవాడవు. నీ ప్రవర్తనయు ఆదర్శ ప్రాయమైనది. మిగుల ఖ్యాతికెక్కిన వాడవు. స్వర్గస్థుడైన మీతండ్రి యొక్క ఆత్మకు శాంతి కలుగవలెనని కోరుకొనుచున్నచో నీవు శ్రీరాముని మాటలను అంగీకరింపుము- (5)

శ్రీరాముడు తండ్రిగారి ఋణమును తీర్చుకొనవలెనని (ఆయన ఆదేశమును పాటింపవలెనని) మేము కోరుకొనుచున్నాము. దశరథమహారాజు కైకేయి కోరిన వరములను ఇచ్చి, ఆమె ఋణము నుండి విముక్తుడై, స్వర్గమునకేగెను-" (6)

గంధర్వులు, మహర్షులు, రాజర్షులు మొదలగువారందఱును ఈ విధముగా పలికి, పిమ్మట తమతమ స్థానములకు వెళ్ళిపోయిరి. తనను దర్శించెడివారికి సమస్తశుభములను అనుగ్రహించెడి శ్రీరాముడు ఆ ఋషీశ్వరాదులశుభవచనములకు మిగుల సంతుష్టుడై, ప్రసన్నవదనుడై వారిని అందఱిని ప్రశంసించెను. తనమనోరథము నెఱవేఱనందులకు భరతుడు ధైర్యమునుగోల్పోయి వణకిపోయెను. అంతట మాటలు తడబడుచుండగా అతడు కృతాంజలియై, శ్రీరామునితో మఱల ఇట్లు నుడివెను. (7-9)

"ఓ కాకుత్స్థవంశశిరోమణీ! మనవంశసంప్రదాయమును అనుసరించి జ్యేష్ఠుడు పట్టాభిషిక్తుడై రాజ్యపాలన చేయుట ధర్మము. దానిని దృష్టిలోనుంచుకొని, నా ప్రార్థనను, మా తల్లికైకేయియొక్క అభ్యర్థనను మన్నింపుము. (10)

ఈ విశాలకోసలమహాసామ్రాజ్యమును నేను ఒక్కడనే రక్షింపజాలను. నీయందే బద్ధానురాగులైన పౌరులను, పల్లెవాసులను రంజింపజేయుట నా ఒక్కనివలన కాని పని. రైతులు వర్షములకొఱకై మేఘముల వైపు చూచునట్లు మనబంధువులును, యోధులును, మిత్రులును, సుహృదులును అందఱును నీ కొఱకై నిరీక్షించుచున్నారు. (11-12)

ఓ మహాప్రాజ్ఞా! కాకుత్స్థవంశశిరోమణీ! ఈ రాజ్యభారమును స్వీకరించి, దానియౌన్నత్యమును నిలబెట్టుము. ప్రజాపరిపాలనము నందు నీవు సర్వసమర్థుడవు." (13)

మధురముగా మాట్లాడుటలో నేర్పరియైన భరతుడు ఈ విధముగా పలికి, అన్నగారియొక్క పాదములపై వ్రాలెను. పిదప అతడు రాజ్యపాలనమును స్వీకరింపుటకై అన్నను పదేపదే ప్రార్థించెను. (14)

శ్యామవర్ణుడు, పద్మపత్రములవంటి నేత్రములు గలవాడు అగు భరతుని స్వయముగా తనయొడిలోనికి చేర్చుకొని, శ్రీరాముడు మదించిన హంసవలె మధురస్వరముతో ఇట్లు పల్కెను. (15)

నాయనా! భరతా! సహజముగనే నీబుద్ధి వినయశోభితము. గురువులకడ సుశిక్షితమగుటవలన అది బాగుగా పదునుదేలి, దృఢమైనది. ఇట్టి బుద్ధిబలముగలవాడవగుటచే నీవు ఈ కోసల రాజ్యమునేగాక సమస్తభూమండలమును సైతము పరిపాలింపగల సమర్థుడవు. (16)

అమాత్యైశ్చ సుహృద్భిశ్చ బుద్ధిమద్భిశ్చ మంత్రిభిః।
సర్వకార్యాణి సమ్మంత్ర్య సుమహాంత్యపి కారయ॥ 17

లక్ష్మీశ్చంద్రాదపేయాద్వా హిమవాన్ వా హిమం త్యజేత్।
అతీయాత్ సాగరో వేలాం న ప్రతిజ్ఞామహం పితుః॥ 18

కామాద్వా తాత లోభాద్వా మాత్రా తుభ్యమిదం కృతమ్।
న తన్మనసి కర్తవ్యం వర్తితవ్యం చ మాతృవత్॥ 19

ఏవం బ్రువాణం భరతః కౌసల్యాసుతమబ్రవీత్।
తేజసాఽఽదిత్యసంకాశం ప్రతిపచ్చంద్రదర్శనమ్॥ 20

అధిరోహాఽర్య! పాదాభ్యాం పాదుకే హేమభూషితే।
ఏతే హి సర్వలోకస్య యోగక్షేమం విధాస్యతః॥ 21

సోఽధిరుహ్య నరవ్యాఘ్రః పాదుకే హ్యవరుహ్య చ।
ప్రాయచ్ఛత్ సుమహాతేజా భరతాయ మహాత్మనే॥ 22

స పాదుకే సంప్రణమ్య రామం వచనమబ్రవీత్।
చతుర్దశ హి వర్షాణి జటాచీరధరో హ్యహమ్॥ 23

ఫలమూలాశనో వీర! భవేయం రఘునందన!।
తవాఽఽగమనమాకాంక్షన్ వసన్ వై నగరాద్బహిః॥ 24

తవ పాదుకయోర్న్యస్యరాజ్యతంత్రం పరంతప!।
చతుర్దశే హి సంపూర్ణే వర్షేఽహని రఘూత్తమ!।
న ద్రక్ష్యామి యది త్వాం తు ప్రవేక్ష్యామి హుతాశనమ్॥ 25

తథేతి చ ప్రతిజ్ఞాయ తం పరిష్వజ్య సాదరమ్।
శత్రుఘ్నం చ పరిష్వజ్య భరతంచేదమబ్రవీత్॥ 26

మాతరం రక్ష కైకేయీం మా రోషం కురు తాం ప్రతి।
మయా చ సీతయా చైవ శప్తోఽసి రఘునందన!॥ 27

అంతేగాక ప్రతిభాశాలురైన ప్రధానవిధిపతులతోడను, ఉపమంత్రులతోడను, ఆత్మీయులైన బంధుమిత్రులతోడను బాగుగా ఆలోచించి, వారినూచనలమేరకు అతి ముఖ్యమైన గొప్పకార్యములైనను వాటినన్నింటిని సులభముగా చేయింపుము (చేయింపగలవు) (17)

ఒకవేళ చంద్రునినుండి కాంతి వేఱైపోవచ్చును. హిమవత్పర్వతము నుండి మంచు తొలగిపోవచ్చును. సముద్రజలములు చెలియలికట్టను దాటిపోవచ్చునేమో? కాని నేను మాత్రము తండ్రియాజ్ఞను మీఱనుగాక మీఱను. (18)

నాయనా! భరతా! తల్లి కైకేయి తీరనికోరికవలనగాని, లోభమువలనగాని, నీపైగల మమకారమువలనగాని - కారణమేదైనను ఇట్లు గావించినది. నీవు దానిని మనసులో పెట్టుకొనవలదు. నీవు ఆమెను ఎల్లప్పుడును తల్లిగా (సముచితముగా) గౌరవించుచుండుము." (19)

శ్రీరాముడు సూర్యునివలె దివ్యతేజస్సుగలవాడు, (సూర్యునివలె ముందునకు సాగుటయేగాని ఏదియైనను వెనుదిరుగనివాడు) శుక్లపక్షపాడ్యమి (పాడ్యమి) నాటి చంద్రునివలె క్రమముగా అభివృద్ధిచెందుచు లోకమును వెలుగులను నింపుచు ఆహ్లాదపఱచువాడు, అట్టి కౌసల్యాతనయుడు ఇట్లు పలుకగా ఆయనతో భరతుడు ఇంకను ఈ విధముగాననెను. (20)

"పూజ్యుడవైన ఓ అన్నా! ఈ పాదుకలు బంగారముతో తాపబడినవి, ఆ పాదరక్షలను ఒక్కసారి నీ పాదములకు తొడిగికొని నాకు అనుగ్రహింపుము.- అవియే సమస్తలోకములకును యోగక్షేమములను సమకూర్చును. (21)

అంతట మహాతేజస్వియు, నరశ్రేష్ఠుడును ఐన ఆ రాముడు పాదుకలను ఒకసారి తొడిగికొని, వెంటనే వాటిని విడిచెను. పిమ్మట వాటిని మహాత్ముడైన భరతునకు ఇచ్చివేసెను. (22)

అప్పుడు ఆ భరతుడు ఆపాదుకలకు ప్రణమిల్లి, శ్రీరామునితో ఇట్లు పలికెను. "నేను ఈ పదునాలుగు సంవత్సరములవఱకును జటాధారినై నారచీరలను ధరించియుందును. వీరుడవైన ఓ రఘువరా! ఫలములను, కందమూలములను ఆహారముగా స్వీకరించుచు మీరాకకై నిరీక్షించుచు నగరమునకు వెలుపలి భాగమున ఉందును. (23-24)

ఓ పరంతపా! ఈ పదునాలుగుసంవత్సరములవఱకును రాజ్యతంత్రమును (రాజ్యపాలన భారమును) నీ పాదుకలమీదనే ఉంచెదను. ఓ రఘువరా! పదునాలుగవ సంవత్సరము ముగిసిన మఱునాడు నీ దర్శనము కానిచో నేను అగ్నిప్రవేశము చేసెదను."(25)

శ్రీరాముడు భరతునిపలుకులకు తనఆమోదమును తెలిపి, సాదరముగా అతనిని కౌగిలించుకొనెను. పిమ్మట శత్రుఘ్నునిగూడ అక్కున జేర్చుకొనెను. అనంతరము అతడు భరతునితో ఇట్లనెను. (26)

"ఓ రఘునందనా! భరతా! తల్లి కైకేయిని భద్రముగా చూచుకొనుము. ఆమెపై ఏ మాత్రము కోపింపకుము. నామీదను, సీతాదేవిమీదను ఒట్టుపెట్టుకొని, ఈ మాటలను చెప్పుచున్నాను."

ఇత్యుక్త్వా౽శ్రుపరీతాక్షో భ్రాతరం విససర్జ హ। 28

స పాదుకే తే భరతః ప్రతాపవాన్
స్వలంకృతే సంపరిపూజ్య ధర్మవిత్ ।
ప్రదక్షిణం చైవ చకార రాఘవం
చకార తే చోత్తమనాగమూర్ధని । 29

అథా౽నుపూర్వ్యాత్ ప్రతినంద్య తం జనం
గురూంశ్చ మంత్రిప్రకృతీస్తథా౽నుజౌ।
వ్యసర్జయద్రాఘవవంశవర్ధనః
స్థిరః స్వధర్మే హిమవానివాచలః । 30

తం మాతరో బాష్పగృహీతకంఠ్యో
దుఃఖేన నామంత్రయితుం హి శేకుః ।
స త్వేవ మాతౄరభివాద్య సర్వా
రుదన్ కుటీం స్వాం ప్రవివేశ రామః । 31

ఇట్లు పలుకుచుండగనే ఆయనకనులలో అశ్రువులు నిండెను. పిదప ఆ ప్రభువు భరతశత్రుఘ్నులకును, తదితరులకును వీడ్కోలు పలికెను. (27-28)

ధర్మజ్ఞుడును, ప్రతాపశాలియు ఐన ఆ భరతుడు చక్కగా అలంకరింపబడిన ఆ పాదుకలను భక్తితో పూజించెను. వాటికిని, శ్రీరామచంద్రునకును ప్రదక్షిణపూర్వకముగా ప్రణమిల్లెను. పిమ్మట ఆపాదుకలను రాజు అధిరోహించెడి 'శత్రుంజయము' అనెడి శ్రేష్ఠమైన ఏనుగు అంబారిపై ఉంచెను. (29)

హిమవత్పర్వతమువలె స్వధర్మమునందు నిశ్చలముగా నిలిచి యుండునట్టి శ్రీరాముడు క్రమముగా అచట చేరియున్న జనులను, గురువులను, మంత్రులను, పౌరులను, జానపదులను అట్లే తన సోదరులైన భరతశత్రుఘ్నులను తగినవిధముగా అభినందించి, వీడ్కోలు పలికెను. (30)

అంతట కౌసల్య మొదలగు తల్లులకు దుఃఖభారముచే కంఠము మూగవోయెను. అందువలన వారు శ్రీరామునితో ఏమియు మాటాడలేకపోయిరి- రాముడును తల్లులందఱికిని నమస్కరించి, ఏడ్చుచు తనపర్ణశాలలో ప్రవేశించెను. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ద్వాదశోత్తరశతతమస్సర్గః *(112)*

వాల్మీకిమహర్షిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపండ్రెండవసర్గము సమాప్తము

-- ❋ ❋ ❋ --

113. నూటపదుమూడవసర్గము

చిత్రకూటమునుండి సపరివారముగా బయలుదేఱిన భరతుడు మార్గమధ్యమున భరద్వాజమహర్షి ఆశీస్సులనుగొని, తిన్నగా అయోధ్యకు చేరుట.

తతః శిరసి కృత్వా తు పాదుకే భరతస్తదా।
ఆరురోహ రథం హృష్టః శత్రుఘ్నేన సమన్వితః। 1

వసిష్ఠో వామదేవశ్చ జాబాలిశ్చ దృఢవ్రతః।
అగ్రతః ప్రయయుః సర్వే మంత్రిణో మంత్రపూజితాః। 2

మందాకినీం నదీం రమ్యాం ప్రాఙ్ముఖాస్తే యయుస్తదా।
ప్రదక్షిణం చ కుర్వాణాః చిత్రకూటం మహాగిరిమ్। 3

పశ్యన్ ధాతుసహస్రాణి రమ్యాణి వివిధాని చ।
ప్రయయౌ తస్య పార్శ్వేన ససైన్యో భరతస్తదా। 4

అదూరాచ్చిత్రకూటస్య దదర్శ భరతస్తదా।
ఆశ్రమం యత్ర స మునిః భరద్వాజః కృతాలయః। 5

పిమ్మట భరతుడు 'శత్రుంజయము' అను పేరుగల ఏనుగు అంబారిపైనున్న ఆపాదుకలను తీసికొని, వాటిని తనశిరమున దాల్చి, శత్రుఘ్నసహితుడై సంతోషముతో రథమును ఎక్కెను. (1)

వసిష్ఠుడును, వామదేవుడును, వ్రతదీక్షలో గట్టివాడైన జాబాలియు, మంత్రాంగమున నిపుణులైన మంత్రులందఱును భరతునిరథమునకు ముందుభాగమున తమతమవాహనములపై సాగిపోవుచుండిరి. వారు సీతారాములపాదస్పర్శతో పునీతమైన చిత్రకూటమహాపర్వతమునకు ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి, మనోహరమైన మందాకినీనది వైపుగా ప్రాఙ్ముఖులై ప్రయాణము చేయుచుండిరి. (2-3)

అప్పుడు భరతుడు తనసైన్యములతోగూడి, చిత్రకూటపర్వతము నుండి స్రవించుచున్న వివిధవర్ణములుగల రమ్యములైన గైరికాది ధాతువులను దర్శించుచు, ఆగిరియొక్క పార్శ్వభాగమున సాగిపోవుచుండెను. (4)

ఆ సమయమున భరతుడు చిత్రకూటపర్వతమునుండి కొంత దూరము వెళ్లినపిదప అచటికి సమీపముననే కన్పించుచున్న భరద్వాజాశ్రమమును జూచెను. అంతట బుద్ధిమంతుడైన

స తమాశ్రమమాగమ్య భరద్వాజస్య బుద్ధిమాన్।
అవతీర్య రథాత్ పాదౌ వవందే భరతస్తదా। 6

ఆ భరతుడు భరద్వాజాశ్రమముకడకు వెళ్లి, అచట తనరథముపై నుండి దిగెను. పిదప అతడు ఆ ఆశ్రమమున ప్రవేశించి, ఆ మహర్షిపాదములకు ప్రణమిల్లెను. (5-6)

తతో హృష్టో భరద్వాజో భరతం వాక్యమబ్రవీత్।
అపి కృత్యం కృతం తాత! రామేణ చ సమాగతమ్। 7

ఏవముక్తః స తు తతో భరద్వాజేన ధీమతా।
ప్రత్యువాచ భరద్వాజం భరతో భ్రాతృవత్సలః। 8

భరద్వాజమహర్షి భరతునిరాకకు మిగుల సంతసించి, ఆయనను ఇట్లు ప్రశ్నించెను. "నాయనా! భరతా! అన్నయగు శ్రీరామచంద్రుని దర్శనమైనదా? నీ కార్యము సఫలమైనదా?" ధీశాలియైన భరద్వాజ మహాముని ఇట్లు అడుగగా సోదరప్రేమగల భరతుడు ఆమహర్షికి ఇట్లు ప్రత్యుత్తరమునిచ్చెను. (7-8)

స యాచ్యమానో గురుణా మయా చ దృఢవిక్రమః।
రాఘవః పరమప్రీతో వసిష్ఠం వాక్యమబ్రవీత్। 9

"ఆ ప్రభువును దర్శించిన పిమ్మట నేనును, మా గురువైన వసిష్ఠుడును 'అయోధ్యకు వచ్చి రాజ్యమును పాలింపవలసినది'గా ఆయనను మిగుల అభ్యర్థించితిమి. దృఢదీక్షగల శ్రీరాముడు అందులకు ఎంతయు సంతసించి, వసిష్ఠమహామునితో ఇట్లు నుడివెను- (9)

పితుః ప్రతిజ్ఞాం తామేవ పాలయిష్యామి తత్త్వతః।
చతుర్దశ హి వర్షాణి యా ప్రతిజ్ఞా పితుర్మమ। 10

'నేను పదునాలుగుసంవత్సరములకాలము వనవాసము చేయుదునని మాతండ్రియెదుట ప్రతిజ్ఞ చేసియుంటిని. నేను ఆ ప్రతిజ్ఞకు కట్టుబడి యుందును-'' (10)

ఏవముక్తో మహాప్రాజ్ఞో వసిష్ఠః ప్రత్యువాచ హ।
వాక్యజ్ఞో వాక్యకుశలం రాఘవం వచనం మహత్। 11

శ్రీరాముడు ఇట్లు పలుకగా పిమ్మట ప్రజ్ఞావంతుడైన వసిష్ఠమహర్షి ఆయనమాటలలోని అంతరార్థమును గ్రహించినవాడై, మాట్లాడుటలో సమర్థుడైన శ్రీరామునితో ఇట్లు నుడివెను. (11)

ఏతే ప్రయచ్ఛ సంహృష్టః పాదుకే హేమభూషితే।
అయోధ్యాయాం మహాప్రాజ్ఞ! యోగక్షేమకరే తవ। 12

"ఓ రామా! బంగారముచే తాపబడిన నీ యీ పాదుకలను భరతునకు ప్రసాదింపుము. అవి కోసలదేశప్రజల యోగక్షేమముల[1] భారమును వహించును." (12)

ఏవముక్తో వసిష్ఠేన రాఘవః ప్రాఙ్ముఖః స్థితః।
పాదుకే హ్యధిరుహ్యైతే మమ రాజ్యాయ వై దదౌ। 13

వసిష్ఠమహర్షి ఇట్లు పలికిన పిమ్మట శ్రీరాముడు తూర్పు దిక్కునకు మఱలి, పాదుకలను ఒకసారి తొడుగుకొని, పిదప రాజ్య క్షేమమునకై వీటిని నాకు అనుగ్రహించెను. (13)

నివృత్తోఽహమనుజ్ఞాతో రామేణ సుమహాత్మనా।
అయోధ్యామేవ గచ్ఛామి గృహీత్వా పాదుకే శుభే। 14

శుభప్రదములైన శ్రీరామునిపాదుకలను స్వీకరించి, మహాత్ముడైన ఆ ప్రభువుయొక్క అనుజ్ఞను పొంది, అయోధ్యను చేరుటకై మఱలి వెళ్లుచున్నాను." (14)

ఏతచ్ఛ్రుత్వా శుభం వాక్యం భరతస్య మహాత్మనః।
భరద్వాజః శుభతరం మునిర్వాక్యమువాచ తమ్। 15

మహాత్ముడైన భరతునినుండి సంతోషకరములైన ఈ మాటలను విని, భరద్వాజమహాముని ఆయనతో మిగుల శుభకరములైన వచనములను ఇట్లు నుడివెను. (15)

నైతచ్చిత్రం నరవ్యాఘ్ర! శీలవృత్తవతాం వర!
యదార్యం త్వయి తిష్ఠేత్తు నిమ్నే వృష్టమివోదకమ్। 16

"ఓ నరోత్తమా! భరతా! ఉత్తమమైన శీలము, సత్ప్రవర్తనయు గలిగిన వారిలో శ్రేష్ఠుడైనవాడా! వర్షించిన (విడువబడిన) నీరు పల్లపుభూమికి చేరి, తటాకాదులలో ఉండునట్లు సర్వశుభలక్షణములును నీలో చేరియున్నవి. ఇందు ఆశ్చర్యపడవలసినది ఏమియును లేదు. (16)

అమృతః స మహాబాహుః పితా దశరథస్తవ।
యస్య త్వమీదృశః పుత్రో ధర్మజ్ఞో ధర్మవత్సలః। 17

ఓ భరతా! బాగుగా ధర్మములను ఎఱిగినవాడవు, ధర్మనిరతి గలవాడవు ఐన నీ వంటి పుత్త్రునిగన్న మహాబాహువగు ఆ దశరథ మహారాజు నిజముగా అమృతస్వరూపుడు. (ఆ ప్రభువు మృతిచెందినను బ్రతికియున్నట్లే)" (17)

1) అపూర్వవస్తులాభో యోగః = సాటిలేని వస్తువులు, సంపదలు ప్రాప్తించుట యోగము. లబ్ధస్య పరిపాలనం క్షేమః = ప్రాప్తించిన వస్తువులను, సంపదలను రక్షించుట క్షేమము-

తమ్ ఋషిం తు మహాత్మానమ్ ఉక్తవాక్యం కృతాంజలిః।
ఆమంత్రయితుమారేభే చరణావుపగృహ్య చ॥ 18

మహాత్ముడైన భరద్వాజముని ఇట్లుపలుకగా భరతుడు చేతులు జోడించి, ఆయనకు పాదాభివందనమొనర్చి, అయోధ్యకు బయలుదేఱుటకు సన్నద్ధుడాయెను- (18)

తతః ప్రదక్షిణం కృత్వా భరద్వాజం పునః పునః।
భరతస్తు యయౌ శ్రీమాన్ అయోధ్యాం సహ మంత్రిభిః॥ 19

వినయసంపన్నుడైన భరతుడు భరద్వాజమునికి ప్రదక్షిణ పూర్వకముగా పదే పదే నమస్కరించి, మంత్రులు మొదలగు వారితోగూడి అయోధ్యకు బయలుదేఱెను. (19)

యానైశ్చ శకటైశ్చైవ హయైర్నాగైశ్చ సా చమూః।
పునర్నివృత్తా విస్తీర్ణా భరతస్యానుయాయినీ॥ 20

చతురంగబలములతోగూడిన ఆ మహాసైన్యము పల్లకీలు, బండ్లు మొదలగు వాహనములతో పరివృతమై భరతుని అనుసరించుచు అయోధ్యకు బయలుదేఱెను. (20)

తతస్తే యమునాం దివ్యాం నదీం తీర్త్వోర్మిమాలినీమ్।
దదృశుస్తాం పునః సర్వే గంగాం శుభజలాం నదీమ్॥ 21

వారందఱును చక్కనితరంగపంక్తులతో ఒప్పుచున్న దివ్యమైన యమునానదిని దాటిరి. అటు పిమ్మట వారు పవిత్రజలములుగల గంగానదిని మఱల దర్శించిరి. (21)

తాం రమ్యజలసంపూర్ణాం సంతీర్య సహ బాంధవః।
శృంగిబేరపురం రమ్యం ప్రవివేశ ససైనికః॥ 22

అనంతరము భరతుడు సైన్యములతోడను, తదితరపరివారముల తోడను కూడి, చూడముచ్చటైన గంగానదీ ప్రవాహమును దాటి, రమ్యమైన శృంగిబేరపురమున ప్రవేశించెను. (22)

శృంగిబేరపురాద్భూయస్త్వయోధ్యాం సందదర్శ హ॥ 23

అయోధ్యాం చ తతో దృష్ట్వా పిత్రా భ్రాత్రా వివర్జితామ్।
భరతో దుఃఖసంతప్తః సారథిం చేదమబ్రవీత్॥ 24

అంతట భరతుడు శృంగిబేరపురమునుండి బయలుదేఱి కొంత దూరము ప్రయాణించినపిమ్మట అయోధ్యను దర్శించెను. తండ్రియు, సోదరుడును లేనట్టి ఆ నగరమును జూచిన పిదప అతడు మిగుల దుఃఖసంతప్తుడై సారథియైన సుమంత్రునితో ఇట్లు పలికెను. (23-24)

సారథే! పశ్య విధ్వస్తా సాఽయోధ్యా న ప్రకాశతే।
నిరాకారా నిరానందా దీనా ప్రతిహతస్వరా॥ 25

"ఓ సుమంత్రా! చూడుము. అయోధ్య పాడుబడి కళదప్పియున్నది. దానిశోభలన్నియును మాసిపోయినవి. అచటి ప్రజలలో ఆనందమే శూన్యమైనది. దీనావస్థకుగుఱియైన ఆ నగరమున నిశ్శబ్దము తాండవించుచున్నది. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే త్రయోదశోత్తరశతతమస్సర్గః *(113)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపదుమూడవసర్గము సమాప్తము

-- * * * --

114. నూటపదునాల్గవసర్గము

భరతుడు అయోధ్యానగరమున ప్రవేశించి, దానిదుఃస్థితినిజూచి, కన్నీరుగార్చుట.

స్నిగ్ధ గంభీరఘోషేణ స్యందనేనోపయాన్ ప్రభుః।
అయోధ్యాం భరతః క్షిప్రం ప్రవివేశ మహాయశాః॥ 1

చక్కని సామర్థ్యముగల మహాయశస్వియైన భరతుడు మృదువైన, గంభీరమగు ధ్వనిగల రథముతో ఆ అయోధ్యానగరమును సమీపించి, అందు ప్రవేశించెను. (1)

బిడాలోలూకచరితామ్ ఆలీననరవారణామ్।
తిమిరాభ్యాహతాం కాళీమ్ అప్రకాశాం నిశామివ॥ 2

అచ్చట అనమయమున పిల్లులు, గుడ్లగూబలు సంచరించుచుండెను. మానవుల, ఏనుగులకదలికలు ఆగిపోయెను. చిమ్మచీకట్లు అలముకొనియుండుటచే కృష్ణపక్షపురాత్రులబోలియుండునట్లు ఆ అయోధ్య శోభావిహీనమై యుండెను. (2)

రాహుశత్రోః ప్రియాం పత్నీం శ్రియా ప్రజ్వలితప్రభామ్।
గ్రహేణాభ్యుత్థితే నైకాం రోహిణీమివ పీడితామ్। 3

అల్పోష్ణక్షుబ్ధసలిలాం ఘర్మోత్తప్తవిహంగమామ్।
లీనమీనఝషగ్రాహాం కృశాం గిరినదీమివ। 4

విధూమామివ హేమాభామ్ అధ్వరాగ్నేః సముత్థితామ్।
హవిరభ్యుక్షితాం పశ్చాత్ శిఖాం విప్రలయం గతామ్। 5

విధ్వస్తకవచాం రుగ్ణగజవాజిరథధ్వజామ్।
హతప్రవీరామాపన్నాం చమూమివ మహాహవే। 6

సఫేనాం సస్వనాం భూత్వా సాగరస్య సముత్థితామ్।
ప్రశాంతమారుతోద్ధూతాం జలోర్మిమివ నిస్స్వనామ్। 7

త్యక్తాం యజ్ఞాయుధైః సర్వైః అభిరూపైశ్చ యాజకైః।
సుత్యాకాలే వినిర్వృత్తే వేదిం గతరవామివ। 8

గోష్ఠమధ్యే స్థితామార్తామ్ అచరంతీం తృణం నవమ్।
గోవృషేణ పరిత్యక్తాం గవాం పత్నీమివోత్సుకామ్। 9

ప్రభాకరాద్యైః సుస్నిగ్ధైః ప్రజ్వలద్భిరివోత్తమైః।
వియుక్తాం మణిభిర్జాత్యైః నవాం ముక్తావలీమివ। 10

సహజముగా స్వీయశోభలచే వెలుగొందుచుండెడి రోహిణి తనప్రియపతియగు చంద్రుని రాహువు కబళించుటచే నిస్సహాయయై, కాంతిహీనమైయుండునట్లు, దివ్యైశ్వర్యములతో తులతూగుచుండెడి అయోధ్య తనప్రభువైన దశరథమహారాజును మృత్యువు కబళించుటచే దీనయై కళదప్పియుండెను. (3)

గ్రీష్మతాపముయొక్క ప్రభావమున పర్వతమునుండి ప్రవహించెడి నదిలోనినీరు తగ్గిపోయి వేడెక్కి యుండును. ఆ తాపప్రభావమునకు తట్టుకొనలేక తీరజలములను ఆశ్రయించియుండెడి పక్షులన్నియును విలవిలలాడుచుండును. తఱిగిపోయిన ఆ నదీజలములలోనున్న చిన్న, పెద్ద చేపలును, మొసళ్లును ఆవేడిని భరింపలేక ఆ నీళ్ల అడుగుభాగమునకు చేరుచుండును. అట్లు కృశించియుండెడి నదివలె ఆ అయోధ్య శోభావిహీనమైయుండెను. (4)

పొగలుబొత్తిగ లేకుండ పైకి ఎగయుచున్న జ్వాలలతో బంగారుకాంతులను వెదజల్లుచుండెడి అగ్నిశిఖవలె అయోధ్య ఇంతకుముందు చక్కగా శోభిల్లుచుండెడిది. కాని నెయ్యి, పాలు మొదలగు ద్రవ్యములు హోమముచేయగా మంటలు ఆగి, పొగ క్రమ్ముకొనుటచే నిస్తేజమై యున్న యజ్ఞాగ్నివలె, శ్రీరాముడు అడవులపాలగుటతో దుఃఖముతో దీనయైయున్న ఈ అయోధ్య ఇప్పుడు వెలవెలబోవుచున్నది. (5)

మహాసంగ్రామమునందు కవచములు నుగ్గునుగ్గుకాగా, గజములు, గుఱ్ఱములు, రథములు దెబ్బతినగా, ధ్వజములు విరిగిపోగా, వీరులు నేలవ్రాలగా ఆపదలో చిక్కుకొనిన మహాసేనవలె ప్రభువును కోల్పోయిన అయోధ్య చిక్కులపాలైయున్నది. (6)

ప్రబలమైనవాయువేగముచే ఉవ్వెత్తుగాలేచి, నురుగులతోగూడి, ఘోషించునట్టి తరంగపంక్తివలె అయోధ్య ఇంతవఱకును జనుల కోలాహలములతో కలకలలాడుచుండెడిది. కాని ఇప్పుడది గాలులు ఆగిపోగా ఉద్ధృతితగ్గి, నిశ్శబ్దముగానున్న తరంగసమూహమువలె శోభావిహీనమైయున్నది. (7)

యజ్ఞము ముగిసినతరువాత యజ్ఞమునకు సంబంధించిన స్రుక్స్రువాది-ఉపకరణములు అన్నియును తొలగింపబడగా, సమర్థులైన ఋత్విజులందఱును వెళ్లిపోగా మంత్రోచ్చారణాది ధ్వనులు ఆగిపోగా నిశ్శబ్దముగా నున్న యజ్ఞవేదికవలె అయోధ్య మూగవోయియున్నది. (8)

ఎదకు వచ్చి, వృషభముతో కూడుటకు తహతహపడుచున్న ఒక ఆవును ఆస్థితిలో వృషభమునుండి వేఱుచేసి, గోశాలలో కట్టివేయుగా అర్తికిలోనగుటచే వనవనలాడుచున్న గడ్డిని పైతము మేయని ఆ గోవువలె, శ్రీరాముని ఎడబాటునకు గుఱియైనఅయోధ్య దుస్సహమైన వేదనతో కుమిలిపోవుచున్నది. (9)

బాగుగా మెఱుపుదేఱి, నిగనిగలాడుచుండెడి ఉత్తమజాతికి చెందిన పద్మరాగాదిమణులు తొలగిన క్రొత్త ముత్యాలహారమువలె శ్రీరామునియెడబాటునకును, దశరథమహారాజువియోగమునకును లోనైన అయోధ్య శోభావిహీనమైయున్నది. (10)

సహసా చలితాం స్థానాత్ మహీం పుణ్యక్షయాద్గతామ్।
సంహృతద్యుతివిస్తారాం తారామివ దివశ్చ్యుతామ్॥ 11

పుణ్యము క్షీణింపగా స్థానచలనమునకుగుతియై, ఆకాశము నుండి జారి, తనదివ్యకాంతిని కోల్పోయి, భూమిపైబడిన తారవలె అయోధ్య నిస్తేజమై యుప్పుచుండెను. (11)

పుష్పనద్ధాం వసంతాంతే మత్తభ్రమరనాదితామ్।
ద్రుతదావాగ్నివిప్లుష్టాం క్లాంతాం వనలతామివ॥ 12

వసంతఋతువునందు చిగిర్చి, చక్కగా వికసించిన పూల గుత్తులతో కలకలలాడుచు, మదించిన గండు తుమ్మెదల ఝంకారములతో వీనులవిందుగావించుచున్న వనలతవలె, ఇంత వఱకును అయోధ్య పుష్పవనములతో కనువిందుగావించుచు, వీణావేణుమృదంగాదులమధుర ధ్వనులతో అందఱిని ఆనందింప జేయుచుండెడిది. కాని గ్రీష్మ-ఋతువునందు వేగముగా వ్యాపించెడి దావాగ్నిమంటలకు కొలదిగా దగ్ధమై వాడిపోయిన వనలతవలె ఇప్పుడు ఈ అయోధ్య కైకేయీదుస్స్వభావములనెడి అగ్నిజ్వాలలకు వసివాడి కళావిహీనమై యుండెను. (12)

సమ్మూఢనిగమాం స్తబ్ధాం సంక్షిప్తవిపణాపణామ్।
ప్రచ్ఛన్నశశినక్షత్రాం ద్యామివాంబుధరైర్వృతామ్॥ 13

ఇప్పుడు అయోధ్యలోని ప్రజలందఱును దుఃఖితులైయున్నందున అందలి రాజవీధులయందు జనసంచారమేలేక అది బోసిపోయి యుండెను. మఱియు దారాపు వ్యాపారులఅంగళ్ళన్నియును మూసి వేయబడి యుండుటచే ఆనగరము నిశ్శబ్దముగానుండెను. అందువలన మేఘములు చంద్రుని, నక్షత్రములను కప్పివేయుగా తేజోరహితమైయున్న ఆకాశమువలె ఈ అయోధ్య వెలవెల బోవుచుండెను. (13)

క్షీణపానోత్తమైర్భిన్నైః శరావైరభిసంవృతామ్।
హతశౌండామివాకాశే పానభూమిమసంస్కృతామ్॥ 14

పానీయశాలయందు చక్కని పానపాత్రలన్నియును మధురరసములు లేనివై, ముక్కలుముక్కలై చెల్లాచెదరుగా పడియుండును. మితిమీఱి మధుపానము చేసియున్నవారందఱును ఆచటినేలపై విచ్చలవిడిగాపడి యుందురు. ఆ విధముగా పానీయశాలయంతయు రోతగొల్పుచుండును. ఇండ్లముంగిళ్ళ యుందును. వీటులలోను ఎవ్వరును శుభ్రపఱచెడివారులేక అవి చెత్తచెదారములతో నిండియుండుటచే ఈ అయోధ్య పానీయభూమివలె అసహ్యముగా ఉన్నది. (14)

వృక్ణభూమితలాం నిమ్నాం వృక్ణపాత్రైః సమావృతామ్।
ఉపయుక్తోదకాం భగ్నాం ప్రపాం నిపతితామివ॥ 15

దెబ్బతినిన అరుగులతో, పగిలిపోయిన పాత్రలతో, క్రుంగి పోయిన భూమితో, త్రాగుటకు నీరులేని కుండలతో ఉన్నయు స్తంభములు దెబ్బతినుటచే కొంతవఱకు శిథిలమైన చలివేంద్రము వలె ఈ అయోధ్య కడు దుస్థితికి లోనైయున్నది. (15)

విపులాం వితతాం చైవ యుక్తపాశాం తరస్వినామ్।
భూమౌ బాణైర్వినిష్కృత్తాం పతితాం జ్యామివాయుధాత్॥ 16

అనువుగా పొడవై, దృఢముగానుండి, వింటిరెండుకొనలవఱకును వ్యాపించియుండి, బలమైన త్రాళ్ళు గలిగి, యోధులబాణములు వేగముగావచ్చితగులుటచే ముక్కలై, ధనుస్సునుండి జాఱిభూమిపైబడిన అల్లెత్రాడువలె, కైకేయివరములధాటికి అయోధ్య ఛిన్నాభిన్నమై యుప్పుచుండెను. (16)

సహసా యుద్ధశౌండేన హయారోహేణ వాహితామ్।
నిహతాంప్రతిసైన్యేన బడబామివ పాతితామ్॥ 17

యుద్ధవీరుడైన ఒకయోధుడు ఒక ఆడుగుఱ్ఱమును అధిరోహింపగా శత్రుసైన్యము దానిని వేగముగా కొట్టుటచే అది యుద్ధభూమిలో నేలకొఱిగి, దురవస్థకులోనగును. అట్టి దుస్థితిలో నున్న ఆడుగుఱ్ఱమువలె అయోధ్య మిగుల దీనస్థితికి లోనైనది. (17)

శుష్కతోయాం మహామత్స్యైః కూర్మైశ్చ బహుభిర్వృతామ్।
ప్రభిన్నతటవిస్తీర్ణాం వాపీమివ హృతోత్పలామ్। 18

పురుషస్యాప్రహృష్టస్య ప్రతిషిద్ధానులేపనామ్।
సంతప్తామివ శోకేన గాత్రయష్టిమభూషణామ్। 19

ప్రావృషి ప్రవిగాఢాయాం ప్రవిష్టస్యాభ్రమండలమ్।
ప్రచ్ఛన్నాం నీలజీమూతైః భాస్కరస్య ప్రభామివ। 20

భరతస్తు రథస్థస్సన్ శ్రీమాన్ దశరథాఽఽత్మజః।
వాహయంతం రథశ్రేష్ఠం సారథిం వాక్యమబ్రవీత్। 21

కిం ను ఖల్వద్య గంభీరో మూర్ఛితో న నిశమ్యతే।
యథాపురమయోధ్యాయాం గీతవాదిత్రనిస్వనః। 22

వారుణీమదగంధశ్చ మాల్యగంధశ్చ మూర్ఛితః।
చందనాగరుగంధశ్చ న ప్రవాతి సమంతతః। 23

యానప్రవరఘోషశ్చ స్నిగ్ధశ్చ హయనిస్వనః।
ప్రమత్తగజనాదశ్చ మహాంశ్చ రథనిస్వనః।
నేదానీం శ్రూయతే పుర్యామ్ అస్యాం రామే వివాసితే। 24

చందనాగరుగంధాంశ్చ మహార్హాశ్చ వనస్రజః।
గతే హి రామే తరుణాః సంతప్తానోపభుంజతే। 25

బహిర్యాత్రాం న గచ్ఛంతి చిత్రమాల్యధరా నరాః।
నోత్సవాః సంప్రవర్తంతే రామశోకార్దితే పురే। 26

సహ నూనం మమ భ్రాత్రా పురస్యాస్య ద్యుతిర్గతా।
నహి రాజత్యయోధ్యేయం సాసారేవార్జునీ క్షపా। 27

కదా ను ఖలు మే భ్రాతా మహోత్సవ ఇవాఽఽగతః।
జనయిష్యత్యయోధ్యాయాం హర్షం గ్రీష్మ ఇవాంబుదః। 28

దిగుడుబావిలోని నీరు ఎండిపోవుటచే అందలి పెద్దపెద్ద మత్స్యములు, తాబేళ్లు బయటపడును. దాని దరులు బీటలువారును. అందలి కలువలు ఎండి నశించును. అయోధ్యానగరస్థితి అట్టిదిగుడుబావివలె దురవస్థకు గురియై యుండెను. (18)

మంచిగంధములు మొదలగు మైపూతలులేక, ఆభరణములను ధరింపక, దుఃఖితుడై కృశించియున్న పురుషుని యొక్క శరీరమువలె అయోధ్య దీనావస్థకు లోనైయుండెను. (19)

వర్షాకాలమునందు దట్టమైన నల్లని మేఘములు సూర్యమండలమును పూర్తిగా కప్పివేయగా నిస్తేజమైయున్న ఆ సూర్యకాంతివలె అయోధ్య వెలవెల బోవుచుండెను. (20)

దశరథునికుమారుడును, సకలశుభలక్షణసంపన్నుడును ఐన భరతుడు రథమునందు కూర్చొనియుండియే ఆ మహారథమును నడుపుచున్న సారథితో ఇట్లనెను. (21)

"ఇదివరలో అయోధ్యయందు వీణావేణుమృదంగతాళముల యొక్క మధురధ్వనులు ఎల్లప్పుడును నగరమునందంతటను వినబడుచుండెడివి. నేడు అవి వినిపించుట లేదేమి? (22)

నేడు అయోధ్యానగరములో వీచుచున్న వాయువులలో జనులను పరవశింపజేసెడి వట్టివేళ్లయొక్క, కస్తూరియొక్క వాసనలు, పూలమాలలపరిమళములు, చందనము, అగరు మొదలగు వాటిసుగంధములు ప్రసరించుట లేదేమి? (23)

శ్రీరాముడు వనవాసమునకు వెళ్లిన పిమ్మట శ్రేష్ఠములగు పల్లకీలను మోయువారిఘోషలు, చెవులకింపైన గుఱ్ఱములసకిలింపులు, మదపుటేనుగులఘీంకారములు, మహారథచక్రములసవ్వడులు ఈ అయోధ్యలో నేడు వినబడుటలేదేమి? (24)

శ్రీరాముడు వనములకు వెళ్లినపిదప యువతీయువకులు కడు దుఃఖితులై, చందనములను, అగరుగంధములను అలదుటలేదు. ఘుమఘుమలాడు క్రొత్తక్రొత్త పూలమాలలను ధరించుట లేదు. (25)

శ్రీరామునియెడబాటునకు కుమిలిపోవుచున్న పురప్రజలు (పౌరులందఱును) వాహ్యాళికై బయటికి వెళ్లుట లేదు సరిగదా! వారు పూలమాలలనుసైతము ధరించుటయే లేదు. పురమునందు ఏవిధములైన ఉత్సవములును జరుగుటయేలేదు. (26)

ఈ అయోధ్యాపురిశోభావైభవములన్నియును మా అన్నయగు శ్రీరామునితోగూడి (వనములకు) వెళ్లిపోయినవి. ఇది ముమ్మాటికిని నిజము. అందువలన నేడు ఈ అయోధ్య జడివానలు కురియుచున్నప్పటి శుక్లపక్షపురాత్రి (వెన్నెల రాత్రి) వలె శోభిల్లుటలేదు. (27)

మా అన్నయగు శ్రీరామచంద్రుడు వనవాసదీక్షను ముగించుకొని, ఇచటికి విచ్చేయుట మహోత్సవమువలె మాకు అందఱికిని సంతోషదాయకము. గ్రీష్మఋతువునందు మేఘమువలె ఆ ప్రభువుయొక్క ఆగమనము అయోధ్యాపౌరులందఱి హృదయములలోను ఆనందోత్సాహములను నింపుట ఎప్పుడోగదా? (28)

తరుణైశ్చారువేషైశ్చ నరైరున్నతగామిభిః।
సంపతద్భిరయోధ్యాయాం నాభిభాంతి మహాపథాః। 29

చక్కని వేషధారణములనుదాల్చిన యువకులును, జనులును నిటారుగా నిలబడి భుజములను ఎగురవేయుచు అయోధ్యయందలి రాజవీధులలో సంచరించుటలేదు. అందువలన నేడు ఈ వీథులన్నియును వెలవెలబోవుచున్నవి-" (29)

ఏవం బహువిధం జల్పన్ వివేశ వసతిం పితుః।
తేన హీనాం నరేంద్రేణ సింహహీనాం గుహామివ। 30

భరతుడు ఇట్లు పలువిధములుగా పలుకుచు రాజభవనమున ప్రవేశించెను. దశరథమహారాజులేని ఆప్రాసాదము సింహములేని గుహవలె ఒప్పుచుండెను. (30)

తదా తదంతఃపురముజ్జ్వలప్రభం
సురైరివోత్సృష్టమభాస్కరం దినమ్ ।
నిరీక్ష్య సర్వం తు వివిక్తమాత్మవాన్
ముమోచ బాష్పం భరతః సుదుఃఖితః । 31

ఆ అంతఃపురము జనసంచారములేకపోవుటచే బోసిపోయియుండెను. అప్పుడు అది సూర్యరశ్మిలేక దేవతలచే విడువబడిన దుర్దినము[1] వలె శోభావిహీనమై యుండెను అంతట బుద్ధిమంతుడైన భరతుడు ఆ అంతఃపురమునందంతటను కలయజూచి, కడు దుఃఖితుడై కన్నీరు కార్చెను. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే చతుర్దశోత్తరశతతమస్సర్గః (114)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపదునాల్గవసర్గము సమాప్తము

-- ✻ ✻ ✻ --

115. నూటపదునైదవసర్గము

భరతుడు తల్లులకు నమస్కరించి, నందిగ్రామమునకు చేరుట - పాదుకలకు పట్టాభిషేకమొనర్చుట - సమస్తకార్యములను వాటికి నివేదించుచు రాజ్యపాలనము చేయుచుండుట.

తతో నిక్షిప్య మాతౄః స అయోధ్యాయాం దృఢవ్రతః।
భరతః శోకసంతప్తో గురూనిదమథాబ్రవీత్। 1

దృఢనిశ్చయముగల భరతుడు తల్లులందరిని అయోధ్య యందలి వారివారి అంతఃపురములలో నిలిపిన పిమ్మట శోకసంతప్తుడై, వసిష్ఠాదిగురువులతో ఇట్లుపలికెను. (1)

నందిగ్రామం గమిష్యామి సర్వానామంత్రయేఽద్య వః।
తత్ర దుఃఖమిదం సర్వం సహిష్యే రాఘవం వినా। 2

"పూజ్యులారా! శ్రీరాముడులేని ఈ అయోధ్యలో నేను ఉండజాలను. కనుక నేను నందిగ్రామమునకు వెళ్లెదను. శ్రీరాముని ఎడబాటువలన కలిగిన దుఃఖమును అచట నిగ్రహించుకొనగలను. కావున అచటికి వెళ్లుటకు మీరందరును నాకు అనుమతినిండు. (2)

గతశ్చ హి దివం రాజా వనస్థశ్చ గురుర్మమ।
రామం ప్రతీక్షే రాజ్యాయ స హి రాజా మహాయశాః। 3

మా తండ్రియైన దశరథమహారాజు స్వర్గమునకు ఏగెను. నాకు గురువు, అన్నయునైన శ్రీరామచంద్రప్రభువు వనములలో నివసించుచున్నాడు. ఈ కోసలరాజ్యమునకు వాస్తవముగా అతడే మహారాజు. కావున ఆయన ఈ రాజ్యమును పాలించుటకై అయోధ్యకు వచ్చెడివఱకును నందిగ్రామమునందుండియే నేను ఆయనకొఱకు నిరీక్షించుచుందును-" (3)

ఏతచ్ఛ్రుత్వా శుభం వాక్యం భరతస్య మహాత్మనః।
అబ్రువన్ మంత్రిణః సర్వే వసిష్ఠశ్చ పురోహితః। 4

మహాత్ముడైన భరతునినుండి చక్కని ఈ శుభవచనములను విన్నపిమ్మట కులగురువు వసిష్ఠుడును, మంత్రులందఱును ఆయనతో ఇట్లు పలికిరి. (4)

1) 'మేఘచ్ఛన్నేఽహ్ని దుర్దినమ్' ఆకాశమునందు అంతటను (పూర్తిగా) మేఘములు క్రమ్ముకొనినినాడు సూర్యదర్శనము ఉండదు. సూర్యరశ్మిలేని ఆదినమును 'దుర్దినము' అనియందురు. సూర్యదర్శనములేని అట్టి దినమున దేవతలును, సూర్యుని ఉపాసించువారును అన్నపానములను ముట్టరు.

సుభృశం శ్లాఘనీయం చ యదుక్తం భరత! త్వయా।
వచనం భ్రాతృవాత్సల్యాత్ అనురూపం తవైవ తత్। 5

నిత్యం తే బంధులుబ్ధస్య తిష్ఠతో భ్రాతృసౌహృదే।
ఆర్యమార్గం ప్రపన్నస్య నానుమన్యేత కః పుమాన్। 6

మంత్రిణాం వచనం శ్రుత్వా యథాభిలషితం ప్రియమ్।
అబ్రవీత్ సారథిం వాక్యం రథో మే యుజ్యతామితి। 7

ప్రహృష్టవదనః సర్వా మాతౄః సమభివాద్య సః।
ఆరురోహ రథం శ్రీమాన్ శత్రుఘ్నేన సమన్వితః। 8

ఆరుహ్య చ రథం శీఘ్రం శత్రుఘ్నభరతావుభౌ।
యయతుః పరమప్రీతౌ వృతౌ మంత్రిపురోహితైః। 9

అగ్రతో గురవస్తత్ర వసిష్ఠప్రముఖా ద్విజాః।
ప్రయయుః ప్రాఙ్ముఖాః సర్వే నందిగ్రామో యతోఽభవత్। 10

బలం చ తదనాహూతం గజాశ్వరథసంకులమ్।
ప్రయయౌ భరతే యాతే సర్వే చ పురవాసినః। 11

రథస్థః స హి ధర్మాత్మా భరతో భ్రాతృవత్సలః।
నందిగ్రామం యయౌ తూర్ణం శిరస్యాధాయ పాదుకే। 12

తతస్తు భరతః క్షిప్రం నందిగ్రామం ప్రవిశ్య సః।
అవతీర్య రథాత్ తూర్ణం గురూనిదమువాచ హ। 13

ఏతద్రాజ్యం మమ భ్రాత్రా దత్తం సంన్యాసవత్ స్వయమ్।
యోగక్షేమవహే చేమే పాదుకే హేమభూషితే। 14

భరతః శిరసా కృత్వా సంన్యాసం పాదుకే తతః।
అబ్రవీద్దుఃఖసంతప్తః సర్వం ప్రకృతిమండలమ్। 15

ఛత్రం ధారయత క్షిప్రమ్ ఆర్యపాదావిమౌ మతౌ।
ఆభ్యాం రాజ్యే స్థితో ధర్మః పాదుకాభ్యాం గురోర్మమ। 16

"ఓ భరతా! నీవు పలికిన ఈ వచనములు మిగుల శ్లాఘనీయములు. నీ భ్రాతృవాత్సల్యమునకు ఇవి సముచితములు- నిత్యము నీవు నీ అన్నయగు శ్రీరామునిదర్శనమునకే తహతహలాడుచుందువు. సర్వదా ఆయనహితమునే కోరుచుందువు. పైగా ధర్మమార్గము నందే నిరతుడవైయుందువు. ఇట్టి నీమాటలను కాదనువారెవ్వరు?" (మహాత్ముడవైన నీమాటను ఎవ్వరును కాదనజాలరు. ఏలనన భరతా! నీవు ఏమి యోచించినను, చెప్పినను, ఆచరించినను అది ధర్మసారమేయగును.) (5-6)

అంతట భరతుడు తనఅభిలాషకు అనుగుణముగా మంత్రులు పలికిన ప్రియవచనములను విని, సారథితో 'రథమును సిద్ధము చేయుము' అని పలికెను. శుభలక్షణసంపన్నుడైన అతడు ప్రసన్నవదనుడై శత్రుఘ్నునితోగూడి తల్లులందఱికిని పాదాభివందనమొనర్చి, పిమ్మట రథమును అధిరోహించెను- ఆ భరతశత్రుఘ్నులు ఇరువురును పరమప్రీతితో రథమునెక్కి పిదప మంత్రులతో, పురోహితులతోగూడి, నందిగ్రామమునకు బయలుదేఱిరి. (7-9)

గురువులైన వసిష్ఠాదిమహాత్ములు, బ్రాహ్మణోత్తములు మున్నగు వారందఱును భరతునిరథమునకు ముందు భాగమున ప్రాఙ్ముఖులై నందిగ్రామమునకు బయలుదేఱిరి. రాజు ఆదేశింపకున్నను రథాశ్వగజములతోగూడిన బలములును, పౌరులు అందఱును అతనిని అనుసరించిరి. (10-11)

మిక్కిలి సోదరప్రేమగలవాడును, ధర్మాత్ముడును ఐన భరతుడు శ్రీరామునిపాదుకలను శిరమునదాల్చి, రథముపై వేగముగా నందిగ్రామమునకు చేరెను- (12)

పిమ్మట ఆ భరతుడు రథమునుండి చకచకదిగి, వేగముగా నందిగ్రామమున ప్రవేశించి, గురువులతో ఇట్లనెను. (13)

"పూజ్యులారా! మా అన్నయగు శ్రీరాముడు స్వయముగా ఈ రాజ్యమును న్యాసముగా[1] నాకు అప్పగించెను. మఱియు బంగారముతో అలంకరింపబడిన ఈ పాదుకలనుగూడ ఇచ్చెను. ఇవి ఈ రాజ్యప్రజలయోగక్షేమముల భారమును వహించుచుండును. ఈ విషయమున నేను నిమిత్తమాత్రుడను, శ్రీరాముని బంటును." (14)

పిదప భరతుడు శ్రీరామునకు ప్రతినిధులుగా ఉన్న ఆపాదుకలకు నమస్కరించి, దుఃఖితుడై, మంత్రులు మొదలగు ప్రముఖులతో, పౌరులందఱితో ఇట్లనెను. (15)

"ఈ పాదుకలను మా అన్నగారిపాదములుగా గౌరవింతును. పూజ్యములైన ఈ పాదుకలకు ఛత్రమును పట్టుడు, వింజామరలతో వీచుడు. మా అన్నగారి ఈపాదుకలద్వారానే ఈ రాజ్యమునందు ధర్మము సుస్థిరముగా ఉండును. (16)

1) న్యాసము = భద్రముగా రక్షించి, తిరిగి యజమానికి అప్పగింపవలసిన వస్తువు.

భ్రాత్రా హి మయి సంన్యాసో నిక్షిప్తః సౌహృదాదయమ్।
తమిమం పాలయిష్యామి రాఘవాగమనం ప్రతి। 17

క్షిప్రం సంయోజయిత్వా తు రాఘవస్య పునః స్వయమ్।
చరణౌ తౌ తు రామస్య ద్రక్ష్యామి సహపాదుకౌ। 18

తతో నిక్షిప్తభారోఽహం రాఘవేణ సమాగతః।
నివేద్య గురవే రాజ్యం భజిష్యే గురువృత్తితామ్। 19

రాఘవాయ చ సంన్యాసం దత్త్వేమే వరపాదుకే।
రాజ్యం చేదమయోధ్యాం చ ధూతపాపో భవామి చ। 20

అభిషిక్తే తు కాకుత్స్థే ప్రహృష్టముదితే జనే।
ప్రీతిర్మమ యశశ్చైవ భవేద్రాజ్యాచ్చతుర్గుణమ్। 21

ఏవం తు విలపన్ దీనో భరతః స మహాయశాః।
నందిగ్రామేఽకరోద్రాజ్యం దుఃఖితో మంత్రిభిః సహ। 22

స వల్కలజటాధారీ మునివేషధరః ప్రభుః।
నందిగ్రామేఽవసద్వీరః ససైన్యో భరతస్తదా। 23

రామాగమనమాకాంక్షన్ భరతో భ్రాతృవత్సలః।
భ్రాతుర్వచనకారీ చ ప్రతిజ్ఞాపారగస్తథా। 24

మా అన్నయగు శ్రీరాముడు మిక్కిలి ప్రేమతో న్యాసరూపమున ఈ రాజ్యభారమును నాపై మోపినాడు. అట్టి ఈ రాజ్యమును ఆ ప్రభువు తన వనవాసదీక్షను ముగించుకొని, ఇచటికి వచ్చువఱకు దీనిని నేను రక్షించుచుందును.[1] (17)

శ్రీరాముడు వనములనుండి తిరిగి వచ్చినపిమ్మట ఆయన పాదములకు ఈ పాదుకలను నేను స్వయముగా తొడిగెదను. అనంతరము పాదుకలను ధరించియున్న ఆ ప్రభువుపాదములను నేను భక్తితో దర్శించెదను. (18)

శ్రీరాముడు తిరిగివచ్చినపిమ్మట ఆయన నాపై ఉంచిన ఈ రాజ్యపాలనభారమును ఆ ప్రభువునకు అప్పగించెదను. తండ్రిని సేవించినట్లు, ఆ మహాత్మునిసేవలో నిమగ్నుడనయ్యెదను. (19)

నాకడ న్యాసముగా ఉంచబడిన ఈ రాజ్యమును, పవిత్రములైన ఈ పాదుకలను, ఈ అయోధ్యను ఆ మహాత్మునకు అప్పగించెదను. కైకేయికారణముగా నాకు వచ్చిన కళంకమునుండి ఆవిధముగా బయట పడెదను. (20)

శ్రీరాముడు కోసలరాజ్యపట్టాభిషిక్తుడైనచో జనులెల్లరును సంతోషముతో పొంగిపోవుదురు. అట్టి సంఘటనవలన నాకు ప్రీతియు, కీర్తిప్రతిష్ఠలును రాజ్యపాలనవలనవచ్చినదానికంటెను నాలుగు రెట్లు లభించును." (21)

మహాయశస్వియైన భరతుడు దుఃఖితుడై, దైన్యముతో ఇట్లు విలపించెను. పిదప నందిగ్రామమునందేయుండి, మంత్రులతోగూడి కోసలరాజ్యమును పరిపాలింపసాగెను. సర్వసమర్థుడును, వీరుడును ఐన ఆ భరతుడు నారచీరలను, జడలను ధరించి, మునివేషధారియై, సైన్యములతో సహా నందిగ్రామమునందే నివసింపదొడంగెను. (22-23)

అపూర్వమైన సోదరప్రేమగల భరతుడు శ్రీరామునిరాకకై నిరీక్షించుచు, ఆయనఆజ్ఞలను అనుసరించుచు, తన ప్రతిజ్ఞను నిలబెట్టుకొనుచుండెను. ఆ పాదుకలకు పట్టాభిషేకమొనర్చి, పిమ్మట

1) శ్రీరామునియందును, ఆయనకు ప్రాతినిధ్యమువహించెడి పూజ్యపాదుకలయెడలనుగల భరతునిభక్తిశ్రద్ధలను చక్కగా ఆవిష్కరించుచు - శ్రీ తులసీదాసు మహాకవి రచించిన ఈ అమృతవచనములు అవశ్యపఠనీయములు -
భరతుడు నిత్యము శ్రీరామునిపాదుకలను పూజించి, పొంగిపొరలుచున్న ప్రేమభావముతో వాటిఆజ్ఞతో రాజ్యకార్యములను నిర్వహించుచుండెను. (దో॥ 325)
భరతుని హృదయమున సర్వదా శ్రీ సీతారాములు వసించుచుండిరి. ఆతనినాలుకపై రామనామజపము సాగుచునే యుండెను. దానిచే తనువు పులకరించుచుండెను. నేత్రములు ఆనందాశ్రుపూర్ణములగుచుండెను. శ్రీ సీతారామలక్ష్మణులు వనములలో నివసించుచుండిరి. కాని భరతుడు ఇంటిలోనే తపస్సు చేయుచు శరీరమును శుష్కింపజేయుచుండెను. ఆ ఉభయుల (శ్రీరామ-భరతుల) పరిస్థితులను మనస్సునకు తెచ్చుకొని, ప్రజలు 'భరతుడు అన్నివిధముల శ్లాఘనీయుడు' అనియనుచుండిరి. అతని నియమవ్రతములను విని, సాధుపుంగవులు సిగ్గుపడుచుండిరి. అతనిప్రేమనిష్ఠను జూచి మునులుగూడ లజ్జతో తలలు వంచుకొనుచుండిరి. భరతునిఆచరణము పరమపవిత్రము, మధురము, మనోహరము, ఆనందప్రదము. అది కలియుగ పాపములను, క్లేశములను తొలగించునది. మహామోహమనెడి చిమ్మచీకట్లను పటాపంచలుచేయుటలో సూర్యునివంటిది. అలవికానివిధానమను పాపసమూహములనెడు ఏనుగులపాలిటి సింహము. అది సర్వసంతాపహరము, భక్తులకు ఆనందదాయకము, సంసారబంధములనుండి ముక్తిని ప్రసాదించును. అది శ్రీరామచంద్రభక్తిరసామృతప్లావితము.-(అయోధ్యాకాండమునకు భరతుని చరితమే పట్టుగొమ్మ.)

పాదుకే త్వభిషిచ్యాథ నందిగ్రామేఽవసత్ తదా।
సవాలవ్యజనం ఛత్రం ధారయామాస స స్వయమ్।
భరతశ్శాసనం సర్వం పాదుకాభ్యాం న్యవేదయత్। 25

అతడు నందిగ్రామమునందే నివసింపసాగెను. భరతుడు స్వయముగా ఆ పాదుకలకు వింజామరలతో వీచుచు, ఛత్రము పట్టుచు వాటిని సేవించుచుండెను. రాజ్యపాలనాది కార్యములను అన్నింటిని అతడు ఆ పాదుకలకు నివేదించుచుండెను. (24-25)

తతస్తు భరతః శ్రీమాన్ అభిషిచ్యాఽఽర్యపాదుకే।
తదధీనస్తదా రాజ్యం కారయామాస సర్వదా। 26

వినయసంపన్నుడైన భరతుడు శ్రీరాముని పాదుకలకు పట్టాభిషేకము చేసినయనంతరము సర్వదా వాటికి అధీనుడై రాజ్యకార్యములను నిర్వర్తింపసాగెను. (26)

తదా హి యత్కార్యముపైతి కించిత్
ఉపాయనం చోపహృతం మహార్హమ్ ।
స పాదుకాభ్యాం ప్రథమం నివేద్య
చకార పశ్చాద్భరతో యథావత్ । 27

భరతుడు ప్రతికార్యమునుగుఱించియు ఆ పాదుకలకు నివేదించుచుండెడివాడు. వచ్చిన కానుకలన్నింటిని వాటికే సమర్పించుచుండెడివాడు. అనంతరము తగిన పద్ధతులలో పరిపాలనను కొనసాగించుచుండెడివాడు. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే పంచదశోత్తరశతతమస్సర్గః (115)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపదునైదవసర్గము సమాప్తము

-- * * * --

116. నూటపదునాఱవసర్గము

ఋషులందఱును కులపతితోగూడి చిత్రకూటమును వీడి వెళ్లుట.

ప్రతిప్రయాతే భరతే వసన్ రామస్తపోవనే।
లక్షయామాస సోద్వేగమ్ అథౌత్సుక్యం తపస్వినామ్। 1

భరతుడు అయోధ్యకు మఱలి వెళ్లిన పిమ్మట శ్రీరాముడు కొంతకాలము ఆవనమునందే నివసించుచుండెను. ఆసమయమున అచటి తాపసులు భయపడుచున్నట్లును, వారు ఆ ప్రదేశమును విడిచిపెట్టిపోవుటకు అభిలషించుచున్నట్లును (వారిముఖకవళికలు, సంభాషణలు మున్నగు వానిని బట్టి) అతడు గమనించెను. (1)

యే తత్ర చిత్రకూటస్య పురస్తాత్ తాపసాశ్రమే।
రామమాశ్రిత్య నిరతాః తానలక్షయదుత్సుకాన్। 2

ఇంతవఱకును శ్రీరాముని ఆశ్రయించి, ఆ చిత్రకూటమునగల ఆశ్రమమునందే ఆసక్తితో నివసించుచున్న ఆ తాపసులు ఎందులకో తత్తఱపడుచున్నట్లు ఆ ప్రభువు గమనించెను. (2)

నయనైర్భృకుటీభిశ్చ రామం నిర్దిశ్య శంకితాః।
అన్యోన్యముపజల్పంతః శనైశ్చక్రుః మిథః కథాః। 3

వారు (తమభయకారణములను సూటిగా శ్రీరామునకు తెలుపుటకు) జంకుచు, కనుసైగలతోను, బొమముడులవిఱుపులతోను రాముని జూపుచు తమలోతాము రహస్యముగా ఏమేమో మాట్లాడుకొనుచుండిరి. (3)

తేషామౌత్సుక్యమాలక్ష్య రామస్త్వాత్మని శంకితః।
కృతాంజలిరువాచేదమ్ ఋషిం కులపతిం తతః। 4

అంతట శ్రీరాముడు వారిలోనిఉత్కంఠను గమనించి, తన వలన వారికేమైనను కష్టము కలిగినదా? అని శంకించెను. అనంతరము అతడు కులపతియైన[1] ఒక మహర్షికడకేగి కృతాంజలియై ఆయనతో ఇట్లు నుడివెను. (4)

న కచ్చిద్భగవన్ కించిత్ పూర్వవృత్తమిదం మయి।
దృశ్యతే వికృతం యేన విక్రియంతే తపస్వినః। 5

"ఓ పూజ్యమహర్షీ! నా విషయమున ఇచటి మునులవైఖరిలో ఏదియో మార్పుకనబడుచున్నది. ఇంతవఱకును నా ప్రవర్తనలో ఏదైనా దోషము వాటిల్ల లేదుగదా? (5)

ప్రమాదాచ్చరితం కచ్చిత్ కించిన్నావరజస్య మే।
లక్ష్మణస్యర్షిభిర్దృష్టం నానురూపమివాత్మనః। 6

నా తమ్ముడైన లక్ష్మణునిప్రవర్తనలో అతనికి తగనిరీతిలో ఏకొంచెముగానైనను ఏదైనా అపరాధము జరిగినదా? (6)

1) కులపతి = వేయిమంది శిష్యులు (విద్యార్థులు) గలవాడు.

కచ్చిచ్ఛుశ్రూషమాణా వః శుశ్రూషణపరా మయి।
ప్రమ(మా)దాఽభ్యుచితాం వృత్తిం సీతా యుక్తం న వర్తతే। 7

అథర్షిర్జరయా వృద్ధః తపసా చ జరాం గతః।
వేపమాన ఇవోవాచ రామం భూతదయాపరమ్। 8

కుతః కల్యాణసత్త్వాయాః కల్యాణాభిరతేస్తథా।
చలనం తాత! వైదేహ్యాః తపస్విషు విశేషతః। 9

త్వన్నిమిత్తమిదం తావత్ తాపసాన్ ప్రతివర్తతే।
రక్షోభ్యస్తేన సంవిగ్నాః కథయంతి మిథః కథా। 10

రావణావరజః కశ్చిత్ ఖరో నామేహ రాక్షసః।
ఉత్పాట్య తాపసాన్ సర్వాన్ జనస్థాననికేతనాన్। 11

ధృష్టశ్చ జితకాశీ చ నృశంసః పురుషాదకః।
అవలిప్తశ్చ పాపశ్చ త్వాం చ తాత! న మృష్యతే। 12

త్వం యదాప్రభృతి హ్యస్మిన్ ఆశ్రమే తాత! వర్తసే।
తదా ప్రభృతి రక్షాంసి విప్రకుర్వంతి తాపసాన్। 13

దర్శయంతి హి బీభత్సైః క్రూరైర్భీషణకైరపి।
నానారూపైర్విరూపైశ్చ రూపైర్వికృతదర్శనైః। 14

అప్రశస్తైరశుచిభిః సంప్రయోజ్య చ తాపసాన్।
ప్రతిఘ్నంత్యపరాన్ క్షిప్రమ్ అనార్యాః పురతః స్థితాః। 15

తేషు తేష్వాశ్రమస్థానేష్వబుద్ధమవలీయ చ।
రమంతే తాపసాంస్తత్ర నాశయంతోఽల్పచేతసః। 16

అవక్షిపంతి స్రుగ్భాండాన్ అగ్నీన్ సించంతి వారిణా।
కలశాంశ్చ ప్రమృద్నంతి హవనే సముపస్థితే। 17

తైర్దురాత్మభిరామృష్టాన్ ఆశ్రమాన్ ప్రజిహాసవః।
గమనాయాన్యదేశస్య చోదయన్త్యృషయోఽద్య మామ్। 18

స్త్రీసహజమైనరీతిలో నాయెడ సేవానిరతిగల సీత మీకు అర్ఘ్యపాద్యాదిసేవలొనర్చుచున్నప్పుడు ఏమరుపాటువలన లోపము లేవియును వాటిల్లలేదుగదా?" (7)

ఏదుమున్ప్రచే వృద్ధుడును, దీర్ఘకాలము తపమొనర్చినవాడును నగు ఆ మహర్షి శ్రీరాముని మాటలను విని, భూతదయాపరుడైన ఆ ప్రభువుతో వణకుచు ఇట్లు పలికెను. (8)

"నాయనా! రామా! సీతాదేవి సహజముగా పవిత్రస్వభావము గలది, శుభములను గూర్చుటలో నిరతురాలు. అట్టి సాధ్వివిషయమున ధర్మలోపము అసంభవము. అందునా ధర్మజీవనులైన తాపసులను సేవించు విషయమున ఆమెవలన ఎట్టి లోపమూ జరుగనే జరుగదు. (9)

మీరు ఈ వనమున నివసించుచున్నప్పటినుండియు రాక్షసుల ఆగడములు మితిమీరినవి. అందువలన తాపసులు భయకంపితులై కర్తవ్యమునుగూర్చి రహస్యముగా వారిలో వారు గుసగుసలాడుకొను చున్నారు. (10)

రావణుని తమ్ముడగు, 'ఖరుడు' అను పేరుగల ఒకానొక రాక్షసుడు దండకారణ్యమున నివసించుచు తపస్సుచేసికొనుచున్న మునులను అందరిని పెక్కురీతుల బాధించుచున్నాడు. అతడు మిగుల పొగరుబోతు, తనను ఇచట ఎదిరింపగలవారు ఎవ్వరును లేరని మదించియున్నవాడు, క్రూరుడు, నరమాంసభక్షకుడు, అహంకారి, మహాపాపి, అతడు ఇచట నీ ఉనికినిగూడ సహించుట లేదు- (11-12)

ఓ రామా! ఈ ఆశ్రమమున మీరు వసించుచున్నప్పటినుండియు రాక్షసులు తాపసులను మిక్కిలి బాధించుచున్నారు. (13)

ఆ రాక్షసులు వికృతములైన వివిధ రూపములతో కనబడుచు తాపసులను భయకంపితులను జేయుచున్నారు. వారియొక్క ఆ రూపములు రోతపుట్టించునవి, క్రూరములైనవి, భయంకరములైనవి, లోకమున అసహజములైనవి, ఆ రాక్షసులు మునులయెదుట నిలిచి, అమంగళకరములైన, అపవిత్రములైన పదార్థములను వారిపై చల్లుచున్నారు. మఱికొందరిని హతమార్చుచున్నారు- (14-15)

నీచబుద్ధిగల ఆ రాక్షసులు ఆయా ఆశ్రమప్రదేశములయందు చాటుమాటుగా దాగియుండి, అదను చూచి, తాపసులను చంపుచు వికృతానందమును పొందుచున్నారు. (16)

మునీశ్వరులు యజ్ఞకార్యములను ప్రారంభింపగనే వారు అచటికి చేరి, స్రుక్కు, స్రువము మొదలగు హోమ సాధనములను చిందరవందరగా విసరివేయుచున్నారు. నీటితో హోమాగ్నులను చల్లార్చుచున్నారు. కలశములను ముక్కలు ముక్కలుగా చేయుచున్నారు. (17)

దుర్మార్గులైన రాక్షసులు ఆక్రమించిన ఆశ్రమములను విడిచిపెట్టి, ఇతరప్రదేశములకు వెళ్లగోరుచు ఈ మునులు నేడు నన్ను ఒత్తిడి చేయుచున్నారు. (18)

తత్పురా రామ! శారీరామ్ ఉపహింసాం తపస్విషు।
దర్శయంతి హి దుష్టాస్తే త్యక్ష్యామ ఇమమాశ్రమమ్॥ 19

ఈ దుష్టరాక్షసులు తపోజీవనులమైన మమ్ము ఇంకను చిత్రహింసలపాలు చేయకముందే మేము ఈ ఆశ్రమములను విడిచివెళ్లెదము. (19)

బహుమూలఫలం చిత్రమ్ అతిదూరాదితో వనమ్।
పురాణాశ్రమమేవాహం శ్రయిష్యే సగణః పునః॥ 20

ఓరామా! ఇచటికి కొలది దూరములో ఒక ప్రాచీనమైన వనము గలదు. ఆ చిత్రమైన ప్రదేశమున కందమూల ఫలములు పుష్కలముగా లభించును. కనుక నేను తోడితాపసులతోగూడి అచటి ఆశ్రమమును ఆశ్రయింపెదను. (20)

ఖరస్త్వయ్యపి చాయుక్తం పురా తాత! ప్రవర్తతే।
సహాస్మాభిరితో గచ్ఛ యది బుద్ధిః ప్రవర్తతే॥ 21

నాయనా! శ్రీరామా! రాక్షసుడైన ఖరుడు నీ విషయమునగూడ అనుచితముగా ప్రవర్తింపవచ్చును. అట్టి దుస్థితి ఎదురుకాక ముందే మీకును నచ్చినచో మాతోగూడి మీరును అచటికి విచ్చేయుడు. (21)

సకళత్రస్య సందేహో నిత్యం యత్తస్య రాఘవ!।
సమర్థస్యాపి హి సతో వాసో దుఃఖమిహాద్య తే॥ 22

ఓ రఘువరా! నీవు ఎల్లప్పుడును సావధానుడవై యుందువు. అంతేగాదు రాక్షసులను హతమార్చుటలో నీవు సర్వసమర్థుడవు. ఐనను ఈ ప్రదేశమున భార్యతోగూడి నివసించుచున్న నీకు ఆపదలు రావని చెప్పజాలము. అట్టిస్థితిలో ఇచట నివసించుట కష్టమే సుమా!" (22)

ఇత్యుక్తవంతం రామస్తం రాజపుత్రస్తపస్వినమ్।
న శశాకోత్తరైర్వాక్యైః అవరోద్ధుం సముత్సుకమ్॥ 23

రణమునందు శత్రువులను నిర్మూలించుటలో ఉత్సాహము కలవాడును రాజకుమారుడును ఐన శ్రీరాముడు ఆ విధముగా పలుకుచున్న ఆ తపస్వికి 'ఇచటనేను మీకు అండగానుండగా మీకు భయమెందులకు? మిమ్ములందఱను నేను అన్ని విధములుగా రక్షింపగలను'- అని అభయమిచ్చెను. ఐనను అతడు వారిని ఆపజాలకపోయెను. (23)

అభినంద్య సమాపృచ్ఛ్య సమాధాయ చ రాఘవమ్।
స జగామాఽశ్రమం త్యక్త్వా కులైః కులపతిః సహ॥ 24

అంతట ఆ మహర్షి (కులపతి) శ్రీరాముని అభినందించి, సమాధానపఱచి, ఆయన అనుమతిని దీసికొని, తనతోడితాపసులతో గూడి, అచటి తనఆశ్రమమును విడిచిపెట్టి వెళ్లెను. (24)

రామః సంసాధ్యత్వృషిగణమనుగమనాత్
దేశాత్ తస్మాత్ కులపతిమభివాద్య ఋషిమ్।
సమ్యక్ ప్రీతైస్తైరనుమత ఉపదిష్టార్థః
పుణ్యం వాసాయ స్వనిలయముపసంపేదే॥ 25

శ్రీరాముడు వారిని అనుసరించి కొంతదూరము వెళ్లెను. వారు ఉపదేశించిన విషయములను పూర్తిగా గ్రహించెను. పిదప కులపతికి నమస్కరించి, ఆ ఋషులందఱిని వీడ్కొలిపి, వారి అనుమతితో పవిత్రమైన తన పర్ణశాలకు చేరెను. (25)

ఆశ్రమం త్వృషివిరహితం ప్రభుః
క్షణమపి న జహౌ స రాఘవః।
రాఘవం హి సతతమనుగతాః
తాపసాశ్చార్షచరితధృతగుణాః॥ 26

ఋషుల సంప్రదాయజీవనమునకు తగిన గుణగణములుగల ఆ తాపసులు నిరంతరము శ్రీరాముని అనుసరించియే యుండెడి వారు. శ్రీరాముడు తాపసులు లేకుండా ఆ ఆశ్రమమున ఒక్క క్షణముగూడ గడిపియెఱుగడు. అనగా శ్రీరాముని ఆశ్రమము ఎల్లప్పుడును ఋషులచే నిండియుండెడిది. వారు ఆ ప్రదేశమును విడిచివెళ్లినను శ్రీరాముని రూపవైభవము, గుణగణములు సర్వదా వారిమనస్సులలో మెదలుచునేయుండెను. శ్రీరామునకును ఋషులకును మధ్యగల అవినాభావసంబంధము అట్టిది. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే షోడశోత్తరశతతమస్సర్గః (116)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపదునాఱవసర్గము సమాప్తము

-- * * * --

117. నూటపదునేడవసర్గము

శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై అత్రిమహర్ష్యాశ్రమమునకు చేరుట - ఆ మహాముని వారికి స్వాగతమర్యాదలను నెఱపి, అనసూయాదేవి తపఃప్రభావమును దెల్పుట - అనసూయాదేవి సీతాదేవికి స్త్రీధర్మములనుగూర్చి వివరించుట.

రాఘవస్త్వథ యాతేషు తపస్విషు విచింతయన్।
న తత్రారోచయద్వాసం కారణైర్బహుభిస్తదా। 1

ఋషులందఱును ఆ ఆశ్రమమును విడిచి వెళ్ళగా శ్రీరాముడు పరిపరివిధముల ఆలోచింపసాగెను. అప్పుడు అనేకకారణములవలన అక్కడ నివసించుటకు ఆయనకు సమ్మతముగాకుండెను. (1)

ఇహ మే భరతో దృష్టో మాతరశ్చ సనాగరాః।
సా చ మే స్మృతిరన్వేతి తాన్ నిత్యమనుశోచతః। 2

స్కంధావారనివేశేన తేన తస్య మహాత్మనః।
హయహస్తికరీషైశ్చ ఉపమర్దః కృతో భృశమ్। 3

తస్మాదన్యత్ర గచ్ఛామ ఇతి సంచింత్య రాఘవః।
ప్రాతిష్ఠత స వైదేహ్యా లక్ష్మణేన చ సంగతః। 4

'భరతుడును, కౌసల్యాదేవి మొదలగు తల్లులును, పౌరులు మున్నగువారందఱును నన్ను ఇచ్చటనే కలిసికొనిరి. కావున వారి స్మృతులు నన్ను నిరంతరము వెంటాడుచున్నవి. నేనును వారిని గూర్చియే చింతించుచున్నాను. మహాత్ముడైన భరతునిసేనాశిబిరములు ఈ ప్రదేశమునందే ఏర్పాటు చేయబడినవి. అందువలన గజముల పేడలతోడను, గుఱ్ఱములలద్దెలతోడను ఈ ప్రదేశమంతయును మిగుల అపవిత్రమైనది. కాబట్టి మఱియొక చోటునకు వెళ్ళుటయే యుక్తము.' అని నిశ్చయించుకొని, శ్రీరాముడు సీతాలక్ష్మణులతో గూడి అచటినుండి బయలుదేఱెను. (2-4)

సోఽత్రేరాశ్రమమాసాద్య తం వవందే మహాయశాః।
తం చాపి భగవానత్రిః పుత్రవత్ ప్రత్యపద్యత। 5

పిమ్మట మహాయశస్వియైన ఆ రాఘవుడు అత్రిమహాముని ఆశ్రమమునకు చేరి, ఆయనకు ప్రణమిల్లెను. అప్పుడు ఆ మహర్షియు శ్రీరాముని తనపుత్రునివలె ప్రేమతో ఆదరించెను. (5)

స్వయమాతిథ్యమాదిశ్య సర్వమస్య సుసత్కృతమ్।
సౌమిత్రిం చ మహాభాగాం సీతాం చ సమసాంత్వయత్। 6

పిమ్మట ఆ అత్రిమహాముని శ్రీరామునకు స్వయముగా సమస్తమైన అతిథిసత్కారములను నెఱపెను- మఱియు లక్ష్మణుని, పూజ్యురాలైన సీతాదేవిని సముచితరీతిలో ఓదార్చెను. (6)

పత్నీం చ సమనుప్రాప్తాం వృద్ధామామంత్ర్య సత్కృతామ్।
సాంత్వయామాస ధర్మజ్ఞః సర్వభూతహితే రతః। 7

అనసూయాం మహాభాగాం తాపసీం ధర్మచారిణీమ్।
ప్రతిగృహ్ణీష్వ వైదేహీమ్ అబ్రవీదృషిసత్తమః।
రామాయ చాఽఽచచక్షే తాం తాపసీం ధర్మచారిణీమ్। 8

సకలధర్మములను చక్కగా ఎఱిగినవాడును, సమస్తప్రాణులకును మేలునుగూర్చుటయందే నిరతుడైయుండువాడును ఐన అత్రిమహాముని వృద్ధురాలైన తనపత్నియగు అనసూయాదేవి అచ్చటికి విచ్చేయగా ఆమెను సగౌరవముగా ఆహ్వానించెను. పిదప ఆమెసమక్షమున ఆ ముని సీతారామలక్ష్మణులను ఎంతయు ఓదార్చెను.- పిమ్మట ఆ ఋషీశ్వరుడు ధర్మప్రవర్తన గలదియు, తపమొనరించు చుండునదియు, మహాత్మురాలును ఐన అనసూయాదేవితో 'ఈ విదేహరాజకుమార్తెయైన సీతాదేవిని లోనికి తీసికొని వెళ్ళుము." అని పల్కెను- ధర్మాత్మురాలును, తపస్వినియు అగు అనసూయాదేవినిగూర్చి శ్రీరామునకు ఇట్లు వివరించెను. (7-8)

దశవర్షాణ్యనావృష్ట్యా దగ్ధే లోకే నిరంతరమ్।
యయా మూలఫలే సృష్టే జాహ్నవీ చ ప్రవర్తితా। 9

ఉగ్రేణ తపసా యుక్తా నియమైశ్చాప్యలంకృతా।
దశవర్షసహస్రాణి యయా తప్తం మహత్తపః। 10

"ఓ పుణ్యాత్ముడా! ఒకానొకసమయమున వరుసగా పది సంవత్సరములపాటు వర్షములు కురియక కఱవుకాటకములు ఏర్పడెను. లోకములన్నియును తినుటకు తిండిలేక, త్రాగుటకు నీరులేక మలమలమాడిపోయెను. అప్పుడు ఈ అనసూయాదేవి కఠోరములైన నియమములతో తీవ్రమైన తపస్సొనర్చి, తన తపఃప్రభావముచే కందమూలఫలములను సృష్టించుటయేగాక,

అనసూయా వ్రతైః స్నాత్వా ప్రత్యూహాశ్చ నివర్తితాః ।
దేవకార్యనిమిత్తం చ యయా సంత్వరమాణయా ।
దశరాత్రం కృతా రాత్రిః సేయం మాతేవ తేఽనఘ । 11

తామిమాం సర్వభూతానాం నమస్కార్యాం యశస్వినీమ్ ।
అభిగచ్ఛతు వైదేహీ వృద్ధామక్రోధనాం సదా ।
అనసూయేతి యా లోకే కర్మభిః ఖ్యాతిమాగతా । 12

ఏవం బ్రువాణం తం ఋషిం తథేత్యుక్త్వా స రాఘవః ।
సీతామువాచ ధర్మజ్ఞామ్ ఇదం వచనముత్తమమ్ । 13

రాజపుత్రి! శ్రుతమిదం మునేరస్య సమీరితమ్ ।
శ్రేయోఽర్థమాత్మనః శీఘ్రమ్ అభిగచ్ఛ తపస్వినీమ్ । 14

సీతా త్వేతద్వచః శ్రుత్వా రాఘవస్య హితైషిణః ।
తామత్రిపత్నీం ధర్మజ్ఞామ్ అభిచక్రామ మైథిలీ । 15

శిథిలాం వలితాం వృద్ధాం జరాపాండురమూర్ధజామ్ ।
సతతం వేపమానాంగీం ప్రవాతే కదలీ యథా । 16

తాం తు సీతా మహాభాగామ్ అనసూయాం పతివ్రతామ్ ।
అభ్యవాదయదవ్యగ్రా స్వనామ సముదాహరత్ । 17

అభివాద్య చ వైదేహీ తాపసీం తామనిందితామ్ ।
బద్ధాంజలిపుటా హృష్టా పర్యపృచ్ఛదనామయమ్ । 18

తతః సీతాం మహాభాగాం దృష్ట్వా తాం ధర్మచారిణీమ్ ।
సాంత్వయంత్యబ్రవీత్ హృష్టా దిష్ట్యా ధర్మమవేక్షసే । 19

త్యక్త్వా జ్ఞాతిజనం సీతే! మానమృద్ధిం చ భామిని! ।
అవరుద్ధం వనే రామం దిష్ట్యా త్వమనుగచ్ఛసి । 20

నగరస్థో వనస్థో వా పాపో వా యది వా శుభః ।
యాసాం స్త్రీణాం ప్రియో భర్తా తాసాం లోకా మహోదయాః । 21

గంగానదిని ప్రవహింపజేసి, లోకముల ఆకలిదప్పులను దీర్చెను. మఱియును ఈమె పదివేలసంవత్సరముల కాలము తీవ్రమైన తపస్సును ఆచరించి, చాంద్రాయణాది వ్రతములను నిర్వర్తించి, వాటి ప్రభావమున ఋషీశ్వరులతపశ్చర్యలకు ఎదురైన విఘ్నములను తొలగించెను. అంతేగాక దేవకార్యనిమిత్తమై ఈమె పదిరాత్రులను ఒకరాత్రిగా మార్చి[1] వారికి సహాయపడెను. ఇట్టి మహాతపస్వినియైన ఈమె నీకు తల్లివంటిది- (9-11)

ఈమె సమస్తప్రాణులకును పూజ్యురాలు. ఎన్నడును కోపమును ఎఱుగని శాంతమూర్తిగా మిగుల కీర్తిగాంచినది. పెద్దముత్తైదువ- ఈమె తనసత్కర్మలచే 'అనసూయ'గా (అసూయలేనిదిగా) ప్రసిద్ధిగాంచినది. విదేహానందినియైన సీతాదేవి ఈమెను అనుసరించుచుండుగాక." (12)

ఆ అత్రిమహాముని ఇట్లు పలుకగా శ్రీరాముడు 'అట్లే' అని పలికి, ధర్మజ్ఞురాలైన సీతాదేవితో ఇట్లు నుడివెను. (13)

"ఓ రాజకుమారీ! ఈ మహర్షిపలుకులను వింటివిగదా! ఇప్పుడు నీశ్రేయస్సుకొఱకై మహాతపస్వినియైన ఈ అనసూయాదేవిని అనుసరింపుము." (14)

మిథిలాధిపతియైన జనకునికూతురగు సీతాదేవి తనహితమును గోరెడి రాముడు పలికిన ఈ మాటలను విని, ధర్మజ్ఞురాలగు అత్రిమహర్షిభార్యను అనుసరించెను. (15)

వృద్ధురాలైన ఆ అనసూయాదేవియొక్క అవయవములు పట్టుదప్పియుండెను. చర్మము ముడుతలు పడియుండెను. తలవెంట్రుకలు నెఱసియుండెను. పెనుగాలికి చలించు అరటి చెట్టువలె ఆమె శరీరాంగములు అనవరతము వణకిపోవుచుండెను. పతివ్రతయు, మహాత్మురాలును ఐన ఆ అనసూయాదేవికి తనపేరును తెల్పుచు సీతాదేవి మిక్కిలి భక్తిశ్రద్ధలతో నమస్కరించెను. (16-17)

పూజ్యురాలును, తపస్వినియు ఐన ఆ అనసూయాదేవికి వైదేహి వినయముతో దోసిలొగ్గి, నమస్కరించి, ఆమె క్షేమసమాచారములను గూర్చి అడిగెను- (18)

అంతట ఆ అనసూయాదేవి ధర్మనిరతయు, మహాత్మురాలును ఐన సీతాదేవిని గాంచి, ఆమెను ఓదార్చుచు సంతోషముతో ఇట్లు పలికెను. "సీతా! నీవు మిక్కిలి అదృష్టవంతురాలవు. ధర్మమార్గమును అనుసరించుచున్నావు. 'ఓ భామినీ! నీవు బంధువులను, అభిమానమును, వివిధసంపదలను త్యజించి, వనములకు పంపబడిన నీభర్తయగు రాముని అనుసరించుచున్న భాగ్యశాలినివి. తనభర్త నగరమునందున్నను, వనములపాలైనను, దుర్మార్గుడైనను,

1) ఒకానొకసారి మాండవ్యమహాముని 'శాండిలి' అను తపస్వినిని 'నీవు పదిదినములలోగా ఒక ప్రాతఃకాలమున వైధవ్యమును పొందుదువు' అని శపించెను. ఆ శాండిలి అనసూయాదేవికి ఆత్మీయురాలు. మాండవ్యముని ఇచ్చిన శాపమునకు ప్రతీకారముగా 'ఇక సూర్యోదయమే కాకుండుగాక' అని శాండిలి ప్రతిశాపమునిచ్చెను. దీనికి దేవతలందఱును భయభ్రాంతులై అనసూయాదేవిని శరణుజొచ్చిరి. ఆమె తనతపోమహిమచే పదిరాత్రులను ఒక్కరాత్రిగా జేసెను. ఆ విధముగా ఆమె శాండిలిభర్తప్రాణములను కాపాడి, దేవతలకోరికను దీర్చెను.

దుశ్శీలః కామవృత్తో వా ధనైర్వా పరివర్జితః।
స్త్రీణామార్యస్వభావానాం పరమం దైవతం పతిః। 22

నాతో విశిష్టం పశ్యామి బాంధవం విమృశంత్యహమ్।
సర్వత్ర యోగ్యం వైదేహి! తపః కృతమివావ్యయమ్। 23

న త్వేవమవగచ్ఛంతి గుణదోషమసత్ స్త్రియః।
కామవక్తవ్యహృదయా భర్తృనాథాశ్చరంతి యాః। 24

ప్రాప్నువంత్యయశశ్చైవ ధర్మభ్రంశం చ మైథిలి।
అకార్యవశమాపన్నాః స్త్రియో యాః ఖలు తద్విధాః। 25

త్వద్విధాస్తు గుణైర్యుక్తా దృష్టలోకపరావరాః।
స్త్రియః స్వర్గే చరిష్యంతి యథాధర్మకృతస్తథా। 26

తదేవమేనం త్వమనువ్రతా సతీ
పతివ్రతానాం సమయానువర్తినీ ।
భవ స్వభర్తుః సహధర్మచారిణీ
యశశ్చ ధర్మం చ తత స్సమాప్స్యసి । 27

సన్మార్గుడైనను (అతడు ఎట్టివాడైనను) అతనిని ప్రేమతో అనుసరించు స్త్రీకి ఉత్తమలోకములు ప్రాప్తించును. (అభ్యుదయ పరంపర సిద్ధించును). పతి చెడుస్వభావముగలవాడైనను, స్వేచ్ఛాచారియైనను, ధనహీనుడైనను ఉత్తమ స్వభావముగల స్త్రీకి అతడే దైవము- ఓ వైదేహీ! నేను ఎంతగానో ఆలోచించి చూచితిని. కానీ భర్తను మించిన హితకారియైన ఆత్మీయుడు నాకు కనబడుటలేదు. మనమొనర్చిన తపస్సువలన లభించెడి శాశ్వత(మహా) ఫలము వలె భర్త సర్వావస్థలయందును భార్యను రక్షించుచు ఇహపర సుఖములను చేకూర్చును- (19-23)

ఓ సీతా! కామాతురలైన దుష్టస్త్రీలు పరపురుషులను కాంక్షించు చుందురు. వారు భర్తలమాటలను లెక్క పెట్టరు. పైగా వారిని శాసించుచుందురు. మంచిచెడ్డల విచక్షణలేక వారు విచ్చలవిడిగా ప్రవర్తించుచుందురు. ఓ మైథిలీ! అట్టి స్త్రీలు అనుచితమైన కార్యములకు పాల్పడి ధర్మభ్రష్టలగుదురు. అందువలన వారు ఈ లోకమున శాశ్వతమైన అపకీర్తిని మూటగట్టుకొందురు- (24-25)

సద్గుణవతులు, లోకమునందలి మంచిచెడ్డలను బాగుగా ఎఱిగిన వారు ఐనట్టి నీవంటి ఉత్తమస్త్రీలు ధర్మమార్గమునను‌సరించు వనితలవలె స్వర్గమున విహరించుచుందురు. (26)

ఓ సీతా! అందువలన నీవు నీపతిదేవుడైన ఈ శ్రీరాముని సేవలయందే నిమగ్నవైయుండుము. పతివ్రతాధర్మములను పాటించు చుండుము. నీ భర్తకు సహధర్మచారిణివైయుండుము. తత్ఫలితముగా నీవు చక్కని కీర్తిప్రతిష్ఠలను, ఉత్తమధర్మఫలములను పొందగలవు- (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే సప్తదశోత్తరశతతమస్సర్గః (117)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపదునేడవసర్గము సమాప్తము

-- * * * --

118. నూటపదునెనిమిదవసర్గము

అనసూయాదేవి సీతాదేవికి దివ్యములైన అంగరాగములను వస్త్రాభరణాదులను కానుకలుగా సమర్పించుట - ఆ ఋషిపత్ని కోరికపై సీతాదేవి తన వివాహగాథను వివరించుట.

సా త్వేవముక్తా వైదేహీ త్వనసూయాఽనసూయయా।
ప్రతిపూజ్య వచో మందం ప్రవక్తుముపచక్రమే। 1

నైతదాశ్చర్యమార్యాయా యన్మాం త్వమభిభాషసే।
విదితం తు మమాప్యేతత్ యథా నార్యాః పతిర్గురుః। 2

యద్యప్యేష భవేద్భర్తా మమాఽఽర్యే! వృత్తవర్జితః।
అద్వైధముపచర్తవ్యః తథాప్యేష మయా భవేత్। 3

దోషదృష్టిలేని ఆ సీతాదేవి అత్రిపత్నియగు అనసూయాదేవి తెలిపిన ధర్మవచనములను గౌరవించుచు, తిన్నగా ఆమెతో ఇట్లు పలుకదొడంగెను- (1)

"ఓ దేవీ! నీవు లోకమునగల స్త్రీలలో సర్వశ్రేష్ఠురాలవు. నాతో నీవు ఇట్లు పలుకుట ఆశ్చర్యకరముగాదు- 'స్త్రీకి పతియే దైవము' అను విషయమును నేను ఎఱుగుదును- (2)

ఓ పూజ్యురాలా! ఒకవేళ భర్త గుణహీనుడైనను, గుణవంతుడైనను ఆవిషయమున ఎట్టి సంకోచములేకుండా సతికి పతి సేవింపదగినవాడే. ఇక నాభర్తయైన శ్రీరాముని విషయమున చెప్పవలసిన పనియేమి?

కింపునర్యో గుణైః శ్లాఘ్యః సానుక్రోశో జితేంద్రియః।
స్థిరానురాగో ధర్మాత్మా మాతృవత్ పితృవత్ ప్రియః। 4

యాం వృత్తిం వర్తతే రామః కౌసల్యాయాం మహాబలః।
తామేవ నృపనారీణామ్ అన్యాసామపి వర్తతే। 5

సకృద్దృష్టాస్వపి స్త్రీషు నృపేణ నృపవత్సలః।
మాతృవద్వర్తతే వీరో మానముత్సృజ్య ధర్మవిత్। 6

ఆగచ్ఛంత్యాశ్చ విజనం వనమేవం భయావహమ్।
సమాహితం మే శ్వశ్ర్వా చ హృదయే తద్ధృతం మహత్। 7

పాణిప్రదానకాలే చ యత్ పురాత్వగ్నిసన్నిధౌ।
అనుశిష్టా జనన్యాఽస్మి వాక్యం తదపి మే ధృతమ్। 8

నవీకృతం తు తత్ సర్వం వాక్యైస్తే ధర్మచారిణి!।
పతిశుశ్రూషణాన్నార్యాః తపో నాన్యద్విధీయతే। 9

సావిత్రీ పతిశుశ్రూషాం కృత్వా స్వర్గే మహీయతే।
తథావృత్తిశ్చ యాతా త్వం పతిశుశ్రూషయా దివమ్। 10

వరిష్ఠా సర్వనారీణామ్ ఏషా చ దివి దేవతా।
రోహిణీ న వినా చంద్రం ముహూర్తమపి దృశ్యతే। 11

ఏవంవిధాశ్చ ప్రవరాః స్త్రియో భర్తృదృఢవ్రతాః।
దేవలోకే మహీయంతే పుణ్యేన స్వేన కర్మణా। 12

తతోఽనసూయా సంహృష్టా శ్రుత్వోక్తం సీతయా వచః।
శిరస్యాఘ్రాయ చోవాచ మైథిలీం హర్షయంత్యుత। 13

నియమైర్వివిధైరాప్తం తపో హి మహదస్తి మే।
తత్ సంశ్రిత్య బలం సీతే! ఛందయే త్వాం శుచిస్మితే। 14

ఆతనిగుణములు శ్లాఘనీయములు. అతడు దయాళువు, జితేంద్రియుడు, సకలప్రాణులయెడలను దృఢమైన అనురాగము గలవాడు, మీదు మిక్కిలి ధర్మనిరతుడు, తల్లిదండ్రులవలె నాకు అత్యంత ప్రేమాస్పదుడు. కనుక ఆయనను భక్తిశ్రద్ధలతో చక్కగా సేవించెదను. (3-4)

మహాబలశాలియైన శ్రీరాముడు తనకన్నతల్లియైన కౌసల్యాదేవి యెడ చూపెడి భక్తిగౌరవములనే తదితరరాజపత్నులయెడగూడ ప్రదర్శించుచుండును. (5)

శ్రీరాముడు పితృభక్తిగలవాడు. ధర్మజ్ఞుడు. ఆ మహావీరుడు ఒక్కసారియైనను దశరథుని ప్రేమానురాగములకు నోచుకొనిన స్త్రీలను నిస్సంకోచముగా తల్లులనువలె గౌరవించుచుండెడివాడు- (6)

జనసంచారములేక భయంకరమైన ఈ వనములకు నేను బయలుదేరెడి సమయమున మా అత్త కౌసల్యాదేవి నాకు ఇచ్చిన మహోపదేశము ఇప్పటికిని నా హృదయమున పదిలముగానున్నది. (7)

లోగడ వివాహసమయమున అగ్నిసమక్షమున మాజనని నాకు బోధించిన మాటలు నేటికిని నాగుండెలో స్థిరముగా నున్నవి. (8)

ఓ ధర్మాత్మురాలా! నీవు నాతో పలికిన మాటలు మా అత్తగారు, మాతల్లి నాకు చేసిన ఉపదేశములను మరల ఒకసారి జ్ఞప్తికి తెచ్చుచున్నవి. పతిని సేవించుటయే స్త్రీకి గొప్పతపస్సు దానికి మించిన తపస్సు లేనేలేదు. (9)

ఓ దేవీ! మహాసాధ్వియైన సావిత్రి భక్తిశ్రద్ధలతో పతిసేవలొనర్చి, స్వర్గమున సుస్థిరస్థానమును పొందినది- అట్లే నీవును నీ పతిసేవలకు ఫలముగా సద్గతులను పొందుదువు- (10)

నారీలోకమునకే మేలుబంతియు, దివ్యస్వరూపిణియునైన రోహిణి తనపాతివ్రత్యప్రభావముచే ఆకాశమునందు తనభర్తయగు చంద్రుని ఒక్క క్షణమైనను విడిచి ఉండదు. (11)

ఎట్టి సంకటపరిస్థితులలోనైనను పతిసేవలను వ్రతదీక్షతో దృఢముగా ఆచరించునట్టి ఇట్టి వనితారత్నములు తమపవిత్ర కార్యములచేత దేవలోకమునను మిగుల గౌరవాదరములను పొందుచుందురు. (12)

అనంతరము సీతాదేవిపలికిన పలుకులకు అనసూయాదేవి ఎంతయు సంతసించి, ఆమెమూర్ధమును మూర్కొనెను. పిమ్మట ఆమె జానకీదేవిసంతోషమును ఇనుమడింపజేయుచు ఆమెతో మరల ఇట్లు పలికెను. (13)

"ఎల్లప్పుడును చిరునవ్వుతో ఉండెడి ఓ సీతా! నేను దృఢమైన నియమములను పాటించుచు తీవ్రముగా తపమొనరించియుంటిని. ఆ తపశ్శక్తిచే నీవు ఏమి కోరినను ఇయ్యగలను. కనుక నీవు ఒక వరమును కోరుకొనుము. (14)

ఉపపన్నం మనోజ్ఞం చ వచనం తవ మైథిలి।
ప్రీతా చాస్మ్యుచితం కిం తే కరవాణి బ్రవీహి మే। 15

తస్యాస్తద్వచనం శ్రుత్వా విస్మితా మందవిస్మయా।
కృతమిత్యబ్రవీత్ సీతా తపోబలసమన్వితామ్। 16

సా త్వేవముక్తా ధర్మజ్ఞా తయా ప్రీతతరాఽభవత్।
సఫలం చ ప్రహర్షం తే హంత సీతే! కరోమ్యహమ్। 17

ఇదం దివ్యం వరం మాల్యం వస్త్రమాభరణాని చ।
అంగరాగం చ వైదేహి! మహార్హం చానులేపనమ్। 18

మయా దత్తమిదం సీతే! తవ గాత్రాణి శోభయేత్।
అనురూపమసంక్లిష్టం నిత్యమేవ భవిష్యతి। 19

అంగరాగేణ దివ్యేన లిప్తాంగీ జనకాత్మజే!।
శోభయిష్యసి భర్తారం యథా శ్రీర్విష్ణుమవ్యయమ్। 20

సా వస్త్రమంగరాగం చ భూషణాని స్రజస్తథా।
మైథిలీ ప్రతిజగ్రాహ ప్రీతిదానమనుత్తమమ్। 21

ప్రతిగృహ్య చ తత్ సీతా ప్రీతిదానం యశస్వినీ।
శ్లిష్టాంజలిపుటా తత్ర సముపాస్త తపోధనామ్। 22

తథా సీతాముపాసీనామ్ అనసూయా దృఢవ్రతా।
వచనం ప్రష్టుమారేభే కాంచిత్ ప్రియకథామను। 23

స్వయంవరే కిల ప్రాప్తా త్వమనేన యశస్వినా।
రాఘవేణేతి మే సీతే! కథా శ్రుతిముపాగతా। 24

తాం కథాం శ్రోతుమిచ్ఛామి విస్తరేణ చ మైథిలి!।
యథాఽనుభూతం కార్త్స్న్యేన తన్మే త్వం వక్తుమర్హసి। 25

ఓ మైథిలీ! నీవు యుక్తియుక్తముగా పలికిన మధురవచనములకు నేను మిగుల సంతృప్తి చెందితిని. నీకు ఇష్టమగు దానిని కోరుకొనుము. నీ కోర్కెను నేను తీర్చెదను." (15)

అనసూయాదేవి నుడివినమాటలను విని, సీతాదేవి మిగుల ఆశ్చర్యపడెను. అప్పుడామె దరహాసము చేయుచు తపోబలసంపన్నురాలైన ఆ అత్రిమహర్షిపత్నితో 'మీ మధురవచనములతోడనే నా కోరికలన్నియును ఈడేరినవి. ఇంక మీరు నా కొఱకై చేయవలసినది ఏమియును లేదు'-అని పల్కెను. (16)

సీతాదేవి పలికిన మాటలను విని, ఆ అనసూయాదేవి మిక్కిలి సంతసించెను. అనంతరము ఆమె ఇట్లనెను. "ఓ సీతా! ఏమియు కోరని నీ నిస్పృహతకు పరమానందభరితురాలనైతిని. నీవు ఆనందముగ కాంక్షింపకున్నను నీ కార్యసాఫల్యమునకు నేను తప్పక తోడ్పడెదను. (17)

ఓ వైదేహీ! ఈ శ్రేష్ఠములైన మాలలు, వస్త్రములు, ఆభరణములు అంగరాగములు[1] అమూల్యములైన మైపూతలు[2] దివ్యములైనవి. ఇవి నీశరీరమునకు మిగుల తగియున్నవి. ఇవి ఏ మాత్రమూ వసివాడక సర్వదా దర్శనీయములై యుండును. వీటినన్నింటిని నీకు ఇచ్చెదను. ఇవి నీ శరీరమునకు వన్నెతెచ్చును. వీటితో నీ భర్తను సంతోషపఱచగలవు. (18-19)

ఓ జానకీ! ఈ దివ్యములైన అంగరాగములను పూసికొని, నిత్యుడైన శ్రీమహావిష్ణువును లక్ష్మీదేవివలె, నీభర్తను నీవు అలరింప జేయగలవు." (20)

అంతట ఆ సీతాదేవి ప్రీతిపూర్వకముగా ఇయ్యబడిన వస్త్రములను, అంగరాగములను, నగలను, దండలను ఆమెనుండి స్వీకరించెను. యశస్వినియైన సీతాదేవి ఆకానుకలను గ్రహించిన పిమ్మట, దోసిలొగ్గి తపస్వినియైన ఆ అనసూయాదేవిని చక్కని భక్తిశ్రద్ధలతో సేవించెను. (21-22)

నిత్యమూ దీక్షవహించి, వ్రతములను ఆచరించునట్టి ఆ అనసూయ తనసమీపముననే కూర్చొనియున్న సీతాదేవితో 'అమ్మా! నీకు ఇష్టమైన ఏదేని ఒక కథను నాకు వినిపింపుము' అని ఆమెను అడిగెను. (23)

"ఓ సీతా! మిగుల వాసిగాంచిన ఈ శ్రీరాముడు స్వయంవర సభలో నిన్ను అర్ధాంగిగా పొందినట్లు నేను వింటిని. ఆ కథను నేను సవిస్తరముగా వినగోరుచున్నాను. దానిని యథాతథముగ పూర్తిగా నాకు తెలుపుము." (24-25)

1) అంగరాగములు = అంగములను రంజింపజేయునవి, కుంకుమ చందనాదులు.

2) అనులేపనములు = మైపూతలు, కర్పూరము, అగరు, కస్తూరి, తక్కోలము మొదలగు పరిమళ ద్రవ్యములు.

ఏవముక్తా తు సా సీతా తాం తతో ధర్మచారిణీమ్।
శ్రూయతామితి చోక్త్వా వై కథయామాస తాం కథామ్। 26

అనసూయాదేవి ఇట్లు వేడుకపడగా, అంతట సీతాదేవి 'ఓ తల్లీ! తెల్పెదను వినుము' అని ధర్మనిరతురాలైన ఆమెతో పలికి - తన వివాహగాథనుగూర్చి ఆమెకు వివరింపదొడంగెను. (26)

మిథిలాధిపతిర్వీరో జనకో నామ ధర్మవిత్।
క్షత్రధర్మే హ్యభిరతో న్యాయతః శాస్తి మేదినీమ్। 27

"జనకుడను మహారాజు మిథిలానగరమునకు ప్రభువు. అతడు మహావీరుడు. గొప్ప ధర్మవేత్త, క్షత్రియధర్మమునందు మిగుల నిరతుడు. ఆ ప్రభువు తనరాజ్యమును ప్రజానురంజకముగా ధర్మముగా పరిపాలించుచుండెడివాడు. (27)

తస్య లాంగలహస్తస్య కర్షతః క్షేత్రమండలమ్।
అహం కిలోత్థితా భిత్త్వా జగతీం నృపతేః సుతా। 28

స మాం దృష్ట్వా నరపతిః ముష్టివిక్షేపతత్పరః।
పాంసుకుంఠితసర్వాంగీం జనకో విస్మితోఽభవత్। 29

ఒకానొక సమయమున ఆమహారాజు యజ్ఞము చేయగోరి, దానికి అనువగు క్షేత్రమును (యజనస్థానమును) తాను స్వయముగా మేడి కఱ్ఱను పట్టుకొని నాగలితో దున్నసాగెను. అప్పుడు నేను భూమిని చీల్చుకొని బయటికి వచ్చితినట- ఆ విధముగానేను ఆ ప్రభువునకు పుత్రికనైతిని. ఆసమయమున ఆ మహారాజు విత్తనములను పిడికిట బట్టి చల్లుచుండెను. ఇంతలో ఆయన దృష్టి నాపై బడెను. అప్పుడు నాశరీరము అంతయును దుమ్ము కొట్టుకొని యుండెను. ఆ స్థితిలోనున్న నన్ను జూచి, ఆజనక భూపతి మిగుల ఆశ్చర్యపడెను. (28-29)

అనపత్యేన చ స్నేహాత్ అంకమారోప్య చ స్వయమ్।
మమేయం తనయేత్యుక్త్వా స్నేహో మయి నిపాతితః। 30

అంతవఱకును సంతతిలేకపోవుటచే ఆ మహారాజు స్వయముగా ప్రేమతో నన్ను తనయొడిలోనికి తీసికొని, 'ఇక ఈ పసికందు నా కూతురే'- అని పలికి, తన నిండు వాత్సల్యమును నాపై క్రుమ్మరించెను- (30)

అంతరిక్షే చ వాగుక్తాఽప్రతిమామానుషీ కిల।
ఏవమేతన్నరపతే! ధర్మేణ తనయా తవ। 31

ఇంతలో ఆకాశమునుండి ఒక దివ్యవాణి నన్నుగూర్చి ఇట్లు తెలిపెను. 'ఓరాజా! ఈమె మనుష్యబాలికకాదు. ఒక దివ్య శిశువు. కావున ధర్మముగా ఈమె నీ కుమార్తెయే' (31)

తతః ప్రహృష్టో ధర్మాత్మా పితా మే మిథిలాధిపః।
అవాప్తో విపులామ్ ఋద్ధిం మామవాప్య నరాధిపః। 32

ధర్మాత్ముడును, మిథిలాధిపతియు ఐన మాతండ్రి ఆ దివ్యవచనములను విన్న పిమ్మట సంతోషముతో పొంగిపోయెను. ఆ రాజభవనమున నేను చేరిన పిమ్మట ఆ మహారాజుయొక్క సంపదలు కొల్లలుగా వృద్ధిచెందెను. (32)

దత్తా చాస్మీష్టవద్దేవ్యై జ్యేష్ఠాయై పుణ్యకర్మణా।
తయా సంభావితా చాస్మి స్నిగ్ధయా మాతృసౌహృదాత్। 33

నిత్యమూ పవిత్రములైన యజ్ఞయాగాదులను ఒనర్చుచుండెడి జనకమహారాజు నన్ను తనపట్టపురాణికి ప్రియమైన కానుకగా ఇచ్చెను. మెత్తని హృదయముగల ఆమహారాణి కన్నతల్లివలె నన్ను అల్లారుముద్దుగా పెంచిపెద్దచేసెను. (33)

పతిసంయోగసులభం వయో దృష్ట్వా తు మే పితా।
చింతామభ్యగమద్దీనో విత్తనాశాదివాధనః। 34

వివాహమునకు తగినవయస్సు వచ్చిన నన్నుజూచి, మా తండ్రి కష్టార్జితమైన సంపదను కోల్పోయిన నిర్ధనునివలె దీనుడై చింతాక్రాంతుడయ్యెను.[1] (34)

1) శ్లో॥ పుత్రీతి జాతా మహతీహ చింతా, కస్మై ప్రదేయేతి మహాన్ వితర్కః। దత్త్వా సుఖం ప్రాప్స్యతి వా న వేతి, కన్యాపితృత్వం ఖలు నామ కష్టమ్॥ ఆడుపిల్ల (కూతురు) కలిగినవెంటనే తల్లిదండ్రులు అంతులేని చింతలకులోనగుదురు. ఈ చిన్నారిని ఎవరికిచ్చి పెండ్లిచేయవలెను? అను ఆలోచనలు వారిని ముసురుకొనును. పెండ్లియైన పిదప మెట్టిననింట ఆమె హాయిగా సుఖపడునా? లేక కష్టాలపాలగునా? అనునది ఒక పెద్దదిగులు. ఈ విధముగా ఆడుపిల్లలతల్లిదండ్రులకు ఎల్లప్పుడును దిగులే.

సదృశాచ్చాపకృష్టాచ్చ లోకే కన్యాపితా జనాత్।
ప్రధర్షణామవాప్నోతి శక్రేణాపి సమో భువి। 35

ఈలోకమున ఆడుపిల్లలుగల తండ్రి తన సంపదలచే, వైభవములచే ఇంద్రునియంతటివాడైయుననుగావచ్చును. మగపిల్లలు గల తండ్రులు (వరపక్షమువారు) అతనితో సమానులుగాని, అతనికంటెను తక్కువవారుగాని కావచ్చును. ఐనను వారు అతనిని చిన్నచూపుచూచెదరు. (35)

తాం ధర్షణామదూరస్థాం దృష్ట్వా చాత్మని పార్థివః।
చింతార్ణవగతః పారం నాససాదాప్లవో యథా। 36

అట్టి కష్టములు ఎదురగు సమయము దగ్గఱపడుచున్నందున జనకమహారాజు ఓడలేనివాడు సముద్రముయొక్క ఆవలి తీరమునకు చేరలేనట్లు చింతాసాగరమునుండి బయటపడలేకుండెను. (36)

అయోనిజాం హి మాం జ్ఞాత్వా నాధ్యగచ్ఛద్విచింతయన్।
సదృశం చానురూపం చ మహీపాలః పతిం మమ। 37

ఆ మిథిలాధిపతి 'నాకూతురు సీత అయోనిజ' అను భావమును మనసులోనుంచుకొని, ఆ దృష్టితోనే నా వివాహవిషయమునుగూర్చి ఆలోచింపసాగెను. నాకు తగినట్లుగా[1] ఉత్తమవంశసంజాతుడు, సత్ప్రవర్తనుడు, రూప, యౌవన సంపన్నుడు ఐన వరుడు ఎంత వెదకి చూచినను ఆయన దృష్టికి గోచరింపకుండెను. (37)

తస్య బుద్ధిరియం జాతా చింతయానస్య సంతతమ్।
స్వయంవరం తనూజాయాః కరిష్యామీతి ధీమతః। 38

ప్రజ్ఞాశాలియు, నిరంతరము వరాన్వేషణలో మునిగియున్న వాడును అగు ఆ మహారాజు 'స్వయంవర విధానముననే నాకుమార్తెకు వివాహము చేయదగును'- అను నిశ్చయమునకు వచ్చెను. (38)

మహాయజ్ఞే తదా తస్య వరుణేన మహాత్మనా।
దత్తం ధనుర్వరం ప్రీత్యా తూణీచాక్షయసాయకౌ। 39

ఆ నిమి వంశములో జనకునికంటెను పూర్వుడైన దేవరాతుడు ఒక మహాయజ్ఞము చేయుచుండగా, మహాత్ముడైన వరుణుడు (శివుడు) ప్రసన్నుడై, ఒక దివ్యధనుస్సును, అక్షయబాణములతో ఒప్పారుచుండెడి రెండు తూణీరములను (అమ్ముల పొదులను) ఆమహారాజునకు అనుగ్రహించెను- (క్రమముగా ఆ శివధనుస్సు జనకమహారాజునకు సంక్రమించెను.) (39)

అసంచాల్యం మనుష్యైశ్చ యత్నేనాపి చ గౌరవాత్।
తన్న శక్తా నమయితుం స్వప్నేష్వపి నరాధిపాః। 40

ఎంతటి బలశాలురైనమానవులుసైతము, తమసర్వశక్తులనూ ఒడ్డి ఎంతగా ప్రయత్నించినను ఆ మహాధనుస్సును ఏ మాత్రమూ కదల్పజాలక పోయిరి. మహారాజులు తమస్వప్నములలోగూడ దానిని ఎక్కుపెట్టుటకు అశక్తులగుచుండిరి. (40)

తద్ధనుః ప్రాప్య మే పిత్రా వ్యాహృతం సత్యవాదినా।
సమవాయే నరేంద్రాణాం పూర్వమామంత్ర్య పార్థివాన్। 41

సత్యసంధుడైన మాతండ్రి (స్వయంవరమహోత్సవమునకు) సకలభూపతులను ఆహ్వానించెను. ఆయన ఆహ్వానమునందుకొని, పెద్ద సంఖ్యలో అచటికి విచ్చేసిన ఆ మహారాజులసమక్షమున ఆ శివధనుస్సును గూర్చి ఆయన ఇట్లు వివరించెను. (41)

ఇదం చ ధనురుద్యమ్య సజ్యం యః కురుతే నరః।
తస్య మే దుహితా భార్యా భవిష్యతి న సంశయః। 42

ఈ మహాధనుస్సును లేవనెత్తి, దీనిని ఎక్కుపెట్టిన పరాక్రమశాలియైన పురుషుడు నా కుమార్తెయగు సీతాదేవికి భర్తయగును- (ఆ వీరునకు నా సీతనిచ్చి వివాహము చేసెదను.) ఇందులకు సందేహము లేదు. (ఇది నా ప్రతిజ్ఞ) (42)

తద్దృష్ట్వా ధనుఃశ్రేష్ఠం గౌరవాద్గిరిసన్నిభమ్।
అభివాద్య నృపా జగ్ముః అశక్తాస్తస్య తోలనే। 43

అచటికి విచ్చేసిన రాజకుమారులందఱును పర్వతమంతగా బరువైన ఆగొప్ప ధనుస్సును జూచి, దానిని ఎక్కుపెట్టలేకపోయిరి సరిగదా కదిలించుటకును అశక్తులై, దానికొక దండముపెట్టి వెళ్లిపోయిరి. (43)

1) వివాహశ్చ, వివాదశ్చ సమయోరేవశోభతే = వివాహముగాని, వివాదముగాని సమానులమధ్యనే శోభిల్లును. వివాహమునకు ఈడుజోడు ముఖ్యముగదా!

సుదీర్ఘస్య తు కాలస్య రాఘవోఽయం మహాద్యుతిః।
విశ్వామిత్రేణ సహితో యజ్ఞం ద్రష్టుం సమాగతః।
లక్ష్మణేన సహ భ్రాత్రా రామః సత్యపరాక్రమః। 44

ఇది జరిగిన చాలకాలమునకు మిగుల తేజస్వియు, సత్యపరాక్రముడును ఐన రఘురాముడు లక్ష్మణునితో గూడి విశ్వామిత్రుని వెంట నాతండ్రి చేయుచున్న యజ్ఞమును జూచుటకై మిథిలా నగరమునకు ఏతెంచెను. (44)

విశ్వామిత్రస్తు ధర్మాత్మా మమ పిత్రా సుపూజితః।
ప్రోవాచ పితరం తత్ర భ్రాతరౌ రామలక్ష్మణౌ। 45

సుతౌ దశరథస్యేమౌ ధనుర్దర్శనకాంక్షిణౌ।
ధనుర్దర్శయ రామాయ రాజపుత్త్రాయ దైవికమ్। 46

అప్పుడు ధర్మనిరతుడైన మాతండ్రి విశ్వామిత్రమహర్షికిని, రామలక్ష్మణులకును సాదరముగా అతిథిమర్యాదలను ఒనర్చెను. పిమ్మట విశ్వామిత్రుడు మాతండ్రితో ఇట్లనెను. "ఓ నరేంద్రా! ఇతడు శ్రీరాముడు; అతడు లక్ష్మణుడు ఈ ఇరువురు సోదరులు దశరథమహారాజకుమారులు. వీరు శివధనుస్సును చూడగోరుచున్నారు. ఆ దివ్యధనుస్సును రాజకుమారుడైన శ్రీరామునకు చూపింపుము." (45-46)

ఇత్యుక్తస్తేన విప్రేణ తద్ధనుః సముపానయత్। 47

నిమేషాంతరమాత్రేణ తదాఽఽనమ్య స వీర్యవాన్।
జ్యాం సమారోప్య ఝడితి పూరయామాస వీర్యవత్। 48

ఆ విశ్వామిత్రుడు ఇట్లు పలికిన వెంటనే ఆ మహాధనుస్సు అచటికి చేర్చబడెను. పరాక్రమశాలియైన రఘురాముడు తృటిపాటుకాలములో ఆ ధనుస్సును వంచి, వెంటనే అల్లెత్రాడును సంధించి, ఆకర్ణాంతము దానిని బలముగా లాగెను. (47-48)

తేన పూరయతా వేగాత్ మధ్యే భగ్నం ద్విధా ధనుః।
తస్య శబ్దోఽభవద్భీమః పతితస్యాశనేరివ। 49

శ్రీరాముడు వింటినారిని వేగముగా లాగుచుండగనే ఆ శివధనుస్సు మధ్యకు విఱిగి, రెండు ముక్కలయ్యెను. ధనుర్భంగమైనప్పుడు పిడుగుపాటువలె మిక్కిలి భయంకరమైన ధ్వని వెలువడెను. (49)

తతోఽహం తత్ర రామాయ పిత్రా సత్యాభిసంధినా।
నిశ్చితా దాతుముద్యమ్య జలభాజనముత్తమమ్। 50

పిమ్మట ఆడినమాటతప్పని మాతండ్రి నన్ను శ్రీరామునకు ఇచ్చి కన్యాదానముచేయుటకై నిశ్చయించుకొని, జలపాత్రను గ్రహించెను. (50)

దీయమానాం న తు తదా ప్రతిజగ్రాహ రాఘవః।
అవిజ్ఞాయ పితుశ్ఛందమ్ అయోధ్యాధిపతేః ప్రభోః। 51

అప్పుడు శ్రీరాముడు అయోధ్యాధిపతియు, తనతండ్రియు ఐన దశరథమహారాజుయొక్క అనుమతిని బడయకుండ నన్ను చేపట్టుటకు సిద్ధపడకుండెను. (51)

తతః శ్వశురమామంత్ర్య వృద్ధం దశరథం నృపమ్।
మమ పిత్రా త్వహం దత్తా రామాయ విదితాత్మనే। 52

అంతట మాతండ్రియగు జనకమహారాజు మామగారును, వృద్ధుడును ఐన దశరథమహారాజును మిథిలకు పిలిపించెను. ఆయనఅనుమతితో ధీశాలిగా వాసిగాంచిన శ్రీరామునితో నావివాహమును జరిపించెను. (52)

మమ చైవానుజా సాధ్వీ ఊర్మిలా ప్రియదర్శనా।
భార్యార్థే లక్ష్మణస్యాపి దత్తా పిత్రా మమ స్వయమ్। 53

మిగుల సౌందర్యవతియు, సాధ్వియు అగు నా చెల్లెలు ఊర్మిళను మాతండ్రి లక్ష్మణునకిచ్చి స్వయముగా వివాహము జరిపించెను. (53)

ఏవం దత్తాఽస్మి రామాయ తదా తస్మిన్ స్వయంవరే।
అనురక్తాస్మి ధర్మేణ పతిం వీర్యవతాం వరమ్। 54

ఈ విధముగా స్వయంవరవిధానమున శ్రీరామునకు నేను భార్యనైతిని- మహావీరులలో శ్రేష్ఠుడైన నాపతికి నేను సహధర్మచారిణినై సర్వదా ఆయనయెడ అనురక్తురాలనై యున్నాను. (54)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే అష్టాదశోత్తరశతతమస్సర్గః (118)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపదునెనిమిదవసర్గము సమాప్తము

-- * * * --

119. నూటపందొమ్మిదవసర్గము

అనసూయాదేవి కోరికపై ఆమె ఇచ్చిన వస్త్రాభరణాదులను సీతాదేవి ధరించుట - అలంకృతయై తనకడకు వచ్చిన సీతాదేవినిజూచి శ్రీరాముడు సంతోషించుట - మునీశ్వరుల ఆశీస్సులనుగొని శ్రీరాముడు సీతాలక్ష్మణులతోడి దండకారణ్యమున ప్రవేశించుట.

అనసూయా తు ధర్మజ్ఞా శ్రుత్వా తాం మహతీం కథామ్।
పర్యష్వజత బాహుభ్యాం శిరస్యాఘ్రాయ మైథిలీమ్। 1

వ్యక్తాక్షరపదం చిత్రం భాషితం మధురం త్వయా।
యథా స్వయంవరం వృత్తం తత్ సర్వం హి శ్రుతం మయా।
రమేఽహం కథయా తే తు దృఢం మధురభాషిణి!। 2

రవిరస్తంగతః శ్రీమాన్ ఉపోహ్య రజనీం శివామ్।
దివసం ప్రతికీర్ణానామ్ ఆహారార్థం పతత్రిణామ్।
సంధ్యాకాలే నిలీనానాం నిద్రార్థం శ్రూయతే ధ్వనిః। 3

ఏతే చాఽప్యభిషేకార్ద్రా మునయః కలశోద్యతాః।
సహితా ఉపవర్తంతే సలిలాప్లుతవల్కలాః। 4

ఋషీణామగ్నిహోత్రేషు హుతేషు విధిపూర్వకమ్।
కపోతాంగారుణో ధూమో దృశ్యతే పవనోద్ధతః। 5

అల్పపర్ణా హి తరవో ఘనీభూతాః సమంతతః।
విప్రకృష్టేఽపి దేశేఽస్మిన్ న ప్రకాశంతి వై దిశః। 6

రజనీచరసత్త్వాని ప్రచరంతి సమంతతః।
తపోవనమృగా హ్యేతే వేదితీర్థేషు శేరతే। 7

సంప్రవృత్తా నిశా సీతే! నక్షత్రసమలంకృతా।
జ్యోత్స్నాప్రావరణశ్చంద్రో దృశ్యతేఽభ్యుదితోఽంబరే। 8

గమ్యతామనుజానామి రామస్యానుచరీ భవ।
కథయంత్యా హి మధురం త్వయాఽహం పరితోషితా। 9

అలంకురు చ తావత్ త్వం ప్రత్యక్షం మమ మైథిలి!।
ప్రీతిం జనయ మే వత్సే! దివ్యాలంకారశోభితా। 10

సా తదా సమలంకృత్య సీతా సురసుతోపమా।
ప్రణమ్య శిరసా తస్యై రామం త్వభిముఖీ యయౌ। 11

తథా తు భూషితాం సీతాం దదర్శ వదతాం।
వరః రాఘవః ప్రీతిదానేన తపస్విన్యా జహర్ష చ। 12

అంతట ధర్మజ్ఞురాలైన అనసూయాదేవి ఆ పవిత్రకల్యాణ గాథను విని, తనరెండు చేతులతో సీతాదేవిని గాఢముగా కౌగిలించుకొనెను. ఆప్యాయతతో ఆమెమూర్ధమును మూర్కొనెను. (1)

ఓ ప్రియభాషిణీ! సీతా! చిత్రమైన నీ స్వయంవర వృత్తాంతమును నీవు మధురవచనములతో స్పష్టముగా వివరించితివి. అంతయును నేను శ్రద్ధగా ఆలకించితిని. ఆ అద్భుతగాథను విని, నేను పరమానంద భరితురాలనైతిని. (2)

చక్కని కిరణకాంతులతో విలసిల్లుచున్న సూర్యుడు అస్తమించుచున్నాడు. చల్లగా హాయిని గొలిపెడి రాత్రి ఆసన్నమగుచున్నది. పగటిపూట ఆహారార్థమై దూరతీరములకు వెళ్లిన పక్షులు సంధ్యాకాల మగుటను గుర్తించి, నిద్రార్థము తమతమ గూండ్లకు చేరెను. అవి చేయుచున్న 'కులకులధ్వనులు' వినబడుచున్నవి. (నదీ)జలములలో స్నానమొనర్చి ఈ మునులు తడిసిన నారచీరలను ధరించి, నీటితో నిండియున్న కలశములను చేతబట్టుకొని కలిసి మెలసి వచ్చుచున్నారు. (3-4)

విధ్యుక్తముగా ఋషీశ్వరుల హోమకార్యములు కొనసాగుచున్నవి. పావురముల మెడలయందలి అరుణశోభలను పోలియున్న పొగలు గాలికి అటునిటు వ్యాపించుచు కనబడుచున్నవి. (5)

ఆప్రదేశమునందంతటను పొగలు, చీకట్లు వ్యాపించియుండుటచే చెట్లు స్వల్పముగా ఆకులుగలవైనప్పటికిని, దట్టమైన ఆకులతో నిండియున్నట్లు కనబడుచున్నవి. దిక్కులు అస్పష్టములుగా గోచరించుచున్నవి. అనగా దిక్కులన్నియు స్పష్టముగా కనబడుటలేదు. (6)

రాత్రులయందు సంచరించెడి ప్రాణులు ఈ ప్రదేశమునందు అంతటను తిరుగాడుచున్నవి. తపోవనములలో తిరుగుచుండెడి లేళ్లు మొదలగు జంతువులు ఆశ్రమవేదికలయందును, నదీతీరముల యందును నిద్రించుచున్నవి. (7)

రాత్రి పూర్తిగా ఏర్పడినది. నక్షత్రములు మిలమిలలాడుచున్నవి. ఆకాశమున చంద్రుడు వెన్నెలయను దుప్పటిని పఱచుచు వృద్ధి చెందుచున్నాడు. కనుక ఇకనీవు వెళ్లవచ్చును. వెళ్లి నీ పతియగు శ్రీరామచంద్రునిసేవలో నిమగ్నవగుము. నీమధురభాషణమునకు నేను ఎంతయు సంతసించితిని. (8-9)

అమ్మా! సీతా! నేనొసంగిన దివ్యములైన వస్త్రములు, ఆభరణములు మున్నగు వాటిని నాయెదుటనే అలంకరించుకొనుము. అలంకారములతో శోభిల్లెడి నిన్ను జూచి, నేను ఎంతయు ఆనందించెదను. (10)

అంతట దేవకాంతవలెనున్న ఆ సీతాదేవి వస్త్రాభరణాదులను, ధరించెను. పిమ్మట ఆమె అనసూయాదేవికి శిరస్సాప్రణమిల్లెను. అనంతరము ఆమె శ్రీరాముని సమ్ముఖమునకు చేరెను. (11)

వాక్చాతుర్యమున మేటియైన శ్రీరాముడు అట్లు అలంకృతయై యున్న సీతాదేవిని జూచెను. తపస్సంపన్నురాలైన అనసూయాదేవి ప్రేమతో ఇచ్చిన ఆ కానుకలను గాంచి అతడు ఎంతయు సంతోషించెను. (12)

న్యవేదయత్ తతః సర్వం సీతా రామాయ మైథిలీ।
ప్రీతిదానం తపస్విన్యా వసనాభరణస్రజమ్। 13

ప్రహృష్టస్త్వభవద్రామో లక్ష్మణశ్చ మహారథః।
మైథిల్యాః సత్క్రియాం దృష్ట్వా మానుషేషు సుదుర్లభామ్। 14

తతస్తాం శర్వరీం ప్రీతః పుణ్యాం శశినిభాననః।
అర్చితస్తాపసైః సిద్ధైః ఉవాస రఘునందనః। 15

తస్యాం రాత్ర్యాం వ్యతీతాయామ్ అభిషిచ్య హుతాగ్నికాన్।
ఆపృచ్ఛేతాం నరవ్యాఘ్రౌ తాపసాన్ వనగోచరాన్। 16

తావూచుస్తే వనచరాః తాపసా ధర్మచారిణః।
వనస్య తస్య సంచారం రాక్షసైః సమభిప్లుతమ్। 17

రక్షాంసి పురుషాదాని నానారూపాణి రాఘవ!।
వసంత్యస్మిన్ మహారణ్యే వ్యాళాశ్చ రుధిరాశనాః। 18

ఉచ్ఛిష్టం వా ప్రమత్తం వా తాపసం ధర్మచారిణమ్।
అదంత్యస్మిన్ మహారణ్యే తాన్ నివారయ రాఘవ!। 19

ఏష పంథా మహర్షీణాం ఫలాన్యాహరతాం వనే।
అనేన తు వనం దుర్గం గంతుం రాఘవ! తే క్షమమ్। 20

ఇతీవ తైః ప్రాంజలిభిస్తపస్విభిః
ద్విజైః కృతఃస్వస్త్యయనః పరంతపః ।
వనం సభార్యః ప్రవివేశ రాఘవః
సలక్ష్మణః సూర్యమివాభ్రమండలమ్ । 21

మిథిలాపతియైన జనకునియొక్క కూతురగు సీతాదేవి తపస్వినియైన అనసూయాదేవి వాత్సల్యముతో తనకు ఇచ్చిన వస్త్రములు, ఆభరణములు, పూలదండలు మొదలగు బహుమానములను అన్నింటిని శ్రీరామచంద్రునకు చూపించెను. (13)

అప్పుడు మానవులకు ఎవ్వరికిని లభింపని విధముగా సీతాదేవికి జరిగిన ఆదరసత్కారములను గాంచి, శ్రీరాముడును, మహారథుడైన లక్ష్మణుడును మిగుల ఆనందించిరి. (14)

అనంతరము చంద్రునివలె ఆహ్లాదకరుడైన రఘురాముడు తాపసులును, సిద్ధులును సమర్పించిన అతిథిసత్కారములకు ప్రీతుడై, సీతాలక్ష్మణులతోగూడి, ఆ ఆశ్రమమునందే ఆ పవిత్రరాత్రిని హాయిగా గడపెను. (15)

ఆ రాత్రి గడచిన పిమ్మట వనవాసులైన తాపసులు స్నానాదికములను ముగించుకొని, హోమకార్యములను ఆచరించిరి. అప్పుడు రామలక్ష్మణులు తమప్రయాణమునకు అనుమతిని గోరిరి. (16)

వనవాసులును, ధర్మవర్తనులును ఐన ఆ మునీశ్వరులు వారితో ఇట్లు నుడివిరి. "ఈ వనప్రదేశము అంతయును రాక్షసులతో నిండియుండును. అందువలన కందమూలఫలాదులకై సంచరించుచుండుట ఉపద్రవముతో కూడినపని. ఓ రఘువరా! ఈ మహారణ్యమున నరమాంసభక్షకులైన రాక్షసులు వివిధరూపములలో తిరుగుచుందురు. ఇంకను ఇందు పెద్దపులులు మొదలైన క్రూరమృగములు నివసించుచుండును. (17-18)

ఓ శ్రీరామా! ధర్మనిరతులైన తాపసులు భోజనానంతరము ఉచ్ఛిష్టావస్థలో ఉన్నప్పుడు గాని, ఏమఱుపాటున ఉన్నప్పుడు గాని ఈ మహావనమున తిరుగుచుండెడి క్రూరమృగములును, రాక్షసులును వారిని చంపివేయుట జరుగుచుండును- ఆ ప్రమాదముల నుండి వారిని రక్షించుచుండుము. ఓ రఘురామా! మహర్షులందఱును ఆహారార్థము కందమూలఫలములను గొనివచ్చుటకై, ఈ మార్గముననే వెళ్లి వచ్చుచుందురు. కావున నీవును ఈ దుర్గమారణ్యమును ప్రవేశించుటకు ఇదియే తగిన మార్గము-" (19-20)

తపస్సంపన్నులైన బ్రాహ్మణోత్తములు అంజలి ఘటించి, ప్రయాణములు హాయిగా సాగుటకై శుభాశీస్సులు పలికిరి. పిమ్మట, శత్రుదమనుడైన శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి, మేఘమండలమున సూర్యునివలె ఆ దట్టమైన వనమున ప్రవేశించెను. (21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అయోధ్యాకాండే ఏకోనవింశోత్తరశతతమస్సర్గః (119)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అయోధ్యాకాండమునందు నూటపంతొమ్మిదవసర్గము సమాప్తము

అయోధ్యాకాండము సమాప్తము

— ❋ ❋ ❋ —

దాశరథిశతకము

ఉ. శ్రీరఘురామ చారుతులసీదళదామ శమక్షమాదిశృం
గారగుణాభిరామ త్రిజగన్నుతశౌర్యరమాలలామ దు
ర్వారకబంధరాక్షసవిరామ జగజ్జనకల్మషార్ణవో
త్తారకనామ భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 1

ఉ. రామ విశాలవిక్రమపరాజితభార్గవరామ సద్గుణ
స్తోమ పరాంగనావిముఖసువ్రతకామ వినీలనీరద
శ్యామ కకుత్స్థవంశకలశాంబుధిసోమ సురారిదోర్బలో
ద్దామవిరామ భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 2

చ. అగణితసత్యభాష శరణాగతపోష దయాలసజ్జరీ
విగతసమస్తదోష పృథివీసురతోష త్రిలోకపూతకృ
ద్గగనధునీమరందపదకంజవిశేష మణిప్రభాధగ
ద్ధగితవిభూష భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 3

ఉ. రంగదరాతిభంగ ఖగరాజతురంగ విపత్పరంపరో
త్తుంగతమఃపతంగ పరితోషితరంగ దయాంతరంగ స
త్సంగ ధరాత్మజాహృదయసారసభృంగ నిశాచరాబ్జమా
తంగ శుభాంగ భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 4

ఉ. శ్రీద సనందనాదిమునిసేవితపాద దిగంతకీర్తిసం
పాద సమస్తభూతపరిపాలవినోద విషాదవల్లికా
చ్ఛేద ధరాధినాథకులసింధుసుధామయపాద నృత్తగీ
తాదివినోద భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 5

ఉ. ఆర్యులకెల్ల మ్రొక్కి వినతాంగుడనై రఘునాథభట్టరా
చార్యులకంజలెత్తి కవిసత్తములన్ వినుతించి కార్యసా
కర్యమెలర్ప నొక్కశతకంబొనగూర్చి రచింతునేడు తా
త్పర్యమునన్ గ్రహింపుమిది దాశరథీ కరుణాపయోనిధీ! 6

చ. మసకొని రేగుబండ్లకును మౌక్తికముల్ వెలవోసినట్లు దు
ర్వ్యసనముజెంది కావ్యము దురాత్ములకిచ్చితి మోస
మయ్యె నా
రసనకు బూతవృత్తి సుకరంబుగ జేకురునట్లు వాక్సుధా
రసములు చిల్క పద్యముఖరంగమునందు నటింపవయ్య సం
తసమును జెంది భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 7

ఉ. శ్రీరమణీయహార యతసీకుసుమాభశరీర భక్తమం
దార వికారదూర పరతత్త్వవిహార త్రిలోకచేతనో
ద్ధార దురంతపాతకవితానవిదూర ఖరాదిదైత్యకాం
తారకుఠార భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 8

చ. దురితలతాలవిత్ర ఖరదూషణకాననవీతిహోత్ర భూ
భరణకళావిచిత్ర భవబంధవిమోచనసూత్ర చారువి
స్ఫురదరవిందనేత్ర ఘనపుణ్యచరిత్ర వినీలభూరికం
ధరసమగాత్ర భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 9

చ. కనకవిశాలచేల భవకాననశాతకుఠారధార స
జ్జనపరిపాలశీల దివిజస్తుతసద్గుణకాండ కాండసం
జనితపరాక్రమ క్రమవిశారద శారదకందకుందచం
దనఘనసారసారయశ దాశరథీ కరుణాపయోనిధీ! 10

ఉ. శ్రీరఘువంశతోయధికి శీతమయూఖుడవైన నీ పవి
త్రోరుపదాబ్జముల్ వికసితోత్పలచంపకవృత్తమాధురీ
పూరితవాక్ప్రసూనముల బూజలొనర్చెద జిత్తగింపుమీ
తారకనామ భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 11

చ. గురుతరమైన కావ్యరసగుంభనకబ్బురమంది మెచ్చరుల్
సరసులమాడ్కి, నంతసిలబాయిదుబోటు శశాంకచంద్రికాం
కురములకిందుకాంతమణికోటి స్రవించినభంగి వింధ్యభూ
ధరమున జాలునే శిలలు దాశరథీ కరుణాపయోనిధీ! 12

చ. తరణికులేశ నానుడుల దప్పులు గల్గిన నీదునామస
ద్విరచితమైన కావ్యము పవిత్రముగాదె వియన్నదీజలం
బరుగుచు వంకయైన మలినాకృతిబాఱిన దన్మహత్త్వముం
దరమె గణింపనెవ్వరికి దాశరథీ కరుణాపయోనిధీ! 13

ఉ. దారుణపాతకాబ్ధికి సదా బడబాగ్ని భవాకులార్తివి
స్తారదవానలార్చికి సుధారసవృష్టి దురంతదుర్మతా
చారభయంకరాటవికి జండకఠోరకుఠారధార నీ
తారకనామమెన్నగను దాశరథీ కరుణాపయోనిధీ! 14

చ. హరునకునవ్విభీషణునకద్రిజకున్ దిరుమంత్రరాజమై
కరికినహల్యకున్ ద్రుపదకన్యకునార్తిహరించు చుట్టమై
పరగినయట్టి నీపతితపావననామము జిహ్వపై నిరం
తరము నటింపజేయుమిక దాశరథీ కరుణాపయోనిధీ! 15

ఉ. ముప్పున గాలకింకరులు ముంగిట నిల్చినవేళ రోగముల్
గొప్పరమైనచో గఫము కుత్తుకనిండినవేళ బాంధవుల్
గప్పినవేళ నీస్మరణ గల్గునొ గల్గదొ నాటికిప్పుడే
తప్పక చేతు నీభజన దాశరథీ కరుణాపయోనిధీ! 16

చ. పరమదయానిధే పతితపావననామ హరే యటంచు సు
స్థిరమతులై సదా భజనసేయు మహాత్ములపాదధూళి నా

శిరమున దాల్తు మీరటకుఁజేరకుడంచు యముండు కింకరో
త్కరములకానతిచ్చునట దాశరథీ కరుణాపయోనిధీ! 17

ఉ. ఆదిని శంభుడవయ్యు సనకాదులకున్ బరతత్త్వమయ్యు నె
ద్దిజముని కోటికెల్ల బరదేవతవయ్యు దినేశవంశభూ
భుజులకు మేటివయ్యు బరిపూర్ణుడవై వెలుగొందు పక్షిరా
డ్ధ్వజ నిను బ్రస్తుతించెదను దాశరథీ కరుణాపయోనిధీ! 18

చ. "ఖండితరక్షకుండఖిలపాపవిమోచనుడబ్జసంభవా
ఖండలపూజితుండు దశకంఠవిలుంఠనచండకాండకో
దండకళాప్రవీణు" డను తావకకీర్తివధూటికిత్తు టా
దండలుగాగ వాకవిత దాశరథీ కరుణాపయోనిధీ! 19

ఉ. శ్రీరమ సీతగాగ నిజసేవకబృందము వీరవైష్ణవా
చారజనంబుగాగ విరజానది గౌతమిగా వికుంఠము
న్నారయ భద్రశైలశిఖరాగ్రముగాగ వసించు చేతనో
ద్ధారకుడైన విష్ణుడవు దాశరథీ కరుణాపయోనిధీ! 20

ఉ. కంటి నదీతటంబు పొడగంటిని భద్రనగాధివాసమున్
గంటినిలాతనూజనురుకార్ముకమార్గణశంఖచక్రముల్
గంటిని నిన్ను లక్ష్మణుని గంటి కృతార్థుడనైతినో జగ
త్కంటకదైత్యనిర్దళన దాశరథీ కరుణాపయోనిధీ! 21

చ. హలికునకున్ హలాగ్రమున నర్థము సేకురుభంగి దప్పిచే
నలమటజెందువానికి సురాపగలో జలమబ్బినట్లు దు
ర్మలినమనోవికారిని మర్త్యుని నన్నొడగూర్చి నీపయిన్
దలపు ఘటింపజేసితివి దాశరథీ కరుణాపయోనిధీ! 22

ఉ. కొంజక తర్కవాదమను గుద్దలిచే బరతత్త్వభూస్థలిన్
రంజిలద్రవ్వి కన్గొనని రామనిధానము నేడు భక్తిసి
ద్ధాంజనమందు హస్తగతమయ్యె బళీయనగా మదీయహృ
త్కంజమునన్ వసింపుమిక దాశరథీ కరుణాపయోనిధీ! 23

ఉ. రాముడు ఘోరపాతకవిరాముడు సద్గుణకల్పవల్లికా
రాముడు షడ్వికారజయరాముడు సాధుజనావనవ్రతో
ద్దాముడు రాముడే పరమదైవము మాకని నీయడుంగుదెం
దామరలే భజించెదను దాశరథీ కరుణాపయోనిధీ! 24

ఉ. చక్కెర మాని వేము దినజాలినకైవడి మానవాధముల్
పెక్కురు బక్కదైవముల వేముఱు గొల్చెదరట్లకాదయా
మ్రొక్కిన నీకె మ్రొక్కవలె మోక్షమొసంగిన నీవ యీవలెన్
దక్కినమాటలేమిటికి దాశరథీ కరుణాపయోనిధీ! 25

ఉ. 'రా'కలుషంబులెల్ల బయలంబడద్రోచిన 'మా'కవాటమై
డీకొని ప్రోచు నిక్కమని ధీయుతులెన్న దదీయవర్ణముల్
గైకొని భక్తిచే నుడువగానరుగాక విపత్పరంపరల్
దాకొనునే జగజ్జనుల దాశరథీ కరుణాపయోనిధీ! 26

ఉ. రామ హరే కకుత్స్థకులరామ హరే రఘురామరామ శ్రీ
రామ హరేయటంచు మదిరంజిల భేకగళంబులీల నీ
నామము సంస్మరించిన జనంబు భవంబెడబాసి తత్పరం
ధామనివాసులౌదురట దాశరథీ కరుణాపయోనిధీ! 27

ఉ. చక్కెరలప్పకున్ మిగుల జవ్వనికెంజిగురాకుమోవికిన్
జొక్కపుజుంటితేనియకు జొక్కులుచున్ గనలేరుగాక నే
డక్కట రామనామమధురామృతమానుటకంటె సౌఖ్యమా
తక్కినమాధురీమహిమ దాశరథీ కరుణాపయోనిధీ! 28

ఉ. అండజవాహ నిన్ను హృదయంబున నమ్మినవారిపాపముల్
కొండలవంటివైన వెసగూలి నశింపకయున్నె సంతతా
ఖండలవైభవోన్నతులు గల్గకమానునె మోక్షలక్ష్మి కై
దండయొసంగకున్నె తుద దాశరథీ కరుణాపయోనిధీ! 29

ఉ. చిక్కనిపాలపై మిసిమిజెందిన మీగడ పంచదారతో
మెక్కినభంగి నీవిమలమేచకరూపసుధారసంబు నా
మక్కువపళ్లెరంబున సమాహితదాస్యమనేటిదోయిటన్
దక్కెనటంచు జుర్రెదను దాశరథీ కరుణాపయోనిధీ! 30

చ. సిరులిడ సీత పీడలెగజిమ్ముటకున్ హనుమంతుడార్తి పో
దరుమ సుమిత్రిసూతి దురితంబులు మాన్పను రామనామమున్
గరుణదలిర్ప మానవుల గావగ బన్నిన వజ్రపంజరో
త్కరముగదా భవన్మహిమ దాశరథీ కరుణాపయోనిధీ! 31

చ. హలి కులిశాంకుశ ధ్వజ శరాసన శంఖ రథాంగ కల్పకో
జ్జ్వలజలజాతరేఖలను పొంకములై కనుపట్టుచున్న నీ
కలితపదాంబుజద్వయము గౌతమపత్నికొసంగినట్లు నా
తలపునజేర్చి కావగదె దాశరథీ కరుణాపయోనిధీ! 32

చ. జలనిధిలోన దూటి కులశైలము మీటి ధరిత్రి గొమ్మునం
దలవడమాటి రక్కసునియంగము గీటి బలీంద్రునిన్ రసా
తలమున మాటి పార్థివకదంబముగూల్చిన మేటి రామ నా
తలపున నాటిరాగదవె దాశరథీ కరుణాపయోనిధీ! 33

ఉ. భండనభీముడార్తజనబాంధవుడుజ్జ్వలబాణతూణకో
దండకళాప్రచండభుజతాండవకీర్తికి రామమూర్తికిన్
రెండవసాటిదైవమిక లేడనుచున్ గడగట్టి భేరికా
డాండ డడాండ డాండ నినదంబులజాండము నిండ మత్తవే
దండమునెక్కి చాటెదను దాశరథీ కరుణాపయోనిధీ! 34

చ. అవనిజకన్నుదోయి తొగలందు వెలింగెడు సోమ జానకీ
కువలయనేత్ర గబ్బిచనుగొండలనుండు ఘనంబ మైథిలీ
నవనవయౌవనంబను వనంబునకున్ మదదంతి వీవెకా
దవిలి భజింతునెల్లపుడు దాశరథీ కరుణాపయోనిధీ! 35

చ. ఖరకరవంశజా వినుమఖండితభూతపిశాచఢాకినీ
జ్వరపరితాపసర్పభయవారకమైన భవత్పదాబ్జవి
స్ఫురదురువజ్రపంజరము జొచ్చితి నీయెడ దీనమానవో
ద్ధరబిరుదాంకమేమఱకు దాశరథీ కరుణాపయోనిధీ! 36

ఉ. జుఱ్ఱెద నీకథామృతము జుఱ్ఱెద నీపదకంజతోయమున్
జుఱ్ఱెద రామనామమున జొబ్బిలుచున్న సుధారసంబు నే
జుఱ్ఱెద జుఱ్ఱుజుఱ్ఱుగ రుచుల్ గనువారిపదంబు గూర్పవే
తఱ్ఱులతోడి పొత్తిడక దాశరథీ కరుణాపయోనిధీ! 37

ఉ. ఘోరకృతాంతవీరభటకోటికి గుండెదిగుల్ దరిద్రతా
కారపిశాచసంహరణకార్యవినోది వికుంఠమందిర
ద్వారకవాటభేది నిజదాసజనావళికెల్లప్రొద్దు నీ
తారకనామమెన్నగను దాశరథీ కరుణాపయోనిధీ! 38

ఉ. విన్నపమాలకించు రఘువీర నహిప్రతి లోకమందు నా
కన్నదురాత్ముడున్ బరమకారుణికోత్తమ వేల్పులందు నీ
కన్న మహాత్ముడున్ బతితకల్మషదూరుడు లేడు నాకు వి
ద్వన్నుత నీవె నాకు గతి దాశరథీ కరుణాపయోనిధీ! 39

ఉ. పెంపున దల్లివై కలుషబృందసమాగమమొందకుండ ర
క్షింపను దండ్రివై మెయి వసించు దశేంద్రియరోగముల్ నివా
రింపను వెజ్జవై కృపగుఱించి పరంబు దిరంబుగాగ స
త్సంపదలీయ నీవెగతి దాశరథీ కరుణాపయోనిధీ! 40

ఉ. కుక్షినజాండపంక్తులొనగూర్చి చరాచరజంతుకోటిసం
రక్షణసేయు తండ్రివి పరంపర నీ తనయుండనైన నా
పక్షము నీవు గావలదె పాపములెన్ని యొనర్చినన్ జగ
ద్రక్షక కర్తవీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 41

ఉ. గద్దరియోగిహృత్కమలగంధరసానుభవంబు జెందు పె
న్నిద్దపుగండుతేటి ధరణీసుతకౌగిలిపంజరంబునన్
ముద్దులుగుల్కు రాచిలుక ముక్తినిధానము రామ రాగదే
తద్దయు నేడు నాకడకు దాశరథీ కరుణాపయోనిధీ! 42

చ. కలియుగమర్త్యకోటి నిను గన్గొనరాని విధంబొ భక్తవ
త్సలత వహింపవో చటులసాంద్రవిపద్దశవార్ధి గ్రుంకుచో
బిలిచిన బల్కవింతమఱుపే నరులిట్లనరాదుగాక నీ
తలపున లేదె సీతచెఱ దాశరథీ కరుణాపయోనిధీ! 43

చ. జనవర నీకథాళి వినసైపక కర్ణములందు ఘంటికా
నినదవినోదముల్ సలుపు నీచునకున్ వరమిచ్చినావు వి
న్ననయము నమ్మి కొల్చిన మహాత్ములకేమియొసంగెదో సనం
దనముని మాకొసంగుమయ దాశరథీ కరుణాపయోనిధీ! 44

ఉ. పాపములొందువేళ రణపన్నగభూతభయజ్వరాదులం
దాపదనొందువేళ భరతాగ్రజ మిమ్ము భజించువారికిన్
బ్రాపుగ నీవు తమ్ముడురుపక్షియులంబని తద్విపత్తిసం
తాపము మాన్పి కాతువట దాశరథీ కరుణాపయోనిధీ! 45

చ. అగణితజన్మకర్మదురితాంబుధిలో బహుదుఃఖవీచికల్
దెగిపడ నీదలేక జగతీధవ నీ పదభక్తినావచే
దగిలి తరింపగోరితి దయంపడి నాదుభయంబు మాన్పవే
తగదని చిత్తమందిడక దాశరథీ కరుణాపయోనిధీ! 46

ఉ. నేనొనరించు పాపములనేకములైనను నాదుజిహ్వకున్
బానకమయ్యె నీపరమపావననామము తొంటి చిల్క దా
మా నను గావుమన్న తుది మాటకు సద్గతిజెందె గావునన్
దాని ధరింపగోరెదను దాశరథీ కరుణాపయోనిధీ! 47

చ. పరధనముల్ హరించి పరభామలనంటి పరాన్నమబ్బినన్
మురిపముగాని మీదనగు మోసమెఱుంగదు మానసంబు దు
స్తరమిది కాలకింకరగదాహతి పాల్పడనీక మమ్ము నే
తరి దరిజేర్చి కాచెదవొ దాశరథీ కరుణాపయోనిధీ! 48

ఉ. చేసితి ఘోరకృత్యములు చేసితి భాగవతాపచారముల్
చేసితినన్యదైవముల జేరి భజించినవారిపొందు నే
జేసిననేరముల్ దలచి చిక్కులబెట్టకుమయ్య యయ్య నీ
దాసుడనయ్య భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 49

చ. పరులధనంబుజూచి పరభామల జూచి హరింపగోరు మ
ద్దురితతరమానసంబనెడుదొంగను బట్టి నిరూఢదాస్యవి
స్ఫురితవివేకపాశముల జుట్టి భవచ్చరణంబనే మరు
త్తరువున గట్టివేయగదె దాశరథీ కరుణాపయోనిధీ! 50

చ. సలలితరామనామజపసారమెఱుంగను గాశికాపురీ
నిలయుడఁగాను నీచరణనీరజరేణుమహాప్రభావమున్
దెలియ నహల్యగాను జగతీవర నీదగుసత్యవాక్యమున్
దలపగ రావణాసురునితమ్ముడగాను భవద్విలాసముల్
దెలిసి నుతింప నాతరమె దాశరథీ కరుణాపయోనిధీ! 51

ఉ. పాతకులైన సేవ్యులకు పాత్రులు కారె తలంచిచూడ జ
ట్రాతికి గల్గె బావనమరాతికి రాజ్యసుఖంబు గల్గె దు
ర్జాతికి పుణ్యమబ్బె కపిజాతి మహత్త్వముఁబొందె గావునన్
దాతవ యెట్టివారలకు దాశరథీ కరుణాపయోనిధీ! 52

ఉ. మామకపాతకవ్రజము మాన్పనగణ్యము చిత్రగుప్తులే
మేమని వ్రాతురో శమనుడేమివిధించునొ కాలకింకర
స్తోమమొనర్చుటేమొ వినజొప్పడదింతకుమున్నె దీనచిం
తామణి యెట్లుగాచెదవొ దాశరథీ కరుణాపయోనిధీ! 53

ఉ. దాసినచుట్టమా శబరి దాని దయామతినేలినావు నీ
దాసునిదాసుడా గుహుడు తావకదాస్యమొసంగినావు నే
జేసినపాపమో! వినుతి చేసిన గానవు గావుమయ్య నీ
దాసులలోన నేనొకడ దాశరథీ కరుణాపయోనిధీ! 54

ఉ. దీక్షవహించి నాకొలదిదీనులనెందరి గాచితో జగ
ద్రక్షక తొల్లి యద్రుపదరాజతనూజ తలంచినంతనే
యక్షయమైన వల్వలిడితక్కట నామొఱ చిత్తగించి ప్ర
త్యక్షము గావవేమిటికి దాశరథీ కరుణాపయోనిధీ! 55

ఉ. నీలఘనాభమూర్తివగు నిన్ను గనుంగొనగోరి వేడినన్
జాలముసేసి దాగెదవు సంస్తుతికెక్కిన రామనామమే
మూలము దామకోగలవు ముక్తికి బ్రాపది పాపమూలకు
ద్దాలముగాదె మాయెడల దాశరథీ కరుణాపయోనిధీ! 56

ఉ. వలదు పరాకు భక్తజనవత్సల నీచరితంబు నమ్మగా
వలదు పరాకు నీబిరుదు వజ్రమువంటిది గావకూరకే
వలదు పరాకు నాదురితవార్ధికి దెప్పవుగా మనంబులో
దలతునెకా నిరంతరము దాశరథీ కరుణాపయోనిధీ! 57

చ. తప్పులెఱుంగలేక దురితంబులు సేసితినంటి నీవు మా
యప్పవు గావుమంటి నికనన్యులకున్ నుడురంటనంటి నీ
కొప్పిదమైన దాసజనులొప్పిన బంటుకు బంటనంటి నా
తప్పులకెల్ల నీవెగతి దాశరథీ కరుణాపయోనిధీ! 58

చ. ఖలుడు దురాత్ముడంచు జనులెన్నగ నాడిగొంటి నేనెపో
పతితుడనంటిపో పతితపావనమూర్తివి నీవు గల్గ వే
దితరుల వేడనంటి నిహమిచ్చిననిమ్ము పరంబొసంగుమీ
యతులితరామనామమధురాక్షరపాళి నిరంతరంబు హృ
ద్గతమని నమ్మి కొల్చెదను దాశరథీ కరుణాపయోనిధీ! 59

ఉ. అంచితమైన నీదుకరుణామృతసారము నాదుపైని బ్రో
క్షించిన జాలు దాన నిరసించెద నాదురితంబులెల్ల దూ
లించెద వైరివర్గమెదిరించెద గోర్కుల నీదుబంటనై
దంచెద గాలకింకరుల దాశరథీ కరుణాపయోనిధీ! 60

చ. జలనిధులేడునొక్కమొగి జక్కికిదెచ్చు శరంబు దాటినిం
పలరగ జేసినాతిగ బదాబ్జపరాగము నీచరిత్రమున్
జలజభవాదినిర్జరులు సన్నుతి సేయగలేరు గావునన్
దలపనగణ్యమయ్య యిది దాశరథీ కరుణాపయోనిధీ! 61

ఉ. కోతికి శక్యమా అసురకోటుల గెల్వను గెల్చెబో నిజం
బాతనిమేన శీతకరుడౌట దవానలుడెట్టిదింత? మా
సీతపతివ్రతామహిమ సేవకు భాగ్యము నీ కటాక్షమున్
ధాతకు శక్యమా పొగడ దాశరథీ కరుణాపయోనిధీ! 62

ఉ. భూపలలామ రామ రఘుపుంగవ రామ త్రిలోకరాజ్యసం
స్థాపన రామ మోక్షఫలదాయక రామ మదీయపాపముల్
పాపగదయ్య రామ నిను బ్రస్తుతి చేసెదనయ్య రామ సీ
తాపతి రామ భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 63

ఉ. నీసహజంబు సాత్వికము నీవిడిపట్టు సుధాపయోధి ప
ద్మాసనుడాత్మజుండు గిరిజాలయు నీప్రియురాలు నీదుసిం
హాసనమిద్ధరిత్రి గొడుగాకసమక్షులు చంద్రభాస్కరుల్
నీసుమతల్పమాదిఫణి నీవె సమస్తము గొల్వనట్టి నీ
దాసులభాగ్యమెట్టిదయ దాశరథీ కరుణాపయోనిధీ! 64

ఉ. చరణము సోకినట్టి శిల జవ్వనిరూపగుటొక్కవింత సు
స్థిరముగ నీటిపై గిరులు దేలినదొక్కటి వింత గాని నీ
స్మరణదనర్చుమానవులు సద్గతిచెందినదెంతవింత యీ
ధరను ధరాత్మజారమణ దాశరథీ కరుణాపయోనిధీ! 65

ఉ. దైవము తల్లిదండ్రి తగు దాత గురుండు సఖుండు నిన్నెకా
భావనసేయుచున్నతరి పాపములెల్ల మనోవికారదు
ర్భావితు జేయుచున్నవి కృపామతినై నను కావుమీ జగ
త్పావనమూర్తి భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 66

ఉ. వాసవరాజ్యభోగసుఖవార్ధిని దేలు ప్రభుత్వమిచ్చినా
యాసకు మేరలేదు కనకాద్రిసమానధనంబు గూర్చినన్
గాసును వెంటరాదు కనికానక చేసిన పుణ్యపాపముల్
వీసరబోవనీవు పదివేలకుజాలు భవంబునొల్ల నీ
దాసునిగాగ నేలుకొను దాశరథీ కరుణాపయోనిధీ! 67

ఉ. సూరిజనుల్ దయాపరులు సూనృతవాదులలుబ్ధమానవుల్
వీరపతివ్రతాంగనలు విప్రులు గోవులు వేదముల్ మహీ
భారము దాల్పగా జనులు పావనమైన పరోపకార స
త్కారమెఱుంగలేరకట దాశరథీ కరుణాపయోనిధీ! 68

ఉ. వారిచరావతారమున వారిధిలో జొరబాటి క్రోధవి
స్తారగుడైన యా నిగమతస్కరవీరనిశాచరేంద్రునిన్
జేరి వధించి వేదములు చిక్కెడలించి విరించికిన్ మహో
దారతనిచ్చితీవెగద దాశరథీ కరుణాపయోనిధీ! 69

చ. కరమనురక్తి మందరము గవ్వముగానహిరాజు ద్రాడుగా
దొరకొని దేవదానవులు దుగ్ధపయోధి మథించుచున్నచో

ధరణి చలింప లోకములు తల్లడమందగ గూర్మమై ధరా
ధరము ధరించితీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 70

ఉ. ధారుణి జాపజుట్టిన విధంబున గైకొని హేమనేత్రుడ
వ్వారిధిలోన దాగినను వాని వధించి వరాహమూర్తివై
ధారుణి దొంటికైవడిని దక్షిణశృంగమునన్ ధరించి వి
స్తారమొనర్చితీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 71

చ. పెటపెటనుక్కుకంబమున భీకరదంతనఖాంకురప్రభా
పటలము గప్పనుప్పతిలి భండనవీధి నృసింహభీకర
స్ఫుటపటుశక్తి హేమకశిపున్ విదళించి సురారిపట్టి ను
త్కట గృపజూచితీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 72

చ. పదయుగళంబు భూగగనభాగములన్ వెసనూని విక్రమా
స్పదుడగు నబ్బలీంద్రునొకపాదమునం దలక్రిందనొత్తి మే
లొదవ జగత్త్రయంబు బురుహూతునికిచ్చు వటుండవైన చి
త్పదములమూర్తివీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 73

చ. ఇరువదియొక్కమారు ధరణీశులనెల్ల వధించి తత్కళే
బరరుధిరప్రవాహమున బైతృకతర్పణమొప్పజేసి భూ
సురవరకోటికిన్ ముదము సొప్పడ భార్గవరామమూర్తివై
ధరణినొసంగితీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 74

చ. దురమున దాటకన్ దునిమి ధూర్జటివిల్ దునుమాడి సీతనున్
బరిణయమంది తండ్రి పనుపన్ ఘనకాననభూమికేగి దు
స్తరపటుచండకాండకులిశాహతి రావణకుంభకర్ణభూ
ధరముల గూల్చితీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 75

చ. అనుపమయాదవాన్వయసుధాబ్ధిసుధానిధి కృష్ణమూర్తి నీ
కనుజుడుగా జనించి కుజనావళినెల్లనడంచి రోహిణీ
తనయుడనంగ బాహుబలదర్పమునన్ బలరామమూర్తివై
తనరిన వేల్పువీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 76

చ. సురలనుతింపగా ద్రిపురసుందరులన్ వరియింప బుద్ధరూ
పరయగ దాల్చితీవు త్రిపురాసురకోటి దహించునప్పుడా
హరునకు తోడుగా వరశరాసనబాణముఖోగ్రసాధన
త్కరమొనరించితీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 77

ఉ. సంకరదుర్గమై దురితసంకులమైన జగంబు చూచి స
ద్వ్యంకవిలీల నుత్తమతురంగమునెక్కి కరాసి బూని వీ
రాంకవిలాసమొప్ప గలికాకృతి సజ్జనకోటికిన్ నిరా
తంకమొనర్చితీవెకద దాశరథీ కరుణాపయోనిధీ! 78

చ. మనమున నూహపోహలు మర్వకమున్నె కఫాదిరోగముల్
దనువున నంటి మేనిబిగి దప్పకమున్నె నరుండు మోక్షసా
ధనమొనరింపగావలయు దత్త్వవిచారము మానియుండుటల్
తనువునకున్ విరోధమది దాశరథీ కరుణాపయోనిధీ! 79

చ. ముదమునగాటపట్టు భవమోహమదద్విరదాంకుశంబు సం
పదలకొటారు కోరికలపంట పరంబునకాది వైరులం
న్నదన జయంబు త్రోవ విపదబ్ధికి నావగదా సదా భవ
త్పదములనామసంస్మరణ దాశరథీ కరుణాపయోనిధీ! 80

చ. ముదితలతానుసారిభవదుఃఖదలంబము వామనామధీ
కరతరహాతిచే వెగి వహావహక్షై చనకుండ నేర్పునే
దరికొని మండుచుండు శిఖి దావ్యానిలన్ శలభాదికీటకో
త్కరము దిరిసమైచనదె దాశరథీ కరుణాపయోనిధీ! 81

చ. హరిపదభక్తి నింద్రియజయాన్వితుడుత్తముడింద్రియంబులన్
మరుగక నిల్పనాదినము మధ్యముడింద్రియపారవశ్యుడై
పరగినవో నికృష్టుడని పల్కగ మూర్ఖతనైన నమ్మి నా
దరమున నెట్లుకాచెదవొ దాశరథీ కరుణాపయోనిధీ! 82

చ. వనకరి చిక్కె మైనసకు వాచవికిన్ జెడిపోయె మీను తా
వినికికి జిక్కె జిల్వ గనువేదురుచెందెను లేళ్ళు తావిలో
మనికి నశించె దేటి తరమా యిరువారిని గెల్వ నైదుసా
ధనముల నీవె కావదగు దాశరథీ కరుణాపయోనిధీ! 83

ఉ. కరములు నీకు మ్రొక్కులిడ కన్నులు నిన్నె చూడ జిహ్వ నీ
స్మరణ దనర్ప వీనులు భవత్కథలన్ వినుచుండ నాస నీ
యురుతరమొప్పు పూసరుల కానగొనన్ బరమార్థసాధనో
త్కరమిది చేయవే కృపను దాశరథీ కరుణాపయోనిధీ! 84

చ. నిరతరభక్తి నొక్కతులసీదళమున్ ఘన సేయువాడు లే
చరగడు దోషగ్రహసంఘములో వెలుగన్ సదా భవత్
స్ఫురదరవిందపాదముల పూజలొనర్చినవారికెల్ల ధ
త్పరమనచేతిధాత్రిగద దాశరథీ కరుణాపయోనిధీ! 85

ఉ. భానుడు తూర్పునందు గనుపట్టిన బావకచంద్రతేజముల్
హీనత జెందినట్లు జగదేకవిరాజితమైన నీ పద
ధ్యానము చేయుచున్న బరదైవమరీచులడంగకుండునే
దానవగర్వనిర్దళన దాశరథీకరుణాపయోనిధీ! 86

ఉ. నీసుమహానియుతత్త్వరసనిగ్రహబోధకథామృతాబ్ధిలో
దానుమునుంగకుండక వృథా తనుకష్టమునొంది మానవుం
డీమహిలోకతీర్థములనెల్ల మునింగిన దుష్కృతాబ్ధి యా
త్మానసపంకముల్ విడునె దాశరథీ కరుణాపయోనిధీ! 87

ఉ. కాంచనవస్తుసంకలితకల్మషమగ్నిపుటంబు బెట్టి వా
డించినరీతి నాల్కనిగిడించిన దుష్కృతదుర్మలత్రయం

బంచితభక్తియోగదహనార్చి దగుల్పక పాయునే కవ
త్కాంచనకుండలాభరణ దాశరథీ కరుణాపయోనిధీ! 88

ఉ. నీసతి పెక్కుగల్ములిడ నేర్పరి లోకముకల్మషంబుగా
నీసుత సేయు పావనము నిర్మలతీర్థధురీణదక్షుడై
నీసుతుడిచ్చు నాయువులు నిచ్చు భజించిన గల్గకుండునే
దాసులకీప్సితార్థములు దాశరథీ కరుణాపయోనిధీ! 89

ఉ. వారిచరత్రమందిడిన వారివిధంబున వర్తనీయమం
దారయ పెంపిలోన దనువంటని కుమ్మరిపుర్వురీతి సం
సారమునన్ మెలంగుచు విచారగుడై పరమొందుగాదె స
త్కారమెలంగి మానవుడు దాశరథీ కరుణాపయోనిధీ! 90

ఉ. ఎక్కడి తల్లి తండ్రి సుతులెక్కడివారు కళత్రబాంధవం
బెక్కడ జీవుడెట్టి తనువెత్తిన బుట్టుచు బోవుచున్నవా
డొక్కడె పాపపుణ్యఫలమొందుచునొక్కడె కానరాడు వే
ఱొక్కడు వెంటనంటి భవమొల్లనయా కృపజూడవయ్య నీ
తక్కరిమాయలందిడక దాశరథీ కరుణాపయోనిధీ! 91

చ. దొరసినకాయముల్ ముదిమి తోచినజావు ధ్రువత్వముల్ సిరుల్
మెఱుపులు గాగ జూచి మది మేదినిలో దమతోడివారలుం
దరుగుటజూచిచూచి తెగువాయువెఱుంగక మోహపాశముల్
తరుగనివారికేమిగతి దాశరథీ కరుణాపయోనిధీ! 92

చ. సిరిగలనాడు మైమఱచి చిక్కిననాడు దలంచి పుణ్యముల్
పొరిపొరి సేయనైతినని పొక్కిన గల్గునె గాలి చిచ్చుపై
గెరలినవేళ దప్పిగొని కీడ్పడువేళ జలంబు గోరి త
త్తరమున ద్రవ్వినంగలదె దాశరథీ కరుణాపయోనిధీ! 93

ఉ. జీవనమింక పంకమున జిక్కిన మీను చలింపకెంతయున్
దావుననిల్చి జీవనమె దక్కగగోరు విధంబు చొప్పడన్
ధావలమైనగాని గుణి తప్పనివాడు తరించువాడయా
భావకభక్తియోగమున దాశరథీ కరుణాపయోనిధీ! 94

చ. సరసునిమానసంబు సరసజ్ఞుడెఱుంగును ముష్కరాధముం
డెఱిగిగ్రహించువాడె కొలనేకనివాసముగాగ దర్దురం
బరయగ నేర్చునెట్లు వికచాబ్జమరందరసైకసౌరభో
త్కరము మిళిందమెఱుంగుక్రియ దాశరథీ కరుణాపయోనిధీ! 95

ఉ. చోదిన తల్లిదండ్రికి తనూభవుడొక్కడె చాలు మేటి చే
చావనివాడు వేల్పొకడు చాలిన వేదనకేడ్చువాడు నో
రారి నిజంబుగానిపలుకాడనివాడు రణంబులోన మేన్
దావనివాడు భద్రగిరిదాశరథీ కరుణాపయోనిధీ! 96

ఉ. శ్రీయుతజానకీరమణ చిన్మయరూప రమేశ రామ నా
రాయణ 'పాహిపాహి'యని బ్రస్తుతి జేసితి నా మనంబునన్
బాయక కిల్బిషవ్రజవిపాటనమొందగజేసి సత్కళా
దాయిఫలంబు నాకిడవె దాశరథీ కరుణాపయోనిధీ! 97

ఉ. ఎంతటి పుణ్యమో శబరియెంగిలి గొంటివి వింతగాదె నీ
మంతనమెట్టిదో యుడుతమేని కరాగ్రనఖాంకురంబులన్
సంతసమందజేసితివి సత్కులజన్మునదేమితక్కు వే
దాంతముగాదె నీమహిమ దాశరథీ కరుణాపయోనిధీ! 98

ఉ. బొంకనివాడె యోగ్యుడరిబృందములెత్తినచోట జివ్వకున్
జంకనివాడె జోదు రభసంబుననర్థి కరంబుసాచినన్
గొంకనివాడె దాత యిల గొల్చి భజించినవాడెపో నిరా
తంకమునన్ను డెన్నగను దాశరథీ కరుణాపయోనిధీ! 99

చ. భ్రమరము గీటకంబుగొని పల్మరు ఝుంకరణోపకారియై
భ్రమరముగానొనర్చునని పల్కుటజేసి భవాదిదుఃఖసం
తమసమెడల్చి భక్తిసహితంబుగ జీవునివిశ్వరూపత
త్త్వమున ధరించుటేమరుదు దాశరథీ కరుణాపయోనిధీ! 100

చ. తరువులు పూచి కాయలగు దత్కుసుమంబులు పూజగా భవ
చ్చరణము సోకి దాసులకు సారముతో ధనధాన్యరాసులై
కరిభటఘోటకాంబరనికాయములై విరజానదీసము
త్తరణమొనర్చు చిత్రమిది దాశరథీ కరుణాపయోనిధీ! 101

ఉ. పట్టితి భట్టరార్యగురు పాదములిమ్మెయునూర్ధ్వపుండ్రముల్
వెట్టితి మంత్రరాజమొడిబెట్టితి నయ్యమకింకరాలికిన్
గట్టితి బొమ్మ నీచరణకంజములందు దలంపుపెట్టి బో
దట్టితి బాపపుంజముల దాశరథీ కరుణాపయోనిధీ! 102

ఉ. అల్లన లింగమంత్రిసుతుడత్రిజగోత్రజుడాదిశాఖ కం
చెర్లకులోద్భవుండన బ్రసిద్ధుడనై భవదంకితంబుగా
నెల్లకవుల్ నుతింప రచియించితి గోపకవీంద్రుడన్ జగ
ద్వల్లభ నీకు దాసుడను దాశరథీ కరుణాపయోనిధీ! 103

– ❋ ❋ ❋ –

Visit Dwarkadheeshvastu.com For
FREE Vastu Consultancy, Music, Epics, Devotional Videos
Educational Books, Educational Videos, Wallpapers
****
All Music is also available in CD format. CD Cover can also be print with your Firm Name
****
We also provide this whole Music and Data in PENDRIVE and EXTERNAL HARD DISK.
Contact : Ankit Mishra (+91-8010381364, dwarkadheeshvastu@gmail.com)

Valmiki-Ramayan Telugu Part - 2

విషయానుక్రమణిక

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
1)	విషయానుక్రమణిక	4
2)	ప్రస్తావన	17
3)	శ్రీరామాయణ పారాయణవిధి:	25
	అరణ్యకాండము	
1)	సీతారామలక్ష్మణులు దండకారణ్యమునందలి మునుల ఆశ్రమమున ప్రవేశించుట మునులు వారికి అతిథి సత్కారములను గావించుట.	.. 1
2)	సీతారామలక్ష్మణులకు దారిలో విరాధుడను రాక్షసుడు తారసపడుట - అతడు సీతాదేవిని లాగికొనుట- శ్రీరాముడు పరితపించుట - లక్ష్మణుడు ధైర్యము చెప్పుట.	.. 3
3)	శ్రీరామునకును విరాధునకును మధ్య వాగ్వివాదములు- రామలక్ష్మణులు విరాధునిపై దెబ్బతీయుట - ఆ రాక్షసుడు వారిని తన భుజములపై మోసికొనిపోవుట.	.. 6
4)	రామలక్ష్మణులు విరాధునివధించి, అతనికి శాపవిముక్తిని కల్గించుట.	.. 8
5)	సీతారామలక్ష్మణులు శరభంగమహర్షి ఆశ్రమమునకు చేరుట - వారు దూరము నుండియే ఇంద్రాదులను దర్శించుట - శరభంగ మహర్షి వారికి అతిథిమర్యాదలను నెఱపిన పిమ్మట బ్రహ్మలోకమునకు వెళ్లుట.	.. 11
6)	రాక్షసులుపెట్టెడి బాధలను తొలగింపుమని మునీశ్వరులు శ్రీరాముని అర్థించుట. ఆప్రభువు వారికి అభయమిచ్చుట- పిమ్మట వారితోగూడి సుతీక్ష్ణమహర్షి ఆశ్రమమునకు బయలుదేఱుట.	.. 15
7)	శ్రీరాముడు సుతీక్ష్ణమహర్షిని సందర్శించుట, ఆ మహాముని వారికి అతిథి సత్కారములను గావించుట.	.. 18
8)	సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణుని అనుమతి గైకొని, మునీశ్వరులతోగూడి దండకారణ్యమునకు బయలుదేఱుట.	.. 20
9)	"దండకారణ్యమునందలి రాక్షసులయెడ ఎట్టి వైరభావమూ లేకుండ వారిని చంపబూనుట ఎంతవఱకు యుక్తము?" అని సీతాదేవి శ్రీరామునకు విన్నవించుట.	.. 22
10)	"ఎట్టి పరిస్థితులలోను ప్రతిజ్ఞాభంగమునకు పాల్పడను". అని శ్రీరాముడు సీతాదేవికి స్పష్టపఱచుట.	.. 25
11)	మాండకర్ణిమహర్షివృత్తాంతము - సీతారామలక్ష్మణులు వేర్వేఱు ఆశ్రమములలో పది సంవత్సరములు గడిపి, మఱల సుతీక్ష్ణాశ్రమమునకు చేరుట. అచట కొంతకాలము ఉండి, పిదప అగస్త్యసోదరుని ఆశ్రమమునకును, అనంతరము అగస్త్యుని ఆశ్రమమునకును చేరుట. అగస్త్య మహాముని ప్రభావము.	.. 27
12)	తనఆశ్రమమునకు విచ్చేసిన శ్రీరామునకు అగస్త్యుడు అతిథిసత్కారములను నెఱపి, దివ్యములైన అస్త్రశస్త్రములను సమర్పించుట.	.. 35
13)	అగస్త్యమహర్షి సీతాసాధ్వియొక్క ఔన్నత్యమును ప్రశంసించుట - శ్రీరామునికోరికపై ఆ మహాముని 'పంచవటి వారికి నివాసయోగ్యము' అని తెల్పుట. వారు అచటికి బయలుదేఱుట.	.. 38
14)	పంచవటికి వెళ్లుచు దారిలో శ్రీరాముడు జటాయువును కలియుట - అతడు తనవంశమును గూర్చి తెలుపుచు ప్రసంగవశమున సకల ప్రాణులఉత్పత్తినిగూర్చి వివరించుట - సీతారామలక్ష్మణులు పంచవటిలో ప్రవేశించుట.	.. 41
15)	పంచవటికి చేరినపిమ్మట పర్ణశాల నిర్మాణమునకు శ్రీరాముడు తగిన సూచనలను ఇచ్చుట - అంతట లక్ష్మణుడు పర్ణశాలను రమ్యముగా నిర్మించుట.	.. 44
16)	హేమంతఋతువర్ణనము - రామలక్ష్మణులు భరతునిఉదాత్తతను గుర్తునకు తెచ్చుకొనుట.	.. 47
17)	పురాణ కథాప్రసంగములతో పంచవటియందు కాలముగడపుచున్న శ్రీరామునికడకు రావణునిచెల్లెలైన శూర్పణఖ వచ్చుట. ఆమె శ్రీరాముని వనవాసమునుగూర్చి తెలిసికొనుట	

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	- తననుగూర్చి ఆయనకు వివరించుట - కామపరవశనైన ఆ రాక్షసి తనను భార్యగా స్వీకరింపుమని ఆయనను కోరుట.	.. 51
18)	రామలక్ష్మణులు శూర్పణఖను తిరస్కరించుట - ఆమె సీతాదేవిపై దాడికి దిగుట - శ్రీరాముని సూచనపై లక్ష్మణుడు ఆమెను విరూపను గావించుట. పిమ్మట ఆ రాక్షసి తనసోదరుడైన ఖరుని ఆశ్రయించుట.	.. 54
19)	శూర్పణఖను విరూపను గావించిన రామలక్ష్మణుల మీదికి, క్రుద్ధుడైన ఖరాసురుడు తన పదునాలుగు వేలమంది యోధులను యుద్ధమునకు పంపుట -	.. 57
20)	ఖరుడు పంపిన రాక్షసయోధులను శ్రీరాముడు ఒక్కడే హతమార్చుట - శూర్పణఖ మఱల ఖరుని ఆశ్రయించుట.	.. 59
21)	పదునాలుగువేలమంది రాక్షసయోధులు హతులైన విషయమును ఖరునకు తెలుపుచు శూర్పణఖ అతనిని ఆ రఘువరుని మీదికి తెప్పగొట్టుట.	.. 62
22)	పదునాలుగువేలమంది రాక్షసయోధులతోడను, దూషణునితోడనుగూడి ఖరుడు యుద్ధమునకు బయలు దేరుట -	.. 64
23)	అపశకునములు ఎన్ని ఎదురైనప్పటికిని ఖరుడు వాటిని సరకుగొనక ప్రగల్భములను పలుకుచు సైన్యముతో ముందునకు సాగుట - రామలక్ష్మణులను సమీపించుట.	.. 67
24)	అప్పుడేర్పడిన అపశకునములనుబట్టి రాక్షసులకు వినాశము, తమకు విజయము తథ్యమని శ్రీరాముడు లక్ష్మణునకు తెలుపుట - అన్న ఆదేశముతో లక్ష్మణుడు సీతాదేవిని దీసికొని ఒక పర్వతగుహనుజేరుట- శ్రీరాముడు యుద్ధసన్నద్ధుడగుట.	.. 71
25)	రాక్షసయోధులు శ్రీరామునిపై దాడికి దిగుట - ఆ ప్రభువు వారిని హతమార్చుట.	.. 75
26)	శ్రీరాముడు దూషణుని, అతని అనుయాయులైన రాక్షసయోధులను సంహరించుట.	.. 79
27)	ఖరునిసేనాధిపతియైన త్రిశిరుడు శ్రీరాముని చేతిలో హతుడగుట.	.. 82
28)	ఖరునకును, శ్రీరామునకును మధ్య జరిగిన ఘోరయుద్ధము.	.. 84
29)	ఖరుడును, శ్రీరాముడును పరస్పరము పరుషోక్తులాడుకొనుట- ఖరుడు శ్రీరామునిపై గదను ప్రయోగించుట - ఆ ప్రభువు దానిని తుత్తునియలు గావించుట.	.. 88
30)	శ్రీరాముడు ఖరుని వధించుట - దేవతలు, మునులు ఆ ప్రభువును కొనియాడుట - సీతాదేవి పరమానందభరితురాలగుట.	.. 91
31)	ఖరదూషణాదులు శ్రీరామునిచేతిలో హతులైన విషయమును అకంపనుడు రావణునకు తెల్పుట - అకంపనునిసూచనపై రావణుడు సీతాపహరణమునకై సంకల్పించుట - పిమ్మట అతడు మారీచునిసహాయమర్థించుట - మారీచుని వచనములకు మెత్తబడి దశకంఠుడు తిరిగి లంకకు చేరుట.	.. 95
32)	శూర్పణఖ లంకకుజేరి, తన అన్నయగు రావణుడు సభలో ఆసీనుడై యుండగా అతనిని దర్శించుట-	.. 100
33)	శూర్పణఖ నిండుసభలో ఉత్తమరాజలక్షణములను పేర్కొనుట - రావణునిమూర్ఖత్వమును ప్రకటించుట- అతడు అంతట ఆలోచనలోపడుట.	.. 103
34)	శూర్పణఖ రామలక్ష్మణులఅందచందములను, శౌర్యపరాక్రమములను వర్ణించి చెప్పుట - సీతాదేవియొక్క సౌందర్యవైభవములను ప్రకటించి, ఆమెకు భర్తకాదగినవాడవు నీవే-' అని పలుకుచు ఆమెను అపహరించుకొనిరమ్మని రావణునకు సూచించుట.	.. 106
35)	శూర్పణఖ చెప్పిన మాటలను విన్న పిమ్మట రావణుడు సీతాదేవిని అపహరించుకొని వచ్చుటకై నిశ్చయించుట - వెంటనే అతడు రథమును అధిరోహించి, సముద్రతీర దృశ్యములను గాంచుచు మారీచునిఆశ్రమమునకు చేరుట-	.. 109

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
36)	'సీతాపహరణవిషయమున తోడ్పడుము' అని రావణుడు మారీచుని కోరుట - అప్పుడతడు అందోళనకు లోనగుట-	.. 112
37)	మారీచుడు శ్రీరామునిఉదాత్తగుణములను గూర్చి రావణునకు వివరించుట - 'సీతాపహరణయత్నమును మానుకొనుము' అని అతడు ఆ లంకాధిపతికి హితవు పలుకుట -	.. 115
38)	మారీచుడు తన పూర్వానుభవమును అనుసరించి, బాల్యమునందే శ్రీరామునిలోగల బలపరాక్రమములను గూర్చి రావణునకు వివరించుట - సీతాదేవిని అపహరించినచో సర్వవినాశము తప్పదని హెచ్చరించుట -	.. 118
39)	మారీచుడు దండకారణ్యమునందు శ్రీరాముని బాణములతీవ్రతను రుచిచూచిన తన మఱియొక పూర్వానుభవమును వివరించుచు 'సీతాపహరణము తగదు' అని రావణుని హెచ్చరించుట -	.. 121
40)	రావణుడు మారీచుని హితవచనములను పెడచెవినిబెట్టుట - మాయలేడిగా మాఱి సీతను ప్రలోభపెట్టుటద్వారా తనకు తోడ్పడుమని ఆదేశించుట - తనఆజ్ఞను పాటింపనిచో తన చేతిలో చావుతప్పదని అతనిని హెచ్చరించుట	.. 124
41)	సీతాదేవిని అపహరించినచో 'నీవు సపరివారముగా నశించుట తథ్యము' అని మారీచుడు రావణుని మఱల హెచ్చరించుట -	.. 127
42)	రావణమారీచులు రథముపై పంచవటికి చేరుట - మారీచుడు మాయలేడిరూపమున ఆ ఆశ్రమముముందు సంచరించుట - సీతాదేవి దానిని జూచి ఆశ్చర్యపడుట -	.. 129
43)	కపటమృగమును జూచి 'ఇది రాక్షసమాయ' - అని లక్ష్మణుడు సందేహమును ప్రకటించుట - కాని సీతాదేవి ముచ్చటపడి, దానిని సజీవముగానైనను, చంపియైనను తీసికొనిరమ్మని శ్రీరాముని కోరుట - శ్రీరాముడు సీతాదేవి రక్షణభారమును లక్ష్మణునిపైనుంచి, లేడిని తీసికొనివచ్చుటకై సిద్ధపడుట.	.. 132
44)	మాయలేడిరూపముననున్న మారీచుడు శ్రీరామునిబాణపుదెబ్బకు హతుడై, రాక్షసరూపమును పొందుట - 'హా సీతా! హా లక్ష్మణా!' అను అతని ఆక్రందనవచనములను విని రాముడు కలవరపడుచు పంచవటికి బయలుదేఱుట	.. 137
45)	'హా సీతా! హా లక్ష్మణా!' అను ఆక్రందనవచనములను విని, శ్రీరాముడు ఆపదలోచిక్కుపడినట్లు భావించి, సీతాదేవి కలత చెందుట - శ్రీరామునకు సహాయపడుటకై వెళ్లుమ'ని ఆమె లక్ష్మణుని కోరుట - అందులకతడు సిద్ధపడకుండుటచే ఆమె పరుషోక్తులాడుట - విధిలేక లక్ష్మణుడు రాముని కడకు బయలుదేఱుట.	.. 140
46)	రామలక్ష్మణులు లేని సమయము చూచుకొని, రావణుడు యతివేషములో సీతాదేవి కడకు వచ్చుట - ఆమెరూపలావణ్యములను వర్ణించుచు, ఆ మహారణ్యమున నివసించుటకుగల కారణములను ఆమెనడుగుట. జానకి ఆ కపటయతికి అతిథి మర్యాదలనొనర్చుట -	.. 144
47)	సీతాదేవి తనను గుఱించియు, తనభర్తయగు శ్రీరామునిగూర్చియు తెలిపి, తమవనవాస కారణములను రావణునకు వివరించుట - తనకు పట్టపురాణివై హాయిగా సుఖింపుమని రావణుడు ఆమెను ప్రలోభపెట్టుట- సీతాదేవి అందులకు తిరస్కరించుచు, శ్రీరాముని ముందు అతనిని కొఱగాని వానినిగా వర్ణించుట -	.. 148
48)	రావణుడు తనవంశవైభవములగూర్చియు, సంపదలను గుఱించియు గొప్పలుచెప్పికొనుట - దురాలోచనాపరుడైన రావణుని సీతాదేవి తూలనాడుట -	.. 152

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
49)	సీతాదేవితనయెడ సుముఖురాలు అగుటకై రావణుడు నయభయవచనములను పలుకుట - అతడు రాక్షసరూపమును పొంది, ఆమెను రథముపై చేర్చుకొని ఆకాశమార్గమున బయలుదేఱుట - నిస్సహాయస్థితిలోనున్న జానకి తనను రక్షించుటకై లక్ష్మణుని, ప్రకృతిని వేడుకొనుట - జటాయువును అర్థించుట -	.. 155
50)	సీతాదేవిని తన రథముపై తీసికొని పోవుచున్న రావణుని నిలువరించుచు జటాయువు హితోక్తులు పల్కుట - 'యుద్ధమునకు సిద్ధమగుము'- అని హెచ్చరించుట -	.. 155
51)	జటాయువునకును రావణునకును మధ్య పోరు ఘోరముగా సాగుట - జటాయువుధాటికి రావణునిరథాదులు ముక్కలగుట - రావణునిదెబ్బకు గృధ్రరాజు ఱెక్కలు తెగి నేలగూలుట - తనను రక్షించుటకై వచ్చిన జటాయువునకై సీతాదేవి మిగుల పరితపించుట -	.. 162
52)	రావణునిపట్టును విడిపించుటకొనుటకై సీతాదేవి పెనగులాడుట - అతడు బలవంతముగా ఆమెను తీసికొని, రథముపై ఆకాశమార్గమున సాగిపోవుట -	.. 166
53)	ఆకాశమార్గమున రథముపై తనను తీసికొనిపోవుచున్న రావణుని మందలించుచు సీతాదేవి తీవ్రముగా పరుషోక్తులాడుట -	.. 170
54)	రావణుడు సీతాదేవితో లంకకు చేరుట, ఆమెను అచట రాక్షస స్త్రీల రక్షణలో నుంచుట - పిమ్మట అతడు ఎనిమిదిమంది రాక్షస యోధులను దండకారణ్యమునకు పంపుట -	.. 173
55)	సీతాదేవిని ప్రలోభపఱచుటకై రావణుడు బలవంతముగా తనభవనవైభవాదులను ఆమెకు చూపించుట - ఆమె వాటియెడ విముఖతను ప్రదర్శించుట - తనను భర్తగా స్వీకరింపుమని రావణుడు పదేపదే వేడుకొనుచు ఆమెపాదములపై పడుట -	.. 175
56)	'నన్ను అపహరించుకొని వచ్చినందులకు శ్రీరామునిచేతిలో నీకు చావు తప్పదు' అని సీతాదేవి రావణుని హెచ్చరించుట - దానికతడు క్రుద్ధుడై, సంవత్సరము గడువు విధించి, ఆమెరక్షణభారమును రక్కసులకు అప్పగించివెళ్లుట - అతని ఆదేశానుసారము వారు ఆమెను అశోకవనమునకు చేర్చుట -	.. 179
	ప్రక్షిప్త సర్గము :	
-	బ్రహ్మదేవునిఆజ్ఞానుసారము దేవేంద్రుడు లంకకు వెళ్లి సీతాదేవికి దివ్యమైన పాయసమును అర్పించుట - పిమ్మట అతడు ఆమెయొద్ద సెలవుగైకొని మఱలుట -	.. 182
57)	మారీచుని చంపి ఆశ్రమమునకు బయలుదేఱిన శ్రీరామునకు అపశకునములు ఎదురగుట - లక్ష్మణుడు దీనవదనుడై అన్నను సమీపించుట -'సీతాదేవికి ఎట్టి ప్రమాదము వాటిల్లినదో?' అను ఆందోళనకులోనై శ్రీరాముడు లక్ష్మణుని మందలించుట -	.. 184
58)	'ఆశ్రమమున ఒంటరిగానున్న సీతాదేవికి ఎట్టి ప్రమాదము సంభవించినదో'? అని శ్రీరాముడు కలవరపడుట - ఆస్వామి తమ్మునితోగూడి త్వరత్వరగా ఆశ్రమమునకు చేరి, ఆమెకై అంతటను కలయజూచుట -	.. 186
59)	'సీతాదేవిని ఆశ్రమమున ఒంటరిగా వదలివచ్చిన కారణమేమి?' అని రాముడు లక్ష్మణుని ప్రశ్నించుట - వదినె తనను తూలనాడుటచే విధిలేక తాను వచ్చినట్లు సౌమిత్రి అన్నకు తెల్పుట - 'ఐనను నీవు ఆమెను వీడి వచ్చుట యుక్తముగాదు సుమా!' అనని శ్రీరాముడనుట -	.. 188
60)	విరహవేదనకులోనైన శ్రీరాముడు సీతాదేవికొఱకై అన్ని ప్రదేశములయందును వెదకుచు మిగుల పరితపించుట -	.. 191
61)	శ్రీరాముడు విరహమునకులోనై వ్యథచెందు చుండగా సౌమిత్రి ఆయనను ఓదార్చుట - వారు ఇరువురును జానకికై ఆవనమునందు అంతటను అన్వేషించుట.	.. 195

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
62)	సీతాదేవియెడబాటువలన శ్రీరాముడు మిగుల విలపించుట -	.. 198
63)	శ్రీరాముడు సీతాదేవియొక్క రూపలావణ్యములను జ్ఞప్తికి దెచ్చుకొనుచు ఆమెయెడబాటునకు వ్యథచెందుట -	.. 200
64)	రామలక్ష్మణులు సీతాదేవికై అన్వేషించుట - శ్రీరాముడు శోకసంతప్తుడై, ఆదేవిజాడ తెల్పుమనుచు పశుపక్ష్యాదులను, వృక్షములను, గోదావరిని అడుగుట - మృగములద్వారా సంకేతమును పొంది వారు దక్షిణదిశకు వెడలుట, సీతాదేవి ధరించిన పూలను, ఆభరణములను ఆమె పాదచిహ్నములను గుర్తించుట, భగ్నములైన కవచాదియుద్ధసాధనములు ఆయనకు కనబడుట - దేవతలు సీతాదేవిని తీసికొనివచ్చి తనకు అప్పగింపనిచో ముల్లోకములను భస్మము చేయుటకు శ్రీరాముడు సిద్ధపడుట -	.. 203
65)	శ్రీరాముడు లోకములను ధ్వంసము చేయుటకు సిద్ధపడగా లక్ష్మణుడు మృదువచనములతో ఆయనను శాంతపఱచుట-	.. 209
66)	'ఆగ్రహావేశములనువీడి, దుష్టుడైన ఆ రాక్షసుని గుర్తించి, వానిని హతమార్చుట ముఖ్య కర్తవ్యము' - అని లక్ష్మణుడు శ్రీరామునకు నివేదించుట -	.. 211
67)	రామలక్ష్మణులు జటాయువును కలిసికొనుట, శ్రీరాముడు ఆ పక్షిరాజును అక్కున జేర్చుకొని ఏడ్చుట -	.. 213
68)	జటాయువు అసువులను బాయుట - శ్రీరాముడు అతనికి దహనసంస్కారముల నొనర్చుట - మోక్షమునొసంగుట.	.. 216
69)	రామలక్ష్మణులు దండకవనమును, క్రౌంచారణ్యమును దాటి ముందునకు సాగుట 'అయోముఖి' అను రాక్షసి దారిలో వారికి అడ్డువచ్చి, అసభ్యముగా ప్రవర్తింపగా లక్ష్మణుడు ఆమెముక్కు చెవులను కోయుట - ఆమె పాఱిపోవుట - 'కబంధుడు' అను రాక్షసునిచేతులలో బంధింపబడినప్పుడు లక్ష్మణుడు వ్యథ చెందుట - శ్రీరాముడు ఆయనకు ధైర్యము చెప్పుట -	.. 221
70)	కబంధుడు రామలక్ష్మణులను భక్షించుటకు సిద్ధపడుట- సమయస్ఫూర్తితో వారు అతని బాహువులను ఖండించి వేయుట- అప్పుడు ఆ రాక్షసునకు కనువిప్పు కలుగగా అతడు రామలక్ష్మణులను ప్రశంసించుట -	.. 225
71)	కబంధుడు శ్రీరామునకు తనపూర్వవృత్తాంతమును దెల్పుట - అతనికోరికపై శ్రీరాముడు వానికి సీతాపహరణవృత్తాంతమును వివరించుట - 'నన్ను దహనమొనర్చిన పిమ్మట నాకు జ్ఞానోదయమగును - అప్పుడు మీకు నేను సహాయపడుదును'- అని కబంధుడు శ్రీరామునకు విన్నవించుట-	.. 227
72)	రామలక్ష్మణులు కబంధునిదేహమునకు అగ్ని సంస్కారమొనర్చుట - ఆ చితిజ్వాలలనుండి కబంధుడు దివ్యదేహముతో బయటికి వచ్చుట - పిమ్మట అతడు శ్రీరామునకు సుగ్రీవుని వృత్తాంతమును దెలిపి, సీతాన్వేషణలో ఆ కపీశ్వరుడు తోడ్పడగలడనియు, కనుక అతనితో మైత్రి చేయుమనియు పలుకుట -	.. 230
73)	దివ్యస్వరూపమును పొందిన కబంధుడు ఋశ్యమూకపర్వతమున నివసించెడి సుగ్రీవునికడకు వెళ్లెడి మార్గమును రామలక్ష్మణులకు దెల్పుచు ఆ దారిలో గల పంపాసరోవరము, మతంగవనము, శబరి ఆశ్రమము, వృక్షసంపద మున్నగువానిని గూర్చి వివరించుట -	.. 232
74)	రామలక్ష్మణులు శబరిఆశ్రమమునకు చేరుట - ఆమె వారికి అతిథిసపర్యలు గావించుట - శ్రీరాముడు శబరియోగక్షేమములను విచారించుట - మతంగముని ప్రభావమును దెల్పుచు శ్రీరామునికోరికపై ఆమె ఆ ఆశ్రమశోభలను వివరించుట - ఆ స్వామిఆజ్ఞగొని ఆమె	

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	దివ్యరూపముతో పరంధామమునకు చేరుట -	.. 237
75)	ఋశ్యమూకపర్వతమునకు వెళ్లుచు రామలక్ష్మణులు పంపాసరోవరతీరమునందలి దృశ్యములను గాంచుట -	.. 240
	కిష్కింధాకాండము	
1)	ఆహ్లాదకరములైన వసంత-ఋతు శోభలను, మనోహరములైన పంపాసరోవరతీరములయందలి దృశ్యములను చూచుచు శ్రీరాముడు మిగుల విరహ వేదనకు గుఱియగుట - లక్ష్మణస్వామి ఉత్సాహవఱచుచు అన్నను ఓదార్చుట - సీతాదేవిని వెదకుచు అచట తిరుగుచున్న రామలక్ష్మణులనుజూచి, సుగ్రీవుడు భయపడుట -	.. 243
2)	రామలక్ష్మణులను జూచిన సుగ్రీవుడు, వారు వాలి పంపగా వచ్చినవారేమో? అని శంకించి భయపడుట - హనుమంతుడు అతనికి ధైర్యము గొల్పుట, పిమ్మట రామలక్ష్మణులనుగూర్చి తెలిసికొనివచ్చుటకు సుగ్రీవుడు హనుమంతుని పంపుట -	.. 256
3)	హనుమంతుడు రామలక్ష్మణులను కలిసికొని, వారిరూపవైభవములను ప్రశంసించుట - వారి ఆగమనకారణములనుగూర్చి అడుగుట - సుగ్రీవునిగూర్చి తెలుపుచు అతడు వారితో సఖ్యమును గోరుచున్నట్లు మారుతి వచించుట - అందులకు వారు సమ్మతించుట.	.. 259
4)	హనుమంతునిఅభ్యర్థనపై శ్రీరాముని ప్రేరణను అనుసరించి, సౌమిత్రి తమవనవాస వృత్తాంతమును, సీతాపహరణవిషయమును మారుతికి వివరించుట - శ్రీరాముడు సుగ్రీవునితో మైత్రికి తనఅభిలాషను వెల్లడించుట - ఆంజనేయుడు నిజరూపమును ప్రకటించి, వారిని తన భుజములపై కూర్చుండ బెట్టుకొని ఋశ్యమూక పర్వతమునకు చేరుట.	.. 264
5)	రామలక్ష్మణులరాకకు మిగుల సంతసించి, సుగ్రీవుడు వారికి అతిథిమర్యాదలు నెఱపుట - అగ్నిసాక్షిగా రామసుగ్రీవులు మిత్రులగుట - వాలి తనకు చేసిన అపకారమును వివరించి, అతనిని వధింపుమని సుగ్రీవుడు శ్రీరాముని వేడుకొనుట - ఆ ప్రభువు వానరేంద్రునకు అభయమిచ్చుట -	.. 268
6)	'సీతాపహరణవృత్తాంతమును హనుమంతుని ద్వారా వినియుంటిని. ఆ దేవిజాడను తెలిసికొని, ఆమెను తీసికొనివచ్చి నీకు అప్పగించెదను' అని సుగ్రీవుడు శ్రీరామునకు మాటఇచ్చుట - అతడు జానకీదేవి నగలమూటను దెచ్చివారికి సమర్పించుట - 'ఆ నగలు సీతాదేవివియే' అని తెలిసికొనిన పిమ్మట - శ్రీరాముడు రావణుని సపరివారముగా చంపివేసెదనని పల్కుట.	.. 271
7)	సుగ్రీవుడు విరహశోకములో ఉన్న శ్రీరాముని ఓదార్చుట - శ్రీరాముడు అతని మాటలకు ఊఱట చెంది. 'వాలిని చంపెదను' - అని మాట ఇచుట.	.. 273
8)	సుగ్రీవుడు తనసంకటపరిస్థితినిగూర్చి శ్రీరామునకు వివరించుట - ఆ ప్రభువు ఆయనను ఊరడించుచు 'వాలితో ఏర్పడిన వైరకారణములను దెల్పుము-' అని కోరుట -	.. 276
9)	వాలితో తనకు వైరమేర్పడిన రీతిని సుగ్రీవుడు శ్రీరామునకు తెలుపుట -	.. 280
10)	వాలి సుగ్రీవుల వైరకారణములను వినిన శ్రీరాముడు 'వాలిని వధించి, నిన్ను శోక విముక్తుని చేసెదను' అని పలికి సుగ్రీవునకు ఊరట గూర్చుట.	... 282
11)	సుగ్రీవుడు వాలిబలపరాక్రమములనుగూర్చి శ్రీరామునకు వివరించుట - బలగర్వితుడైన దుందుభి వాలిని యుద్ధమునకు ఆహ్వానించుట- వాలి అతనిని హతమార్చుట - వాలిచే విసరి వేయబడిన దుందుభి కళేబరము నుండి చిమ్మిన రక్తము మతంగవనమున పడుట - అందులకు మతంగముని వాలిని శపించుట - ఆ శాపకారణముగా వాలి అచటి రాజాలడని ఎఱింగి, సుగ్రీవుడు తనసచివులతోగూడి	

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	ఋశ్యమూకపర్వతమున తలదాచుకొనుట - శ్రీరాముడు తన పరాక్రమముపై సుగ్రీవునకు విశ్వాసమును కలిగించుటకై దుందుభి కాయమును కాలికొనగోటితో చిమ్మివేయుట - మద్దిచెట్టును భేదింపుమని సుగ్రీవుడు ఆ ప్రభువును అర్థించుట -	.. 286
12)	శ్రీరాముడు ఏడుమద్దిచెట్లను భేదించుట - ఆ స్వామి శౌర్యపరాక్రమములపై సుగ్రీవునకు నమ్మకము ఏర్పడుట - రఘువరునిసూచనమేరకు సుగ్రీవుడు వాలిని యుద్ధమునకు ఆహ్వానించుట- ఆ ఇరువురును ఘోరముగా పోరాడుట - ఆ అన్నదమ్ములపోలికలు ఒక్కటిగా ఉండుటవలన శ్రీరాముడు తనబాణమును ప్రయోగింపకుండుట - యుద్ధమున దెబ్బతినిన సుగ్రీవుడు మతంగ వనమునకు చేరుట - శ్రీరాముడు అతనిని ఓదార్చి, కంఠమున (గుర్తుగా) ఒక మాలను ధరింపజేసి, వాలితో మఱల యుద్ధమునకు పంపుట -	.. 294
13)	రామలక్ష్మణులు, సుగ్రీవాదులు కిష్కింధకు బయలుదేఱుట - మహిమాన్వితమైన సప్తజనాశ్రమమును దర్శించి, దానికి నమస్కరించి, వారు ముందునకు సాగుట -	.. 298
14)	శ్రీరాముని అండజూచుకొని, సుగ్రీవుడు వాలిని యుద్ధమునకు కవ్వించుచు మహానాదమొనర్చుట -	.. 301
15)	సుగ్రీవునితో యుద్ధమునకు బయలుదేఱుచున్న వాలికి అతనిభార్య తార హితవచనములను నుడువుట.	.. 303
16)	వాలిసుగ్రీవులు భయంకరముగా పోరాడుట - శ్రీరాముడు ప్రయోగించిన అమోఘమైన బాణమునకు వాలి నేలగూలుట -	.. 306
17)	శ్రీరాముడు తనను నేలగూల్చినందులకు వాలి ఆ ప్రభువును అధిక్షేపించుట -	.. 310
18)	వాలి చేసిన ఆక్షేపణలకు శ్రీరాముడు ధర్మసమ్మతముగా సమాధానమిచ్చుట - అతనిని ఓదార్చుట - అంగదుని ఆదరింపవలసినదిగా వాలి ఆ ప్రభువును అర్థించుట -	.. 315
19)	వాలినేలగూలిన వార్తను విని, దుఃఖితయైన తార అంగదునితోగూడి రణభూమికి బయలుదేఱుట- భయకంపితులై పాఱిపోవుచున్న వాలియనుచరులను 'అట్లు పాఱిపోవలదు' అని తార కోరుట - అనంతరము ఆమె వాలి (తనభర్త) దుర్దశను జూచి విలపించుట -	.. 321
20)	అవసానదశలో నేలపై పడియున్న భర్తను కౌగిలించుకొని తార మిగుల విలపించుట -	.. 324
21)	హనుమంతుడు తారను ఊఱడించుట.	.. 327
22)	కొనయూపిరితోనున్న వాలి తనతమ్ముడైన సుగ్రీవునితోడను, కుమారుడైన అంగదునితోడను హితోక్తులు పలికి అసువులను కోల్పోవుట-	.. 329
23)	మృతిచెందిన వాలియొక్క బలపరాక్రమములను ప్రశంసించుచు తార పరితపించుట -	.. 332
24)	సోదరుని (వాలి) మృతికారణముగా సుగ్రీవుడు శోకమగ్నుడై జీవితముపై విరక్తి పొందుట - తాను ప్రాణత్యాగము చేయుటకు శ్రీరాముని అనుమతిగోరుట - తార శ్రీరామునిఔన్నత్యమును కొనియాడుట - పిదప తననుగూడ చంపి తన భర్తకడకు చేర్చుమని ఆ స్వామిని ప్రార్థించుట - శ్రీరాముడు ఆమెను ఓదార్చుట -	.. 335
25)	శ్రీరాముడు దుఃఖమగ్నులైన సుగ్రీవాదులను ఓదార్చుట - వాలికళేబరమునకు దహనసంస్కారములను నిర్వహింపవలసినదని లక్ష్మణుడు ఆదేశించుట, తారుడు శిబికాదులను తెప్పింపగా అంగదుడు తనతండ్రికి ఉత్తరక్రియలను ఆచరించుట -	.. 342
26)	"కిష్కింధకు విచ్చేసి సుగ్రీవుని పట్టాభిషిక్తుని గావింపుడు" అని మారుతి శ్రీరాముని అభ్యర్థించుట - తండ్రియానతిమేరకు తాను నగరమున ప్రవేశింపరాదనియు, ప్రస్రవణగిరియందే ఉండెదననియు శ్రీరాముడు తెల్పుట - "రాజ్యాభిషిక్తుడవై వర్షాకాలము ముగిసిన పిమ్మట సీతాన్వేషణప్రయత్నమును ప్రారంభింపుము" - అని రామచంద్రుడు సుగ్రీవుని ఆదేశించుట - సుగ్రీవుడు తాను పట్టాభిషిక్తుడై అంగదుని యువరాజును జేయుట -	.. 346

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
27)	శ్రీరాముడు ప్రస్రవణగిరిని వర్ణించుట - సీతాదేవియెడబాటుకారణముగా శోకించుట - లక్ష్మణుడు అన్నను ఓదార్చుట -	.. 350
28)	శ్రీరాముడు వర్ష-ఋతువిశేషములను వర్ణించుచు మధ్యమధ్య తనవిరహావేదనను ప్రకటించుట - 'మనసహాయమును పొందిన సుగ్రీవుడు మనకు తప్పక తోడ్పడును' - అని లక్ష్మణునితో నుడువుట -	.. 355
29)	శరత్కాలము ప్రారంభమైన విషయమును గుర్తించి, మిత్రకార్యమునకు (సీతాన్వేషణమునకు) పూనుకొనవలసినదిగా హనుమంతుడు సుగ్రీవునకు యుక్తియుక్తముగా సూచించుట - మారుతిమాటలను ఆదరించి ఆ కపిరాజు సేనలను సమీకరింపుమని 'నీలుడు' అను సేనాపతిని ఆజ్ఞాపించుట.	.. 363
30)	శరత్కాలమునందలి ప్రకృతిశోభలను గాంచుచు శ్రీరాముడు విరహవేదనకు లోనగుట- లక్ష్మణుడు అన్నను ఓదార్చుట - శరత్కాలము వచ్చినను సుగ్రీవుడు సీతాన్వేషణకు పూనుకొనలేదని భావించి, శ్రీరాముడు అతనిపై కుపితుడగుట - కిష్కింధకు వెళ్లి సుగ్రీవునకు కర్తవ్యమును గుర్తుచేయుమని లక్ష్మణునితోనుడువుట -	.. 366
31)	శ్రీరామునిసూచనమేరకు లక్ష్మణుడు కిష్కింధకు చేరుట - తనరాకనుగూర్చి తెల్పుటకై అంగదుని సుగ్రీవునికడకు పంపుట -సుగ్రీవునకు జాగృతిని కలిగించుటలో అంగదునిప్రయత్నము ఫలింపకుండుట - ప్లక్షుడు, ప్రభావుడు అనుముఖ్యసచివులు సుగ్రీవుని మేలుకొలిపి, లక్ష్మణస్వామిరాకను దెలిపి, కర్తవ్యమును వివరించుట -	.. 376
32)	లక్ష్మణుడు కుపితుడైనందులకు సుగ్రీవుడు ఆందోళనపడుట - శ్రీరాముడు సుగ్రీవునకు చేసిన మహోపకారమును గుర్తుచేయుచు, కృతజ్ఞతతో ఆ రఘువరునకు ప్రత్యుపకారము చేయుమని హనుమంతుడు ఆ వానరరాజునకు హితవుపల్కుట -	.. 381
33)	లక్ష్మణుడు కిష్కింధానగరశోభలను, అంగదాదులభవనములను తిలకించుచు సుగ్రీవునిప్రాసాదమునకు చేరుట - లక్ష్మణుని దర్శించుటకు భీతిల్లుచు, సుగ్రీవుడు ఆయనను శాంతపఱచుటకై తారను పంపుట -తార యుక్తియుక్తముగా సంభాషించి, ఆ సౌమిత్రిని శాంతపఱచుట, అంతఃపురము లోనికి ఆహ్వానించుట -	.. 383
34)	లక్ష్మణస్వామి సుగ్రీవుని మందలించుట -	.. 389
35)	పెద్దకాలము దుఃఖములపాలైన సుగ్రీవుడు కామానుభవములలో మునిగిపోవుటను తారసమర్థించుట- సీతాన్వేషణకు తగిన ఏర్పాట్లను చేయుచున్నందున ఆ వానరరాజు (సుగ్రీవుడు) కృతఘ్నుడు కాడని వివరించుట - కనుక శాంతి వహింపుమని తార లక్ష్మణుని సవినయముగా వేడుకొనుట -	.. 391
36)	తారప్రార్థనతో లక్ష్మణస్వామి శాంతించుటను గమనించి, సుగ్రీవుడు శ్రీరాముని బలపరాక్రమములను ప్రశంసించుచు, తాను ఆ ప్రభువునకు అనుయాయినని తెల్పుట - ఆ వానరరాజుమాటలకు ప్రసన్నుడైన సౌమిత్రి తన పరుషోక్తులను మన్నింపుమని కోరుట - శ్రీరామునిసన్నిధికి రమ్మని పిలుచుట -	.. 394
37)	"వివిధ పర్వతములయందుగల కపివరులను తీసికొనివచ్చుటకై వానరప్రముఖులను పంపుము" అని సుగ్రీవుడు హనుమంతుని ఆదేశించుట - మారుతి పంపగా వెళ్లిన వానర నాయకులు వివిధప్రదేశములలోగల వానరములను సుగ్రీవునికడకు తీసికొనివచ్చుట.	.. 395
38)	సుగ్రీవుడు లక్ష్మణునితోగూడి ప్రస్రవణగిరికి చేరి, శ్రీరాముని దర్శించుట - 'సీతాదేవిని అన్వేషించుటకై పూనుకొనుము'- అని ఆ రఘురాముడు సుగ్రీవుని కోరుట - "ఈ కార్యనిమిత్తమై వేర్వేఱు పర్వతప్రాంతములనుండి కోట్లకొలది వానరవీరులు ఇక్కడికి వచ్చుచు దారిలో ఉన్నారు" అని ఆ వానరరాజు శ్రీరామునకు తెలుపుట -	.. 399

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
39)	శ్రీరామచంద్రుడు సుగ్రీవునకు తన కృతజ్ఞతలను తెల్పుట ఆయా దిక్కులకు వెళ్లిన వానరప్రముఖులు కోట్లకొలదిగానున్న తమతమ వానరసైన్యములతో వచ్చి సుగ్రీవుని కలియుట -	.. 402
40)	'సీతాదేవిజాడను తెలిసికొనుట, రావణుని నివాసమును పసిగట్టుట' అనునవి ముఖ్య కర్తవ్యములు-' అని శ్రీరాముడు తెల్పుట - ఆ ప్రభువు సూచనపై సుగ్రీవుడు 'వినతుడు' అను వానరప్రముఖుని నాయకత్వమున కపివరులను తూర్పుదిక్కునకు పంపుచు, ఆ దిశయందలి విశేషములను వర్ణించుట -	.. 405
41)	అంగదునినాయకత్వమున హనుమంతుడు మొదలగు వానరయోధులను దక్షిణ దిక్కునకు పంపుచు సుగ్రీవుడు వారికి ఆదిశయందలి విశేషములను వివరించుట -	.. 412
42)	సుగ్రీవుడు సీతాన్వేషణనిమిత్తమై తన మామయగు సుషేణుని యొక్క నేతృత్వమున కొంతమంది వానరయోధులను పశ్చిదిశకు పంపుచు వారికి ఆ దిక్కునగల విశేషములను తెల్పుట -	.. 416
43)	సుగ్రీవుడు 'శతవలి'యను వానరవీరుని నాయకత్వమున తగినంతమంది వానరయోధులను ఉత్తరదిశకు పంపుచు, వారికి ఆ దిశావిశేషములను సమగ్రముగా వివరించుట -	.. 422
44)	'సీతాన్వేషణ కార్యమును హనుమంతుడే తప్పక సాధింపగలడు' - అను విశ్వాసముతో సుగ్రీవుడు మారుతిని ప్రశంసించుట - శ్రీరాముడును ఆంజనేయుని శక్తి సామర్థ్యములను మెచ్చుకొనుచు, 'ఆయనపై సీతాదేవికి నమ్మకము కలుగుటకై, ఆనవాలుగా తనయుంగరమును ఆవాయుసుతునకు ఇచ్చుట -	.. 427
45)	సుగ్రీవునిఆజ్ఞనుగొని వానరప్రముఖులు తమ అనుయాయులతోగూడి సీతాన్వేషణకై ఆయా దిక్కులకు బయలుదేఱుట. వానరులు సుగ్రీవునియెదుట బీరములు పలుకుట -	.. 429
46)	'ఈ సమస్తభూమండలమునందలి వివిధ ప్రదేశములనుగూర్చి నీకు ఎట్లు తెలియును?' అని శ్రీరాముడు సుగ్రీవుని ప్రశ్నించుట - అప్పుడు తాను నలుదిక్కులయందును తిరిగి తిరిగి కడకు ఋశ్యమూకపర్వతమును చేరిన సంగతిని తెలుపుట -	.. 430
47)	ఒక్క దక్షిణదిశకు వెళ్లినవారు తప్ప తక్కిన దిక్కులకు వెళ్లిన వానరులందఱును 'అంతటను గాలించియు' సీతాదేవిని గానక, నెలరోజులగడువు ముగియునాటికి మఱలి వచ్చి సుగ్రీవుని చేరుట -	... 433
48)	అంగదాదులు వింధ్యకు దక్షిణమునగల ప్రదేశములను అన్నింటిని సీతాదేవికై అన్వేషించుచు, కండుమహర్షి శాపముతో నిర్జనారణ్యముగా మాఱిన ప్రదేశములను గూడ గాలించుట - ఆ సందర్భమున అంగదుడు ఒక ఘోరరాక్షసుని నేలగూల్చుట.	.. 434
49)	హనుమదాదులు దక్షిణదిశయందు తీవ్రముగా సీతాన్వేషణను కొనసాగించుచుండగనే సుగ్రీవుడు విధించిన మాసముగడువు ముగియుట - ఐనను నిరుత్సాహపడక మనప్రయత్నమును విడువరాదని అంగదుడు సూచించుట - గంధమాదనుడు అంగదునిపలుకులను బలపఱచుట - పిమ్మట వారు రజతాద్రిపైనను, కోద్రవనమునందును, తదితరవనములను అన్వేషించి, అలసిపోయి కొంత విశ్రాంతి తీసికొని ముందునకు నడచుట -	.. 436
50)	హనుమదాది వానరవీరులు ఆయా ప్రదేశములను వెదకుచు ఆకలిదప్పులకు లోనై 'ఋక్షబిలము'నకు చేరుట - ఆ బిలమునందు పక్షులు రాకపోకలు సాగించుచుండుటను, పక్షులఱెక్కలు తడిసియుండుటను గమనించిన మారుతి 'ఇచట నీళ్లు లభ్యమగును' అని పేర్కొనుట - వారు అందఱును ఆ భయంకర గుహలో ప్రవేశించుట - అచట వారికి ఒక స్త్రీరత్నము కనబడుట -	.. 439

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
51)	హనుమంతునిప్రశ్నకు సమాధానముగా 'ఈ భవనమును నిర్మించినవాడు మయుడు. బ్రహ్మదేవుడు ఈ భవనమును 'హేమ' అను అప్సరసకు బహూకరించెను. ఆమె దీనిరక్షణ బాధ్యతను నాకు అప్పగించినది' అని 'స్వయంప్రభ' - అను తాపసి పలుకుట -' ఇచటి ఫలములను భుజించి, మీ రాకకుగల కారణములను తెల్పుడు అని ఆమె అడుగుట -	.. 443
52)	హనుమంతుడు తమరాకకుగల కారణములను స్వయంప్రభకు వివరించుట - వానరులు తన అతిథిసత్కారములను స్వీకరించినందులకు ఆమె సంతోషమును ప్రకటించుట -	.. 445
53)	వానరులప్రార్థనపై స్వయంప్రభ తనతపః ప్రభావముచే వారిని అందఱిని గుహ వెలుపలికి (సముద్ర తీరమునకు) చేర్చుట - సుగ్రీవుడు విధించిన గడువు ముగిసినట్లు అంగదుడు గమనించుట - 'కార్య సాఫల్యము కాకుండ వెళ్ళినచో ఆ వానరరాజు మనలను తప్పక వధించును. అతని చేతులో మరణించుట కంటెను ఇచటనే ప్రాయోపవేశము చేయుట యుక్తము' అని అంగదుడు నుడువుట - స్వయంప్రభగుహలోనే నివసించినచో ప్రాణభయము ఉండదని తారుడు పలుకుట - ఆ సూచనను వానరులు ఆమోదించుట -	.. 447
54)	హనుమంతుడు అంగదునిలోగల రాజలక్షణములను గుర్తించుట - అంగదుడు సూచించిన ప్రాయోపవేశ విషయమును, తారుడు తెలిసిన గుహానివాసమును నిరాకరించుట - సుగ్రీవునితో వేఱగుటకు వానరులు ఒప్పుకొనరనుట - సీతాన్వేషణకార్యమును సాధించుకొని వెళ్లుట యుక్తమని తెల్పుట.	.. 451
55)	అంగదుడు సుగ్రీవుని నిందించుట - ప్రాయోపవేశమునకు దిగుట - అతనియెడ జాలిని ప్రకటించుచు వానరులందఱును ఆమరణనిరాహారదీక్షకు పూనుకొనుట -	.. 454
56)	గిరిశిఖరముననున్న గృధ్రరాజగు సంపాతి ప్రాయోపవేశమునకు దిగిన వానరులను జూచుట - 'వీరందఱును నాకు ఆహారమగుదురు- ఇది విధి విలాసము' - అని అతడు పల్కుట - విచారగ్రస్తుడైయున్న అంగదుడు ఆ మాటలను విని, హనుమంతునితో గత సంఘటనలనుగూర్చి తెలుపుచు జటాయువు యొక్క ఔన్నత్యమును, మృతిని ప్రస్తావించుట- సోదరుడగు జటాయువు ప్రస్తావనను వినినంతనే సంపాతి వానరులతో స్నేహపూర్వకముగా మాట్లాడుట -	.. 456
57)	'సంపాతివలనగాని, ప్రాయోపవేశకారణమునగాని మనము మృతిచెందుట తథ్యము' - అని వానరులు నిశ్చయించుకొనుట - పిదప అంగదుడు సంపాతిని సమీపించి, శ్రీరాముని వనవాసగాథను, సీతాపహరణకథను, దశరథ జటాయువులమైత్రిని, రావణునివలన జటాయుమృతిని, వాలివధను, సీతాదేవికొఱకై తమ అన్వేషణవృత్తాంతమును వివరించుట.	.. 458
58)	జటాయువు తన తమ్ముడే యనియు, అతనితో గలిసి సూర్యమండలమునకు ఎగిరినప్పుడు తనఱెక్కలు కాలి తాను వింధ్యపర్వతముపై పడిన విషయమునూ సంపాతి వానరులకు తెల్పుట - సీతాదేవి జాడను, రావణునినివాసమునుగూర్చి తెల్పుమని అంగదుడు కోరుట - రావణుడు సీతాదేవిని అపహరించిన విషయమును, ప్రస్తుతము ఆమె లంకలో ఉన్న సంగతిని సంపాతి వానరులకు వివరించుట.	.. 460
59)	సీతాపహరణ వృత్తాంతమును తెలుపుమని జాంబవంతుడు సంపాతిని అడుగుట - అప్పుడు సంపాతి "రావణుడు సీతాదేవిని అపహరించి తీసికొని పోవునప్పుడు చూచినట్లు నా సుతుడైన 'సుపార్శ్వుడు' నాకు తెల్పినాడు" అని వారికి వివరించుట - ధైర్య సాహసములతో సముద్రమును లంఘించి, సీతాదేవిజాడకై అన్వేషింపుడు" అని వానరులకు తెల్పుట -	.. 464

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
60)	సంపాతి ఆత్మకథ	.. 467
61)	సంపాతి తనరెక్కలు దగ్ధమైపోయిన కారణమును నిశాకరమునికి తెల్పుట.	.. 469
62)	నిశాకరముని సంపాతిని ఓదార్చుచు భవిష్యత్తులో శ్రీరామునికార్యమునకు తోడ్పడుమని అతనిని ఆదేశించుట -	.. 470
63)	సంపాతికి రెక్కలు రాగా వానరులను ఉత్సాహపఱచి, అది వినువీధికి ఎగిరిపోవుట - సంపాతి మాటలకు ఆనందించిన వానరులు ధైర్యోత్సాహములను కూటగట్టుకొని, సీతాన్వేషణకు పూనుకొనుట -	.. 472
64)	అపారమైన సముద్రమును జూచి, వానరులు అందఱును 'దీనిని లంఘించుటయెట్లు? అని విచారములోపడుట - అంగదుడు వారిని ప్రోత్సహించుచు వారికిగల గమనసామర్థ్యములను వెల్లడింపుడని కోరుట -	.. 474
65)	వానరవీరులు సముద్రమును లంఘించుటయందు తమకుగల శక్తిసామర్థ్యములను ప్రకటించుట -మొత్తము మీద సముద్రమును లంఘించి తిరిగి రాగల వీరుడు 'హనుమంతుడు మాత్రమే' - అని పలికి జాంబవంతుడు ఆయనను ప్రేరేపింతుననుట -	.. 476
66)	జాంబవంతుడు ఆంజనేయునిజన్మవృత్తాంతమును తెలిపి, ఆయనబలపరాక్రమములను ప్రశంసించుట - పిమ్మట సముద్రలంఘనమునకై ఆ మారుతిని ప్రేరేపించుట - అనంతరము హనుమంతుడు తన అద్భుతరూపమును ప్రకటించుట -	.. 479
67)	హనుమంతుడు సముద్రలంఘనమునకు ఉత్సాహమును ప్రకటించుట - జాంబవంతుడు ఆ మహాత్ముని కొనియాడుట - పిమ్మట మారుతి మహేంద్రగిరిపై చేరుట -	.. 483

సుందరకాండము

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
1)	హనుమంతుడు సముద్రమును దాటుట- మైనాకునిస్వాగతము, సురసనుజయించుట, సింహికావధ, లంకాశోభనుగాంచుట-	.. 489
2)	లంకానగరవర్ణనము, అందు ప్రవేశించు విషయమున హనుమంతునిఆలోచన, లఘురూపమున అతడు నగరమున ప్రవేశించుట, చంద్రోదయము.	.. 510
3)	హనుమంతుడు లంకాధిదేవతను దండించి, లంకలో ప్రవేశించుట	.. 516
4)	లంకలో రావణాంతఃపురమున హనుమంతుడు ప్రవేశించుట-	.. 520
5)	చంద్రశోభావర్ణనము, రావణాంతఃపురములో హనుమంతుడు సీతను అన్వేషించుట, ఆమెను గానక దుఃఖపడుట-	.. 524
6)	రావణాదులభవనములలో హనుమంతుడు సీతను అన్వేషించుట-	.. 528
7)	రావణభవన, పుష్పకవిమానముల వర్ణనము	.. 532
8)	హనుమంతుడు పుష్పకవిమానమును జూచుట	.. 535
9)	హనుమంతుడు రావణాంతఃపురమును పరిశీలించుట	.. 537
10)	హనుమంతుడు గాఢనిద్రలోనున్న రావణుని, అతని భార్యలను చూచుట, మండోదరిని సీతగా భ్రమించి సంబరపడుట.	.. 546
11)	'ఈమె సీతకాదు' అని నిర్ధారించుకొని, హనుమంతుడు మఱల అంతఃపురమునందును, పానభూమియందును సీతకొఱకై అన్వేషించుట, అతనిమనస్సులో ధర్మలోపశంకగలుగుట, అది నివృత్తమగుట.	.. 551
12)	సీత మరణించి యుండునని తలచి, హనుమంతుడు దుఃఖితుడగుట, మఱల ఉత్సాహము తెచ్చుకొని సీతను వెదకుట, ఆమెను ఎందునుగానక చింతాక్రాంతుడగుట-	.. 556
13)	సీతాదేవి గతించియుండునని శంకించి, హనుమంతుడు చింతించుట, ఆవార్తను శ్రీరామునకు ఎఱింగించుట వలన అనర్థములు	

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	కలుగునని భావించుట, అశోకవాటికలో వెదకుటకై ఆలోచించుట.	.. 559
14)	హనుమంతుడు అశోకవాటికలో ప్రవేశించి, దానిశోభలను తిలకించుట, ఒక శింశుపావృక్షముపై దాగియుండి, అచటనుండియే సీతను అన్వేషించుట.	.. 565
15)	వనశోభను పరిశీలించి చూచుచు హనుమంతుడు ఒక చైత్యప్రాసాదముకడ దీనయైయున్న సీతను జూచుట, గుర్తించుట, సంతోషపడుట-	.. 571
16)	హనుమంతుడు సీతాదేవి శీలసౌందర్యములను ప్రశంసించుచు, కష్టదశలోనున్న ఆమెను గాంచి, ఆమెకై తానుగూడ శోకించుట	.. 577
17)	సీతను గాంచి హనుమంతుడు ప్రసన్నమనస్కుడగుట.	.. 580
18)	రావణుడు అశోకవాటికకువచ్చుట, హనుమంతుడు అతనిని జూచుట	.. 583
19)	రావణుడు సీతను జూచుట	.. 586
20)	రావణుడు సీతను ప్రలోభపెట్టజూచుట	.. 589
21)	సీత రావణునకు హితవు పలుకుట, అతనిని శ్రీరామునిముందు కొఱగానివానినిగాజేసి మాటాడుట.	.. 592
22)	రావణుడు సీతకు రెండు మాసములగడువొసగుట, సీతాదేవి నిరాకరింపగా అతడు ఆమెను భయపెట్టి, రాక్షసస్త్రీలరక్షణలోనుంచి, తన స్త్రీలతోగూడి రాజభవనమునకు తరలిపోవుట.	.. 596
23)	రాక్షసస్త్రీలు సీతకు నచ్చజెప్పుటకు యత్నించుట.	.. 600
24)	సీత రాక్షసస్త్రీలమాటలను నిరాకరించుట, వారు ఆమెను చంపివైచెదమని భయపెట్టుట-	.. 602
25)	సీత రాక్షసస్త్రీలమాటలను నిరాకరించి, శోకసంతప్తయై విలపించుట.	.. 606
26)	సీత దైన్యముతో విలపించుట, ప్రాణములను విడుచుటకు నిశ్చయించుకొనుట-	.. 608
27)	త్రిజటాస్వప్నవృత్తాంతము	.. 613
28)	సీత విలపించుచు ప్రాణపరిత్యాగమునకు సిద్ధపడుట.	.. 617
29)	సీతకు గోచరించిన శుభశకునములు.	.. 620
30)	సీతాదేవితో సంభాషించువిషయమున హనుమంతునిఆలోచన.	.. 621
31)	సీతాదేవికి వినబడునట్లు హనుమంతుడు రామకథను వర్ణించుట	.. 625
32)	సీతాదేవి యొక్క ఆలోచనాపరంపరలు	.. 627
33)	సీతాదేవి హనుమంతునకు తనవృత్తాంతమును తెలియజెప్పుట.	.. 628
34)	హనుమంతునియెడల సీతసందేహము, అతడు శ్రీరామునిగుణములను కీర్తించుట.	.. 631
35)	సీతకోరికపై హనుమంతుడు శ్రీరాముని శరీరచిహ్నములను, గుణములను వివరించుట, నరవానరులమైత్రివిషయమును దెలిపి, ఆమెకు విశ్వాసమును గలిగించుట.	.. 634
36)	హనుమంతుడు సీతాదేవికి రామముద్రికను సమర్పించుట, ఆమెపై శ్రీరామునకుగల ప్రేమను వివరించి, ఆమెను ఊరడించుట.	.. 644
37)	శ్రీరామచంద్రుని శీఘ్రముగా తీసికొని రమ్మని సీతాదేవి మారుతిని గోరుట, హనుమంతుడు తనవెంట రమ్మని జానకీదేవిని ప్రార్థించుట, ఆమె అందులకు నిరాకరించుట-	.. 649
38)	అభిజ్ఞానార్థము సీతాదేవిచే కాకాసురవృత్తాంతకథనము, చూడామణిప్రదానము, శ్రీరాముని శీఘ్రముగా తీసికొని రమ్మని కోరుట-	.. 654
39)	శ్రీరామునకు సీతాసందేశము, ఆంజనేయుడు ఆమెను ఓదార్చుట, వానరులసముద్రతరణ విషయమున సీతాదేవికిగల సందేహము, మారుతి దానిని నివారించుట	.. 661
40)	హనుమంతునిద్వారా శ్రీరామునకు సీతాసందేశము, మారుతి ఆమెను ఓదార్చుట.	.. 666
41)	హనుమంతుడు ప్రమదావనమును (అశోకవాటికను) ధ్వంసము చేయుట.	.. 668
42)	రాక్షసస్త్రీలవలన ప్రమదావనవిధ్వంసవార్తనెఱింగి, రావణుడు ఎనుబదివేలమంది రాక్షసులను పంపుట, హనుమంతుడు వారిని సంహరించుట-	.. 670

క్రమ సంఖ్య	విషయము	పుట సంఖ్య
43)	హనుమంతుడు చైత్యప్రాసాదమును ధ్వంసము చేయుట, దాని రక్షకులను అంతమొందించుట.	.. 674
44)	మారుతి ప్రహస్తపుత్రుడైన జంబుమాలిని హతమార్చుట.	.. 676
45)	ఏడుగురు మంత్రిపుత్రుల వధ-	.. 678
46)	రావణునిఐదుగురుసేనాపతుల సంహారము-	.. 679
47)	అక్షకుమారుడు పరాక్రమించుట, మారుతి వానిని వధించుట	.. 683
48)	ఇంద్రజిత్తుహనుమంతులయుద్ధము, బ్రహ్మాస్త్రముచేత బంధింపబడి, హనుమంతుడు రావణునిసభలో ప్రవేశించుట-	.. 688
49)	రావణునిఆకారమును జూచి, హనుమంతుడాశ్చర్యపడుట.	.. 694
50)	రావణుడు ప్రహస్తునిచేత హనుమంతుని లంకాప్రవేశమునకు కారణమడిగించుట, హనుమంతుడు తాను శ్రీరాముని దూతనని తెలుపుట.	.. 696
51)	హనుమంతుడు రావణునకు హితమునుపదేశించుట-	.. 698
52)	దూతను వధింపదగదని విభీషణుడు రావణునకు దెల్పుట.	.. 702
53)	రాక్షసులు హనుమంతునితోకకు నిప్పంటించి నగరములో త్రిప్పుట.	.. 705
54)	లంకాదహనము, రాక్షసులవిలాపము.	.. 709
55)	సీతనుగూర్చి హనుమంతుడు చింతించుట.	.. 715
56)	హనుమంతుడు మరల సీతను దర్శించుట. సముద్రమును లంఘించుట-	.. 718
57)	హనుమంతుడు సముద్రమును దాటి, జాంబవంతుని, అంగదాదులను కలిసికొనుట.	.. 722
58)	హనుమంతుడు సీతాన్వేషణవృత్తాంతమును వానరులకు దెల్పుట.	.. 726
59)	హనుమంతుడు వానరులకు సీతయొక్క దురవస్థను దెలిపి, లంకపై దండెత్తుటకు వారిని పురికొల్పుట-	.. 739
60)	లంకను జయించి, సీతను గొనివచ్చెదనని అంగదుడు ఉత్సాహముతో పల్కుట, జాంబవంతుడు అతనిని వారించుట.	.. 742
61)	వానరులమధువనప్రవేశము, వారి కేరింతలు-	.. 743
62)	వానరులు మధువనరక్షకులను, దధిముఖుని పరాభవించుట, అతడు సేవకులతోడ సుగ్రీవునికడకు వెడలుట.	.. 746
63)	మధువనవిధ్వంసవార్తను విని, సుగ్రీవుడు హనుమదాదులవలన కార్యము సఫలమైనట్లు భావించుట-	.. 749
64)	సుగ్రీవునిసందేశముప్రకారము అంగద హనుమదాదులు కిష్కింధకు వచ్చుట, హనుమంతుడు శ్రీరామునకు ప్రణమిల్లి, సీతాసందర్శనవార్తను దెల్పుట-	.. 752
65)	హనుమంతుడు సీతాదేవి సమాచారమును శ్రీరామునకు దెల్పుట-	.. 756
66)	'చూడామణి'ని గాంచి, సీతాదేవిక్లేశములను విని, శ్రీరామచంద్రుడు పరితపించుట-	.. 759
67)	హనుమంతుడు సీతాసందేశమును శ్రీరామచంద్రునకు వినిపించుట-	.. 760
68)	హనుమంతుడు శ్రీరామునకు సీతాసందేహమును, దానిని తాను నివారించిన విధమును దెల్పుట	.. 764
	శ్రీరామపట్టాభిషేకఘట్టము	.. 767

* * *

ప్రస్తావన

శ్లో॥ పరిత్రాణాయసాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ । ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥

దుష్టులను శిక్షించి, సత్పురుషులను కాపాడుటద్వారా లోకమున ధర్మసంస్థాపనము చేయుటకే భగవంతుడు అవతరించుచుండును. త్రేతాయుగమునందు శ్రీరాముడు అవతరించుటలోని పరమార్థముగూడ ఇదియే - ఈ అవతార లక్ష్యసాధనలో బాల-అయోధ్యకాండలు పూర్వరంగములై ఒప్పారినవి. అరణ్యకిష్కింధాకాండములు దుష్టులను శిక్షించుట, సాధువులను సంరక్షించుట అను పరమప్రయోజనములకు సాధనవేదికలై అలరారుచున్నవి. మిత్రబలమును సమకూర్చుకొనుటకును తోడ్పడుచున్నవి. సుందరకాండము సీతాదేవిక్షేమసమాచారములను అరయుటకును, దుష్టరావణునిఉనికిని తెలిసికొనుటకును, ఆ రాక్షసరాజు యొక్క శక్తిసామర్థ్యములను గ్రహించుటకును, శత్రువునకు శ్రీరామచంద్రప్రభువుయొక్క బలపరాక్రమములను రుచిచూపుటకును, రణవ్యూహరచనకును తోడ్పడుచున్నది. ఈ కాండములలో మానవులకు ఉపయుక్తములగు ధార్మిక విషయములు సందర్భోచితముగా ప్రస్తావింపబడినవి. ఇక కథాంశములతో ఈ కాండత్రయవిశేషములను పరిశీలింతము.

అరణ్యకాండము

సీతారామలక్ష్మణులు దండకారణ్యమున మునులయొక్క ఆశ్రమములను సందర్శించుచు క్రమముగా ముందునకు సాగిరి. త్రోవలో వారికి విరాధుడను రాక్షసుడు ఎదురయ్యెను. అతడు శాపగ్రస్తుడైన 'తుంబురుడు' అను పేరు గల గంధర్వుడు, పూర్వజన్మస్మృతి గల్గియున్న వాడు. అతనికి శ్రీరామచంద్రప్రభువు శాపవిముక్తిని ప్రసాదించెను.

పిమ్మట వారు శరభంగమహర్షి ఆశ్రమమును సమీపించిరి. దూరమునుండియే వారు ఇంద్రాదులను దర్శించిరి. వారికి శరభంగమహాముని అతిథిమర్యాదలను నెఱపి బ్రహ్మలోకమునకు వెళ్లెను. అనంతరము మునీశ్వరులు అందఱును శ్రీరాముని కడచేరి, తమకు రాక్షసులబాధలేకుండ చేయుమనికోరిరి. ఆప్రభువు వారికి అభయమిచ్చి, వారితోగూడి సుతీక్ష్ణమహర్షి ఆశ్రమమునకు చేరెను. ఆ మహామునియొసంగిన అతిథిసత్కారములను స్వీకరించిన పిమ్మట సీతారామలక్ష్మణులు దండకారణ్యమునకు బయలుదేఱిరి. అందు ప్రవేశించిన పిమ్మట సీతాదేవి రామచంద్రప్రభువుతో ప్రస్తావించిన విషయములు గమనింపదగినవి.

"స్వామీ! నీవు మునిధర్మమును అవలంబించియుంటివి. కామజములైన వ్యసనములనుండి బయటపడినవారికిమాత్రమే ఈ ధర్మమును ఆచరించుట సాధ్యమగును - అబద్ధములాడుట, పరస్త్రీవ్యామోహము, తనకు ఎట్టి వైరభావము లేకున్నను ప్రాణిహింసకు పూనుకొనుట అనునవి కామజములైన వ్యసనములు - నీవు సత్యసంధుడవు. కనుక ఎట్టి పరిస్థితిలోను అసత్యము పలికి ఎఱుగవు - నీవు ఏకపత్నీవ్రతుడవు, జితేంద్రియుడవు. కావున పరస్త్రీకాంక్ష నీకు ఏమాత్రమును లేదు. అయితే నీకు రాక్షసులయెడ ఎట్టి వైరభావమూ లేదుగదా! అట్టిచో వారిని సంహరించెదనని ప్రతిజ్ఞకు పూనుట ఎంతవఱకు సమంజసము?"

అందులకు ఆ ప్రభువు "సీతా! లోకశ్రేయస్సును గోరి మునీశ్వరులు తపములను ఆచరించుచుందురు. రాక్షసులు వారిని హింసించుచున్నారు. నన్ను శరణుజొచ్చిన మహర్షులశత్రువులు నాకును శత్రువులే. కాబట్టి వారిని చంపుటకై పూనుకొనుటయుక్తమే గదా!" అని ప్రత్యుత్తరమిచ్చెను.

శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై వేర్వేఱు ఆశ్రమములలో పది సంవత్సరములు గడిపెను. పిమ్మట మఱల సుతీక్ష్ణాశ్రమమునకు చేరెను. ఆచట కొంతకాలముండి పిదప అగస్త్యసోదరుని (సుదర్శనుని) ఆశ్రమమునకును, అనంతరము అగస్త్యుని ఆశ్రమమునకును చేరెను. తన ఆశ్రమమునకు విచ్చేసిన శ్రీరామునకు అగస్త్యుడు దివ్యమైన ఒక ధనుస్సును (వైష్ణవచాపమును) అమోఘమైన బాణమును, రెండు తూణీరములను, సువర్ణఖడ్గమును సమర్పించెను. ఆ మహామునిసూచనపై వారు పంచవటికి బయలుదేఱిరి. త్రోవలో పక్షిరాజైన జటాయువు వారిని కలిసి, 'స్వామీ! నేను ఇచట మీకు అండగానుందును-' అని పలికెను. సీతారామలక్ష్మణులు పంచవటిలో ఒక పర్ణశాలను నిర్మించుకొని ఆచట నివసింపసాగిరి.

కొంతకాలమునకు పిమ్మట రావణునిచెల్లెలైన శూర్పణఖ వారికడకు వచ్చెను. కామాతురయైన ఆ రాక్షసి తనను పెండ్లియాడుమని శ్రీరాముని కోరెను. ఆమెకోరికను వారు తిరస్కరింపగా ఆ రాక్షసి సీతాదేవిపై దాడికి దిగెను. అంతట శ్రీరామునిసూచనపై లక్ష్మణుడు ఆమెను విరూపను గావించెను. పరాభవముపాలైన ఆ శూర్పణఖ తనసోదరుడైన ఖరునికడకు వెళ్లి మొఱపెట్టుకొనెను. క్రుద్ధుడైన ఖరాసురునియొక్క పదునాలుగువేలమంది రాక్షసయోధులును, ఖరదూషణాదులును శ్రీరామునితో యుద్ధమునకు తలపడి, ఆ ప్రభువు చేతిలో నిహతులైరి. ఈ విషయము అకంపనుడు అనుగూఢచారిద్వారా రావణునకు తెలిసెను. అకంపనునిసూచనపై రావణుడు సీతాపహరణమునకై సంకల్పించి మారీచునిసహాయమును

అర్థించెను. మారీచుడు శ్రీరామునియొక్క, సాటిలేని శౌర్యపరాక్రమములనుగూర్చి తెలిపి, 'సీతాపహరణమునకు పూనుకొనుట తగదు' అని రావణుని నివారించెను - అంతట ఆ దశకంఠుడు లంకకు చేరెను.

ఇంతలో లంకకు చేరిన శూర్పణఖ రావణుని రెచ్చగొట్టుచు రాజలక్షణములనుగూర్చి ఇట్లు నుడివినది - "విషయసుఖములలో మునిగి రాజ్యపాలనమునందును, రక్షణవిషయమునను జాగ్రత్త వహింపక పరులపై ఆధారపడియుండు రాజులు తమరాజ్యముపై పట్టునుకోల్పోవుదురు. సమర్థులైన గూఢచారులద్వారా రాజ్యములో జరుగుచున్న, జరుగబోవు పరిణామములను ఎప్పటికప్పుడు తెలిసికొనుచు చక్కగా పరిపాలనచేయువాడే దూరదృష్టిగల ప్రభువు. సకాలములో కర్తవ్యములను నెఱవేర్చని రాజు త్వరలోనే రాజ్యభ్రష్టుడగును. అప్పుడతడు బంధుమిత్రులలో, సచివులలో మిగుల చులకనయగును. అనుక్షణము ధర్మనిరతితో జాగరూకుడై, జితేంద్రియుడగు రాజుమాత్రమే చిరకాలము ప్రభువుగా మనగలడు."

రావణునివలె శూర్పణఖయు తెలిసిన మూర్ఖురాలు, దుష్టురాలును, కామాతురయు ఐన శూర్పణఖ ఇట్లు ధర్మవచనములను పలుకుట విడ్డూరమేయైనను, రావణుడు తనవిషయమును పట్టించుకొనుటకై ఆమె అతనిని ఇట్లు రెచ్చగొట్టినది, రామలక్ష్మణులపై అతనిలో ద్వేషమును పెంచినది, సీతాపహరణమునకై అతనిని పురికొల్పినది. అంతటితో ఆ దశకంఠుడు సీతను అపహరించుకొనివచ్చుటకై నిశ్చయించుకొని మఱల మారీచుని ఆశ్రమమునకు చేరెను.

రావణుడు మారీచునకు తన ఆలోచనలను దెలిపి ఈ విషయమున తనకు తోడ్పడుమని అతనిని అర్థించెను. మారీచుడు లోగడ తానొనర్చిన రాక్షసకృత్యములకు పశ్చాత్తప్తుడై, ప్రస్తుతము తన ఆశ్రమమున ధార్మికజీవనమును కొనసాగించుచుండెను. అందువలన అతడు రామలక్ష్మణుల శౌర్యపరాక్రమములనుగూర్చి తన అనుభవములను దెలుపుచు, సీతాపహరణసంకల్పము నుండి రావణుని మఱలించుటకై అతనితో ఈ హితవచనములను పల్కెను - "రాజుకడ ప్రాపకమును సంపాదించుటకై ఇచ్చకపుమాటలాడువారు లోకమున కోకొల్లలు. కాని తాత్కాలికముగా అప్రియముగా కన్పట్టినను ముమ్ముందు యజమానికి మేలుగూర్చెడి మాటలను పలికెడి వారే యుండరు, అథవా పలికినను వాటిని ఆలకించెడి వారు అరుదు-"

సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః । అప్రియస్యతు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥

సీతాదేవిని అపహరించు ప్రయత్నమును మాని, నీ ప్రాణములను కాపాడుకొని, నీ ప్రియపత్నులతో, బంధుమిత్రులతో హాయిగానుండుము - నీకు చేవయున్నచో శ్రీరామునకు ఎదురుగా నిలిచి పోరుసల్పుము. దుష్టునిసాంగత్యముచే సత్పురుషులును నశింతురు. కనుక నీకు తోడ్పడినచో నేనును ఆ స్వామి చేతిలో మడియుట తథ్యము -" ఈ విధముగా మారీచుడు పెక్కురీతుల హితవచనములను పల్కెను.

ఐనను మూర్ఖుడైన రావణుడు అతనిమాటలను పెడచెవిని బెట్టి 'నా ఆజ్ఞను ధిక్కరించినచో నా చేతిలో నీకు చావు తప్పదు' - అని మారీచుని హెచ్చరించెను.

'దుష్టుడైన ఈ రావణునిచేతిలో మరణించుటకంటెను ధర్మాత్ముడైన ఆ శ్రీరామునిబాణమునకు గుఱియై అసువులను వీడుటమేలుగదా!' అని తలంచి, మారీచుడు ఆ రాక్షసరాజునకు తోడ్పడుటకై సిద్ధపడెను. వెంటనే రావణుడును, మారీచుడును పంచవటిసమీపమునకు చేరిరి. మారీచుడు మాయ (బంగారు) లేడి రూపమున ఆశ్రమమునెదుట సంచరింపసాగెను. సీతాదేవి దానిని జూచి ముచ్చటపడి దానిని తెచ్చియిమ్మని పతినికోరెను. ఆమెకోరికను దీర్చుటకై శ్రీరాముడు నిశ్చయించుకొని, ఆమెరక్షణభారమును లక్ష్మణునకు అప్పగించి, లేడిని తీసికొనివచ్చుటకై బయలుదేఱెను. లేడిరూపముననున్న మారీచుడు శ్రీరాముని చాలదూరము తీసికొనిపోయెను. పిదప రామునిబాణపు దెబ్బకు గుఱియై, రాక్షసరూపమును పొంది, 'హా సీతా! హా లక్ష్మణా!' అని ఆక్రందించుచు అసువులను వీడెను. ఆ ఆర్తస్వరములను విని, నిజముగనే శ్రీరాముడు ఆపదలోచిక్కుపడినట్లు భావించి, సీతాదేవి కలవరపడెను. 'రాముని ఆదుకొనుటకై వెంటనే బయలుదేఱుము' అని ఆమె లక్ష్మణుని కోరెను. అందులకు అతడు సిద్ధపడకుండుటచే సీతాదేవి పరుషోక్తులాడెను. విధిలేక లక్ష్మణస్వామి అన్నను ఆదుకొనుటకై బయలుదేఱెను. అదనుచూచుకొని యతివేషములో వచ్చిన రావణుడు సీతను అపహరించుకొని ఆకాశమార్గమున లంకకు బయలుదేఱెను. అప్పుడు జటాయువు రావణుని నిలువరించి అతనికి ఇట్లు హితవు చెప్పెను.

"ఓ రావణా! పరదారాభిలాష నింద్యము. ధీరుడు అట్టి పాపకృత్యమునకు పాల్పడడు. ఉత్తముడైన రాజు ధర్మార్థకామ విషయములయందు శాస్త్రవిరుద్ధముగా నడచుకొనడు - రాజే ప్రజలకు మార్గదర్శకుడు. పుణ్యకార్యములయందును, పాపకృత్యములయందును ప్రజలు రాజునే అనుసరింతురు. కనుక సీతాదేవిని వెంటనే విడిచిపెట్టుము." ఈ సందర్భమున జటాయువునకును రావణునకును పోరు ఘోరముగా సాగెను. రావణునిదెబ్బకు ఱెక్కలు తెగి, గృధ్రరాజు నేలపైబడెను. సీతాదేవిని తీసికొని రావణుడు గగనమార్గమున లంకకు చేరి ఆమెను రాక్షసస్త్రీలకాపలాలో ఉంచెను.

క్రమముగా రామలక్ష్మణులు పంచవటికి చేరి, జానకిని గానక విలపించిరి. వారు ఆమెకొఱకై చెట్టుచెట్టును, పుట్టపుట్టను గాలించిరి. మాయామానుషవిగ్రహుడైన శ్రీరాముడు భార్యావిరహమునకు తట్టుకొనలేక ఆమెకై మిగుల పరితపించెను. సౌమిత్రి ఆయనను ఓదార్చెను. అంతట క్రుద్ధుడైన శ్రీరాముడు ముల్లోకములను భస్మమొనర్చుటకై సిద్ధపడెను. 'అన్నా! దుష్టుడైన ఆ రాక్షసుని గుర్తించి అతనిని శిక్షింపవలెనేగాని అతని కారణముగా ఏ పాపమెఱుగని లోకములనన్నింటిని నశింపజేయుట భావ్యముకాదుగదా!' అని లక్ష్మణుడు సూచించగా అంతట రఘురాముడు శాంతించెను.

సీతాదేవిని వెదకుచు వెళ్లుచుండగా రామలక్ష్మణులకు అవసానదశలోనున్న జటాయువు కన్పించెను. ఆ పక్షిరాజు రావణునకును తనకును జరిగిన పోరువిషయమును, ఆ రాక్షసుడు సీతాదేవిని అపహరించుకొని వెళ్లిన సంగతిని వారికి తెల్పెను. శ్రీరాముడు జటాయువును అక్కునజేర్చుకొని పరితపించెను. అసువులను వీడిన ఆ పక్షిరాజునకు రఘురాముడు దహనసంస్కారములనొనర్చి, అతనికి ముక్తిని ప్రసాదించెను. త్రోవలో కబంధుడను రాక్షసుడు తనపొడవైన చేతులతో వారిని బంధింపగా వారు అతనిబాహువులను ఖండించిరి. శ్రీరాముని అనుగ్రహమున అతడు శాపవిముక్తుడై, నిజస్వరూపము పొందెను. పిమ్మట అతడు శ్రీరామునకు సుగ్రీవునివృత్తాంతమును దెలిపి, సీతాన్వేషణలో ఆ కపివరుడు తోడ్పడగలడనియు, కనుక అతనితో మైత్రిచేయుమనియు పలికెను. రామలక్ష్మణులు మతంగవనమునగల శబరి ఆశ్రమమునకు చేరిరి. పరమభక్తురాలైన ఆ బోయత వారికి అతిథిసత్కారములను నెఱపెను, సుగ్రీవునితో మైత్రి చేయవలసినదిగా సూచించెను. యోగాగ్నిలో ఆమె తనతనువును దాలించెను. శ్రీరామచంద్రప్రభువు ఆమెకు పరంధామ ప్రాప్తిని అనుగ్రహించెను. పిదప రామలక్ష్మణులు పంపాసరోవరముమీదుగా ఋశ్యమూకపర్వతమార్గమున పయనించిరి. ఈ విధముగ ఆ రఘువరుడు ఖరదూషణాది దుష్టరాక్షసులను హతమార్చి ఋషులకు ఆ రక్కసులబాధలు లేకుండచేసెను. పరమభక్తులైన జటాయువునకును, శబరికిని వైకుంఠప్రాప్తిని కలిగించెను. శ్రీరామునిచేతిలో అసువులను వీడిన మారీచునకు ముక్తి లభించెను. ఆ స్వామి అనుగ్రహమువలన విరాధునకును, కబంధునకును శాపవిముక్తి చేకూరెను.

కిష్కింధాకాండము

లోకకంటకుడైన రావణుని వధించుట రామావతారముయొక్క పరమప్రయోజనము. మహావీరుడైన శ్రీరాముడు ఖరదూషణాదిరాక్షసులను హతమార్చుటవలన దండకారణ్యమునగల ఆ రావణునియొక్క ఒక సేనాశిబిరము నేల మట్టమైనది. ఈ ఘట్టము రావణునకు ఒక హెచ్చరికవంటిది. ఇక రావణవధ మిగిలియున్నది. అందులకై ఆ రఘువీరుడు సైన్యసమీకరణము చేయవలసియున్నది. ఈ మహాకార్యమును నిర్వహించుటలో శ్రీరామసుగ్రీవమైత్రి కీలకమైనది. ఈ కార్యకలాపములకన్నింటికిని 'కిష్కింధాకాండము' ఒక ప్రధాన వేదిక.

వసంత-ఋతుశోభలను, పంపాసరోవరసుందరదృశ్యములను జూచుచు శ్రీరామచంద్రుడు విరహవేదనకు గుఱియాయెను. అప్పుడు లక్ష్మణుడు ఆయనను ఓదార్చుచు వ్యక్తులు ఉత్సాహము కలిగియుండుటలోగల వైశిష్ట్యమునుగూర్చి ఇట్లనుడివెను. 'ఆర్యా! ఉత్సాహమును మించిన బలము లేదు. ఉత్సాహముగలవారికి ఈ లోకమున సాధ్యముకానిది లేదు. వారు ఎట్టి క్లిష్టకార్యములయందైనను వెనుకకు తగ్గరు. కనుక ఉత్సాహముతో ధైర్యమును వహించి, ముందునకు సాగినచో సీతాదేవి మనకు తప్పక లభించును.'

రామలక్ష్మణులు సీతను వెదకుచు ఋశ్యమూక పర్వతసమీపమున సంచరించుచుండిరి. వారిని జూచి సుగ్రీవుడు 'వారు వాలిపంపగా వచ్చినవారేమో?' అని భయశంకితుడాయెను. అప్పుడు హనుమంతుడు ఆయనకు ధైర్యముగొలిపి, ఆయనఆదేశముపై వారినిగుఱించి తెలిసికొనుటకై భిక్షుకవేషములో వారికడకు చేరెను. రామలక్ష్మణులఆగమన కారణములను తెలిసికొనిన పిదప, తననుగూర్చి వారికి వివరించి, 'సుగ్రీవుడు మీతో మైత్రిని గోరుచున్నాడు.' అని పలికెను. అందులకు వారు సమ్మతింపగా మారుతి రామలక్ష్మణులను తనభుజములపై చేర్చుకొని, ఋశ్యమూక పర్వతమునకు చేరెను. సుగ్రీవుడు రామలక్ష్మణులరాకకు మిగుల సంతసించెను. రామసుగ్రీవులు అగ్నిసాక్షిగా మిత్రులైరి. ఈ సందర్భమున సుగ్రీవుడు పేర్కొనిన మిత్రలక్షణములు గమనార్హములు - ఉత్తమపురుషుడు తనమిత్రుడెట్టి వాడైనను తారతమ్యములు చూపక అతనిని తనతో సమానముగా గౌరవించును - నిజమైన మిత్రుడు తన స్నేహితునికొఱకై తనసంపదలను, సుఖములను కడకు తన ప్రాణములనుగూడ త్యజించుటకు సిద్ధముగానుండును.

ధనత్యాగః సుఖత్యాగో దేహత్యాగోఽపివాపునః । వయస్యార్థే ప్రవర్తంతే స్నేహం దృష్ట్వా తథావిధమ్ ॥

పిదప సుగ్రీవుడు "ప్రభూ! వాలి నన్ను రాజ్యమునుండి బహిష్కరించుటయేగాక, నా భార్యయైన 'రుమ'ను తన వశమునందుంచుకొనెను. కనుక అతనిని వధింపుము" - అని శ్రీరాముని వేడుకొనెను. అందులకాప్రభువు అతనికి

అభయమిచ్చెను. సీతాపహరణ వృత్తాంతమును హనుమంతునిద్వారా తెలిసికొనిన సుగ్రీవుడు "స్వామీ! నేను సీతజాడను తెలిసికొని, ఆమెను నీ సన్నిధికి చేర్చెదను." అని శ్రీరామునకు మాట ఇచ్చెను. పిదప అతడు జానకీదేవి గిరిపై పడవేసిన నగలమూటను తెప్పించి రామునిముందుంచెను. ఆ మూటను జూచి దుఃఖితుడైన శ్రీరాముడు వాటిని పరిశీలించుటకై లక్ష్మణునకు ఇచ్చెను. అప్పుడు అతడు 'అన్నా! ఈ కేయూరములను, కుండలములను నేను ఎఱుగను - కాని నిత్యము మా వదినెకు పాదాభివందనము చేయుచుండుటగాన ఈ కాలిఅందెలుమాత్రము ఆమెవే-' అని నుడివెను.

నాఽహం జానామి కేయూరే నాఽహంజానామి కుండలే ।
నూపురేత్వభిజానామి నిత్యం పాదాభివందనాత్ ॥ ఈ శ్లోకము భారతీయ సంస్కృతికి మచ్చుతునుక -

పిదప సుగ్రీవుడు విరహశోకమునమున్న శ్రీరాముని ఓదార్చెను. వాలితో తనకు ఏర్పడిన వైరకారణమును ఆ స్వామికి విన్నవించెను. అంతట శ్రీరాముడు 'వాలిని వధించి నిన్ను శోకవిముక్తుని చేసెదను." అని పలికి సుగ్రీవునకు ఊరట గూర్చెను. సుగ్రీవుడు వాలిబలపరాక్రమములను గూర్చి తెల్పెను. అతనికోరికమేరకు శ్రీరాముడు దుందుభికాయమును తనకాలికొనగోటితో చిమ్మివైచెను. ఒకే బాణముతో ఏడు మద్దిచెట్లను ఛేదించెను. అప్పుడు శ్రీరాముని శక్తిపై సుగ్రీవునకు విశ్వాసము నెలకొనెను. రఘువరునిసూచనమేరకు సుగ్రీవుడు వాలిని యుద్ధమునకు ఆహ్వానించెను. అన్నదమ్ముల పోలికలు ఒకటిగా ఉండుటవలన రాముడు వాలిపై బాణమును ప్రయోగించుటకు వీలుపడకపోయెను. అప్పుడు సుగ్రీవుని మెడలో ఒక మాలను వేసి రాఘవుడు అతనిని మఱల వాలితో యుద్ధమునకు పంపెను. సుగ్రీవునితో యుద్ధమునకు వెళ్లుచున్న వాలిని వారించుచు అతనిభార్యయైన తార హితవచనములను పలికెను. శ్రీరాముని శౌర్యపరాక్రమములను వివరించెను, అతనితో విరోధము తగదని హెచ్చరించెను. సుగ్రీవునియువరాజుగా జేయుమని సూచించెను. తారమాటలను పెడచెవినిబెట్టి వాలి సుగ్రీవునితో యుద్ధమునకు దిగెను. శ్రీరాముడు ప్రయోగించిన బాణమునకు వాలి నేలగూలెను. అందులకు వాలి ఆ ప్రభువును తప్పుపట్టుచు ఇట్లు నుడివెను. "నీ దేశమునందును, నీ పురమునందును నేను నీకు ఎన్నడును అపకారము తలపెట్టలేదు. నిన్ను అవమానపఱచియు ఎఱుగను. అట్టి నిరపరాధినైన నన్ను నీవు ఎందులకు చంపబూనితివి? రాజ్యముకొఱకుగాని, సంపదలకొఱకుగాని సామాన్యముగా రాజులమధ్య కలహములు జరుగుచుండును. మఱి ఈ వనమున నీవు నా నుండి ఏ ప్రయోజనమును ఆసించుచున్నావు? నీ పరాక్రమమును చూపుటకు నీవు నాయెదుట నిలిచి యుద్ధము చేయవలసియుండెను. ముందుగా నీవు నన్నే ఆశ్రయించియున్నచో ఒక్క దినములో ఆ సీతాదేవిని తీసికొనివచ్చి నీకు అప్పగించియుండెడివాడను. అంతేగాదు రావణుని బంధించి తీసికొనివచ్చి నీ ముందు ఉంచెడివాడను." ఈ సందర్భమున వాలి పేర్కొనిన రాజలక్షణములు గమనింపదగినవి - 'ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహము, సహనము, ధర్మాచరణము, ధైర్యము, సత్యవ్రతము, పరాక్రమము, అపరాధులను దండించుట మున్నగునవి రాజులకు ఉండవలసిన లక్షణములు.

దమశ్శమః క్షమాధర్మో ధృతిః సత్యం పరాక్రమః । పార్థివానాం గుణా రాజన్ దండశ్చాప్యపరాధిషు ॥

వాలి చేసిన ఆక్షేపణలకు శ్రీరాముడు ఇచ్చిన సమాధానము - "వాలీ! ఈ కిష్కింధ ఇక్ష్వాకు ప్రభువులరాజ్యములోని భాగము. ఈ రాజ్యమునకు ధర్మాత్ముడైన భరతుడు రాజు. మేము అతనిఆజ్ఞను అనుసరించి పూర్తిగా ధర్మాచరణమునందు నిమగ్నులమై యున్నాము. ధర్మమార్గమును వీడి ప్రవర్తించువారిని తప్పక దండించెదము - నీవు కామాతురుడవై తమ్ముని భార్యయైన రుమను నీ అధీనములో నుంచుకొని ఆమెతో సుఖించుచుంటివి. తమ్మునిభార్య కోడలితో సమానము అనగా కూతురువంటిది. కనుక నీవు దండనార్హుడవు. నీవు శాఖామృగానివి. మృగములను మాటున ఉండి వేటాడుట (చంపుట) రాజధర్మము - కావున నేను చెట్టుచాటున ఉండి నిన్ను నేలగూల్చుట ఏ విధముగను అధర్మము గాదు.

రఘువరునిసమాధానములను వినిన పిమ్మట వాలి తనతప్పిదములకు పశ్చాత్తాపపడెను. అంగదుని ఆదరింపవలసినదిగా ఆ స్వామిని ప్రార్థించెను. తార తనభర్త నేలగూలినవార్తను విని అంగదకుమారునితో గూడి రణభూమికి బయలుదేఱెను. ఆచట వాలిదుర్దశను జూచి ఆమె మిగుల విలపించెను. అప్పుడు హనుమంతుడు ఆమెను ఊరడించెను. కొనయూపిరితోనున్న వాలి సుగ్రీవునితోడను, అంగదునితోడను హితవచనములను పలికి అసువులను కోల్పోయెను. ఆ రఘుపుంగవుడు శోకించుచున్న సుగ్రీవుని, అంగదుని, తారను ఓదార్చుచు కాలతత్త్వమును గూర్చి ఇట్లు నుడివెను. "నియతియే (అనగాకాలమే) లోకమునందు సర్వకర్మలకును కారణము. ఏ వ్యక్తియు స్వతంత్రుడు కాడు. కాలమును ఉల్లంఘింపజాలడు. కాలమునకు పక్షపాతధోరణియుండదు. అది లౌకికహేతువులకు కట్టుబడునది కాదు."

పిమ్మట శ్రీరామునిఆదేశముతో అంగదాదులు వాలికి దహనసంస్కారములను ఒనర్చిరి. తాను నగరమున ప్రవేశింపరాదు గనుక ప్రస్రవణగిరియందేయుండెదననియు, వర్షాకాలము ముగిసిన పిమ్మట సీతాన్వేషణను ప్రారంభింపవలెననియు శ్రీరాముడు సుగ్రీవుని ఆదేశించెను. సుగ్రీవుడు కిష్కింధకు పట్టాభిషిక్తుడై, అంగదుని యువరాజును గావించెను.

వర్ష-ఋతువునందు శ్రీరాముడు విరహవేదనకు లోనయ్యెను. లక్ష్మణుడు ఆ ప్రభువును ఓదార్చెను. శరత్కాలము ప్రారంభముకాగానే మిత్రకార్యమునకు అనగా సీతాన్వేషణకు పూనుకొనవలసినదిగా హనుమంతుడు సుగ్రీవునకు సూచించెను. ఈ సందర్భమున ఆ మారుతి మిత్రధర్మములను గూర్చి ఇట్లు ప్రస్తావించెను. 'మిత్రునకు చేయవలసిన ప్రత్యుపకారమును సకాలములో చేసి, సన్మార్గమున ప్రవర్తించెడి వానికి రాజ్యము, యశస్సు, పరాక్రమము వృద్ధియగును. సమయమునుమించిన పిమ్మట మిత్రునికార్యమును సాధించుటకు ఎంతగా ప్రయత్నించిననూ దానివలన ఎట్టి ప్రయోజనమూ ఉండదు.'

మారుతిమాటలను ఆదరించి, సుగ్రీవుడు సేనలను సమీకరించుటకు నీలుని ఆజ్ఞాపించెను. శరత్కాలము వచ్చినను సుగ్రీవుడు సీతాన్వేషణకు పూనుకొనలేదనిభావించి, శ్రీరాముడు కుపితుడై అతనికి కర్తవ్యమును గుర్తుచేయుటకై లక్ష్మణుని కిష్కింధకు పంపెను. ఈ సందర్భమున ఆ ప్రభువు కృతఘ్నుని గూర్చి ఇట్లు ప్రస్తావించెను. 'మిత్రులసహాయముచే తమ పనులను పూర్తిచేసికొని, పిదప వారికి సహాయపడనివారు కృతఘ్నులు. అట్టివారు చనిపోయిన పిమ్మట వారి కళేబరములను పచ్చిమాంసములను తినెడి క్రూరమృగములుగూడ ముట్టవు.'

కృతార్థాహ్యకృతార్థానాం మిత్రాణాం న భవంతి యే । తాన్ మృతానపి క్రవ్యాదాః కృతఘ్నాన్ నోపభుంజతే ॥

అన్న ఆజ్ఞమేరకు కిష్కింధకు చేరిన లక్ష్మణుడు సుగ్రీవుని మందలించుచు అతనితో ఇట్లు నుడివెను. "ఓ వానర రాజా! మిత్రులవలన ఉపకారమునుపొంది, వారికి ప్రత్యుపకారమును చేయనివాడు కృతఘ్నుడు, అతడు వధార్హుడు, మృతప్రాయుడు, బ్రహ్మహత్యకు పాల్పడిన వానికిని, మద్యపానము చేసినవానికిని, దొంగకును, వ్రతభంగమొనర్చిన వానికిని ప్రాయశ్చిత్తముద్వారా ఆ పాపములనుండి విముక్తి కలుగును. కాని కృతఘ్నునిపాపములకు ఏ విధముగను విముక్తి లభింపదు. ఇవి బ్రహ్మదేవుడు పలికిన వచనములు."

బ్రహ్మఘ్నే చ సురాపే చ చోరే భగ్నవ్రతే తథా । నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాఽస్తి నిష్కృతిః ॥

సుగ్రీవుడు సీతాన్వేషణకై తగిన ఏర్పాట్లను చేసినాడనియు, అతడు కృతఘ్నుడు కాడనియు తార సౌమిత్రికి సవినయముగా వివరించెను. పిదప సుగ్రీవుడు లక్ష్మణునితోగూడి ప్రస్రవణగిరికి చేరి, శ్రీరాముని దర్శించెను. ఇంతలో అసంఖ్యాకులైన వానరవీరులు అచటికి చేరి సుగ్రీవుని కలిసిరి.

సీతాదేవిజాడను తెలిసికొనుటకును, రావణునినివాసస్థానమును పసిగట్టుటకును సుగ్రీవుడు నలుదిక్కులకును వానరయోధులను పంపెను. అంగదునినాయకత్వమున హనుమదాదులు దక్షిణదిశకు బయలుదేరిరి. 'హనుమంతుడే సీతాన్వేషణకార్యమును సాధింపగలడు-' అను విశ్వాసముతో సుగ్రీవుడు మారుతిని ప్రశంసించెను. శ్రీరాముడును ఆంజనేయునిశక్తిసామర్థ్యములను మెచ్చుకొనుచు ఆ వాయుసుతునిపై సీతాదేవికి నమ్మకము కల్గుటకై ఆనవాలుగా తన యుంగరమును ఆయనకు ఇచ్చెను. ఒక్క దక్షిణదిశకు వెళ్లినవారుతప్ప తక్కిన దిశలకు వెళ్లినవానరులుమాత్రము గడువు లోపల తిరిగివచ్చి 'మాకు సీతాదేవిజాడ తెలియలేదు-' అని సుగ్రీవునితో తెలిపిరి. హనుమదాదులు ఆకలిదప్పులకులోనై నీటికొఱకు ఒక గుహలో ప్రవేశించిరి. అచట వారికి స్వయంప్రభ అను ఒక తాపసి కనబడెను. ఆ గుహారక్షణ భారమును నిర్వహించుచున్న ఆ తాపసి వారితో 'ఇచటిఫలములను ఆరగించి, మీరాకకుగల కారణములను తెలుపుడు' అని పల్కెను. హనుమంతుడు తమరాకకుగల కారణములను ఆమెకు వివరించెను. వానరులఅభ్యర్థనపై స్వయంప్రభ తన తపఃప్రభావముచే ఆ వానరులను అందఱిని సముద్రతీరమునకు చేర్చెను. పిమ్మట 'సుగ్రీవుడు విధించిన గడువు ముగిసినందున కార్యసాఫల్యము కాకుండ కిష్కింధకు వెళ్లినచో మరణదండన తప్పదు. కనుక మనము ప్రాయోపవేశము చేయుట యుక్తము' - అని అంగదుడు పల్కెను. ప్రాయోపవేశమును హనుమంతుడు నిరాకరించెను. ఐనను అంగదాదివానరులు అందఱును ఆమరణనిరాహారదీక్షకు పూనుకొనిరి. ఇంతలో జటాయువుసోదరుడైన సంపాతి ఆవానరులనుజూచి 'వీరందఱును నాకు ఆహారము అగుదురు' - అని పలికెను. ఆమాటలనువిని, అంగదుడు గతసంఘటనలనుగూర్చి తెలుపుచు జటాయువుయొక్క

ఔన్నత్యమును, అతనిమృతినిగూర్చి ప్రస్తావించెను. తనసోదరునిపేరును వినినంతనే సంపాతి వారితో స్నేహపూర్వకముగా మాట్లాడెను. అంతట అంగదుడు శ్రీరాముని వనవాసగాథను, సీతాపహరణ వృత్తాంతమును, రావణునివలన జటాయువు మృతిని, వాలివధను, సీతాదేవికొఱకై తమఅన్వేషణవృత్తాంతమును సంపాతికి వివరించెను. పిదప సంపాతి జటాయువు తన తమ్ముడేయనుసంగతిని, తనఱెక్కలు కాలిపోయిన విషయమును, ఆవానరులకు తెలిపెను. అంగదుడు కోరినమీదట రావణుడు సీతాదేవిని అపహరించి లంకలో ఉంచిన విషయమును తెలిపెను. 'ధైర్యసాహసములతో సముద్రమును లఘించి, సీతాదేవిజాడకై వెదకుడు' అని సంపాతి వారికి సూచించెను. సంపాతికి ఱెక్కలు రాగా అతడు వానరులను ఉత్సాహపఱచి వినువీథికి ఎగిరిపోయెను. అపారమైన సముద్రమును లంఘించుట యెట్లు? అని వానరులెల్లరును విషాదగ్రస్తులైరి. అప్పుడు అంగదుడు 'విషాదపడుట మహాదోషము. అది వ్యక్తులను క్రుంగదీయును. పరాక్రమము చూపవలసిన సమయమున విషాదమునకు తావిచ్చినవాడు తేజోహీనుడగును'- అని పల్కెను.

నూరుయోజనముల సముద్రమును లంఘించుటకు తమకు శక్తి చాలదని అంగదాదులు ప్రకటించిరి. 'సముద్రమును లంఘించి, తిరిగి రాగల వీరుడు హనుమంతుడు మాత్రమే' - అని పలికి జాంబవంతుడు అయనను ప్రేరేపించెను. అనంతరము మారుతి తనఅద్భుతరూపమును ప్రకటించి, మహేంద్రగిరిపై చేరి సముద్రమును లంఘించుటకు ఉద్యుక్తుడాయెను.

సుందరకాండము

సుందరే సుందరో రామః సుందరే సుందరీ కథా । సుందరే సుందరీ సీతా సుందరే సుందరం వనమ్ ॥

సుందరే సుందరం కావ్యం సుందరే సుందరః కపిః । సుందరే సుందరం మంత్రం సుందరే కిం న సుందరమ్ ॥

అనునది ప్రాజ్ఞులవచనము - పురుష మోహనాకారుడు, సుగుణగణ సుందరుడు శ్రీరాముడు. సర్వవిధముల భువనైక సుందరి సీతామాత. కాంచనాద్రికమనీయవిగ్రహుడైన హనుమంతుడు పరమసుందరుడు. అశోకవనము అతిలోక సుందరము. శ్రీసీతారామహనుమంతులమహామంత్రములు దివ్యములు, సుందరములు. ఈ మహాత్ములకథ సర్వాద్భుత సుందరము. ఈ సుందరకాండముయొక్క బహువిధవైభవములను వర్ణించు కవిత్వము (కావ్యము) అత్యంత సుందరము. ఈ సుందరకాండమునందు సుందరము కానిదేది? సర్వమూ సుందరమే.

సీతాన్వేషణ కిష్కింధకాండమునందే ప్రారంభమైనను ఆదేవియొక్క దర్శనసాఫల్యమును సమకూర్చినదిమాత్రము ఈ సుందరకాండమే - ఈ అన్వేషణమహాకార్యమున ప్రముఖపాత్రను నిర్వహించిన మహాత్ముడు హనుమంతుడు. మారుతియొక్క శక్తిసామర్థ్యములు, బలపరాక్రమములు అత్యద్భుతములు, నిరుపమానములు - ఈయనకార్యదీక్షా దక్షతలు అపూర్వములు. అణిమాది - అష్టసిద్ధులు ఈయనకు కరతలామలకములు, బుద్ధివైభవము సాటిలేనిది. సమయస్ఫూర్తి ఉగ్గుపాలతో అబ్బినవిద్య - ఇంతయేందులకు? ఈ మహాత్మునివిశిష్టలక్షణములన్నియును సుందరకాండమునందు అడుగడుగునను మనకు గోచరించును.

అంగదాదివానరులఅభ్యర్థనననుసరించియు, జాంబవంతుని ప్రోత్సాహమునుబట్టియు మారుతి సముద్రమును లంఘించుటకు నిశ్చయించికొని, అందులకై మహేంద్రగిరినుండి బయలుదేఱి లంకాభిముఖుడై ఆకాశమార్గమున సాగిపోవుచుండెను. త్రోవలో ఆయనకు మైనాకుడు, సురసయను నాగమాత, సింహిక (ఛాయాగ్రాహిణి) అనువారివలన ఆటంకములు ఎదురయ్యెను. మారుతి సమయస్ఫూర్తితో వాటిని అధిగమించి, సూర్యాస్తమయసమయమునకు లంకకు చేరెను.

ఇంతలో లంకాధిదేవత (లంకిణి) ఆనగరమున ప్రవేశింపకుండా ఆయనను నిరోధించెను. ఆ మహాత్మునియొక్క లఘుముష్టిఘాతముతో ఆమె భయవిహ్వలయై ఆయనకు దారి ఇచ్చెను. పిమ్మట మారుతి సూక్ష్మరూపమును దాల్చి, ముఖ్యద్వారమునుండిగాక, వెనుక ద్వారమునుండి నేలపై ఎడమపాదమును మోపుచు రాత్రివేళ లంకలో ప్రవేశించెను. అతడు సీతాదేవికొఱకై రావణభవనసముదాయములను అన్నింటిని గాలించెను. ఆమెను ఎందును గానక అతడు మిగుల చింతించెను. పిమ్మట మారుతి 'పుష్పకము' అను పేరుగల రావణునిఅంతఃపురమున ప్రవేశించెను. ఆమెకై క్రమముగా అన్వేషించుచు రావణునిశయ్యామందిరమున అడుగిడెను. గాఢనిద్రలో ఉన్న ఆ లంకేశ్వరుని, అతనివిలాసస్త్రీలను చూచెను. నిద్రలోనున్న మండోదరిని జూచి, ఆమెను సీతగా భావించి సంబరపడెను. కాని వెంటనే తర్కించుకొని ఆమె సీతాదేవి కాదని నిర్ధారణకు వచ్చెను. అనంతరము నిద్రలో మునిగియున్న లలనామణులమధ్య ఆమెకై గాలించెను. కాని అందు

సీతాదేవిమాత్రము కనబడలేదు. వివిధ శృంగారభంగిమలలో నిద్రించుచున్న తరుణీమణులను గాంచినను జితేంద్రియుడైన మారుతిమాత్రము ఎట్టి మనోవికారములకును లోనుకాలేదు.

ఎంతగాలించినను సీతాదేవి కనబడకపోవుటచే ఆమె తనువును చాలించియుండవచ్చునని తలచి, మారుతి విషాదమునకులోనయ్యెను. బుద్ధికుశలుడైన ఆ స్వామి మరల ఇట్లు తర్కించుకొనసాగెను. 'దిగులు పడకుండ ఉత్సాహముతో ఉండుటవలన కార్యసిద్ధియు, పరసుఖము కలుగును. ఎల్ల వేళలను, అన్ని సందర్భములలోను ఉత్సాహమును కలిగి యుండుటయే శ్రేయస్కరము. అదియే మానవులకార్యములను సఫలమొనర్చును. అందువలన దిగులుచెందక గట్టి ప్రయత్నమొనర్చెదను.'

గట్టి పూనికతో మారుతి సీతాదేవికొఱకై లంకానగరమున ప్రత్యంగుళమూ గాలించెను. కాని జానకిజాడమాత్రము తెలియకుండెను. అప్పుడు సీతాదేవి గతించియుండునని తలంచి, హనుమంతుడు మిగుల విచారగ్రస్తుడయ్యెను, ఆ వార్తను శ్రీరామునకు తెల్పినచో పెక్కు అనర్థములు వాటిల్లునని తలంచెను. స్వప్రయత్నములు సఫలము కానప్పుడు దైవమునాశ్రయించుటయే యుక్తమని నిర్ణయించుకొని, సీతారామలక్ష్మణులను ఇతరదేవతలను ఇట్లు ధ్యానించెను.

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై

నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః

ఇట్లు ప్రార్థించిన వెంటనే 'అశోకవనమున వెదకనివిషయము మారుతికి స్ఫురించెను. మఱుక్షణమే అతడు అశోకవనమున ప్రవేశించెను. అతడు ఒక శింశుపావృక్షముపై చేరి, అచటినుండియే సీతాదేవికొఱకు కలయజూచెను. వనమునందు ఒక చైత్యప్రాసాదముకడ వృక్షచ్ఛాయలో దైన్యముతోనున్న జానకీదేవిని జూచి, ఆమెను గుర్తించి సంతోషించెను. ఇంతలో రావణుడు సపరివారముగా అచటికివచ్చి, ఆమెను ప్రలోభపెట్టుటను గమనించెను. సీతాదేవి గడ్డిపోచను అడ్డుగా పెట్టుకొని, అతనిని తృణీకరించుచు మాట్లాడుటనుగూడ వినెను. అంతట రావణుడు వైదేహికి రెండు మాసముల గడువొసంగి, ఆమెను భయపెట్టుచు తనభవనమునకు తఱలిపోయెను. 'రావణుని చేపట్టుము'- అని రాక్షసస్త్రీలు మైథిలికి నచ్చజెప్పజూచిరి. వారిమాటలను ఆమె నిరాకరింపగా వారు ఆమెను చంపివేయుదుమని భయపెట్టిరి, ఆమె శోకసంతప్తయై ప్రాణత్యాగమునకు నిశ్చయించుకొనెను. ఇంతలో త్రిజట (విభీషణునికూతురు) తన స్వప్నవృత్తాంతమును దెల్పుచు 'రావణుడు సపరివారముగా నశించును. శ్రీరాముడు విజయుడై సీతాదేవితోగూడి వెళ్లును. కనుక ఆ రామపత్నిని శరణుగోరుడు' - అని ఆ రక్కసులకు తెలిపెను. ఇంకను వారితో ఇట్లనెను. 'ఓ రక్కసులారా జనకునిసుతయైన ఈ సీతాదేవికి నమస్కరించినంత మాత్రముననే ఈమె ప్రసన్నురాలగును. ఈ గొప్ప ఆపదనుండి మనలను రక్షించుటకు దయామయురాలైన ఈమెయే సమర్థురాలు.

ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా । అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్ ॥

త్రిజటస్వప్నవృత్తాంతమును విని మనసులో సంతసించినను, ఆజనకనందిని తనదీనావస్థకు దుఃఖించుచు ప్రాణత్యాగమునకు సిద్ధపడెను. అప్పుడు ఆమెకు కొన్ని శుభశకునములు గోచరించెను. అశోకవృక్షముపై చేరియున్న హనుమంతుడు వీటినన్నింటిని గమనించి, సీతాదేవితో సంభాషించుటకు నిశ్చయించుకొనెను. ఆమెకు వినబడునట్లు రామకథను వర్ణించెను. రఘువరునియుదంతమును విని ఆదేవి ఎంతయు సంతసించెను. హనుమంతుడు శింశుపావృక్షమునుండి దిగి, ఆమెకు నమస్కరించెను. ఆ ఇరువురును తమనుగూర్చి తెలుపుకొనిరి. తనపై ఆమెకు విశ్వాసము కలుగుటకై మారుతి రామలక్ష్మణులగుణగణములను, వారి శరీరచిహ్నములను ఆదేవికి వివరించెను. రామసుగ్రీవులమైత్రిని గూర్చియు తెలిపెను. పిదప అతడు శ్రీరామునిఅంగుళీయకమును ఆమెకు సమర్పించి, ఆదేవిపై ఆ స్వామికిగల ప్రేమానురాగములను వివరించి, ఆమెను ఊరడించెను. శ్రీరాముని శీఘ్రముగా తీసికొనిరమ్మని ఆమె మారుతినిగోరెను. అప్పుడతడు తన బృహద్రూపమును ప్రకటించి, తనవెంట రమ్మని ఆమెను ప్రార్థించెను. అందులకు ఆమె నిరాకరించెను. అభిజ్ఞానార్థము తనచూడామణిని మారుతికిచ్చి, ఆదేవి కాకాసురవృత్తాంతమును దెలిపెను. శ్రీరాముని త్వరగా తీసికొనిరమ్మని కోరెను. పిమ్మట ఆ వాయుసుతుడు ఆమెకు ప్రణమిల్లి, తిరుగు ప్రయాణమునకు సన్నద్ధుడాయెను. అంతట హనుమంతుడు తనబలపరాక్రమములను రావణాదులకు ప్రదర్శించుటకును, వారిబలముల స్థాయి ఎట్టిదో గ్రహించుటకును నిశ్చయించుకొని, అశోకవనమును ధ్వంసముచేసెను – అప్పగింపబడిన కార్యమును సాధించి, దానికి భంగము కలుగకుండ పెక్కు ఇతరకార్యములను సాధించినవాడే నిజముగా కార్యదక్షుడుగదా!

కార్యేకర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్ । పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తు మర్హతి ॥

అశోకవనవిధ్వంసవార్తను రాక్షసస్త్రీలద్వారా విని, రావణుడు క్రుద్ధుడై ఎనుబదివేలమంది రాక్షసులను హనుమంతునిమీదికి పంపెను. అప్పుడు అందఱికిని వినబడునట్లు హనుమంతుడు బిగ్గఱగా తానెవరో ప్రకటించుచు ఇట్లు నుడివెను.

జయత్యతిబలోరామో లక్ష్మణశ్చ మహాబలః । రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః ॥

దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః । హనూమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః ॥

మారుతి వారినందఱిని అవలీలగా హతమార్చెను. పిమ్మట రావణునిపనుపున ఒకరి తరువాత మఱియొకరుగా వచ్చిన, ప్రహస్తపుత్త్రుడైన జంబుమాలిని, ఏడుగురు మంత్రికుమారులను, ఐదుగురు సేనాపతులను వధించెను. రావణుని సుతుడైన అక్షకుమారుని మట్టి గఱపించెను. అందులకు క్రుద్ధుడైన రావణుడు తన పెద్దకుమారుడైన ఇంద్రజిత్తును మారుతిపై దాడికి పంపెను. కొంతవడి పోరుఘోరముగా సాగిన పిమ్మట ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకు హనుమంతుడు కట్టుపడెను. ఇంద్రజిత్తు మారుతిని రావణ సభలో ప్రవేశపెట్టెను.

'ఈ లంకలో ప్రవేశించిన నీవెవరు? నీరాకకు కారణమేమి?' అని రావణుడు ప్రశ్నింపగా హనుమంతుడు 'నేను శ్రీరామునిబంటును, సీతాన్వేషణ కార్యనిమిత్తమై ఇచటికి వచ్చితిని. అని తెలుపుచు, అతనికి ఇట్లు హితవచనములను పలికెను – 'ధర్మఫలము అధర్మఫలము ఎప్పుడును కలిసియుండవు. ధర్మకార్యము శుభఫలములను, అధర్మకార్యము అశుభఫలములను ఇచ్చును. ధర్మకార్యాచరణమువలన అధర్మ కార్యఫలము నశింపదు. నీవు ఆచరించిన ధర్మఫలము నీకు పూర్తిగా లభించినది. ఇప్పటి నీ అధర్మఫలమును నీవు త్వరలోనే పొందగలవు.'

ఆ మాటలకు రావణుడు మండిపడుచు "ఈ వానరుని వధింపుడు' అని సేవకులను ఆదేశించెను. అంతట రావణునిసోదరుడైన విభీషణుడు అన్నతో ఇట్లు హితవచనములను పలికెను. "అన్నా! ఏకాలమునందైనను ఏదేశమునందైనను దూతను వధించుట తగదని సజ్జనులు పలుకుదురు. అంగవైకల్యమును గావించుట, కొరడాతో దెబ్బలు కొట్టుట, శిరోముండనము గావించుట. శరీరముపై వాతలు పెట్టించుట మొదలగునవి దూతను దండించు మార్గములు."

విభీషణుడు ఇంకను మఱికొన్ని హితవచనములను పలికిన పిమ్మట రావణుడు తనమనస్సు మార్చుకొని 'ఈ దూతతోకకు నిప్పంటిపుడు' అని ఆజ్ఞ ఇచ్చెను. అప్పుడు రాక్షసులు హనుమంతునివాలమునకు నిప్పంటించి నగరములో త్రిప్పిరి. అప్పుడు ఆంజనేయుడు 'ఇదే అదనుగా భావించి' తన వాలాగ్నితో లంకను దగ్ధమొనర్చెను. హనుమంతునకు ఎట్టి ఆపదయూ కలుగకుండా సీతాదేవి అగ్నిదేవుని ప్రార్థించెను. ఈ అగ్నిప్రమాదమున సీతాదేవియు దగ్ధమై పోయినదేమో యని హనుమంతుడు ఆమెకై మిగుల వగచెను. 'ఈ అనర్థమునకు తనకోపమే కారణము' అని తలపోయుచు అతడు ఇట్లు చింతిచెను. 'కోపావేశమునకు గుఱియైనవాడు ఎట్టి పాపములకైనను ఒడిగట్టును – గురువులను హత్య చేయుటకైనను వెనుకాడడు. కన్నుమిన్ను గానక సజ్జనులనుసైతము నిందించును. 'ఇది అనవచ్చును, ఇది అనకూడదు' – అను విచక్షణనుసైతము కోల్పోవును. అట్టి వానికి చేయగూడని పనిగాని, అనరాని మాట గాని ఉండదు.

'సీతాదేవికి ఎట్టి ఆపదయు కలుగలేదు' అని ఆకాశమునుండి చారణులు పల్కిన వచనములను విని హనుమంతుడు సంతసించెను. అతడు మఱల సీతాదేవిని దర్శించి, ఆమె అనుమతినిగైకొని, తిరుగుప్రయాణమునకు సన్నద్ధుడాయెను. వాయుసూనుడు సముద్రమునుదాటి, జాంబవంతుని, అంగదాది వానరులను కలిసికొని 'దృష్టామయాసీతా' (కనుగొంటిని సీతమ్మను) అని సంతోషముతో నుడివెను. ఆచల్లనివార్తను విని, అందఱును ఆనందముతో కేరింతలు గొట్టిరి. వానరులందఱును కుతూహలముతో అడిగినపిమ్మట ఆ పావని సీతాన్వేషణవృత్తాంతమును, లంకలో తానొనర్చిన సాహసకృత్యములనుగూర్చి వారికి విపులముగా దెలిపెను. జాంబవంతుని సూచనమేరకు వారందఱును కిష్కింధకు పయనమైరి. త్రోవలో వారు మధువనమున ప్రవేశించి. తనివిదీర మధువులను గ్రోలి, సంతోషముతో కేరింతలు కొట్టుచు ఆవనమును అస్తవ్యస్తమొనర్చిరి. ముఖ్యవనపాలకుడు, సుగ్రీవునకు మేనమామయునగు దధిముఖుడు తన అనుచరులతో అంగదాదివానరులను వారించెను. మధుపానముచే మత్తిల్లియున్న అంగదాదులు వారిమాటలను సరకుగొనక వారిని చావమోదిరి. అంతట దధిముఖుడు తన అనుచరులతో సుగ్రీవుని కడకేగి, మధువనమున అంగదాదులఆగడములను గూర్చి ఆ కపీంద్రునకు వివరించెను.

మధువనవిధ్వంసవార్తనువిని, సుగ్రీవుడు హనుమదాదులవలన సీతాన్వేషణకార్యము సఫలమైనట్లు భావించి, రామ లక్ష్మణులకు ఊరటగూర్చెను. వెంటనే అంగదాదులను కిష్కింధకు పంపుమని దధిముఖుని ఆదేశించెను. దధిముఖుని ద్వారా అందిన సుగ్రీవుని సందేశమును అనుసరించి, అంగద హనుమదాదులు కిష్కింధకు విచ్చేసిరి. ఆంజనేయుడు సీతా సందర్శనవార్తను దెలిపెను. లంకలో సీతాదేవిదీనపరిస్థితిని దెలిపి, ఆమె ఇచ్చిన చూడామణిని శ్రీరామునకు సమర్పించెను. చూడామణినిగాంచి, లంకలో జానకి పడుచున్న క్లేశములను గుఱించి విని శ్రీరాముడు మిగుల పరితపించెను. హనుమంతుడొనర్చిన మహోపకారమునకు సంతసించి, కృతజ్ఞతాసూచకముగా ఆరామచంద్రప్రభువు ఆయనకు తనఆలింగనసౌఖ్యమును ప్రసాదించెను.

శ్రీరామునిపాదపద్మములను తులసిదళాదులతో పూజించినవారు సాటిలేని పరమపదమును పొందెదరు. అట్టి శ్రీరామచంద్రుడే పుణ్యములరాశియైన హనుమంతుని అనుగ్రహించి, ఆయనకు స్వయముగా తనఆలింగనసుఖమును ప్రసాదించెను. ఆ మారుతి భాగ్యమును ఎంతని కొనియాడగలము.

యత్పాదపద్మయుగళం తులసీదళాద్యైః సంపూజ్యవిష్ణుపదవీమ్ అతులాం ప్రయాంతి.
తేనైవకిం పునరసౌ పరిరబ్ధమూర్తీ రామేణవాయుతనయః కృతపుణ్యపుంజః

పంచమవేదమైన 'మహాభారతము'న భగవద్గీత ఉపనిషత్సారముగా వాసిగాంచి నేటికిని నిత్యపారాయణ గ్రంథముగా విలసిల్లుచున్నది. అట్లే వేదసారమైన శ్రీమద్రామాయణమునందు ప్రముఖస్థానము వహించిన సుందరకాండము ఇప్పటికిని నిత్యమూ పారాయణము చేయబడుచు, పాఠకులనుండి నీరాజనములందుకొనుచున్నది.

మంగళమ్ మహత్

శ్రీసీతారామాభ్యాం నమః

పారాయణవిధిః

(శ్రీమద్రామాయణ పూజాక్రమః)

ఓమ్ - శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

ఓం భూర్భువస్సువః- ఓమ్ । మమోపాత్త సమస్త దురితక్షయద్వారా శ్రీ పరమేశ్వరప్రీత్యర్థం శ్రీ సీతాలక్ష్మణభరతశత్రుఘ్నహనుమత్సమేత శ్రీరామచంద్రప్రసాదసిద్ధ్యర్థం శ్రీరామచంద్రప్రసాదేన ధర్మార్థకామమోక్ష చతుర్విధపురుషార్థఫలసిద్ధ్యర్థం ఇష్టకామ్యార్థసిద్ధ్యర్థం సర్వపాపక్షయార్థం శ్రీవాల్మీకిరామాయణపారాయణం కరిష్యే ॥

తదర్థం శ్రీరామచంద్రపూజాం కరిష్యే - అస్మిన్ పుస్తకే శ్రీరామచంద్రం ధ్యాయామి, ఆవాహయామి, ఆసనం సమర్పయామి, పాద్యం సమర్పయామి, అర్ఘ్యం సమర్పయామి, ఆచమనీయం సమర్పయామి, పంచామృతేన, శుద్ధోదకేన స్నపయామి, వస్త్రం సమర్పయామి, యజ్ఞోపవీతం సమర్పయామి, ఆభరణాని సమర్పయామి, శ్రీ గంధాన్ ధారయామి, అక్షతాన్ సమర్పయామి, పుష్పైః పూజయామి.

ఓం కేశవాయ నమః ఓం నారాయణాయ నమః ఓం మాధవాయ నమః
ఓం గోవిందాయ నమః ఓం విష్ణవే నమః ఓం మధుసూదనాయ నమః
ఓం త్రివిక్రమాయ నమః ఓం వామనాయ నమః ఓం శ్రీధరాయ నమః
ఓం హృషీకేశాయ నమః ఓం పద్మనాభాయ నమః ఓం దామోదరాయ నమః
ఓం శ్రీరామాయ నమః ఓం శ్రీరామభద్రాయ నమః ఓం శ్రీరామచంద్రాయ నమః

ఓం శ్రీ వేధసే నమః ఓం శ్రీ దాశరథయే నమః ఓం శ్రీ రఘునాథాయ నమః

ఓం శ్రీనాథాయ నమః ఓం శ్రీ సీతాయాఃపతయే నమః

శ్రీ రామచంద్రాయ నమః ధూపమాఘ్రాపయామి, దీపం దర్శయామి, ధూపదీపానంతరం (క్షీరాది) నైవేద్యం సమర్పయామి, శుద్ధ-ఆచమనీయం సమర్పయామి, తాంబూలం సమర్పయామి, కర్పూర - ఆనంద నీరాజనం దర్శయామి, ఛత్రం ధారయామి, చామరం వీజయామి, గీతం శ్రావయామి, నృత్యం దర్శయామి, వాద్యం ఘోషయామి, సువర్ణదివ్య మంత్రపుష్పం సమర్పయామి, సమస్తరాజోపచార - దేవోపచారాన్ సమర్పయామి. ప్రదక్షిణనమస్కారాన్ సమర్పయామి. సర్వం శ్రీ పరమేశ్వరార్పణమస్తు.

శ్రీమద్రామాయణ పారాయణ - ఉపక్రమః

అంగన్యాసకరన్యాసాదయః

అస్య శ్రీమద్వాల్మీకిరామాయణ మహామంత్రస్య నారదో భగవాన్ ఋషిః, అనుష్టుప్ ఛందః, శ్రీ సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న హనుమత్సమేత శ్రీరామచంద్రో దేవతా, ఓం బీజమ్, ధర్మాత్మా సత్యసంధశ్చ రామో దాశరథిర్యది ఇతి శక్తిః, పౌరుషే చాప్రతిద్వంద్వః శరైనం జహి రావణిమ్ ఇతి కీలకమ్, శ్రీ సీతారామచంద్ర ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః.

ధర్మాత్మా - అంగుష్ఠాభ్యాం నమః, సత్యసంధశ్చ - తర్జనీభ్యాం నమః రామః మధ్యమాభ్యాం నమః, దాశరథిర్యది - అనామికాభ్యాం నమః, పౌరుషే చాప్రతిద్వంద్వః - కనిష్ఠికాభ్యాం నమః, శరైనం జహి రావణిమ్ - కరతల కరపృష్ఠాభ్యాం నమః ధర్మాత్మా - హృదయాయ నమః, సత్యసంధశ్చ - శిరసే స్వాహా, రామః - శిఖాయై వషట్, దాశరథిర్యది- కవచాయ హుం, పౌరుషే చాప్రతిద్వంద్వః - నేత్రత్రయాయ వౌషట్ - శరైనం జహి రావణిమ్ - అస్త్రాయ ఫట్, భూర్భువస్సువరోమ్ ఇతి - దిగ్బంధః.

ధ్యానమ్

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ । ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే । 1

అగజాననపద్మార్కం గజాననమహర్నిశమ్ । అనేకదం తం భక్తానామ్ ఏకదంతమ్ ఉపాస్మహే । 2

వాగీశాద్యాః సుమనసః సర్వార్థానామ్ ఉపక్రమే । యం నత్వా కృతకృత్యాః స్యుః తం నమామి గజాననమ్ । 3

శారదా శారదాంభోజవదనా వదనాంబుజే । సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధిస్సన్నిధిం క్రియాత్ । 4

యా కుందేందు తుషారహారధవళా యా శుభ్రవస్త్రావృతా యా వీణావరదండమండితకరా యా శ్వేతపద్మాసనా ।
యా బ్రహ్మాఽచ్యుత శంకరప్రభృతిభిః దేవైః సదా పూజితా సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేషజాడ్యాపహా । 5

దోర్భిర్యుక్తా చతుర్భిః స్ఫటికమణిమయీమ్ అక్షమాలాం దధానా హస్తేనైకేనపద్మం సితమపి చ శుకం పుస్తకం చాఽపరేణ ।
భాసా కుందేందుశంఖస్ఫటికమణినిభా భాసమానాఽసమానా సా మే వాగ్దేవతేయం నివసతు వదనే సర్వదా సుప్రసన్నా । 6

జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్ । ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే । 7

కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్ । ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్ । 8

వాల్మీకేర్మునిసింహస్య కవితావనచారిణః । శృణ్వన్ రామకథానాదం కో న యాతి పరాం గతిమ్ । 9

యః పిబన్ సతతం రామచరితామృతసాగరమ్ । అతృప్తస్తం మునిం వందే ప్రాచేతసమకల్మషమ్ । 10

గోష్పదీకృతవారాశిం మశకీకృతరాక్షసమ్ । రామాయణమహామాలారత్నం వందేఽనిలాత్మజమ్ । 11

అంజనానందనం వీరం జానకీశోకనాశనమ్ । కపీశమ్ అక్షహంతారం వందే లంకాభయంకరమ్ । 12

అమిషీకృతమార్తాండం గోష్పదీకృతసాగరమ్ । తృణీకృతదశగ్రీవమ్ ఆంజనేయం నమామ్యహమ్ । 13

ఉల్లంఘ్య సింధో: సలిలం సలీలం, యశ్శోకవహ్నిం జనకాత్మజాయా: ।
ఆదాయ తేనైవ దదాహ లంకాం, నమామి తం ప్రాంజలిరాంజనేయమ్ । 14

ఆంజనేయమతిపాటలాననం, కాంచనాద్రికమనీయవిగ్రహమ్ ।
పారిజాతతరుమూలవాసినం, భావయామి పవమాననందనమ్ । 15

యత్రయత్ర రఘునాథకీర్తనం, తత్రతత్ర కృతమస్తకాంజలిమ్ ।
బాష్పవారిపరిపూర్ణలోచనం, మారుతిం నమత రాక్షసాంతకమ్ । 16

మనోజవం మారుతతుల్యవేగం, జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానరయూథముఖ్యం, శ్రీరామదూతం శిరసా నమామి । 17

య: కర్ణాంజలిసంపుటై: అహరహ: సమ్యక్ పిబత్యాదరాత్
వాల్మీకేర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు ।
జన్మవ్యాధిజరావిపత్తిమరణై: అత్యంతసోపద్రవమ్
సంసారం స విహాయ గచ్ఛతి పుమాన్ విష్ణో: పదం శాశ్వతమ్ । 18

తదుపగత సమాస సంధియోగం, సమమధురోపనతార్థవాక్యబద్ధమ్ ।
రఘువరచరితం మునిప్రణీతం, దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్ । 19

వాల్మీకిగిరిసంభూతా రామసాగరగామినీ । పునాతు భువనం పుణ్యా రామాయణమహానదీ । 20

శ్లోకసారసమాకీర్ణం సర్గకల్లోలసంకులమ్ । కాండగ్రాహమహామీనం వందే రామాయణార్ణవమ్ । 21

వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే । వేద: ప్రాచేతసాదాసీత్ సాక్షాద్రామాయణాత్మనా । 22

వైదేహీసహితం సురద్రుమతలే హైమే మహామండపే
మధ్యే పుష్పకమాసనే మణిమయే వీరాసనే సుస్థితం ।
అగ్రే వాచయతి ప్రభంజనసుతే తత్త్వం మునిభ్య: పరమ్
వ్యాఖ్యాంతం భరతాదిభి: పరివృతం రామం భజే శ్యామలమ్ । 23

వామే భూమిసుతా పురశ్చ హనుమాన్ పశ్చాత్ సుమిత్రాసుత:
శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయో: వాయ్వాదికోణేషు చ
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరాట్ తారాసుతో జాంబవాన్
మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్ । 24

మాతా రామో మత్పితా రామచంద్రో భ్రాతా రామో మత్సఖా రాఘవేశ: ।
సర్వస్వం మే రామచంద్రో దయాళు: నాఽన్యం దేవం నైవ జానే న జానే । 25

సాకేతే శరదిందుకుందధవళే సౌధే మహామండపే । పర్యస్తాగరుధూపదీపలలితే కర్పూరదీపోజ్జ్వలే ।
సుగ్రీవాంగదజాంబవత్పరివృతం సౌమిత్రిణా సేవితమ్ । లీలామానుషవిగ్రహం రఘువరం రామం భజే శ్యామలమ్ । 26

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చ తస్యై జనకాత్మజాయై ।
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః । 27

రామాయణపారాయణసమాపనశ్లోకాః

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః ।
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం లోకాస్సమస్తాః సుఖినో భవంతు । 1

కాలే వర్షతు పర్జన్యః పృథివీ సస్యశాలినీ । దేశోఽయం క్షోభరహితో బ్రాహ్మణాస్సంతు నిర్భయాః । 2
అపుత్రాః పుత్రిణస్సంతు పుత్రిణస్సంతు పౌత్రిణః । అధనాః సధనాస్సంతు జీవంతు శరదాం శతమ్ । 3
చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్ । ఏకైకమక్షరం ప్రోక్తం మహాపాతకనాశనమ్ । 4
శృణ్వన్ రామాయణం భక్త్యా యః పాదం పదమేవ వా । స యాతి బ్రహ్మణః స్థానం, బ్రహ్మణా పూజ్యతే సదా । 5
రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే । రఘునాథాయ నాథాయ సీతాయాఃపతయే నమః । 6
మంగళం కోసలేంద్రాయ మహనీయగుణాబ్ధయే । చక్రవర్తితనూజాయ సార్వభౌమాయ మంగళమ్ । 7
వేదవేదాంతవేద్యాయ మేఘశ్యామలమూర్తయే । పుంసాం మోహనరూపాయ పుణ్యశ్లోకాయ మంగళమ్ । 8
విశ్వామిత్రాంతరంగాయ మిథిలానగరీపతేః । భాగ్యానాం పరిపాకాయ భవ్యరూపాయ మంగళమ్ । 9
పితృభక్తాయ సతతం భ్రాతృభిస్సహసీతయా । నందితాఖిలలోకాయ రామభద్రాయ మంగళమ్ । 10
త్యక్తసాకేతవాసాయ చిత్రకూటవిహారిణే । సేవ్యాయ సర్వయమినాం ధీరోదారాయ మంగళమ్ । 11
సౌమిత్రిణా చ జానక్యా చాపబాణాసిధారిణే । సంసేవ్యాయ సదా భక్త్యా స్వామినే మమ మంగళమ్ । 12
దండకారణ్యవాసాయ ఖండితామరశత్రవే । గృధ్రరాజాయ భక్తాయ ముక్తిదాయాఽస్తు మంగళమ్ । 13
సాదరం శబరీదత్తఫలమూలాభిలాషిణే । సౌలభ్యపరిపూర్ణాయ సత్త్వోద్రిక్తాయ మంగళమ్ । 14
హనుమత్సమవేతాయ హరీశాభీష్టదాయినే । వాలిప్రమథనాయాఽస్తు మహాధీరాయ మంగళమ్ । 15
శ్రీమతే రఘువీరాయ సేతూల్లంఘితసింధవే । జితరాక్షసరాజాయ రణధీరాయ మంగళమ్ । 16
ఆసాద్య నగరీం దివ్యామ్ అభిషిక్తాయ సీతయా । రాజాధిరాజరాజాయ రామభద్రాయ మంగళమ్ । 17
మంగళాశాసనపరైః మదాచార్యపురోగమైః । సర్వైశ్చ పూర్వైరాచార్యైః సత్కృతాయాఽస్తు మంగళమ్ । 18

కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్ ।
కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి । 19

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్ । తత్సర్వం క్షమ్యతాం దేవ శ్రీరాఘవ నమోఽస్తుతే । 20

ఆత్మా త్వం క్షితిజా మతిః సహచరాః ప్రాణాః శరీరం గృహమ్
పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః ।
సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో
యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం రామాఽస్తు తే పూజనమ్ । 21

* * *

శ్రీసీతారామాభ్యాం నమః

శ్రీమద్వాల్మీకి రామాయణము

అరణ్యకాండము

1. మొదటిసర్గము

**సీతారామలక్ష్మణులు దండకారణ్యమునందలి మునుల ఆశ్రమమున ప్రవేశించుట,
మునులు వారికి అతిథి సత్కారములను గావించుట.**

ప్రవిశ్య తు మహారణ్యం దండకారణ్యమాత్మవాన్।
దదర్శ రామో దుర్ధర్షః తాపసాశ్రమమండలమ్। 1

తిరుగులేని మహావీరుడు, ధైర్యశాలియు ఐన శ్రీరాముడు సామాన్యులు అడుగిడుటకు అసాధ్యమైన దండకారణ్యమున ప్రవేశించెను. అచట ఆయనకు అనేకతాపసాశ్రమములు కనబడెను (1)

కుశచీరపరిక్షిప్తం బ్రాహ్మ్యా లక్ష్మ్యా సమావృతమ్।
యథా ప్రదీప్తం దుర్దర్శం గగనే సూర్యమండలమ్। 2

అచట దర్భలు, నారచీరలు కనవచ్చుచుండెను. అచటి తాపసులెల్లరును వేదపఠనములు కావించుచుండుట చేతను, వారిదివ్యోపాసనలప్రభావముచేతను బ్రహ్మతేజోమయమై యున్న ఆ ఆశ్రమప్రదేశమంతయును, మందేహాదిరాక్షసులకు మధ్యాహ్నసమయమున సూర్యమండలమువలె రాక్షసులకు దుర్నిరీక్ష్యమైయుండెను. (2)

శరణ్యం సర్వభూతానాం సుసమ్మృష్టాజిరం తథా।
మృగైర్బహుభిరాకీర్ణం పక్షిసంఘైః సమావృతమ్। 3

ఆ ఆశ్రమసముదాయము సకలప్రాణులకును సురక్షితమైన నివాసభూమి. ఆ ఆశ్రమ ప్రాంగణములన్నియును స్వచ్ఛముగా నుండెను. ఆ ప్రాంతమునందంతటను మృగములు ప్రశాంతముగా జీవించుచుండెను. కలకలారావములొనర్చుచు పక్షులగుంపులు చెట్లకొమ్మలపై హాయిగా మసలుకొనుచుండెను. (3)

పూజితం చ ప్రనృత్తం చ నిత్యమప్సరసాం గణైః।
విశాలైరగ్నిశరణైః స్రుగ్భాండైరజినైః కుశైః। 4

సమిద్భిస్తోయకలశైః ఫలమూలైశ్చ శోభితమ్।
ఆరణ్యైశ్చ మహావృక్షైః పుణ్యైః స్వాదుఫలైర్వృతమ్। 5

పవిత్రమైన ఆ ప్రదేశమున అప్సరసలు దైవసేవలో భాగముగా ప్రతిదినము నృత్యములొనర్చుచుండిరి. అచటి అగ్నిహోత్రగృహములు (యజ్ఞశాలలు) అతివిశాలములు. అవియన్నియు స్రుక్కులు, స్రువములు, యజ్ఞపాత్రలు, మృగ (జింక) చర్మములు, దర్భలు, దర్భాసనములు, వివిధములగు సమిధలు, జలములతో నిండిన కలశములు, కందమూల ఫలములు మొదలగువానితో శోభిల్లుచుండెను. ఆ ఆశ్రమములకు చుట్టునుగల పవిత్రవనవృక్షములన్నియును మధురములగు ఫలములతో మనోహరముగానుండెను. (4-5)

బలిహోమార్చితం పుణ్యం బ్రహ్మఘోషనినాదితమ్।
పుష్పైర్వన్యైః పరిక్షిప్తం పద్మిన్యా చ సపద్మయా। 6

ఫలమూలాశనైర్దాంతైః చీరకృష్ణాజినాంబరైః।
సూర్యవైశ్వానరాభైశ్చ పురాణైర్మునిభిర్వృతమ్। 7

ఆ ఆశ్రమసమూహము భూతబలులచేతను, వైశ్వదేవాది హోమములవలనను పునీతమైనది. అది వేదఘోషలతో ప్రతిధ్వనించుచుండెను. కమలశోభలతో కలకలలాడుచుండెడి సరస్సులతోడను, వనపుష్పములతోడను చూడముచ్చట గొలుపుచుండెను. అచటి మునులెల్లరును వృద్ధులు, జితేంద్రియులు, వారు నారచీరలను, జింకచర్మములను ధరించుచుందురు. కందమూలఫలములే వారిఆహారము. వారు సూర్యభగవానునివలెను, అగ్నిదేవునివలెను దివ్యతేజస్సులతో వెలసిల్లుచుందురు. (6-7)

పుణ్యైశ్చ నియతాహారైః శోభితం పరమర్షిభిః।
తద్బ్రహ్మభవనప్రఖ్యం బ్రహ్మఘోషనినాదితమ్।
బ్రహ్మవిద్భిర్మహాభాగైః బ్రాహ్మణైరుపశోభితమ్। 8

స దృష్ట్వా రాఘవః శ్రీమాన్ తాపసాశ్రమమండలమ్।
అభ్యగచ్ఛన్ మహాతేజా విజ్యం కృత్వా మహద్ధనుః। 9

దివ్యజ్ఞానోపపన్నాస్తే రామం దృష్ట్వా మహర్షయః।
అభ్యగచ్ఛం స్తథా ప్రీతా వైదేహీం చ యశస్వినీమ్। 10

తే తం సోమమివోద్యంతం దృష్ట్వా వై ధర్మచారిణః।
లక్ష్మణం చైవ దృష్ట్వా తు వైదేహీం చ యశస్వినీమ్।
మంగళాని ప్రయుంజానాః ప్రత్యగృహ్ణన్ దృఢవ్రతాః। 11

రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతామ్।
దదృశుర్విస్మితాకారా రామస్య వనవాసినః। 12

వైదేహీం లక్ష్మణం రామం నేత్రైరనిమిషైరివ।
ఆశ్చర్యభూతాన్ దదృశుః సర్వే తే వనచారిణః। 13

అత్రైనం హి మహాభాగాః సర్వభూతహితే రతమ్।
అతిథిం పర్ణశాలాయాం రాఘవం సన్న్యవేశయన్। 14

తతో రామస్య సత్కృత్య విధినా పావకోపమాః।
ఆజహ్రుస్తే మహాభాగాః సలిలం ధర్మచారిణః। 15

మూలం పుష్పం ఫలం వన్యమ్ ఆశ్రమం చ మహాత్మనః।
నివేదయిత్వా ధర్మజ్ఞాః తతః ప్రాంజలయోఽబ్రువన్। 16

ధర్మపాలో జనస్యాస్య శరణ్యస్త్వం మహాయశాః।
పూజనీయశ్చ మాన్యశ్చ రాజా దండధరో గురుః। 17

ఆ ఆశ్రమప్రదేశమునందలి మహర్షులందఱును నియమితాహారులు, పవిత్రజీవనులు. అచట యజ్ఞకార్యకలాపములు జరుగునప్పుడు చేసెడి వేదమంత్రపఠనములు మాఱుమ్రోగుచుండును. అందువలన అది బ్రహ్మలోకతుల్యముగా ఖ్యాతివహించెను. అందలి బ్రాహ్మణోత్తములు అందఱును సత్పురుషులు, బ్రహ్మజ్ఞానులు. మిగుల తేజోమూర్తియు, కల్యాణగుణసంపన్నుడును ఐన శ్రీరాముడు ఆతాపసాశ్రమముల సముదాయమును జూచి, అల్లెత్రాడును ధనుస్సునుండి వేఱుచేసెను. పిమ్మట వారు మునులను సమీపించిరి. (8-9)

భూతభవిష్యత్తులను దర్శింపగల ఆ మహర్షులు తమకడకు వచ్చుచున్న రామలక్ష్మణులను, మహాసాధ్వియగు సీతాదేవిని దర్శించి, మిగుల సంతసించి, వారికి ఎదురేగిరి. (10)

ధర్మనిరతులు, తపోవ్రతదీక్షలోనున్నవారు, త్రికాలజ్ఞులు ఐన ఆ మహర్షులు ఉదయించుచున్న చంద్రునివలె ఆహ్లాదకరుడైన [1]శ్రీరామచంద్రుని, లక్ష్మణుని, ఉత్తమురాలగు సీతాదేవిని దర్శించి, మంగళాశాసనములతో వారికి స్వాగతము పలికిరి. (11)

వనవాసులైన ఆ మునులు శ్రీరామునిశరీరసౌందర్యమును, సౌకుమార్యమును, లావణ్యవైభవమును ఆశ్చర్యచకితులై దర్శించిరి. (12)

ఆశ్చర్యమునుగొలుపునట్టి అద్భుతసౌందర్యమూర్తులైన ఆ సీతారామలక్ష్మణులను తాపసులు దేవతలవలె కనుఱెప్పలార్పక తదేకదృష్టితో జూచిరి. (13)

మహాత్ములైన ఆ మునులు సమస్తప్రాణులకును హితమును చేకూర్చునట్టి శ్రీరాముని ఆ ఆశ్రమ సముదాయమునందలి ఒక పర్ణశాలయందు అతిథి మర్యాదలతో నివసింపజేసిరి. (14)

ధర్మాచారపరాయణులు, అగ్నివలె తేజోమూర్తులు, మహాత్ములు ఐన ఆ మునీశ్వరులు విధ్యుక్తముగా అర్ఘ్యపాద్యాదులతో శ్రీరాముని సత్కరించిరి. (15)

పిమ్మట ధర్మజ్ఞులైన ఆ మునులు మహాత్ముడైన శ్రీరామునకు వనములలో లభించెడి కందమూల ఫలములను, పుష్పములను సమర్పించి, 'ఓ ప్రభూ! ఈ ఆశ్రమము మీదే' అని నివేదించుచు, అంజలి ఘటించి, ఇట్లు నుడివిరి. (16)

"స్వామీ! నీవు వర్ణాశ్రమాదిసమస్తధర్మములను పరిరక్షించువాడవు. ఆర్తులైన మునులందఱికిని శరణ్యుడవుగా ఖ్యాతికెక్కినవాడవు, ఎల్లరకును పూజ్యుడవు, మాన్యుడవు. నిగ్రహానుగ్రహసమర్థుడవు. ఓ రాఘవా! ఇంద్రాదిలోకపాలురలో చతుర్థాంశయే భూపతి. అందువలన అతడు ప్రజారక్షకుడై

1) ఉద్యంతం చంద్రమ్ ఇవ = ఉదయించుచున్న చంద్రునివలె ఆహ్లాదకరుడు, చంద్రుడు చీకట్లను తొలగించును. శ్రీరామచంద్రుడు రాక్షసులనెడి అంధకారమును రూపుమాపును. రాముడు విదియనాటి చంద్రునివలె (నెలబాలునివలె) పూజ్యుడు.

ఇంద్రస్యేహ చతుర్భాగః ప్రజా రక్షతి రాఘవ।
రాజా తస్మాద్వరాన్ భోగాన్ భుంక్తే లోకనమస్కృతః। 18

వారిచే పూజింపబడును, సకలభోగభాగ్యములను అనుభవించు చుండును. సామాన్యుడైన రాజువిషయమే ఇట్లున్నచో అవతారపురుషుడవైన నిన్నుగూర్చి ఇక చెప్పవలసినదేమి?(17-18)

తే వయం భవతా రక్ష్యా భవద్విషయవాసినః।
నగరస్థో వనస్థో వా త్వం నో రాజా జనేశ్వరః। 19

మేము అందరమును నీరాజ్యమున నివసించుచున్నవారము. కనుక మా అందఱిరక్షణభారము నీదే. నగరమునందున్నను, వనమునందున్నను నీవే మాకు ప్రభుడవు. (19)

న్యస్తదండా వయం రాజన్ జితక్రోధా జితేంద్రియాః।
రక్షితవ్యాస్త్వయా శశ్వత్ గర్భభూతాస్తపోధనాః। 20

ఓ రఘురామా! మేము శాపాయుధములను ప్రక్కన బెట్టితిమి. తపోవిధులకు శత్రువైన క్రోధమును పరిత్యజించితిమి. జితేంద్రియులము. తపస్సులే మాసంపదలు. కనుక గర్భస్థ శిశువును తల్లివలె అనుక్షణము మమ్ము నీవే కాపాడవలెను."(20)

ఏవముక్త్వా ఫలైర్మూలైః పుష్పైరన్యైశ్చ రాఘవమ్।
అన్యైశ్చ వివిధాహారైః సలక్ష్మణమపూజయన్। 21

ఇట్లు పలికిన పిమ్మట ఆ మునీశ్వరులు అచటివనములలో ప్రాప్తించెడి పుష్పములను, కందమూలఫలములను, వివిధములగు ఇతర-ఆహారపదార్థములను సమర్పించి, సీతారామలక్ష్మణులకు అతిథి మర్యాదలను నెఱపిరి. (21)

తథాఽన్యే తాపసాః సిద్ధా రామం వైశ్వానరోపమాః।
న్యాయవృత్తా యథాన్యాయం తర్పయామాసురీశ్వరమ్। 22

అగ్నివలె తేజస్సంపన్నులు, న్యాయప్రవర్తనులు ఐన తదితరమునులు, సిద్ధులు ఆ శ్రీరామచంద్ర ప్రభువును తమసేవలతో సంతుష్టుని గావించిరి. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ప్రథమస్సర్గః *(1)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది మొదటిసర్గము.

— * * * —

2. రెండవసర్గము

సీతారామలక్ష్మణులకు దారిలో విరాధుడను రాక్షసుడు తారసపడుట - అతడు సీతాదేవిని లాగికొనుట - శ్రీరాముడు పరితపించుట - లక్ష్మణుడు ధైర్యము చెప్పుట.

కృతాతిథ్యోఽథ రామస్తు సూర్యస్యోదయనం ప్రతి।
ఆమంత్ర్య స మునీన్ సర్వాన్ వనమేవాన్వగాహత। 1

మునీశ్వరులు, సిద్ధులు భక్తిపూర్వకముగా సమర్పించిన అతిథి సత్కారములను స్వీకరించిన పిమ్మట శ్రీరాముడు ఆ రాత్రి అచట గడిపి, సూర్యోదయసమయమున స్నానాదికములను ముగించుకొనెను. పిదప ఆ ప్రభువు మునీశ్వరులనందఱిని వీడ్కొని, సీతాలక్ష్మణులతోగూడి వనములలో ముందునకు సాగెను. (1)

నానామృగగణాకీర్ణం శార్దూలవృకసేవితమ్।
ధ్వస్తవృక్షలతాగుల్మం దదర్శ సలిలాశయమ్। 2

నిష్కూజనానాశకునిఝిల్లికాగణనాదితమ్ ।
లక్ష్మణానుగతో రామో వనమధ్యం దదర్శ హ। 3

ఆ వనమధ్యప్రదేశము అంతయును వివిధములగు మృగములగుంపులతో నిండియుండెను. అందు పెద్దపులులు, తోడేళ్ళు సంచరించుచుండెను. అచటి వృక్షములన్నియును ధ్వంసమైయుండెను. తీగలపొదలన్నియును పాడుబడి యుండెను. ఎచ్చటనూ సరస్సులే కన్పించకుండెను. ఆకాశమున ఎగురుచున్న పక్షులుసైతము కిక్కుకిక్కుమనుచు ఎట్టి శబ్దములనూ చేయకుండెను. కీచురాళ్ళరొదలుమాత్రము కర్ణకఠోరముగా వినబడుచుండెను. సీతారామలక్ష్మణులు అట్టి భయంకరప్రదేశమును చూచిరి. (2-3)

సీతయా సహ కాకుత్స్థః తస్మిన్ ఘోరమృగాయుతే।
దదర్శ గిరిశృంగాభం పురుషాదం మహాస్వనమ్। 4

గంభీరాక్షం మహావక్త్రం వికటం విషమోదరమ్।
బీభత్సం విషమం దీర్ఘం వికృతం ఘోరదర్శనమ్। 5

వసానం చర్మ వైయాఘ్రం వసార్ద్రం రుధిరోక్షితమ్।
త్రాసనం సర్వభూతానాం వ్యాదితాస్యమివాంతకమ్। 6

త్రీన్ సింహాన్ చతురో వ్యాఘ్రాన్ ద్వౌ వృకౌ పృషతాన్ దశ।
సవిషాణం వసాదిగ్ధం గజస్య చ శిరో మహత్।
అవసజ్యాఽఽయసే శూలే వినదంతం మహాస్వనమ్। 7

స రామం లక్ష్మణం చైవ సీతాం దృష్ట్వా చ మైథిలీమ్।
అభ్యధావత సంక్రుద్ధః ప్రజాః కాల ఇవాంతకః। 8

స కృత్వా భైరవం నాదం చాలయన్నివ మేదినీమ్।
అంకేనాదాయ వైదేహీమ్ అపక్రమ్య తతోఽబ్రవీత్। 9

యువాం జటాచీరధరౌ సభార్యౌ క్షీణజీవితౌ।
ప్రవిష్టౌ దండకారణ్యం శరచాపాసిధారిణౌ। 10

కథం తాపసయోర్వాం చ వాసః ప్రమదయా సహ।
అధర్మచారిణౌ పాపౌ కౌ యువాం మునిదూషకౌ। 11

అహం వనమిదం దుర్గం విరాధో నామ రాక్షసః।
చరామి సాయుధో నిత్యమ్ ఋషిమాంసాని భక్షయన్। 12

ఇయం నారీ వరారోహా మమ భార్యా భవిష్యతి।
యువయోః పాపయోశ్చాహం పాస్యామి రుధిరం మృధే। 13

తస్యైవం బ్రువతో ధృష్టం విరాధస్య దురాత్మనః। 14

శ్రుత్వా సగర్వితం వాక్యం సంభ్రాంతా జనకాఽఽత్మజా।
సీతా ప్రావేపతోద్వేగాత్ ప్రవాతే కదలీ యథా। 15

తాం దృష్ట్వా రాఘవః సీతాం విరాధాంకగతాం శుభామ్।
అబ్రవీల్లక్ష్మణం వాక్యం ముఖేన పరిశుష్యతా। 16

శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి భయంకరమృగములు సంచరించెడి ఆ వనమునందు పర్వతాకారుడైన ఒక రాక్షసుని జూచెను. అతనికంఠధ్వని భయంకరమైనది. అతడు లోతైన (గుంట) కన్నులతో మిగుల పెద్దదియగు నోటితో వికృతాకారముతో భయంకరముగానుండెను. అతనిపొట్ట ఎగుడు దిగుడుగానుండెను. మాంసఖండములతో, రక్తముతో అతనిశరీరము రోతపుట్టించుచుండెను. అవయవములన్నియును హెచ్చుతగ్గులుగానుండెను. మిక్కిలి పొడవైన అతనిశరీరము వికృతముగానుండి భయమును గొల్పుచుండెను. అతడు పులితోలు కప్పుకొనియుండెను. ఆ పులితోలు మాంసయుతమై నెత్తురోడుచుండెను. అతడు మృత్యుదేవతవలె నోరు తెఱచి సకలప్రాణులకును భీతిగొల్పుచుండెను. మూడు సింహములను, నాలుగు పులులను, రెండు తోడేళ్ళను, పది చుక్కలలేళ్ళను, దంతములు గలిగి, క్రొవ్వుతో గూడియున్న ఒక పెద్దఏనుగు తలను ఇనుపశూలమునకు గ్రుచ్చుకొని, అతడు భయంకరముగా అఱచుచుండెను. (4-7)

ఆ రాక్షసుడు రామలక్ష్మణులను, జనకునికూతురగు సీతాదేవిని చూచి క్రుద్ధుడై, ప్రళయకాలమునందు మృత్యుదేవత ప్రాణులపైవలె వారిపై విఱుచుకొనిపడెను. వాని వేగమునకు భూమి దద్దరిల్లెను. అతడు భీకరనాదములను చేయుచు సీతాదేవినడుమును పట్టుకొని, కొంతదూరము వెళ్ళి, అచటి నిలిచి, వారితో ఇట్లనెను. (8-9)

"ఓ పాపాత్ములారా! మీరు మునులవలె జటావల్కములను దాల్చియు, ధనుర్బాణములను, ఖడ్గములను ధరించియున్నారు. పైగా ఒకస్త్రీని వెంటనిడకొనియున్నారు. ఆయువుమూడియే మీరు ఈ దండకారణ్యమున ప్రవేశించినట్లున్నారు. మీరు తాపసులుగానుండియు ఒక స్త్రీతో నివసించుచున్నారేల? మీ అధర్మప్రవర్తన మునులపద్ధతికి విరుద్ధముగాదా? ఇంతకును మీరెవరు? (10-11)

నేను విరాధుడను రాక్షసుడను. నిత్యము మునుల మాంసములను భక్షించుచు ఈ కీకారణ్యమున సాయుధుడనై సంచరించుచుందును. ఈ సుందరి నాకు భార్యకాగలదు. పాపాత్ములైన మిమ్ములను యుద్ధమున చంపి మీరక్తమును త్రాగెదను." (12-13)

దుర్మార్గుడైన ఆ విరాధుడు ఈ విధముగా పలుకుచుండగా అతనిఉన్మత్తప్రేలాపనలను విని, జనకుని కూతురైన సీతాదేవి భయముతో సుడిగాలికి దెబ్బతినిన అరటిచెట్టువలె మిగుల వణకిపోయెను. (14-15)

అంతట శ్రీరాముడు విరాధునిచేతికి చిక్కియున్న సుకుమారియైన ఆ సీతాదేవిని జూచి, చిన్నబోయిన ముఖముగలవాడై లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (16)

పశ్య సౌమ్య! నరేంద్రస్య జనకస్యాఽఽత్మసంభవామ్।
మమ భార్యాం శుభాచారాం విరాధాంకే ప్రవేశితామ్।
అత్యంతసుఖసంవృద్ధాం రాజపుత్రీం యశస్వినీమ్। 17

యదభిప్రేతమస్మాసు ప్రియం వరవృతం చ యత్।
కైకేయ్యాస్తు సుసంపన్నం క్షిప్రమద్యైవ లక్ష్మణ!। 18

యా న తుష్యతి రాజ్యేన పుత్రార్థే దీర్ఘదర్శినీ। 19

యయాఽహం సర్వభూతానాం హితః ప్రస్థాపితో వనమ్।
అద్యేదానీం సకామా సా యా మాతా మమ మధ్యమా। 20

పరస్పర్శాత్తు వైదేహ్యా న దుఃఖతరమస్తి మే।
పితుర్వియోగాత్ సౌమిత్రే! స్వరాజ్యహరణాత్ తథా। 21

ఇతి బ్రువతి కాకుత్స్థే బాష్పశోకపరిప్లుతే।
అబ్రవీల్లక్ష్మణః క్రుద్ధో రుద్ధో నాగ ఇవ శ్వసన్। 22

అనాథ ఇవ భూతానాం నాథస్త్వం వాసవోపమః।
మయా ప్రేష్యేణ కాకుత్స్థ! కిమర్థం పరితప్యసే। 23

శరేణ నిహతస్యాద్య మయా క్రుద్ధేన రక్షసః।
విరాధస్య గతాసోర్హి మహీ పాస్యతి శోణితమ్। 24

రాజ్యకామే మమ క్రోధో భరతే యో బభూవ హ।
తం విరాధే ప్రమోక్ష్యామి వజ్రీ వజ్రమివాచలే। 25

మమ భుజబలవేగవేగితః
పతతు శరోఽస్య మహాన్ మహోరసి ।
వ్యపనయతు తనోశ్చ జీవితం
పతతు తతస్తు మహీం విఘూర్ణితః । 26

"నాయనా! లక్ష్మణా! జనకమహారాజకూతురూ, నాభార్యయు ఐన సీతాదేవి మిగుల ఉత్తమురాలు. ఆమె వాసిగాంచిన రాకుమారి. సుఖసంపదలలో పుట్టిపెఱిగినది. అయ్యో! అట్టి సాధ్వి విరాధునిచేతికి చిక్కియున్నది సుమా! (17)

లక్ష్మణా! మనము అడవులలో ఇడుములపాలగుటయే నాపినతల్లియైన కైకేయికి ఇష్టమైయుండవచ్చును. అందువలననే ఆమె వరముసాకుతో నావనవాసమును కోరినది. తనకుమారునకు రాజ్యమును కట్టబెట్టుటతోమాత్రమే తృప్తిచెందక దూరదృష్టి గల ఆమె (తనసుతునిరాజ్యాధికారము నిష్కంటకముచేయుటకై) సకలప్రాణులకును హితమునే గూర్చునట్టి నన్ను అడవులపాలు చేసినది. ఇప్పుడామెకోరిక నిజముగా నెఱవేఱినట్లైనది. (18-20)

ఓ సౌమిత్రీ! నాకు రాజ్యాధికారము చేతికి రానందులకు దుఃఖములేదు. పితృవియోగముమాత్రము నా మనస్సును కుదిపివేసినది. కాని అంతకంటెను వైదేహి పరునిస్పర్శకు లోనగుట నాకు మిక్కిలి బాధాకరముగా ఉన్నది. ఇది యథార్థము." (21)

పెనుశోకముతో కన్నీరుగార్చుచు శ్రీరాముడు ఇట్లు పలుకుచుండగా లక్ష్మణుడు క్రుద్ధుడై మంత్రబద్ధమైన సర్పమువలె బుసలుకొట్టుచు ఇటుల నుడివెను. (22)

"అన్నయ్యా! దేవేంద్రునివలె నీవు మిక్కిలి పరాక్రమశాలివి. సమస్తప్రాణులకును నీవు నాథుడవు (రక్షకుడవు). నీ సేవకుడనైన నేను నీప్రక్కన ఉండగా ఒక అనాథునివలె నీవు ఇట్లు పరితపించుట ఎందులకు? ఆ రాక్షసుడు చేసినపనికి నామనస్సు ఉడికిపోవుచున్నది. ఒకేఒక్క బాణముతో నేను ఆ విరాధునిప్రాణములను తీసెదను. అతనిరక్తముతో భూమి తనదాహమును తీర్చుకొనును. (23-24)

భరతుడు రాజ్యకాంక్షతో వచ్చుచున్నాడని భ్రమించి, లోగడ చిత్రకూటమున నేనతనిపై అజ్ఞానముచే క్రోధమువూనితిని. కాని ఇంద్రుడు పర్వతముపై వజ్రాయుధమును ప్రయోగించినట్లు, నేను ఆ క్రోధావేశమును ఇప్పుడు ఈ దుష్టవిరాధునిపై క్రుమ్మరించెదను. (25)

శ్రీరామా! నేను భుజబలముతో ధనుస్సును సంధించివిడిచిన బాణము క్షణములో ఈ దుష్టునిహృదయమును చీల్చును. దానితో ఇతనిశరీరమునుండి ప్రాణములు ఎగిరిపోవును. ఫలితముగా ఇతడు (ఇతని శరీరము) గిరగిర తిరుగుచు నేలకొరుగును. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ద్వితీయస్సర్గః *(2)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది రెండవసర్గము.

-- * * * --

3. మూడవసర్గము

శ్రీరామునకును విరాధునకును మధ్య వాగ్వివాదములు - రామలక్ష్మణులు విరాధునిపై దెబ్బతీయుట - ఆ రాక్షసుడు వారిని తన భుజములపై మోసికొనిపోవుట.

ఇత్యుక్త్వా లక్ష్మణః శ్రీమాన్ రాక్షసం ప్రహసన్నివ।
కో భవాన్ వనమభ్యేత్య చరిష్యతి యథాసుఖమ్। 1

అథోవాచ పునర్వాక్యం విరాధః పూరయన్ వనమ్।
ఆత్మానం పృచ్ఛతే బ్రూతం కౌ యువాం క్వ గమిష్యథః। 2

త మువాచ తతో రామో రాక్షసం జ్వలితాననమ్।
పృచ్ఛంతం సుమహాతేజా ఇక్ష్వాకుకులమాత్మనః। 3

క్షత్రియౌ వృత్తసంపన్నౌ విద్ధి నౌ వనగోచరౌ।
త్వాం తు వేదితుమిచ్ఛావః కస్త్వం చరసి దండకాన్। 4

తమువాచ విరాధస్తు రామం సత్యపరాక్రమమ్।
హంత వక్ష్యామి తే రాజన్ నిబోధ మమ రాఘవ। 5

పుత్రః కిల జయస్యాహం మమ మాతా శతహ్రదా।
విరాధ ఇతి మామాహుః పృథివ్యాం సర్వరాక్షసాః। 6

తపసా చాపి మే ప్రాప్తా బ్రహ్మణో హి ప్రసాదజా।
శస్త్రేణావధ్యతా లోకేఽచ్ఛేద్యాభేద్యత్వమేవ చ। 7

ఉత్సృజ్య ప్రమదామేనామ్ అనపేక్షౌ యథాగతమ్।
త్వరమాణౌ పలాయేథాం న వాం జీవితమాదదే। 8

తం రామః ప్రత్యువాచేదం కోపసంరక్తలోచనః।
రాక్షసం వికృతాకారం విరాధం పాపచేతసమ్। 9

క్షుద్ర! ధిక్ త్వాం తు హీనార్థం మృత్యుమన్వేషసే ధ్రువమ్।
రణే సంప్రాప్స్యసే తిష్ఠ న మే జీవన్ గమిష్యసి। 10

శుభలక్షణసంపన్నుడైన లక్ష్మణుడు అన్నతో ఇట్లు పలికినపిమ్మట దరహాసము చేయుచు ఆ రాక్షసునితో 'నీవు ఎవరు? ఈ వనమునజేరి ఏల సంచరించుచుంటివి?' అని ప్రశ్నించెను. (1)

పిమ్మట ఆ విరాధుడు వనము ప్రతిధ్వనించునట్లుగా మరల ఇట్లు నుడివెను. "ఓరీ! ఇంతకును నన్ను ప్రశ్నించుచున్న మీరు ఎవరు? ఎక్కడికి వెళ్లుచున్నారు.?" (2)

భయంకరమైన ముఖముగల ఆ రాక్షసుడు ఇట్లు ప్రశ్నింపగా మిగుల పరాక్రమశాలియైన ఆ రఘురాముడు తమిక్ష్వాకువంశమునుగూర్చి అతనికి తెల్పెను. (3)

'మేము క్షత్రియులము. సచ్చరిత్రగలవారము. వనములలో సంచరించుచుంటిమి. ఈ దండకారణ్యములలో వసించుచున్న నిన్నుగూర్చి తెలిసికొన గోరుచున్నాము." (4)

అప్పుడు విరాధుడు సత్యపరాక్రముడైన శ్రీరామునితో ఇట్లనెను. " ఓ రాజా! రాఘవా! నాస్వరూపమును గూర్చి తెల్పెదను వినుము. (5)

నేను 'జయుడు' అను రాక్షసుని కుమారుడను. మాతల్లి శతహ్రద. ఈ భూతలమున రాక్షసులందఱును నన్ను 'విరాధుడు' అని పిలుతురు. (6)

నాతపస్సునకు మెచ్చి బ్రహ్మదేవుడు నాకు వరమును ప్రసాదించెను. దానిప్రభావమున శస్త్రములు ఏవియును నన్ను చంపజాలవు. నాశరీరమును ఎవ్వరును ఛేదింపజాలరు, భేదింపలేరు. (7)

మీరు ఇరువురును ఈ తరుణిని ఇచ్చటనే విడిచివెళ్లుడు. ఈమెను ఆసించినచో మీరు అసువులతో మిగులరు. ఈ నారీమణి నాకు దక్కుటవలన నేను మీ ప్రాణములను తీయను. నామనసు మారకముందే మీరు వచ్చినదారిబట్టి, పిక్కబలము చూపుడు". (8)

ఆ విరాధునిమాటలకు శ్రీరాముడు కుపితుడై, కన్నులెఱ్ఱజేసి, పాపాత్ముడును, వికృతమైన ఆకారము కలవాడును అగు ఆ విరాధునితో ఇట్లు నుడివెను. "ఛీ! క్షుద్రుడా! ఒక సద్వంశస్త్రీని కోరుకొనుట నీ హీన లక్షణమునకు నిదర్శనము. దీనినిబట్టి నిజముగా నీచావును నీవే కోరుకొనుచున్నావు. క్షణమాగుము. యుద్ధమున నా చేతిలో నీకు చావు తప్పదు. ఇక నానుండి నీవు ప్రాణములతో తప్పించుకొని పోలేవు." (9-10)

తతః సజ్యం ధనుః కృత్వా రామః సునిశితాన్ శరాన్।
సుశీఘ్రమభిసంధాయ రాక్షసం నిజఘాన హ। 11

ధనుషా జ్యాగుణవతా సప్త బాణాన్ ముమోచ హ।
రుక్మపుంఖాన్ మహావేగాన్ సుపర్ణానిలతుల్యగాన్। 12

తే శరీరం విరాధస్య భిత్త్వా బర్హిణవాససః।
నిపేతుః శోణితా దిగ్ధా ధరణ్యాం పావకోపమాః। 13

అంతట శ్రీరాముడు ధనుస్సును ఎక్కుపెట్టి, నిశితమైన బాణములను ఆ రాక్షసునిపై (విరాధునిపై) ప్రయోగించెను. ఇంకను బంగారుపుపిడులుగల ఏడుబాణములను ధనుస్సున సంధించి వదిలెను. అవి గరుత్మంతునివలె, వాయువువలె మహావేగముతో సాగిపోయెను. అగ్నితుల్యములైన ఆ బాణములు నెమలిఈకలను చుట్టుకొనియున్న ఆ విరాధునిశరీరమును చీల్చుకొని రక్తసిక్తములై నేలపై పడిపోయినవి. (11-13)

స విద్ధో న్యస్య వైదేహీం శూలముద్యమ్య రాక్షసః।
అభ్యద్రవత్ సుసంక్రుద్ధః తదా రామం సలక్ష్మణమ్। 14

స వినద్య మహానాదం శూలం శక్రధ్వజోపమమ్।
ప్రగృహ్యాశోభత తదా వ్యాత్తానన ఇవాంతకః। 15

అంతట రామునిబాణములచే కొట్టబడిన ఆ రాక్షసుడు సీతాదేవిని అచటనే ఉంచి, కోపావేశముతో ఊగిపోవుచు రామలక్ష్మణులమీద విజృంభించి దూకెను. అప్పుడు ఆ విరాధుడు దిక్కులు పిక్కటిల్లునట్లు మహానాదమొనర్చుచు వజ్రాయుధమువలె మహోన్నతమైన శూలమును చేతబట్టి, మృత్యుదేవతవలె నోరు తెరుచుకొని భయంకరముగా ఒప్పుచుండెను. (14-15)

అథ తౌ భ్రాతరౌ దీప్తం శరవర్షం వవర్షతుః।
విరాధే రాక్షసే తస్మిన్ కాలాంతకయమోపమే। 16

స ప్రహస్య మహారౌద్రః స్థిత్వాఽజృంభత రాక్షసః।
జృంభమాణస్య తే బాణాః కాయాన్నిష్పేతురాశుగాః। 17

అప్పుడు రామలక్ష్మణులు ప్రళయకాలమునందలి మృత్యుదేవతవలెనున్న, రాక్షసుడగు ఆ విరాధునిపై నిప్పులుగ్రక్కుచున్న బాణములను వర్షించిరి. అంతట భయంకరాకారుడైన ఆ రాక్షసుడు వికటాట్టహాసము చేసి, ఆవులించుచు ఒళ్ళువిరుచుకొని అచట ఉండిపోయెను. అతడట్లు చేయుగా ఆ సోదరులు వేసిన వేగముగల బాణములు అతనిశరీరమునుండి నేలపై రాలెను. (16-17)

స్పర్శాత్తు వరదానేన ప్రాణాన్ సంరోధ్య రాక్షసః।
విరాధః శూలముద్యమ్య రాఘవావభ్యధావత। 18

ఆ బాణములు తగిలినను వరదానప్రభావముచే రాక్షసుడైన ఆ విరాధుడు తనప్రాణములను నిలుపుకొని, శూలమును చేతబట్టి వారిపై విజృంభించెను. (18)

తచ్ఛూలం వజ్రసంకాశం గగనే జ్వలనోపమమ్।
ద్వాభ్యాం శరాభ్యాం చిచ్ఛేద రామః శస్త్రభృతాం వరః। 19

వజ్రాయుధముతో సమానమై, ఆకాశమున నిప్పులు గ్రక్కుచున్న ఆ శూలమును ధనుర్ధారులలో మేటియైన శ్రీరాముడు రెండుబాణములతో ముక్కలుముక్కలు గావించెను. (19)

తద్రామవిశిఖచ్ఛిన్నం శూలం తస్య కరాద్భువి।
పపాతాఽశనినా ఛిన్నం మేరోరివ శిలాతలమ్। 20

ఆ రామునిబాణములచే తుత్తునియలైన ఆ శూలము విరాధునిచేతినుండి వజ్రాయుధముచే ఛేదింపబడిన మేరుపర్వతముయొక్క శిలాఖండమువలె నేలపై బడెను. (20)

తౌ ఖడ్గౌ క్షిప్రముద్యమ్య కృష్ణసర్పోపమౌ శుభౌ।
తూర్ణమాపేతతుస్తస్య తదా ప్రహరతాం బలాత్। 21

పిమ్మట రామలక్ష్మణులు నల్లత్రాచులవలె భయంకరమై పదునైన ఖడ్గములను పైకెత్తి వేగముగా వానిపై లంఘించి, బలముకొలది కొట్టిరి. (21)

స వధ్యమానః సుభృశం బాహుభ్యాం పరిరభ్య తౌ।
అప్రకంప్యౌ నరవ్యాఘ్రౌ రౌద్రః ప్రస్థాతుమైచ్ఛత। 22

బలమైన ఖడ్గప్రహారములకు గురియగుచున్న ఆ విరాధుడు క్రుద్ధుడై, నిర్భయముగా ఆ నరశ్రేష్ఠు (రామలక్ష్మణు)లను తనబాహువులతో బంధించి, తీసికొనిపోవుటకు సిద్ధపడెను. (22)

తస్యాభిప్రాయమాజ్ఞాయ రామో లక్ష్మణమబ్రవీత్।
వహత్వయమ్ అలం తావత్ పథాఽనేన తు రాక్షసః। 23

శ్రీరాముడు ఆ రాక్షసునిఅభిప్రాయమును గమనించి, లక్ష్మణునితో ఇట్లు నుడివెను. "ఓ సౌమిత్రీ ఈ రాక్షసుడు

యథా చేచ్ఛతి సౌమిత్రే! తథా వహతు రాక్షసః।
అయమేవ హి నః పంథా యేన యాతి నిశాచరః। 24

ఈ మార్గముననే మనలను చక్కగా మోసికొనిపోయిన పోనిమ్ము. ఏలనన అతడు వెళ్లెడు మార్గముననే మనమును వెళ్లవలసియున్నది. కనుక అతడు మనలను తనయిష్టానుసారము తీసికొని పోనిమ్ము." (23-24)

న తు స్వబలవీర్యేణ సముత్క్షిప్య నిశాచరః।
బాలావివ స్కంధగతౌ చకారాతిబలౌ తతః। 25

అనంతరము ఉద్దండుడైన ఆ రాక్షసుడు (విరాధుడు) తనబలపరాక్రములచే మిగులబలశాలురైన ఆ రామలక్ష్మణులను బాలురనువలె తనభుజములపై కూర్చుండ బెట్టుకొనెను. (25)

తావారోప్య తతః స్కంధం రాఘవౌ రజనీచరః।
విరాధో వినదన్ ఘోరం జగామాభిముఖో వనమ్। 26

వనం మహామేఘనిభం ప్రవిష్టో
ద్రుమైర్మహద్భిర్వివిధైరుపేతమ్ ।
నానావిధైః పక్షికులైర్విచిత్రం
శివాయుతం వ్యాళమృగైర్వికీర్ణమ్ । 27

అంతట రాక్షసుడైన ఆ విరాధుడు రామలక్ష్మణులను తనభుజములపై చేర్చుకొని ఘోరముగా గర్జించుచు అడవివైపునకు బయలుదేరెను. పిమ్మట ఆ రాక్షసుడు రామలక్ష్మణులను మోసికొనుచు మేఘములవలె దట్టమైన ఒక వనమున ప్రవేశించెను. ఆ అరణ్యము నానావిధములైన మహావృక్షములతో నిండియుండెను. అది వివిధములైన పక్షులగుంపులతో చిత్రవిచిత్రముగానుండెను. ఇంకను అది నక్కలతోడను పెద్దపులులు మొదలగు దుష్టమృగములతోను వ్యాప్తమైయుండెను. (26-27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే తృతీయస్సర్గః (3)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది మూడవసర్గము.

-- * * * --

4. నాల్గవసర్గము

రామలక్ష్మణులు విరాధునివధించి, అతనికి శాపవిముక్తిని కల్గించుట.

హ్రియమాణౌ తు తౌ దృష్ట్వా వైదేహీ రామలక్ష్మణౌ।
ఉచ్చైః స్వరేణ చుక్రోశ ప్రగృహ్య సుభుజా భుజౌ। 1

విరాధుడు ఆ రామలక్ష్మణులను తీసికొని పోవుచుండగా చూచి, చక్కని భుజసౌందర్యము గల వైదేహి వ్యాకులపాటునకు లోనై తనరెండుభుజములను పైకెత్తి, బిగ్గరగా గగ్గోలుపెట్టెను. (1)

ఏష దాశరథీ రామః సత్యవాన్ శీలవాన్ శుచిః।
రక్షసా రౌద్రరూపేణ హ్రియతే సహలక్ష్మణః। 2

సత్యసంధుడు, ఉత్తమశీలసంపదగలవాడు, పవిత్రుడు ఐన ఈ నా దశరథరాముని లక్ష్మణునితో సహా ఈ భయంకర రాక్షసుడు (విరాధుడు) అయ్యో! అపహరించుకొని పోవుచున్నాడు. (2)

మాం వృకా భక్షయిష్యంతి శార్దూలా ద్వీపినస్తథా।
మాం హరోత్సృజ్య కాకుత్స్థౌ నమస్తే రాక్షసోత్తమ। 3

"ఓ మహారాక్షసుడా! ఇక్కడఉన్న నన్ను తోడేళ్లుగాని, పెద్దపులులుగాని, అట్లే చిఱుతపులులుగాని తినివేయగలవు. కావున కకుత్స్థవంశజులైన రామలక్ష్మణులను విడిచిపెట్టి నన్ను తీసికొనిపొమ్ము. నీకు పుణ్యముండును. నీకొకనమస్కారము."(3)

తస్యాస్తద్వచనం శ్రుత్వా వైదేహ్యా రామలక్ష్మణౌ।
వేగం ప్రచక్రతుర్వీరౌ వధే తస్య దురాత్మనః। 4

అప్పుడు మహావీరులైన రామలక్ష్మణులు ఆ సీతాదేవియొక్క ఆక్రందనవచనములను విని, దుర్మార్గుడైన ఆ విరాధుని వధించుటకై త్వరపడసాగిరి. వెంటనే లక్ష్మణుడు భయంకరముగా

తస్య రౌద్రస్య సౌమిత్రిః సవ్యబాహుం బభంజ హ।
రామస్తు దక్షిణం బాహుం తరసా తస్య రక్షసః। 5

స భగ్నబాహుః సంవిగ్నో నిపపాతాఽఽశు రాక్షసః।
ధరణ్యాం మేఘసంకాశో వజ్రభిన్న ఇవాచలః। 6

ముష్టిభిర్జానుభిః పద్భిః సూదయంతౌ తు రాక్షసమ్।
ఉద్యమ్యోద్యమ్య చాప్యేనం స్థండిలే నిష్పిపేషతుః। 7

స విద్ధో బహుభిర్బాణైః ఖడ్గాభ్యాం చ పరిక్షతః।
నిష్పిష్టో బహుధా భూమౌ న మమార స రాక్షసః। 8

తం ప్రేక్ష్య రామః సుభృశమ్ అవధ్యమ్ అచలోపమమ్।
భయేష్వభయదః శ్రీమాన్ ఇదం వచనమబ్రవీత్। 9

తపసా పురుషవ్యాఘ్ర! రాక్షసోఽయం న శక్యతే।
శస్త్రేణ యుధి నిర్జేతుం రాక్షసం నిఖనావహే। 10

శ్రుత్వా రాఘవేణోక్తం రాక్షసః ప్రశ్రితం వచః।
ఇదం ప్రోవాచ కాకుత్స్థం విరాధః పురుషర్షభమ్। 11

హతోఽస్మి పురుషవ్యాఘ్ర! శక్రతుల్యబలేన వై।
మయా తు పూర్వం త్వం మోహాత్ న జ్ఞాతః పురుషర్షభః। 12

కౌసల్యాసుప్రజా రామ! తాత! త్వం విదితో మయా।
వైదేహీ చ మహాభాగా లక్ష్మణశ్చ మహాయశాః। 13

అభి శాపాదహం ఘోరాం ప్రవిష్టో రాక్షసీం తనుమ్।
తుంబురుర్నామ గంధర్వః శప్తో వైశ్రవణేన హ। 14

ప్రసాద్యమానశ్చ మయా సోఽబ్రవీన్మాం మహాయశాః।
యదా దాశరథీ రామః త్వాం వధిష్యతి సంయుగే।
తదా ప్రకృతిమాపన్నో భవాన్ స్వర్గం గమిష్యతి। 15

ఇతి వైశ్రవణో రాజా రంభాసక్తం పురాఽనఘ!।
అనుపస్థీయమానో మాం సంక్రుద్ధో వ్యాజహార హ। 16

సున్న ఆ విరాధునియొక్క ఎడమచేతిని ఖండించివేసెను. ఇంతలో శ్రీరాముడు తనపరాక్రమముచే ఆ రాక్షసుని కుడిభుజమును క్షణములో ఛేదించెను. (4-5)

రామలక్ష్మణులు తనచేతులను నరికివేయగా మేఘసమానుడైన ఆ విరాధుడు (రాక్షసుడు) మిగుల భీతిల్లి, ఇంద్రుని వజ్రాయుధముచే నఱుకబడిన పర్వతమువలె నేలపై పడిపోయెను. ఇంకను వారు ఆ రాక్షసుని పిడికిళ్లతో, మోకాళ్లతో పొడిచిపొడిచి, కాళ్ళతో తన్ని తన్ని, భూతలమున పిండిపిండిగావించిరి. (6-7)

రామలక్ష్మణులు ఆ విరాధుని ఎన్నిబాణములతో కొట్టినను, ఎంతగా ఖడ్గములతో గాయపఱచినను, చేతులను ఖండించి, క్రిందపడవేసి ముష్టిఘాతాదులతో నుగ్గునుగ్గుగావించినను ఆ రాక్షసుడు మాత్రము చావలేదు. (8)

సర్వశక్తిమంతుడును, ఆపదలలో ఆదుకొనువాడును, ఐన శ్రీరాముడు పర్వతమువలె మహాకాయుడగు ఆ రాక్షసుడు ఎంతకును చావకుండుటచే అతనిని పదే పదే చూచి, లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (9)

"ఓ పురుషశ్రేష్ఠా! లక్ష్మణా! ఈ విరాధుడు తపస్సానర్చి వరములను పొందియున్నాడు. అందువలన యుద్ధమునందు శస్త్రములతో వీనిని జయించుట అసాధ్యము. కనుక ఈ రాక్షసుని భూమిలో పాతిపెట్టుదము". (10)

శ్రీరాముడు నుడివిన మాటలను విని, ఆ రాక్షసుడు (విరాధుడు) పురుషశ్రేష్ఠుడైన శ్రీరామునితో ఇట్లు వినమ్ర వచనములను పల్కెను. "ఓ మహాపురుషా! ఇంద్రుని యంతటి బలశాలివైన నీ దెబ్బకు చచ్చితిని. నా మోహావేశమున ఇంతవఱకును నేను నిన్ను గుర్తింపనైతిని. (11-12)

నాయనా! నీవు కౌసల్యాదేవియొక్క నోములపంటవైన శ్రీరాముడవని ఇప్పుడెఱింగితిని. ఈమె మహాసాధ్వియైన వైదేహి యనియు, ఇతడు వాసికెక్కిన లక్ష్మణస్వామి యనియు నేను తెలిసికొంటిని. నేను 'తుంబురుడు' అను గంధర్వుడను. కుబేరునిచే శాపమునకు గుఱియైతిని, తత్ప్రభావమున నేను ఘోరమైన ఈ రాక్షసరూపమును పొందితిని. (13-14)

అప్పుడు నేను పశ్చాత్తాపపడి, ఆయనను పరిపరివిధముల వేడుకొంటిని. అంతట కుబేరుడు ప్రసన్నుడై ఇట్లు పలికెను. 'మహాయశస్వియైన దశరథునిపుత్త్రుడగు శ్రీరాముడు యుద్ధమున నిన్ను వధింపగలడు. అప్పుడు నీవు స్వస్వరూపమును (తుంబుర రూపమును) పొంది స్వర్గమును చేరగలవు' అని- (15)

ఓ మహాత్మా! పూర్వము ఒకనాడు నేను రంభయను అప్సరసయెడ ఆసక్తిగలవాడనై సమయమునకు అనువుగా కుబేరునిసేవలలో పాల్గొనకుంటిని. అందులకు క్రుద్ధుడై అతడు నన్ను పైవిధముగా శపించెను. నావినతిపై శాపవిముక్తి రీతినిగూడ తెల్పెను. (16)

తవ ప్రసాదాన్ముక్తోఽహమ్ అభిశాపాత్ సుదారుణాత్।
భువనం స్వం గమిష్యామి స్వస్తి వోఽస్తు పరంతప!। 17

ఇతో వసతి ధర్మాత్మా శరభంగః ప్రతాపవాన్। 18

అధ్యర్ధయోజనే తాత! మహర్షిః సూర్యసన్నిభః।
తం క్షిప్రమభిగచ్ఛ త్వం స తే శ్రేయో విధాస్యతి। 19

అవటే చాపి మాం రామ ప్రక్షిప్య కుశలీ వ్రజ।
రక్షసాం గతసత్త్వానామ్ ఏష ధర్మః సనాతనః।
అవటే యే నిధీయంతే తేషాం లోకాః సనాతనాః। 20

ఏవముక్త్వా తు కాకుత్స్థం విరాధః శరపీడితః।
బభూవ స్వర్గసంప్రాప్తో న్యస్తదేహో మహాబలః। 21

తచ్ఛ్రుత్వా రాఘవో వాక్యం లక్ష్మణం వ్యాదిదేశ హ। 22

కుంజరస్యేవ రౌద్రస్య రాక్షసస్యాస్య లక్ష్మణ!।
వనేఽస్మిన్ సుమహాన్ శ్వభ్రం ఖన్యతాం రౌద్రకర్మణః। 23

ఇత్యుక్త్వా లక్ష్మణం రామః ప్రదరః ఖన్యతామితి।
తస్థౌ విరాధమాక్రమ్య కంఠే పాదేన వీర్యవాన్। 24

తతః ఖనిత్రమాదాయ లక్ష్మణః శ్వభ్రముత్తమమ్।
అఖనత్ పార్శ్వతస్తస్య విరాధస్య మహాత్మనః। 25

తం ముక్తకంఠం నిష్పిష్య శంకుకర్ణం మహాస్వనమ్।
విరాధం ప్రాక్షిపచ్ఛ్వభ్రే నదంతం భైరవస్వనమ్। 26

తమాహవే నిర్జితమాశు విక్రమౌ
స్థిరావుభౌ సంయతి రామలక్ష్మణౌ ।
ముదాన్వితౌ చిక్షిపతుర్భయావహం
నదంతముత్క్షిప్య బిలే తు రాక్షసమ్ । 27

అవధ్యతాం ప్రేక్ష్య మహాసురస్య తౌ
శితేన శస్త్రేణ తదా నరర్షభౌ ।
సమర్థ్య చాత్యర్థవిశారదావుభౌ
బిలే విరాధస్య వధం ప్రచక్రతుః । 28

స్వయం విరాధేన హి మృత్యురాత్మనః
ప్రసహ్య రామేణ వధార్థమీప్సితః ।
నివేదితః కాననచారిణా స్వయం
న మే వధః శస్త్రకృతో భవేదితి । 29

స్వామీ! నీఅనుగ్రహమువలన భయంకరమైన ఆ శాపమునుండి నేను విముక్తుడనైతిని. ఇక నాలోకమునకు నేను వెళ్లెదను. మీకు శుభమగుగాక. (17)

మహాతపస్వియు, మిక్కిలి ధర్మాత్ముడును ఐన శరభంగమహర్షి ఈ సమీపముననే వసించుచున్నాడు. ఓ ప్రభూ! సూర్యునివలె తేజశ్శాలియైన ఆ మహాత్ముని ఆశ్రమము ఇచటికి ఒకటిన్నరయోజనముల దూరమున గలదు. వెంటనే ఆయనను దర్శింపుము. ఆ ముని మీకు మేలుచేయుగలడు. (18-19)

ఓ రామా! నన్ను ఈ గుంతలో పూడ్చిపెట్టి నీవు హాయిగా వెళ్లుము. మరణించిన రాక్షసులను ఇట్లు సమాధి చేయుటయే పరంపరగా వచ్చుచున్న పద్ధతి. ఈ విధముగా భూమిలో పూడ్చిపెట్టబడినవారు పుణ్యలోకములకు చేరుదురు." (20)

మిగుల బలశాలియైన విరాధుడు శ్రీరామునితో ఇట్లు నుడివి, బాణములవలన కలిగిన బాధకు తట్టుకొనలేక విలవిలలాడుచు దేహమును వీడి స్వర్గస్థుడాయెను. (21)

అవసానదశలో విరాధుడు పలికిన మాటలను విని, శ్రీరాముడు లక్ష్మణుని ఇట్లు ఆదేశించెను. 'ఏనుగువలె భయంకరాకారము గలిగి క్రూరకర్మలను చేయుచుండెడి ఈ రాక్షసుని పాతిపెట్టుటకై ఈ వనమునందు ఒక పెద్దగోతిని తీయుము.' గొయ్యిని త్రవ్వెడు బాధ్యతను లక్ష్మణునకు అప్పగించిన పిమ్మట పరాక్రమశాలియైన శ్రీరాముడు ఆ విరాధుని (శరీరము) కడకేగి, వాని కంఠముపై తనపాదముతో త్రొక్కెను. (22-24)

పిమ్మట లక్ష్మణుడు పలుగును తీసికొని, ఆ విరాధుని మహాకాయముప్రక్కన ఒక పెద్దగోతిని త్రవ్వెను. (25)

శ్రీరాముడు ఆ రాక్షసునికంఠముపైనుండి తనపాదమును తొలగింపగనే నిక్కపొడుచుకొనియున్న చెవులుగల ఆ విరాధుడు భీకరమైన ఒక మహానాదమును చేయసాగెను. అప్పుడు లక్ష్మణుడు అట్లుచుచున్న ఆ విరాధుని ఆ పెద్ద గొయ్యిలోనికి నెట్టివైచెను.(26)

అసహాయశూరులును, రణరంగమున స్థిరముగా నిలిచియుండువారును ఐన రామలక్ష్మణులు భయంకరముగా అఱచుచున్నవాడును, యుద్ధమున తమచేత నిర్జితుడును ఐన ఆ రాక్షసుని లేవనెత్తి సంతోషముతో ఆ గోతిలోనికి విసరివేసిరి.(27)

నరశ్రేష్ఠులును, యుద్ధముచేయుటలో ఆఱితేఱినవారును ఐన ఆ రామలక్ష్మణులు 'ఎంతటివాడిబాణములతో కొట్టినను ఇతడు చావడు.' అని నిశ్చయించుకొని, విరాధుని పడవేసిన గోతిని మట్టితో పూడ్చి అతనిని చంపివేసిరి. (28)

శ్రీరాముడు వనవాసియై తనకడకు వచ్చినప్పుడు ఆయన చేతిలోనే మరణింపవలెనని విరాధుడు కోరుకొనుచుండెను. అందువలన అతడు 'తాను శస్త్రములతో మరణింపను'- అనియుండు తన మృత్యురహస్యమును శ్రీరామునకు వివరించియుండెను.(29)

తదేవ రామేణ నిశమ్య భాషితం
కృతా మతిస్తస్య బిలప్రవేశనే ।
బిలం చ రామేణ బలేన రక్షసా
ప్రవేశ్యమానేన వనం వినాదితమ్ । 30

విరాధునిమాటలను ఆలకించి, శ్రీరాముడు అతనిని గోతిలో పూడ్చిపెట్టుటకు నిశ్చయించుకొనెను. అందువలన రాముడు అట్లు వానిని పూడ్చిపెట్టుచుండగా ఆ విరాధుడు కావించిన అఱపులు ఆ వనమునందంతటను ప్రతిధ్వనించెను.(30)

ప్రహృష్టరూపావివ రామలక్ష్మణౌ
విరాధముర్వ్యాః ప్రదరే నిహత్య తౌ ।
ననందతుర్వీతభయౌ మహావనే
శిలాభిరంతర్దధతుశ్చ రాక్షసమ్ । 31

రామలక్ష్మణులు భూమిలో పాతిపెట్టుటద్వారా విరాధుని హతమొనర్చి, మిక్కిలి సంతసించిరి. పిమ్మట వారు కీకారణ్యమునందలి ఆ గోతిని ఱాళ్లతో కప్పివేసిరి. (31)

తతస్తు తౌ కాంచనచిత్రకార్ముకౌ
నిహత్య రక్షః పరిగృహ్య మైథిలీమ్ ।
విజహ్రతుస్తౌ ముదితౌ మహావనే
దివి స్థితౌ చంద్రదివాకరావివ । 32

విరాధునిమరణానంతరము ఆ రామలక్ష్మణులు బంగారు పన్నైతో విచిత్రముగానున్న తమధనుస్సులను చేతబట్టి, సీతాదేవిని వెంటనిడుకొని, ఆ మహావనమున విహరించుచు ఆకాశమున సూర్యచంద్రులవలె బాసిల్లిరి. (32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే చతుర్థస్సర్గః *(4)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నాల్గవసర్గము.

-- ＊ ＊ ＊ --

5. ఐదవసర్గము

సీతారామలక్ష్మణులు శరభంగమహర్షి ఆశ్రమమునకు చేరుట - వారు దూరమునుండియే ఇంద్రాదులను దర్శించుట - శరభంగ మహర్షి వారికి అతిథిమర్యాదలను నెఱపిన పిమ్మట బ్రహ్మలోకమునకు వెళ్లుట.

హత్వా తు తం భీమబలం విరాధం రాక్షసం వనే ।
తతః సీతాం పరిష్వజ్య సమాశ్వాస్య చ వీర్యవాన్ ।
అబ్రవీల్లక్ష్మణం రామో భ్రాతరం దీప్తతేజసమ్ । 1

తేజశ్శాలియైన శ్రీరాముడు మిగులబలశాలియైన రాక్షసుడగు విరాధుని వధించిన పిమ్మట, సీతాదేవిని అక్కున జేర్చుకొని, ఆమెను ఊరడించెను. పిదప అతడు తేజస్వియైన సోదరుడగు లక్ష్మణునితో ఇట్లనెను. (1)

కష్టం వనమిదం దుర్గం న చ స్మ వనగోచరాః ।
అభిగచ్ఛామహే శీఘ్రం శరభంగం తపోధనమ్ । 2

"సోదరా! ఈ కాఱడవి విశ్రమించుటకు అనువుగా లేదు. మనము ఇట్టి అరణ్యములకు అలవాటు పడినవారము కాము. కావున శీఘ్రముగా తపోధనుడైన శరభంగమహర్షికడకు చేరుదము." (2)

ఆశ్రమం శరభంగస్య రాఘవోఽభిజగామ హ ।
తస్య దేవప్రభావస్య తపసా భావితాత్మనః । 3

శరభంగమహర్షి తనతపస్సాధనచే దైవసాక్షాత్కారమును పొందినవాడు, దివ్యశక్తిసంపన్నుడు. అట్టి ఆ మహాముని ఆశ్రమమునకు శ్రీరాముడు చేరెను. (3)

సమీపే శరభంగస్య దదర్శ మహదద్భుతమ్ ।
విభ్రాజమానం వపుషా సూర్యవైశ్వానరోపమమ్ । 4

అవరుహ్య రథోత్సంగాత్ ఆకాశే విబుధానుగమ్ ।
అసంస్పృశంతం వసుధాం దదర్శ విబుధేశ్వరమ్ । 5

రఘువరుడు శరభంగమునిసమీపమున ఒక అద్భుత పురుషుని గాంచెను. ఆ పురుషుడు సూర్యభగవానునివలెను, అగ్నిదేవునిరీతిగను దివ్యతేజస్సుతో వెలుగొందుచుండెను. అతడు రథమునుండి దిగి, భూమిని తాకకుండ సాగిపోవుచుండెను. అతనిని దేవతలు అనుసరించుచుండిరి. శ్రీరాముడు ఇంకను కొంత సమీపించిన పిమ్మట ఆ మహాపురుషుడు ఇంద్రుడేయని గ్రహించెను. (4-5)

సుప్రభాభరణం దేవం విరజోఽమ్బరధారిణమ్।
తద్విధైరేవ బహుభిః పూజ్యమానం మహాత్మభిః। 6

హరిభిర్వాజిభిర్యుక్తమ్ అంతరిక్షగతం రథమ్।
దదర్శాదూరతస్తస్య తరుణాదిత్యసన్నిభమ్। 7

పాండురాభ్రఘనప్రఖ్యం చంద్రమండలసన్నిభమ్।
అపశ్యద్విమలం ఛత్రం చిత్రమాల్యోపశోభితమ్। 8

చామరవ్యజనే చాగ్ర్యే రుక్మదండే మహాధనే।
గృహీతే వరనారీభ్యాం ధూయమానే చ మూర్ధని। 9

గంధర్వామరసిద్ధాశ్చ బహవః పరమర్షయః।
అంతరిక్షగతం దేవం వాగ్భిరగ్ర్యాభిరీడిరే। 10

సహ సంభాషమాణే తు శరభంగేణ వాసవే।
దృష్ట్వా శతక్రతుం తత్ర రామో లక్ష్మణమబ్రవీత్। 11

రామోఽథ రథముద్దిశ్య లక్ష్మణాయ ప్రదర్శయన్। 12

అర్చిష్మంతం శ్రియా జుష్టమ్ అద్భుతం పశ్య లక్ష్మణ!।
ప్రతపంతమివాఽఽదిత్యమ్ అంతరిక్షగతం రథమ్। 13

యే హయాః పురుహూతస్య పురా శక్రస్య నః శ్రుతాః।
అంతరిక్షగతా దివ్యాః త ఇమే హరయో ధ్రువమ్। 14

ఇమే చ పురుషవ్యాఘ్రా యే తిష్ఠంత్యభితో రథమ్।
శతం శతం కుండలినో యువానః ఖడ్గపాణయః। 15

విస్తీర్ణవిపులోరస్కాః పరిఘాఽఽయతబాహవః।
శోణాంశువసనాః సర్వే వ్యాఘ్రా ఇవ దురాసదాః। 16

ఉరోదేశేషు సర్వేషాం హారా జ్వలనసన్నిభాః।
రూపం బిభ్రతి సౌమిత్రే! పంచవింశతివార్షికమ్। 17

ఏతద్ధి కిల దేవానాం వయో భవతి నిత్యదా।
యథేమే పురుషవ్యాఘ్రా! దృశ్యంతే ప్రియదర్శనాః। 18

తళతళ మెఱయుచున్న ఆభరణములతో ఆ ఇంద్రుడు దేదీప్యమానుడై వెలుగొందుచుండెను. అతడు నిర్మలమైన వస్త్రములను ధరించియుండెను. ఆయనవలె దివ్యతేజస్సులుగల పెక్కుమంది మహాత్ములు ఆయనను పూజించుచుండిరి.(6)

ఆ ఇంద్రునిరథము ఆకుపచ్చని గుఱ్ఱములు గలిగి, అంతరిక్షమున ఉదయభానునివలె ప్రకాశించుచుండెను. శ్రీరాముడు ఆ రథమును సమీపమునుండియే చూచెను. (7)

ఆ సురపతిఛత్రము తెల్లని మేఘకాంతులతోడను చంద్రమండలమువలె గుండ్రముగను తేజరిల్లుచు, చిత్రములైన మాలలతో అలంకృతమై స్వచ్ఛముగా శోభిల్లుచుండెను. (8)

ఇద్దరు దివ్యాంగనలు బంగారుదండములుగల అమూల్యములైన వింజామరలనుపట్టుకొని ఇంద్రునకు ముందుభాగమున ఇరువైపులనుండి ఆయనను సేవించుచుండిరి. (9)

గంధర్వులు, దేవతలు, సిద్ధులు, పెక్కుమంది మహర్షులు అంతరిక్షముననున్న ఇంద్రుని చక్కని స్తుతులతో కీర్తించుచుండిరి. (10)

ఇంద్రుడు శరభంగమహర్షితో మాట్లాడుచుండగా జూచి, శ్రీరాముడు ఆ శతమఖునిరథమును లక్ష్మణునకు జూపుచు అతనితో ఇట్లనెను. (11-12)

"ఓ లక్ష్మణా! ఆకాశముననున్న ఆ అద్భుతరథమును పరికింపుము. దానినుండి కాంతిపుంజములు వెలువడుచున్నవి. అవి ఒక తేజోరాశియై, సూర్యమండలమువలె వెలుగులను విరజిమ్ముచున్నవి. (13)

పెక్కు యజ్ఞములకు ప్రముఖుడైన ఆహూతుడగు ఇంద్రుని యొక్క ఉత్తమాశ్వములనుగూర్చి ఇదివఱలో మనము వినియున్నాము. ఇప్పుడు అంతరిక్షమున కనబడుచున్న హరితవర్ణములు ఈ దివ్యాశ్వములవియే. ఇది నిజము.(14)

ఇదిగో! ఆ రథమునకు నలుదిక్కులయందును వందమంది చొప్పున శ్రేష్ఠులైన యువకులు గలరు. వారు చెవులకు కుండలములను, చేతులలో ఖడ్గములను ధరించియున్నారు. వారివక్షఃస్థలములు మిక్కిలి విశాలములైయున్నవి. వారి బాహువులు ఇనుపగుదియల (పరిఘల) వలె దృఢమైనవి. వారు ధరించిన వస్త్రములు రక్తవర్ణశోభితములు. పెద్దపులుల వలె వారు దుర్జయులు. ఓ సౌమిత్రీ! వారందఱను వక్షఃస్థలము నందు ధరించిన హారములన్నియును అగ్నితేజస్సులతో విరాజిల్లుచున్నవి. రూపురేఖలనుబట్టి వారు ఇరువదియైదు సంవత్సరములవయస్సుగల యువకులని తోచుచున్నది. దేవతలు ఎల్లప్పుడును ఇరువదియైదుసంవత్సరముల వయస్సుగల వారివలెనే ఒప్పుచుందురని ప్రతీతి. ఈ యువకిశోరములు చూడముచ్చటగొలుపుచున్నారు.(15-18)

ఇహైవ సహ వైదేహ్యా ముహూర్తం తిష్ఠ లక్ష్మణ!।
యావజ్జానామ్యహం వ్యక్తం క ఏష ద్యుతిమాన్ రథే। 19

తమేవముక్త్వా సౌమిత్రిమ్ ఇహైవ స్థీయతామితి।
అభిచక్రామ కాకుత్స్థః శరభంగాశ్రమం ప్రతి। 20

తతః సమభిగచ్ఛంతం ప్రేక్ష్య రామం శచీపతిః।
శరభంగమనుప్రాప్య వివిక్త ఇదమబ్రవీత్। 21

ఇహోపయాత్యసౌ రామో యావన్మాం నాభిభాషతే।
నిష్ఠాం నయతు తావత్తు తతో మాం ద్రష్టుమర్హతి। 22

జితవంతం కృతార్థం చ ద్రష్టాఽహమచిరాదిమమ్।
కర్మ హ్యనేన కర్తవ్యం మహదన్యైః సుదుష్కరమ్।
నిష్పాదయిత్వా తత్కర్మ తతో మాం ద్రష్టుమర్హతి। 23

ఇతి వజ్రీ తమామంత్ర్య మానయిత్వా చ తాపసమ్।
రథేన హరియుక్తేన యయౌ దివమరిందమః। 24

ప్రయాతే తు సహస్రాక్షే రాఘవః సపరిచ్ఛదమ్।
అగ్నిహోత్రముపాసీనం శరభంగముపాగమత్। 25

తస్య పాదౌ చ సంగృహ్య రామః సీతా చ లక్ష్మణః।
నిషేదుః సమనుజ్ఞాతా లబ్ధవాసా నిమంత్రితాః। 26

తతః శక్రోపయానం తు పర్యపృచ్ఛత్ స రాఘవః।
శరభంగశ్చ తత్సర్వం రాఘవాయ న్యవేదయత్। 27

మామేష వరదో రామ! బ్రహ్మలోకం నినీషతి।
జితముగ్రేణ తపసా దుష్ప్రాపమకృతాత్మభిః। 28

అహం జ్ఞాత్వా నరవ్యాఘ్ర! వర్తమానమదూరతః।
బ్రహ్మలోకం న గచ్ఛామి త్వామదృష్ట్వా ప్రియాతిథిమ్। 29

త్వయాఽహం పురుషవ్యాఘ్ర! ధార్మికేణ మహాత్మనా।
సమాగమ్య గమిష్యామి త్రిదివం దేవసేవితమ్। 30

'ఓ లక్ష్మణా! నేను వెళ్ళి, ఆ రథమునందు వెలుగొందుచున్న మహాపురుషుడెవరో తెలిసికొని, ఒక్కక్షణములో వత్తును. అంతవఱకును మీవదినెయగు వైదేహితో నీవు ఇచటనే యుండుము-'' అని పలికిన పిమ్మట శ్రీరాముడు శరభంగాశ్రమమునకు బయలుదేరెను. (19-20)

ఆ ఆశ్రమమువైపుగా వచ్చుచున్న శ్రీరాముని జూచి, దేవేంద్రుడు శరభంగమహర్షికడకు వచ్చి, ఆయనతో రహస్యముగా ఇట్లు పలికెను. (21)

"శ్రీరాముడు ఇటే వచ్చుచున్నాడు. ఆయన ఇచ్చటికి వచ్చుటయు మేము సంభాషించుటయు జరుగకముందే నేను ఇచటినుండి వెళ్ళి పోయెదను. ఆయన వహించినదీక్ష ముగిసినపిమ్మట మేము కలసికొనుట యుక్తము. ఆయన తనలక్ష్యసాధనలో కృతార్థుడైనపిమ్మట నేను ఆయనను దర్శింపగలను. దేవతలకుసైతము దుష్కరమైన మహాకార్యమును అతడు సాధింపవలసియున్నది. ఆ ఘనకార్యము నెఱవేఱిన పిమ్మట నేను ఆయనను దర్శింతును.'' (22-23)

శత్రుసంహారకుడైన ఇంద్రుడీవిధముగా ఆ మహర్షితో పలికి, ఆయనను సాదరముగా వీడ్కొని, అశ్వములను పూన్చిన తనరథము నెక్కి, స్వర్గమునకేగెను. (24)

ఇంద్రుడు వెళ్ళిపోయినపిమ్మట శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి హోమవిధులను ఆచరించుచున్న శరభంగమహర్షికడకు చేరెను. (25)

అంతట సీతారామలక్ష్మణులు ఆ మహామునికి పాదాభివందనమునాచరించిరి. వారు మునిఅనుజ్ఞతో ఆసనముల నలంకరించిరి. పిదప ఆ ముని వారిని యథోచితముగా సత్కరించెను. (26)

అప్పుడు రఘురాముడు ఇంద్రునిఆగమనకారణమును గూర్చి ఆ మహర్షిని అడిగెను. అంతట శరభంగముని ఆ విషయమును గూర్చి రామునకు సమగ్రముగా ఇట్లు వివరించెను. (27)

"వరదుడైన ఇంద్రుడు బ్రహ్మదేవునిఆజ్ఞమేరకు నన్ను బ్రహ్మ(సత్య)లోకమునకు తీసికొని వెళ్ళగోరుచున్నాడు. జితేంద్రియులుకానివారు ఆలోకమునకు వెళ్ళుట అసాధ్యము. తీవ్రమైన తపస్సార్జనందున నాకు ఆ శక్తి లభించినది. ఓ పురుషశ్రేష్ఠా! సమీపభవిష్యత్తులో (త్వరలో) నీవిచటికి రానున్న సంగతిని యోగదృష్టితో గ్రహించితిని. కనుక మహాత్ముడవైన నీఆగమనమునకై వేయికన్నులతో నిరీక్షించుచుంటిని. ప్రియమైన అతిథివగు నీదర్శనమును పొందినపిమ్మటనే నిత్యమూ దేవతలచే సేవింపబడు సత్యలోకమునకు వెళ్లెదను. (28-30)

అక్షయా నరశార్దూల! మయా లోకా జితాః శుభాః।
బ్రాహ్మ్యాశ్చ నాకపృష్ఠ్యాశ్చ ప్రతిగృహ్ణీష్వ మామకాన్। 31

ఏవముక్తో నరవ్యాఘ్రః సర్వశాస్త్రవిశారదః।
ఋషిణా శరభంగేణ రాఘవో వాక్యమబ్రవీత్। 32

అహమేవాహరిష్యామి సర్వలోకాన్ మహామునే!।
ఆవాసం త్వహమిచ్ఛామి ప్రదిష్టమిహ కాననే। 33

రాఘవేణైవముక్తస్తు శక్రతుల్యబలేన వై।
శరభంగో మహాప్రాజ్ఞః పునరేవాబ్రవీద్వచః। 34

ఇహ రామ! మహాతేజాః సుతీక్ష్ణో నామ ధార్మికః।
వసత్యరణ్యే ధర్మాత్మా స తే శ్రేయో విధాస్యతి। 35

సుతీక్ష్ణమభిగచ్ఛ త్వం శుచౌ దేశే తపస్వినమ్।
రమణీయే వనోద్దేశే స తే వాసం విధాస్యతి। 36

ఇమాం మందాకినీం రామ! ప్రతిస్రోతామనువ్రజ।
నదీం పుష్పోడుపవహాం తత్ర తత్ర గమిష్యసి। 37

ఏష పంథా నరవ్యాఘ్ర ముహూర్తం పశ్య తాత మామ్।
యావజ్జహామి గాత్రాణి జీర్ణాం త్వచమివోరగః। 38

తతోఽగ్నిం సుసమాధాయ హుత్వా చాజ్యేన మంత్రవిత్।
శరభంగో మహాతేజాః ప్రవివేశ హుతాశనమ్। 39

తస్య రోమాణి కేశాంశ్చ దదాహాగ్నిర్మహాత్మనః।
జీర్ణాం త్వచం తథాఽస్థీని యచ్చ మాంసం సశోణితమ్। 40

రామస్తు విస్మితో భ్రాత్రా భార్యయా చ సహాత్మవాన్। 41

ఓ మహాపురుషా! నాతపశ్శక్తిప్రభావమున అక్షయములైన బ్రహ్మలోక, స్వర్గాదిసమస్తలోకశుభఫలములన్నియును నాకు లభించినవి. ఆ నాతపఃఫలములను అన్నింటిని అతిథివై ఇచటికి విచ్చేసిన నీకు సమర్పించుచున్నాను."[1] (31)

శరభంగమహర్షి ఇట్లు పలికిన పిమ్మట సర్వశాస్త్రములయందు ఆరితేరిన వాడు, నరశ్రేష్ఠుడు ఐన రఘురాముడు ఆయనతో ఇట్లు నుడివెను. (32)

"ఓ మహామునీ! నీవర్పించిన సర్వలోక (ఫల)ములను నేను స్వీకరింతును. ఈ వనమునందు మేము నివసించుటకు అనువైన ప్రదేశమును నీనుండి తెలిసికొన గోరుచున్నాను." (33)

దేవేంద్రునితో సమానమగు బలశాలియైన రఘురాముడు ఇట్లు పలుకగా మిగుల ప్రాజ్ఞుడగు శరభంగముని మరల ఆయనతో ఇట్లనెను. (34)

"ఓ రామా! మహాతేజస్వియు, ధర్మజ్ఞుడును, ధర్మనిరతుడును ఐన సుతీక్ష్ణ మహర్షి ఇచటికి సమీపమున గల వనమునందే నివసించుచున్నాడు. ఆ మహానుభావుడు మీకు చక్కగా తోడ్పడుగలడు. ఈ రమణీయమైన వనప్రదేశమున ఒక పవిత్రస్థానమునందు తపమాచరించుచుండెడి సుతీక్ష్ణమహాముని కడకు వెళ్లుడు. ఆయన మీకు సరియగు నివాసస్థానమును ఏర్పాటుచేయగలడు. (35-36)

ఓ రామా! ఈ మందాకినీనదిలో అచ్చటచ్చట తెప్పలవలె పుష్పములు తేలియాడుచుండును. ఇది తూర్పునకు ప్రవహించుచుండును ఈ నదీతీరమునందు పశ్చిమాభిముఖుడవై వెళ్ళుము. ఇదియే మీరు వెళ్ళవలసిన మార్గము. కాని ఓ నరశ్రేష్ఠా! క్షణకాలము ఆగుము. నిన్ను దర్శించుటకై నేను ఇంతవరకును ఈ శరీరముతో ఉంటిని. ఇప్పుడు నిన్ను దర్శించి ధన్యుడనైతిని. కనుక పాము కుబుసమును విడిచినట్లుగా నేను ఈ శరీరమును త్యజించెదను. చూడుము."(37-38)

మంత్రవేత్తయు, మిగుల తేజస్వియు ఐన శరభంగముని విధివిధానమునగా అగ్నిని ప్రతిష్ఠించి, బ్రహ్మమేధమంత్రములను పఠించుచు నేతితో హోమములనొనర్చి, ఆ మహర్షి ఆ అగ్నిలో ప్రవేశించెను. (39)

పిమ్మట ఆ మహాత్మునిశరీరమునందలి రోమములు, కేశములు, శిథిలావస్థకు చేరినచర్మము, ఎముకలు, రక్తమాంసములు మొదలగు వాటినన్నింటిని అగ్ని దహించివేసెను. ఆ దృశ్యమును జూచి ఆర్ద్రహృదయులైన సీతారామలక్ష్మణులు మిగుల ఆశ్చర్యమునకు లోనైరి. (40-41)

1) దుష్టరావణుని వధించుటకై శ్రీమహావిష్ణువు మానవుడై శ్రీరాముడుగా అవతరించెను. ఆ కార్యము సిద్ధించుటకై మహర్షులు తమ తపః ఫలములను ఆయనకు సర్వాత్మనా సమర్పించిరి. ఇంతకుముందే భరద్వాజాది మహామునులు తమ తపఃఫలములను శ్రీరామునకు ధారపోసిరి. ఇప్పుడు శరభంగమహర్షియు అట్లు చేసెను. పరమాత్ముడైన శ్రీరామునకు తమతపశ్శక్తులను సమర్పించి ఆ మహర్షులును కృతార్థులైరి.

స చ పావకసంకాశః కుమారః సమపద్యత।
ఉత్థాయాగ్నిచయాత్ తస్మాత్ శరభంగో వ్యరోచత। 42

అంతట శరభంగమహాముని పదునైదుసంవత్సరములు మించిన బాలునిరూపములో అగ్నితేజస్సుతో విలసిల్లుచు ఆ అగ్నిగుండమునుండి వెలువడెను. (42)

స లోకాన్ ఆహితాగ్నీనామ్ ఋషీణాం చ మహాత్మనామ్।
దేవానాం చ వ్యతిక్రమ్య బ్రహ్మలోకం వ్యరోచత। 43

నిత్యాగ్నిహోత్రులు, మహాత్ములు ఐన మహర్షులు చేరెడి లోకములను, దివ్యలోకములను దాటి అతడు బ్రహ్మలోకమునకు చేరెను. (43)

స పుణ్యకర్మా భువనే ద్విజర్షభః
పితామహం సానుచరం దదర్శ హ।
పితామహశ్చాపి సమీక్ష్య తం ద్విజం
ననంద సుస్వాగతమిత్యువాచ హ। 44

పుణ్యాత్ముడైన ఆ బ్రాహ్మణోత్తముడు (శరభంగుడు) సత్యలోకమునందు సభాసదులతో గూడియున్న బ్రహ్మదేవుని దర్శించెను. ఆ పితామహుడును (బ్రహ్మయు) ఆ ద్విజుని జూచి ప్రసన్నుడై, "ఓ మహామునీ! నీకు సుస్వాగతము" అని పల్కెను.(44)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచమస్సర్గః (1)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఐదవసర్గము.

— * * * —

6. ఆఱవసర్గము

రాక్షసులుపెట్టెడి బాధలను తొలగింపుమని మునీశ్వరులు శ్రీరాముని అర్థించుట. ఆప్రభువు వారికి అభయమిచ్చుట- పిమ్మట వారితోగూడి సుతీక్ష్ణమహర్షి ఆశ్రమమునకు బయలుదేఱుట.

శరభంగే దివం యాతే మునిసంఘాః సమాగతాః।
అభ్యగచ్ఛంత కాకుత్స్థం రామం జ్వలితతేజసమ్। 1

శరభంగమహర్షి దివంగతుడైన పిమ్మట మునీశ్వరులందఱును కూడి మహాతేజస్వియగు శ్రీరాముని కడకు విచ్చేసిరి. (1)

వైఖానసా వాలఖిల్యాః సంప్రక్షాలా మరీచిపాః।
అశ్మకుట్టాశ్చ బహవః పత్రాహారాశ్చ ధార్మికాః। 2
దంతోలూఖలినశ్చైవ తథైవోన్మజ్జకాః పరే।
గాత్రశయ్యా అశయ్యాశ్చ తథైవాభ్రావకాశకాః। 3
మునయః సలిలాహారా వాయుభక్షాస్తథా పరే।
ఆకాశనిలయాశ్చైవ తథా స్థండిలశాయినః। 4
వ్రతోపవాసినో దాంతాః తథాఽఽర్ద్రపటవాససః।
సజపాశ్చ తపోనిత్యాః తథా పంచతపోఽన్వితాః। 5

శ్రీరాముని దర్శించిన వారిలో * (1) వైఖానసులు, (2) వాలఖిల్యులు, (3) సంప్రక్షాళురు, (4) మరీచిపులు, (5) పెక్కుమంది అశ్మకుట్టులు, (6) ధార్మికులైన పత్రాహారులు, (7) దంతోలూఖలులు (8) ఉన్మజ్జకులు, (9) గాత్రశయ్యులు, (10) అశయులు, (11) అభ్రావకాశులు, (12) సలిలాహారులు (13) వాయుభక్షులు (14) ఆకాశనిలయులు, (15) స్థండిలశాయులు, (16) వ్రతోపవాసులు, (17) దాంతులు, (18) ఆర్ద్రపటవాసులు, (19) జపశీలురు, (20) తపోనిత్యులు, (21) పంచతపోఽన్వితులు మొదలగువారు గలరు. (2-5)

1) బ్రహ్మయొక్క నఖములనుండి జన్మించినవారు, (2) బ్రహ్మయొక్క రోమములనుండి ఉద్భవించినవారు, (3) బ్రహ్మయొక్క పాదప్రక్షాళనమునుండి పుట్టినవారు, (4) సూర్యచంద్రకిరణములను ఆస్వాదించువారు, (5) ధాన్యములను ఱాళ్లతో నలగగొట్టి తినువారు, (6) ఆకులు ఆహారముగా గలవారు, (7) దంతములనే ఱోలుగా ఉపయోగించెడివారు, (8) కంఠమువఱకు నీళ్లలోనుండి తపస్సుచేయువారు, (9) చేతులనే తలగడలుగా జేసికొని శయ్యలేకుండా పరుండువారు, (10) భూతలమున శయనించువారు. (11) ఏట్టిఆచ్ఛాదనములేని ప్రదేశమున ఎండకును, వానకును గాలికిని తట్టుకొనుచు తపస్సుచేయువారు, (12) జలములు మాత్రమే ఆహారముగా గలవారు, (13) వాయువుమాత్రమే ఆహారముగా గలవారు (14) వృక్షాగ్రములయందుండి తపస్సు చేయువారు, (15) భూమిపై దర్భలను (దర్భాస్తరణములను) పఱచుకొని పరుండెడివారు, (16) నిరంతరము ఉపవాసవ్రతదీక్షను పాటించెడివారు, (17) జితేంద్రియులు, (18) తడిబట్టలతో ధ్యానసాధనచేసెడువారు, (19) నిశ్చలజపశీలురు, (20) నిరంతరము తపోదీక్షలోనుండువారు, (21) పంచాగ్నులమధ్య తపస్సొనర్చుచుండువారు- (పంచాగ్నులమధ్యతపస్సు = నాలుగు వైపుల అగ్నులనేర్పఱచుకొని, వేసవిలో ముఖమును సూర్యునకు అభిముఖముగా ఉంచి తపస్సు చేయుట-)

సర్వే బ్రాహ్మ్యా శ్రియా జుష్టా దృఢయోగాః సమాహితాః।
శరభంగాశ్రమే రామమ్ అభిజగ్ముశ్చ తాపసాః। 6

వారందరును బ్రహ్మవిద్యను అనుష్ఠించిన బ్రహ్మతేజస్సంపన్నులు. దృఢముగా యమనియమాది - అష్టాంగయోగసాధన చేసినవారు. ధ్యానయోగసాధననిష్ఠగలవారు. ఈ తాపసులు అందఱును శరభంగాశ్రమముకడనున్న శ్రీరామునియొద్దకు ఏతెంచిరి. (6)

అభిగమ్య చ ధర్మజ్ఞా రామం ధర్మభృతాం వరమ్।
ఊచుః పరమధర్మజ్ఞమ్ ఋషిసంఘాః సమాహితాః। 7

ధనుర్ధారులలో మేటియు, పరమధర్మస్వరూపుడును ఐన శ్రీరామునకు అచట చేరిన మహర్షులు అందఱును ఇట్లు విన్నవించిరి. (7)

త్వమిక్ష్వాకుకులస్యాస్య పృథివ్యాశ్చ మహారథ।
ప్రధానశ్చాపి నాథశ్చ దేవానాం మఘవానివ। 8

విశ్రుతః త్రిషు లోకేషు యశసా విక్రమేణ చ।
పితృభక్తిశ్చ సత్యం చ త్వయి ధర్మశ్చ పుష్కలః। 9

"సాటిలేని మహావీరుడవైన ఓ శ్రీరామా! నీవు ఇక్ష్వాకువంశశిరోమణివి. దేవతల మహేంద్రునివలె నీవు ఈ భూజనులందఱికిని ప్రభుడవు. నీకీర్తియు, పరాక్రమము ముల్లోకములయందును వాసిగాంచినవి. నీ పితృభక్తి నిరుపమానము, సత్యపాలనము సాటిలేనిది, ధర్మనిరతి అపూర్వము. (8-9)

త్వామాసాద్య మహాత్మానం ధర్మజ్ఞం ధర్మవత్సలమ్।
అర్థిత్వాన్నాథ వక్ష్యామః తచ్చ నః క్షంతుమర్హసి। 10

ఓ ప్రభూ! నీవు ధర్మస్వరూపుడవు, ధార్మికరక్షకుడవు, మహానుభావుడవు. మేము అర్థులమై నిన్ను అర్థింపవచ్చితిమి. మా ప్రార్థనను మన్నింపుము. (10)

అధర్మస్తు మహాం స్తాత! భవేత్ తస్య మహీపతేః।
యో హరేద్బలిషడ్భాగం న చ రక్షతి పుత్రవత్। 11

ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడుచుండుట రాజుయొక్క కర్తవ్యము. ప్రజలఆదాయమున ఆఱవవంతు ధనమును పన్నుగా స్వీకరించుచును వారిని అదుకొనని రాజు అధర్మపరుడు గదా! (11)

యుంజానః స్వానివ ప్రాణాన్ ప్రాణైరిష్టాన్ సుతానివ।
నిత్యయుక్తః సదా రక్షన్ సర్వాన్ విషయవాసినః। 12

ప్రాప్నోతి శాశ్వతీం రామ! కీర్తిం స బహువార్షికీమ్।
బ్రహ్మణః స్థానమాసాద్య తత్ర చాపి మహీయతే। 13

ఓ రామా! తనదేశమునగల ప్రజలను అందఱిని తనప్రాణములనువలె - అంతేగాదు తన ప్రాణములకంటెను ప్రీతిపాత్రులైన తనకుమారులనువలె సర్వదా ప్రయత్నపూర్వకముగా రక్షించుచుండెడివాడే నిజమైన ప్రభువు. అట్టి భూపతి కలకాలము శాశ్వతముగానుండునట్టి కీర్తిని పొందును. ఇంకను అతడు బ్రహ్మలోకమును పొంది, అచ్చటగూడ ఆదరింపబడును. (12-13)

యత్ కరోతి పరం ధర్మం మునిర్మూలఫలాశనః।
తత్ర రాజ్ఞశ్చతుర్భాగః ప్రజా ధర్మేణ రక్షతః। 14

కందమూలఫలములను ఆహారముగా స్వీకరించెడి మునులు చేయుఉత్తమధర్మకార్యములఫలములో (తపఃఫలములో) నాల్గవభాగము ప్రజలను ధర్మబద్ధముగా రక్షించుచుండునట్టి రాజునకు చెందును. (14)

సోఽయం బ్రాహ్మణభూయిష్ఠో వానప్రస్థగణో మహాన్।
త్వన్నాథోఽనాథవద్రామ రాక్షసైర్బాధ్యతే భృశమ్। 15

శ్రీరామా! ఇచటి వానప్రస్థులలో వైఖానసవాలఖిల్యాది బ్రాహ్మణులు అధికసంఖ్యలో గలరు. నీవు ఈ ప్రదేశమునకు ప్రభువుడవైనప్పటికిని ఈ వానప్రస్థులందఱును దిక్కులేనివారివలె క్రూరరాక్షసులు పెట్టెడి బాధలకు మిగుల వగచుచున్నారు. (15)

ఏహి పశ్య శరీరాణి మునీనాం భావితాత్మనామ్।
హతానాం రాక్షసైర్ఘోరైః బహూనాం బహుధా వనే। 16

ఈ వనమునందు పవిత్రాత్ములైన పెక్కుమంది మునులను దుష్టరాక్షసులు పలురీతుల హింసించి హతమార్చిరి. ఇవిగో వారి కళేబరములు. ఇక్కడనే పడియున్నవి. వచ్చి చూడుము. (16)

పంపానదీనివాసానామ్ అనుమందాకినీమపి।
చిత్రకూటాలయానాం చ క్రియతే కదనం మహత్॥ 17

ఏవం వయం న మృష్యామో విప్రకారం తపస్వినామ్।
క్రియమాణం వనే ఘోరం రక్షోభిర్భీమకర్మభిః॥ 18

తతస్త్వాం శరణార్థం చ శరణ్యం సముపస్థితాః।
పరిపాలయ నో రామ! వధ్యమానాన్ నిశాచరైః॥ 19

పరా త్వత్తో గతిర్వీర! పృథివ్యాం నోపపద్యతే।
పరిపాలయ నః సర్వాన్ రాక్షసేభ్యో నృపాత్మజ॥ 20

ఏతచ్ఛ్రుత్వా తు కాకుత్స్థః తాపసానాం తపస్వినామ్।
ఇదం ప్రోవాచ ధర్మాత్మా సర్వానేవ తపస్వినః॥ 21

నైవ మర్హథ మాం వక్తుమ్ ఆజ్ఞాప్యోఽహం తపస్వినామ్।
కేవలేనాత్మకార్యేణ ప్రవేష్టవ్యం మయా వనమ్॥ 22

విప్రకారమపాక్రష్టుం రాక్షసైర్భవతామిమమ్।
పితుస్తు నిర్దేశకరః ప్రవిష్టోఽహమిదం వనమ్॥ 23

భవతామర్థసిద్ధ్యర్థమ్ ఆగతోఽహం యదృచ్ఛయా।
తస్య మేఽయం వనే వాసో భవిష్యతి మహాఫలః॥ 24

తపస్వినాం రణే శత్రూన్ హంతుమిచ్ఛామి రాక్షసాన్।
పశ్యంతు వీర్యమ్ ఋషయః సభ్రాతుర్మే తపోధనాః॥ 25

దత్త్వాఽభయం చాపి తపోధనానాం
ధర్మే ధృతాత్మా సహ లక్ష్మణేన।
తపోధనైశ్చాపి సభాజ్యవృత్తః
సుతీక్ష్ణమేవాభిజగామ వీరః॥ 26

పంపాసరోవరప్రాంతములయందును, మందాకినీనది పరిసరములయందును నివసించెడి మహర్షులను ఆ రాక్షసులు మిక్కిలి హింసించుచున్నారు. (17)

క్రూరకర్ములైన రాక్షసులు ఈ వనములయందలి తాపసులయెడ జరిపెడి ఘోరమైన మారణకాండకు మేమందఱమును తట్టుకొనలేకున్నాము. (18)

దీనులపాలిటిపెన్నిధివైన ఓ రామా! మా రక్షణకొఱకై మేము నిన్ను శరణు జొచ్చితిమి. క్రూరులైన రాక్షసులచే చంపబడుచున్న (చిత్రహింసలకు లోనగుచున్న) మమ్ము నీవు కాపాడుము. (19)

మహావీరుడవైన ఓ రాజకుమారా! ఈ భూమండలమున నీవుదప్ప మమ్ము రక్షింపగల సమర్థులు మఱెవ్వరును లేరు-'అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం హి నః' - కనుక ఆ రాక్షసులబారినుండి మమ్ములనందఱిని రక్షించి, ఆదుకొనుము". (20)

కకుత్స్థవంశజుడును, ధర్మాత్ముడును ఐన శ్రీరాముడు నిత్యము తపశ్చర్యలయందేనిరతులై యుండెడి ఆ తాపసుల మొఱనాలకించి, వారియందఱితో ఇట్లు నుడివెను. (21)

"ఓ మహాత్ములారా! మీరు నన్ను ఇట్లు ప్రార్థించుట ఏ మాత్రము తగదు. నేను తాపసుల ఆజ్ఞలను పాలింపవలసిన వాడను. కేవలము నా కార్యము (వనవాసము) కొఱకే ఈ వనమున నేను ప్రవేశించితిని. కాని రాక్షసులు మీకొనర్చెడి అపకారమును(ఆగడములను) రూపుమాపుట కొఱకే కాబోలును పితృవాక్య పరిపాలన నెపముతో ఈ వనమున ప్రవేశించితిని. ఈ వనమునకు నారాక మీకార్యసిద్ధికి తోడ్పడుట దైవికము. అందువలన నా ఈ వనవాసము మహాఫలప్రదము కాగలదు. (22-24)

ఓ తపోధనులారా! "తాపసులశత్రువులైన రాక్షసులను పరిమార్చుటనే నేను కోరుకొనుచున్నాను. మా అన్నదమ్ముల బలపరాక్రమములను ఇక మీరు చూచెదరుగాక" (25)

స్థిరమైన ధర్మబుద్ధిగలవీరుడు పూజ్యుడు శ్రీరాముడు ఆ తపోధనులకు అభయమిచ్చెను. పిమ్మట ఆ ప్రభువు వారితో గూడి, సీతాలక్ష్మణసమేతుడై సుతీక్ష్ణ మహర్షికడకు బయలుదేఱెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే షష్ఠస్సర్గః (6)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఆఱవసర్గము.

— * * * —

7. ఏడవసర్గము

శ్రీరాముడు సుతీక్ష్ణమహర్షిని సందర్శించుట, ఆ మహాముని వారికి అతిథి సత్కారములను గావించుట.

రామస్తు సహితో భ్రాత్రా సీతయా చ పరంతపః।
సుతీక్ష్ణస్యాశ్రమపదం జగామ సహ తైర్ద్విజైః। 1

స గత్వా దూరమధ్వానం నదీస్తీర్త్వా బహూదకాః।
దదర్శ విపులం శైలం మహామేఘమివోన్నతమ్। 2

తతస్తదిక్ష్వాకువరౌ సంతతం వివిధైర్ద్రుమైః।
కాననం తౌ వివిశతుః సీతయా సహ రాఘవౌ। 3

ప్రవిష్టస్తు వనం ఘోరం బహుపుష్పఫలద్రుమమ్।
దదర్శాఽశ్రమమేకాంతే చీరమాలాపరిష్కృతమ్। 4

తత్ర తాపసమాసీనం మలపంకజటాధరమ్।
రామస్సుతీక్ష్ణం విధివత్ తపోవృద్ధమభాషత। 5

రామోఽహమస్మి భగవన్ భవంతం ద్రష్టుమాగతః।
త్వం మాఽభివద ధర్మజ్ఞ మహర్షే సత్యవిక్రమ। 6

స నిరీక్ష్య తతో వీరం రామం ధర్మభృతాం వరమ్।
సమాశ్లిష్య చ బాహుభ్యామ్ ఇదం వచనమబ్రవీత్। 7

స్వాగతం ఖలు తే వీర! రామ! ధర్మభృతాం వర।
ఆశ్రమోఽయం త్వయాఽఽక్రాంతః సనాథ ఇవ సాంప్రతమ్। 8

ప్రతీక్షమాణస్త్వామేవ నారోహేఽహం మహాయశః।
దేవలోకమితో వీర! దేహం త్యక్త్వా మహీతలే। 9

చిత్రకూటముపాదాయ రాజ్యభ్రష్టోఽసి మే శ్రుతః। 10

ఇహోపయాతః కాకుత్స్థ! దేవరాజశ్శతక్రతుః।
ఉపాగమ్య చ మాం దేవో మహాదేవస్సురేశ్వరః।
సర్వాన్ లోకాన్ జితానాహ మమ పుణ్యేన కర్మణా। 11

శత్రుదమనుడైన శ్రీరాముడు అచటి బ్రాహ్మణులతో, సీతాలక్ష్మణులతోగూడి సుతీక్ష్ణుని ఆశ్రమమునకు బయలుదేఱెను. (1)

వారు జలసమృద్ధిగలిగిన మందాకినీనదినిదాటి, కొంతదూరము వెళ్ళిన పిమ్మట వారికి ఒక మహా పర్వతము కనబడెను. అది మిగుల ఎత్తైనదై మేఘములను తాకుచుండెను. (2)

అనంతరము ఇక్ష్వాకువంశశ్రేష్ఠులైన ఆ రామలక్ష్మణులు సీతాసమేతులై, వివిధములగు వృక్షములుగల ఒక అరణ్యమున ప్రవేశించిరి. వారు ఆ ఘోరమైన అరణ్యము నందు ఏకాంతప్రదేశమునందుగల ఒక ఆశ్రమమును జూచిరి. అది ఫలపుష్పములతో నిండిన చెట్లతో ఒప్పుచుండెను. అచ్చటచ్చట వ్రేలాడుచున్న వల్కలములు ఆ ఆశ్రమశోభను ఇనుమడింప జేయుచుండెను. (3-4)

ఆ ఆశ్రమమునందు సుతీక్ష్ణమహాముని సుఖాసీనుడై, ధ్యానవిమగ్నుడై యుండెను. ఆయన జటాజూటము మాసియుండెను. శ్రీరాముడు ఆ తాపసిని సమీపించి, వినమ్రుడై ఆయనతో ఇట్లు నుడివెను. (5)

"ఓ పూజ్యమహర్షీ ! నా పేరు శ్రీరాముడు. మిమ్ము దర్శింపవచ్చితిని. మీరు ధర్మజ్ఞులు, సత్య నిష్ఠగలవారు. కనుక మీరు నాతో మాట్లాడుడు." (6)

అంతట ఆ ముని ధర్మనిరతులలో మేటియు, వీరుడును ఐన శ్రీరాముని జూచి, ఆదరముతో కౌగిలించుకొని, ఆయనతో ఇట్లు పలికెను. (7)

"ఓ శ్రీరామా! నీకు స్వాగతము. నీవు మహావీరుడవు, ధనుర్ధారులలో శ్రేష్ఠుడవు. నీవు కాలుమోపుటతో ఈ ఆశ్రమము పునీతమైనది. నిజముగా ఇది ఇప్పుడు చక్కని రక్షణకు నోచుకొనినది. (8)

ఓ పరాక్రమశాలీ! నీవు మిగుల వాసికెక్కినవాడవు. నేను ఇంతవఱకును నీ రాకకై ఇచ్చట నిరీక్షించుచు ఉంటిని. అందువలననే నేను ఈ దేహమును త్యజించి, భూలోకము నుండి దేవలోకమునకు వెళ్లనైతిని. నీవు కోసలరాజ్యాధికారమును కాదని, (వనవాస నిమిత్తమై) చిత్రకూట పర్వతమునకు చేరినట్లు ఇంతకుముందే నేను వినియుంటిని. (9-10)

ఓ రామా! నూఱు యజ్ఞములనొనర్చిన దేవేంద్రుడు ఇచటికి వచ్చియుండెను. దేవతల ప్రభువైన ఆ ఇంద్రుడు నా యొద్దకు వచ్చి, నేను నా పుణ్యకర్మల ప్రభావమున

తేషు దేవర్షిజుష్టేషు జితేషు తపసా మయా।
మత్ప్రసాదాత్ సభార్యస్త్వం విహరస్వ సలక్ష్మణః। 12

తముగ్రతపసా యుక్తం మహర్షిం సత్యవాదినమ్।
ప్రత్యువాచాత్మవాన్ రామః బ్రహ్మాణమివ వాసవః। 13

అహమేవాహరిష్యామి స్వయం లోకాన్ మహామునే!।
ఆవాసం త్వహమిచ్ఛామి ప్రదిష్టమిహ కాననే। 14

భవాన్ సర్వత్ర కుశలః సర్వభూతహితే రతః।
ఆఖ్యాతః శరభంగేణ గౌతమేన మహాత్మనా। 15

ఏవముక్తస్తు రామేణ మహర్షిర్లోకవిశ్రుతః।
అబ్రవీన్మధురం వాక్యం హర్షేణ మహతాఽఽప్లుతః। 16

అయమేవాశ్రమో రామ! గుణవాన్ రమ్యతామిహ।
ఋషిసంఘానుచరితః సదా మూలఫలాన్వితః। 17

ఇమమాశ్రమమాగమ్య మృగసంఘా మహాయశః!।
అటిత్వా ప్రతిగచ్ఛంతి లోభయిత్వాఽకుతోభయాః।
నాఽన్యో దోషో భవేదత్ర మృగేభ్యోఽన్యత్ర విద్ధి వై। 18

తచ్ఛ్రుత్వా వచనం తస్య మహర్షేర్లక్ష్మణాగ్రజః।
ఉవాచ వచనం ధీరో వికృష్య సశరం ధనుః। 19

తానహం సుమహాభాగ మృగసంఘాన్ సమాగతాన్।
హన్యాం నిశితధారేణ శరేణాశనివర్చసా। 20

భవాన్ తత్రాభిషజ్యేత కిం స్యాత్ కృచ్ఛ్రతరం తతః।
ఏతస్మిన్నాశ్రమే వాసం చిరం తు న సమర్థయే। 21

సకలలోకములను జయించినట్లు తెల్పెను. దేవతలును, ఋషులును సేవించునట్టి ఆ లోకమున్నియును నా తపశ్శక్తి వలన నా వశమునందున్నవి. నేను మిగుల ప్రసన్నచిత్తుడనై వాటిని నీకు సమర్పించుచున్నాను. నీవు సీతాలక్ష్మణసహితుడవై అందు విహరింపుము". (11-12)

ఇంద్రుడు బ్రహ్మదేవునితోవలె, మహాతపస్వియు, సత్యవాదియు ఐన ఆ సుతీక్ష్ణమహర్షితో మహాత్ముడైన శ్రీరాముడు ఇట్లు పలికెను. (13)

"ఓ మహామునీ! ఈ లోకములనన్నింటిని నేను సులభముగనే పొందగలను. ఈ వనమున ఒక కుటీరమును నిర్మించుకొని, నివసించుటకు అనువగు ప్రదేశమును నీవు తెల్పిన చాలును. ఓ పూజ్యమహర్షీ! నీవు సకల ప్రాణులహితమును గోరెడివాడవు. ఇహపరలోకములను (సమస్తవిషయములను) గూర్చి బాగుగా ఎఱిగినవాడవు నాకు ఈ విషయములను గౌతమవంశజుడైన శరభంగమహాముని తెల్పియుండెను." (14-15)

శ్రీరాముడు ఇట్లు పలుకగా లోకప్రసిద్ధుడైన ఆ సుతీక్ష్ణమహర్షి సంతోషముతో పొంగిపోయినవాడై ఆయనతో మధురముగా ఇట్లు నుడివెను. (16)

"ఓ రామచంద్రప్రభూ! ఈ ఆశ్రమము సర్వసౌకర్యములతో విలసిల్లుచున్నది. ఇచటి వాతావరణము ఎంతయు ఆహ్లాదకరముగానుండును. మహర్షులెల్లరును ఇచటికి వచ్చిపోవుచుందురు. కందమూలఫలములు ఇచట పుష్కలముగా లభించును. కనుక మీరు ఇందే నివసింపుడు. ఓ మహాత్మా! అప్పుడప్పుడు లేళ్లగుంపులు ఇతరమృగములు పరస్పరవైరములుమాని ఈ వనమునకు వచ్చి, ఇచట నిర్భయముగా సంచరించుచుండును. అవి తమరూప లావణ్యములచే అందఱిమనస్సులను ఆకర్షించుచు, ఎవ్వరికిని ఎట్టి ఇబ్బందిని కల్గింపక వెడలిపోవుచుండును. ఈ మృగములసంచారముదప్ప ఇచట మఱియొక దోషమేదియును లేదని యెఱుంగుము". (17-18)

అంతట ధీరుడైన శ్రీరాముడు ఆ మహర్షివచనములను విని, ధనుర్బాణములను చేతబట్టి ఆయనతో ఇట్లు నుడివెను. (19)

"ఓ మహాపురుషా! ఇచటికి వచ్చెడి ఆ మృగముల గుంపులు ఒకవేళ మీకు కష్టమును కలిగించినచో వాటిని నేను వజ్రాయుధమువలె వాడియైన నా బాణముచే తునుమాడెదను. ఓ పూజ్యమహర్షీ! నేను మృగములను సంహరించుట మీకు బాధాకరము గావచ్చును. మీ మనస్సు నొచ్చుకొనినచో అంతకంటెను కష్టతరమైనది మీకు మఱియొకటి యుండదు. కనుక ఈ ఆశ్రమము నందు ఎక్కువ కాలము నివసించుటకు నేను ఇచ్చగింపను"-

తమేవముక్త్వా వరదం రామః సంధ్యాముపాగమత్। 22

అన్వాస్య పశ్చిమాం సంధ్యాం తత్ర వాసమకల్పయత్।
సుతీక్ష్ణస్యాఽఽశ్రమే రమ్యే సీతయా లక్ష్మణేన చ। 23

తతః శుభం తాపసభోజ్యమన్నం
స్వయం సుతీక్ష్ణః పురుషర్షభాభ్యామ్ ।
తాభ్యాం సుసత్కృత్య దదౌ మహాత్మా
సంధ్యానివృత్తౌ రజనీమవేక్ష్య । 24

మునితో ఇట్లు పల్కిన పిమ్మట అందులకు ఆయన సమ్మతితో సంధ్యోపాసనకై శ్రీరాముడు సరస్వతీరమునకు చేరెను. (20-22)

సాయం సంధ్యోపాసనను ముగించుకొనిన పిదప శ్రీరాముడు సీతాలక్ష్మణులతో గూడి రమ్యమైన ఆ సుతీక్ష్ణుని ఆశ్రమము నందే నివసించెను. (23)

మహాత్ముడైన సుతీక్ష్ణమహర్షి సంధ్యోపాసనలఅనంతరము పురుషశ్రేష్ఠులైన రామలక్ష్మణులకును సీతాదేవికిని అర్ఘ్యపాద్యాది సకలోపచారములనొనర్చెను. పిదప రాత్రివేళ అనువగు సమయమున ఆ మహర్షి వారికి మునులు స్వీకరించెడి పవిత్రములైన కందమూలఫలములను ఆదరపూర్వకముగా స్వయముగా సమర్పించెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే సప్తమస్సర్గః (7)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏడవసర్గము.

-- ❋ ❋ ❋ --

8. ఎనిమిదవసర్గము

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణుని అనుమతిగైకొని, మునీశ్వరులతో గూడి దండకారణ్యమునకు బయలుదేఱుట.

రామస్తు సహసౌమిత్రిః సుతీక్ష్ణేనాభిపూజితః।
పరిణామ్య నిశాం తత్ర ప్రభాతే ప్రత్యబుధ్యత। 1

ఉత్థాయ తు యథాకాలం రాఘవః సహ సీతయా।
ఉపాస్పృశత్ సుశీతేన జలేనోత్పలగంధినా। 2

అథ తేఽగ్నిం సురాం శ్చైవ వైదేహీ రామలక్ష్మణౌ।
కాల్యం విధివదభ్యర్చ్య తపస్విశరణే వనే। 3

ఉదయంతం దినకరం దృష్ట్వా విగతకల్మషాః।
సుతీక్ష్ణమభిగమ్యేదం శ్లక్ష్ణం వచనమబ్రువన్। 4

సుఖోషితాః స్మ భగవన్! త్వయా పూజ్యేన పూజితాః।
ఆపృచ్ఛామః ప్రయాస్యామో మునయస్త్వరయంతి నః। 5

త్వరామహే వయం ద్రష్టుం కృత్స్నమాశ్రమమండలమ్।
ఋషీణాం పుణ్యశీలానాం దండకారణ్యవాసినామ్। 6

సీతారామలక్ష్మణులు సుతీక్ష్ణమహర్షిచే అతిథిపూజా సత్కారములనందుకొని, ఆశ్రమమునందే ఆ రాత్రి గడిపిరి. వారు ప్రభాతవేళ మేల్కొనిరి. సకాలములో నిద్రనుండి లేచిన సీతారాములు సువాసనలను వెదజల్లుచున్న కలువపూలకొలనులోని గోరువెచ్చని నీటిలో స్నానములను ఆచరించిరి. (లక్ష్మణుడు అంతకు ముందే స్నానమొనర్చి వారిసేవలకు సిద్ధముగానుండెను.) (1-2)

అనంతరము సీతారామలక్ష్మణులు ఆ సుతీక్ష్ణునితపోవనము నందే విధ్యుక్తముగా హోమకార్యములను, దేవతారాధనలను సకాలములో ముగించుకొనిరి. పిదప వారు ఉదయించుచున్న సూర్యుని దర్శించి, సుతీక్ష్ణుని సమీపించి ఆయనతో మృదుమధురముగా ఇట్లు నుడివిరి. (3-4)

"ఓ పూజ్యమహర్షీ! మీరు మాకు అతిథిపూజా సత్కారములను నెఱపితిరి. ఇచట మేము హాయిగానుంటిమి. మా వెంటనున్న ఈ మునులు అందఱును తొందర పెట్టుచున్నారు. మీరు మా ప్రయాణమునకు అనుమతింప ప్రార్థన. దండకారణ్యమున నివసించునట్టి పుణ్యాత్ములైన మునీశ్వరుల యొక్క వివిధాశ్రమములను దర్శించుటకై మేము మిక్కిలి కుతూహలముతో ఉన్నాము. ధర్మనిరతులును,

అభ్యనుజ్ఞాతుమిచ్ఛామః సహైభిర్మునిపుంగవైః।
ధర్మనిత్యైస్తపోదాంతైః విశిఖైరివ పావకైః। 7

అవిషహ్యాతపో యావత్ సూర్యో నాఽతివిరాజతే।
అమార్గేణాఽఽగతాం లక్ష్మీం ప్రాప్యేవాన్వయవర్జితః। 8

తావదిచ్ఛామహే గంతుమ్ ఇత్యుక్త్వా చరణౌ మునేః।
వవందే సహ సౌమిత్రిః సీతయా సహ రాఘవః। 9

తౌ సంస్పృశంతౌ చరణౌ ఉత్థాప్య మునిపుంగవః।
గాఢమాలింగ్య సస్నేహమ్ ఇదం వచనమబ్రవీత్। 10

అరిష్టం గచ్ఛ పంథానం రామ! సౌమిత్రిణా సహ।
సీతయా చాఽనయా సార్ధం ఛాయయేవానువృత్తయా। 11

పశ్యాఽఽశ్రమపదం రమ్యం దండకారణ్యవాసినామ్।
ఏషాం తపస్వినాం వీర! తపసా భావితాత్మనామ్। 12

సుప్రాజ్యఫలమూలాని పుష్పితాని వనాని చ।
ప్రశస్తమృగయూథాని శాంతపక్షిగణాని చ। 13

ఫుల్లపంకజషండాని ప్రసన్నసలిలాని చ।
కారండవవికీర్ణాని తటాకాని సరాంసి చ। 14

ద్రక్ష్యసే దృష్టిరమ్యాణి గిరిప్రస్రవణాని చ।
రమణీయాన్యరణ్యాని మయూరాభిరుతాని చ। 15

గమ్యతాం వత్స! సౌమిత్రే! భవానపి చ గచ్ఛతు।
ఆగంతవ్యం త్వయా తాత! పునరేవాశ్రమం మమ। 16

ఏవముక్తస్తథేత్యుక్త్వా కాకుత్స్థః సహలక్ష్మణః।
ప్రదక్షిణం మునిం కృత్వా ప్రస్థాతుముపచక్రమే। 17

తతః శుభతరే తూణీ ధనుషీ చాయతేక్షణా।
దదౌ సీతా తయోర్భ్రాత్రోః ఖడ్గౌ చ విమలౌ తతః। 18

జ్వాలలు ఆగిన అగ్నివలె ప్రశాంతముగా ఉన్నవారును, జితేంద్రియులై తపస్సులను చేయుచున్నవారును అగు మహామునులు (మా వెంటనున్న ఈ మునులు)ను, మేమును మీ అనుజ్ఞకై అర్థించుచున్నాము. (5-7)

దుష్టుడైన ప్రభువు అపమార్గమున (అధర్మమార్గమున) వచ్చిపడిన రాజ్యసంపదలకు మిడిసిపడుచుండునట్లు సూర్యకిరణములు తట్టుకొనలేనంతగా వేడెక్కకముందే మేము ప్రయాణము చేయగోరుచున్నాము"- అని పలికి, శ్రీరాముడు సీతా లక్ష్మణులతోగూడి, ఆ సుతీక్ష్ణమహర్షి పాదములకు ప్రణమిల్లెను. (8-9)

అంతట ఆ మునీశ్వరుడు తనపాదములవంటి నమస్కరించు చున్న రామలక్ష్మణులను లేవనెత్తి, గాఢముగా కౌగిలించుకొని, ప్రేమపూర్వకముగా వారితో ఇట్లు నుడివెను. (10)

"ఓ రామా! నీడవలె నిన్ను వెన్నంటి వచ్చుచున్న ఈ సీతాదేవితోడను, లక్ష్మణునితోడను గూడి, ఎట్టి ఉపద్రవములునులేని దారిలో సాగిపొమ్ము. ఓ మహావీరా! తపఃప్రభావముచే నిర్మలములైన అంతఃకరణములుగలవారును, దండకారణ్యములలో నివసించువారును అగు ఈ మునీశ్వరులయొక్క రమ్యములైన ఆశ్రమములను దర్శింపుము. (11-12)

నాయనా! రామా! ఆ దండకవనములలో కందమూల ఫలములు కొల్లలుగా లభించును, వృక్షములన్నియును వికసించిన పూవులతో నిండియుండును. ప్రసిద్ధములైన మృగముల సమూహములు తిరుగాడుచుండును, గుంపులు గుంపులుగా పక్షులన్నియును ఎగురుచుండును. అచటి చెఱువులు, సరస్సులు బాగుగా వికసించిన పద్మములతో, స్వచ్ఛములైన జలములతో, అంతటను వ్యాపించియున్న కన్నె లేడి పిట్టలతో కనువిందు గావించుచుండును, గిరులనుండి ప్రసరించు సెలయేళ్లు రమణీయములై చూడముచ్చటగొల్పుచుండును. ఈ విధముగా మనోహరములైన ఆ అరణ్యములు నెమళ్ల క్రేంకారములతో వీనులవిందు గావించుచుండును, దర్శనీయములైన ఆ ప్రదేశములను చక్కగా వీక్షింపుము. రామా! ప్రయాణమును నెమ్మదిగా కొనసాగింపుము. నాయనా! లక్ష్మణా! నీవును వెళ్లుము. నాయనలారా! మా ఆశ్రమమునకు మఱల తప్పక విచ్చేయుడు". (13-16)

ముని ఇట్లు పలుకగా- 'అట్లే'యని, శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై, ఆ మహర్షికి ప్రదక్షిణపూర్వకముగా నమస్కరించి, ప్రయాణమునకు సన్నద్ధుడాయెను. (17)

అంతట విశాలములైన నేత్రములుగల సీతాదేవి చక్కని అమ్ములపొదులను, ధనుస్సులను, స్వచ్ఛములై మెఱయుచున్న ఖడ్గములను రామలక్ష్మణులకు తెచ్చియిచ్చెను. పిమ్మట ఆ సోదరులు ఇరువురును శ్రేష్ఠమైన తూణీరములను,

ఆబధ్య చ శుభే తూణీ చాపౌ చాదాయ సస్వనౌ।
నిష్క్రాంతావాశ్రమాద్గంతుమ్ ఉభౌ తౌ రామలక్ష్మణౌ। 19

శ్రీమంతౌ రూపసంపన్నౌ దీప్యమానౌ స్వతేజసా।
ప్రస్థితౌ ధృతచాపౌ తౌ సీతయా సహ రాఘవౌ। 20

టంకారములతో ఒప్పుచున్న ఆ ధనుస్సులను ధరించి, ప్రయాణమునకై ఆ ఆశ్రమమునుండి బయటికి వచ్చిరి. శుభలక్షణములతో, రూపవైభవములతో విలసిల్లుచు, తమ దివ్య తేజస్సులను విరజిమ్ముచున్న ఆ రామలక్ష్మణులు ధనుస్సులను చేబూని, సీతాసహితులై ముందునకు నడువసాగిరి. (18-20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే అష్టమస్సర్గః (8)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఎనిమిదవసర్గము.

— ✳ ✳ ✳ —

9. తొమ్మిదవసర్గము

"దండకారణ్యమునందలి రాక్షసులయెడ ఎట్టి వైరభావమూ లేకుండ వారిని చంపబూనుట ఎంతవఱకు యుక్తము?" అని సీతాదేవి శ్రీరామునకు విన్నవించుట.

సుతీక్ష్ణేనాభ్యనుజ్ఞాతం ప్రస్థితం రఘునందనమ్।
హృద్యయా స్నిగ్ధయా వాచా భర్తారమిదమబ్రవీత్। 1

అయం ధర్మః సుసూక్ష్మేణ విధినా ప్రాప్యతే మహాన్।
నివృత్తేన తు శక్యోఽయం వ్యసనాత్ కామజాదిహ। 2

త్రీణ్యేవ వ్యసనాన్యత్ర కామజాని భవంత్యుత।
మిథ్యావాక్యం పరమకం తస్మాద్గురుతరావుభౌ।
పరదారాభిగమనం వినా వైరం చ రౌద్రతా। 3

మిథ్యావాక్యం న తే భూతం న భవిష్యతి రాఘవ!
కుతోఽభిలాషణం స్త్రీణాం పరేషాం ధర్మనాశనమ్। 4

తవ నాస్తి మనుష్యేంద్ర! న చాభూత్ తే కదాచన।
మనస్యపి తథా రామ! న చైతద్విద్యతే క్వచిత్। 5

స్వదారనిరతస్త్వం చ నిత్యమేవ నృపాత్మజ!
ధర్మిష్ఠః సత్యసంధశ్చ పితుర్నిర్దేశకారకః। 6

సత్యసంధ! మహాభాగ! శ్రీమన్ లక్ష్మణపూర్వజ!
త్వయి సత్యం చ ధర్మశ్చ త్వయి సర్వం ప్రతిష్ఠితమ్। 7

తచ్చ సర్వం మహాబాహో! శక్యం ధర్తుం జితేంద్రియైః।
తవ వశ్యేంద్రియత్వం చ జానామి శుభదర్శన! 8

తన భర్తయగు శ్రీరాముడు సుతీక్ష్ణమహర్షి యొక్క అనుమతితో బయలు దేఱుటను జూచి సీతాదేవి ప్రేమతో యుక్తియుక్తముగా ఇట్లు వచించెను. (1)

ఆర్యపుత్రా! ఈ మునిధర్మము మహోన్నతమైనది. మిక్కిలి సూక్ష్మమైనది, అతి నిశితమైనది. దీనినెఱుంగుట మిగుల కష్టము. కామజములైన వ్యసనములనుండి బయటపడినవారికి మాత్రమే ఈ ధర్మమును అవలంబించుట సాధ్యమగును. (2)

ఈ లోకమున ప్రముఖములైన కామజములగు వ్యసనములు మూడు గలవు. ఆ మూడింటిలో అబద్ధములాడుట మొదటిది. పరస్త్రీవ్యామోహము రెండవది. తనకు ఎట్టి వైరభావము లేకున్నను ప్రాణిహింసకు పూనుకొనుట మూడవది. వివరి రెండును మిథ్యావచనముకంటెను మిగుల ప్రమాదకరమైనవి. (3)

ఓ రాఘవా! ఇంతకుముందుగాని, ప్రస్తుతముగాని, ఇక మీదటగాని అసత్యవచనము మీరు ఎఱుగనిది. పరస్త్రీవాంఛ అధర్మమూలకము. ధర్మనిరతులైన మీకు అది అసంభవము. ఓ మహాపురుషా! శ్రీరామా! పరస్త్రీఆకాంక్ష మీకు లేదు. ఎన్నడును అది మీలో కలుగనే కలుగదు. అంతేగాదు. మీ మనస్సులో దానికి చోటే లేదు. (4-5)

ఓ రాజకుమారా! నీవు పరమధార్మికుడవు. సత్యసంధుడవు, తండ్రిమాటను జవదాటనివాడవు. అంతేగాదు నీవు ఏకపత్నీవ్రతుడవు. ఓ సత్యవచనా! మహాత్మా! సకలైశ్వర్యసంపన్నా! లక్ష్మణాగ్రజా! సత్యము, ధర్మము నిన్నే ఆశ్రయించుకొనియుండును. ఐశ్వర్య, వైరాగ్యాదిసకలసద్గుణములకు నీవు పెన్నిధివి. (6-7)

ఓ మహాబాహూ! శుభదర్శనా! నీవు జితేంద్రియుడవని నేనెఱుగుదును- సత్యపాలనము మున్నగు సమస్తధర్మములను నిర్వహించుట జితేంద్రియులకుమాత్రమే సాధ్యము. (8)

తృతీయం యదిదం రౌద్రం పరప్రాణాభిహింసనమ్।
నిర్వైరం క్రియతే మోహాత్ తచ్చ తే సముపస్థితమ్। 9

ప్రతిజ్ఞాతస్త్వయా వీర! దండకారణ్యవాసినామ్।
ఋషీణాం రక్షణార్థాయ వధస్సంయతి రక్షసామ్। 10

ఏతన్నిమిత్తం చ వనం దండకా ఇతి విశ్రుతమ్।
ప్రస్థితస్త్వం సహ భ్రాత్రా ధృతబాణశరాసనః। 11

తత స్త్వాం ప్రస్థితం దృష్ట్వా మమ చింతాకులం మనః।
త్వద్వృత్తం చింతయంత్యా వై భవేన్నిశ్శ్రేయసం హితమ్। 12

న హి మే రోచతే వీర! గమనం దండకాన్ ప్రతి।
కారణం తత్ర వక్ష్యామి వదంత్యాః శ్రూయతాం మమ। 13

త్వం హి బాణధనుష్పాణిః భ్రాత్రా సహ వనం గతః।
దృష్ట్వా వనచరాన్ సర్వాన్ కచ్చిత్ కుర్యాః శరవ్యయమ్। 14

క్షత్రియాణామపి ధనుః హుతాశస్యేంధనాని చ।
సమీపతః స్థితం తేజో బలముచ్ఛ్రయతే భృశమ్। 15

పురా కిల మహాబాహో! తపస్వీ సత్యవాక్శుచిః।
కస్మింశ్చిదభవత్ పుణ్యే వనే రతమృగద్విజే। 16

తస్యైవ తపసో విఘ్నం కర్తుమింద్రః శచీపతిః।
ఖడ్గపాణిరథాగచ్ఛత్ ఆశ్రమం భటరూపధృత్। 17

తస్మింస్తదాశ్రమపదే నిశితః ఖడ్గ ఉత్తమః।
స న్యాసవిధినా దత్తః పుణ్యే తపసి తిష్ఠతః। 18

స తచ్ఛస్త్రమనుప్రాప్య న్యాసరక్షణతత్పరః।
వనే తం విచరత్యేవ రక్షన్ ప్రత్యయమాత్మనః। 19

యత్ర గచ్ఛత్యుపాదాతుం మూలాని చ ఫలాని చ।
న వినా యాతి తం ఖడ్గం న్యాసరక్షణతత్పరః। 20

నిత్యం శస్త్రం పరివహన్ క్రమేణ స తపోధనః।
చకార రౌద్రీం స్వాం బుద్ధిం త్యక్త్వా తపసి నిశ్చయమ్। 21

వైరభావము ఏమియు లేకున్నను మానవులు అజ్ఞాన వశమున ఇతరప్రాణులను హింసించుచుందురు. ఆ పరిస్థితి నీకు ఇప్పుడు ఎదురైనది. ఏలనన ఓ మహావీరా! దండకారణ్యములలో నివసించుచుండెడి మహర్షులను రక్షించుటకై రాక్షసులను యుద్ధమున వధించెదనని నీవు ప్రతిజ్ఞ చేసియుంటివి. ఈ కారణమువలననే నీవు సోదరునితోగూడి ధనుర్బాణములను ధరించి దండకారణ్యమని ప్రసిద్ధికెక్కిన వనములకు బయలుదేఱితివి. ఆడినమాట తప్పనివాడవు, (చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి యుండువాడవు) ఏకపత్నీవ్రతుడవు ఐన నీవు ఇట్లు బయలుదేఱుటను జూచి, అనవరతము నీ సౌఖ్యమును, హితమును కోరుకొనుచుండెడి నా మనస్సు మిగుల వ్యాకులపడుచున్నది. (9-12)

ఓ వీరా! నీవు ఇట్లు దండకారణ్యములకు ప్రయాణము చేయుట నాకు తృప్తిగా లేదు- నేను అందులకు కారణములను తెలిపెదను వినుము. నీవు ధనుర్బాణములను చేబూని, లక్ష్మణసహితుడవై, వనములలో అడుగిడిన పిమ్మట అచట సంచరించెడి క్రూరమృగములపై, రాక్షసులపై బాణములను ప్రయోగింతువు గదా! (13-14)

సమిధలు సమీపమున ఉండుటవలనను అగ్ని యొక్క తేజోబలములు వృద్ధియగునట్లు ధనుర్బాణములను ధరించుట వలనను క్షత్రియులయొక్క శౌర్యపరాక్రమములు తేజరిల్లును. (15)

ఓ మహాబాహూ! పూర్వకాలమున మృగములు, పక్షులు, హాయిగా జీవించుచుండెడి ఒక పవిత్ర (ప్రశాంత) వనమున ఒక తపస్వి ఉండెడివాడు. అతడు సత్యవచనుడు, నిర్మలమైన మనస్సుగలవాడు- శచీపతియైన ఇంద్రుడు ఆ ముని తపస్సును భంగపఱచుటకై ఒక ఖడ్గమును దీసికొని, భటునిరూపములో ఆ ఆశ్రమమునకు వచ్చెను. పవిత్రుడైన ఆ తపస్వి నివసించుచున్న ఆ ఆశ్రమమునకు విచ్చేసిన పిమ్మట భటునిరూపమునఉన్న ఇంద్రుడు వాడియైన (తన చేతిలోని) ఆ మహాఖడ్గమును ఆ తాపసికడ న్యాసముగా[1] ఉంచెను. (16-18)

ఆ తపస్వి తనయొద్ద నమ్మకముతో న్యాసముగా ఉంచిన ఆ ఖడ్గమును తీసికొని, వనమున సంచరించు చున్నప్పుడు దానిని రక్షించుటయందే తత్పరుడై యుండెను. కందమూలఫలాదులను సేకరించుటకై వెళ్లినప్పుడుగూడ ఆ తాపసి న్యాసరక్షణనిరతుడై, ఆ ఖడ్గమును తనయొద్దనే ఉంచుకొను చుండెడివాడు. ఆ తపోధనుడు అనుక్షణము ఆ ఖడ్గమును రక్షించుకొనుటయందే నిమగ్నుడై యుండుట వలన క్రమముగా తనతపస్సునందు ఏకాగ్రతను కోల్పోయెను. దానిప్రభావమున అతనిబుద్ధి హింసాత్మకముగా మాఱెను. (19-21)

1) 'రాజులవలన భీతికారణమువలనను, చోరులభయమువలనను, దాయాదులు వంచించి అపహరింతురను భయముతోడను ఒకడు తనద్రవ్యమును ఇతరులయింట భద్రముగా ఉంచుటను న్యాసము'- అని యందురు.

తత స్స రౌద్రేఽభిరతః ప్రమత్తోఽధర్మకర్శితః।
తస్య శస్త్రస్య సంవాసాత్ జగామ నరకం మునిః। 22

ఏవమేతత్ పురావృత్తం శస్త్రసంయోగకారణమ్। 23

అగ్నిసంయోగవద్ధేతుః శస్త్రసంయోగ ఉచ్యతే।
స్నేహాచ్చ బహుమానాచ్చ స్మారయే త్వాం న శిక్షయే। 24

న కథంచన సా కార్యా గృహీతధనుషా త్వయా।
బుద్ధిర్వైరం వినా హంతుం రాక్షసాన్ దండకాశ్రితాన్।
అపరాధం వినా హంతుం లోకాన్ వీర! న కామయే। 25

క్షత్రియాణాం తు వీరాణాం వనేషు నిరతాత్మనామ్।
ధనుషా కార్యమేతావత్ ఆర్తానామ్ అభిరక్షణమ్। 26

క్వచ శస్త్రం క్వచ వనం క్వచ క్షాత్రం తపః క్వచ।
వ్యావిద్ధమిదమస్మాభిః దేశధర్మస్తు పూజ్యతామ్। 27

తదార్య కలుషా బుద్ధిః జాయతే శస్త్రసేవనాత్।
పునర్గత్వా త్వయోధ్యాయాం క్షత్రధర్మం చరిష్యసి। 28

అక్షయా తు భవేత్ ప్రీతిః శ్వశ్రూశ్వశురయోర్మమ।
యది రాజ్యం పరిత్యజ్య భవేస్త్వం నిరతో మునిః। 29

ధర్మాదర్థః ప్రభవతి ధర్మాత్ ప్రభవతే సుఖమ్।
ధర్మేణ లభతే సర్వం ధర్మసారమిదం జగత్। 30

ఆత్మానం నియమైస్తైస్తైః కర్శయిత్వా ప్రయత్నతః।
ప్రాప్యతే నిపుణైర్ధర్మో న సుఖాల్లభ్యతే సుఖమ్। 31

నిత్యం శుచిమతిస్సౌమ్య! చర ధర్మం తపోవనే।
సర్వం హి విదితం తుభ్యం త్రైలోక్యమపి తత్త్వతః। 32

ఆ శస్త్రము (ఖడ్గము) యొక్క సంపర్కమువలన ఆ ముని తపస్సునకు దూరమై, అధర్మమార్గమునకు లోనై, హింసాత్మక చర్యలకు దిగెను. తత్ఫలితముగా ఆయనకు నరకము ప్రాప్తించెను. హింసాప్రవృత్తిని కలిగించెడి ఒక శస్త్రసంపర్కమున జరిగిన ఒక పూర్వ వృత్తాంతమిది. (22-23)

అగ్ని సంబంధమువలన ఆ వస్తువునందు మార్పు కలుగునట్లు శస్త్రము కలిగియుండుటచేతను మనుష్యులబుద్ధులు మారుచుండును. మీ యందలి అనురాగమువలనను, గౌరవకారణమునను ఈ వృత్తాంతమును మీకు జ్ఞప్తికి తెచ్చితినే గాని ఇది హితబోధ ఏమాత్రమూ గాదు. (24)

ధనుర్ధారివైన నీవు దండకారణ్యమునందలి రాక్షసుల యెడ ఎట్టి వైరభావమూ లేకుండా వారిని చంపదలంచుట ఏ విధముగను యుక్తము కాదుగదా! ఓ వీరా! నిరపరాధులైన వారిని చంపుట నాకు సమ్మతము గాదు. (25)

వనములలో నిరంతరము తపమొనర్చుచుండెడి మునులు రాక్షసాదులవలన ఆర్తులైనచో క్షత్రియ వీరులు ధనుర్బాణములను ధరించి, వారిని రక్షింపవలసినదే.(26)

శస్త్రధారణమెక్కడ? వనవాసమెక్కడ? క్షత్రియ ధర్మమెక్కడ? తపోవృత్తి యెక్కడ? ఇవియన్నియును పరస్పరవిరుద్ధములు. ఇప్పుడు మనము వనవాసమునమంటిమి. కనుక మనము వనజీవనధర్మమైన తపఃప్రవృత్తినే కలిగియుండవలెను. అనగా మనము ఇచట తపోవిధులను పాటించుటయే యుక్తము. (27)

ఓ ఆర్యా! శస్త్రధారణమువలన బుద్ధి కలుషితమగును. కనుక వనవాసదీక్ష ముగిసిన పిమ్మట మీరు అయోధ్యకు వెళ్ళినప్పుడు అక్కడ క్షత్రియధర్మమును అవలంబింపవచ్చును. మీరు రాజ్యమును పరిత్యజించి, (రాజ్య విషయమును మఱచి) పూర్తిగా మునివృత్తిలో నిమగ్నులైనచో నా అత్త మామలకు (మీ తల్లిదండ్రులకు) ఎనలేని ప్రీతి కలుగును. (28-29)

ధర్మాచరణమువలన సంపదలు సమకూరును, ధర్మమును అనుష్ఠించుటవలననే సుఖశాంతులు లభ్యము. ధర్మమువలన జ్ఞానము, తద్ద్వారా ముక్తియు లభించును. ఈ జగత్తునకు ధర్మమే ఆధారము. చాంద్రాయణాది వ్రతములను పాటించుచు ప్రయత్నపూర్వకముగా శరీరమును కృశింపజేసి, బుద్ధిమంతులు తపోధర్మమును ఆచరించుదురు. దానివలన ముక్తి లభించును. అంతేగాని శరీరసుఖములకుమాత్రమే పరిమితమై జీవయాత్ర గడపినచో ముక్తి లభింపదు. (30-31)

ఓ సౌమ్యుడా! నిర్మలబుద్ధితో నిత్యము తపోవన ధర్మమునే ఆచరింపుము. ముల్లోకములకు సంబంధించిన పురుషార్థములు అన్నియును పూర్తిగా నీరెఱిగినవే. స్త్రీచాపల్యముచే (మీయందుగల అనురాగముచే) నేను

స్త్రీచాపలాదేతదుదాహృతం మే
ధర్మం చ వక్తుం తవ కస్సమర్థః ।
విచార్య బుద్ధ్యా తు సహానుజేన
యద్రోచతే తత్ కురు మాచిరేణ । 33

ఇట్లు పలికితినే గాని. ధర్మమును గూర్చి మీకు తెల్పగల సమర్థులెవరు? కనుక సోదరుడగు లక్ష్మణునితో వెంటనే బాగుగా ఆలోచించి, మీ ఇష్టానుసారము చేయుడు.(32-33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే నవమస్సర్గః *(9)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది తొమ్మిదవసర్గము.

-- * * * --

10. పదియవసర్గము

"ఎట్టి పరిస్థితులలోను ప్రతిజ్ఞాభంగమునకు పాల్పడను". అని శ్రీరాముడు సీతాదేవికి స్పష్టపఱచుట.

వాక్యమేతత్ తు వైదేహ్యా వ్యాహృతం భర్తృభక్తయా ।
శ్రుత్వా ధర్మే స్థితో రామః ప్రత్యువాచాథ మైథిలీమ్ । 1

పతిభక్తి పరాయణయైన సీతాదేవి పలికిన ఈ వచనములను విని, ధర్మనిరతుడైన శ్రీరాముడు ఆమెకు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (1)

హితముక్తం త్వయా దేవి! స్నిగ్ధయా సదృశం వచః ।
కులం వ్యపదిశంత్యా చ ధర్మజ్ఞే! జనకాత్మజే! । 2

'ఓ దేవీ! నీవు మహోన్నతమైన జనకమహారాజ వంశమున జన్మించినదానవు. ధర్మజ్ఞురాలవు, నాపై నీకు గల అనురాగము గాఢమైనది. అన్నివిధములుగా నీకు తగినట్లుగా నాహితమును గోరుచు వచించితివి. (2)

కిం తు వక్ష్యామ్యహం దేవి! త్వయైవోక్తమిదం వచః ।
క్షత్రియైర్ధార్యతే చాపో నార్తశబ్దో భవేదితి । 3

ఓ దేవీ! 'క్షత్రియులు ధనుర్ధారులైయున్నచోట ఆర్తనాదము వినబడరాదు.' అని నీవే నుడివియుంటివి. ఇక నేనుచెప్పవలసినది ఏమున్నది? (3)

తే చార్తా దండకారణ్యే మునయః సంశితవ్రతాః ।
మాం సీతే! స్వయమాగమ్య శరణ్యాః శరణం గతాః । 4

వసంతో ధర్మనిరతా వనే మూలఫలాశనాః ।
న లభంతే సుఖం భీతా రాక్షసైః క్రూరకర్మభిః । 5

ఓ సీతా! దండకారణ్యమునందు దీక్షతో తపస్సొనరించుచున్న ఆ మునులు ఆర్తులై, స్వయముగా వచ్చి నన్ను శరణుజొచ్చిరి. వారు రక్షింపదగినవారు. వారు వనములలో కందమూలఫలములను ఆహారముగా గొనుచు ధర్మనిరతులై జీవించుచున్నవారు. క్రూరాత్ములైన రాక్షసులఆగడములకు తట్టుకొనలేక భయగ్రస్తులై వారు సుఖశాంతులకు దూరమైయున్నారు. (4-5)

కాలే కాలే చ నిరతా నియమైర్వివిధైర్వనే ।
భక్ష్యంతే రాక్షసైర్భీమైః నరమాంసోపజీవిభిః । 6

తే భక్ష్యమాణా మునయో దండకారణ్యవాసినః ।
అస్మానభ్యవపద్యేతి మామూచుర్ద్విజసత్తమాః । 7

వారు వనములయందు నిరంతరము వివిధములగు నియమములను పాటించుచు తమతపోవిధులలో నిరతులై యుందురు. నరమాంసభక్షకులైన భయంకరరాక్షసులు ఆ సాధుపురుషులను చంపి తినివేయుచుందురు. అట్లు వారు రాక్షసులు పెట్టెడి బాధలకు గుఱియగుచున్నవారు, దండకారణ్యవాసులు, ద్విజోత్తములు ఐన ఆ మునులు 'మమ్ములను అనుగ్రహింపుము'- అని నన్ను వేడుకొనిరి. (6-7)

మయా తు వచనం శ్రుత్వా తేషామేవం ముఖాచ్చ్యుతమ్ ।
కృత్వా చరణశుశ్రూషాం వాక్యమేతదుదాహృతమ్ । 8

వారు స్వయముగా నుడివిన ఆ మాటలను సావధానముగా వింటిని. పిమ్మట వారికి పాదాభివందన మొనర్చి, ఇట్లు వచించితిని. (8)

ప్రసీదంతు భవంతో మే హ్రీరేషా హి మమాతులా।
యదీదృశైరహం విప్రైః ఉపస్థేయైరుపస్థితః।
కిం కరోమీతి చ మయా వ్యాహృతం ద్విజసన్నిధౌ। 9

సర్వైరేతైః సమాగమ్య వాగియం సముదాహృతా। 10

రాక్షసైర్దండకారణ్యే బహుభిః కామరూపిభిః।
అర్దితాః స్మ దృఢం రామ! భవాన్ నస్తత్ర రక్షతు। 11

హోమకాలేషు సంప్రాప్తాః పర్వకాలేషు చానఘ!।
ధర్షయంతి సుదుర్ధర్షా రాక్షసాః పిశితాశనాః। 12

రాక్షసైర్ధర్షితానాం చ తాపసానాం తపస్వినామ్।
గతిం మృగయమాణానాం భవాన్ నః పరమా గతిః। 13

కామం తపఃప్రభావేన శక్తా హంతుం నిశాచరాన్।
చిరార్జితం తు నేచ్ఛామః తపః ఖండయితుం వయమ్। 14

బహువిఘ్నం తపో నిత్యం దుశ్చరం చైవ రాఘవ!।
తేన శాపం న ముంచామో భక్ష్యమాణాశ్చ రాక్షసైః। 15

తదర్ద్యమానాన్ రక్షోభిః దండకారణ్యవాసిభిః।
రక్ష నస్త్వం సహ భ్రాత్రా త్వన్నాథా హి వయం వనే। 16

మయా చైతద్వచః శ్రుత్వా కార్త్స్న్యేన పరిపాలనమ్।
ఋషీణాం దండకారణ్యే సంశ్రుతం జనకాత్మజే!। 17

సంశ్రుత్య చ న శక్ష్యామి జీవమానః ప్రతిశ్రవమ్।
మునీనామన్యథా కర్తుం సత్యమిష్టం హి మే సదా। 18

అప్యహం జీవితం జహ్యాం త్వాం వా సీతే! సలక్ష్మణామ్।
న తు ప్రతిజ్ఞాం సంశ్రుత్య బ్రాహ్మణేభ్యో విశేషతః। 19

"ఓ మహాత్ములారా! మీరు నాయెడ ప్రసన్నులు కండు. విప్రోత్తములైన మీరు ఈ విధముగా నన్ను అర్థించుచున్నందులకు నాకు మిగుల సిగ్గగుచున్నది. నేను ఏమి చేయవలెనో సెలవిండు" అని నేను వారి సమక్షమున నుడివితిని. (9)

నాకడకు విచ్చేసిన ఆ మునులందఱును ఏకగ్రీవముగా నాతో ఇట్లు వచించిరి. "ఓ రామా! కామరూపులైన పెక్కుమంది రాక్షసులు దండకారణ్యమునందు మమ్ములను మిగుల పీడించుచున్నారు. ఇప్పుడు నీవే మమ్ము రక్షింపవలెను. ఓ పుణ్యాత్మా! మాంసములను భక్షించెడివారు, ఎదిరింప శక్యముగాని వారు ఐన రాక్షసులు వచ్చి మేము హోమకార్యములను నిర్వహించునప్పుడును, పర్వదినములలో వివిధములగు యజ్ఞవిధులను ఆచరించుచున్నప్పుడును మమ్ము అవమానించుచు, హింసించుచు మా కార్యములను భంగపఱచుచున్నారు. (10-12)

క్రూరరాక్షసులు పెట్టెడి హింసలకు తాళలేక, తపోధనులమైన మేము 'మమ్ము ఆదుకొను వారికొఱకై వెదకుచుంటిమి. ఇప్పుడిక మీరే మాకు దిక్కు. మా తీవ్రమైన తపః ప్రభావమున ఆ నిశాచరులను హతమార్చెడి శక్తి మాకు గలదు. కాని సంవత్సరములకొలది నిష్ఠతో ఆర్జించిన మాతపోబలమును వీరికై వెచ్చించుట మాకు సమ్మతము గాదు. ఓ రాఘవా! మాతపస్సులకు నిత్యము పెక్కు విఘ్నములు ఎదురగుచుండును తపస్సు చేయుట మిగుల క్లిష్టమైన కార్యము. ఆ కారణముగా రాక్షసులు మమ్ములను భక్షించుచున్నను వారిని శపించుటకు మేము సిద్ధపడుట లేదు. దండకారణ్యమున సంచరించుచుండెడి రాక్షసులచే పీడింప (హింసింప) బడుచున్న మమ్ములను నీవు లక్ష్మణునితో గూడి కాపాడుము. వన వాసులమైన మాకు ఇక నీవే పరమగతి". (13-16)

"ఓ జానకీ! ఈ ఋషుల అభ్యర్థనను నేను సావధానముగా ఆలకించితిని. నన్ను ఆశ్రయించిన ఈ ఋషులవిరోధులు నాకును శత్రువులే. అందువలన రాక్షసులను పూర్తిగా పరిమార్చి, దండకారణ్యవాసులైన ఈ ఋషులను కాపాడెదనని ప్రతిజ్ఞ చేసితిని. నా బొందిలో ప్రాణములుండునంత వఱకును నేను చేసిన ప్రతిజ్ఞను విడువజాలను. ఋషులకిచ్చిన మాటను నిలబెట్టుకొని తీరెదను. సత్యపాలనమే సర్వదా నాకు ఇష్టము. (17-18)

ఓ సీతా! మాటను నిలబెట్టుకొనుటకై నాప్రాణములనైనను ఒడ్డెదను. అంతేగాదు అందులకై నిన్నును, లక్ష్మణుని సైతము పరిత్యజించుటకు వెనుకాడను. ఎట్టి పరిస్థితులలోను చేసిన ప్రతిజ్ఞను మాత్రము విడువను. అందునా బ్రహ్మజ్ఞానులైన బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను

తదవశ్యం మయా కార్యమ్ ఋషీణాం పరిపాలనమ్।
అనుక్తేనాపి వైదేహి! ప్రతిజ్ఞాయ తు కిం పునః। 20

ఎన్నడునూ మఱువనే మఱువను. ఓ వైదేహీ! ఋషీశ్వరులు నన్ను అడుగకున్నను ఎల్లవేళల వారిని రక్షించుట నాకు అవశ్యకర్తవ్యము. ప్రతిజ్ఞ చేసియున్నప్పుడు ఇక చెప్పవలసిన దేమున్నది? (19-20)

మమ స్నేహాచ్చ సౌహార్దాత్ ఇదముక్తం త్వయాఽనఘే।
పరితుష్టోఽస్మ్యహం సీతే! న హ్యనిష్టోఽనుశిష్యతే। 21

పవిత్రాత్మురాలవైన ఓ సీతా! మన ప్రేమానురాగముల వలనను, సుహృద్భావకారణముననను నీవు ఈ విషయమును ప్రస్తావించియుంటివి. ఇందులకు నేను ఎంతయు సంతసించితిని. ఆత్మీయులు కానివారితో ఎవ్వరును ఇట్లు ప్రస్తావింపరు గదా! (21)

సదృశం చానురూపం చ కులస్య తవ చాత్మనః।
సధర్మచారిణీ మే త్వం ప్రాణేభ్యోఽపి గరీయసీ। 22

ఓ వైదేహీ! నీవు నీస్వభావమునకును, మీ వంశమునకును తగినట్లుగా పలికితివి. నీవు నాకు ప్రాణములకంటెను మిన్న. నీవు నాసహధర్మచారిణివి గదా! కావున ధర్మాచరణమున నాతో పాలుపంచుకొనుము. (22)

ఇత్యేవముక్త్వా వచనం మహాత్మా
సీతాం ప్రియాం మైథిలరాజపుత్రీమ్।
రామో ధనుష్మాన్ సహ లక్ష్మణేన
జగామ రమ్యాణి తపోవనాని । 23

మిథిలారాజకుమారియు, తనకు ఆత్మీయురాలును ఐన సీతాదేవితో ఇట్లు పలికిన పిమ్మట మహాత్ముడైన శ్రీరాముడు లక్ష్మణునితోగూడి ధనుర్ధారియై, రమ్యములైన తపోవనభూములకు బయలు దేఱెను. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే దశమస్సర్గః *(10)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పదియవసర్గము.

— * * * —

11. పదునొకొండవసర్గము

మాండకర్ణిమహర్షి వృత్తాంతము - సీతారామలక్ష్మణులు వేర్వేఱు ఆశ్రమములలో పదిసంవత్సరములు గడిపి, మఱల సుతీక్ష్ణాశ్రమమునకు చేరుట. అచట కొంతకాలము ఉండి, పిదప అగస్త్యసోదరుని ఆశ్రమమునకును, అనంతరము అగస్త్యుని ఆశ్రమమునకును చేరుట. అగస్త్య మహాముని ప్రభావము.

అగ్రతః ప్రయయౌ రామః సీతా మధ్యే సుమధ్యమా।
పృష్ఠతస్తు ధనుష్పాణిః లక్ష్మణోఽనుజగామ హ। 1

ఆ వనప్రయాణములో శ్రీరాముడు ముందుభాగమున నడచుచుండగా సౌందర్యవతియైన సీతాదేవి ఆయనను అనుసరించుచుండెను. ఆ యిరువురి వెనుక లక్ష్మణుడు ధనుష్పాణియై నడచుచుండెను. (1)

తౌ పశ్యమానౌ వివిధాన్ శైలప్రస్థాన్ వనాని చ।
నదీశ్చ వివిధా రమ్యా జగ్మతుః సీతయా సహ। 2

సారసాంశ్చక్రవాకాంశ్చ నదీపులినచారిణః।
సరాంసి చ సపద్మాని యుక్తాని జలజైః ఖగైః। 3

యూథబద్ధాంశ్చ పృషతాన్ మదోన్మత్తాన్ విషాణినః।
మహిషాంశ్చ వరాహాంశ్చ నాగాంశ్చ ద్రుమవైరిణః। 4

క్రమముగా సీతారామలక్ష్మణులు వివిధములగు పర్వతసానువులను, వనములను, కనులకింపుగొలుపుచున్న నదులను దర్శించుచు సాగిపోవుచుండిరి. ఇంకను వారు దారిలో నదీతీరములయందలి ఇసుకతిన్నెలపై సంచరించుచున్న బెగ్గురుపక్షులను, చక్రవాకములను, పద్మములతోడను, కలువలతోడను, జలపక్షులతోడనుగూడి కనువిందు గావించుచున్న సరస్సులను గాంచిరి. మఱియు ఆ మార్గమున గుంపులుగుంపులుగానున్న చుక్కలలేళ్లు, వాడికొమ్ములు గలిగి మత్తిల్లియున్న అడవిదున్నలు, వనవరాహములు, చెట్లను కూలద్రోయునట్టి మదగజములు వారికి కనబడెను. (2-4)

తే గత్వా దూరమధ్వానం లంబమానే దివాకరే।
దదృశుః సహితా రమ్యం తటాకం యోజనాయతమ్॥ 5

పద్మపుష్కరసంబాధం గజయూథైరలంకృతమ్।
సారసైర్హంసకాదంబైః సంకులం జలచారిభిః॥ 6

ప్రసన్నసలిలే రమ్యే తస్మిన్ సరసి శుశ్రువే।
గీతవాదిత్రనిర్ఘోషో న తు కశ్చన దృశ్యతే॥ 7

తతః కౌతూహలాద్రామో లక్ష్మణశ్చ మహాబలః।
మునిం ధర్మభృతం నామ ప్రష్టుం సముపచక్రమే॥ 8

ఇదమత్యద్భుతం శ్రుత్వా సర్వేషాం నో మహామునే।
కౌతూహలం మహజ్జాతం కిమిదం సాధు కథ్యతామ్॥ 9

వక్తవ్యం యది చేద్విప్ర! నాతిగుహ్యమపి ప్రభో!॥ 10

తేనైవముక్తో ధర్మాత్మా రాఘవేణ మునిస్తదా।
ప్రభవం సరసః కృత్స్నమ్ ఆఖ్యాతుముపచక్రమే॥ 11

ఇదం పంచాప్సరో నామ తటాకం సార్వకాలికమ్।
నిర్మితం తపసా రామ! మునినా మాండకర్ణినా॥ 12

స హి తేపే తపస్తీవ్రం మాండకర్ణిర్మహామునిః।
దశవర్షసహస్రాణి వాయుభక్షో జలాశ్రయః॥ 13

తతః ప్రవ్యథితాః సర్వే దేవాః సాగ్నిపురోగమాః।
అబ్రువన్ వచనం సర్వే పరస్పరసమాగతాః॥ 14

అస్మాకం కస్యచిత్ స్థానమ్ ఏష ప్రార్థయతే మునిః।
ఇతి సంవిగ్నమనసః సర్వే తే త్రిదివౌకసః॥ 15

తత్ర కర్తుం తపోవిఘ్నం దేవైః సర్వైర్నియోజితాః।
ప్రధానాప్సరసః పంచ విద్యుచ్చలితవర్చసః॥ 16

అప్సరోభిస్తతస్తాభిః మునిర్దృష్టపరావరః।
నీతో మదనవశ్యత్వం సురాణాం కార్యసిద్ధయే॥ 17

వారు మునులతోగూడి ఇట్లు కొంత దూరమేగిన పిమ్మట సూర్యుడు అస్తమించు సమయము ఆసన్నమాయెను. అప్పుడు వారు, యోజనము మేరకు విస్తరించి, మనోహరముగా నున్న ఒక తటాకమును గాంచిరి. ఆ సరస్సునందలి ఎఱ్ఱదామరలు, నల్లగలువలు, ఏనుగుల గుంపులు, నీటిలో సంచరించెడి బెగ్గురుపక్షులు, రాజహంసలు, కలహంసలు చూడ ముచ్చటగొలుపుచుండెను. (5-6)

స్వచ్ఛములైన జలములతో మనోహరముగానున్న ఆ సరస్సునుండి వీణావేణుమృదంగతాళ ధ్వనులతో గూడిన మధురగానములు వారికి వినబడెను. కాని అచట ఎవ్వరును కనబడకుండిరి. (7)

ఆ వాద్యగోష్ఠిని వినిన పిమ్మట మిగుల బలశాలురైన రామలక్ష్మణులు మిక్కిలి కుతూహలముతో ధర్మభృతుడను మహర్షిని ఇట్లు ప్రశ్నించిరి. (8)

"ఓ మహామునీ! అత్యద్భుతమైన ఈ సంగీతమును వినుటవలన మాయందఱిలో కుతూహలము పెంపొందినది. ఓ విప్రోత్తమా! ఆ విషయము అతిగోప్యమైనదిగానిచో దానిని సవిస్తరముగా మాకు విశదపఱచుము". (9-10)

శ్రీరాముడు ఇట్లు పలికిన పిమ్మట 'ధర్మభృతుడు' అను ఆ మహాముని ఆ సరస్సు యొక్క పుట్టు పూర్వోత్తరములను గూర్చి ఇట్లు చెప్పదొడంగెను. (11)

"ఓ రామా! ఈ సరస్సు పేరు 'పంచాప్సరము'. అన్ని కాలములయందును ఇది జలసమృద్ధి గలిగియుండును. 'మాండకర్ణి' అను మహర్షి తనతపఃప్రభావముచే దీనిని నిర్మించెను. (12)

ఆ 'మాండకర్ణి' మహాముని గాలిని, నీటిని మాత్రమే ఆహారముగా గొనుచు, పదివేలసంవత్సరములు తీవ్రముగా తపస్సు చేసెను. (13)

ఆ తపస్సుయొక్క తీవ్రతకు దేవతలు అందఱును భయకంపితులైరి. పిదప వారెల్లరును అగ్నిదేవుని నాయకత్వమున ఒకచోట సమావేశమై, తమలో తాము ఇట్లు చర్చించుకొనిరి. (14)

'ఈ మహర్షి మనలో ఒకరి స్థానమును నాక్రమింపదలచి, ఇట్లు తీవ్రతపస్సు ఆచరించుచున్నాడు'- అని ఆ సకలదేవతలు భయముతో కలవరపాటునకు లోనైరి.(15)

పిమ్మట ఆ దేవతలు ' ఆ మునియొక్క తపస్సును భంగపఱచుటకై విద్యుత్కాంతులవలె మిఱుమిట్లు గొలిపెడి ఐదుమంది మేటి అప్సరసలను నియోగించిరి. (16)

పిమ్మట ఆ దివ్యాంగనలు ఐదుగురును దేవతలకార్యసిద్ధికై లౌకికములైన అలౌకికములైన ధర్మాధర్మములను బాగుగా నెఱిగిన ఆ 'మాండకర్ణి' మునిని కామవశవర్తిని గావించిరి. (17)

తాశ్చైవాప్సరసః పంచ మునేః పత్నీత్వమాగతాః।
తటాకే నిర్మితం తాసామ్ అస్మిన్నంతర్హితం గృహమ్। 18

ఫలితముగా ఐదుగురు అప్సరసలును ఆ మునికి పత్నులైరి. వారికొఱకై ఈ తటాకముయొక్క అడుగు భాగమున ఒక గృహము నిర్మింపబడెను. (18)

తత్రైవాప్సరసః పంచ నివసంత్యో యథాసుఖమ్।
రమయంతి తపోయోగాత్ మునిం యౌవనమాస్థితమ్। 19

ఆ ముని తనతపశ్శక్తిచే చక్కని యౌవనమును పొందెను. ఆ దివ్యభామినులు ఐదుగురును ఆయనతో క్రీడించుచు ఇచట హాయిగా నివసింపసాగిరి. (19)

తాసాం సంక్రీడమానానామ్ ఏష వాదిత్రనిస్స్వనః।
శ్రూయతే భూషణోన్మిశ్రో గీతశబ్దో మనోహరః। 20

ఆటపాటలతో క్రీడించుచున్న ఆ అప్సరసలఆభరణ ధ్వనులు, వీణాదివాద్యధ్వనులు, మధురములైన సంగీత నాదములు మనకు ఇప్పుడు వినబడుచున్నవి." (20)

ఆశ్చర్యమితి తస్యైతత్ వచనం భావితాత్మనః।
రాఘవః ప్రతిజగ్రాహ సహ భ్రాత్రా మహాయశాః। 21

తపోధనుడైన ధర్మభృతునియొక్క ఆశ్చర్యకరములైన ఆ వచనములను మహాయశస్వియైన శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై ఆలకించెను. (21)

ఏవం కథయమానస్య దదర్శాఽఽశ్రమమండలమ్।
కుశచీరపరిక్షిప్తం బ్రాహ్మ్యా లక్ష్మ్యా సమావృతమ్। 22

ఆ మహర్షి ఇట్లు నుడివిన పిమ్మట శ్రీరాముడు అచటి ఆశ్రమప్రదేశములను కలయజూచెను. అవియన్నియును కుశలతో, వల్కలములతో నిండియుండెను, అక్కడ బ్రహ్మతేజస్సు ఉట్టిపడుచుండెను. (22)

ప్రవిశ్య సహ వైదేహ్యా లక్ష్మణేన చ రాఘవః।
ఉవాస మునిభిః సర్వైః పూజ్యమానో మహాయశాః। 23

మహాయశస్వియైన శ్రీరాముడు సీతాలక్ష్మణులతోగూడి ఆ ఆశ్రమమున ప్రవేశించి, అచటి మునులందఱినుండి పూజలను అందుకొనుచు అక్కడ నివసింపసాగెను.(23)

తథా తస్మిన్ స కాకుత్స్థః శ్రీమత్యాశ్రమమండలే।
ఉషిత్వా తు సుఖం తత్ర పూజ్యమానో మహర్షిభిః। 24

ఆ విధముగా శ్రీరాముడు ప్రశాంతమైన ఆ చక్కని ఆశ్రమమున నిత్యము మునీశ్వరులఅతిథిసేవలను స్వీకరించుచు సుఖముగా నివసింపసాగెను. (24)

జగామ చాశ్రమాన్ తేషాం పర్యాయేణ తపస్వినామ్।
యేషాముషితవాన్ పూర్వం సకాశే స మహాస్త్రవిత్। 25

గొప్ప గొప్ప అస్త్రప్రయోగములయందు సమర్థుడైన శ్రీరాముడు పూర్వము తాను నివసించిన మున్యాశ్రమములకు వరుసగా మఱియొక పర్యాయము వెళ్లెను. (25)

క్వచిత్ పరిదశాన్ మాసాన్ ఏకం సంవత్సరం క్వచిత్।
క్వచిచ్చ చతురో మాసాన్ పంచ షట్చాపరాన్ క్వచిత్। 26

అపరత్రాధికం మాసాత్ అప్యర్ధమధికం క్వచిత్।
త్రీన్ మాసాన్ అష్టమాసాంశ్చ రాఘవో న్యవసత్ సుఖమ్। 27

శ్రీరాముడు సీతాలక్ష్మణ సహితుడై ఒక ఆశ్రమమునందు దాదాపు పదిమాసములును, మఱియొకచోట ఒక సంవత్సరమును, వేఱొకచోట నాలుగుమాసములును, అట్లే తదితరాశ్రమములయందు వరుసగా ఐదుమాసములును, ఆఱుమాసములును, ఏడుమాసములును నివసించెను. ఇంకను అతడు వేర్వేఱు ఆశ్రమములయందు క్రమముగా ఒకమాసముకంటె ఎక్కువగను, అర్ధమాసముకంటె ఎక్కువగను, మూడుమాసములును, ఎనిమిది మాసములును హాయిగా నివసించెను. (26-27)

తథా సంవసతస్తస్య మునీనామాశ్రమేషు వై।
రమతశ్చానుకూల్యేన యయుః సంవత్సరా దశ। 28

ఆ విధముగా సీతారామలక్ష్మణులు వేర్వేఱు మునియాశ్రమములలో హాయిగా నివసించుచుండగా పదియేండ్లు గడచెను. (28)

పరివృత్య చ ధర్మజ్ఞో రాఘవః సహ సీతయా।
సుతీక్ష్ణస్యాశ్రమం శ్రీమాన్ పునరేవాజగామ హ। 29

ధర్మజ్ఞుడు, శుభలక్షణసంపన్నుడు ఐన శ్రీరాముడు సీతాలక్ష్మణసమేతుడై (పదిసంవత్సరముల అనంతరము) మఱల సుతీక్ష్ణాశ్రమమునకు వచ్చెను. (29)

స తమాశ్రమమాసాద్య మునిభిః ప్రతిపూజితః।
తత్రాపి న్యవసద్రామః కంచిత్ కాలమ్ అరిందమః। 30

అథాఽఽశ్రమస్థో వినయాత్ కదాచిత్ తం మహామునిమ్।
ఉపాసీనః స కాకుత్స్థః సుతీక్ష్ణమిదమబ్రవీత్। 31

అస్మిన్నరణ్యే భగవాన్ అగస్త్యో మునిసత్తమః।
వసతీతి మయా నిత్యం కథాః కథయతాం శ్రుతమ్। 32

న తు జానామి తం దేశం వనస్యాస్య మహత్తయా।
కుత్రాఽఽశ్రమమిదం పుణ్యం మహర్షేస్తస్య ధీమతః। 33

ప్రసాదాత్ తత్రభవతః సానుజః సహ సీతయా।
అగస్త్యమ్ అభిగచ్ఛేయమ్ అభివాదయితుం మునిమ్। 34

మనోరథో మహానేష హృది మే పరివర్తతే।
యద్యహం తం మునివరం శుశ్రూషేయమపి స్వయమ్। 35

ఇతి రామస్య స మునిః శ్రుత్వా ధర్మాత్మనో వచః।
సుతీక్ష్ణః ప్రత్యువాచేదం ప్రీతో దశరథాత్మజమ్। 36

అహమప్యేతదేవ త్వాం వక్తుకామః సలక్ష్మణమ్।
అగస్త్యమ్ అభిగచ్ఛేతి సీతయా సహ రాఘవ। 37

దిష్ట్యా త్విదానీమర్థేఽస్మిన్ స్వయమేవ బ్రవీషి మామ్।
అహమాఖ్యామి తే వత్స! యత్రాగస్త్యో మహామునిః। 38

యోజనాన్యాశ్రమాదస్మాత్ తథా చత్వారి వై తతః।
దక్షిణేన మహాన్ శ్రీమాన్ అగస్త్యభ్రాతురాశ్రమః। 39

స్థలీప్రాయే వనోద్దేశే పిప్పలీవనశోభితే।
బహుపుష్పఫలే రమ్యే నానాశకునినాదితే। 40

పద్మిన్యో వివిధాస్తత్ర ప్రసన్నసలిలాశ్శివాః।
హంసకారండవాకీర్ణాః చక్రవాకోపశోభితాః। 41

తత్రైకాం రజనీం వ్యుష్య ప్రభాతే రామ! గమ్యతామ్।
దక్షిణాం దిశమాస్థాయ వనషండస్య పార్శ్వతః। 42

అరిందముడైన శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై అచటికి వెళ్ళి, నిత్యము మునీశ్వరులఅతిథి సత్కారములను స్వీకరించుచు ఆ ఆశ్రమమున మరికొంతకాలము గడపెను. (30)

ఇట్లుండగా ఆ ఆశ్రమమున నివసించుచున్న శ్రీరాముడు ఒకనాడు ఆ సుతీక్ష్ణమహామునిని సమీపించి, సవినయముగా ఆయనతో ఇట్లనెను. (31)

"ఓ మహర్షీ! పూజ్యుడైన అగస్త్యమహాముని ఈ దండకారణ్యమునందే నివసించుచున్నట్లు నలుగురునూ ఆయననుగూర్చిన కథలను నిత్యము చెప్పికొనుచుండగా వింటిని. అయితే సువిశాలమైన ఈ దండకారణ్యమునందు ఆ ప్రదేశము ఎక్కడ ఉన్నదో నేనెఱుగను. మహాత్ముడైన ఆ మహర్షియొక్క పవిత్రమైన ఆశ్రమప్రదేశమును దయతో తెలుపుడు. పూజ్యులైన మీరు అనుగ్రహించినచో ఆయనఆశీస్సులను గొనుటకై సీతారామలక్ష్మణులతోగూడి తదాశ్రమమునకు వెళ్ళెదను. (32-34)

ఆ మునీశ్వరుని నేను స్వయముగా సేవింపవలెననెడి తీవ్రమైన అభిలాష ఎప్పటినుండియో నామదిలో గూడుకట్టుకొనియున్నది." (35)

ధర్మాత్ముడైన ఆ శ్రీరాముడు పలికిన మాటలను విని, ఆ సుతీక్ష్ణమహాముని ఎంతయు తృప్తి చెందినవాడై, ఆ దాశరథితో ఇట్లు వచించెను. (36)

"ఓ రామా! 'సీతాలక్ష్మణసహితుడవై నీవు అగస్త్య మహర్షిని దర్శింపుము'- అను ఈ విషయమును నేనే నీకు చెప్పదలచియుంటిని. కాని ఈ విషయమును ముందుగా నీవేప్రస్తావించితివి. ఇది చక్కని మాట. నాయనా! అగస్త్యమహాముని నివసించు ప్రదేశమునుగూర్చి తెలిపెదను వినుము. ఇదిగో! ఈ ఆశ్రమమునకు దక్షిణదిశయందు నాలుగుయోజనములదూరమున అగస్త్య సోదరుని[1] ఆశ్రమము గలదు. అది పవిత్రమైనది, మనోహరమైనది. (37-39)

ఆ ఆశ్రమప్రదేశము వివిధములగు పుష్పములతోను, ఫలములతోను, రావివృక్షములతోను, శోభిల్లుచుండును. అచట నానావిధములగు పక్షులకలరవములు వినిపించుచుండును. నిర్మలమైన జలములతో, పద్మములతో కలకలలాడుచుండెడి అచటి సరస్సులలో హంసలు, కన్నెలేడిపిట్టలు, చక్రవాకములు సంచరించుచు వాటిశోభలను ఇనుమడింపజేయు చుండును. (40-41)

ఓ రామా! ఆ ఆశ్రమమునందు ఒకరాత్రి గడపి, మఱునాటి ఉదయవేళ దక్షిణదిశననుసరించి, వన

1) అగస్త్యసోదరునిపేరు సుదర్శనుడు. తల్లిగర్భమునందున్నప్పుడే అతనికి జ్ఞానోదయమయ్యెను.

తత్రాగస్త్యాశ్రమపదం గత్వా యోజనమంతరమ్।
రమణీయే వనోద్దేశే బహుపాదపసంవృతే। 43

రంస్యతే తత్ర వైదేహీ లక్ష్మణశ్చ సహ త్వయా।
స హి రమ్యో వనోద్దేశో బహుపాదపసంకులః। 44

యది బుద్ధిః కృతా ద్రష్టుమ్ అగస్త్యం తం మహామునిమ్।
అద్యైవ గమనే బుద్ధిం రోచయస్వ మహాయశః। 45

ఇతి రామో మునేః శ్రుత్వా సహ భ్రాత్రాఽభివాద్య చ।
ప్రతస్థేఽగస్త్యముద్దిశ్య సానుజః సహ సీతయా। 46

పశ్యన్ వనాని రమ్యాణి పర్వతాంశ్చాభ్రసన్నిభాన్।
సరాంసి సరితశ్చైవ పథి మార్గవశానుగాః। 47

సుతీక్ష్ణేనోపదిష్టేన గత్వా తేన పథా సుఖమ్।
ఇదం పరమసంహృష్టో వాక్యం లక్ష్మణమబ్రవీత్। 48

ఏతదేవాశ్రమపదం నూనం తస్య మహాత్మనః।
అగస్త్యస్య మునేర్భ్రాతుః దృశ్యతే పుణ్యకర్మణః। 49

యథాహి మే వనస్యాస్య జ్ఞాతాః పథి సహస్రశః।
సన్నతాః ఫలభారేణ పుష్పభారేణ చ ద్రుమాః। 50

పిప్పలీనాం చ పక్వానాం వనాదస్మాదుపాగతః।
గంధోఽయం పవనోత్క్షిప్తః సహసా కటుకోదయః। 51

తత్ర తత్ర చ దృశ్యంతే సంక్షిప్తాః కాష్ఠసంచయాః।
లూనాశ్చ పథి దృశ్యంతే దర్భా వైడూర్యవర్చసః। 52

ఏతచ్చ వనమధ్యస్థం కృష్ణాభ్రశిఖరోపమమ్।
పావకస్యాశ్రమస్థస్య ధూమాగ్రం సంప్రదృశ్యతే। 53

వివిక్తేషు చ తీర్థేషు కృతస్నానా ద్విజాతయః।
పుష్పోపహారం కుర్వంతి కుసుమైః స్వయమార్జితైః। 54

తత్ సుతీక్ష్ణస్య వచనం యథా సౌమ్య! మయా శ్రుతమ్।
అగస్త్యస్యాశ్రమో భ్రాతుః నూనమేష భవిష్యతి। 55

సమూహములకు ప్రక్కగా వెళ్లుడు. అచటికి ఒక యోజనదూరమునగల అగస్త్యాశ్రమునకు చేరుడు. ఆ వనప్రదేశము చక్కని వృక్షసంపదతో రమణీయముగా నుండును. చూడముచ్చటగానుండెడి ఆ వనవృక్షములను జూచి, సీతాదేవియు, నీవును, లక్ష్మణుడును ఎంతయు ఆనందింపగలరు. (42-44)

మిక్కిలి ప్రశస్తిగన్న ఓ శ్రీరామా! ఆ అగస్త్యమహామునిని దర్శించుటకు కుతూహలపడుచున్నచో మీరు నేడే వెళ్లుటకు సిద్ధపడుడు." (45)

సుతీక్ష్ణమహర్షి పలుకులను వినిన పిదప శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై, ఆ మహామునికి నమస్కరించి, అగస్త్యమునిని దర్శించుటకై బయలుదేఱెను. వారు మార్గమున ప్రయాణించుచు రమ్యములైన వనములను, ఆకాశమునంటుచున్న పర్వతములను, సరస్సులను, నదులను దర్శించుచు ముందునకు సాగిరి. (46-47)

సుతీక్ష్ణుడు తెలిపిన త్రోవలో పయనించుచు, దృశ్యసందర్శనముచే పరమసంతుష్టుడైన శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లనుడివెను. (48)

లక్ష్మణా! అదిగో! ఆ కనబడుచున్నది అగస్త్యసోదరుని ఆశ్రమమే. అతడు నిజముగా మహాత్ముడు, సత్కర్మలను ఆచరించువాడు. మనము విన్నరీతిగనే ఈ వనమార్గమున వేలకొలదివృక్షములు ఫలపుష్పములబరువుతో వంగియున్నవి. (49-50)

పక్వమునకువచ్చిన పిప్పళ్లయొక్క మిక్కిలి ఘాటైన వాసనలు ఈ వనమునుండి గాలివాటున ఇటు వచ్చుచున్నవి. అక్కడక్కడ హోమకార్యములకుపయోగమునకై ప్రోగు చేయబడిన కట్టెపుల్లలకుప్పలును అట్లే వైడూర్యములవన్నెలు గలిగి, త్రుంచబడిన దర్భలును కనబడుచున్నవి. (51-52)

ఇదిగో! చూడుము. ఈ వనముయొక్క మధ్యభాగమున ఆశ్రమమునందలి అగ్నినుండి వెలువడిన పొగలు గప్పట్లుచున్నవి. ఈ ధూమములయొక్క పైభాగములు నల్లని మేఘములయొక్క అంచులవలె ప్రతీతమగుచున్నవి.(53)

ఏకాంతములైన పవిత్రతీరములయందు స్నానముల నాచరించిన ద్విజోత్తములు స్వయముగా సమకూర్చుకొనిన పుష్పములను దేవతలకు సమర్పించుచు (వారిని) పూజించుచున్నారు. (54)

సోదరా! మనకు సుతీక్ష్ణ మహర్షి తెల్పినవిధముగనే అగస్త్యసోదరుని ఈ ఆశ్రమము చక్కగా విలసిల్లుచున్నది. ఇతనిసోదరుడును, పవిత్రతాత్ముడును ఐన అగస్త్యముని తనతపఃప్రభావముచే లోకహితముకొఱకు (వాతాపి, ఇల్వలుడు- అను రాక్షసులరూపమున ఉన్న) మృత్యువును

నిగృహ్య తపసా మృత్యుం లోకానాం హితకామ్యయా।
యస్య భ్రాత్రా కృతేయం దిక్ శరణ్యా పుణ్యకర్మణా। 56

ఇహైకదా కిల క్రూరో వాతాపిరపిచేల్వలః।
భ్రాతరౌ సహితావాస్తాం బ్రాహ్మణఘ్నౌ మహాసురౌ। 57

ధారయన్ బ్రాహ్మణం రూపమ్ ఇల్వలః సంస్కృతం వదన్।
ఆమంత్రయతి విప్రాన్ స్మ శ్రాద్ధముద్దిశ్య నిర్ఘృణః। 58

భ్రాతరం సంస్కృతం కృత్వా తతస్తం మేషరూపిణమ్।
తాన్ ద్విజాన్ భోజయామాస శ్రాద్ధదృష్టేన కర్మణా। 59

తతో భుక్తవతాం తేషాం విప్రాణామిల్వలోఽబ్రవీత్।
వాతాపే! నిష్క్రమస్వేతి స్వరేణ మహతా వదన్। 60

తతో భ్రాతుర్వచః శ్రుత్వా వాతాపిర్మేషవన్నదన్।
భిత్త్వా భిత్త్వా శరీరాణి బ్రాహ్మణానాం వినిష్పతత్। 61

బ్రాహ్మణానాం సహస్రాణి తైరేవం కామరూపిభిః।
వినాశితాని సంహత్య నిత్యశః పిశితాశనైః। 62

అగస్త్యేన తదా దేవైః ప్రార్థితేన మహర్షిణా।
అనుభూయ కిల శ్రాద్ధే భక్షితః స మహాసురః। 63

తతః సంపన్నమిత్యుక్త్వా దత్త్వా హస్తోదకం తతః।
భ్రాతరం నిష్క్రమస్వేతి చేల్వలః సోఽభ్యభాషత। 64

స తం తథా భాషమాణం భ్రాతరం విప్రఘాతినమ్।
అబ్రవీత్ ప్రహసన్ ధీమాన్ అగస్త్యో మునిసత్తమః। 65

కుతో నిష్క్రమితుం శక్తిః మయా జీర్ణస్య రక్షసః।
భ్రాతుస్తే మేషరూపస్య గతస్య యమసాదనమ్। 66

అథ తస్య వచః శ్రుత్వా భ్రాతుర్నిధనసంశ్రయమ్।
ప్రధర్షయితుమారేభే మునిం క్రోధాన్నిశాచరః। 67

సోఽభిద్రవన్మునిశ్రేష్ఠం మునినా దీప్తతేజసా।
చక్షుషాఽనలకల్పేన నిర్దగ్ధో నిధనం గతః। 68

తస్యాయమాశ్రమో భ్రాతుః తటాకవనశోభితః।
విప్రానుకంపయా యేన కర్మేదం దుష్కరం కృతమ్। 69

జయించి. దక్షిణదిశను సురక్షితమైనదానినిగా (ఋష్యాదులకు నివాసయోగ్యముగా) చేసెను. (55-56)

ఇచట ఒకానొకప్పుడు క్రూరులైన వాతాపి, ఇల్వలుడు అను ఇరువురు రాక్షససోదరులు ఉండెడివారు. ఆ ఇద్దఱునుగూడి బ్రాహ్మణులను హతమార్చుచుండెడివారు. వారిలో నిర్దయుడైన ఇల్వలుడు బ్రాహ్మణరూపమును ధరించి, శ్రాద్ధముపేరుతో సంస్కృతభాషలో బ్రాహ్మణులను ఆహ్వానించు చుండెడివాడు. (57-58)

అతడు తన సోదరుడైన వాతాపిని శాకరూపమున మార్చి, శ్రాద్ధమునకు తగినట్లు కూరగా వండి, విధి విధానముగా శ్రాద్ధ కర్మను నడిపి, బ్రాహ్మణులకు భోజన పదార్థములలో ఆ కూరనుగూడ వడ్డించెడి వాడు. ఆ విప్రులభోజనములు ముగిసిన పిమ్మట ఇల్వలుడు 'ఓ వాతాపీ! బయటికి రమ్ము' అని బిగ్గఱగా పిలిచెడి వాడు. అనంతరము సోదరుని (ఇల్వలుని) పిలుపును విన్న వాతాపి 'మేమే' అని మేకవలె అఱచుచు ఆ బ్రాహ్మణులఉదరములను చీల్చుకొని బయటికి వచ్చెడివాడు. ఈ విధముగా నరమాంసభక్షకులు, కామరూపులు ఐన ఆ రాక్షసులు వేలకొలదిగా బ్రాహ్మణులను హతమార్చుచుండిరి. (59-62)

ఆ రాక్షసులఆగడములనుగూర్చి దేవతలు అగస్త్యునకు మొఱపెట్టుకొనిరి. అంతట ఆ మహాముని శ్రాద్ధవిధియందు ఆ వాతాపిరాక్షసుని శాకరూపమున భక్షించెను. పిమ్మట 'ఈ శ్రాద్ధభోజనముతో నేను తృప్తి పడితిని' అని ఆ ముని పలికెను. అప్పుడు ఇల్వలుడు అగస్త్యునకు హస్తోదకమునిచ్చి, 'వాతాపి సోదరా! బయటికి రమ్ము' అని పలికెను. (63-64)

బ్రాహ్మణహంతకుడైన ఇల్వలుడు సోదరుని ఆ విధముగా పిలుచుచుండగా, మేధావియైన ఆ అగస్త్యమహాముని నవ్వుచు అతనితో ఇట్లనెను. "బయటికి వచ్చుటకు ఇంకను నీ సోదరునకు శక్తి యెక్కడిది? శాకరూపముననున్న ఆ రాక్షసుడు (వాతాపి) నాకడుపులో జీర్ణమైపోయినాడు. ఇప్పటికే అతడు యమలోకమునకు చేరియుండును." (65-66)

అంతట ఆ నిశాచరుడు (ఇల్వలుడు) ఆ మునిమాటలను విని, తనసోదరుని (వాతాపి) మృతికి కారకుడైన అగస్త్యునిపై మండిపడుచు, ఆయనను హింసింపసాగెను. (67)

అప్పుడా ముని తనపై విఱుచుకొనిపడుచున్న ఆ రాక్షసుని అగ్నితుల్యములైన తనకంటిమంటలతో దగ్ధము గావించెను. (68)

బ్రాహ్మణులపైగల కనికరముతో ఆ మహర్షి దుష్కరమైన ఈ కార్యమును సాధించెను. తటాకములతో, వృక్షములతో సుసంపన్నమైన ఈ ఆశ్రమము మహాత్ముడైన ఆ అగస్త్యుని సోదరునిదే. (69)

ఏవం కథయమానస్య తస్య సౌమిత్రిణా సహ।
రామస్యాస్తంగతః సూర్యః సంధ్యాకాలోఽభ్యవర్తత। 70

ఉపాస్య పశ్చిమాం సంధ్యాం సహ భ్రాత్రా యథావిధి।
ప్రవివేశాఽఽశ్రమపదం తమ్ ఋషిం సోఽభ్యవాదయత్। 71

సమ్యక్ ప్రతిగృహీతశ్చ మునినా తేన రాఘవః।
న్యవసత్ తాం నిశామేకాం ప్రాశ్య మూలఫలాని చ। 72

తస్యాం రాత్ర్యాం వ్యతీతాయాం విమలే సూర్యమండలే।
భ్రాతరం తమగస్త్యస్య హ్యామంత్రయత రాఘవః। 73

అభివాదయే త్వాం భగవన్! సుఖమధ్యుషితో నిశామ్।
ఆమంత్రయే త్వాం గచ్ఛామి గురుం తే ద్రష్టుమగ్రజమ్। 74

గమ్యతామితి తేనోక్తో జగామ రఘునందనః।
యథోద్దిష్టేన మార్గేణ వనం తచ్చావలోకయన్। 75

నీవారాన్ పనసాన్ తాలాన్ తిమిశాన్ వంజులాన్ ధవాన్।
చిరిబిల్వాన్ మధూకాంశ్చ బిల్వానపి చ తిందుకాన్। 76

పుష్పితాన్ పుష్పితాగ్రాభిః లతాభిరనువేష్టితాన్।
దదర్శ రామః శతశః తత్ర కాంతారపాదపాన్। 77

హస్తిహస్తైర్విమృదితాన్ వానరైరుపశోభితాన్।
మత్తైః శకునిసంఘైశ్చ శతశశ్చ ప్రణాదితాన్। 78

తతోఽబ్రవీత్ సమీపస్థం రామో రాజీవలోచనః।
పృష్ఠతోఽనుగతం వీరం లక్ష్మణం లక్ష్మివర్ధనమ్। 79

స్నిగ్ధపత్రా యథా వృక్షా యథా శాంతమృగద్విజాః।
ఆశ్రమో నాతిదూరస్థో మహర్షేర్భావితాత్మనః। 80

అగస్త్య ఇతి విఖ్యాతో లోకే స్వేనైవ కర్మణా।
ఆశ్రమో దృశ్యతే తస్య పరిశ్రాంతశ్రమాపహః। 81

ఆశ్రమమునుగూర్చి శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లు నుడువుచుండగా ఇంతలో సూర్యుడస్తమించెను. సంధ్యాకాలము ఆయెను. అప్పుడు ఆ రఘువరుడు తమ్మునితో యథావిధిగా సాయం సంధ్యావందనమాచరించి, ఆశ్రమమున ప్రవేశించి, ఆ మహర్షికి (అగస్త్యుని సోదరునకు) నమస్కరించెను.(70-71)

అంతట ఆ మహాముని సీతాలక్ష్మణసమేతుడైన శ్రీరామునకు సాదరముగా స్వాగతమర్యాదలను నెఱపెను. వారు కందమూలఫలములను ఆహారముగా స్వీకరించి, ఆ రాత్రికి అచట నివసించిరి. (72)

ఆ రాత్రి గడచిన పిమ్మట సూర్యుడు ఉదయించగనే శ్రీరాముడు ఆ మహర్షిని వీడ్కొనుచు ఇట్లు వచించెను. "ఓ మహామునీ! మీకు నా ప్రణామములు. మీ ఆశ్రమమున ఒకరాత్రి హాయిగా గడిపితిమి. పూజ్యులైన మీ అన్నగారిని దర్శింపబోవుచున్నాము. దయతో అనుమతింపుడు". (73-74)

అగస్త్యసోదరుడు అనుమతించిన పిమ్మట శ్రీరాముడు తనవారితోగూడి, ఆ ముని తెల్పిన మార్గమున వనములను దర్శించుచు ముందునకు సాగెను. (75)

మార్గమున వారు జలకదంబవృక్షములను, పనసచెట్లను, తాటిచెట్లను, తిమిశచెట్లను, పొగడచెట్లను, చంద్ర చెట్లను, కానుగచెట్లను, వీప్పచెట్లను, మారేడువృక్షములను, తుమికిచెట్లను కాంచిరి. ఇంకను వారు వందలకొలది వనవృక్షములను తిలకించిరి. అవి చక్కగా పుష్పించియుండెను. వాటిపైభాగములవఱకును పూదీగెలు అల్లుకొనియుండెను. ఆ చెట్లను ఏనుగులు తమతొండములతో మర్దించుచుండెను. ఆ వృక్షాగ్రములపై వానరములు కూర్చొనియుండెను. బాగుగా మదించినవై వందలకొలదిగానున్న పక్షులగుంపులు కలకలారావములను చేయుచుండెను. (76-78)

అప్పుడు పద్మములవంటి నేత్రములుగల శ్రీరాముడు రూపవైభవముతో విలసిల్లుచు, తన వెన్నంటి వచ్చుచున్న వీరుడైన లక్ష్మణునితో ఇట్లు వచించెను. "ఓ లక్ష్మణా! మహాత్ముడైన అగస్త్యమహర్షియొక్క ఆశ్రమసమీపమునకు చేరితిమి. అందలివృక్షముల ఆకులన్నియును నిగనిగలాడుచున్నవి. అచట వివిధములగు మృగములు, పక్షులు ప్రశాంతముగా మసలుచున్నవి. (79-80)

తనతపఃప్రభావముచేత వింధ్యపర్వతమును స్తంభింప జేసినందున ఆ మహర్షి 'అగస్త్యనామము'తో విఖ్యాతుడయ్యెను.[1] ఆయనఆశ్రమమున చేరినవారియందలిశ్రమలను (అలసటలను) తొలగించి అది హాయినిగూర్చుచుండును. (81)

1) అగమ్ (పర్వతమ్) స్తంభయతీతి అగస్త్యః
అగమును (పర్వతమును, వింధ్యపర్వతమును) స్తంభింపజేసిన వాడు గావున ఆయన 'అగస్త్యుడు' అనుపేరుతో విఖ్యాతి కెక్కెను.

ప్రాజ్యధూమాకులవన: చీరమాలాపరిష్కృత:।
ప్రశాంతమృగయూథశ్చ నానాశకునినాదిత:। 82

తస్యేదమాశ్రమపదం ప్రభావాద్యస్య రాక్షసై:।
దిగియం దక్షిణా త్రాసాత్ దృశ్యతే నోపభుజ్యతే। 83

యదా ప్రభృతి చాక్రాంతా దిగియం పుణ్యకర్మణా।
తదా ప్రభృతి నిర్వైరా: ప్రశాంతా రజనీచరా:। 84

నామ్నా చేయం భగవతో దక్షిణా దిక్ప్రదక్షిణా।
ప్రథితా త్రిషు లోకేషు దుర్ధర్షా క్రూరకర్మభి:। 85

మార్గం నిరోద్ధుం నిరతో భాస్కరస్యాచలోత్తమ:।
నిదేశం పాలయన్ యస్య వింధ్యశ్శైలో న వర్ధతే। 86

అయం దీర్ఘాయుషస్తస్య లోకే విశ్రుతకర్మణ:।
అగస్త్యస్యాఽఽశ్రమ: శ్రీమాన్ వినీతజనసేవిత:। 87

ఏష లోకార్చిత: సాధు: హితే నిత్యరతస్సతామ్।
అస్మానభిగతానేష శ్రేయసా యోజయిష్యతి। 88

ఆరాధయిష్యామ్యత్రాహమ్ అగస్త్యం తం మహామునిమ్।
శేషం చ వనవాసస్య సౌమ్య! వత్స్యామ్యహం ప్రభో!। 89

అత్ర దేవా: సగంధర్వా: సిద్ధాశ్చ పరమర్షయ:।
అగస్త్యం నియతాహారం సతతం పర్యుపాసతే। 90

నాత్ర జీవేన్మృషావాదీ క్రూరో వా యది వా శఠ:।
నృశంస: కామవృత్తో వా మునిరేష తథావిధ:। 91

అత్ర దేవాశ్చ యక్షాశ్చ నాగాశ్చ పతగైస్సహ।
వసంతి నియతాహారా ధర్మమారాధయిష్ణవ:। 92

ఆ ఆశ్రమము యజ్ఞధూమముల (పొగ)తో ఒప్పుచుండును. అందు అంతటను వల్కలములు (నార చీరలు) వ్రేలాడుచు దానివైభవములను ఇనుమడింపజేయుచుండును. అచట నిరంతరము వివిధములగు మృగములు గుంపులుగుంపులుగా తిరుగుచుండును. పక్షులకలకల ధ్వనులు వినిపించుచుండును. (82)

అగస్త్యముని ప్రభావముచే వింధ్యపర్వతమునకు దక్షిణదిశయందుగల ఈ ఆశ్రమప్రాంతమంతయును సురక్షితముగా నున్నది. ఆ మహర్షికి భయపడి రాక్షసులు ఇచటనున్నవారి నెవ్వరినైనను హింసింపరు సరికదా వారు ఈ వైపునకు కన్నెత్తియైనను చూడజాలరు. (83)

పుణ్యాత్ముడైన ఈ మహర్షి ఇచట అడుగిడినప్పటి నుండియు నిశాచరులు తమవైరప్రవృత్తిని ప్రకటింపజాలక గర్వములుడిగి, మసలుకొనుచుండిరి. (84)

పూజ్యుడైన ఈ మహర్షియొక్క ప్రభావముచేత ఈ దక్షిణప్రాంతము దుష్టశక్తులకు అజేయముగా ముల్లోకముల యందును ప్రసిద్ధిగాంచినది. (85)

సూర్యునిమార్గమును (గమనమును) అడ్డుకొనుచున్న వింధ్యమహాపర్వతము ఈ మహాత్ముని ఆదేశమును శిరసావహించి, పెరుగుట మానివేసినది. (86)

దీర్ఘాయుష్మంతుడై, తన పుణ్యకర్మలచే లోకమున ప్రసిద్ధి వహించిన అగస్త్యమహామునియొక్క ఈ ఆశ్రమము సర్వశుభలక్షణములతో విలసిల్లుచు, వినమ్రులైన జనులకు (సాధుపురుషులకు) ఆశ్రయమిచ్చుచున్నది. (87)

సర్వలోకపూజ్యుడైన ఈ సత్పురుషుడు సజ్జనుల హితమునకే అనుక్షణము పాటుపడుచుండును. ఈ ముని ఇచటికి విచ్చేసిన మనకు శ్రేయస్సును గూర్చుటకై అన్నివిధములుగా తోడ్పడగలడు. (88)

సర్వసమర్థుడవైన ఓ లక్ష్మణా! మనము ఈ అగస్త్యమహామునిని సేవించుచు మిగిలిన వనవాసకాలమును ఈ ఆశ్రమప్రదేశమునందే గడుపుదము. (89)

దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు ఇచటికి విచ్చేయుచుందురు. తపోజీవనములకు అనుగుణముగా ఆహారనియమాదులను పాటించుచుండెడి ఈ అగస్త్యమహర్షిని వారు నిరంతరము భక్తిశ్రద్ధలతో సేవించుచుందురు. (90)

సత్యపాలనాది సద్గుణములుగల ఈ మహర్షియొక్క ఆశ్రమమున అసత్యవాదులకును, కఠినాత్ములకును, కామాతురులకును చోటు లేదు. (91)

ఇచట దేవతలు యక్షులు, నాగజాతివారు, గరుడాది పక్షిజాతులవారు ఆహారనియమములను పాటించుచు ధర్మనిరతులై నివసించుచుందురు. (92)

అత్ర సిద్ధా మహాత్మానో విమానైః సూర్యసన్నిభైః।
త్యక్తదేహా నవైర్దేహైః స్వర్యాతాః పరమర్షయః। 93

ఈ ఆశ్రమప్రాంతమునందు తపస్సిద్ధినందిన మహాత్ములు, మహర్షులు తమ స్థూలదేహములను వీడి, దివ్యదేహములను దాల్చి, సూర్యతేజస్సుతో వెలుగొందెడి విమానములపై స్వర్గమునకు చేరుచుందురు. (93)

యక్షత్వమ్ అమరత్వం చ రాజ్యాని వివిధాని చ।
అత్ర దేవాః ప్రయచ్ఛంతి భూతైరారాధితాశ్శుభైః। 94

ఈ ప్రదేశమున శ్రద్ధగా సత్కర్మలను ఆచరించుచు తమను ఆరాధించెడివారికి దేవతలు వివిధములగు రాజ్యసంపదలను, యక్షత్వమును, అమరత్వమును అనుగ్రహించుచుందురు. (94)

ఆగతాః స్మాఽఽశ్రమపదం సౌమిత్రే ప్రవిశాగ్రతః।
నివేదయేహ మాం ప్రాప్తమ్ ఋషయే సీతయా సహ। 95

ఓ లక్ష్మణా! మనము ఆశ్రమ సమీపమునకు రానేవచ్చితిమి. ముందుగా నీవు ఆశ్రమములోనికి వెళ్ళి, సీతతోగూడి నేను ఇచటికి వచ్చినట్లు ఆ అగస్త్యమహర్షికి నివేదింపుము. (95)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకాదశస్సర్గః (11)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పదునొకొండవసర్గము.

— ❋ ❋ ❋ —

12. పండ్రెండవసర్గము

తన ఆశ్రమమునకు విచ్చేసిన శ్రీరామునకు అగస్త్యుడు అతిథి సత్కారములను నెఱపి, దివ్యములైన అస్త్రశస్త్రములను సమర్పించుట.

స ప్రవిశ్యాఽఽశ్రమపదం లక్ష్మణో రాఘవానుజః।
అగస్త్యశిష్యమ్ ఆసాద్య వాక్యమేతదువాచ హ। 1

శ్రీరామునితమ్ముడైన లక్ష్మణుడు వెంటనే ఆ ఆశ్రమమున ప్రవేశించి, ఒక అగస్త్యశిష్యుని సమీపించి ఇట్లు వచించెను.(1)

రాజా దశరథో నామ జ్యేష్ఠస్తస్య సుతో బలీ।
రామః ప్రాప్తో మునిం ద్రష్టుం భార్యయా సహ సీతయా। 2

"ఓ మహాత్మా! దశరథమహారాజుయొక్క పెద్దకుమారుడును, మిగుల బలశాలియు ఐన శ్రీరాముడు తన భార్యయగు సీతాదేవితో గూడి, అగస్త్యమహర్షిని దర్శించుటకై ఇచటికి వచ్చియున్నాడు. (2)

లక్ష్మణో నామ తస్యాహం భ్రాతా త్వవరజో హితః।
అనుకూలశ్చ భక్తశ్చ యది తే శ్రోత్రమాగతః। 3

తే వయం వనమత్యుగ్రం ప్రవిష్టాః పితృశాసనాత్।
ద్రష్టుమిచ్ఛామహే సర్వే భగవంతం నివేద్యతామ్। 4

నేను ఆ శ్రీరామచంద్రునితమ్ముడను. ఆయనకు ప్రియము, హితమునుగూర్చెడి భక్తుడను. మమ్ములనుగూర్చి నీవు వినియే యుండవచ్చును. మేము తండ్రియాజ్ఞను శిరసావహించి, ఈ ఘోరారణ్యమునకు వచ్చితిమి. మేమందఱమును పూజ్యులైన మీగురువుగారిని దర్శింప గోరుచున్నట్లు వారికి నివేదింపుము"- (3-4)

తస్య తద్వచనం శ్రుత్వా లక్ష్మణస్య తపోధనః।
తథేత్యుక్త్వాఽగ్నిశరణం ప్రవివేశ నివేదితుమ్। 5

అంతట ఆ తపోధనుడు ఆ లక్ష్మణస్వామియొక్క పలుకులు విని, 'సరే! మంచిది' యని వచించి, ఈ సమాచారమును తమగురువునకు నివేదించుటకై అగ్నిగృహమున ప్రవేశించెను. (5)

స ప్రవిశ్య మునిశ్రేష్ఠం తపసా దుష్ప్రధర్షణమ్।
కృతాంజలిరువాచేదం రామాగమనమంజసా।
యథోక్తం లక్ష్మణేనైవ శిష్యోఽగస్త్యస్య సమ్మతః। 6

అగస్త్యునిశిష్యులలో ప్రముఖుడైన ఆతడు అగ్నిగృహమున ప్రవేశించిన వెంటనే, సాటిలేని తపశ్శక్తిగల అగస్త్యమహర్షిని సమీపించి, అంజలి ఘటించి, ఆయనకు ప్రణమిల్లెను. అనంతరము అతడు లక్ష్మణుడు తెల్పినరీతిగా రామాగమనవార్తను ఆయనకు ఎఱింగించెను. (6)

పుత్రౌ దశరథస్యేమౌ రామో లక్ష్మణ ఏవ చ।
ప్రవిష్టావాశ్రమపదం సీతయా సహ భార్యయా। 7

ద్రష్టుం భవంతమాయాతౌ శుశ్రూషార్థమ్ అరిందమౌ।
యదత్రానంతరం తత్ త్వమ్ ఆజ్ఞాపయితుమర్హసి। 8

తతః శిష్యాదుపశ్రుత్య ప్రాప్తం రామం సలక్ష్మణమ్।
వైదేహీం చ మహాభాగామ్ ఇదం వచనమబ్రవీత్। 9

దిష్ట్యా రామశ్చిరస్యాద్య ద్రష్టుం మాం సముపాగతః।
మనసా కాంక్షితం హ్యస్య మయాఽప్యాగమనం ప్రతి। 10

గమ్యతాం సత్కృతో రామః సభార్యస్సహలక్ష్మణః।
ప్రవేశ్యతాం సమీపం మే కిం చాసౌ న ప్రవేశితః। 11

ఏవముక్తస్తు మునినా ధర్మజ్ఞేన మహాత్మనా।
అభివాద్యాబ్రవీచ్ఛిష్యః తథేతి నియతాంజలిః। 12

తతో నిష్క్రమ్య సంభ్రాంతః శిష్యో లక్ష్మణమబ్రవీత్।
క్వాఽసౌ రామో మునిం ద్రష్టుమ్ ఏతు ప్రవిశతు స్వయమ్। 13

తతో గత్వాఽఽశ్రమద్వారం శిష్యేణ సహ లక్ష్మణః।
దర్శయామాస కాకుత్స్థం సీతాం చ జనకాత్మజామ్। 14

తం శిష్యః ప్రశ్రితో వాక్యమ్ అగస్త్యవచనం బ్రువన్।
ప్రావేశయద్యథాన్యాయం సత్కారార్హం సుసత్కృతమ్। 15

ప్రవివేశ తతో రామః సీతయా సహలక్ష్మణః।
ప్రశాంతహరిణాకీర్ణమ్ ఆశ్రమం హ్యవలోకయన్। 16

స తత్ర బ్రహ్మణః స్థానమ్ అగ్నేః స్థానం తథైవ చ।
విష్ణోః స్థానం మహేంద్రస్య స్థానం చైవ వివస్వతః। 17

సోమస్థానం భగస్థానం స్థానం కౌబేరమేవ చ।
ధాతుర్విధాతుః స్థానే చ వాయోః స్థానం తథైవ చ। 18

నాగరాజస్య చ స్థానమ్ అనంతస్య మహాత్మనః।
స్థానం తథైవ గాయత్ర్యా వసూనాం స్థానమేవ చ। 19

స్థానం చ పాశహస్తస్య వరుణస్య మహాత్మనః।
కార్తికేయస్య చ స్థానం ధర్మస్థానం చ పశ్యతి। 20

"దశరథమహారాజుకుమారులైన రామలక్ష్మణులు సీతాదేవితోగూడి, మనఆశ్రమమునకు విచ్చేసియున్నారు. శత్రుసంహారకులైన ఆ ఇరువురు రాజకుమారులు మిమ్ము దర్శించి, సేవించుటకై ఇచటికి వచ్చియున్నారు. ఇక ఇప్పుడు మీఆజ్ఞను తెలుపుడు." (7-8)

రామలక్ష్మణులును, మహాసాధ్వియగు సీతాదేవియు తనఆశ్రమమునకు వచ్చినట్లు శిష్యునివలన వినిన పిమ్మట అగస్త్యుడు అతనితో ఇట్లనెను. (9)

"నా అదృష్టము పండి, ఇంతకాలమునకు నేడు శ్రీరాముడు నన్ను చూడవచ్చినాడు. నేనును నిండుమనస్సుతో ఆయనశుభాగమనమునకై నిరీక్షించుచుంటిని. (10)

"శిష్యా! వెంటనే పూజ్యుడైన శ్రీరాముని, సీతాదేవిని, లక్ష్మణుని నాకడకు తీసికొని రమ్ము. వారిని ఇంతవఱకును ఏల ప్రవేశపెట్టలేదు?" (11)

ధర్మజ్ఞుడును, మహాత్ముడును ఐన అగస్త్యముని ఇట్లు వచింపగా శిష్యుడు అంజలి ఘటించి, ప్రణమిల్లి 'అట్లే' యని పలికెను. (12)

పిమ్మట ఆ శిష్యుడు తత్తఱపడుచు లక్ష్మణుని జేరి, "శ్రీరాములవారు ఎక్కడ? మహర్షిని దర్శించుటకు ఆయన స్వయముగనే రావచ్చును" అని నుడివెను. (13)

వెంటనే లక్ష్మణుడు ఆ శిష్యునితోగూడి ఆశ్రమముఖద్వారము కడకేగి, అచటనున్న సీతారాములను అతనికి చూపించెను. అంతట ఆ శిష్యుడు వినమ్రుడై, అగస్త్యుని వచనములను యథాతథముగా శ్రీరామునకు నివేదించెను. పిదప అతడు పూజ్యుడైన శ్రీరామునకు యథోచితముగా స్వాగతసత్కారములను నెఱపి, ఆయనను ఆశ్రమములోనికి గొనివచ్చెను. (14-15)

శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై ఆ ఆశ్రమమునందు నిర్భయముగా సంచరించుచున్న లేళ్లను చూచుచు లోనికి ప్రవేశించెను. (16)

ఆ ఆశ్రమమునందు బ్రహ్మదేవుడు, అగ్ని, విష్ణువు, మహేంద్రుడు, సూర్యుడు, చంద్రుడు, భగుడు (శివుడు), కుబేరుడు, ధాత, విధాత, వాయువు, నాగేంద్రుడు, మహాత్ముడైన ఆదిశేషుడు, గాయత్రి, వసువులు, పాశహస్తుడైన మహాత్ముడగు వరుణుడు, కార్తికేయుడు, యముడు మొదలగు దేవతలకు వేర్వేరుగా పూజామందిరములు నిర్మింపబడి యుండెను. శ్రీరాముడు సీతాలక్ష్మణ సమేతుడై ఆయాదేవతా మందిరములనన్నింటిని విడివిడిగా శ్రద్ధాసక్తులతో దర్శించెను. (17-20)



सीताद्वारा प्रदत्त चूड़ामणि श्रीरामको समर्पित करना   Crest jewel of Sītā handed over to Śrī Rāma

सेतुबन्ध

Bridging the sea

भूधराकार हनुमान्   Mountainous Hanumān



विभीषणद्वारा वस्त्राभूषणोंकी वर्षा Vibhīṣaṇa showers ornaments and garments



देवसभामें भगवान् विष्णु

Lord Viṣṇu in assembly of god

पुष्पकद्वारा अयोध्या-यात्रा Journey to Ayodhyā by Puṣpaka



भगवान् श्रीरामका राज्याभिषेक

Coronation of Lord Śrī Rāma



सीता-त्यागके पश्चात् लक्ष्मण श्रीरामके सान्निध्यमें   Lakṣmaṇa with Śrī Rāma after abandoning Sītā

తతశ్శిష్యైః పరివృతో మునిరప్యభినిష్పతత్।
తం దదర్శాగ్రతో రామో మునీనాం దీప్తతేజసామ్। 21

అబ్రవీద్వచనం వీరో లక్ష్మణం లక్ష్మివర్ధనమ్।
ఏష లక్ష్మణ! నిష్క్రామత్యగస్త్యో భగవాన్ ఋషిః। 22

ఔదార్యేణావగచ్ఛామి నిధానం తపసామిమమ్। 23

ఏవముక్త్వా మహాబాహుః అగస్త్యం సూర్యవర్చసమ్।
జగ్రాహ పరమప్రీతః తస్య పాదౌ పరంతపః। 24

అభివాద్య తు ధర్మాత్మా తస్థౌ రామః కృతాంజలిః।
సీతయా సహ వైదేహ్యా తదా రామస్సలక్ష్మణః। 25

ప్రతిజగ్రాహ కాకుత్స్థమ్ అర్చయిత్వాఽఽసనోదకైః।
కుశలప్రశ్నముక్త్వా చ హ్యాస్యతామితి చాబ్రవీత్। 26

అగ్నిం హుత్వా ప్రదాయార్ఘ్యమ్ అతిథీన్ ప్రతిపూజ్య చ।
వానప్రస్థేన ధర్మేణ స తేషాం భోజనం దదౌ। 27

ప్రథమం చోపవిశ్యాథ ధర్మజ్ఞో మునిపుంగవః।
ఉవాచ రామమాసీనం ప్రాంజలిం ధర్మకోవిదమ్। 28

అగ్నిం హుత్వా ప్రదాయార్ఘ్యమ్ అతిథిం ప్రతిపూజయేత్।
అన్యథా ఖలు కాకుత్స్థ! తపస్వీ సముదాచరన్।
దుస్సాక్షీవ పరే లోకే స్వాని మాంసాని భక్షయేత్। 29

రాజా సర్వస్య లోకస్య ధర్మచారీ మహారథః।
పూజనీయశ్చ మాన్యశ్చ భవాన్ ప్రాప్తః ప్రియాతిథిః। 30

ఏవముక్త్వా ఫలైర్మూలైః పుష్పైరన్యైశ్చ రాఘవమ్।
పూజయిత్వా యథా కామం పునరేవ తతోఽబ్రవీత్। 31

అంతట శ్రీరాముని రాకను గమనించి, అగస్త్యుడు తన శిష్యులతోగూడి లేచి, ఆయనకు ఎదురుగా వచ్చుచుండెను. తేజోమూర్తులైన మునులను వెంటబెట్టుకొని, వారికి ముందుభాగమున నడచుచు వచ్చుచున్న అగస్త్యుని శ్రీరాముడు తిలకించెను. (21)

పిమ్మట మహావీరుడైన శ్రీరాముడు శుభలక్షణసంపన్నుడైన లక్ష్మణునితో ఇట్లనెను. "ఓ సౌమిత్రీ! పూజ్యుడైన అగస్త్యమహర్షి ఇడుగో! ఇదే బయటికి వచ్చుచున్నాడు. ఈయనయొక్క బ్రహ్మతేజస్సును బట్టి ఇతడు ఒక మహాతపోనిధియని తలంచుచున్నాను. (22-23)

శత్రువులను సంహరించుటలో సమర్థుడైన ఆజానుబాహువగు ఆ శ్రీరాముడు సూర్యునివలె మహాతేజస్వియైన అగస్త్యుని గూర్చి ఇట్లు పలికిన పిమ్మట ఆయన పరమసంతోషముతో ఆ మహర్షి పాదములకు ప్రణమిల్లెను. లోకములను ఆనందింపజేయు వాడును, ధర్మాత్ముడును ఐన శ్రీరాముడు సీతా లక్ష్మణసమేతుడై ఆ మహర్షికి పాదాభివందన మాచరించిన పిమ్మట అంజలి ఘటించి నిలిచెను.(24-25)

అంతట అగస్త్యమహాముని కకుత్స్థవంశమువాడైన శ్రీరామునకు స్వాగతమర్యాదలను నెఱపిన పిమ్మట, మార్గాయాసమును దీర్చుకొనుడని వారితో పలికెను.(26)

అనంతరము ఆ ముని అగ్నిహోమకార్యములను ముగించుకొని, సీతారామలక్ష్మణులకు అర్ఘ్యపాద్యాది పూర్వకముగా అతిథిపూజలనునిర్వహించెను. పిమ్మట ఆతడు తన వానప్రస్థజీవనధర్మములకు తగినట్లుగా వారికి ఫలమూలాదులతో భోజనమర్యాదలను నడిపెను. (27)

ధర్మజ్ఞుడైన ఆ మహర్షి ముందుగా తాను కూర్చొని, ప్రాంజలియై ఆసీనుడైన ధర్మజ్ఞుడగు శ్రీరామునితో ఇట్లు నుడివెను. (28)

"ఓ రామా! వనవాసము చేయుచున్నవాడు ముందుగా వైశ్వదేవాది అగ్నికార్యములను నిర్వర్తింపవలెను. పిమ్మట అర్ఘ్యపాద్యాదులతో అతిథిపూజలను కావింపవలెను. అందుకు భిన్నముగా ఆచరించినచో అబద్ధసాక్ష్యము చెప్పిన వాని వలె అతడు పరలోకములో తనమాంసమునే తాను భక్షింపవలసి యుండును. (29)

ఓ రామా! నీవు సమస్తప్రజలకును రాజువు. ధర్మనిరతుడవు, మహాయోధుడవు. నేడు మాకు ప్రియమైన అతిథివి. కనుక నీవు మాన్యుడవు, పూజ్యుడవు". (30)

ఇట్లు పలికిన పిమ్మట ఆ ముని పుష్పాదులతో, ఫలమూలములతో శ్రీరాముని చక్కగా పూజించి, మఱల ఆయనతో ఇట్లు వచించెను. (31)

ఇదం దివ్యం మహచ్చాపం హేమరత్నవిభూషితమ్।
వైష్ణవం పురుషవ్యాఘ్ర! నిర్మితం విశ్వకర్మణా। 32

అమోఘః సూర్యసంకాశో బ్రహ్మదత్తః శరోత్తమః।
దత్తో మమ మహేంద్రేణ తూణీ చాక్షయసాయకౌ। 33

సంపూర్ణౌ నిశితైర్బాణైః జ్వలద్భిరివ పావకైః।
మహారజతకోశోఽయమ్ అసిర్హేమవిభూషితః। 34

"ఓ పురుషోత్తమా! ఇది దివ్యమైన గొప్ప ధనుస్సు, ఇది బంగారముతో, రత్నములతో అలంకృతమైనది. ఈ వైష్ణవచాపమును విశ్వకర్మ నిర్మించెను.(1) సూర్యుని తేజస్సువలె అమోఘమైన ఈ శరము (బాణము) బ్రహ్మదేవునినుండి నాకడకు చేరినది. ఈ రెండు తూణీరములను దేవేంద్రుడు నాకు సమర్పించెను. ఇవి బాణములను అక్షయముగా సమకూర్చుచుండును. అగ్నివలె తేజస్సును విరజిమ్ముచుండెడి వాడియైన బాణములతో నిండియుండును. బంగారు ఒరగల ఈ సువర్ణఖడ్గము గూడ ఆ సురపతియే యిచ్చెను. (32-34)

అనేన ధనుషా రామ! హత్వా సంఖ్యే మహాసురాన్।
ఆజహార శ్రియం దీప్తాం పురా విష్ణుర్దివౌకసామ్। 35

ఓ రామా! ఒకానొకప్పుడు శ్రీమహావిష్ణువు ఈ ధనుస్సును చేబూని, రణరంగమున దుష్టులైన రాక్షసులను తునుమాడి, సమస్త దేవతలకును విజయలక్ష్మిని ప్రసాదించెను. (35)

తద్ధనుస్తౌ చ తూణీరౌ శరం ఖడ్గం చ మానద!।
జయాయ ప్రతిగృహ్ణీష్వ వజ్రం వజ్రధరో యథా। 36

ఓ పూజ్యుడా! ఈ ధనుస్సును, తూణీరములను, అమోఘమైన ఖడ్గమును, ఇంద్రుడు వజ్రాయుధమును వలె, స్వీకరింపుము. నీకు జయము తథ్యము." (36)

ఏవముక్త్వా మహాతేజాః సమస్తం తద్వరాయుధమ్।
దత్త్వా రామాయ భగవాన్ అగస్త్యః పునరబ్రవీత్। 37

ఇట్లు పలికిన పిదప మహాతేజస్వియు, పూజ్యుడును ఐన అగస్త్యమహర్షి శ్రేష్ఠములైన ఆ ఆయుధములను అన్నింటిని శ్రీరామునకు సమర్పించి, ఆయనతో మరల ఇట్లు నుడివెను. (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ద్వాదశస్సర్గః *(12)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పండ్రెండవసర్గము.

— * * * —

13. పదుమూడవసర్గము

అగస్త్యమహర్షి సీతాసాధ్వియొక్క ఔన్నత్యమును ప్రశంసించుట - శ్రీరాముని కోరికపై ఆ మహాముని 'పంచవటీ వారికి నివాసయోగ్యము' అని తెల్పుట. వారు అచటికి బయలు దేఱుట.

రామ! ప్రీతోఽస్మి భద్రం తే పరితుష్టోఽస్మి లక్ష్మణ!।
అభివాదయితుం యన్మాం ప్రాప్తౌ స్థః సహ సీతయా। 1

"ఓ రామలక్ష్మణులారా! మీకు శుభమగుగాక. మీయెడ నేను ప్రసన్నుడనైతిని. నాపైగల ఆదరాభిమానములతో మీరు సీతాదేవితోగూడి, ఇచటికి విచ్చేసినందులకు నేను ఎంతయు సంతసించుచున్నాను. (1)

అధ్వశ్రమేణ వాం ఖేదో బాధతే ప్రచురశ్రమః।
వ్యక్తముత్కంఠతే చాపి మైథిలీ జనకాత్మజా। 2

అడవిబాటలలో పలు శ్రమలకోర్చి, చాలాదూరము ప్రయాణముచేసియున్నందున మీరు మిక్కిలి అలసియుంటిరి. ఆ మార్గాయాసము మిమ్ము మిగుల బాధించుచుండవచ్చును. జనకమహారాజుయొక్క కూతురైన (రాకుమారియైన) సీతాదేవియు తనఅలసట తీర్చుకొనుటకై

1) పూర్వము ఈ వైష్ణవధనుస్సు పరశురామునినుండి శ్రీరాముని చేరెను. అతడు దీనిని వరుణునకు ఇచ్చెను. ఆ వరుణుడు దీనిని అగస్త్యునకు సమర్పించెను.

ఏషా హి సుకుమారీ చ దుఃఖైశ్చ న విమానితా।
ప్రాజ్యదోషం వనం ప్రాప్తా భర్తృస్నేహప్రచోదితా। 3

యథైషా రమతే రామ ఇహ సీతా తథా కురు।
దుష్కరం కృతవత్యేషా వనే త్వామనుగచ్ఛతీ। 4

ఏషా హి ప్రకృతిః స్త్రీణామ్ ఆసృష్టే రఘునందన!।
సమస్థమనురంజంతి విషమస్థం త్యజంతి చ। 5

శతహ్రదానాం లోలత్వం శస్త్రాణాం తీక్ష్ణతాం తథా।
గరుడానిలయోః శైఘ్ర్యమ్ అనుగచ్ఛంతి యోషితః। 6

ఇయం తు భవతో భార్యా దోషైరేతైర్వివర్జితా।
శ్లాఘ్యా చ వ్యపదేశ్యా చ యథా దేవీ హ్యరుంధతీ। 7

అలంకృతోఽయం దేశశ్చ యత్ర సౌమిత్రిణా సహ।
వైదేహ్యా చానయా రామ! వత్స్యసి త్వమరిందమ!। 8

ఏవముక్తస్తు మునినా రాఘవః సంయతాంజలిః।
ఉవాచ ప్రశ్రితం వాక్యమ్ ఋషిం దీప్తమివానలమ్। 9

ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే మునిపుంగవః।
గుణైః సభ్రాతృభార్యస్య వరదః పరితుష్యతి। 10

కింతు వ్యాదిశ మే దేశం సోదకం బహుకాననమ్।
యత్రాఽఽశ్రమపదం కృత్వా వసేయం నిరతః సుఖమ్। 11

తతోఽబ్రవీన్మునిశ్రేష్ఠః శ్రుత్వా రామస్య తద్వచః।
ధ్యాత్వా ముహూర్తం ధర్మాత్మా ధీరో ధీరతరం వచః। 12

విశ్రాంతిని కోరుకొనుచున్నట్లు కనబడుచున్నది. సుకుమారి యగు ఈ జానకికి ఇదివఱలో ఖేదమనుమాటయే యెఱుగదు. వనవాస జీవితము పెక్కు కష్టములతో గూడియుండునని తెలిసియు, భర్తపైగల ప్రేమానురాగములకారణముగా ఆమె ఇటు వచ్చినది. (2-3)

ఓ రామా! కష్టములతో గూడిన ఈ వనవాసమునకు నిన్ను అనుసరించి వచ్చుట ఈమె చేసిన ఒక సాహస కృత్యము. కావున ఈమె ఎల్లప్పుడును సంతోషముగా ఉండునట్లు చూడుము. (4)

ఓ రఘువరా! భర్త తనకు అనుకూలముగానున్నప్పుడు స్త్రీ ఆయనపై ప్రేమానురాగములను ప్రదర్శించుచుండును. పతి దురవస్థలపాలైనప్పుడు స్త్రీ అతనిని త్యజించుచుండును. సృష్టి ప్రారంభమునుండియు ఇది స్త్రీలకు సహజలక్షణము. స్త్రీలు విద్యుత్తువలె చంచలచిత్తములుగలవారు. శస్త్రములవలె తీవ్ర స్వభావములు గలవారు, గరుడునివలె, వాయువువలె వేగధోరణి గలిగియుందురు. అనగా ముందు వెనుక ఆలోచింపక తొందరపాటుతో వ్యవహరించుచుందురు. (5-6)

కానీ నీ భార్యయగు సీతాదేవిలోమాత్రము ఈ దోషములెవ్వియును మచ్చునకైనను కానరావు. ఈ జానకి అరుంధతివలె పరమసాధ్వి. అందువలన ఈమె కడు పూజ్యురాలు. (7)

శత్రుసంహారకుశలుడవైన ఓ రామా! నీవు నీ భార్యయగు వైదేహితో, తమ్ముడగు లక్ష్మణునితోగూడి ఇచటికి వచ్చుటవలన ఈ ఆశ్రమము పునీతమైనది, మిగుల శోభితమైనది. (నీవుఅడుగిడిన ప్రదేశములన్నియును పవిత్రములగుచుండును, ధన్యత చెందుచుండును. నీ పాద స్పర్శమహిమలు అట్టివి.) కనుక నీవు ఇచటనే నివసింపుము." (8)

అగస్త్యమహర్షి ఇట్లు పలికిన పిమ్మట శ్రీరాముడు అంజలిఘటించినవాడై, అగ్నితేజస్సుతో భాసిల్లుచున్న ఆ మునితో వినమ్రముగా ఇట్లు నుడివెను. (9)

"ఓ మునీశ్వరా! మా ముగ్గురియొక్క (నాయొక్క, సీతాలక్ష్మణులయొక్క) గుణములకు ఎంతయు తృప్తిపడి, వరములను ప్రసాదించి మమ్ము అనుగ్రహించితివి. నేనెంతయు ధన్యుడను. అయితే ఓ మహాత్మా! జలసమృద్ధియు, అన్నివిధములుగా అనువగు వనములుగల ప్రదేశమును నాకు తెలుపుడు. అచట ఒక ఆశ్రమమును నిర్మించుకొని, ప్రశాంతముగా హాయిగా నివసింతును." (10-11)

శ్రీరాముడు పలికిన వినమ్రవచనములు వినిన యనంతరము, ప్రతిభాశాలియు, ధర్మాత్ముడును ఐన ఆ అగస్త్యముని మున్ముందు రఘువరుడు నిర్వహింపవలసిన కార్యములకు అనుకూలమైన ప్రదేశమునుగూర్చి క్షణకాలము ధ్యానమగ్నుడై ఆలోచించి, నిశ్చయబుద్ధితో ఇట్లనెను. (12)

ఇతో ద్వియోజనే తాత! బహుమూలఫలోదకః।
దేశో బహుమృగః శ్రీమాన్ పంచవట్యభివిశ్రుతః। 13

తత్ర గత్వాఽఽశ్రమపదం కృత్వా సౌమిత్రిణా సహ।
రంస్యసే త్వం పితుర్వాక్యం యథోక్తమ్ అనుపాలయన్। 14

కాలోఽయం గతభూయిష్ఠో యః కాలస్తవ రాఘవ।
సమయో యో నరేంద్రేణ కృతో దశరథేన తే। 15

తీర్ణప్రతిజ్ఞః కాకుత్స్థ! సుఖం రాజ్యే నివత్స్యసి।
ధన్యస్తే జనకో రామ! స రాజా రఘునందన!।
యస్త్వయా జ్యేష్ఠపుత్రేణ యయాతిరివ తారితః। 16

విదితో హ్యేష వృత్తాంతో మమ సర్వస్తవానఘ!।
తపసశ్చ ప్రభావేన స్నేహాద్దశరథస్య చ। 17

హృదయస్థశ్చ తే ఛందో విజ్ఞాతస్తపసా మయా।
ఇహ వాసం ప్రతిజ్ఞాయ మయా సహ తపోవనే। 18

వసంతం త్వాం జనాః సర్వే జ్ఞాస్యంతి రఘునందన!।
అతశ్చ త్వామహం బ్రూమి గచ్ఛ పంచవటీమితి। 19

స హి రమ్యో వనోద్దేశో మైథిలీ తత్ర రంస్యతే।
స దేశః శ్లాఘనీయశ్చ నాఽతిదూరే చ రాఘవ। 20

గోదావర్యాః సమీపే చ మైథిలీ తత్ర రంస్యతే।
ప్రాజ్యమూలఫలశ్చైవ నానాద్విజగణాయుతః।
వివిక్తశ్చ మహాబాహో! పుణ్యో రమ్యస్తథైవ చ। 21

"నాయనా! రామా! ఇచ్చటికి రెండు యోజనముల దూరమున 'పంచవటి' యను ఒక ప్రసిద్ధప్రదేశము గలదు. అచట ఫలమూలములకును, జలములకును కొదువలేదు. అది అన్నివిధములుగా మీ వనవాసమునకు అనువైన ప్రదేశము. అది లేళ్లగుంపులసంచారములతో మనోహరముగా నుండును.(13)

కనుక నీవు సీతాలక్ష్మణసమేతుడవై అచటికి వెళ్లుము. ఆశ్రమమును నిర్మించుకొనుము. తండ్రి ఆజ్ఞానుసారము నీ వనవాసజీవితమును హాయిగా నడుపుము. ఓ రఘురామా! దశరథమహారాజు నీకు ఆదేశించిన పదునాలుగుసంవత్సరముల వనవాసకాలములో చాలవఱకు గడచి పోయినది. ఓ కాకుత్స్థా! నీ ప్రతిజ్ఞను నెఱవేర్చుకొని, కోసలరాజ్యమును సుఖముగా పాలింపగలవు. ఓ రఘువరా! నిజముగా నీ తండ్రియైన దశరథమహారాజు ధన్యుడు. ఏలనన పూరుడు తనతండ్రియైన యయాతిని[1] వలె జ్యేష్ఠపుత్రుడవైన నీవు నీతండ్రియైన దశరథమహారాజును తరింపజేసితివి. (14-16)

రామా! నీ తండ్రి యైన దశరథుడు నాకు మిత్రుడగుట వలనను, నా తపఃప్రభావముచేతను నీయొక్క ఈ వృత్తాంతమును నేను పూర్తిగా ఎఱుంగుదును. నా తపశ్శక్తిచేత నీహృదయమునందలి అభిప్రాయమును నేను తెలిసికొంటిని. నాతోగూడి ఈ ఆశ్రమమున వసించినచో నీయునికిని గూర్చి ఎల్లరకు తెలిసిపోవును. అందువలన నీవు పంచవటిలో ఉండుటయేయుక్తమని నేను తలంచుచున్నాను.(17-19)

ఓ రఘువరా! ఆ పంచవటిప్రదేశము మిక్కిలి మెచ్చుకొనదగినంతగా ఎంతయు మనోహరముగా ఉండును. అక్కడ సీతాదేవియు హాయిగా ఉండగలదు. అది ఇచటికి ఎంతో దూరమునలేదు. (20)

గోదావరీనదీతీరమునగల ఆ ప్రదేశము కందమూల ఫలములతో సుసంపన్నమైనది. అది వివిధములగు పక్షులకు ఆలవాలము. పవిత్రమైన ఆ పంచవటి జనసంచారములేక ప్రశాంతముగానుండును. మనోజ్ఞమైన ఆ ప్రదేశము సీతాదేవి విహరించుటకు మిగుల అనువైనది. (21)

1) శుక్రాచార్యునికూతురు దేవయాని. చంద్రవంశపురాజైన నహుషుని కుమారుడు యయాతి. విధివిలాసమున దేవయానికిని యయాతికిని పెండ్లియయ్యెను. వృషపర్వుడను రాజుయొక్క కుమార్తెయైన శర్మిష్ఠ విధివశమున దేవయానికి దాసియయ్యెను. దేవయాని పతి (యయాతి) గృహమునకు వెళ్లునపుడు ఆమెవెంట ఆమెదాసియగు శర్మిష్ఠయు యయాతిభవనమునకు చేరెను. యయాతివలన దేవయానికి ఇద్దఱు కొడుకులు కలిగిరి. శర్మిష్ఠకు యయాతివలన ముగ్గురు పుత్త్రులు కలిగిరి. ఇట్లు తనకుమార్తె యగు దేవయానికి ద్రోహము చేసినందులకు శుక్రుడు 'నీకు ముసలితనము ప్రాప్తించుగాక' అని అతనిని శపించెను. అప్పుడు యయాతి వాస్తవములను దెలిపి, తనను క్షమింపుమని ఆయనను వేడుకొనెను. అంతట శుక్రుడు నీ వృద్ధత్వమును నీకుమారులలో ఎవడైనను స్వీకరించినచో నీకు మఱల యౌవనము లభించునని పలికెను. అప్పుడు యయాతికుమారుడైన పూరుడు తనతండ్రిజరాభారమును స్వీకరించి తనయౌవనమును ఆయనకు ఇచ్చెను. ఆ విధముగా యయాతి తిరిగి యౌవనమును పొంది, ఐహికభోగములను అనుభవించి, కడకు రాజ్యమును పూరునకప్పగించి స్వర్గమునకు జేరెను.

భవానపి సదారశ్చ శక్తశ్చ పరిరక్షణే।
అపిచాత్ర వసన్ రామ! తాపసాన్ పాలయిష్యసి। 22

ఓ రామా! సకలప్రాణులను సంరక్షించుటలో సమర్థుడవైన నీవు సీతాలక్ష్మణసహితుడవై, పంచవటియందు నివసించుచు, తాపసులను బాగుగా కాపాడుచుండగలవు. (22)

ఏతదాలక్ష్యతే వీర! మధూకానాం మహద్వనమ్।
ఉత్తరేణాస్య గంతవ్యం న్యగ్రోధమభిగచ్ఛతా। 23

తత: స్థలముపారుహ్య పర్వతస్యావిదూరత:।
ఖ్యాత: పంచవటీత్యేవ నిత్యపుష్పితకానన:। 24

ఓ మహావీరా! అదిగో అచట దట్టమైన ఒక ఇప్పచెట్ల వనము కనబడుచున్నది. అచటినుండి ఉత్తరదిశగా మర్రిచెట్టునకు అభిముఖముగా వెళ్లినచో ఒక పర్వతము వచ్చును. దానికి సమీపముననే 'పంచవటి' యను సుప్రసిద్ధప్రదేశము గలదు. ఆ వనము ఎల్లవేళలయందును పుష్పశోభలతో విలసిల్లుచుండును." (23-24)

అగస్త్యేనైవముక్తస్తు రామ: సౌమిత్రిణా సహ।
సత్కృత్యాఽఽమంత్రయామాస తమ్ ఋషిం సత్యవాదినమ్। 25

శ్రీరాముడు అగస్త్యమునిసూచనలను గమనించిన పిదప లక్ష్మణసహితుడై, సత్యవచనుడైన ఆ మహర్షిని సత్కరించి, తమప్రయాణమునకు అనుమతిని గోరెను. (25)

తౌ తు తేనాభ్యనుజ్ఞాతౌ కృతపాదాభివందనౌ।
తదాశ్రమాత్ పంచవటీం జగ్మతు: సహ సీతయా। 26

ఆ మహాముని అనుమతించిన పిమ్మట సీతారామలక్ష్మణులు అగస్త్యమహర్షికి పాదాభివందనమొనర్చి, ఆ ఆశ్రమమునుండి పంచవటికి బయలుదేఱిరి. (26)

గృహీతచాపౌ తు నరాధిపాత్మజౌ
విషక్తతూణౌ సమరేష్వకాతరౌ।
యథోపదిష్టేన పథా మహర్షిణా
ప్రజగ్మతు: పంచవటీం సమాహితౌ। 27

యుద్ధరంగమున నిర్భయముగా నిలిచెడి రాజకుమారులైన ఆ రామలక్ష్మణులు ధనుస్సులను, తూణీరములను ధరించి, సావధానులై మహర్షి తెల్పినమార్గమున పయనించి, పంచవటికి బయలుదేఱిరి. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే త్రయోదశస్సర్గ: **(13)**

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పదుమూడవసర్గము.

-- * * * --

14. పదునాల్గవసర్గము

పంచవటికి వెళ్లుచు దారిలో శ్రీరాముడు జటాయువును కలియుట - అతడు తన వంశమును గూర్చి తెలుపుచు ప్రసంగవశమున సకల ప్రాణుల ఉత్పత్తిని గూర్చి వివరించుట - సీతారామలక్ష్మణులు పంచవటిలో ప్రవేశించుట.

అథ పంచవటీం గచ్ఛన్ అంతరా రఘునందన:।
ఆససాద మహాకాయం గృధ్రం భీమపరాక్రమమ్। 1

శ్రీరాముడు పంచవటికి పయనించుచు దారిలో ఒక గ్రద్దను చూచెను దానిశరీరము దృఢమైనది. అది శత్రువులకు భయమును గొల్పునట్టి పరాక్రమము గలది. (1)

తం దృష్ట్వా తౌ మహాభాగౌ వటస్థం రామలక్ష్మణౌ।
మేనాతే రాక్షసం పక్షిం బ్రువాణౌ కో భవానితి। 2

మహాత్ములైన ఆ రామలక్ష్మణులు మఱ్ఱిచెట్టుపైనున్న ఆ గ్రద్దను జూచి, అది పక్షియాకారమును దాల్చిన రాక్షసుడని భావించి," 'ఎవరు నీవు'? అని ప్రశ్నించిరి.(2)

స తౌ మధురయా వాచా సౌమ్యయా ప్రీణయన్నివ।
ఉవాచ వత్స! మాం విద్ధి వయస్యం పితురాత్మన:। 3

అప్పుడాపక్షి తనమృదుమధురవచనములతో వారికి తృప్తిని గూర్చుచు, 'నాయనా'! నన్ను మీ తండ్రియొక్క మిత్రునిగా ఎఱుంగుము'. (3)

స తం పితృసఖం బుద్ధ్వా పూజయామాస రాఘవ:।
స తస్య కులమవ్యగ్రమ్ అథ పప్రచ్ఛ నామ చ। 4

ఆ గృధ్రరాజు తనతండ్రియొక్క మిత్రుడని తెలియగనే శ్రీరాముడు అతనిని పూజించెను. పిమ్మట అతడు 'నీవంశము యొక్క పుట్టుపూర్వోత్తరము లెట్టి? నీ పేరేమి?' అని యడిగెను. (4)

రామస్య వచనం శ్రుత్వా సర్వభూతసముద్భవమ్।
ఆచచక్షే ద్విజస్తస్మై కులమాత్మానమేవ చ। 5

పూర్వకాలే మహాబాహో! యే ప్రజాపతయోఽభవన్।
తాన్ మే నిగదతః సర్వాన్ ఆదితః శృణు రాఘవ! । 6

కర్దమః ప్రథమస్తేషాం విక్రీతస్తదనంతరః।
శేషశ్చ సంశ్రయశ్చైవ బహుపుత్రశ్చ వీర్యవాన్। 7

స్థాణుర్మరీచిరత్రిశ్చ క్రతుశ్చైవ మహాబలః।
పులస్త్యశ్చాంగిరాశ్చైవ ప్రచేతాః పులహస్తథా। 8

దక్షో వివస్వానపరోఽరిష్టనేమిశ్చ రాఘవ!।
కశ్యపశ్చ మహాతేజాః తేషామాసీచ్చ పశ్చిమః। 9

ప్రజాపతేస్తు దక్షస్య బభూవురితి విశ్రుతమ్।
షష్టిర్దుహితరో రామ! యశస్విన్యో మహాయశః!। 10

కశ్యపః ప్రతిజగ్రాహ తాసామష్టౌ సుమధ్యమాః।
అదితిం చ దితిం చైవ దనుమప్యథ కాళికామ్।
తామ్రాం క్రోధవశాం చైవ మనుం చాప్యనలామపి। 11

తాస్తు కన్యాస్తతః ప్రీతః కశ్యపః పునరబ్రవీత్।
పుత్రాం స్త్రైలోక్యభర్తౄన్ వై జనయిష్యథ మత్సమాన్। 12

అదితిస్తన్మనా రామ! దితిశ్చ మనుజర్షభ!।
కాళికాచ మహాబాహో! శేషాస్త్వమనసోఽభవన్। 13

అదిత్యాం జజ్ఞిరే దేవాః త్రయస్త్రింశదరిందమ!।
ఆదిత్యా వసవో రుద్రా హ్యశ్వినౌ చ పరంతప!। 14

దితిస్త్వజనయత్ పుత్రాన్ దైత్యాం స్తాత! యశస్వినః।
తేషామియం వసుమతీ పురాఽఽసీత్ సవనార్ణవా। 15

దనుస్త్వజనయత్ పుత్రమ్ అశ్వగ్రీవమ్ అరిందమ!।
నరకం కాలకం చైవ కాళికాపి వ్యజాయత। 16

క్రౌంచీం భాసీం తథా శ్యేనీం ధృతరాష్ట్రీం తథా శుకీం।
తామ్రాపి సుషువే కన్యాః పంచైతా లోకవిశ్రుతాః। 17

ఉలూకాన్ జనయత్ క్రౌంచీ భాసీ భాసాన్ వ్యజాయత।
శ్యేనీ శ్యేనాంశ్చ గృధ్రాంశ్చ వ్యజాయత సుతేజసః। 18

ధృతరాష్ట్రీ తు హంసాంశ్చ కలహంసాంశ్చ సర్వశః।
చక్రవాకాంశ్చ భద్రం తే విజజ్ఞే సాపి భామినీ। 19

అంతట ఆ గృధ్రము (గ్రద్ద) శ్రీరాముని పలుకులను విని, తనవంశమునుగూర్చియు, తనను గురించియు తెలుపబోవుచు ప్రసంగవశమున సకలప్రాణులఉత్పత్తిని గూర్చి ఆయనకు ఇట్లు వివరించెను. (5)

"ఓ మహాబాహూ! రాఘవా! పూర్వకాలమునగల ప్రజాపతులందఱినిగూర్చి ప్రారంభమునుండియు తెల్పెదను. సావధానుడవై వినుము. (6)

ప్రజాపతులలో మొట్టమొదటి వాడు కర్దముడు. వరుసగా విక్రీతుడు, శేషుడు, సంశ్రయుడు, పరాక్రమ శాలియైన బహుపుత్రుడు, స్థాణువు, మరీచి, అత్రి, మహాబలశాలియైన క్రతువు, పులహుడు, దక్షుడు, వివస్వంతుడు, మహాతేజశ్శాలియైన, 'అరిష్టనేమి' యను నామాంతరముగల కశ్యపుడు పులస్త్యుడు, అంగిరసుడు, ప్రచేతసుడు (వరుణుడు) అను పదునైదు మందియు తక్కిన ప్రజాపతులు- వీరిలో కశ్యపుడు చివరివాడు. (7-9)

చక్కని పేరు ప్రతిష్ఠలు గల ఓ రామా! దక్షప్రజాపతి యొక్క కుమార్తెలు అఱువది మంది. వారు మిగుల విఖ్యాతిగన్నవారు. వారిలో అదితి, దితి, దనువు, కాళిక, తామ్ర, క్రోధవశ, మనువు, అనల అను ఎనిమిదిమంది సుందరీమణులను కశ్యపుడు వివాహమాడెను. (10-11)

కశ్యపుడు మిగుల సంతుష్టుడై తనఎనిమిదిమంది భార్యలతో "నాతోసమానులై, ముల్లోకములను ఏలగలిగిన పుత్రులను పొందుదురుగాక" అని పలికెను. మిగుల బాహుబలముగల పురుషోత్తముడవైన ఓ రామా! అదితి, దితి, కాళిక, దనువు అను నలుగురు కశ్యపుని మాటపై మనసును నిలిపిరి. మిగిలిన నలుగురును ఆయన వచనములను పట్టించుకొనలేదు. (12-13)

ఓ అరిసూదనా! అదితియందు ద్వాదశఆదిత్యులు, అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ఇరువురు అశ్విని దేవతలు మొత్తము ముప్పది మూడుమంది దేవతలు జన్మించిరి.(14)

నాయనా! రామా! దితియందు జన్మించిన వారు దైత్యులు. వారు మిగుల ప్రసిద్ధులు. పూర్వము వనములతోడను, సముద్రములతోడను సుసంపన్నమైయున్న ఈ వసుంధరపై దేవతలకును, దైత్యులకును అధికారము ఉండెను. దనువు నందు పుట్టినవాడు అశ్వగ్రీవుడు. నరకుడు, కాలకుడు అనువారు కాళిక యొక్క పుత్రులు. తామ్రయనునామె క్రౌంచి, భాసి, శ్యేని, ధృతరాష్ట్రి, శుకి అను ఐదుమంది కుమార్తెలకు జన్మనిచ్చెను. వారు లోకప్రసిద్ధికెక్కిరి. వారిలో క్రౌంచి గుడ్లగూబలకును, భాసి నీటికాకులకును, కోళ్లకును శ్యేని చక్కని తేజస్సుగల డేగలకును, గ్రద్దలకును జన్మలనిచ్చిరి. ఓ రామా! సావధానముగా

శుకీ న తాం విజజ్ఞే తు నతాయా వినతా సుతా। 20

దశ క్రోధవశా రామ! విజజ్ఞే హ్యాత్మసంభవాః।
మృగీం చ మృగమందాం చ హరీం భద్రమదామపి। 21

మాతంగీమపి శార్దూలీం శ్వేతాం చ సురభిం తథా।
సర్వలక్షణసంపన్నాం సురసాం కద్రుకామపి। 22

అపత్యం తు మృగాః సర్వే మృగ్యా నరవరోత్తమ!।
ఋక్షాశ్చ మృగమందాయాః సృమరాశ్చమరాస్తథా। 23

హర్యాశ్చ హరయోఽపత్యం వానరాశ్చ తరస్వినః।
తతస్త్విరావతీం నామ జజ్ఞే భద్రమదా సుతామ్। 24

తస్యాస్త్వైరావతః పుత్త్రో లోకనాథో మహాగజః।
మాతంగాస్త్వథ మాతంగ్యా అపత్యం మనుజర్షభ!। 25

గోలాంగూలాంశ్చ శార్దూలీ వ్యాఘ్రాంశ్చాజనయత్ సుతాన్।
దిశాగజాంశ్చ కాకుత్స్థ! శ్వేతాప్యజనయత్ సుతాన్। 26

తతో దుహితరౌ రామ! సురభిర్ద్వే వ్యజాయత।
రోహిణీం నామ భద్రం తే గంధర్వీం చ యశస్వినీమ్। 27

రోహిణ్యజనయద్గావై గంధర్వీ వాజినః సుతాన్।
సురసాఽజనయన్నాగాన్ రామ! కద్రూస్తు పన్నగాన్। 28

మనుర్మనుష్యాన్ జనయత్ రామ! పుత్త్రాన్ యశస్వినః।
బ్రాహ్మణాన్ క్షత్త్రియాన్ వైశ్యాన్ శూద్రాంశ్చ మనుజర్షభ।
సర్వాన్ పుణ్యఫలాన్ వృక్షాన్ అనలాఽపి వ్యజాయత। 29

వినతా చ శుకీపౌత్త్రీ కద్రూశ్చ సురసాస్వసా।
కద్రూర్నాగం సహస్రాస్యం విజజ్ఞే ధరణీధరమ్। 30

ద్వౌ పుత్త్రౌ వినతాయాస్తు గరుడోఽరుణ ఏవ చ।
తస్మాజ్జాతోఽహమరుణాత్ సంపాతిస్తు మమాగ్రజః। 31

జటాయురితి మాం విద్ధి శ్యేనీపుత్త్రమ్ అరిందమ!। 32

సోఽహం వాససహాయస్తే భవిష్యామి యదీచ్ఛసి।
ఇదం హి దుర్గం కాంతారం మృగరాక్షససేవితమ్।
సీతాం చ తాత! రక్షిష్యే త్వయి యాతే సలక్ష్మణే। 33

వినుము. ధృతరాష్ట్రియందు హంసలు, కలహంసలు చక్రవాకములు జన్మించెను. శుకి యందు 'నత' పుట్టెను. 'నత' కుమార్తె వినత. (15-20)

కశ్యపునిసతియైన 'క్రోధవశ'యందు మృగి, మృగమంద, హరి, భద్రమద, మాతంగి, శార్దూలి, శ్వేత, సురభి, సర్వశుభలక్షణములుగల సురస, కద్రుక (కద్రువ) అను పదిమంది జన్మించిరి. (21-22)

ఓ పురుషోత్తమా! మృగములన్నియును మృగియొక్క సంతానము. ఎలుగుబంట్లు, సవరపు మెకములు (సృమరములు) చమరీమృగములు మృగమందయొక్క సంతానము. (23)

'హరి' యను నామెయొక్క సంతానము సింహములు, వేగములుగల వానరములు. భద్రమద ఇరావతియను సుతనుగనెను. గజయూథములకు ప్రభువైన 'ఐరావతము' ఇరావతి యొక్క సంతానము. కశ్యపునిభార్యయైన 'మాతంగి' యనునామెయొక్క సంతానము ఏనుగులు. (24-25)

ఓ రామా! కొండముచ్చులు, వ్యాఘ్రములు (పెద్దపులులు) 'శార్దూలి' యను నామెయొక్క సంతానము. 'శ్వేత' యనునామె దిగ్గజములకు జన్మనిచ్చెను. (26)

ఓ రామా! శ్రద్ధగా ఆలకింపుము. 'సురభి' యనునామెకు రోహిణి, గంధర్వి అను ఇరువురు కుమార్తెలు కలిగిరి. వారు చక్కని పేరుప్రతిష్ఠలను సంపాదించిరి. గోవులన్నియును 'రోహిణి'యొక్క సంతానము. గంధర్విసంతానము అశ్వములు. నాగులయొక్క తల్లి సురస. కద్రువ యొక్క సంతానము సర్పములు.(27-28)

కశ్యపునిభార్యయైన 'మనువు' అనునామెయందు కలిగినవారే మానవులు. వీరు బ్రాహ్మణ, క్షత్త్రియ, వైశ్య, శూద్రులు అను వర్ణములతో సుప్రసిద్ధులు. మధురఫలములతో గూడిన వృక్షములన్నియును అనలయొక్క సంతానము. (29)

శుకియొక్క మనుమరాలు వినత. సురససోదరి కద్రువ. కద్రువయొక్క తనయుడు ఆదిశేషుడు. అతడు తనవేయి పడగలతో భూభారమును వహించుచుండును. (30)

వినతకు అరుణుడు (అనూరుడు), గరుడుడు అను ఇరువురు పుత్త్రులు కలిగిరి. నేను, మా అన్నయైన 'సంపాతి' ఆ అరుణుని (అనూరుని) కుమారులము, నా పేరు 'జటాయువు'. మా తల్లి పేరు శ్యేని.[1] అనగా నేను (జటాయువు) శ్యేని అరుణుల కుమారుడను. (31-32)

నీవు సమ్మతించినచో మీనివాసస్థలమును రక్షించుటకు తోడ్పడుచుందును. నాయనా! ఇది దట్టమైన కీకారణ్యము. క్రూరమృగములు, దుష్టరాక్షసులు ఈ ప్రదేశమున సంచరించు చుందురు. నీవును, లక్ష్మణుడును మీ కుటీరమునకు దూరముగా వెళ్లినప్పుడు సీతాదేవిని నేను రక్షించుచుందును. (33)

1) కశ్యపునిభార్యలలో ఒకతె 'తామ్ర'. ఆమె యొక్క ఐదుగురు కుమార్తెలలో ఒకామె పేరు శ్యేని. జటాయువుయొక్క తల్లియైన శ్యేని, ఆ తామ్ర కూతురైన శ్యేని వేర్వేరు.

జటాయుషం తం ప్రతిపూజ్య రాఘవో
ముదా పరిష్వజ్య చ సన్నతోఽభవత్ ।
పితుర్హి శుశ్రావ సఖిత్వమాత్మవాన్
జటాయుషా సంకథితం పునః పునః । 34

అంతట రఘువరుడు ఆ జటాయువును పూజించి, సంతోషముతో కౌగిలించుకొని, నమస్కరించెను. సూక్ష్మబుద్ధియైన శ్రీరాముడు పదేపదే జటాయువుచేసిన ప్రస్తావనలనుబట్టి అతడు తనతండ్రికి ఆత్మీయమిత్రుడని గ్రహించెను. (34)

స తత్ర సీతాం పరిదాయ మైథిలీం
సహైవ తేనాతిబలేన పక్షిణా ।
జగామ తాం పంచవటీం సలక్ష్మణో
రిపూన్ దిధక్షన్ శలభానివానలః । 35

సీతాలక్ష్మణసహితుడైన శ్రీరాముడు పంచవటికి ఏగెను. అచట సీతాదేవియొక్క రక్షణబాధ్యతను మిగుల బలశాలియైన జటాయువునకు అప్పగించెను. పిదప అగ్ని మిడుతలనువలె రఘురాముడు శత్రువులను నిర్మూలింపదలంచెను. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే చతుర్దశస్సర్గః *(14)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పదునాల్గవసర్గము.

-- * * * --

15. పదునైదవసర్గము

పంచవటికి చేరినపిమ్మట పర్ణశాల నిర్మాణమునకు శ్రీరాముడు తగిన సూచనలను ఇచ్చుట - అంతట లక్ష్మణుడు పర్ణశాలను రమ్యముగా నిర్మించుట.

తతః పంచవటీం గత్వా నానావ్యాళమృగాయుతామ్ ।
ఉవాచ భ్రాతరం రామః సౌమిత్రిం దీప్తతేజసమ్ । 1

ఆ పంచవటి వివిధములగు సర్పములతో మృగములతో నిండియుండెను. అచటికి చేరిన పిమ్మట సీతారాముల సేవలలో నిరతుడైయున్న లక్ష్మణునితో శ్రీరాముడు ఇట్లు వచించెను. (1)

ఆగతాః స్మ యథోద్దిష్టమ్ అముం దేశం మహర్షిణా ।
అయం పంచవటీదేశః సౌమ్య! పుష్పితపాదపః । 2

నాయనా! లక్ష్మణా! మనము అగస్త్యమహర్షి సూచించిన పంచవటికి వచ్చితిమి. చక్కగా పుష్పించిన వృక్షములతో ఈ ప్రదేశమంతయును కడురమ్యముగానున్నది. (2)

సర్వతశ్చార్యతాం దృష్టిః కాననే నిపుణో హ్యసి ।
ఆశ్రమః కతరస్మిన్ నో దేశే భవతి సమ్మతః । 3

తమ్ముడా! అరణ్యములలో ఆశ్రమమునకు తగిన స్థలమును గుర్తించుటలో నీవు నిపుణుడవు. కనుక ఈ ప్రాంతమునంతయును ఒక పర్యాయము పరికించి చూడుము. మనము నివసించుటకు అనువైన ఆశ్రమస్థలమును గుర్తింపుము. (3)

రమతే యత్ర వైదేహీ త్వమహం చైవ లక్ష్మణ! ।
తాదృశో దృశ్యతాం దేశః సన్నికృష్టజలాశయః । 4

లక్ష్మణా! మీ వదినెయగు సీతాదేవియు, నేనును, నీవును చక్కగా మసలుటకు ఆ స్థలము అనువుగా ఉండవలెను. సమీపమున జలాశయములు (నీటిసౌకర్యము) ఉండవలెను.(4)

వనరామణ్యకం యత్ర స్థలరామణ్యకం తథా ।
సన్నికృష్టం చ యత్ర స్యాత్ సమిత్పుష్పకుశోదకమ్ । 5

ఆ స్థలము సమతలము గల్గియుండవలెను. చుట్టును, ఫలపుష్పములతో శోభిల్లుచుండెడి చూత (మామిడి), పున్నాగాది వృక్షములు గలిగి, అది మనోహరముగా విలసిల్లుచుండవలెను. అగ్నికార్యాది నిత్యవిధులకు లోటురాకుండ సమిధలు, పూవులు, దర్భలు, జలములు చేరువలో లభించునట్లుండవలెను." (5)

ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః సంయతాంజలిః ।
సీతాసమక్షం కాకుత్స్థమ్ ఇదం వచనమబ్రవీత్ । 6

శ్రీరాముడు ఇట్లు నుడివిన పిమ్మట లక్ష్మణుడు అంజలి ఘటించినవాడై, సీతాదేవిసమక్షమునయున్న తన అన్నతో ఇట్లనెను.(6)

పరవానస్మి కాకుత్స్థ! త్వయి వర్షశతం స్థితే।
స్వయం తు రుచిరే దేశే క్రియతామితి మాం వద। 7

సుప్రీతస్తేన వాక్యేన లక్ష్మణస్య మహాత్మనః।
విమృశన్ రోచయామాస దేశం సర్వగుణాన్వితమ్। 8

స తం రుచిరమాక్రమ్య దేశమాశ్రమకర్మణి।
హస్తే గృహీత్వా హస్తేన రామః సౌమిత్రిమబ్రవీత్। 9

అయం దేశః సమః శ్రీమాన్ పుష్పితైస్తరుభిర్వృతః।
ఇహాఽఽశ్రమపదం సౌమ్య! యథావత్ కర్తుమర్హసి। 10

ఇయమాదిత్యసంకాశైః పద్మైః సురభిగంధిభిః।
అదూరే దృశ్యతే రమ్యా పద్మినీ పద్మశోభితా। 11

యథాఽఽఖ్యాతమ్ అగస్త్యేన మునినా భావితాత్మనా।
ఇయం గోదావరీ రమ్యా పుష్పితైస్తరుభిర్వృతా।
హంసకారండవాకీర్ణా చక్రవాకోపశోభితా। 12

నాఽతిదూరే న చాఽఽసన్నే మృగయూథనిపీడితా।
మయూరనాదితా రమ్యాః ప్రాంశవో బహుకందరాః। 13

దృశ్యంతే గిరయస్సౌమ్య ఫుల్లైస్తరుభిరావృతాః। 14

సౌవర్ణై రాజతైస్తామ్రైః దేశే దేశే చ ధాతుభిః।
గవాక్షితా ఇవాఽఽభాంతి గజాః పరమభక్తిభిః। 15

సాలైస్తాలైస్తమాలైశ్చ ఖర్జూరైః పనసామ్రకైః।
నీవారైస్తిమిశైశ్చైవ పున్నాగైశ్చోపశోభితాః। 16

చూతైరశోకైస్తిలకైః చంపకైః కేతకైరపి।
పుష్పగుల్మలతోపేతైః తైస్తైస్తరుభిరావృతాః। 17

చందనైః స్యందనైర్నీపైః పర్ణాసైః లికుచైరపి।
ధవాశ్వకర్ణఖదిరైః శమీకింశుకపాటలైః। 18

అన్నా! "ఎల్లప్పుడును నేను నీ సేవకుడను. నీకు నచ్చిన ప్రదేశమునుగూర్చి నాకు సెలవిమ్ము. అచటనే ఆశ్రమమును నిర్మింతును." (7)

శ్రీరాముడు బుద్ధిమంతుడైన లక్ష్మణునివచనములకు మిగుల సంతసించెను. కొంతతడవు పరికించి చూచిన పిమ్మట అతడు అన్నివిధములగు సౌకర్యములతో తనకు నచ్చిన ప్రదేశమును గుర్తించెను. (8)

ఆశ్రమమును నిర్మించుటకు యోగ్యమైన ఒక చక్కని ప్రదేశమునకు చేరి, శ్రీరాముడు ప్రేమతో లక్ష్మణుని చేతులను తన చేతులలోనికి దీసికొనెను. పిదప అతనితో ఇట్లు పలికెను. (9)

"ఓ సౌమ్యుడా! ఈ ప్రదేశము సమతలము గలిగి, రమణీయముగానున్నది. ఇచటి వృక్షములన్నియును పుష్పములతో కలకలలాడుచున్నవి. ఇచట సముచితమైన రీతిలో ఆశ్రమమును నిర్మింపుము. (10)

ఈ సమీపముననే పద్మములతో శోభిల్లుచు రమ్యమైన ఒక సరస్సు కనబడుచున్నది. అందలి కమలములన్నియును సూర్యకిరణస్పర్శచే చక్కగా వికసించినవై, కాంతులీనుచు సువాసనలను వెదజల్లుచున్నవి. (11)

మహాత్ముడైన అగస్త్యమహాముని తెల్పినరీతిగా ఈ గోదావరీనది మిగుల రమ్యముగా ప్రవహించుచున్నది. తీరములయందలి వృక్షములన్నియును వికసించిన పూవులతో అందములను చిందించుచున్నవి. నదీజలములలో హంసలు, కన్నెలేడిపిట్టలు, చక్రవాకములు విహరించుచున్నవి. (12)

ఇచటికి సమీపముననేగల ఎత్తైనకొండలు చక్కని వృక్షములతో రమ్యముగా ఉన్నవి. అచట లేళ్లగుంపులు తిరుగాడుచున్నవి. నెమళ్లు క్రేంకారములు సల్పుచున్నవి. అచటి కొండగుహలు చూడముచ్చటగానున్నవి. (13-14)

ఆ పర్వతములపై అచ్చటచ్చట బంగారు, వెండి, రాగి, వన్నెలుగల గైరికాది ధాతువులు ప్రవహించుచున్నవి. అప్పుడాకొండలు పసుపు, తెలుపు, ఎఱుపు రంగులరేఖాచిత్రములతో గవాక్షాకారములో అలంకరింపబడిన ఏనుగులవలె భాసిల్లుచున్నవి. (15)

ఇచటి గిరులు మద్దిచెట్లు, తాటిచెట్లు, కానుగ, ఖర్జూర, పనస, మామిడిచెట్లు, జలకదంబములు, నేమి చెట్లు, పున్నాగవృక్షములు, తియ్యమామిడి, అశోక, తిలక మున్నగు వృక్షములతో శోభిల్లుచున్నవి. సంపంగి, మొగలి మొదలగు పూలగుత్తులతోడను, లతలచే పెనవేసుకొనబడిన వృక్షములతోడను ఆ గిరులు రాజిల్లుచున్నవి. (16-17)

చందనవృక్షములు, ఒక విధమగు తిమిశచెట్లు, స్థలకదంబములు పర్ణాసములు (సుగంధి) నిమ్మచెట్లు, ఉమ్మెత్త, ఇనుమద్దీ, చండ్ర, జమ్మి, మోదుగు, కలిగొట్టు

ఇదం పుణ్యమిదం మేధ్యమ్ ఇదం బహుమృగద్విజమ్।
ఇహ వత్స్యామి సౌమిత్రే! సార్ధమేతేన పక్షిణా। 19

ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః పరవీరహా।
అచిరేణాఽఽశ్రమం భ్రాతుః చకార సుమహాబలః। 20

పర్ణశాలాం సువిపులాం తత్ర సంఘాతమృత్తికామ్।
సుస్తంభాం మస్కరైర్దీర్ఘైః కృతవంశాం సుశోభనామ్। 21

శమీశాఖాభిరాస్తీర్య దృఢపాశావపాశితామ్।
కుశకాశశరైః పర్ణైః సుపరిచ్ఛాదితాం తథా। 22

సమీకృతతలాం రమ్యాం చకార లఘువిక్రమః।
నివాసం రాఘవస్యార్థే ప్రేక్షణీయమనుత్తమమ్। 23

స గత్వా లక్ష్మణః శ్రీమాన్ నదీం గోదావరీం తదా।
స్నాత్వా పద్మాని చాదాయ సఫలః పునరాగతః। 24

తతః పుష్పబలిం కృత్వా శాంతిం చ స యథావిధి।
దర్శయామాస రామాయ తదాశ్రమపదం కృతమ్। 25

స తం దృష్ట్వా కృతం సౌమ్యమ్ ఆశ్రమం సహ సీతయా।
రాఘవః పర్ణశాలాయాం హర్షమాహారయత్ పరమ్। 26

సుసంహృష్టః పరిష్వజ్య బాహుభ్యాం లక్ష్మణం తదా।
అతిస్నిగ్ధం చ గాఢం చ వచనం చేదమబ్రవీత్। 27

ప్రీతోఽస్మి తే మహత్ కర్మ త్వయా కృతమిదం ప్రభో!।
ప్రదేయో యన్నిమిత్తం తే పరిష్వంగో మయా కృతః। 28

భావజ్ఞేన కృతజ్ఞేన ధర్మజ్ఞేన చ లక్ష్మణ!।
త్వయా పుత్త్రేణ ధర్మాత్మా న సంవృత్తః పితా మమ। 29

మున్నగుచెట్లతోడను అవి శోభితములై యున్నవి. ఓ సౌమిత్రీ! ఈ ప్రదేశము పవిత్రమై పుణ్యప్రదమైనది. ఇది లేళ్ల సమూహములతోడను, పక్షులగుంపులతోడను విలసిల్లుచున్నది. కనుక ఈ జటాయువుయొక్క సహకారముతో మనము ఇచటనే నివసించుదము." (18-19)

శ్రీరాముడు ఈ విధముగా పలికిన పిమ్మట మిక్కిలి బలశాలియు, శత్రుసంహారసమర్థుడును ఐన లక్ష్మణస్వామి అన్నకొఱకై శీఘ్రముగా ఆశ్రమమును నిర్మించెను. (20)

కార్యనిర్వహణదక్షుడైన లక్ష్మణుడు త్రవ్వితీసిన మట్టితో గోడలు పెట్టెను. అందమైన, దృఢమైన వెదురు స్తంభములను నిలబెట్టి, వాటిపై పొడవైన వెదురు బొంగులను ఏర్పఱచెను. ఆ బొంగులపై లేతలేత జమ్మి కొమ్మలను పఱచెను. వాటిని దృఢమైన త్రాళ్లతో బిగించెను. పిమ్మట వాటిపై దర్భలను, ఱెల్లుగడ్డిని, కాకివెదుళ్లను ఆకులను కప్పి, సౌమిత్రి ఆ పర్ణశాలను బలముగా, అందముగా తీర్చిదిద్దెను. పిమ్మట నేలను చదునుగా జేసి దానిని రమణీయముగా రూపొందించెను. ఈ విధముగా సీతారాముల కొఱకై నిర్మింపబడిన ఆ కుటీరము నివాసయోగ్యమై, నిరుపమానమై, చూడముచ్చటగానుండెను. (21-23)

పర్ణశాలనిర్మాణమును పూర్తిచేసిన పిమ్మట బుద్ధిమంతుడైన లక్ష్మణుడు గోదావరినదిలో స్నానము చేసి, పద్మములు మొదలగు పూవులను, పండ్లను సేకరించుకొని కుటీరమునకు తిరిగివచ్చెను.(24)

చక్కగా నిర్మింపబడిన ఆ ఆశ్రమమును అతడు సీతారాములకు చూపించెను. అనంతరము యథావిధిగా వాస్తు పూజలును అభ్యుదయశాంతికర్మలును నిర్వహింపబడెను. (25)

శ్రీరాముడు సీతాసహితుడై లక్ష్మణుడు నిర్మించిన ఆ ప్రశాంతకుటీరమును కలయజూచెను. ఆ పర్ణశాలసౌందికకు సీతారాములు ఇద్దఱును ఎంతయు సంతసించిరి. (26)

అంతట శ్రీరాముడు మిగుల సంతోషముతో చేతులు చాచి, లక్ష్మణుని తనఱక్కునజేర్చుకొనెను. పిదప అతడు తమ్మునితో ఆత్మీయముగా మృదుమధురవచనములను ఇట్లు పలికెను. (27)

"తమ్ముడా! నీవు సర్వసమర్థుడవు. నేర్పుతో నీవొనర్చిన ఈ మహత్కార్యమునకు నేను మిగుల సంతుష్టుడనైతిని. ఈ శుభసందర్భమున నా నిర్భరానందమును ప్రకటించుచు నేను నీకు గాఢాలింగనమును ఇచ్చుచుంటిని. (28)

ఓ లక్ష్మణా! నీవు నా మనసులోని అంతర్యమును చక్కగా ఎఱిగినవాడవు. అందువలన నాకు నచ్చెడి రీతిగా శాస్త్రప్రకారము ఈ కుటీరమును నిర్మించితివి. ధర్మజ్ఞుడవైన నీవు నాకు తోడుగా వచ్చి నీ కర్తవ్యమును నెఱవేర్చితివి. తండ్రివలె నీవు ఎల్లవేళల నన్ను రక్షించుచున్నావు. నీవు నా ప్రక్కననే యుండుట వలన తండ్రిలేని లోటు కనబడుటలేదు." (29)

ఏవం లక్ష్మణముక్త్వా తు రాఘవో లక్ష్మివర్ధనః।
తస్మిన్ దేశే బహుఫలే న్యవసత్ సుసుఖం వశీ। 30

నిత్యము నూతనశోభలతో వెలుగొందెడివాడును, జితేంద్రియుడును ఐన శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లు నుడివి, ఫలపుష్పములతో సుసంపన్నమైన ఆ పంచవటియందు హాయిగా నివసింపసాగెను.(30)

కంచిత్ కాలం స ధర్మాత్మా సీతయా లక్ష్మణేన చ।
అన్వాస్యమానో న్యవసత్ స్వర్గలోకే యథామరః। 31

సీతయును, లక్ష్మణుడును భక్తితత్పరులై తనను సేవించుచుండగా స్వర్గలోకమున దేవేంద్రునివలె శ్రీరాముడు అచట సుఖముగా నివసించుచుండెను. ఇట్లు కొంత కాలము గడచెను. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచదశస్సర్గః *(15)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పదునైదవసర్గము.

-- * * * --

16. పదునాఱవసర్గము

హేమంతఋతువర్ణనము - రామలక్ష్మణులు భరతుని ఉదాత్తతను గుర్తునకు దెచ్చుకొనుట.

వసతస్తస్య తు సుఖం రాఘవస్య మహాత్మనః।
శరద్వ్యపాయే హేమంతఋతురిష్టః ప్రవర్తతే। 1

మహాత్ముడైన ఆ శ్రీరాముడు సీతాలక్ష్మణసహితుడై పంచవటియందు నివసించుచుండగా ఇంతలో శరదృతువు గతించెను. సకలప్రాణులకును ఇష్టమైన హేమంతఋతువు ప్రవేశించెను. (1)

స కదాచిత్ ప్రభాతాయాం శర్వర్యాం రఘునందనః।
ప్రయయావభిషేకార్థం రమ్యాం గోదావరీం నదీమ్। 2

ప్రహ్వః కలశహస్తస్తం సీతయా సహ వీర్యవాన్।
పృష్ఠతోఽనువ్రజన్ భ్రాతా సౌమిత్రిరిదమబ్రవీత్। 3

అంతట ఒకనాటి సుప్రభాతవేళ శ్రీరాముడు స్నానాదివిధులకై రమ్యమైన గోదావరీనదికి బయలు దేఱెను. అప్పుడు సీతాదేవియు ఆయనను అనుసరించెను. వినమ్రుడైన లక్ష్మణుడు ఒక కలశమును చేతబట్టుకొని వారివెంట నడచుచు అన్నతో ఇట్లు పలికెను.(2-3)

అయం స కాలః సంప్రాప్తః ప్రియో యస్తే ప్రియంవద।
అలంకృత ఇవాభాతి యేన సంవత్సరః శుభః। 4

"ఓ ప్రియభాషీ! అన్నా! నీకు మిగుల ప్రియమైన హేమంతఋతువు ప్రారంభమైనది. ప్రతిసంవత్సరమూ ఈ ఋతువునందే సస్యములు ఫలించి, ధాన్యలక్ష్మి ఇండ్లకు చేరుచుండును. ప్రజలముఖములలో సంతోషము వెల్లివిరియుచుండును. కావున ఈ హేమంతఋతువు సంవత్సరమునకు శోభనిచ్చెడి శుభప్రదకాలము. (4)

నీహారపరుషో లోకః పృథివీ సస్యశాలినీ।
జలాన్యనుపభోగ్యాని సుభగో హవ్యవాహనః। 5

ఈ ఋతువునందు పొలములన్నియును పైరుపంటలతో కలకలలాడుచుండును. మంచుపడుచుండుటచే జనులశరీరములు చలికి తట్టుకొనలేకయుండును. నీళ్లు మిక్కిలి చల్లబడియుండును గాన అవి స్నానపానములకు అనువుగా ఉండవు. అగ్ని (నెగళ్ల మంటలు) సుఖకరముగా ఉండును. (5)

నవాగ్రయణపూజాభిః అభ్యర్చ్య పితృదేవతాః।
కృతాగ్రయణకాః కాలే సంతో విగతకల్మషాః। 6

సత్పురుషులు ఈ ఋతువు (ఈ కాలము) నందు క్రొత్తపంటలను (క్రొత్తధాన్యములను)తాము భుజించుటకు ముందుగా దేవతలను, పితృదేవతలను తృప్తిపఱచుటకై ఆగ్రయణ కర్మలను[1] (హోమ కార్యములను) ఆచరించి, వారిని పూజించి, పాపరహితులగుదురు. (6)

1) 'ఆగ్రయణము'- అనగా క్రొత్తగా పండినధాన్యములను భుజించుటకు ముందుగా ఆచరింపబడెడి హోమకార్యము. ఈ విషయమున ఆపస్తంబమహర్షి 'నాఽనిష్ట్వాగ్రయణేన - ఆహితాగ్నిః నవస్య ధాన్యస్య అశ్నీయాత్ - వ్రీహీణాం, యవానాం, శ్యామకానామ్ అగ్రే పాకస్య యజేత'- అని పేర్కొనెను. ఆహితాగ్నియైన (నిత్యము అగ్నికార్యములను ఆచరించెడి) సత్పురుషుడు ఆగ్రయణహోమ కార్యములను నిర్వహింపక క్రొత్తగా వచ్చిన పంటధాన్యములను భుజింపరాదు. ముందుగా వడ్లతో, యవలతో, శ్యామాకధాన్యముతో హోమకార్యక్రమములను జరుపవలెను.

ప్రాజ్యకామా జనపదాః సంపన్నతరగోరసాః।
విచరంతి మహీపాలా యాత్రాస్థా విజిగీషవః। 7

సేవమానే దృఢం సూర్యే దిశమంతకసేవితామ్।
విహీనతిలకేవ స్త్రీ నోత్తరా దిక్ ప్రకాశతే। 8

ప్రకృత్యా హిమకోశాఢ్యో దూరసూర్యశ్చ సాంప్రతమ్।
యథార్థనామా సువ్యక్తం హిమవాన్ హిమవాన్ గిరిః। 9

అత్యంతసుఖసంచారా మధ్యాహ్నే స్పర్శతః సుఖాః।
దివసాః సుభగాదిత్యాః ఛాయాసలిలదుర్భగాః। 10

మృదుసూర్యాః సనీహారాః పటుశీతాః సమారుతాః।
శూన్యారణ్యా హిమధ్వస్తా దివసా భాంతి సాంప్రతమ్। 11

నివృత్తాకాశశయనాః పుష్యనీతా హిమారుణాః।
శీతా వృద్ధతరాయామాః త్రియామా యాంతి సాంప్రతమ్। 12

రవిసంక్రాంతసౌభాగ్యః తుషారారుణమండలః।
నిశ్శ్వాసాంధ ఇవాదర్శః చంద్రమా న ప్రకాశతే। 13

జ్యోత్స్నీ తుషారమలినా పౌర్ణమాస్యాం న రాజతే।
సీతేవ చాతపశ్యామా లక్ష్యతే న తు శోభతే। 14

ప్రకృత్యా శీతలస్పర్శో హిమవిద్ధశ్చ సాంప్రతమ్।
ప్రవాతి పశ్చిమో వాయుః కాలే ద్విగుణశీతలః। 15

ఈ కాలమునందు పల్లెప్రజలందఱును ఆవుపాడి, పంటలు సమృద్ధిగా ఉండుటచే కోరికలు తీరినవారై సంతోషముగా ఉందురు. యుద్ధమున జయేచ్ఛగల రాజులు జైత్రయాత్రలు చేయుచుందురు. (7)

ఈ కాలమున సూర్యుడు తనకిరణములను దక్షిణదిశయందు ప్రసరింపజేయుచుండగా (సూర్యకిరణములు నిటారుగా దక్షిణదిశప్రాంతమున పడుచుండగా) ఉత్తరదిశ తిలకము (బొట్టు) లేని స్త్రీవలె నిస్తేజమై (వెలవెలబోవుచు) ఉండును.[1] (8)

దక్షిణాయనమునందు హేమంతకాలమున సూర్యుడు దూరమగుటవలన ప్రకృతిసహజముగా హిమవత్పర్వతమునందు మంచు గడ్డకట్టును. అందువలన ఆ పర్వతమునకు 'హిమాలయము' అను పేరు సార్థకమయ్యెను. (9)

ఈ ఋతువునందు పగటివేళ మధ్యాహ్న సమయమున సూర్యకిరణములయొక్క స్పర్శ సుఖకరముగా ఉండి, జనసంచారములకు అనువుగానుండును. నీడలు, నీళ్లు జనులకు బాధాకరములుగానుండును. (10)

ఈ కాలమున పగటివేళలలో సూర్యకిరణములవేడి తగ్గియుండును. మంచు దట్టముగా పడుచుండును. జనులు తట్టుకొనలేనంతగా చల్లనిగాలులు వీచుచుండును. అరణ్యములలోని వన్యప్రాణులు మంచుదెబ్బకు తట్టుకొనలేక బయట సంచరింపవు. అందువలన అరణ్యములన్నియును శూన్యములై యుండును. (11)

ఈ ఋతువునందు ప్రజలు ఎట్టి ఆచ్ఛాదనములును లేని మేడలపైభాగములయందు పరుండుట మానివేయుదురు. పుష్యమాసరాత్రులలో ప్రదేశములన్నియును మంచుచే ఆవరింపబడియుండును. విపరీతమైన చలిగాలులు వీచుచుండును. రాత్రిసమయములు దీర్ఘములగును.(12)

పొగమంచుచే చంద్రమండలము ఆవరింపబడి, అది యెఱ్ఱబారుట చేతను, సూర్యకిరణకాంతులు దానిపై పడకుండుటవలనను చంద్రుడు 'నిఃశ్వాసములచే మలినమైన అద్దమువలె' తేజోరహితుడైయుండును. (13)

వెన్నెలరాత్రి మంచుబిందువులు ఆవరించుటచే పున్నమినాడు సైతము అది ప్రకాశించుట లేదు. ఎండవేడికి వన్నెతగ్గిన సీతాదేవివలె అది శోభావిహీనమై కనబడుచున్నది. (14)

పడమటిగాలులు సహజముగనే చల్లగానుండును. ఈ ఋతువునందలి ప్రాతఃకాలములయందు మంచుతాకిడి తోడగుటవలన వాటిచల్లదనము రెట్టింపగుచుండును. ఈ ఋతువునందు యవల, గోధుమల చేలుగల అరణ్య

1) ఈ శ్లోకమునందు భూగోళశాస్త్ర విషయములును, జ్యోతిశ్శాస్త్ర సంగతులును ప్రస్తావింపబడినవి.

బాష్పచ్ఛన్నాన్యరణ్యాని యవగోధూమవంతి చ।
శోభంతేఽభ్యుదితే సూర్యే నదద్భిః క్రౌంచసారసైః। 16

ఖర్జూరపుష్పాకృతిభిః శిరోభిః పూర్ణతండులైః।
శోభంతే కించిదానమ్రాః శాలయః కనకప్రభాః। 17

మయూఖైరుపసర్పద్భిః హిమనీహారసంవృతైః।
దూరమభ్యుదితస్సూర్యః శశాంక ఇవ లక్ష్యతే। 18

అగ్రాహ్యవీర్యః పూర్వాహ్ణే మధ్యాహ్నే స్పర్శతః సుఖః।
సంరక్తః కించిదాపాండుః ఆతపః శోభతే క్షితౌ। 19

అవశ్యాయనిపాతేన కించిత్ ప్రక్లిన్నశాద్వలా।
వనానాం శోభతే భూమిః నివిష్టతరుణాతపా। 20

స్పృశంస్తు విమలం శీతమ్ ఉదకం ద్విరదః సుఖమ్।
అత్యంతతృషితో వన్యః ప్రతిసంహరతే కరమ్। 21

ఏతే హి సముపాసీనా విహగా జలచారిణః।
న విగాహంతి సలిలమ్ అప్రగల్భా ఇవాహవమ్। 22

అవశ్యాయతమోనద్ధా నీహారతమసాఽఽవృతాః।
ప్రసుప్తా ఇవ లక్ష్యంతే విపుష్పా వనరాజయః। 23

బాష్పసంఛన్నసలిలా రుతవిజ్ఞేయసారసాః।
హిమార్ద్రవాలుకైస్తీరైః సరితో భాంతి సాంప్రతమ్। 24

తుషారపతనాచ్చైవ మృదుత్వాద్భాస్కరస్య చ।
శైత్యాదగాగ్రస్థమపి ప్రాయేణ రసవజ్జలమ్। 25

జరాజర్జరితైః పద్మైః శీర్ణకేసరకర్ణికైః।
నాళశేషైః హిమధ్వస్తైః న భాంతి కమలాకరాః। 26

ప్రదేశములు పొగమంచుచే కప్పబడియుండును. సూర్యుడు ఉదయించినంతనే ఆ మంచు తొలగి, అవి క్రౌంచ, సారస పక్షుల కలరవములచే శోభిల్లుచుండును. (15-16)

బాగుగా పంటకు వచ్చిన వరిపైరులు పూర్తిగా ధాన్యముతో నిండి, బంగారమువలె పసుపుపచ్చ గలిగి యున్నవి. ఖర్జూరపుష్పములఆకృతిలోనున్న ఆ వరికంకులు ధాన్యము యొక్క బరువుచే కొద్దిగా తలలువంచి శోభిల్లుచున్నవి.(17)

సూర్యుడు ఉదయించి పైకి వచ్చుచు తన కిరణములను అంతటను ప్రసరింప జేయుచున్నాడు. ఐనను దట్టమైన పొగమంచు అలముకొనియుండుటచే మనకు ఆ కిరణములు వేడిని కలిగించుటలేదు. అందువలన సూర్యుడు చంద్రునివలె చల్లగా భాసిల్లుచున్నాడు. (18)

ఈ సమయమున ఎండ వెలుపు, కొద్దిగా తెలుపుతో గూడిన పసుపుపచ్చలు గలిగి పృథ్విపై విలసిల్లుచున్నది. ప్రాతఃకాలమున దానితీవ్రత అంతగా కనబడుట లేదు. కాని మధ్యాహ్న సమయమున అది కొంత సుఖస్పర్శను ఇచ్చుచున్నది. (19)

ఈ వనభూమియందలి పచ్చికబయళ్లన్నియును మంచు పడుటచే కొద్దిగా తడిసియున్నవి. ఆ నీటి బిందువులపై లేతయెండ పడుచుండుటచే ఆ నేల (ముత్యముల మిలమిలలతో) మిగుల కనువిందు గావించుచున్నది. (20)

మిగులదప్పిగొన్న అడవి ఏనుగు నిర్మలజలమును సుఖ భావనతో స్పృశించుచు (స్పృశించి, ఆ జలములచల్లదనమునకు తట్టుకొనలేక) తన తొండమును వెనుకకు దీసికొనుచున్నది. (21)

నీటి సమీపముననున్న ఈ జలపక్షులు రణరంగమున ప్రవేశించుటకు సాహసింపజాలని పిఱికివారివలె నీట మునుగుటకు భయపడుచున్నవి. (22)

రాత్రివేళలలో మంచుచేతను, చీకటిచేతను కప్పబడినవై, ప్రాతఃకాలమున పొగమంచుచే ఆవరింపబడిన పూలులేని వనవృక్షములు నిద్రించుచున్నట్లు కనబడుచున్నవి. (23)

ఇప్పుడు నదీజలములు పొగమంచుచే కప్పబడి కనబడుట లేదు. కాని అందలి బెగ్గురుపిట్టల (జలపక్షుల) మధుర ధ్వనులచేతను, మంచుచే తడిసియున్న ఇసుకతిన్నెల వలనను నదులఉనికి తెలియవచ్చుచున్నది. (24)

నిరంతరము మంచు పడుచుండుటవలనను, సూర్య కిరణములమాంద్యముచేతను మిగుల చల్లగానుండుటచే జలములు పర్వతశిఖరమునుండి జాలినను విషమువలె త్రాగుటకు యోగ్యములుగా లేవు. (25)

మంచుదెబ్బకు పద్మములన్నియును వాడిపోయినవి. వాటి యందలి కేసరములును, కర్ణికలును శిథిలములైనవి. వాటికాడలుమాత్రమే మిగిలియున్నవి. కావున సరస్సులు శోభావిహీనములై యున్నవి. (26)

అస్మింస్తు పురుషవ్యాఘ్రః కాలే దుఃఖసమన్వితః।
తపశ్చరతి ధర్మాత్మా త్వద్భక్త్యా భరతః పురే। 27

త్యక్త్వా రాజ్యం చ మానం చ భోగాంశ్చ వివిధాన్ బహూన్।
తపస్వీ నియతాహారః శేతే శీతే మహీతలే। 28

ఈ హేమంతఋతువునందును పురుషశ్రేష్ఠుడు, ధర్మాత్ముడు ఐన భరతుడు నీ యెడబాటువలన దుఃఖితుడై నీయందుగల భక్తితో అయోధ్యాపురమునందు తపస్సు చేయుచున్నాడు. అతడు 'నేను రాజును' అను అభిమానము లేకుండ వివిధములగు సకలభోగములను త్యజించి, రాజ్యాధికారమును శ్రీరాముని (నీ) పాదములపై మోపి, జటాధారియై. కందమూలఫలములను ఆహారముగాగొనుచు మిగుల చల్లని కటికినేలపై శయనించుచున్నాడు. (27-28)

సోఽపి వేలామిమాం నూనమ్ అభిషేకార్థముద్యతః।
వృతః ప్రకృతిభిర్నిత్యం ప్రయాతి సరయూం నదీమ్। 29

అత్యంతసుఖసంవృద్ధః సుకుమారః సుఖోచితః।
కథంన్వపరరాత్రేషు సరయూమవగాహతే। 30

అతడును ఈ సమయములో ప్రతినిత్యము పౌరులతో గూడి స్నానమాచరించుటకై సరయూనదికి వెళ్లుచుండును. అతడు సహజముగా సుఖములలో పుట్టిపెరిగినవాడు, సుకుమారుడు, ఎప్పుడును సుఖములను అనుభవింప దగినవాడు. అట్టి భరతుడు ఈ అపరరాత్రులయందు సరయూనదీజలములలో ఎట్లు స్నానము చేయగలడు?(29-30)

పద్మపత్రేక్షణో వీరః శ్యామో నిరుదరో మహాన్।
ధర్మజ్ఞః సత్యవాదీ చ హ్రీనిషేధో జితేంద్రియః। 31

ప్రియాభిభాషీ మధురో దీర్ఘబాహురరిందమః।
సంత్యజ్య వివిధాన్ భోగాన్ ఆర్యం సర్వాత్మనా శ్రితః। 32

భరతుడు పద్మపత్రములవంటి నేత్రములుగలవాడు, శ్యామవర్ణమువాడు, సన్నని నడుముగలవాడు. ధర్మములను బాగుగా ఎఱిగిన వాడు, సత్యవచనుడు, అకృత్యములకు పాల్పడనివాడు, జితేంద్రియుడు, ప్రియముగా మధురముగా మాట్లాడుచుండెడివాడు, ఆజానుబాహువు, శత్రుసంహార సమర్థుడు, మహాపురుషుడు, గొప్ప వీరుడు, అట్టి భరతుడు వివిధభోగములను త్యజించి, పూజ్యుడవైన నిన్ను త్రికరణ శుద్ధిగా ఆశ్రయించినాడు. (31-32)

జితః స్వర్గస్తవ భ్రాత్రా భరతేన మహాత్మనా।
వనస్థమపి తాపస్యే యస్త్వామనువిధీయతే। 33

మహాత్ముడైన భరతుడు రాముని (నీ) సేవలకు ఆటంకము కలిగించుననుభావముతో స్వర్గమును గూడ తిరస్కరించి, వనవాసమునన్న నిన్ను అనుసరించుచు తాపసధర్మములను పాటించుచున్నాడు. (33)

న పిత్ర్యమనువర్తంతే మాతృకం ద్విపదా ఇతి।
ఖ్యాతో లోకప్రవాదోఽయం భరతేనాన్యథా కృతః। 34

'లోకములో మానవులు తండ్రిని అనుసరింపక తల్లినే అనుసరింతురు' అను లోకోక్తి మిథ్యయని అతడు ఋజువు చేసినాడు. (34)

భర్తా దశరథో యస్యాః సాధుశ్చ భరతః సుతః।
కథం ను సాఽంబా కైకేయీ తాదృశీ క్రూరశీలినీ। 35

సత్యసంధుడైన దశరథమహారాజునకు భార్యయయ్యును, ధర్మనిరతుడైన భరతునకు తల్లియయ్యును కైకేయి ఇట్టి క్రూరురాలు ఎట్లైనది?" (35)

ఇత్యేవం లక్ష్మణే వాక్యం స్నేహాద్బ్రువతి ధార్మికే।
పరివాదం జనన్యాస్తమ్ అసహన్ రాఘవోఽబ్రవీత్। 36

తనపైగల భక్తిచే ధార్మికుడైన లక్ష్మణుడు కైకేయి మాతను నిందించుచు ఇట్లు పలుకగా అందులకు తప్పుబట్టుచు శ్రీరాముడు అతనితో ఇట్లనెను. (36)

న తేఽంబా మధ్యమా తాత! గర్హితవ్యా కథంచన।
తామేవేక్ష్వాకునాథస్య భరతస్య కథాం కురు। 37

"నాయనా! లక్ష్మణా! పినతల్లియైన కైకేయిని ఎట్టి పరిస్థితిలోను ఇట్లు నిందింపదగదు. ప్రస్తుతము కోసలరాజ్యమును పాలించుచున్న భరతునిగూర్చి మాట్లాడుము. (37)

నిశ్చితా పి హి మే బుద్ధిః వనవాసే దృఢవ్రతా।
భరతస్నేహసంతప్తా బాలిశీక్రియతే పునః। 38

నాబుద్ధి వనవాసవ్రతదీక్షయందే నిశ్చలముగానున్నప్పటికిని భరతునిపైగల అనురాగకారణముగా అది చాంచల్యమునకు లోనగుచున్నది. (వనవాసకాలము ముగియకముందే భరతుని చూచుటకై నా మనస్సు తహతహపడుచున్నది.)(38)

సంస్మరామ్యస్య వాక్యాని ప్రియాణి మధురాణి చ।
హృద్యాన్యమృతకల్పాని మనఃప్రహ్లాదనాని చ॥ 39

భరతునిపలుకులు చెవులకింపైనవి, మృదుమధురములు, హృదయమునకు హత్తుకొనునవి, మనస్సును ఆహ్లాదపఱచునవి. అతనివచనములు ఇప్పటికిని నామదిలో మెదలుచునేయున్నవి.(39)

కదాన్వహం సమేష్యామి భరతేన మహాత్మనా।
శత్రుఘ్నేన చ వీరేణ త్వయా చ రఘునందన॥ 40

ఓ లక్ష్మణా! బుద్ధిమంతుడైన భరతుడు, వీరుడైన శత్రుఘ్నుడు, నీవు, నేను మటల కలసిమెలసి ఆనందించు సమయము ఎప్పుడో గదా!" (40)

ఇత్యేవం విలపం స్తత్ర ప్రాప్య గోదావరీం నదీమ్।
చక్రేఽభిషేకం కాకుత్స్థః సానుజః సహ సీతయా॥ 41

ఈ విధముగా కలతచెందుచు శ్రీరాముడు గోదావరీనదీ తీరమునకు చేరెను. అతడు సీతా లక్ష్మణులతోగూడి నదీజలములలో స్నానమొనర్చెను. (41)

తర్పయిత్వాఽథ సలిలైః తే పితౄన్ దైవతాని చ।
స్తువంతిస్మోదితం సూర్యం దేవతాశ్చ సమాహితాః॥ 42

పిమ్మట వారు దేవతలకును, ఋషులకును, పితృ దేవతలకును జలములతో తర్పణములనొనర్చిరి. ఉదయించుచున్న సూర్యుని, ఇతరదేవతలను ఏకాగ్రతతో స్తుతించిరి. (42)

కృతాభిషేకస్స రరాజ రామః
సీతాద్వితీయః సహ లక్ష్మణేన।
కృతాభిషేకో గిరిరాజపుత్ర్యా
రుద్రఃసనందీ భగవానివేశః॥ 43

సీతాలక్ష్మణులతోగూడి గోదావరిజలములలో స్నానమొనర్చిన శ్రీరాముడు పార్వతీదేవితో, నందీశ్వరునితో గలిసి గంగాజలములలో స్నానమాచరించిన పరమశివునివలె విరాజిల్లెను. (43)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే షోడశస్సర్గః (16)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పదునాఱవసర్గము.

— * * * —

17. పదునేడవసర్గము

పురాణ కథా ప్రసంగములతో పంచవటియందు కాలముగడపుచున్న శ్రీరాముని కడకు రావణుని చెల్లెలైన శూర్పణఖ వచ్చుట. ఆమె శ్రీరాముని వనవాసమును గూర్చి తెలిసికొనుట - తననుగూర్చి ఆయనకు వివరించుట - కామపరవశయైన ఆ రాక్షసి తనను భార్యగా స్వీకరింపుమని ఆయనను కోరుట.

కృతాభిషేకో రామస్తు సీతా సౌమిత్రిరేవ చ।
తస్మాద్గోదావరీతీరాత్ తతో జగ్ముః స్వమాశ్రమమ్॥ 1

ఆశ్రమం తముపాగమ్య రాఘవః సహలక్ష్మణః।
కృత్వా పౌర్వాహ్ణికం కర్మ పర్ణశాలాముపాగమత్॥ 2

నదీజలములలో స్నానాదికములను ముగించికొనిన పిమ్మట సీతారామలక్ష్మణులు ఆ నదీతీరమునుండి తమఆశ్రమమునకు బయలుదేఱిరి. ఆశ్రమమునకు చేరిన పిదప రామలక్ష్మణులు పూర్వాహ్ణసమయమున ఆచరింపవలసిన బ్రహ్మయజ్ఞాదినిత్యకార్యక్రమములను పూర్తిచేసికొనిరి. అనంతరము వారు పర్ణశాలలో ప్రవేశించిరి. (1-2)

ఉవాస సుఖితస్తత్ర పూజ్యమానో మహర్షిభిః।
లక్ష్మణేన సహ భ్రాత్రా చకార వివిధాః కథాః॥ 3

రామలక్ష్మణులు నిత్యము మహర్షులపూజలను అందుకొనుచు హాయిగా నివసించుచుండిరి. వివిధ పురాణేతిహాసాది కథాప్రసంగములతో కాలము గడుపసాగిరి.(3)

స రామః పర్ణశాలాయామ్ ఆసీనః సహ సీతయా।
విరరాజ మహాబాహుః చిత్రయా చంద్రమా ఇవ॥ 4

పర్ణశాలయందు సీతాదేవితోగూడి, సుఖాసీనుడైయున్న మహాబాహువగు శ్రీరాముడు చైత్రమాసమునందు చిత్తా నక్షత్రయుక్తపూర్ణిమనాటి చంద్రునివలె భాసిల్లుచుండెను. (4)

తథాఽఽసీనస్య రామస్య కథాసంసక్తచేతసః।
తం దేశం రాక్షసీ కాచిత్ ఆజగామ యదృచ్ఛయా॥ 5

శ్రీరాముడు అట్లు సుఖాసీనుడై పురాణకథాప్రసంగములలో మునిగియుండగా విధివశమున ఒకానొక రాక్షసి ఆయనకడకు వచ్చెను. (5)

సా తు శూర్పణఖా నామ దశగ్రీవస్య రక్షసః।
భగినీ రామమాసాద్య దదర్శ త్రిదశోపమమ్॥ 6

సింహోరస్కం మహాబాహుం పద్మపత్రనిభేక్షణమ్।
ఆజానుబాహుం దీప్తాస్యమ్ అతీవ ప్రియదర్శనమ్॥ 7

గజవిక్రాంతగమనం జటామండలధారిణమ్।
సుకుమారం మహాసత్త్వం పార్థివవ్యంజనాన్వితమ్॥ 8

రామమిందీవరశ్యామం కందర్పసదృశప్రభమ్।
బభూవేంద్రోపమం దృష్ట్వా రాక్షసీ కామమోహితా॥ 9

సుముఖం దుర్ముఖీ రామం వృత్తమధ్యం మహోదరీ।
విశాలాక్షం విరూపాక్షీ సుకేశం తామ్రమూర్ధజా॥ 10

ప్రీతిరూపం విరూపా సా సుస్వరం భైరవస్వరా।
తరుణం దారుణా వృద్ధా దక్షిణం వామభాషిణీ॥ 11

న్యాయవృత్తం సుదుర్వృత్తా ప్రియమప్రియదర్శనా।
శరీరజసమావిష్టా రాక్షసీ వాక్యమబ్రవీత్॥ 12

జటీ తాపసరూపేణ సభార్యః శరచాపధృత్।
ఆగతస్త్వమిమం దేశం కథం రాక్షససేవితమ్।
కిమాగమనకృత్యం తే తత్ త్వమాఖ్యాతుమర్హసి॥ 13

ఏవముక్తస్తు రాక్షస్యా శూర్పణఖ్యా పరంతపః।
ఋజుబుద్ధితయా సర్వమ్ ఆఖ్యాతుమ్ ఉపచక్రమే॥ 14

అనృతం నహి రామస్య కదాచిదపి సమ్మతమ్।
విశేషేణాఽఽశ్రమస్థస్య సమీపే స్త్రీజనస్య చ॥ 15

ఆసీద్దశరథో నామ రాజా త్రిదశవిక్రమః।
తస్యాహమగ్రజః పుత్రో రామో నామ జనైః శ్రుతః॥ 16

అచటికి వచ్చిన ఆ రాక్షసి పేరు శూర్పణఖ. ఆమె రాక్షసరాజైన దశకంఠునకు (రావణునకు) చెల్లెలు. ఆమె దేవేంద్రునివలె విరాజిల్లుచున్న శ్రీరామచంద్రప్రభువును పరికించి చూచెను. (6)

శ్రీరాముడు విశాలమైన వక్షఃస్థలముగలవాడు. గొప్ప భుజబలముగలవాడు, తామరరేకులవంటి కన్నులుగలవాడు. ఆజానుబాహుడు, ఆయనముఖవికాసము నిరుపమానమైనది. అతడు చూడముచ్చటగొల్పువాడు, గజమువలె గంభీరగమనుడు. జటాజూటములను ధరించియున్నవాడు. మిగుల సుకుమారుడు, మహాబలశాలి, మహారాజ లక్షణములతో విలసిల్లుచున్నవాడు, నల్లగలువలవలె శ్యామవర్ణశోభితుడు, మన్మథునివలె సౌందర్యనిధి. దేవేంద్రవైభవముతో విరాజిల్లుచున్న శ్రీరాముని జూచి ఆ రాక్షసి కామపరవశయయ్యెను. (7-9)

శ్రీరామునిముఖము సుందరమైనది. శూర్పణఖ ముఖమేమో వికృతమైనది. ఈయుననడుము సన్ననిది. ఆమెనడుము లావైనది. ఈయున విశాలనేత్రుడు. ఆమె విరూపాక్షి. ఈయునకురులు నీలకాంతులతో నిగనిగలాడుచున్నవి. ఆమెది రాగిజుట్టు. ఈయునరూపము ప్రసన్నమైనది. ఆమెఆకృతి వెగటుగొల్పునది. ఈయునస్వరము మధురము. ఆమెది గాడిదగొంతు. ఈయున నవయువకుడు. ఆమె కడుముసలిది. ఈయున సరళముగా మాట్లాడును. ఆమె పలుకులు వక్రములు. ఈయునది న్యాయమార్గము. ఆమెది పెడదారి. ఈయున దర్శనము సంతోషము కలిగించును. ఆమె దర్శనము రోతపుట్టించును. ఇది ఇట్లుండగా శూర్పణఖ కామవికారములకు లోనై, (మంచిచెడ్డలను మఱచి) ఆయునను ఇట్లు ప్రశ్నించెను. (10-12)

"ఓ సుందరా! నీవు జటాధారివై తాపసవేషమున ఉన్నావు. కాని భార్యాసహితుడవై ధనుర్బాణములనుగూడ ధరించి యుంటివి. రాక్షసులకు నివాసభూమియైన ఈ అరణ్యమునకు ఎందులకు వచ్చితివి? ఇంతకును నీవు ఇచటికి వచ్చిన పనియేమి? వివరముగా తెల్పుము." (13)

రాక్షసియైన శూర్పణఖ ఇట్లు అడుగగా శత్రుసంహార సమర్థుడైన రాముడు ఎట్టి దాపరికమూ లేకుండా ఆమెతో ఇట్లనెను. (14)

శ్రీరాముడు సర్వదా సత్యవచనుడు. ఎన్నడును ఆయన అసత్యము పలికి యెఱుగడు. అందునా ఆయన పవిత్రమైన ఆశ్రమజీవనము (వనవాసము)ను కొనసాగించుచున్నప్పుడు, స్త్రీలసమక్షమున (ఆయన సత్యవ్రతమును గూర్చి) ఇక చెప్పవలసినది ఏమున్నది. (15)

"దశరథుడు అను ఒక మహారాజు గలడు. అతడు ఇంద్రునివలె పరాక్రమశాలి. ఆయన పెద్దకుమారుడను నేను. అందఱును నన్ను 'శ్రీరాముడు' అని యందురు.

భ్రాతాఽయం లక్ష్మణో నామ యవీయాన్ మామనువ్రతః। 17

ఇయం భార్యా చ వైదేహీ మమ సీతేతి విశ్రుతా।
నియోగాత్తు నరేంద్రస్య పితుర్మాతుశ్చ యంత్రితః। 18

ధర్మార్థం ధర్మకాంక్షీ చ వనం వస్తుమిహాఽఽగతః।
త్వాం తు వేదితుమిచ్ఛామి కథ్యతాం కాఽసి కస్య వా। 19

న హి తావన్మనోజ్ఞాంగీ రాక్షసీ ప్రతిభాసి మే।
ఇహ వా కిన్నిమిత్తం త్వమ్ ఆగతా బ్రూహి తత్త్వతః। 20

సాఽబ్రవీద్వచనం శ్రుత్వా రాక్షసీ మదనార్దితా।
శ్రూయతాం రామ! వక్ష్యామి తత్త్వార్థం వచనం మమ। 21

అహం శూర్పణఖా నామ రాక్షసీ కామరూపిణీ।
అరణ్యం విచరామీదమ్ ఏకా సర్వభయంకరా। 22

రావణో నామ మే భ్రాతా బలీయాన్ రాక్షసేశ్వరః।
వీరో విశ్రవసః పుత్రో యది తే శ్రోత్రమాగతః। 23

ప్రవృద్ధనిద్రశ్చ సదా కుంభకర్ణో మహాబలః।
విభీషణస్తు ధర్మాత్మా నతు రాక్షసచేష్టితః। 24

ప్రఖ్యాతవీర్యౌ చ రణే భ్రాతరౌ ఖరదూషణౌ।
తానహం సమతిక్రాంతా రామ! త్వా పూర్వదర్శనాత్।
సముపేతాఽస్మి భావేన భర్తారం పురుషోత్తమమ్। 25

అహం ప్రభావసంపన్నా స్వచ్ఛందబలగామినీ।
చిరాయ భవ మే భర్తా సీతయా కిం కరిష్యసి। 26

వికృతా చ విరూపా చ న చేయం సదృశీ తవ।
అహమేవానురూపా తే భార్యా రూపేణ పశ్య మామ్। 27

(నా పేరు శ్రీరాముడు) ఇతడు నా చిన్నతమ్ముడు. పేరు లక్ష్మణుడు. నిష్ఠతో నియమములతో నన్ను అనుసరించి యుండువాడు. ఈమె నాభార్య, విదేహరాజు (జనకమహారాజు) యొక్క కూతురు. ఈమెపేరు సీత. మాతండ్రిగారైన దశరథమహారాజుయొక్క, కైకేయిమాతయొక్క ఆదేశానుసారము తపోరూపధర్మమును నడపుటకై (వనవాసముచేయుటకై) మేము ఇచటికి ఏతెంచితిమి. ఓ వనితా! ఇంతకును నీవు ఎవరు? ఎవరికి చెందినదానవు. (తండ్రి యెవరు? నీ భర్తయెవరు?) నిన్నుగూర్చి వివరముగా తెలుపుము. (16-19)

నామాటకు నీరూపము వికృతముగానున్నది. దీనిని బట్టి నీవు ఒక రాక్షసస్త్రీవి' అని భావింతును. ఇక్కడికి నీవు ఎందులకు వచ్చినట్లు? పూర్తిగా విశదపఱచుము"- (20)

శ్రీరాముడు పలికిన వచనములను వినిన పిమ్మట కామాతురయైన ఆ శూర్పణఖ ఇట్లు నుడివెను. "ఓ రామా! వినుము నా విషయములను నీకు యథార్థముగా దెలిపెదను. నాపేరు శూర్పణఖ. నేను కామరూపిణియైన రాక్షసిని. అందఱికిని భయమును గొల్పుచు నేను ఈ అరణ్యమున స్వేచ్ఛగా సంచరించుచుందును. (21-22)

రాక్షసప్రభువైన రావణుడు నాసోదరుడు. అతడు విశ్రవసునికుమారుడు, మహావీరుడు, మిగుల బలశాలి. ఈ విషయమును నీవు వినియేయుండవచ్చును. ఎల్లప్పుడును నిద్రించు స్వభావముగల కుంభకర్ణుడును నా సోదరుడే. అతడు మిక్కిలి బలముగలవాడు. ధర్మాత్ముడైన విభీషణుడు కూడ నా సోదరుడే. కాని ఆయనలోమాత్రము రాక్షసలక్షణములు లేవు. (23-24)

రణరంగమున తిరుగులేని వీరులైన ఖరదూషణులును నా సోదరులే. వారినందఱిని వీడి నేను స్వేచ్ఛగా తిరుగుచుందును. అద్భుతమైన నీరూపమును దర్శించినప్పటి నుండియు నేను కామపరవశనైతిని. పురుషశ్రేష్ఠుడవైన నిన్ను భర్తగా పొందగోరి నీకడకు వచ్చితిని. నేను మిక్కిలి మహిమలు (శక్తిసామర్థ్యములు) గలదానను. నా బలము తిరుగులేనిది. స్వయముగా అంతటను సంచరింపగలను. నాకు భర్తవై చిరకాలము నాతో సుఖముగా జీవించుము. (నేనుండగా) ఇంక సీతతో నీకేమి పని? (ఇంక నీకు సీతతో పని లేదు.) (25-26)

ఈమెఅవయవములు ఎగుడుదిగుడుగా ఉన్నవి. ఈమెరూపము వికారమును గొలుపునట్టిది. ఈమె నీకు తగినభార్య కాదు. (ఒకసారి) నా అందమును జూడుము. నేను మాత్రమే నీకు భార్యగా తగుదును. కనుక నన్ను చేపట్టుము. (27)

ఇమాం విరూపామసతీం కరాలాం నిర్ణతోదరీమ్।
అనేన తే సహ భ్రాత్రా భక్షయిష్యామి మానుషీమ్। 28

ఈ సీత భయంకరమైన వికృతరూపము కలిగియున్నది. ఈమె నడుము వంగియున్నది. చెడు స్వభావము గలది. ఈ మనుష్యకాంతను. నీ తమ్ముని నేను భక్షించెదను. మనకు అడ్డు తొలగును. (28)

తతః పర్వతశృంగాణి వనాని వివిధాని చ।
పశ్యన్ సహ మయా కాంత! దండకాన్ విచరిష్యసి। 29

ఓ అందగాడా! అటుపిమ్మట మనము ఇద్దఱము కలిసి, పర్వతశిఖరప్రదేశములయందును, వివిధములగు వనములలోను హాయిగా విహరింపవచ్చును." (29)

ఇత్యేవముక్తః కాకుత్స్థః ప్రహస్య మదిరేక్షణామ్।
ఇదం వచనమారేభే వక్తుం వాక్యవిశారదః। 30

మత్తిల్లిన చూపులుగల ఆరాక్షసి యొక్క పలుకులను విని, మాటనేర్పరియైన శ్రీరాముడు ఎగతాళిగా నవ్వుచు ఆమెతో ఇట్లు పలుకదొడంగెను. (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే సప్తదశస్సర్గః (17)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పదునేడవసర్గము.

-- * * * --

18. పదునెనిమిదియవసర్గము

రామలక్ష్మణులు శూర్పణఖను తిరస్కరించుట - ఆమె సీతాదేవిపై దాడికి దిగుట -
శ్రీరాముని సూచనపై లక్ష్మణుడు ఆమెను విరూపను గావించుట. పిమ్మట ఆ రాక్షసి తన సోదరుడైన ఖరుని ఆశ్రయించుట.

తతశ్శూర్పణఖాం రామః కామపాశావపాశితామ్।
స్వచ్ఛయా శ్లక్ష్ణయా వాచా స్మితపూర్వమథాబ్రవీత్। 1

కామవికారములకు లోనైన ఆ శూర్పణఖను జూచుచు, శ్రీరాముడు ఆమెతో పరిహాసపూర్వకముగా మృదుమధురముగా ఇట్లునుడివెను. (1)

కృతదారోఽస్మి భవతి! భార్యేయం దయితా మమ।
త్వద్విధానాం తు నారీణాం సుదుఃఖా ససపత్నతా। 2

"ఓ శూర్పణఖా! నేను వివాహితుడను. ఈమె నా ప్రాణేశ్వరి. నీ వంటి స్త్రీలకు సవతిపోరువలన దుఃఖమే మిగులును గదా! (2)

అనుజస్త్వేష మే భ్రాతా శీలవాన్ ప్రియదర్శనః।
శ్రీమానకృతదారశ్చ లక్ష్మణో నామ వీర్యవాన్। 3

అపూర్వీ భార్యయా చార్థీ తరుణః ప్రియదర్శనః।
అనురూపశ్చ తే భర్తా రూపస్యాస్య భవిష్యతి। 4

చూడముచ్చటగానున్న ఇతడు నా తమ్ముడు. భార్యకు దూరముగా ఉన్నవాడు చక్కని సౌశీల్యము గలవాడు. పేరు లక్ష్మణుడు. మిగుల ప్రతాపశాలి. ఇతడు చాల కాలము నుండి భార్యాసుఖము ఎఱుగనివాడు. భార్యయొక్క అవసరము ఉన్నవాడు. యువకుడు, అందగాడు. రూపవైభవమును బట్టి నీవే భర్తగా కోరదగినవాడు. (3-4)

ఏనం భజ విశాలాక్షి! భర్తారం భ్రాతరం మమ।
అసపత్నా వరారోహే! మేరుమ్ అర్కప్రభా యథా। 5

ఓ విశాలాక్షీ! ఓ సుందరీ! నా సోదరుడైన ఇతనిని ఎట్టి సవతిబాధయు లేకుండా, సూర్యకాంతి మేరు పర్వతమునువలె సేవింపుము. (ఆశ్రయింపుము)" (5)

ఇతి రామేణ సా ప్రోక్తా రాక్షసీ కామమోహితా।
విసృజ్య రామం సహసా తతో లక్ష్మణమబ్రవీత్। 6

కామాతురయైన ఆ రాక్షసి రాముడు ఇట్లు పలికిన పిదప ఆయనను విడిచిపెట్టి, వేగముగా లక్ష్మణుని సమీపించి, అతనితో ఇట్లు నుడివెను. (6)

అస్య రూపస్య తే యుక్తా భార్యాఽహం వరవర్ణినీ।
మయా సహ సుఖం సర్వాన్ దండకాన్ విచరిష్యసి। 7

"అద్భుతమైన రూపముగల నీకు సర్వాంగసుందరినైన నేను భార్యగా తగుదును. నన్ను చేపట్టి, దండకారణ్యములయందు అంతటను నాతోగూడి విహరించి సుఖింపుము-" (7)

ఏవముక్తస్తు సౌమిత్రీ రాక్షస్యా వాక్యకోవిదః।
తతశ్శూర్పణఖీం స్మిత్వా లక్ష్మణో యుక్తమబ్రవీత్। 8

ఆ రాక్షసి ఇట్లు పలికిన పిమ్మట, మాటకారియైన లక్ష్మణస్వామి ఆ శూర్పణఖను ఎగాదిగాజూచుచు చిఱునవ్వుతో ఇట్లనెను. (8)

కథం దాసస్య మే దాసీ భార్యా భవితుమిచ్ఛసి।
సోఽహమార్యేణ పరవాన్ భ్రాత్రా కమలవర్ణిని॥ 9

సమృద్ధార్థస్య సిద్ధార్థా ముదితామలవర్ణినీ।
ఆర్యస్య త్వం విశాలాక్షి! భార్యా భవ యవీయసీ॥ 10

ఏనాం విరూపామసతీం కరాళాం నిర్ణతోదరీమ్।
భార్యాం వృద్ధాం పరిత్యజ్య త్వామేవైష భజిష్యతి॥ 11

కో హి రూపమిదం శ్రేష్ఠం సంత్యజ్య వరవర్ణిని!।
మానుషీషు వరారోహే! కుర్యాద్భావం విచక్షణః॥ 12

ఇతి సా లక్ష్మణేనోక్తా కరాళా నిర్ణతోదరీ।
మన్యతే తద్వచస్తథ్యం పరిహాసా విచక్షణా॥ 13

సా రామం పర్ణశాలాయామ్ ఉపవిష్టం పరంతపమ్।
సీతయా సహ దుర్ధర్షమ్ అబ్రవీత్ కామమోహితా॥ 14

ఏనాం విరూపామసతీం కరాళాం నిర్ణతోదరీమ్।
వృద్ధాం భార్యామవష్టభ్య మాం న త్వం బహుమన్యసే॥ 15

"ఓ సుందరీ! నేను పూజ్యుడైన మా అన్నగారి అధీనములో ఉన్నవాడను. (అస్వతంత్రుడను) దాసుడనైన నాకు భార్యవై, నీవును దాసిగా ఉండదలచితివా? (దాసివి అగుటకు ఎట్లు సమ్మతింతువు?) (9)

ఓ విశాలాక్షీ! నీవు నిర్మలమైన వన్నెగలదానవు. పూజ్యుడైన మా అన్న సర్వశుభలక్షణశోభితుడు. కావున నీవు ఆయనను చేపట్టి చిన్నభార్యవై ఆనందింపుము. అప్పుడు నీకోరికలన్నియు తీరును- మా అన్నభార్యయైన సీతాదేవి వికారమైన రూపము గలది, ప్రశస్తి లేనిది, భయమును గొలుపునది, వంగిన నడుముగలది, పైగా వృద్ధురాలు.(1) కనుక మా అన్న ఆమెను పరిత్యజించి నిన్ను, చేపట్ట గలడు. (10-11)

చక్కని లావైన నడుముగల ఓ సుందరీ! ఇట్టి నీరూప సౌభాగ్యమును కాదని తెలివిగలవాడు ఎవ్వడైనను మానవ స్త్రీలపై మనసుపడునా?" (మనుష్యకాంతలలో రత్నమైన సీతాదేవి యొక్క అందచందములను కాదని బుద్ధిమంతుడైన వాడు ఎవ్వడు ఈ (నీ) రూపముపై ఆశపడును?) (12)

భయంకరమైన ఆకారముగలది, లావైన పొట్టగలది ఐన శూర్పణఖ లక్ష్మణుని పరిహాసవచనములలోని అంతరార్థమును తెలిసికొనలేక వాటిని నిజమని నమ్మెను. (13)

శత్రువులకు అజేయుడు, వారిని గడగడలాడింపగల వీరుడు ఐన శ్రీరాముడు సీతాదేవితోగూడి పర్ణశాలయందు హాయిగా కూర్చొనియుండగా కామాతురయైన శూర్పణఖ ఆయనను సమీపించి ఇట్లు నుడివెను. (14)

"భయంకరమైన వికృతాకారము గలది, చెడుస్వభావముగలది, వృద్ధురాలై వంగిన నడుముగల నీ భార్యను చేరదీసి, నీవు నన్ను ఆదరించుట లేదు. కనుక ఓ రామా! నీవు

1) పదునేడవ (17వ) సర్గము లోని 28 వ శ్లోకములో సీతాదేవి వికృతముగా నున్నదని తెలుపుచు శూర్పణఖ సీతను గూర్చి ఉపయోగించిన విశేషణములనే లక్ష్మణుడును ఇచట (18వ సర్గలో 11వ శ్లోకములో) సీతాదేవిని వర్ణించుచు ప్రయోగించెను. కాని ఈ విశేషణముల యెడ లక్ష్మణుని దృష్టిలో బాహ్యార్థము వేఱు. అంతరార్థము వేఱు. బాహ్యార్థము (పైకి తెలియవచ్చెడి అర్థము) ఈ 11వ శ్లోకమునకు తాత్పర్యముగా ఈయబడినది.
ఇక లక్ష్మణుని దృష్టిలో దాని అంతరార్థము-
విరూపా = విశేషరూపము గలది, త్రిలోకసుందరి, అసతి = (న విద్యతే అన్యాసతీ యస్యాః సా = అసతీ) సాటిలేని సద్గుణవతి, పరమపతివ్రత, కరాళా = చక్కగా ఒడ్డుపొడవులు గలది, (నిండైన విగ్రహము గలది) నిర్ణతోదరీ = (నిమ్నం ఉదరం యస్యాః సా) తను మధ్య = సన్నని నడుము గలది. వృద్ధా = చక్కని జ్ఞానము చేతను, ఉత్తమశీలముచేతను, సద్గుణములచేతను గొప్పది, - ఇక తాత్పర్యము-
సీతాదేవి త్రిలోకసుందరి, స్త్రీలలో సాటిలేనిది. (పరమపతివ్రత) స్త్రీలకు తగినట్లు ఎత్తైనది, సన్నని నడుము గలది, చక్కని జ్ఞానము, ఉత్తమ శీలము, సద్గుణములు గల ఉత్తమురాలు. కనుక శ్రీరాముడు ఉత్తమురాలైన, తనభార్యతో (సీతాదేవితో) సుఖముగా జీవించును. అట్టి భార్యయుండగా శ్రీరాముడు వికృతరూపవు, చెడ్డ గుణములు గలదానవు, భయంకరముగా ఉన్నదానవు, వంగిన నడుముగలదానవు, ముసలిదానవు ఐన నిన్ను పరిత్యజింపక ఎట్లుండును. ఎట్టి పరిస్థితిలోను ఆ పూజ్యుడు నిన్ను చేపట్టడు.

అద్యేమాం భక్షయిష్యామి పశ్యతస్తవ మానుషీమ్।
త్వయా సహ చరిష్యామి నిస్సపత్నా యథాసుఖమ్। 16

ఇత్యుక్త్వా మృగశాబాక్షీమ్ అలాతసదృశేక్షణా।
అభ్యధావత్ సుసంక్రుద్ధా మహోల్కా రోహిణీమివ। 17

తాం మృత్యుపాశప్రతిమామ్ ఆపతంతీం మహాబలః।
నిగృహ్య రామః కుపితః తతో లక్ష్మణమబ్రవీత్। 18

క్రూరైరనార్యైః సౌమిత్రే! పరిహాసః కథంచన।
న కార్యః పశ్య వైదేహీం కథంచిత్ సౌమ్య జీవతీమ్। 19

ఇమాం విరూపామసతీమ్ అతిమత్తాం మహోదరీమ్।
రాక్షసీం పురుషవ్యాఘ్ర! విరూపయితుమర్హసి। 20

ఇత్యుక్తో లక్ష్మణస్తస్యాః క్రుద్ధో రామస్య పార్శ్వతః।
ఉద్ధృత్య ఖడ్గం చిచ్ఛేద కర్ణనాసం మహాబలః। 21

నికృత్తకర్ణనాసా తు విస్వరం సా వినద్య చ।
యథాగతం ప్రదుద్రావ ఘోరా శూర్పణఖా వనమ్। 22

సా విరూపా మహాఘోరా రాక్షసీ శోణితోక్షితా।
ననాద వివిధాన్ నాదాన్ యథా ప్రావృషి తోయదః। 23

సా విక్షరంతీ రుధిరం బహుధా ఘోరదర్శనా।
ప్రగృహ్య బాహూ గర్జంతీ ప్రవివేశ మహావనమ్। 24

తతస్తు సా రాక్షససంఘసంవృతం
ఖరం జనస్థానగతం విరూపితా ।
ఉపేత్య తం భ్రాతరముగ్రదర్శనం
పపాత భూమౌ గగనాద్యథాఽశనిః । 25

తత స్సభార్యం భయమోహమూర్ఛితా
స లక్ష్మణం రాఘవమాగతం వనమ్ ।
విరూపణం చాత్మని శోణితోక్షితా
శశంస సర్వం భగినీ ఖరస్య సా । 26

చూచుచుండగనే (నీయుండే) మనుష్యకాంతయైన ఈమెను ఇప్పుడే నమలివేసెదను. పిమ్మట ఎట్టి సవతిబాధయు లేకుండా నీతోగూడి హాయిగా విహరించెదను". (15-16)

కాలుచున్న కొఱవివలె ఎఱ్ఱని చూపులుగల ఆ శూర్పణఖ క్రుద్ధురాలై, రోహిణీతారపైబడు భీకరమైన తోకచుక్కవలె లేడిపిల్లవంటి చూపులుగల సీతాదేవిపై దాడికిదిగెను.(17)

మృత్యుపాశమువలె మీదబడుటకు వచ్చుచున్న ఆ శూర్పణఖను జూచి మిగుల బలశాలియైన శ్రీరాముడు కుపితుడై, హుంకారముతో ఆమెను నిలువరించి, వెంటనే లక్ష్మణునితో ఇట్లనెను. (18)

"ఓ సౌమిత్రీ! క్రూరులైన దుష్టులతో పరిహాసము ఏ విధముగను పనికిరాదు. కనుక ఓ సౌమ్యా! సీతాదేవికి (మీ వదినెకు) ఎట్టి ఆపదయు రాకుండ చూడుము. ఓ పురుషశ్రేష్ఠా! కురూపియు, క్రూర స్వభావయు, మదించియున్నదియు, మహోదరియు ఐన ఈ దుష్టరాక్షసిని విరూపను గావింపుము. (19-20)

అన్న ఇట్లు తనను ఆదేశింపగా, మహాబలశాలియైన లక్ష్మణుడు క్రుద్ధుడై శ్రీరామునిప్రక్కన ఉన్న ఖడ్గమును దీసికొని, ఆ శూర్పణఖయొక్క ముక్కుచెవులను ఖండించెను. (21)

తనముక్కుచెవులు ఖండింపబడగా ఆ భయంకర శూర్పణఖ పెడబొబ్బలు పెట్టుచు వచ్చిన త్రోవను బట్టి, తనవనములకు పరుగులు దీసెను. వికృతాకారము గలిగి, నెత్తురోడుచుండుటచే భయంకరముగా నున్న ఆ రాక్షసి వర్షాకాలమునందలి మేఘమువలె పలువిధములుగా గర్జనలు చేసెను. (22-23)

అట్లు రక్తము కారుచుండగా మిక్కిలి బయంకరమైన ఆకారముగల ఆ రాక్షసి చేతులు పైకెత్తి, లబోదిబోమని మొత్తుకొనుచు మహారణ్యమున ప్రవేశించెను. (24)

ఆ దండకారణ్యము (జనస్థానము) నందు ఆమె సోదరుడైన ఖరుడు నివసించుచుండెను. అతని ఆకారము భీకరమైనది. పెక్కుమంది రాక్షసులు అతనికడ చేరియుండిరి. ముక్కు చెవులు తెగి, విరూపమైయున్న ఆ శూర్పణఖ ఆ ఖరుని సమీపించి, ఆకాశమునుండి పిడుగువలె నేలపై పడిపోయెను. (25)

ఖరునిసోదరియు, రక్తములో తడిసియున్నదియు, భయములో ప్రాణములు అన్నుబట్టియున్నదియు ఐన ఆ శూర్పణఖ, శ్రీరాముడు భార్యయగు సీతతో తమ్ముడైన లక్ష్మణునితో దండకారణ్యమున నివసించుచున్న విషయమును, ఆయనవలన తనముక్కుచెవులు తెగి, తాను విరూపయైన వృత్తాంతమును పూర్తిగా అతనికి (ఖరునికి) వివరించెను.(26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే అష్టాదశస్సర్గః *(18)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పదునెనిమిదవసర్గము.

-- ❋ ❋ ❋ --

19. పందొమ్మిదవసర్గము

శూర్పణఖను విరూపను గావించిన రామలక్ష్మణులమీదికి, క్రుద్ధుడైన ఖరాసురుడు తన పదునాలుగు వేలమంది యోధులను యుద్ధమునకు పంపుట -

తాం తథా పతితాం దృష్ట్వా విరూపాం శోణితోక్షితామ్।
భగినీం క్రోధసంతప్తః ఖరః పప్రచ్ఛ రాక్షసః। 1

ఉత్తిష్ఠ తావదాఖ్యాహి ప్రమోహం జహి సంభ్రమమ్।
వ్యక్తమాఖ్యాహి కేన త్వమ్ ఏవంరూపా విరూపితా। 2

కః కృష్ణసర్పమాసీనమ్ ఆశీవిషమనాగసమ్।
తుదత్యభిసమాపన్నమ్ అంగుల్యగ్రేణ లీలయా। 3

కః కాలపాశమాసజ్య కంఠే మోహాన్న బుధ్యతే।
యస్త్వామద్య సమాసాద్య పీతవాన్ విషముత్తమమ్। 4

బలవిక్రమసంపన్నా కామగా కామరూపిణీ।
ఇమామవస్థాం నీతా త్వం కేనాంతకసమాగతా। 5

దేవగంధర్వభూతానామ్ ఋషీణాం చ మహాత్మనామ్।
కోఽయమేవం విరూపాం త్వాం మహావీర్యశ్చకార హ। 6

న హి పశ్యామ్యహం లోకే యః కుర్యాన్మమ విప్రియమ్।
అంతరేణ సహస్రాక్షం మహేంద్రం పాకశాసనమ్। 7

అద్యాహం మార్గణైః ప్రాణాన్ ఆదాస్యే జీవితాంతకైః।
సలిలే క్షీరమాసక్తం నిష్పిబన్నివ సారసః। 8

నిహతస్య మయా సంఖ్యే శరసంకృత్తమర్మణః।
సఫేనం రుధిరం రక్తం మేదినీ కస్య పాస్యతి। 9

కస్య పత్త్రరథాః కాయాత్ మాంసముత్కృత్య సంగతాః।
ప్రహృష్టా భక్షయిష్యంతి నిహతస్య మయా రణే। 10

ముక్కుచెవులు తెగిపోయి, రక్తముతో తడిసి విరూపయై, తనముందు నేలపై పడియున్న తనసోదరియగు శూర్పణఖ దుస్థితిని జూచి ఖరాసురుడు మిగుల క్రుద్ధుడై ఆమెను ఇట్లడిగెను. (1)

"ఓ సోదరీ! లెమ్ము, నీ నిస్పృహను, చిత్తవైకల్యమును వీడుము. నీ ముక్కుచెవులు కోసి, నిన్ను ఇట్లు వికృతరూపను చేసినదెవరు? ఇప్పుడే వివరముగా తెలుపుము. (2)

ఇతరుల జోలికే పోక ఒకచోట ప్రశాంతముగా ఉన్న విషపూరితమైన కృష్ణసర్పమును (నల్లత్రాచును) వినోదముగానైనను తనవ్రేళ్లతో బాధించుచున్న ఆ మొనగాడెవ్వడు? ముందువెనుకలు ఆలోచింపక నిన్నుజేరి నీ ముక్కుచెవులను కోసినవాడు తనమెడకు తాను మృత్యుపాశమును బిగించుకొనినట్లే. అంతేగాదు అతడు కాలకూట విషమును త్రాగినట్లే, ఇంక వాడు తనచావును తాను కొనితెచ్చుకొనినట్లే- ఈ విషయమును అతడు ఎఱుగనట్లున్నది. (3-4)

ఓ సోదరీ! శూర్పణఖా! నీబలపరాక్రమములు సాటిలేనివి. నీవు కామరూపిణివి, ఎచ్చటనైనను నిర్భయముగా సంచరింపగలదానవు. అంతేగాదు మృత్యుదేవతతో సమానురాలవు. అట్టి నిన్ను ఈ దుఃస్థితికి గుఱిచేసినదెవరు? నిన్ను ఈ విధముగా విరూపనుగా చేసిన ఆ మహావీరుడెవరు? దేవ, గంధర్వ జాతులకు చెందినవాడా? లేక మహాత్ములైన ఋషులలో ఒకడా? ఎవడు వాడు? (5-6)

పాకాసురుని చంపినవాడు, సహస్రాక్షుడు, దేవతలలో ప్రముఖుడు ఐన ఇంద్రుడుదప్ప మఱియొకడు ఎవ్వడును (నిన్ను ఇట్లు బాధించి) నాకు అప్రియమును గూర్చుటకు సాహసింపడు. ఈ లోకమున అట్టి వానిని ఎవ్వనిని నేను ఇంతవఱకు చూడలేదు. (7)

శత్రువులనురూపుమాపునట్టి నాబాణపరంపరద్వారా హంస నీటిలోగలసియున్న పాలనువలె నేడే ఆ అపరాధియొక్క ప్రాణములను పీల్చివేసెదను. (8)

ఓ సోదరీ! నీకు తీరనివ్యథగూర్చిన ఆ వీరుడు ఇక మిగిలియుండడు. రణరంగమున మిగుల వాడియైన నా బాణములచే వానిమర్మస్థానములను (ఆయువుపట్టులను) ఛేదించెదను. వానిశరీరమునుండి నురుగులతో ప్రవహించెడి వేడిరక్తముతో భూమి తనదాహమును తీర్చుకొనగోరుచున్నది. (9)

యుద్ధరంగమున నాచేతిలో మృతిచెందిన వీరునియొక్క శరీరముకడ వివిధములగు పక్షులు గుమిగూడి, ఆ కళేబరమునుండి మాంసఖండములను చీల్చుకొని (పీక్కొని) సంతోషముతో తినగలవు. (10)

తం న దేవా న గంధర్వా న పిశాచా న రాక్షసాః।
మయాఽపకృష్టం కృపణం శక్తాస్త్రాతుమిహాఽఽహవే। 11

ఉపలభ్య శనైస్సంజ్ఞాం తం మే శంసితుమర్హసి।
యేన త్వం దుర్వినీతేన వనే విక్రమ్య నిర్జితా। 12

ఇతి భ్రాతుర్వచః శ్రుత్వా క్రుద్ధస్య చ విశేషతః।
తతశ్శూర్పణఖా వాక్యం సబాష్పమ్ ఇదమబ్రవీత్। 13

తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ।
పుండరీకవిశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ। 14

ఫలమూలాశనౌ దాంతౌ తాపసౌ ధర్మచారిణౌ।
పుత్రౌ దశరథస్యాస్తాం భ్రాతరౌ రామలక్ష్మణౌ। 15

గంధర్వరాజప్రతిమౌ పార్థివవ్యంజనాన్వితౌ।
దేవౌ వా మానుషౌ వా తౌ న తర్కయితుముత్సహే। 16

తరుణీ రూపసంపన్నా సర్వాభరణభూషితా దృష్టా।
తత్ర మయా నారీ తయోర్మధ్యే సుమధ్యమా। 17

తాభ్యామ్ ఉభాభ్యాం సంభూయ ప్రమదామ్ అధికృత్య తామ్।
ఇమామవస్థాం నీతాఽహం యథాఽనాథాఽసతీ తథా। 18

తస్యాశ్చానృజువృత్తాయాః తయోశ్చ హతయోరహమ్।
సఫేనం పాతుమిచ్ఛామి రుధిరం రణమూర్ధని। 19

ఏష మే ప్రథమః కామః కృతస్తాత త్వయా భవేత్।
తస్యాస్తయోశ్చ రుధిరం పిబేయమ్ అహమాహవే। 20

ఇతి తస్యాం బ్రువాణాయాం చతుర్దశ మహాబలాన్।
వ్యాదిదేశ ఖరః క్రుద్ధో రాక్షసానంతకోపమాన్। 21

మానుషౌ శస్త్రసంపన్నౌ చీరకృష్ణాజినాంబరౌ।
ప్రవిష్టౌ దండకారణ్యం ఘోరం ప్రమదయా సహ। 22

తౌ హత్వా తాం చ దుర్వృత్తామ్ అపావర్తితుమర్హథ।
ఇయం చ రుధిరం తేషాం భగినీ మమ పాస్యతి। 23

ఇక సమరభూమియందు నాచేతికిచిక్కిన అక్రూరుని దేవతలు, గంధర్వులు, పిశాచములు, రాక్షసులు మున్నగువారు ఎవ్వరును రక్షింపజాలరు- (11)

ఓ సోదరీ! మొదట ఈ పరిస్థితినుండి తిన్నగా కోలుకొనుము. పిమ్మట పరాక్రమశాలినినైన నన్ను ఈ దుస్థితికి గురిచేసిన దుర్జనుడెవరో తెలుపుము-" (12)

కోపముతో రెచ్చిపోయిన తనసోదరునిమాటలను వినిన పిమ్మట ఆ శూర్పణఖ కన్నీరుగార్చుచు అతనితో ఇట్లు పలికెను.(13)

"ఓ సోదరా! మనదండకారణ్యమున ఇరువురు రాజకుమారులు చేరిరి. వారు నవయువకులు, అంతేగాదు చక్కని రూపలావణ్యములు గలవారు, మిక్కిలి సుకుమారులు, ఐనను సాటిలేని బలపరాక్రమములు గలవారు, మఱియు పద్మములవలె విశాలమై మనోహరమైన నేత్రములుగలవారు వారు వల్కలములను, జింకచర్మములను ధరించియున్నారు. కందమూలఫలములే వారిఆహారములు. వారు జితేంద్రియులు, తాపసులు, ధర్మనిరతులు. వారు దశరథమహారాజు యొక్కకుమారులు, అన్నదమ్ములు, పేర్లు రామలక్ష్మణులు. గంధర్వరాజులవలె వారు నిరుపమానతేజోమూర్తులు, గొప్ప రాజచిహ్నములు గలవారు. వారు దేవతలో, మనుష్యులో తెలుపజాలను. (14-16)

వారివెంట నేను సన్ననినడుముగల ఒక మగువను జూచితిని. ఆమె నిండుజవ్వని, చక్కని సుందరి, మిలమిల లాడుచున్న పెక్కు ఆభరణములను ధరించియున్నది. ఆ యువతిరక్షణనిమిత్తముగా ఆ యుభయులవలన నేను ఒక దిక్కులేని దానివలె కులటవలె ఇట్టి దురవస్థకు లోనైతిని. రణరంగమున ఆ ఇరువురు యువకులు మృతిచెందిన వెంటనే నురుగులతోగూడిన వారిరక్తములను, ఆ కుటిలాత్మురాలిరక్తమును తనివిదీర త్రాగగోరుచున్నాను.(17-19)

ఓ సోదరా! ఆ ముగ్గురియొక్క రుధిరమును రణరంగమునందే తృప్తిగా జుఱ్ఱెదను- ఇదియే నా ఏకైక వాంఛ. దానిని నీవు నెఱవేర్చి తీరవలెను-" (20)

శూర్పణఖపలుకులు విన్నంతనే ఆ ఖరాసురుడు మిగుల మండిపడెను. వెంటనే అతడు యమునివలె భయంకరులైన పదునాలుగుమంది యోధులను శ్రీరామునిమీదికి యుద్ధమునకు పంపుచు వారిని ఇట్లాదేశించెను. (21)

"ఓ యోధులారా! ఇరువురు మానవులు వల్కములను, జింకచర్మములను ధరించియు, శస్త్రధారులై భయంకరమైన ఈ దండకారణ్యమునకు వచ్చియున్నారు. వారితో ఒక తరుణియును గలదు. మీరు అచటికి వెళ్ళి, దురాచారులైన ఆ యువకులిరువురిని, ఆ తరుణిని పరిమార్చిరండు. అప్పుడు నా సోదరియైన ఈ శూర్పణఖ ఆ ముగ్గురి రక్తమును త్రాగగలదు. ఓ రాక్షసులారా! ఇదియే నా

మనోరథోఽయమిష్టోఽస్యా భగిన్యా మమ రాక్షసాః।
శీఘ్రం సంపాద్యతాం తౌ చ ప్రమథ్య స్వేన తేజసా। 24

ఇతి ప్రతిసమాదిష్టా రాక్షసాస్తే చతుర్దశ।
తత్ర జగ్ముస్తయా సార్ధం ఘనా వాతేరితా యథా। 25

తతస్తు తే తం సముదగ్రతేజసం
తథాఽపి తీక్ష్ణప్రదరా నిశాచరాః।
న శేకురేవం సహసా ప్రమర్దితుం
వనే ద్విపా దీప్త మివాగ్ని ముత్థితమ్। 26

సోదరికోరిక. ఇట్లు చేయుట నాకును మిగుల ఇష్టము. వెంటనే వెళ్లి, వారిపై మీపరాక్రమమును జూపి, వారిని చంపివేయుడు. అప్పుడు నాసోదరికోరిక తీరును."(22-24)

ఖరుడు ఈ విధముగా ఆదేశించిన పిమ్మట ఆ పదునాలుగుమంది రాక్షసయోధులు ఆ శూర్పణఖను వెంటబెట్టుకొని, గాలిచే నెట్టబడిన మేఘములవలె పంచవటికి చేరిరి. (25)

పిమ్మట ఆ రాక్షసులు మహాపరాక్రమశాలియైన శ్రీరామునిపై నిశితములైన తమబాణములను ప్రయోగించిరి. ఐనను వనగజములు మండుచున్న అగ్నిజ్వాలలను ఎదుర్కొనలేనట్లు వారు శ్రీరాముని దెబ్బతీయలేకపోయిరి. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకోనవింశతిస్సర్గః (19)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది పందొమ్మిదవ.

— * * * —

20. ఇరువదియవసర్గము

ఖరుడు పంపిన రాక్షసయోధులను శ్రీరాముడు ఒక్కడే హతమార్చుట శూర్పణఖ మరల ఖరుని ఆశ్రయించుట.

తతశ్శూర్పణఖా ఘోరా రాఘవాశ్రమమాగతా।
రక్షసామాచచక్షే తౌ భ్రాతరౌ సహ సీతయా। 1

తే రామం పర్ణశాలాయామ్ ఉపవిష్టం మహాబలమ్।
దదృశుః సీతయా సార్ధం వైదేహ్యా లక్ష్మణేన చ। 2

తాన్ దృష్ట్వా రాఘవః శ్రీమాన్ ఆగతాన్ తాం చ రాక్షసీమ్।
అబ్రవీద్భ్రాతరం రామో లక్ష్మణం దీప్తతేజసమ్। 3

ముహూర్తం భవ సౌమిత్రే! సీతాయాః ప్రత్యనంతరః।
ఇమానస్యా వధిష్యామి పదవీమాగతానిహ। 4

వాక్యమేతత్ తతః శ్రుత్వా రామస్య విదితాత్మనః।
తథేతి లక్ష్మణో వాక్యం రామస్య ప్రత్యపూజయత్। 5

రాఘవోఽపి మహచ్చాపం చామీకరవిభూషితమ్।
చకార సజ్యం ధర్మాత్మా తాని రక్షాంసి చాబ్రవీత్। 6

అనంతరము క్రూరురాలైన శూర్పణఖ శ్రీరాముని ఆశ్రమమునకు చేరి, అచటనున్న సీతారామ లక్ష్మణులను ఆ రాక్షసులకు చూపెను. (1)

అప్పుడు మహాబలశాలియైన శ్రీరాముడు జనకమహారాజు కూతురైన సీతాదేవితోడను, లక్ష్మణునితోడనుగూడి పర్ణశాలయందు ఆసీనుడై యుండెను. ఆ రాక్షసులు ఆ ముగ్గురిని జూచిరి. (2)

పరాక్రమశాలియైన శ్రీరాముడు తనఆశ్రమముకడకు వచ్చియున్న ఆ రాక్షసులను, రాక్షసిని(శూర్పణఖను) చూచెను. పిమ్మట అతడు తేజోమూర్తియు, తమ్ముడును ఐన లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (3)

ఓ సౌమిత్రీ! ఒక క్షణకాలముపాటు సీతాదేవిని రక్షించుచు ఇచటనే యుండుము. ఈ రాక్షసి (శూర్పణఖ) తో గూడి ఇచటికి వచ్చిన ఈ రాక్షసులను వధించెదను. (4)

మహాత్ముడైన రామునియొక్క సమయస్ఫూర్తితోగూడిన పలుకులను విని, లక్ష్మణుడు "సరే" యని పలికి, అన్నఆజ్ఞను తలదాల్చెను. (5)

వెంటనే శ్రీరాముడు బంగారముతో అలంకరింపబడిన తన ధనుస్సును సంధించెను. పిమ్మట ఆ ధర్మాత్ముడు (యుద్ధవీరుడు) ఆ రాక్షసులతో నిట్లనెను. (6)

పుత్రౌ దశరథస్యావాం భ్రాతరౌ రామలక్ష్మణౌ।
ప్రవిష్టౌ సీతయా సార్ధం దుశ్చరం దండకావనమ్। 7

ఫలమూలాశనౌ దాంతౌ తాపసౌ ధర్మచారిణౌ।
వసంతౌ దండకారణ్యే కిమర్థముపహింసథ। 8

యుష్మాన్ పాపాత్మకాన్ హంతుం విప్రకారాన్ మహాహవే।
ఋషీణాం తు నియోగేన ప్రాప్తోఽహం సశరాయుధః। 9

తిష్ఠతైవాత్ర సంతుష్టా నోపావర్తితుమర్హథ।
యది ప్రాణైరిహార్థో వా నివర్తధ్వం నిశాచరాః। 10

తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాస్తే చతుర్దశ।
ఊచుర్వాచం సుసంక్రుద్ధా బ్రహ్మఘ్నాః శూలపాణయః। 11

క్రోధముత్పాద్య నో భర్తుః ఖరస్య సుమహాత్మనః।
త్వమేవ హాస్యసే ప్రాణాన్ అద్యాస్మాభిర్హతో యుధి। 12

కా హి తే శక్తిరేకస్య బహూనాం రణమూర్ధని।
అస్మాకమగ్రతః స్థాతుం కిం పునర్యోద్ధుమాహవే। 13

ఏభిః బాహుప్రయుక్తైర్నః పరిఘైః శూలపట్టిసైః।
ప్రాణాం స్త్యక్ష్యసి వీర్యం చ ధనుశ్చ కరపీడితమ్। 14

ఇత్యేవముక్త్వా సంక్రుద్ధా రాక్షసాస్తే చతుర్దశ।
ఉద్యతాయుధనిస్త్రింశా రామమేవాభిదుద్రువుః।
చిక్షిపుస్తాని శూలాని రాఘవంప్రతి దుర్జయమ్। 15

తాని శూలాని కాకుత్స్థః సమస్తాని చతుర్దశ।
తావద్భిరేవ చిచ్ఛేద శరైః కాంచనభూషణైః। 16

"మేము ఇరువురము సోదరులము, దశరథునికుమారులము, రామలక్ష్మణులము. మేము ఈ సీతాదేవితోగూడి సులభముగా చొఱరాని ఈ దండకారణ్యమున ప్రవేశించితిమి. మేము కందమూల ఫలములను దినుచు జితేంద్రియులమై, తాపసధర్మములను ఆచరించుచు ఈ దండకవనమున నివసించుచున్నాము. మమ్ము మీరు ఎందులకు బాధించు చున్నారు? (7-8)

హింసాప్రవృత్తిగల మీవంటి పాపాత్ములను రణరంగమున వధించుటకై, మహర్షుల ఆదేశమునమసరించి, నేను ధనుర్బాణములను, ఆయుధములను చేపట్టితిని. ఓ రాక్షసులారా! మీరు నాతో యుద్ధముచేయదలచుకొన్నచో పాఱిపోక నిర్భయముగా ఇచ్చటనే యుండుడు. లేక మీకు ఏ మాత్రము ప్రాణములమీద తీపియున్నను వచ్చిన త్రోవపట్టుడు." (9-10)

అంతట బ్రహ్మహత్యలకు పాల్పడువారు, శూలములను ధరించెడి వారు ఐన ఆ పదునాలుగువేలమంది రాక్షసులు శ్రీరామునిపలుకులను విని, మిగుల మండిపడుచు ఆయనతో ఇట్లు పలించిరి. (11)

"మహాకాయుడు, మాకు ప్రభువు ఐన ఖరునకు నీవు కోపమును తెప్పించితివి. నేడు రణభూమియందు మాచేతిలో నీకు చావు తప్పదు. కనుక నీవే ప్రాణములపై ఆశ వదులుకొనుము. మేము పెక్కుమందిమి, నీవు ఒంటరివాడవు. మా యెదుట సమరరంగమున నిలబడుటకు నీకు శక్తి ఎక్కడిది? ఇంక యుద్ధము చేయుట గూడనా!"[1] (12-13)

యుద్ధమునకు రమ్ము! మేము భుజబలముల కొలదియు ప్రయోగించిన పరిఘలు (ముండ్ల ఇనుప గదలు) శూలములు, పట్టిసములు (ఖడ్గములు) మొదలగు ఆయుధములదెబ్బకు నీచేతిలోని ధనుస్సు ముక్కలగును. నీ గర్వము అణగును. తుదకు నీప్రాణములుగూడ మిగులవు." (14)

ఆ పదునాలుగుమంది రాక్షసయోధులు ఇట్లు పలికి, మిగుల క్రుద్ధులై, వివిధములగు ఆయుధములను పైకెత్తి శ్రీరాముని మీదికి విజృంభించిరి. పిమ్మట వారు అజేయుడైన ఆ రఘురామునిపై శూలములను విసరివేసిరి. (15)

అంతట శ్రీరాముడు వారు ప్రయోగించిన పదునాలుగు శూలములను తన బంగారుబాణములచే అక్కడికక్కడే పూర్తిగా ముక్కలుముక్కలు గావించెను. (16)

1) ఓ రామా! నీవు ఏకైకమహా (తిరుగు లేని)సింహమవు. ఖరుని ప్రేరణతో ఇట్లు వచ్చితిమేగాని మేము పెక్కుమందిమి ఉన్నప్పటికిని నిజముగా యుద్ధరంగమున నీ ముందు నిలువగలశక్తి మాకెక్కడిది? ఇకమేము నీతో యుద్ధము చేయుట గూడనా? ఆ ఖరుని చేతిలో మరణించుట కంటెను నీ చేతిలో మృతి చెందుటయే మాకు మేలు గదా! (గోవిందరాజీయవ్యాఖ్యలో ఈ భావము ప్రస్తావింపబడినది.)

తత: పశ్చాన్మహాతేజా నారాచాన్ సూర్యసన్నిభాన్।
జగ్రాహ పరమక్రుద్ధ: చతుర్దశ శిలాశితాన్। 17

గృహీత్వా ధనురాయమ్య లక్ష్యానుద్దిశ్య రాక్షసాన్।
ముమోచ రాఘవో బాణాన్ వజ్రానివ శతక్రతు:। 18

రుక్మపుంఖాశ్చ విశిఖా దీప్తా హేమవిభూషితా:।
తే భిత్త్వా రక్షసాం వేగాత్ వక్షాంసి రుధిరాప్లుతా:।
వినిష్పేతుస్తదా భూమౌ న్యమజ్జంతాశనిస్వనా:। 19

తే భిన్నహృదయా భూమౌ ఛిన్నమూలా ఇవ ద్రుమా:।
నిపేతు: శోణితార్ద్రాంగా వికృతా విగతాసవ:। 20

తాన్ దృష్ట్వా పతితాన్ భూమౌ రాక్షసీ క్రోధమూర్ఛితా।
పరిత్రస్తా పునస్తత్ర వ్యసృజద్భైరవస్వనాన్। 21

సా నదంతీ మహానాదం జవాత్ శూర్పణఖా పున:।
ఉపగమ్య ఖరం సా తు కించిత్ సంశుష్కశోణితా। 22

పపాత పునరేవార్తా సనిర్యాసేవ సల్లకీ। 23

భ్రాతుస్సమీపే శోకార్తా ససర్జ నినదం ముహు:।
సస్వరం ముముచే బాష్పం విషణ్ణవదనా తదా। 24

నిపాతితాన్ దృశ్య రణే తు రాక్షసాన్
ప్రధావితా శూర్పణఖా పునస్తత:।
వధం చ తేషాం నిఖిలేన రక్షసాం
శశంస సర్వం భగినీ ఖరస్య సా। 25

ఆ పిమ్మట మహాతేజశ్శాలియైన రఘునాథుడు మిక్కిలి క్రుద్ధుడై, శిలలపై సానలుదీఱీ, సూర్యునివలె వెలుగులను విరజిమ్ముచున్న పదునాలుగు బాణములను చేతబట్టెను. అనంతరము శ్రీరాముడు విల్లెక్కు పెట్టి, రాక్షసులపై గుఱిపెట్టి, ఇంద్రుడు వజ్రాయుధమునువలె ఆ బాణములను వారిపై వదలెను. (17-18)

ఆ బాణములు కాంచనభూషితములై, బంగారు పిడులు గలిగి తళతళ మెఱయుచున్నవి. అవి రాక్షసుల వక్షఃస్థలములను వేగముగా (క్షణములో) చీల్చివేసి, రక్తసిక్తములై బయటికి వచ్చినవి. పిమ్మట ఆ శరములు పిడుగులవలె ధ్వనించుచు భూగర్భమున చేరినవి. (19)

శ్రీరామునిబాణములదెబ్బలకు వారిగుండెలు బ్రద్దలైనవి. అవయవములన్నియును రక్తములో తడిసిపోయినవి. వారు మొదలు నఱకిన చెట్లవలె నేలపైబడి, అసువులబాసిరి. (20)

ఆ విధముగా నేలపైగూలిన ఆ రాక్షసులను జూచి, ఆ శూర్పణఖ క్రోధముతో ఊగిపోయెను. ఆమె భయముతో వణకుచు అచట మిగుల భీకరధ్వనులను గావించెను. ఆమె అట్లు గగ్గోలు పెట్టుచు మిక్కిలి వేగముగా ఖరుని కడకేగెను. పిమ్మట దుఃఖము పొంగిపొరలుచుండగా ఆర్తితో ఆయనముందు నేలపై పడిపోయెను. ముక్కుచెవులు ఖండింపబడగా స్రవించిన రక్తము ఆమె ముఖముపై కొద్దిగా ఎండి చారికలు గట్టియుండెను. అప్పుడు ఆమె ఎండిపోయిన జిగురుగల అందుగుచెట్టువలె ఒప్పుచుండెను. మిక్కిలి శోకార్తయైయున్న ఆ శూర్పణఖ ఆర్తనాదము చేయుచు మిగుల విషణ్ణవదనయై సోదరునియెదుట వెక్కి వెక్కి యేడ్చుచు కన్నీరు గార్చెను. (21-24)

రణరంగమున రాక్షసులు పడిపోవుటను జూచిన శూర్పణఖ పరుగుపరుగున తనసోదరుడగు ఖరుని జేరి, అవృత్తాంతము నంతయును అతనికి వివరముగా తెలిపెను. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే వింశస్సర్గః *(20)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదియవసర్గము.

— ＊ ＊ ＊ —

21. ఇరువదియొకటవసర్గము

పదునాలుగువేలమంది రాక్షసయోధులు రామునిచే హతులైన విషయమును ఖరునకు తెలుపుచు శూర్పణఖ అతనిని ఆ రఘువరుని మీదికి ఉసిగొల్పుట.

స పునః పతితాం దృష్ట్వా క్రోధాత్ శూర్పణఖాం ఖరః।
ఉవాచ వ్యక్తయా వాచా తామ్ అనర్థార్థమాగతామ్। 1

మయా త్విదానీం శూరాస్తే రాక్షసా రుధిరాశనాః।
త్వత్ప్రియార్థం వినిర్దిష్టాః కిమర్థం రుద్యతే పునః। 2

భక్తాశ్చైవానురక్తాశ్చ హితాశ్చ మమ నిత్యశః।
ఘ్నంతోఽపి న నిహంతవ్యా న న కుర్యుర్వచో మమ। 3

కిమేతత్ శ్రోతుమిచ్ఛామి కారణం యత్కృతే పునః।
హా నాథేతి వినర్దంతీ సర్పవల్లుఠసి క్షితౌ। 4

అనాథవద్విలపసి నాథే తు మయి సంస్థితే।
ఉత్తిష్ఠోత్తిష్ఠ మా భైషీః వైక్లబ్యం త్యజ్యతామిహ। 5

ఇత్యేవముక్తా దుర్ధర్షా ఖరేణ పరిసాంత్వితా।
విమృజ్య నయనే సాస్రే ఖరం భ్రాతరమబ్రవీత్। 6

అస్మీదానీమహం ప్రాప్తా హృతశ్రవణనాసికా।
శోణితౌఘపరిక్లిన్నా త్వయా చ పరిసాంత్వితా। 7

ప్రేషితాశ్చ త్వయా వీర! రాక్షసాస్తే చతుర్దశ।
నిహంతుం రాఘవం క్రోధాత్ మత్ప్రియార్థం సలక్ష్మణమ్। 8

తే తు రామేణ సామర్షాః శూలపట్టిసపాణయః।
సమరే నిహతాస్సర్వే సాయకైర్మర్మభేదిభిః। 9

తాన్ దృష్ట్వా పతితాన్ భూమౌ క్షణేనైవ మహాబలాన్।
రామస్య చ మహత్ కర్మ మహాంస్త్రాసోఽభవన్మమ। 10

అహమస్మి సముద్విగ్నా విషణ్ణా చ నిశాచర!।
శరణం త్వాం పునః ప్రాప్తా సర్వతో భయదర్శినీ। 11

విషాదనక్రాధ్యుషితే పరిత్రాసోర్మిమాలిని।
కిం మాం న త్రాయసే మగ్నాం విపులే శోకసాగరే। 12

సమస్తరాక్షసులవినాశమునకై దాపురించినదా యనునట్లు మరల తనకడకు వచ్చి, నేలపై బడియున్న ఆ శూర్పణఖను జూచి, ఆ ఖరుడు మిగుల క్రుద్ధుడై, ఆమెతో స్పష్టముగా ఇట్లు పలికెను. (1)

"ఓ శూర్పణఖా! వీరులు, రక్తపానము చేసెడివారు ఐన ఆ రాక్షసయోధులను నీప్రీతికొఱకై ఆదేశించి పంపినది ఇప్పుడే గదా! మరల ఎందులకు ఏడ్చుచుంటివి? (2)

నేను పంపిన ఆ రాక్షసులు నాకు మిగుల విశ్వాసపాత్రులు, విధేయులు, (నాయందు అనురక్తులు) అనుక్షణమూ నాహితమునే గోరెడివారు. ఎవరెంతగా దెబ్బతీసినను వారు చచ్చెడివారు కారు. వారు నామాటను జవదాటరు. (3)

'ఇంకను ఏమి ముంచుకొని వచ్చినది? ఓ ప్రభూ! అని గగ్గోలుపెట్టుచు నేలపై బడి పాామువలె మెలికెలు దిరుగుచున్నావు' కారణమేమి? నేను నీకు అండగా ఉండగా దిక్కులేని దానివలె ఎందుకు ఏడ్చుచున్నావు? లెమ్ము- భయపడవద్దు, ఇంక నిస్పృహను వీడుము"(4-5)

ఈ విధముగా పలుకుచు ఖరుడు ఓదార్చగా అసాధ్యురాలైన ఆ శూర్పణఖ (మనసు చిక్కబట్టుకొని) కన్నీటిని తుడుచుకొని, తన సోదరునితో ఇట్లు నుడివెను. (6)

"సోదరా! ముక్కుచెవులు ఖండింపబడగా, నెత్తుటితో తడిసి, నీ అండ చేరితిని. నీవు ఆత్మీయతతో నన్ను ఓదార్చితివి. ఓ వీరా! నీవు కోపోద్రిక్తుడవై నాకు తృప్తి గూర్చుటకై రామలక్ష్మణులను చంపుటకు పదునాలుగు వేలమంది రాక్షసయోధులను పంపియుంటివి. వారుకుపితులై శూలములను, ఖడ్గములను ధరించి, శ్రీరామునిపైకి విజృంభించిరి. కాని సమరమున శ్రీరాముడు వాడియైన తనబాణములచే వారిఆయువు పట్టులను ఛీల్చి, అందఱిని హతమార్చెను. (7-9)

అప్పుడు ఆ మహాబలశాలురు క్షణములో నేలకొఱగుటను, శ్రీరాముని యుద్ధపటిమను చూచి, నేను భయముతో కంపించిపోయితిని. ఓ రాక్షసేశ్వరా! నేను ఇప్పుడు మిగులభీతితో దుఃఖమున మునిగి యున్నాను. ఎప్పుడు ఎటునుండి ఏ ప్రమాదము వచ్చిపడునో యను భయము నన్ను వెంటాడుచున్నది. అందువలన నేను మఱల నిన్ను శరణుజొచ్చితిని. (10-11)

విషాదమనెడి మొసళ్లతో నిండినదియు, అంతులేని భయమనెడి తరంగపరంపరలతో ఉప్పొంగుచున్నదియు

ఏతే చ నిహతా భూమౌ రామేణ నిశితైః శరైః।
యేఽపి మే పదవీం ప్రాప్తా రాక్షసాః పిశితాశనాః। 13

మయి తే యద్యనుక్రోశో యది రక్షస్సు తేషు చ।
రామేణ యది తే శక్తిః తేజో వాఽస్తి నిశాచర!।
దండకారణ్యనిలయం జహి రాక్షసకంటకమ్। 14

యది రామం మమామిత్రం న త్వమద్యవధిష్యసి।
తవ చైవాగ్రతః ప్రాణాన్ త్యక్ష్యామి నిరపత్రపా। 15

బుద్ధ్యాఽహమనుపశ్యామి న త్వం రామస్య సంయుగే।
స్థాతుం ప్రతిముఖే శక్తః సబలశ్చ మహాత్మనః। 16

శూరమానీ న శూరస్త్వం మిథ్యారోపితవిక్రమః।
మానుషౌ యౌ న శక్నోషి హంతుం తౌ రామలక్ష్మణౌ। 17

రామేణ యది తే శక్తిః తేజో వాఽస్తి నిశాచర!।
దండకారణ్యనిలయం జహి తం కులపాంసన!। 18

నిస్సత్త్వస్యాల్పవీర్యస్య వాసస్తే కీదృశస్త్విహ।
అపయాహి జనస్థానాత్ త్వరితః సహబాంధవః। 19

రామతేజోఽభిభూతో హి త్వం క్షిప్రం వినశిష్యసి।
న హి తేజస్సమాయుక్తో రామో దశరథాత్మజః। 20

భ్రాతా చాస్య మహావీర్యో యేన చాస్మి విరూపితా। 21

ఏవం విలప్య బహుశో రాక్షసీ వితతోదరీ।
భ్రాతుః సమీపే దుఃఖార్తా నష్టసంజ్ఞా బభూవహ।
కరాభ్యాముదరం హత్వా రురోద భృశదుఃఖితా । 22

వన అపారమగు శోకసాగరమున మునిగియున్న నన్ను ఏలరక్షింపవు? (నీవు రక్షింపనిచో నా గతి యేమి?) (12)

శ్రీరాముని ఎదుర్కొనుటకై అచటికి నా వెంట వచ్చిన మాంసభక్షకులగు ఆ రాక్షసులందఱును ఆయనయొక్క నిశితశరములకు బలియై నేలగూలిరి. (13)

ఓ నిశాచరా! నామీదను, ఆ రాక్షసులయెడలను నీకు ఏమాత్రము దయయున్నను, నీకు ఆ రాముని ఎదిరింపగల శక్తిసామర్థ్యములు ఉన్నచో, దండకారణ్యమున నివసించురాక్షసులను హతమార్చుచున్నట్టి ఆ రఘురాముని జయింపుము. (14)

నాకు పరమశత్రువైన ఆ రాముని నీవు నేడే చంపకున్నచో నేను నీయెట్టయెదుటనే నిస్సంకోచముగా ప్రాణములను పరిత్యజింతును. (15)

వేలకొలదిబలములు నీకు బాసటగా ఉన్నను, నీవు యుద్ధమున మహాబలశాలియైన ఆ రామునిముందు నిలువజాలవని నా బుద్ధికి తోచుచున్నది. (16)

'నేను శూరుడను' అని నీవు నిన్నుగూర్చి గొప్పలుచెప్పుకొనుచుంటివే గాని నిజముగా నీవు శూరుడవు కానే కావు. నీలో పరాక్రమము ఉన్నదనుట అసత్యము. ఏలనన మానవమాత్రులైన ఆ రామలక్ష్మణులను సైతము హతమార్చుటకు నీకు శక్తి చాలకున్నది. (17)

ఓ నిశాచరసోదరా! నీకు నిజముగా శ్రీరాముని ఎదుర్కొనగల శక్తిసామర్థ్యములు ఉన్నచో దండకారణ్యవాసియైన అతనిని జయింపుము. (హతమార్చుము) లేనిచో నీవు మనరాక్షసజాతికే కళంకము తెచ్చినవాడవగుదువు. (18)

ఒక మానవమాత్రునిగూడ ఎదుర్కొనగల బలపరాక్రమములు లేని నీకు ఈ దండకారణ్యమున నివసించు అర్హత ఎక్కడిది? కనుక వెంటనే నీ ఆత్మీయులతోసహా ఈ జనస్థానమును (దండకవనమును) వీడి వెళ్ళిపొమ్ము. (19)

సోదరా! శ్రీరామునిప్రతాపముచే నీవు పరాభవము పాలై, త్వరలోనే నశింపగలవు. దశరథమహారాజ కుమారుడైన ఆ రాముడు మిగుల పరాక్రమశాలి సుమా! అంతేగాదు అతని సోదరుడైన లక్ష్మణుడుగూడ తిరుగులేని శక్తిసామర్థ్యములు గలవాడు. నాముక్కుచెవులను కోసినవాడు అతడే. (20-21)

లావైన పొట్ట గల ఆశూర్పణఖ ఈ విధముగా పలురీతుల విలపించుచు సోదరుడగు ఖరునిసమీపమున దుఃఖార్తయై, లబలబ మొత్తుకొనుచు, గుండెలు బాదుకొనుచు కొంతతడవునకు సొమ్మసిల్లెను. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకవింశస్సర్గః ***(21)***

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదియొకటవసర్గము.

22. ఇరువదిరెండవసర్గము

పదునాలుగువేలమంది రాక్షసయోధులతోడను, దూషణునితోడను గూడి ఖరుడు యుద్ధమునకు బయలు దేరుట -

ఏవమాధర్షితః శూరః శూర్పణఖ్యా ఖరస్తదా।
ఉవాచ రక్షసాం మధ్యే ఖరః ఖరతరం వచః॥ 1

తవాపమానప్రభవః క్రోధోఽయమ్ అతులో మమ।
న శక్యతే ధారయితుం లవణాంభ ఇవోల్బితమ్॥ 2

న రామం గణయే వీర్యాత్ మానుషం క్షీణజీవితమ్।
ఆత్మదుశ్చరితైః ప్రాణాన్ హతో యోఽద్య విమోక్ష్యతి॥ 3

బాష్పః సంహ్రియతామేష సంభ్రమశ్చ విముచ్యతామ్।
అహం రామం సహ భ్రాత్రా నయామి యమసాదనమ్॥ 4

పరశ్వధహతస్యాద్య మందప్రాణస్య సంయుగే।
రామస్య రుధిరం రక్తమ్ ఉష్ణం పాస్యసి రాక్షసి!॥ 5

సా ప్రహృష్టా వచః శ్రుత్వా ఖరస్య వదనాచ్చ్యుతమ్।
ప్రశశంస పునర్మౌర్ఖ్యాత్ భ్రాతరం రక్షసాం వరమ్॥ 6

తయా పరుషితః పూర్వం పునరేవ ప్రశంసితః।
అబ్రవీద్దూషణం నామ ఖరః సేనాపతిం తదా॥ 7

చతుర్దశ సహస్రాణి మమ చిత్తానువర్తినామ్।
రక్షసాం భీమవేగానాం సమరేష్వనివర్తినామ్॥ 8

నీలజీమూతవర్ణానాం ఘోరాణాం క్రూరకర్మణామ్।
లోకహింసావిహారాణాం బలినాముగ్రతేజసామ్॥ 9

తేషాం శార్దూలదర్పాణాం మహాస్యానాం మహౌజసామ్।
సర్వోద్యోగముదీర్ణానాం రక్షసాం సౌమ్య! కారయ॥ 10

రాక్షసులందరియెదుట శూర్పణఖ శూరుడైన ఖరుని ఈ విధముగా అవమానింపగా వెంటనే అతడు ఉగ్రుడై, ఆమెతో ఇట్లు తీవ్రవచనములను పలికెను. (1)

"ఓ సోదరీ! నీకు జరిగిన ఈ తీరని అవమాన కారణముగా నాలో క్రోధము పెల్లుబుకుచున్నది. అది పర్వదినములలో సముద్రమునందు ఉవ్వెత్తుగా లేచెడి తరంగములవలె ఆపరానిదైయున్నది. (2)

రాముడు మానవమాత్రుడు, పైగా అల్పాయుష్కుడు. నాపరాక్రమనుముందు అతడొక లెక్కా? తాను చేసిన దుష్కార్యములఫలితముగా అతడు నేడు ప్రాణములను కోల్పోవుట తథ్యము. నేను రామునినే గాదు, అతనితమ్ముడైన లక్ష్మణునిగూడ నేడే యమపురికి పంపెదను. కనుక సోదరీ! నీవు భయమును వీడుము, కన్నీరు తుడుచుకొనుము. (3-4)

ఓ రాక్షసీ! (శూర్పణఖా!) అల్పాయుష్కుడైన ఆ రాముని నాగండ్రగొడ్డలిచే రణభూమియందు నేడే హతమార్తును. అతనివెచ్చనివేడిరక్తమును నీవు తనివితీర పానముచేయుదువు గాక-" (5)

ఖరునినోట వచ్చిన మాటలను విని ఆ దుష్టరాక్షసి ఎంతయు పొంగిపోయెను. పిమ్మట ఆ మూర్ఖురాలు రాక్షసశ్రేష్ఠుడైన తనసోదరుని పొగడ్తలలో ముంచెత్తెను.(6)

ఈ విధముగా శూర్పణఖయొక్క దూషణ భూషణములకు గురియైన ఆ ఖరాసురుడు తనసేనాధిపతియైన దూషణునితో ఇట్లు పలికెను. (7)

ఓ సేనాపతీ! మనసైన్యములోని పదునాలుగువేలమంది యోధులును అనుక్షణము నా కనుసన్నలలో మెలగుచుందురు. ఆ రాక్షసవీరులు మిక్కిలి వడిగలవారు, బలశాలురు. రణరంగమున వెన్నుచూపనివారు. వారు నల్లని మేఘములవలె ఒప్పుచుందురు, రూపమున శత్రుభయంకరులు, పగవారిని నిర్దాక్షిణ్యముగా తునుమాడెడివారు, దుష్టావేశములకు లోనై ప్రాణిహింసయొనర్చుటలో సిద్ధహస్తులు, బలశాలురలో అగ్రగణ్యులు, పెద్దపులులవలె దర్పముగలవారు, (పెద్ద పెద్ద ప్రాణులను సైతము గుటుక్కున మ్రింగి వేయుగల) విశాలములైన నోళ్లుగలవారు, మిగుల పరాక్రమవంతులు. అట్టి మనరాక్షసయోధులను నానావిధములగు వాహనములపైనను, వివిధములగు ఆయుధములతోడను యుద్ధమునకై సన్నద్ధులను గావింపుము (8-10)

ఉపస్థాపయ మే క్షిప్రం రథం సౌమ్య! ధనూంషి చ।
శరాంశ్చిత్రాంశ్చ ఖడ్గాంశ్చ శక్తీశ్చ వివిధాః శితాః। 11

ఓ సౌమ్యుడా! వెంటనే నా రథమును సిద్ధపఱచుము. మఱియు ధనుస్సులను, వాడియైన బాణములను, చిత్రవిచిత్రములైన ఖడ్గములను, బల్లెములను, ఇంకను వివిధములగు ఇతరాయుధములను అందుచేర్చుము- (11)

అగ్రే నిర్యాతుమిచ్ఛామి పౌలస్త్యానాం మహాత్మనామ్।
వధార్థం దుర్వినీతస్య రామస్య రణకోవిదః। 12

యుద్ధవిద్యలలో ఆరితేఱిన నేను దుష్టుడైన ఆ రాముని తుదముట్టించుటకై, మిగుల బలవంతులు (దృఢగాత్రులు) పులస్త్యవంశమునకు చెందినవారు ఐన యోధులకు ముందుభాగమున నిల్చి, యుద్ధమునకు వెళ్లదలచుచున్నాను.(1) (12)

ఇతి తస్య బ్రువాణస్య సూర్యవర్ణం మహారథమ్।
సదశ్వైశ్శబలైర్యుక్తమ్ ఆచచక్షేఽథ దూషణః। 13

ఖరాసురుడు ఈ విధముగా పలికిన పిమ్మట దూషణుడు "అయ్యా! సూర్యునివలె ప్రకాశించుచున్న రథమునకు రంగురంగుల గుఱ్ఱములను పూన్చితిని. అది మీకొఱకు సిద్ధముగా ఉన్నది" అని తెలిపెను. (13)

తం మేరుశిఖరాకారం తప్తకాంచనభూషణమ్।
హేమచక్ర మసంబాధం వైడూర్యమయకూబరమ్। 14

మత్స్యైః పుష్పైర్ద్రుమైశ్శైలైః చంద్రసూర్యైశ్చ కాంచనైః।
మంగళైః పక్షిసంఘైశ్చ తారాభిరభిసంవృతమ్। 15

ధ్వజనిస్త్రింశసంపన్నం కింకిణీకవిరాజితమ్।
సదశ్వయుక్తం సోఽమర్షాత్ ఆరురోహ ఖరో రథమ్। 16

ఆ రథము మేరుశిఖరమువలె ఉన్నతమైన ఆకారము కలిగియుండెను. మేలిమి బంగారముతో అలంకరింపబడియుండెను దానిచక్రములు బంగారముతో నిర్మింపబడినవి. అది మిగుల విశాలమైనది. దాని నొగలునందు వైడూర్యములు పొదగబడినవి. ఆ రథమున చేపలు, పూవులు, చెట్లు, కొండలు, సూర్య చంద్రులు, పక్షులగుంపులు, చుక్కలు మొదలగునవి, బంగారముతో చెక్కబడి, మంగళకరములై కనువిందు గావించుచుండెను. అందు ఖడ్గములు మున్నగు ఆయుధములు భద్రపఱచబడినవి. చక్కగా రవళించు గంటలు, మువ్వలు, ఆ రథమునకు అమర్చబడినవి. దానికి జాతిగుఱ్ఱములు పూన్చబడినవి. దానిపై ధ్వజపతాకములు శోభిల్లుచుండెను. అట్టి రథమును ఆ ఖరాసురుడు యుద్ధావేశముతో అధిరోహించెను. (14-16)

విశామ్య తు రథస్థం తం రాక్షసా భీమవిక్రమాః।
తస్థుః సంపరివార్యైనం దూషణం చ మహాబలమ్। 17

అంతట మిగుల పరాక్రమశాలురైన రాక్షసయోధులు ఖరుడు రథమున ఆసీనుడగుటను గమనించిరి. పిమ్మట వారు ఆ రథమునకును, మహాబలశాలియైన దూషణునకును చుట్టును జేరినిలిచిరి. (17)

ఖరస్తు తాన్ మహేష్వాసాన్ ఘోరవర్మాయుధధ్వజాన్।
నిర్యాతేత్యబ్రవీద్ధృష్టో రథస్థః సర్వరాక్షసాన్। 18

ఖరునియుద్ధసన్నద్ధతను గమనించిన రాక్షసయోధులందఱును గొప్పధనుర్బాణములను, దృఢమైన కవచములను, నిశితములైన ఆయుధములను, ధ్వజములను ధరించి, అక్కడ చేరగా రథమునందు ఆసీనుడైయున్న ఆ రాక్షసుడు 'యుద్ధమునకు బయలుదేఱుడు' అని వారికి ఆజ్ఞలనిచ్చెను. (18)

1) ఖరునినోట వెలువడిన ఈమాటలలో దైవికముగా బాధకథాసూచకములైన విషయములు గోచరించుచున్నవి. రణకౌశలముగల నేను మహాకాయులు, పులస్త్యవంశజులు ఐన రావణాది రాక్షసయోధులవధార్థము అసహాయశూరుడైన రాముని యెదుట నిలబడుటకై వెళ్లగోరుచున్నాను. (రాముని చేతిలో మడియుటకై ముందుగా వెళ్లదలంచుచున్నాను.)

తతస్తద్రాక్షసం సైన్యం ఘోరవర్మాయుధధ్వజమ్।
నిర్జగామ జనస్థానాత్ మహానాదం మహాజవమ్। 19

ఆ రాక్షససైనికులు ధరించిన కవచములు, ఆయుధములు, ధ్వజపతాకములు శత్రుభయంకరములై యుండెను. ఖరునిఆజ్ఞయైన వెంటనే ఆ సైన్యము రణోత్సాహముతో మహానాదములనొనర్చుచు జనస్థానమునుండి మిగుల వేగముగా బయలుదేఱెను. (19)

ముద్గరైః పట్టిసైః శూలైః సుతీక్ష్ణైశ్చ పరశ్వధైః।
ఖడ్గైశ్చక్రైశ్చ హస్తస్థైః భ్రాజమానైశ్చ తోమరైః। 20

శక్తిభిః పరిఘైర్ఘోరైః అతిమాత్రైశ్చ కార్ముకైః।
గదాసిముసలైర్వజ్రైః గృహీతైర్భీమదర్శనైః। 21

రాక్షసానాం సుఘోరాణాం సహస్రాణి చతుర్దశ।
నిర్యాతాని జనస్థానాత్ ఖరచిత్తానువర్తినామ్। 22

శత్రుభయంకరులైన పదునాలుగువేలమంది రాక్షస యోధులు ఇనుపగుదియలను, అడ్డకత్తులను, శూలములను, వాడియైన గండ్రగొడ్డళ్లను, ఖడ్గములను, చక్రములను చేతబట్టిరి. ఇంకను వారు మెఱయుచున్న చిన్నచిన్న ఈటెలను, బల్లెములను, భయముగొల్పునట్టి ముండ్లగదలను, గొప్ప గొప్ప ధనుస్సులను, వివిధములగు గదలను, నానావిధములగు ఖడ్గములను, ఇనుపపొన్నులుగల రోకళ్లను, వజ్రాయుధములను (ఎనిమిది అంచులుగల ఆయుధములను) ధరించియుండిరి. వారందఱును ఖరుని ఆదేశములను పాటించుచు జనస్థానమునుండి ముందునకు సాగిపోవుచుండిరి. (20-22)

తాం స్త్వభిద్రవతో దృష్ట్వా రాక్షసాన్ భీమవిక్రమాన్।
ఖరస్యాపి రథః కించిత్ జగామ తదనంతరమ్। 23

శత్రువులకు భయమును గొల్పునట్టి పరాక్రమశాలురైన ఆ రాక్షసవీరులు రణోత్సాహముతో అగ్రభాగమున పరుగులు దీయుచుండగా జూచి, ఖరుని రథము (ఖరుడు) గూడ వారికి వెనుక (భాగమున) తిన్నగా సాగిపోవుచుండెను. (23)

తతస్తాన్ శబలానశ్వాన్ తప్తకాంచనభూషితాన్।
ఖరస్య మతిమాజ్ఞాయ సారథిః సమచోదయత్। 24

అంతట సారథి బంగారుఆభరణములచే అలంకరింపబడిన ఆ రంగురంగుల రథాశ్వములను యుద్ధయాత్రకై ఖరుని ఆదేశానుసారము అదలించుచుండెను. (నడిపించుచుండెను) (24)

స చోదితో రథః శీఘ్రం ఖరస్య రిపుఘాతినః।
శబ్దేనాపూరయామాస దిశశ్చ ప్రదిశస్తదా। 25

శత్రుసంహారకుడైన ఖరునియొక్క ఆ రథము అట్లు వేగముగా ముందునకు సాగుచుండగా దాని చక్రధ్వనులు దశదిశలయందు మాఱుమ్రోగుచుండెను. (25)

ప్రవృద్ధమన్యుస్తు ఖరః ఖరస్వనో
రిపోర్వధార్థం త్వరితో యథాఽంతకః।
అచూచుదత్ సారథిమున్నదన్ ఘనం
మహాబలో మేఘ ఇవాశ్మవర్షవాన్। 26

శత్రువును వధించుటకై తహతహపడుచున్న ఖరునిలో క్రోధము ఇనుమడించుచుండెను. అతడు మృత్యుదేవత (యముని) వలె భయంకరుడై యుండెను. పెనుగాలులతో వడగళ్లవర్షమును కురియుచు గర్జించుచున్న మేఘమువలె ఖరుడు తీవ్రమైన కంఠస్వరముతో రథసారథిని ప్రేరేపించుచుండెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ద్వావింశస్సర్గః (22)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదిరెండవసర్గము.

-- * * * --

23. ఇరువదిమూడవసర్గము

అపశకునములు ఎన్ని ఎదురైనప్పటికిని ఖరుడు వాటిని సరకుగొనక ప్రగల్భములను పలుకుచు సైన్యముతో ముందునకు సాగుట - రామలక్ష్మణులను సమీపించుట.

తస్మిన్ యాతే జనస్థానాత్ అశివం శోణితోదకమ్।
అభ్యవర్షన్మహామేఘః తుములో గర్దభారుణః। 1

ఆ రాక్షససైన్యము జనస్థానమునుండి బయలుదేఱి వెళ్లుచుండగా గాడిదవలె బూడిదరంగులో దట్టముగానున్న మేఘములు అశుభసూచకముగా రక్తధారలను వర్షించెను. (1)

నిపేతుస్తురగాస్తస్య రథయుక్తా మహాజవాః।
సమే పుష్పచితే దేశే రాజమార్గే యదృచ్ఛయా। 2

ఆ ఖరునిరథమునకు పూన్చబడిన గుఱ్ఱములు వేగముగా సాగిపోవుచు పూవులతో నిండి, చదునుగా నున్న రాజమార్గమునందు ఆకస్మికముగా (దైవికముగా) తొట్రుపాటునకు గుఱియైనవి. (2)

శ్యామం రుధిరపర్యంతం బభూవ పరివేషణమ్।
అలాతచక్రప్రతిమం పరిగృహ్య దివాకరమ్। 3

శ్యామవర్ణముగల ఆకాశమునందు సూర్యునిచుట్టును ఎఱ్ఱనిరంగులో ఒకపరివేషము (కాంతివలయము) ఏర్పడెను. అది అలాతచక్రము (కొఱవిని త్రిప్పగా ఏర్పడు చక్రము) వలె కన్పట్టుచుండెను. (3)

తతో ధ్వజముపాగమ్య హేమదండం సముచ్ఛ్రితమ్।
సమాక్రమ్య మహాకాయః తస్థౌ గృధ్రః సుదారుణః। 4

అనంతరము ఖరునిరథముపైభాగమున బంగారు దండముగల ఎత్తైన పతాకమును ఒక గ్రద్ద సమీపించెను. అది దృఢమైన కాయము (శరీరము) గలిగి, భయంకరముగా నుండెను. ఆ గ్రద్ద పతాకము చుట్టును తిరిగి దానిపై నిలిచెను. (4)

జనస్థానసమీపే తు సమాగమ్య ఖరస్వనాః।
విస్వరాన్ వివిధాం శ్చక్రుః మాంసాదా మృగపక్షిణః। 5

మాంసమును భక్షించునవియు, కర్ణకఠోరముగా అఱచునట్టివియు అగు క్రూరమృగములును, పక్షులును ఆ జనస్థానమును సమీపించి నానావిధములుగా వికృతస్వరములను గావించెను. (5)

వ్యాజహ్రుశ్చ ప్రదీప్తాయాం దిశి వై భైరవస్వనమ్।
అశివం యాతుధానానాం శివా ఘోరా మహాస్వనాః। 6

సూర్యుడు ప్రకాశించుచున్న (పగటి) సమయమున వికృతస్వరములతో (కూతలతో) భీతిగొల్పుచు నక్కలు, రాక్షసులకు అమంగళమును సూచించుచు కర్ణకఠోరముగా కూసినవి. (6)

ప్రభిన్నగిరిసంకాశాః తోయశోణితధారిణః।
ఆకాశం తదనాకాశం చక్రుః భీమా వలాహకాః। 7

ఱెక్కలుతెగిన (ఇంద్రునివజ్రాయుధముచే ఱెక్కలు ఖండింపబడగా రక్తసిక్తములైయున్న) పర్వతములవలె ఒప్పుచు, ఎఱ్ఱనిజలములు కలిగియున్న మహామేఘములు ఆకాశమును పూర్తిగా కప్పివేసినవి. (7)

బభూవ తిమిరం ఘోరమ్ ఉద్ధతం రోమహర్షణమ్।
దిశో వా విదిశో వాపి న చ వ్యక్తం చకాశిరే। 8

మేఘములు ఆకాశమును కప్పివేయుటచే సూర్యరశ్మిసోకక, గగుర్పాటు గల్గించుచు (కన్నుపొడుచుకొనినను కానరానంతగా) అన్ని దిక్కులయందును చిమ్మచీకట్లు క్రమ్ముకొనెను. అందువలన దిక్కుతోచని పరిస్థితి ఏర్పడెను. (8)

క్షతజార్ద్రసవర్ణాభా సంధ్యా కాలం వినా బభౌ।

సహజముగా అది సంధ్యాకాలము కానప్పటికిని, ఆకాశమున మబ్బులు పట్టియుండుటచే రక్తము పులుముకొనిన రీతిగా ఎఱ్ఱనికాంతులు అంతటను

ఖరస్యాభిముఖా నేదుః తదా ఘోరమృగాః ఖగాః।
కంకగోమాయుగృధ్రాశ్చ చుక్రుశుర్భయశంసినః। 9

వ్యాపించియున్న కారణముగా అదినిజముగా సంధ్యాసమయమా అనునట్లు తోచుచుండెను. అప్పుడు దుష్టములైన మృగములు, పక్షులు ఖరుని రథమునకు ముందు భాగమున జేరి బిగ్గఱగా అఱచినవి. రాబందులు, నక్కలు, గ్రద్దలు భయమును సూచించుచు గోలపెట్టినవి. (9)

నిత్యాఽశుభకరా యుద్ధే శివా ఘోరనిదర్శనాః।
నేదుర్బలస్యాభిముఖం జ్వాలోద్గారిభిరాననైః। 10

నక్కలకూతలు యుద్ధవిషయమున అశుభసూచకములు. అవి త్వరలో సంభవించెడి అపజయములను తెలుపు చుండును. అట్టి నక్కలు నిప్పులు గ్రక్కుచున్న ముఖములతో ఖరునిసేనలకు అభిముఖముగా చేరి భీకరముగా కూసినవి. (10)

కబంధః పరిఘాభాసో దృశ్యతే భాస్కరాంతికే।
జగ్రాహ సూర్యం స్వర్భానుః అపర్వణి మహాగ్రహః। 11

సూర్యునిసమీపమున పరిఘ (ఇనుపగుదియ) ఆకారమున కబంధమువలెనున్న మేఘఖండము కన్పట్టుచుండెను. గొప్ప గ్రహమైన రాహువు అపర్వణియందు (పర్వదినముగాని సమయమున) సూర్యుని పట్టుకొనెను.(1) (11)

ప్రవాతి మారుతశ్శీఘ్రం నిష్ప్రభోఽభూద్దివాకరః।
ఉత్పేతుశ్చ వినా రాత్రిం తారాః ఖద్యోతసప్రభాః। 12

ప్రతికూలవాయువులు (పెనుగాలులు) తీవ్రముగా వీచెను. సూర్యకాంతులు వెలవెలబోయెను. (సూర్యకాంతులను కప్పివేయునంతగా ధూళితో గూడిన పెనుగాలులు వీచెను) మిణుగురుపురుగులవలె మినుకు మినుకుమనుచు నక్షత్రములు పగటిపూటయుండే ఆకాశమున తోచెను. (12)

సంలీనమీనవిహగా నళిన్యః శుష్కపంకజాః।
తస్మిన్ క్షణే బభూవుశ్చ వినా పుష్పఫలైర్ద్రుమాః। 13

తామరకొలనులలోని చేపలు, జలపక్షులు అడుగు భాగమునకు చేరినవి. కమలములు వాడిపోయినవి. ఆక్షణమున పూవులు, కాయలు, ఆకులు రాలిపోయి, చెట్లు మోడువారియున్నవి. (13)

ఉద్ధూతశ్చ వినా వాతం రేణుర్జలధరారుణః।
చీచీ కూచీతి వాశ్యంత్యో బభూవుస్తత్ర శారికాః। 14

మేఘములవలె ధూసరవర్ణము (బూడిదరంగు) గల ధూళులు గాలిలేకుండగనే పైకెగసినవి. (దుమ్ములు పైకెగసి ఆకాశమును కప్పివేసినవి) అచటి గోరువంకలు కిచకిచమనుచు కూయసాగెను. (14)

ఉల్కాశ్చాపి సనిర్ఘాతా నిపేతుర్ఘోరదర్శనాః।
ప్రచచాల మహీ సర్వా సశైలవనకాననా। 15

ఉల్కలు (తోకచుక్కలు) చూచెడివారిని భీతిల్లజేయుచు భయంకర పక్షులవలె రొదచేయుచు ఆకాశమునుండి నేలపై రాలెను. కొండలతో, కోనలతో, అడవులతో గూడిన సమస్తభూమియు ఒక్కసారిగా కంపించెను. (15)

1) కబంధః = తలలేని మొండెము, ధూమకేతువు.
సాధారణముగా పర్వణి (పర్వ) కాలమున సూర్యచంద్రగ్రహణములు ఏర్పడుచుండును. అనగా అమావాస్యనాడు పగటిసమయమున సూర్యగ్రహణము, పూర్ణిమనాడు రాత్రియందు చంద్రగ్రహణము సంభవించుచుండును. కాని అశుభసూచకముగా ఒక్కొక్కప్పుడు అపర్వణికాలమునను (పాడ్యమితోగూడిన పూర్ణిమనాడు లేదా పాడ్యమితో గూడిన అమావాస్యనాడు) చంద్ర సూర్య గ్రహణములు వచ్చుచుండును.

ఖరస్య చ రథస్థస్య నర్దమానస్య ధీమతః।
ప్రాకంపత భుజః సవ్యః స్వరశ్చాస్యావసజ్జత। 16

సాస్రా సంపద్యతే దృష్టిః పశ్యమానస్య సర్వతః।
లలాటే చ రుజాజాతా నచ మోహాన్న్యవర్తత। 17

తాన్ సమీక్ష్య మహోత్పాతాన్ ఉత్థితాన్ రోమహర్షణాన్।
అబ్రవీద్రాక్షసాన్ సర్వాన్ ప్రహసన్ స ఖరస్తదా। 18

మహోత్పాతాన్ ఇమాన్ సర్వాన్ ఉత్థితాన్ ఘోరదర్శనాన్।
న చింతయామ్యహం వీర్యాత్ బలవాన్ దుర్బలానివ। 19

తారా అపి శరైస్తీక్ష్ణైః పాతయామి నభఃస్థలాత్।
మృత్యుం మరణధర్మేణ సంక్రుద్ధో యోజయామ్యహమ్। 20

రాఘవం తం బలోత్సిక్తం భ్రాతరం చాస్య లక్ష్మణమ్।
అహత్వా సాయకైస్తీక్ష్ణైః నోపావర్తితుముత్సహే। 21

సకామా భగినీ మేఽస్తు పీత్వా తు రుధిరం తయోః।
యన్నిమిత్తస్తు రామస్య లక్ష్మణస్య విపర్యయః। 22

న క్వచిత్ ప్రాప్తపూర్వో మే సంయుగేషు పరాజయః।
యుష్మాకమేతత్ ప్రత్యక్షం నానృతం కథయామ్యహమ్। 23

దేవరాజమపి క్రుద్ధో మత్తైరావతయాయినమ్।
వజ్రహస్తం రణే హన్యాం కిం పునస్తౌ కుమానుషౌ। 24

రథమున ఆసీనుడై గట్టిగా అఱచుచున్న ప్రతిభాశాలియగు ఖరునియొక్క ఎడమభుజము అదరెను. అతనికి గొంతు పెగలకుండెను. మాటలు తడబడుచుండెను. అతడు అన్ని వైపుల పరికించి చూచుచుండగా కన్నుల నీరుగ్రమ్మెను. నొసట బాధయేర్పడెను. ఐనను మూర్ఖుడైన అతడు యుద్ధయాత్రనుండి వెనుదిరగలేదు. (16-17)

భీతిని గొలుపుచు వరుసగా చెలరేగిన ఆ మహోత్పాతములను జూచినంతనే ఖరుడు గర్వముతో నవ్వుచు రాక్షసవీరులనందఱిని ఉద్దేశించి ఇట్లనెను. (18)

"బలవంతుడు దుర్బలశత్రువులను కొంచెముగూడ లెక్కసేయడు. అట్లే ఈ సందర్భమున మనకు వరంపరగా వచ్చిపడిన మహోత్పాతములు ఎంతగా భయమును గొల్పునవి యైనను ధైర్యశాలినైన నేను వాటిని ఏమాత్రము సరకుగొనను. (19)

నేను తలచుకొన్నచో ఆకాశమునందలి నక్షత్రములను సైతము నా వాడిబాణములచే రాలగొట్టెదను. నాకే కోపము వచ్చినచో మృత్యుదేవతనుగూడ మట్టిగలిపింతును. (20)

బలగర్వితుడైన రాముని, అతనితమ్ముడైన లక్ష్మణుని తీవ్రములైన నా బాణములచే మట్టుపెట్టక తిరిగిరాను (తిరిగి వచ్చుటకు ఇచ్చగింపను)[1] (21)

శూర్పణఖను అవమానించిన కారణముగా రణరంగమున రామలక్ష్మణులు మడియుట తథ్యము. ఆ విధముగా నా సోదరికోరిక నెఱవేఱితీరును. అప్పుడు శూర్పణఖ ఆ యిరువురిరక్తములను కడుపార త్రాగగలదు. (22)

నేనొనర్చిన అన్ని యుద్ధములలోను 'పరాజయము' అనుమాటనే యెఱుగను. దానిని (నా జయశక్తిని) మీరు ఇప్పుడు (ఈ సమరమున) ప్రత్యక్షముగా చూడగలరు- నా మాటలు కల్లలుగావు. (23)

మదించిన ఐరావతమును వాహనముగా గలవాడైనను, తిరుగులేని వజ్రాయుధమును తన శస్త్రముగా ధరించియున్నను ఆ దేవేంద్రుని సైతము నేను కుపితుడనైనచో రణరంగమున తుదముట్టింపగలను. ఇక మానవమాత్రులైన రామలక్ష్మణులు[2] నాకు ఒక లెక్కయా?" (24)

1) ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు అను ముగ్గురును పూర్వజన్మలో యాజ్ఞవల్క్యమహర్షిసుతులు. వారు పరమశివుని ఆగ్రహమునకు గుఱియై శపింపబడిరి. ఆ కారణముగా వారు ఖరదూషణత్రిశిరులు అను రాక్షసులై పుట్టిరి. 'శ్రీరాముని చేతిలో మృతులైన పిమ్మట మీకు శాపవిముక్తి లభించును' అని శంకరుడు ఆనాడు వీరిని అనుగ్రహించియుండెను. ఆ కారణమున శ్రీరాముడు మహావీరుడు అని తెలిసియు, దుర్నిమిత్తములు ఎన్ని ఎదురైనను తమకు శాపవిముక్తి కలుగుటకై వారు శ్రీరామునిచేతిలో మడియుటకే ముందునకు సాగిరి- తత్త్వ దీపిక.
2) కుమానుషౌ = కౌ = భూమౌ మనుష్యరూపేణ అవతీర్ణౌ - దుష్టశిక్షణ శిష్టరక్షణ కావించుటకై భూమండలమున మానవరూపమున అవతరించిన దివ్యపురుషులు-

సా తస్య గర్జితం శ్రుత్వా రాక్షసస్య మహాచమూః।
ప్రహర్షమతులం లేభే మృత్యుపాశావపాశితా। 25

సమీయుశ్చ మహాత్మానో యుద్ధదర్శనకాంక్షిణః।
ఋషయో దేవగంధర్వాః సిద్ధాశ్చ సహ చారణైః। 26

సమేత్యోచుః సహితాః తేఽన్యోన్యం పుణ్యకర్మణః। 27

స్వస్తి గోబ్రాహ్మణేభ్యోఽస్తు లోకానాం యేఽభిసంగతాః।
జయతాం రాఘవస్సంఖ్యే పౌలస్త్యాన్ రజనీచరాన్। 28

చక్రహస్తో యథా యుద్ధే సర్వాన్ అసురపుంగవాన్।
ఏతచ్చాన్యచ్చ బహుశో బ్రువాణాః పరమర్షయః। 29

జాతకౌతూహలాస్తత్ర విమానస్థాశ్చ దేవతాః।
దదృశుర్వాహినీం తేషాం రాక్షసానాం గతాయుషామ్। 30

రథేన తు ఖరో వేగాత్ ఉగ్రసైన్యో వినిస్సృతః।
తం దృష్ట్వా రాక్షసం భూయో రాక్షసాశ్చ వినిస్సృతాః। 31

శ్యేనగామీ పృథుగ్రీవో యజ్ఞశత్రుర్విహంగమః।
దుర్జయః కరవీరాక్షః పరుషః కాలకార్ముకః। 32

మేఘమాలీ మహామాలీ సర్పాస్యో రుధిరాశనః।
ద్వాదశైతే మహావీర్యాః ప్రతస్థురభితః ఖరమ్। 33

మహాకపాలః స్థూలాక్షః ప్రమాథీ త్రిశిరాస్తథా।
చత్వార ఏతే సేనాన్యో దూషణం పృష్ఠతో యయుః। 34

సా భీమవేగా సమరాభికామా
మహాబలా రాక్షసవీరసేనా।
తౌ రాజపుత్రౌ సహసాఽభ్యుపేతా
మాలా గ్రహాణామివ చంద్రసూర్యౌ। 35

మృత్యుపాశములచే బంధింపబడి (చావుమూడి) యుండుటవలన ఆ రాక్షసయోధులందఱును ఖరుని గర్జనమును (ప్రగల్భవచనములను) విని సంతోషముతో మిగుల పొంగిపోయిరి. (25)

మహాత్ములైన ఋషులును, దేవతలును, గంధర్వులును, సిద్ధచారణులును ఆయుద్ధమును చూడగోరినవారై అచటికి చేరిరి. అప్పుడు ఆ పుణ్యాత్ములు (పుణ్యకర్ములు) ఒకరికొకరు చేరువగా చేరి, పరస్పరము ఇట్లు సంభాషించుకొనిరి. (26-27)

"పూజ్యములైన గోమాతలకును, బ్రాహ్మణోత్తములకును, లోకకల్యాణకాంక్షగల తదితరసాధుపుంగవులకును శుభమగుగాక - చక్రధారియైన శ్రీమహావిష్ణువు సమరభూమియందు రాక్షసలోకమును హతమార్చినట్లు శ్రీరాముడు పౌలస్త్యవంశజులైన ఈ రాక్షసులనందఱిని తునుమాడి జయమును పొందుగాక." (28-29)

ఆకాశమునందు విమానములలో నున్న దేవతలును, మహర్షులును ఈ యుద్ధమునందును, రాబోవు సంగ్రామములయందును శ్రీరామునివిజయవిశేషములను మిగుల కుతూహలముతో పలువిధముల చర్చించుకొనుచు రణరంగమున మూడియున్న ఆ రాక్షససేనను పరికించిచూచిరి. (30)

మహాసైన్యముతోగూడిన ఖరుడు రథముపై వేగముగా ముందునకుసాగెను. అతనిని జూచి, వెంటనే ఆ రాక్షసయోధులందఱును ఆయనను అనుసరించిరి. (31)

శ్యేనగామి, పృథుగ్రీవుడు, యజ్ఞశత్రువు, విహంగముడు, దుర్జయుడు, కరవీరాక్షుడు, పరుషుడు, కాలకార్ముకుడు, మేఘమాలి, మహామాలి, సర్పాస్యుడు, రుధిరాశనుడు అను పండ్రెండుమంది మహావీరులును ఖరునిరథమునకు చుట్టును నిలిచి పయనించుచుండిరి. అట్లే మహాకపాలుడు, స్థూలాక్షుడు, ప్రమాథి, త్రిశిరుడు అను నలుగురు సేనాపతులును దూషణుని వెంట సాగిపోవుచుండిరి. (32-34)

అంగారకాది గ్రహములసమూహము సూర్యచంద్రులనువలె మిగుల బలోపేతమైన ఆ రాక్షసవీరసేన సమరోత్సాహముతో మిక్కిలి వేగముగా రాజకుమారులైన ఆ రామలక్ష్మణులను సమీపించెను. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే త్రయోవింశస్సర్గః *(23)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదిమూడవసర్గము.

-- ❋ ❋ ❋ --

24. ఇరువదినాల్గవసర్గము

అప్పుడేర్పడిన అపశకునములను బట్టి రాక్షసులకు వినాశము, తమకు విజయము తథ్యమని శ్రీరాముడు లక్ష్మణునకు తెలుపుట - అన్న ఆదేశముతో లక్ష్మణుడు సీతాదేవిని దీసికొని ఒక పర్వత గుహనుజేరుట- శ్రీరాముడు యుద్ధ సన్నద్ధుడగుట.

ఆశ్రమం ప్రతియాతే తు ఖరే ఖరపరాక్రమే।
తానేవౌత్పాతికాన్ రామః సహ భ్రాత్రా దదర్శ హ॥ 1

తానుత్పాతాన్ మహాఘోరాన్ ఉత్థితాన్ రోమహర్షణాన్।
ప్రజానామ్ అహితాన్ దృష్ట్వా వాక్యం లక్ష్మణమబ్రవీత్॥ 2

ఇమాన్ పశ్య మహాబాహో! సర్వభూతాపహారిణః।
సముత్థితాన్ మహోత్పాతాన్ సంహర్తుం సర్వరాక్షసాన్॥ 3

అమీ రుధిరధారాస్తు విసృజంతః ఖరస్వనాః।
వ్యోమ్ని మేఘా వివర్తంతే పరుషా గర్దభారుణాః॥ 4

సధూమాశ్చ శరాః సర్వే మమ యుద్ధాభినందినః।
రుక్మపృష్ఠాని చాపాని వివేష్టంతే చ లక్ష్మణ!॥ 5

యాదృశా ఇహ కూజంతి పక్షిణో వనచారిణః।
అగ్రతో నో భయం ప్రాప్తం సంశయో జీవితస్య చ॥ 6

సంప్రహారస్తు సుమహాన్ భవిష్యతి న సంశయః।
అయమాఖ్యాతి మే బాహుః స్ఫురమాణో ముహుర్ముహుః।
సన్నికర్షే తు నః శూర! జయం శత్రోః పరాజయమ్॥ 7

సప్రభం చ ప్రసన్నం చ తవ వక్త్రం హి లక్ష్యతే।
ఉద్యతానాం హి యుద్ధార్థం యేషాం భవతి లక్ష్మణ!॥ 8

నిష్ప్రభం వదనం తేషాం భవత్యాయుపరిక్షయః॥ 9

రక్షసాం నర్దతాం ఘోరః శ్రూయతే చ మహాధ్వనిః।
ఆహతానాం చ భేరీణాం రాక్షసైః క్రూరకర్మభిః॥ 10

మిగుల పరాక్రమశాలియైన ఖరుడు శ్రీరాముని ఆశ్రమమునకు (పంచవటికి) బయలుదేఱిన పిమ్మట ఏర్పడిన ఉత్పాతములను రామలక్ష్మణులును జూచిరి.(1)

ప్రజలకు కీడును సూచించెడి ఆ మహాభయంకరములైన ఉత్పాతములను జూచి, శ్రీరాముడు రాక్షసులకు ఉపద్రవమురానున్నదని తలంచి, లక్ష్మణునితో ఇట్లనెను. (2)

"మహాబాహుడవైన ఓ లక్ష్మణా! సమస్తప్రాణులకును అశుభములను సూచించునట్టి ఈ మహోత్పాతములను పరిశీలింపుము. ఇవి రాక్షససంహారములను తెలుపునట్టి ప్రమాదఘంటికలు. (3)

ఇదిగో! చూడుము, గాడిదలవలె బూడిదరంగుగలిగిన మేఘములు ఆకాశమున సంచరించుచున్నవి. అవి కర్ణకఠోరముగా భీకరగర్జనలను కావించుచు రక్తధారలను వర్షించుచున్నవి (4)

ఓ లక్ష్మణా! నా (మన) బాణములన్నియును సమరోత్సాహముతో ప్రతాపాగ్నిని వెళ్లగ్రక్కుచున్నవి. బంగారుకొనలుగల మనధనుస్సులు యుద్ధమునకు సన్నద్ధమగుచున్నవి. (5)

సౌమిత్రీ! వనములయందు సంచరించుచున్న ఈ పక్షులయొక్క కూజితములు (అఱుపులు) వెంటనే (భవిష్యత్తులో) మనకు ఎట్టిభయమూలేదనియు, శత్రువుల జీవితములు సంశయాస్పదములనియు సూచించుచున్నవి. మనము త్వరలో ఘోరమైన యుద్ధమును జేయవలసియున్నది కాని ఓ శూరా! నాకుడిభుజము పదేపదే అదరుచుండుటనుబట్టి మనకు జయము, శత్రువులకు అపజయము కలుగునని తెలియుచున్నది. లక్ష్మణా! ఉత్సాహముతో వెలుగులను జిమ్ముచు ప్రసన్నముగానున్న నీముఖముగూడ ఈ విషయమునే సూచించుచున్నది. యుద్ధమునకు సిద్ధమగు వారిముఖములు వెలవెలబోవుచున్నచో (తేజోవిహీనమైయున్నచో) వారికి అపజయము, మరణము తప్పవు. (6-9)

లక్ష్మణా! క్రూరకర్ములైన రాక్షసులయొక్క ఘోరములగు అఱుపులు, వారు మ్రోగించుచున్న భేరీల యొక్క భయంకరధ్వనులు ఇచటికి వినబడుచున్నవి, ఆలకింపుము. (10)

అనాగతవిధానం తు కర్తవ్యం శుభమిచ్ఛతా।
ఆపదం శంకమానేన పురుషేణ విపశ్చితా। 11

తస్మాద్గృహీత్వా వైదేహీం శరపాణిర్ధనుర్ధరః।
గుహామాశ్రయ శైలస్య దుర్గాం పాదపసంకులామ్। 12

ప్రతికూలితుమిచ్ఛామి న హి వాక్యమిదం త్వయా।
శాపితో మమ పాదాభ్యాం గమ్యతాం వత్స! మా చిరమ్। 13

త్వం హి శూరశ్చ బలవాన్ హన్యా హ్యేతాన్ న సంశయః।
స్వయం తు హంతుమిచ్ఛామి సర్వానేవ నిశాచరాన్। 14

ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః సహ సీతయా।
శరానాదాయ చాపం చ గుహాం దుర్గాం సమాశ్రయత్। 15

తస్మిన్ ప్రవిష్టే తు గుహాం లక్ష్మణే సహ సీతయా।
హంత! నిర్యుక్తమిత్యుక్త్వా రామః కవచమావిశత్। 16

స తేనాగ్నినికాశేన కవచేన విభూషితః।
బభూవ రామస్తిమిరే విధూమోఽగ్నిరివోత్థితః। 17

స చాపముద్యమ్య మహత్ శరానాదాయ వీర్యవాన్।
బభూవావస్థితస్తత్ర జ్యాస్వనైః పూరయన్ దిశః। 18

తతో దేవాః సగంధర్వాః సిద్ధాశ్చ సహ చారణైః।
సమేయుశ్చ మహాత్మానో యుద్ధదర్శనకాంక్షిణః। 19

ఋషయశ్చ మహాత్మానో లోకే బ్రహ్మర్షిసత్తమాః।
సమేత్య చోచుః సహితా అన్యోఽన్యం పుణ్యకర్మణః। 20

స్వస్తి గోబ్రాహ్మణేభ్యోఽస్తు లోకానాం యేఽభిసంగతాః।
జయతాం రాఘవో యుద్ధే పౌలస్త్యాన్ రజనీచరాన్। 21

శుభములను కోరుకొనెడి దూరదర్శియైన (తెలివిగల) పురుషుడు తనకెదురగు ఆపదలను ఊహించుచు రాబోవు అనర్థములకు తగిన ప్రతిక్రియలను చేయవలెను. (ఆలోచింపవలెను) (11)

అందువలన ఓ లక్ష్మణా! నీవు ధనుర్బాణములను చేతబట్టి మీ వదినెయగు సీతాదేవిని తీసికొని, వృక్షములతో నిండిన, దుర్గమమగు ఒక కొండగుహకు వేరుము. అచట ఆమెకు రక్షకుడవై యుండుము. (12)

(అప్పుడు యుద్ధమునకు సిద్ధమగుచున్న లక్ష్మణుని జూచి.) శ్రీరాముడు "నాయనా నీవు నా మాటలను కాదనవలదు. నా పాదములనంటి ఒట్టుపెట్టుకొనుము. సీతాదేవితోగూడి వెంటనే వెళ్లుము. (13)

సోదరా! నీవు శూరుడవు, మిగుల బలశాలివి. ఈ రాక్షసులమూకలను నీవే తుదముట్టింపగలవు. అందు సందేహములేదు. కాని ఈ నిశాచరులనందఱిని నేనే చంపగోరుచున్నాను." (14)

శ్రీరాముడట్లు ఆదేశించిన వెంటనే లక్ష్మణుడు ధనుర్బాణములను దీసికొని, వదినెయగు సీతాదేవితో గూడి, దుర్గమమైన (చొఱరాని) ఒక గుహకు చేరెను. (15)

సీతాసహితను దీసికొని లక్ష్మణుడు గుహకు వెళ్లగానే శ్రీరాముడు భళీ! అని తృప్తిపడుచు, దృఢనిశ్చయము మొనర్చుకొని, కవచమును ధరించెను. అగ్నికాంతులను విరజిమ్ముచున్న కవచమును ధరించిన ఆరాముడు చీకటిలో పొగలేని అగ్నివలె విరాజిల్లెను. (16-17)

పిమ్మట ఆ మహావీరుడు వింటిని దీసికొని, వాడియైన తనబాణములను చేతబట్టెను. తరువాత అతడు దశదిశలయందును ధనుష్టంకారములను నింపుచు స్థిరముగా నిలిచెను. (18)

అంతట దేవతలు, గంధర్వులు, సిద్ధులు, చారణులు, తదితరమహాత్ములు యుద్ధమును జూడవలెననెడి కుతూహలముతో అచటికి చేరిరి. పుణ్యకర్ములు, మహాత్ములు ఐన ఋషులును, భృగుమహర్షి మొదలగు మహామహులును అచటికి చేరి, పరస్పరము సంభాషించుకొనసాగిరి. (19-20)

'పూజ్యములైన గోమాతలకును, బ్రాహ్మణోత్తములకును, లోకకల్యాణకాంక్షగల తదితరసాధుపుంగవులకును శుభమగుగాక. చక్రధారియైన శ్రీమహావిష్ణువు యుద్ధక్షేత్రమున రాక్షసలోకమును హతమార్చినట్లు, శ్రీరాముడు పౌలస్త్యవంశజులైన ఈ రాక్షసులనందఱిని

చక్రహస్తో యథా యుద్ధే సర్వానసురపుంగవాన్।
ఏవముక్త్వా పునః ప్రోచుః ఆలోక్య చ పరస్పరమ్। 22

శత్రువుమాడి జయమును పొందుగాక' ఇట్లు సంభాషించుకొనిన పిమ్మట మునులవారు ఒకరినొకరు చూచుకొనుచు ఈ విధముగా మాట్లాడు కొనసాగిరి. (21-22)

చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్।
ఏకశ్చ రామో ధర్మాత్మా కథం యుద్ధం భవిష్యతి। 23

ఇతి రాజర్షయః సిద్ధాః సగణాశ్చ ద్విజర్షభాః।
జాతకౌతూహలాస్తస్థుః విమానస్థాశ్చ దేవతాః। 24

"అటు అంతులేని దురాగతములకు పాల్పడు రాక్షసయోధులేమో పదునాలుగువేలమంది. ఇటు ధర్మాత్ముడైన శ్రీరాముడుమాత్రము ఒక్కడే. ఇక యుద్ధము జరుగుట యెట్లు?" అనియనుకొనుచు రాజర్షులు, సిద్ధగణములవారు, బ్రాహ్మణోత్తములు, విమానములలో ఉన్న దేవతలు యుద్ధమును దర్శించుటకు మిగుల ఉత్కంఠతలోనుండిరి. (23-24)

ఆవిష్టం తేజసా రామం సంగ్రామశిరసి స్థితమ్।
దృష్ట్వా సర్వాణి భూతాని భయాద్విివ్యథిరే తదా। 25

రూపమప్రతిమం తస్య రామస్యాక్లిష్టకర్మణః।
బభూవ రూపం క్రుద్ధస్య రుద్రస్యేవ పినాకినః। 26

వైష్ణవతేజోవిలసితుడైన శ్రీరాముడు సంగ్రామరంగమున అగ్రభాగమున నిలిచియుండగా జూచి, ఆయనయొక్క పరాక్రమప్రభావములను ఎఱుగని ప్రాణులన్నియును భయముతో మిక్కిలి వ్యథ చెందెను. ఎట్టి మహాకార్యమునైనను సునాయాసముగా చేయుగల శ్రీరామునియొక్క నిరుపమానరూపము సర్వదా ప్రసన్నముగా నుండును. కాని రణభూమియందు నిలిచియున్న ఆయనరూపము జగత్తును లయమొనర్చుటకై 'పినాకము' అను త్రిశూలముతో సిద్ధపడిన ప్రళయకాలరుద్రునిరూపమువలె భయావహమై ఒప్పుచున్నది.[1] (25-26)

ఇతి సంభాష్యమాణే తు దేవగంధర్వచారణైః।
తతో గంభీరనిర్హ్రాదం ఘోరవర్మాయుధధ్వజమ్।
అనీకం యాతుధానానాం సమంతాత్ ప్రత్యదృశ్యత। 27

దేవతలు, గంధర్వులు, చారణులు మొదలగు వారు ఒకరితోనొకరు ఇట్లు మాట్లాడుకొనుచుండగా, అంతటను వ్యాపించియున్న రాక్షసులసేన కనబడెను. అది గంభీరములైన ధ్వనులను కావించుచుండెను. భీకరములైన కవచములను, ఆయుధములను, ధ్వజపతాకములను కలిగియుండెను. (27)

సింహనాదం విసృజతామ్ అన్యోఽన్యమభిగర్జతామ్।
చాపాని విస్ఫారయతాం జృంభతాం చాప్యభీక్ష్ణశః। 28

విప్రఘుష్టస్వనానాం చ దుందుభీంశ్చాపి నిఘ్నతామ్।
తేషాం సుతుములః శబ్దః పూరయామాస తద్వనమ్। 29

ఆ రాక్షససైనికులు సింహనాదములను చేయుచుండిరి. 'శత్రువును నేను చంపుదును, నేను చంపుదును' అని పలుకుచు వారు ముందుకు దూకుచుండిరి. ధనుష్టంకారములను కావించుచుండిరి. ఒడలువిఱువి పిచ్చిగా ఎగురుచుండిరి. గట్టిగాకేకలు వేయుచుండిరి. దుందుభులను మ్రోగించుచుండిరి. రణోత్సాహముతో వెలువడిన రాక్షసులఆకోలాహలధ్వనులతో ఆ వనమంతయు నిండిపోయెను. (28-29)

1) స్కాందపురాణమునందు ఈ ఘట్టమున శ్రీరామునిరూపము ఇట్లు వర్ణింపబడినది.

శ్లో॥ శంఖం చక్రంచ శూలంచ పినాకం ఖేటమేవ చ। ఖట్వాంగం ఘంటాం చ డమరుం బాణపాశాంకుశం తథా।
చాపం వజ్రంచ ఖడ్గంచ పరశుం త్రాసకారణం। జయశ్రియంచ గంగాంచ దదృశుః సిద్ధచారణాః॥

ప్రళయకాలరుద్రతేజోవిలసితుడైన శ్రీరాముడు ధరించిన శంఖచక్రములను, బల్లెమును, 'పినాకము' అను పేరుగల త్రిశూలమును, (పినాకము = శివునిత్రిశూలము, శివునివిల్లు) డాలును, శివధనుస్సును, ఘంటమును, డమరుకమును, బాణములను, పాశమును, అంకుశమును, కోదండమును, వజ్రాయుధమును, ఖడ్గమును అట్లే భయంకరమైన గండ్రగొడ్డలిని, జయలక్ష్మిని, గంగను దర్శించిరి.

తేన శబ్దేన విత్రస్తాః శ్వాపదా వనచారిణః।
దుద్రువుర్యత్ర నిశ్శబ్దం పృష్ఠతో న వ్యలోకయన్। 30

వనములలో సంచరించునట్టి పెద్దపులులు మొదలగు క్రూరమృగములన్నియును ఆ భీకరశబ్దములకు భయపడి, వెనుదిరిగి చూడకుండ నిశ్శబ్దప్రదేశములకు పరుగులు దీసినవి. (30)

తత్త్వనీకం మహావేగం రామం సముపసర్పత।
ధృతనానాప్రహరణం గంభీరం సాగరోపమమ్। 31

క్రమముగా ఆసేన సముద్రమువలె గంభీరుడును, వివిధములగు ఆయుధములను ధరించియున్నవాడును ఐన శ్రీరాముని వేగముగా సమీపించెను. (31)

రామోఽపి చారయన్ చక్షుః సర్వతో రణపండితః।
దదర్శ ఖరసైన్యం తత్ యుద్ధాభిముఖముత్థితమ్। 32

యుద్ధవిద్యలలో ఆరితేరిన శ్రీరాముడు తనచూపులను అంతటను ప్రసరింపజేయుచు యుద్ధమునకు సిద్ధపడి, ఎదురుగా వచ్చుచున్న ఖరునిసైన్యమును చూచెను. (32)

వితత్య చ ధనుర్భీమం తూణ్యోశ్చోద్ధృత్య సాయకాన్।
క్రోధమాహారయత్ తీవ్రం వధార్థం సర్వరక్షసామ్। 33

ఆ రాక్షసులను వధించుటకై, ఆ మహావీరుడు వింటిని ఎక్కుపెట్టి, తూణీరములనుండి బాణములను దీసి క్రుద్ధుడై నిలిచెను. (33)

దుష్ప్రేక్షః సోఽభవత్ క్రుద్ధో యుగాంతాగ్నిరివ జ్వలన్।
తం దృష్ట్వా తేజసావిష్టం ప్రాద్రవన్ వనదేవతాః। 34

క్రుద్ధుడైన శ్రీరాముడు ప్రళయకాలాగ్నివలె తేజరిల్లుచు శత్రువులకు దుర్నిరీక్ష్యుడైయుండెను. మహాతేజస్సుతో గూడిన శ్రీరాముని జూచి, భీతిల్లిన వనదేవతలు పరుగులు దీసిరి. (34)

తస్య క్రుద్ధస్య రూపం తు రామస్య దదృశే తదా।
దక్షస్యేవ క్రతుం హంతుః ఉద్యతస్య పినాకినః। 35

యుద్ధావేశముతో క్రుద్ధుడైయున్న శ్రీరామునిరూపము దక్షునియజ్ఞమును ధ్వంసముచేయుటకు ఉద్యుక్తుడై, త్రిశూలధారియైన రుద్రునిరూపమువలె ఒప్పుచుండెను. (35)

ఆవిష్టం తేజసా రామం సంగ్రామశిరసి స్థితమ్।
దృష్ట్వా సర్వాణి భూతాని భయార్తాని ప్రదుద్రువుః। 36

కదనరంగమునందలి అగ్రభాగమున నిలిచియున్న రామునిలో ఆవేశించియున్న తీవ్రమైన తేజస్సునుగాంచి, ప్రాణులన్నియును భయకంపితములై వేగముగా పరుగెత్తినవి. (36)

తత్కార్ముకై రాభరణైర్ధ్వజై శ్చ
 తైర్వర్మభిశ్చాగ్ని సమానవర్ణైః ।
బభూవ సైన్యం పిశితాశనానాం
 సూర్యోదయే నీలమివాభ్రబృందమ్ । 37

రాక్షసుల యొక్క ఆ సైన్యము ధనుర్బాణములను, ఆభరణములను, ధ్వజపతాకములను, అగ్నివలె మెఱయుచున్న కవచములను ధరించియుండెను. అప్పుడు ఆసేన సూర్యోదయసమయమున నల్లని మేఘ సమూహమువలె విలసిల్లుచుండెను. (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే ఆరణ్యకాండే చతుర్వింశస్సర్గః (24)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదినాల్గవసర్గము.

— * * * —

25. ఇరువదిఐదవసర్గము

రాక్షసయోధులు శ్రీరామునిపై దాడికి దిగుట - ఆ ప్రభువు వారిని హతమార్చుట.

అవష్టబ్ధధనుం రామం క్రుద్ధం చ రిపుఘాతినమ్।
దదర్శాఽఽశ్రమమాగమ్య ఖరస్సహ పురస్సరైః॥ 1

ఖరుడు తనముందుభాగమున నడుచుచున్న యోధులతోగూడి, (రఘువరుని) ఆశ్రమమునకు చేరి, శత్రుసంహారసమర్థుడై, రణావేశములో (క్రుద్ధుడై) ధనుర్ధారియై (కదనరంగమున నిలిచి) యున్న శ్రీరాముని గాంచెను. (1)

తం దృష్ట్వా సశరం చాపమ్ ఉద్యమ్య ఖరనిస్వనమ్।
రామస్యాభిముఖం సూతం చోద్యతామిత్యచోదయత్॥ 2

స ఖరస్యాజ్ఞయా సూతః తురంగాన్ సమచోదయత్।
యత్ర రామో మహాబాహుః ఏకో ధూన్వన్ స్థితో ధనుః॥ 3

అతడు రాముని జూచిన పిదప విల్లంబులను చేబూని, ధనుష్టంకారమొనర్చుచు 'రథమును రామునకు ఎదురుగా పోనిమ్ము' అని సారథిని ఆదేశించెను- ఖరునియాజ్ఞననుసరించి, సూతుడు గుఱ్ఱములను అదలించుచు, మహాబాహువైన శ్రీరాముడు ఒంటరిగా ధనుష్టంకారముగావించుచు నిలిచియున్న ప్రదేశమునకు రథమును నడిపెను. (2-3)

తం తు నిష్పతితం దృష్ట్వా సర్వే తే రజనీచరాః।
నర్దమానా మహానాదం సచివాః పర్యవారయన్॥ 4

స తేషాం యాతుధానానాం మధ్యే రథగతః ఖరః।
బభూవ మధ్యే తారాణాం లోహితాంగ ఇవోదితః॥ 5

సమరసన్నద్ధుడైయున్న ఖరుని గాంచి, శ్యేనగామి మొదలగు రాక్షససచివులు అందఱును బిగ్గఱగా సింహనాదములనొనర్చుచు అతనిచుట్టునుజేరి నిలబడిరి. ఆ రాక్షసులమధ్య రథమునందున్న ఖరుడు ఆకాశమున తారల (చుక్కల) మధ్య ప్రకాశించుచున్న అంగారకుని వలె శోభిల్లుచుండెను. (4-5)

తతః శరసహస్రేణ రామమ్ అప్రతిమౌజసమ్।
అర్దయిత్వా మహానాదం ననాద సమరే ఖరః॥ 6

తత స్తం భీమధన్వానం క్రుద్ధాః సర్వే నిశాచరాః।
రామం నానావిధైః శస్త్రైః అభ్యవర్షంత దుర్జయమ్॥ 7

ముద్గరైః పట్టిశైః శూలైః ప్రాసైః ఖడ్గైః పరశ్వధైః।
రాక్షసాః సమరే రామం నిజఘ్నూ రోషతత్పరాః॥ 8

తే వలాహకసంకాశా మహానాదా మహౌజసః।
అభ్యధావంత కాకుత్స్థం రథైర్వాజిభిరేవ చ।
గజైః పర్వతకూటాభై రామం యుద్ధే జిఘాంసవః॥ 9

అంతట ఖరుడు యుద్ధభూమియందు సాటిలేని పరాక్రమశాలియైన రాముని నొప్పించుటకై ఆయనపై వేయిబాణములను ప్రయోగించి, అట్టహాసముతో మహానాదమొనర్చెను. పిమ్మట ఆ రాక్షస యోధులెల్లరును కోపోద్రిక్తులై, శత్రుభయంకరమైన ధనువును ధరించి, అజేయుడైన ఆ రామునిపై నానావిధములగు ఆయుధములను ప్రయోగించిరి. ఇంకను వారు ఆ యుద్ధమున రోషముతో విజృంభించి ఇనుపగుదియలు, కత్తులు, శూలములు, ఈటెలు, ఖడ్గములు, గండ్రగొడ్డళ్లు మొదలగు వానిని శ్రీరామునిపై విసరివేసిరి. మహామేఘములవలె ఒప్పుచు మిగుల బలశాలురైన ఆ రాక్షసులు గర్జించుచు, రథములపై, గుఱ్ఱములపై, కొండలవలెనున్న ఏనుగులపై అధిష్ఠించి, కాకుత్స్థుడైన శ్రీరాముని చంపబూని కదనరంగమున ముందునకు ఉరికిరి. (6-9)

తే రామే శరవర్షాణి వ్యసృజన్ రక్షసాం గణాః।
శైలేంద్రమివ ధారాభిః వర్షమాణా వలాహకాః॥ 10

స తైః పరివృతో ఘోరై రాఘవో రక్షసాం గణైః॥ 11

ఒక మహాపర్వతముపై మేఘములు వర్షధారలను కురిసినట్లు ఆ రాక్షసయోధులు శ్రీరామునిపై బాణములను వర్షించిరి. పిదప క్రూరులైన ఆ రాక్షసులు శ్రీరాముని చుట్టుముట్టిరి. (10-11)

తాని ముక్తాని శస్త్రాణి యాతుధానైః స రాఘవః।
ప్రతిజగ్రాహ విశిఖైః నద్యోఘానివ సాగరః। 12

స తైః ప్రహరణైర్ఘోరైః భిన్నగాత్రో న వివ్యథే।
రామః ప్రదీప్తైర్బహుభిః వజ్రైరివ మహాచలః। 13

స విద్ధః క్షతజాదిగ్ధః సర్వగాత్రేషు రాఘవః।
బభూవ రామః సంధ్యాభ్రైః దివాకర ఇవావృతః। 14

సముద్రము నదీప్రవాహములనువలె శ్రీరాముడు ఆ రాక్షసులు ప్రయోగించిన ఆయుధములన్నింటిని తననిశితశరములచే నిరోధించెను. (తుత్తునియలు గావించెను) అగ్నిజ్వాలలవలె వెలుగులను విరజిమ్ముచున్న వజ్రాయుధములు ఎంతగా ఖండించుచున్నను నిశ్చలముగా నుండెడి మహాపర్వతమువలె ఆ రాక్షసులు తీవ్రములైన ఆయుధములచే తనశరీరమును ఎంతగా గాయపఱచినను శ్రీరాముడు ఏమాత్రము వ్యథచెందలేదు. రాక్షసులఆయుధముల తాకిడికి ఆ రఘురాముని అవయవములన్నియును రక్తసిక్తములాయెను. అప్పుడు ఆ మహావీరుడు సంధ్యాకాలమున ఎఱ్ఱబాఱియున్న మేఘములచే పరివృతుడైన సూర్యునివలె తేజరిల్లెను. (12-14)

విషేదుర్దేవగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః।
ఏకం సహస్రైర్బహుభిః తదా దృష్ట్వా సమావృతమ్। 15

ఒంటరిగానున్న శ్రీరాముని పదునాలుగువేలమంది రాక్షసయోధులు చుట్టుముట్టగా జూచి, దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు మొదలగు వారందఱును మిగుల ఖిన్నులైరి. (15)

తతో రామః సుసంక్రుద్ధో మండలీకృతకార్ముకః।
ససర్జ విశిఖాన్ బాణాన్ శతశోఽథ సహస్రశః। 16

దురావారాన్ దుర్విషహాన్ కాలదండోపమాన్ రణే।
ముమోచ లీలయా రామః కంకపత్రాన్ అజిహ్మగాన్। 17

తే శరాః శత్రుసైన్యేషు ముక్తా రామేణ లీలయా।
ఆదదూ రక్షసాం ప్రాణాన్ పాశాః కాలకృతా ఇవ। 18

అంతట శ్రీరాముడు మిక్కిలి క్రుద్ధుడై, తనధనువును మండలాకారముగా జేసి, ఆ రాక్షసులపై వందల వేలకొలది పదునైన బాణములను వదిలెను. యుద్ధమున శ్రీరాముడు అవలీలగా ప్రయోగించిన ఆ శరములు వారింప శక్యముగానివి, యమదండమువలె భయంకరములైనవి. లక్ష్యమును ఛేదించువఱకును సూటిగా సాగిపోవునవి. వాటిధాటికి శత్రువులు తట్టుకొనలేకుండిరి. శ్రీరాముడు అనాయాసముగా శత్రుసైన్యములపై ప్రయోగించిన ఆ అస్త్రములు యమునికాలపాశములవలె రాక్షసులప్రాణములను హరించెను. (16-18)

భిత్త్వా రాక్షసదేహాంస్తాన్ తే శరా రుధిరాప్లుతాః।
అంతరిక్షగతా రేజుః దీప్తాగ్నిసమతేజసః। 19

ఆ శరములు రాక్షసులదేహములను ఛేదించి, రక్తసిక్తములై అంతరిక్షమునకు చేరి, అగ్నిజ్వాలలవలె విరాజిల్లెను. (19)

అసంఖ్యేయాస్తు రామస్య సాయకాశ్చాపమండలాత్।
వినిష్పేతురతీవోగ్రా రక్షఃప్రాణాపహారిణః। 20

తైర్ధనూంషి ధ్వజాగ్రాణి వర్మాణి చ శిరాంసి చ।
బాహూన్ సహస్తాభరణాన్ ఊరూన్ కరికరోపమాన్।
చిచ్ఛేద రామః సమరే శతశోఽథ సహస్రశః। 21

శ్రీరామునియొక్క ధనుర్మండలమునుండి (మండలాకృతిలోనున్న ధనువునుండి) అత్యుగ్రములైన లెక్కలేనన్ని బాణములు రాక్షసులప్రాణములను హరించుటకై బయల్వెడలినవి. శ్రీరాముడు యుద్ధమున తాను ప్రయోగించిన ఆ బాణములచే రాక్షసులయొక్క వందలవేలకొలదిధనుస్సులను ధ్వజపతాకములను, కవచములను, శిరస్సులను, ఆభరణములతోగూడిన బాహువులను ముక్కలు ముక్కలు గావించెను. (20-21)

హయాన్ కాంచనసన్నాహాన్ రథయుక్తాన్ ససారథీన్।
గజాంశ్చ సగజారోహాన్ సహయాన్ సాదినస్తథా। 22

పదాతీన్ సమరే హత్వా హ్యనయద్యమసాదనమ్। 23

ఆ రఘువరుడు శత్రురథములను ముక్కలు గావించుచు, ఆభరణములు గలిగియున్న రథాశ్వములను, సారథులను, గజములనధిరోహించిన యోధులను, అశ్వములను, అశ్వములపైనున్న సైనికులను, కాల్బలములను హతమార్చెను. (మృత్యుముఖమునకు చేర్చెను) (22-23)

తతో నాళీకనారాచైః తీక్ష్ణాగ్రైశ్చ వికర్ణిభిః।
భీమమార్తస్వరం చక్రుః భిద్యమానా నిశాచరాః। 24

శ్రీరామునియొక్క నాళీక (నాళములుగల) బాణములకును, ఇనుపశరములకును, మిగుల పదునైన కొనలుగల వికర్ణి (చివరమొలికలుగల) బాణములకును తీవ్రముగా గాయపడిన ఆ నిశాచరులు దీనముగా ఆర్తనాదములుగావించిరి. (24)

తత్సైన్యం నిశితైర్బాణైః అర్దితం మర్మభేదిభిః।
రామేణ న సుఖం లేభే శుష్కం వనమివాగ్నినా। 25

రఘువీరుడు నిశితములైన తనబాణములచే ఆ రాక్షసులఆయువు పట్టులను భేదించెను. అప్పుడు వారు విలవిలలాడుచు దావాగ్నికి దగ్ధమై నిస్తేజమైన వనమువలె సుఖశాంతులకు దూరమైరి. (25)

కేచిద్భీమబలాః శూరాః శూలాన్ ఖడ్గాన్ పరశ్వథాన్।
రామస్యాభిముఖం గత్వా చిక్షిపుః పరమాయుధాన్। 26

తాని బాణైర్మహాబాహుః శస్త్రాణ్యావార్య రాఘవః।
జహార సమరే ప్రాణాన్ చిచ్ఛేద చ శిరోధరాన్। 27

కొంతమంది మిక్కిలి బలశాలురైన రాక్షసవీరులు రామునకు అభిముఖులై తమయొక్క మహాయుధములైన శూలములు, ఖడ్గములు, గండ్రగొడ్డళ్లు మొదలగు వాటిని ఆయనపై విసరిరి. మహాబాహువైన రఘువీరుడు ఆ ఆయుధములను తనశరపరంపరచే అడ్డుకొని, వారి కంఠములను ఖండించెను, ప్రాణములను హరించెను. (26-27)

తే ఛిన్నశిరసః పేతుః ఛిన్నవర్మశరాసనాః।
సుపర్ణవాతవిక్షిప్తా జగత్యాం పాదపా యథా। 28

ఆ రాక్షసులకవచములు, ధనుస్సులు ముక్కలు ముక్కలుకాగా, తలలు తెగిపోగా, వారి మొండెములు గరుత్మంతునిరెక్కలవాయువేగమున నేలగూలిన మహావృక్షములవలె భూమిపై పడిపోయెను. (28)

అవశిష్టాశ్చ యే తత్ర విషణ్ణాశ్చ నిశాచరాః।
ఖరమేవాభ్యధావంత శరణార్థం శరార్దితాః। 29

చావగా మిగిలిన రాక్షసులు రాముని శరముల తాకిడికి తాళలేక విషణ్ణవదనులై ఖరుని శరణు జొచ్చుటకై ఆయనకడకు పరుగులుదీసిరి. (29)

తాన్ సర్వాన్ పునరాదాయ సమాశ్వాస్య చ దూషణః।
అభ్యధావత కాకుత్స్థం క్రుద్ధో రుద్రమివాంతకః। 30

నివృత్తాస్తు పునః సర్వే దూషణాశ్రయనిర్భయాః।
రామమేవాభ్యధావంత సాలతాలశిలాయుధాః। 31

అంతట దూషణుడు వారినందఱిని కూడగట్టుకొని, ఓదార్చి యుద్ధావేశములో యముడు ప్రళయరుద్రుని కడకు వెళ్లినట్లు శ్రీరామునిమీదికి పరుగెత్తెను. రణరంగమునుండి తిరిగి వచ్చిన రాక్షసులు దూషణునిఅండ చూచుకొని, నిర్భయులై, సాహసముతో మద్దిచెట్లను, తాటిచెట్లను, పెద్దపెద్ద బండలను, ఆయుధములనుగొని, రామునితో పోరాడుటకై మిగుల వేగముగా కదనరంగమునకు కదిలిరి. (30-31)

శూలముద్గరహస్తాశ్చ చాపహస్తా మహాబలాః।
సృజంతః శరవర్షాణి శస్త్రవర్షాణి సంయుగే।
ద్రుమవర్షాణి ముంచంతః శిలావర్షాణి రాక్షసాః। 32

మహాబలశాలురైన ఆ రాక్షసులు శూలములను, ఇనుపగుదియలను, ధనువులను చేబూని, రణరంగమున నిలిచి, శ్రీరామునిపై శరములను తదితరములైన ఆయుధములను నిరంతరముగా ప్రయోగించిరి. ఇంకను వారు వృక్షములను పెద్దపెద్ద శిలలను ఆయనపై కురిపించిరి. (32)

తద్బభూవాద్భుతం యుద్ధం తుములం రోమహర్షణమ్।
రామస్య చ మహాఘోరం పునస్తేషాం చ రక్షసామ్। 33

తే సమంతాదభిక్రుద్ధా రాఘవం పునరభ్యయుః। 34

మరల ఆ రాక్షసయోధులకును శ్రీరామునకును మధ్య అద్భుతమైన సంకులసమరము గగుర్పాటు గలిగించుచు మిక్కిలి భయంకరముగా జరిగెను. ఆ రాక్షసులు ఎంతయు క్రుద్ధులై అన్నివైపులనుండియు శ్రీరాముని చుట్టుముట్టిరి. (33-34)

తైశ్చ సర్వా దిశో దృష్ట్వా ప్రదిశశ్చ సమావృతాః।
రాక్షసైరుద్యతప్రాసైః శరవర్షాభివర్షిభిః। 35

స కృత్వా భైరవం నాదమ్ అస్త్రం పరమభాస్వరమ్।
సంయోజయత గాంధర్వం రాక్షసేషు మహాబలః। 36

ఆ రాక్షసులు అన్నిదిశలయందును వ్యాపించి, ఈటెలతో విజృంభించుచు శరవర్షములను కురిపించు చుండుటనుమహాబలశాలియైన శ్రీరాముడు గమనించెను. వెంటనే ఆ మహావీరుడు భీకరనాదమొనర్చి, దివ్యకాంతులను కలిగియున్న గాంధర్వాస్త్రమును వారిపై ప్రయోగించెను. (35-36)

తతః శరసహస్రాణి నిర్యయుశ్చాపమండలాత్।
సర్వా దశ దిశో బాణైః ఆవార్యంత సమాగతైః। 37

అప్పుడు మండలాకారముననున్న ఆ ధనుస్సునుండి (గాంధర్వాస్త్రప్రభావముచే) వేలకొలది బాణములు బయల్వెడలినవి. అవి దశదిశలను పూర్తిగా కప్పి వేసినవి. (37)

నాఽఽదదానం శరాన్ ఘోరాన్ న ముంచంతం శిలీముఖాన్।
వికర్షమాణం పశ్యంతి రాక్షసాస్తే శరార్దితాః। 38

శ్రీరాముడు శత్రుభయంకరములగు పదునైనబాణములను తూణీరములనుండి తీసికొనుటగాని, సంధించుటగాని, వాటిని ప్రయోగించుటగాని ఆ రాక్షసులు గుర్తింప లేకుండిరి. అవి తమను తాకి గాయపఱచినప్పుడుమాత్రమే వాటివిషయము ఆ రక్కసులకు తెలియుచుండెను. (38)

శరాంధకారమాకాశమ్ ఆవృణోత్ స దివాకరమ్।
బభూవావస్థితో రామః ప్రవమన్నివ తాన్ శరాన్। 39

శ్రీరామునిబాణపరంపర సూర్యునితోసహా ఆకాశమును పూర్తిగా కప్పివేయగా అంతటను చీకట్లు అలముకొనెను. ఆ శరములన్నియును శ్రీరామునిముఖము నుండియే వెలువడుచున్నావా? యనునట్లు గోచరించుచుండెను. (39)

యుగపత్ పతమానైశ్చ యుగపచ్చ హతైర్భృశమ్।
యుగపత్ పతితైశ్చైవ వికీర్ణా వసుధాఽభవత్। 40

ఏ మాత్రమూ వ్యవధిలేకుండా వచ్చిపడుచున్న బాణములధాటికి వారు ఆ క్షణముననే ఒక్కుమ్మడిగా మరణించుటయు, అదేక్షణములోనే నేలకొఱగుటయు జరుగుచుండెను. లిప్తకాలములోనే ఆ కళేబరములతో రణభూమి నిండిపోవుచుండెను. (40)

నిహతాః పతితాః క్షీణాః ఛిన్నా భిన్నా విదారితాః।
తత్ర తత్ర స్మ దృశ్యంతే రాక్షసాస్తే సహస్రశః। 41

ఆ రణభూమియందు ఎచ్చట చూచినను వేలకొలది రాక్షసులు చెల్లాచెదరుగా పడియుండిరి. వారిలో కొందఱు కొనయూపిరితోనుండిరి. కొందఱితలలు తెగిపడియుండెను. కొందఱిశరీరములు ఛిన్నాభిన్నములై యుండెను. మఱికొందఱితనువులు చీల్చబడియుండెను. పెక్కుమంది చచ్చిపడియుండిరి. (41)

సోష్ణీషైరుత్తమాంగైశ్చ సాంగదైర్బాహుభిస్తథా।
ఊరుభిర్జానుభిశ్ఛిన్నైః నానారూపవిభూషణైః। 42

హయైశ్చ ద్విపముఖ్యైశ్చ రథైర్భిన్నైరనేకశః।
చామరైర్వ్యజనైశ్ఛత్రైః ధ్వజైర్నానావిధైరపి। 43

శ్రీరామునిబాణములధాటికి తలపాగాలుగల శిరస్సులు, భుజకీర్తులుగల బాహువులు, వివిధములగు ఆభరణములుగల తొడలు, మోకాళ్లు వేర్వేఱుగా పడియుండెను. గుఱ్ఱములు, మదపుటేనుగులు, రథములు ముక్కలుముక్కలై నేలపాలైయుండెను. నానావిధములైన చామరములు, వీవనలు, ఛత్రములు, ధ్వజములు

రామస్య బాణాభిహతైః విచిత్రైః శూలపట్టిసైః।
ఖడ్గైః ఖండీకృతైః ప్రాసైః వికీర్ణైశ్చ పరశ్వధైః॥ 44

చూర్ణితాభిః శిలాభిశ్చ శరైశ్చిత్రైరనేకశః।
విచ్ఛిన్నైః సమరే భూమిః వికీర్ణాఽభూద్భయంకరా॥ 45

చిన్నాభిన్నాములై అచట పడియుండెను. చిత్రవిచిత్రములైన శూలములు, అడ్డకత్తులు, ఖడ్గములు, ఈటెలు, గండ్రగొడ్డళ్లు, వివిధాకారములుగల శరములు ముక్కలుముక్కలై అందంతటను పడియుండెను. పెద్దపెద్ద బండరాళ్లు నుగ్గునుగ్గై యుండెను. అప్పటి ఆ సమరభూమి మిక్కిలి భయంకరముగా కన్పట్టుచుండెను. (42-45)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచవింశస్సర్గః (25)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదిఐదవసర్గము.

-- * * * --

26 ఇరువదిఆఱవసర్గము

శ్రీరాముడు దూషణుని, అతని అనుయాయులైన రాక్షసయోధులను సంహరించుట.

దూషణస్తు స్వకం సైన్యం హన్యమానం నిరీక్ష్య సః।
సందిదేశ మహాబాహుః భీమవేగాన్ దురాసదాన్,
రాక్షసాన్ పంచసాహస్రాన్ సమరేష్వనివర్తినః॥ 1

అంతట దూషణుడు తనసైనికులు శ్రీరామునిచేతిలో హతులగుచుండుట గమనించెను. పిమ్మట ఆ పరాక్రమశాలి యుద్ధరంగమున వెన్నుచూపనట్టి ఐదువేలమంది రాక్షసయోధులను యుద్ధము చేయుటకై ఆదేశించెను. వారు మిగుల వేగముగలవారు, భయంకరులు, శత్రువులకు లొంగనివారు. (1)

తే శూలైః పట్టిసైః ఖడ్గైః శిలావర్షైర్ద్రుమైరపి।
శరవర్షైరవిచ్ఛిన్నం వవృషుస్తం సమంతతః॥ 2

ఆ రాక్షసులు శూలములతో, అడ్డకత్తులతో, ఖడ్గములతో రామునిమీదికి విజృంభించిరి. ఇంకను వారు అన్నివైపులనుండియు ఆయనపై ఎడతెఱపిలేకుండ శిలలను వర్షింపసాగిరి, మహావృక్షములను విసరి వేయుచుండిరి, శరములను పరంపరగా ప్రయోగించుచుండిరి. (2)

స ద్రుమాణాం శిలానాం చ వర్షం ప్రాణహరం మహత్।
ప్రతిజగ్రాహ ధర్మాత్మా రాఘవస్తీక్ష్ణసాయకైః॥ 3

సంకులసమరమున కుశలుడైన శ్రీరాముడు ప్రాణాంతకములైన ఆ శిలలవర్షములను, ఎడములేకుండ వచ్చిపడుచున్న వృక్షములను తనతీవ్ర బాణములచే వమ్ముగావించెను. (3)

ప్రతిగృహ్య చ తద్వర్షం నిమీలిత ఇవర్షభః।
రామః క్రోధం పరం భేజే వధార్థం సర్వరక్షసామ్॥ 4

తతః క్రోధసమావిష్టః ప్రదీప్త ఇవ తేజసా।
శరైరవాకిరత్ సైన్యం సర్వతః సహదూషణమ్॥ 5

ఎంతటి వర్షమునకైనను చలింపని వృషభమువలె శ్రీరాముడు రాక్షసులశరవర్షమును నిగ్రహించుచు, ఏ మాత్రము తొణకక వారిని వధించుటకై క్రుద్ధుడై చెలరేగెను. అట్లు క్రోధమును వహించిన ఆ వీరుడు (రాముడు) సింహమువలె పరాక్రమించుచు, అగ్నివలె తేజస్సులను విరజిమ్ముచు ఖరునిసేనాపతియైన దూషణునిపైనను, సైన్యముమీదను, అంతటను శరపరంపరను ప్రయోగించెను. (4-5)

తతస్సేనాపతిః క్రుద్ధో దూషణః శత్రుదూషణః।
శరైరశనికల్పైస్తం రాఘవం సమవాకిరత్॥ 6

అంతట శత్రువులను భంగపఱచెడివాడును, ఖరునిసేనానాయకుడును ఐన దూషణుడు మిక్కిలి క్రుద్ధుడై, పిడుగులవంటి శరములను ఆరామునిపై వేసెను. (6)

తతో రామః సుసంక్రుద్ధః క్షురేణాస్య మహద్ధనుః।
చిచ్ఛేద సమరే వీరః చతుర్భిశ్చతురో హయాన్। 7

హత్వా చాశ్వాన్ శరైస్తీక్ష్ణైః అర్ధచంద్రేణ సారథేః।
శిరో జహార తద్రక్షః త్రిభిర్వివ్యాధ వక్షసి। 8

సచ్ఛిన్నధన్వా విరథో హతాశ్వో హతసారథిః।
జగ్రాహ గిరిశృంగాభం పరిఘం రోమహర్షణమ్। 9

వేష్టితం కాంచనైః పట్టైః దేవసైన్యప్రమర్దనమ్।
ఆయసైః శంకుభిస్తీక్ష్ణైః కీర్ణం పరవసోక్షితమ్। 10

వజ్రాశనిసమస్పర్శం పరగోపురదారణమ్। 11

తం మహోరగసంకాశం ప్రగృహ్య పరిఘం రణే।
దూషణోఽభ్యద్రవద్రామం క్రూరకర్మా నిశాచరః। 12

తస్యాభిపతమానస్య దూషణస్య స రాఘవః।
ద్వాభ్యాం శరాభ్యాం చిచ్ఛేద సహస్తాభరణౌ భుజౌ। 13

భ్రష్టస్తస్య మహాకాయః పపాత రణమూర్ధని।
పరిఘశ్ఛిన్నహస్తస్య శక్రధ్వజ ఇవాగ్రతః। 14

స కరాభ్యాం వికీర్ణాభ్యాం పపాత భువి దూషణః।
విషాణాభ్యాం విశీర్ణాభ్యాం మనస్వీవ మహాగజః। 15

తం దృష్ట్వా పతితం భూమౌ దూషణం నిహతం రణే।
సాధు సాధ్వితి కాకుత్స్థం సర్వభూతాన్యపూజయన్। 16

ఏతస్మిన్నంతరే క్రుద్ధాః త్రయః సేనాగ్రయాయినః।
సంహత్యాఽభ్యద్రవన్ రామం మృత్యుపాశావపాశితాః।
మహాకపాలః స్థూలాక్షః ప్రమాథీ చ మహాబలః। 17

సమరవీరుడైన శ్రీరాముడు మిగుల ఆగ్రహించినవాడై దూషణునియొక్క మహాధనుస్సును తన ఖడ్గముతో ముక్కలు గావించెను. మఱియు నాలుగుబాణములతో వానిరథాశ్వములను నాల్గింటిని హతమొనర్చెను. (7)

శ్రీరాముడు ఆ విధముగా, తనపదునైన బాణములచే ఆ రథాశ్వములను కూల్చివేసిన పిమ్మట ఒక అర్ధచంద్రాకారబాణముతో రథసారథిశిరస్సును ఖండించెను. అనంతరము మూడుబాణములచే దూషణునివక్షఃస్థలముపై దెబ్బతీసెను. ఆ దూషణునిధనుస్సు భంగముకాగా, రథము శిథిలముకాగా, అశ్వములు హతమైపోగా, సారథి నేలకూలగా, అతడు ఎంతయు విజృంభించి, పర్వతశిఖరమువంటి ఒక ఇనుపగుదియను చేతబట్టెను. ఆపరిఘము చూచెడివారికి గగుర్పాటు కల్గించునదైయుండెను. అది బంగారురేకులతో చుట్టబడినది, దేవతలసైన్యమునుగూడ మర్దించునది, అన్నివైపుల వాడియైన ఇనుపమేకులతో ఒప్పుచున్నది, శత్రువులవసతో (క్రొవ్వుతో) తడిసినది, వజ్రమువలె, వజ్రాయుధమువలె కఠిన (ప్రమాదకర)మైనది, శత్రువుల పురద్వారములను భేదించునది. మహాసర్పమువలె శత్రువులకు భయమును గొల్పునది. అట్టి ఇనుపకట్ల గుదియను దీసికొని, మిగుల క్రూరుడైన ఆ దూషణుడు రణరంగమున రామునిమీదికి ఉఱికెను. (8-12)

ఆ విధముగా తనమీదికి దూసికొని వచ్చుచున్న దూషణునియొక్క శౌర్యపరాక్రమసూచకములైన ఆభరణములుగల రెండుభుజములను శ్రీరాముడు రెండుబాణములచే ఖండించెను. (13)

అంతట దూషణునిరెండుహస్తములు తెగిపోగా అపరిమితప్రమాణములోనున్న ఇనుపకట్ల గుదియు రణరంగమున ఇంద్రధ్వజమువలె అతనిచేతులనుండి పడిపోయెను. (14)

రెండుభుజములును ముక్కలుముక్కలుకాగా ధీరుడైన ఆ దూషణుడు దంతములు విఱిగిన మదపుటేనుగువలె నేలకొరిగెను. (15)

ఆవిధముగా రఘువీరునిచేతిలో నిహతుడై నేలపాలైన దూషణునిజూచి, సమస్తప్రాణికోటియును 'బాగుబాగు' అనుచు శ్రీరామునకు జేజేలు పలికిరి. (16)

శ్రీరాముడు దూషణుని హతమార్చినందులకు మిగుల బలశాలురైన మహాకపాలుడు, స్థూలాక్షుడు, ప్రమాథి అను ముగ్గురు సేనానాయకులు ఎంతయు క్రుద్ధులై తమకును చావు దగ్గఱపడుటతో ఆ రఘువీరుని మీదికి ఒక్కుమ్మడిగా విజృంభించిరి. (17)

మహాకపాలో విపులం శూలముద్యమ్య రాక్షసః।
స్థూలాక్షః పట్టిసం గృహ్య ప్రమాథీ చ పరశ్వధమ్। 18

దృష్ట్వైవాపతతస్తూర్ణం రాఘవః సాయకైః శితైః।
తీక్ష్ణాగ్రైః ప్రతిజగ్రాహ సంప్రాప్తానతిథీనివ। 19

మహాకపాలస్య శిరః చిచ్ఛేద పరమేషుభిః।
అసంఖ్యేయైస్తు బాణౌఘైః ప్రమమాథ ప్రమాథినమ్। 20

స పపాత హతో భూమౌ విటపీవ మహాద్రుమః।
స్థూలాక్షస్యాక్షిణీ తీక్ష్ణైః పూరయామాస సాయకైః। 21

దూషణస్యానుగాన్ పంచ సాహస్రాన్ కుపితః క్షణాత్।
బాణౌఘైః పంచసాహస్రైః అనయద్యమసాదనమ్। 22

దూషణం నిహతం దృష్ట్వా తస్యైవ పదానుగాన్।
వ్యాదిదేశ ఖరః క్రుద్ధః సేనాధ్యక్షాన్ మహాబలాన్। 23

అయం వినిహతః సంఖ్యే దూషణః సపదానుగః।
మహత్యా సేనయా సార్ధం యుద్ధ్వా రామం కుమానుషమ్। 24

శస్త్రైర్నానావిధాకారైః హనధ్వం సర్వరాక్షసాః।
ఏవముక్త్వా ఖరః క్రుద్ధో రామమేవాభిదుద్రువే। 25

శ్యేనగామీ పృథుగ్రీవో యజ్ఞశత్రుర్విహంగమః।
దుర్జయః కరవీరాక్షః పరుషః కాలకార్ముకః। 26

మేఘమాలీ మహామాలీ సర్పాస్యో రుధిరాశనః।
ద్వాదశైతే మహావీర్యా బలాధ్యక్షాః ససైనికాః। 27

రామమేవాభ్యవర్తంత విసృజంతః శరోత్తమాన్। 28

తతః పావకసంకాశైః హేమవజ్రవిభూషితైః।
జఘాన శేషం తేజస్వీ తస్య సైన్యస్య సాయకైః। 29

తే రుక్మపుంఖా విశిఖాః సధూమా ఇవ పావకాః।
నిజఘ్నుస్తాని రక్షాంసి వజ్రా ఇవ మహాద్రుమాన్। 30

రక్షసాం తు శతం రామః శతేనైకేన కర్ణినా।
సహస్రం చ సహస్రేణ జఘాన రణమూర్ధని। 31

మహాకపాలుడు ఒక మహాశూలమును, స్థూలాక్షుడు అను రాక్షసుడు అడ్డకత్తిని, ప్రమాథియనువాడు గండ్రగొడ్డలిని చేపట్టియుండిరి. అట్లు మీదికి వచ్చిపడుచున్న ఆ రాక్షసయోధులను జూచి, శ్రీరాముడు ఇంటికి వచ్చిన అతిథులనువలె వారిని మొనదేలియున్న వాడియైన తనబాణములచే సత్కరించెను. (18-19)

ఆ రఘువరుడు తీవ్రమైన శరములచే మహాకపాలునిశిరస్సును ఛేదించెను. పెక్కుబాణములచే ప్రమాథిని నుగ్గునుగ్గు గావించెను. స్థూలాక్షునియొక్క ముఖమున తీక్ష్ణములైన బాణములను నాటెను. అంతట ఆరాక్షసయోధుడు ఒక మహావృక్షమువలె నేలకొరిగెను.(20-21)

పిమ్మట శ్రీరాముడు కోపావేశముతో క్షణమాత్రమున ఐదువేలశరములను ప్రయోగించి, దూషణుని అనుయాయులైన ఐదువేలమందియోధులను మృత్యుముఖమున చేర్చెను.(22)

దూషణుడును, అతనిఅనుచరులందఱును శ్రీరాముని చేతిలో హతులైనట్లెఱింగి, ఖరుడు క్రుద్ధుడై మహాబలశాలురగు తనసేనాపతులను ఇట్లు ఆదేశించెను. "మనదూషణుడు మహాసేనతోగూడి మానవమాత్రుడైన రామునితో యుద్ధమొనర్చి, తనఅనుయాయులందఱితో సమరరంగమున మడిసెను. కనుక ఓ రాక్షసయోధులారా! మీరందఱును వివిధములగు ఆకారములుగల శస్త్రములతో అతనిని చంపివేయుడు."-ఇట్లు పలికిన పిమ్మట ఖరుడు క్రోధావేశముతో రామునిమీదికి పరుగు దీసెను. (23-25)

అంతట శ్యేనగామి, పృథుగ్రీవుడు, యజ్ఞశత్రువు, విహంగముడు, దుర్జయుడు, కరవీరాక్షుడు, పరుషుడు, కాలకార్ముకుడు, మేఘమాలి, మహామాలి, సర్పాస్యుడు, రుధిరాశనుడు - అను మహావీరులైన పండ్రెండుమంది సేనానాయకులు తమసైనికులతోగూడి రామునిమీదికి విజృంభించి, ఆయనపై బాణ పరంపరను ప్రయోగించిరి.(26-28)

అప్పుడు పరాక్రమశాలియైన రఘువీరుడు వజ్రమణులతో, బంగారముతో నిర్మితములై, అగ్నితుల్యములైన బాణములచే ఆ మహాసైన్యముపై దెబ్బతీసెను. బంగారుపిడులు గలవి, వాడియైనవి యగు ఆ శరములు అగ్నిజ్వాలలను చిమ్ముచు వజ్రాయుధములు మహావృక్షములనువలె ఆ రాక్షసులను అందఱిని నిర్మూలించెను. (29-30)

పిదప శ్రీరాముడు వందమంది రాక్షసులు ఎదురైనప్పుడు కర్ణికాకారములుగల వందశరములతోడను, తనను వేయిమంది ఎదుర్కొనినప్పుడు వేయిబాణముల తోడను వారిని కదనరంగమునకు బలియిచ్చెను. ఆ బాణములదెబ్బకు వారికవచములును, ఆభరణములును ఛిన్నాభిన్నములాయెను. ధనుస్సులు తుత్తునియలయ్యెను.

తైర్భిన్నవర్మాభరణాః ఛిన్నభిన్నశరాసనాః।
నిపేతుః శోణితాదిగ్ధా ధరణ్యాం రజనీచరాః॥ 32

తైర్ముక్తకేశైః సమరే పతితైః శోణితోక్షితైః।
ఆస్తీర్ణా వసుధా కృత్స్నా మహావేదిః కుశైరివ॥ 33

క్షణేన తు మహాఘోరం వనం నిహతరాక్షసమ్।
బభూవ నిరయప్రఖ్యం మాంసశోణితకర్దమమ్॥ 34

చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్।
హతాన్యేకేన రామేణ మానుషేణ పదాతినా॥ 35

తస్య సైన్యస్య సర్వస్య ఖరః శేషో మహారథః।
రాక్షసస్త్రిశిరాశ్చైవ రామశ్చ రిపుసూదనః॥ 36

శేషా హతా మహాసత్త్వా రాక్షసా రణమూర్ధని।
ఘోరా దుర్విషహాః సర్వే లక్ష్మణస్యాగ్రజేన తే॥ 37

తతస్తు తద్భీమబలం మహాహవే
సమీక్ష్య రామేణ హతం బలీయసా ।
రథేన రామం మహతా ఖరస్తదా
సమాససాదేంద్ర ఇవోద్యతాశనిః ॥ 38

ఆ నిశాచరులందఱును నెత్తురోడుచు నేలగూలిరి. రక్తసిక్తములైన ఆ రాక్షసుల కేశములు రణరంగమునందంతటను చెల్లాచెదరుగా పడియుండెను. అప్పుడు ఆ యుద్ధభూమి దర్భలతో వ్యాప్తమైన మహావేదికవలె ఒప్పారెను.(31-33)

కనురెప్పపాటులో వేలకొలది రాక్షసులు హతులుకాగా ఆ వనప్రదేశమంతయును మాంసఖండములతో, రక్తపుబురదలతో నిండి మిగుల భీతి గొలుపుచు నరకతుల్యమై ఒప్పెను. ఎట్టి వాహనములేని శ్రీరాముడు ఒక్కడే భయంకరకృత్యములను ఒనర్చునట్టి పదునాలుగువేలమంది రాక్షసయోధులను అవలీలగా మట్టుపెట్టెను. (34-35)

సమరభూమియందు అడుగిడిన యోధులలో శత్రుసంహారకుడైన శ్రీరాముడు, మహారథుడైన ఖరుడు, త్రిశిరరాక్షసుడుమాత్రమే మిగిలియుండిరి. మిక్కిలి బలశాలురు, సాహసములకు లొంగనివారు, భయంకరాకారులు ఐన మిగిలిన రాక్షసవీరులు ఎల్లరును లక్ష్మణాగ్రజుడైన శ్రీరామునిచేతిలో హతులైరి. (36-37)

ఖరుడు చూచుచుండగనే మహాబలవంతులైన రాక్షససైనికులందఱును మిగుల పరాక్రమశాలియైన శ్రీరాముని ధాటికి నేలకొఱిగిరి. అప్పుడతడు ఒక మహారథమునెక్కి, వజ్రపాణియైన ఇంద్రునివలె ఒప్పుచు శ్రీరామునితో యుద్ధమునకు తలపడెను. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే షడ్వింశస్సర్గః *(26)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదిఆఱవసర్గము.

-- * * * --

27. ఇరువదిఏడవసర్గము

ఖరునిసేనాధిపతియైన త్రిశిరుడు శ్రీరాముని చేతిలో హతుడగుట

ఖరం తు రామాభిముఖం ప్రయాంతం వాహినీపతిః।
రాక్షసః త్రిశిరా నామ సన్నిపత్యేదమబ్రవీత్॥ 1

మాం నియోజయ విక్రాంత సన్నివర్తస్వ సాహసాత్।
పశ్య రామం మహాబాహుం సంయుగే వినిపాతితమ్॥ 2

ప్రతిజానామి తే సత్యమ్ ఆయుధం చాహ మాలభే।
యథా రామం వధిష్యామి వధార్హం సర్వరక్షసామ్॥ 3

శ్రీరామునితో యుద్ధమొనర్చుటకై ఖరుడు వెళ్ళుచుండగా అతనిసేనాధిపతియైన త్రిశిరుడు అను రాక్షసుడు అతనిని సమీపించి ఇట్లు నుడివెను. (1)

"ఓ మహావీరుడా! ఆగుమాగుము. తొందరపడవలదు. ఈ యుద్ధమునకు వెంటనే నన్ను నియోగింపుము. మహాబాహువైన రాముడు రణరంగమున నేలకొఱుగుటను చూడగలవు. సకలరాక్షసుల క్షేమముకొఱకై రాముడు వధార్హుడే. ఆ పనిని నేను పూర్తి చేయుదును.

అహం వాస్య రణే మృత్యుః ఏష వా సమరే మమ।
వినివృత్య రణోత్సాహాత్ ముహూర్తం ప్రాశ్నికో భవ। 4

ప్రహృష్టో వా హతే రామే జనస్థానం ప్రయాస్యసి।
మయి వా నిహతే రామం సంయుగాయోపయాస్యసి। 5

ఖరః త్రిశిరసా తేన మృత్యులోభాత్ ప్రసాదితః।
గచ్ఛ యుధ్యేత్యనుజ్ఞాతో రాఘవాభిముఖో యయౌ। 6

త్రిశిరాశ్చ రథేనైవ వాజియుక్తేన భాస్వతా।
అభ్యద్రవద్రణే రామం త్రిశృంగ ఇవ పర్వతః। 7

శరధారాసమూహాన్ స మహామేఘ ఇవోత్సృజన్।
వ్యసృజత్ సదృశం నాదం జలార్ద్రస్య తు దుందుభేః। 8

ఆగచ్ఛంతం త్రిశిరసం రాక్షసం ప్రేక్ష్య రాఘవః।
ధనుషా ప్రతిజగ్రాహ విధూన్వన్ సాయకాన్ శితాన్। 9

స సంప్రహారస్తుములో రామత్రిశిరసోర్మహాన్।
బభూవాతీవ బలినోః సింహకుంజరయోరివ। 10

తతః త్రిశిరసా బాణైః లలాటే తాడితస్త్రిభిః।
అమర్షీ కుపితో రామః సంరబ్ధమ్ ఇదమబ్రవీత్। 11

అహో విక్రమశూరస్య రాక్షసస్యేదృశం బలమ్।
పుష్పైరివ శరైర్యస్య లలాటేఽస్మిన్ పరిక్షతః। 12

మమాపి ప్రతిగృహ్ణీష్వ శరాంశ్చాపగుణచ్యుతాన్।
ఏవముక్త్వా తు సంరబ్ధః శరానాశీవిషోపమాన్।
త్రిశిరో వక్షసి క్రుద్ధో నిజఘాన చతుర్దశ। 13

నీసమక్షమున ఆయుధముపై స్పృశించి, ఈ విషయమును ప్రమాణపూర్వకముగా వచించుచున్నాను. ఈ సమరమున నేను అతని పాలిట మృత్యుదేవత నగుదునో లేక అతడు నన్ను మృత్యుముఖమున చేర్చునో నీవే ప్రత్యక్షముగా చూడగలవు. కనుక ప్రస్తుతము నీ రణోత్సాహమును నిగ్రహించుకొని, కొంతతడవు ఈ విషయమున సాక్షిభూతుడవైయుండుము. నాచేతిలో రాముడే నిహతుడైనచో విజయగర్వముతో నీవు జనస్థానమును చేరెదవు. లేదా! అతనివలన నేను మడిసినచో అప్పుడు నీవే ఆయనను యుద్ధమున ఎదుర్కొనవచ్చును." (2-5)

మృత్యుప్రేరణచే (చావుదగ్గఱపడుటచే) త్రిశిరుడు అట్లు పలుకగా ఖరుడు అందులకు తనసమ్మతిని దెలుపుచు - 'వెళ్లుము, యుద్ధమొనర్పుము' అని ఆజ్ఞాపించెను. అంతట త్రిశిరుడు శ్రీరాముని ఎదుర్కొనుటకై బయలుదేఱెను. (6)

త్రిశిరుడు (మూడుతలలుగలవాడు) వేగముగా సాగిపోగల గుఱ్ఱములను పూన్చిన రథమును అధిరోహించి, పోరునల్పుటకై రామునిమీదికి విజృంభించెను. అప్పుడతడు మూడుశృంగముల పర్వతమువలె ఒప్పుచుండెను. (7)

సమరభూమియందు నిల్చిన త్రిశిరుడు నీటితో తడిసిన దుందుభి (భేరి) వలె నినదించుచు ఒక మహామేఘమువలె రామునిపై ఎడతెఱపి లేకుండా బాణములను వర్షింపసాగెను. (8)

శ్రీరాముడు తనవైపునకు దూసికొని వచ్చుచు బాణములను గుప్పుచున్న త్రిశిరుడు అను రాక్షసుని జూచి, తననిశితములైన బాణములను ధనుస్సునందు సంధించి అతనిని నిరోధించెను. శ్రీరామునకును త్రిశిరునకును మధ్య జరిగిన ఆ ఘోరయుద్ధము బలిష్ఠములైన సింహగజములకు వాటిల్లిన పోరువలె ఒప్పారెను. (9-10)

అంతట త్రిశిరుడు శ్రీరామునిఫాలభాగమును మూడుబాణములతో కొట్టెను. అందులకు శ్రీరాముడు మిగుల కుపితుడై, వెంటనే వ్యంగ్యముగా ఇట్లు పలికెను. అహో! పరాక్రమశాలియైన ఈ రాక్షసుని బలమెంతని చెప్పవచ్చును? ఇతని బాణములు నానొసలును పుష్పములవలె తాకుచున్నవి. (11-12)

'(ఓ త్రిశిరాసురా!) నాధనుస్సునుండి బయల్వెడలిన శరములను నీవు ఎదుర్కొనుము' అని పలికి క్రుద్ధుడైయున్న శ్రీరాముడు విషసర్పములవంటి పదునాలుగు బాణములతో త్రిశిరుని వక్షఃస్థలముపై

చతుర్భిస్తురగానస్య శరైః సన్నతపర్వభిః।
న్యపాతయత తేజస్వీ చతురస్తస్య వాజినః॥ 14

అష్టభిస్సాయకైస్సూతం రథోపస్థే న్యపాతయత్।
రామశ్చిచ్ఛేద బాణేన ధ్వజం చాస్య సముచ్ఛ్రితమ్॥ 15

తతో హతరథాత్ తస్మాత్ ఉత్పతంతం నిశాచరమ్।
బిభేద రామస్తం బాణైః హృదయే సోఽభవజ్జడః॥ 16

సాయకైశ్చాప్రమేయాత్మా సామర్షస్తస్య రక్షసః।
శిరాంస్యపాతయత్ రామో వేగవద్భిః త్రిభిశ్శితైః॥ 17

స భూమౌ రుధిరోద్గారీ రామబాణాభిపీడితః।
న్యపతత్ పతితైః పూర్వం స్వశిరోభిర్నిశాచరః॥ 18

హతశేషాః తతోభగ్నా రాక్షసాః ఖరసంశ్రయాః।
ద్రవంతి స్మ న తిష్ఠంతి వ్యాఘ్రత్రస్తా మృగా ఇవ॥ 19

తాన్ ఖరో ద్రవతో దృష్ట్వా నివర్త్య రుషితః స్వయమ్।
రామమేవాభిదుద్రావ రాహుశ్చంద్రమసం యథా॥ 20

దెబ్బతీసెను. పరాక్రమశాలియు, యుద్ధకుశలుడును ఐన ఆ రాఘవుడు వంగినకనుపులు గల నాలుగు శరములతో త్రిశిరునియొక్క వడిగల గుఱ్ఱములను పడగొట్టెను. ఎనిమిది బాణములను వేసి, రాక్షస సేనాపతిసారథిని నొగలునందే కూల్చెను. రథముపై ఎగురుచున్న ధ్వజమును ఒకే ఒక్క శరముతో ఛేదించెను. (13-15)

శ్రీరామునిబాణములదాటికి రథము శిథిలముకాగా త్రిశిరుడు దానినుండి క్రిందికి దూకుచుండెను. ఇంతలో రాఘవుడు తనబాణములను ప్రయోగించి అతనివక్షఃస్థలమును బ్రద్దలు గావించెను. అంతట ఆ రాక్షసయోధుడు నిశ్చేష్టుడయ్యెను. (16)

ఊహింపనలవికాని ప్రజ్ఞాశాలియగు ఆరఘువీరుడు క్రుద్ధుడై, మూడు వడిగలశరములతో కొట్టి రాక్షసయోధుని మూడు శిరములను నేలపాలు గావించెను. వాని మూడు తలలును పడిపోగా రాముని శరములకు శిథిలమైన ఆ రాక్షసుని మొండెము నెత్తురోడుచు నేలపై కూలెను. (17-18)

ఖరునిసైనికులలో పెక్కుమంది సమరభూమికి బలికాగా మిగిలిన రాక్షసులు రామునిచేతిలో మిగుల దెబ్బతినిరి. అంతట వారు రణరంగమున నిలువజాలక పెద్దపులిభయమునకు పరుగులు దీయుచున్న లేళ్లవలె అచటినుండి పాఱిపోసాగిరి. అట్లు పాఱిపోవుచున్న ఆ రాక్షసులను జూచి ఖరుడు మిక్కిలి క్రుద్ధుడాయెను. వెంటనే అతడు వారిని మఱల్చి, స్వయముగా చంద్రునిపైకి రాహువువలె శ్రీరాముని మీదికి విజృంభించెను. (19-20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే సప్తవింశస్సర్గః *(27)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదిఏడవసర్గము.

— * * * —

28. ఇరువదిఎనిమిదవ సర్గము

ఖరునకును, శ్రీరామునకును మధ్య జరిగిన ఘోరయుద్ధము.

నిహతం దూషణం దృష్ట్వా రణే త్రిశిరసా సహ।
ఖరస్యాప్యభవత్ త్రాసో దృష్ట్వా రామస్య విక్రమమ్॥ 1

స దృష్ట్వా రాక్షసం సైన్యమ్ అవిషహ్యం మహాబలః।
హతమేకేన రామేణ త్రిశిరోదూషణావపి॥ 2

యుద్ధభూమియందు దూషణుడు, త్రిశిరుడు నిహతులగుట జూచి, ఖరుడు శ్రీరామునిపరాక్రమ ప్రభావమునకు మిగుల భయగ్రస్తుడాయెను. త్రిశిరదూషణులేగాక జయింపనలవికాని అపారమైన రాక్షససైన్యము ఒకే ఒక్క శ్రీరామునిచేతిలో తనకనులయెదుటనే హతమైపోవుటను మహాబలశాలియైన ఖరుడు వీక్షించెను. పదునాలుగువేలమంది

తద్బలం హతభూయిష్ఠం విమనాః ప్రేక్ష్య రాక్షసః।
ఆససాద ఖరో రామం నముచిర్వాసవం యథా। 3

వికృష్య బలవచ్చాపం నారాచాన్ రక్తభోజనాన్।
ఖరశ్చిక్షేప రామాయ క్రుద్ధాన్ ఆశీవిషానివ। 4

జ్యాం విధూన్వన్ సుబహుశః శిక్షయాస్త్రాణి దర్శయన్।
చకార సమరే మార్గాన్ శరై రథగతః ఖరః। 5

స సర్వాశ్చ దిశో బాణైః ప్రదిశశ్చ మహారథః।
పూరయామాస తం దృష్ట్వా రామోఽపి సుమహద్ధనుః। 6

సపాయకైర్దుర్విషహైః సస్ఫులింగైరివాగ్నిభిః।
నభశ్చకారావివరం పర్జన్య ఇవ వృష్టిభిః। 7

తద్బభూవ శితైర్బాణైః ఖరరామవిసర్జితైః।
పర్యాకాశమనాకాశం సర్వతః శరసంకులమ్। 8

శరజాలావృతః సూర్యో న తదా స్మ ప్రకాశతే।
అన్యోన్యవధసంరంభాత్ ఉభయోః సంప్రయుధ్యతోః। 9

తతో నాళీకనారాచైః తీక్ష్ణాగ్రైశ్చ వికర్ణిభిః।
ఆజఘాన ఖరో రామం తోత్రైరివ మహాద్విపమ్। 10

తం రథస్థం ధనుష్పాణిం రాక్షసం పర్యవస్థితమ్।
దదృశుః సర్వభూతాని పాశహస్తమివాంతకమ్। 11

హంతారం సర్వసైన్యస్య పౌరుషే పర్యవస్థితమ్।
పరిశ్రాంతం మహాసత్త్వం మేనే రామం ఖరస్తదా। 12

రాక్షసయోధులలో ప్రముఖులెల్లరును మృత్యువు వాతపడగా మిగిలియున్న తనబలములను, చూచి, ఆ ఖరుడు నీరుగారిపోయెను. అతనిగర్వమంతయును చల్లారెను. వెంటనే అతడు నముచియను(1) దానవుడు ఇంద్రునిమీదికి వెడలినట్లుగా శ్రీరామునిపైకి విజృంభించెను. ఖరుడు శక్తిమంతమైన తనధనుస్సును ఆకర్ణాంతము లాగి, రక్తపురుచికి అలవాటు పడిన మహాసర్పములవలె తీవ్రములైన బాణములను రామునిమీద ప్రయోగించెను. (1-4)

రణరంగమున రథమును అధిష్ఠించియున్న ఆఖరుడు శత్రుభయంకరముగా పలువిధముల ధనుష్టంకారము గావించుచు. వివిధమార్గములలో తనఅస్త్రవిద్యాపాటవమును ప్రదర్శింపసాగెను. (5)

ఆ రాక్షసవీరుడు ఇట్లు దశదిశలను తనబాణములతో నింపివేయుగా అప్పుడు శ్రీరాముడును తన మహాధనుస్సును ఎక్కుపెట్టి, దిక్కులన్నింటిని తనశరపరంపరతో ముంచెత్తెను. ఆరఘువీరుడు నిప్పురవ్వలను చిమ్మునట్టి అగ్నులవలె తీవ్రములైన తిరుగులేని తనబాణములచే వర్షధారలతో మేఘమువలె ఆకాశమును సందులేకుండా కప్పివేసెను. (6-7)

ఖరుడును, శ్రీరాముడును ప్రయోగించిన నిశితములైన బాణములచే ఆకాశము అంతయును నిండిపోగా అది అంతటను శరమయమై ఒప్పుచుండెను. ఆ ఇరువురును ఒకరినొకరు వధింపవలెననెడి ఆవేశకావేశములతో ప్రయోగించిన బాణములు నభోమండలమును కప్పివేయుగా సూర్యదర్శనమే కఱవయ్యెను. (8-9)

ఖరుడు మొనదేలియున్న ములుకులుగల బాణములతోడను, పదునైన అంచులుగల 'వికర్ణి' అను పేరుగల అస్త్రములతోడను, అంకుశములతో మదపుటేనుగునువలె శ్రీరాముని బాధించెను. (10)

ధనుర్బాణములను చేబూని, రథమున స్థిరముగా నిల్చియున్న ఆ రాక్షసుడు (ఖరుడు) సమస్త ప్రాణులకును పాశములను చేతబట్టియున్న యమునివలె కన్పట్టెను. అపారమైన రాక్షససైన్యమును హతమార్చి, అలిసి యున్నప్పటికిని సమరమున మహాపరాక్రమముతో స్థిరముగా నిలిచియున్న శ్రీరాముని జూచి, ఖరుడు 'ఆ రఘువీరుడు మహాశక్తిసంపన్నుడు' అని తలపోసెను. (11-12)

1) కశ్యపునివలన దనువునందు పుట్టిన వాడు నముచి. ఇతని భార్య ప్రభ - ఆర్ద్రమైన (పచ్చి) దానితోగాని, శుష్కమైన దానితోగాని ఇతడు చావడు. ఇది ఇతనికిగల వరము. దేవదానవుల యుద్ధములో ఇతడు ఇంద్రునిపై దాడి చేసెను. అప్పుడు ఇంద్రుడు వజ్రాయుధముతో ఇతనిని కొట్టెను. కాని వరప్రభావముతో నముచిపై అది పనిచేయక పోయెను. అంతట అప్పుడు ఆకాశవాణి ఇతనివరమును గూర్చి ఇంద్రునకు తెల్పెను. దేవేంద్రుడు (ఆర్ద్రముగానట్టి, శుష్కముగానట్టి) ఫేనముతో (నురుగుతో) నముచిని గొట్టెను. అప్పుడు అతడు మరణించెను.

తం సింహమివ విక్రాంతం సింహవిక్రాంతగామినమ్।
దృష్ట్వా నోద్విజతే రామః సింహః క్షుద్రమృగం యథా। 13

తతః సూర్యనికాశేన రథేన మహతా ఖరః।
ఆససాద రణే రామం పతంగ ఇవ పావకమ్। 14

తతోఽస్య సశరం చాపం ముష్టిదేశే మహాత్మనః।
ఖరశ్చిచ్ఛేద రామస్య దర్శయన్ పాణిలాఘవమ్। 15

స పునస్త్వపరాన్ సప్త శరానాదాయ వర్మణి।
నిజఘాన ఖరః క్రుద్ధః శక్రాశనిసమప్రభాన్। 16

తతస్తత్ప్రహతం బాణైః ఖరముక్తైః సుపర్వభిః।
పపాత కవచం భూమౌ రామస్యాదిత్యవర్చసః। 17

తతః శరసహస్రేణ రామమ్ అప్రతిమౌజసమ్।
అర్దయిత్వా మహానాదం ననాద సమరే ఖరః। 18

స శరైరర్పితః క్రుద్ధః సర్వగాత్రేషు రాఘవః।
రరాజ సమరే రామో విధూమోఽగ్నిరివ జ్వలన్। 19

తతో గంభీరనిర్హ్రాదం రామః శత్రునిబర్హణః।
చకారాంతాయ స రిపోః సజ్యమన్యత్ మహద్ధనుః। 20

సుమహద్వైష్ణవం యత్తత్ అతిసృష్టం మహర్షిణా।
వరం తద్ధనురుద్యమ్య ఖరం సమభిధావత। 21

తతః కనకపుంఖైస్తు శరైః సన్నతపర్వభిః।
బిభేద రామః సంక్రుద్ధః ఖరస్య సమరే ధ్వజమ్। 22

స దర్శనీయో బహుధా వికీర్ణః కాంచనధ్వజః।
జగామ ధరణీం సూర్యో దేవతానామివాజ్ఞయా। 23

తం చతుర్భిః ఖరః క్రుద్ధో రామం గాత్రేషు మార్గణైః।
వివ్యాధ యుధి మర్మజ్ఞో మాతంగమివ తోమరైః। 24

స రామో బహుభిర్బాణైః ఖరకార్ముకనిస్సృతైః।
విద్ధో రుధిరసిక్తాంగో బభూవ రుషితో భృశమ్। 25

సింహమువలె గంభీరగమనుడైన ఖరుడు మృగరాజువలె పరాక్రమించుచున్నప్పటికిని శ్రీరాముడు సింహము కుందేటిని జూచినట్లుగా అతనిని వీక్షించుచు చెక్కుచెదరక నిలిచియుండెను. (13)

కదనరంగమున సూర్యునివలె వెలుగొందుచున్న రథమును అధిరోహించియున్న ఖరుడు తనవినాశనముకై మిడుత అగ్నిమీదికి దూసికొని పోయినట్లు రాముని సమీపించెను. (14)

యుద్ధమున కొంచెముగా అలిసియున్న శ్రీరామునిపరాకును గమనించి, ఖరుడు తనహస్తలాఘవమును ప్రదర్శించుచు, మహావీరుడైన రఘువీరునిపిడికిటనున్న ధనుర్బాణములను ఖండించెను. క్రుద్ధుడైయున్న ఆ ఖరుడు ఇంకను ఇంద్రునివజ్రాయుధమువలె తీవ్రమైన ఏడు బాణములను తీసికొని శ్రీరామునికవచముపై కొట్టెను. (15-16)

సూర్యతేజస్సుతో విరాజిల్లుచున్న శ్రీరామునియొక్క కవచము ఖరుడు ప్రయోగించిన చక్కని కనుపులుగల బాణములదాటికి దెబ్బతిని నేలపైబడెను. (17)

పిమ్మట ఖరుడు రణరంగమున నిరుపమానమైన తేజస్సుతో ప్రకాశించుచున్న శ్రీరామునిపై అసంఖ్యాకములైన శరములను ప్రయోగించి, ఒక మహానాదమొనర్చెను.(18)

తనశరీరమునందంతటను ఖరుడు బాణములను ప్రయోగింపగా అంతట శ్రీరాముడు క్రుద్ధుడై పొగలు లేని అగ్నివలె ప్రకాశించుచు సమరభూమియందు విరాజిల్లెను. శత్రుసంహారసమర్థుడైన ఆ రఘువీరుడు ఖరుని పరిమార్చుటకై మఱియొక మహాచాపమును ఎక్కుపెట్టి గంభీరముగా ధనుష్టంకారమొనర్చెను. పిమ్మట శ్రీరాముడు తనకు అగస్త్య మహర్షి యొసంగిన, సర్వశ్రేష్ఠమైన వైష్ణవధనుస్సును చేతబట్టి ఖరుని మీదికి విజృంభించెను. (19-21)

అనంతరము శ్రీరాముడు రణభూమియందు వీరావేశముతో బంగారుపుంఖములతో (ఱెక్కలతో) ఒప్పుచు వంగినకనుపులుగల శరములను ప్రయోగించి, ఖరునిరథధ్వజమును ముక్కలు గావించెను. (22)

ఖరునిరథముమీదిబంగారుధ్వజము మిగుల రమ్యమై చూడముచ్చట గొల్పునది. అది రాముని బాణముయొక్క దెబ్బకు శిథిలమై, దేవతలఆజ్ఞమేరకు సూర్యుడే భూమికి దిగివచ్చినాడాయనునట్లు నేలమీద పడిపోయెను. (23)

అంతట ఖరుడు మిగులక్రుద్ధుడై, మావటివాడు చిన్న చిన్న ఈటెలతో మదగజమునువలె నాలుగు బాణములతో రామునిశరీరమును బాధించెను. అప్పుడు ఖరుని ధనుస్సునుండి వెలువడిన పెక్కు బాణములకు గాయపడిన రామునిశరీరము రక్తసిక్తమయ్యెను. అంతట ఆ రఘువరుడు ఎంతయు రోషావిష్టుడయ్యెను.(24-25)

స ధనుర్ధన్వినాం శ్రేష్ఠః ప్రగృహ్య పరమాహవే।
ముమోచ పరమేష్వాసః షట్ శరాన్ అభిలక్షితాన్। 26

శిరస్యేకేన బాణేన ద్వాభ్యాం బాహ్వోరథార్దయత్।
త్రిభిః చంద్రార్ధవక్త్రైశ్చ వక్షస్యభిజఘాన హ। 27

తతః పశ్చాన్మహాతేజా నారాచాన్ భాస్కరోపమాన్।
జిఘాంసూ రాక్షసం క్రుద్ధః త్రయోదశ సమాదదే। 28

తతోఽస్య యుగమేకేన చతుర్భిశ్చతురో హయాన్।
షష్ఠేన తు శిరః సంఖ్యే ఖరస్య రథసారథేః। 29

త్రిభిస్త్రివేణుం బలవాన్ ద్వాభ్యామక్షం మహాబలః।
ద్వాదశేన తు బాణేన ఖరస్య సశరం ధనుః। 30

ఛిత్త్వా వజ్రనికాశేన రాఘవః ప్రహసన్నివ।
త్రయోదశేనేంద్రసమో బిభేద సమరే ఖరమ్। 31

ప్రభగ్నధన్వా విరథో హతాశ్వో హతసారథిః।
గదాపాణిరవప్లుత్య తస్థౌ భూమౌ ఖరస్తదా। 32

తత్కర్మ రామస్య మహారథస్య
సమేత్య దేవాశ్చ మహర్షయశ్చ।
అపూజయన్ ప్రాంజలయః ప్రహృష్టాః
తదా విమానాగ్రగతాః సమేతాః। 33

అంతట ధనుర్ధారులలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు ఆ భీకరసమరమున తనమహాధనుస్సును చేతబట్టి, ప్రసిద్ధములైన ఆఱు బాణములను ఖరునిపై ప్రయోగించెను. వాటిలో ఒక బాణము ఖరునిశిరమును, రెండు శరములు వానిరెండుబాహువులను నొప్పించెను. అర్ధచంద్రాకారముగల మూడుబాణములు ఆ రాక్షసుని యొక్క వక్షస్థలమును గాయపఱచెను. (26-27)

మహాతేజశ్శాలియైన రఘువీరుడు ఖరుని చంపదలచినవాడై క్రోధావేశముతో సూర్యకిరణములవలె తీవ్రములైన పదుమూడు బాణములను ప్రయోగించెను. ఆ యుద్ధమున వాటిలో ఒకదానితో రథముయొక్క కాడిని. నాల్గింటితో రథమునకు పూన్చబడియున్న నాలుగు గుఱ్ఱములను భగ్నమొనర్చెను. ఆఱవబాణముతో ఖరునిరథసారథియొక్క శిరస్సును ఛేదించెను. మహాబలశాలియు, మిగుల పరాక్రమశాలియు ఐన శ్రీరాముడు మూడు బాణములచే రథముయొక్క పోలుగఱ్ఱను (నొగలును). రెండు శరములతో ఇరుసును ముక్కలుగావించెను. పండ్రెండవబాణముతో ఖరునిధనుర్బాణములను ఖండించెను. ఇంద్రసమానుడైన రఘువీరుడు వజ్రాయుధమువంటి తన పదుమూడవబాణమును ప్రయోగించి ఆ యుద్ధమున ఖరుని మిగుల గాయపఱచెను. (28-31)

శ్రీరామునిశరములధాటికి ఖరునియొక్క ధనుస్సు విఱిగి పోయెను. రథము భగ్నమాయెను. అశ్వములు నేలకొఱిగెను, సారథి హతుడయ్యెను. అప్పుడు అతడు చేయునది లేక రథముమీదినుండి దూకి, గదాపాణియై యుద్ధసన్నద్ధుడయ్యెను. (32)

అప్పుడు దేవతలు, మహర్షులు మున్నగువారు కూడి, విమానములపై అచటికి విచ్చేసిరి. వారు మహారథుడైన రఘువీరుడు ఖరాసురుని భంగపఱచిన తీరునకు ఎంతయు సంతసించిరి. పిదప వారందఱును ఆ ప్రభువునకు ప్రణతులర్పించి, కొనియాడిరి. (33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే అష్టావింశస్సర్గః *(28)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదియెనిమిదవసర్గము.

— * * * —

29. ఇరువదితొమ్మిదవసర్గము

ఖరుడును, శ్రీరాముడును పరస్పరము పరుషోక్తులాడుకొనుట - ఖరుడు శ్రీరామునిపై గదను ప్రయోగించుట - ఆ ప్రభువు దానిని తుత్తునియలు గావించుట.

ఖరం తు విరథం రామో గదాపాణిమ్ అవస్థితమ్।
మృదుపూర్వం మహాతేజాః పరుషం వాక్యమబ్రవీత్। 1

గజాశ్వరథసంబాధే బలే మహతి తిష్ఠతా।
కృతం సుదారుణం కర్మ సర్వలోకజుగుప్సితమ్। 2

ఉద్వేజనీయో భూతానాం నృశంసః పాపకర్మకృత్।
త్రయాణామపి లోకానామ్ ఈశ్వరోఽపి న తిష్ఠతి। 3

కర్మ లోకవిరుద్ధం తు కుర్వాణం క్షణదాచర!।
తీక్ష్ణం సర్వజనో హంతి సర్పం దుష్టమివాగతమ్। 4

లోభాత్ పాపాని కుర్వాణః కామాద్వా యో న బుధ్యతే।
భ్రష్టః పశ్యతి తస్యాంతం బ్రాహ్మణీ కరకాదివ। 5

వసతో దండకారణ్యే తాపసాన్ ధర్మచారిణః।
కిన్ను హత్వా మహాభాగాన్ ఫలం ప్రాప్స్యసి రాక్షస!। 6

న చిరం పాపకర్మాణః క్రూరా లోకజుగుప్సితాః।
ఐశ్వర్యం ప్రాప్య తిష్ఠంతి శీర్ణమూలా ఇవ ద్రుమాః। 7

అవశ్యం లభతే జంతుః ఫలం పాపస్య కర్మణః।
ఘోరం పర్యాగతే కాలే ద్రుమాః పుష్పమివార్తవమ్। 8

రథమును కోల్పోయి, గదను చేబూని సమరభూమి యందు నిలిచియున్న ఖరుని జూచి, మహాతేజశ్శాలియైన శ్రీరాముడు యుద్ధధర్మమును అనుసరించి, అతనితో హృదయవిదారకముముగా ఇట్లు పలికెను. (1)

"ఓ నిశాచరా! గజాశ్వరథబలములతో, కాల్బలములతో కూడిన సైన్యమునకు అధిపతివైన నీవు ఘోరకృత్యములకు పాల్పడితివి. ఈ దుష్కర్మను సమస్తలోకములును నిందించుకొనును. (2)

సమస్తప్రాణులకును భయమును గూర్చువాడు, హింసించువాడు, పాపకర్మలకు ఒడిగట్టువాడు అగుపురుషుడు ముల్లోకములకు అధిపతియైనను అతడు మృత్యువునుండి తప్పించుకొనజాలడు. ఇక నీవంటి అల్పునివిషయమై చెప్పనేల? లోకకంటకములైన భయంకరకర్మలను ఆచరించువానిని ఎంతటి దయగలవారైనను మీదికివచ్చిన దుష్టసర్పమునువలె చంపకమానరు. (3-4)

కామము[1]వలనగాని, లోభము[2]వలనగాని దుష్కృత్యములకు పాల్పడి, అందులకు పశ్చాత్తాపపడనివాడు తనసర్వైశ్వర్యములను కోల్పోవును. పైగా అతడు వడగండ్లను భక్షించిన నలికండ్లపాము[3]వలె దుర్మరణము చెందును. (అట్టివాడు తన మృత్యువును) తానే కొని తెచ్చుకొనిన వాడగును.) అట్లే నీవును మరణింతువు. (5)

ఓ రాక్షసుడా! దండకారణ్యమున ధర్మనిరతులై నివసించుచున్న మహానుభావులగు తాపసులను చంపి నీవు బావుకొనునదిమేమి? పాపకర్మలను ఒనరించునట్టి క్రూరులను లోకము గర్హించును. అట్టి పాపాత్ములు (పూర్వపుణ్యవిశేషముచే) ఐశ్వర్యములను పొందినను శిథిలములైన వ్రేళ్ళుగల చెట్లవలె త్వరలోనే నశింతురు. చెట్లు ఆయాఋతువులను అనుసరించి తగినవిధముగా పూవులను పండ్లను పొందినట్లు ప్రాణులు తమ పాపకృత్యములకు తగిన దుష్ఫలితములను (దుఃఖరూపఫలములను) తగిన సమయమురాగానే (నారిపాపములు పండగనే) తప్పక అనుభవింతురు. (6-8)

1) అప్రాప్తస్య ప్రాప్త్యాశా కామః = లేనిదానికై అఱ్ఱులుచాచుట కామము.
2) ప్రాప్తపర్యాశా లోభః = లభించిన దానితో తృప్తిపడక పేరాసకుబోవుట లోభము
3) బ్రాహ్మణీ = రక్తపుచ్ఛిక, నలికండ్లపాము. కరకము = వడగండ్లు. నలికండ్లపాము వడగండ్లను తిన్నచో వెంటనే చనిపోవును'- అని ప్రతీతి.

న చిరాత్ ప్రాప్యతే లోకే పాపానాం కర్మణాం ఫలమ్।
సవిషాణామివాన్నానాం భుక్తానాం క్షణదాచర! । 9

పాపమాచరతాం ఘోరం లోకస్యాప్రియమిచ్ఛతామ్।
అహమాసాదితో రాజ్ఞా ప్రాణాన్ హంతుం నిశాచర: । 10

అద్య హి త్వాం మయా ముక్తా శరా: కాంచనభూషణా:।
విదార్య నిపతిష్యంతి వల్మీకమివ పన్నగా: । 11

యే త్వయా దండకారణ్యే భక్షితా ధర్మచారిణ:।
తానద్య నిహత: సంఖ్యే ససైన్యోఽనుగమిష్యసి । 12

అద్య త్వాం పతితం బాణై: పశ్యంతు పరమర్షయ:।
నిరయస్థం విమానస్థా యే త్వయా హింసితా: పురా । 13

ప్రహర త్వం యథాకామం కురు యత్నం కులాధమ!।
అద్య తే పాతయిష్యామి శిరస్తాలఫలం యథా । 14

ఏవముక్తస్తు రామేణ క్రుద్ధ: సంరక్తలోచన:।
ప్రత్యువాచ ఖరో రామం ప్రహసన్ క్రోధమూర్ఛిత: । 15

ప్రాకృతాన్ రాక్షసాన్ హత్వా యుద్ధే దశరథాత్మజ!।
ఆత్మనా కథమాత్మానమ్ అప్రశస్యం ప్రశంససి । 16

విక్రాంతా బలవంతో వా యే భవంతి నరర్షభా:।
కథయంతి న తే కించిత్ తేజసా స్వేన గర్వితా: । 17

ప్రాకృతాస్త్వకృతాత్మానో లోకే క్షత్రియపాంసనా:।
నిరర్థకం వికత్థంతే యథా రామ! వికత్థసే । 18

కులం వ్యపదిశన్ వీర: సమరే కోఽభిధాస్యతి।
మృత్యుకాలే హి సంప్రాప్తే స్వయమప్రస్తవే స్తవమ్ । 19

ఓ నిశాచరా! విషపదార్థములను భుజించినవారివలె లోకమునందు పాపములను ఆచరించువారు వాటి ఫలములను వెంటనే పొందుదురు. ఓ రాక్షసుడా! మానవాళికి కీడును తలపెట్టుచు ఘోరములైన పాప కృత్యములకు పాల్పడెడి వారియొక్క ప్రాణములను తీయుటకే దశరథమహారాజు నన్ను ఈ దండకారణ్యమునకు పంపెను. (9-10)

ఓ ఖరుడా! సర్పములు పుట్టలో ప్రవేశించునట్లు నేను ప్రయోగించిన నా బంగారుబాణములు నీ శరీరమును నేడే చీల్చుకొనిపోవును (11)

నీ వలనమృతి చెందిన ధర్మాత్ములు వెళ్లిన లోకములకే నీవును ససైన్యముగా నాచే నిహతుడవై వెళ్లెదవు.[1],[2](ఏ పాపమూ ఎఱుగని ఆ పుణ్యాత్ములను చంపిన నీకు నేడు నాచేతిలో చావు తప్పదు.) (12)

నేడు నాబాణములదెబ్బకు నేలగూలి, నరకయాతనను (తీవ్రవేదనను) అనుభవించెడి నిన్ను పూర్వము నీచే చిత్రహింసలకు గుఱియైన మహర్షులు విమానములయందుండి చూచెదరుగాక- (13)

ఓ రాక్షసాధమా! నీయిష్టమువచ్చినట్లు యథాశక్తి నాపై బాణములను ప్రయోగింపుము. తాటిపండునువలె అవలీలగా నేడే నీ తలను నేలగూల్చెదను-" (14)

శ్రీరాముడిట్లు పలుకగా ఖరుడు మిగుల క్రుద్ధుడాయెను. అతనికన్నులెఱ్ఱబాఱెను. పిమ్మట అతడు ఆవేశముతో వికృతముగా నవ్వుచు రఘువరునకు ఇట్లు ప్రత్యుత్తర మిచ్చెను. (15)

"ఓ దాశరథీ! రణమునందు సాధారణసైనికులను జంపి, ఒక మహావీరునివలె నిన్ను నీవు శ్లాఘించు కొనుచుంటివి. నిజముగా నీవు చేసిన యుద్ధము ఏమాత్రమూ ప్రశంసార్హముగాదు. యథార్థముగా పరాక్రమవంతులు, బలశాలులు ఐన నరశ్రేష్ఠులు తమశక్తిసామర్థ్యములకు గర్వింపరు. వాటినిగూర్చి ఏమాత్రము ప్రస్తావింపరు. ఓ రామా! లోకమున కించిత్తైనను ప్రతిభాపటిమలు లేని క్షుద్రులైన క్షత్రియాధములుమాత్రమే నీవలె వ్యర్థముగా ప్రగల్భములను పలుకుచుందురు. (16-18)

యుద్ధమున మృత్యువాసన్నమైయుండగా వీరుడైనవాడు ఎవ్వడును తనవంశప్రతిష్ఠనుగూర్చి, తనను గుఱించి అప్రస్తుతముగా గొప్పలు చెప్పికొనడు. కాల్పబడిన కుశలు

1) యుద్ధమువలన మరణించినవారు 'వీరస్వర్గమును' అలంకరింతురు.
2) శ్లో॥ రామవిద్ధా నిశిచరా బాణైర్మర్మసు తాడితా: । రామమాసాద్య సమరే సాయుజ్యపదనీం గతా: ॥
పాపకర్ములైన రాక్షసులుసైతము సమరమున శ్రీరామునిబాణములకు గుఱియై మరణించినచో, వారు రాముని చేరి సాయుజ్యముక్తిని పొందుదురు- స్కాంద పురాణము-(తత్త్వ దీపిక)

సర్వథైవ లఘుత్వం తే కత్థనేన విదర్శితమ్।
సువర్ణప్రతిరూపేణ తప్తేనేవ కుశాగ్నినా। 20

న తు మామిహ తిష్ఠంతం పశ్యసి త్వం గదాధరమ్।
ధరాధరమివాకంప్యం పర్వతం ధాతుభిశ్చితమ్। 21

పర్యాప్తోఽహం గదాపాణిః హంతుం ప్రాణాన్ రణే తవ।
త్రయాణామపి లోకానాం పాశహస్త ఇవాంతకః। 22

కామం బహ్వపి వక్తవ్యం త్వయి వక్ష్యామి న త్వహమ్।
అస్తం గచ్ఛేద్ధి సవితా యుద్ధవిఘ్నస్తతో భవేత్। 23

చతుర్దశ సహస్రాణి రాక్షసానాం హతాని తే।
త్వద్వినాశాత్ కరోమ్యేష తేషామశ్రుప్రమార్జనమ్। 24

ఇత్యుక్త్వా పరమక్రుద్ధః తాం గదాం పరమాంగదః।
ఖరశ్చిక్షేప రామాయ ప్రదీప్తామ్ అశనిం యథా। 25

ఖరబాహుప్రముక్తా సా ప్రదీప్తా మహతీ గదా।
భస్మవృక్షాంశ్చ గుల్మాంశ్చ కృత్వాఽగాత్ తత్సమీపతః। 26

తామాపతంతీం జ్వలితాం మృత్యుపాశోపమాం గదామ్।
అంతరిక్షగతాం రామః చిచ్ఛేద బహుధా శరైః। 27

సా విశీర్ణా శరైర్భగ్నా పపాత ధరణీతలే।
గదా మంత్రౌషధబలైః వ్యాళీవ వినిపాతితా। 28

క్షణకాలముపాటు బంగారువన్నెతో ప్రకాశించియు, మఱుక్షణమునందే అవి తమతేజస్సును కోల్పోవునట్లు ఆత్మస్తుతి చేసికొనుటవలన నీ అల్పత్వమే ప్రదర్శితమగును. (19-20)

వివిధములగు గైరికాదిధాతువులచే వ్యాప్తమై, భూభారమును వహించుచు నిశ్చలముగానున్న పర్వతమువలె శత్రువులరక్తపుచారికలుగల గదను ధరించి, ఈ యుద్ధభూమియందు నీయెదుట స్థిరముగా నిల్చియున్న నన్ను నీవు చూచుటలేదా? పాశములను చేబూని, ముల్లోకములలోని ప్రాణులను అంతమొందించునట్టి యమునివలె ఈ రణరంగమున నీ ప్రాణములను హరించుటకు గదాపాణినైన నేను ఒక్కడనే చాలుదును- (21-22)

నీవిషయమున (నిన్నుగూర్చి) చెప్పవలసినది ఇంకను చాలాకున్నది. కానీ నేను చెప్పను. ఎందులకనగా సూర్యుడు అస్తమింపబోవుచున్నాడు. సూర్యాస్తమయమైనచో యుద్ధమునకు విఘ్నము వాటిల్లును. నీవు పదునాలుగువేలమంది రాక్షసయోధులను హతమార్చితివి. కనుక నిన్ను చంపి, దానికి ప్రతీకారము తీర్చుకొని, వారిబంధుమిత్రులకన్నీరు తుడిచెదను." (23-24)

ఇట్లు పలికి, శ్రేష్ఠమైన కేయూరములుగల ఖరుడు మిగుల క్రోధావేశముతో నిప్పులుగ్రక్కుచు వజ్రాయుధము వంటి (తన) గదను రామునిమీదికి విసరెను. (25)

ఖరునిచే ప్రయుక్తమై, మంటలను చిమ్ముచున్న బలిష్ఠమైన ఆగద వృక్షములను, పొదలను భస్మమొనర్చుచు శ్రీరాముని సమీపించెను. అంతట శ్రీరాముడు, అగ్నికణములను చిమ్ముచు యమపాశతుల్యమై అంతరిక్షమునుండి తనవైపునకు వచ్చుచున్న ఆగదను తనబాణములచే తుత్తునియలు గావించెను. (26-27)

శ్రీరామునిబాణములధాటికి ముక్కలైన ఆగద మంత్రములయొక్క, ఓషధులయొక్క ప్రభావమున దెబ్బతినిన సర్పమువలె నేలపాలాయెను. (28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకోనత్రింశస్సర్గః (29)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఇరువదితొమ్మిదవసర్గము.

-- * * * --

30. ముప్పదియవసర్గము

శ్రీరాముడు ఖరుని వధించుట - దేవతలు, మునులు ఆ ప్రభువును కొనియాడుట - సీతాదేవి పరమానందభరితురాలగుట.

భిత్త్వా తు తాం గదాం బాణై రాఘవో ధర్మవత్సలః।
స్మయమానః ఖరం వాక్యం సంరబ్ధమ్ ఇదమబ్రవీత్। 1

ఏతత్ తే బలసర్వస్వం దర్శితం రాక్షసాధమ!।
శక్తిహీనతరో మత్తో వృథా త్వమవగర్జసి। 2

ఏషా బాణవినిర్భిన్నా గదా భూమితలం గతా।
అభిధానప్రగల్భస్య తవ ప్రత్యరిఘాతినీ। 3

యత్త్వయోక్తం వినష్టానామ్ అహమశ్రుప్రమార్జనమ్।
రాక్షసానాం కరోమీతి మిథ్యా తదపి తే వచః। 4

నీచస్య క్షుద్రశీలస్య మిథ్యావృత్తస్య రక్షసః।
ప్రాణాన్ అపహరిష్యామి గరుత్మానమృతం యథా। 5

అద్య తే భిన్నకంఠస్య ఫేనబుద్బుదభూషితమ్।
విదారితస్య మద్బాణైః మహీ పాస్యతి శోణితమ్। 6

పాంసురూషితసర్వాంగః స్రస్తన్యస్తభుజద్వయః।
స్వప్స్యసే గాం సమాలింగ్య దుర్లభాం ప్రమదామివ। 7

ప్రవృద్ధనిద్రే శయితే త్వయి రాక్షసపాంసనే।
భవిష్యంత్యశరణ్యానాం శరణ్యా దండకా ఇమే। 8

జనస్థానే హతస్థానే తవ రాక్షస! మచ్ఛరైః।
నిర్భయా విచరిష్యంతి సర్వతో మునయో వనే। 9

అద్య విప్రసరిష్యంతి రాక్షస్యో హతబాంధవాః।
బాష్పార్ద్రవదనా దీనా భయాదన్యభయావహాః। 10

ఆగదను ఛిన్నాభిన్నమొనర్చినపిదప ధర్మాత్ముడైన (నిరాయుధుని వధించుట అనుచితము- అనిభావించునట్టి) శ్రీరాముడు చిరునవ్వు చిందించుచు సంభ్రమాశ్చర్యములకు లోనైయున్న ఖరునితో ఇట్లనెను. (1)

"ఓ రాక్షసాధమా! నీబలమును అంతయును ప్రదర్శించితివి గదా! ఇదియేనా నీబలము? నీవు మిక్కిలి శక్తిహీనుడవయ్యును వ్యర్థముగా ప్రగల్భములను పలుకుచున్నావు. (2)

'ఈగద శత్రువులను పరిమార్చుటలో తిరుగులేనిది-' అని నీవు ఇంతవఱకును బీరములాడుచుంటివిగదా!. కాని అది నాబాణములదెబ్బకు ముక్కలుముక్కలై నేలపాలైనదిసుమా! (3)

'రణభూమికి బలియైన రాక్షసులయొక్క బంధుమిత్రుల కన్నీటిని తుడిచెదను' అని నీవు పలికియుంటివి. ఆ పలుకులన్నియును కల్లలైనవిగదా! (4)

నీవు నీచుడవు, హీనస్వభావుడవు, దుష్ప్రవర్తనుడవు, రాక్షసుడవు. కనుక నేను నీ ప్రాణములను గరుత్మంతుడు అమృతమునువలె హరించివేసెదను. (5)

నేడు నాబాణములతో నీయుదరమును ఛేదించెదను. నీ కంఠమును ఖండించెదను. నీ శరీరమునుండి స్రవించుచు, నురుగులతో బుడగలతో ఒప్పెడి వెచ్చనిరక్తమును భూమి పానముచేయగలదు. (6)

ఈదెబ్బతో నీశరీరావయవములు అన్నియును దుమ్ముకొట్టుకొని పోవును. నీ రెండుభుజములును శరీరమునుండి వేఱై దూరముగా పడిపోవును. అతికష్టముపై లభించిన తరుణినివలె నీవు భూమిని కౌగలించుకొని దీర్ఘనిద్రలో మునుగుదువు. ఓ రాక్షసాధమా! నీవు మరణించుటతో నీవలన బాధలుపడుచు రక్షణ కఱవైయున్న ఋష్యాదులకు ఈదండకారణ్యములు సుఖావహములై నివాసభూములగును.(7-8)

ఓ రాక్షసుడా! నాబాణములధాటికి దండకారణ్యము నందలి రాక్షసులందఱును నిహతులైన పిమ్మట మునులు ఎల్లరును ఈ ప్రదేశమునందు నిర్భయముగా సంచరింతురు.(9)

ఇంతవరకును ఇతరులకు భయమును గొలుపుచువచ్చిన రాక్షసస్త్రీలు తమకు ఆత్మీయులైన రాక్షసయోధులందఱును మృతిచెందుటతో కన్నీరుమున్నీరుగా విలపించుచు దిక్కులేనివారై, నాభయమునకు ఇచటఉండజాలక ఎటువారటు పాఱిపోవుదురు. (10)

అద్య శోకరసజ్ఞాస్తా భవిష్యంతి నిరర్థకాః।
అనురూపకులాః పత్న్యో యాసాం త్వం పతిరీదృశః। 11

నృశంస! నీచ! క్షుద్రాత్మన్ నిత్యం బ్రాహ్మణకంటక!।
యత్కృతే శంకితైరగ్నౌ మునిభిః పాత్యతే హవిః। 12

తమేవమభిసంరబ్ధం బ్రువాణం రాఘవం రణే।
ఖరో నిర్భర్త్సయామాస రోషాత్ ఖరతరస్వనః। 13

దృఢం ఖల్వవలిప్తోఽసి భయేష్వపి చ నిర్భయః।
వాచ్యావాచ్యం తతో హి త్వం మృత్యువశ్యో న బుధ్యసే। 14

కాలపాశపరిక్షిప్తా భవంతి పురుషా హి యే।
కార్యాకార్యం న జానంతి తే నిరస్తషడింద్రియాః। 15

ఏవముక్త్వా తతో రామం సంరుధ్య భ్రుకుటిం తతః।
స దదర్శ మహాసాలమ్ అవిదూరే నిశాచరః।
రణే ప్రహరణస్యార్థే సర్వతో హ్యవలోకయన్। 16

స తముత్పాటయామాస సందశ్య దశనచ్ఛదమ్।
తం సముత్క్షిప్య బాహుభ్యాం వినద్య చ మహాబలః। 17

రామముద్దిశ్య చిక్షేప హతస్త్వమితి చాబ్రవీత్। 18

తమాపతంతం బాణౌఘైః ఛిత్త్వా రామః ప్రతాపవాన్।
రోషమాహారయత్ తీవ్రం నిహంతుం సమరే ఖరమ్। 19

జాతస్వేదస్తతో రామో రోషాద్రక్తాంతలోచనః।
నిర్బిభేద సహస్రేణ బాణానాం సమరే ఖరమ్। 20

తస్య బాణాంతరాద్రక్తం బహు సుస్రావ ఫేనిలమ్।
గిరేః ప్రస్రవణస్యేవ తోయధారాపరిస్రవః। 21

విహ్వల స్స కృతో బాణైః ఖరో రామేణ సంయుగే।
మత్తో రుధిరగంధేన త మేవాభ్యద్రవద్ద్రుతమ్। 22

దుష్టుడవైన నిన్ను పతిగా పొందిన నీ భార్యలందఱును నీవలె దుష్ప్రవర్తన కలవారైరి. (క్రూరజీవనలైరి) నీమరణ కారణముగా వారు కామపురుషార్థమునకు దూరమై (సర్వసుఖములను కోల్పోయి) శోకమున మునింగి విలవిలలాడుదురు. (11)

ఓ ఖరా! నీవు క్రూరుడవు, నీచుడవు, క్షుద్రమైనబుద్ధిగలవాడవు, నిత్యము బ్రాహ్మణులను బాధించువాడవు. కనుక నీవలన ఎప్పుడు ఏ ప్రమాదము వచ్చిపడునో' యను భయసందేహములతో మునీశ్వరులు వణకిపోవుచునే అగ్నికి హవిస్సులను అర్పించుచుందురు. (12)

రణరంగమున తనకు తత్తరపాటును గూర్చుచు రాముడు ఇట్లు పలుకుచుండగా ఖరుడు మిక్కిలి రోషావేశములకు లోనై ఆయనను భయపెట్టుచు ఈ విధముగా పరుషోక్తులాడెను. (13)

"ఓయీ! నిజముగా నీవు అహంకారివి. భయపడవలసిన సమయమునందును నిర్భయుడవై, మంచి చెడ్డలుమఱచి మాట్లాడుచున్నావు. నీకు మృత్యువు ఆసన్నమైయున్నట్లు ఎఱుంగకున్నావు. కాలపాశబద్ధులైన వారు (ఆయువు మూడినవారు) వివేకమును కోల్పోయి (జ్ఞానేంద్రియములు పనిచేయక) కార్యాకార్యవిచక్షణకు దూరమగుదురు". (14-15)

రామునితో ఇట్లు పలికిన పిమ్మట, ఆ నిశాచరుడు క్రుద్ధుడై బొమముడివైచి, రణమున రామునిని దెబ్బతీయుటకు (యుద్ధ) సాధనమునకై అంతటను కలయజూచెను. అప్పుడతనికి సమీపముననే ఒక మద్దిచెట్టు కన్పించెను. అంతట మహాబలశాలియైన ఆ ఖరుడు పెదవులు బిగబట్టి, తన రెండు చేతులతో ఆ చెట్టు బోదెను గట్టిగా పట్టుకొని, బిగ్గరగా అఱచుచు దానిని పెకలించెను. పిదప దానిని రామునిపై విసరివేయుచు ఓయీ! రామా! ఇకనీవు చచ్చినట్లే' అని పలికెను. (16-18)

అప్పుడు మహాపరాక్రమశాలియైన శ్రీరాముడు తనమీదికి వచ్చుచున్న ఆ వృక్షమును (తన) బాణములతో ముక్కలుగావించి, సమరమున ఆ రాక్షసుని హతమొనర్చుటకై మిక్కిలి రోషావేశపరుడాయెను. క్రుద్ధుడైన శ్రీరామునిమేను చెమర్చెను, కన్నులెఱ్ఱబాఱెను, వెయ్యిబాణములను ప్రయోగించి ఆ రఘువీరుడు ఖరుని చీల్చిచెండాడెను. (19-20)

రామునిబాణములకు ఖరునిశరీరమున ఏర్పడిన గాయములనుండి నురగలతోగూడిన రక్తము, ప్రస్రవణగిరి నుండి ప్రవహించెడి జలధారలవలె ఎడతెఱపి లేకుండ స్రవింపసాగెను. (21)

యుద్ధభూమియందు శ్రీరామునిబాణములతాకిడికి ఆ ఖరుడు వ్యాకులపాటునకు లోనయ్యెను. అంతట అతడు రెచ్చిపోయినవాడై రక్తధారలతోడనే రామునిమీదికి

తమాపతంతం సంరబ్ధం కృతాస్త్రం రుధిరాప్లుతమ్।
అపాసర్పత్ ప్రతిపదం కించిత్ త్వరితవిక్రమః। 23

తతః పావకసంకాశం వధాయ సమరే శరమ్।
ఖరస్య రామో జగ్రాహ బ్రహ్మదండమివాపరమ్। 24

స తం దత్తం మఘవతా సురరాజేన ధీమతా।
సందధే చాపి ధర్మాత్మా ముమోచ చ ఖరం ప్రతి। 25

స విముక్తో మహాబాణో నిర్ఘాతసమనిస్వనః।
రామేణ ధనురాయమ్య ఖరస్యోరసి చాపతత్। 26

స పపాత ఖరో భూమౌ దహ్యమానః శరాగ్నినా।
రుద్రేణేవ వినిర్దగ్ధః శ్వేతారణ్యే యథాఽంధకః। 27

స వృత్ర ఇవ వజ్రేణ ఫేనేన నముచిర్యథా।
బలో వేంద్రాశనిహతో నిపపాత హతః ఖరః। 28

తతో రాజర్షయః సర్వే సంగతాః పరమర్షయః।
సభాజ్య ముదితా రామమ్ ఇదం వచనమబ్రువన్। 29

ఏతదర్థం మహాతేజా మహేంద్రః పాకశాసనః।
శరభంగాశ్రమం పుణ్యమ్ ఆజగామ పురందరః। 30

ఆనీతస్త్వమిమం దేశమ్ ఉపాయేన మహర్షిభిః।
ఏషాం వధార్థం క్రూరాణాం రక్షసాం పాపకర్మణామ్। 31

తదిదం నః కృతం కార్యం త్వయా దశరథాత్మజ!।
సుఖం ధర్మం చరిష్యంతి దండకేషు మహర్షయః। 32

ఏతస్మిన్నంతరే దేవాః చారణైః సహ సంగతాః।
దుందుభీంశ్చాభినిఘ్నంతః పుష్పవర్షం సమంతతః।
రామస్యోపరి సంహృష్టా వవృషుర్విస్మితాస్తదా। 33

ఒక్కయుదుటున విజృంభించెను. నెత్తురోడుచున్న శరీరముతో అతిక్రుద్ధుడై విజృంభించి, తనను సమీపించిన ఖరుని సంహరించుటకు అనువుగా అస్త్రసన్నద్ధుడైయున్న రఘువీరుడు వెంటనే రెండడుగులు వెనుకకు జరిగెను.(22-23)

పిమ్మట శ్రీరాముడు రణరంగమున ఖరుని వధించుటకై అగ్నితుల్యమై (నిప్పులుగ్రక్కుచు) మఱియొక బ్రహ్మాస్త్రమాయుననట్లు ఒప్పుచున్న ఒకబాణమును గ్రహించెను. భావగ్రాహియైన ఇంద్రుడు (అగస్త్యుని ద్వారా) శక్తిమంతమైన అస్త్రమును శ్రీరామునకు ప్రసాదించెను. రఘువీరుడు ఆ అస్త్రమును సంధించి, ఖరునిపై ప్రయోగించెను. శ్రీ రాముడు ఆ బాణమును ఆకర్ణాంతము లాగి వదలెను. అప్పుడది పిడుగువలె భయంకరధ్వని గావించుచు ఖరునివక్షః స్థలమును చీల్చెను. (24-26)

శ్వేతారణ్యమున[1] పరమశివునికంటిమంటకు అంధకాసురుడు భస్మమైనట్లు[2] శ్రీరామునిశరాగ్నికి ఖరాసురుడు దగ్ధమై నేలకొఱిగెను. ఇంద్రుని వజ్రాయుధముయొక్క దెబ్బకు వృత్రాసురుడు బలాసురుడు హతులైనట్లుగను, ఫేనము (నురుగు) చే నముచి మృతుడైన విధముగను శ్రీరామునిబాణముచే ఖరుడు నిహతుడై నేలపాలాయెను. (27-28)

శ్రీరాముడు ఖరుని తుదముట్టించినందులకు మిగుల సంతసించి రాజర్షులు, బ్రహ్మర్షులును అచటికి చేరి, శ్రీరాముని ఆరాధించిరి. పిమ్మట వారు ఆయనతో ఇట్లు నుడివిరి. (29)

" ఓ రామా! మహాతేజస్వియు, పాకశాసనుడును ఐన దేవేంద్రుడు ఈ ఖరసంహారమునకై పవిత్రమైన శరభంగాశ్రమమునకు విచ్చేసెను. పాపాత్ములును, క్రూరులును ఐన ఈ రాక్షసులను హతమార్చుటకై మహర్షులు ఉపాయముగా (ఆశ్రమదర్శనమిషతో) నిన్ను ఇచటికి తీసికొని వచ్చిరి. ఓ రఘువరా! ఈ ఘనకార్యమును (రాక్షసవధను) ఒనర్చి మాకు మేలుచేసితివి. ఇప్పుడిక మునీశ్వరులు అందఱును ఈ దండకారణ్యములయందు తమతమధర్మములను నిర్వర్తించుకొనగలరు."(30-32)

ఇంతలో దేవతలును, చారణులును అచటికి చేరిరి. వారు ఆశ్చర్యానందములతో దుందుభులను మ్రోగించుచు అన్ని వైపులనుండియు శ్రీరామునిపై పుష్పవృష్టిని గురిపించిరి. (33)

1) కావేరీనది సముద్రమున సంగమించు ప్రదేశమునకు సమీపమునగల అరణ్యమును 'శ్వేతారణ్యము' అని అందురు.
2) అంధకాసురుడు సింహికా విప్రచిత్తులకుమారుడు. ఇతడు తీవ్రమైన తపస్సు చేసి బ్రహ్మదేవునినుండి గొప్పవరములను పొందెను. వరగర్వితుడైన ఈ దనుజుడు సుందరీమణులను బాధింపసాగెను. కామపరవశుడై ఇతడు పార్వతీదేవిని ఆశించెను. ఆ సందర్భమున ఈ అంధకాసురుని శివుడు సంహరించెను.

అర్ధాధికముహూర్తేన రామేణ నిశితైః శరైః।
చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్॥ 34

ఖరదూషణముఖ్యానాం నిహతాని మహాహవే।
అహో! బత! మహత్ కర్మ రామస్య విదితాత్మనః॥ 35

అహో! వీర్యమహో! దాక్ష్యం విష్ణోరివ హి దృశ్యతే।
ఇత్యేవ ముక్త్వా తే సర్వే యయుర్దేవా యథాగతమ్॥ 36

శ్రీరాముడు వాడియైన తనబాణపరంపరచే ఖరదూషణాది ప్రముఖరాక్షసులతోపాటు క్రూరకర్ములైన పదునాలుగు వేలమంది రాక్షసయోధులను మూడుగడియలలో (ఒకటిన్నర ముహూర్తకాలములో) మహాసంగ్రామమున మట్టిగలిపించెను. భళీ! నిరుపమాన పరాక్రమశాలియైన శ్రీరాముడు ఎంతటి ఘనకార్యము ఒనర్చినాడు? రఘువీరుడు ప్రకటించిన పరాక్రమము, శత్రుసంహార సామర్థ్యము విష్ణువుయొక్క శౌర్యమును, రణకౌశలమును తలపింపజేయుచున్నవి" అని పలికి, దేవతలు, మునులు మొదలగు వారందఱును తమతమస్థానములకు వెళ్ళిరి. (34-36)

తతస్మిన్నంతరే వీరో లక్ష్మణః సహ సీతయా।
గిరిదుర్గాద్వినిష్క్రమ్య సంవివేశాశ్రమం సుఖీ॥ 37

తతో రామస్తు విజయీ పూజ్యమానో మహర్షిభిః।
ప్రవివేశాశ్రమం వీరో లక్ష్మణేనాభిపూజితః॥ 38

ఇంతలో వీరుడైన లక్ష్మణుడు సీతాదేవిని వెంటనిడుకొని, పర్వతగుహనుండి వెలుపలికి వచ్చి తిన్నగా ఆశ్రమమున ప్రవేశించెను. పిమ్మట మహావీరుడైన శ్రీరాముడు రాక్షససంహారము గావించి విజయుడై, మహర్షుల ప్రశంసలనందుకొని, ఆశ్రమమున అడుగిడెను. అంత లక్ష్మణుడు ఆ ప్రభువును పూజించెను. (37-38)

తం దృష్ట్వా శత్రుహంతారం మహర్షీణాం సుఖావహమ్।
బభూవ హృష్టా వైదేహీ భర్తారం పరిషస్వజే॥ 39

ముదా పరమయా యుక్తా దృష్ట్వా రక్షోగణాన్ హతాన్।
రామం చైవావ్యథం దృష్ట్వా తుతోష జనకాత్మజా॥ 40

మహావీరుడైన శ్రీరాముడు అపారమైన రాక్షససైన్యమును మూడుగడియలలోనే రూపుమాపెను. మహర్షులందఱికిని భయమును తొలగించి ఊరట గూర్చెను. తన భర్తయొక్క అపూర్వ విజయమునకును, తనపతియొక్క అత్యద్భుతమైన శౌర్యపరాక్రమవైభవములకును జానకి పరమానందభరితురాలయ్యెను. అంతట ఆ దేవి చెక్కుచెదరనినిబ్బరముతోనున్న తనప్రాణేశ్వరుని పట్టరాని సంతోషముతో కౌగలించుకొనెను. (39-40)

తతస్తు తం రాక్షససంఘమర్దనం
సభాజ్యమానం ముదితైర్మహర్షిభిః।
పునః పరిష్వజ్య శశిప్రభాననా
బభూవ హృష్టా జనకాత్మజా తదా॥ 41

రాక్షసయోధులసమూహములను తుత్తునియలు గావించిన శ్రీరాముని మహర్షులెల్లరును నిర్భరానందముతో పూజించిరి. అప్పుడు చంద్రునిబోలు ముఖకాంతులుగల సీతాదేవి తన భర్తను మఱల మఱల తనహృదయమునకు హత్తుకొని సంతోషపరవశయయ్యెను.(1) (41)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే త్రింశస్సర్గః (30)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదియవసర్గము.

-- * * * --

1) శ్రీరాముడు నిరుపమానమైన తనశౌర్యపరాక్రమములచే అపారమైన శత్రుసైన్యమును మూడుగడియలలో రూపుమాపి విజయమును సాధించినందులకు జానకీదేవి పరమానందభరితురాలయ్యెను.

2) 'అర్ధాంగీ పురుషస్య దారాః' అను ప్రమాణవచనమును అనుసరించి, భర్తవిజయమును తనవిజయముగా భావించి, ఆమె సంతోషముతో పొంగిపోయెను.

3) జగజ్జననియైన సీతాదేవికి మహర్షులు పుత్త్రులవంటివారు. రఘువరుడు రాక్షసులబారినుండి వారిని రక్షించుటవలన ఆమె సంతోషపరవశయయ్యెను. పుత్త్రులకు రక్షణ ఏర్పడినప్పుడు ప్రతితల్లియు ఆనందించుట సహజమే గదా! ఆ ఆనందపారవశ్యములో సీతాదేవి తనపతిని పదేపదే కౌగలించుకొనెను.

31. ముప్పదియొకటవసర్గము

ఖరదూషణాదులు శ్రీరాముని చేతిలో హతులైన విషయమును అకంపనుడు రావణునకు తెల్పుట - అకంపనుని సూచనపై రావణుడు సీతాపహరణమునకై సంకల్పించుట - పిమ్మట అతడు మారీచుని సహాయమర్థించుట - మారీచుని వచనములకు మెత్తబడి దశకంఠుడు తిరిగి లంకకు చేరుట.

త్వరమాణస్తతో గత్వా జనస్థానాదకంపనః।
ప్రవిశ్య లంకాం వేగేన రావణం వాక్యమబ్రవీత్। 1

జనస్థానస్థితా రాజన్ రాక్షసా బహవో హతాః।
ఖరశ్చ నిహతః సంఖ్యే కథంచిదహమాగతః। 2

ఏవముక్తో దశగ్రీవః క్రుద్ధః సంరక్తలోచనః।
అకంపనమువాచేదం నిర్దహన్నివ చక్షుషా। 3

కేన రమ్యం జనస్థానం హతం మమ పరాసునా।
కో హి సర్వేషు లోకేషు గతిం చాధిగమిష్యతి। 4

నహి మే విప్రియం కృత్వా శక్యం మఘవతా సుఖమ్।
ప్రాప్తుం వైశ్రవణేనాపి న యమేన న విష్ణునా। 5

కాలస్య చాప్యహం కాలో దహేయమపి పావకమ్।
మృత్యుం మరణధర్మేణ సంయోజయితుముత్సహే। 6

దహేయమపి సంక్రుద్ధః తేజసాఽఽదిత్యపావకౌ।
వాతస్య తరసా వేగం నిహంతుమ్ అహముత్సహే। 7

తథా క్రుద్ధం దశగ్రీవం కృతాంజలిరకంపనః।
భయాత్ సందిగ్ధయా వాచా రావణం యాచతేఽభయమ్। 8

దశగ్రీవోఽభయం తస్మై ప్రదదౌ రక్షసాం వరః।
స విస్రబ్ధోఽబ్రవీద్వాక్యమ్ అసందిగ్ధమ్ అకంపనః। 9

పుత్రో దశరథస్యాస్తి సింహసంహననో యువా।
రామో నామ వృషస్కంధో వృత్తాయతమహాభుజః। 10

రావణునిగూఢచారులలో ఒకడైన అకంపనుడు జనస్థానమునుండి త్వరత్వరగా బయలుదేఱి, ప్రత్యేకవార్తలతో మిగులవేగముగా లంకకుచేరి రావణునితో ఇట్లనెను. (1)

"ఓ మహారాజా! జనస్థానమునందు యుద్ధమున ఖరునితోగూడ పెక్కు (పదునాలుగువేల) మంది రాక్షసయోధులు నిహతులైరి. నేను అతికష్టముమీద (చావుదప్పి కన్నులొట్టబోయి) ఇక్కడికి రాగలిగితిని." (2)

అకంపనుడు ఇట్లు పలికిన వెంటనే దశగ్రీవుడు క్రుద్ధుడై కన్నులెఱ్ఱజేసెను. అతడు తనచూపులలో నిప్పులను గురిపించుచు (మండిపడుచు) ఆ గూఢచారితో ఇట్లు నుడివెను. (3)

"మనోహరమైన నా జనస్థానమును ఎవడు హతమొనర్చెను? వానికిక నూకలుచెల్లినట్లే. అంతేగాదు వానికి ఏలోకము నందును నిలువనీడలేకుండ జేసెదను. నాకు అప్రియము. (అపకారము) ఒనర్చినవాడు ఇంద్రుడైనను, కుబేరుడైనను, యముడైనను, కడకు విష్ణువేయైనను వానికి మనశ్శాంతి (సుఖము) కఱవగును. (4-5)

నేను యమునికే యముడను. (యముని కాలరాచెదను) అగ్నిని సైతము దహించివేసెదను. మృత్యుదేవతనుగూడ చావగొట్టెదను. నాకు కోపము వచ్చినచో నా తేజస్సుచే సూర్యాగ్నులను ఇద్దరిని ఒక్కుమ్మడిగా భస్మమొనర్చెదను. నా పరాక్రమముతో వాయువుయొక్క వేగమునుగూడ నిరోధింపగలను." (6-7)

ఆ విధముగా క్రుద్ధుడై నిప్పులుగ్రక్కుచున్న దశగ్రీవునకు అకంపనుడు ప్రణమిల్లి, భయముతో వణకుచు మాటలు తడబడుచుండగా 'దయజూడుము' అనుచు అతనిని శరణువేడెను. (8)

రాక్షసేశ్వరుడైన రావణుడు అకంపనునకు అభయమిచ్చెను. అంతట అతడు మనసుకుదుటబడినవాడై ఆ ప్రభువుతో స్పష్టముగా ఇట్లు నుడివెను. (9)

"కోసలప్రభునైన దశరథునికుమారుడు శ్రీరాముడు. అతడు యువకుడు, చక్కని అంగసౌష్ఠవము గలిగిన సుందరుడు, వృషభమునకువలె బలిష్ఠమైనమూపుగలవాడు,

వీరః పృథుయశాః శ్రీమాన్ అతుల్యబలవిక్రమః।
హతం తేన జనస్థానం ఖరశ్చ సహదూషణః। 11

గుండ్రనై నునుపుదేలియున్న భుజములుగలవాడు. అతడు మహావీరుడు. సాటిలేని బలపరాక్రమములుగలవాడు, సర్వశుభలక్షణములతో వాసికెక్కినవాడు. అతడే ఖరదూషణాదులతోసహా మనజనస్థానయోధులను అందఱిని హతమొనర్చెను." (10-11)

అకంపనవచః శ్రుత్వా రావణో రాక్షసాధిపః।
నాగేంద్ర ఇవ నిశ్శ్వస్య వచనం చేదమబ్రవీత్। 12

రాక్షసరాజైనరావణుడు అకంపనునిపలుకులను విని, మహాసర్పమువలె బుసలుకొట్టుచు అతనితో ఇట్లు పలికెను. (12)

సమురేంద్రేణ సంయుక్తో రామః సర్వామరైః సహ।
ఉపయాతో జనస్థానం బ్రూహి కచ్చిదకంపన! 13

"ఓ అకంపనా! అతడు మనజనస్థానమునకు ఇంద్రాది సమస్తదేవతలసహాయముతో వచ్చినాడా? తెల్పుము. లేనిచో అతనికి ఇంతటి సామర్థ్యమెక్కడిది?" (13)

రావణస్య పునర్వాక్యం నిశమ్య తదకంపనః।
ఆచచక్షే బలం తస్య విక్రమం చ మహాత్మనః। 14

రావణుడు మఱల పలికిన మాటలను వినిన పిమ్మట అకంపనుడు మహాత్ముడైన శ్రీరామునియొక్క బలపరాక్రమములనుగూర్చి వివరింపదొడంగెను. (14)

రామో నామ మహాతేజాః శ్రేష్ఠః సర్వధనుష్మతామ్।
దివ్యాస్త్రగుణసంపన్నః పురందరసమో యుధి। 15

"శ్రీరాముడు గొప్ప తేజస్వి, ధనుర్ధారులలో శ్రేష్ఠుడు. అతని అస్త్రములు దివ్యములైనవి. అతడు చక్కని గుణసంపదగలవాడు. రణరంగమున పరాక్రమించుటలో దేవేంద్రతుల్యుడు (రణకౌశలమున తిరుగులేనివాడు.) (15)

తస్యానురూపో బలవాన్ రక్తాక్షో దుందుభిస్వనః।
కనీయాన్ లక్ష్మణో నామ భ్రాతా శశినిభాననః। 16

న తేన సహ సంయుక్తః పావకేనానిలో యథా।
శ్రీమాన్ రాజవరస్తేన జనస్థానం నిపాతితమ్। 17

నైవ దేవా మహాత్మానో నాత్ర కార్యా విచారణా। 18

శరా రామేణ తూత్సృష్టాః రుక్మపుంఖాః పతత్త్రిణః।
సర్పాః పంచాననా భూత్వా భక్షయంతి స్మ రాక్షసాన్। 19

యేన యేన చ గచ్ఛంతి రాక్షసా భయకర్శితాః।
తేన తేన స్మ పశ్యంతి రామమేవాగ్రతః స్థితమ్।
ఇత్థం వినాశితం తేన జనస్థానం తవానఘ! 20

'లక్ష్మణుడు' అను పేరు గల అతని తమ్ముడు అన్నివిధములుగా అతనికి దీటైనవాడు. మిక్కిలి బలశాలి. కన్నులలో ఎఱ్ఱని జీరలుగలవాడు, అతని కంఠస్వరము దుందుభిధ్వనివలె గంభీరమైనది. చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖకాంతిగలవాడు. అగ్నికి వాయువువలె అతడు రాజశ్రేష్ఠుడైన శ్రీరామునకు తోడుగాగలడు. ఆ రాముడే జనస్థానమునందలి మనయోధులను పూర్తిగా మట్టిగలిపించెను. అతనికి ఏ దేవతలసహాయమూ అక్కఱలేదు. ఈ విషయమున ఎట్టి విచారణలో పనిలేదు. బంగారుపిడులతో, బలమైనఱెక్కలతోగూడిన బాణములను శ్రీరాముడు ప్రయోగించెను. అవి ఐదుతలలుగల పాములై మన రాక్షసవీరులను తినివేసినవి. రాక్షసయోధులు సమరభూమియందు ఎటు వెళ్లినను వారికి ఎదురుగా శ్రీరాముడే కన్పట్టుచుండుటచే వారు భయకంపితులు కాజొచ్చిరి. ఓ పుణ్యాత్ముడా! జనస్థానము శ్రీరామునిచేతిలో ఈ విధముగా ధ్వంసమైపోయెను." (16-20)

అకంపనవచః శ్రుత్వా రావణో వాక్యమబ్రవీత్।
జనస్థానం గమిష్యామి హంతుం రామం సలక్ష్మణమ్। 21

అకంపనుని పలుకులను విని, రావణుడు 'అయితే ఆ రామలక్ష్మణులను హతమార్చుటకై ఇప్పుడే జనస్థానమునకు వెళ్లెదను.' అని పలికెను. (21)

అథైవముక్తే వచనే ప్రోవాచేదమ్ అకంపనః।
శృణు రాజన్ యథావృత్తం రామస్య బలపౌరుషమ్। 22

రావణుడిట్లు పలికిన వెంటనే అకంపనుడు ఈ రీతిగా పలికెను. "ఓ మహారాజా! మానవాతీతములైన (దివ్యములైన) శ్రీరామునిబలపరాక్రమములగూర్చి

అసాధ్యః కుపితో రామో విక్రమేణ మహాయశాః।
ఆపగాయాః సుపూర్ణాయా వేగం పరిహరేచ్ఛరైః। 23

సతారగ్రహనక్షత్రం నభశ్చాప్యవసాదయేత్।
అసౌ రామస్తు మజ్జంతీం శ్రీమానభ్యుద్ధరేన్మహీమ్। 24

భిత్త్వా వేలాం సముద్రస్య లోకాన్ ఆప్లావయేద్విభుః।
వేగం వాపి సముద్రస్య వాయుం వా విధమేచ్ఛరైః। 25

సంహృత్య వా పునర్లోకాన్ విక్రమేణ మహాయశాః।
శక్తః స పురుషవ్యాఘ్రః స్రష్టుం పునరపి ప్రజాః। 26

న హి రామో దశగ్రీవ! శక్యో జేతుం త్వయా యుధి।
రక్షసాం వాపి లోకేన స్వర్గః పాపజనైరివ। 27

న తం వధ్యమహం మన్యే సర్వైర్దేవాసురైరపి।
అయం తస్య వధోపాయః తం మమైకమనాః శృణు। 28

భార్యా తస్యోత్తమా లోకే సీతా నామ సుమధ్యమా।
శ్యామా సమవిభక్తాంగీ స్త్రీరత్నం రత్నభూషితా। 29

నైవ దేవీ న గంధర్వీ నాప్సరా నాపి దానవీ।
తుల్యా సీమంతినీ తస్యా మానుషీషు కుతో భవేత్। 30

తస్యాపహర భార్యాం త్వం ప్రమథ్య తు మహావనే।
సీతయా రహితః కామీ రామో హాస్యతి జీవితమ్। 31

అరోచయత తద్వాక్యం రావణో రాక్షసాధిపః।
చింతయిత్వా మహాబాహుః అకంపనమువాచ హ। 32

తెలిపెదను. సావధానుడవై వినుము. పరాక్రమశాలిగా మిగులపేరుమోసిన శ్రీరాముడు నిజముగా కుపితుడైనచో దేవాసురులుసైతము రణమున అతనిని నిగ్రహింపజాలరు. దరులనొరయుచు నిండుగా ప్రవహించెడి నదులవేగమునుగూడ అతడు తన బాణములతో నిరోధింపగలడు. అశ్విన్యాది నక్షత్రములతో, ఆదిత్యాదినవగ్రహములతో, తదితరతారలతో విలసిల్లెడు ఆకాశమునుసైతము అతడు శిథిలమొనర్పగలడు, సముద్రమున మునిగిపోవుచున్న భూమండలమునుగూడ ఉద్ధరింపగలడు. (22-24)

ఆప్రభువు సముద్రముయొక్క చెలియలికట్టను ఛేదించి సమస్తలోకములను ముంచివేయగలడు. అతడు తనబాణములచే సముద్రముయొక్క (సముద్రతరంగములయొక్క) ఉధృతిని, వాయువేగమును తనబాణములచే నిరోధింపగలడు. (సముద్రమును ఇంకిపోవునట్లుగను, వాయువు స్తంభించునట్లుగను చేయగలడు.) పురుషోత్తముడును, మహాయశస్వియు ఐన శ్రీరాముడు సంకల్పమాత్రమున సమస్తలోకములయందలి వివిధములగు ప్రాణులను లయమొనర్చుటకును, మరల వాటిని సృష్టించుటకును సర్వసమర్థుడు. ఓ మహారాజా! యుద్ధమునందు శ్రీరాముని జయించుట నీకు అసాధ్యము. పాపాత్ములు స్వర్గమును చేరలేనట్లు రాక్షసవీరులెవ్వరును అతనిని జయింపజాలరు. (25-27)

దేవాసురులుసైతము అతనిని వధింపలేరని నా విశ్వాసము. కాని అతనిని వధించుటకు తగిన ఉపాయమొకటి నాకు తోచుచున్నది దయతో ఆలకింపుము. (28)

సీతాదేవి అతనిభార్య. ఆమె ఉత్తమురాలు, లోకోత్తరసౌందర్యవతి, నిండుజవ్వని, చక్కని అవయవములపొంకము గలది, రత్నాభరణములను ధరించియున్నది. స్త్రీలలో మేలుబంతి. దివ్యభామినులు గాని, గంధర్వతరుణీమణులు గాని, అప్సరసలుగాని దానవయువతులుగాని అందచందములలో ఆమె కొనగోటికిని చాలరు. ఇక మనుష్యకాంతలలో ఆమెకు సాటి ఎవరుందురు? (29-30)

ఓ ప్రభూ! సీతయనిన శ్రీరామునకు ప్రాణము, అందువలన ఏదేని యొకఉపాయముచే అతనిని వంచించి, ఆమెను అపహరించుకొనిరమ్ము. భార్యావియోగమునకు తట్టుకొనలేక అతడు తనజీవితమును చాలించును." (31)

మహాబాహువు, రాక్షసప్రభువు ఐన రావణునకు ఆ అకంపనుని పల్కులు నచ్చెను. అప్పుడతడు శ్రీరాముని మోసగించుట (శ్రీరాముని సీతాదేవికి దూరముగా పంపివేయుట) ఎట్లు?' అని కొంత తడవు ఆలోచించి, అతనితో ఇట్లు నుడివెను. (32)

బాఢం కాల్యం గమిష్యామి హ్యేకః సారథినా సహ।
ఆనయిష్యామి వైదేహీమ్ ఇమాం హృష్టో మహాపురీమ్। 33

"ఓయీ! నీవు చెప్పిన ఉపాయము యుక్తముగా ఉన్నది. ప్రాతః కాలముననే సారథిని వెంటనిడుకొని, నేనొక్కడనే వెళ్లి, ఆ సీతాదేవిని అవలీలగా ఈ లంకానగరమునకు తీసికొనివచ్చెదను." (33)

అథైవముక్త్వా ప్రయయౌ ఖరయుక్తేన రావణః।
రథేనాదిత్యవర్ణేన దిశః సర్వాః ప్రకాశయన్। 34

ఇట్లు పలికిన పిమ్మట అతడు సూర్యకాంతులను విరజిమ్మునట్టి రథమునకు జవనాశ్వములను [1]పూన్చి, నలుదిక్కులను ప్రకాశింపజేయుచు (మారీచుని ఆశ్రమమునకు) బయలుదేఱెను. (34)

స రథో రాక్షసేంద్రస్య నక్షత్రపథగో మహాన్।
సంచార్యమాణః శుశుభే జలదే చంద్రమా ఇవ। 35

రాక్షసేంద్రునియొక్క ఆమహారథము ఆకాశమున సాగిపోగలదు. అతడు గగనమార్గమున పయనించుచుండగా ఆరథము మేఘములమధ్య చంద్రునివలె శోభిల్లెను.(35)

స మారీచాశ్రమం ప్రాప్య తాటకేయముపాగమత్।
మారీచేనార్చితో రాజా భక్ష్యభోజ్యైరమానుషైః। 36

తం స్వయం పూజయిత్వా తు ఆసనేనోదకేన చ।
అర్థోపహితయా వాచా మారీచో వాక్యమబ్రవీత్। 37

అతడు తాటకసుతుడైన మారీచునియొక్క ఆశ్రమమునకు చేరి, అతనిచెంతకు వెళ్లెను. అప్పుడు మారీచుడు దివ్యములైన భక్ష్యభోజ్యపానీయములతో ఆరాక్షసప్రభువునకు అతిథి సపర్యలొనర్చెను. అనంతరము మారీచుడు రావణునకు ఉచితమైన ఆసనమును ఏర్పఱచి, స్వయముగా అర్ఘ్యపాద్యాదులతో పూజించి అతనితో ప్రయోజనకరములైన మంచిమాటలను ఇట్లు పచించెను. (36-37)

కచ్చిత్ సుకుశలం రాజన్ లోకానాం రాక్షసేశ్వర!।
ఆశంకే నాథ! జానే త్వం యతస్తూర్ణమ్ ఇహాగతః। 38

"ఓ రాక్షసేశ్వరా! నీరాజ్యమున ఎల్లరును కుశలమేగదా! ఊరకరారు మహాత్ములు. నీవు ఇంత హడావుడిగా వచ్చుటకు ఏదో ఒక గొప్పకారణము ఉండవచ్చునని నేను తలంచుచున్నాను." (38)

ఏవముక్తో మహాతేజా మారీచేన స రావణః।
తతః పశ్చాదిదం వాక్యమ్ అబ్రవీద్వాక్యకోవిదః। 39

మారీచుడు ఇట్లు పలికిన పిమ్మట మహాతేజస్వియు, మాటకారియు ఐన రావణుడు అతనితో ఈవిధముగా నుడివెను. (39)

ఆరక్షో మే హతస్తాత! రామేణాక్లిష్టకర్మణా।
జనస్థానమ్ అవధ్యం తత్ సర్వం యుధి నిపాతితమ్।
తస్య మే కురు సాచివ్యం తస్య భార్యాపహరణే। 40

"నాయనా! దండకారణ్యమునకు నాప్రతినిధిగానున్న ఖరుని అసహాయశూరుడైన శ్రీరాముడు హతమార్చెను. జనస్థానమునగల అజేయులైన మనరాక్షసయోధులందఱును యుద్ధమున ఆ రఘువీరునిచేతిలో మడిసిరి. ఇందులకు ప్రతిక్రియగా నేను అతనిభార్యను అపహరింపదలచితిని. ఈ విషయమున నీవు నాకు సహాయపడవలెను." (40)

1) ఖరాః = విశిష్టములైన జవనాశ్వములు
శ్లో॥ అశ్వస్యగ్ర్యాః సముత్పన్నాః తస్మాదశ్వతరాః ఖరాః। ఖరరూక్షస్వరాస్తీక్ష్ణాః ఖరశీలాః ఖరాంఘ్రయః॥ అశ్వశాస్త్రము.
ఖరములు = అశ్వసంతానము, వీటికంఠస్వరములు తీవ్రముగా భయంకరముగానుండును. ఇవి వేగగమనముగలవి. క్రూరస్వభావముగలవి, వాడియైన గిట్టలుగలవి.

రాక్షసేంద్రవచః శ్రుత్వా మారీచో వాక్యమబ్రవీత్ । 41

ఆఖ్యాతా కేన సీతా సా మిత్రరూపేణ శత్రుణా ।
త్వయా రాక్షసశార్దూల! కో న నందతి నిందితః ।
సీతామ్ ఇహానయస్వేతి కో బ్రవీతి బ్రవీహి మే । 42

రక్షోలోకస్య సర్వస్య కః శృంగం ఛేత్తుమిచ్ఛతి ।
ప్రోత్సాహయతి కశ్చ త్వాం స చ శత్రురసంశయః । 43

ఆశీవిషముఖాద్దంష్ట్రామ్ ఉద్ధర్తుం చేచ్ఛతి త్వయా ।
కర్మణా తేన కేనాసి కాపథం ప్రతిపాదితః । 44

సుఖసుప్తస్య తే రాజన్ ప్రహృతం కేన మూర్ధని । 45

ఆ రాక్షసప్రభువుయొక్క మాటలను విని, మారీచుడు అతనితో ఇట్లనెను, "ఓ రాక్షసశ్రేష్ఠుడా! సీతను గూర్చిన సమాచారమును నీకు తెలిపినవాడెవడు? బయటికి మిత్రుడుగా కనబడుచున్నను వాస్తవముగా అతడు నీకు శత్రువే సుమా! నీచే గౌరవాదరములను పొందియు అతడు నీకు కీడుతలపెట్టుచున్నాడు. ఇంతకును 'సీతాదేవిని లంకకు తీసికొనిరమ్ము' -అని సూచించిన వాడెవడో తెలుపుము. సమస్తరాక్షసులవైశిష్ట్యమును (ఉనికిని) దెబ్బతీయదలచినట్టి అతడెవడు? నిన్ను ఇట్లు ప్రేరేపించుచున్నవాడెవడో గాని వాడు మాత్రము నిశ్చయముగా నీకు శత్రువే. అతడు విషసర్పమునోటియందుగల కోఱలను నీచే తీయించదలచుచున్నాడు. (అనగా ఆ విషసర్పముయొక్కకాటునకు నిన్ను బలిచేయదలచుచున్నాడు) 'సీతాపహరణము' అను కార్యమునెపముతో నిన్ను ఈ తప్పుత్రోవ పట్టించిన అతడెవడు? ఓ రాజా! హాయిగా నిద్రించుచున్న నీమాడుపై ఈ విధముగా దెబ్బకొట్టినవాడు ఎవడు? (41-45)

విశుద్ధవంశాభిజనాగ్రహస్తః
తేజోమదః సంస్థితదోర్విషాణః ।
ఉదీక్షితుం రావణ! నేహ యుక్తః
స సంయుగే రాఘవగంధహస్తీ । 46

ఓ రావణా! శ్రీరాముడు ఒక మదపుటేనుగు వంటివాడు. పవిత్రవంశమున జన్మించుటయే ఆ గజమునకు తొండము. తిరుగులేని పరాక్రమమే ఆ ఏనుగుమదము. బలమైనబాహువులే ఆగజమునకుగల దంతములు. సహజముగా మదపుటేనుగుయొక్క మదగంధపువాసన తగిలినంతనే తక్కిన గజములన్నియు భయముతో పాఱిపోవును. అట్లే శ్రీరాముడనెడి మదపుటేనుగును చూచుటకు ఎవ్వరును సాహసింపరు. కావున ఈ సమయమున ఆవీరునితో నీవు కయ్యమునకు కాలుదువ్వుట మేలుగాదు. (46)

అసౌ రణాంతస్థితిసంధివాలో
విదగ్ధరక్షో మృగహా నృసింహః ।
సుప్తస్త్వయా బోధయితుం న యుక్తః
శరాంగపూర్ణో నిశితాసిదంష్ట్రః । 47

శ్రీరాముడు సింహమువంటివాడు. ఈ రాముడనెడి సింహమునకు రణరంగమునందు అగ్రభాగమున స్థిరముగా నిలిచియుండుటయే జూలు, వాలము. (మృగములను వేటాడుటకు సంసిద్ధమైనప్పుడు సింహము తనజూలును విదల్చి, వాలమును నడుముమీదికి చేర్చును. అట్లే రాముడు శత్రువులను హతమార్చుటకై సమరభూమియందు సన్నద్ధుడైనిల్చియుండును). ఈ నరసింహము యుద్ధకుశలురైన రాక్షసులనెడి మృగములను వధించును. ఈ నృసింహమునకు శరములే నఖములు, శస్త్రములే కోఱలు, నిద్రించుచున్న సింహమునుజోలికిపోవుట ప్రమాదకరము. అట్లే పరద్రోహచింత లేక ప్రశాంతముగానున్న శ్రీరాముని కవ్వించుట తగదు. (47)

చాపాపహారే భుజవేగపంకే
శరోర్మిమాలే సుమహాహవౌఘే ।
న రామపాతాళముఖేఽతిఘోరే
ప్రస్కందితుం రాక్షసరాజ! యుక్తమ్ ॥ 48

ఓ రాక్షసరాజా! శ్రీరాముడు ఘోరమైన పాతాళబిలము వంటివాడు. అతని చాపములే ఈ బిలద్వారమునగల మొనళ్ళు, బాణములను సంధించుట, వదులుటలో చూపెడివేగమే బురద, శరములే తరంగపంక్తులు, భీకరమైనయుద్ధమే దుస్తరమైన ప్రవాహము, అట్టి రాముడనెడి పాతాళబిలమునందు ప్రవేశించుట యుక్తముగాదు!- (48)

ప్రసీద లంకేశ్వర! రాక్షసేంద్ర!
లంకాం ప్రసన్నో భవ సాధు గచ్ఛ ।
త్వం స్వేషు దారేషు రమస్వ నిత్యం
రామః సభార్యో రమతాం వనేషు ॥ 49

ఓ లంకాధిపా! రాక్షసప్రభూ! అనుగ్రహింపుము, దయచేసి శాంతింపుము. తిన్నగా లంకకు వెళ్లి, నీవు నీ భార్యలతోగూడి సర్వదా సుఖింపుము. శ్రీరాముడు తన భార్యతోగూడివనములలో హాయిగా ఉండగలడు." (49)

ఏవ ముక్తో దశగ్రీవో మారీచేన స రావణః ।
న్యవర్తత పురీం లంకాం వివేశ చ గృహోత్తమమ్ ॥ 50

మారీచునిపలుకులకు ఊరటచెంది, ఆ రావణుడు లంకాపురమునకు చేరి, తనభవనమున ప్రవేశించెను. (50)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకత్రింశస్సర్గః (31)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదియొకటవసర్గము.

-- * * * --

32. ముప్పదిరెండవసర్గము

శూర్పణఖ లంకకుజేరి, తన అన్నయగు రావణుడు సభలో ఆసీనుడై యుండగా అతనిని దర్శించుట-

తతః శూర్పణఖా దృష్ట్వా సహస్రాణి చతుర్దశ ।
హతాన్యేకేన రామేణ రక్షసాం భీమకర్మణామ్ ॥ 1

దూషణం చ ఖరం చైవ హతం త్రిశిరసా సహ ।
దృష్ట్వా పునర్మహానాదం ననాద జలదో యథా ॥ 2

శూర్పణఖ క్రూరకర్ములైన పదునాలుగువేలమంది రాక్షసయోధులును, ఖరదూషణత్రిశిరులును ఒకే ఒక్క శ్రీరామునిచేతిలో యుద్ధరంగమున నిహతులగుట న్వయముగా చూచెను. వెంటనే ఆమె మేఘము గర్జించినట్లు ఒక మహానాదమొనర్చెను. (1-2)

సా దృష్ట్వా కర్మ రామస్య కృతమన్యైః సుదుష్కరమ్ ।
జగామ పరమోద్విగ్నా లంకాం రావణపాలితామ్ ॥ 3

ఇతరులకు అసాధ్యమైన రీతిగా శ్రీరాముడొనర్చిన ఆ ఘనకార్యమును జూచి, శూర్పణఖ మిగుల భయకంపితురాలయ్యెను. మఱుక్షణమే ఆమె రావణుడు పాలించుచున్న లంకానగరమునకు పరుగులు దీసెను. (3)

సా దదర్శ విమానాగ్రే రావణం దీప్తతేజసమ్ ।
ఉపోపవిష్టం సచివైః మరుద్భిరివ వాసవమ్ ॥ 4

ఆ సమయమున రావణుడు 'పుష్పకము' అను పేరుగల తనరాజభవనమున సుఖాసీనుడైయుండగా ఆమె చూచెను. నిండుసభలో మంత్రులతో పరివృతుడైయున్న ఆ రాక్షసప్రభువు దేవతలతో గూడియున్న ఇంద్రునివలె మహాతేజస్సుతో విలసిల్లుచుండెను. (4)

ఆసీనం సూర్యసంకాశే కాంచనే పరమాసనే ।
రుక్మవేదిగతం ప్రాజ్యం జ్వలంతమివ పావకమ్ ॥ 5

సూర్యకాంతులతో మిఱుమిట్లుగొలిపెడి సువర్ణసింహాసనమును అలంకరించియున్న ఆ రావణుడు బంగారుఇటుకలతో నిర్మింపబడిన వేదికయందు చక్కని ఆజ్యాహుతులతో వర్ధిల్లుచున్నఅగ్నివలె తేజరిల్లుచుండెను. (5)

దేవగంధర్వభూతానామ్ ఋషీణాం చ మహాత్మనామ్।
అజేయం సమరే శూరం వ్యాత్తాననమివాంతకమ్। 6

దేవాసురవిమర్దేషు వజ్రాశనికృతవ్రణమ్।
ఐరావతవిషాణాగ్రైః ఉత్కృష్టకిణవక్షసమ్। 7

వింశద్భుజం దశగ్రీవం దర్శనీయపరిచ్ఛదమ్।
విశాలవక్షసం వీరం రాజలక్షణశోభితమ్। 8

స్నిగ్ధవైదూర్యసంకాశం తప్తకాంచనకుండలమ్।
సుభుజం శుక్లదశనం మహాస్యం పర్వతోపమమ్। 9

విష్ణుచక్రనిపాతైశ్చ శతశో దేవసంయుగే।
అన్యైః శస్త్రప్రహారైశ్చ మహాయుద్ధేషు తాడితమ్। 10

ఆహతాంగం సమస్తైశ్చ దేవప్రహరణైస్తథా।
అక్షోభ్యాణాం సముద్రాణాం క్షోభణం క్షిప్రకారిణమ్। 11

క్షేప్తారం పర్వతేంద్రాణాం సురాణాం చ ప్రమర్దనమ్।
ఉచ్ఛేత్తారం చ ధర్మాణాం పరదారాభిమర్శనమ్। 12

సర్వదివ్యాస్త్రయోక్తారం యజ్ఞవిఘ్నకరం సదా।
పురీం భోగవతీం ప్రాప్య పరాజిత్య చ వాసుకిమ్। 13

తక్షకస్య ప్రియాం భార్యాం పరాజిత్య జహార యః।
కైలాసపర్వతం గత్వా విజిత్య నరవాహనమ్। 14

విమానం పుష్పకం తస్య కామగం వై జహార యః।
వనం చైత్రరథం దివ్యం నళినీం నందనం వనమ్। 15

మహాత్ములైన ఋషీశ్వరులకు కంటకప్రాయుడును, దేవతలు, గంధర్వులు మున్నగు వారికి అజేయుడును ఐన రావణుడు సమరరంగమున నోరు తెరచుకొనియున్న మృత్యుదేవతవలె భయంకరుడై కన్పట్టుచుండెను. (6)

అతడు దేవాసురులకు జరిగిన యుద్ధములయందు వజ్రాయుధముయొక్క తాకిడులకు తట్టుకొనినవాడు. వక్షస్థలమునందు ఐరావతముయొక్క దంతములరాపిడులగుర్తులు గలవాడు. ఇరువదిచేతులతో, పదితలలతో ఒప్పుచున్న ఆ వీరునియొక్క వక్షఃస్థలము విశాలమైనది, అతడు చూడముచ్చటగొల్పెడి ఛత్రచామరాదిరాజలక్షణములతో శోభిల్లుచున్నవాడు. (7-8)

రావణుడు వైడూర్యములతో, రత్నములతో ఖచితములై, మిఱుమిట్లు గొలుపుచున్న ఆభరణములతో భాసిల్లుచుండెను. మేలిమిబంగారుకుండలములతో ప్రకాశించుచుండెను. అతనిబాహువులు నునుపుదేలి గుండ్రములై పొడవుగానుండెను. అతనిదంతములు తెల్లనికాంతులను విరజిమ్ముచుండెను. అతని ముఖములు విశాలములైనవి, ఆకారము పర్వతతుల్యము. (9)

అతడు దేవతలతో సంభవించిన సమరములయందు పెక్కుపర్యాయములు విష్ణుచక్రముయొక్క ప్రహారములను చవిచూచినవాడు, మహాయుద్ధములందు పెక్కువిధములైన శస్త్రములతాకిడులకు గుఱియైనవాడు, ఇంద్రాదిసమస్తదేవతలయొక్క ప్రహారములగుర్తులు అతనిశరీరముపై కన్పట్టుచుండెను. అతడు ప్రశాంతముగానున్న మహాసముద్రములనుసైతము క్షణములో కల్లోలపఱచగలడు. (10-11)

అతడు మహాపర్వతములనుగూడ విసరివేయుగలడు, దేవతలను ముప్పుతిప్పలు పెట్టగలడు. యజ్ఞాది పవిత్ర కార్యములను ధ్వంసమొనర్చెడివాడు. పరసతులను ఆసించెడివాడు. వివిధములగు దివ్యాస్త్రములను ప్రయోగించుటలో ఆఱితేఱినవాడు. మహాత్ములయజ్ఞములకు విఘ్నములను కలిగించెడివాడు. నాగలోకమునందలి భోగవతీపురముపై దండెత్తి వాసుకిని జయించినవాడు. తక్షకుని ఓడించి, అతని భార్యను అపహరించినవాడు. రావణుడు కైలాసపర్వతమునకు వెళ్లి, అలకాపురీశ్వరుడగు కుబేరుని జయించెను. అతనినుండి ఇచ్ఛానుసారము పయనింపగల పుష్పకవిమానమును, అతనివిహారవనమైన దివ్యమగు 'చైత్రరథము'ను, 'నళిని' అను సరస్సును స్వాధీనము చేసికొనెను. ఇంద్రుని 'నందనవనము'ను గూడ ఆక్రమించెను. (12-15)

వినాశయతి యః క్రోధాత్ దేవోద్యానాని వీర్యవాన్।
చంద్రసూర్యౌ మహాభాగౌ ఉత్తిష్ఠంతౌ పరంతపః।
నివారయతి బాహుభ్యాం యః శైలశిఖరోపమః॥ 16

దశవర్షసహస్రాణి తపస్తప్త్వా మహావనే।
పురా స్వయంభువే ధీరః శిరాంస్యుపజహార యః॥ 17

దేవదానవగంధర్వపిశాచపతగోరగైః।
అభయం యస్య సంగ్రామే మృత్యుతో మానుషాదృతే॥ 18

మంత్రైరభిష్టుతం పుణ్యమ్ అధ్వరేషు ద్విజాతిభిః।
హవిర్ధానేషు యః సోమమ్ ఉపహంతి మహాబలః॥ 19

అప్తయజ్ఞహరం క్రూరం బ్రహ్మఘ్నం దుష్టచారిణమ్।
కర్కశం నిరనుక్రోశం ప్రజానామ్ అహితే రతమ్॥ 20

రావణం సర్వభూతానాం సర్వలోకభయావహమ్।
రాక్షసీ భ్రాతరం శూరం సా దదర్శ మహాబలమ్॥ 21

తం దివ్యవస్త్రాభరణం దివ్యమాల్యోపశోభితమ్।
ఆసనే సూపవిష్టం చ కాలకాలమివోద్యతమ్॥ 22

రాక్షసేంద్రం మహాభాగం పౌలస్త్యకులనందనమ్।
రావణం శత్రుహంతారం మంత్రిభిః పరివారితమ్॥ 23

అభిగమ్యాబ్రవీద్వాక్యం రాక్షసీ భయవిహ్వలా॥ 24

తమబ్రవీద్దీప్తవిశాలలోచనం
ప్రదర్శయిత్వా భయమోహమూర్ఛితా।
సుదారుణం వాక్యమభీతచారిణీ
మహాత్మనా శూర్పణఖా విరూపితా॥ 25

మహావీరుడగు అతడు క్రుద్ధుడై ఇతరదేవతలయొక్క ఉద్యానవనములనుగూడ ధ్వంసమొనర్చుచుండును. ఎంతటివారినైనను తపింపజేయువారును[1] లోకములకు వెలుగులను ఇచ్చెడివారునునైన సూర్యచంద్రులయొక్క ఉదయాస్తమయములను పర్వతశిఖరములవలె మహోన్నతుడైన అతడు తన చేతుల్లచేతనే అడ్డువు చేయగలవాడు. (16)

పూర్వము ధీరుడైన రావణుడు మహారణ్యమునందు పదివేలసంవత్సరములు తపమొనర్చి, బ్రహ్మదేవుని అనుగ్రహమునకై తనశిరస్సులను సమర్పించెను. అప్పుడు ప్రసన్నుడైన బ్రహ్మదేవునినుండి 'మానవులవలనతప్ప దేవదానవగంధర్వులవలనగాని పిశాచముల, పక్షుల, సర్పములవలనగాని యుద్ధమున తనకు చావు లేకుండునట్లు' వరమును పొందెను. (17-18)

యజ్ఞములను ఆచరించునప్పుడు ద్విజులు వేదమంత్రములను పఠించుచు సోమలతలనుండి రసమును పిండుదురు. అప్పుడు అచటికి చేరిన బలశాలియైన రావణుడు అట్లు సిద్ధించిన సోమరసమును నాశనము చేయుచుండెడివాడు. (19)

యజ్ఞములు ముగియుచుండగా వాటిని ధ్వంసముచేయువాడు. క్రూరకర్మలనొనర్చెడివాడు. బ్రహ్మహత్యలకు పాల్పడువాడు. దుష్టమైన చరిత్రగలవాడు, కఠినాత్ముడు, దయారహితుడు, ప్రజలకు హాని కలిగించుటలో నిరతుడు, సమస్తప్రాణులను బాధించువాడు, ఎల్లరకును భయమును గూర్చెడివాడు, అసాధారణ బలశాలి, శూరుడు ఐన తన సోదరుడగు రావణుని ఆ శూర్పణఖ దర్శించెను. (20-21)

అతడాసమయమున దివ్యములైన వస్త్రాభరణములను ధరించియుండెను మేలైనపుష్పమాలలతో అలంకృతుడైయుండెను. ఆసనముపై సుఖముగా ఉపవిష్టుడైయుండెను. ప్రళయ కాలయమునివలె భీకరుడైయుండెను. (22)

పౌలస్త్యునివంశమువాడు, వివిధైశ్వర్యసంపన్నుడు, శత్రువులను పరిమార్చువాడు, రాక్షసప్రభువు ఐన రావణుడు తనమంత్రులతోగూడియుండగా భయముతో వణకిపోవుచున్న శూర్పణఖ అతని సమీపమునకు చేరి ఇట్లు పలికెను. (23-24)

అడ్డు, అదుపులు లేక స్వేచ్ఛగా సంచరించునట్టి శూర్పణఖ మహాత్ముడైన లక్ష్మణునివలన ఏర్పడిన తన వికృతరూపమును సభలో ప్రదర్శించుచు విశాలలోచనుడైన రావణునితో దారుణవచనములను ఇట్లు పలికెను. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ద్వాత్రింశస్సర్గః (32)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదిరెండవసర్గము.

1) సూర్యుడు తనవేడికిరణములతో లోకములను తపింప జేయుచుండును. చంద్రుడు చల్లని కిరణములు గలవాడేయైనప్పటికిని విరహమునకు లోనైన జంటలను తపింపజేయుచుండును.

33. ముప్పదిమూడవసర్గము

శూర్పణఖ నిండుసభలో ఉత్తమరాజలక్షణములను పేర్కొనుట - రావణుని మూర్ఖత్వమును ప్రకటించుట - అంతట అతడు ఆలోచనలోపడుట.

తత: శూర్పణఖా దీనా రావణం లోకరావణమ్।
అమాత్యమధ్యే సంక్రుద్ధా పరుషం వాక్యమబ్రవీత్॥ 1

అమాత్యులమధ్య నిండుసభలో సుఖాసీనుడైయున్న లోకకంటకుడగు రావణుడు శూర్పణఖయొక్క వికృతరూపమును, దీనావస్థను జూచియు, ఏమాత్రమూ చలింపకయుండెను. అప్పుడామె మిగుల క్రుద్ధురాలై అతనితో పరుషముగా ఇట్లు నుడివెను. (1)

ప్రమత్త: కామభోగేషు స్వైరవృత్తో నిరంకుశ:।
సముత్పన్నం భయం ఘోరం బోద్ధవ్యం నాఽవబుధ్యసే॥ 2

"ఓ రావణా! అడ్డుచెప్పెడివారులేక నీవు నిరంకుశుడవై నిరంతరము కామభోగములలో మునిగి, కైపెక్కియుంటివి. వినుటకుసైతము మిగులభయంకరమైనపరిస్థితి ఏర్పడినది. నీవు చారులవలన ఇంతకుముందే దానిని తెలిసికొనవలసియుండెను. కాని నీవట్లు చేయలేదు. (2)

సక్తం గ్రామ్యేషు భోగేషు కామవృత్తం మహీపతిమ్।
లుబ్ధం న బహుమన్యంతే శ్మశానాగ్నిమివ ప్రజా:॥ 3

క్షణికములైన ఇంద్రియభోగములలో నిరతుడై, స్వేచ్ఛగా ప్రవర్తించుచు సుఖలోలుడైన రాజును శ్మశానాగ్నివలె ప్రజలు గౌరవింపరు. (3)

స్వయం కార్యాణి య: కాలే నానుతిష్ఠతి పార్థివ:।
స తు వై సహ రాజ్యేన తైశ్చ కార్యైర్వినశ్యతి॥ 4

పరిపాలనావిధులను స్వయముగా పట్టించుకొననిరాజుయొక్క కార్యములన్నియును భంగమగును. అంతేగాక క్రమముగా అతడు రాజ్యభ్రష్టుడగును. (4)

అయుక్తచారం దుర్దర్శమ్ అస్వాధీనం నరాధిపమ్।
వర్జయంతి నరా దూరాత్ నదీపంకమివ ద్విపా:॥ 5

గూఢచారులను నియమింపనివాడు, స్త్రీలోలుడై సంకటసమయములయందును మంత్రులను గాని, ప్రజలనుగానిపట్టించుకొననివాడు ఐన రాజును, ఏనుగులు బురదతోనిండిన నదీతీరమునువలె పరిత్యజింతురు. (అనగా అట్టిరాజునకు ప్రజలు దూరమగుదురు). (5)

యే న రక్షంతి విషయమ్ అస్వాధీనా నరాధిపా:।
తే న వృద్ధ్యా ప్రకాశంతే గిరయ: సాగరే యథా॥ 6

విషయసుఖములలోబడి, రాజ్యపాలనమునందును, రక్షణవిషయమునను జాగ్రుతివహింపక, పరులపై ఆధారపడియుండురాజులు తమదేశముపై పట్టును కోల్పోవుదురు. అంతేగాక వారు సముద్రమునందు మునిగియున్న పర్వతములవలె అభివృద్ధికి నోచుకొనరు. (6)

ఆత్మవద్భిర్విగృహ్య త్వం దేవగంధర్వదానవై:।
అయుక్తచారశ్చపల: కథం రాజా భవిష్యసి॥ 7

దేవగంధర్వదానవులు మిగులధైర్యసాహసములుగలవారు. వారు నీపై ప్రతీకారమునకై పూనుకొనియున్నారు. ఇట్టిస్థితిలో నీవు సరియగు గూఢచారులు[1] లేనివాడవై, చపలచిత్తుడవై రాజుగా ఎట్లు మనగలవు? (7)

త్వం తు బాలస్వభావశ్చ బుద్ధిహీనశ్చ రాక్షస!।
జ్ఞాతవ్యం తు న జానీషే కథం రాజా భవిష్యసి॥ 8

ఓ రాక్షసా! నీవు బాలురవలె వివేకశూన్యుడవు, ప్రజ్ఞారహితుడవు, ఎప్పటికప్పుడు తెలిసికొనదగిన విషయములయందు శ్రద్ధ చూపనివాడవు. ఇట్టిస్థితిలో నీవు రాజుగా ఎట్లు మిగులగలవు? (8)

---

1) స్వపరరాష్ట్ర కార్యాకార్య జ్ఞాపక: చార:॥
స్వదేశమునందును, ఇతరదేశములలోను జరుగుచున్న, జరుగబోవు పరిణామములను గుర్తించి, కర్తవ్యా కర్తవ్యములను ఎప్పటికప్పుడు తెలుపుచుండువాడే సరియైన గూఢచారి. - (గోవిందరాజీయవ్యాఖ్య)

యేషాం చారశ్చ కోశశ్చ నయ శ్చ జయతాం వర! ।
అస్వాధీనా నరేంద్రాణాం ప్రాకృతైస్తే జనైః సమాః । 9

యస్మాత్ పశ్యంతి దూరస్థాన్ సర్వాన్ అర్థాన్ నరాధిపాః ।
చారేణ తస్మాదుచ్యంతే రాజానో దీర్ఘచక్షుషః । 10

అయుక్తచారం మన్యే త్వాం ప్రాకృతైః సచివైర్వృతమ్ ।
స్వజనం తు జనస్థానం హతం యో నాఽవబుధ్యసే । 11

చతుర్దశసహస్రాణి రక్షసాం క్రూరకర్మణామ్ ।
హతాన్యేకేన రామేణ ఖరశ్చ సహదూషణః । 12

ఋషీణామ్ అభయం దత్తం కృతక్షేమాశ్చ దండకాః ।
ధర్షితం చ జనస్థానం రామేణాక్లిష్టకర్మణా । 13

త్వం తు లుబ్ధః ప్రమత్తశ్చ పరాధీనశ్చ రావణ! ।
విషయే స్వే సముత్పన్నం భయం యో నాఽవబుధ్యసే । 14

తీక్ష్ణమల్పప్రదాతారం ప్రమత్తం గర్వితం శఠమ్ ।
వ్యసనే సర్వభూతాని నాభిధావంతి పార్థివమ్ । 15

అతిమానినమగ్రాహ్యమ్ ఆత్మసంభావితం నరమ్ ।
క్రోధినం వ్యసనే హంతి స్వజనోఽపి మహీపతిమ్ । 16

నాఽనుతిష్ఠతి కార్యాణి భయేషు న బిభేతి చ ।
క్షిప్రం రాజ్యాచ్చ్యుతో దీనః తృణైస్తుల్యో భవిష్యతి । 17

విజేతలలో శ్రేష్ఠుడా! గూఢచారులపై అదుపు లేనివారు, కోశాధికారముయొక్క అభివృద్ధిపై దృష్టిపెట్టనివారు, నీతిలేనివారు ఐన రాజులు మూర్ఖులతో సమానులు. (9)

సమర్థులైన గూఢచారులద్వారా భవిష్యత్పరిణామములను, ప్రయోజనములను గ్రహించుచు రాజ్యమును చక్కగా పరిపాలించువారే దూరదృష్టిగల ప్రభువులుగా వాసిగాంతురు. (10)

నీచుట్టును చేరియున్న సచివులందఱును మూర్ఖులు. (ప్రతిభారహితులు) అందువలన నీవు సమర్థులైన గూఢచారులను నియమింపలేకపోయితివి. కావున దండకారణ్యమునందలి నీ స్వజనులందఱు హతులైనను నీవు తెలిసికొనలేకయుంటివి. అక్కడ ఏకైకవీరుడైన రామునిచేతిలో ఖరదూషణాదులతోసహా క్రూరకర్ములైన పదునాలుగువేలమంది రాక్షసయోధులు రణరంగమునకు బలియైరి. (11-12)

శ్రీరాముడు (రాక్షసులబాధ తొలగింతువని) ఋషులకు అభయమిచ్చినాడు. అతడు జనస్థానమునందలి రాక్షసయోధులను అందఱిని హతమార్చి, దానిని తనవశమునందుంచుకొనినాడు. ఇప్పుడు తాపసులెల్లరును నిర్భయముగా (క్షేమముగా) అచట నివసించుచున్నారు.(13)

ఓ రావణా! నీవు గూఢచారులసూచనలను పాటింపని వాడవు. భోగలాలసుడవై మత్తిల్లియున్నవాడవు. నీ రాజ్యమున సంభవించిన ప్రమాదస్థితి తెలిసికొనలేకయుంటివి.(14)

రాజు క్రూరుడు, ఆశ్రితులకు సరియగు పోషణ చేయనివాడు, మిక్కిలి మత్తిల్లియున్నవాడు, అహంకారి, కుత్సితుడు ఐనచో అతనికి కష్టకాలము ఏర్పడినప్పుడు సచివులు మొదలగు వారెవ్వరును తోడుగా నిలువరు. (15)

అంతులేనిగర్వముగలవాడు, సత్పురుషుల దరిచేరనివాడు, తనను తాను గొప్పవానినిగా భావించుకొనువాడు, సమయాసమయములను ఎఱుంగక క్రోధమును ప్రకటించువాడు ఐన రాజునకు దుస్థితి ఎదురైనప్పుడు స్వజనులే (అంతరంగికులును ఆత్మీయులుగానున్న అమాత్యాదులే) హానిగూర్తురు. (16)

సకాలములో కర్తవ్యములను నెఱవేర్చనివాడును, భయావహపరిస్థితులను సరకుగొనక దీమాధోరణితో వ్యవహరించువాడును ఐన రాజు అతిశీఘ్రముగా రాజ్యభ్రష్టుడగును. అతడు దీనుడై గడ్డిపోచకంటెను చులకనయై పోవును. (17)

తుషైః కాష్ఠైర్భవేత్ కార్యం లోష్టైరపి చ పాంసుభిః।
న తు స్థానాత్ పరిభ్రష్టైః కార్యం స్యాద్వసుధాధిపైః। 18

లోకమునకు ఒక్కొక్కప్పుడు ఎండిపోయిన పుల్లలు, మట్టిగడ్డలు, ధూళులు మొదలగు వానిచేగూడ కొంత ప్రయోజనము కలుగుచుండును. కాని పదవీభ్రష్టుడైన రాజుమాత్రము దేనికిని పనికిరాడు. (18)

ఉపభుక్తం యథా వాసః స్రజో వా మృదితా యథా।
ఏవం రాజ్యాత్ పరిభ్రష్టః సమర్థోఽపి నిరర్థకః। 19

కట్టుకొనివిడిచిన వస్త్రమువలె, నలిగిపోయిన పూలమాలలవలె రాజ్యభ్రష్టుడైనరాజు అతడెంత సమర్థుడైనను దేనికిని పనికిరాడు. (19)

అప్రమత్తశ్చ యో రాజా సర్వజ్ఞో విజితేంద్రియః।
కృతజ్ఞో ధర్మశీలశ్చ స రాజా తిష్ఠతే చిరమ్। 20

అనుక్షణము జాగరూకుడైయుండువాడు, పరిపాలనాది విషయములలో ఆఱితేఱినవాడు, జితేంద్రియుడు, ఇతరులు చేసినమేలును మఱువనివాడు, ధర్మనిరతుడు (ధర్మస్వభావము గలవాడు) ఐన రాజు చిరకాలము (జీవితాంతము) తనదేశమునకు ప్రభువుగా నిలువగలడు.(20)

నయనాభ్యాం ప్రసుప్తోఽపి జాగర్తి నయచక్షుషా।
వ్యక్తక్రోధప్రసాదశ్చ స రాజా పూజ్యతే జనైః। 21

రాజు నిద్రించు సమయమున కనులు మూసికొనియున్నను, పరిపాలనకు సంబంధించిన విషయమున నిరంతరము కన్నులు తెఱచుకొని (జాగృతి కలిగి) యుండవలెను. (రాజ్యపాలనము నందు ఏమాత్రము సాచివేతకు తావీయరాదు.) మఱియు అతడు అనువగు సందర్భములలో (సహేతుకముగా) మాత్రము క్రోధమును గాని, అనుగ్రహమునుగాని ప్రకటించుచుండవలెను. అట్టి ప్రభువును ప్రజలు గౌరవింతురు. (21)

త్వం తు రావణ! దుర్బుద్ధిః గుణైరేతైః వివర్జితః।
యస్య తేఽవిదితశ్చారైః రక్షసాం సుమహాన్ వధః। 22

ఓ రావణా! జనస్థానమునందు అసంఖ్యాకులైన మనరాక్షసయోధులు రణరంగమున ఘోరమరణము పాలైనవిషయమును చారులద్వారా నీవు సకాలములో తెలిసికొనలేకపోయితివి. దీనిని బట్టి నీవు ప్రజ్ఞాహీనుడవనియు, రాజునకు ఉండవలసిన ఉత్తమలక్షణములు లేనివాడవనియు విదితమగుచున్నది.(22)

పరావమంతా విషయేషు సంగతో
న దేశకాలప్రవిభాగతత్త్వవిత్ ।
అయుక్తబుద్ధిర్గుణదోషనిశ్చయే
విపన్నరాజ్యో నచిరాద్విపత్స్యసే । 23

ఓ రాజా! నీవు శత్రువులయెడ ఉపేక్షాభావముగలవాడవు, సర్వదా ఇంద్రియసుఖలోలుడవు, దేశకాలములనుబట్టి సకాలములో సరియగురీతిలో వ్యవహరించుట (స్పందించుట) ఎఱుగని వాడవు. యుక్తాయుక్తవిచక్షణ లేనివాడవు. కనుక త్వరలోనే నీరాజ్యమునకు ముప్పు ముంచుకొనిరానున్నది. నీవు ఆపదలపాలగుట నిశ్చయము. (23)

ఇతి స్వదోషాన్ పరికీర్తితాం స్తయా
సమీక్ష్య బుద్ధ్యా క్షణదాచరేశ్వరః ।

కొల్లలుగా సంపదలు, తిరుగులేని సైన్యములు కలిగియుండుటచే, దురహంకారియైయున్న రాక్షసరాజు శూర్పణఖ పేర్కొనిన తన అవగుణములను (లోపములను) గూర్చి ఒక పర్యాయము సమీక్షించుకొనెను. పిమ్మట ఆ రావణుడు 'తొందరపడి రామునితో యుద్ధమునకు తలపడవలదు' అని మారీచుడును,

ధనేన దర్పేణ బలేనచాన్వితో
విచింతయామాస చిరం స రావణః । 24

'శ్రీరామునివలన నీ రాజ్యమునకు త్వరలో ముప్పువాటిల్లనున్నది' అని శూర్పణఖయు[1,2] తెల్పిరి. ఇప్పుడు నా కర్తవ్యమేమి? అని దీర్ఘాలోచనలో పడెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే త్రయస్త్రింశస్సర్గః (33)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదిమూడవసర్గము.

-- ❋ ❋ ❋ --

34.ముప్పదినాల్గవసర్గము

శూర్పణఖ రామలక్ష్మణుల అందచందములను, శౌర్యపరాక్రమములను వర్ణించి చెప్పుట - సీతాదేవియొక్క సౌందర్య వైభవములను ప్రకటించి, 'ఆమెకు భర్తకాదగిన వాడవు నీవే-' అని పలుకుచు ఆమెను అపహరించుకొనిరమ్మని రావణునకు సూచించుట.

తతః శూర్పణఖాం క్రుద్ధాం బ్రువంతీం పరుషం వచః ।
అమాత్యమధ్యే సంక్రుద్ధః పరిపప్రచ్ఛ రావణః । 1

నిండుసభలో అమాత్యులసమక్షమున క్రుద్ధురాలై పరుషవచనములను పలుకుచున్న శూర్పణఖను జూచుచు, రామునివిషయమున క్రోధావేశపరుడైయున్న రావణుడు ఆమెను ఇట్లు ప్రశ్నించెను. (1)

కశ్చ రామః కథంవీర్యః కింరూపః కింపరాక్రమః ।
కిమర్థం దండకారణ్యం ప్రవిష్టః సుదురాసదమ్ । 2

ఆయుధం కించ రామస్య నిహతా యేన రాక్షసాః ।
ఖరశ్చ నిహతః సంఖ్యే దూషణస్త్రిశిరాస్తథా ।
(తత్త్వం బ్రూహి మనోజ్ఞాంగి కేన త్వం చ విరూపితా) । 3

"ఎవడా రాముడు? అతడెంతటి వీరుడు? అతనిరూపరేఖలెట్టివి? అతనిబలపరాక్రమములు ఎట్టివి? చొఱరాని దండకారణ్యమున అతడు ప్రవేశించుటకు గల కారణమేమి? ఖరదూషణత్రిశిరులను, వేలకొలదిగాగల రాక్షసయోధులను యుద్ధమున హతమార్చిన ఆ శ్రీరాముని ఆయుధములెట్టివి? ఓ సుందరీ! నీముక్కుచెవులను కోసి, నిన్ను వికృతరూపను చేసినదెవరు? అన్నింటిని వివరముగా తెలుపుము-" (2-3)

ఇత్యుక్తా రాక్షసేంద్రేణ రాక్షసీ క్రోధమూర్ఛితా ।
తతో రామం యథాతత్త్వమ్ ఆఖ్యాతుమ్ ఉపచక్రమే । 4

రాక్షసరాజు ఇట్లడుగగా క్రోధవివశయైయున్న శూర్పణఖ రామలక్ష్మణులనుగూర్చి తనకు తెలిసినంతలో విపులముగా ఇట్లు చెప్పదొడంగెను. (4)

దీర్ఘబాహుర్విశాలాక్షః చీరకృష్ణాజినాంబరః ।
కందర్పసమరూపశ్చ రామో దశరథాత్మజః । 5

"శ్రీరాముడు దశరథునికుమారుడు. అతడు ఆజానుబాహువు. విశాలమైనకన్నులుగలవాడు, నారచీరలను, జింకచర్మమును ధరించియున్నవాడు. మన్మథునికంటెను అందగాడు. (5)

శక్రచాపనిభం చాపం వికృష్య కనకాంగదమ్ ।
దీప్తాన్ క్షిపతి నారాచాన్ సర్పానివ మహావిషాన్ । 6

అతడు బంగారుపట్టీలు గలిగి, ఇంద్రధనుస్సువంటి వింటిని ఆకర్ణాంతము లాగి మహావిషసర్పములవలె మెఱయుచున్న తనశరములను ప్రయోగించును. (6)

1) శూర్పణఖ =శోణితబాజనేన యజ్ఞాదిసత్క్రియాం నఖయతి (శూర్పణఖ). నఖయతి = విదూషయతి- కుండలతో రక్తమును క్రుమ్మరించుచు యజ్ఞాదిసత్కార్యములను పాడుచేయునది.

2) శూర్పాకారాణి నఖాని యస్యాః సా = శూర్పణఖా. చేటలవంటి గోళ్లు గలది.

నాదదానం శరాన్ ఘోరాన్ న ముంచంతం శిలీముఖాన్।
న కార్ముకం వికర్షంతం రామం పశ్యామి సంయుగే। 7

హన్యమానం తు తత్ సైన్యం పశ్యామి శరవృష్టిభిః।
ఇంద్రేణేవోత్తమం సస్యమ్ ఆహతం త్వశ్మవృష్టిభిః। 8

రక్షసాం భీమరూపాణాం సహస్రాణి చతుర్దశ।
నిహతాని శరైస్తీక్ష్ణైః తేనైకేన పదాతినా। 9

అర్ధాధికముహూర్తేన ఖరశ్చ సహదూషణః।
ఋషీణామభయం దత్తం కృతక్షేమాశ్చ దండకాః। 10

ఏకా కథంచిన్ముక్తాఽహం పరిభూయ మహాత్మనా।
స్త్రీవధం శంకమానేన రామేణ విదితాత్మనా। 11

భ్రాతా చాస్య మహాతేజా గుణతస్తుల్యవిక్రమః।
అనురక్తశ్చ భక్తశ్చ లక్ష్మణో నామ వీర్యవాన్। 12

అమర్షీ దుర్జయో జేతా విక్రాంతో బుద్ధిమాన్ బలీ।
రామస్య దక్షిణో బాహుః నిత్యం ప్రాణో బహిశ్చరః। 13

రామస్య తు విశాలాక్షీ పూర్ణేందుసదృశాననా।
ధర్మపత్నీ ప్రియా భర్తుః నిత్యం ప్రియహితే రతా। 14

సా సుకేశీ సునాసోరుః సురూపా చ యశస్వినీ।
దేవతేవ వనస్యాస్య రాజతే శ్రీరివాపరా। 15

తప్తకాంచనవర్ణాభా రక్తతుంగనఖీ శుభా।
సీతా నామ వరారోహా వైదేహీ తనుమధ్యమా। 16

నైవ దేవీ న గంధర్వీ న యక్షీ న చ కిన్నరీ।
నైవం రూపా మయా నారీ దృష్టపూర్వా మహీతలే। 17

మహాపరాక్రమశాలియైన శ్రీరాముడు యుద్ధరంగమున అమ్ములపొదినుండి భయంకరములైన బాణములను తీసికొనుటయు, ధనుస్సును ఎక్కుపెట్టుటయు, శరములను ప్రయోగించుటయు నేను చూడలేదు. అవి అన్నియును, కనుఱెప్పపాటులో జరిగిపోవుచుండును. కాని ఇంద్రుడు కురిపించిన వడగండ్ల వానకు పైరుపంటలు ధ్వంసమైనట్లు శ్రీరాముని శరవృష్టికి సైన్యమంతయు హతమైపోవుటను మాత్రము చూచితిని. (7-8)

శ్రీరాముడు తానొక్కడే రణభూమియందు నిలిచి, తీక్ష్ణములైన బాణములను ప్రయోగించి, ఖరదూషణులతోసహా భయంకరరూపులైన పదునాలుగువేలమంది రాక్షసయోధులను మూడుగడియలలో మట్టిగఱపించెను. ఋషులకిచ్చిన వాగ్దానముప్రకారము ఆ విధముగా దండకవనమును వారికి నివాసయోగ్యముగా జేసెను. (9-10)

నేను ఆ మహాత్మునిచేతిలో అవమానములపాలైతిని. అతడు ధర్మాత్ముడగుటవలన 'స్త్రీని వధించుట తగదు' అని భావించి, నన్ను విడిచిపెట్టెను. నేను ఎట్టకేలకు చావుదప్పి, ఎట్లో ప్రాణములతో బయటపడితిని. (11)

మహావీరుడైన లక్ష్మణుడు అతనితమ్ముడు. అతడు మిగులతేజస్వి, సద్గుణములనుబట్టియు, పరాక్రమముచేతను అతడు అన్నతో సమానుడు. అతనికి తనయన్నయైన శ్రీరామునియెడలగల ప్రేమానురాగములు, భక్తివిశ్వాసములు అపూర్వములు. అతడు అధర్మమును ఏ మాత్రము సహింపడు. శత్రువులకు జయింపశక్యముగానివాడు, జయశీలుడు, గొప్పపరాక్రమముగలవాడు, మిగులప్రజ్ఞామూర్తి సాటిలేని బలశాలి, అతడు తనఅన్నయగు శ్రీరామునకు బహిఃప్రాణము, కుడిభుజము. (12-13)

శ్రీరామునిధర్మపత్నియగు సీతాదేవి ఆయనతో గూడియున్నది. ఆయనకు ఆమెపైగల ప్రేమ అపారము. ఆమెయు సర్వదా ఆయనహితమునందే నిరతురాలైయుండును. ఆమెకన్నులు విశాలములైనవి, ముఖము నిండుచంద్రునివలె ఆహ్లాదకరము, కేశసౌందర్యము అపురూపమైనది, ఆమె ముక్కు సొగసైనది, ఊరువులు పొంకములైనవి, ఆమె పేరుమోసిన సౌందర్యవతి. వనదేవతవలె, మఱియొక లక్ష్మీదేవివలె విరాజిల్లుచున్నది. మేలిమిబంగారువన్నె గలది, ఆమె ఎఱ్ఱనినఖములు ఉన్నతములైనవి, నాజూకైన నడుముగలది, ఆ ఒప్పులకుప్ప జనకమహారాజుకూతురు. (14-16)

అందచందములలో దేవగంధర్వయక్షకిన్నర బామినులెల్లరును ఆమెముందు దిగదుడుపే. ఇన్ని మాటలెందులకు నేనింతవఱకును ఈ భూమండలమున అట్టి సుందరిని చూచియే యెఱుగను. (17)

యస్య సీతా భవేద్భార్యా యం చ హృష్టా పరిష్వజేత్।
అతిజీవేత్ స సర్వేషు లోకేష్వపి పురందరాత్॥ 18

ఆ జానకిని భార్యగా పొందినవాని అదృష్టమే అదృష్టము. ఆమెకౌగిలిసుఖములను అనుభవించినవాని భాగ్యమే భాగ్యము. అట్టి పురుషుడు అన్నిలోకములవారిలోను సర్వశ్రేష్ఠుడై ఇంద్రునిమించి ఖ్యాతికెక్కును. (18)

సా సుశీలా వపుఃశ్లాఘ్యా రూపేణాప్రతిమా భువి।
తవానురూపా భార్యా స్యాత్ త్వం చ తస్యాస్తథా పతిః॥ 19

ఆమె సౌశీల్యవతి. చక్కని శరీరసౌందర్యముగలది, ఈ లోకములో రూపమున సాటిలేనిది. ఆమె నీకు భార్య కాదగినది, ఆమెకు భర్త కాదగినవాడవు నీవే. (19)

తాం తు విస్తీర్ణజఘనాం పీనశ్రోణీపయోధరామ్।
భార్యార్థే చ తవానేతుమ్ ఉద్యతాఽహం వరాననామ్।
విరూపితాఽస్మి క్రూరేణ లక్ష్మణేన మహాభుజ!॥ 20

ఓ మహాబాహూ! చక్కనివక్షస్థలము, జఘనసౌందర్యముగల ఆ సుందరిని నీకు భార్యను జేయుటకై ఇక్కడికి తీసికొనివచ్చుటకు పూనుకొంటిని. కాని క్రూరుడైన ఆ లక్ష్మణుడు నన్నిట్లు వికృతరూపను గావించెను. (20)

తాంతు దృష్ట్వాఽద్య వైదేహీం పూర్ణచంద్రనిభాననామ్।
మన్మథస్య శరాణాం వై త్వం విధేయో భవిష్యసి॥ 21

యది తస్యామ్ అభిప్రాయో భార్యార్థే తవ జాయతే।
శీఘ్రముద్ధ్రియతాం పాదో జయార్థమిహ దక్షిణః॥ 22

పున్నమినాటి చంద్రునివంటి మనోహరమైన ముఖముగల ఆ వైదేహిని చూచినవెంటనే నీవు మన్మథ బాణములతాకిడికి లోనగుదువు. (కామపరవశుడవగుదువు.) నీవు ఆమెను భార్యగా జేసికొనదలచినచో శ్రీరాముని జయించుటకు ముందడుగు వేయుము. (బయలుదేఱుము.) (21-22)

కురు ప్రియం తథా తేషాం రక్షసాం రాక్షసేశ్వర!।
వధాత్ తస్య నృశంసస్య రామస్యాఽఽశ్రమవాసినః॥ 23

తం శరైర్నిశితైర్హత్వా లక్ష్మణం చ మహారథమ్।
హతనాథాం సుఖం సీతాం యథావదుపభోక్ష్యసి॥ 24

ఓ రాక్షసరాజా! ఆశ్రమవాసి, క్రూరుడు ఐన ఆ రాముని వధించి, ఆ విధముగా ఖరదూషణాది రాక్షసులఆత్మలకు శాంతిని గూర్పుము. నీ నిశితములైన బాణములచే మహారథులైన రామలక్ష్మణులను హతమార్చుము. అనాథయైన సీతతో నీయిష్టానుసారము సుఖింపుము. (23-24)

రోచతే యది తే వాక్యం మమైతద్రాక్షసేశ్వర!।
క్రియతాం నిర్విశంకేన వచనం మమ రావణ!॥ 25

విజ్ఞాయేహాత్మశక్తిం చ హ్రియతామ్ అబలా బలాత్।
సీతా సర్వానవద్యాంగీ భార్యార్థే రాక్షసేశ్వర!॥ 26

ఓ రాక్షసరాజా! రావణా! నా ఈసూచనలు నీకు నచ్చినచో ఎట్టి సందేహములనూ పెట్టుకొనక నేనుచెప్పినట్లు చేయుము. ఓ ప్రభూ! నీ బలపరాక్రమములను సమీక్షించుకొని, సర్వాంగసుందరియైన సీతను నీభార్యను గావించుకొనుటకై బలవంతముగా ఆమెను అపహరించుకొని రమ్ము. (25-26)

నిశమ్య రామేణ శరైరజిహ్మగైః
హతాన్ జనస్థానగతాన్ నిశాచరాన్।
ఖరం చ బుద్ధ్వా నిహతం చ దూషణం
త్వమద్య కృత్యం ప్రతిపత్తుమర్హసి॥ 27

ఓ రాజా! శ్రీరాముడు సూటిగా 'రివ్వున' దూసికొనిపోగల తనవాడిబాణములచే జనస్థానమునందలి ఖరదూషణాదిసమస్తరాక్షసవీరులను సంహరించియున్నాడు గదా! ఆ విషయమును ఒకసారి జ్ఞప్తికి దెచ్చుకొని, నీ కర్తవ్యమును నిర్ణయించుకొనుము. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే చతుస్త్రింశస్సర్గః *(34)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదినాల్గవసర్గము.

-- ✻ ✻ ✻ --

35. ముప్పదిఐదవసర్గము

శూర్పణఖ చెప్పిన మాటలను విన్న పిమ్మట రావణుడు సీతాదేవిని అపహరించుకొని వచ్చుటకై నిశ్చయించుట - వెంటనే అతడు రథమును అధిరోహించి, సముద్రతీర దృశ్యములను గాంచుచు మారీచుని ఆశ్రమమునకు చేరుట-

తతః శూర్పణఖావాక్యం తచ్ఛ్రుత్వా రోమహర్షణమ్।
సచివాన్ అభ్యనుజ్ఞాయ కార్యం బుద్ధ్వా జగామ సః। 1

అనంతరము రావణుడు భయకారణముగా గగుర్పాటును గూర్చెడి శూర్పణఖవచనములను విని సభలోనున్న మంత్రులతో చర్చించి, తనకర్తవ్యమును నిర్ణయించుకొనెను. పిదప అతడు మంత్రులను పంపివైచి తనఅంతఃపురమున ప్రవేశించెను. (1)

తత్కార్యమనుగమ్యాథ యథావదుపలభ్య చ।
దోషాణాం చ గుణానాం చ సంప్రధార్య బలాబలమ్। 2

ఇతికర్తవ్యమిత్యేవ కృత్వా నిశ్చయమాత్మనః।
స్థిరబుద్ధిస్తతో రమ్యాం యానశాలాం జగామ హ। 3

తదుపరి రావణుడు కర్తవ్యమును స్వయముగా నిర్ణయించుకొనెను. సీతను అపహరించుటలో గల గుణదోషములనుగూర్చి తర్కించుకొనెను. తనబలమును శ్రీరామునిబలముతో పోల్చుకొని, కడకు సీతాపహరణమునకే నిశ్చయించుకొనెను. అనంతరము అశ్వశాలకు చేరెను. (2-3)

యానశాలాం తతో గత్వా ప్రచ్ఛన్నో రాక్షసాధిపః।
సూతం సంచోదయామాస రథః సంయోజ్యతామితి। 4

ఆ రాక్షసరాజు రహస్యముగా అశ్వశాలలో ప్రవేశించిన పిమ్మట 'రథమును సిద్ధపఱచుము' అని సారథిని ఆదేశించెను. (4)

ఏవముక్తః క్షణేనైవ సారథిర్లఘువిక్రమః।
రథం సంయోజయామాస తస్యాభిమతముత్తమమ్। 5

కాంచనం రథమాస్థాయ కామగం రత్నభూషితమ్।
పిశాచవదనైర్యుక్తం ఖరైః కాంచనభూషణైః। 6

మేఘప్రతిమనాదేన స తేన ధనదానుజః।
రాక్షసాధిపతిః శ్రీమాన్ యయౌ నదనదీపతిమ్। 7

ఆ సారథి కార్యనిర్వహణమునందు కడుసమర్థుడు. రావణుడు ఇచ్చిన ఆజ్ఞను అనుసరించి, అతడు ఆయనఅభిమతముమేరకు ఒక శ్రేష్ఠమైన రథమును క్షణములో సిద్ధముచేసెను. ఆ బంగారురథము యజమాని కోరికప్రకారము పయనింపగలదు. అది రత్నఖచితమైనది, దానికి పూన్చిన గుఱ్ఱములు బంగారు జీనులతో, పిశాచాకారములుగల ముఖములతో ఒప్పుచుండెను. కుబేరునిసోదరుడు, సకలైశ్వర్యసంపన్నుడు ఐన రావణుడు మేఘగర్జనవలె ధ్వనిచేయునట్టి ఆ రథమునెక్కి సముద్రతీరమునకు చేరెను. (5-7)

స శ్వేతవాలవ్యజనః శ్వేతచ్ఛత్రో దశాననః।
స్నిగ్ధవైడూర్యసంకాశః తప్తకాంచనకుండలః। 8

వింశద్భుజో దశగ్రీవో దర్శనీయపరిచ్ఛదః।
త్రిదశారిర్మునీంద్రఘ్నో దశశీర్ష ఇవాద్రిరాట్। 9

కామగం రథమాస్థాయ శుశుభే రాక్షసేశ్వరః।
విద్యున్మండలవాన్ మేఘః సబలాక ఇవాంబరే। 10

రావణుడు తెల్లనివింజామరలచే సేవింపబడుచుండును. ఆయనరాజచ్ఛత్రము స్వచ్ఛమై తెల్లని కాంతులనీనుచుండును. ఆ దశానునితేరు నీలవైడూర్యములవలె నిగనిగలాడుచుండును. అతడు ఇరువదిబాహువులతో, పదికంఠములతో ఒప్పుచు రాజచిహ్నములతో అద్భుతాకారమున కన్పట్టుచుండును. అతడు దేవతలకు శత్రువు, మునీంద్రులను హింసించుచుండువాడు. పర్వతశిఖరములవలె పదితలలు గలవాడు. యజమాని ఇష్టానుసారము పయనించునట్టి ఆ రథముపై ఆ రాక్షసేశ్వరుడు ఎక్కెను. అతడు తెల్లకొక్కెరలతో అవృతమైన మేఘమువలె విద్యుత్కాంతులను విరజిమ్ముచు గగనమార్గమున సాగిపోవుచుండెను.(8-10)

సశైలం సాగరానూపం వీర్యవానవలోకయన్ ।
నానాపుష్పఫలైర్వృక్షైః అనుకీర్ణం సహస్రశః । 11

శీతమంగళతోయాభిః పద్మినీభిః సమంతతః ।
విశాలైరాశ్రమపదైః వేదిమద్భిః సమావృతమ్ । 12

కదల్యాఢకిసంబాధం నాళికేరోపశోభితమ్ ।
సాలైస్తాలైస్తమాలైశ్చ పుష్పితైస్తరుభిర్వృతమ్ । 13

నాగైః సుపర్ణైర్గంధర్వైః కిన్నరైశ్చ సహస్రశః ।
అజైర్వైఖానసైః మాషైః వాలఖిల్యైర్మరీచిపైః । 14

అత్యంతనియతాహారైః శోభితం పరమర్షిభిః ।
జితకామైశ్చ సిద్ధైశ్చ చారణైరుపశోభితమ్ । 15

దివ్యాభరణమాల్యాభిః దివ్యరూపాభిరావృతమ్ ।
క్రీడారతివిధిజ్ఞాభిః అప్సరోభిః సహస్రశః । 16

సేవితం దేవపత్నీభిః శ్రీమతీభిః శ్రియాఽఽవృతమ్ ।
దేవదానవసంఘైశ్చ చరితం త్వమృతాశిభిః । 17

హంసక్రౌంచప్లవాకీర్ణం సారసైః సంప్రణాదితమ్ ।
వైదూర్యప్రస్తరం రమ్యం స్నిగ్ధం సాగరతేజసా । 18

పాండురాణి విశాలాని దివ్యమాల్యయుతాని చ ।
తూర్యగీతాభిజుష్టాని విమానాని సమంతతః । 19

తపసా జితలోకానాం కామగాన్యభిసంపతన్ ।
గంధర్వాప్సరసశ్చైవ దదర్శ ధనదానుజః । 20

నిర్యాసరసమూలానాం చందనానాం సహస్రశః ।
వనాని పశ్యన్ సౌమ్యాని ఘ్రాణతృప్తికరాణి చ । 21

మహావీరుడైన రావణుడు పర్వతపంక్తితోగూడిన సాగరతీరమునకు జేరి, అచటి మనోహరదృశ్యములనన్నింటిని అవలోకింపసాగెను. ఆ తీరమున పూవులతో, పండ్లతో నిండిన వేలకొలది వృక్షములు విరాజిల్లుచుండెను. నలుదిక్కులయందును చల్లని మధురజలములతో నిండియున్న సరస్సులు, చూడముచ్చటైన వేదికలతో ఒప్పుచున్న విశాలములైన ఆశ్రమములు అలరారుచుండెను. అచట అరటితోటలు, కందిపైరులు, కొబ్బరిచెట్లు, బాగుగా పుష్పించిన మద్దివృక్షములు, తాటిచెట్లు, కానుగచెట్లు శోభిల్లుచుండెను. (11-13)

వేలకొలదిగా గల నాగులు, గరుడపక్షులు, గంధర్వులు, కిన్నరులు బ్రహ్మమానసపుత్రులైన వైఖానసులు, మాషగోత్రజులు, వాలఖిల్యులు, అమృతకిరణములను పానముచేయునట్టి దేవతలు, ఆహారనియమములను పాటించునట్టి మహర్షులు, జితేంద్రియులైన సిద్ధులు, చారణులు మొదలగువారితో ఆ తీరప్రదేశములు శోభిల్లుచుండెను. (14-15)

దివ్యములైన ఆభరణములను, పూలమాలలను ధరించెడివారు, చక్కని రూపసంపదగలవారు, ఆటపాటలలో అభిరుచిగలవారు, అందు ఆరితేఱినవారు ఐన వేలకొలది అప్సరసలు అచట విహరించుచుందురు. ఆ తీరమునందంతటను దివ్యాంగనలసౌందర్యశోభలు వెల్లివిరియుచుండెను. అమృతపానముచేసెడి దేవతలు, దానవులు అచట సంచరించుచుందురు. (16-17)

హంసలు, క్రౌంచపక్షులు, కప్పలు, బెగ్గురుపిట్టలు ఆ ప్రదేశమునందుఅంతటను వ్యాపించి, కోలాహలమొనర్చుచున్నవి. ఆ తీరమున వైడూర్యములనుబోలిన శిలలు సాగరతరంగముల తాకిడికి నునుపుదేలి రమ్యముగా కన్పట్టుచున్నవి. (18)

కుబేరునితమ్ముడైన రావణుడు గగనమార్గమున పయనించుచుండగా ఆయనకు దారిలో విశాలమైన తెల్లనివిమానములు కన్పించెను. అవి దివ్యములైన మాలలతో అలంకరింపబడియుండెను. వాటియందు వాద్యగీతనాదములు వినిపించుచుండెను. ఆ విమానములు తపోమహిమచే లోకములనే జయించిన మహాపురుషులకు చెందినవి. అవి ఎచటికైనను స్వేచ్ఛగా పయనింపగలవు. ఆ రాక్షసప్రభువు ఆ మార్గమున గంధర్వులను, అప్సరసలను తిలకించెను. (19-20)

అతడు మార్గమధ్యమున వేలకొలది చందనవనములను గాంచెను. ఆ వృక్షములనుండి ద్రవపదార్థములు స్రవించుచుండెను. అవి సువాసనలను విరజిమ్ముచు

అగరూణాం చ ముఖ్యానాం వనాన్యుపవనాని చ।
తక్కోలానాం చ జాత్యానాం ఫలానాం చ సుగంధినామ్। 22

పుష్పాణి చ తమాలస్య గుల్మాని మరిచస్య చ।
ముక్తానాం చ సమూహాని శుష్యమాణాని తీరతః। 23

శంఖానాం ప్రస్తరం చైవ ప్రవాళనిచయం తథా।
కాంచనాని చ శైలాని రాజతాని చ సర్వశః। 24

ప్రస్రవాణి మనోజ్ఞాని ప్రసన్నాని హ్రదాని చ।
ధనధాన్యోపపన్నాని స్త్రీరత్నైః శోభితాని చ। 25

హస్త్యశ్వరథగాఢాని నగరాణ్యవలోకయన్।
తం సమం సర్వతః స్నిగ్ధం మృదుసంస్పర్శమారుతమ్।
అనూపం సింధురాజస్య దదర్శ త్రిదివోపమమ్। 26

తత్రాపశ్యత్ స మేఘాభం న్యగ్రోధమ్ ఋషిభి ర్వృతమ్।
సమంతాద్యస్య తాః శాఖాః శతయోజనమాయతాః। 27

యస్య హస్తినమాదాయ మహాకాయం చ కచ్ఛపమ్।
భక్షార్థం గరుడః శాఖామ్ ఆజగామ మహాబలః। 28

తస్య తాం సహసా శాఖాం భారేణ పతగోత్తమః।
సుపర్ణః పర్ణబహులాం బభంజ చ మహాబలః। 29

తత్ర వైఖానసా మాషా వాలఖిల్యా మరీచిపాః।
అజా బభూవుర్ధూమ్రాశ్చ సంగతాః పరమర్షయః। 30

తేషాం దయార్థం గరుడః తాం శాఖాం శతయోజనామ్।
జగామాదాయ వేగేన తౌ చోభౌ గజకచ్ఛపౌ। 31

ఏకపాదేన ధర్మాత్మా భక్షయిత్వా తదామిషమ్।
నిషాదవిషయం హత్వా శాఖయా పతగోత్తమః। 32

ప్రహర్షమతులం లేభే మోక్షయిత్వా మహామునీన్। 33

హాయినిగొల్పునవియైయుండెను. ప్రశస్తములైన అగరువనములను, సువాసలను గుబాళింపచేయునట్టి మధురఫలములుగల శ్రేష్ఠములైన తక్కోలవృక్షముల ఉపవనములను, విరబూసినకానుగచెట్లను, మఱియు పూబొదలను, తేమలేని ముత్యములరాసులను, అతడాతీరమున జూచెను. (21-23)

శంఖములరాసులను, పగడములకుప్పలను, వెండిబంగారుపన్నెలతో విరాజిల్లుచున్నపర్వత శిఖరములను అతడు అంతటను గాంచెను. (24)

ఆ రావణుడు కనువిందుగావించు సెలయేళ్లను, స్వచ్ఛముగానున్న మడుగులను జూచెను. ఇంకను అతడు ధనధాన్యములతో తులతూగుచున్ననగరములను గాంచెను. అవి వనితామణులతోడను, గజాశ్వరథములతోడను నిండియుండెను. అంతటను సమతలముగలిగి, సుందరదృశ్యములతో ఒప్పుచు, పిల్లగాలులచే హాయినిగొల్పుచు స్వర్గతుల్యమై విలసిల్లుచున్నసముద్రతీరమును అతడు సంతోషముతో తిలకించెను. (25-26)

ఇట్లు కొంతదూరము పయనించిన పిమ్మట అతడు మేఘసమూహమువలె ఒప్పుచున్న ఒక మఱ్ఱివృక్షమును జూచెను. దానిచుట్టును ఋషీశ్వరులు చేరియుండిరి. దానికొమ్మలు అన్నివైపులను నూఱుయోజనములవఱకు వ్యాపించియుండెను. (27)

మహాబలశాలియైన గరుత్మంతుడు ఒకానొకప్పుడు ఒకమదపుటేనుగును, పెద్దశరీరముగల ఒక తాబేటిని దీసికొని భక్షించుటకై ఆ చెట్టుకొమ్మపై చేరెను. బలమైన ఱెక్కలుగలవాడును, మిగుల వేగముగలవాడును ఐన ఆ పక్షిరాజుయొక్క బరువునకు ఆగలేక దట్టముగా ఆకులుగల ఆ మఱ్ఱిచెట్టుకొమ్మ విఱిగెను. (28-29)

ఆ వటవృక్షముక్రింద వైఖానసులు, మాషగోత్రజులు, వాలఖిల్యులు, సూర్యకిరణములను ఆస్వాదించెడివారు, బ్రహ్మపుత్రులు, యజ్ఞహోమధూమములను ఆహారముగా గొనువారు, ఐన ఋషీశ్వరులు చేరియుండిరి. అంతట గరుడుడు వారిపై దయ జూపి, ఒక పాదముతో నూఱు యోజనముల వఱకు వ్యాపించియున్న ఆ శాఖను, మరొక పాదముతో గజకూర్మములను పట్టుకొని వేగముగా వెళ్లిపోయెను. పిమ్మట ధర్మాత్ముడైన ఆ గరుత్మంతుడు పయనించుచునే ఆ గజకచ్ఛపముల మాంసములను భక్షించెను. పిమ్మట అతడు ఒక కిరాతగ్రామమును సమీపించెను. అచట మునులను హింసించునట్టి కిరాతులను ఆ కొమ్మతో కొట్టి చంపి, అతడు అచటి మహర్షులను కాపాడి మిక్కిలి సంతోషించెను. (30-33)

స తేనైవ ప్రహర్షేణ ద్విగుణీకృతవిక్రమః।
అమృతానయనార్థం వై చకార మతిమాన్ మతిమ్। 34

అయోజాలాని నిర్మథ్య భిత్త్వా రత్నమయం గృహమ్।
మహేంద్రభవనాద్గుప్తమ్ ఆజహారామృతం తతః। 35

తం మహర్షిగణైర్జుష్టం సువర్ణకృతలక్షణమ్।
నామ్నా సుభద్రం న్యగ్రోధం దదర్శ ధనదానుజః। 36

అతడు విజయోత్సాహమును పొంది, రెట్టింపు పరాక్రమముతో అమృతమును గొనివచ్చుటకై నిశ్చయించుకొనెను. అమృతము ఇంద్రునిభవనమున రక్షింపబడుచుండెను. అందువలన అతడు ఇనుపగవాక్షమును ఛేదించుకొని, రత్నమయమైన గృహమును పడగొట్టి, ఆ అమృతమును దీసికొని వచ్చెను. గరుత్మంతుడు ఒక కొమ్మను విఱుగగొట్టగా మిగిలియున్న ఆ మఱ్ఱిచెట్టు మహర్షులకు నీడనిచ్చుచు 'సుభద్రము' అను పేరుతో ప్రసిద్ధిగాంచెను. రావణుడు ఆ వృక్షమును దర్శించెను. (34-36)

తం తు గత్వా పరం పారం సముద్రస్య నదీపతేః।
దదర్శాశ్రమమేకాంతే రమ్యే పుణ్యే వనాంతరే। 37

తత్ర కృష్ణాజినధరం జటావల్కలధారిణమ్।
దదర్శ నియతాహారం మారీచం నామ రాక్షసమ్। 38

స రావణః సమాగమ్య విధివత్తేన రక్షసా।
మారీచేనార్చితో రాజా సర్వకామైరమానుషైః। 39

తం స్వయం పూజయిత్వా తు భోజనేనోదకేన చ।
అర్థోపహితయా వాచా మారీచో వాక్యమబ్రవీత్। 40

రావణుడు నదీపతియైన సముద్రముయొక్క ఆవలితీరమునకు చేరి అచట రమ్యమై, ప్రశాంతముగా నున్న పవిత్రవనమునందు ఒక ఆశ్రమమును జూచెను. అచట కృష్ణాజినమును ధరించి నారచీరలను దాల్చి, జటాధారియై, ఆహారనియమములను పాటించుచు జీవించుచున్న 'మారీచుడు' అను రాక్షసుని దర్శించెను. అంతట ఆ రాక్షసుడు రావణునకు స్వాగతమర్యాదలను నెఱపి, దివ్యములైన వివిధభోగ్యవస్తువులతో అతనిని విధ్యుక్తముగా అర్చించెను. పిమ్మట ఆ మారీచుడు స్వయముగా అతనిని అన్నపానీయములతో గౌరవించి, అతనితో అర్థయుక్తముగా ఇట్లు నుడివెను. (37-40)

కచ్చిత్ సుకుశలం రాజన్! లంకాయాం రాక్షసేశ్వర!।
కేనార్థేన పునస్త్వం వై తూర్ణమేవమిహాఽఽగతః। 41

ఏవముక్తో మహాతేజా మారీచేన స రావణః।
తం తు పశ్చాదిదం వాక్యమ్ అబ్రవీద్వాక్యకోవిదః। 42

"ఓ రాక్షసరాజా! లంకయందు అందఱును కుశలమేగదా! మఱల ఒంటరిగా వెంటనే నీవు ఇచటికి ఎందులకు వచ్చితివి?" మారీచుడు ఇట్లు ప్రశ్నింపగా వాక్చతురుడైన రావణుడు మారీచునితో ఇట్లు పలికెను. (41-42)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచత్రింశస్సర్గః (35)

వాల్మీకిమహర్షినిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదిఐదవసర్గము.

-- * * * --

36. ముప్పదిఆఱవసర్గము

'సీతాపహరణ విషయమున తోడ్పడుము' అని రావణుడు మారీచుని కోరుట - అప్పుడతడు ఆందోళనకు లోనగుట-

మారీచ! శ్రూయతాం తాత! వచనం మమ భాషతః।
ఆర్తోఽస్మి మమ చార్తస్య భవాన్ హి పరమా గతిః। 1

"ఓ మారీచా! నేను నుడువబోవు మాటలను ఆలకింపుము. నేను ఆపదలలో చిక్కుకొనియున్నాను. ఇక నాకు నీవే దిక్కు. (1)

జానీషే త్వం జనస్థానే యథా భ్రాతా ఖరో మమ।
దూషణశ్చ మహాబాహుః స్వసా శూర్పణఖా చ మే। 2

నా సోదరుడైన ఖరుడు, భుజబలశాలియైన దూషణుడు, నాతోబుట్టువైన శూర్పణఖ, మాంసభక్షకుడు, మిగుల పరాక్రమవంతుడు ఐన త్రిశిరాసురుడు, గుఱి తప్పని యోధులైన అసంఖ్యాక రాక్షసవీరులు, ఇంకను

త్రిశిరాశ్చ మహాతేజా రాక్షసః పిశితాశనః।
అన్యే చ బహవః శూరా లబ్ధలక్షా నిశాచరాః। 3

వసంతి మన్నియోగేన నిత్యవాసం చ రాక్షసాః।
బాధమానా మహారణ్యే మునీన్ వై ధర్మచారిణః। 4

చతుర్దశ సహస్రాణి రక్షసాం భీమకర్మణామ్।
శూరాణాం లబ్ధలక్షాణాం ఖరచిత్తానువర్తినామ్। 5

తే త్విదానీం జనస్థానే వసమానా మహాబలాః।
సంగతాః పరమాయత్తా రామేణ సహ సంయుగే। 6

నానాప్రహరణోపేతాః ఖరప్రముఖరాక్షసాః।
తేన సంజాతరోషేణ రామేణ రణమూర్ధని।
అనుక్త్వా పరుషం కించిత్ శరైర్వ్యాపారితం ధనుః। 7

చతుర్దశ సహస్రాణి రక్షసాముగ్రతేజసామ్।
నిహతాని శరైస్తీక్ష్ణైః మానుషేణ పదాతినా। 8

ఖరశ్చ నిహతః సంఖ్యే దూషణశ్చ నిపాతితః।
హతశ్చ త్రిశిరాశ్చాపి నిర్భయా దండకాః కృతాః। 9

పిత్రా నిరస్తః క్రుద్ధేన సభార్యః క్షీణజీవితః।
స హంతా తస్య సైన్యస్య రామః క్షత్రియపాంసనః। 10

దుశ్శీలః కర్కశస్తీక్ష్ణో మూర్ఖో లుబ్ధోఽజితేంద్రియః।
త్యక్తధర్మో హ్యధర్మాత్మా భూతానామ్ అహితే రతః। 11

తదితరరాక్షసులు నా ఆదేశానుసారము జనస్థానమునందు స్థిరనివాసము కలిగియున్న విషయమును నీవు ఎఱుగుదువు గదా! ఆ మహారణ్యమునందు తమతపోవిధులను నిర్వర్తింపుకొను మునులకు ఆటంకములను కల్గించుచు, రాక్షసులు వారిని బాధించుచుందురు. (2-4)

ఘోరములైన కార్యములనొనర్చువారు, ఖరునిమనస్సును ఎఱిగి ప్రవర్తించువారు, అస్త్రవిద్యలో లక్ష్యసిద్ధిని సాధించినవారు, జనస్థాననివాసులు ఐన పదునాలుగువేలమంది రాక్షసశూరులు రణరంగమునందు సర్వసన్నద్ధులై శ్రీరామునితో యుద్ధమునకు తలపడిరి. (5-6)

వివిధములగు ఆయుధములను ప్రయోగించుటలో ఆఱితేఱిన ఖరుడుమున్నగు రాక్షసప్రముఖుల యొక్క కవ్వింపులకారణముగా శ్రీరాముడు రోషావేశపరుడై, సమరభూమియందు ఎట్టి పరుషవాక్యములను పలుకక వెంటనే తనధనుర్బాణములకు పనిచెప్పెను. (7)

మనుష్యమాత్రుడైన శ్రీరాముడు యుద్ధరంగమున నిలిచి, ప్రయోగించిన తీక్ష్ణములైన బాణములధాటికి పదునాలుగువేలమంది మనరాక్షసయోధులు మట్టిగఱచిరి. ఆ సమరమున ఖరుడు నిహతుడాయెను, దూషణుడు నేలకొఱిగెను. త్రిశిరుడు మృత్యువాతబడెను. దండకారణ్యవాసులు భయరహితులైరి. (8-9)

ఆ రాముడు క్రుద్ధుడైన తండ్రిచేత వెడలగొట్టబడి, భార్యాసహితుడై వనములకు చేరెను. మనసైన్యములను హతమార్చిన ఆ క్షత్రియాధమునకు ఇక ఆయువు మూడినట్లే, అతడు శీలములేనివాడు. కఠిన హృదయుడు, తీక్ష్ణస్వభావముగలవాడు, మూర్ఖుడు, లోభి, ఇంద్రియ నిగ్రహములేనివాడు, ధర్మమును త్యజించినవాడు. అధర్మపరుడు, ప్రాణులకు కీడుతలపెట్టెడివాడు.[1](10-11)

1) శ్రీరామునిగూర్చి రావణుడు పలికిన మాటలలో పైకి నిందించుచున్నట్లు కనబడుచున్నను వాస్తవముగా అందు ప్రశంసలే ద్యోతకములగుచున్నవి.
పిత్రానిరస్తః = కైకేయీవరదానమోహితేన పిత్రా ప్రార్థితస్సన్ వనమాగతః = కైకేయికి ఇచ్చిన వరములలో చిక్కుకొనిన తండ్రిచేత అర్థింపబడి వనములకు వచ్చినవాడు.
సభార్యః = సభాయామ్ ఆర్యః = సభ్యః = సభలో పూజ్యుడు, క్షీణజీవితః = క్షీణాః (ఖరాదీనాం) జీవితాః యేన సః = ఖరాదులజీవితములను క్షీణింపజేసినవాడు, క్షత్రియాన్‌పాతీతి క్షత్రియపః, సచాఽసౌ అంసనశ్చ = శత్రునాశకః = క్షత్రియులను రక్షించువాడు, శత్రువులను నశింపజేయువాడు, దుశ్శీలః = అశీలః = అత్యంతసుశీలః = సద్వృత్తః = సత్ప్రవర్తన కలవాడు, కర్కశః = కఠినః శత్రువిషయే = శత్రువులయెడ కఠినముగానుండువాడు, తీక్ష్ణః = కార్యేషు అనలసః = కార్యశూరుడు, అమూర్ఖః = మూర్ఖుడుకానివాడు - వివేకి, అలుబ్ధః = లుబ్ధుడు కానివాడు, = త్యాగి, జితేంద్రియః = ఇంద్రియములను జయించినవాడు, త్యక్తధర్మః = త్యక్తాః విరుద్ధాః ధర్మాః యేన సః = శాస్త్రవిరుద్ధములైన ధర్మములను త్యజించినవాడు, అధర్మాత్మా = అత్యంత ధర్మాత్మా = మిక్కిలి ధర్మాత్ముడు, భూతానామ్ అహితే అరతః = సర్వభూతదయాపరః = సమస్త ప్రాణులయెడ దయగలవాడు.
– గోవిందరాజీయ వ్యాఖ్య

మేన వైరం వినాఽరణ్యే సత్త్వమాశ్రిత్య కేవలమ్।
కర్ణనాసాపహరణాత్ భగినీ మే విరూపితా। 12

తస్య భార్యాం జనస్థానాత్ సీతాం సురసుతోపమామ్।
ఆనయిష్యామి విక్రమ్య సహాయస్తత్ర మే భవ। 13

త్వయా హ్యహం సహాయేన పార్శ్వస్థేన మహాబల!।
భ్రాతృభిశ్చ సురాన్ యుద్ధే సమగ్రాన్నాఽభిచింతయే। 14

తత్సహాయో భవ త్వం మే సమర్థో హ్యసి రాక్షస!।
వీర్యే యుద్ధే చ దర్పే చ న హ్యస్తి సదృశస్తవ। 15

ఉపాయజ్ఞో మహాన్ శూరః సర్వమాయావిశారదః।
ఏతదర్థమహం ప్రాప్తః త్వత్సమీపం నిశాచర! 16

శృణు తత్కర్మ సాహాయ్యే యత్కార్యం వచనాన్మమ। 17

సౌవర్ణస్త్వం మృగో భూత్వా చిత్రో రజతబిందుభిః।
ఆశ్రమే తస్య రామస్య సీతాయాః ప్రముఖే చర। 18

త్వాం తు నిస్సంశయం సీతా దృష్ట్వా తు మృగరూపిణమ్।
గృహ్యతామితి భర్తారం లక్ష్మణం చాఽభిధాస్యతి। 19

తతస్తయోరపాయే తు శూన్యే సీతాం యథాసుఖమ్।
నిరాబాధో హరిష్యామి రాహుశ్చంద్రప్రభామివ। 20

తతః పశ్చాత్ సుఖం రామే భార్యాహరణకర్శితే।
విస్రబ్ధః ప్రహరిష్యామి కృతార్థేనాంతరాత్మనా। 21

తస్య రామకథాం శ్రుత్వా మారీచస్య మహాత్మనః।
శుష్కం సమభవద్వక్త్రం పరిత్రస్తో బభూవ హ। 22

ఓష్ఠౌ పరిలిహన్ శుష్కౌ నేత్రైరనిమిషైరివ।
మృతభూత ఇవార్తస్తు రావణం సముదైక్షత। 23

ఎట్టి వైరకారణముగూడ లేకుండ (అకారణముగా) ఆ రాముడు తనబలమును జూచుకొని, నా సోదరి శూర్పణఖయొక్క ముక్కుచెవులను గోసి, ఆమెను విరూపను గావించెను. అందువలన దివ్యాంగనవలె సౌందర్యవతియైన అతని భార్యయగు సీతను జనస్థానమునుండి బలవంతముగా తీసికొనివచ్చెదను. ఈ విషయమున నీవు నాకు సహాయపడవలెను. (12-13)

ఓ మహావీరుడా! నాకు కుడిభుజమువంటివాడవైన నీవు అండగా నా ప్రక్కన నిలిచియున్నచో, కుంభకర్ణాదులైన నా సోదరులు తోడుగానున్నచో యుద్ధరంగమున సమస్తదేవతలను నేను లక్ష్యపెట్టను. ఓ మారీచా! అందువలన నీవు నాకు సహాయకుడవై యుండుము. నీవు సర్వసమర్థుడవు, పరాక్రమమునందును, యుద్ధము చేయుటయందును, సమరోత్సాహమునందును నీవు సాటిలేనివాడవు. పైగా ఉపాయశాలివి, మహావీరుడవు, పలువిధములగు మాయలను పన్నుటలో ఘటికుడవు. అందువలన ఈ కార్యమును సాధించుటకై నేను నీ కడకు వచ్చితిని. (14-16)

ఈ సందర్భమున నీవు సహాయపడవలసిన పద్ధతిని తెల్పెదను. శ్రద్ధగా వినుము. తెల్లనిముక్కలుగల చిత్రమైన ఒక బంగారులేడిరూపమును పొంది, ఆరామునిఆశ్రమమున సీతయెదుట సంచరింపుము. అద్భుతమైన నీ మృగరూపమును జూచి, ఆమె మిగుల మోజుపడును. వెంటనే 'ఈ బంగారులేడిని తెచ్చియిండు' అని ఆమె రామలక్ష్మణులను కోరును. అప్పుడు వారు దూరముగా వెళ్ళిపోగా ఆశ్రమమున ఒంటరిగానున్న సీతను నిరాటంకముగా అవలీలగా చంద్రకాంతులను రాహువువలె హరించెదను. (17-20)

అంతట రాముడు భార్యావియోగకారణమున క్రుంగికృశించిపోవును. అప్పుడు నేను తిరుగులేని మనోబలముతో నిస్సంశయముగా అతనిని దెబ్బతీయగలను (వధింపగలను). (21)

శ్రీరామునిపేరును వినినంతనే బుద్ధికుశలుడైన మారీచుడు భయముతో వణకిపోయెను. అతనిముఖము వాడిపోయెను. పెదవులతడి ఆఱిపోయెను. అతడు ఎండినపెదవులను నాలుకతో తడుపుకొనుచు, ఱెప్పపాటులేక గ్రుడ్లప్పగించి చూచుచు మృతప్రాయుడయ్యెను. అతడు మిగుల ఆర్తుడై రావణుని వైపు చూడసాగెను. (22-23)

స రావణం త్రస్తవిషణ్ణ చేతా
మహావనే రామపరాక్రమజ్ఞః ।
కృతాంజలిస్తత్త్వమువాచ వాక్యం
హితం చ తస్మై హితమాత్మనశ్చ ॥ 24

ఆ మారీచుడు ఇంతకుముందే మహావనమునందు (మహావనములకు మధ్యనగల విశ్వామిత్రుని ఆశ్రమమునందు) శ్రీరామునిపరాక్రమమును రుచిచూచియుండెను. అందువలన అతనిమనస్సు భయాందోళనలకు గురియయ్యెను. కనుక అతడు రావణునకు నమస్కరించి, అతనికిని, తనకును మేలు చేకూర్చునట్టి వాస్తవవిషయములను ఇట్లు పలికెను. (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే షట్త్రింశస్సర్గః (6)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదిఆఱవసర్గము.

-- * * * --

37. ముప్పదిఏడవసర్గము

మారీచుడు శ్రీరాముని ఉదాత్తగుణములను గూర్చి రావణునకు వివరించుట - 'సీతాపహరణయత్నమును మానుకొనుము' అని అతడు ఆ లంకాధిపతికి హితవు పలుకుట -

తచ్ఛ్రుత్వా రాక్షసేంద్రస్య వాక్యం వాక్యవిశారదః ।
ప్రత్యువాచ మహాప్రాజ్ఞో మారీచో రాక్షసేశ్వరమ్ ॥ 1

ఆ రాక్షసరాజుపలుకులను విని, మాటనేర్పరియు, ప్రజ్ఞావంతుడును ఐన మారీచుడు అతనితో ఇట్లు నుడివెను. (1)

సులభాః పురుషా రాజన్! సతతం ప్రియవాదినః ।
అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥ 2

"ఓ రాజా! ఆపదలు వచ్చి పడినప్పుడును యజమానియొక్క హితాహితములను పట్టించుకొనక, అయనకడ ప్రాపకమును సంపాదించుటద్వారా తాము లాభపడుటకై ఇచ్చకపుమాటలాడువారు ఈ లోకమున కోకొల్లలు. తాత్కాలికముగ అప్రియముగా కన్పట్టినను దీర్ఘకాలము మీద (మున్ముందు) యజమానికి మేలు గూర్చెడి మాటలను పలికెడువారే ఉండరు. పలికినను వినెడువారును అరుదు. (2)

న నూనం బుధ్యసే రామం మహావీర్యం గుణోన్నతమ్ ।
అయుక్తచారశ్చపలో మహేంద్రవరుణోపమమ్ ॥ 3

ఓ ప్రభూ! నీకు సరియైన గూఢచారులు లేరు. నీవు చపలుడవు. కనుక మహావీరుడైన శ్రీరామునిగూర్చి నిజముగా నీవు ఏ మాత్రము తెలిసికొనలేకున్నావు. అతడు సద్గుణములకు నిధి, బలపరాక్రమముల విషయమున అతడు ఇంద్రవరుణులతో సమానుడు. (3)

అపి స్వస్తి భవేత్ తాత! సర్వేషాం భువి రక్షసామ్ ।
అపి రామో న సంక్రుద్ధః కుర్యాల్లోకమరాక్షసమ్ ॥ 4

అపి తే జీవితాంతాయ నోత్పన్నా జనకాత్మజా ।
అపి సీతానిమిత్తం చ న భవేద్వ్యసనం మమ ॥ 5

నాయనా! నీవు సీతను అపహరించికొనివచ్చినచో ఈ లోకమునందలి రాక్షసులందఱును క్షేమముగా ఉందురా? (ఉండరు.) శ్రీరాముడు కుపితుడై ఈ రాక్షసలోకమును నిర్మూలింపకుండునా? (నిర్మూలించును.) జానకీదేవి నీ ప్రాణములను హరించుటకై పుట్టలేదు గదా! (అందులకే పుట్టినది.) సీతాదేవి కారణముగా నాకును ఆపద వాటిల్లదుగదా! (వాటిల్లుతీరును.) కామప్రవృత్తిగల నీవంటి

అపి త్వామీశ్వరం ప్రాప్య కామవృత్తం నిరంకుశమ్।
న వినశ్యేత్ పురీ లంకా త్వయా సహ సరాక్షసా। 6

త్వద్విధః కామవృత్తో హి దుశ్శీలః పాపమంత్రితః।
ఆత్మానం స్వజనం రాష్ట్రం స రాజా హంతి దుర్మతిః। 7

న చ పిత్రా పరిత్యక్తో నాఽమర్యాదః కథంచన।
న లుబ్ధో న చ దుశ్శీలో న చ క్షత్రియపాంసనః। 8

న చ ధర్మగుణైర్హీనః కౌసల్యానందవర్ధనః।
న తీక్ష్ణో నచ భూతానాం సర్వేషామ్ అహితే రతః। 9

వంచితం పితరం దృష్ట్వా కైకేయ్యా సత్యవాదినమ్।
కరిష్యామీతి ధర్మాత్మా తాత! ప్రవ్రజితో వనమ్। 10

కైకేయ్యాః ప్రియకామార్థం పితుర్దశరథస్య చ।
హిత్వా రాజ్యం చ భోగాంశ్చ ప్రవిష్టో దండకావనమ్। 11

న రామః కర్కశస్తాత! నాఽవిద్వాన్నాఽజితేంద్రియః।
అనృతం దుశ్శ్రుతం చైవ నైవం త్వం వక్తుమర్హసి। 12

రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః।
రాజా సర్వస్య లోకస్య దేవానాం మఘవానివ। 13

కథం త్వం తస్య వైదేహీం రక్షితాం స్వేన తేజసా।
ఇచ్ఛసి ప్రసభం హర్తుం ప్రభామివ వివస్వతః। 14

శరార్చిషమనాధృష్యం చాపఖడ్గేంధనం రణే।
రామాగ్నిం సహసా దీప్తం న ప్రవేష్టుం త్వమర్హసి। 15

ధనుర్వ్యాదితదీప్తాస్యం శరార్చిషమమర్షణమ్।
చాపపాశధరం వీరం శత్రుసైన్యప్రహారిణమ్। 16

నిరంకుశ ప్రభువును పొందినందులకు లంకానగరమునకును, అందలి సమస్తరాక్షసులకును, కడకు నీకును చేటు కలుగకుండునా? (కలుగుట నిశ్చయము.) (4-6)

నీవంటి కామాతురుడు, దుష్టస్వభావముగలవాడు, పాపపుఆలోచనలుగలవాడు, మతిలేనివాడు ఐన రాజు తాను నశించుటయేగాక, తనబంధుమిత్రులకును, దేశప్రజలందఱికిని వినాశనమును తెచ్చిపెట్టినవాడగును.(7)

కౌసల్యాసుతుడైన శ్రీరాముడు తండ్రిచే వెడలగొట్టబడలేదు, ఏవిధముగను ధర్మమార్గమును తప్పడు. అతడు లోభికాడు, ఉదారుడు, సచ్ఛీలుడు, ఉత్తమక్షత్రియుడు, ధర్మగుణశోభితుడు ధనుర్ధారులలో శ్రేష్ఠుడు, పరాక్రమశాలి. క్రౌర్యమును ఎఱుగనివాడు, సమస్తప్రాణులయొక్క హితమునకే పాటుపడుచుండువాడు.(8-9)

నాయనా! సత్యసంధుడైన దశరథుడు కైకేయియొక్క కుతంత్రములలో చిక్కుకొనుట గమనించి, ఆయన మాటను నిలబెట్టుటకై శ్రీరాముడు తానుగా వనములకు వచ్చెను. కైకేయికి ప్రియమును గూర్చుటకును, తండ్రివాగ్దానమును నెఱవేర్చుటకును అతడు దండకారణ్యమున ప్రవేశించెను. (10-11)

రావణా! శ్రీరాముడు కఠినాత్ముడు కాడు, సకలవిద్యావిశారదుడు, ఇంద్రియనిగ్రహముగలవాడు, రామునిగూర్చి నీవు వినినదంతయును, పలికినవన్నియును అసత్యములు. ఆ సత్పురుషునిగూర్చి నీవు ఇట్లు పలుకదగదు. అతడు ధర్మస్వరూపుడు, నిరుపమాన పరాక్రమశాలి, దేవతలకు ఇంద్రునివలె అతడు సమస్తలోకములకును ప్రభువు. (12-13)

శ్రీరామునిభార్యయగు సీతాదేవియొక్క పాతివ్రత్యమే ఆమెకు భద్రకవచము. సూర్యకాంతివలె ఆమెను హరించుట అసాధ్యము. అట్టి సీతను బలవంతముగాగొనిపోవుటకై నీవు ఎట్లు సాహసించుచున్నావు? (14)

శ్రీరాముడనెడిఅగ్నికి మెఱయుచున్న శరములే జ్వాలలు, ధనుర్బాణములను ధరించిన శత్రువులే దానికి ఇంధనములు. అందువలన అది తేజఃపుంజముగా దరిజేరరానిది. కనుక రణభూమియందు సాహసపరాక్రమములతో ప్రజ్వలించుచున్న ఆ రామాగ్నిని దరిజేరుటకును నీకు అశక్యము. (15)

నాయనా! రావణా! శ్రీరాముడు నీపాలిటి యముడు (మృత్యుదేవత) ఎక్కుపెట్టబడిన రామునియొక్క ధనుస్సే శత్రువులను కబళించుటకై తెఱచుకొని నిప్పులు గ్రక్కుచున్న ఆ మృత్యుదేవతముఖము. శరములే కోపోద్రిక్తమైన ఆ మృత్యుముఖమునుండి వెలువడిన

రాజ్యం సుఖం చ సంత్యజ్య జీవితం చేష్టమాత్మనః ।
నాత్యాసాదయితుం తాత! రామాంతకమిహార్హసి । 17

అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా ।
న త్వం సమర్థ స్తాం హర్తుం రామచాపాశ్రయాం వనే । 18

తస్య సా నరసింహస్య సింహోరస్కస్య భామినీ ।
ప్రాణేభ్యోఽపి ప్రియతరా భార్యా నిత్యమనువ్రతా । 19

న సా ధర్షయితుం శక్యా మైథిల్యోజస్వినః ప్రియా ।
దీప్తస్యేవ హుతాశస్య శిఖా సీతా సుమధ్యమా । 20

కిముద్యమమిమం వ్యర్థం కృత్వా తే రాక్షసాధిప! ।
దృష్టశ్చేత్ త్వం రణే తేన తదంతం తవ జీవితమ్ । 21

జీవితం చ సుఖం చైవ రాజ్యం చైవ సుదుర్లభమ్ ।
యదీచ్ఛసి చిరం భోక్తుం మాకృథా రామవిప్రియమ్ । 22

స సర్వైః సచివైః సార్థం విభీషణపురోగమైః ।
మంత్రయిత్వా తు ధర్మిష్ఠైః కృత్వా నిశ్చయమాత్మనః । 23

దోషాణాం చ గుణానాం చ సంప్రధార్య బలాబలమ్ ।
ఆత్మనశ్చ బలం జ్ఞాత్వా రాఘవస్య చ తత్త్వతః ।
హితాహితం వినిశ్చిత్య క్షమం త్వం కర్తుమర్హసి । 24

అహం తు మన్యే తవ న క్షమం రణే
సమాగమం కోసలరాజసూనునా ।
ఇదం హి భూయః శృణు వాక్యముత్తమం
క్షమం చ యుక్తం చ నిశాచరేశ్వర! । 25

మంటలు, చాపమే (ఆ మృత్యుదేవత యొక్క) పాశము. కావున నీ రాజ్యమును, సుఖమును, కడకు నీజీవితమును బలిగావించుటకై, శత్రుసైన్యములను చీల్చిచెండాడునట్టి అజేయపరాక్రముడైన శ్రీరాముడనెడియముని దరిచేరుట నీకు తగదు. (16-17)

శ్రీరామునిబలపరాక్రమములు ఊహింపశక్యముగానివి (సాటిలేనివి). జానకి ఆయనఅర్ధాంగి. రాముని చాపమునే ఆశ్రయించియున్న (శ్రీరాముని రక్షణలోనున్న) ఆమెను అపహరించుట నీకు కాని పని. (18)

పురుషోత్తముడైన శ్రీరాముడు సింహమునకువలె విశాలమైన వక్షఃస్థలముగలవాడు. (సింహపరాక్రముడు.) ఆయనభార్యయైన సీతాదేవి ఆయనకు ప్రాణములకంటెను ప్రియమైనది, నీడవలె ఆయనను అనుక్షణము అనుసరించియుండునది. సౌందర్యరాశియు, మిగులతేజోమూర్తియైన శ్రీరామునిధర్మపత్నియు ఐన ఆ అయోనిజను ఉవ్వెత్తుగా పైకెగయుచున్న అగ్నిజ్వాలనువలె హరించుట నీకు అసాధ్యము. (19-20)

ఓ రాక్షసప్రభూ! వ్యర్థముగా నీవు సీతాపహరణమునకు పూనుకొనుటవలన కలుగు ఫలమేమి? రణరంగమున నీవు శ్రీరాముని కంటబడినచో ఆ క్షణముననే నీ జీవితము ముగిసినట్లు తలంపుము. మిగుల దుర్లభమైన ఈ రాజ్యమును, సుఖమయమైన నీ జీవితమును కలకాలము అనుభవింపదలచినచో శ్రీరామునితో విరోధము పెట్టుకొనకుము. (21-22)

ఓ రాక్షసరాజా! ధర్మాత్ములైన విభీషణాదులతోడను, ముఖ్యులైన మంత్రులందఱితోడను లోతుగా చర్చించిన పిమ్మటనే నీవు ఒక నిశ్చయమునకు రమ్ము. ఇట్లు పూనుకొనుటలోగల మంచిచెడ్డలనుగుఱించి, బలాబలములనుగూర్చి ఆలోచించుకొనుము. నీబలమును, శ్రీరామునిపరాక్రమమును యథార్థముగా ఎఱుంగుము. దీనివలన నీకు కలిగెడి మేలును, కీడును గుర్తెఱింగి, తగినట్లు నడచుకొనుట మంచిది. (23-24)

ఓ రాక్షసరాజా! 'నీవు కోసల రాజకుమారుడైన శ్రీరామునితో యుద్ధమునకు తలపడుట యుక్తము (సరి)కాదు'- అని నేనైతే తలంతును. అంతేగాక నేను నీకు మఱియొక విషయమును నుడివెదను వినుము. అది నీకు మేలైనది, తగినది, యుక్తమైనది. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే సప్తత్రింశస్సర్గః *(37)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ముప్పదియేడవసర్గము సమాప్తము

-- * * * --

38. ముప్పదియెనిమిదవసర్గము

మారీచుడు తన పూర్వానుభవమును అనుసరించి, బాల్యమునందే శ్రీరామునిలోగల బలపరాక్రమములను గూర్చి రావణునకు వివరించుట - సీతాదేవిని అపహరించినచో సర్వవినాశము తప్పదని హెచ్చరించుట -

కదాచిదప్యహం వీర్యాత్ పర్యటన్ పృథివీమిమామ్।
బలం నాగసహస్రస్య ధారయన్ పర్వతోపమః। 1

నీలజీమూతసంకాశః తప్తకాంచనకుండలః।
భయం లోకస్య జనయన్ కిరీటీ పరిఘాయుధః।
వ్యచరం దండకారణ్యే ఋషిమాంసాని భక్షయన్। 2

విశ్వామిత్రోఽథ ధర్మాత్మా మద్విత్రస్తో మహామునిః।
స్వయం గత్వా దశరథం నరేంద్రమిదమబ్రవీత్। 3

అద్య రక్షతు మాం రామః పర్వకాలే సమాహితః।
మారీచాన్మే భయం ఘోరం సముత్పన్నం నరేశ్వర। 4

ఇత్యేవముక్తో ధర్మాత్మా రాజా దశరథస్తదా।
ప్రత్యువాచ మహాభాగం విశ్వామిత్రం మహామునిమ్। 5

బాలో ద్వాదశవర్షోఽయమ్ అకృతాస్త్రశ్చ రాఘవః।
కామం తు మమ యత్ సైన్యం మయా సహ గమిష్యతి। 6

బలేన చతురంగేణ స్వయమేత్య నిశాచరాన్।
వధిష్యామి మునిశ్రేష్ఠ! శత్రూంస్తే మనసేప్సితాన్। 7

ఇత్యేవముక్తః స మునీ రాజానమిదమబ్రవీత్।
రామాన్నాఽన్యద్బలం లోకే పర్యాప్తం తస్య రక్షసః। 8

దేవతానామపి భవాన్ సమరేష్వభిపాలకః।
ఆసీత్ తవ కృతం కర్మ త్రిలోకే విదితం నృప। 9

నేను ఒకానొకప్పుడు పర్వతసమానమైన శరీరము గలిగి, వేయియేనుగుల బలముగలవాడనై, పరాక్రమ గర్వముతో ఈ భూమిపై సంచరించుచుంటిని. నల్లనిమేఘమువలె ఒప్పుచు మేలిమిబంగారు కుండలములను, కిరీటమును ధరించి, పరిఘ అను ఆయుధమును చేతబట్టి, దండకారణ్యమున ఋషుల మాంసములను భక్షించుచు తిరుగసాగితిని. (1-2)

అంతట ధర్మాత్ముడైన విశ్వామిత్రమహాముని నాకు భయపడి, ఒకానొకనాడు స్వయముగా దశరథ మహారాజుకడకు వెళ్లి ఇట్లు విన్నవించుకొనెను. (3)

"ఓ మహారాజా! నేను యజ్ఞములను నిర్వహించెడి సమయములలో మారీచుడొనర్చెడి ఆగడములకు నేను మిగుల భయగ్రస్తుడనై యున్నాను. ఇప్పుడు నన్ను శ్రీరాముడే కాపాడవలెను." (4)

మహానుభావుడైన విశ్వామిత్రమహర్షి ఇట్లు పలికిన పిమ్మట ధర్మాత్ముడైన దశరథమహారాజు ఆయనకు ఈ విధముగా ప్రత్యుత్తరమిచ్చెను. (5)

"శ్రీరాముడు పన్నెండేండ్ల పసిబాలుడు.[1] పైగా అస్త్రవిద్యలలో ఆరితేఱినవాడు కాడు. మీరు కోరినచో నేను నా సైన్యముతో అచటికి రాగలను. ఓ మునీశ్వరా! నేను స్వయముగా చతురంగబలములతో అచటికి వచ్చి మీ కోరికను అనుసరించి, మీ శత్రువులైన ఆ నిశాచరులను వధించెదను." (6-7)

ఆ మహారాజుపలుకులను విన్న పిమ్మట విశ్వామిత్రమహర్షి ఆయనతో ఇట్లనెను. "ప్రభూ! ఆ రాక్షసునిఆగడములను అరికట్టుటకు శ్రీరాముడుమాత్రమే సమర్థుడు, మఱి లోకమునందలి ఏ ఇతరబలములకును శక్తి చాలదు. రాజా! యుద్ధములలో నీవు దేవతలనుగూడ ఆదుకొనియుంటివి. నీవు చేసిన ఘనకార్యములు ముల్లోకములలోను ఖ్యాతికెక్కినవి. నీ

1) బాలకాండమున 20వ సర్గయందలి 2వ శ్లోకమున దశరథుడు 'శ్రీరాముడు 16 సంవత్సరములలోపు వయస్సున ఉన్న వాడు (15 ఏండ్లు నిండినవాడు' అని తెలిపియుండెను. - కాని ఇచట మారీచుడు రావణునిమనస్సున భయము పుట్టించుటకై నాలుగు (4) సంవత్సరములు తగ్గించి తెల్పెను. 12 ఏండ్ల వయస్సుననే శ్రీరాముడు అంతటి పరాక్రమశాలియైయున్నప్పుడు ఇప్పుడు అతడు నిండుయౌవనములో ఇంకెంతటి బలశాలియైయుండును? అని తెల్పుటయే మారీచుని అభిప్రాయము.

కామమస్తు మహత్ సైన్యం తిష్ఠత్విహ పరంతప!।
బాలోఽ ప్యేష మహాతేజాః సమర్థస్తస్య నిగ్రహే। 10

గమిష్యే రామమాదాయ స్వస్తి తేఽస్తు పరంతప!। 11

ఏవ ముక్త్వా తు స మునిః తమాదాయ నృపాత్మజమ్।
జగామ పరమప్రీతో విశ్వామిత్రః స్వమాశ్రమమ్। 12

తం తదా దండకారణ్యే యజ్ఞముద్దిశ్య దీక్షితమ్।
బభూవోపస్థితో రామః చిత్రం విస్ఫారయన్ ధనుః। 13

అజాతవ్యంజనః శ్రీమాన్ పద్మపత్రనిభేక్షణః।
ఏకవస్త్రధరో ధన్వీ శిఖీ కనకమాలయా। 14

శోభయన్ దండకారణ్యం దీప్తేన స్వేన తేజసా।
అదృశ్యత తతో రామో బాలచంద్ర ఇవోదితః। 15

తతోఽహం మేఘసంకాశః తప్తకాంచనకుండలః।
బలీ దత్తవరో దర్పాత్ ఆజగామ తదాశ్రమమ్। 16

తేన దృష్టః ప్రవిష్టోఽహం సహసైవోద్యతాయుధః।
మాం తు దృష్ట్వా ధనుః సజ్యమ్ అసంభ్రాంతశ్చకార సః। 17

అవజానన్నహం మోహాత్ బాలోఽయమితి రాఘవమ్।
విశ్వామిత్రస్య తాం వేదిమ్ అభ్యధావం కృతత్వరః। 18

తేన ముక్తస్తతో బాణః శితః శత్రునిబర్హణః।
తేనాహం త్వాహతః క్షిప్తః సముద్రే శతయోజనే। 19

నేచ్ఛతా తాత! మాం హంతుం తదా వీరేణ రక్షితః।
రామస్య శరవేగేన నిరస్తోఽహమచేతనః। 20

పాతితోఽహం తదా తేన గంభీరే సాగరాంభసి।
ప్రాప్య సంజ్ఞాం చిరాత్ తాత లంకాం ప్రతిగతః పురీమ్। 21

మహాసైన్యము సమర్థవంతమైనదే. ఓ పరంతపా! దానిని ఇక్కడనే యుండనిమ్ము. శ్రీరాముడు బాలుడేయైనను మిగులపరాక్రమశాలి, ఆ రాక్షసుని నిగ్రహించుటకు అతడే సమర్థుడు. కనుక నేను శ్రీరాముని నావెంట దీసికొని వెళ్లెదను. నీకు శుభమేయగును." (8-11)

ఆ విశ్వామిత్రమహాముని ఇట్లు పలికి, పరమప్రీతితో రాజకుమారుని వెంటనిడుకొని, తన ఆశ్రమమునకు చేరెను. పిమ్మట ఆ మహర్షి దండకారణ్యమునందలి తనఆశ్రమమున యజ్ఞదీక్షను గైకొనెను. అప్పుడు శ్రీరాముడు తనఅద్భుతమైన ధనుస్సును చేతబట్టి, టంకారమొనర్చుచు. యజ్ఞరక్షణకై సర్వసన్నద్ధుడై నిలిచెను. (12-13)

ఆసమయమున శ్రీరాముడు సర్వశుభలక్షణములు గలిగి, కిశోరదశయందేయుండెను. ఇంకను యౌవన మంకురింపలేదు. తామరరేకులవంటికన్నులు గల్గియున్న అతడు బ్రహ్మచర్యసూచకములైన ఏకవస్త్రమును, శిఖను ధరించియుండెను. అతడు ధనుర్ధారియై, బంగారు ఆభరణములనుదాల్చి, తన అపూర్వశోభలతో ఉదయించుచున్న బాలచంద్రునివలె ఒప్పుచు దండకారణ్యమును ప్రకాశింప జేయుచుండెను. (14-15)

నేను మేఘమువలె నల్లని శరీరముగలవాడనై, మేలిమిబంగారుకుండలములనుదాల్చి, అదే సమయమున ఆ ఆశ్రమముకడకు చేరితిని. నేను మిగులబలశాలినై యుండుటయేగాక. దేవతలచేతను చావులేకుండునట్లు వరములను పొందియుండుటచే మిక్కిలి గర్వితుడనై ఆయుధమును చేబూని యుంటిని. అట్టి నన్ను జూచి, శ్రీరాముడు ఏ మాత్రము చలింపక ధనుస్సును ఎక్కుపెట్టెను. (16-17)

శ్రీరామునిశౌర్యపరాక్రమములను ఎఱుంగక అజ్ఞానమువలన నేను 'ఇతడు బాలుడే గదా!' అని తలచి. ఆయనను సరకుగొనక, (లక్ష్యపెట్టక) త్వరత్వరగా విశ్వామిత్రుని యజ్ఞవేదికకడకు పరుగుపెట్టితిని. (18)

ఇంతలో ఆ రఘువరుడు శత్రుసంహారకమైన ఒక వాడిబాణమును నాపై ప్రయోగించెను. ఆ బాణము యొక్క దెబ్బకు నేను నూఱుయోజనములదూరమునున్న సముద్రములో పడిపోయితిని. నాయనా! రావణా! ఆ వీరుడు నన్ను హతమార్చుటకు సమర్థుడేయైనను అప్పుడు చంపదలంపక, ప్రాణములతో వదిలిపెట్టెను. ఆయన బాణవేగమునకు నెట్టివేయబడి, స్పృహలేనివాడనై గంభీరమైనసముద్రమున బడితిని- చాలకాలమునకు స్పృహవచ్చిన పిమ్మట తిన్నగా లంకకు జేరితిని. (19-21)

ఏవమస్మి తదా ముక్తః సహాయాస్తు నిపాతితాః।
అకృతాస్త్రేణ బాలేన రామేణాక్లిష్టకర్మణా। 22

ॐ

తన్మయా వార్యమాణస్త్వం యది రామేణ విగ్రహమ్।
కరిష్యస్యాపదం ఘోరాం క్షిప్రం ప్రాప్స్యసి రావణ!। 23

క్రీడారతివిధిజ్ఞానాం సమాజోత్సవశాలినామ్।
రక్షసాం చైవ సంతాపమ్ అనర్థం చాహరిష్యసి। 24

హర్మ్యప్రాసాదసంబాధాం నానారత్నవిభూషితామ్।
ద్రక్ష్యసి త్వం పురీం లంకాం వినష్టాం మైథిలీకృతే। 25

అకుర్వంతోఽపి పాపాని శుచయః పాపసంశ్రయాత్।
పరపాపైర్వినశ్యంతి మత్స్యా నాగహ్రదే యథా। 26

దివ్యచందనదిగ్ధాంగాన్ దివ్యాభరణభూషితాన్।
ద్రక్ష్యస్యభిహతాన్ భూమౌ తవ దోషాత్ తు రాక్షసాన్। 27

హృతదారాంత్సదారాంశ్చ దశ విద్రవతో దిశః।
హతశేషానశరణాన్ ద్రక్ష్యసి త్వం నిశాచరాన్। 28

శరజాలపరిక్షిప్తామ్ అగ్నిజ్వాలాసమావృతామ్।
ప్రదగ్ధభవనాం లంకాం ద్రక్ష్యసి త్వం న సంశయః। 29

పరదారాభిమర్శాత్ తు నాఽన్యత్ పాపతరం మహత్।
ప్రమదానాం సహస్రాణి తవ రాజన్ పరిగ్రహః। 30

ఓ రావణా! ఆయన కృపవలన బ్రతికిబయటపడి, ఇప్పుడు ఇట్లుంటిని. బాలుడైన శ్రీరాముడు పూర్తిగా అస్త్రవిద్యలను నేర్వకున్నను ఎట్టి క్లిష్టకార్యములనైనను అవలీలగా చేయగలసమర్థుడు కనుక నాడు నా సహాయకులందఱును ఆ వీరుని చేతిలో నిహతులైరి. అందువలన నేను నిన్ను ఇట్లు నివారించుచుంటిని. వినను అయనతో విరోధము పెట్టుకొన్నచో నీవు త్వరలోనే తీరని ఆపదలపాలగుట తథ్యము. (22-23)

ఓ రాక్షసరాజా! సీతాదేవికొఱకై నీవు రామునితో యుద్ధమునకు సిద్ధమైనచో, భోగవిలాసములలో తేలియాడుచున్నవారును, సామాజికములైన ఉత్సవములలో నిమగ్నులైనవారును అగు రాక్షసులకు సంతాపమును, అనర్థములను తెచ్చిపెట్టినవాడవగుదువు. మఱియు హర్మ్యములతోడను, ప్రాసాదములతోడను బారులుతీరి, వివిధములగు రత్నములతో అలంకృతమై, కలకలలాడుచున్న లంకా పట్టణము సర్వనాశనమై పోవుటను నీవు చూడగలవు. (24-25)

పాపకృత్యములను ఏమాత్రమును చేయనట్టి పవిత్రులుసైతము పాపులను ఆశ్రయించి (కూడి)యున్నచో వారు ఇతరుల పాపములకారణముగా సర్పములతో నిండియున్న మడుగులలోగల చేపలవలె నశింతురు.(26)

సువాసనలనువెదజల్లెడి గంధములను పూసికొనినవారును, అమూల్యములైన ఆభరణములను అలంకరించుకొనినవారును అగు (సర్వైశ్వర్యములతో తులతూగుచు సుఖముగానున్న) రాక్షసులు నీవొనర్చిన దోషములకారణముగా నీవు చూచుచుండగనే నిహతులై పోవుదురు. (27)

యుద్ధప్రమాదములో ఆలుబిడ్డలను కోల్పోయినవారును, దారాపుత్త్రులను కలిగియున్నవారును, రాముని చేతిలో చావగా మిగిలియున్నవారును ఐన రాక్షసులెల్లరును రక్షించెడివారు లేక (దిక్కులేనివారై) చెల్లాచెదరై దశదిశలకును పాఱిపోవుట నీకన్నులముందే జరుగును.(28)

రావణా! నీబంగారులంక శ్రీరామునిశరపరంపరలకు ధ్వంసమైపోవును, అగ్నిజ్వాలలు చుట్టుముట్టగా, ఆ మంటలకు ఆహుతియై భవనములన్నియును మాడిమసియైపోవును. ఈ సంఘటనములన్నియును జరుగుచుండుటను నీవు చూడగలవు. ఇందులకు సందేహములేదు. (29)

ఓ రాజా! పరసతులను ఆసించుటకంటెమించిన పాపము మఱియొకటిలేదు. నీఅధీనములోనున్న వేలకొలదియువతులతో సుఖించుట నీకు మేలు. నీవు

భవ స్వదారనిరతః స్వకులం రక్ష రాక్షస!।
మానమ్ ఋద్ధిం చ రాజ్యం చ జీవితం చేష్టమాత్మనః। 31

కళత్రాణి చ సౌమ్యాని మిత్రవర్గం తథైవ చ।
యదీచ్ఛసి చిరం భోక్తుం మాకృథా రామవిప్రియమ్। 32

నివార్యమాణః సుహృదా మయా భృశం
ప్రసహ్య సీతాం యది ధర్షయిష్యసి ।
గమిష్యసి క్షీణబలః సబాంధవో
యమక్షయం రామశరాత్తజీవితః । 33

నీభార్యతో హాయిగానుండుము. నీకులమును, గౌరవమును, ఐశ్వర్యమును, రాజ్యమును, నీకు మిగుల ఇష్టములైన నీ ప్రాణములను కాపాడుకొనుము. నిన్నే నమ్ముకొనియున్న నీప్రియపత్నులతో, నీబంధుమిత్రులతో కలకాలము హాయిగానుండదలచినచో శ్రీరామునియెడ అపరాధము చేయవలదు. (30-32)

ఓ రావణా! నీమేలు గోరి నేను ఇంతగా నివారించుచున్నను సీతాదేవిని బలవంతముగా అపహరించినచో నీచతురంగబలములన్నియును క్షీణించును. నీఆత్మీయు లందఱును నశింతురు. కడకు నీవును శ్రీరామునిబాణములకు ఆహుతియై మృత్యువాతబడుదువు-" (33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే అష్టత్రింశస్సర్గః (38)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదియెనిమిదవసర్గము.

-- * * * --

39. ముప్పదితొమ్మిదవసర్గము

మారీచుడు దండకారణ్యమునందు శ్రీరాముని బాణముల తీవ్రతను రుచిచూచిన తన మఱియొక పూర్వానుభవమును వివరించుచు 'సీతాపహరణముతగదు' అని రావణుని హెచ్చరించుట -

ఏవమస్మి తదా ముక్తః కథంచిత్ తేన సంయుగే।
ఇదానీమపి యద్వృత్తం తచ్ఛృణుష్వ నిరుత్తరమ్। 1

ఓరావణా! నాటియుద్ధమున శ్రీరామునిఅనుగ్రహముచే ఎట్టకేలకు సురక్షితుడనై ప్రాణములతో బయటపడి ఇట్లుంటిని. ఇప్పుడుగూడ (రాముని ప్రౌఢావస్థయందును) జరిగిన మఱియొకవృత్తాంతమును గూర్చి తెల్పెదను. సావధానముగా వినుము. (1)

రాక్షసాభ్యామహం ద్వాభ్యామ్ అనిర్విణ్ణః తథాకృతః।
సహితో మృగరూపాభ్యాం ప్రవిష్టో దండకావనమ్। 2

దీప్తజిహ్వో మహాకాయః తీక్ష్ణదంష్ట్రో మహాబలః।
వ్యచరం దండకారణ్యం మాంసభక్షో మహామృగః। 3

శ్రీరామునివలన ఆ విధముగా ప్రాణాపాయస్థితికి లోనైనను నేను ఆయనయెడ విరోధభావమును మాత్రము వీడలేదు. ఒకనాడు మృగరూపమును దాల్చిన ఇద్దఱు రాక్షసులతోగూడి నేను దండకారణ్యమున ప్రవేశించితిని. నేను మాంసమును భక్షించెడి ఒక మహాక్రూర మృగరూపమును ధరించి, ఆ అడవియందు తిరుగసాగితిని. అప్పుడు నిప్పులుగ్రక్కుచున్న (భీకరమైన) నాలుకతో, దృఢమైన శరీరముతో, వాడియైన కోఱలతో మహాబలశాలినైయుంటిని. (2-3)

అగ్నిహోత్రేషు తీర్థేషు చైత్యవృక్షేషు రావణ!।
అత్యంతఘోరో వ్యచరం తాపసాన్ సంప్రధర్షయన్। 4

ఆవిధముగా మిగుల భయంకరరూపమున నేను అగ్నిశాలలయందును, పవిత్రజలాశయ తీరములయందును, దివ్యవృక్షములనీడలయందును తపమొనరించుచుండెడి మునీశ్వరులను హింసించుచు సంచరించుచుంటిని. (4)

నిహత్య దండకారణ్యే తాపసాన్ ధర్మచారిణః।
రుధిరాణి పిబంస్తేషాం తథా మాంసాని భక్షయన్। 5

ఋషిమాంసాశనః క్రూరః త్రాసయన్ వనగోచరాన్।
తథా రుధిరమత్తోఽహం విచరన్ ధర్మదూషకః। 6

ఆసాదయం తదా రామం తాపసం ధర్మచారిణమ్।
వైదేహీం చ మహాభాగాం లక్ష్మణం చ మహారథమ్। 7

తాపసం నియతాహారం సర్వభూతహితే రతమ్।
సోఽహం వనగతం రామం పరిభూయ మహాబలమ్। 8

తాపసోఽయమితి జ్ఞాత్వా పూర్వవైరమనుస్మరన్।
అభ్యధావం హి సంక్రుద్ధః తీక్ష్ణశృంగో మృగాకృతిః।
జిఘాంసురకృతప్రజ్ఞః తం ప్రహారమనుస్మరన్। 9

తేన ముక్తాస్త్రయో బాణాః శితాః శత్రునిబర్హణాః।
వికృష్య బలవచ్చాపం సుపర్ణానిలనిస్స్వనాః। 10

తే బాణా వజ్రసంకాశాః సుముక్తా రక్తభోజనాః।
ఆజగ్ముః సహితాః సర్వే త్రయః సన్నతపర్వణః। 11

పరాక్రమజ్ఞో రామస్య శఠో దృష్టభయః పురా।
సముద్భ్రాంతస్తతో ముక్తః తావుభౌ రాక్షసౌ హతౌ। 12

శరేణ ముక్తో రామస్య కథంచిత్ ప్రాప్య జీవితమ్।
ఇహ ప్రవ్రాజితో యుక్తః తాపసోఽహం సమాహితః। 13

వృక్షే వృక్షే చ పశ్యామి చీరకృష్ణాజినాంబరమ్।
గృహీతధనుషం రామం పాశహస్తమివాంతకమ్। 14

దండకారణ్యమున ధర్మకార్యనిరతులైన తాపసులను చంపి, వారిరక్తమాంసముల భక్షించుచుండుటయే నా పనిగానుండెను. అట్లు క్రూరుడనై ఋషులమాంసములను దినుచు రక్తములను త్రాగుచు, మదించినవాడనై ధర్మవిరుద్ధముగా ప్రవర్తింపసాగితిని. (5-6)

నేను అట్లు తిరుగుచు ధర్మాత్ముడై మునివేషమునసున్న శ్రీరాముని, మహానుభావురాలైన సీతాదేవిని, అసహాయశూరుడైన లక్ష్మణుని సమీపించితిని. (7)

సమస్తప్రాణులహితమును కోరెడివాడును, తాపసవృత్తిని అనుసరించి, ఆహారనియమములను పాటించువాడును, వనవాసియు అగు శ్రీరాముడు మిగులబలశాలియని యెఱింగియు 'ఇతడు తాపస వృత్తిలో ఉన్నాడు గదా! ఎవ్వరినీ హింసింపడుగదా!' అని భావించి, ఆయనను చులకనభావముతో చూచితిని. కాని ఆయనతో నాకుగల పూర్వవైరము గుర్తునకురాగా, ఆయనతీసినదెబ్బను పదేపదే తలంచుకొనుచు, క్రుద్ధుడనై, వాడికొమ్ములుగల మృగరూపముతో బుద్ధిహీనుడనై, శ్రీరాముని చంపదలచి, ఆయనమీదికి దూకితిని. (8-9)

అంతట శ్రీరాముడు ధనుస్సును ఎక్కుపెట్టి, ఆకర్ణాంతము బలముగా లాగి, శత్రుసంహారకములైన పదునైనమూడుబాణములను ప్రయోగించెను. అవి గరుత్మంతునివలె, వాయువువలె వేగముగా ధ్వనిచేయుచు సాగిపోవునవి, వజ్రాయుధమువలె తిరుగులేనివి, దుష్టులైన శత్రువులయొక్క రక్తములను రుచి చూచునట్టివి, వంగినకణుపులుగలవి. అట్లు ప్రయుక్తములైన ఆ మూడుబాణములును మమ్ములను వెంటాడినవి. (10-11)

ఇంతకుముందే నేను శ్రీరామునిపరాక్రమ ప్రభావమును ఎఱుగుదును. ఆయనశరముల తీవ్రతనుగూడ చవిచూచియుంటిని. కనుక నేను మిక్కిలి భయకంపితుడనై అటునిటుతిరుగుచు ఆ బాణములను తప్పించుకొంటిని. కాని నాతోగూడియున్న ఆ ఇరువురు రాక్షసులును ఆ బాణముల దెబ్బకు నిహతులైరి. (12)

ఎట్టకేలకు నేను మాత్రము శ్రీరామునిబాణములకు బలికాకుండ ప్రాణములతో బయటపడి, తిన్నగా ఈ ఆశ్రమమునకు చేరితిని. పిమ్మట పశ్చాత్తాపపడి మునువటిదుష్కృత్యములకు స్వస్తిచెప్పితిని. సదాచరణమునకు దిగితిని. మనోనిగ్రహముతో తపోనిష్ఠలో నిమగ్నుడనైతిని. (13)

వల్కలములను, జింకచర్మమును ధరించిన శ్రీరాముడే అప్పటినుండియు నాకు చెట్టునందును, పుట్టయందును కనబడుచున్నాడు. ధనుర్బాణధారియైన

అపి రామసహస్రాణి భీతః పశ్యామి రావణ!।
రామభూతమిదం సర్వమ్ అరణ్యం ప్రతిభాతి మే। 15

ఆమహామహుడు నాకు పాశహస్తుడైన యమునివలె గోచరించుచున్నాడు. ఓరావణా! (ఉన్నది రాముడొక్కడేయైనను) భయకంపితుడనైన నాకు వేలకొలది రాములున్నట్లు కన్పట్టుచున్నారు. ఆ అరణ్యమునందు ఎక్కడ చూచినను శ్రీరామునిరూపమే నాకు ప్రత్యక్షమగుచున్నది. ఓ రాక్షసరాజా! శ్రీరాముడు తనఆశ్రమమునందేయున్నను ఇతరప్రదేశములయందును నాకు అతడే కన్పట్టుచున్నాడు. అంతేగాదు నిద్రలో స్వప్నమునందును ఆయనయే కనబడుచుండుటచే భయభ్రాంతుడనై కలవరపాటునకు లోనగుచున్నాను. ఓ రావణా! రామభయము పట్టుకొనిన నాకు రత్నములు, రథములు మొదలగు రకారాది పదములు వినబడినను నేను భయముతో వణకిపోవుచున్నాను. (14-17)

రామమేవ హి పశ్యామి రహితే రాక్షసాధిప!।
దృష్ట్వా స్వప్నగతం రామమ్ ఉద్భ్రమామి విచేతనః। 16

రకారాదీని నామాని రామత్రస్తస్య రావణ!।
రత్నాని చ రథాశ్చైవ త్రాసం సంజనయంతి మే। 17

అహం తస్య ప్రభావజ్ఞో న యుద్ధం తేన తే క్షమమ్।
బలిం వా నముచిం వాపి హన్యాద్ధి రఘునందనః। 18

నేను ఆయనపరాక్రమప్రభావమును బాగుగా ఎఱిగినవాడను. ఆ రఘువీరుడు బలిచక్రవర్తిని గాని, రాక్షసవీరుడైన నముచినిగాని అవలీలగా చంపగలసమర్థుడు కావున నీవు ఆయనతో యుద్ధమునకు తలపడుట ఏమాత్రము తగదు. (18)

రణే రామేణ యుధ్యస్వ క్షమాం వా కురు రాక్షస!।
న తే రామకథా కార్యా యది మాం ద్రష్టుమిచ్ఛసి। 19

ఓ రాక్షసరాజా! నీకు చేవయున్నచో శ్రీరామునకు ఎదురుగా నిలిచి పోరుసల్పుము. లేనిచో ఖరాదులు నిహతులైన విషయమును మఱచిపొమ్ము. సీతను దొంగతనముగా అపహరించు ప్రయత్నమును మానుకొనుము. నీవు మఱల నన్ను చూడదలచినచో (నీవు బ్రతికియుండదలచినచో) రామునిగూర్చిన ప్రస్తావనయే చేయకుము. (19)

బహవః సాధవో లోకే యుక్తా ధర్మమనుష్ఠితాః।
పరేషామపరాధేన వినష్టాః సపరిచ్ఛదాః। 20

సోఽహం తవాపరాధేన వినశ్యేయం నిశాచర।
కురు యత్ తే క్షమం తత్త్వమ్ అహం త్వా నాఽనుయామి హ। 21

ధర్మకార్యనిరతులైన (సదాచారసంపన్నులైన) పెక్కుమంది సత్పురుషులు దుష్టసాంగత్యముచేయుటచే ఆ దుష్టులు చేసిన అపరాధములకారణముగా వారు సపరివారముగా నశించుచుండుట లోకప్రసిద్ధము. కనుక ఓ నిశాచరా! సన్మార్గములోనున్న నేను నీవు చేసెడి దోషకారణముగా సర్వనాశనమగుదును. అయితే నీవు నీచేతనైనట్లు (నీకునచ్చినరీతిగా) చేసికొనుము. నేను మాత్రము ఈ విషయమున నిన్ను అనుసరింపను. (20-21)

రామశ్చ హి మహాతేజా మహాసత్త్వో మహాబలః।
అపి రాక్షసలోకస్య న భవేదంతకోఽపి సః। 22

శ్రీరాముడు మహాపరాక్రమవంతుడు, మిగుల ప్రజ్ఞాశాలి, ఆయనబలము నిరుపమానమైనది. కనుక నీవు సీతాపహరణమొనర్చినచో అతడు నీ రాక్షసులనందఱిని సంహరింపక మానడు (తప్పక సంహరించును.) (22)

యది శూర్పణఖాహేతోః జనస్థానగతః ఖరః।
అతివృత్తో హతః పూర్వం రామేణాక్లిష్టకర్మణా। 23

అత్ర బ్రూహి యథాతత్త్వం కో రామస్య వ్యతిక్రమః। 24

జనస్థానమున నీప్రతినిధిగానున్న ఖరుడు శూర్పణఖకారణముగా అనవసరముగా రామునిపై కయ్యమునకు కాలుదువ్వి, సర్వసమర్థుడైన రామునిచేతిలో హతుడయ్యెను. ఇందులో నిజముగా శ్రీరాముని దోషమేమో తెలుపుము. (23-24)

ఇదం వచో బంధుహితార్థినా మయా
యథోచ్యమానం యది నాభిపత్స్యసే ।
సబాంధవస్త్యక్ష్యసి జీవితం రణే
హతోఽద్య రామేణ శరైరజిహ్మగైః । 25

నీక్షేమమును, నీబంధువులహితమును గోరి నేను ఇంతగా నుడువుచుంటిని. ఐనను నీవు నామాటలను పెడచెవినిబెట్టినచో యుద్ధరంగమున రివ్వున దూసికొని వచ్చు శ్రీరామునిబాణములధాటికి నీవు బంధుమిత్ర పరివారములతోగూడ నిహతుడవగుదువు. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకోనచత్వారింశస్సర్గః (39)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ముప్పదితొమ్మిదవసర్గము.

-- * * * --

40. నలుబదియవసర్గము

రావణుడు మారీచుని హితవచనములను పెడచెవినిబెట్టుట - మాయలేడిగా మారి సీతను ప్రలోభపెట్టుట ద్వారా తనకు తోడ్పడుమని ఆదేశించుట - తన ఆజ్ఞను పాటింపనిచో తన చేతిలో చావుతప్పదని అతనిని హెచ్చరించుట -

మారీచేన తు తద్వాక్యం క్షమం యుక్తం నిశాచరః।
ఉక్తో న ప్రతిజగ్రాహ మర్తుకామ ఇవౌషధమ్। 1

మారీచుడు రావణునితో పలికిన మాటలు యుక్తియుక్తములైనవి, అతనికి ఎంతయు మేలుచేయునవి, అవి వినదగినవిగూడ. ఐనను మూర్ఖుడైన రావణుడు, ఆయువుమూడినవాడు ఔషధమును సేవింపనట్లు, ఆ మాటలను చెవికెక్కించుకొనలేదు. (1)

తం పథ్యహితవక్తారం మారీచం రాక్షసాధిపః।
అబ్రవీత్ పరుషం వాక్యమ్ అయుక్తం కాలచోదితః। 2

ఆహాయరహితములైన హితవచనములను పలుకుచున్న ఆమారీచునితో రావణుడు విధిప్రేరితుడై దురుసుగా ఇట్లు (మారీచుడు చెప్పిన దానికి భిన్నముగా) ప్రతికూల వచనములను పలికెను. (2)

యత్కిలైతదయుక్తార్థం మారీచ! మయి కథ్యతే।
వాక్యం నిష్ఫలమత్యర్థమ్ ఉప్తం బీజమివోషరే। 3

త్వద్వాక్యైర్నతు మాం శక్యం భేత్తుం రామస్య సంయుగే।
పాపశీలస్య మూర్ఖస్య మానుషస్య విశేషతః। 4

"ఓ మారీచా! రాజుయొక్క మనస్సును ఎఱుగక నీవు పలికిన ఈ వచనములు అనుచితములు. ఈ మాటలన్నియును చౌటినేలలోనాటిన విత్తనములవలె నిష్ఫలములు (వ్యర్థములు.) పాపస్వభావము గలవాడు, మూర్ఖుడు, అందునా మానవమాత్రుడు ఐన శ్రీరామునియుద్ధపరాక్రమమును దెలుపుచు పలికిన నీ వచనములు నన్ను ఏమాత్రమును భయపెట్టజాలవు. (వాటికి నేను భయపడను. అనగా నేను అతనితో యుద్ధమునకు వెనుకాడను, సీతాపహరణ ప్రయత్నమును విరమించుకొనను.) (3-4)

యస్త్యక్త్వా సుహృదో రాజ్యం మాతరం పితరం తథా।
స్త్రీవాక్యం ప్రాకృతం శ్రుత్వా వనమేకపదే గతః। 5

అవశ్యం తు మయా తస్య సంయుగే ఖరఘాతినః।
ప్రాణైః ప్రియతరా సీతా హర్తవ్యా తవ సన్నిధౌ। 6

మూర్ఖురాలైన ఒక స్త్రీ (కైకేయి) మాటలకు కట్టుబడి తల్లిదండ్రులను, బంధుమిత్రులను, కడకు రాజ్యమును పరిత్యజించి తత్క్షణమే అడవులలో అడుగిడినవాడతడు. యుద్ధమున ఖరుని సంహరించిన ఆ రామునికి ప్రాణములకంటెను ప్రియమైన సీతను నీసమక్షముననే తప్పక అపహరించెదను. (5-6)

ఏవం మే నిశ్చితా బుద్ధిః హృది మారీచ! వర్తతే।
న వ్యావర్తయితుం శక్యా సేంద్రైరపి సురాసురైః। 7

దోషం గుణం వా సంపృష్టః త్వమేవం వక్తుమర్హసి।
అపాయం వా ప్యుపాయం వా కార్యస్యాస్య వినిశ్చయే। 8

సంపృష్టేన తు వక్తవ్యం సచివేన విపశ్చితా।
ఉద్యతాంజలినా రాజ్ఞే య ఇచ్ఛేద్భూతిమాత్మనః। 9

వాక్యమప్రతికూలం తు మృదుపూర్వం హితం శుభమ్।
ఉపచారేణ యుక్తం చ వక్తవ్యో వసుధాధిపః। 10

సావమర్దం తు యద్వాక్యం మారీచ! హితముచ్యతే।
నాభినందతి తద్రాజా మానార్హో మానవర్జితమ్। 11

పంచ రూపాణి రాజానో ధారయంత్యమితౌజసః।
అగ్నేరింద్రస్య సోమస్య వరుణస్య యమస్య చ। 12

ఔష్ణ్యం తథా విక్రమం చ సౌమ్యం దండం ప్రసన్నతామ్।
ధారయంతి మహాత్మానో రాజానః క్షణదాచర!।
తస్మాత్ సర్వాస్వవస్థాసు మాన్యాః పూజ్యాశ్చ పార్థివాః। 13

త్వం తు ధర్మమవిజ్ఞాయ కేవలం మోహమాస్థితః।
అభ్యాగతం మాం దౌరాత్మ్యాత్ పరుషం వక్తుమిచ్ఛసి। 14

గుణదోషౌ న పృచ్ఛామి క్షమంచాత్మని రాక్షస!।
మయోక్తం తవ చైతావత్ సంప్రత్యమితవిక్రమ!। 15

అస్మింస్తు త్వం మహాకృత్యే సాహాయ్యం కర్తుమర్హసి।
శృణు తత్కర్మసాహాయ్యే యత్కార్యం వచనాన్మమ। 16

సౌవర్ణస్త్వం మృగో భూత్వా చిత్రో రజతబిందుభిః।
ఆశ్రమే తస్య రామస్య సీతాయాః ప్రముఖే చర। 17

ప్రలోభయిత్వా వైదేహీం యథేష్టం గంతుమర్హసి। 18

ఓ మారీచా! ఇదియే నామనసులోనిమాట. తిరుగులేని నిర్ణయము. ఇంద్రాదిదేవతలుగాని, అసురులుగాని ఈ ప్రయత్నమునుండి నన్ను మరలింపజాలరు. (7)

సీతాపహరణకార్యనిశ్చయమునందలి గుణదోషములను (మంచిచెడ్డలను) గూర్చియు, మేలు కీడులను గుఱించియు అడిగినప్పుడు నీవు ఇట్లు తెలుపుట యుక్తము. తనక్షేమలాభములను కోరుకొనెడి తెలివిగల ఏ మంత్రియైనను రాజు అడిగినప్పుడుమాత్రమే అతనియెదుట వినమ్రుడై నమస్కరించి తన ఆలోచనలు ప్రకటింపవలెను. (8-9)

రాజునకు విన్నవించుకొనువిషయములు ఆయన ఆలోచనలకు ప్రతికూలముగా ఉండరాదు, హితకరములైనవి, మేలు గూర్చునవి అగు సూచనలనుగూడ మృదువుగా గౌరవపూర్వకముగా తెలుపవలెను. ఓ మారీచా! ఏరాజైనను ఇతరులనుండి గౌరవాదరములను కోరుకొనుచుండును. భక్తిశ్రద్ధలను విడనాడి రాజుమాటలను త్రోసిపుచ్చుచు ఎవ్వరైనను మాట్లాడినచో ఆ విషయము ఎంతయు హితకరమైనదేయైనను గౌరవార్హుడైన రాజు దానిని మెచ్చడు. (10-11)

ఓ నిశాచరా! మిగుల తేజస్సంపన్నులైన ప్రభువులు ఐదుదివ్యలక్షణములను కలిగియుందురు. అగ్నివలె తీక్ష్ణస్వభావమును, ఇంద్రునిరీతి పరాక్రమమును, చంద్రునిభంగి ఆహ్లాదకరత్వమును, వరుణునిభాతి దుష్ట నిగ్రహలక్షణమును, యమునివలె ప్రసన్నతను మహాత్ములైన రాజులు కలిగియుందురు. కనుక ఎట్టి పరిస్థితులయందైనను ప్రభువులు గౌరవార్హులు, పూజ్యులు. (12-13)

ఓ మారీచా! నీవు 'రాజును గౌరవింపవలెననెడి' ఈధర్మమును విడనాడి, అజ్ఞానమున మునింగి, అభ్యాగతుడనైన నన్ను దుర్జనునిరీతి పరుషముగా మాట్లాడుచుంటివి. నేను తలపెట్టిన 'సీతాపహరణకార్యము' మంచిదా? చెడ్డదా? అది నాకు క్షేమకరమా? కాదా? అని నేను నిన్ను అడుగుటలేదు. ఓవీరా! నేను నడుకట్టిన ఈమహాకార్యమునందు నీసహాయము అవసరము. ఇంతమాత్రమే నేను నిన్ను అడిగియుంటిని. నీవు చేయవలసిన సహాయమునుగూర్చి తెల్పెదను వినుము. (14-16)

ఓ మారీచా! వెండివలె తెల్లని చుక్కలుగల చిత్రమైన బంగారువన్నెలేడిగా మారి, నీవు రాముని ఆశ్రమ సమీపమున సీతాదేవియెదుట సంచరించుచుండుము. ఆ

త్వాం తు మాయామృగం దృష్ట్వా కాంచనం జాతవిస్మయా ।
ఆనయైనమితి క్షిప్రం రామం వక్ష్యతి మైథిలీ । 19

అపక్రాంతే తు కాకుత్స్థే దూరం యాత్వా వ్యుదాహర ।
హా సీతే! లక్ష్మణేత్యేవం రామవాక్యానురూపకమ్ । 20

తచ్ఛ్రుత్వా రామపదవీం సీతయా చ ప్రచోదితః ।
అనుగచ్ఛతి సంభ్రాంతః సౌమిత్రిరపి సౌహృదాత్ । 21

అపక్రాంతే చ కాకుత్స్థే లక్ష్మణే చ యథాసుఖమ్ ।
ఆనయిష్యామి వైదేహీం సహస్రాక్షః శచీమివ । 22

ఏవం కృత్వా త్విదం కార్యం యథేష్టం గచ్ఛ రాక్షస! ।
రాజ్యస్యార్ధం ప్రయచ్ఛామి మారీచ! తవ సువ్రత! । 23

గచ్ఛ సౌమ్య! శివం మార్గం కార్యస్యాస్య వివృద్ధయే ।
అహం త్వాఽనుగమిష్యామి సరథో దండకావనమ్ । 24

ప్రాప్య సీతామ్ అయుద్ధేన వంచయిత్వా తు రాఘవమ్ ।
లంకాం ప్రతిగమిష్యామి కృతకార్యః సహ త్వయా । 25

న చేత్ కరోషి మారీచ! హన్మి త్వామహమద్య వై ।
ఏతత్కార్యమవశ్యం మే బలాదపి కరిష్యసి
రాజ్ఞో హి ప్రతికూలస్థో న జాతు సుఖమేధతే । 26

ఆసాద్య తం జీవితసంశయస్తే
మృత్యుర్ధ్రువో హ్యద్య మయా విరుధ్య ।
ఏతద్యథావత్ ప్రతిగృహ్య బుద్ధ్యా
యదత్ర పథ్యం కురు తత్ తథా త్వమ్ । 27

విధముగా అచట స్వేచ్ఛగా తిరుగుచు ఆమెను ప్రలోభపెట్టుము. అంతట వైదేహి బంగారుమాయలేడిని జూచి, ఆశ్చర్యపడుచు 'దీనిని నాకు వెంటనే తెచ్చి ఇమ్ము' అని రాముని అడుగును. (17-19)

రాముడు ఆమెకోరికను అనుసరించి, నిన్ను పట్టుకొనుటకు సిద్ధపడగా, నీవు అతనిని చాలదూరమునకు తీసికొనివెళ్లుము. పిదప శ్రీరామునికంఠస్వరమును అనుకరించుచు "హా! సీతా! హా! లక్ష్మణా!" అనుచు బిగ్గఱగా ఆర్తనాదము చేయుము. ఆమాటలను విని సీత మిగుల దుఃఖితయై, రాముని ఆదుకొనుటకై లక్ష్మణుని ప్రేరేపించును. అన్నయెడలగల భక్తికారణముగా ఆయనకు సహాయపడుటకై, అతడు తొట్రుపడుచు రామునిమార్గమును అనుసరించును. (20-21)

ఆ విధముగా లక్ష్మణుడును ఆశ్రమమునకు దూరమైన పిదప, ఇంద్రుడు శచీదేవినివలె నేనును వైదేహిని సులభముగా తీసికొనివత్తును. ఓ మారీచా! సువ్రతా! ఇంతమాత్రము నా పనిని నెఱవేర్చి, నీవు యథేచ్ఛగా వెళ్లుము. ఈ విధముగా సహాయపడినందులకు నీకు నారాజ్యములో సగభాగమును ఇచ్చెదను. (22-23)

ఓ సౌమ్యుడా! ఈ కార్యసాధనకై ఆకర్షణీయమైన రీతిగా వెళ్లుము. నేను రథముపై నిన్ననుసరించుచు దండకారణ్యమునకు వచ్చెదను. ఎట్టి యుద్ధముతో పనిలేకయే శ్రీరాముని వంచించి, సీతను దీసికొని, కృతకృత్యుడనై నీతోగూడ లంకకు చేరెదను. (24-25)

ఓ మారీచా! నేను చెప్పినట్లు చేయనిచో నిన్ను ఇప్పుడే హతమార్చెదను. నీకు ఇష్టము లేకున్నను నీ చేతనే ఈ పనిని చేయించెదను. రాజునకు ఎదురుతిరిగినవాడు ఎన్నడును సుఖపడడు. (26)

ఓ రాక్షసా! నీవు మృగరూపమును దాల్చి సీతారాములకడకు వెళ్లినచో ఒకవేళ విధివశమున నీ ప్రాణములు దక్కవచ్చును. కాని నన్ను వ్యతిరేకించినచో నీ ప్రాణములు అనంతవాయువులలో కలియుట మాత్రము నిజము - బాగుగా ఆలోచించి. ఈ రెండింటిలో నీకు మేలైన దానిని ఆచరింపుము." (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే చత్వారింశస్సర్గః *(40)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదియవసర్గము.

-- * * * --

41. నలుబదియొకటవసర్గము

సీతాదేవిని అపహరించినచో 'నీవు సపరివారముగానశించుట తథ్యము' అని మారీచుడు రావణుని మఱల హెచ్చరించుట -

ఆజ్ఞప్తో రాజవద్వాక్యం ప్రతికూలం నిశాచరః।
అబ్రవీత్ పరుషం వాక్యం మారీచో రాక్షసాధిపమ్॥ 1

కేనాయముపదిష్టస్తే వినాశః పాపకర్మణా।
సపుత్రస్య సరాష్ట్రస్య సామాత్యస్య నిశాచర!॥ 2

కస్త్వయా సుఖినా రాజన్ నాఽభినందతి పాపకృత్।
కేనేదముపదిష్టం తే మృత్యుద్వారముపాయతః॥ 3

శత్రవస్తవ సువ్యక్తం హీనవీర్యా నిశాచరాః।
ఇచ్ఛంతి త్వాం వినశ్యంతమ్ ఉపరుద్ధం బలీయసా॥ 4

కేనేదముపదిష్టం తే క్షుద్రేణాఽహితవాదినా।
యస్త్వామిచ్ఛతి నశ్యంతం స్వకృతేన నిశాచర!॥ 5

వధ్యాః ఖలు న హన్యంతే సచివాస్తవ రావణ!।
యే త్వాముత్పథమారూఢం న నిగృహ్ణంతి సర్వశః॥ 6

అమాత్యైః కామవృత్తో హి రాజా కాపథమాశ్రితః।
నిగ్రాహ్యః సర్వథా సద్భిః న నిగ్రాహ్యో నిగృహ్యసే॥ 7

ధర్మమర్థం చ కామం చ యశశ్చ జయతాం వర!।
స్వామిప్రసాదాత్ సచివాః ప్రాప్నువంతి నిశాచర!॥ 8

విపర్యయే తు తత్సర్వం వ్యర్థం భవతి రావణ!।
వ్యసనం స్వామివైగుణ్యాత్ ప్రాప్నువంతీతరే జనాః॥ 9

రాజగర్వముతో రావణుడు తనస్థాయికి తగనివిధముగ ఆజ్ఞాపింపగా, నిశాచరుడైన మారీచుడు ఆ రాక్షసరాజుతో ఇట్లు పరుషముగా పలికెను. (1)

"ఓ నిశాచరా! నీవిట్లు చేసినచో (సీతను అపహరించినచో) భార్యాపుత్రాదులతోడను, అమాత్యులతోడను నీవు నశించుటయేగాక నీ రాజ్యమునందలి ప్రజలెల్లరును మృత్యువుపాలగుదురు. ఇంతకును నీకు సర్వనాశనము తెచ్చిపెట్టు ఈ ఉపదేశమును చేసిన ఆ దుర్మార్గుడెవడు? (2)

ఓరాజా! నీవు సుఖసంతోషములతో హాయిగా ఉండుటచూచి, ఓర్వలేని ఆ పాపాత్ముడెవడు? నిన్ను ఈ మిషతో మృత్యుద్వారముకడకు చేర్చుటకై ఇట్లు మాటవేసినవాడెవడు? (3)

సూటిగా నిన్ను ఎదిరింపలేని, బలహీనులైన నీ రాక్షసశత్రువులు నీకంటెను బలశాలియైన శ్రీరాముని చేతిలో నీచావును కోరుకొనుచున్నారనుట స్పష్టము- (4)

ఓ నిశాచరా! ఈదురాలోచనలను నీతలకెక్కించినవాడెవడు? నిజముగా వాడు నీచుడు. నీకు హాని జరుగవలెనని ఎదురుచూచుచున్నవాడు. స్వయంకృతాపరాధమువలననే నీవు నశింపవలయునని తలంచుచున్నవాడు. (5)

ఓ రావణా! లోకవిరుద్ధముగా, శాస్త్రములకు వ్యతిరేకముగా ప్రవర్తించుచున్న నిన్ను ఆపెడదారినుండి మళ్లింపని నీసచివులు నిజముగా చంపదగినవారే. కానీ నీవేల వారిని చంపక ఉపేక్షించుచున్నావు? (6)

విశృంఖలముగా ప్రవర్తించుచు చెడుమార్గమునబడిన రాజును సత్పురుషులైన అమాత్యులు సర్వవిధములుగా ప్రయత్నించి, సరియైన మార్గమునకు మళ్లింపవలెను. నీవు అట్టివాడవేయైనను నీమంత్రులు నిన్ను సన్మార్గమునకు మఱల్చుటలేదు. (7)

జయేచ్ఛగల ఓ రావణా! గుణవంతుడైన రాజుయొక్క అనుగ్రహమువలననే మంత్రులు ధర్మమార్గమును అనుసరించుచు భోగభాగ్యములతో తులతూగుచు పేరుప్రతిష్ఠలనుగూడ పొందుచుందురు. కాని రాజుగుణహీనుడైనచో సచివులేగాక తదితరజనులుగూడ సర్వపురుషార్థములనుండియు భ్రష్టులై కష్టములపాలగుదురు. (8-9)

రాజమూలో హి ధర్మశ్చ జయశ్చ జయతాం వర!।
తస్మాత్ సర్వాస్వవస్థాసు రక్షితవ్యా నరాధిపాః॥ 10

రాజ్యం పాలయితుం శక్యం న తీక్ష్ణేన నిశాచర!।
న చాపి ప్రతికూలేన నాఽవినీతేన రాక్షస!॥ 11

యే తీక్ష్ణమంత్రాః సచివా భజ్యంతే సహ తేన వై।
విషమే తురగాః శీఘ్రా మందసారథయో యథా॥ 12

బహవః సాధవో లోకే యుక్తా ధర్మమనుష్ఠితాః।
పరేషామపరాధేన వినష్టాః సపరిచ్ఛదాః॥ 13

స్వామినా ప్రతికూలేన ప్రజాస్తీక్ష్ణేన రావణ!।
రక్ష్యమాణా న వర్ధంతే మేషా గోమాయునా యథా॥ 14

అవశ్యం వినశిష్యంతి సర్వే రావణ! రాక్షసాః।
యేషాం త్వం కర్కశో రాజా దుర్బుద్ధిరజితేంద్రియః॥ 15

తదిదం కాకతాళీయం ఘోరమాసాదితం మయా।
అత్రైవ శోచనీయస్త్వం ససైన్యో వినశిష్యసి॥ 16

మాం నిహత్య తు రామశ్చ నచిరాత్ త్వాం వధిష్యతి।
అనేన కృతకృత్యోఽస్మి మ్రియే యదరిణా హతః॥ 17

దర్శనాదేవ రామస్య హతం మామ్ ఉపధారయ।
ఆత్మానం చ హతం విద్ధి హృత్వా సీతాం సబాంధవమ్॥ 18

ఆనయిష్యసి చేత్ సీతామ్ ఆశ్రమాత్ సహితో మయా।
నైవ త్వమసి నాహం చ నైవ లంకా న రాక్షసాః॥ 19

ఓ రావణా! ప్రజలయొక్క ధర్మాచరణముగాని, వారిశ్రేయస్సుగాని రాజప్రవర్తనను బట్టియే యుండును. కావున ఎట్టి పరిస్థితులలోనైనను రాజులు ధర్మమార్గమున సుస్థిరులై యుండవలెను. (10)

ఓ రాక్షసరాజా! క్రూరదండనద్వారా (నిరంకుశధోరణితో) రాజ్యమును పాలించుట అసాధ్యము అట్లే ప్రజల మనోభావములకు విరుద్ధముగానున్నవాడు ఇంద్రియ నిగ్రహములేనివాడు రాజ్యమును పాలింపజాలడు. (11)

ఎగుడుదిగుడుగానున్న నేలపై వేగముగా పయనించెడి అశ్వములు అసమర్థుడైన సారథితో నహానశించునట్లు తీక్ష్ణములైన ఉపాయములను ఉపదేశించుమంత్రులు (తమసూచనలమీదనే ఆధారపడిన) మందబుద్ధియైన రాజుతోసహా నశింతురు. ధర్మమార్గమున సాగిపోయెడి సాధువులలో పెక్కుమంది ఇతరులఅపరాధముల కారణముగనే సపరివారముగా నశించుచుందురు. ఓ రావణా! తోడేలు (లేక నక్క) వలన మేకలు అపాయములపాలగునట్లు క్రూరుడై ధర్మవిరుద్ధముగా ప్రవర్తించు రాజు యొక్క పాలనలో ప్రజలు రక్షణ కఱవై ఇక్కట్లకులోనగుదురు. అట్లే క్రూరుడవు, దుర్బుద్ధివి, ఇంద్రియనిగ్రహములేనివాడవు ఐన నీ పరిపాలనలో రాక్షసులందఱును తప్పక నశింతురు. (12-15)

శ్రీరామునిచేతిలో నేను మరణించుటయనునది యాదృచ్ఛికము. అనగా విధినిర్ణయము - కాని నీవు బుద్ధిపూర్వకముగా చేయనున్న అకృత్యమువలన నీవు, నీసైన్యము మరణించుటయనునదిమాత్రము శోచనీయము- (16)

శ్రీరాముడు నన్ను చంపిన మఱుక్షణమే నిన్నును చంపును. కాని (నీచేతిలో మరణించుటకంటెను) నీ శత్రువుచేతిలో అనగా రామునిచేతిలో మృతి చెందుటవలన నాజన్మతరించును. (17)

ఓ రాజా! నేను శ్రీరాముని సమీపించినప్పుడు ఆయనదృష్టి నాపై పడగానే నేను మరణించినట్లు భావింపుము. కానీ! సీతాదేవిని అపహరించినచో నీవు సపరివారముగా హతమగుటమాత్రము తథ్యమని యెఱుంగుము. నన్ను వెంటనిడుకొనివెళ్లి నీవు శ్రీరామునిఆశ్రమమునుండి సీతను అపహరించుకొనివచ్చినచో నేను, నీవు, నీబంగారులంక, కడకు ఈ రాక్షసులందఱును నశించుట ముమ్మాటికిని నిజము- (18-19)

నివార్యమాణస్తు మయా హితైషిణా
న మృష్యసే వాక్యమిదం నిశాచర।
పరేతకల్పా హి గతాయుషో నరా
హితం న గృహ్ణంతి సుహృద్భిరీరితమ్ ॥ 20

ఓ నిశాచరా! నీ హితమునే గోరుచు నేను నిన్ను ఎంతగా నివారించుచున్నను నీవు నామాటను ఆలకించుట లేదు- అల్పాయుష్కులు ఆయువుదీఱినప్పుడు సన్మిత్రులు చెప్పిన మాటలను ఏమాత్రము పరిగణింపరు. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకచత్వారింశస్సర్గః (41)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదియొకటవసర్గము.

— ✻ ✻ ✻ —

42. నలుబదిరెండవసర్గము

రావణమారీచులు రథముపై పంచవటికి చేరుట - మారీచుడు మాయలేడి రూపమున ఆ ఆశ్రమముముందు సంచరించుట - సీతాదేవి దానిని జూచి ఆశ్చర్యపడుట -

ఏవముక్త్వా తు పరుషం మారీచో రావణం తతః।
గచ్ఛావేత్యబ్రవీద్దీనో భయాద్రాత్రించరప్రభోః॥ 1

మారీచుడు రావణునితో ఇట్లు హితవచనములను పలికినను, పిమ్మట ఆ రాక్షసప్రభువునకు భయపడి, అతడు దైన్యముతో 'సరే! వెళ్లుదము' అనినుడివెను. (1)

దృష్టశ్చాహం పునస్తేన శరచాపాసిధారిణా।
మద్విధోద్యతశస్త్రేణ వినష్టం జీవితం చ మే॥ 2

"ఓ రావణా! ఎల్లప్పుడును ధనుర్బాణములను, ఖడ్గమును ధరించియుండెడి శ్రీరామునకు మఱలనేను కనబడినచో, నన్ను చంపుటకై అతడు అస్త్రమును ప్రయోగించుటయు, అప్పుడతని చేతిలో నా జీవితము ముగియుటయు తథ్యము. (2)

న హి రామం పరాక్రమ్య జీవన్ ప్రతినివర్తతే।
వర్తతే ప్రతిరూపోఽసౌ యమదండహతస్య తే॥ 3

శ్రీరాముని ఎదిరించినవాడెవ్వడైనను ప్రాణములతో తిరిగిరాడు. రామునియెడవిరోధమును పెట్టుకొనిన నీవు మృత్యుముఖమున చేరినట్లే, ఇప్పుడు ఇక్కడ ఉన్నది నీ ప్రతిరూపముమాత్రమే. అట్లే లోగడ రామునితో విరోధమును బూనిన నేనును మరణించినట్లే (3)

కిం ను శక్యం మయా కర్తుమ్ ఏవం త్వయి దురాత్మని।
ఏష గచ్ఛామ్యహం తాత! స్వస్తి తేఽస్తు నిశాచర!॥ 4

ఓ నిశాచరా! దురాత్ముడవైన నీఆధీనములోనున్న నేను ఇంకేమిచేయగలను? ఇదిగో నీతో వచ్చుచున్నాను నీకు మేలగుగాక - (శ్రీరామునిచేతిలో నీవు మడియుదువుగాక)"(4)

ప్రహృష్టస్త్వభవత్ తేన వచనేన స రావణః।
పరిష్వజ్య సుసంశ్లిష్టమ్ ఇదం వచనమబ్రవీత్॥ 5

మారీచునిమాటలకు రావణుడు మిగుల సంతుష్టుడై, అతనిని గాఢముగా కౌగిలించుకొని, ఇట్లు నుడివెను. (5)

ఏతత్ శౌండీర్యయుక్తం తే మచ్ఛందాదివ భాషితమ్।
ఇదానీమసి మారీచః పూర్వమన్యో నిశాచరః॥ 6

"ఓ నిశాచరా! నాఅభిప్రాయమునకు అనుగుణముగా నీవు పలికిన ఈ మాటలు నిజముగా వీరోచితములు, యథార్థముగా ఇప్పుడు నీవు మారీచుడవు. ఇంతవఱకు నీవు సామాన్యనిశాచరుడవు మాత్రమే. (6)

ఆరుహ్యతామయం శీఘ్రం రథో రత్నవిభూషితః।
మయా సహ తథా యుక్తః పిశాచవదనైః ఖరైః॥ 7

ఈ నారథము రత్నఖచితము. దీనికి భయంకరమైన ముఖములుగల గుఱ్ఱములు పూన్చబడియున్నవి. నాతోగూడ వెంటనే దీనిని అధిరోహింపుము. సీతను

ప్రలోభయిత్వా వైదేహీం యథేష్టం గంతుమర్హసి।
తాం శూన్యే ప్రసభం సీతామ్ ఆనయిష్యామి మైథిలీమ్। 8

తతో రావణమారీచౌ విమానమివ తం రథమ్।
ఆరుహ్య యయతుః శీఘ్రం తస్మాదాశ్రమమండలాత్। 9

తథైవ తత్ర పశ్యంతౌ పత్తనాని వనాని చ।
గిరీంశ్చ సరితః సర్వా రాష్ట్రాణి నగరాణి చ। 10

సమేత్య దండకారణ్యం రాఘవస్యాశ్రమం తతః।
దదర్శ సహమారీచో రావణో రాక్షసాధిపః। 11

అవతీర్య రథాత్ తస్మాత్ తతః కాంచనభూషణాత్।
హస్తే గృహీత్వా మారీచం రావణో వాక్యమబ్రవీత్। 12

ఏతద్రామాశ్రమపదం దృశ్యతే కదళీవృతమ్।
క్రియతాం తత్ సఖే! శీఘ్రం యదర్థం వయమాగతాః। 13

స రావణవచః శ్రుత్వా మారీచో రాక్షసస్తదా।
మృగో భూత్వాఽఽశ్రమద్వారి రామస్య విచచార హ। 14

స తు రూపం సమాస్థాయ మహదద్భుతదర్శనమ్।
మణిప్రవరశృంగాగ్రః సితాసితముఖాకృతిః। 15

రక్తపద్మోత్పలముఖ ఇంద్రనీలోత్పలశ్రవాః।
కించిదభ్యున్నతగ్రీవ ఇంద్రనీలదళాధరః। 16

కుందేందువజ్రసంకాశమ్ ఉదరంచాస్య భాస్వరమ్।
మధూకనిభపార్శ్వశ్చ పద్మకింజల్కసన్నిభః। 17

వైడూర్యసంకాశఖురః తనుజంఘః సుసంహతః।
ఇంద్రాయుధసవర్ణేన పుచ్ఛేనోర్ధ్వం విరాజతా। 18

మనోహరః స్నిగ్ధవర్ణో రత్నైర్నానావిధైర్వృతః।
క్షణేన రాక్షసో జాతో మృగః పరమశోభనః।
వనం ప్రజ్వలయన్ రమ్యం రామాశ్రమపదం చ తత్। 19

ప్రలోభపెట్టుచు నీకు నచ్చినరీతిగా సాగిపొమ్ము. రామలక్ష్మణులు ఆ ఆశ్రమమున లేని సమయమును జూచి, సీతను బలవంతముగా దీసికొనివత్తును." (7-8)

అనంతరము రావణుడును, మారీచుడును విమానమువంటి ఆ రథమును ఎక్కి, ఆ మారీచాశ్రమమునుండి వెంటనే బయలు దేఱిరి. (9)

ఆయిరువురును రథముమీద పయనించుచునే పట్టణములను, వనములను, పర్వతములను, నదులను, వివిధప్రదేశములను, నగరములను దర్శించుచు దండకారణ్యమును చేరిరి. పిమ్మట రావణుడు మారీచునితోగూడి శ్రీరామునిఆశ్రమమును దర్శించెను. (10-11)

అనంతరము ఆ బంగారురథమునుండి దిగి, రావణుడు మారీచునిచేయి పట్టుకొని, అతనితో ఇట్లనెను. (12)

"ఓ మిత్రమా! అరటిచెట్లతో శోభిల్లుచున్న ఈ ఆశ్రమమే శ్రీరామునిది. మనము వచ్చిన పనిని వెంటనే ప్రారంభింపుము. (కనకమృగరూపమును ధరింపుము). రావణుని ఆదేశమును అనుసరించి, మారీచుడు అపుడు మృగరూపమును దాల్చి, శ్రీరాముని ఆశ్రమముముంగిట సంచరింపసాగెను. (13-14)

మారీచుడు ధరించిన ఆమృగరూపము మిగుల అద్భుతావహముగానుండెను. దానికొమ్ములు ఇంద్రనీలములవలె మెఱయుచుండెను. దానిముఖము తెలుపునలుపువన్నెలతో మిశ్రితమైయుండెను. దానిపెదవులలో ఒకటి ఎఱ్ఱదామరవలెను, మఱియొకటి నల్లగలువరీతిగను ఒప్పుచుండెను. చెవులు ఇంద్రనీలమణులవలె విలసిల్లుచుండెను. మెడ కొంచెము పైకెత్తబడియుండెను. అధరము ఇంద్రనీలములవలె ముదురు రంగుతో విలసిల్లుచుండెను. (15-16)

ఆలేడియొక్క ఉదరము మల్లెపూవులవలెను, చంద్రునిరీతిగను, వజ్రమణివిధమునను తెల్లనికాంతులను ప్రసరింపజేయుచుండెను. పార్శ్వభాగములు నెమలివన్నెలతోడను, పద్మకేసరములకాంతులతోడను విరాజిల్లుచుండెను. గిట్టలు వైడూర్యమణులవలె ఒప్పుచుండెను. సంధిబంధములు, పిక్కలు దృఢముగా నుండెను. తోక పైకెత్తబడి ఇంద్రధనుస్సువలె పలువన్నెలతో మెఱయుచుండెను. (17-18)

వివిధములగు రత్నములనుబోలిన చుక్కలతో ఒప్పుచున్న ఆలేడి నిగనిగలాడుచు మనోహరముగానుండెను. మారీచుడు కనులకింపుగొల్పెడి అట్టి మృగరూపమును పొంది, శ్రీరాముని ఆశ్రమమువెలసియున్న ఆరమ్యమగు వనమునకే వన్నెదెచ్చెను. (19)

మనోహరం దర్శనీయం రూపం కృత్వా స రాక్షసః।
ప్రలోభనార్థం వైదేహ్యా నానాధాతువిచిత్రితమ్। 20

విచరన్ గచ్ఛతే తస్మాత్ శాద్వలాని సమంతతః। 21

రూప్యైర్బిందుశతైశ్చిత్రో భూత్వా చ ప్రియదర్శనః।
విటపీనాం కిసలయాన్ భంక్త్వాఽదన్ విచచార హ। 22

కదలీగృహకం గత్వా కర్ణికారాన్ ఇతస్తతః।
సమాశ్రయన్మందగతిః సీతాసందర్శనం తథా। 23

రాజీవచిత్రపృష్ఠః స విరరాజ మహామృగః।
రామాశ్రమపదాభ్యాశే విచచార యథాసుఖమ్। 24

పునర్గత్వా నివృత్తశ్చ విచచార మృగోత్తమః।
గత్వా ముహూర్తం త్వరయా పునః ప్రతినివర్తతే। 25

విక్రీడంశ్చ క్వచిద్భూమౌ పునరేవ నిషీదతి।
ఆశ్రమద్వారమాగమ్య మృగయూథాని గచ్ఛతి। 26

మృగయూథైరనుగతః పునరేవ నివర్తతే।
సీతాదర్శనమాకాంక్షన్ రాక్షసో మృగతాం గతః।
పరిభ్రమతి చిత్రాణి మండలాని వినిష్పతన్। 27

సముద్వీక్ష్య చ తం సర్వే మృగా హ్యన్యే వనేచరాః।
ఉపాగమ్య సమాఘ్రాయ విద్రవంతి దిశో దశ। 28

రాక్షసః సోఽపి తాన్ వన్యాన్ మృగాన్ మృగవధే రతః।
ప్రచ్ఛాదనార్థం భావస్య న భక్షయతి సంస్పృశన్। 29

తస్మిన్నేవ తతః కాలే వైదేహీ శుభలోచనా।
కుసుమాపచయవ్యగ్రా పాదపానభ్యవర్తత। 30

కర్ణికారాన్ అశోకాంశ్చ చూతాంశ్చ మదిరేక్షణా।
కుసుమాన్యపచిన్వంతీ చచార రుచిరాననా। 31

ఆ రాక్షసుడు ధరించిన మృగరూపము అపురూపమైన అందములను చిందించుచు, చూడముచ్చట గొల్పుచుండెను. వివిధములగు ధాతువుల వన్నెలుగలిగి సీతాదేవిని ప్రలోభపెట్టుటకై ఆ మృగము ఆ పరిసరములలోగల పచ్చికలను మేయుచు అటునిటు తిరుగసాగెను. (20-21)

అసంఖ్యాకములైన వెండివన్నెలచుక్కలతో విలసిల్లుచు కనువిందుగావించుచున్న ఆ మృగము ఆయా వృక్షముల చిగురుటాకులను భక్షించుచు ఆ పరిసరములలో సంచరింపసాగెను. ఆ ఆశ్రమసమీపమునగల అరటితోటకడకు చేరి, సీతాదేవికి కనబడునట్లుగా తిన్నగా అడుగులు వేయుచు గన్నేరుమొక్కలచెంతకు చేరెను. వీపుపైభాగమున పద్మకేసరముల వన్నెలతో విరాజిల్లుచున్న ఆ విచిత్రమృగము శ్రీరాముని ఆశ్రమసమీపమున నిర్భయముగా మసలుచుండెను. (22-24)

ఆ పసిడిలేడి రెండుగడియలపాటు దూరముగా వెళ్లి, మరల అచటికి తిరిగి వచ్చుచుండెను. ఇట్లు పదేపదే పోవుచు వచ్చుచు అది అచట విహరింపసాగెను. (25)

ఆ లేడి కొంతతడవు ఆడుకొనుచుండెను. పిదప కొంతసేపు ఒకచోట కూర్చొనుచుండెను. ఒక్కొక్కసారి ఆశ్రమద్వారముదాక వచ్చి, తిరిగి లేళ్లగుంపుకడకు వెళ్లుచుండెను. (26)

మృగరూపమునను్న ఆ రాక్షసుడు లేళ్లగుంపులలో చేరి, కొంతవడి సంచరించుచు, సీతాదేవిని దర్శింపవలెననెడి కాంక్షతో మరల ఆ ఆశ్రమముకడకు చేరుచుండెను. ఈ విధముగా అది చిత్రవిచిత్రములైన విన్యాసములతో (ఎగిరిగంతులు వేయుచు) అచట సంచరింపసాగెను. (27)

అచటి వనములలో సంచరించెడి జింకలును, ఇతరజంతువులును దానిని సమీపించి, తమ ఘ్రాణశక్తితో అది సామాన్యమృగముగాదని ఎఱింగి, భయపడి దశదిశలకును పాఱిపోసాగెను. (28)

జాతిలక్షణమునుబట్టి ఆ రాక్షసుడు మృగములను భక్షించువాడేయైనను, తనరాక్షసస్వభావమును కప్పిపుచ్చుకొనుటకై ఆయా వనమృగములను స్పృశించుచుండెనే గాని భక్షించుటలేదు- (29)

అదే సమయమున చక్కని కనుతీరుగల సీతాదేవి పూలుగోయుటకై ఆశ్రమమునగల మొక్కలకడ చేరెను. మనోహరమైన ముఖసౌందర్యముగల ఆ వైదేహి గన్నేరుకుసుమములను, అశోకపుష్పములను, మామిడి పూవులను కోయుచు అచట తిరుగుచుండెను. (30-31)

అనర్హాఽరణ్యవాసస్య సా తం రత్నమయం మృగమ్।
ముక్తామణివిచిత్రాంగం దదర్శ పరమాంగనా॥ 32

సీతాదేవి పెద్దకాలము (దాదాపు 13 సంవత్సరములు) వనవాసజీవితమును గడపిన పరమసాధ్వి.[1] మిగుల శ్రేష్ఠమైనది. ముత్యములవంటి తెల్లనిచుక్కలతో రమ్యమైనది అగు ఆ మృగమును రామపత్ని చూచెను. (32)

సా తం రుచిరదంతోష్ఠీ రూప్యధాతుతనూరుహమ్।
విస్మయోత్ఫుల్లనయనా సస్నేహం సముదైక్షత॥ 33

అందమైన పలువరుసలు, పెదవులుగల సీతాదేవి రజత తామ్రవర్ణములుగల వెంట్రుకలతో ఒప్పుచున్న ఆ లేడిని ఆశ్చర్యముతో కనులు పెద్దవిగా జేసి, మక్కువతో జూచెను. (33)

స చ తాం రామదయితాం పశ్యన్ మాయామయో మృగః।
విచచార పునశ్చిత్రం దీపయన్నివ తద్వనమ్॥ 34

అంతట ఆమాయలేడి రామపత్నియగు సీతాదేవిని జూచుచు, ఆవనమునకు వెలుగులను విరజిమ్ము చున్నదాయనునట్లు చిత్రవిచిత్రముగా సంచరించెను- (34)

అదృష్టపూర్వం తం దృష్ట్వా నానారత్నమయం మృగమ్।
విస్మయం పరమం సీతా జగామ జనకాత్మజా ॥ 35

జనకమహారాజు కూతురైన సీతాదేవి వివిధములగు రత్నశోభలతో విలసిల్లుచున్న అట్టి లేడిని ఇదివరలో చూచి యెఱుగదు. అందువలన ఆమె మిక్కిలి ఆశ్చర్యమునకు లోనయ్యెను. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ద్విచత్వారింశస్సర్గః *(42)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదిరెండవసర్గము.

-- * * * --

43. నలుబదిమూడవసర్గము

కపటమృగమును జూచి 'ఇది రాక్షసమాయ' - అని లక్ష్మణుడు సందేహమును ప్రకటించుట - కాని సీతాదేవి ముచ్చటపడి, దానిని సజీవముగానైనను, చంపియైనను తీసికొనిరమ్మని శ్రీరాముని కోరుట - శ్రీరాముడు సీతాదేవిరక్షణభారమును లక్ష్మణునిపైనుంచి, లేడిని తీసికొనివచ్చుటకై సిద్ధపడుట -

సా తం సంప్రేక్ష్య సుశ్రోణీ కుసుమాన్యపచిన్వతీ।
హైమరాజతవర్ణాభ్యాం పార్శ్వాభ్యామ్ ఉపశోభితమ్॥ 1

ప్రహృష్టా చాఽనవద్యాంగీ మృష్టహాటకవర్ణినీ।
భర్తారమభిచక్రంద లక్ష్మణం చాపి సాయుధమ్॥ 2

చక్కని అవయవసౌభాగ్యముగల సీతాదేవి పూలుగోయుచు ఒక ప్రక్కన బంగారువన్నెతోడను, మఱియొక పార్శ్వమున వెండివన్నెతోడను శోభిల్లుచున్న ఆ మృగమును పరిశీలించి చూచెను. మేలిమి బంగారువన్నెగల ఆసుందరి మిగుల సంతోషించినదై 'ఆయుధములతో రండు' అని రామలక్ష్మణులను బిగ్గఱగా పిలిచెను- (1-2)

తయాఽఽహూతౌ నరవ్యాఘ్రౌ వైదేహ్యా రామలక్ష్మణౌ।
వీక్షమాణౌ తు తం దేశం తదా దదృశతుర్మృగమ్॥ 3

వైదేహి పిలుపునందుకొని, నరశ్రేష్ఠులైన ఆరామలక్ష్మణులు ఆప్రదేశమును పరిశీలించిచూచుచుండగా ఆ మృగము వారిదృష్టిలో పడెను. (3)

1) నఞ్+అర్హా = అనర్హా = మిగుల అర్హురాలు. వనవాసస్య అనర్హా = చాలకాలము వనవాసజీవనము అర్హముగా (సముచితముగా) గడపినది. నఞ్‌నకు అత్యంతము. శ్రేష్ఠము అను అర్థము చెప్పుటయు కలదు - విష్ణు సహస్రనామములలో 'అనుత్తమః' అను నామమునకు ఉత్తములలో శ్రేష్ఠుడు. పురుషోత్తముడు - అని గదా పెద్దలవివరణము. త్వరలోనే (ఒక సంవత్సరములో) వనవాసమును పూర్తిచేసికొని ఇంటికి చేరనున్న సమయముగదా ఇది. ఇట్టి రమ్యమైన పసిడివన్నెగల ఈ లేడిని అయోధ్యకు తీసికొనివెళ్ళి, అచటి తమఉద్యానవనములకు చేర్చినచో ఎంతయు బాగుండును గదా! అని సీత భావించియుండెను. ఇది యొక భావన

శంకమానస్తు తం దృష్ట్వా లక్ష్మణో రామమబ్రవీత్।
తమేవైనమహం మన్యే మారీచం రాక్షసం మృగమ్॥ 4

చరంతో మృగయాం హృష్టాః పాపేనోపాధినా వనే।
అనేన నిహతా రాజన్ రాజానః కామరూపిణా॥ 5

అస్య మాయావిదో మాయామృగరూపమిదం కృతమ్।
భానుమత్పురుషవ్యాఘ్ర! గంధర్వపురసన్నిభమ్॥ 6

మృగో హ్యేవంవిధో రత్నవిచిత్రో నాస్తి రాఘవ!।
జగత్యాం జగతీనాథ! మాయైషా హి న సంశయః॥ 7

ఏవం బ్రువాణం కాకుత్స్థం ప్రతివార్య శుచిస్మితా।
ఉవాచ సీతా సంహృష్టా చర్మణా హృతచేతనా॥ 8

ఆర్యపుత్రాభిరామోఽసౌ మృగో హరతి మే మనః।
ఆనయైనం మహాబాహో! క్రీడార్థం నో భవిష్యతి॥ 9

ఇహాఽఽశ్రమపదేఽస్మాకం బహవః పుణ్యదర్శనాః।
మృగాశ్చరంతి సహితాః చమరాః సృమరాస్తథా॥ 10

ఋక్షాః పృషతసంఘాశ్చ వానరాః కిన్నరాస్తథా।
విచరంతి మహాబాహో! రూపశ్రేష్ఠా మనోహరాః॥ 11

న చాస్య సదృశో రాజన్ దృష్టపూర్వో మృగః పురా।
తేజసా క్షమయా దీప్త్యా యథాఽయం మృగసత్తమః॥ 12

నానావర్ణవిచిత్రాంగో రత్నబిందుసమాచితః।
ద్యోతయన్ వనమవ్యగ్రం శోభతే శశిసన్నిభః॥ 13

అహో రూపమ్ అహో లక్ష్మీః స్వరసంపచ్చ శోభనా।
మృగోఽద్భుతో విచిత్రాంగో హృదయం హరతీవ మే॥ 14

యది గ్రహణమభ్యేతి జీవన్నేవ మృగస్తవ।
ఆశ్చర్యభూతం భవతి విస్మయం జనయిష్యతి॥ 15

సమాప్తవనవాసానాం రాజ్యస్థానాం చ నః పునః।
అంతఃపురవిభూషార్థో మృగ ఏష భవిష్యతి॥ 16

అంతట లక్ష్మణుడు ఆమృగమును జూచి శంకించుచు శ్రీరామునితో ఇట్లు నుడివెను. "అన్నా! ఇది నిజమైన మృగముగాదు. రాక్షసుడైన మారీచుడే ఈ రూపమున ఇచటికి వచ్చియుండవచ్చును. వేటయందలి ఆసక్తితో ఈ వనమున సంచరించెడి రాజులను కామరూపియైన ఆ రాక్షసుడు ఈ మాయామృగరూపమున హతమార్చియుండెను. (4-5)

ఓ పురుషశ్రేష్ఠా! మారీచుడు మాయలమారి. అతడే ఈ మాయామృగరూపమును ధరించియుండవచ్చును. ఇది గంధర్వనగరమువలె చూచుటకు ఉన్నట్లుగా భాసించునేగాని వాస్తవముగా లేనట్టిదే. (6)

ఓ జగన్నాథా! చిత్రవిచిత్రములైన వన్నెలతో ఒప్పుచున్న ఇట్టి మృగము ఈ జగత్తునందు ఉండనే ఉండదు. కనుక నిస్సంశయముగా ఇది మాయామృగమే." (7)

మాయలేడియొక్క శరీరసౌందర్యమునకు ఆకర్షితురాలైన సీతాదేవి అట్లు పలుకుచున్న లక్ష్మణుని నివారించి, చిఱునవ్వుచిందించుచు, శ్రీరామునితో సంతోషముగా ఇట్లనియె. (8)

"ఓ ఆర్యపుత్రా! మిక్కిలి అద్భుతమైన అందచందములుగల ఈలేడి నామనస్సును దోచుకొనుచున్నది. దీనిని తీసికొని రండు. ఓ మహాబాహూ! ఇది మనకు క్రీడామృగముకాగలదు. మనఆశ్రమపరిసరములలో చూడముచ్చటైన పెక్కు జంతువులు సంచరించుచుండును. సవరపుమెకములు, చమరమృగములు, ఎలుగుబంట్లు, చుక్కలలేళ్లు, వానరములు, కిన్నరమృగములు ఇచట గుంపులు గుంపులుగా తిరుగుచుండును. అవియన్నియును రూపసౌభాగ్యముచే మనోహరములే. కాని దీనితో సరితూగగల మృగమును ఇదివరలో ఎన్నడును చూచియుండలేదు. వన్నెచిన్నెలను బట్టియు, ఇంపుగొల్పెడి మందగమనమును అనుసరించియు, శరీరకాంతిచేతను ఇట్టి మృగము 'నభూతో నభవిష్యతి'. (9-12)

ఇది పలువన్నెలతో విచిత్రముగా ఉన్నది. దీని శరీరముపైగల రత్నబిందువులు ముచ్చటగొల్పుచున్నవి. చంద్రునివలె ఆహ్లాదకరమై వనమునందంతటను తనశోభలను నింపుచున్నది. దీనిరూపము అద్భుతమైనది. దీనికాంతులు అపూర్వములు. స్వరము మధురమైనది. చిత్రవిచిత్రములైన దీనిఅవయవ సౌభాగ్యములు నామనస్సును ఆకట్టుకొనుచున్నవి. (13-14)

ఈ మృగము ప్రాణములతోడనే మీకు పట్టుబడినచో అది ఎల్లరకును ఆశ్చర్యమును గొల్పును. త్వరలోనే మనము వనవాసమును పూర్తి చేసికొని, మఱల మనరాజ్యమునకు చేరుదుము. అప్పుడు ఇది మనఅంతః పురమునకే ఒక అలంకారముకాగలదు. (15-16)

భరత స్యార్యపుత్త్రస్య శ్వశ్రూణాం మమ చ ప్రభో!।
మృగరూప మిదం వ్యక్తం విస్మయం జనయిష్యతి। 17

జీవన్ న యది తేఽభ్యేతి గ్రహణం మృగసత్తమః।
అజినం నరశార్దూల! రుచిరం మే భవిష్యతి। 18

నిహతస్యాస్య సత్త్వస్య జాంబూనదమయత్వచి।
శష్పబృస్యాం వినీతాయామ్ ఇచ్ఛామ్యహముపాసితుమ్। 19

కామవృత్త మిదం రౌద్రం స్త్రీణామ్ అసదృశం మతమ్।
వపుషా త్వస్య సత్త్వస్య విస్మయో జనితో మమ। 20

తేన కాంచనరోమ్ణాతు మణిప్రవరశృంగిణా।
తరుణాదిత్యవర్ణేన నక్షత్రపథవర్చసా।
బభూవ రాఘవస్యాపి మనో విస్మయమాగతమ్। 21

ఏవం సీతావచః శ్రుత్వా తం దృష్ట్వా మృగమద్భుతమ్।
లోభితస్తేన రూపేణ సీతయా చ ప్రచోదితః। 22

ఉవాచ రాఘవో హృష్టో భ్రాతరం లక్ష్మణం వచః। 23

పశ్య లక్ష్మణ! వైదేహ్యాః స్పృహాం మృగగతామిమామ్।
రూపశ్రేష్ఠతయాహ్యేష మృగోఽద్య న భవిష్యతి। 24

న వనే నందనోద్దేశే న చైత్రరథసంశ్రయే।
కుతః పృథివ్యాం సౌమిత్రే! యోఽస్య కశ్చిత్ సమో మృగః। 25

ప్రతిలోమానులోమాశ్చ రుచిరా రోమరాజయః।
శోభంతే మృగమాశ్రిత్య చిత్రాః కనకబిందవః। 26

పశ్యాస్య జృంభమాణస్య దీప్తామగ్నిశిఖోపమామ్।
జిహ్వాం ముఖాన్నిస్సరంతీం మేఘాదివ శతహ్రదామ్। 27

మసారగల్లర్కముఖః శంఖముక్తానిభోదరః।
కస్య నామాభిరూపోఽసౌ న మనో లోభయేన్మృగః। 28

మీకును, భరతునకును, నాకును, నా అత్తగార్లకును అద్భుతమైన ఈ మృగసౌందర్యము ఆశ్చర్యమును గలిగించును. (17)

ఓ నరశ్రేష్ఠా! ఒకవేళ ఈ పసిడిలేడి ప్రాణములతో దొరకనిచో దీని చర్మమైనను నాకు సంతోషమునే గూర్చును. మరణించిన ఈ జింకయొక్క బంగారు చర్మమును లేత దర్భికలతో సిద్ధముచేయబడిన దర్భాసనముపై పఱచుకొని, నీతోగూడ కూర్చొన గోరుచున్నాను. (18-19)

నాథా! "ఈ ఘోరమైన కార్యమునకు పతులను పురికొల్పుట ఉత్తమస్త్రీలకు ఉచితముగాదు. కాని ఈ బంగారులేడియొక్క శరీరసౌందర్యము చూచుటతో నాలో అట్టి కుతూహలము ఏర్పడినది." (20)

ఆ మృగముయొక్క రోమములబంగారుకాంతులను, మేలైన దానికొమ్ములయొక్క మణిశోభలను, దాని శరీరముపై తళుకులీనుచున్న బాలసూర్యునికాంతులను, నక్షత్రములవలె మిలమిలలాడుచున్న చుక్కల వైభవములను చూచిన పిమ్మట ఆ రఘువరుడును ఆ లేడిపై వేడుకపడెను. సీతాదేవి పలికిన వచనములను వినిన పిమ్మట, అద్భుతమైన దానిరూపమును జూచి శ్రీరాముడు ముగ్ధుడాయెను. సీతాదేవి ప్రేరణతోడుకాగా తమ్ముడైన లక్ష్మణునితో శ్రీరాముడు ఇట్లు పలికెను. (21-23)

"ఓలక్ష్మణా! ఈ బంగారులేడికై విదేహరాజకుమారి (వైదేహి) పడుచున్న తపనను చూడుము. ఓ సౌమిత్రీ! అపూర్వమైన రూపవైభవముగల ఇట్టి మృగము లభించుట దుర్లభము. ఇంద్రుని నందనవనమునగాని, కుబేరుని ఉద్యానవనమైన చైత్రరథమునగాని, ఈభూమండలమున మఱియెక్కడనైనను దీనికి సాటికాగల మృగము ఉండుట అసంభవము. (24-25)

వివిధరీతులలోఉన్న రోమరాజియు (రోమములును) తళతళ మెఱయుచున్న బంగారు చుక్కలును ఈ మృగమును ఆశ్రయించి శోభిల్లుచున్నవి. ఇది ఆవులించునప్పుడు దీనిముఖమునుండి బయటికి వచ్చుచున్న నాలుక అగ్నిజ్వాలవలె భాసిల్లుచు, మేఘమునుండి వెలువడిన మెఱుపువలె విరాజిల్లుచున్నది. దీనిని పరికింపుము. (26-27)

దీనిముఖము ఇంద్రనీలమణులతో నిర్మితమైన పాత్రవలె విలసిల్లుచున్నది. దీనిఉదరము శంఖముత్యముల కాంతులతో విరాజిల్లుచున్నది. ఇట్టి అపురూపమైన మృగమునకై ఎవరిమనస్సు ప్రలోభపడదు? - బంగారు

కస్య రూపమిదం దృష్ట్వా జాంబూనదమయం ప్రభో।
నానారత్నమయం దివ్యం న మనో విస్మయం వ్రజేత్।
(కింపునర్మైథిలీ సీతా బాలా నారీ న విస్మయేత్)। 29

మాంసహేతోరపి మృగాన్ విహారార్థం చ ధన్వినః।
ఘ్నంతి లక్ష్మణ! రాజానో మృగయాయాం మహావనే। 30

ధనాని వ్యవసాయేన విచీయంతే మహావనే।
ధాతవో వివిధాశ్చాపి మణిరత్నసువర్ణినః। 31

తత్సారమఖిలం నౄణాం ధనం నిచయవర్ధనమ్।
మనసా చింతితం సర్వం యథా శుక్రస్య లక్ష్మణ!। 32

అర్థీ యేనార్థకృత్యేన సంవ్రజత్యవిచారయన్।
తమర్థమర్థశాస్త్రజ్ఞాః ప్రాహురర్థ్యాశ్చ లక్ష్మణ!। 33

ఏతస్య మృగరత్నస్య పరార్ధ్యే కాంచనత్వచి।
ఉపవేక్ష్యతి వైదేహీ మయా సహ సుమధ్యమా। 34

న కాదళీ న ప్రియకీ న ప్రవేణీ న చావికీ।
భవేదేతస్య సదృశీ స్పర్శనేనేతి మే మతిః। 35

ఏషచైవ మృగః శ్రీమాన్ యశ్చ దివ్యో నభశ్చరః।
ఉభావేతౌ మృగౌ దివ్యౌ తారామృగమహీమృగౌ। 36

యది వాఽయం తథా యన్మాం భవేద్వదసి లక్ష్మణ!।
మాయైషా రాక్షసస్యేతి కర్తవ్యోఽస్య వధో మయా। 37

ఏతేన హి నృశంసేన మారీచేనాఽకృతాత్మనా।
వనే విచరతా పూర్వం హింసితా మునిపుంగవాః। 38

వన్నెలతో, వివిధములగు రత్నకాంతులతో తేజరిల్లుచున్న దీని దివ్యరూపమును గాంచి ఎవరి మనస్సు కుతూహలపడదు? అమాయికురాలైన మిథిలానగర రాజకుమారి దీనికై ఆశపడుటలో ఆశ్చర్యమేమున్నది? (28-29)

ధనుర్ధారులైన రాజకుమారులు వినోదముగా వేటాడుటకై మహావనములయందు విహరించుచు మాంసముకొఱకును మృగములను చంపుచుందురు. ఇట్టి అద్భుతమృగవిషయమున ఆసగొనుటలో ఆశ్చర్య పడవలసినది యేముండును? (30)

వేటప్రయత్నముతో వచ్చినవారు మహావనములలో ధనములను, (ఏనుగులను వేటాడుటవలన లభించు ముత్యములు మొదలగువాటిని) మణులు రత్నములు, బంగారము మొదలగు వివిధములగు ధాతువులను సేకరించుచుందురు. (31)

ఓ లక్ష్మణా! బ్రహ్మభావమును పొందిన తపస్వి సంకల్పమాత్రముచేత పొందిన సంపదయంతయును ఉత్తమమైనదిగా భావింపబడును. ఏలనన అది లోకహితకారియగును- అట్లే రాజులకు వనములలో లభించిన ఇట్టి అమూల్యమైన ధనము ప్రజలయొక్క అభివృద్ధికి తోడ్పడును. లోకకల్యాణార్థమై ముందు వెనుకలాలోచింపక అర్థసంపాదనకు పూనుకొనువాడే 'అర్థి'- అని అర్థశాస్త్రప్రవీణులు పేర్కొందురు. కనుక అమూల్యమగు ఈ మృగచర్మమును సంపాదింపవలెను. శ్రేష్ఠమైన ఈ మృగముయొక్క ప్రశస్తమైన బంగారుచర్మముపై నేనును, సీతాదేవియు ఆసీనులము కాగలము. (32-34)

నల్లచారల ఇఱ్ఱి (ఒకజాతిలేడి) చర్మము, బొట్ల ఇఱ్ఱి (ఒక జాతిలేడి) చర్మము, ప్రవేణి (ఒకజాతి మృగము) చర్మము (ఏనుగుమీదపఱచెడి ఎఱ్ఱకంబళి), ఉన్నితో సిద్ధపఱచబడిన ఆస్తరణము దీనిస్పర్శసుఖమును ఇయ్యజాలవు. (35)

లోకములో ఈ రెండే దివ్యములైన మృగములు (1) ఆకాశమునచరించు తారామృగము (మృగశీర్ష నక్షత్రము) (2) భూమిపై సంచరించెడి ఈకాంచనమృగము. (మహీమృగము) నీవు నాతో చెప్పినట్లుగా ఇది రాక్షసమాయయే (మాయామృగమే) ఐనచో దీనిని నేను అవశ్యముగా చంపవలసినదే. (36-37)

క్రూరుడు, దుష్టస్వభావముగలవాడు ఐన ఈ మారీచుడు ఇదివఱలో వనములలో సంచరించుచు పెక్కుమంది మహర్షులను హింసించియుండెను. ధనుర్ధారులైన పెక్కుమంది రాజులు వేటకై ఈ

ఉత్థాయ బహవో యేన మృగయాయాం జనాధిపాః।
నిహతాః పరమేష్వాసాః తస్మాద్వధ్యస్త్వయం మృగః। 39

పురస్తాదిహ వాతాపిః పరిభూయ తపస్వినః।
ఉదరస్థో ద్విజాన్ హంతి స్వగర్భోఽశ్వతరీమివ। 40

స కదాచిచ్చిరాల్లోభాత్ ఆససాద మహామునిమ్।
అగస్త్యం తేజసా యుక్తం భక్షస్తస్య బభూవ హ। 41

సముత్థానే చ తద్రూపం కర్తుకామం సమీక్ష్య తమ్।
ఉత్స్మయిత్వా తు భగవాన్ వాతాపిమిదమబ్రవీత్। 42

త్వయాఽవిగణ్య వాతాపే! పరిభూతాః స్వతేజసా।
జీవలోకే ద్విజశ్రేష్ఠాః తస్మాదసి జరాం గతః। 43

తదేతన్నభవేద్రక్షో వాతాపిరివ లక్ష్మణ!।
మద్విధం యోఽతిమన్యేత ధర్మనిత్యం జితేంద్రియమ్।
భవేద్ధతోఽయం వాతాపిః అగస్త్యేనేవ మాం గతః। 44

ఇహ త్వం భవ సన్నద్ధో యంత్రితో రక్ష మైథిలీమ్।
అస్యామాయత్తమస్మాకం యత్కృత్యం రఘునందన!। 45

అహమేనం వధిష్యామి గ్రహీష్యామ్యపి వా మృగమ్।
యావద్గచ్ఛామి సౌమిత్రే! మృగమానయితుం ద్రుతమ్। 46

పశ్య లక్ష్మణ! వైదేహిం మృగత్వచి గతస్పృహామ్।
త్వచా ప్రధానయా హ్యేష మృగోఽద్య న భవిష్యతి। 47

అప్రమత్తేన తే భావ్యమ్ ఆశ్రమస్థేన సీతయా। 48

యావత్ పృషతమేకేన సాయకేన నిహన్మ్యహమ్।
హత్వైతచ్చర్మ చాదాయ శీఘ్రమేష్యామి లక్ష్మణ!। 49

దండకారణ్యమునకు వచ్చినప్పుడు వారిని ఈ రాక్షసుడు (మారీచుడు) హతమార్చియుండెను. కనుక ఇతడు చంపదగినవాడే. (38-39)

పూర్వకాలమున ఈ దండకారణ్యమునందే 'వాతాపి'యను రాక్షసుడు ఉండెడివాడు, వాడు తాపసులను పరాభవించి, కపటోపాయముచే వారికడుపులలో చేరుచుండెడివాడు. కంచరగాడిదనుగాని, తేలునుగాని వాటిసంతానమే గర్భమును చీల్చుకొని వచ్చి చంపినట్లు ఆ రాక్షసుడు మునీశ్వరులను హతమార్చు చుండెడివాడు. (40)

ఒకానొకప్పుడు ఆ వాతాపి లోభత్వమున మిగుల తేజస్వియైన అగస్త్యమహాముని కడకు వెళ్లి, (శ్రాద్ధ కాలమున) అతనికి ఆహారమయ్యెను - ఆ విధముగా అతడు ఆ మహర్షికడుపులో చేరెను. శ్రాద్ధము ముగిసిన పిమ్మట ఆ రాక్షసుడు నిజరూపముతో ఆ మునికడుపును చీల్చుకొని బయటివచ్చుటకు సిద్ధపడుచుండెను - అప్పుడు అగస్త్య మహర్షి చిఱునవ్వుతో వానికిట్లనియెను. (41-42)

'ఓవాతాపీ! నీవు యుక్తాయుక్తవిచక్షణలేక నీమాయాశక్తితో ఈ భూలోకమున పెక్కుమంది బ్రాహ్మణోత్తములను పరాభవించితివి. ఆ పాపములు చుట్టుకొని నీవు జీర్ణమై పోయితివి.' (43)

ఓ లక్ష్మణా! ధర్మనిరతుడను, జితేంద్రియుడను ఐన నావంటి వానిని మోసగించినచో ఈ మారీచ రాక్షసుడుగూడ ఆవాతాపివలెనే నశించును. అగస్త్యునిచేత వాతాపివలె నన్ను జేరిన ఇతడును మడియక తప్పదు. (44)

ఓ సౌమిత్రీ! నీవు ధనుర్బాణములతో సర్వసన్నద్ధుడవై, ఇచటనే యుండి మైథిలిని రక్షించుచుండుము. ఈమెను రక్షించుచుండుటయే మనముఖ్యకర్తవ్యము. ఏ విధముగనైనను దీనిని తీసికొని వచ్చుటకై వెంటనే బయలు దేఱెదను. దీనిని సజీవముగానైనను, చంపియైనను తీసికొని వచ్చెదను. (45-46)

ఓ లక్ష్మణా! ఈ మృగము (లేడి) యొక్క చర్మముపై మనసుపడిన సీతను రక్షించుచుండుము. ఈమెకు మృగచర్మమే ముఖ్యముగావున మృగమును చంపియైనను దానిచర్మమును తీసికొని వచ్చెదను. నీవు ఇచటనేయుండి యేమఱుపాటులేక సీతను రక్షించుచుండుము. (47-48)

ఓ లక్ష్మణా! ఒకే ఒక్క బాణముతో ఈ చుక్కలలేడిని వధించి, దీనిచర్మమును దీసికొని శీఘ్రముగా వచ్చెదను. (49)

ప్రదక్షిణేనాతిబలేన పక్షిణా
జటాయుషా బుద్ధిమతా చ లక్ష్మణ। ।
భవాఽప్రమత్తః పరిగృహ్య మైథిలీం
ప్రతిక్షణం సర్వత ఏవ శంకితః ।50

పక్షిరాజైన జటాయువు మిగుల బలశాలి, ప్రజ్ఞావంతుడు, సమర్థుడు. సీతాసంరక్షణ విషయమున అతని సహాయమున నీవు అప్రమత్తుడవై యుండుము. అనుక్షణము ఈ పరిసరములలో రాక్షసులవలన ప్రమాదము పొంచియుండును సుమా!" (50)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే త్రిచత్వారింశస్సర్గః (43)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదిమూడవసర్గము.

— ❋ ❋ ❋ —

44. నలుబదినాల్గవసర్గము

మాయలేడిరూపముననున్న మారీచుడు శ్రీరాముని బాణపుదెబ్బకు హతుడై, రాక్షసరూపమును పొందుట - 'హా సీతా! హా లక్ష్మణా!' అను అతని ఆక్రందనవచనములను విని రాముడు కలవరపడుచు పంచవటికి బయలుదేఱుట -

తథా తు తం సమాదిశ్య భ్రాతరం రఘునందనః।
బబంధాసిం మహాతేజా జాంబూనదమయత్సరుమ్। 1

మహాతేజస్వియైన శ్రీరాముడు ఆవిధముగా లక్ష్మణుని ఆదేశించి, బంగారుపిడిగల ఖడ్గమును నడుమునకు కట్టుకొనెను- (1)

తతస్త్ర్యవనతం చాపమ్ ఆదాయాఽఽత్మవిభూషణమ్।
ఆబధ్య చ కలాపౌ ద్వౌ జగామోదగ్రవిక్రమః। 2

పిమ్మట అతడు మూడు స్థలములయందు వంగియున్న శార్ఙ్గధనువును అలంకారముగా జేసికొని, రెండు తూణీరములను ధరించి, పరాక్రమస్ఫూర్తితో బయలు దేఱెను. (2)

తం వంచయానో రాజేంద్రమ్ ఆపతంతం నిరీక్ష్య వై।
బభూవాంతర్హితస్త్రాసాత్ పునః సందర్శనేఽభవత్।
బద్ధాసిర్ధనురాదాయ ప్రదుద్రావ యతో మృగః। 3

రాజకుమారుడైన శ్రీరాముడు తనను వెంటాడుచున్నట్లు మారీచుడు గమనించి, ఆయనను మోసగించుటకై భయముతో అంతర్హితుడాయెను. మఱల కొంతతడవునకు ఆయనకు కనబడుచు వేగముగా పోసాగెను. శ్రీరాముడు ఖడ్గముతో, ధనుర్బాణములతో సన్నద్ధుడై ఆ మృగమువెంట పరుగిడసాగెను. (3)

తం స్మ పశ్యతి రూపేణ ద్యోతమానమివాగ్రతః।
అవేక్ష్యాఽవేక్ష్య ధావంతం ధనుష్పాణిం మహావనే। 4

అతివృత్తమిషోః పాతాత్ లోభయానం కదాచన।
శంకితం తు సముద్భ్రాంతమ్ ఉత్పతంతమివాంబరే। 5

దృశ్యమానమ్ అదృశ్యం చ వనోద్దేశేషు కేషుచిత్।
ఛిన్నాభ్రైరివ సంవీతం శారదం చంద్రమండలమ్। 6

బంగారుకాంతులీనుచున్న ఆ మృగము తనను పదేపదే చూచుచు ముందుభాగమున భయముతో మహావనమున పరుగెత్తుచుండుటను ధనుర్ధారియైన శ్రీరాముడు చూచెను - ఒక్కొక్కప్పుడు అది శ్రీరామునిబాణమునకు దొరకినట్లే కనబడుచు చిక్కకుండ తప్పించుకొనుచు తనపై ఆయనకు ఆశలను రేకెత్తించుచుండెను. అది మఱియొకప్పుడు శ్రీరామునకు భయపడి, కలవరపాటుతో ఆకాశమున ఎగిరిపోవుచున్నట్లు ఒప్పెను. వేఱొకసమయమున శరత్కాలమునందు మేఘశకలములమధ్యగల చంద్రమండలమువలె అది ఆయావనములయందు కనబడియు కనబడకుండ సాగిపోవుచుండెను. (4-6)

ముహూర్తాదేవ దదృశే ముహుర్దూరాత్ ప్రకాశతే।
దర్శనాదర్శనాదేవం సోఽపాకర్షత రాఘవమ్। 7

సుదూరమాశ్రమస్యాస్య మారీచో మృగతాం గతః। 8

ఆసీత్ క్రుద్ధస్తు కాకుత్స్థో వివశస్తేన మోహితః।
అథావతస్థే సంభ్రాంతః ఛాయామాశ్రిత్య శాద్వలే। 9

స తమున్మాదయామాస మృగరూపో నిశాచరః।
మృగైః పరివృతో వన్యైః అదూరాత్ ప్రత్యదృశ్యత। 10

గృహీతుకామం దృష్ట్వైనం పునరేవాభ్యధావత।
తత్క్షణాదేవ సంత్రాసాత్ పునరంతర్హితోఽభవత్। 11

పునరేవ తతో దూరాత్ వృక్షషండాద్వినిస్సృతమ్।
దృష్ట్వా రామో మహాతేజాః తం హంతుం కృతనిశ్చయః।
భూయస్తు శరముద్ధృత్య కుపితస్తత్ర రాఘవః। 12

సూర్యరశ్మిప్రతీకాశం జ్వలంతమ్ అరిమర్దనః।
సంధాయ సుదృఢే చాపే వికృష్య బలవద్బలీ। 13

తమేవ మృగముద్దిశ్య శ్వసంతమివ పన్నగమ్।
ముమోచ జ్వలితం దీప్తమ్ అస్త్రం బ్రహ్మవినిర్మితమ్। 14

శరీరం మృగరూపస్య వినిర్భిద్య శరోత్తమః।
మారీచస్యైవ హృదయం బిభేదాఽశనిసన్నిభః। 15

తాలమాత్రమ్ అథోత్పత్య న్యపతత్ స శరాతురః।
వినదన్ భైరవం నాదం ధరణ్యామ్ అల్పజీవితః। 16

మృగరూపమునందున్న మారీచుడు ఒక క్షణకాలముపాటు సమీపముననే కనబడును. మఱుక్షణముననే దూరమున తళుక్కుమనును. ఈ విధముగా కనబడియు కనబడకుండ (చిక్కుచున్నట్లే కనబడుచు చిక్కకుండ) శ్రీరాముని ఆకర్షించుచు ఆయనను ఆశ్రమమునకు చాలదూరము తీసికొనిపోయెను. (7-8)

మృగమును సజీవముగా పట్టుకొనవలెననెడి మిక్కిలి కుతూహలముతోనున్న శ్రీరాముడు, అది ఇట్లు తనను వంచించుచున్నందులకు ఎంతయు క్రుద్ధుడాయెను. పిమ్మట అతడు అలసిపోయి, ఒకచెట్టునీడనగల పచ్చికపై కూర్చొనెను. (9)

అంతట మృగరూపమునందున్న ఆమారీచుడు ఇతర వన్యమృగములతోగూడి ఆసమీపముననే శ్రీరామునకు కనబడెను. అతడు ఆవిధముగా రఘువరునకు తికమక కలిగించుచుండెను. తనను పట్టుకొనుటకై వచ్చుచున్న రాముని జూచి ఆమృగము మరల పరుగిడసాగెను. వెంటనే అది అంతులేని భయముతో అదృశ్యమాయెను- (10-11)

పిమ్మట ఆమృగము కొంతదూరప్రదేశమున చెట్లమధ్యనుండి బయటికి వచ్చెను. మహాతేజస్వియైన రాముడు ఆ మృగమును జూచి, దానిని చంపుటకు నిశ్చయించుకొనెను. (12)

మృగమువలన ఎదురైన చిక్కులకు రఘువరుడు కుపితుడై శరమును చేతబట్టెను. మిగుల బలశాలియు, శత్రుసంహారసమర్థుడును ఐన శ్రీరాముడు సూర్యకిరణ కాంతులను విరజిమ్ముచున్న ఆ బాణమును మిక్కిలి దృఢమైన తనధనుస్సునందు సంధించి, అల్లెత్రాడును బలముగా లాగెను. పిదప అతడు బ్రహ్మనిర్మితమైన ఆ అస్త్రమును మృగముపై ప్రయోగించెను. వజ్రాయుధ తుల్యమైన శ్రేష్ఠమైన ఆ బాణము మిఱుమిట్లు గొలుపుచు, బుసలుకొట్టు సర్పమువలె భయంకరముగా ధ్వనియొనర్చుచు ఆ మృగముయొక్క శరీరమును చీల్చివేసెను. అంతట మారీచుని హృదయము బ్రద్దలాయెను. (13-15)

ఆ బాణపుదెబ్బతో ఆ రాక్షసుడు విలవిలలాడుచు, త్రాటిచెట్టుప్రమాణములో పైకెగిరి, భయంకర శబ్దమొనర్చుచు అయువుదీఱినవాడై భూమిపై పడిపోయెను - పిమ్మట ఆ మారీచుడు ప్రాణములు పోవుచున్న ఆదశలో మృగరూపమును విడిచిపెట్టెను. అప్పుడతనికి రావణునివచనములు జ్ఞప్తికి వచ్చెను. అంతట అతడు 'లక్ష్మణుడు ఆ ఆశ్రమమును వదలి ఇటు

మ్రియమాణస్తు మారీచో జహౌ తాం కృత్రిమాం తనుమ్।
స్మృత్వా తద్వచనం రక్షో దధ్యౌ కేన తు లక్ష్మణమ్।
ఇహ ప్రస్థాపయేత్ సీతా శూన్యే తాం రావణో హరేత్। 17

స ప్రాప్తకాలమ్ ఆజ్ఞాయ చకార చ తతః స్వరమ్।
సదృశం రాఘవస్యైవ హా సీతే! లక్ష్మణేతి చ। 18

తేన మర్మణి నిర్విద్ధః శరేణానుపమేన చ।
మృగరూపం తు తత్ త్యక్త్వా రాక్షసం రూపమాత్మనః। 19

చక్రే స సుమహాకాయో మారీచో జీవితం త్యజన్। 20

తతో విచిత్రకేయూరః సర్వాభరణభూషితః।
హేమమాలీ మహాదంష్ట్రో రాక్షసోఽభూచ్ఛరాహతః। 21

తం దృష్ట్వా పతితం భూమౌ రాక్షసం ఘోరదర్శనమ్।
రామో రుధిరసిక్తాంగం వేష్టమానం మహీతలే।
జగామ మనసా సీతాం లక్ష్మణస్య వచః స్మరన్। 22

మారీచస్యైవ మాయైషా పూర్వోక్తం లక్ష్మణేన తు।
తత్ తథాహ్యభవచ్చాద్య మారీచోఽయం మయా హతః। 23

హా సీతే! లక్ష్మణేత్యేవమ్ ఆక్రుశ్య చ మహాస్వనమ్।
మమార రాక్షసః సోఽయం శ్రుత్వా సీతా కథం భవేత్। 24

లక్ష్మణశ్చ మహాబాహుః కామ్ అవస్థాం గమిష్యతి।
ఇతి సంచింత్య ధర్మాత్మా రామో హృష్టతనూరుహః। 25

తత్ర రామం భయం తీవ్రమ్ ఆవివేశ విషాదజమ్।
రాక్షసం మృగరూపం తం హత్వా శ్రుత్వా చ తత్ స్వరమ్। 26

త్వరమాణో జనస్థానం ససారాఽభిముఖస్తదా। 27

వచ్చుటకును, అచట ఒంటరిగా ఉన్న సీతను రావణుడు అపహరించుటకును ఉపాయమేమి?' అని ఆలోచించెను. రావణుని ఆదేశానుసారము ఆసమయమున తాను చేయవలసినపనిని నిశ్చయించుకొని, అతడు శ్రీరాముని కంఠస్వరమును అనుకరించుచు 'హా సీతా! హా లక్ష్మణా! అని ఆర్తనాదమొనర్చెను. (16-18)

నిరుపమానమైన ఆరామబాణము వానిఆయువుపట్టుపై దెబ్బతీయగా మహాకాయుడైన ఆమారీచుడు ప్రాణములను విడుచుచు తనరాక్షసరూపమును పొందెను. (19-20)

శరాఘాతమునకు నేలకొరిగి, రాక్షసుని ఆకారముతో పడియున్నఅతడు విచిత్రములైన భుజకీర్తులు, వివిధములగు ఆభరణములు, బంగారుహారములు, పెద్ద పెద్ద కోఱలు కలిగియుండెను. (21)

భయంకరరూపముతో భూమిపై పడియున్న ఆ రాక్షసుని శ్రీరాముడు చూచెను. నెత్తురోడుచున్న అతని శరీరము నేలపై అటునిటు దొర్లుచుండెను. అప్పుడు శ్రీరాముడు లక్ష్మణునిమాటలను జ్ఞప్తికి దెచ్చుకొని, సీతను గూర్చి ఆలోచించెను. 'ఇదియంతయును మారీచుని మాయయే' అని లక్ష్మణుడు ఇంతకుముందే చెప్పియుండెను - అది ఇప్పుడు అక్షరాలా నిజమైనది. ఇట్లు నాచేతిలో హతుడైనవాడు ఆమారీచుడే. "ఈ రాక్షసుడు 'అయ్యో! సీతా! అయ్యో! లక్ష్మణా!' అని బిగ్గఱగా ఆక్రోశించుచు మరణించెను. ఈ మాటలను విని సీతాదేవి ఏమగునోగదా! మహాబాహువైన నా తమ్ముడు లక్ష్మణుడు ఎట్టి అవస్థకులోనగునోగదా!" అని ధర్మాత్ముడైన శ్రీరాముడు గగుర్పాటును పొందెను. (22-25)

మృగరూపమునసున్న రాక్షసుని సంహరించి, వానిభయంకరస్వరమును విని, శ్రీరాముడు దిగులుచెంది, తీవ్రమైన భయమునకులోనయ్యెను. వెంటనే ఆ రఘువరుడు జనస్థానమునకు (దండకారణ్యమునగల తన ఆశ్రమమునకు) సంభ్రమముతో బయలుదేఱెను - (26-27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే చతుశ్చత్వారింశస్సర్గః (44)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదినాల్గవసర్గము.

-- * * * --

45. నలుబదియైదవసర్గము

'హా సీతా! హా లక్ష్మణా!' అను ఆక్రందనవచనములను విని, శ్రీరాముడు ఆపదలోచిక్కుపడినట్లు భావించి, సీతాదేవి కలత చెందుట - శ్రీరామునకు సహాయపడుటకై వెళ్లుము'ని ఆమె లక్ష్మణుని కోరుట - అందులకతడు సిద్ధపడకుండుటచే ఆమె పరుషోక్తులాడుట - విధిలేక లక్ష్మణుడు రాముని కడకు బయలుదేఱుట -

ఆర్తస్వరం తు తం భర్తుః విజ్ఞాయ సదృశం వనే।
ఉవాచ లక్ష్మణం సీతా గచ్ఛ జానీహి రాఘవమ్॥ 1

సీతాదేవి వనమునుండి వినబడిన ఆర్తస్వరము తనభర్తదేయని తలంచి, 'రఘువరుని ఆదుకొనుటకై వెంటనే వెళ్లుము' అని లక్ష్మణునితో పలికెను. (1)

నహి మే హృదయం స్థానే జీవితం వాఽవతిష్ఠతి।
క్రోశతః పరమార్తస్య శ్రుతః శబ్దో మయా భృశమ్॥ 2

ఆక్రందమానం తు వనే భ్రాతరం త్రాతుమర్హసి।
తం క్షిప్రమ్ అభిధావ త్వం భ్రాతరం శరణైషిణమ్।
రక్షసాం వశమాపన్నం సింహానామివ గోవృషమ్॥ 3

"ఓ లక్ష్మణా! బిగ్గఱగా ఆర్తితో పలుకుచున్న ఆ మాటలను వినినప్పటినుండియు నామనసు మనసులోలేదు. నాప్రాణములు నిలుచుటలేదు - వనములో ఆక్రందించుచున్న నీసోదరుని కాపాడుము. సింహములమధ్య చిక్కుపడిన వృషభమువలె నీఅన్న రాక్షసులవశమై, ఆపదలపాలై రక్షణను కోరుచున్నాడు. వెంటనే ఆయనను రక్షించుటకై పరుగెత్తుము." (2-3)

న జగామ తథోక్తస్తు భ్రాతురాజ్ఞాయ శాసనమ్।
తమువాచ తతస్తత్ర కుపితా జనకాత్మజా॥ 4

సీతాదేవి అట్లు పలికినను లక్ష్మణుడుమాత్రము (సీతను రక్షించుచు నీవు ఇచటనే యుండుము. అను) అన్నఆజ్ఞను పాటించుచు, కదలక అచటనే యుండెను - అంతట జానకీదేవి మిగుల క్రుద్ధురాలై అతనితో ఇట్లనెను. (4)

సౌమిత్రే! మిత్రరూపేణ భ్రాతుస్త్వమసి శత్రువత్।
యస్త్వమస్యామవస్థాయాం భ్రాతరం నాభిపత్స్యసే॥ 5

ఇచ్ఛసి త్వం వినశ్యంతం రామం లక్ష్మణ! మత్కృతే।
లోభాన్మమ కృతే నూనం నానుగచ్ఛసి రాఘవమ్॥ 6

వ్యసనం తే ప్రియం మన్యే స్నేహో భ్రాతరి నాస్తి తే।
తేన తిష్ఠసి విస్రబ్ధః తమపశ్యన్మహాద్యుతిమ్॥ 7

కిం హి సంశయమాపన్నే తస్మిన్నిహ మయా భవేత్।
కర్తవ్యమిహ తిష్ఠంత్యా యత్ప్రధానస్త్వమాగతః॥ 8

"ఓ సౌమిత్రీ! నీ సోదరునియెడ పైకి ప్రేమను నటించుచుంటివేగాని నిజముగా నీవు ఆయనపాలిట శత్రువువే! ఏలనన ఇట్టి ఆపదసమయమునందును నీవు ఆయనకడకు చేరుటలేదు. నీవు నామీదికోరికతో రామునకు హానినే అభిలషించుచున్నావు. నిజముగా నీవు నామీద మనసుపెట్టుకొనియుండుటవలననే ఆయనను రక్షించుటకై వెళ్లుటలేదు. యథార్థముగా నీసోదరునిపై నీకు ఏమాత్రముప్రేమలేదు. ఆయన అవస్థలపాలగుటయే నీకు ఇష్టము. అందువలననే నీవు మహాతేజశ్శాలియైన శ్రీరామునివిషయమే పట్టక నిశ్చింతగానున్నావు. ముఖ్యముగా నీవు శ్రీరామునకు అండగానుండుటకై మాత్రమే మా వెంట అడవులకు వచ్చితివి. అట్టి శ్రీరాముడు సంకటపరిస్థితిలో చిక్కుకొనియున్నప్పుడు ఆ విషయమును ప్రక్కనబెట్టి నన్ను రక్షించుటకై ఇక్కడనుండుటలో అర్థమేమున్నది. ఈ ఆశ్రమమున నేను క్షేమముగనేయున్నాను గదా!" (5-8)

ఇతి బ్రువాణాం వైదేహీం బాష్పశోకపరిప్లుతామ్।
అబ్రవీల్లక్ష్మణస్త్రస్తాం సీతాం మృగవధూమివ॥ 9

భర్త ఆపదపాలైనట్లు భావించుచున్న సీతయొక్క మానసిక స్థితి భయకంపితమైన లేడిస్థితివలెనుండెను. ఆమె శోకమగ్నయై కన్నీరుమున్నీరుగా ఏడ్చుచు ఇట్లు పలుకుచుండగా లక్ష్మణుడు ఆమెతో ఈ విధముగా వచించెను. (9)

పన్నగాసురగంధర్వదేవమానుషరాక్షసైః ।
అశక్యస్తవ వైదేహి! భర్తా జేతుం న సంశయః ॥ 10

దేవి! దేవమనుష్యేషు గంధర్వేషు పతత్రిషు ।
రాక్షసేషు పిశాచేషు కిన్నరేషు మృగేషు చ ॥ 11

దానవేషు చ ఘోరేషు న స విద్యేత శోభనే! ।
యో రామం ప్రతియుధ్యేత సమరే వాసవోపమమ్ ॥ 12

అవధ్యః సమరే రామో నైవం త్వం వక్తుమర్హసి ।
న త్వామస్మిన్ వనే హాతుమ్ ఉత్సహే రాఘవం వినా ॥ 13

అనివార్యం బలం తస్య బలైర్బలవతామపి ।
త్రిభిర్లోకైః సముద్యుక్తైః సేశ్వరైరపి సామరైః ॥ 14

హృదయం నిర్వృతం తేఽస్తు సంతాపస్త్యజ్యతామయమ్ ।
ఆగమిష్యతి తే భర్తా శీఘ్రం హత్వా మృగోత్తమమ్ ॥ 15

న చ తస్య స్వరో వ్యక్తం మాయయా కేనచిత్ కృతః ।
గంధర్వనగరప్రఖ్యా మాయా సా తస్య రక్షసః ॥ 16

న్యాసభూతాఽసి వైదేహి! న్యస్తా మయి మహాత్మనా ।
రామేణ త్వం వరారోహే! న త్వాం త్యక్తుమిహోత్సహే ॥ 17

కృతవైరాశ్చ వైదేహి! వయమేతైర్నిశాచరైః ।
ఖరస్య నిధనాదేవ జనస్థానవధం ప్రతి ॥ 18

రాక్షసా వివిధా వాచో విసృజంతి మహావనే ।
హింసావిహారా వైదేహి! న చింతయితుమర్హసి ॥ 19

లక్ష్మణేనైవముక్తా సా క్రుద్ధా సంరక్తలోచనా ।
అబ్రవీత్ పరుషం వాక్యం లక్ష్మణం సత్యవాదినమ్ ॥ 20

అనార్యాకరుణారంభ! నృశంస! కులపాంసన! ।
అహం తవ ప్రియం మన్యే రామస్య వ్యసనం మహత్ ॥ 21

రామస్య వ్యసనం దృష్ట్వా తేనైతాని ప్రభాషసే ॥ 22

"ఓ వైదేహీ! నాగులు, అసురులు, గంధర్వులు, దేవతలు, మానవులు, రాక్షసులు మొదలగు వారెవ్వరును శ్రీరాముని జయింపజాలరు ఇందులకు సందేహములేదు. ఓ దేవీ! శుభప్రదురాలా! దేవతలలో మనుష్యులలో, గంధర్వులలో, పక్షులలో, రాక్షసులలో, పిశాచములలో, కిన్నరులలో, మృగములలో, భయంకరులైన దానవులలో ఎవ్వరును యుద్ధమున విష్ణుపరాక్రమశాలియైన శ్రీరాముని ఎదిరించి నిలువజాలరు. ఇది ముమ్మాటికిని వాస్తవము. (10-12)

సమరమున శ్రీరాముడు అవధ్యుడు. (అజేయుడు.) ఆయనకు ఆపదను శంకించుటగాని, నీవు ఇట్లు పరుషముగా మాట్లాడుటగాని తగదు. శ్రీరాముడులేని ఈ ఆశ్రమమున నిన్ను ఒంటరిగా వదలి వెళ్లజాలను. (13)

ముల్లోకములవారును తిరుగులేని బలములతో, ఇంద్రాదిదేవతలతో కూడివచ్చినను శ్రీరాముని బలమును నిలువరింపజాలరు. అమ్మా! నీ మనస్సును నిమ్మళముగా నుంచుకొనుము. ఈ శోకమును వీడుము. నీభర్త ఆమృగమును వధించి శీఘ్రముగా రాగలడు. (14-15)

మనకు వినబడినది యథార్థముగా శ్రీరాముని కంఠస్వరము కాదు. ఎవరో మాయా ప్రభావమున అట్లు పలికియుండిరి. అది ఆమారీచరాక్షసుడు చేసిన ఇంద్రజాలమై[1] యుండవచ్చును. (16)

ఓ వైదేహీ! మహాత్ముడైన శ్రీరాముడు నీరక్షణ భారమును నాపైనుంచి, నిన్ను నాకు న్యాసముగా అప్పగించెను. కనుక నిన్ను ఇచట ఒంటరిగా వదలిపెట్టి వెళ్లజాలను. ఈ జనస్థానమునందు మనము ఖరాది రాక్షసులనందఱిని వధించినప్పటినుండియు మనపై ఈ నిశాచరులు పగబూనియున్నారు. ఈ మహారణ్యమునందు సాధుపురుషులను హింసించుచు సంచరించెడి రాక్షసులు ఇతరులకంఠస్వరములను అనుకరించుచు పలువిధములుగా పలుకుచుందురు. కావున ఈ విషయమున 'నీవు చింతపడవలదు-" (17-19)

లక్ష్మణుడు ఈవిధముగా పలుకగా సీతాదేవి ఎంతయు క్రుద్ధురాలై, కన్నులెఱ్ఱజేసి, యథార్థవాదియైన అతనితో ఇట్లు పరుషముగా వచించెను. (20)

"ఓ దుశ్శీలుడా! కఠినాత్ముడా! క్రూరుడా! వంశమునకు చెడ్డపేరుదెచ్చువాడా! రాముడు కష్టాలపాలగుట నీకు ఇష్టమని నేను తలంచుచున్నాను. నాపతి ఇక్కట్లలో

1) 1) గంధర్వనగరం ప్రోక్తం ఇంద్రజాలం మనీషిభిః ॥ గోవిందరాజీయ వ్యాఖ్య

నైతచ్చిత్రం సపత్నేషు పాపం లక్ష్మణ! యద్భవేత్।
త్వద్విధేషు నృశంసేషు నిత్యం ప్రచ్ఛన్నచారిషు। 23

సుదుష్టస్త్వం వనే రామమ్ ఏకమ్ ఏకోఽనుగచ్ఛసి।
మమ హేతోః ప్రతిచ్ఛన్నః ప్రయుక్తో భరతేన వా। 24

తన్న సిధ్యతి సౌమిత్రే! తవ వా భరతస్య వా।
కథమిందీవరశ్యామం పద్మపత్రనిభేక్షణమ్।
ఉపసంశ్రిత్య భర్తారం కామయేయం పృథగ్జనమ్। 25

సమక్షం తవ సౌమిత్రే! ప్రాణాంస్త్యక్ష్యే న సంశయః।
రామం వినా క్షణమపి నహి జీవామి భూతలే। 26

ఇత్యుక్తః పరుషం వాక్యం సీతయా రోమహర్షణమ్।
అబ్రవీల్లక్ష్మణః సీతాం ప్రాంజలిర్విజితేంద్రియః। 27

ఉత్తరం నోత్సహే వక్తుం దైవతం భవతీ మమ।
వాక్యమ్ అప్రతిరూపం తు న చిత్రం స్త్రీషు మైథిలి!। 28

స్వభావస్త్వేష నారీణామ్ ఏవం లోకేషు దృశ్యతే।
విముక్తధర్మాశ్చపలాః తీక్ష్ణా భేదకరాః స్త్రియః। 29

న సహే హీదృశం వాక్యం వైదేహి! జనకాత్మజే!।
శ్రోత్రయోరుభయోర్మేఽద్య తప్తనారాచసన్నిభమ్। 30

చిక్కుపడుటచూచి. దుర్బుద్ధితో నీవు ఇట్లు మాట్లాడుచున్నావు. మేకవన్నెపులులవలె క్రూరులైన నీవంటి శత్రువులలో ఇట్టిపాపబుద్ధియుండుట ఆశ్చర్యకరముగాదు.[1] (21-23)

ఓలక్ష్మణా! నీవు పూర్తిగా దుష్టుడవు. శ్రీరాముడు ఒంటరిగా వనములకు వచ్చుట చూచి నన్ను పొందవలెనెడి కపటబుద్ధితో నీవు ఆయనవెంట వచ్చియుండవచ్చును. లేదా మాకు హానితలపెట్టుటకై భరతుడే నిన్ను ప్రేరేపించియుండవచ్చును. (24)

ఓ సౌమిత్రీ! ఎట్టి పరిస్థితులలోను నీ కోరికగాని, భరతునినన్నాగముగాని నెఱవేఱదుసుమా! నల్లగలువలవలె శ్యామవర్ణముగలవాడు, తామరరేకులవలె విశాలములైన నేత్రములుగలవాడు ఐన నా భర్తను ఆశ్రయించుకొని యున్న నేను ఒక క్షుద్రపురుషుని ఎట్లు కోరుకొందును? నాభర్త లేకుండా ఈ భూతలమున ఒక్క క్షణముగూడ బ్రతికియుండజాలను. ఇదిగో చూడుము. ఇప్పుడే నీ యెదుటనే నేను నా ప్రాణములను త్యజింతును. ఇందులకు సందేహములేదు-" (25-26)

సీతాదేవి దిగ్భ్రమగొల్పునట్టి పరుషవచనములను పలుకగా లక్ష్మణుడు ఏమాత్రము తొణకక శిరసువంచి నమస్కరించి, ఆమెతో ఇట్లనెను, (27)

"అమ్మా! సీతాదేవీ! నీవు నాకు పూజ్యురాలవైన దేవతవు. ఇకనీముందు మాట్లాడజాలను. స్త్రీలు ఇట్లు మిక్కిలి అనుచితముగా పలుకుట ఆశ్చర్యకరముగాదు. సాధారణముగా స్త్రీలు ఆయాసందర్భములలో ఇట్లు పరుషోక్తులాడుట లోకసహజము. కొన్ని పరిస్థితులలో వారు వినయాదిధర్మమార్గములను అనుసరింపరు, వారిమనస్సులు చాంచల్యమునకు లోనగుచుండును. వారు క్రూరముగా ప్రవర్తింతురు, ఆప్యాయతకును బంధుభావనకు విఘాతము కల్గింతురు. (28-29)

జనకమహారాజు కూతురువైన ఓ సీతాదేవీ! నీవు పల్కిన ఈ నిష్ఠురవచనములు నాచెవులకు కాచబడిన

1) లక్ష్మణస్వామి పరమభాగవతోత్తముడు. ఆయనకు సీతారాములయెడగల భక్తిశ్రద్ధలు సాటిలేనివి. సీతాదేవి లక్ష్మణుని ఇట్లు నిందించుట ఒక విధముగా భాగవతాపరాధమే. ఈ అపరాధకారణముగనే అవైదేహి పతియెడబాటునకు గురియై, కష్టములను అనుభవింపవలసి వచ్చెను. భగవద్భక్తులను నిందించినవారికి ఇడుముల తప్పవు. కనుక వారిని ఎట్టిపరిస్థితులలోను నిందింపరాదు. రామావతారలక్ష్యము ముఖ్యముగా రావణుని వధించుటయే. రావణాసురునిపాపముపండిననేగాని రాముడు అతనిని వధింపడు. అందులకు అతడు సీతను అపహరించుట ఆవశ్యకము- ఆ కారణముననే లక్ష్మణస్వామిని సీతాదేవి పరుషోక్తులు పలుకవలసి వచ్చినది. ఇదియంతయు భగవల్లీలలో ఒకభాగము.
సీతాదేవి శక్తిస్వరూపిణి. 'రామవత్యే భవేత్ సీతా' అనిగదా! ఆర్యోక్తి-
(1)ఒకవేళ తొందరపాటువలన అట్టి అపరాధము జరిగినచో క్షమాపణ వేడుకొనవలెను. అప్పుడు సరళస్వభావముగల భక్తులు వారిని క్షమించెదరు.

ఉపశృణ్వంతు మే సర్వే సాక్షిభూతా వనేచరాః।
న్యాయవాదీ యథాన్యాయమ్ ఉక్తోఽహం పరుషం త్వయా। 31

ధిక్ త్వామ్ అద్య ప్రణశ్య త్వం యన్మామ్ ఏవం విశంకసే।
స్త్రీత్వం దుష్టం స్వభావేన గురువాక్యే వ్యవస్థితమ్। 32

గమిష్యే యత్ర కాకుత్స్థః స్వస్తి తేఽస్తు వరాననే!।
రక్షంతు త్వాం విశాలాక్షి! సమగ్రా వనదేవతాః। 33

నిమిత్తాని హి ఘోరాణి యాని ప్రాదుర్భవంతి మే।
అపి త్వాం సహ రామేణ పశ్యేయం పునరాగతః।
న వేత్స్యేతన్న జానామి వైదేహి! జనకాత్మజే!। 34

లక్ష్మణేనైవముక్తా సా రుదంతీ జనకాత్మజా।
ప్రత్యువాచ తతో వాక్యం తీవ్రం బాష్పపరిప్లుతా। 35

గోదావరీం ప్రవేక్ష్యామి వినా రామేణ లక్ష్మణ!।
ఆబంధిష్యేఽథవా త్యక్ష్యే విషమే దేహమాత్మనః। 36

పిబామ్యహం విషం తీక్ష్ణం ప్రవేక్ష్యామి హుతాశనమ్।
న త్వహం రాఘవాదన్యం పదాఽపి పురుషం స్పృశే। 37

ఇతి లక్ష్మణమాక్రుశ్య సీతా దుఃఖసమన్వితా।
పాణిభ్యాం రుదతీ దుఃఖాత్ ఉదరం ప్రజఘాన చ। 38

తామార్తరూపాం విమనా రుదంతీం
సౌమిత్రిరాలోక్య విశాలనేత్రామ్ ।
ఆశ్వాసయామాస న చైవ భర్తుః
తం భ్రాతరం కించిదువాచ సీతా । 39

బాణవుములుకులవలె వేదన గలిగించుచున్నవి ఇట్టి మాటలకు నేను తట్టుకొనజాలను. లోకమర్యాదను పాటించుచు సముచితముగా మాట్లాడుచున్న నన్ను నీవు పరుషోక్తులాడుచుండుటను ఈ వనవాసులందఱును వినుచున్నారు. ఈ విషయమున నాకు వారెల్లరును సాక్షులు. (30-31)

నా సహజస్వభావమునుబట్టి నేను అన్నగారిఆజ్ఞను పాలించుటయందే నిరతుడనైయుంటిని. అట్టి నన్ను దుష్టస్వభావముగల సాధారణస్త్రీవలె నీవు ఇట్లు శంకించుచున్నావు. అమ్మా! నీవు పొరపడుచున్నావు. దీనివలన ఏకీడు రానున్నదోయేమో! (32)

అమ్మా! శ్రీరామునికడకు నేను బయలు దేఱుచున్నాను. నీకు భద్రమగుగాక. తల్లీ! వనదేవతలందఱును నిన్ను రక్షించుచుందురుగాక. అమ్మా! జానకీదేవీ! నాకు భయంకరములైన అపశకునములు కన్పట్టు (ఎదురగు) చున్నవి. వీటినిబట్టి చూడగా నేను మఱలివచ్చి, నీవు, మాఅన్నయగు శ్రీరాముడు కలిసియుండగా చూచెడి భాగ్యమునాకు కలుగునో? లేదో? నేను ఎఱుగను." (33-34)

లక్ష్మణుడు ఇట్లు పలికినపిమ్మట జానకీదేవి కన్నీరు మున్నీరుగా విలపించుచు తీవ్రముగా అతనితో ఈ విధముగా వచించెను. (35)

"ఓలక్ష్మణా! శ్రీరామునకు దూరమై నేను ఒక్క క్షణమైనను బ్రతుకజాలను. అందులకై గోదావరిలో దూకెదను. ఉరివేసికొందును, లేదా! పర్వత శిఖరము నుండి క్రిందపడెదను. తీవ్రమైన విషమును త్రాగెదను, అగ్నిలో ప్రవేశింతును. ఎట్టి పరిస్థితులలోను శ్రీరాముని తప్ప పరపురుషుని స్పృశింపను." (36-37)

సీతాదేవి దుఃఖమును భరింపలేక ఈ విధముగా లక్ష్మణునిపై విఱుచుకొనిపడెను. అనంతరము ఆమె గుండెలు బాదుకొనుచు ఏడువసాగెను. ఆ విధముగా సీతాదేవి ఏడ్చుచు ఆర్తితో అలమటించుట చూచి, లక్ష్మణుడు మిగుల కలతచెందినవాడై, ఆమెను ఓదార్చుటకు యత్నించెను. తనను ఓదార్చునెపముతో ఆలస్యము చేయుచున్నందులకు లక్ష్మణునిపై కినుక బూని, సీతాదేవి ఏమియు మాట్లాడక మౌనము వహించెను. (38-39)

తతస్తు సీతామ్ అభివాద్య లక్ష్మణః
కృతాంజలిః కించిదభిప్రణమ్య చ ।
అన్వీక్షమాణో బహుశశ్చ మైథిలీం
జగామ రామస్య సమీపమాత్మవాన్ ॥ 40

సీతాదేవియొండినైఖరికిని, ఆమె పలికిన తీవ్రవచనములకును నొచ్చుకొనిన లక్ష్మణుడు దోసిలియొగ్గినవాడై, ఒక ప్రక్కగా నిలబడి ఆమెకు నమస్కరించెను. పిమ్మట 'ఈమెను ఒంటరిగా ఇచట విడిచి పెట్టి వెళ్లుటయెట్లు?' అను తడబాటుతో పదేపదే ఆమెవైపు చూచుచు ఎట్టకేలకు మనస్సును దిటవు చేసికొని, శ్రీరాముని సమీపమునకు బయలుదేరెను. (40)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచచత్వారింశస్సర్గః (45)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదిఐదవసర్గము.

— ✻ ✻ ✻ —

46. నలుబదిఆఱవసర్గము

రామలక్ష్మణులు లేని సమయము చూచుకొని, రావణుడు యతివేషములో సీతాదేవి కడకు వచ్చుట - ఆమెరూప లావణ్యములను వర్ణించుచు, ఆ మహారణ్యమున నివసించుటకుగల కారణములను ఆమెనడుగుట. జానకి ఆ కపటయతికి అతిథి మర్యాదలనొనర్చుట -

తయా పరుషముక్తస్తు కుపితో రాఘవానుజః ।
స వికాంక్షన్ భృశం రామం ప్రతస్థే నచిరాదివ ॥ 1

సీతాదేవియొక్క పరుషవచనములకు లక్ష్మణుడు మిగుల కలతచెందెను. సీతను ఒంటరిగా విడిచిపెట్టి వెళ్లుటకు కొల్లాడకున్నను అన్నను త్వరగా చేరుటకై వెంటనే అతడు ఆశ్రమము విడిచి బయలు దేఱెను. (1)

తదాసాద్య దశగ్రీవః క్షిప్రమ్ అంతరమాస్థితః ।
అభిచక్రామ వైదేహీం పరివ్రాజకరూపధృత్ ॥ 2

తగిన అవకాశముకొఱకు ఎదురుచూచుచున్న దశగ్రీవుడు (రావణుడు) లక్ష్మణుడు అటువెళ్లుట గమనించి, వెంటనే సన్న్యాసివేషములో సీతాదేవిసమక్షమున నిలిచెను. (2)

శ్లక్ష్ణకాషాయసంవీతః శిఖీ ఛత్రీ ఉపానహీ ।
వామే చాంసేఽవసజ్యాఽథ శుభే యష్టికమండలూ ।
పరివ్రాజకరూపేణ వైదేహీం సముపాగమత్ ॥ 3

తామాససాదాతిబలో భ్రాతృభ్యాం రహితాం వనే ।
రహితాం చంద్రసూర్యాభ్యాం సంధ్యామివ మహత్తమః ॥ 4

తామపశ్యత్ తతో బాలాం రామపత్నీం యశస్వినీమ్ ।
రోహిణీం శశినా హీనాం గ్రహవద్భృశదారుణః ॥ 5

వైదేహిసమీపమునకు యతిరూపమున వచ్చిన రావణుడు మృదువైన కాషాయవస్త్రములను ధరించియుండెను, శిఖను, ఛత్రమును, పాదుకలను కలిగియుండెను. ఎడమభుజమున దండమును, కుడిచేతిలో కమండలువును ధరించియుండెను. సూర్యచంద్రులులేని సంధ్యాకాలమునందు పెనుచీకటివలె రామలక్ష్మణులులేని ఆశ్రమమున ఆ అతిబలుడు (రావణుడు) సీతాదేవిని సమీపించెను. క్రూరుడైన రావణుడు పతివ్రతాశిరోమణియు, అమాయికురాలును ఐన ఆ రామపత్నిని చంద్రుడులేని రోహిణిని క్రూరగ్రహము[1] వలె చూచెను. (3-5)

తముగ్రంపాపకర్మాణం జనస్థానరుహా ద్రుమాః ।
సమీక్ష్య న ప్రకంపంతే న ప్రవాతి చ మారుతః ॥ 6

శీఘ్రస్రోతాశ్చ తం దృష్ట్వా వీక్షంతం రక్తలోచనమ్ ।
స్తిమితం గంతుమారేభే భయాద్గోదావరీ నదీ ॥ 7

క్రూరుడు, పాపకృత్యములను ఒనర్చువాడు ఐన రావణుని చూచి, దండకారణ్యమునందలి వృక్షముల కదలికలు ఆగిపోయెను. వాయువు ప్రసరించుట మానెను. పరవళ్లు త్రొక్కుచు ప్రవహించెడి గోదావరినది ఎఱ్ఱబాఱిన కనులతో వీక్షించుచున్న రావణుని గమనించి, నెమ్మదిగా (వేగమును తగ్గించి) ప్రవహింపసాగెను. (6-7)

1) క్రూరగ్రహములు (అంగారకుడు, శని మొదలగు గ్రహములు) రోహిణిని చూచుట లోకమునకు అనర్థదాయకము.

రామస్య త్వంతరప్రేప్సుః దశగ్రీవస్తదంతరే।
ఉపతస్థే చ వైదేహీం భిక్షురూపేణ రావణః। 8

అభవ్యో భవ్యరూపేణ భర్తారమనుశోచతీమ్।
అభ్యవర్తత వైదేహీం చిత్రామివ శనైశ్చరః। 9

స పాపో భవ్యరూపేణ తృణైః కూప ఇవావృతః।
అతిష్ఠత్ ప్రేక్ష్య వైదేహీం రామపత్నీం యశస్వినీమ్। 10

శుభాం రుచిరదంతోష్ఠీం పూర్ణచంద్రనిభాననామ్।
ఆసీనాం పర్ణశాలాయాం బాష్పశోకాభిపీడితామ్। 11

స తాం పద్మపలాశాక్షీం పీతకౌశేయవాసినీమ్।
అభ్యగచ్ఛత వైదేహీం దుష్టచేతా నిశాచరః। 12

స మన్మథశరావిష్టో బ్రహ్మఘోషమ్ ఉదీరయన్।
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం రహితే రాక్షసాధిపః। 13

తాముత్తమాం స్త్రియం లోకే పద్మహీనామివ శ్రియమ్।
విభ్రాజమానాం వపుషా రావణః ప్రశశంస హ। 14

కా త్వం కాంచనవర్ణాభే! పీతకౌశేయవాసిని!।
కమలానాం శుభాం మాలాం పద్మినీవ హి బిభ్రతీ। 15

హ్రీః కీర్తిః శ్రీః శుభా లక్ష్మీః అప్సరా వా శుభాననే!।
భూతిర్వా త్వం వరారోహే! రతిర్వా స్వైరచారిణీ। 16

సమాః శిఖరిణః స్నిగ్ధాః పాండురా దశనాస్తవ।
విశాలే విమలే నేత్రే రక్తాంతే కృష్ణతారకే। 17

రాముడు చిక్కులపాలగుసమయముకొఱకు ఎదురు చూచుచున్న దశగ్రీవుడైన రావణుడు అదనుచూచుకొని భిక్షుకునిరూపములో వైదేహికడకు వచ్చెను. (8)

పతిధ్యాసలోనే మునిగియున్న సీతాదేవికడకు దుర్జనుడైన రావణుడు సాధుపురుషునిరూపములో శనిగ్రహము చిత్తానక్షత్రమునువలె సమీపించెను. (9)

గడ్డిపరకలచే కప్పబడిన కూపమువలె సత్పురుషుని రూపములో ఆవృతుడైన రావణుడు ఉత్తమురాలును, రామునిధర్మపత్నియు ఐన వైదేహిని చూచి, అచట నిలిచెను. సీతాదేవి అందమైన పలువరుస, చక్కని పెదవులుగలది. నిండుచంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖముగలది, తామర రేకులవంటి కన్నులుగలది, పట్టు పీతాంబరమును ధరించియున్నది. రామునియొక్క ఆర్తస్వరమును విన్నది మొదలు దిగులుతో కన్నీరు పెట్టుచున్నది. అట్టి వైదేహి పర్ణశాలయందు కూర్చొని యుండగా ఆరాక్షసుడు దురాలోచనాపరుడై ఆమెకు మఱికొంత దగ్గఱయగునట్లుగా అడుగిడెను. (10-12)

యతివేషమునకు తగినట్లుగా వేదమంత్రములను పఠించుచు అచటికివచ్చిన రావణుడు ఆ నిర్జన ప్రదేశమున ఆమెను చూచి, కామపరవశుడై ఆమెతో సవినయముగా ఇట్లనెను. (13)

తనుశోభలచే పద్మములను ధరింపని లక్ష్మీదేవివలె ఒప్పుచు లోకోత్తరసౌందర్యవతియైన ఆసీతాదేవితో ఆమెను ప్రశంసించుచు రావణుడిట్లనెను. (14)

'పట్టు పీతాంబరమును ధరించి, బంగారు బొమ్మవలె విలసిల్లుచున్న ఓ వనితా! నీవెవరు? నీముఖము, నేత్రములు, కరములు, పాదములు కమలశోభలను వెలార్చుచుండుటచే నీవు పద్మలతవలె విరాజిల్లుచున్నావు. ఓ ఇందువదనా! ఒప్పులకుప్పా! నీవు పార్వతివా? కీర్తివా? శుభస్వరూపురాలవైన లక్ష్మివా? అప్సరసవా? ఐశ్వర్యరూపిణివా? స్వతంత్రురాలవైన రతీదేవివా? ఎవరునీవు? (15-16)

ఓ శుభాంగీ! నీ దంతములు (పలువరుస) హెచ్చుతుగ్గులులేక మొనదేలి, తెల్లని కాంతులను విరజిమ్ముచు నునుపుగానున్నవి. నీ నేత్రములు విశాలములు, స్వచ్ఛములు, కనుగొనలయందు ఎఱుపెక్కి, నల్లని కనీనికలు గలిగియున్నవి. జఘనము విశాలమైనది, ఊరువులు ఏనుగుతొండములవలె బలిష్ఠములైనవి. నీ పయోధరములు ఉన్నతములై, గుండ్రముగానున్నవి. అవి దగ్గఱగాచేరి కొంచెముగా కదలుచున్నవి. పరిపుష్టములై

విశాలం జఘనం పీనమ్ ఊరూ కరికరోపమౌ।
ఏతావుపచితౌ వృత్తౌ సంహతౌ సంప్రవల్గితౌ। 18

పీనోన్నతముఖౌ కాంతౌ స్నిగ్ధౌ తాళఫలోపమౌ।
మణిప్రవేకాభరణౌ రుచిరౌ తే పయోధరౌ। 19

చారుస్మితే! చారుదతి! చారునేత్రే! విలాసిని!।
మనో హరసి మే కాంతే నదీకూలమివాంభసా। 20

కరాంతమితమధ్యాఽసి సుకేశి సంహతస్తని। 21

నైవ దేవీ న గంధర్వీ న యక్షీ న చ కిన్నరీ।
నైవంరూపా మయా నారీ దృష్టపూర్వా మహీతలే। 22

రూపమగ్ర్యం చ లోకేషు సౌకుమార్యం వయశ్చ తే।
ఇహ వాసశ్చ కాంతారే చిత్తమున్మాదయంతి మే। 23

సా ప్రతిక్రామ భద్రం తే న త్వం వస్తుమిహార్హసి।
రాక్షసానామయం వాసో ఘోరాణాం కామరూపిణామ్। 24

ప్రాసాదాగ్రాణి రమ్యాణి నగరోపవనాని చ।
సంపన్నాని సుగంధీని యుక్తాన్యాచరితుం త్వయా। 25

వరం మాల్యం వరం భోజ్యం వరం వస్త్రం చ శోభనే!।
భర్తారం చ వరం మన్యే త్వద్యుక్తమసితేక్షణే!। 26

కా త్వం భవసి రుద్రాణాం మరుతాం వా వరాననే!।
వసూనాం వా వరారోహే! దేవతా ప్రతిభాసి మే। 27

నేహ గచ్ఛంతి గంధర్వా న దేవా న చ కిన్నరాః।
రాక్షసానామయం వాసః కథం ను త్వమిహాగతా। 28

ఇహ శాఖామృగాః సింహా ద్వీపివ్యాఘ్రమృగాస్తథా।
ఋక్షాస్తరక్షవః కంకాః కథం తేభ్యో న బిభ్యసి। 29

మదాన్వితానాం ఘోరాణాం కుంజరాణాం తరస్వినామ్।
కథమేకా మహారణ్యే న బిభేషి వరాననే!। 30

ఎత్తుగా నున్నవి. తాళఫలములవలె నునుపుదేలి, ఆకర్షణీయముగా నున్నవి. మేలైన మణులహారములతో శోభిల్లుచున్నవి. ఓ విలాసినీ! నీ చిఱునవ్వు కమనీయము, నీపలువరుసలు అద్భుతములు, నీ కనులఅందచందములు అపూర్వములు. ఓకాంతా! వేగముగా ప్రవహించెడి నదీజలములు దరులను ఒరయునట్లు నీవు నా మనస్సును హరించుచున్నావు. (17-20)

అందమైన కురులుగల ఓ తరుణీ! నీ నడుము పిడికిటపట్టదగినంతసన్నగానున్నది. దివ్య భామినులుగాని, గంధర్వకాంతలు గాని, యక్షకన్యలు గాని, కిన్నర యువతులుగాని నీ అందచందాలముందు దిగదుడుపే. ఇట్టి సౌందర్యరాశియైన నారీరత్నమును నేను ఇంతవఱకును ఈ భూమండలమున చూచియెఱుగను. లోకోత్తరమైన నీ లావణ్యము, సౌకుమార్యము, యౌవనము, ఈ వనమున ఏకాంత వాసము - ఇవియన్నియును నన్ను పిచ్చివానినిగా చేయుచున్నవి. (21-23)

ఓతరుణీ! భయంకరులు కామరూపులైన రాక్షసులు నివసించెడి ప్రదేశమిది, కనుక ఇట్టి ఘోరారణ్యమున నీవు నివసింపదగదు. నీవు భవనమునకు మఱలుము, నీకు శుభమగుగాక. చక్కని ప్రాసాదములు, సువాసనలను వెదజల్లెడి పుష్పములతో సుసంపన్నములైన అందమైన ఉద్యానవనములు నీవు నివసింపదగినవి. అందమైన చూపులుగల ఓ శుభాంగీ! మేలైన హారములు, షడ్రసోపేతమైన భోజనము, అమూల్యములైన వస్త్రములు నీవు అనుభవింపదగినవి. సర్వశ్రేష్ఠుడైన వరుడే నిన్ను భార్యగా పొందుటకు అర్హుడు. (24-26)

ఓ వరాననా! సర్వాంగసుందరీ! ఎవరు నీవు? రుద్రులకును, మరుత్తులకును, వసువులకును, ఆదిత్యులకును సంబంధించిన దేవతామూర్తివని నాకు తోచుచున్నది. (27)

ఇది భయంకరులైన రాక్షసులకు నివాసము. అందువలన గంధర్వులు, దేవతలు, కిన్నరులు మొదలగువారు ఎవ్వరును ఇచట సంచరింపరు. మఱి ఇచటికి నీవెట్లు వచ్చితివి? (28)

ఈ అరణ్యమున వానరములును, సింహములు, చిఱుత పులులు మొదలగు క్రూర జంతువులును, అట్లే ఎలుగుబంట్లును, మృగములను భక్షించెడి పెద్ద పులులును, రాబందులును సంచరించుచుండును. వాటికి నీవు భయపడుటలేదా? ఓ వరాననా! బలిష్ఠములై, భయమును గొలిపెడి మదపుటేనుగులు ఈ మహారణ్యమున తిరుగుచుండును. ఒంటరిగానున్న నీకు వాటివలన భయము కలుగుట లేదా? (29-30)

కాఽసి కస్య కుతశ్చిత్ త్వం కిన్నిమిత్తం చ దండకాన్।
ఏకా చరసి కల్యాణి! ఘోరాన్ రాక్షససేవితాన్। 31

ఇతి ప్రశస్తా వైదేహీ రావణేన దురాత్మనా।
ద్విజాతివేషేణ హితం దృష్ట్వా రావణమాగతమ్।
సర్వైరతిథిసత్కారైః పూజయామాస మైథిలీ। 32

ఉపనీయాసనం పూర్వం పాద్యేనాభినిమంత్ర్య చ।
అబ్రవీత్ సిద్ధమిత్యేవ తదా తం సౌమ్యదర్శనమ్। 33

ద్విజాతివేషేణ సమీక్ష్య మైథిలీ
సమాగతం పాత్రకుసుంభధారిణమ్ ।
అశక్యముద్వేష్టుమపాయదర్శనం
న్యమంత్రయద్బ్రాహ్మణవత్ తదాఽంగనా । 34

ఇయం బృసీ బ్రాహ్మణ! కామమాస్యతామ్
ఇదం చ పాద్యం ప్రతిగృహ్యతామితి ।
ఇదం చ సిద్ధం వనజాతముత్తమం
త్వదర్థమవ్యగ్రమిహోపభుజ్యతామ్ । 35

నిమంత్ర్యమాణః ప్రతిపూర్ణభాషిణీం
నరేంద్రపత్నీం ప్రసమీక్ష్య మైథిలీమ్ ।
ప్రసహ్య తస్యా హరణే ధృతం మనః
సమర్పయత్ స్వాత్మవధాయ రావణః । 36

తతః సువేషం మృగయాగతం పతిం
ప్రతీక్షమాణా సహ లక్ష్మణం తదా ।
నిరీక్షమాణా హరితం దదర్శ తత్
మహద్వనం నైవ తు రామలక్ష్మణౌ । 37

ఓ కల్యాణీ! నీపేరేమి? నీవు ఎవ్వరిదానవు? ఏ ప్రదేశమునుండి వచ్చితివి? రాక్షసులు నివసించెడి ఘోరమైన ఈ దండకారణ్యమున నీవు ఒంటరిగా సంచరించుటకు కారణమేమి?" (31)

దురాలోచనాపరుడైన రావణుడు వైదేహిని ఇట్లు ప్రశంసించెను. యతివేషమున వచ్చిన ఆ రావణుని జూచి, ఆమె వివిధములగు అతిథిమర్యాదలతో పూజించెను. సీతాదేవి ముందుగా ఆయనను ఆసనముపై కూర్చుండజేసి, అర్ఘ్యపాద్యాదులతో సత్కరించెను. అనంతరము సాధువేషమున నున్న అతనికి పక్వాన్నములు సిద్ధముగానున్నట్లు తెలిపెను. (32-33)

కమండలువును, కాషాయవస్త్రములను ధరించి, యతివేషములో వచ్చిన అతనిని మైథిలి తేరిపారజూచెను. అతడు లోలోన సీతాదేవిని అపహరింపవలెననెడి దుర్బుద్ధి కలిగియేయుండెను. కాని అతిథిగా వచ్చిన అతడు సాధువేషములో ఉన్నందున ఆమె అతనిని అనుమానించుటకు వీలులేకుండెను. కనుక అతనిని ఆతిథ్యమునకు ఆహ్వానించెను. (34)

"ఓ బ్రాహ్మణుడా! ఈ ఆసనమును అలంకరింపుము. ఈ అర్ఘ్యపాద్యములను స్వీకరింపుము. వన్యములైన కందమూలఫలాదులు నీకొఱకై సిద్ధముగా ఉన్నవి. సావధానముగా భుజింపుము." (35)

నిండుమనస్సుతో, మృదువుగా ఆతిథ్యమునకు ఆహ్వానించుచున్న ఆ రామపత్నిని రావణుడు చూచెను. బలవంతముగా ఆమెను అపహరించి, తనమృత్యువును కొనితెచ్చుకొనుటకు అతడు మనస్సులో నిశ్చయించుకొనెను.(36)

అప్పుడు సీతాదేవి వేటకై వెళ్లిన సుందరరూపియగు తన పతి, లక్ష్మణునితోగూడి ఎప్పుడు వచ్చునాయని ఎదురుచూచుచుండెను. అట్లు వారు వెళ్లిన దిక్కునకే చూచుచున్న ఆమెకు మహారణ్యమే కనబడెనుగాని రామలక్ష్మణులఅలికిడియే తెలియకుండెను- (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే షట్చత్వారింశస్సర్గః (46)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదిఆఱవసర్గము.

— * * * —

47. నలుబదియేడవసర్గము

సీతాదేవి తనను గుఱించియు, తన భర్తయగు శ్రీరామునిగూర్చియు తెలిపి, తమ వనవాసకారణములను రావణునకు వివరించుట - తనకు పట్టపు రాణివై హాయిగా సుఖింపుమని రావణుడు ఆమెను ప్రలోభపెట్టుట - సీతాదేవి అందులకు తిరస్కరించుచు, శ్రీరాముని ముందు అతనిని కొఱగాని వానినిగా వర్ణించుట -

రావణేన తు వైదేహీ తథా పృష్టా జిహీర్షతా।
పరివ్రాజకలింగేన శశంసాఽఽత్మానమంగనా॥ 1

సీతాదేవిని అపహరింపదలచి, సన్న్యాసివేషములో వచ్చిన రావణుని ప్రశ్నలకు సమాధానముగా ఆ రామపత్ని తననుగూర్చి ఇట్లు చెప్పదొడంగెను. (1)

బ్రాహ్మణశ్చాతిథిశ్చాయమ్ అనుక్తో హి శపేత మామ్।
ఇతి ధ్యాత్వా ముహూర్తం తు సీతా వచనమబ్రవీత్॥ 2

'ఈ వచ్చినవాడు బ్రాహ్మణుడు, పైగా అతిథి. ఆయనకు ప్రత్యుత్తరమీయనిచో శపించునేమో?' - అని క్షణకాలము ఆలోచించి, సీతాదేవి ఇట్లు నుడివెను. (2)

దుహితా జనకస్యాహం మైథిలస్య మహాత్మనః।
సీతా నామ్నాఽస్మి భద్రం తే రామభార్యా ద్విజోత్తమ॥ 3

ఉషిత్వా ద్వాదశ సమా ఇక్ష్వాకూణాం నివేశనే।
భుంజానా మానుషాన్ భోగాన్ సర్వకామసమృద్ధినీ॥ 4

తతస్త్రయోదశే వర్షే రాజాఽమంత్రయత ప్రభుః।
అభిషేచయితుం రామం సమేతో రాజమంత్రిభిః॥ 5

"బ్రాహ్మణోత్తమా! నీకు మేలగుగాక. మిథిలానగరప్రభువైన మహాత్ముడగు జనకమహారాజుయొక్క కుమార్తెనునేను. నాపేరు సీత. శ్రీరామునిభార్యను. నావివాహానంతరము ఇక్ష్వాకువంశజులరాజధానియైన అయోధ్యలో ఏలోటూలేకుండా మనుష్యులకు సహజములైన[1] వివిధ సుఖభోగములను అనుభవించుచు పండ్రెండుసంవత్సరములు గడపితిని. పదుమూడవసంవత్సరమున దశరథమహారాజు శ్రీరాముని యువరాజపట్టాభిషిక్తుని గావించుటకై ముఖ్యసచివులతో మంత్రాలోచన చేసెను. (3-5)

తస్మిన్ సంభ్రియమాణే తు రాఘవస్యాభిషేచనే।
కైకేయీ నామ భర్తారమ్ ఆర్యా సా యాచతే వరమ్॥ 6

ప్రతిగృహ్య తు కైకేయీ శ్వశురం సుకృతేన మే।
మమ ప్రవ్రాజనం భర్తుః భరతస్యాభిషేచనమ్।
ద్వావయాచత భర్తారం సత్యసంధం నృపోత్తమమ్॥ 7

శ్రీరామునియొక్క పట్టాభిషేకసన్నాహములు జరుగుచుండగా మాఅత్తగారైన కైకేయి తన భర్తయైన దశరథమహారాజును వరములనడిగెను. ఆకైకేయి లోగడ తనభర్తకు తానొనర్చిన ఉపకారమును, అందులకు ప్రతిఫలముగా నాడు అతడిచ్చెదనన్న వరములను జ్ఞప్తికి దెచ్చెను. సత్యసంధుడైన ఆమహారాజు 'ఆ వరములను తప్పక ఇచ్చెదను' అని శపథము చేసెను. అప్పుడామె 'శ్రీరాముని వనములకు పంపుము నాకుమారుడైన భరతునకు పట్టాభిషేకమును జరిపింపుము' అని మామామగారిని రెండువరములను కోరెను. (6-7)

నాద్య భోక్ష్యే న చ స్వప్స్యే న పాస్యే చ కథంచన।
ఏష మే జీవితస్యాంతో రామో యద్యభిషిచ్యతే॥ 8

ఇతి బ్రువాణాం కైకేయీం శ్వశురో మే స మానదః।
అయాచతాఽర్థైరన్వర్థైః న చ యాచ్ఞాం చకార సా॥ 9

'శ్రీరాముడు పట్టాభిషిక్తుడైనచో నేడు అన్నపానములను ముట్టను, నిద్రింపను, ఏదోయొక విధముగా నా ప్రాణములను త్యజింతును'- అని పలికెను. అప్పుడు ఉదారుడైన మామామగారు 'ఆవరములకు మాఱుగా అమూల్యములైన రత్నాభరణాదులను కోరుకొనుము' అని అభ్యర్థించెను. అందులకు ఆమె సమ్మతింపలేదు. (8-9)

1) భుంజానా + అమానుషాన్ భోగాన్ = అని పదచ్ఛేదముచేసినచో - అమానుషములు = మానవాతీతములు, దివ్యములు, అమానుషభోగములు = దివ్యభోగములు, మాదాంపత్యజీవనసుఖములు ప్రాకృతములు గావు, దివ్యములు.

మమ భర్తా మహాతేజా వయసా పంచవింశకః।
అష్టాదశ హి వర్షాణి మమ జన్మని గణ్యతే। 10

మిగుల పరాక్రమశాలియగు నాభర్తయొక్క అప్పటివయస్సు ఇరువదిఐదుసంవత్సరములు. నా వయస్సు పదునెనిమిది సంవత్సరములు. (10)

రామేతి ప్రథితో లోకే గుణవాన్ సత్యవాన్ శుచిః।
విశాలాక్షో మహాబాహుః సర్వభూతహితే రతః। 11

సద్గుణసంపన్నుడు, సత్యవచనుడు, పరమపవిత్రుడు, విశాలములైన నేత్రములుగలవాడు, గొప్ప బాహుబల శోభితుడు, సకలప్రాణులహితమునే కోరెడువాడు' అని శ్రీరాముడు ఈ లోకమున వాసిగాంచెను. (11)

కామార్తస్తు మహాతేజాః పితా దశరథః స్వయమ్।
కైకేయ్యాః ప్రియకామార్థం తం రామం నాభ్యషేచయత్। 12

శ్రీరామునకు తండ్రియైన దశరథుడు మహాతేజస్వి, కైకేయిని సంతోషపఱచుటకై తహతహపడుచుండువాడు, అందువలన కైకేయికి ప్రియమును గూర్చుటకై అతడు రాముని పట్టాభిషేకమును ఆపివేసెను. (12)

అభిషేకాయ తు పితుః సమీపం రామమాగతమ్।
కైకేయీ మమ భర్తారమ్ ఇత్యువాచ ధృతం వచః। 13

అభిషేకసందర్భమును పురస్కరించుకొని శ్రీరాముడు తండ్రికడకు విచ్చేసెను. అప్పుడు కైకేయి ఆయనతో ఏ మాత్రము జంకులేకుండ ఇట్లనెను. (13)

తవ పిత్రా సమాజ్ఞప్తం మమేదం శృణు రాఘవ!।
భరతాయ ప్రదాతవ్యమ్ ఇదం రాజ్యమ్ అకంటకమ్। 14

త్వయా హి ఖలు వస్తవ్యం నవ వర్షాణి పంచ చ।
వనే ప్రవ్రజ కాకుత్స్థ! పితరం మోచయానృతాత్। 15

'ఓ రామా! నేను నుడువుచున్న మీతండ్రిగారి ఆదేశమును వినుము- నిష్కంటకమైన ఈ కోసల రాజ్యాధికారమును భరతునకు అప్పగింపవలెను. నీవు పదునాలుగుసంవత్సరములు వనవాసము చేయవలెను. కనుక ఓ రామా! నీవు వెంటనే వనములకు బయలుదేఱుము- మీతండ్రిని సత్యసంధునిగా జేయుము." (14-15)

తథే త్యుక్త్వా చ తాం రామః కైకేయీమ్ అకుతోభయః।
చకార తద్వచస్తస్యా మమ భర్తా దృఢవ్రతః। 16

అంతట శ్రీరాముడు రాజ్యమును వీడి, వనవాసము చేయుటకు ఏమాత్రము వెనుకాడనివాడై, ఆకైకతో 'అట్లే' అని పల్కెను. పిమ్మట దృఢనిశ్చయముగల నాభర్త ఆమెమాటలను తలదాల్చి వనములకు వచ్చెను. (16)

దద్యాన్న ప్రతిగృహ్ణీయాత్ సత్యం బ్రూయాన్న చానృతమ్।
ఏతద్బ్రాహ్మణ! రామస్య ధ్రువం వ్రతమనుత్తమమ్। 17

ఓ బ్రాహ్మణుడా! 'ఒకరికి ఇచ్చినదానిని తిరిగి స్వీకరింపరాదు, అబద్ధమాడరాదు, సత్యమునే పలుకవలెను. ఎట్టి పరిస్థితులలోనైనను వీటిని తప్పక పాటింపవలెను' అనునది శ్రీరాముని పరమాదర్శము. (17)

తస్య భ్రాతా తు ద్వైమాత్రో లక్ష్మణో నామ వీర్యవాన్।
రామస్య పురుషవ్యాఘ్రః సహాయః సమరేఽరిహా। 18

స భ్రాతా లక్ష్మణో నామ ధర్మచారీ దృఢవ్రతః।
అన్వగచ్ఛత్ ధనుష్పాణిః ప్రవ్రజంతం మయా సహ। 19

జటీ తాపసరూపేణ మయా సహ సహానుజః।
ప్రవిష్టో దండకారణ్యం ధర్మనిత్యో జితేంద్రియః। 20

అతనితమ్ముడైన లక్ష్మణుడు ఇద్దరు తల్లుల (కౌసల్యా సుమిత్రల) ముద్దులకొడుకు. అతడు మిగుల పరాక్రమశాలి, పురుషశ్రేష్ఠుడు, రణరంగమున అరివీరులను హతమార్చుటలో తిరుగులేనివాడు. అతడు శ్రీరామునకు కుడిభుజము. ధర్మాత్ముడు, దృఢవ్రతుడు, ధనుర్ధారి ఐన లక్ష్మణుడు నావలెనే శ్రీరాముని అనుసరించి వచ్చెను. నేను, లక్ష్మణుడును అతని వెంటరాగా జితేంద్రియుడు, ధర్మనిరతుడు ఐన శ్రీరాముడు తాపసివేషములో జటాధారియై ఈ దండకారణ్యమున ప్రవేశించెను. (18-20)

తే వయం ప్రచ్యుతా రాజ్యాత్ కైకేయ్యాస్తు కృతే త్రయః।
విచరామ ద్విజశ్రేష్ఠ! వనం గంభీరమోజసా। 21

సమాశ్వస ముహూర్తం తు శక్యం వస్తుమిహ త్వయా।
ఆగమిష్యతి మే భర్తా వన్యమాదాయ పుష్కలమ్। 22

స త్వం నామ చ గోత్రం చ కులం చాచక్ష్వ తత్త్వతః।
ఏకశ్చ దండకారణ్యే కిమర్థం చరసి ద్విజ!। 23

ఏవం బ్రువంత్యాం సీతాయాం రామపత్న్యాం మహాబలః।
ప్రత్యువాచోత్తరం తీవ్రం రావణో రాక్షసాధిపః। 24

యేన విత్రాసితా లోకాః సదేవాసురపన్నగాః।
అహం తు రావణో నామ సీతే! రక్షోగణేశ్వరః। 25

త్వాంతు కాంచనవర్ణాభాం దృష్ట్వా కౌశేయవాసినీమ్।
రతిం స్వకేషు దారేషు నాధిగచ్ఛామ్యనిందితే!। 26

బహ్వీనామ్ ఉత్తమస్త్రీణామ్ ఆహృతానామ్ ఇతస్తతః।
సర్వాసామేవ భద్రంతే మమాగ్రమహిషీ భవ। 27

లంకా నామ సముద్రస్య మధ్యే మమ మహాపురీ।
సాగరేణ పరిక్షిప్తా నివిష్టా నగమూర్ధని। 28

తత్ర సీతే! మయా సార్ధం వనేషు విహరిష్యసి।
న చాస్యారణ్యవాసస్య స్పృహయిష్యసి భామిని!। 29

పంచ దాస్యః సహస్రాణి సర్వాభరణభూషితాః।
సీతే! పరిచరిష్యంతి భార్యా భవసి మే యది। 30

రావణేనైవముక్తా తు కుపితా జనకాత్మజా।
ప్రత్యువాచాఽనవద్యాంగీ తమనాదృత్య రాక్షసమ్। 31

"మహాగిరిమివాకంప్యం మహేంద్రసదృశం పతిమ్।
మహోదధిమివాక్షోభ్యమ్ అహం రామమనువ్రతా। 32

సర్వలక్షణసంపన్నం న్యగ్రోధపరిమండలమ్।
సత్యసంధం మహాభాగమ్ అహం రామమనువ్రతా। 33

మహాబాహుం మహోరస్కం సింహవిక్రాంతగామినమ్।
నృసింహం సింహసంకాశమ్ అహం రామమనువ్రతా। 34

ఓ బ్రాహ్మణోత్తమా! కైకేయి తృప్తికొఱకై మేము ముగ్గురము రాజ్యమును వీడి, ఈ కీకారణ్యములలో బలసహాయముతో మసలుచుంటిమి. ఈ పవిత్రప్రదేశమున నీవు కొంతతడవు విశ్రాంతి దీసికొనుము. నాభర్త సమృద్ధిగా కందమూలఫలములను తీసికొనిరాగలడు. (21-22)

ఓ విప్రుడా! పూర్వాశ్రమములో నీ పేరేమి? గోత్రమేమి? ఏ యూరివాడవు? ఒంటరిగా ఈ దండకారణ్యమున సంచరించుటకు కారణమేమి? తెలుపుము." (23)

శ్రీరామునిధర్మపత్నియైన సీతాదేవి ఇట్లనుచుండగా మహాబలశాలియు, రాక్షసులకు ప్రభువు ఐన రావణుడు తీవ్రస్వరముతో ఈ విధముగా ప్రత్యుత్తరమిచ్చెను. (24)

"ఓ సీతా! నాపేరు రావణుడు, నేను రాక్షసరాజును. దేవతలు, అసురులు, నాగులు మొదలగు సమస్త లోకములవారును నాకు భయపడుదురు. (25)

ఓ సుందరీ! పట్టువస్త్రములను ధరించి, మేలిమి బంగారుకాంతితో విరాజిల్లుచున్న నిన్నుజూచినది మొదలుకొని నాభార్యలపై నాకు మనసుపోకున్నది. నేను వివిధములగు ప్రదేశములలోగల పెక్కుమంది సుందరీమణులను అపహరించి, తీసికొనివచ్చితిని. నన్ను పతిగా స్వీకరించినచో నీవు పట్టమహిషివి కాగలవు. అప్పుడు వారందఱును నిన్ను సేవింతురు. సముద్రమధ్యమునగల త్రికూటగిరిపై విలసిల్లెడి లంకా మహానగరము నారాజధాని, దానిచుట్టునుగల సాగరము దానికి అగడ్తయై విలసిల్లుచున్నది. ఓ సీతా! అచట నాతోగూడి వనములలో విహరింపగలవు. ఓ భామినీ! నీవు ఆవైభవములకు అలవాటు పడినపిమ్మట ఈ అరణ్యవాసవిషయమునే తలంపవు. నీవు నాభార్యవైనచో వివిధములగు అభరణములను అలంకరించుకొనిన ఐదువేలమంది దాసీలు నీకు పరిచర్యలు చేయుదురు." (26-30)

పరమపతివ్రతయైన జానకి రావణుని పలుకులకు మండిపడి అతనిని తృణీకరించుచు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (31)

"నాపతియైన శ్రీరాముడు మేరునగధీరుడు, పరాక్రమమున మహేంద్రతుల్యుడు, మహాసముద్రమువలె గంభీరుడు, సర్వశుభలక్షణసంపన్నుడు, మహావటవృక్షమువలె ఎల్లరకును నీడనిచ్చి ఆదుకొనెడివాడు, సత్యవాక్పరిపాలకుడు, మహానుభావుడు, మహాభుజబలశాలి, విశాలమైన వక్షఃస్థలముగలవాడు, సింహమువలె ఠీవిగా నడచువాడు, పురుషోత్తముడు, సింహపరాక్రముడు, నిండుచంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖము గలవాడు,

పూర్ణచంద్రాననం రామం రాజవత్సం జితేంద్రియమ్।
పృథుకీర్తిం మహాత్మానమ్ అహం రామమనువ్రతా। 35

త్వం పునర్జంబుకః సింహీం మామిచ్ఛసి సుదుర్లభామ్।
నాహం శక్యా త్వయా స్ప్రష్టుమ్ ఆదిత్యస్య ప్రభా యథా। 36

పాదపాన్ కాంచనాన్ నూనం బహూన్ పశ్యసి మందభాక్।
రాఘవస్య ప్రియాం భార్యాం యస్త్వమిచ్ఛసి రావణ!। 37

క్షుధితస్య హి సింహస్య మృగశత్రోస్తరస్వినః।
ఆశీవిషస్య చ వదనాత్ దంష్ట్రామాదాతుమిచ్ఛసి। 38

మందరం పర్వతశ్రేష్ఠం పాణినా హర్తుమిచ్ఛసి।
కాలకూటం విషం పీత్వా స్వస్తిమాన్ గంతుమిచ్ఛసి। 39

అక్షి సూచ్యా ప్రమృజసి జిహ్వయా లేక్షి చ క్షురమ్।
రాఘవస్య ప్రియాం భార్యాం యోఽధిగంతుం త్వమిచ్ఛసి। 40

అవసజ్య శిలాం కంఠే సముద్రం తర్తుమిచ్ఛసి,
సూర్యాచంద్రమసౌ చోభౌ పాణిభ్యాం హర్తుమిచ్ఛసి, 41
యో రామస్య ప్రియాం భార్యాం ప్రధర్షయితుమిచ్ఛసి, 42

అగ్నిం ప్రజ్వలితం దృష్ట్వా వస్త్రేణాఽఽహర్తుమిచ్ఛసి,
కల్యాణవృత్తాం రామస్య యో భార్యాం హర్తుమిచ్ఛసి, 43
అయోముఖానాం శూలానామ్ అగ్రే చరితుమిచ్ఛసి,
రామస్య సదృశీం భార్యాం యోఽధిగంతుం త్వమిచ్ఛసి, 44

యదంతరం సింహసృగాలయోర్వనే
యదంతరం స్యందినికాసముద్రయోః।
సురాగ్ర్యసౌవీరకయోర్యదంతరం
తదంతరం వై తవ రాఘవస్య చ। 45

యదంతరం కాంచనసీసలోహయోః
యదంతరం చందనవారిపంకయోః।
యదంతరం హస్తిబిడాలయోర్వనే
తదంతరం దాశరథేస్తవైవ చ। 46

యదంతరం వాయసవైనతేయయోః
యదంతరం మద్గుమయూరయోరపి।
యదంతరం సారసగృధ్రయోర్వనే
తదంతరం దాశరథేస్తవైవ చ। 47

మహారాజకుమారుడు, జితేంద్రియుడు, గొప్ప పేరుప్రతిష్ఠలుగలవాడు, నేను అట్టిమహాత్ముని ధర్మపత్నిని. సర్వకాలసర్వావస్థలయందును ఆయునను అనుసరించియుండుటయే నావ్రతము. (32-35)

నేను ఆడుసింహమును, ఎవ్వరికిని అందను. నన్ను ఆశించుచున్న నీవు ఒక నక్కవు. సూర్యకాంతిని పట్టుకొనలేనట్లు నన్ను నీవు తాకజాలవు. మందభాగ్యుడు (దురదృష్టవంతుడు లేక ఆయువుమూడినవాడు) పెక్కుబంగారువృక్షములకై ఆశపడుచుండును. అట్లే రఘువీరునిప్రియభార్యనైననన్ను నీవు ఆశించుచుంటివి. (చావుదగ్గఱపడియేనీవిట్లు కోరుకొనుచుంటివి.) నికలమృగములను హతమార్చెడి పరాక్రమముగల్గి, ఆకలితో నకనకలాడుచున్న సింహముయొక్క నోటిలోని కోఱలను, ఆకలిగొన్న, ఓడువుగల మహావిషసర్పముయొక్క నోటిలోని కోఱలను పొందగోరుచున్నావు. పర్వతములలో శ్రేష్ఠమైన మందరగిరిని చేతితో పెండిచేయుగోరుచున్నావు. ప్రాణములను తీయునట్టి కాలకూటవిషమును త్రాగి, సుఖముగా నుండగోరుచున్నావు. సూదితో కంటిని తుడుచుకొనుటకు ప్రయత్నించునట్లును, కత్తిపదునును నాలుకతో నాకుచు తెలిసికొనుటకు యత్నించునట్లును శ్రీరామునిప్రియభార్యనైన నన్ను నీవు పొందగోరుచున్నావు.(36-40)

మెడకు ఒకపెద్దబండను కట్టుకొని, సముద్రమును ఈదదలచినట్లును, సూర్యచంద్రులిద్దఱిని చేతులతో పట్టుకొనుటకు యత్నించునట్లుగను శ్రీరాముని ప్రియభార్యనైన నన్ను అపహరింపదలచుచున్నావు. (41-42)

మండుచున్న అగ్నిని వస్త్రమున మూటగట్టబూనినట్లు సన్మార్గమున సాగిపోవు శ్రీరామునిపత్నిని హరింపగోరుచున్నావు. పదునుదేలియున్న ఇనుపశూలములపై నడువదలచినట్లు, అన్ని విధములుగా రామునకుతగినభార్యనైననన్ను పొందగోరుచున్నావు. (43-44)

వనమునందు సింహమునకును నక్కకును, సముద్రమునకును పిల్లకాల్వకును, అమృతమునకును బియ్యపుకడుగునీటికిని మధ్యగలఅంతరము రామునకును నీకును మధ్య గలదు. లోహములలో బంగారమునకును సీసమునకును, మంచిగంధమునకును బురదకును, ఏనుగునకును పిల్లికిని గల తారతమ్యమే శ్రీరామునకును నీకును మధ్య గలదు- గరుత్మంతునకును, కాకికిని, నెమలికిని నీటి కాకికిని, హంసకును గ్రద్దకును గల అంతరమే శ్రీరామునకు నీకును మధ్య గలదు. (45-47)

తస్మిన్ సహస్రాక్షసమప్రభావే
    రామే స్థితే కార్ముకబాణపాణౌ ।
హృతాఽపి తేఽహం న చిరాం గమిష్యే
    వజ్రం యథా మక్షికయాఽవగీర్ణమ్ ॥ 48

విష్ణుపరాక్రముడైన శ్రీరాముడు ధనుర్బాణములను చేతధరించియున్నంతవఱకును, ఈగ వజ్రమును బియ్యపు గింజనుగా భావించి మ్రింగినచో అది దానికి జీర్ణము కానట్లు, నీవు నన్ను అపహరించినను నేను నీకు వశముగాను. (వజ్రమును మ్రింగిన ఈగ చచ్చిపోవునట్లు నన్నపహరించినచో నీకు మరణమే శరణ్యము.)" (48)

ఇతీవ తద్వాక్య మదుష్టభావా
    సుధృష్టముక్త్వా రజనీచరం తమ్ ।
గాత్రప్రకంపవ్యథితా బభూవ
    వాతోద్ధతా సా కదలీవ తన్వీ ॥ 49

పరమపవిత్రభావములుగల సీతాదేవి దృఢనిశ్చయముగలదై (నిర్భయముగా) రావణునితో ఇట్లు పలికిన పిమ్మట ఆమెశరీరము గాలిదెబ్బకు అరటిచెట్టువలె కంపించెను. (49)

తాం వేపమానాముపలక్ష్య సీతాం
    స రావణో మృత్యుసమప్రభావః ।
కులం బలం నామ చ కర్మ చ స్వం
    సమాచచక్షే భయకారణార్థమ్ ॥ 50

భయముతో వణకిపోవుచున్న ఆ సీతాదేవిని జూచి, మృత్యుదేవతతో సమానమైన ప్రభావముగల ఆ రావణుడు ఆమెకు ఇంకను భయమును గూర్చుటకై తనరాక్షసజాతిని గూర్చియు, తనపరాక్రమమును గుఱించియు, తనదుష్కృత్యములను గూర్చియు వివరింప మొదలిడెను- (50)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే సప్తచత్వారింశస్సర్గః (47)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదిఏడవసర్గము.

— ✳ ✳ ✳ —

48. నలుబదిఎనిమిదవసర్గము

రావణుడు తనవంశవైభవములగూర్చియు, సంపదలనుగుఱించియు గొప్పలు చెప్పికొనుట - దురాలోచనాపరుడైన రావణుని సీతాదేవి తూలనాడుట -

ఏవం బ్రువంత్యాం సీతాయాం సంరబ్ధః పరుషం వచః ।
లలాటే భ్రుకుటీం కృత్వా రావణః ప్రత్యువాచ హ ॥ 1

ఇట్లు పరుషవచనములను పలుకుచున్న సీతాదేవిపై కుపితుడై, రావణుడు ఫాలభాగమునందు బొమముడి వైచినవాడై ఆమెకు ఈ విధముగా ప్రత్యుత్తరమిచ్చెను. (1)

భ్రాతా వైశ్రవణస్యాహం సాపత్న్యో వరవర్ణిని! ।
రావణో నామ భద్రం తే దశగ్రీవః ప్రతాపవాన్ ॥ 2

"ఓ సుందరీ! కుబేరుడు నాసవతితల్లికొడుకు. నేను దశకంఠుడనైన రావణుడను, తిరుగులేని పరాక్రమము గలవాడను. నీకు మేలగుగాక. (2)

యస్య దేవాః సగంధర్వాః పిశాచపతగోరగాః ।
విద్రవంతి భయాద్భీతా మృత్యోరివ సదా ప్రజాః ॥ 3

ప్రజలు మృత్యువునకు భయపడునట్లు దేవతలు, గంధర్వులు, పిశాచములు, పక్షులు, సర్పములు నన్నుజూచి భయముతో పాఱిపోవుట జగత్ప్రసిద్ధము. (3)

యేన వైశ్రవణో రాజా ద్వైమాత్రః కారణాంతరే ।
ద్వంద్వమాసాదితః క్రోధాత్ రణే విక్రమ్య నిర్జితః ॥ 4

కుబేరుడు నాసవతితల్లికుమారుడు[1] కారణాంతరమున అతడు కుపితుడై, పరాక్రమించి ద్వంద్వయుద్ధమునకు దిగి, నాచేతిలో ఓడిపోయెను.

1) విశ్రవసునకు 'ఇలబిల' యందు కలిగినవాడు కుబేరుడు, కైకసియందు పుట్టినవాడు రావణుడు ఈ విధముగా కుబేరుడు రావణునకు సవతితల్లికుమారుడు.

యద్భయార్తః పరిత్యజ్య స్వమధిష్ఠానమృద్ధిమత్।
కైలాసం పర్వతశ్రేష్ఠమ్ అధ్యాస్తే నరవాహనః। 5

యస్య తత్ పుష్పకం నామ విమానం కామగం శుభమ్।
వీర్యాదేవాఽర్జితం భద్రే! యేన యామి విహాయసమ్। 6

మమ సంజాతరోషస్య ముఖం దృష్ట్వైవ మైథిలి!।
విద్రవంతి పరిత్రస్తాః సురాః శక్రపురోగమాః। 7

యత్ర తిష్ఠామ్యహం తత్ర మారుతో వాతి శంకితః।
తీవ్రాంశుః శిశిరాంశుశ్చ భయాత్ సంపద్యతే రవిః। 8

నిష్కంపపత్రాస్తరవో నద్యశ్చ స్తిమితోదకాః।
భవంతి యత్ర యత్రాహం తిష్ఠామి విచరామి చ। 9

మమ పారే సముద్రస్య లంకా నామ పురీ శుభా।
సంపూర్ణా రాక్షసైర్ఘోరైః యథేంద్రస్యామరావతీ। 10

ప్రాకారేణ పరిక్షిప్తా పాండురేణ విరాజతా।
హేమకక్ష్యా పురీ రమ్యా వైడూర్యమయతోరణా। 11

హస్త్యశ్వరథసంబాధా తూర్యనాదవినాదితా।
సర్వకాలఫలైర్వృక్షైః సంకులోద్యానశోభితా। 12

తత్ర త్వం వసతీ సీతే! రాజపుత్త్రి! మయా సహ।
న స్మరిష్యసి నారీణాం మానుషీణాం మనస్విని। 13

భుంజానా మానుషాన్ భోగాన్ దివ్యాంశ్చ వరవర్ణిని!।
న స్మరిష్యసి రామస్య మానుషస్య గతాయుషః। 14

స్థాపయిత్వా ప్రియం పుత్త్రం రాజ్యే దశరథేన యః।
మందవీర్యః సుతో జ్యేష్ఠః తతః ప్రస్థాపితో హ్యయమ్। 15

తేన కిం భ్రష్టరాజ్యేన రామేణ గతచేతసా।
కరిష్యసి విశాలాక్షి! తాపసేన తపస్వినా। 16

అంతట ఆ కుబేరుడు[1] నాకు భయపడి, సమస్త సంపదలతో విలసిల్లుచున్నదియు, తనరాజధానియు అగు అలకాపురి'ని వీడి పర్వతశ్రేష్ఠమైన కైలాసమునకు చేరెను. ఆ కుబేరునియొద్దనున్న సుందరమైన పుష్పకవిమానమును అతనినుండి నాపరాక్రమముతో సంపాదించితిని. అది యజమానికోరికననుసరించి, ఎచటికైనను పయనింపగలదు - నేను దానిమీదనే ఆకాశమున విహరించుచుందును. (4-6)

ఓ మైథిలీ! నేను కన్నులెఱ్ఱజేసినంతమాత్రమున (నేను క్రుద్ధుడనైనచో) నన్నుజూచి ఇంద్రాదిదేవతలెల్లరును భయపడి పరుగులుదీయుదురు. నేనున్నచోట గాలులను ప్రసరింపజేయుటకు వాయువు వెనుకాడుచుండును, సూర్యుడు నాకు భయపడి తనవేడికిరణములను చల్లబఱచుచుండును. నేను మసలెడి ప్రదేశములలో చెట్లు తమఆకులను కదల్పవు, నదులు వేగముగా ప్రవహింపవు. (7-9)

సముద్రతీరమున అపూర్వశోభలతో విలసిల్లెడి లంకానగరము నారాజధాని. భయంకరులైన రాక్షసులకు అది నెలవు. ఇంద్రునిరాజధానియైన 'అమరావతి' వలె అది మిగుల వైభవోపేతమైనది. దానిచుట్టునుగల ప్రాకారము శ్వేతకాంతులతో విరాజిల్లుచుండును. బంగారముతో నిర్మింపబడిన కక్ష్యలతోడను, వైడూర్య మణులు పొదిగిన సింహద్వారములతోడను ఒప్పుచు అది దర్శనీయముగా ఉండును. అందు గజాశ్వరథబలములు సమృద్ధములు, వాద్యఘోషలు మాఱుమ్రోగుచుండును. అచటి వృక్షములు అన్నిఋతువులలోను ఫలములతో నిండియుండును. అది ఎల్లవేళలలో ఉద్యానవనములతో కళకళలాడుచుండును. (10-12)

రాజకుమార్తెవైన ఓ సీతా! నీవు నాయందనురక్తురాలవై అచట ఉన్నచో మనుష్యకాంతలజీవనమునుగూర్చి తలంపనే తలంపవు. ఓ సుందరీ! మానవలోక భోగములను, దివ్యలోకభోగములను అనుభవించుచు అల్పాయుష్కుడైన రాముని సంగతినే నీవు స్మరింపవు. (13-14)

దశరథుడు తనప్రియపుత్త్రుడైన భరతుని రాజ్యాభిషిక్తుని గావించి, రాముడు జ్యేష్ఠుడైనను, అసమర్థుడగుటచే అతనిని వనములకు పంపెను. ఓ విశాలాక్షీ! రాముడు రాజ్యభ్రష్టుడగుటచే కర్తవ్యాకర్తవ్యములయెడ నిర్ణయశక్తిని కోల్పోయెను. అతడు విరక్తికి గుఱియై శోకమగ్నుడయ్యెను. అట్టి రామునితో నీకేమి ప్రయోజనము? (15-16)

1) కుబేరుడు బ్రహ్మవలన లోకపాలకుడు, ధనాధిపతి అయ్యెను. ఇతడు శంకరునకు మిత్రుడు. లంకా పట్టణము, పుష్పకవిమానము మొదట ఇతనివే. తరువాత రావణుడు బలప్రయోగముచేసి, పుష్పకమును, లంకను ఇతనినుండి లాగికొనెను - నలకూబరుడు, మణిగ్రీవుడు అనువారు ఇతని కుమారులు - ఇతడు నరవాహనుడు - అలకాపురి ఇతనిరాజధాని, 'చైత్రరథము' అనునది ఇతని ఉద్యానవనము.

సర్వరాక్షసభర్తారం కామాత్ స్వయమిహాగతమ్।
న మన్మథశరావిష్టం ప్రత్యాఖ్యాతుం త్వమర్హసి। 17

ప్రత్యాఖ్యాయ హి మాం భీరు! పరితాపం గమిష్యసి।
చరణేనాభిహత్యేవ పురూరవసమూర్వశీ। 18

అంగుల్యా న సమో రామో మమ యుద్ధే స మానుషః।
తవ భాగ్యేన సంప్రాప్తం భజస్వ వరవర్ణిని!। 19

నేను సమస్తరాక్షసులకును ప్రభువును, నీపై మరులు పెంచుకొని ఇటు వచ్చితిని. కామవికారములకులోనైన నన్ను నీవు తిరస్కరింపరాదు. ఓభయస్వభావురాలా! నీవు నన్ను కాదన్నచో, ఒకానొకప్పుడు పురూరవుని తనకాలితో తన్ని తిరస్కరించి, మరల అయనపొందుగోరి ఊర్వశి పశ్చాత్తాపపడినట్లు నీవును పరితాపమునకు లోనగుదువు. ఓ సుందరీ! మానవమాత్రుడైన రాముడు పరాక్రమమున నాకాలిగోటికిని సరితూగడు. నీఅదృష్టముకొలది నేను నిన్ను చేరితిని. కనుక నన్ను స్వీకరింపుము." (17-19)

ఏవ ముక్తా తు వైదేహీ క్రుద్ధా సంరక్తలోచనా।
అబ్రవీత్ పరుషం వాక్యం రహితే రాక్షసాధిపమ్। 20

ఆ నిర్జనవనప్రదేశమున రావణుడిట్లు పలుకగా సీతాదేవి మిగుల క్రుద్ధురాలై కన్నులెఱ్ఱజేయుచు ఆ రాక్షసరాజుతో ఇట్లు పరుషముగా వచించెను. (20)

కథం వైశ్రవణం దేవం సర్వభూతనమస్కృతమ్।
భ్రాతరం వ్యపదిశ్య త్వమ్ అశుభం కర్తుమిచ్ఛసి?। 21

అవశ్యం వినశిష్యంతి సర్వే రావణ! రాక్షసాః।
యేషాం త్వం కర్కశో రాజా దుర్బుద్ధిరజితేంద్రియః। 22

"సమస్తప్రాణులకును పూజ్యుడు, మహాత్ముడు ఐన కుబేరునకు సోదరుడవయ్యును ఇట్టి పాపకృత్యమునకు ఏల పూనుకొనుచున్నావు? ఓ రావణా! నీవు క్రూరుడవు, ఇంద్రియసుఖలోలుడవు, నీ బుద్ధి పెడదారి పట్టినది. అట్టి నిన్ను ప్రభువుగా పొందిన రాక్షసులందఱును నిర్మూలముగా తప్పక నశింతురు. (21-22)

అపహృత్య శచీం భార్యాం శక్యమింద్రస్య జీవితుమ్।
న చ రామస్య భార్యాం మామ్ అపనీయాస్తి జీవితమ్। 23

ఎవ్వడైనను ఇంద్రునిభార్యయైన శచీదేవిని అపహరించి, ఒకవేళ ప్రాణములతో మిగిలి యుండవచ్చునేమోగాని, శ్రీరామునిభార్యనైన నన్ను అపహరించినవాడు తనప్రాణములపై ఆశవదలు కొనవలసినదే. (23)

జీవేచ్చిరం వజ్రధరస్య హస్తాత్
శచీం ప్రధృష్యాప్రతిరూపరూపామ్ ।
న మాదృశీం రాక్షస! దూషయిత్వా
పీతామృతస్యాపి తవాస్తి మోక్షః । 24

ఓ రాక్షసా! నిరుపమానసౌందర్యవతియైన శచీదేవిని ఇంద్రునిఅధీనమునుండి బలవంతముగా లాగికొనిపోయియు జీవించియుండవచ్చునేమోగాని, నావంటిదానిని అవమానించి (కష్టపెట్టి) నీవు అమృతమును త్రాగినను మరణమునుండి తప్పించుకొనజాలవు." (24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే అష్టచత్వారింశస్సర్గః (48)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదియెనిమిదవసర్గము.

-- * * * --

49. నలుబదితొమ్మిదవసర్గము

సీతాదేవితనయెడ సుముఖురాలు అగుటకై రావణుడు నయభయవచనములను పలుకుట - అతడు రాక్షసరూపమును పొంది, ఆమెను రథముపై చేర్చుకొని ఆకాశమార్గమున బయలుదేరుట - నిస్సహాయస్థితిలోనున్న జానకి తనను రక్షించుటకై లక్ష్మణుని, ప్రకృతిని వేడుకొనుట - జటాయువును అర్థించుట -

సీతాయా వచనం శ్రుత్వా దశగ్రీవః ప్రతాపవాన్।
హస్తే హస్తం సమాహత్య చకార సుమహద్వపుః। 1

సీతాదేవి పలుకులను విని, రావణుడు తీరని అసహనమునకులోనై, (ఏమిచేయుటకునుతోచనివాడై), చేతులు పిసికికొనుచు మహాకాయమును ప్రదర్శించెను."(1)

స మైథిలీం పునర్వాక్యం బభాషే చ తతో భృశమ్।
నోన్మత్తయా శ్రుతౌ మన్యే మమ వీర్యపరాక్రమౌ। 2

ఉద్వహేయం భుజాభ్యాం తు మేదినీమ్ అంబరే స్థితః।
ఆపిబేయం సముద్రం చ హన్యాం మృత్యుం రణే స్థితః। 3

అర్కం రుంధ్యాం శరైస్తీక్ష్ణైః విభింద్యాం హి మహీతలమ్।
కామరూపిణమున్మత్తే పశ్య మాం కామదం పతిమ్। 4

అనంతరము అతడు సీతాదేవితో మిగుల గట్టిగా ఇట్లు పలికెను. "ఓసీతా! నీవు నీపతివ్యామోహములోబడి నా శౌర్యపరాక్రమములనుగూర్చి సరిగా విననట్లు లేదు. ఓ ఉన్మత్తురాలా! నేను ఆకాశమునందుండియే నాభుజబలముచే భూమండలమును పైకెత్తగలను. సముద్రజలములను ఆపోశనము పట్టగలను. (త్రాగివేయగలను.) రణరంగమున నిలిచి మృత్యుదేవతను హతమార్చగలను. సూర్యుని అడ్డుకొనగలను, వాడియైన బాణములచే భూమిని బ్రద్దలు గావింపగలను. నేను కోరుకొనిన రూపమును ధరింపగలను. నీవు దేనిని కోరినను ఇయ్యగలను, కనుక నన్ను పతిగా స్వీకరింపుము. (2-4)

ఏవముక్తవతస్తస్య సూర్యకల్పే శిఖిప్రభే।
క్రుద్ధస్య హరిపర్యంతే రక్తే నేత్రే బభూవతుః। 5

సద్యః సౌమ్యం పరిత్యజ్య భిక్షురూపం స రావణః।
స్వం రూపం కాలరూపాభం భేజే వైశ్రవణానుజః। 6

క్రుద్ధుడై ఇట్లు పలుకుచున్న రావణునికన్నులు సూర్యగోళములై, అగ్నిజ్వాలలను వెలిగ్రక్కినవి, పింగళవర్ణముతో ఎఱ్ఱబారినవి. వెంటనే కుబేరునిసోదరుడైన రావణుడు సౌమ్యమైన భిక్షువేషమును పరిత్యజించి, ప్రళయకాలయమునివలె భయంకరమైన తన నిజరూపమును దాల్చెను. (5-6)

సంరక్తనయనః శ్రీమాన్ తప్తకాంచనకుండలః।
క్రోధేన మహతావిష్టో నీలజీమూతసన్నిభః।
దశాస్యః కార్ముకీ బాణీ బభూవ క్షణదాచరః। 7

స పరివ్రాజకచ్ఛద్మ మహాకాయో విహాయ తత్।
ప్రతిపద్య స్వకం రూపం రావణో రాక్షసాధిపః। 8

సంరక్తనయనః క్రోధాత్ జీమూతనిచయప్రభః।
రక్తాంబరధరస్తస్థౌ స్త్రీరత్నం ప్రేక్ష్య మైథిలీమ్। 9

అప్పుడు రాక్షసరూపమును పొందిన ఆ రావణుడు పదితలలతో ఒప్పుచు ధనుర్బాణములను ధరించియుండెను. క్రోధావేశపరుడైన అతనికనులనుండి చింతనిప్పులు కురియుచుండెను. నల్లని మేఘమువలె విలసిల్లుచు విచిత్రశక్తిసంపన్నుడైన అతడు మేలిమిబంగారు కుండలములను ధరించియుండెను. మహాకాయుడైన రాక్షసరాజగు రావణుడు యతీశ్వరునిరూపమును వీడి, స్వస్వరూపమును దాల్చెను. మేఘసముదాయమువలె నల్లనివాడు, ఎఱ్ఱని వస్త్రములను ధరించినవాడు ఐన ఆ రావణుడు క్రోధముతో కనులెఱ్ఱజేసి, స్త్రీరత్నమైన మైథిలిని చూచుచు నిలబడెను. (7-9)

స తామ్ అసితకేశాంతాం భాస్కరస్య ప్రభామివ।
వసనాభరణోపేతాం మైథిలీం రావణోఽబ్రవీత్। 10

పిమ్మట ఆ దశకంఠుడు నల్లనికురులు గలిగి, సూర్య కాంతులను బోలిన తనుశోభలతో విరాజిల్లుచు, చక్కని వస్త్రాభరణములను ధరించియున్న సీతాదేవితో ఇట్లనెను. (10)

త్రిషు లోకేషు విఖ్యాతం యది భర్తారమిచ్ఛసి।
మామాశ్రయ వరారోహే! తవాహం సదృశః పతిః। 11

మాం భజస్వ చిరాయ త్వమ్ అహం శ్లాఘ్యః ప్రియస్తవ।
నైవ చాహం క్వచిద్భద్రే! కరిష్యే తవ విప్రియమ్। 12

త్యజ్యతాం మానుషో భావో మయి భావః ప్రణీయతామ్।
రాజ్యాచ్చ్యుతమ్ అసిద్ధార్థం రామం పరిమితాయుషమ్। 13

కైర్గుణైరనురక్తాఽసి మూఢే! పండితమానిని!।
యః స్త్రియా వచనాద్రాజ్యం విహాయ ససుహృజ్జనమ్। 14

అస్మిన్ వ్యాళానుచరితే వనే వసతి దుర్మతిః। 15

"ముల్లోకములలోను ఖ్యాతికెక్కిన వానిని భర్తగా కోరుకొనుచున్నచో నీవు నన్నాశ్రయించుట యుక్తము. నీకు అన్నివిధములుగా తగిన భర్తను నేనే. ఓ కల్యాణీ! కలకాలము నీవు నాతోనే ఉండిపొమ్ము. నిన్ను సంతోషపఱచుచు నీ ప్రశంసలను పొందదగినవాడను నేను. నీకు నేనెన్నడును అప్రియమును కల్గింపను. మనుష్యమాత్రుడైన రామునిపై వ్యామోహమును త్యజింపుము. నాయందే అనురక్తురాలవు కమ్ము. 'నేనే బుద్ధిమంతురాలను' అని భావించుకొనెడి ఓ మూఢురాలా! రాముడు పట్టాభిషిక్తుడును కాలేదు, పైగా రాజ్యభ్రష్టుడైనాడు, అంతేగాక అల్పాయుష్కుడు. ఆయనలో ఏగొప్పదనమును జూచి, ఆయనపై అనురాగము కలిగియున్నావు? ఒక స్త్రీ కారణముగ ఆ తెలివితక్కువవాడు పెక్కుమంది బంధుమిత్రులతో గూడిన రాజ్యమును వీడి, క్రూరమృగములకు నెలవైన ఈ వనమునందు నివసించుచున్నాడు." (11-15)

ఇత్యుక్త్వా మైథిలీం వాక్యం ప్రియార్హాం ప్రియవాదినీం।
అభిగమ్య సుదుష్టాత్మా రాక్షసః కామమోహితః।
జగ్రాహ రావణః సీతాం బుధః ఖే రోహిణీమివ। 16

వామేన సీతాం పద్మాక్షీం మూర్ధజేషు కరేణ సః।
ఊర్వోస్తు దక్షిణేనైవ పరిజగ్రాహ పాణినా। 17

మైథిలితో ఇట్లు పలికి, దుష్టాత్ముడైన ఆ రాక్షసుడు కామాతురుడై[1] సముచితముగను, ధర్మబద్ధముగను, మాట్లాడుచున్నదియు, గౌరవాదరములకు పాత్రురాలును ఐన సీతాదేవిని సమీపించి, ఆకాశమున బుధుడు రోహిణినివలె[2] ఆమెను పట్టుకొనెను. అతడు పద్మాక్షియైన సీతాదేవి జుట్టును ఎడమ చేతితోను, ఆమె పాదములను కుడిచేతితోను పట్టుకొనెను. (16-17)

తం దృష్ట్వా మృత్యుసంకాశం తీక్ష్ణదంష్ట్రం మహాభుజమ్।
ప్రాద్రవన్ గిరిసంకాశం భయార్తా వనదేవతాః। 18

మృత్యుదేవతవలె భయంకరుడు, నుసుపుదేలి వికృతముగానున్న కోఱలుగలవాడు, మిక్కిలి భుజబలముగలవాడు, పర్వతమువలె మహాకాయము గలవాడు ఐన ఆ రావణుని జూచి, వనదేవతలు ఎల్లరును భయగ్రస్తులై పరుగులుదీసిరి. (18)

1) కామాతురాణాం న భయం న లజ్జా - నీతి శాస్త్రము.
కామముయొక్క పిచ్చిలో మునిగిన వారికి భయము గాని, సిగ్గుగాని ఉండవు.

2) రోహిణి చంద్రునిభార్య. బుధుడు చంద్రుని కుమారుడు. కనుక రోహిణి బుధునకు తల్లితో సమానురాలు. బుధుడు రోహిణినివలె రావణుడు జగన్మాతయైన సీతాదేవిని దుష్టభావముతో పట్టుకొనెను- బుధుడు ఎన్నడును రోహిణిని పట్టుకొనలేదు, పట్టుకొనజాలడుగూడ. రావణునిదుష్కృత్యమును స్పష్టపఱచుటకే అట్లు పోల్చి చెప్పబడినది. ఇది అభూతోపమ.

స చ మాయామయో దివ్యః ఖరయుక్తః ఖరస్వనః।
ప్రత్యదృశ్యత హేమాంగో రావణస్య మహారథః। 19

ఇంతవఱకును గుప్తముగానుంచబడిన రావణునిరథము ఇంతలో అచట బహిర్గతమయ్యెను. అది క్షణములో అంతర్ధానమగుట, మఱుక్షణములో ప్రత్యక్షమగుట మొదలగు మాయాలక్షణములుగలది, అద్భుతమైనది, గుఱ్ఱములచే పూన్చబడియున్నట్టిది, అది సాగిపోవునప్పుడు దానిధ్వనులు కఠోరముగా నుండును. దానిఅంగములు (చక్రములు మొదలగునవి) అన్నియు బంగారువి. (19)

తతస్తాం పరుషైర్వాక్యైః భర్త్సయన్ స మహాస్వనః।
అంకేనాదాయ వైదేహీం రథమారోపయత్ తదా। 20

అనంతరము ఆరావణుడు గొంతుపెంచి, పరుష వచనములతో సీతాదేవిని భయపెట్టుచు, ఆమెను ఒడిలోనికి దీసికొని రథముపైనుంచెను. (20)

సా గృహీతా విచుక్రోశ రావణేన యశస్వినీ।
రామేతి సీతా దుఃఖార్తా రామం దూరగతం వనే। 21

ఉత్తమపతివ్రతయైన సీతాదేవిని రావణుడు అట్లు తీసికొనిపోవుటకు సిద్ధపడగా ఆమె దుఃఖార్తయై, వనములో సుదూరముననున్న తనభర్తను స్మరించుచు, 'రామా! రామా!' అని బిగ్గఱగా కేకలుపెట్టుచు ఏడువసాగెను. (21)

తామ్ అకామాం స కామార్తః పన్నగేంద్రవధూమివ।
వివేష్టమానామ్ ఆదాయ ఉత్పపాతాథ రావణః। 22

కామార్తుడైన ఆ రావణుడు తనయెడ విముఖురాలై[1] ఆడుపామువలె మెలికలు తిరుగుచున్న (తననుండి తప్పించుకొనుటకై పెనగులాడుచున్న) ఆ సీతాదేవిని పట్టుకొని, రథములో ఆకాశమునకు ఎగిరెను. (22)

తతః సా రాక్షసేంద్రేణ హ్రియమాణా విహాయసా।
భృశం చుక్రోశ మత్తేవ భ్రాంతచిత్తా యథాఽఽతురా। 23

రావణుడు తనను అట్లు అపహరించుకొని, ఆకాశమార్గమున వెళ్ళుచుండగా ఆమె ఆర్తురాలై, నిస్పృహతో కలవరపడుచు బిగ్గఱగా ఏడువసాగెను. (23)

హా లక్ష్మణ! మహాబాహో! గురుచిత్తప్రసాదక!।
హ్రియమాణాం న జానీషే రక్షసా మామ్ అమర్షిణా। 24

"అయ్యో "లక్ష్మణా! ఓ మహాబాహూ! పెద్దల మనస్సులను ఎఱిగి మసలుకొనువాడా! ఈ రాక్షసుడు కోపముతో (ఖరాదిరాక్షసులను సంహరించిన శ్రీరామునిపైగల పగతో) నన్ను అపహరించుకొని పోవుచున్న విషయమును నీవు ఎఱుగవా? (24)

జీవితం సుఖమర్థాంశ్చ ధర్మహేతోః పరిత్యజన్।
హ్రియమాణామ్ అధర్మేణ మాం రాఘవ! న పశ్యసి। 25

ఓ రఘునాథా! ధర్మపరిరక్షణకై నీవు ప్రాణములపై మోహమును, శారీరకసుఖములను, రాజ్యభోగములను అన్నింటిని వదలుకొని వచ్చితివి గదా. ఈ దుర్మార్గుడు అధర్మముగా నన్ను అపహరించుకొని పోవుచుండుట నీవు చూచుట లేదా?" (25)

నను నామాఽవినీతానాం వినేతాఽసి పరంతప!।
కథమ్ ఏవంవిధం పాపం న త్వం శాసి హి రావణమ్। 26

ఓ పరంతపా! దుర్జనులను పరిమార్చుటలో నీవు దక్షుడవని వాసికెక్కితివి. కాని పాపాత్ముడైన ఈ రావణుని శిక్షింపక ఎందులకు ఉపేక్షించుచున్నావు? (26)

1) అకారః = విష్ణుః; అ + కామా = అకామా = విష్ణుకామా = శ్రీమహావిష్ణువుపై ప్రేమగలది

నతు సద్యోఽవినీతస్య దృశ్యతే కర్మణః ఫలమ్।
కాలోఽప్యంగీభవత్యత్ర సస్యానామివ పక్తయే॥ 27

న కర్మ కృతవానేతత్ కాలోపహతచేతనః।
జీవితాంతకరం ఘోరం రామాద్వ్యసనమాప్నుహి॥ 28

హంతేదానీం సకామాస్తు కైకేయీ సహ బాంధవైః।
హ్రియే యద్ధర్మకామస్య ధర్మపత్నీ యశస్వినః॥ 29

ఆమంత్రయే జనస్థానే కర్ణికారాన్ సుపుష్పితాన్।
క్షిప్రం రామాయ శంసధ్వం సీతాం హరతి రావణః॥ 30

మాల్యవంతం శిఖరిణం వందే ప్రస్రవణం గిరిమ్।
క్షిప్రం రామాయ శంస త్వం సీతాం హరతి రావణః॥ 31

హంసకారండవాకీర్ణాం వందే గోదావరీం నదీమ్।
క్షిప్రం రామాయ శంస త్వం సీతాం హరతి రావణః॥ 32

దైవతాని చ యాన్యస్మిన్ వనే వివిధపాదపే।
నమస్కరోమ్యహం తేభ్యో భర్తుః శంసత మాం హృతామ్॥ 33

యాని కానిచిదప్యత్ర సత్త్వాని నివసంత్యుత।
సర్వాణి శరణం యామి మృగపక్షిగణానపి॥ 34

హ్రియమాణాం ప్రియాం భర్తుః ప్రాణేభ్యోఽపి గరీయసీమ్।
వివశాఽపహృతా సీతా రావణేనేతి శంసత॥ 35

విదిత్వా మాం మహాబాహుః అముత్రాపి మహాబలః।
ఆనేష్యతి పరాక్రమ్య వైవస్వతహృతామపి॥ 36

పాపాత్మునియొక్క దుష్కర్మలఫలము వెంటనే కనబడదుగదా! విత్తనమునాటిన వెంటనే పంటలభించదు గదా! దేనికైనను తగినసమయము రావలెను- (27)

"ఓ రావణా! నీవు ఆయువుదీఱినవాడవై ప్రాణాంతకమైన ఈ ఘోర కృత్యమునకు పాల్పడుచున్నావు. నీవు ఇడుమలపాలై రామునిచేతిలో మరణించుట తథ్యము." (28)

అయ్యో!! ధర్మాత్ముడైన శ్రీరామునియొక్క ధర్మపత్నినైన నన్ను ఈ దురాత్ముడు తీసికొని పోవుచున్నాడు. ఇప్పుడు కైకేయియొక్క, ఆమెఆత్మబంధువుల యొక్క కోరికలు నెఱవేఱి, వారి మనసులు కుదుటబడియుండవచ్చును- (29)

"దండకారణ్యమున బాగుగా పుష్పించియున్న ఓ గన్నేరుమొక్కలారా! 'రావణుడు సీతను అపహరించుకొని పోవుచున్నాడు' అని వెంటనే రామునకు తెలుపుడు - ఇది నా ప్రార్థన - ఉన్నత శిఖరములతో ఒప్పుచు పుష్పఫల సంపన్నమైన ఓ ప్రస్రవణ గిరీ! నీకు నమస్కారము రావణుడు సీతను అపహరించుకొని పోవుచున్నాడని వెంటనే శ్రీరామునకు తెలుపుము. హంసలతో, బెగ్గురుపక్షులతో విలసిల్లుచున్న ఓ గోదావరీనదీ! నీకు ప్రణమిల్లుచున్నాను. రావణుడు సీతను అపహరించుకొని పోవుచున్నాడని వెంటనే రామునకు నివేదింపుము. - ఈ వనములయందుగల వివిధవృక్షములయొక్క అధిదేవతలందఱికిని నమస్కరించుచున్నాను. ఈ రాక్షసుడు నన్ను అపహరించుకొని పోవుచున్న వార్తను వారు నాభర్తకు తెలుపుదురుగాక. (30-33)

ఈ వనమును ఆశ్రయించుకొని జీవించుచున్న పశుపక్ష్యాది సమస్తప్రాణులారా! నేను మిమ్ము శరణు వేడుచున్నాను. మీరు నా భర్తకు 'ఓరామా! నీకు ప్రాణములకంటెను మిన్నయైనదియు, నీకు అత్యంత ప్రేమపాత్రురాలును ఐన సీతాదేవిని రావణుడు అపహరించుకొని పోవుచున్నాడు. ఆమె నిస్సహాయస్థితిలో ఉన్నది'- అని నివేదింపుడు. (34-35)

శ్రీరాముడు మహాభుజబలశాలి. ఒకవేళ నన్ను యముడు అపహరించుకొనిపోయినను ఆ విషయము నెఱింగి, ఆ పరలోకమునుండియైనను అతడు తన పరాక్రమముతో నన్ను తీసికొని రాగలడు." (36)

సా తదా కరుణా వాచో విలపంతీ సుదుఃఖితా।
వనస్పతిగతం గృధ్రం దదర్శాఽఽయతలోచనా। 37

విశాలాక్షియైన ఆ సీతాదేవి మిగులదుఃఖితయై దయనీయవచనములతో ఇట్లు విలపించుచు ఆ సమయమున చెట్టుపైగల జటాయుపక్షిని జూచెను. (37)

సా తముద్వీక్ష్య సుశ్రోణీ రావణస్య వశం గతా।
సమాక్రందద్భయపరా దుఃఖోపహతయా గిరా। 38

రావణునినిర్బంధములో భయగ్రస్తయైయున్న ఆ సుందరి ఆజటాయువును జూచి, దుఃఖపూరితమైన గద్గదస్వరముతో ఆక్రందించుచు ఇట్లు వేడుకొనెను.(38)

జటాయో! పశ్య మామార్య! హ్రియమాణామ్ అనాథవత్।
అనేన రాక్షసేంద్రేణ కరుణం పాపకర్మణా। 39

నైష వారయితుం శక్యః తవ క్రూరో నిశాచరః।
సత్త్వవాన్ జితకాశీ చ సాయుధశ్చైవ దుర్మతిః। 40

రామాయ తు యథాతత్త్వం జటాయో! హరణం మమ।
లక్ష్మణాయ చ తత్సర్వమ్ ఆఖ్యాతవ్యమ్ అశేషతః। 41

"పూజ్యుడవైన ఓ జటాయూ! పాపకర్ముడైన ఈ రాక్షసరాజు ఒకదిక్కులేనిదానినివలె నన్ను అపహరించుకొని పోవుచున్నాడు. దయజూడుము. ఈ నిశాచరుడు క్రూరుడు, బలశాలి, విజయగర్వముతో నున్నవాడు, సాయుధుడు, పైగా దురాత్ముడు. అట్టి ఇతనిని ఎదుర్కొనుట నీకు అశక్యము. కావున ఓ జటాయూ! ఇతడు నన్ను అపహరించుకొని పోవుచున్న విషయమును పూసగ్రుచ్చినట్లు పూర్తిగా రామలక్ష్మణులకు వివరింపుము." (39-41)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకోనపంచాశస్సర్గః (49)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది నలుబదితొమ్మిదవసర్గము.

-- * * * --

50. ఏబదియవసర్గము

సీతాదేవిని తన రథముపై తీసికొని పోవుచున్న రావణుని నిలువరించుచు జటాయువు హితోక్తులు పల్కుట - 'యుద్ధమునకు సిద్ధమగుము'- అని అతనిని హెచ్చరించుట -

తం శబ్దమ్ అవసుప్తస్తు జటాయురథ శుశ్రువే।
నిరీక్ష్య రావణం క్షిప్రం వైదేహీం చ దదర్శ సః। 1

అంతట అప్పుడే నిద్రకుదిగిన జటాయువు సీతాదేవి యొక్క ఆక్రందనధ్వనులను వినెను. అతడు తటాలున మేల్కొని, రథముపైనున్న రావణుని, వైదేహిని చూచెను. (1)

తతః పర్వతకూటాభః తీక్ష్ణతుండః ఖగోత్తమః।
వనస్పతిగతః శ్రీమాన్ వ్యాజహార శుభాం గిరమ్। 2

పర్వతశిఖరమువలె ఉన్నతుడు, మొనదేలిన ముక్కుతోగూడిన ముఖముగలవాడు, రామసేవాతత్పరుడు, పక్షులలో శ్రేష్ఠుడు ఐన జటాయువు ఒక చెట్టుపైనుండి రావణునితో ఇట్లు హితవచనములను పలికెను. (2)

దశగ్రీవ! స్థితో ధర్మే పురాణే సత్యసంశ్రయః।
జటాయుర్నామ నామ్నాఽహం గృధ్రరాజో మహాబలః। 3

"ఓ దశగ్రీవా! నాపేరు జటాయువు, సనాతన ధర్మమును పాటించువాడను, భగవంతుని నమ్మిన వాడను, (శ్రీరాముని సేవకుడను) నేను మహాబలశాలినైన గ్రద్దను. (3)

రాజా సర్వస్య లోకస్య మహేంద్రవరుణోపమః।
లోకానాం చ హితే యుక్తో రామో దశరథాత్మజః। 4

శ్రీరాముడు దశరథమహారాజుయొక్క కుమారుడు, అతడు సర్వలోకములకును ప్రభువు, మహేంద్ర వరుణులతో సమానుడు, సకలప్రాణులకును హితమును గూర్చువాడు. (4)

తస్యైషా లోకనాథస్య ధర్మపత్నీ యశస్వినీ।
సీతా నామ వరారోహా యాం త్వం హర్తుమ్ ఇహేచ్ఛసి। 5

నీవు అపహరించుకొనిపోవుచున్న ఈ సీతాదేవి జగన్నాథుడైన శ్రీరామునిధర్మపత్ని, ఈ సుందరి పతివ్రతాశిరోమణి (5)

కథం రాజా స్థితో ధర్మే పరదారాన్ పరామృశేత్।
రక్షణీయా విశేషేణ రాజదారా మహాబల। 6

నివర్తయ మతిం నీచాం పరదారాభిమర్శనాత్।
న తత్ సమాచరేద్ధీరో యత్పరోఽస్య విగర్హయేత్
యథాఽఽత్మనస్తథాఽన్యేషాం దారా రక్ష్యా విపశ్చితా। 7

అర్థంవా యదివా కామం శిష్టాః శాస్త్రేష్వనాగతమ్।
వ్యవస్యంతి న రాజానో ధర్మం పౌలస్త్యనందన। 8

ఓ బలశాలీ! ధర్మవర్తనుడైన రాజు పరసతులను ఎట్లు స్పృశించును. మీదుమిక్కిలి రాజపత్నులను తప్పక రక్షింపవలెనుగదా! నీచమైన పరదారాభిలాషనుండి నీ బుద్ధిని మఱలింపుము. ఇతరులు (లోకము) నిందించునట్టి కృత్యమును ధీరుడైనవాడు ఎన్నడును చేయరాదు. వివేకముగలవాడు తనభార్యను రక్షించు కొనురీతిగా పరసతులనుగూడ కాపాడవలెను. ఓ పౌలస్త్యనందనా! సత్పురుషులైన రాజులు ధర్మార్థ కామవిషయముల యందు శాస్త్రోక్తములైన మార్గములనే అనుసరింతురు. వాటికి విరుద్ధముగా ఎన్నడును నడుచుకొనరు - కనుక నీవు ఇట్లు అకార్యమునకు పాల్పడుట తగదు. (6-8)

రాజా ధర్మస్య కామస్య ద్రవ్యాణాం చోత్తమో నిధిః।
ధర్మః శుభం వా పాపం వా రాజమూలం ప్రవర్తతే। 9

ధర్మాచరణమునందును, కామానుభవములయందును, ద్రవ్యములను ఆర్జించుటయందును, వాటిని వినియోగించుట యందును ఎల్లరకును రాజే మార్గదర్శకుడు. ఏలనన పుణ్యకార్యములయందైనను, పాపకృత్యములయందైనను ప్రజలు రాజునే అనుసరింతురు - (యథా రాజా తథా ప్రజాః - అనిగదా). (9)

పాపస్వభావశ్చపలః కథం త్వం రక్షసాం వర!।
ఐశ్వర్యమభిసంప్రాప్తో విమానమివ దుష్కృతీ। 10

కామం స్వభావో యో యస్య న శక్యః పరిమార్జితుమ్।
న హి దుష్టాత్మనామ్ ఆర్యమ్ ఆవసత్యాలయే చిరమ్। 11

ఓ రాక్షసరాజా! నీవు పాపశీలుడవు, చపలుడవు. కావున అనర్హుడవైన నీకు ఈ రాజ్యాధికారము ఎట్లు లభించినది? ఇది నీకు లభించుట పుణ్యాత్మునకు ప్రాప్తింపవలసిన స్వర్గవిమానము ఒక పాపాత్మునకు లభించినట్లుగానున్నది - ఎవరిస్వభావమునైనను పూర్తిగా మార్చుట అసాధ్యము - దుష్టాత్ముల హృదయములలో సదుపదేశములు ఎక్కువ కాలము నిలిచియుండవుగదా! (10-11)

విషయే వా పురే వా తే యదా రామో మహాబలః।
నాపరాధ్యతి ధర్మాత్మా కథం తస్యాపరాధ్యసి। 12

శ్రీరాముడు మిక్కిలి బలశాలియేయైనను అతడు ధర్మాత్ముడు అగుటవలన నీరాజ్యమునకుగాని, నీలంకానగరమునకుగాని ఎట్టి హానినీ కలిగింపలేదుగదా! మఱి ఆయనభార్యను అపహరించుకొనిపోవుచు ఆయనయెడ ఎందులకు అపరాధము చేయుచున్నావు? (12)

యది శూర్పణఖాహేతోః జనస్థానగతః ఖరః।
అతివృత్తో హతః పూర్వం రామేణాక్లిష్టకర్మణా। 13

జనస్థానమునందున్న ఖరుడు హద్దుమీఱి శూర్పణఖ కారణముగ శ్రీరామునితో పోరునకు తలపడెను. అప్పుడు మహాపరాక్రమశాలియైన ఆ రఘువీరుడు అతనిని

అత్ర బ్రూహి యథాతత్త్వమ్ కో రామస్య వ్యతిక్రమః।
యస్య త్వం లోకనాథస్య భార్యాం హృత్వా గమిష్యసి। 14

క్షిప్రం విసృజ వైదేహీం మా త్వా ఘోరేణ చక్షుషా।
దహేద్దహనభూతేన వృత్రమ్ ఇంద్రాశనిర్యథా। 15

సర్పమ్ ఆశీవిషం బద్ధ్వా వస్త్రాంతే నావబుధ్యసే।
గ్రీవాయాం ప్రతిముక్తం చ కాలపాశం న పశ్యసి। 16

స భారః సౌమ్య! భర్తవ్యో యో నరం నావసాదయేత్।
తదన్నమపి భోక్తవ్యం జీర్యతే యదనామయమ్। 17

యత్ కృత్వా న భవేద్ధర్మో న కీర్తిర్న యశో భువి।
శరీరస్య భవేత్ ఖేదః కస్తత్కర్మ సమాచరేత్। 18

షష్టిర్వర్షసహస్రాణి మమ జాతస్య రావణ!।
పితృపైతామహం రాజ్యం యథావదనుతిష్ఠతః। 19

వృద్ధోఽహం త్వం యువా ధన్వీ సశరః కవచీ రథీ।
తథాఽప్యాదాయ వైదేహీం కుశలీ న గమిష్యసి। 20

న శక్తస్త్వం బలాద్ధర్తుం వైదేహీం మమ పశ్యతః।
హేతుభిర్న్యాయసంయుక్తైః ధ్రువాం వేదశ్రుతీమివ। 21

యుధ్యస్వ యది శూరోఽసి ముహూర్తం తిష్ఠ రావణ!।
శయిష్యసే హతో భూమౌ యథా పూర్వం ఖరస్తథా। 22

అసకృత్ సంయుగే యేన నిహతా దైత్యదానవాః।
న చిరాచ్చీరవాసాస్త్వాం రామో యుధి వధిష్యతి। 23

హతమార్చెను. యథార్థముగా ఇందులో శ్రీరాముని దోషము ఏమాత్రమును లేదు. అట్టిస్థితిలో ఆ జగన్నాథునిభార్యయైన సీతాదేవిని అపహరించుట ఎంతవఱకు సముచితమో తెలుపుము? (13-14)

ఓ రావణా! వెంటనే సీతాదేవిని విడిచిపెట్టుము. లేనిచో ఇంద్రునివజ్రాయుధము వృత్రాసురుని హతమార్చినట్లు, క్రుద్ధుడైన శ్రీరాముడు అగ్నితుల్యములైన తనచూపుల తోడనే నిన్ను దహించివేయగలడు. నీవు సీతాదేవిని అపహరించుట 'కోఱలనుండి విషమును వెలిగ్రక్కుచున్న కోడెత్రాచును వస్త్రముకొంగున మూటగట్టుకొనుట వంటిది. యమపాశమును మెడకు చుట్టుకొనుట వంటిది'- అని ఎఱుంగలేకున్నావు. (15-16)

ఓ సౌమ్యుడా! మోయగలిగిన బరువును మాత్రమే తలకెత్తుకొనవలెను. మించిన బరువును నెత్తిన పెట్టుకొన్నచో అది వానిని క్రుంగదీయును. అట్లే ఎవరైనను జీర్ణమగు ఆహారమునే తినవలయును. లేనిచో అది వ్యాధిని తెచ్చిపెట్టును సుమా! ధర్మమునకును, కీర్తిప్రతిష్ఠలకును భంగము గలిగించు పనిని గాని, శరీరమునకు ఖేదమును (ఆయాసమును) కలిగించు కార్యమునుగాని ఎవ్వరును చేయరాదు. (17-18)

నావయస్సు అఱువదివేలసంవత్సరములు. తాతముత్తాతల నుండి సంక్రమించిన రాజ్యమును నేను ధర్మబద్ధముగా పాలించుచున్నాను. నేను అన్నివిధములుగా వృద్ధుడను, పైగా ధనుర్బాణములు మొదలగు ఆయుధములు లేనివాడను. నీవైతే యువకుడవు, ధనుర్బాణములను ధరించినవాడవు, కవచమును రథమును కలిగియున్నవాడవు, ఐనను ఇచట నేను ఉండగా వైదేహిని దీసికొని నీవు క్షేమముగా వెళ్లజాలవు. (19-20)

వేదము పరమప్రమాణమైనది న్యాయసమ్మతములైన హేతువులచేగూడ దానిప్రామాణ్యము ధ్రువీకరింపబడినది. వేదమును ఎవ్వరును నిరాకరింపజాలరు. అట్లే నేను చూచుచుండగా సీతాదేవిని బలవంతముగా అపహరించుకొని వెళ్లజాలవు. (21)

ఓ రావణా! క్షణమాగుము, వీరుడవైనచో నాతో యుద్ధము చేయుము. పూర్వము ఖరునివలె నీవును నేలగూలుట తథ్యము. లోగడ శ్రీరామునిచేతిలో దైత్యులు, దానవులు రణరంగమున పలుపర్యాయములు నిహతులైరి. అట్లే వల్కలములను ధరించియున్న ఆ రఘువరుడు సమరరంగమున త్వరలోనే నిన్ను వధించితీరును. (22-23)

కిన్ను శక్యం మయా కర్తుం గతౌ దూరం నృపాత్మజౌ।
క్షిప్రం త్వం నశ్యసే నీచ! తయోర్భీతో న సంశయః। 24

న హి మే జీవమానస్య నయిష్యసి శుభామిమామ్।
సీతాం కమలపత్రాక్షీం రామస్య మహిషీం ప్రియామ్। 25

ఓ నీచుడా! రాజకుమారులైన రామలక్ష్మణులిరువురును ఇక్కడికి దూరములోనున్నారు. వారికి భయపడియే నీవు వారు లేకుండుట చూచి ఈమెను అపహరించుకొని పోవుచున్నావు. వారిని తీసికొని వచ్చుటకై నేను వెళ్లినచో నీవిచటినుండి పాఱిపోవుదువు. అందువలన నేనే నిన్ను చంపెదను. అంతకంటె నేనేమి చేయుగలను? కమల పత్రాక్షియైన సీతాదేవి శ్రీరామునిపట్టమహిషి. ఆ ప్రభువునకు బహిఃప్రాణము. కనుక పూజ్యురాలు. నాబొందిలో ప్రాణములుండగా ఈమెను నీవు తీసికొని వెళ్లజాలవు. (24-25)

అవశ్యం తు మయా కార్యం ప్రియం తస్య మహాత్మనః।
జీవితేనాఽపి రామస్య తథా దశరథస్య చ। 26

దశరథమహారాజు నాకు గాఢమిత్రుడు. శ్రీరాముడు నాకు ప్రభువు. ఆమహాత్ములిరువురికిని నా ప్రాణములను అర్పించియైనను తప్పక ప్రియమును గూర్పవలెను. (26)

తిష్ఠ తిష్ఠ దశగ్రీవ! ముహూర్తం పశ్య రావణ!।
యుద్ధాతిథ్యం ప్రదాస్యామి యథాప్రాణం నిశాచర!। 27

వృంతాదివ ఫలం త్వాం తు పాతయేయం రథోత్తమాత్। 28

ఓ దశగ్రీవా! ఒక క్షణకాలముపాటు ఆగుమాగుము. ఓనిశాచరా! రణభూమియందు నీకు తగిన సత్కారమును జరిపెదను. తొడిమనుండి పండునువలె నిన్ను రథమునుండి క్రిందపడవేసెదను." (27-28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచాశస్సర్గః (50)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదియవసర్గము.

— ❋ ❋ ❋ —

51. ఏబదిఒకటవసర్గము

జటాయువునకును రావణునకును మధ్య పోరు ఘోరముగా సాగుట - జటాయువుధాటికి రావణుని రథాదులు ముక్కలగుట - రావణుని దెబ్బకు గృధ్రరాజు తెక్కలు తెగి నేలగూలుట - తనను రక్షించుటకై వచ్చిన జటాయువునకై సీతాదేవి మిగుల పరితపించుట -

ఇత్యుక్తస్య యథాన్యాయం రావణస్య జటాయుషా।
క్రుద్ధస్యాగ్నినిభాః సర్వా రేజుర్వింశతి దృష్టయః। 1

ధర్మబద్ధముగా జటాయువు ఇట్లు పలికిన పిమ్మట రావణుడు మిగుల క్రుద్ధుడై తనఇరువది నేత్రముల నుండియు నిప్పులు గురిపించెను. (1)

సంరక్తనయనః కోపాత్ తప్తకాంచనకుండలః।
రాక్షసేంద్రోఽభిదుద్రావ పతగేంద్రమ్ అమర్షణః। 2

మేలిమిబంగారుకుండలములుగల ఆ రాక్షసరాజు కోపముతో కన్నులెఱ్ఱజేయుచు, అసహనముతో ఊగిపోవుచు ఆ జటాయువుమీదికి దూకెను. (2)

స సంప్రహారస్తుములః తయోస్తస్మిన్ మహావనే।
బభూవ వాతోద్ధతయోః మేఘయోర్గగనే యథా। 3

తద్బభూవాద్భుతం యుద్ధం గృధ్రరాక్షసయోస్తదా।
సపక్షయోర్మాల్యవతోః మహాపర్వతయోరివ। 4

ఆ దండకారణ్యమునందు ఒకరిపైనొకరు దెబ్బతీయదలచుకొనిన ఆ జటాయురావణులమధ్య, ప్రతికూలవాయువులచే కొట్టబడిన రెండు మేఘములమధ్య జరిగిన సంఘర్షణమువలె తీవ్రమైన యుద్ధము ప్రారంభమాయెను. 'మాల్యవంతములు' అను పేర్లతో ఒప్పునట్టి రెండు మహాపర్వతములమధ్యవలె ఆయిరువురి నడుమ యుద్ధము అద్భుతముగా జరిగెను. (3-4)

తతో నాళీకనారాచైః తీక్ష్ణాగ్రైశ్చ వికర్ణిభిః।
అభ్యవర్షన్మహాఘోరైః గృధ్రరాజం మహాబలః। 5

స తాని శరజాలాని గృధ్రః పత్రరథేశ్వరః।
జటాయుః ప్రతిజగ్రాహ రావణాస్త్రాణి సంయుగే। 6

తస్య తీక్ష్ణనఖాభ్యాం తు చరణాభ్యాం మహాబలః।
చకార బహుధా గాత్రే వ్రణాన్ పతగసత్తమః। 7

అథ క్రోధాద్దశగ్రీవో జగ్రాహ దశ మార్గణాన్।
మృత్యుదండనిభాన్ ఘోరాన్ శత్రుమర్దనకాంక్షయా। 8

స తైర్బాణైర్మహావీర్యః పూర్ణముక్తైరజిహ్మగైః।
బిభేద నిశితైస్తీక్ష్ణైః గృధ్రం ఘోరైః శిలీముఖైః। 9

స రాక్షసరథే పశ్యన్ జానకీం బాష్పలోచనామ్।
అచింతయిత్వా తాన్ బాణాన్ రాక్షసం సమభిద్రవత్। 10

తతోఽస్య సశరం చాపం ముక్తామణివిభూషితమ్।
చరణాభ్యాం మహాతేజా బభంజ పతగేశ్వరః। 11

తతోఽన్యద్ధనురాదాయ రావణః క్రోధమూర్ఛితః।
వవర్ష శరవర్షాణి శతశోఽథ సహస్రశః। 12

శరైరావారితస్తస్య సంయుగే పతగేశ్వరః।
కులాయమ్ ఉపసంప్రాప్తః పక్షీవ ప్రబభౌ తదా। 13

స తాని శరవర్షాణి పక్షాభ్యాం చ విధూయ చ।
చరణాభ్యాం మహాతేజా బభంజాస్య మహద్ధనుః। 14

తచ్చాగ్నిసదృశం దీప్తం రావణస్య శరావరమ్।
పక్షాభ్యాం స మహావీర్యో వ్యాధునోత్ పతగేశ్వరః। 15

కాంచనోరశ్ఛదాన్ దివ్యాన్ పిశాచవదనాన్ ఖరాన్।
తాం శ్చాస్య జవసంపన్నాన్ జఘాన సమరే బలీ। 16

వరం త్రివేణుసంపన్నం కామగం పావకార్చిషమ్।
మణిహేమవిచిత్రాంగం బభంజ చ మహారథమ్। 17

అప్పుడు మహాబలశాలియైన రావణుడు మిగుల భయంకరములైన, పదునైన ములుకులుగల బాణములను, వాడియైన ఇనుపశరములను, అంకుశములవలె మొనలుగల బాణములను జటాయువుపై కురిపించెను. పక్షిరాజైన ఆ జటాయువు యుద్ధమునందు తనపై రావణుడు ప్రయోగించిన వివిధములగు అస్త్రములను, శరములను త్రిప్పికొట్టెను. పక్షులలో శ్రేష్ఠుడు, మిగుల పరాక్రమశాలియైన జటాయువు వాడియైన గోళ్ళుగల తనకాళ్లతో రావణునిశరీరమును పెక్కు విధముల గాయపఱచెను. (5-7)

పిమ్మట దశగ్రీవుడు మిగుల క్రుద్ధుడై, శత్రువును తునుమాడుటకై యమదండమునుబోలిన భయంకరములైన పదిబాణములను ప్రయోగించెను. అవి తీవ్రములైనవి, పదునైన ములుకులుగలవి. మహావీరుడైన ఆ రావణుడు సూటిగా వెళ్లునట్లు, భీకరములైన ఆ వాడిబాణములను బలముగాలాగి, ప్రయోగించి జటాయువును మిగుల గాయపఱచెను. (8-9)

అంతట జటాయువు ఆరాక్షసుని రథమునందు కన్నీరుపెట్టుచున్న జానకిని చూచినవాడై, రావణుని బాణములను సరకుగొనక, అతని మీదికి విజృంభించెను. మిక్కిలి పరాక్రమశాలియైన ఆపక్షిరాజు ముత్యములతో మణులతో చెక్కబడిన రావణునిధనుస్సును, బాణములను తనపాదములధాటితో ముక్కలు ముక్కలు గావించెను. (10-11)

అనంతరము రావణుడు క్రోధావేశపరవశుడై మఱియొక ధనుస్సును చేబూని, పరంపరగా వేలకొలది బాణములను అతనిపై ప్రయోగించెను. యుద్ధమునందు రావణునిబాణములచే ఆవృతుడైన ఆ జటాయువు గూటిలోని పక్షివలె ఒప్పారెను. అప్పుడు మహాతేజస్వియైన జటాయువు తనపై రావణుడు ప్రయోగించిన బాణపరంపరను తనఱెక్కలతో ఎగురగొట్టెను, పిదప తనపాదములతో అతని ధనుస్సును ముక్కలు గావించెను. మహాబలశాలియైన ఆ పక్షిరాజు అగ్నిజ్వాలలవలె ధగధగలాడుచున్న రావణునికవచమును తనఱెక్కల బలిమిచే ఛేదించెను. రావణునిరథమునకు పూన్చిన గుఱ్ఱములు బంగారుకవచములు గలిగి అద్భుతముగానున్నవి, పిశాచములవలె వికృతములైన ముఖములుగలవి, వేగముగా సాగిపోగలవి. అట్టి రథాశ్వములను మిగుల బలశాలియైన జటాయువు చంపివైచెను. (12-16)

రావణునిరథము శ్రేష్ఠమైనది, బలమైన నొగలు (కూబరము) గలది, యజమాని ఇచ్ఛానుసారము పయనింపగలది, అది అగ్నిజ్వాలలవలె మెఱయుచుండెను. దానిచక్రములు బంగారముతో నిర్మింపబడి మణులతో

పూర్ణచంద్రప్రతీకాశం ఛత్రం చ వ్యజనైః సహ।
పాతయామాస వేగేన గ్రాహిభీ రాక్షసైః సహ। 18

సారథేశ్చాస్య వేగేన తుండేనైవ మహచ్ఛిరః।
పునర్వ్యపాహరత్ శ్రీమాన్ పక్షిరాజో మహాబలః। 19

స భగ్నధన్వా విరథో హతాశ్వో హతసారథిః।
అంకేనాదాయ వైదేహీం పపాత భువి రావణః। 20

దృష్ట్వా నిపతితం భూమౌ రావణం భగ్నవాహనమ్।
సాధు సాధ్వితి భూతాని గృధ్రరాజమ్ అపూజయన్। 21

పరిశ్రాంతం తు తం దృష్ట్వా జరయా పక్షియూథపమ్।
ఉత్పపాత పునర్హృష్టో మైథిలీం గృహ్య రావణః। 22

తం ప్రహృష్టం నిధాయాంకే గచ్ఛంతం జనకాత్మజామ్।
గృధ్రరాజః సముత్పత్య సమభిద్రుత్య రావణమ్।
సమావార్య మహాతేజా జటాయురిదమబ్రవీత్। 23

వజ్రసంస్పర్శబాణస్య భార్యాం రామస్య రావణ!।
అల్పబుద్ధే! హరస్యేనాం వధాయ ఖలు రక్షసామ్। 24

సమిత్రబంధుః సామాత్యః సబలః సపరిచ్ఛదః।
విషపానం పిబస్యేతత్ పిపాసిత ఇవోదకమ్। 25

అనుబంధమ్ అజానంతః కర్మణామ్ అవిచక్షణాః।
శీఘ్రమేవ వినశ్యంతి యథా త్వం వినశిష్యసి। 26

బద్ధస్త్వం కాలపాశేన క్వ గతస్తస్య మోక్ష్యసే।
వధాయ బడిశం గృహ్య సామిషం జలజో యథా। 27

న హి జాతు దురాధర్షౌ కాకుత్స్థౌ తవ రావణ!।
ధర్షణం చాశ్రమస్యాస్య క్షమిష్యేతే తు రాఘవౌ। 28

చెక్కబడియుండెను. అట్టి ఆ మహారథమును ఆ పక్షీంద్రుడు భగ్నముగావించెను. ఆ జటాయువు నిండుచంద్రునివలె స్వచ్ఛమైన కాంతులతో విరాజిల్లుచున్న ఛత్రమును, వింజామరలను, వాటిని పట్టుకొనియున్న రాక్షసులను తనఱెక్కలవేగముతో పడగొట్టెను. మహాబలశాలియు, శ్రీరామునిసేవకుడును ఐన ఆ పక్షిరాజు తనబలమైన ముక్కుతో పొడిచి రథసారథియొక్క శిరమును ఖండించెను. (17-19)

జటాయువువలన రావణునిధనుస్సు ముక్కలయ్యెను. రథము విఱిగిపోయెను. అశ్వములు అసువులు వీడెను. సారథి హతుడయ్యెను. అంతట రావణుడు వైదేహిని దీసికొని నేలమీదికి దుమికెను. వాహనాదులు భగ్నములుకాగా నేలపైబడిన రాక్షసుని జూచి సమస్తప్రాణులును 'బాగుబాగు' అని సంబరముతో పలుకుచు జటాయువును శ్లాఘించెను. (20-21)

వృద్ధావస్థ కారణముగా పక్షిరాజైన జటాయువు మిక్కిలి అలసియుండుటను జూచి, రావణుడు ఎంతయు సంతసించెను. పిమ్మట అతడు సీతాదేవిని దీసికొని మఱల ఆకాశమునకు ఎగిరెను. (22)

సీతాదేవిని దీసికొని, సంతోషముతో ఆకాశమున సాగిపోవుచున్న రావణుని జూచి, జటాయువు తాను పైకెగిరెను. పిమ్మట ఆతేజస్వి అతనికి ఎదురుగా నిలిచి, నిరోధించుచు ఇట్లు పలికెను. (23)

"ఓ అల్పబుద్ధీ! రావణా! శ్రీరామునిబాణములు వజ్రతుల్యములు. అట్టి మహావీరునిభార్యయైన సీతాదేవిని నీవు గొనిపోవుట రాక్షసజాతినిర్మూలనమునకే. నీవు బంధుమిత్రులతో, అమాత్యులతో, బలములతో, పరివారములతోగూడి, దప్పిగొన్నవాడు ఆరాటపడుచు నీరు త్రాగునట్లు (సీతాపహరణ రూపమున) విషపానము చేయుచున్నావు. అవివేకులు (బుద్ధిహీనులు) తమదుష్కర్మల ఫలముల నెఱుంగక నీవలెనే వెంటనే నశించుచుందురు.(24-26)

ఎఱకు (మాంసఖండమునకు) ఆశపడి గాలమునకు చిక్కిన చేపవలె, మృత్యుపాశముచే బద్ధుడవైన నీవు ఎక్కడికి వెళ్లినను దానినుండి తప్పించుకొనజాలవు. ఆశ్రమమునందున్న సీతాదేవిని నీవు అపహరించి, కాకుత్స్థవంశజులు, అజేయపరాక్రములు ఐన ఆ రామలక్ష్మణులకు తీరని అవమానమును గూర్చితివి. ఇంక వారు నిన్ను ఎన్నడును క్షమింపరు. (నిన్ను ప్రాణములతో విడిచిపెట్టరు.) (27-28)

యథా త్వయా కృతం కర్మ భీరుణా లోకగర్హితమ్।
తస్కరాచరితో మార్గో నైష వీరనిషేవితః। 29

యుధ్యస్వ యది శూరోఽసి ముహూర్తం తిష్ఠ రావణ!।
శయిష్యసే హతో భూమౌ యథా భ్రాతా ఖరస్తథా। 30

పరేతకాలే పురుషో యత్ కర్మ ప్రతిపద్యతే।
వినాశాయాత్మనోఽధర్మ్యం ప్రతిపన్నోఽసి కర్మ తత్। 31

పాపానుబంధో వై యస్య కర్మణః కర్మ కో ను తత్।
కుర్వీత లోకాధిపతిః స్వయంభూర్భగవానపి। 32

ఏవముక్త్వా శుభం వాక్యం జటాయుస్తస్య రక్షసః।
నిపపాత భృశం పృష్ఠే దశగ్రీవస్య వీర్యవాన్। 33

తం గృహీత్వా నఖైస్తీక్ష్ణైః విరరాద సమంతతః।
అధిరూఢో గజారోహో యథా స్యాద్దుష్టవారణమ్। 34

విరరాద నఖైరస్య తుండం పృష్ఠే సమర్పయన్।
కేశాంశ్చోత్పాటయామాస నఖపక్షముఖాయుధః। 35

స తథా గృధ్రరాజేన క్లిశ్యమానో ముహుర్ముహుః।
అమర్షస్ఫురితోష్ఠః సన్ ప్రాకంపత స రావణః। 36

స పరిష్వజ్య వైదేహీం వామేనాంకేన రావణః।
తలేనాభిజఘానాశు జటాయుం క్రోధమూర్ఛితః। 37

జటాయుస్తమభిక్రమ్య తుండేనాస్య ఖగాధిపః।
వామబాహూన్ దశ తదా వ్యపాహరదరిందమః। 38

సంఛిన్నబాహోః సద్యైవ బాహవః సహసాఽభవన్।
విషజ్వాలావలీయుక్తా వల్మీకాదివ పన్నగాః। 39

తతః క్రోధాద్దశగ్రీవః సీతామ్ ఉత్సృజ్య రావణః।
ముష్టిభ్యాం చరణాభ్యాం చ గృధ్రరాజమ్ అపోథయత్। 40

తతో ముహూర్తం సంగ్రామో బభూవాఽతులవీర్యయోః।
రాక్షసానాం చ ముఖ్యస్య పక్షిణాం ప్రవరస్య చ। 41

ఓ రావణా! నీవు పిఱికివాడవై చేసిన ఈ పనిని లోకము నిందించును. ఇది దొంగలు చేసెడి పని. వీరులు ఎవ్వరును ఈ పద్ధతిని అనుసరింపరు. ఓ దశగ్రీవా! క్షణకాలము నిలువుము. నిజముగా నీవు వీరుడవేయైనచో నాతో యుద్ధము చేయుము. నీ సోదరుడైన ఖరునివలె నీవును మట్టిగఱచెదవు. చావు దగ్గఱపడినప్పుడు పురుషుడు ఆత్మవినాశనముకొఱకు అధర్మకృత్యములకు పాల్పడుచుండును. కనుక సీతాపహరణమునకు ఒడిగట్టిన నీకు వినాశము తప్పదు. దుష్ఫలితములను ఇచ్చునట్టి ఇట్టి పాపకృత్యములకు ఎవడు సిద్ధపడును? కడకు లోకాధిపతియైన ఇంద్రుడుగాని, సృష్టికర్తయైన బ్రహ్మదేవుడుగాని ఇట్టి దుష్కార్యములకు సాహసింపరు-" (29-32)

జటాయువు ఇట్లు హితవచనములను పలుకుచున్నను వాటిని పట్టించుకొనక, రావణుడు సీతాదేవిని వెంటనిడుకొని, వెళ్లుచునేయుండెను. అప్పుడు పరాక్రమశాలియగు జటాయువు అతనివీపుపై దాడిచేసెను. (33)

పరుగెత్తుచున్న పొగరుబోతు ఏనుగును అదుపు చేయుటకు మావటివాడు దానిని అంకుశముతో పొడిచినట్లు జటాయువు, వెళ్లిపోవుచున్న రావణుని పట్టుకొని, తన పదునైన గోళ్లతో వాని వీపునంతయును గాయపఱచెను. పిమ్మట గోళ్లు, ఱెక్కలు, ముక్కు ఆయుధములుగాగల జటాయువు తనగోళ్లతో రక్కుచు, ముక్కుతో పొడుచుచు అతని వీపును గాయపఱచెను, జుట్టుపట్టుకొని లాగెను.(34-35)

జటాయువు పదేపదే పలువిధములుగా బాధించుచుండుటచే రావణుడు క్రుద్ధుడై పెదవులు కంపించుచుండగా ఆ పక్షిరాజును దెబ్బతీయుటకై వెనుకకు మఱలెను. కోపముతో ఊగిపోవుచున్న ఆ రాక్షసరాజు వైదేహిని తన ఎడమచేతితో గట్టిగా పట్టుకొని, ఆ జటాయువుపై అఱచేతితో బలముగా మోదెను.(36-37)

శత్రువులను పరిమార్చుటలో ఆరితేఱిన ఆ పక్షిరాజు అదను చూచుకొని అతనిపదిఎడమచేతులను తన ముక్కుతో చీల్చివేసెను. రావణునియొక్క తెగిపోయిన (ఎడమ) చేతులన్నియును సాయుధములై, పుట్టనుండి విషజ్వాలలను వెలిగ్రక్కుచు బయటికివచ్చిన సర్పములవలె, క్షణములో వచ్చెను. అనంతరము దశగ్రీవుడైన రావణుడు సీతాదేవిని వదలిపెట్టి, కోపముతో ఆ గృధ్రరాజును పిడికిళ్లతో పొడిచెను, కాళ్లతో తన్నెను. (38-40)

అంతట సాటిలేని వీరులైన ఆ రావణజటాయువుల మధ్య రెండుగడియలపాటు పోరు ఘోరముగా సాగెను. అప్పుడు రావణుడు తనఖడ్గమును పైకెత్తి, శ్రీరామునికొఱకై ప్రాణములకు తెగించి పోరాడుచున్న

తస్య వ్యాయచ్ఛమానస్య రామస్యార్థే స రావణః।
పక్షౌ పార్శ్వౌ చ పాదౌ చ ఖడ్గమ్ ఉద్ధృత్య సోఽచ్ఛినత్। 42
స ఛిన్నపక్షః సహసా రక్షసా రౌద్రకర్మణా।
నిపపాత హతో గృధ్రో ధరణ్యామ్ అల్పజీవితః। 43
తం దృష్ట్వా పతితం భూమౌ క్షతజార్ద్రం జటాయుషమ్।
అభ్యధావత వైదేహీ స్వబంధుమివ దుఃఖితా। 44
తం నీలజీమూతనికాశకల్పం
సుపాండురోరస్కముదారవీర్యమ్ ।
దదర్శ లంకాధిపతిః పృథివ్యాం
జటాయుషం శాంతమివాగ్నిదావమ్ । 45
తతస్తు తం పత్రరథం మహీతలే
నిపాతితం రావణవేగమర్దితమ్ ।
పునః పరిష్వజ్య శశిప్రభాననా
రురోద సీతా జనకాత్మజా తదా । 46

జటాయువుయొక్క రెక్కలను, పార్శ్వభాగములను, కాళ్లను నఱికి వేసెను. (41-42)

క్రూరకర్ముడైన రావణునివలన తనరెక్కలు తెగిపోగా, వెంటనే ఆ జటాయువు నేలపై పడిపోయెను. అతని ప్రాణములు అన్నుబట్టెను. రక్తసిక్తమైన దేహముతో జటాయువు భూమిపై పడియుండగా జూచి, సీతాదేవి ఆత్మబంధువును కోల్పోయిన రీతిగా దుఃఖించుచు అతనికడకు పరుగుదీసెను. (43-44)

అమితపరాక్రమశాలియైన ఆ గృధ్రరాజు నల్లని మేఘమువలె ఒప్పుచుండెను. తెల్లని వక్షఃస్థలమును గలిగియుండెను. అతడు చల్లారిన కాఱుచిచ్చువలె ప్రశాంతముగానుండెను. అట్టి జటాయువును రావణుడు చూచెను. (45)

జనకునికూతురు, చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖముగలదియైన, సీతాదేవి రావణునిబలము యొక్క దెబ్బకు భూమిపై బడియున్న ఆ జటాయువును పదేపదే అక్కున జేర్చుకొనుచు ఏడువసాగెను. (46)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకపంచాశస్సర్గః (51)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదియొకటవసర్గము.

-- ✻ ✻ ✻ --

52. ఏబదిరెండవసర్గము

రావణుని పట్టును విడిపించుటకొనుటకై సీతాదేవి పెనగులాడుట - అతడు బలవంతముగా ఆమెను తీసికొని, రథముపై ఆకాశమార్గమున సాగిపోవుట -

తమల్పజీవితం గృధ్రం స్ఫురంతం రాక్షసాధిపః।
దదర్శ భూమౌ పతితం సమీపే రాఘవాశ్రమాత్। 1
సా తు తారాధిపముఖీ రావణేన సమీక్ష్య తమ్।
గృధ్రరాజం వినిహతం విలలాప సుదుఃఖితా। 2
ఆలింగ్య గృధ్రం నిహతం రావణేన బలీయసా।
విలలాప సుదుఃఖార్తా సీతా శశినిభాననా। 3
నిమిత్తం లక్షణజ్ఞానం శకునిస్వరదర్శనమ్।
అవశ్యం సుఖదుఃఖేషు నరాణాం ప్రతిదృశ్యతే। 4
నూనం రామ! న జానాసి మహద్వ్యసనమాత్మనః।
ధావంతి నూనం కాకుత్స్థం మదర్థం మృగపక్షిణః। 5
అయం హి పాపచారేణ మాం త్రాతుమ్ అభిసంగతః।
శేతే వినిహతో భూమౌ మమాఽభాగ్యాద్విహంగమః। 6

శ్రీరామునిఆశ్రమసమీపమున భూమిపైబడి కొనయూపిరితో నున్న ఆ గృధ్రరాజును రావణాసురుడు చూచెను- (1)

చంద్రముఖియైన ఆ సీతాదేవి రావణునిచేతిలో చావుదెబ్బతినిన పక్షిరాజును జూచి, దుఃఖముతో మిగుల విలపించెను. అందమైన ముఖముగల జానకి బలశాలియైన రావణునిదాటికి మిగుల దెబ్బతినిన జటాయువును అక్కునజేర్చుకొని, ఎంతయు దుఃఖితయై ఏడ్చెను. (2-3)

కన్నులు అదరుట, పక్షులయొక్కకూతలు వినబడుట మొదలగు శకునములు మనుష్యులకు కలుగనున్న సుఖదుఃఖములను సూచించును. (4)

ఓరామా! నాకు వచ్చిన ఈ పెనుఆపదనుగూర్చి నీకు తెల్పుటకొఱకే మృగములు, పక్షులు అటునిటు పరుగెత్తుచున్నవి, ఇది నిశ్చయము. నిజముగా ఇది నీకు తెలియుట లేదేమో? (తెలిసియున్నచో నీవు ఉపేక్షింపవుగదా!) నన్ను కాపాడుటకై ఈ రాక్షసుని ఎదిరించిన జటాయువు నాదురదృష్టవశమున ఈ దుర్మార్గునిచేతిలో దెబ్బతిని, భూమిపై పడియున్నాడు."(5-6)

త్రాహి మామ్ అద్య కాకుత్స్థ! లక్ష్మణేతి వరాంగనా।
సుసంత్రస్తా సమాక్రందత్ శృణ్వతాం తు యథాంతికే॥ 7

తాం క్లిష్టమాల్యాభరణాం విలపంతీమ్ అనాథవత్।
అభ్యధావత వైదేహీం రావణో రాక్షసాధిపః॥ 8

తాం లతామివ వేష్టంతీమ్ ఆలింగంతీం మహాద్రుమాన్।
ముంచ ముంచేతి బహుశః ప్రవదన్ రాక్షసాధిపః॥ 9

క్రోశంతీం రామరామేతి రామేణ రహితాం వనే।
జీవితాంతాయ కేశేషు జగ్రాహాంతకసన్నిభః॥ 10

ప్రధర్షితాయాం సీతాయాం బభూవ సచరాచరమ్।
జగత్ సర్వమ్ అమర్యాదం తమసాఽంధేన సంవృతమ్॥ 11

న వాతి మారుతస్తత్ర నిష్ప్రభోఽభూద్దివాకరః॥ 12

దృష్ట్వా సీతాం పరామృష్టాం దీనాం దివ్యేన చక్షుషా।
కృతం కార్యమితి శ్రీమాన్ వ్యాజహార పితామహః॥ 13

ప్రహృష్టా వ్యథితాశ్చాసన్ సర్వే తే పరమర్షయః।
దృష్ట్వా సీతాం పరామృష్టాం దండకారణ్యవాసినః।
రావణస్య వినాశం చ ప్రాప్తం బుద్ధ్వా యదృచ్ఛయా॥ 14

స తు తాం రామరామేతి రుదతీం లక్ష్మణేతి చ।
జగామాదాయ చాకాశం రావణో రాక్షసేశ్వరః॥ 15

తప్తాభరణసర్వాంగీ పీతకౌశేయవాసినీ।
రరాజ రాజపుత్త్రీ తు విద్యుత్సౌదామినీ యథా॥ 16

ఉద్ధూతేన చ వస్త్రేణ తస్యాః పీతేన రావణః।
అధికం ప్రతిబభ్రాజ గిరిర్దీప్త ఇవాగ్నినా॥ 17

తస్యాః పరమకల్యాణ్యాః తామ్రాణి సురభీణి చ।
పద్మపత్రాణి వైదేహ్యా అభ్యకీర్యంత రావణమ్॥ 18

వనితారత్నమైన సీతాదేవి తనను ముసురుకొనిన ముప్పునకు భయపడుచున్నదై, రామలక్ష్మణులు తనకు చేరువలోనేయున్నట్లు తలంచి, 'ఓరామా! లక్ష్మణా! నన్ను కాపాడుడు' అని పల్కుచు ఆక్రందింపసాగెను. (7)

నలిగిపోయిన పూలమాలలును, చెదరిన ఆభరణములును గలిగి, దిక్కులేని దానివలె విలపించుచున్న సీతాదేవికడకు రాక్షసరాజైన రావణుడు త్వరత్వరగా చేరెను. (8)

సీతాదేవి తనను సమీపించిన రావణునిజూచి భీతిల్లినదై, లతలు చుట్టుకొనినట్లుగా ఆమె వృక్షములను కౌగిలించుకొనుచు అయ్యో! 'రామా! రామా! రక్షింపుము రక్షింపుము' అని బిగ్గఱగా ఆక్రందింపసాగెను. రామునకు దూరమై, ఒంటరిగా వనమున అట్లు ఏడ్చుచున్న సీతాదేవిని తీసికొనిపోవుటకై రావణుడు ఆమె జుట్టు పట్టుకొనెను. 'తాను ఆవిధముగా చేయుట తనవినాశమును కొనితెచ్చుకొనుట కొఱకే' అని ఆమూర్ఖుడు ఎఱుగడు. (9-10)

రావణునిచేతిలో సీతాదేవికి జరిగిన అవమానమునకు తట్టుకొనలేక చరాచరములతోగూడిన జగత్తంతయును తనసహజకృత్యములకు దూరమై, అజ్ఞానాంధకారములో (ఏమిచేయుటకును తోచని స్థితిలో) మునిగి పోయెను. గాలి వీచుట మానెను, సూర్యుడు కాంతిహీనుడై వెలవెల బోయెను. (11-12)

రావణుడు సీతాదేవిని అపహరించుకొనిపోవుచున్న విషయమును తనదివ్యదృష్టిచే ఎఱింగిన బ్రహ్మదేవుడు 'శ్రీమహావిష్ణువు లోగడ దేవతలకు ఇచ్చిన వాగ్దానము నెఱవేఱుచున్నట్లు గ్రహించెను. దండకారణ్యమున నివసించుచుండెడి మహర్షులు అందఱును సీతాపహరణ దృశ్యమునుజూచి వ్యథచెందిరి. కాని ఈనెపమున త్వరలో రావణుని వినాశము కలుగనున్నదని ఎఱింగి సంతోషపడసాగిరి. (13-14)

'రామా! రామా! లక్ష్మణా! లక్ష్మణా! రక్షింపుడు, రక్షింపుడు' అనుచు దుఃఖించుచున్న సీతాదేవిని దీసికొని, రాక్షసరాజైన రావణుడు ఆకాశమున సాగిపోయెను. (15)

జనకరాజకుమారి సర్వావయవములయందును మేలిమిబంగారునగలను ధరించి, పట్టుపీతాంబరములను దాల్చియుండెను. మెఱుపుతీగవలె మెఱయుచుండెను. సీతాదేవియొక్క చీరెకొంగు గాలికి ఎగురుచుండగా రావణుడు దావాగ్నిజ్వాలలతో ఒప్పుచున్న పర్వతమువలె మిగుల బాసిల్లెను. (16-17)

మంగళస్వరూపిణియగు సీతాదేవి ధరించిన గుబాళించుచున్న ఎఱ్ఱదామరలరేకులు కొన్ని ఆరావణునిపై రాలెను. గాలితాకిడులకు రెపరెప

తస్యాః కౌశేయముద్ధూతమ్ ఆకాశే కనకప్రభమ్।
బభౌ చాదిత్యరాగేణ తామ్రమ్ అభ్రమివాతపే। 19

తస్యాస్తత్సునసం వక్త్రమ్ ఆకాశే రావణాంకగమ్।
న రరాజ వినా రామం వినాళమివ పంకజమ్। 20

బభూవ జలదం నీలం భిత్త్వా చంద్ర ఇవోదితః।
సులలాటం సుకేశాంతం పద్మగర్భాభమవ్రణమ్। 21

శుక్లైః సువిమలైర్దంతైః ప్రభావద్భిరలంకృతమ్।
తస్యాస్తద్విమలం వక్త్రమ్ ఆకాశే రావణాంకగమ్। 22

రుదితం వ్యపమృష్టాస్రం చంద్రవత్ ప్రియదర్శనమ్।
సునాసం చారుతామ్రోష్ఠమ్ ఆకాశే హాటకప్రభమ్। 23

రాక్షసేన సమాధూతం తస్యాస్తద్వదనం శుభమ్।
శుశుభే న వినా రామం దివా చంద్ర ఇవోదితః। 24

సా హేమవర్ణా నీలాంగం మైథిలీ రాక్షసాధిపమ్।
శుశుభే కాంచనీ కాంచీ నీలం మణిమివాశ్రితా। 25

సా పద్మగౌరీ హేమాభా రావణం జనకాత్మజా।
విద్యుద్ఘనమివావిశ్య శుశుభే తప్తభూషణా। 26

తరుప్రవాళరక్తా సా నీలాంగం రాక్షసేశ్వరమ్।
ప్రాశోభయత వైదేహీ గజం కక్ష్యేవ కాంచనీ। 27

తస్యా భూషణఘోషేణ వైదేహ్యా రాక్షసాధిపః।
బభౌ సచపలో నీలః సఘోష ఇవ తోయదః। 28

ఉత్తమాంగాచ్చ్యుతా తస్యాః పుష్పవృష్టిః సమంతతః।
సీతాయా హ్రియమాణాయాః పపాత ధరణీతలే। 29

సా తు రావణవేగేన పుష్పవృష్టిః సమంతతః।
సమాధూతా దశగ్రీవం పునరేవాభ్యవర్తత। 30

అభ్యవర్తత పుష్పాణాం ధారా వైశ్రవణానుజమ్।
నక్షత్రమాలా విమలా మేరుం నగమివోన్నతమ్। 31

కొట్టుకొనుచు ఎఱుపు వన్నెలను విరజిమ్ముచున్న సీతాదేవి పీతాంబరము మధ్యాహ్నసమయమున సూర్యునియొక్క అరుణకాంతులతో ఎఱుపెక్కిన మేఘమువలె విలసిల్లుచుండెను. శ్రీరామునకు దూరమై, రావణునిచేజిక్కియున్న సీతాదేవియొక్క చక్కని ముక్కుగల ముఖము కాడలేని పద్మమువలె వాడిపోయియుండెను. (18-20)

చక్కని నొసలు, అందమైన కురులు గలిగి, వికసించిన పద్మమువలె ఒప్పుచు, నిర్మలమైన ఆ జానకి ముఖము నల్లనిమేఘములను చీల్చుకొని ఉదయించుచున్న చంద్రునివలె భాసిల్లెను. (21)

సహజముగా సీతాదేవినిర్మలమైన ముఖము ఎల్లప్పుడును స్వచ్ఛమైన తెల్లని పలువరుసలమిలమిల కాంతులతో మనోహరముగానుండును, నిండుచంద్రునివలె ఆహ్లాదకరమై ఒప్పును, తీరైన నాసికతో అలరారుచుండును, అందమైన ఎఱ్ఱనిపెదవులతో బంగారుకాంతులను వెదజల్లుచుండును. కాని ప్రస్తుతము రాక్షసుని (రావణుని) కారణముగ ఆకాశమున భయకంపితయైయున్న ఆమెయొక్క ముఖము ఎడ్చిఎడ్చి చారికలు గట్టియుండెను. తనపతియగు శ్రీరామునకు దూరమైయున్నందున కడు దుఃఖితయై యున్న ఆమెవదనము పగటిపూట చంద్రునివలె వెలవెలబోవుచుండెను. (22-24)

నల్లని రావణునిఆధీనములోనున్న బంగారువన్నెగల సీతాదేవి నీలమణులతోగూడిన సువర్ణమేఖల (బంగారు ఒడ్డాణము)వలె ఒప్పుచుండెను. మేలిమిబంగారునగలను ధరించిన సీతాదేవి స్వచ్ఛమైన కాంతులతో విలసిల్లుచుండెను. రావణునిసమీపముననున్న ఆమె నీలమేఘము ప్రక్కనగల విద్యుల్లత (మెఱుపుతీగ) వలె ఒప్పుచుండెను.(25-26)

ఏనుగునకు బంగారుగొలుసువలె నల్లని రావణునకు చెట్లచిగురుటాకులవలె ఎఱుపురంగుగల వైదేహి శోభను గూర్చెను. ఆ సీతాదేవియొక్క ఆభరణములసవ్వడులతో రాక్షసరాజైన రావణుడు మెఱుపుతోగూడి గర్జించుచున్న నీలమేఘమువలె ఒప్పుచుండెను. అపహరింపబడుచున్న జానకీదేవి యొక్క కొప్పునుండి జాఱిన పూవులు నేలయందంతటను చెల్లాచెదరుగా పడిపోయెను. అట్లు నలుదిక్కుల రాలిన పూవులన్నియును రావణునిగమన వేగమునకు (గాలిఉధాటికి) పైకెగిరి అతనిమీదనే పడుచుండెను. (27-30)

తనపై పడుచున్న పూలపరంపరతోగూడిన ఆరావణుడు తళుకులీనుచున్నట్టి నక్షత్రములవరుసలతో గూడిన ఎత్తైన మేరుపర్వతమువలె ఒప్పారెను. (31)

చరణాన్నూపురం భ్రష్టం వైదేహ్యా రత్నభూషితమ్।
విద్యున్మండలసంకాశం పపాత మధురస్వనమ్। 32

తాం మహోల్కామివాకాశే దీప్యమానాం స్వతేజసా।
జహారాఽఽకాశమావిశ్య సీతాం వైశ్రవణానుజః। 33

తస్యాస్తాన్యగ్నివర్ణాని భూషణాని మహీతలే।
సఘోషాణ్యవకీర్యంత క్షీణాస్తారా ఇవాంబరాత్। 34

తస్యాః స్తనాంతరాద్భ్రష్టో హారస్తారాధిపద్యుతిః।
వైదేహ్యా నిపతన్ భాతి గంగేవ గగనాచ్చ్యుతా। 35

ఉత్పన్నవాతాభిహతా నానాద్విజగణాయుతాః।
మా భైరితి విధూతాగ్రా వ్యాజహ్రురివ పాదపాః। 36

నళిన్యో ధ్వస్తకమలాః త్రస్తమీనజలేచరాః।
సఖీమివ గతోచ్ఛ్వాసామ్ అన్వశోచంత మైథిలీమ్। 37

సమంతాదభిసంపత్య సింహవ్యాఘ్రమృగద్విజాః।
అన్వధావంస్తదా రోషాత్ సీతాం ఛాయానుగామినః। 38

జలప్రపాతాస్రముఖాః శృంగైరుచ్ఛ్రితబాహుభిః।
సీతాయాం హ్రియమాణాయాం విక్రోశంతీవ పర్వతాః। 39

హ్రియమాణాం తు వైదేహీం దృష్ట్వా దీనో దివాకరః।
ప్రతిధ్వస్తప్రభః శ్రీమాన్ ఆసీత్ పాండరమండలః। 40

నాస్తి ధర్మః కుతః సత్యం నార్జవం నానృశంసతా।
యత్ర రామస్య వైదేహీం భార్యాం హరతి రావణః।
ఇతి సర్వాణి భూతాని గణశః పర్యదేవయన్। 41

సీతాదేవియొక్క రత్నఖచితమైన ఎడమకాలిఅందె జారి నేలపై బడెను. అప్పుడది మెఱపుతీగలవలయమువలె కాంతులీనుచు మధురధ్వనులను గావించెను. (32)

ఆకాశమున తనతేజస్సుతో (ఉత్పాత సూచకమైన) ఒక పెద్ద తోకచుక్కవలె భాసిల్లుచున్న సీతాదేవిని అపహరించి, కుబేరునిసోదరుడైన ఆరావణుడు అంతరిక్షమున ముందునకు సాగెను. (33)

జానకి ధరించిన ఆభరణములు నిప్పుకణికలవలె ప్రకాశించుచుండెను. అవి ధ్వనిచేయుచు, ఆకాశమునుండి రాలుచున్న చుక్కలవలె ఒక్కొక్కటిగా నేలపై పడిపోయెను. (34)

సీతాదేవి వక్షఃస్థలమునందలి హారము చంద్రునివలె ప్రకాశించుచుండెను. అది ఆమెమెడనుండి జారి గగనమునుండి భూమండలమునకు ప్రవహించుచున్న గంగానదివలె భాసిల్లెను. (35)

రావణునియొక్క గమనవేగమువలన ఏర్పడిన ఉత్పాతసూచకములగు గాలులయొక్క తాకిడికి చెట్ల పైభాగములు కదలుచుండెను. ఆకొమ్మలపైగల వివిధములగు పక్షులు కోలాహలధ్వనులు గావించుచుండెను. ఆ వృక్షములు తమశిరఃకంపనములతో, పక్షులకలరవములతో 'భయపడకుము,'- అని సీతాదేవికి అభయము నిచ్చుచున్నట్లు ఉండెను- (36)

వాడిపోయిన కమలములతో, భయపడుచున్న మీనములు మున్నగు జలచరములతో గూడియున్న సరస్సులు నిః స్పృహకులోనైన సీతాదేవిని గూర్చి ఒక ఆత్మీయురాలివలె దుఃఖించుచున్నవి.[1] (37)

సీతాపహరణసమయమున వివిధప్రదేశములలో గుంపులుగా జేరి, అటునిటు సంచరించుచున్న సింహములు, పెద్దపులులు, లేళ్లు, పక్షులు మొదలగునవి రావణునిమీది కోపముతో సీతను రక్షించుటకై ఆమె ఛాయను అనుసరించుచున్నవాయనునట్లు ఉండెను. పర్వతములు జలపాతములనెడి కన్నీటిని స్రవింపజేయుచున్న ముఖములతో, శిఖరములనెడి బాహువులను పైకెత్తినవై, అపహరింప బడుచున్న సీతాదేవికొఱకై దుఃఖించుచున్నట్లు ఉండెను.(38-39)

రావణునిచే అపహరింపబడుచున్న సీతాదేవిని జూచి, విషయమును గ్రహించిన సూర్యుడు కడుదీనుడై తనకాంతులను కోల్పోయి, వెలవెలబోయెను. (40)

'రావణుడు అక్రమముగా మోసముతో శ్రీరాముని ధర్మపత్నియైన సీతాదేవిని అపహరించుకొని

1) వాడిపోయిన కమలములు నిఃస్పృహతో వెలవెలబోయియున్న సీతాదేవిముఖమును సూచించును - భయపడిన మీనాది జలచరములు ఆమె చూపులలోని కలవరపాటును దెల్పును.

విత్రస్తకా దీనముఖా రురుదుర్మృగపోతకాః।
ఉద్వీక్ష్యోద్వీక్ష్య నయనైః అస్రపాతావిలేక్షణాః। 42

సుప్రవేపితగాత్రాశ్చ బభూవుర్వనదేవతాః।
విక్రోశంతీం దృఢం సీతాం దృష్ట్వా దుఃఖం తథాగతామ్। 43

తాం తు లక్ష్మణ రామేతి క్రోశంతీం మధురస్వరమ్।
అవేక్షమాణాం బహుశో వైదేహీం ధరణీతలమ్। 44

స తామ్ ఆకులకేశాంతాం విప్రమృష్టవిశేషకామ్।
జహారాత్మవినాశాయ దశగ్రీవో మనస్వినీమ్। 45

తతస్తు సా చారుదతీ శుచిస్మితా
వినాకృతా బంధుజనేన మైథిలీ ।
అపశ్యతీ రాఘవలక్ష్మణావుభౌ
వివర్ణవక్త్రా భయభారపీడితా । 46

పోవుచుండుటవలన 'లోకములో ఇకమీదట ధర్మము నశించును. సత్యము అడుగంటును, ఋజు భావమునకు చోటుండదు. దయ మాయమగును'- అని సమస్త ప్రాణులును ఒక్కుమ్మడిగా విలపించెను. జింకపిల్లలు పదేపదే ముఖములను పైకెత్తి చూచుచు, సంతతధారగా ప్రవహించుచున్న కన్నీటికారణముగా చూపులు మందగింపగా, భయముతో వణకుచు దైన్యముతో ఏడ్చినవి. (41-42)

ఆవిధముగా తీరని దుఃఖమునకులోనై, 'లక్ష్మణా! రామా!' అని బిగ్గఱగా జాలిగొలిపెడి స్వరముతో ఏడ్చుచు, పదేపదే నేలవైపు వీక్షించుచున్న సీతాదేవిని జూచి, వనదేవతలు మిగుల వణకిపోసాగిరి. (43-44)

సీతాదేవికురులు చెదరియుండెను. నొసట ధరించిన తిలకము చెరిగిపోయెను. అట్టి పతివ్రతను రావణుడు తన చావుదగ్గఱ పడినందున అపహరించెను. (45)

చక్కని పలువరుసగలిగి, సహజముగా చిఱునవ్వుతో ఒప్పుచుండెడి సీతాదేవి బంధుజనములకు (ఆత్మీయులకు) దూరమయ్యెను. ఈ స్థితిలో రామలక్ష్మణులును కనబడకుండుటచే ఆమె దీనవదనయై అంతులేని భయముతో క్రుంగిపోయెను. (46)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ద్విపంచాశస్సర్గః *(52)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదిరెండవసర్గము.

-- * * * --

53. ఏబదిమూడవసర్గము

ఆకాశమార్గమున రథముపై తనను తీసికొనిపోవుచున్న రావణుని మందలించుచు సీతాదేవి తీవ్రముగా పరుషోక్తులాడుట -

ఖముత్పతంతం తం దృష్ట్వా మైథిలీ జనకాత్మజా।
దుఃఖితా పరమోద్విగ్నా భయే మహతి వర్తినీ। 1

రోషరోదనతామ్రాక్షీ భీమాక్షం రాక్షసాధిపమ్।
రుదతీ కరుణం సీతా హ్రియమాణేదమబ్రవీత్। 2

న వ్యపత్రపసే నీచ! కర్మణాఽనేన రావణ!।
జ్ఞాత్వా విరహితాం యన్మాం చోరయిత్వా పలాయసే। 3

త్వయైవ నూనం దుష్టాత్మన్ భీరుణా హర్తుమిచ్ఛతా।
మమాపవాహితో భర్తా మృగరూపేణ మాయయా। 4

ఆవిధముగా రావణుడు తనను దీసికొని, ఆకాశమున సాగిపోవుచుండగా జూచి, సీతాదేవి భయముతో మిగుల కంపించుచు ఎంతయు దుఃఖమున మునింగెను. తనను అట్లు అపహరించుకొని పోవుచున్న రావణునిపై కుపితయై, చేయునది లేక వెక్కివెక్కియేడ్చుటచే సీతాదేవి యొక్క కన్నులెఱుపెక్కెను. అప్పుడామె దీనముగా విలపించుచు భయంకరములైన చూపులుగల ఆ రాక్షసరాజుతో ఈ విధముగా పలికెను. (1-2)

"ఓ నీచరావణా! రామలక్ష్మణులు లేని సమయమును జూచుకొని, ఒక దొంగవలె నన్ను తీసికొని పాఱిపోవుచుంటివి. ఇట్టి పనిచేయుటకు నీకు సిగ్గగుటలేదా? ఓ దుర్మార్గుడా! నన్ను అపహరింపదలచి, నాభర్తకు భయపడి, నీవు మాయామృగరూపముతో ఆయనను నాకు

యో హి మామ్ ఉద్యతస్త్రాతుం సోఽప్యయం వినిపాతితః।
గృధ్రరాజః పురాణోఽసౌ శ్వశురస్య సఖా మమ। 5

పరమం ఖలు తే వీర్యం దృశ్యతే రాక్షసాధమ!।
విశ్రావ్య నామధేయం హి యుద్ధే నాఽస్మి జితా త్వయా। 6

ఈదృశం గర్హితం కర్మ కథం కృత్వా న లజ్జసే।
స్త్రియాశ్చ హరణం నీచ! రహితే తు పరస్య చ। 7

కథయిష్యంతి లోకేషు పురుషాః కర్మ కుత్సితమ్।
సునృశంసమ్ అధర్మిష్ఠం తవ శౌండీర్యమానినః। 8

ధిక్! తే శౌర్యం చ సత్త్వం చ యత్ త్వం కథితవాంస్తదా।
కులాక్రోశకరం లోకే ధిక్! తే చారిత్రమీదృశమ్। 9

కిం కర్తుం శక్యమేవం హి యజ్జవేనైవ ధావసి।
ముహూర్తమపి తిష్ఠస్వ న జీవన్ ప్రతియాస్యసి। 10

న హి చక్షుష్పథం ప్రాప్య తయోః పార్థివపుత్రయోః।
ససైన్యోఽపి సమర్థస్త్వం ముహూర్తమపి జీవితుమ్। 11

న త్వం తయోః శరస్పర్శం సోఢుం శక్తః కథంచన।
వనే ప్రజ్వలితస్యేవ స్పర్శమగ్నేర్విహంగమః।
సాధు కృత్వాఽఽత్మనః పథ్యం సాధు మాం ముంచ రావణ!। 12

మత్ప్రధర్షణరుష్టో హి భ్రాత్రా సహ పతిర్మమ।
విధాస్యతి వినాశాయ త్వం మాం యది న ముంచసి। 13

యేన త్వం వ్యవసాయేన బలాన్మాం హర్తుమిచ్ఛసి।
వ్యవసాయః స తే నీచ! భవిష్యతి నిరర్థకః। 14

న హ్యహం తమపశ్యంతీ భర్తారం విబుధోపమమ్।
ఉత్సహే శత్రువశగా ప్రాణాన్ ధారయితుం చిరమ్। 15

న నూనం చాత్మనః శ్రేయః పథ్యం వా సమవేక్షసే।
మృత్యుకాలే యథా మర్త్యో విపరీతాని సేవతే। 16

ముమూర్షూణాం హి సర్వేషాం యత్ పథ్యం తన్న రోచతే।
పశ్యామ్యద్య హి కంఠే త్వాం కాలపాశావపాశితమ్। 17

దూరము చేసితివనుట నిశ్చయము - మామామగారికి ప్రియమిత్రుడైన జటాయువు నన్ను కాపాడుటకు పూనుకొనగా అతనిని నీవు వధించితివి. అట్లు ఒక ముసలి పక్షిని చంపిన నీవేమి శూరుడవు? (3-5)

ఓ రాక్షసాధమా! యుద్ధరంగమున నీపేరు ప్రకటించుకొని, రఘువీరులతో పోరి, నన్ను ఇటు తీసికొని రాలేదుగదా! దీనినిబట్టి నీపరాక్రమముయొక్క గొప్పదనము కనబడుచునే యున్నది. ఓ నీచుడా! యజమాని లేని సమయమున అతనిభార్యను అపహరించితివి. ఇట్టి నికృష్టమైన పనిని చేయుటకు నీకు సిగ్గులేదా? నీవు పరాక్రమములేని వాడవైనను, మహావీరుడనని గొప్పలు చెప్పుకొనుచుందువు. కాని నీవు ధర్మము తప్పి, చేసిన ఈ క్రూరకార్యమును లోకములోని వీరులెల్లరును నీచమైనదిగా చెప్పికొందురు- ఛీ! నీవు ఆనాడు (నన్ను అపహరించుకొని వచ్చునప్పుడు) నీ బలపరాక్రమములను గూర్చి తెగపొగడుకొంటివి. లోకమున కలకాలము నీ వంశమునకే అపకీర్తిని తెచ్చిపెట్టెడి ఈ నీచరిత్ర సిగ్గుచేటైనది- (6-9)

ఓ రాక్షసుడా! శ్రీరామునకు భయపడి నీవు పలాయనము చిత్తగించుచుంటివి. స్త్రీనైన నేను ఏమి చేయగలను? ఒక్కక్షణకాలముపాటు ఆగుము. నీవు ప్రాణములతో ఇంటికి చేరవు. (శ్రీరాముడు వచ్చి నిన్ను హతమార్చును.) (10)

రామలక్ష్మణులకంటబడినచో నీవూ, నీసైన్యమూ ఒక్క క్షణకాలముగూడ బ్రతికియుండుట దుర్లభము. వారినుండి నీవు తప్పించుకొనజాలవు. అరణ్యమునందు దావాగ్నిజ్వాలలకు పక్షివలె, ఆఇరువురువీరుల శరములధాటికి ఏవిధముగను నీవు తట్టుకొనజాలవు. కావున ఓరావణా! నన్ను విడిచిపెట్టి, నిన్ను నీవు రక్షించుకొనుము. నీవు నన్ను శ్రీరామునకు అప్పగింపనిచో, (ఆయనను నీవు శరణుగోరకున్నచో) నన్ను నీవు అవమానించినందులకు మిగులక్రుద్ధుడైన నాపతి తన తమ్మునితోగూడి వచ్చి నిన్ను హతమార్చితీరును. (11-13)

ఓ నీచుడా! కుటిలబుద్ధితో బలవంతముగా నన్ను అపహరించుకొని వచ్చిన నీసంకల్పము వమ్ము కాకతప్పదు - వేలనన దైవసమానుడైన నాపతిదర్శనము కాకుండ, శత్రువుయొక్క అధీనములో ఉండవలసి వచ్చినచో ఎంతోకాలము నాప్రాణములను నిలుపుకొనుటకు ఇష్టపడను - నీ శ్రేయస్సునుగాని, హితమునుగాని నీవు చూచుకొనకున్నావు. ఇది నిజము. చావు దగ్గఱపడినప్పుడు మానవుడు విపరీతకార్యములకే పూనుకొనును. నూకలుచెల్లినవారికందఱికిని హితకరమైన ఆహారము రుచింపదు. ఇప్పుడు నీమెడకు యమపాశము చుట్టుకొనియున్నట్లు నేను తలంచుచున్నాను. నీవు

యథా చాస్మిన్ భయస్థానే న బిభేషి దశానన!।
వ్యక్తం హిరణ్మయాన్ హి త్వం సంపశ్యసి మహీరుహాన్। 18

నదీం వైతరణీం ఘోరాం రుధిరౌఘనివాహినీమ్।
అసిపత్రవనం చైవ భీమం పశ్యసి రావణ!। 19

తప్తకాంచనపుష్పాం చ వైడూర్యప్రవరచ్ఛదామ్।
ద్రక్ష్యసే శాల్మలీం తీక్ష్ణామ్ ఆయసైః కంటకైశ్చితామ్। 20

న హి త్వమీదృశం కృత్వా తస్యాలీకం మహాత్మనః।
ధరితుం శక్ష్యసి చిరం విషం పీత్వేవ నిర్ఘృణః। 21

బద్ధస్త్వం కాలపాశేన దుర్నివారేణ రావణ!।
క్వ గతో లప్స్యసే శర్మ భర్తుర్మమ మహాత్మనః। 22

నిమేషాంతరమాత్రేణ వినా భ్రాత్రా మహావనే।
రాక్షసా నిహతా యేన సహస్రాణి చతుర్దశ। 23

స కథం రాఘవో వీరః సర్వాస్త్రకుశలో బలీ।
న త్వాం హన్యాచ్ఛరైస్తీక్ష్ణైః ఇష్టభార్యాపహారిణమ్। 24

ఏతచ్చాన్యచ్చ పరుషం వైదేహీ రావణాంకగా।
భయశోకసమావిష్టా కరుణం విలలాప హ। 25

తథా భృశార్తాం బహుచైవ భాషిణీం
విలాపపూర్వం కరుణం చ భామినీం ।
జహార పాపః కరుణం వివేష్టతీం
నృపాత్మజామ్ ఆగతగాత్రవేపథుమ్ । 26

నిజముగా భయపడవలసిన విషయమునందు భయపడుటలేదు. దీనినిబట్టి చూడగా నీవు బంగారువృక్షములకొఱకు ప్రాకులాడుచున్నట్లు కనబడుచున్నది. (14-18)

రక్తప్రవాహముతో నిండి, ఘోరముగానుండెడి వైతరణీనదిని, భయంకరమైన అసిపత్రవనమును (తీవ్ర వేదనను గూర్చెడి కత్తులతో నిండిన నరకమును) చూచెదవు. అగ్నికి ఎఱ్ఱగా కాగిన బంగారు పుష్పములును, బాగుగా నెడెక్కిన వైడూర్యమణులు పొదిగిన ఆకులును గలదియు, మొనదేలియున్న ఇనుపముళ్లుగలదియు ఐన బూరుగుచెట్టుఆకారముగల స్తంభములను కౌగిలించుకొనెదవు - (ఇది పరసతులను కాంక్షించెడివారికి పట్టెడి నరకయాతన.)(19-20)

కసాయివాడవైన నీవు మహాత్ముడైన ఆ శ్రీరామునకు ఈవిధముగా అపకారము చేయుచున్నందున కాలకూట విషమును త్రాగినవానివలె మరణించుట తథ్యము. (21)

ఓ రావణా! నీవు నివారింపశక్యముగాని యమపాశముచే బంధింపబడితివి. మహాత్ముడైన శ్రీరామునకు భయపడుచు (ఆయననుండి తప్పించుకొనుటకై) ఎక్కడికి వెళ్లిన నీకు మనశ్శాంతి లభించును? (22)

ఆనాడు దండకారణ్యమునందు తమ్మునితోడు లేకుండగనే రాముడు ఒక్కడే ఖరుడు మొదలగు పదునాలుగువేలమంది రాక్షసయోధులను ఒక్కనిముషములో మట్టుగలపించెను. వివిధములగు అస్త్రములను ప్రయోగించుటలో ఆతితేజీనవాడు, మహావీరుడు, బలశాలియు ఐన అట్టి శ్రీరాముడు అతని ప్రియభార్యను అపహరించిన నిన్ను తన తీక్ష్ణమైన శరములచే చంపకుండ ఎట్లుండగలడు?'' (23-24)

రావణునిఅధీనములో ఉండుటచే మిగుల భయశోకములకు లోనైయున్న వైదేహి ఇట్లు వివిధములైన పరుషవచనములను పలుకుచు అతిదీనముగా విలపించెను- (25)

మిక్కిలి ఆర్తికిలోనైన సీతాదేవి విలపించుచు, దైన్యముతో జాలిగొలుపునట్లు బహువిధములుగా వచించెను. ఐనను ఆమెమాటలను లెక్కచేయక భయకంపితయై దయనీయముగా మెలికలు దిరుగుచున్న ఆ రాజకుమారిని ఆపాపాత్ముడు తీసికొని పోవుచునేయుండెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే త్రిపంచాశస్సర్గః (53)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదిమూడవసర్గము.

-- * * * --

54. ఏబదినాల్గవసర్గము

రావణుడు సీతాదేవితో లంకకు చేరుట, ఆమెను అచట రాక్షస స్త్రీల రక్షణలో నుంచుట - పిమ్మట అతడు ఎనిమిదిమంది రాక్షస యోధులను దండకారణ్యమునకు పంపుట -

హ్రియమాణా తు వైదేహీ కంచిన్నాథమ్ అపశ్యతీ।
దదర్శ గిరిశృంగస్థాన్ పంచ వానరపుంగవాన్॥ 1

తేషాం మధ్యే విశాలాక్షీ కౌశేయం కనకప్రభమ్।
ఉత్తరీయం వరారోహా శుభాన్యాభరణాని చ।
ముమోచ యది రామాయ శంసేయురితి మైథిలీ॥ 2

వస్త్రముత్సృజ్య తన్మధ్యే విక్షిప్తం సహభూషణమ్।
సంభ్రమాత్తు దశగ్రీవః తత్కర్మ న స బుద్ధవాన్॥ 3

పింగాక్షాస్తాం విశాలాక్షీం నేత్రైరనిమిషైరివ।
విక్రోశంతీం తథా సీతాం దదృశుర్వానరర్షభాః॥ 4

స చ పంపామతిక్రమ్య లంకామ్ అభిముఖః పురీమ్।
జగామ రుదతీం గృహ్య వైదేహీం రాక్షసేశ్వరః॥ 5

తాం జహార సుసంహృష్టో రావణో మృత్యుమాత్మనః।
ఉత్సంగేనైవ భుజగీం తీక్ష్ణదంష్ట్రాం మహావిషామ్॥ 6

వనాని సరితః శైలాన్ సరాంసి చ విహాయసా।
స క్షిప్రం సమతీయాయ శరశ్చాపాదివ చ్యుతః॥ 7

తిమినక్రనికేతం తు వరుణాలయమక్షయమ్।
సరితాం శరణం గత్వా సమతీయాయ సాగరమ్॥ 8

సంభ్రమాత్ పరివృత్తోర్మీ రుద్ధమీనమహోరగః।
వైదేహ్యాం హ్రియమాణాయాం బభూవ వరుణాలయః॥ 9

రావణునిచేతిలో అపహరణకు గుఱియైన సీతాదేవికి ఆమెను ఆదుకొనువారు ఎవ్వరును కానరాలేదు. కాని ఇంతలో ఒక పర్వతశిఖరముపై ఐదుగురు వానర ప్రముఖులు ఆమె కంటబడిరి. అంతట ఒప్పులకుప్పయైన ఆ విశాలాక్షి బంగారుకాంతులీను పట్టుఉత్తరీయపు కొంగున మంగళకరములైన తనఆభరణములను కొన్నింటిని మూటగట్టి వారిమధ్యపడునట్లుగా వదిలెను. ఒకవేళ శ్రీరాముడు వారికడకు వచ్చుటయే తటస్థించినచో ఈ సొమ్ములను గుర్తుగానిచ్చి, తన అపహరణ విషయమును వారు ఆయనకు తెలుపుదురని భావించి, ఆమె ఆవిధముగా జేసెను. (1-2)

సీతాదేవి తనఆభరణములను వస్త్రమున మూటగట్టి పడవేసిన విషయమును లంకకు వెళ్లెడి తొందరలో[1] రావణుడు గమనింపనేలేదు. (3)

దూరముగానున్న వస్తువులనుగాని, వ్యక్తులనుగాని స్పష్టముగా చూడగల ఆవానరప్రముఖులు "రామా! రామా!" అని బిగ్గఱగా విలపించుచున్న విశాలనేత్రయగు ఆ సీతాదేవిని దేవతలవలె ఱెప్పలార్పక చూచిరి. (4)

విలపించుచున్న సీతాదేవిని దీసికొని, ఆ రాక్షసరాజు ఆకాశమార్గమున పంపాసరస్సును దాటి లంకవైపుగా తనప్రయాణమును కొనసాగించెను. (5)

తీక్ష్ణమైన కోఱలుగల మహావిషసర్పమును ఒడిలోనికి చేర్చుకొనినట్లు, తన పాలిటిమృత్యువైన సీతాదేవిని దీసికొని రావణుడు మిక్కిలి సంతోషముతో,[2] పయనించు చుండెను. అతడు అంతరిక్షమార్గమున అరణ్యములను, నదులను, కొండలను, సరస్సులను ధనుస్సునుండివదలిన బాణమువలె అతివేగముగా దాటుచు పయనింపసాగెను- తిమింగిలములకును, మొసళ్లకును నెలవు, నదులకు గమ్యస్థానము, జలములకు నిధియైన అపారసాగరమును జేరి, అతడు దానిని దాటెను. (6-8)

రావణుడు సీతాదేవిని అపహరించుకొని వచ్చుట చూచి, సముద్రుడు మిక్కిలి క్షోభపడెను. తరంగములు సుడులుదిరిగెను. అందలి మత్స్యములు, మహాసర్పములు భయముతో లోపల దాగికొనెను- (9)

1) రావణుని సంభ్రమమునకు కారణములు రెండు - (1) తాను సీతాదేవిని అపహరించుకొని వెళ్లుచున్న విషయము తెలిసి, రాముడు తనను ఎక్కడ వెంటాడునో అనుభయము (2) లంకకు త్వరగా చేరవలయునను ఆరాటము.
2) పంచవటి ఆశ్రమమునుండి చాల దూరమువఱకు పయనించియుండుటచే 'ఇంక రామునిభయము తొలగిపోయినది' అను ధీమాతో రావణుడు సంతోషపడెను-

అంతరిక్షగతా వాచః ససృజుశ్చారణాస్తదా।
ఏతదంతో దశగ్రీవ ఇతి సిద్ధాస్తదాఽబ్రువన్॥ 10

స తు సీతాం వివేష్టంతీమ్ అంకేనాదాయ రావణః।
ప్రవివేశ పురీం లంకాం రూపిణీం మృత్యుమాత్మనః॥ 11

సోఽభిగమ్య పురీం లంకాం సువిభక్తమహాపథామ్।
సంరూఢకక్ష్యాబహుళం స్వమంతఃపురమావిశత్॥ 12

తత్ర తామ్ అసితాపాంగాం శోకమోహపరాయణామ్।
నిదధే రావణః సీతాం మయో మాయామివ స్త్రియమ్॥ 13

అబ్రవీచ్చ దశగ్రీవః పిశాచీర్ఘోరదర్శనాః।
యథా నేమాం పుమాన్ స్త్రీ వా సీతాం పశ్యత్యసమ్మతః॥ 14

ముక్తామణిసువర్ణాని వస్త్రాణ్యాభరణాని చ।
యద్యదిచ్ఛేత్ తదేవాస్యా దేయం మచ్ఛందతో యథా॥ 15

యా చ వక్ష్యతి వైదేహీం వచనం కించిదప్రియమ్।
అజ్ఞానాద్యది వా జ్ఞానాత్ న తస్యా జీవితం ప్రియమ్॥ 16

తథోక్త్వా రాక్షసీస్తాస్తు రాక్షసేంద్రః ప్రతాపవాన్।
నిష్క్రమ్యాంతఃపురాత్ తస్మాత్ కింకృత్యమితి చింతయన్॥ 17

దదర్శాష్టౌ మహావీర్యాన్ రాక్షసాన్ పిశితాశనాన్॥ 18

స తాన్ దృష్ట్వా మహావీర్యో వరదానేన మోహితః।
ఉవాచైతానిదం వాక్యం ప్రశస్య బలవీర్యతః॥ 19

నానాప్రహరణాః క్షిప్రమ్ ఇతో గచ్ఛత సత్వరాః।
జనస్థానం హతస్థానం భూతపూర్వం ఖరాలయమ్॥ 20

తత్రోష్యతాం జనస్థానే శూన్యే నిహతరాక్షసే।
పౌరుషం బలమాశ్రిత్య త్రాసమ్ ఉత్సృజ్య దూరతః॥ 21

బలం హి సుమహద్యన్మే జనస్థానే నివేశితం।
సదూషణఖరం యుద్ధే హతం రామేణ సాయకైః॥ 22

అంతరిక్షమున విహరించెడి చారణులు, సిద్ధులు సీతాపహరణదృశ్యమును జూచి, 'ఇది రావణునకు చరమగీతమును పాడును'- అని తమలో తాము అనుకొనిరి. (10)

సీతాదేవి రావణునినుండి తప్పించుకొనుటకు పెనగులాడుచుండెను. ఐనను అతడు తనపాలిటి మృత్యువైన ఆ వైదేహిని అంకమున జేర్చుకొని లంకానగరమున ప్రవేశించెను. (11)

చక్కగా బారులు తీరియున్న వీధులుగల లంకాపురికి చేరి, జనులతో కిటకిటలాడుచున్న పెక్కు కక్ష్యలుగల తనఅంతఃపురమున అతడు ప్రవేశించెను. (12)

నల్లని నేత్రాంతములు గలది, శోకమోహములచే నిఃస్పృహకు లోనైయున్నది అగు సీతను, మయుడు మాయాస్త్రీనివలె రావణుడు అంతఃపురమున ఉంచెను.(13)

'నా అనుమతి లేకుండ ఏ పురుషుడుగాని, స్త్రీగాని ఈమెను చూడరాదు' అని దశగ్రీవుడు పిశాచములవలె వికృతాకారములుగల అచటి రాక్షసస్త్రీలను ఆదేశించెను. (14)

ముత్యములను, మణులను కూర్చిన హారములను, బంగారు నగలను, పట్టు పీతాంబరములను, ఇంకను ఆమె కోరుకొనిన వస్తువులను అన్నింటిని నాకు ఇచ్చిన రీతిగనే ఆమెకును ఒసంగుడు. మీలో ఎవ్వరైనను తెలిసిగాని, తెలియకగాని, ఈ వైదేహిని గూర్చి ఏదైననొక అప్రియవచనమును పలికినచో వారి ప్రాణములు మిగులవు." (15-16)

పరాక్రమశాలియైన రావణుడు ఆ రాక్షసస్త్రీలను అట్లు ఆదేశించి, ఆ అంతఃపురమునుండి వెలుపలికి వచ్చి, 'ఇక చేయవలసిదేమి?' - అని ఆలోచింపసాగెను. ఇంతలో మాంసభక్షకులు, మహావీరులు ఐన ఎనిమిదిమంది రాక్షసులు ఆయనకు కనబడిరి. బ్రహ్మనుండి వరములను పొంది, బలగర్వితుడై యున్న ఆరావణుడు ఆరాక్షసుల బలపరాక్రమములను మెచ్చుకొనుచు వారితో ఇట్లనెను. (17-19)

"ఓ యోధులారా! మీరు సాయుధులై వెంటనే జనస్థానమునకు వెళ్లుడు. ఇదివరలో అది ఖరుని అధీనములోనుండెను. అచటి మనవారు అందఱును హతులైరి. ప్రస్తుతము అది శూన్యముగానున్నది. మీరు పూర్తిగా భయమును వీడి (నిర్భయముగా) మీ బలపౌరుషములను నమ్ముకొని, (మహాయోధులైన మీరు రక్షణవిషయమున ఏమరుపాటులేక) ఆ శూన్యారణ్యమున నివసింపుడు.(20-21)

నేను ఇదివరలో ఆ జనస్థాన (దండకారణ్య) రక్షణకై ఖరదూషణాదులతో గూడిన మహాసైన్యమును అచట నిలిపితిని. వారందఱును యుద్ధమున శ్రీరామునిబాణములచే నిహతులైరి. ఆ అపజయము నన్ను వేధించుచున్నది. నాలో

తత్ర క్రోధో మమామర్షాత్ ధైర్యస్యోపరి వర్తతే।
వైరం చ సుమహజ్జాతం రామం ప్రతి సుదారుణమ్। 23

ధైర్యము సడలి, క్రోధము పెఱుగుచున్నది. ఆ కారణమున నాకు రామునిపై తీరని బద్ధవైరము ఏర్పడినది. (22-23)

నిర్యాతయితుమిచ్ఛామి తచ్చ వైరమహం రిపోః।
నహి లప్స్యామ్యహం నిద్రామ్ అహత్వా సంయుగే రిపుమ్। 24

తం త్విదానీమహం హత్వా ఖరదూషణఘాతినమ్।
రామం శర్మోపలప్స్యామి ధనం లబ్ధ్వేవ నిర్ధనః। 25

ఆ శత్రువుపై పగదీర్చుకొనుటకు తపనపడుచున్నాను. రణరంగమున ఆతనిని రూపుమాపెడి వఱకును నాకు నిద్రపట్టదు. ఖరదూషణాదిరాక్షసులను వధించిన ఆరాముని ఇప్పుడే హతమార్చి, నిర్ధనుడు నిధిని పొందినంతగా తృప్తి పడెదను. (24-25)

జనస్థానే వసద్భిస్తు భవద్భి రామమాశ్రితా।
ప్రవృత్తిరుపనేతవ్యా కింకరోతీతి తత్త్వతః। 26

అప్రమాదాచ్చ గంతవ్యం సర్వైరపి నిశాచరైః।
కర్తవ్యశ్చ సదా యత్నో రాఘవస్య వధం ప్రతి। 27

యుష్మాకం చ బలజ్ఞోఽహం బహుశో రణమూర్ధని।
అతశ్చాస్మిన్ జనస్థానే మయా యూయం నియోజితాః। 28

మీరు జనస్థానమున నివసించుచు రాముని కదలికలనుగూర్చియు, ఆయనప్రయత్నములను గుఱించియు పూర్తిసమాచారమును ఎప్పటికప్పుడు నాకు తెలియజేయు చుండుడు. నిశాచరులైన మీరు అందఱును అచటికి జాగ్రత్తగా వెళ్లవలెను. రాముని వధించుటకై (మీరు) నిరంతరము ప్రయత్నించుచుండవలెను. రణరంగమున పెక్కు సందర్భములలో మీరు ప్రదర్శించిన బల పరాక్రమములను గూర్చి నేను ఎఱుగుదును. అందువలననే ఆదండకారణ్యమునకు మిమ్ములను పంపుచున్నాను." (26-28)

తతః ప్రియం వాక్యముపేత్య రాక్షసా
మహార్థమష్టావభివాద్య రావణమ్ ।
విహాయ లంకాం సహితాః ప్రతస్థిరే
యతో జనస్థానమలక్ష్యదర్శనాః । 29

రావణుడు పలికిన ప్రశంసావచనములను వినిన పిమ్మట ఆ ఎనిమిదిమంది రాక్షసయోధులును అతనికి నమస్కరించిరి. తమకు అప్పగించిన ఘనకార్యమును సాధించుటకై లంకను వీడి, అందఱును కలిసి, ఇతరులెవ్వరును తమను గమనింపలేనంత వేగముతో జనస్థానమునకు బయలుదేఱిరి.(29)

తతస్తు సీతాముపలభ్య రావణః
సుసంప్రహృష్టః పరిగృహ్య మైథిలీమ్ ।
ప్రసజ్య రామేణ చ వైరముత్తమం
బభూవ మోహాన్ముదితః స రాక్షసః । 30

సీతాదేవిని జూచి కామవికారములకు లోనైన రావణుడు ఆమెను అపహరించుకొనివచ్చి, లంకానగరమున రాక్షసస్త్రీలరక్షణలోనుంచి, మిగుల సంతుష్టుడయ్యెను. మహావీరుడైన శ్రీరామునితో బద్ధవైరము ఏర్పడినప్పటికిని మోహ (అజ్ఞాన) వశమున అతడు పొంగిపోయెను. (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే చతుఃపంచాశస్సర్గః *(54)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదినాల్గవసర్గము.

-- * * * --

55. ఏబదిఐదవసర్గము

సీతాదేవిని ప్రలోభపఱచుటకై రావణుడు బలవంతముగా తన భవనవైభవాదులను ఆమెకు చూపించుట - ఆమె వాటియెడ విముఖతను ప్రదర్శించుట - తనను భర్తగా స్వీకరింపుమని రావణుడు పదేపదే వేడుకొనుచు ఆమె పాదములపై పడుట -

సందిశ్య రాక్షసాన్ ఘోరాన్ రావణోఽష్టౌ మహాబలాన్।
ఆత్మానం బుద్ధివైక్లబ్యాత్ కృతకృత్యమమన్యత। 1

రావణుడు మిగుల బలశాలురైన ఎనిమిదిమంది భయంకరరాక్షసులకు ఆదేశములనిచ్చెను. పిమ్మట బుద్ధిహీనుడైన అతడు తన ప్రయత్నములో కృతకృత్యుడైనట్లు భావించెను. (1)

స చింతయానో వైదేహీం కామబాణసమర్పితః।
ప్రవివేశ గృహం రమ్యం సీతాం ద్రష్టుమభిత్వరన్। 2

స ప్రవిశ్య తు తద్వేశ్మ రావణో రాక్షసాధిపః।
అపశ్యద్రాక్షసీమధ్యే సీతాం శోకపరాయణామ్। 3

అశ్రుపూర్ణముఖీం దీనాం శోకభారాభిపీడితాం।
వాయువేగైరివాఽఽక్రాంతాం మజ్జంతీం నావమర్ణవే। 4

మృగయూథపరిభ్రష్టాం మృగీం శ్వభిరివావృతాం।
అధోముఖముఖీం సీతామ్ అభ్యేత్య చ నిశాచరః। 5

తాం తు శోకపరాం దీనామ్ అవశాం రాక్షసాధిపః।
స బలాద్దర్శయామాస గృహం దేవగృహోపమమ్। 6

హర్మ్యప్రాసాదసంబాధం స్త్రీసహస్రనిషేవితం।
నానాపక్షిగణైర్జుష్టం నానారత్నసమన్వితమ్। 7

దాంతకైస్తాపనీయైశ్చ స్ఫాటికై రాజతైరపి।
వజ్రవైదూర్యచిత్రైశ్చ స్తంభైర్దృష్టిమనోహరైః। 8

దివ్యదుందుభినిర్హ్రాదం తప్తకాంచనతోరణం।
సోపానం కాంచనం చిత్రమ్ ఆరురోహ తయా సహ। 9

దాంతికా రాజతాశ్చైవ గవాక్షాః ప్రియదర్శనాః।
హేమజాలావృతాశ్చాసన్ తత్ర ప్రాసాదపంక్తయః। 10

సుధామణివిచిత్రాణి భూమిభాగాని సర్వశః।
దశగ్రీవః స్వభవనే ప్రాదర్శయత మైథిలీమ్। 11

దీర్ఘికాః పుష్కరిణ్యశ్చ నానావృక్షసమన్వితాః।
రావణో దర్శయామాస సీతాం శోకపరాయణామ్। 12

అతడు సీతాదేవిని తలంచుకొనుచు కామపరవశు డాయెను. అందువలన ఆమెను చూచుటకై త్వరపడుచు రమ్యమైన భవనమున ప్రవేశించెను. (2)

రాక్షసరాజైన రావణుడు ఆమందిరమున ప్రవేశించిన పిమ్మట రాక్షసస్త్రీలమధ్య శోకముతో వ్యాకులపడుచున్న సీతాదేవిని గాంచెను - అప్పుడు ఆమె దీనురాలై అంతులేని శోకముతో అలమటించుచు, సంతతధారగా కన్నీరుగార్చుచు, పెనుగాలులకు సముద్రమధ్యమున కొట్టుమిట్టాడుచున్న నావవలె ఒప్పెను- జింకల గుంపునుండి వేఱై, వేటకుక్కలచే ఆవృతమైన ఆడులేడివలె బిక్కుబిక్కుమనుచు అధోముఖియైయున్న సీతాదేవిని ఆనిశాచరుడు సమీపించెను. శోకాకులయై దైన్యముతోనున్న ఆజానకి దేనినిగూడ చూచుటకు ఇష్టపడకుండెను. ఐనను ఆరాక్షసరాజు దివ్యభవనమును తిలకింపజేయు తనప్రాసాదమును ఆమెకు బలవంతముగా చూపింపసాగెను. (3-6)

ఆ సౌధము చిన్నచిన్న భవనములతోడను, ఉన్నతమైన మేడలతోడను నిండియుండెను. అందు వేలకొలది స్త్రీలు సంచరించుచుండిరి. వివిధజాతులకు చెందిన పక్షులకలరవములతో అలరారుచుండెను. అనేకవిధములగు రత్నకాంతులతో వెలుగొందుచుండెను. అందు మనోహరములైన పెక్కు స్తంభములు నిర్మితములైయుండెను. అవి ఏనుగుదంతములతో, పుటముపెట్టిన బంగారముతో, వెండితో నిర్మింపబడెను. వాటిపై స్ఫటికమణులు, వజ్రవైదూర్యములు పొదగబడియుండుటచే అవి చూడముచ్చట గొలుపుచుండెను. అందు దివ్యదుందుభులు మ్రోగుచుండెను. అది మేలిమిబంగారు ముఖద్వారములతో మిలుమిట్లుగొల్పుచుండెను. సీతాదేవితో సహా అతడు ఆభవనముయొక్క చిత్రములైన బంగారు మెట్లను ఎక్కెను- (7-9)

అందలి గవాక్షములు (కిటికీలు) స్వచ్ఛములైన ఏనుగుదంతములతో నిర్మింపబడి దర్శనీయముగా నుండెను. అచట వరుసలు దీఱినమేడలు బంగారుకిటికీలతో విరాజిల్లుచుండెను. అందలి భూభాగములు అన్నియును సుద్దతో (గచ్చుతో) నిర్మింపబడి, విచిత్రములైన మణులతో పొదగబడియుండెను. అందలి దిగుడుబావులు, తామరకొలనులు వివిధములగు వృక్షములతో ఆవృతములై రమణీయముగానుండెను. ఇట్లు విరాజిల్లుచున్న తన భవనమును ఆదశగ్రీవుడు మైథిలికి చూపించెను. కాని శోకవ్యాకులయైయున్న సీతాదేవిమాత్రము వాటియెడ విముఖురాలైయుండెను. (10-12)

దర్శయిత్వా తు వైదేహ్యాః కృత్స్నం తద్భవనోత్తమం।
ఉవాచ వాక్యం పాపాత్మా సీతాం లోభితుమిచ్ఛయా। 13

దశ రాక్షసకోట్యశ్చ ద్వావింశతిరథాపరాః।
తేషాం ప్రభురహం సీతే! సర్వేషాం భీమకర్మణామ్। 14

వర్జయిత్వా జరావృద్ధాన్ బాలాంశ్చ రజనీచరాన్।
సహస్రమేకమేకస్య మమ కార్యపురస్సరమ్। 15

యదిదం రాజతంత్రం మే త్వయి సర్వం ప్రతిష్ఠితం।
జీవితం చ విశాలాక్షి! త్వం మే ప్రాణైర్గరీయసీ। 16

బహూనాం స్త్రీసహస్రాణాం మమ యోఽసౌ పరిగ్రహః।
తాసాం త్వమీశ్వరా సీతే! మమ భార్యా భవ ప్రియే!। 17

సాధు కిం తేఽన్యయా బుద్ధ్యా రోచయస్వ వచో మమ।
భజస్వ మాఽభితప్తస్య ప్రసాదం కర్తుమర్హసి। 18

పరిక్షిప్తా సహస్రేణ లంకేయం శతయోజనా।
నేయం ధర్షయితుం శక్యా సేంద్రైరపి సురాసురైః। 19

న దేవేషు న యక్షేషు న గంధర్వేషు పక్షిషు।
అహం పశ్యామి లోకేషు యో మే వీర్యసమో భవేత్। 20

రాజ్యభ్రష్టేన దీనేన తాపసేన గతాయుషా।
కిం కరిష్యసి రామేణ మానుషేణాఽల్పతేజసా। 21

భజస్వ సీతే! మామేవ భర్తాఽహం సదృశస్తవ।
యౌవనం హ్యధ్రువం భీరు! రమస్వేహ మయా సహ। 22

దర్శనే మాకృథా బుద్ధిం రాఘవస్య వరాననే! కాఽ।
స్య శక్తిరిహాఽఽగంతుమ్ అపి సీతే! మనోరథైః। 23

పాపాత్ముడైన రావణుడు వైదేహికి తనభవనవిశేషముల నన్నింటిని చూపించిన పిమ్మట ఆమెను ప్రలోభ పెట్టుటకై ఆమెతో ఇట్లు నుడివెను. (13)

"ఓసీతా! నా అధీనములో ముప్పదిరెండుకోట్లమంది రాక్షసయోధులు గలరు. భయంకరకృత్యములను ఒనర్చుటలో వీరు సమర్థులు. వీరుగాక బాలురు, వృద్ధులు పెక్కుమంది గలరు. ఈయందఱికిని నేను ప్రభువును. వేయిమందిరాక్షసులు నా ఒక్కనిసేవలోనర్చుటలోనే నిరతులైయుందురు. (14-15)

ఓ విశాలాక్షీ! ఈనారాజపరివారములన్నియును నీఅధీనములోనుండును. అంతేగాదు నా జీవనసర్వస్వమూ నీ అధీనమే. నీవు నాకు ప్రాణములకంటెను మిన్న. ఓ ప్రియమైన సీతా! ఇంకను పెక్కువేలమంది స్త్రీలు (పరిచారికలు) నన్ను సేవించుచుందురు. నీవు నన్ను చేపట్టినచో వీరియందఱికిని నీవే యజమానురాలవు. కనుక నీవు నా భార్యవు కమ్ము[1]. (16-17)

ఓ సీతా! నామాటవినుము. ఇట్లు చేయుటయే మంచిది. నీకు మఱియొక ఆలోచన దేనికి. (నీ బుద్ధి రాముని మీదికి పోనీయకుము.') నన్నే సేవింపుము. నీయెడ అనురక్తుడనైన (కామవికారములకు లోనైన) నన్ను అనుగ్రహింపుము. (18)

ఈ (నా) లంకారాజ్యము వేయియోజనముల విస్తీర్ణముగలది. దీనిని వేలకొలదిరాక్షసులు పరిరక్షించుచున్నారు. సురాసురులెల్లరును ఇంద్రునితోగూడి వచ్చినను దీనిని జయించుట అసాధ్యము. దేవతలయందును, యక్షులలోను, గంధర్వులయందును, పక్షులలోను ఎవ్వరును ముల్లోకములలో పరాక్రమమున నాతో సమానులు కారు. (19-20)

రాముడు రాజ్యభ్రష్టుడై దైన్యముతో తాపసవృత్తిలో నున్నవాడు, ఆయువుదీఱినవాడు, మనుష్యమాత్రుడు, శక్తిహీనుడు, అట్టి వానితో నీకేమిప్రయోజనము? ఓ సీతా! నేనే నీకు తగిన భర్తను. కనుక నన్ను స్వీకరింపుము. ఓ భయస్వభావురాలా! యౌవనము క్షణికము సుమా! దానిని వృథాచేయక నాతోగూడి ఆనందింపుము. (21-22)

ఓ సుందరీ! శ్రీరాముని చూడవలెననెడు ఆలోచనను మానుకొనుము. మానసికముగానైనను అతడు ఇచటికి (ఈ లంకకు) రాజాలడు. ఇక శరీరముతో ఎట్లు

1) భార్యా+అభవప్రియే. అనియు పదచ్ఛేదము చేయనచ్చును. భవము = సంసారము, భవముకానిది అభవము- అనగా సంసారము కానిది, మోక్షము - అభవప్రియే! = మోక్షప్రియే! విష్ణుప్రియే!. 'భార్యా' పదమును భా+ఆర్యా అని విడదీసినచో విశేషార్థము వచ్చును. భా = చిద్రూపిణీ, ఆర్యా= శ్రేష్ఠా, భార్యా భవ = చిద్రూపిణివైన శ్రేష్ఠురాలవు కమ్ము. అనగా నీవు నాకును, ఈ రాక్షసులందఱికిని పాలించుదానవు (ఈశ్వరివు) కమ్ము. - గోవిందరాజీయ వ్యాఖ్యానము.

న శక్యో వాయురాకాశే పాశైర్బద్ధుం మహాజవః।
దీప్యమానస్య వాప్యగ్నేః గ్రహీతుం విమలాం శిఖామ్। 24

త్రయాణామపి లోకానాం న తం పశ్యామి శోభనే!।
విక్రమేణ నయేద్యస్త్వాం మద్బాహుపరిపాలితామ్। 25

లంకాయాం సుమహద్రాజ్యమ్ ఇదం త్వమ్ అనుపాలయ।
త్వత్ప్రేష్యా మద్విధాశ్చైవ దేవాశ్చాపి చరాచరాః।
అభిషేకోదకక్లిన్నా తుష్టా చ రమయస్వ మాం। 26

దుష్కృతం యత్ పురా కర్మ వనవాసేన తద్గతమ్।
యశ్చ తే సుకృతో ధర్మః తస్యేహ ఫలమాప్నుహి। 27

ఇహ మాల్యాని సర్వాణి దివ్యగంధాని మైథిలి!।
భూషణాని చ ముఖ్యాని సేవస్వ చ మయా సహ। 28

పుష్పకం నామ సుశ్రోణి! భ్రాతుర్వైశ్రవణస్య మే।
విమానం సూర్యసంకాశం తరసా నిర్జితం మయా। 29

విశాలం రమణీయం చ తద్విమానమ్ అనుత్తమమ్।
తత్ర సీతే మయా సార్ధం విహరస్వ యథాసుఖమ్। 30

వదనం పద్మసంకాశం విమలం చారుదర్శనమ్।
శోకార్తం తు వరారోహే! న భ్రాజతి వరాననే!। 31

ఏవం వదతి తస్మిన్ సా వస్త్రాంతేన వరాంగనా।
పిధాయేందునిభం సీతా ముఖమ్ అశ్రూణ్యవర్తయత్। 32

ధ్యాయంతీం తామివాస్వస్థాం దీనాం చింతాహతప్రభామ్।
ఉవాచ వచనం పాపో రావణో రాక్షసేశ్వరః। 33

అలం వ్రీడేన వైదేహి! ధర్మలోపకృతేన చ।
ఆర్షోఽయం దైవనిష్యందో యస్త్వామ్ అభిగమిష్యతి। 34

సాధ్యము. ఆకాశమున మిగుల వేగముగా ప్రసరించెడి (మహాబలుడైన) వాయువును ఎవ్వడును ఏట్టి పాశములచేతను బంధింపజాలడు. (ఆపజాలడు.) తీవ్రముగా మండుచున్న అగ్నిజ్వాలలను ఎవ్వడును పట్టుకొనజాలడు. (23-24)

ఓ శుభాంగీ! నాఅధీనములోనున్న నిన్ను తనపరాక్రమముచేత ఇక్కడినుండి తీసికొనిపోగలమొనగాడు (వీరుడు) ముల్లోకములలో సైతము లేడు. (కనబడడు) (25)

నన్ను పతిగా స్వీకరించి, ఈ విశాలలంకారాజ్యమును నీవే ఏలుకొనుము. అప్పుడు నావంటి రాక్షసవీరులును, దేవతలును, ఈ చరాచరప్రపంచమూ నీకు సేవకులగుదురు. నాకు పట్టమహిషివిగా అభిషిక్తురాలవై సంతోషముతో నన్ను ఆనందింపజేయుము. (26)

ఓ వైదేహీ! పూర్వజన్మలో చేసికొనిన దుష్కృతఫలములు నీవు వనవాసక్లేశములను అనుభవించుట ద్వారా తీఱినవి. నీసుకృతఫలములను ఇచట పొందుము. ఇచటనేయుండి వివిధములగు పుష్పహారములను, దివ్యములైన గంధములను, అమూల్యములైన ఆభరణములను నాతోగూడి అనుభవింపుము. (27-28)

ఓ సుందరీ! నా సోదరుడైన కుబేరుని నాపరాక్రమముచే జయించి, అతనినుండి పుష్పకవిమానమును గొనివచ్చితిని. అది సువిశాలమై, సూర్యకాంతులను వెదజల్లుచు రమణీయముగానుండును. అత్యుత్తమమైన ఆ విమానముపై నాతోగూడి నీవు హాయిగా విహరింపుము.(29-30)

ఓ తరుణీ! నిర్మలమైన నీ ముఖారవిందము ఆహ్లాదకరమైనది. నీవు ఆర్తితో శోకించుచుండుటవలన అది వెలవెలబోవుచున్నది." (31)

అతడిట్లు పలుకుచుండగా నారీశిరోమణియైన సీతాదేవి చీరచెంగుతో చంద్రబింబమువంటి తనముఖమును కప్పుకొని, కన్నీరుకార్చెను. (32)

వైదేహి చింతాక్రాంతురాలై యుండుటవలన స్వస్థతను కోల్పోయి వసివాడియున్నది. ఆమె దీనురాలై శ్రీరామునే ధ్యానించుచున్నది. అట్టిస్థితిలో పాపాత్ముడైన ఆ రాక్షసరాజు ఆమెతో ఇట్లు పచించెను. (33)

"ఓ వైదేహీ! ఇట్లు చేయుట అధర్మమగునని భావించి నీవు బిడియపడనలదు. (వెనుకాడవలదు) విధివశమున ఏర్పడెడి ఈ సంబంధము శాస్త్రసమ్మతమే[1] (34)

1) ఇట్లు పలుకుట ద్వారా రావణుడు సీతాదేవిని వంచించుచున్నాడు. యథార్థముగా ఇట్టి పాపకృత్యములను ధర్మశాస్త్రము ఎన్నడును సమర్థింపలేదు. కన్యను అపహరించుకొనిపోయి, పెండ్లియాడుట 'రాక్షసవివాహము' అనబడును. ఆమె సమ్మతిలేనిచో అదియు నింద్యమే. వివాహితయైన ఒకసాధ్విని అపహరించుట ఘోరమైన పాపము. ఈ పాపఫలితముగా బంగారులంక మట్టిలో గలిసెను, రావణుడు సపరివారముగా నశించెను. అధర్మమును ధర్మముగా భావించుట తామసలక్షణముగదా!

ఏతౌ పాదౌ మయా స్నిగ్ధౌ శిరోభిః పరిపీడితౌ।
ప్రసాదం కురు మే క్షిప్రం వశ్యో దాసోఽహమస్మి తే। 35

ఇమాః శూన్యా మయా వాచః శుష్యమాణేన భాషితాః।
న చాపి రావణః కాంచిత్ మూర్ధ్నా స్త్రీం ప్రణమేత హ। 36

ఓ జానకీ! ఈనీపాదములు మిగుల మృదువైనవి. అట్టి పాదములకు నేను నాపదితలలతో మోకరిల్లెదను. వెంటనే నన్ను అనుగ్రహింపుము. నేను సర్వదా దాసుడనై నీ అధీనములో ఉందును. నేను కామాగ్నిసంతప్తుడనై ఇట్లు పలికితిని. కాని నా పలుకులు నిష్ఫలములు కారాదు. రావణుడెన్నడును ఏ స్త్రీకిని శిరసా నమస్కరింపడు." (35-36)

ఏవముక్త్వా దశగ్రీవో మైథిలీం జనకాత్మజాం।
కృతాంతవశమాపన్నో మమేయమ్ ఇతి మన్యతే। 37

జానకితో రావణుడు ఇట్లు పలికిన పిమ్మట అతడు ఆయువు మూడియుండుటచే 'ఇక ఈమె నాకు దక్కినట్లే' అని మనసులో భావించెను. (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచపంచాశస్సర్గః (55)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదిఐదవసర్గము.

— * * * —

56. ఏబదిఆఱవసర్గము

'నన్ను అపహరించుకొని వచ్చినందులకు శ్రీరామునిచేతిలో నీకు చావు తప్పదు' అని సీతాదేవి రావణుని హెచ్చరించుట - దానికతడు క్రుద్ధుడై, సంవత్సరము గడువు విధించి, ఆమె రక్షణ భారమును రక్కసులకు అప్పగించివెళ్లుట - అతని ఆదేశానుసారము వారు ఆమెను అశోకవనమునకు చేర్చుట -

సా తథోక్తా తు వైదేహీ నిర్భయా శోకకర్శితా।
తృణమంతరతః కృత్వా రావణం ప్రత్యభాషత। 1

రావణుడు ఇట్లు పలుకగా సీతాదేవి శోకముచే కృశించియున్నను గడ్డిపోచను అడ్డుపెట్టుకొని, నిర్భయముగా అతనికి ఈ విధముగా ప్రత్యుత్తరమిచ్చెను. (1)

రాజా దశరథో నామ ధర్మసేతురివాచలః।
సత్యసంధః పరిజ్ఞాతో యస్య పుత్త్రః స రాఘవః। 2

రామో నామ స ధర్మాత్మా త్రిషు లోకేషు విశ్రుతః।
దీర్ఘబాహుర్విశాలాక్షో దైవతం హి పతిర్మమ। 3

సుప్రసిద్ధుడైన దశరథమహారాజు ధర్మపథమునందు స్థిరముగానుండువాడు. సత్యసంధుడు. ఆయనకుమారుడు శ్రీరాముడు. అతడు ధర్మాత్ముడుగా ముల్లోకములలో ఖ్యాతివహించినవాడు. అతడు విశాలనేత్రుడు, ఆజానుబాహువు. సర్వలోకములకును ప్రభువు. ఆయనయే నాపతి. సద్వంశమునకు చెందిన అట్టి మహాపురుషుని భార్యనైన నేను అధర్మమునకు ఎట్లు పాల్పడుదును? (2-3)

ఇక్ష్వాకూణాం కులే జాతః సింహస్కంధో మహాద్యుతిః।
లక్ష్మణేన సహ భ్రాత్రా యస్తే ప్రాణాన్ హరిష్యతి। 4

ప్రత్యక్షం యద్యహం తస్య త్వయా స్యాం ధర్షితా బలాత్।
శయితా త్వం హతః సంఖ్యే జనస్థానే యథా ఖరః। 5

సుప్రసిద్ధమైన ఇక్ష్వాకువంశమున ఆవిర్భవించిన అతడు సింహపరాక్రముడు, మహాతేజస్వి. ఆయన తన తమ్ముడగు లక్ష్మణునితో వచ్చి, నీ ప్రాణములను తీయగలడు. నీవు నన్ను బలవంతముగా అపహరించుకొని వచ్చుట అతని కంటబడియున్నచో నీవును ఖరునివలె యుద్ధరంగమున మట్టి గఱచియుండెడివాడవు. (4-5)

య ఏతే రాక్షసాః ప్రోక్తా ఘోరరూపా మహాబలాః।
రాఘవే నిర్విషాః సర్వే సుపర్ణే పన్నగా యథా। 6

ఘోరరూపులైన 'ఈ రాక్షసులందఱును మహాబలశాలురు' అని నీవు పేర్కొనియుంటివి. కాని గరుత్మంతునిముందు సర్పములవలె వీరెల్లరును రాఘవునియెదుట దేనికిని పనికిరారు. (ఏమాత్రమును నిలువజాలరు.) (6)

తస్య జ్యావిప్రముక్తాస్తే శరాః కాంచనభూషణాః।
శరీరం విధమిష్యంతి గంగాకూలమివోర్మయః। 7

గంగానదీతరంగములు దానిదరులనువలె శ్రీరాముని ధనుస్సునుండి బయలుదేఱిన బంగారుశరములు నీ శరీరమును కూలగొట్టగలవు. ఓ రావణా! సురలకును,

అసురైర్వా సురైర్వా త్వం యద్యవధ్యోఽసి రావణ!।
ఉత్పాద్య సుమహద్వైరం జీవంస్తస్య న మోక్ష్యసే। 8

న తే జీవితశేషస్య రాఘవోఽంతకరో బలీ।
పశోర్యూపగతస్యేవ జీవితం తవ దుర్లభమ్। 9

యది పశ్యేత్ స రామస్త్వాం రోషదీప్తేన చక్షుషా।
రక్షస్త్వమద్య నిర్దగ్ధో గచ్ఛేః సద్యః పరాభవమ్। 10

యశ్చంద్రం నభసో భూమౌ పాతయేన్నాశయేత వా।
సాగరం శోషయేద్వాపి స సీతాం మోచయేదిహ। 11

గతాయుస్త్వం గతశ్రీకో గతసత్త్వో గతేంద్రియః।
లంకా వైధవ్యసంయుక్తా త్వత్కృతేన భవిష్యతి। 12

న తే పాపమిదం కర్మ సుఖోదర్కం భవిష్యతి।
యాఽహం నీతా వినాభావం పతిపార్శ్వాత్ త్వయా వనే। 13

స హి దైవతసంయుక్తో మమ భర్తా మహాద్యుతిః।
నిర్భయో వీర్యమాశ్రిత్య శూన్యే వసతి దండకే। 14

స తే దర్పం బలం వీర్యమ్ ఉత్సేకం చ తథావిధమ్।
అపనేష్యతి గాత్రేభ్యః శరవర్షేణ సంయుగే। 15

యదా వినాశో భూతానాం దృశ్యతే కాలచోదితః।
తదా కార్యే ప్రమాద్యంతి నరాః కాలవశం గతాః। 16

మాం ప్రధృష్య స తే కాలః ప్రాప్తోఽయం రాక్షసాధమ!।
ఆత్మనో రాక్షసానాం చ వధాయాంతఃపురస్య చ। 17

అసురులకును సీవు అవధ్యుడవు కావచ్చునేమో గాని (వారు నిన్ను చంపలేకపోవచ్చునేమోగాని) శ్రీరామునకు తీరనికోపమును కలిగించిన నీవు ప్రాణములతోమాత్రము మిగులవు. (7-8)

మిగిలియున్న నీ జీవితము బలశాలియైన శ్రీరామునిచేతిలో పరిసమాప్తియగును. యూపస్తంభమునకు బంధింపబడిన బలిపశువువలె ఇక నీవు ప్రాణములతో నుండుట అసంభవము. ఓ రాక్షసుడా! శ్రీరాముడు రోషముతో కన్నులెఱ్ఱజేసి చూచినచో ఆయనచూపులజ్వాలలకు నీవు వెంటనే మాడి మసియైపోవుదువు. (9-10)

శ్రీరాముడే తలచుకొన్నచో చంద్రుని ఆకాశమునుండి భూమికి పడగొట్టగలడు. లేదా మటుమాయమొనర్ప గలడు. మహాసాగరమునుసైతము ఇంకిపోవునట్లు చేయగలడు. అంతటి మహాశక్తిమంతుడు అతడు. కనుక ఆ వీరుడు నీచెఱనుండి నన్ను తప్పక విడిపింపగలడు. (11)

'పరసతిని అపహరించుట'యనెడి నీవు ఒనర్చిన మహాపాపఫలముగా[1] నీ ప్రజ్ఞాపాటవములు, బలములు, సంపదలు, కడకు నీ ప్రాణములు పోయినట్లే భావింపుము. ఇప్పుడు నీవు జీవచ్ఛవముగా మిగిలియున్నావు. నీ పాపకృత్యములకారణముగా నీ లంకానగరము త్వరలో దిక్కులేనిదియగును. (12)

ఓ రాక్షసుడా! దండకారణ్యమునందు భర్తతో హాయిగా నివసించుచుండెడి నన్ను నీమాయోపాయముచేత నాపతినుండి యెడబాపితివి. ఆ పాపమునకు ఫలముగా నీకింక సుఖశాంతులు కఱవగును. (13)

నాభర్తయైన శ్రీరాముడు మహాతేజస్సంపన్నుడు, దైవబలముగలవాడు. ఆ మహావీరుడు తనపరాక్రమ ప్రభావముచే జనసంచారమేలేని దండకారణ్యమునందు నిర్భయముగా నివసించుచున్నాడు. అతడు రణరంగము నందు తనబాణపరంపరచే నీశరీరబలమును నశింపజేయును. గర్వమును అణచివేయును, పరాక్రమమును నిర్వీర్య మొనర్చును. అట్లే నీమిడిసిపాటునుసైతము రూపుమాపును. (14-15)

విధివిలాసముచే మానవులు (వ్యక్తులు) పోగాలము దాపురించినప్పుడు కాలవశులై విపరీతకృత్యములకు పాల్పడుచుందురు. (పొరపాట్లకు లోనగుచుందురు.) (16)

ఓ రాక్షసాధమా! నన్ను అపహరించినట్టి ఆ క్షణమే నీకును, నీరాక్షసులకును, నీఅంతఃపురజనులందఱికిని చావునకు సెట్టుకొనిన ముహూర్తసమయము సుమా! (17)

1) ఆయుర్బలం యశో లక్ష్మీః పరదారాభిమర్శనాత్! సద్య ఏవ వినశ్యంతి - - స్మృతి – గోవిందరాజీయవ్యాఖ్య. పరసతిని తాకినచో (పరసతియెడ అకృత్యమునకు పాల్పడినచో) అతని ఆయువు, బలము, కీర్తిప్రతిష్ఠలు, సమస్తసంపదలు వెంటనే నశించును.

న శక్యా యజ్ఞమధ్యస్థా వేదిః స్రుగ్భాండమండితా।
ద్విజాతిమంత్రపూతా చ చండాలేనావమర్దితుమ్। 18

తథాఽహం ధర్మనిత్యస్య ధర్మపత్నీ పతివ్రతా।
త్వయా స్ప్రష్టుం న శక్యాఽస్మి రాక్షసాధమ! పాపినా। 19

క్రీడంతీ రాజహంసేన పద్మషండేషు నిత్యదా।
హంసీ సా తృణషండస్థం కథం పశ్యేత మద్గుకమ్। 20

ఇదం శరీరం నిస్సంజ్ఞం బంధ వా ఖాదయస్వ వా।
నేదం శరీరం రక్ష్యం మే జీవితం వాపి రాక్షస!।
నతు శక్ష్యామ్యుపక్రోశం పృథివ్యాం దాతుమాత్మనః। 21

ఏవముక్త్వా తు వైదేహీ క్రోధాత్ సుపరుషం వచః।
రావణం మైథిలీ తత్ర పునర్నోవాచ కించన। 22

సీతాయా వచనం శ్రుత్వా పరుషం రోమహర్షణమ్।
ప్రత్యువాచ తతః సీతాం భయసందర్శనం వచః। 23

శృణు మైథిలి! మద్వాక్యం మాసాన్ ద్వాదశ భామిని!।
కాలేనానేన నాభ్యేషి యది మాం చారుహాసిని!। 24

తతస్త్వాం ప్రాతరాశార్థం సూదాశ్ఛేత్స్యంతి లేశశః। 25

ఇత్యుక్త్వా పరుషం వాక్యం రావణః శత్రురావణః।
రాక్షసీశ్చ తతః క్రుద్ధ ఇదం వచనమబ్రవీత్। 26

శీఘ్రమేవ హి రాక్షస్యో! వికృతా ఘోరదర్శనాః।
దర్పమస్యా వినేష్యధ్వం మాంసశోణితభోజనాః। 27

వచనాదేవ తాస్తస్య సుఘోరా రాక్షసీగణాః।
కృతప్రాంజలయో భూత్వా మైథిలీం పర్యవారయన్। 28

స తాః ప్రోవాచ రాజా తు రావణో ఘోరదర్శనః।
ప్రచాల్య చరణోత్కర్షైః దారయన్నివ మేదినీమ్। 29

ఓ నీచరాక్షసా! యజ్ఞశాలలో గార్హపత్యాగ్నికిని, ఆహవనీయాగ్నికిని మధ్యన ఉన్నదియు, స్రుక్కు, స్రువము మొదలగు హోమపరికరములతో ఒప్పుచున్నదియు, ద్విజులు పఠించెడి వేదమంత్రములచే పవిత్రమైనదియు అగు యజ్ఞవేదికయందు చండాలుడు కాలుమోపుటకు అర్హుడు కాడు. అట్లే ధర్మాత్ముడైన శ్రీరామునియొక్క ధర్మపత్నిని, పతివ్రతను ఐన నన్ను తాకుటకు పాపాత్ముడవైన నీవు అనర్హుడవు. (18-19)

ఎల్లప్పుడును సరస్సులలో పద్మములమధ్య రాజహంసతో విహరించుచుండెడి ఆడుహంస గడ్డిపరకలమధ్య మసలెడి నీటికాకివైపు చూచుటకైనను ఎట్లు ఆసక్తి చూపును? అట్లే పురుషోత్తముడైన శ్రీరామునే సర్వస్వముగా భావించెడి నేను పాపివైన నిన్ను కన్నెత్తి చూచుటకుసైతము ఇష్టపడను. (20)

ఓ రాక్షసుడా! "ఈ శరీరము జడపదార్థము. దీనిని నీవు బంధించినను, భక్షించినను సరే! నాకు ఈ శరీరమునుగాని, కడకు నా ప్రాణములనుగాని కాపాడుకొనవలెననెడి తపన లేదు. ఈ భూమండలమున నాకు నిందను, కళంకమును తెచ్చిపెట్టెడి పనినీ నేను చేయజాలను". (21)

వైదేహి క్రుద్ధయై రావణునితో ఇట్లు పరుష వచనములను పలికిన పిమ్మట ఆ మైథిలి ఏమియు మాటాడక మిన్నకుండెను. (22)

సీతాదేవి నుడివిన కటువచనములకు ఒడలు కంపరమెత్తగా రావణుడు ఆమెకు భీతినిగొలిపెడి మాటలతో ప్రత్యుత్తరమిచ్చెను. (23)

"ఓ మైథిలీ! నామాట వినుము. నీకు పండ్రెండుమాసములగడువును ఇచ్చుచున్నాను. ఈలోపల నాయెడ సుముఖురాలివి కానిచో గడువుదీరిన మఱునాడే ప్రాతఃకాలభోజనమునకై వంటవారు నిన్ను ముక్కలు ముక్కలుగా జేయుదురు". (24-25)

శత్రువులను బాధించునట్టి రావణుడు సీతాదేవితో ఇట్లు కటువుగా పలికిన పిమ్మట క్రుద్ధుడై, అచటిరాక్షస స్త్రీలతో ఈ విధముగా నుడివెను. (26)

"వికృతములై భయంకరాకారములుగలిగి, రక్తమాంసములను భక్షించెడి ఓ రక్కసులారా! ఈమెఅహంకారమును రూపుమాపి, శీఘ్రముగా (నా) దారికితీసికొని రండు". (27)

భయంకరులైన ఆ రాక్షసస్త్రీలు రావణుని ఆదేశవచనములను వినినవెంటనే చేతులు జోడించుచు అయనకు నమస్కరించి, క్షణములో సీతాదేవిచుట్టును జేరి నిలచిరి. (28)

భీకరస్వరూపుడు, రాక్షసరాజు ఐన రావణుడు భూమిని బ్రద్దలుచేయుచున్నాడా? యనునట్లు 'ధనధన'మని అడుగులు వేయుచు ఆ రక్కసులతో ఇట్లు పలికెను. (29)

అశోకవనికామధ్యే మైథిలీ నీయతామియమ్।
తత్రేయం రక్ష్యతాం గూఢం యుష్మాభిః పరివారితా। 30

తత్రైనాం తర్జనైర్ఘోరైః పునః సాంత్వైశ్చ మైథిలీమ్।
ఆనయధ్వం వశం సర్వా వన్యాం గజవధూమివ। 31

"ఈ మైథిలిని అశోకవనమునకు తీసికొని వెళ్లుడు. ఆ వనమధ్యభాగమున ఈమెను ఒక రహస్య ప్రదేశమునందుంచి చుట్టునుజేరి మీరు కావలా కాయుచుండుడు. అచట మీరందఱును భీతిని గొల్పెడి మాటలతోను, సాంత్వన వచనములతోను (నయాన భయాన) ఈ జానకిని అరణ్యములోని ఆడుఏనుగును వలె త్రోవకుతీసికొని రండు". (30-31)

ఇతి ప్రతిసమాదిష్టా రాక్షస్యో రావణేన తాః।
అశోకవనికాం జగ్ముః మైథిలీం ప్రతిగృహ్య తు। 32

సర్వకాలఫలైర్వృక్షైః నానాపుష్పఫలైర్వృతామ్।
సర్వకాలమదైశ్చాపి ద్విజైః సముపసేవితామ్। 33

రావణుడు ఇట్లు ఆజ్ఞాపింపగా ఆ రాక్షసస్త్రీలు సీతాదేవిని దీసికొని, అశోకవనమునకు వెళ్లిరి. ఆ వనమునందలి వృక్షములు అన్నిఋతువులలోను ఫలించుచుండును. అన్నివేళలయందును అవి ఫలపుష్పములతో కళకళలాడుచుండును. అచటిపక్షులన్నియును పుష్టికరమైన ఆహారములను తిని మత్తిల్లియుండును. (32-33)

సా తు శోకపరీతాంగీ మైథిలీ జనకాత్మజా।
రాక్షసీవశమాపన్నా వ్యాఘ్రీణాం హరిణీ యథా। 34

శోకేన మహతా గ్రస్తా మైథిలీ జనకాత్మజా।
న శర్మ లభతే భీరుః పాశబద్ధా మృగీ యథా। 35

జనకునిగారాలపట్టియైన ఆ మైథిలి ఆడుపులులమధ్య జింకవలె ఆ రాక్షసస్త్రీలమధ్య చిక్కుపడి, బిక్కు బిక్కుమనుచు శోకించుచుండెను. ఆ జానకి అంతులేని శోకమున మునింగి, పాశములచే బంధింపబడి భయపడుచున్న లేడివలె ప్రశాంతిలేకయుండెను. (34-35)

న విందతే తత్ర తు శర్మ మైథిలీ
విరూపనేత్రాభిరతీవ తర్జితా।
పతిం స్మరంతీ దయితం చ దైవతం
విచేతనాఽభూద్భయశోకపీడితా। 36

వికృతములైన చూపులుగల ఆ రాక్షసస్త్రీలు భయపెట్టుచుండుటచే ఆమెకు మనశ్శాంతి లేకుండెను. వారిమధ్య భయశోకములకు లోనైయున్న ఆమె తనప్రాణప్రియుడైన పతిదేవునే స్మరించుచు నిశ్చేష్టురాలై యుండెను. (36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే షట్పంచాశస్సర్గః (56)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదిఆఱవసర్గము.

-- * * * --

ప్రక్షిప్తసర్గము

బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము దేవేంద్రుడు లంకకు వెళ్లి సీతాదేవికి దివ్యమైన పాయసమును అర్పించుట - పిమ్మట అతడు ఆమె యొద్ద సెలవుగైకొని మరలుట -

ప్రవేశితాయాం సీతాయాం లంకాం ప్రతి పితామహః।
తదా ప్రోవాచ దేవేంద్రం పరితుష్టం శతక్రతుమ్। 1

సీతాదేవి లంకలో ప్రవేశించిన పిమ్మట బ్రహ్మదేవుడు సంతోషముతోనున్న దేవేంద్రునితో ఇట్లనెను. (1)

త్రైలోక్యస్య హితార్థాయ రక్షసామ్ అహితాయ చ।
లంకాం ప్రవేశితా సీతా రావణేన దురాత్మనా। 2

"ఓ దేవరాజా! దుర్మార్గుడైన రావణుడు సీతాదేవిని అపహరించుకొనిపోయి లంకలో ఉంచెను. దీనివలన రాక్షసుల వినాశము జరుగును, ముల్లోకములకును మేలు కలుగును. (2)

పతివ్రతా మహాభాగా నిత్యం చైవ సుఖైధితా।
అపశ్యంతీ చ భర్తారం పశ్యంతీ రాక్షసీజనమ్।
రాక్షసీభిః పరివృతా భర్తృ దర్శనలాలసా। 3

పతివ్రతయు, మహాత్మురాలును ఐన జానకీదేవి మొదటి నుండియు సుఖములలోనే పుట్టిపెరిగినది. ఆమె పతి దర్శనమునకు దూరమయ్యెను. అనుక్షణము ఆమెకు ఎదుట రాక్షసస్త్రీలే కనబడుచున్నారు. ఆ రక్కసులమధ్యనున్న ఆ సాధ్వి భర్తృదర్శనమునకై తహతహ పడుచున్నది. (3)

విదితా హి పురీలంకా తీరే నదనదీపతేః।
కథం జ్ఞాస్యతి తాం రామః తత్రస్థాం తామ్ అనిందితామ్। 4

దుఃఖం సంచింతయంతీ సా బహుశః పరిదుర్లభా। 5

ప్రాణయాత్రామ్ అకుర్వాణా ప్రాణాంస్త్యక్ష్యత్యసంశయమ్।
స భూయః సంశయో జాతః సీతాయాః ప్రాణసంక్షయే। 6

స త్వం శీఘ్రమితో గత్వా సీతాం పశ్య శుభాననామ్।
ప్రవిశ్య నగరీం లంకాం ప్రయచ్ఛ హవిరుత్తమమ్। 7

ఏవముక్తోఽథ దేవేంద్రః పురీం రావణపాలితామ్।
ఆగచ్ఛన్నిద్రయా సార్ధం భగవాన్ పాకశాసనః। 8

నిద్రాం చోవాచ గచ్ఛ త్వం రాక్షసాన్ సంప్రమోహయ।
సా తథోక్తా మఘవతా దేవీ పరమహర్షితా।
దేవకార్యార్థసిద్ధ్యర్థం ప్రామోహయత రాక్షసాన్। 9

ఏతస్మిన్నంతరే దేవః సహస్రాక్షః శచీపతిః।
ఆససాద వనస్థాం తాం వచనం చేదమబ్రవీత్। 10

దేవరాజోఽస్మి భద్రం తే ఇహ చాఽస్మి శుచిస్మితే। 11

అహం త్వాం కార్యసిద్ధ్యర్థం రాఘవస్య మహాత్మనః।
సాహాయ్యం కల్పయిష్యామి మా శుచో జనకాత్మజే। 12

మత్ప్రసాదాత్ సముద్రం స తరిష్యతి బలైః సహ।
మయైవేహ చ రాక్షస్యో మాయయా మోహితాః శుభే। 13

తస్మాదన్నమిదం సీతే హవిష్యాన్నమ్ అహం స్వయమ్।
స త్వాం సంగృహ్య వైదేహి ఆగతః సహ నిద్రయా। 14

ఏతదత్స్యసి మద్ధస్తాత్ న త్వాం బాధిష్యతే శుభే।
క్షుధా తృషా చ రంభోరు వర్షాణామ్ అయుతైరపి। 15

ఏవముక్తా తు దేవేంద్రమ్ ఉవాచ పరిశంకితా।
కథం జానామి దేవేంద్రం త్వామిహస్థం శచీపతిమ్। 16

దేవలింగాని దృష్టాని రామలక్ష్మణసన్నిధౌ।
తాని దర్శయ దేవేంద్ర యది త్వం దేవరాట్ స్వయమ్। 17

సీతాయా వచనం శ్రుత్వా తథా చక్రే శచీ పతిః।
పృథివీం నాఽస్పృశత్ పద్భ్యామ్ అనిమేషేక్షణాని చ। 18

లంకానగరము సముద్ర తీరమున గలదు. పూజ్యురాలైన సీతాదేవి ఇచట ఉన్నట్లు ఆ రఘువరునకు ఎట్లు తెలియును? ఆ తల్లిమాత్రము ఇచట దుఃఖముతో కుమిలి పోవుచున్నది. ఏ విధముగను ఆమెను చేరుట ప్రస్తుతము శ్రీరామునకు అసాధ్యము. ఇప్పుడు ఆమె ఎట్టి ఆహారమూ తీసికొనుటలేదు. ఇట్టి స్థితిలో ఆమె ప్రాణములతో మిగిలియుండజాలదు. ఇందు సందేహము లేదు. సీతాదేవి ప్రాణములతో నిలిచి యుండనిచో మన కార్యము సిద్ధించుట సంశయాస్పదమే" (4-6)

అందువలన ఓ దేవేంద్రా! నీవు వెంటనే లంకకు చేరుము, సీతాదేవిని దర్శింపుము, దివ్యమైన పాయసమును ఆమెకు సమర్పింపుము." (7)

పితామహుడు ఇట్లు ఆజ్ఞాపించిన పిమ్మట సురరాజైన ఇంద్రుడు నిద్రాదేవితోగూడి రావణునిఅధీనములోనున్న లంకకు చేరెను. పిమ్మట అతడు నిద్రాదేవితో "నీవు వెళ్లి, రాక్షసులను నిద్రమత్తులో ముంచివేయుము-" అని పలికెను. సురపతి ఆజ్ఞను తలదాల్చి, నిద్రాదేవి మిక్కిలి సంతోషముతో దేవతలకార్యసిద్ధికొఱకై రాక్షసులను నిద్రావశులను గావించెను. (8-9)

ఇంతలోపల శచీపతియైన దేవేంద్రుడు అశోకవనము నందున్న సీతాదేవిని సమీపించి ఆమెతో ఇట్లు నుడివెను. "పూజ్యురాలవైన ఓ జానకీ దేవీ! నీకు మేలు కలుగు గాక. నేను సురరాజును. మహాత్ముడైన శ్రీరామునికార్యసిద్ధికై తోడ్పడగలను. అందులకై నేను నీకడకు వచ్చితిని. కనుక నీవు శోకింపకుము. (10-12)

ఓ శుభాంగీ! నా మాయాప్రభావమున రక్కసులెల్లరును నిద్రలో మునిగియున్నారు. శ్రీరాముడు తనబలములతో సముద్రమును దాటుటకు నేను తోడ్పడుదును. ఓ విదేహ రాజకుమారీ! నేను నిద్రాదేవిని వెంటనిడుకొని ఇచటికి వచ్చితిని. నీ భోజనమునకై నేను స్వయముగా హవిష్యాన్నమును (పవిత్రమైన పాయసమును) తీసికొని వచ్చితిని. ఓ పూజ్యురాలా! నానుండి ఈ పాయసమును గ్రహించి, ఆరగింపుము. దీని ప్రభావమున ఆకలి దప్పులు నిన్ను ఎప్పటికిని బాధింపవు." (13-15)

ఆ సురరాజు ఇట్లు పలుకగా సీతాదేవి ఆయనను శంకించుచు ఈ విధముగా నుడివెను. "నా యెదుట నున్న నీవు శచీపతివైన దేవేంద్రుడవేయని నిన్ను నేను విశ్వసించుట యెట్లు? నేను ఇదివఱలో రామలక్ష్మణుల సమీపమున ఉన్నప్పుడు దేవ చిహ్నములను చూచియుంటిని. నీవు నిజముగా ఆ సురపతివే యైనచో ఆ దివ్యలక్షణములను ప్రకటింపుము." (16-17)

సీతాదేవిమాటలఆంతర్యమును గమనించి, శచీపతి తనదివ్యచిహ్నములను ప్రకటించెను. అతడు తన పాదములు నేలను తాకకుండ నిలిచెను. ఆయనకనుఱెప్పలు మూతపడుట లేదు. ధూళిస్పర్శయే లేని దివ్యవస్త్రములను

అరజోంబరధారీచ స మ్లానకుసుమస్తథా।
తం జ్ఞాత్వా లక్షణైః సీతా వాసవం పరిహర్షితా। 19

ఉవాచ వాక్యం రుదతీ భగవన్ రాఘవంప్రతి।
సహభ్రాత్రా మహాబాహుః దిష్ట్యా మే శ్రుతిమాగతః। 20

యథా మే శ్వశురో రాజా యథా చ మిథిలాధిపః।
తథా త్వామద్య పశ్యామి సనాథోమే పతిస్త్వయా। 21

తవాజ్ఞయా చ దేవేంద్ర పయోభూతమిదం హవిః।
అశిష్యామి త్వయా దత్తం రఘూణాం కులవర్ధనమ్। 22

ఇంద్రహస్తాద్గృహీత్వా తత్ పాయసం సా శుచిస్మితా।
న్యవేదయత భర్త్రే సా లక్ష్మణాయ చ మైథిలీ। 23

యది జీవతి మే భర్తా సహభ్రాత్రా మహాబలః।
ఇదమస్తు తయోర్భక్త్యా తదాఽశ్నాత్ పాయసం స్వయమ్। 24

ఇతీవ తత్ ప్రాశ్యహవిర్వరాననా
జహౌ క్షుధా దుఃఖ సముద్భవం చ తమ్।
ఇంద్రాత్ ప్రవృత్తిమ్ ఉపలభ్యజానకీ
కాకుత్స్థయోః ప్రీతమనా బభూవ । 25

స చాఽపి శక్రః త్రిదివాలయం తదా
ప్రీతో యయౌ రాఘవకార్యసిద్ధయే ।
ఆమంత్ర్య సీతాం స తతో మహాత్మా
జగామ నిద్రాసహితః స్వమాలయమ్। 26

ధరించియుండెను. ఆయన ధరించిన పూలమాలలు వసివాడక యుండెను. ఆయన యొక్క దివ్య చిహ్నములను గాంచిన పిదప సీతాదేవి 'ఇతడు ఇంద్రుడే' యని విశ్వసించి, మిగుల ఆనందించెను. (18-19)

శ్రీరామునియెడబాటు కారణముగా శోకించుచున్న సీతాదేవి ఆ ఇంద్రునితో ఇట్లనెను. "ఓ పూజ్యుడా! తమ్మునితో గూడియున్న మహాబాహువగు శ్రీరాముని ప్రస్తావన నీ వలన నా చెవినబడినది. ఇది నా అదృష్టము. మా మామగారైన దశరథమహారాజునువలెను, మా తండ్రియగు జనక మహారాజును వలెను నిన్ను పూజ్య భావముతో దర్శించుచున్నాను. నీవలన నా పతికి చక్కని అండ లభించినట్లైనది. ఓ దేవేంద్రా! నీవు ఒసంగిన ఈ దివ్య పాయసాన్నమును నీ ఆదేశానుసారము భుజించెదను. దీనివలన రఘువంశము వర్ధిల్లును." (20-22)

అనంతరము ఆ జానకి నిర్మలమైన చిఱునవ్వుతో ఆ హవిష్యాన్నమును ఇంద్రునినుండి స్వీకరించెను. పిదప ఆ మైథిలి దానిని రామలక్ష్మణులకు నివేదన చేసి ఇట్లు నుడివెను. "మహా బలశాలియగు నా పతియు, ఆయన తమ్ముడగు సౌమిత్రియు సుఖముగానున్నట్లు తలంతును. వారికి దీనిని భక్తితో సమర్పించుచున్నాను." అని పలికి ఆమె ఆ పాయసమును భుజించెను. ఇట్లు ఆ హవిష్యాన్నమును భుజించిన పిమ్మట ఆ దేవికి ఆకలిదప్పులబాధలు తొలగెను. ఇంద్రునినోట వెలువడిన రామలక్ష్మణులసమాచారమును దెలిసికొని ఆ జానకి తనమనస్సులో మిగుల సంతసించెను. (23-25)

మహాత్ముడైన దేవేంద్రుడుగూడ ప్రసన్నచిత్తుడై సీతాదేవిని వీడ్కొని, శ్రీరామునికార్యసిద్ధికై సురపురికి (అమరావతికి) చేరెను. నిద్రాదేవియు ఆయనను అనుసరించెను. (26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ప్రక్షిప్తసర్గః

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ప్రక్షిప్తసర్గము

— * * * —

57. ఏబదిఏడవసర్గము

మారీచుని చంపి ఆశ్రమమునకు బయలుదేరిన శ్రీరామునకు అపశకునములు ఎదురగుట - లక్ష్మణుడు దీనవదనుడై అన్నను సమీపించుట - 'సీతాదేవికి ఎట్టి ప్రమాదము వాటిల్లినదో?' అను ఆందోళనకులోనై శ్రీరాముడు లక్ష్మణుని మందలించుట -

రాక్షసం మృగరూపేణ చరంతం కామరూపిణం।
నిహత్య రామో మారీచం తూర్ణం పథి నివర్తతే। 1

తస్య సంత్వరమాణస్య ద్రష్టుకామస్య మైథిలీం।
క్రూరస్వరోఽథ గోమాయుః విననాదాస్య పృష్ఠతః। 2

మృగరూపములో సంచరించుచున్న కామరూపియు, రాక్షసుడును ఐన మారీచుని వధించి శ్రీరాముడు వెంటనే ఆశ్రమమునకు మఱలెను. (1)

అతడు సీతాదేవిని చూచుటకై తొందరపడుచుండెను, ఇంతలో ఆయనవెనుకభాగమునుండి ఒక నక్కకూత వినబడెను. (2)

స తస్య స్వరమాజ్ఞాయ దారుణం రోమహర్షణం।
చింతయామాస గోమాయోః స్వరేణ పరిశంకితః। 3

అశుభం బత మన్యేఽహం గోమాయుర్వాశ్యతే యథా।
స్వస్తి స్యాదపి వైదేహ్యా రాక్షసైర్భక్షణం వినా। 4

మారీచేన తు విజ్ఞాయ స్వరమాలంబ్య మామకమ్।
విక్రుష్టం మృగరూపేణ లక్ష్మణః శృణుయాద్యది। 5

స సౌమిత్రిః స్వరం శ్రుత్వా తాం చ హిత్వా చ మైథిలీం।
తయైవ ప్రహితః క్షిప్రం మత్సకాశమిహైష్యతి। 6

రాక్షసైః సహితైర్నూనం సీతాయా ఈప్సితో వధః।
కాంచనశ్చ మృగో భూత్వా వ్యపనీయాశ్రమాత్తు మామ్। 7

దూరం నీత్వా తు మారీచో రాక్షసోఽభూచ్ఛరాహతః।
హా లక్ష్మణ! హతోఽస్మీతి యద్వాక్యం వ్యాజహార చ। 8

అపి స్వస్తి భవేత్ తాభ్యాం రహితాభ్యాం మహావనే।
జనస్థాననిమిత్తం హి కృతవైరోఽస్మి రాక్షసైః।
నిమిత్తాని చ ఘోరాణి దృశ్యంతేఽద్య బహూని చ। 9

ఇత్యేవం చింతయన్ రామః శ్రుత్వా గోమాయునిస్వనమ్। 10

ఆత్మనశ్చాపనయనాత్ మృగరూపేణ రక్షసా।
ఆజగామ జనస్థానం రాఘవః పరిశంకితః। 11

తం దీనమనసో దీనమ్ ఆసేదుర్మృగపక్షిణః।
సవ్యం కృత్వా మహాత్మానం ఘోరాంశ్చ ససృజుః స్వరాన్। 12

తాని దృష్ట్వా నిమిత్తాని మహాఘోరాణి రాఘవః।
న్యవర్తతాథ త్వరితో జవేనాశ్రమమాత్మనః। 13

స తు సీతాం వరారోహాం లక్ష్మణం చ మహాబలం।
ఆజగామ జనస్థానం చింతయన్నేవ రాఘవః।
తతో లక్ష్మణ మాయాంతం దదర్శ విగతప్రభమ్। 14

తతోఽవిదూరే రామేణ సమీయాయ స లక్ష్మణః।
విషణ్ణః సువిషణ్ణేన దుఃఖితో దుఃఖభాగినా। 15

సంజగర్హేఽథ తం భ్రాతా జ్యేష్ఠో లక్ష్మణమాగతమ్।
విహాయ సీతాం విజనే వనే రాక్షససేవితే। 16

అప్పుడు దారుణమైన ఆ స్వరమును వినినంతనే ఆయనశరీరము అంతయును కంపించెను. ఇదివఱలో తనకంఠస్వరములో మారీచుడు పలికిన 'హా సీతా! హా లక్ష్మణా!' అనుమాటలకు 'ఏమి ఆపద రానున్నదో' అని, శ్రీరాముడు శంకకు లోనై యుండెను. ఇప్పుడీ నక్కకూతవలన ఆయన ఇంకను సందేహములోపడి చింతింపసాగెను. (3)

'నక్క ఇట్లు అఱచుట ఎంతయు అశుభసూచకము. వైదేహి రాక్షసులబారినపడక క్షేమముగనే యుండును గదా! మారీచుడు బుద్ధిపూర్వకముగా నాకంఠస్వరమును అనుకరించి, సీతాలక్ష్మణులకు వినబడునట్లు ఆర్తనాదమొనర్చెను. ఆ ఆర్తవచనములు వినబడినంతనే సీతాదేవి ప్రేరణతో లక్ష్మణుడు వెంటనే నా కడకు బయలుదేఱియుండును. (4-6)

రాక్షసులందఱును కలిసి 'సీతను వధించుటకై' చేసిన పన్నాగమే ఇది. ఆ ఉద్దేశముతోనే మారీచుడు బంగారులేడి రూపములో వచ్చి, ఆశ్రమమునుండి నన్ను చాలాదూరము వఱకు తీసికొనివెళ్లెను. నా బాణములదెబ్బకు మరణించుచు అతడు 'అయ్యో! లక్ష్మణా! చచ్చితిని' అని నా కంఠస్వరముతో బిగ్గఱగా అఱచెను. (7-8)

దండకారణ్యమున నివసించుటవలన నాకు రాక్షసులతో వైరము ఏర్పడినది. భయంకరములైన అపశకునములేవో వరుసగా ఎదురగుచున్నవి. నేను లేకున్నను ఆ మహారణ్యమున సీతాలక్ష్మణులు క్షేమముగానే యుందురుగదా!' (9)

నక్కయఱపు వినిన పిమ్మట శ్రీరాముడు ఇట్లు ఆలోచించుచు, ఆ మారీచుడు మృగరూపమున వచ్చి, తనను ఆశ్రమమునుండి దూరముగా కొనిపోయినందులకు పలువిధముల శంకించుచున్నవాడై, జనస్థానము వైపుగా ముందునకు సాగెను. (10-11)

దీనవదనుడైన శ్రీరాముని జూచి, అచటి మృగములును, పక్షులును దిగులుతో ఆయనను సమీపించి, అప్రదక్షిణముగా తిరుగుచు భయంకరముగా అఱవసాగెను. (12)

మహాఘోరములైన ఈ అపశకునములను గాంచి, రాఘవుడు మిగుల కలవరపడుచు, ఇంకను వేగముగా నడువసాగెను. అతడు సుందరాంగియైన సీతాదేవిని, మహాబలశాలియైన లక్ష్మణునిగూర్చియే ఆలోచించుచు జనస్థానమువైపుగా గబగబ నడిచెను. ఇంతలో చిన్నబోయిన ముఖముతోనున్న లక్ష్మణుడు ఆయనకు కనబడెను. (13-14)

అంతట మిక్కిలి దుఃఖముతో విచారపడుచుడైయున్న లక్ష్మణుడు తనకు కొంతదూరమున చింతాక్రాంతుడై వచ్చుచున్న శ్రీరాముని సమీపించెను. (15)

రాక్షసులకు నిలయమైన వనమునందు 'నా' అన్నవారు లేకుండా సీతను అచట ఒంటరిగా విడిచి

గృహీత్వా చ కరం సవ్యం లక్ష్మణం రఘునందనః।
ఉవాచ మధురోదర్కమ్ ఇదం పరుషమార్తిమత్। 17
అహో లక్ష్మణ! గర్హ్యం తే కృతం యస్త్వం విహాయ తామ్। 18
సీతామిహాఽఽగతః సౌమ్య! కచ్చిత్ స్వస్తి భవేదిహ।
న మేఽస్తి సంశయో వీర! సర్వథా జనకాత్మజా।
వినష్టా భక్షితా వాపి రాక్షసైర్వనచారిభిః। 19
అశుభాన్యేవ భూయిష్ఠం యథా ప్రాదుర్భవంతి మే। 20
అపి లక్ష్మణ! సీతాయాః సామగ్ర్యం ప్రాప్నుయావహే।
జీవంత్యాః పురుషవ్యాఘ్ర! సుతాయా జనకస్య వై। 21
యథా వై మృగసంఘాశ్చ గోమాయుశ్చైవ భైరవమ్।
వాశ్యంతే శకునాశ్చాపి ప్రదీప్తామ్ అభితో దిశమ్। 22
అపి స్వస్తి భవేత్ తస్యా రాజపుత్ర్యా మహాబల!। 23
ఇదం హి రక్షో మృగసన్నికాశం
ప్రలోభ్య మాం దూరమనుప్రయాంతం ।
హతం కథంచిన్మహతా శ్రమేణ
స రాక్షసోఽభూన్మ్రియమాణ ఏవ । 24
మనశ్చ మే దీనమిహాప్రహృష్టం
చక్షుశ్చ సవ్యం కురుతే వికారం ।
అసంశయం లక్ష్మణ! నాస్తి సీతా
హృతా మృతా వా పథి వర్తతే వా । 25

వచ్చినందులకు లక్ష్మణుని శ్రీరాముడు మందలించెను. పిమ్మట అతడు లక్ష్మణునియెడమచేతిని పట్టుకొని ఆర్తిని ప్రకటించుచు ప్రేమతో గట్టిగా ఇట్లు కోపపడెను.(16-17)

"సౌమ్యుడవైన ఓ లక్ష్మణా! అయ్యో! నీవు ఆశ్రమమున సీతాదేవిని ఒంటరిగా విడిచివచ్చితివి. నీవు చేసిన ఈ పని గొప్పతప్పిదముసుమా! ఇంతకును ఆమె క్షేమమే గదా? ఓ వీరుడా! ఈ వనములలో సంచరించెడి రక్కసిమూకలు ఆమెను చంపుటయో లేక భక్షించుటయో చేసియుండును. ఇందుకు సందేహము లేదు. ఏలనన నాకు వరుసగా అన్నియును అపశకునములే కనబడుచున్నవి. (18-20)

పురుషశ్రేష్ఠుడవైన ఓ లక్ష్మణా! జనకునికూతురైన సీత ప్రాణములతోనుండుట మనము చూడగలమా? ఏలనన నల్లజింకలు మొదలగు మృగములు, నక్కలు, కాకులు మొదలగు పక్షులు సూర్యునకు ఎదురుగా నిలిచి భయంకరముగా అఱచుచున్నవి. ఇవి అశుభసూచకములు. ఓ మహాబలా! ఆ రాజకుమారి క్షేమమే గదా! (21-23)

మృగరూపములో వచ్చిన ఆ రాక్షసుడు (మారీచుడు) నన్ను ప్రలోభపెట్టుచు, చాలదూరము తీసికొని పోయినాడు. పెట్టుకేలకు నేనతనిని చంపితిని. అతడు మరణించుచు రాక్షసుడుగా మారెను. (24)

ఓ లక్ష్మణా! ప్రస్తుతము నా మనస్సు దైన్యమునకు లోనై, సంతోషమునకు దూరమైనది. సీత ఆశ్రమములో ఉండియుండదు. ఆమెను ఏ రాక్షసుడైనను చంపియుండవచ్చును. లేదా అపహరించు కొనిపోయి ఉండవచ్చును. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే సప్తపంచాశస్సర్గః (57)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదిఏడవసర్గము.

-- * * * --

58. ఏబదిఎనిమిదవసర్గము

'ఆశ్రమమునఁ ఒంటరిగానున్న సీతాదేవికి ఎట్టి ప్రమాదము సంభవించినదో'? అని శ్రీరాముడు కలవరపడుట - ఆస్వామి తమ్మునితో గూడి త్వరత్వరగా ఆశ్రమమునకు చేరి, ఆమెకై అంతటను కలయజూచుట -

స దృష్ట్వా లక్ష్మణం దీనం శూన్యే దశరథాత్మజః।
పర్యపృచ్ఛత ధర్మాత్మా వైదేహీమ్ ఆగతం వినా। 1

ప్రస్థితం దండకారణ్యం యా మామనుజగామ హ।
క్వ సా లక్ష్మణ! వైదేహీ యాం హిత్వా త్వమిహాఽఽగతః। 2

నిర్జనారణ్యమున సీతాదేవిని ఒంటరిగా వదలి, దీనుడై వచ్చిన లక్ష్మణుని జూచి, ధర్మాత్ముడైన ఆ శ్రీరాముడు అతనిని ఇట్లు అడిగెను. (1)

"ఓలక్ష్మణా! నేను వనవాసమునకు బయలుదేఱినప్పుడు సీతాదేవి నావెంట దండకారణ్యమునకు వచ్చినది. నీవు ఆమెను ఎక్కడ వదిలి ఇటు వచ్చితివి? రాజ్యభ్రష్టుడనై, దీనుడనై నేను దండకారణ్యమున సంచరించుచుంటిని.

రాజ్యభ్రష్టస్య దీనస్య దండకాన్ పరిధావతః।
క్వ సా దుఃఖసహాయా మే వైదేహీ తనుమధ్యమా। 3

యాం వినా నోత్సహే వీర! ముహూర్తమపి జీవితుం।
క్వ సా ప్రాణసహాయా మే సీతా సురసుతోపమా। 4

పతిత్వమ్ అమరాణాం వా పృథివ్యాశ్చాపి లక్ష్మణ!।
తాం వినా తపనీయాభాం నేచ్ఛేయం జనకాత్మజామ్। 5

కచ్చిజ్జీవతి వైదేహీ ప్రాణైః ప్రియతరా మమ।
కచ్చిత్ ప్రవ్రాజనం సౌమ్య! న మే మిథ్యా భవిష్యతి। 6

సీతానిమిత్తం సౌమిత్రే! మృతే మయి గతే త్వయి।
కచ్చిత్ సకామా సుఖితా కైకేయీ సా భవిష్యతి। 7

సపుత్రరాజ్యాం సిద్ధార్థాం మృతపుత్రా తపస్వినీ।
ఉపస్థాస్యతి కౌసల్యా కచ్చిత్ సౌమ్య! న కైకయీమ్। 8

యది జీవతి వైదేహీ గమిష్యామ్యాశ్రమం పునః।
సువృత్తా యది వృత్తా సా ప్రాణాంస్త్యక్ష్యామి లక్ష్మణ!। 9

యది మామ్ ఆశ్రమగతం వైదేహీ నాభిభాషతే।
పునః ప్రహసితా సీతా వినశిష్యామి లక్ష్మణ!। 10

బ్రూహి లక్ష్మణ! వైదేహీ యది జీవతి వా న వా।
త్వయి ప్రమత్తే రక్షోభిః భక్షితా వా తపస్వినీ। 11

సుకుమారీ చ బాలా చ నిత్యం చాదుఃఖదర్శినీ।
మద్వియోగేన వైదేహీ వ్యక్తం శోచతి దుర్మనాః। 12

సర్వథా రక్షసా తేన జిహ్మేన సుదురాత్మనా।
వదతా లక్ష్మణేత్యుచ్చైః తవాపి జనితం భయమ్। 13

శ్రుతస్తు శంకే వైదేహ్యా స స్వరః సదృశో మమ।
త్రస్తయా ప్రేషితస్త్వం చ ద్రష్టుం మాం శీఘ్రమాగతః। 14

సర్వథా తు కృతం కష్టం సీతామ్ ఉత్సృజతా వనే।
ప్రతికర్తుం నృశంసానాం రక్షసాం దత్తమంతరమ్। 15

సుఖదుఃఖములలో నాకు భాగస్వామినియైన సుందరాంగియగు అజానకి ఎక్కడ? ఓ వీరుడా! ఆమె లేకుండ నేను ఒక్క క్షణమైనను జీవించుటకు ఇష్టపడను. (జీవింపజాలను) దేవతవంటి ఆ సీత నాకు ప్రాణతుల్యురాలు. ఇప్పుడు ఆమె ఎక్కడ? బంగారమువంటి ఆ జానకి నా సరసన లేనిచో (నాకు దూరమైనచో) ఈ భూమండలముపై అధికారముగాని, కడకు సురలోకాధిపత్యముగాని నాకు రుచింపవు. నాకు ప్రాణములకంటె మిన్నయైన వైదేహి జీవించియుండునా? ఓ సౌమ్యా! నావనవాసజీవితము వృథాకాదుగదా? (2-6)

ఓ సౌమిత్రీ! సీతాదేవియొక్క ఎడబాటువలన నేను అసువులను వీడినచో, నీవు అయోధ్యకు చేరినచో ఆ కైకేయి తన కోరికలు ఈడేరినందులకు సంతోషపడును గదా? (7)

పుత్త్రుడు (భరతుడు) పట్టాభిషిక్తుడైనందులకును, శాశ్వతముగా రాజ్యాధికారము చేజిక్కినందులకును కైకేయి కృతార్థురాలగును. అప్పుడు తనయునిఎడబాటు కారణముగా శోకమూర్తియైన కౌసల్యామాతకు ఆమెను సేవింపవలసిన గతి పట్టదుగదా? (8)

వైదేహి జీవించియున్నచో నేను మరల ఈ ఆశ్రమమున కాలుమోపెదను. ఉత్తమ శీలవతియైన ఆమె మరణించుటయే సంభవించినచో నేను నా ప్రాణములను త్యజించెదను. (9)

ఓ లక్ష్మణా! నేను ఆశ్రమమునకు చేరినప్పుడు వైదేహి చిఱునవ్వుముఖముతో ఎదురుగా వచ్చి మాట్లాడకున్నచో (మృత్యుపాలగుటగాని, లేక అపహరణకు గుఱియగుటగాని జరిగినచో) నేను ఇంక ఈ లోకమునందే కనపడను.(10)

ఓ లక్ష్మణా! ఇంతకును సీతాదేవి జీవించియున్నదా? లేదా? నీ అజాగ్రతకారణముగా ఆ ఉత్తమురాలు రాక్షసులబారిన పడినదాయేమి? (రాక్షసులు భక్షించినారాయేమి?) తెలుపుము. ఎన్నడును దుఃఖమను మాటనే యెఱుగనిదియు, సుకుమారియు, అమాయికురాలును ఐన వైదేహి నిత్యము వనవాసక్లేశములను అనుభవించుచున్నది. నా యెడబాటువలన ఆమె ఇంకను చింతాక్రాంతురాలైయుండవచ్చును. దురాత్ముడును, కపటియు ఐన ఆ రాక్షసుడు 'అయ్యో! లక్ష్మణా!' అని బిగ్గఱగా కేకపెట్టుటచే మహావీరుడవైన నీకును అన్ని విధములుగా భయము కలిగియుండును. నా కంఠస్వరమును బోలిన గొంతును విని, వైదేహి మిగుల భయపడి, నిన్ను నా కొఱకు పంపియుండును. అందువలన నీవు నన్ను వెదకుచు ఇచటికి వచ్చినట్లు నేను తలంచుచున్నాను. (11-14)

ఓ లక్ష్మణా! ఏ విధముగ జూచినను సీతను వనములో ఒంటరిగా విడిచివచ్చుట గొప్ప తప్పు. దీనివలన మనకు తీరని ముప్పు ఏర్పడవచ్చును. మనపై ప్రతీకారము తీర్చుకొనుటకు రాక్షసులకు చక్కని అవకాశము

దుఃఖితాః ఖరఘాతేన రాక్షసాః పిశితాశనాః।
తైఃసీతా నిహతా ఘోరైః భవిష్యతి న సంశయః। 16

ఇచ్చినట్లైనది. ఖరునిమరణముతో మాంసభక్షకులైన రాక్షసులందఱును మిగుల క్రుంగి పోయిరి. అందువలన ఆ దుర్మార్గులు సీతను చంపవచ్చును. ఇందులకు సందేహము లేదు. (15-16)

అహోఽస్మిన్ వ్యసనే మగ్నః సర్వథా శత్రుసూదన!।
కిన్విదానీం కరిష్యామి శంకే ప్రాప్తవ్యమీదృశమ్। 17

శత్రువులను సంహరించుటలో సమర్థుడవైన ఓ సౌమిత్రీ! అయ్యో! అన్ని విధములుగా ఎంతటి కష్టము వచ్చిపడినది? ఇప్పుడు నేను చేయగలిగినది యేమి? ఇది మనతలవ్రాతయని తలంతును. (17)

ఇతి సీతాం వరారోహాం చింతయన్నేవ రాఘవః।
ఆజగామ జనస్థానం త్వరయా సహలక్ష్మణః। 18

ఇట్లు శుభాంగియైన సీతాదేవినిగూర్చి చింతించుచునే శ్రీరాముడు లక్ష్మణసహితుడై వేగముగా జనస్థానమునకు చేరెను. (18)

విగర్హమాణోఽనుజమార్తరూపం
క్షుధాశ్రమాచ్చైవ పిపాసయా చ।
వినిశ్వసన్ శుష్కముఖో వివర్ణః
ప్రతిశ్రయం ప్రాప్య సమీక్ష్య శూన్యమ్। 19

స్వమాశ్రమం సంప్రవిగాహ్య వీరో
విహారదేశానను సృత్య కాంశ్చిత్।
ఏతత్ తదిత్యేవ నివాసభూమౌ
ప్రహృష్టరోమా వ్యథితో బభూవ। 20

చాలా దూరము నడిచియుండుటచే శ్రీరాముడు మిగుల బడలియుండెను. ఆకలిదప్పులకులోనై యుండుటవలన ఆయనముఖము శుష్కించి, కళదప్పియుండెను. అట్టి స్థితిలో ఆయన ఆర్తితోనున్న లక్ష్మణుని మందలించుచు, నిట్టూర్పులు వదలుచు, ఆశ్రమప్రదేశమునకు చేరెను. అందచ్చటను సీత కనబడక పోవుటచే ఆ వీరుడు తనఆశ్రమమున ప్రవేశించి, ఆమెకొఱకు అంతటను కలయజూచెను. అందును ఆమె కనబడకపోవుటచే, అతడు 'తాను ఆమెతోగూడి విహరించిన ప్రదేశములను, క్రీడాస్థలమును గాలించెను.' ఫలితము శూన్యమగుటచే అతడు గతస్మృతులను తలంచుచు గగుర్పాటుతో చింతాక్రాంతుడయ్యెను. (19-20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే అష్టపంచాశస్సర్గః (58)
వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన, శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదిఎనిమిదవసర్గము.

— * * * —

59. ఏబదితొమ్మిదవసర్గము

'సీతాదేవిని ఆశ్రమమున ఒంటరిగా వదలివచ్చిన కారణమేమి?' అని రాముడు లక్ష్మణుని ప్రశ్నించుట - వదినె తనను తూలనాడుటచే విధిలేక తాను వచ్చినట్లు సౌమిత్రి అన్నకు తెల్పుట - 'ఐనను నీవు ఆమెను వీడి వచ్చుట యుక్తముగాదు సుమా!' అని శ్రీరాముడనుట -

అథాఽఽశ్రమాదుపావృత్తమ్ అంతరా రఘునందనః।
పరిపప్రచ్ఛ సౌమిత్రిం రామో దుఃఖార్దితం పునః। 1

రఘువంశవర్ధనుడైన శ్రీరాముడు మారీచుని చంపిన ప్రదేశమునుండి ఆశ్రమమునకు మఱలివచ్చు చున్నప్పుడు (మార్గమధ్యములో) దుఃఖార్తుడై తనకడకు చేరిన సౌమిత్రిని ఇట్లు ప్రశ్నించెను. (1)

తమువాచ కిమర్థం త్వమ్ ఆగతోఽపాస్య మైథిలీం।
యదా సా తవ విశ్వాసాత్ వనే విరహితా మయా। 2

"ఓ లక్ష్మణా! నీరక్షణలోనున్నప్పుడు సీతాదేవికి ఎట్టి ప్రమాదమూ కలుగదనెడి విశ్వాసముతో నేను ఆమెను వనములో వదలివచ్చితిని. మఱి ఆమెను ఒంటరిగా అచట విడిచిపెట్టి నీవు ఇచటికి ఎందులకు వచ్చితివి? మైథిలిని ఏకాకిగా ఉంచి, నీవు ఇచటికి వచ్చుటను జూచిన పిమ్మట

దృష్ట్వైవాభ్యాగతం త్వాం మే మైథిలీం త్యజ్య లక్ష్మణ!।
శంకమానం మహత్ పాపం యత్ సత్యం వ్యథితం మనః। 3

స్ఫురతే నయనం సవ్యం బాహుశ్చ హృదయం చ మే।
దృష్ట్వా లక్ష్మణ! దూరే త్వాం సీతావిరహితం పథి। 4

ఏవముక్తస్తు సౌమిత్రిః లక్ష్మణః శుభలక్షణః।
భూయో దుఃఖసమావిష్టో దుఃఖితం రామమబ్రవీత్। 5

న స్వయం కామకారేణ తాం త్యక్త్వాఽహమిహాగతః।
ప్రచోదితస్తయైవోగ్రైః త్వత్సకాశమిహాగతః। 6

ఆర్యేణేవ పరాక్రుష్టం హా సీతే! లక్ష్మణేతి చ।
పరిత్రాహీతి యద్వాక్యం మైథిల్యాస్తచ్ఛ్రుతం గతమ్। 7

సా తమార్తస్వరం శ్రుత్వా తవ స్నేహేన మైథిలీ।
గచ్ఛ గచ్ఛేతి మామాహ రుదతీ భయవిహ్వలా। 8

ప్రచోద్యమానేన మయా గచ్ఛేతి బహుశస్తయా।
ప్రత్యుక్తా మైథిలీ వాక్యమ్ ఇదం త్వత్ప్రత్యయాన్వితమ్। 9

న తత్ పశ్యామ్యహం రక్షో యదస్య భయమావహేత్।
నిర్వృతా భవ నాస్త్యేతత్ కేనాప్యేవముదాహృతమ్। 10

విగర్హితం చ నీచం చ కథమార్యోఽభిధాస్యతి।
త్రాహీతి వచనం సీతే! యస్త్రాయేత్ త్రిదశానపి। 11

కిం నిమిత్తం తు కేనాపి భ్రాతురాలంబ్య మే స్వరం।
రాక్షసేనేరితం వాక్యం త్రాహి త్రాహీతి శోభనే!। 12

విస్వరం వ్యాహృతం వాక్యం లక్ష్మణ! త్రాహి మామితి।
న భవత్యా వ్యథా కార్యా కునారీజనసేవితా। 13

అలం వైక్లబ్యమాలంబ్య స్వస్థా భవ నిరుత్సుకా।
న సోఽస్తి త్రిషు లోకేషు పుమాన్ వై రాఘవం రణే।
జాతో వా జాయమానో వా సంయుగే యః పరాజయేత్। 14

నిజముగనే అచట ఆమెకెట్టి మహావిపత్తు కలుగనున్నదోయని తలంచి, నా మనస్సు మిక్కిలి వ్యథచెందుచున్నది. (2-3)

ఓ సౌమిత్రీ! ఆశ్రమమున సీతాదేవికి తోడుగా ఉన్న నీవు ఆమె లేకుండ ఒక్కడవే దారిబట్టి వచ్చుచున్న నిన్ను దూరముననుండగనే చూచితిని. వెంటనే నాయెడమ కన్ను, బాహువు అదిరినవి. నేను గుండె పగిలితిని". (4)

వినయాదిసద్గుణములతో ఒప్పుచున్న లక్ష్మణుడు ఇదివఱలో సీతాదేవి తనను నిందించినందులకు మిక్కిలి బాధపడియుండెను. ఇప్పుడు శ్రీరాముడు మందలించుచు పలికిన మాటలకు అతడు ఎంతయునొచ్చుకొనుచు ఆయనతో ఇట్లు నుడివెను. (5)

"అన్నా! నాయంతటనేనే (బుద్ధిపూర్వకముగా) వదినెను వదలి ఇచటికిరాలేదు. ఆమె తీవ్రమైన మాటలచే నన్ను ఒత్తిడిచేయుటవలన నేను నీకడకు వచ్చితిని.- 'అయ్యో! సీతా! అయ్యో! లక్ష్మణా! నన్ను రక్షింపుడు, రక్షింపుడు'- అని నీకంఠస్వరముతో పలికిన ఆర్తనాదములు ఆమెచెవికి చేరెను. ఆ ఆర్తవచనములను విన్నంతనే ఆమె నీపైగల గాఢానురాగమువలన భయవిహ్వలయై (భయముతో వణకిపోవుచు) ఏడ్చుచు ' లక్ష్మణా! వెళ్లుము, వెళ్లుము' - అని నన్ను తొందరపెట్టెను. 'వెళ్లుము' అనుచు ఆమె ఎంతగా ఒత్తిడి వేయుచున్నను మీఅజేయత్వముమీదను, దైన్యరాహిత్యముపైనను నాకుగల నమ్మకముచే ఆమెకు ఇట్లు ప్రత్యుత్తరము ఇచ్చితిని. (6-9)

"శ్రీరామునకు ఆపద కలిగింపగల రాక్షసుడు ఎవ్వడును ఈ భూమండలమున లేడు. ఇవి రాముని పలుకులు కానేకావు. ఎవడో ఆయనకంఠస్వరమును అనుకరించుచు ఇట్లు పలికియుండును. కావున నీవు నిశ్చింతగానుండవచ్చును. (10)

అమ్మా! శ్రీరాముడు ఉత్తమవంశసంజాతుడు, దేవతలనుసైతము రక్షింపగల సమర్థుడు. అట్టి మహావీరుడు 'హా సీతా! రక్షింపుము' అనుచు దైన్యముతో ఒక అల్పునివలె ఎట్లు పిలుచును? ఓ మంగళస్వరూపురాలా! ఎవడో ఒక దుష్టరాక్షసుడు ఏదేని ఒకప్రయోజనమును ఆశించి, మా అన్నగారి కంఠస్వరమును అనుకరించుచు 'త్రాహి త్రాహి' అని పలికియుండవచ్చును. (11-12)

'హా! లక్ష్మణా! త్రాహిమామ్' అని పలికిన స్వరము రామునిది కాదు. కనుక ఒక సామాన్యస్త్రీవలె నీవు ఇట్లు వ్యథచెందుట ఏమాత్రమూ తగదు. తల్లీ! నీవు కలవరపడవలసిన పనియేలేదు. మనస్సును కుదుట బఱచుకొనుము, నన్ను తొందరపెట్టవలదు. కదనరంగమున శ్రీరాముని జయింపగల మొనగాడు ఈ ముల్లోకములలోను

న జయ్యో రాఘవో యుద్ధే దేవైః శక్రపురోగమైః। 15

ఏవముక్తా తు వైదేహీ పరిమోహితచేతనా।
ఉవాచాశ్రూణి ముంచంతీ దారుణం మామ్ ఇదం వచః। 16

భావో మయి తవాత్యర్థం పాప ఏవ నివేశితః।
వినష్టే భ్రాతరి ప్రాప్తుం న చ త్వం మామ్ అవాప్స్యసి। 17

సంకేతాద్భరతేన త్వం రామం సమనుగచ్ఛసి।
క్రోశంతం హి యథాఽత్యర్థం నైవమ్ అభ్యవపద్యసే। 18

రిపుః ప్రచ్ఛన్నచారీ త్వం మదర్థమ్ అనుగచ్ఛసి।
రాఘవస్యాంతరప్రేప్సుః తథైనం నాభిపద్యసే। 19

ఏవముక్తో హి వైదేహ్యా సంరబ్ధో రక్తలోచనః।
క్రోధాత్ ప్రస్ఫురమాణోష్ఠ ఆశ్రమాదభినిర్గతః। 20

ఏవం బ్రువాణం సౌమిత్రిం రామః సంతాపమోహితః।
అబ్రవీద్దుష్కృతం సౌమ్య! తాం వినా యత్త్వమాగతః|। 21

జానన్నపి సమర్థం మాం రక్షసాం వినివారణే।
అనేన క్రోధవాక్యేన మైథిల్యా నిస్సృతో భవాన్। 22

నహి తే పరితుష్యామి త్యక్త్వా యద్యాసి మైథిలీమ్।
క్రుద్ధాయాః పరుషం శ్రుత్వా స్త్రియాశ్చ త్వమ్ ఇహాఽగతః। 23

సర్వథా త్వపనీతం తే సీతయా యత్ప్రచోదితః।
క్రోధస్య వశమాపన్నో నాకరోః శాసనం మమ। 24

అసౌ హి రాక్షసః శేతే శరేణాభిహతో మయా।
మృగరూపేణ యేనాహమ్ ఆశ్రమాదపవాహితః। 25

వికృష్య చాపం పరిధాయ సాయకం
సలీలబాణేన చ తాడితో మయా ।
మార్గీం తనుం త్యజ్య స విక్లబస్వరో
బభూవ కేయూరధరః స రాక్షసః । 26

ఇంతవఱకును పుట్టలేదు. ఇకమీదట పుట్టబోడు. ఇంద్రాదిదేవతలుసైతము యుద్ధమున శ్రీరాముని జయింపజాలరు." (13-15)

నేనింతగా ధైర్యము చెప్పినను ఆ వైదేహి భ్రాంతికిలోనైన తనతలంపునుండి బయటపడనిదై, సంతతధారగా కన్నీరుగార్చుచు అతిదారుణముగా నాతో ఇట్లనెను. (16)

'మీ అన్న అసువులను వీడినచో నన్ను పొందవలెననెడి పాపబుద్ధి నీలో గూడుకట్టుకొనియున్నది. ఎట్టి పరిస్థితులలోను నీవు నన్ను పొందుటమాత్రము కల్ల. 'శ్రీరాముని తుదముట్టింపుము' అని భరతుడు నీకు సూచించియుండవచ్చును. అందులకే నీవు ఆయనను (శ్రీరాముని) అనుసరించుచుంటివి. భక్తితో మాత్రము గాదు. అందువలననే ఆర్తిలో ఆయన ఎంతగా పిలుచుచున్నను నీవు ఆయనకడకు వెళ్లుట లేదు. నీవు మాఱువేషములోనున్న శత్రుడవు. నాకొఱకే నీవు మమ్ము అనుసరించుచుంటివి. రాముని రూపుమాపెడి అవకాశము కొఱకే నీవు ఎదురుచూచుచుంటివి. ఆ కారణముననే ఆయనకడకు నీవు వెళ్లుట లేదు.' (17–19)

సీతాదేవి ఇట్లు పలుకగా నాలో క్రోధము ఆవేశించినది. కన్నులు ఎఱ్ఱబాఱినవి. పెదవులు అదరినవి. వేయునది లేక వెంటనే ఆశ్రమమునుండి బయలుదేఱి ఇటు వచ్చితిని." (20)

లక్ష్మణునిమాటలకు శ్రీరాముడు ఎంతయు పరితపించి, 'ఓ సౌమ్యా! ఏది ఏమైనను నీవు అమెను అచట ఒంటరిగా విడిచివచ్చుటమాత్రము చాల తప్పు. నేను ఎట్టి రాక్షసయోధులనైనను అదుపుచేయుగల సమర్థుడనని ఎఱింగియు సీత క్రోధముతో పలికిన మాటలకు నీవు ఆశ్రమమునుండి బయలుదేఱితివి. క్రుద్ధురాలైన ఒక స్త్రీ పలికిన పరుషవచనములను పట్టించుకొని, మైథిలిని ఒంటరిగా వదలిపెట్టి నీవిటు వచ్చితివి. ఇది నాకు ఎంతమాత్రమూ సంతోషకరముగాదు. (21-23)

సీత పలికిన కఠినవచనములకు నీవు క్రోధవశుడవై నా ఆజ్ఞను ఉల్లంఘించితివి. నీవు అట్లు చేయుట గొప్ప తప్పిదము సుమా! (24)

మృగరూపములో వచ్చిన ఆ రాక్షసుడు నన్ను ఆశ్రమమునుండి చాల దూరమునకు గొనిపోయెను. నేను ధనుస్సును చేతబట్టి, బాణమును ఎక్కుపెట్టి ఆకర్ణాంతము లాగి అవలీలగా ఆ శరముతో అతనిని కొట్టితిని. నాబాణపు దెబ్బకు అతడునేలగూలెను. అంతట అతడు ఆ మృగరూపమును పరిత్యజించి, రాక్షసుడుగా మారెను. అప్పుడతడు భుజకీర్తులను ధరించి, దీనస్వరముగలవాడై యుండెను.(25-26)

శరాహతేనైవ తదార్తయా గిరా
స్వరం మమాఽఽలంబ్య సుదూరసంశ్రవమ్।
ఉదాహృతం తద్వచనం సుదారుణం
త్వమాగతో యేన విహాయ మైథిలీమ్ ॥ 27

నా బాణధాటికి దెబ్బతిని, అతడు నా కంఠమును అనుకరించుచు, దూరమునకు వినబడునట్లు ఆర్తవచనములను పలికెను. ఆ దారుణవచనములను నావిగా అనుకొని, నీవు మైథిలిని అచట వీడి, ఇటు వచ్చితివి.' (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకోనషష్టితమస్సర్గః *(59)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది ఏబదితొమ్మిదవసర్గము.

— * * * —

60. అఱువదియవసర్గము

విరహవేదనకులోనైన శ్రీరాముడు సీతాదేవికొఱకై అన్ని ప్రదేశములయందును వెదకుచు మిగుల పరితపించుట -

భృశమావ్రజమానస్య తస్యాథో వామలోచనమ్।
ప్రాస్ఫురచ్చాస్ఖలద్రామో వేపథుశ్చాప్యజాయత ॥ 1

ఉపాలక్ష్య నిమిత్తాని సోఽశుభాని ముహుర్ముహుః।
అపి క్షేమం ను సీతాయా ఇతి వై వ్యాజహార చ ॥ 2

త్వరమాణో జగామాథ సీతాదర్శనలాలసః।
శూన్యమావసథం దృష్ట్వా బభూవోద్విగ్నమానసః ॥ 3

ఉద్భ్రమన్నివ వేగేన విక్షిపన్ రఘునందనః।
తత్ర తత్రోటజస్థానమ్ అభివీక్ష్య సమంతతః ॥ 4

దదర్శ పర్ణశాలాం చ రహితాం సీతయా తదా।
శ్రియా విరహితాం ధ్వస్తాం హేమంతే పద్మినీమివ ॥ 5

రుదంతమివ వృక్షైశ్చ మ్లానపుష్పమృగద్విజమ్।
శ్రియా విహీనం విధ్వస్తం సంత్యక్తవనదేవతమ్ ॥ 6

ఆశ్రమమునకు వచ్చుచున్నప్పుడు శ్రీరామునియొక్క ఎడమకన్ను మిగుల అదరెను[1] ఆయనకాళ్లు తడబడెను.[2] శరీరముకంపింపసాగెను. అశుభసూచకములైన అపశకునములు వరుసగా ఎదురగుట చూచి, 'ఇంతకును సీత క్షేమముగా ఉండియుండునా?' అని శ్రీరాముడు తనలో తాను పదేపదే అనుకొనసాగెను. సీతను చూడవలెననెడి తహతహతో ఆయన త్వరత్వరగా అడుగులు వేసి, ఆశ్రమమునకు చేరెను. అచట ఆమె కనబడక పోవుటచే ఆయనమనస్సు ఉద్వేగమునకు లోనయ్యెను. (1-3)

అంతట ఆ రఘురాముడు త్వరత్వరగా పెద్దపెద్ద అంగలువేయుచు, చేతులను అటునిటు ఊపుచు (కదల్చుచు) ఆ పర్ణశాలచుట్టును ఆయాప్రదేశములలో బాగుగా వెదకెను. కాని జానకిమాత్రము కనబడలేదు. వైదేహిలేని ఆ పర్ణశాల ఆయనకు హేమంతఋతువునందు మంచునకు దెబ్బతినిన కమలములతో ఒప్పుచు వెలవెల బోవుచున్న సరస్సువలె కన్పట్టెను. (4-5)

అచటి వృక్షములపైగల తుమ్మెదలన్నియును హీనస్వరముతో రొదచేయుచుండగా ఆ చెట్లే సీతాదేవిని గానక ఏడ్చుచున్నట్లుండెను. ఆమెకరస్పర్శకు దూరమగుటచే పూవులు వాడిపోయియుండెను. జింకలు, పక్షులు ముఖములను చిన్నబుచ్చుకొనియుండెను. వనదేవతలందఱును ఆ ప్రదేశము విడిచి వెళ్లిరి. ఆప్రదేశమంతయు పాడుబడినట్లుండెను. సీతాదేవి సన్న్యాసిరూపమున వచ్చిన రావణునకు సమర్పించుటచే అచటి జింకచర్మములు దర్భలు

1) అధో వామదృశస్స్ఫూర్తౌ బహ్వనిష్టో భవేత్ పుమాన్॥
ఎడమ కన్ను (క్రిందిఱెప్ప) అదిరినచో పురుషునకు పెక్కు అరిష్టములు ప్రాప్తించును.

2) ప్రయాణకాలే స్ఖలనం కరోతీష్టస్య భంజనమ్॥
ప్రయాణసమయమున కాళ్లు తడబడినచో (తొట్రుపాటు కలిగినచో) సంకల్పమునకు భంగము వాటిల్లును.

విప్రకీర్ణాజినకుశం విప్రవిద్ధబృసీకటం।
దృష్ట్వా శూన్యం నిజస్థానం విలలాప పునఃపునః। 7

హృతా మృతా వా నష్టా వా భక్షితా వా భవిష్యతి।
నిలీనాఽప్యథ వా భీరుః అథవా వనమాశ్రితా। 8

గతా విచేతుం పుష్పాణి ఫలాన్యపి చ వా పునః।
అథవా పద్మినీం యాతా జలార్థం వా నదీం గతా। 9

యత్నాన్మృగయమాణస్తు నాససాద వనే ప్రియాం।
శోకరక్తేక్షణః శోకాత్ ఉన్మత్త ఇవ లక్ష్యతే। 10

వృక్షాద్వృక్షం ప్రధావన్ స గిరేశ్చాద్రిం నదాన్నదీం।
బభూవ విలపన్ రామః శోకార్ణవపరిప్లుతః। 11

అపి కచ్చిత్ త్వయా దృష్టా సా కదంబప్రియా ప్రియా।
కదంబ! యది జానీషే శంస సీతాం శుభాననామ్। 12

స్నిగ్ధపల్లవసంకాశా పీతకౌశేయవాసినీ।
శంసస్వ యది వా దృష్టా బిల్వ! బిల్వోపమస్తనీ। 13

అథవాఽర్జున! శంస త్వం ప్రియాం తామ్ అర్జునప్రియాం।
జనకస్య సుతా భీరుః యది జీవతి వా న వా। 14

కకుభః కకుభోరూం తాం వ్యక్తం జానాతి మైథిలీం।
యథా పల్లవపుష్పాఢ్యో భాతి హ్యేష వనస్పతిః। 15

యథాస్థానమున లేకున్నవి. రావణుడు సీతాదేవిని అపహరించుకొనిపోయిన సందర్భమున ఆమె అతనినుండి తప్పించుకొనుటకై ప్రయత్నించినప్పుడు అచటి ఆసనములు, చాపలు చెల్లాచెదరై అటునిటు పడియుండెను. సీతాదేవి ఎడబాటుచే ఆప్రదేశమంతయును శోభావిహీనమై యుండెను. అట్టి తనఆశ్రమప్రదేశమును జూచి శ్రీరాముడు మిగుల విలపింపసాగెను- (6-7)

'సీతను ఎవరైనను అపహరించుకొని పోయిరా? చంపివేసిరా? తప్పిపోయినదా? నన్ను ఆటపట్టించుటకై ఆమె ఎచటనైనను దాగికొనియున్నదా? ఎవ్వరును తోడులేకపోవుటచే భయపడి, ఎవ్వరికంటబడకుండ వనములలో తిరుగుచున్నదా? పూవులను, పండ్లను సేకరించుకొని వచ్చుటకై ఎచటికైనను వెళ్లినదా? స్నానార్థమై సరస్సునకు వెళ్లినదా? లేక జలములను గొనివచ్చుటకై నదికి పోయినదా?'- అని శ్రీరాముడు పరిపరివిధముల తలపోసెను. (8-9)

శ్రీరాముడు ఎంతగా వెదకినను సీతజాడ తెలియక పోయెను. శోకభారముతో ఆయనకన్నులెఱ్ఱబాఱెను. ఆయన ఉన్మత్తునివలె కనబడుచుండెను. అతడు సీతాదేవికొఱకై చెట్లను పుట్టలను, కొండలను కోనలను, నదీనదములను పరుగులు దీయుచు గాలించెను. ఆమె కనబడకపోవుటచే ఆయన శోకసాగరమున మునిగెను. (10-11)

ఓకడిమిచెట్టా! నాకు ప్రాణతుల్యయైన సీతాదేవికి నీపూవులనిన పరమప్రీతి. ఆ సుందరి నీకు కనబడినచో నాకు తెలుపుము - ఓ మారేడు వృక్షమా! పద్మినీజాతికి చెందిన మా సీత చిగురుటాకులవలె కోమలమైనది, పట్టుపీతాంబరములను ధరించియుండునది, ఆమె నీకు కన్పించినచో నాకు తెలుపుము- ఓ తెల్లమద్దివృక్షమా! నా ధర్మపత్నియైన సీతకు నీపైగల ప్రేమ అపారము. భయస్వభావురాలైన మా జానకి బ్రతికియున్నదా? లేదా? తెలుపుము. (12-14)

వనస్పతియైన ఈ కకుభ (ఏటిమద్ది) వృక్షము చక్కగా చిగుళ్లు వేసి, మొగ్గదొడిగి, పూవులతో కనువిందుగావించుచున్నది. దీనినిబట్టి చూడగా కుకుభోరువైన (చక్కని ఊరు సౌభాగ్యముగల) సీతాదేవిని ఈ వనస్పతివృక్షము చూచియేయుండవచ్చును.[1] లేనిచో ఇది ఇట్లు పూవులతో కలకలలాడుచు ఉండదు- (15)

1) సహజముగా ఈ కకుభ (ఏటిమద్ది) వృక్షము పుష్పములు లేకుండగనే ఫలించును. కాని సీతాదేవి దర్శనప్రభావముచే (సీతను చూచిన సంతోషముతో) సహజస్వభావమును అధిగమించి, ఈ వనస్పతి పూలశోభలతో కలకలలాడుచున్నది.
దిగంతములవఱకు (సుదూరతీరములకు) వ్యాపించునదిగావున దీనికి 'కకుభము' అని పేరు - కనుక సీతాదేవి ఏదిక్కునకు వెళ్లినను ఇది చూచియేయుండును.

భ్రమరైరుపగీతశ్చ యథా ద్రుమవరో హ్యయం।
ఏష వ్యక్తం విజానాతి తిలకస్తిలకప్రియామ్। 16

సీతాదేవి తిలకప్రియ. అనగా తిలక (ఎఱ్ఱగోరింట) పుష్పములపై సీతకు మక్కువ ఎక్కువ. చెట్లలో శ్రేష్ఠమైన ఈతిలకవృక్షము సంతోషముతో భ్రమరగీతములను వినిపించుచున్నది. అందువలన ఇది సీతాదేవిని తప్పక చూచియే యుండవచ్చును- (16)

అశోక! శోకాపనుద! శోకోపహతచేతసం।
త్వన్నామానం కురు క్షిప్రం ప్రియాసందర్శనేన మామ్। 17

ఓ అశోకవృక్షమా! నీవు ఎల్లరశోకములను తొలగించుచు వారికి సంతోషమును గూర్చుచుండుదానవు. భార్యయొక్క ఎడబాటుచే మిగులపరితపించుచున్న నాకు వెంటనే సీతాదేవిజాడను తెలిపి, నన్ను శోకరహితునిగా జేయుము. (17)

యది తాల! త్వయా దృష్టా పక్వతాలఫలస్తనీ।
కథయస్వ వరారోహాం కారుణ్యం యది తే మయి। 18

ఓతాళవృక్షమా! పండిన తాళఫలములవలె చక్కని స్తనసౌభాగ్యముగల సీతాదేవిని నీవు చూచియున్నచో నాపై కనికరము ఉంచి ఆ సుందరిసమాచారమును దెల్పుము.(18)

యది దృష్టా త్వయా సీతా జంబు! జంబూఫలోపమా।
ప్రియాం యది విజానీషే నిశ్శంకం కథయస్వ మే। 19

ఓ నేరేడువృక్షమా! నాకు ప్రీతిని గూర్చెడి సీతాదేవి నేరేడుపండ్లవలె నిగనిగలాడు తనుశోభలుగలది. ఆమె నీకు కనబడియున్నచో, నీవు ఎఱిగిన మేరకు ఆమె సమాచారమునుగూర్చి ఏమాత్రము దాచక నాకు తెలుపుము- (19)

అహో! త్వం కర్ణికారాద్య సుపుష్పైః శోభసే భృశం।
కర్ణికారప్రియా సాధ్వీ శంస దృష్టా ప్రియా యది। 20

ఓగన్నేరువృక్షమా! పరమపతివ్రతయైన నాభార్యకు నీవనిన పరమప్రీతి. నీవు నేడు చక్కనిపూల శోభలతో విలసిల్లుచున్నావు. ఒకవేళ ఆమె నీకు కనబడినదాయేమి? ఐనచో నాకు ఆమె జాడను తెలిపి, పున్నెము గట్టుకొనుము-(20)

చూతనీపమహాసాలాన్ పనసాన్ కురవాన్ ధవాన్।
దాడిమానసనాన్ గత్వా దృష్ట్వా రామో మహాయశాః। 21

మల్లికామాధవీశ్చైవ చంపకాన్ కేతకీస్తథా।
పృచ్ఛన్ రామో వనే భ్రాంత ఉన్మత్త ఇవ లక్ష్యతే। 22

మహాయశస్వియైన శ్రీరాముడు ఆవనమునగల మామిడివృక్షములను, మంకెన చెట్లను, పెద్దమద్ది చెట్లను, పనసవృక్షములను, ఎఱ్ఱ చేమంతిపొదలను, ధవవృక్షములను, దానిమ్మచెట్లను, వేగిచెట్లను, అట్లే మల్లెతీగెలను మాధవీలతలను, సంపెంగలను, మొగలిపొదలను చేరి, సీత జాడను తెలుపవలసినదని వాటిని అడుగుచు ఒక ఉన్మత్తునివలె కన్పట్టెను. (21-22)

అథవా మృగశాబాక్షీం మృగ! జానాసి మైథిలీం।
మృగవిప్రేక్షణీ కాంతా మృగీభిః సహితా భవేత్। 23

వృక్షములనుండి సమాధానము రాకపోవుటచే శ్రీరాముడు ఒక మృగమును సమీపించి, ఓ హరిణమా! జింకపిల్లలకన్నులవంటి కన్నులుగల మా మైథిలిని నీవు ఎఱుగుదువు గదా! లేళ్లవలె అందమైన చూపులతో ఒప్పెడి ఆకాంత ఆడులేళ్లమధ్య ఉండియుండును. (23)

గజ! సా గజనాసోరూః యది దృష్టా త్వయా భవేత్।
తాం మన్యే విదితాం తుభ్యమ్ ఆఖ్యాహి వరవారణ!। 24

ఓ గజేంద్రమా! ఏనుగుతొండముఆకారములో చక్కని ఊరుసౌందర్యముగల సీతాదేవిని నీవు గుర్తింతువు గదా! ఆమె నీకు కనబడియున్నచో నాకు తెలుపుము. (24)

శార్దూల! యది సా దృష్టా ప్రియా చంద్రనిభాననా।
మైథిలీ మమ విస్రబ్ధం కథయస్వ న తే భయమ్। 25

ఓ పెద్దపులీ! నీవు భయపడవలసిన పనిలేదు. నేను నిన్నేమియు చేయను. నన్ను నమ్ముము. చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖముగలదియు, నాధర్మపత్నియు ఐన సీత నీకు కనబడియున్నచో నాకు (నిర్భయముగా) తెలుపుము.(25)

కిం ధావసి ప్రియే! దూరం దృష్టాఽసి కమలేక్షణే।
వృక్షైరాచ్ఛాద్య చాత్మానం కిం మాం న ప్రతిభాషసే। 26

తిష్ఠ తిష్ఠ వరారోహే! న తేఽస్తి కరుణా మయి।
నాత్యర్థం హాస్యశీలాఽసి కిమర్థం మాముపేక్షసే। 27

పీతకౌశేయకేనాసి సూచితా వరవర్ణిని!।
ధావంత్యపి మయా దృష్టా తిష్ఠ యద్యస్తి సౌహృదమ్। 28

నైవ సా నూనమథవా హింసితా చారుహాసినీ।
కృచ్ఛ్రం ప్రాప్తం న మాం నూనం యథోపేక్షితుమర్హతి। 29

వ్యక్తం సా భక్షితా బాలా రాక్షసైః పిశితాశనైః।
విభజ్యాంగాని సర్వాణి మయా విరహితా ప్రియా। 30

నూనం తచ్ఛుభదంతోష్ఠం సునాసం చారుకుండలం।
పూర్ణచంద్రమివ గ్రస్తం ముఖం నిష్ప్రభతాం గతమ్। 31

సా హి చంపకవర్ణాభా గ్రీవా గ్రైవేయశోభితా।
కోమలా విలపంత్యాస్తు కాంతా యా భక్షితా శుభా। 32

నూనం విక్షిప్యమాణౌ తౌ బాహూ పల్లవకోమలౌ।
భక్షితౌ వేపమానాగ్రౌ సహస్తాభరణాంగదౌ। 33

మయా విరహితా బాలా రక్షసాం భక్షణాయ వై।
సార్థేనేవ పరిత్యక్తా భక్షితా బహుబాంధవా। 34

హా లక్ష్మణ! మహాబాహో! పశ్యసి త్వం ప్రియాం క్వచిత్।
హా ప్రియే క్వ గతా భద్రే! హా సీతేతి పునః పునః। 35

కమలములవంటి కన్నులుగల నా ప్రియురాలా! (నన్ను జూచి) నీవు దూరముగా ఎందులకు పరుగిడుచున్నావు? నేను నిన్ను చూచితిని సుమా! నీవు చెట్లచాటున దాగికొనుచు నాతో మాట్లాడవేమి? (26)

ఓ సుందరీ! ఆగుమాగుము. నాపై నీకు కనికరమే లేదా? నీవు ఎవ్వరినీ పరిహసించెడి స్వభావముగలదానవేగావు. ఇక నన్నేల ఉపేక్షింపుచున్నావు? (27)

ఓ శుభాంగీ! నీవు పరుగెత్తుచున్నను నీవు ధరించిన పట్టుపీతాంబరమునుబట్టి నిన్నునేను గుర్తించితినిలెమ్ము. నాయందు ఏమాత్రమైనను ఆదరాభిమానములు ఉన్నచో ఇక నిలువుము. (28)

నేను ఇంతవఱకును భ్రమకు లోనైయుంటిని. నిజముగనే ఆమె ప్రాణములతో మిగిలిలేదు. ఎల్లప్పుడును చిఱునవ్వులతోనుండెడి ఆమెను రాక్షసులు చంపియుందురు. లేనిచో ఇట్టి కష్టస్థితిలోనున్న నన్ను ఆమె ఎన్నడును ఉపేక్షింపదు. (29)

నా ప్రియురాలును, అమాయికురాలును ఐన సీతాదేవి నాకు దూరమై ఒంటరిగానుండుట జూచి, మాంసభక్షకులైన రాక్షసులు ఆమె అవయవములను ముక్కలుముక్కలుగాజేసి, భుజించియుందురనుట నిజము- (30)

ఆమెముఖము చక్కని పలువరుసతో, దర్శనీయమైన పెదవులతో అందమైన ముక్కుతో విరాజిల్లుచుండును. ఆమె ధరించెడి కుండలములు చూడముచ్చటగొల్పునవి. అట్టి ఆమెవదనము రాహుగ్రస్తుడైన నిండుచంద్రునివలె కాంతిహీనమై యుండును. (31)

తోడులేక ఒంటరిదై విలపించుచున్న సీతాదేవియొక్కమెడ సంపెంగపూవువన్నెగలది, కంఠహారములతో విలసిల్లుచుండునది. సుతిమెత్తనిది, మనోజ్ఞమైనది. అట్టి ఆమెకంఠము భక్షింపబడియుండును. (32)

ఆమెబాహువులు నవపల్లవములవలె మృదువైనవి, వాటిఅగ్రభాగములును కంపించుచుండును, కంకణములతో, దండకడియములతో అలరారుచుండును, అటునిటు కదల్చబడుచుండును. అట్టి ఆమె బాహువులు రక్కసులచే భుజింపబడియుండును. (33)

రాక్షసులకు ఆహారమగుటకే ఆ అమాయికురాలు నాకు దూరమైయుండును. పెక్కుమంది బంధువులు ఉన్నను తోడి బాటసారులగుంపునుండి వేఱైన ఒక స్త్రీవలె ఆమె నిశాచరులచే భక్షింపబడియుండును. (34)

'అయ్యో! మహాబాహుడవైన ఓ లక్ష్మణా! నా ప్రేమ పెన్నిధియైన సీతను నీవు ఎచ్చటనైనను చూచితివా? శుభస్వరూపురాలవైన ఓ ప్రియురాలా! సీతా! ఎచ్చటికి

ఇత్యేవం విలపన్ రామః పరిధావన్ వనాద్వనమ్।
క్వచిదుద్భ్రమతే వేగాత్ క్వచిద్విభ్రమతే బలాత్।
క్వచిన్మత్త ఇవాభాతి కాంతాన్వేషణతత్పరః। 36

వెళ్లితివి? ఎక్కడనుంటివి? అని శ్రీరాముడు మాటిమాటికి విలపించుచు వనములలో పరుగిడుచుండెను. అతడు మిక్కిలి శోకమున మునింగియుండుటవలన ఎదుట సీత లేకున్నను ఆమె తనసమ్ముఖమున నిలిచియున్నట్లే భ్రమకు లోనగుచుండెను. మఱియొకప్పుడు ఉపమాన వస్తువులైన లతాదికములను జూచి, తత్సాదృశ్య ప్రభావమున సీతాభ్రాంతికి గుఱియగుచుండెను. వేఱొకప్పుడు తనకాంతను (సీతను) అన్వేషించుటలో తత్పరుడై ఉన్మత్తునివలె తిరుగుచుండెను- (35-36)

స వనాని నదీః శైలాన్ గిరిప్రస్రవణాని చ।
కాననాని చ వేగేన భ్రమత్యపరిసంస్థితః। 37

అతడు చిన్నచిన్న వనములను, కీకారణ్యములను, నదీనదములను, పర్వతములను, కొండలలో పుట్టి ప్రవహించెడి సెలయేళ్లను దాటుచు నిలుకడలేనివాడై ఎల్లెడలను తిరుగుచుండెను. (37)

తథా స గత్వా విపులం మహద్వనం
పరీత్య సర్వం త్వథ మైథిలీం ప్రతి ।
అనిష్ఠితాశః స చకార మార్గణే
పునః ప్రియాయాః పరమం పరిశ్రమమ్ । 38

ఆరాముడు ఆ విధముగా విశాలమైన, దట్టమైన అడవులయందు అంతటను సీతాదేవిని కనుగొనుటకై పదేపదే తిరుగుచు మిగుల అలసిపోయెను. ఐనను అతడు నిస్పృహకు లోనుగాక తనకు ప్రాణతుల్యురాలైన జానకిని వెదకుటలోనే సతమతమగుచుండెను. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే షష్టితమస్సర్గః *(60)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదియవసర్గము.

-- * * * --

61. అఱువదియొకటవసర్గము

శ్రీరాముడు విరహమునకులోనై వ్యథచెందుచుండగా సౌమిత్రి ఆయనను ఓదార్చుట - వారు ఇరువురును జానకికై ఆవనమునందు అంతటను అన్వేషించుట.

దృష్ట్వాఽఽశ్రమపదం శూన్యం రామో దశరథాత్మజః।
రహితాం పర్ణశాలాం చ విధ్వస్తాన్యాసనాని చ। 1

అదృష్ట్వా తత్ర వైదేహీం సన్నిరీక్ష్య చ సర్వశః।
ఉవాచ రామః ప్రాక్రుశ్య ప్రగృహ్య రుచిరౌ భుజౌ। 2

దశరథునికుమారుడైన శ్రీరాముడు ఆశ్రమప్రదేశమంతయును శూన్యముగానుండట చూచి, పర్ణశాలయందు అడుగిడెను. అచ్చటగూడ సీత కన్పింపలేదు. కాని అందలి ఆసనములన్నియును చెల్లాచెదరుగా పడియుండుటను అతడు గమనించెను. ఆమె కొఱకై ఆచుట్టుప్రక్కల అంతటను బాగుగా గాలించెను. వైదేహి కనబడక పోవుటచే అతడు 'సీతా! సీతా!' అని బిగ్గఱగా కేకలు వేయుచు లక్ష్మణుని బలిష్ఠములైన భుజములను పట్టుకొని ఇట్లనెను. (1-2)

క్వ ను లక్ష్మణ! వైదేహీ కం వా దేశమితో గతా।
కేనాహృతా వా సౌమిత్రే! భక్షితా కేన వా ప్రియా। 3

"ఓ సౌమిత్రీ! సీత ఎక్కడ? ఇచటినుండి ఎక్కడికి వెళ్లియుండును? నాప్రాణతుల్యమైన ఆమెను ఎవ్వరైనను అపహరించి యుందురా? లేక ఎవ్వరైనను చంపి, తినియుందురా?" (3)

వృక్షేణాచ్ఛాద్య యది మాం సీతే! హసితుమిచ్ఛసి।
అలం తే హసితేనాద్య మాం భజస్వ సుదుఃఖితమ్। 4

"ఓ సీతా! చెట్టుచాటున దాగికొని నన్ను ఆటపట్టించుచున్నావా? ఇంక నీసరసములు చాలును. నీకై

యైః సహ క్రీడసే సీతే! విశ్వస్తైర్మృగపోతకైః।
ఏతే హీనాస్త్వయా సౌమ్యే! ధ్యాయంత్యస్రావిలేక్షణాః। 5

సీతయా రహితోఽహం వై నహి జీవామి లక్ష్మణ!।
మృతం శోకేన మహతా సీతాహరణజేన మామ్।
పరలోకే మహారాజో నూనం ద్రక్ష్యతి మే పితా। 6

కథం ప్రతిజ్ఞాం సంశ్రుత్య మయా త్వమభియోజితః।
అపూరయిత్వా తం కాలం మత్సకాశమిహాగతః। 7

కామవృత్తమ్ అనార్యం మాం మృషావాదినమేవ చ।
ధిక్! త్వామితి పరే లోకే వ్యక్తం వక్ష్యతి మే పితా। 8

వివశం శోకసంతప్తం •దీనం భగ్నమనోరథమ్।
మామిహోత్సృజ్య కరుణం కీర్తిర్నరమివానృజుమ్। 9

క్వ గచ్ఛసి వరారోహే! మాం నోత్సృజ సుమధ్యమే!।
త్వయా విరహితశ్చాహం మోక్ష్యే జీవితమాత్మనః। 10

ఇతీవ విలపన్ రామః సీతాదర్శనలాలసః।
న దదర్శ సుదుఃఖార్తో రాఘవో జనకాత్మజామ్। 11

అనాసాదయమానం తం సీతాం దశరథాత్మజమ్।
పంకమాసాద్య విపులం సీదంతమివ కుంజరమ్। 12

లక్ష్మణో రామమత్యర్థమ్ ఉవాచ హితకామ్యయా। 13

మా విషాదం మహాబాహో! కురు యత్నం మయా సహ।
ఇదం చ హి వనం శూర! బహుకందరశోభితమ్। 14

ప్రియకాననసంచారా వనోన్మత్తా చ మైథిలీ।
సా వనం వా ప్రవిష్టా స్యాత్ నళినీం వా సుపుష్పితామ్। 15

సరితం వాఽపి సంప్రాప్తా మీనవంజులసేవితామ్।
స్నాతుకామా నిలీనా స్యాత్ హాసకామా వనే క్వచిత్। 16

విశ్రామయితుకామా వా లీనా స్యాత్ కాననే క్వచిత్।
జిజ్ఞాసమానా వైదేహీ త్వాం మాం చ పురుషర్షభ!।
తస్యా హ్యన్వేషణే శ్రీమన్! క్షిప్రమేవ యతావహై। 17

పరితపించుచున్న నన్ను ఆదరింపుము. ఓ సౌమ్యురాలా! మచ్చికతో నీతో ఆడుకొనుచుండెడి లేడిపిల్లలు, నీవు కనబడకుండుటచే నిన్నే స్మరించుచు కన్నీరు గార్చుచున్నవి." (4-5)

"ఓ లక్ష్మణా! సీతలేకుండ నేను జీవింపజాలను. ఆమెయెడబాటుచే తీరనిశోకముతో స్వర్గస్థుడనగుట నిశ్చయము. అక్కడ మనతండ్రియైన దశరథమహారాజు తప్పక నన్ను చూచును. అప్పుడతడు 'పదునాలుగు సంవత్సరములపాటు వనవాసము చేయుము-' అని నేను నిన్ను ఆజ్ఞాపించియుంటిని గదా? ప్రతిజ్ఞాపూర్వకముగా అందులకు నీవు సమ్మతించి వనములకు ఏగితివిగదా? ఆ గడువు ముగియకముందే నాకడకు ఇట్లు వచ్చితివేమి?'- అని నన్ను నిలదీయును. మఱియు ఇష్టమువచ్చినట్లుగా ప్రవర్తించువాడను, దుర్జనుడను, అసత్యవాదిని అని నన్ను మన తండ్రి స్వర్గలోకమున ఛీకొట్టును. (6-8)

"ఓ సుందరీ! సీతా! నేను నీయందే మనసు నిల్పినవాడను, (నీఅధీనుడను) దీనుడను, మనోరథములు ఈడేరక నిస్పృహకు లోనైనవాడను. కపటియైనవానిని కీర్తి పరిత్యజించినట్లు నీవు నన్ను దైన్యమునకు గుఱిచేసి ఎక్కడికి వెళ్ళితివి? సాధ్వివైన నీకు నన్ను విడిచి వెళ్ళుట తగదని. నీ యెడబాటునకు లోనైన నేను నా జీవితమును చాలించెదను." (9-10)

ఇట్లు శ్రీరాముడు సీతను జూచుటకై తహతహపడుచు విలపింపసాగెను, కాని దుఃఖార్తుడైన ఆ రాఘవునకు జానకిజాడ మాత్రము కఱవయ్యెను. (11)

విశాలముగానున్న అడుసులో కూరుకొనిపోయిన ఏనుగువలె సీతజాడ తెలియక దుఃఖమగ్నుడై విలపించుచున్న ఆ దాశరథిని (శ్రీరాముని) జూచి, లక్ష్మణుడు ఆయనహితమును గోరుచు ఇట్లునుడివెను. (12-13)

"ఓ మహాబాహూ! దుఃఖింపకుము. మనము ఇద్దరము కలిసి సీతాదేవిని వెదకుదము. ఈ వనము గుహలవంటి పెక్కు పొదరిండ్లతో విలసిల్లుచున్నది. వనములలో సంచరించుటకును, నిర్మలజలములలో స్నానమొనర్చుటకును మైథిలి మిగుల మక్కువపడుచుండును. కనుక వనమునందుగాని, కమలములతో కలకలలాడుచున్న సరస్సులోగాని ప్రవేశించియుండవచ్చును. చేపలతోడను, ప్రబ్బలిచెట్లతోడను గూడియున్న నదికి స్నానముచేయుటకై వెళ్ళియుండవచ్చును. పరిహాసమునకై ఏదైనవొక వనమున దాగియుండవచ్చును. మనలను భయపెట్టుటకుగాని, మనఅన్వేషణ సామర్థ్యమును తెలిసికొనుటకై గాని ఏ అరణ్యమునందైనను దాగికొని యుండవచ్చును. కావున ఓ అన్నా! వెంటనే ఆమెను అన్వేషించుటకై పూనుకొందము- (14-17)

వనం సర్వం విచినువో యత్ర సా జనకాత్మజా।
మన్యసే యది కాకుత్స్థ! మాస్మ శోకే మనః కృథాః। 18

ఏవముక్తస్తు సౌహార్దాల్ లక్ష్మణేన సమాహితః సహ।
సౌమిత్రిణా రామో విచేతుముపచక్రమే। 19

తౌ వనాని గిరీంశ్చైవ సరితశ్చ సరాంసి చ।
నిఖిలేన విచిన్వానౌ సీతాం దశరథాత్మజౌ। 20

తస్య శైలస్య సానూని గుహాశ్చ శిఖరాణి చ।
నిఖిలేన విచిన్వానౌ నైవ తామభిజగ్మతుః। 21

విచిత్య సర్వతః శైలం రామో లక్ష్మణమబ్రవీత్।
నేహ పశ్యామి సౌమిత్రే! వైదేహీం పర్వతే శుభామ్। 22

తతో దుఃఖాభిసంతప్తో లక్ష్మణో వాక్యమబ్రవీత్।
విచరన్ దండకారణ్యం భ్రాతరం దీప్తతేజసమ్। 23

ప్రాప్స్యసి త్వం మహాప్రాజ్ఞ! మైథిలీం జనకాత్మజామ్।
యథా విష్ణుర్మహాబాహుః బలిం బద్ధ్వా మహీమిమామ్। 24

ఏవముక్తస్తు సౌహార్దాల్ లక్ష్మణేన స రాఘవః।
ఉవాచ దీనయా వాచా దుఃఖాభిహతచేతనః। 25

వనం సర్వం సువిచితం పద్మిన్యః ఫుల్లపంకజాః।
గిరిశ్చాయం మహాప్రాజ్ఞ! బహుకందరనిర్ఝరః। 26

నహి పశ్యామి వైదేహీం ప్రాణేభ్యోఽపి గరీయసీమ్। 27

ఏవం స విలపన్ రామః సీతాహరణకర్శితః।
దీనః శోకసమావిష్టో ముహూర్తం విహ్వలోఽభవత్। 28

సంతప్తో హ్యవసన్నాంగో గతబుద్ధిర్విచేతనః।
నిషసాదాతురో దీనో నిశ్శ్వస్యాఽశీతమాయతమ్। 29

బహుళం స తు నిశ్శ్వస్య రామో రాజీవలోచనః।
హా ప్రియేతి విచుక్రోశ బహుశో బాష్పగద్గదః। 30

తం తతః సాంత్వయామాస లక్ష్మణః ప్రియబాంధవః।
బహుప్రకారం ధర్మజ్ఞః ప్రశ్రితం ప్రశ్రితాంజలిః। 31

"ఓ సోదరా! నీవు సమ్మతించినచో ఆజానకికొఱకై వనమునందంతటను అడుగడుగునను గాలింతము. ఇక నీవు మనస్సునందు ఏమాత్రము దిగులు పెట్టుకొనవలదు-"(18)

లక్ష్మణుడు ఇట్లు ప్రేమతో ఓదార్చగా శ్రీరాముడు మనస్సును దిటవుచేసికొని, తమ్మునితోగూడి సీతకై వెదకసాగెను. (19)

ఆ అన్నదమ్ములు ఇరువురును ఏమాత్రము విసుగుపడక వనములను, గిరులను, నదులను, సరస్సులను సీతకొఱకై పూర్తిగా అన్వేషింపసాగిరి. ఇంకను పర్వతసానువులను, గుహలను, శిఖరములను సమగ్రముగా గాలించిరి. కాని సీతజాడ తెలియదయ్యెను. (20-21)

కొండలలోను, కోనలలోను పూర్తిగాలించిన పిమ్మట రాముడులక్ష్మణునితో ఇట్లు పలికెను. "ఓ సౌమిత్రీ! ఈ పర్వతమునందు ఎచ్చటను మంగళస్వరూపురాలైన వైదేహిమాత్రము కన్పించుట లేదు.' (22)

అప్పుడు దుఃఖమగ్నుడై పరితపించుచున్న లక్ష్మణుడు దండకారణ్యమున వెదకుచు తేజస్వియైన అన్నతో ఇట్లు నుడివెను. (23)

"ఓ సర్వజ్ఞా! శ్రీమహావిష్ణువు బలిని బంధించి, ఈ భూమండలమునువలె, నీవును (శత్రువును నిర్మూలించి) జానకిని పొందగలవు-" (24)

లక్ష్మణుడు భక్తితో ఇట్లు పలుకగా (సీతనుగానక) మనఃక్లేశమునకు గుఱియైయున్న శ్రీరాముడు దైన్య స్వరముతో ఇట్లనెను. (25)

"ఓ బుద్ధిమంతుడా! ఈ సమస్తవనమును, వికసించిన పద్మములుగల ఇచటి సరస్సులను, గుహలతో, సెలయేళ్లతో ఒప్పెడి ఈ కొండను పూర్తిగా వెదకితిమి. నాకు ప్రాణములకంటెను మిన్నయైన వైదేహి మాత్రము కనబడలేదు-" (26-27)

సీత కన్పింపకపోవుటచే కృశించియున్న శ్రీరాముడు ఇట్లు విలపించుచు, దీనుడై, అంతులేని శోకమున మునింగినవాడై ఒక క్షణకాలముపాటు నిశ్చేష్టుడయ్యెను. (28)

శ్రీరాముడు సంతాపమునకు లోనయ్యెను. ఎంతయు కృశించియుండెను, ఆయన బుద్ధి పనిచేయకుండెను, ఫలితముగా నిశ్చేష్టుడయ్యెను. దైన్యముతో, బాధతో వేడినిట్టూర్పులు విడుచుచుండెను- (29)

కమలనేత్రుడైన ఆ శ్రీరాముడు పదే పదే నిట్టూర్చుచు, కన్నీరు గార్చుచు, మాటలు తడబడుచుండగా 'హా ప్రియా! సీతా! అని మాటిమాటికిని బిగ్గఱగా జానకిని పిలుచుచుండెను. (30)

అంతట ధర్మజ్ఞుడు, ఆత్మీయుడు ఐన లక్ష్మణుడు బద్ధాంజలియై వినయముతో శ్రీరాముని పెక్కు రీతుల

అనాదృత్య తు తద్వాక్యం లక్ష్మణోష్ఠపుటాచ్చ్యుతమ్।
అపశ్యం స్తాం ప్రియాం సీతాం ప్రాక్రోశత్ స పునః పునః। 32

ఓదార్చెను. కాని అతడు లక్ష్మణునిమాటలను సరకుగొనక, ఎంతకును తనప్రేమపెన్నిదియైన సీతాదేవి కనబడకుండుటచే 'సీతా! సీతా!' అని గట్టిగా పిలువసాగెను- (31-32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకషష్టితమస్సర్గః (61)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదియొకటవసర్గము.

-- * * * --

62. అఱువదిరెండవసర్గము

సీతాదేవియెడబాటువలన శ్రీరాముడు మిగుల విలపించుట -

సీతామపశ్యన్ ధర్మాత్మా కామోపహతచేతనః।
విలలాప మహాబాహు రామః కమలలోచనః। 1

పశ్యన్నివ చ తాం సీతామ్ అపశ్యన్ మదనార్దితః।
ఉవాచ రాఘవో వాక్యం విలాపాశ్రయదుర్వచమ్। 2

త్వమశోకస్య శాఖాభిః పుష్పప్రియతయా ప్రియే!।
ఆవృణోషి శరీరం తే మమ శోకవివర్ధనీ। 3

కదళీకాండసదృశౌ కదల్యా సంవృతావుభౌ।
ఊరూ పశ్యామి తే దేవి! నాఽసి శక్తా నిగూహితుమ్। 4

కర్ణికారవనం భద్రే! హసంతీ దేవి! సేవసే।
అలం తే పరిహాసేన మమ బాధావహేన వై। 5

పరిహాసేన కిం సీతే! పరిశ్రాంతస్య మే ప్రియే!।
అయం స పరిహాసోఽపి సాధు దేవి! న రోచతే। 6

విశేషేణాశ్రమస్థానే హాసోఽయం న ప్రశస్యతే।
అవగచ్ఛామి తే శీలం పరిహాసప్రియం ప్రియే!।
ఆగచ్ఛ త్వం విశాలాక్షి! శూన్యోఽయమ్ ఉటజస్తవ। 7

సువ్యక్తం రాక్షసైః సీతా భక్షితా వా హృతాఽపి వా।
న హి సా విలపంతం మామ్ ఉపసంప్రైతి లక్ష్మణ!। 8

ఏతాని మృగయూథాని సాశ్రునేత్రాణి లక్ష్మణ!।
శంసంతీవ హి వైదేహీం భక్షితాం రజనీచరైః। 9

హా మమార్యే! క్వ యాతాఽసి హా సాధ్వి! వరవర్ణిని!।
హా సకామా త్వయా దేవీ కైకేయీ సా భవిష్యతి। 10

కమలలోచనుడు, ధర్మాత్ముడు ఐన శ్రీరాముడు సీతకనబడక పోవుటచే ఆమెమీది వ్యామోహముచే నిస్పృహాకులుడై, చేతులుచాచి, విలపింపదొడంగెను. సీతకన్పింపకున్నను కామపారవశ్యముచే రాఘవుడు ఆమెను చూచుచున్నట్లే భ్రాంతికి లోనై, గద్గదకంఠముతో విలపించుచు ఇట్లు నుడివెను. (1-2)

"ఓ ప్రియురాలా! నీకు పూవులనిన మిక్కిలి ప్రీతి. కనుక నీవు నీశరీరమునకు బంగారువన్నెగల పూలతో నిండిన అశోకశాఖలను కప్పుకొనుచు నాకు మిగుల శోకమును కలిగించుచున్నావు. ఓ దేవీ! అరటిస్తంభములవంటి ఊరువులుగలనీవు వాటిని అరటిఆకులతోకప్పుకొనుచున్నను, నీయూరువులను నేను చూచుచునే యున్నాను. వాటిని నీవు దాచుకొనజాలవు. (3-4)

భద్రమైన సౌశీల్యముగల ఓదేవీ! నీవు నవ్వులాటకై గన్నేరు వనమును చేరియున్నావా? నాకు బాధాకరమైన ఆ పరిహాసము ఇక చాలును. ప్రియమైన ఓ సీతా! పూర్తిగా అలసియున్న నాకు పరిహాసముతో ఏమి ప్రయోజనము? ఇట్టి పరిస్థితిలో నాకు అట్టి పరిహాసము ఏమాత్రము రుచింపదు. నీ స్వభావము నాకు తెలియును నీకు పరిహాసముపై ప్రీతిమెండు. అయితే ఆశ్రమస్థానమునందు పరిహాసమునకు చోటులేదు. కనుక ఓ విశాలాక్షీ! వెంటనే ఇచటికి రమ్ము. నీవు లేకపోవుటచే ఈ ఆశ్రమము బోసిపోయియున్నది." (5-7)

"లక్ష్మణా! నిజముగనే రాక్షసులు సీతను భక్షించియుందురు, లేదా అపహరించియుందురు. అట్లు కానిచో నేను ఇంతగా విలపించుచున్నను ఆమె నన్ను ఉపేక్షించునా? నిశాచరులు జానకిని భక్షించినారని తెలుపుటకాయుననట్లు మూగజీవులైన ఈ జింకలు కన్నీరు గార్చుచున్నవి." (8-9)

ఓ సుందరీ! లోకపూజ్యురాలవైన ఓ సాధ్వీ! ఇంతకును నీవు ఎటుపోయితివి? నీవు (మనము) ఇట్లు ఆపదల పాలగుటచే కైకేయిదేవికోరిక నెఱవేఱును. నేను

సీతయా సహ నిర్యాతో వినా సీతామ్ ఉపాగతః।
కథం నామ ప్రవేక్ష్యామి శూన్యమంతఃపురం పునః। 11

నిర్వీర్య ఇతి లోకో మాం నిర్దయశ్చేతి వక్ష్యతి।
కాతరత్వం ప్రకాశం హి సీతాపనయనేన మే। 12

నివృత్తవనవాసశ్చ జనకం మిథిలాధిపమ్।
కుశలం పరిపృచ్ఛంతం కథం శక్ష్యే నిరీక్షితుమ్। 13

విదేహరాజో నూనం మాం దృష్ట్వా విరహితం తయా।
సుతాస్నేహేన సంతప్తో మోహస్య వశమేష్యతి। 14

అథవా న గమిష్యామి పురీం భరతపాలితామ్।
స్వర్గోఽపి సీతయా హీనః శూన్య ఏవ మతో మమ। 15

మామిహోత్సృజ్య హి వనే గచ్ఛాయోధ్యాం పురీం శుభామ్।
న త్వహం తాం వినా సీతాం జీవేయం హి కథంచన। 16

గాఢమాశ్లిష్య భరతో వాచ్యో మద్వచనాత్ త్వయా।
అనుజ్ఞాతోఽసి రామేణ పాలయేతి వసుంధరామ్। 17

అంబా చ మమ కైకేయీ సుమిత్రా చ త్వయా విభో।
కౌసల్యా చ యథాన్యాయమ్ అభివాద్యా మమాఽఽజ్ఞయా। 18

రక్షణీయా ప్రయత్నేన భవతా సోక్తకారిణా। 19

సీతాయాశ్చ వినాశోఽయం మమ చామిత్రకర్శన।
విస్తరేణ జనన్యా మే వినివేద్యస్త్వయా భవేత్। 20

ఇతి విలపతి రాఘవే సుదీనే
వనముపగమ్య తయా వినా సుకేశ్యా।
భయవికలముఖస్తు లక్ష్మణోఽపి
వ్యథితమనా భృశమాతురో బభూవ। 21

సీతతోగూడి వనములకు వచ్చితిని. ఐతే సీతలేకుండ ఒంటరిగా అంతఃపురమున మరల ఎట్లు అడుగిడగలను? అట్టి స్థితిలో జనులు నన్నుగూర్చి 'ఈ రాముడు అసమర్థుడు. దయలేనివాడు-' అని చులకనభావముతో చెప్పుకొందురు. సీతను కోల్పోవుటచే నాపిఱికితనము వెల్లడియగును. (10-12)

నేను వనవాసమును ముగించుకొని తిరిగి వెళ్లినప్పుడు మిథిలాధిపతియైన జనకుడు మా క్షేమసమాచారములనుగూర్చి ప్రస్తావించును. అప్పుడు ఆయనకు నేను ఏమని సమాధానము చెప్పగలను? నా ప్రక్కన సీతలేకుండటను గమనించి, ఆవిదేహరాజు కూతురుపైగల వాత్సల్యముతో మోహమున మునింగి, మిగుల పరితపించును. (13-14)

భరతునిపాలనలో సుసంపన్నమైయున్న అయోధ్యాపురమునకు నేను వెళ్లనేవెళ్లను. జానకి తోడుగా లేనప్పుడు స్వర్గముగూడ నాకు శూన్యముగనే కన్పట్టును. (15)

ఓ లక్ష్మణా! నన్ను నీవు ఎంతగా ఓదార్చినను సీతలేనిదే నేను జీవింపజాలను. కావున నన్ను ఈ వనమునందే విడిచి, సుఖావహమైన అయోధ్యాపురికి వెళ్లుము. అచటికి వెళ్లిన పిమ్మట నీవు భరతుని గాఢముగా కౌగిలించుకొని, నామాటగా అతనికి ఇట్లు వచింపుము- 'ఓ భరతా! ఈ వసుంధరను (ఈ కోసల రాజ్యమును) పాలింపుము- అని శ్రీరాముడు నిన్ను ఆదేశించినాడు.' (16-17)

'నాయనా! లక్ష్మణా! శోకమున మునింగియుండు కౌసల్యామాతకును, తల్లిసుమిత్రకును, కైకేయీదేవికిని నమస్కరింపుము. అయితే కౌసల్యామాతనుమాత్రము నీవు ప్రత్యేకముగా రక్షించుచుండుము' ఇది నా ఆజ్ఞ. నీవు ఎల్లప్పుడు నామాటను జవదాటనివాడవుగదా!. (18-19)

ఓ శత్రుసూదనా! నాసీత కన్పింపకుండపోయిన (తప్పిపోయిన) విషయమును నాతల్లికి విపులముగా తెలుపవలెను సుమా!" (20)

వక్కని కురులుగల సీతాదేవి కన్పింపక పోవుటచే, వనమున జేరి, శ్రీరాముడు దైన్యముతో ఇట్లు విలపించుచుండెను. అంతట లక్ష్మణుడు భయముచే చిన్నవోయినముఖముతో మనస్సున కలత చెందినవాడై మిక్కిలి ఆందోళనకు గురియయ్యెను. (21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ద్విషష్టితమస్సర్గః (62)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదిరెండవసర్గము.

— * * * —

63. అఱువదిమూడవసర్గము

శ్రీరాముడు సీతాదేవియొక్క రూపలావణ్యములను జ్ఞప్తికి దెచ్చుకొనుచు ఆమె యెడబాటునకు వ్యథచెందుట -

స రాజపుత్రః ప్రియయా విహీనః
కామేన శోకేన చ పీడ్యమానః ।
విషాదయన్ భ్రాతరమార్తరూపో
భూయో విషాదం ప్రవివేశ తీవ్రమ్ ॥ 1

రాజకుమారుడైన శ్రీరాముడు భార్యయెడబాటువలన మిగుల శోకపీడితుడై, ఆమెనే స్మరించుచు మిక్కిలి పరితపించుచుండెను. అన్నపరిస్థితిని జూచి లక్ష్మణుడును విషాదమున మునింగెను. అంతట శ్రీరాముడు ఎంతయు ఆర్తిలో మఱల తీవ్రమైన విచారమునకు లోనయ్యెను. సీతావిరహముతో పరితపించుచున్న రాముడు దుఃఖితుడైయున్న లక్ష్మణునిజూచి, అత్యంతవిచారగ్రస్తుడై వేడినిట్టూర్పులు విడుచుచు, రోదించుచు, వచ్చిపడిన క్లేశమునకు అనువుగా ఇట్లనెను. (1-2)

స లక్ష్మణం శోకవశాభిపన్నం
శోకే నిమగ్నో విపులే తు రామః ।
ఉవాచ వాక్యం వ్యసనానురూపమ్
ఉష్ణం వినిశ్శ్వస్య రుదన్ సశోకమ్ ॥ 2

న మద్విధో దుష్కృతకర్మకారీ
మన్యే ద్వితీయోఽస్తి వసుంధరాయామ్ ।
శోకేన శోకో హి పరంపరాయా
మామేతి భిందన్ హృదయం మనశ్చ ॥ 3

'ఈ భూమండలమున నావంటి పాపాత్ముడు మఱియొకడు లేనేలేడు'-అని నేను తలంతును. అంతులేని శోకపరంపర నన్ను వెంటాడుచున్నది. అది నాహృదయమును ముక్కలు గావించుచున్నది. మనస్సును వికలమొనర్చుచున్నది. నేను పూర్వజన్మలో బుద్ధిపూర్వకముగా నిజముగనే పెక్కు పాపకర్మలను చేసియుందును. ఆ పాపములఫలితముగనే నేను ఒకదాని తరువాత మఱియొకటిగ దుఃఖములను అనుభవించుచున్నాను. ఓ లక్ష్మణా! మొదట రాజ్యాధికారము చేజారిపోయినది. బంధువులకు దూరమైతిని. తండ్రిని పోగొట్టుకొంటిని. తల్లియెడబాటునకు లోనైతిని. ఇవియన్నియును నాకు గుర్తునకువచ్చుచు నా శోకమును ఇనుమడింపజేయుచున్నవి.(3-5)

పూర్వం మయా నూనమభీప్సితాని
పాపాని కర్మాణ్యసకృత్ కృతాని ।
తత్రాయమద్యాపతితో విపాకో
దుఃఖేన దుఃఖం యదహం విశామి ॥ 4

రాజ్యప్రణాశః స్వజనైర్వియోగః
పితుర్వినాశో జననీవియోగః ।
సర్వాణి మే లక్ష్మణ! శోకవేగమ్
ఆపూరయంతి ప్రవిచింతితాని ॥ 5

ఓ సౌమిత్రీ! ఈ నిర్జనారణ్యమున క్లేశములను అనుభవించుచున్నను నాకు సీత తోడుగానుండుటవలన నాలోని దుఃఖము అడుగునబడియుండెను. కానిఇప్పుడు సీతావియోగమువలన సమిధలు చేరుటచే అగ్నిప్రదీప్తమైనట్లు ఆ దుఃఖము మఱల ప్రజ్వలించినది. (పెల్లుబికినది). ఉత్తమురాలైన నాసీత మిక్కిలి భయస్థురాలు. ఎవడేని ఒక రాక్షసుడు ఆమెను బలవంతముగా అపహరించి, ఆకాశమార్గమున తీసికొనిపోయియుండవచ్చును. సహజముగా మధురస్వరముగల ఆ జానకి అప్పుడు ఆ రాక్షసుని భయమునకు మిక్కిలి పీలపోయిన కంఠముతో ఏడ్చియుండవచ్చును. (6-7)

సర్వం తు దుఃఖం మమ లక్ష్మణేదం
శాంతం శరీరే వనమేత్య శూన్యమ్ ।
సీతావియోగాత్ పునరప్యుదీర్ణం
కాష్ఠైరివాగ్నిః సహసా ప్రదీప్తః ॥ 6

సా నూనమార్యా మమ రాక్షసేన
బలాద్ధృతా ఖం సముపేత్య భీరుః ।
అపస్వరం సస్వరవిప్రలాపా
భయేన విక్రందితవత్యభీక్ష్ణమ్ ॥ 7

తౌ లోహితస్య ప్రియదర్శనస్య
సదోచితావుత్తమచందనస్య ।
వృత్తౌ స్తనౌ శోణితపంకదిగ్ధౌ
నూనం ప్రియాయా మమ నాభిభాతః ॥ 8

'లోహితము' అను పేరుతో ప్రసిద్ధమై, చూచుటకింపైన శ్రేష్ఠమగు ఎఱ్ఱచందనపుపూతలకు సీతాదేవియొక్క సుందరమైన వక్షఃస్థలము అర్హమైనది. రాక్షసునితో పెనగులాడుటవలన అది రక్తసిక్తమై, సహజశోభను కోల్పోయియుండును. (8)

తత్ శ్లక్ష్ణసువ్యక్తమృదుప్రలాపం
తస్యా ముఖం కుంచితకేశభారమ్ ।
రక్షోవశం నూనముపాగతాయా
న భ్రాజతే రాహుముఖే యథేందుః ॥ 9

సీతాదేవిముఖమునుండి వెలువడెడి వచనములు మృదుమధురములై, ఆహ్లాదమును గొలుపుచుండును. ఆమెవదనము నల్లనిముంగురులతో దర్శనీయముగా ఉండును. రాక్షసవశమునన్నందున ఆ జానకి యొక్క అట్టి సుందరముఖము ప్రస్తుతము రాహుగ్రస్తమైన చంద్రబింబమువలె కళావిహీనమై యుండును. (9)

తాం హారపాశస్య సదోచితాయా
గ్రీవాం ప్రియాయా మమ సువ్రతాయాః ।
రక్షాంసి నూనం పరిపీతవంతి
విభిద్య శూన్యే రుధిరాశనాని ॥ 10

పరపురుషుని తాకుటకుసైతము ఇష్టపడని సౌశీల్యముగల నాధర్మపత్ని యొక్క కంఠము ఎల్లప్పుడును చక్కనిబంగారు ఆభరణములతో శోభిల్లుచుండును. ఇప్పుడు నిర్జనప్రదేశమున పచ్చినెత్తురుత్రాగెడి రాక్షసులు ఆమెకంఠమును నులిమి, రక్తమును త్రాగియుందురు. (10)

మయా విహీనా విజనే వనే యా
రక్షోభిరాహృత్య వికృష్యమాణా ।
నూనం వినాదం కురరీవ దీనా
సా ముక్తవత్యాయతకాంతనేత్రా ॥ 11

నాయెడబాటునకులోనై, ఈ నిర్జనవనమునందు ఒంటరిగానున్న ఆమెను రాక్షసులు అపహరించి, లాగికొని పోయియుందురు. అప్పుడామె క్రౌంచపక్షివలె దైన్యముతో బిగ్గఱగా కేకలుపెట్టుచు, తన విశాలనేత్రములతో ఱెప్పవాల్చక నాకై ఎదురుతెన్నులు చూచియుండును. (11)

అస్మిన్ మయా సార్ధముదారశీలా
శిలాతలే పూర్వముపోపవిష్టా ।
కాంతస్మితా లక్ష్మణ! జాతహాసా
త్వామాహ సీతా బహువాక్యజాతమ్ ॥ 12

ఓ లక్ష్మణా! ఉదారస్వభావముగల సీత ఇదివఱలో ఒకప్పుడు ఈ శిలాతలముపై నాతోగూడి కూర్చొనియుండెను. సహజముగా మనోహరముగా చిఱునవ్వు చిందించుచుండెడి ఆమె నవ్వుచు అప్పుడు నీతోగూడ ఎన్నో విషయములను ముచ్చటించినది గదా! (12)

గోదావరీయం సరితాం వరిష్ఠా
ప్రియాప్రియాయా మమ నిత్యకాలమ్ ।
అప్యత్ర గచ్ఛేదితి చింతయామి
నైకాకినీ యాతి హి సా కదాచిత్ ॥ 13

ఈ గోదావరి నదులలో మిగుల వాసికెక్కినది. నా ప్రియమైన సీత ఎల్లప్పుడును ఈ నదిని జూచి ముచ్చటపడుచుండెడిది. బహుశా ఇప్పుడు ఆమె నదికి వెళ్ళియుండునని తలంతును. కాని ఆమె ఎప్పుడును నదికి ఒంటరిగా వెళ్ళదు గదా! (13)

పద్మాననా పద్మవిశాలనేత్రా
పద్మాని వాఽఽనేతుమభిప్రయాతా ।
తదప్యయుక్తం న హి సా కదాచిత్
మయా వినా గచ్ఛతి పంకజాని ॥ 14

సీతాదేవిముఖము సర్వదా పద్మశోభలను వెదజల్లుచుండును. కమలములవలె విశాలమైన నేత్రములుగల ఆమె తామరపూలను గొనివచ్చుటకై సరస్సునకు వెళ్ళియుండవచ్చును. ఈ యూహయు సరికాదు. ఏలనన ఎప్పుడును నేను తోడుగా లేకుండా ఆమె కమలములను దెచ్చుటకై ఒంటరిగా వెళ్ళదు గదా! (14)

కామంత్విదం పుష్పితవృక్షషండం
నానావిధైః పక్షిగణైరుపేతమ్ ।
వనం ప్రయాతా ను తదప్యయుక్తమ్
ఏకాకినీ సాఽతిబిభేతి భీరుః । 15

ఆదిత్య! భో లోకకృతాకృతజ్ఞ!
లోకస్య సత్యానృతకర్మసాక్షిన్! ।
మమ ప్రియా సా క్వ గతా హృతా వా
శంసస్వ మే శోకవశస్య నిత్యమ్ । 16

లోకేషు సర్వేషు చ నాస్తి కించిత్
యత్తే న నిత్యం విదితం భవేత్తత్ ।
శంసస్వ వాయో! కులశాలినీం తాం
హృతా మృతా వా పథి వర్తతే వా । 17

ఇతీవ తం శోకవిధేయదేహం
రామం విసంజ్ఞం విలపంతమేవమ్ ।
ఉవాచ సౌమిత్రిరదీనసత్త్వో
న్యాయే స్థితః కాలయుతం చ వాక్యమ్ । 18

శోకం విముంచార్య! ధృతిం భజస్వ
సోత్సాహతా చాస్తు విమార్గణేఽస్యాః ।
ఉత్సాహవంతో హి నరా న లోకే
సీదంతి కర్మస్వతిదుష్కరేషు । 19

ఇతీవ సౌమిత్రిముదగ్రపౌరుషం
బ్రువంతమార్తో రఘువంశవర్ధనః ।
న చింతయామాస ధృతిం విముక్తవాన్
పునశ్చ దుఃఖం మహదభ్యుపాగమత్ । 20

వనమునందలి వృక్షములు అన్నియును విరబూసిన పూవులతో చూడముచ్చటగొల్పుచుండును. వాటిపైగల వివిధములైన పక్షులయొక్క కలరవములతో అవి వీనులవిందు గావించుచుండును. కావున ఆమె ఇప్పుడు ఆ వనమును జూచుటకై వెళ్ళినదో యేమో? కాని అట్లనుకొనుటయును సరిపోదు. ఏలనన భయస్వభావముగల ఆ సీత తానొక్కతెయే అచటికి పోవుటకు భీతిల్లును గదా!(15)

ఓ. భాస్కరా! నీవు కర్మసాక్షివి. లోకమున జరిగెడి మంచిచెడుకర్మలన్నియును నీకు తెలియుచుండును. లోకులు సర్వదా ఆచరించిన కర్మలను, ఆచరింపని కర్మలనుగూడ నీవు ఎఱుగుదువు. కనుక నా ప్రియమైన సీత ఎక్కడికి వెళ్ళినది? ఆమెను ఎవరు అపహరించిరి? ఆమెవిరహముచే శోకమగ్నుడనైయున్న నాకు తెలిపి పుణ్యమునటొమ్ము- (16)

ఓ వాయుదేవుడా! "సమస్తలోకములలో జరుగుచుండెడి సకలవిషయములును సర్వవ్యాపివైన నీకు తెలిసియే యుండును. ఉత్తమవంశమున బుట్టిన నా జానకి అసువులను వీడినదా? లేక ఆమెను ఎవ్వరైనను అపహరించినారా? లేక ఆశ్రమమునకు వచ్చుచు దారిలోనున్నదా? ఈ విషయములను నాకు స్పష్టముగా తెలుపుము-"(17)

ఇట్లు శోకపరవశుడై నిస్పృహతో విలపించుచున్న శ్రీరామునితో, ధర్మనిరతుడు, ధైర్యశాలి ఐన లక్ష్మణుడు సమయోచితముగా ఇట్లు వచించెను. (18)

"ఓ పూజ్యుడా! శోకమును వీడుము, ధైర్యమును వహింపుము. నిరాశపడక వదినెను ఉత్సాహముతో వెదకవలెను. లోకములో ఉత్సాహవంతులు ఎట్టి క్లిష్టకార్యములయందైనను క్రుంగిపోరు." (19)

మిక్కిలి పరాక్రమశాలియైన లక్ష్మణుడు ఇట్లు ఎంతగా ఓదార్చుచున్నను ఆర్తితోనున్న శ్రీరాముడు అతనిమాటలను చెవినిబెట్టలేదు. ధైర్యమును కోల్పోయియున్న ఆ రాఘవుడు మఱల అంతులేని దుఃఖములో కూరుకొనిపోయెను. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే త్రిషష్టితమస్సర్గః *(63)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదిమూడవసర్గము.

-- * * * --

64. అఱువదినాల్గవసర్గము

రామలక్ష్మణులు సీతాదేవికై అన్వేషించుట - శ్రీరాముడు శోకసంతప్తుడై, ఆ దేవిజాడ తెల్పుమనుచు పశుపక్ష్యాదులను, వృక్షములను, గోదావరిని అడుగుట - మృగములద్వారా సంకేతమును పొంది వారు దక్షిణదిశకు వెడలుట. సీతాదేవి ధరించిన పూలను, ఆభరణములను ఆమె పాదచిహ్నములను గుర్తించుట. భగ్నములైన కవచాది యుద్ధసాధనములు ఆయనకు కనబడుట - దేవతలు సీతాదేవిని తీసికొనివచ్చి తనకు అప్పగింపనిచో ముల్లోకములను భస్మము చేయుటకు శ్రీరాముడు సిద్ధపడుట -

స దీనో దీనయా వాచా లక్ష్మణం వాక్యమబ్రవీత్।
శీఘ్రం లక్ష్మణ! స జానీహి గత్వా గోదావరీం నదీమ్।
అపి గోదావరీం సీతా పద్మాన్యానయితుం గతా। 1

ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః పరవీరహా।
నదీం గోదావరీం రమ్యాం జగామ లఘువిక్రమః। 2

తాం లక్ష్మణస్తీర్థవతీం విచిత్వా రామమబ్రవీత్। 3

నైనాం పశ్యామి తీర్థేషు క్రోశతో న శృణోతి మే। 4

కం ను సా దేశమాపన్నా వైదేహీ క్లేశనాశినీ।
న హ్యహం వేద తం దేశం యత్ర సా జనకాత్మజా। 5

లక్ష్మణస్య వచః శ్రుత్వా దీనః సంతాపమోహితః।
రామః సమభిచక్రామ స్వయం గోదావరీం నదీమ్। 6

స తాముపస్థితో రామః క్వ సీతేత్యేవమబ్రవీత్। 7

భూతాని రాక్షసేంద్రేణ వధార్హేణ హృతామితి।
న తాం శశంసూ రామాయ తథా గోదావరీ నదీ। 8

తతః ప్రచోదితా భూతైః శంసాఽస్మత్ తాం ప్రియామితి।
నతు సాఽభ్యవదత్ సీతాం పృష్టా రామేణ శోచతా। 9

రావణస్య చ తద్రూపం కర్మాణి చ దురాత్మనః।
ధ్యాత్వా భయాత్ తు వైదేహీం సా నదీ న శశంస తామ్। 10

నిరాశస్తు తయా నద్యా సీతాయా దర్శనే కృతః।
ఉవాచ రామః సౌమిత్రిం సీతాఽదర్శనకర్శితః। 11

ఏషా గోదావరీ సౌమ్య! కించిన్న ప్రతిభాషతే।
కిన్ను లక్ష్మణ! వక్ష్యామి సమేత్య జనకం వచః।
మాతరం చైవ వైదేహ్యా వినా తామహమప్రియమ్। 12

దుఃఖితుడైయున్న ఆ రాముడు లక్ష్మణునితో "ఓ సోదరా! సీతాదేవి పద్మములను దీసికొని వచ్చుటకై గోదావరీ నదికి వెళ్లినదో యేమో? కనుక నీవు వెంటనే ఆ నదీతీరమునకు వెళ్ళి తెలిసికొనిరమ్ము" అని దైన్యముతో పలికెను. అంతట వేగముగా వెళ్లగలవాడు, శత్రుసంహార సమర్థుడు ఐన లక్ష్మణుడు రమ్యమైన గోదావరీనదియొద్దకు వెళ్లెను. చక్కనిరేవులు గల ఆ నదీతీరమునందంతటను వైదేహికొఱకు బాగుగా వెదకివచ్చి శ్రీరామునితో ఇట్లు నుడివెను. (1-3)

"అన్నా! నేనెంతగా గాలించినను అందెచ్చటనూ ఆమె కనబడలేదు. ఆమెకొఱకు బిగ్గఱగా కేకలువేసినను సమాధానము లేకుండెను. తనను దర్శించినవారిక్లేశములను రూపుమాపునట్టి ఆ వైదేహి ఎచ్చటికి వెళ్లినదోయేమో? ఆమెయున్న ప్రదేశమునుమాత్రము కనుగొనలేకపోయితిని".(4-5)

లక్ష్మణునిమాటలను విని, శ్రీరాముడు ఇంకను సంతాపముతో క్రుంగిపోయెను. (లక్ష్మణుని విచారణతో తృప్తిపడక) రాముడు తానే స్వయముగా గోదావరీనదీతీరమునకు వెళ్లెను. అతడు ఆమెకై అంతటను తిరుగుచు 'సీత ఎక్కడ? సీత ఎక్కడ?' - అని బిగ్గఱగా కేకలు పెట్టెను.(6-7)

వధార్హుడైన(దురాత్ముడైన) రావణుడు సీతాదేవిని అపహరించుకొనిపోయిన విషయమును అచటగల వివిధములగు ప్రాణులుగాని, గోదావరీనదిగాని తెలుపలేదు. 'శ్రీరామునకు ప్రియమైన సీతాదేవియొక్క జాడను తెలుపుము' అని అచటి ప్రాణులన్నియును ఎంత ప్రేరేపించినను, రాముడు శోకమగ్నుడై ఎంతగా ప్రార్థించినను గోదావరీనది మాత్రము ఆమెనుగూర్చి ఒక్కమాటయు పలుకలేదు. దుష్టబుద్ధియైన రావణునియొక్క భయంకర రూపమును, క్రూరకర్మలను తలంచుకొని, భయపడిన ఆ నది వైదేహినిగూర్చి ఏమియు పలుకలేదు. (8-10)

సీత కనబడక పోవుటచే కృశించియున్న రాముడు ఆమెజాడవిషయమున నది మౌనము వహించుటచే నిరాశకు లోనైనవాడై సౌమిత్రితో ఇట్లనెను. (11)

"సౌమ్యుడవైన ఓ లక్ష్మణా! జానకివిషయమున ఈ గోదావరి నది ప్రత్యుత్తరమిచ్చుటలేదు. (పెదవి విప్పుటయేలేదు.) సీత నాప్రక్కన లేకుండ (సీతయెడబాటునకు లోనై) ఒంటరిగా ఉన్న నేను ఆమెతల్లిదండ్రులకు ఈ అప్రియవార్తను ఏమని తెల్పుదు? (12)

యా మే రాజ్యవిహీనస్య వనే వన్యేన జీవతః।
సర్వం వ్యపనయేచ్ఛోకం వైదేహీ క్వను సా గతా। 13

జ్ఞాతిపక్షవిహీనస్య రాజపుత్రీమపశ్యతః।
మన్యే దీర్ఘా భవిష్యంతి రాత్రయో మమ జాగ్రతః। 14

మందాకినీం జనస్థానమ్ ఇమం ప్రస్రవణం గిరిమ్।
సర్వాణ్యనుచరిష్యామి యది సీతా హి దృశ్యతే। 15

ఏతే మృగా మహావీర్యా మామీక్షంతే ముహుర్ముహుః।
వక్తుకామా ఇవ హి మే ఇంగితాన్యుపలక్షయే। 16

తాంస్తు దృష్ట్వా నరవ్యాఘ్రో రాఘవః ప్రత్యువాచ హ।
క్వ సీతేతి నిరీక్షన్ వై బాష్పసంరుద్ధయా దృశా। 17

ఏవముక్తా నరేంద్రేణ తే మృగాః సహసోత్థితాః।
దక్షిణాభిముఖాః సర్వే దర్శయంతో నభఃస్థలమ్। 18

మైథిలీ హ్రియమాణా సా దిశం యామ్ అన్వపద్యత।
తేన మార్గేణ ధావంతో నిరీక్షంతే నరాధిపమ్। 19

యేన మార్గం చ భూమిం చ నిరీక్షంతే స్మ తే మృగాః।
పునశ్చ మార్గమిచ్ఛంతి లక్ష్మణేనోపలక్షితాః। 20

తేషాం వచనసర్వస్వం లక్షయామాస చేంగితమ్।
ఉవాచ లక్ష్మణో జ్యేష్ఠం ధీమాన్ భ్రాతరమార్తవత్। 21

క్వ సీతేతి త్వయా పృష్టా యథేమే సహసోత్థితాః।
దర్శయంతి క్షితిం చైవ దక్షిణాం చ దిశం మృగాః। 22

సాధు గచ్ఛావహే దేవ! దిశమేతాం హి నైర్ఋతీమ్।
యది స్యాదాగమః కశ్చిత్ ఆర్యా వా సాఽథ లక్ష్యతే। 23

బాఢమిత్యేవ కాకుత్స్థః ప్రస్థితో దక్షిణాం దిశమ్।
లక్ష్మణానుగతః శ్రీమాన్ వీక్షమాణో వసుంధరామ్। 24

ఏవం సంభాషమాణౌ తౌ అన్యోన్యం భ్రాతరావుభౌ।
వసుంధరాయాం పతితం పుష్పమార్గమపశ్యతామ్। 25

తాం పుష్పవృష్టిం పతితాం దృష్ట్వా రామో మహీతలే।
ఉవాచ లక్ష్మణం వీరో దుఃఖితో దుఃఖితం వచః। 26

రాజ్యవిహీనుడనై, వనములలో కందమూలఫలములను తినుచు జీవించుచుండెడి నన్ను సీత అను సాహచర్యముచే ఆ క్లేశములను మఱచిపోవునట్లు చేయుచుండెడిది. ఆ సాధ్వి ఇప్పుడు ఎక్కడ ఉన్నట్లు? బంధుమిత్రులకు దూరమై భార్యావిరహమునకు లోనైన నాకు నిద్ర పట్టకుండుటచే రాత్రులు దీర్ఘములై కన్పట్టుచున్నవి.(13-14)

మందాకినీనదీతీరములయందును, ఈ దండకారణ్యముల యందును, ప్రస్రవణగిరిపైనను (అన్ని ప్రదేశములయందును) పదేపదే గాలించెదను. బహుశా సీత అక్కడ కనబడవచ్చును.(15)

బలిష్ఠములైయున్న ఈ మృగములన్నియును మాటిమాటికిని నావైపే చూచుచున్నవి. దీనినిబట్టిచూడగా అవి నాకు సీతజాడను తెలుపదలచియున్నట్లు అనిపించుచున్నది." (16)

పిమ్మట పురుషశ్రేష్ఠుడైన రాఘవుడు ఆ మృగములను చూచి, 'సీత ఎక్కడ?' అనియడిగెను. కన్నీరు గార్చుచు మసకబాఱిన దృష్టితో తమవైపే చూచుచు శ్రీరాముడు అట్లడుగగా, ఆ మృగములన్నియును వెంటనే లేచి దక్షిణదిశకు మఱలి, ఆకాశమువైపు చూడసాగెను. (17-18)

అపహరణకు గుఱియైన సీతాదేవి వెళ్ళిన దిశను అనుసరించి ఆ మార్గమున పఱుగెత్తుచు ఆ మృగములు పదేపదే వెనుకకు మఱలి, శ్రీరామునివైపే చూచుచుండెను. (19)

ఆ మృగములు దక్షిణదిశగా ఆకాశమార్గమును చూచుచు, ఆమార్గమున ముందునకు సాగుచుండెను. దానినిబట్టి అవి సీత వెళ్ళిన మార్గమును తమకు చూపుచున్నట్లు లక్ష్మణుడు గ్రహించెను. అవి చెప్పదలచు కొనిన విషయసారాంశమును ప్రజ్ఞాశాలియైన లక్ష్మణుడు గుర్తించి ఆర్తుడై అన్నతో ఇట్లు నుడివెను. (20-21)

"ఓ పూజ్యుడా! 'సీతయెక్కడ?' అని నీవు అడుగగనే ఈ మృగములన్నియును వెంటనే లేచి దక్షిణదిశగా మార్గమును సూచించుచున్నవి. కనుక అన్నా! మనము రాక్షసులకు ఆలవాలమైన నైరుతిదిశగా వెళ్ళుదము. అట్లు వెళ్ళినచో ఒకవేళ సీతాదేవి కనబడవచ్చును. లేదా ఆమెను కనుగొను ఉపాయమైనను దొరకవచ్చును". (22-23)

'సరే!' - అని తనఆమోదమును దెలుపుచు శుభలక్షణ సంపన్నుడైన శ్రీరాముడు, లక్ష్మణుడు వెంట వచ్చుచుండగా భూతలమును పరికించిచూచుచు దక్షిణదిశగా బయలుదేఱెను. ఆ అన్నదమ్ములు ఇరువురును పరస్పరము ఇట్లు మాట్లాడుకొనుచు వెళ్ళుచుండగా భూమిపై దారిలో వరుసగా పడియున్న పూవులను జూచిరి. (24-25)

చిన్న ఆధారము దొరికినను దానిపోగూర్చి పూర్తిగా పసిగట్టగలిగిన రాముడు భూమిపై పడియున్న ఆ పుష్పపరంపరను జూచి, దుఃఖితుడై, లక్ష్మణునితో ఇట్లు దైన్యవచనములను పలికెను. (26)

అభిజానామి పుష్పాణి తానీమానీహ లక్ష్మణ!।
పినద్ధానీహ వైదేహ్యా మయా దత్తాని కాననే। 27

మన్యే సూర్యశ్చ వాయుశ్చ మేదినీ చ యశస్వినీ।
అభిరక్షంతి పుష్పాణి ప్రకుర్వంతో మమ ప్రియమ్। 28

ఏవముక్త్వా మహాబాహుం లక్ష్మణం పురుషర్షభః।
ఉవాచ రామో ధర్మాత్మా గిరిం ప్రస్రవణాకులమ్। 29

కచ్చిత్ క్షితిభృతాం నాథ! దృష్టా సర్వాంగసుందరీ!।
రామా రమ్యే వనోద్దేశే మయా విరహితా త్వయా। 30

క్రుద్ధోఽబ్రవీద్గిరిం తత్ర సింహః క్షుద్రమృగం యథా। 31

తాం హేమవర్ణాం హేమాభాం సీతాం దర్శయ పర్వత!।
యావత్ సానూని సర్వాణి న తే విధ్వంసయామ్యహమ్। 32

ఏవముక్తస్తు రామేణ పర్వతో మైథిలీం ప్రతి।
శంసన్నివ తతః సీతాం నాఽదర్శయత రాఘవే। 33

తతో దాశరథీ రామ ఉవాచ చ శిలోచ్చయమ్। 34

మమ బాణాగ్నినిర్దగ్ధో భస్మీభూతో భవిష్యసి।
అసేవ్యః సంతతంచైవ నిస్తృణద్రుమపల్లవః। 35

ఇమాం వా సరితం చాద్య శోషయిష్యామి లక్ష్మణ!।
యది నాఖ్యాతి మే సీతామ్ ఆర్యాం చంద్రనిభాననామ్।
ఏవం స రుషితో రామో దిధక్షన్నివ చక్షుషా। 36

దదర్శ భూమౌ నిష్క్రాంతం రాక్షసస్య పదం మహత్। 37

త్రస్తాయా రామకాంక్షిణ్యాః ప్రధావంత్యా ఇతస్తతః।
రాక్షసేనానువృత్తాయా మైథిల్యాశ్చ పదాన్యథ। 38

"ఓ సౌమిత్రీ! నేలపై బడియున్న ఈ పుష్పములను నేను చక్కగా గుర్తించుచున్నాను. ఇవి సీతాదేవి తనకురులపై ధరించినవే. అంతేగాదు వాటిని తెచ్చిపెట్టినదిగూడా నేనే. నాకు ప్రీతిని గూర్చుటకై సూర్యుడు వీటిని వాడిపోనీయలేదు. వాయువు ఎగురగొట్టలేదు. భూదేవి ఆదరముతో భరించుచున్నది. వారు రక్షించుచుండుటవలననే కాబోలు ఇప్పటికిని ఇవి బాగుగా శోభిల్లుచునే యున్నవి."(27-28)

పురుషోత్తముడైన శ్రీరాముడు మిక్కిలి భుజబలశాలియైన లక్ష్మణునితో ఇట్లు పలికిన పిమ్మట, ఆ ధర్మాత్ముడు చక్కని సెలయేళ్ళతో ఒప్పుచుండెడి ప్రస్రవణగిరిని ఉద్దేశించి ఇట్లు నుడివెను. (29)

'ఓ పర్వతరాజమా! నా భార్యయైన సీతాదేవి ఈ రమ్యమైన వనమునందు నా యెడబాటునకు గురియైనది. ఆ సర్వాంగసుందరిని నీవు చూచితివా? (30)

మృగరాజు అల్పప్రాణిపై కోపించినట్లు ఆ రాముడు మిగుల క్రుద్ధుడై "ఓ గిరివరా! నేను నీ శిఖరములను ధ్వంసము చేయకముందే బంగారు వన్నెతో కలకలలాడు చుండెడి ఆ సీతాదేవిని నాకు చూపుము". (31-32)

సీతావిరహబాధలో క్రుద్ధుడై రాముడు ఇట్లు పలికిన పిమ్మట ఆ ప్రస్రవణగిరి రామునకు సీతను గూర్చిన సమాచారమును తెలుపుచున్నదా? అనునట్లు ప్రతిధ్వనించెను. కాని ఆమెను మాత్రము చూపలేదు. (33)

అనంతరము దశరథునికుమారుడైన శ్రీరాముడు ఆ పర్వతముతో ఈ విధముగా వచించెను. "ఓ శైలమా! సీతజాడ నాకు తెలుపనిచో నీవు నా బాణాగ్నిజ్వాలలో మలమలమాడి మసియైపోవుదువు. నీపై (ఈ కొండపై) శోభిల్లుచున్న గడ్డిపరకలు, చెట్లుచేమలు సర్వనాశనము కాగలవు. అప్పుడిచట సంచరించువాడే యుండడు. (జీవించు ప్రాణియే మిగులదు-)" (34-35)

"ఓ లక్ష్మణా! "సాధ్వియు, చంద్రవదనయు అగు సీతాదేవియొక్క సమాచారమును ఈ నదియైనను తెలుపనిచో దీనిని శుష్కింపజేసెదను." అని పలుకుచు క్రుద్ధుడైన శ్రీరాముడు తనతీక్ష్ణములైన చూపులతో నదిని భస్మమొనర్చుచున్నాడా? యనునట్లు ఒప్పుచుండెను. (36)

ఇంతలో శ్రీరాముడు పర్వతమునకును నదికిని సమీపముననగల నేలపై ఒక రాక్షసుని యొక్క పెద్ద పెద్ద పాదములగుర్తులను చూచెను. రాక్షసుడు (రావణుడు) వెంబడింపగా భయపడుచు రక్షణకొఱకై శ్రీరాముని ఆశ్రయింపగోరి ఇటు నటు పరుగిడిన సీతాదేవి యొక్క పాదముద్రలుగూడ ఆయనకు కనబడెను. (37-38)

స సమీక్ష్య పరిక్రాంతం సీతాయా రాక్షసస్య చ।
భగ్నం ధనుశ్చ తూణీ చ వికీర్ణం బహుధా రథమ్।
సంభ్రాంతహృదయో రామః శశంస భ్రాతరం ప్రియమ్। 39

పశ్య లక్ష్మణ! వైదేహ్యాః శీర్ణాః కనకబిందవః।
భూషణానాం హి సౌమిత్రే! మాల్యాని వివిధాని చ। 40

తప్తబిందునికాశైశ్చ చిత్రైః క్షతజబిందుభిః।
ఆవృతం పశ్య సౌమిత్రే! సర్వతో ధరణీతలమ్। 41

మన్యే లక్ష్మణ! వైదేహీ రాక్షసైః కామరూపిభిః।
భిత్త్వా భిత్త్వా విభక్తా వా భక్షితా వా భవిష్యతి। 42

తస్యా నిమిత్తం వైదేహ్యా ద్వయోర్వివదమానయోః।
బభూవ యుద్ధం సౌమిత్రే! ఘోరం రాక్షసయోరిహ। 43

ముక్తామణిమయం చేదం తపనీయవిభూషితమ్।
ధరణ్యాం పతితం సౌమ్య! కస్య భగ్నం మహద్ధనుః। 44

తరుణాదిత్యసంకాశం వైడూర్యగులికాచితమ్।
విశీర్ణం పతితం భూమౌ కవచం కస్య కాంచనమ్। 45

ఛత్రం శతశలాకం చ దివ్యమాల్యోపశోభితమ్।
భగ్నదండమిదం కస్య భూమౌ సమ్యఙ్నిపాతితమ్। 46

కాంచనోరశ్ఛదాశ్చేమే పిశాచవదనాః ఖరాః।
భీమరూపా మహాకాయాః కస్య వా నిహతా రణే। 47

దీప్తపావకసంకాశో ద్యుతిమాన్ సమరధ్వజః।
అపవిద్ధశ్చ భగ్నశ్చ కస్య సాంగ్రామికో రథః। 48

రథాక్షమాత్రా విశిఖాః తపనీయవిభూషణాః।
కస్యేమేఽభిహతా బాణాః ప్రకీర్ణా ఘోరకర్మణః। 49

శరావరౌ శరైః పూర్ణౌ విధ్వస్తౌ పశ్య లక్ష్మణ!।
ప్రతోదాభీశుహస్తో వై కస్యాయం సారథిర్హతః। 50

కస్యేమౌ పురుషవ్యాఘ్ర! శయాతే నిహతౌ యుధి।
చామరగ్రాహిణౌ సౌమ్య! సోష్ణీషమణికుండలౌ। 51

శ్రీరాముడు సీతాదేవిపాదచిహ్నములను, రాక్షసునికాలిగుర్తులను పరికించి చూచుచు ముందునకు వెళ్లుచుండగా ఆయనకు ముక్కలు ముక్కలై పడియున్న ధనుస్సు, అమ్ముల పొదులును, అంతటను ఛిన్నాభిన్నములై పడియున్న రథశకలములును కన్పట్టెను. అప్పుడు రాముడు దిగ్భ్రాంతికి గురియై తన అనుంగుతమ్మునితో ఇట్లు పలికెను. (39)

"ఓ సౌమిత్రీ! సీతాదేవియొక్క బంగారు ఆభరణముల ముక్కలు, వివిధములగు హారములు ఇచట పడియున్నవి. చూడుము. ఈ ప్రదేశమునందంతటను కాచబడిన బంగారుముక్కలవంటి ఈ నెత్తురుబొట్లు చిత్రముగా వ్యాపించియున్నవి. గమనింపుము. (40-41)

ఓ లక్ష్మణా! కామరూపులైన రాక్షసులు వైదేహిని ముక్కలుగా చేసియుండవచ్చును. లేదా భక్షించియుండవచ్చును. సీతాదేవి కొఱకై పరస్పరము కలహించుకొని, ఇద్దరు రాక్షసులు ఘోరయుద్ధమునకు తలపడినట్లు కనిపించుచున్నది. (42-43)

ముత్యములను, మణులను పొదిగి, మేలిమి బంగారముతో నిర్మితమైన ఒక మహాధనుస్సు విరిగి నేలపాలైయున్నది. ఇది యెవరిదై యుండును? ఇచట ఒక బంగారు కవచము ముక్కలు ముక్కలై నేలపై బడియున్నది. ఇది వైడూర్యమణులచే పొదుగబడి మధ్యాహ్నసూర్యునివలె మిలుమిట్లు గొల్పుచున్నది. ఇంతకును ఇది ఎవరిది? దివ్యములైన మాలలతో అలంకృతమై, నూఱుచువ్వలు గల ఒక ఛత్రము నేలపై ఇచటబడియున్నది. ఈ గొడుగు కఱ్ఱగూడ విరిగియున్నది. ఇది ఎవరిదో గదా? బంగారు కవచములను పిశాచముఖములను కలిగియున్న ఈగుఱ్ఱములు రణరంగమున నేలకొఱగియున్నవి. భీకరములైన మహాకాయములు గల ఈ రథాశ్వములు ఎవరివై యుండును? (44-47)

మండుచున్న అగ్నిజ్వాలలవలె కాంతులను వెదజిమ్ముచు, సమరధ్వజముతో ఒప్పుచున్న ఒక యుద్ధరథము విఱిగిపడియున్నది. ఇది యెవ్వరిదో సుమా! బంగారపు తొడుగు గలిగి, రథముయొక్క ఇరుసుప్రమాణముతో ఒప్పుచు పదునుదేలియున్న ఈ బాణములు ముక్కలు ముక్కలై, అంతటను చెల్లా చెదరుగా పడియున్నవి. ఇవి ఎవరివై యుండును? ఓ లక్ష్మణా! ఇటు చూడుము. ఇచట బాణములతో నిండిన రెండు అమ్ములపొదులు భగ్నములై పడియున్నవి. అచట చేతిలో కొరడా (చెర్నకోల) పట్టుకొనిన ఒక రథసారథి హతుడై పడియున్నాడు. ఈ తూణీరములు ఎవ్వరివి? ఆ సారథి యెవ్వరివాడు? (48-50)

ఓ నరశ్రేష్ఠుడా! లక్ష్మణా! తలపాగాలను, మణికుండలములను ధరించియున్న ఇద్దరు చామరగ్రాహకులు రణరంగమున చచ్చి పడియున్నారు. వీరు ఎవరికి చెందియుందురు?(51)

పదవీ పురుషస్యైషా వ్యక్తం కస్యాపి రక్షసః।
వైరం శతగుణం పశ్య మమేదం జీవితాంతకమ్। 52

సుఘోరహృదయైః సౌమ్య! రాక్షసైః కామరూపిభిః।
హృతా మృతా వా సీతా సా భక్షితా వా తపస్వినీ। 53

న ధర్మస్త్రాయతే సీతాం హ్రియమాణాం మహావనే। 54

భక్షితాయాం హి వైదేహ్యాం హృతాయామపి లక్ష్మణ!।
కే హి లోకేఽప్రియం కర్తుం శక్తాః సౌమ్య! మమేశ్వరాః। 55

కర్తారమపి లోకానాం శూరం కరుణవేదినమ్।
అజ్ఞానాదవమన్యేరన్ సర్వభూతాని లక్ష్మణ!। 56

మృదుం లోకహితే యుక్తం దాంతం కరుణవేదినమ్।
నిర్వీర్య ఇతి మన్యంతే నూనం మాం త్రిదశేశ్వరాః। 57

మాం ప్రాప్య హి గుణో దోషః సంవృత్తః పశ్య లక్ష్మణ!।
అద్యైవ సర్వభూతానాం రక్షసామభవాయ చ। 58

సంహృత్యైవ శశిజ్యోత్స్నాం మహాన్ సూర్య ఇవోదితః।
సంహృత్యైవ గుణాన్ సర్వాన్ మమ తేజః ప్రకాశతే। 59

నైవ యక్షా న గంధర్వా న పిశాచా న రాక్షసాః।
కిన్నరా వా మనుష్యా వా సుఖం ప్రాప్స్యంతి లక్ష్మణ। 60

మమాస్త్రబాణసంపూర్ణమ్ ఆకాశం పశ్య లక్ష్మణ!।
నిస్సంపాతం కరిష్యామి హ్యద్య త్రైలోక్యచారిణామ్। 61

ఈ దారిలో కనబడుచున్న కాలిగుర్తులు ఒక రాక్షసునివే. ఇందు సందేహము లేదు. ఈ సంఘటనతో రాక్షసులపై నాకుగల వైరము నూఱు రెట్లు పెరిగినది. వారినిక ప్రాణములతో విడను. (52)

కామరూపులై కఠినాత్ములగు ఆ రాక్షసులు ఆ సీతాసాధ్విని అపహరించుట గాని, చంపుటగాని, భక్షించుట గాని చేసి యుందురు. మహారణ్యమునందు అపహరణకు గుఱియై, రాక్షసులచే తీసికొనిపోబడు చున్న సీతాదేవిని ఏ ధర్మాత్ముడును[1] రక్షింపలేదు. (ఇంతటి ఆపద వచ్చిపడినప్పుడును ఎవ్వరును రక్షింపకుండుట అధర్మము- అని శ్రీరాముడు కుపితుడాయెను.) (53-54)

ఓ లక్ష్మణా! సీతాదేవి అపహరింపబడుటయో? లేక భక్షింపబడుటయో జరిగియుండును. ఈ సమయములో మనలను ఆదుకొనగల్గిన మహాత్ములెవరు? (ఈ సమయమున నాకు ఇట్టి అప్రియమును కూర్చగల్గిన ఆ మొనగాడు ఎవడు?) సర్వేశ్వరుడు సమస్తలోకములను సృష్టించి, పాలించి, లయ మొనర్పగల సమర్థుడేయైనను ఆ దయాళువు కొన్ని సందర్భములలో ఆపన్నులయెడ మౌనము వహించును. అప్పుడు లోకులు తమయాపదలు స్వయంకృతాపరాధఫలితములని యెఱుంగక అజ్ఞానముచే ఆ సర్వేశ్వరునిగూర్చి చులకనగా మాట్లాడుదురు. (55-56)

నేను లోకహితమునకై పాటుపడువాడను. మృదుస్వభావము గలవాడను, జితేంద్రియుడను, జీవులయెడ కృపజూపువాడను. గర్వితులైన ఇంద్రాదిదేవతలు నామృదుస్వభావమును బలహీనతగా భావించుచున్నారు. అందువలననే వారు సీతను రక్షింపలేదు. (57)

ఓ లక్ష్మణా! కారుణ్యాదిగుణములు నన్నుజేరి దోషములుగా భావింపబడుచున్నవి. కావున నన్ను అసమర్థునిగా భావించి, దుర్మార్గులు నాభార్యను అపహరించిరి. ఈ క్షణముననే రాక్షసులను, వారికి తోడ్పడువారిని సర్వనాశనము చేసెదను. చంద్రకాంతులను (వెన్నెలను) నిస్తేజమొనర్చి, ఉదయించుచున్న సూర్యుడు తన ప్రచండతేజమును ప్రకటించునట్లు నాలోని దయాదిగుణములను ప్రక్కనబెట్టి, నేడే నా శౌర్యపరాక్రమములను చూపెదను గాక. ఇక నేను విజృంభించినచో యక్షులకును, గంధర్వులకును పిశాచములకును, రాక్షసులకును, కిన్నరులకును, మనుష్యులు మున్నగువారికిని ప్రశాంతియే కఱవగును- చూడుము. లక్ష్మణా! నా బ్రహ్మాస్త్రాది బాణపరంపరచే ఆకాశమునంతయును

1) ధర్మః = ధర్మాత్ముడు. ఆపదలలో ఆదుకొనువాడు. ఆపత్సు రక్షకో ధర్మః = ఆపదలలో రక్షించువాడు ధర్మాత్ముడు.

సన్నిరుద్ధగ్రహగణమ్ ఆవారితనిశాకరమ్।
విప్రణష్టానలమరుద్భాస్కరద్యుతిసంవృతమ్ ॥ 62

వినిర్మథితశైలాగ్రం శుష్యమాణజలాశయమ్।
ధ్వస్తద్రుమలతాగుల్మం విప్రణాశితసాగరమ్।
త్రైలోక్యం తు కరిష్యామి సంయుక్తం కాలకర్మణా॥ 63

న తాం కుశలినీం సీతాం ప్రదాస్యంతి మమేశ్వరాః।
అస్మిన్ ముహూర్తే సౌమిత్రే! మమ ద్రక్ష్యంతి విక్రమమ్॥ 64

నాఽఽకాశముత్పతిష్యంతి సర్వభూతాని లక్ష్మణ!।
మమ చాపగుణోన్ముక్తై: బాణజాలైర్నిరంతరమ్॥ 65

అర్దితం మమ నారాచైః ధ్వస్తభ్రాంతమృగద్విజమ్।
సమాకులమ్ అమర్యాదం జగత్పశ్యాద్య లక్ష్మణ!॥ 66

ఆకర్ణపూర్ణైరిషుభిః జీవలోకం దురావరైః।
కరిష్యే మైథిలీహేతోః అపిశాచమ్ అరాక్షసమ్॥ 67

మమ రోషప్రయుక్తానాం సాయకానాం బలం సురాః।
ద్రక్ష్యంత్యద్య విముక్తానామ్ అతిదూరాతిగామినామ్॥ 68

నైవ దేవా న దైతేయా న పిశాచా న రాక్షసాః।
భవిష్యంతి మమ క్రోధాత్ త్రైలోక్యే విప్రణాశితే॥ 69

దేవదానవయక్షాణాం లోకా యే రక్షసామపి।
బహుధా న భవిష్యంతి బాణౌఘైః శకలీకృతాః॥ 70

నిర్మర్యాదాన్ ఇమాన్ లోకాన్ కరిష్యామ్యద్య సాయకైః।
హృతాం మృతాం వా సౌమిత్రే! న దాస్యంతి మమేశ్వరాః॥ 71

తథారూపాం హి వైదేహీం న దాస్యంతి యది ప్రియామ్।
నాశయామి జగత్సర్వం త్రైలోక్యం సచరాచరమ్॥ 72

ఇత్యుక్త్వా రోషతామ్రాక్షో రామో నిష్పీడ్య కార్ముకమ్।
శరమాదాయ సందీప్తం ఘోరమాశీవిషోపమమ్॥ 73

ఈ క్షణముననే కప్పివేసి, ముల్లోకములలో సంచరించెడి వారినందరిని ఎక్కడను కాలుమోపలేనివారినిగా జేసెదను. అంతేగాదు. నా ప్రభావముతో అగ్నిజ్వాలలు చల్లబడును, వాయువేగము ఆగిపోవును, సూర్యకాంతులు వెలవెలబోవును, పర్వతశిఖరములు నుగ్గునుగ్గగును, జలాశయములన్నియును ఎండిపోవును. వృక్షములు, లతలు, పొదలు ఛిన్నాభిన్నమగును. సముద్రజలములు ఇంకిపోవును. ఇంతయేల? ముల్లోకములయందును ప్రళయస్థితినే కలిగింతును. (58-63)

ఓ సౌమిత్రీ! దేవతలందఱును గూడి, సీతాదేవిని భద్రముగా నాకు ఇప్పుడే అప్పగింపకున్నచో ఒక్క క్షణములో వారు నా పరాక్రమమును చవిచూడగలరు. అంతేగాదు నేను నా ధనుస్సును ఎక్కుపెట్టి నారి సారించి, బాణములతో ఆకాశమును పూర్తిగా కప్పివేసినచో ఏ ప్రాణియు అచటికి ఎగురజాలదు. (64-65)

ఓ సౌమిత్రీ! నా శరప్రయోగములతో సమస్తజగత్తును కల్లోలపఱచెదను. చూడుము. ఆ స్థితిలో పక్షులు, మృగములు మొదలగు ప్రాణులన్నియును మృతిచెందును. లేక చెల్లాచెదరగును. ప్రకృతియంతయును అస్తవ్యస్తమగును. (66)

నేను ఆకర్ణాంతములాగి ప్రయోగించిన బాణములను ఎవ్వరును అడ్డుకొనజాలరు. అట్టి నా శరములద్వారా సీతానిమిత్తమై ఈ లోకమునగల పిశాచములను, రాక్షసులను పూర్తిగా నిర్మూలించెదను. (67)

నా బాణములు దిగంతములవఱకును నిరాఘాటముగా రివ్వున సాగిపోగలవు. రోషావేశముతో నేను ప్రయోగించెడి ఆ శరముల పటుత్వమును దేవతలెల్లరును రుచిచూడగలరు. (68)

నా క్రోధప్రభావమునకు ముల్లోకములును నశించినప్పుడు దేవతలును, దైత్యులును, పిశాచములును, రాక్షసులును మిగులరు. దేవ,దానవ, యక్ష, రాక్షసులలోకములన్నియును నా బాణపరంపరధాటికి పెక్కురీతులుగా ముక్కలు ముక్కలై తీరును. (69-70)

ఓ సౌమిత్రీ! నా ప్రేమపెన్నిధియైన సీత అపహరణకు గురియైనను, మృత్యువుపాలైనను ఆమెను దేవతలు సురక్షితముగా నాకు అప్పగింపనిచో నా బాణపరంపరకు గురిచేసి ఈ లోకములను అన్నింటిని అస్తవ్యస్తమొనర్చెదను. సీతాదేవి భద్రముగా(క్షేమముగా) నన్ను జేరనిచో ఈ సమస్తచరాచరజగత్తును రూపుమాపెదను." (71-72)

లక్ష్మణునితో ఇట్లు పలికిన పిమ్మట శ్రీరాముడు రోషముతో కన్నులెఱ్ఱజేసినవాడై, ధనుస్సును గట్టిగా పిడికిలితో పట్టుకొని, విషసర్పమువలె భయంకరమై, పదునుదేలి మెఱయుచున్న బాణమును చేతబట్టెను.

సంధాయ ధనుషి శ్రీమాన్ రామః పరపురంజయః।
యుగాంతాగ్నిరివ క్రుద్ధ ఇదం వచనమబ్రవీత్। 74

పిమ్మట శత్రుపురములను (శత్రువులను) ఛేదించువాడును, అజేయుడును ఐన శ్రీరాముడు బాణమునెక్కుపెట్టి, ప్రళయకాలాగ్నివలె క్రుద్ధుడై ఇట్లు నుడివెను. (73-74)

యథా జరా యథా మృత్యుః యథా కాలో యథా విధిః।
నిత్యం న ప్రతిహన్యంతే సర్వభూతేషు లక్ష్మణ!।
తథాఽహం క్రోధసంయుక్తో న నివార్యోఽస్మి సర్వథా। 75

సమస్తప్రాణులను ఎల్లప్పుడును ముసలితనము, మృత్యువు, కాలము, విధి కబళించుచునేయుండును. వాటిని ఎవ్వరును నివారింపజాలరు. అట్లే నేను క్రుద్ధుడనైనచో నన్ను ఎవ్వరును, ఏవిధముగను ఆపజాలరు. (75)

పురేవ మే చారుదతీమ్ అనిందితాం
దిశంతి సీతాం యది నాఽద్య మైథిలీమ్।
సదేవగంధర్వమనుష్యపన్నగం
జగత్ సశైలం పరివర్తయామ్యహమ్ । 76

పూర్వము (నేను మాయామృగమువెంట వెళ్ళకముందు) మిథిలానగరరాజకుమారియు, సాధ్వీమణియు ఐన సీతాదేవి చక్కని పలువరుసతో దర్శనీయముగా ఉండెడిది. ఇప్పుడు అట్టి వైదేహిని నాకు అప్పగింపనిచో దేవతలతో, గంధర్వులతో, మానవులతో, నాగులతో, పర్వతములతో విలసిల్లుచుండెడి సమస్తజగత్తును సర్వనాశనము చేయుదును. (76)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే చతుష్షష్టితమస్సర్గః *(64)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అరువదినాల్గవసర్గము.

-- ❋ ❋ ❋ --

65. అఱువదిఐదవసర్గము

శ్రీరాముడు లోకములను ధ్వంసము చేయుటకు సిద్ధపడగా లక్ష్మణుడు మృదువచనములతో ఆయనను శాంతపఱచుట-

తప్యమానం తథా రామం సీతాహరణకర్శితమ్।
లోకానామ్ అభవే యుక్తం సాంవర్తకమివానలమ్। 1

వీక్షమాణం ధనుః సజ్యం నిఃశ్వసంతం పునః పునః।
దగ్ధుకామం జగత్సర్వం యుగాంతే చ యథా హరమ్। 2

అదృష్టపూర్వం సంక్రుద్ధం దృష్ట్వా రామం తు లక్ష్మణః।
అబ్రవీత్ ప్రాంజలిర్వాక్యం ముఖేన పరిశుష్యతా। 3

సీతాదేవియెడబాటువలన కృశించియున్న శ్రీరాముడు మిగుల పరితపించుచుండెను. ప్రళయకాలాగ్నివలె లోకములను ధ్వంసమొనర్చుటకు సన్నద్ధుడైయుండెను. ఎక్కుపెట్టిన ధనుస్సును చూచుచు పదేపదే నిట్టూర్చుచుండెను. ప్రళయకాలరుద్రునివలె సమస్తజగత్తును దగ్ధమొనర్చబూని యుండెను. ఇంతగా క్రుద్ధుడైయున్న రామునిస్వరూపమును లక్ష్మణుడు ఇదివఱలో చూచియెఱుగడు. అంతట ఆ సౌమిత్రి వాడిపోయిన ముఖముతో తనఅన్నను జూచి, బద్ధాంజలియై ఇట్లు నుడివెను. (1-3)

పురా భూత్వా మృదుర్దాంతః సర్వభూతహితే రతః।
న క్రోధవశమాపన్నః ప్రకృతిం హాతుమర్హసి। 4

"ఓ అన్నా! నీవు వాస్తవముగా మృదుస్వభావము గలవాడవు. జితేంద్రియుడవు. ఇంతవఱకును సకలప్రాణులకును హితమొనర్చుచుండెడివాడవు. ఇట్లు నీవు క్రోధవశుడవై ప్రకృతిని ధ్వంసమొనర్చబూనుట తగదు. (4)

చంద్రే లక్ష్మీః ప్రభా సూర్యే గతిర్వాయౌ భువి క్షమా।
ఏతచ్చ నియతం సర్వం త్వయి చానుత్తమం యశః। 5

చంద్రునిలో ప్రసన్నత, సూర్యునిలో దివ్యకాంతి, వాయువునందు నిరంతరగమనము, భువియందు ఓర్పు నియతములై యున్నవి. ఇవియన్నియును నీలో మూర్తీభవించి యుండుటచే నీకీర్తి చిరస్థిరమైనది. (5)

ఏకస్య నాఽపరాధేన లోకాన్ హంతుం త్వమర్హసి।
నతు జానామి కస్యాయం భగ్నః సాంగ్రామికో రథః।
కేన వా కస్య వా హేతోః సాయుధః సపరిచ్ఛదః। 6

ఎవడో ఒకడొనర్చిన అపరాధమునకు నీవు సమస్త లోకములను తుదముట్టింపబూనుట తగదు. ఆయుధములతో, పరివారములతోగూడిన ఈ యుద్ధరథము ఎవరిదో ఎఱుగము. దీనిని ఎవరు ఏందువలన ఇట్లు భగ్నమొనర్చిరో గూడ మనకు తెలియదు. (6)

ఖురనేమిక్షతశ్చాయం సిక్తో రుధిరబిందుభిః।
దేశో నిర్వృత్తసంగ్రామః సుఘోరః పార్థివాత్మజ!। 7

ఏకస్యతు విమర్దోఽయం న ద్వయోర్వదతాం వర!।
న హి వృత్తం హి పశ్యామి బలస్య మహతః పదమ్। 8

నైకస్య తు కృతే లోకాన్ వినాశయితుమర్హసి।
యుక్తదండా హి మృదవః ప్రశాంతా వసుధాధిపాః। 9

ఓ రాజకుమారా! ఈ ప్రదేశమంతయును యుద్ధాశ్వముల గిట్టలతాకిడిచే, రథచక్రపుటంచుల యొత్తిడిచే నలిగియున్నది. రక్తధారలచే తడిసియున్నది. ఇచట ఘోరయుద్ధము జరిగినట్లు కనబడుచున్నది. మాట్లాడుటలో నేర్పరియైన ఓ రామా! ఈ సంగ్రామచిహ్నములన్నియును అనగా రథాదులన్నియును ఒక్కనివే, ఇద్దరివి కావు. ఈ యుద్ధమున గొప్పసైన్యము పాల్గొనిన చిహ్నములెవ్వియును కనబడుట లేదు. కనుక ఒక్కడు చేసిన అపరాధమునకై లోకమునన్నింటిని నశింపజేయుట తగదు. కోమలహృదయులు, ప్రశాంతచిత్తులు ఐన పాలకులు అపరాధములకు తగినట్లు దోషులను శిక్షింతురు.[1] (7-9)

సదా త్వం సర్వభూతానాం శరణ్యః పరమా గతిః।
కోను దారప్రణాశం తే సాధు మన్యేత రాఘవ!। 10

ఓ రఘువీరా! సకలప్రాణులకును ఎల్లప్పుడును అన్నివిధములుగా నీవే దిక్కు. అట్టి నీయొక్క భార్యను హింసించుటగాని, అపహరించుటగాని మంచిదేయని ఎవడు తలంచును? (10)

సరితః సాగరాః శైలా దేవగంధర్వదానవాః।
నాలం తే విప్రియం కర్తుం దీక్షితస్యేవ సాధవః। 11

యజ్ఞదీక్షలోనున్న యజమానికి సత్పురుషులైన ఋత్విజులు శాపాది-అపచారములను చేయజాలనట్లే, దీనజనశరణ్యుడవైన నీకు నదులు, సముద్రములు, పర్వతములు దేవగంధర్వదానవులు అప్రియమును గూర్చుటకు సమర్థులు కారు. (11)

యేన రాజన్! హృతా సీతా తమన్వేషితుమర్హసి।
మద్ద్వితీయో ధనుష్పాణిః సహాయైః పరమర్షిభిః। 12

ఓ రాజా! సీతను అపహరించిన దుష్టుని అన్వేషించుటకై నీవు ధనుర్ధారివై సిద్ధపడుము. (అదియే మన ప్రస్తుతకర్తవ్యము) నేను నీకు తోడుగా ఉందును. తపస్సంపన్నులైన మహర్షులు, మనకు సహాయపడుదురు. (12)

సముద్రం చ విచేష్యామః పర్వతాంశ్చ వనాని చ।
గుహాశ్చ వివిధా ఘోరా నదీః పద్మవనాని చ। 13

దేవగంధర్వలోకాంశ్చ విచేష్యామః సమాహితాః।
యావన్నాధిగమిష్యామః తవ భార్యాపహారిణమ్। 14

నీ ధర్మపత్నిని (సీతాదేవిని) అపహరించిన దుష్టుని కనుగొనువఱకును సముద్రమును, పర్వతములను అరణ్యములను, భయంకరములైన వివిధగిరిగుహలను, నదులను, పద్మసరస్సులను, దేవగంధర్వ లోకములను దీక్షతో గాలింతము. (13-14)

నచేత్ సామ్నా ప్రదాస్యంతి పత్నీం తే త్రిదశేశ్వరాః।
కోసలేంద్ర! తతః పశ్చాత్ ప్రాప్తకాలం కరిష్యసి। 15

ఓ కోసలప్రభూ! దేవతలు సామోపాయముచే నీ ప్రేమపత్నిని నీకు అప్పగింపనిచో అప్పుడు నీవు సమయోచితముగా తగినకార్యములను నిర్వహింపవచ్చును. (15)

1) యథాపరాధదండానామ్ (కాళిదాస రఘువంశము) సర్గము-1
రఘువంశప్రభువులు అపరాధములస్థాయినిబట్టి తగినవిధముగా దోషులను శిక్షించుచుండెడి వారు - ఇది ఉత్తమపాలకుల లక్షణము.

శీలేన సామ్నా వినయేన సీతాం
నయేన న ప్రాప్స్యసి చేన్నరేంద్ర! ।
తతః సముత్సాదయ హేమపుంఖైః
మహేంద్రవజ్రప్రతిమైః శరౌఘైః ॥ 16

ఓ నరేంద్రా! సత్స్వభావముచే, సామోపాయములతో, వినయముతో న్యాయమార్గమున ప్రయత్నించినప్పటికిని సీత జాడ తెలియనిచో - అప్పుడు నీవు బంగారు పిడులు గలిగి, ఇంద్రునివజ్రాయుధముతో తుల్యములైన శరములను వర్షించి సమస్తలోకములను రూపుమాపవచ్చును. (16)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచషష్టితమస్సర్గః (65)
వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదిఐదవసర్గము.

— * * * —

66. అఱువదిఆఱవసర్గము

'ఆగ్రహావేశములనుమాని, దుష్టుడైన ఆ రాక్షసుని గుర్తించి, వానిని హతమార్చుట ముఖ్య కర్తవ్యము' - అని లక్ష్మణుడు శ్రీరామునకు నివేదించుట -

తం తథా శోకసంతప్తం విలపంతమ్ అనాథవత్ ।
మోహేన మహతాఽఽవిష్టం పరిద్యూనమ్ అచేతనమ్ ॥ 1

తతః సౌమిత్రిరాశ్వాస్య ముహూర్తాదివ లక్ష్మణః ।
రామం సంబోధయామాస చరణౌ చాభిపీడయన్ ॥ 2

శ్రీరాముడు శోకమున మునింగి, మిగుల పరితపించుచుండెను. అతడు ఎంతయు సమ్మోహితుడై, చిత్తస్వాస్థ్యములేక కలవరపడుచు దిక్కులేనివానివలె విలపించుచుండెను. అప్పుడు సౌమిత్రి ఒక క్షణకాలముపాటు అన్నను ఓదార్చి, ఆయనపాదములనొత్తుచు, కర్తవ్యమును సూచించుచు ఆయనతో ఇట్లు పలికెను. (1-2)

మహతా తపసా రామ! మహతా చాపి కర్మణా ।
రాజ్ఞా దశరథేనాఽసి లబ్ధోఽమృతమివామరైః ॥ 3

తవ చైవ గుణైర్బద్ధః త్వద్వియోగాన్మహీపతిః ।
రాజా దేవత్వమాపన్నో భరతస్య యథాశ్రుతమ్ ॥ 4

"దేవతలకు అమృతమువలె, దశరథమహారాజు ఒనర్చిన అనేకసత్కార్యములకును, మహాతపస్సులకును ఫలముగా నీవు ఆయనకు పుత్త్రుడవై లభించితివి. నీ సద్గుణములకు ఆనందపరవశుడైన (మురిసిపోయిన) ఆ మహారాజు నీ యెడబాటునకు తట్టుకొనలేక దివ్యత్వమును పొందినట్లు (స్వర్గస్థుడైనట్లు) మనభరతునివలన వినియున్నాము గదా! (3-4)

యది దుఃఖమిదం ప్రాప్తం కాకుత్స్థ! న సహిష్యసే ।
ప్రాకృతశ్చాల్పసత్త్వశ్చ ఇతరః కః సహిష్యతి ॥ 5

ఓ కకుత్స్థవంశభూషణా! మహాపురుషుడవైన నీవు ఒక సామాన్యమానవునివలె ఇట్లు శోకింపదగునా? ఇట్లు వచ్చిపడిన ఆపదను మహాధైర్యశాలివైన నీవే నిగ్రహించుకొనకున్నచో అల్పసత్త్వుడైన సాధారణమనుష్యుడు ఇక ఎట్లు తట్టుకొనగలడు? (5)

దుఃఖితో హి భవాన్ లోకాన్ తేజసా యది ధక్ష్యతే ।
ఆర్తాః ప్రజా నరవ్యాఘ్ర క్వను యాస్యంతి నిర్వృతిమ్ ।
ఆశ్వసిహి నరశ్రేష్ఠ! ప్రాణినః కస్యనాపదః ॥ 6

దుఃఖకారణముగా నీవు నీ ప్రభావమును చూపి, ఈ లోకములను అన్నింటిని దహించి వేయుటకు పూనుకొన్నచో తీరని ఆర్తికి గుఱియైన ఈ ప్రజలు ఎల్లరును తమప్రాణములను నిలుపుకొనుటకై ఎచటికివెళ్లగలరు? ఓ నరశ్రేష్ఠా! ఊరడిల్లుము. ఆపదలు రానివారెవ్వరు? (6)

లోకస్వభావ ఏవైష యయాతిర్నహుషాత్మజః ।
గతః శక్రేణ సాలోక్యమ్ అనయస్తం తమఃస్పృశత్ ॥ 7

దుఃఖములు వచ్చిపోవుచుండుట లోకసహజము. నహుషునికుమారుడైన యయాతి స్వర్గమునకు వెళ్లి ఇంద్రుని సమక్షమున నిల్చెను. కాని అతడు తన అహంకారకారణముగ దుఃఖముల పాలయ్యెను.[1] (7)

1) యయాతి చంద్రవంశపురాజు. నహుషుని కుమారుడు. అతనితల్లి ప్రియంవద. అతడు స్వర్గమునకు వెళ్లి, ఇంద్రునియెదుట "ఇచటి వాసులు నా యంతటి గొప్పవారు కారు" - అని గర్వముతో పలికెను. ఫలితముగా అతడు దుఃఖములపాలయ్యెను.

మహర్షిర్యో వసిష్ఠస్తు యః పితుర్నః పురోహితః।
అహ్నా పుత్త్రశతం జజ్ఞే తథైవాస్య పునర్హతమ్। 8

యా చేయం జగతాం మాతా దేవీ లోకనమస్కృతా।
అస్యాశ్చ చలనం భూమేః దృశ్యతే సత్యసంశ్రవ! 9

యౌ ధర్మౌ జగతాం నేత్రౌ యత్ర సర్వం ప్రతిష్ఠితమ్।
ఆదిత్యచంద్రౌ గ్రహణమ్ అభ్యుపేతౌ మహాబలౌ। 10

సుమహాంత్యపి భూతాని దేవాశ్చ పురుషర్షభ!
న దైవస్య ప్రముంచంతి సర్వభూతాదిదేహినః। 11

శక్రాదిష్వపి దేవేషు వర్తమానౌ నయానయౌ।
శ్రూయతే నరశార్దూల! న త్వం శోచితుమర్హసి। 12

నష్టాయామపి వైదేహ్యాం హృతాయామపి చానఘ!
శోచితుం నార్హసే వీర యథాఽన్యః ప్రాకృతస్తథా। 13

త్వద్విధా నహి శోచంతి సతతం సత్యదర్శినః।
సుమహత్స్వపి కృచ్ఛ్రేషు రామాఽనిర్విణ్ణదర్శనాః। 14

తత్త్వతో హి నరశ్రేష్ఠ! బుద్ధ్యా సమనుచింతయ।
బుద్ధ్యా యుక్తా మహాప్రాజ్ఞా విజానంతి శుభాశుభే। 15

అదృష్టగుణదోషాణామ్ అధృతానాం చ కర్మణామ్।
నాంతరేణ క్రియాం తేషాం ఫలమిష్టం ప్రవర్తతే। 16

అన్నా! మనతండ్రిగారికి పురోహితుడైన వసిష్ఠమహర్షి తనవందమందికుమారులను (విశ్వామిత్రుని శాపకారణముగా) ఒక్కదినముననే కోల్పోయి, దుఃఖములకు గుఱియయ్యెను. అంతటి తపస్వికిని దుఃఖములు తప్పలేదు. (8)

సత్యసంధుడవైన ఓ రామా! జగన్మాతయైన భూదేవి సకలలోకములకును పూజ్యురాలు. ఆమెయును అప్పుడప్పుడు చలనరూపమున (భూకంపములరూపములో) దుఃఖములను పొందుచుండుట సుప్రసిద్ధము. (9)

సూర్యచంద్రులు ఈ సమస్తజగత్తునకు నేత్రములవంటివారు. (ఈ జగత్తునకే నాయకులు) విశ్వమంతటికిని వారే ఆధారము.[1] ఇట్టి శక్తిసామర్థ్యములుగల ఆ సూర్య చంద్రులకును రాహుకేతువులవలన గ్రహణబాధ తప్పుటలేదు. (10)

ఓ పురుషశ్రేష్ఠా, పంచమహాభూతములును (భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము) సకలదేవతలును, దేహధారులైన సమస్త ప్రాణులును విధినిర్ణయమును అతిక్రమింపజాలరు. (11)

ఓ నరశ్రేష్ఠా! ఇంద్రాదిదేవతలకును సుఖదుఃఖములు తప్పవనుట జగత్ప్రసిద్ధమే గదా! కనుక నీవు విచారింపదగదు. (12)

ఓ పుణ్యపురుషా! సీతాదేవి అపహరింపబడినను, ప్రస్తుతము ఆమె కనబడకున్నను ఒక పామరునివలె నీవు శోకింపవలసిన పనిలేదు. ఓ రామా! నీవలె సత్యాఽసత్యములను ఎఱిగినవారును, కర్తవ్యాఽకర్తవ్య విచక్షణ గలవారును ఎట్టి దుఃఖములకును క్రుంగిపోరు. (13-14)

ఓ పురుషోత్తమా! ప్రజ్ఞాశాలురైన మహానుభావులు శుభాఽశుభములను (మంచిచెడ్డలను) బాగుగా ఎఱుంగుదురు. కనుక నీవు (శోకమును ప్రక్కనబెట్టి) సూక్ష్మబుద్ధితో వాస్తవములనుగూర్చి ఆలోచింపుము. (15)

పూర్వజన్మలలో చేసికొనిన కర్మలగుణదోషములను ఎఱుంగుట అసాధ్యము. కర్మలఫలములు అనుభవించిన పిమ్మట అవి నశించును. కనుక అవి అనిత్యములు. అందువలన కర్మఫలములను అనుభవించియే తీరవలెను. పురుషప్రయత్నము లేకుండ (పట్టుబట్టి మంచిపనులను చేయనిచో) ఇష్ట ఫలములు లభింపవు.[2] (16)

1) పగటిపూట సూర్యుడు, రాత్రివేళలలో చంద్రుడు నిరంతరము వెలుగులను ప్రసాదించుచుందురు. కావున వీరు జగత్తునకు నేత్రములవంటివారు. వేడిమిని, వర్షములను లోకమునకు అనుగ్రహించుచుండుటచే సూర్యుడును, ఓషధులను పోషించుచు సమస్త ప్రాణులను ఆదుకొనుచుండుటద్వారా చంద్రుడును జగత్తునకు ఆధారమై నిలిచిరి.

2) పూర్వకర్మానుష్ఠానం వినా ఇదానీం ఫలం నోత్పద్యతే. అతః పూర్వకర్మవశే ఇదానీం ప్రవృత్తే కాఽత్ర పరిదేవనా? (గోవిందరాజీయం). పూర్వజన్మలలో ఆచరించిన పుణ్యపాపకర్మలఫలితములే ఈ జన్మలో ప్రాప్తించును. అట్టి ఫలితములను అనుభవింపవలసివచ్చినప్పుడు విచారింప (దుఃఖపడ) వలసిన పనియేమి? 'అవశ్యమనుభోక్తవ్యం కృతం కర్మ శుభాఽశుభమ్" అని గదా! ఆర్యోక్తి.

త్వమేవ హి పురా రామ! మామేవ బహుశోఽన్వశాః।
అనుశిష్యాద్ధి కో ను త్వామ్ అపి సాక్షాద్బృహస్పతిః। 17

ఓ రామా! ఇదివరలో నీవే గదా! నాకు ఇట్లు పెక్కురీతుల బోధచేసియుంటివి. ఇప్పుడు నీకు ఉపదేశింప గలవారు ఎవ్వరు? సాక్షాత్తు ఆ బృహస్పతికిని అసాధ్యము.(17)

బుద్ధిశ్చ తే మహాప్రాజ్ఞ! దేవైరపి దురన్వయా।
శోకేనాఽభిప్రసుప్తం తే జ్ఞానం సంబోధయామ్యహమ్। 18

ఓ ప్రజ్ఞామూర్తీ! నీ ప్రతిభ సాటిలేనిది. దేవతలకును అది అంతు పట్టదు. కాని శోకకారణముగా నీలో అది (ఇప్పుడు) ప్రసుప్తమై (అణగి) యున్నది. దానిని నేను ఇప్పుడు తట్టిలేపుచున్నాను. (నీకు చెప్పగలవాడనా నేను?) (18)

దివ్యం చ మానుషం చ త్వమ్ ఆత్మనశ్చ పరాక్రమమ్।
ఇక్ష్వాకువృషభావేక్ష్య యతస్వ ద్విషతాం వధే। 19

ఓ ఇక్ష్వాకువంశశిరోమణీ! నీవు ధర్మవీరుడవు అజేయమైన నీ పరాక్రమమును దేవగంధర్వాది దివిజులపైగాని, మానవలోకమున సాత్త్వికప్రవృత్తిగల ద్విజులపై గాని చూపదగదు. కావున బాగుగా ఆలోచించి, నీ పరాక్రమమును శత్రువులను (రాక్షసులను) వధించుటకై వినియోగింపుము. (శత్రువధకై పూనుకొనుము) (19)

కిం తే సర్వవినాశేన కృతేన పురుషర్షభ!।
తమేవ త్వం రిపుం పాపం విజ్ఞాయోద్ధర్తుమర్హసి। 20

ఓ మహాపురుషా! లోకములనన్నింటిని రూపుమాపుటవలన ప్రయోజనమేమి? అందువలన సీతను అపహరించిన పాపాత్ముడగు శత్రువును ఎఱింగి (ఆ శత్రువుయొక్క ఆనుపానులు తెలిసికొని) వానిని హతమార్చుము. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే షట్షష్టితమస్సర్గః (66)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదిఆఱవసర్గము.

-- ❋ ❋ ❋ --

67. అఱువదిఏడవసర్గము

రామలక్ష్మణులు జటాయువును కలిసికొనుట. శ్రీరాముడు ఆ పక్షిరాజును అక్కున జేర్చుకొని ఏడ్చుట -

పూర్వజోఽప్యుక్తమాత్రస్తు లక్ష్మణేన సుభాషితమ్।
సారగ్రాహీ మహాసారం ప్రతిజగ్రాహ రాఘవః। 1

రఘువీరుడు ఎదుటివారు చెప్పినమాటలఅంతరార్థమును వెంటనే గ్రహింపగలశక్తిశాలి. అతడు అగ్రజుడేయైనప్పటికిని తనకంటె చిన్నవాడైన లక్ష్మణుడు యుక్తియుక్తముగా పలికిన వచనముల సారాంశమును సంతోషముతో గ్రహించెను. 'బాలాదపి సుభాషితమ్' అని గదా! స్మృతి వాక్యము-(1)

సన్నిగృహ్య మహాబాహుః ప్రవృత్తం కోపమాత్మనః।
అవష్టభ్య ధనుశ్చిత్రం రామో లక్ష్మణమబ్రవీత్। 2

మిక్కిలి భుజబలశాలియైన శ్రీరాముడు తనను ఆవేశించిన కోపమును పూర్తిగా నిగ్రహించుకొనెను. చిత్రమైన తనధనుస్సును ప్రక్కనబెట్టెను. పిమ్మట అతడు లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (2)

కిం కరిష్యావహే వత్స! క్వ వా గచ్ఛావ లక్ష్మణ!।
కేనోపాయేన పశ్యేయం సీతామితి విచింతయ। 3

"నాయనా! లక్ష్మణా! ఇప్పుడు మనము ఏమి చేయుదము? ఎక్కడికి వెళ్ళుదము? సీత జాడ తెలిసికొనుటకు తగునుపాయమును ఆలోచింపుము-" (3)

తం తథా పరితాపార్తం లక్ష్మణో రామమబ్రవీత్।
ఇదమేవ జనస్థానం త్వమన్వేషితుమర్హసి।
రాక్షసైర్బహుభిః కీర్ణం నానాద్రుమలతాయుతమ్। 4

అట్లు ఆర్తితో పరితపించుచున్న శ్రీరామునితో లక్ష్మణుడు ఇట్లనెను. "అన్నా! ఈ దండకారణ్యము పెక్కుమంది రాక్షసులతో నిండియున్నది. ఇందు

సంతీహ గిరిదుర్గాణి నిర్దరాః కందరాణి చ।
గుహాశ్చ వివిధా ఘోరా నానామృగగణాకులాః। 5

ఆవాసాః కిన్నరాణాం చ గంధర్వభవనాని చ।
తాని యుక్తో మయా సార్ధం త్వమన్వేషితుమర్హసి। 6

త్వద్విధా బుద్ధిసంపన్నా మహాత్మానో నరర్షభ!।
ఆపత్సు న ప్రకంపంతే వాయువేగైరివాచలాః। 7

ఇత్యుక్తస్తద్వనం సర్వం విచచార సలక్ష్మణః।
క్రుద్ధో రామః శరం ఘోరం సంధాయ ధనుషి క్షురమ్। 8

తతః పర్వతకూటాభం మహాభాగం ద్విజోత్తమమ్।
దదర్శ పతితం భూమౌ క్షతజార్ద్రం జటాయుషమ్। 9

తం దృష్ట్వా గిరిశృంగాభం రామో లక్ష్మణమబ్రవీత్।
అనేన సీతా వైదేహీ భక్షితా నాత్ర సంశయః। 10

గృధ్రరూపమ్ ఇదం రక్షో వ్యక్తం భవతి కాననే।
భక్షయిత్వా విశాలాక్షీమ్ ఆస్తే సీతాం యథాసుఖమ్। 11

ఏనం వధిష్యే దీప్తాగ్రైః ఘోరైర్బాణైరజిహ్మగైః। 12

ఇత్యుక్త్వాఽభ్యపతద్గృధ్రం సంధాయ ధనుషి క్షురమ్।
క్రుద్ధో రామః సముద్రాంతాం కంపయన్నివ మేదినీమ్। 13

తం దీనం దీనయా వాచా సఫేనం రుధిరం వమన్।
అభ్యభాషత పక్షీ తు రామం దశరథాత్మజమ్। 14

యామోషధిమివాఽయుష్మన్ అన్వేషసి మహావనే।
సా దేవీ మమ చ ప్రాణా రావణేనోభయం హృతమ్। 15

త్వయా విరహితా దేవీ లక్ష్మణేన చ రాఘవ!।
హ్రియమాణా మయా దృష్టా రావణేన బలీయసా। 16

సీతామ్ అభ్యవపన్నోఽహం రావణశ్చ రణే మయా।
విధ్వంసితరథశ్చాత్ర పాతితో ధరణీతలే। 17

వివిధములగు వృక్షములు, లతలు దట్టముగా వ్యాపించియున్నవి. మొదట జానకీదేవిని ఈ వనమున వెదకుదము. ఇందు సులభముగా అడుగిడరాని కొండలు, పగిలియున్న బండలు, లోయలు, కొండచరియలు, గుహలు గలవు. ఇచట భీతిగొల్పెడి వివిధములగు మృగములు సంచరించుచుండును. ఈ జనస్థానమున కిన్నరుల ఆవాసములు, గంధర్వుల భవనములు ఉన్నవి. మనము ఇరువురము వీటినన్నింటిని గాలింతము. (4-6)

ఓ మహాపురుషా! ఎంతటి పెనుగాలులకైనను చలింపని కొండలవలె నీవంటి ప్రజ్ఞాశాలురైన మహాత్ములు ఎంతటి ఆపదలు ఎదురైనను తొణకరు." (7)

శత్రుసంహారమునకై రోషముతోనున్న శ్రీరాముడు లక్ష్మణునిపలుకులను వినినపిమ్మట 'క్షురము' అను భయంకరమైన శరమును ధనుస్సునందు సంధించి, తమ్మునితోగూడి ఆ వనమంతయును వెదకసాగెను. (8)

కొంతతడవునకు పర్వతశిఖరమువలె మహాకాయముగలవాడు, పుణ్యాత్ముడు ఐన జటాయువును శ్రీరాముడు చూచెను. అప్పుడు ఆ పక్షిరాజు రక్తసిక్తమైన శరీరముతో నేలపైబడియుండెను గిరిశృంగమువలెనున్న ఆ జటాయువును గాంచిన పిమ్మట శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లు నుడివెను. "తమ్ముడా! విదేహరాజకుమారియైన సీతాదేవిని భక్షించినవాడు ఇతడే. ఇందులకు సందేహము లేదు. ఈ కాననమున గ్రద్దరూపమున సంచరించుచున్న రాక్షసుడితడు, విశాలాక్షియైన సీతను భక్షించి, ఇచట హాయిగా కూర్చొనియున్నాడు. సూటిగా సాగిపోగలిగి పదునుదేలి మెరయుచున్న నా బాణములతో ఇతనిని ఇప్పుడే వధించెదను." (9-12)

ధనుస్సునందు క్షురమును (క్షురమను పేరుతో అర్ధచంద్రాకారముగల బాణమును) ఎక్కుపెట్టియున్న రాముడు ఇట్లు పలికి, మిగుల క్రుద్ధుడై, సముద్రములవఱకు వ్యాపించియున్న సమస్తభూమండలమును కంపింపజేయుచున్నవానివలె ఒప్పుచు, ఆ గృధ్రము (జటాయువు) మీదికి దాడికి వెడలెను. (13)

నోట రక్తపుముద్దలను గ్రక్కుచున్న ఆపక్షిరాజు దీనుడైయున్న ఆ దాశరథితో (రామునితో) ఇట్లు దైన్యవచనములను పలికెను. "ఓ ప్రభూ! ఈ మహారణ్యమునందు గొప్ప ఓషధికొఱకువలె సీతాదేవికై అన్వేషించుచున్నావు. జానకిని అపహరించినవాడు ఒక రాక్షసుడు. అతనిపేరు రావణుడు. నా ప్రాణములనుగూడ అతడే హరించెను. (14-16)

ఓ రామా! నీవును, లక్ష్మణుడును ఆశ్రమమున లేనప్పుడు. ఒంటరిగా ఉన్న సీతాదేవిని బలశాలియైన

ఏతదస్య ధనుర్భగ్నమ్ ఏతదస్య శరావరమ్।
అయమస్య రథో రామ! భగ్నః సాంగ్రామికో మయా। 18

అయం తు సారథిస్తస్య మత్పక్షనిహతో యుధి। 19

పరిశ్రాంతస్య మే పక్షౌ ఛిత్త్వా ఖడ్గేన రావణః।
సీతామ్ ఆదాయ వైదేహీమ్ ఉత్పపాత విహాయసమ్। 20

రక్షసా నిహతం పూర్వం న మాం హంతుం త్వమర్హసి। 21

రామస్తస్య తు విజ్ఞాయ బాష్పపూర్ణముఖస్తదా।
ద్విగుణీకృతతాపార్తః సీతాసక్తాం ప్రియాం కథామ్। 22

గృధ్రరాజం పరిష్వజ్య పరిత్యజ్య మహద్ధనుః।
నిపపాతాఽవశో భూమౌ రురోద సహలక్ష్మణః। 23

ఏకమ్ ఏకాయనే దుర్గే నిశ్వసంతం కథంచన।
సమీక్ష్య దుఃఖితతరో రామః సౌమిత్రిమబ్రవీత్। 24

రాజ్యాద్భ్రంశో వనే వాసః సీతా నష్టా ద్విజో హతః।
ఈదృశీయం మమాలక్ష్మీః నిర్దహేదపి పావకమ్। 25

సంపూర్ణమపి చేదద్య ప్రతరేయం మహోదధిమ్।
సోఽపి నూనం మమాఽలక్ష్మ్యా విశుష్యేత్ సరితాం పతిః। 26

రావణుడు అపహరించుకొని పోవుచుండగా నేను చూచితిని - వెంటనే నేను జానకీదేవిని ఆదుకొనుటకై ఆమెను సమీపించి, రావణుని నిలువరించితిని. మా ఇరువురిమధ్య జరిగిన ఆ యుద్ధమున నేను రావణుని రథమును ధ్వంసమొనర్చితిని. ఆ మఱుక్షణముననే అతడు నేలపై పడిపోయెను. అతనిధనుస్సును ముక్కలు చేసితిని. కవచమును ఛేదించితిని. యుద్ధరథమును శిథిలమొనర్చితిని. ఆవియన్నియును ఇవిగో ఇక్కడనే పడియున్నవి. ఇదిగో! రణరంగమున నాఱెక్కలధాటికి నేలగూలియున్న ఈతడే రావణునిరథసారథి. (17-19)

యుద్ధమొనర్చి, మిగుల అలసియున్న నాయొక్క ఱెక్కలను ఆ రావణుడు తనఖడ్గముచే ఖండించి, వైదేహిని దీసికొని, ఆకాశమునకు ఎగిరిపోయెను. నేను ఇంతకుముందే రావణునిచేతిలో దెబ్బతినియుంటిని. ఈ స్థితిలో నన్ను నీవు చంపదగదు. (20-21)

తన ప్రేమపెన్నిధియైన సీతాదేవియొక్క అపహరణ గాథను జటాయువునుండి పూర్తిగా వినినంతనే శ్రీరాముడు బొటబొట కన్నీరుగార్చెను. సీతను రక్షించుటకై ప్రాణములకుసైతము తెగించి పోరుసల్పి, రావణుని ఖడ్గధాటికి ఱెక్కలు ముక్కలై పడియున్న జటాయువును చూచుటతో ఆర్తితో పరితపించుచున్న శ్రీరామునిశోకము రెండింతలాయెను. వెంటనే అరఘువరుడు తనకోదండమును ప్రక్కనబెట్టి, జటాయువును కౌగిలించుకొని, దుఃఖపరవశుడై నేలకుజాఱి యేడువసాగెను. జటాయువుయొక్క దీనస్థితికిని, అన్నయొక్క శోకపరితాపములకును తల్లడిల్లి లక్ష్మణుడును విలపింపదొడగెను. (22-23)

తీగెలతో, ముండ్లతో నిండి, కాలు మోపుటకును కష్టముగా ఉన్న మార్గమున నిస్సహాయస్థితిలో కొనయూపిరితో కొట్టుమిట్టాడుచున్న జటాయువును జూచి, శ్రీరాముడు మిగుల దుఃఖితుడై, లక్ష్మణునితో ఇట్లు పలికెను. (24)

తమ్ముడా! ఓ లక్ష్మణా! రాజ్యాధికారము చిక్కినట్లేచిక్కి చేజారిపోయినది. కనీసము రాజ్యమునందైనను ఉండుటకు వీలులేకుండ వనవాసమొకటి వచ్చిపడినది. వనములలోనైనను ప్రశాంతముగా ఉండవచ్చునని తలంపగా ఇంతలో సీతయెడబాటు దాపురించినది. ఇవి చాలవన్నట్లుగా ఆప్తుడైన జటాయువుయొక్క ప్రాణాపాయస్థితి వీటికి తోడైనది. ఇన్నిరీతులుగా శోకాగ్ని నన్ను దహించివేయుచున్నది. ఇట్టి నా శోకాగ్నిముందు (నాదౌర్భాగ్యముముందు) లోకమునందలి అగ్నిశక్తి ఏపాటిది?(25)

నా తాపశాంతికొఱకై జలములతో నిండియున్న సముద్రమున మునుగుదమనుకొన్నను నా దురదృష్టముచే అదియును ఎండిపోవును. (26)

నాస్త్యభాగ్యతరో లోకే మత్తోఽస్మిన్ సచరాచరే।
యేనేయం మహతీ ప్రాప్తా మయా వ్యసనవాగురా। 27

అయం పితృవయస్యో మే'గృధ్రరాజో జరాన్వితః।
శేతే వినిహతో భూమౌ మమ భాగ్యవిపర్యయాత్। 28

ఇత్యేవముక్త్వా బహుశో రాఘవః సహలక్ష్మణః।
జటాయుషం చ పస్పర్శ పితృస్నేహం విదర్శయన్। 29

నికృత్తపక్షం రుధిరావసిక్తం
స గృధ్రరాజం పరిరభ్య రామః ।
క్వ మైథిలీ ప్రాణసమా మమేతి
విముచ్య వాచం నిపపాత భూమౌ । 30

అంతులేని (అధిగమింపరాని) దుఃఖపరంపరలన్ను వెంటాడుచుండుటనుబట్టి చూచినచో ఈ సమస్తచరాచర ప్రపంచమున నాకంటె భాగ్యహీనుడు మఱియొకడు లేడనుట నిశ్చయము- (27)

కడువృద్ధుడైన ఈ జటాయువు మనతండ్రిగారికి ఆప్తమిత్రుడు. నా దురదృష్టమువలన ఈ మహానుభావుడు ప్రాణములన్నుబట్టి నేలపై పడియున్నాడు." (28)

శ్రీరాముడు ఇట్లు పెక్కువిధముల పరితాప వచనములను నుడివినపిమ్మట తనతమ్మునితోగూడి ఆ జటాయువునెడ పితృభక్తిని జూపుచు అతనితనువుపై నిమిరెను. (29)

ఱెక్కలు తెగి, నెత్తుటిమడుగులో పడియున్న ఆగృధ్రరాజును (జటాయువును) కౌగిలించుకొని, శ్రీరాముడు 'నాబహిఃప్రాణమైన మైథిలి ఎక్కడ?' అని పలికి నేలపై పడిపోయెను- (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే సప్తషష్టితమస్సర్గః (67)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదిఏడవసర్గము.

-- * * * --

68. అఱువదిఎనిమిదవసర్గము

జటాయువు అసువులకు బాయుట - శ్రీరాముడు అతనికి దహన సంస్కారముల నొనర్చుట - మోక్షము నొసంగుట

రామః సంప్రేక్ష్య తం గృధ్రం భువి రౌద్రేణ పాతితమ్।
సౌమిత్రిం మిత్రసంపన్నమ్ ఇదం వచనమబ్రవీత్। 1

మమాయం నూనమర్థేషు యతమానో విహంగమః।
రాక్షసేన హతః సంఖ్యే ప్రాణాన్ త్యక్ష్యతి దుస్త్యజాన్। 2

అయమస్య శరీరేఽస్మిన్ ప్రాణో లక్ష్మణ! విద్యతే।
తథా హి స్వరహీనోఽయం విక్లబః సముదీక్ష్యతే। 3

జటాయో! యది శక్నోషి వాక్యం వ్యాహరితుం పునః।
సీతామ్ ఆఖ్యాహి భద్రం తే వధమ్ ఆఖ్యాహి చాత్మనః। 4

కింనిమిత్తోఽహరత్ సీతాం రావణస్తస్య కిం మయా।
అపరాధం తు యం దృష్ట్వా రావణేన హృతా ప్రియా। 5

కథం తచ్చంద్రసంకాశం ముఖమాసీన్మనోహరమ్।
సీతయా కాని చోక్తాని తస్మిన్ కాలే ద్విజోత్తమ!। 6

క్రూరుడైన రావణునిచే నేలపై పడగొట్టబడిన పక్షిరాజు (జటాయువు)ను జూచుచు, శ్రీరాముడు తనయెడ అత్యంతసేవాభావముగల లక్ష్మణునితో ఇట్లునుడివెను.(1)

"ఓ సౌమిత్రీ! కేవలము నాకు సహాయపడుటకై ప్రయత్నించుచు ఈ జటాయువు యుద్ధమున రావణునిచే దెబ్బతినెను. ఇతడు తనవిలువైన ప్రాణములను కోల్పోనున్నాడు. ఇతని శరీరములో ఇంకను ప్రాణములు మిగిలియున్నవి. కొనయూపిరితో ఉన్నందున ఇతని గొంతు మూగపోయినది. ఇప్పుడితడు స్పృహదప్పి పడియున్నాడు." (2-3)

"ఓ జటాయూ! ఇప్పుడు నీకు ఏమాత్రముగనైనను మాట్లాడగలశక్తియున్నచో సీతను గూర్చియు, నీ ఆపాయస్థితిని గూర్చియు నాకు తెలుపుము. నీకు శుభమగును- (4)

ఇంతకును రావణుడు సీతను అపహరించుకొని పోవుటకు కారణమేమి? అతడట్లు చేయుటకు అతని యెడ నేనొనర్చిన అపరాధమేమి? ఓ పక్షిరాజా! సహజముగా చంద్రునివలె ఆహ్లాదకరమైన ఆమెముఖము అప్పుడెట్లున్నది? ఆసమయమున సీతాదేవి నీతో పలికిన మాటలేమి? నాయనా! జటాయూ! అతనిరూపమెట్టిది?

కథంవీర్యః కథంరూపః కింకర్మా స చ రాక్షసః।
క్వ చాస్య భవనం తాత! బ్రూహి మే పరిపృచ్ఛతః। 7

తముద్వీక్ష్యాథ దీనాత్మా విలపంతమ్ అనంతరమ్।
వాచాఽతిసన్నయా రామం జటాయురిదమబ్రవీత్। 8

హృతా సా రాక్షసేంద్రేణ రావణేన విహాయసా।
మాయామ్ ఆస్థాయ విపులాం వాతదుర్దినసంకులామ్। 9

పరిశ్రాంతస్య మే తాత! పక్షౌ ఛిత్త్వా స రాక్షసః।
సీతామ్ ఆదాయ వైదేహీం ప్రయాతో దక్షిణాం దిశమ్। 10

ఉపరుధ్యంతి మే ప్రాణా దృష్టిర్భ్రమతి రాఘవ!।
పశ్యామి వృక్షాన్ సౌవర్ణాన్ ఉశీరకృతమూర్ధజాన్। 11

యేన యాతో ముహూర్తేన సీతామ్ ఆదాయ రావణః।
విప్రణష్టం ధనం క్షిప్రం తత్స్వామీ ప్రతిపద్యతే। 12

విందో నామ ముహూర్తోఽయం స చ కాకుత్స్థ! నాఽబుధత్।
త్వత్ప్రియాం జానకీం హృత్వా రావణో రాక్షసేశ్వరః।
ఝషవద్బడిశం గృహ్య క్షిప్రమేవ వినశ్యతి। 13

న చ త్వయా వ్యథా కార్యా జనకస్య సుతాం ప్రతి।
వైదేహ్యా రంస్యసే క్షిప్రం హత్వా తం రాక్షసం రణే। 14

అతనిబలపరాక్రమములెట్టివి? అపుడతడేమి చేసెను? అతనినివాసమెక్కడ? ఆత్రుతతో అడుగుచుంటిని, తెలుపుము." (5-7)

అప్పుడు ప్రాణములన్నుబట్టియున్న ఆజటాయువు తనతలనుపైకెత్తి మిగుల విలపించుచున్న ఆరాముని జూచి, మిక్కిలి హీనస్వరముతో ఇట్లు నుడివెను. (8)

"ఓ రఘురామా! రాక్షసరాజైన ఆరావణుడు తన ప్రబలమైన మాయాప్రభావమున మబ్బులు క్రమ్ముకొనునట్లుగా చేసి, పెనుగాలులను సృష్టించి, ఆమెను ఆకాశమార్గమున అపహరించుకొని పోయెను. (9)

ప్రభూ! రామచంద్రా! నేను అతనితో పోరాడిపోరాడి అలసిపోయియుంటిని. అప్పుడు అతడు అదనుచూచుకొని నా ఱెక్కలను ఛేదించి, సీతాదేవిని దీసికొని దక్షిణదిశగా సాగిపోయెను. (10)

ఓ రఘువీరా! నా ప్రాణములు కంఠగతములైయున్నవి. మరణవేదనతో నేను కొట్టుమిట్టాడుచున్నాను. దృష్టి మందగించుచున్నది. వట్టివ్రేళ్లవంటి అగ్రభాగములతో, బంగారువన్నెతో ఒప్పుచున్న వృక్షములను నేను చూచుచున్నాను. (అవసానదశలో ప్రాణులకు బంగారువన్నెగల చెట్లు కనబడుచుండునని ప్రతీతి. సౌవర్ణవృక్షదర్శనం మరణచిహ్నమ్.)(11)

రావణుడు సీతను అపహరించుకొనిపోయిన ముహూర్తమును బట్టి, నీకు కనబడకుండపోయిన (నీనుండిదూరమైన) సీతారూపధనము యజమానివైన నీకు మరల త్వరలోనే లభించును. ఇది నిశ్చయము. ఓ కాకుత్స్థా! రాక్షసరాజైన రావణుడు నీ ప్రేమపెన్నిధియైన సీతాదేవిని అపహరించుకొని పోయిన సమయము 'వింద' ముహూర్తకాలము.[1] ఆ విషయమును అతడు ఎఱుగడు. ఆ ముహూర్తము అతనికి మరణాంతకము. కనుక అతడు గాలమునకు చిక్కుకొనిన చేపవలె వెంటనే నశించిపోవుట నిజము- (12-13)

ఓ రామా! జనకసుతయైన సీతాదేవికొఱకై నీవు వ్యథ చెందకుము. త్వరలోనే నీవు రణమున ఆరాక్షసుని హతమార్చి వైదేహితోగూడి ఆనందింపగలవు. (14)

1) నష్టం ధనం విందతి (లభతే) అస్మిన్ - ఇతి విందః.
'వింద' ముహూర్తకాలమున నష్టమైన ధనము తప్పక యజమానికి భద్రముగా లభించును.
శ్లో ॥ రౌద్రః శ్వేతశ్చ మైత్రశ్చ తథా సారభటః స్మృతః ।
సావిత్రో వైశ్వదేవశ్చ గాంధర్వః కుతపస్తథా ॥
రౌహిణస్తిలకశ్చైవ 'విజయో' నైరృతస్తథా
శంబరో వారుణశ్చైవ భగః పంచదశః స్మృతః ॥
ఈ పదునైదు (15)ను పగటిముహూర్తములు. 11వదియైన విజయముహూర్తమునకే 'విందము' అని నామాంతరము.

అనమ్మూర్ధస్య గృధ్రస్య రామం ప్రత్యనుభాషతః।
ఆస్యాత్ సుస్రావ రుధిరం మ్రియమాణస్య సామిషమ్॥ 15

పుత్రో విశ్రవసః సాక్షాత్ భ్రాతా వైశ్రవణస్య చ।
ఇత్యుక్త్వా దుర్లభాన్ ప్రాణాన్ ముమోచ పతగేశ్వరః॥ 16

బ్రూహి బ్రూహీతి రామస్య బ్రువాణస్య కృతాంజలేః।
త్యక్త్వా శరీరం గృధ్రస్య జగ్ముః ప్రాణా విహాయసమ్॥ 17

స నిక్షిప్య శిరో భూమౌ ప్రసార్య చరణౌ తదా।
విక్షిప్య చ శరీరం స్వం పపాత ధరణీతలే॥ 18

తం గృధ్రం ప్రేక్ష్య తామ్రాక్షం గతాసుమ్ అచలోపమమ్।
రామః సుబహుభిర్దుఃఖైః దీనః సౌమిత్రిమబ్రవీత్॥ 19

బహూని రక్షసాం వాసే వర్షాణి వసతా సుఖమ్।
అనేన దండకారణ్యే విశీర్ణమ్ ఇహ పక్షిణా॥ 20

అనేకవార్షికో యస్తు చిరకాలసముత్థితః।
సోఽయమద్య హతఃశేతే కాలో హి దురతిక్రమః॥ 21

పశ్య లక్ష్మణ! గృధ్రోఽయమ్ ఉపకారీ హతశ్చ మే।
సీతామ్ అభ్యవపన్నో వై రావణేన బలీయసా॥ 22

గృధ్రరాజ్యం పరిత్యజ్య పితృపైతామహం మహత్।
మమ హేతోరయం ప్రాణాన్ ముమోచ పతగేశ్వరః॥ 23

సర్వత్ర ఖలు దృశ్యంతే సాధవో ధర్మచారిణః।
శూరాః శరణ్యాః సౌమిత్రే! తిర్యగ్యోనిగతేష్వపి॥ 24

శ్రీరామునకు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చుచున్న జటాయువు ఇంకను స్పృహగలిగియే యుండెను. ఇంతలో అవసానదశలోనున్న అతని నోటినుండి మాంసముతో గూడిన రక్తము స్రవించుచుండెను. ఆ స్థితిలో ఆ పక్షిరాజు 'రావణుడు విశ్రవసునికుమారుడు, కుబేరుని సోదరుడు' అని పలుకుచునే అతడు మఱల తిరిగిరాని తనప్రాణములను కోల్పోయెను. (భగవంతుని సమక్షమున అమహానుభావుడు తన అసువులను వీడెను.) (15-16)

'ఇంకను తెలుపుము-' అనుచు చేతులు జోడించి శ్రీరాముడు పదే పదే ఆత్రుతతో అడుగుచుండగా జటాయువుప్రాణములు అనంతవాయువులలో గలిసిపోయెను. అంతట అతనిశిరస్సు నేలకుఒరిగెను, కాళ్లు చాచుకొనెను, శరీరము తనంతట తానే భూమిపై పడిపోయెను.[1] (17-18)

ఎఱ్ఱబాఱిన కనులతో ఆసువులను వీడి, (కన్నులు తేలవేసియున్న) కొండవలెనున్న జటాయువును జూచి, శ్రీరాముడు కడుదుఃఖితుడై లక్ష్మణునితో ఇట్లు దైన్యవచనములను పలికెను. (19)

'రాక్షసులకు నివాసభూమియైన ఈదండకారణ్యమునందు పెక్కుసంవత్సరములు ఎట్టి భయము లేకుండ హాయిగా గడపిన ఈ పక్షిరాజు (జటాయువు) కడకు ఇచటనే ప్రాణములను విడిచెను. పెద్ద కాలము సుఖసంతోషములతో జీవించిన ఈ వృద్ధుడు నేడు ఈ విధముగా మృతిచెంది పడియున్నాడు. విధి నిర్ణయము దాటరానిది సుమా! (20-21)

ఓ లక్ష్మణా! ఇటు చూడుము, సీతాదేవిని కాపాడుటకై రావణుని ఎదిరించి, బలశాలియగు ఆ రాక్షసుని చేతిలో ఈ జటాయువు నిహతుడాయెను. ఇతడు మనకొనర్చిన మహోపకారము మఱువరానిది సుమా! జటాయువు సమస్తపక్షులకును ప్రభువు. ఇతడు తాతముత్తాతలనుండి తనకు సంక్రమించిన విశాలరాజ్యాధికారమును పరిత్యజించి, మనకు సహాయపడుటకై తనఅసువులనుసైతము అర్పించెను. ఓ సౌమిత్రీ! శూరులు, శరణువేడినవారిని రక్షించెడివారు, ధర్మనిరతులు ఐన సజ్జనులు అంతటను ఉందురు. ఈ ఉదాత్తగుణము పశుపక్ష్యాదులలోను గోచరించును. (22-24)

1) 'రావణునిచేతిలో తీవ్రముగా గాయపడి, ప్రాణాపాయస్థితికి గురియైన జటాయువు శ్రీరాముడు వచ్చెడివఱకు బ్రతికియుండుటకుగల కారణము సీతాదేవిఅనుగ్రహమే-' అని స్కాందపురాణము తెలుపుచున్నది.

శ్లో॥ దేవీ మాం ప్రాహ రాజేంద్ర! యావత్ సంభాషణం మమ।
భవతస్తావదాసన్ మే ప్రాణా ఇత్యాహ జానకీ॥

ఓ రామచంద్రప్రభూ! మీతో నేను సంభాషించువఱకు నా శరీరములో ప్రాణములు నిలిచియుండునని సీతాదేవి నన్ను అనుగ్రహించి యుండెను.- అని జటాయువు పలికెను.

సీతాహరణజం దుఃఖం న మే సౌమ్య! తథాగతమ్।
యథా వినాశే గృధ్రస్య మత్కృతే చ పరంతప!। 25

ఓ పరంతపా! ఓ సౌమ్యుడా! మనకొఱకై రణభూమికి తనప్రాణములనే బలియిచ్చిన ఈ త్యాగమూర్తి మృతివలన కలిగిన దుఃఖము సీతయెడబాటువలన కలిగిన బాధకంటెను నన్ను మిగుల పరితపింపజేయుచున్నది.[1] (25)

రాజా దశరథః శ్రీమాన్ యథా మమ మహాయశాః।
పూజనీయశ్చ మాన్యశ్చ తథాఽయం పతగేశ్వరః। 26

సౌమిత్రే! హర కాష్ఠాని నిర్మథిష్యామి పావకమ్।
గృధ్రరాజం దిధక్షామి మత్కృతే నిధనం గతమ్। 27

నాథం పతగలోకస్య చితామారోప్య రాఘవ!।
ఇమం ధక్ష్యామి సౌమిత్రే! హతం రౌద్రేణ రక్షసా। 28

సకలసద్గుణములతో సత్పురుషుడుగా మిగుల వాసిగాంచిన మనతండ్రియైన దశరథమహారాజువలె ఈ గృధ్రరాజు నాకు పూజ్యుడు, మాన్యుడు. ఓ సౌమిత్రీ! వెంటనే కొన్ని కట్టెలను తీసికొని రమ్ము. వాటిని మథించి అగ్నిని సిద్ధపఱచుదము. మనకొఱకై ప్రాణార్పణమొనర్చిన ఈ గృధ్రరాజునకు ఆఅగ్నితో దహనసంస్కారములను నెఱపుదము. ఓ లక్ష్మణా! దుష్టరావణునిచే నిహతుడైన పక్షిరాజుకళేబరమును చితిపై చేర్చి అంత్యక్రియలను నెఱపెదను. (26-28)

యా గతిర్యజ్ఞశీలానామ్ ఆహితాగ్నేశ్చ యా గతిః।
అపరావర్తినాం యా చ యా చ భూమిప్రదాయినామ్। 29

మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛ లోకాననుత్తమాన్।
గృధ్రరాజ! మహాసత్త్వ! సంస్కృతశ్చ మయా వ్రజ। 30

సత్త్వసంపన్నుడవైన ఓ గృధ్రరాజా! వివిధయజ్ఞములను నిత్యము దీక్షతో ఆచరించెడి గృహస్థులకును, తపశ్శీలురైన వానప్రస్థులకును, గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని అను మూడు అగ్నులయందును నిరంతరము హోమకార్యములను నిర్వర్తించెడి సత్పురుషులకును, యుద్ధమున వెన్నుచూపనివారికిని, సన్న్యాసులకును, పంటపొలములను దానముచేయువారికిని, జితేంద్రియులైన (భోగములను త్యజించిన) నిష్ఠాపరులకును ప్రాప్తించెడి పునరావృత్తిరహితమైన (పునర్జన్మలేని) ఉత్తమలోకములు నీకును ప్రాప్తించును. నాచేదహన సంస్కారములను పొందినందున నీవు మోక్షప్రాప్తికి అర్హుడవు."[2] (29-30)

1) జటాయుషో దీనదశాం విలోక్య, ప్రియావియోగప్రభవం చ శోకమ్।
యో వై విసస్మార తమార్తచిత్తం శ్రీజానకీజీవనమానతోఽ స్మి॥

1) జటాయువునకు మోక్షార్హత - అపరావర్తినాం సద్గతిః. అపరావర్తీ = రణాత్ అపలాయితా = రణరంగమున వెన్నుచూపనివాడు. లోకోపకారార్థము వీరధర్మమును అనుసరించి, వెన్నుచూపక ప్రాణములకుతెగించి రావణునితో పోరాడినవాడు జటాయువు. కావున ఇతడు సద్గతిని పొందుటకు అర్హుడు.

భగవద్భక్తానాం సర్వప్రాణినాం మోక్షాధికారస్య గమ్యమానత్వాచ్చ - భగవద్భక్తిగల (నిష్ఠతో నిరంతరము భగవత్సేవయొనర్చెడి) సమస్త ప్రాణులకును మోక్షప్రాప్తికి అర్హతగలదు. అందువలన రామభక్తులలో ప్రముఖుడైన జటాయువునకు మోక్షమును పొందెడియోగ్యత గలదు.

ఇచట నృసింహపురాణమునందలి విషయమును స్మరించుట యుక్తము -

శ్లో ॥ మత్కృతే నిధనం యస్మాత్, త్వయా ప్రాప్తం ద్విజోత్తమ! ।
తస్మాన్మమప్రసాదేన విష్ణులోకమ్ అవాప్స్యసి ॥

ఓ పక్షిరాజా! నీవు నాకొఱకై అసువులను అర్పించితివి. కావున నీవు నా అనుగ్రహమువలన విష్ణులోకమును పొందగలవు. అని శ్రీరాముడు జటాయువుతో స్వయముగా పలికియుండెను.

(2) తననుగూర్చి 'ఆత్మానం మానుషం మన్యే' (నేను మానవమాత్రుడను) అని పేర్కొన్న శ్రీరాముడు మోక్షమును ఎట్లు ప్రసాదించును? 'సత్యేన లోకాన్ జయతి' అను ప్రమాణవచనమునుసరించి సత్యనిష్ఠాగరిష్ఠుడైనందున శ్రీరామునకు సర్వలోకములును అధీనములో ఉండును - కనుక శ్రీరాముడు మోక్షమును అనుగ్రహించుటలో విప్రతిపత్తి లేదు.

ఏవముక్త్వా చితాం దీప్తామ్ ఆరోప్య పతగేశ్వరమ్।
దదాహ రామో ధర్మాత్మా స్వబంధుమివ దుఃఖితః। 31

రామోఽథ సహసౌమిత్రిః వనం గత్వా స వీర్యవాన్।
స్థూలాన్ హత్వా మహారోహీన్ అనుతస్తార తం ద్విజమ్। 32

రోహిమాంసాని చోత్కృత్య పేశీకృత్య మహాయశాః।
శకునాయ దదౌ రామో రమ్యే హరితశాద్వలే। 33

యత్తత్ ప్రేతస్య మర్త్యస్య కథయంతి ద్విజాతయః।
తత్ స్వర్గగమనం తస్య పిత్ర్యం రామో జజాప హ। 34

తతో గోదావరీం గత్వా నదీం నరవరాత్మజౌ।
ఉదకం చక్రతుస్తస్మై గృధ్రరాజాయ తావుభౌ। 35

శాస్త్రదృష్టేన విధినా జలే గృధ్రాయ రాఘవౌ।
స్నాత్వా తౌ గృధ్రరాజాయ ఉదకం చక్రతుస్తదా। 36

స గృధ్రరాజః కృతవాన్ యశస్కరం
సుదుష్కరం కర్మ రణే నిపాతితః।
మహర్షికల్పేన చ సంస్కృతస్తదా
జగామ పుణ్యాం గతిమాత్మనః శుభామ్। 37

కృతోదకౌ తావపి పక్షిసత్తమే
స్థిరాం చ బుద్ధిం ప్రణిధాయ జగ్మతుః।
ప్రవేశ్య సీతాధిగమే తతో మనో
వనం సురేంద్రావివ విష్ణువాసవౌ। 38

ఇట్లు పలికిన పిమ్మట ధర్మాత్ముడైన శ్రీరాముడు చితిపై ఉంచబడిన పక్షిరాజకళేబరమునకు (జటాయువునకు) అగ్నిసంస్కారములనొనర్చి, ఆత్మబంధువును కోల్పోయినరీతిగా మిగుల దుఃఖించెను.[1] (31)

అనంతరము మహాపరాక్రమశాలియైన శ్రీరాముడు లక్ష్మణునితో గూడి వనమునకు వెళ్ళి, కందమూల ఫలములను తీసికొనివచ్చెను. పిదప వాటిని జటాయువునకు అర్పించుటకై నేలపై దర్భలను పఱచెను. మహాయశస్వియైన శ్రీరాముడు ఆ కందమూలములగుజ్జుతో పిండములను జేసెను. వాటిని పచ్చని దర్భలపైనుంచి జటాయువునకు పిండప్రదానము చేసెను- (32-33)

చనిపోయినవారికి స్వర్గప్రాప్తికై బ్రాహ్మణులు పఠించెడి యామ్యసూక్తాది (పితృదేవతలకు సంబంధించిన) మంత్రములను శ్రీరాముడు జపించెను (పఠించెను.)(34)

పిమ్మట రామలక్ష్మణులు ఇరువురును గోదావరినదికి వెళ్ళి జటాయువునకు సద్గతులు ప్రాప్తించుటకై జలతర్పణములను విడిచిరి. రాఘవులు ఇద్దఱును నదిలో స్నానమాచరించి, జటాయుమోక్షప్రాప్తికై శాస్త్రోక్త ప్రకారము ఉదకశాంతి మున్నగు విధులను నిర్వర్తించిరి.(35-36)

జటాయువు సీతాదేవిని రక్షించుటకై మిక్కిలి కష్టసాధ్యమైన, యశస్కరమైన పరాక్రమమును ప్రదర్శించి, యుద్ధమున రావణునిచే హతుడయ్యెను. మహర్షితుల్యుడైన శ్రీరాముడు అతనికి దహనసంస్కారములనొనర్చుటచే జటాయువునకు ఆత్మశాంతి, పుణ్యగతులు ప్రాప్తించెను. (37)

తర్పణాదికములను ముగించిన పిమ్మట ఆ ఇరువురుసోదరులు జటాయువుపై పరమ విశ్వాసముంచి, సీతాదేవిని అన్వేషించెడి కార్యమునకు పూనుకొనిరి. దేవతాశ్రేష్ఠులైన విష్ణుపురందరులవలె వారు వనములో పురోగమించిరి. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే అష్టషష్టితమస్సర్గః *(68)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదిఎనిమిదవసర్గము.

-- * * * --

(1) "వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః"- ఆపదలు ముసురుకొనినప్పుడు మానవులు దుఃఖముతో క్రుంగిపోవుదురు - ఇది మానవసహజలక్షణము - కాని శ్రీమహావిష్ణువు యొక్క అవతారమేయైన శ్రీరాముడు నిగ్రహానుగ్రహసంపన్నుడుగదా! ఆ స్థితప్రజ్ఞుడు భరతునికై సంతప్తుడగుటయు, సీతయెడబాటునకు కుమిలిపోవుటయు, జటాయుమృతికి విలపించుటయు ఎంతవఱకు సమంజసము?

శ్రీరాముడు అవతారపురుషుడే (సర్వేశ్వరుడే). ఆ మహాత్ముడు ఆశ్రితవత్సలుడు. కనుక అతడు 'దుఃఖితాన్ ఆశ్రితాన్ ఆకలయ్య తద్దుఃఖేన స్వయమపి దుఃఖిత ఇవ ఆభాతి - తేషాం దుఃఖం అపనయతి.'

కనుక తనను శరణుగోరినవారు, తనభక్తులు దుఃఖములకు గుఱియైనప్పుడు మాయామానుషవిగ్రహుడైన అతడును వారి దుఃఖములలో పాలుపంచుకొనును, ఆ విధముగా వారిదుఃఖములను తొలగించును.' అని త్రికాలవేత్తలైన మహర్షులు తెలిపిరి.

69. అఱువదితొమ్మిదవసర్గము

రామలక్ష్మణులు దండకవనమును, క్రౌంచారణ్యమును దాటి ముందునకు సాగుట - 'అయోముఖి' అను రాక్షసి దారిలో వారికి అడ్డువచ్చి, అసభ్యముగా ప్రవర్తింపగా లక్ష్మణుడు ఆమె ముక్కు చెవులను కోయుట - ఆమె పాఱిపోవుట - 'కబంధుడు అను రాక్షసుని చేతులలో బంధింపబడినప్పుడు లక్ష్మణుడు వ్యథ చెందుట - శ్రీరాముడు ఆయనకు ధైర్యము చెప్పుట -

కృత్వైవముదకం తస్మై ప్రస్థితౌ రామలక్ష్మణౌ।
అవేక్షంతౌ వనే సీతాం పశ్చిమాం జగ్మతుర్దిశమ్॥ 1

తాం దిశం దక్షిణాం గత్వా శరచాపాసిధారిణౌ।
అవిప్రహతమైక్ష్వాకౌ పంథానం ప్రతిపేదతుః॥ 2

గుల్మైర్వృక్షైశ్చ బహుభిః లతాభిశ్చ ప్రవేష్టితమ్।
ఆవృతం సర్వతో దుర్గం గహనం ఘోరదర్శనమ్॥ 3

వ్యతిక్రమ్య తు వేగేన వ్యాళసింహనిషేవితమ్।
సుభీమం తన్మహారణ్యం వ్యతియాతౌ మహాబలౌ॥ 4

తతః పరం జనస్థానాత్ త్రిక్రోశం గమ్య రాఘవౌ।
క్రౌంచారణ్యం వివిశతుః గహనం తౌ మహౌజసౌ॥ 5

నానామేఘఘనప్రఖ్యం ప్రహృష్టమివ సర్వతః।
నానాపక్షిగణైర్జుష్టం నానావ్యాళమృగైర్యుతమ్॥ 6

దిదృక్షమాణౌ వైదేహీం తద్వనం తౌ విచిక్యతుః।
తత్ర తత్రావతిష్ఠంతౌ సీతాహరణకర్శితౌ॥ 7

తతః పూర్వేణ తౌ గత్వా త్రిక్రోశం భ్రాతరౌ తదా।
క్రౌంచారణ్యమతిక్రమ్య మతంగాశ్రమమంతరా॥ 8

దృష్ట్వా తు తద్వనం ఘోరం బహుభీమమృగద్విజమ్।
నానాసత్త్వసమాకీర్ణం సర్వం గహనపాదపమ్॥ 9

దదృశాతే తు తౌ తత్ర దరీం దశరథాత్మజౌ।
పాతాళసమగంభీరాం తమసా నిత్యసంవృతామ్॥ 10

ఆసాద్య తౌ నరవ్యాఘ్రౌ దర్యాస్తస్యావిదూరతః।
దదృశాతే మహారూపాం రాక్షసీం వికృతాననామ్॥ 11

రామలక్ష్మణులు జటాయువునకు జలతర్పణములను విడిచిన పిమ్మట ఆఇరువురును వనములలో సీతాదేవిని వెదకుచు నైరృతిదిశగా ముందునకు సాగిరి. ధనుర్బాణములను, ఖడ్గములను ధరించియున్న ఆ ఇక్ష్వాకువంశపురాజకుమారులు ఇద్దఱును నైరృతిదిశయందు వెళ్ళుచు, ఇంతవఱకు ఎవ్వరును అడుగిడని మార్గమున ప్రవేశించిరి. (1-2)

వారు ప్రవేశించిన ఆ అరణ్యమునందు పెక్కుపొదలు, వృక్షములు, తీగెలు దట్టముగా అలముకొని యుండుటచే అందు కాలుమోపుటకును వీలులేకుండెను. అది చూచుటకు భయంకరముగానుండెను. అందు పెద్దపులులు, సింహములు సంచరించుచుండెను. మిక్కిలి పరాక్రమవంతులైన ఆ రాజకుమారులు ఆభీకరారణ్యమును దాటి వేగముగా పురోగమించిరి. (3-4)

తేజోమూర్తులైన ఆరామలక్ష్మణులు దండకారణ్యమునుండి మూడుక్రోసులదూరము పయనించి, దట్టమైన క్రౌంచారణ్యమునకు చేరిరి. ఆవనమునందలి పలువన్నెల వృక్షములన్నియును రంగురంగుల మేఘములవలె శోభిల్లుచుండెను. బాగుగా వికసించినపూవులతో నిండి, ఆ అరణ్యము కలకలలాడుచుండెను. అది వివిధజాతులపక్షులతో, సర్పములతో, మృగములతో నిండియుండెను. సీతా వియోగ దుఃఖముతో కృశించియున్న ఆ ఇరువురును వైదేహిజాడకై అక్కడక్కడ ఆగుచు ఆవనమునంతయును గాలించిరి. (5-7)

పిమ్మట ఆసోదరులిద్దరును క్రౌంచారణ్యమును దాటి, మూడు క్రోసుల దూరము నడచిన పిమ్మట వారు ఒక వనమును చూచిరి. అది క్రౌంచాటవికిని మతంగాశ్రమమునకును మధ్యగలదు - మతంగాశ్రమమునకు తూర్పునగల ఆదట్టమైన వనము క్రూరమృగములతో, పక్షులతో నిండి భీకరముగా ఉండెను. మఱియు ఇతర జంతువులును ఆవనమునందంతటను సంచరించుచుండెను. అచట వారికి ఒక గుహ కనబడెను. పాతాళలోకమువలె గంభీరమై (అంతులేనిదై) యున్న ఆ గుహ ఎల్లప్పుడును చిమ్మచీకట్లతో నిండియుండును. (8-10)

ఆనరశ్రేష్ఠులు గుహకడకు చేరగా దానికి సమీపముననే వారికి మిక్కిలి స్థూలశరీరముగల ఒక రాక్షసి కనబడెను. వికృతముగానున్న దానిముఖమును జూచి చిన్న జంతువులన్నియును మిక్కిలి భీతిల్లుచుండెను. వ్రేలాడుచున్న

భయదామల్పసత్త్వానాం బీభత్సాం రౌద్రదర్శనామ్।
లంబోదరీం తీక్ష్ణదంష్ట్రాం కరాళాం పరుషత్వచమ్। 12

భక్షయంతీం మృగాన్ భీమాన్ వికటాం ముక్తమూర్ధజామ్।
ప్రైక్షేతాం తౌ తతస్తత్ర భ్రాతరౌ రామలక్ష్మణౌ। 13

సా సమాసాద్య తౌ వీరౌ వ్రజంతం భ్రాతురగ్రతః।
ఏహి రంస్యావహేత్యుక్త్వా సమాలంబత లక్ష్మణమ్। 14

ఉవాచ చైనం వచనం సౌమిత్రిముపగుహ్య సా। 15

అహం త్వయోముఖీ నామ లాభస్తే త్వమసి ప్రియః।
నాథ! పర్వతకూటేషు నదీనాం పులినేషు చ।
ఆయుశ్శేషమిమం వీర! త్వం మయా సహ రంస్యసే। 16

ఏవముక్తస్తు కుపితః ఖడ్గముద్ధృత్య లక్ష్మణః।
కర్ణనాసే స్తనౌ చాస్యా నిచకర్తారిసూదనః। 17

కర్ణనాసే నికృత్తే తు విస్వరం సా వినద్య చ।
యథాగతం ప్రదుద్రావ రాక్షసీ భీమదర్శనా। 18

తస్యాం గతాయాం గహనం వ్రజంతౌ వనమోజసా।
ఆసేదతురమిత్రఘ్నౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ। 19

లక్ష్మణస్తు మహాతేజాః సత్త్వవాన్ శీలవాన్ శుచిః।
అబ్రవీత్ ప్రాంజలిర్వాక్యం భ్రాతరం దీప్తతేజసమ్। 20

స్పందతే మే దృఢం బాహుః ఉద్విగ్నమివ మే మనః।
ప్రాయశశ్చాప్యనిష్టాని నిమిత్తాన్యుపలక్షయే। 21

తస్మాత్ సజ్జీభవాఽఽర్య! త్వం కురుష్వ వచనం హితమ్।
మమైవ హి నిమిత్తాని సద్యః శంసంతి సంభ్రమమ్। 22

ఏష వంచులకో నామ పక్షీ పరమదారుణః।
ఆవయోర్విజయం యుద్ధే శంసన్నివ వినర్దతి। 23

తయోరన్వేషతోరేవం సర్వం తద్వనమోజసా।
సంజజ్ఞే విపులః శబ్దః ప్రభంజన్నివ తద్వనమ్। 24

పొట్టతో, తీక్ష్ణములైన కోఱలతో, కర్కశముగా ఉన్న చర్మముతో అది చూచువారికి భయమును గొల్పుచుండెను. (11-12)

చింపిరిజుట్టుతో, అతిస్థూలకాయముతో ఒప్పుచు పెద్ద పెద్ద మృగములను భక్షించుచున్న ఆ రాక్షసిని రామలక్ష్మణులు చూచిరి. (13)

అంతట ఆరక్కసి ఆవీరులను సమీపించి (శ్రీరామునకు) ముందుభాగమున నడచుచున్న లక్ష్మణుని తన చేతులలోనికి దీసికొని, 'రమ్ము, క్రీడింతము' అని పలుకుచు అతని చేతులను పట్టుకొనెను. (14-15)

పిమ్మట ఆమె సౌమిత్రితో 'ఓ యువకుడా! నీఅదృష్టమువలన నీకు నేను లభించితిని. నీవు నాకు ప్రియుడవు. నా పేరు అయోముఖి, నాథా! ఓ వీరా! పర్వత శిఖరములమీదను, నదీతీరములయందలి ఇసుకతిన్నెలపైనను జీవితాంతమువఱకునునాతోగూడి రమింపుము-' అని పల్కెను.(16)

అంతట అరిసూదనుడైన లక్ష్మణుడు కుపితుడై, ఖడ్గమును దీసికొని, ఆరక్కసియొక్క ముక్కు, చెవులను, స్తనములను కోసివేసెను. (17)

ముక్కుచెవులు తెగిపోగా భయంకరస్వరూపముగల ఆ రాక్షసి వికృతస్వరముతో పెడబొబ్బలుపెట్టుచు వచ్చిన త్రోవనే పరుగులుదీసెను. (18)

ఆరక్కసి వెళ్లిపోయిన పిమ్మట శత్రుసంహారసమర్థులైన రామలక్ష్మణులు ఇద్దఱును ముందుకు నడచుచు ఒక కీకారణ్యమునకు చేరిరి. (19)

మహాతేజస్వియు, మిగులబలశాలియు, ఉత్తమశీలము గలవాడును, పవిత్రుడును ఐన లక్ష్మణుడు మిక్కిలి పరాక్రమవంతుడైన అన్నకు నమస్కరించి, ఆయనతో ఇట్లు నుడివెను. (20)

"అగ్రజా! నాయెడమభుజము అదురుచున్నది. నామనస్సు తత్తరపడుచున్నది. ఇంకను అనిష్టసూచకములైన పెక్కుఅపశకునములు గోచరించుచున్నవి. ఆర్యా! ఈ అపశకునములన్నియును ఇప్పుడు నాకు ఏదో ఆపద రానున్నట్లు తెలుపుచున్నవి. కనుక నా పలుకులను ఆలకించి, విపత్తును ఎదుర్కొనుటకు సర్వసన్నద్ధుడవై యుండుము. (21-22)

మిక్కిలి భయంకరమైన వంచులకము (కర్ణవాలము) అను పక్షి పెద్దగా అఱచుచున్నది. ఇది మనకు యుద్ధమున విజయసూచకము. (23)

ఆ ఇరువురును సీతాదేవికొఱకై శక్తికొలది ఆవనమును గాలించుచుండగా ఆ అరణ్యమును బ్రద్దలు గావించుచున్నదా యనునట్లు, దద్దరిల్లజేయుచు, ఒక మహాధ్వని వినబడెను.(24)

సంవేష్టితమివాత్యర్థం గగనం మాతరిశ్వనా।
వనస్య తస్య శబ్దో౾భూత్ దివమ్ ఆపూరయన్నివ। 25

తం శబ్దం కాంక్షమాణస్తు రామః కక్షే సహానుజః।
దదర్శ సుమహాకాయం రాక్షసం విపులోరసమ్। 26

ఆసేదతుస్తతస్తత్ర తావుభౌ ప్రముఖే స్థితమ్।
వివృద్ధమ్ అశిరోగ్రీవం కబంధముదరే ముఖమ్। 27

రోమభిర్నిచితైస్తీక్ష్ణైః మహాగిరిమివోచ్ఛ్రితమ్।
నీలమేఘనిభం రౌద్రం మేఘస్తనితనిఃస్వనమ్। 28

అగ్నిజ్వాలానికాశేన లలాటస్థేన దీప్యతా।
మహాపక్ష్మేణ పింగేన విపులేనాయతేన చ। 29

ఏకేనోరసి ఘోరేణ నయనేనాశుదర్శినా।
మహాదంష్ట్రోపపన్నం తల్లేలిహానం మహాముఖమ్। 30

భక్షయంతం మహాఘోరాన్ ఋక్షసింహమృగద్విపాన్।
ఘోరౌ భుజౌ వికుర్వాణమ్ ఉభౌ యోజనమాయతౌ। 31

కరాభ్యాం వివిధాన్ గృహ్య ఋక్షాన్ పక్షిగణాన్ మృగాన్।
ఆకర్షంతం వికర్షంతమ్ అనేకాన్ మృగయూథపాన్।
స్థితమావృత్య పంథానం తయోర్భ్రాత్రోః ప్రపన్నయోః। 32

అథ తౌ సమతిక్రమ్య క్రోశమాత్రే దదర్శతుః।
మహాంతం దారుణం భీమం కబంధం భుజసంవృతమ్। 33

కబంధమివ సంస్థానాత్ అతిఘోరప్రదర్శనమ్। 34

స మహాబాహురత్యర్థం ప్రసార్య విపులౌ భుజౌ।
జగ్రాహ సహితావేవ రాఘవౌ పీడయన్ బలాత్। 35

అప్పుడు తెలరేగిన ఒక ప్రచండవాయువు గగనమువఱకు వ్యాపించుచున్నట్లు వీచెను. ఆవనమునుండి బయల్వెడలిన శబ్దము అంతరిక్షమువఱకు ప్రతిధ్వనించెను.(25)

'ఈ శబ్దము ఎక్కడినుండి వచ్చినది?, అని దానినిగూర్చి తెలిసికొనగోరినవాడై, శ్రీరాముడు లక్ష్మణునితో గూడి కొంత ముందుకు నడచెను. పిమ్మట అతడు దూరమునగల పాదయందు మహాకాయుడైన ఒక రాక్షసుని గాంచెను. అతనివక్షస్థలము విశాలముగానుండెను. (26)

పిమ్మట ఆఇద్దఱును తమఎట్టయెదుట కనబడుచున్న కబంధుని జూచిరి. ఆ మహోన్నతకాయునితల, మెడ కనబడకుండెను. ముఖము ఉదరభాగముననుండెను. అతనిశరీరమంతయు నిక్కపొడుచుకొని మొనదేలియున్నవెంట్రుకలతో నిండియుండుటచే అతడొక మహాగిరివలె కన్పట్టు చుండెను. నల్లని మేఘమువలె రౌద్రాకారము గలిగియుండెను. అతనిస్వరము మేఘగర్జనవలె దడపుట్టించుచుండెను. అతని లలాటము వక్షఃస్థలముననుండెను. అందు విశాలమైన ఒకే కన్ను ఉండెను. దానిరెప్పవెంట్రుకలు పచ్చని రంగు గలిగియుండెను. ఆతనినేత్రము అగ్నిజ్వాలవలె భయంకరముగా ప్రకాశించుచుండెను. అది దూరమునగల వస్తువును సైతము చూడగలదు. అతనికోఱలు పొడవైనవి. అతడు పదేపదే నాలుకతో చప్పరించుచుండెను. (27-30)

ఆ కబంధుడు మిక్కిలి క్రూరజంతువులైన ఎలుగుబంట్లను, సింహములను, పెద్దపులులను, ఏనుగులను భక్షించుచుండెను. అతనిరెండుభుజములును (చేతులును) యోజనము వఱకు వ్యాపించియుండెను. అట్టి చేతులతో అతడు ఎలుగుబంట్లను, పక్షులగుంపులను, మృగములను లాగికొనుచుండెను. పెక్కు మృగములగుంపులను ఈడ్చుకొనివచ్చుచుండెను. అట్టి ఆ కబంధుడు తనసమీపమునకు వచ్చిన రామలక్ష్మణులదారిని అడ్డగించినిలిచెను. (31-32)

అంతట ఆఇరువురును ఒక క్రోసెడుదూరము ముందునకు నడచి, తమకెదురుగా మహాకాయము గలిగి మిగుల భయంకరముగానున్న కబంధునిజూచిరి. ఆ రాక్షసుడు తనరెండుచేతులతోడను మృగములను లాగుకొనుచుండెను. శిరస్సులేకుండ కేవలము మొండెముతో ఉన్న అతని ఆకారము చూచుటకు ఘోరముగానుండెను. (33-34)

మహాబాహువైన ఆకబంధుడు మిక్కిలిపొడవైన తనచేతులను బాగుగా చాచి రామలక్ష్మణులను ఇద్దఱిని ఒక్కసారిగా పట్టుకొని బలముకొలది వారిని పీడించుచు తనకడకు లాగికొనెను. (35)

ఖడ్గినౌ దృఢధన్వానౌ తిగ్మతేజోవపుర్ధరౌ ।
భ్రాతరౌ వివశం ప్రాప్తౌ కృష్యమాణౌ మహాబలౌ । 36

తత్ర ధైర్యేణ శూరస్తు రాఘవో నైవ వివ్యథే ।
బాల్యాదనాశ్రయత్వాచ్చ లక్ష్మణస్త్వతివివ్యథే ।
ఉవాచ చ విషణ్ణః సన్ రాఘవం రాఘవానుజః । 37

పశ్య మాం వీర! వివశం రాక్షసస్య వశం గతమ్ ।
మయైకేన వినిర్యుక్తః పరిముంచస్వ రాఘవ! । 38

మాం హి భూతబలిం దత్త్వా పలాయస్వ యథాసుఖమ్ । 39

అధిగంతాసి వైదేహీమ్ అచిరేణేతి మే మతిః । 40

ప్రతిలభ్య చ కాకుత్స్థ! పితృపైతామహీం మహీమ్ ।
తత్ర మాం రామ! రాజ్యస్థః స్మర్తుమర్హసి సర్వదా । 41

లక్ష్మణేనైవముక్తస్తు రామః సౌమిత్రిమబ్రవీత్ ।
మాస్మ త్రాసం కృథా వీర! నహి త్వాదృగ్విషీదతి । 42

ఏతస్మిన్నంతరే క్రూరో భ్రాతరౌ రామలక్ష్మణౌ ।
పప్రచ్ఛ ఘననిర్ఘోషః కబంధో దానవోత్తమః । 43

కౌ యువాం వృషభస్కంధౌ మహాఖడ్గధనుర్ధరౌ ।
ఘోరం దేశమిమం ప్రాప్తౌ మమ భక్షావుపస్థితౌ । 44

వదతం కార్యమిహ వాం కిమర్థం చాగతౌ యువామ్ ।
ఇమం దేశమ్ అనుప్రాప్తౌ క్షుధార్తస్యేహ తిష్ఠతః । 45

సబాణచాపఖడ్గౌ చ తీక్ష్ణశృంగావివర్షభౌ ।
మమాఽస్యమ్ అనుసంప్రాప్తౌ దుర్లభం జీవితం పునః । 46

తస్య తద్వచనం శ్రుత్వా కబంధస్య దురాత్మనః ।
ఉవాచ లక్ష్మణం రామో ముఖేన పరిశుష్యతా । 47

మహాతేజోమూర్తులు, మిగుల బలశాలురు ఐన ఆ అన్నదమ్ములు ఖడ్గములను, ధనుర్బాణములను ధరించి యుండిరి. అతడు వారిని అట్లు లాగుచుండగా ఆ ఇరువురును స్పృహను కోల్పోయిరి. (36)

అప్పుడు మహాశూరుడైన శ్రీరాముడు ధైర్యముతో ఏమాత్రము వ్యథచెందలేదు. కాని బాలుడైన లక్ష్మణుడు మాత్రము తనకు సర్వదా అండగానుండెడి అన్నగూడ రక్కసునిచేతిలో చిక్కుపడుటవలన ధైర్యమును కోల్పోయి మిక్కిలి వ్యథచెందెను- విషణ్ణవదనుడైయున్న సౌమిత్రి అన్నతో ఇట్లు నుడివెను. (37)

"మహావీరుడవైన ఓ రామచంద్రా! రాక్షసునిచేతులకు చిక్కి నేను అశక్తుడనైయుంటిని. నన్నుగూర్చి ఆలోచింపక (నన్ను ఆదుకొనుటకై ఆగిపోక) ఈ రాక్షసునిబారినుండి, నీవు బయటపడుము. నన్ను ఈ రాక్షసునకు ఆహారముగాజేసి, నీవు వెంటనే హాయిగా వెళ్లిపొమ్ము. త్వరలోనే నీవు సీతాదేవిని పొందగలవని నేను తలంచుచున్నాను. (38-40)

ఓ కాకుత్స్థా! రామా! తాతముత్తాతలనుండి మనకు సంక్రమించిన కోసలరాజ్యాధికారమును తిరిగి నీవు పొందుము. ఆ రాజ్యపాలన (భారము)లో మునిగిపోయినను నన్నుమాత్రము ఎల్లప్పుడును గుర్తుంచుకొనుము. (నన్నుమాత్రము మఱువకుము.)" (41)

లక్ష్మణుడు ఇట్లు పలికిన పిమ్మట శ్రీరాముడు అతనిని ఓదార్చుచు ఇట్లనెను. "నాయనా! ఓవీరా! నీవు ఏమాత్రము భయపడకుము. నీవంటివాడు ఇట్లు కలతచెందరాదు సుమా!' (42)

ఇంతలో క్రూరుడు, దానవశ్రేష్ఠుడు ఐన కబంధుడు పెద్దగా గర్జించుచు (మహాధ్వనియొనర్చుచు) సోదరులైన ఆరామలక్ష్మణులను ఇట్లు అడిగెను. (43)

"ఓ యువకులారా! వృషభములకువలె బలిష్ఠములైన మూపులుగల మీరు ఎవరు? ధనుర్బాణములను, మహాఖడ్గములను ధరించి ఇచటికి ఏలవచ్చితిరి? ఇది ప్రమాదకరమైనప్రదేశము. మీరు నాకు ఆహారమగుటకే ఇటువచ్చినట్లున్నారు. మీరు ఇక్కడికి వచ్చిన పనియేమో తెలుపుడు. ఆకలితో నకనకలాడుచున్న నాకు ఆహారమగుటకే మీరు ఇచటికి వచ్చితిరి. వాడియైన కొమ్ములుగల కోడెలవలెనున్న మీరు ధనుర్బాణములను, ఖడ్గములను ధరించియుంటిరి. మీరు ఇటువచ్చి నానోటికి చిక్కితిరి. ఇక మీ జీవితములు ముగిసినట్లే." (44-46)

దుష్టబుద్ధియైన ఆ కబంధునిమాటలు వినిన పిమ్మట శ్రీరాముడు విచారవదనుడై లక్ష్మణునితో ఇట్లుపలికెను.(47)

కృచ్ఛ్రాత్ కృచ్ఛ్రతరం ప్రాప్య దారుణం సత్యవిక్రమ।
వ్యసనం జీవితాంతాయ ప్రాప్తమ్ అప్రాప్య తాం ప్రియామ్। 48

కాలస్య సుమహద్వీర్యం సర్వభూతేషు లక్ష్మణ!।
త్వాం చ మాం చ నరవ్యాఘ్ర! వ్యసనైః పశ్య మోహితౌ। 49

నాఽతిభారోఽస్తి దైవస్య సర్వభూతేషు లక్ష్మణ!।
శూరాశ్చ బలవంతశ్చ కృతాస్త్రాశ్చ రణాజిరే।
కాలాభిపన్నాః సీదంతి యథా వాలుకసేతవః। 50

ఇతి బ్రువాణో దృఢసత్యవిక్రమో
మహాయశా దాశరథిః ప్రతాపవాన్ ।
అవేక్ష్య సౌమిత్రిముదగ్రపౌరుషం
స్థిరాం తదా స్వాం మతిమాత్మనాఽకరోత్। 51

"తిరుగులేని పరాక్రమముగల ఓ సౌమిత్రీ! ఎంతగా వెదకినను సీతాదేవి కనబడలేదు. పైగా ఆమెజాడ తెలియకముందే ఇప్పుడు మనప్రాణములకే ముప్పు ఏర్పడినది. ఒకదానితరువాత మఱియొకటిగా దారుణములైన కష్టములు మనలను వెంటాడుచున్నవి.[1] ఎంతటి వారికైనను కాలప్రభావము అధిగమింపరానిది సుమా! ఓనరశ్రేష్ఠా! ఈ కష్టపరంపరలు నిన్నును, నన్నును ఎట్లు ఆవరించుచున్నవో చూడుము. తమ్ముడా! ఇసుకతో కట్టిన అడ్డుకట్టలు ఎంతటివైనను అవి నీటి వేగమునకు కూలిపోకమానవు. అట్లే పరాక్రమవంతులు, బలశాలురు, అస్త్రవిద్యలలో ఆఱితేఱినవారుకూడ కాలమునకు వశులై కష్టములపాలగుదురు. ఎట్టి ప్రాణులనైనను శాసించుటకు దైవమునకు (కాలమునకు) కష్టము (భారము) కాదు." (48-50)

చెక్కుచెదరని పరాక్రమముగలవాడు, మిక్కిలి వాసికెక్కిన వాడు, ప్రతాపవంతుడు ఐన శ్రీరాముడు పౌరుషముతో ఉత్తేజితుడైన లక్ష్మణునిజూచి, తనమనస్సును దిటవు చేసికొనెను. (51)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకోనసప్తతితమస్సర్గః (69)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది అఱువదితొమ్మిదవసర్గము

— ✻ ✻ ✻ —

70. డెబ్బదియవసర్గము

కబంధుడు రామలక్ష్మణులను భక్షించుటకు సిద్ధపడుట - సమయస్ఫూర్తితో వారు అతని బాహువులను ఖండించివేయుట - అప్పుడు ఆ రాక్షసునకు కనువిప్పు కలుగగా అతడు రామలక్ష్మణులను ప్రశంసించుట -

తౌ తు తత్ర స్థితౌ దృష్ట్వా భ్రాతరౌ రామలక్ష్మణౌ।
బాహుపాశపరిక్షిప్తౌ కబంధో వాక్యమబ్రవీత్। 1

తనచేతులలో చిక్కియున్న సోదరులగు రామలక్ష్మణులను జూచి, కబంధుడు వారితో ఇట్లునుడివెను. (1)

తిష్ఠతః కిన్ను మాం దృష్ట్వా క్షుధార్తం క్షత్రియర్షభౌ।
ఆహారార్థం తు సందిష్టౌ దైవేన గతచేతసౌ। 2

ఓ క్షత్త్రియశ్రేష్ఠులారా! నేను ఆకలిగొనియుండుటను చూచియు, ఇంకను మీరు అక్కడనే ఆగియున్నారేమి? నాకు మిమ్ములను ఆదేవుడే ఆహారముగా పంపినాడు. ఇక మీబుద్ధి పనిచేయదు. (ఆలోచించి లాభము లేదు) (2)

తచ్ఛ్రుత్వా లక్ష్మణో వాక్యం ప్రాప్తకాలం హితం తదా।
ఉవాచాఽర్తిం సమాపన్నో విక్రమే కృతలక్షణః। 3

ఆ రాక్షసునిమాటలను విని, లక్ష్మణుడు మిగుల దుఃఖితుడయ్యెను. తనసహజమైన పరాక్రమమును కూడగట్టుకొనినవాడై, సమయోచితముగా ఇట్లు హితవచనములను పలికెను. (3)

త్వాం చ మాం చ పురా తూర్ణమ్ ఆదత్తే రాక్షసాధమః।
తస్మాదసిభ్యామస్యాశు బాహూ ఛిందావహై గురూ। 4

"అన్నా! ఈరాక్షసుడు నిన్నూ, నన్నూ తిని వేయకముందే ఇప్పుడే మనము ఖడ్గములతో వీని పొడవైన బాహువులను ఖండించివేయుదము. (4)

---

1) రాజ్యాధికారము దూరమగుట, వనవాసము ప్రాప్తించుట, సీతాదేవి అపహరణకు గుఱియగుట, వీటికితోడు ఇప్పుడు కబంధునిచేతులలో చిక్కుపడుట - ఇవి యన్నియు రామలక్ష్మణులకు కలిగిన కష్టపరంపరలు.

భీషణోఽయం మహాకాయో రాక్షసో భుజవిక్రమః।
లోకం హ్యతిజితం కృత్వా హ్యావాం హంతుమిహేచ్ఛతి। 5

నిశ్చేష్టానాం వధో రాజన్ కుత్సితో జగతీపతేః।
క్రతుమధ్యోపనీతానాం పశూనామివ రాఘవ। 6

ఏతత్ సంజల్పితం శ్రుత్వా తయోః క్రుద్ధస్తు రాక్షసః।
విదార్యాఽఽస్యం తదా రౌద్రః తౌ భక్షయితుమారభత్। 7

తత స్తౌ దేశకాలజ్ఞౌ ఖడ్గాభ్యామేవ రాఘవౌ।
అచ్ఛిందతాం సుసంహృష్టౌ బాహూ తస్యాంసదేశతః। 8

దక్షిణో దక్షిణం బాహుమ్ అసక్తమసినా తతః।
చిచ్ఛేద రామో వేగేన సవ్యం వీరస్తు లక్ష్మణః। 9

స పపాత మహాబాహుః ఛిన్నబాహుర్మహాస్వనః।
ఖం చ గాం చ దిశశ్చైవ నాదయన్ జలదో యథా। 10

స నికృత్తౌ భుజౌ దృష్ట్వా శోణితౌఘపరిప్లుతః।
దీనః పప్రచ్ఛ తౌ వీరౌ కౌ యువామితి దానవః। 11

ఇతి తస్య బ్రువాణస్య లక్ష్మణః శుభలక్షణః।
శశంస రాఘవం తస్య కబంధస్య మహాత్మనః। 12

అయమిక్ష్వాకుదాయాదో రామో నామ జనైః శ్రుతః।
అస్యైవావరజం విద్ధి భ్రాతరం మాం చ లక్ష్మణమ్। 13

అస్య దేవప్రభావస్య వసతో విజనే వనే।
రక్షసాఽపహృతా పత్నీ యామిచ్ఛంతావిహాగతౌ। 14

త్వం తు కో వా కిమర్థం వా కబంధసదృశో వనే।
ఆస్యేనోరసి దీప్తేన భగ్నజంఘో వివేష్టసే। 15

ఏవముక్తః కబంధస్తు లక్ష్మణేనోత్తరం వచః।
ఉవాచ పరమప్రీతః తదింద్రవచనం స్మరన్। 16

స్వాగతం వాం నరవ్యాఘ్రౌ దిష్ట్యా పశ్యామి చాప్యహమ్।
దిష్ట్యా చేమౌ నికృత్తౌ మే యువాభ్యాం బాహుబంధనౌ। 17

మహాకాయుడు, భయంకరుడు ఐన ఈ రాక్షసుని బలమంతయును వీనిచేతులలోనేయున్నది. లోకమునగల పెక్కు ప్రాణులను హతమార్చి, వీడు ఇప్పుడు మనలను చంపగోరుచున్నాడు. (5)

ఓ రామచంద్రప్రభూ! యజ్ఞవేదికకడకు తీసికొని రాబడిన పశువులనువలె రాజు ప్రతీకారము చేయలేని వారిని వధించుట నింద్యము- కనుక మనము వీనిబాహువులను ఖండించుటమాత్రము చాలును. వీనిని చంపుట అనవసరము." (6)

అప్పుడా రాక్షసుడు ఆఇరువురిసంభాషణువిని, మిగుల క్రుద్ధుడాయెను. వెంటనే అతడు తననోరు తెఱచి, రౌద్రాకారముతో వారిని భక్షించుటకు పూనుకొనెను. (7)

సమయస్ఫూర్తిగల ఆరామలక్ష్మణులు అదనెఱింగి, మిక్కిలి ఉత్సాహభరితులై తమఖడ్గములతో వాని రెండు భుజములను (అరటిబోదెలనువలె) అవలీలగా ఖండించిరి. (8)

సర్వసమర్థుడైన శ్రీరాముడు ఆరాక్షసునకు కుడివైపున ఉన్నందున వానికుడిభుజమును నఱికివేసెను. వీరుడైన లక్ష్మణుడు అతనిఎడమభుజమును ఛేదించెను. అంతట ఆకబంధుడు తనపొడవైన బాహువులు నఱికివేయబడగా, వెంటనే అతడు భూమ్యాకాశములను, దశదిశలను పిక్కటిల్ల జేయుచు మేఘమువలె గర్జించుచు నేలపై పడిపోయెను. (9-10)

పిదప ఆ దానవుడు నెత్తుటిమడుగులో దొగుచు, తెగిపడియున్న తనచేతులను జూచి, దుఃఖితుడై 'మీరు ఎవరు? అని ఆ వీరులను ప్రశ్నించెను. (11)

ఇట్లు పలుకుచున్న మహాత్ముడగు కబంధునకు శుభలక్షణసంపన్నుడైన లక్ష్మణుడు శ్రీరామునిగూర్చి ఇట్లు తెలిపెను. (12)

"ఇక్ష్వాకువంశజుడైన ఇతడు మిక్కిలి వాసికెక్కినవాడు. ఈయనపేరు శ్రీరాముడు. నేను ఇతని తమ్ముడను. నాపేరు లక్ష్మణుడు. నిర్జనారణ్యమున నివసించుచున్న ఇతడు దివ్యప్రభావసంపన్నుడు. ఈయనధర్మపత్నిని ఒక రాక్షసుడు అపహరించెను. ఆమెను వెదకుచు మేము ఇచటికి వచ్చితిమి. (13-14)

ఇంతకును నీవెవరు? శిరస్సు లేనివాడవై మొండెముతో ఈ వనమున పడియుంటివేల? వక్షస్థలమున మెఱయుచున్న ముఖముతో, తెగిపోయిన కాళ్లతో ఇక్కడ పొరలుచుంటివేల?" (15)

లక్ష్మణుడు ఇట్లు పలికిన పిమ్మట కబంధుడు ఇంద్రునివచనములను జ్ఞప్తికిదెచ్చుకొనుచు పరమప్రీతుడై వారికి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (16)

"ఓ పురుషశ్రేష్ఠులారా! మీకు స్వాగతము. నాఅదృష్టము ఫలించి, నాకు మీదర్శనమైనది. నాభాగ్యవశమున మీరు నా బాహువులను ఖండించితిరి.

విరూపం యచ్చ మే రూపం ప్రాప్తం హ్యవినయాద్యథా।
తన్మే శృణు నరవ్యాఘ్ర! తత్త్వతః శంసతస్తవ। 18

నా అవినయమువలన నాకు ఈ వికృతరూపము ప్రాప్తించినది. ఓ నరశ్రేష్ఠా! దానితీరుతెన్నులనుగూర్చి యథార్థముగా తెలిపెదను వినుడు." (17-18)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే సప్తతితమస్సర్గః (70)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ౭౦వ డెబ్బదియవసర్గము.

-- * * * --

71. డెబ్బదియొకటవసర్గము

కబంధుడు శ్రీరామునకు తన పూర్వవృత్తాంతమును దెల్పుట - అతని కోరికపై శ్రీరాముడు వానికి సీతాపహరణ వృత్తాంతమును వివరించుట - 'నన్ను దహనమొనర్చిన పిమ్మట నాకు జ్ఞానోదయమగును - అప్పుడు మీకు నేను సహాయపడుదును' - అని కబంధుడు శ్రీరామునకు విన్నవించుట -

పురా రామ! మహాబాహో! మహాబలపరాక్రమ!।
రూపమాసీన్మమాచింత్యం త్రిషు లోకేషు విశ్రుతమ్।
యథా సోమస్య శక్రస్య సూర్యస్య చ యథా వపుః। 1

సోఽహం రూపమిదం కృత్వా లోకవిత్రాసనం మహత్।
ఋషీన్ వనగతాన్ రామ! త్రాసయామి తతస్తతః। 2

గొప్పబలపరాక్రమములుగల ఓ మహాబాహూ! రామా! పూర్వమునేను వర్ణింపనలవి గాని రూపసౌందర్యమును కలిగియుంటిని. ఇంద్రసూర్యచంద్రులరూపములవలె నా ఆకారము అద్భుతమై ముల్లోకములలో వాసికెక్కినది. అట్టి స్ఫురద్రూపినైన నేను (కామరూపుడను అగుటచే) మిక్కిలి లోకభయంకరమైన వికృతరూపమును పొంది, అక్కడక్కడ వనములలో నివసించెడి మహర్షులను భయపెట్టుచుండెడివాడను. (1-2)

తత్ర స్థూలశిరా నామ మహర్షిః కోపితో మయా।
సంచిన్వన్ వివిధం వన్యం రూపేణాఽనేన ధర్షితః। 3

తేనాఽహముక్తః ప్రేక్ష్యైవం ఘోరశాపాభిధాయినా।
ఏతదేవ నృశంసం తే రూపమస్తు విగర్హితమ్। 4

స మయా యాచితః క్రుద్ధః శాపస్యాంతో భవేదితి।
అభిశాపకృతస్యేతి తేనేదం భాషితం వచః। 5

యదా ఛిత్త్వా భుజౌ రామః త్వాం దహేద్విజనే వనే।
తదా త్వం ప్రాప్స్యసే రూపం స్వమేవ విపులం శుభమ్। 6

ఒకానొకసమయమున 'స్థూలశిరుడు' అను పేరుగల ఒక మహర్షి వనములలో లభించెడి కందమూల ఫలములను సేకరించుచుండెను. అప్పుడు ఆరూపముతో నేను ఆయనను భయపెట్టితిని. అందులకు అతడు కుపితుడయ్యెను. ఘోరముగా శపింపశక్తిగల ఆ ఋషి "లోకనింద్యమైన ఈ క్రూరరూపమే నీకు శాశ్వతముగా ఉండిపోవుగాక' అని నన్ను శపించెను. అప్పుడు నేను, క్రుద్ధుడైయున్న ఆమహర్షిని 'స్వామీ! తీరని అపచారమొనర్చి, మీశాపమునకు గురియైతిని. అట్టి ఈ శాపమునుండి నాకు విముక్తి ఎప్పుడు లభించును? అని వినయముగా అడిగితిని. అప్పుడు ఆముని 'శ్రీరాముడు నిర్జనవనమున నీభుజములను ఖండించి, నిన్ను అగ్నికి ఆహుతిచేసినప్పుడు నీసహజసుందరరూపము నీకు ప్రాప్తించును.' అని నాతో పలికెను. (3-6)

శ్రియా విరాజితం పుత్రం దనోస్త్వం విద్ధి లక్ష్మణ!।
ఇంద్రకోపాదిదం రూపం ప్రాప్తమేవం రణాజిరే। 7

(ఈ కబంధ రూపము ప్రాప్తించిన విధమును తెలుపుచున్నాను వినుము) ఓ లక్ష్మణా! నేను దనువు యొక్క కుమారుడను. (దానవుడను) సంపన్నుడను. ఒకానొకయుద్ధమున ఇంద్రుడు కుపితుడై నాకు ఈ రూపము కలుగునట్లు చేసెను. (ఇంద్రునివలన నాకు ఈ రూపము కలిగిన విధానము ఇది.) (7)

అహం హి తపసోగ్రేణ పితామహమతోషయమ్ ।
దీర్ఘమాయుః స మే ప్రాదాత్ తతో మాం విభ్రమోఽస్పృశత్ । 8

దీర్ఘమాయుర్మయా ప్రాప్తం కిం మే శక్రః కరిష్యతి ।
ఇత్యేవం బుద్ధిమాస్థాయ రణే శక్రమధర్షయమ్ । 9

తస్య బాహుప్రయుక్తేన వజ్రేణ శతపర్వణా ।
సక్థినీ చైవ మూర్ధా చ శరీరే సంప్రవేశితమ్ । 10

స మయా యాచ్యమానః సన్ నాఽనయద్యమసాదనమ్ ।
పితామహవచః సత్యం తదస్త్వితి మమాబ్రవీత్ । 11

అనాహారః కథం శక్తో భగ్నసక్థిశిరోముఖః ।
వజ్రేణాభిహతః కాలం సుదీర్ఘమపి జీవితుమ్ । 12

ఏవముక్తస్తు మే శక్రో బాహూ యోజనమాయతౌ ।
ప్రాదాదాస్యం చ మే కుక్షౌ తీక్ష్ణదంష్ట్రమకల్పయత్ । 13

సోహం భుజాభ్యాం దీర్ఘాభ్యాం సంక్షిప్యాస్మిన్ వనేచరాన్ ।
సింహద్విపమృగవ్యాఘ్రాన్ భక్షయామి సమంతతః । 14

స తు మామబ్రవీదింద్రో యదా రామః సలక్ష్మణః ।
ఛేత్స్యతే సమరే బాహూ తదా స్వర్గం గమిష్యసి । 15

అనేన వపుషా రామ! వనేఽస్మిన్ రాజసత్తమ! ।
యద్యత్ పశ్యామి సర్వస్య గ్రహణం సాధు రోచయే । 16

అవశ్యం గ్రహణం రామో మన్యేఽహం సముపైష్యతి ।
ఇమాం బుద్ధిం పురస్కృత్య దేహన్యాసకృతశ్రమః । 17

స త్వం రామోఽసి భద్రం తే నాఽహమన్యేన రాఘవ! ।
శక్యో హంతుం యథాతత్త్వమ్ ఏవముక్తం మహర్షిణా । 18

అహం హి మతిసాచివ్యం కరిష్యామి నరర్షభ! ।
మిత్రం చైవోపదేక్ష్యామి యువాభ్యాం సంస్కృతోఽగ్నినా । 19

ఏవముక్తస్తు ధర్మాత్మా దనునా తేన రాఘవః ।
ఇదం జగాద వచనం లక్ష్మణస్యోపశృణ్వతః । 20

పిమ్మట నేను బ్రహ్మదేవునిగూర్చి తీవ్రముగా తపస్సుచేసితిని. అందులకు అతడు సంతోషించి, నాకు దీర్ఘాయువును ప్రసాదించెను. ఆవరప్రభావమున నేను గర్వితుడనైతిని. దీర్ఘాయువును పొందిననన్ను ఇక ఇంద్రుడేమి చేయుగలడు? అను గర్వబుద్ధితో నేను యుద్ధమున ఇంద్రుని ఎదిరించితిని. (8-9)

ఆకారణమున ఇంద్రుడు నూఱంచులుగల వజ్రాయుధమును నాపై ప్రయోగించెను. దానిప్రభావమున నా తొడలు, శిరస్సు నా శరీరమున కలిసిపోయెను. (10)

(ఈ వికృతరూపములో బ్రతికియుండుటకంటెను మరణించుటయే మేలు అని భావించి) నన్ను చంపుమని ప్రార్థించుచున్నను, ఆ ఇంద్రుడు నన్ను చంపకయే విడిచిపెట్టెను- "బ్రహ్మవాక్కులు తిరుగులేనివి. అవి సత్యములగుగాక'- అని అతడు నాతో పలికెను. (11)

'దేవేంద్రా! నీవు వజ్రాయుధముతో నా తొడలను, శిరస్సును, ముఖమును భగ్నమొనర్చితివి. ఇట్టి స్థితిలో ఆహారము లేకుండా సుదీర్ఘకాలము నేను ఎట్లు జీవింపగలను?" అని ప్రార్థించితిని. అప్పుడతడు నాకు యోజనముపొడవుగల రెండుచేతులను ప్రసాదించెను. మఱియు వాడికోఱలుగల ముఖమును నాయుదరమున కల్పించెను. అప్పటినుండియు ఈ వనములో సంచరించు చుండెడి సింహములను, ఏనుగులను, మృగములను, పెద్దపులులను నా పొడవైన చేతులతో అన్ని దిక్కులనుండియు లాగికొని తినుచు ఇంతవఱకును జీవించుచు వచ్చితిని. అప్పుడు ఇంద్రుడు నాతో 'రామలక్ష్మణులు యుద్ధమున నీ చేతులను ఖండింపగనే నీవు స్వర్గమునకు చేరగలవు.'- అని పల్కెను.(12-15)

"ఓ మహారాజా! అప్పటినుండియు నేను ఈ ఆకారముతో ఈవనములలో కనిపించిన ప్రతిప్రాణిని లాగికొని భక్షించుటకే ఆరాటపడుచున్నాను. ఇంద్రుడు, ముని చెప్పినరీతిగా ఎప్పటికైనను శ్రీరాముడు ఇచటికి తప్పకవచ్చి, నాచేతులకు చిక్కగలడు'- అని విశ్వసించి, ఈ దేహత్యాగమునకు ఎదురు చూచుచున్నాను. ఓ ప్రభూ! ఆ రాముడవు నీవే. ఆ మహర్షినుడివిన ప్రకారము నీవుతప్ప మఱియెవ్వరును నన్ను చంపజాలరు. నీకు శుభమగును. (16-18)

ఓ నరశ్రేష్ఠా! మీరు నాకు అగ్నిసంస్కారములను జరిపిన పిమ్మట నాబుద్ధిబలమునుబట్టి మీకు తోడ్పడగలను. మఱియు మీకు సరియగు (సీతాన్వేషణకు సహాయపడు) మిత్రుని సూచింపగలను." (19)

ఆ దానవుడు ఇట్లు పలికిన పిమ్మట ధర్మాత్ముడైన శ్రీరాముడు లక్ష్మణుడు వినుచుండగా ఆ కబంధునితో ఇట్లు వచించెను. (20)

రావణేన హృతా భార్యా మమ సీతా యశస్వినీ।
నిష్క్రాంతస్య జనస్థానాత్ సహ భ్రాత్రా యథాసుఖమ్। 21

నామమాత్రం తు జానామి న రూపం తస్య రక్షసః।
నివాసం వా ప్రభావం వా వయం తస్య న విద్మహే। 22

శోకార్తానామ్ అనాథానామ్ ఏవం విపరిధావతామ్।
కారుణ్యం సదృశం కర్తుమ్ ఉపకారే చ వర్తతామ్। 23

కాష్ఠాన్యాదాయ శుష్కాణి కాలే భగ్నాని కుంజరైః।
ధక్ష్యామస్త్వాం వయం వీర! శ్వభ్రే మహతి కల్పితే। 24

స త్వం సీతాం సమాచక్ష్వ యేన వా యత్ర వా హృతా।
కురు కల్యాణమత్యర్థం యది జానాసి తత్త్వతః। 25

ఏవముక్తస్తు రామేణ వాక్యం దనురనుత్తమమ్।
ప్రోవాచ కుశలో వక్తుం వక్తారమపి రాఘవమ్। 26

దివ్యమస్తి న మే జ్ఞానం నాభిజానామి మైథిలీమ్।
యస్తాం జ్ఞాస్యతి తం వక్ష్యే దగ్ధః స్వం రూపమాస్థితః। 27

అదగ్ధస్య తు విజ్ఞాతుం శక్తిరస్తి న మే ప్రభో!।
రాక్షసం తం మహావీర్యం సీతా యేన హృతా తవ। 28

విజ్ఞానం హి మమ భ్రష్టం శాపదోషేణ రాఘవ!।
స్వకృతేన మయా ప్రాప్తం రూపం లోకవిగర్హితమ్। 29

కింతు యావన్న యాత్యస్తం సవితా శ్రాంతవాహనః।
తావన్మామవటే క్షిప్త్వా దహ రామ! యథావిధి। 30

దగ్ధస్త్వయాఽహమవటే న్యాయేన రఘునందన!।
వక్ష్యామి తమహం వీర! యస్తం జ్ఞాస్యతి రాక్షసమ్। 31

తేన సఖ్యం చ కర్తవ్యం న్యాయ్యవృత్తేన రాఘవ!।
కల్పయిష్యతి తే ప్రీతః సాహాయ్యం లఘువిక్రమః। 32

నహి తస్యాస్త్యవిజ్ఞాతం త్రిషు లోకేషు రాఘవ!।
సర్వాన్ పరిసృతో లోకాన్ పురాఽసౌ కారణాంతరే। 33

"ఓ కబంధుడా! నేనును, నాతమ్ముడును లేకుండుట చూచి ఉత్తమసాధ్వియైన నాభార్యయగు సీతాదేవిని రావణుడు జనస్థానమునుండి నిరాటంకముగా అపహరించుకొనిపోయెను. ఆరాక్షసునియొక్క పేరు మాత్రము నేనెఱుగుదును. అతనిరూపమును, నివసించుప్రదేశమును, శక్తిసామర్థ్యములను మేము ఎఱుగము. సీతయెడబాటుకారణముగా మేము శోకార్తులమైయుంటిమి. దారి చూపెడువారులేక ఆమెజాడకై ఇటునిటు తిరుగుచుంటిమి. దయతో సహాయపడుము.(21-22)

ఓ వీరుడా! ఆయాకాలములలో ఏనుగులచే విరుగగొట్టబడిన చెట్లయొక్క ఎండుకట్టెలు తీసికొనివచ్చి, మేము ఒకలోతైన గుంతను తీసి, అందు నిన్ను దహనమొనర్చెదము. సీతను ఎవరు అపహరించిరో? ఎచట దాచిరో మున్నగు విషయములను అన్నింటిని నీవు ఎఱిగినమేరకు మాకు తెలిపి, ఎంతయు తోడ్పడుము."(23-25)

శ్రీరాముడు ఇట్లుపలికిన పిమ్మట వాక్చతురుడైన ఆకబంధుడు మాటాడుటలోనేర్పరియైన రఘువీరునితో ఇట్లనెను. (26)

"ఓరామా! ప్రస్తుతము నాకు దివ్యజ్ఞానములేదు - మైథిలినిగూర్చి ఏమియు ఎఱుగను. నాకు మీరు అగ్ని సంస్కారములను నడుపుటతో నానిజరూపమును పొంది, ఆమెనుగూర్చి తెలిసినమేరకు వివరించెదను. (27)

ఓ ప్రభూ! దహనసంస్కారముతో నానిజరూపమును పొందునంతవఱకు 'సీతాదేవిని అపహరించిన రాక్షసుని గూర్చియు, అతనిపరాక్రమమునుగుఱించియు తెలిసికొనగలశక్తి నాకులేదు. శాపప్రభావముతో నా జ్ఞానమంతయును నశించినది. లోకనింద్యమైన ఈ రూపము స్వయంకృతాపరాధఫలితమే. ఓరామా! వాహనములు (గుఱ్ఱములు) అలసిపోయి, సూర్యభగవానుడు అస్తమింపకముందే నన్ను గోతిలో ఉంచి, పూర్తిగా దగ్ధమొనర్పుడు. ఓ రఘువీరా! నన్ను గోతిలో ఉంచి, యథావిధిగా దగ్ధమొనర్చిన పిమ్మట నేను ఎఱిగినంతవఱకు మీకు తెలుపగలను. న్యాయవర్తనుడై మాటకు కట్టుబడియుండు వానితో మీరు సఖ్యము చేయవలసియున్నది. అట్టివాడు సద్యఃస్ఫూర్తితో తనపరాక్రమమును చూపి, సంతోషముగా మీకు తోడ్పడగలడు. అతనికి ఈ ముల్లోకములలో తెలియనివిషయమే లేదు. ఏదో ఒక కారణముచే (కారణాంతరమున) అతడు సమస్తలోకములను తిరిగివచ్చెను." (28-33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ఏకసప్తతితమస్సర్గః (71)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది డెబ్బదియొకటవసర్గము.

— * * * —

72. డెబ్బదిరెండవసర్గము

రామలక్ష్మణులు కబంధుని దేహమునకు అగ్నిసంస్కారమొనర్చుట - ఆ చితిజ్వాలలనుండి కబంధుడు దివ్యదేహముతో బయటికి వచ్చుట - పిమ్మట అతడు శ్రీరామునకు సుగ్రీవుని వృత్తాంతమును దెలిపి, సీతాన్వేషణలో ఆ కపీశ్వరుడు తోడ్పడగలడనియు, కనుక అతనితో మైత్రి చేయుమనియు పలుకుట -

ఏవముక్తౌ తు తౌ వీరౌ కబంధేన నరేశ్వరౌ।
గిరిప్రదరమాసాద్య పావకం విససర్జతుః। 1

లక్ష్మణస్తు మహోల్కాభిః జ్వలితాభిః సమంతతః।
చితామాదీపయామాస సా ప్రజజ్వాల సర్వతః। 2

తచ్ఛరీరం కబంధస్య ఘృతపిండోపమం మహత్।
మేదసా పచ్యమానస్య మందం దహతి పావకః। 3

స విధూయ చితామాశు విధూమోఽగ్నిరివోత్థితః।
అరజే వాససీ బిభ్రత్ మాలాం దివ్యాం మహాబలః। 4

తతశ్చితాయా వేగేన భాస్వరో విమలాంబరః।
ఉత్పపాతాఽఽశు సంహృష్టః సర్వప్రత్యంగభూషణః। 5

విమానే భాస్వరే తిష్ఠన్ హంసయుక్తే యశస్కరే।
ప్రభయా చ మహాతేజా దిశో దశ విరాజయన్। 6

సోఽంతరిక్షగతో రామం కబంధో వాక్యమబ్రవీత్।
శృణు రాఘవ! తత్త్వేన యథా సీతామ్ అవాప్స్యసి। 7

రామ! షడ్యుక్తయో లోకే యాభిః సర్వం విమృశ్యతే।
పరిమృష్టో దశాంతేన దశాభాగేన సేవ్యతే। 8

దశాభాగగతో హీనః త్వం హి రామ! సలక్ష్మణః।
యత్కృతే వ్యసనం ప్రాప్తం త్వయా దారప్రధర్షణమ్। 9

వీరులును, నరశ్రేష్ఠులును ఐన రామలక్ష్మణులు కబంధునిపలుకులను వినిన పిమ్మట గిరిసమీపమున గల గోతికడకు చేరి, అతనిశరీరమునకు నిప్పంటించిరి. లక్ష్మణుడు బాగుగా మండుచున్నకట్టెలతో చితినంతయును వెలిగించెను. అంతట ఆచితిమట్టును మంటలు పైకిలేచెను. (1-2)

చితిపై కాలుచున్న కబంధునియొక్క మహాకాయము క్రొవ్వుతో నిండియున్నందును అది గడ్డకట్టిన నేతి ముద్దవలె ఒప్పుచుండెను. అందువలన అది మంటలలో నెమ్మదిగా కాలుచుండెను. (3)

అంతట మిగుల బలశాలియైన కబంధుడు చితినుండి బయల్వెడలి నిర్మలమైన రెండు వస్త్రములను, దివ్యమైన పూలమాలను ధరించి, పొగలేని అగ్నిజ్వాలవలె పైకిలేచెను. స్వచ్ఛమైనవస్త్రములతో విరాజిల్లుచున్నకబంధుడు అతివేగముగా చితినుండి బయటికి వచ్చెను. అతడు అన్ని అవయవములయందును ఆభరణములను ధరించి, మిగుల సంతుష్టుడైయుండెను. మహాతేజస్వియైన కబంధుడు అంతరిక్షమునకు ఎగిరి, హంసలను పూన్చిన విమానమున ఆసీనుడయ్యెను. నిరుపమానమైన ఆ విమానము వెలుగులను విరజిమ్ముచుండెను. ఆకబంధుడు తనదివ్యకాంతులతో అన్నిదిక్కులను ప్రకాశింపజేయుచు శ్రీరామునితో ఇట్లు నుడివెను. ఓ రామా! సీతాదేవి లభించెడి ఉపాయమును తెలిపెదను. సావధానుడవై వినుము.' (4-7)

"ఓ ప్రభూ! లోకమున సంధి, విగ్రహము, యానము, ఆసనము, ద్వైధీభావము, సమాశ్రయము అను ఆఱు ఉపాయముల[1] ద్వారా ఎల్లరకును సమస్త కార్యములును సాధ్యములగును. (8)

ఇంకను దుర్దశలలోనే చిక్కుపడియున్నవాడు దుర్దశలనుండి బయటపడు సమయము ఆసన్నమైన మఱియొకనిని సేవించును. (సేవించుట యుక్తము) ఓ రామా! నీ భార్యఎడబాటువలన ప్రస్తుతము నీవు దుఃఖమున క్రుంగిపోవుచుంటివి. కావున మీరు ఇరువురును దుర్దశలో (ఆపదలలో) చిక్కుపడియుంటిరి. కనుక మీరు తక్కువ స్థాయిలోనున్నట్లే - కావున ఓ

1) ఆఱు ఉపాయములు (షడ్యుక్తయః) సంధి విగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయాః - షడ్యుక్తయః - శత్రువుతో ఒడంబడికచేసికొనుటయే సంధి, రిపువిరోధము విగ్రహము, శత్రువునిపైకి దండెత్తివెళ్లుట యానము. అనుకూలమైనకాలమునకై ఎదురుచూచుట ఆసనము, బలహీనులును, బలవంతులును ఐన రెండు విధములైన శత్రువులతోడను మాటలతో మంచిగా ఉండుట ద్వైధీభావము. బలవంతుని ఆశ్రయించుట సమాశ్రయము.

తదవశ్యం త్వయా కార్యః స సుహృత్సుహృదాం వర।
అకృత్వా హి న తే సిద్ధిమ్ అహం పశ్యామి చింతయన్। 10

శ్రూయతాం రామ! వక్ష్యామి సుగ్రీవో నామ వానరః।
భ్రాత్రా నిరస్తః క్రుద్ధేన వాలినా శక్రసూనునా। 11

ఋశ్యమూకే గిరివరే పంపాపర్యంతశోభితే।
నివసత్యాత్మవాన్ వీరః చతుర్భిః సహ వానరైః। 12

వానరేంద్రో మహావీర్యః తేజోవానమితప్రభః।
సత్యసంధో వినీతశ్చ ధృతిమాన్ మతిమాన్ మహాన్। 13

దక్షః ప్రగల్భో ద్యుతిమాన్ మహాబలపరాక్రమః।
భ్రాత్రా వివాసితో రామ! రాజ్యహేతోర్మహాబలః। 14

స తే సహాయో మిత్రం చ సీతాయాః పరిమార్గణే।
భవిష్యతి హి తే రామ! మా చ శోకే మనః కృథాః। 15

భవితవ్యం హి యచ్చాపి న తచ్ఛక్యమిహాన్యథా।
కర్తుమిక్ష్వాకుశార్దూల! కాలో హి దురతిక్రమః। 16

గచ్ఛ శీఘ్రమితో రామ! సుగ్రీవం తం మహాబలమ్।
వయస్యం తం కురు క్షిప్రమ్ ఇతో గత్వాఽద్య రాఘవ!।
అద్రోహాయ సమాగమ్య దీప్యమానే విభావసౌ। 17

స చ తే నావమంతవ్యః సుగ్రీవో వానరాధిపః।
కృతజ్ఞః కామరూపీ చ సహాయార్థీ చ వీర్యవాన్। 18

శక్తౌ హ్యద్య యువాం కర్తుం కార్యం తస్య చికీర్షితమ్।
కృతార్థో వాఽకృతార్థో వా కృత్యం తవ కరిష్యతి। 19

స ఋక్షరజసః పుత్రః పంపామటతి శంకితః।
భాస్కరస్యౌరసః పుత్రో వాలినా కృతకిల్బిషః। 20

సన్నిధాయాఽఽయుధం క్షిప్రమ్ ఋశ్యమూకాలయం కపిమ్।
కురు రాఘవ! సత్యేన వయస్యం వనచారిణమ్। 21

ఆప్తమిత్రుడా! ఇప్పుడు మీకు సహాయపడగల మిత్రుని ఆశ్రయించుట ముఖ్యకర్తవ్యము. అట్లు చేసినచో మాత్రమే మీకార్యము సిద్ధించునని నేను తలంచుచున్నాను. (9-10)

"ఓ రామా! నా పలుకులను ఆలకింపుము- సుగ్రీవుడు అను పేరుగల ఒక వానరుడు గలడు. ఇంద్రుని అంశతో పుట్టిన 'వాలి' ఇతనికి అగ్రజుడు. క్రుద్ధుడైన వాలి ఇతనిని (కిష్కింధ) రాజ్యమునుండి వెడలగొట్టెను. పంపాసరోవర ప్రాంతమున గల 'ఋశ్యమూకము' అను శ్రేష్ఠమైన పర్వతముపై మహావీరుడైన సుగ్రీవుడు నివసించుచున్నాడు. ఆ ప్రజ్ఞాశాలికి నలుగురు వానరప్రముఖులు తోడుగాగలరు. (11-12)

ఓ రామా! ఆ వానరప్రభువు మహావీరుడు. మిగులతేజస్వి, అద్భుతమైనప్రతిభగలవాడు, మాటకు కట్టుబడియుండెడివాడు, వినయమునకు పెట్టినదిపేరు, ధైర్యశాలి, ప్రజ్ఞావంతుడు, అమహాత్ముడు సర్వసమర్థుడు, వాక్చతురుడు, చక్కని వర్చస్సుగలవాడు, సాటిలేని పరాక్రమముగలవాడు మహాబలిష్ఠుడైన అతడు రాజ్యకారణముగా తనఅన్నయగు వాలిచే కిష్కింధనుండి వెళ్లగొట్టబడెను. (13-14)

ఆ సుగ్రీవుడు నీకు మిత్రుడై సీతాన్వేషణయందు సహాయపడగలడు. కనుక నీవు శోకింపవలసిన పని లేదు. ఓ ఇక్ష్వాకువంశ శ్రేష్ఠా! కానున్నది కాకమానదు. దానిని ఎవ్వరును అడ్డుకొనజాలరు. విధినిర్ణయమునకు తిరుగులేదు. దానిని ఎవ్వరును అతిక్రమింపజాలరు. (కనుక ఓ రామా! నీకు సంభవించిన ఈ దురవస్థ విధినిర్ణయమని యెఱింగి ధైర్యముగానుండుము.) (15-16)

ఓ రామా! వెంటనే ఇక్కడినుండి బయలుదేఱుము. మహాపరాక్రమశాలియైన ఆ సుగ్రీవుని నేడే కలిసికొని, అగ్నిసాక్షిగా ఆయనతో మైత్రిని నెఱపుము. ఆ సుగ్రీవుడు వానర (జంతు) జాతికి చెందినవాడు గదా! యనిఅతనిని గూర్చి చులకనగా భావింపవలదు. చేసిన మేలును మఱువనివాడతడు, మహావీరుడు, కామరూపి. (మీ) సహాయమును అర్థించుచున్నవాడు. (17-18)

అతడు కోరెడి కార్యమును నెఱవేర్చుటకు మీరు సమర్థులు. మీవలన అతనికార్యము నెఱవేఱినను, నెఱవేఱకున్నను మీ కార్యమును నిర్వహించుటలో అతడు తప్పక తోడ్పడగలడు. (19)

అతడు ఋక్షరజసునికుమారుడు. సూర్యాంశతో జన్మించినవాడు, వాలితో వైరము ఏర్పడగా అతనికి భయపడి, పంపాసరోవరతీరమున తిరుగుచున్నవాడు. (20)

రామా! శీఘ్రముగా ఋశ్యమూకపర్వతముపై నివసించు ఆ కపిరాజునొద్దకు వెళ్లుము. అచట ఆయుధమును అగ్నిసమీపమున ఉంచి, ప్రమాణపూర్వకముగా అతనితో మైత్రిని ఏర్పరచుకొనుము. (21)

స హి స్థానాని సర్వాణి కార్త్స్న్యేన కపికుంజరః।
నరమాంసాశినాం లోకే నైపుణ్యాదధిగచ్ఛతి। 22

న తస్యావిదితం లోకే కించిదస్తి హి రాఘవ!।
యావత్ సూర్యః ప్రతపతి సహస్రాంశురరిందమ!। 23

స నదీర్విపులాన్ శైలాన్ గిరిదుర్గాణి కందరాన్।
అన్వీక్ష్య వానరైః సార్ధం పత్నీం తేఽధిగమిష్యతి। 24

వానరాంశ్చ మహాకాయాన్ ప్రేషయిష్యతి రాఘవ!।
దిశో విచేతుం తాం సీతాం త్వద్వియోగేన శోచతీమ్। 25

స జ్ఞాస్యతి వరారోహాం నిర్మలాం రావణాలయే। 26

స మేరుశృంగాగ్రగతామనిందితాం
ప్రవిశ్య పాతాళతలేఽపి వా శ్రితామ్ ।
ప్లవంగమానాం ప్రవరస్తవ ప్రియాం
నిహత్య రక్షాంసి పునః ప్రదాస్యతి ।27

ఆ కపీశ్వరుడు రాక్షసలోకమునందలి (రాక్షసులకు సంబంధించిన) సమస్తప్రదేశములను పూర్తిగా యుక్తితో తెలిసికొనగలడు. శత్రువులను తుదముట్టించుటలో సమర్థుడవైన ఓ రామా! వేయి (వేలకొలది) కిరణములుగల సూర్యునియొక్క రశ్మి సోకుచున్నంతవఱకుగల ఈ లోకమునందలి ప్రదేశములలో అతనికి తెలియనిది ఏ మాత్రమును లేదు. (అతడు సమస్తప్రదేశములను ఎఱుగును.) అతడు నదీతీరములను, విశాలములైన పర్వతములను, గిరిదుర్గములను, కొండగుహలను తనఅనుచరులైన వానరులతోగూడి వెదకి, నీ భార్యయగు సీతాదేవిజాడను ఎఱుంగగలడు. (22-24)

ఓ రఘువీరా! నీ యెడబాటునకు గుఱియై శోకించుచున్న సీతాదేవిని అన్వేషించుటకై అతడు మహాకాయులైన వానరులను దశదిశలకును పంపగలడు. రావణునినగరమునందెక్కడ ఉన్నను అతడు ఆ సీతాసాధ్విని తెలిసికొనగలడు. పూజ్యురాలైన నీ ధర్మపత్నియగు సీతాదేవిని మేరుశిఖరములపై ఉంచినను, పాతాళలోకమున దాచినను వానరప్రభువైన ఆ సుగ్రీవుడు అందు ప్రవేశించి అచటి రాక్షసులను పరిమార్చి ఆమెను తీసికొనివచ్చి నీకు అప్పగించగలడు. (25-27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే ద్విసప్తతితమస్సర్గః *(72)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది డెబ్బదిరెండవసర్గము.

— ❋ ❋ ❋ —

73. డెబ్బదిమూడవసర్గము

దివ్య స్వరూపమును పొందిన కబంధుడు ఋశ్యమూకపర్వతమున నివసించెడి సుగ్రీవుని కడకు వెళ్లెడి మార్గమును రామలక్ష్మణులకు దెల్పుచు ఆ దారిలో గల పంపాసరోవరము, మతంగవనము, శబరి ఆశ్రమము, వృక్షసంపద మున్నగువానిని గూర్చి వివరించుట -

నిదర్శయిత్వా రామాయ సీతాయాః ప్రతిపాదనే।
వాక్యమన్వర్థమర్థజ్ఞః కబంధః పునరబ్రవీత్। 1

ఏష రామ! శివః పన్థా యత్రైతే పుష్పితా ద్రుమాః।
ప్రతీచీం దిశమాశ్రిత్య ప్రకాశంతే మనోరమాః। 2

జంబూ ప్రియాళ పనస ప్లక్ష న్యగ్రోధ తిందుకాః।
అశ్వత్థాః కర్ణికారాశ్చ చూతాశ్చాఽన్యే చ పాదపాః। 3

ధన్వనా నాగవృక్షాశ్చ తిలకా నక్తమాలకాః।
నీలాశోకాః కదంబాశ్చ కరవీరాశ్చ పుష్పితాః।
అగ్నిముఖ్యా అశోకాశ్చ సురక్తాః పారిభద్రకాః। 4

కార్యమునుగూర్చి బాగుగా ఎఱింగిన కబంధుడు శ్రీరామునకు సీతాదేవిజాడనెఱుంగుటకు అనువగు ఉపాయమును దెలిపి, మఱల ఆయనతో ప్రయోజనకరమైన మాటలను ఇట్లు నుడివెను. (1)

ఓ రామా! పశ్చిమదిశగా ఈ మార్గమున వెళ్లినచో మీకు శుభము కలుగును. ఈ త్రోవలోగల చెట్లన్నియును విరబూసిన పూవులతో మనోహరముగా ఉండును. ఈ దారిలో నేరేడు, మోరటి, పనస, జువ్వి, మఱ్ఱి, తుమ్మికి, రావి, కొండగోగు, మామిడి మొదలగు వృక్షములును, చండ్ర, పొన్న, ఎఱ్ఱగోరంట, కానుగు చెట్లును, నల్లని అశోకవృక్షములును, కడిమిచెట్లు, గన్నేరుచెట్లు పుష్పభరితములై యుండును. నల్లజీడిచెట్లు, అశోకవృక్షములు, ఎఱ్ఱచందన

తానారుహ్యాఽథవా భూమౌ పాతయిత్వా చ తాన్ బలాత్।
ఫలాన్యమృతకల్పాని భక్షయంతౌ గమిష్యథః। 5

తదతిక్రమ్య కాకుత్స్థ వనం పుష్పితపాదపమ్।
నందనప్రతిమం చాన్యత్ కురవో హ్యుత్తరా ఇవ। 6

సర్వకామఫలా వృక్షాః పాదపాస్తు మధుస్రవాః।
సర్వే చ ఋతవస్తత్ర వనే చైత్రరథే యథా। 7

ఫలభారానతాస్తత్ర మహావిటపధారిణః।
శోభంతే సర్వతస్తత్ర మేఘపర్వతసన్నిభాః। 8

తానారుహ్యాథవా భూమౌ పాతయిత్వా యథాసుఖమ్।
ఫలాన్యమృతకల్పాని లక్ష్మణస్తే ప్రదాస్యతి। 9

చంక్రమంతౌ వరాన్ దేశాన్ శైలాత్ శైలం వనాద్వనమ్।
తతః పుష్కరిణీం వీరౌ పంపాం నామ గమిష్యథః। 10

అశర్కరామ్ అవిభ్రంశాం సమతీర్థామ్ అశైవలామ్।
రామ! సంజాతవాలూకాం కమలోత్పలశాలినీమ్। 11

తత్ర హంసాః ప్లవాః క్రౌంచాః కురరాశ్చైవ రాఘవ!।
వల్గుస్వనా నికూజంతి పంపాసలిలగోచరాః।
నోద్విజంతే నరాన్ దృష్ట్వా వధస్యాఽకోవిదాః శుభాః। 12

ఘృతపిండోపమాన్ స్థూలాన్ తాన్ ద్విజాన్ భక్షయిష్యథః।
రోహితాన్ వక్రతుండాంశ్చ నడమీనాంశ్చ రాఘవ!। 13

పంపాయామిషుభిర్మత్స్యాన్ తత్ర రామ! వరాన్ హతాన్।
నిస్త్వక్పక్షాన్ అయస్తప్తాన్ అకృశాఽనేకకంటకాన్। 14

వృక్షములు, దేవదారువృక్షములు మొదలగునవి అన్నియును కన్పించుచుండును. ఆ వృక్షములను ఎక్కిగాని, బలమును ఉపయోగించి వాటినివంచిగాని అమృత తుల్యములైన వాటిఫలములను భక్షించుచు వెళ్లుడు. (2-5)

ఓ రామా! పూలచెట్లుగల ఆ వనమునుదాటిన పిమ్మట నందనవనముతోసమానమైన మఱియొక చక్కనివనము మీకు కన్పించును. అది ఉత్తరకురుభూములవలె పలురీతుల ప్రయోజనకరమైనది. (అది మీకు ఎంతయు తోడ్పడును.) (6)

ఆ వనమునందలి వృక్షములన్నియును అన్ని ఋతువులలోను కోరిన ఫలములను ఇచ్చుచుండును, తేనెలను స్రవించుచుండును. అది చైత్రరథమువలె ఎల్లప్పుడును కలకలలాడుచుండును. అక్కడి చెట్లన్నియును పండ్లబరువుచే వంగియుండును. అందలి చెట్లు దట్టముగా అలముకొని, మేఘములవలె, పర్వతములవలె శోభిల్లుచుండును. (7-8)

లక్ష్మణుడు అవలీలగా అచటి వృక్షములపై ఎక్కిగాని, వాటి కొమ్మలను వంచిగాని అమృతతుల్యములైన కమ్మని పండ్లనుకోసి నీకు ఇయ్యగలడు. ఓ వీరులారా! అన్నివిధములుగా సర్వసమృద్ధమైన ఆయా ప్రదేశములలో సీతాదేవిజాడను తెలిసికొనుటకై అచటి వనములను, పర్వతములను పదే పదే గాలించుచు ముందునకు నడచినచో మీరు పంపాసరోవరతీరమునకు చేరగలరు. ఆ సరస్సుయొక్క తీరమునందు గులకరాళ్లు మచ్చునకైనను కన్పింపవు, అచటితటములు చెక్కుచెదరక చక్కగానుండును. రేవులన్నియును ఎగుడుదిగుడులేక సమతలముగలిగి యుండును. అందు నాచునకు చోటు ఉండదు. సరస్సునందలి అడుగుభాగములు ఏ మాత్రమూ బురదలేకుండ ఇసుకతో గూడియుండును, చక్కగా వికసించిన కలువలు, కమలములు ఆ సరోవరశోభను ఇనుమడింపజేయుచుండును. (9-11)

పంపాజలములలో విహరించెడి హంసలు, బెగ్గురుపక్షులు, క్రౌంచపక్షులు, కురరపక్షులు మధురధ్వనులను గావించుచుండును. అవి మనుష్యులను జూచి భయపడవు. ఏలనన అచటికి వచ్చినవారెవ్వరును ఆ అందమైన పక్షులకు ఏమాత్రమును హానితలపెట్టరు. పైగా వాటికి ఆహారమును అందించెదరు. (12)

ఓ రామా! మిక్కిలి లావుగా నేతిముద్దలవలెనున్న చెక్కుదీసిన పండ్లను, ముండ్లను తొలగించిన పిదప దృఢముగానున్న నాగజెముడు మొదలగు పదార్థములను లక్ష్మణుడు సిద్ధపఱచగలడు. ఇంకను అతడు చెక్కుదీసిన కందమూలములను బాణములకు గ్రుచ్చి దోరగా కాచి, ఆయాపదార్థములను తీసికొని రాగలడు. వాటిని వలసిన

తవ భక్త్యా సమాయుక్తో లక్ష్మణః సంప్రదాస్యతి। 15

భృశం తే ఖాదతో మత్స్యాన్ పంపాయాః పుష్పసంచయే।
పద్మగంధి శివం వారి సుఖశీతమనామయమ్। 16

ఉద్ధృత్య సతతాక్లిష్టం రౌప్యస్ఫాటికసన్నిభమ్।
అథ పుష్కరపర్ణేన లక్ష్మణః పాయయిష్యతి। 17

స్థూలాన్ గిరిగుహాశయ్యాన్ వరాహాన్ వనచారిణః।
అపాం లోభాదుపావృత్తాన్ వృషభానివ నర్దతః। 18

రూపాన్వితాంశ్చ పంపాయాం ద్రక్ష్యసి త్వం నరోత్తమ। 19

సాయాహ్నే విచరన్ రామ! విటపీన్ మాల్యధారిణః।
శీతోదకం చ పంపాయా దృష్ట్వా శోకం విహాస్యసి। 20

సుమనోభిశ్చితాంస్తత్ర తిలకాన్ నక్తమాలకాన్।
ఉత్పలాని చ ఫుల్లాని పంకజాని చ రాఘవ! 21

న తాని కశ్చిన్మాల్యాని తత్రారోపయితా నరః।
న చ వై మ్లానతాం యాంతి న చ శీర్యంతి రాఘవ! 22

మతంగశిష్యాస్తత్రాఽఽసన్ ఋషయః సుసమాహితాః।
తేషాం భారాభితప్తానాం వన్యమాహరతాం గురోః। 23

యే ప్రపేతుర్మహీం తూర్ణం శరీరాత్ స్వేదబిందవః।
తాని జాతాని మాల్యాని మునీనాం తపసా తదా।
స్వేదబిందుసముత్థాని న వినశ్యంతి రాఘవ! 24

తేషాం గతానామ్ అద్యాపి దృశ్యతే పరిచారిణీ।
శ్రమణీ శబరీ నామ కాకుత్స్థ! చిరజీవినీ। 25

త్వాం తు ధర్మే స్థితా నిత్యం సర్వభూతనమస్కృతమ్।
దృష్ట్వా దేవోపమం రామ! స్వర్గలోకం గమిష్యతి। 26

మేరకు మీరు భక్షించి, పెద్ద గండుమీనులు, సొరమీనులు మొదలగు చేపలకును, రొయ్యలకును ఆదరముతో కొద్ది కొద్దిగా తినిపించి, ఆనందింతురు. (13-15)

ఓ రామా! పంపాసరోవరమునందలి పుష్పములసమీపమునగల జలములు సువాసనలతో ఒప్పుచుండును. చల్లని జలములు సుఖప్రదములు, శుభదాయకములు, ఆరోగ్యకరములు. అవి వెండివలె, స్ఫటికములవలె స్వచ్ఛములై నిర్మలముగా ఉండును. నీవు కందమూలఫలాదిమధురపదార్థములను సుఖముగా భక్షించునప్పుడు లక్ష్మణుడు పంపాజలములను తామరాకుదొన్నెలలో తీసికొనివచ్చి నీ దాహమును తీర్చగలడు. (16-17)

ఆ వనమున సంచరించెడి అడవిపందులు బలిష్ఠములై వృషభములవలె ధ్వనిచేయుచుండును. పర్వతములగుహలే వాటినివాసస్థానములు. వాటిరూపములు చూడముచ్చటగొల్పుచుండును. దప్పికతీర్చుకొనుటకై పంపాసరోవరతీరమునకు వచ్చినప్పుడు వాటిని మీరు చూడవచ్చును. (18-19)

ఓ రామా! మీరు సాయంసమయములయందు పెద్దపెద్దకొమ్మలుగల పూలచెట్లను జూడుడు, వాటి మీదుగా వచ్చుచుండెడి వాయువులసుగంధములను ఆఘ్రాణింపుడు. పంపాసరస్సునందలి చల్లనిజలములదృశ్యములను గాంచుడు. ఆవిధముగా అచట విహరించుటవలన మీశోకము దూరమగును. (20)

ఓ రాఘవా! అచట నీవు విహరించునప్పుడు నిరంతరము పూలతో వెల్లివిరియుచుండెడి బొట్టుగు చెట్లును, కానుగ చెట్లును, చక్కగా వికసించిన కమలములును కలువలును నీ దుఃఖమును పోగొట్టును. ఆ మతంగమహర్షిశిష్యులప్రభావమున పూలను ఎవ్వరును త్రుంచరు. మాలలుగా ధరింపరు. అవి ఎన్నడును వాడవు, రాలిపోవు. (21-22)

పూర్వము మతంగమహర్షిశిష్యులు అచట ఉండిరి. వారు ఏకాగ్రచిత్తులు, శాంతస్వభావులు. వారు గురువుగారికొఱకు ఆ వనములలో లభించెడి కందమూలఫలములను, సమిధలను తీసికొని వచ్చుచుండెడివారు. వాటిబరువునకు అలసిపోయిన వారి శరీరములనుండి స్వేదబిందువులు రాలుచుండెడివి. అవి గాలివాటున చెట్లపైబడి పూవులుగా మారెడివి. అందువలన అవి నశింపవు. (23-24)

ఓ కాకుత్స్థా!! ఆ శిష్యులందఱును వెళ్ళిపోయినను అంతవఱకును వారికి సేవలుచేయుచుండెడి ఒక సన్యాసిని మాత్రము నేటికిని అచటనే యున్నది. 'శబరి' యను పేరుతో ప్రసిద్ధికెక్కిన ఆమె దీర్ఘాయువు. (25)

ఆమె నిత్యము ధర్మకార్యములను ఆచరించుటయందే (మహాత్ములను సేవించుటయందే) నిరతురాలు. నీవు దైవతుల్యుడవు, సకలప్రాణులకును వంద్యుడవు. నిన్ను దర్శించిన పిమ్మట ఆమె స్వర్గమును జేరును. (26)

తతస్తద్రామ! పంపాయాః తీరమాశ్రిత్య పశ్చిమమ్।
ఆశ్రమస్థానమతులం గుహ్యం కాకుత్స్థ! పశ్యసి। 27

న తత్రాక్రమితుం నాగాః శక్నువంతి తమాశ్రమమ్।
వివిధాస్తత్ర వై నాగా వనే తస్మింశ్చ పర్వతే। 28

ఋషేస్తస్యమతంగస్య విధానాత్ తచ్చ కాననమ్।
మతంగవనమిత్యేవ విశ్రుతం రఘునందన। 29

తస్మిన్ నందనసంకాశే దేవారణ్యోపమే వనే।
నానావిహగసంకీర్ణే రంస్యసే రామ! నిర్వృతః। 30

ఋశ్యమూకశ్చ పంపాయాః పురస్తాత్ పుష్పితద్రుమః।
సుదుఃఖారోహణో నామ శిశునాగాభిరక్షితః।
ఉదారో బ్రహ్మణా చైవ పూర్వకాలే వినిర్మితః। 31

శయానః పురుషో రామ! తస్య శైలస్య మూర్ధని।
యత్ స్వప్నే లభతే విత్తం తత్ ప్రబుద్ధోఽధిగచ్ఛతి। 32

న త్వేనం విషమాచారః పాపకర్మాఽధిరోహతి। 33

యస్తు తం విషమాచారః పాపకర్మాఽధిరోహతి।
తత్రైవ ప్రహరంత్యేనం సుప్తమాదాయ రాక్షసాః। 34

తత్రాపి శిశునాగానామ్ ఆక్రందః శ్రూయతే మహాన్।
క్రీడతాం రామ! పంపాయాం మతంగారణ్యవాసినామ్। 35

సిక్తా రుధిరధారాభిః సంహృత్య పరమద్విపాః।
ప్రచరంతి పృథక్ కీర్ణా మేఘవర్ణాస్తరస్వినః। 36

క్రమముగా ఆ పంపాసరస్సుయొక్క పశ్చిమతీరమును ఆశ్రయించి, ముందునకు సాగినచో నీకు ఒక ఆశ్రమప్రదేశము కనిపించును. అది సాటిలేనిది. సామాన్యులు అచటికి చేరజాలరు. ఆ ఆశ్రమ పరిసరములలోను దానికి చేరువలోగల ఋష్యమూక పర్వతమునందును ఏనుగులు సంచరించుచుండును. కాని ఆ ఏనుగులు ఆశ్రమమునందు ప్రవేశింపజాలవు. ఓ రఘునందనా! మతంగమహర్షి నిర్మించుటవలన అది 'మతంగవనము' అని ప్రసిద్ధివహించెను. (27-29)

ఆ వనము 'చైత్రరథము' (కుబేరునివనము) మొదలగు దివ్యవనములయొక్క శోభలతో వెల్లివిరియుచుండును. అంతేగాక అది ఇంద్రునకు చెందిన 'నందనవనమునకు' దీటుగానుండును. అచట వివిధములగు పక్షులగుంపులు విహరించుచుండును. మనోహరముగా ఉండెడి ఆ వనమున నీవు శోకరహితుడవై ప్రశాంతమునగానుందువు. (30)

పంపాసరోవరమునకు తూర్పున 'ఋష్యమూకము'[1] అను పర్వతము గలదు. అందలి వృక్షములన్నియును ఎల్లప్పుడును పూవులతో పండ్లతో విరాజిల్లుచుండును. దానికిచుట్టును చిన్న చిన్నకొండలు ఉండుటచే అది సురక్షితముగా ఉండును. కనుక దానిపైకి ఎక్కుట ఎంతయు కష్టము. అందువలన దానికి 'సుదుఃఖారోహణము' అను పేరు ఏర్పడినది. అది పూర్వము బ్రహ్మదేవునిచే నిర్మింపబడినందున మిగుల ప్రశస్తికెక్కినది. (31)

ఆ ఋశ్యమూకపర్వతముపై నిదురించినవానికి స్వప్నమున లభించిన సంపదలు నిజజీవితములో వాస్తవములగును. దురాచారుడైన పాపాత్ముడు ఆ కొండమీదికి ఎక్కుటకు అనర్హుడు. ఒకవేళ దురాచారుడు ఎవ్వడైనను ఆ పర్వతమును ఎక్కినచో అతడు నిద్రించు నప్పుడు వానిని రాక్షసులు పట్టుకొని చంపుదురు.(32-34)

పంపాసరోవరతీరములయందును, మతంగవనమునందును సంచరించెడి గున్నఏనుగులపెద్దపెద్ద ఘీంకారములు అచటికిని వినబడుచుండును. (35)

అచటనుండెడి మదపుటేనుగులగండస్థలములపై ఎల్లప్పుడు మదజలధారలు స్రవించుచుండును. ఆ గజములు మిగుల బలిష్ఠములై నల్లని మేఘములవలె విలసిల్లుచుండును. ఆమేలుజాతి ఏనుగులు గుంపుగూడి, ఇతర జాతి ఏనుగులతో కలియక వేఱుగా సంచరించుచుండును. (36)

1) ఋశ్యములు అను ఒక జాతి జింకలు మౌనముగా తిరుగుచుండుటచే దానికి 'ఋశ్యమూకము' అను పేరు ఏర్పడినది.

తే తత్ర పీత్వా పానీయం విమలం శీతమవ్యయమ్।
అత్యంత సుఖసంస్పర్శం సర్వగంధసమన్వితమ్।
నిర్వృతాః సంవిగాహంతే వనాని వనగోచరాః। 37

ఋక్షాంశ్చ ద్వీపినశ్చైవ నీలకోమలకప్రభాన్।
రురూనపేతాపజయాన్ దృష్ట్వా శోకం జహిష్యసి। 38

రామ! తస్య తు శైలస్య మహతీ శోభతే గుహా।
శిలాపిధానా కాకుత్స్థ! దుఃఖం చాస్యాః ప్రవేశనమ్। 39

తస్యా గుహాయాః ప్రాగ్ద్వారే మహాన్ శీతోదకో హ్రదః।
ఫలమూలాన్వితో రమ్యో నానామృగసమావృతః। 40

తస్యాం వసతి సుగ్రీవః చతుర్భిః సహ వానరైః।
కదాచిత్ శిఖరే తస్య పర్వతస్యావతిష్ఠతే। 41

కబంధస్త్వనుశాస్యైవం తావుభౌ రామలక్ష్మణౌ।
స్రగ్వీ భాస్కరవర్ణాభః ఖే వ్యరోచత వీర్యవాన్। 42

తం తు ఖస్థం మహాభాగం కబంధం రామలక్ష్మణౌ।
ప్రస్థితౌ త్వం వ్రజస్వేతి వాక్యమూచతురంతికే। 43

గమ్యతాం కార్యసిద్ధ్యర్థమ్ ఇతి తావబ్రవీత్ స చ।
సుప్రీతౌ తావనుజ్ఞాప్య కబంధః ప్రస్థితస్తదా। 44

స తత్కబంధః ప్రతిపద్య రూపం
వృతః శ్రియా భాస్కరతుల్యదేహః ।
నిదర్శయన్ రామమవేక్ష్య ఖస్థః
సఖ్యం కురుష్వేతి తదాఽభ్యువాచ । 45

ఆ పంపాసరస్సుజలములు నిర్మలములై చల్లగానుండును. అన్నికాలములయందును అవి సమృద్ధిగానుండును. తాకినంతనే అవి హాయినిగూర్చును, పరిమళములతో ఒప్పుచుండును. అచటి మధుర జలములను ఆమదపుటేనుగులు తనివిదీర త్రాగి, మఱల వనములలో సంచరించుచుండును. (37)

అచట తిరుగాడెడి ఎలుగుబంట్లను, పెద్దపులులను, నీలమణులవలె మనోజ్ఞమైనకాంతులుగలిగి, మిక్కిలి వేగముగా ఎఱుగెత్తగల నల్లచారలదుప్పులను గాంచుటవలన నీ శోకము తొలగిపోవును. (38)

ఆ ఋశ్యమూకపర్వతముమీద ఒక విశాలమైనగుహ గలదు. దానిద్వారము శిలలచే కప్పబడియున్నందున దానికి 'శిలాపిధానము' పేరు ఏర్పడినది. అందు ప్రవేశించుట మిగుల కష్టముతోగూడినపని. ఆ గుహయొక్క తూర్పుద్వారమున ఒక మడుగుగలదు. అందలి నీరు చల్లగానుండును. ఆమడుగుఒడ్డున ఫలములు, కందమూలములు కొల్లలుగానుండును. లేళ్లగుంపులసంచారములతో అది మనోహరముగా నుండును. (39-40)

సుగ్రీవుడు తననలుగురు అనుచరులతోగూడి ఆ గుహయందు నివసించుచుండును. అప్పుడప్పుడు అతడు ఆ పర్వతశిఖరముపై మసలుచుండును." (41)

బలశాలియైన కబంధుడు కంఠమున దండను ధరించి, ఆకాశమున నిలిచి సూర్యకాంతులతో వెలుగొందుచుండెను. అతడు ఈ విశేషములను విపులముగా తెలిపిన పిమ్మట వారి అనుజ్ఞకై నిరీక్షించుచు కొంతతడవు అచటనే యుండెను. అంతట రామ లక్ష్మణులు ఆకాశముననిలిచియున్న మహాత్ముడగు కబంధునకు 'ఇకనీవు వెళ్లుము' అని అనుజ్ఞనిచ్చి, తాముసు అచటి నుండి వెళ్లుటకు సన్నద్ధులైరి. 'అప్పుడు అతడు వారితో' కార్యసిద్ధికై బయలు దేఱుడు' అని వచించెను. అందులకు వారు మిగుల సంతసించి, అతని ప్రయాణమునకు అనుమతిని ఇచ్చిరి. పిమ్మట కబంధుడు రామానుగ్రహములో స్వర్గమునకు చేరెను. (42-44)

కబంధుడు తన పూర్వరూపమును పొంది చక్కగా విరాజిల్లెను. అతనిశరీరము అంతయు సూర్యకాంతులతో వెలుగొందెను. అతడు రామునకు పంపాసరోవర మార్గమును చూపెను, ఆకాశమునందే నిలిచి, 'మీరు సుగ్రీవునితో తప్పక సఖ్యము చేయుడు' అని పలికెను. (45)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే త్రిసప్తతితమస్సర్గః (73)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది డెబ్బదిమూడవసర్గము.

74. డెబ్బదినాల్గవసర్గము

రామలక్ష్మణులు శబరిఆశ్రమమునకు చేరుట - ఆమె వారికి అతిథి సపర్యలు గావించుట - శ్రీరాముడు శబరియోగక్షేమములను విచారించుట - మతంగముని ప్రభావమును దెలుపుచు శ్రీరాముని కోరికపై ఆమె ఆ ఆశ్రమ శోభలను వివరించుట - ఆ స్వామిఆజ్ఞగొని ఆమె దివ్యరూపముతో పరంధామమునకు చేరుట -

తౌ కబంధేన తం మార్గం పంపాయా దర్శితం వనే।
ప్రతస్థతుర్దిశం గృహ్య ప్రతీచీం నృవరాత్మజౌ। 1

తౌ శైలేష్వాచితానేకాన్ క్షౌద్రకల్పఫలాన్ ద్రుమాన్।
వీక్షంతౌ జగ్మతుర్ద్రష్టుం సుగ్రీవం రామలక్ష్మణౌ। 2

కృత్వా చ శైలపృష్ఠే తు తౌ వాసం రఘునందనౌ।
పంపాయాః పశ్చిమం తీరం రాఘవావుపతస్థతుః। 3

తౌ పుష్కరిణ్యాః పంపాయాః తీరమాసాద్య పశ్చిమమ్।
అపశ్యతాం తతస్తత్ర శబర్యా రమ్యమాశ్రమమ్। 4

తౌ తమాశ్రమమాసాద్య ద్రుమైర్బహుభిరావృతమ్।
సురమ్యమ్ అభివీక్షంతౌ శబరీమ్ అభ్యుపేయతుః। 5

తౌ చ దృష్ట్వా తదా సిద్ధా సముత్థాయ కృతాంజలిః।
రామస్య పాదౌ జగ్రాహ లక్ష్మణస్య చ ధీమతః।
పాద్యమాచమనీయం చ సర్వం ప్రాదాద్యథావిధి। 6

తామువాచ తతో రామః శ్రమణీం సంశితవ్రతామ్। 7

కచ్చిత్ తే నిర్జితా విఘ్నాః కచ్చిత్ తే వర్ధతే తపః।
కచ్చిత్ తే నియతః క్రోధ ఆహారశ్చ తపోధనే!। 8

కచ్చిత్ తే నియమాః ప్రాప్తాః కచ్చిత్ తే మనసః సుఖమ్।
కచ్చిత్ తే గురుశుశ్రూషా సఫలా చారుభాషిణి!। 9

రామేణ తాపసీ పృష్టా సా సిద్ధా సిద్ధసమ్మతా।
శశంస శబరీ వృద్ధా రామాయ ప్రత్యుపస్థితా। 10

అద్య ప్రాప్తా తపస్సిద్ధిః తవ సందర్శనాన్మయా।
అద్య మే సఫలం తప్తం గురవశ్చ సుపూజితాః। 11

అద్య మే సఫలం జన్మ స్వర్గశ్చైవ భవిష్యతి।
త్వయి దేవవరే రామ! పూజితే పురుషర్షభ!। 12

చక్షుషా తవ సౌమ్యేన పూతాఽస్మి రఘునందన!।
గమిష్యామ్యక్షయాన్ లోకాన్ త్వత్ప్రసాదాదరిందమ!। 13

రాజకుమారులైన ఆరామలక్ష్మణులిరువురు పంపాతీరమును చేరుటకై కబంధుడు తెలిపిన మార్గమును అనుసరించి, ఆవనమున పడమరదిశగా బయలుదేఱిరి. (1)

మార్గమునగలకొండలలో ఏపుగా పెఱిగి, మధుర ఫలములతో నిండిన పెక్కువృక్షములుండెను. ఆ సోదరులు వాటిని జూచుచు సుగ్రీవుని గలియుటకై ముందునకు సాగిరి. వారు పర్వతశిఖరముపై ఆరాత్రి గడపి, పిమ్మట పంపాసరస్సు యొక్క పశ్చిమతీరమునకు చేరిరి. అనంతరము వారు ఆతీరమునమన్న శబరి ఆశ్రమమును గాంచిరి. అది మిక్కిలి రమణీయముగానుండెను. పిదప వారు చుట్టునువృక్షసంపదతో కలకలలాడుచున్న ఆ ఆశ్రమమునకు చేరి అందున్న శబరిని గలిసికొనిరి. (2-5)

యోగసిద్ధినిపొందిన ఆశబరి రామలక్ష్మణులను గాంచి, లేచి కృతాంజలియై, వారికి పాదాభివందనమొనర్చెను. పిమ్మట ఆమె వారికి అర్ఘ్యపాద్యాదులతో యథావిధిగా అతిథిమర్యాదలను కావించెను. (6)

పిమ్మట నియమనిష్ఠలతో తపశ్చర్యను కొనసాగించుచున్న ఆ సన్న్యాసినితో శ్రీరాముడు ఇట్లు పలికెను. "ఓ తపస్సంపన్నురాలా! నీతపోవిధులు ఎట్టి ఆటంకములును లేకుండ వర్ధిల్లుచున్నవిగదా? కామక్రోధాదులు నీదరిజేరుట లేదుగదా? నీ ఆహారాదినియమములకు భంగము వాటిల్లుటలేదుగదా? ప్రశాంతజీవనమును కొనసాగించుచున్నావు గదా? ఓ మృదుభాషిణీ! నీవు గురుసేవలలో కృతకృత్యురాలవు అగుచున్నావు గదా?" (7-9)

తపస్సిద్ధురాలును, సిద్ధులకును పూజ్యురాలును, జ్ఞానవయోవృద్ధురాలును ఐన ఆశబరి శ్రీరామునకు ఎదురుగా నిలిచి, ఆయనకు ఇట్లు ప్రత్యుత్తరమునిచ్చెను. "ఓరామచంద్రప్రభూ! నేడు నిన్ను కనులార దర్శించుటతో నా తపస్సు సిద్ధించినది, నా తపోజీవనము సఫలమైనది, గురుసేవలు సార్థకములైనవి, ఓ దేవదేవా! పురుషోత్తమా! నిన్ను పూజించుభాగ్యము కలిగినందున నా జన్మ ధన్యమైనది. ఇక నాకు దివ్య (పరం) ధామ ప్రాప్తి లభించినట్లే. (10-12)

ఓ రఘునందనా! నీ అవ్యాజకరుణాకటాక్షమువలన నేను పవిత్రురాలను ఐతిని. ఓ శత్రుసంహారకా! నీ అనుగ్రహము

చిత్రకూటం త్వయి ప్రాప్తే విమానైరతులప్రభైః।
ఇతస్తే దివమారూఢా యానహం పర్యచారిషమ్। 14

తైశ్చాహముక్తా ధర్మజ్ఞైః మహాభాగైర్మహర్షిభిః।
ఆగమిష్యతి తే రామః సుపుణ్యమిమమాశ్రమమ్। 15

స తే ప్రతిగ్రహీతవ్యః సౌమిత్రిసహితోఽతిథిః।
తం చ దృష్ట్వా వరాన్ లోకాన్ అక్షయ్యాం స్త్వం గమిష్యసి। 16

మయా తు వివిధం వన్యం సంచితం పురుషర్షభ!।
తవార్థే పురుషవ్యాఘ్ర! పంపాయాస్తీరసంభవమ్। 17

ఏవముక్తః స ధర్మాత్మా శబర్యా శబరీమిదమ్।
రాఘవః ప్రాహ విజ్ఞానే తాం నిత్యమ్ అబహిష్కృతామ్। 18

దనోః సకాశాత్ తత్త్వేన ప్రభావం తే మహాత్మనః।
శ్రుతం ప్రత్యక్షమిచ్ఛామి సంద్రష్టుం యదిమన్యసే। 19

ఏతత్తు వచనం శ్రుత్వా రామవక్త్రాద్వినిస్సృతమ్।
శబరీ దర్శయామాస తావుభౌ తద్వనం మహత్। 20

పశ్య మేఘఘనప్రఖ్యం మృగపక్షిసమాకులమ్।
మతంగవనమిత్యేవ విశ్రుతం రఘునందన!। 21

ఇహ తే భావితాత్మానో గురవో మే మహావనే।
జుహవాంచక్రిరే తీర్థం మంత్రవన్మంత్రపూజితమ్। 22

ఇయం ప్రత్యక్ స్థలీ వేదిః యత్ర తే మే సుసత్కృతాః।
పుష్పోపహారం కుర్వంతి శ్రమాదుద్వేపిభిః కరైః। 23

తేషాం తపఃప్రభావేన పశ్యాద్యాపి రఘూద్వహ!।
ద్యోతయంతి దిశస్సర్వాః శ్రియా వేద్యోఽతులప్రభాః। 24

అశక్నువద్భిస్తైర్గంతుమ్ ఉపవాసశ్రమాలసైః।
చింతితేఽభ్యాగతాన్ పశ్య సహితాన్ సప్తసాగరాన్। 25

కృతాభిషేకైస్తైర్న్యస్తా వల్కలాః పాదపేష్విహ।
అద్యాపి నావశుష్యంతి ప్రదేశే రఘునందన!। 26

వలన నేను పునరావృత్తిరహితమైన పరంధామమును పొందెదను. మతంగమహర్షి శిష్యులైన నా గురువులను నేను భక్తిశ్రద్ధలతో సేవించియుంటిని. నీవు చిత్రకూటమునకు చేరిన సమయమున వారు దివ్యకాంతులతో విరాజిల్లెడి విమానములపై పరమపదమునకు చేరిరి. ధర్మజ్ఞులైన మహానుభావులగు ఆ మహర్షులు నాతో ఇట్లు నుడివిరి. "మిగుల పవిత్రమైన ఈ ఆశ్రమమునకు రామచంద్రప్రభువు ఏతెంచును. సౌమిత్రితోగూడి వచ్చిన ఆ స్వామికి నీవు అతిథిమర్యాదలను నెఱపుము. ఆయనదర్శనభాగ్యమువలన నీవు అక్షయలోకములను (కైవల్యమును) పొందగలవు.' ఓ పురుషోత్తమా! ఈ పంపాతీరవనమున లభించెడి ఫలమూలాదులను నీకొఱకై నేను సిద్ధపఱచియున్నాను." (13-17)

ధర్మాత్ముడైన శ్రీరాముడు శబరిపలుకులను విని, భక్తిజ్ఞాన వైరాగ్యములతో విలసిల్లెడి ఆమెతో ఇట్లు పలికెను. (18)

"ఓ శబరీ! నీ ప్రభావమును, నీగురువుల మహాత్మ్యమునుగూర్చి కబంధునివలన వినియున్నాను. నీకు నాపైగల ప్రేమానురాగములను. ఆసక్తినిబట్టి వాటిని చూడవేడుకపడుచున్నాను." (19)

శ్రీరాముడు ఇట్లు పలుకగా, శబరి వారికి ఆ మహావనమును చూపించుచు ఈ విధముగా నుడివెను. (20)

"ఓ రఘువీరా! దట్టమైన మేఘసముదాయమువలె ఒప్పుచు మృగములతో పక్షులతో నిండియున్న ఈ వనమును చూడుము. ఇది 'మతంగవనము' గా ప్రసిద్ధి గాంచినది. సర్వదా పరమాత్మధ్యానమునందే నిరతులైయుండెడి మాగురువులు మంత్రపూతములైన గంగాదినదీజలములను ఆహ్వానించి ఈ పంపాసరోవరమును రూపొందించిరి. (ఆ పవిత్ర జలములను ఇచట నిలిపిరి.) ఓ రామా! పశ్చిమతీరమునగల ఈ పూజాస్థలమును జూడుము. నాచే సేవింపబడిన గురువులు, వార్ధక్యకారణముగా వణకుచున్న చేతులతో ఈ వేదికలయందు పడినపూలతో దేవతలను అర్చించుచుండెడివారు. (21-23)

ఓ రఘువరా! మాగురువులయొక్క తపఃప్రభావముచేత నేటికిని (వారు పరమపదమునకు చేరిన పిమ్మటగూడ) ఈ వేదికలు తమదివ్యకాంతులను దశదిశలకును ప్రసరింప జేయుచున్నవి. ఉపవాసశ్రమల కారణముగా బడలియుండుటచే వారు సప్తసముద్రముల వఱకును స్వయముగా వెళ్లలేక వాటిని గూర్చి చింతనచేసిరి. వెంటనే ఆ సాగరముల జలములు ఇచటికి వచ్చి చేరినవి. ఏడు సముద్రముల జలములు కలిసిన ఈ తీర్థమును గాంచుము. దీనిని 'సప్తసాగరతీర్థము' అని పిలుతురు. (24-25)

మాగురువులు ఈ తీర్థమునందు స్నానములను ఆచరించి, తమతడివస్త్రములను ఇచటి చెట్లపై ఆఱవేసిరి.

దేవకార్యాణి కుర్వద్భిః యానీమాని కృతాని వై।
పుష్పైః కువలయైః సార్ధం మ్లానత్వం నోపయాంతి వై। 27

కృత్స్నం వనమిదం దృష్టం శ్రోతవ్యం చ శ్రుతం త్వయా।
తదిచ్ఛామ్యభ్యనుజ్ఞాతా త్యక్తుమేతత్ కళేబరమ్। 28

తేషామిచ్ఛామ్యహం గంతుం సమీపం భావితాత్మనామ్।
మునీనామాశ్రమో యేషామ్ అహం చ పరిచారిణీ। 29

ధర్మిష్ఠం తు వచః శ్రుత్వా రాఘవః సహలక్ష్మణః।
ప్రహర్షమతులం లేభే ఆశ్చర్యమితి తత్త్వతః। 30

తామువాచ తతో రామః శ్రమణీం సంశితవ్రతామ్।
అర్చితోఽహం త్వయా భక్త్యా గచ్ఛ కామం యథాసుఖమ్। 31

ఇత్యుక్తా జటిలా వృద్ధా చీరకృష్ణాజినాంబరా।
తస్మిన్ ముహూర్తే శబరీ దేహం జీర్ణం జిహాసతీ। 32

అనుజ్ఞాతా తు రామేణ హుత్వాఽఽత్మానం హుతాశనే।
జ్వలత్పావకసంకాశా స్వర్గమేవ జగామ సా। 33

దివ్యాభరణసంయుక్తా దివ్యమాల్యానులేపనా।
దివ్యాంబరధరా తత్ర బభూవ ప్రియదర్శనా।
విరాజయంతీ తం దేశం విద్యుత్సౌదామినీ యథా। 34

యత్ర తే సుకృతాత్మానో విహరంతి మహర్షయః।
తత్పుణ్యం శబరీ స్థానం జగామాఽఽత్మసమాధినా। 35

వారి శరీరస్పర్శప్రభావమున అవి ఇప్పటికిని చెక్కుచెదరక యున్నవి. వారు కమలములు, కలువలు మొదలగు పుష్పములతో, పూలమాలలతో దేవతార్చనలు సలిపిరి. ఆ పూవులు నేటికిని వాడిపోకయున్నవి. (26-27)

ఓరామా! ఈ వనశోభలను కనులారగాంచితివి. దానిమహాత్మ్యమునుగూర్చి పూర్తిగా వింటివి. మీ అనుమతియైనచో ఈ తనువును పరిత్యజింప గోరుచున్నాను. మా గురువులు వసించిన ఈ ఆశ్రమమునందు నేను పరిచారికను. కనుక నేనును ఆ పుణ్యపురుషులకడకే (పరంధామమునకే) చేరెదను. అందులకు నన్ను అనుమతింపుము- (28-29)

లక్ష్మణునితోగూడియున్న శ్రీరాముడు గురువులయొక్క వైభవములను దెలుపునట్టి ఆమాటలనువిని, మిగుల ఆనందించెను, 'ఇది మిగుల ఆశ్చర్యకరముగా నున్నది'- అని తలంచెను. పిమ్మట శ్రీరాముడు వ్రతనియమములను పాటించుటలో మేటియైన ఆ సన్న్యాసినితో "ఓ శబరీ! భక్తితో నీవొనర్చిన పూజలకు నేను ఎంతయు సంతసించితిని, నీయిష్టానుసారము హాయిగా వెళ్లుము." అని పల్కెను. (30-31)

జడలను, నారచీరలను, జింకచర్మమును ధరించియున్న వృద్ధురాలగు ఆ శబరి అప్పటికప్పుడే తనజీర్ణశరీరమును విడువదలచెను. శ్రీరామునిఆజ్ఞయైన పిదప తనదేహమును అగ్నికి ఆహుతిగాజేసి, అగ్నితేజస్సుతో వెలుగొందుచు ఆమె పరంధామమునకు చేరెను. (32-33)

శబరి పరంధామమునకు బయలుదేఱునప్పుడు దివ్యములైన ఆభరణములతోడను, అపూర్వములైన హారములతోడను, సుగంధాదిలేపనములతోడను, అద్భుతములైన వస్త్రములతోడను ఒప్పుచు దర్శనీయురాలైయుండెను. ఆమె విద్యుల్లతవలె మెఱయుచు ఆ ప్రదేశము నందతటను వెలుగులను నింపుచుండెను. (34)

పుణ్యాత్ములును, ఆమెకు గురువులును ఐన ఆ మహర్షులు చేరిన అక్షయలోకములకు శబరియు తన సమాధియోగ ప్రభావముచే చేరెను. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే చతుస్సప్తతితమస్సర్గః *(74)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది డెబ్బదినాల్గవసర్గము.

-- * * * --

75. డెబ్బదిఐదవసర్గము

ఋశ్యమూకపర్వతమునకు వెళ్ళుచు రామలక్ష్మణులు పంపాసరోవరతీరమునందలి దృశ్యములను గాంచుట -

దివం తు తస్యాం యాతాయాం శబర్యాం స్వేన తేజసా।
లక్ష్మణేన సహ భ్రాత్రా చింతయామాస రాఘవః। 1

స చింతయిత్వా ధర్మాత్మా ప్రభావం తం మహాత్మనామ్।
హితకారిణమేకాగ్రం లక్ష్మణం రాఘవోఽబ్రవీత్। 2

దృష్టోఽయమాశ్రమః సౌమ్య బహ్వాశ్చర్యః కృతాత్మనామ్।
విశ్వస్తమృగశార్దూలో నానావిహగసేవితః। 3

సప్తానాం చ సముద్రాణామ్ ఏషు తీర్థేషు లక్ష్మణ!।
ఉపస్పృష్టం చ విధివత్ పితరశ్చాఽపి తర్పితాః। 4

ప్రణష్టమ్ అశుభం తత్తత్ కల్యాణం సముపస్థితమ్।
తేన తత్త్వేన హృష్టం మే మనో లక్ష్మణ! సంప్రతి। 5

హృదయే హి నరవ్యాఘ్ర! శుభమావిర్భవిష్యతి। 6

తదాగచ్ఛ గమిష్యావః పంపాం తాం ప్రియదర్శనామ్।
ఋశ్యమూకో గిరిర్యత్ర నాఽతిదూరే ప్రకాశతే। 7

యస్మిన్ వసతి ధర్మాత్మా సుగ్రీవోఽంశుమతః సుతః।
నిత్యం వాలిభయాత్ త్రస్తః చతుర్భిః సహ వానరైః। 8

అభిత్వరే చ తం ద్రష్టుం సుగ్రీవం వానరర్షభమ్।
తదధీనం హి మే సౌమ్య! సీతాయాః పరిమార్గణమ్। 9

ఏవం బ్రువాణం తం ధీరం రామం సౌమిత్రిరబ్రవీత్।
గచ్ఛావస్త్వరితం తత్ర మమాపి త్వరతే మనః। 10

ఆశ్రమాత్తు తతస్తస్మాత్ నిష్క్రమ్య స విశాంపతిః।
ఆజగామ తతః పంపాం లక్ష్మణేన సహాభిభూః। 11

శబరి తనయోగబలముచే పరంధామమునకు చేరిన పిమ్మట శ్రీరాముడు తన సోదరుడైన లక్ష్మణునితో ఇట్లు ఆలోచింపదొడంగెను. (1)

ధర్మనిరతుడైన శ్రీరాముడు మతంగమహామునిశిష్యులైన ఆ మహర్షుల ప్రభావమునుగూర్చి మఱియొకసారి స్మరించిన పిమ్మట ఏకాగ్రచిత్తముతో తనకు తోడునీడగా నున్న లక్ష్మణునితో ఇట్లనుడివెను. (2)

"మహర్షులయొక్క ఈ ఆశ్రమము పుష్పములతో, ఫలములతోనిండి, సకలతీర్థములకును కూడలియై అత్యద్భుతముగా ఒప్పుచు మనకు మిగుల ఆశ్చర్యమును గొలుపుచున్నది. పెద్దపులులును, ఇతర మృగములును పరస్పర విశ్వాసముతో హింసాప్రవృత్తిని మాని ఇచట హాయిగా మసలుకొనుచున్నవి. ఇందు వివిధములగు పక్షులు కలరవములనొనర్చుచు సుఖముగా జీవించుచున్నవి. (3)

ఓలక్ష్మణా! ఇచటి సప్తసాగరతీర్థములలో స్నానముల నొనర్చి, పితృదేవతలకు విధ్యుక్తముగా శ్రాద్ధ తర్పణాదికమును ఆచరించితిమి. అందువలన మనఅశుభములు అన్నియును నశించినవి, శుభములు (మిత్రలాభములు) కలుగనున్నవి. ఆకారణమువలన ఇప్పుడు నామనస్సు మిగుల ఊరటచెందినది. ఓనరశ్రేష్ఠా! నాహృదయమున శుభసూచకములైన సంకల్పములు కలుగుచున్నవి. (4-6)

కనుక ఓ లక్ష్మణా! కనులకింపైన ఈ పంపాసరోవర తీరమువెంట వెళ్లుదము రమ్ము. ఋశ్యమూకపర్వతము ఇచటికి సమీపముననే కలదు. అందు సూర్యసుతుడును, ధర్మాత్ముడును అగు సుగ్రీవుడు అనుక్షణము వాలికి భయపడుచు నలుగురు వానరప్రముఖులతోగూడి నివసించుచున్నాడు. ఓ సౌమ్యా! వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుని దర్శించుటకై తహతహపడుచున్నాను. సీతాన్వేషణకార్యమున అతడు మనకు ఎంతయు తోడ్పడగలడు." (7-9)

ధీరుడైన శ్రీరాముడు ఇట్లు పలుకుచుండగా, సౌమిత్రి ఆయనతో 'అన్నా! అందులకై నామనస్సుగూడ మిగుల ఆరాటపడుచున్నది. కావున త్వరగా వెళ్లుదము.' అని నుడివెను. (10)

శత్రుసంహారకుడైన శ్రీరామచంద్రప్రభువు లక్ష్మణసహితుడై ఆ ఆశ్రమమునుండి బయలువెడలి పంపాతీరమునకు చేరెను.(11)

స దదర్శ తతః పుణ్యామ్ ఉదారజనసేవితామ్।
నానాద్రుమలతాకీర్ణాం పంపాం పానీయవాహినీమ్॥ 12

పద్మైః సౌగంధికై స్తామ్రాం శుక్లాం కుముదమండలైః।
నీలాం కువలయోద్ఘాటైః బహువర్ణాం కుథామివ॥ 13

స తామాసాద్య వై రామో దూరాదుదకవాహినీమ్।
మతంగసరసం నామ హ్రదం సమవగాహత॥ 14

అరవిందోత్పలవతీం పద్మసౌగంధికాయుతామ్।
పుష్పితామ్రవణోపేతాం బర్హిణోద్ఘుష్టనాదితామ్॥ 15

తిలకైర్బీజపూరైశ్చ ధవైః శుక్లద్రుమైస్తథా।
పుష్పితైః కరవీరైశ్చ పున్నాగైశ్చ సుపుష్పితైః॥ 16

మాలతీకుందగుల్మైశ్చ భాండీరైర్నిచులై స్తథా।
అశోకైః సప్తపర్ణైశ్చ కేతకైరతిముక్తకైః॥ 17

అన్యై వివిధైర్వృక్షైః ప్రమదామివ భూషితామ్।
సమీక్షమాణౌ పుష్పాఢ్యం సర్వతో విపులద్రుమమ్॥ 18

కోయష్టికైశ్చార్జునకైః శతపత్రైశ్చ కీరకైః।
ఏతైశ్చాన్యైశ్చ విహగైః నాదితం తు వనం మహత్॥ 19

తతో జగ్మతురవ్యగ్రౌ రాఘవౌ సుసమాహితౌ।
తద్వనం చైవ సరసః పశ్యంతౌ శకునైర్యుతమ్॥ 20

స దదర్శ తతః పంపాం శీతవారినిధిం శుభామ్।
ప్రహృష్ట నానాశకునాం పాదపైరుపశోభితామ్॥ 21

స రామో వివిధాన్ వృక్షాన్ సరాంసి వివిధాని చ।
పశ్యన్ కామాభిసంతప్తో జగామ పరమం హ్రదమ్॥ 22

అతడు మునులకు ఆవాసమైన పవిత్రపంపాసరస్సును గాంచెను. ఆ సరస్సు నానావిధములైన చక్కని చెట్లతో, తీగెలతో అలముకొనియుండెను. అందు ప్రవహించెడి చల్లనిజలములు మధురములు. ఆసరస్సు సువాసనలను వెదజల్లెడి ఎఱ్ఱదామరలతోడను, తెల్లని, నల్లని కలువలసమూహములతోడను ఒప్పుచు పలువన్నెలుగల కంబళివలె భాసిల్లుచుండెను. (12-13)

అంతట శ్రీరాముడు స్వాదుజలములుగల ఆపంపాసరస్సు యొక్కతీరమున కొంతదూరము నడచి, 'మతంగసరస్సు' అను పేరుతో ప్రసిద్ధికెక్కిన మడుగులో స్నానమాచరించెను. (14)

ఆ పంపాసరస్సునందు కమలములు, కలువలు, ఎఱ్ఱదామరలు శోభిల్లుచుండెను. దానితీరమునందు అంతటను బాగుగా పుష్పించిన మామిడితోపులు విరాజిల్లుచుండెను. అందు నెమళ్ళక్రేంకారములు విన వచ్చుచుండెను. (15)

తిలకవృక్షములు, దానిమ్మ, చంద్ర, ఏరుమద్ది, పుష్పించిన గన్నేరు, విరబూసిన సురపొన్న మొదలగు చెట్లతోడను, జాజి, మల్లెపొదలతోడను, మద్దె, వేప, అశోక, ఏడాకులఅరటి, మొగలి, గురువింద చెట్లతోడను, ఇంకను అనేకవిధములైన వృక్షములతోను శోభిల్లుచున్న ఆపంపాసరస్సు వివిధాలంకారములతో విరాజిల్లుచున్న ప్రమదవలె భాసిల్లుచుండెను. దానితీరమును, అందున్న వనమును గాంచుచు ఆ ఇరువురును ముందునకు సాగుచుండిరి. తీరమునందలి ఆవనము రంగురంగుల పూవులు గలిగి, చాల దూరము వ్యాపించియున్న చెట్లతో రమణీయముగా నుండెను. మఱియు టిట్టిభపక్షులు, నెమళ్ళు, వడ్రంగిపిట్టలు, చిలుకలు, ఇంకను తదితరములైన పక్షులయొక్క కూజితములతో ఆ వనము అలరారుచుండెను. రామలక్ష్మణులిరువురును ఏకాగ్రచిత్తులై పక్షులతో కలకలలాడుచున్న ఆసరస్సును, అచటి వనమును దర్శించుచు త్వరత్వరగా నడచుచు ముందునకు సాగిరి.(16-20)

మఱల వారు చల్లని జలములతోడను, సంతోషముతో కేరింతలు కొట్టుచున్నపక్షులతోడను వివిధములగు వృక్షములతోడను విరాజిల్లుచున్న పంపాసరస్సును దర్శించిరి. (21)

శ్రీరాముడు వివిధములగు వృక్షములను, పలువిధములగు సరస్సులను గాంచుచు, సీతయెడబాటునకు పరితపించు చున్నవాడై పంపాతీరమున సాగిపోవుచుండెను. ఆ తీరమునకు సమీపమునగల ఉపవనములన్నియును పూవులతో కలకలలాడుచున్నవి. అది మద్దివృక్షములతో, సంపెంగపూలమొక్కలతో శోభిల్లుచుండెను. అచట

పుష్పితోపవనోపేతాం సాలచంపకశోభితామ్।
షట్పదౌఘసమావిష్టాం శ్రీమతీమ్ అతులప్రభామ్। 23

స్ఫటికోపమతోయాఢ్యాం శ్లక్ష్ణవాలుకసంతతామ్।
స తాం దృష్ట్వా పునః పంపాం పద్మసౌగంధికైర్యుతామ్।
ఇత్యువాచ తదా వాక్యం లక్ష్మణం సత్యవిక్రమః। 24

అస్యాస్తీరే తు పూర్వోక్తః పర్వతో ధాతుమండితః।
ఋశ్యమూక ఇతి ఖ్యాతః పుణ్యః పుష్పితపాదపః। 25

హరేరృక్షరజోనామ్నః పుత్రస్తస్య మహాత్మనః।
అధ్యాస్తే తం మహావీర్యః సుగ్రీవ ఇతి విశ్రుతః। 26

సుగ్రీవమభిగచ్ఛ త్వం వానరేంద్రం నరర్షభ!।
ఇత్యువాచ పునర్వాక్యం లక్ష్మణం సత్యవిక్రమమ్। 27

రాజ్యభ్రష్టేన దీనేన తస్యామ్ ఆసక్తచేతసా।
కథం మయా వినా శక్యం సీతాం లక్ష్మణ! జీవితుమ్। 28

ఇత్యేవముక్త్వా మదనాభిపీడితః
సలక్ష్మణం వాక్యమనన్యచేతసమ్ ।
వివేశ పంపాం నళినీం మనోరమాం
రఘూత్తమః శోకవిషాదయంత్రితః । 29

తతో మహద్వర్త్మ సుదూరసంక్రమః
క్రమేణ గత్వా ప్రతికూలధన్వనమ్ ।
దదర్శ పంపాం శుభదర్శకాననామ్
అనేకనానావిధపక్షిజాలకామ్ । 30

తుమ్మెదలగుంపులఝుంకారములు వినవచ్చుచుండెను. ఆతీరము నిరుపమాన కాంతులతో దేదీప్యమానమై విలసిల్లుచుండెను. ఆసరస్సు స్ఫటికములవలె స్వచ్ఛములైన జలములతో నిండియుండెను. అది మనోహరమైన ఇసుకతిన్నెలతో ఒప్పుచుండెను. పద్మములపరిమళములతో గుబాళించుచుండెను- అట్టి పంపాసరస్సును జూచి సత్యపరాక్రముడైన శ్రీరాముడు లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (22-24)

"'ఋశ్యమూకము' అను పేరుతో ప్రసిద్ధి కెక్కిన పవిత్రమైన పర్వతము గైరికాది ధాతువులతో విలసిల్లు చుండును. అది విరబూసిన వృక్షములతో శోభిల్లు చుండును. అది ఈ పంపాతీరమునందేకలదు" అని ఇంతకుముందే కబంధుడు తెల్పియుండెను. (25)

మహాత్ముడైన ఋక్షరజుడను వానరునికుమారుడు సుగ్రీవుడు. మహావీరుడుగా ఖ్యాతికెక్కిన అతడు ఈ ఋశ్యమూక పర్వతముపై నివసించుచున్నాడు. (26)

'ఓ నరశ్రేష్ఠా! వానరప్రముఖుడైన ఆసుగ్రీవునికడకు బయలుదేఱుము' అని పలికిన పిమ్మట శ్రీరాముడు సత్యపరాక్రముడైన లక్ష్మణునితో మఱల ఇట్లనెను. (27)

"ఓ సౌమిత్రీ! ప్రస్తుతము నేను రాజ్యాధికారమునకు దూరమై దైన్యావస్థకులోనైయున్నవాడను. ఇట్టిస్థితిలో సీతాదేవి నన్ను ఓదార్చుచు నాకు ఊరట కల్గించు చుండెడిది. కనుక ఆమె నాకు పదే పదే మనస్సులో మెదలుచున్నది. అట్టి సీతాదేవి నాచెంతలేకుండ నేను ఎట్లు జీవించియుండగలను?" (28)

సీతయెడబాటుతో దుఃఖితుడైయున్న ఆ శ్రీరాముడు తనమాటలను సావధానుడై వినుచున్న లక్ష్మణునితో ఇట్లు పలికెను. పిమ్మట శోకవిషాదములకులోనై ఏమి చేయుటకునుతోచకున్న శ్రీరాముడు లక్ష్మణునితోగూడి, పద్మములతోనిండి కలకలలాడుచున్నదై, మనస్సునకు ఉల్లాసమునుగూర్చెడి పంపాసరస్సులో స్నానము చేయుటకై దిగెను. (29)

చిత్రకూటమునుండి చాలదూరము ప్రయాణముచేసిన పిమ్మట శ్రీరాముడు క్రమముగా వెదురు మొదలగు పొదలతో నిండి, బాటసారులు ప్రవేశించుటకు అసాధ్యమైన కబంధవనమునకు చేరెను. పిమ్మట ఆ ప్రభువు నానావిధములగు రంగురంగుల పక్షులతోగూడి, దర్శనీయములైన వనములుగల పంపాసరోవరమును దర్శించెను. (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే అరణ్యకాండే పంచసప్తతితమస్సర్గః (75)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి అరణ్యకాండమునందు ఇది డెబ్బదిఐదవసర్గము.

— ✻ అరణ్యకాండము సమాప్తము ✻ —

॥ శ్రీరామచంద్రాయ నమః ॥

శ్రీమద్వాల్మీకిరామాయణము

కిష్కింధా కాండము

1. మొదటిసర్గము

ఆహ్లాదకరములైన వసంత-ఋతు శోభలను, మనోహరములైన పంపాసరోవర తీరములయందలి దృశ్యములను చూచుచు శ్రీరాముడు మిగుల విరహవేదనకు గుఱియగుట - లక్ష్మణస్వామి ఉత్సాహపఱచుచు అన్నను ఓదార్చుట - సీతాదేవిని వెదకుచు అచట తిరుగుచున్న రామలక్ష్మణులనుజూచి, సుగ్రీవుడు భయపడుట -

స తాం పుష్కరిణీం గత్వా పద్మోత్పలఝషాకులాం।
రామః సౌమిత్రిసహితో విలలాపాఽఽకులేంద్రియః। 1

తస్య దృష్ట్వైవ తాం హర్షాత్ ఇంద్రియాణి చకంపిరే।
స కామవశమాపన్నః సౌమిత్రిమ్ ఇదమబ్రవీత్। 2

సౌమిత్రే శోభతే పంపా వైడూర్యవిమలోదకా।
ఫుల్లపద్మోత్పలవతీ శోభితా వివిధైర్ద్రుమైః। 3

సౌమిత్రే పశ్య పంపాయాః కాననం శుభదర్శనం।
యత్ర రాజంతి శైలాభా ద్రుమాః సశిఖరా ఇవ। 4

మాం తు శోకాభిసంతప్తం మాధవః పీడయన్నివ।
భరతస్య చ దుఃఖేన వైదేహ్యా హరణేన చ। 5

శోకార్తస్యాపి మే పంపా శోభతే చిత్రకాననా।
వ్యవకీర్ణా బహువిధైః పుష్పైః శీతోదకా శివా। 6

శ్రీరాముడు లక్ష్మణస్వామితోగూడి, పద్మములతో, కలువలతో, మత్స్యములతో విలసిల్లుచున్న పంపా సరోవరమునకు చేరెను. అందలి పద్మములు సీతాదేవి ముఖమును, కలువలు ఆమెనేత్రములను, మత్స్యములు ఆమె చూపులకదలికలను స్ఫురింపజేయగా రాఘవుని మనస్సులో సీతాదేవి మెదలెను. అంతట ఆసీతాపతి మిగుల వ్యాకులపాటునకులోనై ఎంతయు విలపించెను. (1)

శ్రీరాముడు ఆదృశ్యమును చూడగానే ఆయన ఇంద్రియములు చలించెను. సీతాదేవికై ఆరాటపడెను. అప్పుడతడు సౌమిత్రితో ఇట్లనెను. (2)

"ఓ సౌమిత్రీ! ఈ పంపాసరస్సు వైడూర్యములవలె స్వచ్ఛములైన జలములతో శోభిల్లుచున్నది. ఇది వికసించిన కమలములతో, తీరములయందలి వివిధములగు వృక్షములతో కలకలలాడుచున్నది. పరిసరములయందుగల వనములు దర్శనీయములైయున్నవి. ఇచట దట్టముగా, ఏపుగా పెఱిగిన చెట్లు శిఖరములతోగూడిన పర్వములవలె అలరారుచున్నవి. (3-4)

అచట అయోధ్యానగరమునకు వెలుపలగల నందిగ్రామమునందు ఉపవాసాదివ్రతనియమములను పాటించుచు భరతుడు మిగుల దుఃఖములకు లోనైయున్నాడు. ఇచట సీతాదేవి అపహరణకు గుఱియై ఎంతయు పరితపించుచున్నది. ఈ ఇరువురి వ్యథలకై నేను ఇప్పటికే మిక్కిలి పరితాపమునకు లోనైయున్నాను. (ఆత్మీయుల దుఃఖములను తలంచుకొని తాము దుఃఖపడుట మహాపురుషుల లక్షణము.) ఈ రెంటికిని తోడుగా ఇప్పుడు వసంతుడు నన్ను మిగుల పీడించుచున్నట్లున్నాడు. (5)

మనస్సు వ్యాకులమైయున్నవానిని ఏదియును రంజింపజేయలేదు. వానికి దేనియందును ఆసక్తియుండదు. కాని చిత్రవిచిత్రములైన వనములతో, పలువిధములైన

నళినైరపి సంఛన్నా హ్యత్యర్థం శుభదర్శనా।
సర్పవ్యాలానుచరితా మృగద్విజసమాకులా। 7

అధికం ప్రతిభాత్యేతత్ నీలపీతం తు శాద్వలం।
ద్రుమాణాం వివిధైః పుష్పైః పరిస్తోమైరివార్పితమ్। 8

పుష్పభారసమృద్ధాని శిఖరాణి సమంతతః।
లతాభిః పుష్పితాగ్రాభిః ఉపగూఢాని సర్వతః। 9

సుఖానిలోఽయం సౌమిత్రే కాలః ప్రచురమన్మథః।
గంధవాన్ సురభిర్మాసో జాతపుష్పఫలద్రుమః। 10

పశ్య రూపాణి సౌమిత్రే వనానాం పుష్పశాలినాం।
సృజతాం పుష్పవర్షాణి తోయం తోయముచామివ। 11

ప్రస్తరేషు చ రమ్యేషు వివిధాః కాననద్రుమాః।
వాయువేగప్రచలితాః పుష్పైరవకిరంతి గామ్। 12

పతితైః పతమానైశ్చ పాదపస్థైశ్చ మారుతః।
కుసుమైః పశ్య సౌమిత్రే క్రీడన్నివ సమంతతః। 13

విక్షిపన్ వివిధాః శాఖా నగానాం కుసుమోత్కచాః।
మారుతశ్చలితస్థానైః షట్పదైరనుగీయతే। 14

మత్తకోకిలసన్నాదైః నర్తయన్నివ పాదపాన్।
శైలకందరనిష్క్రాంతః ప్రగీత ఇవ చాఽనిలః। 15

రంగురంగుల పూవులతో విరాజిల్లుచు, చల్లని జలములతో మనోహరముగానున్న ఈ పంపాసరస్సు మాత్రము నేను ఇంతగా శోకార్తుడనైయున్నప్పటికిని నన్ను ఆకర్షించుచున్నది. (6)

పరిసరములలో కొండచిలువలు మొదలగు మహాసర్పములును, అడవిమృగములును, పక్షులును సంచరించుచున్నప్పటికిని, ఈ సరోవరము కమలములతో, కలువలతో నిండి యుండుటచే మిక్కిలి దర్శనీయముగానున్నది. (7)

ఇదిగో! ఇచటిపచ్చికబయళ్లన్నియును నెమలికంఠమువన్నెలు (నీలము పీతము కలిసిన వన్నెలు) కలిగియున్నవి. వృక్షములనుండి రాలిన పలువన్నెల పూవులతోగూడి ఈ ప్రదేశము రత్నకంబళి పఱచినట్లు శోభిల్లుచున్నది. (8)

ఇచటిచెట్లన్నియును చక్కగా పుష్పించియున్నవి. అందువలన వాటి కొమ్మలన్నియును పూలబరువుతో వంగియున్నవి. పుష్పములతో నిండియున్న లతలు పూర్తిగా వాటికి చుట్టు (అల్లు) కొనియుండుటచే అవి వాటిని కౌగిలించుకొనినట్లు ఒప్పుచున్నవి. (9)

ఓ లక్ష్మణా! ఈ వసంతఋతువులో వృక్షము లన్నియును బాగుగా పూవులతో, పండ్లతో నిండారియున్నవి. అంతేగాక వీటిమీదుగా వీచెడి పిల్లగాలులు సువాసనలతోగూడి మిగుల హాయినిగొలుపుచు నాలో సీతాదర్శనకాంక్షను రేకెత్తించుచున్నవి. (10)

ఓ సౌమిత్రీ! పూవులతో కలకలలాడుచున్న ఈ వనములశోభలను తిలకింపుము. మేఘములు జలములనువలె ఇవి పుష్పములను వర్షించుచున్నవి. (11)

ఓ సౌమిత్రీ! వనములయందలి వివిధములగు వృక్షములు పెనుగాలులకు బాగుగా కదలుచురమ్యములైన శిలలపై పుష్పములను రాల్చుచు భూమిని కప్పివేయుచున్నవి. నేలపైరాలిపడియున్న పూవులతోడను, రాలుచున్న పుష్పములతోడను, చెట్లమీదనేయున్న కుసుమములతోడను వాయువులు క్రీడించుచున్నట్లు కనబడుచున్న ఆదృశ్యమును గాంచుము. (12-13)

పూలతోనిండియున్న వివిధములగు వృక్షశాఖలను కదల్చుచు వాయువులు వేగముగా వీచుచున్నవి. కొమ్మల కదలికలతో తమతమ స్థానములనుండి (పూవులనుండి) లేచిన తుమ్మెదలు తమ ఝుంకారములద్వారా ఆ గాలుల గానములతో శ్రుతికలుపుచున్నవి. (14)

పెద్దపెద్ద గాలులకు చెట్లు ఊగుచు అవి నృత్యము చేయుచున్నవా? అనునట్లు ఒప్పుచున్నవి. ఈ దృశ్యము పర్వతగుహలనుండి పలువిధముల ధ్వనించుచు బయటికివచ్చిన వాయువులు మత్తకోకిలల పంచమస్వర వాద్యములతోగూడి ఆ వృక్షములకు నృత్యములో శిక్షణ ఇచ్చుచున్నవా? అనునట్లు కనబడుచున్నవి. (15)

తేన విక్షిపతాఽత్యర్థం పవనేన సమంతతః।
అమీ సంసక్తశాఖాగ్రా గ్రథితా ఇవ పాదపాః। 16

మిక్కిలి బలముగా వీచుచున్న గాలులకు నలుదిక్కులయందుగల వృక్షములన్నియును ఎంతయు ఊగిపోవుచున్నవి. అప్పుడు ఆ చెట్లకొమ్మలచివరిభాగములు పరస్పరము కలిసిపోగా అవి ఒక మాలగా కూర్చబడినట్లు ఉన్నవి.(16)

స ఏష సుఖసంస్పర్శో వాతి చందనశీతలః।
గంధమ్ అభ్యావహన్ పుణ్యం శ్రమాపనయనోఽనిలః। 17

మలయపర్వతమునందలి చందనవృక్షములమీదుగా వీచెడి చల్లనిగాలులు సువాసనలను మోసికొనివచ్చుచు సుఖసంస్పర్శతో హాయిని గూర్చుచున్నవి. అవి మనబడలికలను పోగొట్టుచున్నవి. (17)

అమీ పవనవిక్షిప్తా వినదంతీవ పాదపాః।
షట్పదైరనుకూజంతో వనేషు మధుగంధిషు। 18

పూదేనెలవాసనలతో గుబాళించుచున్న వనములయందలి వృక్షములు గాలులకు కంపించుచున్నవై తుమ్మెదలఝుంకారములతో గొంతుగలుపుచు నృత్యములు చేయుచున్నట్లున్నవి. (18)

గిరిప్రస్థేషు రమ్యేషు పుష్పవద్భిః మనోరమైః।
సంసక్తశిఖరాః శైలా విరాజంతే మహాద్రుమైః। 19

కనువిందుగావించుచున్న కొండచరియలయందలి మహావృక్షములు ఇచట కొల్లలుగా గలవు. అవియన్నియును పూవులతోనిండి, అత్యున్నతములైన శిఖరములను తాకుచు మనోహరముగా అలరారుచున్నవి. మహోన్నతములైన శిఖరములు, వృక్షములు కలసిమెలసియుండుటచే ఇచటి పర్వతములు పుష్పరాసులవలె మనోజ్ఞముగానున్నవి.(19)

పుష్పసంఛన్నశిఖరా మారుతోత్క్షేపచంచలాః।
అమీ మధుకరోత్తంసాః ప్రగీతా ఇవ పాదపాః। 20

ఇందలివృక్షములఅగ్రభాగములు పుష్పములచే కప్పబడి, గాలులతాకిడికి అటునిటు ఊగుచున్నవి. తుమ్మెదలే శిరోభూషణములుగాగల ఆ పాదపములు భ్రమరఝుంకారములతో శ్రుతిగలిపి, నృత్యములు చేయుచున్నట్లున్నవి. (20)

పుష్పితాగ్రాంస్తు పశ్యేమాన్ కర్ణికారాన్ సమంతతః।
హాటకప్రతిసంఛన్నాన్ నరాన్ పీతాంబరానివ। 21

ఓ లక్ష్మణా! ఇందు అంతటను వ్యాపించి విరబూసియున్న పచ్చగన్నేరు చెట్లను చూడుము. ఇవి పట్టు పీతాంబరములను, బంగారు నగలను ధరించిన మానవులవలె ఒప్పుచు మనోజ్ఞముగా ఉన్నవి. (21)

అయం వసంతః సౌమిత్రే నానావిహగనాదితః।
సీతయా విప్రహీణస్య శోకసందీపనో మమ। 22

వివిధములగు పక్షులయొక్క కలరవములతో (మధురధ్వనులతో) విరాజిల్లుచున్న ఈ వసంత ఋతువు సీతాదేవివిరహమునకు లోనైన నా శోకమును అధికమొనర్చుచున్నది. (22)

మాం హి శోకసమాక్రాంతం సంతాపయతి మన్మథః।
హృష్టః ప్రవదమానశ్చ మామాహ్వయతి కోకిలః। 23

సీతాదేవివిడబాటుచే శోకమున మునింగియున్న నన్ను మన్మథుడు ఇంకను తీవ్రముగా తపింపజేయుచున్నాడు. దీనికితోడుగా సంతోషముతో మత్తిల్లియున్న కోకిల తన పంచమస్వరాలాపనతో ఆహ్వానించుచు నన్ను గేలిచేయుచున్నదా? అనునట్లు ఒప్పుచున్నది. (23)

ఏష దత్యూహకో హృష్టో రమ్యే మాం వననిర్ఝరే।
ప్రణదన్ మన్మథావిష్టం శోచయిష్యతి లక్ష్మణ। 24

ఓ లక్ష్మణా! వనమునందలి రమ్యమైన ఈ సెలయేఱునందుగల జలకుక్కుటము (నీరుకోడి) ఆనందముతో కూయుచు విరహబాధకు లోనైయున్న నన్ను ఎంతయు శోకింపజేయుచున్నది. (24)

శ్రుత్వైతస్య పురా శబ్దమ్ ఆశ్రమస్థా మమ ప్రియా।
మామాహూయ ప్రముదితా పరమం ప్రత్యనందత। 25

లోగడ పంచవటియందలి ఆశ్రమమునందున్నప్పుడు నా ప్రాణప్రియురాలైన సీతాదేవి ఈ జలకుక్కుట నాదములను విని, తాను ఎంతయు ఆనందించుచుండెడిది. మఱియు ఆమె నన్నును పిలిచి మురిపింపజేసెడిది. (25)

ఏవం విచిత్రాః పతగా నానారావవిరావిణః।
వృక్షగుల్మలతాః పశ్య సంపతంతి తతస్తతః। 26

విమిశ్రా విహగాః పుంభిః ఆత్మవ్యూహాభినందితాః।
భృంగరాజప్రముదితాః సౌమిత్రే మధురస్వరాః। 27

నత్యూహారుతవిక్రందైః పుంస్కోకిలరుతైరపి।
స్వనంతి పాదపాశ్చేమే మమానంగ ప్రదీపనాః। 28

అశోకస్తబకాంగారః షట్పదస్వననిస్వనః।
మాం హి పల్లవతామ్రార్చిః వసంతాగ్నిః ప్రధక్ష్యతి। 29

న హి తాం సూక్ష్మపక్ష్మాక్షీం సుకేశీం మృదుభాషిణీం।
అపశ్యతో మే సౌమిత్రే జీవితేఽస్తి ప్రయోజనమ్। 30

అయం హి దయితస్తస్యాః కాలో రుచిరకాననః।
కోకిలాకులసీమాంతో దయితాయా మమానఘ। 31

మన్మథాయాససంభూతో వసంతగుణవర్ధితః।
అయం మాం ధక్ష్యతి క్షిప్రం శోకాగ్నిర్నచిరాదివ। 32

అపశ్యతస్తాం దయితాం పశ్యతో రుచిరద్రుమాన్।
మమాయమ్ ఆత్మప్రభవో భూయస్త్వమ్ ఉపయాస్యతి। 33

అదృశ్యమానా వైదేహీ శోకం వర్ధయతే మమ।
దృశ్యమానో వసంతశ్చ స్వేదసంసర్గదూషకః। 34

ఓ సౌమిత్రీ! చిత్రవిచిత్రములైన పక్షులు వివిధములగు కలరవములను జేయుచు ఈ ప్రదేశమునందున్న వృక్షములమీద, పొదలపైన, తీగెలమీద ఎగురుచున్నవి, చూడుము. (26)

ఓ లక్ష్మణా! ఆడుపక్షులు మగపక్షులతోగూడి సుఖానందములను పొందుచున్నవి. ఆగుంపులోని పక్షులన్నియును, పరస్పరము అభినందించుకొనుచున్నవి. అవి గండుతుమ్మెదలఝుంకారములకు ఉద్దీపితములై సంతోషముతో మధురస్వరములను ఆలపించుచున్నవి.(27)

జలకుక్కుటములయొక్క రతికూజితములతోడను, గండుకోయిలలయొక్క కలరవములతోడను కలిసి ఈ వృక్షములును ధ్వనిచేయుచున్నట్లు ఉన్నవి. ఇవియన్నియును నాలో కోరికలను రేకెత్తించుచున్నవి. (28)

ఈ వసంతాగ్ని నన్ను దహించివేయునట్లున్నది. అశోకవృక్షముల యొక్క ఎఱ్ఱని పూలగుత్తులే నిప్పుకణికలు, క్రొత్తచిగురుటాకులే అగ్నిజ్వాలలు, తుమ్మెదల ఝుంకారములే అగ్నిమంటల చిటపటధ్వనులు. (29)

సీతాదేవియొక్క కనుఱెప్పలు (ఱెప్పలవెండ్రుకలు) అందమైనవి. చూపులు ప్రసన్నములు. కురులు నిగనిగలాడునవి. ఆమెమాటలు మృదుమధురములు. అట్టి సీతను చూడని నా జీవితము నిష్ప్రయోజనము. (30)

ఈ వసంతఋతువునందు వనములన్నియును చక్కని చిగుళ్లతో, పూవులతో, పండ్లతో కనువిందు గావించుచుండును. కోకిలలు తమమధురస్వరములను నలుదిక్కుల వ్యాపింపజేయుచు వీనుల విందుగావించుచుండును. కనుక నాకు ప్రాణములకంటె మిన్నయైన సీతాదేవికి ఈ వసంతకాలము మిక్కిలి ఇష్టము. (31)

సీతావిరహబాధవలన ఏర్పడిన నా శోకాగ్నిని వసంత ఋతువునందలి రమణీయ ప్రకృతి[1] ఇనుమడింపజేసినది. అది ఇప్పటికిప్పుడే క్షణములో నన్ను దహించివేయుచున్నట్లున్నది.(32)

నా ప్రియపత్నియైన సీత కనబడకపోవుట, విరహబాధను ఉద్దీపింపజేయు పుష్పఫలసంపన్నములైన ఈ వృక్షాదులను దర్శించుట అనునవి నామదనతాపమును వృద్ధిచేయుచున్నవి. సీతాదేవి కనబడనందున నా శోకము అధికమగుచున్నది. పైగా స్వేదబిందువులను తొలగించు మలయానిలము ద్వారా ఈ వసంతుడు నన్నింకను వేధించుచున్నాడు.(33–34)

1) వసంతఋతురమణీయ ప్రకృతి = చల్లని మలయమారుతములు వీచుట, చిగురుటాకులతో, పుష్పములతో చెట్లు శోభిల్లుచుండుట, కోకిలలు మధురముగా గానముచేయుట, కమలములు వికసించుట అంతటను సుగంధ పరిమళములు వ్యాపించుట మొదలగునవి విరహజనుల శోకాగ్నిని వృద్ధిచేయును.

మాం హ్యార్య మృగశాబాక్షీ చింతాశోకబలాత్కృతం।
సంతాపయతి సౌమిత్రే క్రూరశ్చైత్రవనానిలః। 35

అమీ మయూరాః శోభంతే ప్రనృత్యంతః తతస్తతః।
స్వైః పక్షైః పవనోద్ధూతైః గవాక్షైః స్ఫాటికైరివ। 36

శిఖినీభిః పరివృతాః త ఏతే మదమూర్ఛితాః।
మన్మథాభిపరీతస్య మమ మన్మథవర్ధనాః। 37

పశ్య లక్ష్మణ నృత్యంతం మయూరమ్ ఉపనృత్యతి।
శిఖినీ మన్మథార్తైషా భర్తారం గిరిసానుషు। 38

తామేవ మనసా రామాం మయూరోఽప్యుపధావతి।
వితత్య రుచిరౌ పక్షౌ రుతైరుపహసన్నివ। 39

మయూరస్య వనే నూనం రక్షసా న హృతా ప్రియా।
తస్మాన్నృత్యతి రమ్యేషు వనేషు సహ కాంతయా। 40

మమ త్వయం వినా వాసః పుష్పమాసే సుదుస్సహః। 41

పశ్య లక్ష్మణ సంరాగం తిర్యగ్యోనిగతేష్వపి।
యదేషా శిఖినీ కామాత్ భర్తారం రమతేఽంతికే। 42

మామప్యేవం విశాలాక్షీ జానకీ జాతసంభ్రమా।
మదనేనాభివర్తేత యది నాపహృతా భవేత్। 43

పశ్య లక్ష్మణ పుష్పాణి నిష్ఫలాని భవంతి మే।
పుష్పభారసమృద్ధానాం వనానాం శిశిరాత్యయే। 44

రుచిరాణ్యపి పుష్పాణి పాదపానామ్ అతిశ్రియా।
నిష్ఫలాని మహీం యాంతి సమం మధుకరోత్కరైః। 45

వదంతి రావం ముదితాః శకునాః సంఘశః కలమ్।
ఆహ్వయంత ఇవాన్యోఽన్యం కామోన్మాదకరా మమ। 46

వసంతో యది తత్రాపి యత్ర మే వసతి ప్రియా।
నూనం పరవశా సీతా సాపి శోచత్యహం యథా। 47

లేడిపిల్లవలె అందమైన చూపులుగల సీతాదేవియొక్క యెడబాటువలన నేను చింతాక్రాంతుడనై ఎంతయు శోకమునకు గుఱియైతిని. దానికితోడుగా ఈ చైత్రమాసమునందలి చల్లని పిల్లవాయువులు నన్ను ఇంకను పరితపింపజేయుచున్నవి.(35)

అచ్చటచ్చట మయూరములు పురులువిప్పి నృత్యము చేయుచున్నవి. అప్పుడు గాలికి కదల్పబడిన వాటి పింఛములు స్ఫటికములు, మణులు పొదిగిన కిటికీలవలె శోభిల్లుచున్నవి. ఈనెమళ్లు ఆడుమయూరములతో పరివృతములై పారవశ్యమున మునిగియున్నవి. మదనవికారములకు లోనైయున్న నన్ను అవి ఇంకను విరహబాధకు గుఱిచేయుచున్నవి. (36-37)

ఓ సౌమిత్రీ! ఇటుచూడుము. పర్వతసానువులయందు నృత్యముచేయుచున్న తనభర్తయగు నెమలితోపాటు ఆడునెమలి కామపరవశయై తానును నాట్యము చేయుచున్నది. మగనెమలికూడ మనోహరములైన తనఱెక్కలను విప్పుకొని, క్రేంకారములనొనర్చుచు ప్రసన్నముఖముతో, ప్రేమగా తన ప్రియురాలిని అనుసరించుచున్నది. (38-39)

ఈ వనమునందు మయూరముయొక్క ప్రియురాలైన ఆడు నెమలిని ఏ రాక్షసుడును అపహరింపలేదు. అందువలననే అది తనకాంతతోగూడి ఇచటి రమ్యవనములయందు నాట్యము చేయుచున్నది. ఇది నిశ్చయము. పూలతోనిండిన ఈచైత్రమాసమునందు సీత తోడుగా లేకుండ ఇచట నివసించుట నాకు దుస్సహము. (40-41)

ఓ లక్ష్మణా! ఈ మయూరి కామపరవశయై, భర్తను జేరి రమించుచున్నది. పశుపక్ష్యాదులయందును ఈస్త్రీపురుష ప్రకృతుల పరస్పరప్రేమానురాగములను జూడుము.(42)

సీతాదేవిని రాక్షసుడు అపహరించుకొనిపోనిచో ఆవిశాలాక్షియు వీటివలె నాయెడ మిగుల ప్రేమానురాగములతో ప్రవర్తించెడిది.(43)

ఓ లక్ష్మణా! ఇటుచూడుము. ఈ వసంతఋతువునందు వనములలో విరబూసిన చెట్లపుష్పములన్నియును నాకు నిరుపయోగములేయైనవి సుమా! ఈ వృక్షములయొక్క కుసుమములు చక్కగా శోభిల్లుచు మనోహరముగా ఉన్నను నిష్ఫలములై తుమ్మెదలతోగూడ నేలపై రాలుచున్నవి.(44-45)

ఈ పక్షులగుంపులన్నియును హర్షోల్లాసములతో ఒకదానిని మఱియొకటి ఆహ్వానించుచున్నట్లుగా హాయిగా మధురధ్వనులు గావించుచున్నవి. ఆవిధముగా అవి నాలో తీవ్రమైన కోరికలను కల్గించుచున్నవి. (46)

నాప్రేమపెన్నిధియైన సీతాదేవి ఉన్నచోటగూడ వసంత ఋతువు ఈ విధముగనే ప్రకృతిని పులకింపజేయుచున్నచో ఆమెయు నావలెనే పారవశ్యముతో శోకించుచుండుట తథ్యము.(47)

మాపం న తు వసంతోఽయం దేశం స్పృశతి యత్ర సా।
కథం హ్యసితపద్మాక్షీ వర్తయేత్ సా మయా వినా। 48

అథవా వర్తతే తత్ర వసంతో యత్ర మే ప్రియా।
కిం కరిష్యతి సుశ్రోణీ సా తు నిర్భర్త్సితా పరైః। 49

శ్యామా పద్మపలాశాక్షీ మృదుపూర్వాభిభాషిణీ।
నూనం వసంతమాసాద్య పరిత్యక్ష్యతి జీవితమ్। 50

దృఢం హి హృదయే బుద్ధిః మమ సంప్రతి వర్తతే।
నాఽలం వర్తయితుం సీతా సాధ్వీ మద్విరహం గతా। 51

మయి భావస్తు వైదేహ్యాః తత్త్వతో వినివేశితః।
మమాపి భావః సీతాయాం సర్వథా వినివేశితః। 52

ఏష పుష్పవహో వాయుః సుఖస్పర్శో హిమావహః।
తాం విచింతయతః కాంతాం పావకప్రతిమో మమ। 53

సదా సుఖమహం మన్యే యం పురా సహ సీతయా।
మారుత స్స వినా సీతాం శోకం వర్ధయతే మమ। 54

తాం వినా స విహంగో యః పక్షీ ప్రణదితస్తదా।
వాయసః పాదపగతః ప్రహృష్టమ్ అభినర్దతి। 55

ఏష వై తత్ర వైదేహ్యా విహగః ప్రతిహారకః।
పక్షీ మాం తు విశాలాక్ష్యాః సమీపమ్ ఉపనేష్యతి। 56

పశ్య లక్ష్మణ సన్నాదం వనే మదవివర్ధనమ్।
పుష్పితాగ్రేషు వృక్షేషు ద్విజానామ్ ఉపకూజతామ్। 57

సీతాదేవి ఏకాంతముగానున్న ఆ ప్రదేశమున వసంతఋతువు ప్రవేశించియుండదు (ఇట్లు విజృంభించి యుండదు) ఒక వేళ అక్కడగూడ వసంత శోభలు వెల్లివిరిసినచో నాకు దూరమైయున్న ఆకమలనేత్ర వాటికి తట్టుకొని అచట ఎట్లుండగలదు? (48)

నా ప్రేమనిధియైన వైదేహియున్నచోటను వసంతుడు విజృంభించియున్నచో అచట పరులకు భయపడుచు బిక్కుబిక్కుమని కాలముగడపుచున్న ఆసుందరాంగి మాత్రము ఏమి చేయుగలదు? (49)

తామర రేకులవలె విశాలములైన నేత్రములుగల నాప్రియమైన సీత ఎదుటివారితో ముందుగా మృదువుగా మాట్లాడునది. ఆతరుణి ఇట్టి వసంతవిజృంభణకు లోనైనచో నిశ్చయముగా ఆమె తనజీవితమును చాలించును. 'నావిరహమునకు గుఱియైన సీతాసాధ్వి జీవించియుండుట అసంభవము" అను అభిప్రాయము. ఇప్పుడు నా హృదయములో క్రమముగా దృఢపడుచున్నది. (50-51)

వాస్తవముగా సీతాదేవి తనప్రేమానురాగములను పూర్తిగా నామీదనే నిలుపుకొనియున్నది. అట్లే నేనును నాప్రాణములన్నింటిని ఆమెపైననే పెట్టుకొనియున్నాను. (52)

పూలవాసనలతో వచ్చుచున్న చల్లని ఈ పిల్లవాయువులు లోకమునకు సుఖస్పర్శను కలిగించుచున్నవి. కాని నా ప్రియమైన సీతనుగూర్చియే చింతించుచున్న నాకు మాత్రము అవి అగ్నితుల్యములై బాధించుచున్నవి. (53)

ఇదివఱలో సీతనాచెంత ఉన్నప్పుడు ఈ చల్లని గాలులు నాకు ఎంతో హాయినిగూర్చుచు వచ్చినవి. కాని ఆమె నాకు తోడుగా లేనందున అవి నావిరహశోకమును వృద్ధిపఱచుచున్నవి. (54)

లోగడ సీతాదేవినాతో గూడియున్నప్పుడు కాకి ఆకాశమున ఎగురుచు 'కావుకావు' మని అఱచుచుండెడిది. అది అశుభసూచకము (సీతాదేవి ఎడబాటును సూచించునది.) ఇప్పుడు ఆకాకియే చెట్టుపై చేరి, హర్షముతో కూయుచున్నది. ఇది శుభసూచకము (త్వరలోనే జానకి నన్ను చేరునని అది తెలుపుచున్నది.) అంతరిక్షమున విహరించుచు అఱచిన ఆ కాకి సీతను అపహరణకు గుఱిచేసినది. చెట్టుమీద కూయుచున్న ఈ కాకి నన్ను విశాలాక్షియైన ఆమె కడకు చేర్చనున్నది. (55-56)

ఓ లక్ష్మణా! ఈ వనమునందు బాగుగా పుష్పించిన చెట్లకొమ్మలపై చేరియున్న పక్షులు కామమును వృద్ధిపఱచునట్టి మధురగానములను చేయుచున్నవి. వాటిని ఆలకింపుము. (57)

విక్షిప్తాం పవనేనైతామ్ అసౌ తిలకమంజరీమ్।
షట్పదః సహసాఽభ్యేతి మదోద్ధూతామివ ప్రియామ్। 58

కామినామ్ అయమత్యంతమ్ అశోకః శోకవర్ధనః।
స్తబకైః పవనోత్క్షిప్తైః తర్జయన్నివ మాం స్థితః। 59

అమీ లక్ష్మణ దృశ్యంతే చూతాః కుసుమశాలినః।
విభ్రమోత్సిక్తమనసః సాంగరాగా నరా ఇవ। 60

సౌమిత్రే పశ్య పంపాయాః చిత్రాసు వనరాజిషు।
కిన్నరా నరశార్దూల విచరంతి తతస్తతః। 61

ఇమాని శుభగంధీని పశ్య లక్ష్మణ సర్వశః।
నలినాని ప్రకాశంతే జలే తరుణసూర్యవత్। 62

ఏషా ప్రసన్నసలిలా పద్మనీలోత్పలాయుతా।
హంసకారండవాకీర్ణా పంపా సౌగంధికాయుతా। 63

జలే తరుణసూర్యాభైః షట్పదాహతకేసరైః।
పంకజైః శోభతే పంపా సమంతాత్ అభిసంవృతా। 64

చక్రవాకయుతా నిత్యం చిత్రప్రస్థవనాంతరా।
మాతంగమృగయూథైశ్చ శోభతే సలిలార్థిభిః। 65

పవనాహితవేగాభిః ఊర్మిభిర్విమలేఽంభసి।
పంకజాని విరాజంతే తాడ్యమానాని లక్ష్మణ। 66

పద్మపత్రవిశాలాక్షీం సతతం పంకజప్రియామ్।
అపశ్యతో మే వైదేహీం జీవితం నాఽభిరోచతే। 67

అహో కామస్య వామత్వం యో గతామపిదుర్లభాం।
స్మారయిష్యతి కల్యాణీం కల్యాణతరవాదినీమ్। 68

ఈ భ్రమరము గాలులకు కంపించుచున్న తిలకపుష్పముల గుత్తులను మదనపరవశయైన ప్రియురాలినివలె త్వరత్వరగా చేరుచున్నది. ఈ అశోకవృక్షము భార్యావిరహమునకు గురియైయున్న వారిశోకమును మిగుల అధికమొనర్చును. ఇది గాలులకు అటునిటు ఊగుచున్న తన పూలగుత్తుల ప్రభావముతో సీతయెడబాటుతో బాధపడుచున్న నన్ను భయపెట్టుచున్నట్లు ఉన్నది. (58-59)

ఓ సౌమిత్రీ! పుష్పగుచ్ఛములతో అలరారుచున్న ఈ మామిడిచెట్లు శృంగారవిలాసగర్వితులై, అంగరాగములతో విలసిల్లుచున్న నరులవలె కనబడుచున్నవి. (60)

పురుషశ్రేష్ఠుడవైన ఓ లక్ష్మణా! పంపాతీరముననున్న చిత్రవిచిత్రములైన వనపంక్తులలో అచ్చటచ్చట విహరించుచున్న కిన్నరులను గమనింపుము. ఈసరోవరమునందు అంతటను సువాసనలను వెదజల్లుచు బాలసూర్యునివలె తళుకులీనుచున్న ఈ కెందామరలను తిలకింపుము. (61-62)

ఈ పంపాసరోవరమునందలి జలములు మిగుల నిర్మలముగా ఉన్నవి. ఇందలి కమలములు, కలువలు చూడముచ్చట గొల్పుచున్నవి. ఇందు హంసలు, బెగ్గురు పక్షులు విహరించుచున్నవి. ఇందలి కెందామరలశోభలు అపూర్వములు. (63)

ఈ పంపాసరోవర జలములయందంతటను కమలములు అలరారుచున్నవి. అవి బాలసూర్య కాంతులతో తేజరిల్లుచున్నవి. ఆ పద్మకేసరములపై మధుపములు వ్రాలుటచే అవి ఉయ్యాలలూగుచున్నవి. నిజముగా ఈపంపాశోభలు కమనీయముగానున్నవి. (64)

ఈ సరోవరమునందు చక్రవాకపక్షులు విహరించుచున్నవి. దీనిని పరిసరములయందుగల వనములు చిత్రవిచిత్రములుగానున్నవి. నిత్యము దాహము తీర్చుకొనుటకై వచ్చెడి గజయూథములతో, లేళ్ల గుంపులతో దీని అందచందములు ఇనుమడించుచున్నవి. (65)

వాయువేగప్రభావమున స్వచ్ఛములైన జలతరంగములు పరవళ్లుద్రొక్కుచున్నవి. ఆ అలలతాకిడిచే ఇందలి కమలముల శోభలు కనులపండువుగానున్నవి. (66)

వైదేహి పద్మపత్రములవలె విశాలములైన నేత్రములు గలది. పద్మములనిన సర్వదా ఆమెకు పంచప్రాణములు. అట్టి జానకి కనబడకపోవుటచే నాకు జీవితముమీదనే విరక్తి కలుగుచున్నది. (67)

మిక్కిలి మధురముగా సంభాషించునట్టి శుభాంగి (సీత) ఎంతగా ప్రయత్నించినను అందనంత దూరతీరములకు చేరియున్నది. ఐనను మన్మథుడు నాచే ఆమెను అనుక్షణము స్మరింపజేయుచున్నాడు. అహో! అతడెంతటి కుటిలుడు? (68)

శక్యో ధారయితుం కామో భవేత్ అద్యాగతో మయా।
యది భూయో వసంతో మాం న హన్యాత్ పుష్పితద్రుమః। 69

యాని స్మ రమణీయాని తయా సహ భవంతి మే।
తాన్యేవారమణీయాని జాయంతే మే తయా వినా। 70

పద్మకోశపలాశాని దృష్ట్వా దృష్టిర్హి మన్యతే।
సీతాయా నేత్రకోశాభ్యాం సదృశానీతి లక్ష్మణ। 71

పద్మకేసరసంసృష్టో వృక్షాంతరవినిస్సృతః।
నిశ్వాస ఇవ సీతాయా వాతి వాయుర్మనోహరః। 72

సౌమిత్రే పశ్య పంపాయా దక్షిణే గిరిసానుని।
పుష్పితాం కర్ణికారస్య యష్టిం పరమశోభనామ్। 73

అధికం శైలరాజోఽయం ధాతుభిః సువిభూషితః।
విచిత్రం సృజతే రేణుం వాయువేగవిఘట్టితమ్। 74

గిరిప్రస్థాస్తు సౌమిత్రే సర్వతః సంప్రపుష్పితైః।
నిష్పత్రైః సర్వతోరమ్యైః ప్రదీప్తా ఇవ కింశుకైః। 75

పంపాతీరరుహాశ్చేమే సంసక్తా మధుగంధినః।
మాలతీ మల్లికాషండాః కరవీరాశ్చ పుష్పితాః। 76

కేతక్యః సిందువారాశ్చ వాసంత్యశ్చ సుపుష్పితాః।
మాధవ్యో గంధపూర్ణాశ్చ కుందగుల్మాశ్చ సర్వశః। 77

చిరిబిల్వా మధూకాశ్చ వంజులా వకుళాస్తథా।
చంపకాస్తిలకాశ్చైవ నాగవృక్షాః సుపుష్పితాః। 78

నీపాశ్చ వరణాశ్చైవ ఖర్జూరాశ్చ సుపుష్పితాః।
పద్మకాశ్చోపశోభంతే నీలాశోకాశ్చ పుష్పితాః। 79

లోధ్రాశ్చ గిరిపృష్ఠేషు సింహకేసరపింజరాః।
అంకోలాశ్చ కురంటాశ్చ పూర్ణకాః పారిభద్రకాః। 80

చూతాః పాటలయశ్చైవ కోవిదారాశ్చ పుష్పితాః।
ముచులిందార్జునాశ్చైవ దృశ్యంతే గిరిసానుషు। 81

చక్కగా వికసించిన పూలచెట్లతో వసంతుడు తీవ్రముగా నన్ను హింసింపకున్నచో ఇప్పటి మన్మథ తాపమును (విరహ వేదనను) ఏదోయొక విధముగా సహించియుండెడివాడను. (69)

సీతాదేవి చెంతనున్నప్పుడు నామనస్సును రంజింపజేసిన ఆ చక్కని దృశ్యములే ఇప్పుడు ఆమె నాప్రక్కన లేనందువలన శోభావిహీనములై కన్పట్టుచున్నవి. (70)

ఓ సౌమిత్రీ! ఈ పద్మములమొగ్గలు, రేకులు సీతాదేవియొక్క నేత్రకోశములను (మొగ్గలవంటి నేత్రములను) పోలియున్నందున అవి నా దృష్టిని ఆకర్షించుచున్నవి (వాటిని చూడవలెననెడి ఇచ్ఛ నాలో కలుగుచున్నది.) (71)

పద్మకేసరములను స్పృశించుచు, వృక్షముల (చెట్లకొమ్మల) మధ్యనుండి వీచుచున్న ఈ సుగంధ వాయువులు సీతాదేవి నిఃశ్వాసములవలె మనోహరముగా ఉన్నవి. (72)

ఓ సౌమిత్రీ! ఈ పంపాసరస్సుయొక్క దక్షిణ తీరమునగల పర్వత సానువులయందు బాగుగా పుష్పించి యున్న గన్నేరుకొమ్మ ఎంత అందముగా ఉన్నదో చూడుము. (73)

ఈ మహా (ఋశ్యమూక) పర్వతము గైరికాది ధాతువులచే ఒప్పుచున్నది. తీవ్రమైన గాలులకు రేగిన ఇచటి ధూళులు మిక్కిలి విచిత్రముగా కనబడుచున్నవి. (74)

ఓ సౌమిత్రీ! ఈ పర్వతసానువులయందలి మోదుగు వృక్షములు ఆకులులేనివై, ఎఱ్ఱనిపూవులతో వెల్లివిరియుచు రమ్యముగా ఉన్నవి. అందువలన ఈ చరియలు అగ్నిజ్వాలలతో ఒప్పుచున్నవా? యనునట్లున్నవి. (75)

ఓ లక్ష్మణా! ఈ పంపాతీరమున పుట్టి పెఱిగి దట్టముగా ఉన్న ఈ వృక్షపరంపరను చూడుము. ఇందలి జాజి, బొడ్డుమల్లెతీగెలు, గన్నేరుచెట్లు చక్కగా పూవులతో నిండియున్నవి. మొగలి, వావిలి చెట్లు, విరజాజి, పూవులగురివెంద తీగెలు, మల్లె పొదలు బాగుగా పుష్పించి, అంతటను సువాసనలు వెదజల్లుచున్నవి. చిరిబిల్వములు, ఇప్పచెట్లు, అశోకవృక్షములు, పొగడచెట్లు, సంపెంగ, ఎఱ్ఱగోరంటపొదలు, నాగవృక్షములు చక్కగా విరబూసియున్నవి. (76-78)

కడిమిచెట్లు, ఉలిమిరిచెట్లు, ఖర్జూర వృక్షములు, బూరంగి (పద్మక) వృక్షములు, నీలాశోకములు పూలతో నిండి అందములొలుకుచున్నవి. లొద్దుగచెట్లు, సింహకేసరములు, సుగంధిచెట్లు, ఊడుగుచెట్లు, పచ్చపూలగోరింటచెట్లు, పూర్ణకవృక్షములు, పారిజాతవృక్షములు, మామిడిచెట్లు, కలిగొట్టుచెట్లు, ఎఱ్ఱకాంచనవృక్షములు, నారింజచెట్లు, మద్దిచెట్లు బాగుగా విరబూసి మనోహరముగా ఉన్నవి. (79-81)

కేతకోద్దాలకాశ్చైవ శిరీషాః శింశుపా ధవాః।
శాల్మల్యః కింశుకాశ్చైవ రక్తాః కురవకాస్తథా।
తినిశా నక్తమాలాశ్చ చందనాః స్పందనాస్తథా। 82

పుష్పితాన్ పుష్పితాగ్రాభిః లతాభిః పరివేష్టితాన్।
ద్రుమాన్ పశ్యేహ సౌమిత్రే పంపాయా రుచిరాన్ బహూన్। 83

వాతవిక్షిప్తవిటపాన్ యథాఽఽసన్నాన్ ద్రుమానిమాన్।
లతాః సమనువర్తంతే మత్తా ఇవ వరస్త్రియః। 84

పాదపాత్ పాదపం గచ్ఛన్ శైలాచ్ఛైలం వనాద్వనమ్।
వాతి నైకరసాస్వాదః సంమోదిత ఇవానిలః। 85

కేచిత్ పర్యాప్తకుసుమాః పాదపా మధుగంధినః।
కేచిన్ముకుళసంవీతాః శ్యామవర్ణా ఇవాబభుః। 86

ఇదం మృష్టమ్ ఇదం స్వాదు ప్రఫుల్లమ్ ఇద మిత్యపి।
రాగమత్తో మధుకరః కుసుమేష్వవలీయతే। 87

నిలీయ పునరుత్పత్య సహసాఽన్యత్ర గచ్ఛతి।
మధులుబ్ధో మధుకరః పంపాతీరద్రుమేష్వసౌ। 88

ఇయం కుసుమసంఘాతైః ఉపస్తీర్ణా సుఖా కృతా।
స్వయం నిపతితైర్భూమిః శయనప్రస్తరైరివ। 89

వివిధా వివిధైః పుష్పైః తైరేవ నగసానుషు।
వికీర్ణైః పీతరక్తా హి సౌమిత్రే ప్రస్తరాః కృతాః। 90

హిమాంతే పశ్య సౌమిత్రే వృక్షాణాం పుష్పసంభవమ్।
పుష్పమాసేహి తరవః సంఘర్షాదివ పుష్పితాః। 91

మొదురు పచ్చమొగలి చెట్లు, విరిగిచెట్లు, దిరిసెనచెట్లు, ఇరుగుడుచెట్లు, ధవవృక్షములు, బూరుగు చెట్లు, మోదుగుచెట్లు, ఎఱ్ఱగోరంటచెట్లు, నెమ్మిచెట్లు, కానుగచెట్లు, చందనవృక్షములు, స్పందనవృక్షములు, ఇంకను తదితర వృక్షములు మిక్కిలి కుసుమశోభితములై విరాజిల్లుచున్నవి. అవి పూదేనెలను స్రవించుచు, పరిమళములను వెదజల్లుచున్నవి. బాగుగా పుష్పించిన లతలు వాటికి చక్కగా అల్లుకొని యున్నవి. లక్ష్మణా! ఈ పంపాతీరమున అందములనొలుకుచున్నఈ వృక్షములనన్నింటిని ఒక్క మాఱు తిలకింపుము. (82-83)

తీవ్రమైన గాలులకు ఈ చెట్ల కొమ్మలన్నియును మిక్కిలి కంపించుచు మన చేతులకు అందునంత క్రిందికి వంగుచున్నవి. వాటికి చుట్టుకొనియున్న తీగెలుగూడ కామపరవశలైన స్త్రీలు పురుషులనువలె వాటిని అనుసరించుచున్నవి. (84)

వాయువు ఒకవృక్షమునుండి మఱియొకవృక్షమునకును, ఒకపర్వతమునుండి మఱియొక పర్వతమునకును, ఒక వనమునుండి వేఱొక వనమునకును వీచుచు అనేక ఫలరసములను ఆస్వాదించుచు ఆనందించుచున్నట్లు ఉన్నది. (85)

ఈ వనములయందలి కొన్ని చెట్లు బాగుగా వికసించిన పూవులతో నిండి పూదేనెలను స్రవించుచు సువాసనలను అంతటను వ్యాపింపజేయుచున్నవి. మఱికొన్ని వృక్షములు మొగ్గలుదొడిగి శ్యామవర్ణముతో (తొడిమరంగుతో) విరాజిల్లుచున్నవి. (86)

'ఈపూవులు మనోహరముగా ఉన్నవి. ఇవి కమ్మగానున్నవి. ఇవి బాగుగా వికసించియున్నవి' - అని భావించుచు తుమ్మెదలు ప్రేమానురాగములతో వేర్వేఱు పుష్పములపై ఆసక్తములగుచు మురిసిపోవుచున్నవి. భ్రమరములు పంపాతీరమునందలి వృక్షములపైగల పూవులమీద వ్రాలి, అందలి మధువులను గ్రోలి, అంతటితో తృప్తిపడక ఇతర పుష్పములయందు తేనెలు సమృద్ధిగానుండుటచూచి, మధులాలసతో వాటికడకు పరుగెత్తుచున్నవి. (87-88)

అతిసుకుమారములైన కుసుమములు సహజముగా రాలి, ఈ నేలపై అంతటను వ్యాపించియున్నవి. ఆ విధముగా ఈ ప్రదేశము ఆస్తరణాలు పఱచినట్లు ఒప్పుచు శయనించుటకు సుఖావహమైయున్నది. (89)

స్వయముగా రాలిన రంగురంగుల పూవులతో ఈ కొండచఱియలన్నియును పసుపు, ఎఱుపు మున్నగు వెలువెన్నల తివాచీలు పఱచినట్లుగా ఉన్నవి. (90)

ఓ సౌమిత్రీ! వసంతఋతువునందు చెట్లన్నియును పుష్పభరితములైయున్న తీరును తిలకింపుము. ఈ

ఆహ్వయంత ఇవాన్యోఽన్యం నగాః షట్పదనాదితాః।
కుసుమోత్తంసవిటపాః శోభంతే బహు లక్ష్మణ। 92

ఏష కారండవః పక్షీ విగాహ్య సలిలం శుభమ్।
రమతే కాంతయా సార్ధం కామమ్ ఉద్దీపయన్ మమ। 93

మందాకిన్యాస్తు యదిదం రూపమేవం మనోహరం।
స్థానే జగతి విఖ్యాతా గుణాస్తస్యా మనోరమాః। 94

యది దృశ్యేత సా సాధ్వీ యది చేహ వసేమహి।
స్పృహయేయం న శక్రాయ నాయోధ్యాయై రఘూత్తమ। 95

న హ్యేవం రమణీయేషు శాద్వలేషు తయా సహ।
రమతో మే భవేచ్చింతా న స్పృహాఽన్యేషు వా భవేత్। 96

అమీ హి వివిధైః పుష్పైః తరవో రుచిరచ్ఛదాః।
కాననేఽస్మిన్ వినా కాంతాం చిత్తమ్ ఉన్మాదయంతి మే। 97

పశ్య శీతజలాం చేమాం సౌమిత్రే పుష్కరాయుతామ్।
చక్రవాకానుచరితాం కారండవనిషేవితామ్।
ప్లవైః క్రౌంచైశ్చ సంపూర్ణాం వరాహమృగసేవితామ్। 98

అధికం శోభతే పంపా వికూజద్భి ర్విహంగమైః। 99

దీపయంతీవ మే కామం వివిధా ముదితా ద్విజాః।
శ్యామాం చంద్రముఖీం స్మృత్వా ప్రియాం పద్మనిభేక్షణామ్। 100

పశ్య సానుషు చిత్రేషు మృగీభిః సహితాన్ మృగాన్।
మాం పునర్మృగశాబాక్ష్యా వైదేహ్యా విరహీకృతమ్। 101

చైత్రమాసమునందు వృక్షములు పోటీపడి పుష్పించినట్లున్నవి. పూలకిరీటమును ధరించిన కొమ్మలుగల వృక్షములు మిగుల శోభిల్లుచు, 'పుష్పించుటలో మీకు శక్తియున్నచో మాతో పోటీకిరండు' అని భ్రమరనాదములద్వారా పరస్పరము ఆహ్వానించుకొనుచున్నట్లున్నవి. (91-92)

ఈ కన్నెలేడిపిట్ట పవిత్రములైన పంపాజలములలో మునిగి తనకాంతతో జలక్రీడలాడుచు నాలో కోరికలను రేకెత్తించుచున్నట్లున్నది. (93)

ఈ పంపాసరోవరరూపము మిగుల రమణీయమైనది. దీని పవిత్రసౌందర్యాదిగుణములు జగద్విఖ్యాతములు, మనోహరములు. ఈ విధముగా రూపవైభవము చేతను, గుణసంపదకారణముననూ ఇది మందాకినిని తలపింప జేయుచున్నది. (94)

ఓ రఘువరా! లక్ష్మణా! సీతాసాధ్వి మనకు ఇక్కడ కనబడినచో ఆమెతోగూడి మనము ఈ ప్రదేశమునందే నివసింతము. అట్టి స్థితిలో ఇంద్రవైభవములనుగాని, అయోధ్యానగరనివాసమును గాని నేను కోరనేకోరను. ఇంతగా రమణీయములైన ఈ పచ్చికబయళ్లపై ఆమెతో గూడి విహరించుట తటస్థించినచో అప్పుడు నాకు ఎట్టి చింతయును ఉండదు. ఇంద్రవైభవాది ఇతరవిషయములను గూర్చి ఎట్టి ధ్యాసయు ఉండదు. (95-96)

వివిధములగు మనోహరమైన రంగురంగుల పూవులతో అలరారుచున్న ఈ వనవృక్షములు భార్యావిరహితుడనైయున్న నన్ను మోహపరవశుని జేయుచున్నవి. (97)

ఓ సౌమిత్రీ! ఒక పర్యాయము ఈ పంపాసరస్సును తిలకింపుము. ఇందలి చల్లని జలములు రుచికరములు, అంతటను వ్యాపించియున్న పద్మములు మనోహరములు, చక్రవాకముల యొక్క కదలికలు, కన్నెలేడి పిట్టల క్రీడలు, నీటికోళ్లసంచారములు, క్రౌంచపక్షులవిహారములు ఎంతయు ఆహ్లాదకరములు. దీని తీరమునందు అడవివరాహములు, పలువివిధములగు మృగములు సంచరించుచున్నవి. పక్షులకలకలారావములతో ఈ పంపాసరస్సు అత్యంతశోభాయమానముగానున్నది. (98-99)

సంతోషముతో కేరింతలు కొట్టుచున్న వివిధములగు పక్షులు, కమలనేత్రయు, ఇందువదనయు, లావణ్యవతియు, నాప్రేమపెన్నిధియు ఐన సీతాదేవిని తలచుకొనుచున్న నాలో, విరహతాపమును పెంచుచున్నవి. (100)

ఓ లక్ష్మణా! ఇటు చూడుము చిత్రవిచిత్రములుగానున్న ఈ కొండచరియలయందు మగజింకలు ఆడులేళ్లతోగూడి క్రీడించుచున్నవి. అవి హరిణలోచనయైన సీతాదేవికై పరితపించుచున్న నాలో విరహబాధను ఇంకను అధికమొనర్చుచున్నవి. (101)

వ్యథయంతీవ మే చిత్తం సంచరంతః తత స్తతః।
అస్మిన్ సానుని రమ్యే హి మత్తద్విజగణాయుతే। 102

పశ్యేయం యది తాం కాంతాం తతః స్వస్తి భవేన్మమ। 103

జీవేయం ఖలు సౌమిత్రే మయా సహ సుమధ్యమా।
సేవతే యది వైదేహీ పంపాయాః పవనం సుఖమ్। 104

పద్మసౌగంధికవహం శివం శోకవినాశనమ్।
ధన్యా లక్ష్మణ సేవంతే పంపోపవనమారుతమ్। 105

శ్యామా పద్మపలాశాక్షీ ప్రియా విరహితా మయా।
కథం ధారయతి ప్రాణాన్ వివశా జనకాత్మజా। 106

కిన్ను వక్ష్యామి రాజానం ధర్మజ్ఞం సత్యవాదినం।
సీతాయా జనకం పృష్టః కుశలం జనసంసది। 107

యా మామ్ అనుగతా మందం పిత్రా ప్రవాజితం వనం।
సీతా సత్పథమాస్థాయ క్వ ను సా వర్తతే ప్రియా। 108

తయా విహీనః కృపణః కథం లక్ష్మణ ధారయే।
యా మామ్ అనుగతా రాజ్యాల్ భ్రష్టం విగతచేతసమ్। 109

తచ్చార్వంచితపక్ష్మాక్షం సుగంధి శుభమవ్రణం।
అపశ్యతో ముఖం తస్యా సీదతీవ మనో మమ। 110

కనువిందుగావించుచున్న ఈ పర్వతసానువునందు అక్కడక్కడ పారవశ్యముతో సంచరించుచున్న పక్షులు, మృగములు నా చిత్తమును ఇంకను కలవరపాటునకు గుఱిచేయుచున్నట్లున్నవి. నాప్రాణప్రియురాలైన సీత కనబడినచో నాకు మనశ్శాంతి లభించును. (102-103)

తమ్ముడా! లక్ష్మణా! ఈ పంపాతీరమున వీచుచున్న గాలులు ఎంతో హాయిగానున్నవి. ఇప్పుడు సుందరాంగియైన సీత నాతోగూడి విహరించినచో మాత్రమే నాప్రాణములు మిగులును. ఈ పంపాతీరములయందలి వనములలో వీచుచున్న నిర్మలవాయువులు కమలములసువాసనను, చెంగల్వలపరిమళములను వెదజల్లుచున్నవి. వీటిని సేవించుచు విహరించెడి దంపతులశోకములను ఇవి తొలగించును. నిజముగా వారే ధన్యులు. (104-105)

కమలదళములవంటి కన్నులు గలదియు, నాప్రేమపెన్నిధియు ఐన ఆ జానకికి నేననిన పంచప్రాణములు. ఆసాధ్వి నాకొఱకై జీవించును.[1] అట్టి సీతాదేవి ఈ నడిమి వయసులో (నిండుజవ్వనమున) నావిరహమునకు గుఱియై తనప్రాణములను ఎట్లు నిలుపుకొనగలుగుచున్నదో గదా? (106)

సీతాదేవితండ్రియైన జనకమహారాజు, సమస్తధర్మములను బాగుగా ఎఱిగినవాడు, సత్యసంధుడు, ఆమహానుభావుడు నిండుసభలో మా ఇద్దఱిక్షేమసమాచారములను అడిగినప్పుడు (జానకినిగూర్చి) ఆయనకు నేనేమని చెప్పను? (107)

తండ్రియాజ్ఞను అనుసరించి, నేను వనములకు బయలు దేఱితిని. పతివ్రతాధర్మమును పాటించి, సీత మందభాగ్యుడనైన నావెంట వనవాసమునకు వచ్చినది. ఆసాధ్వి ఇప్పుడు ఎక్కడనున్నదో యేమో? (108)

ఓలక్ష్మణా! రాజ్యభ్రష్టుడనై, అకారణముగా మాతాపితృసేవలకు దూరమగుచున్నందులకు వికలమనస్కుడనైయున్న నన్ను విడక నాతో ఆమె వనములకు వచ్చినది. అట్టి సాధ్వియెడబాటునకు గుఱియైనందున దీనుడనైయున్న నేను ఇంక ఎట్లు జీవించియుండగలను?(109)

సీతాదేవియొక్క కనుఱెప్పలు సుందరమైనవి. నేత్రములు మనోహరములు. ఆమె ముఖము సువాసనాశోభితము, ఎట్టి దోషములునులేక చక్కని ఆకృతి కలిగియున్నట్టిది. అట్టి మనోజ్ఞమైన (సీతా) వదనము కనబడనందున (ఆముఖ దర్శనములేక) నా మనస్సు కలతచెందుచున్నది. (110)

1) వివశా = ప్రాణత్యాగేఽపి న స్వతంత్రా.

స్మితహాస్యాంతరయుతం గుణవన్మధురం హితం।
వైదేహ్యా వాక్యమతులం కదా శ్రోష్యామి లక్ష్మణ। 111

ప్రాప్య దుఃఖం వనే శ్యామా సా మాం మన్మథకర్శితం।
నష్టదుఃఖేవ హృష్టేవ సాధ్వీ సాధ్వభ్యభాషత। 112

కిన్ను వక్ష్యామి కౌసల్యామ్ అయోధ్యాయాం నృపాత్మజ।
క్వసా స్నుషేతి పృచ్ఛంతీం కథం చాతిమనస్వినీమ్। 113

గచ్ఛ లక్ష్మణ పశ్య త్వం భరతం భ్రాతృవత్సలం।
న హ్యహం జీవితుంశక్తః తామృతే జనకాత్మజామ్। 114

ఇతి రామం మహాత్మానం విలపంతమ్ అనాథవత్।
ఉవాచ లక్ష్మణో భ్రాతా వచనం యుక్తమవ్యయమ్। 115

సంస్తంభ రామ భద్రం తే మా శుచః పురుషోత్తమ।
నేదృశానాం మతిర్మందా భవత్యకలుషాత్మనామ్। 116

స్మృత్వా వియోగజం దుఃఖం త్యజ స్నేహం ప్రియే జనే।
అతిస్నేహపరిష్వంగాత్ వర్తిరార్ద్రాపి దహ్యతే। 117

యది గచ్ఛతి పాతాళం తతో హ్యధికమేవ వా।
సర్వథా రావణస్తావత్ న భవిష్యతి రాఘవ। 118

ప్రవృత్తిర్లభ్యతాం తావత్ తస్య పాపస్య రక్షసః।
తతో హాస్యతి వా సీతాం నిధనం వా గమిష్యతి। 119

యది యాత్యదితేర్గర్భం రావణః సహ సీతయా।
తత్రాప్యేనం హనిష్యామి న చేద్దాస్యతి మైథిలీమ్। 120

ఓ సౌమిత్రీ! సీతాదేవి ఎల్లప్పుడును చిఱునవ్వు చిందించుచు మధురముగా మాట్లాడుచుండును. ఆమె పలుకులు ఉదాత్తములు. హితకరములు. నిరుపమానములైన ఆమెవచనములు మఱల వినెడి భాగ్యము ఎప్పుడు కల్గునోగదా? (111)

సీతాసాధ్వి వనవాసమున పెక్కు దుఃఖములను ఎదుర్కొనుచు వచ్చినది. ఐనప్పటికిని నేను ఎప్పుడైనను మానసిక వేదనకు గుఱియైనచో దానిని గమనించి, ఆమె తన దుఃఖమును ఏమాత్రమును బయల్పడనీయక, నా దుఃఖమును తొలగించుటకై మధురముగా మాట్లాడుచుండెడిది. ఓ రాజకుమారా! లక్ష్మణా! అయోధ్యకు వెళ్ళినప్పుడు, సుతిమెత్తని మనస్సుగల కౌసల్యామాత 'నా అనుంగు కోడలు సీతాదేవి ఎక్కడ?' అని నన్ను అడుగును. అప్పుడు ఆమెతో నేను ఏమని చెప్పను?(112-113)

ఓ లక్ష్మణా! ఆజానకి లేకుండ నేను జీవించియుండుట దుర్లభము. కనుక నీవు ఒక్కడవే అయోధ్యకు వెళ్ళి, భరతుని కలిసికొనుము." అతని సోదరప్రేమ సాటిలేనిది. (114)

ఈ విధముగా ఏమియుతోచని స్థితిలో మహాత్ముడగు శ్రీరాముడు మిగుల విలపించుచుండగా సోదరుడగు లక్ష్మణుడు యుక్తియుక్తముగా ఆయనతో ఇట్లు నుడివెను. (115)

"ఓ పురుషోత్తమా! రామా! ధైర్యమును వహింపుము. దుఃఖింపకుము. నీకు మేలు కలుగును (మావదినె సీతాదేవి తప్పక కనబడును.) నీవంటిధీరులు నిరుత్సాహమునకు గుఱికారు (గుఱికారాదు) అన్నా! 'ఆత్మీయుల యెడబాటువలన దుఃఖము కలుగుట లోకసహజము. ఎవ్వరును (ఎంతటి వివేకవంతులును) దానికి అతీతులు కారు. వత్తి నీటిలో తడిసినను నూనెలో మునిగియుండుటవలన అది జ్వలించుచునే యుండును. కనుక ఈ విషయమును మనస్సులో ఉంచుకొని ఆత్మీయులయెడ (వదినెగారియెడ) వ్యామోహమును వీడుము. (116-117)

ఓ శ్రీరామా! రావణుడు పాతాళలోకమునకు గాని, అంతకంటెను దూరమునకుగాని వెళ్ళినను, ఎట్టి పరిస్థితులలోను మనచేతిలో వానికి చావు తప్పదు. మొదట పాపాత్ముడైన ఆరాక్షసుని (రావణుని) ఉనికి తెలియనిమ్ము (తెలిసికొందము) పిమ్మట సీతాదేవిని మనకు అప్పగించినచో అతడు బ్రతికిబయటపడును. లేనిచో అతనిప్రాణములు మిగులవు. ఒకవేళ అతడు సీతాదేవితో సహా అదితిగర్భములో దాగికొన్నను, వైదేహిని అప్పగింపనిచో అక్కడగూడ అతనిని బ్రతుకనీయను (హతమార్చెదను). (118-120)

స్వాస్థ్యం భద్రం భజస్వార్య త్యజ్యతాం కృపణా మతిః।
అర్థో హి నష్టకార్యార్థైః నాఽయత్నే నాఽధిగమ్యతే। 121

ఓ పూజ్యుడా! ముందు ఈ దైన్యమును వీడుము. ధైర్యమును వహింపుము. అది మనకు ప్రయోజనకారి. చేసిన ప్రయత్నము విఫలమైనను, వస్తువులను, సంపదలను కోల్పోయినను మరల పూనిక వహించి ప్రయత్నింపనిచో అభీష్టము నెఱవేఱదు. (121)

ఉత్సాహో బలవానార్య నాస్త్యుత్సాహాత్ పరం బలమ్।
సోత్సాహస్యాస్తి లోకేఽస్మిన్ న కించిదపి దుర్లభమ్। 122

ఉత్సాహవంతః పురుషా నావసీదంతి కర్మసు।
ఉత్సాహమాత్రమ్ ఆశ్రిత్య సీతాం ప్రతి లభేమహి। 123

ఓ ఆర్యా! ఉత్సాహమే నిజమైన బలము. దానికిమించిన బలములేదు. ఉత్సాహము గలవానికి ఈ లోకములో అసాధ్యమైనది లేదు. ఉత్సాహవంతులైనవారు ఎట్టి కష్టకార్యములయందైనను వెనుకకు తగ్గరు. కనుక పూనిక వహించి (పట్టుబట్టి) ముందునకు సాగినచో సీతాదేవి (మనకు) తప్పక లభించును. (122-123)

త్యజ్యతాం కామవృత్తత్వం శోకం సన్న్యస్య పృష్ఠతః।
మహాత్మానం కృతాత్మానమ్ ఆత్మానం నాఽవబుధ్యసే। 124

అన్నా! నీవు మిగుల ధైర్యశాలివి. మనోనిగ్రహముగలవాడవు. కనుక కాముకునివలె వ్యవహరింపకుము. శోకమును పాఱద్రోలుము. నీ మహత్త్వమునుగూర్చి నీవు తెలియకున్నావు. (నీ ఔన్నత్యమును నీవు విస్మరించుచున్నావు.)" (124)

ఏవం సంబోధితస్తత్ర శోకోపహతచేతనః।
న్యస్య శోకం చ మోహం చ తతో ధైర్యముపాగమత్। 125

శోకమున మునింగియున్న శ్రీరామునకు లక్ష్మణుడు ఇట్లు ధైర్యోత్సాహములను నూరిపోయగా ఆయన తన శోకమోహములను విడనాడి కార్యోన్ముఖుడు అయ్యెను.(125)

సోఽభ్యతిక్రామదవ్యగ్రః తామచింత్య పరాక్రమః।
రామః పంపాం సురుచిరాం రమ్యపారిప్లవద్రుమామ్। 126

సాటిలేని పరాక్రమశాలియైన శ్రీరాముడు మనస్సును దిటవుచేసికొనినవాడై, తీరములయందు గాలులకు ఊగుచు మనోహరముగానున్న చెట్లతో కనువిందు గావించుచున్న పంపాసరస్సును అధిగమించెను. (126)

నిరీక్షమాణః సహసా మహాత్మా
సర్వం వనం నిర్ఝరకందరాంశ్చ ।
ఉద్విగ్నచేతాః సహ లక్ష్మణేన
విచార్య దుఃఖోపహతః ప్రతస్థే । 127

మహాత్ముడైన శ్రీరాముడు లక్ష్మణునితోగూడి సమస్తవనములను, సెలయేళ్లను, పర్వతగుహలను పరికించిచూచుచు సీతాదేవికై వెదకెను. ఎచ్చటను ఆమె కనబడకపోవుటచే మిగుల దుఃఖితుడై ఆతురతతో ముందునకుసాగెను.(127)

తం మత్తమాతంగవిలాసగామీ
గచ్ఛంతమవ్యగ్రమనా మహాత్మా ।
స లక్ష్మణో రాఘవమప్రమత్తో
రరక్ష ధర్మేణ బలేన చైవ । 128

లక్ష్మణుడు మదపుటేనుగువలె దుర్గమవనప్రదేశములయందును నిర్భయముగా సంచరించుచుండు వాడు, శ్రీరామునియందు నిశ్చలమైనప్రేమ (భక్తిశ్రద్ధలు) గలవాడు, మిక్కిలిధైర్యశాలి, ప్రకృతి సౌందర్యమును పట్టించుకొనక శ్రీరామునిసేవలయందు అప్రమత్తుడై (ఏమఱుపాటులేనివాడై) యున్నవాడు. అట్టి సౌమిత్రి వనగమనమును కొనసాగించుచున్న రాఘవునకు రాజనీతిని జ్ఞప్తికిదెచ్చుచు, ఆయనయొక్క బలపరాక్రమములను గుర్తుచేయుచు ఆ సీతావిరహదుఃఖమును దూరముచేసెను. (128)

తౌ ఋశ్యమూకస్య సమీపచారీ
చరన్ దదర్శాద్భుతదర్శనీయౌ ।
శాఖామృగాణామ్ అధిపస్తరస్వీ
వితత్రసే నైవ చిచేష్ట కించిత్ । 129

వానరములకుప్రభువు, బలశాలియు, వాలికి భయపడి ఋశ్యమూకపర్వతసమీపమున మసలుచుండువాడు ఐన సుగ్రీవుడు ఒకానొకప్పుడు పంపాసరోవరపరిసరములలో తిరుగుచుండగా అద్భుత రూపవైభవములుగల రామలక్ష్మణులను జూచెను. ఆ ఇరువురును వాలిపంపగా వచ్చినవారేమో? అని అతడు మిగుల భయపడి నిశ్చేష్టుడాయెను. (129)

స తౌ మహాత్మా గజమందగామీ
శాఖామృగస్తత్ర చిరం చరంతౌ।
దృష్ట్వా విషాదం పరమం జగామ
చింతాపరీతో భయభారమగ్నః ॥ 130

ఏనుగువలె గంభీరముగా నడచువాడును, మిక్కిలి ప్రతిభాశాలియు, వానరుడును ఐన ఆ సుగ్రీవుడు ఎక్కువసేపు అప్రదేశమునందే తిరుగాడుచున్న రామలక్ష్మణులను జూచి, మిగుల భయముతో వణకిపోవుచు చింతాక్రాంతుడై, మిక్కిలి విచారగ్రస్తుడయ్యెను. (130)

తమాశ్రమం పుణ్యసుఖం శరణ్యం
సదైవ శాఖామృగసేవితాంతం ।
త్రస్తాశ్చ దృష్ట్వా హరయోఽభిజగ్ముః
మహౌజసౌ రాఘవలక్ష్మణౌ తౌ ॥ 131

అప్రాంతమంతయును మతంగాశ్రమప్రదేశమే. అది పరమపవిత్రమైనది, సుఖప్రదమైనది. మునిశాపగ్రస్తుడైన వాలి అందు ప్రవేశింపజాలడు. కనుక ఇతరవానరములు అన్నియును ఆ ఆశ్రమమును ఆశ్రయించి ఆవనమును స్థిరనివాసముచేసికొనెను. ఆ వానరములు మహాపరాక్రమ శాలురైన రామలక్ష్మణులను జూచి భయపడి ఆ ఆశ్రమములోని పరుగెత్తెను. (131)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ప్రథమస్సర్గః *(1)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది మొదటిసర్గము

— ❋ ❋ ❋ —

2. రెండవసర్గము

రామలక్ష్మణులను జూచిన సుగ్రీవుడు, వారు వాలి పంపగా వచ్చినవారేమో? అని శంకించి భయపడుట - హనుమంతుడు అతనికి ధైర్యము గొల్పుట, పిమ్మట రామలక్ష్మణులనుగూర్చి తెలిసికొనివచ్చుటకు సుగ్రీవుడు హనుమంతుని పంపుట -

తౌ తు దృష్ట్వా మహాత్మానౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ।
వరాయుధధరౌ వీరౌ సుగ్రీవఃశంకితోఽభవత్ ॥ 1

చక్కని రూపములుగలవారును, శ్రేష్ఠములైన ఆయుధములను ధరించియున్నవారును, వీరులును ఐన ఆ రామలక్ష్మణులను జూచి, సుగ్రీవుడు (వారు వాలి పక్షమువారు కావచ్చునని భావించి) శంకించెను. (1)

ఉద్విగ్నహృదయః సర్వా దిశః సమవలోకయన్।
న వ్యతిష్ఠత కస్మింశ్చిద్దేశే వానరపుంగవః ॥ 2

అంతట ఆవానరశ్రేష్ఠుడు మిగుల భీతిల్లినవాడై నలుదెసలను పరికించి చూచుచు ఒకచోట నిలకడలేక అటునిటు తిరుగసాగెను. (2)

నైవ చక్రే మనః స్థానే వీక్షమాణో మహాబలౌ।
కపేః పరమభీతస్య చిత్తం వ్యవససాద హ ॥ 3

రామలక్ష్మణులను జూచుచు మిక్కిలి భయమునకు లోనైన ఆ కపిరాజుమనస్సునకు లోచనిస్థితి పట్టెను. అప్పుడతడు మిగుల దుఃఖాక్రాంతుడయ్యెను. (3)

చింతయిత్వా స ధర్మాత్మా విమృశ్య గురులాఘవం।
సుగ్రీవః పరమోద్విగ్నః సర్వైరనుచరైః సహ ॥ 4

తతః స సచివేభ్యస్తు సుగ్రీవః ప్లవగాధిపః।
శశంస పరమోద్విగ్నః పశ్యం స్తౌ రామలక్ష్మణౌ ॥ 5

రాజధర్మములను బాగుగా ఎఱింగిన సుగ్రీవుడు ఎంతయును భయకంపితుడై కొంతతడవు ఆలోచించెను. పిమ్మట తనసహచరులైన వానరులందఱితోగూడి తనయొక్క, శత్రువులయొక్క బలాబలములను గూర్చి సాకల్యముగా చర్చించెను. వానరరాజైన ఆసుగ్రీవుడు రామలక్ష్మణులను చూచుచు మిగుల ఆందోళన చెందినవాడై తన మంత్రులతో వారినిగూర్చి ఇట్లు ప్రస్తావించెను. (4-5)

ఏతౌ వనమిదం దుర్గం వాలిప్రణిహితౌ ధ్రువమ్।
ఛద్మనా చీరవసనౌ ప్రచరంతావిహాగతౌ ॥ 6

"ఓ సహచరులారా! అడుగిడరాని ఈ దట్టమైన అడవిలో సంచరించుచు ఇక్కడికి వచ్చిన వీరు ఎవరో కారు, వల్కలములను ధరించియున్నను నిజముగా (వీరు) వాలిపంపగా వచ్చిన గూఢచారులే." (6)

తతః సుగ్రీవసచివా దృష్ట్వా పరమధన్వినౌ।
జగ్ముర్గిరితటాత్ తస్మాత్ అన్యచ్ఛిఖరముత్తమమ్। 7

తే క్షిప్రమ్ అధిగమ్యాథ యూథపా యూథపర్షభమ్।
హరయో వానరశ్రేష్ఠం పరివార్యోపతస్థిరే। 8

ఏకమేకాయనగతాః ప్లవమానా గిరేర్గిరిం।
ప్రకంపయంతో వేగేన గిరీణాం శిఖరాణ్యపి। 9

తతః శాఖామృగాః సర్వే ప్లవమానా మహాబలాః।
బభంజుశ్చ నగాంస్తత్ర పుష్పితాన్ దుర్గసంశ్రితాన్। 10

ఆప్లవంతో హరివరాః సర్వతస్తం మహాగిరిం।
మృగమార్జారశార్దూలాన్ త్రాసయంతో యయుస్తదా। 11

తతః సుగ్రీవసచివాః పర్వతేంద్రం సమాశ్రితాః।
సంగమ్య కపిముఖ్యేన సర్వే ప్రాంజలయః స్థితాః। 12

తతస్తం భయసంవిగ్నం వాలికిల్బిషశంకితమ్।
ఉవాచ హనుమాన్ వాక్యం సుగ్రీవం వాక్యకోవిదః। 13

సంభ్రమస్త్యజ్యతామేష సర్వైర్వాలికృతే మహాన్।
మలయోఽయం గిరివరో భయం నేహాస్తి వాలినః। 14

యస్మాదుద్విగ్నచేతాస్త్వం ప్రద్రుతో హరిపుంగవ।
తం క్రూరదర్శనం క్రూరం నేహ పశ్యామి వాలినమ్। 15

యస్మాత్ తవ భయం సౌమ్య పూర్వజాత్ పాపకర్మణః।
స నేహ వాలీ దుష్టాత్మా న తే పశ్యామ్యహం భయమ్। 16

అంతట సుగ్రీవునిమంత్రులు ఉత్తమధనుర్ధారులైన ఆ రామలక్ష్మణులను జూచి భయముతో ఆగిరిశిఖరమునుండి మఱియొక ఉన్నతమైన గిరిశిఖరమునకు పరుగులుదీసిరి. (7)

అట్లు నలుదిక్కులకును పరుగులు దీసిన ఆ వానరప్రముఖులు వెంటనే ఒకచోట గుమిగూడిరి. పిమ్మట వారు తమరాజైన సుగ్రీవునిచుట్టునుజేరి, ఆయనకు సమీపమున నిలిచిరి. ఆవిధముగా వానరులందఱును తమబలముతో పర్వతశిఖరములను కంపింపజేయుచు ఒక కొండనుండి మఱియొక కొండకు ఎగురుచు, ఒకచోట చేరి, ఒంటరిగానున్న సుగ్రీవునియొద్దకు వచ్చిరి. (8-9)

అనంతరము మహాబలశాలులైన వానరులందఱును గంతులు వేయుచు బాగుగా పుష్పించియున్న వనవృక్షములను విఱిచివేసిరి. ఆమహాగిరియందు అంతటను ఆవిధముగా ఎగురుచున్న వానరులు మృగములను, అడవిపిల్లులను, పెద్ద పులులు మొదలగు జంతువులను భయపెట్టుచు వెళ్ళిరి. (10-11)

పిమ్మట ఆఋశ్యమూక పర్వతమును ఆశ్రయించుకొని యున్న సుగ్రీవుని మంత్రులు సుగ్రీవుని కలిసికొని, అంజలి ఘటించి నిలబడిరి. (12)

పిమ్మట వాలివలన హానిని శంకించి భయగ్రస్తుడైయున్న సుగ్రీవునితో మాటనేర్పరియైన హనుమంతుడు ఇట్లు నుడివెను. (13)

"ఓ వానరులారా! మీరందఱును వాలివలన ప్రమాదము కలుగుననెడి ఈ పిచ్చిభయమును వీడుడు. ఏలనన ఈ మలయ (ఋశ్యమూక) పర్వతమునకు వాలి రాజాలడు. కనుక ఇచట మనకు వాలిభయములేదు. (14)

ఓ వానరశ్రేష్ఠా! నీవు వాలిభయముతో ఆందోళనకులోనై పరుగులుదీయుచు (రక్షణకై) ఇచటికి వచ్చితివి. కాని భయంకరస్వరూపుడును, క్రూరకర్ముడును ఐనవాలి (మునిశాపకారణముగా)[1] ఈ ప్రదేశమునకు రాలేడు. ఓ సౌమ్యా! నీ అన్న నీ భార్యను అపహరించిన క్రూరకర్ముడు. ఆదుష్టాత్మునకు నీవు భయపడుచుంటివి. కాని ఇది నీకు సురక్షిత ప్రదేశము. ఇచట నీకు వాలివలన ఎట్టి ప్రమాదమూ కలుగదు. (15-16)

1) కిష్కింధకు సమీపమునగల ఒక పర్వతముపేరు ఋశ్యమూకము. దీనిపై మతంగమహర్షి తపస్సు చేసికొనుచుండెడివాడు. వాలి దుందుభియను రాక్షసుని చంపి అతని శరీరమును ఎగురవేయగా ఆరక్తము వచ్చి, మతంగమహర్షిపైబడెను. అందులకు కుపితుడై ఆమహాముని " వాలి ఈ పర్వతముపై అడుగుపెట్టినచో మృతుడగుగాక" అని అతనిని శపించెను. కనుక వాలి ఆ కొండమీదికి రాజాలడు. అందువలననే వాలికి భయపడిన సుగ్రీవుడు తలదాచుకొనుటకై ఈ పర్వతమును ఆశ్రయించెను.

అహో శాఖామృగత్వం తే వ్యక్తమేవ ప్లవంగమ।
లఘుచిత్తతయాఽఽత్మానం న స్థాపయసి యో మతౌ। 17

ఓ ప్రభూ! వానరులకు రాజవయ్యును సామాన్యవానరుని వలె నీవు చంచలత్వమునే ప్రకటించుచున్నావు. ఇది మిగుల ఆశ్చర్యకరము. భయకారణముగా బాగుగా ఆలోచింపవలసిన విషయమునందుగూడ నీబుద్ధిని స్థిరముగా నిలుపుటలేదు. (17)

బుద్ధివిజ్ఞానసంపన్న ఇంగితైః సర్వమాచర।
న హ్యబుద్ధిం గతో రాజా సర్వభూతాని శాస్తి హి। 18

నీబుద్ధిని, విజ్ఞానమును,[1] ఇంగితమును ఉపయోగించి, ఇతరులవ్యవహారమునుబట్టి వారిస్వభావమును గుర్తించి, యుక్తమెఱిగి, ఆచరింపుము. బుద్ధికి పనిజెప్పని (ప్రతిభామూర్తికాని) రాజు ప్రజలను పరిపాలింపజాలడు. (18)

సుగ్రీవస్తు శుభం వాక్యం శ్రుత్వా సర్వం హనూమతః।
తతః శుభతరం వాక్యం హనూమంతమ్ ఉవాచ హ। 19

సుగ్రీవుడు హనుమంతునియొక్క, చక్కని (అనువైన) సూచనలు వినెను. పిమ్మట అతడు వాటికంటెను మేలైన వచనములను ఆమారుతితో పల్కెను. (19)

దీర్ఘబాహూ విశాలాక్షౌ శరచాపాసిధారిణౌ।
కస్య న స్యాద్భయం దృష్ట్వా హ్యేతౌ సురసుతోపమౌ। 20

"ఓవాయుసుతా! మనకు కనబడుచున్న ఆ ఇరువురును ఆజానుబాహువులు, ధనుర్బాణములను, ఖడ్గములను ధరించియున్నారు. ఇంద్రునివలె పరాక్రమశాలురు, అట్టి వారిని చూచినప్పుడు ఎవరికి భయము కలుగదు? (20)

వాలిప్రణిహితావేతౌ శంకేఽహం పురుషోత్తమౌ।
రాజానో బహుమిత్రాశ్చ విశ్వాసో నాఽత్ర హి క్షమః। 21

ఈ పురుషోత్తములు ఇద్దఱును వాలి పంపగా వచ్చినవారేయని నా అభిప్రాయము. రాజునకు పెక్కుమంది మిత్రులుందురు. ఈ విషయమున ఎవ్వరినీ నమ్మరాదు సుమా! (వాలి ఈ కొండమీదికి రాలేకపోవచ్చును. అతని మిత్రులు రావచ్చునుగదా!) (21)

అరయశ్చ మనుష్యేణ విజ్ఞేయాశ్ఛన్నచారిణః।
విశ్వస్తానామ్ అవిశ్వస్తా రంధ్రేషు ప్రహరంతి హి। 22

శత్రువులు మాఱువేషములలో వచ్చినప్పుడు వారినిగూర్చి లోతుగా విచారింపవలెను. విశ్వసింపదగనివారు (శత్రువులు) నమ్మినవారి బలహీనతలను తెలిసికొని, వారిని దెబ్బతీయుదురు. (నమ్మించి దెబ్బతీయుట శత్రువుల లక్షణము.) (22)

కృత్యేషు వాలీ మేధావీ రాజానో బహుదర్శనాః।
భవంతి పరహంతారః తే జ్ఞేయాః ప్రాకృతైర్నరైః। 23

వాలి సర్వకార్యములను నిర్వహించుటలో మిగుల కుశలుడు. రాజులు పెక్కు వంచనోపాయములద్వారా శత్రువులను హతమార్చెదరు. కావున అట్టి వారిని గూర్చి సామాన్యమానవులవేషములను ధరించి (గూఢ చర్యముద్వారా) లోతుగా తెలిసికొనవలెను. (23)

తౌ త్వయా ప్రాకృతేనైవ గత్వా జ్ఞేయౌ ప్లవంగమ।
ఇంగితానాం ప్రకారైశ్చ రూపవ్యాభాషణేన చ। 24

ఓ మారుతీ! నీవు సామాన్యమానవునిరూపములో వారి కడకు వెళ్లుము. వారి రూపములు, సంభాషణలు, చేష్టలు మున్నగువానిని బట్టి వారినిగూర్చి వారి సౌమ్య - అసౌమ్య లక్షణములను గుఱించి తెలిసికొనుము. వారు మనయెడ సంతుష్టులైయున్నచో (మనకు అనుకూలురుగా కన్పించినచో)

1) బుద్ధిః = సామాన్యతోజ్ఞానమ్ - బుద్ధియనగా సామాన్య జ్ఞానము.
విజ్ఞానం = విశేషతోజ్ఞానమ్ - విశేషజ్ఞానము- విజ్ఞానము
ఇంగితం = అభిప్రాయసూచకోవ్యాపారః - ఇంగితము అనగా అభిప్రాయములను దెలుపునట్టి ప్రవర్తనాదికము.
(అభిప్రాయమును దెలుపునట్టి చేష్టలు మొదలగునవి.)

లక్షయస్వ తయోర్భావం ప్రహృష్టమనసౌ యది।
విశ్వాసయన్ ప్రశంసాభిః ఇంగితైశ్చ పునః పునః। 25

వారిని ప్రశంసలతో ముంచెత్తుచు, పదేపదే చేష్టలతో తృప్తిపఱచుచు వారివిశ్వాసమును చూఱగొని వారి నిజమైన అంతర్యములను ఎఱుంగుము. (24-25)

మమైవాభిముఖం స్థిత్వా పృచ్ఛ త్వం హరిపుంగవ।
ప్రయోజనం ప్రవేశస్య వనస్యాస్య ధనుర్ధరౌ। 26

శుద్ధాత్మానౌ యది త్వేతౌ జానీహి త్వం ప్లవంగమ।
వ్యాభాషితైర్వా విజ్ఞేయా స్యాద్దుష్టాఽదుష్టతా తయోః। 27

ఓ వానరోత్తమా! నీవు నాకు ఎదురుగా (కనబడునట్లుగా) ఉండి, వారు ధనుర్ధారులై ఈ వనమున ప్రవేశించుటకుగల కారణమును అడుగుము. వారు నిర్మలమైన (కుటిలత్వములేని) మనస్సులు కలవారుగా అనిపించినను వారి మాటల తీరునుబట్టియు, ముఖముల కవళికలను అనుసరించియు వారు సజ్జనులౌనా? కారా? తెలిసికొనుము." (26-27)

ఇత్యేవం కపిరాజేన సందిష్టో మారుతాత్మజః।
చకార గమనే బుద్ధిం యత్ర తౌ రామలక్ష్మణౌ। 28

తథేతి సంపూజ్య వచస్తు తస్య తత్
కపేః సుభీమస్య దురాసదస్య చ।
మహానుభావో హనుమాన్ యయౌ తదా
స యత్ర రామోఽతిబలశ్చ లక్ష్మణః। 29

వానరరాజైన సుగ్రీవుడు ఇట్లు ఆదేశించిన పిమ్మట మారుతి రామలక్ష్మణులకడకు వెళ్లుటకై నిశ్చయించుకొనెను. ఎదిరింప శక్యముగానివాడు, రాజనీతి కుశలుడు ఐన సుగ్రీవునిమాటలను గౌరవించి, మహాత్ముడైన హనుమంతుడు అందులకు 'సరే' యనెను. పిమ్మట అతడు మిగుల పరాక్రమశాలులైన రామలక్ష్మణుల యొద్దకు బయలుదేఱెను. (28-29)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ద్వితీయస్సర్గః (2)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది రెండవసర్గము

-- * * * --

3. మూడవసర్గము

హనుమంతుడు రామలక్ష్మణులను కలిసికొని, వారి రూపవైభవములను ప్రశంసించుట - వారి ఆగమన కారణములను గూర్చి అడుగుట - సుగ్రీవుని గూర్చి తెలుపుచు అతడు వారితో సఖ్యమును గోరుచున్నట్లు మారుతి వచించుట - అందులకు వారు సమ్మతించుట.

వచో విజ్ఞాయ హనుమాన్ సుగ్రీవస్య మహాత్మనః।
పర్వతాదృశ్యమూకాత్తు పుప్లువే యత్ర రాఘవౌ। 1

మహాత్ముడైన సుగ్రీవునియొక్క ఆదేశమును తలదాల్చి, హనుమంతుడు ఋశ్యమూకపర్వతమునుండి ఒక్క గెంతులో రామలక్ష్మణులున్న ప్రదేశమున వాలెను. (1)

కపిరూపం పరిత్యజ్య హనుమాన్ మారుతాత్మజః।
భిక్షురూపం తతో భేజే శఠబుద్ధితయా కపిః। 2

పిమ్మట వాయుసుతుడైన హనుమంతుడు ఆ ఇరువురి విశ్వాసమును పొందుటకై (వారికి తనయెడ నమ్మకము ఏర్పడుటకై) తన కపిరూపమును త్యజించి సన్న్యాసి వేషమును దాల్చెను. (2)

తతః స హనుమాన్ వాచా శ్లక్ష్ణయా సుమనోజ్ఞయా।
వినీతవదుపాగమ్య రాఘవౌ ప్రణిపత్య చ।
ఆబభాషే తదా వీరౌ యథావత్ ప్రశశంస చ। 3

అంతట హనుమంతుడు రామలక్ష్మణుల మనస్సులను ఆకట్టుకొనునట్లుగా మధురవచనములను పలుకుచు సవినయముగా వారిని సమీపించెను. పిదప అతడు ఆ మహావీరులకు ప్రణమిల్లి,[1] భక్తిప్రపత్తులతో కొనియాడుచు తగిన విధముగా వారితో సంభాషించెను. (3)

1) దీని వివరణము 260వ (ప్రక్క) పుటలో ముద్రింపబడినది.

సంపూజ్య విధివద్వీరో హనుమాన్ మారుతాత్మజః।
ఉవాచ కామతో వాక్యం మృదు సత్యపరాక్రమౌ। 4

రాజర్షిదేవప్రతిమౌ తాపసౌ సంశితవ్రతౌ।
దేశం కథమిమం ప్రాప్తౌ భవంతౌ వరవర్ణినౌ। 5

త్రాసయంతౌ మృగగణాన్ అన్యాంశ్చ వనచారిణః।
పంపాతీరరుహాన్ వృక్షాన్ వీక్షమాణౌ సమంతతః। 6

ఇమాం నదీం శుభజలాం శోభయంతౌ తపస్వినౌ।
ధైర్యవంతౌ సువర్ణాభౌ కౌ యువాం చీరవాససౌ। 7

నిఃశ్వసంతౌ వరభుజౌ పీడయంతావిమాః ప్రజాః।
సింహవిప్రేక్షితౌ వీరౌ సింహాతిబలవిక్రమౌ। 8

శక్రచాపనిభే చాపే గృహీత్వా శత్రుసూదనౌ।
శ్రీమంతౌ రూపసంపన్నౌ వృషభశ్రేష్ఠవిక్రమౌ। 9

హస్తిహస్తోపమభుజౌ ద్యుతిమంతౌ నరర్షభౌ। 10

ప్రభయా పర్వతేంద్రోఽయం యువయోరవభాసితః। 11

వాయుసుతుడైన మహావీరుడగు హనుమంతుడు సత్యపరాక్రములైన రామలక్ష్మణులకు తగినట్లుగా గౌరవమర్యాదలు నెఱపెను. పిదప సుగ్రీవునిఆదేశమునకు అనుగుణముగా అతడు భక్తితో మృదుమధుర వచనములను ఇట్లు పలికెను. (4)

"ఓ సుందరరూపులారా! మీరు ఇరువురును రాజర్షుల వలెను, దేవతలవలెను కనబడుచున్నారు. తీవ్రమైన వ్రతదీక్షను చేపట్టిన తాపసులవలె ఉన్నారు. ఐనను మీరు అడవి మృగములకును, ఇతరవనచరులకును భీతిగొల్పుచు, పంపాతీరమునందంతటనుగల వృక్షములను వీక్షించుచున్నారు. ఈ ప్రదేశమునకు ఏందులకై వచ్చితిరి? (5-6)

ఓ సజ్జనులారా! మీరు జటావల్కలములను ధరించి, తాపసులవలెనున్నారు. మిగుల ధైర్యశాలులై, బంగారువన్నెగల మీయొక్కరాకవలన మధురజలములుగల ఈ పంపానదీతీరము ఎంతయు శోభిల్లుచున్నది. ఇంతకును మీరెవరు? మీరు వనసంచారశ్రమవలన నిట్టూర్పులు విడుచుచున్నారు. బలిష్ఠములైన భుజములు గలిగియున్నారు. సింహములను మించిన బలపరాక్రమములుగలవారు. సింహములవలె నిశితముగా చూచెడి మీ చూపులకు ఇచటి ప్రాణులన్నియును మిగుల బాధకు లోనగుచున్నవి. (మీ చూపులకు భయపడి మిమ్ముజూచి భీతిల్లి) ప్రాణులన్నియును పాఱిపోవుచున్నవి. ఇంద్రధనుస్సులవంటి చాపములను ధరించిన మీరు శత్రువులను సంహరించుటలో దక్షులు. సౌందర్యమూర్తులైన మీకాంతులు అపూర్వములు. శ్రేష్ఠములైన వృషభములవలె గంభీరగమనులు మీరు. మీ భుజములు ఏనుగుతుండములవలె పొడవైనవి, బలిష్ఠములైనవి. మీరు తేజోమూర్తులైన పురుషోత్తములు. మీ తేజః ప్రభావమున ఈ మహాపర్వతము దివ్యకాంతిమయమై విరాజిల్లుచున్నది.(7-11)

(1) ఒక సన్న్యాసి (హనుమంతుడు వానరుడేయైనప్పటికిని ప్రస్తుతము సన్న్యాసి వేషములోనున్నందున అతడు) గృహస్థులకు (గృహస్థులైన రామలక్ష్మణులకు) నమస్కరింపరాదుగదా? ఇది సంప్రదాయమునకు విరుద్ధముగదా? అని ఒక ఆక్షేపణ.
ఇది సంప్రదాయమునకు విరుద్ధముగాదు-

1. రామలక్ష్మణులు అత్యద్భుతమైన రూపసంపదగలవారు. వారిఅపూర్వమైనసౌందర్యవైభవమును దర్శించినంతనే ఆనందాతిరేకములో మునిగి, పైమఱచిన హనుమంతుడు తన సన్న్యాసివేషమును విస్మరించి వారికి నమస్కరించెను. కనుక ఇది దోషముగాదు. 'యత్ర ఆకృతిః తత్ర గుణాః' అని గదా! పెద్దలమాట.
2. హనుమంతుడు రామలక్ష్మణులయొక్క నిజమైన అంతర్యములను తెలిసికొనినమ్మటకై సుగ్రీవునిచే పంపబడినవాడు. కనుక అతడు తనమృదుమధుర సంభాషణలచేతను, వినయముతో నమస్కరించుట మున్నగు చేష్టలతోడను వారిమనస్సులను ఆకర్షింపవలసియున్నది. సహజముగా దూతయై వచ్చిన మారుతి తనలక్ష్యసాధనలో భాగముగా నమస్కరించుట సంప్రదాయ విరుద్ధముగాదు.
3. మహావీరలక్షణములు తొణికిసలాడుచున్న వీరిని చూడగానే 'వీరు సుగ్రీవుని విరోధియైన వాలికి బుద్ధిచెప్పగల సమర్థులు' అని తలంచి, తాను సుగ్రీవుని వారుడను' అని తెల్పుటకై హనుమంతుడు వారికి నమస్కరించియుండును. కావున ఇది సమంజసమే.
4. 'భిక్షువు' అనగా బ్రహ్మచారి. బ్రహ్మచారి గృహస్థులకు నమస్కరించుట యుక్తమే. అందువలన ఇది సంప్రదాయబద్ధమే.

రాజ్యర్షిదేవమరప్రఖ్యౌ కథం దేశమ్ ఇహాగతౌ।
పద్మపత్రేక్షణౌ వీరౌ జటామండలధారిణౌ॥ 12

అన్యోఽన్యసదృశౌ వీరౌ దేవలోకాదివాగతౌ।
యదృచ్ఛయేవ సంప్రాప్తౌ చంద్రసూర్యౌ వసుంధరాం॥ 13

విశాలవక్షసౌ వీరౌ మానుషౌ దేవరూపిణౌ।
సింహస్కంధౌ మహోత్సాహౌ సమదావివ గోవృషౌ॥ 14

ఆయతాశ్చ సువృత్తాశ్చ బాహవః పరిఘోపమాః।
సర్వభూషణభూషార్హాః కిమర్థం న విభూషితాః॥ 15

ఉభౌ యోగ్యావహం మన్యే రక్షితుం పృథివీమిమాం।
ససాగరవనాం కృత్స్నాం వింధ్యమేరువిభూషితామ్॥ 16

ఇమే చ ధనుషీ చిత్రే శ్లక్ష్ణే చిత్రానులేపనే।
ప్రకాశేతే యథేంద్రస్య వజ్రే హేమవిభూషితే॥ 17

సంపూర్ణా నిశితైర్బాణైః తూణాశ్చ శుభదర్శనాః।
జీవితాంతకరైర్ఘోరైః శ్వసద్భిరివ పన్నగైః॥ 18

మహాప్రమాణౌ విస్తీర్ణౌ తప్తహాటకభూషితౌ।
ఖడ్గావేతౌ విరాజేతే నిర్ముక్తావివ పన్నగౌ॥ 19

ఏవం మాం పరిభాషంతం కస్మాద్వై నాఽభిభాషథః॥ 20

సుగ్రీవో నామ ధర్మాత్మా కశ్చిద్వానరయూథపః।
వీరో వినికృతో భ్రాత్రా జగద్భ్రమతి దుఃఖితః॥ 21

ప్రాప్తోఽహం ప్రేషితస్తేన సుగ్రీవేణ మహాత్మనా।
రాజ్ఞా వానరముఖ్యానాం హనూమాన్ నామ వానరః॥ 22

మీరు దేవతలవలె మిగులపరాక్రమవంతులు, తామరరేకులవంటి కన్నులుగలవారు, జటావల్కలములను ధరించియున్నను మీరు మహావీరులు. శౌర్యపరాక్రమములలో మీరు ఒకరికొకరు తీసిపోనివారు, దేవలోకమునుండి దిగివచ్చినట్లున్నారు. సూర్యచంద్రులవలె ఆనందదాయకులైన మీరు దైవికముగా ఈ భూలోకమునకు విచ్చేసినట్లున్నారు. విశాల వక్షఃస్థలములు కలిగియున్న మీరు దివ్యరూప శోభితులు, సింహములవలె మీరు చక్కని మూపులు గలవారు, మదించిన వృషభములవలె శత్రుభయంకరులు ఉత్సాహశక్తిసంపన్నులు, ఉత్తమరాజలక్షణములు కలవారు ఐన మీరు రాజ్యభోగములను పరిత్యజించి, జటావల్కలములను ధరించి, ఈ దుర్గమారణ్యములను వచ్చుటకు గల కారణమేమి? (12-14)

ఆజానుబాహువులైన మీభుజములు విశాలములై వృత్తాకారము గలిగియున్నవి. అవి పరిఘలవలె బలిష్ఠములు. వివిధములైన అమూల్యములగు ఆభరణములను ధరించుటకు అర్హములైన మీభుజములు ఆభరణ రహితములైయున్నవేల? సముద్రములతో, వనములతో విరాజిల్లుచున్నదియు, వింధ్యాద్రితో, మేరుపర్వతముతో విలసిల్లుచున్నదియు అగు ఈ సమస్త భూమండలమును రక్షించుటకు (పాలించుటకు) మీరు ఇద్దఱును సర్వసమర్థులే. మీరు ధరించియున్న ఈ ధనుస్సులు అపూర్వములు, ఆశ్చర్యకరములు, సుందరములై, చిత్రములైన బంగారుపూతలతో ఒప్పుచున్నవి. అందువలన ఇవి ఇంద్రుని వజ్రాయుధమువలె సువర్ణముచే అలంకృతములై మిగుల మెఱయుచున్నవి. (15-17)

మీతూణీరములు చూడముచ్చటగానున్నవి. అవి పదునైన బాణములతో నిండియున్నవి. ఆశరములు బుసలు కొట్టుచున్న సర్పములవలె భయంకరములై శత్రువులప్రాణములను తీయునట్టివి. మీఖడ్గములు పొడవైనవి, విశాలములైనవి. మేలిమిబంగారముతో అలంకృతములు. అవి కుబుసము వీడిన సర్పములవలె విరాజిల్లుచున్నవి. (18-19)

ఓ సత్పురుషులారా! నేను ఇంతగా మాట్లాడుచున్నను మీరు ఏమాత్రమును పెదవివిప్పరేల? వానరులకు ప్రభువైన సుగ్రీవుడు ధర్మాత్ముడు, మహావీరుడు. అతడు తనఅన్నయగు వాలిచేత వంచితుడై మిగుల దుఃఖించుచు రక్షణకై ఈ జగత్తునందు అంతటను తిరుగుచున్నాడు. వానర ప్రముఖులకు రాజైన సుగ్రీవుడు మిగుల బుద్ధిశాలి. అతడు పంపగానేను మీకడకు

యువాభ్యాం సహ ధర్మాత్మా సుగ్రీవః సఖ్యమిచ్ఛతి।
తస్య మాం సచివం విత్తం వానరం పవనాత్మజమ్। 23

భిక్షురూపప్రతిచ్ఛన్నం సుగ్రీవప్రియకామ్యయా।
ఋశ్యమూకాదిహ ప్రాప్తం కామగం కామరూపిణమ్। 24

వచ్చితిని. నేను 'హనుమంతుడు' అను పేరుగల వానరుడను. ధర్మనిరతుడైన ఆసుగ్రీవుడు మీతో మైత్రిని గోరుకొనుచున్నాడు. నేను వాయుసుతుడను, వానరుడను. అతనిమంత్రిని, నేను కామరూపుడను, కోరుకొనిన చోటునకు (ఎక్కడికైనను) వెళ్లిరాగలను. సుగ్రీవ ప్రభువునకు ప్రీతిని గూర్చుటకై భిక్షువు (సన్న్యాసి) వేషములో ఋశ్యమూకపర్వతమునుండి ఇచ్చటికి వచ్చితిని." (20-24)

ఏవముక్త్వా తు హనుమాన్ తౌ వీరౌ రామలక్ష్మణౌ।
వాక్యజ్ఞౌ వాక్యకుశలః పునర్నోవాచ కించన। 25

మాటాడుటలో నేర్పరియైన హనుమంతుడు, వాక్యములఅంతరార్థములను గ్రహించుటలో కుశలురు, వీరులు ఐన ఆరామలక్ష్మణులతో ఇట్లు పలికి, వారి సమాధానమునకై నిరీక్షించుచు మౌనముగానుండెను. (25)

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య రామో లక్ష్మణమబ్రవీత్।
ప్రహృష్టవదనః శ్రీమాన్ భ్రాతరం పార్శ్వతః స్థితమ్। 26

సర్వశుభలక్షణసంపన్నుడైన శ్రీరాముడు హనుమంతుని పలుకులనువిని ఎంతయు సంతోషించెను. పిదప తన ప్రక్కనేయున్న తమ్ముడగు లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (26)

సచివోఽయం కపీంద్రస్య సుగ్రీవస్య మహాత్మనః।
తమేవ కాంక్షమాణస్య మమాంతికముపాగతః। 27

"ఓ సౌమిత్రీ! మహాత్ముడు, వానరరాజు ఐన సుగ్రీవుని సచివుడితడు. మనము ఆ సుగ్రీవుని కలియుటకై కోరుకొనుచుండగా అతడే (అతని మంత్రియే) మనకడకు వచ్చెను. (27)

తమభ్యభాష సౌమిత్రే సుగ్రీవసచివం కపిమ్।
వాక్యజ్ఞం మధురైర్వాక్యైః స్నేహయుక్తమ్ అరిందమ। 28

నానృగ్వేదవినీతస్య నాయజుర్వేదధారిణః।
నాసామవేదవిదుషః శక్యమేవం ప్రభాషితుమ్। 29

నూనం వ్యాకరణం కృత్స్నమ్ అనేన బహుధా శ్రుతం।
బహు వ్యాహరతాఽనేన న కించిదపశబ్దితమ్। 30

న ముఖే నేత్రయోర్వాపి లలాటే చ భ్రువోస్తథా।
అన్యేష్వపి చ గాత్రేషు దోషః సంవిదితః క్వచిత్। 31

శత్రుసంహారసమర్థుడవైన ఓ సౌమిత్రీ! సుగ్రీవుని సచివుడైన ఈ వానరుడు మాట్లాడుటలో మిగుల కుశలుడు. ఇతడు నాయెడను సుగ్రీవుని యందును ప్రీతిగలవాడు. కనుక ఈయనతో మృదుమధురముగా తగు విధముగా వచింపుము. ఋగ్వేదమునందును, యజుర్వేదమునందును, సామవేదమునందును సుశిక్షితుడైన వాడు (వేదవిజ్ఞాన సంపన్నుడు) మాత్రమే ఇట్లు మాట్లాడుటకు సమర్థుడు. ఇతడు మనతో పెక్కు విషయములను గూర్చి వచించెను. ఆమాటలలో ఎక్కడను అపశబ్దములేనే లేదు. కనుక 'ఇతడు సమస్త వ్యాకరణములను కూలంకషముగా నేర్చినవాడు." అనునది నిశ్చయము. ఈతడు మాట్లాడునప్పుడు ముఖమునందును, కనులలోను, ఫాలభాగమునందును, కనుబొమలయందును, తదితరములైన అవయవములయందును శరీరమునందెచ్చటను ఎట్టి వికారమూ[1] కనబడలేదు. (28-31)

1) గీతీ శీఘ్రీ శిరఃకంపీ, తథా లిఖితపాఠకః। అనర్థజ్ఞోఽల్పకంఠశ్చ, షడేతే పాఠకాధమాః।
మాట్లాడునప్పుడు రాగాలు తీసెడివాడు, వేగముగా భాషించెడివాడు, తలను కదలించువాడు, వ్రాసిన దానిని చూచి చదివెడివాడు, కంఠస్థముచేసిన దానిని అప్పగించినట్లుగా మాట్లాడెడివాడు, అర్థము తెలియక నుడివెడువాడు, పీలబోయిన కంఠముగలవాడు, ఈ ఆఱుగురును పాఠకాధములు.

అవిస్తరమ్ అసందిగ్ధమ్ అవిలంబితమద్రుతం।
ఉరఃస్థం కంఠగం వాక్యం వర్తతే మధ్యమే స్వరే। 32

ఇతడు సంక్షిప్తముగా తన అభిప్రాయములను స్పష్టపఱచినాడు. ఇతని మాటలలో సందేహమునకు తావులేదు. ఆగుచుగాని, అర్థరహితముగా పదములను విడగొట్టుచుగాని ఉచ్చరింపలేదు. ఇతడు తొందరపాటులేక ఆత్మవిశ్వాసముతో మాట్లాడినాడు, మనసులోని మాటనే స్పష్టముగా తెలిపినాడు. ఇతడు మఱీ బిగ్గఱగాగాక, మఱీ సన్నగా గాక మధ్యమ స్వరముతో ఉచ్చరించినాడు. (32)

సంస్కారక్రమసంపన్నామ్ అద్రుతామ్ అవిలంబితాం।
ఉచ్చారయతి కల్యాణీం వాచం హృదయహారిణీమ్। 33

అనయా చిత్రయా వాచా త్రిస్థానవ్యంజనస్థయా।
కస్య నాఽఽరాధ్యతే చిత్తమ్ ఉద్యతాసేః అరేరపి। 34

ఈయన పలికిన మాటలు వ్యాకరణశాస్త్ర సమ్మతములు, స్పష్టముగా క్రమమును అనుసరించి యున్నవి. లోకసహజమైన వేగముగలవి, ఆగక ఒక క్రమములో సాగినవి. శుభదాయకములు (మేలును గూర్చునవి), ఆకర్షణీయములు. ఈమారుతి వచనములు భావములను స్పష్టముగా ప్రకటించుటకు అనుగుణమగు స్వరస్థానములో[1] పలుకబడుటచే[2] ఆశ్చర్యమును కలిగించుచున్నవి. ఈయన మధురవచనముల తీరునకు ఎల్లరును ముగ్ధులగుదురు. చంపుటకు కత్తియెత్తిన క్రూరుడుసైతము ఈయునపలుకులకు చల్లబడి ఆకత్తిని దింపవలసినదే. (33-34)

ఏవంవిధో యస్య దూతో న భవేత్ పార్థివస్య తు।
సిధ్యంతి హి కథం తస్య కార్యాణాం గతయోఽనఘ। 35

ఏవం గుణగణైర్యుక్తా యస్య స్యుః కార్యసాధకాః।
తస్య సిధ్యంతి సర్వార్థా దూతవాక్యప్రచోదితాః। 36

ఓ నిర్మలహృదయా! ఇట్టి బుద్ధికుశలుడైన దూతలభింపని ప్రభువుయొక్క కార్యములు ఎట్లు సిద్ధించును? ఇట్టి విశిష్టగుణములుగలిగి, కార్యసాధకులైన దూతలను కలిగియున్న రాజు నిజముగా అదృష్టవంతుడు. సమయస్ఫూర్తిగల అట్టి దూతలయొక్క చక్కని మాటల ప్రభావముచే ఆ రాజుయొక్క కార్యములన్నియును (ప్రయోజనములన్నియును) సిద్ధించును." (35-36)

ఏవమ్ ఉక్తస్తు సౌమిత్రిః సుగ్రీవసచివం కపిం।
అభ్యభాషత వాక్యజ్ఞో వాక్యజ్ఞం పవనాత్మజమ్। 37

శ్రీరాముడు ఇట్లు సూచించిన పిమ్మట, వాయుసుతుడును, సుగ్రీవునిమంత్రియు, వాక్యవిశారదుడును ఐన హనుమంతునితో వచనకుశలుడైన లక్ష్మణుడు ఈ విధముగా పలికెను. (37)

విదితా నౌ గుణా విద్వన్ సుగ్రీవస్య మహాత్మనః।
తమేవ చావాం మార్గావః సుగ్రీవం ప్లవగేశ్వరమ్। 38

"ఓ విద్వాంసుడా! మహాత్ముడైన సుగ్రీవునియొక్క గుణగణములనుగూర్చి కబంధునివలన ఇంతకుముందే వినియుంటిమి. (ఇప్పుడు నీవలన ఆయన వైశిష్ట్యమును గుఱించి విపులముగా విని ఎంతయు సంతోషించితిమి.) వానర ప్రభువైన ఆసుగ్రీవునికొఱకై వెదకుచు మేము

1) స్వరములు ఉత్పన్నములగు స్థానములు మూడు (1) వక్షఃస్థలము (2) కంఠము (3) శిరస్సు.
2) 1. వ్యాకరణనియములను అనుసరించిన దోషరహితమైన భాషను సంస్కార సంపన్నము (సంస్కృతము) అని వ్యవహరింతురు.
2. శబ్దోచ్చారణమునందు శాస్త్రీయమైన పద్ధతిని 'క్రమము' అనియందురు.
3. ఆగకుండ ధారాళముగా మాట్లాడుటను 'అవిలంబితము' అని పేర్కొందురు.

యథా బ్రవీషి హనుమన్ సుగ్రీవవచనాదిహ।
తత్తథా హి కరిష్యావో వచనాత్ తవ సత్తమ। 39

ఇచటికి చేరితిమి. సత్పురుషుడవైన ఓ మారుతీ! మైత్రి విషయమున సుగ్రీవుని ఆదేశము మేరకు నీవు పలికిన మాటలకు మేము సమ్మతించితిమి. నీ సూచనలను మేము పాటించెదము." (38-39)

తతస్తు వాక్యం నిపుణం నిశమ్య
ప్రహృష్టరూపః పవనాత్మజః కపిః।
మనః సమాధాయ జయోపపత్తౌ
సఖ్యం తదా కర్తుమియేష తాభ్యామ్। 40

పవనసుతుడైన హనుమంతుడు లక్ష్మణుని సమయోచిత వచనములను విని ఎంతయు సంతోషపడెను. ఇక సుగ్రీవునికార్యము సఫలమగునని (సుగ్రీవునకు వాలి బాధలు తొలగునని) మనస్సున దిటవుచేసికొనెను. సుగ్రీవునకు రామలక్ష్మణులతో మైత్రిని ఏర్పఱచుటకు కుతూహలపడెను. (నిశ్చయించుకొనెను.) (40)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే తృతీయస్సర్గః (3)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది మూడవసర్గము

-- * * * --

4. నాలుగవసర్గము

హనుమంతుని అభ్యర్థనపై శ్రీరాముని ప్రేరణను అనుసరించి, సౌమిత్రి తమ వనవాస వృత్తాంతమును, సీతాపహరణ విషయమును మారుతికి వివరించుట - శ్రీరాముడు సుగ్రీవునితో మైత్రికి తన అభిలాషను వెల్లడించుట - ఆంజనేయుడు నిజరూపమును ప్రకటించి, వారిని తన భుజములపై కూర్చుండబెట్టుకొని ఋశ్యమూక పర్వతమునకు చేరుట.

తతః ప్రహృష్టో హనుమాన్ కృత్యవానితి తద్వచః।
శ్రుత్వా మధురసంభాషం సుగ్రీవం మనసా గతః। 1

హనుమంతుడు లక్ష్మణుని మధురభాషణమును విని, శ్రీరామునికార్యసామర్థ్యమును ఎఱింగి, శ్రీరామునకును, సుగ్రీవునిఅవసరమున్నట్లు గ్రహించి, (శ్రీరామసుగ్రీవుల పరస్పరకార్యలాభాపేక్షలను గుర్తించి) లోలోపల మిగుల సంతోషించెను. అనంతరము సుగ్రీవుని తన మనస్సునందు స్మరణకు దెచ్చుకొనెను. (1)

భవ్యో రాజ్యాగమస్తస్య సుగ్రీవస్య మహాత్మనః।
యదయం కృత్యవాన్ ప్రాప్తః కృత్యం చైతదుపాగతమ్। 2

మహాత్ముడైన ఆ సుగ్రీవునకు రాజ్యము ప్రాప్తించుట సంభవమే (తథ్యమే) ఏలనన కార్యసమర్థుడైన శ్రీరాముడు లభించినాడు. కనుక ఆకార్యము నెఱవేఱినట్లే. (2)

తతః పరమసంహృష్టో హనుమాన్ ప్లవగర్షభః।
ప్రత్యువాచ తతో వాక్యం రామం వాక్యవిశారదః। 3

అంతట వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు మిగుల సంతసించెను. పిమ్మట మాట్లాడుటలో నేర్పరియైన అతడు శ్రీరామునితో ఇట్లనుడివెను. (3)

కిమర్థం త్వం వనం ఘోరం పంపాకాననమండితం।
ఆగతః సానుజో దుర్గం నానావ్యాళమృగాయుతమ్। 4

"ఓ రామా! వనములతో గూడియున్న ఈ పంపాప్రదేశము (దండకారణ్యము) పెద్దపులులతో, భయంకర సర్పములతో, ఇతర క్రూరమృగములతో విలసిల్లుచుండునది. ఈ దట్టమైన అడవిలో కాలుమోపుటయును కష్టమే. నీవు తమ్మునితోగూడి ఇచటికి ఏల వచ్చితివి?" (ఆకారమునందలి పోలికలనుబట్టి లక్ష్మణుడు శ్రీరామునితమ్ముడై యుండునని హనుమంతుడు భావించియుండును) (4)

తస్య తద్వచనం శ్రుత్వా లక్ష్మణో రామచోదితః।
అచచక్షే మహాత్మానం రామం దశరథాత్మజమ్॥ 5

రాజా దశరథో నామ ద్యుతిమాన్ ధర్మవత్సలః।
చాతుర్వర్ణ్యం స్వధర్మేణ నిత్యమే వాభ్యపాలయత్॥ 6

న ద్వేష్టా విద్యతే తస్య న చ స ద్వేష్టి కంచన।
స చ సర్వేషు భూతేషు పితామహ ఇవాపర।
అగ్నిష్టోమాదిభిర్యజ్ఞైః ఇష్టవాన్ ఆప్తదక్షిణైః॥ 7

తస్యాయం పూర్వజః పుత్రో రామో నామ జనైః శ్రుతః।
శరణ్యః సర్వభూతానాం పితుర్నిర్దేశపారగః॥ 8

వీరో దశరథస్యాయం పుత్రాణాం గుణవత్తమః।
రాజలక్షణసంపన్నః సంయుక్తో రాజసంపదా॥ 9

రాజ్యాద్భ్రష్టో వనే వస్తుం మయా సార్ధమిహాగతః।
భార్యయా చ మహాతేజాః సీతయాఽనుగతో వశీ॥ 10

దినక్షయే మహాతేజాః ప్రభయేవ దివాకరః॥ 11

అహమస్యావరో భ్రాతా గుణైర్దాస్యమ్ ఉపాగతః।
కృతజ్ఞస్య బహుజ్ఞస్య లక్ష్మణో నామ నామతః॥ 12

సుఖార్హస్య మహార్హస్య సర్వభూతహితాత్మనః।
ఐశ్వర్యేణ చ హీనస్య వనవాసాశ్రితస్య చ॥ 13

రక్షసాఽపహృతా భార్యా రహితే కామరూపిణా।
తచ్చ న జ్ఞాయతే రక్షః పత్నీ యేనాస్య సా హృతా॥ 14

హనుమంతుడు ఇట్లుపలుకగా శ్రీరామునిప్రేరణతో లక్ష్మణుడు మహాత్ముడైన ఆ దాశరథిని (శ్రీరాముని)గూర్చి మారుతితో ఈ విధముగా నుడివెను. (5)

'దశరథుడు' అను ఒక మహారాజుగలడు. అతడు తేజోమూర్తి, ధర్మాత్ముడు. ఆప్రభువు సర్వదా తన రాజధర్మమును అనుసరించి, నాలుగువర్ణములవారిని చక్కగా పరిపాలించెను. ఆయనను ఎవ్వరును ద్వేషింపరు. ఆయనయు ఎవ్వరినీ ద్వేషింపడు. అతడు సమస్త ప్రాణులలోను బ్రహ్మదేవునివలె శ్రేష్ఠుడు. అగ్నిష్టోమాది వివిధ యజ్ఞములను ఆచరించి తగిన విధముగా దక్షిణలను ఇచ్చి అందటికిని సంతోషమును గూర్చెను. (6-7)

ఆ మహారాజకుమారులలో శ్రీరాముడు పెద్దవాడు. ఇతడు తన సద్గుణములచే ప్రజలలో ప్రసిద్ధిగన్నవాడు. సమస్త ప్రాణులకును దిక్కైనవాడు. తండ్రియాజ్ఞను శిరసావహించుచు, తదనుగుణముగ ప్రవర్తించుచుండెడివాడు. ఇతడు మహావీరుడు, దశరథుని కుమారులందటిలోను సద్గుణములచే శ్రేష్ఠుడు. సమస్తరాజలకణములతో విలసిల్లుచున్నవాడు. రాజసంపదలను కలిగియున్నవాడు. ఇతడు తండ్రిమాటను నిలుపుటకై కోసలరాజ్యమునువీడి, వనవాసమునకై నాతోగూడి ఈఅరణ్యములకు వచ్చెను. ఇతడు ఇంద్రియనిగ్రహముగలవాడు ఈ మహాతేజస్వియొక్క భార్యసీతాదేవి. తేజోనిధియైన సూర్యుని సాయంసమయమున ఆయన కాంతి అనుసరించినట్లు, ఆ మహాసాధ్వి ఈ మహాత్మునివెంట వనములకు వచ్చినది. (8-11)

ఇతడు తనకు ఇతరులు స్వల్పముగా మేలొనర్చినను. దానిని కొండంతలుగా భావించువాడు, సర్వజ్ఞుడు. నాపేరు లక్ష్మణుడు, ఈ మహాత్మునకు నేను చిన్న తమ్ముడను. ఈయన సద్గుణములకు వశుడనై, ఈయనను సేవించుటకు దాసుడనై ఇటు వచ్చితిని. (12)

శ్రీరాముడు సమస్త ప్రాణుల హితమునందే నిరతుడై యుండెడివాడు, సకలైశ్వర్యసంపన్నుడును, సమస్త సుఖములను పొందుటకు అర్హుడైనవాడును ఐన ఈ మహాత్ముడు సకలసంపదలను, సుఖభోగములను త్యజించి తండ్రిని సత్యసంధుని గావించుటకై ఈ అరణ్యములకు విచ్చేసెను. ఈయన ఆశ్రమమున లేకుండుటజూచి, కామరూపుడైన ఒక రాక్షసుడు ఈయన భార్యయగు సీతాదేవిని అపహరించుకొని పోయెను. ఆమెను తీసికొనిపోయిన రాక్షసుడెవరో మేమెఱుగము. (13-14)

దనుర్నామ దితేః పుత్త్రః శాపాద్రాక్షసతాం గతః।
ఆఖ్యాతస్తేన సుగ్రీవః సమర్థో వానరర్షభః। 15

స జ్ఞాస్యతి మహావీర్యః తవ భార్యాపహారిణం।
ఏవముక్త్వా దనుః స్వర్గం భ్రాజమానో గతః సుఖమ్। 16

ఏతత్తే సర్వమాఖ్యాతం యాథాతథ్యేన పృచ్ఛతః। 17

అహం చైవ హి రామశ్చ సుగ్రీవం శరణం గతౌ। 18

ఏష దత్త్వా చ విత్తాని ప్రాప్య చానుత్తమం యశః।
లోకనాథః పురా భూత్వా సుగ్రీవం నాథమిచ్ఛతి। 19

పితా యస్య పురా హ్యాసీత్ శరణ్యో ధర్మవత్సలః।
తస్య పుత్త్రః శరణ్యశ్చ సుగ్రీవం శరణం గతః। 20

సర్వలోకస్య ధర్మాత్మా శరణ్యః శరణం పురా।
గురుర్మే రాఘవఃసోఽయం సుగ్రీవం శరణంగతః। 21

యస్య ప్రసాదే సతతం ప్రసీదేయురిమాః ప్రజాః।
స రామో వానరేంద్రస్య ప్రసాదమ్ అభికాంక్షతే। 22

యేన సర్వగుణోపేతాః పృథివ్యాం సర్వపార్థివాః।
మానితాః సతతం రాజ్ఞా సదా దశరథేన వై। 23

తస్యాయం పూర్వజః పుత్త్రః త్రిషు లోకేషు విశ్రుతః।
సుగ్రీవం వానరేంద్రం తు రామః శరణమాగతః। 24

శోకాభిభూతే రామే తు శోకార్తే శరణం గతే।
కర్తుమర్హతి సుగ్రీవః ప్రసాదం హరియూథపః। 25

ఏవం బ్రువాణం సౌమిత్రిం కరుణం సాశ్రులోచనం।
హనుమాన్ ప్రత్యువాచేదం వాక్యం వాక్యవిశారదః। 26

ఈదృశా బుద్ధిసంపన్నా జితక్రోధా జితేంద్రియాః।
ద్రష్టవ్యా వానరేంద్రేణ దిష్ట్యా దర్శనమాగతాః। 27

దితికి పుత్త్రప్రాయుడైన 'దనువు' అను గంధర్వుడు. మునిశాపకారణముగా రాక్షసత్వమును పొందెను. 'వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు సర్వసమర్థుడు, రామపత్నియైన సీతాదేవిని అపహరించిన వానిని ఆ మహావీరుడు తెలిసికొనగలడు' అని అతడు తెలిపెను. పిమ్మట ఆదనువు (రామానుగ్రహమున) మిక్కిలి తేజోమూర్తియై హాయిగా స్వర్గమునకు చేరెను. (15-16)

ఓ మారుతీ! నీవడిగినరీతిగా మా విషయములను యథాతథముగా తెలిపితిని. నేను, మా అన్నయగు శ్రీరాముడును సుగ్రీవుని ఆశ్రయించుచున్నారు. (17-18)

జగన్నాథుడైన ఈ రాముడు ఇదివఱలో కొల్లలుగా దానధర్మములను ఒనర్చి గొప్ప కీర్తిప్రతిష్ఠలను పొందెను. అట్టి శ్రీరాముడు నేడు సుగ్రీవుని ఆశ్రయించుచున్నాడు.(19)

దశరథమహారాజు ధర్మనిరతుడు, ఆపన్నులకు శరణ్యుడు. ఆయనకుమారుడైన శ్రీరాముడు ఆశ్రితులను అందఱీ ఆదుకొనువాడు. అట్టి మహానుభావుడు ఇప్పుడు సుగ్రీవుని ఆశ్రయించుచున్నాడు. ఈ రాఘవుడు నాకు సర్వదా పూజ్యుడు, సర్వలోకశరణ్యుడు, ధర్మాత్ముడు, అట్టి ప్రభువు ఈనాడు సుగ్రీవుని ఆశ్రయించుచున్నాడు. ఇంతవఱకును ఈ ప్రజలందఱును ఈయన అనుగ్రహము చేతనే సుఖశాంతులు పొందుచున్నారు. కాని అట్టి ప్రభువు నేడు వానరేంద్రుని సహాయమును అర్థించుచున్నాడు. (20-22)

భూమండలమునందలి సకలసద్గుణసంపన్నులైన రాజులందఱును దశరథమహారాజును దర్శించుటకై వచ్చుచుండెడివారు. ఆకోసలపతి వారిని అందఱిని చక్కగా గౌరవించుచుండెడివాడు. అట్టి మహానుభావుని పెద్దకుమారుడు శ్రీరాముడు. ఈయన ముల్లోకములలోను విఖ్యాతిగన్నవాడు. ఈ రాఘవుడు నేడు వానర ప్రభువైన సుగ్రీవుని ఆశ్రయించుచున్నాడు. (23-24)

శోకపరవశుడైన శ్రీరాముడు సీతాదేవియెడబాటు కారణముగా దుఃఖముచే కృశించియున్నాడు. అట్టి రాఘవుడు ఆశ్రయించుచున్నందున వానరులకు నాయకుడైన సుగ్రీవుడు ఈయనకు తోడ్పడుట యెంతేని యుక్తము." (25)

లక్ష్మణుడు కన్నీరు గార్చుచు దైన్యముతో ఇట్లు పలుకుచుండగా వాక్చతురుడైన హనుమంతుడు ఆ సౌమిత్రితో ఈ విధముగా నుడివెను. (26)

"ఓ రాజకుమారులారా! మీరు ప్రజ్ఞామూర్తులు, క్రోధమును జయించిన వారు, జితేంద్రియులు, మావానర రాజునకు (సుగ్రీవునకు) మీవంటిమహాత్ములఅవసరము ఎంతేనిగలదు. అదృష్టవశమున మీదర్శనభాగ్యము

స హి రాజ్యాత్ పరిభ్రష్టః కృతవైరశ్చ వాలినా।
హృతదారో వనే త్యక్తో భ్రాత్రా వినికృతో భృశమ్। 28

కరిష్యతి స సాహాయ్యం యువయోర్భాస్కరాత్మజః।
సుగ్రీవః సహ చాస్మాభిః సీతాయాః పరిమార్గణే। 29

ఇత్యేవముక్త్వా హనుమాన్ శ్లక్ష్ణం మధురయా గిరా।
బభాషే సోఽభిగచ్ఛేమ సుగ్రీవమితి రాఘవమ్। 30

ఏవం బ్రువాణం ధర్మాత్మా హనుమంతం స లక్ష్మణః।
ప్రతిపూజ్య యథాన్యాయమ్ ఇదం ప్రోవాచ రాఘవమ్। 31

కపిః కథయతే హృష్టో యథాఽయం మారుతాత్మజః,।
కృత్యవాన్ సోఽపి సంప్రాప్తః కృతకృత్యోఽసి రాఘవ। 32

ప్రసన్నముఖవర్ణశ్చ వ్యక్తం హృష్టశ్చ భాషతే।
నానృతం వక్ష్యతే వీరో హనుమాన్ మారుతాత్మజః। 33

తతః స తు మహాప్రాజ్ఞో హనుమాన్ మారుతాత్మజః।
జగామాదాయ తౌ వీరౌ హరిరాజాయ రాఘవౌ। 34

భిక్షురూపం పరిత్యజ్య వానరం రూపమాస్థితః।
పృష్ఠమారోప్య తౌ వీరౌ జగామ కపికుంజరః। 35

సతు విపులయశాః కపిప్రవీరః
పవనసుతః కృతకృత్యవత్ ప్రహృష్టః।
గిరివరమురువిక్రమః ప్రయాతః
సుశుభమతిః సహ రామలక్ష్మణాభ్యామ్ । 36

లభించుచున్నది. ప్రస్తుతము ఆప్రభువు తన అన్నయగు వాలితో వైరము ఏర్పడి రాజ్యభ్రష్టుడైనాడు. ఆవాలి మారాజును వంచించి, ఆయన భార్యయగు రుమను తన వశములో నుంచుకొనినాడు. ఫలితముగా సుగ్రీవుడు వనములపాలైయున్నాడు. సూర్యపుత్త్రుడైన ఆసుగ్రీవుడు మాతోగూడి, సీతాదేవిని వెదకుటలో మీకు సహాయపడగలడు". (27-29)

ఆ హనుమంతుడు ఇట్లు మృదుమధురముగా పలికి 'ఇక మనము సుగ్రీవునికడకు వెళ్లుదము' అని పచించెను. (30)

ధర్మాత్ముడైన ఆలక్ష్మణుడు ఇట్లునుడువుచున్న హనుమంతునకు దూతకు తగినట్లుగా గౌరవ మర్యాదలు నెఱపి, తనయన్నయగు శ్రీరామునితో ఈవిధముగా పచించెను. (31)

"అన్నా! రామచంద్రా! వానరుడైన ఈ మారుతి నామాటలకు మిగుల సంతోషించి ఇట్లు పలుకుచున్నాడు. ఈయన మాటలను బట్టి సుగ్రీవునకును నీసహాయము అవసరమని స్పష్టమగుచున్నది. కావున సీతాన్వేషణకు వీరు నిజముగనే తోడ్పడుదురని నమ్మవచ్చును. కనుక నీవును, సుగ్రీవుడును ధన్యులైనట్లే. (32)

పవనసుతుడైన హనుమంతుడు మాట్లాడునప్పుడు ఆయనముఖము ప్రసన్నముగా ఉన్నది. అంతేగాక అతడు మిక్కిలి సంతసముతో పచింపినాడు. ఆ మహావీరునినోట అసత్యము రాదు." (33)

మిక్కిలి బుద్ధిశాలియు, వాయుపుత్త్రుడును ఐన హనుమంతుడు మహావీరులైన ఆరామలక్ష్మణులను వెంటనిడుకొని, వానరరాజైన సుగ్రీవుని కడకు బయలుదేఱెను. పిమ్మట ఆ హనుమంతుడు భిక్షురూపమును పరిత్యజించి, తన వానరరూపమును పొందెను. అనంతరము అతడు ఆవీరులను తన బుజములపై చేర్చుకొని ముందునకు సాగెను. (34-35)

మిగుల సుప్రసిద్ధుడును, గొప్పపరాక్రమశాలియు, వాయుకుమారుడును, పవిత్రాత్ముడును, వానరశ్రేష్ఠుడును ఐన ఆంజనేయుడు తాను ధన్యుడైనట్లు ఆనందించెను. పిదప ఆరామలక్ష్మణులతో గిరిశ్రేష్ఠమైన ఋశ్యమూక పర్వతమునకు చేరెను. (36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే చతుర్థస్సర్గః (4)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నాలుగవసర్గము

— ✻ ✻ ✻ —

5. ఐదవసర్గము

రామలక్ష్మణుల రాకకు మిగుల సంతసించి, సుగ్రీవుడు వారికి అతిథి మర్యాదలు నెఱపుట - అగ్నిసాక్షిగా రామసుగ్రీవులు మిత్రులగుట - వాలి తనకు చేసిన అపకారమును వివరించి, అతనిని వధింపుమని సుగ్రీవుడు శ్రీరాముని వేడుకొనుట - ఆ ప్రభువు వానరేంద్రునకు అభయమిచ్చుట -

ఋశ్యమూకాత్తు హనుమాన్ గత్వా తు మలయం గిరిమ్।
ఆచచక్షే తదా వీరౌ కపిరాజాయ రాఘవౌ॥ 1

అంతట హనుమంతుడు ఋశ్యమూక పర్వతమునుండి మలయగిరికిచేరి,[1] సుగ్రీవుని రామలక్ష్మణులున్న ప్రదేశమునకు దీసికొనివచ్చి, ఆకపిరాజునకు వారినిగూర్చి చెప్పసాగెను. (1)

అయం రామో మహాప్రాజ్ఞః సంప్రాప్తో దృఢవిక్రమః।
లక్ష్మణేన సహ భ్రాత్రా రామోఽయం సత్యవిక్రమః॥ 2

ఇక్ష్వాకూణాం కులే జాతో రామో దశరథాత్మజః।
ధర్మే నిగదితశ్చైవ పితుర్నిర్దేశపారగః॥ 3

తస్యాస్య వసతోఽరణ్యే నియతస్య మహాత్మనః।
రావణేన హృతా భార్యా స త్వాం శరణమాగతః॥ 4

"మహాత్ముడైన శ్రీరాముడు తన తమ్ముడైన లక్ష్మణునితోగూడి ఇచటికి విచ్చేసినాడు. ఈయన చెక్కుచెదరని పరాక్రమశాలి. ఈ మహావీరుడు నీ శత్రువైన వాలిని పరిమార్పగల సమర్థుడు. ఇతడు ఇక్ష్వాకు వంశమునకు చెందినవాడు, దశరథమహారాజుయొక్క కుమారుడు. స్వధర్మాచరణమునందు సుప్రసిద్ధుడు. తండ్రియాజ్ఞను పాలించుటలో సాటిలేనివాడు. నియమనిష్ఠలతో అరణ్యమునందు ఈ మహాత్ముడు నివసించుచుండగా, ఈయన భార్యను రావణుడు అపహరించుకొనిపోయెను. అందువలన ఇతడు నీసహాయమును గోరి ఇచటికి వచ్చినాడు. (2-4)

రాజసూయాశ్వమేధైశ్చ వహ్నిర్యేనాభితర్పితః।
దక్షిణాశ్చ తథోత్సృష్టా గావః శతసహస్రశః॥ 5

తపసా సత్యవాక్యేన వసుధా యేన పాలితా।
స్త్రీహేతోస్తస్య పుత్రోఽయం రామస్త్వాం శరణం గతః॥ 6

ఈయనతండ్రియైన దశరథమహారాజు రాజసూయ - అశ్వమేధయాగములనొనర్చి, అగ్నిదేవుని తృప్తిపఱచెను. బ్రాహ్మణులకు సమృద్ధిగా దక్షిణలను సమర్పించెను. లక్షలాదిగోవులను దానము చేసెను. సత్యసంధుడైన ఆమహారాజు తనతపశ్శక్తిచే ప్రజారంజకముగా కోసల రాజ్యమును పరిపాలించెను. ఆప్రభువు తనభార్యయగు కైకేయికి ఇచ్చిన వరముల కారణముగా ఈశ్రీరాముడు వనములకు ఏతెంచెను. అట్టి ఈ శ్రీరాముడు నీసహాయమును గోరి ఇచటికి వచ్చినాడు. (5-6)

భవతా సఖ్యకామౌ తౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ।
ప్రతిగృహ్యార్చయస్వైతౌ పూజనీయతమావుభౌ॥ 7

సోదరులైన ఆరామలక్ష్మణులు నీతోమైత్రిని గోరుచున్నారు. ఆ ఇరువురును మనకు ఎంతయు పూజ్యులు. కావున వారికి ఎదురేగి, అతిథిమర్యాదలను నెఱపుము." (7)

శ్రుత్వా హనుమతో వాక్యం సుగ్రీవో హృష్టమానసః।
భయం చ రాఘవాద్ఘోరం ప్రజహౌ విగతజ్వరః॥ 8

హనుమంతుని మాటలకు సుగ్రీవునిమనస్సు సంతోషముతో నిండిపోయెను. రాముని చూచుటవలన అతనికి కలిగిన భయము మటుమాయమయ్యెను. అతని దుఃఖము దూరమయ్యెను. (8)

స కృత్వా మానుషం రూపం సుగ్రీవః ప్లవగర్షభః।
దర్శనీయతమో భూత్వా ప్రీత్యా ప్రోవాచ రాఘవమ్॥ 9

అంతట వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు చూడముచ్చటైన మనుష్యరూపమును ధరించి, శ్రీరాముని సమీపించి, ప్రీతితో ఇట్లు నుడివెను. (9)

1) సుగ్రీవుడు రామలక్ష్మణులను చూచి మిగుల భయపడి, ఒక్క గంతులో ఋశ్యమూక పర్వతమునుండి మలయగిరికి (ఋశ్యమూక పర్వతమునందే కొంతదూరమున గల ప్రదేశమునకు) చేరియుండెను.

భవాన్ ధర్మవినీతశ్చ విక్రాంతః సర్వవత్సలః।
ఆఖ్యాతా వాయుపుత్రేణ తత్త్వతో మే భవద్గుణాః। 10

తన్మమైవైష సత్కారో లాభశ్చైవోత్తమః ప్రభో।
యత్ త్వమిచ్ఛసి సౌహార్దం వానరేణ మయా సహ। 11

రోచతే యది వా సఖ్యం బాహురేషః ప్రసారితః।
గృహ్యతాం పాణినా పాణిః మర్యాదా బధ్యతాం ధ్రువా। 12

ఏతత్తు వచనం శ్రుత్వా సుగ్రీవేణ సుభాషితం।
స ప్రహృష్టమనా హస్తం పీడయామాస పాణినా। 13

హృద్యం సౌహృదమాలంబ్య పర్యష్వజత పీడితమ్। 14

తతో హనూమాన్ సంత్యజ్య భిక్షురూపమరిందమః।
కాష్ఠయోః స్వేన రూపేణ జనయామాస పావకమ్। 15

దీప్యమానం తతో వహ్నిం పుష్పైరభ్యర్చ్య సత్కృతమ్।
తయోర్మధ్యేఽథ సుప్రీతో నిదధే సుసమాహితః। 16

తతోఽగ్నిం దీప్యమానం తౌ చక్రతుశ్చ ప్రదక్షిణమ్।
సుగ్రీవో రాఘవశ్చైవ వయస్యత్వమ్ ఉపాగతౌ। 17

తతః సుప్రీతమనసౌ తావుభౌ హరిరాఘవౌ।
అన్యోఽన్యమ్ అభివీక్షంతౌ న తృప్తిముపజగ్మతుః। 18

త్వం వయస్యోఽసి మే హృద్యో హ్యేకం దుఃఖం సుఖం చ నౌ।
సుగ్రీవో రాఘవం వాక్యమ్ ఇత్యువాచ ప్రహృష్టవత్। 19

తతః స పర్ణబహుళాం ఛిత్త్వా శాఖాం సుపుష్పితామ్।
సాలస్యాస్తీర్య సుగ్రీవో నిషసాద సరాఘవః। 20

లక్ష్మణాయాథ సంహృష్టో హనుమాన్ ప్లవగర్షభః।
శాఖాం చందనవృక్షస్య దదౌ పరమపుష్పితామ్। 21

"ఓ పూజ్యుడా! నీవు ధర్మనిరతుడవు. (ధనుర్విద్యాకుశలుడవు) గొప్పపరాక్రమశాలివి. సమస్త ప్రాణులయెడలను దయ చూపెడివాడవు- అని నీయుదాత్తగుణములనుగూర్చి వాయుసుతుడైన హనుమంతుడు విపులముగా తెల్పియుండెను. (10)

ఓ ప్రభూ! నీవంటి మహాత్ముడు వానరుడనైన నాతో మైత్రిని గోరుట నిజముగా నా పాలిటి గొప్ప సత్కారము. ఇది నాకు పరమశ్రేయోదాయకము. ఇదిగో నాస్నేహహస్తమును చాచుచున్నాను. మీరు మనస్ఫూర్తిగా మైత్రిని కోరుకొనుచున్నచో మీ చేతితో నాచేతిని కలుపుడు. దీనివలన మనమైత్రీబంధము విడదీయరానిదగును." (11-12)

సుగ్రీవుడు పలికిన శుభవచనములను విని, శ్రీరాముని మనస్సు సంతోషముతో పొంగిపోయెను. వెంటనే అతడు తన హస్తముతో వానిహస్తమును పట్టుకొనెను. నిర్మలమైన ఆమైత్రిని పురస్కరించుకొని, శ్రీరాముడు అతనిని గాఢముగా కౌగిలించుకొనెను. (13-14)

అంతట శత్రువులను పరిమార్చుటలో సమర్థుడైన హనుమంతుడు భిక్షురూపమును త్యజించి,[1] తన వానరరూపమును స్వీకరించెను. మిక్కిలి చేవగల రెండు జమ్మి కఱ్ఱలతో మథించి, అగ్నిని సిద్ధముచేసెను. పిదప ఆవాయుసుతుడు ప్రజ్వలించుచున్న ఆఅగ్నిని పూవులు మున్నగువానితో నిష్ఠతో అర్చించి పరమసంతోషముతో దానిని ఆఇరువురిమధ్యనుంచెను. (15-16)

అప్పుడు రామసుగ్రీవులు పరస్పరము హస్తములను పట్టుకొని, ప్రజ్వలించుచున్న ఆఅగ్నికి ప్రదక్షిణముల నొనర్చిరి. అట్లు వారు అగ్నిసాక్షిగా మిత్రులైరి. (17)

స్నేహబంధముతో మిగుల సంబరపడుచున్న రామసుగ్రీవులు సౌహార్దముతో ఒకరినొకరు ఎంతగా చూచుకొనినను వారికి తనివి దీరకపోయెను. (18)

"ఓ రాఘవా! నీవు ఈనాడు నాకు ప్రాణమిత్రుడవైతివి. దీనివలన నా హృదయము ఉప్పొంగిపోవుచున్నది. ఇప్పటినుండి సుఖదుఃఖములలో మనము ఇరువురము ఒక్కటియే" అని సుగ్రీవుడు పట్టరాని సంతోషమున శ్రీరామునితో నుడివెను. (19)

అంతట సుగ్రీవుడు బాగుగా ఆకులతో, పూవులతో నిండియున్న మద్దిచెట్టుకొమ్మను విఱిచి, దానిని ఒక ఆసనముగాచేసి, శ్రీరామునితోగూడి దానిపై కూర్చుండెను. పిమ్మట హనుమంతుడు విరబూసియున్న చందనవృక్షము యొక్క ఒక కొమ్మను సంతోషముతో తీసికొనివచ్చి, లక్ష్మణునికై ఆసనమును ఏర్పఱచెను. (20-21)

1) హనుమంతుడు రామలక్ష్మణులను తన భుజములపై తీసికొని వచ్చునప్పుడు భిక్షురూపమును వీడి వానరరూపమును ధరించినను, వారిని ఋశ్యమూకపర్వతమునకు చేర్చిన పిమ్మట, సుగ్రీవునకు విశ్వాసమును కలిగించుటకై అతడు మఱల భిక్షురూపమును దాల్చినట్లు మనము గ్రహింపవలెను.

తతః ప్రహృష్టః సుగ్రీవః శ్లక్ష్ణం మధురయా గిరా।
ప్రత్యువాచ తదా రామం హర్షవ్యాకులలోచనః। 22

అంతట సుగ్రీవుడు మిగుల సంతసించినవాడై శ్రీరాముని ప్రశంసించుచు మృదుమధురముగా ఇట్లు పలికెను. ఆసమయమున శ్రీరామునిఅండదండలు లభించినందులకు సంతోషమూ, వాలి భయము పీడనందున వ్యాకులపాటూ సుగ్రీవునికన్నులలో స్పష్టముగా గోచరించుచుండెను. (22)

అహం వినిక్కృతో రామ చరామీహ భయార్దితః।
హృతభార్యో వనే త్రస్తో దుర్గమేతదుపాశ్రితః। 23

"శ్రీరామా! మా అన్నయగు వాలి నన్ను వంచించి నా రాజ్యమును, నాభార్యనుగూడ దౌర్జన్యముతో లాగికొనెను. నేను నిరంతరము భయముతో వణికిపోవుచున్నాను. దుర్గమమైన ఈ వనమునకు వాలి రాజాలడుగాన ఇది సురక్షితమని భావించి, ఇచట చరించుచున్నాను. (23)

సోఽహం త్రస్తో వనే భీతో వసామ్యుద్భ్రాంతచేతనః।
వాలినా నికృతో భ్రాత్రా కృతవైరశ్చ రాఘవ। 24

ఓ రాఘవా! మాఅన్న నాతో వైరమువూని, నన్ను అచటినుండి పాఱద్రోలెను. అట్లు మిగుల భయకంపితుడనై, మానసికాందోళనకు లోనై ఈ వనమున వసించుచుంటిని. (24)

వాలినో మే మహాభాగ భయార్తస్యాభయం కురు।
కర్తుమర్హసి కాకుత్స్థ భయం మే న భవేద్యథా। 25

ఓ మహానుభావా! వాలివలన నేను మిగుల భయార్తుడనై యున్నాను. ఓ కాకుత్స్థా! నాకు అభయమిచ్చి, నాలోని భయమును పోగొట్టుము." (25)

ఏవముక్తస్తు తేజస్వీ ధర్మజ్ఞో ధర్మవత్సలః।
ప్రత్యభాషత కాకుత్స్థః సుగ్రీవం ప్రహసన్నివ। 26

సుగ్రీవుడు ఇట్లు పలుకగా మిక్కిలి బలశాలియు, ధర్మజ్ఞుడును, ధర్మనిరతుడును ఐన శ్రీరాముడు చిఱునవ్వుతో అతనికి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (26)

ఉపకారఫలం మిత్రం విదితం మే మహాకపే।
వాలినం తం వధిష్యామి తవ భార్యాపహారిణమ్। 27

అమోఘాః సూర్యసంకాశా మమైతే నిశితాః శరాః।
తస్మిన్ వాలిని దుర్వృత్తే నిపతిష్యంతి వేగితాః। 28

కంకపత్రప్రతిచ్ఛన్నా మహేంద్రాశనిసన్నిభాః।
తీక్ష్ణాగ్రా ఋజుపర్వాణః సరోషా భుజగా ఇవ। 29

"ఓ కపీశ్వరా! ఆపదలలో ఆదుకొనువాడేగదా మిత్రుడు. నీభార్యను అపహరించిన వాలిని తప్పక తుదముట్టించెదను. నాశరములు వాడియైనవి. సూర్యునివలె శక్తిమంతములు. రణరంగమున వాటికి తిరుగులేదు. గ్రద్ద ఈకలచే కట్టబడినవి. ఇంద్రునివజ్రాయుధముతో సమానమైనవి. ఇవి పదునుతో మొనదేలియున్నవి, వంకరలేని కణుపులు గలవి. సర్పములవలె భయంకరములైనవి, అట్టి నా బాణములు వేగముగా సాగుచు దుర్మార్గుడైన వాలిని దెబ్బతీయుగలవు. (27-29)

తమద్య వాలినం పశ్య క్రూరైరాశీవిషోపమైః।
శరైర్వినిహతం భూమౌ వికీర్ణమివ పర్వతమ్। 30

మహాసర్పమువలె తీక్ష్ణములైన నా బాణములధాటికి వాలి నిహతుడై పర్వతమువలె నేలగూలుచుండగా నేడు చూడగలవు." (30)

స తు తద్వచనం శ్రుత్వా రాఘవస్యాత్మనో హితం।
సుగ్రీవః పరమప్రీతః సుమహద్వాక్యమబ్రవీత్। 31

శ్రీరాముడు పలికిన మాటలను వినిన సుగ్రీవుడు అవి తనకు హితకరములే యగుటవలన మిగుల సంతోషించెను. పిమ్మట అతడు ఆరాఘవునితో ఇట్లనెను. (31)

తవ ప్రసాదేన నృసింహ రాఘవ
ప్రియాం చ రాజ్యం చ సమాప్నుయామహం।
తథా కురు త్వం నరదేవ వైరిణం
యథా నిహంస్యద్య రిపుం మమాగ్రజమ్। 32

"నరశ్రేష్ఠుడవైన ఓ రాఘవా! నీయనుగ్రహమువలన నా భార్యను, రాజ్యమును పొందబోవుచున్నాను. కనుక ఓ పురుషోత్తమా! తగునుపాయమును ఆలోచించి, నాకు బద్ధశత్రువైన మాఅన్నను నేడే హతమార్చుము." (32)

సీతాకపీంద్రక్షణదాచరాణాం
రాజీవహేమజ్వలనోపమాని ।
సుగ్రీవరామప్రణయప్రసంగే
వామాని నేత్రాణి సమం స్ఫురంతి ॥ 33

శ్రీరామసుగ్రీవులు పరస్పరప్రేమతో మైత్రీ సంభాషణ చేయుచున్నప్పుడు కమలమువంటి సీతాదేవి యొక్క ఎడమనేత్రము, బంగారువన్నెగల వాలియొక్క ఎడమకన్ను, అగ్ని జ్వాలలవంటి రావణుని వామ నేత్రములు ఒక్కసారిగా అదిరినవి. (33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే పంచమస్సర్గః (5)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఐదవసర్గము

— ∗ ∗ ∗ —

6. ఆఱవసర్గము

'సీతాపహరణ వృత్తాంతమును హనుమంతుని ద్వారా వినియుంటిని. ఆ దేవి జాడను దెలిసికొని, ఆమెను తీసికొనివచ్చి నీకు అప్పగించెదను' అని సుగ్రీవుడు శ్రీరామునకు మాట ఇచ్చుట - అతడు జానకీదేవి నగలమూటను దెచ్చి వారికి సమర్పించుట - 'ఆ నగలు సీతాదేవియే' అని తెలిసికొనిన పిమ్మట శ్రీరాముడు రావణుని సపరివారముగా చంపివేసెదనని పల్కుట

పునరే వాఽబ్రవీత్ ప్రీతో రాఘవం రఘునందనమ్ । 1

మిగుల సంతోషముతోనున్న సుగ్రీవుడు రఘువంశజుడైన శ్రీరామునితో మఱల ఇట్లునుడివెను. (1)

అయమాఖ్యాతి మే రామ సచివో మంత్రిసత్తమః ।
హనుమాన్ యన్నిమిత్తం త్వం నిర్జనం వనమాగతః ॥ 2

"ఓ రామా! ఈ హనుమంతుడు ఎల్లప్పుడును నాకు తోడుగానుండువాడు, మంత్రులలో ముఖ్యుడు. మీరు ఈ వనమునకు వచ్చిన కారణమును ఇతడు ఇంతకుముందే నాతో చెప్పియున్నాడు. (2)

లక్ష్మణేన సహ భ్రాత్రా వసతశ్చ వనే తవ ।
రక్షసాఽపహృతా భార్యా మైథిలీ జనకాత్మజా ॥ 3

త్వయా వియుక్తా రుదతీ లక్ష్మణేన చ ధీమతా ।
అంతరప్రేప్సునా తేన హత్వా గృధ్రం జటాయుషమ్ ॥ 4

జనకరాజుకుమార్తెయు, నీ భార్యయు అగు సీతాదేవి తోడను, నీ సోదరుడగు లక్ష్మణునితోడనుగూడి నీవు వనవాసమును కొనసాగించుచుండగా ప్రజ్ఞాశాలులైన మీ అన్నదమ్ములిరువురును సీతచెంతలేనప్పుడు, అదనుకొఱకు వేచియున్న రావణాసురుడు ఒంటరిగా ఉన్న ఆజానికిని అపహరించుకొని పోసాగెను. అప్పుడు ఆమె ఏడ్చుచుండగా విషయమును గ్రహించిన 'జటాయువు' అను గృధ్రము అతనిని ఎదుర్కొనెను. దానిని ఆరాక్షసుడు చంపివైచెను. అని ఈ వాయుసుతుడు తెలిపియుండెను. (3-4)

భార్యావియోగజం దుఃఖమ్ అచిరాత్ త్వం విమోక్ష్యసే ।
అహం తామ్ ఆనయిష్యామి నష్టాం వేదశ్రుతీ మివ ॥ 5

రసాతలే వా వర్తంతీం వర్తంతీం వా నభస్తలే ।
అహమానీయ దాస్యామి తవ భార్యామ్ అరిందమ ॥ 6

ఇదం తథ్యం మమ వచః త్వమవేహి చ రాఘవ ।
న శక్యా సా జరయితుమ్ అపి సేంద్రైః సురాసురైః ॥ 7

తవ భార్యా మహాబాహో భక్ష్యం విషకృతం యథా ॥ 8

ఓ రామా! భార్యయొక్క ఎడబాటువలన కలిగిన దుఃఖమునుండి నీవు త్వరలోనే బయటపడగలవు. మధుకైటభ రాక్షసులు అపహరించిన వేదములను శ్రీహరివలె నేను సీతాదేవిని తీసికొనివచ్చెదను. శత్రువులను సంహరించుటలో దక్షుడవైన ఓ రఘువీరా! పాతాళమునగాని, ఆకాశమునగాని, మఱిఎక్కడనున్నను నీ భార్యను గొనివచ్చి నీకు అప్పగించెదను. ఓ రఘునందనా! నా మాటలు ముమ్మాటికిని నిజమని నమ్ముము. గొప్పభుజబలశాలివైన ఓ రాఘవా! ఇంద్రాది దేవతలుగాని, అసురులుగాని విషాహారమునువలె నీ భార్యను గ్రహింపజాలరు (విషాహారము ఎవ్వరికిని జీర్ణము కానట్లు సీతాదేవి ఎంతటివారికిని వశముకాదు.) (5-8)

త్యజ శోకం మహాబాహో తాం కాంతామ్ ఆనయామి తే।
అనుమానాత్తు జానామి మైథిలీ సా న సంశయః। 9

హ్రియమాణా మయా దృష్టా రక్షసా క్రూరకర్మణా।
క్రోశంతీ రామ రామేతి లక్ష్మణేతి చ విస్వరమ్।
స్ఫురంతీ రావణస్యాంకే పన్నగేంద్రవధూర్యథా। 10

ఆత్మనా పంచమం మాం హి దృష్ట్వా శైలతటే స్థితమ్।
ఉత్తరీయం తయా త్యక్తం శుభాన్యాభరణాని చ। 11

తాన్యస్మాభిః గృహీతాని నిహితాని చ రాఘవ।
ఆనయిష్యామ్యహం తాని ప్రత్యభిజ్ఞాతుమర్హసి। 12

తమబ్రవీత్ తతో రామః సుగ్రీవం ప్రియవాదినమ్।
ఆనయస్వ సఖే శీఘ్రం కిమర్థం ప్రవిలంబసే। 13

ఏవముక్తస్తు సుగ్రీవః శైలస్య గహనాం గుహామ్।
ప్రవివేశ తతః శీఘ్రం రాఘవప్రియకామ్యయా। 14

ఉత్తరీయం గృహీత్వా తు శుభాన్యాభరణాని చ।
ఇదం పశ్యేతి రామాయ దర్శయామాస వానరః। 15

తతో గృహీత్వా తద్వాసః శుభాన్యాభరణాని చ।
అభవద్బాష్పసంరుద్ధో నీహారేణేవ చంద్రమాః। 16

సీతాస్నేహప్రవృత్తేన స తు బాష్పేణ దూషితః।
హా ప్రియేతి రుదన్ ధైర్యమ్ ఉత్సృజ్య న్యపతత్ క్షితౌ। 17

హృది కృత్వా తు బహుశః తమలంకారముత్తమమ్।
నిశశ్వాస భృశం సర్పో బిలస్థ ఇవ రోషితః। 18

అవిచ్ఛిన్నాశ్రువేగస్తు సౌమిత్రిం వీక్ష్య పార్శ్వతః।
పరిదేవయితుం దీనం రామః సముపచక్రమే। 19

పశ్య లక్ష్మణ వైదేహ్యా సంత్యక్తం హ్రియమాణయా।
ఉత్తరీయమిదం భూమౌ శరీరాద్భూషణాని చ। 20

శాద్వలిన్యాం ధ్రువం భూమ్యాం సీతయా హ్రియమాణయా।
ఉత్సృష్టం భూషణమిదం తథారూపం హి దృశ్యతే। 21

ఓ మహాబాహూ! ఒకనాడు క్రూరాత్ముడైన ఒక రాక్షసుడు ఒక స్త్రీని తీసికొని పోవుచుండగా నేను చూచితిని. నా ఊహాప్రకారము ఆమె మిథిలానగరపు రాకుమారియైన సీతాదేవియే. ఇందులకు సందేహము లేదు. ఏలనన ఆమె జీరవోయిన కంఠముతో (ఆర్తస్వరముతో) 'రామా! రామా! లక్ష్మణా! లక్ష్మణా! అని బిగ్గఱగా ఏడ్చుచు, రావణునిఅంకస్థలమునందు విలవిలలాడుచుమెలికలు దిరుగుచున్న ఆడు సర్పము వలె ఒప్పుచుండెను. కనుక ఆమెను తీసికొనివచ్చి నీకు అప్పగించెదను. శోకింపకుము. (9-10)

అప్పుడు నేను నానలుగురు మంత్రులతోగూడి ఈ కొండపైనుంటిని. ఆమె నన్ను చూచి, తన ఉత్తరీయమును, నగలను (ఉత్తరీయమునందు గట్టిన నగలమూటను) ఇచట జాఱవిడిచినది. ఓ రామచంద్రా! నేను ఆఉత్తరీయమును, ఆభరణములను (ఆనగలమూటను) తీసికొని భద్రముగా ఉంచితిని. వాటిని ఇచటికి తీసికొనివచ్చెదను. వాటిని నీవు గుర్తింపగలవు." (11-12)

అంతట శ్రీరాముడు ప్రియవచనములను పలుకుచున్న సుగ్రీవునితో 'మిత్రమా! ఇంక ఆలస్యమెందులకు? వెంటనే వాటిని తీసికొనిరమ్ము-' అని పలికెను. (13)

శ్రీరాముడు ఇట్లనుడువగా సుగ్రీవుడు ఇతరులకు చొఱరాని ఒక కొండగుహలో ప్రవేశించెను. రామునకు ప్రియమును చేకూర్చుటకై వెంటనే అతడు సీతాదేవి జాఱవిడిచిన నగలమూటను తీసికొనివచ్చి, 'వీటిని పరిశీలింపుము' అని పలికి వాటిని రామునకు చూపించెను. (14-15)

అప్పుడు ఆరాఘవుడు పవిత్రములైన ఆభరణములుగల ఆవస్త్రమును దీసికొనెను. అంతట ఆయననేత్రములు అశ్రువులు క్రమ్ముకొనుటచే మంచుచే కప్పబడిన చంద్రునివలె మసకబాఱెను. సీతపైగల గాఢానురాగముతో కనులలో నీరునిండగా రాముడు 'హా ప్రియా! అని విలపించుచు ధైర్యము సడలి నేలపై పడిపోయెను. (16-17)

అనేకములైన ఆమేలి అలంకారములను రాముడు తన హృదయమునకు హత్తుకొని, పుట్టలోని పాము రోషముతో బుసకొట్టినట్లు నిట్టూర్పులు విడిచెను. (18)

సంతతధారగా కన్నీరుగార్చుచున్న శ్రీరాముడు తన ప్రక్కన దైన్యముతో నిలబడియున్న సౌమిత్రిని జూచి విలపింపసాగెను. "ఓ లక్ష్మణా! అపహరణకు గుఱియైన వైదేహి భూమిపై వదలిన శరీరాభరణములను, ఉత్తరీయమును చూడుము. రావణునిచే తీసికొనిపోబడుచున్న జానకి వదలిన ఈ నగలు పచ్చిక బయలునందు పడుటచే చెక్కుచెదరకయున్నవి. కనుక ఇవి ఆమె యొక్క ఆభరణములే" అని విలపించెను. (19-21)

ఏవముక్తస్తు రామేణ లక్ష్మణో వాక్యమబ్రవీత్।
నాహం జానామి కేయూరే నాహం జానామి కుండలే।
నూపురే త్వభిజానామి నిత్యం పాదాభివందనాత్। 22

తతః స రాఘవో దీనః సుగ్రీవమిదమబ్రవీత్। 23

బ్రూహి సుగ్రీవ కం దేశం హ్రియంతీ లక్షితా త్వయా।
రక్షసా రౌద్రరూపేణ మమ ప్రాణైః ప్రియా ప్రియా। 24

క్వ వా వసతి తద్రక్షో మహద్వ్యసనదం మమ।
యన్నిమిత్తమ్ అహం సర్వాన్ నాశయిష్యామి రాక్షసాన్। 25

హరతా మైథిలీం యేన మాం చ రోషయతా భృశం।
ఆత్మనో జీవితాంతాయ మృత్యుద్వారమ్ అపావృతమ్। 26

మమ దయితతరా హృతా వనాంతాత్
రజనిచరేణ విమథ్య యేన సా।
కథయ మమ రిపుం త్వమద్య వై
ప్లవగపతే యమసాదనం నయామి। 27

రాముడిట్లు పలుకగా లక్ష్మణుడు "అన్నా! ఈ కేయూరములను, కుండలములను నేను ఎఱుగను. కాని నిత్యము మావదినెకు పాదాభివందనము చేయుచుండుటవలన ఈ కాలి అందెలను మాత్రము ఆమెవేయుని గుర్తింపుచున్నాను." అని నుడివెను. (22)

అంతట రఘునందనుడు దీనుడై సుగ్రీవునితో ఇట్లనెను. "ఓ సుగ్రీవా! నా ప్రాణములకు ప్రాణమైన సీతాదేవిని దుర్మార్గుడైన ఆరాక్షసుడు అపహరించుకొని పోవుటను నీవు చూచితివి. అదిసరే! ఆమెను దీసికొని అతడు ఏదిశగా సాగిపోయెనో తెల్పుము. ఇంతకును ఆరాక్షసుడు ఎక్కడ ఉండవచ్చును? నాకు ఇంతటి దుఃఖమును తెచ్చిపెట్టిన ఆక్రూరాత్ముని, వానికి తోడగు రాక్షసులను అందఱిని చంపివేసెదను. ఆదుష్టుడు సీతాదేవిని అపహరించి, నా తీవ్రమైన కోపమునకు కారకుడయ్యెను. ఆవిధముగా అతడు తనజీవితము అంతమగుటకు మృత్యుద్వారమును తానే తెఱచెను.(23-26)

ఓ కపీశ్వరా! ఆనిశాచరుడు నన్ను వంచించి, నాకు అత్యంత ప్రేమపాత్రురాలైన సీతాదేవిని వనమునుండి అపహరించుకొని పోయెను. వాడెవడో? తెలుపుము. ఆశత్రువును ఇప్పుడే మృత్యుముఖమునకు చేర్చెదను."(27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే షష్ఠఃసర్గః (6)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఆఱవసర్గము

— * * * —

7. ఏడవసర్గము

సుగ్రీవుడు విరహశోకములో ఉన్న శ్రీరాముని ఓదార్చుట - శ్రీరాముడు అతనిమాటలకు ఊఱట చెంది, 'వాలిని చంపెదను' - అని మాట ఇచ్చుట

ఏవముక్తస్తు సుగ్రీవో రామేణార్తేన వానరః।
అబ్రవీత్ ప్రాంజలిర్వాక్యం సబాష్పం బాష్పగద్గదః। 1

న జానే నిలయం తస్య సర్వథా పాపరక్షసః।
సామర్థ్యం విక్రమం వాపి దౌష్కులేయస్య వా కులమ్। 2

సత్యం తే ప్రతిజానామి త్యజ శోకమరిందమ।
కరిష్యామి తథా యత్నం యథా ప్రాప్స్యసి మైథిలీమ్। 3

శ్రీరాముడు శోకార్తుడై ఇట్లు పలికిన పిమ్మట వానరరాజైన సుగ్రీవుడు ఆప్రభువునకు నమస్కరించి, కన్నీరు గార్చుచు డగ్గుత్తికతో ఈ విధముగా వచించెను. (1)

"ఓ రామా! పరస్త్రీని అపహరించుటయనెడి పాపమునకు పాల్పడిన ఆక్రూరరాక్షసునినివాసస్థానమును గూర్చి నేను ఏమాత్రము ఎఱుగను. వాడు జన్మించిన ఆదుష్టవంశము ఏదియో? వానిశక్తిసామర్థ్యములెట్టివో? నాకు తెలియదు. కాని ఓ శత్రుసంహారకా! సీతాదేవిని తీసికొనివచ్చుటకై తగిన ప్రయత్నమును మాత్రము తప్పక చేసెదను- అని ప్రమాణపూర్వకముగా చెప్పుచున్నాను. కనుక ఇక నీవు శోకింపవలదు. పూర్తిగా నాబలపరాక్రమములను

రావణం సగణం హత్వా పరితోష్యాత్మపౌరుషం।
తథాఽస్మి కర్తా న చిరాత్ యథా ప్రీతో భవిష్యసి। 4

అలం వైక్లబ్యమాలంబ్య ధైర్యమ్ ఆత్మగతం స్మర।
త్వద్విధానామ్ అసదృశమ్ ఈదృశం విద్ధి లాఘవమ్। 5

మయాపి వ్యసనం ప్రాప్తం భార్యాహరణజం మహత్।
న చాహమేవం శోచామి న చ ధైర్యం పరిత్యజే। 6

నాఽహం తామనుశోచామి ప్రాకృతో వానరోఽపి సన్।
మహాత్మా చ వినీతశ్చ కిం పునర్ధృతిమాన్ భవాన్। 7

బాష్పమాపతితం ధైర్యాత్ నిగ్రహీతుం త్వమర్హసి।
మర్యాదాం సత్త్వయుక్తానాం ధృతిం నోత్స్రష్టుమర్హసి। 8

వ్యసనే వాఽర్థకృచ్ఛ్రే వా భయే వా జీవితాంతకే।
విమృశన్ వై స్వయా బుద్ధ్యా ధృతిమాన్ నాఽవసీదతి। 9

బాలిశస్తు నరో నిత్యం వైక్లబ్యం యోఽనువర్తతే।
స మజ్జత్యవశః శోకే భారాక్రాంతేవ నౌర్జలే। 10

ఏషోఽంజలిర్మయా బద్ధః ప్రణయాత్ త్వాం ప్రసాదయే।
పౌరుషం శ్రయ శోకస్య నాఽంతరం దాతుమర్హసి। 11

యే శోకమనువర్తంతే న తేషాం విద్యతే సుఖమ్।
తేజశ్చ క్షీయతే తేషాం న త్వం శోచితుమర్హసి। 12

శోకేనాఽభిప్రపన్నస్య జీవితే చాపి సంశయః।
స శోకం త్యజ రాజేంద్ర ధైర్యమాశ్రయ కేవలమ్। 13

హితం వయస్యభావేన బ్రూమి నోపదిశామి తే।
వయస్యతాం పూజయన్ మే న త్వం శోచితుమర్హసి। 14

మధురం సాంత్వితస్తేన సుగ్రీవేణ స రాఘవః।
ముఖమశ్రుపరిక్లిన్నం వస్త్రాంతేన ప్రమార్జయత్। 15

ప్రకృతిస్థస్తు కాకుత్స్థః సుగ్రీవవచనాత్ ప్రభుః।
సంపరిష్వజ్య సుగ్రీవమ్ ఇదం వచనమబ్రవీత్। 16

ప్రదర్శించి, రావణుని సపరివారముగా హతమార్చెదను. ఆ విధముగా త్వరలోనే నిన్ను సంతోషపఱచి నేను కృతకృత్యుడనయ్యెదను. (2-4)

ఓ ప్రభూ! ఇక ఈ దైన్యమును వీడుము. నీ సహజమైన ధైర్యమును వహింపుము. నీవంటి మహావీరులకు ఇట్టి బేలతనము తగదు. నా భార్యయు అపహరణకులోనైనది. ఆవిధమైన దుఃఖము నాకును వచ్చిపడినది. కాని నేను ఈ విధముగా శోకించుటలేదు. ధైర్యమును వీడలేదు. నేను వానరుడను మూఢుడను, ఐనప్పటికిని నాభార్యనుగూర్చి పరితపించుట లేదు. పూజ్యుడవైన నీవు మహాత్ముడవు, గురువులకడ సుశిక్షితుడవు, ధైర్యశాలివి. అట్టి నీవు ఇట్లు దుఃఖించుచుంటివేల? (5-7)

సంతతధారగా స్రవించుచున్న కన్నీటిని అపుకొనుము. సత్త్వగుణసంపన్నులు సహజమైన ధైర్యమును విడువరాదు. దుఃఖమునందుగాని, ఆర్థికనష్టములయందుగాని, భయస్థితి ఏర్పడినప్పుడుగాని, ప్రాణములకు ముప్పువచ్చినప్పుడుగాని ధైర్యముగలవాడు తన బుద్ధిబలముతో బాగుగా ఆలోచించుకొని నిస్పృహకులోనుగాడు. మూర్ఖుడు మాత్రమే అనుక్షణము దైన్యమునకు గుఱియగుచుండును. బరువెక్కిన నౌక నీటిలో మునిగినట్లు అతడు (నిగ్రహములేనివాడై) శోకమునకు వశుడగును. (8-10)

ప్రభూ! భక్తితో అంజలిఘటించి, నిన్నువేడుకొనుచున్నాను. నన్ను అనుగ్రహింపుము. ధైర్యమును వహింపుము. శోకమును దరిజేరనీయకుము. ఎల్లప్పుడును శోకించువారికి సుఖము శూన్యము. వారి తేజస్సు క్షీణించును. కావున శోకమును దూరమొనర్పుము. (11-12)

పూర్తిగా శోకార్తుడైన వానికి ప్రాణములు నిలుచుటయు కష్టమే. కాబట్టి ఓ రాజేంద్రా! శోకమునుండి బయటపడి గట్టిగా ధైర్యమును అవలంబింపుము. ఓ రామా! నేను స్నేహభావముతో చనవుగలిగి ఇట్లు హితవచనములను పలుకుచుంటిని. దీనిని ఉపదేశముగా భావింపవలదు. నామైత్రిని గౌరవింపుము (విశ్వసింపుము) శోకించుట మానుము." (13-14)

ఆత్మీయతతో గూడిన సుగ్రీవుని మధురమైన ఓదార్పు మాటలకు శ్రీరాముడు కొంత ఊరటచెందెను. పిదప అతడు అశ్రువులతో తడిసియున్న తన ముఖమును ఉత్తరీయముతో తుడుచుకొనెను. సుగ్రీవుని వచనములవలన రామచంద్రప్రభువుయొక్క మనస్సు స్తిమితపడెను. పిమ్మట అతడు సుగ్రీవుని గాఢముగా కౌగిలించుకొని, ఆయనతో ఇట్లు నుడివెను. (15-16)

కర్తవ్యం యద్వయస్యేన స్నిగ్ధేన చ హితేన చ।
అనురూపం చ యుక్తం చ కృతం సుగ్రీవ తత్ త్వయా। 17

ఏష చ ప్రకృతిస్థోఽహమ్ అనునీతస్త్వయా సఖే।
దుర్లభో హీదృశో బంధుః అస్మిన్ కాలే విశేషతః। 18

కింతు యత్నస్త్వయా కార్యో మైథిల్యాః పరిమార్గణే।
రాక్షసస్య చ రౌద్రస్య రావణస్య దురాత్మనః। 19

మయా చ యదనుష్ఠేయం విస్రబ్ధేన తదుచ్యతాం।
వర్షాస్వివ చ సుక్షేత్రే సర్వం సంపద్యతే మయి। 20

మయా చ యదిదం వాక్యమ్ అభిమానాత్ సమీరితం।
తత్త్వయా హరిశార్దూల తత్త్వమిత్యుపధార్యతామ్। 21

అనృతం నోక్తపూర్వం మే న చ వక్ష్యే కదాచన।
ఏతత్ తే ప్రతిజానామి సత్యేనైవ చ తే శపే। 22

తతః ప్రహృష్టః సుగ్రీవో వానరైః సచివైః సహ।
రాఘవస్య వచః శ్రుత్వా ప్రతిజ్ఞాతం విశేషతః। 23

ఏవమేకాంతసంపృక్తౌ తతస్తౌ నరవానరౌ।
ఉభావన్యోఽన్యసదృశం సుఖం దుఃఖమ్ అభాషతామ్। 24

మహానుభావస్య వచో నిశమ్య
హరిర్నరాణామ్ ఋషభస్య తస్య ।
కృతం స మేనే హరివీరముఖ్యః
తదా స్వకార్యం హృదయేన విద్వాన్। 25

"ఓ సుగ్రీవా! ఆదరాభిమానములతో హితమునుగోరెడి ప్రాణమిత్రుడు చేసెడి పనిని నీవొనర్చితివి. నీవు పలికిన ఈ మాటలు సమయోచితములు, దుఃఖమును తొలగించుటలో సమర్థములు. ఓ మిత్రమా! చక్కని నీ అనునయువచనములతో నేను ఊరటచెందితిని. సహజముగా నీవంటి బంధువు (ఆత్మీయుడు) దొరకుట దుర్లభము. అందునా ఇట్టి ఆపదసమయములో లభించుట ఇంకను కష్టము. (17-18)

అదిసరే! సీతాదేవి జాడనుగూర్చియు, దుర్మార్గుడు, క్రూరుడునైన రావణాసురునిసమాచారమును గుఱించియు తెలిసికొనుటకు పూనుకొనుము. (19)

ఓ మిత్రుడా! నీమేలుకొఱకై నేను చేయువలసిన పనిని నిస్సంకోచముగా తెలుపుము. వర్షాకాలమునందు పంటపొలములలో నాటిన విత్తనములవలె నావలన ఆకార్యము సఫలమగును. (20)

ఓ వానరశ్రేష్ఠా! నా పరాక్రమమునందలి విశ్వాసముతో (ఆత్మవిశ్వాసముతో) వాలిని తప్పక చంపెదనని మాటయిచ్చుచున్నాను. ఇది యథార్థము. నన్ను నమ్ముము. నేను ఇంతవఱకును అసత్యమును పలుకలేదు, ఇక ఎన్నడును పలుకను. ప్రమాణపూర్వకముగా ఇట్లు తెలుపుచున్నాను."(21-22)

శ్రీరాముని మాటలకు, అందునా ఆయన ప్రమాణపూర్వకముగా పలికినందులకు, సుగ్రీవుడును, అతని సచివులును ఎంతయు సంతసించిరి. (23)

ఇట్లు శ్రీరాముడును, సుగ్రీవుడును ఏకాంతముగా (రహస్యముగా) సంభాషించుకొనుచు పరస్పరము తమతమకష్టసుఖములను తెలుపుకొనిరి. (24)

వానరప్రముఖుడును, ప్రతిభాశాలియు ఐన సుగ్రీవుడు పురుషశ్రేష్ఠుడును, మహానుభావుడును ఐన శ్రీరాముని మాటలను విని, తన కార్యము (వాలివధ) పూర్తియైనట్లుగా తన మనస్సున తలంచెను. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే సప్తమస్సర్గః (7)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏడవసర్గము

-- ✻ ✻ ✻ --

8. ఎనిమిదవసర్గము

సుగ్రీవుడు తన సంకట పరిస్థితిని గూర్చి శ్రీరామునకు వివరించుట - ఆ ప్రభువు ఆయనను ఊరడించుచు 'వాలితో నీకు ఏర్పడిన వైరకారణములను దెల్పుము-' అని కోరుట -

పరితుష్టస్తు సుగ్రీవః తేన వాక్యేన వానరః।
లక్ష్మణస్యాగ్రతో రామమ్ ఇదం వచనమబ్రవీత్। 1

సర్వథాఽహమ్ అనుగ్రాహ్యో దేవతానామ్ అసంశయః।
ఉపపన్నగుణోపేతః సఖా యస్య భవాన్ మమ। 2

శక్యం ఖలు భవేద్రామ సహాయేన త్వయాఽనఘ।
సురరాజ్యమపి ప్రాప్తుం స్వరాజ్యం కిం పునః ప్రభో। 3

సోఽహం సభాజ్యో బంధూనాం సుహృదాం చైవ రాఘవ।
యస్యాగ్నిసాక్షికం మిత్రం లబ్ధం రాఘవవంశజమ్। 4

అహమప్యనురూపస్తే వయస్యో జ్ఞాస్యసే శనైః।
న తు వక్తుం సమర్థోఽహం స్వయమాత్మగతాన్ గుణాన్। 5

మహాత్మనాం తు భూయిష్ఠం త్వద్విధానాం కృతాత్మనాం।
నిశ్చలా భవతి ప్రీతిః ధైర్యమాత్మవతామివ। 6

రజతం వా సువర్ణం వా వస్త్రాణ్యాభరణాని చ।
అవిభక్తాని సాధూనామ్ అవగచ్ఛంతి సాధవః। 7

ఆఢ్యో వాపి దరిద్రో వా దుఃఖితః సుఖితోఽపి వా।
నిర్దోషో వా సదోషో వా వయస్యః పరమా గతిః। 8

ధనత్యాగః సుఖత్యాగో దేహత్యాగోఽపి వా పునః।
వయస్యార్థే ప్రవర్తంతే స్నేహం దృష్ట్వా తథావిధమ్। 9

తత్తథేత్యబ్రవీద్రామః సుగ్రీవం ప్రియవాదినం।
లక్ష్మణస్యాగ్రతో లక్ష్మ్యా వాసవస్యేవ ధీమతః। 10

వానరరాజైన సుగ్రీవుడు శ్రీరామునిఅభయవచనములకు పొంగిపోయినవాడై, లక్ష్మణునిసమక్షమున ఆమహాత్మునితో ఇట్లు నుడివెను. (1)

"ఓ ప్రభూ! రాజోచితములైన శౌర్యవీర్యపరాక్రమాది గుణములకు నిధివైన నీవంటి మహాత్ముడు మిత్రుడుగా లభించుట నా అదృష్టము. నిజముగా నేను అన్నివిధములుగా దేవతలఅనుగ్రహమునకు పాత్రుడనైతిని. (2)

ఓ స్వామీ! నీ అండదండలున్నచో ఆ సురరాజ్యాధిపత్యము ప్రాప్తించుటయు సంభవమేగదా! ఇక ఈ కిష్కింధారాజ్యవిషయము వేఱుగా చెప్పనేల? (3)

ఓ రామా! సుప్రసిద్ధమైన రఘువంశమునకు చెందిన నీవంటి మహాపురుషుడు అగ్నిసాక్షిగా నాకు మిత్రుడుగా లభించినందువలన బంధుమిత్రులందఱిలో నేను పూజ్యుడనైతిని. నేను నీకు తగిన మిత్రుడనేయని నీవు క్రమముగా తెలిసికొనగలవు. నాగుణగణములను నేను స్వయముగా తెలుపుకొనుట సమంజసముకాదు గదా?(4-5)

నీవంటి బుద్ధిశాలులకును, మహాత్ములకును ఆత్మజ్ఞానులకు వలె ప్రీతియు, ధైర్యము మిక్కిలి నిశ్చలముగా నుండును గదా! సత్పురుషులైన మిత్రులు వెండీ బంగారములు, వస్త్రాభరణములు మొదలగువానిని 'నీవి నావి' అను భేదభావములేక సమానముగా అనుభవింతురు. ఉత్తమ పురుషుడు తనమిత్రుడు ధనవంతుడైనను, నిర్ధనుడైనను, సుఖములలో ఉన్నను, దుఃఖములలో ఉన్నను, నిర్దోషియైనను, దోషియైనను, అతడెట్టివాడైనను తారతమ్యలను చూపక వానిని తనతో సమానునిగనే గౌరవించును. (6-8)

ఓ రామా! నిజమైన మిత్రుడు తన స్నేహితునికొఱకై సంపదలను గాని, సుఖములను గాని, అట్లే కడకు తన ప్రాణములనుగాని త్యజించుటకు సిద్ధముగానుండును. ప్రాణమిత్రులముగావున మనము ఇరువురము ఈ స్నేహధర్మమును పాటింతము." (9)

తేజస్వియైన శ్రీరాముడు ఇంద్రునివలె ప్రజ్ఞాశాలియైన లక్ష్మణునిసమక్షమున ప్రియ (మధుర) భాషియైన సుగ్రీవునితో అట్లే అని పలికెను. (10)

తతో రామం స్థితం దృష్ట్వా లక్ష్మణం చ మహాబలం।
సుగ్రీవః సర్వతశ్చక్షుః వనే లోలమ్ అపాతయత్। 11

స దదర్శ తతః సాలమ్ అవిదూరే హరీశ్వరః।
సుపుష్పమీషత్పత్రాఢ్యం భ్రమరైరుపశోభితమ్। 12

రామలక్ష్మణులు నిలబడియుండుటను గమనించిన సుగ్రీవుడు వారికి ఆసనములను సమకూర్చుటకై తన దృష్టిని నలువైపులకును ప్రసరింపజేసెను. అప్పుడు సుగ్రీవునకు ఆసమీపముననే ఒక మద్దిచెట్టు కనబడెను. అది విరబూసిన పూవులతో, చిగురుటాకులతో, తుమ్మెదలతో విరాజిల్లుచుండెను. (11-12)

తస్యైకాం పర్ణబహులాం భంక్త్వా శాఖాం సుపుష్పితాం।
సాలస్యాస్తీర్య సుగ్రీవో నిషసాద సరాఘవః। 13

అంతట సుగ్రీవుడు పూవులతో, ఆకులతో, నిండిన ఒక మద్ది కొమ్మనువిఱిచి, ఆసనముగా ఏర్పఱచెను. పిమ్మట అతడు శ్రీరామునితోగూడి దానిపై ఆసీనుడయ్యెను. (13)

తావాసీనౌ తతో దృష్ట్వా హనూమానపి లక్ష్మణం।
సాలశాఖాం సముత్పాట్య వినీతమ్ ఉపవేశయత్। 14

అప్పుడు హనుమంతుడు ఆ ఇరువురును కూర్చున్న పిమ్మట మఱియొక మద్దికొమ్మను దీసికొనివచ్చి, వినమ్రుడై నిలబడియున్న లక్ష్మణుని దానిపై ఆసీనుని గావించెను.(14)

సుఖోపవిష్టం రామం తు ప్రసన్నమ్ ఉదధిం యథా।
ఫలపుష్పసమాకీర్ణే తస్మిన్ గిరివరోత్తమే। 15

తతః ప్రహృష్టః సుగ్రీవః శ్లక్ష్ణం మధురయా గిరా।
ఉవాచ ప్రణయాద్రామం హర్షవ్యాకులితాక్షరమ్। 16

పండ్లతో, పూవులతో కనువిందుగావించుచున్న ఆకొండపైభాగమున సముద్రమువలె గంభీరుడైయున్న శ్రీరాముడు సుఖాసీనుడై యుండగా చూచి సుగ్రీవుడు ఎంతయు సంతసించెను. శ్రీరామునియంతటి మహావీరుడు మిత్రుడైనందులకు సంతోషము, వాలివలన ఎప్పుడు ఏ ఆపదరానున్నదో యను భయము అతనిలో ముప్పిరి గొనుచుండగా ఆవానరోత్తముడు రామునితో ప్రేమపూర్వకముగా మృదుమధుర వచనములను ఇట్లు పలికెను. (15-16)

అహం వినికృతో భ్రాత్రా చరామ్యేష భయార్దితః।
ఋశ్యమూకం గిరివరం హృతభార్యః సుదుఃఖితః। 17

సోఽహం త్రస్తో భయే మగ్నో వసామ్యుద్భ్రాంతచేతనః।
వాలినా నికృతో భ్రాత్రా కృతవైరశ్చ రాఘవ। 18

"రామా! మా అన్నయైన వాలి నా భార్యను లాగికొని, నన్ను మిక్కిలి అవమానించెను. నేను మిగుల భయముతో దుఃఖితుడనై ఈ ఋశ్యమూకపర్వతమునకుచేరి, ఇచట వసించుచున్నాను. ఓ రాఘవా! అందువలన నా మనస్సు మిగుల కలతచెందినది. ఆ కారణముగా నేను భయాందోళనములకు లోనైయున్నాను. నా సోదరుడైన వాలి నన్ను కిష్కింధనుండి గెంటివేసి, నాతో వైరము పూనియున్నాడు. (17-18)

వాలినో మే భయార్తస్య సర్వలోకాభయంకర।
మమాఽపి త్వమ్ అనాథస్య ప్రసాదం కర్తుమర్హసి। 19

ఓ సర్వలోకశరణ్యా! సమస్త ప్రాణుల భయమును తొలగించువాడా! వాలిభయమువలన ఆర్తుడనై దిక్కుతోచక యున్నాను. సర్వరక్షకుడవైన నీవు నన్ను అనుగ్రహించి కాపాడుము." (19)

ఏవముక్తస్తు తేజస్వీ ధర్మజ్ఞో ధర్మవత్సలః।
ప్రత్యువాచ స కాకుత్స్థః సుగ్రీవం ప్రహసన్నివ। 20

మిగుల పరాక్రమశాలియు, సమస్తధర్మములను ఎఱిగిన వాడును, ధర్మప్రీతిగలవాడును ఐన శ్రీరాముడు సుగ్రీవునిమాటలను వినిన పిమ్మట దరహాసము చేయుచు అతనితో ఇట్లు నుడివెను. (20)

ఉపకారఫలం మిత్రమ్ అపకారోఽరిలక్షణం।
అద్యైవ తం హనిష్యామి తవ భార్యాపహారిణమ్। 21

ఇమే హి మే మహావేగాః పత్రిణస్తిగ్మతేజసః।
కార్త్తికేయవనోద్భూతాః శరా హేమవిభూషితాః। 22

కంకపత్రప్రతిచ్ఛన్నా మహేంద్రాశనిసన్నిభాః।
సుపర్వాణః సుతీక్ష్ణాగ్రాః సరోషా భుజగా ఇవ। 23

"ఓ సుగ్రీవా! ఉపకారము జరుగుటయే మిత్రునివలన ఫలము. అపకారము చేయుట శత్రువుయొక్క లక్షణము. నీభార్యను అపహరించిన ఆవాలిని నేడే చంపివేయుదును. ఓ మహానుభావా! నా ఈ బాణములు మిగులవాడియైనవి, తీవ్రమైనతేజస్సు గలవి. ఇవి కార్త్తికేయవనమునందు ఉద్భవించినవి గనుక అభేద్యములు, బంగారముతో అలంకరింపబడినవి. గ్రద్దఱెక్కలచే కూర్చబడినవి, ఇంద్రుని వజ్రాయుధముతో తుల్యములైనవి. మంచి కణుపులుగలవి. ఎంతయు పదునైనవి. సర్పములవలె భయంకరములు. (21-23)

భ్రాతృసంజ్ఞమ్ అమిత్రం తే వాలినం కృతకిల్బిషం।
శరైర్వినిహతం పశ్య వికీర్ణమివ పర్వతమ్। 24

ఓ వానరశ్రేష్ఠా! వాలి నీకు సోదరునిరూపముననున్న శత్రువు. అతడు మిగుల పాపాత్ముడు. నా శరములకుగురియై అతడు ఒక పర్వతమువలె నేలగూలగా నీవు చూచెదవుగాక." (24)

రాఘవస్య వచః శ్రుత్వా సుగ్రీవో వాహినీపతిః।
ప్రహర్షమతులం లేభే సాధు సాధ్వితి చాబ్రవీత్। 25

వానరసేనకు అధిపతియైన సుగ్రీవుడు శ్రీరాముని మాటలకు పరమానందభరితుడై 'బాగుబాగు' అని ప్రశంసించుచు ఇట్లనెను. (25)

రామ శోకాభిభూతోఽహం శోకార్తానాం భవాన్ గతిః।
వయస్య ఇతి కృత్వా హి త్వయ్యహం పరిదేవయే। 26

త్వం హి పాణిప్రదానేన వయస్యో మేఽగ్నిసాక్షికం।
కృతః ప్రాణైర్బహుమతః సత్యేనాఽపి శపామి తే। 27

వయస్య ఇతి కృత్వా చ విస్రబ్ధం ప్రవదామ్యహం।
దుఃఖమంతర్గతం యన్మే మనో హరతి నిత్యశః। 28

"ఓ రామా! నేను మిక్కిలి శోకార్తుడనైయున్నాను. శోకముచే విలవిలలాడుచున్న వారికి మహానుభావుడవైన నీవేగదా! దిక్కు. 'నీవు నామిత్రుడవు' అను భావముతో నేను నిన్ను ఇంతగా ప్రాధేయపడుచున్నాను. నీవు నాచేతిలో చేయివేసి, అగ్నిసాక్షిగా మిత్రుడవు ఐతివి. నీవు నాకు ప్రాణతుల్యుడవు. ఈ మాటలను నేను శపథపూర్వకముగా పలుకుచున్నాను. ఇది యథార్థము. నీవు నాకు ప్రాణమిత్రుడవను విశ్వాసముతో ఇంతగా చెప్పుచున్నాను. ఏలనన నాలోని తీవ్రవేదన నామనస్సును అను క్షణము వేధించుచున్నది." (26-28)

ఏతావదుక్త్వా వచనం బాష్పదూషితలోచనః।
బాష్పోపహతయా వాచా నోచ్చైః శక్నోతి భాషితుమ్। 29

సుగ్రీవుడు ఇట్లు పలుకుచుండగా అతని కనులలో అశ్రువులు నిండెను. దుఃఖాశ్రువులప్రభావమున అతని కంఠము గద్గదమాయెను. అందువలన అతడు బిగ్గఱగా మాట్లాడలేకపోయెను. (29)

బాష్పవేగం తు సహసా నదీవేగమివాగతం।
ధారయామాస ధైర్యేణ సుగ్రీవో రామసన్నిధౌ। 30

'శ్రీరామునకు ధైర్యము చెప్పి ఆయనముందర ఇంతగా శోకించుట తగదు' అని భావించి, సుగ్రీవుడు నదీప్రవాహమువలె స్రవించుచున్న కన్నీటిని ఎట్టకేలకు అపుకొనెను. (30)

సన్నిగృహ్య తు తం బాష్పం ప్రమృజ్య నయనే శుభే।
వినిశ్శ్వస్య చ తేజస్వీ రాఘవం వాక్యమబ్రవీత్। 31

తేజస్వియైన సుగ్రీవుడు కన్నీటిని అపుకొని, నేత్రములను తుడుచుకొనెను. పిదప అతడు నిట్టూర్చుచు శ్రీరామునితో ఇట్లు నుడివెను. (31)

పురాఽహం వాలినా రామ రాజ్యాత్ స్వాదవరోపితః।
పరుషాణి చ సంశ్రావ్య నిర్ధూతోఽస్మి బలీయసా। 32

హృతా భార్యా చ మే తేన ప్రాణేభ్యోఽపి గరీయసీ।
సుహృదశ్చ మదీయా యే సంయతా బంధనేషు తే। 33

యత్నవాంశ్చ సుదుష్టాత్మా మద్వినాశాయ రాఘవ।
బహుశస్తత్ప్రయుక్తాశ్చ వానరా నిహతా మయా। 34

శంకయా త్వేతయా చేహ దృష్ట్వా త్వామపి రాఘవ।
నోపసర్పామ్యహం భీతో భయే సర్వే హి బిభ్యతి। 35

కేవలం హి సహాయా మే హనుమత్ప్రముఖాస్త్విమే।
అతోఽహం ధారయామ్యద్య ప్రాణాన్ కృచ్ఛ్రగతోఽపిసన్। 36

ఏతే హి కపయః స్నిగ్ధా మాం రక్షంతి సమంతతః।
సహగచ్ఛంతి గంతవ్యే నిత్యం తిష్ఠంతి చ స్థితే। 37

సంక్షేపస్త్వేష తే రామ కిముక్త్వా విస్తరం హి తే।
స మే జ్యేష్ఠో రిపుర్భ్రాతా వాలీ విశ్రుతపౌరుషః। 38

తద్వినాశాద్ధి మే దుఃఖం ప్రణష్టం స్యాదనంతరం।
సుఖం మే జీవితం చైవ తద్వినాశనిబంధనమ్। 39

ఏష మే రామ శోకాంతః శోకార్తేన నివేదితః।
దుఃఖితః సుఖితో వాపి సఖ్యుర్నిత్యం సఖా గతిః। 40

శ్రుత్వైతద్వచనం రామః సుగ్రీవమ్ ఇదమబ్రవీత్।
కిం నిమిత్తమ్ అభూద్వైరం శ్రోతుమిచ్ఛామి తత్త్వతః। 41

సుఖం హి కారణం శ్రుత్వా వైరస్య తవ వానర।
ఆనంతర్యం విధాస్యామి సంప్రధార్య బలాబలమ్। 42

"ఓ రాఘవా! బలవంతుడైన వాలి నన్ను యువరాజుపదవినుండి తొలగించెను. నోటికి వచ్చినట్లుగా దూషించి, కిష్కింధనుండి గెంటివేసెను. నా ప్రాణములకంటెను ప్రియమైన నా భార్యను అపహరించెను. నాకు ఆత్మీయులైన స్నేహితులనందఱిని చెరసాలలో బంధించెను. ఆ పచ్చిదుర్మార్గుడు నన్ను హతమార్చుటకు తీవ్ర ప్రయత్నమొనర్చెను. పెక్కుపర్యాయములు నన్ను చంపుటకై అతడు వానరులను పంపెను. వారందఱును నాచేతిలో నిహతులైరి. (32-34)

ఓ రామా! పరమదయాళుడవైన నీవు ఇక్కడికి వచ్చినప్పుడుగూడ 'నీవు వాలి పంపగా వచ్చినవాడవే' యను శంకతో మిమ్ములను సమీపించుటకు మిగుల బీతిల్లితిని. భయస్థితులలో చిక్కుపడియున్న వారందఱును ప్రతిసంఘటనకును ఉలిక్కిపడుట సహజముగదా! హనుమంతుడు మొదలగు ప్రముఖులతిరుగులేని అండదండలు నాకున్నవి. ఆకారణమువలననే ఎన్నికష్టములు వచ్చిపడినను నేను ఇప్పటివఱకును ప్రాణములను నిలుపుకొనియున్నాను. ఆప్తులైన ఈ వానరమిత్రులు అన్నివిధములుగా నన్ను కాపాడుచున్నారు. నేను ఎక్కడికి వెళ్లినను, ఎక్కడ ఉన్నను ఎల్లప్పుడు వారు నాకు తోడుగా ఉందురు. (35-37)

ఓ రామా! నన్నుగూర్చి సంక్షిప్తముగా నీకు తెల్పితిని. ఇంతకంటె ఎక్కువగా నీకు చెప్పదగినది ఏమున్నది? నాఅన్నయైన వాలి మిక్కిలి బలపరాక్రమములు గలవాడు. అతడు నాపాలిటి శత్రువు. అతడు నశించిన పిదపనే నా దుఃఖము దూరమగును. నా సుఖజీవితము అయన వినాశముతో ముడిపడియున్నది. ఓరామా! శోకార్తుడనైయున్న నేను నా శోకముతొలగెడి ఉపాయమును నీకు నివేదించితిని. సుఖములలోగాని, దుఃఖములలోగాని ఎవ్వరికైనను మిత్రుడేగదా! గతి-" (38-40)

సుగ్రీవుని పలుకులను విన్న పిమ్మట శ్రీరాముడు అతనితో ఇట్లు నుడివెను. "ఓ సుగ్రీవా! వాలికిని నీకును వైరము ఏర్పడుటకుగల కారణమును నేను వినగోరుచున్నాను. వివరముగా తెలుపుము. మీ వైరకారణమును విని, మీఇరువురి బలాబలములను, గుణదోషములను లోతుగా పరిశీలించెదను. అనంతరము తగిన ఉపాయమును ఆలోచించి, నీకు మేలగునట్లు చూచెదను.[1] (41-42)

1) ఓ సుగ్రీవా! నీ అపరాధము స్వల్పమై అతడు ప్రదర్శించిన వైరము తీవ్రముగానున్నచో తప్పక అతనిని చంపి నీకు మేలు చేకూర్చెదను. అట్లుగాక నీ అపరాధము అధికముగానుండి అతనివైరభావము స్వల్పముగా ఉన్నప్పుడు మీ ఇరువురిని సమాధానపఱచి, నీకు సుఖమును కలిగించెదను. గోవిందరాజీయ వ్యాఖ్య-

బలవాన్ హి మమామర్షః శ్రుత్వా త్వామ్ అవమానితం।
వర్తతే హృదయోత్కంపీ ప్రావృడ్వేగ ఇవాంభసః। 43

హృష్టః కథయ విస్రబ్ధో యావదారోప్యతే ధనుః।
సృష్టశ్చ హి మయా బాణో నిరస్తశ్చ రిపుస్తవ। 44

ఏవముక్తస్తు సుగ్రీవః కాకుత్స్థేన మహాత్మనా।
ప్రహర్షమ్ అతులం లేభే చతుర్భిః సహ వానరైః। 45

తతః ప్రహృష్టవదనః సుగ్రీవో లక్ష్మణాగ్రజే।
వైరస్య కారణం తత్త్వమ్ ఆఖ్యాతుమ్ ఉపచక్రమే। 46

వర్షాకాలమునందలి నదీప్రవాహవేగము క్రమక్రమముగా అధికమైనట్లు నీ అవమానకథను వినిన పిమ్మట నా కోపము ఎక్కువయగుచున్నది. అది నా హృదయమును కంపింపజేయుచున్నది. నేను ధనుస్సును సంధించి, బాణమును విడిచినంతనే నీ శత్రువు (వాలి)యొక్క ప్రాణములు ఎగిరిపోవును. కనుక ఈ లోపలనే నీవు నాపై విశ్వాసముంచి, ప్రశాంతచిత్తముతో నీకథను దెలుపుము." (43-44)

మహాత్ముడైన శ్రీరాముడు ఇట్లు పలుకగా సుగ్రీవుడును, అతని సచివులు నలుగురును మిక్కిలి ఆనందించిరి. అంతట ప్రసన్నముఖుడైయున్న సుగ్రీవుడు వాలికిని తనకును మధ్య ఏర్పడిన వైర కారణమును శ్రీరామునకు సమగ్రముగా వివరింపదొడంగెను. (45-46)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే అష్టమస్సర్గః (8)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఎనిమిదవసర్గము

— * * * —

9. తొమ్మిదవసర్గము

వాలితో తనకు వైరమేర్పడిన రీతిని సుగ్రీవుడు శ్రీరామునకు తెలుపుట -

వాలీ నామ మమ భ్రాతా జ్యేష్ఠః శత్రునిషూదనః।
పితుర్బహుమతో నిత్యం మమాపి చ తథా పురా। 1

పితర్యుపరతేఽస్మాకం జ్యేష్ఠోఽయమితి మంత్రిభిః।
కపీనామీశ్వరో రాజ్యే కృతః పరమసమ్మతః। 2

రాజ్యం ప్రశాసతస్తస్య పితృపైతామహం మహత్।
అహం సర్వేషు కాలేషు ప్రణతః ప్రేష్యవత్ స్థితః। 3

మాయావీ నామ తేజస్వీ పూర్వజో దుందుభేః సుతః।
తేన తస్య మహద్వైరం స్త్రీకృతం విశ్రుతం పురా। 4

స తు సుప్తజనే రాత్రౌ కిష్కింధాద్వారమాగతః।
నర్దతి స్మ సుసంరబ్ధో వాలినం చాహ్వయద్రణే। 5

ప్రసుప్తస్తు మమ భ్రాతా నర్దితం భైరవస్వనం।
శ్రుత్వా న మమృషే వాలీ నిష్పపాత జవాత్తదా। 6

స తు వై నిఃసృతః క్రోధాత్ తం హంతుమసురోత్తమమ్।
వార్యమాణస్తతః స్త్రీభిః మయా చ ప్రణతాత్మనా। 7

మాయన్నయగు వాలి శత్రుసంహారమున దక్షుడు. అతడనిన మాతండ్రియగు ఋక్షరజునకు మిక్కిలి ప్రేమ. ఈ వైరము ఏర్పడకముందు నాకును అతనిపైగల ప్రేమ అపారము. మా తండ్రి గతించిన పిమ్మట జ్యేష్ఠుడగుట వలన అతనిని మంత్రులందఱును ఏకగ్రీవముగా వానర రాజ్యమునకు ప్రభువును గావించిరి. తాతతండ్రులనుండి సంక్రమించిన వానరసామ్రాజ్యమును అతడు ఏలసాగెను. నేను అతనికి వినమ్ర భావముతో సేవకుడనై యుంటిని. (1-3)

మయుని కుమారులలో మాయావి పెద్దవాడు, అతడు దుందుభికి అన్న. ఒక స్త్రీ కారణముగా అతనికి వాలితో వైరమున్నదని ప్రతీతి. అతడు ఒక అర్ధరాత్రివేళ జనులందఱును నిద్రించుచుండగా కిష్కింధానగరద్వారము కడకు చేరెను, పిమ్మట బిగ్గఱగా గర్జించుచు వాలిని యుద్ధమునకు పిలిచెను. (4-5)

గాఢనిద్రలో ఉన్న నా అన్నయైన వాలి ఆభీకరగర్జనను వినిన పిమ్మట దానిని సహింపలేక వేగముగా బయటికి వచ్చెను. అప్పుడు స్త్రీలును, నేనును వినయముతో నమస్కరించుచు ఎంతగా వారించుచున్నను మామనవిని సరకుగొనక వాలి ఆరాక్షసుని హతమార్చుటకై క్రోధముతో ముందుకు దూకెను. (6-7)

స తు నిర్ధూయ సర్వాన్నో నిర్జగామ మహాబలః।
తతోఽహమపి సౌహార్దాత్ నిస్సృతో వాలినా సహ। 8

స తు మే భ్రాతరం దృష్ట్వా మాం చ దూరాదవస్థితం।
అసురో జాతసంత్రాసః ప్రదుద్రావ తతో భృశమ్। 9

తస్మిన్ ద్రవతి సంత్రస్తే హ్యావాం ద్రుతతరం గతౌ।
ప్రకాశశ్చ కృతో మార్గః చంద్రేణోద్గచ్ఛతా తదా। 10

స తృణైరావృతం దుర్గం ధరణ్యా వివరం మహత్।
ప్రవివేశాసురో వేగాత్ ఆవామ్ ఆసాద్య విష్ఠితౌ। 11

తం ప్రవిష్టం రిపుం దృష్ట్వా బిలం రోషవశం గతః।
మామువాచ తదా వాలీ వచనం క్షుభితేంద్రియః। 12

ఇహ త్వం తిష్ఠ సుగ్రీవ బిలద్వారి సమాహితః।
యావత్ తత్ర ప్రవిశ్యాహం నిహన్మి సహసా రిపుమ్। 13

మయా త్వేతద్వచః శ్రుత్వా యాచితః స పరంతపః।
శాపయిత్వా తు మాం పద్భ్యాం ప్రవివేశ బిలం మహత్। 14

తస్య ప్రవిష్టస్య బిలం సాగ్రః సంవత్సరో గతః।
స్థితస్య చ మమ ద్వారి స కాలో వ్యత్యవర్తత। 15

అహం తు నష్టం జ్ఞాత్వా తం స్నేహాదాగతసంభ్రమః।
భ్రాతరం న చ పశ్యామి పాపాశంకి చ మే మనః। 16

అథ దీర్ఘస్య కాలస్య బిలాత్ తస్మాద్వినిస్సృతం।
సఫేనం రుధిరం రక్తమ్ అహం దృష్ట్వా సుదుఃఖితః। 17

నర్దతామ్ అసురాణాం చ ధ్వనిర్మే శ్రోత్రమాగతః।
నిరస్తస్య చ సంగ్రామే క్రోశతో నిస్స్వనో గురోః। 18

అహం త్వవగతో బుద్ధ్యా చిహ్నైస్తైః భ్రాతరం హతం।
పిధాయ చ బిలద్వారం శిలయా గిరిమాత్రయా।
శోకార్తశ్చోదకం కృత్వా కిష్కింధామాగతస్సఖే। 19

మహాబలశాలియైన వాలి మమ్ములను అందఱిని ప్రక్కకు నెట్టివేసి ఆ రక్కసునితో పోరాడుటకై వెడలెను. అప్పుడు నేనును ప్రేమతో అతనిని అనుసరించితిని. (8)

అంతట ఆమాయావి మా అన్నను, నన్నును దూరము నుండియే చూచి, మిగుల భయపడి, వెంటనే పాఱిపోసాగెను. అతడట్లు భీతితో పిక్కబలము చూపుచుండగా మేమును మిగులవేగముగా అతనిని వెంబడించితిమి. ఇంతలో చంద్రుడు ఉదయించుచుండుటచే వెన్నెలకాంతులలో మార్గము స్పష్టముగా గోచరించుచుండెను. (9-10)

ఆమాయావి అట్లు పరుగిడుచు, గడ్డిచే కప్పబడి యుండుటచే చొరరానిదైయున్న ఒక పెద్ద భూగృహమున (బిలమున) ప్రవేశించెను. అప్పుడు మేము ఆబిల సమీపమునకు చేరి, అచట ఆగితిమి. ఆ శత్రువు బిలమున ప్రవేశించుటను గాంచి, వాలి రోషావేశముతో ఊగిపోవుచు నాతో ఇట్లునుడివెను. (11-12)

"ఓ సుగ్రీవా! నేను ఈ బిలమున ప్రవేశించి, శత్రువును పరిమార్చి, తిరిగి వచ్చెడివఱకును నీవు సావధానుడవై ఈ గుహాద్వారముకడనే నిలబడియుండుము." (13)

ఆ మాటలను వినిన పిమ్మట 'నేనును నీ వెంట వచ్చెదను' అని శత్రుసంహారసమర్థుడైన వాలిని వేడుకొంటిని. అంతట అతడు తనపాదములసాక్షిగా నాతో ఒట్టు వేయించుకొని, ఆ మహాగుహలో ప్రవేశించెను. (14)

అతడా బిలములో ప్రవేశించిన పిమ్మట పూర్తిగా ఒక సంవత్సరము గడచెను. అంతవఱకును నేను ఆ గుహాద్వారముకడనే నిలిచియుంటిని. 'ఇంతకాలమువఱకును నాసోదరుడు మఱలిరాకపోవుటచే ఆయనకు ఏదైననొక ఆపద కలిగియుండునని నా మనస్సు శంకించెను. అతడు మరణించియుండునని భావించి, అతనిపై నాకుగల అనురాగముచే ఆందోళనకు గుఱియైతిని. (15-16)

పిమ్మట చాలాకాలమునకు ఆగుహనుండి నురుగుతో గూడిన ఎఱ్ఱని రక్తము బయటకి వచ్చుచుండుట చూచి, మిగుల దుఃఖితుడనైతిని. ఇంతలో రాక్షసులయొక్క గర్జన ధ్వనులును, యుద్ధరంగమున దెబ్బతినిన మా అన్నయొక్క ఆక్రందనధ్వనులును నాచెవికి సోకెను. (17-18)

ఓ మిత్రమా! గుహనుండి రక్తము బయటికి వచ్చుట, రాక్షసులయొక్క గర్జనలు వినబడుట, మాఅన్న యొక్క ఆక్రందనధ్వని చెవికిచేరుట మున్నగు చిహ్నములను బట్టి రాక్షసుడైన మాయావిచేతిలో మా అన్న నిహతుడైనట్లేయని నిశ్చయించుకొంటిని. పిదప కొండంతబండతో ఆ గుహాద్వారమును మూసివేసి, మిగుల శోకార్తుడనై, అన్నకు తిలతర్పణములను వదలి, కిష్కింధకు చేరితిని. (19)

గూహమానస్య మే తత్త్వం యత్నతో మంత్రిభిః శ్రుతం।
తతోఽహం తైః సమాగమ్య సమ్మతైరభిషేచితః। 20

రాజ్యం ప్రశాసతస్తస్య న్యాయతో మమ రాఘవ।
ఆజగామ రిపుం హత్వా వాలీ తమ్ అసురోత్తమమ్। 21

అభిషిక్తం తు మాం దృష్ట్వా వాలీ సంరక్తలోచనః।
మదీయాన్ మంత్రిణో బద్ధ్వా పరుషం వాక్యమబ్రవీత్। 22

నిగ్రహేఽపి సమర్థస్య తం పాపం ప్రతి రాఘవ।
న ప్రావర్తత మే బుద్ధిః భ్రాతుర్గౌరవయంత్రితా। 23

హత్వా శత్రుం స మే భ్రాతా ప్రవివేశ పురం తదా।
మానయం స్తం మహాత్మానం యథావచ్చాభ్యవాదయమ్। 24

ఉక్తాశ్చ నాశిషస్తేన సంతుష్టేనాంతరాత్మనా। 25

నత్వా పాదావహం తస్య ముకుటేనాస్పృశం ప్రభో।
అపి వాలీ మమ క్రోధాత్ న ప్రసాదం చకార సః। 26

ఈ సమాచారమును నాలోనే నిగూఢముగా నుంచుకొంటిని. ఐనను మంత్రులు పలువిధముల ప్రశ్నించి, దానిని తెలిసికొనిరి. అంతట సచివులు అందఱును సమావేశమై, ఒక నిర్ణయమునకు వచ్చి, బలవంతముగా నన్ను పట్టాభిషిక్తుని గావించిరి. (20)

ఓ రఘువరా! ఆయన (వాలి)యొక్క రాజ్యమును న్యాయముగా పరిపాలించుచుంటిని. ఇంతలో వాలి ఆమాయావి రాక్షసుని చంపి, కిష్కింధకు వచ్చెను. అప్పుడతడు పట్టాభిషిక్తుడనైయున్న నన్నుజూచి కన్నులెఱ్ఱజేసెను. పిమ్మట నామంత్రులందఱిని చెరసాలలో బంధించి, నాతో పరుషముగా పలికెను. (21-22)

'అన్నా! అజ్ఞానముచే నావలన ఈ తప్పుజరిగినది. నన్ను మన్నింపుము.' అని నేను ఎంతగా వేడుకొనుచున్నను, అతడు నామనవిని వినిపించుకొనలేదు. అప్పుడతనిని నిగ్రహింపగలిగిన సామర్థ్యము ఉన్నను సోదరుడను గౌరవభావముచే నాకు అట్టి ఆలోచనయే రాలేదు. శత్రువును వధించి, పురమున ప్రవేశించిన మహాత్ముడగు మా అన్నకు ఎప్పటివలె గౌరవభావముతో పాదాభివందన మొనర్చితిని. ఐనను అతడు నాయెడ ప్రసన్నుడుకాలేదు. అందువలన నన్ను అతడు ఆశీర్వదింపలేదు. నా కిరీటము అతనిపాదములకు తాకునట్లు నేను ఆయనకు శిరసాప్రణమిల్లినప్పటికిని అతడు నాపై దయచూపలేదు. అతని కోపము ఏమాత్రము చల్లారలేదు. (23-26)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే నవమస్సర్గః (9)

ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది తొమ్మిదవసర్గము

— * * * —

10. పదవసర్గము

వాలి సుగ్రీవులవైరకారణములను విని శ్రీరాముడు 'వాలిని వధించి నిన్ను శోకవిముక్తుని చేసెదను'- అని పలికి సుగ్రీవునకు ఊరటగూర్చుట

తతః క్రోధసమావిష్టం సంరబ్ధం త ముపాగతం।
అహం ప్రసాదయాంచక్రే భ్రాతరం ప్రియకామ్యయా। 1

దిష్ట్యాఽసి కుశలీ ప్రాప్తో నిహతశ్చ త్వయా రిపుః।
అనాథస్య హి మే నాథః త్వమేకోఽనాథనందనః। 2

ఇదం బహుశలాకం తే పూర్ణచంద్రమివోదితం।
ఛత్రం సవాలవ్యజనం ప్రతీచ్ఛస్వ మయోద్యతమ్। 3

అనంతరము కిష్కింధకు విచ్చేసి, వేగిరపాటుతో క్రోధపరవశుడైయున్న మా అన్నను ప్రసన్నుని గావించుకొనుటకై (మా ఇరువురి హితమును గోరి) వేడుకొంటిని. (1)

'ఓ అన్నా! నీవు శత్రువును పరిమార్చి, క్షేమముగా కిష్కింధకు విచ్చేయుట మా అదృష్టము - దిక్కులేని వాడనైన నాకు నీవే దిక్కు. నీవు అనాథులను ఆదుకొనెడి వాడవు గదా! పెక్కు, చువ్వలు గలదియు, చంద్రునివలె స్వచ్ఛమైనదియు ఐన ఈ ఛత్రమును నేను నీకు

అర్తశ్చాథ బిలద్వారి స్థితః సంవత్సరం నృప।
దృష్ట్వాఽహం శోణితం ద్వారి బిలాచ్చాపి సముత్థితమ్॥ 4

శోకసంవిగ్నహృదయో భృశం వ్యాకులితేంద్రియః।
అపిధాయ బిలద్వారం శైలశృంగేణ తత్తథా।
తస్మాద్దేశాదపాక్రమ్య కిష్కింధాం ప్రావిశం పునః॥ 5

విషాదాత్త్విహ మాం దృష్ట్వా పౌరైర్మంత్రిభిరేవ చ।
అభిషిక్తో న కామేన త న్మే త్వం క్షంతుమర్హసి॥ 6

త్వమేవ రాజా మానార్హః సదా చాహం యథాపురం।
రాజభావనియోగోఽయం మయా త్వద్విరహాత్ కృతః॥ 7

సామాత్య పౌర నగరం స్థితం నిహత కంటకం।
న్యాసభూతమిదం రాజ్యం తవ నిర్యాతయామ్యహమ్॥ 8

మా చ రోషం కృథాః సౌమ్య మయి శత్రునిబర్హణ।
యాచే త్వాం శిరసా రాజన్ మయా బద్ధోఽయమంజలిః॥ 9

బలాదస్మి సమాగమ్య మంత్రిభిః పురవాసిభిః।
రాజభావే నియుక్తోఽహం శూన్యదేశజిగీషయా॥ 10

స్నిగ్ధ మేవం బ్రువాణం మాం స తు నిర్భర్త్స్య వానరః।
ధిక్ త్వామితి చ మాముక్త్వా బహు తత్తదువాచ హ॥ 11

ప్రకృతీశ్చ సమానీయ మంత్రిణశ్చైవ సమ్మతాన్।
మామాహ సుహృదాం మధ్యే వాక్యం పరమగర్హితమ్॥ 12

విదితం వో యథా రాత్రౌ మాయావీ స మహాసురః।
మాం సమాహ్వాయత క్రూరో యుద్ధకాంక్షీ సుదుర్మతిః॥ 13

తస్య తద్వచనం శ్రుత్వా నిస్సృతోఽహం నృపాలయాత్।
అనుయాతశ్చ మాం తూర్ణమ్ అయం భ్రాతా సుదారుణః॥ 14

పట్టుదును, ఈ వింజామరముతో వీచెదను, నిన్ను ఇట్లు సేవించుటకు అనుమతింపుము. (2-3)

ఓ మహారాజా! పూర్తిగా ఒక సంవత్సరముపాటు మీ రాకకై గుహాద్వారముకడ ఆతురతతో నిరీక్షించుచుంటిని. కాని ఇంతలో గుహనుండి రక్తము ప్రవాహముగా వచ్చుట గమనించి మిగుల దిగులు పడితిని. శోకమున మునిగి మిక్కిలి ఆందోళన పడితిని. అనంతరము పర్వత శిఖరమువంటి ఒక బండతో ఆ గుహాద్వారమును మూసివేసితిని. తిన్నగా ఆప్రదేశమునుండి బయలుదేఱి. మఱల కిష్కింధలో అడుగిడితిని. (4-5)

ఇక రాజ్యముగతి ఏమగునోయను విషాదముతో ఇచటికి చేరిన నన్నుచూచి, పౌరులును, మంత్రులును నేను ఇష్టపడకున్నను బలవంతముగా నన్ను రాజ్యాభిషిక్తుని గావించిరి. అందులకు (రాజ్యాధికారమును స్వీకరించినందులకు) నీవు నన్ను క్షమింపుము. ఈ రాజ్యమునకు పూజ్యుడవైన ప్రభుడవు నీవే. ఎప్పటివలె నేను యువరాజుగా ఉండి, నిన్ను సేవించుచుందును. నీవు లేకుండుటవలన రాజ్యమును పాలించు భారము నాపై ఉంచబడినది. అమాత్యులతో, పౌరులతో, నగరములతో గూడిన ఈ రాజ్యమునకు ఎట్టి శత్రు బాధయులేదు. ఈ రాజ్యమును నేను న్యాసముగా స్వీకరించితిని. దీనిని మఱల నీకు అప్పగించుచున్నాను. శత్రువులను పరిమార్చెడివాడా! ఓ సౌమ్యా! నాపై కోపమును వీడుము. ఓ రాజా! నేను దోసిలొగ్గి, శిరసా ప్రణమిల్లి, అర్థించుచున్నాను. (6-9)

రాజు (ప్రభువు) లేనిచో రాజ్యమున అల్లకల్లోలములు చెలరేగునని తలంచి, మంత్రులును, పౌరులును కూడి రాజ్యమును పాలించు (శాసించు) అధికారమునందు నన్ను బలవంతముగా ఉంచిరి.' (10)

నేను ఇట్లు స్నేహపూర్వకముగా (వినమ్రభావముతో) పలుకుచున్నను ఆవాలి నన్ను గద్దించుచు, ఛీకొట్టుచు పెక్కు దుర్భాషలాడెను. గౌరవార్హులైన మంత్రులను, పౌరులను పిలిచి, మిత్రుల సమక్షమున అతడు నన్ను గూర్చి మిగుల నింద్యముగా పలికెను. (11-12)

'ఓ పౌరులారా! క్రూరుడు, యుద్ధకాంక్షగలవాడు, దుష్టబుద్ధియైన మాయావి అను మహారాక్షసుడు ఒక అర్ధరాత్రి సమయమున నన్ను యుద్ధమునకు ఆహ్వానించిన విషయము మీకును తెలియును గదా! ఆ రాక్షసుని కవ్వింపుమాటలను విని, రాజగృహమునుండి బయలుదేఱితిని. అప్పుడు దుర్మార్గుడైన ఈ నా సోదరుడు నన్ను అనుసరించెను. (13-14)

సతు దృష్ట్వైవ మాం రాత్రౌ సద్వితీయం మహాబలః।
ప్రాద్రవద్భయసంత్రస్తో వీక్ష్యావాం త మనుద్రుతౌ। 15

అనుద్రుతశ్చ వేగేన ప్రవివేశ మహాబిలమ్। 16

తం ప్రవిష్టం విదిత్వా తు సుఘోరం సుమహద్బిలం।
అయముక్తోఽథ మే భ్రాతా మయా తు క్రూరదర్శనః। 17

అహత్వా నాస్తి మే శక్తిః ప్రతిగంతుమ్ ఇతః పురీం।
బిలద్వారి ప్రతీక్ష త్వం యావదేనం నిహన్మ్యహమ్। 18

స్థితోఽయమితి మత్వా తు ప్రవిష్టోఽహం దురాసదం।
తం చ మే మార్గమాణస్య గతః సంవత్సరస్తదా। 19

స తు దృష్టో మయా శత్రుః అనిర్వేదాద్భయావహః।
నిహతశ్చ మయా తత్ర సోఽసురో బంధుభిస్సహ। 20

తస్యాస్యాత్తు ప్రవృత్తేన రుధిరౌఘేణ తద్బిలం।
పూర్ణమాసీద్దురాక్రామం స్తనతస్తస్య భూతలే। 21

సూదయిత్వా తు తం శత్రుం విక్రాంతం దుందుభేః సుతం।
నిష్క్రామన్నేవ పశ్యామి బిలస్య పిహితం ముఖమ్। 22

విక్రోశమానస్య తు మే సుగ్రీవేతి పునః పునః।
యదా ప్రతివచో నాస్తి తతోఽహం భృశదుఃఖితః। 23

పాదప్రహారైస్తు మయా బహుభిస్తద్విదారితం।
తతోఽహం తేన నిష్క్రమ్య పథా పురముపాగతః। 24

తత్రాఽనేనాస్మి సంరుద్ధో రాజ్యం ప్రార్థయతాత్మనః।
సుగ్రీవేణ నృశంసేన విస్మృత్య భ్రాతృసౌహృదమ్। 25

ఏవముక్త్వా తు మాం తత్ర వస్త్రేణైకేన వానరః।
నిర్వాసయామాస తదా వాలీ విగతసాధ్వసః। 26

తేనాఽహమ్ అపవిద్ధశ్చ హృతదారశ్చ రాఘవ।
తద్భయాచ్చ మహీ కృత్స్నా క్రాంతేయం సవనార్ణవా। 27

మహాబలశాలియైన ఆ రాక్షసుడు ఇతనితో గూడియున్న నన్నుజూచి, కాలికి బుద్ధిచెప్పెను. మేము అతనిని వెంబడించుట చూచి, భయముతో వణకిపోయెను. అంతట అతడు వేగముగా పరుగెత్తుచు ఒక పెద్ద గుహలో దూరెను. (15-16)

ఆ మాయావి మిగుల భయంకరమైన ఆ పెద్ద గుహలో ప్రవేశించుటను గమనించిన పిమ్మట నేను క్రూరాత్ముడైన నా ఈ సోదరునితో ఇట్లు పలికితిని. (17)

'ఓ సుగ్రీవా! ఈ రాక్షసుని చంపకుండ నేను పురమునందు అడుగుపెట్టను. అతనిని చంపి, నేను తిరిగివచ్చెడివఱకును నీవు ఈ బిలద్వారముకడనే నిరీక్షించుచుండుము.' (18)

ఇతడు అచ్చటనేయుండునని తలచి, దుర్గమమైన ఆ గుహలో ప్రవేశించితిని. ఆమాయావిని వెదకుటలోనే ఒక సంవత్సరము గడచిపోయెను. కడకు భయంకరుడైన ఆరాక్షసుని నేను సులభముగనే కనుగొంటిని. ఆమాయావిని, వాని అనుచరులను నేను అక్కడికక్కడే హతమార్చితిని. (19-20)

వానిముఖము నుండి, వక్షఃస్థలమునుండి బయల్వెడలిన రక్తప్రవాహముతో దుర్గమమైన ఆగుహయంతయు నిండిపోయెను. దుందుభియొక్క కుమారుడును, పరాక్రమశాలియు, నాకు శత్రువు ఐన మాయావిని చంపి, బయటికి వచ్చునప్పుడు ఱాతిచే కప్పబడియున్న ఆగుహద్వారమును కనుగొనలేక పోయితిని. (21-22)

నేను పదే పదే సుగ్రీవా! సుగ్రీవా! అని గొంతెత్తి అఱచినను, నాకు ఎట్టి సమాధానము రానందున ఎంతయు దుఃఖితుడనైతిని. (23)

అప్పుడు నేను బలముకొలది కాళ్లతో పెక్కు మాఱులు తన్నగా ద్వారమునకు అడ్డముగానున్న ఆ శిల ముక్కలు ముక్కలాయెను. అంతట నేను ఆగుహనుండి బయటపడి. దారిబట్టి పురమునకు చేరితిని. (24)

దుర్మార్గుడైన ఈ సుగ్రీవుడు తాను రాజు కావలెనను కోరికతో (రాజ్యకాంక్షతో) అన్నయనియు చూడక (సోదరప్రేమను విస్మరించి) నేను బిలమునుండి బయటికి రాకుండ ఒక పెద్దబండతో దానికి అడ్డు కల్పించెను.' (25)

వానరప్రభువైన వాలి ఈ విధముగా నన్ను దూషించి, ఏమాత్రమూ సంకోచములేకుండ కట్టుబట్టలతో బయటికి గెంటివేసెను. (26)

ఓ రఘురామా! అతడు నాభార్యను అపహరించి, నన్ను త్యజించెను. (రాజ్యభ్రష్టుని గావించెను) అతని భయమువలన నేను వనములతో సముద్రములతో గూడిన ఈ సమస్తభూమండలమున సంచరించితిని. భార్య అపహరింపబడుటచే దుఃఖితుడనై, నేను తిన్నగా

ఋశ్యమూకం గిరివరం భార్యాహరణదుఃఖితః।
ప్రవిష్టోఽస్మి దురాధర్షం వాలినః కారణాంతరే। 28

ఏతత్తే సర్వమాఖ్యాతం వైరానుకథనం మహత్।
అనాగసా మయా ప్రాప్తం వ్యసనం పశ్య రాఘవ। 29

వాలినస్తు భయార్తస్య సర్వలోకాభయంకర।
కర్తుమర్హసి మే వీర ప్రసాదం తస్య నిగ్రహాత్। 30

ఏవముక్తస్తు తేజస్వీ ధర్మజ్ఞో ధర్మసంహితం।
వచనం వక్తుమారేభే సుగ్రీవం ప్రహసన్నివ। 31

అమోఘాః సూర్యసంకాశా మమైతే నిశితాః శరాః।
తస్మిన్ వాలిని దుర్వృత్తే నిపతిష్యంతి వేగితాః। 32

యావత్ తం నాభిపశ్యామి తవ భార్యాపహారిణం।
తావత్ స జీవేత్ పాపాత్మా వాలీ చారిత్రదూషకః। 33

ఆత్మానుమానాత్ పశ్యామి మగ్నం త్వాం శోకసాగరే।
త్వామహం తారయిష్యామి కామం ప్రాప్స్యసి పుష్కలమ్। 34

తస్య తద్వచనం శ్రుత్వా రాఘవస్యాత్మనో హితం।
సుగ్రీవః పరమప్రీతః సుమహద్వాక్యమబ్రవీత్। 35

పర్వతశ్రేష్ఠమైన ఋశ్యమూకమునకు చేరితిని. కొన్ని కారణముల వలన ఆవాలి ఇందు ప్రవేశింపజాలడు. (27-28)

ఓ రఘువీరా! వాలికిని నాకును మధ్య వైరము ఏర్పడుటకు గల కారణములను పూర్తిగా వివరించితిని. ఎట్టి అపరాధము చేయకున్నను నాకు ఎంతటి దుఃఖము వచ్చిపడినదో చూడుము. (29)

సమస్తప్రాణులకును అభయమిచ్చెడి ఓ వీరా! వాలిభయమువలన నేను మిగులమనోవ్యథకు గుఱియైయుంటిని. కనుక నీవు అతనిని నిగ్రహించి నన్ను కరుణింపుము." (30)

తేజస్వియు, ధర్మజ్ఞుడును ఐన రఘువీరుడు సుగ్రీవునిపలుకులను విని, దరహాసముచేయుచు అతనితో ధర్మసహితములైన వచనములను ఇట్లు నుడువసాగెను. (31)

"ఓ సుగ్రీవా! నా బాణములు మిగులవాడియైనవి, తిరుగులేనివి. సూర్యునికిరణములవలె మిఱుమిట్లు గొల్పునవి. దుర్మార్గుడైన ఆవాలిని అవి క్షణములో దెబ్బతీయుగలవు. (32)

వానరోత్తమా! వాలి నీభార్యను అపహరించిన దుర్మార్గుడు. అతడు దుష్టవర్తనుడు. అతడు నాకంట బడునంతవఱకే జీవించియుండును(నాకంటబడిన మఱుక్షణమే అతడు నిహతుడగుట తథ్యము) (33)

ఓ వానరోత్తమా! నీవు పూర్తిగా శోకసాగరమున మునిగియున్న సంగతిని నేను గ్రహించితిని. అందులకు నేనును మిగుల పరితపించుచున్నాను. వాలిని చంపి, నిన్ను ఈ తీవ్రమైన దుఃఖమునుండి తప్పక గట్టెక్కింపగలను. త్వరలోనే నీకోర్కెలన్నియును ఈడేరును. ఇక నీవు శోకింపనవసరము లేదు." (34)

శ్రీరాముడు పలికిన హితవచనములను విని, సుగ్రీవుడు అవి తనకు మేలు చేకూర్చునని తలంచి, ఎంతయు సంతసించెను. పిదప శ్రీరామునితో అతడు సముచితరీతిలో ఇట్లు మృదువచనములను నుడివెను. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే దశమఃసర్గః *(10)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది పదియవసర్గము

— * * * —

11. పదునొకండవ సర్గము

సుగ్రీవుడు వాలి బలపరాక్రమములనుగూర్చి శ్రీరామునకు వివరించుట - బలగర్వితుడైన దుందుభి వాలిని యుద్ధమునకు ఆహ్వానించుట - వాలి అతనిని హతమార్చుట - వాలిచే విసరివేయబడిన దుందుభికళేబరమునుండి చిమ్మిన రక్తము మతంగవనమున పడుట - అందులకు మతంగముని వాలిని శపించుట - ఆ శాపకారణముగా వాలి అచటికి రాజాలడని ఎఱింగి, సుగ్రీవుడు తన సచివులతో గూడి ఋశ్యమూక పర్వతమున తలదాచుకొనుట - శ్రీరాముడు తన పరాక్రమముపై సుగ్రీవునకు విశ్వాసమును కలిగించుటకై దుందుభికాయమును కాలికొనగోటితో చిమ్మివేయుట - మద్దిచెట్లను భేదింపుమని సుగ్రీవుడు ఆ ప్రభువును అర్థించుట -

రామస్య వచనం శ్రుత్వా హర్షపౌరుషవర్ధనం।
సుగ్రీవః పూజయాంచక్రే రాఘవం ప్రశశంస చ। 1

శ్రీరాముడు పలికిన మాటలకు సుగ్రీవునిలో సంతోషము వెల్లివిరిసెను, పౌరుషము పురివిప్పుకొనెను. అప్పుడా వానరోత్తముడు శ్రీరాముని పూజించి, ఆయనను కొనియాడెను. (1)

అసంశయం ప్రజ్వలితైః తీక్ష్ణైర్మర్మాతిగైః శరైః।
త్వం దహేః కుపితో లోకాన్ యుగాన్త ఇవ భాస్కరః। 2

"ఓ రామా! పదునైన నీ బాణములు నిప్పులు గ్రక్కుచు శత్రువులయొక్క ఆయువుపట్టులను ఛేదింపగలవు. నీవు కుపితుడవైనచో ప్రళయకాల సూర్యునివలె సమస్తలోకములను దహించివేయగలవు. ఇందులకు ఏమాత్రమును సందేహములేదు. (2)

వాలినః పౌరుషం యత్తత్ యచ్చ వీర్యం ధృతిశ్చ యా।
తన్మమైకమనాః శ్రుత్వా విధత్స్వ యదనంతరమ్। 3

ఓ రఘువీరా! వాలియొక్క బలపరాక్రమములను గూర్చియు, ధైర్యస్థైర్యములను గుఱించియు విన్న పిమ్మట అనంతరకర్తవ్యమును నిర్ణయింపుము. (3)

సముద్రాత్ పశ్చిమాత్ పూర్వం దక్షిణాదపి చోత్తరం।
క్రామత్యనుదితే సూర్యే వాలీ వ్యపగతక్లమః। 4

అగ్రాణ్యారుహ్య శైలానాం శిఖరాణి మహాన్త్యపి।
ఊర్ధ్వముత్క్షిప్య తరసా ప్రతిగృహ్ణాతి వీర్యవాన్। 5

బహవః సారవంతశ్చ వనేషు వివిధా ద్రుమాః।
వాలినా తరసా భగ్నా బలం ప్రథయతాఽఽత్మనః। 6

వాలి బ్రాహ్మీముహూర్తమునందే మేల్కొని, భూమండలమునకు నలుదిక్కులయందుగల వనములలో సంధ్యావందనాదికములను ఆచరించి, సూర్యుడు ఉదయింపకముందే అనాయాసముగా తిరిగి రాగలడు. పరాక్రమశాలియైన వాలి పర్వతముల యొక్కపై భాగములకు చేరి, నాటియొక్క మహోన్నత శిఖరములను బంతులనువలె పైకి ఎగురవేయుచు పట్టుకొనును. అతడు తనబలమును ప్రదర్శించుచు వనములలో చేవదేలిన వివిధములగు పెక్కువృక్షములను అవలీలగా క్షణములో భగ్నమొనర్పగలడు. (4-6)

మహిషో దుందుభిర్నామ కైలాసశిఖరప్రభః।
బలం నాగసహస్రస్య ధారయామాస వీర్యవాన్। 7

వీర్యోత్సేకేన దుష్టాత్మా వరదానాచ్చ మోహితః।
జగామ సుమహాకాయః సముద్రం సరితాం పతిమ్। 8

ఊర్మిమంతమ్ అతిక్రమ్య సాగరం రత్నసంచయమ్।
మహ్యం యుద్ధం ప్రయచ్ఛేతి తమువాచ మహార్ణవమ్। 9

ఒకానొకప్పుడు మహిషాకారముగల ఒక మహారాక్షసుడు ఉండెడివాడు. అతని పేరు దుందుభి. అతని శరీరము కైలాసశిఖరమువలె మిగులఎత్తైనది. ఆపరాక్రమశాలి వేయిఏనుగల బలముగలవాడు. మహాకాయముగల ఆదుష్టుడు దేవతలవలన వరములను పొందుటచే వాటి ప్రభావమున మిక్కిలి బలగర్వితుడై నదీనాథుడైన సముద్రునికడకు వెళ్ళెను. ఉవ్వెత్తు తరంగములతో వివిధములగురత్నరాసులతో ఒప్పుచున్న సాగరమునుజేరి, అతడు దానియెడ చులకన భావమును ప్రదర్శించుచు 'నాతో యుద్ధమునకు రమ్ము' అని ఆ సముద్రుని పిలిచెను.(7-9)

తతః సముద్రో ధర్మాత్మా సముత్థాయ మహాబలః।
అబ్రవీద్వచనం రాజన్ అసురం కాలచోదితమ్। 10

ఓ రామచంద్ర ప్రభూ! మహాబలశాలియు, ధర్మాత్ముడును ఐన ఆ సముద్రుడు జలములనుండి బయటికి వచ్చి, ఆయువుదీరిన ఆ అసురునితో ఇట్లు పలికెను. (10)

సమర్థో నాఽస్మి తే దాతుం యుద్ధం యుద్ధవిశారద।
శ్రూయతాం చాభిధాస్యామి యస్తే యుద్ధం ప్రదాస్యతి। 11

'ఓ దుందుభీ! నీవు యుద్ధమున ఆరితేఱినవాడవు. నీతో యుద్ధమొనర్చుటకు నేను అశక్తుడను. నీతో పోరు సల్పగల సమర్థునిగూర్చి తెల్పెదను వినుము. (11)

శైలరాజో మహారణ్యే తపస్విశరణం పరం,।
శంకరశ్వశురో నామ్నా హిమవానితి విశ్రుతః। 12

గుహాప్రస్రవణోపేతో బహుకందరనిర్ఝరః।
స సమర్థస్తవ ప్రీతిమ్ అతులాం కర్తుమాహవే। 13

తం భీత ఇతి విజ్ఞాయ సముద్రమసురోత్తమః।
హిమవద్వనమాగచ్ఛత్ శరశ్చాపాదివచ్యుతః। 14

తత స్తస్య గిరేః శ్వేతా గజేంద్రవిపులాః శిలాః।
చిక్షేప బహుధా భూమౌ దుందుభిర్విననాద చ। 15

తతఃశ్వేతాంబుదాకారః సౌమ్యః ప్రీతికరాకృతిః।
హిమవాన్ అబ్రవీద్వాక్యం స్వ ఏవ శిఖరే స్థితః। 16

క్లేష్టుమర్హసి మాం న త్వం దుందుభే ధర్మవత్సల।
రణకర్మస్వకుశలః తపస్విశరణం హ్యహమ్। 17

తస్య తద్వచనం శ్రుత్వా గిరిరాజస్య ధీమతః।
ఉవాచ దుందుభిర్వాక్యం రోషాత్ సంరక్తలోచనః। 18

యది యుద్ధేఽసమర్థ స్త్వం మద్భయాద్వా నిరుద్యమః।
తమాచక్ష్వ ప్రదద్యాన్మే యోఽద్య యుద్ధం యుయుత్సతః। 19

హిమవాన్ అబ్రవీద్వాక్యం శ్రుత్వా వాక్యవిశారదః।
అనుక్తపూర్వం ధర్మాత్మా క్రోధాత్ తమసురోత్తమమ్। 20

వాలీ నామ మహాప్రాజ్ఞః శక్రతుల్యపరాక్రమః।
అధ్యాస్తే వానరః శ్రీమాన్ కిష్కింధామ్ అతులప్రభామ్। 21

స సమర్థో మహాప్రాజ్ఞః తవ యుద్ధవిశారదః।
ద్వంద్వయుద్ధం మహద్దాతుం నముచేరివ వాసవః। 22

తం శీఘ్రమ్ అభిగచ్ఛ త్వం యది యుద్ధమిహేచ్ఛసి।
స హి దుర్ధర్షణో నిత్యం శూరః సమరకర్మణి। 23

శ్రుత్వా హిమవతో వాక్యం క్రోధావిష్టః స దుందుభిః।
జగామ తాం పురీం తస్య కిష్కింధాం వాలినస్తదా। 24

ఈ మహారణ్యమునందు 'హిమవంతుడు' అను పేరుతో వాసికెక్కిన ఒక పర్వతరాజు గలడు. అతడు శంకరునకు మామ. తాపసులకు ఆశ్రయుడు. అతడు గుహలతో, సెలయేళ్ళతో ఒప్పుచుండువాడు. వివిధములగు లోయలతో, సెలయేళ్లతో విలసిల్లుచుండువాడు. యుద్ధరంగమున అన్నివిధముల నీకు దీటైనవాడు. ఆ సమర్థునితో యుద్ధము నీకు ప్రీతిని గూర్చును.'(12-13)

సముద్రుడు తనకు భయపడుచున్నాడని తలంచి, ఆమహారాక్షసుడు ధనుస్సునుండి విడువబడిన బాణమువలె హిమవంతుని కడకు చేరెను. అనంతరము దుందుభి మదపుటేనుగువలె విశాలములైన తెల్లని ఆకొండశిలలను భూమిపై విసరికొట్టుచు ఒక మహానాదమునర్చెను.(14-15)

పిమ్మట సౌమ్యుడును, తెల్లనిమేఘములవలె మనోహరమైన ఆకారముగలవాడును ఐన హిమవంతుడు తన శిఖరమున నిలబడి ఆరక్కసునితో ఇట్లు పలికెను.(16)

యుద్ధప్రీతిగల ఓ దుందుభీ! నేను యుద్ధము చేయుటలో నేర్పరిని కాను, కేవలము తాపసులకు ఆశ్రయమైనవాడను మాత్రమే. కనుక నన్ను బాధింపవలదు. (17)

ప్రజ్ఞాశాలియైన ఆపర్వతరాజు మాటలను విని, దుందుభి కోపముతో కన్నులెఱ్ఱజేసినవాడై అతనితో ఇట్లనెను.(18)

'ఓ హిమవంతుడా! నాకు భయపడిగాని, తగిన ప్రయత్నమును చేయలేకగాని నీవు యుద్ధమునకు అసమర్థుడవైనచో యుద్ధమునకై ఉవ్విళ్ళూరుచున్న నాతో పోరుసల్పగల వానినిగూర్చి ఇప్పుడే తెల్పుము. (19)

ధర్మాత్ముడును, మాటనేర్పరియు ఐన హిమవంతుడు దుందుభి పల్కులనువిని, కుపితుడై ఇంతవఱకు ఎవ్వరును చెప్పని యుద్ధవీరునిగూర్చి అతనికి ఇట్లు వివరించెను. (20)

"ఓ దుందుభీ! 'వాలి' అను ఒక వానరప్రముఖుడు గలడు, అతడు యుద్ధతంత్రములను నేర్చినవాడు, పరాక్రమమున ఇంద్రునితో సమానుడు. అతడు ఇప్పుడు మిక్కిలి వైభవోపేతమైన కిష్కింధానగరమున నివసించుచున్నాడు. అతడు మిక్కిలిప్రజ్ఞాశాలి, యుద్ధములలో ఆఱితేఱినవాడు. 'నముచి' అను రాక్షసునకు ఇంద్రునివలె అతడే నీతో ద్వంద్వయుద్ధమునకు చాలినవాడు. సమరరంగమున ఆవీరుని ఎవ్వరును ఎదిరించి యుండలేదు. నీవు ఇప్పుడే యుద్ధము చేయుటకు ఆరాటపడుచున్నచో వెంటనే అతని కడకు వెళ్ళుము. (21-23)

దుందుభి హిమవంతునిమాటలను విని మిగుల క్రుద్ధుడాయెను. వెంటనే అతడు వాలి పాలించుచున్న కిష్కింధానగరమునకు వెళ్లెను. (24)

ధారయన్ మాహిషం రూపం తీక్ష్ణశృంగో భయావహః।
ప్రావృషీవ మహామేఘః తోయపూర్ణో నభస్తలే। 25

తతస్తద్ద్వార మాగమ్య కిష్కింధాయా మహాబలః।
ననర్ద కంపయన్ భూమిం దుందుభిర్దుందుభిర్యథా। 26

సమీపస్థాన్ ద్రుమాన్ భంజన్ వసుధాం దారయన్ ఖురైః।
విషాణేనోల్లిఖన్ దర్పాత్ తద్ద్వారం ద్విరదో యథా। 27

అంతఃపురగతో వాలీ శ్రుత్వా శబ్దమ్ అమర్షణః।
నిష్పపాత సహ స్త్రీభిః తారాభిరివ చంద్రమాః। 28

మితం వ్యక్తాక్షరపదం తమువాచాథ దుందుభిం।
హరీణామ్ ఈశ్వరో వాలీ సర్వేషాం వనచారిణామ్। 29

కిమర్థం నగరద్వారమ్ ఇదం రుద్ధ్వా వినర్దసి।
దుందుభే విదితో మేఽసి రక్ష ప్రాణాన్ మహాబల। 30

తస్య తద్వచనం శ్రుత్వా వానరేంద్రస్య ధీమతః।
ఉవాచ దుందుభిర్వాక్యం రోషాత్ సంరక్తలోచనః। 31

న త్వం స్త్రీసన్నిధౌ వీర వచనం వక్తుమర్హసి।
మమ యుద్ధం ప్రయచ్ఛాద్య తతో జ్ఞాస్యామి తే బలమ్। 32

అథవా ధారయిష్యామి క్రోధమద్య నిశామిమాం।
గృహ్యతామ్ ఉదయః స్వైరం కామభోగేషు వానర। 33

దీయతాం సంప్రదానం చ పరిష్వజ్య చ వానరాన్।
సర్వశాఖామృగేంద్రస్త్వం సంసాదయ సుహృజ్జనాన్। 34

సుదృష్టాం కురు కిష్కింధాం కురుష్వాత్మసమం పురే।
క్రీడస్వ చ సహ స్త్రీభిః అహం తే దర్పనాశనః। 35

యో హి మత్తం ప్రమత్తం వా సుప్తం వా రహితం భృశం।
హన్యాత్ స భ్రూణహా లోకే త్వద్విధం మదమోహితమ్। 36

అతడు వాడియైన కొమ్ములుగల మహిషరూపమును ధరించి భయంకరముగానుండెను. అప్పుడతడు వర్షాకాలము నందు ఆకాశమున నీటితోనిండిన మహామేఘమువలె ఒప్పుచుండెను. అనంతరము మహాబలశాలియైన ఆదుందుభి కిష్కింధాపురద్వారమున నిలిచి, భూమిని దద్దరిల్లజేయుచు దుందుభి (ఢంకా) వలె మహానాద మొనర్చెను. మహిషరూపమునున్న ఆదుందుభి సమీపమునగల వృక్షములను విఱుగగొట్టుచుండెను, గిట్టలతో భూమిని బ్రద్దలుగావించుచుండెను. అతడు గర్వముతో విఱ్ఱవీగుచు, ఏనుగుదంతములతోవలె, తన కొమ్ములతో ఆపురద్వారమును భేదించుచు గర్జించెను. (25-27)

అంతట అంతఃపురముననున్న వాలి ఆ శబ్దమును విని, దానిని సహింపనివాడై, నక్షత్రములతోగూడిన చంద్రునివలె స్త్రీలతోగూడి బయటకివచ్చెను. అనంతరము ఆవనమున సంచరించెడి సమస్తవానరములకును ప్రభువైన వాలి మితముగా, స్పష్టముగా దుందుభితో ఇట్లునుడివెను. (28-29)

"మహాబలశాలివైన ఓ దుందుభీ! నిన్ను నేను బాగుగా ఎఱుగుదును ఎందులకు ద్వారమును బ్రద్దలు గావించుచు అఱచుచున్నావు? ఇక నీ ప్రాణములను కాపాడు కొనుము." (30)

ప్రజ్ఞాశాలియైన ఆవానరేంద్రుని మాటలను విని దుందుభి రోషముతో కన్ను లెఱ్ఱజేసినవాడై, అతనితో ఇట్లనెను.(31)

"ఓ వీరుడా! స్త్రీలసమక్షమున వారి మెప్పుకొఱకై నీవు ఇట్లు మాట్లాడుటతగదు. ఇప్పుడే నాతో యుద్ధ మొనర్పుము. అప్పుడు నీబలమెంతటిదో బయటపడగలదు. లేదా ఓవానరా! ఈరాత్రివఱకు నేను నా కోపమును నిగ్రహించుకొందును. కనుక నీవు సూర్యోదయము వఱకును స్వేచ్ఛగా సాంసారికసుఖములను, భోగములను అనుభవింపుము. ఇక ఇది నీకు అవసానదశ. కనుక సర్వవానరములకు ప్రభువువైన నీవు నీకోరికమేరకు నీబంధుమిత్రులందఱికిని తనివిదీర దానధర్మములను చేసికొనుము. వారిని ఆత్మీయతతో కౌగిలించుకొని, వీడ్కోలు తీసికొనుము ఈ కొద్దికాలమైనను వారితో గడుపుము. చివరిసారిగా నీ కిష్కింధానగరమును తేఱిపాఱజూచుకొనుము. నీకు సాటియైన పుత్రుడు మొదలగువారికి నీ రాజ్యాధికారమును అప్పగింపుము. స్త్రీలతో నేడు తృప్తిగా క్రీడింపుము. పిమ్మట నేను నీ గర్వమును రూపుమాపెదను. మద్యపానాదులచే మత్తిల్లియున్నవానిని, యుద్ధమునకు సిద్ధముగాలేనివానిని, నిద్రలోనున్నవానిని, పూర్తిగా నిరాయుధుని, స్త్రీలమధ్య కామపరవశుడైయున్న నీవంటివానిని చంపినవాడు భ్రూణహత్య చేసినవాడగును." (32-36)

స ప్రహస్యాబ్రవీన్మందం క్రోధాత్తమ్ అసురోత్తమమ్।
విసృజ్య తాః స్త్రియః సర్వాః తారాప్రభృతికాస్తదా। 37

మత్తోయమితి మా మంస్థా యద్యభీతోఽసి సంయుగే।
మదోఽయం సంప్రహారేఽస్మిన్ వీరపానం సమర్థ్యతామ్। 38

తమేవముక్త్వా సంక్రుద్ధో మాలాముత్క్షిప్య కాంచనీం।
పిత్రా దత్తాం మహేంద్రేణ యుద్ధాయ వ్యవతిష్ఠత। 39

విషాణయోర్గృహీత్వా తం దుందుభిం గిరిసన్నిభం।
ఆవిధ్యత తదా వాలీ వినదన్ కపికుంజరః। 40

వాలీ వ్యాపాదయాంచక్రే ననర్ద చ మహాస్వనమ్।
శ్రోత్రాభ్యామ్ అథ రక్తం తు తస్య సుస్రావ పాత్యతః। 41

తయోస్తు క్రోధసంరంభాత్ పరస్పరజయైషిణోః।
యుద్ధం సమభవద్ఘోరం దుందుభేర్వానరస్య చ। 42

అయుధ్యత తదా వాలీ శక్రతుల్యపరాక్రమః।
ముష్టిభిర్జానుభిశ్చైవ శిలాభిః పాదపైస్తథా। 43

పరస్పరం ఘ్నతోస్తత్ర వానరాసురయో స్తదా।
ఆసీదదసురో యుద్ధే శక్రసూనుర్వ్యవర్ధత। 44

వ్యాపారవీర్యధైర్యైశ్చ పరిక్షీణం పరాక్రమైః।
తం తు దుందుభిముత్పాట్య ధరణ్యామ్ అభ్యపాతయత్। 45

యుద్ధే ప్రాణహరే తస్మిన్ నిష్పిష్టో దుందుభి స్తదా।
పపాత చ మహాకాయః క్షితౌ పంచత్వమాగతః। 46

తం తోలయిత్వా బాహుభ్యాం గతసత్త్వమ్ అచేతనమ్।
చిక్షేప బలవాన్ వాలీ వేగేనైకేన యోజనమ్। 47

అంతట ఆవాలి ముసిముసి నవ్వులు నవ్వుచు తన భార్యయైన తారను, తదితర స్త్రీలను అందఱిని అవలికి పంపివైచి, క్రుద్ధుడై ఆరాక్షసునితో ఇట్లు పలికెను. (37)

"ఓరీ! దుందుభీ! యుద్ధము చేయుటకు నిజముగా నీకు ధైర్యమున్నచో కాచుకొనుము. ఈ వాలి మధుపానముచేసి, మత్తిల్లియున్నాడని భావింపకుము. ఈ మద్యపానమును యుద్ధసమయమున 'వీరపానము'గా ఎఱుంగుము. (సమరోత్సాహమును పెంచుకొనుటకై వీరులు చేసెడి మద్యపానమును 'వీరపానము' అని యందురు.) (38)

వాలి కోపములో ఇట్లు పలికి, తనతండ్రియైన దేవేంద్రుడు ఒసంగిన బంగారుహారమును మెడలో వేసికొని[1] యుద్ధమునకు సిద్ధమై నిలిచెను. పిమ్మట పర్వతమువలె మహాకాయుడై మహిషాకృతిలో నున్న దుందుభియొక్క కొమ్ములను పట్టుకొని, వానరశ్రేష్ఠుడైన వాలి అతనిని గిరగిరత్రిప్పి నేలకేసికొట్టి బిగ్గఱగా గర్జించెను. ఆవిధముగాకొట్టబడిన దుందుభియొక్క చెవులనుండి రక్తముస్రవించెను. (39-41)

వాలిదుందుభులిద్దఱును ఒకరిని మఱియొకరు జయింపవలెననెడి కోరికతో క్రోధావేశముతో విజృంభింపగా వారిమధ్య పోరు ఘోరముగా సాగెను. అప్పుడు ఇంద్రునితో సమానమైన పరాక్రమశాలియగు వాలి దుందుభిని పిడికిళ్లతో గ్రుద్దుచు, మోకాళ్లతో కుమ్ముచు, ఱాళ్లతో కొట్టుచు, అతనిపై వృక్షములను పెకలించి వేయుచు ఘోరముగా యుద్ధమొనర్చెను. (42-43)

ఒకరిపైనొకరు దెబ్బతీయుచు, వాలిదుందుభుల మధ్య కొనసాగిన యుద్ధములో రాక్షసునియొక్కశక్తి సన్నగిల్లెను. వాలిబలము ఇనుమడించెను. (44)

దుందుభియొక్క ఇంద్రియములశక్తిసామర్థ్యములు బలహీనములగుచుండెను. శౌర్యధైర్యములు సడలుచుండెను, పరాక్రమము క్షీణించుచుండెను. ఆ స్థితిలో వాలి విజృంభించి, ఆఅసురుని పైకెత్తి నేలకేసికొట్టెను. ప్రాణములను బలిగొనెడి అయుద్ధమున మహాకాయుడైన దుందుభి వాలిచేతిలో నుగ్గునుగ్గై, నేలకొఱిగి, ప్రాణములను విడిచెను.(45-46)

ఆవిధముగా చచ్చిపడియున్న ఆదుందుభికళేబరమును మహాబలశాలియైన వాలి తన చేతులతో పైకెత్తి, ఒకే ఒక్క ఊపుతో యోజనదూరమున పడవేసెను. అట్లు

1) వాలి దేవేంద్రుని అంశతో పుట్టినవాడు. అతడు వాలికి ఒక బంగారు హారమును బహూకరించెను. ఆమాలను ప్రసాదించుచు ఇంద్రుడు "ఓ వాలీ! నీవు దీనిని ధరించినచో నిన్ను ఎదిరించి, నీతో యుద్ధము చేయుటకు వచ్చిన వీరుడు ఎంతటి వాడైనను వాని బలమంతయును నిన్ను చేరును" అని పలికెను. ఆ మాలమహిమ అట్టిది.

తస్య వేగప్రవిద్ధస్య వక్త్రాత్ క్షతజబిందవః।
ప్రపేతుర్మారుతోత్క్షిప్తా మతంగస్యాశ్రమం ప్రతి। 48

తాన్ దృష్ట్వా పతితాంస్తస్య మునిః శోణితవిప్రుషః।
క్రుద్ధస్తత్ర మహాభాగః చింతయామాస కోన్వయమ్। 49

యేనాఽహం సహసా స్పృష్టః శోణితేన దురాత్మనా।
కోఽయం దురాత్మా దుర్బుద్ధిః అకృతాత్మా చ బాలిశః। 50

ఇత్యుక్త్వాఽథ వినిష్క్రమ్య దదర్శ మునిపుంగవః।
మహిషం పర్వతాకారం గతాసుం పతితం భువి। 51

స తు విజ్ఞాయ తపసా వానరేణ కృతం హి తత్।
ఉత్ససర్జ మహాశాపం క్షేప్తారం వాలినం ప్రతి। 52

ఇహ తేనాప్రవేష్టవ్యం ప్రవిష్టస్య వధో భవేత్।
వనం మత్సంశ్రయం యేన దూషితం రుధిరస్రవైః।
సంభగ్నాః పాదపాశ్చేమే క్షిపతేహాసురీం తనుమ్। 53

సమంతాద్యోజనం పూర్ణమ్ ఆశ్రమం మామకం యది।
ఆగమిష్యతి దుర్బుద్ధిః వ్యక్తం స న భవిష్యతి। 54

యే చాపి సచివాస్తస్య సంశ్రితా మామకం వనం।
న చ తైరిహ వస్తవ్యం శ్రుత్వా యాంతు యథాసుఖమ్। 55

యది తేఽపీహ తిష్ఠంతి శపిష్యే తానపి ధ్రువం।
వనేఽస్మిన్ మామకే నిత్యం పుత్రవత్ పరిరక్షితే। 56

పత్రాంకుర వినాశాయ ఫలమూలాభవాయ చ। 57

దివసశ్చాస్య మర్యాదా యం ద్రష్టా శ్వోఽస్మి వానరం।
బహువర్షసహస్రాణి స వై శైలో భవిష్యతి। 58

తతస్తే వానరాః శ్రుత్వా గిరం మునిసమీరితాం।
నిశ్చక్రముర్వనాత్ తస్మాత్ తాన్ దృష్ట్వా వాలిరబ్రవీత్। 59

విసరివేయబడిన ఆరాక్షసుని యొక్క నోటినుండి స్రవించుచున్న రక్తబిందువులు గాలివాటున వచ్చి మతంగముని ఆశ్రమమునపై పడెను. (47-48)

అప్పుడు ఆఆశ్రమమునయున్న మతంగమహాముని తనపై పడిన ఆ రక్తపు చుక్కలను చూచి, క్రుద్ధుడై 'ఈ పనిచేసినదెవరు?' అని ఆలోచింపసాగెను. (49)

'దుస్సాహసమునకు ఒడిగట్టి, నాపై ఈరక్తమును చిందించిన ఆ దుర్మార్గుడు ఎవడు? నిజముగా అతని స్వభావము చెడ్డది. అతడు బుద్ధిహీనుడు, ముందు వెనుకలు ఆలోచింపనివాడు (తొందరపాటుగలవాడు) మూర్ఖుడు.' ఇట్లు భావించిన పిమ్మట ఆమహర్షి తన ఆశ్రమము వెలుపలికి వచ్చి, పర్వతాకారమున నేలపైబడియున్న మహిషరూపముగల ఒక కళేబరమును జూచెను.(50-51)

'ఈ అకృత్యమునకు పాల్పడినవాడు వానరప్రముఖుడైన వాలి' యని ఆమహాముని తన తపశ్శక్తిచే గ్రహించెను. వెంటనే అతడు తనపై రక్తము పచ్చిపడుటకు కారకుడైన ఆవాలిని ఇట్లు శపించెను. (52)

'నేను నివసించుచున్న ఈ వనమును నెత్తురుచుక్కలతో వాలి అపవిత్రమొనర్చెను. ఇచటి మహావృక్షములను అతడు ధ్వంసము చేసెను. ఇందు రాక్షసునిశవమును పడవేసెను. కనుక అతడు శిక్షార్హుడు. ఆవాలి ఈ ఋశ్యమూకవనము (పర్వతము)నందు ప్రవేశింపరాదు. ఒకవేళ సాహసించి ఇందు అడుగిడినచో అతనికి మరణము తథ్యము. (53)

నా ఆశ్రమమునకు (ఋశ్యమూక పర్వతమునకు) చుట్టును ఒక యోజనము లోపల కాలుమోపినచో నిస్సందేహముగా అతడు నశించును. అతని మంత్రులు మొదలగు వారు సైతము నా ఆశ్రమప్రాంతమున నివసింపరాదు. ఒకవేళ నివసించి ఉన్నచో వారు నా ఆదేశమును పాటించుచు ఇచటనుండి ఎక్కడికైనను స్వేచ్ఛగా వెళ్లవచ్చును. ఈ నావనమునందలి మొక్కలను, కొమ్మలను, ఆకులను, ఫలమూలములను పుత్రునితో సమానముగా రక్షించుకొనుచున్నాను. కావున వాలి పక్షమునకు చెందినవారు నా ఆదేశమును కాదని ఇచట ఉన్నచో వారినిగూడ శపింతును. ఇది వాస్తవము. (54-57)

వారికి (వాలికి చెందినవారికి) ఒక దినముమాత్రమే గడువు విధించుచున్నాను రేపటినుండి వారిలో ఏవానరుడు నాకు కనబడినను అతడు వేలకొలది సంవత్సరములు ఒక పాషాణమై పడియుండును.' (58)

అనంతరము ఆమతంగవనప్రాంతమున నివసించుచున్న వానరులు (వాలికి సంబంధించినవారు)

కిం భవంతః సమస్తాశ్చ మతంగవనవాసినః।
మత్సమీపమ్ అనుప్రాప్తా అపి స్వస్తి వనౌకసామ్। 60

తతస్తే కారణం సర్వం తదా శాపం చ వాలినః।
శశంసుర్వానరాః సర్వే వాలినే హేమమాలినే। 61

ఏతచ్ఛ్రుత్వా తదా వాలీ వచనం వానరేరితమ్।
స మహర్షిం తదాఽఽసాద్య యాచతే స్మ కృతాంజలిః। 62

మహర్షిస్తమనాదృత్య ప్రవివేశాశ్రమం తదా।
శాపధారణభీతస్తు వాలీ విహ్వలతాం గతః। 63

తతః శాపభయాద్భీత ఋశ్యమూకం మహాగిరిం।
ప్రవేష్టుం నేచ్ఛ తి హరిః ద్రష్టుం వాపి నరేశ్వర। 64

తస్యాఽప్రవేశం జ్ఞాత్వాఽహమ్ ఇదం రామ మహావనం।
విచరామి సహామాత్యై విషాదేన వివర్జితః। 65

ఏషోఽస్థినిచయస్తస్య దుందుభేః సంప్రకాశతే।
వీర్యోత్సేకాన్నిరస్తస్య గిరికూటోపమో మహాన్। 66

ఇమే చ విపులాః సాలాః సప్త శాఖావలంబినః।
యత్రైకం ఘటతే వాలీ నిష్పత్రయితుమోజసా। 67

ఏతదస్యాఽసమం వీర్యం మయా రామ ప్రకీర్తితం।
కథం తం వాలినం హంతుం సమరే శక్ష్యసే నృప। 68

తథా బ్రువాణం సుగ్రీవం ప్రహసన్ లక్ష్మణోఽబ్రవీత్।
కస్మిన్ కర్మణి నిర్వృత్తే శ్రద్దధ్యా వాలినో వధమ్। 69

తమువాచాథ సుగ్రీవః సప్త సాలానిమాన్ పురా।
ఏవమేకైకశో వాలీ వివ్యాథాఽథ స చాసకృత్। 70

ఆ వనమును వీడి వాలికడకు వెళ్లిరి. వారిని జూచి, వాలి 'పూజ్యులైన మీరందఱును మతంగవనప్రదేశమున నివసించుచున్నవారుగదా! మఱి అచటినుండి నాకడకు ఎందులకు వచ్చితిరి? అదిసరే! మనవానరులందఱును కుశలమేగదా? అని వారిని ప్రశ్నించెను. (59-60)

అంతట ఆవానరులందఱును తాము ఆప్రదేశమును విడిచిపెట్టివచ్చిన కారణమును, ఆముని వాలిని శపించిన విషయమును బంగారు హారమును ధరించియున్న అతనికి (ఆవాలికి) వివరముగా తెలిపిరి. (61)

అప్పుడు వాలి ఆవానరులు నుడివిన వచనములను శ్రద్ధగా ఆలకించెను. వెంటనే అతడు మతంగమహర్షి సమీపమునకు వెళ్లి, దోసిలొగ్గి తనను క్షమింపవలసినదిగా ప్రార్థించెను. అప్పుడా మహాముని అతని మాటలను సరకుగొనక తన ఆశ్రమములోపలికి వెళ్లెను. అంతట ఆ శాపప్రభావమునకు భీతిల్లి, వాలి వ్యాకులపాటుతో తిరిగి ఇంటికి చేరెను. ఓ రామా! అప్పటినుండియు ఆవాలి ఈ ఋశ్యమూక పర్వతమున ప్రవేశించుటకుగాని, కనీసము దీనిని కన్నెత్తి చూచుటకుగాని ఆలోచించుటయే లేదు. (62-64)

ఓ రఘువరా! వాలి ఇచటికి రాజాలడని ఎఱింగి, అమాత్యులతో గూడి నేను దుఃఖరహితుడనై ఇచట సంచరించు చుంటిని.(65)

ఇదిగో దుందుభియొక్క అస్థిపంజరము ఇచటనే పడియున్నది గమనింపుము, ఇది ఒక పర్వతశిఖరమువలె ఒప్పుచున్నది. వాలి తనబలముకొలది దీనిని ఇంత దూరమున పడునట్లు విసరివేసెను. (66)

రామా! ఇదిగో ఇటుచూడుము. ఇచట విశాలమైన, దృఢమైన ఏడు మద్దిచెట్లుగలవు, వాటికొమ్మలు ఎంతో దూరము వఱకు వ్యాపించియున్నవి. వాలి వాటినన్నింటిని ఒకే ఒక్క దెబ్బతో బలముగా ఊపి, వాటి ఆకులన్నియును రాలిపోవునట్లు చేయుగలడు. (67)

ఓ రఘురామా వాలియొక్క సాటిలేని బలపరాక్రమములను గూర్చి నీకు బాగుగా తెలిపితిని. ఓ రాకుమారా! అతనిని యుద్ధమున నీవు ఎట్లు చంపగలవు?" (68)

అంతట లక్ష్మణుడు దరహాసముచేయుచు అట్లు పలుకుచున్న సుగ్రీవునితో "ఓ వానరోత్తమా శ్రీరాముడు వాలిని చంపగలడు.' అను విశ్వాసము కలుగుటకై అతడేమి చేయవలయును?' అని పలికెను. (69)

అప్పుడు సుగ్రీవుడు లక్ష్మణునితో ఇట్లు నుడివెను. "ఇదివరలో వాలి ఈ ఏడు సాలవృక్షములలో ఒక్కొక్క దానిని అనేక పర్యాయములు భగ్నముగావించెను. కనుక వీటిలో ఒక్కచెట్టును శ్రీరాముడు ఒకే ఒక్క బాణముతో ఛేదించినచో, అప్పుడు ఈయన పరాక్రమమును జూచి,

రామోఽపి దారయేదేషాం బాణేనైకేన చేద్ద్రుమం।
వాలినం నిహతం మన్యే దృష్ట్వారామస్య విక్రమమ్। 71

హతస్య మహిషస్యాస్థి పాదేనైకేన లక్ష్మణ।
ఉద్యమ్యాథ ప్రక్షిపేచ్చేత్ తరసా ద్వే ధనుఃశతే। 72

ఏవ ముక్త్వా తు సుగ్రీవో రామం రక్తాంతలోచనమ్।
ధ్యాత్వా ముహూర్తం కాకుత్స్థం పునరేవ వచోఽబ్రవీత్। 73

శూరశ్చ శూరఘాతీ చ ప్రఖ్యాతబలపౌరుషః।
బలవాన్ వానరో వాలీ సంయుగేష్వపరాజితః। 74

దృశ్యంతే చాఽస్య కర్మాణి దుష్కరాణి సురైరపి।
యాని సంచింత్య భీతోఽహమ్ ఋశ్యమూకం సమాశ్రితః। 75

తమజయ్యమ్ అధృష్యం చ వానరేంద్రమ్ అమర్షణమ్।
విచింతయన్ న ముంచామి ఋశ్యమూకమహం త్వివమ్। 76

ఉద్విగ్నః శంకితశ్చాపి విచరామి మహావనే।
అనురక్తైః సహామాత్యైః హనుమత్ప్రముఖైర్వరైః। 77

ఉపలబ్ధం చ మే శ్లాఘ్యం సన్మిత్రం మిత్రవత్సల।
త్వామహం పురుషవ్యాఘ్ర హిమవంతమివాశ్రితః। 78

కిం తు తస్య బలజ్ఞోఽహం దుర్భ్రాతుర్బలశాలినః।
అప్రత్యక్షం తు మే వీర్యం సమరే తవ రాఘవ। 79

న ఖల్వహం త్వాం తులయే నాఽవమన్యే న భీషయే।
కర్మభిస్తస్య భీమైస్తు కాతర్యం జనితం మమ। 80

'వాలిని ఇతడు చంపగలడు' అని తలంచెదను. మఱియు హతుడైన దుందుభియొక్క ఈ అస్థిపంజరమును ఒకే పాదముతో లేవనెత్తి, బలముకొలది రెండువందల ధనుస్సుల దూరములో (800 మూరలు లేక 400 గజముల దూరములో) పడునట్లు విసిరినను 'రాముడు వాలిని హతమొనర్పగలడు' అని నమ్మెదను. (70-72)

పిమ్మట సుగ్రీవుడు తనలో తాను కొంతతడవు ఆలోచించి, కనులలో ఎఱ్ఱని జీరలుగల శ్రీరామునితో మఱల ఇట్లు నుడివెను. (73)

వానరోత్తముడైన వాలి మిగుల బలవంతుడు, శూరుడు, శూరులనుసైతము పరిమార్పగలవాడు, అతని పరాక్రమము, పౌరుషము ఎంతయువాసికెక్కినవి. యుద్ధములలో ఓటమిని ఎఱుగనివాడు. లోకవిదితములైన అతనిసాహసకృత్యములన్నియును దేవతలకును అసాధ్యములు.[1] వాటిని పలుమార్లు తలంచుకొని భీతిల్లి, ఈ ఋశ్యమూక పర్వతమును ఆశ్రయించితిని. (74-75)

వానరేంద్రుడైన వాలి జయింపశక్యముకానివాడు, సాధారణముగా అతనిని ఎదిరించుట అసాధ్యము, అతడు క్రోధస్వభావముగలవాడు. అతనిని తలచుకొన్నంతనే నాకు దడ పుట్టును. అందువలన నేను ఈ ఋశ్యమూక పర్వతమును విడిచివెళ్లుటలేదు. అతనివలన ఎప్పుడు ఎట్టి ప్రమాదము ముంచుకొనివచ్చునోయను శంకతో మిగుల ఆందోళనపడుచు ఇచట మసలుకొనుచున్నాను. హనుమంతుడు మున్నగు వానరప్రముఖులు నాకు సచివులు. సర్వసమర్థులు, నాయందు అనురాగము గలవారు. వారు నాకు తోడుగా ఉన్నారు. (76-77)

మిత్రులకు అండగానుండెడి ఓ రామా! నీవు కొనియాడదగిన ఉత్తమమిత్రుడవు. పురుషశ్రేష్ఠుడవైన నీవు నాకు మిత్రుడుగా లభించుట నా భాగ్యము. హిమవంతునివలె మహోన్నతుడవైన నిన్ను నేను ఆశ్రయించితిని. ఓ రఘువీరా! నా సోదరుడు మిక్కిలి దుర్మార్గుడు, అతడు మిగులబలశాలి. అతని బలపరాక్రమములను గూర్చి నేను బాగుగా ఎఱుగుదును. కాని యుద్ధమునందు నీ శక్తిసామర్థ్యములను నేను చూచియుండలేదుగదా! ఓ ప్రభూ! నిన్ను వాలితో పోల్చిచెప్పుట నిజముగా నా ఉద్దేశ్యముగాదు. నిన్ను చులకనగా భావించుటగాని, భయపెట్టుటగాని అసలేగాదు.

1) నాలుగు సముద్రములను అవలీలగా చుట్టివచ్చుట, పర్వతశిఖరములను బంతులనువలె ఎగురవేసి పట్టుకొనుట, దుందుభి కళేబరమును ఒక యోజన దూరమున పడునట్లు విసరివేయుట, మద్దిచెట్లను భేదించుట - అనునవి వాలియొక్క కొన్ని సాహసకృత్యములు.

కామం రాఘవ తే వాణీ ప్రమాణం ధైర్యమాకృతిః।
సూచయంతి పరం తేజో భస్మచ్ఛన్నమివానలమ్। 81

స్నిగ్ధానాం ప్రీతియుక్తానాం సుహృదాం సుహృదం ప్రతి।
కాతరం హృదయం రామ ప్రత్యయం నాఽధిగచ్ఛతి। 82

యది బాణేన భేత్తా త్వం సాలాన్ సప్తాద్య రాఘవ।
వాలినం సమరే హంతుం సమర్థః స్యాత్ తతో భవాన్। 83

తస్య తద్వచనం శ్రుత్వా సుగ్రీవస్య మహాత్మనః।
స్మితపూర్వమథో రామః ప్రత్యువాచ హరిం ప్రభుః। 84

యది న ప్రత్యయోఽస్మాసు విక్రమే తవ వానర।
ప్రత్యయం సమరే శ్లాఘ్యమ్ అహముత్పాదయామి తే। 85

ఏవముక్త్వాతు సుగ్రీవం సాంత్వం లక్ష్మణపూర్వజః।
రాఘవో దుందుభేః కాయం పాదాంగుష్ఠేన లీలయా।
తోలయిత్వా మహాబాహుః చిక్షేప దశయోజనమ్। 86

అసురస్య తనుం శుష్కం పాదాంగుష్ఠేన వీర్యవాన్।
క్షిప్తం దృష్ట్వా తతః కాయం సుగ్రీవః పునరబ్రవీత్। 87

లక్ష్మణస్యాగ్రతో రామం తపంతమివ భాస్కరమ్।
హరీణామగ్రతో వీరమ్ ఇదంవచనమబ్రవీత్। 88

ఆర్ద్రః సమాంసః ప్రత్యగ్రః క్షిప్తః కాయః పురా సఖే।
లఘుః సంప్రతి నిర్మాంసః తృణభూతశ్చ రాఘవ। 89

పరిశ్రాంతేన మత్తేన భ్రాత్రా మే వాలినా తదా।
క్షిప్తమేవం ప్రహర్షేణ భవతా రఘునందన।
నాఽత్ర శక్యం బలం జ్ఞాతుం తవ వా తస్య వాఽధికమ్। 90

ఆర్ద్రం శుష్కమితి హ్యేతత్ సుమహద్రాఘవాంతరమ్।
స ఏవ సంశయస్తాత తవ తస్య చ యద్బలే। 91

అతని క్రూరకర్మలకు నాలో గూడుకట్టుకొనియున్న అధైర్యమును నీముందుచుటయే నా లక్ష్యము. ఓ రాఘవా! నీవు చేసిన వాగ్దానము, నీ నిశ్చలబుద్ధి, చెక్కుచెదరని నీ ధైర్యము, నిండైన నీ విగ్రహము ఇవి చాలును. నివురు గప్పిన నిప్పువంటి నీతేజస్సును ఇవి సూచించుచున్నవి. (78-81)

మిత్రులు ఎంతగా ప్రేమను కనబఱచుచున్నను, గాఢమైత్రిని చూపుచున్నను వారు మిత్రునిహృదయము నందలి బెదురుస్థితిని తొలగింపజాలరు, అతనిలో పూర్తి విశ్వాసమును నింపజాలరు. పూజ్యుడవైన నీవు ఈ ఏడుమద్దిచెట్లను ఒకే ఒక్క బాణముతో భేదించినప్పుడు మాత్రమే నీవు యుద్ధమున వాలిని చంపుటకు సమర్థుడవు. అని నేను విశ్వసింతును." (82-83)

మిక్కిలి బుద్ధిశాలియైన సుగ్రీవునిఆమాటలను విని శ్రీరాముడు ఒక్క చిఱునవ్వువిందించెను. పిమ్మట అప్రభువు అతనితో ఇట్లు నుడివెను. (84)

"ఓ వానరోత్తమా! పరాక్రమవిషయమున నాయందు నీకు విశ్వాసము కుదురుకొననిచో, యుద్ధసమయమున నాశక్తిసామర్థ్యములపై నీకు పూర్తినమ్మకమును కలిగింతును." (85)

మిగుల భుజబలశాలియైన శ్రీరాముడు ఇట్లు పలికిన పిమ్మట సుగ్రీవునకు విశ్వాసమును కలిగించుటకై తన కాలిబొటనవ్రేలితో దుందుభియొక్క అస్థిపంజరమును అవలీలగా లేవనెత్తి, అది పదియోజనముల దూరమున పడునట్లు చిమ్మివేసెను. (86)

రక్తమాంసములు లేక ఎండి డొల్లగానున్న ఆదుందుభియొక్క కళేబరమును శ్రీరాముడు చిమ్మివేయుటను సుగ్రీవుడు స్వయముగా దర్శించెను. పిమ్మట వేడికిరణములను వెదజల్లుచున్న సూర్యునివలె తేజశ్శాలియైన శ్రీరామునితో అతడు అచటనున్న లక్ష్మణునిసమక్షమున, వానర ముఖ్యులైన హనుమదాదులఎదుట అర్థవంతముగా మఱల ఇట్లు పచించెను. (87-88)

"ఓ మిత్రమా! అప్పుడు మాఅన్న యుద్ధము చేసి మిగుల అలసి మత్తిల్లియుండెను. ఐనను అతడు రక్తమాంసములతో, కొనయూపిరితో నున్న దుందుభియొక్క బరువైన కాయమును దూరముగా చిమ్మివేసెను. కాని ఇప్పుడది రక్తమాంసములు లేకుండ గడ్డిపరకవలె తేలికగా ఉన్నది. ఓ రఘునందనా! అట్టి అస్థిపంజరమును నీవు సులభముగా ఎగురగొట్టితివి. అందువలన దీనినిబట్టి మీ ఇరువురిలో ఎవరిశక్తి గొప్పదో తెలిసికొనుటకు వలనుపడదు. ఓ రాఘవా! దుందుభికాయము అప్పుడేమో రక్తమాంసములతో బరువుగా ఉండెను. ఇప్పుడది

సాల మేకం తు నిర్భింద్యా భవేద్వ్యక్తిర్బలాబలే। 92

కృత్స్నేమం కార్ముకం సజ్యం హస్తిహస్తమివాతతం।
ఆకర్ణపూర్ణమ్ అయమ్య విసృజస్వ మహాశరమ్। 93

ఇమం హి సాలం సహితస్త్వయా శరో
న సంశయోఽత్రాస్తి విదారయిష్యతి।
అలం విమర్శేన మమ ప్రియం ధ్రువం
కురుష్వ రాజాత్మజ శాపితో మయా। 94

యథా హి తేజస్సు వర: సదా రవి:
యథా హి శైలో హిమవాన్ మహాద్రిషు।
యథా చతుష్పాత్సు చ కేసరీ వర:
తథా నరాణామసి విక్రమే వర:। 95

ఎండిపోయి తేలికగానున్నది. అప్పటికిని ఇప్పటికిని గల భేదము ఇదియే. కనుక ఓ ప్రభూ! మీ ఇరువురి బలాబలములను గూర్చిన నా సంశయము తీరలేదు. అందువలన నీవు ఒక మద్దిచెట్టును ఛేదించినచో మీ బలాబలములు వెల్లడియగును. (89-92)

ఓ రామా! ఏనుగుతొండమువలె బలమైన నీ ఈ ధనుస్సును బాగుగా సంధించి, ఆకర్ణాంతము లాగి, శక్తిమంతమైన బాణమును వదలుము. ఓ రాజకుమారా! నీవు వదలిన బాణము ఈ సాలవృక్షమును తప్పక భేదింపగలదు. ఈ మాటను నేను ప్రమాణపూర్వకముగా పలుకుచున్నాను. ఇందు ముందు వెనుకలాలోచింపవలసిన పనియే లేదు. ఈ నానమ్మకమును నిజము చేయుము. ఇది నా తృప్తికొఱకే గాని నిన్ను పరీక్షించుటకుగాదు. (93-94)

తేజోమూర్తులలో సూర్యుడు గొప్పవాడు. మహాపర్వతములలో హిమవంతుడు మేలుబంతి. జంతువులలో సింహము మహాశక్తిశాలి. అట్లే పరాక్రమవిషయమున మానవులలో నీవు సాటిలేనివాడవు." (95)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకాదశ: సర్గ: (11)

ఇది వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది పదునొకండవసర్గము

-- * * * --

12. పండ్రెండవసర్గము

శ్రీరాముడు ఏడుమద్దిచెట్లను భేదించుట - ఆ స్వామిశౌర్యపరాక్రమములపై సుగ్రీవునకు నమ్మకము ఏర్పడుట - రఘువరుని సూచనమేరకు సుగ్రీవుడు వాలిని యుద్ధమునకు ఆహ్వానించుట - ఆ ఇరువురును ఘోరముగా పోరాడుట - ఆ అన్నదమ్ముల పోలికలు ఒక్కటిగా ఉండుటవలన శ్రీరాముడు తన బాణమును ప్రయోగింపకుండుట - యుద్ధమున దెబ్బతినిన సుగ్రీవుడు మతంగ వనమునకు చేరుట - శ్రీరాముడు అతనిని ఓదార్చి, కంఠమున (గుర్తుగా) ఒక మాలను ధరింపజేసి, వాలితో మరల యుద్ధమునకు పంపుట -

ఏతచ్చ వచనం శ్రుత్వా సుగ్రీవేణ సుభాషితం।
ప్రత్యయార్థం మహాతేజా రామో జగ్రాహ కార్ముకమ్। 1

స గృహీత్వా ధనుర్ఘోరం శరమేకం చ మానద:।
సాలముద్దిశ్య చిక్షేప జ్యాస్వనై: పూరయన్ దిశ:। 2

స విసృష్టో బలవతా బాణ: స్వర్ణపరిష్కృత:।
భిత్త్వా సాలాన్ గిరిప్రస్థే సప్త భూమిం వివేశ హ। 3

ప్రవిష్టశ్చ ముహూర్తేన ధరాం భిత్త్వా మహాజవ:।
నిష్పత్య చ పునస్తూర్ణం స్వతూణీం ప్రవివేశ హ। 4

తాన్ దృష్ట్వా సప్త నిర్భిన్నాన్ సాలాన్ వానరపుంగవ:।
రామస్య శరవేగేన విస్మయం పరమం గత:। 5

అంతట మహాతేజస్వియైన శ్రీరాముడు సుగ్రీవుడు పలికిన సముచితములైన వచనములను విని, అతని విశ్వాసముకొఱకువెంటనే తన ధనువును చేతబట్టెను. (1)

లోకవిఖ్యాతుడైన రామచంద్రుడు తన కోదండమును గ్రహించిన పిమ్మట ధనుష్టంకారములతో దిక్కులను పిక్కటిల్లజేయుచు ఒక మద్దిచెట్టును గురిచేసి, వాడియైన ఒక బాణమును ప్రయోగించెను. మహావీరుడైన రఘువరుడు వేసిన ఆ బంగారుబాణము ఏడు మద్దిచెట్లను చీల్చుకొనుచు, కొండచరియద్వారా పాతాళమున ప్రవేశించెను. మిక్కిలివేగముతో అధోలోకములను చీల్చుకొని వెళ్లిన ఆబాణము క్షణకాలములో తిరిగి వచ్చి, మరల శ్రీరాముని తూణీరములో చేరెను.(2-4)

శ్రీరామునిబాణము ఆఏడుమద్దిచెట్లను ఒక్క దెబ్బతో అట్లు చీల్చివేయుటనుజూచి, సుగ్రీవుడు మిగుల

స మూర్ధ్నా న్యపతద్భూమౌ ప్రలంబీకృతభూషణః।
సుగ్రీవః పరమప్రీతో రాఘవాయ కృతాంజలిః। 6

ఇదం చోవాచ ధర్మజ్ఞం కర్మణా తేన హర్షితః।
రామం సర్వాస్త్రవిదుషాం శ్రేష్ఠం శూరమవస్థితమ్। 7

సేంద్రానపి సురాన్ సర్వాన్ త్వం బాణైః పురుషర్షభ।
సమర్థః సమరే హంతుం కిం పునర్వాలినం ప్రభో। 8

యేన సప్త మహాసాలా గిరిర్భూమిశ్చ దారితాః।
బాణేనైకేన కాకుత్స్థ స్థాతా తే కో రణాగ్రతః। 9

అద్య మే విగతః శోకః ప్రీతిరద్య పరా మమ।
సుహృదం త్వాం సమాసాద్య మహేంద్రవరుణోపమమ్। 10

తమద్యైవ ప్రియార్థం మే వైరిణం భ్రాతృరూపిణం।
వాలినం జహి కాకుత్స్థ మయా బద్ధోఽయమంజలిః। 11

తతో రామః పరిష్వజ్య సుగ్రీవం ప్రియదర్శనం।
ప్రత్యువాచ మహాప్రాజ్ఞో లక్ష్మణానుమతం వచః। 12

అస్మాద్గచ్ఛేమ కిష్కింధాం క్షిప్రం గచ్ఛ త్వమగ్రతః।
గత్వా చాహ్వయ సుగ్రీవ వాలినం భ్రాతృగంధినమ్। 13

సర్వే తే త్వరితం గత్వా కిష్కింధాం వాలినః పురీం।
వృక్షైరాత్మానమావృత్య వ్యతిష్ఠన్ గహనే వనే। 14

సుగ్రీవో వ్యనదద్ఘోరం వాలినోఽఽహ్వానకారణాత్।
గాఢం పరిహితో వేగాత్ నాదైర్భిందన్నివాంబరమ్। 15

తం శ్రుత్వా నినదం భ్రాతుః క్రుద్ధో వాలీ మహాబలః।
నిశ్చక్రామ సుసంరబ్ధో భాస్కరోఽస్తతటాదివ। 16

తతః సుతుములం యుద్ధం వాలిసుగ్రీవయోరభూత్।
గగనే గ్రహయోర్ఘోరం బుధాంగారకయోరివ। 17

ఆశ్చర్యపడెను. అంతట ఆవానరరాజు శ్రీరాముని పరాక్రమమునకు మిగుల సంతసించెను. పిమ్మట అతడు అంజలిఘటించి, ఆభరణములు వ్రేలాడుచుండగా భూమిపై సాగిలబడి ప్రణమిల్లెను. (5-6)

శ్రీరామునిబాణప్రయోగకౌశలమునకు సుగ్రీవుడు ఎంతయు సంతుష్టుడై, ధనుర్ధారులలో శ్రేష్ఠుడు, మహాశూరుడు, ధర్మజ్ఞుడుఐన అరఘువరునితో ఇట్లు పలికెను. (7)

"నరశ్రేష్ఠుడవైన ఓ ప్రభూ! ఇంద్రుడు మొదలగు సమస్తదేవతలను సైతము నీవు నీ బాణములధాటితో రణరంగమున చంపగల సమర్థుడవు. ఇంక నీకు వాలి ఒక లెక్కయా? ఓ రామా! నీవు ఒకే ఒక్క బాణముతో బలిష్ఠములైన ఏడుమద్దిచెట్లను, పర్వతమును, భూమిని (అధోలోకములను) చీల్చివేసితివి. ఇంక రణరంగమున నిన్ను ఎదిరించి నిలువగలవాడెవ్వడు? మహేంద్రునితో, వరుణునితో సమానుడవైన నీవంటి మిత్రుని పొందుటవలన నాభయశోకములు తొలగినవి. నాకు అంతులేని సంతోషము కలిగినది. ఓ రఘువీరా! నీకు చేతులెత్తి నమస్కరించుచున్నాను. సోదరునిరూపములో శత్రువుగా ఉన్న వాలిని నా ప్రీతికొఱకై నేడే వధింపుము. (8-11)

మహాప్రాజ్ఞుడైన శ్రీరామునకు సుగ్రీవుడు లక్ష్మణునివలె ప్రీతిపాత్రుడు అయ్యెను. అట్టి ప్రియమిత్రుని అరఘువరుడు అక్కునజేర్చుకొని ఇట్లు పలికెను. (12)

"ఓ సుగ్రీవా! ఇక కిష్కింధకు వెంటనే వెళ్లుదము. నీవు ముందు నడువుము. వెళ్లి సోదరుని హింసించునట్టి ఆవాలిని యుద్ధమునకు పిలువుము." (13)

అనంతరము వారందఱును వాలిరాజధానియైన కిష్కింధకు వెళ్లి, దట్టమైన అడవిలో చెట్లచాటున నిలిచిరి. అంతట సుగ్రీవుడు నడుముబిగించి, యుద్ధసన్నద్ధుడై, వాలిని ఆహ్వానించుటకై భయంకరముగా గర్జించెను. అట్లొనర్చిన ఆ గర్జన ఆకాశమును చీల్చుచున్నదా? అనునట్లు ఉండెను. (14-15)

మహాబలశాలియైన వాలి తనతమ్ముడగు సుగ్రీవుని గర్జనను విని, మిగుల క్రుద్ధుడై తొట్రుపాటుతో నగరమునుండి వెలుపలికి వచ్చెను. అప్పుడతడు అస్తాద్రినిజేరిన సూర్యబింబమువలె ఒప్పుచుండెను. (అనగా అస్తమింపబోవుచున్న సూర్యునివలె తేజోవిహీనుడై యుండెను.) (16)

ఆకాశమునందు బుధుడు, అంగారకుడు అను గ్రహములమధ్యవలె భూమిపై వాలిసుగ్రీవులమధ్య భయంకరమైన ద్వంద్వయుద్ధము జరిగెను. ఆసోదరులు ఇరువురును క్రోధావేశపరులై యుద్ధభూమియందు పిడుగుపాటులవంటి అఱచేతిదెబ్బలతోను,

తలైరశనికల్పైశ్చ వజ్రకల్పైశ్చ ముష్టిభిః ।
జఘ్నతుః సమరేఽన్యోఽన్యం భ్రాతరౌ క్రోధమూర్ఛితౌ । 18

తతో రామో ధనుష్పాణిః తావుభౌ సముదీక్ష్య తు ।
అన్యోఽన్యసదృశౌ వీరౌ ఉభౌ దేవావివాశ్వినౌ । 19

యన్నావగచ్ఛత్ సుగ్రీవం వాలినం వాపి రాఘవః ।
తతో న కృతవాన్ బుద్ధిం మోక్తుమంతకరం శరమ్ । 20

ఏతస్మిన్నంతరే భగ్నః సుగ్రీవస్తేన వాలినా ।
అపశ్యన్ రాఘవం నాథమ్ ఋశ్యమూకం ప్రదుద్రువే । 21

క్లాంతో రుధిరసిక్తాంగః ప్రహారైర్జర్జరీకృతః ।
వాలినాఽభిద్రుతః క్రోధాత్ ప్రవివేశ మహావనమ్ । 22

తం ప్రవిష్టం వనం దృష్ట్వా వాలీ శాపభయార్దితః ।
ముక్తో హ్యసి త్వమిత్యుక్త్వా సన్నివృత్తో మహాద్యుతిః ।
నివృత్తః స్వపురీం ప్రాప క్రోధావిష్టో మహాబలః । 23

రాఘవోఽపి సహ భ్రాత్రా సహ చైవ హనూమతా ।
తదేవ వనమాగచ్ఛత్ సుగ్రీవో యత్ర వానరః । 24

తం సమీక్ష్యాగతం రామం సుగ్రీవః సహలక్ష్మణం ।
హ్రీమాన్ దీనమువాచేదం వసుధామ్ అవలోకయన్ । 25

ఆహ్వయస్వేతి మాముక్త్వా దర్శయిత్వా చ విక్రమం ।
వైరిణా ఘాతయిత్వా చ కిమిదానీం త్వయా కృతమ్ । 26

తామేవ వేలాం వక్తవ్యం త్వయా రాఘవ తత్త్వతః ।
వాలినం న నిహన్మీతి తతో నాహమితో వ్రజే । 27

తస్య చైవం బ్రువాణస్య సుగ్రీవస్య మహాత్మనః ।
కరుణం దీనయా వాచా రాఘవః పునరబ్రవీత్ । 28

సుగ్రీవ శ్రూయతాం తాత క్రోధశ్చ వ్యపనీయతాం ।
కారణం యేన బాణోఽయం న మయా న విసర్జితః । 29

వజ్రాయుధములవంటి పిడికిళ్లగుద్దులతోను పరస్పరము మోదుకొనిరి. (17-18)

అప్పుడు ధనుర్ధారియైన శ్రీరాముడు అశ్వినీదేవతలవలె ఒకరితోనొకరు పోలియున్న ఆ ఇద్దఱు వీరులను చూచి, సుగ్రీవుని, వాలిని స్పష్టముగా గుర్తింపలేకపోయెను. అందువలన ఆరఘువీరుడు ప్రాణాంతకమైన తన శరమును ప్రయోగింపలేదు. (19-20)

ఇరువురును ఘోరముగా పోరుసల్పుచుండగా వాలి చేతిలో మిక్కిలి దెబ్బతినిన సుగ్రీవుడు తనకు రక్షకుడైన రాఘవుడు కన్పింపక పోవుటచే ఋశ్యమూకపర్వతము వైపునకు పరుగులు దీసెను. తనను ఎదిరించి పోరాడుటకు వచ్చిన సుగ్రీవుని చూచి వాలి మండిపడి, తన పిడిగుద్దులతో అతని శరీరమును నుగ్గునుగ్గు గావించెను. అప్పుడు సుగ్రీవుడు తనశరీరము అంతయును రక్తసిక్తముకాగా, మిక్కిలి అలసిపోయి, ఋశ్యమూక పర్వతముపైగల మహావనమున ప్రవేశించెను. (21-22)

మిగుల బలశాలియైన ఆవాలి ఋశ్యమూక వనమున సుగ్రీవుడు ప్రవేశించుటను జూచెను. పిమ్మట అతడు మతంగముని శాపకారణముగా ఆపర్వతముమీదికి వెళ్లుటకు భయపడి, 'బ్రతికిపోయితివి పొమ్ము' అని పలికి వెనుదిరిగెను. అనంతరము క్రుద్ధుడై అతడు తన నగరమునకు చేరెను.(23)

పిమ్మట శ్రీరాముడుగూడ, తమ్ముడగు లక్ష్మణునితోడను, హనుమంతునితోడనుకూడి సుగ్రీవుడున్న వనమునకు వచ్చెను. అంతట తన కడకు వచ్చిన రామలక్ష్మణులను జూచి, సుగ్రీవుడు సిగ్గుతో తల వంచుకొని, నేలవైపు చూచుచు రామునితో దీనముగా ఇట్లు పలికెను. "ఓ రాఘవా! మీ పరాక్రమమును చూపి తృప్తిపఱచితిరి, వాలిని యుద్ధమునకు ఆహ్వానింపుము అని సూచించితిరి. ఇప్పుడు మీరు చేసిన పనియేమి? నన్ను శత్రువుచేతిలో చావుదెబ్బలు తినునట్లు చేసితిరి. నేను వాలిని చంపను' అని మీరు అప్పుడే వాస్తవమును చెప్పియుండిన బాగుండెడిది. అప్పుడు నేను యుద్ధమునకు వెళ్లకుండెడివాడను." (24-27)

మహాత్ముడైన సుగ్రీవుడు ఇట్లు పలుకగా రఘురాముడు అతనిపై కనికరము చూపుచు మృదువుగా ఇట్లు నుడివెను.(28)

"నాయనా! సుగ్రీవా! క్రోధమును వీడుము, నామాటవినుము. జరిగినదానికి చింతింపవలదు. నేను బాణమును ప్రయోగింపని కారణమును తెలిపెదను. మీ అన్నదమ్ముల (ఇరువురి) పోలికలును ఒక్కటే. వేషభాషలలోగాని, శరీరప్రమాణములలోగాని, కడకు నడకలలోగాని ఏమాత్రమూ భేదమే లేదు. ఓ

అలంకారేణ వేషేణ ప్రమాణేన గతేన చ।
త్వం చ సుగ్రీవ వాలీ చ సదృశౌ స్థః పరస్పరమ్। 30

స్వరేణ వర్చసా చైవ ప్రేక్షితేన చ వానర।
విక్రమేణ చ వాక్యైశ్చ వ్యక్తిం వాం నోపలక్షయే।
తతోఽహం రూపసాదృశ్యాత్ మోహితో వానరోత్తమ। 31

నోత్సృజామి మహావేగం శరం శత్రునిబర్హణం।
జీవితాంతకరం ఘోరం సాదృశ్యాత్తు విశంకితః। 32

మూలఘాతో న నౌ స్యాద్ధి ద్వయోరపి కృతో మయా। 33

త్వయి వీరే విపన్నే హి అజ్ఞానాల్లాఘవాన్మయా।
మౌఢ్యం చ మమ బాల్యం చ ఖ్యాపితం స్యాద్ధరీశ్వర। 34

దత్తాభయవధో నామ పాతకం మహదుచ్యతే। 35
అహం చ లక్ష్మణశ్చైవ సీతా చ వరవర్ణినీ।
త్వదధీనా వయం సర్వే వనేఽస్మిన్ శరణం భవాన్। 36

తస్మాద్యుధ్యస్వ భూయస్త్వం మాం మా శంకీశ్చ వానర।
ఏతన్ముహూర్తే సుగ్రీవ పశ్య వాలినమాహవే।
నిరస్తమిషుణైకేన వేష్టమానం మహీతలే। 37

అభిజ్ఞానం కురుష్వ త్వమ్ ఆత్మనో వానరేశ్వర।
యేన త్వామ్ అభిజానీయాం ద్వంద్వయుద్ధముపాగతమ్। 38

గజపుష్పీమ్ ఇమాం ఫుల్లామ్ ఉత్పాట్య శుభలక్షణాం।
కురు లక్ష్మణ కంఠేఽస్య సుగ్రీవస్య మహాత్మనః। 39

తతో గిరితటే జాతామ్ ఉత్పాట్య కుసుమాకులాం।
లక్ష్మణో గజపుష్పీం తాం తస్య కంఠే వ్యసర్జయత్। 40

స తయా శుశుభే శ్రీమాన్ లతయా కంఠసక్తయా।
విపరీత ఇవాకాశే సూర్యో నక్షత్రమాలయా। 41

వానరోత్తమా! మీ ఇరువురి కంఠస్వరములు, వర్చస్సులు, చూపులు, పరాక్రమములు మాట్లాడుతీరు మొదలగు వానిలో కొంచెముగూడ తేడాలేదు. కావున మీ రూపములలోగల సాదృశ్యముచే నేను భ్రమకు గుఱియైతిని. నా బాణము మిగుల వేగముగలది, శత్రువులప్రాణములను తీయుటలో తిరుగులేనిది. భయంకరమైనది. ఐనను మీ ఇద్దఱిలోగల ఒకే పోలికల కారణముగా నేను నా బాణమును వేయనైతిని. నేను త్వరపడి శరమును వేసినచో అది నీ ప్రాణములనే తీయవచ్చును. అందువలన మనఇద్దఱికిని నష్టము సంభవించును. కనుక నేను బాణప్రయోగము చేయలేదు. (29-33)

ఓ వానరోత్తమా! అనాలోచితముగా తొందరపడి నేను వేసిన బాణము నీకు తగిలినచో నీవు ఆపదకు గుఱియగుదువు. దానివలన లోకము నన్ను మూర్ఖునిగా చపలునిగా భావించును. అభయమిచ్చిన వానిని చంపుటకంటె మహాపాతకము మఱియొకటిలేదు. (34-35)

నేనును, లక్ష్మణుడును, సీతాసాధ్వియు నీ అధీనములోని వారము. ఈ వనమునందు మా అందఱికిని నీవే దిక్కు. అందువలన నీవు యుద్ధరంగమున మఱల వాలితో తలపడుము. నాయెడ సంశయము పెట్టుకొనవద్దు. ఓ సుగ్రీవా! ఈ సారి నేను ఒకే ఒక్క బాణముతో వాలిని మట్టికఱిపించెదను చూడుము. ఓ వానరేశ్వరా! నీవు ఒక చిహ్నమును ధరింపుము. దానివలన మీరు ఇద్దఱు ద్వంద్వయుద్ధము చేయుచున్నప్పుడు నిన్ను నేను సులభముగా గుర్తింపగలను." (36-38)

పిదప శ్రీరాముడు లక్ష్మణునితో 'తమ్ముడా! బాగుగా వికసించిన ఈ నాగకేసరపులతను పెకలించి, మహాత్ముడైన సుగ్రీవుని మెడలో వేయుము.' అనెను. (39)

అంతట లక్ష్మణుడు ఋశ్యమూకపర్వతముయొక్క చఱియయందు బాగుగా వికసించిన పూలతోనిండియున్న నాగకేసరపులతను పెకలించి తీసికొని వచ్చి, ఆ సుగ్రీవుని మెడలో వేసెను. (40)

కంఠమునందు అలంకృతమైన ఆపూలమాలచే సుగ్రీవుడు రాత్రి(1) యందు నక్షత్రపంక్తిచే ఆవృతుడైన నిండు పున్నమినాటి చంద్రుని(2) వలె శోభిల్లుచుండెను. ఇంకను అతడు సంధ్యాకాలమునందు తెల్ల కొంగలచే ఆవృతమైన మేఘమువలె తన శరీరకాంతిచే

1) విపరీతము = రాత్రి (పరీతంతు దివాప్రోక్తం, విపరీతం తు శర్వరీ) పరీతము = పగలు, విపరీతము = రాత్రి
సూర్యః = రాకానిశాకరః = నిండు పున్నమినాటి చంద్రుడు. (రాకా = నిండు పున్నమినాటి రాత్రి) (సూర్యః= రాకామధ్యగతశ్చంద్రః)

మాలయేవ బలాకానాం స సంధ్య ఇవ తోయదః।
విభ్రాజమానో వపుషా రామవాక్యసమాహితః।
జగామ సహ రామేణ కిష్కింధాం వాలిపాలితామ్। 42

నిలిచియుండెను. పిమ్మట సుగ్రీవుడు శ్రీరాముని ఆజ్ఞను శిరసావహించి, ఆ ప్రభువుతోగూడ వాలి అధీనములోనున్న కిష్కింధకు బయలుదేరెను. (41-42)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ద్వాదశఃసర్గః (12)

ఇది వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు పండ్రెండవసర్గము

-- ＊ ＊ ＊ --

13. పదుమూడవసర్గము

రామలక్ష్మణులు, సుగ్రీవాదులు కిష్కింధకు బయలుదేరుట - మహిమాన్వితమైన సప్తజనాశ్రమమును దర్శించి, దానికి నమస్కరించి, వారు ముందునకు సాగుట -

ఋశ్యమూకాత్ స ధర్మాత్మా కిష్కింధాం లక్ష్మణాగ్రజః।
జగామ సహ సుగ్రీవో వాలివిక్రమపాలితామ్। 1

సముద్యమ్య మహచ్చాపం రామః కాంచనభూషితం।
శరాంశ్చాదిత్య సంకాశాన్ గృహీత్వా రణసాధకాన్। 2

లక్ష్మణునకు అన్నయు, ధర్మాత్ముడును ఐన శ్రీరామచంద్రుడు సుగ్రీవునితోగూడి, పరాక్రమశాలియైన వాలిచే పాలింపబడుచున్న కిష్కింధకు బయలుదేరెను. అప్పుడు ఆ రఘువరుడు బంగారముతో నిర్మితమైన మహాధనుస్సును చేతబట్టి, సూర్యకిరణములవలె శోభిల్లుచు, రణరంగమున విజయమును సాధించెడి శరములను గ్రహించెను. (1-2)

అగ్రతస్తు యయౌ తస్య రాఘవస్య మహాత్మనః।
సుగ్రీవః సంహతగ్రీవో లక్ష్మణశ్చ మహాబలః। 3

పృష్ఠతో హనుమాన్ వీరో నలో నీలశ్చ వానరః।
తారశ్చైవ మహాతేజా హరియూథపయూథపః। 4

మహాత్ముడైన ఆశ్రీరామునిముందుభాగమున, కంఠమున నిండైన పూలమాలనుధరించియున్న సుగ్రీవుడును, మహాబలశాలియైన లక్ష్మణుడును వెళ్ళుచుండిరి. ఆ రఘువీరునివెనుకభాగమున మహావీరుడైన హనుమంతుడు, వానరప్రముఖులైన నలుడు, నీలుడు, వానరసేనా నాయకులకు నాయకుడైన మహాతేజశ్శాలియైన తారుడు, నడుచుచుండిరి. 3-4)

తే వీక్షమాణా వృక్షాంశ్చ పుష్పభారావలంబినః।
ప్రసన్నాంబువహాశ్చైవ సరితః సాగరంగమాః। 5

కందరాణి చ శైలాంశ్చ నిర్ఝరాణి గుహాస్తథా।
శిఖరాణి చ ముఖ్యాని దరీశ్చ ప్రియదర్శనాః। 6

వైడూర్యవిమలైః పర్ణైః పద్మైశ్చాకోశకుట్మలైః।
శోభితాన్ సజలాన్ మార్గే తటాకాంశ్చ వ్యలోకయన్। 7

వారు మార్గమధ్యమున కనువిందుగావించుచు పూవులబరువుచే వంగియున్న కొమ్మలుగల మహావృక్షములను, సముద్రమున గలియుటకై, నిర్మలజలములతో సాగిపోవుచున్న నదులను, చిన్నచిన్న గుహలను, కొండలను, సెలయేళ్లను, పెద్దపెద్ద గుహలను, ఎత్తైనశిఖరములను, వైడూర్యములవలె స్వచ్ఛములైన ఆకులతోడను, కమలములతోడను, వికసించుచున్న మొగ్గలతోడను శోభిల్లుచు నిర్మలజలములతో నిండియున్న తటాకములను దర్శించిరి. (5-7)

కారండైః సారసైర్హంసైః వంజులైర్జలకుక్కుటైః।
చక్రవాకైస్తథా చాన్యైః శకునైరుపనాదితాన్। 8

కన్నెలేడిపిట్టలు, బెగ్గురుపక్షులు, హంసలు, వంజులములు, నీటికోళ్లు, చక్రవాకములు, ఇంకను తదితరములైన పక్షుల కలరవములతో ప్రతిధ్వనించుచున్న తటాకములను గాంచిరి. (8)

మృదుశష్పాంకురాహారాన్ నిర్భయాన్ వనగోచరాన్।
చరతః సర్వతోఽ పశ్యన్ స్థలీషు హరిణాన్ స్థితాన్। 9

వనములలో నిర్భయముగా అంతటను సంచరించుచు, లేతలేత గడ్డిపరకలను తినుచున్న లేళ్లను, ఎత్తైన ప్రదేశములలో నిలబడియున్న హరిణములను వారు చూచిరి. (9)

తటాకవైరిణశ్చాపి శుక్లదంతవిభూషితాన్।
ఘోరానేకచరాన్ వన్యాన్ ద్విరదాన్ కూలఘాతినః। 10

మత్తాన్ గిరితటోత్కృష్టాన్ పర్వతానివ జంగమాన్।
వారణాన్ వారిదప్రఖ్యాన్ మహీరేణుసముక్షితాన్। 11

వనే వనచరాంశ్చాఽన్యాన్ ఖేచరాంశ్చ విహంగమాన్।
పశ్యంతస్త్వరితా జగ్ముః సుగ్రీవవశవర్తినః। 12

తేషాం తు గచ్ఛతాం తత్ర త్వరితం రఘునందనః।
ద్రుమషండం వనం దృష్ట్వా రామః సుగ్రీవమబ్రవీత్। 13

ఏష మేఘ ఇవాకాశే వృక్షషండః ప్రకాశతే।
మేఘసంఘాతవిపులః పర్యంతకదళీవృతః। 14

కిమేతత్ జ్ఞాతుమిచ్ఛామి సఖే కౌతూహలం హి మే।
కౌతూహలాపనయనం కర్తుమిచ్ఛామ్యహం త్వయా। 15

తస్య తద్వచనం శ్రుత్వా రాఘవస్య మహాత్మనః।
గచ్ఛన్నేవాచచక్షేఽథ సుగ్రీవః తన్మహద్వనమ్। 16

ఏతద్రాఘవ విస్తీర్ణమ్ ఆశ్రమం శ్రమనాశనం।
ఉద్యానవనసంపన్నం స్వాదుమూలఫలోదకమ్। 17

అత్ర సప్తజనా నామ మునయః సంశ్రితవ్రతాః।
సప్తైవాసన్నధఃశీర్షా నియతం జలశాయినః। 18

సప్తరాత్రకృతాహారా వాయునా వనవాసినః।
దివం వర్షశతైర్యాతా సప్తభిః సకళేబరాః। 19

తేషామేవం ప్రభావానాం ద్రుమప్రాకారసంవృతం।
ఆశ్రమం సుదురాధర్షమ్ అపి సేంద్రైః సురాసురైః। 20

పక్షిణో వర్జయంత్యేతత్ తథాన్యే వనచారిణః।
విశంతి మోహాద్యే తత్ర నివర్తంతే న తే పునః। 21

అచటి అడవిఏనుగులు తటాకములను కలుషితమొనర్చుచుండెను, తెల్లని దంతములతో శోభిల్లుచుండెను. విడివిడిగా తిరుగుచు భయంకరముగా ఉండెను, అవి కొండచరియలయందు ఉత్కృష్టములై నడచుచున్న పర్వతములాయనునట్లు ఒప్పుచుండెను, మేఘములవలె రాజిల్లుచుండెను. భూమిపై గల రేణువులను మీదికి ఎగురగొట్టుచుండెను. అట్టి మదపుటేనుగులను వారు వీక్షించిరి.(10–11)

సుగ్రీవునివశమునందున్నట్టి వారందఱును వనములలో ఆకాశమునందు సంచరించుచున్న ఇతరపక్షులను చూచుచు ముందునకు సాగిరి. (12)

వారందఱును కిష్కింధవైపుగా త్వరత్వరగా వెళ్లుచుండగా రఘువంశజుడైన శ్రీరాముడు అంతలో, పొదలతో దట్టమైన చెట్లతో నిండిన వనమును జూచి, సుగ్రీవునితో ఇట్లు నుడివెను. (13)

"ఓ మిత్రమా! ఇచటి ఈ చెట్ల సమూహము ఆకాశమునందలి మేఘజాలము వలె ఒప్పుచున్నది. ఈ అరటితోటలు మేఘమండలమువలెను వ్యాపించియున్నవి. వీటి విశేషమేమి? వీటినిగూర్చి తెలిసికొనవలెనని నేను మిగుల కుతూహలపడుచున్నాను. కనుక నీవు వీటి విశేషములను తెలిపి, నాకు సంతృప్తిని కలిగింపగలవు."(14–15)

మహాత్ముడైన ఆరఘువరుని మాటలను విని, సుగ్రీవుడు వెళ్లుచునే ఆమహావనమును గూర్చి ఇట్లు వివరించెను. (16)

"ఓ రామా! ఈ విశాలమైన ఆశ్రమము ఉద్యానవనములతో కలకలలాడుచున్నది, ఇందలి కందమూల ఫలములన్నియును మిక్కిలి రుచికరములైనవి. కనుక ఇది అందఱిబడలికలను తీర్చుచుండును. ఈ ఆశ్రమమున 'సప్తజనులు' అని ప్రసిద్ధికెక్కిన ఏడుమంది మహామునులు నివసించుచుండిరి. వారు కఠోరమైన వ్రతములను ఆచరించువారు. వారు తలక్రిందులుగా ఉండి, తపస్సు చేయుచుండిరి. నియమపూర్వకముగా వారు జలములలో శయనించుచుండిరి. వారు ఏడుదినములకు ఒక పర్యాయము వాయుభక్షణము చేయుచుండెడిరి. ఇట్టి నియమజీవనముతో వారు ఏడువందలసంవత్సరములు తపస్సు చేసి, అనంతరము సశరీరముగా స్వర్గమునకు వెళ్లిరి.(17–19)

మహిమాన్వితులైన వారియొక్క ఈ ఆశ్రమమును ఇట్లు వృక్షపంక్తులు చేరియుండుటచే ఇంద్రాది దేవతలుగాని, అసురులుగాని ఇందు ప్రవేశింపజాలరు. వనములలో సంచరించెడి పక్షులుగాని, ఇతర జంతువులుగాని ఇందు ప్రవేశింపజాలవు. ఆరాటపడి (ఆశపడి) ఇందు ప్రవేశించినయెడల ఆప్రాణులు మరల తిరిగి రావు. అచటనే ప్రాణములను కోల్పోవును. (20–21)

విభూషణరవాస్త్రత శ్రూయంతే సకలాక్షరాః।
తూర్యగీతస్వనాశ్చాత్ర గంధో దివ్యశ్చ రాఘవ। 22

త్రేతాగ్నయోఽపి దీప్యంతే ధూమో హ్యత్ర ప్రకాశతే।
వేష్టయన్నివ వృక్షాగ్రాన్ కపోతాంగారుణో ఘనః। 23

ఏతే వృక్షాః ప్రకాశంతే ధూమసంసక్తమస్తకాః।
మేఘజాలప్రతిచ్ఛన్నా వైడూర్యగిరయో యథా। 24

కురు ప్రణామం ధర్మాత్మన్ తాన్ సముద్దిశ్య రాఘవ।
లక్ష్మణేన సహ భ్రాత్రా ప్రయతః సంయతాంజలిః। 25

ప్రణమంతి హి యే తేషాం మునీనాం భావితాత్మనామ్।
న తేషామశుభం కించిత్ శరీరే రామ దృశ్యతే। 26

తతో రామః సహ భ్రాత్రా లక్ష్మణేన కృతాంజలిః।
సముద్దిశ్య మహాత్మనః తాన్ ఋషీన్ అభ్యవాదయత్। 27

అభివాద్య తు ధర్మాత్మా రామో భ్రాతా చ లక్ష్మణః।
సుగ్రీవో వానరాశ్చైవ జగ్ముః సంహృష్టమానసాః। 28

తే గత్వా దూరమధ్వానం తస్మాత్ సప్తజనాశ్రమాత్।
దదృశుస్తాం దురాధర్షాం కిష్కింధాం వాలిపాలితామ్। 29

తతస్తు రామానుజరామవానరాః
ప్రగృహ్య శస్త్రాణ్యుదితాగ్ర్యతేజసః।
పురీం సురేశాత్మజవీర్యపాలితాం
వధాయ శత్రోః పునరాగతాః సహ। 30

ఈ ఆశ్రమప్రదేశమునందు (నృత్యములుచేయువారి) ఆభరణధ్వనులు, (సంగీతమును ఆలపించెడివారి) మధురస్వరములు, తూర్యములు మొదలగు వాద్యనాదములు వినిపించుచుండును. ఇచట దివ్యసుగంధములు గుబాళించుచుండును. వీటినిబట్టి స్వర్గమునకు వెళ్లిన సప్త(ముని)జనులు అప్సరసలతోగూడి తిరిగి వచ్చి, ఇచట వినోదించుచుందురని ప్రతీతి. (22)

త్రేతాగ్నులు (దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని అను మూడగ్నులు) ఇచట ప్రజ్వలించుచున్నవి. వీటినుండిపైకెగసిన పొగలు పావురములశరీరవర్ణము (బూడిదరంగు) గలిగి చెట్లపైభాగములయందు దట్టముగా వ్యాపించుచున్నవి. (23)

చెట్లపైభాగములన్నియును హోమధూమములచే కప్పబడియుండుటచే అవి మేఘములచే కప్పబడిన వైడూర్యపర్వతములవలె విలసిల్లుచున్నవి. (24)

ధర్మాత్ముడవైన ఓ రామా! లక్ష్మణునితోగూడి నీవు కార్యసాఫల్యమునకై దోసిలొగ్గి, సాదరముగా ఈ సప్తజనాశ్రమమునకు (సప్తజనమునులకు) నమస్కరింపుము. మహాత్ములైన ఈ మునులకు నమస్కరించిన వారికి అశుభములు ఉండవు. (శుభములు కలుగును) శరీరబాధలు ఉండవు. (25-26)

అంతట రామలక్ష్మణులు అంజలిఘటించి, మహాత్ములైన ఆసప్తజనమునులకు నమస్కరించిరి. మహాపురుషుడైన రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు, ఇతర వానరులు ఆ ఆశ్రమమునకు నమస్కరించిన పిమ్మట సంతోషముతో ముందునకు సాగిరి. వారందఱును సప్తజనాశ్రమమునుండి చాలాదూరము ప్రయాణము చేసిన పిమ్మట వాలిపాలనలో ఉండుటచే జయింపశక్యముగాని కిష్కింధను జూచిరి. అంతట పరోక్షముగా మునుల ఆశీఃప్రభావముతో దివ్యతేజస్సులతో వెలుగొందుచున్న రామలక్ష్మణసుగ్రీవులు శస్త్రాస్త్రములనుచేబూని, శత్రువును (వాలిని) పరిమార్చుటకై అతని అధీనములో ఉన్న కిష్కింధకు మఱల చేరిరి. (27-30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే త్రయోదశః సర్గః (13)

ఇది వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు పదుమూడవసర్గము

-- * * * --

14. పదునాలుగవ సర్గము

శ్రీరాముని అండజూచుకొని, సుగ్రీవుడు వాలిని యుద్ధమునకు కవ్వించుచు మహానాదమొనర్చుట -

సర్వే తే త్వరితం గత్వా కిష్కింధాం వాలిపాలితాం।
వృక్షైరాత్మాన మావృత్య వ్యతిష్ఠన్ గహనే వనే। 1

విచార్య సర్వతో దృష్టిం కాననే కాననప్రియః।
సుగ్రీవో విపులగ్రీవః క్రోధమాహారయద్భృశమ్। 2

తతః స నినదం ఘోరం కృత్వా యుద్ధాయ చాహ్వయత్।
పరివారై : పరివృతో నాదైర్భిందన్నివాంబరమ్।
గర్జన్నివ మహామేఘో వాయువేగపురస్సరః। 3

అథ బాలార్కసదృశో దృప్తసింహగతిస్తదా।
దృష్ట్వా రామం క్రియాదక్షం సుగ్రీవో వాక్యమబ్రవీత్। 4

హరివాగురయా వ్యాప్తాం తప్తకాంచనతోరణాం।
ప్రాప్తాః స్మ ధ్వజయంత్రాఢ్యాం కిష్కింధాం వాలినః పురీమ్। 5

ప్రతిజ్ఞా యా త్వయా వీర కృతా వాలివధే పురా।
సఫలాం తాం కురు క్షిప్రం లతాం కాల ఇవాగతః। 6

ఏవ ముక్తస్తు ధర్మాత్మా సుగ్రీవేణ స రాఘవః।
తమథోవాచ సుగ్రీవం వచనం శత్రుసూదనః। 7

కృతాభిజ్ఞానచిహ్నస్త్వమ్ అనయా గజసాహ్వయా।
లక్ష్మణేన సముత్పాట్య యైషా కంఠే కృతా తవ। 8

శోభసే హ్యధికం వీర లతయా కంఠసక్తయా।
విపరీత ఇవాకాశే సూర్యో నక్షత్రమాలయా। 9

అద్య వాలిసముత్థం తే భయం వైరం చ వానర!।
ఏకేనాఽహం ప్రమోక్ష్యామి బాణమోక్షేణ సంయుగే। 10

రామసుగ్రీవాదులందఱును త్వరత్వరగా వాలిపాలనలో ఉన్న కిష్కింధకు (సమీపమునకు) చేరి, దట్టమైన ఆవనములో చెట్లచాటున పొంచియుండిరి. సంతోషముతో వనములలో సంచరించునట్టి బలమైన కంఠముగల సుగ్రీవుడు ఆవనములో నలుదిక్కులయందును తన దృష్టిని ప్రసరింపజేసి, మిక్కిలి కృద్ధుడాయెను. (1-2)

పిదప ఆసుగ్రీవుడు వాలిని యుద్ధమునకు పిలుచుచు, తన అనుయాయులతోగూడి, ఆకాశమునకు చిల్లులు పడునట్లుగా భయంకరగర్జన చేసెను. అది వాయువేగమున మహామేఘమొనర్చిన ఉఱుమువలె భీకరముగానుండెను. పిమ్మట ఉదయించుచున్న సూర్యునివలె ఒప్పుచు, రెచ్చిపోయిన సింహమువలె నడుచుచున్న సుగ్రీవుడు కార్యతత్పరుడైన శ్రీరామునితో ఇట్లు విన్నవించెను. (3-4)

"ఓ రఘువీరా! వాలి అధీనములోనున్న ఈ కిష్కింధ వానరయోధులచే రక్షింపబడుచు[1] శత్రుదుర్భేద్యమైనది, అది పుటముపెట్టిన (మేలిమి) బంగారుతోరణములతో విరాజిల్లుచుండును, ధ్వజయంత్రములతో ఒప్పుచుండును. అట్టి నగరమును మనము చేరితిమి. ఓ మహావీరుడా! లోగడ 'వాలిని వధింతును' అని నీవు ప్రతిజ్ఞ చేసియుంటివి. వసంతకాలము లతనువలె ఆ ప్రతిజ్ఞను నీవు సఫలమొనర్పుము." (5-6)

ధర్మాత్ముడైన రఘురామునితో ఇట్లు పలుకగా శత్రుసంహార సమర్థుడైన ఆప్రభువు ఆయనతో ఇట్లనెను. "ఓ వానరోత్తమా! లక్ష్మణుడు 'గజసాహ్వము' అను పేరుగల లతను పెకలించుకొనివచ్చి, గుర్తుకొఱకు నీకంఠమును అలంకరించినాడు. ఓ వీరా! నీ మెడలోగల ఆలతామాలచేత నీవు రాత్రివేళ ఆకాశమున నక్షత్రమాలికతో ఒప్పుచున్న నిండుపున్నమినాటి చంద్రునివలె శోభిల్లుచున్నావు. (7-9)

ఓ వానరవీరా! నేటి సీద్వంద్వయుద్ధ సమయమున ఒకే ఒక్క బాణముతో వాలిని హతమార్చెదను. దానితో అతనివలన నీలో ఏర్పడిన భయముతొలగును, వైరము తీరిపోవును. ('మరణాంతాని వైరాణి' అని గదా! ఆర్యోక్తి)(10)

1) వాగుర = మృగములను, పక్షులను పట్టెడి వల - హరి = వానరము, కిష్కింధ పైదదాడి చేయు శత్రువులను వానరులు (హరులు) బంధింతురు. అనగా కిష్కింధను రక్షించుచుండెడి వానరయోధులే ఈ నగరము మీదికి దండెత్తెడి శత్రువులపాలిట వలలు.

మమ దర్శయ సుగ్రీవ వైరిణం భ్రాతృరూపిణం।
వాలీ వినిహతో యావత్ వనే పాంసుషు వేష్టతే। 11

యది దృష్టిపథం ప్రాప్తో జీవన్ స వినివర్తతే।
తతో దోషేణ మా౽౽ గచ్ఛేత్ సద్యో గర్హేచ్చ మా భవాన్। 12

ప్రత్యక్షం సప్త తే సాలా మయా బాణేన దారితాః।
తేనా౽వేహి బలేనా౽ద్య వాలినం నిహతం మయా। 13

అనృతం నోక్తపూర్వం మే వీర కృచ్ఛ్రే౽పి తిష్ఠతా।
ధర్మలోభపరీతేన న చ వక్ష్యే కథంచన। 14

సఫలాం చ కరిష్యామి ప్రతిజ్ఞాం జహి సంభ్రమం।
ప్రసూతం కలమం క్షేత్రే వర్షేణేవ శతక్రతుః। 15

తదాహ్వాననిమిత్తం త్వం వాలినో హేమమాలినః।
సుగ్రీవ కురు తం శబ్దం నిష్పతేద్యేన వానరః। 16

జితకాశీ బలశ్లాఘీ త్వయా చాధర్షితః పురా।
నిష్పతిష్యత్యసంగేన వాలీ స ప్రియసంయుగః। 17

రిపూణాం ధర్షణం శూరా మర్షయంతి న సంయుగే।
జానంతస్తు స్వకం వీర్యం స్త్రీసమక్షం విశేషతః। 18

స తు రామవచః శ్రుత్వా సుగ్రీవో హేమపింగళః।
ననర్ద క్రూరనాదేన వినిర్భిందన్నివాంబరమ్। 19

తస్య శబ్దేన విత్రస్తా గావో యాంతి హతప్రభాః।
రాజదోషపరామృష్టాః కులస్త్రియ ఇవాకులాః। 20

ద్రవంతి చ మృగాః శీఘ్రం భగ్నా ఇవ రణే హయాః।
పతంతి చ ఖగా భూమౌ క్షీణపుణ్యా ఇవ గ్రహాః। 21

ఓ సుగ్రీవా! సోదరునిరూపములోనున్న నీ శత్రువును ఒక్కసారి చూపించిన చాలును. వెంటనే అతడు నాబాణపుదెబ్బకు నేలకొఱగి, దుమ్ములోబడికొట్టుకొనుచు ప్రాణములను కోల్పోవుట తథ్యము. అతడు నాకంటబడియు, ప్రాణములతో తిరిగిపోయినచో ఆదోషమునాది. అప్పుడు నీవు నన్ను తప్పుపట్టుము. నేను ఒకే బాణముతో ఏడు మద్దిచెట్లను చీల్చివేయుటను నీవు చూచియే యుంటివిగదా! అట్టి శక్తితోడనే నాచేతిలో అతడు నిహతుడైనట్లే తలంపుము. (11-13)

ఓ మహావీరా! ధర్మహానిని సహింపనివాడనగుటచే నేను ఎట్టి కష్టములు ఎదురైనను ఇంతవఱకును అసత్యమును పలుకలేదు. ఏదియేమైనను ఇక మీదటగూడ అనృతమును నుడువనేనుడువను. ఇంద్రుడు పొలములో మొలకెత్తిన వరిపైరును సకాల (సరియగు) వర్షములచేత ఫలింపజేసినట్లు నా ప్రతిజ్ఞను నేను నెఱవేర్చెదను. ఇక నీతొట్రుపాటును విడువుము. కనుక ఓ సుగ్రీవా! బంగారు హారమును ధరించియుండి వాలి యుద్ధమునకు పిలుచుచు గట్టిగా గర్జింపుము. ఆ శబ్దమును వినినంతనే అతడు తన భవనమునుండి బయటికి రాగలడు (యుద్ధరంగమునకు చేరగలడు). (14-16)

ఆవాలికి యుద్ధమనిన పరమప్రీతి, ఓటమిని ఎఱుగనివాడు, తనబలమునుగూర్చి తానే పొగడు కొనుచుండువాడు. నీవు ఎన్నడును అతనిని జయించి యుండలేదు. కనుక ఏ మాత్రమూ ఆలస్యము చేయక అతడు వెంటనే బయటికి రాగలడు. (17)

స్వీయపరాక్రమమును ఎఱిగినవారులు (నిజమైన పరాక్రమవంతులు) శత్రువులు యుద్ధమునకు పెచ్చుగొట్టినప్పుడు ఏమాత్రమూ సహింపజాలరు. అందునా స్త్రీలయెదుట అసలే సహింపరు." (18)

అంతట బంగారమువలె పసుపువన్నెగల ఆ సుగ్రీవుడు శ్రీరాముని వచనములను విని, ఆకాశము బ్రద్దలగునట్లు భయంకరముగా గర్జించెను. ఆ భీకరగర్జనకు భయపడి (సాయంసమయమున ఇండ్లకు చేరుచున్న) ఆవుల ముఖకాంతులు తఱగి, అరాజకపరిస్థితులలో పరపురుషులు జట్టుపట్టుకొని లాగుచుండగా, ఎటుపోవుటకును పాలుపోని కులస్త్రీలవలె వ్యాకులపాటుతో పఱుగులు తీయుచున్నవి. యుద్ధరంగమున భంగపడిన గుఱ్ఱములవలె హరిణములు పాఱిపోవుచున్నవి. పుణ్యము, శక్తి తగ్గిన గ్రహములవలె పక్షులు భూమిపై పడిపోవుచున్నవి.(19-21)

తతః స జీమూతగణప్రణాదో
నాదం హ్యముంచత్ త్వరయా ప్రతీతః ।
సూర్యాత్మజః శౌర్యవివృద్ధతేజాః
సరిత్పతిర్వాఽనిలచంచలోర్మిః ॥ 22

సుగ్రీవుడు సూర్యునిఅంశతో పుట్టినవాడు. మేఘములవలె గర్జించుటలో ప్రసిద్ధుడు. గాలుల వేగమువలన ఎగిరిపడుచున్న తరంగములుగల సముద్రునివలె శౌర్యముచే వృద్ధిపొందిన తేజస్సుగలవాడై అతడు భీకరమగు నాదముచేసెను. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే చతుర్దశఃసర్గః (14)

ఇది వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు పదునాలుగవ సర్గము

— ❋ ❋ ❋ —

15. పదునైదవసర్గము

సుగ్రీవునితో యుద్ధమునకు బయలుదేఱుచున్న వాలికి అతని భార్య తార హితవచనములను నుడువుట.

అథ తస్య నినాదం తు సుగ్రీవస్య మహాత్మనః ।
శుశ్రావాంతఃపురగతో వాలీ భ్రాతురమర్షణః ॥ 1

శ్రుత్వా తు తస్య నినదం సర్వభూత ప్రకంపనమ్ ।
మదశ్చైకపదే నష్టః క్రోధశ్చాపతితో మహాన్ ॥ 2

స తు రోషపరీతాంగో వాలీ సంధ్యాతపప్రభః ।
ఉపరక్త ఇవాదిత్యః సద్యో నిష్ప్రభతాం గతః ॥ 3

అంతఃపురమును చేరియున్నవాడు, సహజముగ కోపస్వభావముగలవాడునైన వాలి మిగుల ధైర్యశాలియు, తనకు తమ్ముడును అగు ఆ సుగ్రీవునియొక్క గర్జనను వినెను. సమస్తప్రాణులను హడలెత్తించుచున్న ఆధ్వనిని వినిన మఱుక్షణమే అతని మత్తు దిగిపోయెను. కోపము హెచ్చయ్యెను. పింగళవర్ణముగలవాడైన వాలి కోపముతో ఊగిపోయెను. అతనిశరీరము సంధ్యాసమయమున సూర్యునికాంతివలె ఎఱ్ఱబాఱి కళదప్పెను. (1-3)

వాలీ దంష్ట్రాకరాళస్తు క్రోధాద్దీప్తాగ్నిసన్నిభః ।
భాత్యుత్పతితపద్మాభః సమృణాళ ఇవ హ్రదః ॥ 4

వాలిదంతములు వికృతములై భయమును కలిగించుచుండెను. కోపకారణముగా అతని కన్నులు నిప్పులు కురియుచుండెను. ఏనుగులు పద్మములను పెకలించివేయుటచే కేవలము తామరకాడలతో మిగిలి, కాంతి తఱిగియున్న మడుగువలె అతడు శోభావిహీనుడై యుండెను. (4)

శబ్దం దుర్మర్షణం శ్రుత్వా నిష్పపాత తతో హరిః ।
వేగేన చరణన్యాసైః దారయన్నివ మేదినీమ్ ॥ 5

వాలి సహింపరాని ఆసుగ్రీవునినాదమును విని, భూమిని చీల్చివేయుచున్నట్లుగా వేగముగా అడుగులు వేయుచు బయలుదేఱెను. (5)

తం తు తారా పరిష్వజ్య స్నేహాద్దర్శితసౌహృదా ।
ఉవాచ త్రస్తసంభ్రాంతా హితోదర్కమ్ ఇదం వచః ॥ 6

ఆసమయమున అతనిభార్యయైన తార భయముతో తొట్రుపడెను. పిదప ఆమె ప్రేమతో తన పతిని కౌగిలించుకొని, తన అనురాగమును ప్రకటించుచు అతనితో ఇట్లు హితవచనములను పలికెను. (6)

సాధు క్రోధమిమం వీర నదీవేగమివాగతమ్ ।
శయనాదుత్థితః కాల్యం త్యజ భుక్తామివ స్రజమ్ ॥ 7

"ఓ మహావీరా! నా ఈమంచిమాటలను వినుము. వేగముగా ప్రవహించుచున్న నదీజలమువలె, నీలో పెల్లుబుకుచున్న ఈ కోపమును ప్రాతఃకాలమున నిద్రనుండి లేచిన పురుషుడు రాత్రివేళ ధరించినపూలదండనువలె

కాల్య మేతేన సంగ్రామం కరిష్యసి చ వానర।
వీర తే శత్రుబాహుళ్యం ఫల్గుతా వా న విద్యతే। 8

సహసా తవ నిష్క్రామో మమ తావన్న రోచతే।
శ్రూయతాం చాభిధాస్యామి యన్నిమిత్తం నివార్యసే। 9

పూర్వమాపతితః క్రోధాత్ స త్వామ్ ఆహ్వయతే యుధి।
నిష్పత్య చ నిరస్తస్తే హన్యమానో దిశో గతః। 10

త్వయా తస్య నిరస్తస్య పీడితస్య విశేషతః।
ఇహైత్య పునరాహ్వానం శంకాం జనయతీవ మే। 11

దర్పశ్చ వ్యవసాయశ్చ యాదృశస్తస్య నర్దతః।
నివాదశ్చాపి సంరంభో నైతదల్పం హి కారణమ్। 12

నాఽసహాయమహం మన్యే సుగ్రీవం తమిహాగతం।
అవష్టబ్ధసహాయశ్చ యమాశ్రిత్యైష గర్జతి। 13

ప్రకృత్యా నిపుణశ్చైవ బుద్ధిమాంశ్చైవ వానరః।
నాఽపరీక్షితవీర్యేణ సుగ్రీవః సఖ్యమేష్యతి। 14

పూర్వమేవ మయా వీర శ్రుతం కథయతో వచః।
అంగదస్య కుమారస్య వక్ష్యామి త్వా హితం వచః। 15

అంగదస్తు కుమారోఽయం వనాంతమ్ ఉపనిర్గతః।
ప్రవృత్తిస్తేన కథితా చారైరాప్తైర్నివేదితా। 16

అయోధ్యాధిపతేః పుత్రౌ శూరౌ సమరదుర్జయౌ।
ఇక్ష్వాకూణాం కులే జాతౌ ప్రథితౌ రామలక్ష్మణౌ।
సుగ్రీవప్రియకామార్థం ప్రాప్తౌ తత్ర దురాసదౌ। 17

తవ భ్రాతుర్హి విఖ్యాతః సహాయో రణకర్కశః।
రామః పరబలామర్దీ యుగాంతాగ్నిరివోత్థితః। 18

నివాసవృక్షః సాధూనామ్ ఆపన్నానాం పరా గతిః।
ఆర్తానాం సంశ్రయశ్చైవ యశసశ్చైకభాజనమ్। 19

త్యజింపుము. ప్రభూ! యుద్ధమున నిన్ను మించినవాడు నీ శత్రువులలో ఎవ్వడును లేడు. నీవు ఎవ్వరికిని తీసిపోవు, సుగ్రీవునితో రేపు ఉదయము పోరాడవచ్చును. నీవు ఇప్పటికిప్పుడు యుద్ధమునకు వెళ్ళుట మంచిదికాదు. నిన్ను ఆపుటకు గల కారణమును తెలిపెదను వినుము.(7-9)

"స్వామీ! ఇంతకుముందుగూడ సుగ్రీవుడు ఇచటికివచ్చి, కోపముతో నిన్ను యుద్ధమునకు పిలిచియుండెను. అప్పుడు యుద్ధమునకు వెళ్లి అతనిని చావమోదితివి. నీ పిడిగుద్దులకు తట్టుకొనలేక అతడు మతంగవనమునకు పాఱిపోయెను. ఒకసారి ఓడిపోయి నీచే దెబ్బలు తినిన అతడు మఱలవచ్చి నిన్ను ఆహ్వానించుచున్నాడు. దీనినిబట్టి ఇందు ఏదో రహస్యము ఉన్నట్లు నాకు అనిపించుచున్నది.(10-11)

మహాగర్జన చేయుచున్న సుగ్రీవునియొక్క దర్పమును, ప్రయత్నమును, నాదముయొక్క తీవ్రతనుబట్టి చూచినచో ఈసారిఅతడు గట్టిప్రయత్నముతో వచ్చినట్లు కనబడుచున్నది. కాబట్టి అతని ఈ ప్రయత్నమును ఒక సామాన్యవిషయముగా భావింపరాదు, దానిని చులకనగా చూడరాదు. ఈ పర్యాయము పోరుసల్పుటకు వచ్చిన సుగ్రీవుడు ఒంటరివాడుగా (ఎవరి అండదండలూ లేకుండా) వచ్చినాడని నేను తలంపను. బలమైన సహాయమును కూడగట్టు కొనియే అతడు ఇట్లు గర్జించుచున్నాడు. (12-13)

సుగ్రీవుడు సహజముగనే తెలివిగలవాడు, కార్యకుశలుడు. వ్యక్తులయొక్క శౌర్యపరాక్రమములను, గుణగణములను లోతుగా పరీక్షింపకుండా వారితో చెలిమిచేయుడు. ఓ మహావీరా! ఇది నేను ఊహించి చెప్పుచున్నమాటకాదు. ఇంతకుముందు మనకుమారుడైన అంగదుడు ప్రసంగవశమున తెలిపిన విషయమునే మీహితముగోరి చెప్పుచున్నాను.(14-15)

కుమారుడైన అంగదుడు ఉపవనములో విహరించుచున్నప్పుడు మిక్కిలి విశ్వాసపాత్రులైన గూఢచారులు అతనికి ఈ వార్తను తెలిపిరి. అతడు దానిని నాతోనుడివెను.(16)

అయోధ్యకు ప్రభువైన దశరథమహారాజుయొక్క కుమారులు రామలక్ష్మణులు. వారు ఇక్ష్వాకు వంశమునకు చెందినవారు, మహాశూరులు, రణరంగమున అజేయులుగా వాసికెక్కినవారు, శత్రువులకు ఎదిరింపశక్యముగానివారు, సుగ్రీవునకు మేలుచేయుటకై అతనికి మిత్రులైరి. శ్రీరాముడు నీతమ్మునకు అండగా ఉన్నాడట. ఆతడు యుద్ధభూమియందు తిరుగులేని పరాక్రమశాలి, ప్రళయకాలమునందలి అగ్నివలె శత్రుబలములను దెబ్బతీయుటలో మిగుల సమర్థుడు. (17-18)

శ్రీరామచంద్రప్రభువు సాధుజనములకు ఒక మహావృక్షము వంటివాడు. (మహావృక్షము తనను చేరిన

జ్ఞాన విజ్ఞాన సంపన్నో నిదేశే నిరతః పితుః।
ధాతూనామివ శైలేంద్రో గుణానామ్ ఆకరో మహాన్। 20

తత్క్షమం న విరోధస్తే సహ తేన మహాత్మనా।
దుర్జయేనాఽప్రమేయేన రామేణ రణకర్మసు। 21

శూర వక్ష్యామి తే కించిత్ న చేచ్ఛా మ్యభ్యసూయితుమ్।
శ్రూయతాం క్రియతాం చైవ తవ వక్ష్యామి యద్ధితమ్। 22

యౌవరాజ్యేన సుగ్రీవం తూర్ణం సాధ్వభిషేచయ।
విగ్రహం మా కృథా వీర భ్రాత్రా రాజన్ బలీయసా। 23

అహం హి తే క్షమం మన్యే తేన రామేణ సౌహృదమ్।
సుగ్రీవేణ చ సంప్రీతిం వైరముత్సృజ్య దూరతః। 24

లాలనీయో హి తే భ్రాతా యవీయానేష వానర।
తత్ర వా సన్నిహస్థో వా సర్వథా బంధురేవ తే। 25

నహి తేన సమం బంధుం భువి పశ్యామి కంచన।
దానమానాది సత్కారైః కురుష్వ ప్రత్యనంతరమ్। 26

వైరమేతత్ సముత్సృజ్య తవ పార్శ్వే స తిష్ఠతు।
సుగ్రీవో విపులగ్రీవః తవ బంధుః సదా మతః। 27

వారికి మొదట తాపమును పోగొట్టును, పిదప పుష్పములను, ఫలములను అందించి వారికి పరమసంతోషమును కూర్చును. అట్లే శ్రీరాముడు తనను ఆశ్రయించిన (సుగ్రీవాది) సాధుజనులకు మొదట అభయమిచ్చి, ప్రాణభయము మొదలగు తాపములను తొలగించును, అనంతరము అన్నివిధముల తోడునీడగా ఉండి వారికి పరమానందమును గూర్చును.[1] ఆపదలలో ఉన్నవారిని అతడు రక్షించును. కష్టములలో (చిక్కులలో) ఉన్నవారికి ఆశ్రయమైనవాడు, సర్వరక్షకుడుగా లోకవిఖ్యాతిని గన్నవాడు. (19)

ఆప్రభువు జ్ఞానస్వరూపుడు, వేదములు మొదలగు సకల శాస్త్రముల విజ్ఞానములకు కుదురైనవాడు, తండ్రియాజ్ఞను పాలించుటయందు నిరతుడు. గైరికాది ధాతువులకు పర్వతమువలె సకలసద్గుణములకు గని. (20)

ఆ రఘువీరుడు రణరంగమున శత్రువులకు జయింప శక్యముగానివాడు, సాటిలేనిపరాక్రమశాలి, అట్టి మహాపురుషునితో నీకు విరోధము తగదు. శూరుడా! నా ఈ చిన్న మనవిని ఆలకింపుము. నిన్ను తప్పుపట్టుట నా ఉద్దేశ్యము కాదు. నేను నీ మేలుకొఱకే చెప్పుచున్నాను, దయతో దానిని పాటింపుము. ఓ రాజా! వెంటనే సుగ్రీవుని యువరాజుగా పట్టాభిషిక్తుని జేయుట ఎంతేని యుక్తము. బలవంతుడైన (శ్రీరాముని సహాయముగల) నీ సోదరునితో యుద్ధమునకు దిగవలదు. ఇప్పుడు నీవు. పూర్తిగా వైరభావమును విడిచి పెట్టుము, శ్రీరామచంద్ర ప్రభువుతో చెలిమి చేయుము, సుగ్రీవునకు ప్రీతిని గూర్చుము ఇట్లు చేయుటయే నీకు క్షేమకరమని తలంతును. (21-24)

నీ సోదరుడైన సుగ్రీవుడు నీకంటెను చిన్నవాడు, దగ్గఱకు తీయదగినవాడు, అతడు దూరముగా ఉన్నను, ప్రక్కనేయున్నను అన్ని విధములుగా నీకు ఐనవాడేగదా! వాస్తవముగా అతడు నీకు ఆత్మీయుడు, ఈ లోకమున అట్టివాడు నాకు కనబడుటలేదు. కనుక నీవు అతనిని యువరాజుగా గౌరవించుట మొదలగు సత్కారములతో దగ్గఱకు చేర్చుకొనుము. (25-26)

ఈ వైరమును నీవు పూర్తిగా త్యజించినచో అతడు నీకు కుడిభుజముగా ఉండగలడు. సుగ్రీవుడు ఎల్లప్పుడును నీకు వినయవిధేయుడైన బంధువే - అని

1) వాసుదేవతరుచ్ఛాయా నాఽతి శీతా, న ఘర్మదా। నరకాంగారశమనీ, సా కిమర్థం న సేవ్యతే॥
శ్రీ మహావిష్ణువు అనెడి మహావృక్షముయొక్క నీడ మిక్కిలి (తట్టుకొనలేని) చల్లదనమును గాని, మిక్కిలి (భరింపరాని) వేడినిగాని ఇయ్యదు. నరకయాతనలు అనెడి మంటలను చల్లార్చును. (ఆయనను శరణుజొచ్చిన వారిని నరక బాధలు తాకనైన తాకవు) కనుక ఆ పరమాత్ముని సేవింపకుండుట యెట్లు? (ఆ మహానుభావుని సేవించినచో ఇహపరలాభములు లభ్యును.) గోవిందరాజీయవ్యాఖ్య

భ్రాతుః సౌహార్ద మాలంబ నాఽన్యా గతిరిహాస్తి తే। 28

యది తే మత్ప్రియం కార్యం యది చావైషి మాం హితామ్।
యాచ్యమానః ప్రయత్నేన సాధువాక్యం కురుష్వ మే। 29

ప్రసీద పథ్యం శృణు జల్పితం హి మే
న రోష మేవానువిధాతుమర్హసి।
క్షమో హి తే కోసలరాజసూనునా
న విగ్రహః శక్రసమానతేజసా। 30

తదా హి తారా హితమేవ వాక్యం
తం వాలినం పథ్యమిదం బభాషే।
న రోచతే తద్వచనం హి తస్య
కాలాభిపన్నస్య వినాశకాలే। 31

నాభావన. నీ తమ్మునియెడ నీవు సద్భావమునే చూపుము. ఇప్పుడు నీకు ఇంతకంటె మఱియొక మార్గము లేదు. (27-28)

నాకు ప్రియమును గూర్పదలచినచో, నాకు హితమును గోరినచో ఇంతగా ప్రార్థించుచు పలుకుచున్న నామాటలను పాటింపుము. ప్రభూ! నేను పలికిన హితవచనములను దయతో ఆలకింపుము. ఇట్లు నచించి నందులకు నన్ను కోపగింపకుము. కోసలరాజుయొక్క కుమారుడు శ్రీరాముడు ఇంద్రునియంతటి మహా పరాక్రమశాలి. కావున్నే అప్రభువుతో యుద్ధము నీకు తగదు. (29-30)

తార ఇంతవఱకును తనపతితో పలికిన మాటలు అతనికి హితకరములు, క్షేమదాయకములు, వినాశకాలము దాపురించియున్నందున ఆయువుమూడిన ఆవాలికి ఆమె మాటలు ఏమాత్రము రుచింపలేదు. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే పంచదశఃసర్గః (15)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది పదునైదవసర్గము

— * * * —

16. పదునాఱవసర్గము

వాలిసుగ్రీవులు భయంకరముగా పోరాడుట - శ్రీరాముడు ప్రయోగించిన అమోఘమైన బాణమునకు వాలి నేలగూలుట -

తా మేవం బ్రువతీం తారాం తారాధిపనిభాననామ్।
వాలీ నిర్భర్త్సయామాస వచనం చేదమబ్రవీత్। 1

గర్జతోఽస్య చ సంరంభం భ్రాతుః శత్రోర్విశేషతః।
మర్షయిష్యామ్యహం కేన కారణేన వరాననే। 2

అధర్షితానాం శూరాణాం సమరేష్వనివర్తినామ్।
ధర్షణామర్షణం భీరు మరణాదతిరిచ్యతే। 3

సోఢుం న చ సమర్థోఽహం యుద్ధకామస్య సంయుగే।
సుగ్రీవస్య చ సంరంభం హీనగ్రీవస్య గర్జతః। 4

న చ కార్యో విషాదస్తే రాఘవంప్రతి మత్కృతే।
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ కథం పాపం కరిష్యతి। 5

చంద్రునివలె మనోహరమైన ముఖముగల తార నుడివిన మాటలను విని, వాలి ఆమెను మందలించుచు ఇట్లనెను. (1)

"ఓ సుందరీ! సుగ్రీవుడు నాకు సోదరుడే! కాదనను, కాని ఇప్పుడు నాకు అతడు శత్రువు. అతడు నన్ను ఊచ్చగొట్టుచు గర్జించుచుండగా నేను ఎందుకని సహింపవలెను? ఓ తారా! నీవు ఉత్తపిఱికిదానవు. యుద్ధమున వెన్నుచూపనివారు, ఎవ్వరికిని ఎదిరింపశక్యము గానివారు ఐన శూరులకు శత్రు తిరస్కారమును సహించుట మరణముకంటెను హీనము. రణభూమియందు కయ్యమునకు కాలుదువ్వుచు పిట్టగొంతుతో పొలికేకలు పెట్టుచున్న సుగ్రీవుని మిడిసిపాటును సమర్థుడనైన నేను సహింపజాలను. శ్రీరామునివలన నాకు ప్రమాదము కలుగునని శంకించుటగాని, అందులకై దుఃఖపడుటగాని చేయవలదు. అతడు బాగుగా ధర్మమును ఎఱిగినవాడు, కర్తవ్యాకర్తవ్యములు తెలిసినవాడు. అట్టి ప్రభువు నిరపరాధినైన నాకు హాని ఎట్లు తలపెట్టును? (2-5)

నివర్తస్వ సహస్త్రీభిః కథం భూయోఽనుగచ్ఛసి।
సౌహృదం దర్శితం తారే మయి భక్తిః కృతా త్వయా। 6

ప్రతియోత్స్యామ్యహం గత్వా సుగ్రీవం జహి సంభ్రమం।
దర్పమాత్రం వినేష్యామి న చ ప్రాణైర్విమోక్ష్యతే। 7

అహం హ్యాజిస్థితస్యాస్య కరిష్యామి యథేప్సితం।
వృక్షైర్ముష్టిప్రహారైశ్చ పీడితః ప్రతియాస్యతి। 8

న మే గర్వితమాయస్తం సహిష్యతి దురాత్మవాన్।
కృతం తారే సహాయత్వం సౌహృదం దర్శితం మయి। 9

శాపితాసి మమ ప్రాణైః నివర్తస్వ జనేన చ।
అహం జిత్వా నివర్తిష్యే తమహం భ్రాతరం రణే। 10

తం తు తారా పరిష్వజ్య వాలినం ప్రియవాదినీ।
చకార రుదతీ మందం దక్షిణా సా ప్రదక్షిణమ్। 11

తతః స్వస్త్యయనం కృత్వా మంత్రవద్విజయైషిణీ।
అంతఃపురం సహ స్త్రీభిః ప్రవిష్టా శోకమోహితా। 12

ప్రవిష్టాయాం తు తారాయాం సహ స్త్రీభిః స్వమాలయం।
నగరాన్నిర్యయౌ క్రుద్ధో మహాసర్ప ఇవ శ్వసన్। 13

స నిఃశ్వస్య మహాతేజా వాలీ పరమరోషణః।
సర్వతశ్చారయన్ దృష్టిం శత్రుదర్శనకాంక్షయా। 14

స దదర్శ తతః శ్రీమాన్ సుగ్రీవం హేమపింగళమ్।
సుసంవీతమవష్టబ్ధం దీప్యమానమివానలమ్। 15

స తం దృష్ట్వా మహావీర్యం సుగ్రీవం పర్యవస్థితం।
గాఢం పరిదధే వాసో వాలీ పరమరోషణః। 16

స వాలీ గాఢసంవీతో ముష్టిముద్యమ్య వీర్యవాన్।
సుగ్రీవమేవాభిముఖో యయౌ యోద్ధుం కృతక్షణః। 17

శ్లిష్టముష్టిం సముద్యమ్య సంరబ్ధతరమాగతః।
సుగ్రీవోఽపి తముద్దిశ్య వాలినం హేమమాలినమ్। 18

ఓ తారా! నాపై నీకుగల ప్రేమానురాగములను, భక్తిని ప్రకటించితివి. మంచిది. తోడివనితలతోగూడి మఱలిపొమ్ము. ఇంక నీవు నావెంట ఎందుకు వత్తువు? నీతత్తరపాటును మానుము. యుద్ధభూమికి వెళ్లి, సుగ్రీవునితో పోరాడి, అతని గర్వమును అణచెదను. అంతేగాని అతని ప్రాణములనుమాత్రము తీయను. యుద్ధరంగమున నిలిచియున్న సుగ్రీవునియొక్క రణకండూతిని తీర్చెదను. వృక్షములతో కొట్టి, పిడిగిళ్లతో పొడిచి, అతనిని నుగ్గునుగ్గుగావించి పంపెదను. దురాత్ముడైన సుగ్రీవుడు నా శక్తికిని, యుద్ధకౌశలమునకును తట్టుకొనజాలడు. తారా! నామీదనీకున్న అనురాగమును తెలిపితివి. నా బుద్ధికివదునుబెట్టి నాకు సహాయపడితివి. నా ప్రాణములపై (నామీద) ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. ఇంక నీపరిజనులతో వెళ్లుము. యుద్ధమున నా సోదరుడైన ఆ సుగ్రీవుని జయించి నేను తప్పక తిరిగిరాగలను."(6-10)

అంతట ఎల్లప్పుడును ప్రియముగా భాషించునట్టి తార తన భర్తయగు వాలిని కౌగిలించుకొనెను. స్వ-పరభేదములేక అందఱి హితమును గోరెడి ఆమె దుఃఖించుచు, నెమ్మదిగా తన పతికి ప్రదక్షిణము చేసెను. అనంతరము ఆమె తన భర్తకు విజయమును గోరుచు, మంత్రపూర్వకముగా స్వస్తి వచనములను పలికెను. పిమ్మట పట్టరాని దుఃఖముతో తోడివనితలతోగూడి అంతఃపురమున ప్రవేశించెను. (11-12)

తార అంతఃపురస్త్రీలతోగూడి తనభవనమున ప్రవేశించిన పిమ్మట, వాలి క్రుద్ధుడై, మహాసర్పమువలె బుసలు కొట్టుచు, నగరమునుండి వెలుపలికి వచ్చెను. మహాబలశాలియైన వాలి మిక్కిలి కోపోద్రిక్తుడై నిట్టూర్చి, శత్రువుజాడ తెలిసికొనుటకై నలుదిక్కుల పరికించి చూచుచు నిలిచిపోయెను. ఇంతలో మహాపరాక్రమశాలియైన వాలికి బంగారువన్నెగల సుగ్రీవుడు కనబడెను. అతడు నడుము బిగించి యుద్ధసన్నద్ధుడై అగ్నివలె తేజరిల్లుచుండెను. (13-15)

అప్పుడు సమీపముననేయున్న మహాపరాక్రమవంతుడగు సుగ్రీవుని చూచిన పిమ్మట ఆవాలి ఇంకను క్రుద్ధుడై, వస్త్రమును నడుమునకు గట్టిగా బిగించుకొనెను. అట్లు యుద్ధసన్నద్ధుడైన పరాక్రమశాలియగువాలి పిడికిలి బిగించి, రెట్టింపు ఉత్సాహముతో యుద్ధము చేయుటకై సుగ్రీవునకు ఎదురుగా నడచెను. పిమ్మట సుగ్రీవుడుగూడ పూనికతో పిడికిలి బిగించి, మెడలో బంగారు హారమును ధరించిన వాలితో తలపడుటకు మిక్కిలి వేగముగా ముందుకు దూసికొనివచ్చెను. (16-18)

తం వాలీ క్రోధతామ్రాక్షః సుగ్రీవం రణపండితం।
ఆపతంతం మహావేగమ్ ఇదం వచనమబ్రవీత్। 19

ఏష ముష్టిర్మయా బద్ధో గాఢః సన్నిహితాంగులిః।
మయా వేగవిముక్తస్తే ప్రాణానాదాయ యాస్యతి। 20

ఏవముక్తస్తు సుగ్రీవః క్రుద్ధో వాలినమబ్రవీత్।
తవైవ చాహరన్ ప్రాణాన్ ముష్టిః పతతు మూర్ధని। 21

తాడితస్తేన సంక్రుద్ధః సమభిక్రమ్య వేగితః।
అభవచ్ఛోణితోద్గారీ సోత్పీడ ఇవ పర్వతః। 22

సుగ్రీవేణ తు నిస్సంగం సాలమ్ ఉత్పాట్య తేజసా।
గాత్రేష్వభిహతో వాలీ వజ్రేణేవ మహాగిరిః। 23

స తు వాలీ ప్రచలితః సాలతాడనవిహ్వలః।
గురుభారసమాక్రాంతో నౌసార్థ ఇవ సాగరే। 24

తౌ భీమబలవిక్రాంతౌ సుపర్ణసమవేగినౌ।
ప్రవృద్ధౌ ఘోరవపుషౌ చంద్రసూర్యావివాంబరే।
పరస్పరమ్ అమిత్రఘ్నౌ ఛిద్రాన్వేషణతత్పరౌ। 25

తతోఽవర్ధత వాలీ తు బలవీర్యసమన్వితః।
సూర్యపుత్రో మహావీర్యః సుగ్రీవః పరిహీయతే। 26

వాలినా భగ్నదర్పస్తు సుగ్రీవో మందవిక్రమః।
వాలినం ప్రతి సామర్షో దర్శయామాస లాఘవమ్। 27

వృక్షైః సశాఖైః శిఖరైః వజ్రకోటినిభైర్నఖైః।
ముష్టిభిర్జానుభిః పద్భిః బాహుభిశ్చ పునః పునః।
తయోర్యుద్ధమభూద్ఘోరం వృత్రవాసవయోరివ। 28

తౌ శోణితాక్తౌ యుధ్యేతాం వానరౌ వనచారిణౌ।
మేఘావివ మహాశబ్దైః తర్జయానౌ పరస్పరమ్। 29

యుద్ధమున నేర్పరియైన సుగ్రీవుడు ఆవిధముగా మహావేగముతో ముందుకు వచ్చుచుండగా, వాలి కన్నులెఱ్ఱజేయుచు అతనితో ఇట్లు పలికెను. (19)

"ఓరీ! ఇదిగో చూడుము. వ్రేళ్లనన్నింటిని ముడిచి నాపిడికిలిని గట్టిగా బిగించితిని. బలముగా ఈ పిడికిలితో ఒక్క దెబ్బ వేసిన నీ ప్రాణములు ఎగిరిపోవును." (20)

వాలి ఇట్లు పలికినందులకు సుగ్రీవుడు మిగుల క్రుద్ధుడై అతనితో ఇట్లనెను. "ఇదిగో! కాచుకొనుము. నాపిడికిలితో నీతలపై మోదినచో అది నీప్రాణములను హరించివేయును." అని పలుకుచు అతడు క్రుద్ధుడై వేగముగా దూసికొనివచ్చెను. ఇంతలో వాలి కొట్టిన పిడికిలి దెబ్బతో అతని నోటినుండి రక్తము స్రవింపసాగెను. అప్పుడు అతడు సెలయేళ్లతోగూడిన పర్వతమువలె ఒప్పుచుండెను. అంతట సుగ్రీవుడు వెంటనే ఒక మద్దిచెట్టును పెకలించి, దానితో మహాపర్వతమును వజ్రాయుధముతో వలె వాలిని కొట్టెను. (21-23)

వ్యాపారులు ఎక్కువ సంఖ్యలో ఎక్కుటవలన బరువునకు తట్టుకొనలేక సముద్రములో అటునిటు ఊగిపోవు నావవలె మద్దిచెట్టు దెబ్బకు దిమ్మెరపోయిన వాలి ఒక్కసారిగా చలించెను. (24)

ఆ వాలిసుగ్రీవులు ఇరువురును తిరుగులేని బలపరాక్రమములు గలవారు, గరుడునివలె మిక్కిలి వేగముగలవారు, యుద్ధావేశమునకు లోనైయున్నవారు, భీకరమైన ఆకారములుగలవారు, శత్రుభావముతో ఒకరినొకరు చంపబూనియున్నవారు, ఎదుటివారి బలహీనతలు గ్రహించుటలో నిమగ్నులైయున్నవారు, వారు పూర్ణిమనాడు సంధ్యా సమయమునందు ఆకాశమునందలి చంద్ర సూర్యులవలె ఒప్పుచుండిరి. అప్పుడు వాలి బలపరాక్రమములతో విజృంభించుచుండెను. సూర్యాంశతో పుట్టినవాడు, మహావీరుడు ఐన సుగ్రీవుడు యుద్ధమున మెత్తబడుచుండెను. వాలిధాటికి సుగ్రీవుని దర్పము అణగిపోయెను. పరాక్రమము సన్నగిల్లెను. అప్పుడు సుగ్రీవుడు క్రోధావేశముతో వాలి మీదికి వేగముగా విజృంభించెను.(25-27)

వారు కొమ్మలతో గూడిన పెద్దపెద్ద వృక్షములతోడను, పర్వతశిఖరములతోడను, వజ్రాయుధమువంటి గోళ్లతోడను, పిడికిళ్లతోడను, మోకాళ్లతోడను, పాదములతోడను, బాహువులతోడను పరస్పరము పదేపదే కొట్టుకొనసాగిరి వారియొక్క పోరు వృత్రాసురునకు ఇంద్రునకు మధ్య జరిగిన యుద్ధమువలె భయంకరముగా కొనసాగెను. (28)

వనచారులైన ఆ ఇరువురు వానరులును రక్తసిక్తములైన దేహములతో పోరాడుచుండిరి. వారు మహామేఘములవలె ఘోరముగా గర్జించుచు ఒకరినొకరు హెచ్చరించుకొనుచుండిరి. (29)

హీయమానమ్ అథోఽపశ్యత్ సుగ్రీవం వానరేశ్వరం।
వీక్షమాణం దిశశ్చైవ రాఘవః స ముహుర్ముహుః। 30

క్రమక్రమముగా శక్తి క్షీణించుచుండుటచే వానర ప్రముఖుడైన సుగ్రీవుడు మాటిమాటికి దిక్కులు చూచుచుండుటను శ్రీరాముడు గమనించెను. (30)

తతో రామో మహాతేజా ఆర్తం దృష్ట్వా హరీశ్వరం।
శరం చ వీక్షతే వీరో వాలినో వధకారణాత్। 31

తతో ధనుషి సంధాయ శరమ్ ఆశీవిషోపమం।
పూరయామాస తచ్చాపం కాలచక్రమివాంతకః। 32

తస్య జ్యాతలఘోషేణ త్రస్తాః పత్రరథేశ్వరాః।
ప్రదుద్రువుర్మృగాశ్చైవ యుగాంత ఇవ మోహితాః। 33

గొప్పబలశాలియు, మహావీరుడును ఐన శ్రీరాముడు ఆపదలలో చిక్కుకొనిన వానరేశ్వరుడగు సుగ్రీవునిజూచి, వాలిని వధించుటకై ఒక్కసారి తన బాణమువైపు చూచెను. వెంటనే ఆ ప్రభువు విషసర్పముతో సమానమైన శరమును ధనుస్సునందు సంధించెను. ప్రళయకాలయముడు 'కాలచక్రము' అను ఆయుధమును చేపట్టినట్లు అతడు తన చాపమును ఎక్కుపెట్టెను. ఆ స్వామియొక్క భయంకరమైన ధనుష్టంకారమునకు పక్షులన్నియును వణకిపోయినవి. ప్రళయకాలము వచ్చి మీదబడినట్లుగా సమస్త మృగములును ఎటున్నవటు పరుగులు దీసినవి. (31-33)

ముక్తస్తు వజ్రనిర్ఘోషః ప్రదీప్తాశనిసన్నిభః।
రాఘవేణ మహాబాణో వాలివక్షసి పాతితః। 34

తతస్తేన మహాతేజా వీర్యోత్సిక్తః కపీశ్వరః।
వేగేనాఽభిహతో వాలీ నిపపాత మహీతలే। 35

ఇంద్రధ్వజ ఇవోద్ధూతః పౌర్ణమాస్యాం మహీతలే।
ఆశ్వయుక్సమయే మాసి గతశ్రీకో విచేతనః। 36

ఆ రఘువీరుడు ప్రయోగించిన మహాశరము వజ్రాయుధమువలె భయంకరధ్వని చేయుచు, పిడుగువలె నిప్పులు గ్రక్కుచు వాలివక్షఃస్థలమునందు నాటుకొనెను. అంతట మహాబలశాలియు, వానరప్రభువుఐన ఆ వాలి పరాక్రమము క్షీణించినవాడై, శ్రీరామునియొక్క బాణదాటికి నిలువలేక నేలపై పడిపోయెను. ఆశ్వయుజ మాసమునందు పూర్ణిమనాడు నేలపై పడవేయబడిన ఇంద్రధ్వజమువలె[1] వాలి భూమిపై పడిపోయెను. అప్పుడు అతడు వన్నెతఱిగి స్పృహను కోల్పోయెను. (34-36)

నరోత్తమః కాలయుగాంతకోపమం
శరోత్తమం కాంచనరూప్యభూషితం।
ససర్జ దీప్తం తమమిత్రమర్దనం
సధూమమగ్నిం ముఖతో యథా హరః। 37

అథోక్షితః శోణితతోయవిస్రవైః
సుపుష్పితాశోక ఇవానిలోద్ధతః।
విచేతనో వాసవసూనురాహవే
విభ్రంశితేంద్రధ్వజవత్ క్షితిం గతః। 38

ప్రళయకాలమునందు హరుడు తనముఖమునుండి పొగతో గూడిన అగ్నిని వదలినట్లు పురుషోత్తముడైన శ్రీరాముడు ప్రళయకాలమృత్యువువంటి తన బాణమును ప్రయోగించెను. అది బంగారముతో వెండితో అలంకృతమైనది. శత్రువులను రూపుమాపునది, కాంతులతో మిలుమిట్లు గొల్పుచున్నది. ఇంద్రాంశతో పుట్టిన వాలియొక్క శరీరము నుండి జలధారలవలె రక్తము ప్రవహించెను. ఆ రక్తముతో అతని శరీరము పూర్తిగా తడిసిపోయెను. అతడు పెనుగాలికి కూలిన, పుష్పించిన అశోకవృక్షమునలెను. ఆకాశమునుండి జారిపడిన ఇంద్రధ్వజమువలెను[1] అచేతనుడై రణరంగమున నేలపై పడిపోయెను. (37-38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే షోడశఃసర్గః *(16)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది పదునారవసర్గము

— ❋ ❋ ❋ —

1) గౌడ (వంగ) దేశమునందు ఒక మహోత్సవసమయమున ఆశ్వయుజమాసమునందు పూర్ణిమనాడు ఇంద్రుని ఉద్దేశించి ధ్వజమును ప్రతిష్ఠింతురు. ఉత్సవానంతరము దానిని నేలపై పడవేయుదురు. – (తత్త్వదీపిక)

17. పదునేడవసర్గము

శ్రీరాముడు తనను నేలగూల్చినందులకు వాలి ఆ ప్రభువును అధిక్షేపించుట -

తత: శరేణాభిహతో రామేణ రణకర్కశ:।
పపాత సహసా వాలీ నికృత్త ఇవ పాదప:। 1

స భూమౌ వ్యస్తసర్వాంగ: తప్తకాంచనభూషణ:।
అపతద్దేవరాజస్య ముక్తరశ్మిరివ ధ్వజ:। 2

తస్మిన్ నిపతితే భూమౌ వానరాణాం గణేశ్వరే।
నష్టచంద్రమివ వ్యోమ న వ్యరాజత భూతలమ్। 3

భూమౌ నిపతితస్యాపి తస్య దేహం మహాత్మన:।
నశ్రీర్జహాతి న ప్రాణా న తేజో న పరాక్రమ:। 4

శక్రదత్తా వరా మాలా కాంచనీ వజ్రభూషితా।
దధార హరిముఖ్యస్య ప్రాణాం స్తేజ: శ్రియం చ సా। 5

స తయా మాలయా వీరో హైమయా హరియూథప:।
సంధ్యానుగతపర్యంత: పయోధర ఇవాభవత్। 6

తస్య మాలా చ దేహశ్చ మర్మఘాతీ చ య: శర:।
త్రిధేవ రచితా లక్ష్మీ: పతితస్యాపి శోభతే। 7

తదస్త్రం తస్య వీరస్య స్వర్గమార్గప్రభావనం।
రామబాణాసనక్షిప్తమ్ ఆవహత్ పరమాం గతిమ్। 8

తం తదా పతితం సంఖ్యే గతార్చిషమివానలం।
బహుమాన్య చ తం వీరం వీక్షమాణం శనైరివ। 9

యయాతిమివ పుణ్యాంతే దేవలోకాత్ పరిచ్యుతం।
ఆదిత్యమివ కాలేన యుగాంతే భువి పాతితమ్। 10

మహేంద్రమివ దుర్ధర్షం ఉపేంద్రమివ దుస్సహం।
మహేంద్రపుత్రం పతితం వాలినం హేమమాలినమ్। 11

సింహోరస్కం మహాబాహుం దీప్తాస్యం హరిలోచనం।
లక్ష్మణానుగతో రామో దదర్శోపససర్ప చ। 12

తం దృష్ట్వా రాఘవం వాలీ లక్ష్మణం చ మహాబలం।
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం పరుషం ధర్మసంహితమ్। 13

శ్రీరాముడు తనతీవ్రమైన బాణముతో కొట్టగా యుద్ధమునందు నిగ్గుదేలిన వాలి మొదలు నఱికిన వృక్షమువలె నేలకొఱగెను. మేలిమి బంగారు ఆభరణములను ధరించినవాలి త్రాళ్లు విప్పివేసిన ఇంద్రధ్వజమువలె అవయవములన్నియును నేలకు తాకునట్లుగా పడిపోయెను. వానరులకు ప్రభువైన ఆ వాలి భూమిపై పడిపోవుటతో అతని రాజ్యము చంద్రుడులేని ఆకాశమువలె కళదప్పెను. (1-3)

ఆ మహాత్ముడు నేలపైబడినప్పటికిని బలపరాక్రమములు, శోభ, ప్రాణములు అతని దేహమును విడిచిపెట్టలేదు. వజ్రములు పొదగబడిన ఇంద్రదత్తమగు ఆ బంగారుదండ వానరప్రభువుయొక్క ప్రాణములను, బలమును, తేజస్సును కాపాడెను. బంగారుమాలతో ఒప్పుచున్న మహావీరుడగు ఆ వాలి సంధ్యాసమయమునందలి ఎఱ్ఱనికాంతులతో కూడియున్న మేఘమువలె విలసిల్లుచుండెను. నేలపై పడియున్న వాలియొక్క శోభ అతడు ధరించినమాల, అతని దేహము, దానిపై నాటుకొనియున్న బాణము అను మూడు రూపములుగా విరాజిల్లుచున్నది. (4-7)

శ్రీరాముడు ప్రయోగించిన ఆ అస్త్రము స్వర్గమునకు దారిజూపునది. అట్టి ప్రభావముగల ఆశరము వీరుడైన వాలిని పరమపదమును పొందుటకు అర్హునిగాజేసెను. (8)

యుద్ధరంగమున పడియున్న ఆ వాలి తిన్నగా కన్నులు తెఱచి చూచుచుండెను. అప్పుడు అతడు మంటలు ఆఱిపోగా మిగిలియున్న అగ్నివలె ఒప్పుచుండెను. పుణ్యము క్షీణించిన పిమ్మట దివినుండి భువికి జాఱిన యయాతి వలెను, యుగాంతమునందు దైవికముగా నేలరాలిన సూర్యునివలెను విలసిల్లుచుండెను. అతడు మహేంద్రునివలె ఎదిరింప శక్యముగానివాడు, ఉపేంద్రునివలె సహింపరానివాడు, అతడు ఇంద్రునివరమువలన జన్మించినవాడు, బంగారుహారమును ధరించినవాడు, అతని వక్షఃస్థలము విశాలమైనది అతడు అజానుబాహువు, చక్కని ముఖకాంతిగలవాడు, అతనికన్నులు బంగారువన్నె గలిగి మెఱయుచుండును. అట్టివాలిని రామలక్ష్మణులు ఆదరముతో చూచి ఆయనను సమీపించిరి. (9-12)

అంతట వాలి మహాబలశాలులైన రామలక్ష్మణులను జూచెను. పిదప అతడు సవినయముగా ధర్మబద్ధముగనే

త్వం నరాధిపతేః పుత్త్రః ప్రథితః ప్రియదర్శనః।
కులీనః సత్త్వసంపన్నః తేజస్వీ చరితవ్రతః। 14

పరాఙ్ముఖవధం కృత్వా కో ను ప్రాప్త స్త్వయా గుణః।
యదహం యుద్ధసంరబ్ధః శరేణోరసి తాడితః। 15

రామః కరుణవేదీ చ ప్రజానాం చ హితే రతః।
సానుక్రోశో జితోత్సాహః సమయజ్ఞో దృఢవ్రతః।
ఇతి తే సర్వభూతాని కథయంతి యశో భువి। 16

దమః శమః క్షమా ధర్మో ధృతిః సత్యం పరాక్రమః।
పార్థివానాం గుణా రాజన్ దండశ్చాఽప్యపరాధిషు। 17

తాన్ గుణాన్ సంప్రధార్యాహమ్ అగ్ర్యం చాభిజనం తవ।
తారయా ప్రతిషిద్ధోఽపి సుగ్రీవేణ సమాగతః। 18

న మామ్ అన్యేన సంరబ్ధం ప్రమత్తం యోద్ధుమర్హతి।
ఇతి మే బుద్ధిరుత్పన్నా బభూవాదర్శనే తవ। 19

న త్వాం వినిహతాత్మానం ధర్మధ్వజమ్ అధార్మికం।
జానే పాపసమాచారం తృణైః కూపమివావృతమ్। 20

సతాం వేషధరం పాపం ప్రచ్ఛన్నమివ పావకం।
నాఽహం త్వామభిజానామి ధర్మచ్ఛద్మాభిసంవృతమ్। 21

విషయే వా పురే వా తే యదా నాఽపకరోమ్యహం।
న చ తామ్ అవజానే చ కస్మాత్త్వం హంస్యకిల్బిషమ్। 22

ఫలమూలాశనం నిత్యం వానరం వనగోచరం।
మామిహాప్రతియుధ్యంతమ్ అన్యేన చ సమాగతమ్। 23

లింగ మప్యస్తి తే రాజన్ దృశ్యతే ఽధర్మసంహితం। 24

శ్రీరామునితో ఇట్లు పరుషవచనములను పలికెను. "స్వామీ! నీవు ఒక మహారాజుగారి కుమారుడవు. సకల ధర్మశాస్త్రములను అభ్యసించినవాడవు. ఉత్తమవంశమున జన్మించినవాడవు, సత్త్వగుణము గలవాడవు, పరాక్రమవంతుడవు, ధర్మనియమములను పాటించువాడవు. అన్నివిధములుగా ఖ్యాతికెక్కినవాడవు. నేను వేఱొకనితో యుద్ధము చేయుచున్నప్పుడు నీవు నన్ను చంపి ఏమి బావుకొంటివి? నేను విజృంభించి యుద్ధము చేయుచున్నప్పుడు నా వక్షఃస్థలమున బాణముతో ఎందుకు కొట్టితివి? (13-15)

'శ్రీరాముడు కనికరముతో ఆశ్రితులను కాపాడుచుండువాడు, ఎల్లప్పుడును ప్రజలహితమునకే పాటుపడువాడు, దయామయుడు, గొప్పఉత్సాహశక్తిగలవాడు, సదాచారసంపన్నుడు, చేపట్టినదీక్షను విడువనివాడు', అని సకల ప్రాణులును ఈ భూమండలమున నీ కీర్తిని గానముచేయుచుండును.(16)

ఓ ప్రభూ! ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహము, సహనము, ధర్మాచరణము, ధైర్యము, సత్యవ్రతము, పరాక్రమము, అపరాధులను దండించుట మొదలగు అన్నియును రాజులకు ఉండవలసిన గుణములు.

ప్రభూ! ఆ ఉత్తమగుణములన్నియు నీలో ఉన్నవనియు, అంతేగాక నీవు సద్వంశమునకు చెందినవాడవనియు తలంచి, నాభార్యయగు తార అడ్డుపడినను వినక సుగ్రీవునితో యుద్ధమునకై వచ్చితిని. ఇంతకుముందు నీ దర్శనము కాలేదు. 'ఇతరులతో యుద్ధమున మునిగియున్న నన్ను ధర్మాత్ముడైన శ్రీరాముడు దెబ్బతీయడు', అని నేను విశ్వసించియుంటిని. కాని నీబుద్ధి దారితప్పినదనీ, నీవు ధర్మమను ముసుగు కప్పుకొనిన అధర్మపరుడవనీ, నీ ఆచారవ్యవహారములు పాపముతో కూడియున్నవనీ, గడ్డిచే కప్పబడిన బావివంటి వాడవనీ నేనెఱుగను. బూడిదలో దాగియున్న నిప్పువలె నీవు సత్పురుషుల వేషములో ఉన్న పాపాత్ముడవు, ధర్మమును అడ్డుపెట్టుకొని లోకమును మోసగించుచున్నవాడవు అనియు నేను ఇంతవఱకును ఎఱుగను. (17-21)

నీ దేశమున, నీ పురమున నేను ఎన్నడును నీకు అపకారమును తలపెట్టలేదు. నిన్ను అవమానపఱచియు ఎఱుగను. అట్టి నిరపరాధినైన నన్ను నీవు ఎందులకు చంపబూనితివి? (22)

నేను కాయకసరులను తినుచు వనములలో జీవించుచుండెడి వానరుడను. నిన్ను ఎదిరించి, యుద్ధము చేసిన వాడనుకాను. మఱియొకరితో పోరాడుచున్నపుడు నీవు నన్ను ఎందులకు చంపబూనితివి? ఓ రాజా! నీవు ధర్మపరునివలె జటావల్కలములవేషమును ధరించితివి. వాస్తవముగా నీవు అధర్మపరుడవు. (23-24)

కః క్షత్రియకులే జాతః శ్రుతవాన్ నష్టసంశయః।
ధర్మలింగప్రతిచ్ఛన్నః క్రూరం కర్మ సమాచరేత్। 25

రామ! రాజకులే జాతో ధర్మవానితి విశ్రుతః।
అభవ్యో భవ్యరూపేణ కిమర్థం పరిధావసి। 26

సామ దానం క్షమా ధర్మః సత్యం ధృతిపరాక్రమౌ।
పార్థివానాం గుణా రాజన్ దండశ్చాఽప్యపరాధిషు। 27

వయం వనచరా రామ మృగా మూలఫలాశనాః।
ఏషా ప్రకృతిరస్మాకం పురుషస్త్వం నరేశ్వరః। 28

భూమిర్హిరణ్యం రూప్యం చ విగ్రహే కారణాని చ।
అత్ర కస్తే వనే లోభో మదీయేషు ఫలేషు వా। 29

నయశ్చ వినయశ్చోభౌ నిగ్రహానుగ్రహావపి।
రాజవృత్తిరసంకీర్ణా న నృపాః కామవృత్తయః। 30

త్వం తు కామప్రధానశ్చ కోపనశ్చానవస్థితః।
రాజవృత్తైశ్చ సంకీర్ణః శరాసనపరాయణః। 31

న తేఽ స్త్యపచితిర్ధర్మే నాఽర్థే బుద్ధిరవస్థితా।
ఇంద్రియైః కామవృత్తః సన్ కృష్యసే మనుజేశ్వర। 32

హత్వా బాణేన కాకుత్స్థ మామిహాఽనపరాధినం।
కిం వక్ష్యసి సతాం మధ్యే కర్మ కృత్వా జుగుప్సితమ్। 33

రాజహా బ్రహ్మహా గోఘ్నః చోరః ప్రాణివధే రతః।
నాస్తికః పరివేత్తా చ సర్వే నిరయగామినః। 34

సూచకశ్చ కదర్యశ్చ మిత్రఘ్నో గురుతల్పగః।
లోకం పాపాత్మనామ్ ఏతే గచ్ఛంతే నాత్ర సంశయః। 35

క్షత్రియవంశమున పుట్టినవాడు, వేదశాస్త్రములను అభ్యసించినవాడు, జ్ఞానియగుటచే సంశయములు లేనివాడు, ధర్మమార్గమును అవలంబించినవాడు ఎవడు ఇట్టి క్రూరమైన కర్మకు పాల్పడును? (25-26)

ఓ రామా! నీవు రాజవంశమున జన్మించినవాడవు. ధర్మాత్ముడుగా ప్రసిద్ధిగన్నవాడవు. పైగా సౌమ్యరూపముతో ఉన్నవాడవు. కాని అట్టినీవు ఇట్టి క్రూరకర్మలకు ఎందులకు ఒడిగట్టితివి? ఓ ప్రభూ! శాంతగుణము, దానము, సహనము, ధర్మాచరణము, సత్యవచనము, ధైర్యము, పరాక్రమము, అపరాధులను దండించుట అనునవి మహారాజుల లక్షణములు. రామా! మేము వనములలో సంచరించెడి మృగములము. ఫలమూలములే మా ఆహారములు. ఇదియే మా జీవనవిధానము. నీవేమో నరుడవు. పైగా మహారాజువు. (27-28)

రాజ్యముకొఱకును, వెండి బంగారములకొఱకును సంపదలకొఱకును సామాన్యముగా రాజులకు కలహములు జరుగుచుండును. మఱి ఇప్పుడు ఈ వనమున నానుండి ఏ ఫలములను ఆశించుచున్నావు? (29)

నీతినిపాటించుట, అణకువ కలిగియుండుట దోషులను దండించుట, నిర్దోషులయెడ (సజ్జనులయెడ) అనుగ్రహమును (ప్రసన్న భావమును) ప్రదర్శించుట రాజు పాటింపవలసిన ముఖ్య విధులు. వీటిని అవివేకముతో తారుమారు చేయరాదు. పాలకులు నియమములకు లోబడి యుండవలయును, తోచిన రీతిగా ప్రవర్తింపరాదు. నీవు కామదాసుడవు, కోపస్వభావుడవు, చపలుడవు, నయవినయాది రాజధర్మములను విచక్షణరహితముగా నడపువాడవు. యుక్తాయుక్తములను మఱచి తోచినరీతిగా ఇతరులను చంపెడివాడవు. ఓనరేశ్వరా! నీకు ధర్మమునందు ఆదరభావములేదు. కార్యసాధనమునందు నీ బుద్ధి స్థిరమైనదికాదు. నీవు విశృంఖలముగా ప్రవర్తించువాడవు. కావున ఇంద్రియములకు వశుడవు. నిరపరాధినైన నన్ను నీ బాణముచే కొట్టితివి. ఇట్టి నీచమైన పనికి ఒడిగట్టిన నీవు ఇందులకు సత్పురుషులకు ఏమని సమాధానము చెప్పెదవు. (30-33)

రాజద్రోహి, గోబ్రాహ్మణహత్యలకు పాల్పడినవాడు, చోరుడు, ఎల్లప్పుడు ప్రాణులను వధించుచుండువాడు, నాస్తికుడు, అన్నకంటెను ముందుగా పెండ్లిచేసికొనినవాడు, వీరందఱికిని నరకయాతనలు తప్పవు. చాడీలు చెప్పెడివాడు, లోభి, మిత్రద్రోహి, గురుద్రోహి మొదలగువారు పాపాత్ముల లోకములకు పోవుదురు. ఇందు ఏమాత్రము సందేహములేదు. (34-35)

అధార్యం చర్మమే సద్భి రోమాణ్యస్థి చ వర్జితం।
అభక్ష్యాణి చ మాంసాని త్వద్విధైర్ధర్మచారిభిః। 36

పంచ పంచనఖా భక్ష్యా బ్రహ్మక్షత్రేణ రాఘవ।
శల్యకః శ్వావిధో గోధా శశః కూర్మశ్చ పంచమః। 37

చర్మ చాస్థి చ మే రాజన్ న స్పృశంతి మనీషిణః।
అభక్ష్యాణి చ మాంసాని సోఽహం పంచనఖో హతః। 38

తారయా వాక్యముక్తోఽహం సత్యం సర్వజ్ఞయా హితం।
తదతిక్రమ్య మోహేన కాలస్య వశమాగతః। 39

త్వయా నాథేన కాకుత్స్థ న సనాథా వసుంధరా।
ప్రమదా శీలసంపన్నా ధూర్తేన పతినా యథా। 40

శఠో నైకృతికః క్షుద్రో మిథ్యాప్రశ్రితమానసః।
కథం దశరథేన త్వం జాతః పాపో మహాత్మనా। 41

ఛిన్న చారిత్రకక్ష్యేణ సతాం ధర్మాఽతివర్తినా।
త్యక్తధర్మాంకుశేనాఽహం నిహతో రామహస్తినా। 42

అశుభం చాప్యయుక్తం చ సతాం చైవ విగర్హితం।
వక్ష్యసే చేదృశం కృత్వా సద్భిః సహ సమాగతః। 43

ఉదాసీనేషు యోఽస్మాసు విక్రమస్తే ప్రకాశితః।
అపకారిషు తం రాజన్ నహి పశ్యామి విక్రమమ్। 44

దృశ్యమానస్తు యుధ్యేథా మయా యది నృపాత్మజ।
అద్య వైవస్వతం దేవం పశ్యేస్త్వం నిహతో మయా। 45

ఓ రఘువీరా! సత్పురుషులకు జింకచర్మము అసనాదులకు ఉపయోగపడును. నా చర్మము అందులకు పనికిరాదు. చమరీమృగముల కేశములు చామరములుగా దైవ సేవలకు ఉపయోగపడును. నా రోమములు అందుకు అనర్హములు. ఏనుగులఎముకలు (దంతములు) లోకమునకు ఉపయోగపడినట్లు నా ఎముకలు ఉపయోగపడవు. నీవంటి ధర్మాత్ములకు నా మాంసఖండములు తినుటకు అయోగ్యములు. ఏదైనా అనివార్యకారణములవలన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు మాంసాహారులైనచో వారికి పంచనఖజంతువులలో ముళ్లపంది, కుక్కలనుచంపెడి వరాహము, ఉడుము, కుందేలు, తాబేలు అను ఐదు మాత్రమే భక్షింపదగినవి. ప్రాజ్ఞులు నా చర్మమునుగాని, ఎముకలనుగాని తాకనే తాకరు. నేను ఐదుగోళ్ల జంతువునే ఐనను నా మాంసపు ముక్కలు తినుటకు పనికిరావు. (తినరానివి) (36-38)

ముందు చూపుగల (సర్వజ్ఞురాలైన) తార నాహితమును కోరుచు సత్యమును (ఇప్పుడు యుద్ధమునకు వెళ్ళుటకు తగదు అని) పలికినది. కాని ఆమె మాటలు కాదని (లక్ష్యపెట్టక) నా మూర్ఖత్వముచే ఆయువు మూడి (విధివిలాసమున) నేను ఇటు యుద్ధమునకు వచ్చితిని.(39)

కాకుత్స్థా! శీలవతియైన యువతికి ధూర్తుడైన పతిచేతిలో రక్షణ కఱవైనట్లు నీవంటి రాజుయొక్క పాలనలో బడిన భూమి (రాజ్యము) దిక్కులేనిదియగును.(40)

నీవు కపటివి, ఇతరులకు అపకారము చేయుచు జీవించువాడవు, నీచపుపనులను చేయువాడవు, నక్కవినయముగలవాడవు. ఇట్టి పాపాత్ముడవైన నీవు మహాత్ముడైన దశరథమహారాజునకు కొడుకువై ఎట్లు పుట్టితివి? (41)

శ్రీరాముడు అనెడి ఏనుగు సదాచారములనెడి బంధములను త్రెంచివేసినది, సత్పురుషుల ధర్మమార్గమును విడిచిపెట్టినది, ధర్మమనెడి అంకుశమును పాఱవేసినది. అట్టి ఏనుగు చేతిలో నేను హతుడనైతిని. (42)

నీవు చేసిన పని అనుచితమైనది. దీనిని సత్పురుషులు నిందింతురు. ఇది నీకు శ్రేయస్కరమూకాదు. ఇట్టి అకృత్యమునకు పాల్పడిన నీవు సజ్జనులమధ్య దీనిని ఎట్లు సమర్థించుకొందువు. (43)

ఓ రాజా! నిరపరాధులమైన మా వంటివారియెడ నీ పరాక్రమమును ప్రదర్శించితివి. ఇట్టి నీ పరాక్రమమును నీకు అపకారము చేసినవారియెడ చూపినట్లు మాత్రము నేను ఎఱుగను. రాజకుమారా! శక్తి సామర్థ్యములను ప్రకటించుటకు ఎదురుగా నిలిచి నీవు నాతో యుద్ధమునకు దిగియున్నచో ఈక్షణమే నా చేతిలో హతుడవై నీవు మృత్యువు కౌగిలిలో చేరి యుండెడివాడవు. (44-45)

త్వయాఽదృశ్యేన తు రణే నిహతోఽహం దురాసదః।
ప్రసుప్తః పన్నగేనేవ నరః పానవశం గతః। 46

రణరంగమున నన్ను ఎవ్వరును ఎదిరింపజాలరు. అట్టి నేను వేఱొకనితో యుద్ధము చేయుచున్నప్పుడు మద్యపానముచేసి, స్పృహదప్పిపడియున్న వానిని పాము కాటువేసినట్లు నీవు చాటున దాగియుండి నన్ను దెబ్బతీసితివి. (46)

మామేవ యది పూర్వం త్వమ్ ఏతదర్థమ్ అచోదయః।
మైథిలీమ్ అహమేకాహ్నా తవ చానీతవాన్ భవేత్। 47

సుగ్రీవ ప్రియకామేన యత్కృతేఽస్మి హత స్త్వయా।
కంఠే బద్ధ్వా ప్రదద్యాం తే నిహతం రావణం రణే। 48

సీతాదేవిని తీసికొనివచ్చుటకై నీవు సుగ్రీవుని ఆశ్రయించితివి. అతనితృప్తికై నీ బాణముతో నన్ను చావుదెబ్బ కొట్టితివి. అట్లు గాక ఆదేవికొఱకై నీవు ముందుగా నన్నే కోరియుండవలసినది. అప్పుడు నేను ఆసాధ్విని ఒక్కరోజులో తీసికొని వచ్చి నీకు అప్పగించెడివాడను. అంతేగాదు రావణుని యుద్ధమున చావగొట్టి, బంధించి, అతనిని నీముందు ఉంచెడివాడను. (47-48)

న్యస్తాం సాగరతోయే వా పాతాళే వాపి మైథిలీం।
ఆనయేయం తవాదేశాత్ శ్వేతామ్ అశ్వతరీమివ। 49

రావణుడు సీతాదేవిని సముద్రజలములలోగాని, పాతాళలోకమున గాని, లేక మఱెక్కడ దాచియుంచినను, నీ ఆజ్ఞయైనచో, మధుకైటభులు పాతాళమునదాచిన శ్వేతాశ్వతరీ రూపమునున్న వేదములను హయగ్రీవుడు తీసికొని వచ్చినట్లుగా, ఆసాధ్విని తీసికొనివచ్చి యుండెడివాడను. (49)

యుక్తం యత్ ప్రాప్నుయాద్రాజ్యం సుగ్రీవః స్వర్గతే మయి।
అయుక్తం యదధర్మేణ త్వయాఽహం నిహతో రణే। 50

నేను మరణించిన పిమ్మట సుగ్రీవుడు కిష్కింధకు రాజు అగుట యుక్తమే, కాని యుద్ధమున నీవు నన్ను చంపిన తీరు మాత్రము పూర్తిగా అనుచితము. (50)

కామ మేవం విధో లోకః కాలేన వినియుజ్యతే।
క్షమం చేద్భవతా ప్రాప్తమ్ ఉత్తరం సాధు చింత్యతామ్। 51

లోకమునందలి ప్రాణులు ఎప్పుడో ఒకప్పుడు మరణింపవలసినదే. ఇది సహజము, అనివార్యము. కావున నామృతికై నేను దుఃఖించుటలేదు. కాని ఈ విధముగా నన్ను చంపుట ఉచితమని భావించినచో నీవు బాగుగా ఆలోచించి నాకు ప్రత్యుత్తరమిమ్ము. (51)

ఇత్యేవ ముక్త్వా పరిశుష్కవక్త్రః
శరాభిఘాతాత్ వ్యథితో మహాత్మా।
సమీక్ష్య రామం రవిసన్నికాశం
తూష్ణీం బభూవామరరాజసూనుః। 52

మిక్కిలి ప్రజ్ఞావంతుడైన వాలి రామునిబాణపు దెబ్బకు గాయపడినవాడై ఇట్లు పలికిన పిమ్మట నోరు ఎండిపోయి సూర్యకాంతులతో వెలుగొందుచున్న శ్రీరామునివైపు చూచుచు మిన్నకుండెను. (52)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే సప్తదశః సర్గః (17)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది పదునేడవసర్గము

— * * * —

18. పదునెనిమిదవసర్గము

వాలి చేసిన ఆక్షేపణలకు శ్రీరాముడు ధర్మసమ్మతముగా సమాధానమిచ్చుట - అతనిని ఓదార్చుట - అంగదుని ఆదరింపవలసినదిగా వాలి ఆ ప్రభువును అర్థించుట -

ఇత్యుక్తః ప్రశ్రితం వాక్యం ధర్మార్థసహితం హితం।
పరుషం వాలినా రామో నిహతేన విచేతసా। 1

తం నిష్ప్రభమివాదిత్యం ముక్తతోయమివాంబుదం।
ఉక్తవాక్యం హరిశ్రేష్ఠమ్ ఉపశాంతమివానలమ్। 2

ధర్మార్థగుణసంపన్నం హరీశ్వరమనుత్తమం।
అధిక్షిప్తస్తదా రామః పశ్చాద్వాలినమబ్రవీత్। 3

ధర్మమ్ అర్థం చ కామం చ సమయం చాపి లౌకికం।
అవిజ్ఞాయ కథం బాల్యాత్ మామిహాద్య విగర్హసే। 4

అపృష్ట్వా బుద్ధిసంపన్నాన్ వృద్ధాన్ ఆచార్యసమ్మతాన్।
సౌమ్య వానరచాపల్యాత్ కిం మాం వక్తుమిహేచ్ఛసి। 5

ఇక్ష్వాకూణామ్ ఇయం భూమిః సశైలవనకాననా।
మృగపక్షిమనుష్యాణాం నిగ్రహప్రగ్రహావపి। 6

తాం పాలయతి ధర్మాత్మా భరతః సత్యవాగృజుః।
ధర్మకామార్థతత్త్వజ్ఞో నిగ్రహానుగ్రహే రతః। 7

నయశ్చ వినయశ్చోభౌ యస్మిన్ సత్యం చ సుస్థితం।
విక్రమశ్చ యథాదృష్టః స రాజా దేశకాలవిత్। 8

తస్య ధర్మకృతాదేశా వయమన్యే చ పార్థివాః।
చరామో వసుధాం కృత్స్నాం ధర్మసంతానమిచ్ఛవః। 9

తస్మిన్ నృపతిశార్దూలే భరతే ధర్మవత్సలే।
పాలయత్యఖిలాం భూమిం కశ్చరేద్ధర్మనిగ్రహమ్। 10

శ్రీరామునిబాణపుదెబ్బకు గురియైన వాలి వినయముతో ధర్మార్థసహితములైన హితవచనములను అజ్ఞానకారణముగ అరఘువరునితో ఇట్లు పరుషముగా పలికెను. (1)

రఘువరుని ఆక్షేపించుచు పలికిన పిమ్మట వాలి తేజస్సులేని సూర్యునివలెను, జలములను వర్షించిన మేఘమువలెను, మంటలుచల్లారిన అగ్నివలెను ఒప్పుచు ఉండెను. ధర్మార్థములలోతులను బాగుగా ఎఱిగినవాడు, వానరశ్రేష్ఠుడు, ప్రభువు ఐన వాలితో శ్రీరాముడు ఇట్లనుడివెను. (2-3)

"వాలీ! ధర్మార్థకామములను, లౌకికములైన ఆచారములను తెలిసికొనక అజ్ఞానముచే నీవు నన్ను ఇప్పుడు తప్పుపట్టుచున్నావు. సౌమ్యుడా! లౌకికమర్యాదలను (ఆచారములను) బాగుగా ఎఱిగినవారు, బుద్ధిబలము గలవారు ఐన పెద్దలను అడిగితెలిసికొనకుండ, వానరులకు సహజమైన చపలత్వమువలన నన్ను ఇట్లు తూలనాడుచున్నావు. (4-5)

కొండలతో, కోనలతో, అరణ్యములతో కూడిన ఈ భూమి (జంబూద్వీపము) అంతయును ఇక్ష్వాకు ప్రభువుల అధీనములోనిది. ఇచటి మృగములను, పక్షులను, మనుష్యులను నిగ్రహించుటకును, అనుగ్రహించుటకును వారికి అధికారముగలదు. ఈ భూమిని ధర్మాత్ముడైన భరతుడు పరిపాలించు చున్నాడు. అతడు సత్యసంధుడు, ఋజువర్తనుడు, ధర్మకామార్థరహస్యములను ఎఱిగినవాడు నిగ్రహానుగ్రహసమర్థుడు. రాజనీతిని, శిక్షాశాస్త్రమును, సత్యమును, శాస్త్రవిహితపద్ధతిని దేశకాల పరిస్థితులను చక్కగా తెలిసిన మహారాజు భరతుడు. అతడు మిగుల పరాక్రమశాలి. (6-8)

మేమును, ఇతరరాజులును అతనియొక్క ధర్మబద్ధములైన ఆదేశములను పాటించుచు[1] ధర్మపరిరక్షణకై ఈ భూమియందు అంతటను సంచరించుచున్నాము. (9)

రాజశ్రేష్ఠుడు, ధర్మనిరతుడు ఐనట్టి భరతుడు ఈ సమస్తభూమిని పరిపాలించుచుండగా, అట్టి ధర్మమును

1) చిన్నవాడైన భరతుడు తనకంటెపెద్దవాడైన శ్రీరామునకు ఆదేశమిచ్చుటయెట్లు? రాజశాసన విషయమున చిన్న పెద్ద తారతమ్యములకు చోటులేదు. కనిష్ఠేన జ్యేష్ఠనియోగః కథమ్? ఇత్యపేక్షాయాం రాజధర్మోఽయమ్ ఇత్యాశయేన ఉక్తం ధర్మపదమ్ -

తే వయం ధర్మవిభ్రష్టం స్వధర్మే పరమే స్థితాః।
భరతాజ్ఞాం పురస్కృత్య నిగృహ్ణీమో యథావిధి। 11

త్వం తు సంక్లిష్టధర్మశ్చ కర్మణా చ విగర్హితః।
కామతంత్రప్రధానశ్చ న స్థితో రాజవర్త్మని। 12

జ్యేష్ఠో భ్రాతా పితా చైవ యశ్చ విద్యాం ప్రయచ్ఛతి।
త్రయ స్తే పితరో జ్ఞేయా ధర్మ్యే పథి హి వర్తినః। 13

యవీయాన్ ఆత్మనః పుత్రః శిష్యశ్చాపి గుణోదితః।
పుత్రవత్తే త్రయ శ్చింత్యా ధర్మశ్చేదత్ర కారణమ్। 14

సూక్ష్మః పరమదుర్జ్ఞేయః సతాం ధర్మః ప్లవంగమ।
హృదిస్థః సర్వభూతానామ్ ఆత్మా వేద శుభాశుభమ్। 15

చపలశ్చపలైః సార్ధం వానరైరకృతాత్మభిః।
జాత్యంధ ఇవ జాత్యంధైః మంత్రయన్ ద్రక్ష్యసే ను కిమ్। 16

అహం తు వ్యక్తతామస్య వచనస్య బ్రవీమి తే।
నహి మాం కేవలం రోషాత్ త్వం విగర్హితుమర్హసి। 17

తదేతత్ కారణం పశ్య యదర్థం త్వం మయా హతః।
భ్రాతుర్వర్తసి భార్యాయాం త్యక్త్వా ధర్మం సనాతనమ్। 18

అస్య త్వం ధరమాణస్య సుగ్రీవస్య మహాత్మనః।
రుమాయాం వర్తసే కామాత్ స్నుషాయాం పాపకర్మకృత్। 19

తత్ వ్యతీతస్య తే ధర్మాత్ కామవృత్తస్య వానర।
భ్రాతృభార్యావమర్శేఽస్మిన్ దండోఽయం ప్రతిపాదితః। 20

(ఆశాసనమును) ఎవరు అతిక్రమింపగలరు? రాజు (భరతుని) యొక్క ఆజ్ఞను అనుసరించి, మేము అందఱము. పూర్తిగా ధర్మాచరణమునందు నిమగ్నులమై యున్నాము. ధర్మమార్గమును వీడి ప్రవర్తించువారిని మేము తప్పక దండించెదము. నీవు పూర్తిగా స్వార్థపరుడవు (భోగలాలసుడవు), రాజధర్మముయొక్క మార్గమును (రాజశాసనమును) వీడినవాడవు, ధర్మవిరోధమునకు పూనుకొనిన వాడవు. కావున నీ అకృత్యములకు ధర్మజ్ఞులు నిన్ను నిందింతురు. (10-12)

తనకంటెపెద్దవాడైన అన్న, తండ్రి, విద్యనేర్పిన గురువు అను ఈ ముగ్గురును ధర్మమార్గమున ప్రవర్తించు వారికి తండ్రులు. అట్లే తనకంటె చిన్నవాడైన సోదరుని (తమ్ముని), తనకు కలిగిన కుమారుని, తనకడవిద్యలను నేర్చిన గుణవంతుడగు శిష్యుని (ఈ ముగ్గురిని) పుత్రునివలె చూచుకొనవలయును. ఇదియే లోక ధర్మము. (13-14)

ధర్మము మిక్కిలి సూక్ష్మమైనది. సత్పురుషులకును అంతంత మాత్రముగా అంతుపట్టనిది. సమస్త ప్రాణులయొక్క హృదయములలో ఉన్న పరమాత్మయే శుభాశుభములను (ధర్మాధర్మములను) ఎఱుంగును. (శ్రీరాముడు అవతారపురుషుడుగావున ఆయన ధర్మాధర్మములను బాగుగా ఎఱుంగును.) (15)

ఓ వానరా! నీవు సహజముగా చపలుడవు, బుద్ధిబలము లేని చపలులైన వానరులతో నీవు మంత్రాలోచన చేయుచుందువు. దానివలన ప్రయోజనము శూన్యము. అనగా నీవు వారివలన ధర్మమార్గమును తెలిసికొనజాలవు. ఒక జాత్యంధుడు (పుట్టుకతో అంధుడు) ఇతర జన్మాంధులవలన మార్గమును తెలిసికొనజాలరుగదా!(16)

వాలీ! నేను ఇంతకుముందు చెప్పిన మాటలను ఇంకను స్పష్టపఱచెదను. నీవు కేవలము కోపావేశములో నన్ను నిందించుట తగదు. నేను నిన్ను చంపుటకు గల కారణమును వివరించెదను వినుము. నీవు పరంపరగా వచ్చుచున్న ధర్మమును గంగలోగలిపి, నీ తమ్ముని భార్యతో సుఖించుచున్నావు. మహాత్ముడగు సుగ్రీవుడు నీకు తమ్ముడు. అతని భార్యయగు రుమ నీకు కోడలితో సమానురాలు. అనగా కూతురువంటిది. అతడు బ్రతికియుండగా నీవు కూతురువంటి రుమతో కామాతురడవై పాపకృత్యమునకు ఒడిగట్టితివి. ఓ వానరా! నీవు కామములో కనులు మూసికొని పొవుటచే ధర్మము తప్పి తమ్ముని భార్యతో శరీరసుఖములకు పాల్పడితివి. అందువలన నీకు ఈ దండన విధింపవలసివచ్చినది. ఓ వానరేశ్వరా! ధర్మవిరుద్ధముగా ప్రవర్తించుచు, లోకమర్యాదకు

న హి ధర్మవిరుద్ధస్య లోకవృత్తాదపేయుషః।
దండాదన్యత్ర పశ్యామి నిగ్రహం హరియూథప। 21

నహి తే మర్షయే పాపం క్షత్రియోఽహం కులోద్భవః। 22

ఔరసీం భగినీం వాపి భార్యాం వాప్యనుజస్య యః।
ప్రచరేత నరః కామాత్ తస్య దండో వధః స్మృతః। 23

భరతస్తు మహీపాలో వయం త్వాదేశవర్తినః।
త్వం తు ధర్మాదతిక్రాంతః కథం శక్య ఉపేక్షితుమ్। 24

గురుర్ధర్మవ్యతిక్రాంతం ప్రాజ్ఞో ధర్మేణ పాలయన్।
భరతః కామవృత్తానాం నిగ్రహే పర్యవస్థితః। 25

వయం తు భరతాదేశవిధిం కృత్వా హరీశ్వర।
త్వద్విధాన్ భిన్నమర్యాదాన్ నియంతుం పర్యవస్థితాః। 26

సుగ్రీవేణ చ మే సఖ్యం లక్ష్మణేన యథా తథా।
దారరాజ్యనిమిత్తం చ నిఃశ్రేయసి రతః స మే। 27

ప్రతిజ్ఞా చ మయా దత్తా తదా వానరసన్నిధౌ।
ప్రతిజ్ఞా చ కథం శక్యా మద్విధేనాఽనవేక్షితుమ్। 28

తదేభిః కారణైః సర్వైః మహద్భిర్ధర్మసంహితైః।
శాసనం తవ యద్యుక్తం తద్భవానను మన్యతామ్। 29

సర్వథా ధర్మ ఇత్యేవ ద్రష్టవ్యస్తవ నిగ్రహః। 30

వయస్యస్యాపి కర్తవ్యం ధర్మమేవానుపశ్యతః।
శక్యం త్వయాపి తత్కార్యం ధర్మమేవానుపశ్యతా। 31

శ్రూయతే మనునా గీతౌ శ్లోకౌ చారిత్రవత్సలౌ।
గృహీతౌ ధర్మకుశలైః తత్తథా చరితం మయా। 32

(సదాచారమునకు) స్వస్తి చెప్పి, పాపకృత్యములలో దిగిన వానిని ఈ విధముగా దండించుటకంటె మఱియొక మార్గము లేదుగదా! (17-21)

నేను క్షత్రియ వంశమునకు చెందినవాడను. కనుక నేను పాపాత్ముడవైన నిన్ను క్షమింపరాదు. 'కూతురు, సోదరి, తమ్మునిభార్య - వీరియెడ కామాతురుడై ప్రవర్తించిన వానిని వధించుటయే తగిన శిక్ష' అని ధర్మశాస్త్రము పేర్కొనుచున్నది. (22-23)

ఈ దేశమును పరిపాలించు మహారాజు భరతుడు. మేము అతని ఆదేశములప్రకారము ప్రవర్తింతుము. నీవు ధర్మము తప్పినవాడవు. కనుక మేము నిన్ను ఉపేక్షించుట యెట్లు కుదురును? ప్రాజ్ఞుడు, మహారాజునైన భరతుడు ఈ దేశమును ధర్మమార్గమున పరిపాలించుచు ధర్మమును అతిక్రమించిన వారిని, కట్టుబాట్లకు లోబడక స్వేచ్ఛగా ప్రవర్తించువారిని శిక్షించుట యందు నిరతుడైయున్నాడు. (24-25)

ఓ వానరశ్రేష్ఠా! భరతునిఆదేశములను అనుసరించి, మర్యాదలను అతిక్రమించెడి నీవంటి వారిని అదుపుచేయుటకే పూనుకొనియున్నాము. (26)

సుగ్రీవుడు నాకు లక్ష్మణునివంటివాడు, అతడు తన భార్యను, రాజ్యమును తిరిగి పొందుటకై నాతో మైత్రిచేసినాడు. నాకు మేలు చేయుటకు అతడు ఆసక్తి కలిగియున్నాడు. సఖ్యము చేసికొనుసమయమున వానరుల సమక్షమున 'నీవు నీ భార్యను, రాజ్యమును తిరిగి పొందునట్లు చేసెదను' అని నేను సుగ్రీవునకు మాట ఇచ్చియుంటిని. చేసిన ప్రతిజ్ఞను ఉపేక్షించుట నావంటి వానికి కుదురదుగదా? (27-28)

ధర్మబద్ధములైన ఇట్టి బలమైన పెక్కు కారణముల వలన నీకు తగిన దండనను విధించితిని. దీనిని నీవు బాగుగా అర్థము చేసికొనుము. నీకు విధించిన ఈ శిక్ష అన్ని విధములుగా ధర్మబద్ధమేయని నీవు తలంపుము.(29-30)

ధర్మనిరతుడైనవానికి మిత్రునకు సహాయపడుటయే కర్తవ్యము. నీవును ధర్మదృష్టిగలవాడవు. కనుక 'నేను నీకు విధించిన ఈ శిక్షను' న్యాయముగనే భావింపుము. (31)

వానరా! రాజోచితములైన సదాచారములను ప్రతిపాదించు రెండు శ్లోకములను మనువు తన మనుధర్మ శాస్త్రములో పేర్కొనినట్లు ప్రతీతి. ధర్మపాలనమునందు నేర్పరులైన వారు వాటిని సాదరముగా స్వీకరించిరి. ఆ మనుధర్మ శాస్త్రము చెప్పిన నియమములనే నేను ఇప్పుడు అనుసరించితిని. (32)

రాజభిర్ధృతదండాస్తు కృత్వా పాపాని మానవాః।
నిర్మలాః స్వర్గమాయాంతి సంతః సుకృతినో యథా। 33

శాసనాద్వా విమోక్షాద్వా స్తేనః స్తేయాద్విముచ్యతే।
రాజా త్వశాసనాత్ పాపం తదవాప్నోతి కిల్బిషమ్। 34

ఆర్యేణ మమ మాంధాత్రా వ్యసనం ఘోరమీప్సితమ్।
శ్రమణేన కృతే పాపే యథా పాపం కృతం త్వయా। 35

అన్యైరపి కృతం పాపం ప్రమత్తైర్వసుధాధిపైః।
ప్రాయశ్చిత్తం చ కుర్వంతి తేన తచ్ఛామ్యతే రజః। 36

తదలం పరితాపేన ధర్మతః పరికల్పితః।
వధో వానరశార్దూల న వయం స్వవశే స్థితాః। 37

శృణు చాప్యపరం భూయః కారణం హరిపుంగవ।
యచ్ఛ్రుత్వా హేతుమద్వీర న మన్యుం కర్తుమర్హసి। 38

న మే తత్ర మనస్తాపో న మన్యుర్హరియూథప।
వాగురాభిశ్చ పాశైశ్చ కూటైశ్చ వివిధైర్నరాః। 39

ప్రతిచ్ఛన్నాశ్చ దృశ్యాశ్చ గృహ్ణంతి సుబహూన్ మృగాన్।
ప్రధావితాన్ వా విత్రస్తాన్ విస్రబ్ధాంశ్చాపి నిష్ఠితాన్। 40

ప్రమత్తాన్ అప్రమత్తాన్ వా నరా మాంసార్థినో భృశం।
విధ్యంతి విముఖాంశ్చాపి న చ దోషోఽత్ర విద్యతే। 41

యాంతి రాజర్షయశ్చాత్ర మృగయాం ధర్మకోవిదాః।
తస్మాత్ త్వం నిహతో యుద్ధే మయా బాణేన వానర।
అయుధ్యన్ ప్రతియుధ్యన్ వా యస్మాచ్ఛాఖామృగో హ్యసి। 42

ఆ మనుస్మృతిలోని విషయములు ఇవి. పాపములను ఒనర్చిన మానవులు రాజు విధించిన శిక్షను అనుభవించిన పిమ్మట వారు ఆపాపములనుండి విముక్తులై, పుణ్యాత్ములైన సత్పురుషులవలె స్వర్గమునకు చేరుదురు. రాజు శిక్షించినను, లేక కనికరించి విడిచి పెట్టినను చోరుడు తన పాపమునుండి విముక్తుడగును. కాని రాజు పాపాత్మునకు తగిన శిక్షను విధింపనిచో ఆదోషియొక్క పాపము రాజునకు చుట్టుకొనును.[1] (33-34)

నీవు చేసిన ఇట్టి పాపకృత్యమునే పూర్వకాలమున శ్రమణుడు అనువాడు చేసియుండెను. మావంశమువాడైన మాంధాత చక్రవర్తి అతనికి ఘోరమైన శిక్షను విధించెను.(35)

ఇతరులు (ప్రజలు) పాపములను చేసినప్పుడు రాజులు ఏమఱుపాటున వారిని శిక్షింపనిచో ఆ పాపములు వారికే అంటును. అందులకై వారు ప్రాయశ్చిత్తము చేసికొనినచో ఆపాపములు వారిని పీడింపక శాంతించును. వానరశ్రేష్ఠ! నీకు విధించిన ఈ మరణదండన ధర్మసమ్మతమైనది. కావున దీనికై పరితపింపవలసిన పనిలేదు. ఏలనన మనము స్వతంత్రులముకాము, ధర్మశాస్త్రమునకు లోబడియుండవలసిన వారము.(36-37)

ఓ వానరరాజా! ఇంకను మఱియొక కారణమును తెల్పెదను వినుము. సహేతుకమైన ఈ వివరణమును విన్నచో నీ కోపము తొలగిపోవును. (38)

ఓ వానరోత్తమా! ఈ విధముగా నిన్ను శిక్షించినందుకు నా మనస్సులో సంతాపమూలేదు, దుఃఖమూలేదు. రాజులు మొదలగువారు వలలను పఱచి, పాశములను ప్రయోగించి, పలువిధములైన కపటోపాయములను పన్ని, చాటున పొంచియుండి గాని, లేక ఎదురుగానుండిగాని పెక్కు మృగములను వేటాడుచుందురు. ఆ మృగములు భయపడి పాఱిపోవుచుండవచ్చును, లేదా విశ్వసించి సమీపముననైనను ఉండవచ్చును. అవి ఏమఱుపాటున ఉన్నను, జాగ్రతకలిగియున్నను, లేక వీరిని గమనింపక పాఱిపోవుచున్నను క్షత్రియులు వాటిని గాయపఱచెదరు. ఇట్లు వేటాడుట వారికి ఏమాత్రము దోషముకాదు. (39-41)

వానరా! బాగుగా ధర్మములను ఎఱిగిన మహారాజులు గూడ వేటాడుచుందురు. కనుక నిన్ను యుద్ధమున బాణమువేసి వధించితిని. నీవు నాకు ఎదురుగా నిలిచి యుద్ధము చేసినను, చేయకున్నను చాటున పొంచియుండి వధించుటలో తప్పులేదు. ఏలనన నీవు శాఖామృగానివి.(42)

1) రాజా రాష్ట్రకృతం పాపమ్. ప్రజలు చేసిన పాపకార్యముల ఫలితమును రాజు అనుభవింపవలసి యుండును. – నీతిశాస్త్రము

దుర్లభస్య చ ధర్మస్య జీవితస్య శుభస్య చ।
రాజానో వానరశ్రేష్ఠ ప్రదాతారో న సంశయః। 43

తాన్ న హింస్యాన్నచాక్రోశేత్ నాఽఽక్షిపేన్నాప్రియం వదేత్।
దేవా మనుష్యరూపేణ చరంత్యేతే మహీతలే। 44

ప్రజలను దుర్లభమైన ధర్మమార్గమున నడిపించెడివారు, వారు జీవించుటకు తోడ్పడెడివారు, వారి అభివృద్ధికి (ప్రగతికి) కృషిచేసెడివారు రాజులే. ఇందు సందేహములేదు. వారిని హింసింపరాదు, నిందింపరాదు, ఆక్షేపింపరాదు. వారినిగూర్చి పరుషవచనములను పలుకరాదు. ఏలనన వారు మనుష్యుల రూపములలో ఈ భూమిపై సంచరించెడి దేవతలు. (43-44)

త్వం తు ధర్మమవిజ్ఞాయ కేవలం రోషమాస్థితః।
ప్రదూషయసి మాం ధర్మే పితృపైతామహే స్థితమ్। 45

ఓ వానరా! నేను తాతాతముత్తాతలు అనుసరించిన ధర్మమార్గమునందే నడచుకొనుచున్నాను. నీవు ధర్మరహస్యములను ఎఱుంగక కేవలము కోపావేశములోబడి నన్ను నిందించుచున్నావు." (45)

ఏవ ముక్తస్తు రామేణ వాలీ ప్రవ్యథితో భృశమ్।
న దోషం రాఘవే దధ్యౌ ధర్మేఽధిగతనిశ్చయః।
ప్రత్యువాచ తతో రామం ప్రాంజలిర్వానరేశ్వరః। 46

శ్రీరాముడు ఇట్లు పలికిన పిమ్మట వానరేశ్వరుడైన వాలి తన అజ్ఞానముచే ధర్మాత్ముడైన శ్రీరాముని నిందించినందులకు మిక్కిలి పరితపించెను. అతనికి ధర్మతత్త్వము బోధపడుటవలన శ్రీరామునియందు ఎట్టి దోషములేదని గ్రహించెను. పిమ్మట అతడు దోసిలొగ్గి ఆ రఘువరునితో ఇట్లు నుడివెను. (46)

యత్త్వమాత్థ నరశ్రేష్ఠ తదేవం నాఽత్ర సంశయః।
ప్రతివక్తుం ప్రకృష్టే హి నాప్రకృష్టస్తు శక్నుయాత్। 47

తదయుక్తం మయా పూర్వం ప్రమాదాదుక్తమప్రియమ్।
తత్రాపి ఖలు మే దోషం కర్తుం నాఽర్హసి రాఘవ। 48

త్వం హి దృష్టార్థతత్త్వజ్ఞః ప్రజానాం చ హితే రతః।
కార్యకారణసిద్ధౌ తే ప్రసన్నా బుద్ధిరవ్యయా। 49

మామప్యగతధర్మాణం వ్యతిక్రాంతపురస్కృతమ్।
ధర్మసంహితయా వాచా ధర్మజ్ఞ పరిపాలయ। 50

"ఓ నరోత్తమా! నీవు పలికినది వాస్తవమే. ఇందు ఏమాత్రమూ సంశయములేదు. నీవంటి సర్వజ్ఞునకు నాబోటి అల్పజ్ఞుడు సమాధానము ఇయ్యజాలడు. ఓ రఘువరా! ఇంతవఱకును నేను పొరపాటున అనుచితముగా మాట్లాడి, నీకు కష్టము కలిగించితిని. అందులకు నన్ను దోషిగా తలంపకుము. నీవు పరమార్థ తత్త్వమును బాగుగా ఎఱిగినవాడవు. ప్రజలమేలుకొఱకై పాటుపడెడివాడవు, సహేతుకముగా దండించుటలో నీబుద్ధి వదునైనది, చెక్కుచెదరనిది. ఓ ధర్మజ్ఞా! ధర్మము తప్పినవాడను, అకృత్యములకు పాల్పడిన వాడను ఐన నన్నును ధర్మబద్ధమైన వచనములతో దారి చూపి ఆదుకొనుము.(47-50)

బాష్పసంరుద్ధకంఠస్తు వాలీ సార్తస్వరం శనైః।
ఉవాచ రామం సంప్రేక్ష్య పంకలగ్న ఇవద్విపః। 51

బురదలో దిగబడిపోయిన ఏనుగువలె దీనదశలోనున్న వాలి కన్నీరుగార్చుచు గద్గద కంఠముగలవాడై, శ్రీరాముని వైపుచూచుచు ఆర్తస్వరముతో తిన్నగా ఇట్లనెను. ప్రభూ! నన్నుగూర్చిగాని, నా భార్యయగు 'తార'ను గుఱించిగాని, నా బంధుమిత్రులనుగూర్చిగాని నాకు ఏమాత్రమూ దిగులులేదు. కాని బంగారు భుజకీర్తులను ధరించిన మాఅంగదుడు ఎంతయు బుద్ధిమంతుడు ఇతనిని గూర్చియే నాకు బెంగ. (51)

న త్వాత్మానమ్ అహం శోచే న తారాం న చ బాంధవాన్।
యథా పుత్రం గుణశ్రేష్ఠమ్ అంగదం కనకాంగదమ్। 52

ఈ చిట్టితండ్రిని ఈ చేతులమీదుగా గారాబముతో పెంచినాను. నేను కనబడక పోయినచో ఇతడు నీరు ఎండిపోయిన చెఱువువలె దిగులుతో చిక్కి శల్యమైపోవును. రామా! ఇతడు ఎంతయు పసివాడు. లోకము

స మమాదర్శనాద్దీనో బాల్యాత్ప్రభృతిలాలితః।
తటాక ఇవ పీతాంబుః ఉపశోషం గమిష్యతి। 53

బాలశ్చాకృతబుద్ధిశ్చ ఏకపుత్త్రశ్చ మే ప్రియః।
తారేయో రామ భవతా రక్షణీయో మహాబలః। 54

సుగ్రీవే చాంగదే చైవ విధత్స్వ మతిముత్తమాం।
త్వం హి శాస్తా చ గోప్తా చ కార్యాకార్యవిధౌ స్థితః। 55

యా తే నరపతే వృత్తిః భరతే లక్ష్మణే చ యా।
సుగ్రీవే చాంగదే రాజన్ తాం త్వమాధాతుమర్హసి। 56

మద్దోషకృతదోషాం తాం యథా తారాం తపస్వినీమ్।
సుగ్రీవో నావమన్యేత తథాఽవస్థాతుమర్హసి। 57

త్వయా హ్యనుగృహీతేన రాజ్యం శక్యముపాసితుమ్।
త్వద్వశే వర్తమానేన తవ చిత్తానువర్తినా। 58

శక్యం దివం చార్జయితుం వసుధాం చాపి శాసితుమ్। 59

త్వత్తోఽహం వధమాకాంక్షన్ వార్యమాణోఽపి తారయా।
సుగ్రీవేణ సహ భ్రాత్రా ద్వంద్వయుద్ధముపాగతః। 60

ఇత్యుక్త్వా సన్నతో రామం విరరామ హరీశ్వరః।
స తమాశ్వాసయద్రామో వాలినం వ్యక్తదర్శనమ్।
సామసంపన్నయా వాచా ధర్మతత్త్వార్థయుక్తయా। 61

న సంతాపస్త్వయా కార్యమ్ ఏతదర్థం ప్లవంగమ। 62

న వయం భవతా చింత్యా నాప్యాత్మా హరిసత్తమ।
వయం భవద్విశేషేణ ధర్మతః కృతనిశ్చయాః। 63

దండ్యే యః పాతయేద్దండం దండ్యో యశ్చాపి దండ్యతే।
కార్యకారణసిద్ధార్థౌ ఉభౌ తౌ నావసీదతః। 64

తద్భవాన్ దండసంయోగాత్ అస్మాత్ విగతకల్మషః।
గతః స్వాం ప్రకృతిం ధర్మ్యాం ధర్మదృష్టేన వర్త్మనా। 65

తెలియనివాడు. ఒక్కగానొక్క కుమారుడు, తారయందు జన్మించిన ఇతడు నాకు ప్రాణతుల్యుడు. నావలె బలశాలి. కనుక ఇతనిని నీవే కాపాడవలెను. (52-54)

స్వామీ! సుగ్రీవునియందువలె ఈ అంగదునిమీదను నీ పరిపూర్ణమైన వాత్సల్యమును ప్రసరింపజేయుము. ఇతనిని రక్షించుభారమునీదే. కర్తవ్యమును, అకర్తవ్యమును బోధించుచు ఇతనికి దారిచూపెడి వాడవును నీవే. ప్రభూ! భరతునిమీదను, లక్ష్మణునిపైనను నీకు గల ప్రేమానురాగములనే సుగ్రీవునియందును, అంగదునియెడలను చూపుము. (55)

రామా! నా వియోగమువలన తార దుఃఖములో మిక్కిలి దీనావస్థకు లోనగును. నా దోషకారణముగా సుగ్రీవుడు ఆమెను దోషిగా భావించుటగాని, అవమానించుటగాని చేయకుండునట్లు చూడుము. (56)

స్వామీ! భక్తిప్రపత్తులతో నిన్ను శరణుజొచ్చి నీ అనుగ్రహమునకు పాత్రుడైనవాడు ఈ రాజ్యమును పాలింపసమర్థుడగును, అంతేగాదు ఈ భూమండలమునే శాసింపగలడు, స్వర్గసుఖములనుగూడ పొందుటకు అర్హుడగును. నీ చేతిలో మృతిచెందవలెననెడి కోరికతోనే నా భార్యయగు తార ఎంతగా వారించుచున్నను ఆమె మాటలను పెడచెవిని బెట్టి, నాతమ్ముడగు సుగ్రీవునితో ద్వంద్వయుద్ధము చేయుటకై ఇటు వచ్చితిని." వాలి సవినయముగా శ్రీరామునితో ఇట్లు పలికి మిన్నకుండెను. (57-60)

అంతట శ్రీరాముడు ధర్మసమ్మతములైన మృదువచనములతో జ్ఞానోదయమైన వాలిని ఊరడించుచు ఇట్లు పలికెను. (61)

ఓ వానరా! నీ భార్యాపుత్త్రుల విషయమై ఇంక నీవు ఏమాత్రము చింతింపవలసిన పనియేలేదు. మేము చేసిన కార్యమును గుఱించిగాని, నీ పాపకృత్యములను గూర్చిగాని నీవు ఆలోచింపవలదు.[1] మేము ధర్మవిషయమున స్థిరనిశ్చయము కలిగియున్నాము. (62-63)

శిక్షింపదగినవానిని సహేతుకముగా శిక్షించిన వాడు దోషికాడు, అతనికి ఏపాపమూ అంటదు. అట్లే నేరము చేయుటవలన శిక్షార్హుడైనవాడు తగిన శిక్షను అనుభవించినచో అప్పుడతడు దోషములనుండి విముక్తుడగును. ఇట్లు వారు ఇద్దఱును కృతార్థులేయగుదురు. (64)

వాలీ! ఈ విధముగా శిక్షను అనుభవించుటద్వారా నీవు పాపరహితుడవైతివి. ధర్మశాస్త్రమును అనుసరించి శిక్షను పొందుటవలన నీకు శుద్ధస్వరూపము లభించినది. (65)

1) నేను నిన్ను శిక్షించుట ధర్మసమ్మతమే. కనుక ఆ విషయమును గూర్చిన ఆలోచనను మానుము. అట్లే నీవు చేసిన పాపకృత్యముల ఫలితముగా నీకు నరక ప్రాప్తియగునేమోయని చింతింపవలదు. ఏలనన నీవు నీదోషములవిషయమున పూర్తిగా పశ్చాత్తాపపడితివి, మఱియు తగిన శిక్షను అనుభవించితివి. (పశ్చాత్తాపం హరతి పాపమ్)

త్యజ శోకం చ మోహం చ భయం చ హృదయే స్థితమ్।
త్వయా విధానం హర్యగ్ర్య న శక్యమ్ అతివర్తితుమ్। 66

యథా త్వయ్యంగదో నిత్యం వర్తతే వానరేశ్వర।
తథా వర్తేత సుగ్రీవే మయి చాపి న సంశయః। 67

వానరోత్తమా! నీ హృదయమునందు నాటుకొనియున్న శోకమును, అజ్ఞానమును, భయమును వీడుము. నీవు నీ ప్రారబ్ధకర్మఫలమును అనుభవింపక తప్పదు. దానిని అతిక్రమించుట సాధ్యము కాదు. అంగదుడు ఇంతవఱకును నీనుండి పొందిన ప్రేమానురాగములనే సుగ్రీవునినుండియు, నానుండియు పొందగలడు. సంశయింపవలసిన పనిలేదు. నీవలెనే, సుగ్రీవుడును, నేనును ప్రేమతో అంగదుని విచారింతుము. (66-67)

స తస్య వాక్యం మధురం మహాత్మనః
సమాహితం ధర్మపథానువర్తినః।
నిశమ్య రామస్య రణావమర్దినో
వచః సుయుక్తం నిజగాద వానరః। 68

శ్రీరాముడు రణరంగమున శత్రువులను తునుమాడుటలో సర్వసమర్థుడు, ధర్మమార్గమున నడచునట్టి ఆమహాత్ముడు పలికిన సమాధానవచనములు మధురములు. వాటిని వినిన పిమ్మట వాలి యుక్తియుక్తముగా ఇట్లు నుడివెను. (68)

శరాభితప్తేన విచేతసా మయా
ప్రదూషితస్త్వం యదజానతా ప్రభో।
ఇదం మహేంద్రోపమ భీమవిక్రమ
ప్రసాదితస్త్వం క్షమ మే నరేశ్వర। 69

"ఓ మహాప్రభూ! నీ బాణపుదెబ్బకు తెలివి తప్పిన నేను అజ్ఞానముచే నిన్ను తీవ్రముగా నిందించితిని. నీవు మహేంద్రునివలె బలశాలివి, శత్రుభయంకరమైన పరాక్రమము గలవాడవు. ప్రసన్నుడవై నా అపచారమును మన్నింపుము. (69)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే అష్టాదశఃసర్గః *(18)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది పదునెనిమిదవసర్గము

-- * * * --

19. పందొమ్మిదవసర్గము

వాలినేలగూలిన వార్తను విని, దుఃఖితయైన తార అంగదునితోగూడి రణభూమికి బయలుదేఱుట - భయకంపితులై పాఱిపోవుచున్న వాలియనుచరులను 'అట్లు పాఱిపోవలదు' అని తార కోరుట - అనంతరము ఆమె వాలి (తనభర్త) దుర్దశను జూచి విలపించుట -

స వానరమహారాజః శయానః శరవిక్షతః।
ప్రత్యుక్తో హేతుమద్వాక్యైః నోత్తరం ప్రత్యపద్యత। 1

వానరప్రభువైన ఆవాలి శ్రీరాముని తీవ్రమైన బాణపుదెబ్బకు నేలపై పడియున్నవాడై, ఆరఘువరుడు సహేతుకముగా పలికిన మాటలను విని, ఏమియు మాట్లాడక మిన్నకుండెను. (1)

అశ్మభిః ప్రవిభిన్నాంగః పాదపైరాహతో భృశం।
రామబాణేన చ క్రాంతో జీవితాంతే ముమోహ సః। 2

సుగ్రీవునిజాళ్లదెబ్బలకు వాలియొక్క అవయవములు శిథిలములయ్యెను, చెట్లతాకిడికి అతడు మిగుల గాయపడెను. శ్రీరామునిబాణాహతికి ప్రాణములు అన్నుబట్టి (అవసానదశకు చేరి) అతడు స్పృహను కోల్పోయెను. (2)

తం భార్యా బాణమోక్షేణ రామదత్తేన సంయుగే।
హతం ప్లవగశార్దూలం తారా శుశ్రావ వాలినమ్। 3

వానరశ్రేష్ఠుడైన వాలి రణరంగమున శ్రీరాముడు ప్రయోగించిన బాణముయొక్క దెబ్బకు మిక్కిలి గాయపడి పడియున్నట్లు అతని భార్యయగు తారకు తెలిసెను. భర్తయొక్క వధవార్తను వినినంతనే ఆమె గుండె బ్రద్దలయ్యెను. ఆ అప్రియవార్తను విని ఆమె

సా సపుత్రాఽప్రియం శ్రుత్వా వధం భర్తుః సుదారుణం।
నిష్పపాత భృశం త్రస్తా వివిధాత్ గిరిగహ్వరాత్। 4

యే త్వంగదపరీవారా వానరా భీమవిక్రమాః।
తే సకార్ముకమాలోక్య రామం త్రస్తాః ప్రదుద్రువుః। 5

సా దదర్శ తతస్త్రస్తాన్ హరీనాపతతో భృశం।
యూథాదివ పరిభ్రష్టాన్ మృగాన్ నిహతయూథపాన్। 6

తానువాచ సమాసాద్య దుఃఖితాన్ దుఃఖితా సతీ।
రామవిత్రాసితాన్ సర్వాన్ అనుబద్ధానివేషుభిః। 7

వానరా రాజసింహస్య యస్య యూయం పురస్సరాః।
తం విహాయ సుసంత్రస్తాః కస్మాద్ద్రవథ దుర్గతాః। 8

రాజ్యహేతోః స చేద్భ్రాతా భ్రాత్రా రౌద్రేణ పాతితః।
రామేణ ప్రహితై రౌద్రైః మార్గణైర్దూరపాతిభిః। 9

కపిపత్న్యా వచః శ్రుత్వా కపయః కామరూపిణః।
ప్రాప్తకాలమ్ అవిక్లిష్టమ్ ఊచుర్వచనమంగనామ్। 10

జీవపుత్రే నివర్తస్వ పుత్రం రక్షస్వ చాంగదం।
అంతకో రామరూపేణ హత్వా నయతి వాలినమ్। 11

క్షిప్తాన్ వృక్షాన్ సమావిధ్య విపులాశ్చ శిలాస్తథా।
వాలీ వజ్రసమైర్బాణైః రామేణ వినిపాతితః। 12

అభిద్రుతమ్ ఇదం సర్వం విద్రుతం ప్రసృతం బలమ్।
అస్మిన్ ప్లవగశార్దూలే హతే శక్రసమప్రభే। 13

రక్ష్యతాం నగరద్వారమ్ అంగదశ్చాభిషిచ్యతామ్।
పదస్థం వాలినః పుత్రం భజిష్యంతి ప్లవంగమాః। 14

అథవాఽరుచితం స్థానమ్ ఇహ తే రుచిరాననే।
ఆవిశంతి హి దుర్గాణి క్షిప్రమ్ అన్యాని వానరాః। 15

భయముతో చలించిపోయెను. వెంటనే ఆమె తన కుమారునితోగూడి, అనేక కక్ష్యలను దాటుచు, ఆ కొండగుహనుండి బయటికి వచ్చెను. (3-4)

అంగదునిఅనుయాయులైన వానరులు మిగుల బలశాలురే, ఐనప్పటికిని ధనుస్సును చేతబట్టియున్న శ్రీరామునిజూచి, ఎంతయు భీతిల్లి, పాఱిపోయిరి. (5)

జట్టునాయకుడు హతుడుకాగా మృగములన్నియును తమ గుంపునువీడి చెల్లాచెదరై పఱుగులు దీయుచున్నట్లు వాలి పడిపోవుటతో మిక్కిలి భయపడి పాఱిపోవుచున్న వానరులను తార చూచెను. (6)

ఆవానరులందఱును శ్రీరాముని జూచి, ఆయన బాణములు తమను వెంటాడుచున్నట్లుగనే భావించి గడగడలాడుచుండిరి. అట్టి స్థితిలోనున్న వారిని సమీపించి, తార మిగుల దుఃఖితయై వారితో ఇట్లనెను. (7)

"ఓ వానరులారా! మహారాజైన వాలికి మీరు అందఱును అనుచరులుగదా! ఆస్వామిని వీడి, దిక్కులేనివారివలె భయపడి ఏల పరుగులు దీయుచున్నారు? రాజ్యలోభముచే సుగ్రీవుడు పన్నిన పన్నాగమిది. శ్రీరామునిచే దూరమునుండియే పడగొట్టగల తీవ్రములైన బాణములను ప్రయోగింపజేసి, అతడు తనఅన్నను దెబ్బతీసెను. కనుక మీరు భయపడవలసిన పనియేమి?" (8-9)

కామరూపులైన ఆ వానరులందఱును వాలిభార్యయగు తార పలికిన మాటలను వినిన పిమ్మట, సమయమునకు తగినట్లు యుక్తియుక్తముగా ఆమెతో ఇట్లు నుడివిరి.(10)

"ఓ దేవీ! మృత్యువు శ్రీరామునిరూపములోవచ్చి, వాలిని హతమార్చి, తీసికొనిపోవుచున్నది. కాని నీ పుత్త్రుడైన అంగదుడు జీవించియేయున్నాడు. కనుక అతనిని రక్షించుకొనుటకై మఱలి రమ్ము. వీరుడైన వాలి విసరిన మహావృక్షములను, పెద్దపెద్ద శిలలను వజ్రతుల్యములైన తనబాణములచే వమ్ముచేసి శ్రీరాముడు వాలిని పడగొట్టెను. ఇంద్రునితో సమానమైనశక్తిగల వాలి పడిపోయిన వెంటనే ఈ వానరబలములన్నియును చెల్లాచెదరై కిష్కింధవైపుగా పరుగెత్తుచున్నవి. (11-13)

ముందు కిష్కింధానగరద్వారమును రక్షించుకొనవలెను. నీకుమారుడైన అంగదుని పట్టాభిషిక్తుని గావింపవలెను. అతడు రాజ్యసింహాసనమున ఆసీనుడైన పిమ్మట వానరులందఱును ఆయనను సేవింపగలరు. అమ్మా! అట్లు గానిచో ఈ కిష్కింధయందు నివసించుట మాకు సమ్మతముగాదు. అపుడు వెంటనే వానరులు అందఱును ఇతరదుర్గములను ఆశ్రయింతురు. (14-15)

అభార్యాశ్చ సభార్యాశ్చ సంత్యజ్య వనచారిణః।
ఉద్విగ్నేభ్యో విప్రయుక్తేభ్యః తేభ్యో నస్తుములం భయమ్। 16

అల్పాంతరగతానాం తు శ్రుత్వా వచనమంగనా।
ఆత్మనః ప్రతిరూపం సా బభాషే చారుహాసినీ। 17

పుత్రేణ మమ కిం కార్యం కిం రాజ్యేన కిమాత్మనా।
కపిసింహే మహాభాగే తస్మిన్ భర్తరి నశ్యతి। 18

పాదమూలం గమిష్యామి తస్యైవాహం మహాత్మనః।
యోఽసౌ రామప్రయుక్తేన శరేణ వినిపాతితః। 19

ఏవ ముక్త్వా ప్రదుద్రావ రుదంతీ శోకకర్శితా।
శిరశ్చోరశ్చ బాహుభ్యాం దుఃఖేన సమభిఘ్నతీ। 20

ఆవ్రజంతీ దదర్శాథ పతిం నిపతితం భువి।
హంతారం దానవేంద్రాణాం సమరేష్వనివర్తినామ్। 21

క్షేప్తారం పర్వతేంద్రాణాం వజ్రాణామివ వాసవం।
మహావాతసమావిష్టం మహామేఘౌఘనిస్స్వనమ్।
శక్రతుల్యపరాక్రాంతం వృష్ట్వేవోపరతం ఘనం। 22

నర్దంతం నర్దతాం భీమం శూరం శూరేణ పాతితమ్।
శార్దూలేనామిషస్యార్థే మృగరాజం యథా హతం। 23

అర్చితం సర్వలోకస్య సపతాకం సవేదికమ్।
నాగహేతోః సుపర్ణేన చైత్యమ్ ఉన్మథితం యథా। 24

వానరప్రభువైన వాలి కొంతమంది వానరులను కిష్కింధనుండి వెళ్లగొట్టెను. వారిలో కొందఱు తమ భార్యలను ఈ కిష్కింధలోనే ఉంచివెళ్లిరి, మఱికొందఱు భార్యలతోగూడి (సకుటుంబముగా) వెళ్లిపోయిరి. భార్యలను ఇక్కడనే ఉంచి వెళ్లినవారు విరహబాధలలో ఉన్నారు, భార్యలతో (సకుటుంబముగా) వెళ్లిన వారు పరస్త్రీగమనాభిలాషులై యున్నారు. ఇంకను సుగ్రీవాది జ్ఞాతులు ఉండనే యున్నారు. ఈయందఱి వలనను మనకు నిరంతరము ప్రమాదము పొంచియుండును.(16)

స్మితభాషిణి (దరహాసముతో మాట్లాడునది)యైన తార తనకు సమీపమున ఉన్న వానరులు పలికిన మాటలను విని, తన స్థాయికి తగినట్లుగా నిండుగా ఇట్లు వచించెను. (17)

"వానరులారా! వానరోత్తముడు, మహాత్ముడు ఐన నా భర్త మృతిచెందిన పిమ్మట నాకు పుత్రునితో పనియేమి? ఇంక రాజ్యమెందులకు? నాకు నాజీవితము మీదనే ఇచ్ఛనశించినది. శ్రీరామునిబాణపుదెబ్బకు నాస్వామి నేలగూలెను. ఇంక ఆమహాత్ముని పాదములే నాకు గతి."(18-19)

ఈ విధముగా పలికిన పిమ్మట తార శోకముతో క్రుంగిపోయి చేతులతో గుండెలపై బాదుకొనుచు తలపైకొట్టుకొనుచు దుఃఖముతో పరుగెత్తెను. అట్లు పరుగిడుచు ఆమె యుద్ధములలో ఎదిరించిన మాయావి మొదలగు దానవప్రముఖులను మట్టికఱపించిన తన భర్త భూమిపైపడియుండగా చూచెను. (20-21)

ఇంద్రుడు వజ్రాయుధమువలె వాలి మహాపర్వతములను సైతము విసరివేసెడివాడు, వాయువువలె మహావేగముగలవాడు, మహామేఘములవలె గర్జించువాడు, ఇంద్రునియంతటి పరాక్రమశాలి. అట్టివాడు ఇప్పుడు వర్షించిన మేఘమువలె చేష్టలుడిగియుండెను. (22)

అతడు భయంకరముగా గర్జించువారిని సైతము తన గర్జనలతో గడగడలాడించువాడు, మహావీరుడైన శ్రీరామునిచేతిలో నేలకొఱిగిన శూరుడు. మాంసముకొఱకై ఒకసింహము మఱియొక సింహముచే మడిసినట్లు రాజ్యముకొఱకై తమ్ముడైన సుగ్రీవునికారణముగా ఇతడు హతుడయ్యెను. (23)

సకలజనులచే పూజింపబడునదియు, పతాకములతో ఒప్పుచున్నదియు, వేదికలచే శోభిల్లుచున్నదియు ఐన ఒక దేవాలయమును, అందుదాగిన సర్పముకొఱకు గరుత్మంతుడు పడగొట్టగా అది శిథిలావస్థకు చేరును. దానివలె వాలి దీనస్థితిలో పడియుండెను. (24)

అవష్టభ్య చ తిష్ఠంతం దదర్శ ధనురుత్తమమ్।
రామం రామానుజం చైవ భర్తుశ్చైవానుజం శుభా। 25

అప్పుడు శ్రీరాముడు తన ధనుస్సును నేలకు మోపి, దానిని ఆనుకొని నిలబడియుండెను. లక్ష్మణుడును ఆయన ప్రక్కన ఉండెను. వాలితమ్ముడైన సుగ్రీవుడును అచటనే ఉండెను. వారినందఱిని తార నిర్మలచిత్తముతో చూచెను. (25)

తానతీత్య సమాసాద్య భర్తారం నిహతం రణే।
సమీక్ష్య వ్యథితా భూమౌ సంభ్రాంతా నిపపాత హ। 26

పిమ్మట ఆమె వారిని అధిగమించి, ముందునకు సాగి, యుద్ధభూమియందు పడియున్న తన భర్తను చూచెను. ఆయన దీనస్థితిని గమనించి ఆమె గుండె పగిలెను, శోకసంతప్తయై నేలమీదపడిపోయెను. (26)

సుప్త్వేవ పునరుత్థాయ ఆర్యపుత్రేతి క్రోశతీ।
రురోద సా పతిం దృష్ట్వా సందితం మృత్యుదామభిః। 27

పిదప తార నిద్రనుండి మేల్కొనినదానివలె లేచి 'ఆర్యపుత్రా!' అని బిగ్గఱగా గగ్గోలు పెట్టెను. అనంతరము ఆమె మృత్యుపాశములచే బంధింపబడిన (అవసానదశకు చేరిన) తన పతిని జూచి, కన్నీరుమున్నీరుగా విలపించెను.(27)

తా మవేక్ష్య తు సుగ్రీవః క్రోశంతీం కురరీమివ।
విషాదమ్ అగమత్ కష్టం దృష్ట్వా చాంగదమాగతమ్। 28

ఆడు లకుముకిపిట్టవలె ఆక్రందించుచున్న ఆతారను, ఆమె వెంటవచ్చిన అంగదుని చూచి, సుగ్రీవుడు మిక్కిలి విషాదమునకు లోనయ్యెను. (28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకోనవింశఃసర్గః *(19)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది పందొమ్మిదవసర్గము

-- * * * --

20. ఇరువదియవసర్గము

అవసానదశలో నేలపై పడియున్న భర్తను కౌగిలించుకొని తార మిగుల విలపించుట -

రామచాపవిసృష్టేన శరేణాంతకరేణ తం।
దృష్ట్వా వినిహతం భూమౌ తారా తారాధిపాననా।
సా సమాసాద్య భర్తారం పర్యష్వజత భామినీ। 1

శ్రీరాముడు తనధనుస్సును ఎక్కుపెట్టి ప్రయోగించిన ప్రాణాంతకమైన బాణముచే దెబ్బతిని వాలి భూమిపై పడియుండెను. చంద్రవదనయు, సౌందర్యవతియు ఐన ఆతార తనభర్తను సమీపించి, ఆయనను కౌగిలించుకొనెను. (1)

ఇషుణాఽభిహతం దృష్ట్వా వాలినం కుంజరోపమం।
వానరేంద్రం మహేంద్రాభం శోకసంతప్తమానసా।
తారా తరుమివోన్మూలం పర్యదేవయదాతురా। 2

గజరాజువలె బలిష్ఠుడును, దేవేంద్రునివలె పరాక్రమశాలియు, వానర ప్రభువూ ఐన వాలి బాణముచే కొట్టబడి, మొదలునఱికిన చెట్టువలె పడియుండెను. అట్టి తన పతినిచూచి, తార శోకముతో కుమిలి పోయినదై తత్తఱపాటుతో పరితపించెను. (2)

రణే దారుణవిక్రాంత! ప్రవీర ప్లవతాం వర।
కిం దీనామ్ అపురోభాగామ్ అద్య త్వం నాఽభిభాషసే। 3

"ఓ మహావీరా! నీవు యుద్ధమున తిరుగులేని పరాక్రమశాలివి. వానరులలో ప్రముఖుడవు. నిరపరాధినైన నేను దీనురాలనై నీ ప్రక్కనేయున్నను నాతో మాట్లాడవేమి? ఓవానరప్రభూ! లెమ్ము, మేలైన శయ్యపై పండుకొనుము. నీవంటి మహారాజులు ఇట్లు కటికనేలపై పండుకొనరాదుగదా! భూపతీ! నీకు నామీదికంటెను

ఉత్తిష్ఠ హరిశార్దూల భజస్వ శయనోత్తమం।
నైవంవిధాః శేరతే హి భూమౌ నృపతిసత్తమాః। 4

అతీవ ఖలు తే కాంతా వసుధా వసుధాధిప।
గతాసు రపి యాం గాత్రైః మాం విహాయ నిషేవసే। 5

వ్యక్తమన్యా త్వయా వీర ధర్మతః సంప్రవర్తితా।
కిష్కింధేవ పురీ రమ్యా స్వర్గమార్గే వినిర్మితా। 6

యాన్యస్మాభిస్త్వయా సార్ధం వనేషు మధుగంధిషు।
విహృతాని త్వయా కాలే తేషామ్ ఉపరమః కృతః। 7

నిరానందా నిరాశాఽహం నిమగ్నా శోకసాగరే।
త్వయి పంచత్వమాపన్నే మహాయూథపయూథపే। 8

హృదయం సుస్థిరం మహ్యం దృష్ట్వా వినిహతం పతిం।
యన్న శోకాభిసంతప్తం స్ఫుటతేఽద్య సహస్రధా। 9

సుగ్రీవస్య త్వయా భార్యా హృతా స చ వివాసితః।
యత్తు తస్య త్వయా వ్యుష్టిః ప్రాప్తేయం ప్లవగాధిప। 10

నిఃశ్రేయసపరా మోహాత్ త్వయా చాహం విగర్హితా।
యైషాఽబ్రవం హితం వాక్యం వానరేంద్ర హితైషిణీ। 11

రూపయౌవనదృప్తానాం దక్షిణానాం చ మానద।
నూనమప్సరసామ్ ఆర్య చిత్తాని ప్రమథిష్యసి। 12

కాలో నిస్సంశయో నూనం జీవితాంతకరస్తవ।
బలాద్యేనావపన్నోఽసి సుగ్రీవస్యావశో వశమ్। 13

వైధవ్యం శోకసంతాపం కృపణం కృపణా సతీ।
అదుఃఖోపచితా పూర్వం వర్తయిష్యామ్యనాథవత్। 14

లాలితశ్చాంగదో వీరః సుకుమారః సుఖోచితః।
వత్స్యతే కామవస్థాం మే పితృవ్యే క్రోధమూర్ఛితే। 15

కురుష్వ పితరం పుత్ర సుదృష్టం ధర్మవత్సలం।
దుర్లభం దర్శనం వత్స తవ తస్య భవిష్యతి। 16

భూకాంతపైననే మక్కువ ఎక్కువ. ఏలనన నీ భార్యనైన నన్ను విడిచిపెట్టి, మృతిచెందిన పిమ్మటగూడ ఆమెనే కౌగిలించుకొని సేవించుచున్నావు. (3-5)

మహావీరా! నీవు ధర్మయుద్ధమొనర్చి స్వర్గమునకు వెళ్ళెడిదారిలోగూడ కిష్కింధవంటి ఒక రమ్యమైన నగరమును నిర్మించుకొనినట్లు స్పష్టమగుచున్నది. లేనిచో కిష్కింధను వదలి ఇక్కడ ఏల పండుకొని యుందువు? సువాసనలతోనిండిన ఉద్యానవనములలో మేమునీతోగూడి హాయిగా విహరించియుంటిమి. ఇప్పుడు నీవు వాటినన్నింటిని వదలిపెట్టి వెళ్లుచున్నావు. మహాసేనాధిపతులకు అధిపతివైన నీవు మరణించుటచే నిరాశకులోనై ఆనందమునకు దూరమైతిని, అంతులేని శోకముతో కుమిలిపోవుచున్నాను. నాప్రాణేశ్వరుడవైన నీవు హతుడవై ఇట్లు పడియుండగా చూచినప్పుడు నిజముగా నాగుండె వేయిముక్కలు కావలసియున్నది. అట్లు కాకపోవుటను బట్టి అది పాషాణమువలె కఠినమైనదని తెలుచున్నది.(6-9)

ఓ వానరేంద్రా! నీవు సుగ్రీవునిభార్యను హరించి, అతనిని కిష్కింధనుండి వెళ్లగొట్టితివి. దాని ఫలమును ఇప్పుడు ఇట్లు అనుభవించితివి. నిజముగా నేను నీమేలు కోరెడిదానను. అందువలననే నీ శ్రేయస్సునుగోరి, పెక్కు హితవచనములను పలికితిని. కాని అజ్ఞానముచే వాటిని పెడచెవిని బెట్టుటయేగాక పైగా నన్ను నిందించితివి. అభిమానధనుడవైన పూజ్యుడా! వీరస్వర్గమునందు చక్కని రూపము, నిండు యౌవనము గలిగి విఱ్ఱవీగుచున్నవారు, కామశాస్త్రమునందు ఆఱితేఱినవారు ఐన అప్సరసల యొక్క చిత్తములను దోచివేయుదువు కాబోలు.(10-12)

నేడు కాలపురుషుడు (యముడు) నీ ప్రాణములను తీయుటకే వచ్చినాడనుట నిశ్చయము - ఏలనన ఎంతటి వారికిని వశముకాని నిన్ను అతడు బలవంతముగా సుగ్రీవునకు లొంగునట్లు చేసినాడు. (13)

ఇంతకుముందు ఎన్నడును నేను దుఃఖమును, దైన్యమును ఎఱుగనే యెఱుగను. ఇప్పుడు వైధవ్యమును పొంది, శోకసంతాపములకులోనై దైన్యముతో దిక్కులేని దానివలె జీవింపవలసియుండును. (14)

వీరుడైన అంగదుడు సుఖములలో పుట్టి పెఱిగినవాడు, అతడు మన గారాల బిడ్డడు. అట్టి సుకుమారుడు నేటినుండి తన పినతండ్రియైన సుగ్రీవునియొక్క కోపతాపములను భరించుచు జీవింపవలసియుండును. ఇకమీదట ఆ చిన్నారికి ఎట్టి దురవస్థ పట్టునోయేమో?(15)

నాయనా! అంగదా! ధర్మవత్సలుడైన మీ తండ్రిని కనులార చూడుము. ఇకముందు ఆయన దర్శనము నీకు దుర్లభము. (16)

సమాశ్వాసయ పుత్త్రం త్వం సందేశం సందిశస్వ చ ।
మూర్ధ్ని చైనం సమాఘ్రాయ ప్రవాసం ప్రస్థితో హ్యసి । 17

రామేణ హి మహత్ కర్మ కృతం త్వామభినిఘ్నతా ।
ఆనృణ్యం చ గతం తస్య సుగ్రీవస్య ప్రతిశ్రవే । 18

ఓ ప్రాణేశ్వరా! పుత్త్రుని ఊరడింపుము, అతనికి సందేశమును ఇమ్ము, నీవు స్వర్గమునకు వెళ్లుచున్నందున ఒక్కసారి అతనిశిరస్సును మూర్కొనుము. రామచంద్ర ప్రభువు నిన్ను చంపి ఘనకార్యమునే చేసినాడు. అతడు సుగ్రీవునకు తాను చేసిన ప్రతిజ్ఞను నెఱవేర్చి, ఋణవిముక్తుడైనాడు. (17-18)

సకామో భవ సుగ్రీవ రుమాం త్వం ప్రతిపత్స్యసే ।
భుంక్ష్వ రాజ్యమ్ అనుద్విగ్నః శస్తో భ్రాతా రిపుస్తవ । 19

ఓ సుగ్రీవా! శత్రువైన నీ అన్న (వాలి) మరణించినాడు. నీకోరిక నెఱవేఱినది. ఇంక నీవు రుమతో ఆనందింపుము. నిర్విచారముగా రాజ్యసుఖములను అనుభవింపుము. (19)

కిం మామేవం విలపతీం ప్రేమ్ణా త్వం నాఽభిభాషసే ।
ఇమాః పశ్య వరా బహ్వీః భార్యాస్తే వానరేశ్వర! । 20

ఓ జీవితేశ్వరా! ఇట్లు నేను ఎంతగా విలపించుచున్నను ప్రేమతో మాట్లాడవేమి? ఇదిగో నీ భార్యలందఱును ఇచటికి వచ్చియున్నారు. వారివైపు ఒకసారి చూడుము."(20)

తస్యా విలపితం శ్రుత్వా వానర్యః సర్వతశ్చ తాః ।
పరిగృహ్యాంగదం దీనం దుఃఖార్తాః పరిచుక్రుశుః । 21

తార విలపించుటను విని, అక్కడనున్న వానరస్త్రీలు అందఱును దీనుడైయున్న అంగదుని దగ్గఱకు తీసికొని, దుఃఖార్తలై మిగుల ఆక్రందించిరి. (21)

కిమంగదం సాంగదవీరబాహో
విహాయ యాస్యద్య చిరప్రవాసం ।
న యుక్త మేవం గుణసన్నికృష్టం
విహాయ పుత్త్రం ప్రియపుత్త్ర గంతుమ్ । 22

కిమప్రియం తే ప్రియ చారువేష
మయా కృతం నాథ సుతేన వా తే ।
సహాంగదాం మాం స విహాయ వీర
యత్ ప్రస్థితో దీర్ఘమితః ప్రవాసమ్ । 23

యద్యప్రియం కించిదసంప్రధార్య
కృతం మయా స్యాత్ తవ దీర్ఘబాహో ।
క్షమస్వ మే తద్ధరివంశనాథ
వ్రజామి మూర్ధ్నా తవ వీర పాదౌ । 24

తార మఱల ఇట్లనెను. "బాహువులకు భుజకీర్తులను ధరించిన ఓ వీరుడా! వాలీ! అంగదుని విడిచి పెట్టి, మఱలిరాని లోకములకు వెళ్లుచున్నావేమి? పుత్త్రుడవిన నీకు ప్రాణము. సకలగుణవంతుడైన కుమారుని వీడి, ఇట్లు వెళ్లుట తగదు. సుందరా! నాథా! వీరా! నన్ను, అంగదుని ఇక్కడనే విడిచిపెట్టి, ఇతరలోకములకు దీర్ఘప్రయాణమునకు బయలుదేఱితివి. నేనుగాని, అంగదుడుగాని నీకు అప్రియమును గూర్చితిమా? (కష్టము కలిగించితిమా?) ఓ దీర్ఘబాహూ! వానరప్రభూ! నా అజ్ఞానకారణముగా నావలన నీకు ఏకొంచెముగానైనను అప్రియము కలిగియున్నచో నన్ను క్షమింపుము. నీ పాదములకు శిరసువంచి ప్రణమిల్లుచున్నాను."(22-24)

తథా తు తారా కరుణం రుదంతీ
భర్తుః సమీపే సహ వానరీభిః ।
వ్యవస్యత ప్రాయముపోపవేష్టుమ్
అనింద్యవర్ణా భువి యత్ర వాలీ । 25

భర్తసమీపముననేయున్న సుందరియగు ఆతార తోడివానరస్త్రీలతోగూడి దీనముగా ఏడ్చుచు ప్రాయోపవేశమునకు (నిరశన దీక్షకు) సిద్ధపడెను. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే వింశః సర్గః *(20)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువదియవసర్గము

— ✻ ✻ ✻ —

21. ఇరువదిఒకటవసర్గము

హనుమంతుడు తారను ఓదార్చుట.

తతో నిపతితాం తారాం చ్యుతాం తారా మివాంబరాత్ ।
శనైరాశ్వాసయామాస హనుమాన్ హరియూథపః । 1

గుణదోషకృతం జంతుః స్వకర్మఫలహేతుకం ।
అవ్యగ్రస్తదవాప్నోతి సర్వం ప్రేత్య శుభాశుభమ్ । 2

శోచ్యా శోచసి కం శోచ్యం దీనం దీనానుకంపసే ।
కస్య కో వాఽనుశోచ్యోఽస్తి దేహేఽస్మిన్ బుద్బుదోపమే । 3

అంగదస్తు కుమారోఽయం ద్రష్టవ్యో జీవపుత్రయా ।
ఆయత్యాం చ విధేయాని సమర్థాన్యస్య చింతయ । 4

జానాస్యనియతామేవం భూతానామ్ ఆగతిం గతిం ।
తస్మాచ్ఛుభం హి కర్తవ్యం పండితేనైహలౌకికమ్ । 5

యస్మిన్ హరిసహస్రాణి ప్రయుతాన్యర్బుదాని చ ।
వర్తయంతి కృతాంశాని సోఽయం దిష్టాంతమాగతః । 6

యదయం న్యాయదృష్టార్థః సామదానక్షమాపరః ।
గతో ధర్మజితాం భూమిం నైనం శోచితుమర్హసి । 7

ఆకాశమునుండి రాలిన తారక (నక్షత్రము)వలె భూమిపై పడియున్న (వాలిభార్యయగు) తారను ఓదార్చుచు వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు మృదువుగా ఇట్లు నుడివెను. (1)

"దేవీ! ఏ ప్రాణియైనను తెలిసిగాని, తెలియకగాని చేసిన శుభాశుభకర్మలయొక్క ఫలములను (సుఖదుఃఖ రూప ఫలములను) జీవించియుండగా ఈ లోకమునందుగాని మరణానంతరము పరలోకమునందుగాని అనుభవించియే తీరును - (వాలి మరణమునకు సుగ్రీవుడు నిమిత్త మాత్రుడు, ఆతని కర్మలే అందులకు కారణములు) నీవే శోచనీయస్థితికి గురియై యుంటివి. మఱినీవు ఎవరి కొఱకు శోకించెదవు? నీవు ప్రస్తుతము దైన్యస్థితికి లోనైయుంటివి, ఇంక ఎవరి కోసము జాలిపడెదవు? ఈ శరీరము నీటిబుడగవలె అస్థిరమైనది. కనుక ఈ దేహమునందున్న జీవుడు మఱి ఏ జీవుని కొఱకును శోకింపవలసిన పని లేదు. (2-3)

అమ్మా! నీకుమారుడైన అంగదుడు పసివాడు. నీవు అతని ఆలనపాలనలు చూడవలసియున్నది. ఇకముందు అతని బాగోగులను (భవిష్యత్తును) గూర్చి నీవు విచారింపవలసియున్నది. దేవీ! నీవు అన్నియును తెలిసిన దానవు, 'ఏ ప్రాణి ఎప్పుడు పుట్టునో? ఎప్పుడు మరణించునో ఎవ్వరును ఎఱుగరు. ఈ సత్యమును నీవును ఎఱుగుదువు. కావున ఈ విలాపమును మాని, పరలోకమున సుఖములను ఇచ్చెడి పుణ్యకార్యములనే ఇచట చేయుట యుక్తము. (4-5)

తల్లీ! అసంఖ్యాకులైన ఈ వానరులందఱును మహారాజైన వాలిమీదనే లక్షలకొలది, కోట్లకొలది ఆశలను పెట్టుకొని (ఆయననే నమ్ముకొని) జీవించుచున్నారు. అట్టి మహాత్ముడు ఇప్పుడు కాలధర్మము చెందెను. (ఇంతమంది స్వజనులకు పట్టుగొమ్మగా నిలిచిన ఆ ప్రభువు వీరినందఱిని విడిచిపెట్టి తనసుకృతఫలములను అనుభవించుటకు వెళ్లినాడు. కావున ఆయన కొఱకై విచారింపవలదు.) ఈ వానరప్రభువు న్యాయమును అనుసరించి తన రాజ్యమును చక్కగా పరిపాలించినాడు. స్వజనులదుఃఖములను తొలగించి, వారికి ఊరట గూర్చినాడు, వారికి సంతృప్తికరముగా పెక్కుప్రయోజనములను కలిగించినాడు. వారొనర్చిన అపరాధములను క్షమించుచు వారిని ఆదుకొనినాడు. అతడు ధర్మాత్ముల (పుణ్య) లోకమునే చేరినాడు. కనుక ఆయనకై దుఃఖింపవలసిన పనిలేదు. (6-7)

సర్వే హి హరిశార్దూలాః పుత్త్రశ్చాయం తవాంగదః।
ఇదం హర్యృక్షరాజ్యం చ త్వత్సనాథమ్ అనిందితే। 8

తావిమౌ శోకసంతాపౌ శనైః ప్రేరయ భామిని!।
త్వయా పరిగృహీతోఽయమ్ అంగదః శాస్తు మేదినీమ్। 9

సంతతిశ్చ యథా దృష్టా కృత్యం యచ్చాపి సాంప్రతం।
రాజ్ఞస్తత్ క్రియతాం తావత్ ఏష కాలస్య నిశ్చయః। 10

సంస్కార్యో హరిరాజశ్చ అంగదశ్చాఽభిషిచ్యతాం।
సింహాసనగతం పుత్త్రం పశ్యంతీ శాంతిమేష్యసి। 11

సా తస్య వచనం శ్రుత్వా భర్తృవ్యసనపీడితా।
అబ్రవీదుత్తరం తారా హనుమంతమ్ అవస్థితమ్। 12

అంగదప్రతిరూపాణాం పుత్త్రాణామేకతః శతం।
హతస్యాప్యస్య వీరస్య గాత్రసంశ్లేషణం వరమ్। 13

న చాఽహం హరిరాజస్య ప్రభవామ్యంగదస్య।
వా పితృవ్యస్తస్య సుగ్రీవః సర్వకార్యేష్వనంతరః। 14

న హ్యేషా బుద్ధిరాస్థేయా హనుమన్నంగదం ప్రతి।
పితా హి బంధుః పుత్త్రస్య న మాతా హరిసత్తమ। 15

నహి మమ హరిరాజసంశ్రయాత్
క్షమతరమస్తి పరత్ర చేహ వా ।
అభిముఖహతవీర సేవితం
శయనమిదం మమ సేవితుం క్షమమ్। 16

ఓ పూజ్యులారా! ఈ వానరప్రముఖులందఱికిని, నీ కుమారుడైన ఈ అంగదునకును, ఈ వానరభల్లూకముల రాజ్యమునకును నీవే రక్షకురాలవు. ఓ దేవీ! ఈ అంగద సుగ్రీవులు ఇరువురును శోకసంతప్తులై యున్నారు. వారికి ఊరట కలిగించి, భావికార్యక్రమమునకు ప్రోత్సహింపుము. నీ పర్యవేక్షణలో ఈ అంగదుడు రాజ్యమును పరిపాలింపగలడు. (8-9)

తల్లిదండ్రులకు సద్గతులను ప్రాప్తింపజేయుటయే సంతానము కలిగినందులకు ఫలము అని శాస్త్రములు తెలుపుచున్నవి. కనుక మహారాజునకు సుగతులు లభించుటకై అంగదుడు ఉత్తరక్రియలను ఆచరింపవలెను. దానికి ఇది తగిన సమయము. ముందు మహారాజైనవాలికి మరణానంతరసంస్కారములను జరుపవలయును. పిదప అంగదుని పట్టాభిషిక్తుని గావింపవలెను. సింహాసనమును అధిష్ఠించిన అంగదుని జూచిన పిమ్మట నీ మనస్సునకు కొంత ఊరట గలిగి, శాంతి చేకూరును." (10-11)

భర్తనియోగమునకు దుఃఖించుచున్న ఆతార మారుతి వచనములను విని, పిమ్మట తన సమీపముననేయున్న అతనితో ఇట్లనుడివెను. (12)

మారుతీ! త్రాసులో అంగదునివంటి వందమంది కుమారులను ఒక ప్రక్కను, మృతుడైనను ఆమహావీరుని పత్నిగా అయినను కౌగిలించుకొని సహగమనము చేయుట మఱియొక ప్రక్కను, ఉంచినచో రెండవదియే మొగ్గుచూపును. అనగా సహగమనమే నాకు ప్రీతికరము. వానరరాజ్యముపై నాకు ఎట్టి అధికారములేదు. అంగదుని పట్టాభిషిక్తుని జేయుట నాచేతిలోనిదిగాదు. అతని పినతండ్రియైన సుగ్రీవుడే సమస్త కార్యములను నిర్వహించుటలో సమర్థుడు. అతడే అంగదునకు దగ్గఱివాడు. నాకంటెను సుగ్రీవుడే అంగదుని యోగ క్షేమములను గూర్చి చక్కగా ఆలోచింపగలడు. (13-14)

ఓ మారుతీ! నీవు వానరులలో ప్రముఖుడవు. అంగదుని గూర్చి నీవు చెప్పిన ఈ ఆలోచన సరికాదు. సుగ్రీవుడు అంగదునకు తండ్రియంతటివాడు. ఈ సందర్భమున తల్లినైన నాకంటెను, సుగ్రీవుడే అంగదునకు శ్రేయస్సును గూర్చగల ఆత్మబంధువు. (15)

హనుమంతా! వానరప్రభువైన వాలి నాకు ప్రాణనాథుడు. ఈ లోకమునగాని, పరలోకమునగాని నా స్వామిని ఆశ్రయించుటయే నాకు యుక్తము. రణరంగమున వీరునితో పోరాడుచు హతుడైన ఈ ప్రభువు సేవించుచున్న శయనమునే నేనును ఆశ్రయించుట ధర్మము. అనగా పతితో సహగమనము చేయుటయే నా కర్తవ్యము. (16)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకవింశః సర్గః *(21)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువది ఒకటవసర్గము

22. ఇరువదిరెండవసర్గము

కొనయూపిరితోనున్న వాలి తన తమ్ముడైన సుగ్రీవునితోడను, కుమారుడైన అంగదునితోడను హితోక్తులు పలికి అసువులను కోల్పోవుట -

వీక్షమాణస్తు మందాసుః సర్వతో మందముచ్ఛ్వసన్।
ఆదావేవ తు సుగ్రీవం దదర్శాఽనుజమగ్రతః॥ 1

తం ప్రాప్తవిజయం వాలీ సుగ్రీవం ప్లవగేశ్వరః।
ఆభాష్య వ్యక్తయా వాచా సస్నేహమ్ ఇదమబ్రవీత్॥ 2

సుగ్రీవ దోషేణ న మాం గంతుమర్హసి కిల్బిషాత్।
కృష్యమాణం భవిష్యేణ బుద్ధిమోహేన మాం బలాత్॥ 3

యుగపద్విహితం తాత న మన్యే సుఖమావయోః।
సౌహార్దం భ్రాతృయుక్తం హి తదిదం తాత నాఽన్యథా॥ 4

ప్రతిపద్య త్వమద్యైవ రాజ్యమేషాం వనౌకసాం।
మామప్యద్యైవ గచ్ఛంతం విద్ధి వైవస్వతక్షయమ్॥ 5

జీవితం చ హి రాజ్యం చ శ్రియం చ విపులామిమాం।
ప్రజహామ్యేష వై తూర్ణం మహచ్చాగర్హితం యశః॥ 6

అస్యాం త్వహమ్ అవస్థాయాం వీర వక్ష్యామి యద్వచః।
యద్యప్యసుకరం రాజన్ కర్తుమేవ తదర్హసి॥ 7

సుఖార్హం సుఖసంవృద్ధం బాలమేనమ్ అబాలిశమ్।
బాష్పపూర్ణముఖం పశ్య భూమౌ పతితమంగదమ్।
మమ ప్రాణైః ప్రియతరం పుత్రం పుత్రమివౌరసమ్॥ 8

తిన్నగా శ్వాసవీల్చుచు కొనయూపిరితో ఉన్న వాలి అంతటను కలయజూచుచు, మొట్టమొదట ఎదురుగా ఉన్న తన తమ్ముడగు సుగ్రీవుని గాంచెను. (1)

వానరాధిపతియైన వాలి యుద్ధమున సఫలుడైన సుగ్రీవుని సంబోధించి, ఆత్మీయతతో స్పష్టముగా ఇట్లు నుడివెను. (2)

"సోదరా! నీ భార్యను నా వశమునందుంచుకొని, నిన్ను కిష్కింధనుండి వెళ్లగొట్టినందులకు నన్ను దోషిగా తలంపవద్దు. ఇదియంతయు విధివిలాసమున జరిగినది. నేను బలగర్వితుడనై అజ్ఞానవశమున అట్లు చేసితిని. అన్నదమ్ములమైన మనము కలిసిమెలసి హాయిగా జీవించెడి యోగమును దైవము మననొసట వ్రాయలేదు. కనుక పరస్పరము సోదరప్రేమతో మసలుకొనవలసిన మనము అందులకు విరుద్ధముగా ప్రవర్తించితిమి. నేను ఇంకొక్క క్షణములో ఈ తనువును చాలించి, పరలోకమునకు వెళ్లుచున్నట్లు ఎఱుంగుము. కావున ఇప్పుడు ఈ వానరరాజ్యమును నీవు స్వీకరింపుము. నాయనా! సుగ్రీవా! నా ఈసమస్తసంపదలను, రాజ్యమును, కడకు నా ప్రాణములను సైతము ఈ క్షణమునందే త్యజించి వెళ్లుచున్నాను. 'వాలి యుద్ధమున అజేయుడు, ఎంతటి వీరునకును లొంగెడివాడు కాడు' అని నాకు గల కీర్తినేటితో అంతరించినది. (3-6)

ఓ వీరుడా! ఈ అవసానదశలో నేను నుడువుచున్న ఈ మాటలను ఆలకింపుము. రాజ్యమును పాలించుట మిక్కిలి క్లిష్ట (భార)మైనదే, ఐనప్పటికిని అందులకు నీవు సమర్థుడవు, కనుక వెంటనే పట్టాభిషిక్తుడవు కమ్ము. (7)

తమ్ముడా! ఇదిగో! కన్నీరు మున్నీరుగా ఏడ్చుచు నేలపై పడియున్న ఈ అంగదకుమారుని చూడుము. ఇతడు నాకు ప్రాణములకంటె మిన్నయైనవాడు, సుఖములలో పుట్టిపెఱిగినవాడు, మాయామర్మములెఱుగని పసివాడు, బుద్ధిమంతుడు, హాయిగా జీవింపవలసినవాడు కనుక వీనిని నీసొంతకుమారునిగా చూచుకొనుము. తండ్రిలేని ఈ చిన్నారికి ఏలోపమునూ రానీయకుండా అన్నివిధములుగా సర్వసమర్థుని గావింపుము. నాకు మాఱుగా వీనికి వస్త్రాభరణాదులను అన్నింటిని నీవే సమకూర్చవలయును,

మయా హీనమ్ అహీనార్థం సర్వతః పరిపాలయ ।
త్వమేవాస్య హి దాతా చ పరిత్రాతా చ సర్వతః ।
భయేష్వభయదశ్చైవ యథాహం ప్లవగేశ్వర । 9

ఏష తారాత్మజః శ్రీమాన్ త్వయా తుల్యపరాక్రమః ।
రక్షసాం తు వధే తేషామ్ అగ్రతస్తే భవిష్యతి । 10

అనురూపాణి కర్మాణి విక్రమ్య బలవాన్ రణే ।
కరిష్యత్యేష తారేయః తరస్వీ తరుణోఽంగదః । 11

సుషేణదుహితా చేయమ్ అర్థసూక్ష్మవినిశ్చయే ।
ఔత్పాతికే చ వివిధే సర్వతః పరినిష్ఠితా । 12

యదేషా సాధ్వితి బ్రూయాత్ కార్యం తన్ముక్తసంశయం ।
న హి తారామతం కించిత్ అన్యథా పరివర్తతే । 13

రాఘవస్య చ తే కార్యం కర్తవ్యమ్ అవిశంకయా ।
స్యాదధర్మో హ్యకరణే త్వాం చ హింస్యాద్విమానితః । 14

ఇమాం చ మాలామ్ ఆధత్స్వ దివ్యాం సుగ్రీవ కాంచనీం ।
ఉదారా శ్రీ స్థితా హ్యస్యాం సంప్రజహ్యాన్మృతే మయి । 15

ఇత్యేవ ముక్తః సుగ్రీవో వాలినా భ్రాతృసౌహృదాత్ ।
హర్షం త్యక్త్వా పునర్దీనో గ్రహగ్రస్త ఇవోడురాట్ । 16

తద్వాలివచనాచ్ఛాంతః కుర్వన్ యుక్తమ్ అతంద్రితః ।
జగ్రాహ సోఽభ్యనుజ్ఞాతో మాలాం తాం చైవ కాంచనీమ్ । 17

తాం మాలాం కాంచనీం దత్త్వా వాలీ దృష్ట్వాఽఽత్మజం స్థితం ।
సంసిద్ధః ప్రేత్యభావాయ స్నేహాదంగదమబ్రవీత్ । 18

శత్రుబాధలు లేకుండా చూడవలసిన వాడవు నీవే. ఇతనికి ఎట్టి భయమూ లేకుండా అండగా నిలువుము. (8-9)

నాయనా! సుగ్రీవా! ఈ తారాకుమారుడు మిగుల తేజస్వి, నీవలె పరాక్రమశాలి, రాక్షసాదిశత్రువులను వధించునప్పుడు నీకు కుడిభుజముగా ఉండగలడు. ఈ అంగదుడు మిక్కిలి బలశాలి. చురుకుదనము గలవాడు, యువకుడు, రణరంగమున విక్రమించి, తనస్థాయికి తగినట్లు సాహసముతో పోరాడగలడు. (10-11)

సుగ్రీవా! నా ధర్మపత్నియగు ఈ తార సుషేణుని కూతురు.[1] ఈమె ఎంతయు సూక్ష్మబుద్ధిగలది, అర్థవిశ్లేషమునందు చతురురాలు, రాబోవు ఆపదలను పసిగట్టగలదు, సకలవిషయములయందును సమర్థురాలు. (12)

'ఇట్లు చేయుట యుక్తము' అని తార ఏకార్యమును గూర్చి చెప్పినను దానిని నిస్సంశయముగా (ఏమాత్రమూ సందేహపడక) చేయవచ్చును. ఆమె చెప్పినదేదియు మఱియొక రీతిగా (అన్యథా)కాదు. (13)

తమ్ముడా! శ్రీరామునికార్యమును (ఆదేశమును) ఎట్టి సంకోచమూ లేకుండా చేయుము. అట్లు చేయనిచో అది అధర్మమగును. (నీవు మాట ఇచ్చిన ప్రకారము సీతాన్వేషణ కార్యమును చేయనిచో అది అధర్మము అగును) ఆయన మనస్సును నొప్పించినచో నిన్ను శిక్షింపక మానడు. (14)

సుగ్రీవా! ఇదిగో! ఈ దివ్యమైన బంగారు మాలను నాబొందిలో ప్రాణములు ఉండగనే ధరింపుము. లేనిచో నేను మృతిచెందిన మఱుక్షణమే ఈ మాలయందున్న అజేయశక్తి, ప్రభావము మాయమగును." (15)

అన్నయగు వాలి సోదరప్రేమతో ఇట్లు పలికిన పిమ్మట సుగ్రీవుడు సంతోషమునకు దూరమై, రాహుగ్రస్తుడైన చంద్రునివలె కాంతివిహీనుడయ్యెను. (16)

ఆవాలి పలికిన వచనములకు సుగ్రీవునిమనస్సు కుదుటబడెను. అన్నపై అతనికిగల వైరభావము తొలగిపోయెను. అతడు సావధానుడై (శ్రద్ధాదరములతో) అన్న చెప్పినట్లు చేయుచు ఆయన ఇచ్చిన బంగారు మాలను గ్రహించెను. (17)

వాలి ఆబంగారుహారమును సుగ్రీవునకు ఇచ్చిన పిమ్మట అక్కడనేయున్న అంగదునివైపు చూచెను. ప్రాణములను విడుచుచున్న ఆస్థితిలో అతడు పుత్రవాత్సల్యముతో ఇట్లు పలికెను. (18)

1) పాలసముద్రమును మథించినప్పుడు 'తార' అందుండి ఉద్భవించెను. అప్పుడు ఆమెయొక్క దక్షిణ (కుడి) హస్తమును వాలియు, వామ(ఎడమ) హస్తమును సుషేణుడును పట్టుకొనిరి. అంతట ఆమె కొఱకు వారు ఇరువురును వివాదమునకు దిగిరి. దేవతల తీర్పులో తార సుషేణునకు కూతురయ్యెను, వాలికి భార్య అయ్యెను. ఇది స్కాంద పురాణ ప్రమాణము.
శ్లో ॥ దేవైః సుషేణ కలహే పుత్రీతి ప్రతిపాదితా ।
సుషేణో దుహితుః తస్యాః స్వయంవరమ్ అకల్పయత్ ।
ఇత్థమ్ ఊఢా కపీంద్రేణ తారా సర్వాంగ సుందరీ ॥

దేశకాలౌ భజస్వాఽద్య క్షమమాణః ప్రియాప్రియే।
సుఖదుఃఖసహః కాలే సుగ్రీవవశగో భవ। 19

యథా హి త్వం మహాబాహో లాలితః సతతం మయా।
న తథా వర్తమానం త్వాం సుగ్రీవో బహుమంస్యతే। 20

మాఽస్యాఽమిత్రైర్గతం గచ్ఛేః మా శత్రుభిరరిందమ।
భర్తురర్థపరో దాంతః సుగ్రీవవశగో భవ। 21

న చాతిప్రణయః కార్యః కర్తవ్యోఽప్రణయశ్చ తే।
ఉభయం హి మహాన్ దోషః తస్మాదంతరదృగ్ భవ। 22

ఇత్యుక్త్వాథ వివృత్తాక్షః శరసంపీడితో భృశం।
వివృతైర్దశనైర్భీమైః బభూవోత్క్రాంతజీవితః। 23

తతో విచుక్రుశుస్తత్ర వానరా హరియూథపాః।
పరిదేవయమానాస్తే సర్వే ప్లవగపుంగవాః। 24

కిష్కింధా హ్యద్య శూన్యాఽఽసీత్ స్వర్గతే వానరాధిపే।
ఉద్యానాని చ శూన్యాని పర్వతాః కాననాని చ।
హతే ప్లవగశార్దూలే నిష్ప్రభా వానరాః కృతాః। 25

యస్య వేగేన మహతా కాననాని వనాని చ।
పుష్పౌఘేణానుబధ్యంతే కరిష్యతి తదద్య కః। 26

యేన దత్తం మహద్యుద్ధం గంధర్వస్య మహాత్మనః।
గోలభస్య మహాబాహోః దశవర్షాణి పంచ చ। 27

నైవ రాత్రౌ న దివసే తద్యుద్ధమ్ ఉపశామ్యతి।
తతస్తు షోడశే వర్షే గోలభో వినిపాతితః। 28

హత్వా తం దుర్వినీతం తు వాలీ దంష్ట్రాకరాళవాన్।
సర్వాభయకరోఽస్మాకం కథమేష నిపాతితః। 29

"నాయనా! నామరణానంతరము నీ పినతండ్రియగు సుగ్రీవుడు చెప్పినట్లు నడచుకొనుచుండుము. దేశకాల పరిస్థితులను అనుసరించుచు నడచుకొనుము. ప్రియమునకు పొంగిపోవుటగాని, అప్రియమునకు క్రుంగిపోవుటగాని చేయక సుఖదుఃఖములను సమానముగా భావింపుము.(19)

మహాబాహుండవైన ఓ అంగదా! నేను నిన్ను ఎల్లప్పుడును ప్రేమతో లాలించితిని. నా దగ్గఱ నడుచుకొనినట్లు ప్రవర్తించినచో పినతండ్రియగు సుగ్రీవునికడమాత్రము నీ ఆటలు సాగవు. (20)

శత్రువులను అదుపుచేయుగలవాడా! సుగ్రీవుని శత్రువులను గాని, వారి మిత్రులనుగాని కలియువద్దు. నీవు నిగ్రహముగలిగి, రాజునకు ప్రయోజనమును గూర్చుపనులనే ఆచరింపుము. సంతతము ఆయనయొక్క అదుపు ఆజ్ఞలలోనే ఉండుము. నీవు సుగ్రీవుని కడ మిక్కిలి చనవుతో ప్రవర్తింపకుము, అట్లని ఆయనకు అతి దూరముగా ఉండకుము. ఈ రెండును దోషములే. కనుక ఈ రెండింటికిని మధ్యేమార్గమున నడచుకొనుము."(21-22)

ఇట్లు పలికిన పిమ్మట బాణము గ్రుచ్చుకొనుటవలన కలిగిన బాధకు అతనికన్నులు తిరుగసాగెను. భయంకరములైన అతనిదంతములు బయటికి వచ్చెను. ప్రాణములు ఎగిరిపోయెను. అప్పుడు అచటి వానరులు, సేనాపతులు, వానరప్రముఖులు అందఱును తమ ప్రభువుయొక్క మృతికి బిగ్గఱగా ఏడ్చుచు దీనముగా ఇట్లు వచించిరి. (23-24)

"మన ప్రభువు స్వర్గస్థుడైనందున కిష్కింధ శూన్యమాయెను. ఉద్యానవనములు, పర్వతములు, అడవులు వెలవెలబోవుచున్నవి. ఆ స్వామి గతించినందున వానరుల ముఖములు కళదప్పినవి. (25)

వాలి మిక్కిలి వేగముగా సాగిపోవునప్పుడు అచటి అరణ్యములు, ఉపవనములు, సరస్సులు మొదలగు చోట్లగల పూవులన్నియును ఆయన వేగమునకు ఎగిరి ఆయనను అనుసరించుచుండెడివి. ఇట్లు ఆపని చేయగలవారు ఎవరు?(26)

దీర్ఘమైన బాహువులు గలవాడు, మహాత్ముడు ఐన 'గోలభుడు' అను గంధర్వునకును వానరప్రభువైన వాలికిని ఘోరయుద్ధము జరిగెను. ఆసమరము పదునైదు సంవత్సరముల కాలము రాత్రింబవళ్లు నిర్విరామముగా కొనసాగెను. పదునాఱవసంవత్సరమున వాలిచేతిలో గోలభుడు హతుడయ్యెను. భయంకరములైన దంతములు గల ఆప్రభువు దుష్టుడైన ఆ గంధర్వుని హతమార్చి, మాకు ఆదుర్మార్గుని భయములేకుండ చేసెను. అట్టి మహాబలశాలియైన వాలి ఇప్పుడు ఇతరులచేత ఎట్లు హతుడయ్యెను?" (27-29)

హతే తు వీరే ప్లవగాధిపే తదా
ప్లవంగమాస్తత్ర న శర్మ లేభిరే ।
వనేచరాః సింహయుతే మహావనే
యథా హి గావో నిహతే గవాం పతౌ । 30

దట్టమైన అడవిలో ఒక సింహమువలన గోనాథుడు (ఆబోతు) మరణించినప్పుడు ఆగోపతి (వృషభము)తో కలిసి మసలెడి ఆవులు దుఃఖించినట్లు, వానరులకు ప్రభువు, వీరుడు ఐన వాలి సింహపరాక్రముడైన శ్రీరామునిచేత నిహతుడుకాగా అచటి వానరులందఱును క్షోభతో మిగుల క్రుంగిపోయిరి. (30)

తతస్తు తారా వ్యసనార్ణవాప్లుతా
మృతస్య భర్తుర్వదనం సమీక్ష్య సా ।
జగామ భూమిం పరిరభ్య వాలినం
మహాద్రుమం ఛిన్నమివాశ్రితా లతా । 31

తనపతి మరణించిన కారణముగా తార దుఃఖసముద్రములో మునిగిపోయెను. చచ్చిపడియున్న భర్త ముఖమును చూచి, ఆమె ఆయనను కౌగిలించుకొని, నఱికి వేయబడిన చెట్టును అల్లుకొనియున్న తీగవలె నేలపైపడిపోయెను. (31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ద్వావింశః సర్గః (22)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువది రెండవసర్గము

— * * * —

23. ఇరువదిమూడవసర్గము

మృతిచెందిన వాలియొక్క బలపరాక్రమములను ప్రశంసించుచు తార పరితపించుట -

తతః సముపజిఘ్రంతీ కపిరాజస్య తన్ముఖం ।
పతిం లోకాచ్చ్యుతం తారా మృతం వచనమబ్రవీత్ । 1

వానరేంద్రుడైన వాలి బంధుమిత్రులందఱిని వీడి స్వర్గస్థుడుకాగా, తార ఆయనముఖమును మూర్కొనుచు ఇట్లనెను. (1)

శేషే త్వం విషమే దుఃఖే అకృత్వా వచనం మమ ।
ఉపలోపచితే వీర సుదుఃఖే వసుధాతలే । 2

"మహావీరా! నేను చెప్పిన మాట వినక నాకు తీరని దుఃఖమును తెచ్చిపెట్టితివి. ఇప్పుడు నీవు కటికిఱాళ్లతో నిండి, మిక్కిలి బాధాకరమైన ఈ ఎగుడుదిగుడు నేలపై ఇట్లు పడియుంటివి. (2)

మత్తః ప్రియతరా నూనం వానరేంద్ర మహీ తవ ।
శేషే హి తాం పరిష్వజ్య మాం చ న ప్రతిభాషసే । 3

ఓ వానరేంద్రా! నామీదకంటెను ఈ భూకాంతపైననే నీకు ప్రేమ ఎక్కువగా ఉన్నట్లున్నది. అందువలననే కాబోలు నాతో ఒక్కమాటకూడా మాట్లాడకుండా ఆమెను కౌగిలించుకొని పండుకొని యున్నావు. (3)

సుగ్రీవస్య వశం ప్రాప్తో విధిరేష భవత్యహో ।
సుగ్రీవ ఏవ విక్రాంతో వీర సాహసికప్రియ । 4

ఋక్షవానరముఖ్యాస్త్వాం బలినం పర్యుపాసతే ।
ఏషాం విలపితం కృచ్ఛ్రమ్ అంగదస్య చ శోచతః ।
మమ చేమాం గిరం శ్రుత్వా కిం త్వం న ప్రతిబుధ్యసే । 5

సాహసవంతుడవైన మహావీరా! నీవు వెళ్లగొట్టిన సుగ్రీవుడే ఇప్పుడు మొనగాడైనాడు, అతని అధీనములోనే పడిపోయితిని. ఇది విధి వైపరీత్యము. ఎంత ఆశ్చర్యకరము? స్వామీ! ఈ భల్లూకముఖ్యులు, వానరప్రముఖులు అందఱును ఇంతవఱకును బలశాలివైన నిన్ను సేవించుచున్నారు. వీరి విలాపములను, కుమిలిపోవుచున్న అంగదుని ఆక్రందనను, నా దీనవచనములను వినియు నీవు ఏలమేల్కొనవు? (4-5)

ఇదం తద్వీరశయనం యత్ర శేషే హతో యుధి।
శాయితా నిహతా యత్ర త్వయైవ రిపవః పురా। 6

విశుద్ధసత్త్వాభిజన ప్రియయుద్ధ మమ ప్రియ।
మామనాథాం విహాయైకాం గతస్త్వమసి మానద। 7

శూరాయ న ప్రదాతవ్యా కన్యా ఖలు విపశ్చితా।
శూరభార్యాం హతాం పశ్య సద్యో మాం విధవాం కృతామ్। 8

అవభగ్నశ్చ మే మానో భగ్నా మే శాశ్వతీ గతిః।
అగాధే చ నిమగ్నాఽస్మి విపులే శోకసాగరే। 9

అశ్మసారమయం నూనమ్ ఇదం మే హృదయం దృఢం।
భర్తారం నిహతం దృష్ట్వా యన్నాద్య శతధా గతమ్। 10

సుహృచ్చైవ హి భర్తా చ ప్రకృత్యా మమ చ ప్రియః।
ఆహవే చ పరాక్రాంతః శూరః పంచత్వమాగతః। 11

పతిహీనా తు యా నారీ కామం భవతు పుత్రిణీ।
ధనధాన్యైః సుపూర్ణాఽపి విధవేత్యుచ్యతే జనైః। 12

స్వగాత్రప్రభవే వీర శేషే రుధిరమండలే।
క్రిమిరాగపరిస్తోమే త్వమాత్మశయనే యథా। 13

రేణుశోణితసంవీతం గాత్రం తవ సమంతతః।
పరిరబ్ధుం న శక్నోమి భుజాభ్యాం ప్లవగర్షభ। 14

కృతకృత్యోఽద్య సుగ్రీవో వైరేఽస్మిన్నతిదారుణే।
యస్య రామవిముక్తేన హృతమ్ ఏకేషుణా భయమ్। 15

శరేణ హృది లగ్నేన గాత్రసంస్పర్శనే తవ।
వార్యామి త్వాం నిరీక్షంతీ త్వయి పంచత్వమాగతే। 16

ప్రభూ! ఇంతకుముందు యుద్ధమున నీచే హతులైన శత్రువులు ఇచటనే నేలపాలైరి. ఇప్పుడు నీవును మృతుడవై ఈ నేలపై పడియుంటివి. దానినిబట్టి ఇది 'వీరశయనము' (వీరులను బలిదీసికొను ప్రదేశము) అని స్పష్టమగుచున్నది.(6)

స్వామీ! ధర్మయుద్ధమునందు నీవు తిరుగులేని బలశాలివి. నీవు యుద్ధప్రీతిగలవాడవు (యుద్ధభీతి లేనివాడవు) నాప్రాణనాథుడవు. అట్టి నీవు నేడు నన్ను అనాథనుగా (దిక్కులేని దానినిగా) చేసివెళ్లిపోయితివి. ప్రభూ! తెలివి (దూరదృష్టి) గలవాడు తన బిడ్డను శూరునకు ఇచ్చి వివాహము చేయరాదు. చూడుము వీరుని భార్యనైన కారణముగ నేను ఇప్పుడు విధవనైతిని. అన్ని విధములుగా నేను ఇట్లు దురదృష్టవంతురాలనైతిని. పట్టపురాణిగా నాలో గల అహంకారము దెబ్బతినినది. శాశ్వతముగా సుఖములలో తేలియాడవలసిన నాకు ఈ దుర్గతి పట్టినది. అగాధమైన అంతులేని శోకసాగరములో మునిగిపోయితిని. (7-9)

నిజముగా నా హృదయము ఇనుమువలె మిక్కిలి కఠినమైనది. అందువలననే కాబోలు భర్త మరణించుటను చూచియు అది ముక్కలు ముక్కలై పోలేదు. (10)

నా భర్త సహజముగా సహృదయుడు, నాకు అత్యంతప్రియుడు, యుద్ధమున మహావీరుడు. అట్టి శూరుడు నేడు మృతిచెందినాడు. (11)

స్త్రీ పుత్రసంతానవతియైనను, ఆమెకు ధనధాన్య సంపదలకు ఏమాత్రము లోటులేకున్నను, పతిని కోల్పోయినచో లోకులు ఆమెను 'విధవ' అనియే పిలిచెదరు. (12)

ఓ వీరా! నీవు నిత్యము అక్కరంగుగల ఎఱ్ఱని కంబళితోగూడిన మెత్తని తల్పముపై పరుండియుండెడి వాడవు. ఆ విధముగనేడు నీవు గాయపడి నీశరీరమునుండి స్రవించిన రక్తపుమడుగులో పండుకొనియుంటివి. (13)

ఓ వానరేంద్రా! నీ శరీరమంతయును రక్తముతో తడిసి, దుమ్ముకొట్టుకొనియున్నది. అందువలన నేను నిన్ను గాఢముగా కౌగిలించుకొనలేకపోవుచున్నాను. (14)

సుగ్రీవునకు నీతో ఏర్పడిన బద్ధవైరకారణముగా అతడు అనుక్షణము భీతిల్లుచు వణకిపోవుచుండెను. శ్రీరాముడు ఒకే ఒక్క బాణముతో నిన్ను హతమార్చెను. నీవు చనిపోవుటతో నీ తమ్ముని భయముగూడ తొలగిపోయినది. ఇప్పుడు అతడు కృతార్థుడు ఐనట్లే -(15)

నాథా! నీవు ప్రాణములను కోల్పోయినను నీమీది మమకారముతో నేను నిన్ను కౌగిలించుకొనుటకై తహతహపడుచుంటిని. కాని నీ గుండెపై నాటుకొనియున్న బాణము నన్ను వారించుచున్నది. (నాకు అడ్డువచ్చుచున్నది.) (16)

ఉద్వవర్హ శరం నీలః తస్య గాత్రగతం తదా।
గిరిగహ్వరసంలీనం దీప్తమాశీవిషం యథా॥ 17

తస్య నిష్కృష్యమాణస్య బాణస్య చ బభౌ ద్యుతిః।
అస్తమస్తకసంరుద్ధో రశ్మిర్దినకరాదివ॥ 18

పేతుః క్షతజధారాస్తు వ్రణేభ్యస్తస్య సర్వశః।
తామ్రగైరికసంపృక్తా ధారా ఇవ ధరాధరాత్॥ 19

అవకీర్ణం విమార్జంతీ భర్తారం రణరేణునా।
అస్రైర్నయనజైః శూరం సిషేచాఽస్త్రసమాహతమ్॥ 20

రుధిరోక్షితసర్వాంగం దృష్ట్వా వినిహతం పతిం।
ఉవాచ తారా పింగాక్షం పుత్రమ్ అంగదమంగనా॥ 21

అవస్థాం పశ్చిమాం పశ్య పితుః పుత్త్ర సుదారుణాం।
సంప్రసక్తస్య వైరస్య గతోఽంతః పాపకర్మణా॥ 22

బాలసూర్యోదయతనుం ప్రయాంతం యమసాదనం।
అభివాదయ రాజానం పితరం పుత్త్ర! మానదమ్॥ 23

ఏవముక్తః సముత్థాయ జగ్రాహ చరణౌ పితుః।
భుజాభ్యాం పీనవృత్తాభ్యామ్ అంగదోఽహమితి బ్రువన్॥ 24

అభివాదయమానం త్వామ్ అంగదం త్వం యథా పురా।
దీర్ఘాయుర్భవ పుత్త్రేతి కిమర్థం నాఽభిభాషసే॥ 25

అహం పుత్త్రసహాయా త్వామ్ ఉపాసే గతచేతసం।
సింహేన నిహతం సద్యో గౌః సవత్సేవ గోవృషమ్॥ 26

ఇష్ట్వా సంగ్రామయజ్ఞేన రామప్రహరణాంభసి।
అస్మిన్నవభృథే స్నాతః కథం పత్న్యా మయా వినా॥ 27

కొండగుహలో చేరి మెఱయుచున్న సర్పమువలె ఒప్పుచు వాలియొక్క శరీరమున గ్రుచ్చుకొనియున్న శరమును అప్పుడు సుగ్రీవుని సేనాపతియైన నీలుడు లాగివేసెను. వాలియొక్క శరీరమునుండి లాగబడుచున్న ఆబాణకాంతి అస్తాద్రిశిఖరములచే నిరోధింపబడుచున్న (అస్తమించుచున్న) సూర్యకిరణకాంతివలె అలరారుచుండెను. (17-18)

వాలియొక్క శరీరమునందు ఏర్పడిన గాయములనుండి స్రవించుచున్న రక్తధారలు పర్వతమునుండి ప్రవహించుచున్న ఎఱ్ఱని గైరికాదిధాతువులధారలవలె అంతటను చిందిపడెను. (19)

శ్రీరాముని అస్త్రధాటికి మృతుడైపడియున్న వాలియొక్క శరీరము యుద్ధభూమియందలి ధూళిచే నిండియుండెను. తార శూరుడైన తన భర్తను (భర్త శరీరమును) తుడుచుచు కన్నీళ్లతో కడిగెను. (20)

రణమునందు బాగుగా దెబ్బతినుటచే వాలి శరీరము అంతయును రక్తముతో నిండియుండెను. అట్టి తన పతిని చూచిన పిమ్మట ఆతార పింగాక్షుడైన అంగద కుమారునితో ఇట్లనెను. (21)

"నాయనా! అంగదా! మీ తండ్రియొక్క ఘోరమైన అవసానదశను చూడుము. ఆయన ఒడిగట్టిన పాపకర్మల ఫలితముగా ఆ అన్నదమ్ముల (వాలిసుగ్రీవుల) మధ్య ఏర్పడిన వైరము నేటితో ముగిసినది. మీ తండ్రియొక్క శరీరము బాలసూర్యునివలె భాసిల్లుచున్నది. ఇప్పుడు అతడు మృత్యుముఖమున చేరినాడు. పూజ్యుడైన ఆమహారాజునకు నమస్కరింపుము" (22-23)

తన తల్లియగు తార ఇట్లు పలికిన పిమ్మట అంగదుడు 'నేను మీ కుమారుడనైన అంగదుడను' అని పలుకుచు, బలిష్ఠములైన తన చేతులను చాచి, జనకుని పాదములకు నమస్కరించెను. (24)

తదుపరి తార ఇట్లు నుడివెను. 'ప్రభూ! మనకుమారుడైన అంగదుడు మీ పాదములకు ప్రణమిల్లుచున్నాడు. కాని నీవు ఎప్పటివలె 'కుమారా! దీర్ఘాయుష్మాన్‌భవ' అని ఏల ఆశీర్వదింపవు? అప్పుడే సింహముచేత నిహతమైన వృషభమును లేగదూడతోగూడిన ఆవువలె, నేను కుమారుడైన అంగదునితోగూడి, శ్రీరామునివలన మరణించిన నిన్ను (నీ సన్నిధికి) చేరితిని. స్వామీ! నీవు యుద్ధయజ్ఞమును ముగించుకొని, శ్రీరాముని బాణపుదెబ్బ అనెడి జలములో నీ ధర్మపత్నినైన నన్నువిడిచి, (నేములేకుండా) ఈ అవభృథస్నానమును ఎట్లు ఆచరించితివి? (25-27)

యా దత్తా దేవరాజేన తవ తుష్టేన సంయుగే।
శాతకుంభమయీం మాలాం తాం తే పశ్యామి నేహ కిమ్?। 28

దేవతలకు ప్రభువైన మహేంద్రుడు యుద్ధమున నీ పరాక్రమునకు మెచ్చి, నీకు బహూకరించిన బంగారు హారము నిరంతరము నీ కంఠమున మెఱయుచుండెడిది. అది ఇప్పుడు కనబడుటలేదేమి? (28)

రాజశ్రీర్న జహాతి త్వాం గతాసుమ్ అపి మానద।
సూర్యస్యావర్తమానస్య శైలరాజమివ ప్రభా। 29

అందఱిని సమానముగా గౌరవించువాడా! సూర్యుడు అస్తమించుచున్నను మేరుపర్వతముయొక్క శోభతఱగనట్లు, ప్రాణములునిన్ను వీడినను నీ దేహకాంతి తగ్గలేదు.(29)

న మే వచః పథ్యమిదం త్వయా కృతం
న చాఽస్మి శక్తా వినివారణే తవ ।
హతా సపుత్రాఽస్మి హతేన సంయుగే
సహ త్వయా శ్రీర్విజహాతి మామిహ । 30

ఓ ప్రభూ! నీ హితమును కోరుచు నేను చెప్పిన మాటలను నీవు పెడచెవిని బెట్టితివి. యుద్ధమునకు వెళ్లుచున్న నిన్ను నేను నివారింపజాలనైతిని. నీవు రణరంగమున హతుడవైతివి. నీవు మరణించుటవలన నేను, అంగదుడును నిర్జీవులమైతిమి (చచ్చినవారితో సమానులమైతిమి.) రాజ్యలక్ష్మి నీతోగూడ నన్నును విడిచిపెట్టినది. (30)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే త్రయోవింశః సర్గః (23)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువది మూడవసర్గము

— * * * —

24. ఇరువదినాలుగవసర్గము

సోదరుని (వాలి) మృతికారణముగా సుగ్రీవుడు శోకమగ్నుడై జీవితముపై విరక్తి పొందుట - తాను ప్రాణత్యాగము చేయుటకు శ్రీరాముని అనుమతిగోరుట - తార శ్రీరాముని ఔన్నత్యమును కొనియాడుట - పిదప తననుగూడ చంపి తన భర్తకడకు చేర్చుమని ఆ స్వామిని ప్రార్థించుట - శ్రీరాముడు ఆమెను ఓదార్చుట -

తాం చాశ్రువేగేన దురాసదేన
త్వభిప్లుతాం శోకమహార్ణవేన ।
పశ్యం స్తదా వాల్యనుజస్తరస్వీ
భ్రాతుర్వధేనాప్రతిమేన లేపే । 1

భర్త మరణించుటచే తట్టుకొనలేని బాధతో సంతతధారగా కన్నీరుగార్చుచు, శోకసముద్రమున మునిగియున్న ఆ తారను జూచి తేజశ్శాలియైన సుగ్రీవుడు చలించిపోయెను. అంతేగాక అతడు దారుణమైన తన అన్న మృతికి మిక్కిలి పరితపించెను. (1)

స బాష్పపూర్ణేన ముఖేన వీక్ష్య
క్షణేన నిర్విణ్ణమనా మనస్వీ ।
జగామ రామస్య శనైః సమీపం
భృత్యైర్వృతః సంపరిదూయమానః । 2

అతడు క్షణకాలముపాటు తారవైపు చూచి తానును కన్నీరుమున్నీరుగా ఏడ్చెను. అతని మనస్సును దైన్యము ఆవరించెను. అతడు లోలోన కుమిలిపోవుచు భృత్యులతో గూడి చిన్నబోయిన ముఖముతో తిన్నగా శ్రీరాముని జేరెను.(2)

స తం సమాసాద్య గృహీతచాపమ్
ఉదాత్తమాశీవిషతుల్యబాణం ।
యశస్వినం లక్షణలక్షితాంగమ్
అవస్థితం రాఘవమిత్యువాచ । 3

పురుషశ్రేష్ఠుడైన శ్రీరాముడు సర్పతుల్యములైన బాణములను, కోదండమును ధరించి నిలిచియుండెను. చక్కని అవయవముల పొందికగలిగి యశస్వియైన ఆ రఘువీరునికడకు చేరి సుగ్రీవుడు ఇట్లు నుడివెను. (3)

యథా ప్రతిజ్ఞాతమిదం నరేంద్ర
కృతం త్వయా దృష్టఫలం చ కర్మ।
మమాద్య భోగేషు నరేంద్రపుత్ర
మనో నివృత్తం సహ జీవితేన । 4

"రాజకుమారుడవైన ఓ మహాప్రభూ! నీవు చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొంటివి. రాజ్యఫలముగూడ నాకు దక్కినది. కాని ఇప్పుడు నాకు రాజ్యభోగములపై మనస్సు పోవుటలేదు. అంతేకాదు, జీవితము మీదనే నాకు విరక్తి కలిగినది. (4)

అస్యాం మహిష్యాం తు భృశం రుదంత్యాం
పురే చ విక్రోశతి దుఃఖతప్తే।
హతేఽగ్రజే సంశయితేఽంగదే చ
న రామ రాజ్యే రమతే మనో మే ॥ 5

పెట్టమహిషియైన మావదినె (తార) గుండె పగిలి ఆక్రందించుచున్నది. పురజనులు దుఃఖమగ్నులై గగ్గోలు పెట్టుచున్నారు. మా అన్నయేమో కన్నుమూసినాడు. బ్రతుకుటయా? లేక మరణించుటయా? అను సందేహములో పడియున్నాడు అంగదకుమారుడు. ఈ స్థితిలో నామనస్సు రాజ్యాధికారమునైపు మొగ్గు చూపుటలేదు. (5)

క్రోధాదమర్షాదతివిప్రధర్షాత్
భ్రాతుర్వధో మేఽనుమతః పురస్తాత్।
హతే త్విదానీం హరియూథపేఽస్మిన్
సుతీవ్రమిక్ష్వాకుకుమార తప్స్యే ॥ 6

ఇక్ష్వాకువంశజుడవైన శ్రీరామా! మా అన్నయగు వాలి ఇంతకుముందు నన్ను తీవ్రముగా అవమానించియున్నాడు. దానివలనకలిగిన క్రోధము నా మనస్సును దహించివేసినది. వాటికి తట్టుకొనలేక అతనివధను కోరుకొంటిని. కాని వానరప్రభువైన మాఅన్న మృతి చెందుటతో ఇప్పుడు నేను తీవ్రమైన పరితాపమునకు లోనైతిని. అది నన్ను జీవితాంతము వెంటాడగలదు. (6)

శ్రేయోఽద్య మన్యే మమ శైలముఖ్యే
తస్మిన్ నివాసశ్చిరమృశ్యమూకే।
యథా తథా వర్తయతః స్వవృత్త్యా
నేమం నిహత్య త్రిదివస్య లాభః ॥ 7

ఓ రామా! ఇంతవఱకును పర్వతశ్రేష్ఠమైన ఋష్యమూకశైలమునందే ఏదోఒకవిధముగా కాలముగడపుచు వచ్చితిని. నా (వానర) స్వభావమునకు తగినట్లుగా జీవించుటకు జీవితాంతము అచట నివసించుటయే ఇప్పుడు నాకు మేలనిపించుచున్నది. అంతేగాని నా అన్నను పొగొట్టుకొనుటద్వారా నాకు స్వర్గసుఖములు లభించినను అవి ఏమాత్రమూ సంతోషకరములుగావు. (7)

న త్వాం జిఘాంసామి చరేతి యన్మామ్
అయం మహాత్మా మతిమాన్ ఉవాచ।
తస్యైవ తద్రామ! వచోఽనురూపమ్
ఇదం పునః కర్మ చ మేఽనురూపమ్ ॥ 8

ఓ రామా! మాఅన్నయగు వాలి మహానుభావుడు, కర్తవ్య-అకర్తవ్యములను బాగుగా ఎఱిగినవాడు. అతడు నాతో యుద్ధము చేయు సమయమున 'తమ్ముడా! నిన్ను నేను చంపదలచుకొనలేదు. నీవు స్వేచ్ఛగా ఎక్కడనైనను సంచరింపవచ్చును' - అని పలికియుండెను. ఇట్లు పల్కుట అతనికే చెల్లును. కాని దురాత్ముడనైన నేను అతనినిగురించి మీకు తగువిధముగాచెప్పి, (మీద్వారా) అతని మృతికి కారకుడనైతిని. నా మాటలు, నాచేష్టలు నాకేతగును. (8)

భ్రాతా కథం నామ మహాగుణస్య
భ్రాతుర్వధం రాఘవ రోచయేత।
రాజ్యస్య దుఃఖస్య చ వీర సారం
న చింతయన్ కామపురస్కృతః సన్ ॥ 9

ఓ రఘువీరా! సద్గుణశాలియైన అన్నను చంపుటవలన కలిగెడు దుఃఖము ప్రబలమైనదా? లేక ఆ సోదరుని చంపుటద్వారా లభించు రాజ్యసుఖములు ప్రబలమైనవా? అని ఆలోచించినప్పుడు ఎంతటి స్వార్థపరుడైనను భ్రాతృవధను ఎట్లు కోరుకొనును? (9)

వధో హి మే మతో నాసీత్ స్వమాహాత్మ్యావ్యతిక్రమాత్।
మమాసీత్ బుద్ధిదౌరాత్మ్యాత్ ప్రాణహారీ వ్యతిక్రమః ॥ 10

వాలి తనయొక్క ఔన్నత్యము (పేరు ప్రతిష్ఠలు) దెబ్బతినరాదని తలంచి, నన్ను చంపవలెననెడి తలంపును తన మనస్సునకే రానీయలేదు. కాని నా దుర్బుద్ధి కారణముగా అతనికి ప్రాణహానిని గలిగించి, నేను ఘోరమైన అపరాధమునకు పాల్పడితిని. (10)

ద్రుమశాఖావభగ్నోఽహం ముహూర్తం పరినిష్టనన్।
సాంత్వయిత్వా త్వనేనోక్తో న పునః కర్తుమర్హసి। 11

భ్రాతృత్వమ్ ఆర్యభావశ్చ ధర్మశ్చానేన రక్షితః।
మయా క్రోధశ్చ కామశ్చ కపిత్వం చ ప్రదర్శితమ్। 12

అచింతనీయం పరివర్జనీయమ్
అనీప్సనీయం స్వనవేక్షణీయమ్ ।
ప్రాప్తోఽస్మి పాప్మానమిమం నరేంద్ర
భ్రాతుర్వధాత్ త్వాష్ట్రవధాదివేంద్రః । 13

పాప్మాన మింద్రస్య మహీ జలం చ
వృక్షాశ్చ కామం జగృహుః స్త్రియశ్చ ।
కో నామ పాప్మానమిమం క్షమేత
శాఖామృగస్య ప్రతిపత్తుమిచ్ఛన్ । 14

నార్హామి సంమాన మిమం ప్రజానాం
న యౌవరాజ్యం కుత ఏవ రాజ్యం ।
అధర్మయుక్తం కులనాశయుక్తమ్
ఏవంవిధం రాఘవ కర్మ కృత్వా । 15

పాపస్య కర్తాఽస్మి విగర్హితస్య
క్షుద్రస్య లోకాపకృతస్య చైవ ।
శోకో మహాన్ మామ్ అభివర్తతేఽయం
వృష్టేర్యథా నిమ్నమివాంబువేగః । 16

సోదర్య ఘాతాపరగాత్రవాలః
సంతాపహస్తాక్షిశిరోవిషాణః ।
ఏనోమయో మామ్ అభిహంతి హస్తీ
దృప్తో నదీకూలమివ ప్రవృద్ధః । 17

(మొదటిసారి జరిగిన పోరులో) వాలి నన్ను ఒక చెట్టుకొమ్మతో కొట్టగా ఆదెబ్బకు నేను ఆర్తనాదము చేయసాగితిని. అప్పుడతడు నన్ను ఓదార్చి "మఱలనాతో ఇంక ఎప్పుడును యుద్ధమునకు తలపడకుము' అని నన్ను హెచ్చరించి పంపెను. (11)

మా అన్నయేమో తనసోదరప్రేమను, గౌరవభావమును, ధర్మమును పాటించెను నేనైతే కామక్రోధములను, మా వానరులకు సహజమైన చాపల్యమును ప్రదర్శించితిని.(12)

త్వష్టయొక్క కుమారుడైన విశ్వరూపుని వధించిన ఇంద్రునివలె నేను మాసోదరుని చంపి మహాపాపమునకు ఒడిగట్టితిని.[1] ఇట్టి పాపమును చేయకుండుటయే గాక వానిని గూర్చి ఆలోచించుటయు మహాదోషము. సత్పురుషులు అట్టి పాపకర్మలకు దూరముగా ఉందురు. మఱియు వాటిని ఏ విధముగను అభిలషింపరాదు, చూడనుగూడ చూడరాదు. ఇవి ఎల్లరకును త్యజింపదగినవి. (13)

ఇంద్రుడు విశ్వరూపుని చంపుటద్వారా తనకు చుట్టుకొనిన బ్రహ్మహత్యా పాపమును భూమి 'ఊషర' క్షేత్రరూపమునను, నీరు నుఱుగు రూపములోను, వృక్షములు జిగురు రూపమునను, స్త్రీలు ఋతురూపమునను గ్రహించి ఆయనకు ఆ బరువును తొలగించిరి. ఎవ్వరికిని ఉపయోగపడని శాఖామృగమునైన నాపైబడిన ఈ పాపభారమును స్వీకరించుటకు ఎవరు ముందుకు వత్తురు? ఎవరు దీనిని భరింపగలరు? (14)

ఓ రఘువీరా! నేను ఇట్టి పాపకృత్యము చేసి, అధర్మమునకు పాల్పడితిని. ఇది వంశమునే నశింప జేయునది. ఈ విధముగా మహాపాపినైన నేను ప్రజాగౌరవమును పొందుటకు అనర్హుడను. యువరాజుగా ఉండుటకును తగను. ఇక రాజుగా ఎట్లుండగలను? (15)

ఇట్టి మహాపాపమొనర్చిన నేను మిక్కిలి నీచుడను. దీనివలన నన్ను సజ్జనులు ఏవగించుకొందురు. లోకము లన్నియును నన్ను వెలివేయును. జడివాననీరు మహావేగముతో పల్లపు ప్రదేశములను ముంచివేసి నట్లు ఈ మహాపాపము నన్ను ఆవరించును. (16)

మహాపాపమనెడి మదపుటేనుగు నదులదరులనువలె నన్ను క్షణక్షణము పొడుచుచున్నది. సోదరునివధయే ఈ పాపమనెడి ఏనుగునకు పీపు, తోక. సంతాపమే దీనికి తొండము, కన్నులు, శిరస్సు, దంతములు. (17)

1) 'త్వష్ట' అని ఒక ప్రజాపతి పేరు. ఇంద్రునిపైగల కోపముచే అతనికి కీడుచేయుటకై ఈప్రజాపతి మూడు శిరములుగల 'విశ్వరూపుడు' అను వానిని సృజించెను. విశ్వరూపుడు ఇంద్రపదవిని గోరి తపస్సు చేయుచుండెను. ఇతని తపస్సును భంగము చేయుటకై ఇంద్రుడు శతధా ప్రయత్నించినను లాభము లేకపోయెను. అంతట ఆతడు ఈ తపస్వి శిరమును స్వయముగా ఖండించి, మహాపాపి అయ్యెను.

అంహో బతేదం నృవరాఽవిషహ్యం
నివర్తతే మే హృది సాధువృత్తమ్ ।
వివర్ణ మగ్నౌ పరితప్యమానం
కిట్టం యథా రాఘవ జాతరూపమ్ । 18

మహాబలానాం హరియూథపానామ్
ఇదం కులం రాఘవ మన్నిమిత్తం ।
అస్యాంగదస్యాపి చ శోకతాపాత్
అర్ధస్థితప్రాణ మితీవ మన్యే । 19

సుతః సులభ్యః సుజనః సువశ్యః
కుతః సుపుత్త్రః సదృశోఽంగదేన ।
న చాపి విద్యేత స వీర దేశో
యస్మిన్ భవేత్ సోదరసన్నికర్షః । 20

యద్యంగదో వీర వరార్హ జీవేత్
జీవేచ్చ మాతా పరిపాలనార్థం ।
వినా తు పుత్త్రం పరితాపదీనా
తారా న జీవేదితి నిశ్చితం మే । 21

సోఽహం ప్రవేక్ష్యామ్యతిదీప్తమగ్నిం
భ్రాత్రా చ పుత్త్రేణ చ సఖ్యమిచ్ఛన్ ।
ఇమే విచేష్యంతి హరిప్రవీరాః
సీతాం నిదేశే తవ వర్తమానాః । 22

కృత్స్నం తు తే సేత్స్యతి కార్యమేతత్
మయ్యప్రతీతే మనుజేంద్రపుత్త్ర ।
కులస్య హంతారమజీవనార్హం
రామానుజానీహి కృతాగసం మామ్ । 23

ఇత్యేవ మార్తస్య రఘుప్రవీరః
శ్రుత్వా వచో వాల్యనుజస్య తస్య ।
సంజాతబాష్పః పరవీరహంతా
రామో ముహూర్తం విమనా బభూవ । 24

వన్నెదఱిగిన బంగారము అగ్నిలో కాల్చబడుచున్నప్పుడు దానిలోని మాలిన్యము తొలగిపోవునట్లుగా నాలోని సాధుభావము (సత్ప్రవర్తన) సంతాపమునకు లోనగుటచే దానికంటిన పాపము దూరమై పోవుచున్నది. ఎంత ఆశ్చర్యము. (18)

ఓ రఘువీరా! వానరప్రభువైన వాలి నా కారణముగా వధింపబడుటవలనను, పితృవియోగముచే అంగదుడు కుమిలిపోవుచుండుటవలనను వానరులెల్లరును కడు దుఃఖితులైయున్నారు. ఆయోధులను పరికించి చూడగా వారి ప్రాణములు సగము ఎగిరిపోయినట్లు అనిపించుచున్నది.(19)

ఓ రఘువీరా! సజ్జనుడును, తండ్రిమాటజవదాటక వశుడై ప్రవర్తించువాడును ఐన కుమారుడు సులభముగనే లభింపవచ్చునేమో కాని అంగదునివంటి పుత్త్రుడు ప్రాప్తించుట మాత్రము అసంభవము. అట్లే వాలివంటి సోదరుని సాన్నిధ్యము ఏదేశమునందునూ లభింపదు. (20)

అంగదుడు దుర్భరమైన ఇట్టి పితృవియోగమునకు తట్టుకొని జీవించుట ఎంతయు కష్టము. అతడు జీవించి యున్నచో మాత్రము అతనికొఱకై తల్లియగుతారయు తప్పక జీవించును. తనయుడు జీవింపకున్నచో అంతులేని పరితాపముతో దీనయై, ఇక ఆమెయు మిగులదు ఇది నాగట్టి నమ్మకము. (21)

రామా! తోబుట్టువైన వాలి ఇప్పటికే మరణించి యున్నాడు. ఇక పుత్త్రుడైన అంగదుడును అసువులు వీడినచో నేను బ్రతికియుండుట అసంభవము. వారిపైగల మమకారముతో వెంటనేనేను అగ్నిజ్వాలలకు ఆహుతి అయ్యెదను. ఈ వానర వీరులు నీ ఆదేశానుసారము సీతాన్వేషణ గావింతురు. (22)

మహారాజకుమారుడవైన ఓ రామా! నేను మృతిచెందినను సీతాన్వేషణకార్యము ఏమాత్రము ఆగదు. అది పూర్తిగా సఫలమగును. నేను నా వంశమునకే తీరని అప్రతిష్ఠను తెచ్చిపెట్టితిని. ఇక నావలన అది అంతరించి పోవును. క్షమింపరాని పాపకార్యమునకు పాల్పడిన నేను జీవించియుండుటకు అర్హుడను కాను. కనుక మరణించుటకు నన్ను అనుమతింపుము." (23)

ఆర్తుడై విలపించుచున్న సుగ్రీవుని వచనములను విని, ఆ రఘువీరుడు అతని ఆర్తిలో పాలుపంచుకొనుచు కంటతడిపెట్టెను. అతడు తనను ఆశ్రయించిన వారిని ఆదుకొనుటకై వారి విరోధులను శిక్షించునట్టి వాడు. ఐనను శ్రీరామచంద్రునిమనస్సు క్షణకాలముపాటు కలతకులోనయ్యెను. (24)

తస్మిన్ క్షణేఽభీక్ష్ణమవేక్ష్యమాణః
క్షితిక్షమావాన్ భువనస్య గోప్తా ।
రామో రుదంతీం వ్యసనే నిమగ్నాం
సముత్సుకః సోఽథ దదర్శ తారామ్ ॥ 25

తాం చారునేత్రాం కపిసింహనాథం
పతిం సమాశ్లిష్య తదా శయానామ్ ।
ఉత్థాపయామాసురదీనసత్త్వాం
మంత్రిప్రధానాః కపివీరపత్నీమ్ ॥ 26

సా విస్ఫురంతీ పరిరభ్యమాణా
భర్తుః సకాశాదపనీయమానా ।
దదర్శ రామం శరచాపపాణిమ్
స్వతేజసా సూర్యమివ జ్వలంతమ్ ॥ 27

సుసంవృతం పార్థివలక్షణైశ్చ
తం చారునేత్రం మృగశాబనేత్రా ।
అదృష్టపూర్వం పురుషప్రధానమ్
అయం స కాకుత్స్థ ఇతి ప్రజజ్ఞే ॥ 28

తస్యేంద్రకల్పస్య దురాసదస్య
మహానుభావస్య సమీపమార్యా ।
ఆర్తాతితూర్ణం వ్యసనాభిపన్నా
జగామ తారా పరివిహ్వలంతీ ॥ 29

సా తం సమాసాద్య విశుద్ధసత్త్వా
శోకేన సంభ్రాంతశరీరభావా ।
మనస్వినీ వాక్యమువాచ తారా
రామం రణోత్కర్షణలబ్ధలక్షమ్ ॥ 30

త్వమప్రమేయశ్చ దురాసదశ్చ
జితేంద్రియశ్చోత్తమధార్మికశ్చ ।
అక్షయ్యకీర్తిశ్చ విచక్షణశ్చ
క్షితిక్షమావాన్ క్షతజోపమాక్షః ॥ 31

భూదేవివలె మిక్కిలి సహనముగలవాడును, లోక రక్షకుడును ఐన ఆస్వామి అప్పుడు తనను తార పదేపదే చూచుచుండుట గమనించెను. అంతట శోకమగ్నయై ఆక్రందించుచున్న తారయొక్క దుఃఖమును తొలగింప దలచినవాడై ఆ ప్రభువు ఆదరముతో ఆమెవైపు చూచెను. (25)

చారునేత్రయైన తార వానరప్రముఖులకు ప్రభువైన తననాథుని కౌగిలించుకొని పడియుండెను. అప్పుడు శ్రీరాముడు ఆమెకడకు వచ్చుటను గమనించిన ముఖ్యసచివులు అతిదైన్యముతో అచట పడియున్న ఆ వీరపత్నిని లేవదీసి కూర్చుండబెట్టిరి. (26)

ప్రముఖులైన మంత్రులు పతిచెంతనున్న ఆతారను లేవదీయునప్పుడు ఆమె పెనగులాడుచు పదే పదే తన భర్తపై బడుచు ఆయనను కౌగిలించుకొనుచుండెను. ఇంతలో ధనుర్బాణములను ధరించి, తన తేజస్సుచే సూర్యునివలె భాసిల్లుచు అటు వచ్చుచున్న శ్రీరాముని ఆమె చూచెను. (27)

పురుషోత్తముడైన ఆశ్రీరామచంద్రుని ఇంతకుముందు ఆ తార చూచియుండలేదు. కాని అంగదుని వలన ఆ ప్రభువుయొక్క శుభలక్షణములను గూర్చి వినియుండెను. అందమైననేత్రములతో, చక్కని రాజలక్షణములతో విలసిల్లుచున్న ఆస్వామిని చూచిన పిమ్మట మాత్రము 'కకుత్స్థ వంశజుడైన ఆమహానుభావుడు ఇతడే' అని ఆమె ఆయనను గుర్తించెను. (28)

శ్రీరాముడు పరాక్రమమున ఇంద్రునియంతటివాడు, శత్రువులకు అజేయుడు. సాధ్వియైన అతార ఆర్తురాలై, దుఃఖముతో కుమిలిపోవుచున్నదై, శక్తిలేకున్నను తూలుచూ సోలుచూ ఆ మహానుభావుని పాదములచెంత చేరెను. పిమ్మట అతార శోకభారముచే ఒడలు మఱచినదై, (శోకావేశములో కుపితయై) ఇతడు ఒకే ఒక్క బాణముతో నా భర్తను హతమార్చినవాడు' అని భావించి, పరుషవచనములను మాట్లాడు సంకల్పముతో రాముని చేరెను. కాని శ్రీరామునిప్రభావముచే ఆమెలోని శ్రీప్రభావము తగ్గిపోయెను. అంతట ఆమె ఆప్రభువుతో ఇట్లనెను. (29-30)

"ఓ రామా! నీవు దేశకాలాదులకు అతీతుడవు. కనుక వాక్కులకును, మనస్సునకును అందనివాడవు, భక్తి, జ్ఞాన, వైరాగ్యాదుల చేతనూ నీవు సులభముగా లభ్యుడవు కావు. ఇంద్రియ వికారములైన కామక్రోధాది. అరి షడ్వర్గములను జయించినవాడవు, ధర్మమును రక్షించుటకై అవతరించినవాడవు. నీకీర్తిప్రతిష్ఠలు శాశ్వతములు. నీవు సమస్త కార్యములను యుక్తాయుక్త విచక్షణతో ఆచరించువాడవు, సహనమున

త్వమాత్తబాణాసనబాణపాణిః
మహాబలః సంహననోపపన్నః ।
మనుష్యదేహాభ్యుదయం విహాయ
దివ్యేన దేహాభ్యుదయేన యుక్తః । 32

యేనైకబాణేన హతః ప్రియో మే
తేనైవ మాం త్వం జహి సాయకేన ।
హతా గమిష్యామి సమీప మస్య
న మామృతే రామ రమేత వాలీ । 33

స్వర్గేఽపి పద్మామలపత్రనేత్రః
సమేత్య సంప్రేక్ష్య చ మామ్ అపశ్యన్ ।
న హ్యేష ఉచ్చావచతామ్రచూడా
విచిత్రవేషాప్సరసోఽభజిష్యత్ । 34

స్వర్గేఽపి శోకం చ వివర్ణతాం చ
మయా వినా ప్రాప్స్యతి వీర వాలీ ।
రమ్యే నగేంద్రస్య తటావకాశే
విదేహకన్యారహితో యథా త్వమ్ । 35

త్వం వేత్థ యావద్వనితావిహీనః
ప్రాప్నోతి దుఃఖం పురుషః కుమారః ।
తత్త్వం ప్రజానన్ జహి మాం న వాలీ
దుఃఖం మమాదర్శనజం భజేత । 36

యచ్చాపి మన్యేత భవాన్ మహాత్మా
స్త్రీఘాతదోషో న భవేత్తు మహ్యమ్ ।
ఆత్మేయ మస్యేతి చ మాం జహి త్వం
న స్త్రీవధః స్యాన్మనుజేంద్రపుత్త్ర । 37

భూదేవి వంటివాడవు. కనులలో ఎఱ్ఱని జీఱలు గలవాడవు. ధర్మరక్షణకై నిరంతరము ధనుర్బాణములను ధరించి యుండెడివాడవు, తిరుగులేని బలశాలివి. దృఢమైన చక్కని అవయవములపొందికగలవాడవు. మానవ శరీరముతో లభించు లౌకికసుఖములను పరిత్యజించి, దివ్యశరీరవైభవములు గలిగియున్నవాడవు. (31-32)

[1]ఓరామా! నానాథుని చంపిన బాణముతోడనే నన్నును చంపివేయుము. నేను ఆయన సమీపమునకు చేరెదను. నేను లేకున్నచో ఆయన సుఖముగా ఉండజాలడు, స్వర్గమునందు విచిత్రములైన వేషములను దాల్చి, తమ శిరములపై ఎఱ్ఱని పుష్పములను ధరించిన అప్సరసలు విశాలనేత్రుడగు నాపతిచుట్టు చేరియుండగా అతడు వారిని బాగుగా చూచియు, అచట నేను కన్పింపకపోవుటచే నాస్వామి వారితో ఆనందింపడు. (33-34)

ఓ రఘువీరా! నీ అర్ధాంగియగు సీత నీచెంత లేకుండుటచే అందమైన ఋశ్యమూకపర్వత సానువులయందున్ననూ నీవు శోకమున మునిగి పరితాపమునకులోనైతివి. అట్లే నేను సరసన లేకుండుటచే నా భర్తయగు వాలియు సకలసుఖములకు ఆలవాలమైన స్వర్గమునందును దుఃఖములకు లోనై కృశించిపోవును. (35)

యౌవనమునకున్న పురుషుడు తనభార్య దూరముగా ఉన్నంత వఱకును విరహవేదననుండి బయటపడజాలడు- అను విషయమును నీవును ఎఱుగుదువు. కనుక దానిని మనస్సునందుంచుకొని, ఆయన నాయెడబాటువలన కలిగెడు దుఃఖమును పొందకుండుటకై నన్ను చంపి ఆయనకడకు చేర్చుము. (36)

పూజ్యుడవైన ఓ మహాత్మా! "ఈ తారను చంపినచో నాకు స్త్రీహత్యాపాపము చుట్టుకొనునేమో?" అని నీవు సందేహపడవలదు. ఏలనన పురుషునకు భార్య విడదీయరాని వ్యక్తి, అనగా ఆయన శరీరమే. ఈ విషయమును శాస్త్రములును వేదములును నొక్కి చెప్పుచున్నవి.[2] కావున 'ఈ తార ఆమెభర్త యగు వాలి ఆత్మయే' అని భావించి, నీవు నన్ను చంపివేయుము. (37)

1) ఇంతవఱకును శ్రీరాముని దివ్యతేజో విశేషములను దర్శించి విస్మితురాలైన తార క్షణకాలము తనశోకమును మఱచి ఆప్రభువుయొక్క దివ్యగుణవైభవములను వర్ణించెను. అనంతరము తన సహజలక్షణములను అనుసరించి, ఆప్రభువుతో నుడువుచున్నది.

2) అర్ధోవా ఏష ఆత్మనః యత్పత్నీ' 'ఆత్మాహిదారాః' పురుషునకు అతని భార్య సగభాగము (అర్ధాంగి) భార్యయే పురుషునకు ఆత్మ – వేద శాస్త్రప్రమాణములు. యజ్ఞయాగాది శాస్త్రోక్తకర్మలయందు భార్యాభర్తలిద్దఱికిని సమానమైన అధికారము ఉండును. అనగా భార్యతోడులేకుండా పురుషుడు యజ్ఞకర్మలను ఆచరింపరాదు. దీనినిబట్టి ఆలుమగలయొక్క అవినాభావ సంబంధము తేటతెల్లమగుచున్నది.

శాస్త్రప్రయోగాద్వివిధాచ్చ వేదాత్
ఆత్మా హ్యనన్యః పురుషస్య దారాః।
దారప్రదానాన్న హి దానమన్యత్
ప్రదృశ్యతే జ్ఞానవతాం హి లోకే ॥ 38

త్వం చాపి మాం తస్య మమ ప్రియస్య
ప్రదాస్యసే ధర్మ మవేక్ష్య వీర ।
అనేన దానేన న లప్స్యసే త్వమ్
అధర్మయోగం మమ వీర ఘాతాత్ ॥ 39

ఆర్తామనాథామ్ అపనీయమానామ్
ఏవంవిధామ్ అర్హసి మాం నిహంతుమ్।
అహం హి మాతంగవిలాసగామినా
ప్లవంగమానామ్ ఋషభేణ ధీమతా।
వినా వరార్హోత్తమహేమమాలినా
చిరం న శక్ష్యామి నరేంద్ర జీవితుమ్ ॥ 40

ఇత్యేవ ముక్తస్తు విభుర్మహాత్మా
తారాం సమాశ్వాస్య హితం బభాషే ॥ 41

మా వీరభార్యే విమతిం కురుష్వ
లోకో హి సర్వో విహితో విధాత్రా ।
తం చైవ సర్వం సుఖదుఃఖయోగం
లోకోఽబ్రవీత్ తేన కృతం విధాత్రా ॥ 42

త్రయో హి లోకా విహితం విధానం
నాతిక్రమంతే వశగా హి తస్య ।
ప్రీతిం పరాం ప్రాప్స్యసి తాం తథైవ
పుత్రస్తు తే ప్రాప్స్యతి యౌవరాజ్యమ్ ।
ధాత్రా విధానం విహితం తథైవ
న శూరపత్న్యః పరిదేవయంతి ॥ 43

ఆశ్వాసితా తేన తు రాఘవేణ
ప్రభావయుక్తేన పరంతపేన ।
సా వీరపత్నీ ధ్వనతా ముఖేన
సువేషరూపా విరరామ తారా ॥ 44

"ఈలోకమున కన్యాదానమునకు (కన్యను ఒక పురుషునకు భార్యగా దానము చేయుటకు) మించిన పుణ్య కార్యము మఱియొకటి లేనేలేదు' అని జ్ఞానుల అభిప్రాయము. ఓ రఘువీరా! నీవును ఈ ధర్మమును పాటించి, నన్ను నా భర్తయైన వాలికి ఇచ్చివేయుము. ఓ ధర్మజ్ఞా! నన్ను చంపి ఇట్లు దానము చేయుటవలన (నన్ను నా భర్తకడకు పంపుటవలన) నీకు ఏమాత్రమూ అధర్మపాపము అంటనే అంటదు. (38-39)

ఓ ప్రభూ! భర్తచే వంచితురాలను. (నాభర్తయైన వాలి నాకు మాట మాత్రము చెప్పకుండా నన్ను ఇచటనే విడిచిపెట్టి తాను పరలోకమునకు ఏగినాడు) నాథుడు (దిక్కు)లేనిదానను. ఈ విధముగా ఆర్తితో అలమటించు చున్నదానను. కనుక నీవు నన్ను చంపుట తగును. (నన్ను చంపి నా భర్త కడకు పంపుటయే న్యాయము) నాపతి ఏనుగువలె గంభీరముగా నడచెడివాడు, వానరులలో శ్రేష్ఠుడు. ఉత్తమమైన, మహిమాన్వితమైన బంగారుమాలను ధరించుచుండెడివాడు. ఆమహాత్మునకు దూరమై ఇంక నేను బ్రతుకజాలను." (40)

తార ఈ విధముగా పలికిన పిమ్మట - మహాత్ముడగు ఆ ప్రభువు ఆమెను ఓదార్చుచు ఇట్లు హితవచనములను పల్కెను. "ఓ వీరపత్నీ! ఇట్లు విరక్తికి లోనుకావద్దు. ఈ లోకములన్నింటిని విధాత(బ్రహ్మ)యే సృష్టించెను గదా! ఈ సమస్తప్రాణులకును సుఖ దుఃఖములనుకూర్చెడివాడు అతడేయని పండితులును, పామరులును ఎఱుగుదురు. ముల్లోకవాసులును ఆయన వశములోనివారే. కనుక ఆవిధి (బ్రహ్మ) విధానమును ఎవ్వరును అతిక్రమింపజాలరు. నీ కుమారుడైన అంగదుడు త్వరలోనే యువరాజు కాగలడు. ఆవిధముగా నీకు పరమసంతోషమే ప్రాప్తించును. విధినిర్ణయమే అంత. అందువలన వీరపత్నులు ఎవ్వరును విలపింపరాదు." (41-43)

శత్రువులను శిక్షించునట్టి శ్రీరాముడు ఇట్లు యుక్తియుక్తముగా పలికి, తారను ఓదార్చెను. అప్పుడు ఆ వీరపత్ని మిక్కిలి ఊరటచెందినదై ముఖమున సంతృప్తిని స్ఫురింపజేసెను. పిదప ఆమె సంతోషవచనములను పలుకుచు తనదుఃఖమును వీడెను. (44)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే చతుర్వింశఃసర్గః (24)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువదినాలుగవసర్గము

-- * * * --

25. ఇరువదిఐదవసర్గము

శ్రీరాముడు దుఃఖమగ్నులైన సుగ్రీవాదులను ఓదార్చుట - వాలి కళేబరమునకు దహనసంస్కారములను నిర్వహింపవలసినదని లక్ష్మణుడు ఆదేశించుట, తారుడు శిబికాదులను తెప్పింపగా అంగదుడు తన తండ్రికి ఉత్తర క్రియలను ఆచరించుట -

సుగ్రీవం చైవ తారాం చ సాంగదం సహలక్ష్మణః।
సమానశోకః కాకుత్స్థః సాంత్వయన్నిదమబ్రవీత్। 1

వాలిమరణమునకు సుగ్రీవుడును, తారయు, అంగదుడును శోకించుచుండగా రామలక్ష్మణులును వారి దుఃఖములో పాలుపంచుకొనిరి. అంతట శ్రీరాముడు, సుగ్రీవాదులను ఓదార్చుచు ఇట్లు నుడివెను. (1)

న శోకపరితాపేన శ్రేయసా యుజ్యతే మృతః।
యదత్రానంతరం కార్యం తత్సమాధాతుమర్హథ। 2

లోకవృత్తమ్ అనుష్ఠేయం కృతం వో బాష్పమోక్షణం।
న కాలాదుత్తరం కించిత్ కర్మ శక్యమ్ ఉపాసితుమ్। 3

మృతిచెందిన వాలికై మీరు ఎంతగా విలపించినను ఆయన ఆత్మకు శాంతి లభింపదు. తనువు చాలించిన వారికి దహనసంస్కారాదిఉత్తరక్రియలను ఆచరించుటవలన వారికి ఊర్ధ్వలోకలాభములు కలుగును. కావున మీరు వెంటనే ఆకార్యక్రమములను ప్రారంభింపుడు. మీరు ఇంతవఱకును ఎంతయు దుఃఖించి యున్నారు. ఇంక లోకమర్యాదను పాటించి అగ్నిసంస్కారములను జరుపవలసియున్నది. ఏపనినైనను కాలము మించిపోయిన తరువాత చేయుట అశక్యము. (2-3)

నియతిః కారణం లోకే నియతిః కర్మసాధనం।
నియతిః సర్వభూతానాం నియోగేష్విహ కారణమ్। 4

న కర్తా కస్యచిత్ కశ్చిత్ నియోగే చాపి నేశ్వరః।
స్వభావే వర్తతే లోకః తస్య కాలః పరాయణమ్। 5

న కాలః కాలమత్యేతి న కాలః పరిహీయతే।
స్వభావం చ సమాసాద్య న కశ్చిదతివర్తతే। 6

నియతి అనగా కాలము లేక దైవము. లోకమునందు కాలమే సర్వకర్మలకును కారణము. కార్యసాధనము గూడ అదియే. కర్మలను ఆచరించు విషయమున సమస్తప్రాణులును ప్రేరణను పొందుటకు కాలమే కారణము. ఏవ్యక్తియు ఏపనినైనను స్వతంత్రముగా చేయలేడు, ఇతరులతో చేయింపజాలడు, లోకమంతయును స్వభావమును అనుసరించి ప్రవర్తించును. స్వభావమునకు ఆధారము కాలము, కాలము తనవ్యవస్థను అతిక్రమింపదు. కాలము ఎప్పుడును నశింపదు. స్వభావమును (ప్రారబ్ధకర్మను) అనుసరించి ఏవ్యక్తియు కాలమును ఉల్లంఘింపడు. (కాలోహిదురతిక్రమః) (4-6)

న కాలస్యాస్తి బంధుత్వం న హేతుర్న పరాక్రమః।
న మిత్రజ్ఞాతిసంబంధః కారణం నాఽఽత్మనో వశః। 7

కిం తు కాలపరీణామో ద్రష్టవ్యః సాధు పశ్యతా।
ధర్మశ్చార్థశ్చ కామశ్చ కాలక్రమసమాహితాః। 8

కాలమునకు బంధుత్వముగాని, మిత్రత్వముగాని, జ్ఞాతిభావముగాని ఉండదు. అనగా కాలమునకు పక్షపాతధోరణి ఉండదు. కాలము లౌకికహేతువులకు కట్టుబడియుండునది కాదు. దానిపై ఎవ్వరి పరాక్రమమూ పనిచేయదు. అది ఎవ్వరికినీ లొంగియుండునది కాదు. కావున కాలతత్త్వమును ఎఱింగిన జ్ఞాని 'కాలము పరిణామశీలము' అని తెలిసికొనగలడు. ధర్మార్థకామములుగూడ కాలక్రమమును అనుసరించియే ప్రాప్తించును. (7-8)

ఇతః స్వాం ప్రకృతిం వాలీ గతః ప్రాప్తః క్రియాఫలం।
ధర్మార్థకామసంయోగైః పవిత్రం ప్లవగేశ్వరః। 9

నా బాణపు దెబ్బ ద్వారా ప్రాయశ్చిత్తము నొంది, వాలి తనదైనశుద్ధ ప్రకృతిని (భావమును) పొందినాడు. అనగా పాపరహితుడైనాడు. విధ్యుక్తముగా తానొనర్చిన ధర్మార్థకామములకు సంబంధించిన పవిత్రకార్యమును చేసినాడు. అనగా దివ్యలోకమును చేరినాడు. (9)

స్వధర్మస్య చ సంయోగాత్ జితస్తేన మహాత్మనా।
స్వర్గః పరిగృహీతశ్చ ప్రాణాన్ అపరిరక్షతా॥ 10

ఏషా వై నియతిః శ్రేష్ఠా యాం గతో హరియూథపః।
తదలం పరితాపేన ప్రాప్తకాలమ్ ఉపాస్యతామ్॥ 11

వచనాంతే తు రామస్య లక్ష్మణః పరవీరహా।
అవదత్ ప్రశ్రితం వాక్యం సుగ్రీవం గతచేతసమ్॥ 12

కురు త్వమస్య సుగ్రీవ ప్రేతాకార్యమ్ అనంతరం।
తారాంగదాభ్యాం సహితో వాలినో దహనం ప్రతి॥ 13

సమాజ్ఞాపయ కాష్ఠాని శుష్కాణి చ బహూని చ।
చందనాదీని దివ్యాని వాలిసంస్కారకారణాత్॥ 14

సమాశ్వాసయ చైనం త్వమ్ అంగదం దీనచేతసం।
మా భూర్బాలిశబుద్ధిస్త్వం త్వదధీనమిదం పురమ్॥ 15

అంగదస్త్వానయేన్మాల్యం వస్త్రాణి వివిధాని చ।
ఘృతం తైలమథో గంధాన్ యచ్చాత్ర సమనంతరమ్॥ 16

త్వం తార శిబికాం శీఘ్రమ్ ఆదాయాగచ్ఛ సంభ్రమాత్।
త్వరా గుణవతీ యుక్తా హ్యస్మిన్కాలే విశేషతః॥ 17

సజ్జీభవంతు ప్లవగాః శిబికావాహనోచితాః।
సమర్థా బలినశ్చైవ నిర్హరిష్యంతి వాలినమ్॥ 18

ఏవముక్త్వా తు సుగ్రీవం సుమిత్రానందవర్ధనః।
తస్థౌ భ్రాతృసమీపస్థో లక్ష్మణః పరవీరహా॥ 19

లక్ష్మణస్య వచః శ్రుత్వా తారః సంభ్రాంతమానసః।
ప్రవివేశ గుహాం శీఘ్రం శిబికాసక్తమానసః॥ 20

ఆదాయ శిబికాం తారః స తు పర్యాపతత్ పునః।
వానరైరూహ్యమానాం తాం శూరైరుద్వహనోచితైః॥ 21

దివ్యాం భద్రాసనయుతాం శిబికాం స్యందనోపమాం।
పక్షికర్మభిరాచిత్రాం ద్రుమకర్మవిభూషితాం॥ 22

వానరప్రభువైనవాలి ప్రాణములకు తెగించి (ప్రాణములను రక్షించుకొనుటపై శ్రద్ధచూపక) స్వధర్మ (వీరధర్మ)మును అనుసరించి పోరాడి, వీరస్వర్గమును అలంకరించెను. సర్వోన్నతమైన గతిని పొందెను. (వాలికి సద్గతి ప్రాప్తించెను) కనుక మీరు ఎవ్వరును అయుక్తై పరితపింపవలదు. ఇప్పుడు ఇంక మీకర్తవ్యమును (వాలికి అంత్యక్రియలను) నెఱవేర్పుడు." (10-11)

శ్రీరాముడు ఇట్లు పలికిన పిమ్మట శత్రుసూదనుడైన లక్ష్మణుడు దుఃఖితుడైయున్న సుగ్రీవునితో సవినయముగా ఇట్లు పలికెను. (12)

"ఓ సుగ్రీవా! తారకును, అంగదునకును తోడుగా ఉండి, వాలికి దహనసంస్కారాదిప్రేతకార్యములను నడుపుము. వాలికి అగ్నిసంస్కారములకై సమృద్ధిగా ఎండుకట్టెలను, దివ్యములైన చందనాదులను తెప్పింపుము. (13-14)

సుగ్రీవా! దీనుడైయున్న ఈ అంగదునిలో ధైర్యమును కలిగింపుము. నీమనస్సులోని మూఢత్వమును తొలగింపుము. (ఇప్పుడు ఏమిచేయవలెను? అను అయోమయస్థితినుండి బయటపడుము.) ఈ కిష్కింధానగరము అంతయును నీ అధీనములోనున్నది. (15)

మరణానంతరము ఉత్తరక్రియలకు అవసరమగు పూలదండలను, వివిధములగు వస్త్రములను, నేతిని, తైలమును, గంధాదులను ఇంకను తదితర వస్తువులను అంగదుడు తీసికొని రావలెను. (16)

ఓ తారుడా! నీవు త్వరగా వెళ్లి ఒక పల్లకీని తీసికొనిరమ్ము. ఇట్టి సందర్భములలో పనులను సావధానముగా త్వరగా చేయుట మంచిది. శవవాహనమైన పల్లకీని మోయుటకు సమర్థులు, బలిష్ఠులు ఐన వానరులు సిద్ధముకావలెను. వారు వాలికళేబరమును తీసికొని పోవుదురు." (17-18)

సుమిత్రాదేవి కుమారుడు, శత్రువులను హతమొనర్చుటలో సర్వసమర్థుడు ఐన లక్ష్మణుడు సుగ్రీవునితో ఇట్లు నుడివిన పిమ్మట అన్న సమీపమునకు చేరెను. (19)

అంతట తారుడు లక్ష్మణస్వామి మాటలను తలదాల్చి, జాగ్రత్తగా శిబికను తీసికొని వచ్చుటకై త్వరత్వరగా కిష్కింధానగరమున ప్రవేశించెను. ఆ శవపేటికను మోయగల బలవంతులైన వానరులచే పల్లకీని మోయించుకొనుచు తారుడు అచటినుండి తిరిగివచ్చెను. (20-21)

ఆపల్లకి రథమువలె దివ్యముగా ఉన్నది. అందు రాజులకు తగిన ఆసనము ఏర్పాటుచేయబడినది. అందు చిత్రింపబడిన అందమైన పక్షులు, చక్కని వృక్షములు ఆ పల్లకికి మిక్కిలి శోభను ఇచ్చుచున్నవి. అందు

ఆచితాం చిత్రపత్తీభిః సువివిష్టాం సమంతతః।
విమానమివ సిద్ధానాం జాలవాతాయనావృతాం। 23

సునియుక్తాం విశాలాం చ సుకృతాం విశ్వకర్మణా।
దారుపర్వతకోపేతాం చారుకర్మపరిష్కృతాం। 24

వరాభరణహారైశ్చ చిత్రమాల్యోపశోభితాం।
గుహాగహనసంఛన్నాం రక్తచందనభూషితాం। 25

పుష్పౌఘైః సమభిచ్ఛన్నాం పద్మమాలాభిరేవ చ।
తరుణాదిత్యవర్ణాభిః భ్రాజమానాభిరావృతామ్। 26

ఈదృశీం శిబికాం దృష్ట్వా రామో లక్ష్మణమబ్రవీత్।
క్షిప్రం వినీయతాం వాలీ ప్రేతకార్యం విధీయతామ్। 27

తతో వాలినముద్యమ్య సుగ్రీవః శిబికాం తదా।
ఆరోపయత విక్రోశన్ అంగదేన సహైవ తు। 28

ఆరోప్య శిబికాం చైవ వాలినం గతజీవితం।
అలంకారైశ్చ వివిధైః మాల్యైర్వస్త్రైశ్చ భూషితమ్। 29

ఆజ్ఞాపయత్ తదా రాజా సుగ్రీవః ప్లవగేశ్వరః।
ఔర్ధ్వదైహికమార్యస్య క్రియతామ్ అనురూపతః। 30

విశ్రాణయంతో రత్నాని వివిధాని బహూన్యపి।
అగ్రతః ప్లవగా యాంతు శిబికా సమనంతరమ్। 31

రాజ్ఞామ్ ఋద్ధివిశేషా హి దృశ్యంతే భువి యాదృశాః।
తాదృశం వాలినః క్షిప్రం ప్రాకుర్వన్నౌర్ధ్వదైహికమ్। 32

అంగదం పరిగృహ్యాశు తారప్రభృతయస్తదా।
క్రోశంతః ప్రయయుః సర్వే వానరా హతబాంధవాః। 33

తతః ప్రణిహితాః సర్వా వానర్యోఽస్య వశానుగాః।
చుక్రుశుర్వీర వీరేతి భూయః క్రోశంతి తాః స్త్రియః। 34

తారాప్రభృతయః సర్వా వానర్యో హతయూథపాః।
అనుజగ్ముర్హి భర్తారం క్రోశంత్యః కరుణస్వనాః। 35

తాసాం రుదితశబ్దేన వానరీణాం వనాంతరే।
వనాని గిరయః సర్వే విక్రోశంతీవ సర్వతః। 36

కాల్బలముల చిత్రములు విలసిల్లుచున్నవి. అందు అంతటను నిర్మాణకౌశలము ఉట్టిపడుచున్నది. అది సిద్ధులవిమానమువలె సన్నని రంధ్రములతో గూడిన గవాక్షములను కల్గియున్నది. అది విశాలముగా చక్కగా విశ్వకర్మచే (శిల్పులచే) నిర్మింపబడినది. అందుచెక్కలతో నిర్మితములైన క్రీడాపర్వతములచిత్రములు చక్కని శిల్ప శోభలతో ఒప్పుచున్నవి. శ్రేష్ఠములైన ఆభరణములతో, చిత్రవిచిత్రములైన పూలదండలతో అది అలంకరింపబడి యున్నది. అందు కృత్రిమమైన గుహలు, అడవులు చిత్రింపబడినవి. అది ఎఱ్ఱచందనపు పూతలతో ఒప్పుచున్నది. బాగుగా వికసించిరాలిన పుష్పములు అందలి ఆసనమున చల్లబడినవి. దానికి అలంకరింపబడిన పద్మమాలలు బాలసూర్యుని ఎఱ్ఱని కిరణశోభలను వెదజల్లుచున్నవి. అట్టి శిబికను తారుడు తీసికొని వచ్చెను.(22-26)

శ్రీరాముడు ఆశిబికను చూచి లక్ష్మణునితో "వాలిని (వాలిశవమును) త్వరగా తీసికొని వెళ్లి, ప్రేతకార్యములను (దహనసంస్కారాదులను) జరుపవలెను." అని పలికెను. (27)

అంతట సుగ్రీవుడు అంగదునితోగూడి ఏడ్చుచు వాలి కళేబరమును లేవనెత్తి పల్లకిలోనికి చేర్చెను. ప్రాణములనుకోల్పోయియున్న వాలియొక్క శరీరమును వివిధములగు దండలతో, వస్త్రములతో, భూషణములతో అలంకరించిరి. (28-29)

వానరశ్రేష్ఠుడు కిష్కింధకు ప్రభువైన సుగ్రీవుడు ఇట్లు ఆదేశించెను. "పూజ్యుడైన వాలికి తగినట్లు రాజలాంఛనములతో ఉత్తర (దహనసంస్కారాది) క్రియలను జరుపవలెను. వానరులు వివిధములగు రత్నములను శిబికకు ముందు భాగమున పుష్కలముగా చల్లుచు వెళ్లవలెను. మహాసంపన్నులు. వైభవోపేతులు ఐన మహారాజులకు వలె వానర ప్రభువైనవాలికిని అంత్యక్రియలను వెంటనే ఘనముగా నిర్వహింతురు గాక." (30-32)

మృతుడైనవాలికి దగ్గఱి బంధువులైన తారుడు మొదలగు వానరులు అంగదుని కౌగిలించుకొని, ఏడ్చుచు ముందునకు నడిచిరి. (33)

మిక్కిలి ఆప్తులు, వాలిఅధీనములోనున్నవారు ఐన అచటి వానరస్త్రీలు ఎల్లరును వీరా! వీరా! అని గగ్గోలు పెట్టుచు వారివెంట నడిచిరి. వాలిభార్యలైన తార మొదలగు వారు అందఱును తమపతి మృతికి కన్నీరు మున్నీరుగా దైన్యముతో విలపించుచు ఆ పల్లకిని అనుసరించిరి. ఆ వానరస్త్రీలు అందఱును బిగ్గఱగా ఏడ్చుచుండుటచే ఆ ధ్వనులు అంతటను ప్రతిధ్వనించు చుండెను. అప్పుడు ఆ పరిసరములలో గల వనములును, కొండలును ఆక్రందించుచున్నవా? అను నట్లుండెను. (34-36)

పులినే గిరినద్యాస్తు వివిక్తే జలసంవృతే।
చితాం చక్రుః సుబహవో వానరాః శోకకర్శితాః। 37

అవరోప్య తతః స్కంధాత్ శిబికాం వహనోచితాః।
తస్థురేకాంతమాశ్రిత్య సర్వే శోకసమన్వితాః। 38

తతస్తారా పతిం దృష్ట్వా శిబికాతలశాయినం।
ఆరోప్యాంకే శిరస్తస్య విలలాప సుదుఃఖితా। 39

హా వానరమహారాజ హా నాథ మమ వత్సల।
హా మహార్హ మహాబాహో హా మమ ప్రియ పశ్య మామ్।
జనం న పశ్యసీమం త్వం కస్మాచ్ఛోకాభిపీడితమ్। 40

ప్రహృష్టమివ తే వక్త్రం గతాసోరపి మానద।
అస్తార్కసమవర్ణం చ లక్ష్యతే జీవతో యథా। 41

ఏష త్వాం రామరూపేణ కాలః కర్షతి వానర।
యేన స్మ విధవాః సర్వాః కృతా ఏకేషుణా వనే। 42

ఇమాస్తాస్తవ రాజేంద్ర వానర్యో వల్లభాః సదా।
పాదైర్వికృష్టమధ్వానమ్ ఆగతాః కిం న బుధ్యసే।
తవేష్టా నను నామైతా భార్యాశ్చంద్రనిభాననాః। 43

ఇదానీం నేక్షసే కస్మాత్ సుగ్రీవం ప్లవగేశ్వరం।
ఏతే హి సచివా రాజన్ తారప్రభృతయస్తవ। 44

పురవాసీ జనశ్చాయం పరివార్యాసతేఽనఘ।
విసర్జయైతాన్ ప్లవగాన్ యథోచితమరిందమ।
తతః క్రీడామహే సర్వా వనేషు మదనోత్కటాః। 45

ఏవం విలపతీం తారాం పతిశోకపరిప్లుతాం।
ఉత్థాపయంతి స్మ తదా వానర్యః శోకకర్శితాః। 46

సుగ్రీవేణ తతస్సార్ధమ్ అంగదః పితరం రుదన్।
చితామ్ ఆరోపయామాస శోకేనాఽభిహతేంద్రియః। 47

కొండలమీదినుండి ప్రవహించుచున్న నది[1]యొక్క జలములచే ఆవృతమై, జనసంచారములేనట్టి ఇసుకతిన్నెపై, శోకముచే కృశించియున్న పెక్కుమంది వానరులు ఒకచితిని పేర్చిరి. ఆ పల్లకిని మోయుచున్న వారు అందఱును ఆశిబికను క్రిందికి దించి, శోకమగ్నులై ఆ నిర్జనప్రదేశమున ఒక ప్రక్కకు చేరి నిలిచియుండిరి.(37-38)

పిమ్మట తార పల్లకిలో పండుకొనబెట్టియున్న తన పతినిజూచి, ఆయనశిరమును తనయొడిలోనికి చేర్చుకొని, అంతులేనిదుఃఖముతో మిగుల విలపింపసాగెను. (39)

"అయ్యో! వానరేంద్రా! అయ్యయ్యో! జీవితేశ్వరా! ప్రేమమూర్తీ! శ్రేష్ఠుడవైన ఓ మహాబాహూ! అయ్యో! నాప్రేమపెన్నిధీ! ఇట్లు విలపించుచున్న నన్ను ఏలచూడవు? ఎంతయు శోకముతో కుమిలిపోవుచున్న ఈపురజనులను ఎందులకు కనికరించుటలేదు? అభిమానధనుడా! నీవు ప్రాణములను వీడినను నీ ముఖమున ఏమాత్రము కళదప్పలేదు. నీవు కన్నుమూసినను అస్తమించుచున్న సూర్యకిరణకాంతులతో వెలుగొందుచు నీవు జీవించియున్నట్లేతోచుచున్నది. ఆమృత్యువే ఈ రాముని రూపమున వచ్చి నిన్ను లాగుకొని పోవుచున్నట్లున్నది. శ్రీరాముడు ప్రయోగించిన ఒకే ఒక్క బాణముచే నీవు చనిపోవుటతోబాటు ఇచట నున్న మేము అందఱము విధవలమై పోయితిమి. (40-42)

ఓ రాజేంద్రా! నిన్ను తమప్రాణములతో సమానముగా చూచుకొనెడి ఈ నీ ప్రియసతులెల్లరును ఏమియు తోచని అయోమయస్థితిలో పడి, దారివెంట కాళ్లీడ్చుకొనుచు ఇచ్చటికి వచ్చిరి. చంద్రవదనలైన ఈ నీ పత్నులందఱును నీకు ప్రియమైనవారే గదా! వారిని గమనింపవేల? (వారి వైపే చూడవేల?) (43)

ఓ స్వామీ! ఇదిగో! వానరప్రభువైన సుగ్రీవుడు, తారుడు మొదలగు సచివులందఱును ఇప్పుడు ఇచట చేరియున్నారు. వారివైపే చూడవేల? (44)

ఓ శత్రుసూదనా! ఓ పుణ్యాత్ముడా! ఈ పురజనులు అందఱును నీచుట్టును చేరియున్నారు. వారివారి అర్హతలను అనుసరించి, ఆ వానరులను అందఱిని పంపివేయుము. నీప్రేమకై తపనపడుచున్న మేమందఱము నీతో విహరింతుము." (45)

శోకముతో అల్లాడుచు తార ఇట్లు విలపించుచుండగా, ఇతరవానరస్త్రీలు దుఃఖమునుండి కొంత తేరుకొని, ఆమెను లేవదీసికూర్చుండబెట్టిరి. తండ్రికై ఆక్రందించుచున్న అంగదుడు శోకభారముతో కాలుసేతులాడనివాడై, సుగ్రీవునిసహాయముతో వాలికళేబరమును చితిపై

1) ఇది తుంగభద్రానది, సహ్యాద్రినుండి బయలుదేరి, కిష్కింధానగరపర్వతములమధ్యనుండి ప్రవహించుచున్నది. ఇది కడకు కృష్ణానదిలో కలియును.

తతోఽగ్నిం విధివద్దత్వా సోఽపసవ్యం చకార హ।
పితరం దీర్ఘమధ్వానం ప్రస్థితం వ్యాకులేంద్రియః। 48

నుంచెను. అనంతరము అతడు విధ్యుక్తముగా తండ్రి చితికి కొఱివి బెట్టెను. పిమ్మట అంగదుడు మనస్సు వికలమైనవాడై దీర్ఘప్రయాణము చేయుచున్న (పరలోకములకు ఏగుచున్న) తండ్రికి (చితికి) అపసవ్యముగా ప్రదక్షిణమొనర్చెను. (46-48)

సంస్కృత్య వాలినం తే తు విధిపూర్వం ప్లవంగమాః।
ఆజగ్మురుదకం కర్తుం నదీం శీతజలాం శివామ్। 49

వానరులందఱును శాస్త్రప్రకారము వాలికి అంత్యసంస్కారముల నొనర్చి, అతనికి తిలతర్పణములను సమర్పించుటకై చల్లని శుభజలములుగల నదీతీరమును చేరిరి. (49)

తతస్తే సహితాస్తత్ర హ్యంగదం స్థాప్య చాగ్రతః।
సుగ్రీవతారాసహితాః సిషిచుర్వాలినే జలమ్। 50

పిదప వానరులు అందఱును ఒకచోటచేరి, సుగ్రీవతారాసహితులై, అంగదుని ముందుంచుకొని వాలికి తిలోదకములను ఇచ్చిరి. (50)

సుగ్రీవేణైవ దీనేన దీనో భూత్వా మహాబలః।
సమానశోకః కాకుత్స్థః ప్రేతకార్యాణ్యకారయత్। 51

మహాబలశాలియైన శ్రీరాముడు దీనుడైయున్న సుగ్రీవునియొక్క శోకములో పాలుపంచుకొని, దైన్యముతో ప్రేతకార్యములను అన్నింటిని నడిపించెను.[1] (51)

తతస్తు తం వాలినమగ్ర్యపౌరుషం
ప్రకాశమిక్ష్వాకువరేషుణా హతం।
ప్రదీప్య దీప్తాగ్ని సమౌజసం తదా
సలక్ష్మణం రామముపేయివాన్ హరిః। 52

ఇక్ష్వాకువంశజుడైన రఘువరునియొక్క బాణముచే హతుడైన వాలి మిగుల పరాక్రమశాలి, సుప్రసిద్ధుడు, అతనికి అంత్యసంస్కారములను జరిపిన పిమ్మట సుగ్రీవుడు శ్రీరాముని కడకు చేరెను. అప్పుడు లక్ష్మణసహితుడైన శ్రీరాముడు అగ్నితేజస్సుతో వెలుగొందుచుండెను. (52)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే పంచవింశః సర్గః (25)
వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువదిఐదవసర్గము

-- ✻ ✻ ✻ --

26. ఇరువదిఆఱవసర్గము

"కిష్కింధకు విచ్చేసి సుగ్రీవుని పట్టాభిషిక్తుని గావింపుడు" అని మారుతి శ్రీరాముని అభ్యర్థించుట - తండ్రియానతి మేరకు తాను నగరమున ప్రవేశింపరాదనియు, ప్రస్రవణగిరియందే ఉండెదననియు శ్రీరాముడు తెల్పుట - "రాజ్యాభిషిక్తుడవై వర్షాకాలము ముగిసిన పిమ్మట సీతాన్వేషణ ప్రయత్నమును ప్రారంభింపుము" - అని రామచంద్రుడు సుగ్రీవుని ఆదేశించుట - సుగ్రీవుడు తాను పట్టాభిషిక్తుడై అంగదుని యువరాజును జేయుట -

తతః శోకాభిసంతప్తం సుగ్రీవం క్లిన్నవాససం।
శాఖామృగమహామాత్రాః పరివార్యోపతస్థిరే। 1

వాలికి దహనసంస్కారాది ఉత్తరక్రియలు ముగిసిన పిమ్మట సుగ్రీవుడు స్నానాదులను ముగించుకొనెను. కాని అతడు ఇంకను దుఃఖమునుండి తేరుకొనలేదు. అప్పుడు ముఖ్యులైన వానరసచివులు ఆవానరప్రభువుచుట్టును చేరి నిలబడిరి. (1)

అభిగమ్య మహాబాహుం రామమ్ అక్లిష్టకారిణం।
స్థితాః ప్రాంజలయః సర్వే పితామహమివర్షయః। 2

ఎట్టి కార్యములనైనను సులభముగా సాధింపగలవాడు, మహాబాహువు ఐన శ్రీరామునియొద్దకు సుగ్రీవాది వానరులు ఎల్లరును మహర్షులు బ్రహ్మదేవునికడకువలె చేరి అంజలి ఘటించి నిలిచిరి. అంతట మేరు పర్వతము

1) వానరాది తిర్యగ్జాతులకు (తిర్యక్కులు = పశుపక్ష్యాదులు) శాస్త్రవిహితమైన దహనసంస్కారాది - ఉత్తర క్రియలకు అర్హతలేదు. కాని వాలి మొదలగు వానరులు దైవాంశసంభూతులగుటవలన వారికి వేదాధ్యయనయోగ్యతయు, మరణానంతరము విధ్యుక్తములైన దహనసంస్కారాది ఉత్తరక్రియలకు అధికారమూ కలవు. - గోవిందరాజీయ వ్యాఖ్య

తతః కాంచనశైలాభః తరుణార్కనిభాననః।
అబ్రవీత్ ప్రాంజలిర్వాక్యం హనుమాన్ మారుతాత్మజః। 3

భవత్ప్రసాదాత్ సుగ్రీవః పితృపైతామహం మహత్।
వానరాణాం సుదుష్ప్రాపం ప్రాప్తో రాజ్యమిదం ప్రభో। 4

భవతా సమనుజ్ఞాతః ప్రవిశ్య నగరం శుభం।
సంవిధాస్యతి కార్యాణి సర్వాణి ససుహృజ్జనః। 5

స్నాతోఽయం వివిధైర్గంధైః ఔషధైశ్చ యథావిధి।
అర్చయిష్యతి రత్నైశ్చ మాల్యైశ్చ త్వాం విశేషతః। 6

ఇమాం గిరిగుహాం రమ్యామ్ అభిగంతుమితోఽర్హసి।
కురుష్వ స్వామిసంబంధం వానరాన్ సంప్రహర్షయన్। 7

ఏవముక్తో హనుమతా రాఘవః పరవీరహా।
ప్రత్యువాచ హనూమంతం బుద్ధిమాన్ వాక్యకోవిదః। 8

చతుర్దశసమాః సౌమ్య గ్రామం వా యది వా పురం।
న ప్రవేక్ష్యామి హనుమన్ పితుర్నిర్దేశపాలకః। 9

సుసమృద్ధాం గుహాం రమ్యాం సుగ్రీవో వానరర్షభః।
ప్రవిష్టో విధివద్వీరః క్షిప్రం రాజ్యేఽభిషిచ్యతామ్। 10

ఏవముక్త్వా హనూమంతం రామః సుగ్రీవమబ్రవీత్।
వృత్తజ్ఞో వృత్తసంపన్నమ్ ఉదారబలవిక్రమమ్। 11

ఇమమప్యంగదం వీర యౌవరాజ్యేఽభిషేచయ।
జ్యేష్ఠస్య స సుతో జ్యేష్ఠః సదృశో విక్రమేణ తే।
అంగదోఽయమ్ అదీనాత్మా యౌవరాజ్యస్య భాజనమ్। 12

పూర్వోఽయం వార్షికో మాసః శ్రావణః సలిలాగమః।
ప్రవృత్తాః సౌమ్య చత్వారో మాసా వార్షికసంజ్ఞితాః। 13

వలె గంభీరుడు, ఉదయసూర్యునివలె కోభిల్లు ముఖము గలవాడు, వాయుసుతుడు ఐన హనుమంతుడు శ్రీరామునకు నమస్కరించి, ఇట్లు పలికెను. (2-3)

"ప్రభూ! తాతముత్తాతలనుండి వచ్చుచున్నదియు, సులభముగా లభ్యముకానిదియు ఐన వానర మహాసామ్రాజ్యము నీ అనుగ్రహమువలన సుగ్రీవునకు ప్రాప్తించెను. నీ ఆజ్ఞయైనచో అమహాత్ముడు బంధు మిత్రులతోగూడి, శుభప్రదమైన కిష్కింధానగరమున ప్రవేశించి, సమస్త కార్యములను చేపట్టగలడు. (4-5)

ప్రభూ! ఈ వానరోత్తముడు వివిధములగు సుగంధ జలములతోడను, ఔషధములతోడను విధి విధానముగా పట్టాభిషిక్తుడైన పిమ్మట, అమూల్యములగు రత్నములతోడను, హారములతోడను నిన్ను భక్తిశ్రద్ధలతో అర్చింపగలడు. రమ్యమైన ఈ కిష్కింధానగరమున ప్రవేశించి, వానరరాజ్యమునకు సుగ్రీవుని పట్టాభిషిక్తుని గావింపుము. ఆ విధముగా వానరులందఱికిని సంతోషమును గూర్చ ప్రార్థన." (6-7)

శత్రుసూదనుడును, ప్రజ్ఞాశాలియు, వాక్చతురుడును ఐన శ్రీరాముడు హనుమంతునిపలుకులను విని ఆయనతో ఇట్లనెను. (8)

"ఓ సౌమ్యుడా! పదునాలుగుసంవత్సరముల వనవాస కాలము ముగియువఱకును నేను గ్రామమునగాని, నగరమునగాని ప్రవేశింపరాదు. ఇది మాతండ్రియాజ్ఞ. వీరుడు, వానరశ్రేష్ఠుడు ఐన సుగ్రీవుడు వివిధములగు సంపదలతో తులతూగుచు, మనోహరముగా ఉన్న కిష్కిందలో ప్రవేశించి, వెంటనే రాజ్యాభిషిక్తుడగుగాక." (9-10)

హనుమంతునితో ఇట్లు పలికిన పిమ్మట శ్రీరాముడు సుగ్రీవునకు ఇట్లు సూచించెను. "ఓ వీరుడా! నీవు లోకవ్యవహారదక్షుడవు. ఈ అంగదుడు సత్ప్రవర్తనగలవాడు, మిక్కిలి బలశాలి, పరాక్రమవంతుడు, కనుక ఇతనిని యువరాజుగా పట్టాభిషిక్తుని గావింపుము. నీ అన్నయగు వాలియొక్కకుమారుడు అంగదుడు శ్రేష్ఠుడు, పరాక్రమమున అతనియంతటివాడు. గట్టి ధైర్యసాహసములుగల వాడు, యువరాజుగా ఉండదగినవాడు. (11-12)

వర్షములు కురిసెడి నాలుగు మాసములు[1] వార్షికములు అని పేర్కొనబడును. మొత్తముగా కలిపి దీనిని 'వర్షాకాలము' అని యందురు. బాగుగా వానలు పడు (వర్షాకాలమునకు సంబంధించిన) నాలుగు మాసములలో ఈ శ్రావణమాసము మొదటిది. (13)

1) 'పక్షా వై మాసాః' అను శ్రుతివచన ప్రమాణమును అనుసరించి మాసము అనగా పక్షము. అని అర్థము. లౌకిక వ్యవహారప్రసిద్ధిని బట్టి రెండు పక్షములు ఒక మాసము. శ్రావణభాద్రపదమాసములకు సంబంధించిన నాలుగు పక్షములును వేదప్రమాణమును అనుసరించి నాలుగు మాసములుగా భావింపబడును. వర్షాకాలమునకు సంబంధించిన నాలుగు పక్షములలో శ్రావణమాసమునకు సంబంధించిన మొదటి పక్షము (శుక్ల పక్షము) ప్రారంభమైనది - అనిదీని యర్థము.

నాయముద్యోగసమయః ప్రవిశ త్వం పురీం శుభామ్।
అస్మిన్ వత్స్యామ్యహం సౌమ్య పర్వతే సహ లక్ష్మణః। 14

ఇయం గిరిగుహా రమ్యా విశాలా యుక్తమారుతా।
ప్రభూతసలిలా సౌమ్య ప్రభూతకమలోత్పలా। 15

కార్తికే సమనుప్రాప్తే త్వం రావణవధే యత।
ఏష నః సమయః సౌమ్య ప్రవిశ త్వం స్వమాలయం। 16

అభిషిక్తః స్వరాజ్యే చ సుహృదః సంప్రహర్షయ। 17

ఇతి రామాభ్యనుజ్ఞాతః సుగ్రీవో వానరాధిపః।
ప్రవివేశ పురీం రమ్యాం కిష్కింధాం వాలిపాలితామ్। 18

తం వానరసహస్రాణి ప్రవిష్టం వానరేశ్వరం।
అభివాద్య ప్రవిష్టాని సర్వతః పర్యవారయన్। 19

తతః ప్రకృతయః సర్వా దృష్ట్వా హరిగణేశ్వరం।
ప్రణమ్య మూర్ధ్నా పతితా వసుధాయాం సమాహితాః। 20

సుగ్రీవః ప్రకృతీః సర్వాః సంభాష్యోత్థాప్య వీర్యవాన్।
భ్రాతురంతఃపురం సౌమ్యం ప్రవివేశ మహాబలః। 21

ప్రవిశ్య త్వభినిష్క్రాంతం సుగ్రీవం ప్లవగేశ్వరం।
అభ్యషించంత సుహృదః సహస్రాక్షమివామరాః। 22

తస్య పాండురమాజహ్రుః ఛత్రం హేమపరిష్కృతం।
శుక్లే చ వాలవ్యజనే హేమదండే యశస్కరే। 23

తథా సర్వాణి రత్నాని సర్వబీజౌషధైరపి।
సక్షీరాణాం చ వృక్షాణాం ప్రరోహాన్ కుసుమాని చ। 24

శుక్లాని చైవ వస్త్రాణి శ్వేతం చైవానులేపనం।
సుగంధీని చ మాల్యాని స్థలజాన్యంబుజాని చ। 25

చందనాని చ దివ్యాని గంధాంశ్చ వివిధాన్ బహూన్।
అక్షతం జాతరూపం చ ప్రియంగు మధుసర్పిషీ।
దధి చర్మచ వైయాఘ్రం వారాహీ చాఽ ప్యుపానహౌ। 26

ఓ సౌమ్యుడా! సీతాన్వేషణప్రయత్నమునకు ఈ వర్షాకాలము అనువైనది కాదు. కనుక నీవు సుఖముగా నుండెడి కిష్కింధకు వెళ్లుము. నేను లక్ష్మణునితోగూడి ఈ ప్రస్రవణగిరియందే నివసించెదను. (14)

ఓ సత్పురుషుడా! ఈ పర్వతగుహ మిగుల విశాలమైనది, రమ్యమైనది. ఇచట వీచెడి గాలులు హాయిని గొల్పునవి. కమలములకును, కలువలకును, నిర్మల జలములకును ఇక్కడ కొదువలేదు. కార్తికమాసము ప్రారంభమగుకాలమున అనగా ఆశ్వయుజమాసము ముగియు సమయమున నీవు రావణవధకై సేనలను సంసిద్ధపఱచుము. ఇదియే మాసూచన. ఇంక నీవు నీనగరమున ప్రవేశింపుము. నీ రాజ్యమున పట్టాభిషిక్తుడవై, నీవు మిత్రులను సంతోషపఱచుము." (15-17)

శ్రీరాముడు ఇట్లు ఆదేశించిన పిమ్మట వానరప్రభువైన సుగ్రీవుడు ఇంతవఱకును వాలిచే పరిపాలింపబడిన రమ్యమగు కిష్కింధానగరమున ప్రవేశించెను. (18)

అంతకు ముందే వేలకొలది వానరులు కిష్కింధలో ప్రవేశించియుండిరి. ఇంతలో నగరములో ప్రవేశించిన వానరప్రభువగు సుగ్రీవునకు నమస్కరించి, వారు ఆయన చుట్టునుజేరిరి. అనంతరము పౌరులెల్లరును భక్తి శ్రద్ధలతో ఆ ప్రభువును దర్శించి, భూమిపై సాగిలపడి నమస్కరించిరి. (19-20)

పరాక్రమశాలియైన సుగ్రీవుడు పౌరులను అందఱిని లేవనెత్తి, ఆత్మీయముగా సంభాషించెను. పిమ్మట ఆమహాబలశాలి వాలియొక్క ప్రశాంత (శుభావహ)మైన అంతఃపురమున అడుగిడెను. (21)

పిమ్మట వానరప్రభువగు సుగ్రీవుడు సభాస్థలికి రాగా సుహృదులైన వానరులు ఆయనను దేవతలు దేవేంద్రునివలె పట్టాభిషిక్తుని గావించిరి. వారు బంగారు చువ్వలు, దండము కల్గిన స్వచ్ఛమైన ఛత్రమును పట్టిరి. ఇంకను బంగారు పిడులుగల మేలైన తెల్లని వింజామరలతో వీచిరి. (22-23)

అమూల్యములైన వివిధములగు రత్నములను, నానావిధములగు బీజములను, ఓషధులను, పాలుగారునట్టి వృక్షములకు పూసిన చక్కని పూవులను, తెల్లనివస్త్రములను, అనులేపములను, భూమిపైనను, జలములలోను ఉత్పన్నములై సువాసనలను వెదజల్లుచున్న పూలమాలలను, దివ్యములైన చందనములను, పలువిధములగు సుగంధములను, బంగారుఅక్షతలను, కొఱ్ఱధాన్యమును, తేనెలను, నేతులను, పెరుగులను, పులిచర్మములను, వరాహచర్మముతో సిద్ధపఱచబడిన

సమాలంభనమాదాయ రోచనాం సమనశ్శిలామ్।
ఆజగ్ముస్తత్ర ముదితా వరాః కన్యాస్తు షోడశ। 27

తత స్తే వానరశ్రేష్ఠం యథాకాలం యథావిధి।
రత్నైర్వస్త్రైశ్చ భక్ష్యైశ్చ తోషయిత్వా ద్విజర్షభాన్। 28

తతః కుశపరిస్తీర్ణం సమిద్ధం జాతవేదసం।
మంత్రపూతేన హవిషా హుత్వా మంత్రవిదో జనాః। 29

తతో హేమప్రతిష్ఠానే వరాస్తరణసంవృతే।
ప్రాసాదశిఖరే రమ్యే చిత్రమాల్యోపశోభితే।
ప్రాఙ్ముఖం వివిధైర్మంత్రైః స్థాపయిత్వా వరాసనే। 30

నదీనదేభ్యః సంహృత్య తీర్థేభ్యశ్చ సమంతతః। 31

ఆహృత్య చ సముద్రేభ్యః సర్వేభ్యో వానరర్షభాః।
అపః కనకకుంభేషు నిధాయ విమలాః శుభాః। 32

శుభైర్వృషభశృంగైశ్చ కలశైశ్చాపి కాంచనైః।
శాస్త్రదృష్టేన విధినా మహర్షివిహితేన చ। 33

గజో గవాక్షో గవయః శరభో గంధమాదనః।
మైందశ్చ ద్వివిదశ్చైవ హనుమాన్ జాంబవాన్ నలః। 34

అభ్యషించంత సుగ్రీవం ప్రసన్నేన సుగంధినా।
సలిలేన సహస్రాక్షం వసవో వాసవం యథా। 35

అభిషిక్తే తు సుగ్రీవే సర్వే వానరపుంగవాః।
ప్రచుక్రుశుర్మహాత్మానో హృష్టాస్తత్ర సహస్రశః। 36

రామస్య తు వచః కుర్వన్ సుగ్రీవో హరిపుంగవః।
అంగదం సంపరిష్వజ్య యౌవరాజ్యేఽభ్యషేచయత్। 37

అంగదే చాఽభిషిక్తే తు సానుక్రోశాః ప్లవంగమాః।
సాధు సాధ్వితి సుగ్రీవం మహాత్మానోఽభ్యపూజయన్। 38

పాదరక్షలను, మైపూతలను, గోరోచనమును, మణిసిలలను అవివాహితలైన పదునాఱుమంది యువతీమణులు తీసికొని వచ్చిరి. (24-27)

అనంతరము వానరశ్రేష్ఠుడగు సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేయుటకుముందుగా ఆవానరులు హోమములు మున్నగు విధులను నిర్వహించుటకై ఆహ్వానించిన బ్రాహ్మణోత్తములకు అమూల్యములగు రత్నములను, నూతనవస్త్రములను, మధురములగు భక్ష్యములను సమర్పించి, వారిని సంతోషపఱచిరి. మంత్రవేత్తలైన ఋత్విజులు హోమవేదికకు నాలుగువైపుల దర్భలను పఱచి, ప్రజ్వలించుచున్న అగ్నిదేవునకు వేదమంత్రములచే పవిత్రములైన హవిస్సులను సమర్పించిరి. (28-29)

అనంతరము రమ్యమైన రాజభవనము యొక్క పై భాగమున శ్రేష్ఠములైన ఆస్తరణములను (కంబళ్లను) పఱచిరి. ఆ భవనమును రంగురంగుల పూలమాలలతో అలంకరించిరి. అచట బంగారు కాళ్లుగల ఆసనమును ఏర్పఱచిరి. ఆ ఋత్విజులు వేదమంత్రములను పఠించుచు ఆసనముపై సుగ్రీవుని తూర్పుముఖముగా కూర్చుండబెట్టిరి. (30)

వానర శ్రేష్ఠులు నలుదిక్కులయందుగల నదీనదముల నుండియు, పుణ్యతీర్థముల నుండియు, సమస్త సముద్రముల నుండియు నిర్మలములైన పవిత్ర జలములను తీసికొనివచ్చి, బంగారు కలశములలో ఉంచిరి. (31-32)

మహర్షులు సూచించినరీతిగా కల్పసూత్రములను అనుసరించి విధ్యుక్తముగా, శాస్త్రప్రకారము శుభ్రమైన బంగారుకలశములలో, వృషభములకొమ్ములతో నిర్మలములైన ఆ పరిమళ జలములను తీసికొని, గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, హనుమంతుడు, జాంబవంతుడు, నలుడు మున్నగు వానరప్రముఖులు, సహస్రాక్షుడైన ఇంద్రునకు వసువులవలె, సుగ్రీవునకు అభిషేకమహోత్సవమును నిర్వహించిరి. (33-35)

సుగ్రీవుని పట్టాభి మహోత్సవము ముగిసిన వెంటనే మహాత్ములైన వేలకొలది వానరోత్తములు అందఱును పరమ సంతోషముతో తమ ప్రభువునకు జయధ్వనులు కావించి కోలాహలమొనర్చిరి. (36)

వానరోత్తముడైన సుగ్రీవుడు శ్రీరాముని ఆదేశమును పాటించుచు, అంగదుని అక్కున జేర్చుకొని, అతనికి యువరాజపట్టాభిషేకమును జరిపెను. (37)

అంగదుడు అభిషిక్తుడైన వెంటనే మహానుభావులైన వానరులు 'బాగుబాగు' అనుచు జయ నినాదములు చేసిన

రామం చైవ మహాత్మానం లక్ష్మణం చ పునః పునః।
ప్రీతాశ్చ తుష్టువుః సర్వే తాదృశే తత్ర వర్తతి। 39

పిమ్మట వారు సుగ్రీవుని అభినందించుచు పూజించిరి. ఈ విధముగా సుగ్రీవాంగదుల పట్టాభిషేక మహోత్సవములు ముగిసిన పిమ్మట, వానరులెల్లరును పట్టరాని సంతోషముతో మహాత్ములైన రామలక్ష్మణులను పదేపదే కొనియాడిరి. (38-39)

హృష్టపుష్టజనాకీర్ణా పతాకాధ్వజశోభితా।
బభూవ నగరీ రమ్యా కిష్కింధా గిరిగహ్వరే। 40

పర్వతగుహాయందు మనోహరముగానున్న ఆ కిష్కింధానగరము పతాకములతో, ధ్వజములతో విరాజిల్లెను. అందలి జనులందఱును సంతోషముతో పొంగిపోయిరి. (40)

నివేద్య రామాయ తదా మహాత్మనే
మహాభిషేకం కపివాహినీపతిః।
రుమాం చ భార్యాం ప్రతిలభ్య వీర్యవాన్
అవాప రాజ్యం త్రిదశాధిపో యథా। 41

మహాపరాక్రమశాలియగు ఆ వానరప్రభువు (సుగ్రీవుడు) శ్రీరామునికడకు వచ్చి, పట్టాభిషేకమహోత్సవముల శుభవార్తలను ఆ ప్రభువునకు నివేదించెను. తన భార్యయగురుమను చేపట్టెను. దేవేంద్రుడు అమరావతిని వలె అతడు రాజ్యాధికారమును స్వీకరించెను. (41)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే షడ్వింశః సర్గః (26)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువదిఆఱవసర్గము

— * * * —

27. ఇరువదిఏడవసర్గము

శ్రీరాముడు ప్రస్రవణగిరిని వర్ణించుట - సీతాదేవియెడబాటు కారణముగా శోకించుట - లక్ష్మణుడు అన్నను ఓదార్చుట -

అభిషిక్తే తు సుగ్రీవే ప్రవిష్టే వానరే గుహామ్।
ఆజగామ సహ భ్రాత్రా రామః ప్రస్రవణం గిరిమ్। 1

సుగ్రీవుడు వానరులకు ప్రభువుగా పట్టాభిషిక్తుడైన పిమ్మట శ్రీరామునికడకు వచ్చి, ఆయనఆశీస్సులను గైకొని తిరిగి కిష్కింధలో ప్రవేశించెను. అనంతరము రఘువరుడు లక్ష్మణసహితుడై ప్రస్రవణగిరికి చేరెను. (1)

శార్దూలమృగసంఘుష్టం సింహైర్భీమరవైర్వృతమ్।
నానాగుల్మలతాగూఢం బహుపాదపసంకులమ్। 2

ఋక్షవానరగోపుచ్ఛైః మార్జారైశ్చ నిషేవితమ్।
మేఘరాశినిభం శైలం నిత్యం శుచిజలాశ్రయమ్। 3

ఆ ప్రస్రవణపర్వతమున పెద్దపులులు మొదలగు క్రూరమృగములు సంచరించుచుండెను. భయంకరమైన సింహగర్జనలు ప్రతిధ్వనించుచుండెను. పలువిధములైన పొదలు, లతలు విరివిగా వ్యాపించి యుండెను. అచట అనేకవృక్షములు దట్టముగా ఏపుగా పెఱిగియుండెను. అచట ఎలుగుబంట్లు, కోతులు, కొండముచ్చులు, అడవిపిల్లులు తిరుగాడుచుండెను. ఆగిరిశిఖరములు మేఘపంక్తులవలె ఒప్పుచుండెను. నిర్మలములైన జలాశయములు సమృద్ధిగా ఉండెను. (2-3)

తస్య శైలస్య శిఖరే మహతీమ్ ఆయతాం గుహామ్।
ప్రత్యగృహ్ణాత వాసార్థం రామః సౌమిత్రిణా సహ। 4

లక్ష్మణునితో గూడి శ్రీరాముడు ఆ గిరిశిఖరము నందలి మిక్కిలి విశాలమైన ఒక పెద్దగుహను తమకు నివాసముగా నిర్ణయించుకొనెను. (4)

కృత్వా చ సమయం సౌమ్యః సుగ్రీవేణ సహానఘః।
కాలయుక్తం మహద్వాక్యమ్ ఉవాచ రఘునందనః।
వినీతం భ్రాతరం భ్రాతా లక్ష్మణం లక్ష్మివర్ధనమ్। 5

ఇయం గిరిగుహా రమ్యా విశాలా యుక్తమారుతా।
అస్యాం వసావ సౌమిత్రే వర్షరాత్రమ్ అరిందమ। 6

గిరిశృంగమ్ ఇదం రమ్యమ్ ఉన్నతం పార్థివాత్మజ।
శ్వేతాభిః కృష్ణతామ్రాభిః శిలాభిరుపశోభితం। 7

నానాధాతుసమాకీర్ణం దరీనిర్ఝరశోభితం।
వివిధైర్వృక్షషండైశ్చ చారుచిత్రలతావృతం। 8

నానావిహగ సంఘుష్టం మయూరరవనాదితం।
మాలతీకుందగుల్మైశ్చ సిందువారకురంటకైః। 9

కదంబార్జునసర్జైశ్చ పుష్పితైరుపశోభితమ్। 10

ఇయం చ నళినీ రమ్యా ఫుల్లపంకజమండితా।
నాఽతిదూరే గుహాయా నౌ భవిష్యతి నృపాత్మజ। 11

ప్రాగుదక్ప్రవణే దేశే గుహా సాధు భవిష్యతి।
పశ్చాచ్చైవోన్నతా సౌమ్య నివాతేయం భవిష్యతి। 12

గుహాద్వారే చ సౌమిత్రే శిలా సమతలా శుభా।
శ్లక్ష్ణా చైవాయతా చైవ భిన్నాంజనచయోపమా। 13

గిరిశృంగమిదం తాత పశ్య చోత్తరతః శుభం।
భిన్నాంజనచయాకారమ్ అంభోధరమివోత్థితమ్। 14

దక్షిణస్యామపి దిశి స్థితం శ్వేతమివాపరం।
కైలాసశిఖరప్రఖ్యం నానాధాతువిభూషితమ్। 15

ప్రాచీనవాహినీం చైవ నదీం భృశమకర్దమాం।
గుహాయాః పూర్వతః పశ్య త్రికూటే జాహ్నవీమివ। 16

సౌమ్యుడు పుణ్యపురుషుడు ఐన శ్రీరాముడు 'శరత్కాలములో సీతాన్వేషణప్రయత్నమును ప్రారంభించెదము' అని సుగ్రీవునితో ఏర్పాటు చేసికొనియుండెను. దానికి తగినట్లుగా రఘునందనుడు వినయశీలసంపన్నుడైన లక్ష్మణునితో ఇట్లు నుడివెను. (5)

'ఓ శత్రుసూదనా! విశాలమైన ఈ గిరిగుహ మిక్కిలి రమ్యముగా ఉన్నది. ఇచట అనుకూలమైన గాలులు వీచుచున్నవి. సౌమిత్రీ! ఈ వర్షాకాలము ముగియువఱకు ఇచటనే నివసింతము. (6)

ఓ లక్ష్మణా! ఈ పర్వతశిఖరము మిక్కిలి ఉన్నతమై మనోహరముగా ఉన్నది. ఇది తెలుపు, నలుపు, ఎఱుపురంగుల శిలలతో శోభిల్లుచున్నది. వివిధములగు గైరికాదిధాతువులతో విరాజిల్లుచున్నది. దరులయందలి సెలయేళ్లతో కనువిందు గావించుచున్నది. వివిధములగు వృక్షములవరుసలతో, చిత్ర విచిత్రములగు లతలతో వ్యాప్తమైయున్నది. ఈ ప్రాంతమంతయును పలువిధములైన పక్షుల కలకలారావములతో ప్రతిధ్వనించుచున్నది. ఇచటి నెమళ్లక్రేంకారములు ఇంపుగొలుపుచున్నవి. ఇచటగల జాజిపొదలు, మల్లెపొదలు, వావిలి, ఎఱ్ఱగోరంట చెట్లు, కడిమి, మద్ది, సాలవృక్షములు బాగుగా పుష్పించి, చూడముచ్చటగా ఉన్నవి. (7-10)

ఓ రాజకుమారా! లక్ష్మణా! మనకు సమీపముననే యున్న ఈ సరస్సు చక్కగా వికసించిన పద్మములతో కలకలలాడుచున్నది. వర్షాకాలమున అది ఇంకను చేరువకాగలదు. (11)

ఓ సౌమ్యా! ఈ గుహయొక్క ఈశాన్యభాగము పల్లముగానున్నది. శుభకరమైనది. పడమరభాగమున మిక్కిలి ఎత్తుగా నుండుటచే పెనుగాలుల బాధయుండదు. ఈ గుహకు ముందుభాగమున గల బండలు సమతలముగలిగి సుఖకరములుగా ఉన్నవి. ఇవి కాటుకకొండనుండి పగులగొట్టి తీసినవాటివలె నల్లగా పొడవుగా ఉన్నవి. (12-13)

గుహకు ఉత్తరమునగల ఈ పర్వతశిఖరము పగిలిన కాటుకకొండవలె ఒప్పుచు విశిష్టముగా కన్పట్టు చున్నది. చూడుము. (14)

దక్షిణభాగమున వెండివలెనున్న ఈ తెల్లనిశిఖరము గైరికాదివివిధధాతువులతో విలసిల్లుచు మఱియొక కైలాసశిఖరమాయుననట్లు శోభిల్లుచున్నది. (15)

ఈ గుహకు ముందుభాగమున తూర్పుదిక్కుగా, నిర్మలజలములతో చక్కగా ప్రవహించుచున్న ఈ నది త్రికూటపర్వతమునుండి జాలువారెడి గంగానదివలె విరాజిల్లుచున్నది. (16)

చంపకైస్తిలకైస్తాలైః తమాలైరతిముక్తకైః।
పద్మకైః సరలైశ్చైవ అశోకైశ్చైవ శోభితామ్। 17

వానీరైస్తిమిశైశ్చైవ వకులైః కేతకైర్ధవైః।
హింతాలైస్తిరిటైర్నీపైః వేత్రకైః కృతమాలకైః। 18

తీరజైః శోభితా భాతి నానారూపైస్తతస్తతః।
వసనాభరణోపేతా ప్రమదేవాభ్యలంకృతా। 19

శతశః పక్షిసంఘైశ్చ నానానాదైర్వినాదితా।
ఏకైకమ్ అనురక్తైశ్చ చక్రవాకైరలంకృతా। 20

పులినైరతిరమ్యైశ్చ హంససారససేవితైః।
ప్రహసంతీవ భాత్యేషా నారీ సర్వవిభూషితా। 21

క్వచిన్నీలోత్పలచ్ఛన్నా భాతి రక్తోత్పలైః క్వచిత్।
క్వచిదాభాతి శుక్లైశ్చ దివ్యైః కుముదకుట్మలైః। 22

పారిప్లవశతైర్జుష్టా బర్హిణక్రౌంచనాదితా।
రమణీయా నదీ సౌమ్య మునిసంఘైర్నిషేవితా। 23

పశ్య చందనవృక్షాణాం పంక్తీః సురచితా ఇవ।
కకుభానాం చ దృశ్యంతే మనసేవోదితాః సమమ్। 24

అహో సురమణీయోఽయం దేశః శత్రునిషూదన।
దృఢం రంస్యావ సౌమిత్రే సాధ్వత్ర నివసావహై। 25

ఇతశ్చ నాతిదూరే సా కిష్కింధా చిత్రకాననా।
సుగ్రీవస్య పురీ రమ్యా భవిష్యతి నృపాత్మజ। 26

గీతవాదిత్రనిర్ఘోషః శ్రూయతే జయతాం వర।
నర్దతాం వానరాణాం చ మృదంగాడంబరైః సహ। 27

ఆ నదీతీరమునందు అటనట సంపెంగలు, ఎఱ్ఱగోరంటలు, తాళవృక్షములు, పూలగురివెందలు, పద్మకములు, సరళములు, అశోకములు, ప్రబ్బలిచెట్లు, తిమిశములు, పొగడచెట్లు, మొగలిచెట్లు, ధవవృక్షములు, హింతాలములు, చెఱకుగడలు, కడిమిచెట్లు, ముంజగడ్డి, యష్టిమధుకములు మొదలగునవి నానారూపములలో అలరారుచుండుటచే ఆ నది వివిధములగు వస్త్రములను, ఆభరణములను అలంకరించుకొనిన యువతివలె భాసిల్లుచున్నది. (17-19)

వందలకొలదిపక్షులగుంపులయొక్క కలకలధ్వనులతో ఇది ప్రతిధ్వనించుచున్నది. ఇందు చక్రవాకములు పరస్పరానురాగములతో పరవశించిపోవుచున్నవి. (20)

తీరములయందలి రమ్యమైన ఇసుకతిన్నెలపై హంసలు, బెగ్గురుపక్షులు విహరించుచుండుటచే ఈ నది బాగుగా అలంకరించుకొనిన తరుణి చక్కగా దరహాసము చేయుచున్నట్లున్నది. (21)

ఈ నదియందు ఒకచోట నల్లగలువలు దట్టముగా వ్యాపించి యున్నవి. ఇంకను అక్కడక్కడ దివ్యములైన ఎఱ్ఱగలువలు, తెల్లగలువలు, కలువలమొగ్గలు అందముగా కన్పట్టుచున్నవి. (22)

ఇందలి జలములపై తేలియాడు వందలకొలది పక్షులు అటునిటు కదలుచు కనువిందుగావించుచున్నవి. నెమళ్లయొక్క క్రేంకారములు, క్రౌంచపక్షుల మధురధ్వనులు వినసొంపుగా ఉన్నవి. ఈ నదియొక్క అందచందములు బహురమ్యములు. ఈ నదిని ఆశ్రయించి పెక్కుమంది మునులు తమ తపశ్చర్యలను కొనసాగించుచున్నారు. (23)

ఇచట ఒక ప్రక్కన వరుసలు దీఱియున్న చందనవృక్షములు, మఱియొక వైపున మద్దివృక్షములపంక్తులు ప్రయత్నపూర్వకముగా సమముగా పెంచబడినట్లున్నవి. చూడుము. (24)

ఓ పరంతపా! ధీరా! ఈ ప్రదేశము ఎంతరమణీయముగా ఉన్నది. ఇది మనము నివసించుటకు ఎంతయు అనుకూలముగా తోచుచున్నది. కావున లక్ష్మణా! మనము ఇచటనే ప్రశాంతముగా గడుపుదము. (25)

ఓ రాజకుమారా! సుగ్రీవునినగరమైన కిష్కింధ చిత్రవిచిత్రములైన వనములతో రమ్యముగా అలరారుచు ఇచటికి సమీపముననే యున్నది. ఓ మహావిజేతా! వానరులందఱును పరమ సంతోషముతో నృత్యములు చేయుచున్నట్లున్నది. వీణా, వేణు, మృదంగ, తాళముల ఆడంబరధ్వనులతో గీతములు వినబడుచున్నవి. (26-27)

లబ్ధ్వా భార్యాం కపివరః ప్రాప్య రాజ్యం సుహృద్వృతః।
ధ్రువం నందతి సుగ్రీవః సంప్రాప్య మహతీం శ్రియమ్। 28

ఇత్యుక్త్వా న్యవసత్ తత్ర రాఘవః సహ లక్ష్మణః।
బహుదృశ్యదరీకుంజే తస్మిన్ ప్రస్రవణే గిరౌ। 29

సుసుఖేఽపి బహుద్రవ్యే తస్మిన్ హి ధరణీధరే।
వసతస్తస్య రామస్య రతిరల్పాపి నాఽభవత్।
హృతాం హి భార్యాం స్మరతః ప్రాణేభ్యోఽపి గరీయసీమ్। 30

ఉదయాభ్యుదితం దృష్ట్వా శశాంకం చ విశేషతః।
ఆవివేశ న తం నిద్రా నిశాసు శయనం గతమ్। 31

తత్సముత్థేన శోకేన బాష్పోపహతచేతసం।
తం శోచమానం కాకుత్స్థం నిత్యం శోకపరాయణం। 32

తుల్యదుఃఖోఽబ్రవీద్భ్రాతా లక్ష్మణోఽనునయన్ వచః। 33

అలం వీర వ్యథాం గత్వా న త్వం శోచితుమర్హసి।
శోచతో వ్యవసీదంతి సర్వార్థా విదితం హి తే। 34

భవాన్ క్రియాపరో లోకే భవాన్ దైవపరాయణః।
ఆస్తికో ధర్మశీలశ్చ వ్యవసాయీ చ రాఘవ। 35

న హ్యవ్యవస్థితః శత్రుం రాక్షసం తం విశేషతః।
సమర్థ స్త్వం రణే హంతుం విక్రమై ర్జిహ్మకారిణమ్। 36

సమున్మూలయ శోకం త్వం వ్యవసాయం స్థిరం కురు।
తతః సపరివారం తం నిర్మూలం కురు రాక్షసమ్। 37

పృథివీమపి కాకుత్స్థ ససాగరవనాచలామ్।
పరివర్తయితుం శక్తః కిమంగ పున రావణమ్। 38

శరత్కాలం ప్రతీక్షస్వ ప్రావృట్కాలోఽయమాగతః।
తతః సరాష్ట్రం సగణం రావణం త్వం వధిష్యసి। 39

కపీంద్రుడైన సుగ్రీవునకు రాజ్యాధికారము దక్కినది. మిత్రులు చేరునైరి, భార్యతోడైనది, సంపదలు కొల్లలుగా ప్రాప్తించినవి. కనుక ఇప్పుడతడు ఆనందముతో ఉన్నాడనుట నిశ్చయము." (28)

ఇట్లు పలికిన పిమ్మట శ్రీరాముడు ఆ ప్రస్రవణగిరిపైగల గుహలో చక్కని ఒక లతాగృహమున లక్ష్మణునితో గూడి నివసింపసాగెను. (29)

ఆ పర్వతము పూవులు, పండ్లు సమృద్ధిగా గలిగి సుఖజీవనమునకు అనువుగా నుండెను. అట్టి చోట నివసించుచున్నప్పటికిని ప్రాణములకంటె మిన్నయైన తన భార్య (సీతాదేవి) అపహరింపబడి, దూరముగా ఉండుటవలన ఆమెనే స్మరించుచున్న శ్రీరామునకు అది ఏమాత్రమూ సంతోషమును కల్గింపకుండెను. అంతేగాక ఉదయాద్రినుండి వెడలిన చంద్రుని చూచిన పిమ్మట పండుకొనియున్నను (చంద్రముఖియైన సీతావిరహకారణముగా) శ్రీరామునకు రాత్రులయందు నిద్రయే పట్టకుండెను.(30-31)

సీతావియోగమువలన కలిగిన దుఃఖకారణముగా శ్రీరాముడు కన్నీరుగార్చుచు వేదనపడుచుండెను. అట్లు అనుక్షణము శోకముతో పరితపించుచున్న ఆ రఘువరుని జూచి లక్ష్మణుడును కుమిలిపోవుచుండెను. అట్టి స్థితిలో ఆ సౌమిత్రి అన్నను ఓదార్చుచు ఇట్లు నుడివెను. (32-33)

"అన్నయ్యా! నీవు మహావీరుడవు. నీవు ఎంతయు వ్యథ చెందితివి. నీవంటి ఉదాత్తపురుషుడు శోకింపదగడు. దుఃఖించుటవలన సకల ప్రయోజనములును దెబ్బతినును. ఇవి అన్నియును నీకు తెలిసిన విషయములే. ఓ రఘువరా! నీవు కార్యశూరుడవు, సర్వశుభలక్షణసంపన్నుడవు, ధర్మమార్గనిరతుడవు, ఎల్లప్పుడును లక్ష్యసిద్ధికై కృషిచేయువాడవు. ఆత్మవిశ్వాసము గలవాడవు. కనుక నీవు విచారపడవలదు. (34-35)

అన్నా! నీవు ఇప్పుడు ధైర్యమును కోల్పోయినచో మాయావియైన శత్రువును, అందునా రాక్షసుని రణరంగమున హతమార్చుటకు శక్తిలేనివాడవు అగుదువు. కనుక శోకమును పూర్తిగా విడనాడుము, గట్టిగా కార్యోన్ముఖుడవుకమ్ము. పిమ్మట ఆ రాక్షసుని సపరివారముగా తుదముట్టింపుము. (36-37)

ఓ కాకుత్స్థా! నీవు గట్టిగా పూనుకొనినచో సముద్రములు, అరణ్యములు, పర్వతములు మున్నగువానితో గూడిన ఈ సమస్తభూమండలమును తలక్రిందులు చేయగలవు. ఇక ఈ రావణుడునీకు ఒక లెక్కయా? (38)

వర్షాకాలము ఆరంభమైనది. శరత్కాలమువఱకు వేచియుండుము. పిదప రావణుని, అతనిసేనలను, కడకు రాజ్యమును నీవు రూపుమాపగలవు. (39)

అహం తు ఖలు తే వీర్యం ప్రసుప్తం ప్రతిబోధయే।
దీప్తైరాహుతిభిః కాలే భస్మచ్ఛన్నమివానలమ్ । 40

లక్ష్మణస్య తు తద్వాక్యం ప్రతిపూజ్య హితం శుభం।
రాఘవః సుహృదం స్నిగ్ధమ్ ఇదం వచనమబ్రవీత్ । 41

వాచ్యం యదనురక్తేన స్నిగ్ధేన చ హితేన చ।
సత్యవిక్రమయుక్తేన తదుక్తం లక్ష్మణ త్వయా । 42

ఏష శోకః పరిత్యక్తః సర్వకార్యావసాదకః।
విక్రమేష్వప్రతిహతం తేజః ప్రోత్సాహయామ్యహమ్ । 43

శరత్కాలం ప్రతీక్షిష్యే స్థితోఽస్మి వచనే తవ।
సుగ్రీవస్య నదీనాం చ ప్రసాదమ్ అనుపాలయన్ । 44

ఉపకారేణ వీరస్తు ప్రతికారేణ యుజ్యతే।
అకృతజ్ఞోఽప్రతికృతో హంతి సత్త్వవతాం మనః । 45

అథైవముక్తః ప్రణిధాయ లక్ష్మణః
కృతాంజలిస్తత్ ప్రతిపూజ్య భాషితం ।
ఉవాచ రామం స్వభిరామదర్శనం
ప్రదర్శయన్ దర్శనమాత్మనః శుభమ్ । 46

యథోక్తమేతత్ తవ సర్వమీప్సితం
నరేంద్ర కర్తా న చిరాద్ధరీశ్వరః ।
శరత్ప్రతీక్షః క్షమతామిమం భవాన్
జలప్రపాతం రిపునిగ్రహే ధృతః । 47

నియమ్య కోపం ప్రతిపాల్యతాం శరత్
క్షమస్వ మాసాంశ్చతురో మయా సహ ।
వసాఽచలేఽస్మిన్ మృగరాజసేవితే
సంవర్ధయన్ శత్రువధే సముద్యమమ్ । 48

నివురుగప్పిన నిప్పును (పై బూడిదను తొలగించి) ఆహుతులతో సకాలములో ప్రజ్వలింపజేసినట్లు, నీలో నిద్రాణమైయున్న పరాక్రమమును నా మృదువచనముల ద్వారా మేలుకొలుపుచున్నాను." (40)

లక్ష్మణుడు పలికిన మేలైన హితవచనములను ఆదరముతో ఆలకించి, శ్రీరాముడు ఆత్మీయుడైన తన తమ్మునితో మృదు మధురముగా ఇట్లు నుడివెను. (41)

"ఓ సౌమిత్రీ! నీవు నాపైగల అనురాగముతో సమయోచితముగా పలికిన ప్రియవచనములు మిక్కిలి హితకరములు, అమోఘములు, అవి పరాక్రమశోభితములు. (42)

సమస్తకార్యములకు భంగకరమైన ఈ శోకమును ఇదిగో! ఇప్పుడే పరిత్యజించుచున్నాను. నాలోని తిరుగులేని బలపరాక్రమములు నీ అద్భుతవచనముల వలన ఉత్తేజితమైనవి. (43)

తమ్ముడా! నీ సూచనలను తప్పక పాటించెదను. సుగ్రీవుడు కార్యోన్ముఖుడగువఱకును, వర్షాకాలమున పొంగి ప్రవహించెడి నదులు ప్రశాంతముగునవఱకును ఆగుచు, శరత్కాలమునకై నిరీక్షింతును. (44)

ఉపకారము పొందిన వీరుడు తప్పక ప్రత్యుపకారమును చేసియే తీరును. అట్లుగాక చేసిన మేలు మఱచి ప్రత్యుపకారమును చేయనిచో సజ్జనులమనస్సులు నొచ్చుకొనును. కనుక సత్పురుషులు నిందింతురని భయమునకైనను సుగ్రీవుడు మనకు తప్పక సాయపడును". (45)

శ్రీరాముడు పలికిన వచనములు భవిష్యత్కార్యక్రమమునకు అనుగుణముగా నున్నవని తలంచి, లక్ష్మణుడు తనముఖ కవళికలలో ఎంతేని సంతోషమును ప్రకటించెను. పిమ్మట అతడు చేతులు జోడించి నమస్కరించుచు నయనాభిరాముడైన శ్రీరామునితో ఇట్లు పచించెను. (46)

"ఓ నరేంద్రా! నీవు చెప్పిన రీతిగా, నీ కోరిక మేరకు వానర రాజైన సుగ్రీవుడు మన కార్యములను అన్నింటిని త్వరలోనే తప్పక పూర్తి చేయగలడు. కనుక పూజ్యుడవైన నీవు శరత్కాలమువఱకు నిరీక్షించుము. నీవు శత్రు సంహారదక్షుడవు. కనుక శోకరహితుడవై వర్షాకాలము ముగియు వఱకు ఓపిక పట్టుము. (47)

అన్నా! కోపమును అణచుకొని, శరత్కాలమువఱకు వేచియుండుము. ఈ వర్షాకాలమునందలి నాలుగు మాసములలో సంభవించెడి కష్టములను సహింపుము. శత్రువును వధించుటయందు నీలోగల ఉత్సాహమును సడలనీయక సింహములు సంచరించునట్టి ఈ వనమునందు నాతోగూడి వసింపుము. (48)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే సప్తవింశస్సర్గః (27)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువది ఏడవసర్గము

-- * * * --

28. ఇరువది ఎనిమిదవసర్గము

శ్రీరాముడు వర్ష-ఋతువిశేషములను వర్ణించుచు మధ్య మధ్య తన విరహవేదనను ప్రకటించుట - 'మన సహాయమును పొందిన సుగ్రీవుడు మనకు తప్పక తోడ్పడును' - అని లక్ష్మణునితో నుడువుట -

స తథా వాలినం హత్వా సుగ్రీవమ్ అభిషిచ్య చ।
వసన్ మాల్యవతః పృష్ఠే రామో లక్ష్మణమబ్రవీత్। 1

అయం స కాలః సంప్రాప్తః సమయోఽద్య జలాగమః।
సంపశ్య త్వం నభో మేఘైః సంవృతం గిరిసన్నిభైః। 2

నవమాసధృతం గర్భం భాస్కరస్య గభస్తిభిః।
పీత్వా రసం సముద్రాణాం ద్యౌః ప్రసూతే రసాయనమ్। 3

శక్యమ్ అంబరమారుహ్య మేఘసోపానపంక్తిభిః।
కుటజార్జునమాలాభిః అలంకర్తుం దివాకరమ్। 4

సంధ్యారాగోత్థితైస్తామ్రైః అంతేష్వధికపాండరైః।
స్నిగ్ధైరభ్రపటచ్ఛేదైః బద్ధవ్రణమివాంబరమ్। 5

మందమారుతనిశ్వాసం సంధ్యాచందనరంజితం।
ఆపాండుజలదం భాతి కామాతురమివాంబరమ్। 6

ఏషా ఘర్మపరిక్లిష్టా నవవారిపరిప్లుతా।
సీతేవ శోకసంతప్తా మహీ బాష్పం విముంచతి। 7

మేఘోదరవినిర్ముక్తాః కల్హారసుఖశీతలాః।
శక్యమ్ అంజలిభిః పాతుం వాతాః కేతకిగంధినః। 8

ఏష ఫుల్లార్జునః శైలః కేతకైరధివాసితః।
సుగ్రీవ ఇవ శాంతారిః ధారాభిరభిషిచ్యతే। 9

శ్రీరాముడు వాలిని తుదముట్టించి, సుగ్రీవుని కిష్కింధకు పట్టాభిషిక్తుని గావించెను. పిమ్మట ఆ రఘువరుడు ప్రస్రవణగిరిపై (మాల్యంతమున) నివసించు సమయమున లక్ష్మణునితో ఇట్లనెను. (1)

"సౌమిత్రీ! ఇంతకుముందు మనము ప్రస్తావించుకొనిన రీతిగా వర్షాకాలము రానేవచ్చినది. పర్వతములవంటి మేఘములు ఆకాశమునందు అంతటను వ్యాపించియున్నవి. చూడుము. (2)

స్త్రీ తొమ్మిదిమాసములు గర్భమును ధరించి, అనంతరము శిశువునకు జన్మనిచ్చినట్లు, ఆకాశము సూర్యకిరణములద్వారా సముద్రజలములను పీల్చి తొమ్మిదిమాసములు తనలో నిలుపుకొని, వర్షరూపమున ఇప్పుడు ఆ జలసంపదను అందించుచున్నది. (3)

సోదరా! మేఘపంక్తులు (వరుసలు) అనెడి మెట్లద్వారా ఆకాశమునకు చేరి, కొండమల్లె, గన్నేరు పూలమాలికలతో మనము మనవంశమునకు మూలపురుషుడైన సూర్యభగవానుని అలంకరింపవచ్చును. (4)

సంధ్యారాగకాంతులచే ఎఱుపెక్కి, ఆర్ద్రమైనతెల్లనిమేఘ కాంతులచే ఆవరింపబడియున్న ఆకాశము తెల్లని కట్టుగుడ్డతో గూడిన రక్తసిక్తమైన వ్రణమువలె కన్పట్టుచున్నది. (5)

పిల్లగాలులే నిట్టూర్పులుగా, సంధ్యారాగములే ఎఱ్ఱచందనపు పూతలుగా, తెల్లని మేఘములే వివర్ణమైన (పాలిపోయిన) ముఖకాంతులుగా ఒప్పుచున్న ఆకాశము కామాతురునివలె[1] భాసిల్లుచున్నది. (6)

వేసవితాపమునకు వేడెక్కినదై, తొలకరిజల్లులకు తడిసిన భూమి విరహతాపముచే వేడికన్నీరు గార్చుచున్న సీతవలె ఆవిరిని వెలిగ్రక్కుచున్నది. (7)

మేఘములమధ్యనుండి తిన్నగవీచుచు, పాటలవర్ణము (తెలుపు ఎఱుపులతో గూడిన వన్నె) గల కలువల చల్లదనమును, మొగలిపూవుల సువాసనలను తీసికొనివచ్చుచున్న మందమారుతములను దోసిళ్లతో బట్టి త్రాగుట శక్యమే అని అనిపించుచున్నది. (8)

బాగుగా వికసించిన పూవులుగల అర్జునవృక్షములతోను, సువాసనలను వెదజల్లెడి మొగలిపొదలతోను ఒప్పుచు ప్రశాంతముగా నున్న ఈ ప్రస్రవణగిరి, శత్రుమరణానంతరము అర్జునపుష్పమాలలతోడను, మొగలిపూవులసుగంధములతోడను

1) కామాతురుడు విరహబాధకారణముగా నిట్టూర్పులు విడుచుచుండును, విరహతాపమునుండి బయటపడుటకై చల్లని చందనమును పూసికొనుచుండును. ఆ బాధకు తట్టుకొనలేక అతని ముఖమంతయు పాలిపోయియుండును.

మేఘకృష్ణాజినధరా ధారాయజ్ఞోపవీతినః।
మారుతాపూరితగుహాః ప్రాధీతా ఇవ పర్వతాః। 10

కశాభిరివ హైమీభిః విద్యుద్భిరివ తాడితమ్।
అంతః స్తనితనిర్ఘోషం సవేదనమివాంబరమ్। 11

నీలమేఘాశ్రితా విద్యుత్ స్ఫురంతీ ప్రతిభాతి మే।
స్ఫురంతీ రావణస్యాంకే వైదేహీవ తపస్వినీ। 12

ఇమాస్తా మన్మథవతాం హితాః ప్రతిహతా దిశః।
అనులిప్తా ఇవ ఘనైః నష్టగ్రహనిశాకరాః। 13

క్వచిద్బాష్పాభిసంరుద్ధాన్ వర్షాగమసముత్సుకాన్।
కుటజాన్ పశ్య సౌమిత్రే పుష్పితాన్ గిరిసానుషు।
మమ శోకాభిభూతస్య కామసందీపనాన్ స్థితాన్। 14

రజః ప్రశాంతం సహిమోఽద్య వాయుః
నిదాఘదోషప్రసరాః ప్రశాంతాః।
స్థితా హి యాత్రా వసుధాధిపానాం
ప్రవాసినో యాంతి నరాః స్వదేశాన్। 15

సంప్రస్థితా మానసవాసలుబ్ధాః
ప్రియాన్వితాః సంప్రతి చక్రవాకాః।
అభీక్ష్ణ వర్షోదక విక్షతేషు
యానాని మార్గేషు న సంపతంతి। 16

అలంకృతుడైన సుగ్రీవునివలె జలధారలచే అభిషేకింప బడుచున్నది. (9)

మేఘములనెడి కృష్ణాజినములను, వర్షధారలనెడి యజ్ఞోపవీతములను ధరించి, వాయువులతో నిండిన గుహలు గల పర్వతములు బ్రహ్మచారులవలె వేదాధ్యయనమును ప్రారంభించుచున్నట్లుగా తోచుచున్నది. (10)

మెఱుపులనెడి బంగారుకొరడాలతో కొట్టబడుచున్న ఆకాశము మేఘగర్జనలనెడి ఆర్తనాదములతో తనవేదనను ప్రకటించుచున్నట్లు ఉన్నది. నీలమేఘమును ఆశ్రయించి, మెఱయుచున్న విద్యుల్లత (మెఱపుతీగ) రావణుని చెఱలో శోకించుచున్న సీతాదేవిని స్ఫురింప జేయుచున్నది. (11-12)

మేఘములు దట్టముగా అలముకొనియుండుటచే ఆకాశమున చంద్రుడు, నక్షత్రములు (శుక్రాది గ్రహములు) మఱుగునబడినవి (కనబడుటలేదు) అందువలన ఆ చీకట్లలో తూర్పుమొదలగు దిశలు తెలియుటలేదు. అట్టి ఈ రాత్రులు ప్రేయసీప్రియులసుఖానుభవములకు అనుకూలముగా ఉండుటచే వారికి హాయిని గూర్చుచున్నవి. (13)

ఓ లక్ష్మణా! ఈ పర్వతశిఖరములపై బాగుగా వికసించిన కొండమల్లెలశోభలను పరికింపుము. తొలకరి జల్లులు పడుటచే కొన్నిచోట్ల అవి భూమినుండి వెలువడిన ఆవిరిచే కప్పబడియున్నవి, మఱికొన్ని తావుల వర్షజలస్పర్శచే కిలకిలలాడుచున్నవి. కాని శోకమగ్నుడనైన నాకుమాత్రము అవి విరహతాపమును పెంచుచున్నవి. (14)

వర్షములు బాగుగా కురియుచుండుటచే దుమ్ములు అణగిపోయినవి, చల్లని గాలులు వీచుచున్నవి. వేసవి కాలతాపములు తగ్గిపోయినవి, రాజులదైత్రయాత్రలు ఆగిపోయినవి, ఇతర (దూర) ప్రదేశములకు వెళ్లినవారు స్వస్థలములకు తిరిగి వచ్చుచున్నారు.[1] (15)

మానససరోవరమునందు నివసించుటకు ఆరాటపడు హంసలు[2] స్వస్థానమునకు బయలుదేఱినవి, ఇప్పుడు చక్రవాకములు ప్రియులను చేరినవి. ఎడతెఱపిలేని వానల వలన మార్గములు మిగుల దెబ్బతినుటచే రథములు మున్నగు వాహనముల సంచారములు ఆగిపోయినవి. (16)

1) భగవదనుగ్రహవీక్షణములు ప్రసరించినంతనే రజస్తమోగుణములు అంతరించును, భక్తజనులనిత్యజీవనవిధానమున ప్రశాంతి చేకూరును, హృదయతాపములు తొలగును, ఆధ్యాత్మికాదితాపత్రయములు శాంతించును, భవబంధములు తొలగిపోవును. జీవులకు స్వస్థలమైన పరమపదము ప్రాప్తించును- గోవిందరాజీయ వ్యాఖ్య-

2) 'పరమహంస'లుగా కీర్తింపబడు సన్న్యాసులు చాతుర్మాస్యదీక్షలకారణముగా సంచారములు మానుకొని తమ ఆశ్రమములకు చేరిరి. మోక్షకాంక్షగలవారు భగవద్భక్తిపరాయణులు అగుదురు, భగవత్కటాక్షముచే లౌకికకర్మలయందు ప్రవృత్తులుకారు.

క్వచిత్ప్రకాశం క్వచిదప్రకాశం
నభః ప్రకీర్ణాంబుధరం విభాతి ।
క్వచిత్ క్వచిత్ పర్వతసన్నిరుద్ధం
రూపం యథా శాంతమహార్ణవస్య । 17

ఆకాశమున మేఘములు చెల్లాచెదరైయున్నవి. మేఘములు ఆవరించియున్నచోట ఆకాశము కనబడుటలేదు, అవి అడ్డులేనిచోట స్పష్టముగా కనబడుచున్నది.(1) ఇంకను అక్కడక్కడ పర్వతములడ్డుకొని యుండుటచే ప్రశాంతముగా నున్న సముద్రమువలె భాసిల్లుచున్నది. (17)

వ్యామిశ్రితం సర్జకదంబపుష్పైః
నవం జలం పర్వతధాతుతామ్రం ।
మయూరకేకాభిరనుప్రయాతం
శైలాపగాః శీఘ్రతరం వహంతి । 18

వేగిస, కడిమి పుష్పములతో కలిసి తెల్లగను, పర్వతములయందలి గైరికాది ధాతువులతో గూడి ఎఱ్ఱగను ఉన్న వర్షజలములతో ఒప్పుచు, నెమళ్ల క్రేంకారములవలె గలగల ధ్వనులను జేయుచు సెలయేళ్లు వేగముగా ప్రవహించుచున్నవి.(2) (18)

రసాకులం షట్పదసన్నికాశం
ప్రభుజ్యతే జంబుఫలం ప్రకామం ।
అనేకవర్ణం పవనావధూతం
భూమౌ పతత్యామ్రఫలం విపక్వమ్ । 19

ఈ వర్షాకాలమున తుమ్మెదలవలె నల్లగానుండి కమ్మని రసముతో నిండిన నేరేడుపండ్లను, బాగుగా పండి, అనేకవర్ణములు గలిగి, గాలులతాకిడికి నేలపై రాలిపడిన మామిడిపండ్లను జనులు మిక్కిలి మక్కువతో తిందురు.(3) (19)

విద్యుత్పతాకాః సబలాకమాలాః
శైలేంద్రకూటాకృతిసన్నికాశాః ।
గర్జంతి మేఘాః సముదీర్ణనాదా
మత్తా గజేంద్రా ఇవ సంయుగస్థాః । 20

మెఱుపులనెడి పతాకములతో, కొంగలపంక్తులనెడి పూలమాలలతో, పర్వతశిఖరములవంటి ఆకారములతో ఒప్పుచు మహాధ్వనులతో గర్జించుచున్న మేఘములు, మెఱయుచున్న జయపతాకములతో, తెల్లని పూలమాలలతో, పర్వతశిఖరములవంటి పెద్దపెద్ద ఆకారములతో విలసిల్లుచు, ఘీంకరించుచున్న (యుద్ధరంగమునందలి) మదపుటేనుగులవలె అలరారుచున్నవి. (20)

వర్షోదకాప్యాయితశాద్వలాని
ప్రవృత్తనృత్తోత్సవబర్హిణాని ।
వనాని నిర్వృష్ట బలాహకాని
పశ్యాపరాహ్ణేష్వధికం విభాంతి । 21

లక్ష్మణా! మేఘములన్నియు బాగుగా వర్షించి యుండుటచే ఆ వాననీటికి పచ్చిక బయళ్ళు ఏపుగా పెఱిగి కలకలలాడుచున్నవి. నెమళ్లగుంపులు నృత్యోత్సవములు ప్రారంభించినవి. కనుక మధ్యాహ్నసమయమున కనువిందు గావించుచున్న ఈ వనములశోభలను తిలకింపుము. (21)

సముద్వహంతః సలిలాతిభారం
బలాకినో వారిధరా నదంతః ।
మహత్సు శృంగేషు మహీధరాణాం
విశ్రమ్య విశ్రమ్య పునఃప్రయాంతి । 22

కొంగలతోగూడిన మేఘములు జలభారమును మోయుచు ఉఱుముచు, పర్వతములయొక్క ఉన్నత శృంగప్రదేశములయందు అక్కడక్కడ ఆగుచు, సాగిపోవుచున్నవి.(4) (22)

మేఘాభికామా పరిసంపతంతీ
సమ్మోదితా భాతి బలాకపంక్తిః ।

గర్భధారణార్థము బలాకపక్షులు మేఘములపై మక్కువ జూపుచు, వాటిని కలియుటకై సంతోషముతో

1) మోహము తొలగని సాధకునకు బ్రహ్మస్వరూపము ద్యోతకముకాదు. అది వీడినంతనే ఆత్మ స్వరూపము స్పష్టమగును.
2) భక్తులహృదయములలో జ్ఞానము, సాత్త్వికరాజసగుణములు మిశ్రితమైయుండును. వారిముఖములనుండి జాలువాఱెడి భక్తి ప్రేరితములైన భగవన్నుతులు పరిసరములయందు ప్రతిధ్వనించుచుండును.
3) భగవదనుగ్రహముచే జీవులు తమకర్మలను అనుసరించి, శుభాశుభఫలములను అనుభవింతురు.
4) హృదయమునందు భగవంతుని నిలుపుకొని (భగవంతునిభారమును హృదయమున మోయుచు) దైవధ్యానమునందు నిమగ్నులైన జ్ఞానులు నిరంతరము ఆ పరమేశ్వరుని స్తుతించుచు క్రమక్రమముగా తమపాపములను అధిగమించుచు పరంధామమును చేరుదురు.

వాతావధూతా వరపౌండరీకీ
లంబేవ మాలా రచితాంబరస్య ॥ 23

బారులు తీరి ఎగురుచున్నవి. ఆ బలాకపంక్తులు గాలికి కదలుచు, ఆకాశముయొక్క మెడలో వ్రేలాడుచున్న తెల్లనిపద్మముల మాలికలవలె కన్పట్టుచున్నవి. (23)

బాలేంద్రగోపాంతరచిత్రితేన
విభాతి భూమిర్నవశాద్వలేన ।
గాత్రానువృత్తేన శుకప్రభేణ
నారీవ లాక్షోక్షితకంబళేన ॥ 24

అక్కడక్కడ చిన్నచిన్న ఆరుద్రపురుగులుగల పచ్చికబయళ్ళు గూడిన భూమి అటనట లక్కరంగుచుక్కలు గలిగి, ఎక్కువభాగము చిలుకపచ్చనన్నెలో ఒప్పుచున్న కంబళమును (శాలువను) కప్పుకొనిన స్త్రీవలె రాజిల్లుచున్నది. (24)

నిద్రా శనైః కేశవమభ్యుపైతి
ద్రుతం నదీ సాగరమభ్యుపైతి ।
హృష్టా బలాకా ఘనమభ్యుపైతి
కాంతా సకామా ప్రియమభ్యుపైతి ॥ 25

ఈ వర్షాకాలసమయమున ప్రాణులు గాఢనిద్రలో ఉన్నప్పుడు జీవాత్మ మెల్లగా పరమాత్మను చేరును. నది వేగముగా ప్రవహించుచు సముద్రమును చేరును. సంతోషముతో బలాకపక్షి మేఘమును సమీపించును. యువతి సకామభావముతో సేవించుటకై తనప్రియుని సమీపించును. (25)

జాతా వనాంతాః శిఖి సంప్రనృత్తా
జాతాః కదంబాః సకదంబశాఖాః ।
జాతా వృషా గోషు సమానకామా
జాతా మహీ సస్యవనాభిరామా ॥ 26

వనములన్నియును నెమళ్లనృత్యములతో శోభిల్లుచున్నవి. కడిమిచెట్లన్నియును చక్కనికొమ్మలతో, పూలతో అలరారుచున్నవి. వృషభములు, గోవులు సమానముగా కామ ప్రవృత్తి కలిగియున్నవి. భూమండలము అంతయును పైరు పంటలతో, వనములతో విరాజిల్లుచున్నది. (26)

వహంతి వర్షంతి నదంతి భాంతి
ధ్యాయంతి నృత్యంతి సమాశ్వసంతి ।
నద్యో ఘనా మత్తగజా వనాంతాః
ప్రియావిహీనాః శిఖినః ప్లవంగాః ॥ 27

ఈ వర్షాకాలమున నదులు పొంగి ప్రవహించుచున్నవి. మేఘములు వర్షించుచున్నవి. మదపుటేనుగులు ఘీంకరించుచున్నవి. వనములన్నియును కలకలలాడుచున్నవి. ఎడబాటునకు లోనైన యువతీయువకులు విరహముతో బాధపడుచున్నారు. మయూరములు నాట్యములు చేయుచున్నవి. వానరములు విరివిగా పండ్లు లభించుచుండుటచే నిర్విచారముగా (సంతోషముతో) ఉన్నవి. (27)

ప్రహర్షితాః కేతకపుష్పగంధమ్
ఆఘ్రాయ హృష్టా వననిర్ఝరేషు ।
ప్రపాత శబ్దాకులితా గజేంద్రాః
సార్ధం మయూరైః సమదా నదంతి ॥ 28

సెలయేళ్లతీరములయందు విహరించుచున్న మదపుటేనుగులు మొగలిపూవుల వాసనలను ఆఘ్రాణించి, పరమసంతోషముతో పరవసించియున్నవి. జలపాతములయొక్క మహాధ్వనులకు అవి వ్యాకులపాటునకు లోనై, ఘీంకరించుచు మయూరముల క్రేంకారములతో స్వరము కలుపుచున్నవి. (28)

ధారానిపాతైరభిహన్యమానాః
కదంబశాఖాసు విలంబమానాః ।
క్షణార్జితం పుష్పరసావగాఢం
శనైర్మదం షట్చరణాస్త్యజంతి ॥ 29

జడివానలతాకిడికి మిగుల దెబ్బతిని, కడిమిచెట్ల కొమ్మలపై చేరిన తుమ్మెదలకు అంతకుముందే బాగుగా త్రాగిన పూదేనెల మత్తు క్రమముగా దిగిపోయినది. (29)

అంగారచూర్ణోత్కర సన్నికాశైః
ఫలైః సువర్యాప్తరసైః సమృద్ధైః ।
జంబూద్రుమాణాం ప్రవిభాంతి శాఖాః
నిలీయమానా ఇవ షట్పదౌఘైః ॥ 30

నేరేడువృక్షములకు గుత్తులు గుత్తులుగా ఉండి, రససమృద్ధిగల పండ్లు బొగ్గుపొడి ముద్దలవలె నల్లగా అలరారుచున్నవి. అట్టి పండ్లుగల ఆ కొమ్మలు తుమ్మెదల గుంపులతో నిండిపోయినట్లు కన్పట్టుచున్నవి. (30)

తటిత్పతాకాభి రలంకృతానామ్
ఉదీర్ణ గంభీర మహారవాణాం ।
విభాంతి రూపాణి వలాహకానాం
రణోద్యతానామివ వారణానామ్ । 31

మార్గానుగః శైలవనానుసారీ
సంప్రస్థితో మేఘరవం నిశమ్య ।
యుద్ధాభికామః ప్రతినాగశంకీ
మత్తో గజేంద్రః ప్రతిసన్నివృత్తః । 32

క్వచిత్ ప్రగీతా ఇవ షట్పదౌఘైః
క్వచిత్ ప్రనృత్తా ఇవ నీలకంఠైః ।
క్వచిత్ ప్రమత్తా ఇవ వారణేంద్రైః
విభాంత్యనేకాశ్రయిణో వనాంతాః । 33

కదంబ సర్జార్జున కందలాఢ్యా
వనాంతభూమిర్నవవారిపూర్ణా ।
మయూరమత్తాభిరుత ప్రనృత్తైః
ఆపానభూమిప్రతిమా విభాతి । 34

ముక్తాసకాశం సలిలం పతద్వై
సునిర్మలం పత్రపుటేషు లగ్నం ।
హృష్టా వివర్ణచ్ఛదనా విహంగాః
సురేంద్రదత్తం తృషితాః పిబంతి । 35

షట్పాదతంత్రీ మధురాభిధానం
ప్లవంగమోదీరిత కంఠతాళం ।
ఆవిష్కృతం మేఘమృదంగనాదైః
వనేషు సంగీతమివ ప్రవృత్తమ్ । 36

క్వచిత్ ప్రనృత్తైః క్వచిదున్నదద్భిః
క్వచిచ్చ వృక్షాగ్రనిషణ్ణకాయైః ।
వ్యాలంబ బర్హాభరణైర్మయూరైః
వనేషు సంగీతమివ ప్రవృత్తమ్ । 37

స్వనైర్ఘనానాం ప్లవగాః ప్రబుద్ధా
విహాయ నిద్రాం చిరసన్నిరుద్ధాం ।
అనేక రూపాకృతి వర్ణనాదా
నవాంబుధారాభిహతా నదంతి । 38

మెఱుపుతీగలనెడి పతాకములతో ఒప్పుచు, మిగులగంభీరముగా గర్జించుచున్న మేఘములయొక్క రూపములు, మెఱయుచున్న జయపతాకములతో విలసిల్లుచు, మిక్కిలి గంభీరముగా ఘీంకారములు సలుపుచు యుద్ధమునకు సిద్ధమగుచున్న ఏనుగులయొక్క రూపములవలె విరాజిల్లుచున్నవి. (31)

రణరంగమున యుద్ధమునకు సిద్ధముగా ఉన్న మదపుటేనుగు మేఘగర్జనను విని, అది ప్రతిపక్షమునందలి ఏనుగుయొక్క ఘీంకారమేయని తలంచెను. వెంటనే ఆ గజము వనపర్వతముల మార్గమున సాగిపోయి, ఎచ్చటను శత్రుగజము కనబడకపోవుటచే అది తనభ్రమయేయని భావించెను. వెంటనే అది తన స్థానమునకు మఱలెను.(32)

ఇచటి వనములమధ్యప్రదేశములు కొన్నిచోట్ల తుమ్మెదలు ఝుంకారములు చేయుచున్నట్లుగను, మఱికొన్ని తావుల నెమళ్లు నృత్యములు చేయుచున్నట్లుగను, మఱికొన్నిచోట్ల మదపుటేనుగులు సంచరించుచున్నట్లుగను తోచుచు అనేక కార్య కలాపములకు ఆశ్రయమైయున్నట్లు భాసిల్లుచున్నవి. (33)

ఆ వనమధ్యప్రదేశము కడిమి, సర్జ, అర్జున, మెట్టతామర మొదలగు పుష్పములతో ఒప్పుచు, వర్షజలములతో పరిపూర్ణమై, మత్తిల్లిన నెమళ్లకలరవములచే, నృత్యములచే విలసిల్లుచుండుటవలన అది మధుశాలవలె తోచుచున్నది.(34)

రంగురంగుల ఱెక్కలుగలవి, దప్పిగొన్నవి అగు ఆ చాతకపక్షులు. ఇంద్రునిఅనుగ్రహముచే కురిసి, తామరాకులమీదపడి, మంచిముత్యములవలె మెఱయుచున్న ఆ వర్షజలమును సంతోషముతో త్రాగుచున్నవి. (35)

తుమ్మెదలఝుంకారములే తంత్రీవాద్యములుగా, కప్పలబెకబెకలే కంఠతాళములుగా, మేఘగర్జనలే మృదంగధ్వనులుగా మిళితములై వనములలో సంగీతము సాగుచుండెను. ఆ తంత్రీ, తాళ, మృదంగవాద్యములకు అనుగుణముగా పింఛములే ఆభరణములుగా నెమళ్లు కొన్ని పురివిప్పి లయబద్ధముగా నృత్యము చేయుచున్నవి. క్రేంకారములతో రాగయుక్తముగా గానము చేయుచున్నవి. మఱికొన్ని వృక్షాగ్రభాగమున నిలిచి, ఆ గానానందమును పొందుచున్నవి. ఈ విధముగా ఆ వనములు సంగీతమయములై తోచుచున్నవి. (36-37)

పలు రూపములు, ఆకృతులు, రంగులు, ధ్వనులు గలవి, బాగుగా నిద్రలో మునిగియున్నవియగు కప్పలు మేఘగర్జనలకు మేల్కొని, వర్షాకాలపు మేఘములు కురియుచున్న జలధారలతాకిడికి లోనై బెకబెకలు చేయుచున్నవి. (38)

నద్యః సముద్వాహిత చక్రవాకా:
తటాని శీర్ణాన్యపవాహయిత్వా ।
దృప్తా నవప్రాభృత పూర్ణభోగా
ద్రుతం స్వభర్తారముపోపయాంతి ॥ 39

చక్కని స్తనసౌభాగ్యముగల నూతనవధువు కామావేశమునకు లోనై, లజ్జను ప్రక్కనబెట్టి, పండ్లు, పాలు, చందనాదికానుకలతో తనభర్తను చేరుచున్నట్లు వర్షములకు ఉప్పొంగిన నదులు చక్రవాకములనెడి స్తనములతో ఒప్పుచు మర్యాదలను ఉల్లంఘించి, (గట్లను కూలగొట్టుచు) నూతనములగు ఫలపుష్పాది బహుమతులతో తమపతియైన సముద్రుని జేరుటకు పరుగులుదీయుచున్నవి. (39)

నీలేషు నీలా: ప్రవిభాంతి సక్తా:
మేఘేషు మేఘా నవవారిపూర్ణా: ।
దవాగ్నిదగ్ధేషు దవాగ్నిదగ్ధా:
శైలేషు శైలా ఇవ బద్ధమూలా: ॥ 40

నల్లని మేఘములపై చేరిన జలములతో నిండిన నల్లని మేఘములు దావాగ్నిచే దగ్ధమగుచున్న శైలములపై సమూలముగా కాలుచిచ్చునకు కాలిపోవుచున్న మరికొన్ని పర్వతములవలె ఒప్పుచున్నవి. (40)

ప్రహృష్ట సన్నాదిత బర్హిణాని
సశక్రగోపాకుల శాద్వలాని ।
చరంతి నీపార్జున వాసితాని
గజా: సురమ్యాణి వనాంతరాణి ॥ 41

అచటి వనములలోని నెమళ్లు సంతోషముతో చక్కగా క్రేంకారములు పలుకుచున్నవి, ఆరుద్రపురుగులతో నిండియున్న పచ్చికబయళ్లు కనువిందుగావించుచున్నవి. కదంబ-అర్జున పుష్పములసువాసనలు గుబాళించుచున్నవి. అట్టి రమ్యవనములలో గజములు సంచరించుచున్నవి. (41)

నవాంబుధారాహత కేసరాణి
ద్రుతం పరిత్యజ్య సరోరుహాణి ।
కదంబ పుష్పాణి సకేసరాణి
నవాని హృష్టా భ్రమరా: పతంతి ॥ 42

సరస్సులలోని పద్మములకేసరములు తొలకరివానల జలధారలకు దెబ్బతినగా వెంటనే తుమ్మెదలు వాటిని వీడి, అప్పుడే వికసించిన కదంబపుష్పముల కేసరములపై సంతోషముతో వాలుచున్నవి. (42)

మత్తా గజేంద్రా ముదితా గవేంద్రా
వనేషు విశ్రాంతతరా మృగేంద్రా: ।
రమ్యా నగేంద్రా నిభృతా నరేంద్రా:
ప్రక్రీడితో వారిధరై: సురేంద్ర: ॥ 43

వర్షాకాలమునందు గజేంద్రములు మదించియున్నవి. వృషభములు సంతోషముతో రంకెలు వేయుచున్నవి. వనములలో మృగరాజులు హాయిగా విశ్రాంతి తీసికొనుచున్నవి. ప్రకృతి అందచందములతో పర్వతములు మనోహరముగా ఉన్నవి. మహారాజులు జైత్రయాత్రలు మాని కళారాధనలో ఆనందించుచుండిరి. దేవేంద్రుడు విలాసముగా మేఘములతో వినోదించుచుండెను. ఇట్లు ప్రాణులన్నియును మానసోల్లాసమును పొందుచున్నవి. (43)

మేఘా: సముద్భూత సముద్రనాదా
మహాజలౌఘై: గగనావలంబా: ।
నదీస్తటాకాని సరాంసి వాపీ:
మహీం చ కృత్స్నామ్ అపవాహయంతి ॥ 44

ఆకాశమున నిలిచియున్న మేఘములు సముద్రఘోషలనుమించి గర్జనలు చేయుచున్నవి. అవి తమ వర్షధారలచే నదులను, చెఱువులను, సరస్సులను, బావులను, సమస్త భూమండలమును ముంచెత్తుచున్నవి. (44)

వర్షప్రవేగా విపులా: పతంతి
ప్రవాంతి వాతా: సముదీర్ణఘోషా: ।
ప్రణష్టకూలా: ప్రవహంతి శీఘ్రం
నద్యో జలైర్విప్రతిపన్నమార్గా: ॥ 45

వర్షములు కుండపోతగా వేగముగా పడుచున్నవి. వాయువులు మహాధ్వనులతో వీచుచున్నవి. నదులు జలములతో ఉప్పొంగి, గట్లను తెగగొట్టుచు, మార్గములను ముంచివేయుచు చకచకా ప్రవహించుచున్నవి. (45)

నద్రై ర్నవేంద్రా ఇవ పర్వతేంద్రాః
సురేంద్రదత్తైః పవనోపనీతైః ।
ఘనాంబుకుంభైరభిషిచ్యమానా
రూపం శ్రియం స్వామివ దర్శయంతి ॥ 46

ఘనోపగూఢం గగనం సతారం
న భాస్కరో దర్శనమభ్యుపైతి ।
నవైర్జలౌఘైర్ధరణీ వితృప్తా
తమోవిలిప్తా న దిశః ప్రకాశాః ॥ 47

మహాంతి కూటాని మహీధరాణాం
ధారాభిధౌతాన్యధికం విభాంతి ।
మహాప్రమాణైర్విపులైః ప్రపాతైః
ముక్తాకలాపైరివ లంబమానైః ॥ 48

శైలోపలప్రస్ఖలమానవేగాః
శైలోత్తమానాం విపులాః ప్రపాతాః ।
గుహాసు సన్నాదితబర్హిణాసు
హారా వికీర్యంత ఇవాభిభాంతి ॥ 49

శీఘ్రప్రవేగా విపులాః ప్రపాతా
నిర్ధౌత శృంగోపతలా గిరీణాం ।
ముక్తాకలాపప్రతిమాః పతంతో
మహాగుహోత్సంగతలైర్ధ్రియంతే ॥ 50

సురతామర్దవిచ్ఛిన్నాః స్వర్గస్త్రీహారమౌక్తికాః ।
పతంతీవాకులా దిక్షు తోయధారాః సమంతతః ॥ 51

నిలీయమానైర్విహగైః నిమీలద్భిశ్చ పంకజైః ।
వికసంత్యా చ మాలత్యా గతోఽస్తం జ్ఞాయతే రవిః ॥ 52

వృత్తా యాత్రా నరేంద్రాణాం సేనా ప్రతినివర్తతే ।
వైరాణి చైవ మార్గాశ్చ సలిలేన సమీకృతాః ॥ 53

మాసి ప్రోష్ఠపదే బ్రహ్మ బ్రాహ్మణానాం వివక్షతాం ।
అయమ్ అధ్యాయసమయః సామగానాముపస్థితః ॥ 54

నివృత్తకర్మాయతనో నూనం సంచితసంచయః ।
ఆషాఢీమ్ అభ్యుపగతో భరతః కోసలాధిపః ॥ 55

మానవులచే జలకలశములద్వారా మహారాజులు అభిషేకింపబడునట్లు, ఇంద్రునిచే ప్రేరేపింపబడి, వాయువులచే కొనిరాబడిన మేఘములనెడి జలకుంభములచే అభిషేకింపబడుచున్న పర్వతములు తమ రూపములను, వైభవములను లోకమునకు ప్రదర్శించుచున్నట్లు ఒప్పుచున్నవి. (46)

మేఘములు ఆకాశమును కప్పివేయుటచే రాత్రివేళ నక్షత్రములుగాని, పగటిపూట సూర్యుడుగాని కనబడుటలేదు. భూమియంతయు జలమయమైనది. అంతటను చీకట్లు దట్టముగా అలముకొనుటచే దిక్కులు స్పష్టముగా గోచరించుటయే లేదు.(47)

మహోన్నతములైన పర్వతశిఖరములు వర్షధారలచే పూర్తిగాక్షాళితములై (కడుగబడినవై) మిక్కిలి ప్రకాశించుచున్నవి. వాటిపై విశాలములైన పెక్కుజలపాతములు ప్రవహించుచుండుటచే అవి ముత్యాలహారములను ధరించినట్లు భాసిల్లుచున్నవి.(48)

కొండబాళ్లు అడ్డుపడుటవలన మహాపర్వతశిఖరములనుండి ప్రవహించు జలపాతములవేగము ఆగిపోయి, అవి నెమళ్ల క్రేంకారములతో నిండిన గుహలలో పడుచున్నవి. అప్పుడు అవి చెల్లాచెదరైన ముత్యాలహారములవలె విరాజిల్లుచున్నవి.(49)

పర్వతశిఖరములనుండి విశాలములై మహావేగముగా ప్రవహించుచున్న జలపాతములు క్రిందనున్న ప్రదేశములపైబడి వాటిని శుభ్రపఱచుచున్నవి. అప్పుడు అవి పర్వతగుహలు ధరించిన ముత్యాల హారములవలె శోభిల్లుచున్నవి. (50)

నలుదిక్కులయందు అంతటను పడుచున్న వర్షధారలు, స్వర్గస్త్రీలు తమప్రియులతో క్రీడించుచున్నప్పుడు తెగిపోయిన కంఠహారములనుండి రాలిపడుచున్న ముత్యములవలె ఒప్పుచున్నవి. (51)

పక్షులన్నియును తమతమగూండ్లకు (గూళ్లకు) చేరినవి. కమలములు ముకుళించుకొని పోవుచున్నవి, జాజిపువ్వులు వికసించుచున్నవి. దీనిని బట్టి సూర్యుడు అస్తమించుచున్నట్లు తెలియుచున్నది. (52)

మార్గములన్నియును నీటిప్రవాహములలో మునిగిపోవుట వలన త్రోవలు స్పష్టముగా గుర్తింప వీలులేకున్నవి. అందువలన ముందునకు సాగిపోవుచున్న రాజులసైన్యములు తమతమజైత్రయాత్రలను మానుకొని వెనుకకు మఱలినవి. భాద్రపదమాసమునందు వేదమును పఠింపగోరిన సామవేదశాఖకు చెందిన బ్రాహ్మణులు అధ్యయనము చేయు సమయము ఆసన్నమైనది. (53-54)

కోసలదేశప్రభునైన భరతుడు నాలుగుమాసములకు కావలసిన గృహోపకరణములను, సమృద్ధిగా సంపదలను సమకూర్చుకొని ఆషాఢపూర్ణిమనాటినుండి చాతుర్మాస్యవ్రత దీక్షను పూనియే యుండును. (55)

నూనమ్ ఆపూర్యమాణాయాః సరయ్వా వర్ధతే రయః।
మాం సమీక్ష్య సమాయాంతమ్ అయోధ్యాయా ఇవ స్వనః। 56

ఇమాః స్ఫీతగుణా వర్షాః సుగ్రీవః సుఖమశ్నుతే।
విజితారిః సదారశ్చ రాజ్యే మహతి చ స్థితః। 57

అహం తు హృతదారశ్చ రాజ్యాచ్చ మహతశ్చ్యుతః।
నదీకూలమివ క్లిన్నమ్ అవసీదామి లక్ష్మణ। 58

శోకశ్చ మమ విస్తీర్ణో వర్షాశ్చ భృశదుర్గమాః।
రావణశ్చ మహాన్ శత్రుః అపారం ప్రతిభాతి మే। 59

అయాత్రాం చైవ దృష్ట్వేమాం మార్గాంశ్చ భృశదుర్గమాన్।
ప్రణతే చైవ సుగ్రీవే న మయా కించిదీరితమ్। 60

అపి చాతిపరిక్లిష్టం చిరాద్దారైః సమాగతం।
ఆత్మకార్యగరీయస్త్వాత్ వక్తుం నేచ్ఛామి వానరమ్। 61

స్వయమేవ హి విశ్రమ్య జ్ఞాత్వా కాలముపాగతం।
ఉపకారం చ సుగ్రీవో వేత్స్యతే నాఽత్ర సంశయః। 62

తస్మాత్ కాలప్రతీక్షోఽహం స్థితోఽస్మి శుభలక్షణ।
సుగ్రీవస్య నదీనాం చ ప్రసాదమ్ అనుపాలయన్। 63

ఉపకారేణ వీరో హి ప్రతికారేణ యుజ్యతే।
అకృతజ్ఞోఽప్రతికృతో హంతి సత్త్వవతాం మనః। 64

తమేవముక్తః ప్రణిధాయ లక్ష్మణః
కృతాంజలిః తత్ప్రతిపూజ్య భాషితమ్।
ఉవాచ రామం స్వభిరామదర్శనం
ప్రదర్శయన్ దర్శనమాత్మనః శుభమ్। 65

నేను వనవాసమునకు బయలుదేఱునప్పుడు అయోధ్యా ప్రజలఆర్తనాదములు వెల్లువికినట్లు, వర్షజలములకు పొంగిన సరయూనదీ ప్రవాహముయొక్క వేగముగూడ వృద్ధిచెంది యుండుట నిశ్చయము సుమా! (56)

శత్రువిజేతయైన సుగ్రీవుడు భార్యను చేరదీసి, రాజ్యాధికారమును చేపట్టియున్నాడు. అతడు మిగుల సంతోషమును గూర్చెడి ఈ వర్షాకాలమున సుఖానందములను అనుభవించుచున్నాడు. నాయనా! లక్ష్మణా! మఱి నేనైతే మహారాజ్యాధికారమును జాఱవిడుచుకొంటిని. నా భార్య అపహరింపబడినది. ప్రస్తుతము నేను ప్రవాహవేగమునకు కోసికొనిపోయిన నదీతీరమువలె కృశించియున్నాను. నా శోకమునకు అంతులేకున్నది. వర్షములు విజృంభించి కురియుచున్నవి. అందువలన ఎటు పోవుటకును వీలులేకున్నది. రావణుడేమో బలమైనశత్రువు. ఈ గడ్డుపరిస్థితులనుండి బయటపడుట కష్టముగా తోచుచున్నది. (57-59)

ఎటు ప్రయాణము చేయుటకును ఈ సమయము అనువుగాదు. త్రోవలు అన్నియును పాడైపోయియున్నవి. కిష్కింధకు వెళ్లుచు సుగ్రీవుడు నాకు నమస్కరించునప్పుడు ఈ వర్షాకాలపరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, సీతాన్వేషణ ప్రయత్నమును గూర్చి నేను అతనితో ఒక్కముక్క గూడ చెప్పలేదు. సుగ్రీవుడు ఎంతో కాలము కష్టములను అనుభవించిన పిదప భార్యను పొందగలిగినాడు. ఇక మనకార్యము చాలా శ్రమతో గూడినది. స్వల్పకాలములో అది సిద్ధించునదికాదు. కనుక అప్పుడు అతనితో ఏ మాటయు ప్రస్తావింపదలచుకొనలేదు.(60-61)

సుగ్రీవుడు కొంతకాలము ఆగిన పిమ్మట, శరత్కాలము మొదలుకాగానే గుర్తించి, అతడే మనకు ఉపకారము చేయుటకు స్వయముగా పూనుకొనగలడు. ఇందులకు సందేహములేదు. ఓ బుద్ధిమంతుడా! అందువలన అతడు మనకార్యమునకు దిగువఱకును, పొంగిపొఱలుచున్న నదులు శాంతించువఱకును నిరీక్షించుచు ఇచటనే ఉండెదను. (62-63)

ఉపకారమును పొందిన వీరుడు ప్రత్యుపకారమును తప్పకచేయును. పొందిన ఉపకారమును మఱచి, ప్రత్యుపకారమును చేయనిచో సత్పురుషుల మనస్సులు బాధపడును. నలుగురూ తనను నిందింతురను భయముతో నైనను సుగ్రీవుడు మనకు సాయపడును." (64)

శ్రీరాముడు పలికిన వచనములు భవిష్యత్కార్యక్రమమునకు అనువుగా ఉన్నట్లు భావించి, లక్ష్మణుడు తన ముఖకవళికలద్వారా సంతోషమును ప్రకటించెను. పిమ్మట అతడు అంజలి ఘటించి నయనాభిరాముడైన శ్రీరామునితో ఇట్లు నుడివెను. (65)

యథోక్త మేతత్ తవ సర్వమీప్సితం
నరేంద్ర కర్తా న చిరాద్ధరీశ్వరః ।
శరత్ప్రతీక్షః క్షమతామిమం భవాన్
జలప్రపాతం రిపునిగ్రహే ధృతః ॥ 66

"ఓ నరేంద్రా! నీవు చెప్పిన రీతిగా నీ కోరికమేరకు సుగ్రీవుడు మనకార్యములను అన్నింటిని త్వరలోనే తప్పక నెఱవేర్చగలడు. పూజ్యుడవైన నీవు శరత్కాలము వఱకు నిరీక్షించుచుండుము. నీవు శత్రుసంహార సమర్థుడవు కనుక శోకరహితుడవై వర్షాకాలము ముగియువఱకును ఓపిక పట్టుము. (66)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే అష్టావింశః సర్గః (28)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువదియెనిమిదవసర్గము

— ❋ ❋ ❋ —

29. ఇరువదితొమ్మిదవసర్గము

శరత్కాలము ప్రారంభమైన విషయమును గుర్తించి, మిత్ర కార్యమునకు (సీతాన్వేషణమునకు) పూనుకొనవలసినదిగా హనుమంతుడు సుగ్రీవునకు యుక్తియుక్తముగా సూచించుట - మారుతిమాటలను ఆదరించి ఆ కపిరాజు సేనలను సమీకరింపుమని 'నీలుడు' అను సేనాపతిని ఆజ్ఞాపించుట.

సమీక్ష్య విమలం వ్యోమ గతవిద్యుద్వలాహకం।
సారసారవసంఘుష్టం రమ్యజ్యోత్స్నానులేపనమ్॥ 1

హనుమంతుడు మెఱుపులు, మేఘములు లేకుండ నిర్మలముగా ఉన్న ఆకాశమును చూచెను. అది బెగ్గురు పక్షుల కలరవములతో నిండియుండెను. పిండి ఆరబోసినట్లు వెన్నెల వ్యాపించి యుండుటచే మనోహరముగా ఉండెను.(1)

సమృద్ధార్థం చ సుగ్రీవం మందధర్మార్థసంగ్రహం।
అత్యర్థమ్ అసతాం మార్గమ్ ఏకాంతగతమానసమ్॥ 2

నిర్వృత్తకార్యం సిద్ధార్థం ప్రమదాభిరతం సదా।
ప్రాప్తవంతమ్ అభిప్రేతాన్ సర్వానేవ మనోరథాన్॥ 3

స్వాం చ పత్నీమ్ అభిప్రేతాం తారాం చాపి సమీప్సితాం।
విహరంతమ్ అహోరాత్రం కృతార్థం విగతజ్వరం॥ 4

క్రీడంతమివ దేవేశం నందనేఽప్సరసాం గణైః।
మంత్రిషు న్యస్తకార్యం చ మంత్రిణామ్ అనవేక్షకం॥ 5

అంతట మారుతి వర్షాకాలము ముగిసి, శరత్కాలము ప్రారంభమైనట్లును, అది సీతాన్వేషణకు తగిన సమయమనియు గుర్తించి, వెంటనే సుగ్రీవునికడకు వెళ్లెను. అప్పుడు సుగ్రీవుడు సంపదలలో మునిగితేలుచు ధర్మార్థములను పట్టించుకొనకయుండెను. కామ పరవశుడై ఏకాంతమున భోగలాలసుడై యుండెను. తనను బాధించినట్టి వాలి హతుడై, రాజ్యాధికారము చేజిక్కుటతో నిరంతరము స్త్రీలోలుడై యుండెను. అతని మనోరథములు అన్నియును సిద్ధించియుండెను. తన భార్యయగు రుమతోడను, తారతోడనుగూడి అహోరాత్రములు విహరించుచుండెను. అతడు ఈ విధముగా కృతార్థుడగుచున్నందున అతని విరహబాధ తొలగిపోయెను. నందనవనమున దేవేంద్రుడు అప్సరసలతోవలె అతడు తనతరుణీమణులతో క్రీడించుచుండెను. అతడు రాజ్యపాలనభారమును పూర్తిగా మంత్రులపైననే ఉంచెను. మంత్రులకార్యకలాపములను ఏ మాత్రమూ పట్టించు కొనకుండెను. (2-5)

ఉత్పన్నరాజ్యసందేశం కామవృత్తమ్ అవస్థితం।
నిశ్చితార్థోఽర్థతత్త్వజ్ఞః కాలధర్మవిశేషవిత్॥ 6

సుగ్రీవుడు సర్వదా కామపరతంత్రుడగుటవలన రాజ్యస్ఫూర్తి దెబ్బతినినది. వాయుసుతుడు సకల శాస్త్రముల రహస్యములను బాగుగా ఎఱిగినవాడు. కర్తవ్యా

ప్రసాద్య వాక్యైర్మధురైః హేతుమద్భిర్మనోరమైః।
వాక్యవిద్వాక్యతత్త్వజ్ఞం హరీశం మారుతాత్మజః। 7

హితం తథ్యం చ పథ్యం చ సామధర్మార్థనీతిమత్।
ప్రణయప్రీతిసంయుక్తం విశ్వాసకృత నిశ్చయం।
హరీశ్వరమ్ ఉపాగమ్య హనుమాన్ వాక్యమబ్రవీత్। 8

రాజ్యం ప్రాప్తం యశశ్చైవ కౌలీ శ్రీరభివర్ధితా।
మిత్రాణాం సంగ్రహః శేషః తం భవాన్ కర్తుమర్హతి। 9

యో హి మిత్రేషు కాలజ్ఞః సతతం సాధు వర్తతే।
తస్య రాజ్యం చ కీర్తిశ్చ ప్రతాపశ్చాభివర్ధతే। 10

యస్య కోశశ్చ దండశ్చ మిత్రాణ్యాత్మా చ భూమిప।
సమవేతాని సర్వాణి స రాజ్యం మహదశ్నుతే। 11

తద్భవాన్ వృత్తసంపన్నః స్థితః పథి నిరత్యయే।
మిత్రార్థమ్ అభినీతార్థం యథావత్ కర్తుమర్హతి। 12

సంత్యజ్య సర్వకర్మాణి మిత్రార్థే యోఽనువర్తతే।
సంభ్రమాద్ధి కృతోత్సాహః సోఽనర్థైర్నావరుధ్యతే। 13

యస్తు కాలవ్యతీతేషు మిత్రకార్యేషు వర్తతే।
స కృత్వా మహతోప్యర్థాన్న మిత్రార్థేన యుజ్యతే। 14

యదిదం వీర కార్యం నో మిత్రకార్యమ్ అరిందమ।
క్రియతాం రాఘవస్యైతత్ వైదేహ్యాః పరిమార్గణమ్। 15

తదిదం వీరకార్యం తే కాలాతీతమ్ అరిందమ। 16

కర్తవ్యములయొక్క యథార్థజ్ఞానము గలవాడు. ఏయే సమయములయందు ఏయే ధర్మములను పాటింపవలెనో చక్కగా తెలిసినవాడు, మాట్లాడుటలో నేర్పరి. అట్టి సర్వసమర్థుడైన హనుమంతుడు పెడదారిబట్టిన సుగ్రీవుని ప్రవర్తనను గమనించెను. పిమ్మట వాక్యవిశారదుడైన మారుతి మనోహరమైన మృదుమధురములగు వచనములచే మాటలఅంతర్యమును గమనింపగల ఆ వానర ప్రభువును ప్రసన్నునిగా జేసికొనెను. పిమ్మట అతడు ప్రభువుయొక్క హితమును గోరుచు అయనతో చక్కవచనములను పలికెను. అవిసత్యములు, ప్రయోజనకరములు సామమార్గమున ధర్మార్థనీతియుక్తములు. శాస్త్రప్రమాణబుద్ధితో గట్టివిశ్వాసముతో పలికినవి. ప్రభువుపైన ఆదరాభిమానములతో ప్రియముగా నుడివినవి. (6-8)

'పూజ్యుడవైన ఓ ప్రభూ! నీకు రాజ్యాధికారము ప్రాప్తించినది. కీర్తిప్రతిష్ఠలు అబ్బినవి. వంశపరంపరగా వచ్చుచున్న సంపదలు వృద్ధిచెందినవి. మిత్రులకిచ్చిన వాగ్దానముప్రకారము వారికార్యక్రమములు నిర్వర్తింప వలసియున్నవి. మిత్రులకు చేయవలసిన సహాయమును (ప్రత్యుపకారమును) సకాలములో చేసి, సన్మార్గమున ప్రవర్తించువానికి రాజ్యము, యశస్సు, పరాక్రమము వృద్ధియగును. అట్లుగాక విలంబము చేసినవానికి విపరీతఫలములే కలుగును. (9-10)

ఓ రాజా! కోశము, (ధనాగారము) సేన, మిత్రులు, దృఢమైన శరీరము అనునవి సమానస్థాయిలో ఉండి, తనవశములో ఉన్నప్పుడే ఆ రాజు విశాలమైన రాజ్యమును పాలింపగలడు, అనుభవింపగలడు. ఓ ప్రభూ! నీవు సదాచారసంపన్నుడవు, సన్మార్గమున నడచు కొనుచున్నవాడవు. కనుక చేసిన వాగ్దానము ప్రకారము నీవు మిత్రుని (శ్రీరాముని) కార్యమును సఫలము చేయుము. (11-12)

సమస్తసుఖభోగములను పరిత్యజించి, మిక్కిలి ఆదరముతో ఉత్సాహవంతుడై మిత్రునికార్యము సఫలమొనర్చుటకై పాటుపడువానికి ఎట్టి అనర్థములును ప్రాప్తింపవు. సకాలములో మిత్రుని కార్యసాధనకు పూనుకొనక సమయము మించిన పిమ్మట ప్రయత్నమును ఎంతగొప్పగా చేసినను దానివలన మిత్రునకు ఎట్టి ప్రయోజనమూ కలుగదు. (13-14)

మహావీరా! శత్రుసూదనా! శ్రీరాముడు మనకు పరమమిత్రుడు. మనము ఆయనకార్యమును సాధించి పెట్టవలసియున్నది కనుక వెంటనే సీతాన్వేషణకు పూనుకొనవలెను. ఇప్పటికే కాలాతీతమైనది (15-16)

న చ కాలమ్ అతీతం తే నివేదయతి కాలవిత్।
త్వరమాణోఽపి సన్ ప్రాజ్ఞః తవ రాజన్ వశానుగః। 17

కులస్య హేతుః స్ఫీతస్య దీర్ఘబంధుశ్చ రాఘవః।
అప్రమేయప్రభావశ్చ స్వయం చాఽప్రతిమో గుణైః। 18

తస్య త్వం కురు వై కార్యం పూర్వం తేన కృతం తవ।
హరీశ్వర హరిశ్రేష్ఠాన్ ఆజ్ఞాపయితుమర్హసి। 19

న హి తావద్భవేత్ కాలో వ్యతీతశ్చోదనాదృతే।
చోదితస్య హి కార్యస్య భవేత్ కాలవ్యతిక్రమః। 20

అకర్తురపి కార్యస్య భవాన్ కర్తా హరీశ్వర।
కిం పునః ప్రతికర్తుస్తే రాజ్యేన చ ధనేన చ। 21

శక్తిమానపి విక్రాంతో వానరర్క్షగణేశ్వర।
కర్తుం దాశరథేః ప్రీతిమ్ ఆజ్ఞాయాం కిన్న సజ్జసే। 22

కామం ఖలు శరైః శక్తః సురాసురమహోరగాన్।
వశే దాశరథిః కర్తుం త్వత్ప్రతిజ్ఞాం తు కాంక్షతే। 23

ప్రాణత్యాగావిశంకేన కృతం తేన తవ ప్రియం।
తస్య మార్గామ వైదేహీం పృథివ్యామపి చాంబరే। 24

న దేవా న చ గంధర్వా నాఽసురా న మరుద్గణాః।
న చ యక్షా భయం తస్య కుర్యుః కిముత రాక్షసాః। 25

తదేవం శక్తియుక్తస్య పూర్వం ప్రియకృతస్తవ।
రామస్యార్హసి పింగేశ కర్తుం సర్వాత్మనా ప్రియమ్। 26

నాఽధస్తాదవనౌ నాప్సు గతిర్నోపరి చాంబరే।
కస్యచిత్ సజ్జతేఽస్మాకం కపీశ్వర తవాజ్ఞయా। 27

రాజా! సీతాన్వేషణకు ఇది తగిన సమయమని శ్రీరాముడు ఎఱుంగును. అందుకై అతడు త్వరపడుచున్నాడు గూడ. ప్రస్తుతము ఆయన నీపై ఆధారపడియున్నాడు ప్రాజ్ఞుడైనందున సమయము మించిపోవుచున్న విషయమును నీకు గుర్తుచేయుటకు అతడు వెనుకాడుచున్నాడు. శ్రీరాముడు నీకు ప్రాణమిత్రుడు (ఆప్తబంధువు) మీ వంశోన్నతికి (నీ అభివృద్ధికి) ఆయనయే హేతువు, అతులప్రభావశాలి, సహజముగనే సాటిలేని సద్గుణములు గలవాడు. ఓ వానరేశ్వరా! ఆ మహాత్ముడు ఇదివఱకే నీకు మేలుచేసియున్నాడు కావున నీవు వెంటనే ప్రత్యుపకారము చేయుటకు పూనుకొనుము. సీతాదేవిని వెదకుటకై వానర ప్రముఖులను ఆజ్ఞాపింపుము. (17-19)

రాముడు ప్రేరేపింపకముందే ఆయన కార్యమును ప్రారంభించినచో మనము కాలాతీతము చేసినట్లుగా పరిగణింపడు. కాని ప్రేరేపింపబడిన పిమ్మటనే మనము కార్యోన్ముఖులమైనచో కాలవిలంబమునకు మనమే బాధ్యులమగుదుము (20)

నీకు ఎట్టి మేలూ చేయనివారికిని ఉపకారము చేయు స్వభావమునీది. వాలిని వధించి, నీకు రాజ్యమును, సంపదలను లభింపజేసిన శ్రీరామునకు సహాయపడవలసిన విషయమున ఇక చెప్పవలసినది యేమున్నది? (21)

వానరములకును, భల్లూకములకును ప్రభువైన ఓ సుగ్రీవా! మహాశక్తిమంతుడవూ, గొప్ప పరాక్రమశాలివే ఐనను శ్రీరామునకు ప్రీతిని గూర్చెడి సీతాన్వేషణకు వానరులను ఆజ్ఞాపించుటకై నీవు ఇంకను సిద్ధపడవేమి? (22)

ఆ రఘువీరుడు తన బాణములచే సురాసురులను, నాగులను లొంగదీసికొనుటలో మిక్కిలి సమర్థుడేయైనను నీవు చేసిన ప్రతిజ్ఞమేరకు (నీ ద్వారా) కార్యసిద్ధికై ఎదురుచూచుచున్నాడు. ఆ ప్రభువు ప్రాణములను కూడా లెక్కచేయక వాలిని వధించి, నీకు ప్రియమును గూర్చినాడు. కనుక ఆ స్వామియొక్క ధర్మపత్నియైన వైదేహికొఱకై భూమండలమును, ఆకాశమును గాలింతము. (23-24)

దేవతలు, గంధర్వులు, అసురులు, మరుద్గణములు, యక్షులు మొదలగువారికి ఆ రఘువీరుడు ఏమాత్రము భయపడడు. ఇక ఆయనకు రాక్షసులు ఒక లెక్కయా? మహాశక్తిశాలియు, ఇంతకు ముందే నీకు ప్రియమొనర్చినవాడును ఐన శ్రీరామునకు సర్వశక్తులను ఒడ్డియైనను సహాయపడుట ఎంతేని యుక్తము. (25-26)

వానరేశ్వరా! నీ ఆజ్ఞయైనచో రామకార్యమొనర్చుటకు మేము కటిబద్ధులమై యున్నాము. అధోలోకములయందుగాని, ఈ భూమండలమునగాని, జలములలోగాని, కడకు

తదాజ్ఞాపయ కః కిం తే కృతే కుత్ర వ్యవస్యతు।
హరయో హ్యప్రధృష్యాస్తే సంతి కోట్యగ్రతోఽనఘ। 28

తస్య తద్వచనం శ్రుత్వా కాలే సాధు నివేదితం।
సుగ్రీవః సత్త్వసంపన్నః చకార మతిముత్తమామ్। 29

స సందిదేశాభిమతం నీలం నిత్యకృతోద్యమం।
దిక్షు సర్వాసు సర్వేషాం సైన్యానామ్ ఉపసంగ్రహే। 30

యథా సేనా సమగ్రా మే యూథపాలాశ్చ సర్వశః।
సమాగచ్ఛంత్యసంగేన సేనాగ్రాణి తథా కురు। 31

యే త్వంతపాలాః ప్లవగాః శీఘ్రగా వ్యవసాయినః।
సమానయంతు తే సైన్యం త్వరితాః శాసనాన్మమ।
స్వయంచానంతరం సైన్యం భవానేవాఽనుపశ్యతు। 32

త్రిపంచరాత్రాదూర్ధ్వం యః ప్రాప్నుయాన్నేహ వానర।
తస్య ప్రాణాంతికో దండో నాఽత్ర కార్యా విచారణా। 33

హరీంశ్చ వృద్ధానుపయాతు సాంగదో
భవాన్ మమాజ్ఞామ్ అధికృత్య నిశ్చితాం।
ఇతి వ్యవస్థాం హరిపుంగవేశ్వరో
విధాయ వేశ్మ ప్రవివేశ వీర్యవాన్ । 34

అంతరిక్షమున గాని మిమ్ములను అడ్డుకొనగల మొనగాడెవ్వడు? ఓ వానరరాజా! మహాత్ములైన కోట్లకొలది వానర యోధులు నీ ఆధీనములో ఉన్నారు. వారిని ఎంతటి వారును ఎదిరింపజాలరు. అందువలన వారిలో ఎవ్వరు ఎక్కడ ఏమిచేయవలయునో నిర్ణయించి ఆజ్ఞాపింపుము". (27-28)

హనుమంతుడు సకాలములో యుక్తియుక్తముగా నివేదించిన మృదువచనములను విని, సత్త్వసంపన్నుడైన సుగ్రీవుడు వెంటనే తగు నిర్ణయమునకు వచ్చెను. (29)

అంతట ఆ వానరరాజు సర్వదా సర్వకార్యదక్షుడైన 'నీలుడు' అను సేనాపతిని అన్ని దిక్కులనుండియు సమస్త సైన్యములను సమీకరించుటకై తన అభిమతము ప్రకారము ఆదేశించెను. (30)

"ఓ సేనాపతీ! యూథపతులతో గూడిన మన సమస్త సేనలు వెంటనే ఇచటికి చేరునట్లుగా ఉపసేనాపతులందఱికిని ఆజ్ఞ ఇమ్ము. శీఘ్రగమనముగలవారు, పనిలో చురుకైనవారు, రాజ్యపుపొలిమేరలను రక్షించువారు ఐన వానర యోధులను వెంటనే ఇచటికి చేర్చవలెను. ఆ సైన్య పర్యవేక్షణబాధ్యత అంతయు నీదే. ఇది నా ఆజ్ఞ. వారు అందఱును పదునైదుదినములలో ఇచటికి చేరవలెను. అట్లురాని వారికి మరణదండన విధింపబడును. ఇది తిరుగులేని ఆజ్ఞ. ఈ నా ఆదేశమును అనుసరించి, అంగదుని వెంటనిడుకొని, వానరప్రముఖులకడకు వెళ్లుము." అని పలికి, పరాక్రమశాలియు, వానరప్రభువు ఐన సుగ్రీవుడు ఈ వ్యవస్థను ఏర్పఱచిన పిమ్మట తన అంతఃపురమున ప్రవేశించెను. (31-34)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకోనత్రింశః సర్గః (29)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇరువదితొమ్మిదవసర్గము

-- * * * --

30. ముప్పదియవసర్గము

శరత్కాలమునందలి ప్రకృతిశోభలను గాంచుచు శ్రీరాముడు విరహవేదనకు లోనగుట - లక్ష్మణుడు అన్నను ఓదార్చుట - శరత్కాలము వచ్చినను సుగ్రీవుడు సీతాన్వేషణకు పూనుకొనలేదని భావించి, శ్రీరాముడు అతనిపై కుపితుడగుట - కిష్కింధకు వెళ్లి సుగ్రీవునకు కర్తవ్యమును గుర్తుచేయుమని లక్ష్మణునితోనుడువుట -

గుహాం ప్రవిష్టే సుగ్రీవే విముక్తే గగనే ఘనైః।
వర్షరాత్రోషితో రామః కామశోకాభిపీడితః। 1

పాండురం గగనం దృష్ట్వా విమలం చంద్రమండలం।
శారదీం రజనీం చైవ దృష్ట్వా జ్యోత్స్నానులేపనాం। 2

సేనాపతియైన నీలునకు ఆజ్ఞలను ఇచ్చిన పిమ్మట సుగ్రీవుడు కిష్కింధలో ప్రవేశించెను. వర్షరాత్రులను ప్రస్రవణగిరిపై గడపిన శ్రీరాముడు మేఘములు తొలగిపోవుటచే నిర్మలముగానున్న ఆకాశమును చూచి, సీతాదేవియెడబాటునకు మిక్కిలి శోకపీడితుడయ్యెను. క్రమముగా స్వచ్ఛముగానున్న గగనమును, ప్రసన్నముగా

కామవృత్తం చ సుగ్రీవం నష్టాం చ జనకాత్మజాం।
బుద్ధ్వా కాలమ్ అతీతం చ ముమోహ పరమాతురః। 3

న తు సంజ్ఞా ముపాగమ్య ముహూర్తాన్మతిమాన్ పునః।
మనఃస్థామపి వైదేహీం చింతయామాస రాఘవః। 4

ఆసీనః పర్వతస్యాగ్రే హేమధాతువిభూషితే।
శారదం గగనం దృష్ట్వా జగామ మనసా ప్రియామ్। 5

దృష్ట్వా చ విమలం వ్యోమ గత విద్యుద్వలాహకం।
సారసారవసంఘుష్టం విలలాపాఽఽర్తయా గిరా। 6

సారసారవసన్నాదైః సారసారవనాదినీ।
యాఽఽశ్రమే రమతే బాలా సాఽద్య మే రమతే కథమ్। 7

పుష్పితాం శ్చాఽఽసనాన్ దృష్ట్వా కాంచనానివ నిర్మలాన్।
కథం సా రమతే బాలా పశ్యంతీ మామ్ అపశ్యతి। 8

యా పురా కలహంసానాం స్వరేణ కలభాషిణీ।
బుధ్యతే చారు సర్వాంగీ సాఽద్య మే బుధ్యతే కథమ్। 9

నిఃస్వనం చక్రవాకానాం నిశమ్య సహచారిణాం।
పుండరీకవిశాలాక్షీ కథమేషా భవిష్యతి। 10

సరాంసి సరితో వాపీః కాననాని వనాని చ।
తాం వినా మృగశాబాక్షీం చరన్ నాఽద్య సుఖం లభే। 11

అపి తాం మద్వియోగాచ్చ సౌకుమార్యాచ్చ భామినీం।
న దూరం పీడయేత్ కామః శరద్గుణనిరంతరః। 12

ఉన్న చంద్రమండలమును, పండువెన్నెల విరబూసిన శరద్రాత్రులను గాంచి, ఆ ప్రభువు సీతాదేవికొఱకై ఇంకను వ్యాకులుడయ్యెను. 'సుగ్రీవుడు భోగలాలసుడై యున్నాడు, ఇంతవఱకును జానకిజాడయే తెలియదయ్యెను. రావణునిపై దండెత్తుటకు సమయము మించిపోవుచున్నది. అని తలపోయుచు ఆ రాఘవుడు ఇంకను శోకమగ్నుడాయెను.(1-3)

ఒక ముహూర్తకాలము (రెండుగడియల) తరువాత శ్రీరాముడు స్పృహలోనికి వచ్చెను. పిదప ఆ ప్రజ్ఞాశాలి తన మనస్సులో మెదలుచున్న సీతాదేవిని గూర్చి చింతింపసాగెను. అనంతరము బంగారువన్నెగల ధాతువులతో ఒప్పుచున్న పర్వతముపైభాగమున ఆ ప్రభువు ఆసీనుడయ్యెను. పిమ్మట ఆ స్వామి శరత్కాలము నందలి ఆకాశమును చూచి, తన ప్రేమపెన్నిధియైన సీతాదేవిని స్మరింపసాగెను. మెఱుపులు, మేఘములు లేకపోవుటచే నిర్మలముగా ఉన్నదియు, బెగ్గురుపిట్టల కలరవములతో నిండినదియు అగు ఆకాశమును జూచి, ఆర్తస్వరముతో ఇట్లు విలపించెను. (4-6)

"సారసపక్షులవలె మధురస్వరముగల సీత నా ఆశ్రమమునందు ఆ పక్షులతో సంభాషించుచు వినోదించు చుండెడిది. ఇప్పుడు ఆ బేల తన మనస్సును ఎట్లు ఆహ్లాదపరచుకొనుచున్నదో యేమో! బంగారు వన్నెగల స్వచ్ఛమైన పూవులతో నిండిన వేగిసచెట్లనుదర్శించి, నాకై పరికించి చూచుచుండెడి సీత ఈ సమయమున నేను కనబడకుండుటచే ఎంతగా దిగులు పడుచున్నదోగదా! (7-8)

సర్వాంగసుందరి, మధురముగా భాషించునది ఐన సీతాదేవి పూర్వము వీనసొంపైన కలహంసలరవములకు మేల్కొనుచుండెడిది. ఇప్పుడు నాప్రాణేశ్వరి ఎట్లు మేల్కొనుచున్నదో గదా! కమలములవలె విశాలములైన నేత్రములు గలదియు, నాయెడబాటునకులోనైనదియు అగు సీత తన ప్రక్కన సంచరించెడి చక్రవాకముల ధ్వనులనువిని, (ఆవిరహబాధను) ఎట్లు ఓర్చుకొనుచున్నదోగదా! (9-10)

సరస్సులు, నదీతీరములు, దిగుడుబావులు, అరణ్యములు, ఉద్యానవనములు మొదలగు రమ్యప్రదేశములలో నేను సంచరించుచున్నను అందమైన కనులుగల ఆ సీత తోడుగా లేకుండుటచే నాకు సుఖము శూన్యమైనది. (11)

సీతాదేవి సహజముగనే సుకుమారి. (కోమలమైనశరీరము, మెత్తనిమనస్సుగలది.)పైగా ప్రస్తుతము నా యెడబాటునకు లోనైయున్నది. అట్టి జానకిని శరత్కాలగుణములను (ఎడబాటునకులోనైయున్న ప్రేయసీ ప్రియులను బాధించు లక్షణములను) కలిగియున్న మన్మథుడు చిరకాలము పీడింపడుగదా! (12)

ఏవమాది నరశ్రేష్ఠో విలలాప నృపాత్మజః।
విహంగ ఇవ సారంగః సలిలం త్రిదశేశ్వరాత్। 13

తతశ్చంచూర్య రమ్యేషు ఫలార్థీ గిరిసానుషు।
దదర్శ పర్యుపావృత్తో లక్ష్మీవాన్ లక్ష్మణోఽగ్రజమ్। 14

తం చింతయా దుస్సహయా పరీతం
విసంజ్ఞమేకం విజనే మనస్వీ।
భ్రాతుర్విషాదాత్ పరితాపదీనః
సమీక్ష్య సౌమిత్రిరువాచ రామమ్। 15

కిమార్య కామస్య వశంగతేన
కిమాత్మపౌరుష్యపరాభవేన।
అయం సదా సంహ్రియతే సమాధిః
కిమత్ర యోగేన నివర్తితేన। 16

క్రియాభియోగం మనసః ప్రసాదం
సమాధియోగానుగతం చ కాలం।
సహాయసామర్థ్య మదీనసత్త్వ
స్వకర్మహేతుం చ కురుష్వ హేతుమ్। 17

న జానకీ మానవవంశనాథ
త్వయా సనాథా సులభా పరేణ।
న చాగ్నిచూడాం జ్వలితాముపేత్య
న దహ్యతే వీర వరార్హ కశ్చిత్। 18

సలక్షణం లక్ష్మణమప్రధృష్యం
స్వభావజం వాక్యమువాచ రామః।
హితం చ పథ్యం చ నయప్రసక్తం
ససామ ధర్మార్థసమాహితం చ। 19

నిస్సంశయం కార్యమవేక్షితవ్యం
క్రియావిశేషో హ్యనువర్తితవ్యః।
నను ప్రవృత్తస్య దురాసదస్య
కుమార కార్యస్య ఫలం న చింత్యమ్। 20

అథ పద్మపలాశాక్షీం మైథిలీమ్ అనుచింతయన్।
ఉవాచ లక్ష్మణం రామో ముఖేన పరిశుష్యతా। 21

రాజకుమారుడు, నరశ్రేష్ఠుడునైన శ్రీరాముడు ఈ విధముగా వేదనపడుచు, వర్షజలబిందువులకై ఆరాటముతో ఎదురుచూచెడి చాతకమువలె సీతాదేవికొఱకు పరితపింపసాగెను." (13)

శుభలక్షణములుగల లక్ష్మణుడు రమ్యములైన పర్వత ప్రాంతములలో ఫలములకొఱకై అంతటను సంచరించి, తిరిగివచ్చినవాడై అన్నను చూచెను. అప్పుడు మతిమంతుని మనస్సుగలవాడైన శ్రీరాముడు అంతులేని చింతకులోనై, నిర్జనప్రదేశమున ఒంటరిగా పరాకున కూర్చొనియుండెను. అన్నయొక్క విషాదస్థితిని జూచి లక్ష్మణుడు ఎంతయు నొచ్చుకొని, ఆయనతో ఇట్లనెను. (14-15)

"అన్నా! పరాక్రమమును విస్మరించి, (పురుషప్రయత్నమును మాని) ఈవిధముగా కామపరతంత్రుడవగుటవలన ఏమి ప్రయోజనము? దీనివలన చిత్తస్థైర్యము దెబ్బతినును? అందువలన లాభమేమి? ఇట్టి స్థితిలో మనస్సును చిక్కబట్టుకొన్నచో ఈ చింత దూరమగును. (16)

అన్నా! దైన్యమును వీడుము. కార్యసాధనకు పూనుకొనుము. మనస్సును ప్రసన్నముగానుంపుము. ఇప్పుడు చిత్తస్థైర్యమును (ధైర్యమును) వహింపుము. సుగ్రీవుడు మొదలగు సహాయకులయొక్క సామర్థ్యమును ఉపయోగించుకొనుము. కార్యసిద్ధికి తోడ్పడు విధానమును అవలంబింపుము. (17)

ఓ నరోత్తమా! శత్రువులు ఎంతటివారైనను నీ ధర్మపత్నియైన సీతాదేవిని సమీపింపజాలరు. (పొందజాలరు) ఓ మహావీరా! ఉవ్వెత్తుగా ప్రజ్వరిల్లుచున్న అగ్నిశిఖలను సమీపించినచో ఆమంటలకు దగ్ధముగాక ఎవ్వడు మిగులును? (18)

అంతట శుభలక్షణసంపన్నుడు, అజేయుడు నైన లక్ష్మణునితో శ్రీరాముడు తన స్వభావమునకు అనుగుణముగా ఇట్లు నుడివెను. "నాయనా! నీవు పలికిన మాటలు ఇప్పుడేగాక మున్ముందుగూడ హితమును గూర్చునవి, రాజనీతియుక్తములైనవి. అవి ఊరటనుకలిగించునవి, ధర్మార్థసహితమైనవి. ఇప్పుడు మనము సీతాన్వేషణకార్యమునకు సర్వసన్నద్ధులము కావలెను. ఆకార్యమును సాధించుటకై ఉత్సాహముతో పట్టుదలతో ప్రయత్నింపవలెను. ఆకార్యము కష్టసాధ్యమేయైనను దానినిగూర్చి ముందే ఆలోచింపరాదా? తప్పక ఆలోచింపదగును. (19-20)

పిమ్మట తామరరేకులవంటి విశాలమైన నేత్రములుగల సీతాదేవినిగూర్చి ఆలోచించుచు శ్రీరాముడు దిగులు చెందిన ముఖముగలవాడై లక్ష్మణునితో ఇట్లు పలికెను. (21)

తర్పయిత్వా సహస్రాక్షః సలిలేన వసుంధరాం।
నిర్వర్తయిత్వా సస్యాని కృతకర్మా వ్యవస్థితః। 22

స్నిగ్ధగంభీరనిర్ఘోషాః శైలద్రుమపురోగమాః।
విసృజ్య సలిలం మేఘాః పరిశ్రాంతా నృపాత్మజ। 23

నీలోత్పలదలశ్యామాః శ్యామీకృత్వా దిశో దశ।
విమదా ఇవ మాతంగాః శాంతవేగాః పయోధరాః। 24

జలగర్భా మహావేగాః కుటజార్జునగంధినః।
చరిత్వా విరతాః సౌమ్య వృష్టివాతాః సముద్యతాః। 25

ఘనానాం వారణానాం చ మయూరాణాం చ లక్ష్మణ।
నాదః ప్రస్రవణానాం చ ప్రశాంతః సహసానఘ। 26

అభివృష్టా మహామేఘైః నిర్మలాశ్చిత్రసానవః।
అనులిప్తా ఇవాభాంతి గిరయశ్చిత్రదీప్తిభిః। 27

దర్శయంతి శరన్నద్యః పులినాని శనైః శనైః।
నవసంగమసవ్రీడా జఘనానీవ యోషితః। 28

శాఖాసు సప్తచ్ఛదపాదపానాం
ప్రభాసు తారార్కనిశాకరాణాం ।
లీలాసు చైవోత్తమవారణానాం
శ్రియం విభజ్యాద్య శరత్ ప్రవృత్తా । 29

సంప్రత్యనేకాశ్రయచిత్రశోభా
లక్ష్మీః శరత్కాలగుణోపనీతా ।
సూర్యాగ్రహస్తప్రతిబోధితేషు
పద్మాకరేష్వభ్యధికం విభాతి । 30

"దేవేంద్రుడు అనువుగా (పుష్కలముగా) వర్షములను కురిపించి, భూమిని సస్యశ్యామలమొనర్చి, కృతకృత్యుడయ్యెను. (వర్షాకాలము పూర్తియయ్యెను.) రాజకుమారా! మేఘములు మిగుల గంభీరముగా గర్జించుచు పర్వతములమీదను, వృక్షములపైనను, నగరములమీదను సంచరించుచు బాగుగా వర్షించి సేదదీర్చుకొనుచున్నవి. ఇంతవఱకును నల్లగలువలరేకులవలె శ్యామవర్ణముగలిగియున్న (జలములతో నిండియున్న) మేఘములు బాగుగా వర్షించుటద్వారా దిక్కులను అన్నింటిని నల్లబఱచి (సమస్త భూమిని పైరు పంటలతో నింపి) మదరహితములైన ఏనుగులవలె ప్రశాంతముగా సాగిపోవుచున్నవి. (22-24)

ఓ సౌమ్యా! జలములతో ఒప్పుచు, బొండుమల్లెల పరిమళములను, అర్జునపుష్పములసువాసనలను వెదజల్లుచు, మహావేగముతో విజృంభించుచు సంచరించిన వానగాలులు ఇప్పుడు శాంతించియున్నవి. (25)

లక్ష్మణా! ఇంతవఱకును హోరెత్తించిన మేఘములగర్జనలు, ఏనుగులఘీంకారములు, నెమళ్లక్రేంకారములు, సెలయేళ్ల గలగలలు చప్పున సద్దుమణిగినవి. (26)

చిత్రవిచిత్రములైన రంగుల సానువులతో విలసిల్లుచున్న పర్వతములు, మేఘములు బాగుగా వర్షించుటచే మలినములు తొలగి నిర్మలములై, చిత్రమైన కాంతులతో వెలుగొందుచున్నవి. (27)

నవసంగమవేళయందు బిడియపడుచున్న స్త్రీలు తమ జఘనములనువలె ప్రవాహములు తగ్గిపోవుటచే నదులు తమ ఇసుక తిన్నెలను తిన్నతిన్నగా ప్రదర్శించుచున్నవి. (28)

ఇదిగో! శరత్కాలము తనశోభలను ఏడాకుల పొన్నవృక్షములకొమ్మలమీదను, సూర్యచంద్రనక్షత్రముల కాంతులపైనను, శ్రేష్ఠమైనఏనుగుల లీలావిలాసములయందును ప్రసరింపజేయుచు రానేవచ్చినది. (శరత్కాలమునందు ఏడాకులపొన్న చెట్లకొమ్మలు చక్కగా రాజిల్లుచున్నవి, నక్షత్రముల మిలమిలలు, సూర్యునికాంతులు, చంద్రునియొక్క వెన్నెలలు హాయినిగొల్పుచున్నవి, శ్రేష్ఠములగు గజముల యొక్క లీలావిలాసములు మాడముచ్చట గొల్పుచున్నవి.)(29)

ఇప్పుడు బాగుగా విప్పుకొనిన చిత్రవిచిత్రములగు పలురంగుల పుష్పములతో వైభవోపేతమైన శరత్కాల శోభలు అంతటను వెల్లివిరియుచున్నవి. అందునా ఉదయభానునియొక్క కిరణములస్పర్శతో సరస్సులలో చక్కగా వికసించిన కమలములకాంతులు ఇంకను కనువిందుగావించుచున్నవి. (30)

సప్తచ్ఛదానాం కుసుమోపగంధీ
షట్పాదబృందైరనుగీయమానః ।
మత్తద్విపానాం పవనోఽనుసారీ
దర్పం వనేష్వభ్యధికం కరోతి । 31

ఈ శరత్కాలవాయువులు ఏడాకులపొన్నపూల సువాసనలతో ఒప్పుచు అవిచ్ఛిన్నముగా (నిరంతరము) వీచుచున్నవి. తుమ్మెదలగుంపులు వాటియొక్క గుణములను గానముచేయుచున్నవి. అవి వనములలోని మదపుటేనుగులదర్పమును అధికము చేయుచున్నవి. (31)

అభ్యాగతైశ్చారువిశాలపక్షైః
సరఃప్రియైః పద్మరజోఽవకీర్ణైః ।
మహానదీనాం పులినోపయాతైః
క్రీడంతి హంసాః సహ చక్రవాకైః । 32

హంసలు, చక్రవాకములు జంటలు జంటలుగా వచ్చుచున్నవి. అవి మిక్కిలి సంతోషముతో రెక్కలను విప్పుకొనియున్నవి. సరస్సులపై వాటికి మక్కువ ఎక్కువ. అట్టి హంసలు, చక్రవాకములు శరత్కాలప్రభావమున వైరములను మాని ఇచటి మహానదుల ఇసుకతిన్నెలపై కలిసిమెలసి విహరించుచున్నవి. (32)

మదప్రగల్భేషు చ వారణేషు
గవాం సమూహేషు చ దర్పితేషు ।
ప్రసన్నతోయాసు చ నిమ్నగాసు
విభాతి లక్ష్మీర్బహుధా విభక్తా । 33

బాగుగా మత్తిల్లియున్నఏనుగులయందును, దర్పముతోనున్న వృషభములసమూహములయందును, స్వచ్ఛములైనజలములతో ప్రవహించుచున్న నదులయందును శరత్కాలవైభవములు ఎంతయు ప్రతిఫలించుచున్నవి. (33)

నభః సమీక్ష్యాంబుధరైర్విముక్తం
విముక్తబర్హాభరణా వనేషు ।
ప్రియాస్వసక్తా వినివృత్తశోభా
గతోత్సవా ధ్యానపరా మయూరాః । 34

ఆకాశమున మబ్బులు కనబడకపోవుటచే (తొలగిపోవుటచే) అడవిలోని నెమళ్లు తమకు శోభను గూర్చెడి పింఛములను ముడుచుకొనినవి. అవి తమప్రియురాండ్రపై ఆసక్తిని వీడి నిస్తేజములైనవి. సంతోష రహితములై ధ్యానమగ్నములైనట్లున్నవి.(34)

మనోజ్ఞగంధైః ప్రియకైరనల్పైః
పుష్పాతిభారావనతాగ్రశాఖైః ।
సువర్ణగౌరైర్నయనాభిరామైః
ఉద్యోతితానీవ వనాంతరాణి । 35

ఇచట చక్కగా వికసించిన పూలబరువుచే వంగిన కొమ్మలు గల మంకెన చెట్లు విరివిగానున్నవి. అవి ఇంపైన పరిమళములను వెదజల్లుచున్నవి, పచ్చని బంగారువన్నెతో కన్నులకు ఇంపుగొలుపుచున్నవి. అట్టి మంకెన వృక్షములతో నిండి ఈ వనమధ్య ప్రదేశములన్నియు కలకలలాడుచున్నవి. (35)

ప్రియాన్వితానాం నలినీప్రియాణాం
వనే రతానాం కుసుమోద్ధతానాం ।
మదోత్కటానాం మదలాలసానాం
గజోత్తమానాం గతయోఽద్య మందాః । 36

ఈవనగజేంద్రములు ఆడుఏనుగులతోగూడియున్నవి. వీటికి సరస్సులనిన పరమప్రీతి, వనములయందు సంచరించుటలో ఆసక్తిగలవి. ఏడాకులపొన్నపూలవాసనలకు మత్తిల్లియున్నవి. గండస్థలమునుండి మదజలములను స్రవింపజేయుచున్నవి. మత్తిల్లి భోగలాలసతోనున్నవి. అందువలన మదపుటేనుగులన్నియు మందగమనముతో సాగిపోవుచున్నవి. (36)

వ్యభ్రం నభః శస్త్రవిధౌతవర్ణం
కృశప్రవాహాని నదీజలాని ।
కల్హారశీతాః పవనాః ప్రవాంతి
తమోవిముక్తాశ్చ దిశః ప్రకాశాః । 37

మేఘములు తొలగిపోవుటచే ఆకాశము స్వచ్ఛమైనశస్త్రమువలె విరాజిల్లుచున్నది. నీరు తగ్గిపోవుటచే నదులు సన్నగా ప్రవహించుచున్నవి. ఎఱ్ఱదామరలమీదుగా వచ్చుచుండుటచే వాయువులు చల్లగా వీచుచున్నవి. చీకట్లు తొలగిపోవుటచే దిక్కులన్నియును చక్కగా ప్రకాశించుచున్నవి. (37)

సూర్యాతపక్రామణ నష్టపంకా
భూమిశ్చిరోద్ఘాటిత సాంద్రరేణుః ।
అన్యోన్యవైరామర్షాయుతానామ్
ఉద్యోగకాలోఽద్య నరాధిపానామ్ । 38

సూర్యకిరణములవేడిచే బురదప్రదేశములు ఎండిపోయినవి. వర్షాకాలము ముగియుటవలన కొద్దిగా రేగిన దుమ్ములు దట్టముగా అలముకొనియున్నవి. ఈ శరత్కాలము పరస్పరవైరములతో, అసూయలతోనున్న నరేంద్రులకు జైత్రయాత్రలకై అనువుగా ఉన్నది. (38)

శరద్గుణాప్యాయిత రూపశోభాః
ప్రహర్షితాః పాంసుసముత్థితాంగాః ।
మదోత్కటాః సంప్రతి యుద్ధలుబ్ధా
వృషా గవాం మధ్యగతా నదంతి । 39

సమన్మథం తీవ్రగతానురాగాః
కులాన్వితా మందగతిం కరిణ్యః ।
మదాన్వితం సంపరివార్య యాంతం
వనేషు భర్తారమనుప్రయాంతి । 40

త్యక్త్వా వరాణ్యాత్మవిభూషణాని
బర్హాణి తీరోపగతా నదీనాం ।
నిర్భర్త్స్యమానా ఇవ సారసౌఘైః
ప్రయాంతి దీనా విమదా మయూరాః । 41

విత్రాస్య కారండవచక్రవాకాన్
మహారవైర్భిన్నకటా గజేంద్రాః ।
సరస్సు బద్ధాంబుజభూషణేషు
విక్షోభ్య విక్షోభ్య జలం పిబంతి । 42

వ్యపేతపంకాసు సవాలుకాసు
ప్రసన్నతోయాసు సగోకులాసు ।
ససారసారావవినాదితాసు
నదీషు హృష్టా నిపతంతి హంసాః । 43

నదీఘనప్రస్రవణోదకానామ్
అతిప్రవృద్ధానిలబర్హిణానాం ।
ప్లవంగమానాం చ గతోత్సవానాం
ద్రుతం రవాః సంప్రతి సంప్రణష్టాః । 44

అనేకవర్ణాః సువినష్టకాయా
నవోదితేష్వంబుధరేషు నష్టాః ।
క్షుధార్దితా ఘోరవిషా బిలేభ్యః
చిరోషితా విప్రసరంతి సర్పాః । 45

చంచచ్చంద్రకరస్పర్శహర్షోన్మీలితతారకా ।
అహో రాగవతీ సంధ్యా జహాతి స్వయమంబరమ్ । 46

ఇచటి వృషభములు శరత్కాలవైభవముచే ప్రియమును గొల్పెడి శరీరశోభలు గలిగియున్నవి. సంతోషముతో పొంగిపోవుచున్నవి. అవి కొమ్ములతో చిమ్ముటవలన పైకెగిరిన దుమ్ములు వాటిశరీరములపై వ్యాపించియున్నవి. ఇప్పుడవి మిక్కిలి మదించి పోరాడుటకు ఆరాటపడుచున్నవి. ఆ వృషభములు ఆవులగుంపులమధ్యచేరి ఱంకెలు వేయుచున్నవి. (39)

వనములలోని ఆడుఏనుగులు భర్తపై తీవ్రమైన ప్రేమానురాగములు గలవై, తోడి ఆడుఏనుగులతో కలిసి, కామావేశముతో బాగుగా మదించి. మందగమనముతో వెళ్లుచున్న మగఏనుగు చుట్టునుజేరి. దానిని అనుసరించి నడచుచున్నవి. (40)

నెమళ్లు తమకు అందమునుగూర్చెడి అలంకారములైన పింఛములను త్యజించి, నదీతీరములయందు చేరినవై, హంసలగుంపులచే భయపెట్టబడుచున్నవా యనునట్లు, దీనములై నిరుత్సాహముతో గబగబ నడచుచున్నవి.(41)

గండస్థలములనుండి మదజలములు కారుచున్న గజేంద్రములు పెద్దపెద్ద ఘీంకారములతో కన్నెలేడి పిట్టలకును, చక్రవాకములకును భీతినిగూర్చుచు, అందమైన కమలములతో అలరారుచున్న సరస్సులలోని జలములను అటునిటు కదల్చుచు తమదాహమును తీర్చుకొనుచున్నవి. (42)

ఈశరత్కాలమున నదులు బురదలు తొలగి నిర్మలజలములతో రమణీయముగానున్నవి. వాటి తీరములయందలి ఇసుకతిన్నెలపై గోవులు హాయిగా సంచరించుచున్నవి. అవి సారసపక్షులకలరవములచే ప్రతిధ్వనించుచున్నవి. అట్టి నదీజలములలో హంసలు సంతోషముతో త్రుళ్లింతలాడుచున్నవి. (43)

నదీప్రవాహములఘోషలు, మేఘములగర్జనలు, సెలయేళ్లగలగలలు, గాలులవిజృంభణలు, నెమళ్ల క్రేంకారములు, ఉత్సాహములు తొలగిన మండూకముల బెకబెకలు చప్పున పూర్తిగా శాంతించినవి. (44)

వానలు జోరుగా పడుచున్నప్పుడు (వర్షాకాలమున) భయంకరమైన విషసర్పములు పుట్టలలో దూరి చాల కాలము అచటనే యున్నవి. తగినంత ఆహారము లేకపోవుటచే ఆకలితో నకనకలాడుచు అవి బక్కచిక్కియున్నవి. వర్షములు ఆగిపోవుటచే ఆరంగురంగుల పాములన్నియును బిలములలోనుండి బయటికి వచ్చుచున్నవి. (45)

సంధ్యాసమయము ఎఱుపురంగును నింపుకొన్నది. అప్పుడు మిక్కిలిశోభలను చిందించెడి చంద్రకిరణముల స్పర్శచేత కలిగిన సంతోషకారణముగా ఆకాశమున

రాత్రిః శశాంకోదిత సౌమ్యవక్త్రా
తారాగణోన్మీలిత చారునేత్రా ।
జ్యోత్స్నాంశుకప్రావరణా విభాతి
నారీవ శుక్లాంశుక సంవృతాంగీ । 47

విపక్వశాలిప్రసవాని భుక్త్వా
ప్రహర్షితా సారసచారుపంక్తిః ।
నభః సమాక్రామతి శీఘ్రవేగా
వాతావధూతా గ్రథితేవ మాలా । 48

సుప్తైకహంసం కుముదైరుపేతం
మహాహ్రదస్థం సలిలం విభాతి ।
ఘనైర్విముక్తం నిశి పూర్ణచంద్రం
తారాగణాకీర్ణమివాంతరిక్షమ్ । 49

ప్రకీర్ణహంసాకులమేఖలానాం
ప్రబుద్ధపద్మోత్పలమాలినీనాం ।
వాప్యుత్తమానామ్ అధికాద్య లక్ష్మీః
వరాంగనానామివ భూషితానామ్ । 50

వేణుస్వన వ్యంజిత తూర్యమిశ్రః
ప్రత్యూష కాలానిల సంప్రవృద్ధః ।
సమ్మూర్ఛితో గర్గర గోవృషాణామ్
అన్యోన్య మాపూరయతీవ శబ్దః । 51

నవైర్నదీనాం కుసుమప్రభాసైః
వ్యాధూయమానైర్మృదుమారుతేన ।
ధౌతామలక్షౌమపటప్రకాశైః
కూలాని కాశైరుపశోభితాని । 52

వనప్రచండా మధుపానశౌండాః
ప్రియాన్వితాః షట్చరణాః ప్రహృష్టాః ।
వనేషు మత్తాః పవనానుయాత్రాం
కుర్వంతి పద్మాసనరేణుగౌరాః । 53

తారకలు మిలమిలలాడుచున్నవి. ఆసంధ్య స్వయముగా అంబరమును వీడుచున్నది. అహో! ఏమాశ్చర్యము! అనురాగవతియైన సంధ్యయనెడి నాయిక తనప్రియుని కరస్పర్శవలన పరవసించినదై, అరమోడ్పుకన్నులతో ఒప్పుచున్నది. ఆపారవశ్యములో ఆమె స్వయముగనే అంబరములను (వస్త్రమును) త్యజించుచున్నది. (46)

ఉదయించినచంద్రబింబము అనెడి ఆహ్లాదకరమైన ముఖముగలదియు, మెఱయుచున్న నక్షత్రములనెడు ఉన్మీలితనేత్రములు గలదియు, పండువెన్నెలయనెడి వస్త్రములను ధరించినదియు అగు రాత్రి మనోహరముఖముతో, అరమోడ్పుకనులతో భాసిల్లుచు తెల్లచీరకట్టుకొన్న తరుణివలె విరాజిల్లుచున్నది. (47)

బాగుగా పక్వమునకువచ్చిన వరిగింజలను తిని, ఆనందించుచు వేగముగా సాగిపోవుచున్న చక్కని బెగ్గురు పిట్టలపంక్తి గాలితాకిడికి పైకి ఎగిరిన పూలమాలవలె ఆకాశమున వ్యాపించుచున్నది. (48)

గాఢనిద్రలో మునిగియున్న హంసలతో విలసిల్లుచు, కలువలతో విరాజిల్లుచు చూడముచ్చటగానున్న మహాసరస్సులోని నీరు, మేఘములు తొలగి రాత్రివేళ నిండుచంద్రునితో, తారకల తళతళలతో ఆహ్లాదకరముగానున్న అంతరిక్షమువలె భాసిల్లుచున్నది. (49)

చుట్టును వ్యాపించి, తళుకులీనుచున్న హంసలనెడి ఒడ్డాణములతో ఒప్పుచు, చక్కగా వికసించిన పద్మముల మాలికలతో, కలువలహారములతో అలరారుచున్న దిగుడుబావులు మేలైన వస్త్రాభరణములను ధరించిన తరుణీమణులవలె శోభిల్లుచున్నవి. (50)

పిల్లనగ్రోవి (వేణువు)చే పలికింపబడిన తూర్య, గీత, వాద్యముల నాదములు, ప్రాతఃకాలమునందు వీచుచున్న వాయువులచే అంతటను వ్యాప్తములగుచున్నవి. ప్రభాతవేళ మెఱుగు చిలుకుటవలన కలిగెడి చప్పుళ్లు, దూడలకొఱకై ఆరాటపడుచున్న గోవులఅంబారవములు, కామ పరవశములైయున్న వృషభములఅంకెలు ఒకదానికొకటి మించి ప్రవర్తిల్లుచున్నవి. (51)

నదీతీరములయందు క్రొత్తగా మొలచి, బాగుగా పెఱిగిన తెల్లుగడ్డి పిల్లవాయువులకు అటునిటు కదలుచున్నది. అది పూలకాంతులను విరజిమ్ముచు, ఉతికిఆరవేయబడిన స్వచ్ఛములైనతెల్లని పట్టువస్త్రముల శోభలతో విరాజిల్లుచున్నది. (52)

తుమ్మెదలు వనములలో స్వేచ్ఛగా సంచరించుచున్నవి, బాగుగా పూదేనెలను గ్రోలి, సంతోషముతో పరవసించియున్నవి. అవి పద్మములయొక్క, వేగిసపూలయొక్క, పుప్పొడుల

జలం ప్రసన్నం కుముదం ప్రభాసం
క్రౌంచస్వనః శాలివనం విపక్వం ।
మృదుశ్చ వాయుర్విమలశ్చ చంద్రః
శంసంతి వర్షవ్యపనీతకాలమ్ ॥ 54

మీనోపసందర్శిత మేఖలానాం
నదీవధూనాం గతయోఽద్య మందాః ।
కాంతోపభుక్తాలసగామినీనాం
ప్రభాతకాలేష్వివ కామినీనామ్ ॥ 55

సచక్రవాకాని సశైవలాని
కాశైర్దుకూలైరివ సంవృతాని ।
సపత్రలేఖాని సరోచనాని
వధూముఖానీవ నదీముఖాని ॥ 56

ప్రఫుల్లబాణాసనచిత్రితేషు
ప్రహృష్టషట్పాదనికూజితేషు ।
గృహీతచాపోద్యతచండదండః
ప్రచండచారోఽద్య వనేషు కామః ॥ 57

లోకం సువృష్ట్యా పరితోషయిత్వా
నదీస్తటాకాని చ పూరయిత్వా ।
నిష్పన్నసస్యాం వసుధాం చ కృత్వా
త్యక్త్వా నభస్తోయధరాః ప్రణష్టాః ॥ 58

ప్రసన్నసలిలాః సౌమ్య కురరీభిర్వినాదితాః ।
చక్రవాకగణాకీర్ణా విభాంతి సలిలాశయాః ॥ 59

అసనాః సప్తపర్ణాశ్చ కోవిదారాశ్చ పుష్పితాః ।
దృశ్యంతే బంధుజీవాశ్చ శ్యామాశ్చ గిరిసానుషు ॥ 60

హంస సారస చక్రాహ్వైః కురరైశ్చ సమంతతః ।
పులినాన్యవకీర్ణాని నదీనాం పశ్య లక్ష్మణ ॥ 61

ప్రభావముచే పసుపు వన్నెలతో ఒప్పుచున్నవి. అవి గాలిలో కలసివచ్చుచున్న పరిమళములను ఆసించుచు ప్రియురాండ్రతో గూడి ఆవాయువులను అనుసరించుచున్నవి. (53)

శరత్కాలముయొక్క రాకతో జలములు నిర్మలములైనవి. కలువలు చక్కగా వికసించినవి. క్రౌంచపక్షులు మధురముగా కూయుచున్నవి. చంద్రుడు పండువెన్నెలలను ప్రసరింపజేయుచున్నాడు. ఇవి అన్నియును శరత్కాలవైభవమును చాటుచున్నవి. (54)

ప్రాతఃకాలమున ఒడ్డునకు చేరిన చేపలనెడు వడ్డాణములతో ఒప్పుచున్ననదీవధువుల (నదులనెడి స్త్రీలయొక్క) మందగమనములు, రాత్రివేళ పతులతో హాయిగా సుఖించి, అలసిపోయి ఉదయమున లేచి వచ్చుచున్న స్త్రీల మందగతులవలె ఒప్పుచున్నవి. (55)

చక్రవాకపక్షులతో ఒప్పుచు, నాచుతీగలతో విలసిల్లుచు, తెల్లుగడ్డియనెడి పట్టువస్త్రములచే ఆవృతములైన నదులముఖములు, పత్రరేఖలతో (చెక్కిళ్లపై అలంకరించుకొనెడి చిత్రములతో) గూడి, గోరోచనమును అలుముకొని, మేలి ముసుగులను కప్పుకొనిన వనితలముఖములవలె అలరారుచున్నవి.(56)

ఈ శరత్కాలమున వనములు అన్నియును చక్కగా వికసించిన గోరంటమొక్కలతోడను, వేగిసచెట్లతోడను చిత్రవిచిత్రములుగా విలసిల్లుచున్నవి. తుమ్మెదలు సంతోషముతో ఝుంకారములు చేయుచున్నవి. ఇట్టి వనములయందు మన్మథుడు తన ధనుస్సునందు తీవ్రములైన పుష్పబాణములను సంధించి, విరహములోనున్న జంటలపై దాడిచేయుచు ప్రచండవేగముతో సంచరించుచున్నాడు. (57)

మేఘములు పుష్కలములైన వానలతో లోకమునకు సంతోషమును గూర్చినవి, నదులను, తటాకములను జలములతో నింపినవి. అనువుగా వర్షించి భూమిని పాడిపంటలతో వర్ధిల్లజేసినవి. పిమ్మట అవి ఆకాశమును వీడి వెళ్లిపోయినవి. (58)

లక్ష్మణా! జలాశయములు నిర్మలమైన నీటితో నిండి ప్రసన్నముగా ఉన్నవి. వాటితీరములయందలి క్రౌంచపక్షులు మధురధ్వనులను గావించుచున్నవి. అవి చక్రవాకముల గుంపులతో చూడముచ్చటగా ఉన్నవి. కొండచరియలు పుష్పించినవేగిసవృక్షములతో, ఏడాకుల పొన్నచెట్లతో, ఎఱ్ఱకాంచనవృక్షములతో, నల్లని మంకెనచెట్లతో అలరారుచు కనువిందుగావించుచున్నవి. (59-60)

నాయనా! సౌమిత్రీ చూడుము. నదులయొక్క ఇసుకతిన్నెలపై అంతటను హంసలు, బెగ్గురుపక్షులు చక్రవాకములు, క్రౌంచపక్షులు సంచరించుచున్నవి. (61)

అన్యోఽన్యబద్ధవైరాణాం జిగీషూణాం నృపాత్మజ।
ఉద్యోగసమయః సౌమ్య పార్థివానామ్ ఉపస్థితః। 62

ఇయం సా ప్రథమా యాత్రా పార్థివానాం నృపాత్మజ।
న చ పశ్యామి సుగ్రీవమ్ ఉద్యోగం వా తథావిధమ్। 63

చత్వారో వార్షికా మాసా గతా వర్షశతోపమాః।
మమ శోకాభిభూతస్య సౌమ్య సీతామ్ అపశ్యతః। 64

చక్రవాకీవ భర్తారం పృష్ఠతోఽనుగతా వనం।
విషమం దండకారణ్యమ్ ఉద్యానమివ యాఽఽగతా। 65

ప్రియావిహీనే దుఃఖార్తే హృతరాజ్యే వివాసితే।
కృపాం న కురుతే రాజా సుగ్రీవో మయి లక్ష్మణ। 66

అనాథో హృతరాజ్యోఽయం రావణేన చ ధర్షితః।
దీనో దూరగృహః కామీ మాం చైవ శరణం గతః। 67

ఇత్యేతైః కారణైః సౌమ్య సుగ్రీవస్య దురాత్మనః।
అహం వానరరాజస్య పరిభూతః పరంతప। 68

స కాలం పరిసంఖ్యాయ సీతాయాః పరిమార్గణే।
కృతార్థః సమయం కృత్వా దుర్మతిర్నావబుధ్యతే। 69

త్వం ప్రవిశ్య చ కిష్కింధాం బ్రూహి వానరపుంగవం।
మూర్ఖం గ్రామ్యసుఖే సక్తం సుగ్రీవం వచనాన్మమ। 70

అర్థినామ్ ఉపపన్నానాం పూర్వం చాప్యుపకారిణామ్।
ఆశాం సంశ్రుత్య యో హంతి స లోకే పురుషాధమః। 71

శుభం వా యది వా పాపం యో హి వాక్యమ్ ఉదీరితమ్।
సత్యేన పరిగృహ్ణాతి స వీరః పురుషోత్తమః। 72

ఓ రాజకుమారా! పరస్పరము బద్ధవైరములుగల రాజులు ఒకరిని మఱియొకరు జయింపగోరినవారై, జైత్రయాత్రలకు బయలుదేఱు సమయము ఆసన్నమైనది. రాజులయొక్క జైత్రయాత్రలలో ఇది మొదటిది. కాని సుగ్రీవుడుమాత్రము ఇంతవఱకును మనకడకు రానేలేదు. కనీసము అతడు అట్టి ప్రయత్నమునకు దిగినట్లు గూడ నాకు అనిపించుటలేదు. (62-63)

ఓ సౌమ్యుడా! ఇంతవఱకును సీతాదేవిజాడయే తెలియకున్నది. ఆమెయెడబాటుకారణముగా నేను శోకమునకులోనై మిగుల పరితపించుచున్నాను. ఈ స్థితిలోనున్న నాకు ఈ నాల్గుమాసములును నూఱు సంవత్సరములుగా (నాలుగు యుగములుగా) తోచుచున్నవి. ఆడుచక్రవాకము తన భర్తనువలె జానకి నన్ను అనుసరించినది. అందునా ఆమె నాతో ఒక ఉద్యానవనమునకు వచ్చినట్లుగా ఘోరమైన ఈ దండకారణ్యములకు ఏతెంచినది. (64-65)

తమ్ముడా! లక్ష్మణా! నేను రాజ్యాధికారమునకు దూరమై వనములకు ఏతెంచితిని. నాప్రేమపెన్నిధియైన సీతాదేవిని ఎడబాసి, దుఃఖార్తుడనైతిని. ఇట్టి నాపై వానరరాజైన సుగ్రీవుడు దయ చూపుటలేదు. (66)

"ఓ పరంతపా! ఈ శ్రీరాముడు అండదండలు లేనివాడు, రాజ్యమును కోల్పోయినవాడు, రావణునిచే వంచితుడు, ఇంటికి దూరముగా ఉన్నవాడు భార్యయెడబాటుచే దుఃఖించుచున్నాడు, దైన్యముతో నన్ను శరణుజొచ్చినాడు." అని తలంచుచు వానరేంద్రుడు, దురాత్ముడు ఐన సుగ్రీవుడు నన్ను చులకన చేయుచున్నాడు. (67-68)

పరస్పరము సహాయపడుటకు సుగ్రీవుడు నాతో ప్రతిజ్ఞాపూర్వకముగా ఒప్పందము చేసికొనియున్నాడు. సీతాదేవిని అన్వేషించుటకు సమయమును నిర్దేశించియున్నాడు. నా సహాయముతో అతని పని నెఱవేఱినది. ఇప్పుడు ఆ దుర్మతి తన ప్రతిజ్ఞనే విస్మరించినాడు. కనుక ఓ లక్ష్మణా! నీవు వెంటనే కిష్కింధకు వెళ్లుము. మూర్ఖుడై ఇంద్రియసుఖములలో మునిగియున్న వానరరాజగు సుగ్రీవునితో నామాటగా ఇట్లు చెప్పుము. (69-70)

"ఇదివఱలో ఉపకారము చేసి, ప్రత్యుపకారమును ఆసించి, తన కడకు వచ్చినప్పుడు, మీకు తప్పక సహాయము చేయుదును' అని వారికి ప్రతిజ్ఞా పూర్వకముగా ఆశకల్పించి, ఆ ఆశను వమ్ముచేసిన వాడు ఈ లోకములో అధముడు. (71)

తాను ఇచ్చినమాట శుభముగాని, అశుభముగాని దానికి కట్టుబడియుండువాడే నిజమైన వీరుడు, ఉత్తమ పురుషుడు. (72)

కృతార్థా హ్యకృతార్థానాం మిత్రాణాం న భవంతి యే।
తాన్ మృతానపి క్రవ్యాదాః కృతఘ్నాన్ నోపభుంజతే। 73

మిత్రులసహాయముతో తమ పనులను పూర్తి చేసికొని, పిదప వారికి సహాయపడని వారు కృతఘ్నులు. అట్టివారు చనిపోయిన పిమ్మట వారి కళేబరములను పచ్చిమాంసములను తినెడి క్రూరమృగములుగూడ ముట్టవు." అని- (73)

నూనం కాంచనపృష్ఠస్య వికృష్టస్య మయా రణే।
ద్రష్టుమ్ ఇచ్ఛతి చాపస్య రూపం విద్యుద్గణోపమమ్। 74

లక్ష్మణా! నావింటికొమ్ములు బంగారముతో నిర్మింపబడినవి. అవి మెఱుపుతీగలవలె మిఱుమిట్లు గొలుపుచుండును. రణరంగమున అట్టి నాధనుస్సును ఎక్కుపెట్టి బాణమును ప్రయోగించుటను నిజముగా అతడు చూడదలచుకొన్నట్లున్నది. (నా బాణపుదెబ్బను రుచిచూడదలచుకొన్నట్లున్నది.)(74)

ఘోరం జ్యాతలనిర్ఘోషం క్రుద్ధస్య మమ సంయుగే।
నిర్ఘోషమివ వజ్రస్య పునః సంశ్రోతుమిచ్ఛతి। 75

యుద్ధభూమియందు క్రుద్ధుడనై నేను విజృంభించినప్పుడు వజ్రాయుధధ్వనివలె భయంకరమైన నా ధనుష్టంకారమును అతడు మరల వినదలచుకొన్నాడోయేమో? (75)

కామమేవం గతేఽప్యస్య పరిజ్ఞాతే పరాక్రమే।
త్వత్సహాయస్య మే వీర న చింతా స్యాన్నృపాత్మజ। 76

రాకుమారా! వీరా! నీవు నాకు తిరుగులేని సహాయకుడవు (కుడిభుజమువంటివాడవు) నా పరాక్రమ ప్రభావమును అతడు పూర్తిగా ఎఱుగును (నా పరాక్రమము దెబ్బకు తాళ వృక్షములు కూలిపోవుట, వాలి నేలగూలుట మొదలగునవి అతనికి తెలియును. ఇట్లెఱింగియున్నప్పటికిని "మాట తప్పినచో శ్రీరామునిచేతిలో వాలికి పట్టిన దుర్గతి నాకును తప్పదు'- అను భయము (చింత) సుగ్రీవునకు లేకుండుట ఆశ్చర్యకరము. (76)

యదర్థమ్ అయమారంభః కృతః పరపురంజయ।
సమయం నాఽభిజానాతి కృతార్థః ప్లవగేశ్వరః। 77

శత్రుపురంజయా! వాలిని వధించుట, సీతాదేవిని అన్వేషించుట అను రెండు ప్రయోజనములను సాధించుట కొఱకే మనకును సుగ్రీవునకు ప్రతిజ్ఞాపూర్వముగా మైత్రియేర్పడినది. వాలివధ పూర్తియైనది. సుగ్రీవునకు రాజ్యాధికారము ప్రాప్తించుట మొదలగు ప్రయోజనములును కలిగినవి. అతని అవసరములన్నియును తీరినవి. కనుక ఆ వానరేంద్రుడు తాను చేసిన ప్రమాణమును విస్మరించి, సీతాన్వేషణకొఱకు ప్రయత్నించుట లేదు. (77)

వర్షాసమయకాలం తు ప్రతిజ్ఞాయ హరీశ్వరః।
వ్యతీతాంశ్చతురో మాసాన్ విహరన్ నాఽవబుధ్యతే। 78

సామాత్యపరిషత్ క్రీడన్ పానమేవోపసేవతే।
శోకదీనేషు నాఽస్మాసు సుగ్రీవః కురుతే దయామ్। 79

వర్షాకాలము ముగిసిన వెంటనే సీతాన్వేషణకై యత్నించుటకు అతడు ప్రతిజ్ఞ చేసియున్నాడు. కాని అతడు సుఖభోగములలో మునిగి ఈ నాలుగుమాసములు గడచిపోయిన విషయమునే తెలియులేకున్నాడు. సుగ్రీవుడు మంత్రులతో, బంధువులతో గూడి మత్తుపదార్థములను సేవించుచు, వినోదములలో మునిగియున్నాడు. శోకములో మునిగి, దైన్యముతోనున్న మనపై అతడు ఆసక్తి చూపుటలేదు. (78-79)

ఉచ్యతాం గచ్ఛ సుగ్రీవః త్వయా వత్స మహాబల।
మమ రోషస్య యద్రూపం బ్రూయాశ్చైనమిదం వచః। 80

మహాబలశాలివైన లక్ష్మణా! వెంటనే నీవు సుగ్రీవుని కడకు వెళ్లుము. క్రుద్ధుడనైనేను చెప్పుచున్న ఈ మాటలను అతనితో నుడువుము- (80)

న చ సంకుచితః పంథా యేన వాలీ హతో గతః।
సమయే తిష్ఠ సుగ్రీవ మా వాలిపథమన్వగాః। 81
ఏక ఏవ రణే వాలీ శరేణ నిహతో మయా।
త్వాం తు సత్యాదతిక్రాంతం హనిష్యామి సబాంధవమ్। 82

'సుగ్రీవా! మీ అన్న మృతుడై వెళ్లిన మార్గము ఇంకను మూయబడలేదు- నీవు ఇచ్చిన మాటకు కట్టుబడియుండుము. వాలి వెళ్లిన త్రోవను అనుసరింపకుము. సమర భూమియందు నా బాణ ప్రహారమునకు వాలి ఒక్కడు మాత్రమే హతుడైనాడు. చేసిన ప్రతిజ్ఞను పాటింపనిచో నీవు సపరివారముగా మృత్యులోకమునకు ఏగుదువు.' (81-82)

తదేవం విహితే కార్యే యద్ధితం పురుషర్షభ।
తత్తద్బ్రూహి నరశ్రేష్ఠ త్వర కాలవ్యతిక్రమః। 83

పురుషశ్రేష్ఠా! లక్ష్మణా! మనమున్న ఈ పరిస్థితులకు అనుగుణముగా మన కార్యము సిద్ధించునట్లు చూడుము. దానికి తగినట్లుగా సుగ్రీవునితో ఇట్లు నుడువుము. త్వరపడుము, కాలముగడచి పోవుచున్నది. (83)

కురుష్వ సత్యం మయి వానరేశ్వర
ప్రతిశ్రుతం ధర్మమవేక్ష్య శాశ్వతమ్।
మా వాలినం ప్రేత్య గతో యమక్షయం
త్వమద్య పశ్యేర్మమ చోదితైః శరైః। 84

'ఓ వానరేశ్వరా! ధర్మము శాశ్వతమైనది. దానిని దృష్టిలో ఉంచుకొని నాకు చేసిన వాగ్దానమును నిజము చేయుము. అట్లు చేయనిచో నేను ప్రయోగించిన బాణములకు హతుడవై మృత్యులోకమున నీవు మీఅన్నను చూడవలసివచ్చును.' (84)

స పూర్వజం తీవ్రవివృద్ధకోపం
లాలప్యమానం ప్రసమీక్ష్య దీనం।
చకార తీవ్రాం మతిముగ్రతేజా
హరీశ్వరే మానవవంశనాథః। 85

మనువంశజుడైన లక్ష్మణుడు తనఅన్న మిక్కిలి క్రుద్ధుడయ్యును దీనముగా మాట్లాడుటను జూచి, సుగ్రీవునివిషయమున మండిపడుచు, ఆతనిని శిక్షించుటకు సిద్ధమాయెను. (85)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే త్రింశః సర్గః (30)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పదియవసర్గము

-- * * * --

31. ముప్పదియొకటవసర్గము

శ్రీరాముని సూచనమేరకు లక్ష్మణుడు కిష్కింధకు చేరుట - తన రాకను గూర్చి తెల్పుటకై అంగదుని సుగ్రీవుని కడకు పంపుట - సుగ్రీవునకు జాగృతిని కలిగించుటలో అంగదుని ప్రయత్నము ఫలింపకుండుట - ప్లక్షుడు, ప్రభావుడు అనుముఖ్య సచివులు సుగ్రీవుని మేలుకొలిపి, లక్ష్మణస్వామి రాకను దెలిపి, కర్తవ్యమును వివరించుట -

స కామినం దీనమదీనసత్త్వం
శోకాభిపన్నం సముదీర్ణకోపం।
నరేంద్రసూనుర్నరదేవపుత్త్రం
రామానుజః పూర్వజమిత్యువాచ। 1

మహారాజకుమారుడైన శ్రీరాముడు ఆసమయమున సీతాదేవివిడబాటువలన శోకమున మునిగి దీనుడై యుండెను. ఐనను మిక్కిలి శక్తిసంపన్నుడైన ఆ ప్రభువు సుగ్రీవునియెడల మిక్కిలి క్రుద్ధుడై యుండెను. అప్పుడు లక్ష్మణుడు తన అన్నతో ఇట్లు నుడివెను. (1)

న వానరః స్థాస్యతి సాధువృత్తే
న మంస్యతే కర్మఫలానుషంగాన్।
న భోక్ష్యతే వానరరాజ్యలక్ష్మీం
తథాహి నాఽభిక్రమతేఽస్య బుద్ధిః। 2

"అన్నా! సుఖదుఃఖములలో పాలుపంచుకొనుట మిత్రుల లక్షణము. కాని వానరుడైన సుగ్రీవుడు మనకు మిత్రుడయ్యును అట్లు ప్రవర్తించుటలేదు. 'వాలి వధింపబడుట, రాజ్యలాభము కలుగుట, భార్య చేరువయగుట మొదలగు ప్రయోజనములు మనవలన కలిగినవి' అను విషయమును ఆతడు మఱచినాడు. అందువలన అతనిధ్యాస మనపైపె మఱలుటలేదు. కనుక ఇంక వానరరాజ్యవైభవములను అనుభవింపజాలడు. (2)

మతిక్షయాద్గ్రామ్యసుఖేషు సక్తః
తవ ప్రసాదాప్రతికారబుద్ధిః ।
హతోఽగ్రజం పశ్యతు వీర తస్య
న రాజ్యమేవం విగుణస్య దేయమ్ ॥ 3

న ధారయే కోపముదీర్ణవేగం
నిహన్మి సుగ్రీవమసత్యమద్య ।
హరిప్రవీరైః సహ వాలిపుత్రో
నరేంద్రపత్న్యా విచయం కరోతు ॥ 4

త మాత్తబాణాసనముత్పతంతం
నివేదితార్థం రణచండకోపం ।
ఉవాచ రామః పరవీరహంతా
స్వవేక్షితం సానునయం చ వాక్యమ్ ॥ 5

న హి వై త్వద్విధో లోకే పాపమేవం సమాచరేత్।
పాపమార్యేణ యో హంతి స వీరః పురుషోత్తమః॥ 6

నేదమ్ అద్య త్వయా గ్రాహ్యం సాధువృత్తేన లక్ష్మణ।
తాం ప్రీతిమ్ అనువర్తస్వ పూర్వవృత్తం చ సంగతమ్॥ 7

సామోపహితయా వాచా రూక్షాణి పరివర్జయన్।
వక్తుమ్ అర్హసి సుగ్రీవం వ్యతీతం కాలపర్యయే॥ 8

సోఽగ్రజేనానుశిష్టార్థో యథావత్ పురుషర్షభః।
ప్రవివేశ పురీం వీరో లక్ష్మణః పరవీరహా॥ 9

తతః శుభమతిః ప్రాజ్ఞో భ్రాతుః ప్రియహితే రతః।
లక్ష్మణః ప్రతిసంరబ్ధో జగామ భవనం కపేః॥ 10

శక్రబాణాసనప్రఖ్యం ధనుః కాలాంతకోపమః।
ప్రగృహ్య గిరిశృంగాభం మందరః సానుమానివ॥ 11

యథోక్తకారీ వచనమ్ ఉత్తరం చైవ సోత్తరం।
బృహస్పతిసమో బుద్ధ్యా మత్వా రామానుజస్తథా॥ 12

ఓ వీరా! సుగ్రీవుడు మతిభ్రమించి, తుచ్ఛమైన ఇంద్రియసుఖములలో పడియున్నాడు. నిజముగా అతడు బుద్ధిలేనివాడు, కావున అతనికి నీవు చేసిన మహోపకారమునకు ప్రత్యుపకారము చేయవలసిన మాటనే మఱచినాడు. అతడు గుణహీనుడు. కనుక అట్టి వానికి రాజ్యమును ఇయ్యగూడదు. కాబట్టి ఆవానరుడు తనఅన్నవలె మృత్యుమార్గమును అనుసరింపక తప్పదు. ఇప్పుడు నాలో పెల్లుబుకుచున్నఈ కోపావేశమును ఆపుకొనలేకున్నాను. మాట తప్పిన సుగ్రీవుని నేడే హతమార్చెదను. అంతట అంగదుడురాజై, ప్రముఖములైన వానరులతోగూడి సీతాదేవికొఱకై అన్వేషింపగలడు." (3-4)

శ్రీరాముడు శత్రువీరులను తుదముట్టించుటలో సర్వసమర్థుడు, తనను ఆశ్రయించిన వారికి ఏమాత్రమూ హానిగూర్చడు. అట్టి రాముడు పలికిన దైన్యవచనములను విన్నంతమాత్రముననే లక్ష్మణుడు రణావేశపరుడై క్రోధముతో ధనుర్బాణములను చేపట్టి, ఒక్క ఉదుటున లేచెను. అట్టి లక్ష్మణునిచూచి శ్రీరాముడు అతనితో సహేతుకముగా ఇట్లు అనునయవచనములను పలికెను. (5)

"లక్ష్మణా! నీవంటివాడు ఇట్లు పాపమును (మిత్రవధను) ఆచరింపడు. వివేకముతో బాగుగా ఆలోచించి, నిజమైన పాపిని శిక్షించువాడు మాత్రమే వీరుడు, సత్పురుషుడు. సౌమిత్రీ! నీవు సత్ప్రవర్తన గలవాడవు. ఈ విధముగా సుగ్రీవుని చంపుటకై నిశ్చయించుట తగదు. ఇదివరలో అతనియెడ నీకున్న ప్రేమను, మైత్రిని అదేవిధముగా కొనసాగింపుము. (6-7)

'సీతాన్వేషణకై యత్నింపవలసిన సమయము మించిపోయినది' అని సుగ్రీవునితో కటువచనములతో గాక మృదువుగా పలుకుము." (8)

పురుషశ్రేష్ఠుడు, శత్రువులను హతమార్చగల వీరుడునైన లక్ష్మణుడు తన అన్న ఆజ్ఞాపించిన రీతిగా కిష్కింధాపురమున ప్రవేశించెను. (9)

అంతట నిర్మలమైనమనస్సుగలవాడు, ప్రాజ్ఞుడు, అన్నకు ప్రియమును గూర్చుచు, ఆయన హితముకొఱకే ఎల్లప్పుడును పాటుపడుచుండువాడు ఐన లక్ష్మణుడు సుగ్రీవుని చంపెడి ఆలోచనను మార్చుకొని అతని భవనమును చేరెను. (10)

ప్రళయకాలయమునివలె భయంకరుడైన లక్ష్మణుడు, గిరిశిఖరమును బోలిన ఇంద్రధనుస్సువంటి చాపమును గ్రహించి, మందరపర్వతమువలె ఒప్పుచుండెను. (11)

లక్ష్మణుడు తనఅన్నయొక్క ఆదేశమును పూర్తిగా (తు.చ.తప్పక) పాటించువాడు. బుద్ధియందు బృహస్పతితో సమానుడు. అట్టి ఆ సౌమిత్రి తాను సుగ్రీవునితో చెప్పవలసిన విషయములను, వాటికి ఆవానరప్రభువు ఇచ్చెడి

కామక్రోధసముత్థేన భ్రాతుః కోపాగ్నినా వృతః।
ప్రభంజన ఇవాఽప్రీతః ప్రయయౌ లక్ష్మణ స్తదా। 13

సాలతాలాశ్వకర్ణాంశ్చ తరసా పాతయన్ బహూన్।
పర్యస్యన్ గిరికూటాని ద్రుమానన్యాంశ్చ వేగతః। 14

శిలాశ్చ శకలీకుర్వన్ పద్భ్యాం గజ ఇవాశుగః।
దూరమ్ ఏకపదం త్యక్త్వా యయౌ కార్యవశాద్ద్రుతమ్। 15

తామ్ అపశ్యద్బలాకీర్ణాం హరిరాజమహాపురీమ్।
దుర్గామ్ ఇక్ష్వాకుశార్దూలః కిష్కింధాం గిరిసంకటే। 16

రోషాత్ ప్రస్ఫురమాణోష్ఠః సుగ్రీవం ప్రతి లక్ష్మణః।
దదర్శ వానరాన్ భీమాన్ కిష్కింధాయా బహిశ్చరాన్। 17

తం దృష్ట్వా వానరాః సర్వే లక్ష్మణం పురుషర్షభం।
శైలశృంగాణి శతశః ప్రవృద్ధాంశ్చ మహీరుహాన్।
జగృహుః కుంజరప్రఖ్యా వానరాః పర్వతాంతరే। 18

తాన్ గృహీతప్రహరణాన్ హరీన్ దృష్ట్వా తు లక్ష్మణః।
బభూవ ద్విగుణం క్రుద్ధో బహ్వింధన ఇవానలః। 19

తం తే భయపరీతాంగాః క్రుద్ధం దృష్ట్వా ప్లవంగమాః।
కాలమృత్యుయుగాంతాభం శతశో విద్రుతా దిశః। 20

తతః సుగ్రీవభవనం ప్రవిశ్య హరిపుంగవాః।
క్రోధమ్ ఆగమనం చైవ లక్ష్మణస్య న్యవేదయన్। 21

తారయా సహితః కామీ సక్తః కపివృషో రహః।
న తేషాం కపివీరాణాం శుశ్రావ వచనం తదా। 22

ప్రత్యుత్తరములను, పిమ్మట తాను అతనికి చేయవలసిన సూచనలను బాగుగా ఆలోచించుకొని బయలుదేఱెను. సీతాన్వేషణవిషయమున సుగ్రీవుడు అశ్రద్ధ చూపుటవలన శ్రీరామునిలో శోకక్రోధములు పెల్లుబుకుటను చూచి, లక్ష్మణునిలో క్రోధాగ్ని ప్రజ్వరిల్లెను. అంతట సుగ్రీవునిపైగల అసంతృప్తితో అతడు పెనుగాలివలె విజృంభించుచు వెళ్లెను. (12-13)

లక్ష్మణుడు అమితవేగముతో వెళ్లుచుండుటచే ఆదారికి ఇరువైపులనున్న మద్దిచెట్లు, తాటిచెట్లు నేలకు ఒఱిగిపోవుచుండెను. త్రోవలో ఉన్న ఇతరవృక్షములను, కొండశిఖరములను అతడు పెకలించి, విసరివేయుచుండెను. కార్య - అవసరమును బట్టి పెద్దపెద్ద అంగలు వేయుచు అతడు మహాగజమువలె సాగిపోవుచుండుటచే అతనిపాదముల క్రింద పడిన బండలన్నియును ముక్కలు ముక్కలు అగుచుండెను. (14-15)

ఇక్ష్వాకువంశజుడైన లక్ష్మణుడు సుగ్రీవుని రాజధానియైన కిష్కింధానగరమును చూచెను. దట్టమైన కొండలమధ్య విలసిల్లుచున్న ఆ నగరముచుట్టును చేరియున్న సైన్యములు దానిని రక్షించుచుండెను. అందువలన అది ఇతరులు ప్రవేశించుటకు అసాధ్యముగా ఉండెను. (16)

సుగ్రీవునిపైగల రోషముతో లక్ష్మణుని పెదవులు వణకుచుండెను. అప్పుడు అతడు కిష్కింధ వెలుపల సంచరించుచున్న వానరయోధుల గుంపులను చూచెను. (17)

నగరము వెలుపలనున్న వానరులును, కొండలమధ్య మధపుటేనుగులవలె బలశాలులైన వానరులును పురుషశ్రేష్ఠుడైన లక్ష్మణునిజూచి, వందలకొలదిగానున్న పర్వతశిఖరముల మీదికి చేరిరి, ఏపుగా పెఱిగిన మహావృక్షములకు ఎగబ్రాకిరి. (18)

ఆయుధములు గలిగియున్న ఆ వానరులనుజూచిన పిమ్మట మంటలలో పెక్కుకట్టెలను వేసినప్పుడు విజృంభించిన అగ్నివలె లక్ష్మణుని కోపము రెట్టింపాయెను. (19)

యుగాంతమున చెలరేగిన ప్రళయకాలమృత్యువువలె క్రుద్ధుడైయున్న ఆ లక్ష్మణునిగాంచి, వందలకొలదిగా నున్న వానరులందఱును భయముతో వణకిపోవుచు నలుదిక్కులకు పాఱిపోయిరి. (20)

పిమ్మట కొందఱు వానరప్రముఖులు సుగ్రీవునిభవనమున ప్రవేశించి, క్రుద్ధుడై వచ్చుచున్న లక్ష్మణస్వామిని గూర్చి నివేదించిరి. ఆసమయమున కామాసక్తుడైన సుగ్రీవుడు తారతో గూడి వినోదించుచుండెను. అందువలన అతడు వానరప్రముఖుల వచనములను ఆలకింపలేదు. అప్పుడు

తతః సచివసందిష్టా హరయో రోమహర్షణాః।
గిరికుంజరమేఘాభా నగర్యా నిర్యయుస్తదా। 23

నఖదంష్ట్రాయుధా ఘోరాః సర్వే వికృతదర్శనాః।
సర్వే శార్దూలదర్పాశ్చ సర్వే చ వికృతాననాః। 24

దశనాగబలాః కేచిత్ కేచిద్దశగుణోత్తరాః।
కేచిన్నాగసహస్రస్య బభూవుస్తుల్యవిక్రమాః। 25

కృత్స్నాం హి కపిభిర్వ్యాప్తాం ద్రుమహస్తై ర్మహాబలైః।
అపశ్యల్లక్ష్మణః క్రుద్ధః కిష్కింధాం తాం దురాసదామ్। 26

తతస్తే హరయః సర్వే ప్రాకారపరిఘాంతరాత్।
నిష్క్రమ్యోదగ్రసత్త్వాస్తు తస్థురావిష్కృతం తదా। 27

సుగ్రీవస్య ప్రమాదం చ పూర్వజం చార్తమాత్మవాన్।
బుద్ధ్వా కోపవశం వీరః పునరేవ జగామ సః। 28

స దీర్ఘోష్ణమహోచ్ఛ్వాసః కోపసంరక్తలోచనః।
బభూవ నరశార్దూలః సధూమ ఇవ పావకః। 29

బాణశల్యస్ఫురజ్జిహ్వః సాయకాసనభోగవాన్।
స్వతేజోవిషసంఘాతః పంచాస్య ఇవ పన్నగః। 30

తం దీప్తమివ కాలాగ్నిం నాగేంద్రమివ కోపితం।
సమాసాద్యాంగదస్త్రాసాత్ విషాదమ్ అగమద్భృశమ్। 31

సోఽంగదం రోషతామ్రాక్షః సందిదేశ మహాయశాః।
సుగ్రీవః కథ్యతాం వత్స మమాగమనమిత్యుత। 32

ఏష రామానుజః ప్రాప్తః త్వత్సకాశమ్ అరిందమః।
భ్రాతుర్వ్యసనసంతప్తో ద్వారి తిష్ఠతి లక్ష్మణః। 33

తస్య వాక్యేయది రుచిః క్రియతాం సాధు వానర।
ఇత్యుక్త్వా శీఘ్రమాగచ్ఛ వత్స వాక్యమరిందమ। 34

కొండలవలె, ఏనుగులరీతి, మేఘములతో సమానముగా మహాదేహములు గలిగియున్న ఆ వానరులు మంత్రుల ఆదేశమును విని, మిక్కిలి సంతసించినవారై, నగరము వెలుపలికి చేరిరి. (21-23)

గోళ్లు, దంతములే ఆయుధములుగాగల ఆవానరులు భయంకరమైన ఆకారములతో వికృతముగా కనబడుచుండిరి. వారిముఖములు విచిత్రములుగా ఉండెను. వారందఱును పెద్దపులులవలె దర్పముగలవారు. వారిలో కొందఱు పదియేనుగుల బలమును, మఱికొందఱు వందయేనుగుల బలమును, ఇంకను కొందఱు వేయి యేనుగుల బలమును గలిగియుండిరి. మహాబలశాలులైన ఆకపులు చెట్లను చేతబట్టుకొని, అందు అంతటను వ్యాపించియుండిరి. వానరులచే రక్షింపబడుచు శత్రువులకు దుర్భేద్యముగా ఉన్న కిష్కింధను కుపితుడైన లక్ష్మణుడు గాంచెను.(24-26)

అంతట మహాశక్తిశాలులైన వానరులందఱును ప్రాకారమునుండి పరిఘ (అగడ్త) నుండి వెలుపలికి వచ్చి, లక్ష్మణునకు కనబడునట్లు నిలబడిరి. (27)

ప్రజ్ఞాశాలియైన ఆ లక్ష్మణవీరుడు తన అన్నయొక్క ఆర్తిని, సుగ్రీవుని ఏమఱుపాటును మనస్సునకు తెచ్చుకొని ఇంకనూ కుపితుడయ్యెను. అంతట ఆ నరశ్రేష్ఠుని కన్నులు ఎఱ్ఱబాఱెను. అతడు దీర్ఘముగా వేడి నిట్టూర్పులు వదలుచు పొగతోగూడిన అగ్నివలె ఒప్పాఱెను. అంతేగాదు అతడు ఐదుతలలసర్పమువలె భయంకరముగా ఉండెను. మెఱయుచున్న బాణాగ్రములే ఆసర్పముయొక్క కదలుచున్ననాలుకలు, ధనుస్సే దానిపడగ, ఆయన యొక్క తేజస్సే ఆసర్పముయొక్క విషము. (28-30)

ప్రళయకాలాగ్నివలె జ్వలించుచున్నవాడును, ఆదిశేషుని వలె బుసలుకొట్టుచున్నవాడును ఐన లక్ష్మణుని సమీపించి, అంగదుడు భయముతో వణకిపోవుచు మిక్కిలి విషాదమునకు లోనయ్యెను. (31)

లక్ష్మణుని కన్నులు రోషముతో ఎఱుపెక్కియుండెను. మహావీరుడుగా వాసికెక్కిన ఆ సౌమిత్రి అంగదుని ఇట్లు ఆదేశించెను. "నాయనా! అంగదా! సుగ్రీవునకు నారాకను గూర్చి ఇట్లు తెలుపుము. 'శ్రీరాముని తమ్ముడు, శత్రుదమనుడు ఐన లక్ష్మణుడు నీకడకు వచ్చియున్నాడు. తన అన్నయొక్క దుఃఖమునకు పరితపించుచు అతడు ద్వారముకడ నిలిచియున్నాడు. అతని మాటలను పాటింపదలచినచో తగినరీతిగా ప్రవర్తింపుము. (నీవు ఆయున కడకు వచ్చెదవా? లేక ఆయననే నీయొద్దకు తీసికొనిరావలెనా? తెలుపుము-) "నాయనా! అంగదా! ఈ మాత్రము పలికి, వెంటనే తిరిగిరమ్ము." (32-34)

లక్ష్మణస్య వచః శ్రుత్వా శోకావిష్టోఽఙ్గదోఽబ్రవీత్।
పితుః సమీపమ్ అగమ్య సౌమిత్రిరయమాగతః॥ 35

అథాంగదస్తస్య వచో నిశమ్య
సంభ్రాంతభావః పరిదీనవక్త్రః।
నిపత్య తూర్ణం నృపతే స్తరస్వీ
తతః కుమారశ్చరణౌ వవందే॥ 36

సంగృహ్య పాదౌ పితురగ్ర్యతేజా
జగ్రాహ మాతుః పునరేవ పాదౌ।
పాదౌ రుమాయాశ్చ నిపీడయిత్వా
నివేదయామాస తతస్తమర్థమ్॥ 37

స నిద్రామదసంవీతో వానరో న విబుద్ధవాన్।
బభూవ మదమత్తశ్చ మదనేన చ మోహితః॥ 38

తతః కిలకిలాం చక్రుః లక్ష్మణం ప్రేక్ష్య వానరాః।
ప్రసాదయంతస్తం క్రుద్ధం భయమోహితచేతసః॥ 39

తే మహౌఘనిభం దృష్ట్వా వజ్రాశనిసమస్వనం।
సింహనాదం సమం చక్రుః లక్ష్మణస్య సమీపతః॥ 40

తేన శబ్దేన మహతా ప్రత్యబుధ్యత వానరః।
మదవిహ్వలతామ్రాక్షో వ్యాకులస్రగ్విభూషణః॥ 41

అథాంగదవచః శ్రుత్వా తేనైవ చ సమాగతౌ।
మంత్రిణౌ వానరేంద్రస్య సమ్మతౌ దూరదర్శినౌ॥ 42

ప్లక్షశ్చైవ ప్రభావశ్చ మంత్రిణావర్థధర్మయోః।
వక్తుమ్ ఉచ్చావచం ప్రాప్తం లక్ష్మణం తౌ శశంసతుః॥ 43

ప్రసాదయిత్వా సుగ్రీవం వచనైః సామనిశ్చితైః।
ఆసీనం పర్యుపాసీనౌ యథా శక్రం మరుత్పతిమ్॥ 44

సత్యసంధౌ మహాభాగౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ।
వయస్యభావం సంప్రాప్తౌ రాజ్యార్హౌ రాజ్యదాయినౌ॥ 45

తయోరేకో ధనుష్పాణిః ద్వారి తిష్ఠతి లక్ష్మణః।
యస్య భీతాః ప్రవేపంతో నాదాన్ముంచంతి వానరాః॥ 46

స ఏష రాఘవభ్రాతా లక్ష్మణో వాక్యసారథిః।
వ్యవసాయరథః ప్రాప్తః తస్య రామస్య శాసనాత్॥ 47

అయం చ దయితో రాజన్ తారాయాస్తనయోఽంగదః।
లక్ష్మణేన సకాశం తే ప్రేషితస్త్వరయానఘ॥ 48

లక్ష్మణునిమాటలను విని, అంగదుడు మిగుల బాధపడెను. పిమ్మట సౌమిత్రిరాకను తెలుపుటకై అతడు తన పినతండ్రికడకు వెళ్లెను. ఆ వాలికుమారుడు లక్ష్మణుని వచనములకు మిగుల దిగులు పడెను. అతనిముఖము వాడిపోయెను. వెంటనే బలశాలియు, యువరాజు ఐన అంగదుడు సుగ్రీవునిపాదములపైబడి ఆయనకు ప్రణమిల్లెను. (35-36)

మహాతేజస్వియైన అంగదుడు తనపినతండ్రికి నమస్కరించిన పిమ్మట తన తల్లియగు తారచరణములకు మోకరిల్లెను. పినతల్లి రుమకు ప్రణమిల్లెను. అనంతరము లక్ష్మణస్వామిరాకనుగూర్చి వారికి నివేదించెను. (37)

అప్పుడు కామపరవశుడైన సుగ్రీవుడు మితిమీఱి మధువును గ్రోలుటచే మత్తులో మునిగియుండెను. అతడు ఆమత్తులోనుండి ఎంతకును తేఱుకొనలేదు. (38)

అంతట క్రుద్ధుడైయున్న లక్ష్మణుని జూచి, భయముతో వానరులు దిక్కుతోచనివారై, ఆయనను ప్రసన్నునిజేసికొనుటకై కిలకిలారావములు కావించిరి. మహాప్రవాహమువలె గంభీరుడై యున్న లక్ష్మణునిజూచి, ఆవానరులు ఆయన సమీపమునకు చేరి సింహనాదమొనర్చిరి. అది పిడుగుపాటువలె భీకరముగా నుండెను. ఆమహాధ్వనికి వానరప్రభువు మేల్కొనెను. మత్తుచే మైమఱచి పడియున్న అతని కనులు ఎఱ్ఱబాఱియుండెను. అతనిమెడలోని మాలలు, ఆభరణములు చెదరియుండెను.(39-41)

అంగదుని ఆహ్వానముపై ప్లక్షుడు, ప్రభావుడు అను ఇరువురు అతని వెంటవచ్చిరి. వారు వానరప్రభువునకు ముఖ్యులు, దూరదృష్టిగలవారు. వారు ధర్మార్థరహస్యములను విశదపఱచుటకై వచ్చిన లక్ష్మణుని ప్రశంసించిరి. (42-43)

అంతట దేవతలకు ప్రభువైన ఇంద్రునివలె ఆసీనుడైయున్న సుగ్రీవుని సమీపమునకుచేరి, ఆ ఇద్దఱు మంత్రులు సవినయముగా విస్పష్టములైన వచనములతో ఆ ప్రభువును సంతోషపఱచి ఇట్లు పలికిరి. (44)

"రాజా! సోదరులైన రామలక్ష్మణులు మహాత్ములు, సత్యసంధులు, మనకు ఆప్తమిత్రులు. వారు మహారాజకుమారులు, రాజ్యపాలనమునకు అర్హులు, మీకు రాజ్యమును ప్రసాదించినవారు. ఆ అన్నదమ్ములలో ఒకడైన లక్ష్మణస్వామి ధనుర్ధారియై ద్వారముకడ నిలిచియున్నాడు. వానరులు అందఱును ఆయనకు భయపడి గడగడలాడుచు గగ్గోలుపెట్టుచున్నారు. ఇదిగో! రాఘవునకు ప్రియసోదరుడైన లక్ష్మణుడు శ్రీరాముని ఆదేశమును అనుసరించి ఆయనసందేశమును గొనివచ్చినవాడు. అన్నగించినవారిఅంతుచూడగల సమర్థుడు. రాజా! తారయొక్క గారాలపట్టియైన ఈ అంగదుడు ఆ లక్ష్మణుడు పంపగా నీకడకు వచ్చినవాడు. (45-48)

సోఽయం రోషపరీతాక్షో ద్వారి తిష్ఠతి వీర్యవాన్।
వానరాన్ వానరపతే చక్షుషా నిర్దహన్నివ। 49

తస్య మూర్ధ్నా ప్రణమ్య త్వం సపుత్త్రః సహ బంధుభిః।
గచ్ఛ శీఘ్రం మహారాజ రోషో హ్యస్య నివర్త్యతామ్। 50

యదాహ రామో ధర్మాత్మా తత్ కురుష్వ సమాహితః।
రాజన్ తిష్ఠ స్వసమయే భవ సత్యప్రతిశ్రవః। 51

ఓ వానరేంద్రా! పరాక్రమశాలియైన లక్ష్మణుడు కోపముతో కన్నులెఱ్ఱజేయుచు తనచూపులతో వానరులను దహించివేయుచున్నాడాయనునట్లు ద్వారముకడ నిల్చియున్నాడు. మహారాజా! నీవు వెంటనే నీకుమారుడైన అంగదునితో, బంధువులతో, అనుచరులతో ఆయన సమీపమునకు వెళ్ళి శిరసా ప్రణమిల్లుము. ఆయన రోషమును చల్లార్చుము. ఓ రాజా! ధర్మాత్ముడైన శ్రీరామునిఆదేశమును శ్రద్ధాదరములతో ఆచరింపుము. సత్యసంధుడవు కమ్ము, చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడియుండుము." (49-51)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకత్రింశః సర్గః *(31)*

వాల్మీకిమహర్షి విరచితమై, ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఇది ముప్పది ఒకటవ సర్గము.

-- * * * --

32. ముప్పదిరెండవసర్గము

లక్ష్మణుడు కుపితుడైనందులకు సుగ్రీవుడు ఆందోళనపడుట - శ్రీరాముడు సుగ్రీవునకు చేసిన మహోపకారమును గుర్తు చేయుచు, కృతజ్ఞతతో ఆ రఘువరునకు ప్రత్యుపకారము చేయుమని హనుమంతుడు ఆ వానరరాజునకు హితవుపల్కుట -

అంగదస్య వచః శ్రుత్వా సుగ్రీవః సచివైః సహ।
లక్ష్మణం కుపితం శ్రుత్వా ముమోచాసనమాత్మవాన్। 1

సచివాన్ అబ్రవీద్వాక్యం నిశ్చిత్య గురులాఘవమ్।
మంత్రజ్ఞాన్ మంత్రకుశలో మంత్రేషు పరినిష్ఠితాన్। 2

లక్ష్మణుడు కుపితుడైయున్నట్లు మంత్రులసమక్షమున అంగదుడు చెప్పగా విని, సుగ్రీవుడు భయముతో ఆసనమునుండి దిగ్గున లేచెను. సుగ్రీవుడు కర్తవ్యమును బాగుగా ఆలోచింపగలవాడు. కనుక అతడు శ్రీరాముని ఔన్నత్యమును, తనఅల్పత్వమును గ్రహించెను. మంత్రాంగమును బాగుగా ఎఱిగి, దానిని చక్కగా నడుపుటలో సమర్థులైన మంత్రులతో అతడు ఇట్లు నుడివెను. (1-2)

న మే దుర్వ్యాహృతం కించిత్ నాఽపి మే దురనుష్ఠితం।
లక్ష్మణో రాఘవభ్రాతా క్రుద్ధః కిమితి చింతయే। 3

అసుహృద్భిర్మమామిత్రైః నిత్యమ్ అంతరదర్శిభిః।
మమ దోషాన్ అసంభూతాన్ శ్రావితో రాఘవానుజః। 4

"నేను శ్రీరాముని తమ్ముడైన లక్ష్మణస్వామినిగూర్చి ఎప్పుడును పరుషముగా మాట్లాడియుండలేదు. ఆయనకు కించిత్తైనను అపకారమును చేసియెఱుగను. ఇప్పుడు ఆ మహాత్ముడు నాపై క్రుద్ధుడగుటకు కారణమేమి? కుటిలాత్ములు, నా శత్రువులు, నాలో దోషములను వెదకెడివారు లేనిపోనివి కల్పించి, లక్ష్మణునితో చెప్పియుండవచ్చును. (3-4)

అత్ర తావద్యథాబుద్ధి సర్వైరేవ యథావిధి।
భావస్య నిశ్చయస్తావత్ విజ్ఞేయో నిపుణం శనైః। 5

మంత్రులారా! మీ బుద్ధిబలముమేరకు యుక్తాయుక్తముగా ఆలోచించి, లక్ష్మణునిమనస్సులోని ఆంతర్యమును గుర్తింపుడు. అప్పుడు అతనికోపకారణము వాస్తవముగా తెలియగలదు. (5)

న ఖల్వస్తి మమ త్రాసో లక్ష్మణాన్నాపి రాఘవాత్।
మిత్రం త్వస్థానకుపితం జనయత్యేవ సంభ్రమమ్। 6

సర్వథా సుకరం మిత్రం దుష్కరం పరిపాలనం।
అనిత్యత్వాచ్చ చిత్తానాం ప్రీతిరల్పేఽపి భిద్యతే। 7

నాకు రామునివలనగాని, లక్ష్మణునివలనగాని ఎట్టి భయమూ లేదుగదా? కాని మిత్రునిఅకారణకోపము నాలో ఆందోళనను కలిగించుచున్నది. మిత్రుని సంపాదించుకొనుట సులభమే. కాని ఆమైత్రిని నిలుపుకొనుట మాత్రము చాల కష్టము. ఏలనన చిత్తములు చంచలములు. కావున ఏ చిన్నసంఘటన వలననైనను ఆమైత్రి దెబ్బతినవచ్చును. (6-7)

అతోనిమిత్తం త్రస్తోఽహం రామేణ తు మహాత్మనా।
యన్మమోపకృతం శక్యం ప్రతికర్తుం న తన్మయా॥ 8

మహాత్ముడైన శ్రీరాముడు నాకు మహోపకారము చేసియున్నాడు. (ఆ ప్రభువు వాలిని వధించి, నన్ను కిష్కింధకు రాజును గావించినాడు. ఆయనవలననే నా భార్య నాకు దక్కినది. అద్భుతమైన సుఖములు అమరినవి.) అట్టి సత్పురుషునకు ఏ చిన్న ప్రత్యుపకారమునూ చేయలేకపోవుచున్నాను. అందువలననే ఆ స్వామియనిన భయముగుచున్నది." (8)

సుగ్రీవేణైవముక్తస్తు హనుమాన్ హరిపుంగవః।
ఉవాచ స్వేన తర్క్యేణ మధ్యే వానరమంత్రిణామ్॥ 9

సుగ్రీవుడు ఇట్లు పలికిన పిమ్మట వానరులలో ప్రముఖుడైన హనుమంతుడు మంత్రులందరు వినుచుండగా సుగ్రీవునిముందు తన ఆలోచనలను ఇట్లు ప్రకటించెను. (9)

సర్వథా నైతదాశ్చర్యం యస్త్వం హరిగణేశ్వర।
న విస్మరసి సుస్నిగ్ధమ్ ఉపకారకృతం శుభమ్॥ 10

"ఓ వానరరాజా! ఆరామచంద్రప్రభువు చెలిమితో నీకొనర్చిన గొప్ప ఉపకారము ఎంతయుమేలైనది. ఎన్నడునూ మఱచిపోరానిది. అది ఇప్పుడు నీ మనసులో మెదలుచుండుట ఏవిధముగనూ ఆశ్చర్యకరము గాదు. (10)

రాఘవేణ తు వీరేణ భయమ్ ఉత్సృజ్య దూరతః।
త్వత్ప్రియార్థం హతో వాలీ శక్రతుల్యపరాక్రమః॥ 11

సర్వథా ప్రణయాత్ క్రుద్ధో రాఘవో నాఽత్ర సంశయః।
భ్రాతరం సంప్రహితవాన్ లక్ష్మణం లక్ష్మివర్ధనమ్॥ 12

మహావీరుడైన శ్రీరాముడు లోకాపవాదము వచ్చునేమోయని భయపడక[1] నీకు ప్రీతినిగూర్చుటకై ఇంద్రునియంతటి పరాక్రమశాలియైన వాలిని హతమార్చెను. అన్ని విధములుగా నీ మీదగల ప్రేమకారణముగనే నీ మేలుగోరియే శ్రీరాముడు కుపితుడైయున్నాడు. ఇందు ఏమాత్రమూ సంశయము లేదు. అందువలననే శుభలక్షణసంపన్నుడైన తమ్ముడగు లక్ష్మణుని నీయొద్దకు పంపినాడు. (11-12)

త్వం ప్రమత్తో న జానీషే కాలం కాలవిదాం వర।
ఫుల్లసప్తచ్ఛదశ్యామా ప్రవృత్తా తు శరచ్ఛివా॥ 13

బాగుగా వికసించిన పొన్నపూలతో, ఏడాకులఅరటి చెట్లతో కలకలలాడుచు ఆహ్లాదకరమైన శరత్కాలము రానేవచ్చినది. సమయజ్ఞులలో నీవు శ్రేష్ఠుడవేయైనను సుఖలోలుడవై కాలాతీతవిషయమును గుర్తించుటలేదు.(13)

నిర్మలగ్రహనక్షత్రా ద్యౌః ప్రణష్టవలాహకా।
ప్రసన్నాశ్చ దిశః సర్వాః సరితశ్చ సరాంసి చ॥ 14

మేఘములన్నియును తొలగిపోవుటచే ఆకాశము ఆహ్లాదకరముగా ఉన్నది. అందు గ్రహములు, నక్షత్రములు మిలమిలలాడుచున్నవి. నదులు, సరస్సులు నిర్మలమైన జలములతో ఇంపుగొల్పుచున్నవి. దిక్కులన్నియును ప్రసన్నముగా ఉన్నవి. (14)

ప్రాప్తమ్ ఉద్యోగకాలం తు నావైషి హరిపుంగవ।
త్వం ప్రమత్త ఇతి వ్యక్తం లక్ష్మణోఽయమ్ ఇహాగతః॥ 15

ఓ వానరరాజా! సీతాన్వేషణమునకు ప్రయత్నింపవలసిన సమయము ఆసన్నమైనది. నీవు సుఖలోలుడవై ఈ విషయమును విస్మరించినట్లు తలంచి, ఈ లక్ష్మణుడు ఇచ్చటికి వచ్చియున్నాడు. (15)

ఆర్తస్య హృతదారస్య పరుషం పురుషాంతరాత్।
వచనం మర్షణీయం తే రాఘవస్య మహాత్మనః॥ 16

మహాత్ముడైన శ్రీరాముని భార్య అపహరణకు గురియైనది. అందువలన అతడు ఆర్తితోనున్నాడు. కావున అతడు ఆవేదనతో లక్ష్మణునిద్వారా పంపిన వచనములు పరుషములుగానున్నను వాటిని నీవు ఓర్చుకొనవలెను. (బాధలలో ఉన్నవారు కఠినముగా పలికినను వాటిని పట్టించుకొన రాదు.) (16)

1) శ్రీరామునకు వాలి ఎట్టి అపకారమును చేయలేదు. అందువలన అతడు ఆ ప్రభువునకు శత్రువు కాడు. అట్టి స్థితిలో ఆ ప్రభువు తనకు శత్రువు కానివానిని చంపుట అన్యాయముగదా! అని లోకము నిందించునేమోయని వెనుకాడక ఆ రఘువీరుడు వాలిని హతమార్చెను.

కృతాపరాధస్య హి తే నాన్యత్ పశ్యామ్యహం క్షమమ్।
అంతరేణాంజలిం బద్ధ్వా లక్ష్మణస్య ప్రసాదనాత్। 17

ఆ ప్రభువువిషయమున అపరాధము చేసియుంటివి, కనుక నీవు అంజలిఘటించి, (శరణుజొచ్చి) లక్ష్మణుని ప్రసన్నుని చేసికొనుటయే తగిన ఉపాయము. అది తప్ప మఱియొకదారి నాకు కనబడుటలేదు. (17)

నియుక్తైర్మంత్రిభిర్వాచ్యో హ్యవశ్యం పార్థివో హితం।
అత ఏవ భయం త్యక్త్వా బ్రవీమ్యవధృతం వచః। 18

రాజు నియమించుకొనిన మంత్రులు ఎల్లప్పుడును విధిగా అతనిహితమును గోరియే పలుకుచుండవలెను. కనుక నేను నిర్భయముగా నా నిశ్చితాభిప్రాయమును (కఠినసత్యమును) నుడువుచున్నాను. (18)

అభిక్రుద్ధః సమర్థో హి చాపమ్ ఉద్యమ్య రాఘవః।
సదేవాసురగంధర్వం వశే స్థాపయితుం జగత్। 19

ఆ రామచంద్రప్రభువు నిజముగా క్రుద్ధుడైనచో కోదండమును (ధనుస్సును) చేబూని, దేవతలు, అసురులు, గంధర్వులు మున్నగువారితో గూడిన ఈ సమస్త జగత్తును తనవశములోనుంచుకొనగలడు. (19)

న స క్షమః కోపయితుం యః ప్రసాద్యః పునర్భవేత్।
పూర్వోపకారం స్మరతా కృతజ్ఞేన విశేషతః। 20

రాజా! ఇదివరలో నీవు ఆ స్వామివలన గొప్ప ఉపకారమును పొందియుంటివి. దానిని పదేపదే గుర్తుచేసికొనుచు ఆయన అనుగ్రహమును పొందవలసియున్నది. అంతేగాని ఆ ప్రభువునకు కోపము తెప్పించుట ఏమాత్రమును తగదు. (20)

తస్య మూర్ధ్నా ప్రణమ్య త్వం సపుత్త్రః ససుహృజ్జనః।
రాజంస్తిష్ఠ స్వసమయే భర్తుర్భార్యేవ తద్వశే। 21

ఓ వానరేంద్రా! నీవు, పుత్త్రుడైన అంగదునితో, బంధుమిత్రులతో గూడి ఆయనకు శిరసా ప్రణమిల్లుము. చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి భార్య తనభర్తకువలె నీవు ఆయనకు విధేయుడవై యుండుము. (21)

న రామ రామానుజశాసనం త్వయా
కపీంద్రయుక్తం మనసాఽప్యపోహితుమ్।
మనో హి తే జ్ఞాస్యతి మానుషం బలం
సరాఘవస్యాస్య సురేంద్రవర్చసః। 22

ఓ కపీంద్రా! రామలక్ష్మణులశాసనమును మనస్సులోనైనను ఉల్లంఘింపరాదు. ఆ ఇద్దఱును దేవేంద్రునివలె పరాక్రమ సంపన్నులు. ఆ మహాపురుషులబలము నీమనస్సునకు తెలియును. (22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ద్వాత్రింశస్సర్గః (32)

వాల్మీకిమహర్షి విరచితమై, ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పదిరెండవసర్గము

-- * * * --

33. ముప్పదిమూడవసర్గము

లక్ష్మణుడు కిష్కింధానగర శోభలను, అంగదాదుల భవనములను తిలకించుచు సుగ్రీవుని ప్రాసాదమునకు చేరుట - లక్ష్మణుని దర్శించుటకు భీతిల్లుచు, సుగ్రీవుడు ఆయనను శాంతపఱచుటకై తారను పంపుట - తారయుక్తియుక్తముగా సంభాషించి, ఆ సౌమిత్రిని శాంతపఱచుట, అంతఃపురములోనికి ఆహ్వానించుట -

అథ ప్రతిసమాదిష్టో లక్ష్మణః పరవీరహా।
ప్రవివేశ గుహాం ఘోరాం కిష్కింధాం రామశాసనాత్। 1

పిమ్మట అంగదుడు శత్రుదమనుడైన లక్ష్మణుని ఆహ్వానించెను. అంతట సౌమిత్రి శ్రీరామునిశాసనమును అనుసరించి, ఘోరముగానున్న కిష్కింధ (గుహా)లో ప్రవేశించెను. (1)

ద్వారస్థా హరయస్తత్ర మహాకాయా మహాబలాః।
బభూవుర్లక్ష్మణం దృష్ట్వా సర్వే ప్రాంజలయః స్థితాః। 2

ద్వారపాలకులుగా ఉన్న మహాకాయులు, మిక్కిలి బలశాలురు ఐన వానరులు అందఱును లక్ష్మణస్వామిని జూచి, అంజలిఘటించి నిలబడిరి. (2)

నిఃశ్వసంతం తు తం దృష్ట్వా క్రుద్ధం దశరథాత్మజం।
బభూవుర్హరయస్త్రస్తా న చైనం పర్యవారయన్। 3

స తాం రత్నమయీం శ్రీమాన్ దివ్యామ్ పుష్పితకాననాం।
రమ్యాం రత్నసమాకీర్ణాం దదర్శ మహతీం గుహామ్। 4

హర్మ్యప్రాసాదసంబాధాం నానాపణ్యోపశోభితాం।
సర్వకామఫలైర్వృక్షైః పుష్పితైరుపశోభితామ్। 5

దేవగంధర్వపుత్రైశ్చ వానరైః కామరూపిభిః।
దివ్యమాల్యాంబరధరైః శోభితాం ప్రియదర్శనైః। 6

చందనాగరుపద్మానాం గంధైః సురభిగంధినాం।
మైరేయాణాం మధూనాం చ సంమోదితమహాపథామ్।
దదర్శ గిరినద్యశ్చ విమలాస్తత్ర రాఘవః। 7

అంగదస్య గృహం రమ్యం మైందస్య ద్వివిదస్య చ।
గవయస్య గవాక్షస్య గజస్య శరభస్య చ। 8

విద్యున్మాలేశ్చ సంపాతేః సూర్యాక్షస్య హనూమతః।
వీరబాహోః సుబాహోశ్చ నళస్య చ మహాత్మనః। 9

కుముదస్య సుషేణస్య తారజాంబవతో స్తథా।
దధివక్త్రస్య నీలస్య సుపాటలసునేత్రయోః। 10

వీతేషాం కపిముఖ్యానాం రాజమార్గే మహాత్మనాం।
దదర్శ గృహముఖ్యాని మహాసారాణి లక్ష్మణః। 11

పాండురాభ్రప్రకాశాని దివ్యమాల్యయుతాని చ।
ప్రభూతధనధాన్యాని స్త్రీరత్నైః శోభితాని చ। 12

పాండురేణ తు సాలేన పరిక్షిప్తం దురాసదం।
వానరేంద్రగృహం రమ్యం మహేంద్రసదనోపమం। 13

శుక్లైః ప్రాసాదశిఖరైః కైలాసశిఖరోపమైః।
సర్వకామఫలై ర్వృక్షైః పుష్పితైరుపశోభితం। 14

మహేంద్రదత్తైః శ్రీమద్భిః నీలజీమూతసన్నిభైః।
దివ్యపుష్పఫలైర్వృక్షైః శీతచ్ఛాయైర్మనోరమైః। 15

క్రుద్ధుడై నిట్టూర్పులు విడుచుచున్న దశరథతనయుడగు లక్ష్మణునిజూచి, వారు మిగుల బీతిల్లి, ఆయనకు దూరముగనే ఉండిపోయిరి. (ఆయనతోగూడి లోపలికి వెళ్లలేదు.) (3)

మహాతేజశ్శాలియైన ఆ లక్ష్మణమూర్తి దివ్యమై, రమ్యముగా నున్న ఆమహాగుహను జూచెను. అందలి వనములు వికసించిన పూలతో కలకలాడుచుండెను. అది రత్నములతో నిర్మింపబడి, అమూల్యములైన వస్తువులతో ఆకర్షణీయముగా ఉండెను. అది సంపన్నులగృహములతో, రాజభవనములతో అలరారు చుండెను. వీథులన్నియును అమూల్యములగు వస్తువులఅంగళ్లతో విలసిల్లుచుండెను. అన్ని కాలములయందును పుష్పించి, ఫలించెడి వృక్షములతో విరాజిల్లుచుండెను. (4-5)

అందలి వానరులు కామరూపులు, దేవతల, గంధర్వుల అంశలతో పుట్టినవారు, వారు దివ్యములైన హారములను, వస్త్రములను ధరించి దర్శనీయముగా ఉండిరి, (6)

ఆ నగరమునందలి రాజవీథులు ఎల్లప్పుడును ఘుమఘుమలాడెడి చందన, అగరు, పద్మముల సువాసనలతోడను, మిరాదేశమునకు చెందిన మధువులతోడను గుబాళించుచుండెను, అందు గిరులనుండి ప్రవహించెడి సెలయేళ్లు స్వచ్ఛముగానుండెను. (7)

అంగదుడు, మైందుడు, ద్వివిదుడు, గవయుడు, గవాక్షుడు, గజుడు, శరభుడు, విద్యున్మాలి, సంపాతి, సూర్యాక్షుడు, హనుమంతుడు, వీరబాహుడు, సుబాహుడు, నళుడు, కుముదుడు, సుషేణుడు, తారుడు, జాంబవంతుడు, దధివక్త్రుడు, నీలుడు, సుపాటలుడు, సునేత్రుడు, మొదలగు మహాత్ములైన కపిప్రముఖులయొక్క భవనములు రాజమార్గము నందు విలసిల్లుచుండెను. దృఢముగానున్న ఆ గృహముల అందచందములను లక్ష్మణుడు దర్శించెను. (8-11)

స్వచ్ఛముగానున్న మేఘములవలె ఒప్పుచు, దివ్యములగు మాలలతో అలంకరింబడిన ఆ భవనములు ధనధాన్యసంపదలతో, స్త్రీ రత్నములతో శోభిల్లుచున్నవి. (12)

వానరరాజైన సుగ్రీవునిమహాభవనము దేవేంద్రుని ప్రాసాదమువలె, మిక్కిలి రమ్యముగా ఉండెను. దాని చుట్టునుగల ప్రాకారము తెల్లని కాంతులను విరజిమ్ముచుండెను. అది ఇతరులకు అలభ్యమైనది. (13)

ఆ భవనముయొక్క, శిఖరములు కైలాసశిఖరములవలె స్వచ్ఛములై తెల్లని కాంతులతో మెఱయుచుండెను. ఆభవనసమీపమున బాగుగా వికసించిన పుష్పములతో, అందఱికిని ఇష్టమగు ఫలములతోగూడిన వృక్షములు విరాజిల్లుచున్నవి. ఇవి మాత్రమేగాక అచట దివ్య పుష్పఫలములతోగూడి, చల్లనినీడలనిచ్చుచున్న మహావృక్షములును గలవు. వాటిని ఇంద్రుడు ప్రసాదించెను. అవి నల్లని

హరిభిః సంవృతద్వారం బలిభిః శస్త్రపాణిభిః।
దివ్యమాల్యావృతం శుభ్రం తప్తకాంచనతోరణమ్। 16

సుగ్రీవస్య గృహం రమ్యం ప్రవివేశ మహాబలః।
అవార్యమాణః సౌమిత్రిః మహాభ్రమివ భాస్కరః। 17

స సప్తకక్ష్యా ధర్మాత్మా నానాజనసమాకులాః।
ప్రవిశ్య సుమహద్గుప్తం దదర్శాంతఃపురం మహత్। 18

హైమరాజతపర్యంకైః బహుభిశ్చ వరాసనైః।
మహార్హాస్తరణోపేతైః తత్ర తత్రోపశోభితమ్। 19

ప్రవిశన్నేవ సతతం శుశ్రావ మధురస్వరం।
తంత్రీగీతసమాకీర్ణం సమగీతపదాక్షరమ్। 20

బహ్వీశ్చ వివిధాకారా రూపయౌవనగర్వితాః।
స్త్రియః సుగ్రీవభవనే దదర్శ స మహాబలః। 21

దృష్ట్వాభిజనసంపన్నాః చిత్రమాల్యకృతస్రజః।
ఫలమాల్యకృతవ్యగ్రాః భూషణోత్తమభూషితాః। 22

నాఽతృప్తాన్ నాఽపి చావ్యగ్రాన్ నానుదాత్తపరిచ్ఛదాన్।
సుగ్రీవానుచరాం శ్చాపి లక్షయామాస లక్ష్మణః। 23

కూజితం నూపురాణాం చ కాంచీనాం నినదం తథా।
సన్నిశమ్య తతః శ్రీమాన్ సౌమిత్రిర్లజ్జితోఽభవత్। 24

రోషవేగప్రకుపితః శ్రుత్వా చాభరణస్వనం।
చకార జ్యాస్వనం వీరో దిశః శబ్దేన పూరయన్। 25

చారిత్రేణ మహాబాహుః అపకృష్టః స లక్ష్మణః।
తస్థావేకాంతమాశ్రిత్య రామశోకసమన్వితః। 26

తేన చాపస్వనేనాథ సుగ్రీవః ప్లవగాధిపః।
విజ్ఞాయాగమనం త్రస్తః సంచచాల వరాసనాత్। 27

అంగదేన యథా మహ్యం పురస్తాత్ ప్రతివేదితం।
సువ్యక్తమ్ ఏష సంప్రాప్తః సౌమిత్రిర్భ్రాతృవత్సలః। 28

మేఘములవలె రమ్యములై శోభిల్లుచుండెను. ఆ భవన సింహద్వారమును బలిష్ఠులైన వానరులు శస్త్రములను చేబూని రక్షించుచుండిరి. అది మేలిమిబంగారుతోరణములతో, దివ్యములగుమాలలతో అలంకృతమై తళతళలాడుచుండెను. అట్టి రమ్యమైన సుగ్రీవుని గృహమున మిక్కిలి బలశాలియైన లక్ష్మణుడు మేఘములమధ్య సూర్యునివలె ప్రవేశించెను, ఆయనకు ఎవ్వరును అడ్డుచెప్పలేదు. (14-17)

ధర్మాత్ముడైన ఆసౌమిత్రి పెక్కుమంది పరిజనులతో ఒప్పుచున్న ఏడు కక్ష్యలను దాటెను. పిమ్మట అతడు కట్టుదిట్టములతో సురక్షితముగానున్న ఒక పెద్ద అంతః పురమును చూచెను. ఆ అంతఃపురమునందు అచ్చటచ్చట మిక్కిలి విలువైన ఆస్తరణములు పఱచబడియుండెను. వాటిపై బంగారముతో వెండితో నిర్మింపబడిన తల్పములు, శ్రేష్ఠములైన పెక్కు ఆసనములు అమర్చబడియుండెను. (18-19)

అతడు అందు ప్రవేశించుచునే నిరంతరము కొనసాగుచున్న మధురసంగీతమును వినెను. అది వీణ మొదలగు తంత్రీవాద్యములతోడను, సమతాళగతులతోడను (త్రిశ్రమిశ్ర, చతురస్రాది గతులతోడను.) మిళితమైయుండెను. ఆ భవనమునందు చక్కనిరూపములతో నిండుయౌవనములతో ఆకర్షణీయములైన వివిధాకారములుగల పెక్కుమంది స్త్రీలు ఆయనకు కనబడిరి. వారు ఉత్తమ వంశములకు చెందినవారు, చిత్ర విచిత్రములైన మాలలను ధరించినవారు, పండ్లను, విశిష్టములైన హారములను సమకూర్చుచున్నవారు. మేలైన అభరణములను ధరించినవారు. పిమ్మట లక్ష్మణుడు సుగ్రీవుని అనుచరులను గాంచెను. వారు అన్ని విధములుగా సంతృప్తులై యుండిరి, ప్రభుసేవలలో సావధానులైయుండిరి, శ్రేష్ఠములైన వస్త్రములను, ఆభరణములను ధరించి యుండిరి.(20-23)

పిమ్మట ఆ లక్ష్మణస్వామి కాలిఅందెలసవ్వడులను, ఒడ్డాణముల గలగలలను విని, లోపలికి వెళ్లుటకు సంకోచించెను. అభరణములధ్వనులనుగూడ విని, మిగుల క్రుద్ధుడై, దిక్కులు పిక్కటిల్లునట్లుగా ధనుష్టంకారమును గావించెను. (24-25)

మహాబాహువైన లక్ష్మణుడు ఉన్నతమైన రఘువంశజుల మర్యాదను పాటించుచు కొంచెము వెనుకకు తగ్గెను, శోకమున మునిగియున్న శ్రీరామునికై పరితపించుచు ఆస్వామి ఒక ఏకాంత (స్త్రీలసవ్వడిలేని) స్థలమున నిలిచెను. (26)

ఆ ధనుష్టంకారమును వినినంతనే వానరరాజైన సుగ్రీవుడు అచటికి లక్ష్మణుడు వచ్చినట్లు గ్రహించి, భయముతో తన ఉన్నతాసనమునుండి ఉలిక్కిపడిలేచెను. (27)

'అంగదుడు ఇంతకు ముందే నాతో చెప్పినరీతిగా సోదరప్రేమగల లక్ష్మణుడు వచ్చియున్నాడనుట నిశ్చయము' అని సుగ్రీవుడు తనలో తానసుకొనెను. (28)

అంగదేన సమాఖ్యాతం జ్యాస్వనేన చ వానరః।
బుబుధే లక్ష్మణం ప్రాప్తం ముఖం చాస్య వ్యశుష్యత॥ 29

అంగదుడు చెప్పినట్లు లక్ష్మణుడు వచ్చిన విషయము ఆ ధనుష్టంకారమువలన సుగ్రీవునకు ధ్రువపడెను. వెంటనే అతనిముఖము వెలవెలబోయెను. (29)

తత స్తారాం హరిశ్రేష్ఠః సుగ్రీవః ప్రియదర్శనాం।
ఉవాచ హితమవ్యగ్రః త్రాసనంభ్రాంతమానసః॥ 30

వానరప్రభువైన సుగ్రీవుడు భయముతో మానసికముగా మిగుల అందోళనపడెను. అనంతరము అతడు కర్తవ్యమును గూర్చి తర్కించుకొని, సుందరియైన తారతో ఇట్లు హితవచనములను పలికెను. (30)

కిన్ను తత్కారణం సుభ్రు ప్రకృత్యా మృదుమానసః।
సరోష ఇవ సంప్రాప్తో యేనాయం రాఘవానుజః॥ 31

కిం పశ్యసి కుమారస్య రోషస్థానమ్ అనిందితే।
న ఖల్వకారణే కోపమ్ ఆహరేన్నరసత్తమః॥ 32

"ఓ సుందరీ! శ్రీరామునితమ్ముడైన లక్ష్మణుడు సహజముగా మృదుస్వభావముగలవాడు. ఇప్పుడు క్రుద్ధుడై ఇచ్చటికి వచ్చినాడు. అందులకు కారణము ఏమైయుండును? ఉత్తమురాలా! ఆ రాజకుమారునకు అకారణముగా కోపము రాదుగదా? అయితే ఆయనకు కోపము ఎందులకు వచ్చినట్లు? ఆలోచింపుము. (31-32)

యదస్య కృతమస్మాభిః బుధ్యసే కించిదప్రియం।
తద్బుద్ధ్వా సంప్రధార్యాశు క్షిప్రమ్ అర్హసి భాషితుమ్॥ 33

అథవా స్వయమేవైనం ద్రష్టుమ్ అర్హసి భామిని।
వచనైః సాంత్వయుక్తైశ్చ ప్రసాదయితుమర్హసి॥ 34

త్వద్దర్శనే విశుద్ధాత్మా న స కోపం కరిష్యతి।
న హి స్త్రీషు మహాత్మానః క్వచిత్ కుర్వంతి దారుణమ్॥ 35

మనము ఆయన విషయమున ఏ కొంచెముగానైనను అపచారము చేసినట్లు నీకు అనిపించుచున్నదా? అయినచో ఆ దృష్టితో బాగుగా ఆలోచించి వెంటనే తెలుపుము. లేదా! నీవే స్వయముగా అచటికి వెళ్లి, ఆయనతో మాట్లాడుము. నీ మృదువచనములతో ఆయనను ప్రసన్నునిగా జేయుము. ఆయన పవిత్రమైన మనస్సుగలవాడు, కనుక నీ ముందు అతడు కోపపడడు. మహాత్ములు స్త్రీలపట్ల ఏ మాత్రమూ కఠినముగా వ్యవహరింపరు సుమా! (33-35)

త్వయా సాంత్వైరుపక్రాంతం ప్రసన్నేంద్రియమానసం।
తతః కమలపత్రాక్షం ద్రక్ష్యామ్యహమరిందమమ్॥ 36

కిష్కింధకు విచ్చేసిన ఆ లక్ష్మణుడు శత్రుసంహార దక్షుడు, కమలపత్రములవంటి నేత్రములు గలవాడు. నీ మృదువచనములకు ఆ స్వామి ప్రసన్నుడైన పిమ్మట నేను ఆయనను దర్శింతును." (36)

సా ప్రస్ఖలంతీ మదవిహ్వలాక్షీ
ప్రలంబకాంచీగుణ హేమసూత్రా।
సలక్షణా లక్ష్మణసన్నిధానం
జగామ తారా నమితాంగయష్టిః॥ 37

అంతట సుగ్రీవునివచనానుసారము ఆ తార లక్ష్మణునికడకు బయలుదేరెను. తొట్రుపాటుతో ఆమె అడుగులు తడబడుచుండెను. మధువులు గ్రోలుటచే ఆమెకనులు మూతలు పడుచుండెను. ఆమె నడుమునకు ధరించిన ఒడ్డాణముయొక్క బంగారుసూత్రములు వ్రేలాడు చుండెను. శుభలక్షణములతో ఒప్పుచున్న ఆతార వినమ్రయై ఆ స్వామిసన్నిధికి చేరెను. (37)

స తాం సమీక్ష్యైవ హరీశపత్నీం
తస్థావుదాసీనతయా మహాత్మా।
అవాఙ్ముఖోఽభూన్మనుజేంద్రపుత్రః
స్త్రీసన్నికర్షాద్వినివృత్తకోపః॥ 38

రాజకుమారుడైన ఆ లక్ష్మణుడు వానరరాజపత్నియైన ఆ తారను చూడగానే గౌరవభావముతో ముఖమును దించుకొనెను. స్త్రీలయెదుట కోపమును ప్రకటించుట ఉచితముగాదని తలంచి ఆ మహాత్ముడు శాంతము వహించెను. (38)

సా పానయోగాద్వినివృత్తలజ్జా
దృష్టిప్రసాదాచ్చ నరేంద్రసూనోః।
ఉవాచ తారా ప్రణయప్రగల్భం
వాక్యం మహార్థం పరిసాంత్వపూర్వమ్॥ 39

ఆ తార మధువును సేవించియుండుటచేతను, ఆ రాజకుమారుని చూపులలో ఆమెకు ప్రసన్నత గోచరించుటచేతను స్త్రీ సహజమైన బిడియమును విడనాడెను. పిమ్మట ఆమె లక్ష్మణుని శాంతపఱచుటకై విశేషార్థములతోగూడిన ప్రేమపూరితచతురవచనములను పలికెను. (39)

కిం కోపమూలం మనుజేంద్రపుత్త్ర
క స్తే న సంతిష్ఠతి వాఙ్నిదేశే ।
కః శుష్కవృక్షం వనమాపతంతం
దవాగ్నిమాసీదతి నిర్విశంకః । 40

స తస్యా వచనం శ్రుత్వా సాంత్వపూర్వమశంకితం ।
భూయః ప్రణయదృష్టార్థం లక్ష్మణో వాక్యమబ్రవీత్ । 41

కిమయం కామవృత్తస్తే లుప్తధర్మార్థసంగ్రహః ।
భర్తా భర్తృహితే యుక్తే న చైనమ్ అవబుధ్యసే । 42

న చింతయతి రాజ్యార్థం సో ఽ స్మాన్ శోకపరాయణాన్ ।
సామాత్యపరిషత్ తారే పానమేవోపసేవతే । 43

స మాసాంశ్చతురః కృత్వా ప్రమాణం ప్లవగేశ్వరః ।
వ్యతీతాంస్తాన్ మదవ్యగ్రో విహరన్ నా ఽ వబుధ్యతే । 44

న హి ధర్మార్థసిద్ధ్యర్థం పానమేవం ప్రశస్యతే ।
పానాదర్థశ్చ ధర్మశ్చ కామశ్చ పరిహీయతే । 45

ధర్మలోపో మహాంస్తావత్ కృతే హ్యప్రతికుర్వతః ।
అర్థలోపశ్చ మిత్రస్య నాశే గుణవతో మహాన్ । 46

మిత్రం హ్యర్థగుణశ్రేష్ఠం సత్యధర్మపరాయణం ।
తద్ద్వయం తు పరిత్యక్తం న తు ధర్మే వ్యవస్థితమ్ । 47

తదేవం ప్రస్తుతే కార్యే కార్యమ్ అస్మాభిరుత్తరమ్ ।
యత్కార్యం కార్యతత్త్వజ్ఞే తదుదాహర్తుమర్హసి । 48

సా తస్య ధర్మార్థసమాధియుక్తం
నిశమ్య వాక్యం మధురస్వభావమ్ ।
తారా గతార్థే మనుజేంద్రకార్యే
విశ్వాసయుక్తం తమువాచ భూయః । 49

న కోపకాలః క్షితిపాలపుత్త్ర
న చాతికోపః స్వజనే విధేయః ।
త్వదర్థకామస్య జనస్య తస్య
ప్రమాదమప్యర్హసి వీర సోఢుమ్ । 50

"ఓ మహారాజకుమారా! నీ కోపమునకు కారణమేమి? నీ ఆజ్ఞను పాటింపని వాడెవడు? ఎండిన వృక్షములు గల వనముమీదికి దూసికొనివచ్చుచున్న దావాగ్నిని ఎవడు సమీపించును?" (40)

ఊరటగూర్చుపద్ధతిలో ఆమె అధికమైన ప్రేమను ప్రకటించుచు నిస్సంకోచముగా పలికిన మాటలను విని, లక్ష్మణమూర్తి ఆమెతో ఇట్లు నుడివెను. (41)

"ప్రభువుహితమునే గోరెడి ఓ తారా! నీ ప్రభువు సుఖభోగములలో మునిగి, ధర్మార్థములను పాటించుట లేదు- ఈ విషయమును నీవు ఏల గమనించుటలేదు. సుగ్రీవుడు మంత్రులతో, రాజ్యాంగసభ్యులతోగూడి మధుసేవలలోనే పడియున్నాడు శోకమగ్నులమైన మా సంగతినే మఱచిపోయినాడు. అతడు రాజ్య ప్రయోజనములను గూర్చియు ఆలోచించుటలేదు. (42-43)

ఆ వానరరాజు నాలుగు నెలలకాలము (అవధి) ముగిసినంతనే సీతాన్వేషణకు పూనుకొందునని మాట ఇచ్చియున్నాడు. కాని మదమత్తుడై విహరించుచు ఆ అవధి గడచిపోయిన సంగతినే ఎఱుగకున్నాడు. (44)

ధర్మార్థములసిద్ధికి ప్రయత్నించువాడు మధుపానలోలుడు కాడు. మధుపానమువలన ధర్మార్థకామములు దెబ్బతినును. (45)

ఉపకారముచేసిన వానికి ప్రత్యుపకారము చేయకుండుట గొప్ప అధర్మము. (క్షమింపరాని నేరము.) గుణవంతుడైన మిత్రుని పోగొట్టుకొనుటవలన అర్థకామములు రెండును నష్టమగును. (46)

తనమిత్రునిఅర్థకామములయందు సహాయపడువాడు, ఇచ్చినమాటమీదనిలబడి ధర్మమునకు కట్టుబడియుండువాడు నిజమైన మిత్రుడు. కాని నీ స్వామిలో ఈ రెండు లక్షణములును లోపించినవి. మిత్రుడైన శ్రీరామునకు సీతాన్వేషణయందు తోడ్పడుట లేదు. తాను స్థిరముగా ధర్మమునందు నిలిచియుండుట లేదు. (47)

ఓ తారా! కార్యసాధనమార్గమును ఎఱిగినదానవు. ఇట్టి స్థితిలో మేము ఏమి చేయుట యుక్తమో, మాకొఱకు అతడేమి చేయవలెనో నీవే తెలుపుము." (48)

ఆ తార పూర్తిగా ధర్మార్థసహితములైన లక్ష్మణుని వచనములను విని, తద్ద్వారా ఆయనమధురస్వభావమును గుర్తించెను. పిమ్మట ఆమె శ్రీరామునికార్యమైన సీతాన్వేషణ విషయమున కాలతీతమైనట్లు భావించి, ఆ సౌమిత్రికి విశ్వాసము కలుగునట్లుగా మఱల ఇట్లు నుడివెను. (49)

"వీరుడవైన ఓ రాజకుమారా! ఇది కోపపడవలసిన సమయము కాదు. పైగా ఆత్మీయుల విషయమున కోపము ఏ మాత్రమూ తగదు. మీ కార్యసాధనవిషయము ఆయనమనస్సున మెదలుచునే యున్నది. ఆయనవలన ఏదైనా పొరపాటు జరిగియున్నచో దానిని నీవు ఓర్చుకొనుము (అందులకు క్షమింపుము) (50)

కోపం కథం నామ గుణప్రకృష్టః
కుమార కుర్యాదపకృష్టసత్త్వే ।
కస్త్వద్విధః కోపవశం హి గచ్ఛేత్
సత్త్వావరుద్ధస్తపసః ప్రసూతిః । 51

జానామి రోషం హరివీరబంధోః
జానామి కార్యస్య చ కాలసంగమ్ ।
జానామి కార్యం త్వయి యత్కృతం నః
తచ్చాపి జానామి యదత్ర కార్యమ్ । 52

తచ్చాపి జానామి యథాఽవిషహ్యం
బలం నరశ్రేష్ఠ శరీరజస్య ।
జానామి యస్మింశ్చ జనేఽవబద్ధం
కామేన సుగ్రీవమసక్తమద్య । 53

న కామతంత్రే తవ బుద్ధిరస్తి
త్వం వై యథా మన్యువశం ప్రపన్నః ।
న దేశకాలౌ హి న చార్థధర్మౌ
అపేక్షతే కామరతిర్మనుష్యః । 54

తం కామవృత్తం మమ సన్నికృష్టం
కామాభియోగాచ్చ నివృత్తలజ్జమ్ ।
క్షమస్వ తావత్ పరవీరహంతః
త్వద్భ్రాతరం వానరవంశనాథమ్ । 55

మహర్షయో ధర్మతపోభికామాః
కామానుకామాః ప్రతిబద్ధమోహాః ।
అయం ప్రకృత్యా చపలః కపిస్తు
కథం న సజ్జేత సుఖేషు రాజా । 56

ఇత్యేవ ముక్త్వా వచనం మహార్థం
సా వానరీ లక్ష్మణమప్రమేయమ్ ।
పునః సఖేలం మదవిహ్వలం చ
భర్తుర్హితం వాక్యమిదం బభాషే । 57

ఉద్యోగస్తు చిరాజ్ఞప్తః సుగ్రీవేణ నరోత్తమ ।
కామస్యాపి విధేయేన తవార్థప్రతిసాధనే । 58

ఆగతా హి మహావీర్యా హరయః కామరూపిణః ।
కోటీశతసహస్రాణి నానానగనివాసినః । 59

తదాగచ్ఛ మహాబాహో చారిత్రం రక్షితం త్వయా ।
అచ్ఛలం మిత్రభావేన సతాం దారావలోకనమ్ । 60

ఓ రాజపుత్త్రా! మిక్కిలిపరాక్రమశాలి బలహీనునిపై కోపపడి ప్రయోజనమేమి? పైగా నీవు ప్రయత్నశీలుడవు, శాంతమూర్తివి. అట్టి నీవంటివాడు కోపమునకు ఎట్లు వశమగును? (51)

స్వామీ! వానరవీరులకు ఆత్మీయుడైన శ్రీరామచంద్రప్రభువు యొక్క పరాక్రమమును నేను ఎఱుగుదును. సీతాన్వేషణ కార్యమునకు విలంబము జరిగినదనియు నాకు తెలియును. మీరు మాకు చేసిన మహోపకారమునుగూడ నేను ఎఱుగుదును. ఇప్పుడు వెంటనే సీతాన్వేషణకార్యమునకు పూనుకొనవలసిన విషయమునుగూడ నేను ఎఱుగుదును. ఓ నరవరా! అధిగమింపరాని కామవికారములయొక్క ప్రభావమునుగూడ నేను ఎఱుగుదును. మఱియు సుగ్రీవుడు సుఖభోగలోలుడై ఉన్నాడనియు నాకు తెలియును. ఆకారణముగా ముఖ్యకర్తవ్యమైన సీతాన్వేషణ కార్యమునందు ఆయన మనస్సు మఱలకయున్నది. (52-53)

నీవు పూర్తిగా కోపమున మునిగియున్నందున కామప్రభావమును ఎఱుగకయున్నావు. భోగాసక్తుడైనవాడు దేశకాలములను గూర్చిగాని, అర్థధర్మములను గుఱించిగాని ఆలోచింపడు. (54)

శత్రువీరులను హతమార్చుటలో సమర్థుడవైన ఓ లక్ష్మణా! సుగ్రీవుడు కామాసక్తుడై సిగ్గువిడిచి, సుఖలోలుడై నా చెంతనే యున్నాడు. ఆ వానరప్రభువు నీకు సోదరుని వంటివాడు. కావున ఇప్పుడు ఆయనను దయతో క్షమింపుము. (55)

స్త్రీజన వ్యామోహాదులకు వశులుగాక, సంతతము ధర్మాచరణమునందును, తపశ్చర్యలయందును నిరతులై యుండెడి మహర్షులుగూడ కామాభిలాషలకు బానిసలగుదురు. ఇక సుగ్రీవుడు సహజముగనే చపలుడైన వానరుడు, పైగా ప్రభువుగూడ. అట్టివాడు సుఖభోగములకు ఎట్లు వశుడు కాకుండును?" (56)

సాటిలేని బలపరాక్రమములుగల లక్ష్మణునితో ఆ తార ఈ విధముగా అర్థవంతములైన మాటలను - పలికిన పిమ్మట మదముచే పరవశింపజేసెడి వచనములను తన ప్రభువు హితమునుగోరి సవిలాసముగా ఇట్లు నుడివెను. (57)

ఓ నరోత్తమా! సుగ్రీవుడు సుఖములకు దాసుడేయై యున్నను మీ కార్యమును సాధించుటకై (సీతాదేవి జాడ తెలిసికొనుటకై) తగిన ఆజ్ఞలను ఇచ్చియేయున్నాడు. ఆయన ఆదేశములను శిరసావహించి, వివిధములగు పర్వత ప్రాంతములలో నివసించుచున్నవారు, కామరూపులు, మహావీరులు ఐన కోట్లకొలది వానరులు వచ్చియేయున్నారు. (58-59)

ఓ మహాబాహూ! (పరస్త్రీలను చూచుట అనుచితమని భావించి నీవు బయటనే నిలబడియుంటివి. అట్లు చేయుట వలన) నీ సత్ప్రవర్తనను నీవు ఋజువుచేసికొంటివి. సత్పురుషులు గౌరవభావముతో (మాతృభావముతో సోదరీభావముతో) పరస్త్రీలను చూచుట దోషము గాదు. కావున లోపలికి రమ్ము. (60)

తారయా చాభ్యనుజ్ఞాతః త్వరయా చాపి చోదితః।
ప్రవివేశ మహాబాహుః అభ్యంతరమరిందమః। 61

శత్రుసూదనుడు, మహాబాహువు ఐన లక్ష్మణుడు తారయొక్క అభ్యర్థనపై, ఆమెప్రేరణను అనుసరించి, సుగ్రీవుని అంతఃపురమున ప్రవేశించెను. (61)

తతః సుగ్రీవమాసీనం కాంచనే పరమాసనే।
మహార్హాస్తరణోపేతే దదర్శాదిత్యసన్నిభమ్। 62

దివ్యాభరణచిత్రాంగం దివ్యరూపం యశస్వినమ్।
దివ్యమాల్యాంబరధరం మహేంద్రమివ దుర్జయమ్। 63

దివ్యాభరణమాల్యాభిః ప్రమదాభిః సమావృతం।
సంరబ్ధతరరక్తాక్షో బభూవాంతకసన్నిభః। 64

పిమ్మట అతడు అమూల్యమైన ఆస్తరణముగల బంగారు సింహాసనముపై సూర్యునివలె వెలుగొందుచున్న సుగ్రీవుని జూచెను. ఆ సుగ్రీవుడు చిత్రములైన దివ్యాభరణములను, అపూర్వములైన మాలలను, వస్త్రములను ధరించియుండెను. దివ్యమైన రూపము గలిగి సుప్రసిద్ధుడైన ఆ వానరప్రభువు అజేయుడైన మహేంద్రునివలె విలసిల్లుచుండెను. ఇంకను అతడు దివ్యములగు ఆభరణములను, వస్త్రములను దాల్చిన తరుణీమణులతో పరివృతుడైయుండెను. అట్టి స్థితిలో ఉన్న అతనిని జూచి, రోషావేశముతో కన్నులెఱ్ఱబాఱినవాడై లక్ష్మణుడు ప్రళయకాల యమునివలె ఒప్పారెను. (62-64)

రుమాం తు వీరః పరిరభ్య గాఢం
వరాసనస్థో వరహేమవర్ణః।
దదర్శ సౌమిత్రిమదీనసత్త్వం
విశాలనేత్రః సువిశాలనేత్రమ్। 65

విశాలములైనకనులుగలవాడు, మేలిమిబంగారు వన్నెగలవాడు, వీరుడు ఐన సుగ్రీవుడు ఉన్నతమైన ఆసనముపై చేరి, రుమను గాఢముగా కౌగిలించుకొనియుండెను. అప్పుడు మిక్కిలిక్రుద్ధుడై కన్నులు పెద్దవిగా చేసియున్న లక్ష్మణమూర్తిని ఆ సుగ్రీవుడు చూచెను. (65)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే త్రయస్త్రింశఃసర్గః (33)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పదిమూడవసర్గము

-- * * * --

34. ముప్పదినాల్గవసర్గము

లక్ష్మణస్వామి సుగ్రీవుని మందలించుట -

తమప్రతిహతం క్రుద్ధం ప్రవిష్టం పురుషర్షభం।
సుగ్రీవో లక్ష్మణం దృష్ట్వా బభూవ వ్యథితేంద్రియః। 1

ఎదిరింపశక్యముగానివాడు, నరశ్రేష్ఠుడు ఐన లక్ష్మణుడు క్రుద్ధుడై తనమందిరమున ప్రవేశించినంతనే చూచి సుగ్రీవుడు నిశ్చేష్టుడయ్యెను. (1)

క్రుద్ధం నిశ్శ్వసమానం తం ప్రదీప్తమివ తేజసా।
భ్రాతుర్వ్యసనసంతప్తం దృష్ట్వా దశరథాత్మజమ్। 2

ఉత్పపాత హరిశ్రేష్ఠో హిత్వా సౌవర్ణమాసనమ్।
మహాన్ మహేంద్రస్య యథా స్వలంకృత ఇవ ధ్వజః। 3

మహాతేజస్వియైన ఆ లక్ష్మణుడు శోకమున మునిగియున్న తనఅన్నకొఱకై తపించుచు, క్రుద్ధుడై నిట్టూర్పులు విడచుచుండెను. అట్టి సౌమిత్రిని జూచి, సుగ్రీవుడు కంగారుతో బంగారుసింహాసనమునుండి ఒక్కఉదుటున ఎగిరిపడెను. అప్పుడతడు అలంకృతమైయున్న గొప్ప ఇంద్రధ్వజము ఆకాశమునుండి జాఱిపడినట్లు ఒప్పారెను. (2-3)

ఉత్పతంతమ్ అనూత్పేతూ రుమాప్రభృతయః స్త్రియః।
సుగ్రీవం గగనే పూర్ణచంద్రం తారాగణా ఇవ। 4

సుగ్రీవుడు అట్లు ఎగిరిపడగానే రుమ మొదలగు స్త్రీలు, ఆకాశమున పూర్ణచంద్రుడు ఉదయింపగనే తారకలవలె, అతనిని అనుసరించి లేచినిలబడిరి. (4)

సంరక్తనయనః శ్రీమాన్ విచచాల కృతాంజలిః।
బభూవావస్థితస్తత్ర కల్పవృక్షో మహానివ। 5

రుమాద్వితీయం సుగ్రీవం నారీమధ్యగతం స్థితం।
అబ్రవీల్లక్ష్మణః క్రుద్ధః సతారం శశినం యథా। 6

సత్త్వాభిజనసంపన్నః సానుక్రోశో జితేంద్రియః।
కృతజ్ఞః సత్యవాదీ చ రాజా లోకే మహీయతే। 7

యస్తు రాజా స్థితోఽధర్మే మిత్రాణామ్ ఉపకారిణాం।
మిథ్యాప్రతిజ్ఞాం కురుతే కో నృశంసతర స్తతః। 8

శతమ్ అశ్వానృతే హంతి సహస్రం తు గవానృతే।
ఆత్మానం స్వజనం హంతి పురుషః పురుషానృతే। 9

పూర్వం కృతార్థో మిత్రాణాం న తత్ ప్రతికరోతి యః।
కృతఘ్నః సర్వభూతానాం స వధ్యః ప్లవగేశ్వర। 10

గీతోఽయం బ్రహ్మణా శ్లోకః సర్వలోకనమస్కృతః।
దృష్ట్వా కృతఘ్నం క్రుద్ధేన తం నిబోధ ప్లవంగమ। 11

బ్రహ్మఘ్నే చ సురాపే చ చోరే భగ్నవ్రతే తథా।
నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నే నాస్తి నిష్కృతిః। 12

అనార్యస్త్వం కృతఘ్నశ్చ మిథ్యావాదీ చ వానర।
పూర్వం కృతార్థో రామస్య న తత్ ప్రతికరోషి యత్। 13

నను నామ కృతార్థేన త్వయా రామస్య వానర।
సీతాయా మార్గణే యత్నః కర్తవ్యః కృతమిచ్ఛతా। 14

అలంకృతుడైయున్న సుగ్రీవునియొక్క కన్నులు మత్తుచే ఎఱ్ఱబాఱియుండెను. అతడు దోసిలియొగ్గి తడబడుచున్నవాడై లక్ష్మణుని సమీపించి నిలబడెను. అప్పుడా సౌమిత్రి స్థిరముగా కల్పవృక్షమువలె ఒప్పుచుండెను. (5)

నక్షత్రములనడుమ చంద్రునివలె స్త్రీలమధ్య రుమతోగూడి యున్న సుగ్రీవునితో క్రుద్ధుడైయున్న లక్ష్మణుడు ఇట్లనెను. (6)

"సుగ్రీవా! ధైర్యశాలియు, ఉత్తమవంశమున జన్మించినవాడును, మెత్తని స్వభావము (దయ) గలవాడును, ఇంద్రియనిగ్రహము గలవాడును, సత్యవచనుడును ఐన రాజే లోకమున గౌరవాదరములకు అర్హుడగును. అధర్మపరుడు, ఉపకారము చేసిన మిత్రులకు మాటఇచ్చి తప్పినవాడు ఐన రాజు మిక్కిలి క్రూరాత్ముడుగా పరిగణింపబడును. (7-8)

అశ్వవిషయమున బొంకినవాడు (గుఱ్ఱమును దానమిత్తునని పలికి మాటతప్పినవాడు) నూఱు అశ్వములను చంపిన పాపమును మూటగట్టుకొనును, అట్లే గోమాత విషయమున అసత్యమునకు పాల్పడిన వానిని వేయి గోవులను చంపిన పాపము చుట్టుకొనును. ఆవిధముగా తోడిమానవునకు వాగ్దానము చేసి తప్పినవాడు తనను, తన బంధువులను చంపిన వానితో సమానుడు, అతనికి దుర్గతులు తప్పవు. ఇక పురుషోత్తముడైన శ్రీరామచంద్రునకుకిచ్చిన వాగ్దానమును భంగమొనర్చినవాడు సకలప్రాణులను హతమొనర్చిన మహాపాపాత్మునితో తుల్యుడు. (అతడు రౌరవాది నరకయాతనలను అనుభవింపక తప్పదు.) (9)

ఓ వానర రాజా! మిత్రులవలన ఉపకారమును పొంది, (తన కార్యమును గట్టెక్కించుకొని) తిరిగి వారికి ప్రత్యుపకారము చేయనివాడు కృతఘ్నుడు. అతడు వధార్హుడు. అంతేగాదు, సకలజనులముందును అతడు మృతప్రాయుడు. చేసినమేలును మఱచిన వానిని (కృతఘ్నుని) చూచి బ్రహ్మదేవుడు క్రుద్ధుడై ఈ శ్లోకమును ప్రకటించెను. దీనిని సమస్తలోకములును ఆదరించినవి. దానిని నీవు తెలిసికొనుము. బ్రహ్మహత్యకు పాల్పడిన వానికిని, మద్యపానము చేసినవానికిని, దొంగకును, వ్రతభంగమొనర్చిన వానికిని ప్రాయశ్చిత్తముద్వారా ఆ పాపములనుండి విముక్తి కలుగునని సత్పురుషులు పేర్కొనిరి. కాని కృతఘ్నుని పాపములకు మాత్రము ఏ విధముగను విముక్తి కలుగదని తెల్పిరి. (10-12)

ఓ వానరా! నీవు నీచుడవు, పైగా కృతఘ్నుడవు, మీదు మిక్కిలి అసత్యవాదివి. శ్రీరాముని సహాయముతో ముందుగా నీపనిని నెఱవేర్చుకొంటివి. ఇంతవఱకును దానికి ప్రత్యుపకారమునుగూర్చి తలంపనైతివి. నీకోరిక నెఱవేఱినది (నీ అవసరము తీఱినది) ఆ ప్రభువునకు ప్రత్యుపకారమును చేయవలయునను తలంపుతో వెంటనే సీతాన్వేషణ కార్యమునకు పూనుకొనవలెను గదా! (13-14)

న త్వం గ్రామ్యేషు భోగేషు సక్తో మిథ్యాప్రతిశ్రవః।
న త్వామ్ రామో విజానీతే సర్పం మండూకరావిణమ్। 15

ఓ సుగ్రీవా! నీవు తప్పుడు ప్రమాణమును చేసినవాడవు. అందువలననే ఆ ప్రమాణమునకు కట్టుబడక తుచ్ఛమైన భోగములలో పడితివి. నీవు కప్పవలె ధ్వని చేయునట్టి పాముపని (వంచకుడవని)[1] శ్రీరాముడు తలంపలేదు. (15)

మహాభాగేన రామేణ పాపః కరుణవేదినా।
హరీణాం ప్రాపితో రాజ్యం త్వం దురాత్మా మహాత్మనా। 16

ఓ సుగ్రీవా! నీవు దురాత్ముడవు. మహాపాపివి. ఐనను మహాత్ముడు, సకలసద్గుణసంపన్నుడు, దయార్ద్ర హృదయుడు ఐన శ్రీరామునిఅనుగ్రహమువలననే నీకు ఈ వానరరాజ్యము దక్కినది సుమా! (16)

కృతం చేన్నాభిజానీషే రామస్యాక్లిష్టకర్మణః।
సద్యస్త్వం నిశితైర్బాణైః హతో ద్రక్ష్యసి వాలినమ్। 17

న చ సంకుచితః పంథా యేన వాలీ హతో గతః।
సమయే తిష్ఠ సుగ్రీవ మా వాలిపథమన్వగాః। 18

శ్రీరాముడు ఎంతటికార్యములనైనను అవలీలగా చేయగలడు. ఆ స్వామిచేసిన మేలును నీవు విస్మరించినచో నేడే ఆ ప్రభువు యొక్క వాడిబాణములకు ఆహుతియై నీ అన్నను దర్శింపగలవు. సుగ్రీవా! వాలివెళ్లిన మార్గము ఇంకను మూయబడలేదు. నీ ప్రతిజ్ఞకు కట్టుబడియుండుము. లేనిచో నీకు నీ అన్న వెళ్లిన దారియే దిక్కు. (17-18)

న నూనమిక్ష్వాకువరస్య కార్ముక
చ్యుతాన్ శరాన్ పశ్యసి వజ్రసన్నిభాన్।
తతః సుఖం నామ నిషేవసే సుఖీ
న రామకార్యం మనసాఽప్యవేక్షసే। 19

ఇక్ష్వాకువంశశ్రేష్ఠుడైన శ్రీరామునియొక్క ధనుస్సునుండి ప్రయోగింపబడిన వజ్రసమానములైన బాణములతీవ్రతను ఇంతవఱకును నీవు రుచి చూచియుండలేదు. నీవు అనుభవించు చున్న ఈ సుఖములు శాశ్వతమని తలంచుచున్నావు. అందువలననే నీవు శ్రీరామునికార్యము (సీతాన్వేషణకార్యము)ను మనస్సులోగూడ గుర్తుపెట్టుకొన్నట్లులేదు." (19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే చతుస్త్రింశః సర్గః (34)

వాల్మీకిమహర్షివిరచితమై, ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పదినాల్గవసర్గము

-- * * * --

35. ముప్పదిఐదవసర్గము

పెద్దకాలము దుఃఖములపాలైన సుగ్రీవుడు కామానుభవములలో మునిగిపోవుటను తార సమర్థించుట - సీతాన్వేషణకు తగిన ఏర్పాట్లను చేయుచున్నందున ఆ వానరరాజు (సుగ్రీవుడు) కృతఘ్నుడు కాదని వివరించుట - కనుక శాంతి వహింపుమని తార లక్ష్మణుని సవినయముగా వేడుకొనుట -

తథా బ్రువాణం సౌమిత్రిం ప్రదీప్తమివ తేజసా।
అబ్రవీల్లక్ష్మణం తారా తారాధిపనిభాననా। 1

మిక్కిలి తేజస్వియై వెలుగొందుచున్న లక్ష్మణుడు ఇట్లు పలుకుచుండగా చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖముగల తార ఆ సౌమిత్రితో ఇట్లు నుడివెను. (1)

నైవం లక్ష్మణ వక్తవ్యో నాఽయం పరుష మర్హతి।
హరీణామీశ్వరః శ్రోతుం తవ వక్త్రాద్విశేషతః। 2

నైవాకృతజ్ఞః సుగ్రీవో న శఠో నాఽపి దారుణః।
నైవానృతకథో వీర న జిహ్మశ్చ కపీశ్వరః। 3

"ఓ లక్ష్మణస్వామీ! సుగ్రీవునితో నీవు ఇట్లు పరుషముగా పలుకుట తగదు. ఇతడు వానరరాజు. పైగా నీకు మిత్రుడు. కనుక నీవంటి మహాత్మునినోటినుండి ఇట్టి కఠినవచనములు వచ్చుట ఏమాత్రమూ ధర్మము గాదు. ఓ వీరుడా! వానరరాజైన ఈ సుగ్రీవుడు కృతఘ్నుడుకాడు,

1) సర్పము కప్పను నోటగఱచినప్పుడు ఆ మండూకము 'బెక బెక' అని అఱచును. ఆ ధ్వనిని విని, దూరమున ఉన్నవారు అక్కడ ఉన్నది కప్పయే యని భావింతురు. కాని వాస్తవముగా అది పాము. అట్లే నీవును మేకవన్నె పులివి. నీ మాటలు వేఱు - నీ స్వరూపము వేఱు.

ఉపకారం కృతం వీరో నాఽప్యయం విస్మృతః కపిః।
రామేణ వీర సుగ్రీవో యదన్యైర్దుష్కరం రణే। 4

రామప్రసాదాత్ కీర్తిం చ కపిరాజ్యంచ శాశ్వతం।
ప్రాప్తవానిహ సుగ్రీవో రుమాం మాం చ పరంతప। 5

సుదుఃఖం శయితః పూర్వం ప్రాప్యేదం సుఖముత్తమం।
ప్రాప్తకాలం న జానీతే విశ్వామిత్రో యథా మునిః। 6

ఘృతాచ్యాం కిల సంసక్తో దశవర్షాణి లక్ష్మణ।
అహోఽమన్యత ధర్మాత్మా విశ్వామిత్రో మహామునిః। 7

న హి ప్రాప్తం న జానీతే కాలం కాలవిదాం వరః।
విశ్వామిత్రో మహాతేజాః కిం పునర్యః పృథగ్జనః। 8

దేహధర్మం గతస్యాస్య పరిశ్రాంతస్య లక్ష్మణ।
అవితృప్తస్య కామేషు కామం క్షంతుమిహార్హసి। 9

న చ రోషవశం తాత గంతుమ్ అర్హసి లక్ష్మణ।
నిశ్చయార్థమ్ అవిజ్ఞాయ సహసా ప్రాకృతో యథా। 10

సత్త్వయుక్తా హి పురుషాః త్వద్విధాః పురుషర్షభ।
అవిమృశ్య న రోషస్య సహసా యాంతి వశ్యతామ్। 11

ప్రసాదయే త్వాం ధర్మజ్ఞ సుగ్రీవార్థే సమాహితా।
మహాన్ రోషసముత్పన్నః సంరంభస్త్యజ్యతామ్ అయమ్। 12

రుమాం మాం కపిరాజ్యం చ ధనధాన్యవసూని చ।
రామప్రియార్థం సుగ్రీవః త్యజేదితి మతిర్మమ। 13

వంచించు వాడును కాడు, కఠినాత్ముడును అబద్ధములాడు వాడును, కుటిలుడును కానేకాడు. రణరంగమున ఇతరులకు అసాధ్యమైన ఉపకారమును శ్రీరాముడు చేసియున్నాడు, వానరవీరుడైన ఈ సుగ్రీవుడు ఆమేలును మఱవలేదు. ఓ పరంతపా! ఆ ప్రభువు యొక్క అనుగ్రహమువలననే ఈ సుగ్రీవుడు శాశ్వతముగా వానరరాజ్యమును, కీర్తిప్రతిష్ఠలతోపాటు రుమను, నన్నును పొందగల్గెను. (2-5)

ఇతడు లోగడ తీరని కష్టముల పాలయ్యెను. ఇప్పుడు సుఖభోగములు ప్రాప్తింపగనే వాటిలోబడి మైమఱచి, విశ్వామిత్రమహామునివలె కాలము గడచిపోవుచున్న విషయమునే ఎఱుగకున్నాడు. లక్ష్మణా! ధర్మాత్ముడైన విశ్వామిత్రమహాముని మేనక వలపులలో చిక్కుకొని కాలమునే మఱచిపోయెను. ఆ పదిసంవత్సరముల కాలమూ ఆయనకు ఒకదినముగనే గడచిపోయెనట. మహాతేజస్వియు, కాలము విలువ తెలిసిన వాడునుఐన విశ్వామిత్రునియంతటివాడే భోగాసక్తుడై కాలమునే మఱచిపోవుట సంభవించినప్పుడు ఇక సామాన్యుడైన ఈ సుగ్రీవునిసంగతి చెప్పనేల? (6-8)

ఓ స్వామీ! ఆహారము, నిద్ర, భయము, దాంపత్య సుఖము అనునవి ప్రాణులకు సహజములైన దేహధర్మములు.[1] ఆపదలపాలైనప్పుడు అలసిన సుగ్రీవునకు ఈ దేహధర్మములు అనువుగా అమరలేదు. రామానుగ్రహముతో ఆ ఆపదలు తొలగగా ఇతనికి ఆహారనిద్రాదుల సుఖములను పొందెడి భాగ్యము కలిగినది. ఆ సుఖములలో మునిగిన ఈ వానరేంద్రునకు తనివితీరక, అందే పరవసించిపోవుచున్నాడు. ఇతనిపరిస్థితిని గమనించి కామవశుడైయున్న ఇతనిదోషమును క్షమించుట న్యాయము. (9)

నాయనా! లక్ష్మణా! యథార్థవిషయములను తెలిసికొనకుండ సామాన్యునివలె (పామరునివలె) తొందరపడి క్రోధవశుడవు కావలదు. (10)

ఓ పురుషశ్రేష్ఠా! పరాక్రమవంతులైన (మనోబలముగల) నీవంటివారు ముందు వెనుకలు ఆలోచింపక ఆవేశముతో క్రోధమునకు వశులుగారు. (11)

ఓ ధర్మజ్ఞుడా! మమ్ము అనుగ్రహింపవలసినదిగా సుగ్రీవునిపక్షమున (సుగ్రీవునకు మాఱుగా) నేను నిన్ను త్రికరణశుద్ధిగా వేడుకొనుచున్నాను. తీవ్రమైన రోషావేశముతో కలిగిన ఈ అలుకను వీడుము. శ్రీరామునకు ప్రీతిని గూర్చుటకై ధనధాన్యసంపదలను, కిష్కింధారాజ్యమును, నన్నును, కడకు రుమను సుగ్రీవుడు పరిత్యజించునని నా

1) ఆహార నిద్రాభయమైథునాని సమానమేతత్ పశుభిర్నరాణామ్ ॥

సమానేష్యతి సుగ్రీవః సీతయా సహ రాఘవమ్।
శశాంకమివ రోహిణ్యా నిహత్వా రావణం రణే। 14

శతకోటిసహస్రాణి లంకాయాం కిల రాక్షసాః।
అయుతాని చ షట్త్రింశత్ సహస్రాణి శతాని చ। 15

అహత్వా తాంశ్చ దుర్ధర్షాన్ రాక్షసాన్ కామరూపిణః।
న శక్యో రావణో హంతుమ్ యేన సా మైథిలీ హృతా। 16

తే న శక్యా రణే హంతుమ్ అసహాయేన లక్ష్మణ।
రావణః క్రూరకర్మా చ సుగ్రీవేణ విశేషతః। 17

ఏవమ్ ఆఖ్యాతవాన్ వాలీ స హ్యభిజ్ఞో హరీశ్వరః।
ఆగమస్తు న మే వ్యక్తః శ్రవాత్ తస్మాద్బ్రవీమ్యహమ్। 18

త్వత్సహాయనిమిత్తం వై ప్రేషితా హరిపుంగవాః।
ఆనేతుం వానరాన్ యుద్ధే సుబహూన్ హరియూథపాన్। 19

తాంశ్చ ప్రతీక్షమాణోఽయం విక్రాంతాన్ సుమహాబలాన్।
రాఘవస్యార్థసిద్ధ్యర్థం న నిర్యాతి హరీశ్వరః। 20

కృతాత్ర సంస్థా సౌమిత్రే సుగ్రీవేణ యథా పురా।
అద్య తైర్వానరైః సర్వైః ఆగంతవ్యం మహాబలైః। 21

ఋక్షకోటిసహస్రాణి గోలాంగూలశతాని చ।
అద్య త్వామ్ ఉపయాస్యంతి జహి కోపమ్ అరిందమ।
కోట్యోఽనేకాస్తు కాకుత్స్థ కపీనాం దీప్తతేజసామ్। 22

తవ హి ముఖ మిదం నిరీక్ష్య కోపాత్
క్షతజనిభే నయనే నిరీక్షమాణాః ।
హరివరవనితా న యాంతి శాంతిం
ప్రథమభయస్య హి శంకితాః స్మ సర్వాః। 23

స్పష్టమైన విశ్వాసము. ఈ వానరప్రభువు రణరంగమున రావణుని హతమార్చి రోహిణిని చంద్రునితోవలె సీతాదేవిని శ్రీరామునికడకు తప్పక చేర్చగలడు. (12-14)

'లక్ష్మణప్రభూ! లంకలో రాక్షసులు వేలకొలది (అసంఖ్యాకులుగా) ఉన్నట్లు ప్రసిద్ధి. వారందఱును ఎదిరింప శక్యము గానివారు, కామరూపులు. వారిని అందఱినీ హతమార్చనిదే సీతాదేవిని అపహరించిన రావణుని నేలగూల్చుట అశక్యము. (15-16)

ఇతరులసహాయము లేకుండా సుగ్రీవుడు ఒక్కడే అంతమంది రాక్షసులను యుద్ధభూమియందు సంహరించుట అసాధ్యము. అందునా కటికిదుర్మార్గుడైన రావణుని తుదముట్టించుట, అతనికి ఇంకను అశక్యము.' (17)

వానరరాజైన వాలి లంకలోని సేనల సంఖ్యను పూర్తిగా తెలిసినవాడు. అతడు చెప్పినందువలననే నాకు ఈ విషయములు తెలిసినవి. రావణుడు ఇంత సేనను ఎట్లు సమకూర్చుకొనగల్గెనో నేను ఎఱుగను. నేను వాలినుండి విన్నదానినే నీకు తెలుపుచున్నాను. (18)

యుద్ధమున మీకు సహాయపడుటకుగాను పెక్కుమంది వానరయోధులను తీసికొని వచ్చుటకై సుగ్రీవుడు ఇంతకుముందే వానరప్రముఖులను పంపియున్నాడు. శ్రీరామునికార్యమును (సీతాన్వేషణకార్యమును) సఫలమొనర్చుటకై మిక్కిలి బలపరాక్రమశాలులైన వానరయోధులయొక్క రాకకు నిరీక్షించుచు సుగ్రీవుడు ఈ నగరమునుండి కదలలేదు. (19-20)

ఓ సౌమిత్రీ! నీవు ఇచ్చటికి రాకముందే సుగ్రీవుడు సీతాన్వేషణనిమిత్తమై తగిన ఏర్పాట్లు చేసియున్నాడు. మహాబలశాలులైన ఆ వానరులందఱును ఇప్పటికే ఇచటికి రావలసియుండెను. శత్రుసూదనుడవైన ఓ కాకుత్స్థా! కోట్లకొలది భల్లూకయోధులు (ఎలుగు బంట్లు) వందలకొలది కొండముచ్చులు, తేజోమూర్తులైన పెక్కు కోట్లమంది వానర వీరులు నేడే నీ కడకు రాగలరు. దయదలచి కోపమును వీడుము. (21-22)

వాలి వధింపబడుటవలన భయముతో వణకిపోవుచున్న వానరస్త్రీలు అందఱును ఇంకను ఎట్టి ప్రమాదము వచ్చిపడునోయని మిగుల శంకించుచున్నారు. ఇప్పుడు కోపముతో భయంకరముగా ఉన్న నీ ముఖమును, రక్తకాంతులను చిమ్ముచున్న నీ కన్నులను చూచుచున్నవారి మనస్సులు మిక్కిలి ఆందోళనచెందుచున్నవి." (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే పంచత్రింశః సర్గః (35)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పదిఐదవసర్గము

-- * * * --

36. ముప్పదిఆఱవసర్గము

తార ప్రార్థనతో లక్ష్మణస్వామి శాంతించుటను గమనించి, సుగ్రీవుడు శ్రీరాముని బలపరాక్రమములను ప్రశంసించుచు, తాను ఆ ప్రభువునకు అనుయాయినని తెల్పుట - ఆ వానర రాజు మాటలకు ప్రసన్నుడైన సౌమిత్రి తన పరుషోక్తులను మన్నింపుమని కోరుట - శ్రీరాముని సన్నిధికి రమ్మని పిలుచుట -

ఇత్యుక్తస్తారయా వాక్యం ప్రశ్రితం ధర్మసంహితం।
మృదుస్వభావః సౌమిత్రిః ప్రతిజగ్రాహ తద్వచః। 1

తస్మిన్ ప్రతిగృహీతే తు వాక్యే హరిగణేశ్వరః।
లక్ష్మణాత్ సుమహత్ త్రాసం వస్త్రం క్లిన్నమివాత్యజత్। 2

తతః కంఠగతం మాల్యం చిత్రం బహుగుణం మహత్।
చిచ్ఛేద విమదశ్చాసీత్ సుగ్రీవో వానరేశ్వరః। 3

స లక్ష్మణం భీమబలం సర్వవానరసత్తమః।
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం సుగ్రీవః సంప్రహర్షయన్। 4

ప్రణష్టా శ్రీశ్చ కీర్తిశ్చ కపిరాజ్యం చ శాశ్వతం।
రామప్రసాదాత్ సౌమిత్రే పునః ప్రాప్తమ్ ఇదం మయా। 5

కః శక్తస్తస్య దేవస్య ఖ్యాతస్య స్వేనకర్మణా।
తాదృశం విక్రమం వీర ప్రతికర్తుమ్ అరిందమ। 6

సీతాం ప్రాప్స్యతి ధర్మాత్మా వధిష్యతి చ రావణం।
సహాయమాత్రేణ మయా రాఘవః స్వేన తేజసా। 7

సహాయకృత్యం కిం తస్య యేన సప్త మహాద్రుమాః।
శైలశ్చ వసుధా చైవ బాణేనైకేన దారితాః। 8

ధనుర్విస్ఫారయాణస్య యస్య శబ్దేన లక్ష్మణ।
సశైలా కంపితా భూమిః సహాయైస్తస్య కిన్ను వై। 9

అనుయాత్రాం నరేంద్రస్య కరిష్యేఽహం నరర్షభ।
గచ్ఛతో రావణం హంతుం వైరిణం సపురస్సరమ్। 10

యది కించిదతిక్రాంతం విశ్వాసాత్ ప్రణయేన వా।
ప్రేష్యస్య క్షమితవ్యం మే న కశ్చిన్నాఽపరాధ్యతి। 11

ఇతి తస్య బ్రువాణస్య సుగ్రీవస్య మహాత్మనః।
అభవల్లక్ష్మణః ప్రీతః ప్రేమ్ణా చైవమ్ ఉవాచ హ। 12

తార ధర్మబద్ధములైన వచనములను సవినయముగా పలుకగా మృదుస్వభావముగల సౌమిత్రి ఆమాటలను మౌనముగా వినెను. (1)

తారవచనములను ఆలకించి, లక్ష్మణస్వామి ప్రశాంతముగా నుండుటను గమనించి, వానరప్రభువగు సుగ్రీవుడు తనలో ఆ సౌమిత్రివలన కలిగిన మహాభయమును స్నానానంతరము తడిగుడ్డనువలె పరిత్యజించెను. పిమ్మట ఆ వానరరాజు సుఖభోగములకు చిహ్నముగా తనకంఠమున ధరించిన, చిత్రవిచిత్రమగు దివ్యమాలను సంతోషాతిరేకముతో త్రెంచివేసెను, మత్తునుండి బయటపడెను. (2-3)

అంతట వానరప్రముఖుడైన ఆ సుగ్రీవుడు మహాబలశాలియైన లక్ష్మణునకు సంతోషమును గూర్చుచు వినమ్రతతో ఇట్లనుడివెను. (4)

'ఓ సౌమిత్రీ! వాలిదౌర్జన్య కారణముగా నేను కోల్పోయిన సంపదలు, కీర్తిప్రతిష్ఠలు, వానరరాజ్యము రామచంద్రప్రభువు యొక్క అనుగ్రహముతో మఱల నాకు దక్కినవి. (5)

ఓ శత్రుసంహారకా! మహావీరా! లోకవిఖ్యాతుడైన ఆ రామచంద్రప్రభువు చేసిన సాహసోపేతమైన మహోపకారమునకు తగినట్లుగా ప్రత్యుపకారమును చేయుగల సమర్థుడెవడు? (6)

ధర్మాత్ముడైన ఆ రఘువీరుడు తనపరాక్రమముచేతనే రావణుని హతమార్చి, సీతాదేవిని పొందగలడు. ఆ ప్రభువునకు నా సహాయము నిమిత్తమాత్రము. ఆ మహాత్ముడు ఒకే ఒక్క బాణముతో ఏడుతాళ వృక్షములను, మహాపర్వతమును, భూమిని చీల్చివేసెను. అట్టి స్వామికి నేను చేయుగల సహాయము ఏ పాటిది? ఓ లక్ష్మణా! ఆ రాముడెక్కు పెట్టిన అద్భుతమైన ధనుష్టంకారధ్వనికి పర్వతములతో సహా భూమి అంతయును కంపించెను. అట్టి అసహాయశూరునకు ఇతరులసహాయముతో పనియేమి? (7-9)

ఓ నరశ్రేష్ఠా! రావణుని, అతనిసైన్యములను హతమార్చుటకై ఆ మహాప్రభువు చేయు జైత్రయాత్రలో నేను ఆయన వెంటనుండును. ఆ స్వామియందుగల విశ్వాసమువలనగాని, చనవుచేగాని నేను ఏకొంచెముగానైనను హద్దుమీఱియుండవచ్చును. కావున ఈ భృత్యుడు క్షంతవ్యుడు. లోకమునందు సామాన్యులలో తప్పుచేయనివాడెవడు?" (10-11)

మహాత్ముడైన ఆ సుగ్రీవుడు ఇట్లు పలికిన పిదప లక్ష్మణుడు ఎంతయు సంతుష్టుడై ప్రేమపూర్వకముగా అతనితో ఇట్లనెను. (12)

సర్వథా హి మమ భ్రాతా సనాథో వానరేశ్వర।
త్వయా నాథేన సుగ్రీవ ప్రశ్రితేన విశేషతః। 13

"వానరేంద్రుడవైన ఓ సుగ్రీవా! వినయస్వభావముగల నీవంటివాడు తోడుగా ఉన్నప్పుడు మా అన్నయైన శ్రీరామునకు ఎవరి అండదండలతో ఏమిపని? నీవు ఆయనకు కుడిభుజము వంటివాడవు. (13)

యస్తే ప్రభావః సుగ్రీవ యచ్చ తే శౌచమార్జవం।
అర్హస్త్వం కపిరాజ్యస్య శ్రియం భోక్తుమ్ అనుత్తమామ్। 14

ఓ సుగ్రీవా! నీవు మిగుల ప్రతిభాశాలివి. నీ మనస్సు నిర్మలమైనది. నీవు ఋజుస్వభావము గలవాడవు. (నిష్కపటివి) కనుక ఈ కిష్కింధా రాజ్యముయొక్క సాటిలేని సంపదలను అనుభవించుటకు నీవు నిజముగా అర్హుడవు. (14)

సహాయేన చ సుగ్రీవ త్వయా రామః ప్రతాపవాన్।
వధిష్యతి రణే శత్రూన్ అచిరాన్నాఽత్ర సంశయః। 15

ఓ వానరరాజా! ప్రతాపశాలియైన శ్రీరాముడు నీ సహాయముతో రణరంగమునందలి శత్రువులను అందఱిని త్వరలోనే సంహరింపగలడు. ఇందులకు సందేహము లేదు. (15)

ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య సంగ్రామేష్వనివర్తినః।
ఉపపన్నం చ యుక్తం చ సుగ్రీవ తవ భాషితమ్। 16

ఓ సుగ్రీవా! నీవు కృతజ్ఞుడవు, మిత్రధర్మమును, యుద్ధాది సమస్తధర్మములను బాగుగా ఎఱిగినవాడవు. నీవు ఇప్పుడు పలికిన వచనములు సహేతుకములు, సముచితములు. (16)

దోషజ్ఞః సతి సామర్థ్యే కోఽన్యో భాషితుమర్హతి।
వర్జయిత్వా మమ జ్యేష్ఠం త్వాం చ వానరసత్తమ। 17

సదృశశ్చాసి రామస్య విక్రమేణ బలేన చ।
సహాయో దైవతైర్దత్తః చిరాయ హరిపుంగవ। 18

ఓ వానరశ్రేష్ఠా! నీవును, మా అన్నయు తప్ప, సామర్థ్యము ఉండియు నమ్రతతో మాట్లాడు వాడుగాని, తనదోషములను గుర్తింపగల వాడుగాని ఈ లోకమున ఎవ్వడుండును? బలపరాక్రమములయందు నీవు మాఅన్నయంతటివాడవు. దైవానుగ్రహమువలననే చాలకాలమునకు నీసహాయము లభించినది. (17-18)

కింతు శీఘ్రమితో వీర నిష్క్రామ త్వం మయా సహ।
సాంత్వయ స్వవయస్యం త్వం భార్యాహరణకర్శితమ్। 19

ఓ వీరా! అదిసరే! వెంటనే నీవు నాతో బయలుదేఱుము. నీవు అచటికివచ్చి, భార్యయెడబాటువలన మిగిలి కృశించియున్న నీ మిత్రుని ఓదార్చుము. (19)

యచ్చ శోకాభిభూతస్య శ్రుత్వా రామస్య భాషితమ్।
మయా త్వం పరుషాణ్యుక్తః తచ్చ త్వం క్షంతుమర్హసి। 20

వానరరాజా! శోకనిమగ్నుడైయున్న శ్రీరాముని పల్కులను విని, నేను ఎంతయు వ్యథచెందితిని. ఆ వేదన కారణముగా నేను ఆ కోపములో నిన్ను నా పరుషోక్తులతో నొప్పించితిని. అందులకు నన్ను క్షమింపుము. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే షట్త్రింశః సర్గః *(36)*

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీ మద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పదియాఱవసర్గము

— * * * —

37. ముప్పదిఏడవసర్గము

"వివిధ పర్వతములయందుగల కపివరులను తీసికొనివచ్చుటకై వానర ప్రముఖులను పంపుము" అని సుగ్రీవుడు హనుమంతుని ఆదేశించుట - మారుతి పంపగా వెళ్లిన వానర నాయకులు వివిధ ప్రదేశములలోగల వానరులను సుగ్రీవుని కడకు తీసికొనివచ్చుట

ఏవముక్తస్తు సుగ్రీవో లక్ష్మణేన మహాత్మనా।
హనుమంతం స్థితం పార్శ్వే సచివంత్విదమబ్రవీత్। 1

మహాత్ముడగు లక్ష్మణుడు ఇట్లు పలికిన పిమ్మట సుగ్రీవుడు తనప్రక్కనే యున్న సచివుడగు హనుమంతునితో ఈవిధముగా పలికెను. (1)

మహేంద్రహిమవద్వింధ్యకైలాసశిఖరేషు చ।
మందరే పాండుశిఖరే పంచ శైలేషు యే స్థితాః। 2

తరుణాదిత్యవర్ణేషు భ్రాజమానేషు సర్వతః।
పర్వతేషు సముద్రాంతే పశ్చిమాయాం తు యే దిశి। 3

ఆదిత్యభవనే చైవ గిరౌ సంధ్యాభ్రసన్నిభే।
పద్మతాళవనం భీమం సంశ్రితా హరిపుంగవాః। 4

అంజనాంబుదసంకాశాః కుంజరప్రతిమౌజసః।
అంజనే పర్వతే చైవ యే వసంతి ప్లవంగమాః। 5

మనశ్శిలాగుహావాసా వానరాః కనకప్రభాః।
మేరుపార్శ్వగతాశ్చైవ యే ధూమ్రగిరిసంశ్రితాః। 6

తరుణాదిత్యవర్ణాశ్చ పర్వతే చ మహారుణే।
పిబంతో మధు మైరేయం భీమవేగాః ప్లవంగమాః। 7

వనేషు చ సురమ్యేషు సుగంధిషు మహత్సు చ।
తాపసానాం చ రమ్యేషు వనాంతేషు సమంతతః। 8

తాం స్తాన్ సమానయ క్షిప్రం పృథివ్యాం సర్వవానరాన్।
సామదానాదిభిః కల్పైః ఆశు ప్రేషయ వానరాన్। 9

ప్రేషితాః ప్రథమం యే చ మయా దూతా మహాజవాః।
త్వరణార్థం తు భూయస్త్వం హరీన్ సంప్రేషయాపరాన్। 10

యే ప్రసక్తాశ్చ కామేషు దీర్ఘసూత్రాశ్చ వానరాః।
ఇహానయస్వ తాన్ సర్వాన్ శీఘ్రం తు మమ శాసనాత్। 11

అహోభిర్దశభి ర్యే హి నాగచ్ఛంతి మమాజ్ఞయా।
హంతవ్యాస్తే దురాత్మానో రాజశాసనదూషకాః। 12

శతాన్యథ సహస్రాణాం కోట్యశ్చ మమ శాసనాత్।
ప్రయాంతు కపిసింహానాం దిశో మమ మతే స్థితాః। 13

మేఘపర్వతసంకాశాః ఛాదయంత ఇవాంబరం।
ఘోరరూపాః కపిశ్రేష్ఠా యాంతు మచ్ఛాసనాదితః। 14

మహేంద్రగిరి, హిమవత్పర్వతము, వింధ్యాచలము, కైలాసపర్వతము, తెల్లని శిఖరములుగల మందరాచలము అను ఈ ఐదు పర్వతశిఖరములపై ఉండు వానరులను తీసికొని రావలెను. పడమటి దిక్కున సముద్రతీరమునందు ఎల్లప్పుడును మధ్యాహ్నసూర్యునికాంతులతో భాసిల్లెడి పర్వతప్రదేశములలోగల వానరులను తోడ్కొని రావలెను. సంధ్యారుణకాంతులతో విలసిల్లెడి. ఉదయగిరి యందు దట్టమైన పద్మతాళవనముగలదు. దానిని ఆశ్రయించుకొనియున్న వానరప్రముఖులను వెంటనిడుకొని రావలెను. నల్లని మేఘములవలె ఒప్పుచు ఏనుగులవలె బలిష్ఠులై అంజనాద్రిపై నివసించుచున్న వానరులను, తోడ్కొని రావలెను. మనశ్శిలాగుహాలయందు వసించుచు బంగారువన్నెలతో ప్రకాశించెడి వానరులను, మేరుపర్వతముమీదగల వానరులను ధూమ్రగిరిని ఆశ్రయించుకొనియున్న వానరులను తీసికొని రావలెను.(2-5)

మధ్యాహ్నసూర్యునికాంతులతో విలసిల్లుచు, మహారుణ పర్వతముపై మైరేయము అను మధువులను సేవించుచు వేగముగా పరుగెత్తగల వానరులను, మిక్కిలి రమ్యములై సువాసనలను వెదజల్లుచుండెడి మహా వనములయందలి వానరులను, మిక్కిలి మనోహరములైన తాపసులవనముల యందంతటనుగల వానరులను, ఇంకను ఈ భూమండలమునగల ఆయావానరులను అందఱిని సామ, దానాది - ఉపాయములతో తీసికొని వచ్చుటకై తగిన వానరప్రముఖులను పంపుము. (6-9)

నేను వేగముగా వెళ్లిరాగల కొంతమంది దూతలను ఇంతకు ముందే పంపియుంటిని. వారిని తొందరపెట్టి తీసికొని వచ్చుటకై మఱికొంతమంది వానరదూతలను వెంటనే పంపుము. (10)

సుఖభోగములలో మునిగియున్నవారిని, పనులను ఆలస్యముగా చేయువారిని అందఱిని శీఘ్రముగా ఇక్కడికి తీసికొనిరమ్ము. ఇది నా శాసనము. నలుదిక్కులయందును గల వానరులు అందఱును నా ఆజ్ఞప్రకారము పదిదినములలో విధిగా ఇచటికి చేరవలెను. అట్లు రానివారు రాజశాసనమును ధిక్కరించిన దుర్మార్గులు అగుదురు. అట్టివారు అందఱును వధార్హులు. (11-12)

నా అధీనములోనున్న వందలు, వేలు, కోట్ల కొలదిగా గల వానరులు అన్ని దిక్కులనుండి వెంటనే ఇచటికి రావలెను. ఇది నా ఆదేశము. (13)

భయంకరమైన రూపములుగలిగి, మేఘములవలె, పర్వతములవలె ఒప్పుచుండెడి వానరప్రముఖులు ఆకాశమును కప్పివేయుచున్నారా యనునట్లు నా ఆజ్ఞప్రకారము గుంపులు గుంపులుగా ఇచటినుండి వెళ్లవలెను. (14)

తే గతిజ్ఞా గతిం గత్వా పృథివ్యాం సర్వవానరాః।
ఆనయంతు హరీన్ సర్వాన్ త్వరితాః శాసనాన్మమ। 15

తస్య వానరరాజస్య శ్రుత్వా వాయుసుతో వచః।
దిక్షు సర్వాసు విక్రాంతాన్ ప్రేషయామాస వానరాన్। 16

తే పదం విష్ణువిక్రాంతం పతత్రిజ్యోతిరధ్వగాః।
ప్రయాతాః ప్రహితా రాజ్ఞా హరయస్తత్క్షణేన వై। 17

తే సముద్రేషు గిరిషు వనేషు చ సరస్సు చ।
వానరా వానరాన్ సర్వాన్ రామహేతోరచోదయన్। 18

మృత్యుకాలోపమస్యాజ్ఞాం రాజరాజస్య వానరాః।
సుగ్రీవస్యాయయుః శ్రుత్వా సుగ్రీవభయదర్శినః। 19

తత స్తే౽ఞ్జనసంకాశా గిరేస్తస్మాన్మహాజవాః।
తిస్రః కోట్యః ప్లవంగానాం నిర్యయుర్యత్ర రాఘవః। 20

అస్తం గచ్ఛతి యత్రార్కః తస్మిన్ గిరివరే స్థితాః।
తప్తహేమమహాభాసః తస్మాత్ కోట్యో దశ చ్యుతాః। 21

కైలాసశిఖరేభ్యశ్చ సింహకేసరవర్చసాం।
తతః కోటిసహస్రాణి వానరాణామ్ ఉపాగమన్। 22

ఫలమూలేన జీవంతో హిమవంతమ్ ఉపాశ్రితాః।
తేషాం కోటిసహస్రాణాం సహస్రం సమవర్తత। 23

అంగారకసమానానాం భీమానాం భీమకర్మణాం।
వింధ్యాద్వానరకోటీనాం సహస్రాణ్యపతన్ ద్రుతమ్। 24

క్షీరోదవేలానిలయాః తమాలవనవాసినః।
నారికేళాశనాశ్చైవ తేషాం సంఖ్యా న విద్యతే। 25

వనేభ్యో గహ్వరేభ్యశ్చ సరిద్భ్యశ్చ మహాజవాః।
ఆగచ్ఛద్వానరీ సేనా పిబంతీవ దివాకరమ్। 26

వానరులనివాసస్థానములను బాగుగా ఎఱిగిన ఈ దూతలందఱును ఆయాప్రదేశములకు వెళ్లవలెను- పిమ్మట ఈ భూమండలమునగల వానరులు అందఱిని వెంటబెట్టుకొని, ఈ సుగ్రీవాజ్ఞమేరకు త్వరత్వరగా ఇచటికి చేరవలెను-" (15)

వానరప్రభువుయొక్క, ఆజ్ఞను శిరసావహించి, హనుమంతుడు వడివడిగా వెళ్లగలవానరులను అన్ని దిక్కులకును పంపెను- (16)

రాజాజ్ఞప్రకారము ఆ వానరులు అందఱును వెంటనే పక్షులు, నక్షత్రములు సంచరించునట్టి ఆకాశమార్గమున సాగిపోయిరి. (17)

ఆ వానరదూతలు సముద్రతీరములయందును, పర్వతప్రాంతములయందును, వనములలోను, సరోవర ప్రదేశములయందును నివసించుచున్నట్టి కపులను అందఱిని రామకార్యార్థమై కిష్కింధానగరదిశకు తరలించిరి, (18)

ప్రళయకాలయమునివలె భయంకరముగానున్న వానరప్రభువగు సుగ్రీవునిఆజ్ఞను వినినంతనే వానరులు గడగడవణకుచు ప్రయాణమైరి. (19)

అనంతరము కాటుకవలె నల్లగా ఉన్నవారు, మిక్కిలి వేగముగలవారు ఐన మూడు కోట్లమంది వానరులు అంజనాద్రినుండి బయలుదేఱి రాముడున్న ప్రదేశమునకు విచ్చేసిరి. (20)

సూర్యుడు అస్తమించునట్టి పర్వతశ్రేష్ఠమైన అస్తాద్రియందు నివసించునట్టి వారు, మేలిమి బంగారు దేహచ్ఛాయగలవారు ఐన వానరులు పదికోట్లమంది ఆ గిరిని విడిచి వచ్చిరి. సింహముయొక్క జూలువంటి వన్నెగల వేయికోట్లమంది వానరులు కైలాసశిఖరములనుండి బయలుదేఱివచ్చిరి. (21-22)

హిమవత్పర్వతమును ఆశ్రయించి, ఫలమూలములతో జీవించుచుండెడి వేలకోట్లకొలదిగా గల వానరులు అచటికి చేరిరి. (23)

కుజునివలె ఎఱ్ఱనివర్ణముగలవారు (అగ్నివలె తేజోమూర్తులు), భయంకరస్వరూపులు, భీకరమైన చేష్టలుగలవారు ఐన కోట్లకొలది వానరులు వింధ్యపర్వతమునుండి వేగముగా విచ్చేసిరి. కొంతమంది పాలసముద్రతీరమునుండియు, మఱికొందఱు కానుగవనములనుండియు వేగముగా వచ్చిరి. వారిఆహారము కొబ్బరి. వారిసంఖ్య లెక్కింపనలవికానిది- వనములనుండియు, గుహలనుండియు, నదీతీరములనుండియు వానరసేనలు గుంపులు గుంపులుగా సూర్యకాంతులను కప్పివేయుచు మిక్కిలి వేగముగా వచ్చిపడినవి. (24-26)

యే తు త్వరయితుం యాతా వానరాః సర్వవానరాన్।
తే వీరా హిమవచ్ఛైలం దదృశుస్తం మహాద్రుమమ్। 27

తస్మిన్ గిరివరే రమ్యే యజ్ఞో మాహేశ్వరః పురా।
సర్వదేవమనస్తోషో బభౌ దివ్యో మనోహరః। 28

అన్ననిష్యందజాతాని మూలాని చ ఫలాని చ।
అమృతాస్వాదకల్పాని దదృశుస్తత్ర వానరాః। 29

తదన్న సంభవం దివ్యం ఫలం మూలం మనోహరమ్।
యః కశ్చిత్ సకృదశ్నాతి మాసం భవతి తర్పితః। 30

తాని మూలాని దివ్యాని ఫలాని చ ఫలాశనాః।
ఔషధాని చ దివ్యాని జగృహుర్హరియూథపాః। 31

తస్మాచ్చ యజ్ఞాయతనాత్ పుష్పాణి సురభీణి చ।
ఆనిన్యుర్వానరా గత్వా సుగ్రీవప్రియకారణాత్। 32

తే తు సర్వే హరివరాః పృథివ్యాం సర్వవానరాన్।
సంచోదయిత్వా త్వరితా యూథానాం జగ్మురగ్రతః। 33

తే తు తేన ముహూర్తేన యూథపాః శీఘ్రగామినః।
కిష్కింధాం త్వరయా ప్రాప్తాః సుగ్రీవో యత్ర వానరః। 34

తే గృహీత్వౌషధీః సర్వాః ఫలం మూలం చ వానరాః।
తం ప్రతిగ్రాహయామాసుః వచనం చేదమబ్రువన్। 35

సర్వే పరిగతాః శైలాః సముద్రాశ్చ వనాని చ।
పృథివ్యాం వానరాః సర్వే శాసనాదుపయాంతి తే। 36

ఏవం శ్రుత్వా తతో హృష్టః సుగ్రీవః ప్లవగాధిపః।
ప్రతిజగ్రాహ తత్ ప్రీతః తేషాం సర్వమ్ ఉపాయనమ్। 37

కపులనందరినీ తీసికొనవచ్చుటకై వెళ్లిన మహావీరులగు వానరదూతలందఱును మహావృక్షములతో నిండిన హిమవత్పర్వతమును దర్శించిరి. (27)

రమ్యమైన ఆమహాపర్వతముపై ఒకానొకప్పుడు రుద్రయాగము కనులపండువుగా నిర్వహింపబడినది, దివ్యమైన ఆ యజ్ఞము సమస్త దేవతలకును సంతోషకరమై యొప్పెను. (28)

ఆ యజ్ఞశాలయందు క్షీరాన్నము, ఆజ్యాది హోమద్రవ్యములు స్రవించినవి. అందువలన అచట ఉత్పన్నములైన అమృతతుల్యములగు ఫలమూలములను ఆవానరులు చూచిరి. ఆహవ్యాన్నమునుండి ఉత్పన్నములైన ఫలమూలములు దివ్యములు, మనోహరములు. ఎవ్వడైనను వాటిని ఒక్కసారి తిన్నచో వానికి ఒక నెలవఱకు ఆకలియేయుండదు. పండ్లను ఆహారముగా గొనెడి ఆ వానరప్రముఖులు ఆ దివ్యములైన ఫలమూలములను, అద్భుతములైన ఓషధులను తనివిదీర ఆరగించిరి. ఆ యజ్ఞశాలకు వెళ్లిన వానరులు సుగ్రీవునకు సంతోషమును గూర్చుటకై సువాసనలను వెదజల్లుచున్న అచటి పుష్పములను తీసికొనివచ్చిరి. (29-32)

ఆ వానర ప్రముఖులు అందఱును భూమండలమునగల సకలవానరులను త్వరత్వరగా నడిపించుచు, తమతమ గుంపులకు ముందు భాగములయందు సాగిపోవుచుండిరి. వేగగమనములో సమర్థులైన ఆ వానరనాయకులు అందఱును తమ ప్రభువు విధించిన గడువునకే త్వరత్వరగా కిష్కింధకు చేరి, సుగ్రీవుని సమక్షమున నిలిచిరి. (33-34)

ఆ వానరనాయకులెల్లరును తాము తీసికొనివచ్చిన ఓషధులను, ఫలమూలములను తమప్రభువునకు కానుకలుగా సమర్పించి, ఆయునకు ఇట్లు నివేదించిరి. (35)

"మహారాజా! మేము వానరులకొఱకై కొండలను, కోనలను, సముద్రతీరములను, నదీతటములను, అడవులను గాలించితిమి. ఈ భూమిపై గల వానరులందఱును మీ యాజ్ఞను తలదాల్చి ఇచటికి చేరుచున్నారు-" (36)

వారివచనములను విని వానరరాజైన సుగ్రీవుడు మిగుల సంతోషించెను. పిమ్మట వారు సమర్పించిన కానుకలను ఆదరముతో స్వీకరించి, ఎంతయు సంతుష్టుడాయెను. (37)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే సప్తత్రింశః సర్గః *(37)*

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పదియేడవసర్గము

-- * * * --

38. ముప్పదిఎనిదియవసర్గము

సుగ్రీవుడు లక్ష్మణునితోగూడి ప్రస్రవణగిరికి చేరి, శ్రీరాముని దర్శించుట - 'సీతాదేవిని అన్వేషించుటకై పూనుకొనుము'- అని ఆ రఘురాముడు సుగ్రీవుని కోరుట - "ఈ కార్యనిమిత్తమై వేర్వేఱు పర్వతప్రాంతములనుండి కోట్లకొలది వానరవీరులు ఇక్కడికి వచ్చుచు దారిలో ఉన్నారు" అని ఆ వానరరాజు శ్రీరామునకు తెలుపుట -

ప్రతిగృహ్య చ తత్సర్వమ్ ఉపాయనముపాహృతం।
వానరాన్ సాంత్వయిత్వా చ సర్వానేవ వ్యసర్జయత్। 1

విసర్జయిత్వా స హరీన్ శూరాంస్తాన్ కృతకర్మణః।
మేనే కృతార్థమ్ ఆత్మానం రాఘవం చ మహాబలమ్। 2

స లక్ష్మణో భీమబలం సర్వవానరసత్తమమ్।
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం సుగ్రీవం సంప్రహర్షయన్।
కిష్కింధాయా వినిష్క్రామ యది తే సౌమ్య రోచతే। 3

తస్య తద్వచనం శ్రుత్వా లక్ష్మణస్య సుభాషితం।
సుగ్రీవః పరమప్రీతో వాక్యమేతదువాచ హ। 4

ఏవం భవతు గచ్ఛావః స్థేయం త్వచ్ఛాసనే మయా। 5

తమేవ ముక్త్వా సుగ్రీవో లక్ష్మణం శుభలక్షణం।
విసర్జయామాస తదా తారామ్ అన్యాశ్చ యోషితః। 6

ఏతే త్యుచ్చైర్హరివరాన్ సుగ్రీవః సముదాహరత్।
తస్య తద్వచనం శ్రుత్వా హరయః శీఘ్రమాయయుః। 7

బద్ధాంజలిపుటాః సర్వే యే స్యుః స్త్రీదర్శనక్షమాః।
తానువాచ తతః ప్రాప్తాన్ రాజాఽర్కసదృశప్రభః। 8

ఉపస్థాపయత క్షిప్రం శిబికాం మమ వానరాః। 9

శ్రుత్వా తు వచనం తస్య హరయః శీఘ్రవిక్రమాః।
సముపస్థాపయామాసుః శిబికాం ప్రియదర్శనామ్। 10

తా ముపస్థాపితాం దృష్ట్వా శిబికాం వానరాధిపః।
లక్ష్మణారుహ్యతాం శీఘ్రమ్ ఇతి సౌమిత్రిమబ్రవీత్। 11

ఇత్యుక్త్వా కాంచనం యానం సుగ్రీవః సూర్యసన్నిభమ్।
బృహద్భిర్హరిభిర్యుక్తమ్ ఆరురోహ సలక్ష్మణః। 12

పాండురేణాతపత్రేణ ధ్రియమాణేన మూర్ధని।
శుక్లైశ్చ వాలవ్యజనైః ధూయమానైః సమంతతః। 13

సుగ్రీవుడు వానరప్రముఖులు సమర్పించిన కానుకలను స్వీకరించెను. ఆ దూతలకు కృతజ్ఞతలను తెలిపిన పిమ్మట వారినందఱిని పంపివైచెను. (1)

తాము వెళ్లిన కార్యములను సాధించుకొని తిరిగి వచ్చిన ఆ వానరప్రముఖులను పంపివేసిన పిమ్మట సుగ్రీవుడు తానును, మహాబలశాలియైన శ్రీరాముడును కృతార్థత చెందినట్లు భావించెను. (2)

అంతట సమస్తవానరులలో ప్రముఖుడు, మిక్కిలి బలశాలియు ఐన సుగ్రీవునకు సంతోషమును గూర్చుచు లక్ష్మణుడు సవినయముగా "ఓ సౌమ్యుడా! సముచితమని భావించినచో వెంటనే కిష్కింధనుండి శ్రీరామునికడకు బయలుదేఱుము" అని నుడివెను. (3)

ఆ లక్ష్మణస్వామి పలికిన చక్కని మాటలను విని, సుగ్రీవుడు ఎంతయు సంతుష్టుడై, మఱల ఆయనతో ఇట్లు వచించెను. (4)

"స్వామీ! అట్లేయగుగాక - మీ ఆజ్ఞను శిరసావహింతును. వెంటనే రామచంద్రప్రభువుకడకు వెళ్లుదము." అని సుగుణసంపన్నుడైన లక్ష్మణునితో పలికిన పిమ్మట అతడు తార మొదలగు వానరస్త్రీలను అందఱిని పంపివైచెను. (5-6)

అనంతరము సుగ్రీవుడు "మీరందఱును ఇక్కడికి చేరండి" అని ముఖ్యులైన వానరులను బిగ్గఱగా పిలిచెను. ఆయనమాటలను వినిన వెంటనే వారందఱును విచ్చేసిరి. ఆ వచ్చినవారందఱును అంతఃపురమునందు ప్రవేశించుటకు యోగ్యులు. వారు చేతులు జోడించి తమ ప్రభువుసమక్షమున నిలబడిరి. అంతట సూర్యతేజస్సుతో వెలుగొందుచున్న సుగ్రీవుడు "ఓ వానరులారా! వెంటనే నా పల్లకీని ఇక్కడికి చేర్చుడు" అని వారిని ఆదేశించెను. వడిగా వెళ్లగలిగిన ఆ వానరులు రాజాజ్ఞను శిరసావహించి, చూడముచ్చటైన పల్లకీని అచటికి చేర్చిరి. (7-10)

అచట ఉంచబడిన ఆ శిబికను జూచి సుగ్రీవుడు 'లక్ష్మణా! త్వరగా దీనిలో కూర్చుండుము.' అని ఆయనను ప్రార్థించెను. (11)

అంతట లక్ష్మణునితోగూడి సుగ్రీవుడు సూర్యతేజస్సుతో ప్రకాశించుచున్న ఆ బంగారుపల్లకీని ఎక్కెను. దానిని పెక్కుమంది వానరులు మోయుచుండిరి. (12)

వానరులు తమ ప్రభువుశిరస్సుపై శ్వేతచ్ఛత్రమును పట్టిరి. ఆయనకు అన్నివైపులనుండి తెల్లని వింజామరలతో వీచుచుండిరి. శంఖములను పూరించుచుండిరి. భేరీలను

శంఖభేరీనినాదైశ్చ హరిభిశ్చాభినందితః।
నిర్యయౌ ప్రాప్య సుగ్రీవో రాజ్యశ్రియమనుత్తమామ్॥ 14

స వానరశతైస్తీక్ష్ణైః బహుభిః శస్త్రపాణిభిః।
పరికీర్ణో యయౌ యత్ర యత్ర రామో వ్యవస్థితః॥ 15

స తం దేశమ్ అనుప్రాప్య శ్రేష్ఠం రామనిషేవితమ్।
అవాతరన్మహాతేజాః శిబికాయాః సలక్ష్మణః॥ 16

ఆసాద్య చ తతో రామం కృతాంజలిపుటోఽభవత్।
కృతాంజలౌ స్థితే తస్మిన్ వానరాశ్చాభవంస్తథా॥ 17

తటాకమివ తద్దృష్ట్వా రామః కుట్మలపంకజమ్।
వానరాణాం మహత్ సైన్యం సుగ్రీవే ప్రీతిమానభూత్॥ 18

పాదయోః పతితం మూర్ధ్నా తముత్థాప్య హరీశ్వరమ్।
ప్రేమ్ణా చ బహుమానాచ్చ రాఘవః పరిషస్వజే॥ 19

పరిష్వజ్య చ ధర్మాత్మా నిషీదేతి తతోఽబ్రవీత్॥ 20

తం నిషణ్ణం తతో దృష్ట్వా క్షితౌ రామోఽబ్రవీద్వచః॥ 21

ధర్మమర్థం చ కామం చ యస్తు కాలే నిషేవతే।
విభజ్య సతతం వీర స రాజా హరిసత్తమ॥ 22

హిత్వా ధర్మం తథార్థం చ కామం యస్తు నిషేవతే।
స వృక్షాగ్రే యథా సుప్తః పతితః ప్రతిబుధ్యతే॥ 23

అమిత్రాణాం వధే యుక్తో మిత్రాణాం సంగ్రహే రతః।
త్రివర్గఫలభోక్తా తు రాజా ధర్మేణ యుజ్యతే॥ 24

ఉద్యోగసమయస్త్వేష ప్రాప్తః శత్రువినాశన।
సంచింత్యతాం హి పింగేశ హరిభిః సహ మంత్రిభిః॥ 25

ఏవముక్తస్తు సుగ్రీవో రామం వచనమబ్రవీత్॥ 26

ప్రణష్టా శ్రీశ్చ కీర్తిశ్చ కపిరాజ్యం చ శాశ్వతం।
త్వత్ప్రసాదాన్మహాబాహో పునః ప్రాప్తమిదం మయా।
తవ దేవ ప్రసాదాచ్చ భ్రాతుశ్చ జయతాం వర॥ 27

కృతం న ప్రతికుర్యాద్యః పురుషాణాం స దూషకః॥ 28

మ్రోగించుచుండిరి, వందిమాగధులు స్తుతించుచుండిరి. విశాలమైన వానరరాజ్యమునకు ప్రభువైన సుగ్రీవుడు అట్లు రాజమర్యాదలతో బయలుదేరెను. (13-14)

వందలకొలది వానరులు వాడియైన శస్త్రములను చేబూని, ఆయనవెంట నడుచుచుండిరి. ఆ విధముగా అతడు శ్రీరాముడు ఉన్న ప్రస్రవణగిరికి సాగిపోవుచుండెను. మహాతేజస్వియైన సుగ్రీవుడు లక్ష్మణసహితుడై రాముడు నివసించుచున్న ఆ ఉత్తమపర్వత ప్రదేశమునకు చేరి, పల్లకీ నుండి దిగెను. (15-16)

శ్రీరామునికడకు చేరిన పిమ్మట సుగ్రీవుడు ఆ ప్రభువునకు అంజలిఘటించి నమస్కరించెను. అనంతరము అనుచరులైన వానరులును తమరాజువలెనే శ్రీరామునకు భక్తిశ్రద్ధలతో ప్రణమిల్లిరి. (17)

మొగ్గతొడిగిన పద్మములుగల సరస్సువలె విలసిల్లుచున్న ఆ మహావానరసైన్యమును జూచి, శ్రీరాముడు సుగ్రీవుని యెడ ప్రసన్నుడాయెను. (18)

పాదములపై శిరస్సును మోపి, సాగిలబడియున్న ఆ వానరరాజును లేవనెత్తి, శ్రీరాముడు ప్రేమాదరములతో ఆయనను అక్కున చేర్చుకొనెను. పిమ్మట శ్రీరాముడు సుగ్రీవునకు కూర్చుండుటకై ఆజ్ఞను ఇచ్చెను. వెంటనే ఆ వానరేంద్రుడు నేలపై ఆసీనుడయ్యెను. అనంతరము ఆ రఘువీరుడు ఆయనతో ఇట్లు నుడివెను. (19-21)

"వీరుడవైన ఓ వానరోత్తమా! నిత్యము ధర్మార్థకామములకు తగిన సమయములను నిర్ణయించుకొని, వాటికి అనుగుణముగా ప్రవర్తించువాడే రాజు. ధర్మార్థములను విస్మరించి, కేవలము కామములను అనుభవించుచుండువాడు చెట్టుపైకొమ్మన నిద్రించువానితో సమానుడు. అతడు క్రిందబడిన (పతనమైన) తరువాతనే మేల్కొనును (తెలివి తెచ్చుకొనును.) (22-23)

శత్రువులను వధించుటయందు ఆసక్తిగలవాడు, మిత్రులను సంపాదించుకొనుటయందు నిరతుడు, నియమములకు కట్టుబడి ధర్మార్థకామములను ఆచరించునట్టివాడు ఐన రాజు ధర్మఫలములను అనుభవించుటకు యోగ్యుడగును. శత్రువులను సంహరించుటలో సమర్థుడవైన ఓ వానరరాజా! సీతాన్వేషణకు పూనుకొనవలసిన సమయము ఆసన్నమైనది. కనుక ఈ విషయమునుగూర్చి నీ సహచర మంత్రులతో బాగుగా ఆలోచింపుము." (24-25)

శ్రీరాముడు ఇట్లు పలికిన పిదప సుగ్రీవుడు ఆ ప్రభువుతో ఇట్లనెను. (26)

"ఓ మహాబాహూ! విజేతలలో శ్రేష్ఠుడవైన ఓ దేవా! మీతో చెలిమి ఏర్పడకముందు నేను వానరరాజ్యమును, సంపదలను, కీర్తిప్రతిష్ఠలను పోగొట్టుకొనియుంటిని. మీ అనుగ్రహమువలనను, మీ తమ్మునితోడ్పాటుచేతను వాటినన్నింటిని మరల శాశ్వతముగా పొందితిని. మేలుచేసిన వారికి ప్రత్యుపకారము చేయనివాడు అధర్మపరుడు, మానవాధముడు. (27-28)

ఏతే వానరముఖ్యాశ్చ శతశః శత్రుసూదన।
ప్రాప్తాశ్చాదాయ బలినః పృథివ్యాం సర్వవానరాన్। 29

ఋక్షాశ్చావహితాః శూరా గోలాంగూలాశ్చ రాఘవ।
కాంతారవనదుర్గాణామ్ అభిజ్ఞా ఘోరదర్శనాః। 30

దేవగంధర్వపుత్రాశ్చ వానరాః కామరూపిణః।
స్వైః స్వైః పరివృతాః సైన్యైః వర్తంతే పథి రాఘవ। 31

శతైః శతసహస్రైశ్చ కోటిభిశ్చ ప్లవంగమాః।
అయుతైశ్చావృతా వీరాః శంకుభిశ్చ పరంతప। 32

అర్బుదైరర్బుదశతైః మధ్యైశ్చాంతైశ్చ వానరాః।
సముద్రైశ్చ పరార్ధైశ్చ హరయో హరియూథపాః।
ఆగమిష్యంతి తే రాజన్ మహేంద్రసమవిక్రమాః। 33

మేరుమందరసంకాశా వింధ్యమేరుకృతాలయాః।
తే త్వామ్ అభిగమిష్యంతి రాక్షసం యే సబాంధవం।
నిహత్య రావణం సంఖ్యే హ్యానయిష్యంతి మైథిలీమ్। 34

తత స్తముద్యోగమవేక్ష్య బుద్ధిమాన్
హరిప్రవీరస్య నిదేశవర్తినః।
బభూవ హర్షా ద్వసుధాధిపాత్మజః
ప్రబుద్ధనీలోత్పల తుల్యదర్శనః। 35

ఓ శత్రుసూదనా! వందలకొలదిగాగల ఈ వానర ప్రముఖులు భూమండలమునగల బలశాలులైన వానరులకు అందఱికిని రాజాజ్ఞను తెలిపి, వారిని ఆహ్వానించి వచ్చిరి. ఓ రఘువీరా! చూచుటకు భయంకరముగానున్న భల్లూకవీరులు, కొండముచ్చులు, దేవగంధర్వులఅంశలతో జన్మించిన వానరులు తమతమసైన్యములతోగూడినవారై ఇచటికి వచ్చుచు దారిలో ఉన్నారు. వీరు అందఱును మహారణ్యములను, వనదుర్గములను బాగుగా ఎఱిగినవారు. మనయెడ శ్రద్ధాసక్తులుగలవారు, కామరూపులు. (29-31)

ఓ పరంతపా! ఒకరివెంట వందమంది, మఱియొకరి వెంట లక్షమంది, ఇంకొకరివెంట కోటిమంది, మఱియొకరి వెంట పదివేలమంది వానరసైనికులు గలరు. ఈ విధముగా ఒక్కొక్కరివెంట ఇంకను శంకువు, అర్బుదము, మధ్యము, అంతము, సముద్రము, పరార్ధము, అను సంఖ్యలలో[1] వానరయోధులు గలరు. వారు ఇంద్రునితో సమానమైన పరాక్రమములుగలవారు. వారు అందఱును త్వరలో ఇచటికి చేరగలరు. (32-33)

వారందఱును మేరుపర్వతమువలె, మందరగిరివలె దృఢమైనవారు. వింధ్యాచలప్రదేశములు, మేరుశిఖర ప్రాంతములు వారినివాసములు. వారు త్వరలో నిన్ను చేరగలరు. వారు రాక్షసరాజైన రావణుని, వానియొక్క బంధుమిత్రులను, పరివారములను యుద్ధభూమికి బలియిచ్చి, సీతాదేవిని తీసికొని రాగలరు." (34)

ప్రజ్ఞాశాలియైన శ్రీరాముడు ఈ మాటలను విని, తన ఆజ్ఞలను పాలించునట్టి సుగ్రీవుడు సీతాన్వేషణకై చేయుచున్న ప్రయత్నములను గమనించి, మిక్కిలి సంతసించెను. అప్పుడు ఆయనకన్నులు బాగుగా వికసించిన నల్లగలువలవలె మిక్కిలి దర్శనీయములై రాజిల్లుచుండెను. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే అష్టత్రింశఃసర్గః (38)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పది ఎనిమిదవసర్గము

— * * * —

1) ఈ సంఖ్యావిషయములు జ్యోతిశ్శాస్త్రమునందు ఇట్లు పేర్కొనబడినవి. **ఏకందశ శతంత్వస్మాత్ సహస్రమ్ అయుతం తతః। పరం, లక్షం, ప్రయుతం, కోటిమ్, అథార్బుదం, బృందం, ఖర్వం, నిఖర్వంచ, తస్మాన్మహా సరోజం, శంకుం, సరితాంపతిం త్వంతం మధ్యం, పరార్ధమాహుః, యథోత్తరం దశగుణం తథాజ్ఞేయమ్।**
ఒకటి, పది, వంద, వేయి, అయుతము, లక్ష, ప్రయుతము, కోటి, అర్బుదము, బృందము, ఖర్వము, నిఖర్వము, పద్మము, శంకువు, సముద్రము, అంతము, మధ్యము, పరార్ధము – అనునవి సంఖ్యలు. వీటిలో వరుసగా ఒక సంఖ్య కంటే తరువాతి సంఖ్య పదిరెట్లు అని ఎఱుంగవలెను.

39. ముప్పదితొమ్మిదవసర్గము

శ్రీరామచంద్రుడు సుగ్రీవునకు తన కృతజ్ఞతలను తెల్పుట - ఆయా దిక్కులకు వెళ్లిన వానర ప్రముఖులు కోట్లకొలదిగానున్న తమతమ వానరసైన్యములతో వచ్చి సుగ్రీవుని కలియుట -

ఇతి బ్రువాణం సుగ్రీవం రామో ధర్మభృతాం వరః।
బాహుభ్యాం సంపరిష్వజ్య ప్రత్యువాచ కృతాంజలిమ్॥ 1

యదింద్రో వర్షతే వర్షం న తచ్చిత్రం భవేత్ క్వచిత్।
ఆదిత్యో వా సహస్రాంశుః కుర్యాద్వితిమిరం నభః॥ 2

చంద్రమా రశ్మిభిః కుర్యాత్ పృథివీం సౌమ్య నిర్మలామ్।
త్వద్విధో వాపి మిత్రాణాం ప్రతికుర్యాత్ పరంతప॥ 3

ఏవం త్వయి న తచ్చిత్రం భవేద్యత్ సౌమ్య శోభనం।
జానామ్యహం త్వాం సుగ్రీవ సతతం ప్రియవాదినమ్॥ 4

త్వత్సనాథః సఖే సంఖ్యే జేతాఽస్మి సకలానరీన్।
త్వమేవ మే సుహృన్మిత్రం సాహాయ్యం కర్తుమర్హసి॥ 5

జహారాత్మవినాశాయ వైదేహీం రాక్షసాధమః।
వంచయిత్వా తు పౌలోమీమ్ అనుహ్లాదో యథా శచీమ్॥ 6

నచిరాత్ తం హనిష్యామి రావణం నిశితైః శరైః।
పౌలోమ్యాః పితరం దృప్తం శతక్రతురివాఽఽహవే॥ 7

ఏతస్మిన్నంతరే చైవ రజః సమభివర్తత।
ఉష్ణాం తీవ్రాం సహస్రాంశోః ఛాదయత్ గగనే ప్రభామ్॥ 8

దిశః పర్యాకులాశ్చాసన్ రజసా తేన మూర్ఛితా।
చచాల చ మహీ సర్వా సశైలవనకాననా॥ 9

తతో నగేంద్రసంకాశైః తీక్ష్ణదంష్ట్రైర్మహాబలైః।
కృత్స్నా సంఛాదితా భూమిః అసంఖ్యేయైః ప్లవంగమైః॥ 10

నిమేషాంతరమాత్రేణ తతస్తైర్హరియూథపైః।
కోటీశతపరీవారైః కామరూపిభిరావృతా॥ 11

ఆ సుగ్రీవుడు పలుకుచున్న మాటలను విని, ధనుర్ధారులలో శ్రేష్ఠుడైన శ్రీరాముడు తనయెదుటనే అంజలి ఘటించి, నిలిచియున్న ఆ వానరేంద్రుని తన బాహువులతో గాఢముగా కౌగిలించుకొనెను. పిమ్మట అతనితో ఇట్లు నుడివెను. (1)

"మిత్రుడా! ఇంద్రుడు వర్షములను కురిపించుట, వేయికిరణములుగల సూర్యుడు చిమ్మచీకట్లను పాఱద్రోలుట, చంద్రుడు తనచల్లని కాంతులతో ఈ భూమండలమునకు ఆహ్లాదము గూర్చుట - అనునవి వారిసహజలక్షణములు. అట్లే మిత్రులకు ప్రత్యుపకారము చేయుట నీవంటి సత్పురుషునకు సహజగుణము - ఇందు ఆశ్చర్యపడవలసిన విషయము ఏ మాత్రమూ లేదు. సౌమ్యుడవైన ఓ సుగ్రీవా! నీయందలి ఈ ప్రత్యుపకార (శుభ) లక్షణము ఆశ్చర్యకరముగాదు. ఏలనన నీవు ఎల్లప్పుడును ప్రియవచనములనే పలికెడివాడవు. నీ స్వభావమును నేను ఎఱుగుదును. (2-4)

ఓ సుగ్రీవా! నీవు నాకు తోడుగా ఉన్నచో నేను రణరంగమున శత్రువులను అందఱిని అవలీలగా జయించెదను. నీవు నాకు ప్రాణమిత్రుడవు. కనుక నీవే నాకు సహాయపడవలెను. (5)

అనుహ్లాదుడను రాక్షసుడు శచీదేవినివలె రాక్షసాధముడైన రావణుడు తనవినాశముకొఱకే సీతాదేవిని వంచనతో అపహరించుకొని పోయెను. ఇంద్రుడు గర్వోన్మత్తుడైన అనుహ్లాదుని, అతనికి తోడ్పడిన పులోముని రణరంగమున చంపివేసినట్లుగా నేను దుష్టుడైన ఆ రావణుని నా వాడియైన బాణములతో త్వరలోనే సంహరించెదను." (6-7)

శ్రీరాముడు ఇట్లు పలుకుచుండగా, ఆకాశమున సూర్యునియొక్క వేడికిరణకాంతులను కప్పివేయుచు దుమ్ములు చెలరేగెను. అట్లు దుమ్ములు అంతటను వ్యాపించుటచే అన్ని దిక్కులయందును చీకట్లు అలముకొనెను. కొండలు, వనములు, అరణ్యములు మొదలగు వానితో భూమియంతయును కంపించెను. అప్పుడు వాడియైన దంతములు గలవారు, మిగుల బలశాలురు, మదపుటేనుగులవలె ఒప్పుచున్న వారు ఐన అసంఖ్యాకులగు వానరులు 'ఇసుక వేస్తే రాలనంతగా' భూమిపై వ్యాపించియుండిరి. మఱుక్షణముననే కామరూపులైన వానరసేనానాయకులు, కోట్లకొలదిగానున్న వారి పరివారములతో భూమిని ఆవరించియుండిరి. (8-11)

నాదేయైః పార్వతీయైశ్చ సాముద్రైశ్చ మహాబలైః।
హరిభిర్మేఘనిర్హ్రాదైః అన్యైశ్చ వనచారిభిః। 12

తరుణాదిత్యవర్ణైశ్చ శశిగౌరైశ్చ వానరైః।
పద్మకేసరవర్ణైశ్చ శ్వేతైర్మేరుకృతాలయైః। 13

కోటీసహస్రైర్దశభిః శ్రీమాన్ పరివృతస్తదా।
వీరః శతవలిర్నామ వానరః ప్రత్యదృశ్యత। 14

తతః కాంచనశైలాభః తారాయా వీర్యవాన్ పితా।
అనేకైర్దశసాహస్రైః కోటిభిః ప్రత్యదృశ్యత। 15

తథాఽపరేణ కోటీనాం సహస్రేణ సమన్వితః।
పితా రుమాయాః సంప్రాప్తః సుగ్రీవశ్వశురో విభుః। 16

పద్మకేసరసంకాశః తరుణార్కనిభాననః।
బుద్ధిమాన్ వానరశ్రేష్ఠః సర్వవానరసత్తమః। 17

అనీకైర్బహుసాహస్రైః వానరాణాం సమన్వితః।
పితా హనుమతః శ్రీమాన్ కేసరీ ప్రత్యదృశ్యత। 18

గోలాంగూలమహారాజో గవాక్షో భీమవిక్రమః।
వృతః కోటిసహస్రేణ వానరాణామ్ అదృశ్యత। 19

ఋక్షాణాం భీమవేగానాం ధూమ్రః శత్రునిబర్హణః।
వృతః కోటిసహస్రాభ్యాం ద్వాభ్యాం సమభివర్తత। 20

మహాచలనిభైర్ఘోరైః పనసో నామ యూథపః।
ఆజగామ మహావీర్యః తిసృభిః కోటిభిర్వృతః। 21

నీలాంజనచయాకారో నీలో నామాథ యూథపః।
అదృశ్యత మహాకాయః కోటిభిర్దశభిర్వృతః। 22

తతః కాంచనశైలాభో గవయో నామ యూథపః।
ఆజగామ మహావీర్యః కోటిభిః పంచభిర్వృతః। 23

దరీముఖశ్చ బలవాన్ యూథపోఽభ్యాయయౌ తదా।
వృతః కోటిసహస్రేణ సుగ్రీవం సముపస్థితః। 24

మైందశ్చ ద్వివిదశ్చోభౌ అశ్విపుత్రౌ మహాబలౌ।
కోటికోటిసహస్రేణ వానరాణామ్ అదృశ్యతామ్। 25

గజశ్చ బలవాన్ వీరః కోటీభిస్తిసృభిర్వృతః।
ఆజగామ మహాతేజాః సుగ్రీవస్య సమీపతః। 26

ఋక్షరాజో మహాతేజా జాంబవాన్నామ నామతః।
కోటిభిర్దశభిః ప్రాప్తః సుగ్రీవస్య వశే స్థితః। 27

నదీ, సముద్రతీరములందును, పర్వత, వనప్రదేశములయందును నివసించెడి మహాబలశాలులైన వానరులు అచటికి చేరిరి. వారు మేఘములవలె గర్జించుచుండిరి. వారిలో కొందఱు బాలసూర్యునివలె ఎఱుపురంగుతోను, మఱికొందఱు చంద్రునివలె స్వచ్ఛమైన వన్నెతోను, ఇంకను కొందఱు పద్మకేసరములవలె పసుపువన్నె కలిగియుండిరి. వారిలో పెక్కుమంది మేరు పర్వత నివాసులు, శ్వేతవర్ణములవారు. (12-13)

తేజస్వియైన 'శతవలి' అను వానరవీరుడు పదివేలకోట్ల మంది అనుచరులతోగూడి అచటికి చేరెను. మేరు పర్వతమువలె ధీరుడు, పరాక్రమశాలి, తారకు తండ్రియైన సుషేణుడు పెక్కువేలకోట్లమందితో అచటికి వచ్చెను. సుగ్రీవునకు మామయైన రుమతండ్రి మఱియొక వేయికోట్ల మందితో అచటికి చేరెను. (14-16)

పద్మకేసరముల వన్నెగలవాడును, బాలసూర్యునివలె చక్కని ముఖశోభగలవాడును, వానరులందఱిలో శ్రేష్ఠుడును, ప్రజ్ఞాశాలియు, హనుమంతునితండ్రియు అగు 'కేసరి' అను వానరప్రముఖుడు వేలకొలది వానరసైనికులతో అచటికి చేరెను. కొండముచ్చులకు ప్రభువు, గొప్ప పరాక్రమశాలి ఐన గవాక్షుడు వేయికోట్లమందివానరులతో అచటికి వచ్చెను. శత్రువులను రూపుమాపెడివాడు, అమితమైన వేగముగలవాడు, అగు ధూమ్రుడు అను భల్లూకనాయకుడు రెండువేల కోట్లమంది భల్లూకములతో వచ్చెను. (17-20)

గొప్పవీరుడగు పనసుడను వానరయోధుడు మహాపర్వత సన్నిభులు, భయంకరాకారులు ఐన మూడుకోట్లమంది వానరులతో అచటికి చేరెను. కాటుకకొండవలె గొప్ప ఆకారముగలవాడు, మహాకాయుడు ఐన నీలుడు అను వానర యోధుడు పదికోట్లమంది అనుచరులతో అచటికివచ్చెను. (21-22)

గవయుడు అను వానరసేనానాయకుడు మహాపరాక్రమశాలి, మేరుపర్వతమువలె దృఢమైనవాడు అతడు ఐదు కోట్లమంది వానరులతో విచ్చేసెను. (23)

దరీముఖుడను వానరనాయకుడు మిగుల బలశాలి, అతడు వేయికోట్లమంది అనుచరులతో సుగ్రీవునికడకు వచ్చెను. అశ్వినీదేవతల కుమారులైన మైందుడు, ద్వివిదుడు అనువారు మిగుల బలాఢ్యులు. వారు ఒక్కొక్కరు వేయికోట్లమంది అనుచరులతో అచటికి చేరిరి. (24-25)

మిగుల తేజస్వియు, వీరుడును ఐన గజుడు మిక్కిలి బలశాలి. అతడు మూడుకోట్లమంది వానరులతో సుగ్రీవుని సమీపించెను. (26)

భల్లూకప్రభువైన జాంబవంతుడు మిక్కిలితేజస్వి, అతడు సుగ్రీవునకు అతిసన్నిహితుడు. అతడు పదికోట్లమంది భల్లూకయోధులతో గూడి వచ్చెను. (27)

రుమణ్వాన్ నామ విక్రాంతో వానరో వానరేశ్వరం।
ఆయయౌ బలవాంస్తూర్ణం కోటీశతసమావృతః। 28
తతః కోటిసహస్రాణాం సహస్రేణ శతేన చ।
పృష్ఠతోఽనుగతః ప్రాప్తో హరిభిర్గంధమాదనః। 29
తతః పద్మసహస్రేణ వృతః శంకుశతేన చ।
యువరాజోఽంగదః ప్రాప్తః పితృతుల్యపరాక్రమః। 30
తతస్తారాద్యుతిస్తారో హరిర్భీమపరాక్రమః।
పంచభిర్హరికోటీభిః దూరతః ప్రత్యదృశ్యత। 31
ఇంద్రజానుః కపిర్వీరో యూథపః ప్రత్యదృశ్యత।
ఏకాదశానాం కోటీనామ్ ఈశ్వరస్తైశ్చ సంవృతః। 32
తతో రంభస్త్వనుప్రాప్తః తరుణాదిత్యసన్నిభః।
అయుతేనావృతశ్చైవ సహస్రేణ శతేన చ। 33
తతో యూథపతిర్వీరో దుర్ముఖో నామ వానరః।
ప్రత్యదృశ్యత కోటీభ్యాం ద్వాభ్యాం పరివృతో బలీ। 34
కైలాసశిఖరాకారైః వానరైర్భీమవిక్రమైః।
వృతః కోటీసహస్రేణ హనుమాన్ ప్రత్యదృశ్యత। 35
నళశ్చాపి మహావీర్యః సంవృతో ద్రుమవాసిభిః।
కోటీశతేన సంప్రాప్తః సహస్రేణ శతేన చ। 36
తతో దధిముఖః శ్రీమాన్ కోటిభిర్దశభిర్వృతః।
సంప్రాప్తోఽభిమతస్తస్య సుగ్రీవస్య మహాత్మనః। 37
శరభః కుముదో వహ్నిః వానరో రంహ ఏవ చ।
ఏతే చాన్యే చ బహవో వానరాః కామరూపిణః। 38
ఆవృత్య పృథివీం సర్వాం పర్వతాంశ్చ వనాని చ।
యూథపాః సమనుప్రాప్తాః తేషాం సంఖ్యా న విద్యతే।
ఆగతాశ్చ విశిష్టాశ్చ పృథివ్యాం సర్వవానరాః। 39
ఆప్లవంతః ప్లవంతశ్చ గర్జంతశ్చ ప్లవంగమాః।
అభ్యవర్తంత సుగ్రీవం సూర్యమభ్రగణా ఇవ। 40
కుర్వాణా బహుశబ్దాంశ్చ ప్రహృష్టా బాహుశాలినః।
శిరోభిర్వానరేంద్రాయ సుగ్రీవాయ న్యవేదయన్। 41
అపరే వానరశ్రేష్ఠాః సంయమ్య చ యథోచితమ్।
సుగ్రీవేణ సమాగమ్య స్థితాః ప్రాంజలయస్తదా। 42
సుగ్రీవస్త్వరితో రామే సర్వాంస్తాన్ వానరర్షభాన్।
నివేదయిత్వా ధర్మజ్ఞః స్థితః ప్రాంజలిరబ్రవీత్। 43

మిక్కిలి బలపరాక్రములుగల రుమణ్వంతుడను వానరప్రముఖుడు వందకోట్లమంది అనుచరులతోగూడి ఆవానరప్రభువు సమీపమునకు త్వరత్వరగా విచ్చేసెను. (28)

పిమ్మట గంధమాదనుడనువాడు కోటానుకోట్లమంది వానరులను వెంటబెట్టుకొని అచటికి వచ్చెను. (29)

యువరాజైన అంగదుడు తనతండ్రియైన వాలివలె గొప్ప పరాక్రమశాలి, అతడు వేయిపద్మముల, నూఱుశంకువుల సంఖ్యలో అనుచరవానరులతోగూడి అచటికి చేరెను. (30)

నక్షత్రకాంతులతో విలసిల్లుచున్నవాడు, భీమపరాక్రముడు ఐన 'తారుడు' అను వానర ప్రముఖుడు ఐదు కోట్లమంది వానరులతో వచ్చి రాజునకు దూరముగా నిలబడెను.(31)

వానరవీరుడగు ఇంద్రజానువు పదకొండుకోట్లమంది వానరులకు అధిపతి, అతడు వారితోగూడి విచ్చేసెను. బాలసూర్యుని కాంతులతో విలసిల్లుచుండెడి రంభుడనువాడు కోట్లకొలది వానరయోధులతోగూడి అచటికి చేరెను. (32-33)

వీరుడు, బలశాలి, వానరనాయకుడు ఐన దుర్ముఖుడగు వానరప్రముఖుడు రెండుకోట్లమంది వానరులతోగూడి అచటికి వచ్చెను. కైలాసశిఖరములవలె ఉన్నతులు, శత్రువులకు భయమును గొల్పెడి పరాక్రమశాలురుఐన వేయికోట్లమంది వానరులను వెంటబెట్టుకొని హనుమంతుడు ఏతెంచెను.(34-35)

మహాపరాక్రమశాలియగు నలుడు వృక్షములపై నివసించెడి కోట్లకొలదివానరులతోగూడి అచటికి విచ్చేసెను. (36)

శుభలక్షణసంపన్నుడైన దధిముఖుడు మహాత్ముడైన ఆ సుగ్రీవునకు అత్యంతముఖ్యుడు. అతడు పదికోట్లమంది వానరులతోగూడి అచటికి విచ్చేసెను. (37)

శరభుడు, కుముదుడు, వహ్ని, రంహుడు ఇంకను పెక్కుమంది కామరూపులైన వానరులు పర్వతములతో, వనములతో కూడిన సమస్త భూమండలమును గాలించి, అసంఖ్యాకవానరులను వెంటబెట్టుకొని వచ్చిరి. ఈ వచ్చినవానరులందఱును భూమండలమున ప్రసిద్ధిగన్నవారు.(38-40)

ఆ వానరులు ఎగురుచు, దుముకుచు, గర్జించుచు, మేఘములు సూర్యునివలె సుగ్రీవునిచుట్టును చేరిరి. చక్కని బాహువులు గలిగిన ఆ వానరులు మిగుల సంతోషించుచు కేరింతలతో కోలాహలమొనర్చుచు వినమ్రతతో తమరాకనుగూర్చి సుగ్రీవప్రభువునకు తెల్పిరి. (41-42)

ఇంకను కొందఱు వానరశ్రేష్ఠులు తగిన విధముగా వస్త్రాభరణాదులను సర్దుకొని, సుగ్రీవునిసమీపమున దోసిలొగ్గి నిలబడిరి. అంతట ధర్మజ్ఞుడైన సుగ్రీవుడు శ్రీరామునికడ అంజలిఘటించి నిలిచి, అచటికి వచ్చిన వానరులను గూర్చి ఆ ప్రభువునకు నివేదించెను.

యథాసుఖం పర్వతనిర్ఝరేషు
వనేషు సర్వేషు చ వానరేంద్రాః ।
నివేశయిత్వా విధివద్బలాని
బలం బలజ్ఞః ప్రతిపత్తుమీష్టే । 44

అనంతరము అతడు ఆ వానరులతో ఇట్లనెను. 'ఓ వానరులారా! సమస్తపర్వతములయందును, సెలయేళ్లయందును, వనములలోను మీమీబలములను సుఖముగా నిలుపుడు'. అప్పుడు ఆయాగుంపులకు నాయకుడైన వాడు తన బలమునుగూర్చి తెలిసికొనుటకు వీలగును. (43-44)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకోనచత్వారింశః సర్గః (39)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ముప్పదితొమ్మిదవసర్గము

— * * * —

40. నలుబదివసర్గము

'సీతాదేవి జాడను తెలిసికొనుట, రావణుని నివాసమును పసిగట్టుట, అనునవి ముఖ్య కర్తవ్యములు-' అని శ్రీరాముడు తెల్పుట - ఆ ప్రభువు సూచనపై సుగ్రీవుడు 'వినతుడు' అను వానర ప్రముఖునినాయకత్వమున కపివరులను తూర్పుదిక్కునకు పంపుచు, ఆ దిశయందలి విశేషములను వర్ణించుట -

అథ రాజా సమృద్ధార్థః సుగ్రీవః ప్లవగేశ్వరః ।
ఉవాచ నరశార్దూలం రామం పరబలార్దనమ్ । 1

అనంతరము బలవైభవములతో ఒప్పుచున్న వానర ప్రభువగు సుగ్రీవుడు శత్రుబలములను తునుమాడెడి పురుషోత్తముడైన శ్రీరామునితో ఇట్లనెను. (1)

ఆగతా వినివిష్టాశ్చ బలినః కామరూపిణః ।
వానరా వారణేంద్రాభా యే మద్విషయవాసినః । 2

త ఇమే బహువిక్రాంతైః హరిభిర్భీమవిక్రమైః ।
ఆగతా వానరా ఘోరా దైత్యదానవసన్నిభాః । 3

"ఓ ప్రభూ! శక్తిశాలులగు వానరులు ఇచటికి వచ్చి తమకు అనువగు ప్రదేశములలో నిలిచియున్నారు. వారందఱును మదపుటేనుగులవలె బలిష్ఠులు. నా రాజ్యమున నివసించువారు కామరూపులు. నా ఆదేశానుసారము వెళ్లివచ్చిన ఈ వానరప్రముఖులు శత్రుభయంకరులు, దైత్యులతో, దానవులతో సమానులు. వీరు పెక్కుయుద్ధములలో తమ సాహసపరాక్రమములను ప్రకటించిన యోధులను వెంటనిడుకొని వచ్చిరి. (2-3)

ఖ్యాతకర్మాఽపదానాశ్చ బలవంతో జితక్లమాః ।
పరాక్రమేషు విఖ్యాతా వ్యవసాయేషు చోత్తమాః । 4

పృథివ్యంబుచరా రామ నానానగనివాసినః ।
కోట్యగ్రశ ఇమే ప్రాప్తా వానరాస్తవ కింకరాః । 5

నిదేశవర్తినః సర్వే సర్వే గురుహితే రతాః ।
అభిప్రేతమ్ అనుష్ఠాతుం తవ శక్ష్యంత్యరిందమ । 6

రామా! ఈ వానరులు శత్రువులపై లంఘించి, వారిని హతమార్చుటలో ఖ్యాతికెక్కినవారు, బలశాలులు, రణరంగము నందు అలసటను ఎఱుగనివారు, సాటిలేని పరాక్రమము గలవారు, కార్యశూరులు (అప్పగించిన పనిని చక్కగా నెఱవేర్చువారు), వీరు నేలమీదను, నీటిపైనను సంచరింపగలరు. వివిధములగు పర్వతములు, వృక్షములు వీరి నివాసస్థానములు, ఇచటికి వచ్చిన ఈ కోట్లకొలది వానరులందఱును నీ సేవకులు, నీ ఆజ్ఞలను తుచ,తప్పక పాటింతురు, ప్రభువునకు హితమును గూర్చుటలో నిరతులు, ఓ శత్రుసంహారకా! వీరు అందఱును నీ అభీష్టమును నెఱవేర్పగల సమర్థులు. (4-6)

త ఇమే బహుసాహస్రైః అనీకైర్భీమవిక్రమైః ।
యన్మన్యసే నరవ్యాఘ్ర ప్రాప్తకాలం తదుచ్యతామ్ ।
త్వత్సైన్యం త్వద్వశే యుక్తమ్ ఆజ్ఞాపయితుమర్హసి । 7

ఓ నరోత్తమా! వేలసంఖ్యలో ఉన్న నిరుపమాన పరాక్రమవంతులగు సైనికులతో ఈ వానరప్రముఖులు సిద్ధముగా ఉన్నారు. రావణునిపై యుద్ధమునకు వెళ్లుటకై ఇది తగిన సమయమని తలంచినచో తెల్పుము. ఇదియంతయు నీ సైన్యమే- ఇది నీ అధీనములోనున్నది. తగినరీతిగా ఆజ్ఞాపింపదగును. (7)

కామమేషామ్ ఇదం కార్యం విదితం మమ తత్త్వతః।
తథాపి తు యథాతత్త్వమ్ ఆజ్ఞాపయితుమర్హసి। 8

ఇతి బ్రువాణం సుగ్రీవం రామో దశరథాత్మజః।
బాహుభ్యాం సంపరిష్వజ్య ఇదం వచనమబ్రవీత్। 9

జ్ఞాయతాం మమ వైదేహీ యది జీవతి వా న వా।
స చ దేశో మహాప్రాజ్ఞ యస్మిన్ వసతి రావణః। 10

అధిగమ్య తు వైదేహీం నిలయం రావణస్య చ।
ప్రాప్తకాలం విధాస్యామి తస్మిన్ కాలే సహ త్వయా। 11

నాఽహమస్మిన్ ప్రభుః కార్యే వానరేశ న లక్ష్మణః।
త్వమస్య హేతుః కార్యస్య ప్రభుశ్చ ప్లవగేశ్వర। 12

త్వమేవాఽఽజ్ఞాపయ విభో మమ కార్యవినిశ్చయమ్।
త్వం హి జానాసి యత్కార్యం మమ వీర న సంశయః। 13

సుహృద్ద్వితీయో విక్రాంతః ప్రాజ్ఞః కాలవిశేషవిత్।
భవానస్మద్ధితే యుక్తః సుకృతార్థోఽర్థవిత్తమః। 14

ఏవముక్తస్తు సుగ్రీవో వినతం నామ యూథపమ్।
అబ్రవీద్రామసాన్నిధ్యే లక్ష్మణస్య చ ధీమతః। 15

శైలాభం మేఘనిర్ఘోషమ్ ఊర్జితం ప్లవగేశ్వరః। 16

సోమసూర్యనిభైః సార్ధం వానరైర్వానరోత్తమ।
దేశకాలనయైర్యుక్తః కార్యాకార్యవినిశ్చయే। 17

వృతః శతసహస్రేణ వానరాణాం తరస్వినాం।
అధిగచ్ఛ దిశం పూర్వాం సశైలవనకాననామ్। 18

తత్ర సీతాం చ వైదేహీం నిలయం రావణస్య చ।
మార్గధ్వం గిరిశృంగేషు వనేషు చ నదీషు చ। 19

నదీం భాగీరథీం రమ్యాం సరయూం కౌశికీం తథా।
కాలిందీం యమునాం రమ్యాం యామునం చ మహాగిరిమ్। 20

సరస్వతీం చ సింధుం చ శోణం మణినిభోదకం।
మహీం కాలమహీం చైవ శైలకాననశోభితామ్। 21

కార్యసాధనలో వీరిశక్తిసామర్థ్యములను నేను నీకు వివరించితిని. నీ యిష్టానుసారము వీరిని ఆజ్ఞాపింపుము." (8)

ఈ విధముగా పలుకుచున్న సుగ్రీవుని ఆ దాశరథి ప్రీతితో గాఢముగా కౌగిలించుకొని, అతనితో ఇట్లు నుడివెను. (9)

"ఓ ప్రజ్ఞాశాలీ! ఇంతకును సీతాదేవి జీవించియున్నదా? లేదా! అను విషయమును, రావణుడున్న ప్రదేశమును ఎఱుంగవలెను. సీతాదేవిజాడను, రావణునినివాసస్థానమును తెలిసికొనిన పిమ్మట సమయోచితముగా కర్తవ్యమును గూర్చి నీతో చర్చించి, తగిన కాలమును నిర్ణయించెదను.(10-11)

కిష్కింధాధిపతివైన ఓ వానరరాజా! సీతాన్వేషణ కార్యము నావలనను, లక్ష్మణుని వలనను కాని పని. ఈ కార్యసాధనకు కారకుడవు నీవే. దీనిసాఫల్యము నీ చేతిలోనే గలదు. ఓ వీరా! నా (సీతాన్వేషణ) కార్యమును సాధించు విధానము నీకే బాగుగా తెలియును. ఇందులకు సందేహము లేదు. కనుక నీవే తగువిధముగా నిర్ణయించి, నీ అనుచరులను ఆజ్ఞాపింపుము. (12-13)

ఓ సుగ్రీవా! లక్ష్మణునితరువాత నీవే నాకు ఆప్తుడవు. పరాక్రమశాలివి, బుద్ధిమంతుడవు, సమయస్ఫూర్తి గలవాడవు, నాకు హితమును గూర్చుటయందే నిరతుడవు, పరోపకారము చేయుటయందు నిష్ఠగలవాడవు. కార్యసాధనలో దక్షుడవు." (14)

శ్రీరాముడు ఇట్లు యుక్తియుక్తముగా పలికిన పిమ్మట ఆ వానరప్రభువు వెంటనే సేనానాయకుడైన వినతుని పిలిపించెను. పర్వతమువలె మహాకాయుడు, మేఘమువలె గర్జించువాడు, మిగుల బలశాలి ఐన ఆ యూథపతిని ధీశాలురైన రామలక్ష్మణులసమక్షమున సుగ్రీవుడు ఇట్లు ఆదేశించెను. (15-16)

"ఓ వానరోత్తమా! సూర్యచంద్రులవలె తేజోమూర్తులు, దేశకాలములకు అనుగుణముగా ప్రవర్తించెడివారు ఐన వానరులతో గూడి, కర్తవ్యాకర్తవ్యములను నిర్ణయించుకొనుము. చురుకైన వేలకొలదిగాగల ఆ వానరులను వెంటబెట్టుకొని, కొండలతో, కోనలతో, అరణ్యములతో నిండిన తూర్పుదిక్కునకు బయలుదేరుము. అచట సీతాదేవిజాడను, రావణుని నివాసస్థలమును పసిగట్టుటకై మీరు అందఱును పర్వతశిఖరప్రాంతములను, వనములను, నదీతీరములను బాగుగా గాలింపుడు. (17-19)

గంగ, రమ్యమైన సరయు, కౌశికి, యమున మున్నగు నదులను, యామునగిరిని, సరస్వతి, సింధు, మణులవలె స్వచ్ఛమైన జలములుగల శోణ, మహీపర్వతములనుండియు, వనముల మధ్యగా ప్రవహించెడి కాలమహీ మున్నగు నదీతీరములయందును వెదకుము. (20-21)

బ్రహ్మమాలాన్ విదేహాంశ్చ మాళవాన్ కాశికోసలాన్।
మాగధాంశ్చ మహాగ్రామాన్ పుండ్రాన్ వంగాం స్తథైవ చ।
పత్తనం కోశకారాణాం భూమిం చ రజతాకరాం। 22

సర్వమేతద్విచేతవ్యం మార్గయద్భిస్తతస్తతః।
రామస్య దయితాం భార్యాం సీతాం దశరథస్నుషామ్। 23

సముద్రమ్ అవగాఢాంశ్చ పర్వతాన్ పత్తనాని చ।
మందరస్య చ యే కోటిం సంశ్రితాః కేచిదాయుతామ్। 24

కర్ణప్రావరణాశ్చైవ తథా చాప్యోష్ఠకర్ణకాః।
ఘోరలోహముఖాశ్చైవ జవనాశ్చైకపాదకాః। 25

అక్షయా బలవంతశ్చ పురుషాః పురుషాదకాః।
కిరాతాః కర్ణచూడాశ్చ హేమాంగాః ప్రియదర్శనాః। 26

ఆమమీనాశనాస్తత్ర కిరాతా ద్వీపవాసినః।
అంతర్జలచరా ఘోరా నరవ్యాఘ్రా ఇతి శ్రుతాః। 27

ఏతేషామ్ ఆలయాః సర్వే విచేయాః కాననౌకసః। 28

గిరిభిర్యే చ గమ్యంతే ప్లవనేన ప్లవేన చ।
రత్నవంతం యవద్వీపం సప్తరాజ్యోపశోభితమ్। 29

సువర్ణరూప్యకం చైవ సువర్ణాకరమండితం।
యవద్వీపమ్ అతిక్రమ్య శిశిరో నామ పర్వతః। 30

దివం స్పృశతి శృంగేణ దేవదానవసేవితః।
ఏతేషాం గిరిదుర్గేషు ప్రపాతేషు వనేషు చ।
మార్గధ్వం సహితాః సర్వే రామపత్నీం యశస్వినీమ్। 31

తతో రక్తజలం శోణమ్ అగాధం శీఘ్రగామినమ్।
గత్వా పారం సముద్రస్య సిద్ధచారణసేవితం। 32

తస్య తీర్థేషు రమ్యేషు విచిత్రేషు వనేషు చ।
రావణః సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః। 33

బ్రహ్మమాల, విదేహ, మాళవ, కాశి, కోసల, మగధ మొదలగు మహాగ్రామములను, పుండ్ర, అంగ దేశములయందలి జనపదములను, కోశకారుల పత్తనములను, వెండిగనులు గల భూములు మున్నగు ప్రదేశములను అన్నింటిని దశరథునికోడలు, శ్రీరాముని భార్యయు ఐన సీతాదేవికై గాలింపుడు. (22-23)

సముద్రములలోగల పర్వతములను, వాటిమధ్యగల ద్వీపములయందలి నగరములను, మందరాచలశిఖరము మీదగల గ్రామములలో నివసించుచున్న జనులను విచారింపుడు. వారిలో కొందఱికి చెవులుండవు, కొందఱి పెదవులు చెవులవఱకు వ్యాపించియుండును, కొందఱి ముఖములు అయోమయములై భీతినిగొల్పుచుండును, వారు ఒకేఒక్కపాదము గలవారైనను వేగముగా సంచరించుచుందురు. వారిలో కొందఱు వంశాభివృద్ధిగలవారు. కొందఱు బలశాలులు, నరభక్షకులు, కొందఱు కిరాతులు, చెవులను కప్పియుండు కేశములుగలవారు, కొందఱు బంగారువన్నె గలిగి దర్శనీయముగా ఉందురు. కొందఱు కిరాతులు ద్వీపములలో నివసించుచు పచ్చిచేపలను తిందురు. కొందఱు జలములలో సంచరించుచుందురు. వారు భయంకరులు, నరవ్యాఘ్రములుగా ప్రసిద్ధికెక్కినవారు. వీరి అందఱి నివాసస్థానములకు వెళ్లి, వానరులందఱును సీతాదేవి ఆచూకిని, రావణుని నివాసస్థానమును వెదకవలెను.(24-28)

ఇట్లు కొంతదూరము వెళ్లిన పిమ్మట యవద్వీపము కనబడును. అది రత్నముల రాశిగా భాసిగాంచినది, ఏడు ఖండములుగా ఏర్పడియున్నది. దానిచుట్టును సముద్రము, కొండలు ఆవరించియున్నవి. నావలద్వారాగాని, లంఘించిగాని అచటికి చేరవీలగును. పిమ్మట సువర్ణ ద్వీపమును, రూప్యకద్వీపమును చేరుదురు. అవి బంగారు వెండి గనులకు నెలవైనవి. యవద్వీపమును దాటిన పిమ్మట 'శిశిరము' అను పర్వతము కనబడును. దాని శిఖరములు ఆకాశమును తాకుచుండును, దేవతలు, దానవులు అచట విహరించుచుందురు. ఈ ద్వీపములకు సంబంధించిన గిరిదుర్గములయందును, సెలయేళ్ల సమీపమునను, వనములలోను పూజ్యురాలైన సీతాదేవియొక్క జాడకొఱకు గాలింపవలెను. (29-31)

పిమ్మట సముద్రమును దాటి ఆవలితీరమునగల శోణనదమునకు చేరవలెను. అది మిక్కిలిలోతైనది, ఎఱ్ఱని జలములతో వేగముగా ప్రవహించునది. ఆ ప్రదేశమున సిద్ధులు, చారణులు విహరించుచుందురు. ఆ శోణనదముయొక్క తీరములయందు చిత్రవిచిత్రములుగా ఉండెడి రమ్యమైన వనములుగలవు. అందు సీతాదేవి జాడకొఱకై, రావణుని నివాసమును తెలిసికొనుటకై తీవ్రముగా గాలింపవలెను. (32-33)

పర్వతప్రభవా నద్యః సురమ్యా బహునిష్కుటాః।
మార్గితవ్యా దరీమంతః పర్వతాశ్చ వనాని చ। 34

తతః సముద్రద్వీపాంశ్చ సుభీమాన్ ద్రష్టుమర్హథ। 35

ఊర్మిమంతం సముద్రం చ క్రోశంతమ్ అనిలోద్ధతం। 36

తత్రాసురా మహాకాయాః ఛాయాం గృహ్ణంతి నిత్యశః।
బ్రహ్మణా సమనుజ్ఞాతా దీర్ఘకాలం బుభుక్షితాః। 37

తం కాలమేఘప్రతిమం మహోరగనిషేవితం।
అభిగమ్య మహానాదం తీర్థేనైవ మహోదధిం। 38

తతో రక్తజలం భీమం లోహితం నామ సాగరం।
గతా ద్రక్ష్యథ తాం చైవ బృహతీం కూటశాల్మలీం। 39

గృహం చ వైనతేయస్య నానారత్నవిభూషితం।
తత్ర కైలాససంకాశం విహితం విశ్వకర్మణా। 40

తత్ర శైలనిభా భీమా మందేహా నామ రాక్షసాః।
శైలశృంగేషు లంబంతే నానారూపా భయావహాః। 41

తే పతంతి జలే నిత్యం సూర్యస్యోదయనం ప్రతి।
నిహతా బ్రహ్మతేజోభిః అహన్యహని రాక్షసాః।
అభితప్తాశ్చ సూర్యేణ లంబంతే స్మ పునః పునః। 42

తతః పాండురమేఘాభం క్షీరోదం నామ సాగరం।
గతా ద్రక్ష్యథ దుర్ధర్షా ముక్తాహారమివోర్మిభిః। 43

తస్య మధ్యే మహాన్ శ్వేతఋషభో నామ పర్వతః।
దివ్యగంధైః కుసుమితై రాజతైశ్చ నగైర్వృతః। 44

పర్వతములనుండి ప్రవహించెడి నదులను, మనోహరమైన ఉద్యానవనములను, చక్కని గుహలుగల పర్వతములను, వనములను పూర్తిగా వెదకవలెను. శోణనదాదులను అన్వేషించి, ముందునకు సాగినచో ఇక్షుసముద్రము వచ్చును. అది పెనుగాలులకు ఉవ్వెత్తుగా ఎగసిపడు తరంగములతో తీవ్రఘోషలతో ఒప్పుచుండును. ఆ సముద్రమునందు వెదకిన పిమ్మట భయంకరమైన ద్వీపములను గాలింపవలెను. (34-36)

ఆ ఇక్షుసముద్రమునందు మహాకాయులైన అసురులు ఉందురు. వారు తమ ఆకలిని దీర్చుకొనుటకై నిత్యము ప్రాణులనీడలను గ్రహించి, వారిని భక్షించుచుందురు. దీర్ఘకాలమునుండి అట్లు జీవించుటకు వారికి బ్రహ్మదేవుని అనుమతి గలదు. కావున ఆ అసురులను తప్పించుకొని పోవుచుండవలెను. ఆ ఇక్షుసముద్రము నల్లని మేఘమువలె కన్పట్టుచుండును. దానిలో భయంకరమైన పెద్దపెద్ద సర్పములు నివసించుచుండును. అందు భీకరమైనగర్జనలు వినిపించుచుండును. యుక్తితో ఆ ఇక్షుసముద్రమును దాటుడు. అనంతరము 'లోహితము' అను మధుసముద్రముయొక్క తీరమునకు చేరెదరు. అచట శాల్మలీ (బూరుగు) వృక్షములు అధిక సంఖ్యలో గలవు. అందువలన దానికి శాల్మలీద్వీపము అనిపేరు. అది ఒక మహాద్వీపము. (37-39)

వినతాపుత్రుడైన గరుత్మంతునిభవనము అచట గలదు. దానిని విశ్వకర్మ నిర్మించెను. అది కైలాస శిఖరమువలె ఉన్నతమైనది. వివిధరత్నకాంతులతో మిఱుమిట్లు గొలుపుచుండును. (40)

ఆ శాల్మలీద్వీపమునందలి గిరిశిఖరములయందు 'మందేహులు' అను రాక్షసులు వ్రేలాడు చుందురు. వారు పర్వతప్రమాణములతో మహాకాయములు గలిగి భయంకరముగా ఉందురు. వారు నిత్యము సూర్యోదయ సమయమున ఊర్ధ్వముఖులై భాస్కరుని మ్రింగుటకై ప్రయత్నించుచుందురు. కాని ఆ సందర్భమున సూర్యుని కిరణముల తీవ్రతకును, గాయత్రీ మంత్రములకును (ద్విజులు సమర్పించెడి అర్ఘ్య ప్రదానములకు) మిగుల దెబ్బతిని, నిహతులై, వారు ఆ మధు (సురా) సముద్రమున పడిపోవుచుందురు. మఱల ఉజ్జీవితులై వారు శైలశిఖరములపై వ్రేలాడు చుందురు. ఇట్లు అను దినము జరుగు చుండును. (41-42)

తిరుగులేని వీరులైన ఓ వానరులారా! (ఆ పిమ్మట, ఘృత, దధిసముద్రములు మీకు కన్పట్టును. అందు సీతాదేవికై అన్వేషింపుడు) అచటినుండి ముందునకు సాగిన పిమ్మట 'క్షీరోదము' అను సముద్రము మీకు గోచరించును. అది తెల్లనిమేఘకాంతులతో విలసిల్లుచుండును.

పరశ్చ రాజతైః పద్మైః జ్వలితైర్హేమకేసరైః।
నామ్నా సుదర్శనం నామ రాజహంసైః సమాకులం। 45

విబుధాశ్చారణా యక్షాః కిన్నరాః సాప్సరోగణాః।
హృష్టాః సమభిగచ్ఛంతి నళినీం తాం రిరంసవః। 46

క్షీరోదం సమతిక్రమ్య తతో ద్రక్ష్యథ వానరాః।
జలోదం సాగరశ్రేష్ఠం సర్వభూతభయావహమ్। 47

తత్ర తత్కోపజం తేజః కృతం హయముఖం మహత్।
అస్యాహుస్తన్మహావేగమ్ ఓదనం సచరాచరమ్। 48

తత్ర విక్రోశతాం నాదో భూతానాం సాగరౌకసాం।
శ్రూయతే చ సమర్థానాం దృష్ట్వా తద్బడబాముఖమ్। 49

స్వాదూదస్యోత్తరే దేశే యోజనాని త్రయోదశ।
జాతరూపశిలో నామ మహాన్ కనకపర్వతః। 50

తత్ర చంద్రప్రతీకాశం పన్నగం ధరణీధరం।
పద్మపత్రవిశాలాక్షం తతో ద్రక్ష్యథ వానరాః। 51

ఆసీనం పర్వతస్యాగ్రే సర్వభూతనమస్కృతం।
సహస్రశిరసం దేవమ్ అనంతం నీలవాససమ్। 52

త్రిశిరాః కాంచనః కేతుః తాలస్తస్య మహాత్మనః।
స్థాపితః పర్వతస్యాగ్రే విరాజతి సవేదికః। 53

పూర్వస్యాం దిశి నిర్మాణం కృతం తత్ త్రిదశేశ్వరైః। 54

అందలి తరంగములు ముత్యాలహారములవలె మెఱయుచుండును. ఆ సముద్రమధ్యమున 'ఋషభము' అను పేరుగల తెల్లని మహాపర్వతము ఒకటి గలదు. ఆ పర్వతమునందు అన్నివైపులయందును పెక్కువృక్షములు దట్టముగా వ్యాపించియుండును. అవి బాగుగా వికసించిన పూవులతో శోభిల్లుచు దివ్యములైన పరిమళములను వెదజల్లుచుండును. ఆ ఋషభగిరిపై 'సుదర్శనము' అను పేరుగల సరస్సు గలదు. ఆ సరోవరము వెండివలె తెల్లని కాంతులు గల పద్మములతో విరాజిల్లుచుండును. ఆకమలములలోని కింజల్కములు మేలిమి బంగారు కాంతులతో మనోహరముగా ఉండును. ఆ సరస్సునందు రాజహంసలగుంపులు విహరించుచుండును. అందు దేవతలు, చారణులు, యక్షులు, కిన్నరులు, అప్సరసలతోగూడి సంతోషముతో జలవిహారములు సలుపుటకై వచ్చుచుందురు. (43-46)

ఆ క్షీరసముద్రమును దాటి కొంతదూరము పురోగమించిన పిదప స్వచ్ఛమైన మధురజలములుగల ఒక మహాసముద్రము కన్పట్టును. అది సకల ప్రాణులకును భయమును గొల్పుచుండును. అందు 'ఔర్వుడు' అను మహామునియొక్క కోపమునవలన ఏర్పడినట్టి దివ్యతేజస్సు ప్రవేశించెను. ఆ బడబాగ్నికే 'హయముఖము' అని పేరు. చరాచరములతోగూడి, మహావేగముతో కదలుచుండెడి జలములే ఆ అగ్నికి ఆహారము. ఆ సముద్రమున నివసించెడి మహాప్రాణులు సైతము ఆ బడబాగ్నిని జూచి భయముతో గగ్గోలు పెట్టుచుండును. ఆ ప్రాణులగోల అచట ఇప్పటికిని వినబడుచుండును. (47-49)

ఈ మధురజలధికి ఉత్తరభాగమునందు పదుమూడు యోజనముల దూరములో ఒక పెద్ద బంగారు పర్వతముగలదు. దానిపేరు 'జాతరూపశిలము'. ఆ గిరి శిఖరమున సర్పాకృతి 'అనంతుడు' అను పేరుతో ఆదిశేషుడు ఆసీనుడైయుండును. అతడు చంద్రునివలె తెల్లని వన్నెవాడు, భూభారమును వహించెడి మహాత్ముడు. పద్మపత్రములవలె విశాలములైన నేత్రములుగలవాడు. అతడు నీలవస్త్రములను ధరించును. వేయిపడగలు గలవాడు, సమస్త ప్రాణులకు అతడు వంద్యుడు. మీకు అక్కడ ఆ మహాత్ముని దర్శనము కాగలదు. (50-52)

ఆ పర్వతముపైన మహాత్ముడైన ఆదిశేషునియొక్క ధ్వజము తాటిచెట్టు ఆకారములో ఒప్పారుచుండును. దాని పతాకము బంగారుతో నిర్మితమై, మూడు శిరముల గుర్తులతో విలసిల్లుచుండును. ఆ తాల ధ్వజమునకు ఒక వేదికయు కలదు. ఈ తాల ధ్వజమును తూర్పుదిశయందు దేవతలు నిర్మించిరి. (53-54)

తతః పరం హేమమయః శ్రీమానుదయపర్వతః।
తస్య కోటిర్దివం స్పృష్ట్వా శతయోజనమాయతా। 55

జాతరూపమయీ దివ్యా విరాజతి సవేదికా।
సాలైస్తాలైస్తమాలైశ్చ కర్ణికారైశ్చ పుష్పితైః।
జాతరూపమయైర్దివ్యైః శోభతే సూర్యసన్నిభైః। 56

తత్ర యోజనవిస్తారమ్ ఉచ్ఛ్రితం దశయోజనం।
శృంగం సౌమనసం నామ జాతరూపమయం ధ్రువమ్। 57

ఆ 'జాతరూపశిలము' అను పర్వతమును దాటిన పిమ్మట హేమమయమైన 'ఉదయాద్రి' కన్పట్టును. అది దర్శనీయముగా ఉండును దాని శిఖరము నూఱుయోజనముల నిడివికి విస్తరించి, ఆకాశమును తాకుచుండును. బంగారు కాంతులతో మెఱయుచున్న ఆ శిఖరమునకు ఉదయగిరి ఒక చక్కని వేదికగా అమరియున్నది. ఆ ఉదయాచలము మద్దిచెట్లతోడను, తాలవృక్షములతోడను, కానుగచెట్లతోడను, బాగుగా పుష్పించిన గన్నేరుచెట్లతోడను విరాజిల్లుచున్నది. అవి అన్నియును సువర్ణమయములై, సూర్యకాంతులవలె ఒప్పుచున్న దివ్యశోభలను వెదజల్లుచున్నవి. అచట 'సౌమనసము' అను పేరుగల దృఢమైన ఒక బంగారు శిఖరము విరాజిల్లుచుండును. అది ఒక యోజనముమేరకు విస్తరించియున్నది, పదియోజనముల ప్రమాణములో ఎత్తుగా ఉన్నది. (55-57)

తత్ర పూర్వం పదం కృత్వా పురా విష్ణు స్త్రివిక్రమే।
ద్వితీయం శిఖరే మేరోః చకార పురుషోత్తమః। 58

ఉత్తరేణ పరిక్రమ్య జంబూద్వీపం దివాకరః।
దృశ్యో భవతి భూయిష్ఠం శిఖరం తన్మహోచ్ఛ్రయమ్। 59

పూర్వము శ్రీమహావిష్ణువు వామనావతార సమయమున త్రివిక్రముడై ఒక పాదమును 'సౌమనస' శిఖరము మీదను, రెండవ పాదమును మేరుశిఖరముపైనను ఉంచెను. సూర్యుడు జంబూద్వీపమునకు ఉత్తరభాగమున పరిభ్రమించి, మిక్కిలి ఉన్నతమైన సౌమనసశిఖరమునకు చేరిన పిమ్మట మేరుగిరికి దక్షిణభాగమున ఉన్నవారికి స్పష్టముగా గోచరించును. (58-59)

తత్ర వైఖానసా నామ వాలఖిల్యా మహర్షయః।
ప్రకాశమానా దృశ్యంతే సూర్యవర్ణాస్తపస్వినః। 60

ఆ సౌమనసశిఖరముమీద వైఖానసులు, వాలఖిల్యులు[1] అను మహర్షులు దర్శనమిత్తురు. వారు గొప్ప తపస్సంపన్నులు, సూర్యతేజస్సుతో విరాజిల్లుచుందురు. (60)

అయం సుదర్శనో ద్వీపః పురో యస్య ప్రకాశతే।
యస్మిన్ తేజశ్చ చక్షుశ్చ సర్వప్రాణభృతామపి। 61

ఉదయాద్రికి ముందు భాగమున 'సుదర్శన' ద్వీపము గలదు. సూర్యుడు ఉదయగిరిపైగల సౌమనసశిఖరముమీదికి చేరినంతనే, ఆ స్వామియొక్క కిరణప్రసారముతో సుదర్శనద్వీపనివాసులలో చైతన్యము వెల్లివిరియును. అందువలననే దీనికి 'సుదర్శనద్వీపము' అను పేరు ఏర్పడినట్లు ప్రతీతి. (61)

శైలస్య తస్య శృంగేషు కందరేషు వనేషు చ।
రావణః సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః। 62

ఆ ఉదయపర్వతమునందుగల శిఖరములపైనను, గుహలయందును, వనములలోను సీతాదేవిజాడను, రావణునినివాసమును పసిగట్టుటకు ఇటునటు (ప్రత్యంగుళము) గట్టిగా గాలింపుడు. (62)

కాంచనస్య చ శైలస్య సూర్యస్య చ మహాత్మనః।
ఆవిష్టా తేజసా సంధ్యా పూర్వా రక్తా ప్రకాశతే। 63

సువర్ణమయమైన ఉదయాచలతేజస్సులు, మహాత్ముడైన సూర్యునియొక్క కాంతులు వ్యాపించుటవలన ప్రభాత సంధ్య ఎఱుపు వన్నెతో దర్శనీయముగా ఉండును. (63)

1) బ్రహ్మదేవునియొక్క నఖముల (గోళ్ల)నుండి ఉదయించినవారు వైఖానసులు. సృష్టికర్తయొక్క రోమములనుండి ఉద్భవించిన వారు వాలఖిల్యులు.

పూర్వమేతత్ కృతం ద్వారం పృథివ్యా భువనస్య చ।
సూర్యస్యోదయనం చైవ పూర్వాహ్యేషా దిగుచ్యతే। 64

తస్య శైలస్య పృష్ఠేషు నిర్ఝరేషు గుహాసు చ।
రావణః సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః। 65

తతః పరమగమ్యా స్యాత్ దిక్పూర్వా త్రిదశావృతా।
రహితా చంద్రసూర్యాభ్యామ్ అదృశ్యా తిమిరావృతా। 66

శైలేషు తేషు సర్వేషు కందరేషు వనేషు చ।
యే చ నోక్తా మయా దేశా విచేయా తేషు జానకీ। 67

ఏతావద్వానరైః శక్యం గంతుం వానరపుంగవాః।
అభాస్కరమ్ అమర్యాదం న జానీమస్తతః పరమ్। 68

అధిగమ్య తు వైదేహీం నిలయం రావణస్య చ।
మాసే పూర్ణే నివర్తధ్వమ్ ఉదయం ప్రాప్య పర్వతమ్। 69

ఊర్ధ్వం మాసాన్న వస్తవ్యం వసన్ వధ్యో భవేన్మమ।
సిద్ధార్థాః సన్నివర్తధ్వమ్ అధిగమ్య చ మైథిలీమ్। 70

మహేంద్రకాంతాం వనషండమండితాం
దిశం చరిత్వా నిపుణేన వానరాః।
అవాప్య సీతాం రఘువంశజప్రియాం
తతో నివృత్తాః సుఖినో భవిష్యథ । 71

సూర్యుడు ఉదయించెడి ఈ స్థానమును మొట్టమొదట బ్రహ్మసృష్టించెను. కనుక బ్రహ్మలోకమునకును, భూలోకమునకును ఇది ద్వారమునంటిది. (ఊర్ధ్వలోకవాసులు భూలోకమునకు ఈ లోకమునుండియే ప్రవేశింతురు. అట్లే భూలోకనివాసులు ఈ ద్వారముద్వారా ఊర్ధ్వలోకములకు చేరుదురు.) మొదట ఈ ద్వార నిర్మాణము ఈ దిశయందే జరుగుటవలన దీనికి పూర్వదిశ (తూర్పుదిక్కు) అను పేరు ఏర్పడెను. (64)

ఆ ఉదయాచలముయొక్క పరిసరప్రాంతములయందును రావణునికై, సీతాదేవికై అంతటను అన్వేషింపుడు. (65)

ఆ ఉదయాద్రిని దాటిన పిదప ఆప్రాంతమంతయును అగమ్యము. అది దేవతలకు నివాసము. అచట సూర్యచంద్ర కిరణములు ప్రసరింపవు గావున అది అంధకారమయము, అదృశ్యము. (66)

తూర్పుదిశయందుగల కొన్ని పర్వతములను, గుహలను, వనములనుగూర్చి నేను తెల్పలేదు వాటి అన్నింటి యందును జానకీదేవిజాడకై మీరు అన్వేషింపుడు. (67)

ఓ వానరులారా! ఆ ఉదయాద్రివఱకే వానరులు వెళ్లగలరు. దానితరువాతిప్రదేశములు అన్నియును చిమ్మచీకట్లతో నిండియుండును. అవి నిర్జనప్రదేశములు (అందు ఏ ప్రాణులును సంచరింపవు.) వాటినిగూర్చి నేను ఎఱుగను. (68)

నేను తెల్పినరీతిగా ఉదయగిరివఱకునుగల సమస్త ప్రదేశములలో సీతాదేవికొఱకై, రావణునినివాసమునకై జాగ్రత్తగా వెదకుడు. ఒక నెలలోపల మీరు తిరిగి రావలెను. ఆ నెల గడువును దాటరాదు. అవధి దాటి వచ్చినవారికి నాచేతిలో చావు తప్పదు. సీతాదేవికై అన్వేషించి, కృతార్థులై మఱలి రండు. ఓ వానరులారా! తూర్పుదిక్కు అంతయును వనములతో నిండియున్నది. ఆ దిశ దేవేంద్రునిఅధీనములోనిది. ఆ ప్రదేశము నందంతటను నేర్పుగా గాలింపుడు. శ్రీరాముని ప్రేమపెన్నిధియైన సీతాదేవిజాడను పట్టుకొని హాయిగా తిరిగిరండు. మీకు క్షేమమగుగాక. (69-71)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే చత్వారింశః సర్గః (40)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదియవసర్గము

-- * * * --

41. నలుబది ఒకటవసర్గము

అంగదుని నాయకత్వమున హనుమంతుడు మొదలగు వానర యోధులను దక్షిణ దిక్కునకు పంపుచు సుగ్రీవుడు వారికి ఆదిశయందలి విశేషములను వివరించుట -

తత: ప్రస్థాప్య సుగ్రీవ: తన్మహద్వానరం బలం।
దక్షిణాం ప్రేషయామాస వానరాన్ అభిలక్షితాన్॥ 1

నీలమ్ అగ్నిసుతం చైవ హనుమంతం చ వానరం।
పితామహసుతం చైవ జాంబవంతం మహాబలమ్॥ 2

సుహోత్రం చ శరారిం చ శరగుల్మం తథైవ చ।
గజం గవాక్షం గవయం సుషేణమ్ ఋషభం తథా॥ 3

మైందం చ ద్వివిదం చైవ విజయం గంధమాదనం।
ఉల్కాముఖమ్ అసంగం చ హుతాశనసుతావుభౌ॥ 4

అంగదప్రముఖాన్ వీరాన్ వీర: కపిగణేశ్వర:।
వేగవిక్రమసంపన్నాన్ సందిదేశ విశేషవిత్॥ 5

తేషామ్ అగ్రేసరం చైవ మహద్బలమథాంగదమ్।
విధాయ హరివీరాణామ్ ఆదిశద్దక్షిణాం దిశమ్॥ 6

యే కేచన సముద్దేశా: తస్యాం దిశి సుదుర్గమా:।
కపీశ: కపిముఖ్యానాం స తేషాం తానుదాహరత్॥ 7

సహస్రశిరసం వింధ్యం నానాద్రుమలతాయుతం।
నర్మదాం చ నదీం దుర్గాం మహోరగనిషేవితామ్॥ 8

తతో గోదావరీం రమ్యాం కృష్ణవేణీం మహానదీం।
వరదాం చ మహాభాగాం మహోరగనిషేవితామ్॥ 9

మేఖలామ్ ఉత్కలాం చైవ దశార్ణనగరాణ్యపి।
అశ్వవంతీమ్ అవంతీం చ సర్వమేవానుపశ్యత॥ 10

విదర్భాన్ ఋషికాం శ్చైవ రమ్యాన్ మాహిషకానపి।
తథా వంగాన్ కళింగాంశ్చ కౌశికాంశ్చ సమంతత:॥ 11

సుగ్రీవుడు గొప్ప వానరబలమును (వినతుడు మున్నగు వానరులను) తూర్పు దిశకు పంపిన పిమ్మట అన్ని విధములుగా నిగ్గుదేలిన వానరులను దక్షిణదిశకు పంపించెను. (1)

అగ్నిసుతుడైన నీలుడు, కపివరుడైన హనుమంతుడు, బ్రహ్మాంశసంభూతుడు, మహాబలశాలియు ఐన జాంబవంతుడు, సుహోత్రుడు, శరారి, శరగుల్ముడు, గజుడు, గవాక్షుడు, గవయుడు, సుషేణుడు,[1] ఋషభుడు, మైందుడు, ద్వివిదుడు, విజయుడు, గంధమాదనుడు, హుతాశనసుతులైన ఉల్కాముఖుడు, అసంగుడు, వాలికుమారుడైన అంగదుడు మున్నగు వానరవీరులను మహావీరుడు, వానర ప్రభువు ఐన సుగ్రీవుడు సీతాన్వేషణకై దక్షిణదిశకు వెళ్లవలసినదిగా ఆదేశించెను. వీరందఱును పరాక్రమసంపన్నులు, వేగగమనములో దిట్టలు. ఈ వానరవీరులకు అందఱికిని మహాబలశాలియైన అంగదుని నాయకునిగా నియమించి దక్షిణదిక్కునకు పంపెను. (2-6)

ఆ దిశయందు అతికష్టముగానైనను అడుగిడుటకు సాధ్యముగాని కొన్ని ప్రదేశములనుగూర్చిమాత్రమే సుగ్రీవుడు ఆ వానరప్రముఖులకు వివరించెను. (7)

ఓ వానర వీరులారా! సీతాన్వేషణమును మీరు వింధ్య పర్వతము[2] నుండి ప్రారంభింపుడు. ఆ గిరి పెక్కు శిఖరములతోడను, వివిధములగు వృక్షములతోను, లతలతోను విలసిల్లుచుండును. అక్కడినుండి కదలిన పిమ్మట నర్మదానది వచ్చును. మహావిషసర్పములకు నెలవగుట వలన దానిని దాటుట సులభముగాదు. పిదప రమ్యములైన గోదావరి, మహానది, కృష్ణవేణి, వరద, పెద్దపెద్ద పాములకు ఆశ్రయమైన మహాభాగ మొదలగు నదీతీరములను గాలింపుడు.(8-9)

మేఖల, ఉత్కల, దశార్ణదేశములయందలి నగరములను. అట్లే అశ్వవంతి, అవంతి పురములను, అంతటను సీతాదేవికై అన్వేషింపుడు. (10)

మనోహరములైన విదర్భ, ఋషిక, మాహిషక, వంగ, కళింగ, కౌశిక మొదలగు దేశములయందలి వివిధ ప్రాంతములను బాగుగా వెదకుడు. అనంతరము

1) వానరప్రముఖులలో సుషేణులు ఇద్దఱుగలరు. ఒకడు తారయొక్క తండ్రి, వాలికి మామ. మఱియొకడు - అన్యుడు. ఇక్కడ పేర్కొనబడినవాడు తారతండ్రి కాడు.

2) సుగ్రీవుడు వానరసమూహములను ఆయాదిశలకు పంపునప్పుడు వింధ్యపర్వతమును కేంద్రముగాజేసికొనెను. వింధ్యకును హిమవత్పర్వతమునకును మధ్యగల పవిత్రప్రదేశమును 'ఆర్యావర్తము' అని యందురు. అది ఉత్తరదిశ. వింధ్యకు దక్షిణమునగల ప్రదేశమును 'దక్షిణాపథము' అని పిలుతురు. అది దక్షిణదిశ.

అన్వీక్ష్య దండకారణ్యం సపర్వతనదీగుహాం।
నదీం గోదావరీం చైవ సర్వమేవానుపశ్యత।
తథైవాంధ్రాంశ్చ పుండ్రాంశ్చ చోళాన్ పాండ్యాన్ సకేరళాన్। 12

అయోముఖశ్చ గంతవ్యః పర్వతో ధాతుమండితః।
విచిత్రశిఖరః శ్రీమాన్ చిత్రపుష్పితకాననః। 13

సచందనవనోద్దేశో మార్గితవ్యో మహాగిరిః। 14

తతస్తామ్ ఆపగాం దివ్యాం ప్రసన్నసలిలాం శివాం।
తత్ర ద్రక్ష్యథ కావేరీం విహితామ్ అప్సరోగణైః। 15

తస్యాసీనం నగస్యాగ్రే మలయస్య మహౌజసం।
ద్రక్ష్యథాదిత్యసంకాశమ్ అగస్త్యమ్ ఋషిసత్తమమ్। 16

తతస్తేనాభ్యనుజ్ఞాతాః ప్రసన్నేన మహాత్మనా।
తామ్రపర్ణీం గ్రాహజుష్టాం తరిష్యథ మహానదీమ్। 17

సా చందనవనైర్దివ్యైః ప్రచ్ఛన్నా ద్వీపశాలినీ।
కాంతేవ యువతిః కాంతం సముద్రమ్ అవగాహతే। 18

తతో హేమమయం దివ్యం ముక్తామణివిభూషితమ్।
యుక్తం కవాటం పాండ్యానాం గతా ద్రక్ష్యథ వానరాః। 19

తతః సముద్రమ్ ఆసాద్య సంప్రధార్యార్థనిశ్చయమ్।
అగస్త్యేనాంతరే తత్ర సాగరే వినివేశితః। 20

చిత్రనానానగః శ్రీమాన్ మహేంద్రః పర్వతోత్తమః।
జాతరూపమయః శ్రీమాన్ అవగాఢో మహార్ణవమ్। 21

నానావిధైర్నగైః ఫుల్లైః లతాభిశ్చోపశోభితం।
దేవర్షియక్షప్రవరైః అప్సరోభిశ్చ సేవితమ్। 22

దండకారణ్యమునందలి పర్వతప్రాంతములను, నదీతీరములను, గుహలను, గోదావరీనదియొక్క పాయలను నిశితముగా పరిశీలింపుడు. అట్లే ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళ మున్నగు దేశములలోని సకలభాగములను అన్వేషింపుడు. (11-12)

వివిధములగు గైరికాదిధాతువులతో విలసిల్లుచు సుశోభితమైన మలయపర్వతమును[1] మాత్రము తప్పక వెదకుడు. ఆ గిరి శిఖరములు చిత్రవిచిత్రములుగానుండును. అందలి వనములన్నియును రంగురంగుల పూవులతో దర్శనీయముగా ఉండును. ఆ మహాగిరిపై చందన వృక్షవనములు కోకొల్లలు. (13-14)

అటనుండి క్రమముగా ముందునకు సాగినచో మీకు కావేరీ నది దర్శనమిచ్చును. దివ్యమైన ఆ పవిత్రనది నిర్మలమైన జలములతో ప్రవహించుచుండును. ఆ నదీతీరములయందు అప్సరసలు విహరించుచుందురు. ఆ మలయ పర్వతముమీద నివసించుచున్న[2] అగస్త్యమహామునిని దర్శింపుడు. ఆ మహాత్ముడు సూర్యునివలె భాసిల్లెడి మహాతేజోమూర్తి. ఆ మహాత్ముని ప్రసన్నుని జేసికొని, ఆయనఅనుజ్ఞతో మహానదియైన తామ్రపర్ణిని దాటుడు. ఆ నది మొసళ్లతో నిండియుండును సుమా! ఆ నది చిత్రవిచిత్రములైన ద్వీపములతో, దట్టముగా వ్యాపించియున్న చందనవృక్షములతో శోభిల్లుచుండును. అట్టి తామ్రపర్ణి ఒక యువతి తన భర్తను జేరునట్లు సముద్రమునుజేరును. (15-18)

అనంతరము పాండ్యరాజుల నగరము వచ్చును. అది దివ్యమై బంగారు కాంతులతో తేజరిల్లుచుండును. అది ఆ మహారాజులస్థాయికి తగినట్లు ముత్యములచేతను, మణులచేతను అలంకరింపబడి యుండును. సీతాదేవికై ఆప్రదేశములనుగాలింపుడు. (19)

పాండ్యనగరమును దాటినపిమ్మట మీరు సముద్ర తీరమునకు చేరుదురు. అచట సముద్రలంఘనవిషయమున మీ కార్యక్రమమును నిశ్చయించుకొనుడు. ఆ సముద్రమునందు అగస్త్యుడు పర్వతోత్తమమైన మహేంద్రగిరిని నెలకొల్పెను. దానిపై చిత్రవిచిత్రములైన వృక్షములు పెక్కుగలవు. అవి పుష్పములతోను, ఫలములతోను కలకలలాడుచుండును. ఆ మహాసముద్రమును చొచ్చుకొనియున్న మహేంద్రగిరి బంగారు కాంతులను విరజిమ్ముచుండును అది వివిధములగు వృక్షములతోడను, లతలతోడను శోభిల్లుచుండును.

1) గోవిందరాజీయ వ్యాఖ్యానమున అయోముఖపర్వతము సహ్యాద్రిగా పేర్కొనబడినది. కాని చందనవృక్షశోభితముగా వర్ణింపబడినందున అది 'మలయ పర్వతము' యయుండునని తిలక్ వ్యాఖ్యానము తలంచుచున్నది.

2) పంచవటికి ఉత్తరమునగల అగస్త్యాశ్రమమును శ్రీరాముడు దర్శించినట్లు ఇదివఱలో పేర్కొనబడినది. ఇప్పుడు అగస్త్యుడు (అగస్త్యాశ్రమము) మలయపర్వతముమీద ఉన్నట్లు తెలుపబడినది. ఇట్లు పేర్కొనుటలో వైరుధ్యము ఏమియులేదు. ఏలనని ఆదిశంకరాచార్యులవారిమఠములు పలుచోట్ల ఉన్నట్లు అగస్త్యునిఆశ్రమములుగూడ వేర్వేరుచోట్ల ఉండియుండవచ్చును గదా! –

సిద్ధచారణసంఘైశ్చ ప్రకీర్ణం సుమనోహరమ్।
తముపైతి సహస్రాక్షః సదా పర్వసు పర్వసు॥ 23

అక్కడ దేవర్షులు సంచరించుచుందురు, ప్రముఖులైన యక్షులు, అప్సరసలు విహరించుచుందురు. సిద్ధులు, చారణులు గుంపులుగా చేరుచుందురు. మిక్కిలి మనోహరమైన ఆ మహేంద్రగిరికి దేవేంద్రుడు ప్రతిపర్వదినమునందును సముద్రస్నానాదులకై వచ్చుచుండును. (20-23)

ద్వీపస్తస్యాపరే పారే శతయోజనమాయతః।
అగమ్యో మానుషైర్దీప్తః తం మార్గధ్వం సమంతతః।
తత్ర సర్వాత్మనా సీతా మార్గితవ్యా విశేషతః॥ 24

స హి దేశస్తు వధ్యస్య రావణస్య దురాత్మనః।
రాక్షసాధిపతేర్వాసః సహస్రాక్షసమద్యుతేః॥ 25

ఆ మహేంద్రపర్వతమునకు నూఱుయోజనముల దూరమున ఒక మహాద్వీపముగలదు. అది దీపకాంతులతో విలసిల్లుచుండును. అందు ప్రవేశించుట మానవ మాత్రులకు అసాధ్యము. ఆ ప్రదేశమంతయును బాగుగా వెదకవలెను. అంతేగాదు ఆ సీతామాతకొఱకు ఏకాగ్రతతో ప్రతి అంగుళము పట్టుబట్టి గాలింపవలెను ఆ ప్రదేశమంతయును రాక్షసరాజైన రావణునిఅధీనములోనుండును. అతడు ఇంద్రునివలె పరాక్రమశాలి. సీతాపహరణమునకు పాల్పడిన ఆ దుర్మార్గుడు వధార్హుడు. (24-25)

దక్షిణస్య సముద్రస్య మధ్యే తస్య తు రాక్షసీ।
అంగారకేతి విఖ్యాతా ఛాయామ్ ఆక్షిప్య భోజినీ॥ 26

ఆ దక్షిణ సముద్రముయొక్క మధ్యలో 'అంగారక' అని ప్రసిద్ధికెక్కిన ఒక రాక్షసి గలదు. ఆ రాక్షసి సముద్రముమీద పయనించువారినీడలను ఆకర్షించి, వారిని భక్షించు చుండును. (26)

ఏవం నిస్సంశయాన్ కృత్వా సంశయాన్నష్టసంశయాః।
మృగయధ్వం నరేంద్రస్య పత్నీమ్ అమితతేజసః॥ 27

లంకాద్వీపమునందును సంశయాస్పదములైన (సీతాదేవి ఇచట ఉండవచ్చునని భావించెడి) స్థలములన్నింటిని నిశితముగా గాలింపుడు. మీసందేహములు అన్నియును తీరినపిమ్మట (సీతాదేవి అచట లేదని పూర్తిగా తేలిన పిమ్మట) లంకా ద్వీపమును దాటి ముందునకు సాగుడు. మిగుల తేజస్వి (అమిత పరాక్రమశాలియైన) శ్రీరామప్రభువు యొక్క పత్నియగు సీతామాతయొక్క జాడను కనుగొనుటకై దక్షిణ దిశగా వెళ్లుడు. (27)

తమతిక్రమ్య లక్ష్మీవాన్ సముద్రే శతయోజనే।
గిరిః పుష్పితకో నామ సిద్ధచారణసేవితః॥ 28

చంద్రసూర్యాంశుసంకాశః సాగరాంబుసమావృతః।
భ్రాజతే విపులైః శృంగైః అంబరం విలిఖన్నివ॥ 29

తస్యైకం కాంచనం శృంగం సేవతేఽయం దివాకరః।
శ్వేతం రాజతమేకం చ సేవతేఽయం నిశాకరః॥ 30

న తం కృతఘ్నాః పశ్యంతి న నృశంసా న నాస్తికాః।
ప్రణమ్య శిరసా శైలం తం విమార్గత వానరాః॥ 31

లంకాద్వీపమును దాటి ఆ దక్షిణ దిశయందే ముందునకు వెళ్లినచో వందయోజనములదూరమున ఆ సముద్రమునందు 'పుష్పితకము' అను ఒక పర్వతము కన్పట్టును. అది శోభాయమానముగా ఉండును. అందు సిద్ధులు, చారణులు సంచరించుచుందురు. దాని చుట్టును అగాధమైన సముద్రము ఆవరించియున్నది. అది సూర్యచంద్రులశోభలతో వెలుగొందుచుండును. ఆ గిరియొక్క శిఖరములు మిక్కిలి ఎత్తైనవై, ఆకాశమును తాకుచున్నాయనునట్లు ఉండును. ఆ పుష్పితకపర్వతము యొక్క ఒక బంగారుశిఖరమును సూర్యుడు తన కిరణములతో ప్రకాశింపజేయుచుండును, ఒక వెండిశిఖరముపై చంద్రుడు తనవెన్నెలకాంతులను ప్రసరింపజేయుచుండును. ఆ పర్వతము కృతఘ్నులకును, క్రూరులకును, నాస్తికులకును కన్పట్టదు. ఓ వానరోత్తములారా! ముందుగా ఆ శైలమునకు ప్రణమిల్లి, అనంతరము అచట అన్వేషింపుడు. (28-31)

తమతిక్రమ్య దుర్ధర్షాః సూర్యవాన్నామ పర్వతః।
అధ్వనా దుర్విగాహేన యోజనాని చతుర్దశ॥ 32

తత స్తమప్యతిక్రమ్య వైద్యుతో నామ పర్వతః।
సర్వకామఫలైర్వృక్షైః సర్వకాలమనోహరైః॥ 33

తత్ర భుక్త్వా వరార్హాణి మూలాని చ ఫలాని చ।
మధూని పీత్వా ముఖ్యాని పరం గచ్ఛత వానరాః॥ 34

తత్ర నేత్రమనఃకాంతః కుంజరో నామ పర్వతః।
అగస్త్యభవనం యత్ర నిర్మితం విశ్వకర్మణా॥ 35

తత్ర యోజనవిస్తారమ్ ఉచ్ఛ్రితం దశయోజనం।
శరణం కాంచనం దివ్యం నానారత్నవిభూషితమ్॥ 36

తత్ర భోగవతీ నామ సర్పాణామ్ ఆలయః పురీ।
విశాలకక్ష్యా దుర్ధర్షా సర్వతః పరిరక్షితా॥ 37

రక్షితా పన్నగైర్ఘోరైః తీక్ష్ణదంష్ట్రైర్మహావిషైః।
సర్పరాజో మహాప్రాజ్ఞో యస్యాం వసతి వాసుకిః।
నిర్యాయ మార్గితవ్యా చ సా చ భోగవతీ పురీ॥ 38

తత్ర చానంతరాదేశా యే కేచన సుసంవృతాః॥ 39

తం చ దేశమతిక్రమ్య మహాన్ ఋషభసంస్థితః।
సర్వరత్నమయః శ్రీమాన్ ఋషభో నామ పర్వతః॥ 40

గోశీర్షకం పద్మకం చ హరిశ్యామం చ చందనం।
దివ్యమ్ ఉత్పద్యతే యత్ర తచ్చైవాగ్నిసమప్రభమ్॥ 41

న తు తచ్చందనం దృష్ట్వా స్ప్రష్టవ్యం చ కదాచన।
రోహితా నామ గంధర్వా ఘోరా రక్షంతి తద్వనమ్॥ 42

తత్ర గంధర్వపతయః పంచ సూర్యసమప్రభాః।
శైలూషో గ్రామణీః శిగ్రుః శుభ్రో బభ్రుస్తథైవ చ॥ 43

తిరుగులేని పరాక్రమశాలులైన ఓ వానరులారా! ఆ పుష్పితక పర్వతమును దాటిన పిమ్మట పదునాలుగు యోజనముల దూరములో 'సూర్యవంతము' అని శైలము వచ్చును. దానికి వెళ్లవలసిన మార్గము అతిక్లిష్టమైనది. (32)

ఆ సూర్యవంతగిరినిగూడ దాటినపిదప 'వైద్యుతము' అను పర్వతము వచ్చును అందలి వృక్షములు సర్వకాలముల యందును ఫలపుష్పములతో అలరారుచు మనోహరముగా ఉండును. అవి అందఱి అభిరుచులను తీర్చగల వివిధఫలములను ఒసంగుచుండును. ఓ వానరోత్తములారా! అచట మిక్కిలి రుచికరములైన కందమూలఫలములను ఆరగింపుడు, మేలైన మధువులను సేవింపుడు. సావధానముగా సీతాదేవికై అన్వేషింపుడు. (33-34)

అనంతరము మీరు 'కుంజరము' అను పర్వతమును చేరుదురు. అది కనువిందుగావించుచుండును. ఆగిరిపై అగస్త్యమహామునికై విశ్వకర్మ నిర్మించిన భవనము గలదు. అది ఒక యోజనము మేరకు విస్తరించి పదియోజనముల ఎత్తుకలిగియున్నది. దివ్యమైన ఆ బంగారుభవనము వివిధములగు రత్నములతో విరాజిల్లుచుండును. (35-36)

కుంజర పర్వతమునుండి ముందునకుసాగినచో 'భోగవతి' అను పురము కనబడును. అది సర్పములకు నిలయము, అందలి కక్ష్యలు విశాలమైనవి. అది అన్నివైపుల పరిరక్షింపబడుచుండును. కావున అందు ప్రవేశించుట అసాధ్యము. తీక్ష్ణమైన కోఱలుగల భయంకరమైన విషసర్పములచే ఆభోగవతిపురము రక్షింపబడుచుండును, అందు మహాప్రాజ్ఞుడు, సర్పములకు రాజు ఐన వాసుకి నివసించుచుండును. భోగవతినగరమును గాలించిన తరువాత దానికి చుట్టును ఆ సమీపముననేగల ఇతర ప్రదేశములను అన్నింటిని బాగుగా అన్వేషింపవలెను. (37-39)

భోగవతీపురమును దాటిన పిమ్మట వృషభాకృతిలో ఒక మహాశైలము వచ్చును. దానిపేరు 'వృషభపర్వతము' అది వివిధరత్నములతో విలసిల్లుచు సర్వసంపదలతో తులతూగుచుండును. ఆ గిరి గోరోచనమువలె పసుపు వన్నెతోడను, తామరాకులవలె ఆకుపచ్చవర్ణముతోడను, తమాలపత్రమువలె నీలవర్ణముతోడను ఒప్పెడి వివిధములగు చందనములకు ఉత్పత్తిస్థానము. ఆచందనవృక్షములు అగ్నివలె తేజరిల్లుచుండును. ఆ చందనవనమును ఘోరరూపములుగల 'రోహితులు' అను గంధర్వులు సంరక్షించుచుందురు. కనుక ఆ చందనవృక్షములను చూచి ఆనందింపవలెనేగాని వాటిని తాకరాదు. శైలూషుడు, గ్రామణి, శిగ్రువు, శుభ్రువు, బభ్రువు అను పేర్లుగల ఐదుగురు గంధర్వ ప్రభువులు ఆ వృషభ గిరిపై నివసించుచుందురు. వారు అందఱును సూర్యకాంతులతో విరాజిల్లుచుందురు. (40-43)

రవిసోమాగ్నివపుషాం నివాసః పుణ్యకర్మణామ్।
అంతే పృథివ్యా దుర్ధర్షాః తత్ర స్వర్గజితః స్థితాః। 44

తతః పరం న వః సేవ్యః పితృలోకః సుదారుణః।
రాజధానీ యమస్యైషా కష్టేన తమసా వృతా। 45

ఏతావదేవ యుష్మాభిః వీరా వానరపుంగవాః।
శక్యం విచేతుం గంతుం వా నాఽతో గతిమతాం గతిః। 46

సర్వ మేతత్ సమాలోక్య యచ్చాన్యదపి దృశ్యతే।
గతిం విదిత్వా వైదేహ్యాః సన్నివర్తితుమర్హథ। 47

యస్తు మాసాన్నివృత్తోఽగ్రే దృష్టా సీతేతి వక్ష్యతి।
మత్తుల్యవిభవో భోగైః సుఖం స విహరిష్యతి। 48

తతః ప్రియతరో నాస్తి మమ ప్రాణాద్విశేషతః।
కృతాపరాధో బహుశో మమ బంధుర్భవిష్యతి । 49

అమితబలపరాక్రమా భవంతో
విపులగుణేషు కులేషు చ ప్రసూతాః।
మనుజపతిసుతాం యథా లభధ్వం
తదధిగుణం పురుషార్థమారభధ్వమ్ । 50

ఆ వృషభగిరిని దాటినపిమ్మట భూమియొక్క సరిహద్దు కన్పట్టును. అది సూర్యచంద్రాగ్నులతేజస్సులతో వెలుగొందెడి దేహములుగల పుణ్యపురుషులకు నివాసస్థానము. ఆ ప్రదేశమునందు మిగుల శక్తిశాలురు, స్వర్గగమనమునకు అర్హులైనవారుమాత్రమే నివసించుచుందురు. (44)

అనంతరము కనబడునది పితృలోకము. అది సర్వ భయంకరమైన యమసదనము. అచటి చిమ్మచీకట్లలో ఎవ్వరును ప్రవేశింపజాలరు. కనుక మీరు అచటికి వెళ్లరాదు. (45)

వీరులైన ఓ వానరప్రముఖులారా! నేను చెప్పిన రీతిగా భూమిసరిహద్దువఱకుగల ఈ ప్రదేశములవఱకు మాత్రమే మీరు వెళ్లగలరు, వెదకగలరు. ఆ పిమ్మట మీకు దారియే దొరకదు. (46)

ఇంతవఱకు తెలుపబడిన ప్రదేశములను అన్నింటిని బాగుగా వెదకిన పిమ్మట ఇంకను అన్వేషింపదగిన ప్రదేశములు ఏవైనను మీదృష్టికి వచ్చినచో వాటినిగూడ గాలించి, సీతామాతఆచూకీ తెలిసికొని రాగలరు. (47)

నేను విధించిన ఒకనెలగడువులోపల అందఱికంటెను ముందుగా వచ్చి, 'నేను సీతాదేవిని దర్శించితిని' - అని తెలిపినవాడు నాతోసమానముగా భోగభాగ్యములను అనుభవించుటకును, సుఖముగా జీవించుటకును అర్హుడగును. నాకు అతనినిమించిన ప్రేమాస్పదుడు మఱియొకడు ఉండడు, అతడు నాకు ప్రాణతుల్యుడు, ఎన్ని దోషములు ఉన్నను అతడునాకు ఆత్మబంధువే! (48-49)

మిత్రులారా! మీరు సాటిలేని బలపరాక్రమములు గలవారు. ఉన్నతగుణములకు నెలవైన సద్వంశములలో జన్మించినవారు. ఏ విధముగా నైనను మీరు జనకమహారాజసుతయైన సీతాదేవిజాడను తెలిసికొని రండు. అందులకు తగిన ప్రయత్నములను ఈ క్షణమునుండియే ప్రారంభింపుడు. (50)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకచత్వారింశః సర్గః (41)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదిఒకటవసర్గము.

-- * * * --

42. నలుబదిరెండవసర్గము

సుగ్రీవుడు సీతాన్వేషణనిమిత్తమై తన మామయగు సుషేణునియొక్క నేతృత్వమున కొంతమంది వానరయోధులను పశ్చిమదిశకు పంపుచు వారికి ఆ దిక్కునగల విశేషములను దెల్పుట -

అథ ప్రస్థాప్య సుగ్రీవః తాన్ హరీన్ దక్షిణాం దిశమ్।
అబ్రవీన్మేఘసంకాశం సుషేణం నామ యూథపమ్। 1

అంగదాది వానరులను దక్షిణదిశకు పంపినపిమ్మట వానరరాజైన సుగ్రీవుడు తారయొక్క తండ్రియు, తనకు మామయు ఐన సుషేణునికడకు చేరి, దోసిలొగ్గి

తారాయాః పితరం రాజా శ్వశురం భీమవిక్రమం।
అబ్రవీత్ ప్రాంజలిర్వాక్యమ్ అభిగమ్య ప్రణమ్య చ। 2

మరీచిపుత్రం మారీచమ్ అర్చిష్మంతం మహాకపిం।
వృతం కపివరైః శూరైః మహేంద్రసదృశద్యుతిమ్। 3

బుద్ధివిక్రమసంపన్నం వైనతేయసమద్యుతిమ్।
మరీచిపుత్రాన్ మారీచాన్ అర్చిర్మాలాన్ మహాబలాన్।
ఋషిపుత్రాంశ్చ తాన్ సర్వాన్ ప్రతీచీమ్ ఆదిశద్దిశమ్। 4

ద్వాభ్యాం శతసహస్రాభ్యాం కపీనాం కపిసత్తమాః।
సుషేణప్రముఖా యూయం వైదేహీం పరిమార్గత। 5

సురాష్ట్రాన్ సహబాహ్లీకాన్ శూరాన్ భీమాం స్తథైవ చ।
స్ఫీతాన్ జనపదాన్ రమ్యాన్ విపులాని పురాణి చ। 6

పున్నాగగహనం కుక్షిం వకుళోద్దాలకాకులమ్।
తథా కేతకషండాంశ్చ మార్గధ్వం హరియూథపాః। 7

ప్రత్యక్స్రోతోగమాశ్చైవ నద్యః శీతజలాః శివాః।
తాపసానామ్ అరణ్యాని కాంతారా గిరయశ్చ యే। 8

తతః స్థలీం మరుప్రాయామ్ అత్యుచ్చశిరసః శిలాః।
గిరిజాలావృతాం దుర్గాం మార్గిత్వా పశ్చిమాం దిశం। 9

తతః పశ్చిమమాసాద్య సముద్రం ద్రష్టుమర్హథ।
తిమినక్రాయుతజలమ్ అక్షోభ్యమ్ అథ వానరాః। 10

తతః కేతకషండేషు తమాలగహనేషు చ।
కపయో విహరిష్యంతి నారికేళవనేషు చ। 11

తత్ర సీతాం చ మార్గధ్వం నిలయం రావణస్య చ।
వేలాతటనివిష్టేషు పర్వతేషు వనేషు చ। 12

మురచీపత్తనం చైవ రమ్యం చైవ జటీపురం।
అవంతీమ్ అంగలేపాం చ తథా చాఽలక్షితం వనం।
రాష్ట్రాణి చ విశాలాని పత్తనాని తతస్తతః। 13

నమస్కరించెను. యూథపతియగు ఆ సుషేణుడు మేఘమువలె నీలవర్ణమువాడు, మిగుల పరాక్రమశాలి. అతడేగాక మరీచి మహర్షికుమారుడును, మిక్కిలి తేజస్వియు ఐన మారీచుడుగూడ అక్కడనే యుండెను. అతడు మహేంద్రునితో సమానమైన వర్చస్సుగలవాడు. ఆకపివరుడు శూరులగు వానరులతో గూడియుండెను. అతడు సూక్ష్మబుద్ధి, ఎంతయు బలాఢ్యుడు. వేగమున గరుత్మంతునితో సమానుడు. ప్రముఖులైన వానరులు పెక్కుమంది అతని చుట్టును చేరియుండిరి. ఇంకను మరీచమహర్షి అంశలతో బుట్టిన వానరులు కొంతమది అచటనే యుండిరి. వారును మహాబలశాలులు, తేజస్సంపన్నులు వారినందఱిని సీతాన్వేషణకై పశ్చిమదిశకు వెళ్లవలసినదిగా ఆదేశించుచు సుగ్రీవుడు ఇట్లు నుడివెను. "ఓ వానర ప్రముఖులారా! సుషేణునినాయకత్వమున మీరు అందఱును రెండులక్షలమంది వానరవీరులతో గూడి సీతాదేవి జాడను తెలిసికొనుడు." (1-5)

'ఓ కపిశ్రేష్ఠులారా! సౌరాష్ట్రప్రాంతములను, బాహ్లీక దేశములను, శూర, భీమ ప్రదేశములను, విశాలములై మనోహరముగా ఉండెడి జనపదములను, మహానగరములను, పున్నాగవృక్షములతోను, వకుళవృక్షములతోను, ఉద్దాలక వృక్షములతోను, మొగలిపొదలతోడను కూడియున్న మధ్యదేశమును సీతాదేవికొఱకై గాలింపుడు. (6-7)

పవిత్రమైనచల్లనిజలములతో పశ్చిమదిశకు ప్రవహించెడి నదీతీరములయందును, మునీశ్వరులు తపశ్చర్యలను ఒనర్చెడి వనములయందును, దట్టమైనఅడవులలోను, దుర్గమములైన కొండలపైనను సీతాదేవికై అన్వేషింపుడు. (8)

అనంతరము పశ్చిమదిశయందు మరుభూములవంటి మెట్టనేలలను, నిటారుగానున్న శిలాప్రాంతములను, కొండలచే ఆవరింపబడియున్న దుర్గమప్రదేశములను బాగుగా వెదకుడు. (9)

ఓ వానరులారా! పిదప ఇంకను పడమరదిశగా సాగినచో సముద్రతీరమునకు చేరుదురు. అందలి జలములలో తిమింగిలములు, మొసళ్లు సంచరించుచుండును. ఆ సముద్రజలములు ప్రశాంతముగా ఉండును. ఆ సాగరతీరమునగల మొగలిపొదలలోను, కానుగతోపులలోను, కొబ్బరి తోటలలోను, మీ వానరులందఱును సంచరింపవచ్చును. ఆ తీరమునగలపర్వతములయందును, వనములలోను రావణునినివాసమును, సీతాదేవిఆచూకీని తెలిసికొనుటకై తీవ్రముగా అన్వేషింపుడు. (10-12)

అనంతరము మురచీ పట్టణమును, రమ్యమైన జటీపురమును, అవంతిని,[1] అంగలోపాపురిని, అలక్షిత వనమును, ఇంకను విశాలములైన ప్రదేశములను, పట్టణములను గాలింపుడు.

1) తూర్పుదిశామార్గమున పేర్కొనబడిన అవంతికంటె ఇది వేఱైనది.

సింధుసాగరయోశ్చైవ సంగమే తత్ర పర్వతః।
మహాన్ హేమగిరిర్నామ శతశృంగో మహాద్రుమః। 14

తస్య ప్రస్థేషు రమ్యేషు సింహాః పక్షగమాః స్థితాః।
తిమిమత్స్యగజాంశ్చైవ నీడాన్యారోపయంతి తే। 15

తాని నీడాని సింహానాం గిరిశృంగగతాశ్చ యే।
దృప్తాస్తృప్తాశ్చ మాతంగాః తోయదస్వననిస్స్వనాః।
విచరంతి విశాలేఽస్మిన్ తోయపూర్ణే సమంతతః। 16

తస్య శృంగం దివస్పర్శం కాంచనం చిత్రపాదపం।
సర్వమాశు విచేతవ్యం కపిభిః కామరూపిభిః। 17

కోటిం తత్ర సముద్రే తు కాంచనీం శతయోజనాం।
దుర్దర్శాం పారియాత్రస్య గతాం ద్రక్ష్యథ వానరాః। 18

కోట్యస్తత్ర చతుర్వింశత్ గంధర్వాణాం తరస్వినామ్।
వసంత్యగ్నినికాశానాం ఘోరాణాం కామరూపిణామ్। 19

పావకార్చిప్రతీకాశాః సమవేతాః సహస్రశః।
నాత్యాసాదయితవ్యాస్తే వానరైర్భీమవిక్రమైః। 20

నాదేయం చ ఫలం తస్మాత్ దేశాత్ కించిత్ ప్లవంగమైః।
దురాసదా హి తే వీరాః సత్త్వవంతో మహాబలాః। 21

ఫలమూలాని తే తత్ర రక్షంతే భీమవిక్రమాః।
తత్ర యత్నశ్చ కర్తవ్యో మార్గితవ్యా చ జానకీ।
నహి తేభ్యో భయం కించిత్ కపిత్వమ్ అనువర్తతామ్। 22

తత్ర వైడూర్యవర్ణాభో వజ్రసంస్థానసంస్థితః।
నానాద్రుమలతాకీర్ణో వజ్రో నామ మహాగిరిః। 23

సింధునదము సముద్రమున కలియు ప్రదేశమున హేమగిరియను ఒక పర్వతముగలదు. అది నూఱుశిఖరములుగలది. ఎత్తైన వృక్షములతో నిండినది. (13-14)

రమ్యములైన ఆ పర్వతశిఖరములయందు సింహములవలె క్రూరములైన పక్షులు నివసించుచుండును. అవి తిమింగిలములను, ఏనుగులనుగూడ తమగూండ్ల (నివాసముల) లోనికి ఈడ్చుకొనిపోవుచుండును. ఆ సింహముల (ఆక్రూరజంతువుల) నివాసస్థలములు నీటితో నిండిన ఆవిశాలప్రదేశమునందు అంతటను గలవు. వాటి సమీపమునగల శిఖరములయందు మదపుటేనుగులు మిక్కిలి గర్వించినవై మేఘగర్జనలవలె ఘీంకరించుచు ఒడలుమఱచి తిరుగుచుండును. చిత్రమైన వృక్షములు గల దాని బంగారుశిఖరము మహోన్నతమై ఆకాశమును తాకుచుండును. కామరూపులైన మీ వానరులందఱును అందు అడుగడుగునను గాలింపవలెను. (15-17)

కొంచెము ముందునకు సాగినపిమ్మట సముద్ర మధ్యమున 'పారియాత్రము' అను ఒక మహాపర్వతము గోచరించును. దాని బంగారుశిఖరము నూఱుయోజనముల విస్తృతికలిగియుండును. సామాన్యులకు దానిదర్శనము దుర్లభము. మీరు అచటికి వెళ్లి, సీతాదేవి కొఱకై బాగుగా వెదకవలెను. (18)

ఆ పారియాత్ర పర్వతశిఖరముపై ఇరువది నాలుగు కోట్లమంది గంధర్వులు నివసించుచుందురు. వారు కామరూపులు, వేగగమనులు, అగ్నితో సమానమైనతేజస్సుగలవారు, భయంకరులు. అగ్నిజ్వాలలవలె తేజరిల్లునట్టి ఆ గంధర్వులు వేర్వేఱు ప్రాంతములనుండి అచటికి చేరుచుందురు. మీరు ఎంతటిపరాక్రమవంతులైనను వారిసమీపములకు వెళ్లరాదు. వారికెట్టి హానియు కలిగింపరాదు. ఆ శిఖరమునందలి ఎట్టిఫలములను తీసికొనరాదు. ఏలనన దృఢకాయులు, మహాబలశాలులు, వీరులు, మిగులభయంకరులు ఐన ఆగంధర్వులు అచటి ఫలమూలములను రక్షించుచుందురు. వారిని ఎదుర్కొనుట మిగుల కష్టము. ఐనను అచట జానకీదేవిజాడను తెలిసికొనుటకై గట్టిగా యత్నింపవలెను. వానరులుగా ప్రవర్తించువారికి ఆ గంధర్వులవలన ఎట్టి భయమూ ఉండదు. (19-22)

పారియాత్రపర్వతమునకు సమీపములో సముద్రమునందు 'వజ్రగిరి' అను పేరుగల ఉన్నతమైన ఒక పర్వతము గలదు. అది వివిధములగు వృక్షములతోను, లతలతోను శోభిల్లుచుండును, వైడూర్యములవలె అది స్వచ్ఛములైన కాంతులతో విలసిల్లుచుండును. వజ్రమువలె ఆ గిరి

శ్రీమాన్ సముదితస్తత్ర యోజనానాం శతం సమమ్।
గుహాస్తత్ర విచేతవ్యాః ప్రయత్నేన ప్లవంగమాః। 24

చతుర్భాగే సముద్రస్య చక్రవాన్ నామ పర్వతః।
తత్ర చక్రం సహస్రారం నిర్మితం విశ్వకర్మణా। 25

తత్ర పంచజనం హత్వా హయగ్రీవం చ దానవం।
ఆజహార తత శ్చక్రం శంఖం చ పురుషోత్తమః। 26

తస్య సానుషు చిత్రేషు విశాలాసు గుహాసు చ।
రావణః సహవైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః। 27

యోజనానాం తతష్షష్టిః వరాహో నామ పర్వతః।
సువర్ణశృంగః సుశ్రీమాన్ అగాధే వరుణాలయే। 28

తత్ర ప్రాగ్జ్యోతిషం నామ జాతరూపమయం పురం।
యస్మిన్ వసతి దుష్టాత్మా నరకో నామ దానవః। 29

తత్ర సానుషు చిత్రేషు విశాలాసు గుహాసు చ।
రావణః సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః। 30

తమతిక్రమ్య శైలేంద్రం కాంచనాంతరనిర్దరః।
పర్వతః సర్వసౌవర్ణో ధారాప్రస్రవణాయుతః। 31

తం గజాశ్చ వరాహాశ్చ సింహా వ్యాఘ్రాశ్చ సర్వతః।
అభిగర్జంతి సతతం తేన శబ్దేన దర్పితాః। 32

యస్మిన్ హరిహయః శ్రీమాన్ మహేంద్రః పాకశాసనః।
అభిషిక్తః సురై రాజా మేఘవాన్ నామ పర్వతః। 33

తమతిక్రమ్య శైలేంద్రం మహేంద్రపరిపాలితం।
షష్టిర్గిరిసహస్రాణి కాంచనాని గమిష్యథ। 34

కఠినమైనది. ఎటు చూచినను అది నూఱుయోజనముల మేరకు వ్యాపించియుండును. దానివైభవము అపూర్వము. ఆ గిరిగుహలయందు ఆ తల్లిజాడకొఱకు పట్టుబట్టి గాలింపవలెను. (23-24)

ఆ సమీపముననే 'చక్రవంతము' అను ఒక మహాశైలము గలదు. అది సముద్రమున నాల్గవవంతు వ్యాపించియున్నది. దానిపై విశ్వకర్మ వేయి అంచులుగల ఒక చక్రమును నిర్మించెను. పురుషోత్తముడైన శ్రీమహావిష్ణువు ఈ పర్వతమునందు నివసించుచున్న పంచజనుడు, హయగ్రీవుడు అనుదానవులను చంపి, వారినుండి 'పాంచజన్యము' అను శంఖమును, 'సుదర్శనము' అను సహస్రారచక్రమును తీసికొనివచ్చెను. చిత్రములైన ఆ పర్వతసానువులయందును, విశాలములైన గుహలయందును రావణునినివాసమును, వైదేహిజాడను పసిగట్టుటకై తీవ్రముగా వెదకుడు. (25-27)

ఓ వానరులారా! ఆచక్రవంతగిరికి అఱువది యోజనముల దూరములో అగాధమైన ఆ సముద్రమున 'వరాహగిరి' గలదు. అది బంగారుశిఖరములతో విలసిల్లుచుండును. దానిపై ప్రాగ్జ్యోతిషపురము గలదు. అది సువర్ణమయము. ఆ నగరమును 'నరకుడు' అను దానవుడు పరిపాలించుచుండును. అతడు కడుదుష్టాత్ముడు అచటి చిత్రవిచిత్రములైన సానువుల యందును, విశాలములైన గుహలయందును సీతాదేవి జాడను, రావణునినివాసమును తెలిసికొనుటకై గట్టిగా అన్వేషింపుడు. (28-30)

ఆ వరాహగిరిని దాటినపిమ్మట సర్వసౌవర్ణపర్వతము వచ్చును. దాని గుహలలోపలిభాగములును, వెలుపలి భాగములును సువర్ణమయములు. అది నిరంతరము నేలకొలది జలధారలతోడను, సెలయేళ్లతోడను విరాజిల్లుచుండును. ఆ పర్వతముపై అంతటను సంచరించుచుండెడి ఏనుగుల ఘీంకారములు, వరాహముల ఘుర్ఘురధ్వనులు, సింహముల గర్జనలు, పెద్దపులుల గాండ్రింపులు ఆ గుహలలో ప్రతిధ్వనించు చుండును. ఆ ప్రతిధ్వనులకు రెచ్చిపోయి, ఆ గజాదులన్నియును ప్రతిగర్జనలను చేయుచుండును. (31-32)

అటు పిమ్మట మీరు 'మేఘవంతము' అను పర్వతమునకు చేరుదురు. ఆ గిరిపైననే దేవతలు మహేంద్రుని 'సురరాజు'గా పట్టాభిషిక్తునిగావించిరి. ఆ ఇంద్రుడు పచ్చనిగుఱ్ఱములు గలవాడు, వైభవోపేతుడు, పాకాసురుని సంహరించినవాడు. (33)

దేవేంద్రునివలన సురక్షితముగా ఉన్న ఆ మేఘవంత పర్వతమును దాటి ముందునకు సాగినపిమ్మట మీకు అఱువదివేల బంగారుకొండలు (బంగారు కొండల ప్రాంతము) కన్పట్టును. అవి అన్నివైపుల బాలసూర్యుని

తరుణాదిత్యవర్ణాని భ్రాజమానాని సర్వతః।
జాతరూపమయైర్వృక్షైః శోభితాని సుపుష్పితైః। 35

తేషాం మధ్యే స్థితో రాజా మేరురుత్తరపర్వతః।
ఆదిత్యేన ప్రసన్నేన శైలో దత్తవరః పురా। 36

తేనైవముక్తః శైలేంద్రః సర్వ ఏవ త్వదాశ్రయాః।
మత్ప్రసాదాద్భవిష్యంతి దివారాత్రౌ చ కాంచనాః। 37

త్వయి యే చాపి వత్స్యంతి దేవగంధర్వదానవాః।
తే భవిష్యంతి రక్తాశ్చ ప్రభయా కాంచనప్రభాః। 38

విశ్వేదేవాశ్చ మరుతో వసవశ్చ దివౌకసః।
ఆగమ్య పశ్చిమాం సంధ్యాం మేరుమ్ ఉత్తరపర్వతమ్। 39

ఆదిత్యమ్ ఉపతిష్ఠంతి తైశ్చ సూర్యోఽభిపూజితః।
అదృశ్యః సర్వభూతానామ్ అస్తం గచ్ఛతి పర్వతమ్। 40

యోజనానాం సహస్రాణి దశ తాని దివాకరః।
ముహూర్తార్ధేన తం శీఘ్రమ్ అభియాతి శిలోచ్చయమ్। 41

శృంగే తస్య మహద్దివ్యం భవనం సూర్యసన్నిభమ్।
ప్రాసాదగణసంబాధం విహితం విశ్వకర్మణా। 42

శోభితం తరుభిశ్చిత్రైః నానాపక్షిసమాకులైః।
నికేతం పాశహస్తస్య వరుణస్య మహాత్మనః। 43

అంతరా మేరుమస్తం చ తాలో దశశిరా మహాన్।
జాతరూపమయః శ్రీమాన్ భ్రాజతే చిత్రవేదికః। 44

తేషు సర్వేషు దుర్గేషు సరస్సు చ సరిత్సు చ।
రావణః సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః। 45

యత్ర తిష్ఠతి ధర్మజ్ఞః తపసా స్వేన భావితః।
మేరుసావర్ణిరిత్యేవ ఖ్యాతో వై బ్రహ్మణా సమః। 46

ప్రష్టవ్యో మేరుసావర్ణిః మహర్షిః సూర్యసన్నిభః।
ప్రణమ్య శిరసా భూమౌ ప్రవృత్తం మైథిలీం ప్రతి। 47

కాంతులతో వెలుగొందుచుండును. ఆ పర్వతములపైనున్న వృక్షములు బంగారువన్నెగల పూవులతో చూడముచ్చట గొల్పుచుండును. ఆ బంగారుకొండలమధ్య పర్వతములకు రాజైన మహోన్నతమగు మేరుగిరి మీకు దర్శనమిచ్చును. పూర్వకాలమున సూర్యుడు ప్రసన్నుడై ఆ మేరు పర్వతమునకు ఒక వరమును ఇచ్చుచు ఇట్లు పలికెను. "ఓ పర్వతరాజా! నిన్ను ఆశ్రయించుకొనిన వారందఱును నా అనుగ్రహప్రభావముచే రాత్రింబవళ్లు (నిరంతరము) బంగారుకాంతులతో విరాజిల్లు చుందురు. నీపైన నివసించెడి దేవతలు, గంధర్వులు, దానవులు నీయందు అనురక్తులై బంగారు వన్నెగల దివ్యతేజస్సులతో వెలుగొందుదురు." (34-38)

విశ్వేదేవతలు, మరుద్గణములు, అష్టవసువులు, ఇతరదేవతలు సాయంసమయమున శ్రేష్ఠమైన మేరుపర్వతమునకు విచ్చేసి, సూర్యభగవానుని ఉపాసింతురు. ఆ కర్మసాక్షి వారిపూజలను అందుకొనిన పిమ్మట సమస్తప్రాణులకును అదృశ్యుడై అస్తాద్రిని చేరును. సువిశాలములైన ఆ మేరుపర్వతభాగములనుగూడ జానకీదేవిజాడకొఱకై అన్వేషించుట మఱువరాదు సుమా! (39-40)

మేరుపర్వతమునకును అస్తాద్రికిని మధ్య పదివేల యోజనముల దూరముగలదు. దానిని ఆ మార్తాండుడు అర్ధముహూర్తకాలములో అధిగమించి, అస్తాచలమును చేరగలడు. (41)

ఆ పశ్చిమాద్రిశిఖరముపై విశ్వకర్మ దివ్యమైన ఒక మహాభవనమును నిర్మించెను. అది పెక్కు మేడల వరుసలతోగూడి సూర్య కాంతులతో విరాజిల్లుచుండును. ఆ మహాభవనము పాశహస్తుడైన మహాత్ముడగు వరుణుని నివాసస్థానము. దానిప్రాంగణము వివిధములగు పక్షులకు నిలయమైన చిత్రవిచిత్రములగు వృక్షములతో శోభిల్లుచుండును. మేరుగిరికిని అస్తాద్రికిని మధ్య పదిశాఖలుగల ఒక మహాతాళవృక్షముగలదు. అది బంగారు కాంతులీనుచు దర్శనీయముగా ఉండును. దాని క్రిందిభాగమునఒక చిత్రమైన వేదిక అలరారుచుండును. అచటి దుర్గములయందును, సరస్సులతటముల యందును, నదీతీరములయందును, సీతాదేవిజాడకై, రావణునినివాసమునకై బాగుగా గాలింపుడు. (42-45)

ఆ ప్రాంతమున 'మేరుసావర్ణి' అను మహర్షి గలడు. అతడు మిగులఖ్యాతిగన్నవాడు, సమస్త ధర్మములను ఎఱిగినవాడు, బాగుగా తపమొనరించిన పవిత్రాత్ముడు. బ్రహ్మదేవునియంతటివాడు. ఆ మహాముని సూర్యునివలె మహాతేజస్వి, ఆ మహాత్మునకు సాష్టాంగముగా ప్రణమిల్లి, మైథిలి ఆచూకీనిగూర్చి అభ్యర్థింపుడు. అందువలన కార్యసిద్ధి కలుగవచ్చును. (46-47)

ఏతావజ్జీవలోకస్య భాస్కరో రజనీక్షయే।
కృత్వా వితిమిరం సర్వమ్ అస్తం గచ్ఛతి పర్వతమ్। 48

ఏతావద్వానరైః శక్యం గంతుం వానరపుంగవాః।
అభాస్కరమ్ అమర్యాదం న జానీమస్తతః పరమ్। 49

అధిగమ్య చ వైదేహీం నిలయం రావణస్య చ।
అస్తపర్వతమాసాద్య పూర్ణే మాసే నివర్తత।
ఊర్ధ్వం మాసాన్న వస్తవ్యం వసన్ వధ్యో భవేన్మమ। 50

సహైవ శూరో యుష్మాభిః శ్వశురో మే గమిష్యతి।
శ్రోతవ్యం సర్వమేతస్య భవద్భిర్దిష్టకారిభిః। 51

గురురేష మహాబాహుః శ్వశురో మే మహాబలః।
భవంతశ్చాపి విక్రాంతాః ప్రమాణం సర్వకర్మసు। 52

ప్రమాణమేనం సంస్థాప్య పశ్యధ్వం పశ్చిమాం దిశమ్।
దృష్టాయాం తు నరేంద్రస్య పత్న్యామమితతేజసః।
కృతకృత్యా భవిష్యామః కృతస్య ప్రతికర్మణా। 53

అతోఽన్యదపి యత్కార్యం కార్యస్యాస్య హితం భవేత్।
సంప్రధార్య భవద్భిశ్చ దేశకాలార్థసంహితమ్। 54

తతః సుషేణప్రముఖాః ప్లవంగాః
సుగ్రీవవాక్యం నిపుణం నిశమ్య ।
ఆమంత్ర్య సర్వే ప్లవగాధిపం తే
జగ్ముర్దిశం తాం వరుణాభిగుప్తామ్ । 55

సూర్యభగవానుడు ప్రాతఃకాలమునందు ఉదయగిరినుండి అస్తాద్రివఱకుగల జగత్తును పూర్తిగా చీకట్లను పాఱద్రోలి, సమస్తప్రాణులకును వెలుగులను ప్రసాదించుచు, సాయంసమయమునకు అస్తాద్రిని చేరును. ఓ వీరులారా! పశ్చిదిశయందు ఇంతవఱకే వానరులు వెళ్లగలరు. అటు పిమ్మట సూర్యునిప్రకాశముగాని, ఏదేశపుసరిహద్దుగాని కన్పట్టదు. కావున ఆ తరువాతగల ప్రదేశమును గూర్చి నేను ఎఱుగను. (48-49)

అస్తాద్రివఱకు గాలించి, రావణునినివాసస్థానమును, జానకీదేవిజాడను తెలిసికొని, నెలలోపల తిరిగిరండు. గడువుమీఱి అచట మసలరాదు. సకాలములో ఇచటికి రానివారికి నా చేతిలో చావు తప్పదు. (50)

ఓ వానరులారా! మామామయు, మహాశూరుడునైన సుషేణుడు మీతో రాగలడు. మీకు నాయకుడైన ఆయనయొక్క ఆదేశములను పూర్తిగా అనుసరింపగలరు. ఈ సుషేణుడు మిగుల బలశాలి, మహాబాహువు, పైగా పెద్దవాడు, మార్గదర్శకుడు. మీరును తిరుగులేని పరాక్రమశాలులే. ఐనను అన్ని విషయములయందును ఈయనమాటయే చెల్లును. ఈయన నాయకత్వమున మీరు పశ్చిమదిశను గాలింపుడు. మహాతేజశ్శాలియైన రామచంద్రప్రభువు యొక్క పత్నియగు సీతామాతజాడ తెలిసినచో ఇంకమనము కృతార్థులమైనట్లే. ఆ మహాత్ముడు చేసిన మహోపకారమునకు ఆ విధముగా మనము ఋణముతీర్చుకొనినవారమగుదుము. (51-53)

సీతాన్వేషణకార్యము సఫలమగుటకు నేను నుడివినట్లేగాక మఱియొక ఉపాయము మీకు తోచినచో దేశకాలపరిస్థితులకు అనుగుణముగా మీరు నిశ్చయించుకొని, ఆ విధముగా చేయగలరు." (54)

సుషేణుడు మొదలగు వానర ప్రముఖులందఱును సుగ్రీవుని ఆదేశములను కడు శ్రద్ధతో వినిరి. పిదప ఆ వానరరాజుఅనుమతిని గైకొని వారు ఎల్లరును వరుణదేవుని పాలనలో సురక్షితముగా ఉన్న పశ్చిమదిశకు పయనమైరి. (55)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ద్విచత్వారింశఃసర్గః (42)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదిరెండవసర్గము

— * * * —

43. నలుబదిమూడవసర్గము

సుగ్రీవుడు 'శతవలి'యను వానరవీరుని నాయకత్వమున తగినంతమంది వానరయోధులను ఉత్తరదిశకు పంపుచు, వారికి ఆ దిశావిశేషములను సమగ్రముగా వివరించుట -

తతః సందిశ్య సుగ్రీవః శ్వశురం పశ్చిమాం దిశం।
వీరం శతవలిం నామ వానరం వానరర్షభః। 1

ఉవాచ రాజా ధర్మజ్ఞః సర్వవానరసత్తమం।
వాక్యమ్ ఆత్మహితం చైవ రామస్య చ హితం తథా। 2

వృతః శతసహస్రేణ త్వద్విధానాం వనౌకసాం।
వైవస్వతసుతైః సార్ధం ప్రతిష్ఠస్వ స్వమంత్రిభిః। 3

దిశం హ్యుదీచీం విక్రాంతాం హిమశైలావతంసికాం।
సర్వతః పరిమార్గధ్వం రామపత్నీమ్ అనిందితామ్। 4

అస్మిన్ కార్యే వినిర్వృత్తే కృతే దాశరథేః ప్రియే।
ఋణాన్ముక్తా భవిష్యామః కృతార్థార్థవిదాం వరాః। 5

కృతం హి ప్రియమస్మాకం రాఘవేణ మహాత్మనా।
తస్య చేత్ ప్రతికారోఽస్తి సఫలం జీవితం భవేత్। 6

అర్థినః కార్యనిర్వృత్తిమ్ అకర్తురపి యశ్చరేత్।
తస్య స్యాత్ సఫలం జన్మ కిం పునః పూర్వకారిణః। 7

ఏతాం బుద్ధిమ్ అవస్థాయ దృశ్యతే జానకీ యథా।
తథా భవద్భిః కర్తవ్యమ్ అస్మత్ప్రియహితైషిభిః। 8

అయం హి సర్వభూతానాం మాన్యస్తు నరసత్తమః।
అస్మాసు చాగతప్రీతీ రామః పరపురంజయః। 9

ఇమాని వనదుర్గాణి నద్యః శైలాంతరాణి చ।
భవంతః పరిమార్గంతు బుద్ధివిక్రమసంపదా। 10

తత్ర మ్లేచ్ఛాన్ పులిందాంశ్చ శూరసేనాం స్తథైవ చ।
ప్రస్థలాన్ భరతాం శ్చైవ కురూంశ్చ సహ మద్రకైః। 11

వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుడు తనమామయగు సుషేణుని పశ్చిమదిశకు వెళ్లవలసినదిగా ఆదేశించెను. పిదప ధర్మజ్ఞుడైన ఆ వానరరాజు వానరనాయకుడైన 'శతవలి' అను వీరునితో తనకును శ్రీరామునకును హితకరమగు వచనములను ఇట్లు నుడివెను. (1-2)

"ఓ శతవలీ! నీతో సమానులైన వానరవీరులతోగూడి, వైవస్వతునియంశలతో జన్మించిన నీ సహచరమంత్రులను వెంటనిడుకొని, ఉత్తరదిశకు బయలుదేఱుము. ఆ ఉత్తరదిశ మహిమాన్వితమైనది. హిమవత్పర్వతము ఆ దిశకే ఒక దివ్యాభరణము. పూజ్యురాలైన సీతామాతజాడకై మీరు ఆ దిశయందు అంతటను పూర్తిగా గాలింపుడు. (3-4)

లక్ష్యసిద్ధి సాధించుటలో ఆఱితేఱిన ఓ వానరులారా! ఈ సీతాన్వేషణకార్యము మనప్రయత్నములతో సఫలమైనచో శ్రీరామచంద్రప్రభువు ఎంతయు సంతోషించును. ఆ విధముగా మనము ఋణవిముక్తులమై ధన్యులమగుదుము. మహాత్ముడైన ఆ రఘువీరుడు మనకు ఎంతయో మేలు చేసినాడు. ఆ స్వామికి ప్రత్యుపకారము చేయగలిగినచో మన జీవితములు పూర్తిగా సఫలములగును. (5-6)

మనకు ఉపకారము చేయనివాడెవ్వడైనను మనలను అర్థించినప్పుడు అతనికి తోడ్పడినచో మనజన్మలు సార్థకములగును. ఆ రామచంద్రప్రభువు ఇంతకుముందే మనకు మహోపకారమొనర్చియున్నాడు. ఇక ఆయనకు సహాయపడవలసిన విషయమునుగూర్చి చెప్పనేల? (7)

ఓ వానరవీరులారా! మీరు ఎల్లప్పుడును నాకు హితమును గూర్చుచు, నన్ను సంతోషపెట్టుటయందే నిరతులైయుందురు. కనుక నేను ఇంతవఱకును తెలిపిన విషయములను మనస్సులలో నిలుపుకొని, మీరు ఏ విధముగనైనను జానకీదేవి జాడను తెలిసికొనియే తీరవలెను. పురుషోత్తముడు, శత్రువిజేతయు. ఐన ఈ శ్రీరాముడు సకలప్రాణులకును ఆరాధ్యుడు. పైగా మనపై పరమప్రేమగలవాడు. (8-9)

నేను చెప్పబోవుచున్న వనములయందును, దుర్గములలోను, నదీతీరములయందును, కొండలపైనను, గుహలలోను మీరు మీ బుద్ధిబలమును ఉపయోగించుచు ఆ తల్లి అమాకికొఱకై గట్టిగా అన్వేషింపుడు. (10)

మ్లేచ్ఛదేశములను, పుళిందులభూములను, శూరసేనుల రాజ్యములను బాగుగా అన్వేషింపుడు, అట్లే ఇంద్రప్రస్థమును, దానిపరిసరప్రదేశములను, దక్షిణకురుభూములైన

కాంభోజాన్ యవనాంశ్చైవ శకాన్ ఆరట్టకానపి।
బాహ్లీకాన్ ఋషికాంశ్చైవ పౌరవాన్ అథ టంకణాన్। 12

చీనాన్ పరమచీనాంశ్చ నీహారాంశ్చ పునః పునః।
అన్విష్య దరదాంశ్చైవ హిమవంతం తథైవ చ। 13

లోధ్రపద్మకషండేషు దేవదారువనేషు చ।
రావణః సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః। 14

తతః సోమాశ్రమం గత్వా దేవగంధర్వసేవితం।
కాలం నామ మహాసానుం పర్వతం తు గమిష్యథ। 15

మహత్సు తస్య శైలస్య నిర్దరేషు గుహాసు చ।
విచినుధ్వం మహాభాగాం రామపత్నీం తతస్తతః। 16

తమతిక్రమ్య శైలేంద్రం హేమగర్భం మహాగిరిమ్।
తతః సుదర్శనం నామ గంతుమ్ అర్హథ పర్వతమ్। 17

తతో దేవసఖో నామ పర్వతః పతగాలయః।
నానాపక్షిగణాకీర్ణో వివిధద్రుమభూషితః। 18

తస్య కాననషండేషు నిర్ఝరేషు గుహాసు చ।
రావణః సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః। 19

తమతిక్రమ్య చాకాశం సర్వతః శతయోజనం।
అపర్వతనదీవృక్షం సర్వసత్త్వవివర్జితమ్। 20

తం తు శీఘ్రమ్ అతిక్రమ్య కాంతారం రోమహర్షణం।
కైలాసం పాండురం శైలం ప్రాప్య హృష్టా భవిష్యథ। 21

తత్ర పాండురమేఘాభం జాంబూనదపరిష్కృతం।
కుబేరభవనం దివ్యం నిర్మితం విశ్వకర్మణా। 22

విశాలా నళినీ యత్ర ప్రభూతకమలోత్పలా।
హంసకారండవాకీర్ణా హ్యప్సరోగణసేవితా। 23

కురుక్షేత్రాది ప్రాంతములను, మద్రకదేశములను, కాంభోజరాజ్యములను, యవనులభూములను శకులదేశములను, ఆరట్టకదేశభాగములను, బాహ్లీకరాజ్యములను, ఋషిక ప్రదేశములను, పురురాజులభూములను, టంకణ దేశప్రాంతములను, చీన, పరమచీనభూములను, ఎల్లప్పుడును మంచుతో నిండియుండు ప్రదేశములను, దరదదేశములను, హిమవత్పర్వత ప్రాంతములను, దట్టముగా ఉండెడి లొద్దుగచెట్లమధ్యను, పద్మక వృక్షములలోను, దేవదారు వనములయందును రావణునినివాసమును, సీతాదేవిజాడను పసిగట్టుటకై పదేపదే నిశితముగా గాలింపుడు. (11-14)

దేవతలు, గంధర్వులు సంచరించునట్టి సోమాశ్రమ ప్రాంతములను వెదకుడు. పిమ్మట పెద్ద సానువులుగల కాలపర్వతమునకు వెళ్ళుడు. ఆగిరియందుగల పెద్దపెద్ద గుహలలోను, సెలయేటితీరములయందును రామపత్నియగు సీతాదేవికొఱకై ప్రత్యంగుళము అన్వేషింపుడు. (15-16)

అకాలగిరిని దాటిన పిమ్మట 'హేమగర్భము' అను పేరుగల మహాపర్వతము వచ్చును. ఆ పిమ్మట 'సుదర్శనము' అను పెద్దకొండ ఎదురగును. ఈ రెండింటిని గాలించి, ముందునకు సాగినచో 'దేవసఖ' శైలమును చేరుదురు. ఆ గిరి పక్షులకు ఆశ్రయము, అది వివిధములగు పక్షులగుంపులతో నిండియుండును, అనేకవిధములగు చక్కనివృక్షములతో కలకలలాడుచుండును. ఆ పర్వతముపైగల వనములలోను, సెలయేళ్లతీరములయందును, గుహలలోను రావణుని నివాసమునకై, సీతాదేవిజాడకై అందంతటను గట్టిగా అన్వేషింపుడు. (17-19)

ఆ దేవసఖపర్వతము దాటినపిమ్మట ఎటుచూచినను వందయోజనములమేరకు శూన్యప్రదేశమే కన్పట్టును. అందు కొండలుగాని, నదులుగాని, వృక్షములుగాని ఉండవు. అందువలన ఎట్టి ప్రాణులును అచట నివసింపవు. (20)

ఆ శూన్యప్రదేశమును అధిగమించినపిమ్మట ఒక దుర్గమారణ్యము ఎదురగును, దానిని చూచిన వెంటనే మీ ఒడలు పులకరించును. అచట మీకు కైలాసశిఖరము కన్పట్టును. తెల్లనికాంతులతో విలసిల్లుచుండెడి ఆ కైలాసమును జూచినంతనే మీకు పరమసంతోషము కలుగును. అచట కుబేరునిదివ్య భవనము గలదు. దానిని విశ్వకర్మ నిర్మించెను. అది తెల్లని మేఘములవలె విరాజిల్లుచు బంగారు అలంకారములతో అలరారుచుండును. అక్కడ విశాలమైనసరస్సుగలదు. అందలి కమలముల, కలువల శోభలు అపూర్వములు. అందు హంసలు, కన్నెలేడిపిట్టలు విహరించుచుండును, అప్సరసలు అచట క్రీడించుచుందురు. ఆ ప్రాంతమునకు యక్షరాజైన

తత్ర వైశ్రవణో రాజా సర్వభూతనమస్కృతః।
ధనదో రమతే శ్రీమాన్ గుహ్యకైః సహ యక్షరాట్॥ 24

తస్య చంద్రనికాశేషు పర్వతేషు గుహాసు చ।
రావణః సహ వైదేహ్యా మార్గితవ్యస్తతస్తతః॥ 25

క్రౌంచం తు గిరిమాసాద్య బిలం తస్య సుదుర్గమం।
అప్రమత్తైః ప్రవేష్టవ్యం దుష్ప్రవేశం హి తత్ స్మృతమ్॥ 26

వసంతి హి మహాత్మానః తత్ర సూర్యసమప్రభాః।
దేవైరప్యర్చితాః సమ్యక్ దేవరూపా మహర్షయః॥ 27

క్రౌంచస్య తు గుహాశ్చాన్యాః సానూని శిఖరాణి చ।
నిర్దరాశ్చ నితంబాశ్చ విచేతవ్యాస్తతస్తతః॥ 28

క్రౌంచస్య శిఖరం చాపి నిరీక్ష్య చ తతస్తతః।
అవృక్షం కామశైలం చ మానసం విహగాలయమ్॥ 29

న గతిస్తత్ర భూతానాం దేవదానవరక్షసాం।
న చ సర్వైర్విచేతవ్యః ససానుప్రస్థభూధరః॥ 30

క్రౌంచం గిరిమ్ అతిక్రమ్య మైనాకో నామ పర్వతః।
మయస్య భవనం యత్ర దానవస్య స్వయంకృతమ్॥ 31

మైనాకస్తు విచేతవ్యః ససానుప్రస్థకందరః।
స్త్రీణామ్ అశ్వముఖీనాం చ నికేతాస్తత్ర తత్ర తు॥ 32

తం దేశం సమతిక్రమ్య ఆశ్రమం సిద్ధసేవితం।
సిద్ధా వైఖానసాస్తత్ర వాలఖిల్యాశ్చ తాపసాః॥ 33

వంద్యాస్తే తు తపస్సిద్ధాః తపసా వీతకల్మషాః।
ప్రష్టవ్యా చాపి సీతాయాః ప్రవృత్తిర్వినయాన్వితైః॥ 34

హేమపుష్కరసంఛన్నం తస్మిన్ వైఖానసం సరః।
తరుణాదిత్యసంకాశైః హంసైర్విచరితం శుభైః॥ 35

కుబేరుడు అధిపతి. సర్వశుభలక్షణములుగల అతడు సమస్తప్రాణులకును పూజ్యుడు. ఆ ధనపతి అచట యక్షులతోగూడి హాయిగా విహరించుచుండును. చంద్రకాంతులతో విలసిల్లెడి ఆ పర్వతశిఖరములయందును, గుహలలోను, రావణునినివాసమునకై, వైదేహీదేవిజాడకై అంతటను క్షుణ్ణముగా గాలింపుడు. (21-25)

ఆ పిమ్మట మీరు క్రౌంచగిరికి వెళ్లుడు. అందు బిలమువలె కన్పట్టెడి దుర్గమమైన ఒక గుహగలదు. కుమారస్వామి, తనశక్తిని ('శక్తి' అను ఆయుధమును) ప్రయోగించినందున అది అట్లు ఏర్పడినట్లు ప్రతీతి. అందు కాలుమోపుటయు అసాధ్యమని ప్రసిద్ధి. కనుక అందుజాగరూకులై ప్రవేశింపుడు. అచట సూర్యునివలె తేజోమూర్తులైన మహాత్ములగు మహర్షులు నివసించుచుందురు. ఆ దివ్య స్వరూపులను దేవతలుగూడ సాదరముగా అర్చించుచుందురు. ఆ క్రౌంచపర్వతముయొక్క ఇతరగుహలను, సానువులను, శిఖరములను, సెలయేళ్లను, గిరిమధ్య భాగములను పూర్తిగా నిశితముగా గాలింపవలెను. (26-28)

క్రౌంచశిఖరమును వెదకిన పిమ్మట 'అవృక్షము' అను పేరుగల కామశైలమును,[1] పక్షులకు నెలవైన మానసపర్వతమునుగూడ వెదకుడు. అచ్చట ఎట్టి ప్రాణులును నివసింపవు. అంతేగాదు దేవతలు, దానవులు, రాక్షసులు మున్నగువారుగూడ సంచరింపరు. అచటగల సానువులను, మైదానప్రదేశములను గట్టిగా అన్వేషింపుడు. క్రౌంచపర్వతమును అధిగమించినపిమ్మట 'మైనాకము' అను పర్వతము కన్పట్టును. అచట మయుడు అను దానవుడు నిర్మించుకొనిన భవనముగలదు. ఆ గిరిపై అక్కడక్కడ కింపురుషస్త్రీలయొక్క భవనములును గలవు. ఆ మైనాక శైలముయొక్క సానువులను, మైదాన ప్రదేశములను, గుహలను బాగుగా గాలింపుడు. (29-32)

మైనాకపర్వతమును వెదకి ముందునకు సాగినపిదప ఒక పవిత్రమైన ఆశ్రమము వచ్చును. దానిని సిద్ధులు సేవించుచుందురు. అక్కడ సిద్ధులు, వైఖానసులు, వాలఖిల్యులు మొదలగు మహాత్ములు తమ తపశ్చర్యలను కొనసాగించుచుందురు. వారు అందఱును తపస్సిద్ధినంది పునీతులైరి. ఆ మహానుభావులకు వినయపూర్వకముగా నమస్కరించి, సీతామాతయొక్క జాడనుగూర్చి అర్థింపగలరు. ఆ ఆశ్రమమునందు 'వైఖానసము' అను సరస్సుగలదు. అందలి జలములు బంగారువన్నెగల కమలములతో నిండియుండును. అందు మధ్యాహ్న సూర్యుని కాంతులతో

1) ఈ పర్వతమునందు మన్మథుడు తపమొనరించినందున దీనికి 'కామశైలము' అను పేరు ఏర్పడినది.

ఔపవాహ్యః కుబేరస్య సార్వభౌమ ఇతి స్మృతః।
గజః పర్యేతి తం దేశం సదా సహ కరేణుభిః। 36

తత్పరః సమతిక్రమ్య నష్టచంద్రదివాకరం।
అనక్షత్రగణం వ్యోమ నిష్పయోదమ్ అనాదితమ్। 37

గభస్తిభిరివార్కస్య స తు దేశః ప్రకాశతే।
విశ్రామ్యద్భిస్తపస్సిద్ధైః దేవకల్పైః స్వయంప్రభైః। 38

తం తు దేశమ్ అతిక్రమ్య శైలోదా నామ నిమ్నగా। 39

ఉభయో స్తీరయోస్తస్యాః కీచకా నామ వేణవః।
తే నయంతి పరం తీరం సిద్ధాన్ ప్రత్యానయంతి చ। 40

ఉత్తరాః కురవస్తత్ర కృతపుణ్యప్రతిశ్రయాః। 41

తతః కాంచనపద్మాభిః పద్మినీభిః కృతోదకాః।
నీలవైడూర్యపత్రాభిః నద్యస్తత్ర సహస్రశః। 42

రక్తోత్పలవనైశ్చాత్ర మండితాశ్చ హిరణ్మయైః।
తరుణాదిత్యసదృశైః భాంతి తత్ర జలాశయాః। 43

మహార్హమణిపత్రైశ్చ కాంచనప్రభకేసరైః।
నీలోత్పలవనైశ్చిత్రైః స దేశః సర్వతో వృతః। 44

నిస్తులాభిశ్చ ముక్తాభిః మణిభిశ్చ మహాధనైః।
ఉద్భూతపులినాస్తత్ర జాతరూపైశ్చ నిమ్నగాః। 45

సర్వరత్నమయైశ్చిత్రైః అవగాఢా నగోత్తమైః।
జాతరూపమయైశ్చాఽపి హుతాశనసమప్రభైః। 46

నిత్యపుష్పఫలాస్తత్ర నగాః పత్రరథాకులాః।
దివ్యగంధరసస్పర్శాః సర్వకామాన్ స్రవంతి చ। 47

విలసిల్లెడి అందమైన హంసలు విహరించుచుండును. యక్షులకు ప్రభువైన కుబేరునియొక్క గజవాహనమునకు 'సార్వభౌమము' అని పేరు. అది ఆడు ఏనుగులతోగూడి సర్వదా ఆప్రదేశమున సంచరించుచుండును. (33-36)

ఆ వైఖానససరస్సును దాటివెళ్ళినపిమ్మట ఒక ప్రదేశము వచ్చును. అచ్చట సూర్యచంద్రులయొక్క, నక్షత్రములయొక్క దర్శనమే యుండదు. అక్కడ మేఘములుగాని, మెఱుపులుగాని కనబడవు సరిగదా వాటిగర్జనలుగూడ వినబడవు. ఆకాశము కేవలము శూన్యమై యుండును. ఐనను సూర్యకిరణములు ప్రసరించినట్లుగా ఆ ప్రదేశము అంతయును దివ్యతేజోమయమైయుండును. దేవతలతో సమానులైన తపస్సిద్ధులు ఆ ప్రదేశమున విశ్రమించుచుందురు. వారు స్వయంప్రకాశకులు. వారిజ్ఞానతేజస్సులే అచటి వెలుగులకు కారణము. (37-38)

ఆ ప్రదేశమును దాటినపిదప 'శైలోదము' అను పేరుగల నది వచ్చును. ఆ నదియొక్క రెండుతీరముల యందును 'కీచకములు' అను వెదుళ్ళుగలవు. ఆ వెదుళ్ళు వంగి, పరస్పరము పెనవైచుకొని వంతెనవలె ఒప్పుచుండును. అచటి సిద్ధులు ఆ వెదుళ్ళవంతెన మీదుగా ఉభయతీరములకును తమరాకపోకలను సాగించుచుందురు. ఆశైలోదననదీతీరముననే ఉత్తరకురు భూములు గలవు. అవి పుణ్యాత్ములకు నిలయములు. (39-41)

ఆ ఉత్తరకురుదేశమున పెక్కునదులు గలవు. అవి జలసమృద్ధిగల జీవనదులు. వాటిలో బంగారుపద్మములు, తామరతీగెలు, నీలవైడూర్యములవంటి ఆకులు అలరారుచుండును. తరుణసూర్యునికాంతులతో ఒప్పుచు, బంగారు వన్నెగల్గియున్న ఎఱ్ఱదామరలతో అచటి జలాశయములు ఎల్లప్పుడును కలకలలాడుచుండును. అచటి జలాశయములు నల్లగలువలతో నిండియుండును. ఆ కలువలఆకులు అమూల్యములైన నీలమణులవలెను, వాటికేసరముల బంగారుకాంతులలోను ఒప్పుచుండుటచే అవి చిత్రవిచిత్రములుగా శోభిల్లుచుండును. (42-44)

అందలి నదులు మిక్కిలి ఎత్తైన ఇసుకతిన్నెలతో మనోహరముగా ఉండును. ఆ తీరములు మిక్కిలి విలువైన గుండ్రని ముత్యములతో మణులతో, బంగారములతో విరాజిల్లుచుండును. ఆ నదులలోనికి చొచ్చుకొనియున్న పర్వతములు బంగారుకాంతులను విరజిమ్ముచు అగ్నిజ్వాలలవలె మెఱయుచుండును. అవి వివిధములగు రత్నములకు నిలయములు. (45-46)

అచటి వృక్షములు పక్షులగుంపులకు నివాసములు. అవి అన్ని కాలములయందును అద్భుతపరిమళములను వెదజల్లెడి పూవులతోడను, రసవంతములై నోరూరించెడి పండ్లతోను ఒప్పుచు అందటి అభిరుచులను తీర్చుచుండును. (47)

నానాకారాణి వాసాంసి ఫలంత్యన్యే నగోత్తమాః। 48

ముక్తావైడూర్య చిత్రాణి భూషణాని తథైవ చ।
స్త్రీణాం చాప్యనురూపాణి పురుషాణాం తథైవ చ।
సర్వర్తుసుఖసేవ్యాని ఫలంత్యన్యే నగోత్తమాః। 49

మహార్హాణి విచిత్రాణి హైమాన్యన్యే నగోత్తమాః।
శయనాని ప్రసూయంతే చిత్రాస్తరణవంతి చ। 50

మనఃకాంతాని మాల్యాని ఫలంత్యత్రాపరే ద్రుమాః।
పానాని చ మహార్హాణి భక్ష్యాణి వివిధాని చ। 51

స్త్రియశ్చ గుణసంపన్నా రూపయౌవనలక్షితాః।
గంధర్వాః కిన్నరాః సిద్ధా నాగా విద్యాధరాస్తథా।
రమంతే సహితాస్తత్ర నారీభిర్భాస్కరప్రభాః। 52

సర్వే సుకృతకర్మాణః సర్వే రతిపరాయణాః।
సర్వే కామార్థసహితా వసంతి సహయోషితః। 53

గీతవాదిత్రనిర్ఘోషః సోత్కృష్టహసితస్వనః।
శ్రూయతే సతతం తత్ర సర్వభూతమనోహరః। 54

తత్ర నాఽముదితః కశ్చిత్ నాస్తి కశ్చిదసత్ప్రియః।
అహన్యహని వర్ధంతే గుణాస్తత్ర మనోరమాః। 55

సమతిక్రమ్య తం దేశమ్ ఉత్తరః పయసాం నిధిః।
తత్ర సోమగిరిర్నామ మధ్యే హేమమయో మహాన్। 56

ఇంద్రలోకగతా యే చ బ్రహ్మలోకగతాశ్చ యే।
దేవాస్తం సమవేక్షంతే గిరిరాజం దివం గతాః। 57

సతు దేశో విసూర్యోఽపి తస్య భాసా ప్రకాశతే।
సూర్యలక్ష్మ్యాఽభివిజ్ఞేయః తపతేవ వివస్వతా। 58

భగవానపి విశ్వాత్మా శంభురేకాదశాత్మకః।
బ్రహ్మా వసతి దేవేశో బ్రహ్మర్షిపరివారితః। 59

న కథంచన గంతవ్యం కురూణామ్ ఉత్తరేణ వః।
అన్యేషామపి భూతానాం నాతిక్రామతి వై గతిః। 60

సహి సోమగిరిర్నామ దేవానామపి దుర్గమః।
తమాలోక్య తతః క్షిప్రమ్ ఉపావర్తితుమర్హథ। 61

అచటి కొన్ని వృక్షములు వస్త్రములను ప్రసాదించును. ముత్యములు, వైడూర్యములు పొదిగిన చిత్రములైన ఆభరణములను అనుగ్రహించును. స్త్రీలును, పురుషులును ధరించుటకు అవి అనువుగా ఉండును. మఱికొన్ని వృక్షములు అన్ని ఋతువులయందును హాయిని గొల్పుచుండును. (48-49)

తదితరవృక్షములలో కొన్ని శ్రేష్ఠములైన, చిత్రవిచిత్రములైన బంగారుతల్పములను, ఆస్తరణములను సృష్టించును. మఱికొన్ని మనస్సునకింపైన మాల్యములను, కమ్మని పానీయములను, వివిధములగు భక్ష్యములను సమకూర్చును. (50-51)

అచటి స్త్రీలు సద్గుణములుగలవారు, చక్కనిరూపములు, యౌవనముగలవారు. అచట దివ్య తేజస్సంపన్నులైన గంధర్వులు, కిన్నరులు, సిద్ధులు, నాగులు, విద్యాధరులు స్త్రీలతోగూడి ఆనందించుచుండురు. (52)

స్త్రీలతో చేరియున్నవారు అందఱును సత్కార్యములను ఒనర్చినవారు, సుఖలాలసులు, భోగాసక్తులు. అచట నిరంతరము మధురగీతాలాపనలు, ఇంపైన వీణావేణుమృదంగ తాళధ్వనులు, కమ్మని దరహాసములసవ్వడులు వినిపించు చుండును. అవి సకలప్రాణుల మనస్సులను రంజింపజేయు చుండును. అచట సుఖములకు నోచుకొనని వారుగాని, చెడు ఆలోచనలు గలవారుగాని ఉండనే ఉండరు. అచటివారిలో అనుదినము సద్గుణములు వృద్ధిచెందుచుండును. (53-55)

ఆ కురుదేశప్రాంతములను అన్వేషించిన పిమ్మట ఉత్తరదిశయందు లవణసముద్రము వచ్చును. ఆ సముద్రము నడుమ 'సోమగిరి' అను పేరుగల ఒక మహాపర్వతముగలదు. అది సువర్ణమయము. ఇంద్రలోకమునందును, బ్రహ్మలోకము నందునుగల దేవతలు ఆకాశమున నిలిచి, ఆపర్వతరాజము యొక్క అందచందమును తిలకించుచుందురు. (56-57)

రాత్రివేలలో సూర్యుడులేకున్నను, సోమగిరికాంతులతో ఆ ప్రదేశము సూర్యప్రభలతో వెలుగొందుచున్నట్లే యుండును. (58)

అచ్చట విశ్వాత్మకుడైన విష్ణుభగవానుడు, ఏకాదశమూర్తి స్వరూపుడైన శంకరభగవానుడు, సృష్టికర్తయైన బ్రహ్మయు నివసించుచుందురు. ఈ త్రిమూర్తులను బ్రహ్మర్షులు సేవించుచుందురు. ఎట్టి పరిస్థితులలోను మీరు ఉత్తర కురుభూములనుదాటి వెళ్లరాదు. శక్తి శాలులైన దైత్యులు సైతము దానిని అతిక్రమించి వెళ్లజాలరు. ఆ సోమగిరి యందు ప్రవేశించుట దేవతలకుసైతము అసాధ్యము. కనుక అందంతటను సీతాదేవి కొఱకు అన్వేషించి తిరిగిరండు. (59-61)

ఏతావద్వానరైః శక్యం గంతుం వానరపుంగవాః।
అభాస్కరమ్ అమర్యాదం న జానీమస్తతః పరమ్। 62

సర్వమేతద్విచేతవ్యం యన్మయా పరికీర్తితమ్।
యదన్యదపి నోక్తం చ తత్రాఽపి క్రియతాం మతిః। 63

ఓ వీరులారా! వానరులైన మీరు ఇంతవఱకు మాత్రమే వెళ్లగలరు. ఆపైన సూర్యరశ్మియే యుండదు. కనుక ఆ తరువాత ఏదేశములున్నదియు నేను ఎఱుగను. ఇంతవఱకును నేను తెల్పిన ప్రదేశములను అన్నింటిని పూర్తిగా గాలింపుడు. నేను పేర్కొనని ప్రదేశములవిషయమున మీ బుద్ధి కౌశలమును అనుసరించి అన్వేషింపుడు. (62-63)

తతః కృతం దాశరథేర్మహత్ప్రియం
మహత్తరం చాపి తతో మమ ప్రియం।
కృతం భవిష్యత్యనిలానలోపమా
విదేహజాదర్శనజేన కర్మణా । 64

తతః కృతార్థాః సహితాః సబాంధవా
మయార్చితాః సర్వగుణైర్మనోరమైః ।
చరిష్యథోర్వీం ప్రతిశాంతశత్రవః
సహప్రియా భూతధరాః ప్లవంగమాః । 65

ఓ వానరయోధులారా! మీరు అందఱును వాయుదేవుని వలె సర్వత్ర సంచరింపగలరు. మహాత్ముడైన అగ్నివలె తేజోమూర్తులు. మీరు ఎన్ని శ్రమలకోర్చియైనను ఆ వైదేహీదేవిని జూచి, ఆమె క్షేమవార్తను తీసికొని రాగలిగినచో శ్రీరామచంద్ర ప్రభువు ఎంతయు సంతోషించును. ఇక నేను పొందెడి ఆనందమునకు అవధియే యుండదు మీరు ఈ ఘనకార్యమును సాధించుకొని వచ్చినచో, అన్ని విధములుగను ప్రశంసావహములైన సత్కారములతో మిమ్ములను, మీ బంధుమిత్రులను గౌరవింతును. ఆ పిమ్మట మీరు, ఆలుబిడ్డలతో గూడి సుఖసంతోషజీవితములను అనుభవింపగలుగుదురు. మఱియు మిమ్ము ఆశ్రయించిన ఇతర ప్రాణులనుగూడ పోషింపగలరు. అప్పుడు మిమ్ము ఎదిరించి నిల్వగల శత్రువులే యుండరు. (64-65)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే త్రిచత్వారింశః సర్గః (43)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదిమూడవసర్గము

-- * * * --

44. నలుబదినాలుగవసర్గము

'సీతాన్వేషణ కార్యమును హనుమంతుడే తప్పక సాధింపగలడు' - అను విశ్వాసముతో సుగ్రీవుడు మారుతిని ప్రశంసించుట - శ్రీరాముడును ఆంజనేయుని శక్తి సామర్థ్యములను మెచ్చుకొనుచు, 'ఆయనపై సీతాదేవికి నమ్మకము కలుగుటకై, ఆనవాలుగా తనయుంగరమును ఆవాయుసుతునకు ఇచ్చుట -

విశేషేణ తు సుగ్రీవో హనుమత్యర్థముక్తవాన్।
స హి తస్మిన్ హరిశ్రేష్ఠే నిశ్చితార్థోఽర్థసాధనే। 1

అబ్రవీచ్చ హనూమంతం విక్రాంతమ్ అనిలాత్మజం।
సుగ్రీవః పరమప్రీతః ప్రభుః సర్వవనౌకసామ్। 2

'సీతాన్వేషణ కార్యమును వానరోత్తముడైన ఆ హనుమంతుడు తప్పక సాధింపగలడు.' అని సుగ్రీవునకు గట్టిన నమ్మకముగలదు. కనుక అతడు ఆమారుతితో ప్రత్యేకముగా ఇట్లు చెప్పదొడంగెను. సమస్త వానరులకును ప్రభువైన సుగ్రీవుడు మిగుల ఆప్యాయతను ప్రకటించుచు మిక్కిలి పరాక్రమశాలియు, వాయుసుతుడును అగు హనుమంతునితో ఇట్లు వివరముగా పలికెను. (1-2)

న భూమౌ నాంతరిక్షే వా నాఽంబరే నాఽమరాలయే।
నాఽప్సు వా గతిసంగం తే పశ్యామి హరిపుంగవ॥ 3

"ఓ వానరోత్తమా! వివిధములగు పెక్కు జంతువులు తిరిగెడి భూమిపైగాని, మేఘములు మొదలగునవి సంచరించెడి ఎట్టి ఆధారములేని అంతరిక్షమున గాని, సుడిగాలులు సంభవించెడి ఆకాశమున గాని, దివ్యశక్తి సంపన్నులైన దేవతలుండెడి స్వర్గమునగాని పశుపక్ష్యాదులు సంచరింపజాలని నీటియందుగాని నీ గమనమునకు అడ్డు ఉండదు. (3)

సాసురాః సహగంధర్వాః సనాగనరదేవతాః।
విదితాః సర్వలోకాస్తే ససాగరధరాధరాః। 4

గతిర్వేగశ్చ తేజశ్చ లాఘవం చ మహాకపే।
పితుస్తే సదృశం వీర మారుతస్య మహౌజసః। 5

తేజసా వాఽపి తే భూతం సమం భువి న విద్యతే।
తద్యథా లభ్యతే సీతా తత్ త్వమేవోపపాదయ। 6

త్వయ్యేవ హనుమన్నస్తి బలం బుద్ధిః పరాక్రమః।
దేశకాలానువృత్తిశ్చ నయశ్చ నయపండిత। 7

తతః కార్యసమాసంగమ్ అవగమ్య హనూమతి।
విదిత్వా హనుమంతం చ చింతయామాస రాఘవః। 8

సర్వథా నిశ్చితార్థో ఽయం హనూమతి హరీశ్వరః।
నిశ్చితార్థకరశ్చాపి హనుమాన్ కార్యసాధనే। 9

తదేవం ప్రస్థితస్యాఽస్య పరిజ్ఞాతస్య కర్మభిః।
భర్త్రా పరిగృహీతస్య ధ్రువః కార్యఫలోదయః। 10

తం సమీక్ష్య మహాతేజా వ్యవసాయోత్తరం హరిం।
కృతార్థ ఇవ సంవృత్తః ప్రహృష్టేంద్రియమానసః। 11

దదౌ తస్య తతః ప్రీతః స్వనామాంకోపశోభితం।
అంగులీయమభిజ్ఞానం రాజపుత్ర్యాః పరంతపః। 12

అనేన త్వాం హరిశ్రేష్ఠ చిహ్నేన జనకాత్మజా।
మత్సకాశాదనుప్రాప్తమ్ అనుద్విగ్నాఽను పశ్యతి। 13

వ్యవసాయశ్చ తే వీర సత్త్వయుక్తశ్చ విక్రమః।
సుగ్రీవస్య చ సందేశః సిద్ధిం కథయతీవ మే। 14

స తం గృహ్య హరిశ్రేష్ఠః స్థాప్య మూర్ధ్ని కృతాంజలిః।
వందిత్వా చరణౌ చైవ ప్రస్థితః ప్లవగోత్తమః। 15

అసురులు, గంధర్వులు, నాగులు, మానవులు, దేవతలు, సముద్రములు, పర్వతములు ఉండెడి సమస్త లోకములును నీకు సుపరిచితములు. వీరుడవైన ఓ వానరోత్తమా! ఎదురులేని గమనమునందును, వేగమునందును, శక్తి సామర్థ్యములయందును నీవు మహాపరాక్రమశాలియైన నీతండ్రియగు వాయుదేవుని యంతటివాడవు. బలపరాక్రమముల విషయమున ఈ భూమండలమునందు నీకు సాటియైన ప్రాణియేలేదు. కాబట్టి సీతాదేవిజాడను తెలిసికొనదగిన మార్గమును నీవే ఆలోచింపుము. (4-6)

నీతికోవిదుడవైన ఆంజనేయా! అసాధారణమైన బుద్ధికుశలత, సాటిలేని బలపరాక్రమములు నీయందే గలవు. నీవు గొప్ప ఉపాయశాలివి. దేశకాలములకు అనుగుణముగా ప్రవర్తింపగలవాడవు." (7)

సుగ్రీవుని మాటలనుబట్టి సీతాన్వేషణకార్యభారము హనుమంతునిపైననే ఉన్నట్లు శ్రీరాముడు గ్రహించెను. ఆ కార్యసాధనకు హనుమంతుడు సమర్థుడనిగూడ గ్రహించెను. పిమ్మట ఆప్రభువు ఇట్లు ఆలోచింపసాగెను. (8)

"హనుమంతుడు సీతాన్వేషణకార్యమును తప్పక నెఱవేర్పగలడు" అని సుగ్రీవునకు గట్టి నమ్మకముగలదు. అట్లే హనుమంతుడును తాను ఆపనిని సాధింపగలనని పూర్తి ఆత్మవిశ్వాసముతో ఉన్నాడు. హనుమంతుడు ఇదివఱలో సాధించిన కార్యములనుబట్టి అతనిసామర్థ్యమును సుగ్రీవుడు ఎఱిగియున్నాడు. కనుక ఆ వానరరాజు ఈ పనిని ఇతనికి అప్పగించెను. అందువలన ఇతనివలన కార్యము సఫలమగుట తథ్యము." (9-10)

మహాతేజస్వియైన శ్రీరాముడు కార్యసాధనయందు దక్షుడైన హనుమంతునివైపు ఒక్కసారి పరికించి చూచెను. పిమ్మట ఆస్వామి 'ఇక తనకార్యము సఫలమైనట్లే' అని భావించి ఎంతయు సంతుష్టుడయ్యెను, లోలోపల పొంగిపోయెను. అట్లు సంప్రీతుడైన ఆ ప్రభువు రాజకుమారియైన సీతాదేవికి ఆనవాలుగా ఉండుటకై తన పేరు చెక్కబడిన ఉంగరమును హనుమంతునకు ఇచ్చి, ఇట్లనుడివెను. "ఓ వానరశ్రేష్ఠా! ఈ ముద్రికను జూచిన పిమ్మట సీతాదేవి 'ఇతడు రామునికడనుండి వచ్చిన దూతయే' అని తలంచి, ఎట్టి వ్యాకులపాటునకు లోనుగాకుండ నిన్ను పూర్తిగా విశ్వసించును. నీతో మాట్లాడును. ఓ వీరుడా! నీ కార్యోత్సాహము, నీ ధైర్యసాహసములు. నీ పరాక్రమము, సుగ్రీవుని సందేశము. ఇవి అన్నియును కార్యసిద్ధిని నాకు సూచించుచున్నవి." (నీ వలన కార్యసిద్ధి కలుగునని నేను నమ్ముచున్నాను.)(11-14)

అంతట ఆ వానరశ్రేష్ఠుడు అంజలి ఘటించి, రాముముద్రికను తీసికొని, శిరస్సునందు ఉంచుకొనెను. పిమ్మట అతడు ఆ ప్రభుపాదములకు ప్రణమిల్లి, అటనుండి బయలుదేఱెను.(15)

స తత్ ప్రకర్షన్ హరిణాం బలం మహత్
బభూవ వీరః పవనాత్మజః కపిః ।
గతాంబుదే వ్యోమ్ని విశుద్ధమండలః
శశీవ నక్షత్రగణోపశోభితః ॥ 16

వానర వీరుడైన ఆ మారుతి ఆ మహాకపిసైన్యమును వెంటనిడుకొని పయనమయ్యెను. అప్పుడు ఆ మహాత్ముడు మేఘములులేని నిర్మలమైన ఆకాశమున నక్షత్రములతోగూడియున్న చంద్రునివలె శోభిల్లెను. అప్పుడు శ్రీరాముడు ఇట్లు పలికెను. (16)

అతిబల బలమాశ్రితస్తవాహం
హరివరవిక్రమ విక్రమైరనల్పైః ।
పవనసుత యథాఽభిగమ్యతే సా
జనకసుతా హనుమన్ తథా కురుష్వ ॥ 17

"వాయుసుతుడవైన ఓ ఆంజనేయా! నీవు మిక్కిలి బలశాలివి, పైగా సింహపరాక్రముడవు. నేను నీ శక్తి సామర్థ్యములను ఆశ్రయించితిని. అద్భుతమైన నీ బలపరాక్రమములను పూర్తిగా ప్రదర్శించి, సీతాదేవి క్షేమసమాచారములను తెలిసికొని రమ్ము." (17)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే చతుశ్చత్వారింశః సర్గః *(44)*

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదినాలుగవసర్గము

-- * * * --

45. నలుబదిఐదవసర్గము

సుగ్రీవునిఆజ్ఞనుగొని వానరప్రముఖులు తమ అనుయాయులతోగూడి సీతాన్వేషణకై ఆయా దిక్కులకు బయలుదేఱుట. వానరులు సుగ్రీవుని యెదుట బీరములు పలుకుట -

సర్వాం శ్చాహూయ సుగ్రీవః ప్లవగాన్ ప్లవగర్షభః ।
సమస్తాన్ అబ్రవీద్భూయో రామకార్యార్థసిద్ధయే ।
ఏవమేతద్విచేతవ్యం యన్మయా పరికీర్తితమ్ ॥ 1

వానరప్రభువైన సుగ్రీవుడు ఆవానరులను అందఱిని సమావేశపఱచి "శ్రీరామకార్యము (సీతాన్వేషణము) సఫలమగుటకై నేను విపులముగా తెల్పిన ప్రదేశములను అన్నింటిని వెదకుడు." అని పలికెను. (1)

తదుగ్రశాసనం భర్తుః విజ్ఞాయ హరిపుంగవాః ।
శలభా ఇవ సంఛాద్య మేదినీం సంప్రతస్థిరే ॥ 2

అంతట ఆవానరప్రముఖులు తమప్రభువుయొక్క తిరుగులేని శాసనమును తలదాల్చి, మిడుతలవలె భూమిని కప్పివేయుచు అచ్చటినుండి బయలుదేఱిరి.(2)

రామః ప్రస్రవణే తస్మిన్ న్యవసత్ సహలక్ష్మణః ।
ప్రతీక్షమాణ స్తం మాసం యః సీతాధిగమే కృతః ॥ 3

సీతాదేవిని అన్వేషించుటకై విధించిన నెలగడువును నిరీక్షించుచు శ్రీరాముడు లక్ష్మణసహితుడై ఆ ప్రస్రవణ గిరియందే నివసించుచుండెను. (3)

ఉత్తరాం తు దిశం రమ్యాం గిరిరాజసమావృతాం ।
ప్రతస్థే సహసా వీరో హరిః శతవలిస్తదా ॥ 4

గిరిరాజమైన హిమవత్పర్వతముతో మనోహరముగా ఒప్పుచున్న ఉత్తరదిశకు వానరవీరుడైన శతవలి తన అనుచరులతోగూడి వెంటనే బయలుదేఱెను. (4)

పూర్వాం దిశం ప్రతియయౌ వినతో హరియూథపః ॥ 5

తారాంగదాదిసహితః ప్లవగో మారుతాత్మజః ।
అగస్త్యచరితామ్ ఆశాం దక్షిణాం హరియూథపః ॥ 6

పశ్చిమాం తు భృశం ఘోరాం సుషేణః ప్లవగేశ్వరః ।
ప్రతస్థే హరిశార్దూలో దిశం వరుణపాలితామ్ ॥ 7

'వినతుడు' అను వానర నాయకుడు తనవారితోగూడి తూర్పుదిక్కునకు ప్రయాణమాయెను. తారుడు, అంగదుడు మొదలగు వారిని వెంటనిడుకొని, కపిశ్రేష్ఠుడైన మారుతి అగస్త్యమహాముని సంచరించిన దక్షిణ దిశకు వెడలెను. కపివరుడు, వానర నాయకుడు ఐన సుషేణుడు వరుణదేవుని పాలనలో ఉన్నదియు, మిక్కిలి దుర్గమమైనదియు అగు పడమరదిక్కునకు తనవారిని వెంటబెట్టుకొని అటనుండి కదలెను. (5-7)

తతః సర్వా దిశో రాజా చోదయిత్వా యథాతథం।
కపిసేనాపతీన్ ముఖ్యాన్ ముమోద సుఖితః సుఖమ్। 8

వానరరాజైన సుగ్రీవుడు ప్రముఖులైన వానరసేనాపతులను నలుదిక్కులకు యథావిధిగా పంపించి, సంతృప్తుడై హాయిగా ఉండెను. (8)

ఏవం సంబోధితాః సర్వే రాజ్ఞా వానరయూథపాః।
స్వాం స్వాం దిశమ్ అభిప్రేత్య త్వరితాః సంప్రతస్థిరే। 9

ఆయా వానరసేనానాయకులందఱును రాజాజ్ఞను శిరసావహించి, తమతమదిశలకు శీఘ్రముగా సాగిపోయిరి. (9)

ఆనయిష్యామహే సీతాం హనిష్యామశ్చ రావణం।
వదంతశ్చోన్నదంతశ్చ గర్జంతశ్చ ప్లవంగమాః।
క్ష్వేళంతో ధావమానాశ్చ వినదంతో మహాబలాః। 10

'రావణుని హతమార్చి సీతామాతను తీసికొనివచ్చెదము' అని పలుకుచు ఆ వానరులు సంతోషాతిశయముచే బిగ్గఱగా అఱచుచు, గర్జించుచు, తమనుతాము ప్రశంసించుకొనుచు, సింహనాదములను గావించుచు, వికృతముగా కేకలు వేయుచు ముందునకు సాగిరి. (10)

అహమేకో హనిష్యామి ప్రాప్తం రావణమాహవే।
తతశ్చోన్మథ్య సహసా హరిష్యే జనకాత్మజామ్। 11

'అదుష్టరావణుడు నా చేతికి దొరకినచో నేనొక్కడనే వానిని రణరంగమున నేలగూల్చెదను. పిమ్మట అతని సేనలను అన్నింటిని చీకాకు పఱచి, క్షణములో జానకీదేవినిగైకొని వచ్చెదను.' (11)

వేపమానాం శ్రమేణాద్య భవద్భిః స్థీయతామితి।
ఏక ఏవాఽఽహరిష్యామి పాతాళాదపి జానకీం। 12

'మీరందఱును ఇక్కడనే ఉండుడు. జానకీదేవి బిక్కుబిక్కుమనుచు పాతాళములో ఉన్నప్పటికిని నేను ఒక్కడనే అచటికివెళ్లి, ఎన్ని శ్రమలకు ఓర్చియైనను ఆ తల్లిని తీసికొనివచ్చెదను. (12)

విధమిష్యామ్యహం వృక్షాన్ పాతయిష్యామ్యహం గిరీన్।
ధరణీం దారయిష్యామి క్షోభయిష్యామి సాగరాన్। 13

అహం యోజన సంఖ్యాయాః ప్లవితా నాఽత్ర సంశయః।
శతం యోజనసంఖ్యాయాః శతం సమధికం హ్యహమ్। 14

భూతలే సాగరే వాపి శైలేషు చ వనేషు చ।
పాతాళస్యాపి వా మధ్యే న మమాచ్ఛిద్యతే గతిః। 15

'వృక్షములను పెకలించి వైచెదను. కొండలను పిండిచేసెదను, భూమిని బ్రద్దలు కావించెదను. సముద్రములను కల్లోలపఱచెదను, నేను ఎన్ని యోజనములఎత్తునకైనను నిస్సంశయముగా ఎగురగలను.' 'నేను వందలకొలది యోజనములు ఎగురగలను.' 'నేను వందకుమించి యెగురగలను.' 'భూమండలమున గాని, సముద్రమునగాని, పర్వతములయందుగాని, అరణ్యములలోగాని, పాతాళలోకమున గానీ, నన్ను ఆపగలవారు ఎవ్వరును ఉండరు.' (13-15)

ఇత్యేకైకం తదా తత్ర వానరా బలదర్పితాః।
ఊచుశ్చ వచనం తత్ర హరిరాజస్య సన్నిధౌ। 16

బలగర్వితులైన వానరులలో ఒక్కొక్కడు ఈ విధముగా సుగ్రీవుని యెదుట ప్రగల్భములు పలికిరి. (16)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే పంచచత్వారింశఃసర్గః (45)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదిఐదవసర్గము

-- * * * --

46. నలుబదిఆఱవసర్గము

'ఈ సమస్త భూమండలమునందలి వివిధ ప్రదేశములను గూర్చి నీకు ఎట్లు తెలియును?' అని శ్రీరాముడు సుగ్రీవుని ప్రశ్నించుట

- అప్పుడు అతడు తాను నలుదిక్కులయందును తిరిగి తిరిగి కడకు ఋశ్యమూకపర్వతమును చేరిన సంగతిని తెలుపుట -

గతేషు వానరేంద్రేషు రామః సుగ్రీవమబ్రవీత్।
కథం భవాన్ విజానీతే సర్వం వై మండలం భువః। 1

వానరప్రముఖులు అందఱును తమతమ బలములతో వెళ్లిన పిమ్మట శ్రీరాముడు 'ఈ సమస్తభూమండలమును గూర్చి మీకు ఎట్లు తెలియును?' అని సుగ్రీవుని ప్రశ్నించెను. (1)

సుగ్రీవస్తు తతో రామమ్ ఉవాచ ప్రణతాత్మవాన్।
శ్రూయతాం సర్వమాఖ్యాస్యే విస్తరేణ నరర్షభ। 2

యదా తు దుందుభిం నామ దానవం మహిషాకృతిం।
పరికాలయతే వాలీ మలయం ప్రతి పర్వతమ్।
తదా వివేశ మహిషో మలయస్య గుహాం ప్రతి। 3

వివేశ వాలీ తత్రాపి మలయం తజ్జిఘాంసయా। 4

తతోఽహం తత్ర నిక్షిప్తో గుహాద్వారి వినీతవత్।
న చ నిష్క్రమతే వాలీ తదా సంవత్సరే గతే। 5

తతః క్షతజవేగేన ఆపుపూరే తదా బిలమ్।
తదహం విస్మితో దృష్ట్వా భ్రాతృశోకవిషార్దితః। 6

అథాహం కృతబుద్ధిస్తు సువ్యక్తం నిహతో గురుః।
శిలా పర్వతసంకాశా బిలద్వారి మయావృతా।
అశక్నువన్నిష్క్రమితుం మహిషో వినశేదితి। 7

తతోఽహమాగాం కిష్కింధాం నిరాశస్తస్య జీవితే।
రాజ్యం చ సుమహత్ ప్రాప్తం తారయా రుమయా సహ।
మిత్రైశ్చ సహితస్తత్ర వసామి విగతజ్వరః। 8

ఆజగామ తతో వాలీ హత్వా తం దానవర్షభమ్। 9

తతోఽహమదదాం రాజ్యం గౌరవాద్భయయంత్రితః।
స మాం జిఘాంసుర్దుష్టాత్మా వాలీ ప్రవ్యథితేంద్రియః। 10

పరికాలయతే క్రోధాత్ ధావంతం సచివైస్సహ। 11

తతోఽహం వాలినా తేన సానుబంధః ప్రధావితః।
నదీశ్చ వివిధాః పశ్యన్ వనాని నగరాణి చ। 12

ఆదర్శతలసంకాశా తతో వై పృథివీ మయా।
అలాతచక్రప్రతిమా దృష్టా గోష్పదవత్ తదా। 13

పూర్వాం దిశం తతో గత్వా పశ్యామి వివిధాన్ ద్రుమాన్।
పర్వతాంశ్చ నదీ రమ్యాః సరాంసి వివిధాని చ। 14

పిమ్మట సుగ్రీవుడు శ్రీరామునకు నమస్కరించి, ఆ ప్రభువుతో ఇట్లనెను. "ఓ నరోత్తమా! దయతో వినుడు. అంతయును విపులముగా వివరింతును. మా అన్నయగు వాలి మహిషాకారములో ఉన్న 'దుందుభి' యను రాక్షసుని మలయగిరివైపు తఱిమికొట్టెను. అప్పుడు ఆ రాక్షసుడు మలయపర్వతగుహలో దూరెను. అంతట వాలియు అతనిని చంపదలచి, ఆ పర్వతగుహలో ప్రవేశించెను. (2-4)

అప్పుడు నేను మా అన్నమీది ప్రేమతో ఆ గుహాద్వారము కడనే వేచియుంటిని. ఇట్లు సంవత్సర కాలము గడచినను మా అన్నమాత్రము తిరిగిరాలేదు. అనంతరము వేగముగా ప్రవహించుచువచ్చిన రక్తముతో ఆ బిలమునిండిపోయెను. అందులకు నేను మిక్కిలి ఆశ్చర్యములో తట్టుకొనలేనంతగా భ్రాతృశోకమున మునిగితిని. (5-6)

అంతట నిజముగా 'మా అన్నయే ఆ దానవునిచేతిలో మరణించియుండును' - అని నేను భావించితిని. అప్పుడు 'బిలమును మూసివేసినచో ఆ మహిషుడు బయటికి రాలేక అందే మరణించుట జరుగును' - అని తలంచి, వెంటనే నేను కొండంతబండను దీసికొనవచ్చి, ఆగుహాద్వారమునకు అడ్డుపెట్టితిని. పిమ్మట నేను మా అన్న బ్రతుకుపై ఆశ వదులుకొని, కిష్కింధకు చేరితిని. వెనువెంటనే విశాలమైన ఈ రాజ్యమును రుమను, తారను చేపట్టితిని. నిర్భయముగా మిత్రులతో గూడి నివసింపసాగితిని. (7-8)

ఇంతలో, దుందుభిని చంపిన మా అన్న కిష్కింధకు రానేవచ్చెను. వాలిని చూచిన వెంటనే నేను భయముతో గజగజవణకుచు సగౌరవముగా రాజ్యాధికారమును ఆయనకు అప్పగించితిని. కాని మాఅన్నమాత్రము మనస్తాపమునకులోనై, క్రోధముతో ఉడికిపోవుచు నన్ను చంపుటకు సిద్ధపడెను. అప్పుడు మంత్రులతో నేను పాఱిపోసాగితిని. అతడు నావెంటబడెను. అట్లు వాలి నన్ను, నా మిత్రులను తఱుముచు వెంటాడెను. అప్పుడు నేను మిత్రులతోగూడి, పలు నదీతీరములను, వనములను, నగరములను గాంచుచు పిక్కబలము చూపసాగితిని. ఆసమయమున నాకు ఈభూమి అద్దములోనున్న[1] దానివలెను, అలాతచక్రము రీతిగను, ఆవుగిట్ట ప్రమాణముగను కన్పట్టెను. (9-13)

నేను మొదట తూర్పుదిశగా వెళ్లితిని. ఆదిక్కున పలు విధములైన వృక్షములను, కొండలను, రమ్యములైన నదీతీరములను, పెక్కుసరస్సులను కాంచితిని. ఇంకను

1) భూమండలము ఎంత విశాలమైనదైనను అద్దమున అది చిన్నదిగానే కనబడును. (కొండ అద్దమందు కొంచెమై యుండదా?) అలాతము = కొఱవి. కొఱవిని దీసికొని త్రిప్పునప్పుడు అది ఒక చక్రమువలె కనబడును. ఆవు పాదము చిన్నదిగదా! మిక్కిలి వేగముగా పఱుగుదీయుచున్న సుగ్రీవునకు ఈ భూమండలము అంతయు అద్దములోనున్న దానివలె, అలాతచక్రమువలె, గోష్పదమువలె చిన్నదిగా తోచెను.

ఉదయం తత్ర పశ్యామి పర్వతం ధాతుమండితం।
క్షీరోదం సాగరం చైవ నిత్యమ్ అప్సరసాలయమ్। 15

పరికాలయమానస్తు వాలినాఽభిద్రుతస్తదా।
పునరావృత్య సహసా ప్రస్థితోఽహం తదా విభో। 16

పున రావర్తమానస్తు వాలినాఽభిద్రుతో ద్రుతం।
దిశస్తస్యాస్తతో భూయః ప్రస్థితో దక్షిణాం దిశం।
వింధ్యపాదపసంకీర్ణాం చందనద్రుమభూషితామ్। 17

ద్రుమశైలాం స్తతః పశ్యన్ భూయో దక్షిణతోఽపరాన్।
పశ్చిమాం తు దిశం ప్రాప్తో వాలినా సమభిద్రుతః। 18

సంపశ్యన్ వివిధాన్ దేశాన్ అస్తం చ గిరిసత్తమమ్। 19

ప్రాప్య చాస్తం గిరిశ్రేష్ఠమ్ ఉత్తరాం సంప్రధావితః।
హిమవంతం చ మేరుం చ సముద్రం చ తథోత్తరమ్। 20

యదా న విందం శరణం వాలినా సమభిద్రుతః।
తదా మాం బుద్ధిసంపన్నో హనుమాన్ వాక్యమబ్రవీత్। 21

ఇదానీం మే స్మృతం రాజన్ యథా వాలీ హరీశ్వరః।
మతంగేన తదా శప్తో హ్యస్మిన్నాశ్రమమండలే। 22

ప్రవిశేద్యది వై వాలీ మూర్ధాస్య శతధా భవేత్।
తత్ర వాసః సుఖోఽస్మాకం నిరుద్విగ్నో భవిష్యతి। 23

తతః పర్వతమాసాద్య ఋశ్యమూకం నృపాత్మజ।
న వివేశ తదా వాలీ మతంగస్య భయాత్ తదా। 24

ఏవం మయా తదా రాజన్ ప్రత్యక్షమ్ ఉపలక్షితం।
పృథివీమండలం కృత్స్నం గుహామ్ అస్యాగత స్తతః। 25

అచట గైరికాది ధాతువులతోగూడిన ఉదయాద్రిని, నిత్యము అప్సరసలు విహరించెడి క్షీరసాగరమును చూచితిని. ఓ ప్రభూ! వాలి మమ్ములను వేగముతో వెంటాడుచుండగా ఆ తూర్పునుండి మఱలివచ్చి, వెంటనే మఱియొక దిశగా పరుగెత్తదొడంగితిని.(14-16)

వాలి తిరిగివచ్చి నన్ను వెంటబడితఱుముగా నేను ఆ దిశనుండి దక్షిణదిశగా పరుగులు దీసితిని. అది దట్టముగా వృక్షములుగల వింధ్యపర్వతముతోడను, చక్కని చందన వృక్షములతోడను విలసిల్లుచుండెను. ఆదక్షిణదిశయందు ఇంకను దట్టముగా వృక్షములుగల పెక్కు పర్వతములను కాంచితిని. అచ్చటను వాలి నన్ను వెంటాడుచుండుటచే ఆ దక్షిణదిశనుండి నేను పశ్చిమదిశకు చేరితిని. ఆ దిక్కున వివిధములగు దేశములను, గిరిశ్రేష్ఠమైన అస్తాద్రిని చూచితిని. (17-19)

ఆపడమరదిశయందును విడిచిపెట్టక వాలినన్ను వెంటాడుచుండుటచే అతని ధాటికి తట్టుకొనలేక ఉత్తర దిశకు పరుగెత్తితిని. ఆదిక్కున హిమవత్పర్వతమును, మేరుగిరిని, లవణసముద్రమును గాంచితిని. (20)

ఆ విధముగా వాలి నన్ను తఱుముచుండగా నాకు ఎచ్చటను రక్షణ లభింపకపోయెను. (తలదాచుకొనుటకు భద్రమైన ప్రదేశముగాని, ఆదుకొను పుణ్యాత్ములు గాని లభింపరైరి.) అప్పుడు ప్రజ్ఞాశాలియైన హనుమంతుడు నాతో ఇట్లు నుడివెను. (21)

"ఓ రాజా ఇప్పుడు నాకు జ్ఞప్తికి వచ్చినది. "వానర ప్రభునైన వాలి ఈ ఆశ్రమ ప్రదేశమున ప్రవేశించినచో అతని శిరస్సు నూఱు వ్రక్కలగును." అని మతంగమహాముని శపించియుండెను. కనుక అతడు అచ్చటికి రాడు. కావున ఆ ఆశ్రమమునందు ఎట్టి భయములేకుండ హాయిగా నివసింపవచ్చును." (22-23)

కనుక ఓ రాజకుమారా! అప్పుడు నేను నా మంత్రులతో గూడి ఋశ్యమూకపర్వతమును ఆశ్రయించితిని. మతంగ మహాముని శాపమునకు భయపడి వాలి అచటికి రాలేదు. ఓ ప్రభూ! ఈ విధముగానేను సమస్త భూమండలమును ప్రత్యక్షముగా చూచుట సంభవించెను. పిమ్మట ఈ ఋశ్యమూక పర్వతగుహకు చేరితిని." (24-25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే షట్చత్వారింశస్సర్గః (46)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదిఆఱవ సర్గము

-- ❋ ❋ ❋ --

47. నలుబదిఏడవసర్గము

ఒక్క దక్షిణ దిశకు వెళ్లిన వారు తప్ప తక్కిన దిక్కులకు వెళ్లిన వానరులందఱును 'అంతటను గాలించియు' సీతాదేవిని గానక, నెలరోజుల గడువు ముగియునాటికి మఱలి వచ్చి సుగ్రీవుని చేరుట -

దర్శనార్థం తు వైదేహ్యాః సర్వతః కపియూథపాః।
వ్యాదిష్టాః కపిరాజేన యథోక్తం జగ్మురంజసా। 1

సరాంసి సరితః కక్షాన్ ఆకాశం నగరాణి చ।
నదీదుర్గాం స్తథా శైలాన్ విచిన్వంతి సమంతతః। 2

సుగ్రీవేణ సమాఖ్యాతాః సర్వే వానరయూథపాః।
ప్రదేశాన్ ప్రవిచిన్వంతి సశైలవనకాననాన్। 3

విచిత్య దివసం సర్వే సీతాధిగమనే ధృతాః।
సమాయాంతి స్మ మేదిన్యాం నిశాకాలేషు వానరాః। 4

సర్వర్తుకామాన్ దేశేషు వానరాః సఫలాన్ ద్రుమాన్।
ఆసాద్య రజనీం శయ్యాం చక్రుః సర్వేష్వహస్సు తే। 5

తదహః ప్రథమం కృత్వా మాసే ప్రస్రవణం గతాః।
కపిరాజేన సంగమ్య నిరాశాః కపియూథపాః। 6

విచిత్య తు దిశం పూర్వాం యథోక్తాం సచివైస్సహ।
అదృష్ట్వా వినతః సీతామ్ ఆజగామ మహాబలః। 7

ఉత్తరాం చ దిశం సర్వాం విచిత్య స మహాకపిః।
ఆగతః సహ సైన్యేన వీరః శతవలిస్తదా। 8

సుషేణః పశ్చిమామ్ ఆశాం విచిత్య సహ వానరైః।
సమేత్య మాసే సంపూర్ణే సుగ్రీవమ్ ఉపచక్రమే। 9

తం ప్రస్రవణపృష్ఠస్థం సమాసాద్యాఽభివాద్య చ।
ఆసీనం సహ రామేణ సుగ్రీవమ్ ఇదమబ్రువన్। 10

విచితాః పర్వతాః సర్వే వనాని గహనాని చ।
నిమ్నగాః సాగరాంతాశ్చ సర్వే జనపదాశ్చ యే। 11

వానరయూథములన్నియును సీతాదేవిజాడను కనుగొనుటకై సుగ్రీవునిఆదేశానుసారము వెంటనే ఆయాదేశములకు వెళ్ళెను. వారు సరస్సులను, నదీతీరములను, లతాగృహములను, చెట్టుచేమలులేని ప్రదేశములను, నదులు అడ్డుగానుండుట వలన సులభముగా వెళ్లరాని ప్రదేశములను, అట్లే కొండలను కోనలను అంతటను ఆ తల్లి ఆచూకీకై వెదకిరి. సుగ్రీవుని ఆజ్ఞను తలదాల్చి, ఆ వానరప్రముఖులు అందఱును పర్వతములను దట్టమైన అడవులను నిశితముగా గాలించిరి. (1-3)

వారు ఎల్లరును పగలంతయును సీతను వెదకుటయందే నిమగ్నులై రాత్రివేళలో నియమితప్రదేశమునకు చేరుచుండిరి. వారు అన్నిఋతువులలోను, ఫలించెడి చెట్లను ఆశ్రయించి, ఆపండ్లతో తమఆకలిని తీర్చుకొనుచుండిరి. ఆ నెల రోజులలోను పగటివేళలో ఆకలి మాటను విస్మరించి, సీతామాతకై వెదకుచు, రాత్రిసమయములలో ఫలములను భుజించి విశ్రమించుచుండిరి. (4-5)

వారు బయలుదేఱిన నాటినుండి ఒక మాసము దినములు సీతాదేవికొఱకై వెదకి, ఆమెజాడను గానక నిరాశతో ప్రస్రవణగిరికి (మాల్యవంతపర్వతమునకు) మఱలివచ్చి, కపిరాజైన సుగ్రీవుని కలిసిరి. (దక్షిణదిశకు వెళ్లిన హనుమదాదులు మాత్రము రాలేదు.) (6)

సుగ్రీవుని ఆదేశమును అందుకొని, అనుచరులతోగూడి తూర్పుదిక్కునకు వెళ్లిన మహాబలశాలియగు వినతుడు సీతాదేవికొఱకై ఎంతయు వెదకి ఆమెనుగానక మఱలివచ్చెను. 'శతవలి'యను మహాకపివీరుడు తనబలములతో ఉత్తరదిశయందు అంతటను బాగుగా గాలించి, రిక్తహస్తములతో తిరిగి వచ్చెను. 'సుషేణుడు' అను వానర ప్రముఖుడు తన మిత్రులతో గూడి గడువు ముగియు వఱకును పశ్చిమ దిక్కున నలుమూలలలోను ఆ తల్లికై అన్వేషించి, నిరాశతో సుగ్రీవుని సన్నిధికి చేరెను. (7-9)

వారందఱును ప్రస్రవణగిరిపై శ్రీరామునితోగూడి ఆసీనుడైయున్న సుగ్రీవుని కడకు చేరి, ఆయనకు నమస్కరించి ఇట్లు నివేదించిరి. (10)

"ఓ వానరరాజా! మీరు ఆదేశించిన రీతిగా సమస్త పర్వతములను, వనములను, కీకారణ్యములను, నదీతీరములను, సముద్రతటములను, జనపదములను, ఆతల్లిజాడకై బాగుగా అన్వేషించితిమి. ఇంకను మీ సూచనమేరకు సకలగుహలను, అందు అంతటను బాగుగా తీగెలల్లుకొనిన

గుహాశ్చ విచితాః సర్వాః త్వయా యాః పరికీర్తితాః ।
విచితాశ్చ మహాగుల్మా లతావితతసంతతాః ॥ 12

గహనేషు చ దేశేషు దుర్గేషు విషమేషు చ ।
సత్త్వాన్యతిప్రమాణాని విచితాని హతాని చ ॥ 13

ఉదారసత్త్వాభిజనో మహాత్మా
స మైథిలీం ద్రక్ష్యతి వానరేంద్రః ।
దిశం తు యామేవ గతా తు సీతా
తామాస్థితో వాయుసుతో హనూమాన్ ॥ 14

వివిధములగు పొదరిండ్లను, ఎంతయు వెదకితిమి. సాధారణముగా ప్రవేశించుటకు అసాధ్యములైన పలు విధములైన ద్వీపములయందును, పెక్కుదేశములయందును, నిట్టవల్లములతో ఒప్పుచు కాలుమోపుటకే అసాధ్యముగానున్న దుర్గములయందును ప్రత్యంగుళముగా గాలించితిమి. భయంకరమైన ఆకారములుగల క్రూరజంతువులు అడ్డుతగిలినప్పుడు వాటిని హతమార్చితిమి. శ్రీరామచంద్రప్రభువు యొక్క కార్యమును సాధించుటకై మాసర్వశక్తులను ఒడ్డి ప్రయత్నించితిమి. కాని మాకృషి ఫలింపలేదు. (11-13)

ఓ మహారాజా! వాయుసుతుడైన హనుమంతుడు మహాశక్తిశాలి, కారణజన్ముడు. ఆ మహాత్ముడే సీతామాతజాడను తెలిసికొని రాగలడు. ఏలనన రావణుడు సీతాదేవిని అపహరించి తీసికొని వెళ్లిన దక్షిణదిశకే ఆ వానరోత్తముడు అంగదాదులతోగూడి వెళ్లినాడు." (14)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే సప్తచత్వారింశః సర్గః (47)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదియేడవసర్గము

-- * * * --

48. నలుబది ఎనిమిదవసర్గము

అంగదాదులు వింధ్యకు దక్షిణమునగల ప్రదేశములను అన్నింటిని సీతాదేవికై అన్వేషించుచు, కండు మహర్షి శాపముతో నిర్జనారణ్యముగా మారిన ప్రదేశములను గూడ గాలించుట - ఆ సందర్భమున అంగదుడు ఒక ఘోర రాక్షసుని నేలగూల్చుట

సహ తారాంగదాభ్యాం తు గత్వా స హనుమాన్ కపిః ।
సుగ్రీవేణ యథోద్దిష్టం తం దేశమ్ ఉపచక్రమే ॥ 1

స తు దూరమ్ ఉపాగమ్య సర్వైస్తైః కపిసత్తమైః ।
విచినోతి స్మ వింధ్యస్య గుహాశ్చ గహనాని చ ॥ 2

పర్వతాగ్రాన్ నదీదుర్గాన్ సరాంసి విపులాన్ ద్రుమాన్ ।
వృక్షషండాంశ్చ వివిధాన్ పర్వతాన్ ఘనపాదపాన్ ॥ 3

అన్వేషమాణాస్తే సర్వే వానరాః సర్వతో దిశం ।
న సీతాం దదృశుర్వీరా మైథిలీం జనకాత్మజామ్ ॥ 4

తే భక్షయంతో మూలాని ఫలాని వివిధాని చ ।
అన్వేషమాణా దుర్ధర్షా న్యవసం స్తత్ర తత్ర హ ॥ 5

తారుడు, అంగదుడు మున్నగువారితోగూడి వానర ప్రముఖుడైన హనుమంతుడు సుగ్రీవునిఆదేశానుసారము ఆయాదేశములకు బయలుదేరెను. ప్రముఖులైన వానరులందఱును వెంటరాగా మారుతి దూరప్రయాణమొనర్చి తిన్నగా వింధ్యకు చేరెను. అనంతరము వారు అచటి గుహలను, దట్టమైన అడవులను, వింధ్యపర్వతశిఖరములను, నదీతీరములను, దుర్గములను, సరస్సులను, విశాలమైన వృక్షములను, చెట్లతోపులను, ఇతరములగు పలుగిరులను, పెద్దపెద్ద వృక్షములను సీతాదేవికై గాలించిరి. (1-3)

పిమ్మట మిథిలానగరప్రభువగు జనకునియొక్క కూతురైన సీతాదేవిని అన్వేషించుచు, వీరులైన ఆవానరులందఱును ఆ ప్రదేశములయందు అంతటను తిరిగిరి. కాని వారికి ఆమెజాడమాత్రము తెలియకుండెను. (4)

ఇతరులకు ఎదిరింపశక్యముగాని ఆవానరులు ఆమెను వెదకునప్పుడు పలువిధములగు కందమూలఫలములను భక్షించుటద్వారా తమ ఆకలిని తీర్చుకొనుచు అక్కడక్కడ విశ్రమించిరి. (5)

స తు దేశో దురన్వేష్యో గుహాగహనవాన్ మహాన్।
నిర్జలం నిర్జనం శూన్యం గహనం రోమహర్షణం।
తాదృశాన్యప్యరణ్యాని విచిత్య భృశపీడితాః। 6

త్యక్త్వా తు తం తదా దేశం సర్వే వై హరియూథపాః।
దేశమన్యం దురాధర్షం వివిశుశ్చాకుతోభయాః। 7

వింధ్యపరిసరములలోగల ఒక ప్రదేశము చొరరాని గుహలతోడను, కీకారణ్యములతోడను నిండియుండెను. అచట నీరు దొరకదు, జనులులేరు, ప్రాణిశూన్యమైన ఆ అటవీప్రాంతము భయమును, గగుర్పాటును కలిగించునదైయుండెను. అట్టి దుర్గమప్రదేశములయందును వారు పెక్కుశ్రమలకోర్చి గాలించిరి. (6)

పిమ్మట ఆ వానరప్రముఖులు అందఱును ఆప్రదేశమును వీడి, మఱియొక దుర్గమప్రదేశమున నిర్భయులై ప్రవేశించిరి. (7)

యత్ర వంధ్యఫలా వృక్షా విపుష్పాః పర్ణవర్జితాః।
నిస్తోయాః సరితో యత్ర మూలం యత్ర సుదుర్లభం। 8

న సంతి మహిషా యత్ర న మృగా న చ హస్తినః।
శార్దూలాః పక్షిణో వాపి యే చాన్యే వనగోచరాః। 9

న యత్ర వృక్షా నౌషధ్యో న లతా నాఽపి వీరుధః।
స్నిగ్ధపత్రాః స్థలే యత్ర పద్మిన్యః ఫుల్లపంకజాః।
ప్రేక్షణీయాః సుగంధాశ్చ భ్రమరైశ్చాపి వర్జితాః। 10

వారు అడుగిడిన ఆ ప్రదేశమునందలి వృక్షములు పండ్లుగాని, పూవులుగాని, కడకు ఆకులుగాని లేక మోడువాఱియున్నవి. అచటి నదులలోని నీరు ఎండి పోయినది. కందమూలములు గూడ అచట లభింపవు. అచట అడవిదున్నలు, లేళ్లు, ఏనుగులు, పెద్దపులులు, పక్షులు మొదలగునవిగాని, తదితర వన్యమృగములుగాని గోచరింపవు. అక్కడ వృక్షములు, ఓషధులు, లతలు, పొదలు లేనే లేవు. ఆ ప్రదేశమునందు నవనవలాడు ఆకులు, వికసించిన పద్మములుగల సరస్సులు లేవు. అచట తుమ్మెదల రొదలుగాని, సువాసనలను వెదజల్లెడి పూవులు గాని లేవు. వేయేల? అక్కడ చూడదగిన దృశ్యములే లేవు. (8-10)

కండుర్నామ మహాభాగః సత్యవాదీ తపోధనః।
మహర్షిః పరమామర్షీ నియమైర్దుష్ప్రధర్షణః। 11

తస్య తస్మిన్ వనే పుత్త్రో బాలః షోడశవార్షికః।
ప్రణష్టో జీవితాంతాయ క్రుద్ధస్తత్ర మహామునిః। 12

తేన ధర్మాత్మనా శప్తం కృత్స్నం తత్ర మహద్వనం।
అశరణ్యం దురాధర్షం మృగపక్షివివర్జితమ్। 13

ఒకానొకప్పుడు మహానుభావుడైన కండుడు అను పేరుగల మహర్షి అచట ఉండెడివాడు ఆ మహాముని సత్యవాది. గొప్ప తపస్సంపన్నుడు, నియమనిష్ఠలుగల వారిలో మేటి. కాని ఆయన అంతులేని కోపము గలవాడు. పదునాఱు సంవత్సరముల వయస్సుగల ఆయన కుమారుడు ఆ వనమునందే మరణించెను. అందులకు ఆ మహాముని ఆ వనముపై మిక్కిలి క్రుద్ధుడై ఆ వననాశనమునకు కారకుడయ్యెను. ధర్మాత్ముడైన ఆకండుమహర్షి దానిని శపించెను. తత్ప్రభావమున పాడైపోయిన ఆవనమునుండి పశుపక్ష్యాదులు పాఱిపోయెను, ఎవ్వరును అచట తలదాచుకొనుటకు వీలులేకపోయెను, అంతట అది ప్రవేశించుటకు అనువుగాని ప్రదేశమాయెను. (11-13)

తస్య తే కాననాంతాశ్చ గిరీణాం కందరాణి చ।
ప్రభవాని నదీనాం చ విచిన్వంతి సమాహితాః। 14

తత్ర చాఽపి మహాత్మానో నాఽపశ్యన్ జనకాత్మజాం।
హర్తారం రావణం వాపి సుగ్రీవప్రియకారిణః। 15

ఆ ప్రదేశమునందలి అడవులను, గిరిగుహలను, నదీతీరములను ఆవానరులు సమష్టిగా గాలించిరి. సుగ్రీవునకు ప్రియమును గూర్చెడి ఆ వానరప్రముఖులు ఎంతగా వెదకినను జానకీదేవినిగాని, ఆమెను అపహరించిన రావణునిగాని వారికి కనబడలేదు. (14-15)

తే ప్రవిశ్యాశు తం భీమం లతాగుల్మసమావృతం।
దదృశుః క్రూరకర్మాణమ్ అసురం సురనిర్భయమ్। 16

వెంటనే వారు మఱియొకప్రదేశమున ప్రవేశించిరి. అది లతలతోడను, పొదలతోడను నిండి భయంకరముగా ఉండెను. అచట వారు దేవతలకు గూడ భయపడని

తం దృష్ట్వా వానరా ఘోరం స్థితం శైలమివాపరం।
గాఢం పరిహితాః సర్వే దృష్ట్వా తాన్ పర్వతోపమాన్। 17

సోఽపి తాన్ వానరాన్ సర్వాన్ నష్టాః స్థేత్యబ్రవీద్బలీ।
అభ్యధావత సంక్రుద్ధో ముష్టిముద్యమ్య సంహితమ్। 18

తమాపతంతం సహసా వాలిపుత్త్రోఽంగద స్తదా।
రావణోఽయ మితి జ్ఞాత్వా తలేనాభిజఘాన హ। 19

స వాలిపుత్త్రాభిహతో వక్త్రాచ్ఛోణితముద్వమన్।
అసురోఽభ్యపతద్భూమౌ పర్యస్త ఇవ పర్వతః। 20

తేఽపి తస్మిన్ నిరుచ్ఛ్వాసే వానరా జితకాశినః।
వ్యచిన్వన్ ప్రాయశస్తత్ర సర్వం తద్గిరిగహ్వరమ్। 21

విచితం తు తతః కృత్వా సర్వే తే కాననం పునః।
అన్యదేవాపరం ఘోరం వివిశుర్గిరిగహ్వరమ్। 22

తే విచిత్య పునః ఖిన్నా వినిష్పత్య సమాగతాః।
ఏకాంతే వృక్షమూలే తు నిషేదుర్దీనమానసాః। 23

క్రూరాత్ముడగు ఒక రాక్షసుని జూచిరి. మఱియొక కొండవలె నిలిచియున్న ఆ భీకరరాక్షసుని గాంచి, వారు వెంటనే నడుము బిగించిరి. ఆ అసురుడు అయా వానరులను అందఱిని కలయజూచి, "ఇక మీకు నా చేతిలో చావు తప్పదు." అని పలుకుచు ఆ బలశాలి క్రుద్ధుడై గట్టిగా పిడికిలి బిగించి, వారిమీదికి విజృంభించెను. (16-18)

అట్లు తనమీద విఱుచుకొని పడుచున్న ఆ రాక్షసుని గాంచి, వాలిసుతుడైన అంగదుడు 'వీడే రావణుడు' అని తలంచి, వానిని తన అఱచేతితో చఱచెను. (19-20)

వాలిసుతుడైన అంగదునిదెబ్బకు ఆ అసురుడు దిమ్మెరపోయి, నోటినుండి రక్తము గ్రక్కుచు ఒక పర్వతమువలె నేలగూలెను. అతడు మరణించిన పిదప ఆ వానరులు జయోత్సాహముతో ఆ గిరిగుహయందంతటను పూర్తిగా గాలించిరి. వారందఱును ఆ అడవిని పదే పదే వెదకినపిమ్మట మఱియొక భయంకరమైన పర్వతగుహలో ప్రవేశించిరి. (21-22)

వారు ఆగుహను బాగుగా అన్వేషించినను ఆ తల్లి జాడ దొరకకపోవుటచే ఖిన్నులై, బయటికి వచ్చి ఒక చెట్టు మొదట దీనమానసులై కూర్చుండిరి. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే అష్టచత్వారింశః సర్గః (48)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదిఎనిమిదవసర్గము

-- * * * --

49. నలుబదితొమ్మిదవసర్గము

హనుమదాదులు దక్షిణదిశయందు తీవ్రముగా సీతాన్వేషణను కొనసాగించుచుండగనే సుగ్రీవుడు విధించిన మాసము గడువు ముగియుట - ఐనను నిరుత్సాహపడక 'మనప్రయత్నమును విడువరాదు'-అని అంగదుడు సూచించుట - గంధమాదనుడు అంగదుని పలుకులను బలపఱచుట - పిమ్మట వారు కోద్రవనమునందును, రజతాద్రిపైనను, తదితర వనములను అన్వేషించి, అలసిపోయి కొంత విశ్రాంతి తీసికొని ముందునకు నడచుట -

అథాంగదస్తదా సర్వాన్ వానరాన్ ఇదమబ్రవీత్।
పరిశ్రాంతో మహాప్రాజ్ఞః సమాశ్వాస్య శనైర్వచః। 1

వనాని గిరయో నద్యో దుర్గాణి గహనాని చ।
దర్యో గిరిగుహాశ్చైవ విచితాని సమంతతః। 2

తత్ర తత్ర సహాస్మాభిః జానకీ న చ దృశ్యతే।
తద్వా రక్షోహృతా యేన సీతా సురసుతోపమా। 3

అంతట మిక్కిలి ప్రజ్ఞాశాలియైన అంగదుడు కొంత అలసటకు లోనైయున్నను ఆ వానరులందఱికిని ఊరట గూర్చుచు, వారితో తిన్నతిన్నగా ఇట్లు నుడివెను. (1)

"వానరులారా! మనము అందఱము ఒక్కుమ్మడిగా వనములను, పర్వతములను, నదీతీరములను, దుర్గములను, దట్టమైన అడవులను, కొండచఱియలను, గిరిగుహలను పూర్తిగా గాలించితిమి. ఎక్కడెక్కడ ఎంతగా వెదకినను జానకీదేవిమాత్రము మనకు కనబడలేదు. అంతేగాక దివ్యాంగనలతో సమానయగు సీతాదేవిని అపహరించుకొని పోయిన ఆ రాక్షసుడును కనబడలేదు. (2-3)

కాలశ్చ నో మహాన్ యాతః సుగ్రీవశ్చోగ్రశాసనః।
తస్మాద్భవంతః సహితా విచిన్వంతు సమంతతః। 4

మనకు సుగ్రీవుడు ఇచ్చిన గడువేమో మీఱిపోయినది. అతడైతే చండశాసనుడు. అందువలన మనమందఱము గలిసి అంతటను ఇంకను శ్రద్ధగా గాలింతము. (4)

విహాయ తంద్రీం శోకం చ నిద్రాం చైవ సముత్థితాం।
విచినుధ్వం యథా సీతాం పశ్యామో జనకాత్మజామ్। 5

మనలను ఆవరించిన ఈ కునికిపాట్లను, విచారమును మానివైచి, నిద్రావస్థనుండి బయటపడి, జనకుని కూతురైన సీతాదేవి కనబడునంతవఱకును గట్టిగా అన్వేషింతము. (5)

అనిర్వేదం చ దాక్ష్యం చ మనసశ్చాఽపరాజయః।
కార్యసిద్ధికరాణ్యాహుః తస్మాదేతత్ బ్రవీమ్యహమ్। 6

'విరక్తికి లోనుకాకుండుట, ధైర్యోత్సాహములను కలిగి యుండుట కార్యసిద్ధికి ముఖ్యలక్షణములు' అని అనుభవజ్ఞులు చెప్పుదురు. అందువలన మీతో నేను ఈ వచనములను పలుకుచుంటిని. (6)

అద్యాపి తద్వనం దుర్గం విచిన్వంతు వనౌకసః।
ఖేదం త్యక్త్వా పునః సర్వైః వనమేతద్విచీయతామ్। 7

అవశ్యం క్రియమాణస్య దృశ్యతే కర్మణః ఫలం।
అలం నిర్వేదమాగమ్య న హి నో మీలనం క్షమమ్। 8

నేడును మనమందఱము ఖేదమును వీడి, మఱియొకసారి ఈ వనమును గాలించుటకు పూనుకొన వలెను. ఈపర్యాయము ప్రత్యంగుళము జాగ్రత్తగా అన్వేషింతము. ఇంతవఱకును దిగులుపడుచు కూర్చున్నది ఇక చాలును. పూనికతో కృషిచేసినచో ఫలము తప్పక లభించును. నిరాశకులోనై ఎట్టి ప్రయత్నమూ చేయనిచో మనము కాలుగూడ కదపలేము. (7-8)

సుగ్రీవః కోపనో రాజా తీక్ష్ణదండశ్చ వానరః।
భేతవ్యం తస్య సతతం రామస్య చ మహాత్మనః। 9

హితార్థమ్ ఏతదుక్తం వః క్రియతాం యది రోచతే।
ఉచ్యతాం వా క్షమం యన్నః సర్వేషామేవ వానరాః। 10

సుగ్రీవుడు సహజముగనే కోపస్వభావముగలవాడు. పైగా ఆరాజు వేయు శిక్షయు మిక్కిలి తీవ్రముగా ఉండును. కనుక అతనియెడలను, మహాత్ముడైన శ్రీరామునివిషయమునను మనము ఎల్లప్పుడును భయభక్తులతో మెలగవలెను. మనఅందఱిహితము కొఱకే నేను ఇట్లు చెప్పుచుంటిని. మీకును రుచించినచో అట్లు చేయుదము. లేనిచో మనవానరులందఱికిని మేలుగూర్చెడి మఱియొక విధానము ఏదైనను మీకు స్ఫురించినచో దానిని తెల్పుడు." (9-10)

అంగదస్య వచః శ్రుత్వా వచనం గంధమాదనః।
ఉవాచాఽవ్యక్తయా వాచా పిపాసాశ్రమఖిన్నయా। 11

అంగదుడు ఇట్లు పలికిన పిమ్మట 'గంధమాదనుడు' అను వానరుడు దప్పికచే అలసియున్న కంఠముతో (మిక్కిలి ఆయాసపడుచు) అస్పష్టముగా ఇట్లు నుడివెను.(11)

సదృశం ఖలు వో వాక్యమ్ అంగదో యదువాచ హ।
హితం చైవానుకూలం చ క్రియతామ్ అస్య భాషితమ్। 12

పునర్మార్గామహై శైలాన్ కందరాంశ్చ దరీస్తథా।
కాననాని చ శూన్యాని గిరిప్రస్రవణాని చ। 13

యథోద్దిష్టాని సర్వాణి సుగ్రీవేణ మహాత్మనా।
విచిన్వంతు వనం సర్వే గిరిదుర్గాణి సర్వశః। 14

"అంగదుడు పలికిన వచనములు మన అందఱికి సమ్మతమేగదా! అతనిపలుకులు హితకరమైనవి, ఆచరణ సాధ్యములైనవి. కనుక అతడు చెప్పినట్లే చేయుదము. మహాత్ముడైన సుగ్రీవుడు తెల్పినరీతిగా ఇచట గల గిరులను, గుహలను, కొండచఱియలను, నదీతీరములను, అడవులను, శూన్యప్రదేశములను, సెలయేళ్లను, మనము మఱల వెదకుదము. అంతేగాక అందఱము సకల గిరిదుర్గములను, వనమునందంతటను పూర్తిగా గాలింతము. (12-14)

తతః సముత్థాయ పునః వానరాస్తే మహాబలాః।
వింధ్యకాననసంకీర్ణాం విచేరుర్దక్షిణాం దిశమ్। 15

వెంటనే మహాబలశాలులైన ఆ వానరులందఱును సర్వసన్నద్ధులై, దక్షిణదిశయందలి వింధ్యపర్వతపరిసరములలోగల అడవులు మొదలగు వానిని అన్నింటిని పూర్తిగా వెదకిరి. (15)

తే శారదాభ్రప్రతిమం శ్రీమద్రజతపర్వతం।
శృంగవంతం దరీమంతమ్ అధిరుహ్య చ వానరాః। 16

పిమ్మటవారు శరత్కాలమునందలి మేఘమువలె శోభిల్లుచున్న రజతపర్వతమును అధిరోహించిరి. అది ఎత్తైన శిఖరములతోడను, పెద్దపెద్ద గుహలతోడను విరాజిల్లుచుండెను. (16)

తత్ర లోధ్రవనం రమ్యం సప్తపర్ణవనాని చ।
వ్యచిన్వంస్తే హరివరాః సీతాదర్శనకాంక్షిణః। 17

తస్యాగ్రమ్ అధిరూఢా స్తే శ్రాంతా విపులవిక్రమాః।
న పశ్యంతి స్మ వైదేహీం రామస్య మహిషీం ప్రియామ్। 18

అచట సీతాదేవిదర్శనమునకై తహతహపడుచున్న ఆ వానరప్రముఖులు రమ్యమైన లోధ్రవనమును, ఏడాకుల అరటిచెట్లతోటలను అన్వేషించిరి. మిక్కిలి పరాక్రమశాలులైన ఆకపులు అడ్డంకులను అధిగమించుచు శ్రమతో ఆ రజతాద్రి పైభాగమునకు చేరి బాగుగా వెదకిరి. ఐనను వారికి శ్రీరామునకు ప్రాణతుల్యయైన వైదేహియొక్క జాడమాత్రము చిక్కకపోయెను. (17-18)

తేతు దృష్టిగతం కృత్వా తం శైలం బహుకందరం।
అవరోహంత హరయో వీక్షమాణాః సమంతతః। 19

అవరుహ్య తతో భూమిం శ్రాంతా విగతచేతసః।
స్థిత్వా ముహూర్తం తత్రాథ వృక్షమూలమ్ ఉపాశ్రితాః। 20

అక్కడనుండి అటునిటు చూచినప్పుడు వారి చూపులు ఆ కొండగుహలపైబడెను. వెంటనే ఆవానరులు క్రిందికి దిగి, వాటిని అన్నింటిని నిశితముగా గాలించిరి. భూమిమీదికి చేరి గుహలను గాలించుటతో, వారు మిక్కిలి అలసిపోయి, ఒడలు తెలియని స్థితికి చేరిరి. అందువలన వృక్షమూలములను ఆశ్రయించి, ఒక క్షణకాలము గడిపిరి. (19-20)

తే ముహూర్తం సమాశ్వస్తాః కించిద్భగ్నపరిశ్రమాః।
పున రేవోద్యతాః కృత్స్నాం మార్గితుం దక్షిణాం దిశమ్। 21

హనుమత్ప్రముఖా స్తే తు ప్రస్థితాః ప్లవగర్షభాః।
వింధ్యమేవాదితస్తావత్ విచేరుస్తే తతస్తతః। 22

ఒక ముహూర్తకాలము విశ్రాంతి తీసికొనుటవలన వారి బడలికలు కొంతవఱకు తొలగిపోయెను, ఊరట చేకూరెను. మఱల వారు ఆ దక్షిణదిశను పూర్తిగా వెదకుటకు సన్నద్ధులైరి. పిమ్మట వానరశ్రేష్ఠులైన హనుమంతుడు మొదలగు ఆ ప్రముఖులందఱును సీతాన్వేషణకై బయలుదేఱిరి. అప్పుడు వారు వింధ్య పర్వతమును మొదటినుండితుదివఱకు అన్ని మూలలయందును ప్రత్యంగుళము సావధానులై అన్వేషించిరి. (21-22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకోనపంచాశఃసర్గః (49)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది నలుబదితొమ్మిదవసర్గము

-- * * * --

50. ఏబదియవసర్గము

హనుమదాది వానరవీరులు ఆయా ప్రదేశములను వెదకుచు ఆకలి దప్పులకులోనై 'ఋక్షబిలము'నకు చేరుట - ఆ బిలమునందు పక్షులు రాకపోకలు సాగించుచుండుటను, పక్షుల ఱెక్కలు తడిసియుండుటను గమనించిన మారుతి 'ఇచట నీళ్లు లభ్యమగును' అని పేర్కొనుట - వారు అందఱును ఆ భయంకర గుహలో ప్రవేశించుట - అచట వారికి ఒక స్త్రీరత్నము కనబడుట -

సహ తారాంగదాభ్యాం తు సంగమ్య హనుమాన్ కపిః।
విచినోతి స్మ వింధ్యస్య గుహాశ్చ గహనాని చ। 1

సింహశార్దూలజుష్టేషు శిలాశ్చ సరితస్తథా।
విషమేషు నగేంద్రస్య మహాప్రస్రవణేషు చ। 2

వానరప్రముఖుడైన హనుమంతుడు తారునితో, అంగదునితోగూడి, వింధ్యపర్వతమునందలి గుహలను, దట్టమైన అడవులను గాలించెను. ఇంకను ఆ మహాత్ముడు సింహములు, పెద్దపులులు సంచరించెడి గుట్టలను, గుబురులను, నదీతీరములను, ఆ వింధ్యకు సంబంధించిన ఎగుడు దిగుడు నేలలను పెద్దపెద్ద సెలయేళ్లుగల ప్రదేశములను అన్వేషించెను. (1-2)

ఆసేదుస్తస్య శైలస్య కోటిం దక్షిణపశ్చిమాం।
తేషాం తత్రైవ వసతాం స కాలో వ్యత్యవర్తత। 3

సహి దేశో దురన్వేష్యో గుహాగహనవాన్ మహాన్। 4

పిమ్మట ఆ వానరులు వింధ్యగిరిపైభాగమునగల నైరృతిదిశకు చేరిరి. ఆ ప్రదేశమున వసించుచుండగా వారి కాలములో ఎక్కువ భాగము అక్కడనే గడచిపోయెను. పెద్దపెద్ద గుహలతోడను, దట్టమైన అరణ్యములతోడను నిండిన ఆదిశయందు వారు కాలుమోపుటకును అసాధ్యముగా ఉండెను. (3-4)

తత్ర వాయుసుతః సర్వం విచినోతి స్మ పర్వతమ్।
పరస్పరేణ హనుమాన్ అన్యోఽన్యస్యాఽవిదూరతః। 5

ఐనను ఆ ప్రదేశమున వారు సమైక్య భావముతో ఒకరికొకరుతోడుగా ప్రక్కప్రక్కననే నడచుచుండగా మారుతి ఆ పర్వతమును పూర్తిగా గాలించెను. (5)

గజో గవాక్షో గవయః శరభో గంధమాదనః।
మైందశ్చ ద్వివిదశ్చైవ సుషేణో జాంబవాన్ నలః।
అంగదో యువరాజశ్చ తారశ్చ వనగోచరః। 6

గిరిజాలావృతాన్ దేశాన్ మార్గిత్వా దక్షిణాం దిశం।
విచిన్వంతస్తతస్తత్ర దదృశుర్వివృతం బిలమ్। 7

గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, సుషేణుడు, జాంబవంతుడు, నలుడు, యువరాజైన అంగదుడు, తారుడు మున్నగు వానరులు ఆదక్షిణదిశయందు కొండలతో నిండిన ఆయా ప్రదేశములను వెదకుచుండగా అక్కడ వారికి తెఱువబడియున్న ఒక బిలము (గుహ) కనబడెను. (6-7)

దుర్గమ్ ఋక్షబిలం నామ దానవేనాభిరక్షితం।
క్షుత్పిపాసాపరీతాశ్చ శ్రాంతాశ్చ సలిలార్థినః।
అవకీర్ణం లతావృక్షైః దదృశుస్తే మహాబిలమ్। 8

తతః క్రౌంచాశ్చ హంసాశ్చ సారసాశ్చాపి నిష్క్రమన్।
జలార్ద్రాశ్చక్రవాకాశ్చ రక్తాంగాః పద్మరేణుభిః। 9

ఆ దుర్గముపేరు 'ఋక్ష బిలము'. అది ఒక దానవుని అధీనములో గలదు. అక్కడకు చేరిన ఆ హనుమదాదులు మిక్కిలి అలసిపోయిరి. ఆకలిదప్పులకు లోనైయుండిరి. కనీసము దాహముతీర్చుకొనుటకై మంచి నీరైనను దొరికిన బాగుండునని తపనపడుచుండిరి. బాగుగా పరికించి చూచిన పిమ్మట 'ఆ మహా బిలము లతావృక్షములతో కప్పబడియున్నట్లు వారు గమనించిరి. ఆ గుహాలోపలి నుండి క్రౌంచపక్షులు, హంసలు, బెగ్గురుపక్షులు, చక్రవాకములు బయటికి వచ్చుచుండెను. ఆ పక్షులు నీటితో తడిసియుండెను, పద్మములరేణువులు అంటుకొని యుండుటచే అవి ఎఱ్ఱగా కనబడుచుండెను. (8-9)

తతస్తద్బిలమాసాద్య సుగంధి దురతిక్రమం।
విస్మయవ్యగ్రమనసో బభూవుర్వానరర్షభాః। 10

సంజాతపరిశంకాస్తే తద్బిలం ప్లవగోత్తమాః।
అభ్యపద్యన్త సంహృష్టాః తేజోవంతో మహాబలాః। 11

నానాసత్త్వసమాకీర్ణం దైత్యేంద్రనిలయోపమం।
దుర్దర్శమ్ అతిఘోరం చ దుర్విగాహం చ సర్వశః। 12

తతః పర్వతకూటాభో హనుమాన్ పవనాత్మజః।
అబ్రవీద్వానరాన్ సర్వాన్ కాంతారవనకోవిదః। 13

గిరిజాలావృతాన్ దేశాన్ మార్గిత్వా దక్షిణాం దిశం।
వయం సర్వే పరిశ్రాంతా న చ పశ్యామ మైథిలీమ్। 14

అస్మాచ్చాపి బిలాద్ధంసాః క్రౌంచాశ్చ సహ సారసైః।
జలార్ద్రాశ్చక్రవాకాశ్చ నిష్పతంతి స్మ సర్వతః। 15

నూనం సలిలవానత్ర కూపో వా యది వా హ్రదః।
తథా చేమే బిలద్వారే స్నిగ్ధాస్తిష్ఠంతి పాదపాః। 16

ఇత్యుక్త్వా తద్బిలం సర్వే వివిశుస్తిమిరావృతం।
అచంద్రసూర్యం హరయో దదృశూ రోమహర్షణమ్। 17

నిశామ్య తస్మాత్ సింహాంశ్చ తాం స్తాంశ్చ మృగపక్షిణః।
ప్రవిష్టా హరిశార్దూలా బిలం తిమిరసంవృతమ్। 18

న తేషాం సజ్జతే చక్షుః న తేజో న పరాక్రమః।
వాయోరివ గతిస్తేషాం దృష్టిస్తమసి వర్తతే। 19

పిమ్మట ఆ వానరోత్తములు బిలము కడకు చేరిరి. ఆ బిలమునుండి సువాసనలు వచ్చుచుండెను. వారికి అందు ప్రవేశించుట అసాధ్యముగా తోచెను. ఆ స్థితిని జూచి, వారు ఆశ్చర్యచకితులైరి. చక్కని తేజస్సులు గలవారు, మిక్కిలి బలశాలులు ఐన ఆ వానరప్రముఖులు అచటికి చేరిన పిమ్మట దానిని బాగుగా పరికించి చూచిరి. అప్పుడు వారికి 'ఇది పాతాళగుహయా?, లేక రావణుని మాయామందిరమా?', అను శంకలు గలిగెను. పక్షులు తడిసియుండుటనుబట్టియు, వాటిరాకపోకలను బట్టియు అందు జలములు ఉండునని ఊహించిరి. అచటి ప్రతికూలపరిస్థితులకు వారు ఎంతయు నీరసపడిరి. (10-11)

'ఈ బిలము పలువిధములగు ప్రాణులకు ఆవాసమైయున్నది. ఇది చూచుటకు భయంకరమై ఒక మహా రాక్షసునియొక్క భవనమును పోలియున్నది, లోపలికి పోవుటయు కష్టసాధ్యమే.' అని వారందఱును తలపోసిరి. పర్వతశిఖరమువలె మహోన్నతుడు, ఎట్టి దుర్గమారణ్యములయందైనను సంచరించుటలో నిపుణుడు, ఐన ఆ మారుతి ఆ వానరులందఱితో ఇట్లు నుడివెను.(12-13)

"పర్వతపంక్తులతో నిండిన ఈ దక్షిణదిశయందలి ప్రదేశములను అన్నింటిని వెదకివెదకి మనము అందఱము ఎంతయు అలసిపోయితిమి. ఐనను సీతాదేవిజాడ తెలియలేదు. (14)

ఈ బిలమునుండి హంసలు, క్రౌంచపక్షులు, బెగ్గురుపక్షులు చక్రవాకములు తడిసిన రెక్కలతో అన్ని వైపులనుండియు బయటికి వచ్చినవి. పైగా ఈ బిలద్వారమునొద్దగల వృక్షములన్నియును పచ్చని ఆకులతో కలకలలాడుచున్నవి. కావున ఇచట చక్కని జలములతోనిండిన బావిగాని, మడుగుగాని తప్పక ఉండి తీరును." (15-16)

హనుమంతుడు ఇట్లు పలికినపిమ్మట ఆవానరులు అందఱును ఆ బిలమున ప్రవేశించిరి. సూర్యచంద్రుల కిరణములు సోకని కారణముగా అచట చిమ్మచీకట్లు ఆవరించియుండెను. దానిని చూడగనే వారికి గగుర్పాటు కలిగెను. ఆ కపిప్రముఖులు ఆ చీకటి గుహలోనికి ప్రవేశించుచుండగా దానిలోపలినుండి సింహములు, వివిధములగు మృగములు, పక్షులు బయటికి వచ్చుచుండుటను గమనించిరి. వారు వాయువేగముతో లోనికి చకచక వెళ్లుచుండిరి, చీకటియందును వారు చూడగలుగుచుండిరి. వెలుగునందువలె అతిమిరమునందును వారిశక్తిసామర్థ్యములకు అడ్డులేకుండెను. వారిదృష్టి విశిష్టమైనదగుటచే వారు సహజముగనే అంతటను పరికింపగలుగుచుండిరి. (17-19)

తే ప్రవిష్టాస్తు వేగేన తద్బిలం కపికుంజరాః।
ప్రకాశమ్ అభిరామం చ దదృశుర్దేశముత్తమమ్। 20

తతస్తస్మిన్ బిలే దుర్గే నానాపాదపసంకులే।
అన్యోఽన్యం సంపరిష్వజ్య జగ్ముర్యోజనమంతరమ్। 21

తే నష్టసంజ్ఞాస్తృషితాః సంభ్రాంతాః సలిలార్థినః।
పరిపేతుర్బిలే తస్మిన్ కంచిత్ కాలమ్ అతంద్రితాః। 22

తే కృశా దీనవదనాః పరిశ్రాంతాః ప్లవంగమాః।
ఆలోకం దదృశుర్వీరా నిరాశా జీవితే తదా। 23

తతస్తం దేశమాగమ్య సౌమ్యం వితిమిరం వనం।
దదృశుః కాంచనాన్ వృక్షాన్ దీప్తవైశ్వానరప్రభాన్। 24

సాలాం స్తాలాంశ్చ పున్నాగాన్ కకుభాన్ వంజులాన్ ధవాన్।
చంపకాన్ నాగవృక్షాంశ్చ కర్ణికారాంశ్చ పుష్పితాన్। 25

స్తబకైః కాంచనైశ్చిత్రైః రక్తైః కిసలయైస్తథా।
ఆపీడైశ్చ లతాభిశ్చ హేమాభరణభూషితాన్। 26

తరుణాదిత్యసంకాశాన్ వైడూర్యకృతవేదికాన్।
విభ్రాజమానాన్ వపుషా పాదపాంశ్చ హిరణ్మయాన్। 27

నీలవైడూర్యవర్ణాశ్చ పద్మినీః పతగావృతాః।
మహద్భిః కాంచనైః పద్మైః వృతా బాలార్కసన్నిభైః। 28

జాతరూపమయైర్మత్స్యైః మహద్భిశ్చ సకచ్ఛపైః।
నలినీస్తత్ర దదృశుః ప్రసన్నసలిలావృతాః। 29

కాంచనాని విమానాని రాజతాని తథైవ చ।
తపనీయగవాక్షాణి ముక్తాజాలావృతాని చ। 30

హైమరాజతభౌమాని వైడూర్యమణిమంతి చ।
దదృశు స్తత్ర హరయో గృహముఖ్యాని సర్వశః। 31

ఆ వానరోత్తములు వేగముతో పూర్తిగా ఆ గుహలోనికిచేరిరి. ఆ ప్రదేశమంతయు వెలుతురుతో నిండియుండెను. అది మిగుల మనోహరముగా ఉండెను. (20)

ఆ బిలమునందు పలువిధములగు చెట్లు దట్టముగా అలముకొనియుండుటచే అది చొరరానిదై యుండెను. అందువలన వారు పరస్పరము తమ చేతులను ఊతగాగొని, తిన్నగా ఒక యోజనముదూరము ముందునకు వెళ్లిరి. (21)

దప్పిగొనియుండుటవలన వారిలో చురుకుదనము తగ్గియుండెను. ఐనను దాహము తీర్చుకొనుటకై తహతహపడుచు అలసత్వమునకు తావీయక కొంత తడవు వేగముగా ముందునకుసాగిరి. ఆ వానర వీరులు మిక్కిలి అలసిపోయి ఆకలిదప్పులచే కృశించియుండిరి. వారు తమ జీవితములపై ఆశవదలుకొని దీనవదనులై యుండిరి. అట్టి స్థితిలో వారికి ఒక వెలుగు కన్పట్టెను. (22-23)

వారు ఆ ప్రదేశమునకు రాగానే వారికి ప్రశాంతమైన ఒక వనము కనబడెను. అది వెలుతురుతో నిండియుండెను. అందలి వృక్షములు అగ్నిజ్వాలలవలె వెలుగొందుచు, బంగారుకాంతులీనుచుండెను. అచట మద్దీ, తాళ, పున్నాగములు, ఏఱుమద్దిచెట్లు, అశోకములు, ధవవృక్షములు, చంపకములు, నాగవృక్షములు, గన్నేరుచెట్లు మున్నగునవి బాగుగా పుష్పించియుండెను. చిత్రములైన బంగారువన్నెగల పూలగుత్తులు, ఎఱ్ఱని చిగురుటాకులు అల్లుకొనియున్న లతలు అచటి చెట్లకు ఆభరణములుగా విలసిల్లుచుండెను. అవి ఉదయసూర్య కాంతులతో మెఱయుచుండెను. వాటి వేదికలపై వైడూర్యమణులు పొదగబడి యుండెను. ఆ వృక్షముల కాండములు రజతకాంతులతో తళతళలాడుచుండెను.(24-27)

అక్కడి సరస్సులు నీలవైడూర్యమణుల వన్నెలతో విలసిల్లుచు పలువిధములగు పక్షులకు నిలయములై యుండెను. బాలభానునికాంతులతో, చక్కని కేసరములతో ఒప్పుచున్న అచటి పద్మములు మనోజ్ఞముగా ఉండెను. ఆ సరస్సులయందలి నిర్మలజలములలో బంగారుకాంతులీను మత్స్యములు, అద్భుతములైన తాబేళ్లు సంచరించుచు కనువిందుగావించుచుండెను. అట్టి అందమైన సరస్సులను ఆవానర ప్రముఖులు బాగుగా తిలకించిరి. (28-29)

పిమ్మటవారికి ప్రముఖములైన భవనములు కన్పట్టెను. వాటిశిఖరములు బంగారముతోను, వెండితోను నిర్మితములై యుండెను. ఆ గృహములకిటికీలు సువర్ణమయములై, ముత్యాల జాలములతో విలసిల్లుచుండెను. వాటి నేలలన్నియును వెండి బంగారములతో నిర్మింపబడి, వైడూర్యమణులచే పొదుగబడియుండెను. (30-31)

పుష్పితాన్ ఫలినో వృక్షాన్ ప్రవాళమణిసన్నిభాన్।
కాంచనభ్రమరాం శ్చైవ మధూని చ సమంతతః। 32

అచటి వృక్షములపూవులు పగడములవన్నెలను, పండ్లు మణులకాంతులను విరజిమ్ముచుండెను. తుమ్మెదలు నిగనిగలాడుచు మకరందములను గ్రోలుటకై వాటిమీద వాలియుండెను. (32)

మణికాంచనచిత్రాణి శయనాన్యాసనాని చ।
మహార్హాణి చ యానాని దదృశుస్తే సమంతతః। 33

హైమరాజతకాంస్యానాం భాజనానాం చ సంచయాన్।
అగరూణాం చ దివ్యానాం చందనానాం చ సంచయాన్। 34

శుచీన్యభ్యవహార్యాణి మూలాని చ ఫలాని చ।
మహార్హాణి చ పానాని మధూని రసవంతి చ। 35

దివ్యానామ్ అంబరాణాం చ మహార్హాణాం చ సంచయాన్।
కంబలానాం చ చిత్రాణామ్ అజినానాం చ సంచయాన్। 36

తత్ర తత్ర చ విన్యస్తాన్ దీప్తాన్ వైశ్వానరప్రభాన్।
దదృశుర్వానరాః శుభ్రాన్ జాతరూపస్య సంచయాన్। 37

ఆ భవనములయందు అంతటనుగల తల్పములు, ఆసనములు బంగారముతో, మణులతో నిర్మితములై చిత్రవిచిత్రములుగా ఉండెను. అచటి వాహనములు అమూల్యములు, అచటి బంగారు, వెండి, కంచు పాత్రలు అన్నియును అపూర్వములు, అగరు, చందనపరిమళములు దివ్యములు, కందమూలఫలాది- ఆహార పదార్థములు అన్నియును మధురములు, అచటి పానీయములును, తేనెలును మిగుల రుచికరములు, శ్రేష్ఠములు. అచట కనబడుచున్న వస్త్రములు దివ్యములు, అమూల్యములు. కంబళములు, మృగ చర్మములు చిత్ర విచిత్రములు. అక్కడ ఉంచబడిన దీపములు అగ్నికాంతులను ప్రసరింపజేయుచుండెను. నిగ్గుదేలిన అచటి మేలిమి బంగారురాసులు ఆ ప్రదేశమునకే వన్నెదెచ్చు చుండెను. ఈ దృశ్యములు అన్నియును ఆ వానరులకు సంతోషమును గూర్చెను. (33-37)

తత్ర తత్ర విచిన్వంతో బిలే తస్మిన్ మహాబలాః।
దదృశు ర్వానరాః శూరాః స్త్రియం కాంచిదదూరతః। 38

తాం దృష్ట్వా భృశసంత్రస్తాః చీరకృష్ణాజినాంబరాం।
తాపసీం నియతాహారాం జ్వలంతీమివ తేజసా। 39

విస్మితా హరయస్తత్ర వ్యవాతిష్ఠంత సర్వశః।
పప్రచ్ఛ హనుమాం స్తత్ర కాఽసి త్వం కస్య వా బిలమ్। 40

మిగుల బలశాలులైన ఆ వానరవీరులు ఆ గుహయందు పలుప్రదేశములను వెదకిన పిమ్మట సమీపముననేయున్న ఒక స్త్రీని చూచిరి. ఆమె కృష్ణాజినమును వస్త్రముగా ధరించియుండెను, ఆహార నియమములను పాటించుచుండుటచే ఆతాపసి తేజోరాశిగా విలసిల్లుచుండెను. ఆదివ్యస్త్రీని జూచి ఆవానరులు సంభ్రమాశ్చర్యములకు లోనై, దూరముననే ఉండిపోయిరి. అప్పుడు హనుమంతుడు "అమ్మా! నీవెవరు? ఈ గుహ ఎవరిది?" - అని ఆమెను అడిగెను. (38-40)

తతో హనూమాన్ గిరిసన్నికాశః
కృతాంజలిస్తామ్ అభివాద్య వృద్ధాం।
పప్రచ్ఛ కా త్వం భవనం బిలం చ
రత్నాని హేమాని వదస్వ కస్య। 41

పర్వతాకారుడైన హనుమంతుడు అంజలి ఘటించి, వృద్ధురాలైన ఆతాపసికి ప్రణమిల్లి, ఇట్లు అర్థించెను. "మాతా! ఎవరమ్మా నీవు? ఈ భవనము, గుహ, ఈ బంగారురత్నాలరాసులు ఎవరివి? దయతో తెల్పుము." (41)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే పంచాశఃసర్గః (50)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది యేబదియవసర్గము

-- * * * --

51. ఏబదిఒకటవసర్గము

హనుమంతుని ప్రశ్నకు సమాధానముగా 'ఈ భవనమును నిర్మించిన వాడు మయుడు. బ్రహ్మదేవుడు ఈ భవనమును 'హేమ' అను అప్సరసకు బహూకరించెను. ఆమె దీని రక్షణ బాధ్యతను నాకు అప్పగించినది' అని 'స్వయం ప్రభ' - అను తాపసి పలుకుట -' ఇచటి ఫలములను భుజించి, మీ రాకకు గల కారణములను తెల్పుడు అని ఆమె వారిని అడుగుట -

ఇత్యుక్త్వా హనుమాంస్తత్ర పునః కృష్ణాజినాంబరాం।
అబ్రవీత్ తాం మహాభాగాం తాపసీం ధర్మచారిణీమ్। 1

ఇదం ప్రవిష్టాః సహసా బిలం తిమిరసంవృతం।
క్షుత్పిపాసాపరిశ్రాంతాః పరిఖిన్నాశ్చ సర్వశః। 2

మహద్ధరణ్యా వివరం ప్రవిష్టాః స్మ పిపాసితాః।
ఇమాంస్త్వేవంవిధాన్ భావాన్ వివిధాన్ అద్భుతోపమాన్। 3

దృష్ట్వా వయం ప్రవ్యథితాః సంభ్రాంతా నష్టచేతసః।
కస్యైతే కాంచనా వృక్షాః తరుణాదిత్యసన్నిభాః।
శుచీన్యభ్యవహార్యాణి మూలాని చ ఫలాని చ। 4

కాంచనాని విమానాని రాజతాని గృహాణి చ।
తపనీయగవాక్షాణి మణిజాలావృతాని చ। 5

పుష్పితాః ఫలవంతశ్చ పుణ్యాః సురభిగంధినః।
ఇమే జాంబూనదమయాః పాదపాః కస్య తేజసా। 6

కాంచనాని చ పద్మాని జాతాని విమలే జలే।
కథం మత్స్యాశ్చ సౌవర్ణాః చరంతి సహ కచ్ఛపైః। 7

ఆత్మానమ్ అనుభావం చ కస్య చైతత్ తపోబలమ్।
అజానతాం నః సర్వేషాం సర్వమ్ ఆఖ్యాతుమర్హసి। 8

ఏవ ముక్తా హనుమతా తాపసీ ధర్మచారిణీ।
ప్రత్యువాచ హనూమంతం సర్వభూతహితే రతా। 9

మయో నామ మహాతేజా మాయావీ దానవర్షభః।
తేనేదం నిర్మితం సర్వం మాయయా కాంచనం వనమ్। 10

పురా దానవముఖ్యానాం విశ్వకర్మా బభూవ హ।
యేనేదం కాంచనం దివ్యం నిర్మితం భవనోత్తమమ్। 11

ధర్మనిరతయు, మహాత్మురాలును, జింకచర్మమును వస్త్రముగా ధరించియున్నదియు అగు ఆ తాపసితో హనుమంతుడు మరల ఇట్లనెను. (1)

"అమ్మా! మేము ఆకలిదప్పులతో అలసి, అన్ని విధములుగా నలిగియుంటిమి. కనుక సాహసమొనర్చి ఈ చీకటిగుహయందు అడుగిడితిమి. భూతలమునందలి ఈ బిలము మిక్కిలి విశాలముగా ఉండుట జూచి, దాహనివృత్తికై ఇందు ప్రవేశించితిమి. కాని అద్భుతమైన ఇచటి వివిధ పదార్థములను జూచి మిగుల దిగ్భ్రాంతి చెందితిమి. 'ఇవి రాక్షసమాయాకల్పితములేమో?' అని సందేహించితిమి. 'ఏనచో మన ఆకలిదప్పులు తీరుటయెట్లు' - అని తలంచి బాధపడితిమి. మా వివేకము దెబ్బతినినది. (2-3)

తల్లీ! ఇచ్చట ఉదయభానుని కాంతులతో విలసిల్లుచున్న సువర్ణమయవృక్షములు, పరిశుభ్రమైన భోజనపదార్థములు, ఫలమూలములు, బంగారుభవనములు, వెండిగృహములు, మణులతెరలతో ఒప్పుచున్న బంగారుకిటికీలు కనబడుచున్నవి, ఇంతకును ఇవి ఎవరివి? బంగారువన్నెలతో ఒప్పెడి ఇక్కడి వృక్షములు స్వచ్ఛములై పూలతో, పండ్లతోనిండి సువాసనలను వెదజల్లుచున్నవి. ఇది ఎవరిప్రభావము? ఇచటి సరస్సులలోని జలములు నిర్మలములై బంగారు కమలములతో శోభిల్లుచున్నవి. బంగారుకాంతులీను మత్స్యములు తాబేళ్లతో కలిసి విహరించుచున్నవి. దీనికంతటకును కారణము నీ మహిమయా? లేక మఱొకరి తపోబలప్రభావమా? ఈ విషయములు ఏవియును మాకు తెలియవు. కనుక దయతో స్పష్టపఱచుము."(4-8)

మారుతి ఇట్లు మాటాడిన పిమ్మట ధర్మనిరతురాలును, ఎల్లప్పుడు సమస్తప్రాణులమేలునే కోరునదియు ఐన ఆ తాపసి ఆయనకు ప్రత్యుత్తరమిచ్చెను. (9)

'పూర్వము 'మయుడు' అను ఒక దానవశ్రేష్ఠుడు కలడు. అతడు మిగుల మాయావి, మిక్కిలి శక్తిమంతుడు. అతడే తనమాయచే ఈ కాంచనవనమును అంతయును నిర్మించెను. అతడు దానవప్రముఖులకు విశ్వకర్మగా (శిల్పిగా) ఉండెడివాడు. దివ్యమైన ఈ బంగారు భవనమునకు నిర్మాత అతడే. (10-11)

స తు వర్షసహస్రాణి తపస్తప్త్వా మహావనే।
పితామహాద్వరం లేభే సర్వమ్ ఔశనసం ధనమ్॥ 12

వనం విధాయ బలవాన్ సర్వకామేశ్వరస్తదా।
ఉవాస సుఖితః కాలం కంచిదస్మిన్ మహావనే॥ 13

తమప్సరసి హేమాయాం సక్తం దానవపుంగవం।
విక్రమ్యైవాశనిం గృహ్యా జఘానేశః పురందరః॥ 14

ఇదం చ బ్రహ్మణా దత్తం హేమాయై వనముత్తమం।
శాశ్వతాః కామభోగాశ్చ గృహం చేదం హిరణ్మయమ్॥ 15

దుహితా మేరుసావర్ణేః అహం తస్యాః స్వయంప్రభా।
ఇదం రక్షామి భవనం హేమాయా వానరోత్తమ॥ 16

మమ ప్రియసఖీ హేమా నృత్తగీతవిశారదా।
తయా దత్తవరా చాఽస్మి రక్షామి భవనోత్తమమ్॥ 17

కిం కార్యం కస్య వా హేతోః కాంతారాణి ప్రపశ్యథ।
కథం చేదం వనం దుర్గం యుష్మాభిరుపలక్షితమ్॥ 18

ఇమాన్యభ్యవహార్యాణి మూలాని చ ఫలాని చ।
భుక్త్వా పీత్వా చ పానీయం సర్వం మే వక్తుమర్హథ॥ 19

ఆ మయుడు ఒక మహావనమునందు వేయి సంవత్సరములు తీవ్రముగా తపమొనర్చి బ్రహ్మదేవుని వలన దివ్యమైన ఒక వరమును పొందెను. దాని ప్రభావమున అతనికి శుక్రాచార్యుని నుండి శిల్ప శాస్త్ర జ్ఞానమంతయును లభించెను.[1] (12)

బలశాలియైన అతడు సకలసుఖభోగములకు నెలవైన భవనములను, వనాదులను చక్కగా నిర్మించుకొని, కొంతకాలము ఈ మహావనమునందే హాయిగా నివసించెను. ఆ దానవశ్రేష్ఠుడు 'హేమ'యను అప్సరసయందు ఆసక్తుడైయుండుటను దేవేంద్రుడు గమనించెను. అందులకు ఆ సురపతి కుపితుడై తనవజ్రాయుధమును చేతబట్టి ఆ మయుని సంహరించెను. (13-14)

అపూర్వమైన ఈ వనమును, ఈ బంగారు గృహమును బ్రహ్మదేవుడు 'హేమ'కు బహూకరించెను. ఆ విధముగా ఆ అప్సరస వీటిని పొంది, చాలకాలము ఇందు సుఖభోగములను అనుభవించెను. ఓ వానరోత్తమా! నేను మేరుసావర్ణిసుతను, పేరు స్వయంప్రభ. ఆ హేమయొక్క ఈ భవనమును కాపాడుచు నేను ఇందునివసించుచుంటిని. నా ప్రియసఖియైన హేమ నృత్తగీతములయందు నైపుణ్యము గలది. ఈ భవనమును రక్షించు బాధ్యత ఆమె నాకు అప్పగించినది. (15-17)

ఓ కపివరా! మీరు వచ్చిన పనియేమి? ఈ అడవులను అన్వేషించుటకుగల హేతువేమి? దుర్గమమైన ఈ వనము మీదృష్టికి ఎట్లు వచ్చినది? ముందుగా ఈ ఫలమూలాది భోజనపదార్థములను ఆరగింపుడు. ఈ కమ్మని పానీయములను సేవింపుడు. పిమ్మట తిన్నగా మీవృత్తాంతములను విశదపఱచుడు." (18-19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకపంచాశః సర్గః (51)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదిఒకటవసర్గము

-- * * * --

1) ఉశనసుడు = (ఉశన కుమారుడు) శుక్రాచార్యుడు - ఉశనసునియొద్ద గల (శిల్ప) శాస్త్ర జ్ఞానము ఔశనసము. ఔశనసమును పొందెననగా ఉశనసునినుండి శిల్పశాస్త్రమును పొందెనని భావము. 'మయుడు' అనువాడు త్రిపురములకు అధిపతి. శంకరునివలన ఆత్రిపురములు నశించిన పిమ్మట అతడు ఆత్మరక్షణముకొఱకు ఈ బిలమును నిర్మించుకొని, ఇందు తలదాచుకొనెను. అని మత్స్యపురాణమునందు ప్రస్తావింపబడినది.- గోవింద రాజీయము

52. ఏబదిరెండవసర్గము

హనుమంతుడు తమ రాకకుగల కారణములను స్వయంప్రభకు వివరించుట - వానరులు తనఅతిథి సత్కారములను స్వీకరించినందులకు ఆమె సంతోషమును ప్రకటించుట -

అథ తాన్ అబ్రవీత్ సర్వాన్ విక్రాంతాన్ హరిపుంగవాన్।
ఇదం వచనమేకాగ్రా తాపసీ ధర్మచారిణీ। 1

పరాక్రమశాలులైన ఆ వానరప్రముఖులను అందఱిని ఉద్దేశించి, ధర్మనిరతురాలైన ఆతాపసి (స్వయం ప్రభ) సావధానముగా ఇట్లు నుడివెను. (1)

వానరా యది వః ఖేదః ప్రణష్టః ఫలభక్షణాత్।
యది చైతన్మయా శ్రావ్యం శ్రోతుమిచ్ఛామి కథ్యతామ్। 2

'ఓ వానరులారా! ఈ ఫలమూలాదులను భక్షించుటవలన మీ ఆకలిదప్పులు తీఱినవిగదా! మీ విశేషములను వినగోరుచున్నాను. మీకు ఎట్టి అభ్యంతరము లేనిచో వివదీకరింపుడు." (2)

తస్యా స్తద్వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః।
ఆర్జవేన యథాతత్త్వమ్ ఆఖ్యాతుమ్ ఉపచక్రమే। 3

వాయుసుతుడైన హనుమంతుడు ఆమెమాటలను విన్న పిమ్మట, ఎట్టి దాపఱికమూ లేకుండ తమవృత్తాంతములను వినయముతో ఆమెకిట్లు వివరింపసాగెను. (3)

రాజా సర్వస్య లోకస్య మహేంద్రవరుణోపమః।
రామో దాశరథిః శ్రీమాన్ ప్రవిష్టో దండకావనమ్।
లక్ష్మణేన సహ భ్రాత్రా వైదేహ్యా చాపి భార్యయా। 4

తస్య భార్యా జనస్థానాత్ రావణేన హృతా బలాత్। 5

"దశరథమహారాజుయొక్క పెద్దకుమారుడు శ్రీరాముడు. అతడు సమస్తలోకములకును ప్రభువు. శక్తి సామర్థ్యములయందు ఆ స్వామి దేవేంద్రునితో, వరుణునితో సమానుడు. సకల సద్గుణసంపన్నుడైన ఆ ప్రభువు పితృాజ్ఞను అనుసరించి దండకావనమున ప్రవేశించెను. భార్యయగు సీతాదేవియు, తమ్ముడగు లక్ష్మణుడును అతని వెంటవచ్చిరి. వారు దండకారణ్యమున వనవాసము చేయుచుండగా దుష్టరావణుడు ఆయన భార్యను (సీతాదేవిని) అపహరించుకొని పోయెను. (4-5)

వీర స్తస్య సఖా రాజ్ఞః సుగ్రీవో నామ వానరః।
రాజా వానరముఖ్యానాం యేన ప్రస్థాపితా వయమ్। 6

అగస్త్యచరితామ్ ఆశాం దక్షిణాం యమరక్షితామ్।
సహైభిర్వానరైర్ఘోరైః అంగదప్రముఖైర్వయం। 7

రావణం సహితాః సర్వే రాక్షసం కామరూపిణం।
సీతయా సహ వైదేహ్యా మార్గధ్వమితి చోదితాః। 8

వానరవీరుడైన సుగ్రీవుడు ఆ ప్రభువునకు మిత్రుడు. అతడు మా వానరులందఱికిని రాజు. ఆయనఆజ్ఞను అనుసరించి మేము ఇటు వచ్చితిమి. 'ఆ సుగ్రీవుడు' ఓ వానరప్రముఖులారా! సీతాదేవిజాడను, కామరూపియు, రాక్షసుడు ఐన రావణునినివాసమును వెదకుటకై మీరందఱును దక్షిణదిశకు వెళ్లుడు." అని మమ్ములను ఆదేశించియుండెను. ఆ రాజుయొక్క ఆనతిని తలదాల్చి, అంగదుడు మొదలగు వారితోగూడి మేము, యమునిచే పాలింపబడుచు, అగస్త్యమహర్షి సంచరించుటచే పునీతమైన ఈ దిక్కునకు వచ్చితిమి. (6-8)

విచిత్య తు వయం సర్వే సమగ్రాం దక్షిణాం దిశం।
బుభుక్షితాః పరిశ్రాంతా వృక్షమూలమ్ ఉపాశ్రితాః। 9

మేము అందఱమును దక్షిణదిశయందలి ప్రదేశములను అన్నింటిని పూర్తిగా గాలించితిమి, ఆకలి గొంటిమి, అలసిపోయితిమి. చివఱకు ఒక వృక్షము క్రిందికి చేరితిమి. మా ముఖములు వాడిపోయినవి, ఈ కార్యమును సాధించుట ఎట్లు?' అని, మేము ఆలోచింపదొడంగితిమి. ఈ

వివర్ణవదనాః సర్వే సర్వే ధ్యానపరాయణాః।
నాధిగచ్ఛామహే పారం మగ్నాశ్చింతామహార్ణవే। 10

చారయంత స్తతశ్చక్షుః దృష్టవంతో వయం బిలం।
లతాపాదపసంఛన్నం తిమిరేణ సమావృతమ్। 11

అస్మాద్ధంసా జలాక్లిన్నాః పక్షైః సలిలవిస్రవైః।
కురరాః సారసాశ్చైవ నిష్పతంతి పతత్రిణః।
సాధ్వత్ర ప్రవిశామేతి మయా తూక్తాః ప్లవంగమాః। 12

తేషామపి హి సర్వేషామ్ అనుమానమ్ ఉపాగతం।
గచ్ఛామ ప్రవిశామేతి భర్తృకార్యత్వరాన్వితాః। 13

తతో గాఢం నిపతితా గృహ్య హస్తౌ పరస్పరం।
ఇదం ప్రవిష్టాః సహసా బిలం తిమిరసంవృతమ్। 14

ఏతన్నః కార్యమేతేన కృత్యేన వయమాగతాః।
త్వాం చైవోపగతాః సర్వే పరిద్యూనా బుభుక్షితాః। 15

ఆతిథ్యధర్మదత్తాని మూలాని చ ఫలాని చ।
అస్మాభిరుపభుక్తాని బుభుక్షాపరిపీడితైః। 16

యత్ త్వయా రక్షితాః సర్వే మ్రియమాణా బుభుక్షయా।
బ్రూహి ప్రత్యుపకారార్థం కిం తే కుర్వంతు వానరాః। 17

ఏవముక్తా తు సర్వజ్ఞా వానరై స్తైః స్వయంప్రభా।
ప్రత్యువాచ తతః సర్వాన్ ఇదం వానరయూథపాన్। 18

సర్వేషాం పరితుష్టాఽస్మి వానరాణాం తరస్వినాం।
చరంత్యా మమ ధర్మేణ న కార్యమిహ కేనచిత్ । 19

చింతాసముద్రమునుండి బయటపడలేకపోయితిమి. ఇట్టి స్థితిలో మేము నలువైపులయందును దృష్టి సారింపగా లతలతోడను, వృక్షములతోడను కప్పబడి, చీకట్లతో నిండియున్న ఈ బిలము కన్పించెను. (9-11)

నీటిలో తడిసి, ఱెక్కలనుండి జలములను జార్చుచు ఈ బిలమునుండి బయటబడుచున్న హంసలు, లకుముకి పిట్టలు, బెగ్గురుపక్షులు మొదలగువానిని మేము చూచితిమి. అప్పుడు నేను 'మనదాహములు తీరుటకై ఇందు ప్రవేశించుటమంచిది' అని వానరులకు సూచించితిని. అప్పుడు వారును 'నీటిలో తడిసిన పక్షులు బయటికి వచ్చుటను జూచి, ఇచట నీరు ఉండవచ్చును' - అని భావించి, నామాటకు అంగీకరించిరి. పిమ్మట వారు స్వామికార్యము త్వరగా పూర్తిచేయవలయునను ఆరాటముతో - 'వెళ్లుదము, అందు ప్రవేశింతము' అని పలికిరి. (12-13)

అంతట మేము అందఱము దగ్గఱగా చేరి, పరస్పరము చేతులు ఊతగాగొని, ఈ చీకటి గుహలో ధైర్యముతో ప్రవేశించితిమి. మేము వచ్చిన పని ఇది, ఈ పనికై వచ్చి మేము అందఱము నిన్ను చేరితిమి. మేము ఆకలితో కృశించియుంటిమి. అతిథిమర్యాదలతో దయతో నీ వొసంగిన ఫలమూలాదులను బాగుగా ఆకలిగొనియున్న మేము తనివిదీర తింటిమి. ఆకలితో అన్నుబట్టియున్న మమ్ములను నిజముగా నీవు నేడు రక్షించితివి. ఈ వానరులు నీకు చేయగల ప్రత్యుపకారమును తెల్పుము." (14-17)

మారుతి ఇట్లు పలికిన పిమ్మట సర్వజ్ఞురాలైన ఆ స్వయంప్రభ ఆ కపియోధులందఱితో ఇట్లు నుడివెను. "ఓ వీరులారా! సాదరముగా పలికిన మీమాటలే నాకు పరమ సంతోషమును గూర్చినవి. ఇచట నా ధర్మజీవనమును నేను గడపుచుంటిని. మిమ్ము శ్రమపెట్టబోను." (18-19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ద్విపంచాశఃసర్గః (52)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదిరెండవసర్గము

— ❋ ❋ ❋ —

53. ఏబదిమూడవసర్గము

వానరుల ప్రార్థనపై స్వయంప్రభ తన తపః ప్రభావముచే వారిని అందఱిని గుహ వెలుపలికి (సముద్ర తీరమునకు) చేర్చుట - సుగ్రీవుడు విధించిన గడువు ముగిసినట్లు అంగదుడు గమనించుట - 'కార్య సాఫల్యము కాకుండ వెళ్లినచో ఆ వానర రాజు మనలను తప్పక వధించును. అతని చేతిలో మరణించుటకంటెను ఇచటనే ప్రాయోపవేశము చేయుట యుక్తము' అని అంగదుడు నుడువుట - స్వయంప్రభ గుహలోనే నివసించినచో ప్రాణభయము ఉండదని తారుడు పలుకుట - ఆ సూచనను వానరులు ఆమోదించుట -

ఏవముక్తః శుభం వాక్యం తాపస్యా ధర్మసంహితం।
ఉవాచ హనుమాన్ వాక్యం తామనిందితచేష్టితామ్। 1

శరణం త్వాం ప్రపన్నాః స్మః సర్వే వై ధర్మచారిణి।
యః కృతః సమయోఽస్మాకం సుగ్రీవేణ మహాత్మనా।
స చ కాలో హ్యతిక్రాంతో బిలే చ పరివర్తతాం। 2

సా త్వమస్మాద్బిలాద్ఘోరాత్ ఉత్తారయితుమర్హసి। 3

తస్మాత్ సుగ్రీవవచనాత్ అతిక్రాంతాన్ గతాయుషః।
త్రాతుమ్ అర్హసి నః సర్వాన్ సుగ్రీవభయకర్శితాన్। 4

మహచ్చ కార్యమ్ అస్మాభిః కర్తవ్యం ధర్మచారిణి।
తచ్చాఽపి న కృతం కార్యమ్ అస్మాభిరిహ వాసిభిః। 5

ఏవ ముక్తా హనుమతా తాపసీ వాక్యమబ్రవీత్।
జీవతా దుష్కరం మన్యే ప్రవిష్టేన నివర్తితుమ్। 6

తపసస్తు ప్రభావేన నియమోపార్జితేన చ।
సర్వానేవ బిలాదస్మాత్ ఉద్ధరిష్యామి వానరాన్। 7

నిమీలయత చక్షూంషి సర్వే వానరపుంగవాః।
న హి నిష్క్రమితుం శక్యమ్ అనిమీలితలోచనైః। 8

తతః సమ్మీలితాః సర్వే సుకుమారాంగుళైః కరైః।
సహసాఽపిదధుర్దృష్టిం హృష్టా గమనకాంక్షయా। 9

వానరాస్తు మహాత్మానో హస్తరుద్ధముఖాస్తదా।
నిమేషాంతరమాత్రేణ బిలాదుత్తారితాస్తయా। 10

తతస్తాన్ వానరాన్ సర్వాన్ తాపసీ ధర్మచారిణీ।
నిస్సృతాన్ విషమాత్ తస్మాత్ సమాశ్వాస్యేదమబ్రవీత్। 11

తాపసియైన ఆ స్వయంప్రభ ధర్మసహితముగా ఇట్లు చక్కని మాటలను పలికిన పిమ్మట సత్కార్మలను ఆచరించెడి ఆమెతో హనుమంతుడు ఇట్లు నుడివెను.(1)

"ఓ ధర్మాత్మురాలా! మేము అందఱము నిన్ను శరణు గోరుచున్నాము. మహాత్ముడైన సుగ్రీవుడు మాకు ఒక గడువును విధించెను. మేము ఆ గడువులోపలనే సీతాన్వేషణకార్యమును ముగించుకొని ఆయనను చేరవలసియుండెను. కాని ఆసమయము మాకు ఈ బిలమునందే ముగిసినది. మహాత్మురాలవైన నీవే మమ్ములను దుర్గమమైన ఈ బిలమునుండి బయటపడవేయవలయును. మేము ఆ సుగ్రీవుని ఆజ్ఞను పాటింపలేక పోయితిమి. ప్రాణములపై ఆశవదలుకొంటిమి. సుగ్రీవుడు శిక్షించునను భయముతో ఆందోళనపడుచున్న మమ్ము ఇక నీవే రక్షింపవలెను.(2-4)

ఓ ధర్మనిరతురాలా! మేము గొప్ప కార్యమును సాధింపవలసియున్నది. ఆ కార్యసిద్ధికై ఎంతయు కృషి సల్పితిమి. కాని పరిస్థితులప్రభావమున ఈ గుహలో చిక్కుపడి ఆ పనిని పూర్తిచేయలేకపోయితిమి." (5)

హనుమంతుడు ఇట్లు పలికిన పిమ్మట తాపసియైన ఆ స్వయంప్రభ ఆయనతో ఇట్లనెను. "ఈ బిలములో ప్రవేశించిన వాడు ఇందుండి ప్రాణములతో బయటపడుట కష్టము. కాని నేను నియమనిష్ఠలతో ఆచరించిన నా తపస్సుయొక్క ప్రభావముచే వానరులైన మిమ్ములను అందఱిని ఈ బిలము నుండి ఉద్ధరించెదను. ఓ వానరోత్తములారా! మీరందఱును కనులు మూసికొనుడు. అట్లు చేయనిచో (కనులు మూసికొననిచో) ఇందుండి బయటపడజాలరు." (6-8)

ఆమె పలికిన అభయవచనములకు వారు మిగుల సంతసించి, వెళ్లుటకై తహతహపడుచు, వెంటనే తమ సుకుమారమైన చేతులతో కనులు మూసికొనిరి. మహాత్ములైన ఆ వానరులు చేతులతో ముఖములను, కప్పికొనిన మఱుక్షణముననే ఆ మహిమాన్వితురాలు వారిని బిలమువెలుపలికి చేర్చెను. (9-10)

అనంతరము ధర్మపరాయణురాలైన ఆ తాపసి క్లిష్టప్రదేశమైన ఆగుహనుండి బయటపడిన ఆ వానరులను ఓదార్చి వారితో ఇట్లనెను. (11)

ఏష వింధ్యో గిరిః శ్రీమాన్ నానాద్రుమలతాకులః।
ఏష ప్రస్రవణః శైలః సాగరోఽయం మహోదధిః। 12

స్వస్తి వోఽస్తు గమిష్యామి భవనం వానరర్షభాః।
ఇత్యుక్త్వా తద్బిలం శ్రీమత్ ప్రవివేశ స్వయంప్రభా। 13

తత స్తే దదృశుర్ఘోరం సాగరం వరుణాలయం।
అపారమ్ అభిగర్జంతం ఘోరైరూర్మిభిరావృతమ్। 14

మయస్య మాయావిహితం గిరిదుర్గం విచిన్వతాం।
తేషాం మాసో వ్యతిక్రాంతో యో రాజ్ఞా సమయః కృతః। 15

వింధ్యస్య తు గిరేః పాదే సంప్రపుష్పితపాదపే।
ఉపవిశ్య మహాత్మానః చింతామ్ ఆపేదిరే తదా। 16

తతః పుష్పాతిభారాగ్రాన్ లతాశతసమావృతాన్।
ద్రుమాన్ వాసంతికాన్ దృష్ట్వా బభూవుర్భయశంకితాః। 17

తే వసంతమ్ అనుప్రాప్తం ప్రతిబుధ్వా పరస్పరం।
నష్టసందేశకాలార్థా నిపేతుర్ధరణీతలే। 18

తతస్తాన్ కపివృద్ధాంస్తు శిష్టాంశ్చైవ వనౌకసః।
వాచా మధురయాఽఽభాష్య యథావదనుమాన్య చ। 19

స తు సింహవృషస్కంధః పీనాయతభుజః కపిః।
యువరాజో మహాప్రాజ్ఞః అంగదో వాక్యమబ్రవీత్। 20

శాసనాత్ కపిరాజస్య వయం సర్వే వినిర్గతాః।
మాసః పూర్ణో బిలస్థానాం హరయః కిన్న బుధ్యతే। 21

వయమ్ ఆశ్వయుజే మాసి కాలసంఖ్యావ్యవస్థితాః।
ప్రస్థితాః సోఽపి చాతీతః కిమతః కార్యముత్తరమ్। 22

భవంతః ప్రత్యయం ప్రాప్తా నీతిమార్గవిశారదాః।
హితేష్వభిరతా భర్తుః నిసృష్టాః సర్వకర్మసు। 23

ఇది వింధ్యపర్వతము (శాఖ) సకలశోభానిలసితము, చక్కని చెట్లతో, తీగెలతో విరాజిల్లుచున్నది. ఇందు పెక్కు సెలయేళ్లు ప్రవహించుచున్నవి. ఇటు వైపునున్న ఈ సముద్రమును 'మహోదధి'- అని పిలుతురు. ఓ వానరులారా! మీకు శుభమగుగాక. ఇక నేను నా భవనమునకు వెళ్లెదను." అని పలికిన పిమ్మట స్వయంప్రభ అద్భుతమైన ఆ గుహలో ప్రవేశించెను. (12-13)

అనంతరము వారు వరుణునకు నిలయమైన ఆ మహోదధిని జూచిరి. అది ఎగసిపడుచున్న అలలతో భీతిగొల్పుచుండెను. ఉవ్వెత్తుతరంగములతో నిండిన ఆ అపారమైన సముద్రఘోషలు అంతటను ప్రతిధ్వనించుచుండెను. మయుని మాయా శిల్పములతో నిర్మితమైన ఆ గిరిదుర్గమును వెదకుటలోనే వారికి సుగ్రీవుడు పెట్టిన మాసము గడువు ముగిసెను. (14-15)

ఆ మహాత్ములు వింధ్యగిరియొక్క నైఋతిభాగమున బాగుగా పుష్పించియున్న ఒక వృక్షముయొక్క నీడలో కూర్చొని చింతాక్రాంతులైయుండిరి. వసంత-ఋతువునందలి అచటి వృక్షములు అన్నియును పూలబరువుతో వంగియుండెను, లతలు వాటికి అల్లిబిల్లిగా అల్లుకొనియుండెను. అట్టి వృక్షములను జూచి, (వసంత-ఋతువు రాబోవుచున్నదని గమనించి, గడువుముగిసిన కారణముగా సుగ్రీవునివలన ఏ ప్రమాదము వచ్చి పడునోయని) భయసందేహములకు గురియైరి. వారు వసంత-ఋతువు రాబోవుచున్న విషయమును గుర్తించి, తమలో తాము చర్చించుకొనిరి, రాజు ఇచ్చిన కాలవ్యవధి మీఱినందున భయముతో భూమిపై పడిపోయిరి. (16-18)

అంగదుడు సింహావృషభములవలె చక్కని మూపుతో, బలిష్ఠములైన పొడవైన భుజములతో ఒప్పుచున్న వాడు, మిక్కిలి ప్రాజ్ఞుడు, యువరాజు. అతడు వృద్ధులైన వానరులను, తదితరకపులను తగిన విధముగా గౌరవించుచు, చక్కని సంబోధనలతో మధురముగా ఇట్లు పలికెను. (19-20)

"వానరమిత్రులారా! కపిరాజైన సుగ్రీవునియొక్క శాసనమును అనుసరించి, మనమందఱము సీతాన్వేషణకై కిష్కింధనుండి బయలుదేఱితిమి. మనము బిలమునందు ఉన్నప్పుడే ఆయన పెట్టిన మాసవ్యవధి పూర్తియైనది. కాని ఆ విషయము మీకు ఏలతట్టలేదు? మనము మనకు అప్పగించిన కార్యమును ఒక మాసములో పూర్తి చేయుటకు అంగీకరించి ఆశ్వయుజమాసములో బయలుదేఱితిమి. అదియును గడచిపోయినది. కనుక

కర్మస్వప్రతిమాః సర్వే దిక్షు విశ్రుతపౌరుషాః।
మాం పురస్కృత్య నిర్యాతాః పింగాక్షప్రతిచోదితాః। 24

ఇదానీమ్ అకృతార్థానాం మర్తవ్యం నాఽత్ర సంశయః।
హరిరాజస్య సందేశమ్ అకృత్వా కః సుఖీ భవేత్। 25

తస్మిన్నతీతే కాలే తు సుగ్రీవేణ కృతే స్వయం।
ప్రాయోపవేశనం యుక్తం సర్వేషాం చ వనౌకసామ్। 26

తీక్ష్ణః ప్రకృత్యా సుగ్రీవః స్వామిభావే వ్యవస్థితః।
న క్షమిష్యతి నః సర్వాన్ అపరాధకృతో గతాన్। 27

అప్రవృత్తౌ చ సీతాయాః పాపమేవ కరిష్యతి।
తస్మాత్ క్షమమిహాద్యైవ ప్రాయోపవిశనం హి నః।
త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ ధనాని చ గృహాణి చ। 28

ధ్రువం నో హింసితా రాజా సర్వాన్ ప్రతిగతానితః।
వధేనాఽప్రతిరూపేణ శ్రేయాన్ మృత్యురిహైవ నః। 29

న చాఽహం యౌవరాజ్యేన సుగ్రీవేణాఽభిషేచితః।
నరేంద్రేణాఽభిషిక్తోఽస్మి రామేణాఽక్లిష్టకర్మణా। 30

స పూర్వం బద్ధవైరో మాం రాజా దృష్ట్వా వ్యతిక్రమం।
ఘాతయిష్యతి దండేన తీక్ష్ణేన కృతనిశ్చయః। 31

కిం మే సుహృద్భిర్వ్యసనం పశ్యద్భిర్జీవితాంతరే।
ఇహైవ ప్రాయమాసిష్యే పుణ్యే సాగరరోధసి। 32

ఇప్పుడు మన కర్తవ్యమేమి? మీరు రాజునకు విశ్వాసపాత్రులు, నీతిమార్గమునందు కుశలురు. ప్రభువు హితమునందే నిరతులైయుందురు. వివిధములగు కార్యములను నిర్వహించుటలో మీరు సాటిలేనివారు. కనుకనే అన్ని కార్యములయందును మీరే నియమింపబడుచుందురు. మీరు బలపరాక్రమ శాలులుగా అన్ని దిక్కులయందును వాసి గాంచితిరి. మహారాజు ఆదేశముమేరకు నన్ను ముందుంచుకొని బయలుదేఱితిరి. మనకు అప్పగించిన పనిలో కృతార్థులము కాలేదు. కనుక ఇప్పుడు మనము మరణించుటయే మంచిది. ఇందులకు మనకు ఎట్టి సంకోచమూ అక్కఱలేదు. కపిరాజు ఆజ్ఞను పాటింపని వానికి సుఖమెట్లు దక్కును? (21-25)

సుగ్రీవుడు స్వయముగా విధించిన కాలవ్యవధి ముగియనే ముగిసినది. ఇప్పుడు మనవానరులకు అందఱికిని ప్రాయోపవేశమే దిక్కు. మఱియొక మార్గము లేదు. సుగ్రీవుడు సహజముగనే తీవ్రస్వభావము గలవాడు, పైగా ఇప్పుడు మనకు అతడు ప్రభువు. అపరాధము చేసి యుంటిమిగాన ఇప్పుడు ఆయన సమీపమునకు వెళ్లినచో ఆస్వామి మనలో ఎవ్వరినీ క్షమింపడు - సీతాదేవిజాడను తెలిసికొనకుండ వెళ్లినచో అతడు మనలను వధించి తీరును. అందువలన భార్యాపుత్త్రులపైనను, సిరిసంపదల మీదను, ఇండ్లు వాకిండ్లవిషయముననను మోహమును త్యజించి, ఇక్కడే, ఈక్షణముననే ప్రాయోపవేశమునకు పూనుకొనుట యుక్తము. (26-28)

మనము (కార్యము సఫలము కాకుండ) మఱలి వెళ్లినచో ఆయన మరణదండన విధించుట తథ్యము. ఇట్లు నిరర్థకముగా ఆయనచే వధింపబడుటకంటె మనము ఇచటనే అసువులను వీడుట మంచిది. (29)

సుగ్రీవుడు నన్ను యువరాజుగా చేయలేదు. ఎంతటి కార్యమునైనను అవలీలగా సాధించువాడు, మహారాజకుమారుడు ఐన ఆ శ్రీరామచంద్ర ప్రభువే నన్ను యువరాజుగా పట్టాభిషిక్తుని గావించెను. వానర రాజైన సుగ్రీవుడు మొదటినుండియు నాకు బద్ధశత్రువు. ఆయనఆజ్ఞను ఉల్లంఘించిన నన్ను చూచినచో అతడు కఠినమైన మరణదండన విధించును. ఇది నిశ్చయము. నా మిత్రులందఱును చూచుచుండగా బ్రతికియుండగనే నేను అతనివలన అకాలమృత్యువునోట పడుట యెందులకు? కాబట్టి ఇక్కడనే పవిత్రమైన ఈ సాగరతీరమునందే ప్రాయోపవేశమును చేసెదను." (30-32)

ఏతచ్ఛ్రుత్వా కుమారేణ యువరాజేన భాషితం।
సర్వే తే వానరశ్రేష్ఠాః కరుణం వాక్యమబ్రువన్। 33

యువరాజైన అంగదకుమారుడు పలికిన మాటలను వినిన పిమ్మట ఆ వానరప్రముఖులందఱును దీనముగా ఇట్లు నుడివిరి. (33)

తీక్ష్ణః ప్రకృత్యా సుగ్రీవః ప్రియాసక్తశ్చ రాఘవః।
అదృష్టాయాం తు వైదేహ్యాం దృష్ట్వా చైవ సమాగతాన్। 34

రాఘవప్రియకామార్థం ఘాతయిష్యత్యసంశయమ్।
న క్షమం చాపరాద్ధానాం గమనం స్వామిపార్శ్వతః। 35

ఇహైవ సీతామ్ అన్విష్య ప్రవృత్తిమ్ ఉపలభ్య వా।
నోచేద్గచ్ఛామ తం వీరం గమిష్యామో యమక్షయమ్। 36

"నిజముగా సుగ్రీవుడు తీక్ష్ణ స్వభావముగలవాడు. శ్రీరాముడు తన ప్రియపత్నియైన సీతాదేవియందు అనురక్తుడైయున్నాడు. సీతజాడ తెలిసికొనక మనము వెళ్లినచో శ్రీరాముని మెప్పు పొందుటకై ఆ వానరరాజు మనలను తప్పక వధించును. నేరము చేసినవారు ప్రభువు సమీపమునకు వెళ్లుట ఏ మాత్రము తగదు. ఏది ఏమైనను ఎంతగా గాలించియైనను సీతాదేవి జాడను తెలిసికొనిన పిమ్మటనే ఆ వీరునికడకు వెళ్లవలెను. లేనిచో ఆయనచేతిలో మనకు చావు తప్పదు." (34-36)

ప్లవంగమానాం తు భయార్దితానాం
శ్రుత్వా వచస్తార ఇదం బభాషే ।
అలం విషాదేన బిలం ప్రవిశ్య
వసామ సర్వే యది రోచతే వః । 37

భయముతో వణకిపోవుచున్న వానరులు పలికిన మాటలను వినిన యనంతరము 'తారుడు' అను వాడు ఇట్లు నుడివెను. "ఇక్కడ కూర్చొని ఇట్లు విచారపడుటవలన ప్రయోజనము లేదు. మీకు అందఱికిని ఇష్టమైనచో ఆ తాపసి (స్వయంప్రభ) గుహాకే వెళ్లి మనము అందఱము అక్కడనే నివసింతము. ఆ గుహ మాయాప్రభావమున నిర్మింపబడినది, మిక్కిలి దుర్గమమైనది. అది పండ్లచెట్లకును, జలాశయములకు నెలవు. కనుక అన్నపానాదులకు లోటు ఉండదు. అక్కడ ఉన్నచో శ్రీరామునివలన గాని, వానరరాజు వలనగాని, కడకు ఆదేవేంద్రుని వలనగాని మనకు ఏమాత్రము భయము ఉండదు." (37-38)

ఇదం హి మాయావిహితం సుదుర్గమం
ప్రభూతవృక్షోదకభోజ్యపేయకం ।
ఇహాస్తి నో నైవ భయం పురందరాత్
న రాఘవాద్వానరరాజతోఽపి వా । 38

శ్రుత్వాంగదస్యాఽపి వచోఽనుకూలమ్
ఊచుశ్చ సర్వే హరయః ప్రతీతాః ।
యథా న హింస్యేమ తథా విధానమ్
అసక్తమద్యైవ విధీయతాం నః । 39

తారుడు పలికిన మాటలు అంగదునకును అనుకూలముగా ఉండుట వానరులుగమనించిరి. వారికి అవి సమ్మతముగా ఉండెను అప్పుడు వారు "తారుడు చెప్పిన పద్ధతినే ఎట్టి అలస్యము లేకుండ, ఇప్పుడే ఆచరించెదము. అప్పుడు మనకు ఏ మాత్రమూ ప్రమాదము ఉండదు." అని పలికిరి. (39)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే త్రిపంచాశః సర్గః (53)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదిమూడవసర్గము

-- * * * --

54. ఏబదినాలుగవసర్గము

హనుమంతుడు అంగదునిలోగల రాజలక్షణములను గుర్తించుట - అంగదుడు సూచించిన ప్రాయోపవేశ విషయమును, తారుడు తెలిపిన గుహానివాసమును నిరాకరించుట - సుగ్రీవునితో వేఱగుటకు వానరులు ఒప్పుకొనరనుట - సీతాన్వేషణ కార్యమును సాధించుకొని వెళ్లుట యుక్తమని తెల్పుట.

తథా బ్రువతి తారే తు తారాధిపతివర్చసి।
అథ మేనే హృతం రాజ్యం హనుమానంగదేన తత్। 1

బుద్ధ్యా హ్యష్టాంగయా యుక్తం చతుర్బలసమన్వితం।
చతుర్దశగుణం మేనే హనుమాన్ వాలినః సుతమ్। 2

ఆపూర్యమాణం శశ్వచ్చ తేజో బలపరాక్రమైః।
శశినం శుక్లపక్షాదౌ వర్ధమానమివ శ్రియా। 3

బృహస్పతిసమం బుద్ధ్యా విక్రమే సదృశం పితుః।
శుశ్రూషమాణం తారస్య శుక్రస్యేవ పురందరం। 4

చంద్రునివంటి కాంతిగల తారుడు ఇట్లు పలుకుచుండగ హనుమంతుడు అంగదునిలో రాజ్యమును పాలింపగల సామర్థ్యము ఉన్నట్లు తలంచెను. "వాలికుమారుడైన అంగదునిలో అష్టాంగములు (బుద్ధికి సంబంధించిన ఎనిమిది గుణములు),[1] నాలుగు బలములు,[2] పదునాలుగు విశిష్ట లక్షణములు[3] కలవని హనుమంతుడు గుర్తించెను. (1-2)

ఈ అంగదుడు తేజస్సునందును, బలమునందును, పరాక్రమమునందును శుక్లపక్షచంద్రునివలె అను దినము వృద్ధిచెందుచున్నాడు. బుద్ధియందు బృహస్పతి. పరాక్రమమునందు తనతండ్రియగు వాలితో సమానుడు. శుక్రునిమాటలను దేవేంద్రుని వలె తారుని వచనములను శ్రద్ధగా వినుచున్నాడు. రాజాజ్ఞను సాధించు ప్రయత్నమున బాగుగా అలసిపోయియున్నాడు. "ఈవిధముగా ఆలోచించుచు సకలశాస్త్రవేత్తయైన అంగదుని తనఅభిప్రాయములకు అనుకూలముగా మార్చుటకు పూనుకొనెను. అంతట హనుమంతుడు

1) బుద్ధికి సంబంధించిన ఎనిమిది గుణములు.
శ్లో॥ గ్రహణం ధారణం చైవ, స్మరణం ప్రతిపాదనం।
ఊహోఽపోహోఽర్థ విజ్ఞానం, తత్త్వజ్ఞానంచధీగుణాః॥
వినవలెననెడి కోరిక, వినుట, వినిన విషయమును గ్రహించుట, గ్రహించిన దానిని మనస్సున నిలుపుకొనుట, ఊహించుట సంశయనివృత్తి, అర్థమును చక్కగా గ్రహించుట, తత్త్వజ్ఞానమును ఎఱుంగుట.

2) నాలుగు బలములు - సామదానభేదదండోపాయములు (ఇవి శత్రువును లొంగదీయుటకు తగిన ఉపాయములు) మఱియు బాహుబలము, మనోబలము, ఉపాయబలము, బంధుబలము.

3) రాజునకు ఉండవలసిన పదునాలుగు విశిష్ట లక్షణములు.
శ్లో॥ దేశకాలజ్ఞతా, దార్ఢ్యం, సర్వక్లేశ సహిష్ణుతా, సర్వవిజ్ఞానితా, దాక్ష్యమ్, ఊర్జః, సంవృతమంత్రతా।
అవిసంవాదితా, శౌర్యం, శక్తిజ్ఞత్వం, కృతజ్ఞతా, శరణాగతవాత్సల్యమ్, అమర్షిత్వమ్, అచాపలమ్॥
దేశకాలజ్ఞానము, దృఢత్వము, అన్నివిధములైన క్లేశములను సహింపగల శక్తి, వివిధవిషయములయందు పరిజ్ఞానము, సామర్థ్యము, ఉత్సాహము లేక బలము, మంత్రాలోచనములను గోప్యముగా ఉంచుట, పరస్పరవిరోధములైన మాటలు పలుకకుండుట, శౌర్యము, తనబలమును, శత్రుబలమును ఎఱిగియుండుట, కృతజ్ఞత, శరణాగతవాత్సల్యము, తగినసమయమున కోపమును ప్రకటించుట, స్థిరత్వము గల్గియుండుట.

భర్తురర్థే పరిశ్రాంతం సర్వశాస్త్రవిదాం వరం।
అభిసంధాతుమారేభే హనుమాన్ అంగదం తతః। 5

స చతుర్ణామ్ ఉపాయానాం తృతీయమ్ ఉపవర్ణయన్।
భేదయామాస తాన్ సర్వాన్ వానరాన్ వాక్యసంపదా। 6

తేషు సర్వేషు భిన్నేషు తతోఽభీషయదంగదం।
భీషణైర్బహుభిర్వాక్యైః కోపోపాయసమన్వితైః। 7

త్వం సమర్థతరః పిత్రా యుద్ధే తారేయ వై ధురం।
దృఢం ధారయితుం శక్తః కపిరాజ్యం యథా పితా। 8

నిత్యమ్ అస్థిరచిత్తా హి కపయో హరిపుంగవ।
నాజ్ఞాప్యం విషహిష్యంతి పుత్రదారాన్ వినా త్వయా। 9

త్వాం నైతే హ్యనుయుంజేయుః ప్రత్యక్షం ప్రవదామి తే।
యథాఽయం జాంబవాన్ నీలః సుహోత్రశ్చ మహాకపిః। 10

న హ్యహం త ఇమే సర్వే సామదానాదిభిర్గుణైః।
దండేన వా త్వయా శక్యా సుగ్రీవాదపకర్షితుమ్। 11

విగృహ్యాసనమప్యాహుః దుర్బలేన బలీయసః।
ఆత్మరక్షాకరస్తస్మాత్ న విగృహ్ణీత దుర్బలః। 12

యాం చేమాం మన్యసే ధాత్రీమ్ ఏతద్బిలమితి శ్రుతం।
ఏతల్లక్ష్మణబాణానామ్ ఈషత్కార్యం విదారణే। 13

స్వల్పం హి కృతమింద్రేణ క్షిపతా హ్యశనిం పురా।
లక్ష్మణో నిశితైర్బాణైః భింద్యాత్ పత్రపుటం యథా। 14

'సామ, దాన, భేద, దండములు' అను చతురుపాయములలో మూడవదియగు భేదోపాయము ద్వారా వానరులను అందఱిని తన అభిప్రాయములకు అనుగుణముగా (అంగద, తారుల ఆలోచనలకు భిన్నముగా) తన వాక్చాతుర్యముచే మార్చుటకు ప్రయత్నించెను. (3-6)

ఈ విషయమున ఆవానరులందఱిలో భేదభావములు ఏర్పడగా, హనుమంతుడు కోపముతో పెక్కు కఠిన వచనములను పలుకుచు అంగదుని మందలించెను. (7)

"ఓ అంగదా! యుద్ధమునందు మీ పినతండ్రియైన సుగ్రీవునికంటెను నీవు మిగుల సమర్థుడవు. అంతేగాదు, మీ తండ్రియైన వాలివలె నీవు ఈ కపిరాజ్యమును బాగుగా రక్షించుచు, చక్కగా పరిపాలింప గలవు. ఓ కపివరా! ఈ వానరులు ఎల్లప్పుడును చంచలమనస్కులు, వారు తమభార్యాసుతులను వదలుకొని, నీ ఆజ్ఞకు (ప్రాయోపవేశపద్ధతికి) ఏమాత్రము ఇష్టపడరు. (8-9)

ఓ వాలిసుతా! మహాకపులైన ఈ జాంబవంతుడు, నీలుడు, సుహోత్రుడు మొదలగు వానరులెవ్వరును సుగ్రీవుని వ్యతిరేకించి, నిన్ను అనుసరింపరు. నేనుగూడ నీపక్షము వహింపను, మమ్ములను సామ, దాన, భేదములచేగాని, కడకు దండోపాయముచేగాని సుగ్రీవునినుండి వేఱుచేయుజాలవు. ఏ మాత్రమూ దాపఱికములేకుండ నీయెదుటనే పలుకుచున్నాను. 'బలవంతునకు బలహీనునితో వైరము ఏర్పడినచో ఒక్కొక్కప్పుడు అతడు ఆ దుర్బలుని క్షమించుట సంభవమగును. కాని బలహీనుడు బలవంతునితో వైరము పూనినచో అతడు క్షేమముగా ఉండజాలడు. కనుక దుర్బలుడు ఆత్మరక్షణము కోరుకొన్నచో ఎన్నడును బలవంతునితో విరోధము పెట్టుకొనడు.' అని విజ్ఞులు తెల్పుచుందురు. (10-12)

'ఈ గుహలో చేరినచో ఇది సర్వరక్షకము (తల్లివలె ఒడిలో చేర్చుకొని కాపాడును.) అక్కడ మనకు ఎవరి వలననూ ఎట్టి ప్రమాదమూ ఉండదు.' అని తారుడు తెలిపియుండెను. కాని ఇది భ్రమమాత్రమే. ఏలనన ఈ గుహను దెబ్బతీయుట లక్ష్మణుని బాణములకు మిగుల చిన్నపని. ఇదివఱలో మయుని చంపుటకై ఇంద్రుడు ప్రయోగించిన వజ్రాయుధము ఈ గుహకు స్వల్పమైన హానిని మాత్రమే కల్గించినది. కానీ లక్ష్మణుడైతే తన బాణములచే ఈ గుహను ఆకునువలె చీల్చివేయగలడు. ఇంద్రునిదగ్గఱ ఉన్నది ఒకే ఒక్క వజ్రాయుధము. కాని లక్ష్మణుని కడ దానితో సమానములైన బాణములు

లక్ష్మణస్య తు నారాచా బహవః సంతి తద్విధాః।
వజ్రాశనిసమస్పర్శా గిరీణామపి దారణాః॥ 15

అవస్థానే యదైవ త్వమ్ ఆసిష్యసి పరంతప।
తదైవ హరయః సర్వే త్యక్ష్యంతి కృతనిశ్చయాః॥ 16

స్మరంతః పుత్త్రదారాణాం నిత్యోద్విగ్నా బుభుక్షితాః।
ఖేదితా దుఃఖశయ్యాభిః త్వాం కరిష్యంతి పృష్ఠతః॥ 17

స త్వం హీనః సుహృద్భిశ్చ హితకామైశ్చ బంధుభిః।
తృణాదపి భృశోద్విగ్నః స్పందమానాద్భవిష్యసి॥ 18

న చ జాతు న హింస్యుస్త్వాం ఘోరా లక్ష్మణసాయకాః।
అపవృత్తం జిఘాంసంతో మహావేగా దురాసదాః॥ 19

అస్మాభిస్తు గతం సార్థం వినీతవదుపస్థితం।
ఆనుపూర్వ్యాత్తు సుగ్రీవో రాజ్యే త్వాం స్థాపయిష్యతి॥ 20

ధర్మకామః పితృవ్యస్తే ప్రీతికామో దృఢవ్రతః।
శుచిః సత్యప్రతిజ్ఞశ్చ న త్వాం జాతు జిఘాంసతి॥ 21

ప్రియకామశ్చ తే మాతుః తదర్థం చాస్య జీవితం।
తస్యాపత్యం చ నాస్త్యన్యత్ తస్మాదంగద గమ్యతామ్ ॥ 22

పెకల్లగలవు. ఆశరములు పర్వతములను సైతము తుత్తునియలు చేయగలవు. అయినకు ఈ బిలమొక లెక్కయా? (13-15)

ఓ పరంతపా! అంగదా! నీవు ఈ బిలమున ప్రవేశించిన మఱుక్షణమే ఈ వానరులు నిన్ను విడిచి పెట్టి వెళ్లగలరు, అందులకు వారు నిశ్చయించుకొనియున్నారు. వారందఱును ఆలుబిడ్డలను స్మరించుచు బెంగపెట్టుకొని యున్నారు. ఆకలిదప్పులతో అలమటించుచున్నారు. కటికి నేలపై పరుండలేక దుఃఖించుచున్నారు. కనుక వారు నిన్ను విడిచి వెళ్లగలరు. (16-17)

నీహితమును గోరెడి బంధుమిత్రులందఱును నీకు దూరముకాగా నీవు ఒంటరివాడవు అగుదువు. అప్పుడు నీవు గడ్డిపఱకలకదలికలకును భయపడగలవు. లక్ష్మణునియొక్క బాణములు తీవ్రమైనవి, మహావేగముగలవి, ఎదిరింపశక్యముగానివి, శత్రువులను రూపుమాపునవి. కర్తవ్యమును (సీతాన్వేషణకార్యమును) విస్మరించిన నిన్ను అవి ఎన్నటికిని వధింపక మానవు- అంగదా! నీవు మాతో గలిసి సీతాన్వేషణకార్యమును సాధించుకొని, మఱల వినయవిధేయతలతో సుగ్రీవుని జేరినచో అతడు నిన్ను క్రమముగా రాజ్యాభిషిక్తుని గావించును. (18-20)

వాలిసుతా! నీ పినతండ్రియైన సుగ్రీవుడు ధర్మనిరతుడు నీ శ్రేయస్సును కాంక్షించువాడు, నియమములను పాటించువాడు, అంతశ్శుద్ధిగలవాడు, ప్రతిజ్ఞకు కట్టుబడియుండువాడు కనుక అతడు ఎన్నడును నిన్ను చంపడు. అంగదా! సుగ్రీవుడు ఎల్లప్పుడును నీ తల్లి తారకు ప్రీతిగూర్చుచుండువాడు. ఆమెను ప్రాణమొక యెత్తుగా చూచుకొనును. అతనికి నీవు తప్ప వేఱొక సంతానములేదు. (అతనికి వారసులెవ్వరును లేరు.) కావున మనము కార్యమును సఫలమొనర్చుకొని వెళ్లుటయే యుక్తము." (21-22)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే చతుఃపంచాశః సర్గః (54)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదినాలుగవసర్గము

— * * * —

55. ఏబదిఐదవసర్గము

అంగదుడు సుగ్రీవుని నిందించుట - ప్రాయోపవేశమునకు దిగుట - అతనియెడ జాలిని ప్రకటించుచు వానరులందఱును ఆమరణనిరాహారదీక్షకు పూనుకొనుట -

శ్రుత్వా హనుమతో వాక్యం ప్రశ్రితం ధర్మసంహితం।
స్వామిసత్కారసంయుక్తమ్ అంగదో వాక్యమబ్రవీత్। 1

హనుమంతుడు వినయపూర్వకముగా పలికిన వచనములు ధర్మసహితములైనవి. అవి సుగ్రీవునియెడ ఆయనకుగల ప్రభుభక్తిని ప్రకటించుచున్నవి. ఆ మారుతి మాటలను వినిన పిమ్మట అంగదుడు ఇట్లనెను. (1)

స్థైర్యమ్ ఆత్మమనః శౌచమ్ ఆనృశంస్యమ్ అథార్జవం।
విక్రమశ్చైవ ధైర్యం చ సుగ్రీవే నోపపద్యతే। 2

"ఓ వాయుకుమారా! స్థిరబుద్ధి, అంతఃకరణశుద్ధి, దయ, ఋజువర్తనము, పరాక్రమము, గాంభీర్యము మొదలగు గుణములు సుగ్రీవునిలో మచ్చునకైనను కానరావు. (2)

భ్రాతుర్జ్యేష్ఠస్య యో భార్యాం జీవతో మహిషీం ప్రియాం।
ధర్మేణ మాతరం యస్తు స్వీకరోతి జుగుప్సితః।
కథం స ధర్మం జానీతే యేన భ్రాత్రా మహాత్మనా। 3

యుద్ధాయాభినియుక్తేన బిలస్య పిహితం ముఖమ్। 4

సుగ్రీవునియొక్క అన్నయగు వాలికి ప్రియపత్నియు, పట్టమహిషియు ఐన తార అతనికి వదిన, ధర్మము ప్రకారము మాతృమూర్తితో సమానురాలు. అట్టి వదినెను తనఅన్న బ్రతికియుండగనే అతడు స్వీకరించెను. ఇదియేపాటి ధర్మము? అంతేగాదు దుందుభితో యుద్ధమునకు వెళ్లినప్పుడు వాలి అతనిని గుహాద్వారము కడ రక్షణకు నియమించెను. అతడు ఆ బిలద్వారమును మూసివేసి అన్నకు ద్రోహము చేసెను. అట్టి సుగ్రీవుని ధర్మజ్ఞుడు అని యెట్లు చెప్పగలము? (3-4)

సత్యాత్ పాణిగృహీతశ్చ కృతకర్మా మహాయశాః।
విస్మృతో రాఘవో యేన స కస్య తు కృతం స్మరేత్। 5

లక్ష్మణస్య భయాద్యేన నాఽధర్మభయభీరుణా।
ఆదిష్టా మార్గితుం సీతాం ధర్మమస్మిన్ కథం భవేత్। 6

తస్మిన్ పాపే కృతఘ్నే తు స్మృతిహీనే చలాత్మని।
ఆర్యః కో విశ్వసేజ్జాతు తత్కులీనో జిజీవిషుః। 7

మహాయశస్వియైన శ్రీరాముడు సుగ్రీవునితో అగ్నిసాక్షిగా మైత్రిచేసి, అతనికి మహోపకారమొనర్చెను. అట్టి రామచంద్రప్రభువునే (సీతాన్వేషణకార్యమునే) మఱచిపోయెను. అట్టి కృతఘ్నుడు ఎవరి మేలును మాత్రము గుర్తుంచుకొనును? అధర్మమునకు వెఱచిగాక, కేవలము లక్ష్మణుడు తనను చంపునేమోయను భయము చేతనే అతడు మనలను సీతాన్వేషణకార్యమునకై ఆదేశించెను. ఇందులో ధర్మము ఎక్కడ ఉన్నది? అతడు మిగుల పాపాత్ముడు, కృతఘ్నుడు పైగా బుద్ధిహీనుడు, చపలుడు. అట్టి వానిని ఉత్తమ వంశమున జన్మించినవాడు, శత్రువులను జయింపగోరువాడు, పూజ్యుడు ఐన పురుషుడు ఎప్పుడైనను విశ్వసించునా? (5-7)

రాజ్యే పుత్త్రః ప్రతిష్ఠాప్యః సగుణో నిర్గుణోఽపి వా।
కథం శత్రుకులీనం మాం సుగ్రీవో జీవయిష్యతి। 8

ఒకవేళ అతనికి కొడుకు కలిగినచో అతడు గుణవంతుడైనను, గుణహీనుడేయైనను అతడే రాజ్యార్హుడగును. (సుగ్రీవుడు రాజ్యమును అతనికే కట్టబెట్టును.) కనుక శత్రువుయొక్క కుమారుడనైన నన్ను అతడెట్లు బ్రతుకనిచ్చును? (8)

భిన్నమంత్రోఽపరాద్ధశ్చ హీనశక్తిః కథం హ్యహమ్।
కిష్కింధాం ప్రాప్య జీవేయమ్ అనాథ ఇవ దుర్బలః। 9

ఉపాంశుదండేన హి మాం బంధనేనోపపాదయేత్।
శఠః క్రూరో నృశంసశ్చ సుగ్రీవో రాజ్యకారణాత్। 10

బంధనాద్వాఽవసాదాన్మే శ్రేయః ప్రాయోపవేశనమ్।
అనుజానీత మాం సర్వే గృహం గచ్ఛంతు వానరాః। 11

అహం వః ప్రతిజానామి నాఽగమిష్యామ్యహం పురీం।
ఇహైవ ప్రాయమాసిష్యే శ్రేయో మరణమేవ మే। 12

అభివాదనపూర్వం తు రాఘవౌ బలశాలినౌ।
అభివాదనపూర్వం తు రాజా కుశలమేవ చ।
వాచ్యస్తాతో యవీయాన్ మే సుగ్రీవో వానరేశ్వరః। 13

ఆరోగ్యపూర్వం కుశలం వాచ్యా మాతా రుమా చ మే।
మాతరం చైవ మే తారామ్ ఆశ్వాసయితుమర్హథ। 14

ప్రకృత్యా ప్రియపుత్త్రా సా సానుక్రోశా తపస్వినీ।
వినష్టమిహ మాం శ్రుత్వా వ్యక్తం హాస్యతి జీవితమ్। 15

ఏతావదుక్త్వా వచనం వృద్ధాంస్తాన్ అభివాద్య చ।
వివేశ చాంగదో భూమౌ రుదన్ దర్భేషు దుర్మనాః। 16

తస్య సంవిశతస్తత్ర రుదంతో వానరర్షభాః।
నయనేభ్యః ప్రముముచుః ఉష్ణం వై వారి దుఃఖితాః। 17

సుగ్రీవం చైవ నిందంతః ప్రశంసంతశ్చ వాలినం।
పరివార్యాంగదం సర్వే వ్యవసన్ ప్రాయమాసితుమ్। 18

మతం తద్వాలిపుత్త్రస్య విజ్ఞాయ ప్లవగర్షభాః।
ఉపస్పృశ్యోదకం తత్ర ప్రాఙ్ముఖాః సముపావిశన్। 19

దక్షిణాగ్రేషు దర్భేషు ఉదక్తీరం సమాశ్రితాః।
ముమూర్షవో హరిశ్రేష్ఠా ఏతత్ క్షమమితి స్మ హ। 20

సుగ్రీవునకు దూరముగా ఉండదలచిన నా ఆలోచనలు బయటపడినవి. ఆయన ఆదేశమును అనుసరింపక (సీతాన్వేషణమును మాని) నేను అపరాధినైతిని. నా శక్తియు క్షీణించినది. ఇట్టి స్థితిలో కిష్కింధకు వెళ్లి, బలహీనుడైన అనాథ (దిక్కులేని) వలె నేను ఎట్లు జీవింపగలను? (9)

సుగ్రీవుడు వంచకుడు, క్రూరుడు, కనికరములేనివాడు. రాజ్యాధికారమును నిలుపుకొనుటకై అతడు నన్ను రహస్యముగా దండించును, శాశ్వతముగా బంధించును. కిష్కింధకు చేరి బంధింపబడి దుఃఖములపాలగుటకంటె, ఇచటనేయుండి ప్రాయోపవేశము చేయుటయే నాకు శ్రేయస్కరము. కావున ఇందులకు నన్ను అనుమతించి, వానరులెల్లరును గృహోన్ముఖులుగానమ్మను. దయతో వినుడు. నేను ప్రతిజ్ఞాపూర్వకముగా పలుకుచున్నాను. కిష్కింధకు రానేరాను. ఇక్కడనే ప్రాయోపవేశముచేసి మరణించెదను. నాకు అదియే మేలు. (10-12)

బలశాలులైన రామలక్ష్మణులతోను, మా పినతండ్రియు, వానరేంద్రుడును, ఐన సుగ్రీవమహారాజుతోను నాకు మాఱుగా నమస్కార పూర్వకముగా కుశల ప్రశ్నలుగావించి, నా క్షేమసమాచారములను తెలుపుడు. మాపినతల్లియైన రుమతోను నేను ఆమె ఆరోగ్యకుశలములను అడిగినట్లు తెల్పుడు. మఱియు మా తల్లియగు తారను ఓదార్పుడు. సహజముగనే ఆమెది జాలిగుండె. నేననిన ఆమెకు పంచప్రాణములు. పైగా ఆమె మిగుల పరితపించుచున్నది. ఇచట నేను మరణించినట్లు వినిన వెంటనే ఆమె తన అసువులను విడుట తథ్యము." (13-15)

అంగదుడు ఈ విధముగా పలికి, ఆ వృద్ధవానరులకు అందఱికిని నమస్కరించెను. పిమ్మట అతడు భూమిపై దర్భలను పఱచుకొని, దీనవదనుడై ఏడ్చుచు వాటిపై కూర్చుండెను. ఈ విధముగా దర్భలపై ఆసీనుడైయున్న అంగదునిజూచి, వానరప్రముఖులు అందఱును దుఃఖముతో రోదించుచు వేడివేడి కన్నీరు గార్చిరి. పిమ్మట వారు సుగ్రీవుని నిందించుచు వాలిని ప్రశంసింపసాగిరి. అనంతరము అంగదునిచుట్టును జేరి, తామును ఆమరణనిరాహారదీక్ష చేయుటకు నిశ్చయించుకొనిరి. (16-18)

అంగదునిఅభిప్రాయమును గుర్తించి, వానరులెల్లరును నీటిని ఆచమించి, అచ్చటనే తూర్పుదిక్కునకు మళ్లి కూర్చుండిరి. వారు సముద్రమునకు ఉత్తరతీరమున దక్షిణమునకు కొనలు ఉండునట్లుగా దర్భలను పఱచుకొని, వాటిపైచేరిరి. పిమ్మట ఆ వానరశ్రేష్ఠులు తాము ఈ విధముగా తనువులను చాలించుటయే యుక్తమని తలంచిరి. (19-20)

రామస్య వనవాసం చ క్షయం దశరథస్య చ।
జనస్థానవధం చైవ వధం చైవ జటాయుషః। 21

హరణం చైవ వైదేహ్యా వాలినశ్చ వధం రణే।
రామకోపం చ వదతాం హరీణాం భయమాగతమ్। 22

తదుపరి ఆ వానరులు 'శ్రీరామునివనవాసమును, దశరథునిమరణమును, దండకారణ్యమున ఖరదూషణాదుల సంహారమును, జటాయువుయొక్క మరణమును, రావణునిచే సీతాపహరణమును, వాలివధను, శ్రీరాముని కోపమునుగూర్చి పరస్పరము సంభాషించుకొనుచు భయభ్రాంతులైరి. (21-22)

స సంవిశద్భిర్బహుభి ర్మహీధరో
మహాద్రికూటప్రతిమైః ప్లవంగమైః।
బభూవ సన్నాదితనిర్ఝరాంతరో
భృశం నదద్భిర్జలదై రివోల్బణైః। 23

మహాపర్వతశిఖరములవలె ఉన్నతములైన శరీరములుగల అసంఖ్యాకులైన వానరులు భయముతో బిగ్గఱగా కేకలు వేయసాగిరి. అవి ఆపర్వతగుహలయందు అంతటను ప్రతిధ్వనించెను అప్పుడు ఆ పర్వతము మేఘగర్జనలతో నిండిన ఆకాశమువలె ప్రతీతమయ్యెను. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే పంచపంచాశఃసర్గః (55)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదిఐదవసర్గము

— * * * —

56. ఏబదిఆఱవసర్గము

గిరిశిఖరముననున్న గృధ్రరాజగు సంపాతి ప్రాయోపవేశమునకు దిగిన వానరులను జూచుట - 'వీరందఱును నాకు ఆహారమగుదురు - ఇది విధి విలాసము' - అని అతడు పల్కుట - విచారగ్రస్తుడైయున్న అంగదుడు ఆ మాటలను విని, హనుమంతునితో గత సంఘటనలను గూర్చి తెలుపుచు జటాయువు యొక్క ఔన్నత్యమును, మృతిని ప్రస్తావించుట - సోదరుడగు జటాయువుప్రస్తావనను వినినంతనే సంపాతి వానరులతో స్నేహపూర్వకముగా మాట్లాడుట -

ఉపవిష్టాస్తు తే సర్వే యస్మిన్ ప్రాయం గిరిస్థలే।
హరయో గృధ్రరాజశ్చ తం దేశమ్ ఉపచక్రమే। 1

సంపాతిర్నామ నామ్నా తు చిరంజీవీ విహంగమః।
భ్రాతా జటాయుషః శ్రీమాన్ ప్రఖ్యాతబలపౌరుషః। 2

ఆ వానరులందఱును ప్రాయోపవేశమునకు సిద్ధమై కూర్చొనియున్న ప్రదేశమునకు సమీపమున ఒకానొక గృధ్రరాజు చేరెను. ఆ పక్షిరాజుపేరు సంపాతి. అతడు చిరంజీవి, బలపరాక్రమములచే సుప్రసిద్ధుడు, ఉపకార స్వభావముగలవాడు. జటాయువునకు సోదరుడు. (1-2)

కందరాదభినిష్క్రమ్య స వింధ్యస్య మహాగిరేః।
ఉపవిష్టాన్ హరీన్ దృష్ట్వా హృష్టాత్మా గిరమబ్రవీత్। 3

వింధ్యమహాపర్వతగుహనుండి బయటికివచ్చి, ఆ పక్షిరాజు అచటకూర్చొనియున్న వానరులను జూచి మిక్కిలి సంతోషముతో ఇట్లు నుడివెను. (3)

విధిః కిల నరం లోకే విధానేనానువర్తతే।
యథాఽయం విహితో భక్ష్యః చిరాన్మహ్యమ్ ఉపాగతః। 4

"మానవుడు పూర్వజన్మలో చేసికొనిన సుకృతములనుబట్టి అతనియోగక్షేమములను భగవంతుడే చూచుకొనును సుమా! కనుక దైవవశమున చాలాకాలముతరువాత అప్రయత్నముగనే ఆహారము నేడు నానోటిముందునకు వచ్చినది. (4)

పరం పరాణాం భక్షిష్యే వానరాణాం మృతం మృతం।
ఉవాచేదం వచః పక్షీ తాన్ నిరీక్ష్య ప్లవంగమాన్। 5

ఆ సంపాతి వానరులనుజూచి, 'ఈ ప్రాయోపవేశమునకు పూనుకొనిన వానరులలో మరణించిన వారిని వరుసగా (ఒకరి తరువాత మఱియొకరిని) భక్షింతును.' అని పల్కెను- (5)

తస్య తద్వచనం శ్రుత్వా భక్ష్యలుబ్ధస్య పక్షిణః।
అంగదః పరమాయస్తో హనుమంతమ్ అథాఽబ్రవీత్। 6

ఆహారముకొఱకై ఆరాటపడుచున్న ఆ పక్షియొక్క మాటలను విని, అంగదుడు మిగుల ఉద్విగ్నుడై హనుమంతునితో ఇట్లనెను. (6)

పశ్య సీతాపదేశేన సాక్షాద్వైవస్వతో యమః।
ఇమం దేశమ్ అనుప్రాప్తో వానరాణాం విపత్తయే। 7

రామస్య న కృతం కార్యం రాజ్ఞో న చ వచః కృతమ్।
హరీణామియమజ్ఞాతా విపత్తిః సహసాగతా। 8

వైదేహ్యాః ప్రియకామేన కృతం కర్మ జటాయుషా।
గృధ్రరాజేన యత్ తత్ర శ్రుతం వ స్తదశేషతః। 9

తథా సర్వాణి భూతాని తిర్యగ్యోనిగతాన్యపి।
ప్రియం కుర్వంతి రామస్య త్యక్త్వా ప్రాణాన్ యథా వయం।
అన్యోఽన్యమ్ ఉపకుర్వంతి స్నేహకారుణ్యయంత్రితాః। 10

తేన తస్యోపకారార్థం త్యజతాత్మానమాత్మనా।
ప్రియం కృతం హి రామస్య ధర్మజ్ఞేన జటాయుషా। 11

రాఘవార్థే పరిశ్రాంతా వయం సంత్యక్తజీవితాః।
కాంతారాణి ప్రపన్నాః స్మ న చ పశ్యామ మైథిలీమ్। 12

స సుఖీ గృధ్రరాజస్తు రావణేన హతో రణే।
ముక్తశ్చ సుగ్రీవభయాత్ గతశ్చ పరమాం గతిమ్। 13

జటాయుషో వినాశేన రాజ్ఞో దశరథస్య చ।
హరణేన చ వైదేహ్యాః సంశయం హరయో గతాః। 14

రామలక్ష్మణయోర్వాస అరణ్యే సహ సీతయా।
రాఘవస్య చ బాణేన వాలినశ్చ తథా వధః। 15

రామకోపాదశేషాణాం రాక్షసానాం తథా వధః।
కైకేయ్యా వరదానేన ఇదం హి వికృతం కృతమ్। 16

తదసుఖమనుకీర్తితం వచో
భువి పతితాంశ్చ సమీక్ష్య వానరాన్।
భృశచలితమతిర్మహామతిః
కృపణముదాహృతవాన్ స గృధ్రరాట్। 17

తత్తు శ్రుత్వా తదా వాక్యమ్ అంగదస్య ముఖోద్గతం।
అబ్రవీద్వచనం గృధ్రః తీక్ష్ణతుండో మహాస్వనః। 18

"ఓ మారుతీ! చూడుము. సీతాన్వేషణనిమిత్తమై ఇచటికి వచ్చిన వానరులకు ఆపదను కల్గించుటకై సాక్షాత్తుగా సూర్యపుత్రుడైన ఆ యముడే ఇటు వచ్చినాడు. ఇంతవఱకును శ్రీరామునికార్యమూ నెఱవేఱలేదు. సుగ్రీవునిఆదేశమూ పూర్తిచేయుట జరుగలేదు. ఇంతలో అనుకొనకుండగనే హఠాత్తుగా మనపై ఈ ఆపద వచ్చిపడినది. గృధ్రరాజైన జటాయువు సీతాదేవిని ఆదుకొనుటకై చేసిన సాహసకార్యమును గూర్చి మీరు పూర్తిగా వినియేయుంటిరి. పశుపక్ష్యాది సమస్తప్రాణులును మనవలె ప్రాణములకు తెగించి శ్రీరామునకు ప్రియమును చేయుచున్నవి (సహాయపడుచున్నవి.) మిత్రులు, దయాపరులైనవారు ఈ విధముగా పరస్పరము తోడ్పడుచుందురు. అందువలన ఆ ప్రభువునకు మేలుచేయుటకొఱకై మనము ప్రాణత్యాగము చేయుదము. ధర్మజ్ఞుడైన జటాయువు శ్రీరామునకు ప్రియమును గూర్చెను. (7-11)

రఘువీరుని కార్యమునకై జీవితములపై ఆశను వీడి మిక్కిలి శ్రమపడితిమి. పెక్కు అడవులను గాలించితిమి. ఐనను సీతాదేవి జాడను కనుగొనలేకపోయితిమి. (12)

యుద్ధమున రావణునిచే హతుడైన గృధ్రరాజగు జటాయువే నిజముగా అదృష్టవంతుడు అతనికి మనవలె సుగ్రీవునిబాధ లేకుండపోయినది. పైగా పరమగతి ప్రాప్తించినది. (13)

దశరథమహారాజు స్వర్గస్థుడగుట, జటాయువు హతుడగుట, సీతాదేవి అపహరణకు గుఱియగుట. ఈ సంఘటనలన్నియును వానరులజీవితములకే సందేహమును తెచ్చిపెట్టినవి. రామలక్ష్మణులు సీతాదేవితో సహ వనవాసము చేసిరి. శ్రీరాముడు ఒకే ఒక్క బాణముతో వాలిని వధించివేసెను. ఇంక ఆ రఘువీరుని ఆగ్రహమునకులోనై రాక్షసులందఱును మృత్యువుపాలు కానున్నారు. ఈ విపరీతసంఘటనలు అన్నియును కైకేయి పొందిన వరదానఫలితములేగదా!" (14-16)

వానరులు విచారముతో పదేపదే పలికిన మాటలను విని సంపాతి ఎంతయు నొచ్చుకొనెను. ప్రాయోపవేశ దీక్షలో నేలపైబడియున్న వానరులను గాంచి అతడు మిక్కిలి చలించిపోయెను. పిమ్మట మహాత్ముడైన ఆ గృధ్రరాజు దీనముగా ఇట్లు నుడివెను. (17)

వాడియైన ముక్కుగలవాడగు ఆగృధ్రరాజు అంగదుని నోట వెలువడిన మాటలను విని, ఉచ్చస్వరముతో ఇట్లు పలికెను. (18)

కో௨యం గిరా ఘోషయతి ప్రాణైః ప్రియతమస్య మే।
జటాయుషో వధం భ్రాతుః కంపయన్నివ మే మనః। 19

కథమాసీజ్జనస్థానే యుద్ధం రాక్షసగృధ్రయోః।
నామధేయమిదం భ్రాతుః చిరస్యాద్య మయా శ్రుతమ్। 20

ఇచ్ఛేయం గిరిదుర్గాచ్చ భవద్భిరవతారితుమ్। 21

"నా సోదరుడైన జటాయువుయొక్క వధనుగూర్చి ప్రకటించుచున్న ఈ వ్యక్తి ఎవరు? అతడు నాకు ప్రాణములకంటెను ప్రియతముడు. ఈ వచనములు నా మనస్సును ఆందోళన పఱచుచున్నవి. దండకారణ్యమునందు నా సోదరునకును రాక్షసునకును యుద్ధము ఎట్లు సంభవించినది? చాలా కాలమునకు ఇప్పుడు నా తమ్మునిపేరు నా చెవికి సోకినది. మహాత్ములారా! నన్ను ఈ గిరిశిఖరమునుండి దయతో క్రిందికి దింపుడు. (19-21)

యవీయసో గుణజ్ఞస్య శ్లాఘనీయస్య విక్రమైః।
అతిదీర్ఘస్య కాలస్య తుష్టో௨స్మి పరికీర్తనాత్। 22

తదిచ్ఛేయమహం శ్రోతుం వినాశం వానరర్షభాః।
భ్రాతుర్జటాయుషస్తస్య జనస్థాననివాసినః। 23

నా తమ్ముడు మిగుల సద్గుణములు గలవాడు. అతని బలపరాక్రమములు మిగుల కొనియాడదగినవి. ఎంతోకాలముతరువాత అతనిని గుఱించి విని, మిగుల సంతుష్టుడనైతిని. ఓ వానరప్రముఖులారా! దండకారణ్యమునందు నివసించుచున్న నా తమ్ముడగు జటాయువు యొక్క వధ ఎట్లు జరిగినది? నేను వినగోరుచున్నాను. దయతో వివరింపుడు. (22-23)

తస్యైవ చ మమ భ్రాతుః సఖా దశరథః కథం।
యస్య రామః ప్రియః పుత్త్రో జ్యేష్ఠో గురుజనప్రియః। 24

పెద్దలయొక్క ఆదరాభిమానములకు పాత్రుడైన శ్రీరాముడు దశరథునకు ప్రియమైన జ్యేష్ఠకుమారుడు. అట్టి దశరథుడు నా సోదరునకు మిత్రుడెట్లయ్యెను? (24)

సూర్యాంశుదగ్ధపక్షత్వాత్ న శక్నోమ్యుపసర్పితుం।
ఇచ్ఛేయం పర్వతాదస్మాత్ అవతర్తుమ్ అరిందమాః। 25

శత్రుసంహారమునందు సమర్థులైన ఓ వానరులారా! సూర్యకిరణములవేడికి నాఱెక్కలు మాడిపోయినవి. అందువలన నేను ఎగురజాలను. కనుక నేను స్వయముగా మీకడకు వచ్చుటకు అశక్తుడను. కాబట్టి నన్ను ఈ పర్వతముమీదినుండి దయతో క్రిందికి దింపుడు." (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే షట్పంచాశఃసర్గః *(56)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదిఆఱవసర్గము

-- * * * --

57. ఏబదిఏడవసర్గము

'సంపాతివలనగాని, ప్రాయోపవేశకారణమున గాని మనము మృతిచెందుట తథ్యము' - అని వానరులు నిశ్చయించుకొనుట - పిదప అంగదుడు సంపాతిని సమీపించి, శ్రీరాముని వనవాసగాథను, సీతాపహరణ కథను, దశరథ జటాయువుల మైత్రిని, రావణునివలన జటాయుమృతిని, వాలి వధను, సీతాదేవికొఱకై తమ అన్వేషణ వృత్తాంతమును వివరించుట.

శోకాత్ భ్రష్టస్వరమపి శ్రుత్వా తే హరియూథపాః।
శ్రద్దధుర్నైవ తద్వాక్యం కర్మణా తస్య శంకితాః। 1

సోదరునిమృతివార్త విని, దుఃఖితుడైయున్న సంపాతియొక్క కంఠస్వరము గద్గదమయ్యెను. వానర యోధులు అతనిమాటలు వినియు వాటిపై వారికి విశ్వాసము ఏర్పడలేదు. ఏలనన అతడు తమను చంపునేమోయను శంక వారిమనస్సులలో మెదలుచుండెను.(1)

తే ప్రాయముపవిష్టాస్తు దృష్ట్వా గృధ్రం ప్లవంగమాః।
చక్రుర్బుద్ధిం తదా రౌద్రాం సర్వాన్ నో భక్షయిష్యతి। 2

సర్వథా ప్రాయమాసీనాన్ యది నో భక్షయిష్యతి।
కృతకృత్యా భవిష్యామః క్షిప్రం సిద్ధిమితో గతాః।
ఏతాం బుద్ధిం తతశ్చక్రుః సర్వే తే వానరర్షభాః। 3

ప్రాయోపవేశమునకు కూర్చొనియున్న ఆవానరులు ఆ గృధ్రరాజును చూచి, అతడు తమను తినివేయునని తలంపుతో వారు మానసికముగా ఉద్రేకమునకు లోనైరి. పిమ్మట ఆ కపిశ్రేష్ఠులు అందఱును. "మనము పూర్తిగా ప్రాణత్యాగమునకు సిద్ధపడియే ఈ ప్రాయోపవేశదీక్షకు దిగితిమి. ఇప్పుడు అతడు మనలను భక్షించినచో మనసంకల్పమే నెఱవేఱును. అంతట మనము కృతకృత్యులమగుదుము." అని నిర్ణయించుకొనిరి.(2-3)

అవతార్య గిరేః శృంగాత్ గృధ్రమ్ ఆహాంగదస్తదా। 4

బభూవర్క్షరజా నామ వానరేంద్రః ప్రతాపవాన్।
మమార్యః పార్థివః పక్షిన్ ధార్మికస్తస్య చాత్మజౌ। 5

సుగ్రీవశ్చైవ వాలీ చ పుత్త్రావోఘబలావుభౌ।
లోకే విశ్రుతకర్మాభూత్ రాజా వాలీ పితా మమ। 6

పిమ్మట అంగదుడు గిరిశృంగమునుండి క్రిందికి దిగి సంపాతితో ఇట్లు వచించెను. "ఓ పక్షిరాజా! పూర్వము 'ఋక్షరజుడు' అను ఒక వానరేంద్రుడు ఉండెను. అతడు మా పితామహుడు, మిగులప్రతాపశాలి, ధార్మికుడైన ప్రభువు. వాలిసుగ్రీవులు ఆయనకుమారులు. ఆ ఇద్దరును అమోఘబలశాలులు. మా తండ్రి యగువాలి వానరులకు ప్రభువు. అతడు కార్యశూరుడుగా లోకమున ఖ్యాతి వహించినవాడు. (4-6)

రాజా కృత్స్నస్య జగత ఇక్ష్వాకూణాం మహారథః।
రామో దాశరథిః శ్రీమాన్ ప్రవిష్టో దండకావనమ్। 7

లక్ష్మణేన సహ భ్రాత్రా వైదేహ్యా చాపి భార్యయా।
పితుర్నిదేశనిరతో ధర్మ్యం పంథానమాశ్రితః।
తస్య భార్యా జనస్థానాత్ రావణేన హృతా బలాత్। 8

దశరథమహారాజుయొక్క కుమారుడు శ్రీరాముడు. ఆ జగత్ప్రభువు ఇక్ష్వాకువంశమువారిలో ప్రముఖుడు. సద్గుణసంపన్నుడైన ఆ రఘువీరుడు తన భార్యయగు సీతాదేవితో, తమ్ముడగు లక్ష్మణునితోగూడి దండకారణ్యమున ప్రవేశించెను. అతడు తండ్రియాజ్ఞను పాలించుటలో నిరతుడు. నిరంతరము ధర్మమార్గమునే అనుసరించెడివాడు. వారు దండకారణ్యమున ఉన్నప్పుడు ఆయనధర్మపత్నియగు సీతాదేవిని రావణుడు అపహరించుకొనిపోయెను. (7-8)

రామస్య తు పితుర్మిత్రం జటాయుర్నామ గృధ్రరాట్।
దదర్శ సీతాం వైదేహీం హ్రియమాణాం విహాయసా। 9

రావణం విరథం కృత్వా స్థాపయిత్వా చ మైథిలీం।
పరిశ్రాంతశ్చ వృద్ధశ్చ రావణేన హతో రణే। 10

ఏవం గృధ్రో హతస్తేన రావణేన బలీయసా।
సంస్కృతశ్చాపి రామేణ గతశ్చ గతిముత్తమామ్। 11

శ్రీరామునితండ్రియైన దశరథమహారాజునకు గృధ్రరాజైన జటాయువు పరమమిత్రుడు. రావణుడు సీతాదేవిని అపహరించుకొని ఆకాశమున వెళ్లుచుండగా అతడు గమనించెను. వెంటనే జటాయువు రావణుని ఎదుర్కొని, వానిరథమును భగ్నమొనర్చెను. సీతాదేవికి అండగానిలిచెను. అంతట వృద్ధుడైన జటాయువు సాహసముతో పోరాడియు యుద్ధమున రావణునిచే హతుడయ్యెను. ఈ విధముగా బలశాలియైన ఆ రావణునిచే ఆ గృధ్రరాజు హతుడైన పిమ్మట శ్రీరాముడు అతనికి అంత్యసంస్కారములను నెఱపెను. రామకార్యార్థమై అసువులను అర్పించిన ఆ జటాయువునకు ఉత్తమగతులు ప్రాప్తించెను. (9-11)

తతో మమ పితృవ్యేణ సుగ్రీవేణ మహాత్మనా।
చకార రాఘవః సఖ్యం సోఽవధీత్ పితరం మమ।
మమ పిత్రా విరుద్ధో హి సుగ్రీవః సచివైః సహ। 12

అనంతరము శ్రీరాముడు మాకు పినతండ్రియు, మహాత్ముడును ఐన సుగ్రీవునితో మైత్రి ఏర్పఱచుకొనెను. సుగ్రీవుని ఆదుకొనుటకై అతడు మాతండ్రిని వధించెను.

నిహత్య వాలినం రామః తత స్తమభిషేచయత్। 13

స రాజ్యే స్థాపితస్తేన సుగ్రీవో వానరాధిపః।
రాజా వానరముఖ్యానాం యేన ప్రస్థాపితా వయమ్। 14

సుగ్రీవునితోడను, అతని మంత్రులతోడను మా తండ్రికి విరోధము ఉన్నందున శ్రీరాముడు వాలిని హతమార్చి, సుగ్రీవుని పట్టాభిషిక్తుని గావించెను. శ్రీరామునిసహాయముతో వానరులకు ప్రభువై, రాజ్యాధికారమును చేబట్టిన సుగ్రీవుడు సీతాన్వేషణనిమిత్తమై మమ్ములను ఇటు పంపెను. (12-14)

ఏవం రామప్రయుక్తాస్తు మార్గమాణాస్తతస్తతః।
వైదేహీం నాఽధిగచ్ఛామో రాత్రౌ సూర్యప్రభామివ। 15

తే వయం దండకారణ్యం విచిత్య సుసమాహితాః।
అజ్ఞానాత్తు ప్రవిష్టాః స్మ ధరణ్యా వివృతం బిలమ్। 16

మయస్య మాయావిహితం తద్బిలం చ విచిన్వతాం।
వ్యతీత స్తత్ర నో మాసో యో రాజ్ఞా సమయః కృతః। 17

తే వయం కపిరాజస్య సర్వే వచనకారిణః।
కృతాం సంస్థామ్ అతిక్రాంతా భయాత్ ప్రాయమ్ ఉపాస్మహే। 18

క్రుద్ధే తస్మింస్తు కాకుత్స్థే సుగ్రీవే చ సలక్ష్మణే।
గతానామపి సర్వేషాం తత్ర నో నాస్తి జీవితమ్। 19

శ్రీరాముని కార్యార్థమై ఇటు బయలుదేఱినమేము అన్నివైపులయందును సీతాదేవికొఱకై నిశితముగా గాలించితిమి. కాని రాత్రివేళ సూర్యకాంతివలె మాకు ఆమె దర్శనము కాలేదు. ఆ అన్వేషణలో ఉన్నట్టి మేము ఏకాగ్రచిత్తులమై దండకారణ్యమును అంతయును గాలించుచు, విశాలమైన ఒక గుహయందు అజ్ఞానవశమున ప్రవేశించితిమి. అది ఒక ధర్మాత్మురాలిది. ఆ బిలమును మయుడు అను దానవుడు తనమాయచే నిర్మించెను. సీతాదేవిజాడకై అందుగాలించుచుండగనే, మా ప్రభువు (సుగ్రీవుడు) మాకు విధించిన మాసముగడువు ముగిసినది. కపిరాజుయొక్క ఆజ్ఞను మేము ఎల్లప్పుడును శిరసావహించు చుందుము. అట్టి మేము ఆయన పెట్టిన అవధిని అతిక్రమించుటచే భయముతో ప్రాణత్యాగమునకై ప్రాయోపవేశమునకు దిగితిమి. మేము అందఱము వచ్చిన పనిని పూర్తిచేయక అచటికి వెళ్ళినను రామలక్ష్మణులును, సుగ్రీవుడును క్రుద్ధులగుదురు, అప్పుడు మా ప్రాణములెట్లును మిగులవు. (15-19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే సప్తపంచాశః సర్గః *(57)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదిఏడవసర్గము

— * * * —

58. ఏబదిఎనిమిదవసర్గము

జటాయువు తన తమ్ముడే యనియు, అతనితో గలిసి సూర్యమండలమునకు ఎగిరినప్పుడు తన ఱెక్కలు కాలి తాను వింధ్యపర్వతముపై పడిన విషయమునూ సంపాతి వానరులకు తెల్పుట - సీతాదేవి జాడను, రావణుని నివాసమునుగూర్చి తెల్పుమని అంగదుడు కోరుట - రావణుడు సీతాదేవిని అపహరించిన విషయమును, ప్రస్తుతము ఆమె లంకలో ఉన్న సంగతిని సంపాతి వానరులకు వివరించుట.

ఇత్యుక్తః కరుణం వాక్యం వానరైస్త్యక్తజీవితైః।
సబాష్పో వానరాన్ గృధ్రః ప్రత్యువాచ మహాస్వనః। 1

ప్రాణములమీద ఆశలను వదలుకొనిన వానరులయొక్క దైన్యవచనములను వినిన పిదప సంపాతి కంటతడిబెట్టెను. పిమ్మట అతడు వారితో బిగ్గఱగా ఇట్లనుడివెను. (1)

యవీయాన్ మమ స భ్రాతా జటాయుర్నామ వానరాః।
యమాఖ్యాత హతం యుద్ధే రావణేన బలీయసా। 2

"ఓ వానరులారా! బలశాలియైన రావణునిచే హతుడైనట్లు మీరు తెలిపిన ఆ జటాయువు నాకు తోబుట్టువు, తమ్ముడు. నేను ఇప్పుడు వృద్ధుడను, పైగా ఱెక్కలు కాలిపోయియున్నవాడను. కనుక నా సోదరుని చంపిన దుష్టరావణునిపై పగదీర్చుకొనుటకు అశక్తుడను.

వృద్ధభావాదపక్షత్వాత్ శృణ్వన్ తదపి మర్షయే।
న హి మే శక్తిరస్త్యద్య భ్రాతుర్వైరవిమోక్షణే। 3

పురా వృత్రవధే వృత్తే పరస్పరజయైషిణౌ।
ఆదిత్యమ్ ఉపయాతౌ స్వో జ్వలంతం రశ్మిమాలినమ్। 4

ఆవృత్త్యాకాశమార్గే తు జవేన స్మ గతౌ భృశం।
మధ్యం ప్రాప్తే దినకరే జటాయురవసీదతి। 5

తమహం భ్రాతరం దృష్ట్వా సూర్యరశ్మిభిరర్దితం।
పక్షాభ్యాం ఛాదయామాస స్నేహాత్ పరమవిహ్వలః। 6

నిర్దగ్ధపక్షః పతితో వింధ్యేఽహం వానరర్షభాః।
అహమస్మిన్ వసన్ భ్రాతుః ప్రవృత్తిం నోపలక్షయే। 7

జటాయుషస్త్వేవముక్తో భ్రాత్రా సంపాతినా తదా।
యువరాజో మహాప్రాజ్ఞః ప్రత్యువాచాంగదస్తదా। 8

జటాయుషో యది భ్రాతా శ్రుతం తే గదితం మయా।
ఆఖ్యాహి యది జానాసి నిలయం తస్య రక్షసః। 9

అదీర్ఘదర్శినం తం వై రావణం రాక్షసాధిపం।
అంతికే యది వా దూరే యది జానాసి శంస నః। 10

తతోఽబ్రవీన్మహాతేజా జ్యేష్ఠో భ్రాతా జటాయుషః।
ఆత్మానురూపం వచనం వానరాన్ సంప్రహర్షయన్। 11

నిర్దగ్ధపక్షో గృధ్రోఽహం హీనవీర్యః ప్లవంగమాః।
వాఙ్మాత్రేణ తు రామస్య కరిష్యే సాహ్యముత్తమమ్। 12

జానామి వారుణాన్ లోకాన్ విష్ణోస్త్రైవిక్రమానపి।
మహాసురవిమర్దాన్వాఽప్యమృతస్య చ మంథనమ్। 13

రామస్య యదిదం కార్యం కర్తవ్యం ప్రథమం మయా।
జరయా చ హృతం తేజః ప్రాణాశ్చ శిథిలా మమ। 14

అందువలన ఇంతటి బాధాకరమైన వార్తను వినియు నేను మౌనముగా సహించుచుంటిని. (2-3)

పూర్వము వృత్రాసురవధ జరిగినప్పుడు మేము అన్నదమ్ములము ఇద్దరము 'ఆకాశమున వేగముగా ఎగిరెడి విషయమున' పరస్పరము పోటీపడి, వేడికిరణములతో వెలుగుచున్న సూర్యమండలమును సమీపించితిమి. మిక్కిలి వేగముగా ఎగిరి వినువీధికి చేరితిమి. మధ్యాహ్నసమయమున సూర్యకిరణముల వేడికి తట్టుకొనలేక జటాయువుయొక్క శక్తి క్షీణించెను. అంతట సూర్యకిరణముల తాపమును భరింపలేక విలవిలలాడుచున్న నాతమ్ముని జూచి, నేను మిక్కిలి బాధపడితిని. వెంటనే ప్రేమతో అతనిపై నా ఱెక్కలను కప్పితిని. ఓ వానరోత్తములారా! సూర్యకిరణముల వేడికి నా ఱెక్కలు మాడిపోగా ఈ వింధ్యపర్వతముపై పడిపోయితిని. అప్పటినుండి నేను ఇక్కడనే నివసించుచుంటిని. తదాది నా తమ్ముని జాడయే నాకు తెలియకుండెను." (4-7)

జటాయువుయొక్క అన్నయగు సంపాతి ఇట్లు పలుకగా, మిగుల తెలివిగలవాడు, యువరాజు ఐన అంగదుడు అతనితో ఈ విధముగా నుడివెను. (8)

"ఓ పక్షిరాజా! నీవు చెప్పినదంతయును నేను వింటిని. నీవు వాస్తవముగా జటాయువునకు సోదరుడవైనచో, ఒకవేళ ఆ రాక్షసునినివాసము తెలిసియున్నయెడల దయతో వివరింపుము. రాక్షసుడైన ఆ రావణుడు త్వరలోరానున్న అనర్థములను గుర్తింపలేకయున్నాడు. 'అతడు ఇక్కడికి సమీపముననే యున్నాడా? లేక దూరప్రదేశమున ఉన్నాడా?' నీవు ఎఱింగినచో తెల్పుము."(9-10)

జటాయువునకు అన్నయు, మహాశక్తిశాలియు ఐన సంపాతి వానరులకు సంతోషమును గూర్చుచు తనకు అనుగుణమైన రీతిలో ఇట్లు నుడివెను. (11)

"ఓ వానరులారా! నేను ఱెక్కలు కాలిన పక్షిని, శక్తిహీనుడను, నాకు చేతనైనంతలో శ్రీరామునకు మాట సాయము చేయగలను. నేను అతల, వితలాదివరుణ లోకములను, (అధోలోకములను) విష్ణువు త్రివిక్రమ - (వామన) అవతారమున ఆక్రమించిన ఊర్ధ్వలోకములను బాగుగా ఎఱుగుదును. దేవాసుర సంగ్రామములు, అమృతార్థమై జరిగిన క్షీరసాగరము నాకు తెలియును. వృద్ధావస్థచే నాశక్తి ఉడిగియున్నను, ప్రాణశక్తి క్షీణించినను శ్రీరామునికార్యమునకు తోడ్పడుటయే నాప్రథమ కర్తవ్యము. (12-14)

తరుణీ రూపసంపన్నా సర్వాభరణభూషితా।
హ్రియమాణా మయా దృష్టా రావణేన దురాత్మనా। 15

క్రోశంతీ రామ రామేతి లక్ష్మణేతి చ భామినీ।
భూషణాన్యపవిధ్యంతీ గాత్రాణి చ విధూన్వతీ। 16

సూర్యప్రభేవ శైలాగ్రే తస్యాః కౌశేయముత్తమం।
అసితే రాక్షసే భాతి యథా వా తటిదంబుదే। 17

తాం తు సీతామ్ అహం మన్యే రామస్య పరికీర్తనాత్।
శ్రూయతాం మే కథయతో నిలయం తస్య రక్షసః। 18

పుత్రో విశ్రవసః సాక్షాత్ భ్రాతా వైశ్రవణస్య చ।
అధ్యాస్తే నగరీం లంకాం రావణో నామ రాక్షసః। 19

ఇతో ద్వీపః సముద్రస్య సంపూర్ణే శతయోజనే।
తస్మిన్ లంకాపురీ రమ్యా నిర్మితా విశ్వకర్మణా। 20

జాంబూనదమయైర్ద్వారైః చిత్రైః కాంచనవేదికైః।
ప్రాకారేణాఽర్కవర్ణేన మహతా సుసమావృతా। 21

తస్యాం వసతి వైదేహీ దీనా కౌశేయవాసినీ।
రావణాంతఃపురే రుద్ధా రాక్షసీభిః సురక్షితా। 22

జనకస్యాత్మజాం రాజ్ఞః తత్ర ద్రక్ష్యథ మైథిలీమ్।
లంకాయామథ గుప్తాయాం సాగరేణ సమంతతః। 23

సంప్రాప్య సాగరస్యాంతం సంపూర్ణం శతయోజనం।
ఆసాద్య దక్షిణం తీరం తతో ద్రక్ష్యథ రావణమ్। 24

తత్రైవ త్వరితాః క్షిప్రం విక్రమధ్వం ప్లవంగమాః।
జ్ఞానేన ఖలు పశ్యామి దృష్ట్వా ప్రత్యాగమిష్యథ। 25

ఆద్యః పంథాః కులింగానాం యే చాఽన్యే ధాన్యజీవినః।
ద్వితీయో బలిభోజానాం యే చ వృక్షఫలాశినః। 26

చక్కని రూపసంపదగలిగి, వివిధములగు ఆభరణములను ధరించియున్న ఒక తరుణిని దుర్మార్గుడైన రావణుడు అపహరించుకొనిపోవుచుండగా నేను చూచితిని. ఆ స్త్రీ రామా! రామా! లక్ష్మణా! అని వాపోవుచుండెను. ఆమె తన ఆభరణములను తీసివేయుచుండెను. ఆమె శరీరమంతయును వణకిపోవుచుండెను. ఉదయాద్రిపై ప్రసరించుచున్న సూర్యకాంతులవలె ఆమెపట్టుపీతాంబరము శోభిల్లుచుండెను. నల్లని రాక్షసునిప్రక్కనున్న ఆతరుణి మేఘముప్రక్కన మెఱయుచున్న మెఱుపుతీగవలె ఒప్పుచుండెను. పదేపదే శ్రీరాముని నామమును స్మరించుచున్నందున 'ఆ తరుణి సీతయే' అని నేను తలంతును. ఇంక ఆ రాక్షసుని నిలయమును గూర్చి తెల్పెదను వినుడు. (15-18)

ఓ వానరులారా! ఆ రాక్షసుని పేరు రావణుడు. అతడు విశ్రవసునియొక్క ఔరస పుత్త్రుడు, కుబేరుని సోదరుడు. లంకానగరము అతని నివాసము. ఇచటికి వందయోజనములదూరమున సముద్రమునడుమ ఒక ద్వీపము గలదు. విశ్వకర్మ లంకానగరమును నిర్మించెను. అది మిగులరమ్యమైనది. అందలి గృహద్వారములు సువర్ణమయములు, బంగారు వేదికలు చిత్రములైనవి. ఆనగరమునకు చుట్టునుగల మహాప్రాకారములు సూర్యకాంతులతో తేజరిల్లుచుండును. (19-21)

సీతాదేవి ఆ లంకయందలి రావణునిఅంతఃపురమునందు బంధింపబడియున్నది. ఆమె పట్టువస్త్రమును దాల్చియున్నది. దీనురాలైయున్న ఆ సీతామాతను రాక్షసస్త్రీలు కావలాకాయుచున్నారు. లంకానగరముచుట్టునుగల సముద్రము దానిని రక్షించుచున్నది. జనకమహారాజుకూతురైన మైథిలిని అక్కడ చూడగలరు. సముద్రముమీద పూర్తిగా నూఱుయోజనములదూరము ప్రయాణించిన పిమ్మట, దాని దక్షిణ తీరమునగల లంకలో రావణుని చూడగలరు. కనుక ఓ వానరులారా! వెంటనే మీ పరాక్రమమును చూపుచు సముద్రమును లంఘించుటకు త్వరపడుడు. మీరు అక్కడ అవశ్యము సీతాదేవిని దర్శించి క్షేమముగా తిరిగిరాగలరు. నా దివ్యదృష్టితో చూచి పలుకుచున్న మాటలివి. (22-25)

పావురములు, ధాన్యమును (గింజలను) తినిజీవించెడి పక్షులు భూమికి కొంతదూరముననే ఆకాశమున ఎగురగలవు. అది మొదటిమార్గము. కాకులు, చెట్ల పండ్లను భక్షించెడి ఇతరపక్షులు మఱికొంత ఎత్తున పయనింపగలవు. అది రెండవ మార్గము. నీటికాకులు, క్రౌంచపక్షులు, లకుముకి పిట్టలు అంతకంటెను ఎత్తునగల మూడవమార్గమున సంచరింపగలవు. దానికంటెను పైనగల నాల్గవ మార్గమున డేగలును,

భాసాస్తృతీయం గచ్ఛంతి క్రౌంచాశ్చ కురరైస్సహ।
శ్యేనాశ్చతుర్థం గచ్ఛంతి గృధ్రా గచ్ఛంతి పంచమమ్। 27

బలవీర్యోపపన్నానాం రూపయౌవనశాలినామ్।
షష్ఠస్తు పంథా హంసానాం వైనతేయగతిః పరా।
వైనతేయాచ్చ నో జన్మ సర్వేషాం వానరర్షభాః। 28

ఇహస్థోఽహం ప్రపశ్యామి రావణం జానకీం తథా।
అస్మాకమపి సౌపర్ణం దివ్యం చక్షుర్బలం తథా। 29

తస్మాదాహారవీర్యేణ నిసర్గేణ చ వానరాః।
ఆయోజనశతాత్ సాగ్రాత్ వయం పశ్యామ నిత్యశః। 30

అస్మాకం విహితా వృత్తిః నిసర్గేణ చ దూరతః।
విహితా పాదమూలే తు వృత్తిశ్చరణయోధినామ్। 31

గర్హితం తు కృతం కర్మ యేన స్మ పిశితాశినా।
ప్రతీకార్యం చ మే తస్య వైరం భ్రాతుః కృతం భవేత్। 32

ఉపాయో దృశ్యతాం కశ్చిత్ లంఘనే లవణాంభసః।
అభిగమ్య తు వైదేహీం సమృద్ధార్థా గమిష్యథ। 33

సముద్రం నేతుమిచ్ఛామి భవద్భిర్వరుణాలయమ్।
ప్రదాస్యామ్యుదకం భ్రాతుః స్వర్గతస్య మహాత్మనః। 34

తతో నీత్వా తు తం దేశం తీరం నదనదీపతేః।
నిర్దగ్ధపక్షం సంపాతిం వానరాః సుమహౌజసః। 35

పునః ప్రత్యానయిత్వా చ తం దేశం పతగేశ్వరమ్।
బభూవుర్వానరా హృష్టాః ప్రవృత్తిమ్ ఉపలభ్య తే। 36

అంతకంటెను ఎత్తునగల ఐదవమార్గమున గ్రద్దలును ఎగురగలవు. బలపరాక్రమములు గలవి, చక్కని రూపములతో, యౌవనములతో విలసిల్లుచుండెడి హంసలు అపైన ఉన్న ఆఱవ మార్గమున పయనింపగలవు. వినతాసుతులైన గరుత్మంతుడు అరుణుడు (అనూరుడు) అంతకంటెను ఎత్తునగల ఆకాశ (ఏడవ) మార్గమున సంచరింతురు. మేము అందఱము వైనతేయసంతానమే. (26-28)

నేను ఆవైనతేయునివంశమువాడను గనుక ఇక్కడ నుండియే రావణుని, జానకిని స్పష్టముగా చూచుచున్నాను. మాకును గరుడునివలె దివ్యమైన దృష్టి బలము గలదు. కావున ఓ వానరులారా! మేము మా ఆహారబలముచేతను, సహజమైన దివ్యశక్తివలనను శతయోజనముల వఱకేగాక అంతకంటె దూరమునకును అనుక్షణము చూడగలము. దూరముననున్న ఆహార పదార్థమును గ్రహించి, దానిని భక్షించుట మా జాతి లక్షణము. కుక్కుటములు మొదలగు పక్షులు తమ కాళ్లదగ్గరనున్న (సమీపముననున్న) ఆహార పదార్థములను మాత్రమే తిని జీవించును. (29-31)

మాంసభక్షకుడైన ఆ రావణుడొనర్చిన సీతాపహరణ, నా సోదరుని వధించుట అను రెండు కృత్యములును మిక్కిలి నింద్యములే- అందులకై వానిపై పగదీర్చు కొనవలసియే యున్నది. మొదట ఈ లవణ సముద్రమును లంఘించు ఉపాయమునుగూర్చి ఆలోచింపుడు. ఆ తరువాత సీతాదేవిని దర్శించి, కృతార్థులై కిష్కింధకు చేరవచ్చును. (32-33)

వరుణునకు నిలయమైన సముద్రతీరమునకు చేరుటకై సహాయపడుటకు మిమ్ము అర్థించుచున్నాను. అక్కడ మహాత్ముడు, స్వర్గస్థుడుఐన నా తమ్ముడగు జటాయువునకు జలాంజలులను (తర్పణములను) సమర్పింతును." (34)

అనంతరము మిగుల బలశాలులైన ఆవానరులు ఱెక్కలు మాడిపోయిన సంపాతిని ఆ సముద్ర తీర ప్రదేశమునకు చేర్చిరి. సంపాతి తన సోదరునకు జలతర్పణములను సమర్పించిన పిమ్మట వానరులు అతనిని మఱల యథాస్థానమునకు చేర్చిరి. అతని ద్వారా సీతాదేవి సమాచారమును ఎఱింగి, ఆ వానరులు ఎంతయు సంతోషపడిరి. (35-36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే అష్టపంచాశః సర్గః (58)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదిఎనిమిదవసర్గము

-- * * * --

59. ఏబదితొమ్మిదవసర్గము

సీతాపహరణ వృత్తాంతమును తెలుపుమని జాంబవంతుడు సంపాతిని అడుగుట - అప్పుడు సంపాతి "నా సుతుడైన 'సుపార్శ్వుడు' రావణుడు సీతాదేవిని అపహరించి తీసికొని పోవునప్పుడు చూచినట్లు నాకు తెల్పినాడు" అని వారికి వివరించుట - "ధైర్య సాహసములతో సముద్రమును లంఘించి, సీతాదేవి జాడకై అన్వేషింపుడు" అని వానరులకు తెల్పుట -

తతస్తదమృతాస్వాదం గృధ్రరాజేన భాషితం।
నిశమ్య ముదితా హృష్టాః తే వచః ప్లవగర్షభాః। 1

గృధ్రరాజైన సంపాతి నుడివిన అమృతతుల్యములగు వచనములను విన్న పిమ్మట ఆ వానరులందఱును పరమానందభరితులైరి. (1)

జాంబవాన్ వానరశ్రేష్ఠః సహ సర్వైః ప్లవంగమైః।
భూతలాత్ సహసోత్థాయ గృధ్రరాజమ్ అథాబ్రవీత్। 2

వానర (భల్లూక) శ్రేష్ఠుడైన జాంబవంతుడు తోడి వానరులందఱితో గూడి వెంటనేలేచి, నేలపై నిలబడెను. పిమ్మట అతడు సంపాతిని ఇట్లు ప్రశ్నించెను. (2)

క్వ సీతా కేన వా దృష్టా కో వా హరతి మైథిలీం।
తదాఖ్యాతు భవాన్ సర్వం గతిర్భవ వనౌకసామ్। 3

"పూజ్యుడవైన ఓ మహాత్మా! ఇంతకును సీతాదేవి ఎక్కడ ఉన్నది? ఆమెను చూచిన వారెవరు? ఆమెను ఎవరు అపహరించిరి? వీటిని అన్నింటిని దయతో తెల్పుము. ఈ వానరులను ఇక నీవే ఆదుకొనవలెను. (3)

కో దాశరథిబాణానాం వజ్రవేగనిపాతినాం।
స్వయం లక్ష్మణముక్తానాం న చింతయతి విక్రమమ్। 4

వజ్రాయుధమువలె తీవ్రములై వేగముగా సాగిపోవు శ్రీరాముని బాణములధాటిని, లక్ష్మణుడు స్వయముగా ప్రయోగించెడి శరములప్రభావమును గుర్తింపని ఆ మూర్ఖుడు ఎవడు?'' (4)

స హరీన్ ప్రీతిసంయుక్తాన్ సీతాశ్రుతిసమాహితాన్।
పునరాశ్వాసయన్ ప్రీత ఇదం వచనమబ్రవీత్। 5

సీతాదేవి జాడను తెలిసికొనగోరి, గుమిగూడిన వారు, తన యందు ప్రీతితో ఉన్న వారు ఐన వానరులను మఱల ఓదార్చుచు ఆ సంపాతి సంతోషముతో ఇట్లు పలికెను. (5)

శ్రూయతామిహ వైదేహ్యా యథా మే హరణం శ్రుతం।
యేన చాఽపి మమాఖ్యాతం యత్ర వాఽఽయతలోచనా। 6

'వైదేహి ఎట్లు అపహరింపబడినదీ, ఆ విశాలాక్షి ఇప్పుడు ఎక్కడ ఉన్నదీ, ఎవరు నాకు ఈ విషయములను తెలిపినదీ - అను వాటిని గుఱించి నేను విన్నదానిని యథాతథముగా మీకు వివరించెదను, వినుడు. (6)

అహమ్ అస్మిన్ గిరౌ దుర్గే బహుయోజనమాయతే।
చిరాన్నిపతితో వృద్ధః క్షీణప్రాణపరాక్రమః। 7

తం మామేవం గతం పుత్రః సుపార్శ్వో నామ నామతః।
ఆహారేణ యథాకాలం బిభర్తి పతతాం వరః। 8

ఇప్పుడు నేనున్న ఈ గిరిదుర్గము పెక్కు యోజనములమేరకు విస్తరించియున్నది. చాలా కాలము క్రిందట నేను ఈ కొండపై పడితిని. నేను వృద్ధుడనై యున్నందున నా ప్రాణశక్తియు, బలపరాక్రమములును క్షీణించినవి. ఇట్టి స్థితిలో ఉన్న నన్ను నాకుమారుడు, పక్షులలో శ్రేష్ఠుడు ఐన 'సుపార్శ్వుడు' అనువాడు ఆయా సమయములలో ఆహారాదులను సమకూర్చుచు నన్ను పోషించుచున్నాడు. (7-8)

తీక్ష్ణకామాస్తు గంధర్వాః తీక్ష్ణకోపా భుజంగమాః।
మృగాణాం తు భయం తీక్ష్ణం తత స్తీక్ష్ణక్షుధా వయమ్। 9

న కదాచిత్ క్షుధార్తస్య మమాహారాభికాంక్షిణః।
గతసూర్యేఽహని ప్రాప్తో మమ పుత్రో హ్యనామిషః। 10

గంధర్వులు మిక్కిలి కామప్రవృత్తిగలవారు, సర్పములకు కోపము ఎక్కువ. జింకలు భయస్వభావము గలవి. మా జాతికి (గ్రద్దలకు) ఆకలి అధికము. ఒకానొకనాడు ఆకలితో నకనకలాడుచు నేను ఆహారముకొఱకు ఎదురుచూచుచుంటిని. నాకు ఆహారమును తీసికొని

స మయా వృద్ధభావాచ్చ కోపాచ్చ పరిభర్త్సితః।
క్షుత్పిపాసాపరీతేన కుమారః పతతాం వరః। 11

స మామాహారసంరోధాత్ పీడితం ప్రీతివర్ధనః।
అనుమాన్య యథాతత్త్వమ్ ఇదం వచనమబ్రవీత్। 12

అహం తాత యథాకాలం ఆమిషార్థీ ఖమాప్లుతః।
మహేంద్రస్య గిరేర్ద్వారమ్ ఆవృత్య చ సమాస్థితః। 13

తతః సత్త్వసహస్రాణాం సాగరాంతరచారిణాం।
పంథానమేకోఽధ్యవసం సన్నిరోద్ధుమ్ అవాఙ్ముఖః। 14

తత్ర కశ్చిన్మయా దృష్టః సూర్యోదయసమప్రభాం।
స్త్రియమ్ ఆదాయ గచ్ఛన్వై భిన్నాంజనచయప్రభః। 15

సోఽహమ్ అభ్యవహారార్థీ తౌ దృష్ట్వా కృతనిశ్చయః।
తేన సామ్నా వినీతేన పంథానమ్ అభియాచితః। 16

న హి సామోపపన్నానాం ప్రహర్తా విద్యతే క్వచిత్।
నీచేష్వపి జనః కశ్చిత్ కిమంగ బత మద్విధః। 17

స యాతస్తేజసా వ్యోమ సంక్షిపన్నివ వేగతః।
అథాహం ఖచరైర్భూతైః అభిగమ్య సభాజితః। 18

దిష్ట్యా జీవసి తాతేతి హ్యబ్రువన్ మాం మహర్షయః।
కథంచిత్ సకళత్రోఽసౌ గతస్తే స్వస్త్యసంశయమ్। 19

ఏవ ముక్తస్తతోఽహం తైః సిద్ధైః పరమశోభనైః।
స చ మే రావణో రాజా రక్షసాం ప్రతివేదితః।
హరన్ దాశరథేర్భార్యాం రామస్య జనకాత్మజాం। 20

వచ్చుటకై నా కుమారుడు బయటికి వెళ్లెను. మాంసము దొరకక పోవుటచే అతడు సూర్యుడు అస్తమించిన పిమ్మట రిక్తహస్తములతో తిరిగి వచ్చెను. వృద్ధుడనైయున్న నేను అప్పుడు ఆకలిదప్పులబాధలకు తట్టుకొనలేక కుపితుడనైతిని. ఆ ఆవేశములో నేను నాకుమారుని తీవ్రముగా మందలించితిని. ఎల్లప్పుడును సంతోషమును గూర్చుచుండెడి నాకుమారుడు, తిండిలేక బాధపడుచున్న నన్ను వినయముతో ఓదార్చి, జరిగిన విషయమును ఇట్లు చెప్పదొడంగెను. (9-12)

"తండ్రీ! నేను ఎప్పటివలె ఆహారమును సంపాదించుకొని వచ్చుటకై ఆకాశమునకు ఎగిరితిని. అంతట మహేంద్రగిరి ద్వారముకడకు చేరి, అచట నిలబడితిని. (13)

పిమ్మట సముద్ర జలములలో సంచరించెడి వేలకొలది ప్రాణులయొక్క మార్గమును నిరోధించి, వాటిని పట్టుకొనుటకై తలను క్రిందికివంచి అచటనే వేచియుంటిని. ఆ సమయమున ఛేదింపబడిన కాటుక కొండవలె నల్లగా నున్న ఒక దుష్టుడు ఒక స్త్రీని తీసికొని పోవుచుండుటను నేను చూచితిని. ఆ వనిత ఉదయ సూర్యుని కాంతులతో విలసిల్లుచుండెను. (14-15)

ఆ స్థితిలో ఉన్న నేను ఆ ఇద్దరినిజూచి, వారిని నీకు ఆహారముగా తీసికొనివచ్చుటకు నిశ్చయించు కొంటిని. కాని ఆ పురుషుడు సవినయముగా 'దారి ఇమ్ము' అని నన్ను మృదువుగా అడిగెను. నీచుడుసైతము తనను సవినయముగా సమీపించిన వానిని హింసింపడు. (కొట్టడు) ఇక నావంటికులీనుని విషయమున చెప్పవలసిన దేముండును? (16-17)

అంతట అతడు తన తేజస్సుచే ఆకాశమును కప్పివేయుచున్నాడా యనునట్లు వేగముగా వెళ్లిపోయెను. పిమ్మట ఆకాశమున సంచరించెడి సిద్ధులు, చారణులు మొదలగువారు నా కడకు వచ్చి నన్ను ప్రశంసించిరి. 'నాయనా! అదృష్టవశమున నీవు బ్రతికిపోయితివి. రావణుడు తనకడనున్న స్త్రీని (రక్ష్యవస్తువును) రక్షించుకొనుటలోనే నిమగ్నుడై యుండుటవలన ఎట్టకేలకు అతడు నీ జోలికి రాకుండ వెళ్లి పోయినాడు నీకు తప్పక శుభములు కలుగును.' అని మహర్షులు నాతో పలికిరి. (18-19)

మిక్కిలి శుభంకరులైన ఆ సిద్ధపురుషులు ఇట్లు పలికిన పిమ్మట 'ఆ వెళ్లిన వాడు రాక్షస రాజైన రావణుడు అనియు, జనకునికూతురూ, శ్రీరామునిధర్మపత్నియు

భ్రష్టాభరణకౌశేయాం శోకవేగపరాజితామ్।
రామలక్ష్మణయోర్నామ క్రోశంతీం ముక్తమూర్ధజామ్। 21

ఏష కాలాత్యయస్తావత్ ఇతి కాలవిదాం వరః।
ఏతమర్థం సమగ్రం మే సుపార్శ్వః ప్రత్యవేదయత్। 22

తచ్ఛ్రుత్వాఽపి హి మే బుద్ధిః నాసీత్ కాచిత్ పరాక్రమే।
అపక్షో హి కథం పక్షీ కర్మ కించిదుపక్రమే। 23

యత్తు శక్యం మయా కర్తుం వాగ్బుద్ధిగుణవర్తినా।
శ్రూయతాం తత్ ప్రవక్ష్యామి భవతాం పౌరుషాశ్రయమ్। 24

వాఙ్మతిభ్యాం తు సర్వేషాం కరిష్యామి ప్రియం హి వః।
యద్ధి దాశరథేః కార్యం మమ తన్నాత్ర సంశయః। 25

తే భవంతో మతిశ్రేష్ఠా బలవంతో మనస్వినః।
ప్రేషితాః కపిరాజేన దేవైరపి దురాసదాః। 26

రామలక్ష్మణబాణాశ్చ నిశితాః కంకపత్రిణః।
త్రయాణామపి లోకానాం పర్యాప్తాస్త్రాణనిగ్రహే। 27

కామం ఖలు దశగ్రీవః తేజోబలసమన్వితః।
భవతాం తు సమర్థానాం న కించిదపి దుష్కరమ్। 28

తదలం కాలసంగేన క్రియతాం బుద్ధినిశ్చయః।
న హి కర్మసు సజ్జంతే బుద్ధిమంతో భవద్విధాః। 29

ఐన సీతాదేవిని అతడు అపహరించుకొని పోవుచున్నాడనియు, నేను తెలిసికొంటిని. ఆమె ధరించిన ఆభరణములు చెదరియుండెను. పట్టువస్త్రము నలిగియుండెను. కేశములు జారియుండెను. అనుక్షణమూ ఆమె రామలక్ష్మణులను గూర్చి స్మరించుచు ఏడ్చుచుండెను. నారాకలో కాలాతీతము అగుటకు కారణము ఇదియే' అని కాలమువిలువ తెలిసిన సుపార్శ్వుడు ఈ విషయమును నాకు సమగ్రముగా నివేదించెను. (20-22)

అట్టి ఆవేదన గలిగించు విషయమును వినినప్పటికిని ఆ దుష్టునిపై విజృంభింపవలెనను ఆలోచన నాకు కలుగలేదు. నేను ఱెక్కలుడిగిన పక్షిని. నేనేమి చేయగలను? నేను నా బుద్ధిబలమునుబట్టి నాకు సాధ్యమైన మాట సాయము చేసెదను. దానిని మీరు పౌరుషముతో సాధింపవలసి యున్నది. ఆ విషయమును తెలిపెదను. (23-24)

నేను వాఙ్మనస్సులచే తోడ్పడి మీ అందఱికిని సంతోషమును గూర్చెదను. శ్రీరామునికార్యము నా కార్యమే. అందు సంశయము లేదు. వానరరాజగు సుగ్రీవుడు పంపగా వచ్చిన మీరందఱును ప్రజ్ఞావంతులు. మిగుల బలశాలులు, చక్కని ఆలోచనాశక్తి గలవారు. దేవతలకును అజేయులు. రామలక్ష్మణుల బాణములు ఱెక్కలు గలవి, వాడియైనవి అవి ముల్లోకములను నిగ్రహించుటయందును, అనుగ్రహించుట యందును సమర్థములు. మీకు శత్రువైన దశకంఠుడు మిక్కిలి బలపరాక్రమములు గలవాడే కావచ్చును. కాని మీవంటి సర్వసమర్థులకు అతనిని జయించుట ఏమాత్రమూ కష్టముగాదు. మీరు ఇక ఏ మాత్రమూ అలస్యము చేయక దృఢముగా నిశ్చయించుకొని, సీతాన్వేషణకు పూనుకొనుడు. మీవంటి ప్రతిభామూర్తులు కార్యసాధనయందు ఉపేక్షవహింపరు. (25-29)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకోనషష్టితమః సర్గః (59)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది ఏబదితొమ్మిదవసర్గము

— * * * —

60. అఱువదియవసర్గము

సంపాతి ఆత్మకథ

తతః కృతోదకం స్నాతం తం గృధ్రం హరియూథపాః।
ఉపవిష్టా గిరౌ దుర్గే పరివార్య సమంతతః। 1

తమంగదమ్ ఉపాసీనం తైః సర్వైర్హరిభిర్వృతమ్।
జనితప్రత్యయో హర్షాత్ సంపాతిః పునరబ్రవీత్। 2

కృత్వా నిశ్శబ్దమేకాగ్రాః శృణ్వంతు హరయో మమ।
తత్త్వం సంకీర్తయిష్యామి యథా జానామి మైథిలీమ్। 3

అస్య వింధ్యస్య శిఖరే పతితోఽస్మి పురా వనే।
సూర్యాతపపరీతాంగో నిర్దగ్ధః సూర్యరశ్మిభిః। 4

లబ్ధసంజ్ఞస్తు షడ్రాత్రాత్ వివశో విహ్వలన్నివ।
వీక్షమాణో దిశః సర్వా నాభిజానామి కించన। 5

తతస్తు సాగరాన్ శైలాన్ నదీః సర్వాః సరాంసి చ।
వనాన్యుదధివేలాం చ సమీక్ష్య మతిరాగమత్। 6

హృష్టపక్షిగణాకీర్ణః కందరాంతరకూటవాన్।
దక్షిణస్యోదధేస్తీరే వింధ్యోఽయ మితి నిశ్చయః। 7

ఆసీచ్చాత్రాశ్రమం పుణ్యం సురైరపి సుపూజితం।
ఋషిర్నిశాకరో నామ యస్మిన్నుగ్రతపాః భవత్। 8

అష్టౌ వర్షసహస్రాణి తేనాస్మిన్ ఋషిణా వినా।
వసతో మమ ధర్మజ్ఞాః స్వర్గతే తు నిశాకరే। 9

అవతీర్య తు వింధ్యాగ్రాత్ కృచ్ఛ్రేణ విషమాచ్ఛనైః।
తీక్ష్ణదర్భాం వసుమతీం దుఃఖేన పునరాగతః। 10

గృధ్రరాజైన సంపాతి తన సోదరుడైన జటాయువునకు జలాంజలులను సమర్పించి, స్నానమొనర్చి గిరిదుర్గము కడ ఆసీనుడైయుండెను. అంతట వానరప్రముఖులు అతని చుట్టును చేరి కూర్చుండిరి. (1)

తోడి వానరులందఱితోగూడి అంగదుడు సంపాతి సమీపమున కూర్చొనియుండెను. అంతట గృధ్రరాజు వారందఱికిని తనయెడ పూర్తిగా విశ్వాసము ఏర్పడుటను గమనించి, సంతోషముతో మఱల వారికిట్లనెను. (2)

"ఓ వానరులారా! మైథిలిని గూర్చి నాకు తెలిసినదంతయును యథాతథముగాతెలిపెదను. ఏకాగ్రచిత్తులై నిశ్శబ్దముగా వినుడు. ఇది చాలా కాలము క్రిందట జరిగిన విషయము. ఒకానొకప్పుడు సూర్యునియొక్క ప్రచండ తాపమునకు నా అవయవములన్నియును అస్తవ్యస్తములైనవి. అంతేగాక ఆ సూర్యకిరణముల వేడికి నాఱెక్కలు మాడిపోయినవి. అప్పుడు నేను ఈ వింధ్యశిఖరముపైగల వనమునందు పడిపోయితిని. ఆఱుదినములవఱకును స్పృహలేని స్థితిలో చేష్టలుడిగి పడియుంటిని. అటుపిమ్మట నాకు తెలివిరాగా నలువైపులను పరికించి చూచితిని. దిమ్మదిరిగియున్న ఆ స్థితిలో నాకు ఏమియు అంతుపట్టకుండెను. సముద్రములు, పర్వతములు, సమస్తమైన నదులు, సరస్సులు, వనములు, సాగరతీరములు మొదలగు వాటినన్నింటిని పరికించి చూచితిని. నేను పడియున్న ప్రదేశము సముద్రతీరమునందలి వింధ్య పర్వతముయొక్క దక్షిణప్రాంతమని నాకు తోచినది. అది సంతోషముతో కిలకిలారావములు గావించుచున్న పక్షులగుంపులతోడను, విశాలములైన గుహలతోడను, ఎత్తైన శిఖరములతోడను ఒప్పుచున్నది. నా పూర్వానుభవమునుబట్టి ఇది వింధ్యయొక్క దక్షిణభాగమని నిశ్చయించుకొంటిని. (3-7)

ఇచ్చట పవిత్రమైన ఒక ఆశ్రమము కలదు. అది దేవతలచేతను పూజలందుకొనునది. అందు 'నిశాకరుడు' (చంద్రుడు) అను ఋషియుండెడివాడు. అతడు గొప్పతపశ్శాలి. ధర్మజ్ఞులైన ఓ వానరులారా! ఆ నిశాకరముని స్వర్గస్థుడయ్యెను. ఆ ఋషిలేకున్నను నేను ఇక్కడనే మసలుచున్నాను. ఇప్పటికి ఎనిమిదివేల సంవత్సరములు గడచినవి. ఎగుడు దిగుడుగానున్న వింధ్యగిరిపైభాగమునుండి అతి కష్టముమీద నెమ్మదిగా క్రిందికి దిగితిని. మొనలుదేఱిన దర్భలుగల ఈ ప్రదేశమునకు మిగుల ప్రయాసపడిమఱలవచ్చితిని. (8-10)

తమ్ ఋషిం ద్రష్టుకామోఽస్మి దుఃఖేనాభ్యాగతో భృశం।
జటాయుషా మయా చైవ బహుశోఽభిగతో హి సః। 11

తస్యాశ్రమపదాభ్యాశే వవుర్వాతాః సుగంధినః।
వృక్షో నాఽపుష్పితః కశ్చిత్ అఫలో వా న విద్యతే। 12

ఉపేత్య చాశ్రమం పుణ్యం వృక్షమూలమ్ ఉపాశ్రితః।
ద్రష్టుకామః ప్రతీక్షేఽహం భగవంతం నిశాకరమ్। 13

అథాపశ్యమ్ అదూరస్థమ్ ఋషిం జ్వలితతేజసం।
కృతాభిషేకం దుర్ధర్షమ్ ఉపావృత్తమ్ ఉదఙ్ముఖమ్। 14

తమ్ ఋక్షాః సృమరా వ్యాఘ్రాః సింహా నాగాః సరీసృపాః।
పరివార్యోపగచ్ఛంతి ధాతారం ప్రాణినో యథా। 15

తతః ప్రాప్తమ్ ఋషిం జ్ఞాత్వా తాని సత్త్వాని వై యయుః।
ప్రవిష్టే రాజని యథా సర్వం సామాత్యకం బలమ్। 16

ఋషిస్తు దృష్ట్వా మాం ప్రీతః ప్రవిష్టశ్చాశ్రమం పునః।
ముహూర్తమాత్రాన్నిష్క్రమ్య తతః కార్యమ్ అపృచ్ఛత। 17

సౌమ్య వైకల్యతాం దృష్ట్వా రోమ్ణాం తే నావగమ్యతే।
అగ్నిదగ్ధావిమౌ పక్షౌ త్వక్చైవ వ్రణితా తవ। 18

గృధ్రౌ ద్వౌ దృష్టపూర్వౌ మే మాతరిశ్వసమౌ జవే।
గృధ్రాణాం చైవ రాజానౌ భ్రాతరౌ కామరూపిణౌ। 19

జ్యేష్ఠో హి త్వం తు సంపాతే జటాయురనుజస్తవ।
మానుషం రూపమాస్థాయ గృహ్ణీతాం చరణౌ మమ। 20

కిం తే వ్యాధిసముత్థానం పక్షయోః పతనం కథమ్।
దండో వాఽయం కృతః కేన సర్వమాఖ్యాహి పృచ్ఛతః। 21

ఆ ఋషిని దర్శింపగోరి, మిక్కిలి శ్రమపడి అచటికి చేరితిని. ఇదివరలో నేను, జటాయువు (మేము ఇరువురము) ఆయనను దర్శించియే యుంటిమి. ఆ ఆశ్రమసమీపమునందలి వాయువులు సువాసనలను వెదజల్లుచుండును. అచటి వృక్షములన్నియును నిరంతరము పుష్పములతో ఫలములతో కలకలలాడుచుండును. ఆ పవిత్రాశ్రమమునకు చేరిన పిమ్మట ఆ సమీపముననేయున్న ఒక చెట్టుక్రిందికి చేరితిని. పూజ్యుడైన ఆ నిశాకరమహర్షిదర్శనముకొఱకు అచట వేచియుంటిని. (11-13)

ఆ ఋషి స్నానాదులను ముగించుకొని, ఆశ్రమమునకు తిరిగివచ్చుచుండగా ఆయనను కొలది దూరములో చూచితిని. అప్పుడు అతడు ఉదఙ్ముఖుడై (ఉత్తర దిక్కునకు అభిముఖుడై) చూడశక్యముగాని తేజస్సుతో వెలుగుచుండెను. ఎలుగుబంట్లు, సృమరములు, పెద్దపులులు, సింహములు, ఏనుగులు, సర్పములు ఆ మహర్షి చుట్టును చేరి, ప్రాణులు బ్రహ్మదేవునివలె ఆయనను సమీపించుచున్నవి. (14-15)

మహారాజు తనభవనమును ప్రవేశింపగనే మంత్రులు, సమస్తబలములు తమ తమ స్థానములకు మఱలినట్లు ఆనిశాకరమహర్షి ఆశ్రమమున అడుగిడగనే ఆప్రాణులన్నియును యథాస్థానములకు వెళ్లి పోయెను. ఆశ్రమములో ప్రవేశించినట్టి ఆముని నన్నుజూచి సంతుష్టుడై, క్షణకాలము బయటికి వచ్చి, నేను వచ్చిన కార్యమును గూర్చి అడిగెను. (16-17)

ఓ సౌమ్యుడా! నీ రోమములు అన్నియును ఊడిపోయియున్నవి, ఱెక్కలు మాడియున్నవి, శరీరము అంతయును గాయపడియున్నది. ఇందులకు గల కారణము నాకు బోధపడుటలేదు. ఓ సంపాతీ! మీ సోదరులు ఇరువురును కామరూపులు. వేగమున వాయుదేవునితో సమానులు, గృధ్రజాతికే మీరు ప్రభువులు, మీ ఇద్దరిని ఇదివఱలో నేను చూచియుంటిని. నీవు పెద్దవాడవు, జటాయువు నీ తమ్ముడు. మీరు ఉభయులును మనుష్యరూపమును దాల్చి నా పాదములకు ప్రణమిల్లితిరి. అదిసరే, ఇంతకును నీకు వచ్చిన ఈ వ్యాధియేమి? ఱెక్కలు ఇట్లు శిథిలములగుటకు కారణమేమి? నిన్ను ఈ విధముగా ఎవరు దండించిరి? (గాయపఱచిరి?) నేను అడిగిన ఈ విషయములను అన్నింటిని విశదీకరింపుము." (18-21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే షష్టితమః సర్గః (60)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది అఱువదియవసర్గము

61. అఱువదిఒకటవసర్గము

సంపాతి తన ఱెక్కలు దగ్ధమైపోయిన కారణమును నిశాకరమునికి తెల్పుట.

తతస్తద్దారుణం కర్మ దుష్కరం సాహసాత్ కృతం।
ఆచచక్షే మునేః సర్వం సూర్యానుగమనం తదా॥ 1

భగవన్ వ్రణయుక్తత్వాత్ లజ్జయా వ్యాకులేంద్రియః।
పరిశ్రాంతో న శక్నోమి వచనం ప్రతిభాషితుమ్॥ 2

అహం చైవ జటాయుశ్చ సంఘర్షాద్దర్పమోహితౌ।
ఆకాశం పతితౌ వీరౌ జిజ్ఞాసంతౌ పరాక్రమమ్॥ 3

కైలాసశిఖరే బద్ధ్వా మునీనామ్ అగ్రతః పణం।
రవిః స్యాదనుయాతవ్యో యావదస్తం మహాగిరిమ్॥ 4

అథావాం యుగపత్ ప్రాప్తౌ అపశ్యావ మహీతలే।
రథచక్రప్రమాణాని నగరాణి పృథక్ పృథక్॥ 5

క్వచిద్వాదిత్రఘోషాంశ్చ బ్రహ్మఘోషాంశ్చ శుశ్రువః।
గాయంతీశ్చాంగనా బహ్వీః పశ్యావో రక్తవాససః॥ 6

తూర్ణమ్ ఉత్పత్య చాకాశమ్ ఆదిత్యపథమాశ్రితౌ।
ఆవామ్ ఆలోకయావః తద్వనం శాద్వలసన్నిభమ్॥ 7

ఉపలైరివ సంఛన్నా దృశ్యతే భూః శిలోచ్చయైః।
ఆపగాభిశ్చ సంవీతా సూత్రైరివ వసుంధరా॥ 8

హిమవాంశ్చైవ వింధ్యశ్చ మేరుశ్చ సుమహాన్ నగః।
భూతలే సంప్రకాశంతే నాగా ఇవ జలాశయే॥ 9

నిశాకరమహర్షి అట్లు అడిగిన పిమ్మట నేను, నా సోదరుడు సాహసముచేసి, సూర్యమండలమునకు ఎగిరిన విషయమును ఆ మహాత్మునకు పూర్తిగా వివరించితిని. మేము చేసిన ఆ కృత్యము మిగుల ప్రమాదకరమైనది. కష్టసాధ్యమైనది. (1)

"ఓ మహాత్మా! ఈ విషయమును మీకు తెలుపుటకు సిగ్గుపడుచున్నాను. గాయపడియుండుటచే నా ఇంద్రియములు పట్టుదప్పియున్నవి. మీదు మిక్కిలి అలసియుంటిని. మీకు ప్రత్యుత్తరమిచ్చుటకు శక్తి చాలకున్నది. (2)

వీరులమైన మేము (నేను, జటాయువు) ఇరువురము బలగర్వితులమై మా పరాక్రమములను తెలిసికొనగోరి, పోటీపడి ఆకాశమునకు ఎగిరితిమి. 'సూర్యుడు అస్తాద్రిని చేరెడులోపల ఆ భాస్కరునికడకు వెళ్లిరావలెను' అని కైలాసశిఖరమునందలి మునులసమక్షమున పందెము వేసికొని బయలుదేఱితిమి. పిమ్మట మేము ఇద్దఱము ఒక్కసారిగా ఆకాశమునకు చేరి, అటనుండి భూమిపైగల వేర్వేఱు నగరములను చూచితిమి. అవి రథచక్రముల ప్రమాణములో కనబడినవి. మాకు అక్కడక్కడ వీణానాదములు, వేణుగానములు, మృదంగధ్వనులు, వేదఘోషలు వినబడినవి. మఱియు ఎఱ్ఱనివస్త్రములను ధరించి, గానము చేయుచున్న పెక్కుమంది స్త్రీలు కనబడిరి. (3-6)

వేగముగా ఆకాశమున మఱికొంతపైకి వెళ్లి, సూర్యమార్గమును చేరితిమి. అక్కడినుండి క్రిందికి చూడగా భూమిపైగల వనములు పచ్చికబయళ్లవలె కన్పట్టెను. భూమండలమునందున్న కొండలన్నియును పఱచబడిన ఱాళ్లవలె గోచరించెను. నదులన్నియును భూమికి అలంకరించిన హారములుగా ఒప్పుచుండెను. భూతలమునగల హిమవత్పర్వతము, వింధ్యశైలము, మేరుగిరి మొదలగునవి జలాశయమునందలి ఏనుగులవలె భాసిల్లుచుండెను. అప్పుడు మా శరీరములు చెమర్చినవి. తీవ్రమైన ఖేదమునకును, భయమునకును గుఱియైతిమి. మా చిత్తములు భ్రమకు లోనయ్యెను. ఇంద్రియములు, మనస్సు మిగుల దుర్బలములయ్యెను. అజ్ఞానము ఆవరించెను. మాకు ఆగ్నేయము, దక్షిణము,

తీవ్రః స్వేదశ్చ ఖేదశ్చ భయం చాసీత్ తదాఽఽవయోః।
సమావిశతి మోహశ్చ తమో మూర్ఛా చ దారుణా। 10

న దిగ్విజ్ఞాయతే యామ్యా నాగ్నేయీ న చ వారుణీ।
యుగాంతే నియతో లోకో హతో దగ్ధ ఇవాగ్నినా। 11

మనశ్చ మే హతం భూయః సన్నివర్త్య తు సంశ్రయం।
యత్నేన మహతా హ్యస్మిన్ పునః సంధాయ చక్షుషి। 12

యత్నేన మహతా భూయో రవిః సమవలోకితః।
తుల్యః పృథ్వీప్రమాణేన భాస్కరః ప్రతిభాతి నౌ। 13

జటాయుర్మామ్ అనాపృచ్ఛ్య నిపపాత మహీం తతః।
తం దృష్ట్వా తూర్ణమాకాశాత్ ఆత్మానం ముక్తవానహమ్। 14

పక్షాభ్యాం చ మయా గుప్తో జటాయుర్న ప్రదహ్యతే।
ప్రమాదాత్ తత్ర నిర్దగ్ధః పతన్ వాయుపథాదహమ్। 15

ఆశంకే తం నిపతితం జనస్థానే జటాయుషం।
అహం తు పతితో వింధ్యే దగ్ధపక్షో జడీకృతః। 16

రాజ్యేన హీనో భ్రాత్రా చ పక్షాభ్యాం విక్రమేణ చ।
సర్వథా మర్తుమేవేచ్ఛన్ పతిష్యే శిఖరాద్గిరేః। 17

పడమర మొదలగు దిక్కులే తెలియని స్థితి ఏర్పడెను. ఈ లోకమంతయు నియమబద్ధముగా యథాస్థితిలో కొనసాగుచున్నను మాకు అది ప్రళయకాలాగ్నిచే దగ్ధమై పోయినట్లు తోచెను. (7-11)

మా మనస్సులు పనిచేయని స్థితికి చేరెను. కన్నులు భైర్లుక్రమ్మెను. ఎంతగా ప్రయత్నించినను ఏమియు కన్పడకుండెను. అట్టి స్థితిలో మనోదృష్టులను కేంద్రీకరింపజేసి గట్టి ప్రయత్నముతో చూడగా సూర్యమండలము గోచరమయ్యెను. అప్పుడు భాస్కరుడు మాకు భూమండల ప్రమాణములో కన్పట్టెను. (12-13)

అంతట జటాయువు నాతో చెప్పకుండగనే భూమివైపు జారిపోసాగెను. అతనిదుస్థితినిజూచి, ఆదుకొనుటకై నేను ఆకాశమునుండి అతనికడకు చేరితిని. వెంటనే అతనిని నా ఱెక్కలతో కప్పివేసితిని. అందువలన అతడు సూర్యుని తాపమునకు మాడిపోకుండ సురక్షితుడయ్యెను. కాని నా ఱెక్కలు మాత్రము దగ్ధమైపోవుటచే నేను క్రిందపడితిని.(14-15)

జటాయువు దండకారణ్యమున పడిపోయియుండవచ్చునని అనుకొంటిని. నేను మాత్రము ఱెక్కలు మాడిపోవుటచే నిశ్చేష్టుడనై వింధ్యపర్వతముపై పడిపోయితిని. రాజ్యమును కోల్పోయితిని. సోదరుడు దూరమాయెను. ఱెక్కలు కాలిపోయెను. పరాక్రమము నశించెను. ఈ గిరిశిఖరమునుండి క్రిందబడి చచ్చిపోవుటయే మేలని అనుక్షణము ఆలోచించుచుంటిని. (16-17)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ఏకషష్టితమఃసర్గః (61)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది అఱువదిఒకటవసర్గము

-- * * * --

62. అఱువదిరెండవసర్గము

నిశాకరముని సంపాతిని ఓదార్చుచు భవిష్యత్తులో శ్రీరాముని కార్యమునకు తోడ్పడుమని అతనిని ఆదేశించుట -

ఏవముక్త్వా మునిశ్రేష్ఠమ్ అరుదం దుఃఖితో భృశం।
అథ ధ్యాత్వా ముహూర్తం తు భగవాన్ ఇదమబ్రవీత్। 1

పక్షౌ చ తే ప్రపక్షౌ చ పునరన్యౌ భవిష్యతః।
ప్రాణాశ్చ చక్షుషీ చైవ విక్రమశ్చ బలం చ తే। 2

ఆ మునివరునితో ఇట్లు పలికిన పిమ్మట నేను మిగుల దుఃఖితుడనై ఏడ్చితిని. అంతట ఆ మహాత్ముడు క్షణకాలముపాటు ధ్యానమగ్నుడై నాతో ఇట్లు నుడివెను. (1)

"ఓ సంపాతీ! దుఃఖింపకుము. నీ చిన్న, పెద్ద ఱెక్కలు మఱల వచ్చును. అట్లే నీ దృష్టి గూడ బాగగును. క్షీణించిన నీ ప్రాణశక్తి, బలపరాక్రమములు యథాస్థాయికి పుంజుకొనును. రాబోవు కాలములో గొప్పగొప్ప పనకార్యములు

పురాణే సుమహత్ కార్యం భవిష్యతి మయా శ్రుతం।
దృష్టం మే తపసా చైవ శ్రుత్వా చ విదితం మమ। 3

రాజా దశరథో నామ కశ్చిదిక్ష్వాకునందనః।
తస్య పుత్రో మహాతేజా రామో నామ భవిష్యతి। 4

అరణ్యం చ సహ భ్రాత్రా లక్ష్మణేన గమిష్యతి।
అస్మిన్నర్థే నియుక్తస్సన్ పిత్రా సత్యపరాక్రమః। 5

నైర్ఋతో రావణో నామ తస్య భార్యాం హరిష్యతి।
రాక్షసేంద్రో జనస్థానాత్ అవధ్యః సురదానవైః। 6

సా చ కామైః ప్రలోభ్యంతీ భక్ష్యైర్భోజ్యైశ్చ మైథిలీ।
న భోక్ష్యతి మహాభాగా దుఃఖే మగ్నా యశస్వినీ। 7

పరమాన్నం తు వైదేహ్యై జ్ఞాత్వా దాస్యతి వాసవః।
యదన్నమ్ అమృతప్రఖ్యం సురాణామపి దుర్లభం। 8

తదన్నం మైథిలీ ప్రాప్య విజ్ఞాయేంద్రాదిదం త్వితి।
అగ్రమ్ ఉద్ధృత్య రామాయ భూతలే నిర్వపిష్యతి। 9

యది జీవతి మే భర్తా లక్ష్మణేన సహ ప్రభుః।
దేవత్వం గచ్ఛతోర్వాపి తయోరన్నమిదం త్వితి। 10

ఏష్యంత్యన్వేషకాస్తస్యా రామదూతాః ప్లవంగమాః।
ఆఖ్యేయా రామమహిషీ త్వయా తేభ్యో విహంగమ। 11

సర్వథా హి న గంతవ్యమ్ ఈదృశః క్వ గమిష్యసి।
దేశకాలౌ ప్రతీక్షస్వ పక్షౌ త్వం ప్రతిపత్స్యసే। 12

నోత్సహేయమ్ అహం కర్తుమ్ అద్యైవ త్వాం సపక్షకమ్।
ఇహస్థస్త్వం తు లోకానాం హితం కార్యం కరిష్యసి। 13

త్వయాఽపి ఖలు తత్కార్యం తయోశ్చ నృపపుత్రయోః।
బ్రాహ్మణానాం సురాణాం చ మునీనాం వాసవస్య చ। 14

సంభవింపునని పురాణములద్వారా వినియుంటిని. ఆ విషయములు అన్నింటిని నా తపఃప్రభావమున దివ్యదృష్టిద్వారా తెలిసికొంటిని. (2-3)

ఇక్ష్వాకువంశమున 'దశరథుడు' అను మహారాజు ఉండును. ఆయనకు మహాపరాక్రమశాలియగు 'రాముడు' అను కుమారుడు కలుగును. సత్యపరాక్రముడైన శ్రీరాముడు పితాజ్ఞను అనుసరించి, తనభార్యయగు సీతాదేవితో, తమ్ముడగు లక్ష్మణునితోగూడి అరణ్యములకు చేరును. రాక్షసుడైన రావణుడు ఆ రామునిభార్యను అపహరించి తీసికొని వెళ్లును. ఆ రాక్షసరాజును సురాసురులుగూడ చంపజాలరు. (4-6)

సీతాదేవి మహాపతివ్రత, వాసికెక్కిన వనితామణి. రావణుడు భక్ష్యభోజ్యములను, వివిధసుఖభోగములను ఆశచూపి, ప్రలోభపెట్టినను ఆమె వాటిని అంగీకరింపదు. ఆమె నిరంతరము తనపతినే ధ్యానించుచు దుఃఖములో మునిగియుండును. 'రాక్షసరాజు సమకూర్చిన ఆహారమును ఆమె గైకొనదు' - అని ఎఱింగిన దేవేంద్రుడు దేవతలకుగూడ దుర్లభమైన, అమృతతుల్యమైన పరమాన్నమును ఆమెకు సమర్పింపగలడు. ఆ పాయసమును ఇంద్రుడు ఇచ్చుచున్నాడని తెలిసికొని దానిని ఆమె గ్రహించును. అందు మొదటిముద్దను శ్రీరామచంద్రుని ఉద్దేశించి, నేలపై ఉంచును. అట్లు ఉంచునప్పుడు 'నా పతిదేవుడు, ఆయనతమ్ముడు లక్ష్మణుడు జీవించియున్నను, లేక దివ్యత్వమును పొందియున్నను ఈ పరమాన్నము వారికి చెందుగాక-' అని పలుకును. (7-10)

శ్రీరామునిదూతలైన వానరులు సీతాదేవిని వెదకుచు నీ సమీపమునకు రాగలరు. అప్పుడు నీవు ఆ రామపత్ని సమాచారమును వారికి తెలుపవలసియుండును. ఏ విధముగను నీవు ఇచటినుండి కదలరాదు. ఇట్టిస్థితిలో నీవు మాత్రము ఎక్కడికి వెళ్లగలవు? దేశకాలముల కొఱకు నిరీక్షించుచుండుము. నీ ఱెక్కలు మరల నీకు రాగలవు. నేను ఇప్పుడే నీకు ఱెక్కలు వచ్చునట్లు చేయగలను. కాని అందులకు పూనుకొనను. నీవు ఇచ్చట ఉండియే లోకమునకు గొప్పమేలు చేయగలవు. నీవు రాజకుమారులైన రామలక్ష్మణులకార్యసిద్ధికై సహాయ పడుము. దానివలన వారికేగాక బ్రాహ్మణులకును, ఇంద్రాదిదేవతలకును, మునీశ్వరులకును హితము కలుగును. (11-14)

ఇచ్ఛామ్యహమపి ద్రష్టుం భ్రాతరౌ రామలక్ష్మణౌ।
నేచ్ఛే చిరం ధారయితుం ప్రాణాం స్త్యక్ష్యే కళేబరమ్।
మహర్షిస్త్వబ్రవీదేవం దృష్టతత్త్వార్థదర్శనః। 15

నేను అన్నదమ్ములైన ఆ రామలక్ష్మణులను చూచుటకు కుతూహలపడుచున్నాను. అంతవఱకు ఈ ప్రాణములను నిలుపుకొనుటకు ఇష్టపడను. కనుక ఈ తనువును త్యజించెదను." అని భవిష్యత్తులో జరుగు సంఘటనలను దర్శింపగల ఆ మహర్షి ఇట్లు పలికెను అని సంపాతి వానరులతో నుడివెను. (15)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే ద్విషష్టితమః సర్గః *(62)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది అఱువదిరెండవసర్గము

-- * * * --

63. అఱువదిమూడవసర్గము

సంపాతికి ఱెక్కలు రాగా వానరులను ఉత్సాహపఱచి, అది విను వీధికి ఎగిరిపోవుట - సంపాతి మాటలకు ఆనందించిన వానరులు ధైర్యోత్సాహములను కూడగట్టుకొని, సీతాన్వేషణకు పూనుకొనుట -

ఏతైరన్యైశ్చ బహుభిః వాక్యైర్వాక్యవిదాం వరః।
మాం ప్రశస్యాభ్యనుజ్ఞాప్య ప్రవిష్టః స స్వమాశ్రమమ్। 1

కందరాత్తు విసర్పిత్వా పర్వతస్య శనైః శనైః।
అహం వింధ్యం సమారుహ్య భవతః ప్రతిపాలయే। 2

అద్య త్వేతస్య కాలస్య సాగ్రం వర్షశతం గతమ్।
దేశకాలప్రతీక్షోఽస్మి హృది కృత్వా మునేర్వచః। 3

మహాప్రస్థానమాసాద్య స్వర్గతే తు నిశాకరే।
మాం నిర్దహతి సంతాపో వితర్కైర్బహుభిర్వృతమ్। 4

ఉత్థితాం మరణే బుద్ధిం మునివాక్యైర్నివర్తయే।
బుద్ధిర్యా తేన మే దత్తా ప్రాణానాం రక్షణాయ తు।
సా మేఽపనయతే దుఃఖం దీప్తేవాగ్నిశిఖా తమః। 5

బుధ్యతా చ మయా వీర్యం రావణస్య దురాత్మనః।
పుత్రః సంతర్జితో వాగ్భిః న త్రాతా మైథిలీ కథమ్। 6

వాక్చతురులలో శ్రేష్ఠుడైన ఆ నిశాకరమహర్షి ఇట్టివే మఱికొన్ని వచనములను ప్రశంసాపూర్వకముగా పలికి, నాకు అనుజ్ఞ ఇచ్చి, ఆయన తనఆశ్రమమున ప్రవేశించెను. పర్వతగుహనుండి బయటికి వచ్చి, తిన్నతిన్నగా వింధ్యగిరి మీదికి చేరి, నేను మీకొఱకు నిరీక్షించుచుంటిని. నాటినుండి ఆ ముని పలికిన వచనములను మనస్సున నిలుపుకొని, దేశకాలములకు అనుగుణముగా మీకొఱకు ఎదురుచూచుచునేయుంటిని. ఆ నిరీక్షణలో వందలకొలది సంవత్సరములు గడచిపోయినవి. (1-3)

ఆ నిశాకరమహర్షి తనువునువీడి స్వర్గస్థుడయ్యెను. అప్పటినుండి నేను పెక్కు తర్కవితర్కములలో పడితిని. ఫలితముగా అంతులేని సంతాపము నా మనస్సును దహించివేయుచున్నది. నాకు జీవితముపై విరక్తి కలిగి మరణించుటయే మేలని పెక్కు పర్యాయములు అనుకొంటిని. కాని ఆమునివచనములు ఆ ఆలోచనల నుండి నన్ను మఱల్చినవి. ఆ మహర్షి ఉపదేశములు నా ప్రాణములను కాపాడినవి, అగ్నిజ్వాలలు చీకట్లను తొలగించినట్లుగా అవి నా దుఃఖమును శాంతింపజేసినవి.(4-5)

దుష్టుడైన రావణునియొక్క పరాక్రమమును నేను పూర్తిగా ఎఱుగుదును. అందువలన 'సీతాదేవిని నీవు ఎందులకు రక్షింపలేదు?' అని నేను నా కుమారుని తీవ్రముగా మందలించితిని. నాకుమారుడైన సుపార్శ్వుడు సీతాదేవిని రావణుడు అపహరించుకొని పోవుచున్నప్పుడు ఆమెవిలాపమును స్వయముగా వినియుండెను. సీతాదేవిని రక్షింపగల రామలక్ష్మణులు ఆమెకు

తస్యా విలపితం శ్రుత్వా తౌ చ సీతాం వినా కృతౌ।
న మే దశరథస్నేహాత్ పుత్త్రేణోత్పాదితం ప్రియమ్। 7

తస్య త్వేవం బ్రువాణస్య సంపాతేర్వానరైః సహ।
ఉత్పేతతుస్తదా పక్షౌ సమక్షం వనచారిణామ్। 8

స దృష్ట్వా స్వాం తనుం పక్షైః ఉద్గతైరరుణచ్ఛదైః।
ప్రహర్షమ్ అతులం లేభే వానరాంశ్చేదమబ్రవీత్। 9

ఋషేర్నిశాకరస్యైవ ప్రభావాదమితాత్మనః।
ఆదిత్యరశ్మినిర్దగ్ధౌ పక్షౌ మే పునరుత్థితౌ। 10

యౌవనే వర్తమానస్య మమాసీద్యః పరాక్రమః।
తమేవాద్యానుగచ్ఛామి బలం పౌరుషమేవ చ। 11

సర్వథా క్రియతాం యత్నః సీతామధిగమిష్యథ।
పక్షలాభో మమాయం వః సిద్ధిప్రత్యయకారకః। 12

ఇత్యుక్త్వా స హరీన్ సర్వాన్ సంపాతిః పతగోత్తమః।
ఉత్పపాత గిరేః శృంగాత్ జిజ్ఞాసుః ఖగమాం గతిమ్। 13

తస్య తద్వచనం శ్రుత్వా ప్రీతిసంహృష్టమానసాః।
బభూవుర్హరిశార్దూలా విక్రమాభ్యుదయోన్ముఖాః। 14

అథ పవనసమానవిక్రమాః
ప్లవగవరాః ప్రతిలబ్ధపౌరుషాః ।
అభిజిదభిముఖా దిశం యయుః
జనకసుతాపరిమార్గణోన్ముఖాః । 15

దూరమున ఉన్న సంగతియు అతనికి తెలియును. దశరథునిపై నాకు గల ఆదరభావమును గూడ అతడెఱుగును. ఐనను అతడు ఆ మైథిలిని రక్షించుటకు ప్రయత్నింపలేదు. నా సుతునియొక్క ఈ వైఖరి నాకు మిక్కిలి అసంతృప్తిని కల్గించినది. అందువలన నేను అతనిని కోపగించితిని." (6-7)

సంపాతి ఆ వానరులతో ఇట్లు పలుకుచుండగా వారు చూచుచుండగనే ఆ గృధ్రరాజునకు ఎప్పటివలె ఱెక్కలు వచ్చెను. (8)

ఆ సంపాతి ఎఱ్ఱని ఈకలుగల ఱెక్కలతో ఒప్పుచు తనశరీరమును చూచుకొని, పరమానందభరితుడయ్యెను. అనంతరము అతడు వానరులతో ఇట్లు నుడివెను. (9)

"మిత్రులారా! సూర్యకిరణములయొక్క తీవ్రమైన వేడికి పూర్తిగా మాడిపోయిన నా ఱెక్కలు మహాత్ముడైన ఆ నిశాకరమహర్షియొక్క ప్రభావమువలననే మఱల వచ్చినవి. నిండు యౌవనదశలో నాలో ఉన్న పరాక్రమము, బలపౌరుషములు నేడు మఱలనాకు సమకూరినవి. అన్ని విధములుగా గట్టి పూనికతో అన్వేషింపుడు. మీకు సీతాదేవిజాడ తప్పక లభింపగలదు. నాకు మఱల ఱెక్కలు వచ్చుటయే అందులకు ప్రబలనిదర్శనము. కనుక ఇక మీకార్యము సిద్ధించినట్లే." (10-12)

పక్షిరాజైన ఆ సంపాతి వానరులందఱితో ఇట్లు పలికిన పిమ్మట తన ఱెక్కలబలమిని తెలిసికొనగోరి, ఆ పర్వత శిఖరమునుండి వినువీధికి ఎగిరెను. (13)

ఆ వానరప్రముఖులు సంపాతిపలుకులను విని, పరమసంతోషముతో పొంగిపోయిరి. పిదప వారు తమ బలపరాక్రముల ద్వారా కార్యసాధనకు సర్వసన్నద్ధులైరి. వాయువుతో సమానమైన బలపరాక్రమములుగల ఆ వానరశ్రేష్ఠులు మఱల ధైర్యోత్సాహములను కూడగట్టుకొనిరి. సీతాన్వేషణకు ఉన్ముఖులై, అభిజిత్తుముహూర్తము[1] కొఱకు ప్రతీక్షింపసాగిరి. (14-15)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే త్రిషష్టితమః సర్గః *(63)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది అఱువదిమూడవసర్గము

-- * * * --

1) శ్లో॥ సూర్యాచ్చతుర్థకం లగ్నమ్, అభిజిత్ పరికీర్తితమ్ ।
సర్వదోషహరం చైవ, ప్రశస్తం శుభకర్మసు । (జ్యోతిష శాస్త్రము)
సూర్యోదయానంతరము (ఉదయలగ్నమునుండి) నాల్గవలగ్నము 'అభిజిల్లగ్నము. (అభిజిన్ముహూర్తము.) అది సర్వదోషహరము, శుభకార్యములకు ప్రశస్తము.

64. అఱువదినాలుగవసర్గము

అపారమైన సముద్రమును జూచి, వానరులు అందఱును 'దీనిని లంఘించుటయెట్లు?' అని విచారములోపడుట - అంగదుడు వారిని ప్రోత్సహించుచు వారికిగల గమన సామర్థ్యములను వెల్లడింపుడని కోరుట -

ఆఖ్యాతా గృధ్రరాజేన సముత్పత్య ప్లవంగమాః।
సంగమ్య ప్రీతిసంయుక్తా వినేదుః సింహవిక్రమాః॥ 1

సంపాతేర్వచనం శ్రుత్వా హరయో రావణక్షయం।
హృష్టాః సాగరమాజగ్ముః సీతాదర్శనకాంక్షిణః॥ 2

అభిక్రమ్య తు తం దేశం దదృశుర్భీమవిక్రమాః।
కృత్స్నం లోకస్య మహతః ప్రతిబింబమివ స్థితమ్॥ 3

దక్షిణస్య సముద్రస్య సమాసాద్యోత్తరాం దిశం।
సన్నివేశం తతశ్చక్రుః హరివీరా మహాబలాః॥ 4

సత్త్వైర్మహద్భిర్వికృతైః క్రీడద్భిర్వివిధైర్జలే।
వ్యాత్తాస్యైః సుమహాకాయైః ఊర్మిభిశ్చ సమాకులమ్॥ 5

ప్రసుప్తమివ చాన్యత్ర క్రీడంతమివ చాన్యతః।
క్వచిత్ పర్వతమాత్రైశ్చ జలరాశిభిరావృతమ్॥ 6

సంకులం దానవేంద్రైశ్చ పాతాళతలవాసిభిః।
రోమహర్షకరం దృష్ట్వా విషేదుః కపికుంజరాః॥ 7

ఆకాశమివ దుష్పారం సాగరం ప్రేక్ష్య వానరాః।
విషేదుః సహసా సర్వే కథం కార్యమితి బ్రువన్॥ 8

విషణ్ణాం వాహినీం దృష్ట్వా సాగరస్య నిరీక్షణాత్।
ఆశ్వాసయామాస హరీన్ భయార్తాన్ హరిసత్తమః॥ 9

తాన్ విషాదేన మహతా విషణ్ణాన్ వానరర్షభాన్।
ఉవాచ మతిమాన్ కాలే వాలిసూనుర్మహాబలః॥ 10

గృధ్రరాజైన సంపాతి వారిని ప్రోత్సహించుచు ఇట్లు పలికిన పిమ్మట సింహపరాక్రములైన ఆ వానరులు అందఱును మిక్కిలి సంతోషముతో గుమిగూడి ఎగిరి గంతులు వేయుచు కేరింతలుకొట్టిరి. సంపాతి వచనములను వినిన పిమ్మట ఆ వానరులు సీతాదేవిని దర్శించుటకై ఉబలాటపడసాగిరి. అప్పుడు వారు రావణునినివాసస్థానమైన లంకకు వెళ్లుటకై సాగర తీరమునకు చేరిరి. (1-2)

సాటిలేనిపరాక్రమశాలులైన ఆ వానరులు సముద్రతీరమునకు చేరిన పిమ్మట, నానావిధసంపదలతో నిండిన ఈ విశాలవిశ్వమునకు ప్రతిబింబమువలెనున్న ఆ సాగరమును చూచిరి. మహాబలశాలులైన ఆ వానరవీరులు దక్షిణ సముద్రముయొక్క ఉత్తరతీరమునకు చేరినపిదప తమకు అనువగు ఒక స్థానమును ఏర్పఱచుకొనిరి. (3-4)

ఆ సముద్రమునందు వికృతములైన వివిధములగు పెద్దపెద్ద జలచరములు క్రీడించుచుండెను. అందలి మహాతరంగములు నోళ్లు తెఱచుకొని, మ్రింగబోవుచున్నవా? యనునట్లు ఎగసిపడుచుండెను. ఆ సముద్రము ఒక చోట ప్రశాంతముగా నిద్రించుచున్నట్లుగను, వేఱొక చోట కేరింతలు కొట్టుచున్నట్లుగను ఒప్పుచుండెను. మఱియొకచోటగల తరంగములు త్రుళ్లింతలు గొట్టుచు పర్వతప్రమాణములో నిలసిల్లుచుండెను. అది పాతాళలోకమున నివసించెడి దానవశ్రేష్ఠులకు నెలవైయుండెను. గగుర్పాటును కలిగించుచున్న ఆ సాగరమును జూచి వానరప్రముఖులు మిక్కిలి దిగాలు పడిరి. (5-7)

అంతట వానరులు అందఱును ఆకాశమువలె అధిగమింపరాని సముద్రమును గాంచి, 'ఇక వెంటనే దీనిని లంఘించుట యెట్లు?' అని పలుకుచు విచారమునకు లోనైరి. అపారమైన ఆ సముద్రమును గాంచుటతో విషాదమునకు లోనై, భయభ్రాంతులైయున్న ఆ కపిసైనికులను గాంచి యువరాజైన అంగదుడు వారిని ఓదార్పసాగెను. (8-9)

మహాబలశాలియు, ప్రతిభామూర్తియు ఐన ఆవాలిసుతుడు అంతులేని విషాదములో మునిగియున్న ఆ వానర ప్రముఖులతో సమయోచితముగా ఇట్లు నుడివెను. (10)

న విషాదే మనః కార్యం విషాదో దోషవత్తమః।
విషాదో హంతి పురుషం బాలం క్రుద్ధ ఇవోరగః। 11

విషాదోఽయం ప్రసహతే విక్రమే పర్యుపస్థితే।
తేజసా తస్య హీనస్య పురుషార్థో న సిధ్యతి। 12

తస్యాం రాత్ర్యాం వ్యతీతాయామ్ అంగదో వానరైః సహ।
హరివృద్ధైః సమాగమ్య పునర్మంత్రమ్ అమంత్రయత్। 13

సా వానరాణాం ధ్వజినీ పరివార్యాంగదం బభౌ।
వాసవం పరివార్యేవ మరుతాం వాహినీ స్థితా। 14

కోఽన్యస్తాం వానరీం సేనాం శక్తః స్తంభయితుం భవేత్।
అన్యత్ర వాలితనయాత్ అన్యత్ర చ హనూమతః। 15

తతస్తాన్ హరివృద్ధాంశ్చ తచ్చ సైన్యమ్ అరిందమః।
అనుమాన్యాంగదః శ్రీమాన్ వాక్యమర్థవదబ్రవీత్। 16

క ఇదానీం మహాతేజా లంఘయిష్యతి సాగరం।
కః కరిష్యతి సుగ్రీవం సత్యసంధమ్ అరిందమమ్। 17

కో వీరో యోజనశతం లంఘయేచ్చ ప్లవంగమాః।
ఇమాంశ్చ యూథపాన్ సర్వాన్ మోక్షయేత్ కో మహాభయాత్। 18

కస్య ప్రభావాద్దారాంశ్చ పుత్రాంశ్చైవ గృహాణి చ।
ఇతో నివృత్తాః పశ్యేమ సిద్ధార్థాః సుఖినో వయమ్। 19

కస్య ప్రసాదాద్రామం చ లక్ష్మణం చ మహాబలమ్।
అభిగచ్ఛేమ సంహృష్టాః సుగ్రీవం చ మహాబలమ్। 20

యది కశ్చిత్ సమర్థో వః సాగరప్లవనే హరిః।
స దదాత్విహ నః శీఘ్రం పుణ్యామ్ అభయదక్షిణామ్। 21

"ఓ వానరోత్తములారా ఎవ్వరును మనస్సునకు విచారమును రానీయరాదు. విచారపడుట మహాదోషము (ప్రమాదకరము) విషాదము వ్యక్తులను క్రుంగదీయును. రెచ్చిపోయిన సర్పము బాలుని కాటువేసినట్లుగా అది మనలను దెబ్బతీయును. పరాక్రమమును చూపవలసిన సమయమున విషాదమునకు తావిచ్చిన వాడు తేజోవిహీనుడగును. ఆకారణమున అతనిపురుషార్థము (కార్యము) నెఱవేఱదు." (11-12)

ఆ రాత్రి గడచిన పిమ్మట అంగదుడు పెద్దలు, పిన్నలు ఐన వానరులందఱితో సమావేశమై, సముద్రమును దాటుటను గూర్చి లోతుగా చర్చించెను. (13)

వానరసైనికులు అందఱును అంగదునిచుట్టును జేరి, ఇంద్రునిచుట్టును చేరిన సురసైనికులవలె విలసిల్లిరి.(14)

వాలి తనయుడైన అంగదుడు, వాయుసుతుడైన హనుమంతుడు రక్షకులుగా ఉండగా ఈ వానరసేనను నిలువరింపగల మొనగాడెవ్వడు? (15)

అంతట మిక్కిలి శౌర్యపరాక్రమములు గలవాడు, శత్రుసంహార సమర్థుడు ఐన అంగదుడు అచటి వానర వృద్ధులతోడను, తదితరసైనికులతోడను సాదరముగా అర్థవంతములగు మాటలను ఇట్లు నుడివెను. (16)

"ఓ మిత్రులారా! ఇప్పుడు ఈ విశాలసముద్రమును లంఘింపగల మహాశక్తిశాలి ఎవరు? శత్రుసంహార దక్షుడైన సుగ్రీవుని సత్యసంధునిగావింపగలవారు ఎవ్వరు? (సుగ్రీవుడు శ్రీరామునకు ఇచ్చిన మాటను నిలబెట్టగలవారు ఎవరు?) ఓ కపులారా! సముద్రముమీద వందయోజనముల దూరము లంఘింపగలవీరుడు ఎవడు? ఈ వానరప్రముఖులను అందఱిని ఈ మహాభయమునుండి (ఈ సంకటపరిస్థితులనుండి) రక్షింపగలవారు ఎవరు? ఇప్పుడు ఎవరిఅనుగ్రహ ఫలితముగా మనము ఈ కార్యమునందు కృతార్థులము కాగలము? పిమ్మట సుఖముగా ఇచటనుండి బయలుదేఱి, కిష్కింధకు చేరి ఇండ్లువాకిండ్లను, ఆలుబిడ్డలను చూచుకొనగలము? ఎవరిఅనుగ్రహమువలన మనము బలశాలులైన రామలక్ష్మణుల కడకును, సుగ్రీవుని సమీపమునకును చేరి, వారికి సంతోషములో మన ముఖములను చూపగలము? (17-20)

మనవానరులలో ఈ సముద్రమును లఘింపగల సమర్థులు ఎవరైనను ఉన్నచో వెంటనే వారు ముందునకు వచ్చి, మాకు అభయదానము చేసి, పుణ్యము కట్టుకొనవలెను." (21)

అంగదస్య వచః శ్రుత్వా న కశ్చిత్ కించిదబ్రవీత్।
స్తిమితే వాభవత్ సర్వా తత్ర సా హరివాహినీ। 22

అంగదుని వచనములను వినిన పిమ్మట అచట నున్న వారిలో ఎవ్వరునూ పెదవి విప్పనేలేదు. అప్పుడు ఆ వానరసైనికులు అందఱును నిమ్మకు నీరెత్తినట్లు నిశ్చలముగా ఉండిపోయిరి. (22)

పునరేవాంగదః ప్రాహ తాన్ హరీన్ హరిసత్తమః।
సర్వే బలవతాం శ్రేష్ఠా భవంతో దృఢవిక్రమాః। 23

వ్యపదేశ్య కులే జాతాః పూజితాశ్చాఽ ప్యభీక్ష్ణశః।
న హి వో గమనే సంగః కదాచిత్ కస్యచిత్ క్వచిత్।
బ్రువధ్వం యస్య యా శక్తిః ప్లవనే ప్లవగర్షభాః। 24

అంతట వానరశ్రేష్ఠుడైన అంగదుడు ఆ కపులను ఉద్దేశించి, మఱల ఇట్లు నుడివెను, "మీరు అందఱును బలశాలురలో శ్రేష్ఠులు, తిరుగులేని పరాక్రమములు గలవారు, ఎట్టి కళంకమూ లేని ఉత్తమవంశమున జన్మించినవారు, అందఱి గౌరవాదరములను చూరగొన్నవారు. ఎప్పుడైనను, ఎవ్వడైనను, ఎక్కడైనను మీ గమనమును అడ్డుకొన గలవాడు ఎవ్వడును ఉండడు. కనుక ఓ వానరశ్రేష్ఠులారా! సముద్రమును లంఘించుటయందు మీమీ శక్తి సామర్థ్యములను వెల్లడింపుడు." (23-24)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే చతుష్షష్టితమః సర్గః (64)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది అఱువదినాలుగవసర్గము

-- * * * --

65. అఱువదిఐదవసర్గము

వానరవీరులు సముద్రమును లంఘించుటయందు తమకుగల శక్తి సామర్థ్యములను ప్రకటించుట - మొత్తము మీద సముద్రమును లంఘించి తిరిగి రాగల వీరుడు 'హనుమంతుడు మాత్రమే' - అని పలికి జాంబవంతుడు ఆయనను ప్రేరేపింతునునుట -

తతోఽఙ్గదవచః శ్రుత్వా సర్వే తే వానరోత్తమాః।
స్వం స్వం గతౌ సముత్సాహమ్ ఆహుస్తత్ర యథాక్రమమ్। 1

అంగదునిపలుకులను వినిన పిమ్మట ఆ వానర ప్రముఖులు అందఱును గమనమునందు తమ తమ సామర్థ్యములనుగూర్చి ఉత్సాహముతో క్రమముగా ఇట్లు నుడువదొడంగిరి. (1)

గజో గవాక్షో గవయః శరభో గంధమాదనః।
మైందశ్చ ద్వివిదశ్చైవ సుషేణో జాంబవాం స్తథా। 2

గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, సుషేణుడు, అట్లే జాంబవంతుడు ఇట్లు పచించిరి. (2)

ఆబభాషే గజస్తత్ర ప్లవేయం దశయోజనం।
గవాక్షో యోజనా న్యాహ గమిష్యామీతి వింశతిమ్। 3

గవయో వానరస్తత్ర వానరాం స్తానువాచ హ।
త్రింశతం తు గమిష్యామి యోజనానాం ప్లవంగమాః। 4

శరభస్తానువాచాథ వానరాన్ వానరర్షభః।
చత్వారింశద్గమిష్యామి యోజనానాం ప్లవంగమాః। 5

వానరస్తు మహాతేజా అబ్రవీద్గంధమాదనః।
యోజనానాం గమిష్యామి పంచాశత్తు న సంశయః। 6

గజుడు పదియోజనముల దూరమును, గవాక్షుడు ఇరువది యోజనములవఱకును ఎగురగలిగినట్లు తెల్పిరి. గవయుడు అను వానరుడు తాను ముప్పది యోజనముల మేరకు వెళ్లగల్గునట్లు తన వారితో పేర్కొనెను. 'శరభుడు' అను కపివరుడు తనగమనశక్తి నలుబది యోజనముల వఱకు కలదని నుడివెను. మిగుల బలశాలియైన 'గంధమాదనుడు' మొత్తము మీద ఏబది యోజనముల వఱకు ఎగురగలను, ఇందులకు సందేహములేదు' అని వచించెను. పిమ్మట 'మైందుడు' అను కపివరుడు 'నాకు అఱువది యోజనములవఱకు ఎగురగలశక్తి కలదు.' అని

మైందస్తు వానరస్తత్ర వానరాంస్తానువాచ హ।
యోజనానాం పరం షష్టిమ్ అహం ప్లవితుముత్సహే। 7

తతస్తత్ర మహాతేజా ద్వివిదః ప్రత్యభాషత।
గమిష్యామి న సందేహః సప్తతిం యోజనాన్యహమ్। 8

సుషేణస్తు హరిశ్రేష్ఠః ప్రోక్తవాన్ కపిసత్తమాన్।
అశీతింయోజనానాం తు ప్లవేయం ప్లవగేశ్వరాః। 9

తేషాం కథయతాం తత్ర సర్వాం స్తాన్ అనుమాన్య చ।
తతో వృద్ధతమస్తేషాం జాంబవాన్ ప్రత్యభాషత। 10

పూర్వమ్ అస్మాకమప్యాసీత్ కశ్చిద్గతిపరాక్రమః।
తే వయం వయసః పారమ్ అనుప్రాప్తాః స్మ సాంప్రతమ్। 11

కింతు నైవం గతే శక్యమ్ ఇదం కార్యముపేక్షితుం।
యదర్థం కపిరాజశ్చ రామశ్చ కృతనిశ్చయౌ। 12

సాంప్రతం కాలభేదేన యా గతిస్తాం నిబోధత।
నవతిం యోజనానాం తు గమిష్యామి న సంశయః। 13

తాంస్తు సర్వాన్ హరిశ్రేష్ఠాన్ జాంబవాన్ పునరబ్రవీత్।
న ఖల్వేతావదేవాసీత్ గమనే మే పరాక్రమః। 14

మయా మహాబలేశ్చైవ యజ్ఞే విష్ణుః సనాతనః।
ప్రదక్షిణీకృతః పూర్వం క్రమమాణస్త్రివిక్రమమ్। 15

స ఇదానీమహం వృద్ధః ప్లవనే మందవిక్రమః।
యౌవనే చ తదాసీన్మే బలమ్ అప్రతిమం పరైః। 16

సంప్రత్యేతావతీం శక్తిం గమనే తర్కయామ్యహమ్।
నైతావతా చ సంసిద్ధిః కార్యస్యాస్య భవిష్యతి। 17

అథోత్తరముదారార్థమ్ అబ్రవీదంగదస్తదా।
అనుమాన్య మహాప్రాజ్ఞం జాంబవంతం మహాకపిః। 18

అహమేతద్గమిష్యామి యోజనానాం శతం మహత్।
నివర్తనే తు మే శక్తిః స్యాన్నవేతి న నిశ్చితా। 19

స్పష్టపఱచెను. పిదప మహాతేజస్వియగు 'ద్వివిదుడు' అను కపిశ్రేష్ఠుడు 'నేను నిస్సందేహముగా డెబ్బది యోజనముల దూరము వెళ్లగలను' అని నొక్కి చెప్పెను. అనంతరము వానర ప్రముఖుడగు 'సుషేణుడు' తాను ఎనుబది యోజనములవఱకు వెళ్లగలిగినట్లు ఆకపివరులకు వివరించెను. (3-9)

వీరు అందఱును ఇట్లు తెలిపిన పిమ్మట వారిలో మిగుల వృద్ధుడగు జాంబవంతుడు వారి వారి మాటలను ప్రశంసించుచు, తననుగూర్చి ఆ కపివరులకు ఇట్లు తెలిపెను. (10)

"మిత్రులారా! లోగడ మాకును గమనమునందు కొంతవఱకు శక్తిసామర్థ్యములు కలవు. మేము అందఱము ఇప్పుడు వృద్ధులమైతిమి. అందువలన మాకు శక్తి చాలకున్నను కపిరాజైన సుగ్రీవుడు, శ్రీరామచంద్ర ప్రభువు తలపెట్టిన ఈ సీతాన్వేషణమును ఉపేక్షించుటకు వలను పడదు. కాని ప్రస్తుతము కాల పరిణామమును బట్టి నేను నిస్సంశయముగా తొంబది యోజనముల దూరము వెళ్లగలను." (11-13)

జాంబవంతుడు ఆ కపివరులందఱితో మఱల ఇట్లు నుడివెను. "గమనమునందు నా శక్తిసామర్థ్యములు ఇంత మాత్రమేగాదు. మహాదాతయగు బలిచక్రవర్తి యజ్ఞము చేయుచున్నప్పుడు సనాతనుడైన శ్రీమహా విష్ణువు మూడు అడుగులతో ఈ విశ్వమును కొలిచెను. సమస్త విశ్వమును ఆక్రమించిన ఆవిరాట్పురుషునకు ఆసమయమున నేను కొలది కాలములోనే ప్రదక్షిణ మొనర్చితిని. అప్పటి నా శక్తి అట్టిది. (14-15)

నేను యౌవనమునందు ఉన్నప్పుడు బలమున ఇతరులెవ్వరును నాతో చాలకుండిరి. కాని ఇప్పుడు నేను వృద్ధుడనగుటచే నా గమనశక్తి క్షీణించినది. ప్రస్తుతము ఎగురుటలో నాకున్న ఈ పాటి శక్తి కార్యసాధనకు ఎంతవఱకు సరిపోవును? అని తర్కించుకొనుచున్నాను. కాని ఈకార్యము నెఱవేఱుటకు ఇంతమాత్రపు శక్తి సరిపోదని నిర్ణయించుకొంటిని." (16-17)

అంతట కపివరుడైన అంగదుడు మిగుల ప్రజ్ఞాశాలియైన జాంబవంతుని మాటలను మెచ్చుకొనుచు, అందులకు ప్రత్యుత్తరముగా అతడు ఇట్లు సాదరవచనములను పలికెను. (18)

"జాంబవంతా! నేను మాత్రము నందయోజనముల వఱకు ఎగురగలను. కాని నాకు మఱల తిరిగి రాగల శక్తి ఉండునో లేదో? చెప్పజాలను." (19)

తమువాచ హరిశ్రేష్ఠం జాంబవాన్ వాక్యకోవిదః।
జ్ఞాయతే గమనే శక్తిః తవ హర్యృక్షసత్తమ। 20

కామం శతం సహస్రం వా న హ్యేష విధిరుచ్యతే।
యోజనానాం భవాన్ శక్తో గంతుం ప్రతినివర్తితుమ్। 21

న హి ప్రేషయితా తాత స్వామీ ప్రేష్యః కథంచన।
భవతాఽయం జనః సర్వః ప్రేష్యః ప్లవగసత్తమ। 22

భవాన్ కలత్రమ్ అస్మాకం స్వామిభావే వ్యవస్థితః।
స్వామీ కలత్రం సైన్యస్య గతిరేషా పరంతప।
తస్మాత్ కలత్రవత్తాత ప్రతిపాల్యః సదా భవాన్। 23

అపి చైతస్య కార్యస్య భవాన్ మూలమ్ అరిందమ।
మూలమ్ అర్థస్య సంరక్ష్యమ్ ఏష కార్యవిదాం నయః।
మూలే హి సతి సిధ్యంతి గుణాః పుష్పఫలోదయాః। 24

తద్భవాన్ అస్య కార్యస్య సాధనే సత్యవిక్రమ।
బుద్ధివిక్రమసంపన్నో హేతురత్ర పరంతప। 25

గురుశ్చ గురుపుత్రశ్చ త్వం హి నః కపిసత్తమ।
భవంతమాశ్రిత్య వయం సమర్థా హ్యర్థసాధనే। 26

ఉక్తవాక్యం మహాప్రాజ్ఞం జాంబవంతం మహాకపిః।
ప్రత్యువాచోత్తరం వాక్యం వాలిసూనురథాంగదః। 27

యది నాహం గమిష్యామి నాన్యే వానరపుంగవాః। 28

పునః ఖల్విదమస్మాభిః కార్యం ప్రాయోపవేశనమ్। 29

న హ్యకృత్వా హరిపతేః సందేశం తస్య ధీమతః।
తత్రాపి గత్వా ప్రాణానాం పశ్యామి పరిరక్షణమ్। 30

స హి ప్రసాదే చాత్యర్థం కోపే చ హరిరీశ్వరః।
అతీత్య తస్య సందేశం వినాశో గమనే భవేత్। 31

తద్యథా హ్యస్య కార్యస్య న భవత్యన్యథా గతిః।
తద్భవానేవ దృష్టార్థః సంచింతయితుమర్హతి। 32

అనంతరము మాటనేర్పరి ఐన జాంబవంతుడు వానరశ్రేష్ఠుడైన అంగదునితో ఇట్లు నుడివెను. "వానర భల్లూకములకు నాయకుడవైన ఓ యువరాజా! నీ గమనశక్తిని నేను ఎఱుగుదును. నీవు వందల, వేల యోజనములదూరమునకైనను వెళ్లిరాగల సమర్థుడవే. కాని ఇది తగిన పద్ధతి కాదుగదా! కార్యములను నిర్వహించుటకు ప్రభువు ఇతరులను పంపవలెనేగాని ముందుగా తాను వెళ్లగూడదు. ఓ వానరోత్తమా! వీరిలో ఎవరినైనను నీవు పంపవచ్చును. నాయనా! పరంతపా! నీవు మాకు నాయకుడవు. కావున నిన్ను రక్షించుకొనుట మా కర్తవ్యము. సైన్యములకును నీవు రక్షణీయుడు. ఇదియే లోకపద్ధతి కాబట్టి ఒక అమూల్యమైన నిధినివలె పాలకుడవైన నిన్ను మేము సదా రక్షించుకొనవలసి యున్నది. (20-23)

ఓ అరిందమా! అంతేకాదు ఈ అన్వేషణ మహాకార్యమునకు నీవే మూలము. (ముఖ్యుడవు) కార్య ప్రయోజనమునకు మూలమును కాపాడుకొనవలయును. ఇది కార్యసాధకుల లక్షణము. మూలము సురక్షితముగా ఉన్నప్పుడే మేలైన పూవులు, పండ్లు కొల్లలుగా ఏర్పడును. (24)

నిరుపమాన పరాక్రమశాలీ! పరంతపా! అందువలన పూజ్యుడవు, ప్రజ్ఞాపరాక్రమములు గలవాడవుఐన ఈ కార్యసాధనకు హేతువు నీవే. (25)

ఓ కపివరా! నీవు మహారాజకుమారుడవు, ఇప్పుడు మాకు ప్రభుడవు. నిన్ను ఆశ్రయించుకొని (నీ అండదండలు) ఉన్నప్పుడే కార్యసాధనమునందు మేము సమర్థులము కాగలము. (26)

ప్రజ్ఞాశాలియైన జాంబవంతుడు ఇట్లు హితవచనములు పలుకగా వానర ప్రముఖుడు, వాలిసుతుడు ఐన అంగదుడు ఈ విధముగా ప్రత్యుత్తరము ఇచ్చెను. (27)

'నేను వెళ్లనిచో తక్కిన వానరప్రముఖులు ఎవ్వరును వెళ్లజాలరు. అప్పుడు మన అందఱికిని ప్రాయోపవేశమే శరణ్యము. ధీశాలియైన ఆ సుగ్రీవుని ఆదేశమును పూర్తిచేయక మనము కిష్కింధకు వెళ్లినచో అక్కడగూడ మన ప్రాణములకు రక్షణయుండదు. వానరప్రభువైన ఆ సుగ్రీవుడు అనుగ్రహించుటలో మిగుల ఉదారుడు. (సాటిలేనివాడు) కోపము వచ్చినచో అతడు ప్రళయ కాలయముడు. కనుక ఆ మహానుభావుని ఆదేశమును అతిక్రమించి వెళ్లినచో మనకు వినాశము తప్పదు. ఓ మహాత్మా! సీతాదేవిజాడను తెలిసికొనుటకు ఎట్టి ఆటంకములూరాని (ఏర్పడని) సరియైన మార్గమును (ఉపాయమును) నీవే తెలుపుము. ఏలనన నీవు సమస్త విషయములను ఎఱిగినవాడవు." (28-32)

సోఽంగదేన తదా వీరః ప్రత్యుక్తః ప్లవగర్షభః।
జాంబవానుత్తరం వాక్యం ప్రోవాచేదం తతోఽంగదమ్। 33

అంగదుడు ఇట్లు నుడివిన పిమ్మట వానరప్రముఖుడు, వీరుడు ఐన జాంబవంతుడు అందులకు ప్రత్యుత్తరముగా ఆవాలిసుతునితో ఇట్లనెను. (33)

అస్య తే వీర కార్యస్య న కించిత్ పరిహీయతే।
ఏష సంచోదయామ్యేనం యః కార్యం సాధయిష్యతి। 34

"ఓ వీరుడా! ఈ నీకార్యమునకు ఏమాత్రమూ లోపము కలుగదు. సీతాదేవిజాడను తెలిసికొనుటలో ఎట్టి ఆటంకమూ రాకుండెడి ఉపాయమును నేను తెలిపెదను. ఇదిగో! ఈ వీరుడు మనకార్యమును సాధింపగలడు. ఆమహాత్మునకు నేను ప్రేరణ గూర్చెదను. (34)

తతః ప్రతీతం ప్లవతాం వరిష్ఠమ్
ఏకాంతమాశ్రిత్య సుఖోపవిష్టం ।
సంచోదయామాస హరిప్రవీరో
హరిప్రవీరం హనుమంతమేవ । 35

ఆ సమయమున వానర ప్రముఖుడుగా వాసికెక్కిన హనుమంతుడు ఏకాంతముగా ఒకచోట హాయిగా కూర్చొనియుండెను. అతడు ఎంత దూరము వఱకైనను లంఘింపగల (వెళ్లిరాగల) సమర్థుడు. అట్టి వానరవీరుని వానర భల్లూకములలో ముఖ్యుడైన జాంబవంతుడు ప్రేరేపింపసాగెను. (35)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే పంచషష్టితమఃసర్గః *(65)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది అఱువదిఐదవసర్గము

— * * * —

66. అఱువదిఆఱవసర్గము

జాంబవంతుడు ఆంజనేయుని జన్మవృత్తాంతమును తెలిపి, ఆయన బలపరాక్రమములను ప్రశంసించుట - పిమ్మట సముద్ర లంఘనమునకై ఆ మారుతిని ప్రేరేపించుట - అనంతరము హనుమంతుడు తన అద్భుతరూపమును ప్రకటించుట -

అనేకశతసాహస్రీం విషణ్ణాం హరివాహినీం।
జాంబవాన్ సముదీక్ష్యైవం హనుమంతమ్ అథాబ్రవీత్। 1

జాంబవంతుడు అనేక లక్షలకొలదిగా ఉన్న ఆ వానర సైనికులు మిగుల విషాదమునకు లోనైయుండుటను బాగుగా గమనించెను. అంతట అతడు హనుమంతుని ప్రేరేపించుచు ఇట్లు నుడివెను. (1)

వీర వానరలోకస్య సర్వశాస్త్రవిశారద।
తూష్ణీమ్ ఏకాంత మాశ్రిత్య హనుమన్ కిం న జల్పసి। 2

హనుమన్ హరిరాజస్య సుగ్రీవస్య సమో హ్యసి।
రామలక్ష్మణయోశ్చాఽపి తేజసా చ బలేన చ। 3

ఓ ఆంజనేయా! నీవు వానరులందరిలో సాటిలేని వీరుడవు. సమస్త శాస్త్రములలోను ఆఱితేఱిన వాడవు. నీవు ఇట్లు ఏకాంతప్రదేశమున కూర్చుండి ఏమాత్రమూ మాట్లాడక, మౌనమువహించియుంటివేల? ఓ వాయుసుతుడా! తేజస్సునందును, బలపరాక్రమముల యందును నీవు వానరరాజైన సుగ్రీవుని యంతటి వాడవు, రామలక్ష్మణులకును ఏమాత్రము తీసిపోవు. (2-3)

అరిష్టనేమినః పుత్త్రో వైనతేయో మహాబలః।
గరుత్మానితి విఖ్యాత ఉత్తమః సర్వపక్షిణామ్। 4

బహుశో హి మయా దృష్టః సాగరే స మహాబలః।
భుజగానుద్ధరన్ పక్షీ మహావేగో మహాయశాః। 5

కశ్యపమహర్షివలన వినతయందు గలిగిన గరుత్మంతుడు మిగుల బలశాలి. అతడు పక్షిలోకములో శ్రేష్ఠుడుగా వాసిగాంచినవాడు. మహాబలవంతుడగు ఆ పక్షిరాజు వేగగమనమునందు సుప్రసిద్ధుడు. అతడు సముద్రజలములనుండి మహాసర్పములను బయటికి

పక్షయోర్యద్బలం తస్య తావద్భుజబలం తవ।
విక్రమశ్చాపి వేగశ్చ న తే తేనావహీయతే। 6

బలం బుద్ధిశ్చ తేజశ్చ సత్త్వం చ హరిపుంగవ।
విశిష్టం సర్వభూతేషు కిమాత్మానం న బుధ్యసే। 7

అప్సరాప్సరసాం శ్రేష్ఠా విఖ్యాతా పుంజికస్థలా।
అంజనేతి పరిఖ్యాతా పత్నీ కేసరిణో హరేః। 8

విఖ్యాతా త్రిషు లోకేషు రూపేణాప్రతిమా భువి।
అభిశాపాదభూత్ తాత వానరీ కామరూపిణీ।
దుహితా వానరేంద్రస్య కుంజరస్య మహాత్మనః। 9

కపిత్వే చారుసర్వాంగీ కదాచిత్ కామరూపిణీ।
మానుషం విగ్రహం కృత్వా రూపయౌవనశాలినీ। 10

విచిత్రమాల్యాభరణా మహార్హక్షౌమవాసినీ।
అచరత్ పర్వతస్యాగ్రే ప్రావృడంబుదసన్నిభే। 11

తస్యా వస్త్రం విశాలాక్ష్యాః పీతం రక్తదశం శుభమ్।
స్థితాయాః పర్వతస్యాగ్రే మారుతోఽపహరచ్ఛనైః। 12

స దదర్శ తతస్తస్యా వృత్తావూరూ సుసంహతౌ।
స్తనౌ చ పీనౌ సహితౌ సుజాతం చారు చాననమ్। 13

తాం విశాలాయతశ్రోణీం తనుమధ్యాం యశస్వినీమ్।
దృష్ట్వైవ శుభసర్వాంగీం పవనః కామమోహితః। 14

స తాం భుజాభ్యాం దీర్ఘాభ్యాం పర్యష్వజత మారుతః।
మన్మథావిష్టసర్వాంగో గతాత్మా తామ్ అనిందితామ్। 15

సా తు తత్రైవ సంభ్రాంతా సువృత్తా వాక్యమబ్రవీత్।
ఏకపత్నీవ్రతమిదం కో నాశయితుమిచ్ఛతి। 16

అంజనాయా వచః శ్రుత్వా మారుతః ప్రత్యభాషత। 17

లాగుకొని పోవుచుండగా నేను పెక్కు పర్యాయములు చూచితిని. ఆ గరుత్మంతుని రెక్కలబలమువలె నీభుజబలమూ తిరుగులేనిది. పరాక్రమమునందును, వేగగమనమునందును నీవు అతనికి ఏమాత్రమూ తక్కువ కాదు. ఓ కపివరా! బలము, ప్రజ్ఞ, తేజస్సు, ధైర్యసాహసములు మున్నగువాటియందు సకల ప్రాణులకంటెను నీవు శ్రేష్ఠుడవు. ఇట్టి నీ ప్రత్యేకతను నీవు గుర్తింపవేమి? సముద్రమును లంఘించుటకు సిద్ధపడవేమి? (4-7)

అప్సరసలలో శ్రేష్ఠురాలుగా ప్రసిద్ధివహించిన 'పుంజికస్థల' 'అంజన' అను పేరుతో ఖ్యాతికెక్కెను. ఆమె 'కేసరి' అను వానరునకు పత్ని అయ్యెను. ఆమె ముల్లోకములయందును అందచందములలో మేలుబంతిగా వాసిగాంచెను. శాపవశమున ఆమె ఈ భూలోకమున కామరూపిణియగు ఒక వానరస్త్రీగా జన్మించెను. నాయనా! మహాత్ముడు, వానరప్రభువు ఐన కుంజరునకు ఈమె కూతురు. (8-9)

వానరస్త్రీ ఐనప్పటికిని ఆమె సర్వాంగసుందరి. కామరూపిణియగు ఆమె ఒకానొకప్పుడు చక్కని రూప యౌవన శోభలతో మానవరూపమును ధరించెను. చిత్రవిచిత్రములైన మాలలను, ఆభరణములను, అమూల్యములైన పట్టు వస్త్రములనుదాల్చి, ఆమె వర్షాకాలపు మేఘములవలె ఒప్పుచున్న పర్వతాగ్రమునందు సంచరించుచుండెను. (10-11)

పర్వతముపై విహరించుచున్న ఆ విశాలాక్షి ధరించిన పచ్చనివస్త్రము ఎఱ్ఱనిఅంచులతో తళతళ మెఱయుచుండెను. ఇంతలో వాయుదేవుడు ఆమె వస్త్రమును తిన్నగా అపహరించుకొనిపోయెను. ఆమె చక్కని ఊరువులను, స్తనసౌభాగ్యమును, మనోహరమైనముఖమును, విశాలమైన నితంబమును, సన్నని నడుమును కలిగియుండెను. పేరుమోసిన ఆ సర్వాంగసుందరినిజూచి, వాయుదేవుడు కామపరవశుడయ్యెను. పిదప అతడు పూర్తిగా కామవికారములకు లోనై, ఆ పూజ్యురాలియందు మరులు గొనినవాడై, తనదీర్ఘమైన బాహువులతో ఆమెను కౌగిలించుకొనెను. (12-15)

అప్పుడు మచ్చలేని ప్రవర్తనగల ఆ అంజన జరిగిన సంఘటనకు విభ్రాంతురాలై 'నేను పతివ్రతను, నా సౌశీల్యమును భంగపఱచుటకు పూనుకొనిన వీడు ఎవడు?' అని పలికెను. ఆమెమాటలను విని, వెంటనే వాయుదేవుడు ఇట్లు నుడివెను. (16-17)

న త్వాం హింసామి సుశ్రోణి మా భూత్ తే సుభగే భయం।
మనసాఽస్మి గతో యత్త్వాం పరిష్వజ్య యశస్వినీమ్। 18

వీర్యవాన్ బుద్ధిసంపన్నః తవ పుత్రో భవిష్యతి।
మహాసత్త్వో మహాతేజా మహాబలపరాక్రమః।
లంఘనే ప్లవనే చైవ భవిష్యతి మయా సమః। 19

ఏవముక్తా తతస్తుష్టా జననీ తే మహాకపే।
గుహాయాం త్వాం మహాబాహో ప్రజజ్ఞే ప్లవగర్షభమ్। 20

అభ్యుత్థితం తతః సూర్యం బాలో దృష్ట్వా మహావనే।
ఫలం చేతి జిఘృక్షుస్త్వమ్ ఉత్ప్లుత్యాభ్యుద్గతో దివమ్। 21

శతాని త్రీణి గత్వాఽథ యోజనానాం మహాకపే।
తేజసా తస్య నిర్ధూతో న విషాదం గతస్తతః। 22

తావదాపతతస్తూర్ణమ్ అంతరిక్షం మహాకపే।
క్షిప్తమింద్రేణ తే వజ్రం క్రోధావిష్టేన ధీమతా। 23

తదా శైలాగ్రశిఖరే వామో హనురభజ్యత।
తతో హి నామధేయం తే హనుమానితి కీర్త్యతే। 24

తత స్త్వాం నిహతం దృష్ట్వా వాయుర్గంధవహః స్వయం।
త్రైలోక్యే భృశసంక్రుద్ధో న వవౌ వై ప్రభంజనః। 25

సంభ్రాంతాశ్చ సురాః సర్వే త్రైలోక్యే క్షోభితే సతి।
ప్రసాదయంతి సంక్రుద్ధం మారుతం భువనేశ్వరాః। 26

ప్రసాదితే చ పవనే బ్రహ్మా తుభ్యం వరం దదౌ।
అశస్త్రవధ్యతాం తాత సమరే సత్యవిక్రమ। 27

వజ్రస్య చ నిపాతేన విరుజం త్వాం సమీక్ష్య చ।
సహస్రనేత్రః ప్రీతాత్మా దదౌ తే వరముత్తమమ్। 28

"ఓ సుందరీ! నిన్ను ఏమియు బాధింపను. నేను కౌగిలించుకొనినప్పటికిని, నిన్ను మానసికముగ మాత్రమే, పొందితిని. పూజ్యురాలవైన నీకు ఎట్టి కళంకమూ అంటదు. కనుక భయపడవలదు. మహాపరాక్రమశాలి, బుద్ధి సంపన్నుడు ఐన సుతుడు నీకు కలుగును. అతడు ధైర్యసాహసములుగలవాడు, మిగులతేజస్వి, బలపరాక్రమముల యందు సాటిలేనివాడు కాగలడు. ఆకాశమునకు ఎగురుటయందును, సముద్రములను లంఘించుటలోను అతడు నాయంతటివాడు కాగలడు." (18-19)

ఓ కపివరా! మహాబాహూ! వాయుదేవుడు ఇట్లు అనుగ్రహవచనములను పలికి వెళ్లిన పిమ్మట మీ తల్లియగు అంజనాదేవి తన మనస్సు కుదుటబడగా మిగుల సంతుష్టురాలయ్యెను. పిదప ఆమె ఆ గుహయందు వానరశ్రేష్ఠుడవైన నీకు జన్మనిచ్చెను. (20)

అనంతరము నీవు బాల్యదశలో ఉన్నప్పుడు ఉదయించుచున్న సూర్యునిజూచి, ఆ సూర్యబింబమును వనమునందలి ఫలమనుకొని, దానిని గ్రహింపగోరి ఆకాశమునకు ఎగిరితివి. ఓ మహాకపీ! ఆసందర్భమున నీవు మూడువందల యోజనములదూరమునకు ఎగిరితివి. అప్పుడు సూర్యకిరణముల వేడి నీపై ఎంతగా ప్రభావము చూపినను (ఎంతతీవ్రముగా పడినను) నీవు ఏమాత్రమూ క్లేశమునకు గురికాలేదు. అప్పుడు అంతరిక్షమునకు దూసికొని వచ్చుచున్న నిన్నుజూచి, ధీమంతుడైన ఇంద్రుడు మిగులక్రుద్ధుడై, నీపై తన వజ్రాయుధమును ప్రయోగించెను. అప్పుడు నీవు పర్వత శిఖరముపై పడిపోగా నీకోమలమైన దవడలు దెబ్బతినెను. అప్పటినుండి నీవు 'హనుమంతుడు' అను పేరుతో ప్రసిద్ధికెక్కితివి. (21-24)

అంతట వాసనలను తీసికొనువెళ్లువాడు, మహావృక్షాదులను పెకలించివేయగల మహాబలుడు ఐన వాయుదేవుడు, నీవు అట్లు గాయపడుటను జూచి, మిగుల క్రుద్ధుడయ్యెను. వెంటనే ఆ స్వామి ముల్లోకములలోను గాలిని స్తంభింపజేసెను. తత్ఫలితముగా ముల్లోకములును క్షోభకు గురికాగా లోకపాలురును, సకల దేవతలును దిక్కుతోచనివారై క్రుద్ధుడైన వాయుదేవుని ప్రసన్నుని జేసికొనిరి. నాయనా! సాటిలేని పరాక్రమముగలవాడా! అప్పుడు ఆ స్వామి దేవతలయెడ అనుగ్రహము చూపెను. (శాంతించెను) అంతట 'సమరమునందు ఎట్టి ఆయుధమువలనను నీకు మృతియుండనట్లు' బ్రహ్మదేవుడు వరమును ప్రసాదించెను. నీవు

స్వచ్ఛందతశ్చ మరణం తే భూయాదితి వై ప్రభో। 29

వజ్రాయుధము దెబ్బకు కూడ క్షేమముగా ఉండుట చూచి ఇంద్రుడు సంతుష్టుడై, నీకు స్వచ్ఛందమరణము ప్రాప్తించునట్లు వరమిచ్చెను. (25-29)

స త్వం కేసరిణః పుత్రః క్షేత్రజో భీమవిక్రమః।
మారుతస్యౌరసః పుత్రః తేజసా చాపి తత్సమః। 30

(ఈదృశస్యహితే తాత వర్ణయామః కథమ్ బలమ్
కార్యంచలోకసమ్మాన్యం కర్తుం శక్తస్త్వమేవ హి
భవాన్ జీవాతవేఽస్మాకం అంజనాగర్భసంభవః)

ఓ మారుతీ! నీవు కేసరి యనువానియొక్క భార్యయగు అంజనయందు జన్మించినవాడవు (క్షేత్రజాడవు) నిరూపమానమైన పరాక్రమముగల వాడవు- నీవు వాయుదేవునివరమువలన అవతరించినవాడవు. (ఔరస పుత్రుడవు.) కనుక నీవు తేజస్సు (వేగము, బలము) నందు వాయుదేవునియంతటివాడవు. నాయనా! ఇట్టి మహాత్ముడవైన నీయొక్క బలమును మేము ఎంతని కొనియాడగలము? ఇది లోక కల్యాణదాయకమైన మహాకార్యము. దీని సాధించుటకు నీవే సమర్థుడవు. నీవు అంజనాసుతుడవు. ఇప్పుడు మా అందరికిని ప్రాణరక్షకుడవు నీవే. (30)

త్వం హి వాయుసుతో వత్స ప్లవనే చాపి తత్సమః।
వయమద్య గతప్రాణా భవాన్ నస్త్రాతు సాంప్రతమ్।
దాక్ష్యవిక్రమసంపన్నః పక్షిరాజ ఇవాపరః। 31

వాయుసుతుడవైన నీవు లంఘించుటలో (ఎగురుటలో) ఆ మహాత్మునితో సమానుడవు. మేము అందరము కొనఊపిరితో ఉన్నాము. ఇప్పుడు మమ్ము నీవే కాపాడవలయును. కార్యసామర్థ్యమునందును పరాక్రమమునందును నీవు ఆ గరుత్మంతుని యంతటి వాడవు. (31)

త్రివిక్రమే మయా తాత సశైలవనకాననా।
త్రిస్సప్తకృత్వః పృథివీ పరిక్రాంతా ప్రదక్షిణమ్। 32

నాయనా! శ్రీ మహావిష్ణువు వామనుడుగా (త్రివిక్రముడుగా) అవతరించిన కాలమున నేను కొండలతో కోనలతో, అరణ్యములతో నిండియున్న ఈ సమస్త భూమండలమునకు ఇరువదియొక్క పర్యాయములు ప్రదక్షిణ మొనర్చితిని. (32)

తథా చౌషధయోఽస్మాభిః సంచితా దేవశాసనాత్।
నిష్పన్నమ్ అమృతం యాభిః తదాసీన్నో మహద్బలమ్। 33

స ఇదానీమ్ అహం వృద్ధః పరిహీనపరాక్రమః।
సాంప్రతం కాలమస్మాకం భవాన్ సర్వగుణాన్వితః। 34

తద్విజృంభస్వ విక్రాంతః ప్లవతామ్ ఉత్తమో హ్యసి। 35

త్వద్వీర్యం ద్రష్టుకామేయం సర్వవానరవాహినీ।
ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవమ్। 36

అమృతముకొఱకు క్షీరసాగరమును మథించు సమయమున దేవతల ఆదేశమును అనుసరించి మేము వివిధ ప్రదేశములనుండి దివ్యౌషధులను తీసికొనివచ్చి ఆ సముద్రమునందు ఉంచితిమి. వాటినుండి అమృతము ఏర్పడెను. అప్పుడు మేము తిరుగులేని బలము కలిగియుంటిమి. ప్రస్తుతము నేను వృద్ధుడను. కనుక నాబల పరాక్రమములు క్షీణించినవి. ఇట్టి పరిస్థితిలో మన అందరిలోను నీవే ధైర్యసాహసపరాక్రమాది -ఉదాత్తగుణములు పరిపూర్ణముగా కలిగియున్నవాడవు. లంఘించుటలో నీవు అందరికంటెను అగ్రేసరుడవు. కనుక పరాక్రమశాలివైన నీవు వెంటనే విజృంభింపుము. ఈ వానర సేనలన్నియును నీ శౌర్య పరాక్రమములను చూడగోరుచున్నవి. కావున వానరోత్తమా! లెమ్ము. ఈ మహాసముద్రమును లంఘింపుము. (33-36)

పదా హి సర్వభూతానాం హనుమన్ యా గతిస్తవ।
విషణ్ణా హరయః సర్వే హనూమన్ కిముపేక్షసే।
విక్రమస్వ మహావేగో విష్ణుస్త్రీన్ విక్రమానివ। 37

ఓ మారుతీ! సమస్తప్రాణులగమనముకంటెను నీది (నీగమనము) మిక్కిలి ఉత్కృష్టమైనది. ఈ వానరులందఱును విషాదములో మునిగియున్నారు, ఇక నీవు ఉపేక్షింపరాదు. వామనావతారమున తన పాదత్రయముచే ముల్లోకములను అక్రమించునప్పుడు పరాక్రమించిన శ్రీమహావిష్ణువువలె నీవు ఇప్పుడు మహావేగముతో విజృంభింపుము." (37)

తతస్తు వై జాంబవతా ప్రచోదితః
ప్రతీతవేగః పవనాత్మజః కపిః ।
ప్రహర్షయం స్తాం హరివీరవాహినీం
చకార రూపం మహదాత్మన స్తదా । 38

జాంబవంతుడు ఇట్లు ప్రేరేపింపగా వాయుసుతుడైన ఆ హనుమంతునకు తన వేగముపై (తన శక్తి సామర్థ్యములపై) గట్టి విశ్వాసము ఏర్పడెను. వెంటనే ఆ మహాత్ముడు సమస్తవానరవీరసైనికులలో ఉత్సాహమును పెంచుచు తనఅద్భుతరూపమును ప్రకటించెను. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే షట్ షష్టితమఃసర్గః (66)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది అఱువదిఆఱవసర్గము

-- * * * --

67. అఱువదిఏడవసర్గము

హనుమంతుడు సముద్రలంఘనమునకు ఉత్సాహమును ప్రకటించుట - జాంబవంతుడు ఆ మహాత్ముని కొనియాడుట - పిమ్మట మారుతి మహేంద్రగిరిపై చేరుట -

తం దృష్ట్వా జృంభమాణం తే క్రమితుం శతయోజనం।
వీర్యేణాపూర్యమాణం చ సహసా వానరోత్తమం। 1

సహసా శోకముత్సృజ్య ప్రహర్షేణ సమన్వితాః।
వినేదుస్తుష్టువుశ్చాపి హనుమంతం మహాబలమ్। 2

నూఱుయోజనములమేర ఉన్న సముద్రమును వెంటనే లంఘించుటకై వానరోత్తముడైన ఆ మారుతి తనలో పరాక్రమమును కూడగట్టుకొనుచు, తన అద్భుతరూపమును పెంచసాగెను. అట్టి ఆ మహావీరుని జూచిన వెంటనే ఆ వానరులు తమవిచారములను మానిరి. పిదప మహాబలశాలియగు హనుమంతుని ప్రస్తుతించుచు, వారు సంతోషముతో బిగ్గఱగా కేరింతలు కొట్టిరి. (1-2)

ప్రహృష్టా విస్మితాశ్చైవ వీక్షంతే స్మ సమంతతః।
త్రివిక్రమకృతోత్సాహం నారాయణమివ ప్రజాః। 3

వామనావతారమున మూడు పాదముల విన్యాసములతో ఉత్సాహముగా ముల్లోకములను ఆక్రమించిన శ్రీమహావిష్ణువును ప్రజలు దర్శించినట్లు, అందు అంతటను చేరియున్న వానరులు సంభ్రమాశ్చర్యములతో పరమానందభరితులై ఆ మారుతిని గాంచిరి. (3)

సంస్తూయమానో హనుమాన్ వ్యవర్ధత మహాబలః।
సమావిధ్య చ లాంగూలం హర్షాచ్చ బలమేయివాన్। 4

తస్య సంస్తూయమానస్య వృద్ధైర్వానరపుంగవైః।
తేజసాఽఽపూర్యమాణస్య రూపమాసీదనుత్తమమ్। 5

మహావీరుడైన హనుమంతుడు వానరులప్రశంసలకు సంతోషించుచు, వాలమును పైకెత్తి ఇంకను బలమును పుంజుకొనుచున్నవాడై వృద్ధిహొందెను. వృద్ధులు, వానరప్రముఖులు ప్రశంసించుచుండగా ఆయనలోని తేజస్సు వెల్లివిరియుచుండెను. అప్పుడు ఆ మహాత్ముని రూపము అద్భుతముగా ఉండెను. (4-5)

యథా విజృంభతే సింహో వివృద్ధో గిరిగహ్వరే।
మారుతస్యౌరసః పుత్రః తథా సంప్రతి జృంభతే। 6

అశోభత ముఖం తస్య జృంభమాణస్య ధీమతః।
అంబరీషమివాదీప్తం విధూమ ఇవ పావకః। 7

హరీణామ్ ఉత్థితో మధ్యాత్ సంప్రహృష్టతనూరుహః।
అభివాద్య హరీన్ వృద్ధాన్ హనుమానిదమబ్రవీత్। 8

అరుజత్ పర్వతాగ్రాణి హుతాశనసఖోఽనిలః।
బలవాన్ అప్రమేయశ్చ వాయురాకాశగోచరః। 9

తస్యాహం శీఘ్రవేగస్య శీఘ్రగస్య మహాత్మనః।
మారుతస్యౌరసః పుత్రః ప్లవనే నాస్తి మత్సమః। 10

ఉత్సహేయం హి విస్తీర్ణమ్ ఆలిఖంతమివాంబరం।
మేరుం గిరిమసంగేన పరిగంతుం సహస్రశః। 11

బాహువేగప్రణున్నేన సాగరేణాహముత్సహే।
సమాప్లావయితుం లోకం సపర్వతనదీహ్రదమ్। 12

మమోరుజంఘవేగేన భవిష్యతి సముత్థితః।
సముచ్ఛ్రితమహాగ్రాహః సముద్రో వరుణాలయః। 13

పన్నగాశనమాకాశే పతంతం పక్షిసేవితే।
వైనతేయమహం శక్తః పరిగంతుం సహస్రశః। 14

ఉదయాత్ ప్రస్థితం వాపి జ్వలంతం రశ్మిమాలినం।
అనస్తమితమాదిత్యమ్ అభిగంతుం సముత్సహే। 15

పర్వతగుహయందు సింహము జూలువిదల్చి విజృంభించుచున్నట్లుగా వాయుసుతుడు ఇప్పుడు ఒక్కసారిగా అత్యుత్సాహముతో పరాక్రమించెను. (6)

ధీశాలియైన హనుమంతుడు ఆవులించుచుండగా ఆయనముఖము వెలుగొందుచున్న పెనమువలెను, పొగలేనిఅగ్నివలెను శోభిల్లుచుండెను. వానరులమధ్యనున్న హనుమంతుడు లేచి నిలబడెను. అప్పుడు ఆయన శరీరము గగుర్పాటును పొందెను. అంతట అతడు వృద్ధులైన కపివరులకు నమస్కరించి ఇట్లు నుడివెను.(7-8)

"ఆకాశమున సంచరించుచుండెడి వాయుదేవుడు మిగుల బలశాలి, అతనిశక్తికి హద్దులు లేవు. అతడు అగ్నిదేవునకు మిత్రుడు, తనవేగముచే ఉన్నతములైన పర్వతశిఖరములనుగూడ ఛిన్నాభిన్నమొనర్పగలడు. శీఘ్రముగా సాగిపోగల గరుత్మంతుడు మున్నగువారివలె ఆ మహాత్ముడు వేగగమనుడు. అట్టి మహాత్ముడైన వాయుదేవునియొక్క పుత్త్రుడను నేను. ఎగురుటలో నాకు ఎవ్వరును సాటి కాజాలరు. (9-10)

ఆకాశమును తాకుచున్నదా? అన్నంతగా మహోన్నతమై, విశాలమైన మేరుపర్వతముచుట్టును నేను అనాయాసముగా వేలకొలది పర్యాయములు వరుసగా తిరిగి రాగలను. నా బాహుబలముచే సముద్రమును అల్లకల్లోలమొనర్చి, పర్వతములతోడను, నదులతోడను, చెఱువులతోడను కూడియున్న ఈ భూమండలమును ఆ సాగరజలములలో అవలీలగా ముంచివేయగలను. నా తొడలయొక్క, పిక్కలయొక్క వేగముచే వరుణదేవుని నివాసమైన సముద్రమును క్రిందుమీదుగావించెదను. అప్పుడు అకల్లోలితజలములచే అందలి మొసళ్లు మొదలగు మహాజలచరములు అన్నియును పైకి ఎగురగొట్టబడును.(11-13)

పక్షులు సంచరించెడి ఆకాశమునందు పన్నగాశనుడైన గరుత్మంతుడు అమితవేగముతో ఎగురుచుండును. అప్పుడు నేను అంతకంటెను మించిన వేగముతో ఆవైనతేయునిచుట్టును వేలకొలది పర్యాయములు ప్రదక్షిణములు చేయగలను. (14)

ఓ వానరప్రముఖులారా! ఉదయాద్రినుండి బయలుదేఱిన సూర్యునితోపాటు నేను కదలి, ఆయనను మించిన వేగముతో ముందుగా అస్తాద్రికి చేరెదను. మఱల నేను ఆ అస్తాద్రినుండి బయలుదేఱి, మధ్యాహ్న సమయమువఱకు (ఆ భాస్కరుడు ఆకాశము మధ్యకు చేరునప్పటికే) ఆ వేడి కిరణముల స్వామికి (సూర్యునకు) ఎదురురాగలను. అనంతరము భూమిని తాకకుండగనే

తతో భూమిమ్ అసంస్పృశ్య పునరాగంతుముత్సహే।
ప్రవేగేనైవ మహతా భీమేన ప్లవగర్షభాః। 16

ఉత్సహేయమ్ అతిక్రాంతుం సర్వానాకాశగోచరాన్।
సాగరం శోషయిష్యామి దారయిష్యామి మేదినీం। 17

పర్వతాం శ్చూర్ణయిష్యామి ప్లవమానః ప్లవంగమాః।
హరిష్యామ్యూరువేగేన ప్లవమానో మహార్ణవమ్। 18

లతానాం వివిధం పుష్పం పాదపానాం చ సర్వశః।
అనుయాస్యంతి మామద్య ప్లవమానం విహాయసా।
భవిష్యతి హి మే పంథాః స్వాతేః పంథా ఇవాంబరే। 19

చరంతం ఘోర మాకాశమ్ ఉత్పతిష్యంత మేవ వా।
ద్రక్ష్యంతి నిపతంతం చ సర్వభూతాని వానరాః। 20

మహామేఘప్రతీకాశం మాం చ ద్రక్ష్యథ వానరాః।
దివమావృత్య గచ్ఛంతం గ్రసమానమివాంబరమ్। 21

విధమిష్యామి జీమూతాన్ కంపయిష్యామి పర్వతాన్।
సాగరం క్షోభయిష్యామి ప్లవమానః సమాహితః। 22

వైనతేయస్య సా శక్తిః మమ యా మారుతస్య వా। 23

ఋతే సుపర్ణరాజానం మారుతం వా మహాజవం।
న తద్భూతం ప్రపశ్యామి యన్మాం ప్లుతమనువ్రజేత్। 24

నిమేషాంతరమాత్రేణ నిరాలంబనమంబరం।
సహసా నిపతిష్యామి ఘనాద్విద్యుదివోత్థితా। 25

భవిష్యతి హి మే రూపం ప్లవమానస్య సాగరే।
విష్ణోర్విక్రమమాణస్య పురా త్రీన్ విక్రమానివ। 26

(మధ్యలో ఎచ్చటనూ విశ్రాంతి తీసికొనకుండా) తీవ్రమైన మహావేగముతో (అదే వేగముతో) తిరిగి రాగలను. అంతటి వేగముతో సుదూర తీరములకు నిర్విరామముగా వెళ్లిరాగల నాకు ఈ సముద్రమును లంఘించుట ఒక లెక్కయా? (15-16)

నా వేగగమనముచే ఆకాశమున సంచరించెడి గ్రహ నక్షత్రాదులను సైతము నేను అధిగమింపగలను. సముద్రము ఎండిపోవునట్లుగా చేయగలను. భూమిని బ్రద్దలుగావింపగలను. ఓ వానరులారా! నేను పర్వతములపై గంతులువేయుచు వాటిని నుగ్గునుగ్గు గావింపగలను. నేను ఊరువేగముతో సాగుచు ఎంతటి మహాసముద్రములనైనను అవలీలగా దాటగలను. (17-18)

నేను ఆకాశమున వేగముగా సాగిపోవునప్పుడు ఆ పరిసరములలోగల వృక్షములయొక్క, తీగెలయొక్క వివిధములగు పూవులు అన్నియును ఆ వేగములో నాతో కలిసి ఎగిరి రాగలవు. పుష్పములు అన్నియును చెల్లాచెదరై నా వెంటవచ్చుచున్నప్పుడు (ఆ పూవులన్నియును మిలమిలమెఱయుచుండుటచే) నా మార్గము అనేక నక్షత్రముల సముదాయములచే కూడియున్న స్వాతీ నక్షత్రమార్గమువలె శోభిల్లును. (19)

ఓ వానరులారా! నేను భయంకరమైన ఆకాశమున పైకి వెళ్లుచు, క్రిందికి వచ్చుచు సంచరించునప్పుడు ఆదృశ్యమును సమస్తప్రాణులును కాంచగలవు. విశాలమైన మహామేఘతుల్యమగు ఆకారముతో అంబరమును మ్రింగివేయుచున్నట్లు ఆకాశమును అంతయును వ్యాపించియున్న నన్ను మీరందఱును చూడగలరు.(20-21)

ఏకాగ్రచిత్తముతో అంతరిక్షమున ఎగురుచు మేఘజాలమును చెల్లాచెదరుగావింతును, పర్వతములను కంపింపజేయుదును. సాగరమును అల్లకల్లోలమొనర్చెదను. గరుత్మంతునివలెను, వాయుదేవునివలెను. నేను మహాశక్తిమంతుడను. మహావేగముగలవైనతేయుడు, వాయుదేవుడు తప్ప ఇతర ప్రాణులెవ్వియును దివమందు త్వరితగతితో పురోగమించుచున్న నన్ను అనుసరింపజాలవు.(22-24)

మేఘమునుండి వెలువడు మెఱుపువలె నేను విద్యుద్వేగముతో నిరాధారమైన ఆకాశమునకు ఱెప్పపాటు కాలములో (క్షణములో) ఎగురగలను. మహాసముద్రముపై ఎగురునప్పుడు నా రూపము పాదత్రయముతో ముల్లోకములను ఆక్రమించుటకై విజృంభించినప్పటి విష్ణురూపమువలె ఒప్పారును. (25-26)

బుద్ధ్యా చాహం ప్రపశ్యామి మనశ్చేష్టా చ మే తథా।
అహం ద్రక్ష్యామి వైదేహీం ప్రమోదధ్వం ప్లవంగమాః। 27

నా బుద్ధిద్వారా నిశ్చయించుకొనిన కార్యమునకు నా మనస్సుగూడ అనుకూలముగా ప్రవర్తించును. (నేను ఎప్పుడేదీ అనుకొన్నను దానిని సాధించి తీరెదను.) కనుక నేను సీతాదేవిని తప్పక దర్శింపగలను. మీరును ఆనందింపగలరు. (27)

మారుతస్య సమో వేగే గరుడస్య సమో జవే।
అయుతం యోజనానాం తు గమిష్యామీతి మే మతిః। 28

వాసవస్య సవజ్రస్య బ్రహ్మణో వా స్వయంభువః।
విక్రమ్య సహసా హస్తాత్ అమృతం తదిహాఽఽనయే।
లంకాం వాపి సముత్క్షిప్య గచ్ఛేయమితి మే మతిః। 29

వేగమునందు నేను వాయుదేవునియంతటి వాడను. బలపరాక్రమములయందు గరుత్మంతునితో సమానుడను. వేలకొలది యోజనములదూరమునకైనను లంఘింపగలనని నా నమ్మకము. నేను పరాక్రమించినచో వజ్రాయుధమును చేతబట్టియున్న దేవేంద్రునినుండిగాని, స్వయముగా ఆవిర్భవింపగల ప్రభావశాలియైన బ్రహ్మదేవునినుండిగాని అమృతమును బలవంతముగా లాగికొని రాగలను. అట్లే రావణునిలంకనుసైతము పెకలించి తీసికొని రాగలను. ఇది నా దృఢమైన విశ్వాసము." (28-29)

తమేవం వానరశ్రేష్ఠం గర్జంతమ్ అమితౌజసం।
ప్రహృష్టా హరయస్తత్ర సముదైక్షంత విస్మితాః। 30

మిగుల తేజోబలసంపన్నుడును, వానరులలో శ్రేష్ఠుడునువైన ఆ హనుమంతుడు ఇట్లు గట్టిగా నొక్కి వక్కాణించుచుండగా ఆ వానరులు అందఱును ఆనందాశ్చర్యములతో ఆస్వామివైపు తేఱిపాఱజూచిరి. (30)

తస్య తద్వచనం శ్రుత్వా జ్ఞాతీనాం శోకనాశనం।
ఉవాచ పరిసంహృష్టో జాంబవాన్ హరిసత్తమమ్। 31

తోడివానరులయొక్క విచారమును తొలగించుచు వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు పలికిన వచనములను విని, జాంబవంతుడు పరమానందభరితుడై, పిదప ఆయనతో ఇట్లు నుడివెను. (31)

వీర! కేసరిణః పుత్ర హనుమన్ మారుతాత్మజ।
జ్ఞాతీనాం విపులః శోకః త్వయా తాత వినాశితః। 32

తవ కల్యాణరుచయః కపిముఖ్యాః సమాగతాః।
మంగళం కార్యసిద్ధ్యర్థం కరిష్యంతి సమాహితాః। 33

ఋషీణాం చ ప్రసాదేన కపివృద్ధమతేన చ।
గురూణాం చ ప్రసాదేన ప్లవస్వ త్వం మహార్ణవమ్। 34

నాయనా! ఓ కేసరికుమారా! ఓ వాయువరప్రసాదీ! మహావీరుడవైన ఓ హనుమంతా! నీలోని ధైర్యోత్సాహములకు అనుగుణముగా చక్కని అభయవచనములను పలికి, మన వానరులలో గూడుకట్టుకొనియున్న అపారమైన దుఃఖమును రూపుమాపితివి. ఇచట చేరియున్న ఈ కపివరులందఱును నీ శుభమునుకోరుచున్నారు. వారు ఎల్లరును ఏకాగ్రతతో నీ కార్యము సఫలమగుటకు స్వస్తి వచనములను పలుకుదురు. ఋషులయొక్క, వృద్ధులైన వానరులయొక్క ఆశీస్సులతో, గురువులఅనుగ్రహముతో నీవు ఈ మహాసముద్రమును లంఘింపుము. (32-34)

స్థాస్యామశ్చైకపాదేన యావదాగమనం తవ।
త్వద్గతాని చ సర్వేషాం జీవితాని వనౌకసామ్। 35

ఓ మారుతీ! నీవు తిరిగి వచ్చెడివఱకును నీకై యెదురుతెన్నులు చూచుచూ, మేము నీ నామమునే స్మరించుచుందుము. మన వానరులప్రాణములన్నియును నీపైననే ఆధారపడియున్నవి. (35)

తతస్తు హరిశార్దూలః తానువాచ వనౌకసః।
నేయం మమ మహీ వేగం లంఘనే ధారయిష్యతి। 36

పిదప కపివరుడైన హనుమంతుడు ఆవానరులతో ఇట్లు నుడివెను." నేను కాలుమోపి లంఘించుటకు పూనుకొనినప్పుడు నా బలమునకు ఈ భూమి తట్టుకొనలేదు. (36)

ఏతానీహ నగస్యాస్య శిలాసంకటశాలినః।
శిఖరాణి మహేంద్రస్య స్థిరాణి చ మహాంతి చ। 37

ఏషు వేగం కరిష్యామి మహేంద్రశిఖరేష్వహం।
నానాద్రుమవికీర్ణేషు ధాతునిఃష్యందశోభిషు। 38

ఏతాని మమ నిష్పేషం పాదయోః ప్లవతాం వరాః।
ప్లవతో ధారయిష్యంతి యోజనానామితః శతమ్। 39

తతస్తం మారుతప్రఖ్యః స హరిర్మారుతాత్మజః।
ఆరురోహ నగశ్రేష్ఠం మహేంద్రమ్ అరిమర్దనః। 40

వృతం నానావిధైర్వృక్షైః మృగసేవితశాద్వలం।
లతాకుసుమసంబాధం నిత్యపుష్పఫలద్రుమమ్। 41

సింహశార్దూలచరితం మత్తమాతంగసేవితం।
మత్తద్విజగణోద్ఘుష్టం సలిలోత్పీడసంకులం। 42

మహద్భిరుచ్ఛ్రితం శృంగైః మహేంద్రం స మహాబలః।
విచచార హరిశ్రేష్ఠో మహేంద్రసమవిక్రమః। 43

పాదాభ్యాం పీడితస్తేన మహాశైలో మహాత్మనః।
రరాజ సింహాభిహతో మహాన్ మత్త ఇవ ద్విపః। 44

ముమోచ సలిలోత్పీడాన్ విప్రకీర్ణశిలోచ్చయః। 45

విత్రస్తమృగమాతంగః ప్రకంపితమహాద్రుమః।
నాగగంధర్వమిథునైః పానసంసర్గకర్కశైః। 46

ఎత్తైనశిలలతో గూడిన ప్రదేశములుగల ఈ మహేంద్రపర్వతముయొక్క ఈ శిఖరములు మహోన్నతములు, స్థిరములు. ఈ గిరిశృంగములు స్రవించుచున్న గైరికాదిధాతువులతో విలసిల్లుచున్నవి. ఇందు అంతటను వివిధములగు వృక్షములు వ్యాపించియున్నవి. నేను ఈ శిఖరములపైన బలముగా కాలుమోపి ఇచటినుండియే లంఘించెదను. ఓ వానరప్రముఖులారా! సముద్రముపై నూఱుయోజనముల దూరము లఘించుటకు నేను పూనుకొనినప్పుడు (బయలుదేఱునప్పుడు) ఈ శిఖరములు నా పాదముల ఒత్తిడిని భరింపగలవు. (37-39)

అనంతరము శత్రుసంహారకుడు, వానరప్రముఖుడు, వేగమున వాయుదేవునితో సమానుడు ఐన ఆ మారుతి పర్వతములలో శ్రేష్ఠమైన ఆ మహేంద్రగిరిని అధిరోహించెను. (40)

ఆ మహేంద్రగిరిపై వివిధములగు వృక్షములు శోభిల్లుచున్నవి. అచటి పచ్చికబయళ్లపై మృగములు (లేళ్లు) హాయిగా సంచరించుచున్నవి. ఆయాప్రదేశముల యందు పూలతీగెలు దట్టముగా అలముకొనియున్నవి. అచటి వృక్షములు ఎల్లప్పుడును పుష్పములతో, ఫలములతో నిండి కలకలలాడుచుండును. అచట సింహములు, పెద్దపులులు సంచరించుచుండును. మదపుటేనుగులు స్వేచ్ఛగా తిరుగుచుండును. ఆగిరియందు నిరంతరము బాగుగా మత్తిల్లిన పక్షుల గుంపులయొక్క కలకలారావములు వినిపించుచుండును. ఆ గిరి నిర్మల జలప్రవాహములతోనిండియుండును. అద్భుతములైన శిఖరములతో అత్యున్నతమై ఒప్పుచున్న ఆ మహేంద్రగిరిపై పరాక్రమమున దేవేంద్రునితో సమానుడును, మహాబలశాలియు, కపివరుడును ఐన ఆ హనుమంతుడు ఇటునటు సంచరించెను. (41-43)

ఆ మహాత్ముని పాదములయొత్తిడికి కంపించిన ఆపర్వతము సింహముచే కొట్టబడిన బలీయమైన మదపుటేనుగువలె ఒప్పుచు ధ్వని చేసెను. (కంపించిన ఆ పర్వతముపై గల ప్రాణులన్నియును గగ్గోలు పెట్టెను.) బ్రద్దలైన ఆ పర్వతముయొక్క పగుళ్లనుండి నీటి ఊటలు స్రవించెను. (44-45)

హనుమంతుని పాదములయొత్తిడికి ఆ గిరి కంపింపగా అందలి మృగములు, ఏనుగులు మిగుల భీతిల్లసాగెను. మహావృక్షములు సైతము ఊగిపోవుచుండెను. అచట జంటలు జంటలుగా విహరించుచు మధువులను సేవించుటయందే నిమగ్నులైయున్న నాగులు, గంధర్వులు, ఆ గిరిపై గుంపులుగుంపులుగా ఉన్న విద్యాధరులు అచటి పక్షులతో

ఉత్పతద్భిశ్చ విహగైః విద్యాధరగణైరపి।
త్యజ్యమానమహాసానుః సంనిలీనమహోరగః।
చలశృంగశిలోద్ధాతః తదాఽభూః స మహాగిరిః। 47

పాటు భయముతో ఆ గిరిసానువులను వదలి అంతరిక్షమునకు ఎగిరిపోవుచుండిరి. శిలలయొత్తిడికి మహాసర్పములు నలిగి పోవుచుండెను. ఉన్నతములై, పంక్తులు దీఱియున్న గిరిశిఖరములు చలించి పోవుచుండెను. ఈ విధముగా అప్పుడు ఆ మహేంద్ర గిరి సంక్షోభస్థితికి గుఱియయ్యెను. (46-47)

నిశ్శ్వసద్భిస్తదాఽఽర్తైస్తు భుజంగైరర్ధనిస్సృతైః।
సపతాక ఇవాభాతి స తదా ధరణీధరః। 48

ఆ పర్వతప్రదేశములయందుగల పుట్టలలోనుండి మహాసర్పములు ఆర్తితో బుసలుకొట్టుచు సగము బయటికి రాగా ఆమహేంద్రగిరి పతాకములతో విలసిల్లు చున్నట్లుండెను. (48)

ఋషిభిస్త్రాసపంభ్రాంతైః త్యజ్యమానః శిలోచ్చయః।
సీదన్మహతి కాంతారే సార్థహీన ఇవాధ్వగః। 49

అచట ఏర్పడిన కల్లోలపరిస్థితికి ఋషులు అందఱును భయభ్రాంతులై ఆ పర్వతమును వీడి వెళ్లిపోసాగిరి అప్పుడు ఆ గిరి విశాలమైన కీకారణ్యమునందు ఎవ్వరునూ తోడులేక ఆపదలలో చిక్కుకొని ఏకాకియైన బాటసారి వలె, దుఃస్థితికి లోనయ్యెను. (49)

స వేగవాన్ వేగసమాహితాత్మా
హరిప్రవీరః పరవీరహంతా।
మనస్సమాధాయ మహానుభావో
జగామ లంకాం మనసా మనస్వీ। 50

శత్రువీరులను సంహరించుటలో దక్షుడు, వానరులలో శ్రేష్ఠుడు, వేగగమనుడు, మనోనిగ్రహము గలవాడు, మహానుభావుడు ఐన ఆ మారుతి వేగముగా సముద్రమును లంఘించుటకు నిశ్చయించుకొనెను. ఏకాగ్రచిత్తముతో మనస్సులో లంకను గూర్చి ఆలోచించుచు బయలుదేఱెను. (50)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే కిష్కింధాకాండే సప్తషష్టితమఃసర్గః (67)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి కిష్కింధాకాండమునందు ఇది అఱువదియేడవసర్గము

కిష్కింధాకాండః సమాప్తః

-- * కిష్కింధాకాండము సమాప్తము * --

— * * * --

॥ శ్రీరామచంద్రాయ నమః ॥

శ్రీమద్వాల్మీకిరామాయణము

సుందర కాండము

మొదటి సర్గము

హనుమంతుడు సముద్రమును దాటుట, మైనాకుని స్వాగతము, సురసను జయించుట, సింహికావధ, లంకాశోభను గాంచుట.

తతో రావణనీతాయాః సీతాయాశ్శత్రుకర్శనః।
ఇయేష పదమన్వేష్టుం చారణాచరితే పథి। 1

దుష్కరం నిష్ప్రతిద్వంద్వం చికీర్షన్ కర్మ వానరః।
సముదగ్రశిరోగ్రీవో గవాంపతిరివాబభౌ। 2

అథ వైడూర్యవర్ణేషు శాద్వలేషు మహాబలః।
ధీరస్సలిలకల్పేషు విచచార యథాసుఖమ్। 3

ద్విజాన్ విత్రాసయన్ ధీమాన్ ఉరసా పాదపాన్ హరన్।
మృగాంశ్చ సుబహూన్ నిఘ్నన్ ప్రవృద్ధ ఇవ కేసరీ। 4

నీలలోహితమాంజిష్ఠపత్రవర్ణైస్సితాసితైః।
స్వభావవిహితైశ్చిత్రైః ధాతుభిస్సమలంకృతమ్। 5

కామరూపిభిరావిష్టమ్ అభీక్ష్ణం సపరిచ్ఛదైః।
యక్షకిన్నరగంధర్వైః దేవకల్పైశ్చ పన్నగైః। 6

స తస్య గిరివర్యస్య తలే నాగవరాయుతే।
తిష్ఠన్ కపివరస్తత్ర హ్రదే నాగ ఇవాబభౌ। 7

అనంతరము (జాంబవంతుని ప్రేరణతో) అరివీర భయంకరుడైన ఆంజనేయుడు రావణాపహృతయైన సీతయొక్కజాడను అన్వేషించుటకై, చారణాది దివ్యజాతుల వారు సంచరించు ఆకాశమార్గమున వెళ్లుటకు నిర్ణయించుకొనెను. (1)

దుష్కరమైన, సాటిలేని ఆ కార్యమును సాధింపనెంచిన వాడై హనుమంతుడు తనమెడను, శిరస్సును నిటారుగా నిలిపి, వృషభేంద్రునివలె ప్రకాశించుచుండెను. (2)

అచటి పచ్చికబయళ్లు వైడూర్యవర్ణశోభితములై చల్లదనము గలిగి, మృదువుగా స్వచ్ఛములైయుండుటచే అవి సలిలకల్పములై వాయుస్పర్శచే తరంగాయితములై అలరారుచుండెను. అంతట ధీరుడును, మహాబలశాలియు ఐన హనుమంతుడు వాటిపై హాయిగా అటు నిటు సంచరించుచుండెను. (3)

ప్రతిభాశాలియైన ఆ హనుమంతుడు ఒక మహాసింహమువలె విజృంభించుచు తిరుగుచుండగా ఆయన వక్షఃస్థలముయొక్క తాకిడికి అచటివృక్షములు కూలిపోసాగినవి. వాటిపైగల పక్షులు భయపడినవి. పెక్కు మృగములు అసువులను కోల్పోయినవి. (4)

ఆ మహేంద్రగిరి సహజముగనే నీలము, ఎఱుపు, పసుపు, ఆకుపచ్చ, తెలుపు, నలుపు మొదలగు చిత్రవిచిత్రవర్ణములుగల ధాతువులచే అలంకృతమైయుండెను. అచట దేవతాసములైన కామరూపులగు యక్షకిన్నరగంధర్వనాగులు పలుపరికరములతో నిరంతరము సంచరించుచుండిరి. అసంఖ్యాకములైన ఏనుగులతో ఒప్పుచున్న ఆ మహేంద్రగిరి తలమున నిలిచియున్న ఆ కపివరుడు జలాశయము నందలి ఒక మహాగజమువలె భాసించెను. (5-7)

స సూర్యాయ మహేంద్రాయ పవనాయ స్వయంభువే।
భూతేభ్యశ్చాంజలిం కృత్వా చకార గమనే మతిమ్। 8

అంజలిం ప్రాఙ్ముఖః కృత్వా పవనాయాత్మయోనయే।
తతో హి వవృధే గంతుం దక్షిణో దక్షిణాం దిశమ్। 9

ప్లవంగప్రవరైర్దృష్టః ప్లవనే కృతనిశ్చయః।
వవృధే రామవృద్ధ్యర్థం సముద్ర ఇవ పర్వసు। 10

నిష్ప్రమాణశరీరస్సన్ లిలంఘయిషురర్ణవమ్।
బాహుభ్యాం పీడయామాస చరణాభ్యాం చ పర్వతమ్। 11

స చచాలాచలశ్చాపి ముహూర్తం కపిపీడితః।
తరూణాం పుష్పితాగ్రాణాం సర్వం పుష్పమశాతయత్। 12

తేన పాదపముక్తేన పుష్పౌఘేణ సుగంధినా।
సర్వతః సంవృతశ్శైలో బభౌ పుష్పమయో యథా। 13

తేన చోత్తమవీర్యేణ పీడ్యమానస్స పర్వతః।
సలిలం సంప్రసుస్రావ మదం మత్త ఇవ ద్విపః। 14

పీడ్యమానస్తు బలినా మహేంద్రస్తేన పర్వతః।
రీతీః నిర్వర్తయామాస కాంచనాంజనరాజతీః। 15

ముమోచ చ శిలాశ్శైలో విశాలాస్సమనశ్శిలాః।
మధ్యమేనార్చిషా జుష్టో ధూమరాజీరివానలః। 16

గిరిణా పీడ్యమానేన పీడ్యమానాని సర్వతః।
గుహావిష్టాని భూతాని వినేదుర్వికృతైః స్వరైః। 17

అతడు సూర్యునకును, మహేంద్రునకును, వాయుదేవునకును, బ్రహ్మదేవునకును, ఇతరదేవతలకును అంజలిఘటించి, బయలుదేఱుటకు నిశ్చయించు కొనెను. పిమ్మట కార్యదక్షుడైన మారుతి తూర్పునకు తిరిగి తన తండ్రియగు వాయుదేవునకు ప్రణమిల్లెను. దక్షిణదిశగా వెళ్లదలచినవాడై అతడు తనశరీరమును పెంచెను.(8-9)

రామకార్యసిద్ధికై, సముద్రమును లంఘింప నిశ్చయించుకొని, వానరవీరులందఱును చూచుచుండగా, అతడు పున్నమి (పర్వ)దినములయందు ఉప్పొంగు సముద్రునివలె వృద్ధిచెందెను. (10)

హనుమంతుడు సముద్రమును అవలీలగా దాటగోరి, అపరిమితముగా తనశరీరమును పెంచెను, లంఘించుటకు ఉద్యుక్తుడై మహేంద్రగిరిని తన కరచరణములచే బలముగా అదిమెను. (11)

ఆ పర్వతము స్థావరమేయైనను మారుతి గట్టిగా అదుముటచే అది కొన్నిక్షణములపాటు కంపించెను. విరబూసిన చెట్లకొమ్మల నుండి పూవులన్నియును జలజలరాలెను. చెట్లనుండి రాలి సువాసనలను వెదజల్లుచున్న పుష్పములతో ఆ పర్వతము నిండిపోయెను. అప్పుడది ఒక పూలకొండవలె భాసించెను. (12-13)

ఆ మహావీరునిచే అదుమబడిన ఆ పర్వతము ఒక భద్రగజము మదజలమునువలె జలధారలు స్రవింప జేసెను. మహాబలశాలియైన ఆ మారుతిచే అదుమబడిన మహేంద్రగిరి తనపగుళ్లనుండి బంగారు, వెండి, కాటుక ధారలను వెలిగ్రక్కెను. ఏలనన అగ్ని యొక్క[1] సప్తార్చులలో 'మధ్యమార్చి' అనునది సులోహిత. దాని జ్వాలలనుండి పొగలు వెలువడుచున్నట్లు, ఆంజనేయునిచే అదుమబడిన ఆ మహేంద్రగిరినుండి పెద్ద పెద్ద ఎఱ్ఱని శిలలు ముక్కలు ముక్కలుగా బయటపడసాగెను.[2] ఆ గిరి గట్టిగా అదుమబడుటచే దాని గుహలయందు అంతటా నివసించుచున్న ప్రాణులన్నియును మిగుల నలిగి, వికృతస్వరములతో గగ్గోలు పెట్టెను. శైల

1. కాలీ, కరాలీ, చ మనోజవా చ, సులోహితా యా, చ సుధూమ్రవర్ణా! స్ఫులింగినీ, విశ్వరుచీ, చ దేవీ లేలాయమానా ఇతి సప్త జిహ్వాః (ముండకోపనిషత్తు 1-2-4) అను ఏడును అగ్ని జ్వాలలు. వాటిలో మధ్యమజ్వాలయైన 'సులోహిత' నుండి ధూమము బయలుదేఱును.
2. కొండశిలలరాపిడివలన ఉత్పన్నమైన అగ్నులచే తప్తమైన ఆ పర్వతమునందలి బంగారు, వెండి మొదలగు ధాతువులన్నియును కఱిగి పగుళ్లనుండి బయటికి ప్రవహించెను.

స మహాసత్త్వసన్నాదః శైలపీడానిమిత్తజః।
పృథివీం పూరయామాస దిశశ్చోపవనాని చ। 18

శిరోభిః పృథుభిస్సర్పా వ్యక్తస్వస్తికలక్షణైః।
వమంతః పావకం ఘోరం దదంశు ర్దశనైశ్శిలాః। 19

తాస్తదా సవిషైర్దష్టాః కుపితైస్తైర్మహాశిలాః।
జజ్వలుః పావకోద్దీప్తా బిభిదుశ్చ సహస్రధా। 20

యాని చౌషధజాలాని తస్మిన్ జాతాని పర్వతే।
విషఘ్నాన్యపి నాగానాం న శేకుః శమితుం విషమ్। 21

భిద్యతేఽయం గిరిర్భూతైః ఇతి మత్వా తపస్వినః।
త్రస్తా విద్యాధరా స్తస్మాత్ ఉత్పేతుఃస్త్రీగణైస్సహ। 22

పానభూమిగతం హిత్వా హైమమాసవభాజనమ్।
పాత్రాణి చ మహార్హాణి కరకాంశ్చ హిరణ్మయాన్। 23

లేహ్యానుచ్చావచాన్ భక్ష్యాన్ మాంసాని వివిధాని చ।
ఆర్షభాణి చ చర్మాణి ఖడ్గాంశ్చ కనకత్సరూన్। 24

కృతకంఠగుణాః క్షీబా రక్తమాల్యానులేపనాః।
రక్తాక్షాః పుష్కరాక్షాశ్చ గగనం ప్రతిపేదిరే। 25

హారనూపుర కేయూర పారిహార్యధరాః స్త్రియః।
విస్మితా స్సస్మితాస్తస్థుః ఆకాశే రమణైస్సహ। 26

దర్శయంతో మహావిద్యాం విద్యాధరమహర్షయః।
సహితాస్తస్థురాకాశే వీక్షాంచక్రుశ్చ పర్వతమ్। 27

పీడకులోనైన వివిధప్రాణుల ఆ ఆక్రందన ధ్వనులు పృథ్వి యందంతటను నిండెను. ఉపవనములయందును, దశదిశలయందును వ్యాపించెను. (14-18)

స్పష్టముగా వ్యక్తమగుచున్న స్వస్తికలక్షణములుగల విశాలమైన పడగలతో భయంకరముగా విషాగ్నులను గ్రక్కుచు సర్పములు తమకోఱలతో శిలలను కాటు వేయుచు గట్టిగా పట్టుకొనసాగెను. (19)

బుసలుకొట్టుచున్న విషసర్పముల కాటుకులోనైన ఆ గండశిలలు విషాగ్ని కీలలతో మండెను. అప్పుడు అవి 'పెటేల్ పెటేల్‌మనుచు' వేలకొలదిగా తుత్తునియలాయెను. (20)

ఆ మహేంద్రగిరిపై పుట్టిపెఱిగిన ఓషధులలో విషహరములైనవి పెక్కుగలవు. ఐనను అవి ఆ మహాసర్పముల ఘోరవిషమును మాత్రము హరింపజాలకపోయినవి. (21)

'భూతములచే ఈ కొండ పగులగొట్టబడుచున్నది' అని తలంచి, తాపసులు కలతచెందిరి. విద్యాధరులును భయపడి, తమస్త్రీలతోగూడ అచటినుండి ఆకసమునకు ఎగిరిపోయిరి. (22)

ఆ విద్యాధరులు పానభూమియందలి మధుర పానీయములుగల బంగారుపాత్రలను, అమూల్యములైన భోజనపాత్రలను, కనకకలశములను భయముతో అచటనే వదలివెళ్ళిరి. (23)

వారు లేహ్యములను రుచ్యములైన భక్ష్యములను బాగుగా గుజ్జుగలిగిన వివిధమధురరసఫలములను, ఎద్దు చర్మములతో చేయబడిన డాళ్లను, బంగారుపిడులుగల ఖడ్గములను అచటనే విడిచిపెట్టిపోయిరి. (24)

వారు గళములయందు కంఠహారములను, ఎఱ్ఱని పూలమాలలను ధరించియుండిరి. శరీరములపై ఎఱ్ఱ చందనములను అలందుకొనియుండిరి. సహజముగనే ఎఱ్ఱదామరలవంటి వారికన్నులు మధుపానముచే ఇంకను ఎఱుపెక్కియుండెను. అట్టి విద్యాధరులు మిక్కిలి భీతితో ఆకాశమునకు చేరిరి. (25)

విద్యాధరస్త్రీలు హారములను, అందెలను, దండ కడియములను, కరకంకణములను ధరించియుండిరి. వారు సంభ్రమాశ్చర్యములతో, దరహాసములతో తమ ప్రియులతోగూడి అంతరిక్షమున నిలిచియుండిరి. (26)

విద్యాధరులును, మహర్షులును ఆకాశమున ఒక్కచోట చేరి, నిరాధారముగా అంతరిక్షమున తేలియాడు తమ మహావిద్యను ప్రదర్శించుచు అచటినుండి మహేంద్ర గిరిని కుతూహలముతో వీక్షింపసాగిరి. (27)

శుశ్రువుశ్చ తదా శబ్దమ్ ఋషీణాం భావితాత్మనామ్।
చారణానాం చ సిద్ధానాం స్థితానాం విమలేఽంబరే। 28

అప్పుడు నిర్మలాకాశమున నిలిచియున్న పవిత్రాంతఃకరణులైన ఋషుల, చారణుల, సిద్ధుల మాటలను వారు వినిరి. (28)

ఏష పర్వతసంకాశో హనుమాన్ మారుతాత్మజః।
తితీర్షతి మహావేగః సముద్రం మకరాలయమ్। 29

"పర్వతాకారుడును, వాయునందనుడును, మిక్కిలి వేగముగలవాడును ఐన ఈ హనుమంతుడు మొసళ్లకు నిలయమైన సముద్రమును లంఘింపదలంచుచున్నాడు. (29)

రామార్థం వానరార్థం చ చికీర్షన్ కర్మ దుష్కరమ్।
సముద్రస్య పరం పారం దుష్ప్రాపం ప్రాప్తుమిచ్ఛతి। 30

అతడు శ్రీరామకార్యార్థము వానరరాజైన సుగ్రీవుని ఆజ్ఞమేరకు ఇతరులకసాధ్యమైన పనిని చేయదలంచుచు, దాటశక్యముగాని సముద్రముయొక్క ఆవలిఒడ్డును చేరగోరుచున్నాడు." (30)

ఇతి విద్యాధరాశ్శ్రుత్వా వచస్తేషాం మహాత్మనామ్।
తమప్రమేయం దదృశుః పర్వతే వానరర్షభమ్। 31

ఆ మహాత్ములయొక్క ఈ వచనములను విని, విద్యాధరులు సాటిలేని ఆ వానరోత్తముని మహేంద్రగిరిపై చూచిరి. (31)

దుధువే చ స రోమాణి చకంపే చాచలోపమః।
ననాద సుమహానాదం సుమహానివ తోయదః। 32

పర్వతసదృశుడైన ఆ మారుతి ఒక్కసారి ఒడలు విఱచి, రోమములను విదల్చెను, ప్రళయకాలమేఘము గర్జించినట్లు ఒక మహానాదము చేసెను. (32)

ఆనుపూర్వ్యేణ వృత్తం చ లాంగూలం లోమభిశ్చితమ్।
ఉత్పతిష్యన్ విచిక్షేప పక్షిరాజ ఇవోరగమ్। 33

మారుతి ఎగురసన్నద్ధుడై, రోమములతో నిండి, మొదట లావుగానుండి క్రమముగా సన్నబడుచు వర్తులాకారముననున్న తనవాలమును గరుడుడు పామును విదిలించినట్లు విదల్చెను. (33)

తస్య లాంగూలమావిద్ధమ్ అత్తవేగస్య పృష్ఠతః।
దదృశే గరుడేనేవ హ్రియమాణో మహోరగః। 34

మహావేగగమనుడగు ఆ మారుతి తనవాలమును ఒక్కసారి విదల్చెను. అప్పుడు పృష్ఠభాగమునుండి నిట్టనిలువుగా వంకరగా నిలిచియున్న ఆలాంగూలము గరుత్మంతునిచే కొనిపోబడు మహాసర్పమువలె గోచరించు చుండెను. (34)

బాహూ సంస్తంభయామాస మహాపరిఘసన్నిభౌ।
ససాద చ కపిః కట్యాం చరణౌ సంచుకోచ చ। 35

ఆ కపీశ్వరుడు పెద్ద పెద్ద ఇనుపగుదియలవలెనున్న తనబాహువులను స్తంభింపజేసెను, ఊపిరి బిగబట్టి, కటిప్రదేశమును కృశింపజేసి, పాదములను బాగుగా కుదించెను. (35)

సంహృత్య చ భుజౌ శ్రీమాన్ తథైవ చ శిరోధరామ్।
తేజస్సత్త్వం తథా వీర్యమ్ ఆవివేశ స వీర్యవాన్। 36

శుభలక్షణసంపన్నుడైన ఆ మారుతి తన భుజములను, మెడను కుదించెను. అప్పుడు ఆ వీరునియందు తేజస్సు, బలము, పరాక్రమము నిండారెను. (36)

మార్గమాలోకయన్ దూరాత్ ఊర్ధ్వం ప్రణిహితేక్షణః।
రురోధ హృదయే ప్రాణాన్ ఆకాశమవలోకయన్। 37

ఆ మారుతి చూపులను పైకి ప్రసరింపజేయుచు, తాను వెళ్లవలసినమార్గమును దూరమునుండి పరిశీలించుచు, ఆకాశమును నిశితముగా చూచుచు, ఉచ్ఛ్వాసమును హృదయమునందు బిగబట్టెను. (37)

పద్భ్యాం దృఢమవస్థానం కృత్వా స కపికుంజరః।
నికుంచ్య కర్ణౌ హనుమాన్ ఉత్పతిష్యన్మహాబలః। 38

వానరాన్ వానరశ్రేష్ఠ ఇదం వచనమబ్రవీత్।
యథా రాఘవనిర్ముక్తః శరః శ్వసనవిక్రమః। 39

గచ్ఛేత్ తద్వద్గమిష్యామి లంకాం రావణపాలితామ్।
నహి ద్రక్ష్యామి యది తాం లంకాయాం జనకాత్మజామ్। 40

అనేనైవ హి వేగేన గమిష్యామి సురాలయమ్।
యది వా త్రిదివే సీతాం న ద్రక్ష్యామ్యకృతశ్రమః। 41

బద్ధ్వా రాక్షసరాజానమ్ ఆనయిష్యామి రావణమ్।
సర్వథా కృతకార్యోఽహమ్ ఏష్యామి సహ సీతయా। 42

ఆనయిష్యామి వా లంకాం సముత్పాట్య సరావణామ్।
ఏవముక్త్వా తు హనుమాన్ వానరాన్ వానరోత్తమః। 43

ఉత్పపాతాథ వేగేన వేగవానవిచారయన్।
సుపర్ణమివ చాత్మానం మేనే స కపికుంజరః। 44

సముత్పతతి తస్మింస్తు వేగాత్ తే నగరోహిణః।
సంహృత్య విటపాన్ సర్వాన్ సముత్పేతుస్సమంతతః। 45

స మత్తకోయష్టిబకాన్ పాదపాన్ పుష్పశాలినః।
ఉద్వహన్నూరువేగేన జగామ విమలేఽంబరే। 46

ఊరువేగోత్థితా వృక్షా ముహూర్తం కపిమన్వయుః।
ప్రస్థితం దీర్ఘమధ్వానం స్వబంధుమివ బాంధవాః। 47

తమూరువేగోన్మథితాః సాలాశ్చాన్యే నగోత్తమాః।
అనుజగ్ముర్హనూమంతం సైన్యా ఇవ మహీపతిమ్। 48

సుపుష్పితాగ్రైర్బహుభిః పాదపైరన్వితః కపిః।
హనుమాన్ పర్వతాకారో బభూవాద్భుతదర్శనః। 49

మహాబలశాలియగు ఆ కపివరుడు పాదములను నేలపై దృఢముగా మోపి, చెవులను రిక్కించి, పైకెగుర సన్నద్ధుడయ్యెను. (38)

వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు అంగదాది వానరులతో ఇట్లనెను. "వాయువేగమున సాగిపోవు రామబాణమువలె నేను మిక్కిలి వేగముగా రావణునిచే పాలింపబడుచున్నలంకకు వెళ్ళెదను. అచ్చట జానకీ మాతను కాంచజాలనిచో అదేవేగమున సురలోకమునకు పోయెదను. ఆ స్వర్గమునగూడ సీతాదేవిని దర్శింపనిచో రాక్షసరాజైన రావణుని అవలీలగా బంధించి, తీసికొని వచ్చెదను. ఏదియేమైనను కృతకృత్యుడనై సీతతోసహా తిరిగి వచ్చెదను. (39-42)

లేనిచో రావణునితోసహా లంకను పెకలించుకొని, తీసికొనిరాగలను." వానరోత్తముడైన హనుమంతుడు తోడివానరులతో ఇట్లు పలికి, మిక్కిలివేగముగా సాగి పోగల ఆ మారుతి ఎట్టి జంకుగొంకులులేక అతివేగముగా అంతరిక్షమునకు ఎగిరెను. అపుడాకపీశ్వరుడు తనను గరుత్మంతునిగా భావించుకొనెను. (43-44)

అతడట్లు ఎగురునప్పుడు ఆ వేగమునకు పర్వతము పైగల వృక్షములన్నియును అన్నివైపులనుండి కొమ్మలతో సహా ఆకసమునకు ఎగిరెను. (45)

మదించిన కొక్కెరలను, కొంగలను, పూవులతో నిండిన వృక్షములను తనఊరువేగమున వెంటగొనిపోవుచు నిర్మలమైన ఆకాశమున అతడు పురోగమించెను. (46)

సుదీర్ఘయాత్రకు బయలుదేఱిన ఆత్మీయుని వీడ్కొలుపుటకు ప్రియబంధువులు కొంతదూరము అనుసరించునట్లు, ఆ కపివరుని ఊరువేగమునకు పైకెగిరిన వృక్షములన్నియును ఒకముహూర్తకాలము అతనిని వెన్నంటినవి. (47)

ఆయనఊరువేగధాటికి పెకలింపబడిన మద్దిచెట్లు, తదితరమహావృక్షములును, సైన్యములు ఒక మహా రాజునువలె ఆ హనుమంతుని అనుసరించెను. (48)

పర్వతాకారుడును, కపివరుడును ఐన ఆ హనుమంతుడు బాగుగాపుష్పించిన పెక్కు మహా వృక్షములతో పరివృతుడు అగుటచే మిక్కిలి అద్భుతముగా కన్పట్టుచుండెను.(49)

సారవంతోఽథ యే వృక్షా న్యమజ్జన్ లవణాంభసి।
భయాదివ మహేంద్రస్య పర్వతా వరుణాలయే। 50

దేవేంద్రునకు భయపడి, పర్వతములు సముద్రములో దాగికొనినట్లు చేవగల (బరువుగల) చెట్లన్నియును జలధిలో పడి మునిగిపోయెను. (50)

స నానాకుసుమైః కీర్ణః కపిస్సాంకురకోరకైః।
శుశుభే మేఘసంకాశః ఖద్యోతైరివ పర్వతః। 51

మేఘసదృశుడై అలరారుచున్న విశాలాకృతిగల ఆ హనుమంతుడు వివిధములగుకుసుమములతో, చిగుళ్లతో, మొగ్గలతో పరివృతుడై, (రాత్రులయందు) మిణుగురు పురుగులతోగూడిన పర్వతమువలె శోభిల్లెను. (51)

విముక్తాస్తస్య వేగేన ముక్త్వా పుష్పాణి తే ద్రుమాః।
అవశీర్యంత సలిలే నివృత్తాస్సుహృదో యథా। 52

ఆత్మీయులను కొంత దూరము అనుసరించి, వెనుకకు మఱలిన మిత్రులవలె ఆ చెట్లు ఆయనవేగముతో కొంత దూరము అనుసరించినవై, ఆయనవేగమునుండి విడివడి, పూవులను రాల్చుచు నీటిలో పడి, అంతటను వ్యాపించెను. (52)

లఘుత్వేనోపపన్నం తత్ విచిత్రం సాగరేఽపతత్।
ద్రుమాణాం వివిధం పుష్పం కపివాయుసమీరితమ్।
తారాచితమివాకాశం ప్రబభౌ స మహార్ణవః। 53

ఆ హనుమంతునివాయువేగకారణముగా వృక్షముల యొక్క వివిధములగుపుష్పములు కొంత దూరము కొనిపోబడినవై, తేలికగా ఉండుటవలన తుదకు విచిత్రముగా అవి సాగరమున బడిపోయెను.[1] అప్పుడా మహాసముద్రము అసంఖ్యాకములైన నక్షత్రములతో గూడిన ఆకాశమువలె శోభిల్లెను. (53)

పుష్పౌఘేణానుబద్ధేన నానావర్ణేన వానరః।
బభౌ మేఘ ఇవాకాశే విద్యుద్గణవిభూషితః। 54

తస్య వేగసమాధూతైః పుష్పైస్తోయ మదృశ్యత।
తారాభిరభిరామాభిః ఉదితాభిరివాంబరమ్। 55

వివిధములగు రంగులుగల పుష్పసమూహములు మారుతిశరీరముపై అంటుకొనియుండగా అతడు ఆకాశమున మెఱుపుతీగలతో అలరారు మేఘమువలె ప్రకాశించెను. ఆయనవేగముచే చెల్లాచెదరై పడిపోయిన పూవులతో ఆ సముద్రజలము మనోజ్ఞమై, ఉదయించుచున్న మనోహరములైన నక్షత్రములతో అలరారు ఆకాశమువలె విలసిల్లెను. (54-55)

తస్యాంబరగతౌ బాహూ దదృశాతే ప్రసారితౌ।
పర్వతాగ్రాత్ వినిష్క్రాంతౌ పంచాస్యావివ పన్నగౌ। 56

బాగుగా చాచబడినవై, అంబరమున అలరారుచున్న ఆ మారుతి రెండుబాహువులు పర్వతాగ్రమునుండి వెలువడిన ఐదుపడగలసర్పములవలె భాసిల్లుచుండెను. (56)

పిబన్నివ బభౌ చాపి సోర్మిమాలం మహార్ణవమ్।
పిపాసురివ చాకాశం దదృశే స మహాకపిః। 57

మహావేగగమనుడైన ఆ కపివరుడు ఉత్తుంగ తరంగములతో అలరారు ఆ సముద్రమును తన ఛాయ ద్వారా జుఱ్ఱుచున్న వానివలె ఒప్పారెను, ఇంకను అతడు ఆకాశమును పానము చేయగోరు వానివలెను భాసిల్లెను. (57)

1) ఆత్మీయులను వీడ్కొలుపుటకై వారిని కొంతదూరము అనుసరించి, వారియెడబాటునకు తట్టుకొనలేక మిత్రులు దుఃఖాశ్రువులను రాల్చుచు శోకసాగరమున మునిగెదరు. అట్లే మహావృక్షములు ఆయనవేగమునకు కొంతదూరము (ఆయనను) అనుసరించి, పుష్పములను రాల్చుచు, సముద్రమునబడి నీటిపై తేలియాడుచుండెను.

తస్య విద్యుత్ప్రభాకారే వాయుమార్గానుసారిణః।
నయనే విప్రకాశేతే పర్వతస్థావివానలౌ। 58

పింగే పింగాక్షముఖ్యస్య బృహతీ పరిమండలే।
చక్షుషీ సంప్రకాశేతే చంద్రసూర్యావివోదితౌ। 59

ముఖం నాసికయా తస్య తామ్రయా తామ్రమాబభౌ।
సంధ్యయా సమభిస్పృష్టం యథా తత్సూర్యమండలమ్। 60

లాంగూలం చ సమావిద్ధం ప్లవమానస్య శోభతే।
అంబరే వాయుపుత్రస్య శక్రధ్వజ ఇవోచ్ఛ్రితః। 61

లాంగూలచక్రేణ మహాన్ శుక్లదంష్ట్రోఽనిలాత్మజః।
వ్యరోచత మహాప్రాజ్ఞః పరివేషీవ భాస్కరః। 62

స్ఫిగ్దేశేనాభితామ్రేణ రరాజ స మహాకపిః।
మహతా దారితేనేవ గిరిర్గైరికధాతునా। 63

తస్య వానరసింహస్య ప్లవమానస్య సాగరమ్।
కక్షాంతరగతో వాయుః జీమూత ఇవ గర్జతి। 64

ఖే యథా నిపతత్యుల్కా హ్యుత్తరాంతాద్వినిస్సృతా।
దృశ్యతే సానుబంధా చ తథా స కపికుంజరః। 65

పతత్పతంగసంకాశో వ్యాయతశ్శుశుభే కపిః।
ప్రవృద్ధ ఇవ మాతంగః కక్ష్యయా బధ్యమానయా। 66

ఉపరిష్టాచ్ఛరీరేణ ఛాయయా చావగాఢయా।
సాగరే మారుతావిష్టా నౌరివాసీత్ తదా కపిః। 67

వాయుమార్గమున సాగిపోవుచున్న ఆయనయొక్క కన్నులు విద్యుత్కాంతులవలె మెఱయుచు పర్వతమునందలి రెండగ్నులవలె ప్రకాశించుచుండెను. (58)

వానరశ్రేష్ఠుడైన మారుతియొక్క నేత్రములు పింగళ(గోరోచన) వర్ణము గలిగి, మిక్కిలి విశాలములై గుండ్రముగా విలసిల్లుచుండెను. అప్పుడవి ఉదయించుచున్న సూర్యచంద్రులవలె భాసిల్లుచుండెను. (59)

ఎఱ్ఱని నాసికగల ఆయన ఎఱ్ఱని ముఖమండలము సంధ్యారాగ సంశోభితమగు సూర్యమండమువలె విలసిల్లుచుండెను. (60)

ఆకాశమున తేలిపోవుచున్న వాయుపుత్రునియొక్క వాలము మహోన్నతముగా నిలిచి, పైకెత్తబడిన ఇంద్రధ్వజమువలె శోభిల్లుచుండెను. (61)

మహాత్ముడును, తెల్లని పలువరుస గలవాడును, మిక్కిలి ప్రజ్ఞాశాలియు ఐన ఆ వాయునందనుడు చక్రాకృతిలోనున్న వాలముతో గూడి పరివేషము (చుట్టును కాంతివలయము)తో ఒప్పుచున్న భాస్కరునివలె తేజరిల్లెను. ఎఱ్ఱని వాలమూలప్రదేశ శోభలతో ఒప్పారు ఆ కపీశ్వరుడు గైరికాదిధాతువులతో రెండుగా విభజింప బడిన పర్వతమువలె విరాజిల్లెను. (62-63)

సముద్రమును లంఘించుచు పోవుచున్న ఆ వానర వీరునిబాహుమూలములద్వారా ప్రసరించు వాయువు మేఘగర్జనవలె ధ్వనింపసాగెను. (64)

పొడవైన వాలముతోగూడి ఉత్తరదిశనుండి దక్షిణ దిశకు (లంకకు) సాగిపోవుచున్న ఆ కపివరుడు ఆకాశమున ఉత్తరమునపొడమి, దక్షిణదిశగా రాలిపోవు తోకచుక్క వలె గోచరించెను. (ఉల్కాపాతము లోకమునకు అశుభసూచకము- అట్లే మారుతి దక్షిణదిక్కునకు సాగిపోవుట లంకకు అరిష్ట సూచకము.) (65)

సాగిపోవుచున్న సూర్యునివలె ఒప్పుచు విశాల దేహముగల ఆ వానరేంద్రుడు కక్ష్యయందు బంధింప బడిన మహామాతంగమువలె శోభిల్లెను. (66)

హనుమంతుడు ఆకాశమున సాగిపోవుచుండెను. ఆయననీడ సముద్రజలములలో ప్రతిబింబించుచు లోతుగా మునిగియుండెను. నీటిలో కొంతమునిగి, మిగిలినభాగము నీటిపై తేలుచు అనుకూలపవనముల ప్రభావమున సాగిపోవు నౌకవలె అతడు ఒప్పెను. (67)

యం యం దేశం సముద్రస్య జగామ స మహాకపిః।
స స తస్యోరువేగేన సోన్మాద ఇవ లక్ష్యతే। 68

సాగరస్యోర్మిజాలానామ్ ఉరసా శైలవర్ష్మణామ్।
అభిఘ్నంస్తు మహావేగః పుప్లువే స మహాకపిః। 69

ఆకాశమున ఆ మారుతి సాగిపోవునప్పుడు అతడు దాటుచున్న సముద్రప్రాంతములన్నియును అతని ప్రబల వేగమున అల్లకల్లోలములై ఉన్మాదభరితములైనట్లు కనబడెను. కొండలంతఎత్తునకు ఎగురుచున్న సముద్ర తరంగములను తన వక్షఃస్థలముతో నెట్టుచు, వాటిని ఛిన్నాభిన్నముగావించుచు ఆ మహాకపి మిక్కిలి వేగముగా ఆకసమున తేలిపోవుచుండెను. (68-69)

కపివాతశ్చ బలవాన్ మేఘవాతశ్చ నిస్సృతః।
సాగరం భీమనిర్ఘోషం కంపయామాసతుర్భృశమ్। 70

హనుమంతుని గమనవేగమున ఏర్పడిన బలీయమైన వాయువు, మేఘములనుండి వెలువడు గాలియు రెండును కలిసి, భయంకరఘోషలతో ఘూర్ణిల్లుచున్న సముద్రమును ఇంకను కంపింపజేసినవి. (70)

వికర్షన్నూర్మిజాలాని బృహంతి లవణాంభసి।
పుప్లువే కపిశార్దూలో వికిరన్నివ రోదసీ। 71

లవణసముద్రమునందు ఉవ్వెత్తుగా ఎగురుచున్న పెద్దపెద్ద తరంగపంక్తులను చెల్లాచెదరుగావించుచు, ఆ కపివరుడు ఒక విభజనరేఖవలె భూమ్యాకాశములను వేఱువేయుచున్నట్లు సాగిపోవుచుండెను. (71)

మేరుమందరసంకాశాన్ ఉద్ధతాన్ స మహార్ణవే।
అతిక్రామన్ మహావేగః తరంగాన్ గణయన్నివ। 72

మహావేగగమనుడైన హనుమంతుడు మేరుమందర పర్వతములయంత ఎత్తున ఎగిరిఎగిరిపడుచున్న ఆ మహా సముద్రతరంగములను లెక్కపెట్టుచున్న వానివలె, ముందునకు సాగెను. (72)

తస్య వేగసముద్ధూతం జలం సజలదం తదా।
అంబరస్థం విబభ్రాజ శారదాభ్రమివాతతమ్। 73

ఆవాయునందనుని వేగముచే పైకెగసిన సముద్రజలము ఆకాశమునందంతటను వ్యాపించి జలముతోగూడిన తెల్లని శరత్కాలమేఘమువలె విలసిల్లెను. (73)

తిమినక్రఝషాః కూర్మా దృశ్యంతే వివృతాస్తదా।
వస్త్రాపకర్షణేనేవ శరీరాణి శరీరిణామ్। 74

తరంగితమైన సముద్రముయొక్క జలములు అటునిటు తొలిగిపోవుటవలన అందలి తిమింగిలములు, మొసళ్ళు, పెద్దపెద్దచేపలు, తాబేళ్లు వస్త్రములుతొలగిన (దిగంబరములైన) మానవశరీరములవలె కనబడు చుండెను. (74)

ప్లవమానం సమీక్ష్యాథ భుజంగాస్సాగరాలయాః।
వ్యోమ్ని తం కపిశార్దూలం సుపర్ణ ఇతి మేనిరే। 75

సముద్రమునందలి సర్పములన్నియును ఆకాశమున తేలిపోవుచున్న కపీశ్వరునిగాంచి, ఆయనను గురుత్మంతునిగా తలపోసి(భీతిల్లి)నవి. (75)

దశయోజనవిస్తీర్ణా త్రింశద్యోజనమాయతా।
ఛాయా వానరసింహస్య జలే చారుతరాఽభవత్। 76

ఆ వానరశ్రేష్ఠునినీడ పదియోజనముల పొడవు ముప్పదియోజనముల వెడల్పు గలదై నీటిపై మిక్కిలి మనోహరముగా ఒప్పుచుండెను.[1] (76)

1) అది సంధ్యాసమయము. హనుమంతుడు ఉత్తరమునుండి దక్షిణమునకు వెళ్లుచుండెను. కనుక సంధ్యాకాల సూర్యకాంతి ప్రభావమున ఆ మారుతి శరీరచ్ఛాయ పొడవు యథా ప్రకారముగా ఉండును. వెడల్పు (దూరమునకు పోగా పోగా) పెద్దది యగును. అందువలన ఆయన నీడ పొడవు కంటెను వెడల్పు ఎక్కువ కనబడెను.

శ్వేతాభ్రఘనరాజీవ వాయుపుత్రానుగామినీ।
తస్య సా శుశుభే ఛాయా వితతా లవణాంభసి। 77

వాయునందనుని అనుసరించున్న విశాలమైన అతని నీడ సముద్రజలములలో స్వచ్ఛమైన, దట్టమైన మేఘ మండలమువలె విరాజిల్లెను. (77)

శుశుభే స మహాతేజా మహాకాయో మహాకపిః।
వాయుమార్గే నిరాలంబే పక్షవానివ పర్వతః। 78

మహాతేజస్వియు, మహాకాయుడును ఐన ఆ కపివరుడు నిరాధారమైన వాయు (ఆకాశ) మార్గమున పయనించుచు టెక్కలుగల పర్వతమువలె భాసిల్లుచుండెను. (78)

యేనాసౌ యాతి బలవాన్ వేగేన కపికుంజరః।
తేన మార్గేణ సహసా ద్రోణీకృత ఇవార్ణవః। 79

అమితబలశాలియైన ఆ కపీంద్రుడు మిక్కిలి వేగముగా వెళ్లుచున్న ఆమార్గమున సముద్రము విశాలమైన ఓడవలె ఒప్పారెను. (79)

ఆపాతే పక్షిసంఘానాం పక్షిరాజ ఇవ వ్రజన్।
హనుమాన్ మేఘజాలాని ప్రకర్షన్ మారుతో యథా। 80

పక్షిసమూహముల మార్గమున గరుత్మంతునివలె సాగిపోవుచు హనుమంతుడు మేఘములను ఆకర్షించుచు వెళ్లు వాయువువలె ఒప్పెను. (80)

పాండురారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ।
కపినాకృష్యమాణాని మహాభ్రాణి చకాశిరే। 81

మారుతిచే ఆకర్షింపబడుచున్న మహామేఘములు తెలుపు, ఎఱుపు, నీలము, పసుపు మొదలగు పలు వన్నెలతో ప్రకాశించుచుండెను. (81)

ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః।
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చంద్రమా ఇవ లక్ష్యతే। 82

పదేపదే మేఘములమధ్య ప్రవేశించుచు, బయటికి వచ్చుచు పురోగమించుచున్న హనుమంతుడు మేఘములచే కప్పబడుచు, అవి తొలగినంతనే ప్రకాశించుచున్న చంద్రునివలె గోచరించెను. (82)

ప్లవమానం తు తం దృష్ట్వా ప్లవంగం త్వరితం తదా।
వవర్షుః పుష్పవర్షాణి దేవగంధర్వదానవాః। 83

అప్పుడు అతివేగముగా ఆకసమున పయనించుచున్న హనుమంతునిజూచి, దేవతలు, గంధర్వులు, దానవులు ఆయనపై పుష్పవర్షములను గురిపించిరి. (83)

తతాప న హి తం సూర్యః ప్లవంతం వానరోత్తమమ్।
సిషేవే చ తదా వాయూ రామకార్యార్థసిద్ధయే। 84

రామకార్యార్థసిద్ధికై (సీతాన్వేషణ కార్యము ఫలించుటకై) ఆకసమున పయనించుచున్న వానరోత్తమునకు సూర్యుడు తాపమును కలిగింపలేదు. ఆయనశ్రమను తొలగించుటకై వాయుదేవుడుగూడ చల్లగా వీచుచు ఆయనను సేవించెను. (తండ్రియైన వాయుదేవుడు తనపుత్రుని సేవించుట (పూజించుట) ఏమిటి? రామకార్యప్రవృత్తుడైన రామభక్తుడు పూజ్యార్హుడే) (84)

ఋషయస్తుష్టువుశ్చైనం ప్లవమానం విహాయసా।
జగుశ్చ దేవగంధర్వాః ప్రశంసంతో మహౌజసమ్। 85

అంతరిక్షమున పయనించుచున్న మహాతేజస్వియగు ఆ హనుమంతుని మహర్షులు స్తుతించిరి. దేవతలు, గంధర్వులు, ఆయనను ప్రశంసించుచు కీర్తించిరి. (85)

నాగాశ్చ తుష్టువుర్యక్షా రక్షాంసి విబుధాః ఖగాః।
ప్రేక్ష్య సర్వే కపివరం సహసా విగతక్లమమ్। 86

ఏ మాత్రము అలసటచెందక అవలీలగా, శీఘ్రముగా పయనించుచున్న కపివరునిగాంచి, నాగులు, యక్షులు, దిక్పాలురు, దేవతలు మొదలగువారందఱును ప్రస్తుతించిరి, పక్షిగణములన్నియు నుతించెను. (86)

తస్మిన్ ప్లవగశార్దూలే ప్లవమానే హనూమతి।
ఇక్ష్వాకుకులమానార్థీ చింతయామాస సాగరః। 87

సాహాయ్యం వానరేంద్రస్య యది నాహం హనూమతః।
కరిష్యామి భవిష్యామి సర్వవాచ్యో వివక్షతామ్। 88

అహమిక్ష్వాకునాథేన సగరేణ వివర్ధితః।
ఇక్ష్వాకుసచివశ్చాయం నావసీదితుమర్హతి। 89

తథా మయా విధాతవ్యం విశ్రమేత యథా కపిః।
శేషం చ మయి విశ్రాంతః సుఖేనాతితరిష్యతి। 90

ఇతి కృత్వా మతిం సాధ్వీం సముద్రశ్ఛన్నమంభసి।
హిరణ్యనాభం మైనాకమ్ ఉవాచ గిరిసత్తమమ్। 91

త్వమిహాసురసంఘానాం పాతాళతలవాసినామ్।
దేవరాజ్ఞా గిరిశ్రేష్ఠ పరిఘస్సన్నివేశితః। 92

త్వమేషాం జాతవీర్యాణాం పునరేవోత్పతిష్యతామ్।
పాతాళస్యాప్రమేయస్య ద్వారమావృత్య తిష్ఠసి। 93

తిర్యగూర్ధ్వమధశ్చైవ శక్తిస్తే శైల వర్ధితుమ్।
తస్మాత్ సంచోదయామి త్వామ్ ఉత్తిష్ఠ గిరిసత్తమ। 94

స ఏష కపిశార్దూలః త్వాముపర్యేతి వీర్యవాన్।
హనుమాన్ రామకార్యార్థం భీమకర్మా ఖమాప్లుతః। 95

అస్యసాహ్యం మయా కార్యమ్ ఇక్ష్వాకుకులవర్తినః।
మమ హీక్ష్వాకవః పూజ్యాః పరం పూజ్యతమాస్తవ। 96

కురు సాచివ్య మస్మాకం న నః కార్యమతిక్రమేత్।
కర్తవ్య మకృతం కార్యం సతాం మన్యుముదీరయేత్। 97

వానరపుంగవుడైన ఆ హనుమంతుడు సాగిపోవు చుండగా ఇక్ష్వాకువంశముయొక్క కీర్తిప్రతిష్ఠలను కోరునట్టి సాగరుడు ఇట్లు తలపోసెను. (87)

వానరేంద్రుడైన హనుమంతునకు సహాయపడనిచో నేను అన్నివిధములుగ అందఱి దృష్టిలో నిందార్హుడనగుదును. (88)

నేను ఇంతటివాడనగుటకు ఇక్ష్వాకుప్రభువైన సగరుడే కారకుడు. ఇతడు ఆ ఇక్ష్వాకువంశసచివుడు. కావున ఇతడు ఎట్టిశ్రమలకును గురికారాదు. (89)

కనుక నేను ఈ కపీశ్వరునకు తగురీతిగా విశ్రాంతిని సమకూర్చవలెను. అతడు ఇచ్చట విశ్రమించి, తరువాతి ప్రయాణమును హాయిగా కొనసాగింపగలడు. (90)

ఈ విధముగా సముద్రుడు నిండుమనస్సుతో బాగుగా ఆలోచించి, (సముద్ర) జలములలో దాగియున్న గిరిసత్తముడును, బంగారుశిఖరములు గలిగినవాడును అగు మైనాకునితో ఇట్లనెను. (91)

"ఓ మైనాకా! దేవరాజైనఇంద్రుని కారణమున పాతాళవాసులైన రక్కసిమూకలకు అడ్డుగా నీవు మహాశిలవలె నిలిచిపోయితివి. (92)

పరాక్రమవంతులైన ఆ రాక్షసులు మఱల లేచి రాకుండ దుర్భేద్యమైన ఈ పాతాళద్వారమును పూర్తిగా మూసివేసి, ఇచటఉంటివి.[1] (93)

ఓ మైనాకా! పైకిని, క్రిందికిని, అన్నివైపులకును పెఱుగుటకు నీవు సమర్థుడవు. కనుక ఓ గిరీంద్రా! నిన్ను ప్రోత్సహించుచున్నాను. లెమ్ము (94)

పరాక్రమవంతుడు, అసహాయశూరుడు, కపిప్రవరుడు ఐన ఈ హనుమంతుడు, రామకార్యార్థియై నీకు పైభాగమున ఆకాశమున ఇదిగో! వచ్చుచునేయున్నాడు. (95)

ఇక్ష్వాకువంశజులు నాకుపూజ్యులు, నీవు నన్ను ఆశ్రయించియుండుటవలన నీకును వారు పరమ పూజ్యులు. కనుక ఇక్ష్వాకువంశమువాడైన శ్రీరాముని ఆజ్ఞానువర్తి యగు ఇతనికి సహాయపడుట మనకర్తవ్యము. (96)

కావున మాకు సహాయపడుము. (హనుమంతునకు విశ్రాంతిని చేకూర్చుము) ఈ (మా) కార్యమును విధిగా ఆచరింపుము. కర్తవ్యకార్యమును (సకాలములో) చేయనిచో పెద్దలకు కోపము వచ్చును. సజ్జనులకు కోపము రానీయరాదు. (97)

1) పూర్వము బలిచక్రవర్తి ఇంద్రుని పరాజితునిగావించి స్వర్గరాజ్యమును వశపఱచుకొనెను. దాని వలన దేవతలు కష్టాలపాలైరి. అప్పుడు శ్రీ మహావిష్ణువు 'వామనమూర్తి'గా అవతరించి, బలిచక్రవర్తిని పాతాళమునకు పంపెను. అతనితో రాక్షసులును పాతాళమునకు చేరిరి. వారు తిరిగి రాకుండ ఆ ద్వారమునకు ఇంద్రుడు మైనాకుని అడ్డుగా నిల్పెను.

సలిలాదూర్ధ్వముత్తిష్ఠ తిష్ఠత్వేష కపిస్త్వయి।
అస్మాకమతిథిశ్చైవ పూజ్యశ్చ ప్లవతాం వరః। 98

ఈ కపివరుడు మనకు అతిథి, పరమపూజ్యుడు. కావున నీవు నీటినుండి (వెంటనే) బయటికి రమ్ము-ఆలసింపవలదు. నీపై అతడు విశ్రాంతిని తీసికొనగలడు. (98)

చామీకరమహానాభ దేవగంధర్వసేవిత।
హనుమాంస్త్వయి విశ్రాంతః తత శ్శేషం గమిష్యతి।
(స ఏష కపిశార్దూలః త్వాముపర్యేతి వీర్యవాన్)। 99

బంగారుశిఖరములుగలవాడా! దేవతలచే గంధర్వులచే సేవింపబడువాడా! ఓ మైనాకా! హనుమంతుడు నీపై ఒకింత విశ్రమించి, తరువాతిప్రయాణమును కొనసాగింపగలడు. పరాక్రమశాలియైన వానరశ్రేష్ఠుడు ఇదిగో! నీ సమీపమునకు రానేవచ్చినాడు. (99)

కాకుత్స్థస్యానృశంస్యం చ మైథిల్యాశ్చ వివాసనమ్।
శ్రమం చ ప్లవగేంద్రస్య సమీక్ష్యోత్థాతుమర్హసి। 100

సీతాదేవి విషయమున శ్రీరామునివిహ్వాలతను, రాముని ఎడబాటువలన సీతాదేవియొక్క దుఃస్థితిని, హనుమంతుని కార్యభారమును (శ్రమను) గుర్తించి, (జలములనుండి) త్వరగా బయటికి రమ్ము" (100)

హిరణ్యనాభో మైనాకో నిశమ్య లవణాంభసః।
ఉత్పపాత జలాత్ తూర్ణం మహాద్రుమలతాయుతః। 101

సువర్ణశృంగుడైన మైనాకుడు సముద్రునిమాటలను పాటించి, లతలతో ఒప్పుచున్న పెనువృక్షములతోసహా వేగముగా నీటినుండి బయటికి వచ్చెను. (101)

స సాగరజలం భిత్త్వా బభూవాభ్యుత్థితస్తదా।
యథా జలధరం భిత్త్వా దీప్తరశ్మిర్దివాకరః। 102

స మహాత్మా ముహూర్తేన పర్వతస్సలిలావృతః।
దర్శయామాస శృంగాణి సాగరేణ నియోజితః। 103

మేఘమండలమును చీల్చుకొని, ప్రకాశించు కిరణములతో వచ్చు భాస్కరునివలె అప్పుడు ఆ మైనాకుడు సాగరజలములను భేదించుకొని, బయటికి వచ్చేసెను. సముద్రునిచే నియోగింప (ఆదేశింప)బడిన, మహాత్ముడైన ఆ మైనాకుడు సాగరజలములచే ఆవృతుడై, ఒక్కసారిగా తటాలున తనశృంగములను దర్శింపజేసెను. (102-103)

శాతకుంభనిభైః శృంగైః సకిన్నరమహోరగైః।
ఆదిత్యోదయసంకాశైః ఆలిఖద్భిరివాంబరమ్। 104

ఆ మైనాకగిరిశిఖరములు బంగారుకాంతుల నీనుచుండెను. వాటిపై కిన్నరులు విహరించుచుండిరి. మహాసర్పములు సంచరించుచుండెను. ఆ శిఖరములు ఆకాశమున వ్రాయుచు ఒరయుచు, ఉదయించుచున్న సూర్యకిరణములవలె అంతట భాసిల్లు చుండెను. (104)

తప్తజాంబూనదైః శృంగైః పర్వతస్య సముత్థితైః।
ఆకాశం శస్త్రసంకాశమ్ అభవత్ కాంచనప్రభమ్। 105

సముద్రజలములనుండి ఉవ్వెత్తుగా పైకిలేచిన, మైనాకపర్వతశిఖరములు పుటముపెట్టిన బంగారు వన్నెలను విరజిమ్ముచుండెను. అందువలన లోహవర్ణముగల ఆకాశము కాంచనప్రభలతో ఒప్పారెను. (105)

జాతరూపమయైః శృంగైః భ్రాజమానైస్స్వయంప్రభైః।
ఆదిత్యశతసంకాశః సోఽభవద్గిరిసత్తమః। 106

సువర్ణమయములై స్వయంప్రభలతో వెలుగొందు శిఖరములతో విరాజిల్లుచు, ఆ గిరీంద్రము వందలకొలది సూర్యులతో సమానముగా మిలుమిట్లు గొల్పుచుండెను. (106)

తముత్థితమసంగేన హనూమానగ్రతః స్థితమ్।
మధ్యే లవణతోయస్య విఘ్నోఽయమితి నిశ్చితః। 107

లవణసముద్రమధ్యమున అనూహ్యముగా పైకి వచ్చి, ఎదురుగా నిలిచియున్న ఆ మైనాకపర్వతమును జూచి, హనుమంతుడు ఇది యొక 'ఆటంకము' (విఘ్నము) అని తలంచెను. (107)

స తముచ్ఛ్రితమత్యర్థం మహావేగో మహాకపిః।
ఉరసా పాతయామాస జీమూతమివ మారుతః। 108

స తథా పాతితస్తేన కపినా పర్వతోత్తమః।
బుద్ధ్వా తస్య కపేర్వేగం జహర్ష చ ననంద చ। 109

తమాకాశగతం వీరమ్ ఆకాశే సముపస్థితః।
ప్రీతో హృష్టమనా వాక్యమ్ అబ్రవీత్ పర్వతః కపిమ్।
మానుషం ధారయన్ రూపమాత్మనశ్శిఖరే స్థితః। 110

దుష్కరం కృతవాన్ కర్మ త్వమిదం వానరోత్తమ।
నిపత్య మమ శృంగేషు విశ్రమస్వ యథాసుఖమ్। 111

రాఘవస్య కులే జాతైః ఉదధిః పరివర్ధితః।
స త్వాం రామహితే యుక్తం ప్రత్యర్చయతి సాగరః। 112

కృతే చ ప్రతికర్తవ్యమ్ ఏష ధర్మ స్సనాతనః।
సోఽయం త్వత్ప్రతికారార్థీ త్వత్తః సమ్మానమర్హతి। 113

త్వన్నిమిత్తమనేనాహం బహుమానాత్ ప్రచోదితః।
తిష్ఠ త్వం కపిశార్దూల మయి విశ్రమ్య గమ్యతామ్। 114

యోజనానాం శతం చాపి కపిరేష ఖమాప్లుతః।
తవ సానుషు విశ్రాంతః శేషం ప్రక్రమతామితి। 115

తదిదం గంధవత్ స్వాదు కందమూలఫలం బహు।
తదాస్వాద్య హరిశ్రేష్ఠ విశ్రాంతోఽనుగమిష్యసి। 116

అస్మాకమపి సంబంధః కపిముఖ్య త్వయాఽస్తి వై।
ప్రఖ్యాత స్త్రిషు లోకేషు మహాగుణపరిగ్రహః। 117

మిక్కిలివేగముగా సాగిపోగల ఆ కపీశ్వరుడు, వాయువు మేఘమునువలె, అత్యున్నతమైన ఆ పర్వతమును తనవక్షఃస్థలముతో పడద్రోసెను. (108)

కపివరునిచే అవలీలగా పడగొట్ట బడిన ఆ గిరీంద్రము ఆయనవేగబలమునకు అబ్బురపడి ఓహో! ఎంతటిశక్తి !! యనుచు హర్షముతో పులకించి, ఆనందముతో ఉప్పొంగిపోయెను. (109)

ఆ మైనాకపర్వతము ప్రేమతో, ప్రసన్నమైన మనస్సుతో మానవరూపమును దరించి, తనశిఖరముపై నిలిచి, ఆకాశమున వెళ్ళుచున్న ఆ కపివీరుని సమీపించి ఇట్లు పలికెను. (110)

ఓ వానరోత్తమా! నీవు ఈ దుష్కరకార్యమునకు పూనుకొంటివి. (అలసితివేమో?) నా శిఖరప్రదేశములయందు నిలిచి, హాయిగా కొంతకాలము విశ్రమింపుము. (111)

"జలధి రఘువంశజులచే ఇంతగా వృద్ధిచెందినది. కనుక అట్టి సాగరుడు రామకార్యమును సాధించుటకై నియుక్తుడవైన నీకు (కృతజ్ఞతాసూచకముగా) అతిథి సపర్యలు చేయదలచినాడు. (112)

మేలుచేసినవారికి ప్రత్యుపకారముచేయుట అందటికిని కర్తవ్యము. ఇది సనాతనధర్మలక్షణము. అట్టి సముద్రుడు నీకు సహాయపడదలచినాడు. నీ సమ్మానమును పొందుటకు అతడు అర్హుడు. (అతనిచే నియుక్తుడనైన నాఆతిథ్యమును నీవు స్వీకరించుటయే అతనికి జరుగు సమ్మానము) (113)

'శతయోజనములదూరము ప్రయాణము చేయుటకై ఈ కపివరుడు ఆకాశమార్గమున వెళ్లుచున్నాడు. నీ సానువుల (కొండచరియల) యందు కొంత విశ్రమించి, తరువాతిప్రయాణమును పిదప కొనసాగింపగలడు' అని సముద్రుడు నన్ను నీ నిమిత్తమై సగౌరవముగా ప్రోత్సహించెను. కనుక ఓ కపివరా! కొంతసేపు నాపై విశ్రమించి, ముందునకు సాగుము. (114-115)

అందువలన ఓ హరివీర! ఇచట కందమూల ఫలములు సమృద్ధిగాగలవు. అవి కమ్మనివాసనలను కుమ్మరించుచున్నవి. మిక్కిలిరుచికరమైనవి. వాటిని ఆస్వాదించి, కొంతతడవు విశ్రమించి, పిమ్మట ముందుకు సాగిపోవచ్చును. (116)

ఓ కపివరా! మాతోగూడ నీకు సంబంధము గలదు. నీవు సత్పురుషుల ప్రేమాదరములను స్వీకరించువాడవుగా ముల్లోకములయందును ప్రసిద్ధికెక్కితివి. (117)

వేగవంతః ప్లవంతో యే ప్లవంగా మారుతాత్మజ।
తేషాం ముఖ్యతమం మన్యే త్వామహం కపికుంజర। 118

అతిథిః కిల పూజార్హః ప్రాకృతోఽపి విజానతా।
ధర్మం జిజ్ఞాసమానేన కిం పునస్త్వాదృశో మహాన్। 119

త్వం హి దేవవరిష్ఠస్య మారుతస్య మహాత్మనః।
పుత్రస్తస్యైవ వేగేన సదృశః కపికుంజర। 120

పూజితే త్వయి ధర్మజ్ఞ పూజాం ప్రాప్నోతి మారుతః।
తస్మాత్ త్వం పూజనీయో మే శృణు చాప్యత్ర కారణమ్। 121

పూర్వం కృతయుగే తాత పర్వతాః పక్షిణోఽభవన్।
తే హి జగ్ముర్దిశస్సర్వా గరుడానిలవేగినః। 122

తతస్తేషు ప్రయాతేషు దేవసంఘాస్సహర్షిభిః।
భూతాని చ భయం జగ్ముః తేషాం పతనశంకయా। 123

తతః క్రుద్ధ స్సహస్రాక్షః పర్వతానాం శతక్రతుః।
పక్షాంశ్చిచ్ఛేద వజ్రేణ తత్ర తత్ర సహస్రశః। 124

స మాముపాగతః క్రుద్ధో వజ్రముద్యమ్య దేవరాట్।
తతోఽహం సహసా క్షిప్తః శ్వసనేన మహాత్మనా। 125

అస్మిన్ లవణతోయే చ ప్రక్షిప్తః ప్లవగోత్తమ।
గుప్తపక్షసమగ్రశ్చ తవ పిత్రాఽభిరక్షితః। 126

తతోఽహం మానయామి త్వాం మాన్యో హి మమ మారుత।
త్వయా మే హ్యేష సంబంధః కపిముఖ్య మహాగుణః। 127

తస్మిన్నేవం గతే కార్యే సాగరస్య మమైవ చ।
ప్రీతిం ప్రీతమనాః కర్తుం త్వమర్హసి మహాకపే। 128

ఓ మారుతీ! కపికుంజరా! వేగముగా ఎగిరి పోగల వానర శ్రేణిలో నిన్ను ఒక ప్రముఖునిగా తలంతును. (118)

ధర్మాత్ముడైన బుద్ధిమంతుడు ఇంటికివచ్చిన అతిథి సామాన్యుడైనను అతనిని పూజించును. ఇక నీవంటి మహాత్ముడు వచ్చినప్పుడు పూజింపవలసిన విషయము చెప్పనేల? ఓ కపీశ్వరా! నీవు దేవతలలోశ్రేష్ఠుడును, మహాత్ముడును ఐన వాయుదేవునికుమారుడవు, వేగములో అతనికి నీవే సాటి. (119-120)

ఓ ధర్మజ్ఞా! నిన్ను పూజించినచో వాయుదేవుని పూజించినట్లే. అందువలన నీవు నాకు పూజ్యుడవు. ఇందుకు కారణమును చెప్పెదను. ఆలకింపుము. (121)

ఓ పూజ్యుడా! పూర్వకాలమున పర్వతములకు రెక్కలు ఉండెడివి. అవి గరుడవేగముతో, వాయువేగముతో అన్ని దిక్కులకును సంచరించుచుండెడివి. (122)

అందువలన సంచరించునప్పుడు అవి వచ్చి తమ మీద పడునేమోఅని దేవతలందఱును ఋషులెల్లరును, సకలప్రాణులును భయపడుచుండెడివారు. (123)

అంతట సహస్రాక్షుడైనఇంద్రుడు క్రుద్ధుడై పర్వతముల రెక్కలను అక్కడికక్కడే తన వజ్రాయుధముచే పూర్తిగా ఖండించివేసెను. (124)

ఆ దేవేంద్రుడు క్రుద్ధుడై (నా రెక్కలు ముక్కలుగా చేయుటకై) వజ్రాయుధమునెత్తి, నాకడకు వచ్చుచుండగా మహాత్ముడైనవాయుదేవుడు నేర్పుగా నన్ను సముద్రమున పడవేసెను. (125)

ఓ వానరోత్తమ! నీ తండ్రియైన వాయుదేవునిచే నేను సురక్షితుడనై, చెక్కు చెదరని రెక్కలు గలవాడనై, ఈ లవణ సముద్రమున భద్రముగా ఉంచబడితిని. (126)

ఓ కపివర! అందువలన వాయుదేవుడు నాకు మిక్కిలి పూజ్యుడు. కనుక నేను నిన్ను సగౌరవముగా ఆదరించుచున్నాను. నీకును నాకును గల ఈ సంబంధము సద్గుణ ప్రధానమైనది. ఓ కపీశ్వరా! ఈ సంఘటనల కారణముగ నీవు నిండు మనస్సుతో సముద్రునకును, నాకును ప్రీతిని గూర్చుము. (127-128)

శ్రమం మోక్షయ పూజాం చ గృహాణ కపిసత్తమ।
ప్రీతిం చ బహుమన్యస్వ ప్రీతోఽస్మి తవ దర్శనాత్। 129

ఏవముక్తః కపిశ్రేష్ఠః తం నగోత్తమమబ్రవీత్।
ప్రీతోఽస్మి కృతమాతిథ్యం మన్యురేషోఽపనీయతామ్। 130

త్వరతే కార్యకాలో మే అహశ్చాప్యతివర్తతే।
ప్రతిజ్ఞా చ మయా దత్తా న స్థాతవ్యమిహాంతరే। 131

ఇత్యుక్త్వా పాణినా శైలమ్ ఆలభ్య హరిపుంగవః।
జగామాకాశమావిశ్య వీర్యవాన్ ప్రహసన్నివ। 132

స పర్వతసముద్రాభ్యాం బహుమానాదవేక్షితః।
పూజిత శ్చోపపన్నాభిః ఆశీర్భిరనిలాత్మజః। 133

అథోర్ధ్వం దూరముత్ప్లుత్య హిత్వా శైలమహార్ణవౌ।
పితుః పంథానమాస్థాయ జగామ విమలేఽంబరే। 134

భూయశ్చోర్ధ్వం గతిం ప్రాప్య గిరిం తమవలోకయన్।
వాయుసూనుర్నిరాలంబే జగామ విమలేఽంబరే। 135

తద్ద్వితీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్।
ప్రశశంసు స్సురాస్సర్వే సిద్ధాశ్చ పరమర్షయః। 136

ఓ కపిసత్తమా! నీ దర్శనమువలన నేను ఆనంద భరితుడనైతిని. ఇచట కొంతతడవు ఆగి అలుపు దీర్చుకొనుము. మా పూజలనందుకొనుము. (మా) ప్రేమను ఆదరింపుము." (129)

మైనాకుని మాటలను విన్న పిమ్మట హనుమంతుడు ఆ గిరివరునితో ఇట్లు పలికెను. "మీ ఆదరవచనములకు తృప్తి చెందితిని. ఆతిథ్యమును స్వీకరించినట్లే భావింపుము. ఏమియు అనుకొనవద్దు. (130)

కార్యసమయము మించిపోవుచున్నది. పగలు గడిచి పోవుచున్నది. ప్రొద్దు క్రుంకుచున్నది. మిత్రుల యెదుట ప్రతిజ్ఞ చేసియుంటిని. కావున మార్గమధ్యమున ఇచ్చట ఆగుటకు వీలులేదు." (131)

మహావీరుడైన ఆ హరిప్రవరుడు ఈ విధముగా పలికి, తన కరస్పర్శతో మైనాకుని ఆతిథ్యమును స్వీకరించినట్లుగా ప్రకటించి, ప్రసన్నముఖుడై ఆకాశమున కొంతపైకెగిరి, మిక్కిలి వేగముగా ముందునకు సాగెను. (132)

వాయుసుతుడైన ఆ హనుమంతుని సముద్రుడు మైనాకుడు మిక్కిలి ఆదరముతో చూచుచు, (భక్తి తత్పరులై)పూజించిరి. రామకార్యసిద్ధికి అనువగు ఆశీర్వచనములతో అభినందించిరి. (133)

అనంతరము మారుతి మైనాకుని, సముద్రుని వీడ్కొని, పైకి కొంతఎత్తునకు ఎగిరి, వాయు మార్గమును అనుసరించి, నిర్మలాకాశమున ఇంకను వేగముగా పురోగమించెను. (134)

వాయునందనుడు ఇంకనుపైకెగిరి, ఆ గిరివరుని జూచుచు నిరాధారమైన నిర్మలాకాశమున ఇంకను వేగముగా ముందునకు సాగెను. (135)

హనుమంతుడు ఒనర్చిన సుదుష్కరమైన ఆ రెండవ కార్యమునుజూచి, దేవతలు, సిద్ధులు, మహర్షులు, అందఱును ఆయనను ప్రశంసించిరి. (సముద్రమును లంఘించుటకై ఆకసమునకు ఎగురుట మొదటికార్యము. మైనాకునిఅడ్డంకిని అధిగమించి పురోగమించుట రెండవ కార్యము.) (136)

దేవతాశ్చాభవన్ హృష్టాః తత్రస్థాస్తస్య కర్మణా।
కాంచనస్య సునాభస్య సహస్రాక్షశ్చ వాసవః। 137

సహస్రాక్షుడైన ఇంద్రుడును, అచ్చట నిలిచియున్న దేవతలందఱును కాంచన శిఖరములు గల ఆ మైనాకుని కృషికి మిక్కిలి హర్షించిరి. (137)

ఉవాచ వచనం ధీమాన్ పరితోషాత్ సగద్గదమ్।
సునాభం పర్వతశ్రేష్ఠం స్వయమేవ శచీపతిః। 138

ధీశాలియగు దేవేంద్రుడు సంతోషాతిరేకమున గద్గదస్వరముతో కాంచనశిఖరములు గల గిరివరునితో స్వయముగా ఇట్లనెను. (138)

హిరణ్యనాభ! శైలేంద్ర! పరితుష్టోఽస్మి తే భృశమ్।
అభయం తే ప్రయచ్ఛామి తిష్ఠ సౌమ్య! యథాసుఖమ్। 139

"హిరణ్యనాభ! శైలేంద్ర! నీ కృత్యమునకు నేను మిక్కిలి సంతసించితిని. నీకు అభయమునిచ్చుచున్నాను. ఓ సౌమ్య! నీ నింకహాయిగా నుండుము. (139)

సాహ్యం కృతం తే సుమహ ద్విక్రాంతస్య హనూమతః।
క్రమతో యోజనశతం నిర్భయస్య భయే సతి। 140

రామస్యైష హి దూత్యేన యాతి దాశరథేర్హరిః।
సత్క్రియాం కుర్వతా తస్య తోషితోఽస్మి దృఢం త్వయా। 141

మిక్కిలి పరాక్రమశాలియు, నూఱుయోజనముల (పరిమితిగల) దూరమునకు పయనించుచున్నవాడును, భయపడవలసిన సమయమునందును[1] నిర్భయముగా నున్న హనుమంతునకు నీవు గొప్పగా సహాయపడితివి. ఈ కపీశ్వరుడు దశరథనందనుడైన శ్రీరాముని దూతగా వెళ్లుచున్నాడు. అట్టి వానిని నీవు సత్కరించినందులకు నేను మిక్కిలి సంతోష పడుచున్నాను." (140-141)

తతః ప్రహర్ష మగమత్ విపులం పర్వతోత్తమః।
దేవతానాం పతిం దృష్ట్వా పరితుష్టం శతక్రతుమ్। 142

అనంతరము దేవతలకు ప్రభువైన ఇంద్రుడు పరితుష్టుడగుటను గాంచి, పర్వతోత్తముడైన ఆ మైనాకుడు మిక్కిలి ప్రహర్షమును పొందెను. (142)

స వై దత్తవర స్శైలో బభూవావస్థిత స్తదా।
హనుమాంశ్చ ముహూర్తేన వ్యతిచక్రామ సాగరమ్। 143

అంతట ఇంద్రునిచే అభయ (వర)మును పొందిన ఆ గిరివరునకు మనస్సుకుదుటబడెను. హనుమంతుడు ఆ సాగరప్రదేశమును ఒక క్షణకాలములో దాటి పోయెను.(143)

తతో దేవా స్సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః।
అబ్రువన్ సూర్యసంకాశాం సురసాం నాగమాతరమ్। 144

పిమ్మట దేవతలును, గంధర్వులును, సిద్ధులును, మహర్షులును సూర్యతేజస్సుగల నాగమాత యగు'సురస'తో ఇట్లు పలికిరి. (144)

అయం వాతాత్మజశ్శ్రీమాన్ ప్లవతే సాగరోపరి।
హనుమాన్నామ తస్య త్వం ముహూర్తం విఘ్నమాచర। 145

"(యోజనములకొలది ప్రయాణము చేసినను అలుపెఱుగక) చక్కని తేజస్సుతో వెలసిల్లుచున్నవాడు, హనుమంతుడను పేరుగల ఈ వాయునందనుడు సాగరముపైభాగమున ఆకాశమున పయనించుచున్నాడు. నీవు భయంకరములైన కోఱలతో పచ్చనినేత్రములు గలిగి,

1) ఇచట 'భయేసతి' అను ప్రయోగమును ప్రాజ్ఞులు రెండు విధములుగా వివరింతురు- (1) నూఱుయోజనముల దూరము సముద్రముపై ఆకాశమున నిరాధారముగా పయనించుచున్న ఆంజనేయునకు ఏమి ప్రమాదము వాటిల్లునోయని ఇంద్రాదుల భయము- సముద్రమునుండి బయటికి వచ్చిన తనను ఇంద్రుడేమిచేయునో యని మైనాకుని భయము- ఇంద్రుడు అభయమిచ్చుటచే మైనాకుని భయము తొలగినది. మైనాకుని ఆతిథ్యమును స్వీకరించి, మారుతి ముందునకు సాగుటచే ఇంద్రాదుల భయము కూడ తొలగినది. వాస్తవముగా హనుమంతునకు ఎట్టి భయమూ లేదు.

రాక్షసం రూపమాస్థాయ సుఘోరం పర్వతోపమమ్।
దంష్ట్రాకరాళం పింగాక్షం వక్త్రం కృత్వా నభస్స్పృశమ్। 146

బలమిచ్ఛామహే జ్ఞాతుం భూయశ్చాస్య పరాక్రమమ్।
త్వాం విజేష్యత్యుపాయేన విషాదం వా గమిష్యతి। 147

ఏవముక్తా తు సా దేవీ దైవతైరభిసత్కృతా।
సముద్రమధ్యే సురసా బిభ్రతీ రాక్షసం వపుః। 148

వికృతం చ విరూపం చ సర్వస్య చ భయావహమ్।
ప్లవమానం హనూమంతమ్ ఆవృత్యేదమువాచ హ। 149

మమ భక్షః ప్రదిష్టస్త్వమ్ ఈశ్వరైర్వానరర్షభ।
అహం త్వాం భక్షయిష్యామి ప్రవిశేదం మమాననమ్। 150

ఏవముక్తస్సురసయా ప్రాంజలిర్వానరర్షభః।
ప్రహృష్టవదనశ్శ్రీమాన్ ఇదం వచనమబ్రవీత్। 151

రామో దాశరథిర్నామ ప్రవిష్టో దండకావనమ్।
లక్ష్మణేన సహ భ్రాత్రా వైదేహ్యా చాపి భార్యయా। 152

అన్యకార్యవిషక్తస్య బద్ధవైరస్య రాక్షసైః।
తస్య సీతా హృతా భార్యా రావణేన యశస్వినీ। 153

తస్యాస్సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్।
కర్తుమర్హసి రామస్య సాహ్యం విషయవాసిని। 154

అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్।
ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే। 155

ఏవముక్తా హనుమతా సురసా కామరూపిణీ।
అబ్రవీన్నాతివర్తేన్మాం కశ్చిదేష వరో మమ। 156

ఆకాశమంతవెడల్పైన నోరుగలిగి, పర్వత సమానమైన భయంకరరాక్షసరూపమును ధరించి, క్షణకాలముపాటు ఆయనకు విఘ్నమును కల్పింపుము. (145-146)

ఈయన బలపరాక్రమములను మఱల తెలిసికొన గోరుచున్నాము. ఇతడు ఉపాయముచే నిన్ను జయించునా? లేక (అపజయముపాలై) విషాదమునకు లోనగునా?"(147)

ఈ విధముగా దేవతలు గౌరవపూర్వకముగా నాగమాతయగు సురసాదేవిని కోరగా, ఆమె వికారమైన, వికృతమైన రాక్షసరూపమును ధరించెను. సర్వలోక భయంకరమైన ఆరూపముతో ఆమె ఆకాశమున పయనించుచున్న ఆ హనుమంతుని సముద్రమధ్యమున అడ్డగించి, ఇట్లు పలికెను. (148-149)

"ఓ వానరేశ్వర! దేవతలు నిన్ను నాకు ఆహారముగా నిర్ణయించిరి. కనుక నిన్ను నేను భక్షింతును, నానోటిలో ప్రవేశింపుము." (150)

సురస ఇట్లుపలుకగా దివ్యశోభలతో విలసిల్లుచున్న హనుమంతుడు ప్రసన్నవదనుడై, చేతులుజోడించి, ఆమెతో ఇట్లనెను. (151)

"దశరథుని కుమారుడైన శ్రీరాముడు తనతమ్ముడైన లక్ష్మణునితోడను, భార్యయైన సీతాదేవితోను గూడి దండకారణ్యమున ప్రవేశించెను. (152)

రాక్షసులను హతమార్చెదనని ఋషుల సమక్షమున చేసిన ప్రతిజ్ఞమేరకు మారీచుని వధించుటకై వెళ్లియుండగా ఆయన భార్యయగు యశస్వినియైనసీతాదేవిని రావణుడు అపహరించుకొని వచ్చెను. (153)

రాముని ఆదేశమును అనుసరించి, నేను ఆమెకడకు దూతగా వెళ్లుచుంటిని. ఓ సురసా! నీవును ఆయన రాజ్యమునందే నివసించుచున్నదానవు. ఆయన త్రిలోకప్రభువు కనుక ఆయనకార్యమునకు సహాయపడుము. (154)

అట్లు కానిచో సీతామాతను జూచి, ఆమెకుశలవార్తను కార్యనిర్వహణదక్షుడైన రామునకుదెలిపి, పిమ్మట నీ ముఖమున ప్రవేశింతును. నేను ఈమాటను ప్రతిజ్ఞాపూర్వకముగా పల్కుచున్నాను." (155)

హనుమంతుడు ఇట్లు వచింపగా కామరూపిణియైన సురస ఇట్లు పలికెను." ఎవ్వరును నన్నుదాటి ముందునకు సాగలేరు. ఇది నాకు వరము." (156)

తం ప్రయాంతం సముద్వీక్ష్య సురసా వాక్యమబ్రవీత్।
బలం జిజ్ఞాసమానా వై నాగమాతా హనూమతః। 157

ప్రవిశ్య వదనం మేఽద్య గంతవ్యం వానరోత్తమ।
వర ఏష పురా దత్తో మమ ధాత్రేతి సత్వరా। 158

వ్యాదాయ విపులం వక్త్రం స్థితా సా మారుతేః పురః।
ఏవముక్తస్సురసయా క్రుద్ధో వానరపుంగవః।
అబ్రవీత్ కురు వై వక్త్రం యేన మాం విషహిష్యసే। 159

ఇత్యుక్త్వా సురసాం క్రుద్ధో దశయోజనమాయతః। 160

దశయోజనవిస్తారో బభూవ హనుమాం స్తదా।
తం దృష్ట్వా మేఘసంకాశం దశయోజనమాయతమ్। 161

చకార సురసా చాస్యం వింశద్యోజనమాయతమ్।
హనుమాంస్తు తతః క్రుద్ధః త్రింశద్యోజనమాయతః। 162

చకార సురసా వక్త్రం చత్వారింశత్ తథోచ్ఛ్రితమ్।
బభూవ హనుమాన్ వీరః పంచాశద్యోజనోచ్ఛ్రితః। 163

చకార సురసా వక్త్రం షష్టియోజనమాయతమ్।
తథైవ హనుమాన్ వీరః సప్తతీయోజనోచ్ఛ్రితః। 164

చకార సురసా వక్త్రమ్ అశీతీయోజనాయతమ్।
హనుమానచలప్రఖ్యో నవతీయోజనోచ్ఛ్రితః। 165

చకార సురసా వక్త్రం శతయోజనమాయతమ్।
తద్దృష్ట్వా వ్యాదితం త్వాస్యం వాయుపుత్రస్సుబుద్ధిమాన్। 166

దీర్ఘజిహ్వం సురసయా సుఘోరం నరకోపమమ్।
సుసంక్షిప్యాత్మనః కాయం బభూవాంగుష్ఠమాత్రకః। 167

సోఽభిపత్యాశు తద్వక్త్రం నిష్పత్య చ మహాజవః।
అంతరిక్షే స్థితః శ్రీమాన్ ఇదం వచనమబ్రవీత్। 168

(ఇట్లన్నను) ముందునకుసాగుచున్న హనుమంతుని జూచి, అతని బలమును పరీక్షింపగోరినదై, నాగమాతయైన సురస ఇట్లు పల్కెను. (157)

'ఓ వానరోత్తమా! ఇప్పుడు నీవు నానోట ప్రవేశించియే ముందునకు సాగవలెను. పూర్వము బ్రహ్మదేవుడు నాకు ఇచ్చిన వరమిది.' అని పలుకుచు త్వరపడుచున్నదై, నోటిని విపులముగా తెఱచి, హనుమంతునిముందర నిలిచెను. సురస ఇట్లు వచింపగా హనుమంతుడుక్రుద్ధుడై, నన్ను మ్రింగదలచినచో, నీనోటిని తెఱువుము. (158-159)

అని సురసతోపలికి, మారుతి(కుపితుడై) పది యోజనములవెడల్పుతో పదియోజనములఎత్తునకు పెరిగెను. పదియోజనముల వైపుల్యముతో ఎదిగి, మేఘ సదృశుడైయున్న ఆయననుజూచి, సురస తననోటిని ఇరువదియోజనములకు పెంచెను. పిమ్మట హనుమంతుడు క్రుద్ధుడై ముప్పదియోజనములకు పెరిగెను. (160-162)

అంతట సురస తన నోటిని నలుబదియోజనములు విస్తరింపజేసెను. వీరుడైన హనుమంతుడు ఏబది యోజనములకు పెరిగెను. (163)

పిమ్మట సురస అఱువదియోజనములమేరకు తన నోటిని విస్తరింపజేసెను. అప్పుడు వీరుడైన మారుతి డెబ్బదియోజనములు పెరిగెను. (164)

పిదప సురస తనముఖమును ఎనుబది యోజనములకు పెంచెను. హనుమంతుడు పర్వత సదృశుడై తొంబదియోజనముల ఎత్తునకు ఎదిగెను. (165)

సురస తనఆస్యమును నూఱుయోజనములు విస్తరింపజేసెను. సురసచే విస్తరింపచేయబడినఆస్యము దీర్ఘమైనజిహ్వగలిగి, ఘోరముగా నరకప్రాయముగా నుండెను. దానిని జూచి మిక్కిలి బుద్ధిశాలియైన వాయుసుతుడు సమయస్ఫూర్తితో తనకాయమును సంక్షిప్తముగాజేసి, అంగుష్ఠ మాత్రుడయ్యెను.(166-167)

మిక్కిలి వేగముగలవాడైన ఆ మారుతి వెంటనే ఆమెముఖమున ప్రవేశించి, చిటికెలో బయటికి వచ్చెను. ప్రసన్నుడైయున్న ఆ వాయుసూనుడు అంతరిక్షమున నిలిచి, ఇట్లు వచించెను. (168)

ప్రవిష్టోఽస్మి హి తే వక్త్రం దాక్షాయణి నమోఽస్తు తే।
గమిష్యే యత్ర వైదేహీ సత్యం చాసీద్వరస్తవ। 169

తం దృష్ట్వా వదనాన్ముక్తం చంద్రం రాహుముఖాదివ।
అబ్రవీత్ సురసా దేవీ స్వేన రూపేణ వానరమ్। 170

అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్।
సమానయస్వ వైదేహీం రాఘవేణ మహాత్మనా। 171

తత్ తృతీయం హనుమతో దృష్ట్వా కర్మ సుదుష్కరమ్।
సాధు సాధ్వితి భూతాని ప్రశశంసు స్తదా హరిమ్। 172

స సాగర మనాధృష్యమ్ అభ్యేత్య వరుణాలయమ్।
జగామాకాశమావిశ్య వేగేన గరుడోపమః। 173

సేవితే వారిధారాభిః పతగైశ్చ నిషేవితే।
చరితే కైశికాచార్యైః ఐరావతనిషేవితే। 174

సింహకుంజరశార్దూలపతగోరగవాహనైః।
విమానైస్సంపతద్భిశ్చ విమలైస్సమలంకృతే। 175

వజ్రాశనిసమాఘాతైః పావకైరుపశోభితే।
కృతపుణ్యైర్మహాభాగైః స్వర్గజిద్భిరలంకృతే। 176

వహతా హవ్యమత్యర్థం సేవితే చిత్రభానునా।
గ్రహనక్షత్రచంద్రార్కతారాగణవిభూషితే। 177

మహర్షిగణగంధర్వనాగయక్షసమాకులే।
వివిక్తే విమలే విశ్వే విశ్వావసునిషేవితే। 178

దేవరాజగజాక్రాంతే చంద్రసూర్యపథే శివే।
వితానే జీవలోకస్య వితతే బ్రహ్మనిర్మితే। 179

"ఓ దాక్షాయణీ! నీకు నమస్కారము నీనోట ప్రవేశించితిని గదా! ఇంక సీతాదేవికడకు వెళ్లెదను. నీకు బ్రహ్మ ఇచ్చిన వరముగూడ నెరవేఱి (సత్యమై) నదిగదా!" (169)

రాహుముఖమునుండి చంద్రునివలె తనముఖము నుండి బయటపడిన కపివరునిజూచి, 'సురసా'దేవి నిజస్వరూపముతో ఇట్లుపల్కెను. (170)

"సౌమ్యుడవైన ఓ వానరశ్రేష్ఠా! రామకార్యసిద్ధికై హాయిగా వెడలుము. సీతామాతను మహాత్ముడైనరాముని కడకుచేర్చుము." (171)

అప్పుడు హనుమంతుడొనర్చిన మిక్కిలి కష్టసాధ్యమైన ఆ మూడవకార్యమును జూచి, ప్రాణులన్నియును 'బాగు బాగు' అని ఆయునను ప్రశంసించినవి. (172)

వేగమున గరుత్మంతునితో సమానుడైన ఆ మారుతి సులభముగా దాటుటకు శక్యముగాని వరుణాలయమైన సాగరమును (సురస కారణముగా) సమీపించెను. అనంతరము అతడు ఆకాశమార్గమునకెగిరి ప్రయాణమును సాగించెను. (173)

ఆ ఆకాశమార్గము వారిధారలచే ఒప్పుచుండును. పక్షులచే సేవింపబడుచుండును. అచట కైశికరాగ ప్రవీణులైన తుంబురప్రభృతిగంధర్వులు సంచరించు చుందురు. అది ఇంద్రవాహనమైన ఐరావతముతోగూడి యుండును. సింహములు, ఏనుగులు, పెద్దపులులు, పక్షులు, సర్పములు మొదలగువాటి ఆకారములుగలిగి వాటివలె సంచరించుచున్న నిర్మలవిమానములచే అది అలంకృతమై యుండును. వజ్రాయుధధ్వనులతో పిడుగుపాటుశబ్దములతో అగ్నులకాంతులతో విలసిల్లు చుండును. పుణ్యకర్మలను ఆచరించి, స్వర్గమును జయించినవారు ఆయాప్రదేశములను అలంకరించి యుందురు. అది దేవతలకు సమర్పింపబడిన హవిస్సులను తీసికొనుపోవు అగ్నికి మార్గమైనది. అందు సూర్య చంద్రులు, తదితరగ్రహములు, అశ్విని మొదలగు నక్షత్రములు, తారాగణములు మనోహరముగా విలసిల్లు చుండును. మహర్షులతోడను, గంధర్వనాగయక్షుల తోడను అది నిండియుండును. అది స్వచ్ఛమై అతి నిర్మలమైయుండును. 'విశ్వావసుడు' అను గంధర్వరాజు అచట నివసించుచుండును. మంగళకరము, సూర్యచంద్రుల గమనమార్గమైన ఆ ఆకాశమున దేవేంద్రుని గజములు సంచరించుచుండును. ఆ ఆకాశము ప్రాణికోటికి పైభాగమున బ్రహ్మనిర్మించిన వితానము (మేలుకట్టు)వలె

బహుశస్స్వచితే వీరైః విద్యాధరగణైర్వరైః।
జగామ వాయుమార్గే తు గరుత్మానివ మారుతిః। 180

హనుమాన్ మేఘజాలాని ప్రకర్షన్ మారుతో యథా।
కాలాగరుసవర్ణాని రక్తపీతసితాని చ। 181

కపినాకృష్యమాణాని మహాభ్రాణి చకాశిరే।
ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునః పునః।
ప్రావృషీందురివాభాతి నిష్పతన్ ప్రవిశం స్తదా। 182

ప్రదృశ్యమానస్సర్వత్ర హనుమాన్ మారుతాత్మజః।
భేజేఽంబరం నిరాలంబం లంబపక్ష ఇవాద్రిరాట్। 183

ప్లవమానం తు తం దృష్ట్వా సింహికా నామ రాక్షసీ।
మనసా చింతయామాస ప్రవృద్ధా కామరూపిణీ। 184

అద్య దీర్ఘస్య కాలస్య భవిష్యామ్యహమాశితా।
ఇదం హి మే మహత్ సత్త్వం చిరస్య వశమాగతమ్। 185

ఇతి సంచింత్య మనసా ఛాయామస్య సమాక్షిపత్।
ఛాయాయాం గృహ్యమాణాయాం చింతయామాస వానరః। 186

సమాక్షిప్తోఽస్మి సహసా పంగూకృతపరాక్రమః।
ప్రతిలోమేన వాతేన మహానౌరివ సాగరే। 187

తిర్యగూర్ధ్వమధశ్చైవ వీక్షమాణస్తతః కపిః।
దదర్శ స మహత్ సత్త్వమ్ ఉత్థితం లవణాంభసి। 188

తద్దృష్ట్వా చింతయామాస మారుతిర్వికృతాననమ్।
కపిరాజేన కథితం సత్త్వమద్భుతదర్శనమ్। 189

ఛాయాగ్రాహి మహావీర్యం తదిదం నాత్ర సంశయః।
స తాం బుద్ధ్వార్థతత్త్వేన సింహికాం మతిమాన్ కపిః। 190

వ్యవర్ధత మహాకాయః ప్రావృషీవ బలాహకః।
తస్య సా కాయముద్వీక్ష్య వర్ధమానం మహాకపేః। 191

విరాజిల్లుచుండును. శ్రేష్ఠులైన విద్యాధరులు, వీరులు పలువురు అచట సంచరించుచుందురు. అట్టి ఆకాశమార్గమున వాయుసూనుడు గరుత్మంతునివలె వేగముగా సాగిపోవుచుండెను. (174-180)

హనుమంతుడు వాయువువలె మేఘములను చీల్చుకొని పోవుచుండెను. నలుపు, అగరు, ఎఱుపు, పసుపు, తెలుపు వన్నెలుగల ఆ మేఘములు ఆయనచే ఆకర్షింపబడుచు ప్రకాశించుచుండెను. మారుతి మేఘ మండలమున పదేపదే లోపలికి చొరబడుచు బయటికి వచ్చుచు వర్షాకాలమున మేఘములమధ్య చరించు చంద్రునివలె ప్రకాశించెను. (181-182)

నిరాధారమైన ఆకాశమార్గమునవెళ్లుచు ఎక్కడ చూచినను అతడే గోచరించుచు ఆ మారుతాత్మజుడు ఱెక్కలుగల ఒకమహాపర్వతమువలె ప్రకాశించెను. (183)

కామరూపిణియైన 'సింహిక' అనురాక్షసి ఆకాశమున ఎగిరిపోవుచున్న మారుతినిజూచి, ఉవ్వెత్తుగా పెఱిగినదై మనస్సున ఇట్లు ఆలోచించెను. (184)

ఇంతకాలమునకు ఒక మహాజంతువు నాకు దక్కనున్నది. చాలాకాలమునకు పిమ్మట నేను మంచి ఆహారమును తనివిదీర తినబోవుచున్నాను. (185)

ఆ రాక్షసి ఇట్లాలోచించి, ఆయనఛాయను ఒడిసి పట్టెను. తననీడ లాగికొనిపోబడుచుండగా హనుమంతుడు ఇట్లు తలపోసెను. (186)

సముద్రమున ఎదురుగాలికి పయనించు మహా నావవలె నాపరాక్రమము కుంటుపడుచున్నది. నేను బలవంతముగా లాగబడుచుంటిని. (187)

అనంతరము హనుమంతుడు క్రింద, పైన, అన్ని వైపుల పరికించెను. అపుడు అతడు సముద్రమునుండి బయల్వెడలిన ఒకమహాసత్త్వమును గాంచెను. (188)

ఆ వికృతాకారమునుజూచి, మారుతి ఇట్లుతలంచెను. 'చూచుటకు మిక్కిలి ఆశ్చర్యకరము, మహాశక్తిమంతము, ఐన ఈ ఛాయాగ్రాహిణిని గూర్చియే కపిరాజైనసుగ్రీవుడు తెల్పియుండెను. అదియేఇది. ఇందు సందేహములేదు. ప్రజ్ఞాశాలియైన ఆ హనుమంతుడు యథార్థముగా 'అది సింహికయే' యని గుర్తించెను. (189-190)

వర్షాకాలమునందలి మేఘమువలె అతడు తనశరీరమును పెంచెను. ఆ మహాకపియొక్క పెఱుగుచున్నకాయమును జూచి, ఆ సింహిక పాతాళ కుహరమునుబోలు తననోటిని

వక్త్రం ప్రసారయామాస పాతాళాంతరసన్నిభమ్।
ఘనరాజీవ గర్జంతీ వానరం సమభిద్రవత్। 192

స దదర్శ తత స్తస్యా వివృతం సుమహన్ముఖమ్।
కాయమాత్రం చ మేధావీ మర్మాణి చ మహాకపిః। 193

స తస్యా వివృతే వక్త్రే వజ్రసంహననః కపిః।
సంక్షిప్య ముహురాత్మానం నిష్పపాత మహాబలః। 194

ఆస్యే తస్యా నిమజ్జంతం దదృశుః సిద్ధచారణాః।
గ్రస్యమానం యథా చంద్రం పూర్ణం పర్వణి రాహుణా। 195

తత స్తస్యా నఖైస్తీక్ష్ణైః మర్మాణ్యుత్కృత్య వానరః। 196

ఉత్పపాతాథ వేగేన మనస్సంపాతవిక్రమః।
తాం తు దృష్ట్వా చ ధృత్యా చ దాక్షిణ్యేన నిపాత్య చ।
స కపిప్రవరో వేగాత్ వవృధే పునరాత్మవాన్। 197

హృతహృత్ సా హనుమతా పపాత విధురాఽంభసి।
స్వయంభువైవ హనుమాన్ సృష్టస్తస్యా నిపాతనే।
తాం హతాం వానరేణాశు పతితాం వీక్ష్య సింహికామ్। 198

భూతాన్యాకాశచారీణి తమూచుః ప్లవగోత్తమమ్।
భీమమద్య కృతం కర్మ మహత్ సత్త్వం త్వయా హతమ్। 199

సాధయార్థ మభిప్రేతమ్ అరిష్టం ప్లవతాం వర।
యస్య త్వేతాని చత్వారి వానరేంద్ర యథా తవ। 200

ధృతి ర్దృష్టి ర్మతిర్దాక్ష్యం స్వకర్మసు న సీదతి।
స తైస్సంభావితః పూజ్యః ప్రతిపన్నప్రయోజనః। 201

జగామాకాశమావిశ్య పన్నగాశనవత్ కపిః।
ప్రాప్తభూయిష్ఠపారస్తు సర్వతః ప్రతిలోకయన్। 202

యోజనానాం శతస్యాంతే వనరాజిం దదర్శ సః।
దదర్శ చ పతన్నేవ వివిధద్రుమభూషితమ్। 203

తెఱచెను. మేఘ మండలమువలె గర్జించుచు హనుమంతునిమీదికి విజృంభించెను. (191-192)

పిమ్మట మేధావియైన ఆ మహాకపి తనశరీరమును కబళించుటకు అనువుగా తెఱవబడిన ఆమె విశాల ముఖమును జూచెను. పిదప అతడు తన మర్మస్థానములను సంక్షిప్తమొనర్చి, (సూక్ష్మమొనర్చి) మహా వీరుడును, వజ్రదేహుడును ఐన ఆ కపివరుడు వివృతమైన దాని నోటియందు అతివేగముగా దుమికెను. (193-194)

పున్నమినాడు రాహువుచే గ్రసింపబడుచున్న పూర్ణ చంద్రునివలె, ఆమెముఖమున మునిగిపోవుచున్న హనుమంతుని సిద్ధచారణులు చూచిరి. (195)

పిమ్మట వానరేంద్రుడు తన వాడిగోళ్లతో సింహిక యొక్క ఆయువుపట్టులను చీల్చిచెండాడెను. వెంటనే మనోవేగముతో ఆకాశమునకెగిరెను. (196)

మహాప్రజ్ఞాశాలియైన ఆ హనుమంతుడు సమయస్ఫూర్తితోను, ధైర్యముతోను, పటుత్వముతోడను ఆ సింహికను రూపుమాపి, మఱల వేగముగా పెఱిగి ఆకసమునకు ఎగిరి, ముందునకు సాగెను. (197)

హనుమంతుడు ఆమెగుండెలను చీల్చివేయగా ఆ సింహిక ఆర్తయై సముద్రమునపడిపోయెను. హనుమంతుడు సింహికను హతమార్చుటయు బ్రహ్మసంకల్పములోని భాగమేగదా! హనుమంతుని చేతిలో క్షణములో గతాసువై, సముద్రజలములపాలైన ఆ సింహికను గాంచి, ఆకాశమున చరించు సిద్ధగంధర్వాదులందఱును ఆ కపివరునితో ఇట్లనిరి. "ఈ మహాప్రాణిని హతమార్చి, నీవు ఒక అద్భుతకార్యమును సాధించితివి. (198-199)

ఓ వానరోత్తమ! నీకు ఇష్టమైన, మంగళకరమైన కార్యమును సాధింపుము. నీవలె గట్టిధైర్యము, దూరదృష్టి, సమయస్ఫూర్తి, పటుత్వముగలవాడు తన కార్యసిద్ధియందు ఎన్నడును వైఫల్యమును పొందడు." పూజ్యుడైన హనుమంతుడు తానుముందుగా చేపట్టియున్న సీతాన్వేషణ కార్యమును సాధింపదలచినవాడై, గంధర్వాదులచే గౌరవింపబడెను. అనంతరము ఆకాశమార్గమున గరుత్మంతునివలె ముందునకుసాగెను. ఇంచుమించుగా ఆవలి తీరమునకుజేరి, నలువైపుల పరికించిచూచెను. (200-202)

అతడు నూఱుయోజనములమేరకు సముద్రమును లంఘించినపిదప వృక్షపంక్తులను గాంచెను. ఆ కపిశ్రేష్ఠుడు భూమిపైకి దిగుచునే వివిధవృక్షములతో కలకలలాడుచున్న

ద్వీపం శాఖామృగశ్రేష్ఠో మలయోపవనాని చ।
సాగరం సాగరానూపం సాగరానూపజాన్ ద్రుమాన్। 204

సాగరస్య చ పత్నీనాం ముఖాన్యపి విలోకయన్।
స మహామేఘసంకాశం సమీక్ష్యాత్మానమాత్మవాన్। 205

నిరుంధంతమివాకాశం చకార మతిమాన్ మతిమ్।
కాయవృద్ధిం ప్రవేగం చ మమ దృష్ట్వైవ రాక్షసాః। 206

మయి కౌతూహలం కుర్యుః ఇతి మేనే మహాకపిః।
తత శ్శరీరం సంక్షిప్య తన్మహీధరసన్నిభమ్।
పునః ప్రకృతిమాపేదే వీతమోహ ఇవాత్మవాన్। 207

తద్రూపమ్ అతిసంక్షిప్య హనుమాన్ ప్రకృతౌ స్థితః।
త్రీన్ క్రమానివ విక్రమ్య బలివీర్యహరో హరిః। 208

స చారు నానావిధరూపధారీ
పరం సమాసాద్య సముద్రతీరమ్ ।
పరై రశక్యః ప్రతిపన్నరూపః
సమీక్షితాత్మా సమవేక్షితార్థః । 209

తతస్స లంబస్య గిరేస్సమృద్ధే
విచిత్రకూటే నిపపాత కూటే ।
సకేతకోద్దాలకనాళికేరే
మహాద్రికూటప్రతిమో మహాత్మా । 210

తతస్తు సంప్రాప్య సముద్రతీరం
సమీక్ష్య లంకాం గిరివర్యమూర్ధ్ని ।
కపిస్తు తస్మిన్ నిపపాత పర్వతే
విధూయ రూపం వ్యథయన్ మృగద్విజాన్। 211

స సాగరం దానవపన్నగాయుతం
బలేన విక్రమ్య మహోర్మిమాలినమ్ ।
నిపత్య తీరే చ మహోదధే స్తదా
దదర్శ లంకామ్ అమరావతీమివ । 212

ద్వీపమును, లంకకు దక్షిణముననున్న మలయపర్వతము నందలి ఉపవనములను గాంచెను. అతడు సముద్రమును, సముద్రమునకు సమీపమునగల జలాశయములను, ఆ ప్రదేశములలో పుట్టిపెఱిగిన వృక్షములను, త్రికూటపర్వతము నందు పుట్టి, ప్రవహించు నదీముఖములను గాంచుచు, మహామేఘసదృశమై ఆకాశమునడ్డగించుచున్నట్లు ఒప్పుచున్న తన శరీరమును చూచి, ప్రతిభామూర్తియగు అతడు ఇట్లాలోచించెను. "నా పెద్దశరీరమును, అమితవేగమును చూచినచో రాక్షసులందఱును సంభ్రమాశ్చర్యములకు లోనగుదురు." ఇట్లాలోచించి, పర్వతముతో సమానమగు తన శరీరమును కుదించుకొనెను. జితేంద్రియుడు మోహము తొలగిన పిదప ఆత్మజ్ఞానియై, స్వరూపమును పొందినట్లు హనుమంతుడు మఱల స్వస్వరూప స్థితుడాయెను.(203-207)

బలిచక్రవర్తిసంపదను హరింపదలచివచ్చిన విష్ణువు త్రివిక్రమావతారముధరించి, పిమ్మట యథాస్థితికి (వామనాకృతికి) వచ్చినట్లు అతడు తనసహజమైన ఆకృతితో ఒప్పెను.(208)

మనోహరమైన వివిధరూపములను ధరింపగల వాడును, శత్రువులకు జయింపనలవికానివాడును, అగు హనుమంతుడు సముద్రపుఆవలితీరమునకు చేరెను. పిమ్మట తన పర్వతప్రమాణ దేహమును జూచుకొని, తన కర్తవ్యమును నిర్ణయించుకొని, చిన్నదైన తన సహజ రూపమును ధరించెను. (209)

అనంతరము గొప్ప పర్వతశిఖరముతో సమానుడైన, మహాత్ముడైన ఆ హనుమంతుడు సర్వవస్తుసమృద్ధము, విచిత్రములైన రంగులుగల చిన్నచిన్న శిఖరములు గలదియు, మొగలిపొదలతోను, విరిగిచెట్లతోను, కొబ్బరి చెట్లతోను అలరారుచున్నదియునైన లంబపర్వతశిఖరముపై దిగెను. (210)

అంతట కపివరుడు సముద్రతీరమున జేరి, మహా పర్వతముయొక్క పైభాగముననున్న లంకానగరమును జూచి, తన పూర్వరూపమును విడిచి, ఆ గిరిపై దిగెను. ఆయన దిగునప్పుడు మృగములు, పక్షులు వ్యథచెందెను. (211)

పెద్దపెద్ద తరంగపంక్తులతో విలసిల్లుచు దానవులకును పన్నగములకును నెలవైన సముద్రమును హనుమంతుడు తన పరాక్రమముతో దాటి, ఆ జలధితీరమున దిగి, అమరావతివలె ఒప్పుచున్న లంకా నగరమును గాంచెను. (212)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ప్రథమస్సర్గః *(1)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది మొదటిసర్గము.

-- * * * --

2. రెండవసర్గము

లంకానగర వర్ణనము, అందు ప్రవేశించు విషయమున హనుమంతుని ఆలోచన, లఘు రూపమున అతడు నగరమున ప్రవేశించుట, చంద్రోదయము

స సాగరమనాధృష్యమ్ అతిక్రమ్య మహాబలః।
త్రికూటశిఖరే లంకాం స్థితాం స్వస్థో దదర్శ హ। 1

మహాబలశాలియైన ఆ హనుమంతుడు ఇతరులకు ఎవ్వరికిని దాటశక్యముగాని సాగరమును అవలీలగా లంఘించి, స్వస్థచిత్తుడై, తిన్నగా త్రికూటపర్వత శిఖరముపైనున్న లంకానగరముమీదికి తనదృష్టిని సారించెను. (1)

తతః పాదపముక్తేన పుష్పవర్షేణ వీర్యవాన్।
అభివృష్టః స్థితస్తత్ర బభౌ పుష్పమయో యథా। 2

పరాక్రమశాలియైన ఆ హనుమంతుడు అచట (త్రికూటపర్వతముపై) నిలిచియుండగా వృక్షములు ఆయనపై పుష్పములను వర్షించెను. అప్పుడతడు పుష్పమయవిగ్రహుడై భాసించెను. (2)

యోజనానాం శతం శ్రీమాన్ తీర్త్వాఽప్యుత్తమవిక్రమః।
అనిశ్శ్వసన్ కపిస్తత్ర న గ్లానిమధిగచ్ఛతి। 3

మిక్కిలి పరాక్రమముగలవాడును, ప్రజ్ఞాశాలియునైన హనుమంతుడు నూఱుయోజనముల సముద్రమును లంఘించియు, అలసటను ఏమాత్రమూ పొందలేదు. (చెక్కుచెదరకయుండెను) పైగా ఒక్క నిట్టూర్పునుగూడ విడువలేదు. (3)

శతాన్యహం యోజనానాం క్రమేయం సుబహూన్యపి।
కిం పున స్సాగరస్యాంతం సంఖ్యాతం శతయోజనమ్। 4

వందలకొలదియోజనముల దూరమునైనను నేను సులభముగా దాట(లంఘింప)గలను. కేవలము ఒక్క నూఱుయోజనములకు పరిమితమైన ఈ సాగరము నాకొక లెక్కయా?" అని యతడనుకొనెను. (4)

స తు వీర్యవతాం శ్రేష్ఠః ప్లవతామపి చోత్తమః।
జగామ వేగవాన్ లంకాం లంఘయిత్వా మహోదధిమ్। 5

ఆ మారుతి పరాక్రమవంతులలో శ్రేష్ఠుడగుటయేగాక ఎగుర (లంఘింప) గలవారిలోగూడ సర్వోత్తముడు. అట్టి వేగముగలవాడైన అతడు మహాసముద్రమును దాటి (లంఘించి) లంకకు చేరెను. (5)

శాద్వలాని చ నీలాని గంధవంతి వనాని చ।
గండవంతి చ మధ్యేన జగామ నగవంతి చ। 6

అచటి వనములు నల్లనిపచ్చికబయళ్లుగలిగి, సువాసనలు వెదజల్లుచుండెను. వాటిమధ్య అక్కడక్కడ గండశిలలు, ప్రశస్తమైన వృక్షములును గలవు. అట్టి వనములయందు అతడుసంచరించెను. (6)

శైలాంశ్చ తరుసంఛన్నాన్ వనరాజీశ్చ పుష్పితాః।
అభిచక్రామ తేజస్వీ హనుమాన్ ప్లవగర్షభః। 7

వానరోత్తముడును, మహాతేజస్వియునైన హనుమంతుడు చెట్లతోనిండిన పర్వతములమీదను, పుష్పించిన వనముల మధ్యను తిరుగాడెను. (7)

స తస్మిన్నచలే తిష్ఠన్ వనాన్యుపవనాని చ।
స నగాగ్రే చ తాం లంకాం దదర్శ పవనాత్మజః। 8

పవనసుతుడు ఆ త్రికూటపర్వతముపై నిలుచు అచటి వనములను, ఉపవనములను ఆ పర్వతశిఖరముపై నున్న లంకానగరమును తిలకించెను. (8)

సరలాన్ కర్ణికారాంశ్చ ఖర్జూరాంశ్చ సుపుష్పితాన్।
ప్రియాళాన్ ముచులిందాంశ్చ కుటజాన్ కేతకానపి। 9

ఆ కపివరుడు అచటి సరళ (దేవదారు) వృక్షములను, కొండగోగుచెట్లను, బాగుగా పుష్పించిన ఖర్జూరపు చెట్లను, మోరటి, నిమ్మవృక్షములను, కొండమల్లె, మొగలి పొదలను,

ప్రియంగూన్ గంధపూర్ణాంశ్చ నీపాన్ సప్తచ్ఛదాం స్తథా।
అసనాన్ కోవిదారాంశ్చ కరవీరాంశ్చ పుష్పితాన్। 10

పుష్పభారనిబద్ధాంశ్చ తథా ముకులితానపి।
పాదపాన్ విహగాకీర్ణాన్ పవనాధూతమస్తకాన్। 11

హంసకారండవాకీర్ణా వాపీః పద్మోత్పలాయుతాః।
ఆక్రీడాన్ వివిధాన్ రమ్యాన్ వివిధాంశ్చ జలాశయాన్। 12

సంతతాన్ వివిధైర్వృక్షైః సర్వర్తుఫలపుష్పితైః।
ఉద్యానాని చ రమ్యాణి దదర్శ కపికుంజరః। 13

సమాసాద్య చ లక్ష్మీవాన్ లంకాం రావణపాలితామ్।
పరిఖాభిః సపద్మాభిః సోత్పలాభి రలంకృతామ్। 14

సీతాపహరణార్థేన రావణేన సురక్షితామ్।
సమంతాద్విచరద్భిశ్చ రాక్షసైరుగ్రధన్విభిః। 15

కాంచనేనావృతాం రమ్యాం ప్రాకారేణ మహాపురీమ్।
గృహైశ్చ గ్రహసంకాశైః శారదాంబుదసన్నిభైః। 16

పాండురాభిః ప్రతోళీభిః ఉచ్చాభి రభిసంవృతామ్।
అట్టాలకశతాకీర్ణాం పతాకాధ్వజశోభితామ్। 17

తోరణైః కాంచనైర్దివ్యైః లతాపంక్తివిచిత్రితైః।
దదర్శ హనుమాన్ లంకాం దివి దేవపురీం యథా। 18

గిరిమూర్ధ్ని స్థితాం లంకాం పాండురైర్భవనై శ్శుభైః।
దదర్శ స కపిశ్రేష్ఠః పురమాకాశగం యథా। 19

పాలితాం రాక్షసేంద్రేణ నిర్మితాం విశ్వకర్మణా।
ప్లవమానామివాకాశే దదర్శ హనుమాన్ పురీమ్। 20

సువాసనలను వెదజల్లు పిప్పలిచెట్లను, కడిమి, ఏడాకుల అరటి, వేగిస, కాంచనవృక్షములను, పుష్పించిన గన్నేరుచెట్లను, పూలబారముతో వంగినవియు, మొగ్గదొడిగినవియు, వివిధములగు పక్షులతో నిండినవియు, గాలితాకిడికి తలలూపుచున్నట్టివియునగు ఇతర వృక్షములను గాంచెను. (9-11)

హంసలతోడను, కారండవపక్షులతోడను కూడినవియు, పద్మములతోడను, కలువలతోడను ఒప్పుచున్నవియునగు దిగుడుబావులను, రమ్యములైన వివిధములగు విహార ప్రదేశములను, అన్నిఋతువులయందును పుష్పించు, ఫలించు వృక్షములతో చుట్టును వ్యాప్తములైయున్న పలువిధములగు జలాశయములను, మిక్కిలి మనోహరములైన ఉద్యానవనములను ఆకపివరుడు దర్శించెను. (12-13)

సర్వశుభలక్షణసంపన్నుడైన హనుమంతుడు రావణునిచే పరిపాలింపబడుచున్నలంకను సమీపించెను. కనువిందుగావించు పద్మములచేతను, కలువలచేతను కూడిన అగడ్తలతో ఆ లంక విలసిల్లుచుండెను. (14)

సీతాపహరణకారణముగా (శ్రీరామునకు భయపడుచున్న) రావణునిచే అది ప్రత్యేకముగా రక్షింపబడుచుండెను. ఉగ్రములైన ధనుస్సులను చేబూనినరాక్షసులు దానిరక్షణకై చుట్టును సంచరించుచుండిరి. (15)

బంగారుప్రాకారములతో ఆవృతమై, శరత్కాలమేఘములవలె స్వచ్ఛములై, గ్రహసదృశములైన (ఆకాశమునంటుచున్న) గృహములతో ఆ మహా నగరము రమ్యముగా విలసిల్లుచుండెను.(16)

ఆ లంకానగరము స్వచ్ఛములైన, విశాలములైన ప్రధాన వీధులతో అలరారుచుండెను. అసంఖ్యాకములైన మహోన్నతహర్మ్యములతో పతాకధ్వజములతో శోభిల్లుచుండెను. దివ్యములైన బంగారుతోరణములతోడను, చిత్ర విచిత్రములైన లతాపంక్తులతోడను ఒప్పుచున్న ఆ లంకానగరము స్వర్గమునందలి అమరావతివలె భాసిల్లుచుండెను. అట్టి లంకానగరమును ఆ కపిశ్రేష్ఠుడు గాంచెను. (17-18)

స్వచ్ఛముగా, అందముగానున్నభవనములతో ఆ లంకానగరము గిరిశిఖరమున నెలకొనియుండెను. అందువలన హనుమంతుడు దానిని 'ఆకాశమున అలరారుచున్న నగరము'గా జూచెను.(19)

విశ్వకర్మచే నిర్మింపబడి, రాక్షసరాజైన రావణునిచే పరిపాలింపబడుచున్న అప్పురము ఆకాశమున తేలియాడుచున్నదా? అనునట్లు ఒప్పుచుండెను. అట్టి ఆ లంకను మారుతి దర్శించెను. (20)

వప్రప్రాకారజఘనాం విపులాంబునవాంబరామ్।
శతఘ్నీశూలకేశాంతామ్ అట్టాలకవతంసకామ్। 21

మనసేవ కృతాం లంకాం నిర్మితాం విశ్వకర్మణా।
ద్వారముత్తరమాసాద్య చింతయామాస వానరః। 22

కైలాసశిఖరప్రఖ్యామ్ ఆలిఖంతీమివాంబరమ్।
డీయమానామివాకాశమ్ ఉచ్ఛ్రితైర్భవనోత్తమైః। 23

సంపూర్ణాం రాక్షసైర్ఘోరైః నాగైర్భోగవతీమివ।
అచింత్యాం సుకృతాం స్పష్టాం కుబేరాధ్యుషితాం పురా। 24

దంష్ట్రిభిర్బహుభిశ్శూరైః శూలపట్టిసపాణిభిః।
రక్షితాం రాక్షసైర్ఘోరైః గుహామాశీవిషైరివ। 25

తస్యాశ్చ మహతీం గుప్తిం సాగరం చ నిరీక్ష్య సః।
రావణం చ రిపుం ఘోరం చింతయామాస వానరః। 26

ఆగత్యాపీహ హరయో భవిష్యంతి నిరర్థకాః।
న హి యుద్ధేన వై లంకా శక్యా జేతుం సురైరపి। 27

ఇమాం తు విషమాం దుర్గాం లంకాం రావణపాలితామ్।
ప్రాప్యాపి స మహాబాహుః కిం కరిష్యతి రాఘవః। 28

అవకాశో న సాంత్వస్య రాక్షసేష్వభిగమ్యతే।
న దానస్య న భేదస్య నైవ యుద్ధస్య దృశ్యతే। 29

విశ్వకర్మ పూర్తిగామనస్సుపెట్టి నిర్మించిన ఆ లంకాపురి కోటప్రాకారమే జఘనము (నడుము)గా, విపులములైన అగడ్తలలోని జలములే నూతన వస్త్రములుగా, శతఘ్నులు, శూలములే కేశపాశములుగా, కోటబురుజులే కర్ణభూషణములుగా గలిగి, ఒక సుందరివలె భాసిల్లుచుండెను. హనుమంతుడు అట్టి లంకాపురియొక్క ఉత్తరద్వారమునకుచేరి సీతాదేవిని దర్శించుట ఎట్లు? అని ఆలోచింపసాగెను. (21-22)

ఈ నగరము కైలాసశిఖరసదృశమై, అంబరమును ఒరసికొనుచు ఎత్తైన మహాభవనములతో ఆకాశమున ఎగురుచున్నదా? అనునట్లు శోభిల్లుచున్నది. (23)

నాగజాతులచే వ్యాప్తమైన పాతాళనగరము (భోగవతి) వలె భయంకరులైన రాక్షసులచే ఇది నిండియున్నది. మిక్కిలి స్పష్టముగా చక్కగానిర్మింపబడి, ఊహాకందని శోభలతోవిలసిల్లుచున్న ఈనగరము పూర్వము కుబేరునిచే అధిష్ఠింపబడియుండెను. (24)

మహాసర్పములచే గుహవలె, ఈ లంకానగరము కోఱలుగలవారును, చేతులలో శూలములను, పట్టిసములను ధరించినవారును, శూరులును, భయంకరులును ఐన పెక్కుమంది రాక్షసులచేత రక్షింపబడుచున్నది. (25)

ఆ లంకానగరముయొక్క మహారక్షణవ్యవస్థను, దాని చుట్టునుగల సాగరమును జూచి, ఆ కపివరుడు రావణుని ఒక భయంకరశత్రువుగా భావించి (గుర్తించి) ఇట్లు ఆలోచింపసాగెను. "వానరులు ఇచటికివచ్చినను ఏమియు ప్రయోజనముండదు. ఏలనన యుద్ధమున ఈ లంకను జయించుటకు దేవతలకును శక్యముగాదు. ఇతరులెవ్వరును తేలికపాటుజాడరానివిధముగా కట్టుదిట్టమైన రక్షణవ్యవస్థతో రావణుడు లంకానగరమును పాలించుచున్నాడు. ఇదిఎంతటి వారికిని ప్రవేశింపశక్యము గానిది. (శ్రీరాముడు ఒకే ఒక్క బాణముతో సప్తతాళవృక్షములను భేదించెను. సప్తకులపర్వతములను కూలద్రోసెను. ఆయన బాణము భూలోకాది సప్తలోకములను చొచ్చుకొనిపోయి పాతాళలోకమునుజేరి మఱలివచ్చి అది తూణీరమున ప్రవేశించెను. ఐనను) మహాబాహువైన శ్రీరాముడు సైతము ఇట్టిలంకనుజేరి, ఏమి చేయుగలడు? (26-28)

రాక్షసులను జయించువిషయమున వారిఆసురీ ప్రకృతి కారణముగా సామోపాయమునకు అవకాశమే లేదు. వీరు అర్థ సంపదలు కలవారగుటవలన దానము ఇచట పనిచేయదు, బలదర్పితులగుటవలన వీరికడ భేదోపాయమునకు తావులేదు, వీరు బుద్ధి పరాక్రమశాలురగుట వలన ఇక యుద్ధమున వీరిని జయించుట అసాధ్యముగా కన్పట్టుచున్నది. (అనగా చతురుపాయములును వీరియెడల నిరర్థకములు) (29)

చతుర్ణామేవ హి గతిః వానరాణాం మహాత్మనామ్।
వాలిపుత్రస్య నీలస్య మమ రాజ్ఞశ్చ ధీమతః। 30

యావజ్జానామి వైదేహీం యది జీవతి వా న వా।
తత్రైవ చింతయిష్యామి దృష్ట్వా తాం జనకాత్మజామ్। 31

తతస్స చింతయామాస ముహూర్తం కపికుంజరః।
గిరిశృంగే స్థితస్తస్మిన్ రామస్యాభ్యుదయే రతః। 32

అనేన రూపేణ మయా న శక్యా రక్షసాం పురీ।
ప్రవేష్టుం రాక్షసైర్గుప్తా క్రూరైర్బలసమన్వితైః। 33

ఉగ్రౌజసో మహావీర్యా బలవంతశ్చ రాక్షసాః।
వంచనీయా మయా సర్వే జానకీం పరిమార్గతా। 34

లక్ష్యాలక్ష్యేణ రూపేణ రాత్రౌ లంకాపురీ మయా।
ప్రవేష్టుం ప్రాప్తకాలం మే కృత్యం సాధయితుం మహత్। 35

తాం పురీం తాదృశీం దృష్ట్వా దురాధర్షాం సురాసురైః।
హనుమాన్ చింతయామాస వినిశ్శ్వస్య ముహుర్ముహుః। 36

కేనోపాయేన పశ్యేయం మైథిలీం జనకాత్మజామ్।
అదృష్టో రాక్షసేంద్రేణ రావణేన దురాత్మనా। 37

న వినశ్యేత్ కథం కార్యం రామస్య విదితాత్మనః।
ఏకామేకశ్చ పశ్యేయం రహితే జనకాత్మజామ్। 38

భూతాశ్చార్థా విపద్యంతే దేశకాలవిరోధితాః।
విక్లబం దూతమాసాద్య తమస్సూర్యోదయే యథా। 39

అర్థానర్థాంతరే బుద్ధిః నిశ్చితాపి న శోభతే।
ఘాతయంతి హి కార్యాణి దూతాః పండితమానినః। 40

అంగదుడు, నీలుడు, నేను, ధీశాలియైనసుగ్రీవుడు బలిష్ఠులైన ఈ నలుగురు వానరులకు మాత్రమే ఈ లంకలో ప్రవేశించుటకు సాధ్యమగును. (30)

సీత బ్రతికియున్నదా? లేదా? అనునది ముందుగా తెలిసికొనదగిన ముఖ్యవిషయము. ఆ జానకీదేవిని చూచిన పిమ్మటనే ఈ విషయమునుగూర్చి ఆలోచించుట యుక్తము. (31)

శ్రీరామునిఅభ్యుదయ కార్యసాధనయందే నిరతుడైన కపివరుడు ఆ గిరిశిఖరముపైనిలిచినవాడై ఒక్క క్షణకాలము ఇట్లు ఆలోచింపసాగెను. (32)

మిక్కిలి క్రూరులును, బలిష్ఠులునుఐన రాక్షసులచే రక్షింపబడుచున్న ఈ రావణనగరమును నేనీరూపముతో ప్రవేశించుట అసాధ్యము. (33)

ఈ రాక్షసులెల్లరును తీక్ష్ణమైన తేజస్సుగలవారు, మహాపరాక్రమశాలురు, మిక్కిలిబలవంతులు. సీతాన్వేషణకై వీరిని నేనువంచింపవలెను. అనగా వీరికన్నుగప్పి, కార్యమును సాధించుటయెట్లు? (34)

లక్ష్య (కనబడు) రూపమున వెళ్లినచో నన్ను రాక్షసులు కనుగొందురు. అలక్ష్య (కనబడని) రూపమున సీతాన్వేషణ చేయుట సాధ్యముగాదు. కావున నా ఈమహాకార్యమును సాధించుటకై కనబడియు కనపడని (సూక్ష్మ) రూపమును నేనుధరింపవలెను. ఆవిధముగా ఈలంకాపురిలో ప్రవేశించుటకురాత్రియే నాకు తగినసమయము. (35)

అట్టి ఆ లంకాపురినిజూచి, అది సురాసురులకును దుర్భేద్యమైనదనిభావించి, హనుమంతుడు లంకలో అడుగిడుటయెట్లు? అని మఱీమఱీ ఆలోచింపసాగెను. (36)

దుర్బుద్ధియు, రాక్షసరాజును ఐన రావణుని కన్నుగప్పి, నేను జనకాత్మజయైనసీతామాతను ఏవిధముగా చూడగలను? (37)

అంతటి మహానుభావుడైనశ్రీరామునికార్యము భంగము కాకుండ నేను ఎట్లు ప్రవర్తింపవలెను? ఏకాంత ప్రదేశమున ఒంటరిగానుండు సీతమ్మతల్లిని నేను ఒక్కడనే ఎట్లు దర్శింపగలను? (38)

స్థిరచిత్తములేని పిఱికిదూతను పొందుటవలన సిద్ధములైన అర్థములు (కార్యములు) గూడ దేశ, కాలములకు విరుద్ధముగా చేయబడినవై సూర్యోదయ సమయమున చీకట్లవలె నశించును. (39)

'ఈ కార్యమును ఇట్లు చేయవలెను, ఇట్లు చేయరాదు'- అని నిశ్చయింపబడిన తరువాతగూడ వివేకములేని దూతల వలన ఆ కార్యము సఫలముగాదు. ఏలనన తమకుఏమియు తెలియకున్నను తామెంతో తెలిసినవారమని భావించి, గర్వపడు దూతలు కార్యములను చెడగొట్టుచుందురుగదా! (40)

న వినశ్యేత్ కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్।
లంఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్। 41

నా స్వామికార్యము భంగము కాకుండుట ఎట్లు? (సీతాదేవిజాడను తెలిసికొనుఉపాయమేమి?) వీరి ముందర నేను అవివేకిని కాకుండుట ఎట్లు? సముద్ర లంఘనము వ్యర్థ కాకుండుట యెట్లు? (41)

మయి దృష్టే తు రక్షోభిః రామస్య విదితాత్మనః।
భవేద్వ్యర్థమిదం కార్యం రావణానర్థమిచ్ఛతః। 42

న హి శక్యం క్వచిత్ స్థాతుమ్ అవిజ్ఞాతేన రాక్షసైః।
అపి రాక్షసరూపేణ కిముతాన్యేన కేనచిత్। 43

నేను రాక్షసుల కంటబడినచో రావణసంహారమును కోరుచున్న ప్రజ్ఞాశాలియైన శ్రీరామునికార్యము వ్యర్థమగును. రాక్షసులు పసిగట్టకుండా రాక్షసరూపమును ధరించినను లంకలో ఎచ్చటనుండుటకును సాధ్యముగాదు. ఇక వేతే రూపవిషయమును గూర్చి చెప్పనేల? (42-43)

వాయురప్యత్ర నాజ్ఞాతః చరేదితి మతిర్మమ।
న హ్యస్త్యవిదితం కించిత్ రాక్షసానాం బలీయసామ్। 44

రాక్షసులకు తెలియకుండ ఈ లంకలో గాలియును ప్రసరింపజాలదు- అని నేను తలంతును. ఇచ్చట బలవంతులైన రాక్షసులకు తెలియనిది ఏదియును ఉండదుగదా! (చీమ చిటుక్కుమన్నను వారికి తెలిసిపోవును.) (44)

ఇహాహం యది తిష్ఠామి స్వేన రూపేణ సంవృతః।
వినాశముపయాస్యామి భర్తురర్థశ్చ హీయతే। 45

నేను ఇచ్చట నానిజ (పెద్ద) రూపముతోడనే దాగి యున్నచో నాకుమరణముతప్పదు. మీదుమిక్కిలి ప్రభు (రాముని) కార్యముగూడ చెడిపోవును. (45)

తదహం స్వేన రూపేణ రజన్యాం హ్రస్వతాం గతః।
లంకామభిపతిష్యామి రాఘవస్యార్థసిద్ధయే। 46

అందువలన రామకార్యార్థసిద్ధికై నేను నా నిజరూపమును కుదించుకొని (నా సూక్ష్మ రూపముతో) రాత్రివేళ లంకలోప్రవేశించెదను. (46)

రావణస్య పురీం రాత్రౌ ప్రవిశ్య సుదురాసదామ్।
విచిన్వన్ భవనం సర్వం ద్రక్ష్యామి జనకాత్మజామ్। 47

సులభముగా చొరరానిలంకానగరమును రాత్రివేళ ప్రవేశించి, రావణునిభవనమును పూర్తిగాగాలించుచు జానకీదేవిని దర్శింపగలను." (47)

ఇతి నిశ్చిత్య హనుమాన్ సూర్యస్యాస్తమయం కపిః।
ఆచకాంక్షే తదా వీరో వైదేహ్యా దర్శనోత్సుకః। 48

ఈ విధముగా నిశ్చయించుకొని, వానరవీరుడైన హనుమంతుడు వైదేహీదర్శనముకొఱకు ఆరాట పడుచున్నవాడై, సూర్యాస్తమయమునకై నిరీక్షింపసాగెను. (48)

సూర్యే చాస్తంగతే రాత్రౌ దేహం సంక్షిప్య మారుతిః।
వృషదంశకమాత్రస్సన్ బభూవాద్భుతదర్శనః। 49

సూర్యుడస్తమింపగనే మారుతి రాత్రియందు మార్జాల ప్రమాణమున[1] తనరూపమును కుదించుకొనెను. అప్పుడతని దేహము ఆశ్చర్యమునుగొల్పునదిగా నుండెను. (49)

ప్రదోషకాలే హనుమాన్ తూర్ణముత్ప్లుత్య వీర్యవాన్।
ప్రవివేశ పురీం రమ్యాం సువిభక్తమహాపథామ్। 50

పరాక్రమశాలియైనహనుమంతుడు ఆ ప్రదోష కాలమున వేగముగాఎగిరి, బాగుగావిభజింపబడిన మార్గములుగల రమ్యమైన లంకానగరమున ప్రవేశించెను. (50)

ప్రాసాదమాలావితతాం స్తంభైః కాంచనరాజతైః।
శాతకుంభమయైర్జాలైః గంధర్వనగరోపమామ్। 51

ఆ లంకానగరము ప్రాసాదములవరుసలతో విస్తరించి యుండెను. బంగారు, వెండిస్తంభములతోడను, స్వర్ణనిర్మితములైన కిటికీలతోడను గంధర్వనగరమువలె అద్భుతావహమైయుండెను. (51)

1) చడీ చప్పుడు లేకుండా, ఎవ్వరి దృష్టిలోను పడకుండా సంచరించుట పిల్లి స్వభావము. కనుక హనుమంతుడు లంకలో ఎవరి కంటాపడకుండా సంచరింపదలచినవాడై, పిల్లిప్రమాణములో తన రూపమును కుదించుకొనెనని భావింపనగును. ఇది హనుమంతుని 'సూక్ష్మ బుద్ధికి' నిదర్శనము.

సప్తభౌమాష్టభౌమైశ్చ స దదర్శ మహాపురీమ్।
తలైః స్ఫటికసంకీర్ణైః కార్తస్వరవిభూషితైః। 52

ఆ నగరమునందలి భవనములు సువర్ణభూషితములై ఏడంతస్తులతోను, ఎనిమిదంతస్తులతోను అలరారుచుండెను. వాటిభూభాగములు స్ఫటికమణులతో పొదగబడియుండెను. అట్టి మహానగరమును హనుమంతుడు గాంచెను. (52)

వైడూర్యమణిచిత్రైశ్చ ముక్తాజాలవిభూషితైః।
తలైశ్శుశుభిరే తాని భవనాన్యత్ర రక్షసామ్। 53

ఆ లంకాపురియందలి రాక్షసులభవనముల భూభాగములు వైడూర్యమణులచేచిత్రింపబడినవై, ముత్యముల సముదాయముచే అలంకరింపబడినవై, ప్రకాశించుచుండెను. (53)

కాంచనాని చ చిత్రాణి తోరణాని చ రక్షసామ్।
లంకాముద్యోతయామాసుః సర్వతస్సమలంకృతామ్। 54

రాక్షసులు నివసించు లంకయందలిగోపురములు బంగారముతోనిర్మింపబడినవై, చిత్రవిచిత్రములుగానుండెను. అవి చక్కగాఅలంకరింపబడిన లంకా పట్టణమును అంతటను ప్రకాశింపజేయుచుండెను. (54)

అచింత్యామద్భుతాకారాం దృష్ట్వా లంకాం మహాకపిః।
ఆసీద్విషణ్ణో హృష్టశ్చ వైదేహ్యా దర్శనోత్సుకః। 55

ఊహాకందని అద్భుతాకారముగల ఆ లంకను జూచి, హనుమంతుడు విషాదమునకులోనయ్యెను. కాని వైదేహీ దర్శనకుతూహలుడై, అతడు మిక్కిలిసంతోష పడెను. (55)

స పాండురోద్విద్ధవిమానమాలినీం
మహార్హజాంబూనదజాలతోరణామ్ ।
యశస్వినీం రావణబాహుపాలితాం
క్షపాచరైః భీమబలై స్సమావృతామ్ । 56

రావణునిచే పరిపాలింపబడుచున్న ఆ లంకానగరము స్వచ్ఛములైన రాజప్రాసాదపంక్తులతో అలరారుచుండెను. అమూల్యములైన బంగారుకిటికీలతోడను, తోరణముల తోడను వెలసిల్లుచుండెను. మిక్కిలి బలశాలురైన రాక్షసులతోగూడి యుండెను. అట్టి ప్రసిద్ధమైన లంకాపురిని మారుతి గాంచెను. (56)

చంద్రోఽపి సాచివ్యమివాస్య కుర్వన్
తారాగణై ర్మధ్యగతో విరాజన్ ।
జ్యోత్స్నావితానేన వితత్య లోకమ్
ఉత్తిష్ఠతే నైకసహస్రరశ్మిః । 57

అట్టిసమయమున వేలకొలదికిరణములుగల చంద్రుడును నక్షత్రగణములమధ్య విరాజిల్లుచు వెన్నెలయనెడి చాందినీతో లోకమును కప్పివేయుచు హనుమంతునకు సహాయము చేయుచున్నవానివలె ఉదయించెను. (57)

శంఖప్రభం క్షీరమృణాళవర్ణమ్
ఉద్గచ్ఛమానం వ్యవభాసమానమ్ ।
దదర్శ చంద్రం స హరిప్రవీరః
పోప్లూయమానం సరసీవ హంసమ్ । 58

ఉదయించి పైకివచ్చుచున్న చంద్రుడు తెల్లని శంఖప్రభలతో, పాలవలె తెల్లనితామరతూడులశోభలతో ప్రకాశించుచుండెను. ఇంకను ఆ కళానిధి సరస్సున ఈదుచున్నహంసవలె మనోహరముగానుండెను. అట్టి చంద్రుని ఆ వానరవీరుడు గాంచెను. (58)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ద్వితీయస్సర్గః *(2)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది రెండవసర్గము.

-- * * * --

3. మూడవసర్గము

హనుమంతుడు లంకాధిదేవతను దండించి, లంకలోప్రవేశించుట

స లంబశిఖరే లంబే లంబతోయదసన్నిభే।
సత్త్వమాస్థాయ మేధావీ హనుమాన్ మారుతాత్మజః। 1

నిశి లంకాం మహాసత్త్వో వివేశ కపికుంజరః।
రమ్యకాననతోయాఢ్యాం పురీం రావణపాలితామ్। 2

శారదాంబుధరప్రఖ్యైః భవనైరుపశోభితామ్।
సాగరోపమనిర్ఘోషాం సాగరానిలసేవితామ్। 3

సుపుష్టబలసంఘుష్టాం యథైవ విటపావతీమ్।
చారుతోరణనిర్యూహాం పాండురద్వారతోరణామ్। 4

భుజగాచరితాం గుప్తాం శుభాం భోగవతీమివ।
తాం స విద్యుద్ఘనాకీర్ణాం జ్యోతిర్గణనిషేవితామ్।
మందమారుతసంచారాం యథేంద్రస్యామరావతీమ్। 5

శాతకుంభేన మహతా ప్రాకారేణాభిసంవృతామ్।
కింకిణీజాలఘోషాభిః పతాకాభిరలంకృతామ్। 6

ఆసాద్య సహసా హృష్టః ప్రాకారమభిపేదివాన్।
విస్మయావిష్టహృదయః పురీమాలోక్య సర్వతః। 7

జాంబూనదమయైర్ద్వారైః వైడూర్యకృతవేదికైః। 8

వజ్రస్ఫటికముక్తాభిః మణికుట్టిమభూషితైః।
తప్తహాటకనిర్యూహైః రాజతామలపాండురైః। 9

మిక్కిలిప్రజ్ఞాశాలియు, వాయుసుతుడును, మహాబల సంపన్నుడునుఐన ఆ కపిశ్రేష్ఠుడు ఉన్నతశిఖరములు గలిగి, ఎత్తైనమేఘమువలె ఒప్పుచున్న లంబ (త్రికూట) పర్వతమునందు రమ్యములైన వనములతోను, జలాశయములతోను విలసిల్లుచు, రావణపాలితమైన లంకానగరమున ధైర్యమువహించి ప్రవేశించెను. (1-2)

ఆ లంకానగరము శరత్కాలమేఘములవలె స్వచ్ఛములైన హర్మ్యములతో విలసిల్లుచుండెను. సముద్రఘోషలనుమించు రాక్షసులభయంకర ధ్వనులతో నిండియుండెను. సముద్రము మీదుగా వచ్చు చల్లని పిల్లగాలులతో సేవింపబడుచుండెను. (3)

ఆ లంకాపురి బలిష్ఠములైనసేనలతో నిండియుండెను. అచటి ద్వారబంధములపై మత్తగజములు చెక్కబడి యుండెను. అది స్వచ్ఛములైన ద్వారతోరణములుగలిగి, అలకాపురిని తలపించుచుండెను. (4)

సర్పసంచారములచే ఒప్పుచున్న భోగవతి (పాతాళ నగరము) వలె ఆ లంకా నగరము సురక్షితమై, సుందరమై విలసిల్లుచుండెను. అది ఇంద్రుని నగరమైన అమరావతివలె మెఱుపులతోగూడిన మేఘములచే వ్యాప్తమై, నక్షత్రమండలముతో శోభిల్లుచుండెను. అచట చల్లని పిల్లవాయువులు వీచుచుండెను. అది సకలవైభవములతో ఒప్పారుచుండెను. (5)

ఆ పురి ఎత్తైనబంగారుప్రాకారముచే పరివృతమై యుండెను. చిఱుమువ్వల సవ్వడులతోగూడిన పతాకములతో అది అలంకరింపబడియుండెను. (6)

ఆ లంకానగరమును త్వరత్వరగా చేరి, హనుమంతుడు సంతోషముతో దాని ప్రాకారము మీదికి ఎక్కెను. పిమ్మట ఆ లంకాపురిని కలయజూచిన మారుతిహృదయము ఆశ్చర్యచకితమయ్యెను. (7)

ఆ నగరమునందలిద్వారములు స్వర్ణమయములై యుండెను. వేదికలు (అరుగులు) స్ఫటికములతోను ముత్యములతోనుగూడి వైడూర్యమణిమయములై యుండెను. కుట్టిమములు (నేలలు) వజ్రములతోడను, మణులతోడను అలంకరింపబడియుండెను. పుటముపెట్టిన బంగారముతో నిర్మింపబడిన ఏనుగులతోడను, వెండివలె ఆ భవనముల పైభాగములు నిర్మలములై స్వచ్ఛములై యుండెను.

వైడూర్యకృతసోపానైః స్ఫాటికాంతరపాంసుభిః।
చారుసంజవనోపేతైః ఖమివోత్పతితైశ్శుభైః। 10

క్రౌంచబర్హిణసంఘుష్టై రాజహంసనిషేవితైః।
తూర్యాభరణనిర్ఘోషైః సర్వతః ప్రతినాదితామ్। 11

వస్వౌకసారాప్రతిమాం తాం వీక్ష్య నగరీం తతః।
ఖమివోత్పతితాం లంకాం జహర్ష హనుమాన్ కపిః। 12

తాం సమీక్ష్య పురీం రమ్యాం రాక్షసాధిపతేశ్శుభామ్।
అనుత్తమామ్ఋద్ధియుతాం చింతయామాస వీర్యవాన్। 13

నేయమన్యేన నగరీ శక్యా ధర్షయితుం బలాత్।
రక్షితా రావణబలైః ఉద్యతాయుధధారిభిః। 14

కుముదాంగదయోర్వాపి సుషేణస్య మహాకపేః।
ప్రసిద్ధేయం భవేద్భూమిః మైందద్వివిదయోరపి। 15

వివస్వతస్తనూజస్య హరేశ్చ కుశపర్వణః।
ఋక్షస్య కేతుమాలస్య మమ చైవ గతిర్భవేత్। 16

సమీక్ష్య తు మహాబాహో రాఘవస్య పరాక్రమమ్।
లక్ష్మణస్య చ విక్రాంతమ్ అభవత్ ప్రీతిమాన్కపిః। 17

తాం రత్నవసనోపేతాం కోష్ఠాగారావతంసకామ్।
యంత్రాగారస్తనీమ్ఋద్ధాం ప్రమదామివ భూషితామ్। 18

తాం నష్టతిమిరాం దీప్తైః భాస్వరైశ్చ మహాగృహైః।
నగరీం రాక్షసేంద్రస్య స దదర్శ మహాకపిః। 19

అథ సా హరిశార్దూలం ప్రవిశంతం మహాబలమ్।
నగరీ స్వేన రూపేణ దదర్శ పవనాత్మజమ్। 20

వైడూర్యమణులచే పొదగబడిన సోపానములతోడను, స్ఫటికమణిమయములైన ముంగిళ్లతోడను, మనోహరములైన సభాస్థలులతోడను, అంబరమును చుంబించుచు అగ్గృహములు శోభిల్లుచుండెను. (8-10)

క్రౌంచపక్షుల కలకలములతోడను, నెమళ్ల క్రేంకారములతోడను, రాజహంసలనడకలతోడను అచటి భవనములు విరాజిల్లుచుండెను. అంతటను తూర్యధ్వనులును, ఆభరణముల గలగలలును ప్రతి ధ్వనించుచుండెను. సంపదలకునెలవైన అలకాపురితో సదృశమై, ఆకాశమునకు ఎగిరిపోవుచున్నదాయునట్లు ఒప్పుచున్న ఆ లంకానగరమునుజూచి, హనుమంతుడు మిక్కిలి సంతసించెను. (11-12)

అత్యుత్తమము, ఐశ్వర్యసంపన్నము, అత్యంత సుందరము, మంగళప్రదము ఐన రావణునియొక్క ఆ లంకాపురిని మహాపరాక్రమశాలియైన మారుతి పరికించి చూచి ఆలోచింపసాగెను. (13)

ఆయుధములతో సిద్ధముగానున్న రావణసైన్యములు రక్షించుచున్న ఈ నగరమును బలప్రయోగముతో ఇతరులెవ్వరును జయింపజాలరు. (14)

కాని దుర్భేద్యమైనదిగా ప్రసిద్ధికెక్కిన ఈ నగరమును కుముదుడు, అంగదుడు, మహాకపియైన సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు-వీరికి మాత్రము జయింప సాధ్యము కావచ్చును. సూర్యసుతుడైనసుగ్రీవునకును, వానరవీరుడైన కుశపర్వునకును, భల్లూకరాజైన జాంబవంతునకును, కేతుమాలునకును, నాకును ఇందు ప్రవేశింపవీలగునేమో? (15-16)

హనుమంతుడు శ్రీరాముని పరాక్రమమును, లక్ష్మణుని శౌర్యమును బాగుగా గుర్తుకుదెచ్చుకొని (లంక ఎంతటిదైనను రామలక్ష్మణుల బలపరాక్రమములముందు అది నిలువజాలదని తలంచి) మిక్కిలి సంతసించెను. (17)

ఆ లంకానగరము రత్నకాంతులే వస్త్రములుగా, కోష్ఠాగారములే కర్ణాభరణములుగా, యంత్రాగారములే స్తనములుగాగలిగి, ఐశ్వర్యసంపన్నయై వివిధాలంకార శోభితయైన స్త్రీవలె మనోహరముగానుండెను. అచటి గృహములదీపకాంతులచే నగరములోనిచీకట్లన్నియు తొలిగిపోయెను. అట్టిలంకానగరమును ఆ కపివరుడు గాంచెను. (18-19)

మహాబలశాలియు, వానరశ్రేష్ఠుడును ఐన మారుతి లంకలో ప్రవేశించుచుండగా లంకాధిదేవత స్వస్వరూపముతో ఆయనను జూచెను. (20)

సా తం హరివరం దృష్ట్వా లంకా రావణపాలితా।
స్వయమేవోత్థితా తత్ర వికృతాననదర్శనా। 21

రావణపాలితయైన ఆ లంక (లంకిణి) ఆ కపివరుని జూచి, భయంకరమైన ముఖముతో చూపులతో అచటలేచి నిలబడెను. (21)

పురస్తాత్ కపివర్యస్య వాయుసూనోరతిష్ఠత।
ముంచమానా మహానాదమ్ అబ్రవీత్ పవనాత్మజమ్। 22

ఆ లంకాధిదేవత కపిశ్రేష్ఠుడైన మారుతికి ఎదురుగా నిలిచెను. పిమ్మట ఆమె భయంకరనాదమొనర్చుచు హనుమంతునితో ఇట్లనెను. (22)

కస్త్వం కేన చ కార్యేణ ఇహ ప్రాప్తో వనాలయ।
కథయస్వేహ యత్తత్త్వం యావత్ ప్రాణా ధరంతి తే। 23

"ఓ వానరా! నీవెవరు? నీవు ఇచటికి వచ్చిన పనియేమి? నా చేతిలో నీ ప్రాణములు పోకముందే యథార్థమును దెలుపుము. (23)

న శక్యం ఖల్వియం లంకా ప్రవేష్టుం వానర త్వయా।
రక్షితా రావణబలైః అభిగుప్తా సమంతతః। 24

ఓ వానరా! రావణబలములచే అంతటను బాగుగా రక్షింపబడుచున్న ఈ లంకలో ప్రవేశించుట నీకు అసాధ్యము సుమా!" (24)

అథ తామబ్రవీద్వీరో హనుమానగ్రతస్స్థితామ్।
కథయిష్యామి తే తత్త్వం యన్మాం త్వం పరిపృచ్ఛసి। 25

కా త్వం విరూపనయనా పురద్వారేఽవతిష్ఠసి।
కిమర్థం చాపి మాం రుద్ధ్వా నిర్భర్త్సయసి దారుణా। 26

పిమ్మట తనయెదుట నిల్చిన లంకతో (లంకాధిదేవతతో) మహావీరుడైన హనుమంతుడిట్లు పలికెను. "నీవడిగిన యథార్థమును తరువాత వచించెదను. ముందుగా నీవెవరో తెల్పుము. వికృతమైన ఆకారముతో, నేత్రములతో భయంకరముగా నున్న నీవెవరు? ఈ పురద్వారముకడ నిలిచియుండుటకు గల కారణమేమి? నన్ను ఎందులకు నిరోధించుచున్నావు? ఏల బెదరించుచున్నావు?" (25-26)

హనుమద్వచనం శ్రుత్వా లంకా సా కామరూపిణీ।
ఉవాచ వచనం క్రుద్ధా పరుషం పవనాత్మజమ్। 27

కామరూపిణియైన ఆలంక (లంకాధిదేవత) హనుమంతుని మాటలనువిని, కుపితయై మారుతితో పరుషముగా ఇట్లు పలికెను. (27)

అహం రాక్షసరాజస్య రావణస్య మహాత్మనః।
ఆజ్ఞాప్రతీక్షా దుర్ధర్షా రక్షామి నగరీమిమామ్। 28

"నేను మహాత్ముడును, రాక్షసరాజును అగు రావణుని ఆజ్ఞానువర్తిని, ఈ నగరమును రక్షించుచున్నాను. నన్ను ఎవ్వరును ఎదిరింపజాలరు. (28)

న శక్యా మామవజ్ఞాయ ప్రవేష్టుం నగరీ త్వయా।
అద్య ప్రాణైః పరిత్యక్తః స్వప్స్యసే నిహతో మయా। 29

నన్ను ధిక్కరించి, నీవీనగరమున ప్రవేశించుట అసాధ్యము, నేడు నాచేతిలో నీకు చావుతప్పదు. నీవు అసువులు వీడి దీర్ఘనిద్రలో మునిగెదవు. (29)

అహం హి నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ।
సర్వతః పరిరక్షామి హ్యేతత్తే కథితం మయా। 30

ఓ వానరా! నేను సాక్షాత్తు లంకాధిదేవతను. ఈ నగరమును అన్నివిధములుగా రక్షించుచుందును. ఈ విషయమునే నీకుతెల్పితిని." (30)

లంకాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః।
యత్నవాన్ స హరిశ్రేష్ఠః స్థితః శైల ఇవాపరః। 31

కపిశ్రేష్ఠుడును, వాయుసుతుడునుఐన ఆ హనుమంతుడు లంకాధిదేవతవచనములను విని, ఆమెనుఎదిరించుటకు సిద్ధమై పర్వతాకారమున నిలబడెను. (31)

స తాం స్త్రీరూపవికృతాం దృష్ట్వా వానరపుంగవః।
అబభాషేఽథ మేధావీ సత్త్వవాన్ ప్లవగర్షభః। 32

పిమ్మట వానరోత్తముడును, మిక్కిలి ప్రజ్ఞాశాలియు, మహాబలసంపన్నుడును ఐన ఆ హనుమంతుడు వికృతాకారమున స్త్రీరూపముననున్న ఆ లంకాధిదేవతను జూచి ఆమెతో ఇట్లుభాషించెను. (32)

ద్రక్ష్యామి నగరీం లంకాం సాట్టప్రాకారతోరణామ్।
ఇత్యర్థమిహ సంప్రాప్తః పరం కౌతూహలం హి మే। 33

వనాన్యుపవనానీహ లంకాయాః కాననాని చ।
సర్వతో గృహముఖ్యాని ద్రష్టుమాగమనం హి మే। 34

తస్య తద్వచనం శ్రుత్వా లంకా సా కామరూపిణీ।
భూయ ఏవ పునర్వాక్యం బభాషే పరుషాక్షరమ్। 35

మామనిర్జిత్య దుర్బుద్ధే రాక్షసేశ్వరపాలితామ్।
న శక్యమద్య తే ద్రష్టుం పురీయం వానరాధమ। 36

తతస్స కపిశార్దూలః తామువాచ నిశాచరీమ్।
దృష్ట్వా పురీమిమాం భద్రే పునర్యాస్యే యథాగతమ్। 37

తతః కృత్వా మహానాదం సా వై లంకా భయావహమ్।
తలేన వానరశ్రేష్ఠం తాడయామాస వేగితా। 38

తతస్స కపిశార్దూలో లంకయా తాడితో భృశమ్।
ననాద సుమహానాదం వీర్యవాన్ పవనాత్మజః। 39

తతస్సంవర్తయామాస వామహస్తస్య సోఽంగులీః।
ముష్టినాఽభిజఘానైనాం హనుమాన్ క్రోధమూర్ఛితః। 40

స్త్రీ చేతి మన్యమానేన నాతిక్రోధస్స్వయం కృతః।
సా తు తేన ప్రహారేణ విహ్వలాంగీ నిశాచరీ। 41

పపాత సహసా భూమౌ వికృతాననదర్శనా।
తతస్తు హనుమాన్ ప్రాజ్ఞః తాం దృష్ట్వా వినిపాతితామ్। 42

కృపాం చకార తేజస్వీ మన్యమానః స్త్రియం తు తామ్।
తతో వై భృశసంవిగ్నా లంకా సా గద్గదాక్షరమ్। 43

ఉవాచాగర్వితం వాక్యం హనూమంతం ప్లవంగమమ్।
ప్రసీద సుమహాబాహో త్రాయస్వ హరిసత్తమ। 44

సమయే సౌమ్య తిష్ఠంతి సత్త్వవంతో మహాబలాః।
అహం తు నగరీ లంకా స్వయమేవ ప్లవంగమ। 45

"మేడలతో, ప్రాకారములతో, తోరణములతో ఒప్పుచు మనోహరముగానున్న లంకానగరమును చూడవలెనని నాకు మిక్కిలి కుతూహలముగానున్నది. అందులకై నేనిచటికి వచ్చితిని. (33)

లంకలోని తోటలను, ఉద్యానవనములను, అడవులను, అంతటను వరుసలుదీరియున్న భవనములను చూచుటకై ఇచటికి నేను ఏతెంచితిని." (34)

కామరూపిణియైన ఆ లంకాధిదేవత హనుమంతుని వచనములను విని, ఇంకను పరుషములైనవచనములను ఇట్లు పలికెను. (35)

"దుర్బుద్ధిగల ఓ వానరాధమా! నేను రావణుని పోషణలో, అతని అండదండలలోనున్నాను. నన్ను జయింపకయే నేడు ఈ నగరమున నీవు ప్రవేశింపజాలవు"- (36)

పిమ్మట కపివరుడు ఆ రాక్షసితో "ఓ శుభాంగీ! ఈ నగరమును చూచిన పిమ్మట మఱల వచ్చినరీతిగనే వెళ్లెదను"- అని నమ్రస్వరముతో పలికెను. (37)

పిదప ఆ లంకాధిదేవత భయంకరమైన ఒక మహాధ్వని గావించి, ఆ కపివరుని తన అఱచేతితో వేగముగా బలముకొలది కొట్టెను. (38)

లంకాధిదేవత బలముగా కొట్టగా కపిశ్రేష్ఠుడును, మహా వీరుడును ఐన ఆ వాయుసుతుడు ఒక మహానాదమును గావించెను. (39)

వెంటనే ఆ హనుమంతునకు పట్టరానికోపము వచ్చినను తన ఎడమచేతివ్రేళ్లను ముడిచి, ఆమెపై తిన్నగా ఒక దెబ్బవేసెను. (40)

'స్త్రీ' అనిభావించి అతడు తనకోపమును ప్రకటింపలేదు. ఆ రాక్షసిమాత్రము అతని లఘుముష్టి ఘాతముతోడనే విహ్వలయై, వికృతములైన ముఖముతో చూపులతో వెంటనే భూమిపైపడిపోయెను. అనంతరము ప్రాజ్ఞుడును, తేజస్వియునైన హనుమంతుడు అట్లు నేలకొరిగిన ఆ రాక్షసిని జూచి, 'స్త్రీ' అనిభావించి, ఆమెను దయదలచెను. అప్పుడారాక్షసి మిక్కిలిదిగులుపడినదై గర్వమునువీడి, గద్గదస్వరముతో వానరవీరుడైన హనుమంతునితో ఇట్లు పలికెను. "ఓ మహాబాహూ! అనుగ్రహింపుము. ఓ కపీశ్వరా! కాపాడుము. (41-44)

"ఓ మహాపురుషా! ధీరులైనమహాబలశాలురు 'స్త్రీవధ చేయరాదు' అనునియమమునకు కట్టుబడి యుందురు. ఓ వానరోత్తమా! నేను సాక్షాత్తుగా లంకాధిదేవతను.

నిర్జితాహం త్వయా వీర విక్రమేణ మహాబల।
ఇదం తు తథ్యం శృణు వై బ్రువంత్యా మే హరీశ్వర। 46

మహాబలశాలివైన ఓ వీరుడా! నీ పరాక్రమముచేత నేను జయింపబడితిని. ఓ కపీశ్వరా! నేనుచెప్పెడి ఈమాట తథ్యము. వినుము. (45-46)

స్వయంభువా పురా దత్తం వరదానం యథా మమ।
యదా త్వాం వానరః కశ్చిత్, విక్రమాద్వశమానయేత్। 47

తదా త్వయా హి విజ్ఞేయం రక్షసాం భయమాగతమ్।
స హి మే సమయస్సౌమ్య ప్రాప్తోఽద్య తవ దర్శనాత్। 48

పూర్వము బ్రహ్మదేవుడునాకొకవరమొసంగెను. అది ఏమనగా- 'ఒకవానరుడు నిన్ను తనపరాక్రమముచేత జయించినప్పుడు రాక్షసులకుకీడుమూడునని నీవెఱుంగుము'- ఓ సౌమ్య! నీ దర్శనముగుటవలన నేడు ఆ సమయము ఆసన్నమైనట్లే- (47-48)

స్వయంభూవిహితస్సత్యో న తస్యాస్తి వ్యతిక్రమః।
సీతానిమిత్తం రాజ్ఞస్తు రావణస్య దురాత్మనః। 49

రక్షసాం చైవ సర్వేషాం వినాశస్సముపాగతః।
తత్ప్రవిశ్య హరిశ్రేష్ఠ పురీం రావణపాలితామ్।
విధత్స్వ సర్వకార్యాణి యాని యానీహ వాంఛసి। 50

బ్రహ్మపలికినమాట సత్యమైతీరును. దానికి తిరుగుండదు. దురాత్ముడును, రాక్షసరాజును ఐన రావణునకును, రాక్షసులందఱికిని సీతానిమిత్తముగా వినాశకాలము దాపురించినది. అందువలన ఓ కపిశ్రేష్ఠా! రావణుడుపాలించుచున్న ఈ లంకాపురిని ప్రవేశించి, నీవుతలపెట్టినకార్యములన్నింటిని నిర్వహింపుము. (49-50)

ప్రవిశ్య శాపోపహతాం హరీశ్వర
శుభాం పురీం రాక్షసముఖ్యపాలితామ్ ।
యదృచ్ఛయా త్వం జనకాత్మజాం సతీం
విమార్గ సర్వత్ర గతో యథాసుఖమ్ । 51

ఓ కపీశ్వరా! శాపమునకు గురియై, రావణునిచే పరిపాలింపబడుచున్న ఈ సుందరనగరమును ప్రవేశింపుము. హాయిగా వెళ్ళి, స్వేచ్ఛగా (నిరాటంకముగా) పరమసాధ్వియైన జానకికై అంతటనువెదకుము." (51)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే తృతీయస్సర్గః *(3)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన, శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది మూడవసర్గము.

-- * * * --

4. నాల్గవసర్గము

లంకలో రావణాంతఃపురమున హనుమంతుడు ప్రవేశించుట.

స నిర్జిత్య పురీం శ్రేష్ఠాం లంకాం తాం కామరూపిణీమ్ ।
విక్రమేణ మహాతేజా హనూమాన్ కపిసత్తమః । 1

అద్వారేణ మహాబాహుః ప్రాకారమభిపుప్లువే ।
ప్రవిశ్య నగరీం లంకాం కపిరాజహితంకరః । 2

మహాతేజశ్శాలియు, కపివరుడునునైన ఆ హనుమంతుడు కామరూపిణియు, ఉత్తమురాలును అగు ఆ లంకాపురాధిదేవతను తనపరాక్రమముచేత జయించెను. సుగ్రీవునకు హితకరుడు, మహాబాహువులగు ఆ హనుమంతుడు ముఖ్యద్వారము నుండిగాక (అద్వారమున)[1] ప్రాకారముపైనుండి దుమికి లంకానగరమున అడుగిడెను. (1-2)

1) గ్రామం వా నగరం వాపి, పత్తనం వా పరస్య హి । విశేషాత్ సమయే సౌమ్య! న ద్వారేణ విశేన్నృప! ॥ నీతిశాస్త్రము ఓరాజా! శత్రువుయొక్క, గ్రామమునుగాని, నగరమునుగాని, పట్టణమునుగాని విశేషసమయమున ముఖ్యద్వారమునుండి ప్రవేశింపరాదు.

చక్రేఽథ పాదం సవ్యం చ శత్రూణాం స తు మూర్ధని।
ప్రవిష్టః సత్త్వసంపన్నో నిశాయాం మారుతాత్మజః। 3

సత్త్వసంపన్నుడైన ఆ మారుతి శత్రువుల శిరముపైన (శత్రునగరమున) ఎడమపాదమునుంచెను.[1] పిమ్మట రాత్రివేళ ఆ నగరమున ప్రవేశించెను. (3)

స మహాపథమాస్థాయ ముక్తాపుష్పవిరాజితమ్।
తతస్తు తాం పురీం లంకాం రమ్యామభియయౌ కపిః। 4

ఆ మహాకపి ముత్యములతోను, పూవులతోను విరాజిల్లుచున్న రాజమార్గమును అనుసరించుచు రమ్యమైన ఆ లంకాపురిలోనికి వెళ్లెను. (4)

హసితోత్కృష్టనినదైః తూర్యఘోషపురస్సరైః।
వజ్రాంకుశనికాశైశ్చ వజ్రజాలవిభూషితైః। 5

గృహమేఘైః పురీ రమ్యా బభాసే ద్యౌరివాంబుదైః।
ప్రజజ్వాల తదా లంకా రక్షోగణగృహైశ్శుభైః। 6

సితాభ్రసదృశైశ్చిత్రైః పద్మస్వస్తికసంస్థితైః।
వర్ధమానగృహైశ్చాపి సర్వతస్సువిభూషితైః। 7

అచటి గృహములు ఉత్కృష్టములైన హాసధ్వనులతో నిండియుండెను. అవి వివిధవాద్యఘోషలతో ఒప్పారుచుండెను. ఆ గృహములు ఐరావతమువలె ఉన్నతములై, స్వచ్ఛములై, వజ్రఖచితములై శోభిల్లుచుండెను.[2] అట్టి ఉన్నతగృహములతో అలరారుచు ఆ లంకానగరము ఆకాశమునందలి మేఘమండలమువలె భాసిల్లుచుండెను. ఆ లంకానగరము స్వచ్ఛములై తెల్లనిమేఘములవలెనున్న రాక్షసుల గృహములతో జిలుగులను విరజిమ్ముచుండెను. వాటిలో కొన్ని చిత్రవిచిత్రాకారములు గలిగియుండెను. కొన్ని పద్మ- స్వస్తికచిహ్నములతో అలరారుచుండెను. మఱికొన్ని "వర్ధమాననామక-"[3] ఆకృతులతో వెలసిల్లుచుండెను. అంతటను అట్టి రమ్యహర్మ్యములతో ఆ లంక నిరుపమానముగా నుండెను. (5-7)

తాం చిత్రమాల్యాభరణాం కపిరాజహితంకరః।
రాఘవార్థం చరన్ శ్రీమాన్ దదర్శ చ ననంద చ। 8

సుగ్రీవసచివుడు, స్వామికార్యసాధనదక్షుడునైన హనుమంతుడు రామకార్యార్థము సంచరించుచు చిత్ర మాల్యాభరణములతో అలరారుచున్న ఆ లంకాపురిని చూచి, మిక్కిలి ఆనందించెను.[4] (8)

భవనాద్భవనం గచ్ఛన్ దదర్శ పవనాత్మజః।
వివిధాకృతిరూపాణి భవనాని తతస్తతః। 9

ఆ పావని ప్రతిగృహమును పరికించుచు ముందునకు సాగుచుండెను. అచటిగృహములు ఒకదానికంటె మఱియొకటి చిత్రవిచిత్రములైన ఆకారములు గలిగియుండెను. (9)

1) **ప్రయాణ కాలే చ గృహప్రవేశే, వివాహ కాలేఽపి చ దక్షిణాంఘ్రిమ్।**
కృత్వాఽగ్రతః శత్రుపురప్రవేశే, వామం నిదధ్యా చ్చరణం నృపాల! ॥ నీతిశాస్త్రము
ఓ నృపాలా! ప్రయాణముచేయునప్పుడును, గృహప్రవేశసమయమునను, వివాహకాలమునందును కుడికాలు ముందుంచవలెను. శత్రుపురమున ప్రవేశించునప్పుడు ముందుగా ఎడమకాలును మోపవలెను- బృహస్పతి వచనము.

2) **వజ్రాంకుశనికాశైః** - వజ్రం అంకుశో యస్య సః వజ్రాంకుశః ఐరావతః, తత్తుల్యైః, తద్వత్ శుభ్రైః- ఇత్యర్థః-వజ్రాంకుశతుల్య సంస్థానైర్వా- గోవింద రాజీయ వ్యాఖ్య- పుట 62.

3) **దక్షిణ ద్వార రహితా 'వర్ధమానా' ధన ప్రదా।** (వరాహ మిహిర సంహిత)
దక్షిణ దిశయందు ద్వారము లేని గృహమునకు **'వర్ధమానము'** అని పేరు.

4) త్వరలో కార్యము సఫలమగునను ప్రబలవిశ్వాసముతో నూఱుయోజనముల పొడవుగల ఒక మహాసాగరమును లంఘించుట వాయుసుతుడైన హనుమంతునకు ఒక సామాన్యవిషయమేయైనను, సాధారణముగా లోకదృష్టిలో అది మహాకార్యము. రాక్షసులచే నిరంతరము సురక్షితముగా కాపాడబడుచు ఇతరులకు దుర్భేద్యమైయున్నలంకలోప్రవేశించుట హనుమంతునిదృష్టిలో నిజముగా ఒక ఘనకార్యము- అనితరసాధ్యములైన ఈ మహత్కార్యములను రెండింటిని హనుమంతుడు అవలీలగా సాధించెను. ఈ కార్యద్వయ (రామకార్య) సిద్ధితో హనుమంతుడు మహదానందభరితుడయ్యెను. దీనితో 'త్వరలోనే సీతాదర్శనము అగునని ఆయనలో ప్రబల విశ్వాసము కుదురుకొనెను.

శుశ్రావ మధురం గీతం త్రిస్థానస్వరభూషితమ్।
స్త్రీణాం మదసమృద్ధానాం దివి చాప్సరసామివ। 10

శుశ్రావ కాంచీనినదం నూపురాణాం చ నిస్స్వనమ్।
సోపాననినదాంశ్చైవ భవనేషు మహాత్మనామ్। 11

ఆస్ఫోటితనినాదాంశ్చ క్ష్వేళితాంశ్చ తతస్తతః।
శుశ్రావ జపతాం తత్ర మంత్రాన్ రక్షోగృహేషు వై। 12

స్వాధ్యాయనిరతాంశ్చైవ యాతుధానాన్ దదర్శ సః।
రావణస్తవసంయుక్తాన్ గర్జతో రాక్షసానపి। 13

రాజమార్గం సమావృత్య స్థితం రక్షోబలం మహత్।
దదర్శ మధ్యమే గుల్మే రావణస్య చరాన్ బహూన్। 14

దీక్షితాన్ జటిలాన్ ముండాన్ గోఽజినాంబరవాససః।
దర్భముష్టిప్రహరణాన్ అగ్నికుండాయుధాంస్తథా। 15

కూటముద్గరపాణీంశ్చ దండాయుధధరానపి।
ఏకాక్షానేకకర్ణాంశ్చ లంబోదరపయోధరాన్। 16

కరాలాన్ భుగ్నవక్త్రాంశ్చ వికటాన్ వామనాంస్తథా।
ధన్వినః ఖడ్గినశ్చైవ శతఘ్నీముసలాయుధాన్। 17

పరిఘోత్తమహస్తాంశ్చ విచిత్రకవచోజ్జ్వలాన్।
నాఽతిస్థూలాన్ నాతికృశాన్ నాఽతిదీర్ఘాతిహ్రస్వకాన్। 18

స్వర్గమునందలి అప్సరసలవలె గానముచేయుచున్న మదవతులైన[1] స్త్రీలయొక్క త్రిస్థానస్వర (మంద్ర, మధ్యమ, తార స్థాయులుగల) మధురమైనసంగీతమును మారుతి వినెను. (10)

మిక్కిలిసంపన్నులైనవారి గృహములయందు సంచరించుచున్న స్త్రీలఒడ్డాణపు గజ్జెలసవ్వడులను, వారి కాలియందెలధ్వనులను, వారు మెట్లపైనడుచునప్పుడు కలిగెడిమధురరవములను ఆ మారుతి వినెను. (11)

అచ్చటచ్చట రాక్షసగృహములయందు యోధులు జబ్బలు చఱచుకొనుటవలన కలిగిన ధ్వనులును, వారి సింహగర్జనలును, మఱికొన్ని తావుల యందు జపించు వారివేదమంత్రములును హనునికి వినబడెను. (12)

ఆ హనుమంతుడు వేదాధ్యయనపరతులైన రాక్షసులను, సంయుక్తముగా రావణస్తుతులొనర్చు వారిని, గర్జించుచున్న రాక్షసులను చూచెను. (13)

నగరముయొక్కనడిబొడ్డున సేనానివేశమునందు రాజమార్గమున చుట్టునుచేరిన గొప్ప రాక్షసబలములను, రావణుని యొక్క పెక్కుమంది గూఢచారులను అతడు చూచెను. (14)

ఆ నగరమునందలి యజ్ఞదీక్షానిమగ్నులను, జడలు ధరించిన వారిని, శిరోముండనము గావించుకొనినవారిని, వృషభచర్మములను వస్త్రములుగా ధరించినవారిని, అతడు చూచెను. దర్భలను పిడికిళ్లలో ధరించి వాటిని మంత్రించి, ఆయుధములుగా శత్రువులపై ప్రయోగించు వారిని, యజ్ఞకుండములయందు హోమములొనర్చి కృత్యాదిశక్తులను పొంది, వాటిని పరులపై ప్రయోగించు వారిని అతడు వీక్షించెను. (15)

కూట(ఆయుధ)ములను, ఇనుపగుదియలను, దండాయుధములను ధరించినవారిని, ఒంటికంటి వారిని, ఒంటిచెవివారిని, వ్రేలాడుచున్న పొట్టలు, స్తనములుగల వారిని, భయంకరాకారులను, వంకరమూతులుగల వారిని, వికృతాకారులను, పొట్టివారిని, ధనుస్సులను, ఖడ్గములను, శతఘ్నులను, ఇనుపదండములను ధరించినవారిని, గట్టి పరిఘ(ఇనుపకట్లగుదియ)లను చేబూనినవారిని, ఉజ్జ్వలములైన విచిత్రకవచములను ధరించినవారిని, ఆ హనుమంతుడు వీక్షించెను. అచట ఆ రాక్షసులలో కొందఱు మిక్కిలిలావుగా గాని, సన్నముగా గాని గాక మధ్యస్థముగానుండిరి. మఱికొందఱు పొట్టిగా గాని, పొడవుగా గాని కాక

1) మదము = సంతోషము, గర్వము, మత్తు

నాఽతిగౌరాన్ నాతికృష్ణాన్ నాఽతికుబ్జాన్ న వామనాన్।
విరూపాన్ బహురూపాంశ్చ సురూపాంశ్చ సువర్చసః। 19

ధ్వజీన్ పతాకినశ్చైవ దదర్శ వివిధాయుధాన్।
శక్తివృక్షాయుధాంశ్చైవ పట్టిశాశనిధారిణః।
క్షేపణీపాశహస్తాంశ్చ దదర్శ స మహాకపిః। 20

స్రగ్విణస్త్వనులిప్తాంశ్చ వరాభరణభూషితాన్। 21

నానావేషసమాయుక్తాన్ యథా స్వైరగతాన్ బహూన్।
తీక్ష్ణశూలధరాంశ్చైవ వజ్రిణశ్చ మహాబలాన్। 22

శతసాహస్రమవ్యగ్రమ్ ఆరక్షం మధ్యమం కపిః।
రక్షోఽధిపతినిర్దిష్టం దదర్శాంతఃపురాగ్రతః। 23

స తదా తద్గృహం దృష్ట్వా మహాహాటకతోరణమ్।
రాక్షసేంద్రస్య విఖ్యాతమ్ అద్రిమూర్ధ్ని ప్రతిష్ఠితమ్। 24

పుండరీకావతంసాభిః పరిఖాభిరలంకృతమ్।
ప్రాకారావృతమత్యంతం దదర్శ స మహాకపిః। 25

త్రివిష్టపనిభం దివ్యం దివ్యనాదవినాదితమ్।
వాజిహేషితసంఘుష్టం నాదితం భూషణైస్తదా। 26

రథైర్యానైర్విమానైశ్చ తథా హయగజైశ్శుభైః।
వారణైశ్చ చతుర్దంతైః శ్వేతాభ్రనిచయోపమైః। 27

భూషితం రుచిరద్వారం మత్తైశ్చ మృగపక్షిభిః।
రక్షితం సుమహావీర్యైః యాతుధానైస్సహస్రశః।
రాక్షసాధిపతేర్గుప్తమ్ ఆవివేశ గృహం కపిః। 28

సమముగానుండిరి. కొందఱు మిక్కిలి తెల్లనివారును గారు, నల్లనివారును గారు. అంతగా గూనివారును గారు, పొట్టి వారును గారు. కొందఱు వికృతరూపములను ధరింప గలవారు, కొందఱు బహు రూపములు గలవారు, కొందఱు అందమైనవారు, మఱికొందఱు మిక్కిలి తేజస్సుగల వారునుఐయుండిరి. ధ్వజములను, పతాకములను, వివిధములైన ఆయుధములను, బల్లెములను, వృక్షములను, పట్టిసము (అడ్డకత్తి) లను, వజ్రాయుధములను ధరించిన వారిని క్షేపణులను (తెడ్డను) పాశములను చేబూనిన వారిని, ఆంజనేయుడు గాంచెను. (16-20)

పూలమాలలు ధరించిన వారిని, సుగంధ ద్రవ్యములను అలదుకొనిన వారిని, చక్కని ఆభరణములను దాల్చిన వారిని, నానావిధములైన వేషములను ధరించిన వారిని, స్వేచ్ఛగా సంచరించుచున్న పెక్కుమందిని, పదునైన శూలములను, వజ్రాయుధములను ధరించిన మహా బలశాలురను, హనుమంతుడు గాంచెను. (21-22)

అంతఃపురప్రాంగణమున మధ్యభాగమున రావణుని ఆజ్ఞానుసారము సావధానులైయున్న వేలకొలది సైనికులను అతడు చూచెను. (23)

అంతట విశాలమైన బంగారుసింహద్వారముగల రావణునిప్రాసాదమును అతడు వీక్షించెను. ప్రసిద్ధమైన రావణునిఆమహాభవనము త్రికూటాద్రిపై సుప్రతిష్ఠితమై యుండెను. అది తెల్లని కమలములతో కలకలలాడుచున్న అగడ్తలతో శోభిల్లుచుండెను. దానిచుట్టును దుర్గమమైన ప్రాకారము నిర్మితమైయుండెను. అట్టి వైభవోపేతమైన మహా భవనమును ఆ కపీశ్వరుడు దర్శించెను. (24-25)

రావణునియొక్క ఆ మహాప్రాసాదము స్వర్గవైభవతుల్యమై, దివ్యమై, దివ్యములైన నాదములతో ప్రతిధ్వనించుచుండెను. గుఱ్ఱములసకిలింపులతో నిండియుండెను. ఆభరణముల ధ్వనులతో నినదించు చుండెను. అది రథములతోడను, పల్లకీలు మొదలగు వాహనములతోడను, విమానములతోడను, విలసిల్లు చుండెను. చక్కని గుఱ్ఱములతోను, ఏనుగులతోను, తెల్లని మేఘములవలెనున్న నాలుగుదంతములుగల భద్రగజములతోను అలరారు చుండెను. మత్తిల్లిన మృగములతోను, శారికాది పక్షులతోను భూషితమై, మనోహరముగా ఉండెను. అట్టి రమ్యమైన ముఖద్వారము మహావీరులైన రాక్షసులచే పెక్కు విధములుగా రక్షింపబడుచుండెను. ఐనప్పటికిని ఆరావణాంతఃపురమున ఆంజనేయుడు ప్రవేశించెను. (26-28)

స హేమజాంబూనదచక్రవాళం
  మహార్హముక్తామణిభూషితాంతమ్ ।
పరార్థ్యకాలాగరుచందనాక్తం
  స రావణాంతః పురమావివేశ ॥ 29

ఆరావణాంతఃపురము తప్తకాంచనప్రాకారములతో విలసిల్లుచుండెను. అందలి లోపలి భాగము అమూల్యములైన ముత్యములతో, మణులతో అలంకృతమై యుండెను. శ్రేష్ఠములైన కాలాగరు చందన పరిమళములను అది వెదజల్లుచుండెను. అట్టి అంతఃపురమున ఆ కపివరుడు అడుగిడెను. (29)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే చతుర్థస్సర్గః (4)

వాల్మీకి మహర్షి విరచితమై ఆది కావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నాల్గవ సర్గము.

— ✻ ✻ ✻ —

5. ఐదవసర్గము

చంద్రశోభావర్ణనము, రావణాంతఃపురములో హనుమంతుడు సీతను అన్వేషించుట.

ఆమెను గానక దుఃఖపడుట

తత స్స మధ్యంగతమంశుమంతం
  జ్యోత్స్నావితానం మహదుద్వమంతమ్ ।
దదర్శ ధీమాన్ దివి భానుమంతం
  గోష్ఠే వృషం మత్తమివ భ్రమంతమ్ ॥ 1

అనంతరము ధీశాలియైన ఆహనుమంతుడు ఆకాశమధ్యభాగమున చల్లనికిరణములతో హాయిని గూర్చుచున్న చంద్రునిగాంచెను. ఆకళానిధి వెన్నెలలను సర్వత్ర విరజిమ్ముచుండెను, గోశాలలో తిరుగుచున్న మదించిన వృషభమువలె ఒప్పుచుప్రకాశించుచుండెను. (1)

లోకస్య పాపాని వినాశయంతం
  మహోదధిం చాపి సమేధయంతమ్ ।
భూతాని సర్వాణి విరాజయంతం
  దదర్శ శీతాంశుమథాభియాంతమ్ ॥ 2

లోకులపాపములను (దుఃఖములను) నశింపజేయుచున్నవాడును, మహాసముద్రమునసైతము వృద్ధిపొందించుచున్నవాడును, సమస్తప్రాణులను, భూతలమును, జలములను, వాయుమండలమును ఆకాశమును ప్రకాశింపజేయుచున్నవాడును, అమృత కిరణుడునుఅగు చంద్రుడు ఆకసమునపైకి వచ్చుచుండగా ఆ మారుతి దర్శించెను. (2)

యా భాతి లక్ష్మీర్భువి మందరస్థా
  తథా ప్రదోషేషు చ సాగరస్థా ।
తథైవ తోయేషు చ పుష్కరస్థా
  రరాజ సా చారునిశాకరస్థా ॥ 3

భువియందు మందరగిరిపైనను, సాయంసంధ్యా (ప్రదోష) కాలములయందు సముద్రముమీదను, అట్లే జలములలోని పద్మములయందును విరాజిల్లునట్టి శోభలు (లక్ష్మి) ఆహ్లాదకరములైన చంద్రకిరణములయందు భాసించుచుండెను. (3)

హంసో యథా రాజతపంజరస్థః
  సింహో యథా మందరకందరస్థః ।
వీరో యథా గర్వితకుంజరస్థః
  చంద్రోఽపి బభ్రాజ తథాఽంబరస్థః ॥ 4

వెండిపంజరమున హంసవలెను, మందరగిరిగుహ యందలి సింహముభంగి, మదపుటేనుగుపై వీరునిబాతి చంద్రుడు అంబరమున దేదీప్యమానముగాప్రకాశించు చుండెను.(4)

స్థిత: కకుద్మానివ తీక్ష్ణశృంగో
మహాచలశ్శ్వేత ఇవోచ్చశృంగ: ।
హస్తీవ జాంబూనదబద్ధశృంగో
రరాజ చంద్ర: పరిపూర్ణశృంగ: । 5

వాడికొమ్ములుగలవృషభమువలెను, ఉన్నత శిఖరములుగల మహాపర్వతమురీతి, బంగారు తొడుగులుగల దంతములతో అలరారు ఏనుగువలెను షోడశకళలతోచంద్రుడు విరాజిల్లుచుండెను. (5)

వినష్టశీతాంబుతుషారపంకో
మహాగ్రహగ్రాహవినష్టపంక: ।
ప్రకాశలక్ష్మ్యాశ్రయనిర్మలాంకో
రరాజ చంద్రో భగవాన్ శశాంక: । 6

చంద్రకిరణప్రభావమున శీతాంబువులు, మంచు బిందువులు, చీకట్లుతొలగిపోయెను. గ్రహరాజైన సూర్యునియొక్క కిరణప్రతిఫలనముచేత ఆయనలోని మాలిన్యములుఅంతరించెను. ప్రకాశలక్ష్మికి ఆశ్రయమగుటచే ఆయనలోనిమచ్చయు నిర్మలమై ప్రకాశించెను. శశాంకుడైన చంద్రభగవానుడు ఈ విధముగా తేజరిల్లెను. (6)

శిలాతలం ప్రాప్య యథా మృగేంద్రో
మహారణం ప్రాప్య యథా గజేంద్ర: ।
రాజ్యం సమాసాద్య యథా నరేంద్ర:
తథా ప్రకాశో విరరాజ చంద్ర: । 7

అంబరమున విరాజమానుడైన రేరాజు (చంద్రుడు) శిలాతలముపై స్థిరముగానున్న మృగరాజువలెను, మహారణరంగమున నిలిచిన గజరాజువగిది, రాజ్యాధికారమును పొంది, సింహాసనముపై ఆసీనుడైన మహారాజుభంగి స్పష్టముగా తేజరిల్లుచుండెను. (7)

ప్రకాశచంద్రోదయనష్టదోష:
ప్రవృత్తరక్ష:పిశితాశదోష: ।
రామాభిరామేరితచిత్తదోష:
స్వర్గప్రకాశో భగవాన్ ప్రదోష: । 8

పండువెన్నెలలను పంచియిచ్చుచున్న చంద్రోదయము వలన అంధకారముఅంతరించుటచే జనులానందించుచుండిరి. నిశాచరులు మాంసభక్షణమునందు ప్రవృత్తులై సంతోషించుచుండిరి. స్త్రీ పురుషులు ప్రణయకలహములనువీడి అనురాగసౌఖ్యములలో ఓలలాడుచుండిరి. ఇట్లు అందరికిని ఆనందావహమగు ప్రదోషకాలము సీతాన్వేషణ తత్పరుడైన హనుమంతునకు స్వర్గసుఖదాయకమయ్యెను.[1] (8)

తంత్రీస్వనా: కర్ణసుఖా: ప్రవృత్తా:
స్వపంతి నార్య: పతిభిస్సువృత్తా: ।
నక్తంచరాశ్చాపి తథా ప్రవృత్తా
విహర్తుమత్యద్భుతరౌద్రవృత్తా: । 9

వీణాతంత్రీరవములు వీనులవిందు గావింపసాగెను. అనుకూలవతు(సత్ప్రవర్తన)లైన స్త్రీలు పతులతోగూడి నిద్రించుచుండిరి. అట్లే మిక్కిలిఅద్భుతమైన, భయంకరమైన ప్రవృత్తిగల నిశాచరులు విహారములు సల్పుచుండిరి. (9)

మత్తప్రమత్తాని సమాకులాని
రథాశ్వభద్రాసనసంకులాని ।
వీరశ్రియా చాపి సమాకులాని
దదర్శ ధీమాన్ స కపి: కులాని । 10

ధీరుడు ప్రజ్ఞాశాలియైన ఆ హనుమంతుడు చూచిన గృహములలోకొన్ని మదిరాపానమత్తులై స్వగృహముకోల్పోయిన వారిచే నిండియుండెను. మఱికొన్ని రథాశ్వములను, అంబారీలతోగూడిన గజములను గలిగియుండెను. ఇంకనుకొన్ని వీరలక్ష్మీసంపన్నములై కలకలలాడుచుండెను. (10)

1) ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య యశస: శ్రియ: । జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగఇతీరణా ॥
సమగ్రమైన ఐశ్వర్యము, పరిపూర్ణమైనధర్మము, సత్కీర్తి, ఉత్తమసంపద , నిర్మలజ్ఞానము, సంపూర్ణవైరాగ్యము- ఈ ఆఱింటిని భగము- అని వ్యవహరింతురు- ఈ ఆఱునుగలవాడు భగవంతుడు. షడ్గుణైశ్వర్యసంపన్నుడైన హనుమంతునకు భగవత్స్వరూపమైన ఈ ప్రదోషకాలము స్వర్గతుల్యమైన సుఖానందములను గూర్చెను.

పరస్పరం చాధికమాక్షిపంతి
భుజాంశ్చ పీనానధివిక్షిపంతి ।
మత్తప్రలాపానధివిక్షిపంతి
మత్తాని చాన్యోన్యమధిక్షిపంతి ॥ 11

ఆ గృహములలోని రాక్షసులలో కొందఱు ఒకరినొకరు పరిహసించుకొనుచుండిరి. బలిసినబాహువులను ఒకరిపై నొకరు వేసికొనుచుండిరి. మదిరామత్తులైన వారు అధికముగా ప్రేలాపనలను గావించుచుండిరి.వారు పరస్పరము బెదిరించుకొనుచుండిరి. (11)

రక్షాంసి వక్షాంసి చ విక్షిపంతి
గాత్రాణి కాంతాసు చ విక్షిపంతి ।
రూపాణి చిత్రాణి చ విక్షిపంతి
దృఢాని చాపాని చ విక్షిపంతి ॥ 12

కొందఱు రాక్షసులు ఱొమ్ములు విరుచుకొనుచుండిరి. కొందఱు తమకాంతలపై తూలిపడుచుండిరి. మఱి కొందఱు వివిధవేషములను ధరించుచుండిరి. కొందఱు బలమైనధనుస్సులను అటునిటు త్రిప్పుచుండిరి. అట్టి రాక్షసులను మారుతి వీక్షించెను. (12)

దదర్శ కాంతాశ్చ సమాలభంత్యః
తథా పరాస్తత్ర పునస్స్వపంత్యః ।
సురూపవక్త్రాశ్చ తథా హసంత్యః
క్రుద్ధాః పరాశ్చాపి వినిశ్శ్వసంత్యః ॥ 13

ఆ భవనములలోని కొందఱుకాంతలు అంగరాగాదులను అలదుకొనుచుండిరి. మఱికొందఱు స్త్రీలు మఱల నిద్రలో మునుగుచుండిరి. సుందరవదనలైన కొందఱు దరహాసములు చేయుచుండిరి. కొందఱు కుపితలు నిట్టూర్పులు విడుచుచుండిరి. (13)

మహాగజైశ్చాపి తథా నదద్భిః
సుపూజితైశ్చాపి తథా సుసద్భిః ।
రరాజ వీరైశ్చ వినిశ్శ్వసద్భిః
హ్రదో భుజంగైరివ నిశ్శ్వసద్భిః ॥ 14

ఆ లంకాపురి ఏనుగులఘీంకారములతో నిండియుండెను. మిక్కిలి పూజ్యులైన సజ్జనులతోడ విరాజిల్లు చుండెను. ఇంకను ఆ పురి నిట్టూర్పులు విడుచుచున్న వీరులతోగూడినదై బుసలుకొట్టుచున్న సర్పములతో నిండిన ఒక మడుగువలె ఒప్పుచుండెను. (14)

బుద్ధిప్రధానాన్ రుచిరాభిధానాన్
సంశ్రద్దధానాన్ జగతః ప్రధానాన్ ।
నానావిధానాన్ రుచిరాభిధానాన్
దదర్శ తస్యాం పురి యాతుధానాన్ ॥ 15

ఆ నగరమునందలి రాక్షసులలో బుద్ధిశాలురును, (వివిధవిద్యలలో ఆరితేఱినవారు) చక్కగా వ్యవహరించు వారును, ఆస్తికులును, వివిధములగు స్వభావములుగల వారును, చక్కనిపేర్లుగలవారును గలరు. అట్టి ప్రముఖరాక్షసులను మారుతి గాంచెను. (15)

ననంద దృష్ట్వా స చ తాన్ సురూపాన్
నానాగుణానాత్మగుణానురూపాన్ ।
విద్యోతమానాన్ స తదానురూపాన్
దదర్శ కాంశ్చిచ్చ పునర్విరూపాన్ ॥ 16

ఆ బుద్ధిశాలురు మిక్కిలి అందమైనవారు,[1] సద్గుణ సంపన్నులు, తమ స్వభావములకనుగుణముగా ప్రవర్తించుచు వాసికెక్కినవారు. అట్టివారిని చూచి, ఆ కపివరుడు ఆనందించెను. ఇంకను అతడు వికృతాకారములుగలవారిని, తదనుగుణముగా ప్రవర్తించువారినిగూడ కొందఱిని జూచెను. (16)

తతో వరార్హాస్సువిశుద్ధభావాః
తేషాం స్త్రియస్తత్ర మహానుభావాః ।
ప్రియేషు పానేషు చ సక్తభావాః
దదర్శ తారా ఇవ సుప్రభావాః ॥ 17

అనంతరము మారుతి శ్రేష్ఠపురుషులకు తగిన సతులను, పతులయందు ప్రేమానురాగములు గలవారిని, అనుగుణమైన మంచిప్రవర్తనలుగల శీలవతులను జూచెను. ఇంకను తమప్రియులపైనను, పానాదులయందును ఆసక్తిగలవారు, నక్షత్రములవలె మిక్కిలి శోభిల్లుచున్నవారు ఐన ఆ రాక్షసస్త్రీలను అతడచట చూచెను. (17)

1) విభీషణాది సజ్జనులనుజూచి హనుమంతుడు ఆనందముతో పొంగిపోయెను. తక్కినవారిని సాధారణముగా గమనించెను.

శ్రియా జ్వలంతీ స్త్రపయోపగూఢా
నిశీథకాలే రమణోపగూఢాః ।
దదర్శ కాశ్చిత్ ప్రమదోపగూఢా
యథా విహంగాః కుసుమోపగూఢాః । 18

చక్కనిచుక్కలైన కొందఱుస్త్రీలు అర్ధరాత్రమున తమకాంతుల కౌగిళ్లలోచిక్కి, సిగ్గుదొంతరలలో మునిగి ఆనందపరవశలైయుండిరి. వారు పుష్పములచే కప్పబడినపక్షులవలె ఒప్పుచుండిరి. అట్టిస్త్రీలను ఆ కపివరుడు గాంచెను. (18)

అన్యాః పునర్హర్మ్యతలోపవిష్టా
స్తత్ర ప్రియాంకేషు సుఖోపవిష్టాః ।
భర్తుః ప్రియా ధర్మపరా నివిష్టా
దదర్శ ధీమాన్ మదనాభివిష్టాః । 19

ధర్మపరాయణలైనకొందఱు కులసతులు కామ వికారములకు లోనైనవారై, హర్మ్యతలములయందు తమ ప్రియులయొడులలో చేరి, వారిని ఆనందింపజేయు చుండిరి, తాము సుఖానుభూతిని పొందుచుండిరి. అట్టి వారిని ధీశాలియైన హనుమంతుడు చూచెను. (19)

అప్రావృతాః కాంచనరాజివర్ణాః
కాశ్చిత్ పరార్థ్యా స్తపనీయవర్ణాః ।
పునశ్చ కాశ్చిత్ శశలక్ష్మవర్ణాః
కాంతప్రహీణా రుచిరాంగవర్ణాః । 20

అచటి స్త్రీలలో కొందఱు మేలిముసుగులు లేనివారై, బంగారుతీగెలవలె మెఱిసిపోవుచుండిరి. కొందఱు రమణీమణులు తప్తకాంచనకాంతులతో విరాజిల్లు చుండిరి. మఱికొందఱు చంద్రునివలె తెల్లనికాంతులతో ప్రకాశించుచుండిరి. కొందఱు సుందరాంగులు ప్రియ విరహతాపములకు లోనై యుండిరి. అట్టి లతాంగులను ఆ మారుతి గాంచెను. (20)

తతః ప్రియాన్ ప్రాప్య మనోఽభిరామాన్
సుప్రీతియుక్తాః ప్రసమీక్ష్య రామాః ।
గృహేషు హృష్టాః పరమాభిరామా
హరిప్రవీరస్స దదర్శ రామాః । 21

అనంతరము మనస్సులకు ఆహ్లాదమునుగూర్చుచున్న ప్రియులనుపొంది, మిక్కిలి ఆనందముననుభవించుచున్న సుందరీమణులను కపివరుడు చూచెను- ఇంకను మిక్కిలి మనోహరముగానున్న స్త్రీలు తమతమగృహముల యందు ఆనందముగానుండుటను వీక్షించెను. (21)

చంద్రప్రకాశాశ్చ హి వక్త్రమాలాః
వక్రాక్షిపక్ష్మాశ్చ సునేత్రమాలాః ।
విభూషణానాం చ దదర్శ మాలాః
శతహ్రదానామివ చారుమాలాః । 22

చంద్రకాంతులను విరజిమ్మునట్టి అచటి స్త్రీల ముఖములను, వంకరగానున్న కనురెప్పలుగల వారి నేత్రములను, విద్యున్మాలలవలె మనోహరముగానున్న వారి ఆభరణ పంక్తులను[1] అతడు చూచెను. (22)

న త్వేవ సీతాం పరమాభిజాతాం
పథి స్థితే రాజకులే ప్రజాతామ్ ।
లతాం ప్రఫుల్లామివ సాధుజాతాం
దదర్శ తన్వీం మనసాభిజాతామ్ । 23

కాని మిక్కిలి సౌందర్యవతియు, ధర్మమార్గమును అనుసరించు రాజవంశమునందు ఆవిర్భవించినదియు, వికసించినలతవలె రూపసౌభాగ్యముగలదియు, అయోనిజయు, కోమలాంగియు ఐన సీతాదేవిని మాత్రము అతడు చూడలేదు. (23)

సనాతనే వర్త్మని సన్నివిష్టాం
రామేక్షణాం తాం మదనాభివిష్టామ్ ।
భర్తుర్మనశ్శ్రీమదనుప్రవిష్టాం
స్త్రీభ్యో వరాభ్యశ్చ సదా విశిష్టామ్ । 24

అవిచ్ఛిన్నమైనధర్మమార్గమునందు ప్రవర్తించునట్టిదియు, రాముని ఎడబాటుకారణముగా దుఃఖితయై, ఆయన దర్శనమునకై ఎదురుతెన్నులుచూచు చున్నదియు, శ్రీరాముని యొక్క పవిత్రమైనమనస్సునందు స్థిరముగా నిల్చియున్నట్టిదియు, నారీరత్నములలో అత్యుత్తమురాలునుఐన సీతాదేవినిమాత్రము అతడు దర్శింపలేదు- (24)

1) మానుషస్త్రీలకును, రాక్షసస్త్రీలకును మధ్యగల వ్యత్యాసములను గుర్తించుటకై ఆలంకలోని స్త్రీలముఖములను, నేత్రములను, ఆభరణములను సీతాన్వేషణ తత్పరుడైన హనుమంతుడు పరికించిచూచెను.

ఉష్ణార్దితాం సానుసృతాస్రకంఠీం
పురా వరార్హోత్తమనిష్కకంఠీమ్ ।
సుజాతపక్ష్మామభిరక్తకంఠీం
వనే ప్రనృత్తామివ నీలకంఠీమ్ ॥ 25

శ్రీరామునివిరహముచే పరితపించుచున్నదియు, కన్నీరుమున్నీరుగా విలపించుచు గద్గదకంఠముతో ఒప్పుచున్నదియు, లోగడ మేలైన బంగారు కంఠాభరణములను ధరించుచున్నట్టిదియు, అందమైన కనురెప్పలుగలదియు, మధురమైన కంఠస్వరము గలదియు, వనమునందు చక్కగా నాట్యముచేయు మయూరివలె విలసిల్లునదియు ఐన సీతాదేవిమాత్రము కనబడలేదు. (25)

అవ్యక్తరేఖా మివ చంద్రరేఖాం
పాంసుప్రదిగ్ధామివ హేమరేఖామ్ ।
క్షతప్రరూఢామివ బాణరేఖాం
వాయుప్రభిన్నామివ మేఘరేఖామ్ ॥ 26

అస్పష్టమైన ఆకారముగల చంద్రరేఖవలెను, ధూళి ధూసరితమైన బంగరురేఖవలెను- గాయము మానినను గుర్తుగా మిగిలిన బాణరేఖవలెను, గాలితాకిడికి చెల్లాచెదరైన మేఘశకలమువలెను- కృశించి ఉన్న జానకీదేవి మాత్రము అచట ఆ హనుమకు కన్పింపలేదు.[1] (26)

సీతామపశ్యన్మనుజేశ్వరస్య
రామస్య పత్నీం వదతాం వరస్య ।
బభూవ దుఃఖాభిహతశ్చిరస్య
ప్లవంగమో మంద ఇవాచిరస్య ॥ 27

వాక్చతురులలో శ్రేష్ఠుడును, నరేంద్రుడును ఐన శ్రీరాముని యొక్కపత్నియగు సీతాదేవిని ఎంతగా వెదకినను ఆమె కనబడకపోవుటచే కపిప్రవరుడు దుఃఖాక్రాంతుడై క్షణకాలముపాటు అజ్ఞునివలె దిక్కుతోచనివాడాయెను. (27)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే పంచమస్సర్గః (5)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన, శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఐదవసర్గము.

— ✻ ✻ ✻ —

6. ఆఱవసర్గము

రావణాదులభవనములలో హనుమంతుడు సీతను అన్వేషించుట

స నికామం విమానేషు విషణ్ణః కామరూపధృక్ ।
విచచార పునర్లంకాం లాఘవేన సమన్వితః ॥ 1

కామరూపధారియైన ఆ హనుమంతుడు రావణుని గృహములయందు ఎచ్చటను సీతజాడగానక మిక్కిలి విచారగ్రస్తుడయ్యెను. అనంతరము జాగరూకుడై నేర్పుతో లంకయందంతటను అన్వేషింపసాగెను. (1)

1) మారుతి పెక్కుమంది సుందరీమణులను చూచెను. కాని వారిలో ఏ ఒక్కరును సీతాదేవికాదని తనమనస్సున అతడు నిర్ణయించుకొనెను. ఏలనన అతడు తనమనస్సులో ముద్రించుకొనిన సీతాదేవికి సంబంధించిన ఊహాచిత్రమిది- వాస్తవముగా, పదునారుకళలతోగూడిన చంద్రునివలె భాసిల్లు సీతాదేవి శ్రీరాముని ఎడబాటువలన ఇప్పుడు నీహారాచ్ఛాదితమైన విదియనాటిచంద్రునివలె కాంతిహీనయై యుండును. సహజముగా బంగారుకాంతిగల ఆమెదేహము ధూళిధూసరితమైన సువర్ణరేఖవలెనుండును బాణములగాయములు మానినను వాటిగుర్తులు మిగిలియుండునట్లు సీతాదేవి మనస్సుపై కొట్టబడిన రావణునివాగ్బాణములగుర్తులు మాత్రము ఆమె ముఖకవళికలపై కన్పట్టుచుండును. గాలి తాకిడికి మేఘములు విచ్ఛిన్నములై శకలములు వేఱైనయట్లు రావణుడనెడి వాయుఘాతములకు రాముడనెడి మేఘమునుండి వేఱైన శకలమువలె సీతాదేవి కాంతిహీనయై యుండును- అట్టి జానకీదేవి మాత్రము ఎంతగా వెదకినను అచటి తరుణీమణులలో మారుతికి కనబడలేదు.

ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనమ్।
ప్రాకారేణార్కవర్ణేన భాస్వరేణాభిసంవృతమ్। 2

పిమ్మట శుభలక్షణసంపన్నుడైన మారుతి సూర్యకాంతులతో ప్రకాశించుచున్న ప్రాకారముగల రావణుని ప్రాసాదమును సమీపించెను. (2)

రక్షితం రాక్షసైర్ఘోరైః సింహైరివ మహద్వనమ్।
సమీక్షమాణో భవనం చకాశే కపికుంజరః। 3

సింహములచే సురక్షితముగానున్న మహారణ్యమువలె ఆరావణభవనము భయంకరులైనరాక్షసులచే కాపాడబడుచుండెను. అట్టిభవనమును పరికించి చూచుచు ఆ కపివరుడు ఆశ్చర్యచకితుడాయెను. (3)

రూప్యకోపహితైశ్చిత్రైః తోరణైర్హేమభూషితైః।
విచిత్రాభిశ్చ కక్ష్యాభిః ద్వారైశ్చ రుచిరైర్వృతమ్। 4

ఆ భవనము వెండిబంగారములతో నిర్మింపబడిన ముఖద్వారములతో అద్భుతముగా శోభిల్లుచుండెను. అది చిత్రవిచిత్రములైనఅంతస్థులతోడను, అందమైన ద్వారములతోడను అలరారుచుండెను. (4)

గజాస్థితైర్మహామాత్రైః శూరైశ్చ విగతశ్రమైః।
ఉపస్థితమసంహార్యైః హయైస్స్యందనయాయిభిః। 5

ఆ రావణభవనసమీపమున అలుపెఱుగనివారును, శూరులునుఐన ప్రముఖులు మదపుటేనుగులను అధిష్ఠించి యుండిరి. అజేయులైన అశ్వారూఢులును రథారూఢులును సర్వసన్నద్ధులైయుండిరి. (5)

సింహవ్యాఘ్రతనుత్రాణైః దాంతకాంచనరాజతైః।
ఘోషవద్భిర్విచిత్రైశ్చ సదా విచరితం రథైః। 6

అచట దంతములతో, వెండిబంగారములతో నిర్మింపబడిన విచిత్రములైన రథములు ధ్వనులనొనర్చుచు ఇటునటు సంచరించుచుండెను. అందు సింహవ్యాఘ్రచర్మములచే చేయబడిన కవచములు ఉంచబడియుండెను. (6)

బహురత్నసమాకీర్ణం పరార్ధ్యాసనభాజనమ్।
మహారథసమావాసం మహారథమహాస్వనమ్। 7

ఆ భవనము అనేకరత్నములతో అలంకృతమైనది, శ్రేష్ఠములైన ఆసనములకును, పాత్రలకును నెలవైనది, మహారథులకు నిలయమైనది, మహారథముల ధ్వనులచే నిండినది. (7)

దృశ్యైశ్చ పరమోదారైః తైస్తైశ్చ మృగపక్షిభిః।
వివిధైర్బహుసాహస్రైః పరిపూర్ణం సమంతతః। 8

అచ్చట నానావిధములైన జింకలు, శారికాది పక్షులు వేలసంఖ్యలో అంతటను చేరియుండెను. ఆయా మృగ పక్షులన్నియును గంభీరములై చూడముచ్చటగొల్పు చుండెను. (8)

వినీతైరంతపాలైశ్చ రక్షోభిశ్చ సురక్షితమ్।
ముఖ్యాభిశ్చ వరస్త్రీభిః పరిపూర్ణం సమంతతః। 9

ఆ భవనము సుశిక్షితులు, వినయశీలురు, బాహ్యరక్షకులు ఐన రాక్షసులచే బాగుగారక్షింపబడు చుండెను. అది ప్రముఖవనితారత్నములచే పరిపూర్ణమై యుండెను. (9)

ముదితప్రమదారత్నం రాక్షసేంద్రనివేశనమ్।
వరాభరణసంహ్రాదైః సముద్రస్వననిస్స్వనమ్। 10

ఆ రాక్షసేంద్రుని నివాసమునందలి వనితారత్నములు ఆనందమున ఓలలాడుచుండిరి. వారి ఆభరణముల మంజుల రవములు సముద్రపుటలలధ్వనులవలె మనోజ్ఞములై యుండెను. (10)

తద్రాజగుణసంపన్నం ముఖ్యైశ్చాగరుచందనైః।
మహాజనై స్సమాకీర్ణం సింహైరివ మహద్వనమ్। 11

భేరీమృదంగాభిరుతం శంఖఘోషవినాదితమ్।
నిత్యార్చితం పర్వహుతం పూజితం రాక్షసైస్సదా। 12

సముద్రమివ గంభీరం సముద్రమివ నిస్స్వనమ్।
మహాత్మనో మహద్వేశ్మ మహారత్నపరిచ్ఛదమ్। 13

మహారత్నసమాకీర్ణం దదర్శ స మహాకపిః।
విరాజమానం వపుషా గజాశ్వరథసంకులమ్। 14

లంకాభరణమిత్యేవ సోఽమన్యత మహాకపిః।
చచార హనుమాంస్తత్ర రావణస్య సమీపతః। 15

గృహాద్గృహం రాక్షసానామ్ ఉద్యానాని చ వానరః।
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః। 16

అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్।
తతోఽన్యత్ పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్। 17

అథ మేఘప్రతీకాశం కుంభకర్ణనివేశనమ్।
విభీషణస్య చ తదా పుప్లువే స మహాకపిః। 18

మహోదరస్య చ గృహం విరూపాక్షస్య చైవ హి।
విద్యుజ్జిహ్వస్య భవనం విద్యున్మాలేస్తథైవ చ। 19

వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః।
శుకస్య చ మహాతేజాః సారణస్య చ ధీమతః। 20

తథా చేంద్రజితో వేశ్మ జగామ హరియూథపః।
జంబుమాలేస్సుమాలేశ్చ జగామ హరిసత్తమః। 21

రశ్మికేతోశ్చ భవనం సూర్యశత్రోస్తథైవ చ।
వజ్రకాయస్య చ తథా పుప్లువే స మహాకపిః। 22

ధూమ్రాక్షస్య చ సంపాతేః భవనం మారుతాత్మజః।
విద్యుద్రూపస్య భీమస్య ఘనస్య విఘనస్య చ। 23

శుకనాసస్య వక్రస్య శఠస్య వికటస్య చ।
హ్రస్వకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః। 24

యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య నాదినః।
విద్యుజ్జిహ్వేంద్రజిహ్వానాం తథా హస్తిముఖస్య చ। 25

ఆ ప్రాసాదము ఛత్రచామరాది రాజచిహ్నములచే ఒప్పారుచుండెను. అది శ్రేష్ఠములైన అగరుచందనాదుల పరిమళములను వెదజల్లుచుండెను. అది బలిష్ఠులైన రాక్షసులతోగూడి సింహములచే వ్యాప్తమైన మహారణ్యము వలె విలసిల్లుచుండెను. (11)

ఆ భవనము భేరీమృదంగధ్వనులతోను, శంఖనాదములతోను మాఱుమ్రోగుచుండెను. అచట రాక్షసులచే నిత్యార్చనలు, పర్వదినములయందు హోమ కార్యములు పూజలు కొనసాగుచుండెను. (12)

ఆ రావణభవనము సముద్రమువలె లోతైనది. విశాలమైనది(రావణభయముచే) నిశ్శబ్దమైనది. అది మహా రత్నములతోపొదుగబడిన పైకప్పులు గలది. శ్రేష్ఠములైన రత్నములతోనిండినది, మహాత్ముడైన రావణునియొక్క అట్టి మహాభవనమును ఆ వానరవీరుడు దర్శించెను. గజాశ్వరథములతోనిండినదై, మధురాకృతితో విరాజిల్లుచున్న ఆభవనము లంకానగరమునకే ఆభరణమని ఆ మహాకపి తలంచెను. అట్టి రావణభవనసమీపమున అతడు సంచరించెను. (13-15)

ఆ వానరోత్తముడు రాక్షసులయొక్కగృహములను, ప్రాసాదములను ఉద్యానవనములను క్రమక్రమముగా వీక్షించుచు నిర్భయముగా తిరుగసాగెను. (16)

మిక్కిలి పరాక్రమశాలియైన హనుమంతుడు అతి వేగముతో ప్రహస్తునిభవనముపై దుమికెను. పిమ్మట మహాపార్శ్వుని గృహముపైకెగిరెను. అనంతరము మేఘ సదృశమైన కుంభకర్ణునిప్రాసాదముమీదికిని, పిమ్మట విభీషణునిహర్మ్యముపైకిని చేరెను. తదనంతరము ఆ మహాకపి మహోదరుడు, విరూపాక్షుడు, విద్యుజ్జిహ్వుడు, విద్యున్మాలుడు, వజ్రదంష్ట్రుడు, మొదలగువారి భవనములపై తిరిగెను. పిమ్మట మహాతేజశ్శాలియైన మారుతి ధీమంతుడైనశుకుడు, సారణుడు, ఇంద్రజిత్తు, జంబుమాలి, సుమాలి మొదలగువారి భవనములన్నింటిని క్రమముగా గాలించెను. (17-21)

అటుపిమ్మట రశ్మికేతువు, సూర్యశత్రువు, వజ్రకాయుడు, ధూమ్రాక్షుడు, సంపాతి, విద్యుద్రూపుడు, భీముడు, ఘనుడు, విఘనుడు, శుకనాసుడు, వక్రుడు, శఠుడు, వికటుడు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, నాది, విద్యుజ్జిహ్వుడు, ఇంద్రజిహ్వుడు, హస్తిముఖుడు, కరాళుడు,

కరాళస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి।
క్రమమాణః క్రమేణైవ హనుమాన్ మారుతాత్మజః। 26

తేషు తేషు మహార్హేషు భవనేషు మహాయశాః।
తేషామ్ ఋద్ధిమతామ్ ఋద్ధిం దదర్శ స మహాకపిః। 27

సర్వేషాం సమతిక్రమ్య భవనాని సమంతతః।
ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనమ్। 28

రావణస్యోపశాయిన్యో దదర్శ హరిసత్తమః।
విచరన్ హరిశార్దూలో రాక్షసీర్వికృతేక్షణాః। 29

శూలముద్గరహస్తాశ్చ శక్తితోమరధారిణీః।
దదర్శ వివిధాన్ గుల్మాన్ తస్య రక్షఃపతేర్గృహే। 30

రాక్షసాంశ్చ మహాకాయాన్ నానాప్రహరణోద్యతాన్।
రక్తాన్ శ్వేతాన్ సితాంశ్చైవ హరీంశ్చాపి మహాజవాన్। 31

కులీనాన్ రూపసంపన్నాన్ గజాన్ పరగజారుజాన్।
నిష్ఠితాన్ గజశిక్షాయామ్ ఐరావతసమాన్ యుధి। 32

నిహంతౄన్ పరసైన్యానాం గృహే తస్మిన్ దదర్శ సః।
క్షరతశ్చ యథా మేఘాన్ స్రవతశ్చ యథా గిరీన్। 33

మేఘస్తనితనిర్ఘోషాన్ దుర్ధర్షాన్ సమరే పరైః।
సహస్రం వాహినీస్తత్ర జాంబూనదపరిష్కృతాః। 34

హేమజాలపరిచ్ఛన్నాః తరుణాదిత్యసన్నిభాః।
దదర్శ రాక్షసేంద్రస్య రావణస్య నివేశనే। 35

శిబికా వివిధాకారాః స కపిర్మారుతాత్మజః।
లతాగృహాణి చిత్రాణి చిత్రశాలాగృహాణి చ। 36

క్రీడాగృహాణి చాన్యాని దారుపర్వతకానపి।
కామస్య గృహకం రమ్యం దివాగృహకమేవ చ।
దదర్శ రాక్షసేంద్రస్య రావణస్య నివేశనే। 37

పిశాచుడు, శోణితాక్షుడు మొదలగు రాక్షసుల గృహములను ఆ మారుతి వరుసగాశోధించెను.(22-26)

సుప్రసిద్ధుడైన ఆ హనుమంతుడు అద్భుతావహములైన ఆయాభవనములయందు సంచరించుచు సంపన్నులైన ఆ రాక్షసుల సంపదలను తిలకించెను. (27)

శుభలక్షణసంపన్నుడైన మారుతి రాక్షసులందఱి భవనములను పూర్తిగా శోధించిన పిమ్మట రాక్షసప్రభువైన రావణుని ప్రాసాదమునకు చేరెను. (28)

కపివరుడైన ఆంజనేయుడు అంతటను తిరుగుచు రావణునిసమీపమున శయనించినవారును, వికృతములైన చూపులుగలవారును ఐన రాక్షసస్త్రీలను జూచెను. (29)

ఆ రాక్షసస్త్రీలలోకొందఱు శూలములను, ఇనుపగుదియలను చేతబట్టియుండిరి. కొందఱు శక్తి, తోమరములను దాల్చియుండిరి. ఆ రావణుని నిలయమున వివిధసేనా విభాగములనుగూడ అతడు చూచెను. (30)

అతడు వివిధాయుధములను ధరించియున్న మహాకాయులగు రాక్షసులను, ఎఱ్ఱనివి, తెల్లనివి, మహా వేగగమనముగలవియుఅగు బంధింపబడియున్న గుఱ్ఱములను గాంచెను. (31)

ఉత్తమజాతికిచెందినవి, చక్కని ఆకారముగలవి, శత్రుసైన్యమునందలిగజములను పీడించుటలో సమర్థములైనవి, యుద్ధాదివిద్యలయందు సుశిక్షితములైనవి, ఐరావతతుల్యములైనవి, రణరంగమునందు శత్రుసైన్యములను హతమార్చునవి, వర్షించుచున్న మేఘములవలె మదజలములను స్రవించుచున్నవి, పర్వతసదృశములైనవి, మేఘగర్జనలవలె ఘీంకరించుచున్నవి, సమరరంగమున శత్రువులకు ఎదిరింపరానివియుఐన మదపుటేనుగులను ఆ రావణనిలయమున కపివరుడుగాంచెను. బంగారు అలంకారములుగలవియు, స్వర్ణాభరణములచే భూషితములైనవియు, మధ్యందిన సూర్యునివలెనున్న వేలకొలది సేనలను రావణనివేశమునందు హనుమంతుడు వీక్షించెను. (32-35)

రావణసదనమున వాయుసుతుడైన ఆ హనుమంతుడు వివిధాకారములతోనున్న పల్లకీలను, చిత్ర విచిత్రములైన పొదరిండ్లను, చిత్రశాలాగృహములను, క్రీడామందిరములను, దేవదారువృక్షములతోకూడిన క్రీడాపర్వతములను, సురత క్రీడాగారములను, పగటి పూట విహరించు రమ్యప్రదేశములను పరికించిచూచెను. (36, 37)

స మందరగిరిప్రఖ్యం మయూరస్థానసంకులమ్। 38
ధ్వజయష్టిభిరాకీర్ణం దదర్శ భవనోత్తమమ్।
అనేకరత్నసంకీర్ణం నిధిజాలం సమంతతః। 39
ధీరనిష్ఠితకర్మాంతం గృహం భూతపతేరివ।
అర్చిర్భిశ్చాపి రత్నానాం తేజసా రావణస్య చ। 40
విరరాజాథ తద్వేశ్మ రశ్మిమానివ రశ్మిభిః।
జాంబూనదమయాన్యేవ శయనాన్యాసనాని చ।
భాజనాని చ ముఖ్యాని దదర్శ హరియూథపః। 41

మందరగిరివలె సువర్ణమయమై ఉన్నతమైనదియు, క్రీడామయూరములతో నిండినదియు, ధ్వజ పతాకములచే విలసిల్లుచున్నదియు, అనేకరత్నములతో విలసితమైనదియు, మహాపద్మాదినవనిధులకు నెలవైనదియు, సదాశివునకు నివాసమైన కైలాసమువలె దృఢవ్రతుల తపఃఫలముగా ప్రాప్తించినదియు, రత్నకాంతులతోను, రావణునితేజస్సుతోను వెలుగొందుచున్న ఆ భవనము చండకిరణుడైన సూర్యునివలె తేజరిల్లుచుండెను. అట్టి మహాభవనమును ఆకపీశ్వరుడు కాంచెను. కాంచనమయములైన అచటి తల్పములను, ఆసనములను, ముఖ్యములైనపాత్రలను హనుమంతుడు తిలకించెను. (38-41)

మధ్వాసవకృతక్లేదం మణిభాజనసంకులమ్।
మనోరమమసంబాధం కుబేరభవనం యథా। 42
నూపురాణాం చ ఘోషేణ కాంచీనాం నినదేన చ।
మృదంగతలఘోషైశ్చ ఘోషవద్భిర్వినాదితమ్। 43

తేనెలతోగూడినమద్యములతో తడిసినదియు, మణులు పొదిగినపాత్రలతో అలరారుచున్నదియు అగు ఆ భవనము కుబేరప్రాసాదమువలె విశాలమై మనోహరముగానుండెను. అది కాలియందెలసవ్వడుల చేతను ఒడ్డాణముల రవళులచేతను, మృదంగనాదముల తోడను మార్మ్రోగుచుండెను. (42-43)

ప్రాసాదసంఘాతయుతం స్త్రీరత్నశతసంకులమ్।
సువ్యూఢకక్ష్యం హనుమాన్ ప్రవివేశ మహాగృహమ్। 44

చక్కగా రూపొందింపబడిన గదులుగల ఆ రాజభవనము వందలకొలది వనితారత్నములతోను వరుసలుదీరియున్న ప్రాసాదములతోను విలసిల్లుచుండెను. అట్టి మహాభవనమున హనుమంతుడు ప్రవేశించెను. (44)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే షష్ఠస్సర్గః (6)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన, శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఆఱవసర్గము.

— * * * —

7. ఏడవసర్గము

రావణ భవన, పుష్పకవిమానముల వర్ణనము

స వేశ్మజాలం బలవాన్ దదర్శ
వ్యాసక్తవైడూర్యసువర్ణజాలమ్।
యథా మహత్ప్రావృషి మేఘజాలం
విద్యుత్పినద్ధం సవిహంగజాలమ్। 1

ఆ మహాంతఃపురములోనిగృహములు వైడూర్య ఖచితములైన బంగారుకిటికీలతో భాసిల్లుచుండెను. అవి పక్షులతోగూడినవై విద్యుత్కాంతులను విరజిమ్ముచు వర్షాకాలపుమేఘములవలె విలసిల్లుచుండెను- (ఇచట గృహములు మేఘములతోను, బంగారుకిటికీలు మెఱపులతోను, వైడూర్యములు పక్షులతోను పోల్చబడినవి) (1)

నివేశనానాం వివిధాశ్చ శాలాః
ప్రధానశంఖాయుధచాపశాలాః ।
మనోహరాశ్చాపి పునర్విశాలాః
దదర్శ వేశ్మాద్రిషు చంద్రశాలాః ॥ 2

పర్వతాకారసదృశములైన ఆగృహములలో హాయిగా కూర్చొనుటకు అనువైన వివిధములగు గదులను, శ్రేష్ఠతమములైన శంఖ-ఆయుధ, ధనుశ్శాలలను, మనోహరములు, విశాలములువైన చంద్రశాలలను హనుమంతుడు చూచెను. (2)

గృహాణి నానావసురాజితాని
దేవాసురైశ్చాపి సుపూజితాని ।
సర్వైశ్చ దోషైః పరివర్జితాని
కపిర్దదర్శ స్వబలార్జితాని ॥ 3

ధనకనకవస్తువాహనాదిసకలసంపదలతో తులతూగుచున్నట్టివి. సురాసురులప్రశంసలను అందుకొనుచున్నట్టివి, ఏవిధములైన లోటులును లేనట్టివి, రావణుడు తన పరాక్రమముచే సంపాదించుకొనినట్టివి ఐన గృహములను మారుతి గాంచెను. (3)

తాని ప్రయత్నాభిసమాహితాని
మయేన సాక్షాదివ నిర్మితాని ।
మహీతలే సర్వగుణోత్తరాణి
దదర్శ లంకాధిపతేర్గృహాణి ॥ 4

ఆ గృహములు రావణుని గట్టిపూనికతో మయుడను శిల్పియే స్వయముగా నిర్మించెనా? యనునట్లున్నవి. అవి భూతలమునందే సర్వగుణోత్కృష్టములైనవి. అట్టి ప్రాసాదములను కపివరుడు దర్శించెను. (4)

తతో దదర్శోచ్ఛ్రితమేఘరూపం
మనోహరం కాంచనచారురూపమ్ ।
రక్షోఽధిపస్యాత్మబలానురూపం
గృహోత్తమం హ్యప్రతిరూపరూపమ్ ॥ 5

పిమ్మట వాయుసుతుడు పుష్పకవిమానమును దర్శించెను. అది మేఘమువలె మహోన్నతమైనది. విశాలమైనది, ఆహ్లాదకరమైనది, బంగారమువలె కనులకు మిఱుమిట్లు గొల్పుచున్నది. అది నిరుపమానమై, ఉత్తమోత్తమమై రావణునిస్థాయికి దగినట్లు విరాజిల్లుచున్నది. (5)

మహీతలే స్వర్గమివ ప్రకీర్ణం
శ్రియా జ్వలంతం బహురత్నకీర్ణమ్ ।
నానాతరూణాం కుసుమావకీర్ణం
గిరేరివాగ్రం రజసావకీర్ణమ్ ॥ 6

అది దివినుండిభువికి దిగివచ్చిన స్వర్గమాయనునట్లుండెను. నానావిధరత్నప్రకీర్ణమై వెలుగులను వెదజల్లుచుండెను. అది పెక్కువిధములైన వృక్షములపూవులతో కప్పబడి కుసుమపరాగములచే అచ్ఛాదితమైన గిరిశిఖరమువలె విలసిల్లుచుండెను. (6)

నారీప్రవేకైరివ దీప్యమానం
తటిద్భిరంభోదవదర్చ్యమానమ్ ।
హంసప్రవేకైరివ వాహ్యమానం
శ్రియా యుతం ఖే సుకృతాం విమానమ్ ॥ 7

అత్యంతశోభలతో అలరారుచున్న ఆ పుష్పక విమానము మెఱుపుతీగలవంటి నారీరత్నములచే గూడినదై విద్యుల్లతాయుతమేఘమువలె వెలుగొందుచున్నది. అందఱిచే సేవింపబడుచున్నది, రాజహంసలచే మోయబడుచున్న బ్రహ్మాది పుణ్యపురుషుల విమానమువలె అది శోభిల్లుచున్నది. (7)

యథా నగాగ్రం బహుధాతుచిత్రం
యథా నభశ్చ గ్రహచంద్రచిత్రమ్ ।
దదర్శ యుక్తీకృతమేఘచిత్రం
విమానరత్నం బహురత్నచిత్రమ్ ॥ 8

ఆ పుష్పకము చంద్రాదిగ్రహములచే శోభిల్లుచున్న ఆకాశమువలె నుండెను. నానావిధరత్నములచే చిత్రితమై, గైరికాదిధాతువులచే బహువర్ణశోభితమై ఒప్పుచున్న పర్వతశిఖరమువలె విలసిల్లుచుండెను. అది చిత్రవిచిత్రముగా గూడియున్న మేఘరాశివలె రాజిల్లుచుండెను. అట్టి విమానరత్నమును ఆ హనుమంతుడు గాంచెను. (8)

మహీకృతా పర్వతరాజిపూర్ణా
శైలాః కృతా వృక్షవితానపూర్ణాః ।
వృక్షాః కృతాః పుష్పవితానపూర్ణాః
పుష్పం కృతం కేసరపత్రపూర్ణమ్ । 9

ఆ పుష్పకవిమానముపై పెక్కుదృశ్యములు చిత్రింపబడియుండెను. అందు చిత్రితమైన భూమిపై పర్వతపంక్తులు విలసిల్లుచుండెను. ఆ పర్వతములపై వృక్షసమూహములు ఆ వృక్షములపై పుష్పవితానములు, వాటిపై కేసరములు పత్రములు విరాజిల్లుచుండెను. (9)

కృతాని వేశ్మాని చ పాండురాణి
తథా సుపుష్పాణ్యపి పుష్కరాణి ।
పునశ్చ పద్మాని సకేసరాణి
ధన్యాని చిత్రాణి తథా వనాని । 10

ఆ పుష్పకముపై చిత్రితములైన గృహములు స్వచ్ఛ కాంతులను విరజిమ్ముచుండెను. సరస్సులు రంగురంగుల పూవులతో శోభిల్లుచుండెను. పద్మములు కింజల్కములతో రాజిల్లుచుండెను. అచట చిత్రింపబడిన కొలనులు అత్యద్భుతములు. (10)

పుష్పాహ్వయం నామ విరాజమానం
రత్నప్రభాభిశ్చ వివర్ధమానమ్ ।
వేశ్మోత్తమానామపి చోచ్చమానం
మహాకపిస్తత్ర మహావిమానమ్ । 11

ఆ కపిశ్రేష్ఠుడు దర్శించిన ఆ మహావిమానము 'పుష్పకము" అనుపేరుతో విరాజిల్లుచుండెను. అది రత్నకాంతులను దశదిశల యందును విరజిమ్ముచు ఆకాశమునకు ఎగురుచున్నదా యనునట్లు ఉండెను. అచటగల ప్రాసాదములన్నింటికంటెను అది అత్యున్నత శ్రేణికి చెందినదైయుండెను. (11)

కృతాశ్చ వైడూర్యమయా విహంగాః
రూప్యప్రవాళైశ్చ తథా విహంగాః ।
చిత్రాశ్చ నానావసుభిర్భుజంగా
జాత్యానురూపాస్తురగాశ్శుభాంగాః । 12

అందువైడూర్యములతోను, వెండితోను, పగడములతోను చెక్కబడిన పక్షులును, వివిధమణులచే చిత్రితములైన సర్పములును, చక్కని అవయవసంపదగలిగిన ఉత్తమజాతి గుఱ్ఱములును రూపొందింపబడియుండెను. (12)

ప్రవాళజాంబూనదపుష్పపక్షాః
సలీలమావర్జితజిహ్మపక్షాః ।
కామస్య సాక్షాదివ భాంతి పక్షాః
కృతా విహంగాస్సుముఖాస్సుపక్షాః । 13

ఆ విమానమునందు చూడముచ్చటగొల్పు చక్కని ముఖములు, మంచిరెక్కలుగలపక్షులు చెక్కబడినవి. ఆ రెక్కలు, ముఖములు విలాసవంతమైనభంగిమలలో వంచబడి, వంకరలు దిరిగియున్నవి. ఆ పక్షములపై పగడముల పూవులు, బంగారుపుష్పములు ముద్రింపబడినవి. ఆ పక్షులు సాక్షాత్తుగా మన్మథసహాయకులవలె మనోహరముగా చిత్రితములైనవి. (13)

నియుజ్యమానాస్తు గజాస్సుహస్తాః
సకేసరాశ్చోత్పలపత్రహస్తాః ।
బభూవ దేవీ చ కృతా సుహస్తా
లక్ష్మీస్తథా పద్మిని పద్మహస్తా । 14

ఆ భవనమున లక్ష్మీదేవి తన మనోహరహస్తములతో పద్మములనుధరించి పద్మసరస్సున విరాజిల్లుచున్నట్లు చిత్రింపబడెను. ఆమెకు ఇరువైపుల మంచి తొండములుగల ఏనుగులు రూపొందింపబడినవి. అవి తమతొండములతో తామరపూవులను, ఆకులను గ్రహించి, ఆ దేవికి ఆత్మార్పణ బుద్ధితో అభిషేకము చేయుచున్నట్లుండెను. అట్టితఱి పద్మకేసరములు ఏనుగుల శరీములపై రాలియుండెను. (14)

ఇతీవ తద్గృహమభిగమ్య శోభనం
సవిస్మయో నగమివ చారుశోభనమ్ ।
పునశ్చ తత్పరమసుగంధి సుందరం
హిమాత్యయే నగమివ చారుకందరమ్ । 15

పర్వతమువలెఉన్నతమై, ఆహ్లాదకరముగా శోభిల్లుచున్న ఆగృహమును (పుష్పకమును) జూచి హనుమంతుడు ఆశ్చర్యచకితుడాయెను. వసంతఋతువునందు పరిమళభరితమై, సుందరమై, చక్కనిగుహలుగల పర్వతమువలెనున్న ఆ భవనమును అతడు మఱొకమాఱు ప్రవేశించెను. (15)

తతస్స తాం కపిరభిపత్య పూజితాం
చరన్ పురీం దశముఖబాహుపాలితామ్ ।
అదృశ్య తాం జనకసుతాం సుపూజితాం
సుదుఃఖితః పతిగుణవేగనిర్జితామ్ ॥ 16

అనంతరము ఆ కపివరుడు రావణునిచే పరిపాలింపబడుచు అందరి మన్ననలను అందుకొనుచున్న ఆ లంకాపురిలో ప్రవేశించి సంచరింపసాగెను. ఐనను పరమపూజ్యురాలును, శ్రీరాముని సద్గుణప్రభావముచే జయింపబడినదియు, (అంతేగాక శ్రీరాముడు శివధనుస్సు యొక్క గుణమును (అల్లెత్రాడును) బలముగా లాగగా ధనుర్భంగమాయెను. ఆ విధముగా జయింపబడినదియు) ఐన ఆ జానకి కనబడకపోవుటచే అతడు విచారగ్రస్తుడాయెను.(16)

తతస్తదా బహువిధభావితాత్మనః
కృతాత్మనో జనకసుతాం సువర్త్మనః ।
అపశ్యతోఽభవదతిదుఃఖితం మనః
సుచక్షుషః ప్రవిచరతో మహాత్మనః ॥ 17

ధర్మమార్గానువర్తియు, ప్రజ్ఞాశాలియు, మహా ధైర్యవంతుడును, సూక్ష్మదృష్టిగలవాడును, ఐన ఆ హనుమంతుడు నిశ్చయబుద్ధితో అంతటను సంచరించుచు సీతాదేవికై వెదకెను. ఐనను ఆజానకిని గానక అతడు మిక్కిలి విచారగ్రస్తుడై పరిపరివిధముల ఆలోచింపసాగెను. (17)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే సప్తమస్సర్గః (7)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన, శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏడవసర్గము.

— * * * —

8. ఎనిమిదవసర్గము

హనుమంతుడు పుష్పకవిమానమును చూచుట

స తస్య మధ్యే భవనస్య సంస్థితం
మహద్విమానం మణివజ్రచిత్రితమ్ ।
ప్రతప్తజాంబూనదజాలకృత్రిమం
దదర్శ వీరః పవనాత్మజః కపిః ॥ 1

ఆ భవనసముదాయమునకు మధ్యనున్నదియు, మణుల చేతను, వజ్రములతోడను చిత్రముగా నిర్మింపబడినదియు, మేలిమిబంగారముతో సిద్ధపఱచబడిన కిటికీలుగలదియునైన ఆ మహా విమానమును వాయుసుతుడైన మహావీరుడగు ఆ హనుమంతుడు జూచెను. (1)

తదప్రమేయాఽప్రతికారకృత్రిమం
కృతం స్వయం సాధ్వితి విశ్వకర్మణా ।
దివం గతం వాయుపథప్రతిష్ఠితం
వ్యరాజతాఽఽదిత్యపథస్య లక్ష్మవత్ ॥ 2

లోకము "బాగు, బాగు" అని మెచ్చుకొనునట్లుగా ఆ విమానమును విశ్వకర్మ స్వయముగా నిర్మించెను. దాని నిర్మాణము సాటిలేనిది, ఊహలకందనిది. ఆకాశమున ఉన్నట్టిది, అంతరిక్షమునవెలకొని, అంతటను అప్రతిహత (తిరుగులేని) సంచారము గలది. అట్టి ఆ విమానము సూర్యమార్గమునకు సూచికయా అనునట్లుగా విరాజిల్లు చుండెను. (2)

న తత్ర కించిన్న కృతం ప్రయత్నతో
న తత్ర కించిన్న మహార్హరత్నవత్ ।
న తే విశేషా నియతాస్సురేష్వపి
న తత్ర కించిన్న మహావిశేషవత్ ॥ 3

అచట ప్రయత్నపూర్వకముగా చక్కగా నిర్మింపబడనిదేదియును లేదు. మేలుజాతి రత్నములచే పొదగబడనిదేదియును లేదు. ఆ విమానమునందలి విచిత్ర విశేషములు దేవతా భవనములయందును కనబడవు. ఇంతయేల? అందులేని విశేషముగాని, చెక్కబడని శిల్పములుగాని లేనేలేవు. (3)

తపస్సమాధానపరాక్రమార్జితం
మనస్సమాధానవిచారచారిణమ్ ।
అనేకసంస్థానవిశేషనిర్మితం
తతస్తతస్తుల్యవిశేషదర్శనమ్ ॥ 4

మనస్సమాధాయ తు శీఘ్రగామినం
దురావరం మారుతతుల్యగామినమ్ ।
మహాత్మనాం పుణ్యకృతాం మహర్ధినాం
యశస్వినామగ్ర్యముదామివాలయమ్ ॥ 5

విశేషమాలంబ్య విశేషసంస్థితం
విచిత్రకూటం బహుకూటమండితమ్ ।
మనోఽభిరామం శరదిందునిర్మలం
విచిత్రకూటం శిఖరం గిరేర్యథా ॥ 6

వహంతి యం కుండలశోభితాననా:
మహాశనా వ్యోమచరా నిశాచరా: ।
వివృత్తవిధ్వస్తవిశాలలోచనా:
మహాజవా భూతగణాస్సహస్రశ: ॥ 7

వసంతపుష్పోత్కరచారుదర్శనం
వసంతమాసాదపి కాంతదర్శనమ్ ।
స పుష్పకం తత్ర విమానముత్తమం
దదర్శ తద్వానరవీరసత్తమ: ॥ 8

ఆ విమానము మహాతపశ్శౌర్యచేతను, పరాక్రమము చేతను సంపాదింపబడినది, అందు ఆసీనులైనవారి ఆలోచనలను అనుసరించి అది సంచరించును. అందలి వివిధ (సభాభవనములు, భోజనశాలలు, వినోదమందిరములు, గోపురములు మొదలగు) భాగములు నేర్పైనపనితనములతో విలసిల్లుచున్నవి. అన్ని ప్రదేశములలోను శిల్పనిర్మాణ వైశిష్ట్యము ఆ విమానమునకు తగినట్లుగను, సమానముగను ఉన్నది. (4)

ఆ విమానము యజమాని మనస్సునెఱింగి వేగముగా సంచరించునది, దానిగమనము శత్రువులకును నివారింప శక్యముగానిది, వాయువేగముతో సాగిపోగలది, మహాత్ముల, పుణ్యాత్ముల, తేజస్సంపన్నుల, సుప్రసిద్ధుల భవనముల వలెను, ఇంద్రాదిదేవతలకు ఆవాసమైన స్వర్గమువలెను సుఖసంతోషదాయకమైనది. (5)

పలువిశిష్టశిల్పరీతులను అవలంబించుటచే ఆ పుష్పకము యొక్క ఆకారము ఉదాత్తముగానున్నది. చిత్రవిచిత్రములైన అనేకశిఖరములతో అలంకృతమైనది. శరత్కాలచంద్రునివలె నిర్మలమై స్వాంతములకు ఆహ్లాదమును గూర్చునది. అది గిరిశిఖరమువలె ఉపశిఖరశోభితమైనది. (6)

కర్ణకుండలములతో శోభించుచున్న ముఖములుగల వారును, మహాకాయులును, ఆకాశమునసంచరించెడి రాక్షసులును, తమప్రభువునకు అనుకూలముగా ప్రవర్తించువారును,[1] విశాలములైన నేత్రములుగలవారును, అతివేగముగా సంచరింపగలవారును ఐన వేలకొలది భూతగణములవారు ఆ విమానమును మోయుచున్నట్లు దాని వెలుపలిభాగమున శిల్పములు చెక్కబడియుండెను. (7)

అది వసంతఋతువునందలి పుష్పరాశివలె మాడముచ్చటగా నున్నది. వసంతమాసముకంటెను మనోహరమై, దర్శనీయముగా నున్నది. అట్టి శ్రేష్ఠమైన విమానమును ఆ వానరవీరవరేణ్యుడు చూచెను. (8)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే అష్టమస్సర్గ: *(8)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన, శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఎనిమిదవసర్గము.

1. *వివృత్త విధ్వస్త విశాల లోచనా: - గోవిందరాజీయ వ్యాఖ్యాధారము-పుట 30 బొంబాయివారి-నాగరలిపి ప్రతి - వి-విరుద్ధం-స్వామి కార్యవిరుద్ధం, వృత్తం-చరితం, విధ్వస్తం యేషాం తే తథా! తే చ తే విశాలలోచనాశ్చేతి తథా-*
వివృత్తాని వర్తులాని విధ్వస్తాని భుగ్నాని లోచనాని యేషాం తే తథా-
మహాజనా: మహాజన ఇవ స్థితా:-

9. తొమ్మిదవసర్గము

హనుమంతుడు రావణాంతఃపురమును పరిశీలించుట

తస్యాలయవరిష్ఠస్య మధ్యే విపులమాయతమ్ ।
దదర్శ భవనశ్రేష్ఠం హనుమాన్ మారుతాత్మజః । 1

అర్ధయోజనవిస్తీర్ణమాయతం యోజనం మహత్ ।
భవనం రాక్షసేంద్రస్య బహుప్రాసాదసంకులమ్ । 2

మార్గమాణస్తు వైదేహీం సీతామాయతలోచనామ్ ।
సర్వతః పరిచక్రామ హనూమానరిసూదనః । 3

ఉత్తమం రాక్షసావాసం హనుమానవలోకయన్ ।
ఆససాదాథ లక్ష్మీవాన్ రాక్షసేంద్రనివేశనమ్ । 4

చతుర్విషాణై ర్ద్విరదైః త్రివిషాణై స్తథైవ చ ।
పరిక్షిప్తమసంబాధం రక్ష్యమాణముదాయుధైః । 5

రాక్షసీభిశ్చ పత్నీభీ రావణస్య నివేశనమ్ ।
ఆహృతాభిశ్చ విక్రమ్య రాజకన్యాభిరావృతమ్ । 6

తన్నక్రమకరాకీర్ణం తిమింగిలఝషాకులమ్ ।
వాయువేగసమాధూతం పన్నగైరివ సాగరమ్ । 7

యా హి వైశ్రవణే లక్ష్మీః యా చేంద్రే హరివాహనే ।
సా రావణగృహే సర్వా నిత్యమేవానపాయినీ । 8

యా చ రాజ్ఞః కుబేరస్య యమస్య వరుణస్య చ ।
తాదృశీ తద్విశిష్టా వా ఋద్ధీ రక్షోగృహేష్విహ । 9

శ్రేష్ఠమైన ఆ పుష్పకవిమానములోపల శోభిల్లెడి విశాలమైన ఒక మహా భవనమును వాయుసుతుడైన హనుమంతుడు దర్శించెను. (1)

రావణుని ఆ మహాభవనము చుట్టును అనేకప్రాసాదములు గలవు. ఆ భవనము అర్ధయోజనము వెడల్పునను, ఒక యోజనము పొడవునను విస్తరించియుండెను. (2)

శత్రుసంహారసమర్థుడైన హనుమంతుడు విదేహప్రభు సుతయు, విశాలములైన నేత్రములుగలదియు అగు సీతాదేవిని వెదకుచు ఆ భవనమును కలయజూచెను.(3)

సర్వశుభలక్షణములుగల ఆ హనుమంతుడు రాక్షసుల నిలయములను పరికించుచు సర్వోత్తమమైన ఆ రావణుని ప్రాసాదమును జేరెను. (4)

విశాలమైన ఆభవనము రెండేసి, మూడేసి, నాల్గేసి దంతములుగల మత్తగజములచేతను, ఆయుధములను చేతబట్టి సర్వసన్నద్ధులైయున్న రాక్షసులచేతను పరివేష్టింపబడి వారిచే అది సురక్షితముగా ఉండెను. (5)

ఆ మహాప్రాసాదము రాక్షసస్త్రీలైన రావణపత్నులతోను, ఇంకను అతడు పరాక్రమముచే బలవంతముగా తీసికొనివచ్చిన రాజకన్యలతోను నిండియుండెను. (6)

ఆ మహాప్రాసాదము మొసళ్లతోడను, ప్రమాదకరములైన మత్స్యములతోడను, వీటినన్నింటిని హతమార్చి మ్రింగివేయగల తిమింగలములతోడను, చేపలతోడను, విషసర్పముల తోడను, పెనుగాలులచే ఆకాశమునంటు చున్న ఉవ్వెత్తు తరంగములతోడను వ్యాప్తమైన మహాసాగరమువలెనుండెను.(7)

ధనపతియైన కుబేరభవనమునందలి సంపద్వైభవములు, ఉచ్చైశ్రవము (దివ్యాశ్వము) వాహనముగాగల ఇంద్రుని ఐశ్వర్యములశోభలు, రావణమహాభవనమునందు చిరస్థిరముగా తేజరిల్లుచుండెను. (8)

రావణునియొక్క, పుత్రుల, సోదరుల, మంత్రుల గృహముల యందలి సంపద్వైభవములు యక్షరాజైన కుబేరునియొక్క, యమునియొక్క, వరుణునియొక్క సమృద్ధములైనసంపదలతో సమానములు- అని అనుటకంటెను, వాటికంటెను గొప్పవిఅని పేర్కొనుటయే సముచితము. (9)

తస్య హర్మ్యస్య మధ్యస్థం వేశ్మ చాన్యత్ సునిర్మితమ్।
బహునిర్యూహసంకీర్ణం దదర్శ పవనాత్మజః। 10

ఆ మహాప్రాసాదమధ్యభాగమున ఒక విచిత్రభవనము గలదు. అది మత్తవారణప్రతిమలతో, అద్భుతముగా నిర్మింపబడియుండెను. దానిని ఆ మారుతి వీక్షించెను. (10)

బ్రహ్మణోఽర్థే కృతం దివ్యం దివి యద్విశ్వకర్మణా।
విమానం పుష్పకం నామ సర్వరత్నవిభూషితమ్। 11

విశ్వకర్మ బ్రహ్మదేవునికొఱకై 'పుష్పకము' అను పేరుగల ఒక దివ్యవిమానమును సర్వవిధములైన రత్నములతో 'దివి'యందు స్వయముగా నిర్మించియిచ్చెను. (11)

పరేణ తపసా లేభే యత్ కుబేరః పితామహాత్।
కుబేరమోజసా జిత్వా లేభే తద్రాక్షసేశ్వరః। 12

కుబేరుడు తీవ్రమైనతపస్సొనర్చి బ్రహ్మదేవుని అనుగ్రహముతో దానిని (పుష్పకమును)కానుకగా పొందెను. రావణుడు తనపరాక్రమముచే కుబేరుని జయించి, ఆ పుష్పకమును తనవశము చేసికొనెను. (12)

ఈహామృగసమాయుక్తైః కార్తస్వరహిరణ్మయైః।
సుకృతైరాచితం స్తంభైః ప్రదీప్తమివ చ శ్రియా। 13

మేరుమందరసంకాశైః ఉల్లిఖద్భిరివాంబరమ్।
కూటాగారైశ్శుభాకారైః సర్వతస్సమలంకృతమ్। 14

ఆ పుష్పకమునందలిస్తంభములు వెండి బంగారములతో నిర్మింపబడియుండెను. వాటిపై క్రీడామృగములబొమ్మలు చక్కగా చిత్రింపబడెను. ఇంకను అవి అంతటను వెలుగులనువిరజిమ్ముచు కనువిందుగావించు ఆకారములతో ఒప్పుచుండెను. వాటి శిఖరములు ఆకాశమును తాకుచున్నవా యనునట్లు మహోన్నతములై మేరుమందరశిఖరములతో తుల్యములై విరాజిల్లుచుండెను. ఇంకను ఆ పుష్పకము అంతటను నేత్రపర్వముగావించు గుప్తగృహములతో అలరారు చుండెను. (13-14)

జ్వలనార్కప్రతీకాశం సుకృతం విశ్వకర్మణా।
హేమసోపానసంయుక్తం చారుప్రవరవేదికమ్। 15

అది విశ్వకర్మచే చక్కగానిర్మింపబడినది, అగ్నిజ్వాలలతో, సూర్యరశ్మితో సమానముగ వెలుగొందుచున్నది. బంగారుమెట్లతో విలసిల్లుచున్నది. అందలి వేదికలు చూడముచ్చటగానున్నవి. (15)

జాలవాతాయనైర్యుక్తం కాంచనైస్స్ఫాటికైరపి।
ఇంద్రనీలమహానీలమణిప్రవరవేదికమ్ । 16

ఆ పుష్పకముయొక్క కిటికీలును, గవాక్షములును బంగారములతోను, స్ఫటికములతోను నిర్మితములైనవి. అచటి ఉన్నతములైనవేదికలు అన్నియును, ఇంద్రనీలములతోను, సింహళద్వీపమునలభించు మహా నీలములతోను పొదుగబడినవి. (16)

విద్రుమేణ విచిత్రేణ మణిభిశ్చ మహాధనైః।
నిస్తులాభిశ్చ ముక్తాభిః తలేనాభివిరాజితమ్। 17

అందలి భూతలము (నేల) చిత్రవిచిత్రములైన పగడముల తోడను, అమూల్యములైనమణులతోడను, గుండ్రనిముత్యాలతోడను ఖచితమై, అద్భుతముగా విరాజిల్లుచుండెను. (17)

చందనేన చ రక్తేన తపనీయనిభేన చ।
సుపుణ్యగంధినా యుక్తమ్ ఆదిత్యతరుణోపమమ్। 18

సువాసనలతో గుబాళించుచున్న ఎఱ్ఱచందనముచే ఆహ్లాదకరముగానున్న ఆ పుష్పకము బంగారుకాంతులను విరజిమ్ముచు మధ్యాహ్నసమయమునందలి సూర్యునితో సమానముగా తేజరిల్లుచుండెను. (18)

కూటాగారైర్వరాకారైః వివిధైస్సమలంకృతమ్।
విమానం పుష్పకం దివ్యమ్ ఆరురోహ మహాకపిః। 19

వివిధములైన మధురాకృతులుగల గుప్తగృహములతో (కూటాగారములతో) ఆ పుష్పకవిమానము అలంకృతమైయుండెను. అట్టి దివ్యవిమానమును ఆ కపివరుడు అధిరోహించెను. (19)

తత్రస్థస్స తదా గంధం పానభక్ష్యాన్నసంభవమ్।
దివ్యం సమ్మూర్ఛితం జిఘ్రత్ రూపవంతమివానిలమ్। 20

అప్పుడు పానీయములనుండియు, తినుబండారములనుండియు, అన్నములనుండియు వచ్చుచు నైమఱపించు (ప్రాణతర్పణమొనర్చు) దివ్యగంధము సర్వత్రవ్యాపించెను. ఆ వాసన నాసాపుటములకు తాకగనే వాయుదేవుడే ఆకృతిదాల్చి, ఈ పరిమళరూపమున వచ్చినాడాయని హనుమంతుడు భావించెను. (20)

స గంధస్తం మహాసత్త్వం బంధుర్బంధుమివోత్తమమ్।
ఇత ఏహీత్యువాచేవ తత్ర యత్ర స రావణః। 21

ఒక బంధువు తనఆప్తబంధువును పిలిచినట్లుగా ఆ సువాసన (వాయువు) మిక్కిలి సత్త్వసంపన్నుడైన హనుమంతుని "ఇటు రమ్ము, ఇటు రమ్ము" అని- రావణుడున్న స్థలమునకు పిలుచుచున్నదా? అన్నట్లు ఒప్పుచుండెను. (21)

తతస్తాం ప్రస్థితశ్శాలాం దదర్శ మహతీం శుభామ్।
రావణస్య మనఃకాంతాం కాంతామివ వరస్త్రియమ్। 22

అనంతరము ముందునకుసాగుచున్న ఆ హనుమంతుడు శుభాకృతిగల ఒక విశాలమైన శాలనుగాంచెను. కాంత తన కాంతునకు ప్రియమైనట్లు అది మనోహరమైన సర్వాంగసుందరి వలె రావణునకు అత్యంత ప్రియమైనది. (22)

మణిసోపానవికృతాం హేమజాలవిభూషితామ్।
స్ఫాటికైరావృతతలాం దంతాంతరితరూపికామ్। 23

ఆశాలసోపానములకు మణులుతాపబడినవి, కిటికీలు బంగారముచేనిర్మింపబడినవి, అచటి భూతలము స్ఫటికములచే పొదుగబడినది, మఱియు దంత ఫలకములచే రూపొందింపబడినది. (23)

ముక్తాభిశ్చ ప్రవాళైశ్చ రూప్యచామీకరైరపి।
విభూషితాం మణిస్తంభైః సుబహుస్తంభభూషితామ్। 24

ఆశాలయందు అనేకమణిస్తంభములు నిర్మింపబడినవి. అవి వెండిబంగారములతో సమంచితములై కాంతులీనుచున్నవి. వాటిపై మంచి ముత్యములు, స్వచ్ఛప్రవాళములు అమర్చబడినవి. (24)

సమైః ఋజుభిరత్యుచ్చైః సమంతాత్ సువిభూషితైః।
స్తంభైః పక్షైరివాత్యుచ్చైః దివం సంప్రస్థితామివ। 25

అచటి స్తంభములు సమానములై, ఏమాత్రము వంకరలేనివై, అత్యున్నతములై, ఆమూలాగ్రము అలంకృతములై దర్శనీయములైయుండెను. పక్షములవలె ఎత్తైన స్తంభములతో అది విశాలమైన ఆకాశమునకు ఎగురుచున్నదా అనునట్లు విలసిల్లుచుండెను. (25)

మహత్యా కుథయాస్తీర్ణాం పృథివీలక్షణాంకయా।
పృథివీమివ విస్తీర్ణాం సరాష్ట్రగృహమాలినీమ్। 26

అందు భూతలముపై పృథివీ (నదులు, సముద్రములు, గిరులు, వనాది) లక్షణములుగల విశాలమై చిత్రమైన రత్నకంబళము పఱచబడియుండెను. అందువలన అది రాష్ట్రములతోను, వరుసలుగట్టిన గృహములతోను అలరారుచున్నట్టి విపులధరాతలమువలె తోచుచుండెను. (26)

నాదితాం మత్తవిహగైః దివ్యగంధాధివాసితామ్।
పరార్ధ్యాస్తరణోపేతాం రక్షోఽధిపనిషేవితామ్। 27

అది మిక్కిలిమత్తిల్లిన (పరవశించిన) పక్షుల కలకలములచే మాఱుమ్రోగుచుండెను. దివ్యములైన పరిమళములతో సువాసితమైయుండెను. సర్వోత్తమములైన ఆస్తరణములతో అలరారుచుండెను. అట్టి భవనమున రావణుడు నివసించు చుండెను. (27)

ధూమ్రామగరుధూపేన విమలాం హంసపాండురామ్।
చిత్రాం పుష్పోపహారేణ కల్మాషీమివ సుప్రభామ్। 28

అది స్వచ్ఛమై, హంసలవలె శ్వేతకాంతిశోభితము, అగరు ధూపముచే ధూమ్రవర్ణవిలసితము, పుష్పహారములచే చిత్రవర్ణ విరాజితము, చిత్రవిచిత్రవర్ణశోభితముం వసిష్ఠునిధేనువువలె[1] కోరికలను ఈడేర్చుచు విరాజిల్లుచుండెను. (28)

మనస్సంహ్లాదజననీం వర్ణస్యాపి ప్రసాదనీమ్।
తాం శోకనాశినీం దివ్యాం శ్రియస్సంజననీమివ। 29

అది మనస్సులకు చక్కనిఆహ్లాదమును గూర్చును. అచ్చటి వన్నెచిన్నెలు రంగులకే హంగులుగూర్చును. శోకములను పాఱద్రోలును, సర్వదివ్యసంపదలకు జనని యైన (నిలయమైన) ఆ శాలను హనుమంతుడు కాంచెను. (29)

ఇంద్రియాణీంద్రియార్థైస్తు పంచ పంచభిరుత్తమైః।
తర్పయామాస మాతేవ తదా రావణపాలితా। 30

ఇంద్రియార్థములద్వారా తల్లి సంతానముయొక్క పంచేంద్రియములను తృప్తిపఱచురీతిగా రావణుని పాలనలోని ఆశాల హనుమంతునకు మిక్కిలి సంతృప్తి గలిగించుచుండెను.(30)

స్వర్గోఽయం దేవలోకోఽయమ్ ఇంద్రస్యేయం పురీ భవేత్।
సిద్ధిర్వేయం పరా హి స్యాత్ ఇత్యమన్యత మారుతిః। 31

ఇది స్వర్గమా? ఇది ముప్పదిమూడుకోట్ల దేవతలకు నిలయమైన దేవలోకమా? ఇది ఇంద్రవైభవములకు నెలవైన అమరావతియా? దివ్యతపశ్శర్యలకు ఫలరూపమైన పరాసిద్ధియా? అని ఆశాలను జూచి. హనుమంతుడు తలపోసెను- (31)

ప్రధ్యాయత ఇవాపశ్యత్ ప్రదీపాంస్తత్ర కాంచనాన్।
ధూర్తానివ మహాధూర్తైః దేవనేన పరాజితాన్। 32

జూదమునందు ఆరితేఱినవారిచే ద్యూతక్రీడయందు ఓడింపబడి, దీర్ఘాలోచనలోపడిన (ధ్యానమగ్నులవలెనున్న) జూదరులవలె అచట బంగారుకాంతులతో నిశ్చలముగానున్న మణిస్తంభదీపములను మారుతిగాంచెను. (32)

దీపానాం చ ప్రకాశేన తేజసా రావణస్య చ।
అర్చిర్భిర్భూషణానాం చ ప్రదీప్తేత్యభ్యమన్యత। 33

దీపజ్వాలలతోడను రావణునితేజస్సుతోడను, ఆభరణముల ప్రకాశములతోడను నిండి, అది దేదీప్యమానమైనదని హనుమంతుడు తలంచెను. (33)

తతోఽపశ్యత్ కుథాసీనం నానావర్ణాంబరస్రజమ్।
సహస్రం వరనారీణాం నానావేషవిభూషితమ్। 34

నానావిధములైన వన్నెలు (రంగులు)గల వస్త్రములను, పూలమాలలను ధరించినవారును, వివిధములగు వేషభూషణములతో విరాజిల్లుచున్నవారును, కంబళములపై శయనించినవారును అగు వేలకొలది సుందరీమణులను అతడు గాంచెను. (34)

పరివృత్తేఽర్ధరాత్రే తు పాననిద్రావశంగతమ్।
క్రీడిత్వోపరతం రాత్రౌ సుష్వాప బలవత్తదా। 35

ఆ నారీమణులు అర్ధరాత్రివఱకు మద్యపానములతో, క్రీడావినోదములతో అలసిపోయి, నిద్ర క్రమ్ముకొనివచ్చు చుండగా తూలుచుండిరి. అనంతరము వారు గాఢమైన నిద్రలో మునిగిరి. (35)

1. వసిష్ఠమహర్షికామధేనువు అందఱి మనోరథములను తీర్చుచుండును. అట్లే శబల (కల్మాషీ) వర్ణశోభితమైన ఈ భవనము అందు నివసించువారి కోరికలను అన్నింటిని ఈడేర్చును.

తత్ప్రసుప్తం విరురుచే నిశ్శబ్దాంతరభూషణమ్।
నిశ్శబ్దహంసభ్రమరం యథా పద్మవనం మహత్। 36

నిద్రాముద్రితలైన వారి ఆభరణములు నిశ్చలముగా నున్నందున అచట నిశ్శబ్దము తాండవించుచుండెను. కదలకమెదలకయున్న హంసలతో, తుమ్మెదలతోగూడిన మహాపద్మసరస్సువలె ఆ దృశ్యము ఒప్పుచుండెను. (36)

తాసాం సంవృతదంతాని మీలితాక్షీణి మారుతిః।
అపశ్యత్పద్మగంధీని వదనాని సుయోషితామ్। 37

నిదురించుచున్న అచక్కని వనితలదంతములను వారిపెదవులు కప్పివేసెను. వారి నేత్రములు మూసికొని యుండెను. ముఖములు పద్మములసువాసనలను విరజిమ్ముచుండెను. అట్టి స్త్రీలను హనుమంతుడు గాంచెను. (37)

ప్రబుద్ధానీవ పద్మాని తాసాం భూత్వా క్షపాక్షయే।
పునస్సంవృతపత్రాణి రాత్రావివ బభుస్తదా। 38

"ఆరాక్షసస్త్రీలముఖములు పగటిపూట వికసించిన పద్మములవలెనుండి, రాత్రియందు మాత్రము ముకుళించుకొనిన కమలములరీతి ఒప్పాఋచుండెను. (38)

ఇమాని ముఖపద్మాని నియతం మత్తషట్పదాః।
అంబుజానీవ ఫుల్లాని ప్రార్థయంతి పునః పునః। 39

ఆస్త్రీలముఖపద్మములను జూచి, మదించిన తుమ్మెదలు నిజముగనే అవి బాగుగావికసించిన పద్మములని విశ్వసించి. రసాస్వాదనకై మఱలమఱల అభిలాషపడుచుండెను." (39)

ఇతి చామన్యత శ్రీమాన్ ఉపపత్త్యా మహాకపిః।
మేనే హి గుణతస్తాని సమాని సలిలోద్భవైః। 40

సర్వశుభలక్షణములతో ఒప్పుచున్న ఆ కపివరుడు ఇట్లు యుక్తియుక్తముగా ఆలోచించి, సౌరభాది గుణములనుబట్టి అవి (ఆ ముఖములు) జలజసదృశములని తలంచెను. తటస్థ భావముగల హనుమంతుడు ఆ స్త్రీలను పద్మములనియే భావించెను. (40)

సా తస్య శుశుభే శాలా తాభిః స్త్రీభిర్విరాజితా।
శారదీవ ప్రసన్నా ద్యౌః తారాభిరభిశోభితా। 41

అట్టి భామినులచే తేజరిల్లుచున్న ఆ రావణభవనశాల తారకలచే మిక్కిలి శోభిల్లుచున్న శరత్కాలమునందలి నిర్మలాకాశమువలె విరాజిల్లుచుండెను. (41)

స చ తాభిః పరివృతః శుశుభే రాక్షసాధిపః।
యథా హ్యుడుపతిశ్శ్రీమాన్ తారాభిరభిసంవృతః। 42

తరుణీమణులచే పరివేష్టితుడైన ఆ రావణుడు తారలచే పరివృతుడైన కళానిధియగు చంద్రునివలె తేజరిల్లుచుండెను. (42)

యాశ్చ్యవంతేఽంబరాత్తారాః పుణ్యశేషసమావృతాః।
ఇమాస్తాస్సంగతాః కృత్స్నా ఇతి మేనే హరిస్తదా। 43

'మిగిలియున్న పుణ్యవిశేషముగల తారలన్నియును అంబరము నుండి అవనిపై రాలుచుండును. ఆ తారలు అన్నియును ఈ వనితారత్నములుగా రూపుదాల్చియుండును'- అని హనుమంతుడు అప్పుడు తలపోసెను. (ఈ స్త్రీలందఱును ఆతారలవలె వెలుగొందుచున్నారని భావము-) (43)

తారాణామివ సువ్యక్తం మహతీనాం శుభార్చిషామ్।
ప్రభావర్ణప్రసాదాశ్చ విరేజుస్తత్ర యోషితామ్। 44

రాత్రులయందు నిర్మలాకాశమున నక్షత్రముల ప్రభలు. వన్నెలు, స్వచ్ఛముగా చక్కగా ప్రకటితములగుచుండును. అదేవిధముగా ఈనారీమణుల దేహకాంతులు, రూపములు, ప్రసన్నముగా స్పష్టముగా వ్యక్తమగుచుండెను. (44)

వ్యావృత్తగురుపీనస్రక్ప్రకీర్ణవరభూషణాః ।
పానవ్యాయామకాలేషు నిద్రాపహృతచేతసః । 45

మద్యపానసమయమునను, రతిక్రీడాసమయమునందును ఆయువతులయొక్క పెద్దవియైన లావైన పూలమాలలు తారుమారైనవి. వారిఆభరణములన్నియు అటునిటు చెదరియున్నవి. క్రమముగావారు అలసిసొలసి నిద్రలోమునుంగుటచే మనోవ్యాపారములన్నియును ఆగిపోయినవి (45)

వ్యావృత్తతిలకాః కాశ్చిత్ కాశ్చిదుద్భ్రాంతనూపురాః ।
పార్శ్వే గళితహారాశ్చ కాశ్చిత్ పరమయోషితః । 46

అచట ఉత్తమస్త్రీలు గలరు. వారిలో కొందఱితిలకములు చెదరినవి, కొంతమంది వనితల అందెలస్థానములు తప్పినవి. కొందఱి కంఠహారములు ప్రక్కకు జాఱినవి. (46)

ముక్తాహారాఽఽవృతాశ్చాన్యాః కాశ్చిద్విస్రస్తవాససః ।
వ్యావిద్ధరశనాదామాః కిశోర్య ఇవ వాహితాః । 47

కొందఱి ముత్యాలహారములు ఛిన్నములై మీదబడి యున్నవి. కొందఱివస్త్రములు జాఱి (తొలగి)యున్నవి. కొందఱి మొలనూలు ఆభరణములు ఛిన్నములైయున్నవి. మార్గాయాసముతొలగుటకొఱకై భూమిపై అటునిటు పొరలాడుచున్న ఆడుగుఱ్ఱపుపిల్లలవలె ఆ యువతీమణులు తమశ్రమనివారణకై అటునిటు పొరలుచుండిరి. (47)

సుకుండలధరాశ్చాన్యా విచ్ఛిన్నమృదితస్రజః ।
గజేంద్రమృదితాః ఫుల్లా లతా ఇవ మహావనే । 48

అందమైన కుండలములను ధరించియున్న కొందఱు తరుణీమణుల పూలమాలలు తెగి, నలిగిపోయియుండెను. వారు మహావనమునందు బాగుగా వికసించి, గజరాజుతుండము తాకిడిచే నలిగినలతలవలె ఒప్పుచుండిరి. (48)

చంద్రాంశుకిరణాభాశ్చ హారాః కాసాంచిదుత్కటాః ।
హంసా ఇవ బభుస్సుప్తాః స్తనమధ్యేషు యోషితామ్ । 49

కొంతమందికాంతల వక్షస్స్థలములపై మిలమిలలాడుచున్న హారములు చంద్రసూర్యకిరణతుల్యములై భాసిల్లుచుండెను. అవి నిద్రించుచున్న శ్రేష్ఠహంసలవలె ఒప్పుచుండెను.(49)

అపరాసాం చ వైడూర్యాః కాదంబా ఇవ పక్షిణః ।
హేమసూత్రాణి చాన్యాసాం చక్రవాకా ఇవాభవన్ । 50

కొంతమందికాంతల వైడూర్యమణిహారములు కలహంసలా యుననట్లును, మఱికొందఱి (తరుణీమణుల) బంగారు సూత్రములు చక్రవాకములాయుననట్లుగను అలరారుచుండెను. (50)

హంసకారండవాకీర్ణాః చక్రవాకోపశోభితాః ।
ఆపగా ఇవ తా రేజుః జఘనైః పులినైరివ । 51

ఇసుకతిన్నెలవంటిపిఱుదులుగల ఆ స్త్రీలు హంసలతోను, కారండవపక్షుల (కన్నెలేడి పిట్టల)తోడను చక్రవాకముల తోడను వ్యాప్తములై శోభిల్లుచున్ననదులవలె ఒప్పుచుండిరి. (51)

కింకిణీజాలసంకోశాః తా హైమవిపులాంబుజాః ।
భావగ్రాహా యశస్తీరాః సుప్తా నద్య ఇవాఽఽబభుః । 52

చిఱుగజ్జెలే మొగ్గలుగా, బంగారుఆభరణములే పెద్ద కమలములుగా, శృంగారభావములే (నిద్రావస్థయందు వాసనాప్రభావముచే ప్రకటితములగు శృంగారచేష్టలే) మొసళ్లుగా, కీర్తులే తీరములుగాగలిగి ఆ స్త్రీలు నదులవలె భాసిల్లుచుండిరి. (52)

మృదుష్వంగేషు కాసాంచిత్ కుచాగ్రేషు చ సంస్థితాః।
బభూవుర్భూషణానీవ శుభా భూషణరాజయః। 53

అంశుకాంతాశ్చ కాసాంచిత్ ముఖమారుతకంపితాః।
ఉపర్యుపరి వక్త్రాణాం వ్యాధూయంతే పునః పునః। 54

తాః పతాకా ఇవోద్ధూతాః పత్నీనాం రుచిరప్రభాః।
నానావర్ణసువర్ణానాం వక్త్రమూలేషు రేజిరే। 55

వవల్గుశ్చాత్ర కాసాంచిత్ కుండలాని శుభార్చిషామ్।
ముఖమారుతసంసర్గాత్ మందం మందం సుయోషితామ్। 56

శర్కరాసవగంధైశ్చ ప్రకృత్యా సురభిస్సుఖః।
తాసాం వదననిశ్వాసః సిషేవే రావణం తదా। 57

రావణాననశంకాశ్చ కాశ్చిద్రావణయోషితః।
ముఖాని స్మ సపత్నీనామ్ ఉపాజిఘ్రన్ పునః పునః। 58

అత్యర్థం సక్తమనసో రావణే తా వరస్త్రియః।
అస్వతంత్రాస్సపత్నీనాం ప్రియమేవాఽఽచరంస్తదా। 59

బాహూనుపనిధాయాన్యాః పారిహార్యవిభూషితాన్।
అంశుకాని చ రమ్యాణి ప్రమదాస్తత్ర శిశ్యిరే। 60

అన్యా వక్షసి చాన్యస్యాః తస్యాః కాశ్చిత్ పునర్భుజమ్।
అపరా త్వంకమన్యస్యాః తస్యా శ్చాప్యపరా భుజౌ। 61

ఊరుపార్శ్వకటీపృష్ఠమ్ అన్యోఽన్యస్య సమాశ్రితాః।
పరస్పరనివిష్టాంగ్యో మదస్నేహవశానుగాః। 62

కొంతమంది తరుణీమణులయొక్క సుకుమారములైన అవయవములయందును, స్తనములపైభాగముల యందును బాగుగా ఏర్పడియున్న భూషణముల చక్కనిగుర్తులు (ఆస్త్రీలు ధరించిన) ఆభరణములేయనునట్లుగా విరాజిల్లు చుండెను. (ఆ స్త్రీలు ఆభరణములను ధరింపకయున్నను ఆ రేఖలవలన వాటిని ధరించియున్నట్లుగానే వారు విరాజిల్లు చుండిరనుట)- (53)

కొందఱు స్త్రీలు ముఖములపై తమ చీరెలకొంగులను కప్పుకొనియుండిరి. వారి ఉచ్ఛ్వాసనిఃశ్వాసములకు ఆ వస్త్రాంచలములు పదేపదే రెపరెపలాడుచుండెను. (54)

నానావిధములైనవన్నెచిన్నెలతో శోభిల్లుచున్న రావణ కాంతల యొక్క ముఖములపై మనోజ్ఞములైన ప్రభలుగల చీరెలచెఱగులు ఎగురవేయబడిన పతాకములవలె శోభిల్లుచుండెను. (55)

మనోహరమైన వర్చస్సులతో ఒప్పుచున్న కొందఱుస్త్రీల కుండలములు వారి ముఖవాయుస్పర్శల ప్రభావమున తిన్నతిన్నగా కదలుచుండెను. (56)

సహజముగనే సువాసనాభరితములై సుఖకరములైన వారినిఃశ్వాసములు మధురిములైనమద్యముల గుబాళింపులతో రావణునిసేవించెను. (57)

కొందఱు రావణపత్నులు రావణునిముఖమను భావనతో తమప్రక్కనగల సవతులముఖములను పదేపదే మూర్కొనిరి. (ముద్దిడిరి). (58)

రావణునియందే అత్యాసక్తములైన మనస్సులుగల తరుణీమణులు మధుపానపరవశలై, (రావణుడే తమను ముద్దాడుచున్నట్లు తలంచి), వారును సపత్నులకు సంతసమును గూర్చుచుండిరి. (59)

కొందఱుమదవతులు కంకణాలంకృతములైన బాహువులను, మఱికొందఱు రమ్యములైన వస్త్రములను తలగడలుగా జేసికొని అచట శయనించిరి. (60)

ఒక తరుణి మఱియొకయువతి వక్షఃస్థలముపై శిరముంచి శయనించెను. ఆమెభుజమును మఱియొకభామిని తలగడగా జేసికొని నిద్రించెను. ఒక తన్వి మఱియొకసుందరియొడిలో తలపెట్టుకొని నిద్రపోయెను. ఇంకొక జవ్వని మఱియొక లావణ్యవతి యొక్కభుజములపై తలనిడుకొని నిదురలో మునిగెను. (61)

యౌవనమదమునకును, ప్రేమానురాగములకును లోనైన ఆ కాంతలందఱును పరస్పరము తొడలను, పార్శ్వములను, కటిప్రదేశములను, వీపులను ఆశ్రయించి, ఒండొరులపై అవయములను పడవేసికొని నిదురించిరి. (62)

అన్యోన్యభుజసూత్రేణ స్త్రీమాలా గ్రథితా హి సా।
మాలేవ గ్రథితా సూత్రే శుశుభే మత్తషట్పదా॥ 63

కొందఱు తరుణీమణులు వరుసగా భుజములనుచాచి పండుకొనియుండుటచే అది 'స్త్రీమాల'గా గోచరించు చుండెను. మాలవలెనున్న ఆ భుజసూత్రమున తుమ్మెదలవలె కేశపాశములు నిగనిగలాడుచుండెను. (63)

లతానాం మాధవే మాసి ఫుల్లానాం వాయుసేవనాత్।
అన్యోఽన్యమాలాగ్రథితం సంసక్తకుసుమోచ్చయమ్॥ 64

వ్యతివేష్టిత సుస్కంధమ్ అన్యోఽన్యభ్రమరాకులమ్।
ఆసీద్వనమివోద్ధూతం స్త్రీవనం రావణస్య తత్॥ 65

రావణుని స్త్రీలసముదాయము (స్త్రీవనము) ఒక లతావనమువలె భాసిల్లుచుండెను. వసంతఋతువునందు చల్లనిగాలులు సోకుటచే వికసించినపూవులతో లతావనము శోభిల్లుచుండును. అట్లే మధుపరిమళభరితములైన ముఖ మారుతములచే ఆనందతరంగితమైనది ఆ స్త్రీవనము. వరుసగానున్న పుష్పపంక్తులచే అన్యోఽన్యముగ్రథితమైనది లతావనము. స్త్రీవనము పరస్పరము పెనవైచుకొనిన భుజపంక్తులతో ఒప్పుచున్నది. ప్రక్కప్రక్కనే ఒరసికొనియున్న పుష్పములతో విలసిల్లుచున్నది లతావనము. వనితలుధరించిన పూలమాలలు ఒకదానితోనొకటి కలిసియుండుటచే పుష్ప శోభలతో భాసిల్లుచున్నది స్త్రీవనము. లతలచే పరివృతములైన స్కంధములతో అలరారుచున్నది లతావనము. భుజములు పరస్పరము చుట్టుకొని వనశోభలను స్ఫురింపజేయుచున్నది స్త్రీవనము. అన్యోన్యముగా చేరియున్న భ్రమరములతో రాజిల్లుచున్నది లతావనము. పరస్పరము కలిసియున్న ముంగురుల మధుపాళితో తేజరిల్లుచున్నది స్త్రీవనము.(64-65)

ఉచితేష్వపి సువ్యక్తం న తాసాం యోషితాం తదా।
వివేకశ్శక్య ఆధాతుం భూషణాంగాంబరస్రజామ్॥ 66

ఆ సమయమున అచటి స్త్రీలయొక్క ఆభరణములు, అవయవములు, వస్త్రములు, పూలమాలలు ఉచితస్థానముల యందే విలసిల్లుచున్నను, వారు సమ్మర్దముగా పరుండి యున్నందున అవి ఏవి ఎవరివో వింగడించి, స్పష్టముగా వివరించుటకు ఎవ్వరికిని శక్యముగాకుండెను. (66)

రావణే సుఖసంవిష్టే తాః స్త్రియో వివిధప్రభాః।
జ్వలంతః కాంచనా దీపాః ప్రైక్షంతాఽనిమిషా ఇవ॥ 67

రావణుడు గాఢనిద్రలోనుండగా ప్రజ్వలించుచున్న కాంచనస్తంభదీపములు పలువన్నెచిన్నెలతో రాజిల్లుచున్న ఆ రావణకాంతలను ఱెప్పపాటులేనివై (దేవతలవలె) చూచుచున్నవాయనునట్లు ఒప్పుచుండెను. (రావణుడు మేల్కొనియుండగా ఆయనకాంతలను ఎవ్వరును కన్నెత్తియైనను చూడలేరు-అనిభావము). (67)

రాజర్షిపితృదైత్యానాం గంధర్వాణాం చ యోషితః।
రాక్షసానాం చ యాః కన్యాః తస్య కామవశం గతాః॥ 68

రాజర్షుల, పితృదేవతల, దైత్యుల, గంధర్వుల కాంతలును, రాక్షసకన్యలును రావణునియెడగల మోహముతో అచటికి వచ్చిచేరియుండిరి. (68)

యుద్ధకామేన తాస్సర్వా రావణేన హృతాః స్త్రియః।
సమదా మదనేనైవ మోహితాః కాశ్చిదాగతాః॥ 69

అచటి స్త్రీలందఱును యుద్ధకాంక్షగల రావణునిచే అపహరింపబడినవారే. కాని మఱికొందఱు జవ్వనులు మాత్రము కామాతురలై రావణునిమోహించి తమకు తాముగా వచ్చినవారు. (69)

న తత్ర కాచిత్ ప్రమదా ప్రసహ్య
వీర్యోపపన్నేన గుణేన లబ్ధా ।
న చాన్యకామాపి న చాన్యపూర్వా
వినా వరార్హాం జనకాత్మజాం తామ్ ॥ 70

మహాసాధ్వియైనజానకితప్ప వారిలో రావణుడు కామాతురుడై తన పరాక్రమమునుచూపి, బలవంతముగా తీసికొనివచ్చిన వనితఒక్కతెయును లేదు. వారు అందఱును అతనిగుణములచే ఆకర్షితలై అతనిని పొందినవారే. వారిలో వేఱొకపురుషుని ప్రేమించిన ప్రమదగాని, లేక వేఱొకనికిభార్యయైన భామినిగాని లేనేలేదు. (70)

న చాకులీనా న చ హీనరూపా
నాదక్షిణా నానుపచారయుక్తా ।
భార్యాఽభవత్ తస్య న హీనసత్త్వా
న చాపి కాంతస్య న కామనీయా ॥ 71

రావణునిభార్యలలో ఒక్కతెయు అకులీన (ఉత్తమవంశ సంజాతకానిది)లేదు. వికృతరూపముగలది లేనేలేదు. అసమర్థురాలు (నేర్పులేనిది) అసలేలేదు. సేవలకు అర్హురాలు కానిదియులేదు. బుద్ధిహీనయునులేదు. కాంతునకు మరులుగొల్పజాలనిదియులేదు. (అందఱునూ అన్నింటను యోగ్యతలు గలవారే). (71)

బభూవ బుద్ధిస్తు హరీశ్వరస్య
యదీదృశీ రాఘవధర్మపత్నీ ।
ఇమా యథా రాక్షసరాజభార్యాః
సుజాతమస్యేతి హి సాధుబుద్ధేః ॥ 72

రాక్షసరాజైన రావణునిభార్యలందఱును తమభర్తయైన రావణునితోగూడి సుఖముగానున్నరీతిగనే రాఘవధర్మపత్నియైన సీతాదేవియు తనభర్తయైన శ్రీరామునితోగూడి హాయిగాఉన్నచో ఇతనికి (రావణునకు) శుభమేకలుగును- (అనగా సీతాదేవిని అపహరింపకున్నను, లేదా ఆమెను శ్రీరామునకు అప్పగించినను రావణునకు మేలేజరుగును) అని బుద్ధిశాలియైన కపీశ్వరుని (హనుమంతుని) మనస్సునకు తట్టెను. (72)

పునశ్చ సోఽచింతయదార్తరూపో
ధ్రువం విశిష్టా గుణతో హి సీతా ।
అథాయమస్యాం కృతవాన్ మహాత్మా
లంకేశ్వరః కష్టమనార్యకర్మ ॥ 73

'సీతామాత ఉత్తమగుణసంపన్నురాలు. ఇది ముమ్మాటికిని నిజము. రావణుడు ఉత్తమవంశమున జన్మించినవాడు, లంకకు ప్రభువు, గొప్ప శివభక్తుడు, ఐనను అతడు తనవంశమునకును, తనప్రభుస్థాయికిని, తనదైవభక్తిరీతికిని తగనివిధముగా ఈమె విషయమున ఎంతయో అనుచితమైన కార్యమును చేసినాడు.[1] ఇది యెంతేని విచారకరము'- అని చింతించుచు హనుమంతుడు దుఃఖితుడాయెను. (73)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే నవమస్సర్గః *(9)*

వాల్మీకిమహర్షి విరచితమై, ఆదికావ్యమైన, శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది తొమ్మిదవసర్గము

-- ❋ ❋ ❋ --

1. పరమ శాంభవాగ్రేసరుండనను చు బల్కు, రావణుడు తెలియలేకపోయె. ॥ త్యాగరాజ ॥ (సంకీర్తనావళి)

10. పదవసర్గము

హనుమంతుడు గాఢనిద్రలోనున్న రావణుని, అతని భార్యలను చూచుట, మందోదరిని సీతగా భ్రమించి సంబరపడుట

తత్ర దివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నభూషితమ్।
అవేక్షమాణో హనుమాన్ దదర్శ శయనాసనమ్। 1

దాంతకాంచనచిత్రాంగైః వైడూర్యైశ్చ వరాసనైః।
మహార్హాస్తరణోపేతైః ఉపపన్నం మహాధనైః। 2

తస్య చైకతమే దేశే దివ్యమాలావిభూషితమ్।
దదర్శ పాండురం ఛత్రం తారాధిపతిసన్నిభమ్। 3

జాతరూపపరిక్షిప్తం చిత్రభానుసమప్రభమ్।
అశోకమాలావితతం దదర్శ పరమాసనమ్। 4

వాలవ్యజనహస్తాభిః వీజ్యమానం సమంతతః।
గంధైశ్చ వివిధైర్జుష్టం వరధూపేన ధూపితమ్। 5

పరమాస్తరణాస్తీర్ణమ్ ఆవికాజినసంవృతమ్।
దామభిర్వరమాల్యానాం సమంతాదుపశోభితమ్। 6

తస్మిన్ జీమూతసంకాశం ప్రదీప్తోత్తమకుండలమ్।
లోహితాక్షం మహాబాహుం మహారజతవాససమ్। 7

లోహితేనానులిప్తాంగం చందనేన సుగంధినా।
సంధ్యారక్తమివాకాశే తోయదం సతటిద్గణమ్। 8

వృతమాభరణైర్దివ్యైః సురూపం కామరూపిణమ్।
సవృక్షవనగుల్మాఢ్యం ప్రసుప్తమివ మందరమ్। 9

సీతాదేవిజాడకై అతినిశితముగా వెదకుచున్న హనుమంతుడు ఆ మహాభవనమునందు ఒక శయనాసనము (తల్పము)ను గాంచెను. అది స్ఫటికములతో రత్నములతో భూషితమై యుండెను. దంతపునగిషీలతోను, బంగారుచిత్రములతోడను అలరారుచు, వైడూర్య ఖచితములైన మేలైనఆసనములు అచటరాజిల్లుచుండెను, అమూల్యములైన అత్యుత్తమములైన ఆస్తరణములును విలసిల్లుచుండెను. అట్టి ఆసనములతోను, ఆస్తరణములతోను అది దేవలోకమునందలి శయనాసనమును తలపించుచుండెను. (1-2)

ఆ శయనాసనమునకు ఊర్ధ్వభాగమున దివ్యములైన మాలలతోఅలంకృతమై, చంద్రునివలె స్వచ్ఛములైన కాంతులతోవిరాజిల్లుచున్న ఒకఛత్రమును ఆమారుతి గాంచెను. (3)

బంగారముతో నిర్మితమైనది, సూర్యకిరణములతో సమానమైనకాంతులు గలది, అశోకపుష్పమాలికలచే వ్యాప్తమైనదియగు (ఆ ఆసనమును చూచినంతనే దుఃఖములు దూరమగును. మనఃప్రశాంతి గల్గును) పరమాసనము (తల్పము)ను జూచెను. (4)

అచట చామరములను చేతబట్టి అంతటను వాయు ప్రసారము జరుగునట్లు స్త్రీలు వీచుచుండిరి. అది వివిధ సుగంధభరితమైయుండెను. శ్రేష్ఠములైన ధూపములచే పరివ్యాప్తమైయుండెను. మేలైన ఆస్తరణములచే కప్పబడియుండెను. అత్యుత్తమములైన ఉన్నికంబళ్లతో విలసిల్లుచుండెను. సుగంధ పుష్పమాలికలతో అంతటను శోభిల్లుచుండెను. (5-6)

అట్లుభాసిల్లుచున్న తల్పముపై నిద్రించుచున్న వీరుడైన రావణుని ఆమహాకపి గాంచెను. అతడు నల్లని మేఘమువలె నుండెను. అతని కర్ణకుండలములు మెఱయుచుండెను. ఎఱ్ఱబాఱినకన్నులును, మహాబాహువులును గలిగియున్న అతడు బంగారు జరీ వస్త్రములను ధరించియుండెను. పరిమళభరితమైన ఎఱ్ఱ చందనము అతని శరీరముపై పూయబడియుండెను. ధగధగ మెఱయుచున్న దివ్యాభరణములచే భూషితుడై సుందరరూపియు, కామరూపియు ఐన అతడు ఆకాశమున సంధ్యారాగప్రభావితమై, మెఱపులచే

క్రీడిత్వోపరతం రాత్రౌ వరాభరణభూషితమ్।
ప్రియం రాక్షసకన్యానాం రాక్షసానాం సుఖావహమ్। 10

పీత్వాప్యుపరతం చాపి దదర్శ స మహాకపిః।
భాస్వరే శయనే వీరం ప్రసుప్తం రాక్షసాధిపమ్। 11

నిశ్శ్వసంతం యథా నాగం రావణం వానరర్షభః।
ఆసాద్య పరమోద్విగ్నః సోపాసర్పత్ సుభీతవత్। 12

అథారోహణమాసాద్య వేదికాంతరమాశ్రితః।
సుప్తం రాక్షసశార్దూలం ప్రేక్షతే స్మ మహాకపిః। 13

శుశుభే రాక్షసేంద్రస్య స్వపతశ్శయనోత్తమమ్।
గంధహస్తిని సంవిష్టే యథా ప్రస్రవణం మహత్। 14

కాంచనాంగదసన్నద్ధౌ దదర్శ స మహాత్మనః।
విక్షిప్తౌ రాక్షసేంద్రస్య భుజావింద్రధ్వజోపమౌ। 15

ఐరావతవిషాణాగ్రైః ఆపీడనకృతవ్రణౌ।
వజ్రోల్లిఖితపీనాంసౌ విష్ణుచక్రపరిక్షతౌ। 16

పీనౌ సమసుజాతాంసౌ సంగతౌ బలసంయుతౌ।
సులక్షణనఖాంగుష్ఠౌ స్వంగులీతలలక్షితౌ। 17

సంహతౌ పరిఘాకారౌ వృత్తౌ కరికరోపమౌ।
విక్షిప్తౌ శయనే శుభ్రే పంచశీర్షావివోరగౌ। 18

ఒప్పుచున్న మేఘమువలె తేజరిల్లుచుండెను. వృక్షవనములతోను, పొదలతోడను నిండిన మందరపర్వతమే నిద్రించుచున్నదా అనునట్లు అతడు నిశ్చలముగా ఒప్పుచుండెను. అమూల్యములైన ఆభరణములను దాల్చినవాడును, రాక్షసకన్యలకు ప్రీతిపాత్రుడును, రాక్షసులకు సుఖములనుగూర్చువాడును ఐన రావణుడు రాత్రివేళ మదిరాపానమొనర్చి, సురతక్రీడలు సలిపి, గాఢముగా నిదురించుచుండెను. అట్టివానిని హనుమంతుడు చూచెను. (7-11)

ఏనుగువలె గురకపెట్టుచున్న రావణుని సమీపించి, ఆ కపివరుడు మిక్కిలి ఉద్విగ్నుడై "ఛీ! ఇతడు పరస్త్రీని అపహరించి, తీసికొనివచ్చిన దుర్మార్గుడు. ఇతనికి దూరముగానుండుటయే ఉచితము- అని అనుకొనుచు పాపని చాలభయపడినవానివలె అతనికి దూరముగా వెళ్లెను.[1] (12)

అనంతరము ఆ మహాకపి సోపానమార్గమున మెట్టియొక వేదికను అధిష్ఠించి, గాఢనిద్రలోనున్న రావణుని చూడసాగెను.(13)

నిద్రించుచున్నరావణుని మహాతల్పము ఒక మదపుటేనుగు చేరిన సెలయేఱువలె ప్రకాశించెను. (గంధహస్తిని-అనగా తనమదగంధముచే ఇతర గజములను భయపెట్టునది. ఈ మదగజము సెలయేటిలో ప్రవేశింపగనే తక్కిన మగఏనుగులు భయపడి పాఱిపోవును. ఆడుఏనుగులు అచ్చటనే యుండును). (14)

బంగారుభుజకీర్తులుగలిగి, ఇంద్రధ్వజమువలె ఒప్పుచు, మహావీరుడగు రావణుని చాచబడియున్న రెండుబాహువులను ఆ హనుమంతుడు చూచెను. ఆ బాహువులపై ఐరావతము యొక్క కోఱలరాపిడికి ఏర్పడిన గాయములగుర్తులు కనబడుచుండెను. బలిష్ఠములైన ఆ భుజములు వజ్రాయుధము యొక్క తాకిడిమచ్చలను, ఉపేంద్రుని చక్రచిహ్నములను కలిగియుండెను. పుష్టిగలిగియున్న ఆ బాహువులు చక్కగా పొందికగానున్న భుజములతో బలోపేతములై ఉండెను. వాటి నఖములు, అంగుష్ఠములు, వ్రేళ్లు, అరచేతులు శుభలక్షణములు గలిగియుండెను. ఆబాహువులు దృఢమైన సంధిబంధములుగలిగి, ఇనుపగుదియలవలె ఒప్పుచుండెను. ఇంకను ఏనుగుతుండములవలె అవి గుండ్రముగానుండెను. స్వచ్ఛమైనతల్పముపై చాచబడి యున్న అవి ఐదుపడగలుగల

1) *శకటం పంచహస్తేషు, దశహస్తేషు వాజినమ్ । గజం సహస్రహస్తేషు, దుష్టం దూరేణ వర్జయేత్ ॥ నీతిశాస్త్రము*
శకటకమునకు (బండికి) ఐదుమూరలదూరముగా, గుఱ్ఱమునకు పదిమూరలదూరముగా, ఏనుగునకు వేయి మూరలదూరముగా, దుష్టునకు వీలైనంతఎక్కువదూరముగా ఉండవలెను.

శశక్షతజకల్పేన సుశీతేన సుగంధినా।
చందనేన పరార్ధ్యేన స్వనులిప్తౌ స్వలంకృతౌ। 19

ఉత్తమస్త్రీవిమృదితౌ గంధోత్తమనిషేవితౌ।
యక్షకిన్నరగంధర్వదేవదానవరావిణౌ। 20

దదర్శ స కపిస్తస్య బాహూ శయనసంస్థితౌ।
మందరస్యాంతరే సుప్తౌ మహాహీ రుషితావివ। 21

తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః।
శుశుభేఽచలసంకాశః శృంగాభ్యామివ మందరః। 22

చూతపున్నాగసురభిః వకులోత్తమసంయుతః।
మృష్టాన్నరససంయుక్తః పానగంధపురస్సరః। 23

తస్య రాక్షససింహస్య నిశ్చక్రామ మహాముఖాత్।
శయానస్య వినిశ్వాసః పూరయన్నివ తద్గృహమ్। 24

ముక్తామణివిచిత్రేణ కాంచనేన విరాజితమ్।
ముకుటేనాపవృత్తేన కుండలోజ్జ్వలితాననమ్। 25

రక్తచందనదిగ్ధేన తథా హారేణ శోభినా।
పీనాయతవిశాలేన వక్షసాఽభివిరాజితమ్। 26

పాండురేణాపవిద్ధేన క్షౌమేణ క్షతజేక్షణమ్।
మహార్హేణ సుసంవీతం పీతేనోత్తమవాససా। 27

మాషరాశిప్రతీకాశం నిశ్శ్వసంతం భుజంగవత్।
గాంగే మహతి తోయాంతే ప్రసుప్తమివ కుంజరమ్। 28

చతుర్భిః కాంచనైర్దీపైః దీప్యమానచతుర్దిశమ్।
ప్రకాశీకృతసర్వాంగం మేఘం విద్యుద్గణైరివ। 29

సర్పములవలె విలసిల్లుచుండెను. అవి కుందేటిరక్తమువలె ఎఱ్ఱనై చల్లని పరిమళములతో గూడిన, మేలైన చందనముల పూతలతో ఒప్పుచుండెను. అవి చక్కగా అలంకృతములైయున్నవి, ఉత్తమసుగంధ ద్రవ్యములు పూయబడియున్న ఆబాహువులను వనితారత్నములు మర్దించియుండిరి. అవి యక్షులను, కిన్నరులను, గంధర్వులను, దేవదానవులను బాధించునవి. మందరగిరిగుహాయందు నిద్రించుచున్న క్రుద్ధభుజంగముల వలె ఒప్పుచు ఆతల్పముపైనున్న రావణుని బాహువులను ఆ కపీశ్వరుడు చూచెను. (15-21)

అట్టి నిండైన బాహువులతో తేజరిల్లుచున్న రావణుడు పర్వతసమానుడై శిఖరములతోగూడిన మందరగిరివలె రాజిల్లుచుండెను. (22)

నిద్రించుచున్న రావణునియొక్క నిట్టూర్పులు ఆ మందిరమును నింపుచున్నవా! యనునట్లు ఆయన ముఖమునుండి బయల్వెడలెను. అవి మామిడి పున్నాగసుమపరిమళములతో, పొగడలసువాసనలతో మృష్టాన్నరసఘుమఘుమలతో మద్యపాన సుగంధములతో గుబాళించుచుండెను. (23-24)

హనుమంతుడు ఆశయ్యాగృహమున రావణుని, ఆతని పత్నులను గాంచెను. అతడు ముత్యములు, మణులు పొదుగబడి, కొంచెము ప్రక్కకు ఒరిగిన సువర్ణ కిరీటముతో విరాజిల్లుచుండెను. అతనిముఖము కుండలముల కాంతులతో మనోహరముగానుండెను. ఎఱ్ఱ చందనముచే అనులిప్తమై హారములతోశోభిల్లుచున్నదై, ఆతని విశాలవక్షస్థలము పరిపుష్టమై విరాజిల్లుచుండెను. అతడు ధరించిన, తెల్లని పట్టువస్త్రము కొంచెము తొలగియుండెను. అయననేత్రములు ఎఱ్ఱబాఱియుండెను. అతడు అమూల్యమైన పచ్చనిమేలి వస్త్రములను అనువుగా ధరించియుండెను. అతడు మినుములరాశివలె ఒప్పాఱుచుండెను. మహాసర్పము బుసలుకొట్టుచున్నట్లు అతడు నిట్టూర్పులు విడుచుచుండెను. గంభీరమైన గంగాజలములమధ్య గాఢనిద్రలోనున్న ఏనుగువలె అతడు తెల్లనివస్త్రముపై పరుండియుండెను. ఆశయ్యా మందిరమునందంతటను కాంచనదీపకాంతులు మెఱుమిట్లుగొలుపుచుండగా వాటిమధ్య ఆతనిశరీరము

పాదమూలగతాశ్చాపి దదర్శ సుమహాత్మనః।
పత్నీ స్స ప్రియభార్యస్య తస్య రక్షఃపతేర్గృహే। 30

శశిప్రకాశవదనాః చారుకుండలభూషితాః।
అమ్లానమాల్యాభరణా దదర్శ హరియూథపః। 31

నృత్తవాదిత్రకుశలా రాక్షసేంద్రభుజాంకగాః।
వరాభరణధారిణ్యో నిషణ్ణా దదృశే హరిః। 32

వజ్రవైదూర్యగర్భాణి శ్రవణాంతేషు యోషితామ్।
దదర్శ తాపనీయాని కుండలాన్యంగదాని చ। 33

తాసాం చంద్రోపమైర్వక్త్రైః శుభైర్లలితకుండలైః।
విరరాజ విమానం తత్ నభస్తారాగణైరివ। 34

మదవ్యాయామఖిన్నాస్తా రాక్షసేంద్రస్య యోషితః।
తేషు తేష్వవకాశేషు ప్రసుప్తాః తనుమధ్యమాః। 35

అంగహారైస్తథైవాన్యా కోమలైర్నృత్తశాలినీ।
విన్యస్తశుభసర్వాంగీ ప్రసుప్తా వరవర్ణినీ। 36

కాచిద్వీణాం పరిష్వజ్య ప్రసుప్తా సంప్రకాశతే।
మహానదీప్రకీర్ణేవ నళినీ పోతమాశ్రితా। 37

అన్యా కక్షగతేనైవ మడ్డుకేనాసితేక్షణా।
ప్రసుప్తా భామినీ భాతి బాలపుత్రేవ వత్సలా। 38

పటహం చారుసర్వాంగీ పీడ్య శేతే శుభస్తనీ।
చిరస్య రమణం లబ్ధ్వా పరిష్వజ్యేవ భామినీ। 39

కాచిద్వంశం పరిష్వజ్య సుప్తా కమలలోచనా।
రహః ప్రియతమం గృహ్య సకామేవ చ కామినీ। 40

విద్యుద్గణములమధ్య మేఘమువలె విరాజిల్లుచుండెను. వానిపాదములచెంత చేరియున్న అతనిముద్దుల భార్యలందఱిని మారుతి చూచెను. (25-30)

చంద్రునివంటి ముఖములుగలవారును, మనోహరములైన కుండలములచే అలంకృతలైనవారును, వాడని పూలమాలలను, ఆభరణములను ధరించినవారును ఐన రావణపత్నులను ఆ కపీశ్వరుడు చూచెను. (31)

నృత్యవాద్యకళలలో నేర్పరులును, అమూల్యములైన ఆభరణములను ధరించినవారునై, రావణుని భుజములపైనను, ఒడియందును చేరినిద్రించుచున్న అతనిభార్యలను ఆ కపివరుడు గాంచెను. (32)

ఆ కాంతలు చెవులకుధరించిన వజ్రవైదూర్య ఖచితములైన బంగారుకుండలములను, బాహువులయందు దాల్చిన దండకడియములను అతడు చూచెను. (33)

అచటి వనితలయొక్క చంద్రసదృశములైన ముఖశోభలతోను, దర్శనీయములైన చక్కనికుండలముల తోను ఒప్పుచున్న ఆ విమానము (విమానాకారములోనున్న పర్యంకము) నక్షత్రకాంతులతో వెలుగొందుచున్న ఆకాశమువలె విరాజిల్లుచుండెను. (34)

అందమైననడుములుగల రావణకాంతలు రతిక్రీడలలో అలసినవారై ఎక్కడివారక్కడ గాఢనిద్రలో మునిగిరి.(35)

నృత్తమునందు అఱితేఱిన మఱియొకశుభాంగి నృత్తముచేయుచున్నప్పుడు ఉండెడి మనోహరములైన అంగభంగిమలతోడనే నిద్రించుచుండెను. (36)

ఒక తరుణి వీణను కౌగిలించుకొని నిద్రించుచుండెను. ఆమె నదీప్రవాహమునకొట్టుకొనివచ్చి, ఒకనావను ఆశ్రయించిన పద్మలతవలె మనోహరముగానుండెను. (37)

'మడ్డుకము' అను చర్మవాద్యమును చంకలోనే ఉంచుకొని, నిద్రించుచున్న ఒకయువతి వాత్సల్యముతో బాలకుని చంకనిడుకొని, సుప్తయైయున్న భామినివలె భాసిల్లుచుండెను.(38)

స్తనసౌభాగ్యముగల ఒక సర్వాంగసుందరి 'పటహము' అను చర్మవాద్యమును వక్షఃస్థలమునకు అదుముకొని, చిరకాలము పిమ్మట పొందిన ప్రియుని కౌగిలించుకొని యున్న భామినివలె నిద్రించెను. (39)

వేణువును హృదయమునకుహత్తుకొని, గాఢనిద్రలో మునిగిన కమలనేత్రయైన ఒకకాంత ఏకాంతమున కామావేశమునకు గురియై తమకముతో తనప్రాణ ప్రియుని కౌగిలించుకొనిన ఒకకామినివలె భాసిల్లుచుండెను. (40)

విపంచీం పరిగృహ్యాన్యా నియతా నృత్తశాలినీ।
నిద్రావశమనుప్రాప్తా సహకాంతేవ భామినీ। 41

అన్యా కనకసంకాశైః మృదుపీనైర్మనోరమైః।
మృదంగం పరిపీడ్యాంగైః ప్రసుప్తా మత్తలోచనా। 42

భుజపార్శ్వాంతరస్థేన కక్షగేణ కృశోదరీ।
పణవేన సహానింద్యా సుప్తా మదకృతశ్రమా। 43

డిండిమం పరిగృహ్యాన్యా తథైవాసక్తడిండిమా।
ప్రసుప్తా తరుణం వత్సమ్ ఉపగుహ్యేవ భామినీ। 44

కాచిదాడంబరం నారీ భుజసంయోగపీడితమ్।
కృత్వా కమలపత్రాక్షీ ప్రసుప్తా మదమోహితా। 45

కలశీమపవిధ్యాన్యా ప్రసుప్తా భాతి భామినీ।
వసంతే పుష్పశబలా మాలేవ పరిమార్జితా। 46

పాణిభ్యాం చ కుచౌ కాచిత్ సువర్ణకలశోపమౌ।
ఉపగుహ్యాబలా సుప్తా నిద్రాబలపరాజితా। 47

అన్యా కమలపత్రాక్షీ పూర్ణేందుసదృశాననా।
అన్యామాలింగ్య సుశ్రోణీం ప్రసుప్తా మదవిహ్వలా। 48

ఆతోద్యాని విచిత్రాణి పరిష్వజ్య వరస్త్రియః।
నిపీడ్య చ కుచైస్సుప్తాః కామిన్యః కాముకానివ। 49

తాసామేకాంతవిన్యస్తే శయానాం శయనే శుభే।
దదర్శ రూపసంపన్నామ్ అపరాం స కపిః స్త్రియమ్। 50

ముక్తామణిసమాయుక్తైః భూషణైస్సువిభూషితామ్।
విభూషయంతీమివ తత్ స్వశ్రియా భవనోత్తమమ్। 51

నృత్తకళానిపుణురాలైన ఒకరమణి 'విపంచి'ని (ఏడు తీగల వీణను) తనయెదపై చేర్చుకొని, కాంతునితో జేరి నిద్రించుచున్న ఒక భామినివలె ఒప్పుచుండెను. (41)

మఱియొకకాంత బంగారువన్నెలుగల, మృదువై, పరిపుష్టములై, మనోహరములైనఅంగములతో మృదంగమును బాగుగా కౌగిలించుకొని, పారవశ్యముతో గాఢనిద్రలో మునిగియుండెను. (42)

మధుపానాదిక్రీడలలో అలసిసొలసి శ్లాఘనీయురాలైన ఒక అనింద్యసుందరి భుజపార్శ్వములమధ్య చంకలో నున్న పణవముతోగూడియే నిద్రలోనికి జారెను. (43)

డిండిమమునందాసక్తయైన మఱియొక తరుణి ఒక 'డిండిమ' వాద్యమును గ్రహించి, ఇష్టమైన రమణుని కౌగిలించుకొనియున్న భామినివలె, అట్లే నిదురించెను. (44)

కమలపత్రాక్షియైన వేఱొకముదిత మదమోహితయై 'ఆడంబరము' అను- తూర్యవాద్యమును బిగికౌగిలిలో నుంచుకొని పరవశయై నిద్రించెను. (45)

గాఢనిద్రలో మునిగిన ఒకభామిని ప్రక్కనేయున్న కలశమును త్రోయగా అందలి గంధోదకములచే (పన్నీటిచే) ఆమె తడిసిపోయెను. అప్పుడామె వసంతఋతువునందు (వాడిపోకుండ ఉండుటకై)నీటిచే తడుపబడిన వివిత్రవర్ణ పుష్పమాలవలె ఒప్పుచుండెను. (46)

ముంచుకొని వచ్చుచున్ననిద్రకు లోనైన ఒకఅబల బంగారుకలశములవంటి తనకుచములను చేతులతో కప్పుకొని నిద్రించుచుండెను. (47)

చంద్రబింబమువంటి ముఖముగల ఒకకమలలోచన మదనావేశమునకులోనై, మఱియొక రమణిని కౌగిలించుకొని నిదురించెను. (48)

అచటి తరుణీమణులు చిత్రవిచిత్రములైన చతుర్విధ వాద్యములను (వీణ, మృదంగము, వేణువు, తాళము మొదలగునవి చతుర్విధ వాద్యములు) హృదయములకు హత్తుకొని, ప్రియులను తమకుచములతో బిగికౌగిళ్లలో నుంచెత్తిన కామినులవలె నిద్రించుచుండిరి. (49)

అచటి కాంతలలో మిక్కిలి సౌందర్యముగల ఒక స్త్రీ ప్రత్యేకముగా ఏర్పఱచబడిన చక్కనిశయ్యపై నిద్రించుచుండెను. ఆమెను ఆ కపివరుడు చూచెను. (50)

ఆమె మంచిముత్యములు పొదిగిన ఆభరణములను ధరించినదై, తనకాంతులచే ఆ మహాభవనమును ప్రకాశింపజేయుచున్నదా! యనునట్లుండెను. (51)

గౌరీం కనకవర్ణాభామ్ ఇష్టామంతఃపురేశ్వరీమ్।
కపిర్మందోదరీం తత్ర శయానాం చారురూపిణీమ్। 52

అక్కడ శయ్యపై పరుండియున్న కనకవర్ణాంగియగు మండోదరిని ఆ హనుమంతుడు తిలకించెను. స్వచ్ఛమైన కాంతులతో ఆమెరూపము మనోహరముగా విరాజిల్లుచుండెను. ఆమె రావణునకు మిక్కిలిప్రీతిని గూర్చునది, ఆ అంతఃపురమునకు ఆమె పట్టమహిషి. (52)

స తాం దృష్ట్వా మహాబాహుః భూషితాం మారుతాత్మజః।
తర్కయామాస సీతేతి రూపయౌవనసంపదా।
హర్షేణ మహతా యుక్తో ననంద హరియూథపః। 53

మహాబాహువైన ఆ మారుతి సర్వాలంకారశోభితయైన ఆ మందోదరినిజూచి, రూప, యౌవన సౌభాగ్యములను బట్టి ఆమె సీతాదేవి ఐయుండవచ్చునని తలంచెను. పిమ్మట ఆ కపివరుడు మిక్కిలి హర్షోల్లసితుడయ్యెను. (53)

ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం
ననంద చిక్రీడ జగౌ జగామ।
స్తంభానరోహన్నిపపాత భూమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనామ్। 54

సీతాదేవి కనబడినదని భావించి, ఆ ఆనందములో హనుమంతుడు భుజాస్ఫాలనము గావించెను, వాలమును ముద్దాడెను. అటునిటు గంతులువేయుచు అమిత సంతోషముతో పాటలుపాడెను, స్తంభములమీదికి ప్రాకెను. భూమిమీదికి జారెను. వానరులకు స్వామిభక్తి పరాయణత్వము స్వాభావికము[1] కనుక హనుమంతునకు శ్రీరామునిపైగల భక్తి-ఉత్సాహములే అతని భుజాస్ఫాలనాది చర్యలకు ప్రేరకములు. (54)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే దశమస్సర్గః *(10)*

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పదియవసర్గము.

— * * * —

11. పదునొకొండవసర్గము

'ఈమెసీతకాదు' - అని నిర్ధారించుకొని , హనుమంతుడు మరల అంతఃపురమందును, పానభూమి యందును సీతకొఱకై అన్వేషించుట, అతని మనసులో ధర్మలోపశంక కలుగుట, అది నివృత్తమగుట.

అవధూయ చ తాం బుద్ధిం బభూవావస్థిత స్తదా।
జగామ చాపరాం చింతాం సీతాంప్రతి మహాకపిః। 1

న రామేణ వియుక్తా సా స్వప్తుమర్హతి భామినీ।
న భోక్తుం నాప్యలంకర్తుం న పానముపసేవితుమ్। 2

ఆ మహాకపి అంతకుముందున్న తనఆలోచనను (మందోదరినిజూచి, సీతయనుభ్రాంతిని) మార్చుకొనెను. సీతాదేవినిగూర్చి అతడు నేకవిధముగా సరియైన ఆలోచనచేయసాగెను. రాముని (పతి) యెడబాటునకు గురియైనసీతాదేవి ఇట్లునిద్రించుట సంభవమా? ఆ స్థితిలో ఆమెకు అన్నపానాదులమీదికి మనసేపోదు, ఆభరణముల విషయమేపట్టదు. (1-2)

* వానరుల స్వామిభక్తి పరాయణత్వమును, వారి స్వాభావికచేష్టలను 'మహాకవి' గోస్వామి తులసీదాసు తన రామచరితమానసమున ప్రస్తావించెను. లంకాకాండము- దోహా 23, తరువాత గల చౌపాయి, చూడదగును.

"తన యజమాని సేవలో సిగ్గువిడిచి ఎక్కడైనను సరే నాట్యము చేయు వానరజాతి ధన్యము, నాట్యము చేయుచు, గంతులు వేయుచు, ప్రజలను సంతోషపెట్టి, వానరము తన యజమానికి మేలు చేయును. ఇది దాని ధర్మనిరతికి తార్కాణము. అంగదా! మీ జాతి వారందఱును స్వామిభక్తిపరాయణులే. కావున నీ స్వామి గుణములను పొగడకుండ ఎట్లుండ గలవు? నేను సద్గుణములను ఆదరించెదను, చతురుడను."

నాన్యం నరముపస్థాతుం సురాణామపి చేశ్వరమ్।
న హి రామసమః కశ్చిత్ విద్యతే త్రిదశేష్వపి। 3

పరపురుషుడు ఎంతటివాడైనను, కడకు అతడు సురాధిపతియేయైనను, అతనిని ఆమె దరిజేరదు. దేవతలయందుసైతము ఎవ్వడునురామునితో సమానుడైనవాడు లేడు. (3)

అన్వేయమితి నిశ్చిత్య భూయస్తత్ర చచార సః।
పానభూమౌ హరిశ్రేష్ఠః సీతాసందర్శనోత్సుకః। 4

కనుక 'ఈమెసీతాదేవికానేకాదు'- అని నిశ్చయించుకొని, ఆ కపివరుడు సీతాసందర్శనమునకై కుతూహలపడుచు పానభూమియందు మఱల అన్వేషింపసాగెను. (4)

క్రీడితేనాపరాః క్లాంతా గీతేన చ తథాఽపరాః।
నృత్తేన చాపరాః క్లాంతాః పానవిప్రహతాస్తథా। 5

ఆ పానభూమియందు ఆటపాటలతో అలసిపోయిన వారుకొందఱు, నృత్తములచే డస్సియున్నవారు మఱి కొందఱు, మధుపానములచేమత్తిల్లిపడియున్నవారు ఇంకను కొందఱు గలరు. (5)

మురజేషు మృదంగేషు పీఠికాసు చ సంస్థితాః।
తథాఽఽస్తరణముఖ్యేషు సంవిష్టాశ్చాపరాః స్త్రియః। 6

కొందఱుస్త్రీలు మురజములను, మృదంగములను, చిన్నచిన్న పీఠములను ఆనుకొని నిద్రించుచుండిరి. మఱి కొందఱు మేలైనఆస్తరణములపైశయనించియుండిరి.(6)

అంగనానాం సహస్రేణ భూషితేన విభూషణైః।
రూపసల్లాపశీలేన యుక్తగీతార్థభాషిణా। 7

దేశకాలాభియుక్తేన యుక్తవాక్యాభిధాయినా।
రతాభిరతసంసుప్తం దదర్శ హరియూథపః। 8

అచటి అంగనలు వివిధాలంకారములతో భూషితలై యుండిరి. వారు తమతమ అందచందములనుగూర్చి సరసోక్తులాడుకొనువారు. తాము పాడెడి పాటల అర్థములనుగూర్చి చర్చించుకొనువారు, దేశ కాలములకు అనుగుణముగా ప్రవర్తించువారు, సందర్భోచితముగా సంభాషించువారు. అట్టి పెక్కుమందిఅంగనలతోగూడి, బాహ్యరతియందలి ఆసక్తితో అలసిసొలసినిద్రించుచున్న రావణుని కపీశ్వరుడుచూచెను. (7-8)

అన్యత్రాపి వరస్త్రీణాం రూపసంలాపశాలినామ్।
సహస్రం యువతీనాం తు ప్రసుప్తం స దదర్శ హ। 9

మఱియొకచోట రూపసౌభాగ్యములనుగూర్చి సల్లాపములను గావించువారును, స్త్రీలలో అగ్రశ్రేణికి చెందినవారును ఐన పెక్కుమంది యువతులు నిద్రించుచుండగా ఆ హనుమంతుడు చూచెను. (9)

తాసాం మధ్యే మహాబాహుః శుశుభే రాక్షసేశ్వరః।
గోష్ఠే మహతి ముఖ్యానాం గవాం మధ్యే యథా వృషః। 10

ఒక విశాలమైన గోశాలయందు ఉత్తమజాతి ఆవులమధ్య ఒక ఆంబోతువలె మహాబాహువైన రావణుడు ఆ తరుణీమణులమధ్య శోభిల్లుచుండెను. (10)

స రాక్షసేంద్రశ్శుశుభే తాభిః పరివృతః స్వయమ్।
కరేణుభిర్యథారణ్యే పరికీర్ణో మహాద్విపః। 11

అరణ్యమునందు ఆడుఏనుగులచే పరివృతమైన ఒకమదపుటేనుగువలె రాక్షసరాజు ఆ లావణ్యవతులచే పరివృతుడై రాజిల్లుచుండెను. (11)

సర్వకామైరుపేతాం చ పానభూమిం మహాత్మనః।
దదర్శ హరిశార్దూలః తస్య రక్షఃపతేర్గృహే। 12

మహాకాయుడైన ఆ రావణుని శయనమందిరమున వివిధభోగ్యవస్తువులతోగూడిన పానభూమిని ఆ కపివరుడు తిలకించెను. (12)

మృగాణాం మహిషాణాం చ వరాహాణాం చ భాగశః।
తత్ర న్యస్తాని మాంసాని పానభూమౌ దదర్శ సః। 13

ఆ పానభూమియందు వేర్వేఱుగాడంచబడిన లేళ్ల, దున్నల, అడవిపందుల మాంసఖండములను ఆ హనుమంతుడు చూచెను. (13)

రౌక్మేషు చ విశాలేషు భాజనేష్వర్ధభక్షితాన్।
దదర్శ హరిశార్దూలో మయూరాన్ కుక్కుటాం స్తథా। 14

వరాహవార్ధ్రాణసకాన్ దధిసౌవర్చలాయుతాన్।
శల్యాన్ మృగమయూరాంశ్చ హనుమానన్వవైక్షత। 15

క్రకరాన్ వివిధాన్ సిద్ధాన్ చకోరానర్ధభక్షితాన్।
మహిషానేకశల్యాంశ్చ ఛాగాంశ్చ కృతనిష్ఠితాన్। 16

లేహ్యానుచ్చావచాన్ పేయాన్ భోజ్యాని వివిధాని చ।
తథాఽఽమ్లలవణోత్తంసైః వివిధైరాగషాడబైః। 17

హారనూపురకేయూరైః అపవిద్ధైర్మహాధనైః।
పానభాజనవిక్షిప్తైః ఫలైశ్చ వివిధైరపి। 18

కృతపుష్పోపహారా భూః అధికం పుష్యతి శ్రియమ్।
తత్ర తత్ర చ విన్యస్తైః సుశ్లిష్టైశ్శయనాసనైః। 19

పానభూమిర్వినా వహ్నిం ప్రదీప్తేవోపలక్ష్యతే।
బహుప్రకారైర్వివిధైః వరసంస్కారసంస్కృతైః। 20

మాంసైః కుశలసంపృక్తైః పానభూమిగతైః పృథక్।
దివ్యాః ప్రసన్నా వివిధాః సురాః కృతసురా అపి। 21

శర్కరాఽఽసవమాధ్వీకపుష్పాసవఫలాసవాః।
వాసచూర్ణైశ్చ వివిధైః దృష్టాస్తైస్తైః పృథక్ పృథక్। 22

సంతతా శుశుభే భూమిః మాల్యైశ్చ బహుసంస్థితైః।
హిరణ్మయైశ్చ వివిధైః భాజనైః స్ఫాటికైరపి। 23

జాంబూనదమయైశ్చాన్యైః కరకైరభిసంవృతా।
రాజతేషు చ కుంభేషు జాంబూనదమయేషు చ। 24

పానశ్రేష్ఠం తదా భూరి కపిస్తత్ర దదర్శ హ।
సోఽపశ్యచ్ఛాతకుంభాని శీధోర్మణిమయాని చ। 25

అక్కడ పెద్దపెద్దబంగారుపాత్రలలో సగముతిని వదలివేయుబడిన నెమళ్ల, కోళ్లమాంసఖండములను ఆ కపివరుడు గాంచెను. (14)

పెరుగుతో, 'రుచకము' అను లవణముతోడను కలిపి వండిన అడవిపందులు, ఖడ్గమృగములు, ముళ్లపందులు, లేళ్లు, నెమళ్లు మొదలగు జంతువులమాంసఖండములను ఆ మారుతి వరుసగాచూచెను. (15)

బాగుగావండబడిన కొక్కెరపక్షులు, వివిధములైన చకోరములు, మహిషములు, మత్స్యములు, మేకలు, మొదలగువాటి మాంసఖండములను, సగము భక్షించి వదలివేయుబడినవానిని మారుతి గాంచెను. (16)

వివిధములైన పచ్చళ్లను, పానీయములను, భోజ్యవస్తువులను, మఱియు పులుపు, ఉప్పు మొదలగు షడ్రసోపేతములైనతినుబండారములను ఆ కపీశ్వరుడు గాంచెను. (17)

అటునిటు చెల్లాచెదరుగా పడియున్న అమూల్యహారములను, అందెలను, కేయూరములను, వివిధములగు ఫలరసములతో నిండిన పానపాత్రలను ఆమారుతి వీక్షించెను. (18)

అచ్చటచ్చట బాగుగా అమర్చబడిన శయనాసనముల తోడను, అలంకారార్థమై వెదజల్లబడిన పూవులతోడను, అచటినేల మిక్కిలి శోభావహమై ఆ పానభూమి అగ్ని లేకుండగనే వివిధజ్వాలలతో వెలుగొందుచున్నదా యనునట్లుండెను. ఘుమఘుమలాడునట్లు బాగుగా పలురీతులలో వండబడినవి, పానశాలయందు వేర్పుగా అమర్చబడినవినగు మాంసములను, దివ్యములైన రుచికరములైన వివిధములగు సహజమద్యములను, శర్కరలతో, తేనెలతో, పూదేనెలతో, ఫలములతో సిద్ధపఱచబడి, నానావిధములగు సువాసనచూర్ణములతో వేర్వేఱుగాకలుపబడిన కృత్రిమ మద్యములను మారుతి గాంచెను. (19-22)

అనేకవిధములైనపూలమాలలతోడను, బంగారు పాత్రల తోడను, స్ఫటికపాత్రలతోడను నిండినదై ఆ పాన భూమి మిక్కిలిశోభించుచుండెను. (23)

ఇంకను బంగారముతో నిర్మితములైన కొమ్ముచెంబులతో గూడిన ఆభూమి ఎంతయో శోభించుచుండెను. వెండి, బంగారుకడవలలో పూర్తిగా నింపబడిన మేలైనమద్యములను అక్కడ అనుమయమున కపీశ్వరుడుచూచెను. అతడు చెఱకురసములో సిద్ధమైన మద్యముతోనిండియున్న మణిమయములైన బంగారు పాత్రలను, వెండిపాత్రలను

రాజతాని చ పూర్ణాని భాజనాని మహాకపిః।
క్వచిదర్ధావశేషాణి క్వచిత్పీతాని సర్వశః। 26

క్వచిన్నైవ ప్రపీతాని పానాని స దదర్శ హ।
క్వచిద్భక్ష్యాంశ్చ వివిధాన్ క్వచిత్పానాని భాగశః।
క్వచిదన్నావశేషాణి పశ్యన్ వై విచచార హ। 27

క్వచిత్ ప్రభిన్నైః కరకైః క్వచిదాలోళితైర్ఘటైః।
క్వచిత్ సంపృక్తమాల్యాని జలాని చ ఫలాని చ। 28

శయనాన్యత్ర నారీణాం శుభ్రాణి బహుధా పునః।
పరస్పరం సమాశ్లిష్య కాశ్చిత్ సుప్తా వరాంగనాః। 29

కాశ్చిచ్చ వస్త్రమన్యస్యాః స్వపంత్యాః పరిధాయ చ।
ఆహృత్య చాబలాస్సుప్తా నిద్రాబలపరాజితాః। 30

తాసాముచ్ఛ్వాసవాతేన వస్త్రం మాల్యం చ గాత్రజమ్।
నాత్యర్థం స్పందతే చిత్రం ప్రాప్య మందమివానిలమ్। 31

చందనస్య చ శీతస్య శీధోర్మధురసస్య చ।
వివిధస్య చ మాల్యస్య ధూపస్య వివిధస్య చ। 32

బహుధా మారుతస్తత్ర గంధం వివిధముద్వహన్।
రసానాం చందనానాం చ ధూపానాం చైవ మూర్ఛితః। 33

ప్రవవౌ సురభిర్గంధో విమానే పుష్పకే తదా।
శ్యామావదాతాస్తత్రాన్యాః కాశ్చిత్ కృష్ణావరాంగనాః। 34

కాశ్చిత్ కాంచనవర్ణాంగ్యః ప్రమదా రాక్షసాలయే।
తాసాం నిద్రావశత్వాచ్చ మదనేన విమూర్ఛితమ్। 35

పద్మినీనాం ప్రసుప్తానాం రూపమాసీద్యథైవ హి।
ఏవం సర్వమశేషేణ రావణాంతఃపురం కపిః।
దదర్శ సుమహాతేజా న దదర్శ చ జానకీమ్। 36

దర్శించెను. కొన్నిచోట్లగల పాత్రలలోనిమద్యము సగము త్రాగబడియుండెను. మఱికొన్నిపాత్రలలోని మద్యము పూర్తిగా త్రాగబడి యుండెను. కొన్నితావుల పాత్రలలోని మద్యములను ఎవ్వరునుతాకలేదు. ఈ దృశ్యములను అతడు వీక్షించెను. కొన్నిప్రదేశములయందు పెక్కువిధములగు భక్ష్యములను, కొన్నితావుల వేర్వేఱుగానున్న మద్యములను, తినగా మిగిలినఅన్నములను కొన్నిచోట్లను చూచుచు ఆ మారుతి అంతటనుసంచరించెను. (24-27)

కొన్నిచోట్ల చిన్నచిన్నపాత్రలు పగిలియుండెను. మఱికొన్ని తావుల ఘటములు దొర్లియుండెను. మఱికొన్నిప్రదేశముల యందు మిశ్రితములైన మాలలు, జలములు, ఫలములు పడియుండెను. (28)

ఒకచోట స్త్రీలయొక్క తల్పములు అనేక- ఆకారములు గలిగి స్వచ్ఛములైయుండెను. వాటిపై కొంత మందితరుణీమణులు పరస్పరము కౌగిలించుకొని పరుండియుండిరి. (29)

పూర్తిగానిద్రమత్తులోనున్న కొందఱుస్త్రీలు నిద్రించుచున్న ప్రక్కనున్నస్త్రీలయొక్క దుప్పట్లను లాగికొనికప్పుకొనిరి. (30)

ఆ స్త్రీలఉచ్ఛ్వాసనిఃశ్వాసలకు వారిశరీరములపైగల వస్త్రములు, మాలలు పిల్లవాయువులకు కదలినట్లుగా చిత్రముగా స్వల్పముగా కదలుచుండెను. (31)

అచట చల్లనిచందనములు, చెఱకురసములతో, తేనెలతో సిద్ధపఱచబడినమద్యములు, పరిమళములను వెదజల్లుచున్న మాలలు, ఘుమఘుమలాడు ధూపములును గలవు.(32)

అచట ప్రసరించుచున్నవాయువు ఆ రసచందనధూపాదుల వివిధసుగంధములను అంతటను వ్యాపింపజేయుచుండెను. (33)

అప్పుడు ఆసువాసనలు పుష్పకవిమానమునందు నలుమూలలవ్యాపించెను. ఆ రావణమందిరమున కొందఱుస్త్రీలు మనోహరమైనచాయగలవారు, కొందఱు స్వచ్ఛమైన శ్యామవర్ణముగలవారు, మఱికొందఱు బంగారువన్నెవారును గలరు. రతికేళిలో అలసిపోయి యుండుటవలనను, నిద్రాప్రభావమునను ఆ నిద్రించుచున్న వారిరూపము ముకుళించుకొనియున్న పద్మములవలెనుండెను. మహా తేజశ్శాలియైనమారుతి ఈవిధముగనున్న రావణాంతఃపురము నందు అంతటను అడుగడుగునను గాలించెను. కాని సీతాదేవి మాత్రము కనబడలేదు- (34-36)

నిరీక్షమాణశ్చ తదా తాః స్త్రియః స మహాకపిః।
జగామ మహతీం శంకాం ధర్మసాధ్వసశంకితః। 37

ఆ స్త్రీలనుచూచుచున్న కపివరుడు 'తన వలన ధర్మలోపము జరిగినదేమో!' అను తీవ్రమైన సందేహమునకు లోనయ్యెను. (37)

పరదారావరోధస్య ప్రసుప్తస్య నిరీక్షణమ్।
ఇదం ఖలు మమాత్యర్థం ధర్మలోపం కరిష్యతి। 38

అంతఃపురమునందు ఇట్లు గాఢనిద్రలోనున్న పరకాంతలను చూచితిని. దీనివలన నా బ్రహ్మచర్య ధర్మనిష్ఠ దెబ్బతినునేమో? (38)

న హి మే పరదారాణాం దృష్టిర్విషయవర్తినీ।
అయం చాత్ర మయా దృష్టః పరదారపరిగ్రహః। 39

పరసతులవిషయమున నాకెన్నడును విషయ వాసనా దృష్టియేలేదు. పైగా పరదారలను పరిగ్రహించిన ఈదుష్ట రావణుడుగూడ ఇప్పుడు నాకంటబడెను. (39)

తస్య ప్రాదురభూచ్చింతా పునరన్యా మనస్వినః।
నిశ్చితైకాంతచిత్తస్య కార్యనిశ్చయదర్శినీ। 40

హనుమంతుడు మిక్కిలిమనోబలముగలవాడు. నిశ్చయించుకొనినలక్ష్యమునందు ఏకాగ్రచిత్తమును కలిగి యుండువాడు. అట్టి మారుతిమనస్సున కర్తవ్య నిశ్చయమునకు తోడ్పడుచక్కనిఆలోచన తళుక్కున మెఱసెను. (40)

కామం దృష్టా మయా సర్వా విశ్వస్తా రావణస్త్రియః।
న హి మే మనసః కించిత్ వైకృత్యముపపద్యతే। 41

నిద్రించుచున్న రావణస్త్రీలను అందఱినిపరికించి చూచినది వాస్తవమే. ఐనను నాలో ఎట్టిమనోవికారమూ కలుగలేదు.(41)

మనో హి హేతుస్సర్వేషామ్ ఇంద్రియాణాం ప్రవర్తనే।
శుభాశుభాస్వవస్థాసు తచ్చ మే సువ్యవస్థితమ్। 42

శుభవిషయములయందును, అశుభవిషయముల యందును సమస్తమైన ఇంద్రియములతీరుతెన్నులకు మనస్సేకారణము. కాని నామనస్సు (ఈ పరిస్థితులలో గూడ) ఎట్టి వికారములకునులోనుగాక సన్మార్గమున నిశ్చలముగా నున్నది. (42)

నాన్యత్ర హి మయా శక్యా వైదేహీ పరిమార్గితుమ్।
స్త్రియో హి స్త్రీషు దృశ్యంతే సదా సంపరిమార్గణే। 43

వైదేహిని మఱియొకచోట ఎక్కడనని వెదకను? స్త్రీలను స్త్రీసమూహములమధ్యనే వెదకవలెనుగదా! (43)

యస్య సత్త్వస్య యా యోనిః తస్యాం తత్పరిమార్గ్యతే।
న శక్యా ప్రమదా నష్టా మృగీషు పరిమార్గితుమ్। 44

ఒక ప్రాణిని ఆ జాతిప్రాణులమధ్యనే వెదకవలెను. తప్పిపోయిన స్త్రీని లేళ్లమధ్య వెదకుటవలన ప్రయోజనము ఉండదుగదా! (44)

తదిదం మార్గితం తావత్ శుద్ధేన మనసా మయా।
రావణాంతఃపురం సర్వం దృశ్యతే న చ జానకీ। 45

అందువలన నిర్మలమైనమనస్సుతో నేను ఈ రావణాంతఃపురమును నిశితదృష్టితో పూర్తిగా గాలించితిని. కాని జానకీదేవిమాత్రము కనబడలేదు. (45)

దేవగంధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ వీర్యవాన్।
అవేక్షమాణో హనుమాన్ నైవాపశ్యత జానకీమ్। 46

సీతాన్వేషణచేయుచున్న పరాక్రమశాలియగు హనుమంతునకు దేవగంధర్వనాగకన్యలు కనబడిరిగాని సీతాదేవిమాత్రము కన్పించలేదు. (46)

తామపశ్యన్ కపిస్తత్ర పశ్యంశ్చాన్యా వరస్త్రియః।
అపక్రమ్య తదా వీరః ప్రధ్యాతుముపచక్రమే। 47

వీరుడైనహనుమంతునకు అక్కడసీతాదేవితప్ప ఇతరస్త్రీలు ఎందఱోకనబడిరి- అప్పుడతడు కొంచెము దూరముగావెళ్లి మఱలదీర్ఘాలోచనలోపడెను. (47)

స భూయస్తు పరం శ్రీమాన్ మారుతిర్యత్నమాస్థితః ।
ఆపానభూమిముత్సృజ్య తాం విచేతుం ప్రచక్రమే ॥ 48

సర్వశుభలక్షణములతో ఒప్పుచున్న ఆహనుమంతుడు ఆ పానభూమినుండి వెలుపలికివచ్చి, తనప్రయత్నమునకు కృతనిశ్చయుడై, మరల ఆరావణాంతఃపురమున సీతాదేవిని వెదకసాగెను. (48)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకాదశస్సర్గః (11)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పదునొకొండవ సర్గము.

-- * * * --

12. పంద్రెండవ సర్గము

సీత మరణించి యుండునని తలచి, హనుమంతుడు దుఃఖితుడగుట, మరల ఉత్సాహము తెచ్చుకొని సీతను వెదకుట, ఆమెను ఎందును గానక చింతాక్రాంతుడగుట

స తస్య మధ్యే భవనస్య మారుతిః
లతాగృహాంశ్చిత్రగృహాన్ నిశాగృహాన్ ।
జగామ సీతాం ప్రతిదర్శనోత్సుకో
న చైవ తాం పశ్యతి చారుదర్శనామ్ ॥ 1

సీతాదేవిదర్శనమునకై ఆరాటపడుచున్న మారుతి రావణభవనసముదాయముల మధ్యగల లతాగృహములను, (పొదరిండ్లను) చిత్రశాలలను, రాత్రివిహారములకు అనువైనమందిరములను వెదకెను. కాని చక్కనిచుక్కయైన సీతాదేవిమాత్రము కనబడలేదు. (1)

స చింతయామాస తతో మహాకపిః
ప్రియామపశ్యన్ రఘునందనస్య తామ్ ।
ధ్రువం న సీతా ధ్రియతే యథా న మే
విచిన్వతో దర్శనమేతి మైథిలీ ॥ 2

శ్రీరామునిప్రియపత్నియైనసీతాదేవి కనబడక పోవుటచే ఆ మారుతి ఇట్లుతలంచెను." నిజముగా సీతాదేవి తన ప్రాణములను నిలుపుకొనియుండక పోవచ్చును. లేనిచో ఎంతగా వెదకినను ఆమెదర్శనము నాకు ఏలకలుగదు?(2)

సా రాక్షసానాం ప్రవరేణ జానకీ
స్వశీలసంరక్షణతత్పరా సతీ ।
అనేన నూనం ప్రతి దుష్టకర్మణా
హతా భవేదార్యపథే పరే స్థితా ॥ 3

జానకీదేవి ఉత్కృష్టమైన ధర్మమార్గమును అనుసరించునట్టిది. తనశీలమును సంరక్షించుకొనుటలో తత్పరురాలు. పతివ్రతయైన అట్టి సీతాదేవి దుష్ప్రవృత్తిగల రాక్షసరాజైన ఈరావణునిచే నిశ్చయముగా సంహరింపబడియే యుండును. (3)

విరూపరూపా వికృతా వివర్చసో
మహాననా దీర్ఘవిరూపదర్శనాః ।
సమీక్ష్య సా రాక్షసరాజయోషితో
భయాద్వినష్టా జనకేశ్వరాత్మజా ॥ 4

రావణునిఆజ్ఞలను తలదాల్చునట్టి రాక్షసస్త్రీలు భయంకరమైన ఆకారములను, క్రూరస్వభావములను, వికృతములైన ముఖములను, వికారములైన నేత్రములను గలిగి కాంతిహీనలై యున్నారు. అట్టి భీకరాకృతులనుజూచి, జానకీదేవి భయవిహ్వలయై, కనబడకుండ[1] దాగియుండవచ్చును. (4)

సీతామదృష్ట్వా హ్యనవాప్య పౌరుషం
విహృత్య కాలం సహ వానరైశ్చిరమ్ ।
న మేఽస్తి సుగ్రీవసమీపగా గతిః
సుతీక్ష్ణదండో బలవాంశ్చ వానరః ॥ 5

అంగదాదివానరులతోగూడి ఇంతకాలము సీతజాడను తెలిసికొనుటకు ప్రయత్నించితిని. కాని ఆమె ఉనికి తెలియలేదు. పురుషప్రయత్నమంతయు నిష్ఫలమైనది. ఇట్టిస్థితిలో సుగ్రీవునియొద్దకు వెళ్లుటతగదు. అతడు మహాబలవంతుడు. వెళ్లినచో తీక్ష్ణమైనదండన విధించును. (5)

1) నశ్-అదర్శనే - కనబడకుండుట

దృష్టమంతఃపురం సర్వం దృష్ట్వా రావణయోషితః।
న సీతా దృశ్యతే సాధ్వీ వృథా జాతో మమ శ్రమః। 6

కిం ను మాం వానరాస్సర్వే గతం వక్ష్యంతి సంగతాః।
గత్వా తత్ర త్వయా వీర కిం కృతం తద్వదస్వ నః। 7

అదృష్ట్వా కిం ప్రవక్ష్యామి తామహం జనకాత్మజామ్।
ధ్రువం ప్రాయముపైష్యంతి కాలస్య వ్యతివర్తనే। 8

కిం వా వక్ష్యతి వృద్ధశ్చ జాంబవానంగదశ్చ సః।
గతం పారం సముద్రస్య వానరాశ్చ సమాగతాః। 9

అనిర్వేదశ్శ్రియో మూలమ్ అనిర్వేదః పరం సుఖమ్।
భూయస్తత్ర విచేష్యామి న యత్ర విచయః కృతః। 10

అనిర్వేదో హి సతతం సర్వార్థేషు ప్రవర్తకః।
కరోతి సఫలం జంతోః కర్మ యత్ తత్ కరోతి సః। 11

తస్మాదనిర్వేదకృతం యత్నం చేష్టేఽహముత్తమమ్।
అదృష్టాంశ్చ విచేష్యామి దేశాన్ రావణపాలితాన్। 12

ఆపానశాలా విచితాః తథా పుష్పగృహాణి చ।
చిత్రశాలాశ్చ విచితా భూయః క్రీడాగృహాణి చ। 13

నిష్కుటాంతరరథ్యాశ్చ విమానాని చ సర్వశః।
ఇతి సంచింత్య భూయోఽపి విచేతుముపచక్రమే। 14

భూమీగృహాంశ్చైత్యగృహాన్ గృహాతిగృహకానపి।
ఉత్పతన్ నిపతంశ్చాపి తిష్ఠన్ గచ్ఛన్ పునః పునః। 15

అపావృణ్వంశ్చ ద్వారాణి కవాటాన్యవఘాటయన్।
ప్రవిశన్ నిష్పతంశ్చాపి ప్రపతన్నుత్పతన్నపి। 16

సర్వమప్యవకాశం స విచచార మహాకపిః।
చతురంగుళమాత్రోఽపి నావకాశస్స విద్యతే।
రావణాంతఃపురే తస్మిన్ యం కపిర్న జగామ సః। 17

రావణునిఅంతఃపురమును పూర్తిగాగాలించితిని. రావణునికాంతలు అందఱును కనబడిరి. కాని సీతాసాధ్వి మాత్రము కనబడలేదు. సముద్రమును లఘించివచ్చిన నా ప్రయత్నమంతయును వృథాయైనది. (6)

నేను మఱలివెళ్లినచో నారాకకై నిరీక్షించుచుండు వానరులు అందఱును నాచుట్టునుజేరి ఏమందురోగదా! "ఓ వీరుడా! లంకకువెళ్లి నీవేమిచేసితివి? మాకు తెలుపుము" అని యడిగెదరు. (7)

ఆ జానకీదేవిని చూడకయే నేనువారికి ఏమని సమాధానమియ్యగలను? సమయముమించిపోయినచో వారు ప్రాయోపవేశము చేసెదరు. (8)

సముద్రమునుదాటి నేనువారిని జేరినచో నాతోగూడివచ్చిన పెద్దవాడైన జాంబవంతుడు, యువరాజైన అంగదుడు, తక్కినవానరులు ఏమందురో ఏమో? (9)

దిగులుపడకుండ ఉత్సాహముతోనుండుటవలన కార్యసిద్ధియు, పరమసుఖము కలుగును. కనుక నేను ఇంతవఱకును వెదకనిప్రదేశములనన్నింటిని గట్టిగా గాలింతును. (10)

ఎల్లవేళలను అన్నిసందర్భములలో ఉత్సాహము కలిగియుండుటయే శ్రేయస్కరము. అదియే మానవుల కార్యములను సఫలమొనర్చును. (11)

అందువలన దిగులుపడక గట్టిప్రయత్నమొనర్చెదను. ఇంతవఱకును వెదకని రావణపాలితప్రదేశముల నన్నింటిని అన్వేషింతును. (12)

పానశాలలుమొదలుకొని, పుష్పగృహములను, చిత్రశాలలను, క్రీడామందిరములనుసైతము పరికించి వెదకితిని. గృహోద్యానములను, అందలివీధులను, భవనములను పూర్తిగా గాలించితిని. ఐనను మఱల వెదకెదను." ఈ విధముగాఆలోచించి, ఆ మారుతి మఱల అన్వేషణకు దిగెను. (13-14)

భూగర్భగృహములను, దేవాలయములను, విహారార్థము దూరముగా నిర్మింపబడినగృహములను పట్టిపట్టి వెదకెను. ఎత్తైనప్రదేశములకు ఎగఱాకుచు దిగుచు నిలబడుచు, ముందునకు సాగుచు, తలుపులను తెఱచుచు, మూయుచు, లోనికిప్రవేశించుచు బయటికి వచ్చుచు, దిగుచు ఎక్కుచు, అన్ని ప్రదేశములయందును సంచరించెను. రావణాంతఃపురమున ఆ హనుమంతుడు వెదకనిస్థలమే లేదు. అతడు ప్రతి-అంగుళమూ గాలించివేసెను. (15-17)

ప్రాకారాంతరరథ్యాశ్చ వేదికాశ్చైత్యసంశ్రయాః।
దీర్ఘికాః పుష్కరిణ్యశ్చ సర్వం తేనావలోకితమ్। 18

ప్రాకారములమధ్యగలవీధులను, నాలుగుకూడళ్లను ఆశ్రయించియున్న మహావృక్షములను, అవటివేదికలను, దిగుడుబావులను, సరస్సులను అతడు పరిశీలించి చూచెను. (18)

రాక్షస్యో వివిధాకారా విరూపా వికృతా స్తథా।
దృష్టా హనుమతా తత్ర న తు సా జనకాత్మజా। 19

వికృతములైన వివిధాకారములుగలవారును, అంగ వికారములుగలవారును అగు రాక్షసస్త్రీలను హనుమంతుడుగాంచెను. కానిఆయనకు జానకిజాడ మాత్రము దొరకలేదు. (19)

రూపేణాప్రతిమా లోకే వరా విద్యాధరస్త్రియః।
దృష్టా హనుమతా తత్ర న తు రాఘవనందినీ। 20

లోకమునసాటిలేనిసౌందర్యముగల విద్యాధరస్త్రీలు మారుతికి అచట కనబడిరి. కాని రామపత్ని మాత్రము కనబడలేదు. (20)

నాగకన్యా వరారోహాః పూర్ణచంద్రనిభాననాః।
దృష్టా హనుమతా తత్ర న తు సీతా సుమధ్యమా। 21

పూర్ణచంద్రబింబమునంటి అందమైనముఖములు గలవారును, మంచిరూపవైభవముగలవారును అగు నాగకన్యలు ఆ హనుమంతునకు కనబడిరి- కాని చక్కని చుక్కసీతాదేవిమాత్రము కనబడలేదు. (21)

ప్రమథ్య రాక్షసేంద్రేణ నాగకన్యా బలాద్ధృతాః।
దృష్టా హనుమతా తత్ర న సా జనకనందినీ। 22

రావణునిచే బలాత్కారముగా తీసికొనిరాబడి, నిర్బంధములలోనున్న నాగకన్యలను మారుతిచూచెను. కాని జానకీదేవిమాత్రము కనబడలేదు. (22)

సోఽపశ్యంస్తాం మహాబాహుః పశ్యంశ్చాన్యా వరస్త్రియః।
విషసాద ముహుర్ధీమాన్ హనుమాన్ మారుతాత్మజః। 23

మహాబాహువు, బుద్ధిశాలియు, వాయునందనుడును ఐన హనుమంతుడు ఇతరసుందరీమణులను ఎందఱినో గాంచెను. కాని సీతాదేవిమాత్రము కనబడకుండుటచే అతడు మిక్కిలివిచారగ్రస్తుడయ్యెను. (23)

ఉద్యోగం వానరేంద్రాణాం ప్లవనం సాగరస్య చ।
వ్యర్థం వీక్ష్యానిలసుతః చింతాం పునరుపాగమత్। 24

సీతాన్వేషణకై కిష్కింధనుండి అన్నిదిక్కులకును వెళ్లిన వానరుల ప్రయత్నములును, తాను సముద్రమును లంఘించివచ్చుటయు వ్యర్థమైనవని భావించి, అనిలసుతుడు మఱల మిక్కిలిచింతాక్రాంతుడయ్యెను. (24)

అవతీర్య విమానాచ్చ హనుమాన్ మారుతాత్మజః।
చింతాముపజగామాథ శోకోపహతచేతనః। 25

వాయుసుతుడైనహనుమంతుడు విమానమునుండి క్రిందికిదిగి, మిక్కిలి కలవరపాటునకులోనైనవాడై దీర్ఘాలోచనలోపడెను. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ద్వాదశస్సర్గః *(12)*

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పండ్రెండవ సర్గము.

— * * * --

13. పదమూడవ సర్గము

సీతాదేవి గతించియుండునని శంకించి, హనుమంతుడు చింతించుట, ఆ వార్తను శ్రీరామునకెఱింగించుటవలన అనర్థములు కలుగునని భావించుట, అశోకవాటికలో వెదకుటకై ఆలోచించుట.

విమానాత్తు సుసంక్రమ్య ప్రాకారం హరియూథపః।
హనుమాన్ వేగవానాసీత్ యథా విద్యుద్ఘనాంతరే। 1

సంపరిక్రమ్య హనుమాన్ రావణస్య నివేశనాత్।
అదృష్ట్వా జానకీం సీతామ్ అబ్రవీద్వచనం కపిః। 2

భూయిష్ఠం లోళితా లంకా రామస్య చరతా ప్రియమ్।
న హి పశ్యామి వైదేహీం సీతాం సర్వాంగశోభనామ్। 3

పల్వలాని తటాకాని సరాంసి సరితస్తథా।
నద్యోఽనూపవనాంతాశ్చ దుర్గాశ్చ ధరణీధరాః।
లోళితా వసుధా సర్వా న తు పశ్యామి జానకీమ్। 4

ఇహ సంపాతినా సీతా రావణస్య నివేశనే।
ఆఖ్యాతా గృధ్రరాజేన న చ పశ్యామి తామహమ్। 5

కిం ను సీతాఽథ వైదేహీ మైథిలీ జనకాత్మజా।
ఉపతిష్ఠేత వివశా రావణం దుష్టచారిణమ్। 6

క్షిప్రముత్పతతో మన్యే సీతామాదాయ రక్షసః।
బిభ్యతో రామబాణానామ్ అంతరా పతితా భవేత్। 7

అథవా హ్రియమాణాయాః పథి సిద్ధనిషేవితే।
మన్యే పతితమార్యాయా హృదయం ప్రేక్ష్య సాగరమ్। 8

రావణస్యోరువేగేన భుజాభ్యాం పీడితేన చ।
తయా మన్యే విశాలాక్ష్యా త్యక్తం జీవితమార్యయా। 9

ఉపర్యుపరి వా నూనం సాగరం క్రమతస్తదా।
విచేష్టమానా పతితా సముద్రే జనకాత్మజా। 10

మేఘములమధ్య తళుక్కుమనిమెఱసి క్షణములో అందువిలీనమగు విద్యుల్లతవలె వానరోత్తముడైన హనుమంతుడు భవనమునుండి ప్రాకారమునకు త్రుటిలో చేరెను. (1)

హనుమంతుడు రావణగృహములను అన్నింటిని చుట్టివచ్చి, జానకిజాడ గానక అతడు తనలోతాను ఇట్లు అనుకొనెను. (2)

రామకార్యసాఫల్యమునకై సంచరించుచు లంకను పూర్తిగా గాలించితిని. కాని సర్వాంగసుందరియైన జనకసుతయగు సీతాదేవిజాడను మాత్రము కనుగొనలేక పోయితిని. (3)

చిన్నచిన్న నీటిగుంటలను, చెఱువులను, సరస్సులను, చిన్నచిన్నప్రవాహములను, నదులను, జలములతోనిండిన వనప్రాంతములను, దుర్గమములైన పర్వతములను- ఇది అది అనక లంకయందంతటను గాలించితిని. కాని జానకీదేవి మాత్రము కనబడలేదు. సీతాదేవి రావణునిలంకలోనే కలదని గృధ్రరాజైనసంపాతి నుడివియుండెను. కాని ఆమెజాడనుమాత్రము చిక్కించుకొనలేకపోయితిని.(4-5)

విదేహరాజైన జనకునిసుతయు, మైథిలియు ఐన సీతాదేవి చేయునదిలేక దుష్టప్రవృత్తిగలరావణునకు వశమైయుండునా? (ఇది అసంభవము) (6)

రావణుడు సీతాదేవిని అపహరించి, ఆమెను లంకకు తీసికొని వచ్చునప్పుడు రామునిబాణములు తనను వెంటాడి చంపునని భయపడినవాడై, ఎగిరి వేగముగా వచ్చియుండవచ్చును. అప్పుడు ఆమె మధ్యలోనే (సముద్రములో) పడిపోయినదేమో? (7)

లేదా! పూజ్యురాలైనసీత రావణాపహృతయై అతనిచే ఆకాశమార్గమున కొనిపోబడుచున్నప్పుడు క్రిందనున్న అపారసాగరమును జూచి, భయముతో గుండెపగిలి, సముద్రమున పడిపోయినదేమో? (8)

రావణుడుఅతివేగముగా ఆమెను తనభుజబలముచే తీసికొనిపోవుచున్నప్పుడు పరమపునీతయైన ఆ విశాలాక్షి తనప్రాణములను త్యజించియుండునని తలంతును-(9)

లేదా సముద్రమునకు పైపైన రావణుడామెను తీసికొని వెళ్లుచుండగా ఆమెపెనగులాడుచు సముద్రమున పడిపోయినదేమో? (10)

అహో క్షుద్రేణ వాఽనేన రక్షంతీ శీలమాత్మనః।
అబంధుర్భక్షితా సీతా రావణేన తపస్వినీ। 11

అయ్యో! ఆదుకొనువారు ఎవ్వరునులేక నిస్సహాయురాలై దీనావస్థకు గురియైన సీత తన శీలమును రక్షించుకొను ప్రయత్నమున నీచుడైన ఈ రావణునిచే భక్షింపబడినదేమో? (11)

అథవా రాక్షసేంద్రస్య పత్నీభిరసితేక్షణా।
అదుష్టా దుష్టభావాభిః భక్షితా సా భవిష్యతి। 12

అందమైనకనులుగలదియు, సౌశీల్యవతియు ఐన సీతాదేవినిజూచి, రావణునిభార్యలు అసూయాగ్రస్తలై ఆమెను భక్షించినారేమో? (12)

సంపూర్ణచంద్రప్రతిమం పద్మపత్రనిభేక్షణమ్।
రామస్య ధ్యాయతీ వక్త్రం పంచత్వం కృపణా గతా। 13

తామరరేకులవంటి నేత్రములుగలిగి, పూర్ణచంద్రుని బోలిన శ్రీరామునిముఖమును ధ్యానించుచు, దీనురాలైనసీత పతివిరహమును భరింపలేక అసువులను వీడినదేమో? (13)

హా రామ లక్ష్మణేత్యేవం హాయోధ్యే చేతి మైథిలీ।
విలప్య బహు వైదేహీ న్యస్తదేహా భవిష్యతి। 14

విదేహరాజసుతయైన ఆమైథిలి ఓ రామా! ఓ లక్ష్మణా! అయ్యో! అయోధ్యా! అని పలురీతుల విలపించుచు తన తనువును చాలించినదో ఏమో? (14)

అథవా నిహితా మన్యే రావణస్య నివేశనే।
నూనం లాలప్యతే సీతా పంజరస్థేవ శారికా। 15

అథవా! రావణునిగృహమున గోప్యముగా ఉంచబడిన సీత పంజరమున బంధింపబడిన గోరువంకవలె నిజముగా విలవిలలాడుచుండునని నేననుకొందును. (15)

జనకస్య సుతా సీతా రామపత్నీ సుమధ్యమా।
కథముత్పలపత్రాక్షీ రావణస్య వశం వ్రజేత్। 16

జనకమహారాజసుతయు, రామపత్నియు, సుమధ్యయు, ఉత్పలములవలె అందమైనకనులు గలదియు ఐన సీత రావణునకు వశమగుట అసంభవము. (16)

వినష్టా వా ప్రణష్టా వా మృతా వా జనకాత్మజా।
రామస్య ప్రియభార్యస్య న నివేదయితుం క్షమమ్। 17

జానకి తప్పిపోయినదనిగాని, కనబడలేదనిగాని, మృతి చెందినదనిగాని భార్యనుప్రాణముగా చూచుకొను శ్రీరామునకు తెలుపుట యుక్తముగాదు. (17)

నివేద్యమానే దోషస్స్యాత్ దోషస్స్యాదనివేదనే।
కథం ను ఖలు కర్తవ్యం విషమం ప్రతిభాతి మే। 18

ఇట్టివార్తను శ్రీరామునకుతెలుపుటయు దోషమే, తెలుపకుండటయు దోషమే. నాకువిషమసమస్య ఎదురైనది గదా! ఇపుడు నా కర్తవ్యమేమి? (18)

అస్మిన్నేవం గతే కార్యే ప్రాప్తకాలం క్షమం చ కిమ్।
భవేదితి మతం భూయో హనుమాన్ ప్రవిచారయత్। 19

తలపెట్టిన సీతాన్వేషణకార్యము ఇట్లైనది. ఇట్టి పరిస్థితులలో చేయదగినదేమి? అను ఊగిసలాటకులోనై హనుమంతుడు మరల దీర్ఘాలోచనలోపడెను. (19)

యది సీతామదృష్ట్వాఽహం వానరేంద్రపురీమితః।
గమిష్యామి తతః కో మే పురుషార్థో భవిష్యతి। 20

సీతాదేవిని జూడక (సీతజాడదెలిసికొనక) ఒకవేళ నేను ఇట్లే కిష్కింధకువెళ్లినచో నేను ఏ పురుషార్థమును సాధించినట్లు? (20)

మమేదం లంఘనం వ్యర్థం సాగరస్య భవిష్యతి।
ప్రవేశశ్చైవ లంకాయా రాక్షసానాం చ దర్శనమ్। 21

(సీతాదేవిఆచూకీని తెలిసికొనకొనకుండవెళ్లినచో) నేను ఇంతగాశ్రమపడిసాగరమును లంఘించుటయు వ్యర్థమే. లంకలోప్రవేశించుటయు, రాక్షసులను జూచుటయు వ్యర్థాయే- (21)

కిం మాం వక్ష్యతి సుగ్రీవో హరయో వా సమాగతాః।
కిష్కింధాం సమనుప్రాప్తం తౌ వా దశరథాత్మజౌ। 22

ఈ స్థితిలో కిష్కింధయందు అడుగిడినచో నన్ను జూచి, సుగ్రీవుడేమనునో? తోడివానరులు ఏమందురో? ఆ రామలక్ష్మణులు ఏమని పలుకుదురో? (22)

గత్వా తు యది కాకుత్స్థం వక్ష్యామి పరమప్రియమ్।
న దృష్టేతి మయా సీతా తతస్త్యక్ష్యతి జీవితమ్। 23

కిష్కింధకువెళ్లి "సీత నాకు కనబడలేదు" అను మిక్కిలిఅప్రియమైనవచనమును రామునితోపల్కినచో తత్క్షణమే అతడు జీవితమును చాలించును. (23)

పరుషం దారుణం క్రూరం తీక్ష్ణమింద్రియతాపనమ్।
సీతానిమిత్తం దుర్వాక్యం శ్రుత్వా స న భవిష్యతి। 24

సీతజాడనుగూర్చి, కఠినాతికఠినమైన, దారుణమైన, క్రూరమైన, మిక్కిలితీవ్రమైన, ఇంద్రియములను దహించి వేయునట్టి "నదృష్టామయాసీతా" అను దుర్వార్తను విన్నచో ఆ సీతాపతి మిగులడు. (24)

తం తు కృచ్ఛ్రగతం దృష్ట్వా పంచత్వగతమానసమ్।
భృశానురక్తో మేధావీ న భవిష్యతి లక్ష్మణః। 25

తీవ్రవేదనకుగురియై, మరణోన్ముఖుడైన శ్రీరాముని జూచి, ఆయనయందు అత్యంతానురక్తుడైన ధీశాలియైన లక్ష్మణుడును జీవింపడు. (25)

వినష్టౌ భ్రాతరౌ శ్రుత్వా భరతోఽపి మరిష్యతి।
భరతం చ మృతం దృష్ట్వా శత్రుఘ్నో న భవిష్యతి। 26

ఇద్దఱుసోదరుల (రామలక్ష్మణుల) మరణవార్త వినగానే భరతుడును మృతిచెందును. భరతుడు మరణించుటను జూచి, శత్రుఘ్నుడును జీవింపడు. (26)

పుత్రాన్ మృతాన్ సమీక్ష్యాథ న భవిష్యంతి మాతరః।
కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ న సంశయః। 27

పుత్రులమరణవార్తలను విన్నంతనే కౌసల్యా, సుమిత్రా, కైకేయీమాతల అసువులు అనంతవాయువులలో గలియుట నిశ్చయము. (27)

కృతజ్ఞస్సత్యసంధశ్చ సుగ్రీవః ప్లవగాధిపః।
రామం తథాగతం దృష్ట్వా తతస్త్యక్ష్యతి జీవితమ్। 28

వానరప్రభువైన సుగ్రీవుడు సత్యసంధుడు, చేసిన మేలు మఱువని వాడు, రామునకు ప్రియమిత్రుడు, కనుక రాముడు మృతిచెందగనే అతడును జీవితమును చాలించును.(28)

దుర్మనా వ్యథితా దీనా నిరానందా తపస్వినీ।
పీడితా భర్తృశోకేన రుమా త్యక్ష్యతి జీవితమ్। 29

పతి మృతికి శోకాకులయైన'రుమ'యు మిక్కిలి వ్యథితయై, దీనురాలై ఆనందమునుకోల్పోయినదై పరితాపముతో కుమిలికుమిలి తనప్రాణములను విడుచును. (29)

వాలిజేన తు దుఃఖేన పీడితా శోకకర్శితా।
పంచత్వం చ గతే రాజ్ఞి తారాఽపి న భవిష్యతి। 30

వాలి మరణకారణముగా దుఃఖములో మునిగియున్న తారయు రాజైనసుగ్రీవుడు మరణించినచో దుఃఖాక్రాంతయై అసువులను వీడును- (30)

మాతాపిత్రోర్వినాశేన సుగ్రీవవ్యసనేన చ।
కుమారోఽప్యంగదః కస్మాత్ ధారయిష్యతి జీవితమ్। 31

తల్లితండ్రులను కోల్పోయిన, పసివాడైన అంగదకుమారుడు సుగ్రీవుడును మృతి చెందినచో ఎట్లు జీవించును? (31)

భర్తృజేన తు దుఃఖేన హ్యభిభూతా వనౌకసః।
శిరాంస్యభిహనిష్యంతి తలైర్ముష్టిభిరేవ చ। 32

ప్రభువైనసుగ్రీవుడు మరణించినచో వానరులందఱును పట్టరానిదుఃఖమునకులోనై అరచేతులతో, పిడికిళ్లతో తమ తలలను బాదుకొందురు. (32)

సాంత్వేనానుప్రదానేన మానేన చ యశస్వినా।
లాలితాః కపిరాజేన ప్రాణాంస్త్యక్ష్యంతి వానరాః। 33

వాసిగాంచిన సుగ్రీవునిచే వానరులందఱును అనునయ వచనములతోను, బహుమతులతోను సగౌరవముగా ఇంతవఱకును లాలింపబడుచుండిరి. కనుక సుగ్రీవుడు మరణించినచో వారుసుప్రాణములను త్యజించెదరు- (33)

న వనేషు న శైలేషు న నిరోధేషు వా పునః।
క్రీడామనుభవిష్యంతి సమేత్య కపికుంజరాః। 34

వనములయందుగాని, పర్వతములపైగాని, గృహాదుల ఆవరణములయందుగాని కపీశ్వరులందఱును గలిసి క్రీడాసుఖములను అనుభవింపజాలరు- (34)

సపుత్త్రదారాస్సామాత్యా భర్తృవ్యసనపీడితాః।
శైలాగ్రేభ్యః పతిష్యంతి సమేషు విషమేషు చ। 35

వానరులందఱును సుగ్రీవునియెడబాటునకు తట్టుకొనలేనివారై, భార్యాపుత్రులతోను, సహచరులతోను పర్వతశిఖరములనుండి సమతలములపైనను, ఎగుడు దిగుడుప్రదేశములలోను పడిపోయెదరు. (35)

విషముద్బంధనం వాపి ప్రవేశం జ్వలనస్య వా।
ఉపవాసమథో శస్త్రం ప్రచరిష్యంతి వానరాః। 36

వానరులు విషముతినిగాని, ఉరిబోసికొనిగాని, మంటలలో దూకిగాని అన్నపానములుమానిగాని, ఆయుధములతో పొడుచుకొనిగాని, ప్రాణములను త్యజింతురు- (36)

ఘోరమారోదనం మన్యే గతే మయి భవిష్యతి।
ఇక్ష్వాకుకులనాశశ్చ నాశశ్చైవ వనౌకసామ్। 37

నేను కిష్కింధకువెళ్లినచో ఇక్ష్వాకువంశము అంతరించును. వానరులందఱును గతించెదరు, భయంకరమైన రోదనధ్వనులు అంతటనువినిపించును. (37)

సోఽహం నైవ గమిష్యామి కిష్కింధాం నగరీమితః।
న చ శక్ష్యామ్యహం ద్రష్టుం సుగ్రీవం మైథిలీం వినా। 38

కనుక ఇచ్చటినుండి కిష్కింధానగరమునకు వెళ్లను. సీతాదేవిజాడను తెలిసికొనకుండ సుగ్రీవునియెదుట నిలబడుట నావలన కానిపని. (38)

మయ్యగచ్ఛతి చేహస్థే ధర్మాత్మానౌ మహారథౌ।
ఆశయా తౌ ధరిష్యేతే వానరాశ్చ మనస్వినః। 39

నేనచటికి వెళ్లకుండ ఇచ్చటనేయున్నచో ధర్మాత్ములును మహారథులునువైన రామలక్ష్మణులును, బుద్ధిమంతులైన వానరులును (శుభవార్తతో హనుమంతుడు తిరిగి వచ్చునను)ఆశతో జీవింతురు. (39)

హస్తాదానో ముఖాదానో నియతో వృక్షమూలికః।
వానప్రస్థో భవిష్యామి హ్యదృష్ట్వా జనకాత్మజామ్। 40

సాగరానూపజే దేశే బహుమూలఫలోదకే।
చితాం కృత్వా ప్రవేక్ష్యామి సమిద్ధమరణీసుతమ్। 41

సీతాదేవిజాడను తెలిసికొనలేకున్నచో కందమూల ఫలములు ఉదకములు సమృద్ధిగా గల సాగరతీరమున, వృక్షమూలములను ఆశ్రయించినవాడనై చేతికిని, నోటికిని అందిన ఆహారమును భుజించుచు జితేంద్రియుడనై, వానప్రస్థుడనై కాలము గడిపెదను. లేదా! చితిని పేర్చుకొని ప్రజ్వలించుచున్న (అరణిని మథించుట వలన కలిగిన) పవిత్రాగ్నిలో ప్రవేశించెదను. (40-41)

ఉపవిష్టస్య వా సమ్యగ్లింగినం సాధయిష్యతః।
శరీరం భక్షయిష్యంతి వాయసాశ్శ్వాపదాని చ। 42

లేదా! ప్రాయోపవేశమునుబూని, యోగసాధనద్వారా జీవాత్మకు శరీరసంబంధమును దూరమొనర్చి, ప్రాణములను త్యజించెదను. అప్పుడు ఈశరీరమును కాకులుగాని, పులులు మొదలగు క్రూరమృగములుగాని భక్షింపగలవు. (42)

ఇదం మహర్షిభిర్దృష్టం నిర్యాణమితి మే మతిః।
సమ్యగాపః ప్రవేక్ష్యామి న చేత్ పశ్యామి జానకీమ్। 43

జానకి కనబడకున్నచో జలసమాధి ద్వారా వనను ఆసువులను వీడెదను. ఇది మహర్షులు సమ్మతించిన నిర్యాణ (దేహత్యాగ) మార్గము- అని నా భావన. (43)

సుజాతమూలా సుభగా కీర్తిమాలా యశస్వినీ।
ప్రభగ్నా చిరరాత్రీయం మమ సీతామపశ్యతః। 44

ఈ రాత్రిప్రారంభవేళలో లంకాధిదేవతను నేను జయించితిని. కనుక ఇది నాకు శుభదాయకమైనరాత్రి. చంద్రోదయముతో రమ్యమై సీతాన్వేషణకు అనుకూలించినది గాన ఇది సుభగ. ప్రారంభమున విజయమును, కీర్తిని కల్గించినందున ఇది నాకు కీర్తిదాయిని. నేను (హనుమంతుడు) లంకలో ప్రవేశించిన రాత్రిగా' ఖ్యాతికెక్కినదిగాన ఇది 'విఖ్యాత' జాగరణ వలన నాకు

తాపసో వా భవిష్యామి నియతో వృక్షమూలికః।
నేతః ప్రతిగమిష్యామి తామదృష్ట్వాసితేక్షణామ్। 45

యదీతః ప్రతిగచ్ఛామి సీతామనధిగమ్య తామ్।
అంగదస్సహ తైస్సర్వైః వానరైర్న భవిష్యతి। 46

వినాశే బహవో దోషా జీవన్ భద్రాణి పశ్యతి।
తస్మాత్ ప్రాణాన్ ధరిష్యామి ధ్రువో జీవితసంగమః। 47

ఏవం బహువిధం దుఃఖం మనసా ధారయన్ ముహుః।
నాధ్యగచ్ఛత్ తదా పారం శోకస్య కపికుంజరః। 48

తతో విక్రమమాసాద్య ధైర్యవాన్ కపికుంజరః।
రావణం వా వధిష్యామి దశగ్రీవం మహాబలమ్।
కామమస్తు హృతా సీతా ప్రత్యాచీర్ణం భవిష్యతి। 49

అథ వైనం సముత్క్షిప్య హ్యుపర్యుపరి సాగరమ్।
రామాయోపహరిష్యామి పశుం పశుపతేరివ। 50

ఇతి చింతాం సమాపన్నః సీతామనధిగమ్య తామ్।
ధ్యానశోకపరీతాత్మా చింతయామాస వానరః। 51

యావత్ సీతాం హి పశ్యామి రామపత్నీం యశస్వినీమ్।
తావదేతాం పురీం లంకాం విచినోమి పునః పునః। 52

సంపాతివచనాచ్చాపి రామం యద్యానయామ్యహమ్।
అపశ్యన్ రాఘవో భార్యాం నిర్దహేత్ సర్వవానరాన్। 53

ఇది దీర్ఘమైనది కనుక ఇది 'చిరరాత్రి' ఇంతవఱకును శుభములే కలిగినవి కాని సీతాదేవిజాడ తెలిసికొనలేకపోయినచో ఇవియన్నియును బూడిదలో పోసినపన్నీరే యగును. అందమైనకనులుగల సీతాదేవిని గాంచక ఇచటినుండి నేను వెళ్లనేవెళ్లను. దేహత్యాగముచేయుటకంటెను తాపసిగా ఉండుటయే మేలు. కనుక వృక్షమూలములను ఆశ్రయించి, నియమములను పాటించుచు తపస్వినయ్యెదను. (44 - 45)

పూజ్యురాలైన సీతాదేవిని దర్శింపక ఇచటినుండి నేను మిత్రులకడకు మఱలివెళ్లినచో అంగదాది వానరు లెవ్వరును జీవింపరు. (46)

మరణించుటవలన పెక్కు (పూర్వోక్త) ప్రమాదములు సంభవింపవచ్చును. బ్రతికియుండిన సుఖముల బడయవచ్చు. బ్రతికియున్నవారు ఎన్నడైనను మేలుల కలిసికొనుట నిశ్చయము.[1] అందువలన నేను ప్రాణములను నిలుపుకొందును- (47)

హనుమంతుడు ఇట్లు మనస్సునందు పరిపరివిధముల దుఃఖపడుచు శోకమునుండి బయటపడలేకపోయెను. (48)

అనంతరము ధైర్యశాలియైనమారుతి పరాక్రమమును ప్రకటించుచు ఇట్లనుకొనెను. కానున్నది కానిమ్ము, అపహరింపబడినసీత విషయమేమైనను మహాబలవంతుడును, దశకంఠుడునగు ఆరావణుని హతమార్చెదను. దానితో నా పగతీఱును. (49)

అథవా ఈరావణుని సముద్రముమీదుగా ఎత్తుకొనిపోయి, పశువును అగ్నికి[2] ఆహుతిగా సమర్పించినట్లు వీనిని శ్రీరామునకు అర్పించెదను.' (50)

ఈవిధముగాపరిపరివిధముల ఆలోచనలలో మునిగిన హనుమంతుడు ఆ సీతాదేవి కనబడనందున మిక్కిలి శోకాకులుడై ఆమెజాడను తెలిసికొనుధ్యాసతో ఇట్లు చింతింపసాగెను. (51)

రామపత్నియు, లోకవిఖ్యాతయునగు ఆ సీతాదేవి దర్శనమగువఱకును ఈ లంకానగరమును మఱీమఱీ గాలించెదను. (52)

సంపాతిమాటలమేరకు సీతాదేవిజీవించియున్నదని భావించి, ఒకవేళనేను శ్రీరాముని ఇక్కడికి తీసికొనివచ్చినచో ఆ రాఘవుడు భార్యనుగానక కుపితుడై వానరులనందఱిని మట్టుపెట్టును. (53)

1) ఈ సూక్తి లోకోపకారకమైన 'మహోపదేశము'. కనుక ఎవ్వరును ఎట్టి పరిస్థితులలోను ఆత్మహత్యకు పూనుకొనరాదు.
2) "ఇమం పశుం పశుపతే అద్య బధ్నామ్యగ్న" (తైత్తిరీయసంహిత)

ఇహైవ నియతాహారో వత్స్యామి నియతేంద్రియః।
న మత్కృతే వినశ్యేయుః సర్వే తే నరవానరాః। 54

కనుక ఆహారనియమములతో ఇంద్రియనిగ్రహము గలవాడనై, ఇచటనే నివసింతును. నాకారణముగా నరవానరులెల్లరును నశించుట యుక్తము గాదు. (54)

అశోకవనికా చేయం దృశ్యతే యా మహాద్రుమా।
ఇమామధిగమిష్యామి న హీయం విచితా మయా। 55

మహావృక్షములతోనిండి, ఎదురుగా కనబడుచున్న ఈ అశోకవనమును ఇంతవఱకును నేను వెదకలేదు. దానిని ఇప్పుడు గాలించెదను. (55)

వసూన్ రుద్రాంస్తథాఽఽదిత్యాన్ అశ్వినౌ మరుతోఽపి చ।
నమస్కృత్వా గమిష్యామి రక్షసాం శోకవర్ధనః। 56

అష్టవసువులకును, ఏకాదశరుద్రులకును, ద్వాదశాదిత్యులకును, అశ్వినీదేవతలకును, మరుత్తులకును నమస్కరించి, రాక్షసులకు శోకవర్ధనుడనైన నేను ఈఅశోకవనమునందు అడుగిడెదను. (56)

జిత్వా తు రాక్షసాన్ సర్వాన్ ఇక్ష్వాకుకులనందినీమ్।
సంప్రదాస్యామి రామాయ యథా సిద్ధిం తపస్వినే। 57

నేనురాక్షసులందఱిని జయించి, ఇక్ష్వాకువంశమునకు ఆనందదాయినియైన సీతాసాధ్విని, ఒక మహాతపస్వికి తపఃఫలమునువలె శ్రీరామునకు సమర్పింతును. (57)

స ముహూర్తమివ ధ్యాత్వా చింతావగ్రథితేంద్రియః।
ఉదతిష్ఠన్ మహాతేజా హనుమాన్ మారుతాత్మజః। 58

మహాతేజశ్శాలియైన వాయుసుతుడగు ఆ హనుమంతుడు చింతావ్యాకులుడై క్షణకాలముపాటు ధ్యానమగ్నుడాయెను. అశోకవనమును ప్రవేశించుటకు ఉద్యుక్తుడై లేచినిలబడెను. (58)

నమోఽస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యై చ తస్యై జనకాత్మజాయై।
నమోఽస్తు రుద్రేంద్రయమానిలేభ్యో
నమోఽస్తు చంద్రార్కమరుద్గణేభ్యః। 59

శ్రీరామునకు నమస్కారము. జనకసుతయైన సీతామాతకు ప్రణతి, లక్ష్మణునకునమస్కారము. రుద్రునకు, ఇంద్రునకు, యమునికి, వాయుదేవునకు నమస్కారములు. సూర్యచంద్రులకును మరుద్దేవతలకును నమస్కారములు.(59)

స తేభ్యస్తు నమస్కృత్య సుగ్రీవాయ చ మారుతిః।
దిశస్సర్వాస్సమాలోక్య హ్యశోకవనికాం ప్రతి। 60

మారుతి వారందఱితోపాటు సుగ్రీవునకును నమస్కరించి, అశోకవనమునకు వెళ్లుసంకల్పముతో అన్ని దిక్కులను కలయజూచెను. (60)

స గత్వా మనసా పూర్వమ్ అశోకవనికాం శుభామ్।
ఉత్తరం చింతయామాస వానరో మారుతాత్మజః। 61

వాయునందనుడైన హనుమంతుడు ముందుగా అందమైన అశోకవనమునకేగుటకు మనస్సున నిశ్చయించుకొని, అనంతరకర్తవ్యమునుగూర్చి ఆలోచింపసాగెను. (61)

ధ్రువం తు రక్షోబహులా భవిష్యతి వనాకులా।
అశోకవనికాఽచింత్యా సర్వసంస్కారసంస్కృతా। 62

అశోకవనము అవశ్యము రాక్షసులమూకలతో నిండియే యుండును. అది వృక్షములతో కూడియుండును. అది అన్నివిధములుగా అలంకృతమై, మహావనలక్షణములతో అందముగా ఒప్పుచుండును. (ఇంతవఱకును దానిని నేను వెదకిచూడలేదు.) (62)

రక్షిణశ్చాత్ర విహితా నూనం రక్షంతి పాదపాన్।
భగవానపి సర్వాత్మా నాతిక్షోభం ప్రవాతి వై। 63

అచ్చట వనవృక్షరక్షణకై భటులుతప్పక నియమింపబడి యుందురు. సర్వాత్ముడైన వాయుదేవుడు గూడ మితవేగముతో వీచుచుండును. (63)

సంక్షిప్తో౽యం మయాత్మా చ రామార్థే రావణస్య చ।
సిద్ధిం మే సంవిధాస్యంతి దేవాస్సర్షిగణాస్త్విహ॥ 64

రావణుని కంటబడకుండ రామకార్యసిద్ధికై నేను సూక్ష్మరూపమును ధరించితిని. దేవతలును, మహర్షులును ఇక్కడ నాకు కార్యసాఫల్యమును సమకూర్చెదరు గాక.(64)

బ్రహ్మా స్వయంభూర్భగవాన్ దేవాశ్చైవ దిశంతు మే।
సిద్ధిమగ్నిశ్చ వాయుశ్చ పురుహూతశ్చ వజ్రభృత్॥ 65

వరుణః పాశహస్తశ్చ సోమాదిత్యౌ తథైవ చ।
అశ్వినౌ చ మహాత్మానౌ మరుతశ్శర్వ ఏవ చ॥ 66

స్వయంభువువైన బ్రహ్మదేవుడు, ఇతర దేవతలును, అగ్నియు, వాయుదేవుడు, వజ్రాయుధుడైన ఇంద్రుడు, పాశహస్తుడైనవరుణుడును, అట్లే సూర్యచంద్రులును, మహాత్ములైన అశ్వినీదేవతలును, మరుత్తులును, శివుడును నాకు కార్యసిద్ధిని ప్రసాదింతురుగాక.(65-66)

సిద్ధిం సర్వాణి భూతాని భూతానాం చైవ యః ప్రభుః।
దాస్యంతి మమ యే చాన్యే హ్యదృష్టాః పథి గోచరాః॥ 67

సమస్తభూతములును, సమస్తజీవకోటికి అధిపతియైన శ్రీమహావిష్ణువు, అదృశ్యమార్గమునచరించు ఇతర దేవతలు నాకుకార్యసిద్ధిని కలిగించెదరు గాక. (67)

తదున్నసం పాండురదంతమవ్రణం
శుచిస్మితం పద్మపలాశలోచనమ్।
ద్రక్ష్యే తదార్యావదనం కదా న్వహం
ప్రసన్నతారాధిపతుల్యదర్శనమ్ ॥ 68

అందమైననాసికతోను, స్వచ్ఛమైనదంతపంక్తులతోను, ఆహ్లాదకరమైనచిఱునవ్వుతోను, తామరరేకులవంటి కన్నులతోను, విలసిల్లుచు పూర్ణచంద్రునివలె ప్రసన్నమై దర్శనీయమై, అత్యంతమనోహరమైన ఆ సీతాదేవి వదనమును దర్శించు భాగ్యము నాకు ఎప్పుడు కల్గునో గదా! (68)

క్షుద్రేణ పాపేన నృశంసకర్మణా
సుదారుణాలంకృతవేషధారిణా।
బలాభిభూతా హ్యబలా తపస్వినీ
కథం ను మే దృష్టిపథే౽ద్య సా భవేత్॥ 69

రావణుడు నీచుడు, పాపి, క్రూరకర్మలను ఆచరించువాడు, అతిభయంకర స్వభావముగలవాడైనను తిలకము, త్రిపుండ్రములు మొదలగు అలంకారములు గలిగియుండువాడు. అట్టివానిచే బలవంతముగా అపహరింపబడినదియు, అబలయు, అనుక్షణము శ్రీరామునే ధ్యానించుచున్నదియు అగు ఆ సీతాదేవిని నేనుఎట్లు దర్శింపగలనోగదా! (69)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే త్రయోదశస్సర్గః (13)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పదుమూడవ సర్గము.

-- * * * --

14. పదునాల్గవ సర్గము

హనుమంతుడు అశోకవాటికలోప్రవేశించి, దాని శోభలను తిలకించుట, ఒకశింశుపావృక్షమందు దాగియుండి అటనుండియే సీతను అన్వేషించుట.

స ముహూర్తమివ ధ్యాత్వా మనసా చాధిగమ్య తామ్।
అవప్లుతో మహాతేజాః ప్రాకారం తస్య వేశ్మనః॥ 1

మహాతేజశ్శాలియైన ఆ హనుమంతుడు క్షణకాలముపాటు సీతాదేవిని మనస్సున ధ్యానించి, మానసికముగా అశోకవనమును చేరెను. పిమ్మట రావణునిభవనమునుండి అశోకవనప్రాకారము మీదికి దుమికెను. (1)

స తు సంహృష్టసర్వాంగః ప్రాకారస్థో మహాకపిః।
పుష్పితాగ్రాన్ వసంతాదౌ దదర్శ వివిధాన్ ద్రుమాన్। 2

సాలానశోకాన్ భవ్యాంశ్చ చంపకాంశ్చ సుపుష్పితాన్।
ఉద్దాలకాన్ నాగవృక్షాన్ చూతాన్ కపిముఖానపి। 3

అథామ్రవణసంఛన్నాన్ లతాశతసమావృతాన్।
జ్యాముక్త ఇవ నారాచః పుప్లువే వృక్షవాటికామ్। 4

స ప్రవిశ్య విచిత్రాం తాం విహగైరభినాదితామ్।
రాజతైః కాంచనైశ్చైవ పాదపైస్సర్వతో వృతామ్। 5

విహగైర్మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్।
ఉదితాదిత్యసంకాశాం దదర్శ హనుమాన్ కపిః। 6

వృతాం నానావిధైర్వృక్షైః పుష్పోపగఫలోపగైః।
కోకిలైర్భృంగరాజైశ్చ మత్తైర్నిత్యనిషేవితామ్। 7

ప్రహృష్టమనుజే కాలే మృగపక్షిసమాకులే।
మత్తబర్హిణసంఘుష్టాం నానాద్విజగణాయుతామ్। 8

మార్గమాణో వరారోహాం రాజపుత్రీమనిందితామ్।
సుఖప్రసుప్తాన్ విహగాన్ బోధయామాస వానరః। 9

ఉత్పతద్భిర్ద్విజగణైః పక్షైస్సాలాస్సమాహతాః।
అనేకవర్ణా వివిధా ముముచుః పుష్పవృష్టయః। 10

పుష్పావకీర్ణశ్శుశుభే హనుమాన్ మారుతాత్మజః।
అశోకవనికామధ్యే యథా పుష్పమయో గిరిః। 11

దిశస్సర్వాః ప్రధావంతం వృక్షషండగతం కపిమ్।
దృష్ట్వా సర్వాణి భూతాని వసంత ఇతి మేనిరే। 12

ప్రాకారముమీదికిచేరిన ఆ మహాకపివరుడు పులకితగాత్రుడై, వసంతఋతుప్రారంభమున సమృద్ధిగా పుష్పములతోనిండిన వివిధములగు మహావృక్షములను దర్శించెను- (2)

మద్దిచెట్లు, అందమైనఅశోకవృక్షములు, విరబూసిన సంపెంగలు, విరిగిచెట్లు, పొన్నచెట్లు, మామిడిచెట్లు, కోతిమామిడిచెట్లు మొదలగువాటినిజూచుచు, మామిడి తోపులచేఆవరింపబడినదియు, వందలకొలదిలతలచే నిండినదియు అగు వృక్షవాటికను ధనుస్సునుండి ప్రయోగింపబడిన బాణమువలె మారుతి వేగముగా ఒక్క గంతులో చేరెను. (3-4)

అతడు చిత్రవిచిత్రముగానున్నవృక్షవాటికలో ప్రవేశించి, పక్షులకిలకిలారావములతో విలసిల్లుచున్నదియు, అంతటను వెండిబంగారువన్నెలుగలచెట్లతో అలరారుచున్నదియు, వివిధములగు పక్షులతో, పలురంగులుగల లేళ్లగుంపులతో విచిత్రముగా ఉన్నట్టిదియు, ఉదయభానునికాంతులతో తేజరిల్లుచున్నదియుఅగు ఆ చిత్రకాననమును ఆ హనుమంతుడు దర్శించెను. (5-6)

మానవులకుఆహ్లాదకారియు, మృగములకును పక్షులకును ఉల్లాసమునుగూర్చునదియు, వసంత ఋతువునందు పుష్పఫలసంపన్నములైన నానావిధ వృక్షములతోకూడినదియు, మత్తిల్లిన కోకిలలచేతను, గండుతుమ్మెదలతోడను సేవింపబడుచున్నదియు, హాయిగావిహరించునెమళ్లకు ఆశ్రయమైనదియు, నానావిధములైనపక్షిగణములకు ఆటపట్టైనదియుఅగు ఆ చిత్రవనమును కపీశ్వరుడు గాంచెను. (7-8)

సర్వశుభలక్షణసంపన్నయు, సౌందర్యరాశియుఅగు జనకసుతను వెదకుచు హనుమంతుడు సుఖనిద్రలోనున్న పక్షులనుమేల్కొల్పెను. (9)

పైకెగురుచున్న పక్షులరెక్కలతాకిడి కారణముగా అచటి వృక్షములన్నియు పలువన్నెలుగల వివిధ పుష్పములను వర్షించెను. (10)

వాయుసుతుడైన హనుమంతునిపై ఆ పూవులన్నియును జలజలరాలెను. ఆ పుష్పరాశిలో మునిగిన మారుతి అశోకవనమధ్యమున పుష్పమయమైన ఒకపర్వతమువలె విరాజిల్లుచుండెను. (11)

మారుతి ఆ మహావృక్షములపైచేరి, అన్ని వైపులకును గంతులిడుచు వెళ్లుచుండగా చూచిన ప్రాణులన్నియును అతడు వసంతుడేమోయని తలపోసెను. (12)

వృక్షేభ్యః పతితైః పుష్పైః అవకీర్ణా పృథగ్విధైః।
రరాజ వసుధా తత్ర ప్రమదేవ విభూషితా। 13

వృక్షములనుండిరాలిన నానావిధములగుపుష్పములతో కప్పబడిన వసుధ పూర్తిగాఅలంకారములతోగూడిన నారీమణివలె రాజిల్లుచుండెను. (13)

తరస్వినా తే తరవః తరసాభిప్రకంపితాః।
కుసుమాని విచిత్రాణి ససృజుః కపినా తదా। 14

మహాబలశాలియైన ఆ హనుమంతుడు తనబలము కొలది అచటివృక్షములను అటునిటు కదల్చగా వాటినుండి చిత్రవిచిత్రములైన పూవులు రాలినవి. (14)

నిర్ధూతపత్రశిఖరాః శీర్ణపుష్పఫలా ద్రుమాః।
నిక్షిప్తవస్త్రాభరణా ధూర్తా ఇవ పరాజితాః। 15

హనుమంతునిచేత బలముగాకదల్చబడిన వృక్షములనుండి ఆకులు, పూవులు, ఫలములు పూర్తిగా రాలిపోయినవి. అప్పుడా బోసిపోయినచెట్లు జూదములో పూర్తిగాఓడిపోయి, వస్త్రాభరణములనుసైతము కోల్పోయిన జూదరులవలె[1] ఒప్పుచుండెను. (15)

హనూమతా వేగవతా కంపితాస్తే నగోత్తమాః।
పుష్పపర్ణఫలాన్యాశు ముముచుః పుష్పశాలినః। 16

విహంగసంఘైర్హీనాస్తే స్కంధమాత్రాశ్రయా ద్రుమాః।
బభూవురగమాస్సర్వే మారుతేనేవ నిర్ధుతాః। 17

మహాశక్తిశాలియైన వాయుసుతుడు ఫలపుష్పములతో నిండిన వృక్షములను పూర్తిగా కదల్చెను. అప్పుడవి వెంటనే పుష్పములను ఆకులను, ఫలములను రాల్చినవి. కావున పక్షులుసైతము ఎగిరిపోవుటచే మోడులైపోయిన ఆ చెట్లన్నియు పెనుగాలులతాకిడికి లోనైనవాటివలె బోదెలతో మాత్రమే మిగిలి, ఆశ్రయించువారులేక నిరుపయోగములై యుండెను. (16-17)

నిర్ధూతకేశీ యువతిః యథా మృదితవర్ణకా।
నిష్పీతశుభదంతోష్ఠీ నఖైర్దంతైశ్చ విక్షతా। 18

తథా లాంగూలహస్తైశ్చ చరణాభ్యాం చ మర్దితా।
బభూవాశోకవనికా ప్రభగ్నవరపాదపా। 19

మారుతియొక్క తోకచేతను, కరములచేతను, పాదముల చేతనుమర్దింపబడి, ఆవనమునందలి వృక్షములు మిక్కిలి భగ్నములైనవి. అప్పుడు ఆ అశోకవనము ప్రియుడుగావించిన శృంగారచేష్టలవలన నలిగినదై, చెదరిన జుట్టుతో, రాలిపోయిన మైపూతలతో ఒప్పుచున్న యువతివలె గోచరించుచుండెను. (18-19)

మహాలతానాం దామాని వ్యధమత్తరసా కపిః।
యథా ప్రావృషి వింధ్యస్య మేఘజాలాని మారుతః। 20

వర్షాకాలమునందు పెనుగాలులు వింధ్యపర్వతముపై గల మేఘపంక్తులను చెదరగొట్టినట్లు ఆ మారుతి తనబలముచేత మహాలతావలయములను ఛేదించెను. (20)

స తత్ర మణిభూమీశ్చ రాజతీశ్చ మనోరమాః।
తథా కాంచనభూమీశ్చ దదర్శ విచరన్ కపిః। 21

ఆ హనుమంతుడు అటునిటుసంచరించుచు మణులు పొదుగబడుటచే మనోహరములైన వెండి బంగారు భూములను (వేదికలను)చూచెను. (21)

వాపీశ్చ వివిధాకారాః పూర్ణాః పరమవారిణా।
మహార్హైర్మణిసోపానైః ఉపపన్నాస్తతస్తతః। 22

వివిధములైన ఆకారములుగలిగి, స్వచ్ఛములైన మధురజలములతోనిండి, శ్రేష్ఠములైనమణిమయ సోపానములతో ఒప్పుచున్న దిగుడుబావులను ఆ మారుతి అచ్చటచ్చటగాంచెను,

1) జూదరులు మిక్కిలి వ్యసనమునకు లోనగుదురు. వారు వివేకభ్రష్టులై అమూల్యములైన వస్తువులనుసైతము కడకు తమవస్త్రములనుగూడ జూదమునందు పణముగా పెట్టుచుందురు. వాటిని ఓడిపోయినను సిగ్గుపడరు. కావున జూదములాడుట ప్రమాదకరము.

ముక్తాప్రవాళసికతాః స్ఫాటికాంతరకుట్టిమాః।
కాంచనైస్తరుభి శ్చిత్రైః తీరజైరుపశోభితాః। 23

ఫుల్లపద్మోత్పలవనాః చక్రవాకోపకూజితాః।
నత్యూహరుతసంఘుష్టా హంససారసనాదితాః। 24

దీర్ఘాభిర్ద్రుమయుక్తాభిః సరిద్భిశ్చ సమంతతః।
అమృతోపమతోయాభిః శివాభిరుపసంస్కృతాః। 25

లతాశతైరవతతాః సంతానకుసుమావృతాః।
నానాగుల్మావృతఘనాః కరవీరకృతాంతరాః। 26

తతోఽంబుధరసంకాశం ప్రవృద్ధశిఖరం గిరిమ్।
విచిత్రకూటం కూటైశ్చ సర్వతః పరివారితమ్। 27

శిలాగృహైరవతతం నానావృక్షైస్సమావృతమ్।
దదర్శ హరిశార్దూలో రమ్యం జగతి పర్వతమ్। 28

దదర్శ చ నగాత్ తస్మాత్ నదీం నిపతితాం కపిః।
అంకాదివ సముత్పత్య ప్రియస్య పతితాం ప్రియామ్। 29

జలే నిపతితాగ్రైశ్చ పాదపైరుపశోభితామ్।
వార్యమాణామివ క్రుద్ధాం ప్రమదాం ప్రియబంధుభిః। 30

పునరావృత్తతోయాం చ దదర్శ స మహాకపిః।
ప్రసన్నామివ కాంతస్య కాంతాం పునరుపస్థితామ్। 31

తస్యాఽదూరాత్ సపద్మిన్యో నానాద్విజగణాయుతాః।
దదర్శ హరిశార్దూలో హనూమాన్ మారుతాత్మజః। 32

ఆ దిగుడుబావుల అడుగు భాగములు స్ఫటికశిలలతో నిర్మితములై యుండెను. వాటిపై ఇసుకకు మారుగా ముత్యములు, పగడములు విలసిల్లుచుండెను. వాటితీరముల యందు కాంచన వృక్షములు (సంపెంగలు, పొన్నలు) మొదలగు అద్భుతములైన వృక్షములుశోభిల్లుచుండెను. ఆసరస్సులు బాగుగా వికసించినకమలములతోను, కలువలతోను భాసిల్లుచుండెను. చక్రవాకముల కూజితములతోను, నానకోయిలల కలకలములతోను, హంసల నాదములతోను, బెగ్గురుపక్షులధ్వనులతోను ఒప్పుచుండెను. ఆ దిగుడు బావులకు నలుదెసల చిన్నచిన్న కాల్వలు గలవు. ఆ కాల్వలదరులపై ఎత్తైనవృక్షములు గలవు. వాటియందలి జలములు అమృతతుల్యములు. ఆ కాల్వలు మంగళకరములు, అలంకృతములు, ఆ బావుల పరిసరములు అసంఖ్యాకములైన లతలతోను, కల్పవృక్ష పుష్పములతోను, వివిధములగు పొదలతోను, గన్నేరు చెట్లతోను వ్యాప్తములైయుండెను. (22-26)

పిమ్మట కపీశ్వరుడు మేఘములను తాకుచున్న ఎత్తైన శిఖరముగల పర్వతమును జూచెను. ఆ పర్వతమునందు పెక్కుగుహలు ఏర్పడియుండెను. అది వివిధ వృక్షములతో శోభిల్లుచుండెను. ఆపర్వతము రమ్యాతిరమ్యమైనది. (27-28)

ఆ కొండనుండిక్రిందికి ప్రవహించుచున్న ఒకనదిని హనుమంతుడుదర్శించెను. ఆనది ప్రణయకుపితయైన ప్రియురాలు ప్రియునియొడినుండి తటాలున దిగిపోవుచున్నట్లుగాఒప్పుచుండెను. కుపితయైన ఆ ప్రమదను తమచేతులతోఅడ్డగించి వారించుచున్న ప్రియ (సఖులవలె)బంధువులవలె, నదీతీరమునగల చెట్లకొమ్మలు జలములను తాకునంతగా వంగి, ప్రవాహమును అడ్డగించుచున్నవాయనునట్లు శోభిల్లుచుండెను. ప్రియ సఖులువారించి నచ్చజెప్పగా ప్రసన్నురాలై తనప్రియుని జేరుటకు వెనుదిరిగిన కాంతవలె దారిమరల్చుకొని పర్వతాభిముఖముగా ప్రవహించుచున్న పునరావృతమైన నదిని ఆకపివరుడు మరల గాంచెను. (29-31)

హరిప్రవరుడైన వాయునందనుడు ఆ పర్వత సమీపమున వివిధములగు పక్షులగుంపులతో గూడిన పద్మసరస్సులనుగాంచెను. (32)

కృత్రిమాం దీర్ఘికాం చాపి పూర్ణాం శీతేన వారిణా।
మణిప్రవరసోపానాం ముక్తాసికతశోభితామ్॥ 33

వివిధైర్మృగసంఘైశ్చ విచిత్రాం చిత్రకాననామ్।
ప్రాసాదైస్సుమహద్భిశ్చ నిర్మితైర్విశ్వకర్మణా॥ 34

కాననైః కృత్రిమైశ్చాపి సర్వతస్సమలంకృతామ్।
యే కేచిత్ పాదపాస్తత్ర పుష్పోపగఫలోపగాః॥ 35

సచ్ఛత్రాస్సవితర్దీకాః సర్వే సౌవర్ణవేదికాః।
లతాప్రతానైర్బహుభిః పర్ణైశ్చ బహుభిర్వృతామ్॥ 36

కాంచనీం శింశుపామేకాం దదర్శ హరియూథపః।
వృతాం హేమమయీభిస్తు వేదికాభిస్సమంతతః॥ 37

సోఽపశ్యద్భూమిభాగాంశ్చ నగప్రస్రవణాని చ।
సువర్ణవృక్షానపరాన్ దదర్శ శిఖిసన్నిభాన్॥ 38

తేషాం ద్రుమాణాం ప్రభయా మేరోరివ దివాకరః।
అమన్యత తదా వీరః కాంచనోఽస్మీతి వానరః॥ 39

తాం కాంచనైస్తరుగణైః మారుతేన చ వీజితామ్।
కింకిణీశతనిర్ఘోషాం దృష్ట్వా విస్మయమాగమత్॥ 40

స పుష్పితాగ్రాం రుచిరాం తరుణాంకురపల్లవామ్।
తామారుహ్య మహాబాహుః శింశుపాం పర్ణసంవృతామ్॥ 41

ఇతో ద్రక్ష్యామి వైదేహీం రామదర్శనలాలసామ్।
ఇతశ్చేతశ్చ దుఃఖార్తాం సంపతంతీం యదృచ్ఛయా॥ 42

అశోకవనికా చేయం దృఢం రమ్యా దురాత్మనః।
చంపకైశ్చందనైశ్చాపి వకులైశ్చ విభూషితా॥ 43

అచట శీతలజలములతోనిండిన ఒకదీర్ఘికను (సరస్సును) ఆతడుచూచెను. అది మణిమయ సోపానములతోను, ముక్తాసికతములతోను శోభిల్లుచుండెను. దానిసమీపమున వివిధమృగసమూహములతో గూడి, ఆశ్చర్యమునుగొలుపు విచిత్రవనములుండెను. విశ్వకర్మచే నిర్మితములైన మహాప్రాసాదములు విలసిల్లుచుండెను. అది విచిత్రములైన వనములతో అన్ని వైపులయందును చక్కగా అలంకృతమై యుండెను. అచటి వృక్షములలో కొన్నిపుష్పఫలభరితములై యుండెను. అవి పెక్కులతావితానములతో బంగారువేదికలతో ఒప్పుచుండెను. అచట హనుమంతుడు ఒక శింశుపా వృక్షమునుజూచెను. దానిచుట్టును దట్టముగా ఆకులు లతలుఅల్లుకొనియుండెను. అదిబంగారు వేదికలతో పరివృతమైయుండెను. (33-37)

అచటివివిధప్రదేశములను, కొండలను, సెలయేళ్లను, అగ్నికాంతులనువిరజిమ్ము బంగారువన్నెగల ఇతర వృక్షములను హనుమంతుడు దర్శించెను. (38)

మేరుపర్వత(సువర్ణ)ప్రభలతో ప్రకాశించు సూర్యునివలె, ఆ బంగారువన్నెల చెట్లకాంతులమధ్య విరాజిల్లు మారుతి తనను బంగారుదేహముగలవానినిగా భావించుకొనెను.(39)

ఆ శింశుపావృక్షమునకు చుట్టును కాంచనతరువులు గలవు. ఆ శింశుపావృక్షమునకు చిఱుగంటలు అమర్చబడి యుండెను. వాయుప్రసారమునకు కదలుచున్న ఆగంటలు నిర్విరామముగా ధ్వనించుచుండెను. అట్టి ఆ దృశ్యమును గాంచి హనుమంతుడు ఆశ్చర్యపడెను. (40)

ఆశింశుపావృక్షముయొక్క కొమ్మలపై పుష్పములు విరబూసియుండెను. అదిచక్కనిమొగ్గలతో చిగుళ్లతో మనోహరముగా ఉండెను. దట్టమైనఆకులతో అలరారుచున్న ఆ శింశుపావృక్షమునెక్కి, మారుతి ఇట్లు తలంపసాగెను.(41)

దుఃఖార్తయై, రామునిదర్శించుటకై ఎదురుతెన్నులు చూచుచు, ఇటునటు సంచరించెడి వైదేహి దైవవశమున ఇటువచ్చినచో అమెను నేను చూచెదను. (42)

దుర్మార్గుడైన రావణుని ఈ అశోకవనము సంపెంగ చెట్లతో, చందనవకుళవృక్షములతో అలంకృతమై యుండుట వలన ఇది వర్ణనాతీతమై రమ్యముగా నున్నది. (43)

ఇయం చ నళినీ రమ్యా ద్విజసంఘనిషేవితా।
ఇమాం సా రామమహిషీ నూనమేష్యతి జానకీ। 44

పక్షిగణములచే సేవింపబడుచున్న ఈ పద్మ సరస్సుగూడ మిక్కిలిమనోహరముగానున్నది. కనుక శ్రీరామపత్నియైన జానకి (పతియెడబాటువలన కలిగినతాపమును ఉపశమింప జేసికొనుటకై) ఈచల్లని ప్రదేశమునకు తప్పక రాగలదు. (44)

సా రామా రామమహిషీ రాఘవస్య ప్రియా సతీ।
వనసంచారకుశలా ధ్రువమేష్యతి జానకీ। 45

సీతాదేవి శ్రీరామునకుప్రాణప్రియమైనది. ఆమె వనసంచారమునదక్షురాలు. సాధ్వియైనఆ జానకి ఇచటికి వచ్చుటనిశ్చయము. (45)

అథవా మృగశాబాక్షీ వనస్యాస్య విచక్షణా।
వనమేష్యతి సాఽఽర్యేహ రామచింతానుకర్శితా। 46

అందమైననేత్రములుగలదియు, శ్రీరామునిధ్యాసతో కృశించినదియు, ఈవనవిషయములను బాగుగా ఎఱింగినదియు, పూజ్యురాలునుఐనఆసీతాదేవి ఈ వనమునసంచరించుచు ఇచటికితప్పకరాగలదు. (46)

రామశోకాభిసంతప్తా సా దేవీ వామలోచనా।
వనవాసే రతా నిత్యమ్ ఏష్యతే వనచారిణీ। 47

శ్రీరామునికై పరితపించుచున్నదియు, పదునాల్గు సంవత్సరములపాటు నిత్యము వనవాసనియమములను పాటించుచున్నదియుఐన ఆ వామలోచన (సీతాదేవి) ఇచ్చటికి తప్పక రాగలదు. (47)

వనేచరాణాం సతతం నూనం స్పృహయతే పురా।
రామస్య దయితా భార్యా జనకస్య సుతా సతీ। 48

జనకసుతయు, శ్రీరామునిప్రియపత్నియుఐన సీతాసాధ్వి లోగడ ఎల్లప్పుడును వనచరులయెడ ఎంతగానో ఆదరాభిమానములను చూపుచుండెడిది. (48)

సంధ్యాకాలమనాశ్శ్యామా ధ్రువమేష్యతి జానకీ।
నదీం చేమాం శివజలాం సంధ్యార్థే వరవర్ణినీ। 49

శ్రేష్ఠమైనదేహము గలదియు, అక్షయయౌవన సంపన్నురాలును, ప్రాతస్సంధ్యాకాలమును గమనించునదియుఐన జానకి పవిత్రజలములుగల ఈ నదీతీరమునకు స్నానధ్యానాదులకై తప్పకవచ్చును. (49)

తస్యాశ్చాప్యనురూపేయమ్ అశోకవనికా శుభా।
శుభా యా పార్థివేంద్రస్య పత్నీ రామస్య సమ్మతా। 50

రాజశ్రేష్ఠుడైనశ్రీరామచంద్రునకు ప్రాణతుల్యయైన సీతాదేవి మిక్కిలి శుభలక్షణములుగలది. మంగళ ప్రదమైన, ఈఅశోకవనము ఆమె ఉనికికి అన్ని విధములుగతగినట్టిది. (50)

యది జీవతి సా దేవీ తారాధిపనిభాననా।
ఆగమిష్యతి సాఽవశ్యమ్ ఇమాం శివజలాం నదీమ్। 51

చంద్రబింబాననయైన ఆదేవి బ్రతికియున్నచో పవిత్ర జలములుగల ఈ నదికడకు తప్పకరాగలదు. (51)

ఏవం తు మత్వా హనుమాన్ మహాత్మా
ప్రతీక్షమాణో మనుజేంద్రపత్నీమ్।
అవేక్షమాణశ్చ దదర్శ సర్వం
సుపుష్పితే పర్ణఘనే నిలీనః। 52

మహాత్ముడైన హనుమంతుడు ఇట్లుఆలోచించి, శ్రీరామ పత్నిదర్శనమునకై నిరీక్షించుచు, బాగుగా పుష్పించి యున్న దట్టమైనఆకులమధ్యదాగినవాడై నలువైపుల పరికించిపరికించి చూడసాగెను. (52)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే చతుర్దశస్సర్గః (14)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పదునాల్గవ సర్గము.

— * * * —

15. పదునైదవ సర్గము

వనశోభను పరిశీలించిచూచుచు, హనుమంతుడు ఒక చైత్య ప్రాసాదముకడ దీనయైయున్న సీతనుచూచుట, గుర్తించుట, సంతోషపడుట.

స వీక్షమాణస్తత్రస్థో మార్గమాణశ్చ మైథిలీమ్।
అవేక్షమాణశ్చ మహీం సర్వాం తామన్వవైక్షత॥ 1

సంతానకలతాభిశ్చ పాదపైరుపశోభితామ్।
దివ్యగంధరసోపేతాం సర్వతస్సమలంకృతామ్॥ 2

తాం స నందనసంకాశాం మృగపక్షిభిరావృతామ్।
హర్మ్యప్రాసాదసంబాధాం కోకిలాకులనిఃస్వనామ్॥ 3

కాంచనోత్పలపద్మాభిః వాపీభిరుపశోభితామ్।
బహ్వాసనకుథోపేతాం బహుభూమిగృహాయుతామ్॥ 4

సర్వర్తుకుసుమై రమ్యాం ఫలవద్భిశ్చ పాదపైః।
పుష్పితానామశోకానాం శ్రియా సూర్యోదయప్రభామ్॥ 5

ప్రదీప్తామివ తత్రస్థో మారుతిస్సముదైక్షత।
నిష్పత్రశాఖాం విహగైః క్రియమాణామివాసకృత్॥ 6

వినిష్పతద్భిశ్శతశః చిత్రైః పుష్పావతంసకైః।
ఆమూలపుష్పనిచితైః అశోకైశ్శోకనాశనైః॥ 7

పుష్పభారాతిభారైశ్చ స్పృశద్భిరివ మేదినీమ్।
కర్ణికారైః కుసుమితైః కింశుకైశ్చ సుపుష్పితైః॥ 8

అశోకవృక్షముపైచేరియున్న ఆహనుమంతుడు సీతాదేవి దర్శనమునకై ఎదురుచూచుచు, ఆ ప్రదేశము నంతయు పరికించుచు అశోకవనమును సాకల్యముగా కలయజూచెను.(1)

ఆ అశోకవనము లతాలంకృతములైన కల్పవృక్షముల తోడను, ఇతర పాదపములతోడను శోభిల్లుచుండెను. ఆ వనమునందు ఎల్లెడల దివ్యగంధరసములు గుబాళించు చుండెను. అది అంతటను శోభలనువెలార్చుచుండెను. మృగములతో, పక్షిగణములతోనిండి, ఇంద్రుని నందనవన సదృశమై యొప్పుచుండెను. అచట హార్మ్యములు, ప్రాసాదములు క్రిక్కిరిసియుండెను. కోకిలలు మధుర స్వరములతో వీనులవిందు గావించుచుండెను. అచటి దిగుడుబావులు సంపెంగలతో, కలువలతో, కమలములతో శోభిల్లుచుండెను. అక్కడక్కడ పలువిధములైన ఆసనములు, ఆస్తరణములు ఏర్పాటుచబడియుండెను. అచటపెక్కు భూగృహములు దర్శనమిచ్చుచుండెను. అన్ని ఋతువుల యందును అచటి వృక్షములు పుష్పఫల భరితములై విలసిల్లుచుండుటచే అది మిక్కిలి మనోహరమై యుండెను. విరబూసిన అశోకవృక్షముల శోభలతో ఆవనము ఉదయ సూర్యకాంతులను విరజిమ్ముచున్నదానివలె ఒప్పుచుండెను. వందలకొలది పక్షులు పదేపదే చెట్లపైవచ్చివ్రాలుచుండుట వలన ఆ కొమ్మలపై పక్షులు తప్ప ఆకులే లేవన్నట్లుండెను. ఆ పక్షులు పుష్పములను ముక్కులగిఱచుకొని, ఎగిరి పోవుచుండగా అవి చిత్రములైనపూవులతో అలంకరింప బడినట్లుండెను. ఈ విధముగా పక్షులు చెట్లపై వ్రాలుచుండుటను, అచటినుండిఎగిరిపోవుటను హనుమంతుడు చూచెను. ఆమూలాగ్రముగా వ్యాపించిన అశోకవృక్షములు చూచువారి శోకములనుహరించి వేయుచుండెను. తలకుమించిన పూల బరువులచేవంగి నేలను స్పృశించుచున్నట్లున్న గన్నేరుచెట్లతోను, బాగుగా విరబూసిన మోదుగుచెట్లతోను విరాజిల్లుచున్న ఆ అశోకవనమును అచటనున్న మారుతి కలయజూచెను.(2-8)

స దేశః ప్రభయా తేషాం ప్రదీప్త ఇవ సర్వతః।
పున్నాగాస్సప్తపర్ణాశ్చ చంపకోద్దాలకాస్తథా॥ 9

వివృద్ధమూలా బహవః శోభంతే స్మ సుపుష్పితాః।
శాతకుంభనిభాః కేచిత్ కేచిదగ్నిశిఖోపమాః॥ 10

నీలాంజననిభాః కేచిత్ తత్రాఽశోకాస్సహస్రశః।
నందనం విబుధోద్యానం చిత్రం చైత్రరథం యథా॥ 11

అతివృత్తమివాచింత్యం దివ్యం రమ్యం శ్రియావృతమ్।
ద్వితీయమివ చాకాశం పుష్పజ్యోతిర్గణాయుతమ్॥ 12

పుష్పరత్నశతైశ్చిత్రం పంచమం సాగరం యథా।
సర్వర్తుపుష్పైర్నిచితం పాదపైర్మధుగంధిభిః॥ 13

నానానినాదైరుద్యానం రమ్యం మృగగణైర్ద్విజైః।
అనేకగంధప్రవహం పుణ్యగంధం మనోరమమ్।
శైలేంద్రమివ గంధాఢ్యం ద్వితీయం గంధమాదనమ్॥ 14

అశోకవనికాయాం తు తస్యాం వానరపుంగవః।
స దదర్శావిదూరస్థం చైత్యప్రాసాదముచ్ఛ్రితమ్॥ 15

మధ్యే స్తంభసహస్రేణ స్థితం కైలాసపాండురమ్।
ప్రవాళకృతసోపానం తప్తకాంచనవేదికమ్॥ 16

ముష్ణంతమివ చక్షూంషి ద్యోతమానమివ శ్రియా।
విమలం ప్రాంశుభావత్వాత్ ఉల్లిఖంతమివాంబరమ్॥ 17

ఆ వనప్రదేశమంతయును వృక్షములశోభలచే తేజోమయమై యొప్పుచుండెను. బాగుగాలావెక్కిన బోదెలుగల అసంఖ్యాకములైన పున్నాగవృక్షములు, ఏడాకులఅరటిచెట్లు, సంపెంగలు, విరిగిచెట్లు పుష్పభరితములై శోభిల్లుచుండెను. వేలకొలదిగానున్న ఆ అశోకవృక్షములలో కొన్నిబంగారువన్నెలతోడను. మఱికొన్ని అగ్నికాంతులతోడను, ఇంకనుకొన్ని నీలవర్ణములతోడను, కాటుకరంగులతోడను రాజిల్లుచుండెను. అది దివ్యమైన నందనోద్యానమువలెను, ఆశ్చర్యమునుగొలుపు చైత్రరథము (కుబేరుని ఉద్యానవనము) రీతి విలసిల్లుచుండెను. (9-11)

అంతేగాదుఆవనము నందనోద్యానము. చైత్రరథముల కంటెను ఉత్కృష్టమైవిలసిల్లుచుండెను. అది ఊహాతీతమై, దివ్యమై, మనోహరమై, బహువిధశోభలకు నెలవై, నక్షత్రముల వలె మిలమిలలాడు పుష్పములతో తేజరిల్లుచు మఱియొక ఆకాశమువలె అలరారుచుండెను. (12)

అసంఖ్యాకములైనపుష్పములనెడి రత్నములతోగూడిన ఆ వనము లంకచుట్టునుగల నాలుగుసముద్రములకు తోడుగా ఐదవరత్నాకరమువలె రాజిల్లుచుండెను. అక్కడి వృక్షములు అఱు ఋతువులలోను పుష్పించుచు కమ్మని సువాసనలను వెదజల్లుచుండెను. నానావిధములైన మృగములశబ్దములతోను. పక్షుల కూజితములతోడను అది మిక్కిలి రమ్యముగానుండెను, సువాసనలతోగూడి, బహువిధములైన పరిమళములను వెదజల్లుచు మనోహరమైన ఆవనము సుగంధభరితమై రెండవ గంధమాదనపర్వతమువలె ఒప్పుచుండెను. (13-14)

ఆ అశోకవనమునందు తానున్నప్రదేశమునకు సమీపమున ఎత్తైన ఒకచైత్యప్రాసాదమును ఆ వానరోత్తముడు గాంచెను. వేయిస్తంభములతో నిర్మితమైన ఆ ప్రాసాదము కైలాసమువలె ధవళకాంతుల నీనుచుండెను. పగడములు పొదిగిన సోపానములతో, మేలిమిబంగారువేదికలతో ఆ ప్రాసాదము మనోజ్ఞములైన కాంతులను ప్రసరింపజేయుచు కన్నులకు మిఱుమిట్లు గొల్పుచుండెను. ఇంకను అది (ప్రాసాదము) నిర్మలమై అత్యున్నతమై ఆకాశమును తాకుచున్నట్లుండెను. (15-17)

తతో మలినసంవీతాం రాక్షసీభి స్సమావృతామ్। 18

ఉపవాసకృశాం దీనాం నిశ్శ్వసంతీం పునః పునః।
దదర్శ శుక్లపక్షాదౌ చంద్రరేఖామివామలామ్। 19

ఇంతలో హనుమంతుడు మలినవస్త్రములను ధరించిన ఒకస్త్రీనిచూచెను. ఆమెచుట్టును రాక్షసస్త్రీలు చేరియుండిరి. ఆమె ఉపవాసములచే కృశించినదై, శుక్లపక్ష ప్రారంభమునందలి నెలవంకవలె స్వచ్ఛముగానుండెను. ఆ అమలాంగి దీనురాలై, మాటిమాటికిని నిట్టూర్పులు విడుచుచుండుటను అతడుగమనించెను. (18-19)

మందప్రఖ్యాయమానేన రూపేణ రుచిరప్రభామ్।
పినద్ధాం ధూమజాలేన శిఖామివ విభావసోః। 20

పీతేనైకేన సంవీతాం క్లిష్టేనోత్తమవాససా।
సపంకామనలంకారాం విపద్మామివ పద్మినీమ్। 21

జాజ్వల్యమానముగా ప్రకాశించుచున్న అగ్నిజ్వాలను పొగ కప్పివేసినప్పుడు దానికాంతి స్పష్టముగాగోచరింపదు. అట్లే మనోహరకాంతులుగల ఆమెరూపలావణ్యశోభలు హేతుబద్ధముగా ఆలోచించినప్పుడే గుర్తించుటకు సాధ్యమగును.[1] ఆమె ఒకే ఒక పచ్చనిపట్టువస్త్రమును ధరించియుండెను. అది మలినమైనను ఉత్తమమైనది. ఆమె అలంకారరహితయై పద్మములులేనట్టి బురదతో గూడిన సరస్సువలె తోచుచుండెను. (20-21)

వ్రీడితాం దుఃఖసంతప్తాం పరిమ్లానాం తపస్వినీమ్।
గ్రహేణాంగారకేణేవ పీడితామివ రోహిణీమ్। 22

ఆమె దుఃఖసంతప్తయై తఱిగిపోయిన శరీరచ్ఛాయతో ధ్యానస్థితిలోఉన్నదై బిడియముతోతలవంచుకొని, పాపగ్రహమైన అంగారకునిచే పీడింపబడిన రోహిణివలె నుండెను. (22)

అశ్రుపూర్ణముఖీం దీనాం కృశామనశనేన చ।
శోకధ్యానపరాం దీనాం నిత్యం దుఃఖపరాయణామ్। 23

సంతతధారగా కన్నీరుగార్చుచున్నదై, ఆహారమును మానివేయుటవలనకృశించినదై, శోకించుచు ధ్యానమగ్నయై, నిరంతరదుఃఖపరాయణయై ఆమె అతి దీనావస్థలో నుండెను. (23)

ప్రియం జనమపశ్యంతీం పశ్యంతీం రాక్షసీగణమ్।
స్వగణేన మృగీం హీనాం శ్వగణాభివృతామివ। 24

ఆత్మీయులకుదూరమై, అనుక్షణము రాక్షసీగణముచే ఆవృతమైయున్న ఆమె, తనజాతివాళ్లకుదూరమై వేటకుక్కలమధ్యచిక్కుపడిన ఆడులేడివలె దిక్కుమొగముతో నుండెను. (24)

నీలనాగాభయా వేణ్యా జఘనం గతయైకయా।
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ। 25

జడగట్టిన ఆమెకేశపాశము నల్లత్రాచునుబోలి, కటి ప్రదేశమువఱకు వ్రేలాడుచుండెను. అప్పుడామె శరత్కాలమునందు నల్లనివృక్షపంక్తితోగూడిన భూమివలె ఒప్పుచుండెను. (25)

సుఖార్హాం దుఃఖసంతప్తాం వ్యసనానామకోవిదామ్।
తాం సమీక్ష్య విశాలాక్షీమ్ అధికం మలినాం కృశామ్। 26

తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః।
హ్రియమాణా తదా తేన రక్షసా కామరూపిణా। 27

ఏమాత్రము కష్టములనుఎఱుగనదియు, సర్వసుఖములను పొందుటకు యోగ్యురాలయ్యును దుఃఖములపాలైనదియు, మలినవస్త్రధారిణియు, మిక్కిలి కృశించినదియుఅగు ఆ విశాలాక్షినిజూచి, తాను అనుకొనిన కారణములనుబట్టి కామరూపియైన ఆ రావణునిచే అపహరింపబడి తీసికొని రాబడిన ఆనాటిసీత ఈమెయే- అని హనుమంతుడు భావింపసాగెను. (26-27)

1. ఇప్పుడుహనుమంతుడు యుక్తియుక్తముగాతర్కించుకొని, ఆమెనుగుర్తించుటకై పరిపరివిధముల ఆలోచించుచున్నాడు.

యథారూపా హి దృష్టా సా తథారూపేయమంగనా।
పూర్ణచంద్రాననాం సుభ్రూం చారువృత్తపయోధరామ్। 28

కుర్వంతీం ప్రభయా దేవీం సర్వా వితిమిరా దిశః।
తాం నీలకేశీం బింబోష్ఠీం సుమధ్యాం సుప్రతిష్ఠితామ్। 29

సీతాం పద్మపలాశాక్షీం మన్మథస్య రతిం యథా।
ఇష్టాం సర్వస్య జగతః పూర్ణచంద్రప్రభామివ। 30

భూమౌ సుతనుమాసీనాం నియతామివ తాపసీమ్।
నిశ్శ్వాసబహుళాం భీరుం భుజగేంద్రవధూమివ। 31

శోకజాలేన మహతా వితతేన న రాజతీమ్।
సంసక్తాం ధూమజాలేన శిఖామివ విభావసోః। 32

తాం స్మృతీమివ సందిగ్ధామ్ బుద్ధిం నిపతితామివ।
విహతామివ చ శ్రద్ధామ్ ఆశాం ప్రతిహతామివ। 33

సోపసర్గాం యథా సిద్ధిం బుద్ధిం సకలుషామివ।
అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ। 34

రామోపరోధవ్యథితాం రక్షోహరణకర్శితామ్।
అబలాం మృగశాబాక్షీం వీక్షమాణాం తతస్తతః। 35

బాష్పాంబుపరిపూర్ణేన కృష్ణవక్రాక్షిపక్ష్మణా।
వదనేనాప్రసన్నేన నిశ్శ్వసంతీం పునః పునః। 36

మలపంకధరాం దీనాం మండనార్హామమండితామ్।
ప్రభాం నక్షత్రరాజస్య కాలమేఘైరివావృతామ్। 37

తస్య సందిదిహే బుద్ధిః ముహుస్సీతాం నిరీక్ష్య తు।
ఆమ్నాయానామయోగేన విద్యాం ప్రశిథిలామివ। 38

ఋశ్యమూకపర్వతముమీదుగా వెళ్లుచున్నప్పటి అంగనరూపురేఖలే ఈమెయందుగోచరించుచున్నవి. ఈమెనిండుచందురునిబోలిన ముఖముగలది. చక్కని కనుబొమ్మలుగలది. సర్వాంగసౌందర్యముగలది. ఈ దేవి తన తనుశోభలచే అన్నిదిశలయందునుఅలముకొనిన చీకట్లను పాఱద్రోలుచున్నది. ఈమె నల్లనికురులు, దొండపండువంటిపెదవులు, చక్కనినడుముగలిగి, సర్వాంగసౌష్ఠవముతో విలసిల్లుచున్నది. తామరరేకుల వంటికన్నులుగలిగి ఈమె మన్మథసతియైన రతీదేవివలె శోభిల్లుచున్నది. నిండుపున్నమినాటి వెన్నెలవలె అందఱికిని ఆహ్లాదమునుగూర్చునది. కనుక నిజముగా **ఈమె సీతయే-** (28-30)

ఈమె అనువైన తనుసౌభాగ్యముగలిగి, భూమిపై స్థిరముగా ఆసీనయైయున్నది. తపోనియమములను పాటించుచున్నది. భయమునకులోనై ఇతరులను దరిజేరనీయని ఆడుసర్పము వలె నిట్టూర్పులు విడుచుచున్నది. పొగచే ఆవృతమైన అగ్నిశిఖవలె ఈమె దుర్భరశోకకారణముగ కాంతి తఱిగియున్నది. (31-32)

సందేహమునకులావిచ్చుచున్న ధర్మశాస్త్రమువలెను, క్షీణించినసంపదవలెను, సన్నగిల్లినశ్రద్ధవలెను, నెఱవేఱని ఆశవలెను, విఘ్నములెదురగుటచే నిష్ఫలమైన కార్యసిద్ధివలెను, కలుషితమైనబుద్ధివలెను, నిరాధారమైన అపవాదముచే దెబ్బతినినకీర్తివలెను ఒప్పుచు, రావణునిచే అపహరింపబడుట వలన కృశించినదై, శ్రీరాముని యెడబాటునకు వ్యథచెందినదై, అబలయైన జింకపిల్లవలె అటునిటు బిత్తరచూపులతో చూచుచున్న సీతాదేవిని మారుతి గాంచెను. (33-35)

ఆమెకన్నులు అశ్రుపూర్ణములైయుండెను. కనుఱెప్పల వెంట్రుకలునల్లనై వంకరగానుండెను. పదేపదే నిట్టూర్పులు విడుచుచున్న ఆమెవదనము అప్రసన్నముగా నుండెను. తపశ్చర్యకారణముగ ఆమెశరీరమున ధూళి చేరియుండెను. అలంకారములకు అర్హురాలయ్యును ఏట్టి అలంకారములనుగూడ ధరింపక దీనురాలై, ఆమె కారుమేఘములచే కప్పబడిన పూర్ణచంద్రునివలెనుండెను. (36-37)

పఠనపాఠనములు (అభ్యాసము) లేక వేదాదివిద్యల విషయమున సందేహములు పొడసూపినట్లు, సీతను జూచిన హనుమంతునకు ఆమెసీతాదేవి ఔనా? కాదా? అనుసందేహములుఏర్పడెను. (38)

దుఃఖేన బుబుధే సీతాం హనుమానవలంకృతామ్।
సంస్కారేణ యథా హీనాం వాచమర్థాంతరం గతామ్॥ 39

వ్యుత్పత్తి, వ్యాకరణ- ఉచ్చారణాదులసంస్కారము (అవగాహన) లేనప్పుడు విపరీతార్థములనుదెలుపు వాక్యమువలె, తైలాదిసంస్కారములులేక అలంకారరహితయైన సీతాదేవిని ఆ మారుతి అతికష్టముమీద గుర్తింపగల్గెను. (39)

తాం సమీక్ష్య విశాలాక్షీం రాజపుత్రీమనిందితామ్।
తర్కయామాస సీతేతి కారణైరుపపాదిభిః॥ 40

సౌశీల్యవతియు, జనకసుతయు, విశాలాక్షియువైన ఆమెను బాగుగాపరిశీలనగాజూచి, తానుగమనించిన లక్షణములనుబట్టి హనుమంతుడు ఆమెసీతాదేవియే అని నిశ్చయించుకొనెను.(40)

వైదేహ్యా యాని చాంగేషు తదా రామోఽన్వకీర్తయత్।
తాన్యాభరణజాలాని శాఖాశోభీన్యలక్షయత్॥ 41

జానకీదేవి ధరించెడిఆబరణములనుగూర్చి శ్రీరాముడు హనుమంతునకు తెలిపియుండెను. అవియన్నియును కొమ్మలకు వ్రేలాడుచుండుటను అతడు గాంచెను. (41)

సుకృతౌ కర్ణవేష్టౌ చ శ్వదంష్ట్రౌ చ సుసంస్థితౌ।
మణివిద్రుమచిత్రాణి హస్తేష్వాభరణాని చ॥ 42

శ్యామాని చిరయుక్తత్వాత్ తథా సంస్థానవంతి చ।
తాన్యేవైతాని మన్యేఽహం యాని రామోఽన్వకీర్తయత్॥ 43

చక్కగారూపొందింపబడినకర్ణకుండలములు, బాగుగా అమరియున్న 'శ్వదంష్ట్రములు' అనుపేరుగల శ్రవణాభరణములు, మణులతో, పగడములతోగూడి చిత్రవిచిత్రముగానున్నహస్తాభరణములు ఇచట గలవు, చాలకాలముధరింపబడుటచే[1] నల్లబడి (శరీర తాపముచే నల్లబాఱి) యున్నవి. అట్లే శాఖలపైనుంచబడినవిగూడ నల్లబడినవి. 'ఇవియే నాడుశ్రీరాముడువర్ణించిన అభరణములు - అని నేనుభావింతును. (42-43)

తత్ర యాన్యవహీనాని తాన్యహం నోపలక్షయే।
యాన్యస్యా నావహీనాని తానీమాని న సంశయః॥ 44

రావణుడు సీతాదేవినిఅపహరించుకొని పోవునప్పుడు ఋశ్యమూకపర్వతముపై (ఆమెజారవిడువగా) పడిన అభరణములు ఇచటకన్పించుటలేదు. ఆమెచే జారవిడువబడని అభరణములు ఇవియే. సందేహమేలేదు. (44)

పీతం కనకపట్టాభం స్రస్తం తద్వసనం శుభమ్।
ఉత్తరీయం నగాసక్తం తదా దృష్టం ప్లవంగమైః॥ 45

అనాడు ఋశ్యమూకపర్వతముపై జారవిడువబడిన బంగారపుటంచుగల పచ్చనిఉత్తరీయము చెట్లకు తగుల్కొని యుండగా ఆవస్త్రమును వానరులుచూచిరి. (45)

భూషణాని చ ముఖ్యాని దృష్టాని ధరణీతలే।
అనయైవాపవిద్ధాని స్వనవంతి మహాంతి చ॥ 46

ఈమెచేతనే భూమిపై పడవేయబడిన గలగలలాడు శ్రేష్ఠములైన, అతిముఖ్యములైన భూషణములనుగూడ ఆ వానరులుచూచిరి. (46)

ఇదం చిరగృహీతత్వాత్ వసనం క్లిష్టవత్తరమ్।
తథాఽపి నూనం తద్వర్ణం తథా శ్రీమద్యథేతరత్॥ 47

చాలాకాలమునుండి ఈమెధరించుచుండుటచే ఈ వస్త్రముమిక్కిలిమాసినట్లున్నది. కాని దానివన్నెలు, చిన్నెలు ఏమాత్రముతఱుగలేదు. అక్కడ జారవిడువబడిన వస్త్రముయొక్కశోభలుగూడ ఇట్లేయున్నవి. (47)

1. పతివిరహమునకులోనైనప్పుడు బాధతో స్త్రీలు అభరణములను ధరింపరుగదా! అని పావనితలంచెను. వీటిని ముత్తైదువలు తప్పకధరించుచుందురు.

ఇయం కనకవర్ణాంగీ రామస్య మహిషీ ప్రియా।
ప్రణష్టాపి సతీ యాऽస్య మనసో న ప్రణశ్యతి। 48

బంగారువన్నెతనువుగలఈసాధ్వి రామునకు అత్యంత ప్రేమపాత్రమైన సీతాదేవియే. శారీరకముగా ఈమె రామునకు దూరముగానున్నను ఆయనమనస్సులో మాత్రము సుస్థిరముగానే యున్నది. (48)

ఇయం సా యత్కృతే రామః చతుర్భిః పరితప్యతే।
కారుణ్యేనానృశంస్యేన శోకేన మదనేన చ। 49

స్త్రీ ప్రణష్టేతి కారుణ్యాత్ ఆశ్రితేత్యానృశంస్యతః।
పత్నీ నష్టేతి శోకేన ప్రియేతి మదనేన చ। 50

ఆపత్కాలమునందు స్త్రీలను అవశ్యముగా ఆదుకొనవలెను. సీతను ఆపదలో రక్షింపలేకపోయితిని గదా! అని కనికరము. తనను ఆశ్రయించినవారిని రక్షించుస్వభావముగలవాడు రాముడు- కావునదయ, భార్య దూరమైనందుకు శోకము, తనకుప్రియురాలైన సీతయెడబాటునకు విరహము, సీతానిమిత్తముగా పై నాల్గింటికిలోనై శ్రీరాముడు పరితపించుచున్నాడు. (49-50)

అస్యా దేవ్యా యథారూపమ్ అంగప్రత్యంగసౌష్ఠవమ్।
రామస్య చ యథారూపం తస్యేయమసితేక్షణా। 51

అంగప్రత్యంగసౌష్ఠవములచే అతిలోకసుందరి సీతాదేవి. అందచందములకు కుదురైనశ్రీరాముడు పురుషమోహనాకారుడు. అన్నివిధములుగా వీరు ఒకరికొకరుతగినవారు. కావున ఈతన్వి శ్రీరామునకు తగినభార్య. (51)

అస్యా దేవ్యా మనస్తస్మిన్ తస్య చాస్యాం ప్రతిష్ఠితమ్।
తేనేయం స చ ధర్మాత్మా ముహూర్తమపి జీవతి। 52

శ్రీరామునిమనస్సునందంతటను సీతాకృతియే నిండియున్నది. సీతాదేవిమనస్సునందు శ్రీరాముని రూపమే పరిపూర్ణమైయున్నది. కావున ధర్మాత్ములైన వారిరువురును జీవించియుండగలుగుచున్నారు. లేనిచో ఆయుభయులును క్షణకాలమైనను జీవించియుండజాలరు. (52)

దుష్కరం కృతవాన్ రామో హీనో యదనయా ప్రభుః।
ధారయత్యాత్మనో దేహం న శోకేనావసీదతి। 53

మహాసాధ్వియైనసీతాదేవికి దూరమైకూడ శ్రీరామచంద్రుడు తనప్రాణములను నిలుపుకొని, దుష్కర కార్యమును చేయుచున్నాడు ఇట్టి దుఃఖస్థితిలో ఆయన ధైర్యస్థైర్యములను కల్గియుండుట ప్రశంసావహము. (53)

దుష్కరం కురుతే రామో య ఇమాం మత్తకాశినీమ్।
సీతాం వినా మహాబాహుః ముహూర్త మపి జీవతి। 54

నిండుజవ్వనియైన ఈ సీతాదేవిని విడిచి క్షణకాలమైనను ఉండజాలని శ్రీరాముడు ఇంతవఱకును జీవించియుండుట నిజముగా అశక్యమైన కార్యమే. (54)

ఏవం సీతాం తదా దృష్ట్వా హృష్టః పవనసంభవః।
జగామ మనసా రామం ప్రశశంస చ తం ప్రభుమ్। 55

ఈ విధముగా సీతనుజూచి మారుతి ఎంతయు సంతోషించెను. అప్పుడతడు శ్రీరామచంద్రుని స్మరించి, ఆ ప్రభువును మిక్కిలికొనియాడెను. (ఇంతటి ఉత్తమ సాధ్వియైనభార్యకొఱకై పరితపించుట శ్రీరామునకు ఉచితమే. ఇంతటి సౌశీల్యవతిని భార్యగా పొందుటకు ఆయనయే యోగ్యుడు.) (55)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే పంచదశస్సర్గః *(15)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పదునైదవ సర్గము.

— * * * —

16. పదునాఱవ సర్గము

హనుమంతుడు సీతాదేవిశీలసౌందర్యములను ప్రశంసించుచు, కష్టదశలోనున్న యామెనుగాంచి ఆమెకై తానుగూడ శోకించుట

ప్రశస్య తు ప్రశస్తవ్యాం సీతాం తాం హరిపుంగవః।
గుణాభిరామం రామం చ పునశ్చింతాపరోఽభవత్॥ 1

సుగుణాభిరాములు, లోకస్తుత్యులు ఐన సీతారాములను మనస్సులోనే ప్రశంసించి, ఆ వానరోత్తముడు మఱల ఆలోచనలలో మునింగెను. (1)

స ముహూర్తమివ ధ్యాత్వా బాష్పపర్యాకులేక్షణః।
సీతామాశ్రిత్య తేజస్వీ హనుమాన్ విలలాప హ॥ 2

గొప్పతేజశ్శాలియైన ఆహనుమంతుడు ఒక క్షణకాలముపాటుధ్యాననిమగ్నుడై సీతాదేవిస్థితినిజూచి, కన్నీరుమున్నీరుగా విలపింపసాగెను. (2)

మాన్యా గురువినీతస్య లక్ష్మణస్య గురుప్రియా।
యది సీతాఽపి దుఃఖార్తా కాలో హి దురతిక్రమః॥ 3

మిక్కిలి వినయవిధేయతలుగల లక్ష్మణస్వామికి పూజ్యురాలును, అతనికి అన్నయైన శ్రీరామునకు ధర్మపత్నియుఐన సీతామాత ఇడుములపాలైనది, విధివిధానము ఎవ్వరికైనను అనుల్లంఘనీయము గదా!(3)

రామస్య వ్యవసాయజ్ఞా లక్ష్మణస్య చ ధీమతః।
నాత్యర్థం క్షుభ్యతే దేవీ గంగేవ జలదాగమే॥ 4

శ్రీరామునిపరాక్రమమును, అభిప్రాయమును, అట్లే ధీశాలియైనలక్ష్మణునిశౌర్యమును (అయిరువురి ప్రయత్న ప్రభావములను) బాగుగా ఎఱిగినందువలన వర్షాకాలమున గంగానది క్షోభింపనట్లు సీతాదేవియు మిక్కిలిక్షోభకు గుఱికాలేదు. (4)

తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణామ్।
రాఘవోఽర్హతి వైదేహీం తం చేయమసితేక్షణా॥ 5

సీతారాములు పరస్పరము అనుగుణములైన స్వభావములు, వయస్సులు, ప్రవర్తనలుగలవారు. ఇద్దఱును సద్వంశసంజాతులు, సాముద్రికలక్షణాదులును అనురూపముగాగలవారు. కనుక సీతాదేవికి అనువైనవాడు రాముడు, అసితేక్షణయైన సీతాదేవియు శ్రీరామునకు తగినవధువు. (5)

తాం దృష్ట్వా నవహేమాభాం లోకకాంతామివ శ్రియమ్।
జగామ మనసా రామం వచనం చేదమబ్రవీత్॥ 6

మేలిమిబంగారమువలె శోభిల్లుచు, లక్ష్మీదేవివలె లోకమనోహరయైన ఆ సీతాదేవిని మారుతిచూచి, మనస్సున రాముని స్మరించుచు ఇట్లు పలికెను. (6)

అస్యా హేతోర్విశాలాక్ష్యా హతో వాలీ మహాబలః।
రావణప్రతిమో వీర్యే కబంధశ్చ నిపాతితః॥ 7

ఈ విశాలాక్షికారణముగనే మహాబలుడైన వాలి వధింపబడెను, పరాక్రమమున రావణునితో సమానుడైన కబంధుడుగూడ కడతేర్చబడెను. (7)

విరాధశ్చ హతస్సంఖ్యే రాక్షసో భీమవిక్రమః।
వనే రామేణ విక్రమ్య మహేంద్రేణేవ శంబరః॥ 8

దేవేంద్రుడు శంబరాసురునివధించినట్లు మహాపరాక్రమశాలియైన శ్రీరాముడు వనవాస సమయమున రణరంగమునందు భీమవిక్రముడైన విరాధుడను రాక్షసునిగూడ హతమార్చెను. (8)

చతుర్దశసహస్రాణి రక్షసాం భీమకర్మణామ్।
నిహతాని జనస్థానే శరైరగ్నిశిఖోపమైః॥ 9

భయంకరకృత్యములనొనర్చు పదునాలుగువేలమంది రాక్షసులును అగ్నిశిఖాతుల్యములైన శ్రీరాముని బాణపరంపరకు జనస్థానమున బలియైరి. (9)

ఖరశ్చ నిహతస్సంఖ్యే త్రిశిరాశ్చ నిపాతితః।
దూషణశ్చ మహాతేజా రామేణ విదితాత్మనా। 10

జగద్విఖ్యాతుడైనశ్రీరామునిచే సమరరంగమున ఖరుడు, త్రిశిరుడు మట్టిగలిసిరి. యుద్ధవీరుడైన దూషణుడును నేలపాలాయెను. (10)

ఐశ్వర్యం వానరాణాం చ దుర్లభం వాలిపాలితమ్।
అస్యా నిమిత్తే సుగ్రీవః ప్రాప్తవాన్ లోకసత్కృతమ్। 11

లోకప్రసిద్ధమైనదియు, వాలిచే పాలింపబడినదియు, దుర్లభమైనవానరరాజ్యము ఈమెకారణముననే గదా! సుగ్రీవునకు ప్రాప్తించినది. (11)

సాగరశ్చ మయా క్రాంతః శ్రీమాన్ నదనదీపతిః।
అస్యా హేతోర్విశాలాక్ష్యాః పురీ చేయం నిరీక్షితా। 12

ఈ విశాలాక్షికొఱకే నదీనదములకు పతియు, రత్నాకరమువైన సాగరమునుదాటి, నేను ఇచటికివచ్చి, ఈ లంకానగరమును గాలించితిని. (12)

యది రామస్సముద్రాంతాం మేదినీం పరివర్తయేత్।
అస్యాః కృతే జగచ్చాపి యుక్తమిత్యేవ మే మతిః। 13

ఒకవేళ శ్రీరాముడుసంకల్పించినచో ఈమె (సీతాదేవి) కొఱకై సముద్రవలయితమైనఈభూమండలమునేగాదు, సకలలోకములనుసైతము తలక్రిందులుగావించును. అట్లు చేయుటయుయుక్తమే- అని నాఅభిప్రాయము. (13)

రాజ్యం వా త్రిషు లోకేషు సీతా వా జనకాత్మజా।
త్రైలోక్యరాజ్యం సకలం సీతాయా నాప్నుయాత్ కలామ్। 14

శ్రీరామునకు ముల్లోకములపై రాజ్యాధికారమును పొందుటముఖ్యమా? జనకాత్మజయైనసీతాదేవిని పొందుట ముఖ్యమా? అనిఆలోచించినచో త్రిలోకాధిపత్యమంతయును సీతాదేవియొక్క ఔన్నత్యముముందు పదునాఱవ వంతునకును సరిపోదు. (14)

ఇయం సా ధర్మశీలస్య మైథిలస్య మహాత్మనః।
సుతా జనకరాజస్య సీతా భర్తృదృఢవ్రతా। 15

ఉత్థితా మేదినీం భిత్త్వా క్షేత్రే హలముఖక్షతే।
పద్మరేణునిభైః కీర్ణా శుభైః కేదారపాంసుభిః। 16

యజ్ఞనిమిత్తమై నాగలితో భూమిని దున్నుచుండగా పద్మపరాగములవలె శుభకరములైన పంటపొలాల ధూళిచే కప్పబడినదై ఈమె భూమినిచీల్చుకొనిఉదయించెను. ఉత్తమ ధార్మికుడును మహాత్ముడును, మిథిలాధిపతియువైన జనకమహారాజునకు సుతయు, మహాపతివ్రతయువైన **ఆ సీతాదేవియే ఈమె.** (15-16)

విక్రాంతస్యార్యశీలస్య సంయుగేష్వనివర్తినః।
స్నుషా దశరథస్యైషా జ్యేష్ఠా రాజ్ఞో యశస్వినీ। 17

పరాక్రమశాలియు, శ్రేష్ఠస్వభావముగలవాడును, యుద్ధమున వెన్నుచూపనివాడునువైన దశరథమహారాజునకు పెద్దకోడలైన యశస్విని ఈమెయే గదా! (17)

ధర్మజ్ఞస్య కృతజ్ఞస్య రామస్య విదితాత్మనః।
ఇయం సా దయితా భార్యా రాక్షసీవశమాగతా। 18

ధర్మస్వరూపుడు, శరణాగతవత్సలుడు, ఆత్మజ్ఞానియువైన శ్రీరామునకు ప్రాణప్రియయు, భార్యయువైన ఆ సీతాదేవియే ఇచట ఈ స్థితిలో రాక్షసస్త్రీలవశములోనున్నది గదా! (18)

సర్వాన్ భోగాన్ పరిత్యజ్య భర్తృస్నేహబలాత్ కృతా।
అచింతయిత్వా దుఃఖాని ప్రవిష్టా నిర్జనం వనమ్। 19

ఈమె తనభర్తపైగల అపరిమితమైన అనురాగ కారణమున సకలభోగభాగ్యములను, ఆత్మీయులను వీడి, వనవాసమునఎదురగు క్లేశములనుసైతము పరిగణింపక నిర్జనవనమున అడుగిడెను. (19)

సంతుష్టా ఫలమూలేన భర్తృశుశ్రూషణే రతా।
యా పరాం భజతే ప్రీతిం వనేఽపి భవనే యథా। 20

పతిసేవాపరాయణయై ఫలమూలములనే ఆహారముగా గొని సంతుష్టపడుచు, భవనములయందు వలెనే అరణ్యమునందును పరమప్రీతిని పొందిన **ఆ సీతయే ఈమె.** (20)

సేయం కనకవర్ణాంగీ నిత్యం సుస్మితభాషిణీ।
సహతే యాతనామేతామ్ అనర్థానామభాగినీ। 21

నిరంతరము చిఱునవ్వుతోభాషించు పుత్తడి బొమ్మయైన సీతమ్మ ఎట్టి చిన్నకష్టమునకైనను ఏమాత్రముతట్టుకొనలేనిది. ఆ సీతమ్మయే ఈనాడు ఇట్టి తీవ్రవేదనలను భరించుచున్నది (21)

ఇమాం తు శీలసంపన్నాం ద్రష్టుమర్హతి రాఘవః।
రావణేన ప్రమథితాం ప్రపామివ పిపాసితః। 22

దుష్టరావణుడు పెట్టుచున్న అన్నికష్టములకును తట్టుకొని, తనశీలసంపదను సంరక్షించుకొనుచున్న ఈ సీతాదేవినిజూచుటకై, దప్పిగొన్నవాడు చలివేంద్రమును చూచుటకు ఆరాటపడునట్లు, రాఘవుడు తహతహలాడు చున్నాడు. (22)

అస్యా నూనం పునర్లాభాత్ రాఘవః ప్రీతిమేష్యతి।
రాజా రాజ్యపరిభ్రష్టః పునః ప్రాప్యేవ మేదినీమ్। 23

శ్రీరాముడు ఈమెను మరలపొందినచో, రాజ్యమును కోల్పోయినరాజు తిరిగి తనరాజ్యాధికారమును పొందినంతగా నిజముగామిక్కిలిఆనందించును. (23)

కామభోగైః పరిత్యక్తా హీనా బంధుజనేన చ।
ధారయత్యాత్మనో దేహం తత్సమాగమకాంక్షిణీ। 24

కామములను, భోగములను పరిత్యజించి, భర్తకు (బంధుజనులకు) దూరమైన సీతాదేవి తనస్వామిని చేరుకోరికతో ప్రాణములను చిక్కబట్టుకొనియున్నది (24)

నైషా పశ్యతి రాక్షస్యో నేమాన్ పుష్పఫలద్రుమాన్।
ఏకస్థహృదయా నూనం రామమేవానుపశ్యతి। 25

ఈమె తనయెదుటనున్న రాక్షసస్త్రీలను చూచుటలేదు. ఈ పుష్పఫలవృక్షములనుసైతము కాంచుటలేదు. శ్రీరాముని తనహృదయమందిరమున నింపుకొని, నిరంతరము అనన్యచిత్తముతో ఆయననే ధ్యానించు చున్నది. (25)

భర్తా నామ పరం నార్యా భూషణం భూషణాదపి।
ఏషా తు రహితా తేన భూషణార్హా న శోభతే। 26

భూషణములెన్నియున్నను నాతికి పతియే పరమ భూషణము. భూషణార్హయైన ఈమె పతియైన శ్రీరామునకు దూరమగుటచే శోభిల్లుటలేదు. (26)

దుష్కరం కురుతే రామో హీనో యదనయా ప్రభుః।
ధారయత్యాత్మనో దేహం న దుఃఖేనావసీదతి। 27

శ్రీరామచంద్రప్రభువు దుస్సహమైన ఈమె యెడబాటునకులోనైగూడా దుఃఖముతో క్రుంగిపోక ప్రాణములను నిలుపుకొనియేయున్నాడు. వాస్తవముగా ఆయనకు ఇది దుష్కరమైనకార్యము.[1] (27)

ఇమామసితకేశాంతాం శతపత్రనిభేక్షణామ్।
సుఖార్హాం దుఃఖితాం దృష్ట్వా మమాపి వ్యథితం మనః। 28

నల్లనికురులుగలదియు, కమలములవంటి కన్నులు గలదియు, శ్రీరామునికడ దివ్యసుఖములనుపొందుటకు అర్హురాలునగు ఈమె ఈ రాక్షసస్త్రీలమధ్య దుఃఖార్తయగుటచూచి, నామనస్సుగూడ కలతచెందుచున్నది. ఇక పరమదయాళువైన శ్రీరామునివిషయమై చెప్పవలసినదేమి? (28)

క్షితిక్షమా పుష్కరసన్నిభాక్షీ
యా రక్షితా రాఘవలక్ష్మణాభ్యామ్।
సా రాక్షసీభి ర్వికృతేక్షణాభిః
సంరక్ష్యతే సంప్రతి వృక్షమూలే। 29

ఓర్పులో భూదేవివంటిదియు, పద్మనేత్రయునైన ఈమె ఇంతవఱకును రామలక్ష్మణులచే రక్షింపబడినది. కాని ఇప్పుడు ఒకచెట్టుక్రింద కూర్చొని, ఈమె రాక్షసస్త్రీలయొక్క భయంకరములైన వికారపుచూపుల కాపలాలో దీనురాలై యున్నది. (29)

1) 15వ సర్గమునందలి 53వ శ్లోకమునందును, 16వ సర్గము నందలి 27వ శ్లోకమునను భావములు ఇంచుమించు ఒకేవిధముగానుండి 'పునరుక్తి'గా కన్పట్టును, కాని మిక్కిలిసంతోషమునగాని, దుఃఖాతిరేకమునగాని ప్రకటింపబడువానిని' పునరుక్తిగాభావింపరాదు ఇది మారుతిదుఃఖాతిరేకవచనము.

హిమహతనళినీవ నష్టశోభా
వ్యసనపరంపరయా నిపీడ్యమానా ।
సహచరరహితేవ చక్రవాకీ
జనకసుతా కృపణాం దశాం ప్రపన్నా ॥ 30

హిమపాతముచే దెబ్బతినిన పద్మలతవలె శోభారహితయు, ఆపదలపరంపరచేపీడింపబడు చున్నదియుఐన జనకసుత తోడులేనిఆడుచక్రవాకము వలె చెప్పలేనంతదీనదశకు లోనయ్యెను. (30)

అస్యా హి పుష్పావనతాగ్రశాఖాః
శోకం దృఢం వై జనయంత్యశోకాః ।
హిమవ్యపాయేన చ మందరశ్మిః
అభ్యుత్థితో నైకసహస్రరశ్మిః ॥ 31

పూలభారముచేవంగినకొమ్మలుగల అశోకవృక్షములు ఈమెశోకమును అధికమొనర్చుచున్నవి. వసంతునితో గూడిన చంద్రుడు వేలకొలది చల్లనికిరణములతో ప్రకాశించుచు ఈమెవిరహతాపమును ఇనుమడింప జేయుచున్నాడు.[1] (31)

ఇత్యేవమర్థం కపిరన్వవేక్ష్య
సీతేయమిత్యేవ నివిష్టబుద్ధిః ।
సంశ్రిత్య తస్మిన్ నిషసాద వృక్షే
బలీ హరీణామ్ ఋషభస్తరస్వీ ॥ 32

మిక్కిలి బలశాలియు, కపిశ్రేష్ఠుడును, మహావీరుడును ఐన హనుమంతుడు ఈ విధముగా విషయములను సమగ్రముగా పరిశీలించినపిమ్మట **ఈమె సీతాదేవియే** అని గట్టిగానిశ్చయించుకొని, ఆ వృక్షముపైననే ఉండిపోయెను. (32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే షోడశస్సర్గః *(16)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పదునాఱవసర్గము.

-- * * * --

17. పదునేడవ సర్గము

సీతనుగాంచి, హనుమంతుడు ప్రసన్నమనస్కుడగుట

తతః కుముదషండాభో నిర్మలో నిర్మలం స్వయమ్ ।
ప్రజగామ నభశ్చంద్రో హంసో నీలమివోదకమ్ ॥ 1

ఇంతలో కలువలతోసమానమైనకాంతిగల నిర్మల చంద్రుడు, నీలముగానున్న జలములయందు హంస ప్రవేశించినట్లు స్వయముగా స్వచ్ఛమైన వినీలాకాశ పశ్చిమభాగమును జేరెను. (1)

సాచివ్యమివ కుర్వన్ స ప్రభయా నిర్మలప్రభః ।
చంద్రమా రశ్మిభిశ్శీతైః సిషేవే పవనాత్మజమ్ ॥ 2

నిర్మలకాంతులతో విలసిల్లుచున్న చంద్రుడు తన ప్రభలతో సహాయపడుచున్నవానివలె చల్లని కిరణములతో ఆ మారుతినిసేవించెను. (2)

స దదర్శ తతస్సీతాం పూర్ణచంద్రనిభాననామ్ ।
శోకభారైరివ న్యస్తాం భారైర్నావమివాంభసి ॥ 3

పిమ్మట హనుమంతుడు బరువుతో నీటిలో క్రుంగిపోవుచున్న నావవలె శోకభారముతోక్రుంగిపోవుచున్న పూర్ణచంద్రాననయగు సీతాదేవినిగాంచెను. (3)

దిదృక్షమాణో వైదేహీం హనుమాన్ మారుతాత్మజః ।
స దదర్శావిదూరస్థా రాక్షసీర్ఘోరదర్శనాః ॥ 4

వాయుసుతుడైన హనుమంతుడు సీతాదేవిని స్పష్టముగా చూడగోరి, దృష్టిని అటుప్రసరింపజేసెను. అప్పుడాయనకు ఆ సమీపముననే భయంకరాకారములతో నున్న రాక్షసస్త్రీలు కనబడిరి. (4)

1. తమతమ నెలవులుదప్పిన తమమిత్రులె శత్రులగుటతథ్యము సుమతీ! అట్లే సీత శ్రీరామునికడఉన్నచో ఆమెకు అశోకము, చంద్రుడు సుఖ (ఆనంద)మునేగూర్చుట జరుగును-రామునకుదూరముగా నున్నందున ఇప్పుడు సీతాదేవికి అశోకము, చంద్రుడు కష్టమును పరితాపమునేగూర్చుచున్నారు.

ఏకాక్షీమేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా।
అకర్ణాం శంకుకర్ణాం చ మస్తకోచ్ఛ్వాసనాసికామ్। 5

అతికాయోత్తమాంగీం చ తనుదీర్ఘశిరోధరామ్।
ధ్వస్తకేశీం తథాఽకేశీం కేశకంబళధారిణీమ్। 6

లంబకర్ణలలాటాం చ లంబోదరపయోధరామ్।
లంబోష్ఠీం చుబుకోష్ఠీం చ లంబాస్యాం లంబజానుకామ్। 7

హ్రస్వాం దీర్ఘాం తథా కుబ్జాం వికటాం వామనాం తథా।
కరాళాం భుగ్నవక్త్రాం చ పింగాక్షీం వికృతాననామ్। 8

వికృతాః పింగళాః కాళీః క్రోధనాః కలహప్రియాః।
కాలాయసమహాశూల కూటముద్గరధారిణీః। 9

వరాహమృగశార్దూలమహిషాజశివాముఖీః।
గజోష్ట్రహయపాదీశ్చ నిఖాతశిరసోఽపరాః। 10

ఏకహస్తైకపాదాశ్చ ఖరకర్ణ్యశ్వకర్ణికాః।
గోకర్ణీర్హస్తికర్ణీశ్చ హరికర్ణీస్తథాపరాః। 11

అనాసా అతినాసాశ్చ తిర్యఙ్నాసా వినాసికాః।
గజసన్నిభనాసాశ్చ లలాటోచ్ఛ్వాసనాసికాః। 12

హస్తిపాదా మహాపాదా గోపాదాః పాదచూళికాః।
అతిమాత్రశిరోగ్రీవా అతిమాత్రకుచోదరీః। 13

అతిమాత్రాస్యనేత్రాశ్చ దీర్ఘజిహ్వానఖా స్తథా।
అజాముఖీర్హస్తిముఖీః గోముఖీస్సూకరీముఖీః। 14

హయోష్ట్రఖరవక్త్రాశ్చ రాక్షసీర్ఘోరదర్శనాః।
శూలముద్గరహస్తాశ్చ క్రోధనాః కలహప్రియాః। 15

ఒక్కకన్నుమాత్రమేగలది, ఒకేచెవిగలది, తలచుట్టును వ్యాపించియున్న చెవులుగలది, చెవులులేనిది, శంకువువంటి కర్ణములుగలది, తలవఱకు వ్యాప్తమైయున్న ముక్కుగలది, శరీరమునకుమించిన తలగలది, సన్నని పొడవైన మెడగలది, చింపిరిజుట్టుగలది, జుట్టులేనిది, కేశములనే కంబళముగాధరించినట్టిది, వ్రేలాడుచున్న కర్ణములు, లలాటముకలది, వ్రేలాడుచున్నపొట్ట, స్తనములు గలది, వ్రేలాడుచున్నపెదవులుగలది, గడ్డము వఱకువ్యాప్తమైన పెదవులు గలది, వ్రేలాడుముఖము గలది, వ్రేలాడుచున్న మోకాళ్లుగలది, మఱుగుజ్జుది, పొడవైనది, గూనిది, వంకరగానున్నది, పొట్టిది, ఎత్తైన కోఱలుగలది, వంకరమూతిగలది, పచ్చనికళ్లుగలది, వికారముగానున్న ముఖముగలది. ఇట్టి రాక్షసస్త్రీలను మారుతిగాంచెను. (5-8)

వికారముగానున్నవారు, పచ్చనిశరీరములుగలవారు, నల్లనివారు, కోపస్వభావలు, కలహప్రియులు, నల్లని పెద్దఇనుప శూలములను, కూటములను, గుదియలను ధరించినవారు, పందులు, లేళ్లు, పెద్దపులులు, గేదెలు, మేకలు, నక్కలు వీటి ముఖములవంటి ముఖములు గలవారు, ఏనుగులు, ఒంటెలు, గుఱ్ఱములు - వీటి పాదములవంటి పాదములు గలవారు, కుదించుకొని పోయినశిరస్సులుగలవారు, ఒంటిచేయిగలవారు, ఒంటిపాదముగలవారు, గాడిద చెవులవారు, గుఱ్ఱముల చెవులవారు, ఆవుచెవులవారు, ఏనుగుచెవులవారు, కోతిచెవులవారు, ముక్కులు లేనివారు, పెద్దముక్కులుగల వారు, అడ్డముక్కులుగలవారు, వంకర ముక్కులుగలవారు, ఏనుగుతొండమువంటిముక్కుగలవారు, నుదుటువఱకు ముక్కుగలవారు, ఏనుగుకాళ్లవారు, పెద్ద పాదములుగల వారు, ఆవుపాదములవారు, పాదములమీద కేశములు గలవారు, మించినశిరస్సు, మెడగలవారు, పెద్దకుచములు, బానకడుపుగలవారు, పెద్దముఖము, నేత్రములుగలవారు, పొడవైననాల్క, గోళ్లుగలవారు, మేకముఖములవారు, ఏనుగుముఖములవారు, గోముఖముల వారు, సూకర ముఖములవారు, గుఱ్ఱములు, ఒంటెలు, ఏనుగులు - వీటినోళ్లవంటి నోళ్లుగలవారు- ఈవిధముగా భయంకరరూపములుగల రాక్షసస్త్రీలను హనుమంతుడు గాంచెను. శూలములను, ఇనుపగుదియలను చేతబట్టి యున్నవారు, కోపముఖములవారు, కలహ ప్రియులు, కోఱలుగలవారు, పొగబాఱినజుట్టుగలవారు, వికారముగానున్న ముఖముల వారు ఐన రాక్షసీగణములను అతడు చూచెను.

కరాలా ధూమ్రకేశిశ్చ రాక్షసీర్వికృతాననాః।
పిబంతీస్సతతం పానం సదా మాంససురాప్రియాః। 16

మాంసశోణితదిగ్ధాంగీః మాంసశోణితభోజనాః।
తా దదర్శ కపిశ్రేష్ఠో రోమహర్షణదర్శనాః। 17

స్కంధవంతముపాసీనాః పరివార్య వనస్పతిమ్।
తస్యాధస్తాచ్చ తాం దేవీం రాజపుత్రీ మనిందితామ్। 18

లక్షయామాస లక్ష్మీవాన్ హనుమాన్ జనకాత్మజామ్।
నిష్ప్రభాం శోకసంతప్తాం మలసంకులమూర్ధజామ్। 19

క్షీణపుణ్యాం చ్యుతాం భూమౌ తారాం నిపతితామివ।
చారిత్రవ్యపదేశాఢ్యాం భర్తృదర్శనదుర్గతామ్। 20

భూషణైరుత్తమైర్హీనాం భర్తృవాత్సల్యభూషణామ్।
రాక్షసాధిపసంరుద్ధాం బంధుభిశ్చ వినాకృతామ్। 21

వియూథాం సింహసంరుద్ధాం బద్ధాం గజవధూమివ।
చంద్రరేఖాం పయోదాంతే శారదాభ్రై రివావృతామ్। 22

క్లిష్టరూపామసంస్పర్శాత్ అయుక్తామివ వల్లకీమ్।
సీతాం భర్తృవశే యుక్తామ్ అయుక్తాం రాక్షసీవశే। 23

అశోకవనికామధ్యే శోకసాగరమాప్లుతామ్।
తాభిః పరివృతాం తత్ర సగ్రహామివ రోహిణీమ్। 24

దదర్శ హనుమాన్ దేవీం లతామకుసుమామివ।
సా మలేన చ దిగ్ధాంగీ వపుషా చాప్యలంకృతా।
మృణాళీ పంకదిగ్ధేవ విభాతి న విభాతి చ। 25

మలినేన తు వస్త్రేణ పరిక్లిష్టేన భామినీమ్।
సంవృతాం మృగశాబాక్షీం దదర్శ హనుమాన్ కపిః। 26

ఆ స్త్రీలు నిరంతరము మద్యపానముచేయుచుండిరి. మాంసభక్షణముపైనను, సురాపానముల మీదను వారికి మక్కువ ఎక్కువ. వారు రక్తమాంసభక్షకులు. వారిశరీరములు మాంసరక్తములతో పూయబడినట్లుండెను. చూచెడివారికి గగుర్పాటు గలిగించు ఆ భయంకర రాక్షసస్త్రీలను కపివరుడు గాంచెను. (9-17)

ఆ రాక్షసస్త్రీలు పెద్దస్కంధముగల వృక్షముచుట్టును కూర్చొనియుండిరి. ఆ చెట్టుక్రిందనేయున్న పూజ్యురాలును, జనకరాజసుతయునగు సీతాదేవిని హనుమంతుడు దర్శించెను. ఆ జానకిని దర్శించుటవలన అతడు మహానందభరితుడై, దివ్యతేజోవిలసితుడయ్యెను. శోకసంతప్తయగుటవలన ఆమె వన్నెతఱిగియుండెను. ఆమెకేశములన్నియు ధూళితో నిండియుండెను. పుణ్యముక్షీణించుటవలన భూమిపైరాలిన తారవలె ఆమె నిస్తేజయైయుండెను. పతివ్రతాధర్మములను పాటించుచు ఉత్తమశీలసంపన్నయేయైయున్నను భర్తృదర్శన భాగ్యము లేకపోవుటచే ఆమె దీనురాలైయుండెను. (18-20)

శ్రేష్ఠములైనఆభరణములను ధరింపకయున్నను ఆమెకు పతిప్రేమయే ఏకైకభూషణము. రావణునిచే అపహృతయై ఆత్మీయులకు (రామలక్ష్మణులకు) దూరమై ఒంటరిగానున్న సీతాదేవి, సింహముచేఅడ్డగింపబడి తోడిగజయూథములకు దూరమై ఏకాకిగా చిక్కులపాలైన ఆడుఏనుగువలె ఉండెను. ఆమె వర్షాకాలాంతమునందు శరత్కాలమేఘములచే కప్పబడిన చంద్రరేఖవలె ఒప్పు చుండెను. (21-22)

ఉద్వర్తనాది (నలుగుబెట్టుట...... మొదలగు) సంస్కారములు లేనందున ఆమెరూపము తీగలను సరిచేయని (శ్రుతిచేయని) వీణవలె శోభావిహీనమై యుండెను. ఆమె రాక్షసస్త్రీల మధ్యమున్నను, ఆమెమనస్సు శ్రీరామునియందే లగ్నమై యుండుటవలన వారిమాటలు ఆమెచెవికెక్కుటలేదు. అశోకవనమధ్యముననున్నను ఆమె శోకసాగరమున మునిగి యుండెను. అచ్చటరాక్షసస్త్రీలచే పరివృతయై గ్రహములచే చుట్టబడిన రోహిణివలెను, పుష్పములులేని లతవలెను నిస్తేజమైయున్న సీతాదేవిని ఆ మారుతి గాంచెను. ఆమె శరీరము మలినముతోకూడి శోభావిహీనమైయున్నను సహజ లావణ్యప్రభావమున బురదతో నిండిన తామర తూడువలె తేజరిల్లుచుండెను. నలిగిమలినమైన వస్త్రమును దాల్చినదై లేడిపిల్లవలె బిత్తర చూపులుగలల సీతాదేవిని ఆవానరోత్తముడు వీక్షించెను. (23-26)

తాం దేవీం దీనవదనామ్ అదీనాం భర్తృతేజసా।
రక్షితాం స్వేన శీలేన సీతామసితలోచనామ్॥ 27

తాం దృష్ట్వా హనుమాన్ సీతాం మృగశాబనిభేక్షణామ్।
మృగకన్యామివ త్రస్తాం వీక్షమాణాం సమంతతః॥ 28

రాక్షసస్త్రీలమధ్య దీనవదనయైయున్నను ఆమె తనభర్తయైన శ్రీరామునిపరాక్రమమును బాగుగా ఎఱిగినదగుటవలన ధైర్యముతో ఎవ్వరికిని తలవంచనిదై యుండెను. చక్కని నేత్రసౌందర్యముగల సీతాదేవిని ఆమెశీలమే రక్షించుచుండెను. మనోహరములైన చూపులతో ఒప్పుచు, భయముతో అటు నిటు చూచు చున్నఆడులేడివలెఉన్న ఆ సీతాదేవిని హనుమంతుడు తిలకించెను. (27-28)

దహంతీమివ నిశ్శ్వాసైః వృక్షాన్ పల్లవధారిణః।
సంఘాతమివ శోకానాం దుఃఖస్యోర్మిమివోత్థితామ్॥ 29

తాం క్షమాం సువిభక్తాంగీం వినాభరణశోభినీమ్।
ప్రహర్షమతులం లేభే మారుతిః ప్రేక్ష్య మైథిలీమ్॥ 30

ఆమె తన వేడినిట్టూర్పులచే చిగుళ్లుదొడిగిన వృక్షములను కాల్చివేయుచున్నట్లుండెను. శోకముల రాశివలెను, ఎగసిపడుచున్న దుఃఖతరంగములవలెను ఒప్పుచును ఆభరణములు లేకున్నను చక్కని అవయవ సౌష్ఠవముతో శోభిల్లుచున్న క్షమామూర్తియైన ఆ సీతా మాతను జూచి, మారుతి మిక్కిలి సంతసించెను.(29-30)

హర్షజాని చ సోఽశ్రూణి తాం దృష్ట్వా మదిరేక్షణామ్।
ముమోచ హనుమాంస్తత్ర నమశ్చక్రే చ రాఘవమ్॥ 31

నమస్కృత్వా చ రామాయ లక్ష్మణాయ చ వీర్యవాన్।
సీతాదర్శనసంహృష్టో హనుమాన్ సంవృతోఽభవత్॥ 32

అందమైన కన్నులుగల ఆ సీతాదేవిని జూచుట తోడనే ఆ హనుమంతుని నేత్రములనుండి ఆనందాశ్రువులు స్రవించెను. పిమ్మట ఆంజనేయుడు రాముని స్మరించి, ఆయనకు అంజలిఘటించెను. సీతాదర్శనముతో ఆనందభరితుడై రామలక్ష్మణులకు నమస్కరించి, ఆ మహావీరుడు ఆకుల చాటున దాగికొనియుండెను.[1] (31-32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే సప్తదశస్సర్గః (17)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పదునేడవసర్గము.

-- * * * --

18. పదునెనిమిదవ సర్గము

రావణుడు అశోకవాటికకు వచ్చుట, హనుమంతుడు అతనిని చూచుట

తథా విప్రేక్షమాణస్య వనం పుష్పితపాదపమ్।
విచిన్వతశ్చ వైదేహీం కించిచ్ఛేషా నిశాఽభవత్॥ 1

ఆవిధముగా హనుమంతుడు పూలతోనిండిన వృక్షములుగల ఆవనమునందంతటను గాలించుచు సీతాదేవిని గుర్తించునంతలో వేకువజాము అయ్యెను. (1)

షడంగవేదవిదుషాం క్రతుప్రవరయాజినామ్।
శుశ్రావ బ్రహ్మఘోషాంశ్చ విరాత్రే బ్రహ్మరక్షసామ్॥ 2

వేదవేదాంగములయందు నిష్ణాతులును, ప్రముఖ యజ్ఞములనుజేసినవారును ఐన బ్రహ్మరాక్షసులు వేకువజామున కావించుచున్నవేదఘోషలను హనుమంతుడు వినెను. (2)

1) తరు పల్లవ మహఁ రహా లుకాఈ । కరఇ బిచార కరౌఁ కా భాఈ ॥
హనుమంతుడు చెట్లఆకుల, మాటున దాగుకొనికూర్చుండి "ఈమెయొక్క దుఃఖమునుతొలగించుటకునేనేమి చేయువలెను?" అని ఆలోచింపసాగెను. (శ్రీరామచరితమానసము 5/8/1)

అథ మంగళవాదిత్రైః శబ్దైశ్శ్రోత్రమనోహరైః।
ప్రాబుధ్యత మహాబాహుః దశగ్రీవో మహాబలః। 3

విబుధ్య తు యథాకాలం రాక్షసేంద్రః ప్రతాపవాన్।
స్రస్తమాల్యాంబరధరో వైదేహీమన్వచింతయత్। 4

భృశం నియుక్తస్తస్యాం చ మదనేన మదోత్కటః।
న స తం రాక్షసః కామం శశాకాత్మని గూహితుమ్। 5

స సర్వాభరణైర్యుక్తో బిభ్రత్ శ్రియమనుత్తమామ్।
తాం నగైర్వివిధైర్జుష్టాం సర్వపుష్పఫలోపగైః। 6

వృతాం పుష్కరిణీభిశ్చ నానాపుష్పోపశోభితామ్।
సదామదైశ్చ విహగైః విచిత్రాం పరమాద్భుతామ్। 7

ఈహామృగైశ్చ వివిధైః జుష్టాం దృష్టిమనోహరైః।
వీథీస్సంప్రేక్షమాణశ్చ మణికాంచనతోరణాః। 8

నానామృగగణాకీర్ణాం ఫలైః ప్రపతితైర్వృతామ్।
అశోకవనికామేవ ప్రావిశత్ సంతతద్రుమామ్। 9

అంగనాశతమాత్రం తు తం వ్రజంతమనువ్రజన్।
మహేంద్రమివ పౌలస్త్యం దేవగంధర్వయోషితః। 10

దీపికాః కాంచనీః కాశ్చిత్ జగృహుస్తత్ర యోషితః।
వాలవ్యజనహస్తాశ్చ తాలవృంతాని చాపరాః। 11

కాంచనైరపి భృంగారైః జహ్రుస్సలిలమగ్రతః।
మండలాగ్రాన్ బృసీంశ్చైవ గృహ్యాన్యాః పృష్ఠతో యయుః। 12

కాచిద్రత్నమయీం స్థాలీం పూర్ణాం పానస్య భామినీ।
దక్షిణా దక్షిణేనైవ తదా జగ్రాహ పాణినా। 13

రాజహంసప్రతీకాశం ఛత్రం పూర్ణశశిప్రభమ్।
సౌవర్ణదండమపరా గృహీత్వా పృష్ఠతో యయౌ। 14

పిమ్మట వీనసొంపైన మంగళకరములైన చతుర్వాద్య ధ్వనులచే దీర్ఘబాహువు, మహాబలము గలవాడును ఐన దశకంఠుని అతనిఅనుచరులు మేల్కొలిపిరి. (3)

ప్రతాపశాలియైన రావణుడు సకాలమున మేల్కొనెను. చెదరినహారములను, జారిపోవుచున్నవస్త్రములను సర్దుకొనెను, ఎల్లప్పుడును సీతాదేవి అతని స్మృతిపథమున మెదలుచునే యుండెను. (4)

సీతాదేవిపై మరులుగొనియున్న అతనిలో ఇంకను కామవికారములు చెలరేగెను. మదోన్మత్తుడైన రావణుడు తనకామాతిరేకమును అణచుకొనలేకపోయెను. (5)

అతడుసర్వాభరణభూషితుడై నూతనశోభలతో తేజరిల్లు చుండెను. పిమ్మట వివిధములగు ఫలములతోడను, పూలతోను శోభిల్లుచున్న వృక్షములు గల ఆ అశోకవనమున ప్రవేశించెను. ఆ అశోకవనము సరస్సులతో నిండియుండెను. నానావిధపుష్పములచే శోభిల్లుచుండెను. అది నిరంతరము మత్తిల్లినపక్షుల కలకలారావములతో అద్భుతావహమై చిత్రవిచిత్రముగా నుండెను. చక్కనిరూపులుగల వివిధములగు క్రీడామృగములతో అలరారుచుండెను. అనేకవిధములగు మృగములగుంపులతో విలసిల్లుచుండెను. అందు ఆయావృక్షముల నుండి రాలినఫలములతో నేల యంతయు నిండియుండెను. అందలిచెట్లు దట్టముగానుండెను. మణిఖచితములైన బంగారు ముఖ ద్వారములుగల ఉద్యానవన వీధులనుగాంచుచు రావణుడు అందుప్రవేశించెను. (6-9)

దేవకన్యలు, గంధర్వకాంతలు దేవేంద్రుని అనుసరించినట్లు పులస్త్యవంశజుడైన ఆరావణుని వందలకొలదిఅంగనలు అనుగమించిరి. అచట కొందఱు యువతులు బంగారు కరదీపికలను, మఱికొందఱు వీసనకఱ్ఱలను, వింజామరలను చేబూని అతనిని సేవించుచుండిరి. కొందఱు బంగారు పూర్ణ కుంభములతో ముందునడచు చుండిరి. మఱికొందఱు ఖడ్గములను, ఆస్తరణములను (ఆసనములను) గ్రహించి, అతని వెనుకనడచుచుండిరి. (10-12)

మఱొక నెఱజాణ మద్యముతో నిండిన రత్నఖచిత పాత్రను కుడిచేతబట్టుకొని రావణునిప్రక్కన నడచుచుండెను. (13)

ఇంకొకతరుణి రాజహంసవలెస్వచ్ఛమై నిండు చంద్రుని వంటికాంతిగలిగిన బంగారు దండముగల గొడుగును పట్టుకొని అతనివెనుక నడచుచుండెను. (14)

నిద్రామదపరీతాక్ష్యో రావణస్యోత్తమాః స్త్రియః।
అనుజగ్ముః పతిం వీరం ఘనం విద్యుల్లతా ఇవ। 15

వ్యావిద్ధహారకేయూరాః సమామృదితవర్ణకాః।
సమాగలితకేశాంతాః సస్వేదవదనాస్తథా। 16

ఘూర్ణంత్యో మదశేషేణ నిద్రయా చ శుభాననాః।
స్వేదక్లిష్టాంగకుసుమాః సుమాల్యాకులమూర్ధజాః। 17

ప్రయాంతం నైరృతపతిం నార్యో మదిరలోచనాః।
బహుమానాచ్చ కామాచ్చ ప్రియా భార్యాస్తమన్వయుః। 18

స చ కామపరాధీనః పతిస్తాసాం మహాబలః।
సీతాసక్తమనా మందో మదాంచితగతిర్బభౌ। 19

తతః కాంచీనినాదం చ నూపురాణాం చ నిస్స్వనమ్।
శుశ్రావ పరమస్త్రీణాం స కపిర్మారుతాత్మజః। 20

తం చాప్రతిమకర్మాణమ్ అచింత్యబలపౌరుషమ్।
ద్వారదేశమనుప్రాప్తం దదర్శ హనుమాన్ కపిః। 21

దీపికాభిరనేకాభిః సమంతాదవభాసితమ్।
గంధతైలావసిక్తాభిః ధ్రియమాణాభిరగ్రతః। 22

కామదర్పమదైర్యుక్తం జిహ్మతామ్రాయతేక్షణమ్।
సమక్షమివ కందర్పమ్ అపవిద్ధశరాసనమ్। 23

మథితామృతఫేనాభమ్ అరజోవస్త్రముత్తమమ్।
సలీలమనుకర్షంతం విముక్తం సక్తమంగదే। 24

తం పత్రవిటపే లీనః పత్రపుష్పఘనావృతః।
సమీపమివ సంక్రాంతం నిధ్యాతుముపచక్రమే। 25

రావణునిఅనుంగుసతులు నిద్రమత్తుతో మూతలు పడుచున్నకన్నులుగలవారై మెఱుపుతీగెలు మేఘమును వలె వీరుడైన తమపతిని అనుసరించుచుండిరి. (15)

రావణునిప్రియసతులు, మదిరలోచనలునైన ఆ తరుణీమణులహారములు, కేయూరములు తమతమ స్థానములనుండి తొలగియుండెను. వారిమైపూతలు రాలి పోయియుండెను. కొప్పులుజాఱి చెదరియుండెను, ముఖములపై స్వేదబిందువులు కన్పట్టుచుండెను. ముఖములు ముద్దులొలుకుచుండెను. వారు నిద్రమత్తుతో తూలుచుండిరి. వారిశరీరములపై గలకుసుమములు స్వేదబిందువులచే తడిసియుండెను. శిరోజములు, పూలమాలలు కదలుచుండెను. అతని ప్రియభార్యలందఱును ఆదరాభిమానములతోను, కామముతోను రావణుని అనుసరించుచుండిరి. (16-18)

వారికిపతియైన మహాబలుడగు ఆరావణుడు కామవశుడగుటచే మందబుద్ధియై సీతాదేవిపైగల ఆసక్తితో మత్తిల్లిన నడకలతో తిన్నగా వచ్చెను. (19)

అప్పుడు ఆ ఉత్తమస్త్రీలయొక్క ఒడ్డాణపు సవ్వడులను, అందెలరవళులను వాయుసూనుడు వినెను. (20)

సాటిలేని దుస్సాహసకార్యములను చేయువాడును, అమితబలపరాక్రమశాలియు అశోకవనద్వారముకడకు చేరినవాడునుఅగు ఆ రావణుని వానరోత్తముడైన హనుమంతుడు చూచెను. (21)

సుగంధతైలములతోతడుపబడిన అనేక కరదీపికలను ధరించి, స్త్రీలు ముందునడచుచుండగా అంతటనువ్యాపించిన వాటివెలుగులలో అతడు తేజరిల్లుచుండెను. అతనిలో కామము, గర్వము, మదము పెచ్చుపెఱిగియుండెను. అతని విశాలనేత్రములు కుటిలములై ఎఱ్ఱబాఱియుండెను. అతడు ధనుస్సును ధరింపక సమక్షమున నిలిచిన మన్మథునివలెనుండెను. మథింపబడిన అమృతపునుఱుగువలె స్వచ్ఛమై, నిర్మలమైన అతని ఉత్తరీయముజాఱి, కేయూరము నందు చిక్కుకొనెను. దానిని అతడు విలాసముగా లాగుచుండెను. అట్టి రావణుడు సమీపించుచుండగా హనుమంతుడు ఆకులతోనిండినకొమ్మపైఒదిగి, దట్టమైన పత్రపుష్పములచే కప్పబడినవాడై, అతనినిపరికించి చూడసాగెను. (22-25)

అవేక్షమాణస్తు తతో దదర్శ కపికుంజరః।
రూపయౌవనసంపన్నా రావణస్య వరస్త్రియః॥ 26

నలుదెసల పరికించిచూచుచున్న కపివరుడు రూపయౌవన సంపన్నలైన రావణుని ప్రియ(వర)పత్నులను గాంచెను. (26)

తాభిః పరివృతో రాజా సురూపాభిర్మహాయశాః।
తన్మృగద్విజసంఘుష్టం ప్రవిష్టః ప్రమదావనమ్॥ 27

మిక్కిలి ప్రసిద్ధికెక్కిన రావణుడు ఆ సుందరీమణులచే పరివృతుడై, మృగములధ్వనులతో పక్షులకూజితములతో నిండిన ఆ ప్రమదావనమున ప్రవేశించెను. (27)

క్షీబో విచిత్రాభరణః శంకుకర్ణో మహాబలః।
తేన విశ్రవసః పుత్రః స దృష్టో రాక్షసాధిపః॥ 28

మదించియున్నవాడును, విచిత్రములైన ఆభరణములను ధరించియున్నవాడును, గర్వముతో చెవులనుతిక్కించి యున్నవాడును, మహాబలశాలియు, విశ్రవసునిపుత్రుడునుఐన రావణుని హనుమంతుడు చూచెను. (28)

వృతః పరమనారీభిః తారాభిరివ చంద్రమాః।
తం దదర్శ మహాతేజాః తేజోవంతం మహాకపిః॥ 29

అతడు తారలచే చంద్రునివలె నారీమణులచే పరివృతుడై యుండెను. అట్టితేజశ్శాలిని మహా పరాక్రమశాలియైన హనుమంతుడు గాంచెను. (29)

రావణోఽయం మహాబాహుః ఇతి సంచింత్య వానరః।
సోఽయమేవ పురా శేతే పురమధ్యే గృహోత్తమే।
అవప్లుతో మహాతేజా హనుమాన్ మారుతాత్మజః॥ 30

"మహాబాహువైన ఈరావణుడు లంకాపురమునందలి మహాప్రాసాదమున శయనించియుండగా ఇంతకుముందే చూచియుంటిని. అతడేఇతడు"- అని భావించి, దివ్య తేజోమూర్తియైన మారుతి కొంచెము క్రిందికి దిగెను. (30)

స తథాఽప్యుగ్రతేజాస్సన్ నిర్ధూతస్తస్య తేజసా।
పత్రగుహ్యాంతరే సక్తో హనుమాన్ సంవృతోఽభవత్॥ 31

మహాతేజశ్శాలియైనను హనుమంతుడు ఆ రావణుని తేజస్సుముందు నిలువజాలనివానివలె అతని చేష్టలు గమనించుటకై (ఎవ్వరికినికనబడకుండ) ఆకులచాటున ఒదిగియుండెను. (31)

స తామసితకేశాంతాం సుశ్రోణీం సంహతస్తనీమ్।
దిదృక్షురసితాపాంగీమ్ ఉపావర్తత రావణః॥ 32

నల్లనికురులుగలదియు, చక్కని కటిప్రదేశము గలదియు, వక్షస్థలమును అనువుగా సర్దుకొని కూర్చొనియున్నట్టిదియు, నేత్రసౌందర్యముగలదియు ఐన ఆ సీతాదేవిని చూడదలచినవాడై ఆ రావణుడు ఆమెను సమీపించెను. (32)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే అష్టాదశస్సర్గః *(18)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పదునెనిమిదవ సర్గము.

— * * * —

19. పందొమ్మిదవ సర్గము

రావణుడు సీతను చూచుట

తస్మిన్నేవ తతః కాలే రాజపుత్రీ త్వనిందితా।
రూపయౌవనసంపన్నం భూషణోత్తమభూషితమ్॥ 1

తతో దృష్ట్వైవ వైదేహీ రావణం రాక్షసాధిపమ్।
ప్రావేపత వరారోహా ప్రవాతే కదళీ యథా॥ 2

రూపయౌవనసంపన్నుడు, శ్రేష్ఠములైనఆభరణములను ధరించినవాడు, రాక్షసులకుప్రభువు ఐన రావణుడు వచ్చిన మఱుక్షణముననే సౌశీల్యవతియు, సౌందర్యరాశియు, జనకరాజసుతయునైన సీతాదేవి అతనినిచూచి పెనుగాలికి అరటిచెట్టువలె కంపించెను. (1-2)

ఆచ్ఛాద్యోదరమూరుభ్యాం బాహుభ్యాంచ పయోధరౌ।
ఉపవిష్టా విశాలాక్షీ రుదంతీ వరవర్ణినీ। 3

విశాలములైననేత్రములుగల సీతాసాధ్వి తొడలతో ఉదరమును, బాహువులతో వక్షఃస్థలమును కప్పుకొని (ముడుచుకొని) ఏడ్చుచుకూర్చొనెను. (3)

దశగ్రీవస్తు వైదేహీం రక్షితాం రాక్షసీగణైః।
దదర్శ దీనాం దుఃఖార్తాం నావం సన్నామివార్ణవే। 4

రాక్షసస్త్రీలచే రక్షింపబడుచు సముద్రము నడుమ కొట్టుమిట్టాడు నావవలె దీనస్థితిలోనున్న సీతాదేవిని రావణుడు చూచెను. (4)

అసంవృతాయామాసీనాం ధరణ్యాం సంశితవ్రతామ్।
ఛిన్నాం ప్రపతితాం భూమౌ శాఖామివ వనస్పతేః। 5

ఛేదింపబడినకొమ్మ చెట్టునుండి నేత్రై భూమిపై బడియున్నట్లు కఠోరమైన వ్రతదీక్షలోనున్న సీతాదేవి కటికినేలపై కూర్చొనియుండెను. (5)

మలమండనచిత్రాంగీం మండనార్హామమండితామ్।
మృణాళీ పంకదిగ్ధేవ విభాతి న విభాతి చ। 6

శరీరము ధూళిధూసరితమైయున్నను ఆమె తన సహజకాంతితో ప్రకాశించుచునేయుండెను. అలంకారములను ధరించుటకు అర్హురాలైన ఆ సౌభాగ్యవతి (పతి యెడబాటు కారణముగా) భూషణములను ధరింపక యున్నను ఆమె తేజస్సు తఱుగలేదు, బురదతో లిప్తమైయున్న తామరతూడు వలె తేజోహీనగా కన్పట్టుచున్నను. ఆమె సహజతేజస్సు బహిర్గతమగుచునే యుండెను. (6)

సమీపం రాజసింహస్య రామస్య విదితాత్మనః।
సంకల్పహయసంయుక్తైః యాంతీమివ మనోరథైః। 7

సీతాదేవి సంకల్పములనెడి గుఱ్ఱములనుబూన్చి తన మనోరథములనే రథములుగాజేసికొని, జగద్విఖ్యాతుడు, రాజశ్రేష్ఠుడు ఐన శ్రీరామచంద్రునికడకు వెళ్లుచున్నదా యనునట్లు కన్పట్టుచుండెను. (7)

శుష్యంతీం రుదతీమేకాం ధ్యానశోకపరాయణామ్।
దుఃఖస్యాంతమపశ్యంతీం రామాం రామమనువ్రతామ్। 8

అందచందములతో మనోజ్ఞయైన సీతాదేవి రాముని యందే చిత్తమునునిల్పి, అతనినే ధ్యానించుచు శోకాకులయయ్యెను. ఈ దుఃఖమునకు అంతమేలేదా? అని ఒంటరిగా పరితపించుచు, శుష్కించియుండెను. (8)

వేష్టమానాం తథాఽఽవిష్టాం పన్నగేంద్రవధూమివ।
ధూప్యమానాం గ్రహేణేవ రోహిణీం ధూమకేతునా। 9

ఆమె మణిమంత్రాదుల ప్రభావమునకులోనైన ఆడు సర్పమువలె రావణునిచే బంధింపబడియుండెను. మఱియు 'ధూమకేతువు' అనెడి గ్రహబాధకులోనైన రోహిణివలె ఆమె పరితపించుచుండెను. (9)

వృత్తశీలకులే జాతామ్ ఆచారవతి ధార్మికే।
పునస్సంస్కారమాపన్నాం జాతామివ చ దుష్కులే। 10

సీతాదేవి ధార్మికసంప్రదాయములకు కుదురైన ఉత్తమ శీలములుగల జనకరాజవంశమునందు పుట్టినది, వివాహ సంస్కారఫలముగా[1] ఆమె పవిత్రమైన ఇక్ష్వాకు వంశమున మెట్టినది. మలినవస్త్రధారణాది దుఃస్థితులలోనున్న ఈ జానకి ఇప్పుడు దుష్కులమున మెట్టినదాయనునట్లు ఒప్పుచుండెను.(10)

అభూతేనాపవాదేన కీర్తిం నిపతితామివ।
ఆమ్నాయానామయోగేన విద్యాం ప్రశిథిలామివ। 11

నిరాధారముగా వచ్చిపడిన అపవాదువలన దెబ్బతినిన కీర్తివలెను, పఠనపాఠనములు లేకపోవుటచే మిక్కిలిశిథిలమైన వేదాదివిద్యలవలెను ఆమె గోచరించుచుండెను. (11)

1. "వైవాహికో విధిః స్త్రీణాం ఔపనాయనికః స్మృతః" అనుస్మృతి వాక్యప్రమాణమును అనుసరించి, స్త్రీలకు వివాహము పునర్జన్మ "కుమారాణాం ఉపనయనమివ, కుమారీణాం వివాహో ద్వితీయం జన్మ"బాలురకు ఉపనయనము పునర్జన్మ. కన్యలకు వివాహము పునర్జన్మ.

సన్నామివ మహాకీర్తిం శ్రద్ధామివ విమానితామ్।
పూజామివ పరిక్షీణామ్ ఆశాం ప్రతిహతామివ॥ 12

సన్నగిల్లిన మహాకీర్తివలెను, అవమానములకు గురియైనప్పుడు తఱిగిపోయినశ్రద్ధవలెను, తగినంతగా పూజాద్రవ్యములులేని పూజవలెను, నిష్ఫలమైన ఆశవలెను ఆమె అతిదీనావస్థకు గురియైయుండెను. (12)

ఆయతీమివ విధ్వస్తామ్ ఆజ్ఞాం ప్రతిహతామివ।
దీప్తామివ దిశం కాలే పూజామపహృతామివ॥ 13

ఆమెస్థితి తరిగిపోయినఆదాయమువలెను, ఆచరణకు నోచుకొనని ఆజ్ఞవలెను, ఉత్పాతకాలమున మండుచున్న దిక్కువలెను, పూజాద్రవ్యములు అపహరింప బడినప్పుడు భంగమైన పూజవలెను ఉండెను. (13)

పద్మినీమివ విధ్వస్తాం హతశూరాం చమూమివ।
ప్రభామివ తమోధ్వస్తామ్ ఉపక్షీణామివాపగామ్॥ 14

నలిగినతామరతూడువలెను, శూరులెల్లరును నేలగూలగా మిగిలియున్నసేనవలెను, చిమ్మచీకట్లచే మసకబాఱిన కాంతివలెను, దాదాపుగా ఎండిపోయిననదివలెను ఆమె దీనావస్థలోనుండెను. (14)

వేదీమివ పరామృష్టాం శాంతామగ్నిశిఖామివ।
పౌర్ణమాసీమివ నిశాం రాహుగ్రస్తేందుమండలామ్॥ 15

అపవిత్రులు అడుగిడిన యజ్ఞవేదికవలెను, చల్లారిన అగ్నిశిఖవలెను, రాహుగ్రస్తచంద్రగ్రహణమునాటి పున్నమిరాత్రి వలెను ఆమె నిస్తేజయైయుండెను. (15)

ఉత్కృష్టపర్ణకమలాం విత్రాసిత విహంగమామ్।
హస్తిహస్తపరామృష్టామ్ ఆకులాం పద్మినీమివ॥ 16

ఒక యేనుగు తనతొండముచే తామరాకులను, పద్మములను పెకలించివేయగా, అచటి జల పక్షులన్నియును భయపడిపాఱిపోగా శోభావిహీనమైయున్న పద్మసరస్సువలె సీతాదేవి వ్యాకులచిత్తయై యుండెను. (16)

పతిశోకాతురాం శుష్కాం నదీం విస్రావితామివ।
పరయా మృజయా హీనాం కృష్ణపక్షనిశామివ॥ 17

అభ్యంగనాదిసంస్కారములులేక భర్తృశోకముచే పరితపించుచున్న సీతాదేవి, దఱులుపాడై నీరంతయు వృథాగాగా ఎండిపోయిననదివలె, కృష్ణపక్షమునందలి చీకటి రాత్రివలె కళదప్పియుండెను. (17)

సుకుమారీం సుజాతాంగీం రత్నగర్భగృహోచితామ్।
తప్యమానామివోష్ణేన మృణాలీమచిరోద్ధృతామ్॥ 18

సుకుమారియు, సుందరాంగియు, రత్నఖచిత హర్మ్యములలో నివసింపదగినదియు ఐన సీతాదేవి అప్పుడే పెకలింపబడి, ఎండవేడికి కమలిపోయిన తామరతూడువలె నుండెను. (18)

గృహీతామాలితాం స్తంభే యూథపేన వినాకృతామ్।
నిశ్శ్వసంతీం సుదుఃఖార్తాం గజరాజవధూమివ॥ 19

వేటాడువారు పట్టుకొనిపోయి స్తంభమునకు బంధింపగా, గజరాజునకు దూరమగుటవలన మిక్కిలి దిగులుతో నిట్టూర్పులు విడుచుచున్న ఆడుఏనుగువలె ఆమె దుఃఖార్తయై యుండెను. (19)

ఏకయా దీర్ఘయా వేణ్యా శోభమానామయత్నతః।
నీలయా నీరదాపాయే వనరాజ్యా మహీమివ॥ 20

పొడవైన ఒకేఒక్కజడతో సహజముగాశోభిల్లుచున్న సీతాదేవి వర్షాకాలాంతమున నల్లనివృక్షపంక్తిలోఒప్పెడి భూమివలెనుండెను. (20)

ఉపవాసేన శోకేన ధ్యానేన చ భయేన చ।
పరిక్షీణాం కృశాం దీనామ్ అల్పాహారాం తపోధనామ్॥ 21

ఆమె ఉపవాసములతో, శోకముతో, ఆలోచనలతో, భయముతో వాయుమాత్రాహారముతో తపోవ్రత నియమములను పాటించుచు, మిక్కిలి క్షీణించి, కృశించి దీనదశలో నుండెను. (21)

ఆయాచమానాం దుఃఖార్తాం ప్రాంజలిం దేవతామివ।
భావేన రఘుముఖ్యస్య దశగ్రీవపరాభవమ్॥ 22

దుఃఖార్తయైనసీతాదేవి అంజలిఘటించి, శ్రీరామునివలన రావణునకు పరాభవము కలుగవలెనని నిండుమనస్సుతో కోరుకొనుచు కులదేవతను ప్రార్థించు చున్నట్లుండెను. (22)

సమీక్షమాణాం రుదతీమనిందితాం
సుపక్ష్మతామ్రాయతశుక్లలోచనామ్ ।
అనువ్రతాం రామమతీవ మైథిలీం
ప్రలోభయామాస వధాయ రావణః ॥ 23

అందమైనవెప్పలతో కొనలయందెఱ్ఱగను, మధ్యన తెల్లగను ఉండి, విశాలమైన నేత్రములుగల సీతాదేవి తనను రక్షించు వారికొఱకై నలుదెసల పరికించుచు దుఃఖించు చుండెను. ఆమె శ్రీరామునే తనసర్వస్వముగా భావించి, పతివ్రతాధర్మములను నడుపుచుండెను. రావణుడు చావుమూడినవాడై సాధ్వియైన ఆ మైథిలిని ప్రలోభపెట్టసాగెను. (23)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకోనవింశస్సర్గః *(19)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది పందొమ్మిదవ సర్గము.

— ✻ ✻ ✻ —

20. ఇరువదియవసర్గము

రావణుడు సీతను ప్రలోభపెట్టజూచుట

స తాం పతివ్రతాం దీనాం నిరానందాం తపస్వినీమ్ ।
సాకారైర్మధురైర్వాక్యైః న్యదర్శయత రావణః ॥ 1

పతివ్రతయు, తపోనిష్ఠలోనున్నదియు, దుఃఖితయు దీనురాలునుఐయున్న ఆ సీతాదేవికి రావణుడు హస్తముఖాదిసంజ్ఞలతో మధురవచనములద్వారా తన మనోభావములను ప్రకటించెను. (1)

మాం దృష్ట్వా నాగనాసోరు గూహమానా స్తనోదరమ్ ।
అదర్శనమివాత్మానం భయాన్నేతుం త్వమిచ్ఛసి ॥ 2

ఓ సుందరీ! సీతా! నన్నుజూచి, నీవక్షస్థలమును హస్తములతో కప్పుకొనుచున్నావు. నాకు భయపడి నీవు ముఖమును చాటుచేసికొనగోరుచున్నావా ఏమి? (2)

కామయే త్వాం విశాలాక్షి బహుమన్యస్వ మాం ప్రియే ।
సర్వాంగగుణసంపన్నే సర్వలోకమనోహరే ॥ 3

సర్వాంగసుందరీ! సద్గుణసంపన్నా! సకల లోకములను ఆహ్లాదపఱచు ఓ విశాలాక్షీ! నేను నిన్ను ప్రేమించు చున్నాను. ఓ ప్రియురాలా! నన్ను ఆదరింపుము. (3)

నేహ కేచిన్మనుష్యా వా రాక్షసాః కామరూపిణః ।
వ్యపసర్పతు తే సీతే భయం మత్తస్సముత్థితమ్ ॥ 4

ఓ సీతా! మనుష్యులుగాని, కామరూపులైన రాక్షసులుగాని ఇక్కడ లేరు. నేను ఒక్కడనే యున్నాను. నావలన నీకు ఏమాత్రము భయముక్కఱలేదు. (4)

స్వధర్మో రక్షసాం భీరు సర్వథైవ న సంశయః ।
గమనం వా పరస్త్రీణాం హరణం సంప్రమథ్య వా ॥ 5

ఓ భయస్వభావురాలా! బలాత్కారముగా పరస్త్రీలను అపహరించుటయు, పొందుటయు రాక్షసులకు అన్నివిధములుగా స్వధర్మము. ఇందు సందేహమునకు తావేలేదు. (5)

ఏవం చైతదకామాం తు న త్వాం స్ప్రక్ష్యామి మైథిలి ।
కామం కామశ్శరీరే మే యథాకామం ప్రవర్తతామ్ ॥ 6

ఓ మైథిలీ! అదిఅట్లుండనిమ్ము. సహజముగా నేను కామాతురుడను. మన్మథుడు నాలో కామవికారములను ఎంతగారెచ్చగొట్టినను కొట్టనిమ్ము. కాని నాపైప్రేమలేని నిన్ను తాకనేతాకను.[1] (6)

1. అకారః = విష్ణువు, అ+కామా = శ్రీ మహావిష్ణువుపై ప్రేమగలది. *(అకామా = విష్ణుప్రియ)* విష్ణుకామాం త్వాం నస్ప్రక్ష్యామి. అనగా నీవు రాముని మాత్రమే ఇష్టపడుచుంటివి. కావున నేను నిన్నుతాకను. *(ఇది గర్భితభావము)*

దేవి నేహ భయం కార్యం మయి విశ్వసిహి ప్రియే।
ప్రణయస్వ చ తత్త్వేన మైవం భూశ్శోకలాలసా। 7

ఏకవేణీ ధరాశయ్యా ధ్యానం మలినమంబరమ్।
అస్థానేఽప్యుపవాసశ్చ నైతాన్యౌపయికాని తే। 8

విచిత్రాణి చ మాల్యాని చందనాన్యగరూణి చ।
వివిధాని చ వాసాంసి దివ్యాన్యాభరణాని చ। 9

మహార్హాణి చ పానాని శయనాన్యాసనాని చ।
గీతం నృత్తం చ వాద్యం చ లభ మాం ప్రాప్య మైథిలి। 10

స్త్రీరత్నమసి మైవం భూః కురు గాత్రేషు భూషణమ్।
మాం ప్రాప్య హి కథం ను స్యాః త్వమనర్హా సువిగ్రహే। 11

ఇదం తే చారు సంజాతం యౌవనం వ్యతివర్తతే।
యదతీతం పునర్నైతి స్రోతః శీఘ్రమపామివ। 12

త్వాం కృత్వోపరతో మన్యే రూపకర్తా స విశ్వసృట్।
న హి రూపోపమా త్వన్యా తవాస్తి శుభదర్శనే। 13

త్వాం సమాసాద్య వైదేహి రూపయౌవనశాలినీమ్।
కః పుమానతివర్తేత సాక్షాదపి పితామహః। 14

యద్యత్ పశ్యామి తే గాత్రం శీతాంశుసదృశాననే।
తస్మింస్తస్మిన్ పృథుశ్రోణి చక్షుర్మమ నిబధ్యతే। 15

భవ మైథిలి భార్యా మే మోహమేనం విసర్జయ।
బహ్వీనాముత్తమస్త్రీణామ్ ఆహృతానామితస్తతః।
సర్వాసామేవ భద్రం తే మమాగ్రమహిషీ భవ। 16

లోకేభ్యో యాని రత్నాని సంప్రమథ్యాహృతాని వై।
తాని మే భీరు సర్వాణి రాజ్యం చైతదహం చ తే। 17

విజిత్య పృథివీం సర్వాం నానానగరమాలినీమ్।
జనకాయ ప్రదాస్యామి తవ హేతోర్విలాసిని। 18

కనుక ఓ దేవీ! నీవు భయపడవలసినపనిలేదు. నన్ను నమ్ముము. మనస్ఫూర్తిగా ప్రేమింపుము. ఇట్లు శోకింపకుము. (7)

ఒంటిజడకలిగియుండుట, నేలపైపరుండుట, ఎల్లప్పుడును ఆలోచింపుచుండుట, మలినవస్త్రములను దాల్చుట, నిష్కారణముగా ఉపవాసములుచేయుట- ఇవన్నియును నీకు ఏమాత్రము తగినవిగావు. (8)

ఓ మైథిలీ! నీవు నన్నుచేరి చిత్రవిచిత్రములైన మాలలు, చందనములు, అగరులు, అనేకవిధములైన మేలివస్త్రములు, దివ్యాభరణములు, శ్రేష్ఠములైన పానీయములు, తల్పములు, ఆసనములు నృత్తగీతవాద్యములు మొదలగువాటిని అన్నింటిని పొందుము. (9-10)

ఓ సుందరీ! నీవు స్త్రీలలోరత్నమువంటిదానవు. ఇట్లుండుట నీకుతగదు. తనువుపై సొమ్ములను ధరింపుము. నన్ను పొందియు నీవు సకలభోగభాగ్యములకు అనర్హురాలవు ఎట్లగుదువు? (11)

మనోహరమైన నీయౌవనము వ్యర్థముగా గడచిపోవుచున్నది. ఆ తారుణ్యము తలిగిపోయినచో శీఘ్రముగా ప్రవహించు నదీజలమువలె తిరిగిరాదు. (12)

ఓ దర్శనీయసుందరీ! రూపశిల్పియైనబ్రహ్మ నిన్ను సృజించినపిమ్మట తనసృష్టిరచనాకార్యమును చాలించెననుకొందును. ఏలనన ఈ లోకములో నీకు సాటికాగలసౌందర్యవతి మఱియొకతె లేదుగదా! (నీవు సౌందర్యమునకు పరాకాష్ఠవు). (13)

ఓ వైదేహీ! చక్కనిరూపము, నిండుయౌవనముగల నిన్ను పొందినవాడు సాక్షాత్తు సృష్టికర్తయైనపితామహుడు ఐననుసరే నిన్నువిడువడు. (14)

ఓ చంద్రబింబాననా! నీ అవయవసౌందర్య సౌభాగ్యములను తనివితీర చూచునప్పుడు ప్రతిఅవయవలాలిత్యదర్శనము నందును నాదృష్టి అచటనే ఆగిపోవుచున్నది. (15)

ఓ మైథిలీ! నీవు నాదానవగుము. నేను నీకు శత్రువునను శంకనువీడుము. నేను ఆయాదిశలనుండి పెక్కుమంది యువతీమణులను తీసికొనివచ్చితిని. వారందఱిలో నీవే నాకుపట్టపురాణివి అగుదువు, నీకు మేలగును. (16)

ఓ భయస్వభావురాలా! నేను సకలలోకములను జయించి, అచటిసంపదలనన్నింటిని తీసికొనివచ్చితిని. అవియన్నియునునీవే. నా రాజ్యమంతయునునీదే, ఇంతయేల? నేనును నీవాడనే. (17)

ఓ విలాసినీ! ప్రసిద్ధములైనమహానగరములతోనిండిన ఈ సమస్తభూమండలమును నేనుజయించి, నీకొఱకై దానిని నీ తండ్రియైనజనకునకు ఇచ్చివేసెదను. (18)

నేహ పశ్యామి లోకేఽన్యం యో మే ప్రతిబలో భవేత్।
పశ్య మే సుమహద్వీర్యమ్ అప్రతిద్వంద్వమాహవే। 19

ఈ లోకములో ఎంతగాలించిచూచినను నన్నెదిరింపగల యోధుడు ఎవ్వడును లేడు. రణరంగమున సాటిలేని నా మహాపరాక్రమమునుగూర్చి నీవు తెలిసికొనుము. (19)

అసకృత్ సంయుగే భగ్నా మయా విమృదితధ్వజాః।
అశక్తాః ప్రత్యనీకేషు స్థాతుం మమ సురాసురాః। 20

యుద్ధభూమిలో పెక్కుపర్యాయములు నేను సురాసురులను మట్టిగఱిపించితిని. వారిధ్వజములను భగ్నమొనర్చితిని. వారెవ్వరును శత్రువులుగా నాయెదుట నిలువజాలరు. (20)

ఇచ్ఛయా క్రియతామద్య ప్రతికర్మ తవోత్తమమ్।
సప్రభాణ్యవసజ్యంతాం తవాంగే భూషణాని చ। 21

సాధు పశ్యామి తే రూపం సంయుక్తం ప్రతికర్మణా।
ప్రతికర్మాభిసంయుక్తా దాక్షిణ్యేన వరాననే। 22

భుఙ్క్ష్వ భోగాన్ యథాకామం పిబ భీరు రమస్వ చ।
యథేష్టం చ ప్రయచ్ఛ త్వం పృథివీం వా ధనాని చ। 23

ఇప్పుడు నీకు నచ్చినవిధముగా అలంకరించుకొనుము. కాంతులను విరజిమ్ముచున్న సొమ్ములను ధరింపుము. ఓ వరాననా! అలంకరింపబడిన నీ రూపమును కనులారగాంచెదను. నా మీది దయతో అలంకారములను దాల్చి, నాకనుకూలవతివికమ్ము. నీకు ఇష్టమైనరీతిగా భోగములనుఅనుభవింపుము. పానీయములను సేవింపుము. నాతోరమింపుము. నీయిష్టప్రకారము భూమిని, సంపదలను పంచిపెట్టుము. (21-23)

లలస్వ మయి విస్రబ్ధా ధృష్టమాజ్ఞాపయస్వ చ।
మత్ప్రసాదాల్లలంత్యాశ్చ లలంతాం బాంధవాస్తవ। 24

నాయందు విశ్వాసముంచి ప్రీతినిగూర్చుము. నిస్సంకోచముగా నన్ను నీ సేవకునిగాభావించి, ఆజ్ఞాపింపుము. నన్ను అనుగ్రహించి నాతోగూడినీవు ఆనందించినచో నీతో పాటు నీ బంధువులును భోగములనుఅనుభవించెదరు. (24)

బుద్ధిం మమానుపశ్య త్వం శ్రియం భద్రే యశశ్చ మే।
కిం కరిష్యసి రామేణ సుభగే చీరవాససా। 25

ఓ మంగళప్రదా! ఒక్కసారి ఇటుమఱలి నా ఐశ్వర్యమును, తేజస్సును, కీర్తిని బాగుగాపరికింపుము. ఓ సుందరీ! నారచీరలను ధరించియున్న రామునివలన నీకు ఒరుగునదియేమి? (25)

నిక్షిప్తవిజయో రామో గతశ్రీర్వనగోచరః।
వ్రతీ స్థండిలశాయీ చ శంకే జీవతి వా న వా। 26

రాముడు జయమును, సంపదలను కోల్పోయినవాడు, పైగా అడవులపాలైనవాడు, మునివ్రతమును పాటించుచు నేలపై శయనించుచున్నవాడు, ఇంతకును అతడు జీవించి యున్నాడో లేడో? (26)

న హి వైదేహి రామస్త్వాం ద్రష్టుం వాప్యుపలప్స్యతే।
పురో బలాకైరసితైః మేఘైర్జ్యోత్స్నామివావృతామ్। 27

న చాపి మమ హస్తాత్ త్వాం ప్రాప్తుమర్హతి రాఘవః।
హిరణ్యకశిపుః కీర్తిమ్ ఇంద్రహస్తగతామివ। 28

ఓ వైదేహీ! వర్షసూచకముగా కొక్కెరలగుంపులు సంచరింపగా నల్లనిమేఘములుదట్టముగా ఆకాశమును ఆవరించును.[1] అందువలన రాత్రివేళ వెన్నెలలుకన్పింపవు. అట్లే నా చెంతచేరి వెన్నెలవలెనున్న నిన్ను రాముడుపొందలేడు సరిగదా! చూడనుగూడ చూడలేడు. (బలశాలియైన) హిరణ్య కశిపుడు ఇంద్రహస్తగతయైన తనభార్యను తిరిగి పొందగల్గెను. కాని నా చేత చిక్కిన నిన్ను రాముడు మఱల పొందజాలడు. (27-28)

* ఆకాశమున గుంపులుగుంపులుగా ఎగురుచున్న బలాకపక్షులు వర్షాగమనమును సూచించును. పిదప ఆకాశము దట్టమైన నల్లనిమేఘములచే ఆవృతమగును. అప్పుడు మేఘాచ్ఛాదితమైనఆకాశమున వెన్నెల గోచరముగాదు.

చారుస్మితే చారుదతి చారునేత్రే విలాసిని।
మనో హరసి మే భీరు సుపర్ణః పన్నగం యథా। 29

అందమైనచిఱునవ్వు, చక్కనిపలువరుస, విశాల నేత్రములు గల ఓ విలాసినీ! భయస్వభావురాలా! గరుత్మంతుడు సర్పమును హరించునట్లు నీవు నా మనస్సును హరించుచున్నావు. (29)

క్లిష్టకౌశేయవసనాం తన్వీమప్యనలంకృతామ్।
త్వాం దృష్ట్వా స్వేషు దారేషు రతిం నోపలభామ్యహమ్। 30

అంతఃపురనివాసిన్యః స్త్రియస్సర్వగుణాన్వితాః।
యావత్యో మమ సర్వాసామైశ్వర్యం కురు జానకి। 31

నీవు సుందరాంగినేయైనను నలిగిపోయిన పట్టువస్త్రమును ధరించియుంటివి. అలంకరించుకొనలేదు. ఐనను నిన్ను చూచినపిమ్మట నాసతులపై నాకు మనస్సే పోవుటలేదు. నా అంతఃపురమున సర్వసద్గుణసంపన్నలైన కాంతలు ఎందఱోగలరు. జానకీ! నన్ను చేపట్టినచో వారందఱిపై అధిపత్యము నీదేయగును. (30-31)

మమ హ్యసితకేశాంతే త్రైలోక్యప్రవరాః స్త్రియః।
తాస్త్వాం పరిచరిష్యంతి శ్రియమప్సరసో యథా। 32

ఓ నల్లనికురులుగల సీతా! ముల్లోకములయందును సర్వశ్రేష్ఠలైన ఆ తరుణీమణులు, లక్ష్మీదేవిని అప్సరసలు సేవించునట్లు నీకు ఊడిగములు సలుపుదురు. (32)

యాని వైశ్రవణే సుభ్రు రత్నాని చ ధనాని చ।
తాని లోకాంశ్చ సుశ్రోణి మాం చ భుంక్ష్వ యథాసుఖమ్। 33

ఓశుభాంగీ! కుబేరునిజయించి, నేను తీసికొనివచ్చిన రత్నములను, ధనరాసులను, ముల్లోకసంపదలను అనుభవింపుము నాతోగూడి హాయిగానుండుము. (33)

న రామస్తపసా దేవి న బలేన న విక్రమైః న।
ధనేన మయా తుల్యః తేజసా యశసాపి వా। 34

ఓ దేవీ! తపస్సు, బలపరాక్రమములు, సంపదలు తేజస్సు, కీర్తిప్రతిష్ఠలు మున్నగువాటిలో ఏ విషయమునను రాముడు నాతో సమానుడుకాడు, కాజాలడు. (34)

పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్
ధననిచయం ప్రదిశామి మేదినీం చ।
మయి లల లలనే యథాసుఖం త్వం
త్వయి చ సమేత్య లలంతు బాంధవాస్తే। 35

ఓలలనా! ధనరాసులను, రాజ్యమును నీకు అప్పగించెదను. యథేచ్ఛగాత్రాగుము, విహరింపుము, క్రీడింపుము, భోగములను అనుభవింపుము. నాపై ప్రేమజూపుము. అంతేగాదు నీవలె నీ వారుగూడ హాయిగా ఆనందింపవచ్చును. (35)

కుసుమితతరుజాలసంతతాని
భ్రమరయుతాని సముద్రతీరజాని।
కనకవిమలహారభూషితాంగి
విహర మయాసహ భీరు కాననాని। 36

ఓ భయస్వభావురాలా! మేలిమిబంగారు ఆభరణములను ధరింపుము. సముద్రతీరమునందు బాగుగాపుష్పించి, తుమ్మెదలు వ్రాలియున్న వృక్ష పంక్తులుగలవనములలో నాతోజేరి విహరింపుము. (36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే వింశస్సర్గః (20)

వాల్మీకిమహర్షివిరచితమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదియవ సర్గము.

-- * * * --

21. ఇరువదియొకటవసర్గము

సీత రావణునకు హితవు పల్కుట, అతనిని శ్రీరామునిముందు కొరగానివానినిగా చేసి మాటాడుట

తస్య తద్వచనం శ్రుత్వా సీతా రౌద్రస్య రక్షసః।
ఆర్తా దీనస్వరా దీనా ప్రత్యువాచ శనైర్వచః। 1

భయంకరముగానున్న ఆ రాక్షసుని (రావణుని) పలుకులనువిని, దీనురాలైన ఆ సీతాదేవి దీనస్వరముతో ఆర్తితో నెమ్మదిగా ఇట్లు ప్రత్యుత్తరమునిచ్చెను. (1)

దుఃఖార్తా రుదతీ సీతా వేపమానా తపస్వినీ।
చింతయంతీ వరారోహా పతిమేవ పతివ్రతా। 2

తృణమంతరతః కృత్వా ప్రత్యువాచ శుచిస్మితా।
నివర్తయ మనో మత్తః స్వజనే క్రియతాం మనః। 3

న మాం ప్రార్థయితుం యుక్తం సుసిద్ధిమివ పాపకృత్।
అకార్యం న మయా కార్యమ్ ఏకపత్న్యా విగర్హితమ్। 4

కులం సంప్రాప్తయా పుణ్యం కులే మహతి జాతయా।
ఏవముక్త్వా తు వైదేహీ రావణం తం యశస్వినీ। 5

రాక్షసం పృష్ఠతః కృత్వా భూయో వచనమబ్రవీత్।
నాహమౌపయికీ భార్యా పరభార్యా సతీ తవ। 6

సాధు ధర్మమవేక్షస్వ సాధు సాధువ్రతం చర।
యథా తవ తథాఽన్యేషాం దారా రక్ష్యా నిశాచర।
ఆత్మానముపమాం కృత్వా స్వేషు దారేషు రమ్యతామ్। 7

అతుష్టం స్వేషు దారేషు చపలం చలితేంద్రియమ్।
నయంతి నికృతిప్రజ్ఞం పరదారాః పరాభవమ్। 8

ఇహ సంతో న వా సంతి సతో వా నానువర్తసే।
తథాహి విపరీతా తే బుద్ధిరాచారవర్జితా। 9

వచో మిథ్యాప్రణీతాత్మా పథ్యముక్తం విచక్షణైః।
రాక్షసానామభావాయ త్వం వా న ప్రతిపద్యసే। 10

అకృతాత్మానమాసాద్య రాజానమనయే రతమ్।
సమృద్ధాని వినశ్యంతి రాష్ట్రాణి నగరాణి చ। 11

తథేయం త్వాం సమాసాద్య లంకా రత్నౌఘసంకులా।
అపరాధాత్ తవైకస్య న చిరాద్వినశిష్యతి। 12

స్వకృతైః హన్యమానస్య రావణాఽదీర్ఘదర్శినః।
అభినందంతి భూతాని వినాశే పాపకర్మణః। 13

సుందరాంగియైనసీతాదేవి దుఃఖార్తయై యేడ్చు చుండెను. వణకుచు జాలిగొల్పుస్థితిలో ఆసాధ్వి తృణమునే బ్రహ్మాస్త్రముగాజేసి, కాకాసురునిపై ప్రయోగించిన తన పతినే ధ్యానించుచు గడ్డిపరకను అడ్డుగానుంచుకొని ఆస్మేరముఖి- ఇట్లుపల్కెను "నీమనస్సును నామీదినుండి తొలగించి, నీకాంతలపైకి మరల్చుము. పాపకర్ముడు సుసిద్ధిని ఆసించుటయుక్తము కానట్లు నీవు నన్ను ఆసించుటతగదు. నేను ఉత్తమమైనజనకుని వంశమున పుట్టినదానను, పవిత్రమైన రఘువంశమున మెట్టినదానను, ఏకపత్నీవ్రతుడైన శ్రీరామచంద్రుని భార్యను, పతివ్రతను. నీచమైన ఇట్టి అకృత్యము నావలన కానేకాదు" అనుచు ఉత్తమసాధ్విగా వాసికెక్కినవైదేహి రావణునియెడ నిర్లక్ష్యముతో అతనినిలెక్కచేయక ఇట్లువచింపసాగెను. "నేనుపతివ్రతను, శ్రీరామచంద్రుని భార్యను, నీకుభార్యనుకాజాలను. చక్కని ధర్మదృష్టిని కలిగియుండుము. సత్పురుషుల నియమజీవన విధానమును చక్కగాపాటింపుము. ఓ నిశాచరా! నీ భార్యలవలెనే ఇతరసతులుగూడ రక్షింపదగిన వారని గ్రహించుచు నీకునిన్నే ఉపమానముగాజేసికొని, నీ భార్యలతో రమింపుము. (2-7)

తనభార్యలయందు సంతృప్తిపడక, చపల స్వభావముతో ఇంద్రియచాంచల్యముగల నికృష్టుని పరవనితలు పరాభవముపాలు చేసెదరు. (8)

ఈ దేశములో సత్పురుషులే లేరా? ఉన్నచో నీవు వారిని అనుసరించుటలేదు గాబోలు. నీబుద్ధిపెడదారిపట్టుట వలననే నీవు సదాచారమునకుదూరమైతివి. నీవు వ్యర్థముగా ప్రణయప్రలాపములను కావించు చున్నావు. సత్పురుషులు సదుపదేశములను ఇచ్చినను, రాక్షసులకు పోగాలముదాపురించియున్నందున వక్రమార్గముపట్టిననీకు ఆ హితవచనములు చెవికెక్కుట లేదు. (9-10)

అవినీతిపరుడును, జితేంద్రియుడుకానివాడును ఐన రాజుపాలనలోని నగరములు, రాష్ట్రములు ఎంతగా సస్యసమృద్ధములైనను అవి పూర్తిగా నశించియే తీరును. అట్లే సకలైశ్వర్యసంపన్నమైన ఈ లంకకు నీవు రాజగుట వలన నీఒక్కని అపరాధకారణముగ అది త్వరలోనే తప్పక నశించితీరును. (11-12)

ఓ రావణ! దూరదృష్టిలేనిపాపకర్ముడు తానుచేసిన అపరాధములఫలితముగా చావుదెబ్బలకులోనగును అప్పుడు అతనినిజూచి యెల్లరును సంతోషింతురు. పాపివైననీవును

ఏవం త్వాం పాపకర్మాణం వక్ష్యంతి నికృతా జనాః।
దిష్ట్యైతద్వ్యసనం ప్రాప్తో రౌద్ర ఇత్యేవ హర్షితాః। 14

శక్యా లోభయితుం నాహమ్ ఐశ్వర్యేణ ధనేన వా।
అనన్యా రాఘవేణాహం భాస్కరేణ ప్రభా యథా। 15

ఉపధాయ భుజం తస్య లోకనాథస్య సత్కృతమ్।
కథం నామోపధాస్యామి భుజమన్యస్య కస్యచిత్। 16

అహమౌపయికీ భార్యా తస్యైవ వసుధాపతేః।
వ్రతస్నాతస్య విప్రస్య విద్యేవ విదితాత్మనః। 17

సాధురావణ! రామేణ మాం సమానయ దుఃఖితామ్।
వనే వాసితయా సార్ధం కరేణ్వేవ గజాధిపమ్। 18

మిత్రమౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా।
వధం చానిచ్ఛతా ఘోరం త్వయాసౌ పురుషర్షభః। 19

విదితస్స హి ధర్మజ్ఞః శరణాగతవత్సలః।
తేన మైత్రీ భవతు తే యది జీవితుమిచ్ఛసి। 20

ప్రసాదయస్వ త్వం చైనం శరణాగతవత్సలమ్।
మాం చాస్మై ప్రయతో భూత్వా నిర్యాతయితుమర్హసి। 21

ఏవం హి తే భవేత్ స్వస్తి సంప్రదాయ రఘూత్తమే।
అన్యథా త్వం హి కుర్వాణో వధం ప్రాప్స్యసి రావణ। 22

వర్జయేద్వజ్రముత్సృష్టం వర్జయేదంతకశ్చిరమ్।
త్వద్విధం తు న సంక్రుద్ధో లోకనాథస్స రాఘవః। 23

నశించినప్పుడు నీవలన ఇడుములపాలైన వారు (హింసలకులోనైన దేవగంధర్వాదులు) "మంచియే జరిగినది ఈ దుష్టునకు ఇట్టి దురవస్థ పట్టవలసినదే" అని యనుకొనుచు మిక్కిలి సంబరపడుదురు. (13-14)

ఎట్టిధనాశలకుగాని, ఐశ్వర్యాదిప్రలోభములకుగాని, నేను లొంగెడిదాననుగాను. సూర్యునినుండి కాంతి వేఱుగానట్లు శ్రీరామునినుండి నేను వేఱుగాను. (15)

జగన్నాథుడైనశ్రీరామునిభుజము గౌరవాదరములకు పాత్రమైనది. అట్టిభుజమును తలగడగాజేసికొనినట్టి నేను ధన్యాత్మురాలను. ఇప్పుడు ఎవరోమఱియొకరి భుజమును ఏ విధముగాఆశ్రయింతును? (16)

వేదవ్రతస్నాతకోత్సవమును ముగించుకొనినవాడై (నియమములనుపాటించుచు వేదాధ్యయనమును ముగించుకొనినవాడై) ఆత్మజ్ఞానియైన బ్రాహ్మణునకు వేదవిద్యాసంపదవలె నేను అయోధ్యాపతిశ్రీరామునకు మాత్రమే భార్యగా తగినదానను. (17)

ఓ సాధు రావణా! [1] వనములో సంచరించు ఆడు ఏనుగును గజరాజుతో చేర్చినట్లు దుఃఖార్తనైన నన్ను శ్రీరామునితో జేర్చుము. (18)

ఓ రావణా! నీవు దుర్మరణముపాలుకాకుండ, నీ రాజ్యాధికారమును సుస్థిరముగా నిలుపుకొనగోరు కొనుచున్నచో మహా పురుషుడైన శ్రీరామునితో సఖ్యము సేయుటయే యుక్తము. శ్రీరామచంద్రుడు ధర్మజ్ఞుడుగా, శరణాగత వత్సలుడుగా మిక్కిలి వాసికెక్కినవాడు. నీవు బ్రతికియుండదలచినచో ఆయనతో మైత్రిని నెఱపుటయే క్షేమము. (19-20)

శరణుగోరిన వారిని అనుగ్రహించునట్టి ఆస్వామిని నీవు ప్రసన్నుని జేసికొనుము. నీవు జితేంద్రియుడవై, నిర్మల మనస్సుతో నన్ను ఆయనకు అప్పగింపుము. (21)

ఓ రావణా! నేనుసుడివినరీతిగా నన్ను శ్రీరామచంద్ర ప్రభువునకుసమర్పించినచో నీకు మేలుకలుగును. లేనిచో నీకు మరణముతప్పదు. (22)

ఇంద్రుడుప్రయోగించిన వజ్రాయుధమైనను నిన్ను ఏమియు చేయజాలక వదలిపెట్టవచ్చును, యముడు సైతము నిన్ను చాలాకాలమువఱకు విడిచిపెట్టవచ్చును. కాని జగత్ప్రభునైనశ్రీరాముడు ఆగ్రహించినచో నీవంటివానిని చంపుటతథ్యము. (23)

1) ఒక దుర్మార్గునికి సైతము హితవచనములను చెప్పునప్పుడు మంచిగా సంబోధించినచో అవి అతనిచెవికెక్కవచ్చును- అను బుద్ధితో 'ఓ సాధు రావణా!' అని సంబోధించి యుండవచ్చును. రావణుడు పంచవటి కడకు సాధువేషములో వచ్చెను- అందులకై అట్లు సంబోధించెనోయేమో?

రామస్య ధనుషశ్శబ్దం శ్రోష్యసి త్వం మహాస్వనమ్।
శతక్రతువిసృష్టస్య నిర్ఘోషమశనేరివ। 24

ఇంద్రుడుప్రయోగించిన వజ్రాయుధముయొక్క భయంకర ధ్వనివలె, భూమ్యాకాశములను దద్దరిల్లజేయు శ్రీరాముని ధనుష్టంకారమును నీవు త్వరలోనే వినగలవు. (24)

ఇహ శీఘ్రం సుపర్వాణో జ్వలితాస్యా ఇవోరగాః।
ఇషవో నిపతిష్యంతి రామలక్ష్మణలక్షణాః। 25

మంచికణుపులుగలవియు, బుసలుకొట్టుచున్న మహాసర్పములవలె నిప్పులుగ్రక్కుచున్నవియు, రామలక్ష్మణ నామాంకితములైన దివ్యములైనబాణములు శీఘ్రముగా ఈ లంకానగరముపై పడగలవు. (25)

రక్షాంసి పరినిఘ్నంతః పుర్యామస్యాం సమంతతః।
అసంపాతం కరిష్యంతి పతంతః కంకవాససః। 26

రామలక్ష్మణుల తెక్కలబాణములపరంపరలు ఈ నగరము నందంతటను పడుచు రాక్షసులను తునుమాడగలవు. రవ్వంతయు చోటులేకుండ అవి లంకను కప్పివేయుగలవు. (26)

రాక్షసేంద్రమహాసర్పాన్ స రామగరుడో మహాన్।
ఉద్ధరిష్యతి వేగేన వైనతేయ ఇవోరగాన్। 27

మహాపరాక్రమశాలియైన శ్రీరాముడనెడి గరుత్మంతుడు రాక్షసులనెడి సర్పములను వైనతేయుడు నాగులనువలె వేగముగా నిర్మూలింపగలడు. (27)

అపనేష్యతి మాం భర్తా త్వత్తశ్శీఘ్రమరిందమః।
అసురేభ్యః శ్రియం దీప్తాం విష్ణుస్త్రిభిరివ క్రమైః। 28

శ్రీ మహావిష్ణువు త్రివిక్రముడై మూడడుగులచేత అసురుల నుండి మహైశ్వర్యములను హరించివేసినట్లు శత్రుసంహారకుడైన నాభర్త నన్ను నీనుండి శీఘ్రముగా తీసికొనిపోగలడు.(28)

జనస్థానే హతస్థానే నిహతే రక్షసాం బలే।
అశక్తేన త్వయా రక్షః కృతమేతదసాధు వై। 29

ఓ రావణా! ఖరదూషణాదిరాక్షసబలములు (పదునాల్గు వేలమంది) శ్రీరామునిచేతిలో దండకారణ్యమున మట్టిగలిసినవి. వారందఱును హతులగుటచే 'జనస్థానము'న నీఅధికారమును కోల్పోయితివి. అనగా నీ సేనాశిబిరములలో ఒకటి కూలిపోయినది. అంతేగాక రణరంగమున రాముని ఎదిరించి, యుద్ధము చేయుటకు చేతగాక నీవు ఈ దొంగపని చేసితివి. (29)

ఆశ్రమం తు తయోశ్శూన్యం ప్రవిశ్య నరసింహయోః।
గోచరం గతయోర్భ్రాత్రోః అపనీతా త్వయాఽధమ। 30

ఓ నీచుడా! సింహపరాక్రములైన రామలక్ష్మణులు బయటికివెళ్లుటచూచి, వారులేనప్పుడు ఆశ్రమములో ప్రవేశించి, నన్ను అపహరించుకొనివచ్చితివి. (30)

న హి గంధముపాఘ్రాయ రామలక్ష్మణయోస్త్వయా।
శక్యం సందర్శనే స్థాతుం శునా శార్దూలయోరివ। 31

పెద్దపులులజాడలను పసిగట్టి కుక్క అచట నిలవజాలనట్లు రామలక్ష్మణులవాసన తగిలినను నీవు తట్టుకొనజాలవు. ఇక వారియెదుట ఎట్లునిలువగలవు? (31)

తస్య తే విగ్రహే తాభ్యాం యుగగ్రహణమస్థిరమ్।
వృత్రస్యేవేంద్రబాహుభ్యాం బాహోరేకస్య నిగ్రహః। 32

దేవేంద్రుని రెండుబాహువులను వృత్రాసురుని ఒంటిచేయి ఎదుర్కొనలేనట్లు రామలక్ష్మణులతో నీకు యుద్ధమే సంభవించినచో నీవువారిని జయించుట కల్ల. (32)

క్షిప్రం తవ స నాథో మే రామస్సౌమిత్రిణా సహ।
తోయమల్పమివాదిత్యః ప్రాణానాదాస్యతే శరైః। 33

సూర్యభగవానుడు తనకిరణములచే చిన్నమడుగులోని జలములను శుష్కింపజేసినట్లు నాభర్తయైనశ్రీరాముడు సలక్ష్మణుడై తనబాణములతో నీప్రాణములను తీయుగలడు. (33)

గిరిం కుబేరస్య గతోఽపధాయ వా
సభాం గతో వా వరుణస్య రాజ్ఞః।
అసంశయం దాశరథేర్న మోక్ష్యసే
మహాద్రుమః కాలహతోఽశనేరివ। 34

నీకు ఆయువుమూడినది. ఎంతటిమహావృక్షమైనను పిడుగుపాటు నుండి తప్పించుకొనజాలనట్లు, కైలాసగిరికి పరుగులుదీసినను, కుబేరుని అలకాపురికి చేరినను, వరుణదేవునిసభను ఆశ్రయించినను శ్రీరామునినుండి నీవు తప్పించుకొనలేవు. ఇది తథ్యము.(34)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకవింశస్సర్గః *(21)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదియొకటవసర్గము.

-- * * * --

22. ఇరువదిరెండవసర్గము

రావణుడు సీతకు రెండుమాసములగడువు నొసగుట, సీతాదేవి నిరాకరింపగా అతడు ఆమెను భయపెట్టి, రాక్షసస్త్రీలరక్షణయందు ఉంచి, తనస్త్రీలతోగూడి రాజభవనమునకు తరలిపోవుట

సీతాయా వచనం శ్రుత్వా పరుషం రాక్షసాధిపః।
ప్రత్యువాచ తతస్సీతాం విప్రియం ప్రియదర్శనామ్। 1

సీతాదేవిపలికిన పరుషవచనములను విని, రావణుడు రూపసౌభాగ్యములుగల ఆమెయొక్కపలుకులకు సమాధానముగా ఇట్లు కఠోరమైన మాటలను పలికెను. (1)

యథా యథా సాంత్వయితా వశ్యస్త్రీణాం తథా తథా।
యథా యథా ప్రియం వక్తా పరిభూత స్తథా తథా। 2

"స్త్రీలను బుజ్జగించుకొలదియు పురుషుడువారికి లోకువయగును. వారిని తనకుఅనుకూలముగా జేసికొనుటకై ప్రియవచనములనుబల్కినచో అతడు వారి తిరస్కారములకు గురియగును. (2)

సన్నియచ్ఛతి మే క్రోధం త్వయి కామస్సముత్థితః।
ద్రవతోఽమార్గమాసాద్య హయానివ సుసారథిః। 3

అపమార్గమున పరుగులుదీయుచున్న గుఱ్ఱములను సమర్థుడైనసారథి అదుపుచేయునట్లు, నీ కఠినవచనములకారణముగా నాకువచ్చిన పట్టరాని కోపమును నాకు నీపైగలవలపు నిగ్రహించుచున్నది. (3)

వామః కామో మనుష్యాణాం యస్మిన్ కిల నిబధ్యతే।
జనే తస్మింస్త్వనుక్రోశః స్నేహశ్చ కిల జాయతే। 4

తమకు ఇష్టమైనవారియెడగల వ్యామోహము జనులను కట్టివేయుచుండును. పైగా వారు ప్రతికూలముగా ప్రవర్తింతురు. అప్పుడు జనులకు వారిపైకోపము రాదుసరిగదా! జాలి, ప్రేమ అధికమగుచునేయుండును. వారు (జనులు) కుంఠితులు (ఏమియుచేయలేనివారు) అగుదురు. (4)

ఏతస్మాత్ కారణాన్న త్వాం ఘాతయామి వరాననే।
వధార్హామవమానార్హాం మిథ్యా ప్రవ్రజితే రతామ్। 5

ఓ సుముఖీ! అందువలననే, నీవు వధార్హురాలవైనను, అవమానింపదగినదానవైనను, కపటవనవాసము చేయుచున్న రామునియందే ఆసక్తిగలదానవైనను నిన్ను చంపక జాలిపడుచు నీపై ప్రేమను జూపుచుంటిని. (5)

పరుషాణీహ వాక్యాని యాని యాని బ్రవీషి మామ్।
తేషు తేషు వధో యుక్తః తవ మైథిలి దారుణః। 6

ఓ మైథిలీ! నీవు నాతోపలికినప్రతివాక్యమునకును నిన్ను దారుణముగా చంపవలసియున్నది." (6)

ఏవముక్త్వా తు వైదేహీం రావణో రాక్షసాధిపః।
క్రోధసంరంభసంయుక్తః సీతాముత్తరమబ్రవీత్। 7

రాక్షసరాజైనరావణుడు వైదేహితో ఇట్లుపలికి, కోపోద్రేకములతో ఊగిపోవుచు మఱల ఆమెతో ఇట్లు వచించెను. (7)

ద్వౌ మాసౌ రక్షితవ్యౌ మే మోఽవధిస్తే మయాకృతః।
తతశ్శయనమారోహ మమ త్వం వరవర్ణిని। 8

ఓ వరవర్ణినీ! నేను నీకు రెండుమాసముల గడువును[1] ఇచ్చియుంటిని. దానికి నేను కట్టుబడియుందును. తదనంతరము నీవు నా దానవగుము. (8)

ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం భర్తారం మామనిచ్ఛతీమ్।
మమ త్వాం ప్రాతరాశార్థమ్ ఆరభంతే మహానసే। 9

ఈ రెండుమాసముల వ్యవధిలోపల నీవు నన్ను భర్తగా అంగీకరింపనిచో ఆ పిమ్మటవెంటనే నా ప్రాతఃకాల భోజనమునకై వంటశాలలో నిన్నుముక్కలు ముక్కలుగావింతురు. (9)

1. నీకు 12 మాసములగడువును ఇచ్చియుంటిని. అందు పదిమాసములు గడచినవి ఇంక రెండుమాసములవ్యవధియే మిగిలియున్నది.

తాం తర్జ్యమానాం సంప్రేక్ష్య రాక్షసేంద్రేణ జానకీమ్।
దేవగంధర్వకన్యాస్తా విషేదుర్వికృతేక్షణాః। 10

ఓష్ఠప్రకారైరపరా వక్త్రనేత్రైస్తథాఽపరాః।
సీతామాశ్వాసయామాసుః తర్జితాం తేన రక్షసా। 11

తాభిరాశ్వాసితా సీతా రావణం రాక్షసాధిపమ్।
ఉవాచాత్మహితం వాక్యం వృత్తశౌండీర్యగర్వితమ్। 12

నూనం న తే జనః కశ్చిత్ అస్తి నిఃశ్రేయసే స్థితః।
నివారయతి యో న త్వాం కర్మణోఽస్మాద్విగర్హితాత్। 13

మాం హి ధర్మాత్మనః పత్నీం శచీమివ శచీపతేః।
త్వదన్యస్త్రిషు లోకేషు ప్రార్థయేన్మనసాపి కః। 14

రాక్షసాధమ రామస్య భార్యామమితతేజసః।
ఉక్తవానసి యత్పాపం క్వ గతస్తస్య మోక్ష్యసే। 15

యథా దృప్తశ్చ మాతంగః శశశ్చ సహితో వనే।
తథా ద్విరదవద్రామః త్వం నీచ శశవత్ స్మృతః। 16

స త్వమిక్ష్వాకునాథం వై క్షిపన్నిహ న లజ్జసే।
చక్షుషోర్విషయం తస్య న తావదుపగచ్ఛసి। 17

ఇమే తే నయనే క్రూరే విరూపే కృష్ణపింగళే।
క్షితౌ న పతితే కస్మాత్ మామనార్య నిరీక్షతః। 18

తస్య ధర్మాత్మనః పత్నీం స్నుషాం దశరథస్య చ।
కథం వ్యాహరతో మాం తే న జిహ్వా పాప! శీర్యతే। 19

అసందేశాత్తు రామస్య తపసశ్చానుపాలనాత్।
న త్వాం కుర్మి దశగ్రీవ భస్మ భస్మార్హ తేజసా। 20

ఈవిధముగా రావణుడు జానకిని భయపెట్టుచుండగా జూచి, దేవగంధర్వకన్యలు బిత్తరబిత్తరచూపులతో బాధపడిరి.(10)

రావణునిచే భయపెట్టబడుచున్న సీతను పెదవుల కదలికలతో కొందఱు, ముఖసంజ్ఞలతో మఱికొందఱు, చూపులసైగలతో ఇంకనుకొందఱు ఊరడించిరి. (11)

వారిచే ఆ విధముగా ఓదార్చబడినసీత రాక్షసరాజైన రావణునితో తన పాతివ్రత్యబలమును, దర్పమును ప్రకటించుచు అతనికి హితకరమైనవచనములను నుడివెను. (12)

"నిజముగా నీమేలుగోరువాడుగాని, అన్నివిధములుగా అతినింద్యమైన ఈ దుష్కార్యమునుండి నిన్ను నివారింపగల వాడుగాని ఇక్కడ ఎవ్వడును లేనట్లున్నది. (13)

దేవేంద్రునకుశచీదేవివలె ధర్మాత్ముడైనశ్రీరామునకు నేనుధర్మపత్నిని. అట్టినన్ను ఈ ముల్లోకములలో ఎవ్వడును మనస్సునసైతము కాంక్షింపజాలడు. నీవుమాత్రమే ఈదుస్సాహసమునకు ఒడిగట్టితివి. (14)

ఓ రాక్షసాధమ! మిక్కిలితేజశ్శాలియైనశ్రీరాముని భార్యనైన నన్నుగూర్చి ఇట్టి కాఱుకూతలుకూసిన నీవు ఎచ్చటికివెళ్లినను చావునుండి తప్పించుకొనజాలవు. (15)

నీవు రామునితో యుద్ధమునకుసిద్ధమగుట అడవిలో కుందేలు మదపుటేనుగును ఎదిరించుటవంటిది. రాముడు మదపుటేనుగువంటివాడు. తుచ్ఛుడా! నీవు కుందేలువంటి వాడవు. అనాడు ఇక్ష్వాకుప్రభువైన శ్రీరాముని కంటబడుటకు జంకి, మాయామృగమునెపముతో ఆయనను దూరముగా పంపి, ఇట్లు నన్ను అపహరించితివి. ఆయన పరోక్షమున ఇప్పుడు ఇట్లు ప్రగల్భములు పలుకుటకు నీకుసిగ్గులేదా? నీవు శ్రీరాముని కంటబడినచో ఆయనశక్తిరుచి నీకు తెలియును. (16-17)

ఓ దుష్టుడా! కృష్ణపింగళవర్ణములుగలిగిన నీనేత్రములు క్రూరములై వికృతములైయున్నవి. నన్నుజూచుచున్న నీ ఈ పాపపుకనులు ఏల నేలరాలకున్నవి? (18)

ఓ పాపకర్ముడా! నేను ధర్మస్వరూపుడైన శ్రీరామునిభార్యను, దశరథునికోడలిని, అట్టి నన్నుగూర్చి ఈ విధముగా ప్రేలుచున్న నీ నాలుక ఏల చీలికలై పడిపోదు? (19)

ఓ దశకంఠా! నీవు భస్మముచేయదగినవాడవు. నా తపఃప్రభావమునను, పాతివ్రత్యమహిమచేతను నేను నిన్నట్లు చేయగలను. కాని అందులకు నాకు రామాజ్ఞ లేదు. కనుక నీవు బ్రతికిపోయితివి. (20)

నాపహర్తుమహం శక్యా త్వయా రామస్య ధీమతః।
విధిస్తవ వధార్థాయ విహితో నాత్ర సంశయః। 21

శూరేణ ధనదభ్రాత్రా బలైస్సముదితేన చ।
అపోహ్య రామం కస్మాద్ధి దారచౌర్యం త్వయా కృతమ్। 22

సీతాయా వచనం శ్రుత్వా రావణో రాక్షసాధిపః।
వివృత్య నయనే క్రూరే జానకీమన్వవైక్షత। 23

నీలజీమూతసంకాశో మహాభుజశిరోధరః।
సింహసత్త్వగతిశ్శ్రీమాన్ దీప్తజిహ్వోగ్రలోచనః। 24

చలాగ్రమకుటప్రాంశుః చిత్రమాల్యానులేపనః।
రక్తమాల్యాంబరధరః తప్తాంగదవిభూషణః। 25

శ్రోణీసూత్రేణ మహతా మేచకేన సుసంవృతః।
అమృతోత్పాదనద్ధేన భుజంగేనేవ మందరః। 26

తాభ్యాం స పరిపూర్ణాభ్యాం భుజాభ్యాం రాక్షసేశ్వరః।
శుశుభేఽచలసంకాశః శృంగాభ్యామివ మందరః। 27

తరుణాదిత్యవర్ణాభ్యాం కుండలాభ్యాం విభూషితః।
రక్తపల్లవపుష్పాభ్యామ్ అశోకాభ్యామివాచలః। 28

స కల్పవృక్షప్రతిమో వసంత ఇవ మూర్తిమాన్।
శ్మశానచైత్యప్రతిమో భూషితోఽపి భయంకరః। 29

అవేక్షమాణో వైదేహీం కోపసంరక్తలోచనః।
ఉవాచ రావణస్సీతాం భుజంగ ఇవ నిశ్శ్వసన్। 30

అనయేనాభిసంపన్నమ్ అర్థహీనమనువ్రతే।
నాశయామ్యహమద్య త్వాం సూర్యస్సంధ్యామివౌజసా। 31

నేను ప్రజ్ఞాశాలియైన శ్రీరాముని పత్నిని. వాస్తవముగా నన్ను నీవు అపహరింపజాలవు. కాని నీకు చావు దగ్గరపడినందుననే విధి ఈ విధముగా సంకల్పించెను. ఇందుకు సందేహములేదు. (21)

"నేను వీరుడను. కుబేరుని సోదరుడను. అపారబలసంపన్నుడను" అని బీరములాడుచుంటివి. అట్టి నీవు శ్రీరాముని దూరముగా బంపి, దొంగవలె పరసతిని ఏల అపహరించితివి? (నిజముగా నీకు శక్తియున్నచో ఆయన యెదుటపడలేదేమి?) (22)

రాక్షసరాజైనరావణుడు సీతాదేవిమాటలకు ఉగ్రుడై, ఆమెవైపు గ్రుడ్లుఱిమిచూచెను. (23)

రావణుడు నల్లనిమేఘమువలెనుండెను. గొప్ప భుజములను, మెడను, కల్గియుండెను. అతడు సింహమువంటిబలమును, గమనమునుగలవాడు, ఐశ్వర్యవంతుడు. అతని జిహ్వాగ్రము, కన్నులు ఎఱ్ఱబాఱి యుండెను. కోపముతో ఊగిపోవుచుండుటచే అతని దృఢకిరీటము చలించుచుండెను. రంగురంగుల మాలలను, మైపూతలను కలిగియుండెను. ఎఱ్ఱని దండలను, వస్త్రములను ధరించియుండెను. మేలిమిబంగారుభుజకీర్తులను, ఆభరణములను దాల్చియుండెను. (24-25)

అమృతముకొఱకై సముద్రమథనసమయమున వాసుకి (సర్పము)చే చుట్టబడిన మందరపర్వతమువలె ఆ రావణుడు నల్లనిగొప్పమొలత్రాడుచే ఒప్పుచుండెను. నిండుగా బలిష్ఠములైన భుజములతో ఆ రావణుడు పర్వతసదృశుడై రెండుశిఖరములతో విరాజిల్లుచున్న మందరగిరివలె శోభిల్లుచుండెను. (26-27)

తరుణభానునిశోభలతో ధగధగలాడు కుండలములను ధరించిన రావణుడు ఎఱ్ఱనిచిగుళ్లతో, పుష్పములతో ఒప్పుచున్న రెండుఅశోకవృక్షములను ఇరువైపులయందును కలిగియున్న పర్వతమువలె విలసిల్లుచుండెను. (28)

అతడు కల్పవృక్షసదృశుడై ఆకృతిదాల్చిన వసంతునివలె సర్వాలంకారభూషితుడై యుండెను. ఐనను అతడు శ్మశానమునందలి మంటపమువలె భయంకరుడై యుండెను. (29)

రావణుడు వైదేహిని గ్రుడ్లుఱిమి వీక్షించుచు కోపముతో మండిపడుచున్నవాడై భుజంగమువలె బుసలుకొట్టుచు ఆమెతో ఇట్లుపలికెను. (30)

"ఓ సీతా! రాముడు నీతిదప్పినవాడు. ధనహీనుడు. అట్టి వానిని అనుసరించుచున్ననిన్ను సూర్యుడు తన కాంతితో ప్రాతస్సంధ్యాకాలమునందలి తమస్సునువలె ఇప్పుడే రూపుమాపెదను." (31)

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణశ్శత్రురావణః।
సందిదేశ తతస్సర్వా రాక్షసీర్ఘోరదర్శనాః। 32

ఏకాక్షీమేకకర్ణాం చ కర్ణప్రావరణాం తథా।
గోకర్ణీం హస్తికర్ణీం చ లంబకర్ణీమకర్ణికామ్। 33

హస్తిపాద్యశ్వపాద్యౌ చ గోపాదీం పాదచూలికామ్।
ఏకాక్షీమేకపాదీం చ పృథుపాదీమపాదికామ్। 34

అతిమాత్రశిరోగ్రీవామ్ అతిమాత్రకుచోదరీమ్।
అతిమాత్రాస్యనేత్రాం చ దీర్ఘజిహ్వామజిహ్వికామ్। 35

అనాసికాం సింహముఖీం గోముఖీం సూకరీముఖీమ్।
యథా మద్వశగా సీతా క్షిప్రం భవతి జానకీ। 36

తథా కురుత రాక్షస్యః సర్వాః క్షిప్రం సమేత్య చ।
ప్రతిలోమానులోమైశ్చ సామదానాదిభేదనైః।
ఆవర్తయత వైదేహీం దండస్యోద్యమనేన చ। 37

ఇతి ప్రతిసమాదిశ్య రాక్షసేంద్రః పునఃపునః।
కామమన్యుపరీతాత్మా జానకీం పర్యతర్జయత్। 38

ఉపగమ్య తతః క్షిప్రం రాక్షసీ ధాన్యమాలినీ।
పరిష్వజ్య దశగ్రీవమిదం వచనమబ్రవీత్। 39

మయా క్రీడ మహారాజ సీతయా కిం తవానయా।
వివర్ణయా కృపణయా మానుష్యా రాక్షసేశ్వర। 40

నూనమస్యా మహారాజ న దివ్యాన్ భోగసత్తమాన్।
విదధాత్యమరశ్రేష్ఠః తవ బాహుబలార్జితాన్। 41

అకామాం కామయానస్య శరీరముపతప్యతే।
ఇచ్ఛంతీం కామయానస్య ప్రీతిర్భవతి శోభనా। 42

ఏవముక్తస్తు రాక్షస్యా సముత్క్షిప్తస్తతో బలీ।
ప్రహసన్ మేఘసంకాశో రాక్షసః స న్యవర్తత। 43

ప్రస్థితః స దశగ్రీవః కంపయన్నివ మేదినీమ్।
జ్వలద్భాస్కరవర్ణాభం ప్రవివేశ నివేశనమ్। 44

దేవగంధర్వకన్యాశ్చ నాగకన్యాశ్చ సర్వతః।
పరివార్య దశగ్రీవం వివిశుస్తత్ గృహోత్తమమ్। 45

రాక్షసులకురాజు, శత్రువులనువేధించువాడువైన రావణుడు సీతాదేవితో ఇట్లుపలికినపిమ్మట భయంకరాకారములతోనున్న అచటగల రాక్షసస్త్రీలనందరిని ఇట్లుఆదేశించెను. (32)

ఆ రాక్షసస్త్రీలలో ఒకేకన్ను ఒకేచెవిగలది, అట్లే తలమొత్తమువ్యాపించినచెవులుగలది. ఆవుచెవులుగలది, ఏనుగుచెవులుగలది, వ్రేలాడుచెవులుగలది, చెవులు లేనిది, ఏనుగుపాదములుగలది, గుఱ్ఱముల పాదములుగలది, ఆవుపాదములుగలది, పాదములపై వెంట్రుకలుగలది, ఒకేకన్ను, ఒకేపాదముగలది, పెద్దపాదములుగలది, పాదములేలేనిది, అసాధారణమైన తల, మెడగలది, పెద్దపెద్దకుచములు, పెద్ద ఉదరముగలది, అసహజమైన ముఖము, నేత్రములు గలది, పొడవైననాలుకగలది, నాలుకయేలేనిది, ముక్కు లేనిది, సింహముఖముగలది, గోముఖముగలది, పందిముఖముగలది- ఇట్టిరాక్షసస్త్రీలను అతడాదేశించెను. "మీరందఱును కలిసి అనుకూలవిధానమున గాని, ప్రతికూలవిధానమునగాని (మంచిమాటలతోగాని, భయవచనములతోగాని) సామదానభేదోపాయములచే గాని, కడకు దండోపాయముచేగాని వెంటనే సీత నాకు వశమగునట్లు చూడుడు." (33-37)

రావణుడు ఇట్లు వారిని పదేపదేఆదేశించుచు కామక్రోధములకు లోనైనవాడై సీతాదేవిని మిక్కిలి భయపెట్టుచు వెళ్లెను. అప్పుడు ధాన్యమాలిని అను రాక్షసస్త్రీ వెంటనే రావణునిసమీపించి, వానిని కౌగిలించుకొని, ఇట్లు పలికెను. 'ఓ మహారాజా! ఈ సీతాదేవి మనుష్యకాంత, శోభాహీన, దీనురాలు. కనుక ఈమెతో నీకేమిపని? నాతోరమింపుము. ఓ ప్రభూ! నీ బాహుబలార్జితములైన దివ్యభోగములను అనుభవించు యోగము సృష్టికర్తయైనబ్రహ్మ ఈమెనొసట వ్రాయలేదు. ఇదితథ్యము. తనపైప్రేమలేని స్త్రీని కోరుకొనుటవలన పురుషునకు తాపమేమిగులును. తనపై వలపుగలతరుణిని కోరుకొనినచో ఆనందముదక్కును." ధాన్యమాలిని ఆయనతో ఇట్లుపలికి, బలశాలియు, మేఘతుల్యుడు ఐన ఆ రాక్షసుని ప్రక్కకుతీసికొని పోయెను. అతడునవ్వుచు వెనుకకు మరలెను. (38-43)

దశగ్రీవుడు భూమికంపించునట్లు బయలుదేరి వెళ్లెను. పిమ్మట అతడు సూర్యకాంతులతోవిలసిల్లుచున్న తన ప్రాసాదమున ప్రవేశించెను. (44)

దేవగంధర్వకన్యలును, నాగకన్యలును అతని చుట్టుచేరి ఆ మహాప్రాసాదమున ప్రవేశించిరి. (45)

స మైథిలీం ధర్మపరామవస్థితాం
ప్రవేపమానాం పరిభర్త్స్య రావణః ।
విహాయ సీతాం మదనేన మోహితః
స్వమేవ వేశ్మ ప్రవివేశ భాస్వరమ్ ॥ 46

ఆ రావణుడు ధర్మపరాయణయై భయముతో వణకిపోవుచున్న ఆ మైథిలిని మిక్కిలిభయపెట్టి, ఆమెను విడిచి వెళ్లెను. పిమ్మట అతడు కామవివశుడై వెలుగులను విరజిమ్ముచున్న తనభవనమునకు చేరెను. (46)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ద్వావింశస్సర్గః (22)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదిరెండవసర్గము.

-- * * * --

23. ఇరువదిమూడవసర్గము

రాక్షసస్త్రీలు సీతకు నచ్చజెప్పుటకు యత్నించుట

ఇత్యుక్త్వా మైథిలీం రాజా రావణశ్శత్రురావణః ।
సందిశ్య చ తతస్సర్వా రాక్షసీర్నిర్జగామ హ ॥ 1

శత్రువులనుపీడించునట్టి రావణుడు ఇట్లు మైథిలితో పలికి, రాక్షసస్త్రీలకు ఆజ్ఞలను ఇచ్చినపిమ్మట అచటినుండి వెడలిపోయెను. (1)

నిష్క్రాంతే రాక్షసేంద్రే తు పునరంతఃపురం గతే ।
రాక్షస్యో భీమరూపాస్తాః సీతాం సమభిదుద్రువుః ॥ 2

రావణుడు అక్కడినుండిబయలుదేఱి, అంతఃపురమునకు జేరగనే భయంకరాకారలైన ఆ రాక్షస స్త్రీలు సీతాదేవికడకు పరుగులుదీసిరి. (2)

తతస్సీతాముపాగమ్య రాక్షస్యః క్రోధమూర్ఛితాః ।
పరం పరుషయా వాచా వైదేహీమిదమబ్రువన్ ॥ 3

ఆ స్త్రీలు సీతాదేవిని సమీపించి, క్రోధపరవశలై పరుషముగా ఆమెతో ఇట్లు మాట్లాడదొడగిరి. (3)

పౌలస్త్యస్య వరిష్ఠస్య రావణస్య మహాత్మనః ।
దశగ్రీవస్య భార్యాత్వం సీతే న బహుమన్యసే ॥ 4

ఓ సీతా! రావణుడు పులస్త్యునివంశమున పుట్టినవాడు, మిక్కిలిశ్రేష్ఠుడు, మహాత్ముడు, ఆ దశకంఠుని భార్యవగుటను నీవు గౌరవముగా ఎందుకు భావించుటలేదు. (4)

తతస్త్వేకజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్ ।
ఆమంత్ర్య క్రోధతామ్రాక్షీ సీతాం కరతలోదరీమ్ ॥ 5

అనంతరము 'ఏకజట'అనుపేరుగల రాక్షసి కన్నులెఱ్ఱజేసినదై, సన్ననినడుముగలసీతతో ఇట్లు పలికెను. (5)

ప్రజాపతీనాం షణ్ణాం తు చతుర్థో యః ప్రజాపతిః ।
మానసో బ్రహ్మణః పుత్రః పులస్త్య ఇతి విశ్రుతః ॥ 6

"షట్ప్రజాపతులుగా (మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అను పేర్లతో) ప్రసిద్ధికెక్కినఆఱుగురిలో పులస్త్యుడు నాల్గవవాడు. అతడు బ్రహ్మమానసపుత్రుడుగా సుప్రసిద్ధుడు. (6)

పులస్త్యస్య తు తేజస్వీ మహర్షిర్మానసస్సుతః ।
నామ్నా స విశ్రవా నామ ప్రజాపతిసమప్రభః ॥ 7

తస్య పుత్రో విశాలాక్షి రావణశ్శత్రురావణః ।
తస్య త్వం రాక్షసేంద్రస్య భార్యా భవితుమర్హసి ।
మయోక్తం చారుసర్వాంగి! వాక్యం కిం నానుమన్యసే ॥ 8

తేజస్వియైన 'విశ్రవసుడు' అనుమహర్షి ఆ పులస్త్యుని మానసపుత్రుడు. అతడు తేజస్సున బ్రహ్మయంతటివాడు. ఓ విశాలాక్షీ! సుప్రసిద్ధుడైన ఆ విశ్రవమునికుమారుడే రావణుడు. అతడు అరివీరభయంకరుడు, ఆ రాక్షసప్రభువునకు భార్యవగుటకు నీవు తగినదానవు. ఓ సుందరాంగీ! నేను నుడువుచున్న హితవచనములను నీవు ఏల ఆలకింపవు?" (7-8)

తతో హరిజటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్ ।
వివర్త్య నయనే కోపాత్ మార్జారసదృశేక్షణా ॥ 9

పిదప పిల్లికనులుగల 'హరిజట'యను ఒక రాక్షసి కోపముతో కన్నులు త్రిప్పుచు ఇట్లు పలికెను. "ముప్పదిముగ్గురు దేవతలును,

యేన దేవాస్త్రయస్త్రింశత్ దేవరాజశ్చ నిర్జితాః।
తస్య త్వం రాక్షసేంద్రస్య భార్యా భవితుమర్హసి। 10

వీర్యోత్సిక్తస్య శూరస్య సంగ్రామేష్వనివర్తినః।
బలినో వీర్యయుక్తస్య భార్యాత్వం కిం న లప్స్యసే। 11

తతస్తు ప్రఘసా నామ రాక్షసీ క్రోధమూర్ఛితా।
భర్త్సయంతీ తదా ఘోరమ్ ఇదం వచనమబ్రవీత్। 12

ప్రియాం బహుమతాం భార్యాం త్యక్త్వా రాజా మహాబలః।
సర్వాసాం చ మహాభాగాం త్వాముపైష్యతి రావణః। 13

సమృద్ధం స్త్రీసహస్రేణ నానారత్నోపశోభితమ్।
అంతఃపురం సముత్సృజ్య త్వాముపైష్యతి రావణః। 14

అన్యా తు వికటా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్।
అసకృద్దేవతా యుద్ధే నాగగంధర్వదానవాః।
నిర్జితాస్సమరే యేన స తే పార్శ్వముపాగతః। 15

తస్య సర్వసమృద్ధస్య రావణస్య మహాత్మనః।
కిమద్య రాక్షసేంద్రస్య భార్యాత్వం నేచ్ఛసేఽధమే। 16

తతస్తు దుర్ముఖీ నామ రాక్షసీ వాక్యమబ్రవీత్।
యస్య సూర్యో న తపతి భీతో యస్య చ మారుతః।
న వాతిస్మాయతాపాంగే కిం త్వం తస్య న తిష్ఠసి। 17

పుష్పవృష్టిం చ తరవో ముముచుర్యస్య వై భయాత్।
శైలాశ్చ సుభ్రు పానీయం జలదాశ్చ యదేచ్ఛతి। 18

తస్య నైరృతరాజస్య రాజరాజస్య భామిని।
కిం త్వం న కురుషే బుద్ధిం భార్యార్థే రావణస్య హి। 19

సాధు తే తత్త్వతో దేవి కథితం సాధు భామిని।
గృహాణ సుస్మితే వాక్యమ్ అన్యథా న భవిష్యసి। 20

దేవేంద్రుడును రావణునిచేతిలో పరాజితులైరి. అట్టిరాక్షసేంద్రుని భార్యవగుటకు నీవు అర్హురాలవు. రావణుడు గర్వింపదగిన పరాక్రమముగలవాడు, మహావీరుడు, శూరుడు, రణరంగమున వెన్నుచూపనివాడు, మహాబలశాలి, మహాశక్తిసంపన్నుడు, అట్టివానికి భార్యవగుటకు ఏల సమ్మతింపవు? (9-11)

అనంతరము 'ప్రఘస'యనుపేరుగల రాక్షసి క్రోధవివశయై ఆమెనుబెదరించుచు కఠోరముగా ఇట్లు వచించెను. (12)

రావణుని భార్యలందఱిలోను మండోదరి సర్వసౌభాగ్యవతి. ఆమెయనిన ఆయనకు ఎనలేనిప్రేమ, గౌరవము, ఆమెను సైతము వీడి, మహాబలశాలియైన రావణుడు నిన్నుపొందగోరుచున్నాడు.(13)

అమూల్యములైనరత్నములతో శోభిల్లుచున్న రావణుని అంతఃపురమునందు వేలకొలది కాంతామణులు గలరు. అట్టి తరుణీమణులనుసైతము వీడి, రావణుడు నిన్ను చేరగోరుచున్నాడు. (14)

'వికట' యను పేరుగల మఱియొక రాక్షసి ఇట్లనెను. రావణుడు సంగ్రామరంగమున దేవతలను, నాగులను, గంధర్వులను, దానవులను పెక్కుపర్యాయములు ఓడించెను. అట్టివాడు నీ సరసనచేరుటకు ఉబలాటపడుచున్నాడు. అతడు రాక్షసులకుప్రభువు, ఓ అధమురాలా! అంతటి రావణునిభార్యవగుటకు నీవు ఏల ఇష్టపడకున్నావు?(15-16)

పిమ్మట 'దుర్ముఖి'యనురాక్షసి ఇట్లు పలికెను. ఓ సుందరీ! రావణునకు భయపడి సూర్యుడు తీక్ష్ణ కిరణములను ప్రసరింపజేయడు, వాయువు పెనుగాలులనువీచడు, ఓ విశాలాక్షీ! అట్టి మహా ప్రభువుసరసన నీవేలచేరవు? అతనికిభయపడి చెట్లు సైతము అతని కోరికమేరకే పుష్పములను రాల్చును. అట్లే పర్వతములు, మేఘములు మధురజలములను సమకూర్చుచుండును. ఓ భామినీ! అతడు రాక్షసరాజు, అంతేగాదు రాజులకే రాజు, అట్టి రావణునిపై ఏల మనసు పడవు? అతని భార్యవగుటకు ఏల సిద్ధపడవు? (17-19)

చిఱునవ్వుమోముగల ఓ తరుణీ! దేవీ! నీ మేలుగోరి నుడువుచుంటిని, నా మాటలనుగ్రహింపుము, లేనిచో నీవు బ్రతికియుండవు. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే త్రయోవింశస్సర్గః *(23)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదిమూడవసర్గము.

-- * * * --

24. ఇరువదినాల్గవసర్గము

సీత రాక్షసస్త్రీల మాటలను నిరాకరించుట. వారామెను చంపివైచెదమని భయపెట్టుట

తతస్సీతాముపాగమ్య రాక్షస్యో వికృతాననాః।
పరుషం పరుషానార్యః ఊచుస్తాం వాక్యమప్రియమ్।1

వికృతాననలైన ఆ రాక్షసస్త్రీలు సీతాదేవికి ఇంకను దగ్గరగాజేరి, పరుషవచనములకు తట్టుకొనలేని ఆనుకుమారిని గదుముచు అప్రియములైన మాటలను పలికిరి. (1)

కిం త్వమంతఃపురే సీతే సర్వభూతమనోహరే।
మహార్హశయనోపేతే న వాసమనుమన్యసే।2

"ఓ సీతా! రావణునిఅంతఃపురము అందఱికిని ఆహ్లాదకరమైనది. అత్యుత్తమములైన తల్పములతో విలసిల్లుచున్నది. అచట హాయిగానుండుటకు ఏలఇచ్చగింపవు? (2)

మానుషీ మానుషస్యైవ భార్యాత్వం బహుమన్యసే।
ప్రత్యాహర మనో రామాత్ న త్వం జాతు భవిష్యసి।3

మానవకాంతవైననీవు మనుజునకు భార్యగా ఉండుటయే గొప్పగా తలంచుచున్నావు. నీవు ఎన్నడును, ఏ విధముగను రాముని చేరజాలవు. కనుక ఆయననుండి నీ మనస్సును మఱల్చుకొనుము. (3)

త్రైలోక్యవసుభోక్తారం రావణం రాక్షసేశ్వరమ్।
భర్తారముపసంగమ్య విహరస్వ యథాసుఖమ్।4

రాక్షసేంద్రుడైన రావణుడు ముల్లోకములయందలి సర్వసంపదలకును అధికారి. ఆయనకుభార్యవై హాయిగా విహరింపుము. (4)

మానుషీ మానుషం తం తు రామమిచ్ఛసి శోభనే।
రాజ్యాద్భ్రష్టమసిద్ధార్థం విక్లబం త్వమనిందితే।5

ఓ మంగళస్వరూపిణీ! పూజ్యురాలా! నీవు మానవకాంతవగుటచే మానవుడైన ఆ రామునే కోరుకొనుచున్నావు. కాని అతడు రాజ్యభ్రష్టుడు, ఏకార్యమును సాధింపజాలనివాడు, పైగా శోకాకులుడు." (5)

రాక్షసీనాం వచశ్శ్రుత్వా సీతా పద్మనిభేక్షణా।
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యామ్ ఇదం వచనమబ్రవీత్।6

పద్మనయనయైనసీతాదేవి రాక్షసస్త్రీలమాటలను వినినంతనే ఆమెకన్నులు అశ్రుపూర్ణములుకాగా వారితో ఇట్లనెను. (6)

యదిదం లోకవిద్విష్టమ్ ఉదాహరథ సంగతాః।
నైతన్మనసి వాక్యం మే కిల్బిషం ప్రతిభాతి వః।7

"ఇచట చేరినమీరందఱును నాతోనుడువుచున్న విషయము లోకనింద్యము. మీరుపలికిన ఈ పాపవచనములు నా మనస్సునకు ఎక్కుటలేదు. (7)

న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి।
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః।8

మానవకాంత రాక్షసునకు భార్యయగుటతగదు. మీరందఱునుకలిసి, మీ యిష్టానుసారము నన్ను చంపి తినివేయుడు. ఐనను మీరుచెప్పినట్లుగా మాత్రము నేను చేయనే చేయను. (8)

దీనో వా రాజ్యహీనో వా యో మే భర్తా స మే గురుః।
తం నిత్యమనురక్తాస్మి యథా సూర్యం సువర్చలా।9

నాభర్త దీనుడైనను, రాజ్యహీనుడైనను అతడే నాకు గురువు. సువర్చలాదేవి సూర్యునియందువలె సర్వదా నేను నా పతియందే అనురక్తురాలను. మహాసాధ్వియైన శచీదేవి దేవేంద్రుని అనుసరించినట్లును, అరుంధతి వసిష్ఠుని, రోహిణి చంద్రుని, లోపాముద్ర అగస్త్యుని, సుకన్య చ్యవనమహర్షిని, సావిత్రి సత్యవంతుని, శ్రీమతి

యథా శచీ మహాభాగా శక్రం సముపతిష్ఠతి।
అరుంధతీ వసిష్ఠం చ రోహిణీ శశినం యథా।10

లోపాముద్రా యథాఽగస్త్యం సుకన్యా చ్యవనం యథా।
సావిత్రీ సత్యవంతం చ కపిలం శ్రీమతీ యథా।11

సౌదాసం మదయంతీవ కేశినీ సగరం యథా।
నైషధం దమయంతీవ భైమీ పతిమనువ్రతా।
తథాహమిక్ష్వాకువరం రామం పతిమనువ్రతా। 12

సీతాయాః వచనం శ్రుత్వా రాక్షస్యః క్రోధమూర్ఛితాః।
భర్త్సయంతి స్మ పరుషైః వాక్యైః రావణచోదితాః। 13

అవలీనస్స నిర్వాక్యో హనుమాన్ శింశుపాద్రుమే।
సీతాం సంతర్జయంతీస్తా రాక్షసీరశృణోత్కపిః। 14

తామభిక్రమ్య సంక్రుద్ధా వేపమానాం సమంతతః।
భృశం సంలిలిహుర్దీప్తాన్ ప్రలంబాన్ దశనచ్ఛదాన్। 15

ఊచుశ్చ పరమక్రుద్ధాః ప్రగృహ్యాశు పరశ్వధాన్।
నేయమర్హతి భర్తారం రావణం రాక్షసాధిపమ్। 16

సంభర్త్స్యమానా భీమాభీ రాక్షసీభిర్వరాననా।
సా బాష్పమపమార్జంతీ శింశుపాం తాముపాగమత్। 17

తతస్తాం శింశుపాం సీతా రాక్షసీభిస్సమావృతా।
అభిగమ్య విశాలాక్షీ తస్థౌ శోకపరిప్లుతా। 18

తాం కృశాం దీనవదనాం మలినాంబరధారిణీమ్।
భర్త్సయాంచక్రిరే సీతాం రాక్షస్యస్తాం సమంతతః। 19

తతస్తు వినతా నామ రాక్షసీ భీమదర్శనా।
అబ్రవీత్ కుపితాకారా కరాళా నిర్ణతోదరీ। 20

సీతే పర్యాప్తమేతావత్ భర్తృస్నేహో నిదర్శితః।
సర్వత్రాతికృతం భద్రే వ్యసనాయోపకల్పతే। 21

పరితుష్టాస్మి భద్రం తే మానుషస్తే కృతో విధిః।
మమాపి తు వచః పథ్యం బ్రువంత్యాః కురు మైథిలి। 22

రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్।
విక్రాంతం రూపవంతం చ సురేశమివ వాసవమ్। 23

కపిలుని, మదయంతీదేవి సౌదాసుని, కేశినీదేవి సగరుని, దమయంతి నలుని అనుసరించినట్లు ఇక్ష్వాకువంశశ్రేష్ఠుడును, నాకు పతియునుఐన శ్రీరామచంద్రప్రభువునే నేను అనుసరించెదను." సీతాదేవి యొక్క ప్రతివచనములనువిని, రావణునిచే ప్రేరితలైన రాక్షసస్త్రీలు కోపోద్రిక్తలై పరుషవచనములతో ఆమెను భయపెట్టసాగిరి. (9-13)

అశోకవృక్షముపై మౌనముగా దాగియున్న ఆ హనుమంతుడు సీతాదేవిని భయపెట్టుచున్న ఆ రాకాసిమూకలమాటలను నిశ్చలముగా వినెను. (14)

క్రోధావేశపరలైనరాక్షసస్త్రీలు వణకిపోవుచున్న సీతాదేవిని చుట్టుముట్టి, వ్రేలాడుచున్న తమనెఱ్ఱని పెదవులను నాకుచు, చప్పరించుచు, ఆమెను తినివేయబోవుచున్నట్లు ప్రవర్తించిరి. (15)

వెంటనే వారుక్రోధముతో గండ్రగొడ్డళ్లను చేతబట్టి, "రాక్షసాధిపుడైన రావణుని భర్తగాపొందుటకు ఈమె అర్హురాలు కానేకాదు"- అనిపలికిరి. (16)

భయంకరరాక్షసస్త్రీలు మిక్కిలిబెదిరించుచుండగా వరాననయైన సీతాదేవి పొరలివచ్చుచున్న కన్నీటిని తుడుచుకొనుచు (హనుమంతుడు కూర్చొనియున్న) అశోకవృక్షముయొక్క మూలమునకు జరిగెను. (17)

అట్లు శింశుపావృక్షసమీపమునకు జేరిన సీతాదేవిని రాక్షస స్త్రీలు చుట్టుముట్టిరి. అప్పుడావిశాలాక్షి శోకమగ్నయయ్యెను. (18)

ఆ రాకాసిమూకలు దీనవదనయు, మాసినవస్త్రములను ధరించినదియు, బక్కచిక్కినదియుఐన ఆ సీతాదేవి చుట్టును జేరి, హెచ్చరికలతో ఆమెను బెదిరింపసాగెను.(19)

చూచువారికి భయమును గొల్పునదియు, కోపదృష్టితో ఉన్నదియు, వంకరటింకరగానున్నదియు, ఎత్తైన పొట్టగలదియుఐన 'వినత'యను రక్కసి అప్పుడు ఇట్లు నుడివెను. ఓ సీతా! ఇంతవఱకును నీపతిపై నీవు చూపినప్రేమ ఇకచాలును. ఏ విషయముననైనను అతిగా ప్రవర్తించినచో అది కష్టములకుదారితీయును. (20-21)

ఓ సీతా! ఒక మానవకాంతధర్మమును నీవు బాగుగా ఆచరించితివి. చాలసంతోషము, నీకు మేలుకలుగుగాక. నీహితమునకే నేను నుడువుచున్న మాటనుగూడ పాటింపుము. (22)

రావణుడు గొప్పపరాక్రమశాలి, మిక్కిలిరూపసి, భోగానుభవమున దేవేంద్రునివంటివాడు, కడుసమర్థుడు,

దక్షిణం త్యాగశీలం చ సర్వస్య ప్రియదర్శనమ్।
మానుషం కృపణం రామం త్యక్త్వా రావణమాశ్రయ। 24

దివ్యాంగరాగా వైదేహి దివ్యాభరణభూషితా।
అద్యప్రభృతి సర్వేషాం లోకానామీశ్వరీ భవ। 25

అగ్నేస్స్వాహా యథా దేవీ శచీవేంద్రస్య శోభనే।
కిం తే రామేణ వైదేహి కృపణేన గతాయుషా। 26

ఏతదుక్తం చ మే వాక్యం యది త్వం న కరిష్యసి।
అస్మిన్ ముహూర్తే సర్వాస్త్వాం భక్షయిష్యామహే వయమ్। 27

అన్యా తు వికటా నామ లంబమానపయోధరా।
అబ్రవీత్ కుపితా సీతాం ముష్టిముద్యమ్య గర్జతీ। 28

బహూన్యప్రియరూపాణి వచనాని సుదుర్మతే।
అనుక్రోశాన్మృదుత్వాచ్చ సోఢాని తవ మైథిలి। 29

న చ నః కురుషే వాక్యం హితం కాలపురస్కృతమ్।
ఆనీతాఽసి సముద్రస్య పారమన్యైర్దురాసదమ్। 30

రావణాంతఃపురం ఘోరం ప్రవిష్టా చాసి మైథిలి।
రావణస్య గృహే రుద్ధామ్ అస్మాభిస్తు సురక్షితామ్। 31

న త్వాం శక్తః పరిత్రాతుమ్ అపి సాక్షాత్ పురందరః।
కురుష్వ హితవాదిన్యా వచనం మమ మైథిలి। 32

అలమశ్రుప్రపాతేన త్యజ శోకమనర్థకమ్।
భజ ప్రీతిం చ హర్షం చ త్యజైతాం నిత్యదైన్యతామ్। 33

సీతే రాక్షసరాజేన సహ క్రీడ యథాసుఖమ్।
జానాసి హి యథా భీరు స్త్రీణాం యౌవనమధ్రువమ్। 34

యావన్న తే వ్యతిక్రామేత్ తావత్ సుఖమవాప్నుహి।
ఉద్యానాని చ రమ్యాణి పర్వతోపవనాని చ। 35

త్యాగశీలుడు, అందఱికిని ఆనందమునుగూర్చువాడు. అంతేగాదు అతడురాక్షసప్రభువు. అట్టి రావణుని నీవు భర్తగా సేవింపుము. మానవుడు, దీనుడుఅయిన రాముని త్యజించి, రావణుని ఆశ్రయింపుము. (23-24)

ఓ వైదేహి! నేటినుండి దివ్యములైన మైపూతలతో, అమూల్యములైన ఆభరణములతో వెలుగొందుము. ఓ మంగళ స్వరూపిణీ! అగ్నిదేవునకు-స్వాహాదేవివలె, దేవేంద్రునకు శచీదేవివలె. నీవు రావణునకుభార్యవై సర్వలోకములకును రాణివగుము. దీనుడైనరాముడు ఆయువు తీరనున్నవాడు. అట్టివానితో నీకేమిపని? (25-26)

నేనుచెప్పిన ఈ మాటలను నీవు విననిచో మేమందఱము ఈ క్షణముననే నిన్నుభక్షించి వేయగలము. (27)

వ్రేలాడుచున్న స్తనములుగలిగిన 'వికట'యను మఱియొక రాక్షసి కుపితయై, పిడికిలిబిగించి, సీతను భయపెట్టుచు ఇట్లుపలికెను. (28)

ఓ సీతా! నీవు బుద్ధిహీనురాలవు. ఇంతవఱకును మాకు అప్రియమైన మాటలను ఎన్నోపలికితివి. ఐనను నీ మీదజాలిపడి మంచితనముతో వాటినన్నింటిని సహించితిమి. (29)

ఓ మైథిలీ! కాలానుగుణముగ నీకుహితకరమైన మాటలనే మేము పలుకుచుంటిమి. వాటిని నీవు వినుట లేదు. సముద్రముయొక్క ఈవలితీరమునకు నీవు తీసికొనిరాబడితివి. ఇతరులెవ్వరును ఇచటికిచేరజాలరు. (30)

ఓ మైథిలీ! శత్రుభయంకరమైన రావణాంతఃపురమున నీవు ఉంచబడితివి. రావణగృహమునందు బంధింపబడిన నిన్ను మేము కాపలాకాయుచుంటిమి. (31)

సాక్షాత్తు ఆ దేవేంద్రుడుసైతము నిన్ను రక్షింపజాలడు. కావున ఓ మైథిలీ! నీ హితముగోరి చెప్పుచున్న నా మాటలను పాటింపుము. ఓ సీతాదేవీ! ఏడుపును చాలింపుము. అనర్థదాయకమైన నీ శోకమును వీడుము. అనుక్షణము దైన్యముతోనుండుట మానుము. సంతోషముతో ప్రియముగా మెలగుము. (32-33)

భయస్వభావముగల ఓ సీతా! స్త్రీలయౌవనము స్థిరముగా నిలిచియుండదు. దానిశోభలు క్రమముగా క్షీణించును. ఈ విషయమును నీవును ఎఱుగుదువు. కనుక నీవు రావణునితో హాయిగారమింపుము. (34)

నీయౌవనము జాఱిపోకముందే సర్వసుఖములను అనుభవింపుము. ఓ సుందరీ! ఈత్రికూటపర్వతము నందలి

సహ రాక్షసరాజేన చర త్వం మదిరేక్షణే।
స్త్రీసహస్రాణి తే దేవి వశే స్థాస్యంతి సుందరి। 36

రావణం భజ భర్తారం భర్తారం సర్వరక్షసామ్।
ఉత్పాట్య వా తే హృదయం భక్షయిష్యామి మైథిలి।
యది మే వ్యాహృతం వాక్యం న యథావత్ కరిష్యసి। 37

తతశ్చండోదరీ నామ రాక్షసీ క్రోధమూర్ఛితా।
భ్రామయంతీ మహచ్ఛూలమ్ ఇదం వచనమబ్రవీత్। 38

ఇమాం హరిణలోలాక్షీం త్రాసోత్కంపిపయోధరామ్।
రావణేన హృతాం దృష్ట్వా దౌహృదో మే మహానభూత్। 39

యకృత్ ప్లీహమథోత్పీడం హృదయం చ సబంధనమ్।
అంత్రాణ్యపి తథా శీర్షం ఖాదేయమితి మే మతిః। 40

తతస్తు ప్రఘసా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్। 41

కంఠమస్యా నృశంసాయాః పీడయామః కిమాస్యతే।
నివేద్యతాం తతో రాజ్ఞే మానుషీ సా మృతేతి హ। 42

నాత్ర కశ్చన సందేహః ఖాదతేతి స వక్ష్యతి।
తతస్త్వజాముఖీ నామ రాక్షసీ వాక్యమబ్రవీత్। 43

విశస్యేమాం తతః సర్వాన్ సమాన్ కురుత పీలుకాన్।
విభజామ తతస్సర్వా వివాదో మే న రోచతే।
పేయమానీయతాం క్షిప్రం లేహ్యముచ్చావచం బహు। 44

తతశ్శూర్పణఖా నామ రాక్షసీ వాక్యమబ్రవీత్। 45

అజాముఖ్యా యదుక్తం హి తదేవ మమ రోచతే।
సురా చానీయతాం క్షిప్రం సర్వశోకవినాశినీ।
మానుషం మాంసమాస్వాద్య నృత్యామోఽథ నికుంభిలామ్। 46

ఉపవనములలో రమ్యమైన ఉద్యానములలో రావణునితోగూడి నీవు విహరింపుము. అప్పుడు వేలకొలదిగాగల మేమందఱము నీకు పరిచారికలమై నీ అధీనములోనుందుము. (35-36)

సకలరాక్షసులకును ప్రభువైన రావణునకు నీవు భార్యవై ఆయనను భజింపుము. నేనునుడివిన ఈ మాటలను నీవు పెడచెవినబెట్టినచో నీ గుండెనుచీల్చి, దానిని తినివేయుదుము. (37)

అనంతరము 'చండోదరి'యనురాక్షసి క్రోధవివశయై ఒక మహాశూలమును త్రిప్పుచు ఇట్లునచించెను. (38)

"భయముచేకంపించుచున్న వక్షఃస్థలముగలదియు, లేడివలె బెదురుచూపులతోనున్నదియు, రావణునిచే అపహరింపబడినదియునైన ఈమెను జూచి (గర్భవతులకువలె) నాకొక తీరనికోరిక కలిగినది. (39)

ఈమె యకృత్తును, (గుండెకు కుడివైపుననుండు మాంసము) ప్లీహమును (గుండెకు ఎడమవైపుననుండెడి మాంసము) ఉత్పీడమును (గుండెకుపైనుండుమాంసము) గుండెను, ప్రేగులను, శిరస్సును, తినివేయవలెనని నాకు ఇచ్ఛకలిగినది." (40)

అనంతరము 'ప్రఘస'యనురాక్షసి ఇట్లు వచించెను.(41)

"ఇట్లు వృథాగా ఊరకకూర్చొనుటఎందులకు? ఈ మూర్ఖురాలికంఠమును నులిపివేయుదము. పిమ్మట ఈ మానవకాంత మరణించినదని రాజుగారికి నివేదింతము. 'అయినచోతినివేయుడు' అని అతడు మనకు ఆజ్ఞను ఇచ్చును- ఇందుకు సందేహమేలేదు"- పిమ్మట 'అజాముఖి' యనురాక్షసి ఇట్లుపలికెను. (42-43)

"మనమందరము ఈమెను ముక్కలు ముక్కలుగాజేసి, మాంసఖండములను సమానముగా పంచుకొందము. ఈ విషయమున అంతగావివాదపడుట నాకు రుచింపదు. త్వరగా మద్యములను, అనేకవిధములైన లేహ్యములను సమృద్ధిగా తీసికొనిరండు. మనము విందుచేసికొందము" (44)

పిదప 'శూర్పణఖ'యనురాక్షసి ఈ విధముగా నుడివెను.(45)

"అజాముఖి చెప్పినవిషయము నాకునుసమ్మతమే. శీఘ్రముగా మద్యమును కొనిరండు. అది అన్నివిధములైన మనబాధలను దూరముచేయును. నరమాంసమును భక్షించి, నికుంభిలాదేవి (లంకయొక్క పశ్చిమ ద్వారమునందలి భద్రకాళి) తృప్తికై నృత్యములు చేయుదము. (46)

ఏవం సంభర్త్స్యమానా సా సీతా సురసుతోపమా।
రాక్షసీభిస్సుఘోరాభిః ధైర్యముత్సృజ్య రోదితి। 47

ఇట్లు ఘోరరాక్షసస్త్రీలు బెదిరించి భయపెట్టుచుండగా దేవతవంటి ఆ సీత ధైర్యమును కోల్పోయి, వికలయై ఏడువసాగెను. (47)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే చతుర్వింశస్సర్గః (24)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదినాల్గవసర్గము.

-- * * * --

25. ఇరువదియైదవసర్గము

సీత రాక్షసస్త్రీలమాటలను నిరాకరించి, శోకసంతప్తయై విలపించుట

తథా తాసాం వదంతీనాం పరుషం దారుణం బహు।
రాక్షసీనామసౌమ్యానాం రురోద జనకాత్మజా। 1

క్రూరస్వభావముగల ఆ రాక్షసస్త్రీలు మిక్కిలిభీతిని గొలుపుచు పరుషములైన వచనములను పలుకుచుండగా వారిమాటలను విని, జానకి విలపింపసాగెను. (1)

ఏవముక్తా తు వైదేహీ రాక్షసీభిర్మనస్వినీ।
ఉవాచ పరమత్రస్తా బాష్పగద్గదయా గిరా। 2

న మానుషీ రాక్షసస్య భార్యా భవితుమర్హతి।
కామం ఖాదత మాం సర్వా న కరిష్యామి వో వచః। 3

ఆ రాక్షసస్త్రీలమాటలకు మిక్కిలి భయపడినదై, సాధ్వియైన సీతాదేవి కన్నీరుగార్చుచు గద్గదస్వరముతో మాటలు తడబడుచుండగా ఇట్లు పలికెను- ఒక మానవకాంత రాక్షసునకు ఎన్నటికిని భార్యకాజాలదు. నన్ను మీరు మీ ఇష్టానుసారము తినివేసినసరే! మీ మాటలను నేను ఏ మాత్రము పాటింపను. (2-3)

సా రాక్షసీమధ్యగతా సీతా సురసుతోపమా।
న శర్మ లేభే దుఃఖార్తా రావణేన చ తర్జితా। 4

రావణునిచే భయపెట్టబడినదై, దేవకన్యవంటి ఆ సీతాదేవి రాక్షసస్త్రీలమధ్య బిక్కుబిక్కుమనుచు దుఃఖార్తయై శాంతికి నోచుకొనకుండెను. (4)

వేపతేస్మాధికం సీతా విశంతీవాంగమాత్మనః।
వనే యూథపరిభ్రష్టా మృగీ కోకైరివార్దితా। 5

వనమునందు తనగుంపునకుదూరమై తోడేళ్లచే పీడింపబడిన లేడివలె సీతాదేవి తనశరీరమును దగ్గరకు ముడుచుకొనుచు గడగడ వణకసాగెను. (5)

సా త్వశోకస్య విపులాం శాఖామాలంబ్య పుష్పితామ్।
చింతయామాస శోకేన భర్తారం భగ్నమానసా। 6

శోకముచే మనస్సునకలతచెందిన ఆ సీతాదేవి బాగుగా పుష్పించిన అశోకవృక్షముయొక్క ఒక పెద్ద కొమ్మను ఆలంబనముగా జేసికొని, భర్తను తలచుకొనుచు చింతింపసాగెను. (6)

సా స్నాపయంతీ విపులౌ స్తనౌ నేత్రజలస్రవైః।
చింతయంతీ న శోకస్య తదాంతమధిగచ్ఛతి। 7

సీతాదేవి తనభర్తను స్మరించుచు కన్నీరుమున్నీరుగా విలపించుచుండెను. సంతతధారగా ప్రవహించు అశ్రువులచే ఆమెవక్షఃస్థలము తడిసిపోవుచుండెను. ఆమెశోకమునకు అంతమే లేకుండెను. (7)

సా వేపమానా పతితా ప్రవాతే కదలీ యథా।
రాక్షసీనాం భయత్రస్తా వివర్ణవదనాఽభవత్। 8

పెనుగాలికివంగి నేలనుతాకుచున్న అరటిచెట్టువలె ఆ సీతాదేవి రాక్షసస్త్రీలభయమునకు వణకుచు వెలవెల బోవుచుండెను. (8)

తస్యాస్సా దీర్ఘవిపులా వేపంత్యా సీతయా తదా।
దదృశే కంపినీ వేణీ వ్యాలీవ పరిసర్పతీ। 9

భయకంపితయై, వణకుచున్న ఆసీతయొక్క పొడవైన దట్టమైనజడ అటునిటుకదలుచు ప్రాకుచున్న ఆడుపామువలె గోచరించుచుండెను. (9)

సా నిశ్శ్వసంతీ దుఃఖార్తా శోకోపహతచేతనా।
ఆర్తా వ్యసృజదశ్రూణి మైథిలీ విలలాప హ। 10

సీతాదేవి తన భర్తయెడబాటునకు మిక్కిలి పరితపించుచుండెను. పైగా రాక్షసస్త్రీలమాటలు శూలములై ఆమెను బాధించుచుండెను. అప్పుడామె నిట్టూర్పులు విడుచుచు, కన్నీరుగార్చుచు, ఎంతయు విలపింపసాగెను. (10)

హా రామేతి చ దుఃఖార్తా హా పునర్లక్ష్మణేతి చ।
హా శ్వశ్రు మమ కౌసల్యే హా సుమిత్రేతి భామినీ। 11

దుఃఖముతో కుమిలిపోవుచున్న సీత హా! రామా! హా! లక్ష్మణా! అయ్యో! అత్తయైన కౌసల్యా! అయ్యో! సుమిత్రాదేవీ! అని వాపోయెను. (11)

లోకప్రవాదస్సత్యోఽయం పండితైస్సముదాహృతః।
అకాలే దుర్లభో మృత్యుః స్త్రియా వా పురుషస్య వా। 12

యత్రాహమేవం క్రూరాభీ రాక్షసీభిరిహార్దితా।
జీవామి హీనా రామేణ ముహూర్తమపి దుఃఖితా। 13

"స్త్రీ పురుషులలో ఎవ్వరికైనను తాము కోరుకొన్నప్పుడే మరణము సంభవింపదు"- అను ప్రాజ్ఞులమాట సత్యము. రామునియెడబాటునకు లోనై, ఈవిధముగా రాక్షసస్త్రీలచే బాధింపబడుచు, క్షణకాలమైనను నేను జీవించి యుండరాదు. కాని ఇంకను నేను జీవించి యుండుటనుబట్టి పండితులమాట నిశ్చయమని తోచుచున్నది- (12-13)

ఏషాఽల్పపుణ్యా కృపణా వినశిష్యామ్యనాథవత్।
సముద్రమధ్యే నౌః పూర్ణా వాయువేగైరివాహతా। 14

సముద్రమధ్యమున ఒక నిండునౌక పెనుతుఫానుకు లోనై కకావికలైనట్లు దీనావస్థకుగురియై, శోకభారముతో నేను అంతరించిపోవుదును. నిజముగా నేను దురదృష్టవంతురాలను. (14)

భర్తారం తమపశ్యంతీ రాక్షసీవశమాగతా।
సీదామి ఖలు శోకేన కూలం తోయహతం యథా। 15

రాక్షసస్త్రీలకు అధీనురాలనై, నా పతిదర్శనమునకు నోచుకొనక, జలప్రవాహముధాటికి శిథిలమైనగట్టువలె నేను శోకముతో క్రుంగిపోవుచున్నాను. (15)

తం పద్మదళపత్రాక్షం సింహవిక్రాంతగామినమ్।
ధన్యాః పశ్యంతి మే నాథం కృతజ్ఞం ప్రియవాదినమ్। 16

నా పతియైనరాముడు పద్మదళాయతనేత్రుడు, సింహమువలె పరాక్రమముతో గంభీరముగా నడచువాడు, కృతజ్ఞుడు ప్రియముగా మాట్లాడువాడు, అట్టి నా నాథునిదర్శనము లభించినవారు ఎంతయు ధన్యాత్ములు.(16)

సర్వథా తేన హీనాయా రామేణ విదితాత్మనా।
తీక్ష్ణం విషమివాస్వాద్య దుర్లభం మమ జీవితమ్। 17

సద్గుణసంపన్నుడుగా జగద్విఖ్యాతుడైన శ్రీరాముని యెడబాసిన నేను తీక్ష్ణమైనవిషమును మ్రింగిన దానివలె జీవించియుండుట దుర్లభము. (17)

కీదృశం తు మయా పాపం పురా జన్మాంతరే కృతమ్।
యేనేదం ప్రాప్యతే దుఃఖం మయా ఘోరం సుదారుణమ్। 18

నేను పూర్వజన్మలో ఎట్టిపాపమును చేసికొని యుంటినో ఏమో? ఇప్పుడు నాకు భయంకరమైన, మిక్కిలి దారుణమైన ఇట్టి దుఃఖము దాపురించినది. (18)

జీవితం త్యక్తుమిచ్ఛామి శోకేన మహతా వృతా।
రాక్షసీభిశ్చ రక్ష్యంత్యా రామో నాసాద్యతే మయా। 19

రాక్షసస్త్రీల అధీనములోనున్న నేను రాముని చేరజాలను. కనుక అంతులేనిశోకములో మునిగిన నేను జీవితమును చాలించుటయే యుక్తము. (19)

ధిగస్తు ఖలు మానుష్యం ధిగస్తు పరవశ్యతామ్।
న శక్యం యత్పరిత్యక్తుమ్ ఆత్మచ్ఛందేన జీవితమ్। 20

నాజీవితము నాపతియైనశ్రీరాముని అధీనములోనిది. కనుక నాఇష్టానుసారము దీనినిత్యజించుటకు నాకు అధికారములేదు. మనుష్యత్వము పుణ్యపాపవిచక్షణ చేయునట్టి వివేకముగలది. అందువలన ఈ జీవితమును త్యజించుటకు నాకు అవకాశములేదు.[1] (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే పంచవింశస్సర్గః (25)

వాల్మీకి మహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదియైదవసర్గము.

— * * * —

26. ఇరువదిఆఱవసర్గము

సీత దైన్యముతో విలపించుట-ప్రాణములను విడుచుటకు నిశ్చయించు కొనుట.

ప్రసక్తాశ్రుముఖీత్యేవం బ్రువంతీ జనకాత్మజా।
అధోముఖముఖీ బాలా విలప్తుముపచక్రమే। 1

ఉన్మత్తేవ ప్రమత్తేవ భ్రాంతచిత్తేవ శోచతీ।
ఉపావృత్తా కిశోరీవ వివేష్టంతీ మహీతలే। 2

సరళస్వభావయైన జానకి ఇట్లు పలుకుచు అధోముఖియై నిరంతరము కన్నీరుగార్చుచు విలపింపసాగెను. ఉన్మత్తురాలివలె, మత్తెక్కినదానివలె, చిత్తభ్రమకు లోనైనదానివలె శోకించుచు, ఆడుగుఱ్ఱపు పిల్లవలె నేలపైబడి దొర్లసాగెను- (1-2)

రాఘవస్య ప్రమత్తస్య రక్షసా కామరూపిణా।
రావణేన ప్రమథ్యాహమ్ ఆనీతా క్రోశతీ బలాత్। 3

అయ్యో! శ్రీరాముడు బంగారులేడికొఱకై వెళ్లినప్పుడు, కామరూపియైన రాక్షసుడగు రావణుడు బలవంతముగా అపహరించి, ఏడ్చుచున్న నన్ను తీసికొనివచ్చెను. (3)

రాక్షసీవశమాపన్నా భర్త్స్యమానా సుదారుణమ్।
చింతయంతీ సుదుఃఖార్తా నాహం జీవితుముత్సహే। 4

రాక్షసస్త్రీలు నన్ను తమఅదుపులోనుంచుకొని, మిక్కిలి దారుణముగా బెదరించుచున్నారు. దుఃఖములలో మునిగియున్న నాకు చింతావ్యాకులమైన ఈ జీవితముపై ఏమాత్రము ఆశలేదు. (4)

న హి మే జీవితేనార్థో నైవార్థైర్న చ భూషణైః।
వసంత్యా రాక్షసీమధ్యే వినా రామం మహారథమ్। 5

మహాయోధుడైన నా ప్రాణనాథునకు దూరముగా ఈ రాకాసిమూకలమధ్య చిక్కుపడియున్న నాకు సంపదలెందుకు? భూషణములెందుకు? కడకు ఈ స్థితిలో నేను జీవించుట ఎందులకు? (5)

అశ్మసారమిదం నూనమ్ అథవాప్యజరామరమ్।
హృదయం మమ యేనేదం న దుఃఖేనావశీర్యతే। 6

నాగుండె నిజముగా ఒకఇనుపముద్ద. దీనికి జరామరణములులేవు. అట్లుగానిచో ఇంతటి దుఃఖమునకు గుఱియైగూడ ఇదియేల బ్రద్దలుగాకున్నది? (6)

ధిక్! మామనార్యామసతీం యాహం తేన వినాకృతా।
ముహూర్తమపి రక్షామి జీవితం పాపజీవితా। 7

శ్రీరామునకు దూరమైన ఈ జీవితము నిజముగా నికృష్టమైనది. దానిని క్షణమైనను కొనసాగించుట యుక్తముగాదు. ఐనను దీనిని రక్షించుకొనుచున్నాననగా ఛీ! నేను ఎంతటి అనార్యను? దుష్టురాలను? (7)

1) ఈ మానవజన్మనుఇచ్చినవాడు భగవంతుడు. కనుక ఇది భగవదధీనమైనది- అనగా పరాధీనమైనది. (పరుడు=సర్వశ్రేష్ఠుడు, పరాధీనము= భగవంతునిఆధీనమైనది) కావున దీనినిత్యజించు అధికారము మానవులకు ఎవ్వరికినిలేదు. అందువలన ఎవ్వరును ఆత్మహత్యకుపాల్పడరాదు. అట్లుచేయుట మహాపాపము. భగవదపచారము.

కా చ మే జీవితే శ్రద్ధా సుఖే వా తం ప్రియం వినా।
భర్తారం సాగరాంతాయా వసుధాయాః ప్రియంవదమ్। 8

సముద్రములే ఎల్లలుగాగల ఈ వసుధకు ప్రభువు నాభర్త, అతడు ప్రియభాషి. అట్టి ప్రాణప్రియునకు దూరమైననాకు సుఖములపైగాని జీవితముపైగాని ఆసక్తి ఎందులకు? (8)

ఛిద్యతాం భక్ష్యతాం వాపి శరీరం విసృజామ్యహమ్।
న చాప్యహం చిరం దుఃఖం సహేయం ప్రియవర్జితా। 9

ఈ రాక్షసస్త్రీలు నాశరీరమును ముక్కలుముక్కలు గావించినను, తినివేసినను నాకు సమ్మతమే, దీనిని త్యజించుటకు నేను సిద్ధముగాఉన్నాను. ప్రియునకు దూరముగా అంతులేని ఈ దుఃఖములను ఇంక ఎంత మాత్రమూ సహింపజాలను. (9)

చరణేనాపి సవ్యేన న స్పృశేయం నిశాచరమ్।
రావణం కిం పునరహం కామయేయం విగర్హితమ్। 10

నికృష్టుడైన ఆ నిశాచరుని నేను ఎడమకాలితోనైనను తాకను. ఇంక ఆ రావణుని కోరుకొనుటగూడనా? (10)

ప్రత్యాఖ్యాతం న జానాతి నాత్మానం నాత్మనః కులమ్।
యో నృశంసస్వభావేన మాం ప్రార్థయితుమిచ్ఛతి। 11

ఛిన్నా భిన్నా విభక్తా వా దీప్తే వాగ్నౌ ప్రదీపితా।
రావణం నోపతిష్ఠేయం కిం ప్రలాపేన వశ్చిరమ్। 12

కపటస్వభావముతో నాకొఱకై ప్రాధేయపడుచున్న ఆ రావణుడు తానేమిటో? తన వంశమెట్టిదోగూడ ఎఱుగకున్నాడు, నేను వానిని తిరస్కరించుచున్నాననియు తెలియలేకున్నాడు. ఓ రక్కసులారా! మీరు నన్ను నిలువునాచీల్చినను, కొట్టిచంపినను, ఏకీలుకాకీలు వేఱుగావించినను, మంటలలో కాల్చివేసినను, నేనుమాత్రము ఆరావణుని దరిజేరను, మీరు ఇట్లు అహర్నిశలు ప్రేలుచుండుట వ్యర్థము. (11-12)

ఖ్యాతః ప్రాజ్ఞః కృతజ్ఞశ్చ సానుక్రోశశ్చ రాఘవః।
సద్వృత్తో నిరనుక్రోశః శంకే మద్భాగ్యసంక్షయాత్। 13

శ్రీరాముడు శత్రువులచేతను ప్రశంసింపబడువాడు, ఇతరుల దోషములనుగూడ గుణములుగా భావించువాడు, ఆశ్రితులొనర్చిన స్వల్పకార్యమునైనను గొప్పగా తలంచువాడు, తనను నమ్ముకొనినవారికి చిన్నకష్టము కలిగినను దానిని తొలగించుటకే ఆరాటపడుచుండువాడు, అనుక్షణము తన భక్తుల యోగక్షేమములను వహించు చుండువాడు. ఐనను నాపై జాలిచూపుటలేదు. ఇది నా దురదృష్టము. (13)

రాక్షసానాం సహస్రాణి జనస్థానే చతుర్దశ।
యేనైకేన నిరస్తాని స మాం కిం నాభిపద్యతే। 14

రాముడు తానొక్కడే దండకారణ్యమునందు పదునాలుగు వేలమంది రాక్షసులను తుదముట్టించెను. అట్టి మహానుభావుడు నన్ను ఎందుకు ఆదుకొనుటలేదు? (14)

నిరుద్ధా రావణేనాహమ్ అల్పవీర్యేణ రక్షసా।
సమర్థః ఖలు మే భర్తా రావణం హంతుమాహవే। 15

అల్పవీరుడైన రాక్షసుడగు రావణునిచే నేను బంధింపబడితిని. రణరంగమున ఈ తుచ్ఛరావణుని హతమార్చుటకు నా భర్త ఎంతయు సమర్థుడుగదా!(15)

విరాధో దండకారణ్యే యేన రాక్షసపుంగవః।
రణే రామేణ నిహతః స మాం కిం నాభిపద్యతే। 16

శ్రీరాముడు దండకారణ్యమున 'విరాధు'డను ప్రముఖ రాక్షసుని యుద్ధమున రూపుమాపెను. అట్టి మహావీరుడు నన్నేల రక్షింపరాడు? (16)

కామం మధ్యే సముద్రస్య లంకేయం దుష్ప్రధర్షణా।
న తు రాఘవబాణానాం గతిరోధీహ విద్యతే। 17

అపారమైన సముద్రమధ్యమునగల ఈ లంకలో ప్రవేశించుట ఎట్టివారికిని అసాధ్యము. అది నిజమే కావచ్చును, ఐనను రాఘవునిబాణములగమనమును ఆపుటకు ఎవ్వరికిని శక్యముకాదుగదా! (17)

కిన్ను తత్కారణం యేన రామో దృఢపరాక్రమః ।
రక్షసాపహృతాం భార్యామ్ ఇష్టాం నాభ్యవపద్యతే । 18

ఇహస్థాం మాం న జానీతే శంకే లక్ష్మణపూర్వజః ।
జానన్నపి హి తేజస్వీ ధర్షణం మర్షయిష్యతి । 19

హృతేతి యోఽధిగత్వా మాం రాఘవాయ నివేదయేత్ ।
గృధ్రరాజోఽపి స రణే రావణేన నిపాతితః । 20

కృతం కర్మమహత్ తేన మాం తథాఽభ్యవపద్యతా ।
తిష్ఠతా రావణద్వంద్వే వృద్ధేనాపి జటాయుషా । 21

యది మామిహ జానీయాత్ వర్తమానాం స రాఘవః ।
అద్య బాణైరభిక్రుద్ధః కుర్యాల్లోకమరాక్షసమ్ । 22

విధమేచ్చ పురీం లంకాం శోషయేచ్చ మహోదధిమ్ ।
రావణస్య చ నీచస్య కీర్తిం నామ చ నాశయేత్ । 23

తతో నిహతనాథానాం రాక్షసీనాం గృహే గృహే ।
యథాహమేవం రుదతీ తథా భూయో న సంశయః । 24

అన్విష్య రక్షసాం లంకాం కుర్యాద్రామస్సలక్ష్మణః ।
న హి తాభ్యాం రిపుర్దృష్టో ముహూర్తమపి జీవతి । 25

చితాధూమాకులపథా గృధ్రమండలసంకులా ।
అచిరేణ తు లంకేయం శ్మశానసదృశీ భవేత్ । 26

అచిరేణైవ కాలేన ప్రాప్స్యామ్యేవ మనోరథమ్ ।
దుష్ప్రస్థానోఽయమాఖ్యాతి సర్వేషాం వో విపర్యయమ్ । 27

యాదృశానీహ దృశ్యంతే లంకాయామశుభాని వై ।
అచిరేణ తు కాలేన భవిష్యతి హతప్రభా । 28

నూనం లంకా హతే పాపే రావణే రాక్షసాధమే ।
శోషం యాస్యతి దుర్ధర్షా ప్రమదా విధవా యథా । 29

తిరుగులేని పరాక్రమశాలియైన శ్రీరామునకు నేను భార్యను, ప్రాణప్రియను. అట్టి నన్ను రాక్షసుడు అపహరింపగా రక్షింపరాకుండుటకుగల కారణమేమో? (18)

నేను ఇచ్చట ఉన్నవిషయము లక్ష్మణాగ్రజునకు (రామునకు) తెలియదేమో? అనితలంతును. తెలిసియున్నచో ఈ అవమానమును తేజోమూర్తియైన ఆ స్వామి సహించునా? (ఎట్టిపరిస్థితిలోను సహింపడు) (19)

శ్రీరామునికడకువెళ్లి 'సీతాదేవి రావణునిచే అపహరింపబడినది' అను వార్తను తెలుపుటకు అవకాశమున్నవాడు గృధ్రరాజైన జటాయువుమాత్రమే. కాని అతడు కూడ రావణునిచే యుద్ధమున నిహతుడయ్యెను. (20)

జటాయువు వృద్ధుడైనను నన్ను రక్షించుటకై ద్వంద్వయుద్ధమున రావణుని ఎదుర్కొనెను. అతడు చేసినది ఒక మహత్కార్యము, అది శ్లాఘనీయము. (21)

నేనిలంకలో ఉన్నవిషయమును శ్రీరాముడు ఎఱిగియే యున్నచో ఆ ప్రభువు మిక్కిలిక్రుద్ధుడై తనబాణములచే ఈ లోకమున ఒక్కరాక్షసుడుగూడ మిగిలియుండకుండ చేయును. అంతేగాదు ఈ లంకను ఊదివేయును, ఈ మహాసముద్రమును ఇంకింపజేయును, ఈ నీచరావణుని నామరూపములు సైతము లేకుండా చేయును. (22-23)

ఇప్పుడు నేను ఏడ్చుచున్నట్లే త్వరలో లంకలో ప్రతిగృహమునందును అనాథలైన రాక్షసస్త్రీలు కుమిలి కుమిలి ఏడ్చుటతథ్యము. ఇందుకు సందేహము లేదు. (24)

రామలక్ష్మణులిరువురు (ఇచటికివచ్చి) రాక్షసుల లంకను గాలించి, శత్రువులను వధింతురు. వారి కంటబడిన శత్రువు ఎవ్వడైనను క్షణకాలముగూడ ప్రాణములతో మిగులడు. (25)

త్వరలో ఈ లంకలోని వీధులయందంతటను చితుల (మంటల) పొగలు క్రమ్ముకొనును. గ్రద్దలు గుంపులు గుంపులుగా తిరుగాడును. ఇది (లంక) వల్లకాడుగా మారును- కొలదికాలములోనే నామనోరథము ఈడేరిపోవును. మీ ఈ దుర్మార్గధోరణి మీ అందరికిని కలుగబోవు కీడును సూచించుచున్నది. ఈలంకలో కనబడుచున్న అపశకునములనుబట్టి ధగధగలాడుచున్న ఈ లంక త్వరలోనే పాడుబడిపోవుట తథ్యమనిపించుచున్నది. మహాపాపియు, రాక్షసాధముడునైన రావణుడు మరణించిన వెంటనే ఇప్పటివఱకు దుర్భేద్యముగానున్న లంక, భర్తనుకోల్పోయిన స్త్రీవలె కళాహీనయగును. ఇది తథ్యము. (26-29)

పుణ్యోత్సవసముత్సా చ నష్టభర్త్రీ సరాక్షసీ।
భవిష్యతి పురీ లంకా నష్టభర్త్రీ యథాఽంగనా। 30

నూనం రాక్షసకన్యానాం రుదంతీనాం గృహే గృహే।
శ్రోష్యామి నచిరాదేవ దుఃఖార్తానామిహ ధ్వనిమ్। 31

సాంధకారా హతద్యోతా హతరాక్షసపుంగవా।
భవిష్యతి పురీ లంకా నిర్దగ్ధా రామసాయకైః। 32

యది నామ స శూరో మాం రామో రక్తాంతలోచనః।
జానీయాద్వర్తమానాం హి రావణస్య నివేశనే। 33

అనేన తు నృశంసేన రావణేనాధమేన మే।
సమయో యస్తు నిర్దిష్టః తస్య కాలోఽయమాగతః। 34

స చ మే విహితో మృత్యుః అస్మిన్ దుష్టేన వర్తతే।
అకార్యం యే న జానంతి నైరృతాః పాపకారిణః। 35

అధర్మాత్తు మహోత్పాతో భవిష్యతి హి సాంప్రతమ్।
నైతే ధర్మం విజానంతి రాక్షసాః పిశితాశనాః। 36

ధ్రువం మాం ప్రాతరాశార్థే రాక్షసః కల్పయిష్యతి।
సాఽహం కథం కరిష్యామి తం వినా ప్రియదర్శనమ్।
రామం రక్తాంతనయనమ్ అపశ్యంతీ సుదుఃఖితా। 37

యది కశ్చిత్ ప్రదాతా మే విషస్యాద్య భవేదిహ।
క్షిప్రం వైవస్వతం దేవం పశ్యేయం పతినా వినా। 38

నాఽజానాజ్జీవతీం రామః స మాం లక్ష్మణపూర్వజః।
జానంతౌ తౌ న కుర్యాతాం నోర్వ్యాం హి మమ మార్గణమ్। 39

నూనం మమైవ శోకేన స వీరో లక్ష్మణాగ్రజః।
దేవలోకమితో యాతః త్యక్త్వా దేహం మహీతలే। 40

ధన్యా దేవాస్సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః।
మమ పశ్యంతి యే నాథం రామం రాజీవలోచనమ్। 41

అథవా నహి తస్యార్థో ధర్మకామస్య ధీమతః।
మయా రామస్య రాజర్షేః భార్యయా పరమాత్మనః। 42

ఇటువంటి రాక్షసులతోగూడ ప్రభువైన రావణుడు మృతిచెందగా ఈ లంకలో రాక్షసస్త్రీలు మాత్రమే మిగులుదురు. అప్పుడు లంక వైధవ్యమును పొందిన స్త్రీవలె శుభకార్యములకు నోచుకొనదు. (30)

త్వరలోనే ఈ లంకలో ఇంటింటను దుఃఖార్తలైన రాక్షసకన్యల రోదనధ్వనులను వినగలను. (31)

కోపముచే ఎఱ్ఱబాఱిన కనులుగలవాడును, శూరుడును ఐన శ్రీరామునకు నేను ఈ రావణునిలంకలో ఉన్నవిషయము తెలిసినచో ఈ లంకలోని రాక్షసవీరులందఱును ఆ రాముని బాణములచే హతులగుదురు, లంకానగరము పూర్తిగా దగ్ధమైపోవును, ఇందంతటను చిమ్మచీకట్లు క్రమ్ముకొనును. ఇందు నామమాత్రముగా నైనను వెలుగులుండవు.(32-33)

క్రూరుడును, అధముడునైన ఈ రావణుడు నాకు నిర్దేశించిన మృత్యుకాలము అతనికే ఆసన్నమైనది. ఆ దుష్టుడు నాకు విధించిన మృత్యువు అతనికే వర్తించును. పాపకర్ములైన రాక్షసులు చేయగూడనివానిని ఎఱుగరు- పచ్చిమాంసములను తినువారైన ఈ రక్కసులు ధర్మమును ఎఱుగరు. వీరు చేయు అధర్మకార్యములవలన మహోపద్రవము అతిశీఘ్రముగా జరుగబోవుచున్నది. (34-36)

ఆ రాక్షసుడు ప్రాతఃకాలభోజనమునకై నన్ను వండించి తీరును. ప్రియదర్శనుడైన నా రాముడు చెంతలేనప్పుడు నేనేమి చేయగలను? అందమైనకనులుగలశ్రీరాముని దర్శనభాగ్యము లేనందున దుఃఖార్తనై పతియెడబాటునకు లోనైతిని. నాకు ఇప్పుడు ఎవరైనను విషమునిచ్చెడి ఒక మహాదాత లభించిన బాగుండును. అప్పుడు వెంటనే నేను యముని దర్శించి యుండెడిదానను. (37-38)

లక్ష్మణాగ్రజుడైన శ్రీరామునకు నేనింకను జీవించియున్నట్లు బహుశ తెలిసియుండదు. వారికి తెలిసియేయున్నచో ఈ పృథివియందు నాకొఱకై వెదకకుండ ఉండరుగదా! తప్పక వెదకియే తీరుదురు. (39)

లక్ష్మణుని అన్నయైన వీరుడగు ఆ రాముడు నా విరహ బాధతోనే తనతనువును ఈ భూలోకమునందే వీడి, దేవలోకమునకు తప్పక చేరియుండవచ్చును. (40)

(ఇప్పుడు) దేవలోకముననున్న దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు మున్నగు వారందఱును రాజీవలోచనుడైన నా రామచంద్రప్రభువును దర్శించి, ధన్యులయ్యెదరు. (41)

ఆ రామచంద్రప్రభువు ధర్మైకదృష్టిగలవాడు, జ్ఞాననిధి, అంతేగాదు అతడు రాజర్షి, వస్తుతః పరమాత్ముడు. అట్టి మహానుభావునకు భార్యనైననాతో పనియేమి? (42)

దృశ్యమానే భవేత్ ప్రీతిః సౌహృదం నాస్త్యపశ్యతః।
నాశయంతి కృతఘ్నాస్తు న రామో నాశయిష్యతి। 43

సాధారణముగా లోకములో జనులకు ఎదుటనున్న వారియెడనే ప్రేమ, సౌహార్దము నిలిచి యుండును. కనబడని వారిపై ప్రేమ సన్నగిల్లును. ఇది కృతఘ్నుల లక్షణము, కాని శ్రీరాముడు కృతజ్ఞుడు, కనుక ఆ స్వామి నన్ను మఱచుట కల్ల. (43)

కిం ను మే న గుణాః కేచిత్ కిం వా భాగ్యక్షయో మమ।
యాఽహం సీదామి రామేణ హీనా ముఖ్యేన భామినీ। 44

జగన్నాథుడైన శ్రీరామునకు పత్నినైయుండియు నేను ఈ దురవస్థలపాలగుటకు కారణమేమి? నాలో సద్గుణములు ఏమియునులేవా? లేక నా అదృష్టమే అడుగంటినదా? (44)

శ్రేయో మే జీవితాన్మర్తుం విహీనాయా మహాత్మనః।
రామాదక్లిష్టచారిత్రాత్ శూరాచ్ఛత్రునిబర్హణాత్। 45

శ్రీరాముడు ఉదాత్తచరిత్రుడు. శత్రువులను నిర్మూలించుటలో ఏకైకవీరుడు, అతడు మహాత్ముడు, అట్టినాప్రభువునకు దూరముగానుండి జీవించియుండుట కంటెను ఈ తనువును త్యజించుటయే మేలు. (45)

అథవా న్యస్తశస్త్రౌ తౌ వనే మూలఫలాశినౌ।
భ్రాతరౌ హి నరశ్రేష్ఠౌ సంవృత్తౌ వనగోచరౌ। 46

అథవా మహాపురుషులైన ఆ సోదరులిద్దరును అస్త్రశస్త్రములను ప్రక్కనబెట్టి, వనములయందు కందమూలములను భక్షించుచు మునివృత్తి నవలంబించి యున్నారాయేమి? (46)

అథవా రాక్షసేంద్రేణ రావణేన దురాత్మనా।
ఛద్మనా ఘాతితౌ శూరౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ। 47

శూరులును, సోదరులును ఐన ఆ రామలక్ష్మణులను దుర్మార్గుడైన రాక్షసరాజగు రావణుడు కపటోపాయముచే చంపించెనాయేమి? ("అతిప్రేమః పాపశంకీ"- అనిగదా)(47)

సాఽహమేవం గతే కాలే మర్తుమిచ్ఛామి సర్వథా।
న చ మే విహితో మృత్యుః అస్మిన్ దుఃఖేఽపి వర్తతే। 48

ఇట్టి కష్టకాలమున ఏ విధముగ ఆలోచించినను నాకు మరణమే శరణ్యమని తోచుచున్నది. కాని ఇట్టి దుఃఖములలోగూడ నాకు మృత్యువు రాకున్నది. (48)

ధన్యాః ఖలు మహాత్మానో మునయస్త్యక్తకిల్బిషాః।
జితాత్మానో మహాభాగా యేషాం న స్తః ప్రియాప్రియే। 49

మునీశ్వరులు పుణ్యపురుషులు. వారు జితేంద్రియులు, మహానుభావులు, అట్టి మహాత్ములు యథార్థముగా ధన్యులు. వారికి "ఇది ప్రియము, ఇది అప్రియము" అను ధ్యాసయే యుండదు. (49)

ప్రియాన్న సంభవేద్దుఃఖమ్ అప్రియాదధికం భయమ్।
తాభ్యాం హి యే వియుజ్యంతే నమస్తేషాం మహాత్మనామ్। 50

ప్రియము ప్రాప్తించినప్పుడు దుఃఖము కలుగదు. అనగా సుఖమేకలుగును. అప్రియము ఎదురైనప్పుడు మిక్కిలి భయము కలుగును. ఇది సామాన్యుల లక్షణము- ఈద్వంద్వములకు అతీతులైనవారు మహాత్ములు. అట్టి వారికి నా నమస్కారము.[1] (50)

సాహం త్యక్తా ప్రియార్హేణ రామేణ విదితాత్మనా।
ప్రాణాం స్త్యక్ష్యామి పాపస్య రావణస్య గతా వశమ్। 51

ఆత్మజ్ఞానియు, నా ప్రేమస్వరూపుడును ఐన శ్రీరామునకు దూరమైతిని. పాపియైన రావణునివశములో ఉంటిని. ఇట్టిపరిస్థితిలో నేను అసువులను వీడెదను. (51)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే షడ్వింశస్సర్గః (26)

వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదిఆఱవసర్గము.

-- * * * --

1) శ్లో॥ న ప్రహృష్యేత్ ప్రియం ప్రాప్య, నోద్విజేత్ ప్రాప్య చాప్రియమ్ । స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణిస్థితః ॥ భగవద్గీత 5/20
ప్రియలాభములకు పొంగిపోనివాడును, అప్రియములు ఎదురైనప్పుడు క్రుంగిపోనివాడును, స్థిరమైన బుద్ధిగలవాడును, మోహవివశుడు కానివాడును, ఐన బ్రహ్మవేత్త పరమాత్మయందు ఏకీభావస్థితుడైయుండును.

27. ఇరువదిఏడవసర్గము

త్రిజటాస్వప్న వృత్తాంతము

ఇత్యుక్తా స్సీతయా ఘోరా రాక్షస్యః క్రోధమూర్ఛితాః।
కాశ్చిజ్జగ్ముస్తదాఖ్యాతుం రావణస్య తరస్వినః। 1

తతస్సీతాముపాగమ్య రాక్షస్యో ఘోరదర్శనాః।
పునః పరుషమేకార్థమ్ అనర్థార్థమథాబ్రువన్। 2

అద్యేదానీం తవానార్యే సీతే పాపవినిశ్చయే।
రాక్షస్యో భక్షయిష్యంతి మాంసమేతద్యథాసుఖమ్। 3

సీతాం తాభిరనార్యాభిః దృష్ట్వా సంతర్జితాం తదా।
రాక్షసీ త్రిజటా వృద్ధా శయానా వాక్యమబ్రవీత్। 4

ఆత్మానం ఖాదతానార్యా న సీతాం భక్షయిష్యథ।
జనకస్య సుతామిష్టాం స్నుషాం దశరథస్య చ। 5

స్వప్నో హ్యద్య మయా దృష్టో దారుణో రోమహర్షణః।
రాక్షసానామభావాయ భర్తురస్యా జయాయ చ। 6

ఏవముక్తాస్త్రిజటయా రాక్షస్యః క్రోధమూర్ఛితాః।
సర్వా ఏవాబ్రువన్ భీతాః త్రిజటాం తామిదం వచః। 7

కథయస్వ త్వయా దృష్టః స్వప్నోఽయం కీదృశో నిశి।
తాసాం శ్రుత్వా తు వచనం రాక్షసీనాం ముఖాచ్చ్యుతమ్। 8

ఉవాచ వచనం కాలే త్రిజటా స్వప్నసంశ్రితమ్।
గజదంతమయాం దివ్యాం శిబికామంతరిక్షగామ్। 9

యుక్తాం హంససహస్రేణ స్వయమాస్థాయ రాఘవః।
శుక్లమాల్యాంబరధరో లక్ష్మణేన సహాగతః। 10

స్వప్నే చాద్య మయా దృష్టా సీతా శుక్లాంబరావృతా।
సాగరేణ పరిక్షిప్తం శ్వేతం పర్వతమాస్థితా।
రామేణ సంగతా సీతా భాస్కరేణ ప్రభా యథా। 11

సీతాదేవిపలికిన (ప్రాణత్యాగమునకు సంబంధించిన) మాటలనువిని, భీకరరాక్షసస్త్రీలు కోపముతో ఉడికిపోయిరి. వారిలో కొందఱు బలశాలియైన రావణునకు ఈ సంగతులను నివేదించుటకై వెళ్లిరి. (1)

అనంతరము భయంకరాకారలైనరాక్షసస్త్రీలు సీతాదేవిని సమీపించి, రావణానుకూలముగా అనర్థకరములైన మాటలనే పరుషముగా మఱల నుడువసాగిరి. (2)

దుర్మార్గురాలవైన ఓ సీతా! నీ నిర్ణయము (రావణుని తిరస్కరించుట) అనుచితమైనది. రాక్షసస్త్రీలము అందరము కలిసి, నేడే, ఇప్పుడే నీ శరీరమాంసమును తృప్తిగా భక్షింపగలము. (3)

అప్పుడు క్రూరలైన రాక్షసస్త్రీలు ఈ విధముగా సీతాదేవిని భయపెట్టుటచూచి, ఇంతవఱకు నిదురించియున్న జ్ఞానవృద్ధురాలు, విభీషణుని కూతురు ఐన 'త్రిజట' యనురాక్షసి మేల్కొని, ఇట్లునచించెను. (4)

"ఓ దుష్టస్త్రీలారా! మిమ్ములనుమీరే తినివేయుడు. ఈమె జనకునిగారాలబిడ్డ, దశరథునికోడలు. మీరు సీతను భక్షింపజాలరు. (5)

నాకొక కల వచ్చినది. అది మిక్కిలిభయంకరమైనది, గగుర్పాటును కలిగించునది. రాక్షసులందఱివినాశమును... సీతాపతియగు శ్రీరామునిజయమును సూచించునది. (6)

కోపోద్రేకములోనున్న ఆ రాక్షసస్త్రీలు త్రిజటమాటలకు మిక్కిలి భీతిల్లిరి. పిమ్మట వారందఱును ఆమెతో ఇట్లనిరి. (7)

"ఓ త్రిజటా! ఈ రాత్రి నీకువచ్చిన 'కల'యెట్టిదో వివరింపుము." ఆ రాక్షసస్త్రీల మాటలనువిని, త్రిజట ఆ ఉషఃకాలమున తనకువచ్చిన స్వప్నవిశేషములనుగూర్చి ఇట్లు వివరింపసాగెను. "ఏనుగుదంతములతో నిర్మింపబడి, వేయిహంసలనుపూన్చిన ఒక దివ్యమైనపల్లకి ఆకాశమున ఇటు వచ్చుచుండుట నేను కలలో చూచితిని. అందు లక్ష్మణునితో గూడిన శ్రీరాముడు శ్వేత మాల్యాంబరధారియై, ఆసీనుడై యుండెను. (8-10)

నేను స్వప్నమున సీతనుగూడ చూచితిని. ఆమె సముద్ర మధ్యమునగల ఒకతెల్లనిపర్వతముపై ఆసీనురాలై యుండెను. ఆమెయు శుభ్రవస్త్రములను ధరించి యుండెను. సూర్యునికిని సూర్యకాంతికిని భేదము లేనట్లు శ్రీరామునకును సీతాదేవికినిగల సాంగత్యము విడదీయరానిది (11)

రాఘవశ్చ మయా దృష్టః చతుర్దంతం మహాగజమ్। 12
ఆరూఢః శైలసంకాశం చచార సహలక్ష్మణః।
తతస్తౌ నరశార్దూలౌ దీప్యమానౌ స్వతేజసా। 13
శుక్లమాల్యాంబరధరౌ జానకీం పర్యుపస్థితౌ।
తతస్తస్య నగస్యాగ్రే హ్యాకాశస్థస్య దంతినః। 14
భర్త్రా పరిగృహీతస్య జానకీ స్కంధమాశ్రితా।
భర్తురంకాత్ సముత్పత్య తతః కమలలోచనా। 15
చంద్రసూర్యౌ మయా దృష్టా పాణినా పరిమార్జతీ।
తతస్తాభ్యాం కుమారాభ్యామ్ ఆస్థితస్స గజోత్తమః।
సీతయా చ విశాలాక్ష్యా లంకాయా ఉపరి స్థితః। 16
పాండురర్షభయుక్తేన రథేనాష్టయుజా స్వయమ్।
ఇహోపయాతః కాకుత్స్థః సీతయా సహ భార్యయా। 17
శుక్లమాల్యాంబరధరో లక్ష్మణేన సహాగతః।
తతోఽన్యత్ర మయా దృష్టో రామస్సత్యపరాక్రమః। 18
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ వీర్యవాన్।
ఆరుహ్య పుష్పకం దివ్యం విమానం సూర్యసన్నిభమ్। 19
ఉత్తరాం దిశమాలోక్య జగామ పురుషోత్తమః।
ఏవం స్వప్నే మయా దృష్టో రామో విష్ణుపరాక్రమః।
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా సహ భార్యయా। 20
న హి రామో మహాతేజాః శక్యో జేతుం సురాసురైః।
రాక్షసైర్వాపి చాన్యైర్వా స్వర్గః పాపజనైరివ। 21
రావణశ్చ మయా దృష్టః క్షితౌ తైలసముక్షితః। 22
రక్తవాసాః పిబన్ మత్తః కరవీరకృతస్రజః।
విమానాత్ పుష్పకాదద్య రావణః పతితో భువి। 23
కృష్యమాణః స్త్రియా దృష్టో ముండః కృష్ణాంబరః పునః।
రథేన ఖరయుక్తేన రక్తమాల్యానులేపనః। 24
పిబంస్తైలం హసన్ నృత్యన్ భ్రాంతచిత్తాకులేంద్రియః।
గర్దభేన యయౌ శీఘ్రం దక్షిణాం దిశమాస్థితః। 25

తరువాత శ్రీరాముడు పర్వతసదృశమై నాలుగు దంతములుగల ఒకమహాగజముపై ఆరూఢుడై లక్ష్మణునితోగూడి వచ్చుచుండుట నేను తిలకించితిని. తమతేజస్సులతో వెలుగొందుచు తెల్లనిపూలమాలలను, వస్త్రములనుధరించియున్న ఆ నరశ్రేష్ఠులు జానకిని సమీపించిరి. ఆకాశమునందు శ్రీరామచంద్రుడు తాను అధిష్ఠించియున్న ఏనుగును స్థిరముగా నిలిపెను. పిమ్మట పర్వతాగ్రముపైనున్న జానకి ఆ ఏనుగుయొక్క మూపుపై ఎక్కి శ్రీరాముని ఒడిలోనికి చేరెను. రామచంద్రప్రభువు జానకిని చేరదీసెను. పిదప ఆ కమలలోచన తనపతి యొడినుండిలేచి, సూర్యచంద్రులను స్పృశించు చుండుటను నేనుజూచితిని.[1][2] అనంతరము ఆ రామలక్ష్మణులు, సీతయు అధిరోహించిన మదపుటేనుగు లంకపైభాగమున నిలిచెను. (12-16)

పిదప తెల్లని ఎనిమిదివృషభములను పూన్చిన రథముపై చేరిన రాముడు శుక్లమాల్యాంబరధరుడై, భార్యయైనసీతతో, లక్ష్మణునితోగూడి ఇచ్చటికి విచ్చేసెను. మఱియు సాటిలేని పరాక్రమశాలియు, మహావీరుడును, పురుషోత్తముడును ఐన శ్రీరాముడు పత్నియైనసీతతో, తమ్ముడైనలక్ష్మణునితో గూడి సూర్యకాంతులను విరజిమ్ముచున్న దివ్యమైన పుష్పకవిమానమును అధిరోహించి, ఉత్తరదిశకు వెళ్లెను. సీతాలక్ష్మణసమేతుడై విష్ణుపరాక్రముడైనశ్రీరాముని ఈ విధముగా స్వప్నములో నేనుదర్శించితిని. (17-20)

పాపులు స్వర్గమునుచేరజాలనట్లు, సురాసురులుగాని, రాక్షసులుగాని తదితరులుగాని మహాతేజశ్శాలియైన శ్రీరాముని జయింప సమర్థులు గారు. (21)

నూనెపూయబడిన దేహముతో నేలపైబడియున్న రావణునిగూడ నేనుచూచితిని. ఆ రావణుడు ఎఱ్ఱనివస్త్రములను ధరించియుండెను. త్రాగుచు మత్తిల్లియుండెను. గన్నేరుదండలను దాల్చి యుండెను,[3] పుష్పకవిమానమునుండి యతడు ఇప్పుడే నేలపై పడిపోయెను. అతడు శిరోముండనము గావించుకొని, నల్లని వస్త్రములను ధరించినవాడై, ఒకస్త్రీచే లాగబడు చుండెను. ఎఱ్ఱనిమాలలను, మైపూతలనుగలిగి, గాడిదలనుకట్టిన రథముపై చేరియుండెను. అతడు కలతచెందినమనస్సుతో, పిచ్చివానివలె (చాంచల్యముతో) నూనెను త్రాగుచు, నవ్వుచు, నృత్యము చేయుచు

1. *ఆదిత్యమండలం వాతు చంద్రమండలమేవ వా। స్వప్నే గృహ్ణాతి హస్తాభ్యాం రాజ్యం సంప్రాప్నుయాన్మహత్ ॥*
స్వప్నమున సూర్యమండలమును గాని, చంద్రమండలమునుగాని తనచేతులతో స్పృశించినవానికి మహారాజ్యము ప్రాప్తించును. -
2. *ఆరోహణం గోవృషకుంజరాణాం, ప్రాసాదశైలాగ్రవనస్పతీనామ్। - ధ్రువమర్థలాభమ్ - గజారోహణము, శైలాగ్రమునకుజేరుట*
- మున్నగువానివలన నిశ్చయముగా సంపదలు లభించును.- గోవిందరాజీయ వ్యాఖ్య.
3. *బలిపశువు మెడలో గన్నేరు దండలను అలంకరించుట ఆచారము.*

పునరేవ మయా దృష్టో రావణో రాక్షసేశ్వరః।
పతితోఽవాక్ఛిరా భూమౌ గర్దభాద్భయమోహితః। 26

సహసోత్థాయ సంభ్రాంతో భయార్తో మదవిహ్వలః।
ఉన్మత్త ఇవ దిగ్వాసా దుర్వాక్యం ప్రలపన్ బహు। 27

దుర్గంధం దుస్సహం ఘోరం తిమిరం నరకోపమమ్।
మలపంకం ప్రవిశ్యాశు మగ్నస్తత్ర స రావణః। 28

ప్రస్థితో దక్షిణామాశాం ప్రవిష్టో కర్దమం హ్రదమ్।
కంఠే బద్ధ్వా దశగ్రీవం ప్రమదా రక్తవాసినీ। 29

కాలీ కర్దమలిప్తాంగీ దిశం యామ్యాం ప్రకర్షతి।
ఏవం తత్ర మయా దృష్టః కుంభకర్ణో నిశాచరః। 30

రావణస్య సుతాస్సర్వే దృష్టాస్తైలసముత్క్షితాః।
వరాహేణ దశగ్రీవః శింశుమారేణ చేంద్రజిత్।
ఉష్ట్రేణ కుంభకర్ణశ్చ ప్రయాతో దక్షిణాం దిశమ్। 31

ఏకస్తత్ర మయా దృష్టః శ్వేతచ్ఛత్రో విభీషణః। 32

శుక్లమాల్యాంబరధరః శుక్లగంధానులేపనః।
శంఖదుందుభినిర్ఘోషైః నృత్తగీతైరలంకృతః। 33

ఆరుహ్య శైలసంకాశం మేఘస్తనితనిస్స్వనమ్।
చతుర్దంతం గజం దివ్యమ్ ఆస్తే తత్ర విభీషణః। 34

చతుర్భిస్సచివైస్సార్ధం వైహాయసముపస్థితః। 35

సమాజశ్చ మయా దృష్టో గీతవాదిత్రనిస్స్వనః।
పిబతాం రక్తమాల్యానాం రక్షసాం రక్తవాససామ్। 36

లంకా చేయం పురీ రమ్యా సవాజిరథకుంజరా।
సాగరే పతితా దృష్టా భగ్నగోపురతోరణా। 37

లంకా దృష్టా మయా స్వప్నే రావణేనాభిరక్షితా।
దగ్ధా రామస్య దూతేన వానరేణ తరస్వినా। 38

పీత్వా తైలం ప్రనృత్తాశ్చ ప్రహసంత్యో మహాస్వనాః।
లంకాయాం భస్మరూక్షాయాం ప్రవిష్టా రాక్షసస్త్రియః। 39

కుంభకర్ణాదయశ్చేమే సర్వే రాక్షసపుంగవాః।
రక్తం నివసనం గృహ్య ప్రవిష్టా గోమయహ్రదే। 40

గాడిదలరథముపై దక్షిణదిక్కునకు త్వరత్వరగా వెళ్లెను. పిమ్మట రాక్షసరాజైనరావణుడు భయవ్యాకులుడై, గాడిదపైనుండి తలక్రిందులుగా భూమిపై పడిపోవుచుండుటను చూచితిని. ఆ రావణుడు త్వరత్వరగా తొట్రుపడుచులేచి, భయపీడితుడై మత్తుచేస్సృహలేనివాడై, దిగంబరుడై, పిచ్చివానివలె నోటికివచ్చినట్లుగా పెక్కువిధములు ప్రేలుచుండెను. అతడు దుస్సహమై, దుర్గంధభూయిష్ఠమై, భయంకరమై అంధకారమయమైన నరకమువంటి మలకూపమునబడి వెంటనే అందు మునిగిపోయెను. (22-28)

అతడు దక్షిణదిశకు బయలుదేఱినవాడై బురదమడుగులో ప్రవేశించెను. ఒకనల్లనిస్త్రీ శరీరమంతయును బురదపూసికొని, ఎఱ్ఱనివస్త్రములను ధరించి, రావణునిమెడకు త్రాడుగట్టి, దక్షిణదిక్కునకు ఈడ్చుకొని పోవుచుండెను. కలలో నేనీ దృశ్యమును గాంచితిని. రాక్షసుడైన కుంభకర్ణునిగూడ నేను అట్లే చూచితిని. (29-30)

రావణునిసుతులందఱును నూనెలలోమునిగిన దేహములతో గనబడిరి. వరాహముపై రావణుడు, మొసలిమీద ఇంద్రజిత్తు ఒంటెపైకుంభకర్ణుడు దక్షిణదిశగా సాగిపోయిరి. (31)

వారిలో ఒక్క విభీషణుడు మాత్రము తెల్లనిగొడుగుతో కనబడెను. అతడు తెల్లనిమాలలను, వస్త్రములను ధరించి యుండెను. స్వచ్ఛమైనగంధముతో, మైపూతలతో ఒప్పుచుండెను. శంఖదుందుభిధ్వనులతో, నృత్త గీతములతో ఆనందించుచుండెను. ఆ విభీషణుడు శైల సదృశమై, మేఘగర్జనలవంటి ఘీంకారములు పలుపుచున్న నాలుగు దంతములుగల దివ్యగజమును ఆరోహించి, నలుగురు మంత్రులతోగూడి ఆకాశముననుండెను. (32-35)

గీతములనుపాడుచు, వాద్యత్రయమును ప్రయోగించుచున్న రాక్షససమూహమునుగూడ గాంచితిని. వారు మద్యములను సేవించుచుండిరి. ఎఱ్ఱని పూలదండలను, వస్త్రములను ధరించియుండిరి. (36)

రమ్యమైన ఈ లంకాపురియందలి గోపురములు, తోరణములు ఛిన్నాభిన్నములాయెను. హయ, రథ, గజ బలములతోగూడ అది సాగరమున పడిపోవుటను జూచితిని. (37)

ఇంతవఱకును రావణునిచే రక్షింపబడిన ఈ లంక రామునిదూతయైన మహాబలశాలియైన ఒక వానరప్రముఖునిచే దగ్ధమైపోవుచున్నట్లు స్వప్నమున గాంచితిని. (38)

రాక్షసస్త్రీలందఱును తైలములనుద్రాగుచు, హ్హాహ్హా అని వెకిలిగా నవ్వుచు, బిగ్గరగాఅరచుచుబుగ్గియై భయంకరముగా నున్న లంకలో గంతులువేయుచుండిరి. (39)

కుంభకర్ణుడు మొదలగు ఈ రాక్షసయోధులందఱును మాసినవస్త్రములను ధరించి, ఆవుపేడమడుగులో ప్రవేశించిరి." ఇంకను త్రిజట ఆ రాక్షసస్త్రీలతో ఇట్లు పలుకదొడగెను. (40)

అపగచ్ఛత నశ్యధ్వం సీతామాప స రాఘవః।
ఘాతయేత్ పరమామర్షీ సర్వైస్సార్ధం హి రాక్షసైః। 41

ప్రియాం బహుమతాం భార్యాం వనవాసమనువ్రతామ్।
భర్త్సితాం తర్జితాం వాపి నానుమంస్యతి రాఘవః। 42

"ఇక్కడినుండి దూరముగా కనబడకుండ తొలగి పొండు. శ్రీరాముడుసీతాదేవినిపొందితీరును. క్రుద్ధుడైన ఆ రాముడు రావణాదిరాక్షసులతోపాటు మిమ్ముగూడ హతమార్చివేయును. శ్రీరామునకు సీతాదేవి బహిః ప్రాణము. ఆమె వనవాసమున ఆపత్కాలమునందు ఆయనకుతోడుగా దీక్షను కొనసాగించుచున్న సాధ్వి. ప్రేమకు ప్రతిరూపమైన తనభార్యను ఎవరైనా తిట్టినను, భయపెట్టినను అతడు ఏ మాత్రము సహింపడు.(41-42)

తదలం క్రూరవాక్యైర్వః సాంత్వమేవాభిధీయతామ్।
అభియాచామ వైదేహీమ్ ఏతద్ధి మమ రోచతే। 43

మీ క్రూరవచనములను ఇక చాలింపుడు. ఆమెతో మృదువుగా మాట్లాడుడు. సీతాదేవిని శరణువేడుదము. ఇదియే నాకు యుక్తముగాతోచుచున్నది. (43)

యస్యామేవంవిధస్స్వప్నో దుఃఖితాయాం ప్రదృశ్యతే।
సా దుఃఖైర్వివిధైర్ముక్తా ప్రియం ప్రాప్నోత్యనుత్తమమ్। 44

ఏస్త్రీయైనను దుఃఖమునకు లోనైయుండగా ఈ విధమైన కలవచ్చినచో ఆమె దుఃఖములనుండి విముక్తురాలై సర్వోత్కృష్టుడైన తనప్రియుని పొందగలదు. (44)

భర్త్సితామపి యాచధ్వం రాక్షస్యః కిం వివక్షయా।
రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసానాముపస్థితమ్। 45

ఓ రాక్షసస్త్రీలారా! 'ఇంతవఱకును ఈమెను ఎంతగానో భయపెట్టుచు బాధించితిరి. ఇప్పుడు ఈమె మనలను క్షమించునా?', అనుశంకను మానుడు. ఇంక క్షమాపణకోరుచు ఈమెను బ్రతిమాలుకొనుడు. ఏలనన శ్రీరామునివలన రాక్షసులకు ఘోరమైన ఆపదవచ్చిపడినది. (45)

ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా।
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్। 46

ఓ రక్కసులారా! జనకసుతయైన ఈ సీతాదేవికి నమస్కరించినంత మాత్రముననే ఆమె ప్రసన్నురాలగును. ఈ గొప్పఆపదనుండి మనలను రక్షించుటకు దయామయురాలైన ఈమెయే సమర్థురాలు. (46)

అపి చాస్యా విశాలాక్ష్యా న కించిదుపలక్షయే।
విరూపమపి చాంగేషు సుసూక్ష్మమపి లక్షణమ్। 47

విశాలాక్షియైన ఈ సీతాదేవిఅవయవములయందు దుఃఖములనుసూచించు అవలక్షణములెవ్వియును ఏమాత్రమూ కనబడుటలేదు. (47)

ఛాయావైగుణ్యమాత్రం తు శంకే దుఃఖముపస్థితమ్।
అదుఃఖార్హామిమాం దేవీం వైహాయసముపస్థితామ్। 48

ఈమె శ్రీరాముని(తనభర్త)తోగూడి విమానమును అధిష్ఠించియున్నట్లు నేనుస్వప్నమునగాంచితిని. ఇది ఈమెకు శుభసూచకము. ఇట్టి శుభలక్షణములనుబట్టి ఈ సీతాదేవి దివ్యసుఖములకే అర్హురాలు. ఇప్పుడు కనబడుచున్న ఈ దుఃఖములు కేవలము ఛాయామాత్రములే. యథార్థములు ఏమాత్రమునుగావు. (ఇవి తాత్కాలికములే) ఈ మబ్బులు వీడగానే ఈమెకు రాజ్యలాభము తథ్యము. (48)

అర్థసిద్ధిం తు వైదేహ్యాః పశ్యామ్యహముపస్థితామ్।
రాక్షసేంద్రవినాశం చ విజయం రాఘవస్య చ। 49

నా స్వప్నమున విమానదర్శనము అగుటనుబట్టి ఆనిత్వరలో సీతాదేవికి మనోరథసిద్ధియు, రావణునికి వినాశనమూ, శ్రీరామునికి విజయమూ, తప్పక కల్గితీరునని నాకు తోచుచున్నది. (49)

నిమిత్తభూతమేతత్తు శ్రోతుమస్యా మహత్ప్రియమ్।
దృశ్యతే చ స్ఫురచ్చక్షుః పద్మపత్రమివాయతమ్। 50

పద్మపత్రమువలె విశాలమైన ఈమెఎడమకన్ను అదురుట ఒక శుభశకునము. దీనినిబట్టి త్వరలోనే 'ఈమె ఒక శుభవార్త వినబోవుచున్నదని ఇది సూచించుచున్నది. (50)

ఈషచ్చ హృషితో వాస్యా దక్షిణాయా హ్యదక్షిణః।
అకస్మాదేవ వైదేహ్యా బాహురేకః ప్రకంపతే। 51

మృదుస్వభావముగల ఈ సీతాదేవియొక్క ఎడమభుజము గగుర్పాటుతో స్వల్పముగా అదురుచున్నది. ఈమెకు ఇదియును ఒక శుభసూచకము. (51)

కరేణుహస్తప్రతిమః సవ్యశ్చోరురనుత్తమః।
వేపమానస్సూచయతి రాఘవం పురతః స్థితమ్। 52

ఏనుగుతొండమువంటి శ్రేష్ఠమైన ఈమెఎడమతొడ కంపించుచున్నది. దీనినిబట్టి శ్రీరాముడు ఈమె యెదుట నిలిచియున్నట్లే అని తెలియనగును. (52)

పక్షీ చ శాఖా నిలయం ప్రవిష్టః
పునః పునశ్చోత్తమ సాంత్వవాదీ।
సుస్వాగతాం వాచముదీరయానః
పునః పునశ్చోదయతీవ హృష్టః। 53

ఒకపక్షి చెట్టుకొమ్మపైనున్నగూటిలో ప్రవేశించి, మాటి మాటికి మధురముగా కూయుచున్నది. ఆ కూజితము "సీతా! నీవుభయపడకుము" శ్రీరాముడునీయెదుటనే యున్నాడు. ఆయనకు "సుస్వాగతం" అని స్వాగతవచనములను పలుకుము అని ఊరడించుచు సంతోషముతో సీతాదేవికి ఉత్సాహమును కలిగించుచున్నట్లున్నది." (53)

తతస్సా హ్రీమతీ బాలా భర్తుర్విజయహర్షితా।
అవోచద్యది తత్తథ్యం భవేయం శరణం హి వః। 54

పిమ్మట సీతాదేవి తనభర్తకు విజయము సిద్ధించునని ఎఱింగి, సంతసించి, స్త్రీకి సహజాలంకారమైన బిడియముతో ఇట్లనెను. త్రిజట చెప్పిన స్వప్నవిశేషములు నిజమైనచో మీ అందఱికిని శరణమును (అభయమును) ఒసగెదను.(54)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే సప్తవింశస్సర్గః *(27)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదియేడవసర్గము.

-- * * * --

28. ఇరువదియెనిమిదవసర్గము

సీత విలపించుచు ప్రాణపరిత్యాగమునకు సిద్ధపడుట

సా రాక్షసేంద్రస్య వచో నిశమ్య
తద్రావణస్యాప్రియమప్రియార్తా।
సీతా వితత్రాస యథా వనాంతే
సింహాభిపన్నా గజరాజకన్యా। 1

ఆ సీతాదేవి రాక్షసరాజైనరావణుని కఠోరవచనములను విని దుఃఖించినదై, తనభర్త తనకడ లేనందున ఆర్తురాలై, దట్టమైన అడవినడుమ సింహముచేతజిక్కిన గున్నయేనుగువలె మిక్కిలి భీతిల్లెను. (1)

సా రాక్షసీమధ్యగతా చ భీరుః
వాగ్భిర్భృశం రావణతర్జితా చ।
కాంతారమధ్యే విజనే విసృష్టా
బాలేవ కన్యా విలలాప సీతా। 2

భయస్వభావయైన సీతాదేవి రాక్షసస్త్రీలమధ్య దిక్కుతోచనిదై విలవిలలాడుచుండెను. పైగా ఆమెను రావణుడు కర్ణ కఠోరములైన తనమాటలతో మిక్కిలి బెదరించెను. అట్టిస్థితిలో ఆమె అడవిమధ్యలో ఒంటరిగా విడిచిపెట్టబడి, బిక్కుబిక్కు మనుచున్న అమాయిక బాలికవలె విలపించెను. (2)

సత్యం బతేదం ప్రవదంతి లోకే
నాకాలమృత్యుర్భవతీతి సంతః।
యత్రాహమేవం పరిభర్త్స్యమానా
జీవామి కించిత్క్షణమప్యపుణ్యా। 3

"లోకమునందు ఎవ్వరికైనను వారుకోరిన సమయమున మృత్యువు సంభవింపదు''- అని ప్రాజ్ఞులుపల్కుదురు. ఇది ముమ్మాటికి సత్యమేగదా! రావణుడును, ఈరక్కసి మూకలును నన్ను ఇంతగా భయపెట్టుచున్నప్పుడు ఒక్కక్షణముగూడ నేను జీవించియుండరాదు. ఐనను దురదృష్టవంతురాలనైన నేను జీవించియుంటిని. ఇదియే అందులకు ప్రబల నిదర్శనము. (3)

సుఖాద్విహీనం బహుదుఃఖపూర్ణమ్
ఇదం తు నూనం హృదయం స్థిరం మే ।
విశీర్యతే యన్న సహస్రధాఽద్య
వజ్రాహతం శృంగమివాఽచలస్య । 4

నైవాస్తి దోషం మమ నూనమత్ర
వధ్యాహమస్యాః ప్రియదర్శనస్య ।
భావం న చాస్యాహమనుప్రదాతుమ్
అలం ద్విజో మంత్రమివాద్విజాయ । 5

నూనం మమాంగాన్యచిరాదనార్యః
శస్త్రైశ్శితైశ్ఛేత్స్యతి రాక్షసేంద్రః ।
తస్మిన్ననాగచ్ఛతి లోకనాథే
గర్భస్థజంతోరివ శల్యకృంతః । 6

దుఃఖం బతేదం మమ దుఃఖితాయా
మాసౌ చిరాయాధిగమిష్యతో ద్వౌ ।
బద్ధస్య వధ్యస్య తథా నిశాంతే
రాజాపరాధాదివ తస్కరస్య । 7

హా రామ హా లక్ష్మణ హా సుమిత్రే
హా రామమాతస్సహ మే జనన్యా ।
ఏషా విపద్యామ్యహమల్పభాగ్యా
మహార్ణవే నౌరివ మూఢవాతా । 8

తరస్వినౌ ధారయతా మృగస్య
సత్త్వేన రూపం మనుజేంద్రపుత్రౌ ।
నూనం విశస్తౌ మమ కారణాత్తౌ
సింహర్షభౌ ద్వావివ వైద్యుతేన । 9

నూనం స కాలో మృగరూపధారీ
మామల్పభాగ్యాం లులుభే తదానీమ్ ।
యత్రార్యపుత్రం విససర్జ మూఢా
రామానుజం లక్ష్మణపూర్వజం చ । 10

హా రామ సత్యవ్రత దీర్ఘబాహో
హా పూర్ణచంద్రప్రతిమానవక్త్ర ।
హా జీవలోకస్య హితః ప్రియశ్చ
వధ్యాం న మాం వేత్సి హి రాక్షసానామ్ । 11

అనన్యదైవత్వమియం క్షమా చ
భూమౌ చ శయ్యా నియమశ్చ ధర్మే ।
పతివ్రతాత్వం విఫలం మమేదం
కృతం కృతఘ్నేష్వివ మానుషాణామ్ । 12

సుఖమనుమాటకే నోచుకొనక, అనేకములైన దుఃఖములలో మునిగిన నాగుండె వజ్రాయుధముచే కొట్టబడిన పర్వత శిఖరమువలె తుత్తునియలు కావలసి యున్నది. కాని అట్లు కాలేదనగా అది ఒక ఱాతివలె కఠినమైనది. (4)

ఈ భయంకరుడైన రావణుడు ఎట్లైనను నన్ను వధించి తీరును. కనుక ఇట్టి స్థితిలో నేనుఆత్మహత్యను చేసికొనుటలో దోషమేమాత్రములేదు-ఇది యథార్థము. ద్విజుడు ఒక అద్విజునకు మంత్రమును ఉపదేశింపలేనట్లు నేను ఈ రాక్షసునకు నా మనస్సును ఇయ్యజాలను. (5)

జగన్నాథుడైన శ్రీరాముడు(రెండునెలల) గడువులోపల ఇచటికి రానిచో దుర్మార్గుడైన ఈ రావణుడు, శస్త్రచికిత్సకుడు గర్భస్థప్రాణిని ఛేదించినట్లు, నా అవయవములను తన పదునైనశస్త్రములతో నిజముగనే ముక్కలు ముక్కలు గావింపగలడు. (6)

అయ్యో! చిరకాలమునుండి దుఃఖములోమునిగిన నాకు రావణుడు ఇచ్చిన రెండుమాసములగడువు త్వరలోనే ముగియనున్నది. రాజాపరాధమువలన బద్ధుడై శిక్షపడి, వేకువజాముననే వధింపబడనున్న దొంగస్థితివలెనే ఇప్పుడు నా స్థితియున్నది.(7)

అయ్యో! రామా! లక్ష్మణా! సుమిత్రాదేవీ! కౌసల్య అత్త గారూ! ఓ నాతల్లీ! (సునయనా!) అందఱును నాదుఃస్థితిని గూర్చి వినుడు. దురదృష్టవంతురాలనైన నేను మహాసముద్రమున పెనుగాలికి గుఱియైన నావవలె తీవ్రమైన ఆపదలలో కొట్టుమిట్టాడుచున్నాను. (8)

బలశాలురు, రాజకుమారులు ఐన ఆ రామలక్ష్మణులు మృగరూపమునుధరించిన ఒక ప్రాణిచేత (మారీచుని చేత) పిడుగుపాటుచే రెండుసింహములవలె, నిజముగా నాకారణముగా ఆపదలపాలైరి. (9)

వాస్తవముగా ఆ కాలపురుషుడే మృగరూపమునుదాల్చి అల్పభాగ్యనైననన్ను అప్పుడు ప్రలోభపెట్టెను. అందువలన మూర్ఖురాలనైననేను ఆమృగమును తీసికొనిరమ్మని, ముందుగా పూజ్యుడైనశ్రీరాముని, పిమ్మట లక్ష్మణుని పంపితిని. (10)

ఓ రామా! నీవు సత్యవ్రతుడవు, దీర్ఘబాహుడవు, నిండుచంద్రునిబోలు ముఖవర్చస్సుగలవాడవు. నీవు సకల ప్రాణులకును హితైషివి, ప్రియతముడవు. నీ భార్యనైననన్ను రాక్షసులు వధింపబోవుచున్నారు. నీవెఱుగవా? (11)

నిన్నే పరమదైవముగా అనన్యభక్తితో సేవించుచుంటిని. నీదర్శనభాగ్యము కల్గునను ఆశతో రాక్షసులు పెట్టు నానాబాధలను ఓర్పుతో సహించుచుంటిని. కటికినేలపై శయనించుచుంటిని. నియమపూర్వకముగా ధర్మమును ఆచరించుచుంటిని. పాతివ్రత్యముతో మనుగడ సాగించు చుంటిని-ఇవి అన్నియును కృతఘ్నులగు మానవుల కొనర్చిన ఉపకారమువలె నిష్ఫలమగుచున్నవి. (12)

మోఘో హి ధర్మశ్చరితో మయాఽయం
తథైకపత్నీత్వమిదం నిరర్థమ్ ।
యా త్వాం న పశ్యామి కృశా వివర్ణా
హీనా త్వయా సంగమనే నిరాశా ॥ 13

పితుర్నిదేశం నియమేన కృత్వా
వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ ।
స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభిః
త్వం రంస్యసే వీతభయః కృతార్థః ॥ 14

అహం తు రామ త్వయి జాతకామా
చిరం వినాశాయ నిబద్ధభావా ।
మోఘం చరిత్వాఽథ తపోవ్రతం చ
త్యక్ష్యామి ధిక్! జీవితమల్పభాగ్యా ॥ 15

సా జీవితం క్షిప్రమహం త్యజేయం
విషేణ శస్త్రేణ శితేన వాపి ।
విషస్య దాతా నహి మేఽస్తి కశ్చిత్
శస్త్రస్య వా వేశ్మని రాక్షసస్య ॥ 16

ఇతీవ దేవీ బహుధా విలప్య
సర్వాత్మనా రామమనుస్మరంతీ ।
ప్రవేపమానా పరిశుష్కవక్త్రా
నగోత్తమం పుష్పితమాససాద ॥ 17

శోకాభితప్తా బహుధా విచింత్య
సీతాఽథ వేణ్యుద్గ్రథనం గృహీత్వా ।
ఉద్బధ్య వేణ్యుద్గ్రథనేన శీఘ్రమ్
అహం గమిష్యామి యమస్య మూలమ్ ॥ 18

ఉపస్థితా సా మృదుసర్వగాత్రీ
శాఖాం గృహీత్వాఽథ నగస్య తస్య ।
తస్యాస్తు రామం ప్రవిచింతయంత్యా
రామానుజం స్వం చ కులం శుభాంగ్యాః ॥ 19

శోకానిమిత్తాని తథా బహూని
ధైర్యార్జితాని ప్రవరాణి లోకే ।
ప్రాదుర్నిమిత్తాని తదా బభూవుః
పురాపి సిద్ధాన్యుపలక్షితాని ॥ 20

అయ్యో! రామా! నా ధర్మాచరణము, పాతివ్రత్య పాలనము వ్యర్థములేయైనవి. నీ దర్శన భాగ్యమే కరవైనది. నీకై కృశించి వివర్ణనైతిని. నిన్ను మరల కలిసికొనగలనను ఆశయు నాలో సన్నగిల్లినది. (13)

ఓ రామా! నీవు పితృాజ్ఞను నియమపూర్వకముగా పాలించి. వనవాసవ్రతమును పూర్తిచేసి, గడువు ముగియగానే వనములనుండి అయోధ్యకు చేరెదవని భావింతును. లబ్ధమనోరథుడవై అచట నిర్భయముగ సుందరీమణులతో విహరించెదవని నేను తలంతును. (14)

ఓ రామా! నేనైతే నీయందే అనురక్తురాలను. చిరకాలము నీయందే బద్ధానురాగనగుటవలన ఈ రాక్షసులచే మడియుటకుగూడ లెక్కచేయలేదు. నిన్ను చేరజాలని నాధర్మాచరణము నాతపస్సు, (నిరశనవ్రతము) పాతివ్రత్య జీవనము అన్నియు వ్యర్థములైనవి. నా జీవితమునే త్యజింతును. ఛీ! నేను దురదృష్టవంతురాలను. (15)

నేను విషభక్షణముచేగాని, వాడియైనశస్త్రముచేగాని నా జీవితమును వెంటనే చాలించెదను. కాని ఈ రాక్షస నివాసమున నాకు విషమునిచ్చువారుగాని, శస్త్రమునిచ్చెడి వారుగాని కనబడుట లేదు. (16)

ఇట్లు సీతాదేవి పలురీతులవిలపించుచు సర్వాత్మభావముతో శ్రీరాముని స్మరించుచుండెను. ఆమె భయముతో వణకుచు నోరుఎండిపోయినదై, బాగుగా పుష్పించిన అశోకవృక్షమును సమీపించెను. (17)

శోకాకులయైన సీతాదేవి పరిపరివిధముల ఆలోచించినదై, తనజడనే ఉచ్చుగా చేసికొనెను. పిమ్మట 'నేను ఈ జడతో ఉరివేసికొని శీఘ్రముగా యమసదనమునకు చేరెదను." (తనువును చాలించెదను) అని ఆమె నిర్ణయించుకొనెను.(18)

సుకుమారియైన ఆ సీతాదేవి ఆ చెట్టుకొమ్మను బట్టుకొని నిలబడెను. అనంతరము ఆమె శ్రీరాముని, లక్ష్మణుని, తనవంశమును స్మరింపసాగెను. ఇంతలో శుభాంగియైన ఆమెకు శోకమును తొలగించి, ధైర్యమును గూర్చునవి, సత్ఫలదాయకములుగా లోకప్రసిద్ధములైనవి- శ్రీరాముని ఆగమనమును సూచించుచు లోగడకనపడిన పెక్కు శుభశకునములు మరల గోచరించెను. (19-20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే అష్టావింశస్సర్గః *(28)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదియెనిమిదవసర్గము.

-- * * * --

29. ఇరువదితొమ్మిదవసర్గము

సీతకు గోచరించిన శుభశకునములు

తథాగతాం తాం వ్యథితామనిందితాం
వ్యపేత హర్షాం పరిదీనమానసామ్ ।
శుభాం నిమిత్తాని శుభాని భేజిరే
నరం శ్రియా జుష్టమివోపజీవినః । 1

తస్యాశ్శుభం వామమరాళపక్ష్మ-
రాజీవృతం కృష్ణవిశాలశుక్లమ్ ।
ప్రాస్పందతైకం నయనం సుకేశ్యా
మీనాహతం పద్మమివాభితామ్రమ్ । 2

భుజశ్చ చార్వంచితపీనవృత్తః
పరార్ధ్యకాలాగరుచందనార్హః ।
అనుత్తమేనాధ్యుషితః ప్రియేణ
చిరేణ వామస్సమవేపతాశు । 3

గజేంద్రహస్తప్రతిమశ్చ పీనః
తయోర్ద్వయోస్సంహతయోస్సుజాతః ।
ప్రస్పందమానః పునరూరురస్యా
రామం పురస్తాత్ స్థితమాచచక్షే । 4

శుభం పునర్హేమసమానవర్ణమ్
ఈషద్రజోధ్వస్తమివామలాక్ష్యాః ।
వాసఃస్థితాయాశ్శిఖరాగ్రదత్యాః
కించిత్ పరిస్రంసత చారుగాత్ర్యాః । 5

ఏతైర్నిమిత్తైరపరైశ్చ సుభ్రూః
సంబోధితా ప్రాగపి సాధుసిద్ధైః ।
వాతాతపక్లాంతమివ ప్రణష్టం
వర్షేణ బీజం ప్రతిసంజహర్ష । 6

తస్యాః పునర్బింబఫలాధరోష్ఠం
స్వక్షిభ్రుకేశాంతమరాళపక్ష్మ ।
వక్త్రం బభాసే సితశుక్లదంష్ట్రం
రాహోర్ముఖాచ్చంద్ర ఇవ ప్రముక్తః । 7

ఆ విధముగా ప్రాణత్యాగమునకుసిద్ధమై వ్యథచెందుచున్నట్టిదియు, దోషరహితయు, సంతోషములేనిదై దైన్యముతోనున్నట్టిదియునైన ఆ శుభాంగిని, భాగ్యశాలి కడకు ఆశ్రితులుచేరినట్లు శుభశకునములు చేరెను. (1)

కేశసౌందర్యముతో ఒప్పుచున్న ఆ సీతాదేవినేత్రములు వంకరదిరిగిన ఱెప్పలవెంట్రుకలతో మనోహరముగా ఉండెను. అవి శుభకరములై, విశాలములై తెలుపు నలుపు కంటిపాపలతో విలసిల్లుచుండెను. వాటిలో వామనేత్రము చేపతాకిడికి కెందామరవలె అదిరెను. (2)

సీతాదేవిఎడమభుజము మిక్కిలిఅందమైనది. అది గుండ్రముగా పరిపుష్టమైయున్నది. శ్రేష్ఠమైన అగరు, చందనములను పూసికొనుటకు అర్హమైనది. సర్వశ్రేష్ఠుడైన శ్రీరామునకు చాలాకాలము తలగడగాఉన్నట్టిది. అట్టి వామభుజముగూడ అదిరెను. (3)

పొందికగా చక్కగా చేరియున్న ఆమె రెండు ఊరువులలో ఎడమతొడ చలించెను. అది ఏనుగు తొండముతోసమానమై, పరిపుష్టమై సుందరముగా ఒప్పుచుండెను. ఆ ఊరువుయొక్క స్పందన రాముడు ఎదురుగా ఉన్నట్లు సూచించుచున్నది.(4)

సుందరగాత్రియైన ఆసీతాదేవి నయనములు నిర్మలముగా నుండెను. ఆమెపలువరుస దానిమ్మగింజల వలె మనోహరముగా ఉండెను. ఆమె నిలబడి యుండగా మంగళప్రదమైనదియు, బంగారువన్నెగలదియు, పరాగముచే కొంచెము మలినమైనదియు, ఐన వస్త్రము కొద్దిగా జారెను. (ఇది భర్తసమాగమ సూచకము) (5)

సీతాదేవికి పొడసూపిన ఈ శకునములు ఇదివరలో సత్ఫలసూచకములుగా ప్రసిద్ధికెక్కినవే. కనుక తనకు శుభములు కలుగబోవుచున్నవని భావించుచు చక్కని కనుబొమలుగలసీతాదేవి ఎండకుఎండి, గాలికి ఎగిరిపోయిన విత్తనము వర్షముపడగానే మొలకెత్తినట్లు మిక్కిలి సంతోషించెను. (6)

సీతాదేవిముఖము దొండపండువంటి ఎఱ్ఱని అధరోష్ఠముతోను, అందమైననేత్రములతోను, కనుబొమలతోను, ముంగురులతోను, వంకరదిరిగిన కనుఱెప్పల వెంట్రుకలతోను, నిగనిగలాడుచు అందముగా నున్న పలువరుసతోను మనోజ్ఞముగానుండెను. అట్టి ముఖము రాహుముఖము నుండివిముక్తుడైన చంద్రునివలె ప్రకాశించెను. (7)

సా వీతశోకా వ్యపనీతతంద్రీ
శాంతజ్వరా హర్షవివృద్ధసత్త్వా ।
అశోభతార్యా వదనేన శుక్లే
శీతాంశునా రాత్రిరివోదితేన ॥ 8

పూజ్యురాలైన ఆ సీతాదేవికి శోకము దూరమాయెను. ఆందోళన తొలగిపోయెను. మనస్తాపము శాంతించెను. మనస్సు సంతుష్టమై వికసించెను. అట్టి సీతాదేవిముఖము చంద్రోదయముతో (పండువెన్నెలలో) ప్రకాశించు శుక్లపక్షరాత్రివలె శోభిల్లెను. (8)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకోనత్రింశస్సర్గః (29)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఇరువదితొమ్మిదవసర్గము.

-- * * * --

30. ముప్పదియవసర్గము

సీతాదేవితో సంభాషించు విషయమున హనుమంతుని ఆలోచన

హనుమానపి విశ్రాంతః సర్వం శుశ్రావ తత్త్వతః ।
సీతాయాస్త్రిజటాయాశ్చ రాక్షసీనాం చ తర్జనమ్ ॥ 1

అవేక్షమాణస్తాం దేవీం దేవతామివ నందనే ।
తతో బహువిధాం చింతాం చింతయామాస వానరః ॥ 2

అశోకవృక్షముపైచేరి అన్నింటిని ప్రశాంతముగా సావధానముగా గమనించుచున్న హనుమంతుడు సీతాదేవి పల్కిన మాటలను, త్రిజట చెప్పిన స్వప్నవృత్తాంతమును, రాక్షసస్త్రీలు సీతను భయపెట్టుచు పల్కినవచనములను పూర్తిగా వినెను. పిమ్మట హనుమంతుడు నందనవనమునందలి దివ్యకాంతవలెనున్న సీతాదేవినిచూచుచు ఇట్లనేకవిధముల ఆలోచింపసాగెను. (1-2)

యాం కపీనాం సహస్రాణి సుబహూన్యయుతాని చ ।
దిక్షు సర్వాసు మార్గంతే సేయమాసాదితా మయా ॥ 3

"ఈ సీతాదేవిజాడను తెలిసికొనుటకొఱకే లక్షలకొలది వానరులు అన్నిదిశలకునువెళ్ళి, వెదకుచుండిరి. కాని ఈమె దర్శనభాగ్యము నాకే దక్కినది. (3)

చారేణ తు సుయుక్తేన శత్రోశ్శక్తిమవేక్షతా ।
గూఢేన చరతా తావత్ అవేక్షితమిదం మయా ॥ 4

యుక్తిశాలియైనసేవకుడు (గూఢచారి) శత్రుబల స్థాయిని మెలకువతో సమగ్రముగా తెలిసికొనుట ఆవశ్యకము. ఆ పనిపైవచ్చిన నేను ఎవరూ ఎఱుంగని రీతిగా సంచరించుచు అన్నివిషయములను పూర్తిగా చూచితిని(గ్రహించితిని). (4)

రాక్షసానాం విశేషశ్చ పురీ చేయమవేక్షితా ।
రాక్షసాధిపతేరస్య ప్రభావో రావణస్య చ ॥ 5

రాక్షసులయొక్క విశేషములను గమనించితిని, ఈ లంకాపురిని పూర్తిగా చూచితిని, రాక్షసరాజైనరావణుని ప్రభావమును, ఆతని ధోరణిని తెలిసికొంటిని. (5)

యుక్తం తస్యాప్రమేయస్య సర్వసత్త్వదయావతః ।
సమాశ్వాసయితుం భార్యాం పతిదర్శనకాంక్షిణీమ్ ॥ 6

సమస్త ప్రాణులపై దయజూపువాడును, అపరిమితము లైన బలపరాక్రమములు గలవాడును ఐన ఆ శ్రీరామునకు భార్యయగు సీతాదేవి తన పతిదర్శనముకై ఆరాట పడుచున్నది. ఇప్పుడు ఈమెను ఓదార్చుట యుక్తమగును. (6)

అహమాశ్వాసయామ్యేనాం పూర్ణచంద్రనిభాననామ్ ।
అదృష్టదుఃఖాం దుఃఖార్తాం దుఃఖస్యాంతమగచ్ఛతీమ్ ॥ 7

నిండుచందురునిబోలు ముఖకాంతిగల సీతాదేవి లోగడఎన్నడును ఏ విధమైనదుఃఖములను ఎఱుగదు. కాని ఇప్పుడు దుఃఖములతో క్రుంగిపోవుచున్నది. ఈమె దుఃఖములకు అంతమేలేనట్లున్నది. ఈమెను నేను ఓదార్చెదను. (7)

యద్యప్యహమిమాం దేవీం శోకోపహతచేతనామ్।
అనాశ్వాస్య గమిష్యామి దోషవద్గమనం భవేత్। 8

గతే హి మయి తత్రేయం రాజపుత్త్రీ యశస్వినీ।
పరిత్రాణమవిందంతీ జానకీ జీవితం త్యజేత్। 9

మయా చ స మహాబాహుః పూర్ణచంద్రనిభాననః।
సమాశ్వాసయితుం న్యాయ్యః సీతాదర్శనలాలసః। 10

నిశాచరీణాం ప్రత్యక్షమ్ అనర్హం చాపి భాషణమ్।
కథం ను ఖలు కర్తవ్యమ్ ఇదం కృచ్ఛ్రగతో హ్యహమ్। 11

అనేన రాత్రిశేషేణ యది నాశ్వాస్యతే మయా।
సర్వథా నాస్తి సందేహః పరిత్యక్ష్యతి జీవితమ్। 12

రామశ్చ యది పృచ్ఛేన్మాం కిం మాం సీతాఽబ్రవీద్వచః।
కిమహం తం ప్రతిబ్రూయామ్ అసంభాష్య సుమధ్యమామ్। 13

సీతాసందేశరహితం మామితస్త్వరయా గతమ్।
నిర్దహేదపి కాకుత్స్థః క్రుద్ధస్తీవ్రేణ చక్షుషా। 14

యదిచేద్యోజయిష్యామి భర్తారం రామకారణాత్।
వ్యర్థమాగమనం తస్య ససైన్యస్య భవిష్యతి। 15

అంతరం త్వహమాసాద్య రాక్షసీనామిహ స్థితః।
శనైరాశ్వాసయిష్యామి సంతాపబహుళామిమామ్। 16

అహం హ్యతితనుశ్చైవ వానరశ్చ విశేషతః।
వాచం చోదాహరిష్యామి మానుషీమిహ సంస్కృతామ్। 17

యది వాచం ప్రదాస్యామి ద్విజాతిరివ సంస్కృతామ్।
రావణం మన్యమానా మాం సీతా భీతా భవిష్యతి।
వానరస్య విశేషేణ కథం స్యాదభిభాషణమ్। 18

అవశ్యమేవ వక్తవ్యం మానుషం వాక్యమర్థవత్।
మయా సాంత్వయితుం శక్యా నాన్యథేయమనిందితా। 19

సేయమాలోక్య మే రూపం జానకీ భాషితం తథా।
రక్షోభిస్త్రాసితా పూర్వం భూయస్త్రాసం గమిష్యతి। 20

తీవ్రమైన శోకములధాటికి ఈమెమనస్సు వ్యాకులమై యున్నది. ఇట్టి పరిస్థితిలోసైతము నేను ఈమెను ఓదార్చకుండవెళ్లినచో నాప్రయాణమునకర్థమే యుండదు. (8)

నేను ఈమెతో మాట్లాడకుండ తిరిగివెళ్లిపోయినచో మిక్కిలి వాసికెక్కిన రాజపుత్రికయగు ఈ జానకీదేవి ఎట్టి రక్షణోపాయమును గానక తనప్రాణములనే త్యజించును. (9)

ఆజానుబాహువు, చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖము గలవాడు, సీతాదేవినిగాంచుటకై తహతహపడుచున్నవాడు అగు ఆ శ్రీరామునిగూడ నేను ఓదార్చుట న్యాయము, సముచితము. (10)

ఈ రక్కసిమూకలయెదుట ఈమెతో మాట్లాడుటకు వీలుగాదు. ఇప్పుడు నేనేమిచేయవలెను? గొప్పక్లిష్ట పరిస్థితిలో చిక్కుపడితిని. (11)

కొద్దిగా మిగిలియున్న ఈ రాత్రి సమయములోనే నేను ఈమెను ఓదార్చకున్నచో ఈమె తనజీవితమును చాలించుట తథ్యము. ఇందులకు ఏ మాత్రమూ సందేహము లేదు. (12)

'సీత నన్నుగూర్చి ఏమని పలికినది?' అని శ్రీరాముడు నన్నడిగినచో, సీతాదేవితో సంభాషింపకయే ఆ స్వామికి నేనేమని సమాధానము చెప్పగలను? (13)

సీతాసందేశమును పొందకుండగనే నేను తొందరపడి వెళ్లినచో శ్రీరాముడు క్రుద్ధుడై తనవాడిచూపులతో నన్ను దహించివేయును. (14)

రామకార్యార్థము ఇచటికివచ్చుటకై సుగ్రీవుని నేను ప్రోత్సహించినచో (ఇంతలో సీతాదేవి తనువును చాలించిన యెడల) సైన్యసహితముగా ఆతనిరాక వ్యర్థముకాగలదు. (15)

నేను ఇక్కడనేఉండి, రాక్షసస్త్రీలు ఆమె దగ్గరలేనప్పుడు గాని, లేక వారు ఏమరుపాటున ఉన్నప్పుడుగాని, మిక్కిలి శోకసంతప్తయైయున్న సీతాదేవిని మెల్లగా ఓదార్చెదను.(16)

నేను ప్రస్తుతము సూక్ష్మరూపుడనైయుంటిని, పైగా మిక్కిలి వానరుడను. సామాన్య మానవులరీతిలో నేను ఆమెతో సరళమైన భాషలోవినయముతో మాట్లాడగలను. (17)

నేను ద్విజునివలె సంస్కృతమునందు మాట్లాడినచో సీతాదేవి నన్ను రావణునిగా తలంచి భయపడును. "ఒక వానరుడు ఇట్టి చక్కనిసంస్కృతములో మాట్లాడుట ఎట్లు సంభవము?" అని సీతాదేవి సందేహపడవచ్చును. (18)

నేను సరియైనరీతిలో సామాన్య మనుష్యభాషలో అర్థవంతముగా మాట్లాడుటయే యుక్తము. అట్లుకానిచో 'అన్నెం పున్నెం' ఎఱుగని ఈమెను అనునయించుట ఎట్లు?(19)

ఇంతకుముందే రాక్షసులవలన ఈమె భయకంపితయై యున్నది. ఇప్పుడు నా వానరరూపమునుజూచి, నా మానవభాషనుబట్టి ఈమె ఇంకను భీతిల్లగలదు. (20)

తతో జాతపరిత్రాసా శబ్దం కుర్యాన్మనస్వినీ।
జానానా మాం విశాలాక్షీ రావణం కామరూపిణమ్। 21

బుద్ధిమంతురాలును, విశాలాక్షియుఐన సీతాదేవి నన్ను కామరూపుడైనరావణునిగా భావించి, మిక్కిలి భయపడి బిగ్గరగాకేకలుపెట్టును. (21)

సీతయా చ కృతే శబ్దే సహసా రాక్షసీగణః।
నానాప్రహరణో ఘోరః సమేయాదంతకోపమః। 22

సీతాదేవికేకలనువిని యమకింకరులవలె ఘోరముగానున్న రాకాసిమూకలు వెంటనే వివిధములైన ఆయుధములను దీసికొని గుమిగూడును. (22)

తతో మాం సంపరిక్షిప్య సర్వతో వికృతాననాః।
వధే చ గ్రహణే చైవ కుర్యుర్యత్నం యథాబలమ్। 23

అటుపిమ్మట వికృతములైనరూపములుగల ఆ రాక్షసస్త్రీలు అన్నివైపులనుండియు చుట్టుముట్టి, నన్ను పట్టుకొనిచంపుటకు శక్తి కొలది ప్రయత్నింతురు. (23)

గృహ్య శాఖాః ప్రశాఖాశ్చ స్కంధాశ్చోత్తమశాఖినామ్।
దృష్ట్వా విపరిధావంతం భవేయుర్భయశంకితాః। 24

వారికిఅందకుండ నేను మహావృక్షముల స్కంధములపైకి ఎగబ్రాకి, శాఖోపశాఖలపై గంతులు వేయుచు పరుగిడుచుండుటను చూచి, ఆ రాక్షసస్త్రీలు భయసందేహములకు లోనయ్యెదరు. (24)

మమ రూపం చ సంప్రేక్ష్య వనే విచరతో మహత్।
రాక్షస్యో భయవిత్రస్తా భవేయుర్వికృతాననాః। 25

ఈ వనమున అటునిటు సంచరించుచున్న నా మహద్రూపమును పరికించిచూచి, వికృతాకారలైన ఆ రాక్షసస్త్రీలు గజగజ వణకిపోవుదురు. (25)

తతః కుర్యుస్సమాహ్వానం రాక్షస్యో రక్షసామపి।
రాక్షసేంద్రనియుక్తానాం రాక్షసేంద్రనివేశనే। 26

పిదప ఈ రాక్షసస్త్రీలు రావణునిభవనమునకువెళ్ళి, ఆయని పరివారములోని రాక్షసులతో మొఱపెట్టుకొందురు. (26)

తే శూలశక్తినిస్త్రింశవివిధాయుధపాణయః।
ఆపతేయుర్విమర్దేఽస్మిన్ వేగేనోద్వేగకారిణః। 27

అప్పుడు ఆరాక్షసులు శూలములు, బల్లెములు, ఖడ్గములు మొదలగు వివిధాయుధములనుధరించి, పోరాడుటకు శీఘ్రముగా ఇచటికివచ్చి వాలుదురు. (27)

సంరుద్ధస్తైస్తు పరితో విధమన్ రక్షసాం బలమ్।
శక్నుయాం న తు సంప్రాప్తుం పరం పారం మహోదధేః। 28

వారందఱును అట్లునన్ను చుట్టుముట్టినప్పుడు ఆ రాక్షససేనలను పరిమార్చుచు నేను ఈ మహాసముద్రము యొక్క ఆవలితీరమును చేరలేకపోవచ్చును. (28)

మాం వా గృహ్ణీయురాప్లుత్య బహవశ్శీఘ్రకారిణః।
స్యాదియం చాగృహీతార్థా మమ చ గ్రహణం భవేత్। 29

చురుకైనకొంతమందిరాక్షసులు నామీదబడి నన్ను పట్టుకొని బంధించెదరు. ఆ స్థితిలో నేను శ్రీరాముని సందేశమును సీతాదేవికి అందింపజాలను. నేను వచ్చిన పని నెఱవేఱదు. (29)

హింసాభిరుచయో హింస్యుః ఇమాం వా జనకాత్మజామ్।
విపన్నం స్యాత్ తతః కార్యం రామసుగ్రీవయోరిదమ్। 30

లేదా హింసాప్రవృత్తిగలరాక్షసులు ఈ జానకీదేవిని చిత్రహింసలపాలు చేయవచ్చును. అందువలన రామసుగ్రీవులు నాకు అప్పగించిన సీతాన్వేషణకార్యము భంగమగును. (30)

ఉద్దేశే నష్టమార్గేఽస్మిన్ రాక్షసైః పరివారితే।
సాగరేణ పరిక్షిప్తే గుప్తే వసతి జానకీ। 31

జానకీదేవి ఉంచబడినస్థలము ఎవ్వరికిని తెలియని రహస్యప్రదేశము. ఇచ్చటికి చేరుటకు మార్గములు లేవు. దీనిచుట్టును సముద్రము గలదు. పైగా పెక్కుమంది రాక్షసులు నిరంతరము ఈమెను కాపలాకాయుచున్నారు. (31)

విశస్తే వా గృహీతే వా రక్షోభిర్మయి సంయుగే।
నాన్యం పశ్యామి రామస్య సాహాయ్యం కార్యసాధనే। 32

నేను యుద్ధమున రాక్షసులకు పట్టుబడినను, వారిచే చంపబడినను, రామకార్యసాధన విషయమున సహాయపడ గలవారు ఎవరునూ ఉండరు. (32)

విమృశంశ్చ న పశ్యామి యో హతే మయి వానరః।
శతయోజనవిస్తీర్ణం లంఘయేత మహోదధిమ్। 33

ఒకవేళ ఈ రాక్షసులు నన్ను చంపివేసినచో ఎంతగా ఆలోచించినను నూరు యోజనములవఱకు వ్యాపించియున్న ఈ సముద్రమును దాటి ఇచటికిరాగలవానరుడు ఎవ్వడును, నాకు కనబడుటలేదు. (33)

కామం హంతుం సమర్థోఽస్మి సహస్రాణ్యపి రక్షసామ్।
న తు శక్ష్యామి సంప్రాప్తుం పరం పారం మహోదధేః। 34

వేలకొలది రాక్షసులనుసైతము యుద్ధమున నేను పూర్తిగా హతమార్చగలను. కాని ఈ సమరమున నిమగ్నుడనైన నేను మహాసముద్రముయొక్క ఆవలి తీరమును సకాలములో గడువులోపల చేరజాలను. (34)

అసత్యాని చ యుద్ధాని సంశయో మే న రోచతే।
కశ్చ నిస్సంశయం కార్యం కుర్యాత్ ప్రాజ్ఞస్ససంశయమ్। 35

యుద్ధరంగమున జయాపజయములు అనిశ్చితములు, సంశయాత్మకమైన కార్యమునుజేయుట నాకు రుచింపదు. ప్రాజ్ఞుడైనవాడెవ్వడును సంశయాత్మకకార్యమును లోతుగా ఆలోచింపక తొందరపడి చేయనేచేయడు. (35)

ప్రాణత్యాగశ్చ వైదేహ్యా భవేదనభిభాషణే।
ఏష దోషో మహాన్ హి స్యాత్ మమ సీతాభిభాషణే। 36

సీతాదేవితో మాట్లాడకుండగనే నేను మఱలి పోయినచో ఆమె ప్రాణత్యాగము చేసికొనుటయు జరుగ వచ్చును. ఆమెతో సంభాషించినచో రాక్షసులవలననాకు ఈ మహావిపత్తు (యుద్ధము) సంభవింపవచ్చును. (36)

భూతాశ్చార్థా వినశ్యంతి దేశకాలవిరోధితాః।
విక్లబం దూతమాసాద్య తమస్సూర్యోదయే యథా। 37

తప్పక సఫలమగుకార్యములు సైతము అవివేకియైన దూత చేతిలోపడి, దేశకాలములకు ప్రతికూలముగా ఆచరింపబడి, సూర్యోదయ సమయమున చీకట్లు నశించురీతి అవి పూర్తిగా నిష్ఫలములగును. (37)

అర్థానర్థాంతరే బుద్ధిః నిశ్చితాపి న శోభతే।
ఘాతయంతి హి కార్యాణి దూతాః పండితమానినః। 38

లాభనష్టములనుగూర్చి ప్రభువు తన సచివులతో చర్చించి, నిశ్చయించినకార్యము అవివేకియైన దూతచేతిలో పడినచో అది సఫలముగాదు. ఏలనన అసమర్థులైనను తాము సమర్థులమనుకొనుదూతలు కార్యములను చెడగొట్టుదురుగదా! (38)

న వినశ్యేత్ కథం కార్యం వైక్లబ్యం న కథం భవేత్।
లంఘనం చ సముద్రస్య కథం ను న వృథా భవేత్। 39

రామకార్యము నిష్ఫలముకాకుండుట ఎట్లు? ఈ రాక్షసుల యెదుట నేను తెలివిలేనివాడను కాకుండుట ఎట్లు? నా సముద్రలంఘనము వృథా కాకుండుట ఎట్లు? (39)

కథం ను ఖలు వాక్యం మే శృణుయాన్నోద్విజేత వా।
ఇతి సంచింత్య హనుమాన్ చకార మతిమాన్ మతిమ్। 40

"సీతాదేవి భయసందేహములకు లోనుకాకుండు నట్లుగా ఈమెకు నా మాటలను ఎట్లు విన్పింపవలెను?" అని ఆలోచించి, ప్రజ్ఞాశాలియైన హనుమంతుడు ఒక నిశ్చయమునకు వచ్చెను. (40)

రామమక్లిష్టకర్మాణం స్వబంధుమనుకీర్తయన్।
నైనాముద్వేజయిష్యామి తద్బంధుగతమానసామ్। 41

శ్రీరాముడు ఎట్టి క్లిష్టకార్యమునైనను అవలీలగా నెఱవేర్చువాడు, ఆయన నాకుస్వామి. ఇప్పుడు ఈమె మనస్సు శ్రీరామునియందే లగ్నమైయున్నది. కావున ఆయనను కీర్తించుచు ఈమె భయసందేహములకు లోనుకాకుండ చూచెదను. (నేను ఈమెకంటబడినచో ఈమె ఉద్వేగమునకులోను కావచ్చును. కనుక ఈమె యెదుటబడకుండగనే శ్రీరామగుణకీర్తనము గావించుచు ఈమెను ప్రసన్నురాలినిగాజేసికొనెదను.) (41)

ఇక్ష్వాకూణాం వరిష్ఠస్య రామస్య విదితాత్మనః।
శుభాని ధర్మయుక్తాని వచనాని సమర్పయన్। 42

ఇక్ష్వాకువంశజులలో సర్వశ్రేష్ఠుడును, పరమాత్మ స్వరూపుడునునైన శ్రీరామునకు సంబంధించిన శుభకరములు,

శ్రావయిష్యామి సర్వాణి మధురాం ప్రబ్రువన్ గిరమ్।
శ్రద్ధాస్యతి యథా హీయం తథా సర్వం సమాదధే। 43

ధర్మయుక్తములుఅగు సమస్త విషయములను వివరించుచు, మృదుమధుర వచనములను వినిపించెదను. ఆ విధముగా ఈమెకు పూర్తిగా విశ్వాసము, శ్రద్ధాసక్తులు, మనశ్శాంతి కలుగునట్లు చేసెదను. (42-43)

ఇతి స బహువిధం మహానుభావో
జగతిపతేః ప్రమదామవేక్షమాణః।
మధురమవితథం జగాద వాక్యం
ద్రుమవిటపాంతరమాస్థితో హనూమాన్। 44

చెట్టుపై కొమ్మలమధ్యనున్న మహానుభావుడగు హనుమంతుడు జగన్నాథుడైనశ్రీరాముని భార్యయగు సీతాదేవిని జూచుచు బహువిధములగు యథార్థ మధురవచనములను ఇట్లు పలుకసాగెను. (44)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే త్రింశస్సర్గః *(30)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదియవ సర్గము.

— ❋ ❋ ❋ —

31. ముప్పదియొకటవసర్గము

సీతాదేవికి వినపడునట్లు హనుమంతుడు రామకథను వర్ణించుట

ఏవం బహువిధాం చింతాం చింతయిత్వా మహామతిః।
సంశ్రవే మధురం వాక్యం వైదేహ్యా వ్యాజహార హ। 1

ప్రతిభాశాలియైన హనుమంతుడు ఇట్లు పలు విధములుగా ఆలోచించి, కర్తవ్యమును నిర్ణయించుకొని, సీతాదేవిమాత్రమే శ్రద్ధగా ఆలకించునట్లుగా మధుర వచనములను పలికెను. (1)

రాజా దశరథో నామ రథకుంజరవాజిమాన్।
పుణ్యశీలో మహాకీర్తిః ఇక్ష్వాకూణాంమహాయశాః। 2

"ఇక్ష్వాకువంశజులలో 'దశరథుడు' అనుపేరుగల మహారాజు గలడు, అతడు పవిత్రస్వభావముగలవాడు, గొప్ప కీర్తిశాలి, దివ్యములైన రథములు, ఏనుగులు, శ్యామకర్ణాశ్వములు, మొదలగు బలములు గలవాడు. అతడు దానధర్మాదులచే వాసికెక్కినవాడు, సరళస్వభావుడు, శౌర్యపరాక్రమముల యందు ప్రసిద్ధిగన్నవాడు. (2)

రాజర్షీణాం గుణశ్రేష్ఠః తపసా చర్షిభిస్సమః।
చక్రవర్తికులే జాతః పురందరసమో బలే। 3

అతడు రాజర్షులలో సద్గుణసంపన్నుడు, ఋషులవలె తపోధనుడు, చక్రవర్తులవంశమున జన్మించినవాడు, బలసంపదలో దేవేంద్రునివంటివాడు. (3)

అహింసారతిరక్షుద్రో ఘృణీ సత్యపరాక్రమః।
ముఖ్యశ్చేక్ష్వాకువంశస్య లక్ష్మీవాన్ లక్ష్మివర్ధనః। 4

అహింసానియమములను పాటించువాడు, ఉదార స్వభావముగలవాడు, దయాళువు, సత్యసంధుడు ఐశ్వర్యవంతుడు, సంపదలను పరిరక్షించుటలోదక్షుడు అతడు ఇక్ష్వాకువంశమునకు తలమానికము. (4)

పార్థివవ్యంజనైర్యుక్తః పృథుశ్రీః పార్థివర్షభః।
పృథివ్యాం చతురంతాయాం విశ్రుతస్సుఖదస్సుఖీ। 5

అతడు మహారాజలక్షణశోభితుడు, శుభలక్షణ సంపన్నుడు, రాజశిరోమణి, నేలనాలుగు చెఱగుల ఖ్యాతికెక్కినవాడు, తాను సుఖములను అనుభవించుచు, ప్రజలకు సుఖసంతోషములను గూర్చుచు రాజ్యమును పాలించువాడు. (5)

తస్య పుత్రః ప్రియో జ్యేష్ఠః తారాధిపనిభాననః।
రామో నామ విశేషజ్ఞః శ్రేష్ఠస్సర్వధనుష్మతామ్। 6

ఆ దశరథునకు ప్రియమైనవాడు, ఆయన పుత్రులలో జ్యేష్ఠుడు శ్రీరాముడు. అతడు చంద్రునివలె ప్రసన్నమైన ముఖముగలవాడు, జ్ఞాన స్వరూపుడు, ధనుర్ధారులలో అగ్రేసరుడు. (6)

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా।
రక్షితా జీవలోకస్య ధర్మస్య చ పరంతపః। 7

అతడు స్వధర్మమును పాటించువాడు, ఆశ్రితులకు కల్పవృక్షము, సకలప్రాణులకును, సమస్తధర్మములకును సంరక్షకుడు, అంతేగాదు అరివీరభయంకరుడు. (7)

తస్య సత్యాభిసంధస్య వృద్ధస్య వచనాత్ పితుః।
సభార్యస్సహ చ భ్రాత్రా వీరః ప్రవ్రాజితో వనమ్। 8

సత్యసంధుడు, వృద్ధుడుఐన తండ్రి (దశరథుని) ఆజ్ఞను అనుసరించి, వీరుడైన శ్రీరాముడు తన భార్యయైన సీతాదేవితో, సోదరుడైన లక్ష్మణునితో వనవాసమునకు వెళ్లెను. (8)

తేన తత్ర మహారణ్యే మృగయాం పరిధావతా।
రాక్షసా నిహతాశ్శూరా బహవః కామరూపిణః। 9

ఆమహారణ్యమునందు దుష్టశిక్షణకై వెళ్లినప్పుడు శ్రీరాముడు కామరూపులైన పెక్కుమందిరాక్షస యోధులను అవలీలగా హతమార్చెను. (9)

జనస్థానవధం శ్రుత్వా హతౌ చ ఖరదూషణౌ।
తతస్త్వమర్షాపహృతా జానకీ రావణేన తు।
వంచయిత్వా వనే రామం మృగరూపేణ మాయయా। 10

శ్రీరామునిచేతిలో దండకారణ్యమున ఖర దూషణులును, ఇతర రాక్షసయోధులును హతులైరి. ఆ వార్తలనువినిన రావణుడుక్రుద్ధుడై, మాయలేడి రూపమునుధరించిన మారీచుని సహాయముతో వనమున శ్రీరాముని మోసగించి, జానకీదేవిని అపహరించెను. (10)

స మార్గమాణస్తాం దేవీం రామస్సీతామనిందితామ్।
ఆససాద వనే మిత్రం సుగ్రీవం నామ వానరమ్। 11

రాముడు సాధ్వియైన ఆ సీతాదేవిని వెదకుచు వనమునందు 'సుగ్రీవుడు' అనుపేరుగల వానరుని మిత్రునిగాపొందెను. (11)

తతస్స వాలినం హత్వా రామః పరపురంజయః।
ప్రాయచ్ఛత్ కపిరాజ్యం తత్ సుగ్రీవాయ మహాబలః। 12

అనంతరము శత్రువిజేతయు, మహాబలశాలియు ఐన ఆ శ్రీరాముడు వాలినిచంపి, ఆ వానరరాజ్యమునకు సుగ్రీవుని రాజుగాజేసెను. (12)

సుగ్రీవేణాపి సందిష్టా హరయః కామరూపిణః।
దిక్షు సర్వాసు తాం దేవీం విచిన్వంతి సహస్రశః। 13

సుగ్రీవునిఆదేశానుసారము కామరూపులైన వేలకొలది వానరులు అన్నిదిక్కులయందు ఆ దేవిని వెదకుచున్నారు.(13)

అహం సంపాతివచనాత్ శతయోజనమాయతమ్।
అస్యా హేతోర్విశాలాక్ష్యాః సాగరం వేగవాన్ ప్లుతః। 14

'సంపాతి' సూచనమేరకు నేను విశాలాక్షియగు ఆ సీతాదేవినిమిత్తమై, నూఱుయోజనములపొడవుగల మహాసముద్రమును వేగముగా లంఘించితిని. (14)

యథారూపాం యథావర్ణాం యథాలక్ష్మీం చ నిశ్చితామ్।
అశ్రౌషం రాఘవస్యాహం సేయమాసాదితా మయా। 15

విరరామైవముక్త్వాసౌ వాచం వానరపుంగవః।
జానకీ చాపి తచ్ఛ్రుత్వా పరం విస్మయమాగతా। 16

సీతాదేవియొక్కఆకారమును, రూపసౌభాగ్యమును, తేజోవిశేషములను, చిహ్నములను నేను రామునివలన విని, ఆరూపమును నామనస్సులో ముద్రించుకొంటిని. నేనువిన్నరీతిగా అట్టిశుభలక్షణములతోనున్న సీతాదేవినే ఇచట నేను చూచితిని." కపివరుడైన హనుమంతుడు ఇట్లుపలికి తనమాటలను చాలించెను. జానకీదేవియు ఆ కపివరునివచనములనువిని, ఆశ్చర్యపడెను. (15-16)

తతస్సా వక్రకేశాంతా సుకేశీ కేశసంవృతమ్।
ఉన్నమ్య వదనం భీరుః శింశుపావృక్షమైక్షత। 17

ఆమె నొక్కులుదీఱియున్న చక్కని కేశసంపద కలిగియుండెను. పిమ్మట భయస్వభావురాలైన ఆ సీతాదేవి కేశములచేకప్పబడియున్న తనముఖమును పైకెత్తి శింశుపావృక్షమును జూచెను. (17)

నిశమ్య సీతా వచనం కపేశ్చ
దిశశ్చ సర్వాః ప్రదిశశ్చ వీక్ష్య।
స్వయం ప్రహర్షం పరమం జగామ
సర్వాత్మనా రామమనుస్మరంతీ। 18

సీతాదేవి కపీశ్వరుని పలుకులనువిని, అన్నిదిక్కులను పరికించిచూచెను. త్రికరణశుద్ధిగా శ్రీరాముని స్మరించుచు ఆమె పరమానందభరితురాలయ్యెను. (18)

సా తిర్యగూర్ధ్వం చ తథాప్యధస్తాత్
నిరీక్షమాణా తమచింత్యబుద్ధిమ్ ।
దదర్శ పింగాధిపతేరమాత్యం
వాతాత్మజం సూర్యమివోదయస్థమ్ ॥ 19

ఆమె నలుప్రక్కలను, పై భాగములను అట్లే క్రిందను పరిశీలించిచూచెను. అప్పుడు ఆమె మహాబుద్ధిశాలియు, సుగ్రీవునిసచివుడును, ఉదయాద్రిపై బాలభానునివలె శోభిల్లుచున్నవాడునుఅగు మారుతిని గాంచెను. (19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకత్రింశస్సర్గః (31)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదియొకటవసర్గము.

— * * * —

32. ముప్పదిరెండవసర్గము

సీతాదేవియొక్క ఆలోచనాపరంపరలు

తతశ్శాఖాంతరే లీనం దృష్ట్వా చలితమానసా ।
వేష్టితార్జునవస్త్రం తం విద్యుత్సంఘాతపింగళమ్ ॥ 1

సా దదర్శ కపిం తత్ర ప్రశ్రితం ప్రియవాదినమ్ ।
ఫుల్లాశోకోత్కరాభాసం తప్తచామీకరేక్షణమ్ ॥ 2

కొమ్మలమధ్యకలిసిపోయియున్న వాడును, మెఱుపుతీగల రాశివలెపచ్చని వచ్చనివర్ణము కలిగియున్నవాడును, తెల్లనివస్త్రమును ధరించియున్న వాడును, బాగుగావికసించిన అశోకపుష్పములవలె శోభిల్లుచున్నవాడును, పుటముపెట్టిన బంగారువన్నెకనులుగలవాడును, వినయశోభితుడునువై మధుర వచనములను పలుకుచున్న ఆకపివరునిజూచి, సీతాదేవి ఉలిక్కిపడి, కుతూహలముతో పరికించి చూడసాగెను.(1-2)

సాథ దృష్ట్వా హరిశ్రేష్ఠం వినీతవదవస్థితమ్ ।
మైథిలీ చింతయామాస విస్మయం పరమం గతా ॥ 3

అహో భీమమిదం రూపం వానరస్య దురాసదమ్ ।
దుర్నిరీక్షమితి జ్ఞాత్వా పునరేవ ముమోహ సా ॥ 4

విలలాప భృశం సీతా కరుణం భయమోహితా ।
రామరామేతి దుఃఖార్తా లక్ష్మణేతి చ భామినీ ॥ 5

పిమ్మట చెట్టుపై వినయముతో ఒదిగియున్న కపివరునిజూచి, మైథిలి మిక్కిలి ఆశ్చర్యపడినదై ఆలోచింపసాగెను. 'అహో! ఈ వానరునిరూపము ఎంత ఆశ్చర్యమును గొలుపుచున్నది! ఇది భయంకరము, దరిజేరరానిది, చూడశక్యముగానిది.' అనితలంచుచు వెంటనే ఆమె స్పృహను కోల్పోయెను. తేజోరాశియగు సీతాదేవి భయభ్రాంతయై, దుఃఖితయై రామా! రామా! లక్ష్మణా! అని మిక్కిలి దీనముగా విలపించెను. (3-5)

రురోద బహుధా సీతా మందం మందస్వరా సతీ ।
సా తం దృష్ట్వా హరిశ్రేష్ఠం వినీతవదుపస్థితమ్ ।
మైథిలీ చింతయామాస స్వప్నోఽయమితి భామినీ ॥ 6

సాధ్వియైనసీత సన్ననిస్వరముతో (రాక్షసులకు వినబడకుండ) తిన్నగా పలువిధముల రోదించెను. ఇంకను ఆ మైథిలి వినమ్రమూర్తియైయున్న ఆకపివరునిగాంచి, 'ఇది స్వప్నముగావచ్చును.' అని తలపోయసాగెను. (6)

సా వీక్షమాణా పృథుభుగ్నవక్త్రం
శాఖామృగేంద్రస్య యథోక్తకారమ్ ।
దదర్శ పింగాధిపతేరమాత్యం
వాతాత్మజం బుద్ధిమతాం వరిష్ఠమ్ ॥ 7

సా తం సమీక్ష్యైవ భృశం విసంజ్ఞా
గతాసుకల్పేవ బభూవ సీతా ।
చిరేణ సంజ్ఞాం ప్రతిలభ్య భూయో
విచింతయామాస విశాలనేత్రా ॥ 8

ఆమె ఇటునటుగమనించుచు వెడల్పైన వక్రముఖము గలవాడును, వానరోత్తముడైన సుగ్రీవునకు ఆజ్ఞానువర్తియు, అమాత్యుడును, ప్రజ్ఞావంతులలో శ్రేష్ఠుడునుఐన మారుతిని వీక్షించెను. విశాలనేత్రయైన ఆ సీతాదేవి ఆ హనుమంతుని చూడగానే చేష్టలుడిగినదై, స్పృహను కోల్పోయెను. కొంతసేపటికి ఆమె స్పృహను పొంది, మఱల ఆలోచింపసాగెను. (7-8)

స్వప్నే మయాఽయం వికృతోఽద్య దృష్టః
శాఖామృగశ్శాస్త్రగణైర్నిషిద్ధః ।
స్వస్త్యస్తు రామాయ సలక్ష్మణాయ
తథా పితుర్మే జనకస్య రాజ్ఞః । 9

స్వప్నోఽపి నాయం న హి మేఽస్తి నిద్రా
శోకేన దుఃఖేన చ పీడితాయాః ।
సుఖం హి మే నాస్తి యతోఽస్మి హీనా
తేనేందుపూర్ణప్రతిమాననేన । 10

రామేతి రామేతి సదైవ బుద్ధ్యా
విచింత్య వాచా బ్రువతీ తమేవ ।
తస్యానురూపాం చ కథాం తమర్థమ్
ఏవం ప్రపశ్యామి తథా శృణోమి । 11

అహం హి తస్యాద్య మనోభవేన
సంపీడితా తద్గతసర్వభావా ।
విచింతయంతీ సతతం తమేవ
తమేవ పశ్యామి తథా శృణోమి । 12

మనోరథస్స్యాదితి చింతయామి
తథాపి బుద్ధ్యా చ వితర్కయామి ।
కిం కారణం తస్య హి నాస్తి రూపం
సువ్యక్తరూపశ్చ వదత్యయం మామ్ । 13

నమోఽస్తు వాచస్పతయే సవజ్రిణే
స్వయంభువే చైవ హుతాశనాయ చ ।
అనేన చోక్తం యదిదం మమాగ్రతో
వనౌకసా తచ్చ తథాస్తు నాన్యథా । 14

నేడు కలలో వికృతాకారముగల ఒకవానరమును గాంచితిని. 'స్వప్నమున వానరమును జూచుట మంచిదికాదు, అని శాస్త్రములు తెలుపుచున్నవి. (ఎవరికి ఏ ఆపదరానున్నదో? తెలియదు) శ్రీరామునకును, లక్ష్మణునకును, మాతండ్రియైన జనకమహారాజునకును శుభములు కలుగుగాక. (ఈ దుస్స్వప్న ప్రభావము వారిపై పడకుండుగాక) (9)

పూర్ణచంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖముగల శ్రీరామునకు దూరముగానున్ననాకు సుఖమేలేదు. శోక దుఃఖపీడితురాలనైన నాకు నిద్రయే పట్టుటలేదుగదా! ఇక స్వప్నము ఎట్లువచ్చును? కనుక ఇది కల ఏమాత్రమూగాదు- (10)

నేను నిరంతరము మనస్సులో శ్రీరామునే స్మరించుచు రామా! రామా! అనిపల్కుచుంటిని. ఆ కారణమున తదనురూపముగా నేను ఆయనకథలనేవినుచున్నాను, ఆయనరూపమునే చూచుచున్నాను. (11)

నేను ఇప్పుడు శ్రీరామవిరహముతో బాధపడుచుంటిని. నామనస్సునందంతటను రాముడేనిండియుండెను. అనవరతము ఆయనను గూర్చియే ఆలోచించుచుంటిని, కనుక ఎల్లప్పుడును భ్రమరకీటన్యాయమున నేను ఆయన రూపమునే చూచుచున్నాను, ఆయన కథలనే వినుచున్నాను. బహుశా ఇది నామనోరథమే ఐయుండవచ్చును. బాగుగా తర్కించి చూచినచో ఇది మనోరథము కాజాలదు. ఏలనన మనోరథమునకు రూపము ఉండదుగదా! ఈ వానరుడు స్పష్టమైనరూపముగలవాడై నాతో ప్రత్యక్షముగా మాట్లాడుచున్నాడు. (12-13)

బృహస్పతికి నమస్కారములు, మహేంద్రునకు ప్రణతులు, బ్రహ్మదేవునకు ప్రణామములు, అగ్నిదేవునకు వందనములు. ఈ వానరుడు నా యెదుటపలికిన వచనములు తథ్యములగుగాక. అన్యథాకాకుండుగాక. (శ్రీరాముని గుణములను కీర్తించియున్నందున ఇతడు రామునిపక్షమువాడే ఐయుండును- ఇతర పక్షములకు చెందినవాడుకాడు.) (14)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ద్వాత్రింశస్సర్గః (32)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదిరెండవసర్గము.

-- * * * --

33.ముప్పదిమూడవసర్గము

సీతాదేవి హనుమంతునకు తన వృత్తాంతమును తెలియజెప్పుట

సోఽవతీర్య ద్రుమాత్ తస్మాత్ విద్రుమ ప్రతిమాననః ।
వినీతవేషః కృపణః ప్రణిపత్యోపసృత్య చ । 1

పగడమువలె ఎఱ్ఱనిముఖముగలవాడును, సముచితమైన వేషము గలవాడును, సీతాదేవిదుస్థితిని జూచి దీనుడైయున్నవాడునగు ఆ హనుమంతుడు ఆ శింశుపావృక్షమునుండిదిగి,[1] ఆమెను సమీపించి నమస్కరించెను. (1)

1) త్రిజటా స్వప్నవృత్తాంతమును విని, రాక్షసస్త్రీలు అందరును భీతిల్లిరి. అందువలనవారికి సీతాదేవిపై ఆదరభావము ఏర్పడెను. పిమ్మట వారు ఆమెను శరణుజొచ్చిరి. పిదప ఎక్కడివారక్కడనే నిద్రలోమునిగిరి. ఈ అవకాశమును జూచుకొని హనుమంతుడు చెట్టుమీది క్రిందికిదిగెను.

తామబ్రవీన్మహాతేజా హనూమాన్ మారుతాత్మజః।
శిరస్యంజలిమాధాయ సీతాం మధురయా గిరా। 2

కా ను పద్మపలాశాక్షి క్లిష్టకౌశేయవాసిని।
ద్రుమస్య శాఖామాలంబ్య తిష్ఠసి త్వమనిందితే। 3

కిమర్థం తవ నేత్రాభ్యాం వారి స్రవతి శోకజమ్।
పుండరీకపలాశాభ్యాం విప్రకీర్ణమివోదకమ్। 4

సురాణామసురాణాం వా నాగగంధర్వరక్షసామ్।
యక్షాణాం కిన్నరాణాం వా కా త్వం భవసి శోభనే। 5

కా త్వం భవసి రుద్రాణాం మరుతాం వా వరాననే।
వసూనాం వా వరారోహే దేవతా ప్రతిభాసి మే। 6

కిం ను చంద్రమసా హీనా పతితా విబుధాలయాత్।
రోహిణీ జ్యోతిషాం శ్రేష్ఠా శ్రేష్ఠాసర్వగుణాన్వితా। 7

కా త్వం భవసి కల్యాణి త్వమనిందితలోచనే।
కోపాద్వా యది వా మోహాత్ భర్తారమసితేక్షణే।
వసిష్ఠం కోపయిత్వా త్వం నాసి కల్యాణ్యరుంధతీ। 8

కో ను పుత్రః పితా భ్రాతా భర్తా వా తే సుమధ్యమే।
అస్మాల్లోకాదముం లోకం గతం త్వమనుశోచసి। 9

రోదనాదతినిశ్వాసాత్ భూమిసంస్పర్శనాదపి।
న త్వాం దేవీమహం మన్యే రాజ్ఞస్సంజ్ఞావధారణాత్। 10

వ్యంజనాని చ తే యాని లక్షణాని చ లక్షయే।
మహిషీ భూమిపాలస్య రాజకన్యాసి మే మతా। 11

రావణేన జనస్థానాత్ బలాదపహృతా యది।
సీతా త్వమసి భద్రం తే తన్మమాచక్ష్వ పృచ్ఛతః। 12

యథా హి తవ వై దైన్యం రూపం చాప్యతిమానుషమ్।
తపసా చాన్వితో వేషః త్వం రామమహిషీ ధ్రువమ్। 13

సా తస్య వచనం శ్రుత్వా రామకీర్తనహర్షితా।
ఉవాచ వాక్యం వైదేహీ హనూమంతం ద్రుమాశ్రితమ్। 14

మహాతేజశ్శాలియు, వాయుసుతుడునునైన హనుమంతుడు అంజలిఘటించి, శిరసా నమస్కరించినవాడై, ఆ సీతాదేవితో మధురవచనములను పలికెను. (2)

"తామరరేకులవంటికన్నులుగల ఓ దేవీ! నలిగిన పట్టువస్త్రమును ధరించిన ఓ సాధ్వీ! చెట్టుకొమ్మను ఆశ్రయించియున్న నీవెవరు?(3)

పద్మపత్రములనుండి సంతతధారగా ఉదకము స్రవించునట్లు నీనేత్రములనుండి దుఃఖాశ్రువులు వెల్లుబుకుచుండుటకుగల కారణమేమి? (4)

ఓమంగళప్రదురాలా! నీవు దివ్యభామినివా? అసుర కాంతవా? నాగకన్యవా? గంధర్వయోషితవా? రాక్షసస్త్రీవా? యక్షతరుణివా? కిన్నరనారివా? నీవెవరు? (5)

ఓ వరాననా! ఓ సుందరీ! రుద్రగణములకుగాని, మరుద్గణములకుగాని, వసుగణములకుగాని చెందిన దానవా? నాకొక దేవతవలె కన్పించుచున్నావు. ఇంతకును నీవెవరు? (6)

తారలలో శ్రేష్ఠురాలును, సర్వోత్తమగుణ సంపన్నయునై, చంద్రునకుదూరమై దివినుండి భువికి చేరిన రోహిణివా?(7)

చక్కని కనుబొమలుగల ఓ కల్యాణీ! ఓ అసితేక్షణా! ఎవరమ్మా నీవు? రుసరుసలవలనగాని, పొరపాటువలన గాని భర్తయైన వసిష్ఠునికోపమునకు గురియై, ఇక్కడికి వచ్చిన అరుంధతివి కావుగదా! (8)

ఓ సుమధ్యమా! నీపుత్రుడెవరు? తండ్రిఎవరు? సోదరుడెవరు? నీ భర్తఎవరు? పరలోకమునకు చేరిన ఎవరినైననుగూర్చి నీవు దుఃఖించుచున్నావా? (9)

నీరోదనధోరణినిబట్టియు, నిట్టూర్పులరీతిననుసరించియు, నీవు భూతలమును తాకియుండుటవలనను, ఇంకను నీయందలి రాజచిహ్నములకారణముననుసీవు దేవతాస్త్రీవి కావని నాకు తోచుచున్నది. (10)

నీ అవయవచిహ్నములనుబట్టియు, నీ సాముద్రికలక్షణములను అనుసరించియు నీవొక రాజకన్యవనియు, చక్రవర్తికి పట్టపురాణివనియు నేను తలంతును. (11)

రావణునిచే దండకారణ్యమునుండి బలవంతముగా అపహరింపబడి, తీసికొనిరాబడిన సీతాదేవివి నీవేయైనచో నీకు శుభమగుగాక. ఆ విషయములను దయతో నాకు తెలుపుము. (12)

నీ లోకోత్తరరూపమును, దైన్యస్థితిని, తాపసవేషమును బట్టి చూచినచో నీవు నిజముగా శ్రీరామునిపట్టమహిషివే - అని నా విశ్వాసము." (13)

సీతాదేవి హనుమంతుని మాటలనువిని, అతడొనర్చిన రామసంకీర్తనమునకు హర్షితయయ్యెను. పిమ్మట ఆమె చెట్టుక్రిందికిచేరిన హనుమంతునితో ఇట్లనెను. (14)

పృథివ్యాం రాజసింహానాం ముఖ్యస్య విదితాత్మనః।
స్నుషా దశరథస్యాహం శత్రుసైన్యప్రతాపినః। 15

"భూమండలమునగల మహారాజులలో దశరథుడు ప్రముఖుడు, అతడు ప్రజ్ఞాశాలి, శత్రుసైన్యములను పరితపింపజేయువాడు. అట్టి దశరథుని కోడలిని నేను. (15)

దుహితా జనకస్యాహం వైదేహస్య మహాత్మనః।
సీతేతి నామ నామ్నాఽహం భార్యా రామస్య ధీమతః। 16

మహానుభావుడు, విదేహప్రభువైన జనకరాజుయొక్క పుత్రికను. నన్ను 'సీత' అనియందురు. నేను ధీమంతుడైన శ్రీరామునకు భార్యను. (16)

సమా ద్వాదశ తత్రాహం రాఘవస్య నివేశనే।
భుంజానా మానుషాన్ భోగాన్ సర్వకామసమృద్ధినీ। 17

నేను అయోధ్యలో శ్రీరాముని అంతఃపురమున ఏలోటూ లేనిదాననై, సమస్త మానవభోగములను అనుభవించుచు పన్నెండుసంవత్సరములు గడిపితిని. (17)

తతస్త్రయోదశే వర్షే రాజ్యేనేక్ష్వాకునందనమ్।
అభిషేచయితుం రాజా సోపాధ్యాయః ప్రచక్రమే। 18

పిమ్మట పదమూడవ సంవత్సరమున ఇక్ష్వాకు వంశవర్ధనుడైన శ్రీరామునకు యువరాజపట్టాభిషేకమును జరిపించుటకై మహారాజు పురోహితులతోగూడి సర్వసన్నద్ధుడాయెను. (18)

తస్మిన్ సంభ్రియమాణే తు రాఘవస్యాభిషేచనే।
కైకేయీ నామ భర్తారం దేవీ వచనమబ్రవీత్। 19

శ్రీరాముని పట్టాభిషేకనిమిత్తము సకలసన్నాహములు జరుగుచుండగా కైకేయి అనురాణి దశరథమహారాజుతో ఇట్లు పలికెను. (19)

న పిబేయం న ఖాదేయం ప్రత్యహం మమ భోజనమ్।
ఏష మే జీవితస్యాంతో రామో యద్యభిషిచ్యతే। 20

"శ్రీరాముని యువరాజుగాజేసినచో ఈ క్షణమునుండి నాజీవితాంతమువఱకును అన్నపానాదులను ముట్టనేముట్టను.(20)

యత్తదుక్తం త్వయా వాక్యం ప్రీత్యా నృపతిసత్తమ।
తచ్చేన్న వితథం కార్యం వనం గచ్ఛతు రాఘవః। 21

ఓ మహారాజా! నామీదిప్రేమతోలోగడ నాకు వాగ్దానము చేసియుంటివి. ఆ మాటను నిలబెట్టుకొనుటకై రాముని వనములకు పంపుము." (21)

స రాజా సత్యవాగ్దేవ్యా వరదానమనుస్మరన్।
ముమోహ వచనం శ్రుత్వా కైకేయ్యాః క్రూరమప్రియమ్। 22

సత్యవాక్పరిపాలకుడైన ఆ మహారాజు కైకేయీదేవికి ఇచ్చిన వరములనే స్మరించుచు, కర్ణకఠోరమైన, అప్రియమైన ఆమె పలుకులనువిని మూర్ఛిల్లెను. (22)

తతస్తు స్థవిరో రాజా సత్యే ధర్మే వ్యవస్థితః।
జ్యేష్ఠం యశస్వినం పుత్రం రుదన్ రాజ్యమయాచత। 23

అనంతరము, వృద్ధుడైన ఆ రాజు సత్యమునకును ధర్మమునకును కట్టుబడినవాడై, ఏడ్చుచు, తండ్రి మాటను జవదాటనివాడగు జ్యేష్ఠపుత్రుడైన శ్రీరాముని భరతునికై రాజ్యమును యాచించెను. (23)

స పితుర్వచనం శ్రీమాన్ అభిషేకాత్పరం ప్రియమ్।
మనసా పూర్వమాసాద్య వాచా ప్రతిగృహీతవాన్। 24

సకలసద్గుణరాశియైన ఆ శ్రీరాముడు తండ్రిఆజ్ఞను పట్టాభిషేకముకంటెను గొప్పదిగా భావించి, మనస్ఫూర్తిగా సంతోషముతో దానికంగీకరించి, అందులకు తన ఆమోద(వచన)మును దెల్పెను. (24)

దద్యాన్న ప్రతిగృహ్ణీయాత్ న బ్రూయాత్ కించిదప్రియమ్।
అపి జీవితహేతోర్వా రామస్సత్యపరాక్రమః। 25

శ్రీరాముడు సత్యపరాక్రముడు. ఎట్టి క్లిష్టపరిస్థితులలోగూడ ఆడినమాట తప్పడు. ఆయన ఇతరులకు దానముచేయునే గాని ఇతరులనుండి ఏమియు ప్రతిగ్రహింపడు. ఎవ్వరితోడను ఏమాత్రమైనను అప్రియముగా మాట్లాడడు. (25)

స విహాయోత్తరీయాణి మహార్హాణి మహాయశాః।
విసృజ్య మనసా రాజ్యం జనన్యై మాం సమాదిశత్। 26

మిక్కిలివాసిగాంచిన శ్రీరాముడు అమూల్యములైన పట్టువస్త్రములను ఆభరణములను విసర్జించి, వల్కలములను ధరించి, మనస్ఫూర్తిగా రాజ్యమును త్యజించి, తన తల్లియైన కౌసల్యాదేవికడ ఉండుమని నన్నాదేశించెను. (26)

సాహం తస్యాగ్రతస్తూర్ణం ప్రస్థితా వనచారిణీ।
నహి మే తేన హీనాయా వాసస్స్వర్గేఽపి రోచతే। 27

శ్రీరాముని సాహచర్యములేని స్వర్గవాసముగూడ నాకు రుచింపదు. అందువలన వెంటనే వనవాసమునకు సన్నద్ధనై ఆయనకంటెను ముందుగానే బయలుదేఱితిని. (27)

ప్రాగేవ తు మహాభాగః సౌమిత్రిర్మిత్రనందనః।
పూర్వజస్యానుయాత్రార్థే ద్రుమచీరైరలంకృతః। 28

నిర్మలమైనమనస్సుగలవాడును, మిత్రులచే ప్రశంసింప బడువాడును, (మిత్రులను ఆనందింప జేయువాడును) సుమిత్రాదేవి కుమారుడును అగు లక్ష్మణుడు నాకంటె ముందుగనే నారచీరలు ధరించి, అన్నగారిసేవలకై ఆయనను అనుసరించుటకు సన్నద్ధుడయ్యెను. (28)

తే వయం భర్తురాదేశం బహుమాన్య దృఢవ్రతాః।
ప్రవిష్టాః స్మ పురాఽదృష్టం వనం గంభీరదర్శనమ్। 29

మేము రాజగారిఆదేశమును తలదాల్చి, దృఢమైన దీక్షతో కనివిని యెఱుగని దట్టమైన వనమున అడుగిడితిమి.(29)

వసతో దండకారణ్యే తస్యాహమమితౌజసః।
రక్షసాఽపహృతా భార్యా రావణేన దురాత్మనా। 30

మేము దండకారణ్యమున నివసించునప్పుడు అమిత పరాక్రమశాలియగు శ్రీరామునియొక్క భార్యనైన నన్ను దుష్టరాక్షసుడైన రావణుడు అపహరించి, ఇచటికి తీసికొని వచ్చెను. (30)

ద్వౌ మాసౌ తేన మే కాలో జీవితానుగ్రహః కృతః।
ఊర్ధ్వం ద్వాభ్యాం తు మాసాభ్యాం తతస్త్యక్ష్యామి జీవితమ్। 31

రావణుడు నాకు రెండుమాసముల గడువుపెట్టినాడు. అట్టి గడువుముగియగనే నేను ప్రాణత్యాగమును చేసెదను.(31)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే త్రయస్త్రింశస్సర్గః *(33)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదిమూడవసర్గము.

-- * * * --

34. ముప్పదినాలుగవసర్గము

హనుమంతుని యెడల సీత సందేహము, అతడు శ్రీరాముని గుణములను కీర్తించుట

తస్యాస్తద్వచనం శ్రుత్వా హనుమాన్ హరియూథపః।
దుఃఖాద్దుఃఖాభిభూతాయాః సాంత్వముత్తరమబ్రవీత్। 1

వానరశ్రేష్ఠుడైన హనుమంతుడు దుఃఖపరంపరతో క్రుంగిపోవుచున్న ఆ సీతాదేవివచనములను విని, ఆమెను ఓదార్చుచు ఇట్లుపలికెను. (1)

అహం రామస్య సందేశాత్ దేవి దూతస్తవాగతః।
వైదేహి కుశలీ రామః త్వాం చ కౌశలమబ్రవీత్। 2

"ఓ జానకీదేవీ! నేను శ్రీరామునిదూతను. ఆ స్వామి సందేశముతో నీ కడకు వచ్చితిని, శ్రీరాముడు క్షేమముగా ఉన్నాడు. నీకుశలమును అడిగినాడు. (2)

యో బ్రాహ్మమస్త్రం వేదాంశ్చ వేద వేదవిదాం వరః।
స త్వాం దాశరథీ రామో దేవి కౌశలమబ్రవీత్। 3

ఓ దేవీ! దశరథునికుమారుడైన శ్రీరాముడు వేదములను బాగుగాఎఱిగినవాడు, అంతేగాదు, వేదవేత్తలలోశ్రేష్ఠుడు, బ్రహ్మాస్త్రము మొదలగు వివిధ అస్త్రములయందును పారంగతుడు. అతడు నీ క్షేమసమాచారములను తెలిసికొనగోరుచున్నాడు. (3)

లక్ష్మణశ్చ మహాతేజా భర్తుస్తేఽనుచరః ప్రియః।
కృతవాన్ శోకసంతప్తః శిరసా తేఽభివాదనమ్। 4

నీ భర్తయైన శ్రీరామునకు ఇష్టుడు, అనుచరుడైన లక్ష్మణుడు మహాతేజశ్శాలి, అతడు శోకసంతప్తుడై వినయముతో శిరస్సువంచి నీకు ప్రణతులర్పించినాడు. (4)

సా తయోః కుశలం దేవీ నిశమ్య నరసింహయోః।
ప్రీతిసంహృష్టసర్వాంగీ హనూమంతమథాబ్రవీత్। 5

నరశ్రేష్ఠులైన ఆ ఇరువురుసోదరుల కుశలవార్తనువిని సీతాదేవి మిక్కిలిఆనందముతో పొంగిపోయెను. పిమ్మట హనుమంతునితో ఇట్లు పలికెను. (5)

కల్యాణీ బత గాథేయం లౌకికీ ప్రతిభాతి మా।
ఏతి జీవంతమానందో నరం వర్షశతాదపి। 6

"మానవుడు బ్రతికియున్నచో నంద సంవత్సరములకైనను (నిన్నటికైనను) ఆనందమును (సుఖమును) పొందగలడు." అను లోకోక్తి శుభప్రదమైనది, యథార్థమైనది- అని నాకు తోచుచున్నది. (6)

తయా సమాగతే తస్మిన్ ప్రీతిరుత్పాదితాఽద్భుతా।
పరస్పరేణ చాలాపం విశ్వస్తౌ తౌ ప్రచక్రతుః। 7

శ్రీరామునిదూతగావచ్చిన హనుమంతునిపై సీతాదేవికి పూర్తిగానమ్మకముఏర్పడెను. వారిద్దఱును పరమ విశ్వాసముతో పరస్పరము సంభాషింపసాగిరి. (7)

తస్యాస్తద్వచనం శ్రుత్వా హనూమాన్ హరియూథపః।
సీతాయాశ్శోకదీనాయాః సమీపముపచక్రమే। 8

సీతాదేవి పలికిన ఆ మాటలనువిని, కపివరుడైన హనుమంతుడు దీనవదనయైన ఆమెకు చేరువగా రాసాగెను. (8)

యథా యథా సమీపం స హనూమానుపసర్పతి।
తథా తథా రావణం సా తం సీతా పరిశంకతే। 9

హనుమంతుడు తనసమీపమునకు వచ్చుకొలదియు ఆతడు రావణుడేమోయని ఆమె శంకింపసాగెను. (9)

అహో ధిక్! దుష్కృతమిదం కథితం హి యదస్య మే।
రూపాంతరముపాగమ్య స ఏవాయం హి రావణః। 10

తామశోకస్య శాఖాం సా విముక్త్వా శోకకర్శితా।
తస్యామేవానవద్యాంగీ ధరణ్యాం సముపావిశత్। 11

'అయ్యయ్యో! ఈతనిని పూర్తిగానమ్మి, నా కథనంతయు వివరించి, ఎంతయో పొరపాటు చేసితిని. ఈ వానర రూపమునవచ్చినవాడు నిజముగా ఆ రావణుడే.' దివ్యశరీర శోభితయు, శోకార్తయునైన సీతాదేవి అశోక వృక్షముయొక్క కొమ్మనువీడి, నేలపై కూర్చుండెను. (10-11)

హనుమానపి దుఃఖార్తాం తాం దృష్ట్వా భయమోహితామ్।
అవందత మహాబాహుః తతస్తాం జనకాత్మజామ్।
సా చైనం భయవిత్రస్తా భూయో నైవాభ్యుదైక్షత। 12

మహానుభావుడైనహనుమంతుడు దుఃఖార్తయై భయవిహ్వలయైయున్న ఆమెనుజూచి, ఏమియులోచక వెంటనే ఆ జానకికి ప్రణమిల్లెను. అయితే భయాకులయైన సీతాదేవి మాత్రము మఱల ఆయనవైపు తిరిగి చూడలేదు. (12)

తం దృష్ట్వా వందమానం తు సీతా శశినిభాననా।
అబ్రవీద్దీర్ఘముచ్ఛ్వస్య వానరం మధురస్వరా। 13

చంద్రునివలె ఆహ్లాదకరమైన ముఖముగల సీతాదేవి తనకు నమస్కరించుచున్న కపివరునిజూచి, దీర్ఘముగా నిట్టూర్చినదై, సుస్మితముగా ఇట్లనెను. (13)

మాయాం ప్రవిష్టో మాయావీ యది త్వం రావణస్స్వయమ్।
ఉత్పాదయసి మే భూయః సంతాపం తన్న శోభనమ్। 14

నీవు వానరరూపములోవచ్చిన మాయావినైన రావణుడవేయైనచో మఱల నీవు నాకు సంతాపకారకుడవే అగుదువు. ఇది నీకు మంచిదిగాదు. (14)

స్వం పరిత్యజ్య రూపం యః పరివ్రాజకరూపధృత్।
జనస్థానే మయా దృష్టః త్వం స ఏవాసి రావణః। 15

లోగడ నిజరూపమును త్యజించి, సన్న్యాసివేషముతో దండకారణ్యమున నాకు కనబడిన రావణుడవే నీవు. (15)

ఉపవాసకృశాం దీనాం కామరూప నిశాచర।
సంతాపయసి మాం భూయః సంతప్తాం తన్న శోభనమ్। 16

కామరూపుడవైన ఓ నిశాచరా! నేను ఉపవాసములచే కృశించి, శోకసంతప్తనైయున్నదానను. దీనురాలనైయున్న నన్ను పదేపదే సంతాపమునకు గుఱిచేయుట నీకు భావ్యముకాదు. (16)

అథవా నైతదేవం హి యన్మయా పరిశంకితమ్।
మనసో హి మమ ప్రీతిః ఉత్పన్నా తవ దర్శనాత్। 17

లేక నేను శంకించినరీతిగా నీవు నిజముగా రావణుడవు కాకపోవచ్చును. ఏలనన నీదర్శనము నాకు ప్రీతినిగూర్చినది. (17)

యది రామస్య దూతస్త్వమ్ ఆగతో భద్రమస్తు తే।
పృచ్ఛామి త్వాం హరిశ్రేష్ఠ ప్రియా రామకథా హి మే। 18

ఓ కపివరా! నీవు నిజముగనే రామునిదూతవై ఇచటికి వచ్చినచో నీకు శుభమగుగాక. నాకు ప్రియమైన రామకథను వినిపింపుము. (18)

గుణాన్ రామస్య కథయ ప్రియస్య మమ వానర।
చిత్తం హరసి మే సౌమ్య నదీకూలం యథా రయః। 19

ఓ వానరా! నాకు ప్రియమైన రామునిగుణములను గూర్చి తెల్పుము. ప్రవాహవేగము నదీతటములను హరించివేయునట్లు దానివలన నా మనస్తాపమును హరించివేయుదువు. (19)

అహో! స్వప్నస్య సుఖతా యాహమేవం చిరాహృతా।
ప్రేషితం నామ పశ్యామి రాఘవేణ వనౌకసమ్। 20

స్వప్నేఽపి యద్యహం వీరం రాఘవం సహలక్ష్మణమ్।
పశ్యేయం నావసీదేయం స్వప్నోఽపి మమ మత్సరీ। 21

నాహం స్వప్నమిమం మన్యే స్వప్నే దృష్ట్వా హి వానరమ్।
న శక్యోఽభ్యుదయః ప్రాప్తుం ప్రాప్తశ్చాఽభ్యుదయో మమ। 22

కిం ను స్యాచ్చిత్తమోహోఽయం భవేద్వాతగతిస్త్వియమ్।
ఉన్మాదజో వికారో వా స్యాదియం మృగతృష్ణికా। 23

అథవా నాయమున్మాదో మోహోఽప్యున్మాదలక్షణః।
సంబుధ్యే చాహమాత్మానమ్ ఇమం చాపి వనౌకసమ్। 24

ఇత్యేవం బహుధా సీతా సంప్రధార్య బలాబలమ్।
రక్షసాం కామరూపత్వాత్ మేనే తం రాక్షసాధిపమ్। 25

ఏతాం బుద్ధిం తదా కృత్వా సీతా సా తనుమధ్యమా।
న ప్రతివ్యాజహారాథ వానరం జనకాత్మజా। 26

సీతాయాశ్చింతితం బుద్ధ్వా హనుమాన్ మారుతాత్మజః।
శ్రోత్రానుకూలైర్వచనైః తదా తాం సంప్రహర్షయత్। 27

ఆదిత్య ఇవ తేజస్వీ లోకకాంతశ్శశీ యథా।
రాజా సర్వస్య లోకస్య దేవో వైశ్రవణో యథా। 28

విక్రమేణోపపన్నశ్చ యథా విష్ణుర్మహాయశాః।
సత్యవాదీ మధురవాక్ దేవో వాచస్పతిర్యథా। 29

రూపవాన్ సుభగశ్శ్రీమాన్ కందర్ప ఇవ మూర్తిమాన్।
స్థానక్రోధః ప్రహర్తా చ శ్రేష్ఠో లోకే మహారథః।
బాహుచ్ఛాయామవష్టబ్ధో యస్య లోకో మహాత్మనః। 30

అపకృష్యాశ్రమపదాత్ మృగరూపేణ రాఘవమ్। 31

అహో! ఈ స్వప్నము ఎంత సుఖావహమైనది! నేను అపహరింపబడి చాలాకాలమైనది. ఇంతకాలమునకు శ్రీరాముడు దూతగాపంపిన వానరుని నేను ప్రత్యక్షముగా చూచుచున్నాను. (20)

కలలోనైనను లక్ష్మణునితోగూడి వీరుడైన శ్రీరాముడు నాకు కనబడియున్నచో నా పరితాపమంతయును తొలగిపోయి యుండెడిది. (కాని స్వప్నమునందైనను ఆ స్వామిదర్శనము కలుగలేదు) నాయెడ స్వప్నమునకుగూడా అసూయయే. (21)

స్వప్నమున వానరుడు కనబడినచో శుభములు కలుగుటకు అవకాశము ఉండదు. కాని నాకు శుభమే కలిగినది. కనుక దీనిని నేను స్వప్నముగా భావింపను. (22)

ఇది నాకు కలిగిన చిత్తభ్రమయా? వాతప్రకోపమా? ఉన్మాదమువలన కలిగిన వికారమా? లేక ఎండమావులేనా? (23)

నేను పూర్తిగా స్పృహకలిగియేయున్నాను. ఈ వానరునిగూడా గుర్తింపగల్గుచున్నాను. కనుక ఇది ఉన్మాదమేమాత్రమునుగాదు. ఉన్మాదలక్షణమైన మోహముగాదు." (24)

అని[1] ఈ విధముగా సీతాదేవి పరిపరివిధముల బలాబలములనుగూర్చి తర్కించుకొని, రాక్షసులు కామరూపులగుట వలన ఇతడు రావణుడేయని అనుకొనెను. (25)

సౌందర్యవతియైన ఆ సీతాదేవి ఈ విధముగా నిర్ణయించుకొనెను. పిమ్మట ఆమె హనుమంతునితో ఏమియు మాట్లాడక మిన్నకుండెను. (26)

వాయుసుతుడైన హనుమంతుడు ఆమె మనోభావములను ఎఱింగి, చెవులకింపగు మధురవచనములతో ఆమెకు మిక్కిలిసంతోషమును కలిగించెను- "శ్రీరామచంద్రుడు తేజస్సునందుసూర్యుడు, లోకమునకు ఆహ్లాదమునుగూర్చుటలో చంద్రుడు, సకల లోకాధిపత్యమున కుబేరుడు. పరాక్రమ వైభవమున అతడు సర్వలోకవిఖ్యాతుడైన మహావిష్ణువు. సత్యముగా మధురముగా మాట్లాడుటలో సాక్షాత్తుగా బృహస్పతియే. అతడు రమణీయరూపసౌభాగ్యములుగలవాడు, మహా తేజశ్శాలి, మధురాకృతిలోమన్మథుడు, దండింపదగిన వారియెడ అనువైన సమయమున కోపమును చూపువాడు, దండించువాడు. సర్వలోక శ్రేష్ఠుడు, మహారథుడు, మహాత్ముడైన శ్రీరామునిబాహుచ్ఛాయను ఆశ్రయించి, లోకము మనుగడ సాగించును. (27-30)

అట్టి శ్రీరాముని మాయామృగరూపమున ఆకర్షింపజేసి రావణుడు అయనను ఆశ్రమమునకు దూరము గావించెను. పంచవటియందు ఒంటరిగానున్న నిన్ను అతడు అపహరించెను.

1) "రాక్షసులు మహాబలసంపన్నులు. వారితో పోల్చినప్పుడు వానరులబలము అత్యల్పము. మహాసముద్రమును లంఘించుటగాని, ఈ రాక్షసులను తప్పించుకొని ఇక్కడికి చేరుటగాని ఒక వానరమాత్రునకు అసాధ్యము"-

శూన్యే యేనాపనీతాసి తస్య ద్రక్ష్యసి యత్ఫలమ్।
నచిరాద్రావణం సంఖ్యే యో వధిష్యతి వీర్యవాన్। 32

రోషప్రముక్తైరిషుభిః జ్వలద్భిరివ పావకైః।
తేనాహం ప్రేషితో దూతః త్వత్సకాశమిహాగతః। 33

దానిఫలమును అతడు పొందగలడు. త్వరలో మహావీరుడైన శ్రీరాముడు యుద్ధమున అగ్నిజ్వాలలవలె మంటలనుగ్రక్కునట్టి బాణములను రోషావేశముతో ప్రయోగించి, ఆ రావణుని వధించివేయును. ఆ స్వామి పంపగా నేను దూతగా నీ కడకు వచ్చితిని. (31-33)

త్వద్వియోగేన దుఃఖార్తః స త్వాం కౌశలమబ్రవీత్।
లక్ష్మణశ్చ మహాతేజాః సుమిత్రానందవర్ధనః। 34

అభివాద్య మహాబాహుః స త్వాం కౌశలమబ్రవీత్।
రామస్య చ సఖా దేవి సుగ్రీవో నామ వానరః। 35

రాజా వానరముఖ్యానాం స త్వాం కౌశలమబ్రవీత్।
నిత్యం స్మరతి రామస్త్వాం ససుగ్రీవస్సలక్ష్మణః। 36

నీ యెడబాటుకారణమున శ్రీరాముడు దుఃఖార్తుడై యున్నాడు, అతడు నీ కుశలమునడిగెను. సుమిత్రానందవర్ధనుడు, మహాతేజశ్శాలి, మహాబాహువు ఐన లక్ష్మణుడు అభివాదనమొనర్చి, నీక్షేమ సమాచారములను అడిగెను. ఓ దేవీ! సుగ్రీవుడను వానరుడు శ్రీరామునిమిత్రుడు, వానరులకు ప్రభువైన అతడును నీ క్షేమములనరసెను. ఆ రామచంద్రప్రభువు, లక్ష్మణస్వామి, సుగ్రీవుడు అందఱును అనుక్షణము నిన్ను స్మరించుచున్నారు. (34-36)

దిష్ట్యా జీవసి వైదేహి రాక్షసీవశమాగతా।
నచిరాత్ ద్రక్ష్యసే రామం లక్ష్మణం చ మహాబలమ్। 37

మధ్యే వానరకోటీనాం సుగ్రీవం చామితౌజసమ్।
అహం సుగ్రీవసచివో హనుమాన్నామ వానరః। 38

ఓ వైదేహీ! నీవు ఈ రక్కసిమూకలమధ్య ఈదుస్థితికి లోనైనను జీవించియుండుట నిజముగా గొప్పఅదృష్టమే. మహాబలశాలురైన రామలక్ష్మణులను, అసంఖ్యాకమైన వానరసైన్యముతోగూడిన మహాతేజశ్శాలియగుసుగ్రీవుని త్వరలోనే నీవుచూడగలవు. నేను ఆ సుగ్రీవునకు మంత్రిని, వానరుడను, నాపేరుహనుమంతుడు. (37-38)

ప్రవిష్టో నగరీం లంకాం లంఘయిత్వా మహోదధిమ్।
కృత్వా మూర్ధ్ని పదన్యాసం రావణస్య దురాత్మనః। 39

త్వాం ద్రష్టుముపయాతోఽహం సమాశ్రిత్య పరాక్రమమ్।
నాహమస్మి తథా దేవి యథా మామవగచ్ఛసి।
విశంకా త్యజ్యతామేషా శ్రద్ధత్స్వ వదతో మమ। 40

నేను ఆ మహాసముద్రమునుదాటి, ఈలంకానగరమున ప్రవేశించితిని. నా పరాక్రమమునుచూపుచు, దుర్మార్గుడైన రావణుని శిరస్సుపై పాదమునూని, అతని కీర్తిప్రతిష్ఠలను మంటగలిపి, తిరుగులేని వాని యొక్క పరాక్రమమును వమ్మొనర్చి, నీ దర్శనమునకై ఇచటికి ఏతెంచితిని. నీవు అనుకొనుచున్నట్లు నేను కామరూపుడైన రావణుడను కాను, ఈ నీ సందేహమును వీడుము, నా మాటలను విశ్వసింపుము. (39-40)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే చతుస్త్రింశస్సర్గః (34)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదినాలుగవసర్గము.

-- * * * --

35. ముప్పదిఐదవసర్గము

సీత కోరికపై హనుమంతుడు శ్రీరాముని శరీర చిహ్నములను, గుణములను వివరించుట, నరవానరుల మైత్రి విషయమును దెలిపి, యామెకు విశ్వాసమును గలిగించుట.

తాం తు రామకథాం శ్రుత్వా వైదేహీ వానరర్షభాత్।
ఉవాచ వచనం సాంత్వమ్ ఇదం మధురయా గిరా। 1

సీతాదేవి వానరశ్రేష్ఠుడైన హనుమంతునిద్వారా శ్రీరామగాథనువిని, అతనిపై కనికరముచూపుచు మధుర వచనములను ఇట్లు పలికెను. (1)

క్వ తే రామేణ సంసర్గః కథం జానాసి లక్ష్మణమ్।
వానరాణాం నరాణాం చ కథమాసీత్ సమాగమః। 2

యాని రామస్య లింగాని లక్ష్మణస్య చ వానర।
తాని భూయస్సమాచక్ష్వ న మాం శోకస్సమావిశేత్। 3

కీదృశం తస్య సంస్థానం రూపం రామస్య కీదృశమ్।
కథమూరూ కథం బాహూ లక్ష్మణస్య చ శంస మే। 4

ఏవముక్తస్తు వైదేహ్యా హనుమాన్ మారుతాత్మజః।
తతో రామం యథాతత్త్వమ్ ఆఖ్యాతుముపచక్రమే। 5

జానంతీ బత దిష్ట్యా మాం వైదేహి పరిపృచ్ఛసి।
భర్తుః కమలపత్రాక్షి సంస్థానం లక్ష్మణస్య చ। 6

యాని రామస్య చిహ్నాని లక్ష్మణస్య చ యాని వై।
లక్షితాని విశాలాక్షి వదతశ్శృణు తాని మే। 7

రామః కమలపత్రాక్షః సర్వసత్త్వమనోహరః।
రూపదాక్షిణ్యసంపన్నః ప్రసూతో జనకాత్మజే। 8

తేజసాఽఽదిత్యసంకాశః క్షమయా పృథివీసమః।
బృహస్పతిసమో బుద్ధ్యా యశసా వాసవోపమః। 9

రక్షితా జీవలోకస్య స్వజనస్యాభిరక్షితా।
రక్షితా స్వస్య వృత్తస్య ధర్మస్య చ పరంతపః। 10

రామో భామిని లోకస్య చాతుర్వర్ణ్యస్య రక్షితా।
మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః। 11

అర్చిష్మానర్చితోఽత్యర్థం బ్రహ్మచర్యవ్రతే స్థితః।
సాధూనాముపకారజ్ఞః ప్రచారజ్ఞశ్చ కర్మణామ్। 12

నీకు శ్రీరామునితో పరిచయము ఎట్లు ఏర్పడినది? లక్ష్మణుని ఏ విధముగా ఎఱుగుదువు? నరవానరుల సమాగమము జరిగినతీరేమి? (2)

ఓ వానరోత్తమా! రామలక్ష్మణులచిహ్నములు ఎట్టివి? వాటిని పూర్తిగావివరింపుము. వాటిని వినుటవలన నాశోకము తొలగును. (3)

రామలక్ష్మణుల అవయవములపొందిక ఎట్టిది? వారి ఆకారములెట్టివి, ఊరువులు, బాహువులు ఎట్టివి? నాకు వివరింపుము. (4)

సీతాదేవి ఇట్లడుగగా వాయుసుతుడైన హనుమంతుడు శ్రీరాముని రూపరేఖాలావణ్యములను యథాతథముగా వివరించుటకు ఉపక్రమించెను. (5)

కమలపత్రములవంటి కన్నులుగల ఓ సీతాదేవీ! నీ భర్తయైన రామునియొక్క, మఱదియైన లక్ష్మణునియొక్క అవయవ సౌభాగ్యములను నీవు ఎఱుగుదువు. ఐనను నీవు నన్నడుగుట నా అదృష్టము, చాలాసంతోషము. (6)

ఓ విశాలాక్షీ! శ్రీరామునిచిహ్నములను, లక్ష్మణునిలక్షణములను నాకు తెలిసినంతవఱకు వివరించెదను వినుము. (7)

ఓ జానకీ! శ్రీరాముడు కమలపత్రములవంటి కన్నులు గలవాడు. తన నిరుపమానకాంతిచే సమస్త ప్రాణులకును ఆనందమును గూర్చువాడు, పుట్టుకతోనే అతడు చక్కనిదేహసౌందర్యము, గుణసంపదయు గలవాడు. (8)

అతడు తేజస్సున సూర్యునివంటివాడు, సహనమునందు భూదేవితోతుల్యుడు, బుద్ధియందు బృహస్పతి, యశస్సుచే దేవేంద్రుడు. (9)

సర్వప్రాణులకును సంరక్షకుడు, విశేషముగా తనను ఆశ్రయించిన (శరణుజొచ్చిన) వారిని పరిరక్షించువాడు, లోకమునకు ఆదర్శప్రాయమైన తనప్రవర్తన విషయమున జాగ్రతిగలవాడు, ధర్మరక్షకుడు, శత్రువులను రూపుమాపువాడు. (10)

ఓ సీతాదేవీ! అతడు నాలుగువర్ణములవారినీ రక్షించువాడు, లోకమర్యాదలను తాను పాటించుచు ఇతరులచే పాటింపజేయువాడు. (11)

కాంతిమంతుడు, సర్వలోకములకును అత్యంత పూజ్యుడు, బ్రహ్మచర్యవ్రతమును పాటించువాడు, సత్పురుషులొనర్చు ఉపకారములనుమఱవని వ్యవహార జ్ఞానసంపన్నుడు, లోకకల్యాణమునకై కర్మలను ఆచరించువాడు. ఇతరులచే ఆచరింపజేయువాడు.[1] (12)

1) *యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః। స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే (భగవద్గీత 3/21)*
(శ్రేష్ఠుడైన పురుషుని ఆచరణమునే (ప్రవర్తననే) ఇతరులును అనుసరింతురు. అతడు నిల్పిన (ప్రతిష్ఠించిన) ప్రమాణములనే లోకులందఱును పాటించెదరు.

రాజవిద్యావినీతశ్చ బ్రాహ్మణానాముపాసితా।
శ్రుతవాన్ శీలసంపన్నో వినీతశ్చ పరంతపః। 13

రాజవిద్యాకుశలుడు, బ్రాహ్మణులను ఆదరించువాడు, సర్వవిద్యాపారంగతుడు, సదాచారసంపన్నుడు, వినయశోభితుడు, శత్రుభయంకరుడు.[1] (13)

యజుర్వేదవినీతశ్చ వేదవిద్భిస్సుపూజితః।
ధనుర్వేదే చ వేదేషు వేదాంగేషు చ నిష్ఠితః। 14

రాముడు యజుర్వేదమునందు పారంగతుడు, ధనుర్వేదము నందును, ఋక్సామాథర్వవేదముల యందును, శిక్షాది వేదాంగములయందును నిష్ణాతుడు, వేదపండితులచే పూజింపబడుచుండువాడు. (14)

విపులాంసో మహాబాహుః కంబుగ్రీవః శుభాననః।
గూఢజత్రుస్సుతామ్రాక్షో రామో దేవి జనైః శ్రుతః। 15

ఓ సీతాదేవీ! రాముడు విశాలములైనభుజములు, దీర్ఘములైన బాహువులు, శంఖమునంటి కంఠముగలవాడు, శుభప్రదమైన ముఖముగలవాడు, కండరములలో మూసికొనిపోయిన సంధియెముకలుగలవాడు, మనోహరములైన ఎఱ్ఱనికన్నులుగలవాడు, లోకవిఖ్యాతుడు. (15)

దుందుభిస్వననిర్ఘోషః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్।
సమస్సమవిభక్తాంగో వర్ణం శ్యామం సమాశ్రితః। 16

అతడు దుందుభిధ్వనివలె గంభీరమైనకంఠస్వరము గలవాడు, నిగనిగలాడు శరీరచ్ఛాయగలవాడు, ప్రతాపశాలి, ఎక్కువతక్కువలులేకుండా పరిపుష్టములైన చక్కని అవయవములుగలవాడు, మేఘశ్యామవర్ణ శోభితుడు. (16)

త్రిస్థిరస్త్రిప్రలంబశ్చ త్రిసమస్త్రిషు చోన్నతః।
త్రితామ్రస్త్రిషు చ స్నిగ్ధో గంభీరస్త్రిషు నిత్యశః। 17

వక్షఃస్థలము, మణికట్టు, పిడికిలి–ఈ మూడు స్థానములను దృఢముగా[1] గలవాడు. (ఇవి రాజలక్షణములు), దీర్ఘములైన కనుబొమలు, బాహువులు, ముష్కములు గలవాడు[2] (ఇవి సంపన్నుల లక్షణములు) తలవెంట్రుకలు, ముష్కములు, మోకాళ్లు- ఈ మూడును సమప్రమాణమునగలవాడు.[3] (ఇవి రాజలక్షణములు) ఉన్నతమైననాభి, పొట్ట(కుక్షి), వక్షఃస్థలముగలవాడు,[4] (ఇవియు రాజలక్షణములు) ఎఱ్ఱని నేత్రాంతములు, నఖములు, అఱచేతులు, అఱికాళ్లు గలవాడు,[5] (ఇవి సుఖపురుషునిలక్షణములు) నునుపైన పాదరేఖలు, కేశములు, లింగమణియుగలవాడు.[6] (ఇవి భాగ్యవంతుని లక్షణములు) ఆయన కంఠస్వరము, నడక, నాభి గంభీరములైనవి.[7] (ఇవి ప్రశంసాపాత్రుని లక్షణములు) (17)

---

1) ఆన్వీక్షకీత్రయీ వార్తాదండనీతిశ్చ శాశ్వతీ। విద్యాశ్చతస్రస్తు లోకసంస్థితి హేతవః॥
ఆన్వీక్షకీ, త్రయి, వార్త, దండనీతి, ఈ నాల్గు లక్షణములను కల్గియుండు రాజే లోకకల్యాణమును గూర్చగలడు.

1. ఉరశ్చ మణి బంధశ్చ ముష్టిశ్చ నృపతేః స్థిరాః।
2. దీర్ఘ భ్రూబాహు ముష్కస్తు చిరంజీవి ధనీ నరః।
3. కేశాగ్రం, వృషణం, జాను సమా యస్య స భూపతిః।
4. నాభ్యంతఃకుక్షివక్షోభిరున్నతః క్షితిపో భవేత్।
5. నేత్రాంతనఖ పాణ్యంఘ్రితలై స్తామ్రైః త్రిభిఃసుఖీ।
6. స్నిగ్ధాభవంతివై యేషాం పాదరేఖాః శిరోరుహాః। తథాలింగమణిస్త్వేషాం, మహాభాగ్యం వినిర్దిశేత్॥
7. స్వరే గతౌచ నాభౌచ గంభీరః త్రిషు శస్యతే।

త్రివలీవాంస్త్ర్యవనత: చతుర్వ్యంగస్త్రిశీర్షవాన్।
చతుష్కలశ్చతుర్లేఖ: చతుష్కిష్కుశ్చతుస్సమ:। 18

శ్రీరాముని ఉదరముపై లేక కంఠమునందు త్రిరేఖలు గలవు. (మూడు ముడుతలుగలవాడు) స్తనములు, స్తనాగ్రములు, పాదరేఖలు నిమ్నముగా నుండును.[1] ఆయన కంఠము, లింగము, వీపు, పిక్కలు హ్రస్వములుగా నుండును.[1అ] (ఇవి పూజ్యుని లక్షణములు) శిరస్సుపై మూడుసుడులు గలవాడు.[2] (ఇవి మహారాజలక్షణములు) నాలుగువేదములను సూచించు రేఖలుగలవాడు, అనగా బొటనవ్రేలి మొదటను, నొసటిపైనను, అఱచేతులలోను, అఱికాళ్లలోను నాలుగేసి రేఖలుగలవు.[3] (ఇవి వేదపారంగతుని లక్షణములు) లలాట, పాద, పాణి తలములయందు నాలుగురేఖలు గలవాడు.[4] (ఇవి ఆయుర్దాయమును, మహారాజలక్షణములను సూచించును) అతడు తొంబదియాఱు అంగుళముల (4 మూరల) ఎత్తైనవాడు.[5] దేవతాసమానుడు. (ఇవి దివ్యపురుషుని లక్షణములు), ఆయన బాహువులు, మోకాళ్లు, ఊరువులు, పిక్కలు అనునవి (నాల్గును) హెచ్చు తగ్గులులేకుండా సమానముగా నుండువాడు.[6] (18)

చతుర్దశసమద్వంద్వ: చతుర్దంష్ట్రశ్చతుర్గతి:।
మహోష్ఠహనునాసశ్చ పంచస్నిగ్ధోఽష్టవంశవాన్। 19

పదునాలుగుజతలు అనగా కనుబొమ్మలు, నాసికా పుటములు, నేత్రములు, చెవులు, పెదవులు, స్తనాగ్రములు, మోచేతులు, మణికట్టులు, మోకాళ్లు, ముష్కములు, పిఱుదులు, చేతులు, పాదములు, పిఱుదులపై ఎత్తైన కందరములు సమప్రమాణములోగలవాడు.[7] (ఇవి రాజ లక్షణములు) అతడు నాలుగుదంష్ట్రలు, (సూదివలె మొనదేలిన దంతములు) కలవాడు[8] (రెండు పలువరుసలలో మధ్యగల నాలుగుదంతములకును ప్రక్కనదున్న నాలుగుపండ్లకును 'దంష్ట్రలు' అనుపేరు ప్రసిద్ధము) నాలుగు మృగముల

---

1. **పీనోపచితై: నిమ్నై: క్షితిపతయశ్చూచుకైఃస్తనై: । సులిన:స్నిగ్ధా నిమ్నా రేఖా ధనినాం తద్వ్యత్యయేన నిస్వానాం॥**
స్తనములుపుష్టములై నిమ్నముగానుండుట రాజలక్షణము. స్తనాగ్రములు, పాదరేఖలు లోతుగానుండుట ధనికలక్షణము, తద్భిన్నముగానుండుట దరిద్రలక్షణము.

1అ. **గ్రీవాప్రజననం పృష్ఠం హ్రస్వం జంఘాచ పూజ్యతే ।** 2. **ఆవర్తత్రయంరుచిరం యస్యశిర: సక్షితి భృతాం నేతా ।**

3. **మూలేఽంగుష్ఠస్య వేదానాం, చతస్రస్తిస ఏవవా । ఏకా, ద్వేవా యథాయోగం, రేఖా జ్ఞేయాద్విజన్మనామ్ ॥**
అంగుష్ఠము మొదట ఎన్నిరేఖలుండునో అన్నివేదములలో ప్రావీణ్యముండును.

4.1) **లలాటేయస్యదృశ్యన్తే చతుస్త్రి ద్వ్యేకరేఖికా: । శతద్వయం, శతం, షష్టి:, తస్యాయుర్వింశతిస్తథా ॥**
లలాటముపై నాలుగురేఖలున్నచో 200 సం॥లు ఆపైన, మూడురేఖలున్నచో 100 సం॥లు, రెండు రేఖలున్నచో 60 సం॥లు, ఒకరేఖయున్నచో 20 ॥ సం॥ అంతకు లోపల ఆయుర్దాయము ఉండును.

2) **యస్య పాదతలేవజ్రధ్వజశంఖాంకుశోపమా: । రేఖా: సమ్యక్ ప్రకాశన్తే మనుజేంద్రం తమాదిశేత్ ॥**
అఱికాలిలో వజ్ర, ధ్వజ, శంఖ - అంకుశ - ఆకారములలో రేఖలున్నవాడు చక్రవర్తియగును.

3) **పాణౌ చతస్రో రేఖాశ్చ యస్యతిష్ఠంత్యభంగురా:** - కరతలమునందును భంగము కాకుండ నాలుగురేఖలున్నవాడు చక్రవర్తియగును.

5. **షణ్ణవత్యంగులోత్సేధో య: పుమాన్ స దివౌకస: ।**

6. **బాహూజానూరు జంఘాశ్చ చత్వార్యథసమాని చ ।**

7. **భ్రువౌనాసాపుటే నేత్రే, కర్ణావోష్ఠౌ చ చూచుకే ।**
కూర్పరామణిబంధౌ చ, జానునీ వృషణౌ కటీ । కరౌ పాదౌస్ఫిజౌ యస్య సమౌజ్ఞేయ స్వభూపతి: ॥

8. **స్నిగ్ధా ఘనాశ్చ దశనా: సుతీక్ష్ణదంష్ట్రా స్సమాశ్చ శుభా:** - కాంతిగలవి, సునుపైనవి, పెద్దవి, మొనదేలినవి, సమములు ఐన దంష్ట్రములు మంగళకరములు."

దశపద్మో దశబృహత్ త్రిభిర్వ్యాప్తో ద్విశుక్లవాన్।
షడున్నతో నవతనుః త్రిభిర్వ్యాప్నోతి రాఘవః। 20

(సింహము, పెద్దపులి, ఏనుగు, వృషభము) నడకవంటి నడకగలవాడు.(1) అందమైన పెదవులు, చుబుకము, నాసికగలవాడు.(1అ) (ఇవి రాజలక్షణములు) ఓ దేవీ! ఆ రాముడు నిగనిగలాడు నేత్రములు, పలువరుస, చర్మము, పాదములు, కేశములుగలవాడు.(2) (ఇవి సుఖ పురుషలక్షణములు,) జానకీ! ఆయన శరీరము, చేతివ్రేళ్లు, కాలివ్రేళ్లు, కరములు, నాసిక, నయనములు, కర్ణములు, ప్రజనము అను అష్టవంశములు తగినప్రమాణములో గలవాడు.(3) (19)

శ్రీరాముడు పద్మములవంటిముఖము,నేత్రములు, నోరు, నాలుక, పెదవులు, దవడలు, స్తనములు, గోళ్లు, హస్తములు, పాదములుగలవాడు.(4) అతడు శ్రేష్ఠమైన శిరస్సు, లలాటము, చెవులు, కంఠము, వక్షము, హృదయము, నోరు, చేతులు, కాళ్లు, వీపు అను పదిఅవయములు గలవాడు.(5) ఆ శ్రీరాముని తేజస్సు, యశస్సు, సంపదలు సర్వలోక ప్రసిద్ధములు.(6) పవిత్రములైన మాతృ పితృ వంశములు గలవాడు, మఱియు స్వచ్ఛములైన దంతములు, నేత్రములు గలవాడు.(7) చంకలు, ఉదరము, వక్షస్థలము, నాసిక, భుజములు, లలాటము అను ఉన్నతములైన ఆఱు అంగములు గలవాడు.(8) సూక్ష్మములైన వ్రేళ్లకణుపులు, వెంట్రుకలు, రోమములు, గోళ్లు చర్మము, లింగము, మీసము, దృష్టి, బుద్ధి-గలవాడు.(9) పూర్వాహ్ణము, మధ్యాహ్నము, అపరాహ్ణము అను త్రికాలముల యందును ధర్మార్థకామములను ఆచరించుచుండువాడు.(10) (20)

1. గజసింహాగతీ వీరా శార్దూల వృషభోపమౌ ।
1అ. బంధుజీవకుసుమోపమోఽధరో, మాంసలోరుచిరబింబరూపధృత్ ।
పూర్ణమాంసలహనుస్తుభూమిపః తుంగతుండరుచిరాకృతిస్తథా ॥ మంకెనపూవువలెను, దొండపండువలెను ఎఱ్ఱనై నిగ్గలిగి బలిష్ఠమై మనోహరమైన అధరము, పరిపూర్ణమైన గడ్డము, ఉన్నతమైన నాసిక. - అనునవి రాజలక్షణములు.
2. కేశనేత్రదంతత్వక్ పాదతలాని -పంచస్నిగ్ధాః
చక్షుస్స్నేహేన సౌభాగ్యం, దంత స్నేహేన భోజనమ్ ।
త్వచస్స్నేహేన శయనం, పాదస్నేహేన వాహనమ్ ।
స్నిగ్ధనీల మృదుకుంచితాస్తథా, మూర్ధజాస్సుఖ కరాస్సమంశిరః ॥
మనోహరమైననేత్రములు సౌభాగ్యమును, దంతములు భోజనసౌఖ్యమును, చర్మము-శయనసౌఖ్యమును, పాదములు వాహనసౌఖ్యమును, కేశములు సుఖములను కలిగించును.
3. అష్టవంశశ్శరీరంచ హస్తపాదాంగుళీశిరా । నాసికాచక్షుషీ కర్ణౌ ప్రజనోయస్యచాహతాః ॥
4. ముఖనేత్రాస్య జిహ్వోష్ఠతాలుస్తననఖాః కరౌ । పాదౌచ దశపద్మాని పద్మాకారాణి యస్య చ ॥
5. శిరోలలాటే శ్రవణే గ్రీవా వక్షశ్చ హృత్తథా । ఉదరం పాణి పాదౌ చ పృష్ఠం దశ బృహంతి చ ॥
6. త్రిభిర్వ్యాప్తిశ్చయస్యస్యాత్ । తేజసా, యశసా, శ్రియా ॥
7. ద్వౌశుక్లౌశుభౌశుద్ధౌ । వంశౌ మాతుః పితుస్తథా ॥ ద్వేదంతనేత్రే శుక్లే యస్యసః ద్విశుక్లవాన్ ॥
8. కక్షఃకుక్షిశ్చ వక్షశ్చ ఘ్రాణః స్కంధోలలాటికా । సర్వభూతేషు నిర్దిష్టా ఉన్నతాంగాస్సుఖప్రదాః ॥
9. కేశశ్మశ్రునఖలోమత్వగంగుళిపర్వశేఫోబుద్ధి దర్శినాని- నవ తనవః
10. ధర్మార్థకామః కాలేషు త్రిషుయస్యస్వనుష్ఠితాః ।

సత్యధర్మపరశ్శ్రీమాన్ సంగ్రహానుగ్రహే రతః।
దేశకాలవిభాగజ్ఞః సర్వలోక ప్రియంవదః। 21

భ్రాతా చ తస్య ద్వైమాత్రః సౌమిత్రిరపరాజితః।
అనురాగేణ రూపేణ గుణైశ్చైవ తథావిధః। 22

స సువర్ణచ్ఛవిః శ్రీమాన్ రామశ్శ్యామో మహాయశాః।
తావుభౌ నరశార్దూలౌ త్వద్దర్శనసముత్సుకౌ। 23

విచిన్వంతౌ మహీం కృత్స్నామ్ అస్మాభిరభిసంగతౌ।
త్వామేవ మార్గమాణౌ తౌ విచరంతౌ వసుంధరామ్। 24

దదర్శతుః మృగపతిం పూర్వజేనావరోపితమ్।
ఋశ్యమూకస్య పృష్ఠే తు బహుపాదపసంకులే।
భ్రాతుర్భయార్తమాసీనం సుగ్రీవం ప్రియదర్శనమ్। 25

వయం తు హరిరాజం తం సుగ్రీవం సత్యసంగరమ్।
పరిచర్యామహే రాజ్యాత్ పూర్వజేనావరోపితమ్। 26

తతస్తౌ చీరవసనౌ ధనుఃప్రవరపాణినౌ। 27

ఋశ్యమూకస్య శైలస్య రమ్యం దేశముపాగతౌ।
స తౌ దృష్ట్వా నరవ్యాఘ్రౌ ధన్వినౌ వానరర్షభః। 28

అవప్లుతో గిరేస్తస్య శిఖరం భయమోహితః।
తతస్స శిఖరే తస్మిన్ వానరేంద్రో వ్యవస్థితః।
తయోస్సమీపం మామేవ ప్రేషయామాస సత్వరమ్। 29

తావహం పురుషవ్యాఘ్రౌ సుగ్రీవవచనాత్ ప్రభూ। 30

రూపలక్షణసంపన్నౌ కృతాంజలిరుపస్థితః।
తౌ పరిజ్ఞాతతత్త్వార్థౌ మయా ప్రీతిసమన్వితౌ। 31

పృష్ఠమారోప్య తం దేశం ప్రాపితౌ పురుషర్షభౌ।
నివేదితౌ చ తత్త్వేన సుగ్రీవాయ మహాత్మనే। 32

తయోరన్యోఽన్యసల్లాపాత్ భృశం ప్రీతిరజాయత।
తతస్తౌ ప్రీతిసంపన్నౌ హరీశ్వరనరేశ్వరౌ।
పరస్పరకృతాశ్వాసౌ కథయా పూర్వవృత్తయా। 33

ఆ శ్రీరాముడు సకలైశ్వర్యసంపన్నుడు, సత్యభాషణము నందును, ధర్మాచరణమునందును నిరతుడు, ధర్మమార్గమున ధనమునార్జించి, పాత్రులకు దానము చేయువాడు, దేశకాలములకు అనువుగా ప్రవర్తించువాడు, అందఱితోడను ప్రియముగా మాట్లాడెడివాడు. (21)

శ్రీరామునిసోదరుడైన లక్ష్మణుడు, ఇద్దఱు తల్లుల (కౌసల్యాసుమిత్రల) ముద్దులకొడుకు. అతడు అనురాగముచేతను, రూపగుణములచేతను పూర్తిగా రామునివంటివాడే. అతడు సాటిలేనివీరుడు, వాసికెక్కిన శ్రీరాముడు మేఘశ్యాముడు, లక్ష్మణుడేమో బంగారు వన్నెవాడు. ఆ పురుషశ్రేష్ఠులిద్దఱును నిన్ను చూడవలెనని కుతూహలపడుచున్నారు. (22-23)

ఆ సోదరులిద్దఱును నిన్నేవెదకుచు, భూతలమునందు అంతటను గాలించుచు, నేల నాలుగు చెఱగుల యందును తిరుగుచు మా సమీపమునకు వచ్చిరి. (24)

వానరరాజైన సుగ్రీవుడు తన అన్నయైనవాలిచే రాజ్యబహిష్కృతుడై అతనికి భయపడి దట్టమైనచెట్లుగల ఋశ్యమూకపర్వతముపై నివసించుచుండెను. ప్రియదర్శనుడైన ఆ సుగ్రీవుని రామ లక్ష్మణులు అచట చూచిరి. (25)

అగ్రజుడైనవాలిచే రాజ్యభ్రష్టుడైనను, సత్యప్రతిజ్ఞుడై వానరప్రభువైన సుగ్రీవుని మేము సేవించుచున్నాము. (26)

అనంతరము నారచీరలనుధరించినవారును, ధనుర్బాణములను చేతబట్టినవారును, నరశ్రేష్ఠులును అగు రామలక్ష్మణులు రమ్యమైన ఆ ఋశ్యమూకపర్వత ప్రాంతమునకు చేరిరి. ధనుర్ధారులైన ఆ నరవరులను ఆ కపీంద్రుడు చూచెను. (27-28)

వారినిజూచి సుగ్రీవుడు భయకంపితుడై ఒక్క గంతులో పర్వతశిఖరమునుచేరి, అచటనే నిలబడెను. పిమ్మట వెంటనే వారికడకు నన్నే పంపెను. (29)

సుగ్రీవాజ్ఞననుసరించి నేను సర్వసమర్థులును, చక్కని రూపరేఖలుగలవారును, సద్గుణసంపన్నులును అగు ఆ నరవరులను సమీపించి, అంజలిఘటించి నిలిచితిని. వారు నావలన సుగ్రీవుని యథార్థవృత్తాంతమును దెలిసికొని, సంతోషపడిరి. పిమ్మట వారిని నేను నా భుజములపై ఎక్కించుకొని, ఆ పర్వతప్రదేశమునకు చేర్చితిని. వారి వాస్తవవిశేషములను మహాత్ముడైన సుగ్రీవునకు నివేదించితిని. (30-32)

ఆ రామసుగ్రీవులిరువురును అరమరికలులేకుండా మాట్లాడుకొనుటవలన వారిమధ్య దృఢస్నేహము ఏర్పడెను. పిదప ఆనరవానరప్రముఖులు దృఢమైన ప్రేమాదరములతో తమతమ పూర్వవృత్తాంతములను తెలుపుకొని పరస్పరము ఊరటనుపొందిరి. (33)

తతస్స సాంత్వయామాస సుగ్రీవం లక్ష్మణాగ్రజః।
స్త్రీహేతోర్వాలినా భ్రాత్రా నిరస్తమురుతేజసా। 34

తతస్త్వన్నాశజం శోకం రామస్యాక్లిష్టకర్మణః।
లక్ష్మణో వానరేంద్రాయ సుగ్రీవాయ న్యవేదయత్। 35

స శ్రుత్వా వానరేంద్రస్తు లక్ష్మణేనేరితం వచః।
తదాసీన్నిష్ప్రభోఽత్యర్థం గ్రహగ్రస్త ఇవాంశుమాన్। 36

తతస్త్వద్గాత్రశోభీని రక్షసా హ్రియమాణయా।
యాన్యాభరణజాలాని పాతితాని మహీతలే। 37

తాని సర్వాణి రామాయ ఆనీయ హరియూథపాః।
సంహృష్టా దర్శయామాసుః గతిం తు న విదుస్తవ। 38

తాని రామాయ దత్తాని మయైవోపహృతాని చ। 39

స్వనవంత్యవకీర్ణాని తస్మిన్ విగతచేతసి।
తాన్యంకే దర్శనీయాని కృత్వా బహువిధం తవ। 40

తేన దేవప్రకాశేన దేవేన పరిదేవితమ్।
పశ్యతస్తాని రుదతః తామ్యతశ్చ పునఃపునః। 41

ప్రాదీపయన్ దాశరథేః తాని శోకహుతాశనమ్। 42

శయితం చ చిరం తేన దుఃఖార్తేన మహాత్మనా।
మయాపి వివిధైర్వాక్యైః కృచ్ఛ్రాదుత్థాపితః పునః। 43

తాని దృష్ట్వా మహాబాహుః దర్శయిత్వా ముహుర్ముహుః।
రాఘవస్సహ సౌమిత్రిః సుగ్రీవే సన్న్యవేదయత్। 44

స తవాదర్శనాదార్యే రాఘవః పరితప్యతే।
మహతా జ్వలతా నిత్యమ్ అగ్నినేవాగ్నిపర్వతః। 45

త్వత్కృతే తమనిద్రా చ శోకశ్చింతా చ రాఘవమ్।
తాపయంతి మహాత్మానమ్ అగ్న్యాగారమివాగ్నయః। 46

తవాదర్శనశోకేన రాఘవః ప్రవిచాల్యతే।
మహతా భూమికంపేన మహానివ శిలోచ్చయః। 47

అనంతరము మిక్కిలి తేజశ్శాలియైన అన్నయగు వాలిచే స్త్రీనిమిత్తముగా వెళ్లగొట్టబడినసుగ్రీవుని శ్రీరాముడు ఓదార్చెను. (34)

తదుపరి ఎట్టిదుష్కరములైన కార్యములనైనను అవలీలగా సాధించు రామునకు నీయెడబాటువలన కలిగిన శోకమును గూర్చి లక్ష్మణుడు సుగ్రీవునకు పూర్తిగా వివరించెను. (35)

లక్ష్మణుడు తెలిపిన విషయములను విఁటింగినవాడై, ఆ సుగ్రీవుడు గ్రహగ్రస్తుడైనసూర్యునివలె మిక్కిలి కాంతిహీనుడయ్యెను. (36)

రావణుడు నిన్ను అపహరించుకొని పోవునప్పుడు నీవు నీ శరీరముపై శోభిల్లుచున్న ఆభరణములను భూమిపై పడవేసితివి. వాటిని అన్నింటిని వానరవీరులు తీసికొని వచ్చి, సంతోషముతో శ్రీరామునకు చూపిరి. కాని రావణుడు నిన్నుకొనిపోయినమార్గమును మాత్రము తెలుపలేకపోయిరి. (37-38)

లోగడ ఆ ఆభరణములు ధ్వనిచేయుచు క్రిందబడినప్పుడు వాటిని నేనే సేకరించి సుగ్రీవునకు అప్పగించితిని. ఆ నగలను సుగ్రీవుడు శ్రీరామునకు సమర్పించెను. వాటిని చూచిన వెంటనే శ్రీరాముడు స్పృహను కోల్పోయెను. సుందరములైన నీ ఆభరణములను దివ్యస్వరూపుడైన శ్రీరాముడు తన యొడిలోనుంచుకొని, పరిపరివిధముల పరితపింపసాగెను. రాముడు వాటిని పదేపదే చూచుచు, రోదించుచుండెను. ఈ విధముగ అవి ఆయన శోకాగ్నిని ప్రజ్వలింపజేయుచుండెను. (39-42)

ఆ మహాత్ముడు మిక్కిలిదుఃఖముతో చాలాసేపు నేలపై స్పృహలేక పడియుండెను. అప్పుడు నేను పెక్కు సాంత్వన వచనములతో అతికష్టముమీద ఆయనను లేవదీసి కూర్చుండబెట్టితిని. (43)

మహాబాహువైన శ్రీరాముడు లక్ష్మణసహితుడై ఆ నగలనుచూచి, పదే పదే ప్రక్కనఉన్నవారికి చూపించుచు, సుగ్రీవుని చేతులలో పెట్టెను. (44)

ఓ పూజ్యురాలా! నీవు కనబడకపోవుటచే ఆ శ్రీరాముడు నిత్యము ప్రజ్వలించుచున్నమహాగ్నిచేత అగ్నిపర్వతమువలె తపించుచున్నాడు. (45)

నీయెడబాటు కారణముగా నిద్రలేమి, శోకము, చింత మహాత్ముడైన ఆ రాముని అగ్నిగృహమును (అగ్ని కార్యములు నిర్వహింపబడుగృహమును) అగ్నులవలె (దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్నుల వలె) తపింప జేయుచున్నవి. (46)

నీవు కనబడనికారణమున శోకమునకులోనైన రాఘవుడు మిక్కిలి భయంకరమైన భూకంపముచే ఒక మహాపర్వతమువలె ఎంతయో చలించి పోవుచున్నాడు. (47)

కాననాని సురమ్యాణి నదీః ప్రస్రవణాని చ।
చరన్ న రతిమాప్నోతి త్వామపశ్యన్ నృపాత్మజే। 48

ఓ రాకుమారీ! అందమైన వనములయందును, నదీతీరములయందును, సెలయేళ్లప్రక్కన సంచరించు చున్నను శ్రీరాముడు నీ సాహచర్యము కఱవైనందున ఆనందింపలేకపోవుచున్నాడు. (48)

స త్వాం మనుజశార్దూలః క్షిప్రం ప్రాప్స్యతి రాఘవః।
సమిత్రబాంధవం హత్వా రావణం జనకాత్మజే। 49

ఓ జానకీ! ఆ నరశ్రేష్ఠుడు రావణుని బంధుమిత్ర పరివారసహితముగా సంహరించి, శీఘ్రముగా నిన్ను పొందును. (నిన్ను గొనిపోవును) (49)

సహితౌ రామసుగ్రీవౌ ఉభావకురుతాం తదా।
సమయం వాలినం హంతుం తవ చాన్వేషణం తథా। 50

రాముడు వాలిని చంపుటకును, సుగ్రీవుడు వానరులను పంపి నిన్ను వెదకించుటకును ఆయుభయులు అప్పుడు ప్రతిజ్ఞాపూర్వకముగా ఒక 'ఒప్పందము' చేసికొనిరి. (50)

తతస్తాభ్యాం కుమారాభ్యాం వీరాభ్యాం స హరీశ్వరః।
కిష్కింధాం సముపాగమ్య వాలీ యుద్ధే నిపాతితః। 51

కపీశ్వరుడైన సుగ్రీవుడు వీరులైన ఆ రాకుమారులతో గూడి కిష్కింధను సమీపించెను. యుద్ధమున వాలి నిహతుడయ్యెను. (51)

తతో నిహత్య తరసా రామో వాలినమాహవే।
సర్వర్క్షహరిసంఘానాం సుగ్రీవమకరోత్ పతిమ్। 52

శ్రీరాముడు తనపరాక్రమముతో వాలిని రణరంగమున హతమార్చినపిమ్మట భల్లూకవానరసమూహములకు సుగ్రీవుని రాజుగాచేసెను. (52)

రామసుగ్రీవయోరైక్యం దేవ్యేవం సముపాగతమ్।
హనూమంతం చ మాం విద్ధి తయోర్దూతమిహాగతమ్। 53

ఓ సీతాదేవీ! ఈ విధముగా రామసుగ్రీవులమైత్రి బలపడెను. నాపేరు హనుమంతుడు. నేను వారిదూతగా ఇచ్చటికి వచ్చితిని. (53)

స్వరాజ్యం ప్రాప్య సుగ్రీవః సమానీయ హరీశ్వరాన్।
త్వదర్థం ప్రేషయామాస దిశో దశ మహాబలాన్। 54

ఓ దేవీ! సుగ్రీవుడు కిష్కింధారాజ్యమునకు ప్రభువై, మహావీరులైన వానరయోధులను రప్పించి, నిన్ను అన్వేషించుటకై వారిని అన్నిదిక్కులకును పంపెను. (54)

ఆదిష్టా వానరేంద్రేణ సుగ్రీవేణ మహౌజసా।
అద్రిరాజప్రతీకాశాః సర్వతః ప్రస్థితా మహీమ్। 55

మహాతేజశ్శాలియగు వానరప్రభువగు సుగ్రీవునియొక్క ఆదేశముమేరకు మహాపర్వతసదృశులైన వానరవీరులు అందఱును భూమి నలుదిక్కులకును (నిన్ను వెదకుటకై) బయలుదేఱిరి. (55)

తతస్తే మార్గమాణా వై సుగ్రీవవచనాతురాః।
చరంతి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః। 56

ఆ వానరులు సుగ్రీవుడు ఆదేశించినపనిని నెఱవేర్చుటకై త్వరపడుచు నిన్ను అన్వేషించుచున్నవారై, భూమి యందంతటను సంచరించుచున్నారు. మేము కూడా ఆ పనిమీదనే ఇటు (దక్షిణదిశకు) వచ్చితిమి. (56)

అంగదో నామ లక్ష్మీవాన్ వాలిసూనుర్మహాబలః।
ప్రస్థితః కపిశార్దూలః త్రిభాగబలసంవృతః। 57

వాలిసుతుడైన అంగదుడు శ్రీమంతుడు, మహాబలశాలి. ఆ కపీశ్వరుడును వానరసేనలో మూడవవంతుబలములను వెంటనిడుకొని బయలుదేఱెను. (57)

తేషాం నో విప్రణష్టానాం వింధ్యే పర్వతసత్తమే।
భృశం శోకపరీతానామ్ అహోరాత్రగణా గతాః। 58

శ్రేష్ఠమైనవింధ్యాద్రియందు సంచరించుచుండగా మేమందఱము దారితప్పి, శోకాతురులమైతిమి. మేము ఆస్థితిలోనుండగా పెక్కుదినములు గడచిపోయినవి. (58)

తే వయం కార్యనైరాశ్యాత్ కాలస్యాతిక్రమేణ చ।
భయాచ్చ కపిరాజస్య ప్రాణాంస్త్యక్తుం వ్యవస్థితాః। 59

కార్యము సఫలముగాకుండుటవలనను, గడువుమీఱుట వలనను సుగ్రీవునివలనిభయముచేతను మేము అందఱము ప్రాణత్యాగమునకు సిద్ధపడితిమి. (59)

విచిత్య వనదుర్గాణి గిరిప్రస్రవణాని చ।
అనాసాద్య పదం దేవ్యాః ప్రాణాంస్త్యక్తుం సముద్యతాః। 60

మేము దుర్గమారణ్యములను, గిరులను, సెలయేళ్ల తీరములను గాలించితిమి. కాని దేవీ! మీ జాడగానక నిస్పృహతో అసువులను వీడుటకు పూనుకొంటిమి. (60)

తతస్తస్య గిరేర్మూర్ధ్ని వయం ప్రాయముపాస్మహే।
దృష్ట్వా ప్రాయోపవిష్టాంశ్చ సర్వాన్ వానరపుంగవాన్। 61
భృశం శోకార్ణవే మగ్నః పర్యదేవయదంగదః।
తవ నాశం చ వైదేహి వాలినశ్చ వధం తథా।
ప్రాయోపవేశమస్మాకం మరణం చ జటాయుషః। 62

పిమ్మట ఆగిరిశిఖరమునై మేము ప్రాయోపవేశమునకు ఉపక్రమించితిమి. నిరాహారదీక్షకుదిగిన వానరపుంగవులను అందరినిజూచి, అంగదుడు మిక్కిలి శోకమగ్నుడయ్యెను. అంతట అతడు నీ అపహరణమును, వాలిమృతిని, జటాయు మరణమును, మా ప్రాయోపవేశవిషయమును తలచుకొనుచు ఎంతయు విలపించెను. (61-62)

తేషాం నః స్వామిసందేశాత్ నిరాశానాం ముమూర్షతామ్।
కార్యహేతోరిహాయాతః శకునిర్వీర్యవాన్ మహాన్। 63
గృధ్రరాజస్య సోదర్యః సంపాతిర్నామ గృధ్రరాట్।
శ్రుత్వా భ్రాతృవధం కోపాత్ ఇదం వచనమబ్రవీత్। 64

సుగ్రీవాజ్ఞను సకాలములో నెఱవేర్పజాలక మేము నిరాశోపహతులమై మరణింపదలచితిమి. అప్పుడు మా కార్యసాఫల్యమునకాయన్నట్లు మహాపరాక్రమశాలియైన 'సంపాతి' అనుపేరుగల గృధ్రరాజు అచటికి వచ్చెను. జటాయువు సోదరుడగు ఆ సంపాతి తనసోదరుని మరణవార్తను విని, క్రుద్ధుడై ఇట్లు పలికెను. (63-64)

యవీయాన్ కేన మే భ్రాతా హతః క్వ చ నిపాతితః।
ఏతదాఖ్యాతుమిచ్ఛామి భవద్భిర్వానరోత్తమాః। 65

"ఓ వానర వీరులారా! నా తమ్ముడైన జటాయువును ఎవరు ఎక్కడ చంపివేసిరి.? మీవలన వినగోరుచున్నాను తెల్పుడు. (65)

అంగదోఽకథయత్తస్య జనస్థానే మహద్వధమ్।
రక్షసా భీమరూపేణ త్వాముద్దిశ్య యథాతథమ్। 66

రావణునిచే జటాయువు చంపబడుటను (పరోపకారమునకై జరిగిన జటాయువుయొక్క శ్లాఘ్యమృతిని) గూర్చి అంగదుడు అతనికి పూసగ్రుచ్చినట్లు వివరించెను. (66)

జటాయుషో వధం శ్రుత్వా దుఃఖితః సోఽరుణాత్మజః।
త్వాం శశంస వరారోహే వసంతీం రావణాలయే। 67

ఓ సీతాదేవీ! జటాయువుమృతినిగూర్చి విని. దుఃఖితుడైన ఆ సంపాతి నీవు రావణాలయమునందు (లంకలో) ఉన్న విషయమును దెల్పెను. (67)

తస్య తద్వచనం శ్రుత్వా సంపాతేః ప్రీతివర్ధనమ్।
అంగదప్రముఖాస్తూర్ణం తతస్సంప్రస్థితా వయమ్। 68

పిదప ఆ సంపాతిపలికిన సంతోషకరములైన మాటలను విని, అంగదసహితులమై మేమందఱము వెంటనే బయలు వెడలితిమి. (68)

వింధ్యాదుత్థాయ సంప్రాప్తాః సాగరస్యాంతముత్తరమ్।
త్వద్దర్శనకృతోత్సాహా హృష్టాస్తుష్టాః ప్లవంగమాః। 69
అంగదప్రముఖాస్సర్వే వేలోపాంతముపస్థితాః। 70

వానరులందఱును సంతోషముతో పొంగిపోయి, నిన్ను చూడవలెనను కుతూహలముతో వింధ్యనుండి బయలుదేఱి, సముద్రముయొక్క ఉత్తరతీరమునకు చేరిరి. (69-70)

చింతాం జగ్ముః పునర్భీతాః త్వద్దర్శనసముత్సుకాః।
అథాహం హరిసైన్యస్య సాగరం ప్రేక్ష్య సీదతః। 71
వ్యవధూయ భయం తీవ్రం యోజనానాం శతం ప్లుతః।
లంకా చాపి మయా రాత్రౌ ప్రవిష్టా రాక్షసాకులా। 72

నీ దర్శనకాంక్షతో సాగరతటమునకు జేరిన అంగదాది ప్రముఖులెల్లరును భయముతో మిక్కిలి చింతాగ్రస్తులైరి. పిమ్మట అపారసముద్రమునుజూచి భీతిల్లుచున్న కపిసైన్యము యొక్క తీవ్రమైన భయాందోళనములను పోగొట్టి, నేను నూరుయోజనముల విస్తీర్ణముగల జలధిని లంఘించితిని. ఆ రాత్రియందే రాక్షసులతో నిండిన లంకలో ప్రవేశించితిని. (71-72)

రావణశ్చ మయా దృష్టః త్వం చ శోకపరిప్లుతా।
ఏతత్తే సర్వమాఖ్యాతం యథావృత్తమనిందితే। 73

ఓ పూజ్యురాలా! నేను రావణుని చూచితిని, శోకాకులవైన నిన్నును దర్శించితిని. ఈ వృత్తాంతమును పూర్తిగా యథాతథముగ నీకు విన్నవించితిని. (73)

అభిభాషస్వ మాం దేవి దూతో దాశరథేరహమ్।
తం మాం రామకృతోద్యోగం త్వన్నిమిత్తమిహాగతమ్। 74

ఓ దేవీ! నేను శ్రీరామునిదూతను. నన్ను విశ్వసింపుము. అస్వామిప్రోత్సాహముతో నిన్ను అన్వేషించుచు ఇచ్చటికి వచ్చితిని, దయచూపి నాతో మాట్లాడుము. (74)

సుగ్రీవసచివం దేవి బుధ్యస్వ పవనాత్మజమ్।
కుశలీ తవ కాకుత్స్థః సర్వశస్త్రభృతాం వరః। 75

గురోరారాధనే యుక్తో లక్ష్మణశ్చ సులక్షణః।
తస్య వీర్యవతో దేవి భర్తుస్తవ హితే రతః। 76

అహమేకస్తు సంప్రాప్తః సుగ్రీవవచనాదిహ।
మయేయమసహాయేన చరతా కామరూపిణా।
దక్షిణాదిగనుక్రాంతా త్వన్మార్గవిచయైషిణా। 77

దిష్ట్యాహం హరిసైన్యానాం త్వన్నాశమనుశోచతామ్। 78

అపనేష్యామి సంతాపం తవాభిగమశంసనాత్।
దిష్ట్యా హి మమ న వ్యర్థం దేవి సాగరలంఘనమ్। 79

ప్రాప్స్యామ్యహమిదం దిష్ట్యా త్వద్దర్శనకృతం యశః।
రాఘవశ్చ మహావీర్యః క్షిప్రం త్వామభిపత్స్యతే।
సపుత్రబాంధవం హత్వా రావణం రాక్షసాధిపమ్। 80

మాల్యవాన్నామ వైదేహి గిరీణాముత్తమో గిరిః।
తతో గచ్ఛతి గోకర్ణం పర్వతం కేసరీ హరిః। 81

స చ దేవర్షిభిర్దిష్టః పితా మమ మహాకపిః।
తీర్థే నదీపతేః పుణ్యే శంబసాదనముద్ధరత్। 82

తస్యాహం హరిణః క్షేత్రే జాతో వాతేన మైథిలి।
హనుమానితి విఖ్యాతో లోకే స్వేనైవ కర్మణా। 83

విశ్వాసార్థం తు వైదేహి భర్తురుక్తా మయా గుణాః।
అచిరాద్రాఘవో దేవి త్వామితో నయితాఽనఘే। 84

ఏవం విశ్వాసితా సీతా హేతుభిః శోకకర్శితా।
ఉపపన్నైరభిజ్ఞానైః దూతం తమవగచ్ఛతి। 85

అతులం చ గతా హర్షం ప్రహర్షేణ చ జానకీ।
నేత్రాభ్యాం వక్రపక్ష్మాభ్యాం ముమోచానందజం జలమ్। 86

అమ్మా! నేను వాయుసుతుడను, సుగ్రీవునిమంత్రిని. నన్ను నమ్ముము, శస్త్రధారులందరిలో మేటియైన నీ నాథుడు కుశలమే. (75)

సర్వశుభలక్షణములు కలిగినవాడును, అగ్రజునిసేవలయందే నిమగ్నుడునుఅగు లక్ష్మణుడును కుశలియే. అతడు పరాక్రమశాలియైన నీ భర్త (రాముని) యొక్క హితమునందే నిరతుడై యుండును. (76)

సుగ్రీవుని ఆదేశమును అనుసరించి, నేనొక్కడను మాత్రము ఈ లంకకు రాగలిగితిని. కామరూపుడనైన నేను నీ జాడను తెలిసికొనగోరి ఒంటరిగా సంచరించుచు ఈ అశోకవనమునకు (దక్షిణదిశకు) చేరితిని. (77)

అమ్మా! నీజాడ తెలియక వానరవీరులు అందఱును శోకాకులురై, మిక్కిలి పరితపించుచున్నారు. నిన్ను దర్శించిన వార్తను తెలిపి, నేను వారిసంతాపమును తొలగింపగలను. నేను అదృష్టవంతుడను. ఓ దేవీ! భాగ్యవశమున నా సాగర లంఘనము వ్యర్థము కాలేదు.(78-79)

ఎన్ని ఆటంకములెదురైనను అందరికంటెను ముందుగా నిన్ను దర్శించినకీర్తి నాకే దక్కినది. ఇది నాకు ప్రాప్తించిన మహద్భాగ్యము. మహావీరుడైన రాఘవుడు రాక్షసాధిపుడైన రావణుని, అతనిబంధుమిత్ర పరివారములను హతమార్చి, అతిశీఘ్రముగా నిన్ను పొందగలడు. (80)

ఓ వైదేహీ! 'మాల్యవంతము' అను పేరుగల ఒకమహాపర్వతము గలదు. అచటనివసించుచున్న 'కేసరి' అను వానరుడు 'గోకర్ణ' పర్వతమునకు వెళ్లెను. 'శంబసాదనుడు' అను ఒక రాక్షసుడు సముద్ర తీరమునగల అచటి పుణ్యక్షేత్రమునందు ఉపద్రవములను కల్గించుచుండెను. దేవతలు, ఋషులు ప్రార్థింపగా నా తండ్రియైనకేసరి ఆ రాక్షసుని హతమార్చెను. ఆ కపీశ్వరుని భార్యయగు అంజనాదేవి యందు వాయుదేవుని అనుగ్రహమున పుత్రుడనై జన్మించితిని. నా చర్యలనుబట్టి లోకమున నాకు 'హనుమంతుడు'అనుఖ్యాతి ఏర్పడినది. (81-83)

పవిత్రురాలవైన ఓవైదేహీ! నీవు విశ్వసించుటకై నీభర్తయైన శ్రీరాముని గుణములను తెల్పితిని. ఓ దేవీ! త్వరలోనే శ్రీరాముడు నిన్ను ఇచటినుండి తీసికొని పోగలడు."(84)

శోకముచే కృశించిన సీతాదేవి హనుమంతుడు పేర్కొనిన కారణములచే అతనిని విశ్వసించెను. తగిన నిదర్శనములచే అతనిని రామునిదూతగా ఎఱింగెను. (85)

అప్పుడు జానకీదేవి అంతులేనిసంతోషమును పొందెను. ఆ మహాసంతోషములో అందమైన ఆమెకనులనుండి ఆనందాశ్రువులు స్రవించెను. (86)

చారు తద్వదనం తస్యాః తామ్రశుక్లాయతేక్షణమ్।
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్। 87

ఎఱ్ఱని రేఖలతో విశాలమైన తెల్లని నేత్రములుగల ఆ సీతాదేవియొక్క మనోహరమైనవదనము రాహువునుండి విముక్తుడైన చంద్రునివలె భాసిల్లెను. (87)

హనూమంతం కపిం వ్యక్తం మన్యతే నాన్యథేతి సా।
అథోవాచ హనూమాంస్తామ్ ఉత్తరం ప్రియదర్శనామ్। 88

'కపీశ్వరుడైన హనుమంతుడు నిజముగా రామ దూతయే' అని ఆమె భావించెను. పిమ్మట హనుమంతుడు దర్శనీయురాలైన ఆమెకు ఇట్లు ప్రత్యుత్తరమును ఇచ్చెను. (88)

ఏతత్తే సర్వమాఖ్యాతం సమాశ్వసిహి మైథిలి।
కిం కరోమి కథం వా తే రోచతే ప్రతియామ్యహమ్। 89

ఓ మైథిలీ! నీకు విషయములను అన్నింటిని తెల్పితిని. ఊరడిల్లుము. ఇప్పుడు నేనేమిచేసినచో నీకు సంతోషము కల్గునో తెల్పుము, తిరిగి వెళ్లెదను. (89)

హతేఽసురే సంయతి శంబసాదనే
కపిప్రవీరేణ మహర్షిచోదనాత్।
తతోఽస్మి వాయుప్రభవో హి మైథిలి
ప్రభావతస్తత్ప్రతిమశ్చ వానరః। 90

ఓ మైథిలీ! మహర్షుల ప్రేరేపణలవలన కపివరుడైన కేసరి రాక్షసుడైన శంబసాదనుని యుద్ధమున చంపివేసెను. పిమ్మట నేను వాయుదేవుని వరమువలన కేసరి భార్యయైన అంజనాదేవియందు జన్మించితిని. బలసంపదలో నేను ఆ వాయుదేవుని యంతటివాడను, వానరుడను. (90)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే పంచత్రింశస్సర్గః *(35)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదిఐదవసర్గము.

-- * * * --

36. ముప్పదిఆఱవసర్గము

హనుమంతుడు సీతాదేవికి రామముద్రికను సమర్పించుట, ఆమెపై శ్రీరామునకుగల ప్రేమను వివరించి ఆమెను ఊరడించుట

భూయ ఏవ మహాతేజా హనుమాన్ మారుతాత్మజః।
అబ్రవీత్ ప్రశ్రితం వాక్యం సీతాప్రత్యయకారణాత్। 1

మహాతేజశ్శాలియు, వాయుసుతుడును ఐన హనుమంతుడు సీతాదేవికి తనపై ఇంకను విశ్వాసము దృఢపడుటకై వినయముతో మఱల ఇట్లు పలికెను. (1)

వానరోఽహం మహాభాగే దూతో రామస్య ధీమతః।
రామనామాంకితం చేదం పశ్య దేవ్యంగులీయకమ్। 2

"ఓ మహాభాగ్యశాలినీ! దేవీ! నేను వానరుడను, ప్రజ్ఞాశాలియైన శ్రీరామునిదూతను. శ్రీరామనామాంకితమైన ఈ ఉంగరమును చూడుము. (2)

ప్రత్యయార్థం తవానీతం తేన దత్తం మహాత్మనా।
సమాశ్వసిహి భద్రం తే క్షీణదుఃఖఫలా హ్యసి। 3

నాపైనీకు విశ్వాసము కుదురుకొనుటకై మహాత్ముడైన శ్రీరాముడు దీనిని ఇయ్యగా నేను తీసికొని వచ్చితిని. ఊరడిల్లుము, దుఃఖములన్నియు తొలగి, నీకు శుభములు కలుగును." (3)

(ఇత్యుక్త్వా ప్రదదౌ తస్యై సీతాయై వానరోత్తమః)।
గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కరవిభూషణమ్।
భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితాఽభవత్। 4

ఆ కపివరుడు ఇట్లుపలికి, సీతాదేవికి ఆ అంగుళీయకమును సమర్పించెను. జానకీదేవి తన భర్త కరస్పర్శను నోచుకొనిన ఆ అంగుళ్యాభరణమును గ్రహించి, దానిని పరికించిచూచుచు భర్తనుపొందినదానివలె మహానందభరితురాలయ్యెను. (4)

చారు తద్వదనం తస్యాః తామ్రశుక్లాయతేక్షణమ్।
అశోభత విశాలాక్ష్యా రాహుముక్త ఇవోడురాట్॥ 5

తతస్సా హ్రీమతీ బాలా భర్తృసందేశహర్షితా।
పరితుష్టా ప్రియం కృత్వా ప్రశశంస మహాకపిమ్॥ 6

విక్రాంతస్త్వం సమర్థస్త్వం ప్రాజ్ఞస్త్వం వానరోత్తమ।
యేనేదం రాక్షసపదం త్వయైకేన ప్రధర్షితమ్॥ 7

శతయోజనవిస్తీర్ణః సాగరో మకరాలయః।
విక్రమశ్లాఘనీయేన క్రమతా గోష్పదీకృతః॥ 8

న హి త్వాం ప్రాకృతం మన్యే వానరం వానరర్షభ।
యస్య తే నాస్తి సంత్రాసో రావణాన్నాపి సంభ్రమః॥ 9

అర్హసే చ కపిశ్రేష్ఠ మయా సమభిభాషితుమ్।
యద్యసి ప్రేషితస్తేన రామేణ విదితాత్మనా॥ 10

ప్రేషయిష్యతి దుర్ధర్షో రామో న హ్యపరీక్షితమ్।
పరాక్రమమవిజ్ఞాయ మత్సకాశం విశేషతః॥ 11

దిష్ట్యా స కుశలీ రామో ధర్మాత్మా సత్యసంగరః।
లక్ష్మణశ్చ మహాతేజాః సుమిత్రానందవర్ధనః॥ 12

కుశలీ యది కాకుత్స్థః కిం న సాగరమేఖలామ్।
మహీం దహతి కోపేన యుగాంతాగ్నిరివోత్థితః॥ 13

అథవా శక్తిమంతౌ తౌ సురాణామపి నిగ్రహే।
మమైవ తు న దుఃఖానామ్ అస్తి మన్యే విపర్యయః॥ 14

కచ్చిన్న వ్యథితో రామః కచ్చిన్న పరితప్యతే।
ఉత్తరాణి చ కార్యాణి కురుతే పురుషోత్తమః॥ 15

కచ్చిన్న దీనస్సంభ్రాంతః కార్యేషు చ న ముహ్యతి।
కచ్చిత్ పురుషకార్యాణి కురుతే నృపతేస్సుతః॥ 16

ద్వివిధం త్రివిధోపాయమ్ ఉపాయమపి సేవతే।
విజిగీషుస్సుహృత్ కచ్చిత్ మిత్రేషు చ పరంతపః॥ 17

కనులపండువుగావించుచు వెలుగులతోనిండిన ఆమె ముఖము రాహువునుండి విముక్తుడైనచంద్రునివలె ఒక్కసారిగా ప్రసన్నమయ్యెను. (5)

నిర్మల హృదయయైన ఆ సీతాదేవి తనపతి సందేశప్రాప్తిచే సంతోషముతో పొంగిపోయినదై, సిగ్గుదొంతరలలో మునిగిపోయెను. ప్రియవచనములతో సమ్మానించుచు ఆమె ఆకపివరుని కొనియాడెను. (6)

"ఓ వానరోత్తమా! నిజముగా నీవు ఎంతయో పరాక్రమశాలివి, మిక్కిలి సమర్థుడవు, పరమప్రాజ్ఞుడవు, అందువలననే నీవు రాక్షసులకు ఆయువుపట్టైన ఈ లంకలో ఒంటరిగా ప్రవేశింపగల్గితివి. (7)

శతయోజనముల విస్తీర్ణముగలదై, భయంకర మకరములకు ఆలవాలమైన ఈ మహాసాగరమును గోష్పాదమంతగా భావించి '(ఒక పిల్లకాల్వనువలె) అవలీలగా లంఘించితివి' యథార్థముగా నీ పరాక్రమము ఎంతేని శ్లాఘనీయము. ఓ వానరశ్రేష్ఠా! రావణుడనిన నీకు భయముగాని, తత్తరపాటుగాని ఏమాత్రములేవు. కనుక నిజముగా నీవు సామాన్య వానరుడవుగావు. ఓ కపివరా! మహాత్ముడైన శ్రీరామచంద్రప్రభువు నిన్ను పంపెను. కనుక నాతో సంభాషించుటకు నీవు యోగ్యుడవు. సాటిలేని పరాక్రమముగల శ్రీరాముడు ఎవ్వరినైనను బాగుగా పరీక్షింపక, పరాక్రమమును తెలిసికొనక దూతగా ఎక్కడికిని పంపడు. విశేషించి నాయొద్దకు అసలే పంపడు. (8-11)

సత్యపరాక్రముడు, ధర్మాత్ముడు ఐన శ్రీరాముడును, సుమిత్రానందవర్ధనుడు, మహాతేజశ్శాలియైన లక్ష్మణుడును క్షేమముగానుండుట నా అదృష్టఫలమే. (12)

శ్రీరాముడు క్రుద్ధుడైనచో పైకెగసిన ప్రళయాగ్ని జ్వాలలవలె సాగరమే హద్దుగాగల ఈ సమస్త భూమండలమును దహించి వేయగల సమర్థుడు. ఐనను అట్లేందుకు చేయుటలేదు?(13)

ఆ రామలక్ష్మణులు దేవతలను సైతము నిగ్రహింపగల సమర్థులే, కాని నాదుఃఖములకే అంతములేదని నేను భావింతును. (14)

శ్రీరాముడు వ్యథకు గుఱియగుటలేదు గదా? పరితపించుట లేదుగదా? ఆ పురుషోత్తముడు నన్నుపొందుటకై చేయవలసిన కార్యములకు సన్నద్ధుడగు చున్నాడా? (15)

రాజకుమారుడైన శ్రీరాముడు నిఃస్పృహకు, భ్రాంతికి లోనై అన్యమనస్కుడై, పనులలో పొరపడుటలేదుగదా! ఆయన ప్రయత్నశీలుడై కార్యములను ఆచరించు చున్నాడా?(16)

శత్రుభయంకరుడైన శ్రీరాముడు మిత్రుల విషయమున సౌహార్దముతో సామదాన - ఉపాయములను, శత్రువుల విషయమున జయేచ్ఛతో దాన, భేద, దండోపాయములను అవలంబించుచున్నాడా? (17)

కచ్చిన్మిత్రాణి లభతే మిత్రైశ్చాప్యభిగమ్యతే।
కచ్చిత్ కల్యాణమిత్రశ్చ మిత్రైశ్చాపి పురస్కృతః। 18

కచ్చిదాశాస్తి దేవానాం ప్రసాదం పార్థివాత్మజః।
కచ్చిత్ పురుషకారం చ దైవం చ ప్రతిపద్యతే। 19

కచ్చిన్న విగతస్నేహః ప్రవాసాన్మయి రాఘవః।
కచ్చిన్మాం వ్యసనాదస్మాత్ మోక్షయిష్యతి వానర। 20

సుఖానాముచితో నిత్యమ్ అసుఖానామనౌచితః।
దుఃఖముత్తరమాసాద్య కచ్చిద్రామో న సీదతి। 21

కౌసల్యాయాస్తథా కచ్చిత్ సుమిత్రాయాస్తథైవ చ।
అభీక్ష్ణం శ్రూయతే కచ్చిత్ కుశలం భరతస్య చ। 22

మన్నిమిత్తేన మానార్హః కచ్చిచ్ఛోకేన రాఘవః।
కచ్చిన్నాన్యమనా రామః కచ్చిన్మాం తారయిష్యతి। 23

కచ్చిదక్షౌహిణీం భీమాం భరతో భ్రాతృవత్సలః।
ధ్వజినీం మంత్రిభిర్గుప్తాం ప్రేషయిష్యతి మత్కృతే। 24

వానరాధిపతిః శ్రీమాన్ సుగ్రీవః కచ్చిదేష్యతి।
మత్కృతే హరిభిర్వీరైః వృతో దంతనఖాయుధైః। 25

కచ్చిచ్చ లక్ష్మణశ్శూరః సుమిత్రానందవర్ధనః।
అస్త్రవిచ్ఛరజాలేన రాక్షసాన్ విధమిష్యతి। 26

రౌద్రేణ కచ్చిదస్త్రేణ జ్వలతా నిహతం రణే।
ద్రక్ష్యామ్యల్పేన కాలేన రావణం ససుహృజ్జనమ్। 27

కచ్చిన్న తద్ధేమసమానవర్ణం
తస్యాననం పద్మసమానగంధి।
మయా వినా శుష్యతి శోకదీనం
జలక్షయే పద్మమివాతపేన। 28

ధర్మాపదేశాత్ త్యజతశ్చ రాజ్యం
మాం చాప్యరణ్యం నయతః పదాతిమ్।
నాసీద్వ్యథా యస్య న భీర్న శోకః
కచ్చిత్ స ధైర్యం హృదయే కరోతి। 29

అతడు మిత్రులను సమకూర్చుకొనుచున్నాడా? మిత్రులు గూడ ప్రత్యుపకారముచేయుటకై ఆయనను చేరుచున్నారా? ఆయన మిత్రులందఱును మంచివారేనా? వారు ఆయనను గౌరవించువారేనా? (18)

రాజకుమారుడైన శ్రీరాముడు దేవతల అనుగ్రహమునకై వారిని ప్రార్థించుచున్నాడా? తనవంతు (పురుష) ప్రయత్నమును చేయుచున్నాడా? దైవముయొక్క అనుకూల్యమును సంపాదించుచున్నాడా? (కార్యసిద్ధికి పురుషప్రయత్నము, దైవానుగ్రహము ఆవశ్యకములే.) ఓ వానరా? నాయెడబాటువలన ఆయనకు నాపై ప్రేమ తొలగిపోలేదు గదా? ఆయన నాకు ఈ ఆపదలనుండి విముక్తిని కల్గించును గదా? శ్రీరాముడు ఎల్లప్పుడును సుఖములలో తేలియాడిన వాడు, ఆయన కష్టమనుమాటనే యెఱుగడు, అట్టి ప్రభువు ఇప్పుడు అంతులేని దుఃఖములపాలై క్రుంగిపోవుట లేదుగదా! (19-21)

కౌసల్యాసుమిత్రాభరతుల క్షేమసమాచారములు అప్పుడప్పుడు తెలియుచున్నవిగదా! (22)

సర్వలోకపూజ్యుడైన శ్రీరాముడు నాకారణముగా పరితపించుటలేదుగదా! కార్యాంతరమగ్నుడై ప్రభువు నాకు విముక్తిని ప్రసాదించునా? (23)

భరతుడు అన్నయైన శ్రీరామునియెడ అనన్యభక్తి పరిపూర్ణుడు. అతడు మంత్రులపర్యవేక్షణలో సురక్షితమై అజేయమైన అక్షౌహిణీసేనను, ఈ రాక్షసుల బారినుండి నన్ను కాపాడుటకై ఇచటికి పంపునా? (24)

శ్రీమంతుడు, వానరాధిపతియైన సుగ్రీవుడు దంతములు, నఖములు ఆయుధములుగాగల వానరవీరులను వెంట నిడుకొని నా కొఱకై ఇటకు వచ్చునా? (25)

సుమిత్రానందనుడును, అస్త్రవిద్యలయందు ఆరితేఱిన వాడును, మహాశూరుడును ఐన లక్ష్మణ కుమారుడు తన శరపరంపరలతో ఈ రాక్షసహతకులను చీల్చి చెండాడునుగదా! (26)

భయంకరముగా నిప్పులుగ్రక్కు(రాముని)శరజాలముతో బంధుమిత్ర పరివారసహితముగా రణరంగమున రావణుడు, నిహతుడగుటను అతిత్వరలో నేను చూడగలనా? (27)

బంగారువన్నెతో పద్మపరిమళములతో ఆహ్లాదకరమైన ఆ శ్రీరాముని ఆననము నాయెడబాటు కారణముగా నీరు ఇంకిపోయిన పిమ్మట ఎండతీవ్రతకు కమిలిపోయిన పద్మమువలె శోకదీనమై వాడిపోలేదుగదా! (28)

'పితృవాక్యపరిపాలన' అను ధర్మమును పాటించుటకై శ్రీరాముడు రాజ్యమును సైతము త్యజించునప్పుడుగాని, తనతోపాటు నన్నును నడిపించుచు అడవులకుతీసికొని వచ్చునప్పుడుగాని, ఆయన వ్యథచెందలేదు, భయపడ లేదు, శోకమునకు గురికాలేదు. ఐతే నేను దూరమై నందున ఇప్పుడాయన ధైర్యము సడలలేదుగదా? (29)

న చాస్య మాతా న పితా న చాన్యః
స్నేహాద్విశిష్టోఽస్తి మయా సమో వా ।
తావత్త్వహం దూత జిజీవిషేయం
యావత్ ప్రవృత్తిం శృణుయాం ప్రియస్య ॥ 30

ఇతీవ దేవీ వచనం మహార్థం
తం వానరేంద్రం మధురార్థముక్త్వా ।
శ్రోతుం పునస్తస్య వచోఽభిరామం
రామార్థయుక్తం విరరామ రామా ॥ 31

సీతాయా వచనం శ్రుత్వా మారుతిర్భీమవిక్రమః ।
శిరస్యంజలిమాధాయ వాక్యముత్తరమబ్రవీత్ ॥ 32

న త్వామిహస్థాం జానీతే రామః కమలలోచనే ।
తేన త్వాం నానయత్యాశు శచీమివ పురందరః ॥ 33

శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః ।
చమూం ప్రకర్షన్ మహతీం హర్యృక్షగణసంకులామ్ ॥ 34

విష్టంభయిత్వా బాణౌఘైః అక్షోభ్యం వరుణాలయమ్ ।
కరిష్యతి పురీం లంకాం కాకుత్స్థః శాంతరాక్షసామ్ ॥ 35

తత్ర యద్యంతరా మృత్యుః యది దేవాస్సహాసురాః ।
స్థాస్యంతి పథి రామస్య స తానపి వధిష్యతి ॥ 36

తవాదర్శనజేనార్యే శోకేన పరిపూరితః ।
న శర్మ లభతే రామః సింహార్దిత ఇవ ద్విపః ॥ 37

మలయేన చ వింధ్యేన మేరుణా మందరేణ చ ।
దర్దురేణ చ తే దేవి శపే మూలఫలేన చ ॥ 38

యథా సునయనం వల్గు బింబోష్ఠం చారుకుండలమ్ ।
ముఖం ద్రక్ష్యసి రామస్య పూర్ణచంద్రమివోదితమ్ ॥ 39

క్షిప్రం ద్రక్ష్యసి వైదేహి రామం ప్రస్రవణే గిరౌ ।
శతక్రతుమివాసీనం నాగరాజస్య మూర్ధని ॥ 40

మా దంపతుల అన్యోన్యానురాగములు అనన్యములు. ఈ విషయమున ఆయనకు తల్లిదండ్రులు, బంధువులు, మఱియెవ్వరును నాతో సమానులుగాని, అధికులుగాని కారు. నాకు ప్రాణప్రియుడైన అట్టి శ్రీరాముని వృత్తాంతమును వినునంతవఱకే నేను జీవించి యుండగోరుదును." (30)

సీతాదేవి ఆ హనుమంతునితో ఈ విధముగా సహేతుకమైన మధురవచనములను పలికిన పిమ్మట, శ్రీరామునకు సంబంధించిన మనోహరవిషయములను మారుతినుండి మఱల వినగోరినదై మిన్నకుండెను. (31)

జానకీదేవి పలికిన మృదుమధుర వచనములను విని, మహాపరాక్రమశాలియైన మారుతి వినమ్రుడై, అంజలి ఘటించి, ఆమెతో ఇట్లనుడువసాగెను. (32)

"ఓ కమలలోచనా! నీవు ఈ లంకలో ఉన్నసంగతి శ్రీరామునకు ఏమాత్రము తెలియదు. అందువలన ఇంద్రుడు శచీదేవిని తీసికొనివచ్చినట్లుగా రాముడు నిన్ను గొనిపోలేదు.[1] (33)

నా వచనములను విన్నంతనే రాఘవుడు శీఘ్రముగా వానరభల్లూక గణములతోగూడిన మహాసైన్యమును వెంటనిడుకొని రాగలడు. శ్రీరాముడు అక్షోభ్యమైన (క్షోభింపజేయుటకు అలవికాని) మహాసముద్రమును తన బాణపరంపరతో స్తంభింపజేసి, లంకానగరమునందలి రాక్షసులనందఱిని భస్మమొనర్చును. (34-35)

ఆ సమయమున సురాసురులెవ్వరైనను, కడకు యముడైనను తనమార్గమునకు అడ్డుదగిలినచో శ్రీరాముడు వారినిగూడ చంపివేయును. (36)

పూజ్యురాలా! నీవు కనబడకపోవుటచే శోకాకులుడైన శ్రీరాముడు సింహముచే పీడింపబడిన ఏనుగువలె మనశ్శాంతిని పొందుటలేదు. (37)

ఓ దేవీ! వైదేహీ! శ్రీరాముడు చక్కని నయనశోభలుగలవాడు, మిక్కిలిసుందరుడు, దొండపండువంటి ఎఱ్ఱనిపెదవులుగలవాడు, అందమైన కుండలములను ధరించెడివాడు. పూర్ణచంద్రునిబోలు ఆ రాముని ముఖమును నీవు అతిత్వరలోనే దర్శింపగలవు. ఇది ముమ్మాటికి నిజము. మలయపర్వతముమీద, మేరుగిరిపైన, వింధ్యాచలము మీద, మందరాద్రిపైన, దర్దురశైలముమీద, కడకు మాప్రాణములను నిల్పునట్టి ఫలమూలములపైన ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. (38-39)

ఓ వైదేహీ! ఐరావతముపై ఆసీనుడైయున్న ఇంద్రునివలె ప్రస్రవణపర్వతముపై విరాజిల్లుచున్న శ్రీరాముని అతిశీఘ్రముగా చూడగలవు. (40)

1. అనుహ్లాదుడనువాడు శచీదేవిని అపహరించుకొనిపోయెను. ఆమె ఎక్కడున్నదియు తెలియక ఇంద్రుడు ఆమెను శీఘ్రముగా తీసికొనిరాలేకపోయెను. కొంతకాలమునకు తెలిసిన వెంటనే అతడు ఆమెను 'అమరావతి'కి తీసికొనివచ్చెను.

న మాంసం రాఘవో భుంక్తే న చాఽపి మధు సేవతే।
వన్యం సువిహితం నిత్యం భక్తమశ్నాతి పంచమమ్। 41

నైవ దంశాన్ న మశకాన్ న కీటాన్ న సరీసృపాన్।
రాఘవోఽపనయేద్గాత్రాత్ త్వద్గతేనాంతరాత్మనా। 42

నిత్యం ధ్యానపరో రామో నిత్యం శోకపరాయణః।
నాన్యచ్చింతయతే కించిల్ స తు కామవశం గతః। 43

అనిద్రస్సతతం రామః సుప్తోఽపి చ నరోత్తమః।
సీతేతి మధురాం వాణీం వ్యాహరన్ ప్రతిబుధ్యతే। 44

దృష్ట్వా ఫలం వా పుష్పం వా యద్వాఽన్యత్ సుమనోహరమ్।
బహుశో హా ప్రియేత్యేవం శ్వసంస్త్వామభిభాషతే। 45

స దేవి నిత్యం పరితప్యమానః
త్వామేవ సీతేత్యభిభాషమాణః।
ధృతవ్రతో రాజసుతో మహాత్మా
తవైవ లాభాయ కృతప్రయత్నః। 46

సా రామసంకీర్తనవీతశోకా
రామస్య శోకేన సమానశోకా।
శరన్ముఖే సాంబుదశేషచంద్రా
నిశేవ వైదేహసుతా బభూవ। 47

రాఘవుడు ఎన్నడును, మద్యమాంసములను ముట్టడు, వనవాసులైన వానప్రస్థులకు విహితములైన సాత్త్వికములైన వన్యఫలములను, కందమూలములను ఐదు భాగములుగా జేసి, వాటిలో ఐదవభాగమును ప్రతిదినము శరీరధారణ నిమిత్తము తగినంతమాత్రమే భుజించును.[1] (41)

నీ మీదనే మనస్సును లగ్నమొనర్చి, తదన్యమును మఱచిన శ్రీరాముడు తనశరీరముపై వ్రాలెడి అడవి ఈగలను, దోమలను, తిరుగాడెడి పురుగులను, పాములనుసైతము ఏమాత్రము పట్టించుకొనడు. (42)

నరోత్తముడైన శ్రీరాముడు ఎల్లప్పుడును నీ ధ్యాసలోనే మునిగి, శోకాకులుడై యుండును, నిన్ను జేరుకోరికతో ఇక దేనిని గూర్చియు ఏ మాత్రము ఆలోచింపడు. (43)

శ్రీరాముడు నిద్రనే ఎఱుగడు, ఎప్పుడైనను ఒకకునుకు వచ్చినచో "సీతా! సీతా!" అను మధురవచనముల పలవరింతలతో ఉలికిపడి లేచును. (44)

ఏదైననొకఫలమునుగాని, పుష్పమునుగాని, మనోహరమైన మఱియొకవస్తువునుగాని చూచినప్పుడు "ప్రియా! ప్రియా! అని బహువిధముల పలుకుచు నిట్టూర్పులను విడుచుచుండును. (45)

ఓ దేవీ! మహాత్ముడైన ఆ రాజకుమారుడు సర్వదా "సీతా! సీతా!" అని పలవరించుచు నీ కొఱకై పరితపించుచున్నాడు. అతడు కఠిననియమములను పాటించుచు నిన్నుపొందుటకే ప్రయత్నించుచున్నాడు." (46)

శ్రీరాముని గుణ సంకీర్తన శ్రవణప్రభావమున వైదేహి శోకము తొలగిపోయెను. కాని శ్రీరాముడు శోకమగ్నుడైన విషయములనువిని ఆమెయు శోకమగ్నయయ్యెను. శరత్కాలప్రారంభమున మేఘములచే కప్పబడిన చంద్రుడు ప్రకాశింపడు, మేఘములు తొలగినంతనే పూర్ణచంద్రుడు ఆహ్లాదకరుడై ప్రకాశించునట్లు సీతాదేవి శ్రీరామునిగుణసంకీర్తన వినినంతనే ప్రసన్నమైన ముఖముతో శరత్కాలరాత్రివలె శోభిల్లుచుండెను. సీతాదేవిస్థితియు శరత్కాలరాత్రివలె ఒప్పుచుండెను.(47)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే షట్త్రింశస్సర్గః *(36)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదిఆఱవసర్గము.

-- * * * --

1) *వానప్రస్థులు ఆహారపదార్థములను (కందమూలఫలములను) ఐదుభాగములుగా జేసి మొదటి నాలుగుభాగములను వరుసగా దేవతలకును, పితృదేవతలకును, అతిథులకును భూతగణములకును అర్పించి, మిగిలిన ఐదవభాగమును మాత్రము వారు స్వీకరించెడివారు.*
- గోవిందరాజీయ వ్యాఖ్య

37. ముప్పదియేడవ సర్గము

శ్రీరామచంద్రుని శీఘ్రముగా తీసికొనిరమ్మని సీతాదేవి మారుతిని గోరుట, హనుమంతుడు తన వెంట రమ్మని జానకీదేవిని ప్రార్థించుట-ఆమె అందులకు నిరాకరించుట

సీతా తద్వచనం శ్రుత్వా పూర్ణచంద్రనిభాననా।
హనూమంతమువాచేదం ధర్మార్థసహితం వచః॥ 1

అమృతం విషసంసృష్టం త్వయా వానర భాషితమ్।
యచ్చ నాన్యమనా రామో యచ్చ శోకపరాయణః॥ 2

ఐశ్వర్యే వా సువిస్తీర్ణే వ్యసనే వా సుదారుణే।
రజ్జ్వేవ పురుషం బద్ధ్వా కృతాంతః పరికర్షతి॥ 3

విధిర్నూనమసంహార్యః ప్రాణినాం ప్లవగోత్తమ।
సౌమిత్రిం మాం చ రామం చ వ్యసనైః పశ్య మోహితాన్॥ 4

శోకస్యాస్య కదా పారం రాఘవోఽధిగమిష్యతి।
ప్లవమానః పరిశ్రాంతో హతనౌస్సాగరే యథా॥ 5

రాక్షసానాం వధం కృత్వా సూదయిత్వా చ రావణమ్।
లంకామున్మూలితాం కృత్వా కదా ద్రక్ష్యతి మాం పతిః॥ 6

స వాచ్యస్సంత్వరస్వేతి యావదేవ న పూర్యతే।
అయం సంవత్సరః కాలః తావద్ధి మమ జీవితమ్॥ 7

వర్తతే దశమో మాసో ద్వౌ తు శేషౌ ప్లవంగమ।
రావణేన నృశంసేన సమయో యః కృతో మమ॥ 8

విభీషణేన చ భ్రాత్రా మమ నిర్యాతనం ప్రతి।
అనునీతః ప్రయత్నేన న చ తత్కురుతే మతిమ్॥ 9

మమ ప్రతిప్రదానం హి రావణస్య న రోచతే।
రావణం మార్గతే సంఖ్యే మృత్యుః కాలవశంగతమ్॥ 10

హనుమంతునిద్వారా శ్రీరామచంద్రుని కుశల సమాచారములను వినినంతనే సీతాదేవిముఖము నిండుచంద్రునిశోభలను వెదజల్లెను. ఆమె హనుమంతునితో ధర్మసమ్మతములై అర్థవంతములైన వచనములను ఇట్లు పలికెను. "ఓ వానరోత్తమా! 'శ్రీరాముడు తదేకధ్యానతో ఎల్లప్పుడు నిన్నే స్మరించుచున్నాడు' అని నీవు నుడివిన వచనములు నాకు అమృతతుల్యములు. అవి ఆనందదాయకములు 'అతడు శోకమగ్నుడైయున్నాడు' అని నీవు తెల్పినమాటలు నాకు విషసదృశములు. ఇవి దుఃఖకారకములు (1-2)

అంతులేని ఐశ్వర్యమునందుగాని, దారుణమైన దుఃఖమునందు గాని త్రాడుతోవలె బంధించి, దైవము పురుషుని లాగికొనిపోవును. (3)

ఓ వానరోత్తమా! విధివశమున ఆపదకులోనైన నన్ను, శ్రీరాముని, లక్ష్మణుని చూడుము. ప్రాణులకు విధి నిర్ణయము అనుల్లంఘనీయము సుమా![1] (4)

మహాసముద్రమునందు నౌక బ్రద్దలుకాగా ఈదుచు అలసిపోయినవానివలెనున్న శ్రీరాముడు ఈ శోకసముద్రము నుండి ఎప్పటికి బయటపడగలడు?. (5)

శ్రీరాముడు రాక్షసులనువధించి, రావణుని హతమార్చి లంకానగరమును రూపుమాపి, నన్ను ఎప్పుడు చేరునోగదా? (6)

ఓ వానరోత్తమా! దుష్టుడైన రావణుడు నాకు ఒక సంవత్సరకాలము గడువు పెట్టియుండెను. అతడు విధించిన ఆ ఒకసంవత్సరకాలవ్యవధిలో పదియవనెల నడచుచున్నది. ఇక రెండుమాసములే మిగిలియున్నవి. ఆ గడువు ముగియువఱకే నేను జీవించియుందును. 'కావున త్వరపడుమ'ని శ్రీరామునితో విన్నవింపుము. (7-8)

"సీతాదేవిని శ్రీరామునకు తిరిగి అప్పగింపుము" అని అతని సోదరుడైన విభీషణుడు ఎంతగా బ్రతిమాలి చెప్పినను రావణుడు అతని మాటను ఏమాత్రమూ లక్ష్యపెట్టుటలేదు. శ్రీరామునకు నన్ను అప్పగించుట రావణునకు బొత్తిగా సమ్మతముగాదు. ఆయువుమూడిన రావణుని రణరంగమున కబళించుటకు మృత్యుదేవత ఎదురుచూచుచున్నది. (9-10)

1. వ్యసనము = కోరిక, క్రోధము, ఆపద. నేను బంగారులేడికై కోరికపడుట, నా కోరికను తీర్చుటకై శ్రీరాముడు మోహవశుడై లేడిని వెంబడించుట, నేను లక్ష్మణుని కోపగించుట ఈ ఆపదలకు మూలములు. ఈ వ్యసనముల ఫలితముగా విచక్షణను కోల్పోయితిమి. ఇదియంతయు విధినిర్ణయము.

జ్యేష్ఠా కన్యాఽనలా నామ విభీషణసుతా కపే।
తయా మమేదమాఖ్యాతం మాత్రా ప్రహితయా స్వయమ్। 11

అవింధ్యో నామ మేధావీ విద్వాన్ రాక్షసపుంగవః।
ధృతిమాన్ శీలవాన్ వృద్ధో రావణస్య సుసమ్మతః। 12

రామాత్ క్షయమనుప్రాప్తం రక్షసాం ప్రత్యచోదయత్।
న చ తస్య స దుష్టాత్మా శృణోతి వచనం హితమ్। 13

ఆశంసేయం హరిశ్రేష్ఠ క్షిప్రం మాం ప్రాప్స్యతే పతిః।
అంతరాత్మా హి మే శుద్ధః తస్మింశ్చ బహవో గుణాః। 14

ఉత్సాహః పౌరుషం సత్త్వమ్ ఆనృశంస్యం కృతజ్ఞతా।
విక్రమశ్చ ప్రభావశ్చ సంతి వానర రాఘవే। 15

చతుర్దశసహస్రాణి రాక్షసానాం జఘాన యః।
జనస్థానే వినా భ్రాత్రా శత్రుః కస్తస్య నోద్విజేత్। 16

న స శక్యస్తులయితుం వ్యసనైః పురుషర్షభః।
అహం తస్య ప్రభావజ్ఞా శక్రస్యేవ పులోమజా। 17

శరజాలాంశుమాన్ శూరః కపే రామదివాకరః।
శత్రురక్షోమయం తోయమ్ ఉపశోషం నయిష్యతి। 18

ఇతి సంజల్పమానాం తాం రామార్థే శోకకర్శితామ్।
అశ్రుసంపూర్ణనయనామ్ ఉవాచ వచనం కపిః। 19

శ్రుత్వైవ తు వచో మహ్యం క్షిప్రమేష్యతి రాఘవః।
చమూం ప్రకర్షన్ మహతీం హర్యృక్షగణసంకులామ్। 20

అథవా మోచయిష్యామి త్వామద్యైవ వరాననే।
అస్మాద్దుఃఖాదుపారోహ మమ పృష్ఠమనిందితే। 21

త్వాం హి పృష్ఠగతాం కృత్వా సంతరిష్యామి సాగరమ్।
శక్తిరస్తి హి మే వోఢుం లంకామపి సరావణామ్। 22

అహం ప్రస్రవణస్థాయ రాఘవాయాద్య మైథిలి।
ప్రాపయిష్యామి శక్రాయ హవ్యం హుతమివానలః। 23

ద్రక్ష్యస్యద్యైవ వైదేహి రాఘవం సహలక్ష్మణమ్।
వ్యవసాయసమాయుక్తం విష్ణుం దైత్యవధే యథా। 24

ఓ కపివరా! 'అనల' అనునామె విభీషణుని పెద్దకూతురు. ఆమె తనతల్లి పంపగా ఇచటికివచ్చి, నాతో స్వయముగా ఇట్లు పలికెను. అవింధ్యుడు అను ఒక వృద్ధ రాక్షసుడు గలడు. అతడు మిక్కిలి తెలివిగలవాడు, విద్వాంసుడు, ధైర్యశాలి, ఉత్తమస్వభావము గలవాడు, రావణునికడ చొరవగలవాడు. అతడు 'రామునివలన రాక్షసులనాశము తథ్యము' అని రావణునితో నొక్కి చెప్పెను. కాని ఆ దుష్టరావణుడు అతని హితవచనములను పెడచెవిని బెట్టెను.". (11-13)

ఓ కపీశ్వరా! నా స్వామి త్వరలోనే నన్ను చేరగలడు. ఇది నా పరమవిశ్వాసము. నా అంతరాత్మ పవిత్రమైనది, శ్రీరామునిలో ఉత్సాహము, పౌరుషము, బలము, కరుణ, కృతజ్ఞత, పరాక్రమము, శక్తి మొదలగు పలుసద్గుణములు గలవు. (14-15)

శ్రీరాముడు సోదరునితోడు లేకుండగనే తానొక్కడే దండకారణ్యమునందు పదునాలుగువేలమంది రాక్షసులను హతమార్చెను. అట్టి మహావీరునకు ఏ శత్రువు భయపడడు? (16)

ఎట్టి క్లిష్టపరిస్థితులును ఆ మహాపురుషుని చలింప జేయజాలవు. దేవేంద్రునిశక్తి శచీదేవికి తెలిసినట్లు ఆయన ప్రభావము నాకు తెలియును. (17)

సూర్యుడు తనతీవ్రకిరణములచే నీటిని పూర్తిగా ఇంకింపజేసినట్లు, శూరుడైన శ్రీరాముడు, తన బాణపరంపరలచే శత్రురాక్షససమూహములను మగ్గ మగ్గ గావింపగలడు." (18)

శ్రీరామునియెడబాటుకారణముగా శోకముతో కృశించినదియు, కనులయందు అశ్రువులు నిండినదియు అగు సీతాదేవి ఈ విధముగా పలుకగా ఆమెతో హనుమంతుడు ఇట్లనెను. (19)

"శ్రీరాముడు నా మాటలను వినినంతనే భల్లూకవానర సమూహములతోగూడిన మహాసైన్యమును వెంటనిడుకొని, శీఘ్రముగా రాగలడు. (20)

లేనిచో, అమ్మా! నేడే నిన్ను ఈ దుఃఖమునుండి విముక్తురాలనుగా చేయగలను. ఓ పూజ్యురాలా! నా వీపును అధిరోహింపుము. నిన్ను నావీపుపై చేర్చుకొని, ఈ మహాసముద్రమును దాటగలను, రావణునితోగూడ ఈ లంకను పెకలించి తీసికొనిపోగలశక్తి నాకు గలదు.(21-22)

ఓ మైథిలీ! అగ్నిదేవుడు హవ్యమును ఇంద్రునకు అందజేసినట్లు, ప్రస్రవణగిరిపైనున్న శ్రీరామునకు నేడే నిన్ను అప్పగింతును. ఓ వైదేహీ! దైత్యసంహారమునకు సన్నద్ధుడైన విష్ణువువలె, లక్ష్మణునితోగూడియున్న శ్రీరాముడు రాక్షసులను వధించుటకై సిద్ధముగా ఉన్నాడు.

త్వద్దర్శనకృతోత్సాహమ్ ఆశ్రమస్థం మహాబలమ్।
పురందరమివాసీనం నాగరాజస్య మూర్ధని। 25

పృష్ఠమారోహ మే దేవి మా వికాంక్షస్వ శోభనే।
యోగమన్విచ్ఛ రామేణ శశాంకేనేవ రోహిణీ। 26

కథయంతీవ చంద్రేణ సూర్యేణ చ మహార్చిషా।
మత్పృష్ఠమధిరుహ్య త్వం తరాకాశమహార్ణవౌ। 27

న హి మే సంప్రయాతస్య త్వామితో నయతోఽంగనే।
అనుగంతుం గతిం శక్తాః సర్వే లంకానివాసినః। 28

యథైవాహమిహ ప్రాప్తః తథైవాహమసంశయః।
యాస్యామి పశ్య వైదేహి త్వాముద్యమ్య విహాయసమ్। 29

మైథిలీ తు హరిశ్రేష్ఠాత్ శ్రుత్వా వచనమద్భుతమ్।
హర్షవిస్మితసర్వాంగీ హనుమంతమథాబ్రవీత్। 30

హనుమన్ దూరమధ్వానం కథం మాం వోఢుమిచ్ఛసి।
తదేవ ఖలు తే మన్యే కపిత్వం హరియూథప। 31

కథం వాల్పశరీరస్త్వం మామితో నేతుమిచ్ఛసి।
సకాశం మానవేంద్రస్య భర్తుర్మే ప్లవగర్షభ। 32

సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః।
చింతయామాస లక్ష్మీవాన్ నవం పరిభవం కృతమ్। 33

న మే జానాతి సత్త్వం వా ప్రభావం వాఽసితేక్షణా।
తస్మాత్ పశ్యతు వైదేహి యద్రూపం మమ కామతః। 34

ఇతి సంచింత్య హనుమాన్ తదా ప్లవగసత్తమః।
దర్శయామాస వైదేహ్యాః స్వరూపమరిమర్దనః। 35

స తస్మాత్ పాదపాద్ధీమాన్ ఆప్లుత్య ప్లవగర్షభః।
తతో వర్ధితుమారేభే సీతాప్రత్యయకారణాత్। 36

మహా బలశాలియు, ఆశ్రమనివాసియు, నిన్ను చూచుటకై కుతూహలపడుచున్నవాడును. ఐన శ్రీరాముడు ఇంద్రుడు ఐరావతముమూపుపైనున్నట్లు ప్రస్రవణగిరిపై ఆసీనుడై యున్నాడు. అట్టి ప్రభువును నీవు నేడే చూడగలవు.(23-25)

ఓ మంగళదాయినీ! దేవీ! నా వీపును అధిరోహింపుము. కాదనవలదు. రోహిణి చంద్రునిజేరినట్లు శ్రీరాముని జేరుటకు నిశ్చయించుకొనుము. (26)

నీవు నావీపుపై ఆసీనవై, చంద్రునితోను, మహాతేజశ్శాలియైన సూర్యునితోను సంభాషించుచున్నట్లు ఆకాశమార్గమున పయనించుచు ఈ మహాసముద్రమును దాటుము. (27)

ఓ దేవీ! ఇక్కడినుండి ఆకాశమార్గమున నిన్ను తీసికొనిపోవునప్పుడు నావేగగతిని అనుసరించుటకు ఈ లంకానివాసులకెవ్వరికిని శక్యముగాదు. (28)

ఓ వైదేహీ! నేను ఇక్కడికి వచ్చిన విధముగనే, ఆకాశమార్గమున నిన్ను దీసికొని వెళ్లగలను సుమా! ఇందు సంశయము లేదు." (29)

సీతాదేవి కపివరుని అద్భుతవచనములను విని, ఆనందాశ్చర్యములతో పులకితగాత్రయై, హనుమంతునితో ఇట్లు పలికెను. (30)

"ఓ హనుమంతుడా! ఇంతదూరము నన్ను ఎట్లు మోసికొనివెళ్లగలవు? దీనినిబట్టి నీవానరలక్షణము ప్రకటితమగుచున్నది. (31)

ఓ కపివరా! నీ శరీరమేమో చిన్నది. నన్ను ఇచటినుండి మహాపురుషుడైన నాస్వామికడకు ఎట్లు తీసికొని పోగలవు?(32)

సర్వశక్తిసంపన్నుడును, వాయుసుతుడును ఐన హనుమంతుడు సీతాదేవి వచనములనువిని, తనకు అది ఒక అవమానముగా భావించెను. (33)

సీతాదేవి నా బలమునుగాని, ప్రభావమునుగాని ఎఱుగదు. అందువలన నాయిచ్ఛానుసారము ఆమెకు నా పర్వతాకారరూపమును ప్రకటింతును. (34)

వానరోత్తముడును, శత్రువులను పరిమార్చువాడును ఐన హనుమంతుడు ఇట్లాలోచించి, సీతాదేవికి తన బృహద్రూపమును జూపెను. (35)

ధీశాలియగు ఆ కపివరుడు ఆ చెట్టువేదికనుండి[1] ఒక్కగంతులో కొంతదూరమునకు చేరి, సీతాదేవికి నమ్మకము కల్గించుటకై శరీరమును పెంచసాగెను. (36)

1) 33వ సర్గలో మొదటి శ్లోకమునందు- అంజనేయస్వామి వృక్షముపైనుండి క్రిందికిదిగి, సీతాదేవి సమీపమునకు చేరినట్లు పేర్కొనబడినది. కావున ఇంతవఱకును, మారుతి వృక్షమూలముననే యున్నట్లు భావింపవలెను. ఇప్పుడు సీతాదేవికి తన బృహద్రూపమును జూపుటకై చెట్టుమూలమునుండి కొంతదూరమునకు జరిగినట్లు గ్రహింపవలెను.

మేరుమందరసంకాశో బభౌ దీప్తానలప్రభః।
అగ్రతో వ్యవతస్థే చ సీతాయా వానరోత్తమః। 37

హరిః పర్వతసంకాశః తామ్రవక్త్రో మహాబలః।
వజ్రదంష్ట్రనఖో భీమో వైదేహీమిదమబ్రవీత్। 38

సపర్వతవనోద్దేశాం సాట్టప్రాకారతోరణామ్।
లంకామిమాం సనాథాం వా నయితుం శక్తిరస్తి మే। 39

తదవస్థాప్యతాం బుద్ధిః అలం దేవి వికాంక్షయా।
విశోకం కురు వైదేహి రాఘవం సహలక్ష్మణమ్। 40

తం దృష్ట్వాఽచలసంకాశమ్ ఉవాచ జనకాత్మజా।
పద్మపత్రవిశాలాక్షీ మారుతస్యౌరసం సుతమ్। 41

తవ సత్త్వం బలం చైవ విజానామి మహాకపే।
వాయోరివ గతిం చైవ తేజశ్చాగ్నేరివాద్భుతమ్। 42

ప్రాకృతోఽన్యః కథం చేమాం భూమిమాగంతుమర్హతి।
ఉదధేరప్రమేయస్య పారం వానరపుంగవ। 43

జానామి గమనే శక్తిం నయనే చాపి తే మమ।
అవశ్యం సంప్రధార్యాఽఽశు కార్యసిద్ధిర్మహాత్మనః। 44

అయుక్తం తు కపిశ్రేష్ఠ మమ గంతుం త్వయాఽనఘ।
వాయువేగసవేగస్య వేగో మాం మోహయేత్తవ। 45

అహమాకాశమాపన్నా హ్యుపర్యుపరి సాగరమ్।
ప్రపతేయం హి తే పృష్ఠాత్ భయాద్వేగేన గచ్ఛతః। 46

పతితా సాగరే చాహం తిమినక్రఝషాకులే।
భవేయమాశు వివశా యాదసామన్నముత్తమమ్। 47

న చ శక్ష్యే త్వయా సార్ధం గంతుం శత్రువినాశన।
కళత్రవతి సందేహః త్వయ్యపి స్యాదసంశయః। 48

హ్రియమాణాం తు మాం దృష్ట్వా రాక్షసా భీమవిక్రమాః।
అనుగచ్ఛేయురాదిష్టా రావణేన దురాత్మనా। 49

హనుమంతుడు మేరు, మందరగిరులతో సమానముగాపెరిగి, ప్రజ్వలించుచున్న అగ్నిజ్వాలలవలె వెలుగొందుచు సీతాదేవి సమ్ముఖమున నిలిచెను. (37)

పర్వతసదృశుడును, ఎఱ్ఱని ముఖముగలవాడును, మిక్కిలిబలశాలియు, వజ్రమువలె తీక్ష్ణములైనకోరలు, నఖములు, భయంకరమైన ఆకారముగలవాడై హనుమంతుడు సీతాదేవితో ఇట్లు పలికెను. (38)

"పర్వతములతో వనప్రదేశములతో ఒప్పుచున్నదియు, కోటబురుజులతో, ప్రాకారములతో, ముఖద్వారములతో విలసిల్లుచున్నదియు అగు ఈ లంకానగరమును రావణ సహితముగా తీసికొనిపోగలశక్తి నాకుగలదు. (39)

దేవీ! అందువలన సందేహమును వీడుము. మనస్సును కుదుటపఱచుకొనుము. నీవు నావీపును అధిరోహించి రామలక్ష్మణులకడకుచేరి, వారి శోకమును తొలగింపుము." (40)

పద్మపత్రములవలె విశాలములైన నేత్రములుగల ఆ జానకి, పర్వతసమానుడగు ఆ వాయుసుతునితో ఇట్లనెను. "ఓ వానరోత్తమా! నీ బలపరాక్రమములను, వాయువేగ గమనమును అగ్నిజ్వాలలవంటి నీ అద్భుతతేజస్సును నేను తెలిసికొంటిని. ఓ వానరపుంగవా! సామాన్య మానవుడెవ్వడైనను, ఊహకుఅందని సముద్రమునుదాటి ఈ ప్రదేశమునకు రాగలడా? (41-43)

నీగమనవేగమును, నన్ను తీసికొనివెళ్లగల నీశక్తిని నేనెఱుగుదును. మహాత్ములు తమకార్యసిద్ధికై ముందుగా బాగుగా ఆలోచింతురు. నేను గూడ ముందువెనుకలు ఆలోచించి, ఒక నిర్ణయమునకు రావలసియున్నది. (44)

ఓ పుణ్యపురుషా! కపివరా! నేను నీతో ప్రయాణము చేయుట యుక్తముకాదు. నీ వాయువేగగమనము నాకు తత్తఱపాటును కలిగింపవచ్చును. (45)

సముద్రమునకు ఎంతోయెత్తున మిక్కిలివేగముతో ఆకాశమార్గమున వెళ్లుచున్న నీవీపుపైనుండి భయముతో నేను క్రింద పడిపోవచ్చును. సముద్రము తిమింగిలములతో, మొసళ్లతో పెద్దపెద్ద చేపలతో నిండియుండును. నేను పట్టుదప్పి అందు పడిపోయినచో వెంటనే ఆ జలజంతువులు నన్ను భక్షించును. (46-47)

ఓ అరిసూదనా! నీతో ప్రయాణముచేయుటకు నాకు ధైర్యముచాలదు. ఏలనన నన్ను రక్షించు ప్రయత్నమున నీ భద్రతకును ముప్పువాటిల్లవచ్చును. (48)

నీవు నన్నుతీసికొనిపోవుచుండగా జూచి, భయంకరులైన రాక్షసయోధులు దురాత్ముడైన రావణుని ఆదేశముతో మనలను వెంటాడుదురు. (49)

తైస్త్వం పరివృతః శూరైః శూలముద్గరపాణిభిః।
భవేస్త్వం సంశయం ప్రాప్తో మయా వీర కళత్రవాన్॥ 50

సాయుధా బహవో వ్యోమ్ని రాక్షసాస్త్వం నిరాయుధః।
కథం శక్ష్యసి సంయాతుం మాం చైవ పరిరక్షితుమ్॥ 51

ఓ వీరుడా! శూలములను, ఇనుపగుదియలను చేతబట్టిన రాక్షసవీరులు నిన్ను చుట్టుముట్టెదరు. అప్పుడు నన్ను రక్షించుచున్న నీ పరిస్థితియు ప్రమాదములోబడును. నీవేమో ఒంటరివాడవు, నిరాయుధుడవు, రాక్షసులేమో పెక్కుమంది, పైగా ఆయుధములుగలవారు. అట్టి స్థితిలో ఆకాశమున నీవు ముందుకు ఎట్లు ప్రయాణింపగలవు? నన్ను ఎట్లు రక్షింపగలవు? (50-51)

యుధ్యమానస్య రక్షోభిః తవ తైః క్రూరకర్మభిః।
ప్రపతేయం హి తే పృష్ఠాత్ భయార్తా కపిసత్తమ॥ 52

ఓ కపివరా! క్రూరకర్మలను చేయునట్టి ఆ రాక్షసులతో నీవు యుద్ధము చేయునప్పుడు నేను భయకంపితనై నీ వీపునుండి జారిపడిపోవచ్చును. (52)

అథ రక్షాంసి భీమాని మహాంతి బలవంతి చ।
కథంచిత్ సాంపరాయే త్వాం జయేయుః కపిసత్తమ॥ 53

ఓ వానరోత్తమా! రాక్షసులు మిక్కిలి భయంకరులు, స్థూలకాయులు, బలవంతులు వారు ఏదేని ఒకరీతిగా నిన్ను యుద్ధమున జయింపగలరు. (53)

అథవా యుధ్యమానస్య పతేయం విముఖస్య తే।
పతితాం చ గృహీత్వా మాం నయేయుః పాపరాక్షసాః॥ 54

మాం వా హరేయుస్త్వద్ధస్తాత్ విశసేయురథాపి వా।
అవ్యవస్థౌ హి దృశ్యేతే యుద్ధే జయపరాజయౌ॥ 55

లేక- నీవు వారితో యుద్ధముచేయుచు నా విషయమున ఏమరుపాటుతో ఉన్నచో నేను పడిపోగలను. అప్పుడు పాపులైన రాక్షసులు పడిపోయిన నన్ను తీసికొని పోవుదురు. లేదా! నీ చేతినుండి నన్ను వారు హరించుకొని పోవుదురు. లేక, చంపివేయుదురు. 'యుద్ధమునందు జయాపజయములు అస్థిరములు' అని అందఱెఱిగినదే గదా! (54-55)

అహం వాపి విపద్యేయం రక్షోభిరభితర్జితా।
త్వత్ప్రయత్నో హరిశ్రేష్ఠ భవేన్నిష్ఫల ఏవ తు॥ 56

ఓ వానరోత్తమా! రాక్షసులచేత భయపెట్టబడినదాననై నేను ఆపదలపాలునూగావచ్చును. అప్పుడు నీ కృషియంతయు వృథాయే యగును. (56)

కామం త్వమసి పర్యాప్తో నిహంతుం సర్వరాక్షసాన్।
రాఘవస్య యశో హీయేత్ త్వయా శస్తైస్తు రాక్షసైః॥ 57

రాక్షసులనందఱిని చంపివేయుటకు నీవు మిక్కిలి సమర్థుడవే కావచ్చును. రాక్షసయోధులనందఱిని నీవే చంపి, నన్ను దీసికొనిపోయినచో శ్రీరామునికీర్తికి భంగమువాటిల్లును. (57)

అథవాఽఽదాయ రక్షాంసి న్యసేయుః సంవృతే హి మామ్।
యత్ర తే నాభిజానీయుః హరయో నాపి రాఘవౌ॥ 58

లేదా, రాక్షసులు నన్ను దీసికొనిపోయి, ఆవానరులుగాని రామలక్ష్మణులుగాని తెలిసికొనలేనంత రహస్య ప్రదేశమున దాచియుంచగలరు. (58)

ఆరంభస్తు మదర్థోఽయం తతస్తవ నిరర్థకః।
త్వయా హి సహ రామస్య మహానాగమనే గుణః॥ 59

అందువలన నన్ను దీసికొనిపోవుటకై నీవు సంకల్పించిన ప్రయత్నమంతయును వ్యర్థమేయగును. కావున ఇక్కడికి శ్రీరాముడు నీతోగలిసివచ్చుటయే మంచిది. (59)

మయి జీవితమాయత్తం రాఘవస్య మహాత్మనః।
భ్రాతౄణాం చ మహాబాహో తవ రాజకులస్య చ॥ 60

ఓ మహావీరుడా! మహాత్ముడైన శ్రీరాముడు, ఆయన సోదరులు, నీవు, నీరాజైనసుగ్రీవుడు ఆయన పరివారము వీరియందఱి జీవితములు నాపైననే ఆధారపడియున్నవి గదా! (60)

తౌ నిరాశౌ మదర్థం తు శోకసంతాపకర్శితౌ।
సహ సర్వర్క్షహరిభిః త్యక్ష్యతః ప్రాణసంగ్రహమ్॥ 61

ఆ రామలక్ష్మణులు ఇరువురును నిరాశపడి, శోకసంతాపములచే కృశించినవారై, భల్లూకవానరులతో గూడ ప్రాణములను విడుతురు. (61)

భర్తుర్భక్తిం పురస్కృత్య రామాదన్యస్య వానర।
నాహం స్ప్రష్టుం స్వతో గాత్రమ్ ఇచ్ఛేయం వానరోత్తమ॥ 62

ఓ వానరపుంగవా! నా పాతివ్రత్య ధర్మమునమనుసరించి, శ్రీరామునిదప్ప, మఱియొక పురుషునిశరీరమును నా బొందిలో ప్రాణము ఉండునంత వరకు తాకను. (62)

యదహం గాత్రసంస్పర్శం రావణస్య బలాద్గతా।
అనీశా కిం కరిష్యామి వినాథా వివశా సతీ॥ 63

రావణుడు బలవంతముగా నన్ను అపహరించుకొని వచ్చునప్పుడు నాకు వాని శరీరస్పర్శ కలిగినది. ఏలనన స్వయముగా ఎదుర్కొనగలశక్తి లేనిదానను, పరాధీనురాలను, పైగా నన్ను రక్షించునాథుడు అచట లేకుండెను. నేను ఏమి చేయగలను? (63)

యది రామో దశగ్రీవమ్ ఇహ హత్వా సబాంధవమ్।
మామితో గృహ్య గచ్ఛేత తత్తస్య సదృశం భవేత్॥ 64

శ్రీరాముడు దశకంఠుని సపరివారముగా పరిమార్చి, నన్ను ఇచటినుండి తీసికొనిపోవుటయే ఆ మహావీరుని స్థాయికి తగినపని. (64)

శ్రుతా హి దృష్టాశ్చ మయా పరాక్రమా
మహాత్మనస్తస్య రణావమర్దినః।
న దేవగన్ధర్వభుజంగరాక్షసా
భవంతి రామేణ సమా హి సంయుగే॥ 65

రణరంగమున శత్రుసమూహములను నుగ్గునుగ్గు గావించు ఆ మహాత్ముని పరాక్రమవైభవములను వినుటయేగాక నేను స్వయముగా చూచితిని. దేవతలలో, గంధర్వులలో, నాగులలో, రాక్షసులలో ఎవ్వరును శ్రీరామునకు సమరభూమియందు సాటికాగలవారులేరు. (65)

సమీక్ష్య తం సంయతి చిత్రకార్ముకం
మహాబలం వాసవతుల్యవిక్రమమ్।
సలక్ష్మణం కో విషహేత రాఘవం
హుతాశనం దీప్తమివానిలేరితమ్॥ 66

శ్రీరాముడు అద్భుతమైన ధనుస్సుగలవాడు, మహాబలశాలి, పరాక్రమమున దేవేంద్రుని మించినవాడు. వాయువుతోడై మహాజ్వాలలతో మీదికెగయుఅగ్నివలె, లక్ష్మణుడుతోడై, తేజరిల్లుచుండెడి ఆ మహావీరుని జూచి సంగ్రామరంగమున ఎదురుగా నిలబడగలవాడెవ్వడు?"(66)

సలక్ష్మణం రాఘవమాజిమర్దనం
దిశాగజం మత్తమివ వ్యవస్థితమ్।
సహేత కో వానరముఖ్య సంయుగే
యుగాంతసూర్యప్రతిమం శరార్చిషమ్॥ 67

ఓ వానరోత్తమా! యుద్ధమున శత్రువులను మర్దించు శ్రీరాముడు లక్ష్మణసహితుడై బాణములనెడి కిరణములను విరజిమ్ముచు, ప్రళయకాలసూర్యునివలె తేజరిల్లుచు, కదనరంగమున మదించిన దిగ్గజమువలె నిలిచియున్నప్పుడు ఆ వీరునిఎదుర్కొనగల యోధుడెవ్వడు? (67)

స మే హరిశ్రేష్ఠ సలక్ష్మణం పతిం
సయూథపం క్షిప్రమిహోపపాదయ।
చిరాయ రామం ప్రతి శోకకర్శితాం
కురుష్వ మాం వానరముఖ్య హర్షితామ్॥ 68

కావున ఓ కపివరా! లక్ష్మణునితో, వానరసమూహములతో గూడియున్న నాస్వామిని వెంటనే ఇచటకు తీసికొనిరమ్ము. చాలకాలమునుండి రామవిరహశోకముతో కృశించియున్నదానను. శ్రీరాముని తోడ్కొనివచ్చి నాకు ఆనందమును గూర్పుము. (68)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే సప్తత్రింశస్సర్గః (37)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదియేడవసర్గము.

— * * * —

38. ముప్పదియెనిమిదవసర్గము

అభిజ్ఞానార్థము సీతాదేవిచే కాకాసుర వృత్తాంత కథనము , చూడామణి ప్రదానము,

శ్రీరాముని శీఘ్రముగా దీసికొని రమ్మని కోరుట

తతస్స కపిశార్దూలః తేన వాక్యేన హర్షితః।
సీతామువాచ తచ్ఛ్రుత్వా వాక్యం వాక్యవిశారదః॥ 1

అంతట హనుమంతుడు యుక్తియుక్తములైన సీతాదేవి వచనములనువిని పొంగిపోయెను. అనంతరము మాటనేర్పరియైన అతడు ఆమెతో ఇట్లు పలికెను. (1)

యుక్తరూపం త్వయా దేవి భాషితం శుభదర్శనే।
సదృశం స్త్రీస్వభావస్య సాధ్వీనాం వినయస్య చ। 2

స్త్రీత్వం న తు సమర్థం హి సాగరం వ్యతివర్తితుమ్।
మామధిష్ఠాయ విస్తీర్ణం శతయోజనమాయతమ్। 3

ద్వితీయం కారణం యచ్చ బ్రవీషి వినయాన్వితే।
రామాదన్యస్య నార్హామి సంస్పర్శమితి జానకి। 4

ఏతత్ తే దేవి సదృశం పత్న్యాస్తస్య మహాత్మనః।
కా హ్యన్యా త్వామ్ ఋతే దేవి బ్రూయాద్వచనమీదృశమ్। 5

శ్రోష్యతే చైవ కాకుత్స్థః సర్వం నిరవశేషతః।
చేష్టితం యత్త్వయా దేవి భాషితం మమ చాగ్రతః। 6

కారణైర్బహుభిర్దేవి రామప్రియచికీర్షయా।
స్నేహప్రస్కన్నమనసా మయైతత్ సముదీరితమ్। 7

లంకాయా దుష్ప్రవేశత్వాత్ దుస్తరత్వాన్మహోదధేః।
సామర్థ్యాదాత్మనశ్చైవ మయైతత్ సముదీరితమ్। 8

ఇచ్ఛామి త్వాం సమానేతుమ్ అద్యైవ రఘుబంధునా।
గురుస్నేహేన భక్త్యా చ నాన్యథైతదుదాహృతమ్। 9

యది నోత్సహసే యాతుం మయా సార్ధమనిందితే।
అభిజ్ఞానం ప్రయచ్ఛ త్వం జానీయాద్రాఘవో హి యత్। 10

ఏవముక్తా హనుమతా సీతా సురసుతోపమా।
ఉవాచ వచనం మందం బాష్పప్రగ్రథితాక్షరమ్। 11

ఇదం శ్రేష్ఠమభిజ్ఞానం బ్రూయాః త్వం తు మమ ప్రియమ్।
శైలస్య చిత్రకూటస్య పాదే పూర్వోత్తరే పురా। 12

తాపసాశ్రమవాసిన్యాః ప్రాజ్యమూలఫలోదకే।
తస్మిన్ సిద్ధాశ్రమే దేశే మందాకిన్యా హ్యదూరతః। 13

"అమ్మా! మంగళస్వరూపిణీ! నీ వచనములు సహేతుకములు, మిక్కిలి యుక్తియుక్తములు, అవి స్త్రీ స్వభావమునకును, పతివ్రతలనమ్రతకును తగియున్నవి. (2)

నా వీపుపై అధిష్ఠించి, విశాలమై నూఱుయోజనముల పొడవుగల మహాసాగరమును దాటుట స్త్రీసహజమైన భయస్వభావమునకు అనువుకానిది. (3)

అమ్మా! ఓ వినయశీలా! 'నా భర్తయైన శ్రీరామునితప్ప అన్యపురుషుని తాకను' అని నీవు పేర్కొనిన రెండవ కారణము ఆ మహాపురుషునియొక్క పత్నివగు నీకే తగును. ఓ దేవీ! నీవుతప్ప ఇట్టివచనమును ఏ స్త్రీ పలుకగలదు? ఓ దేవీ! ఇచటి నీ ప్రతిచర్యను, నాతో నీవు పలికిన ప్రతి వచనమును, శ్రీరామునకు నేను పూసగ్రుచ్చినట్లు[1] పూర్తిగా వివరింతును. (4-6)

ఓ తల్లీ! నీకును శ్రీరామునకును ప్రియమును చేకూర్పవలెననుకోరికతోడను, ఆ స్వామిపైగల స్నేహాతిరేకమున మనస్సునకు తోచకపోవుటవలనను, ఇంకను పెక్కుకారణముల చేతను నీతో ఇట్లు (నిన్ను నా వీపుపై మోసికొనిపోయి శ్రీరామునియొద్దకు చేర్చెదనని) చెప్పియుంటిని. (7)

లంకాప్రవేశము అసాధ్యముగుటవలనను, మహా సముద్రము దాటశక్యముగానిది యగుటచేతను, నాకు నిన్ను తీసికొనివెళ్లగల సామర్థ్యము ఉండుటవలనను నేనిట్లు పలికితిని. (8)

తల్లీ! శ్రీరామునిపైగల విశేషమైన భక్తిప్రపత్తులచేత, నేడే శ్రీరామునికడకు నిన్ను చేర్చవలెనను కోరికతోడను ఇట్లు నుడివితిని. మఱియొక కారణమేదియు లేదు. (9)

ఓ పూజ్యురాలా! నా వెంట వచ్చుటకు నీకు సమ్మతము కానిచో శ్రీరాముడు గుర్తింపగల ఏదైన నొక 'ఆనవాలు'ను దయతో ప్రసాదింపుము." (10)

దివ్యకాంతవంటి సీతాదేవి హనుమంతునివచనములను విన్న పిమ్మట కన్నీరుపెట్టుచు తడబడుచు తిన్నగా (రాకాసిమూకలకు వినబడకుండ) ఇట్లు పలికెను. (11)

నా స్వామికి గుర్తుగా శ్రేష్ఠమైన ఈకథను తెలుపుము. "చిత్రకూటపర్వతమునకు ఈశాన్యభాగమున ఒక ఉపపర్వతము గలదు. అచ్చట ఫలమూలములు, ఉదకములు, సమృద్ధిగాగలవు. ఆ ప్రదేశమున మందాకినీ నదీసమీపమున ఒక సిద్ధాశ్రమము ఉన్నది. అందు పూర్వము నేను సీతో తాపసాశ్రమవాసినిగా ఉన్నప్పుడు ఈ కథ జరిగినది. (12-13)

1) రావణుడు నిన్ను భయపెట్టుట, నీవు రావణుని తృణీకరించుట, రాక్షసస్త్రీలు నిన్ను బెదిరించుట, విరహ తాపమునకు తట్టుకొనలేక నీవు ప్రాణత్యాగమునకు సిద్ధపడుట, నిరంతరము శ్రీరామునే ధ్యానించుచుండుట, నీ పాతివ్రత్యధర్మాచరణము, శ్రీరామునకు నీసందేశము మున్నగు విషయములను యథాతథముగ శ్రీరామునకు తెలుపుదును. ఈవిషయములను అన్నింటిని వృక్షముపైనున్న నేను గమనించియే యుంటిని.

తస్యోపవనషండేషు నానాపుష్పసుగంధిషు।
విహృత్య సలిలక్లిన్నా తవాంకే సముపావిశమ్ । 14

ఆ సిద్ధాశ్రమసమీపమున నానాపుష్పపరిమళములతో నిండిన పెక్కుఉపవనములు విలసిల్లుచున్నవి. ఆ ఉపవనములయందు విహరించి, అలసి, స్వేదజలములతో తడిసి, నేను నీ యొడిలో కూర్చొనియుంటిని. (14)

తతో మాంససమాయుక్తో వాయసః పర్యతుండయత్।
తమహం లోష్టముద్యమ్య వారయామి స్మ వాయసమ్ । 15

ఇంతలో ఒకకాకి వచ్చి, మాంసమునకు ఆశపడి, నా స్తనములమధ్య తన ముక్కుతో పొడిచెను. నేనా వాయసమును ఒక మట్టిపెడ్డతో వారించితిని. (15)

దారయన్ స చ మాం కాకః తత్రైవ పరిలీయతే।
న చాప్యుపారమన్మాంసాత్ భక్షార్థీ బలిభోజనః । 16

ఆ కాకి నన్ను పదేపదే బాధించుచు, నానుండి తప్పించుకొనుచు అచటనే తిరుగుచుండెను. ఆహారకాంక్షగల ఆ కాకి మాంసముకొఱకైన తనప్రయత్నమును విరమించుకొనలేదు. (16)

ఉత్కర్షంత్యాం చ రశనాం క్రుద్ధాయాం మయి పక్షిణి।
స్రస్యమానే చ వసనే తతో దృష్టా త్వయా హ్యహమ్ । 17

నేను కోపముతో ఆ వాయసమును అదలించుచు, వదలిన ఒడ్డాణమును సరిచేసికొనుచు, జాఱిపోవుచున్న వస్త్రమును సర్దుకొనుచుంటిని అప్పుడు నీవు నన్ను చూచితివి. (17)

త్వయాపహసితా చాహం క్రుద్ధా సంలజ్జితా తదా।
భక్షగృధ్నేన కాకేన దారితా త్వాముపాగతా । 18

వాయసముపై క్రుద్ధురాలనైయున్న నన్ను నీవు పరిహసింపగా నేను సిగ్గుపడితిని. ఆహారముపైగల ఆశతో వాయసము నన్ను చీరగా నేను నీ కడకు వచ్చితిని. (18)

ఆసీనస్య చ తే శ్రాన్తా పునరుత్సంగమావిశమ్।
క్రుధ్యన్తీ చ ప్రహృష్టేన త్వయాహం పరిసాంత్వితా । 19

అలసియున్న నేను, కూర్చొనియున్న నీయొడిలో జేరితిని. కోపముతోనున్న నన్ను నీవు నవ్వుచు ఓదార్చితివి. (19)

బాష్పపూర్ణముఖీ మందం చక్షుషీ పరిమార్జతీ।
లక్షితాహం త్వయా నాథ వాయసేన ప్రకోపితా । 20

వాయసబాధకారణముగా కుపితనైన నాకన్నులలో నీరునిండెను. మెల్లగా ఆ అశ్రువులను తుడుచుకొనుచున్న నన్ను నీవు చూచితివి." (20)

పరిశ్రమాత్ ప్రసుప్తా చ రాఘవాంకేఽప్యహం చిరమ్।
పర్యాయేణ ప్రసుప్తశ్చ మమాంకే భరతాగ్రజః । 21

నేను మిక్కిలి అలసటచెందియుండుటవలన శ్రీరాముని యొడిలో చాలాసేపు నిద్రించితిని. నేను మేల్కొనిన పిమ్మట శ్రీరాముడు నాయొడిలో నిద్రించెను. (21)

స తత్ర పునరేవాథ వాయసస్సముపాగమత్।
తతస్సుప్తప్రబుద్ధాం మాం రామస్యాంకాత్ సముత్థితామ్।
వాయసస్సహసాగమ్య విదదార స్తనాంతరే । 22

అటుపిమ్మట కొంతసేపటికి ఆ వాయసము మరల అచటికి వచ్చెను. శ్రీరామునిఒడిలో నిద్రించి, మేల్కొని లేచిన నన్ను ఆ కాకివేగముగా సమీపించి, నా స్తనములమధ్య చీరెను. (22)

పునఃపునరథోత్పత్య విదదార స మాం భృశమ్।
తతస్సముక్షితో రామో ముక్తైశ్శోణితబిందుభిః । 23

అది మాటిమాటికి ఎగిరి యెగిరి నన్ను మిక్కిలి బాధించెను. అంతట శ్రీరాముడు నా వక్షస్థలమునుండి స్రవించుచున్న రక్తబిందువులతో తడిసెను. (23)

వాయసేన తతస్తేన బలవత్ క్లిశ్యమానయా।
స మయా బోధితశ్శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః । 24

అప్పుడు ఆ వాయసముచేత ఎంతయు బాధింపబడుచున్న నేను సకలైశ్వర్యసంపన్నుడు, అరిసూదనుడైన శ్రీరాముని గాఢనిద్రనుండి మేల్కొల్పితిని. (24)

స మాం దృష్ట్వా మహాబాహుః వితున్నాం స్తనయోస్తదా।
ఆశీవిష ఇవ క్రుద్ధః శ్వసన్ వాక్యమభాషత । 25

మహాబాహువులుగలవాడైన ఆ రాముడు అప్పుడు ఆ కాకముచే స్తనములమధ్య పీడింపబడుచున్న నన్ను జూచి, రెచ్చిపోయి బుసలుకొట్టుచున్న త్రాచుపామువలె క్రుద్ధుడై, నిట్టూర్పులు విడుచుచు ఇట్లుపలికెను. (25)

కేన తే నాగనాసోరు విక్షతం వై స్తనాంతరమ్।
కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా। 26

ఓ సుందరీ! సీతా! నీస్తనమధ్యభాగమున గాయపఱచిన వాడెవడు. కోపముతోనున్న విస్తృతమైన పడగగల భయంకరమైన మహాసర్పముతో ఆడుకొనుచున్న వాడెవడు? (26)

వీక్షమాణస్తతస్తం వై వాయసం సముదైక్షత।
నఖైః సరుధిరై స్తీక్ష్ణైః మామేవాభిముఖం స్థితమ్। 27

శ్రీరాముడు అటునిటు పరికించుచు రక్తసిక్తములైన వాడిగోళ్లతో నాకెదురుగా నిలిచియున్న ఆ కాకిని జూచెను.(27)

పుత్రః కిల స శక్రస్య వాయసః పతతాం వరః।
ధరాంతరగతశ్శీఘ్రం పవనస్య గతౌ సమః। 28

ఆ వాయసము ఇంద్రునికుమారుడట! అతడు పక్షులలో శ్రేష్ఠుడట. శీఘ్రగమనమున వాయుతుల్యుడట. అతడు (శ్రీరాముని జూచి) తనరక్షణకై మఱియొక ప్రదేశమునకు వెళ్ళెను. (28)

తతస్తస్మిన్ మహాబాహుః కోపసంవర్తితేక్షణః।
వాయసే కృతవాన్ క్రూరాం మతిం మతిమతాం వరః। 29

పిమ్మట, మహాబుద్ధిశాలియు, గొప్పబాహువులుగల శ్రీరాముడు కోపముతో కన్నులు ఎఱ్ఱజేసినవాడై, వాయసమును గట్టిగా శిక్షించుటకై నిర్ణయమును తీసికొనెను. (29)

స దర్భం సంస్తరాద్గృహ్య బ్రాహ్మేణాస్త్రేణ యోజయత్।
స దీప్త ఇవ కాలాగ్నిః జజ్వాలాభిముఖో ద్విజమ్। 30

అతడు తన ఆస్తరణమునుండి దర్భను దీసికొని, దానిని బ్రహ్మాస్త్రముగా అభిమంత్రించెను. ఆ అస్త్రము మండుచున్న ప్రళయకాలాగ్నివలె ఆ పక్షియెదుట మంటలను ఎగజిమ్మెను. (30)

స తం ప్రదీప్తం చిక్షేప దర్భం తం వాయసం ప్రతి।
తత స్తం వాయసం దర్భః సోఽంబరేఽనుజగామ హ। 31

పిమ్మట రాముడు ఆ జ్వలించుచున్న దర్భను (బ్రహ్మాస్త్రమును) ఆ వాయసముపై ప్రయోగించెను. అప్పుడు భలే! ఆ ఇషీకాస్త్రము (బ్రహ్మాస్త్రము) ఆకాశమున పాఱిపోవుచున్న ఆ పక్షిని వెంటాడెను. (31)

అనుసృష్టస్తదా కాకో జగామ వివిధాం గతిమ్।
త్రాణకామ ఇమం లోకం సర్వం వై విచచార హ। 32

అట్లు ఆ అస్త్రము వెంటాడుచుండగా ఆ కాకి దాని ప్రమాదమునుండి తప్పించుకొనుటకై వివిధప్రదేశములకు వెళ్లెను. తనను రక్షించువారికొఱకై ఈ లోకము నందంతటను సంచరించెను. (32)

స పిత్రా చ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః।
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః। 33

న శర్మ లబ్ధ్వా లోకేషు తమేవ శరణం గతః।
స తం నిపతితం భూమౌ శరణ్యశ్శరణాగతమ్।
వధార్హమపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్। 34

తండ్రియగుదేవేంద్రుడును, ఇతరదేవతలును, మహర్షులును ఆకాకమును రక్షించుటకు తమ అశక్తతను ప్రకటించిరి. అంతట అది ముల్లోకములనుగాలించి, తనను రక్షింపగలవారినిగానక తిరిగివచ్చి, ఆ శ్రీరామచంద్రునే శరణుపొందెను. సర్వలోకశరణ్యుడైన ఆ రాఘవుడు తనను శరణుగోరి నేలపై సాగిలపడిన ఆ వాయసము వధార్హమైనను దయదలచి దానిని రక్షించెను. (33-34)

పరిద్యూనం విషణ్ణం చ స తమాయాంతమబ్రవీత్।
మోఘం కర్తుం న శక్యం తు బ్రాహ్మమస్త్రం తదుచ్యతామ్।
హినస్తు దక్షిణాక్షి త్వచ్ఛర ఇత్యథ సోఽబ్రవీత్। 35

పశ్చాత్తాపముతో విషాదమునకులోనై తనను శరణువేడిన ఆ వాయసముతో శ్రీరాముడు ఇట్లు పలికెను. "నేను ప్రయోగించిన బ్రహ్మాస్త్రము వృథాకారాదు. కనుక ఏమి చేయవలెనో తెల్పుము." (35)

తతస్తస్యాక్షి కాకస్య హినస్తి స్మ స దక్షిణమ్।
దత్త్వా స దక్షిణం నేత్రం ప్రాణేభ్యః పరిరక్షితః।
(తదాప్రభృతికాకానామ్ ఏకమక్షీతి విశ్రుతమ్)। 36

పిమ్మట ఆ కాకి "నీ బ్రహ్మాస్త్రము నాకుడికంటిని రూపుమాపుగాక" అని నుడివెను. అప్పుడు శ్రీరాముడు ఆ వాయసముయొక్క దక్షిణనేత్రమును తీసివేసెను. ఆ వాయసము గూడ తనకుడికంటిని సమర్పించి, ప్రాణములతో బయటపడెను. (అప్పటినుండి కాకులన్నియు ఒకే కన్నుగలవియైనట్లు- ప్రసిద్ధి) (36)

స రామాయ నమస్కృత్వా రాజ్ఞే దశరథాయ చ।
విసృష్టస్తేన వీరేణ ప్రతిపేదే స్వమాలయమ్॥ 37

ఆ వాయసము శ్రీరామచంద్రప్రభువునకు నమస్కరించి, రామునకు కన్నతండ్రియు, తనకు స్వర్లోకమిత్రుడును ఐన దశరథమహారాజునకు మనస్సులోనే ప్రణతులు చెల్లించి, మహావీరుడైన రాముని నుండి సెలవుగైకొని, తన ఇంటికి చేరెను. (37)

మత్కృతే కాకమాత్రే తు బ్రహ్మాస్త్రం సముదీరితమ్।
కస్మాద్యో మాఽపహరత్ త్వత్తః క్షమసే తం మహీపతే॥ 38

"నా కొఱకై ఒక కాకిమీద బ్రహ్మాస్త్రమునే ప్రయోగించిన ఓ స్వామీ! నన్ను అపహరించిన ఈ రావణుని హతమార్చక ఉపేక్షించుటకు కారణమేమి? (38)

స కురుష్వ మహోత్సాహః కృపాం మయి నరర్షభ।
త్వయా నాథవతీ నాథ హ్యనాథా ఇవ దృశ్యతే॥ 39

ఓ ప్రాణనాథా! నీవు మహాపురుషుడవు, మిక్కిలి ఉత్సాహశక్తిగలవాడవు. ఇక్కడ నీ ధర్మపత్ని ఒక దిక్కులేని దానివలె పడియున్నది. నాపై కనికరము చూపుము. (39)

ఆనృశంస్యం పరో ధర్మః త్వత్త ఏవ మయా శ్రుతమ్।
జానామి త్వాం మహావీర్యం మహోత్సాహం మహాబలమ్॥ 40

'దీనులపై కరుణచూపుట పరమధర్మము' అని నీవే నాకు తెలిపియుంటివి. నీ పరాక్రమవైభవమును, మహోత్సాహ శక్తిని, మహాబలసంపదను నేనెఱుగుదును. (40)

అపారపారమక్షోభ్యం గాంభీర్యాత్ సాగరోపమమ్।
భర్తారం ససముద్రాయా ధరణ్యా వాసవోపమమ్॥ 41

నీ గుణములు, కర్మలు అనంతములు, అవి ఊహకు అందనివి. నిన్నెవ్వరును క్షోభపెట్టజాలరు. గాంభీర్యమున సముద్రునివంటివాడవు. సముద్రములే హద్దులుగాగల విశాలభూమండలమునకు ప్రభుడవు. ఐశ్వర్యమున దేవేంద్రుడవు. (41)

ఏవమస్త్రవిదాం శ్రేష్ఠః సత్త్వవాన్బలవానపి।
కిమర్థమస్త్రం రక్షస్సు న యోజయసి రాఘవ॥ 42

ఓ స్వామీ! నీవు అస్త్రవిద్యలలో ఆరితేఱినవాడవు, సత్యపరాక్రముడవు. మహాబలశాలివి. ఐనప్పటికిని రాక్షసులపై అస్త్రములను ఏల ప్రయోగించుటలేదు." (42)

న నాగా నాపి గంధర్వా నాఽసురా న మరుద్గణాః।
రామస్య సమరే వేగం శక్తాః ప్రతిసమాధితుమ్॥ 43

నాగులు, గంధర్వులు, అసురులు, మరుద్గణములవారు వీరిలో ఎవ్వరును సమరభూమియందు రాముని ధాటికి తట్టుకొనజాలరు. (43)

తస్య వీర్యవతః కశ్చిత్ యద్యస్తి మయి సంభ్రమః।
కిమర్థం న శరైస్తీక్ష్ణైః క్షయం నయతి రాక్షసాన్॥ 44

నామీద ఆ మహావీరునకు ఏ కొంచెమైనను తొట్రుపాటు ఉన్నచో ఆయన తనతీక్ష్ణశరములచేత రాక్షసులను ఏల నశింపజేయుడు? (44)

భ్రాతురాదేశమాదాయ లక్ష్మణో వా పరంతపః।
కస్య హేతోర్న మాం వీరః పరిత్రాతి మహాబలః॥ 45

మహావీరుడు, మిక్కిలిబలశాలి, శత్రువులను రూపుమాపువాడు అయిన లక్ష్మణుడైనను అన్నగారి ఆజ్ఞను గైకొని, నన్ను ఎందులకు కాపాడుటలేదు? (45)

యది తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ।
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః॥ 46

మమైవ దుష్కృతం కించిత్ మహదస్తి న సంశయః।
సమర్థావపి తౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ॥ 47

వాయుదేవునివలె మహాబలసంపన్నులును, అగ్నిదేవునివలె మిక్కిలితేజశ్శాలురును ఐన ఆ మహాపురుషులు దేవతలకును ఎదిరింపశక్యముగాని వారు. ఐనప్పటికిని నన్నెందులకు ఉపేక్షించుచున్నారు? నేను చేసికొనిన పాపము కొద్దిగనో గొప్పగనో యుండియేతీరును. అందు సందేహములేదు. లేనిచో శత్రువులను పరిమార్చుటయందు మిక్కిలి సమర్థులై యుండియు వారు నావైపు తిరిగిచూచుట లేదేమి? (47)

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్।
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః। 48

త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన మే శపే।
రామే దుఃఖాభిపన్నే చ లక్ష్మణః పరితప్యతే। 49

కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్।
ఇమం ముహూర్తం దుఃఖానాం ద్రక్ష్యస్యంతమనిందితే। 50

తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రౌ మహాబలౌ।
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః। 51

హత్వా చ సమరే క్రూరం రావణం సహబాంధవమ్।
రాఘవస్త్వాం విశాలాక్షి నేష్యతి స్వాం పురీం ప్రతి। 52

బ్రూహి యద్రాఘవో వాచ్యో లక్ష్మణశ్చ మహాబలః।
సుగ్రీవో వాపి తేజస్వీ హరయోఽపి సమాగతాః। 53

ఇత్యుక్తవతి తస్మింశ్చ సీతా సురసుతోపమా।
ఉవాచ శోకసంతప్తా హనుమంతం ప్లవంగమమ్। 54

కౌసల్యా లోకభర్తారం సుషువే యం మనస్వినీ।
తం మమార్థే సుఖం పృచ్ఛ శిరసా చాభివాదయ। 55

విసృజ్య సర్వరత్నాని ప్రియాయాశ్చ వరాంగనాః।
ఐశ్వర్యం చ విశాలాయాం పృథివ్యామపి దుర్లభమ్।
పితరం మాతరం చైవ సమ్మాన్యాభిప్రసాద్య చ। 56

అనుప్రవ్రజితో రామం సుమిత్రా యేన సుప్రజాః।
ఆనుకూల్యేన ధర్మాత్మా త్యక్త్వా సుఖమనుత్తమమ్। 57

అనుగచ్ఛతి కాకుత్స్థం భ్రాతరం పాలయన్ వనే।
సింహస్కంధో మహాబాహుః మనస్వీ ప్రియదర్శనః। 58

మహాతేజస్సంపన్నుడును, వాయుసుతుడును ఐన హనుమంతుడు, సీతాదేవి కన్నీరుగార్చుచు పలికిన జాలిగొలుపు వచనములనువిని ఇట్లు నుడివెను. (48)

"శ్రీరాముడు నీయెడబాటువలన కలిగిన దుఃఖముచే ఎల్లవేళలా నిన్నే తలంచుకొనుచు, ఇతర విషయములన్నింటి యందును. విముఖుడైయున్నాడు. దీనిని ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. దుఃఖమగ్నుడైన రామునిజూచి లక్ష్మణస్వామి పడుచున్న పరితాపమునకు మేరయే లేకున్నది. (49)

ఓ పూజ్యురాలా! ఎట్టకేలకు నేను నిన్ను కనుగొంటిని. ఇది దుఃఖింపదగిన సమయముగాదు. త్వరలోనే ఈ దుఃఖములన్నియు తొలగిపోవుట నీవు చూడగలవు. (50)

పురుషశ్రేష్ఠులు, రాజకుమారులు, మహాబలసంపన్నులు, నిన్నుజూచుటకై ఆరాటపడుచున్నవారు ఐన రామ లక్ష్మణులు ఇరువురును లంకను భస్మమొనర్పగలరు. (51)

ఓ విశాలాక్షీ! శ్రీరాముడు క్రూరుడైన రావణుని సమరాంగణమున సపరివారముగ హతమార్చి, నిన్ను తన నగరమైన అయోధ్యకు గొనిపోవును. (52)

ప్రభువైన శ్రీరామునకు, మహాబలశాలియైన లక్ష్మణస్వామికి, తేజస్వియైన సుగ్రీవునకు, సముద్రతీరమునకు చేరియున్న వానరయోధులకు నీవు ఈయదలచుకొనిన సందేశమును తెల్పుము." (53)

ఆ హనుమంతుడు ఇట్లుపలికిన పిమ్మట దివ్యభామిని వలె ఒప్పుచున్న సీతాదేవి శోకముచే తపించుచున్నదై, ఆ వానరశ్రేష్ఠునితో ఇట్లనెను. (54)

"విశాలహృదయురాలైన కౌసల్యాదేవియొక్క కడుపు పంటయు, జగన్నాథుడును ఐన నా స్వామి కుశలమును అడిగినట్లు తెల్పుము. ఆయనకు నా ప్రణామములను అర్పింపుము. (55)

ఓ పావనీ! లక్ష్మణుని గుణగుణములను గూర్చి ఎంతచెప్పినను తక్కువయే. అతడు అన్ని విధములైన భోగ్యవస్తువులను వదలిపెట్టెను. తనకు ప్రియమునుగూర్చు భార్యను. ఆమె సఖులను, విశాలమైన భూమండలమును, దుర్లభమైన ఐశ్వర్యమును త్యజించెను. తండ్రిని, తల్లిని గౌరవించి, వారి అనుగ్రహాశీస్సులను పొంది, కన్నతల్లి సుమిత్రాదేవికి పేరుదెచ్చినసుపుత్రుడు లక్ష్మణుడు. ధర్మాత్ముడైన అతడు పిండైన సుఖజీవితమును పరిత్యజించి, శ్రీరాముని అనుసరించి, వనవాసమునకు వచ్చెను. అతడు సోదరుడైన శ్రీరామునకు కుడిభుజముగానుండి, వనమున అనుకూలములైన సేవలను అందించుచు ఆయనవెంట నడిచెను. (56-57)

అతడు సింహమువంటి భుజబలముగలవాడు, దీర్ఘబాహువు, మంచిమనస్సుగలవాడు, చూచువారికి ముచ్చటగొలుపువాడు,

పితృవద్వర్తతే రామే మాతృవన్మాం సమాచరన్।
హ్రియమాణాం తదా వీరో న తు మాం వేద లక్ష్మణః। 59

వృద్ధోపసేవీ లక్ష్మీవాన్ శక్తో న బహుభాషితా।
రాజపుత్రః ప్రియః శ్రేష్ఠః సదృశః శ్వశురస్య మే। 60

మత్తః ప్రియతరో నిత్యం భ్రాతా రామస్య లక్ష్మణః।
నియుక్తో ధురి యస్యాంతు తాముద్వహతి వీర్యవాన్। 61

యం దృష్ట్వా రాఘవో నైవ వృత్తమార్యమనుస్మరేత్।
స మమార్థాయ కుశలం వక్తవ్యో వచనాన్మమ। 62

మృదుర్నిత్యం శుచిర్దక్షః ప్రియో రామస్య లక్ష్మణః।
యథా హి వానరశ్రేష్ఠ దుఃఖక్షయకరో భవేత్। 63

త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ।
రాఘవః త్వత్సమారంభాత్ మయి యత్నపరో భవేత్। 64

ఇదం బ్రూయాశ్చ మే నాథం శూరం రామం పునః పునః।
జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ।
ఊర్ధ్వం మాసాన్న జీవేయం సత్యేనాహం బ్రవీమి తే। 65

రావణేనోపరుద్ధాం మాం నికృత్యా పాపకర్మణా।
త్రాతుమర్హసి వీర త్వం పాతాళాదివ కౌశికీమ్। 66

తతో వస్త్రగతం ముక్త్వా దివ్యం చూడామణిం శుభమ్।
ప్రదేయో రాఘవాయేతి సీతా హనుమతే దదౌ। 67

ప్రతిగృహ్య తతో వీరో మణిరత్నమనుత్తమమ్।
అంగుల్యా యోజయామాస న హ్యస్య ప్రాభవద్భుజః। 68

మణిరత్నం కపివరః ప్రతిగృహ్యాభివాద్య చ।
సీతాం ప్రదక్షిణం కృత్వా ప్రణతః పార్శ్వతఃస్థితః। 69

శ్రీరాముని, తండ్రిగా, నన్ను తల్లిగా భావించి, సేవించుచుండువాడు. రావణుడు నన్ను అపహరించి, ఇచ్చటికి తీసికొనివచ్చిన విషయమును మహావీరుడైన లక్ష్మణుడు అప్పుడెఱుగడు. అతడు పెద్దలను సేవించువాడు, శుభలక్షణములుగలవాడు, శక్తిశాలి, మితభాషి, ఆ రాజకుమారుడు శ్రీరామునకు అత్యంతప్రీతిపాత్రుడు, మారక్షణవిషయమున మామామగారైన దశరథునివంటివాడు, వనవాస సమయమున అతడును- వెంటనుండుటవలన మా అత్తమామలు మా కడలేనిలోపము కనబడలేదు. (58-60)

సోదరుడైనలక్ష్మణుడు శ్రీరామునకు నాకంటెను మిక్కిలి ప్రియుమైనవాడు. అప్పగించిన ప్రతికార్యమును ఆ వీరుడు వెంటనే చక్కగా నెఱవేర్చుచుండెడివాడు. అతనినిజూచి శ్రీరాముడు స్వర్గస్థుడైన తనతండ్రిని గూర్చినబెంగనుగూడ మఱచిపోయెడివాడు. అట్టి లక్ష్మణుని క్షేమసమాచారములను అడిగినట్లు నామాటగా దెల్పుము. (61-62)

ఓ వానరశ్రేష్ఠా! శ్రీరామునకు ప్రియవిధేయుడు సర్వదా మృదుస్వభావముగలవాడు, పవిత్రముగానుండువాడు, సర్వసమర్థుడు, ఐన లక్ష్మణుడు నా దుఃఖములను మాపుమాపుటకును, శ్రీరాముడు నన్ను ఈ చెఱనుండి విడిపించుటకును నీవే పూనుకొనుము. ఈ కార్య నిర్వహణమునకు నీవే దక్షుడవు. (63-64)

మహావీరుడును, నా స్వామియు ఐన శ్రీరామునకు పదేపదే ఈ విషయమును నొక్కిచెప్పుము. "ఓ దశరథాత్మజ! ఒకమాసమువఱకే నేను ప్రాణములతో నుందును. నెలముగిసిన పిమ్మట ఒక్కక్షణముకూడ నేను బ్రతికియుండను. ఈమాట ముమ్మాటికిని నిజము. (65)

క్రూరకర్ముడైన రావణుడు నన్ను వంచనతో అపహరించి, నిర్బంధములోనుంచినాడు. అట్టి నన్ను ఓ మహావీర! పాతాళము నుండి ఇంద్రునిఐశ్వర్యమును విష్ణువు కాపాడినట్లు[1] నన్ను రక్షించుటకు నీవే సమర్థుడవు." (66)

అనంతరము సీతాదేవి తన కొంగుముడివిప్పి, అందున్న శుభప్రదమైన దివ్యచూడామణిని దీసి 'దీనిని శ్రీరామునకు సమర్పింపుము' అని పల్కుచు హనుమంతునకు ఇచ్చెను. (67)

అప్పుడు వీరుడైన హనుమంతుడు అత్యుత్తమమైన ఆ చూడామణిని (మణిశిరోభూషణమును) గ్రహించెను. అది భుజమున ఇముడదు గావున దానిని తన చేతివ్రేలియందు భద్రపఱచుకొనెను. పిదప సీతాదేవికి నమస్కరించి, ప్రదక్షిణ మొనర్చి, వినమ్రుడై ప్రక్కకుచేరి నిలబడెను. (68-69)

1) పూర్వము వృత్రాసురుని చంపిన కారణముగా ఇంద్రుడు బ్రహ్మహత్యాపాపమునకు లోనయ్యెను. అందువలన ఇంద్రునిఐశ్వర్యము పాతాళమును జేరెను. దేవతలు, విష్ణువు, వైష్ణవ అశ్వమేధయాగమునొనర్చి ఇంద్రుని పవిత్రునిగా జేసిరి. విష్ణువు పాతాళమునుండి ఇంద్రుని సంపదలను తీసికొనివచ్చి, అతనికి ఇచ్చెను.

హర్షేణ మహతా యుక్తః సీతాదర్శనజేన సః।
హృదయేన గతో రామం శరీరేణ తు విష్ఠితః। 70

సీతాదేవిని దర్శించుటవలన అతడు మహదానందమును పొందెను. శారీరకముగా అతడు ఇచ్చటనేయున్నను ఆతని మనస్సుమాత్రము రాముని సన్నిధికి చేరెను. (70)

మణివరముపగృహ్య తం మహార్హం
జనకనృపాత్మజయా ధృతం ప్రభావాత్।
గిరిరివ పవనావధూతముక్తః
సుఖితమనాః ప్రతిసంక్రమం ప్రపేదే। 71

ఇంతవఱకును సీతాదేవిశిరమున అలంకృతమైయున్న అమూల్యమైన ఆ చూడామణిని ఆంజనేయుడు గ్రహించెను. దానిప్రభావమున, మహావాయువుచే కంపితమై నిలద్రొక్కికొనిన పర్వతమువలె, ఇప్పటివఱకును ఊగిసలాటకులోనైన అతడు స్వస్థచిత్తుడై తిరుగుప్రయాణమునకు సన్నద్ధుడాయెను.[1] (71)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే అష్టత్రింశస్సర్గః *(38)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పది ఎనిమిదవ సర్గము.

-- ❋ ❋ ❋ --

39. ముప్పదితొమ్మిదవ సర్గము

శ్రీరామునకు సీతా సందేశము-ఆంజనేయుడు ఆమెను ఓదార్చుట ,వానరుల సముద్రతరణవిషయమున సీతాదేవికి గల సందేహము - మారుతి దానిని నివారించుట

మణిం దత్త్వా తతస్సీతా హనుమంతమథాఽబ్రవీత్।
అభిజ్ఞానమభిజ్ఞాతమ్ ఏతద్రామస్య తత్త్వతః। 1

శిరోభూషణమును ఇచ్చిన పిమ్మట సీతాదేవి హనుమంతునితో ఇట్లు నుడివెను. "శ్రీరాముడు ఈ ఆనవాలును పూర్తిగా గుర్తింపగలడు. (1)

మణిం దృష్ట్వా తు రామో వై త్రయాణాం సంస్మరిష్యతి।
వీరో జనన్యా మమ చ రాజ్ఞో దశరథస్య చ। 2

వీరుడైనశ్రీరాముడు ఈ మణిని జూచినవెంటనే నా తల్లిని, నాతండ్రియైన జనకుని, దశరథమహారాజును సంస్మరించును. అట్లే నన్నును గుర్తుకు తెచ్చు కొనగలడు. (2)

స భూయస్త్వం సముత్సాహే చోదితో హరిసత్తమ।
అస్మిన్ కార్యసమారంభే ప్రచింతయ యదుత్తరమ్। 3

త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ।
హనుమన్ యత్నమాస్థాయ దుఃఖక్షయకరో భవ। 4

ఓ కపివరా! మిక్కిల ఉత్సాహమును పొందినవాడవై, ఈ కార్యసిద్ధికై అనంతరకర్తవ్యమును ఆలోచింపుము. ఓ కపీశ్వరా! ఈ కార్యనిర్వహణమునకు నీవే తగినవాడవు. ఓ మారుతీ! నడుముబిగించి, నా దుఃఖములను తొలగించుటకు పూనుకొనుము. (3-4)

తస్య చింతయతో యత్నో దుఃఖక్షయకరో భవేత్।
స తథేతి ప్రతిజ్ఞాయ మారుతిర్భీమవిక్రమః।
శిరసాఽఽవంద్య వైదేహీం గమనాయోపచక్రమే। 5

నీవు బాగుగా ఆలోచించి ప్రయత్నించినచో నిజముగా నా దుఃఖములు దూరమగును." పిమ్మట మిక్కిలి పరాక్రమశాలియైన ఆ మారుతి 'అట్లే చేయుదును' అని ప్రతిజ్ఞచేసి, వైదేహికి శిరసాప్రణమిల్లి, వెళ్లుటకు ఉపక్రమించెను. (5)

---

1) ధైర్యశాలియైన హనుమంతునకు ఎదురైన అవరోధప్రభంజనములు- వాటిని అధిగమించిన తీరు తెన్నులు.
సముద్ర తీరమునకు చేరునప్పటికే అన్వేషణ- అవధి ముగియుటచే సుగ్రీవాజ్ఞవలన మరణభయము, సముద్రలంఘన సమయమున ఎదురైన అవరోధములు, దుర్భేద్యమైన లంకలో ప్రవేశించుట, విశాలమైన లంకలో సీతాన్వేషణమును కొనసాగించుట- సీతజాడ తెలియక నిస్పృహకులోనై, ప్రాణత్యాగమునకు సిద్ధపడుట- సీతాదేవి దర్శనమైనను ఆమె మారుతిని రావణునిగా భావించి, ఆయనతో మాట్లాడకుండుట- ప్రబలములైన ఈ ఆటంకములను అధిగమించి, ఆమెకు రామముద్రికను ఇచ్చి, ఆమె నుండి చూడామణిని గ్రహించిన పిమ్మట ఆ మారుతి మనస్సు కుదుటబడెను.

జ్ఞాత్వా సంప్రస్థితం దేవీ వానరం మారుతాత్మజమ్।
బాష్పగద్గదయా వాచా మైథిలీ వాక్యమబ్రవీత్। 6

హనూమన్ కుశలం బ్రూయాః సహితౌ రామలక్ష్మణౌ। 7

సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ వృద్ధాంశ్చ వానరాన్।
బ్రూయాస్త్వం వానరశ్రేష్ఠ కుశలం ధర్మసంహితమ్। 8

యథా స చ మహాబాహుః మాం తారయతి రాఘవః।
అస్మాద్దుఃఖాంబుసంరోధాత్ త్వం సమాధాతుమర్హసి। 9

జీవంతీం మాం యథా రామః సంభావయతి కీర్తిమాన్।
తత్తథా హనుమన్ వాచ్యం వాచా ధర్మ మవాప్నుహి। 10

నిత్యముత్సాహయుక్తాశ్చ వాచశ్శ్రుత్వా మయేరితాః।
వర్ధిష్యతే దాశరథేః పౌరుషం మదవాప్తయే। 11

మత్సందేశయుతా వాచః త్వత్తః శ్రుత్వైవ రాఘవః।
పరాక్రమవిధిం వీరో విధివత్ సంవిధాస్యతి। 12

సీతాయా వచనం శ్రుత్వా హనుమాన్ మారుతాత్మజః।
శిరస్యంజలిమాధాయ వాక్యముత్తరమబ్రవీత్। 13

క్షిప్రమేష్యతి కాకుత్స్థో హర్యృక్షప్రవరైర్వృతః।
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి। 14

న హి పశ్యామి మర్త్యేషు నాఽసురేషు సురేషు వా।
యస్తస్య క్షిపతో బాణాన్ స్థాతుముత్సహతేఽగ్రతః। 15

అప్యర్కమపి పర్జన్యమ్ అపి వైవస్వతం యమమ్।
స హి సోఢుం రణే శక్తః తవ హేతోర్విశేషతః। 16

స హి సాగరపర్యంతాం మహీం శాసితుమీహతే।
త్వన్నిమిత్తో హి రామస్య జయో జనకనందిని। 17

తస్య తద్వచనం శ్రుత్వా సమ్యక్ సత్యం సుభాషితమ్।
జానకీ బహుమేనేఽథ వచనం చేదమబ్రవీత్। 18

తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునఃపునః।
భర్తృస్నేహాన్వితం వాక్యం సౌహార్దాదనుమానయత్। 19

వాయుసుతుడైన హనుమంతుడు బయలుదేఱుచున్నట్లు తెలిసికొని, సీతాదేవి కంటనీరుపెట్టుచు గద్గదస్వరముతో ఇట్లు పలికెను. (6)

ఓ హనుమంతుడా! రామలక్ష్మణులిద్దఱికిని, అమాత్యులతో గూడిన సుగ్రీవునకును నేను వారి క్షేమసమాచారములను అడిగినట్లు తెలుపుము. ఓ వానర శ్రేష్ఠా! ఇంకను వృద్ధులైన భల్లూకవానరులందఱికిని ధర్మక్రమమునను సరించి, వారి వారి కుశలముల నడిగినట్లు తెలుపుము. (7, 8)

ఆజానుబాహువైన రాఘవుడు నన్ను ఈ దుఃఖ సముద్రము నుండి ఉద్ధరించునట్లు చేయుటకు నీవే తగినవాడవు.(9)

ఓ మారుతీ! 'ధర్మపరిరక్షకుడు' అని వాసిగాంచిన శ్రీరాముడు నన్నాదుకొని, నా ప్రాణములను నిలుపునట్లు తగినవిధముగా విన్నవించి, నీవు పుణ్యముకట్టుకొనుము. (10)

అనుక్షణము ఆయనలో ఉత్సాహమునునింపు నా మాటలను విన్నపిమ్మట శ్రీరామునకు నన్ను పొందుటకై పౌరుషము ఇనుమడించును. (11)

నా సందేశముతోగూడిన ఈ మాటలను నీవలన వినినంతనే వీరుడైనశ్రీరాముడు తనపరాక్రమమును ప్రకటించుటకు తగినరీతి నిర్ణయింపగలడు." (12)

వాయుసుతుడైన హనుమంతుడు సీతాదేవి పలికిన వచనములనువిని, వినమ్రుడై ఆమెకు నమస్కరించి, ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (13)

"శ్రీరాముడు భల్లూకవానరయోధులతో గూడినవాడై శీఘ్రముగా ఇచటికిరాగలడు. ఆ స్వామి యుద్ధమున శత్రువీరులను తునుమాడి, నీ దుఃఖమును రూపుమాపగలడు. (14)

శ్రీరాముడు బాణములను వేయునప్పుడు ఆయనకు ఎట్టయెదుట నిలబడుటకు సాహసింపగలవానిని మనుష్యులలోగాని సురాసురులలోగాని నేను ఇంతవఱకు చూడలేదు, ఇక ముందుచూడబోను. (15)

ఆ ప్రభువు రణరంగమున తీక్ష్ణకిరణుడగు సూర్యునైనను, ఇంద్రునైనను, సూర్యపుత్రుడైన ఆయమునిసైతము ఎదిరింపగల సమర్థుడు. ఇక నీ నిమిత్తముగా వేఱుచె చెప్పవలసిన పనియేమి? (16)

శ్రీరాముడు సముద్రములే ఎల్లలుగాగల ఈ సమస్త భూమండలమును పాలింపగోరుచున్నాడు. ఓ జానకీ! నీనిమిత్తముగా ఆయనకు జయము తప్పక కలుగును." (17)

జానకీదేవి ఆ హనుమంతుడు పలికిన సహేతుకములైన, పరమార్థదాయకములైన, వీనులవిందు గావించు వచనములను విని, అతనిని ప్రశంసించుచు ఇట్లు నుడివెను. (18)

అంతట సీతాదేవి బయలుదేఱుచున్న అతనిని మాటి మాటికి చూచుచు, తనభర్తయైన శ్రీరామునిపై భక్తిపూర్ణములైన అతనిమాటలను వాత్సల్యముతో అభినందించెను. (19)

యది వా మన్యసే వీర వసైకాహమరిందమ।
కస్మింశ్చిత్ సంవృతే దేశే విశ్రాంతః శ్వో గమిష్యసి। 20

మమ చైవాల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్ తవ వానర।
అస్య శోకస్య మహతో ముహూర్తం మోక్షణం భవేత్। 21

గతే హి హరిశార్దూల పునరాగమనాయ తు।
ప్రాణానామపి సందేహో మమ స్యాన్నాత్ర సంశయః। 22

తవాదర్శనజశ్శోకో భూయో మాం పరితాపయేత్।
దుఃఖాద్దుఃఖపరామృష్టాం దీపయన్నివ వానర। 23

అయం చ వీర సందేహః తిష్ఠతీవ మమాగ్రతః।
సుమహాంస్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర। 24

కథం ను ఖలు దుష్పారం తరిష్యంతి మహోదధిమ్।
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ। 25

త్రయాణామేవ భూతానాం సాగరస్యాస్య లంఘనే।
శక్తిస్స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా। 26

తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే।
కిం పశ్యసి సమాధానం త్వం హి కార్యవిదాం వరః। 27

కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే।
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే ఫలోదయః। 28

బలైస్సమగ్రైర్యది మాం రావణం జిత్య సంయుగే।
విజయీ స్వపురీం యాయాత్ తత్తు మే స్యాద్యశస్కరమ్। 29

శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః।
మాం నయేద్యది కాకుత్స్థః తత్ తస్య సదృశం భవేత్। 30

తద్యథా తస్య విక్రాంతమ్ అనురూపం మహాత్మనః।
భవేదాహవశూరస్య తథా త్వముపపాదయ। 31

తదర్థోపహితం వాక్యం సహితం హేతుసంహితమ్।
నిశమ్య హనుమాన్శేషం వాక్యముత్తరమబ్రవీత్। 32

ఓ మహావీర! అరిమర్దన! నీకు ఇష్టమైనచో ఇచట ఒక దినము ఉండుము. ఏదైననొక రహస్యప్రదేశమున విశ్రాంతిగైకొనుము. రేపు వెళ్లవచ్చును. (20)

ఓ వానరోత్తమా! నీవు సమీపమున ఉండుటవలన మందభాగ్యురాలనైన నాయొక్క ఈ అంతులేని శోకమునకు ఒక క్షణకాలముపాటైనను శాంతి లభింపగలదు. (21)

ఓ కపివరా! నీవు వెళ్లి తిరిగివచ్చువఱకు నా ప్రాణములు నిలుచునో? లేదో? అనునది సందేహాస్పదమే! ఇది తథ్యము. (22)

ఓ కపీశ్వరా! నీ రాక నాకు కొంతఊరట గూర్చినది. కాని నీవు కనబడకుండపోయినచో కలుగు దుఃఖము, ఇంతవఱకును నాకున్న దుఃఖమునకుతోడై అది నన్ను ఇంకను పరితపింపజేయును. (23)

మహావీరుడవైన ఓ కపివరా! నీకు సహాయకులైన భల్లూకవానరుల విషయమున నాలో ఒక తీరని సందేహము మెదలుచున్నది. (24)

దాటశక్యముగాని ఈ మహాసముద్రమును ఆ వానరభల్లూకసైన్యములుగాని, ఆ రాజకుమారులుగాని ఎట్లు దాటగలరు? ఈ సాగరమును లంఘించుటకు గరుత్మంతునకును, నీకును, ఆవాయుదేవునకును (ఈ ముగ్గురికి) మాత్రమే సాధ్యమగును. (25-26)

అందువలన మిక్కిలి క్లిష్టమైన ఈ కార్యసాఫల్యమునకు నీకు తోచుచున్న ఉపాయమేమి? ఏలనన కార్యసాధకులలో నీవే అగ్రేసరుడవు. (27)

ఓ శత్రుసంహారకా! ఈ కార్యమును సాధించుటలో నీవు ఒక్కడవు మాత్రమే సమర్థుడవు. ఇది నిజము. కాని ఇట్లు చేయుట వలన ఈకీర్తి నీకుమాత్రమే దక్కును. రామునకు లభింపదు. ఈ కార్యసిద్ధివలన నీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడించును. (28)

శ్రీరాముడు యుద్ధమునందు రావణుని, ఆతని సైన్యములను జయించి, నన్ను గ్రహించి, జయ పతాకములతో తన పురమునకు (అయోధ్యకు) వెళ్లినచో అది నాకు శోభను చేకూర్చును. శత్రుబలములను పరిమార్చువాడైన శ్రీరాముడు తనశరపరంపరలతో లంకను అతలాకుతలమొనర్చి, నన్ను తీసికొనివెళ్లినచో అది ఆయన పరాక్రమమునకు వన్నె దెచ్చును. (29-30)

అందువలన సమరశూరాగ్రేసరుడైన ఆ మహాత్ముని యొక్క నిరుపమానపరాక్రమమునకు తగినట్లుగా కార్యసాధనవిధానమును రూపొందింపుము." (31)

హనుమంతుడు అర్థవంతములైన, ఆమోదయోగ్యములైన, యుక్తియుక్తములైన సీతాదేవి వచనములను విని, ఇంకను చెప్పవలసియున్న మాటలను ఆమెతో ఇట్లు పలికెను. (32)

దేవి హర్యృక్షసైన్యానామ్ ఈశ్వరః ప్లవతాం వరః।
సుగ్రీవస్సత్త్వసంపన్నః తవార్థే కృతనిశ్చయః। 33

స వానరసహస్రాణాం కోటీభిరభిసంవృతః।
క్షిప్రమేష్యతి వైదేహి రాక్షసానాం నిబర్హణః। 34

తస్య విక్రమసంపన్నాః సత్త్వవంతో మహాబలాః।
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయః స్థితాః। 35

యేషాం నోపరి నాధస్తాత్ న తిర్యక్ సజ్జతే గతిః।
న చ కర్మసు సీదంతి మహత్స్వమితతేజసః। 36

అసకృత్తైర్మహోత్సాహైః ససాగరధరాధరా।
ప్రదక్షిణీకృతా భూమిః వాయుమార్గానుసారిభిః। 37

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః।
మత్తః ప్రత్యవరః కశ్చిత్ నాస్తి సుగ్రీవసన్నిధౌ। 38

అహం తావదిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః।
న హి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరే జనాః। 39

తదలం పరితాపేన దేవి శోకో వ్యపైతు తే।
ఏకోత్పాతేన తే లంకామ్ ఏష్యంతి హరియూథపాః। 40

మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యావివోదితౌ।
త్వత్సకాశం మహాసత్త్వౌ నృసింహావాగమిష్యతః। 41

తౌ హి వీరౌ నరవరౌ సహితౌ రామలక్ష్మణౌ।
ఆగమ్య నగరీం లంకాం సాయకైర్విధమిష్యతః। 42

సగణం రావణం హత్వా రాఘవో రఘునందనః।
త్వామాదాయ వరారోహే స్వపురం ప్రతి యాస్యతి। 43

తదాశ్వసిహి భద్రం తే భవ త్వం కాలకాంక్షిణీ।
నచిరాద్ద్రక్ష్యసే రామం ప్రజ్వలంతమివానలమ్। 44

నిహతే రాక్షసేంద్రేఽస్మిన్ సపుత్రామాత్యబాంధవే।
త్వం సమేష్యసి రామేణ శశాంకేనేవ రోహిణీ। 45

అమ్మా! సీతాదేవీ! వానరశ్రేష్ఠుడైనసుగ్రీవుడు భల్లూకవానర సైన్యములకు ప్రభువు, అతడు మహాబల సంపన్నుడు. ఎట్లైనను నిన్ను ఆదుకొనుటకై కృతనిశ్చయుడై యున్నాడు. (33)

ఓ వైదేహీ! అతడు కోట్లకొలది వానరసమూహములతో గూడినవాడై రాక్షసులను సంహరించుటకు త్వరలోనే ఇక్కడికి రాగలడు. (34)

పరాక్రమవంతులును, శక్తిసంపన్నులును, మిక్కిలి బలశాలురును, మనోవేగమున ఒక్కగంతులో ఎక్కడికైనను చేరగలవారును ఐన వానరులు ఆయన ఆజ్ఞను ఎల్లవేళల శిరసావహింతురు. (35)

భూమ్యాకాశములయందును, వివిధదిశలయందును వారిగమనములకు అడ్డులేదు. వారు అమిత తేజస్సంపన్నులు. ఎట్టి క్లిష్టకార్యములను సైతము చేయుటకు వెనుకాడరు. (36)

మహోత్సాహశక్తిగల ఆ భల్లూకవానరులు ఆకాశమార్గమున సంచరించుచు, మహాసముద్రములతో, గొప్ప గొప్ప పర్వతములతో గూడిన ఈ భూమండలమును పెక్కు పర్యాయములు చుట్టివచ్చిరి. (37)

ఆ సుగ్రీవుని సన్నిధిలోగల భల్లూకవానరులు ఎల్లరును నా కంటెను ఘనులు, నాతో సమానులు, వారిలో నా కంటెను తక్కువవాడు ఒక్కడును లేడు. (38)

అల్పుడనైన నేనే ఇచటికి రాగలిగితిని. ఇక మహాబల సంపన్నులమాట చెప్పనేల? సాధారణముగా లోకములో సామాన్యులనే పంపుదురు. శ్రేష్ఠులను పంపరుగదా![1] అమ్మా! అందువలన పరితాపపడుట మానుము. నీ శోకము తొలగిపోవును. ఆ వానరయోధులు ఒక్క గంతులో లంకకుచేరగలరు. (39-40)

మహాశక్తిసంపన్నులు, నరోత్తములు ఐన ఆ రామలక్ష్మణులు నా వీపును అధిష్ఠించి, ఉదయించిన సూర్యచంద్రులవలె నీ సన్నిధికి రాగలరు. (41)

వీరులు, మహాపురుషులు ఐన ఆ రామలక్ష్మణులు ఇద్దఱునువచ్చి, లంకానగరమును తమ శరములచే ధ్వంసము చేసెదరు. (42)

ఓ సీతాదేవీ! రఘువంశమునకు ఆనందదాయకుడైన రాఘవుడు సపరివారముగా రావణుని హతమార్చి, నిన్ను దీసికొని తనఅయోధ్యానగరమునకు చేరగలడు. (43)

అందువలన అమ్మా! ఊరడిల్లుము. నీకు శుభమగుగాక. నీవు తగినసమయమునకై వేచియుండుము. జ్వాలలతో వెలుగుచున్న అగ్నివలెతేజరిల్లు శ్రీరామచంద్రుని త్వరలోనే నీవు దర్శింపగలవు. (44)

పుత్రులతో, అమాత్యులతో, బంధువులతోగూడ ఈ రావణుడు నేలగూలిన పిమ్మట రోహిణి చంద్రుని జేరినట్లు నీవు శ్రీరామచంద్రప్రభువును జేరగలవు. (45)

1. ఈ మాటలు మారుతి వినయమునకు మచ్చుతునకలు. ఇవి సీతాదేవి మనస్సులో ధైర్యమును నింపును.

క్షిప్రం త్వం దేవి శోకస్య పారం యాస్యసి మైథిలి।
రావణం చైవ రామేణ నిహతం ద్రక్ష్యసేఽచిరాత్॥ 46

ఓ సీతాదేవీ! నీవు అతిత్వరలో ఈ శోకమునుండి బయటపడగలవు. అచిరకాలములోనే శ్రీరాముని చేతిలో రావణుడు హతమగుట చూడగలవు. (46)

ఏవమాశ్వాస్య వైదేహీం హనుమాన్ మారుతాత్మజః।
గమనాయ మతిం కృత్వా వైదేహీం పునరబ్రవీత్॥ 47

శమరిఘ్నం కృతాత్మానం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్।
లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వారముపస్థితమ్॥ 48

వాయుసుతుడైన హనుమంతుడు ఈ విధముగా వైదేహిని ఓదార్చి, బయలుదేఱబోవుచు ఆమెతో మఱల ఇట్లు పలికెను. శత్రువులను పరిమార్చుటకు కృతనిశ్చయుడైన ఆ రాముని, ధనుర్ధారియైన లక్ష్మణుని త్వరలోనే లంకానగరమున ప్రవేశించుచుండగా నీవు చూడగలవు. (47-48)

నఖదంష్ట్రాయుధాన్ వీరాన్ సింహశార్దూలవిక్రమాన్।
వానరాన్ వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్॥ 49

వానరులు నఖములు, దంతములు ఆయుధములుగా గలవారు, వారు మహావీరులు, సింహవ్యాఘ్రములవలె గొప్ప పరాక్రమము గలవారు, మదగజములవలె ఉన్నతములైన శరీరములుగలవారు, వారందఱును కలిసి త్వరలో ఇచ్చటికి వచ్చుటను నీవు కాంచగలవు.[1] (49)

శైలాంబుదనికాశానాం లంకామలయసానుషు।
నర్దతాం కపిముఖ్యానామ్ ఆర్యే యూథాన్యనేకశః॥ 50

ఓ పూజ్యురాలా! పర్వతములతో, మేఘములతో సమానులైన అసంఖ్యాకులైన వానరయోధుల సమూహములు లంకయందును, మలయపర్వత శిఖరములపైనను గర్జించుచుండుట శీఘ్రముగానే నీవు చూడగలవు. (50)

స తు మర్మణి ఘోరేణ తాడితో మన్మథేషుణా।
న శర్మ లభతే రామః సింహార్దిత ఇవ ద్విపః॥ 51

క్రూరమైన మన్మథబాణములతాకిడికిలోనైన ఆ శ్రీరాముడు సింహముచే పీడింపబడిన ఏనుగువలె శాంతిని పొందుటలేదు. (51)

మా రుదో దేవి శోకేన మా భూత్ తే మనసోఽప్రియమ్।
శచీవ పత్యా శక్రేణ భర్త్రా నాథవతీ హ్యసి॥ 52

రామాద్విశిష్టః కోఽన్యోఽస్తి కశ్చిత్ సౌమిత్రిణా సమః।
అగ్నిమారుతకల్పౌ తౌ భ్రాతరౌ తవ సంశ్రయౌ॥ 53

ఓ సీతాదేవీ! ఇంక ఏడువవలదు. నీ మనస్సు శోకముచే వ్యాకులపాటును చెందకుండుగాక, ఇంద్రునితోగూడిన శచీదేవివలె నీవు నీభర్త రక్షణలోనేఉన్నావు. శ్రీరాముని కంటెను శ్రేష్ఠుడెవడు? లక్ష్మణస్వామికి సాటికాగల వాడెవ్వడు? అగ్నివాయువులవలె ఆ సోదరులు ఇద్దఱును నీకు అండగాగలరు. ఇంక చింతయెందులకు? (52-53)

నాస్మింశ్చిరం వత్స్యసి దేవి దేశే
రక్షోగణైరధ్యుషితేఽతిరౌద్రే।
న తే చిరాదాగమనం ప్రియస్య
క్షమస్వ మత్సంగమకాలమాత్రమ్॥ 54

రాక్షసుల సమూహములతోనిండి, అతిభయంకరమైన ఈ ప్రదేశమునందు నీవింక ఎంతోకాలము ఉండవలసిన పనిలేదు. నీ స్వామి అతిత్వరలోనే ఇచ్చటికి విచ్చేయును. నేను వెళ్ళి శ్రీరామునితోగలిసి వచ్చువఱకు ఓపిక పట్టుము. (రావణుడు సపరివారముగాహతుడగుట నీవు తప్పక చూడగలవు.) (54)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకోనచత్వారింశస్సర్గః (39)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ముప్పదితొమ్మిదవసర్గము.

— ✻ ✻ ✻ —

1. శ్రీరామలక్ష్మణులు ఒంటరివారుగారు. వారిని వెన్నంటి నడచు మహావానరసైన్యము అపారమైనది, అజేయమైనది.

40. నలుబదియవ సర్గము

హనుమంతుని ద్వారా శ్రీరామునకు సీతాసందేశము - మారుతి ఆమెను ఓదార్చుట

శ్రుత్వా తు వచనం తస్య వాయుసూనోర్మహాత్మనః।
ఉవాచాత్మహితం వాక్యం సీతా సురసుతోపమా। 1

దివ్యభామినివంటిసీతాదేవి మహాత్ముడైన ఆ వాయుసూనుని మాటలనువిని, తనకు హితకరమైన వచనములను ఇట్లు పలికెను. (1)

త్వాం దృష్ట్వా ప్రియవక్తారం సంప్రహృష్యామి వానర।
అర్ధసంజాత సస్యేవ వృష్టిం ప్రాప్య వసుంధరా। 2

ఓ వానరోత్తమా! పైరుసగమువఱకు పెఱిగియుండగా వర్షముపడగానే వికసించినభూమివలె ప్రియభాషివైన నిన్నుజూచి, నేను మిక్కిలిసంతోషపడుచున్నాను. (2)

యథా తం పురుషవ్యాఘ్రం గాత్రైశ్శోకాభికర్శితైః।
సంస్పృశేయం సకామాహం తథా కురు దయాం మయి। 3

శోకముచే నేను మిక్కిలి కృశించియున్నాను. ఎట్లైనను మహాపురుషుడైన నా స్వామితో స్పర్శసుఖమును పొందగోరుచున్నాను. నాయందు దయయుంచి, నామనోరథము ఈడేరునట్లు చూడుము. (3)

అభిజ్ఞానం చ రామస్య దద్యా హరిగణోత్తమ।
క్షిప్తామిషీకాం కాకస్య కోపాదేకాక్షిశాతనీమ్। 4

ఓ కపివరా! నాడు శ్రీరాముడు కోపోద్రిక్తుడై 'ఇషీకము' అను తృణమునుమంత్రించి, కాకియొక్క ఒకకన్నును తొలగించెను. ఆ కథను నా ప్రభువునకు ఆనవాలుగా తెలుపుము. (4)

మనశ్శిలాయాస్తిలకో గండపార్శ్వే నివేశితః।
త్వయా ప్రణష్టే తిలకే తం కిల స్మర్తుమర్హసి। 5

"రామా! ఒకనాడు నానుదుట తిలకము చెదరగా నీవు మణిసిలగంధతిలకమును నుదుటిపై ఉంచుటకు మాఱుగా నా చెక్కిలిపై దిద్దితివి. ఆ విషయమును జ్ఞప్తికి దెచ్చుకొనుము. (5)

స వీర్యవాన్ కథం సీతాం హృతాం సమనుమన్యసే।
వసంతీం రక్షసాం మధ్యే మహేంద్రవరుణోపమః। 6

మహేంద్రునితో, వరుణునితో సమానమైన పరాక్రమము గలవాడవైనను నీ భార్యయైన సీత (నేను) రావణునిచే అపహరింపబడి, రాక్షసులమధ్య కాలము వెళ్లబుచ్చుచుండగా నీవెట్లు ఓర్చుకొనుచున్నావు. (6)

ఏష చూడామణిర్దివ్యో మయా సుపరిరక్షితః।
ఏతం దృష్ట్వా ప్రహృష్యామి వ్యసనే త్వామివానఘ। 7

ఓ సత్పురుషా! ఈ దివ్యచూడామణిని నేను ఇంత వఱకును కాపాడుకొనుచువచ్చితిని. ఈ దుఃఖ సమయమునగూడ దీనిని చూచినప్పుడెల్ల నిన్నే దర్శించినట్లు సంతోషపడుచుంటిని. (7)

ఏష నిర్యాతిత శ్రీమాన్ మయా తే వారిసంభవః।
అతః పరం న శక్ష్యామి జీవితుం శోకలాలసా। 8

రత్నాకరమునందు(1) పుట్టి మిలమిలలాడుచున్న ఈ చూడామణిని నీకు పంపుచున్నాను. శోకమగ్నమైన నేను (ఇది లేకుండా) ఇక మీదట జీవించియుండజాలను- (8)

అసహ్యాని చ దుఃఖాని వాచశ్చ హృదయచ్ఛిదః।
రాక్షసీనాం సుఘోరాణాం త్వత్కృతే మర్షయామ్యహమ్। 9

భయంకరులైన రాక్షసస్త్రీలు నాకు కలిగించిన దుఃఖములు భరింపరానివి, పలికినపలుకులు హృదయ విదారకములు, వాటిని అన్నింటిని నీకొఱకై (ఏనాటికైనను నీవువచ్చి నన్ను రక్షింతువను ఆశతో) ఇంతవఱకును సహించుచువచ్చితిని. (9)

ధారయిష్యామి మాసం తు జీవితం శత్రుసూదన।
మాసాదూర్ధ్వం న జీవిష్యే త్వయా హీనా నృపాత్మజ। 10

ఓ శత్రుసంహారకా! ఒకనెలవఱకుమాత్రమే నా ప్రాణములను నిలుపుకొనియుందును. ఓ రాజకుమారా! నీవు రానిచో ఆటుపైన నా ప్రాణములు నిలువవు. (10)

1) రత్నాకరమునందు పుట్టిన ఈ చూడామణిని సముద్రుడు వరుణునకు ఇయ్యగా అతడు జనకునకు ఇచ్చెను. ఆ జనకమహారాజు ఆ మణిని తన భార్యద్వారా దశరథుని సమక్షమున సీతాదేవికి ఆమె వివాహకాలమున ఇచ్చెను-

ఘోరో రాక్షసరాజోఽయం దృష్టిశ్చ న సుఖా మయి।
త్వాం చ శ్రుత్వా విషజ్జంతం న జీవేయమహం క్షణమ్। 11

రాక్షసరాజైన ఈ రావణుడు మిక్కిలి క్రూరుడు. వాని చూపులు నన్నెంతగానో బాధించుచున్నవి. నీవు వచ్చుట ఆలస్యమైనచో గడువునకు (నెలకు) పిమ్మట ఒక్కక్షణము గూడ ప్రాణములతో నుండజాలను." (11)

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్।
అథాబ్రవీన్మహాతేజా హనుమాన్ మారుతాత్మజః। 12

మహాతేజశ్శాలియు, వాయుసూనుడును ఐన హనుమంతుడు, సీతాదేవి కన్నీరుగార్చుచు పలికిన దీన వచనములను విని, పిమ్మట ఇట్లు నుడివెను. (12)

త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే।
రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే। 13

ఓ సీతాదేవీ! శ్రీరాముడు నీ శోకములోమునిగి, సుఖ భోగములకు విముఖుడైయున్నాడు, 'ఇది సత్యము' అని శపథపూర్వకముగా తెలుపుచున్నాను! శ్రీరాముడు దుఃఖమగ్నుడగుటనుజూచి, లక్ష్మణుడును మిక్కిలి పరితపించుచున్నాడు. (13)

కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్।
ఇమం ముహూర్తం దుఃఖానామ్ అంతం ద్రక్ష్యసి భామిని। 14

ఓ భామినీ! ఎట్టకేలకు నీవునాకు కనబడితివి. ఇది శోకింపవలసిన సమయముగాదు, ఇక ఈక్షణమునుండి నీ దుఃఖము దూరమైనట్లు భావింపుము. (14)

తావుభౌ పురుషవ్యాఘ్రౌ రాజపుత్రావరిందమౌ।
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః। 15

శత్రుసంహారకులు, మహాపురుషులు ఐన ఆ రాజకుమారులు ఇరువురును నీదర్శనమునకై ఆరాటపడుచున్నారు. ఈకారణముగా వారు లంకను భస్మమొనర్తురు. (15)

హత్వా తు సమరే క్రూరం రావణం సహబాంధవమ్।
రాఘవౌ త్వాం విశాలాక్షి స్వాం పురీం ప్రాపయిష్యతః। 16

ఓ విశాలాక్షీ! ఆ రామలక్ష్మణులు దుర్మార్గుడైన రావణుని బంధుమిత్రపరివారసహితముగా రణభూమికి బలియిచ్చి, నిన్ను అయోధ్యానగరమునకు తీసికొని వెళ్లెదరు. (16)

యత్తు రామో విజానీయాత్ అభిజ్ఞానమనిందితే।
ప్రీతిసంజననం తస్య భూయస్త్వం దాతుమర్హసి। 17

ఓ పూజ్యురాలా! శ్రీరామునకు సంతోషమును గూర్చునట్టి ఆయన గుర్తింపగల్గిన ఏదైన మఱియొక ఆనవాలును ఇమ్ము.(17)

సాఽబ్రవీద్దత్తమేవేతి మయాఽభిజ్ఞానముత్తమమ్।
ఏతదేవ హి రామస్య దృష్ట్వా మత్కేశభూషణమ్। 18

"ఓ వీరుడా! నేనిదివఱకే ఉత్తమమైన నా చూడామణిని ఆనవాలుగా ఇచ్చియున్నాను. ఓ హనుమంతుడా దీనిని చూచినపిమ్మట శ్రీరాముడు నీ మాటలను పూర్తిగా విశ్వసించును." అని సీతాదేవి పలికెను. (18)

శ్రద్ధేయం హనుమన్ వాక్యం తవ వీర భవిష్యతి।
స తం మణివరం గృహ్య శ్రీమాన్ ప్లవగసత్తమః। 19

సర్వశుభలక్షణసంపన్నుడైన ఆ వానరోత్తముడు ఆ మణిభూషణమును తీసికొని, సీతాదేవికి శిరసా ప్రణమిల్లి, వెళ్లుటకు ఉపక్రమించెను. (19)

ప్రణమ్య శిరసా దేవీం గమనాయోపచక్రమే।
తముత్పాతకృతోత్సాహమ్ అవేక్ష్య హరిపుంగవమ్। 20

వర్ధమానం మహావేగమ్ ఉవాచ జనకాత్మజా।
అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పగద్గదయా గిరా। 21

ఎగురుటకుసిద్ధమైనవాడును, దేహమును పెంచుచున్న వాడును, మహావేగముగలవాడును ఐన ఆ వానరశ్రేష్ఠుని జూచి, ఆ జానకి కన్నులలో అశ్రువులునిండగా, గద్గదస్వరముతో దీనముగా ఇట్లు నుడివెను. (20-21)

హనుమన్ సింహసంకాశౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ।
సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్। 22

"ఓ హనుమంతుడా! సింహపరాక్రమములైన ఆ రామలక్ష్మణ సోదరులను, అమాత్యులతోగూడిన సుగ్రీవుని, తదితరులందఱిని కుశలప్రశ్నలతో అడిగినట్లు తెలుపుము. (22)

యథా చ స మహాబాహుః మాం తారయతి రాఘవః।
అస్మాద్దుఃఖాంబుసంరోధాత్ త్వం సమాధాతుమర్హసి। 23

ఆజానుబాహుడైన ఆ శ్రీరామచంద్రుడు నన్ను ఈ దుఃఖసాగరమునుండి గట్టెక్కించుటకు తగిన ఉపాయమును నీవే ఆలోచింపుము. (23)

ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభిరేభిః పరిభర్త్సనం చ ।
బ్రూయాస్తు రామస్య గతస్సమీపం
శివశ్చ తేఽధ్వాస్తు హరిప్రవీర ॥ 24

ఓ మహావానరవీరా! నీవు రాముని సన్నిధికేగి, తీవ్రమైనదియు, అంతులేనిదియు ఐన నా ఈ వేదనను, రక్కసిమూకలు నన్ను బెదిరించుచు బాధించుచున్న తీరును ఆయనకు విన్నవింపుము. నీ ప్రయాణము హాయిగా కొనసాగుగాక." (24)

స రాజపుత్ర్యా ప్రతివేదితార్థః
కపిః కృతార్థః పరిహృష్టచేతాః ।
అల్పావశేషం ప్రసమీక్ష్య కార్యం
దిశం హ్యుదీచీం మనసా జగామ ॥ 25

ఆ హనుమంతుడు రాజకుమారియైన సీతాదేవిసందేశమును అందుకొని, కృతార్థుడై సంతోషముతో పొంగిపోయెను. పిమ్మట అతడు మిగిలిన కొద్దికార్యమునుగూర్చి ఆలోచించి, ఉత్తరదిశగా వెళ్లుటకు సంకల్పించుకొనెను. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే చత్వారింశస్సర్గః (40)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదియవసర్గము.

-- ❋ ❋ ❋ --

41. నలుబదియొకటవసర్గము

హనుమంతుడు ప్రమదావనమును (అశోకవాటికను) ధ్వంసము చేయుట

స చ వాగ్భిః ప్రశస్తాభిః గమిష్యన్ పూజితస్తయా।
తస్మాద్దేశాదపక్రమ్య చింతయామాస వానరః ॥ 1

సీతాదేవి తనకడసెలవుదీసికొని వెళ్లబోవుచున్న హనుమంతుని యెడ పూజ్యభావముతో కృతజ్ఞతాపూర్వకముగా ఆయనను కొనియాడెను. పిమ్మట ఆ వానరోత్తముడు ఆ ప్రదేశమునుండి కొంతదవ్వరిగి ఇట్లు ఆలోచింపసాగెను. (1)

అల్పశేషమిదం కార్యం దృష్టేయమసితేక్షణా।
త్రీనుపాయానతిక్రమ్య చతుర్థ ఇహ దృశ్యతే ॥ 2

'సీతాదేవిని దర్శించుట' అను ఒకకార్యము ముగిసినది, ఇంకను చేయవలసినకార్యము కొంచెము మిగిలియున్నది. చతురుపాయములలో మొదటి మూడింటిని (సామ, దాన, భేదోపాయములను) ప్రక్కనబెట్టి, నాల్గవదియగు దండోపాయమును మాత్రమే ఆశ్రయించుట యుక్తమని తోచుచున్నది. (2)

న సామ రక్షస్సు గుణాయ కల్పతే
న దానమర్థోపచితేషు యుజ్యతే ।
న భేదసాధ్యా బలదర్పితా జనాః
పరాక్రమస్త్వేవ మమేహ రోచతే ॥ 3

రాక్షసులకడ సామోపాయము పనిచేయదు. ధనమదాంధుల యెడ 'దానము' నిష్ప్రయోజనము. బలగర్వితులవిషయమున భేదోపాయమునకు తావులేదు. ఇంక నాపరాక్రమమునకు పనిచెప్పుటయే సమంజసము. (3)

న చాస్య కార్యస్య పరాక్రమాదృతే
వినిశ్చయః కశ్చిదిహోపపద్యతే ।
హతప్రవీరా హి రణే హి రాక్షసాః
కథంచిదీయుర్యదిహాద్య మార్దవమ్ ॥ 4

ఇప్పుడు ఈ కార్యమునందు పరాక్రమమును చూపుటయే సరియైనయుపాయమని నా నిశ్చితాభిప్రాయము. ఏలనన ప్రముఖులైన రాక్షసయోధులెల్లరును రణరంగమున హతులైనచో మిగిలినవారు ఏదోయొకవిధముగా సులభముగనే చల్లబడుదురు. (4)

కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్।
పూర్వకార్యావిరోధేన స కార్యం కర్తుమర్హతి ॥ 5

అప్పగింపబడిన కార్యమును సాధించి, దానికి భంగము వాటిల్లకుండ మఱియెన్నికార్యములనైనను సాధింపవచ్చును. అట్టివాడే నిజముగా కార్యదక్షుడు. (5)

న హ్యేకస్సాధకో హేతుః స్వల్పస్యాపీహ కర్మణః।
యో హ్యర్థం బహుధా వేద స సమర్థోఽర్థసాధనే ॥ 6

కార్యమదెంత స్వల్పమైనదైనను దానినిసాధించుటకు పెక్కుఉపాయములుండును. వాటినన్నింటిని ఎఱింగినవాడే యథార్థముగా కార్యసమర్థుడు. (6)

ఇహైవ తావత్ కృతనిశ్చయో హ్యహం
యది వ్రజేయం ప్లవగేశ్వరాలయమ్ ।
పరాత్మసమ్మర్దవిశేషతత్త్వవిత్
తత: కృతం స్యాన్మమ భర్తృశాసనమ్ । 7

కథం ను ఖల్వద్య భవేత్ సుఖాగతం
ప్రసహ్య యుద్ధం మమ రాక్షసైస్సహ ।
తథైవ ఖల్వాత్మబలం చ సారవత్
సమ్మానయేన్మాం చ రణే దశానన: । 8

తతస్సమాసాద్య రణే దశాననం
సమంత్రివర్గం సబలప్రయాయినమ్ ।
హృది స్థితం తస్య మతం బలం చ వై
సుఖేన మత్వాఽహమిత: పునర్వ్రజే । 9

ఇదమస్య నృశంసస్య నందనోపమముత్తమమ్ ।
వనం నేత్రమన:కాంతం నానాద్రుమలతాయుతమ్ । 10

ఇదం విధ్వంసయిష్యామి శుష్కం వనమివానల: ।
అస్మిన్ భగ్నే తత: కోపం కరిష్యతి దశానన: । 11

తతో మహత్సాశ్వమహారథద్విపం
బలం సమాదేక్ష్యతి రాక్షసాధిప: ।
త్రిశూలకాలాయసపట్టిశాయుధం
తతో మహద్యుద్ధమిదం భవిష్యతి । 12

అహం తు తైస్సంయతి చండవిక్రమై:
సమేత్య రక్షోభిరసహ్యవిక్రమ: ।
నిహత్య తద్రావణచోదితం బలం
సుఖం గమిష్యామి కపీశ్వరాలయమ్ । 13

తతో మారుతవత్ క్రుద్ధో మారుతిర్భీమవిక్రమ: ।
ఊరువేగేన మహతా ద్రుమాన్ క్షేప్తుమథారభత్ । 14

తతస్తు హనుమాన్ వీరో బభంజ ప్రమదావనమ్ ।
మత్తద్విజసమాఘుష్టం నానాద్రుమలతాయుతమ్ । 15

తద్వనం మథితై: వృక్షై: భిన్నైశ్చ సలిలాశయై: ।
చూర్ణితై: పర్వతాగ్రైశ్చ బభూవాప్రియదర్శనమ్ । 16

నానాశకుంతవిరుతై: ప్రభిన్నైస్సలిలాశయై: ।
తామ్రై: కిసలయై: క్లాంతై: క్లాంతద్రుమలతాయుతమ్ । 17

నేను ఇక్కడనే శత్రుబలములకును, మనవారి బలములకును యుద్ధనైపుణ్యమునందలి తారతమ్యములను బాగుగాతెలిసికొనుట యుక్తము. పిమ్మట కృతనిశ్చయుడనై, సుగ్రీవునికడకు వెళ్లినచో అప్పుడు ప్రభుశాసనమును చక్కగా నెఱవేర్చిన వాడనగుదును. (7)

ఇప్పుడు నాకు రాక్షసులతో తీవ్రమైనయుద్ధము సులభముగా సంభవించునట్లు చూడవలెను. అప్పుడే రావణుడు యుద్ధమున తనవారిబలమును, నాబలమును వాస్తవముగా తెలిసికొనగలడు. (8)

కావున రావణుని, వానిమంత్రులను, సైన్యమును, అనుచరులను యుద్ధమున ఎదుర్కొని, వాని శక్తి సామర్థ్యములను, మనస్సులోని ఆలోచనలను, బాగుగా ఎఱింగి, తృప్తిగా తిరిగివెళ్లెదను. (9)

క్రూరుడైనరావణుని యొక్క ఈఅశోకవనము శ్రేష్ఠమైనది, 'నందనవనముతో' సమానమైనది, బహువిధములైన చక్కని, వృక్షములతోడను, లతలతోడనుగూడి, నయనానందకరముగా, మనోజ్ఞముగానున్నది. (10)

ఎండిపోయినవనమును అగ్ని భస్మమొనర్చినట్లు నేను ఈ వనమును ధ్వంసముచేసెదను. ఇది పాడైపోయిన వార్తను విన్నవెంటనే దశాననుడు కుపితుడగును. (11)

పిమ్మట అశ్వములతోను, రథములతోను, ఏనుగులతోను, త్రిశూలములు, నల్లని ఇనుపపట్టిసములు మొదలగు ఆయుధములనుధరించిన కాల్బలములతోను గూడినగొప్ప సైన్యములను, రావణుడు ఇచ్చటికి పంపును. అప్పుడు ఒక మహాయుద్ధము జరుగును. (12)

తీక్ష్ణమైన పరాక్రమముగల ఆ రాక్షసయోధులతో రణరంగమున నేను ఎదురులేనిప్రతాపముతో పోరాడి, ఆ రావణప్రేరిత బలములను హతమార్చి, హాయిగా సుగ్రీవుని సన్నిధికి చేరగలను. (13)

అనంతరము తీవ్రమైనపరాక్రమముగల మారుతి విజృంభించినవాడై, పెనుగాలివలె అత్యంతవేగముతో బలముగా వృక్షములను పెకలించివేయనారంభించెను. (14)

పిమ్మట మహావీరుడైనహనుమంతుడు మదించిన పక్షుల కలకలారావములతోను, వివిధములగు వృక్షములతోను లతలతోను విలసిల్లుచున్న ప్రమదావనమును భగ్నము చేసెను. (15)

ఆవనమునందలివృక్షములన్నియును పూర్తిగా నేలమట్టమాయెను. సరస్సులు పాడైపోయెను. క్రీడా పర్వతములన్నియును నుగ్గునుగ్గాయెను. అప్పుడా వనము ప్రాణములేని దేహమువలె శోభావిహీనమయ్యెను. (16)

ఆ అశోకవనము కలవరపాటునకులోనైన వివిధములగు పక్షుల వికృతధ్వనులతో నిండిపోయెను. అచటి జలాశయములు ఛిన్నాభిన్నములాయెను. ఎఱ్ఱని చిగుళ్ళు వాడిపోయెను. వృక్షములు,

స బభౌ తద్వనం తత్ర దావానలహతం యథా।
వ్యాకులావరణా రేజుః విహ్వలా ఇవ తా లతాః॥ 18

లతలు నేలకూలెను. కారుచిచ్చుచే బుగ్గియైపోయినట్లు ఆవనము నిస్తేజమాయెను. ఆధారములను కోల్పోయినతీగలు నిరాశ్రయములై, విహ్వలలైన స్త్రీలవలె కళదప్పియుండెను. (17-18)

లతాగృహైశ్చిత్రగృహైశ్చ నాశితైః
మహోరగైః వ్యాలమృగైశ్చ నిర్ధుతైః।
శిలాగృహైరున్మథితైస్తథా గృహైః
ప్రణష్టరూపం తదభూన్మహద్వనమ్॥ 19

హనుమంతుడు విధ్వంసించుటచే తత్ప్రభావమున ఆ వనమునందలి పొదరిండ్లు, చిత్రశాలలు అతలాకుతలములాయెను. అందలి మహాసర్పములు, పెద్దపులులు మొదలగు క్రూరజంతువులు ఆర్తధ్వనులు చేయసాగెను. క్రీడాపర్వత గుహలు, ఇతర గృహములు పూర్తిగా దెబ్బతినెను. ఈ కారణముగా ఆ సుందరవనము తన పూర్వవైభవమును పూర్తిగాకోల్పోయెను. (19)

సా విహ్వలాఽశోకలతాప్రతానా
వనస్థలీ శోకలతాప్రతానా।
జాతా దశాస్యప్రమదావనస్య
కపేర్బలాద్ధి ప్రమదావనస్య॥ 20

సీతాదేవిని ఆదుకొనుటకై వచ్చిన ఆ కపీశ్వరుని బలప్రభావముచే రావణుని అంతఃపురకాంతల విహారార్థమై ఏర్పడిన అశోకలతాసమూహాలతో కలకలలాడు ఆ వనప్రదేశము శోకమునమునింగిన స్త్రీలతోగూడినదై, నిస్తేజమై ఒప్పెను- (20)

స తస్య కృత్వార్థపతేర్మహాకపిః
మహద్వ్యలీకం మనసో మహాత్మనః।
యుయుత్సురేకో బహుభిర్మహాబలైః
శ్రియా జ్వలంస్తోరణమాస్థితః కపిః॥ 21

ఆ కపీశ్వరుడు మిక్కిలిబలశాలియైన రావణునిమనస్సు క్లేశపడునట్లుగా వనమును భంగపఱచెను. పిమ్మట మహాబలశాలురైన పెక్కుమంది రాక్షసయోధులతో ఒంటరిగా పోరాడదలచినవాడై, అతడు ఉత్సాహశక్తితో ఒప్పారుచు ఆ వనముఖద్వారముపై నిలిచి, శత్రువులరాకకై ఎదురు చూచుచుండెను. (21)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకచత్వారింశస్సర్గః (41)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదియొకటవసర్గము.

— * * * —

42. నలుబదిరెండవసర్గము

రాక్షసస్త్రీలవలన ప్రమదావన విధ్వంసవార్త నెఱిగి, రావణుడు ఎనుబదివేలమంది రాక్షసులనుపంపుట, హనుమంతుడు వారిని సంహరించుట

తతః పక్షినినాదేన వృక్షభంగస్వనేన చ।
బభూవుస్త్రాససంభ్రాంతాః సర్వే లంకానివాసినః॥ 1

పిమ్మట పక్షులఆర్తనాదములను, వృక్షములు విఱిగి పడిపోవునప్పటి పెళపెళారావములనువిని, లంకా నివాసులందఱును మిక్కిలి భయభ్రాంతులైరి. (1)

విద్రుతాశ్చ భయత్రస్తా వినేదుర్మృగపక్షిణః।
రక్షసాం చ నిమిత్తాని క్రూరాణి ప్రతిపేదిరే॥ 2

ఆ వనమునందలి మృగములు, పక్షులు భయపడి గగ్గోలు పెట్టుచు పాఱిపోసాగెను. రాక్షసులకు భయమును గొలుపు అపశకునములు వచ్చిపడెను. (సూచితములయ్యెను.) (2)

తతో గతాయాం నిద్రాయాం రాక్షస్యో వికృతాననాః।
తద్వనం దదృశుర్భగ్నం తం చ వీరం మహాకపిమ్॥ 3

అంతవఱకును నిద్రలోమునిగియున్న, వికృతాకారలైన ఆ రాక్షసస్త్రీలందఱును వనభంగధ్వనులకు మేల్కొని, సర్వనాశనమైన ఆ వనమును, మహావీరుడైన ఆ వానరుని చూచిరి. (3)

స తా దృష్ట్వా మహాబాహుః మహాసత్త్వో మహాబలః।
చకార సుమహద్రూపం రాక్షసీనాం భయావహమ్॥ 4

మహాబాహువు, గొప్పశక్తిశాలియు, మిక్కిలి బలవంతుడును ఐన ఆ హనుమంతుడు ఆ రాక్షసస్త్రీలకు దడపుట్టునట్లుగా తనశరీరమును ఇంకను పెంచెను. (4)

తతస్తం గిరిసంకాశమ్ అతికాయం మహాబలమ్।
రాక్షస్యో వానరం దృష్ట్వా పప్రచ్ఛుర్జనకాత్మజామ్। 5

కోఽయం కస్య కుతో వాయం కింనిమిత్తమిహాగతః।
కథం త్వయా సహానేన సంవాదః కృత ఇత్యుత। 6

ఆచక్ష్వ నో విశాలాక్షి మా భూత్ తే సుభగే భయమ్।
సంవాదమసితాపాంగి త్వయా కిం కృతవానయమ్। 7

అథాబ్రవీత్ తదా సాధ్వీ సీతా సర్వాంగసుందరీ।
రక్షసాం భీమరూపాణాం విజ్ఞానే మమ కా గతిః। 8

యూయమేవాభిజానీత యోఽయం యద్వా కరిష్యతి।
అహిరేవ హ్యహేః పాదాన్ విజానాతి న సంశయః। 9

అహమప్యస్య భీతాస్మి నైనం జానామి కో న్వయమ్।
వేద్మి రాక్షసమేవైనం కామరూపిణమాగతమ్। 10

వైదేహ్యా వచనం శ్రుత్వా రాక్షస్యో విద్రుతా దిశః।
స్థితాః కాశ్చిద్గతాః కాశ్చిత్ రావణాయ నివేదితుమ్। 11

రావణస్య సమీపే తు రాక్షస్యో వికృతాననాః।
విరూపం వానరం భీమమ్ ఆఖ్యాతుముపచక్రముః। 12

అశోకవనికామధ్యే రాజన్ భీమవపుః కపిః।
సీతయా కృతసంవాదః తిష్ఠత్యమితవిక్రమః। 13

న చ తం జానకీ సీతా హరిం హరిణలోచనా।
అస్మాభిర్బహుధా పృష్టా నివేదయితుమిచ్ఛతి। 14

వాసవస్య భవేద్దూతో దూతో వైశ్రవణస్య వా।
ప్రేషితో వాపి రామేణ సీతాన్వేషణకాంక్షయా। 15

తేన త్వద్భుతరూపేణ యత్తత్ తవ మనోహరమ్।
నానామృగగణాకీర్ణం ప్రమృష్టం ప్రమదావనమ్। 16

న తత్ర కశ్చిదుద్దేశో యస్తేన న వినాశితః।
యత్ర సా జానకీ సీతా స తేన న వినాశితః। 17

జానకీరక్షణార్థం వా శ్రమాద్వా నోపలభ్యతే।
అథవా కః శ్రమ స్తస్య సైవ తేనాభిరక్షితా। 18

మహాకాయుడును, మిక్కిలిబలశాలియు, పర్వతమంత ఎత్తునకు పెఱిగినవాడునుఅగు ఆ వానరుని జూచి, రాక్షసస్త్రీలు సీతాదేవితో ఇట్లనిరి. (5)

"ఇతడెవరు? ఎవరికిసంబంధించినవాడు? ఎచటినుండి వచ్చినాడు? ఎందులకువచ్చినాడు? నీతో అతడు మాట్లాడినదేమి? ఓ సుందరీ! ఓ విశాలాక్షీ! నిన్ను మేము ఏమియుఅనము, భయపడకుము, ఈతడు నీతో ఏమి మాట్లాడెను? తెలుపుము-" (6-7)

సర్వాంగసుందరియు, సాధ్వియుఐన సీతాదేవి ఇట్లు పలికెను. "కామరూపులైన భయంకరరాక్షసుల విషయము నాకేమి తెలియును? ఇతడెవరో? ఏమిచేయనున్నాడో? మీకే తెలియును. పాముజాడలు పామునకే యెఱుక. ఇది లోకవిదితము. ఇతనిని జూచి నేనును భయపడుచున్నాను. ఇతడు ఎవరో నేనెఱుగను. కామరూపియైన రాక్షసుడే ఇట్లు వచ్చినాడా అని తలంతును. (8-10)

వైదేహి వచనములనువిని రాక్షసస్త్రీలు నలుదెసలకును (వనమునందటునిటు) పరుగులుదీసిరి. వారిలో కొందఱచటనే యుండిరి, మఱికొందఱు ఈ విషయమును రావణునకు నివేదించుటకై వెళ్ళిరి. (11)

వికృతాకారములుగల ఆ రాక్షసస్త్రీలు రావణునికడకేగి, వికృతరూపముతో భయంకరముగానున్న వానరునిగూర్చి అతనికి తెలుపసాగిరి. (12)

"ఓ మహారాజా! భయంకరరూపుడైన ఒకవానరుడు అశోకవనమునకువచ్చి సీతాదేవితో సంభాషించెను, అతడు, అమితపరాక్రమశాలి. ఆ వానరునిగూర్చి తెలుపుమని జానకిని పెక్కురీతుల అడిగితిమి. కాని హరిణలోచనయైన ఆసీత ఆ వివరములను తెలుపుటకు ఏ మాత్రము ఇష్టపడుటలేదు. అతడు అక్కడనే యున్నాడు. (13-14)

అతడు ఇంద్రునిదూతయైనను కావచ్చును, లేక కుబేరుని దూతయైనను కావచ్చును, లేదా సీతాన్వేషణార్థము శ్రీరామునిచే పంపబడినవాడైనను కావచ్చును. (15)

నీ మనస్సునకు మిక్కిలిఆహ్లాదమును గూర్చునదియు, వివిధములగు మృగములతో నిండినదియుఐన ప్రమదావనమును అద్భుతరూపుడైన ఆ కపి ధ్వంసమొనర్చెను. (16)

ఆ వనమునందు ఆ మహావీరుడు ధ్వంసముచేయని ప్రదేశమేలేదు. కాని జానకియున్నచోటును మాత్రము అతడు తాకనైననుతాకలేదు. (17)

జానకిని రక్షించుటకొఱకో, లేక శ్రమవలన అలసటచెందియో తెలియుటలేదు, కాని, అంతటి పరాక్రమశాలికి శ్రమయేమిటి? కావున ఆమెను రక్షించుటకే ఆ ప్రదేశమును అతడు భగ్నమొనర్పలేదు- అని మాకుఅనిపించుచున్నది. (18)

చారుపల్లవపుష్పాఢ్యం యం సీతా స్వయమాస్థితా।
ప్రవృద్ధశ్శింశుపావృక్షః స చ తేనాభిరక్షితః॥ 19

తస్యోగ్రరూపస్యోగ్ర త్వం దండమాజ్ఞాతుమర్హసి।
సీతా సంభాషితా యేన తద్వనం చ వినాశితమ్॥ 20

మనఃపరిగృహీతాం తాం తవ రక్షోగణేశ్వర।
కస్సీతామభిభాషేత యో న స్యాత్ త్యక్తజీవితః॥ 21

రాక్షసీనాం వచశ్శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః।
హుతాగ్నిరివ జజ్వాల కోపసంవర్తితేక్షణః॥ 22

తస్య క్రుద్ధస్య నేత్రాభ్యాం ప్రాపతన్నశ్రుబిందవః।
దీప్తాభ్యామివ దీపాభ్యాం సార్చిషః స్నేహబిందవః॥ 23

ఆత్మనస్సదృశాన్ శూరాన్ కింకరాన్ నామ రాక్షసాన్।
వ్యాదిదేశ మహాతేజా నిగ్రహార్థం హనూమతః॥ 24

తేషామశీతిసాహస్రం కింకరాణాం తరస్వినామ్।
నిర్యయుర్భవనాత్ తస్మాత్ కూటముద్గరపాణయః॥ 25

మహోదరా మహాదంష్ట్రా ఘోరరూపా మహాబలాః।
యుద్ధాభిమనసః సర్వే హనుమద్గ్రహణోన్ముఖాః॥ 26

తే కపీంద్రం సమాసాద్య తోరణస్థమవస్థితమ్।
అభిపేతుర్మహావేగాః పతంగా ఇవ పావకమ్॥ 27

తే గదాభిర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః।
ఆజఘ్నుర్వానరశ్రేష్ఠం శరైశ్చాదిత్యసన్నిభైః॥ 28

ముద్గరైః పట్టిశైశ్శూలైః ప్రాసతోమరశక్తిభిః।
పరివార్య హనూమంతం సహసా తస్థురగ్రతః॥ 29

హనుమానపి తేజస్వీ శ్రీమాన్ పర్వతసన్నిభః।
క్షితావావిధ్య లాంగూలం ననాద చ మహాస్వనమ్॥ 30

సీతాదేవి స్వయముగా ఆశ్రయించియున్న శింశుపావృక్షము అందమైనచిగుళ్లతో, పుష్పములతో విలసిల్లు చున్నది. దానిని అతడు భగ్నమొనర్పకుండుటచే ఏపుగాపెరిగిన ఆ వృక్షము కలకలలాడుచునే యున్నది. (19)

ఓ ఉగ్రరూపా! అతడు ముందుగా సీతాదేవితో సంభాషించెను. అంతేగాక ప్రమదావనమును నాశమొనర్చెను. ఈ రెండు మహాపరాధములను గావించిన ఆ భయంకరాకారుని తీవ్రముగా దండించుటకు ఆజ్ఞాపింపుము. ఓ రాక్షసరాజా! నీవు ఎంతగానో మనసుపడిన సీతతో సంభాషించుటకు సాహసించువాడు నిజముగా తన ప్రాణములపై ఆశ వదలుకొనవలసినదే"- రాక్షసరాజైన రావణుడు ఆ రక్కసిమూకలమాటలను విని, కోపముతో గ్రుడ్లుఱుముచు హుతాగ్నివలె భగ్గున మండిపడెను. మండుచున్నదీపములనుండి జ్వాలలతోగూడిన తైలబిందువులురాలుచున్నట్లు క్రోధావేశముతో ఊగిపోవుచున్న అతనినేత్రములనుండి అశ్రుకణములు జాఱెను. (20-23)

మిక్కిలితేజశ్శాలియైనరావణుడు హనుమంతుని బంధించితెచ్చుటకై తనకుదీటైన శూరులగు ప్రముఖరాక్షసయోధులకు ఆజ్ఞలను ఇచ్చెను- (24)

రావణుని ఆజ్ఞమేరకు బలశాలురైన ఆ కింకరులలో ఎనుబదివేలమందియోధులు బాణములను, ఇనుపగుదియలను చేబూనినవారై, ఆ భవనమునుండి బయలుదేఱిరి. (25)

మహోదరులు, పెద్దపెద్ద కోఱలుగలవారు, భయంకరాకారులు, మహాబలశాలురు, రణోత్సాహముతో ఉన్నవారు, ఐనట్టివారందఱును హనుమంతుని బంధించుటకై ఉబలాటపడుచుండిరి. (26)

యుద్ధసన్నద్ధుడై వనముఖద్వారముపై నిలిచియున్న ఆ కపివరుని వారు సమీపించి, మండుచున్న అగ్నిమీదికి మిడుతలవలె అతనిపైకి (తమ నాశముకొఱకై) అతి వేగముగా దూసికొనివచ్చిరి. (27)

ఆ రాక్షసయోధులు గదలను, చిత్రములైన ఇనుపగుదియలను, బంగారుపిడులుగల అడ్డకత్తులను, సూర్యకిరణములవలె వాడియైన బాణములను ఆ వానరోత్తమునిపై విసరివేసిరి. (28)

ఆ రాక్షసవీరులు ఇనుపగుదియలతోడను, అడ్డకత్తుల తోడను, శూలములతోడను, ఈటెలతోడను, తోమరముల (చిన్నఈటెల) తోడను, బల్లెములతోడను అతి వేగముగా హనుమంతునిచుట్టుముట్టి, ఆయనను ఎదిరించినిలిచిరి. (29)

మహాతేజశ్శాలియు, పర్వతసదృశుడునుఐన ఆ హనుమంతుడును హర్షాతిరేకముతో తనవాలమును నేలపైకొట్టి, భయంకరముగా సింహనాదమొనర్చెను.(30)

స భూత్వా సుమహాకాయో హనుమాన్ మారుతాత్మజః।
ధృష్టమాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్। 31

తస్యాస్ఫోటితశబ్దేన మహతా సానునాదినా।
పేతుర్విహంగా గగనాత్ ఉచ్చైశ్చేదమఘోషయత్। 32

వాయుసుతుడైనహనుమంతుడు తనశరీరమును మిక్కిలిపెంచినవాడై, లంకలోప్రతిధ్వనించునట్లుగా దృఢముగా తనజబ్బలుచరచెను. ఆ హనుమంతుడు తనభుజములను చరచగా ఏర్పడిన మహాధ్వనికారణముగా ఆకాశమున ఎగురుచున్న పక్షులన్నియును నేలరాలెను. అతడు బిగ్గరగా ఇట్లు జయఘోషమొనర్చెను. (31-32)

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః। 33

దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః।
హనుమాన్ శత్రుసైన్యానాం నిహన్తా మారుతాత్మజః। 34

మహాబలసంపన్నుడైన శ్రీరామునకు జయము, మిక్కిలి పరాక్రమశాలియైన లక్ష్మణస్వామికి జయము, శ్రీరామునకు విధేయుడై, కిష్కింధకు ప్రభువైన సుగ్రీవునకు జయము- అసహాయశూరుడు, కోసలదేశప్రభువు ఐన శ్రీరామునకు నేను దాసుడను, వాయుపుత్రుడను, నా పేరు హనుమంతుడు, శత్రుసైన్యములను రూపుమాపు వాడను. (33-34)

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్।
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః। 35

అర్దయిత్వా పురీం లంకామ్ అభివాద్య చ మైథిలీమ్।
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్। 36

నేయిమందిరావణులైనను యుద్ధరంగమున నన్నెదిరించి నిలువజాలరు. వేలకొలదిశిలలతోను, వృక్షములతోను, సకలరాక్షసులను, లంకాపురిని నాశనమొనర్చెదను. రాక్షసులందఱును ఏమియుచేయలేక చూచుచుండురుగాక- నేను వచ్చినపనిని ముగించుకొని, సీతాదేవికి నమస్కరించి వెళ్లెదను.(35-36)

తస్య సన్నాదశబ్దేన తేఽభవన్ భయశంకితాః।
దదృశుశ్చ హనూమంతం సంధ్యామేఘమివోన్నతమ్। 37

హనుమంతుని భీషణధ్వనులకు రాక్షసకింకరులు భయముతో గడగడవణకిరి. వారు సంధ్యాకాలమేఘము వలె పద్మరాగ శోభలతో ఉన్నతుడైయున్న హనుమంతుని జూచిరి. (37)

స్వామిసందేశనిశ్శంకాః తతస్తే రాక్షసాః కపిమ్।
చిత్రైః ప్రహరణైర్భీమైః అభిపేతుస్తతస్తతః। 38

(ఆవిధముగా భయకంపితులైనను) ఆ రాక్షసులు రావణుని ఆజ్ఞమేఱకు జంకుగొంకులులేనివారై చిత్ర విచిత్రములైన భయంకరములైన ఆయుధములతో అన్ని వైపులనుండి అతనిని ఎదుర్కొనిరి. (38)

స తైః పరివృతశ్శూరైః సర్వతస్స మహాబలః।
ఆససాదాయసం భీమం పరిఘం తోరణాశ్రితమ్। 39

మహాబలశాలియైన ఆ హనుమంతుని రాక్షసవీరులు చుట్టుముట్టగా అతడు ముఖద్వారమునకు బిగించిన భయంకరమైన ఇనుపగడియను చేతబట్టెను. (39)

స తం పరిఘమాదాయ జఘాన రజనీచరాన్।
స పన్నగమివాదాయ స్ఫురంతం వినతాసుతః। 40

విచచారాంబరే వీరః పరిగృహ్య చ మారుతిః।
సూదయామాస వజ్రేణ దైత్యానివ సహస్రదృక్। 41

హనుమంతుడు ఆ పరిఘను గ్రహించి, రాక్షసవీరులను హతమార్చెను. గడియను చేతబట్టియున్న ఆ హనుమంతుడు కదలుచున్న పన్నగమును పట్టుకొనిన గరుత్మంతునివలె ఆకాశమున సంచరించెను. పిమ్మట ఆ మహావీరుడు 'ఇంద్రుడు తన వజ్రాయుధముచే దైత్యులను సంహరించినట్లు' రావణ కింకరులను పరిమార్చెను. (40-41)

స హత్వా రాక్షసాన్వీరాన్ కింకరాన్ మారుతాత్మజః।
యుద్ధకాంక్షీ పునర్వీరః తోరణం సముపాశ్రితః। 42

పరాక్రమశాలియైన ఆ వాయుసుతుడు కింకర రాక్షసులను అందఱిని చంపి, ఇంకను యుద్ధము చేయదలచినవాడై వనముఖద్వారము మీదికి చేరెను- (42)

తతస్తస్మాద్భయాన్ముక్తాః కతిచిత్ తత్ర రాక్షసాః।
నిహతాన్ కింకరాన్ సర్వాన్ రావణాయ న్యవేదయన్। 43

తదుపరి హనుమంతునకు భయపడి ప్రాణములను అఱచేతబట్టుకొని, పాఱిపోయిన కొంతమంది రాక్షసులు రావణునికడకేగి, 'కింకరులందఱును మారుతిచేతిలో మడిసిరి'- అని చావుకబురు చల్లగా తెలిపిరి. (43)

స రాక్షసానాం నిహతం మహాబలం
నిశమ్య రాజా పరివృత్తలోచనః।
సమాదిదేశాప్రతిమం పరాక్రమే
ప్రహస్తపుత్రం సమరే సుదుర్జయమ్ ॥ 44

రాక్షసబలములన్నియును నిహతమైనట్లు దెలియగానే రావణుడు కన్నులెఱ్ఱజేసినవాడై, సాటిలేని పరాక్రమవంతుడు, యుద్ధమున అజేయుడు ఐన ప్రహస్త పుత్రుని (ప్రహస్తుడను మంత్రియొక్క కుమారుని) హనుమంతునితో తలపడుటకు ఆజ్ఞాపించెను. (44)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ద్విచత్వారింశస్సర్గః (42)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదిరెండవసర్గము.

-- ❋ ❋ ❋ --

43. నలుబదిమూడవసర్గము

హనుమంతుడు చైత్యప్రాసాదమును ధ్వంసము చేయుట, దాని రక్షకులను అంతమొందించుట

తత స్స కింకరాన్ హత్వా హనుమాన్ ధ్యానమాస్థితః।
వనం భగ్నం మయా చైత్యప్రాసాదో న వినాశితః॥ 1

తస్మాత్ ప్రాసాదమప్యేనం భీమం విధ్వంసయామ్యహమ్।
ఇతి సంచింత్యమనసా హనుమాన్ దర్శయన్ బలమ్॥ 2

చైత్యప్రాసాదమాప్లుత్య మేరుశృంగమివోన్నతమ్।
ఆరురోహ కపిశ్రేష్ఠో హనుమాన్ మారుతాత్మజః॥ 3

హనుమంతుడు రాక్షసకింకరులను అందఱిని హతమార్చినపిమ్మట, చైత్యప్రాసాదము అతని దృష్టిలో పడెను. అప్పుడతడు "నేను అశోకవనమును ధ్వంస మొనర్చితిని. కాని ఈ చైత్య (దేవాలయాకృతిలో ఉన్న) ప్రాసాదమును ఓలికిమాత్రము పోలేదు. కనుక ఈ గొప్ప ప్రాసాదమును విధ్వంసముచేసెదను"- అని మనస్సున నిర్ణయించుకొనెను. పిదప తనబలమును ప్రకటించుచు ఆ ముఖద్వారముపైనుండి మేరుశిఖరమువలె ఎత్తునఉన్న చైత్యప్రాసాదముమీదికి ఎగిరి, కపివరుడైన ఆ మారుతి దానిని అధిరోహించెను. (1-3)

ఆరుహ్య గిరిసంకాశం ప్రాసాదం హరియూథపః।
బభౌ స సుమహాతేజాః ప్రతిసూర్య ఇవోదితః॥ 4

ఆ వానరయోధుడు ఒక పర్వతమువలెనున్న ఆ ప్రాసాదమును ఆరోహించి, మఱియొక ఉదయభానుని వలె మహాతేజశ్శాలియై విరాజిల్లెను. (4)

సంప్రధృష్య చ దుర్ధర్షం చైత్యప్రాసాదముత్తమమ్।
హనుమాన్ ప్రజ్వలల్లక్ష్మ్యా పారియాత్రోపమోఽభవత్॥ 5

చేరశక్యముగాని ఉన్నతచైత్యప్రాసాదమును హనుమంతుడు ఆక్రమించి, 'పారియాత్ర' కులపర్వతముతో సమానుడై, చక్కగా శోభిల్లుచుండెను. (5)

స భూత్వా సుమహాకాయః ప్రభావాన్ మారుతాత్మజః।
ధృష్టమాస్ఫోటయామాస లంకాం శబ్దేన పూరయన్॥ 6

ఆ వాయుసూనుడు తనప్రభావముచే శరీరమును పెంచి, లంకానగరమునందంతటను మాఱుమ్రోగునట్లుగా నిర్భయముగా భుజాస్ఫాలనముగావించెను. (6)

తస్యాస్ఫోటితశబ్దేన మహతా శ్రోత్రఘాతినా।
పేతుర్విహంగమాస్తత్ర చైత్యపాలాశ్చ మోహితాః॥ 7

హనుమంతుడు చెవులకు చిల్లులుపడునట్లు తీవ్రముగా భుజాస్ఫాలనముచేయగా ఆకాశమున ఎగురుచున్నపక్షులు నేలపైబడిపోయెను. అచటి చైత్య సంరక్షకులెల్లరును మూర్ఛపోయిరి. (7)

అస్త్రవిజ్జయతాం రామో లక్ష్మణశ్చ మహాబలః।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః॥ 8

"అస్త్రవిద్యాపారంగతుడైన శ్రీరామునకు జయము మిక్కిలి బలపరాక్రమములుగల లక్ష్మణునకు జయము- రాఘవునిఅనుగ్రహమునకుపాత్రుడై కిష్కింధకు ప్రభువైన సుగ్రీవునకు జయము- (8)

దాసోఽహం కోసలేంద్రస్య రామస్యాక్లిష్టకర్మణః।
హనుమాన్ శత్రుసైన్యానాం నిహంతా మారుతాత్మజః। 9

న రావణసహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్।
శిలాభిశ్చ ప్రహరతః పాదపైశ్చ సహస్రశః। 10

అర్దయిత్వా పురీం లంకామ్ అభివాద్య చ మైథిలీమ్।
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసామ్। 11

ఏవముక్త్వా విమానస్థః చైత్యస్థాన్ హరియూథపః।
ననాద భీమనిర్హ్రాదో రక్షసాం జనయన్ భయమ్। 12

తేన శబ్దేన మహతా చైత్యపాలాశ్శతం యయుః।
గృహీత్వా వివిధానస్త్రాన్ ప్రాసాన్‌ఖడ్గాన్ పరశ్వధాన్। 13

విసృజంతో మహాకాయా మారుతిం పర్యవారయన్।
తే గదాభిర్విచిత్రాభిః పరిఘైః కాంచనాంగదైః। 14

ఆజఘ్నుర్వానరశ్రేష్ఠం బాణైశ్చాదిత్యసన్నిభైః।
ఆవర్త ఇవ గంగాయాః తోయస్య విపులో మహాన్। 15

పరిక్షిప్య హరిశ్రేష్ఠం స బభౌ రక్షసాం గణః।
తతో వాతాత్మజః క్రుద్ధో భీమరూపం సమాస్థితః। 16

ప్రాసాదస్య మహాంతస్య స్తమ్భం హేమపరిష్కృతమ్।
ఉత్పాటయిత్వా వేగేన హనుమాన్ పవనాత్మజః। 17

తతస్తం భ్రామయామాస శతధారం మహాబలః।
తత్రచాగ్నిస్సమభవత్ ప్రాసాదశ్చాప్యదహ్యత। 18

దహ్యమానం తతో దృష్ట్వా ప్రాసాదం హరియూథపః।
స రాక్షసశతం హత్వా వజ్రేణేంద్ర ఇవాసురాన్।
అంతరిక్షే స్థితశ్శ్రీమాన్ ఇదం వచనమబ్రవీత్। 19

మాదృశానాం సహస్రాణి విసృష్టాని మహాత్మనామ్। 20

బలినాం వానరేంద్రాణాం సుగ్రీవవశవర్తినామ్।
అటంతి వసుధాం కృత్స్నాం వయమన్యే చ వానరాః। 21

దశనాగబలాః కేచిత్ కేచిద్దశగుణోత్తరాః।
కేచిన్నాగసహస్రస్య బభూవుస్తుల్యవిక్రమాః। 22

మిక్కిలి క్లిష్టములైన కార్యములను సైతము అవలీలగా సాధింపగల కోసలేంద్రునకు నేను సమ్మినబంటును. శత్రుబలములను రూపుమాపువాడను. వాయుసూనుడను. హనుమంతుడను. (9)

వేయిమందిరావణులైనను యుద్ధమున నాకు సాటిరారు. అసంఖ్యాకములైన బాళ్లతోను, వృక్షములతోను కొట్టుచు రాక్షసులనుపరిమార్చి, లంకానగరమును ధ్వంసమొనర్చెదను. సీతాదేవికి ప్రణమిల్లి, కృతార్థుడనై వెళ్లెదను. రాక్షసులెల్లరును కన్నులప్పగించి చూచుచుందురుగాక." (10-11)

ప్రాసాదముపైనున్న వానరయోధుడు చైత్యపాలకులకు జయఘోషలు వినిపించుచు రాక్షసులకు దడపుట్టునట్లుగా భయంకరమైన నాదమొనర్చెను. (12)

ఆ మహాశబ్దమునువిని, వందలకొలది చైత్యరక్షకులు వివిధములగు అస్త్రములను, ఈటెలను, ఖడ్గములను గండ్రగొడ్డళ్లను తీసికొని, హనుమంతుని ఎదుర్కొనుటకు ఏతెంచిరి. (13)

పిమ్మట మహాకాయులైన ఆరాక్షసులు ఆయుధములను ప్రయోగించుచు మారుతిని చుట్టుముట్టిరి. వారు విచిత్రములగు గదలతోను, సూర్యకిరణములవలె తీక్ష్ణములైన బాణములతోను తమ బలముకొలదియు అతనిని కొట్టిరి. (14)

హనుమంతునిచుట్టుచేరియున్న ఆ రాక్షసులగుంపు గంగాజలములయందలి విశాలమైన గొప్ప సుడిగుండము వలె ఒప్పారెను. (15)

పిదప వాయుసూనుడు క్రుద్ధుడై, భయంకర రూపమును దాల్చినవాడై, ఆ ప్రాసాదముయొక్క స్వర్ణాలంకృతమైన మహాస్తంభమును పెకలించెను. తదుపరి మహాబలశాలియైన హనుమంతుడు నూఱంచులుగల ఆ స్తంభమును గిరగిర త్రిప్పసాగెను. అప్పుడు దానినుండి అగ్ని ఉద్భవించెను. అది ప్రాసాదమును దహించివేసెను. (16-18)

పిమ్మట ఆ వానరోత్తముడు దహింపబడుచున్న ప్రాసాదమునుజూచి, ఆ వందలకొలదిరాక్షసులను, ఇంద్రుడు తనవజ్రాయుధముచే అసురులను సంహరించినట్లు హతమార్చెను. సర్వశక్తిసంపన్నుడైన హనుమంతుడు అంతరిక్షమునునిల్చి, ఇట్లు బిగ్గరగా వారిని హెచ్చరించెను. (19)

నా వంటి మహాపరాక్రమశాలురైన వానరయోధులు వేలకొలది పంపబడిరి. మహాబలశాలురైనవారు అందఱును సుగ్రీవాజ్ఞలను శిరసావహించువారే. మేమును, ఇతర వానరులును భూమండలమందంతటను సంచరించుచున్నాము. (20-21)

పదికొందఱు పదియేనుగులబలముగలవారు, మఱికొందఱు వారికి పదిరెట్లు (వందయేనుగుల) బలము గలవారు, ఇంకనుకొందఱు వేయియేనుగులబలము గలవారు. (22)

సంతి చౌఘబలాః కేచిత్ కేచిద్వాయుబలోపమాః।
అప్రమేయబలాశ్చాన్యే తత్రాసన్ హరియూథపాః। 23

ఆ వానరయోధులలో కొందఱు (ఓఘసంఖ్యాక) కోట్లకొలది ఏనుగులబలముగలవారు. మఱికొందఱు వాయువేగబలసంపన్నులు. ఇంకనుకొందఱు ఊహలకు అందని అంతగా బలసమంచితులు. (23)

ఈదృగ్విధైస్తు హరిభిః వృతో దంతనఖాయుధైః।
శతైశ్శతసహస్రైశ్చ కోటీభిరయుతైరపి। 24

ఆగమిష్యతి సుగ్రీవః సర్వేషాం వో నిషూదనః।
నేయమస్తి పురీ లంకా న యూయం న చ రావణః।
యస్మాదిక్ష్వాకునాథేన బద్ధం వైరం మహాత్మనా। 25

దంతములు, నఖములు ఆయుధములుగాగల ఇట్టి వానరయోధులు వందలు, వేలు, లక్షలు, కోట్లకొలది వెంటరాగా సుగ్రీవుడు ఇచటికివచ్చి, మిమ్ములనందఱిని తుదముట్టింపగలడు. మీరు మహాత్ముడైన శ్రీరామచంద్రప్రభువుతో వైరముపెట్టుకొనినారు. ఆ కారణమున మీరును ఉండరు. మీకు ఆధారభూమియైన లంకానగరమూ ఉండదు. కడకు మీ ప్రభువైన దుష్టరావణుడు సైతము మిగులడు- (24-25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే త్రిచత్వారింశస్సర్గః (43)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదిమూడవసర్గము.

— ❋ ❋ ❋ —

44. నలుబదినాల్గవసర్గము

మారుతి ప్రహస్తపుత్రుడైన జంబుమాలిని హతమార్చుట

సందిష్టో రాక్షసేంద్రేణ ప్రహస్తస్య సుతో బలీ।
జంబుమాలీ మహాదంష్ట్రో నిర్జగామ ధనుర్ధరః। 1

ప్రహస్తునికుమారుడైన జంబుమాలి మిక్కిలి బలశాలి, అతడు పెద్దపెద్ద కోఱలుగలవాడు, ధనుర్ధారి, అతడు రాక్షసరాజైన రావణుని ఆదేశమననుసరించి, యుద్ధమునకు బయలుదేఱెను. (1)

రక్తమాల్యాంబరధరః స్రగ్వీ రుచిరకుండలః।
మహాన్ వివృత్తనయనః చండస్సమరదుర్జయః। 2

అతడు ఎఱ్ఱని వస్త్రమాల్యములనుధరించి, కంఠమున పూలదండలను కలిగియుండెను. అతని శ్రవణకుండలములు మనోహరములు, మిక్కిలి తీక్ష్ణస్వభావముగలవాడు, యుద్ధమున జయింపశక్యము కానివాడు, అతడు కన్నులెఱ్ఱజేయుచు వచ్చెను. (2)

ధనుశ్శక్రధనుఃప్రఖ్యం మహద్రుచిరసాయకమ్।
విస్ఫారయానో వేగేన వజ్రాశనిసమస్వనమ్। 3

ఇంద్రధనుస్సుతో తుల్యమైనదియు, మిక్కిలి శక్తిమంతములైనబాణములను ప్రయోగింపగలదియు అగు ధనుస్సునుఎక్కుపెట్టి, అతడు వజ్రాయుధమువలె, పిడుగుపాటువలె భయంకరములైన ధనుష్టంకారములను గావించుచు అతివేగముగా వచ్చెను. (3)

తస్య విస్ఫారఘోషేణ ధనుషో మహతా దిశః।
ప్రదిశశ్చ నభశ్చైవ సహసా సమపూర్యత। 4

ఆగొప్పధనుష్టంకారధ్వనులతో అష్టదిక్కులును, భూమ్యాకాశములును క్షణములో నిండిపోయెను. (4)

రథేన ఖరయుక్తేన తమాగతముదీక్ష్య సః।
హనుమాన్ వేగసంపన్నో జహర్ష చ ననాద చ। 5

గాడిదలనుపూన్చిన రథముపై ఆ జంబుమాలి వచ్చుటనుజూచి, హనుమంతుడు హర్షముతో మిక్కిలి ఉప్పొంగిపోయినవాడై గర్జించెను. (5)

తం తోరణవిటంకస్థం హనుమంతం మహాకపిమ్।
జంబుమాలీ మహాబాహుః వివ్యాధ నిశితైశ్శరైః। 6

మహాబాహువైన జంబుమాలి ముఖద్వారముయొక్క పైభాగమునఉన్న కపివరుడగు ఆ హనుమంతునిపై వాడియైన బాణములను ప్రయోగించెను. (6)

అర్ధచంద్రేణ వదనే శిరస్యేకేన కర్ణినా।
బాహ్వోర్వివ్యాధ నారాచైః దశభిస్తం కపీశ్వరమ్॥ 7

తస్య తచ్ఛుశుభే తామ్రం శరేణాభిహతం ముఖమ్।
శరదీవాంబుజం ఫుల్లం విద్ధం భాస్కరరశ్మినా॥ 8

తత్తస్య రక్తం రక్తేన రంజితం శుశుభే ముఖమ్।
యథాకాశే మహాపద్మం సిక్తం చందనబిందుభిః॥ 9

చుకోప బాణాభిహతో రాక్షసస్య మహాకపిః।
తతః పార్శ్వేఽతివిపులాం దదర్శ మహతీం శిలామ్॥ 10

తరసా తాం సముత్పాట్య చిక్షేప జవవద్ బలీ।
తాం శరైర్దశభిః క్రుద్ధః తాడయామాస రాక్షసః॥ 11

విపన్నం కర్మ తద్దృష్ట్వా హనుమాంశ్చండవిక్రమః।
సాలం విపులముత్పాట్య భ్రామయామాస వీర్యవాన్॥ 12

భ్రామయన్తం కపిం దృష్ట్వా సాలవృక్షం మహాబలమ్।
చిక్షేప సుబహూన్ బాణాన్ జంబుమాలీ మహాబలః॥ 13

సాలం చతుర్భిశ్చిచ్ఛేద వానరం పంచభిర్భుజే।
ఉరస్యేకేన బాణేన దశభిస్తు స్తనాంతరే॥ 14

స శరైః పూరితతనుః క్రోధేన మహతావృతః।
తమేవ పరిఘం గృహ్య భ్రామయామాస వేగతః॥ 15

అతివేగోఽతివేగేన భ్రామయిత్వా బలోత్కటః।
పరిఘం పాతయామాస జంబుమాలేర్మహోరసి॥ 16

తస్య చైవ శిరో నాస్తి న బాహూ న చ జానునీ।
న ధనుర్న రథో నాశ్వాః తత్రాదృశ్యంత నేషవః॥ 17

స హతస్తరసా తేన జంబుమాలీ మహాబలః।
పపాత నిహతో భూమౌ చూర్ణితాంగవిభూషణః॥ 18

జంబుమాలిం చ నిహతం కింకరాంశ్చ మహాబలాన్।
చుక్రోధ రావణః శ్రుత్వా కోపసంరక్తలోచనః॥ 19

అతడు హనుమంతుని ముఖముపై ఒక అర్ధచంద్రాకారబాణమును, శిరస్సుపై ఒక వంకరములికిగల బాణమును, బాహువులపై పది తీవ్రములైనబాణములను ప్రయోగించి, ఆయునను బాధించెను. (7)

జంబుమాలియొక్కబాణముచే కొట్టబడిన ఆ కపివరుని ఎఱ్ఱనిముఖము శరత్కాలమునందు సూర్యకిరణ స్పర్శచే బాగుగా వికసించిన కెందామరవలె శోభిల్లెను. (8)

సహజముగా ఎఱ్ఱనైనహనుమంతునిముఖము బాణాహతిచే రక్తరంజితమై ఆకాశమున చందనబిందువులచే ఆర్ద్రమైన మహాపద్మమువలె భాసిల్లెను- (9)

జంబుమాలి బాణముచేకొట్టగా ఆ కపివరుడు మిక్కిలి క్రుద్ధుడాయెను. అంతట అతడు ప్రక్కనేయున్న విపులమైన ఒక మహాశిలను చూచెను- (10)

హనుమంతుడు ఆ మహాశిలను వేగముగాపెకలించి, ఆ రాక్షసునిపై బలముకొలది గట్టిగావిసరెను. అందులకు జంబుమాలిక్రుద్ధుడై పదిబాణములతో దానిని ముక్కలుగావించెను.(11)

మహావీరుడైనహనుమంతుడు తనశిలాప్రయోగము వ్యర్థమగుటచూచి, పరాక్రమముతో విజృంభించినవాడై ఒక పెద్దమద్దిచెట్టునుపెకలించి, దానిని త్రిప్పసాగెను. (12)

ఆసాలవృక్షమునుత్రిప్పుచున్న మహాబలశాలియైన హనుమంతునిజూచి, పరాక్రమవంతుడైనజంబుమాలి ఆయనపై పెక్కుబాణములను వేసెను. (13)

రాక్షసుడు నాలుగుబాణములతో ఆసాలవృక్షమును ముక్కలు గావించెను. భుజములపై ఐదుబాణములను గుండెపై ఒకశరమును, వక్షఃస్థలమున పదిబాణములను వేసి, అతడు కపీశ్వరుని నొప్పించెను. (14)

శరీరమునిండ శరములు గ్రుచ్చుకొనియుండగా కోపముతో ఉడికిపోయిన హనుమంతుడు ఆ పరిఘనే దీసికొని వేగముగా త్రిప్పసాగెను. (15)

మహాబలశాలియు, మిక్కిలివేగముగలవాడును ఐన వాయుసుతుడు ఆపరిఘను గిరగిరత్రిప్పుచు, దానితో జంబుమాలి గుండెలపై మోదెను. (16)

ఆ పరిఘధాటికి జంబుమాలియు, అతని రథవాహనములు నుగ్గునుగ్గయ్యెను. మీదుమిక్కిలి అతనిశిరస్సు, బాహువులు, మోకాళ్ళు, ధనుర్బాణములు పొడిపొడియై అవి మచ్చునకైనను మిగులలేదు. (17)

మహాబలవంతుడైన ఆ జంబుమాలి హనుమంతుని దెబ్బకు వెంటనే నేలకొరిగెను. వాని అవయవములు, భూషణములు చూర్ణములాయెను. (18)

మహాబలశాలురైన ఎనుబదివేలమంది కింకరులును, జంబుమాలియు అసువులనుగోల్పోయిన విషయమునువిని, రావణుడు కోపోద్రేకములతో కన్నులెఱ్ఱజేసి, మండిపడెను. (19)

సరోషసంవర్తితతామ్రలోచనః
ప్రహస్తపుత్రే నిహతే మహాబలే ।
అమాత్యపుత్రానతివీర్యవిక్రమాన్
సమాదిదేశాశు నిశాచరేశ్వరః ॥ 20

ప్రహస్తపుత్రుడు, మహాబలవంతుడు ఐన జంబుమాలి రణభూమికి బలియైపోగా, రాక్షసరాజైన ఆ రావణుడు రోషముతో గ్రుడ్లుఱుముచు, మిక్కిలి బలపరాక్రమములు గల అమాత్యపుత్రులను హనుమంతునితో తలపడుటకు వెంటనే పంపెను. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే చతుశ్చత్వారింశస్సర్గః(44)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదినాల్గవసర్గము.

-- ✻ ✻ ✻ --

45. నలుబదిఐదవసర్గము

ఏడుగురు మంత్రిపుత్త్రుల వధ

తతస్తే రాక్షసేంద్రేణ చోదితా మంత్రిణస్సుతాః ।
నిర్యయుర్భవనాత్ తస్మాత్ సప్త సప్తార్చివర్చసః ॥ 1

పిమ్మట అగ్నివలె తేజరిల్లుచున్న ఏడుగురు మంత్రికుమారులును రావణునిఆదేశానుసారము ఆభవనమునుండి యుద్ధమునకు బయల్వెడలిరి. (1)

మహాబలపరీవారా ధనుష్మంతో మహాబలాః ।
కృతాస్త్రాస్త్రవిదాం శ్రేష్ఠాః పరస్పరజయైషిణః ॥ 2

వారందఱును మహాబలశాలురు, గొప్పధనుర్ధారులు, అస్త్రవిద్యలలోసుశిక్షితులు, అస్త్రవేత్తలలోశ్రేష్ఠులు, హనుమంతునిజయించుటకై ఒకరినిమించి మఱియొకరు 'నేనంటే నేను' అని ఉబలాటపడుచున్నవారు, వారివెంటనున్న సైనికులుగూడ మహాబలసంపన్నులు. (2)

హేమజాలపరిక్షిప్తైః ధ్వజవద్భిః పతాకిభిః ।
తోయదస్వననిర్ఘోషైః వాజియుక్తైర్మహారథైః ॥ 3

తప్తకాంచనచిత్రాణి చాపాన్యమితవిక్రమాః ।
విస్ఫారయంతస్సంహృష్టాః తటిద్వంత ఇవాంబుదాః ॥ 4

అశ్వములనుపూన్చిన వారి రథములు బంగారుతెరలు గలవి, ధ్వజపతాకములతో అలరారుచున్నవి; మేఘగర్జనలవలె రథధ్వనులు గావించుచున్నవి. అమిత పరాక్రమశాలురైన ఆ యోధులధనుస్సులు మేలిమి బంగారుకాంతులతో చిత్రవిచిత్రములుగానున్నవి, వారు రణోత్సాహముతో మెఱుపులను విరజిమ్ముచున్న మేఘములవలె విలసిల్లుచు, ధనుష్టంకారములను గావించుచుండిరి. (3-4)

జనన్యస్తు తతస్తేషాం విదిత్వా కింకరాన్ హతాన్ ।
బభూవుశ్శోకసంభ్రాంతాః సబాంధవసుహృజ్జనాః ॥ 5

ఎనుబదివేలమంది కింకరరాక్షసులు రణరంగమున నిహతులైనవార్తను ఎఱింగి, వారి తల్లులు, బంధువులు, మిత్రులు మొదలగువారు శోకసంభ్రాంతచిత్తులైరి. (5)

తే పరస్పరసంఘర్షాత్ తప్తకాంచనభూషణాః ।
అభిపేతుర్హనూమంతం తోరణస్థమవస్థితమ్ ॥ 6

మేలిమిబంగారు ఆభరణములనుదాల్చిన ఆమంత్రికుమారులు ఒకరితోనొకరు పోటీపడుచు వనముఖద్వారముపైచేరి, యుద్ధసన్నద్ధుడైయున్న హనుమంతునిపై దాడిచేసిరి. (6)

సృజంతో బాణవృష్టిం తే రథగర్జితనిస్స్వనాః ।
వృష్టిమంత ఇవాంభోదా విచేరుర్నైరృతాంబుదాః ॥ 7

వర్షాకాలమేఘములవంటి ఆరాక్షసులు మేఘగర్జనలను బోలిన రథధ్వనులతో బాణవృష్టిని గురిపించుచు, వర్షించుచున్నమేఘములవలె సంచరింపసాగిరి. (7)

అవకీర్ణస్తతస్తాభిః హనుమాన్ శరవృష్టిభిః ।
అభవత్ సంవృతాకారః శైలరాడివ వృష్టిభిః ॥ 8

అప్పుడు శరవర్షముచే ఆవరింపబడిన హనుమంతుడు వర్షజలములచేకప్పబడిన పర్వతరాజువలె విలసిల్లెను.[1] (8)

1. వర్షధారలప్రభావము పర్వతముపై ఏమియుఉండనట్లు రాక్షసులయొక్క బాణములు హనుమంతుని ఏమియు చేయలేకపోయెను.

స శరాన్ మోఘయామాస తేషామాశుచరః కపిః।
రథవేగం చ వీరాణాం విచరన్ విమలేఽంబరే। 9

అతిశీఘ్రముగా సాగిపోగల ఆ హనుమంతుడు నిర్మలమైన ఆకాశమున సంచరించుచు ఆ రాక్షసవీరులరథముల ఉధృతిని, బాణపరంపరను నిర్వీర్యమొనర్చెను. (9)

స తైః క్రీడన్ ధనుష్మద్భిః వ్యోమ్ని వీరః ప్రకాశతే।
ధనుష్మద్భిర్యథా మేఘైః మారుతః ప్రభురంబరే। 10

ధనుర్ధారులైన ఆ రాక్షసులతో ఆకాశమున రణక్రీడ సల్పుచున్న ఆ వానరవీరుడు, అంబరమున ఇంద్ర ధనుశ్శోభితములైన మేఘములతోవిరాజిల్లెడి వాయుదేవునివలె ప్రకాశించెను. (10)

స కృత్వా నినదం ఘోరం త్రాసయంస్తాం మహాచమూమ్।
చకార హనుమాన్ వేగం తేషు రక్షస్సు వీర్యవాన్। 11

సాటిలేనివీరుడైన హనుమంతుడు ఆ మహా సైన్యమునకు వణకుపుట్టించుచు భయంకరముగా గర్జించెను. పిమ్మట అతడు ఆ రాక్షసయోధులను హతమార్చుటకు విజృంభించెను. (11)

తలేనాభ్యహనత్ కాంశ్చిత్ పాదైః కాంశ్చిత్ పరంతపః।
ముష్టినాభ్యహనత్ కాంశ్చిత్ నఖైః కాంశ్చిద్వ్యదారయత్। 12

ప్రమమాథోరసా కాంశ్చిత్ ఊరుభ్యామపరాన్ కపిః।
కేచిత్ తస్య నినాదేన తత్రైవ పతితా భువి। 13

శత్రుసంహారకుడైన హనుమంతుడు వారిలో కొందఱిని అఱచేతితోచావగొట్టెను. కాళ్లతో తన్నుచు కొందఱిని, ముష్టిఘాతములతో మఱికొందఱిని మట్టిగఱపించెను. కొందఱిని గోళ్లతోచీల్చిచెండాడెను. తన వక్షఃస్థలముతో కొందఱిని, తొడలతాకిడితో కొంతమందిని నుగ్గునుగ్గు గావించెను. కొందఱు ఆ మారుతి గర్జనలకే నేలగూలిరి. (12-13)

తతస్తేష్వవసన్నేషు భూమౌ నిపతితేషు చ।
తత్సైన్యమగమత్ సర్వం దిశో దశ భయార్దితమ్। 14

ఇట్లు రాక్షసయోధులందఱును రణభూమికిబలికాగా హతశేషులైన సైనికులు భయకంపితులై అన్నిదిశలకును పాఱిపోయిరి. (14)

వినేదుర్విస్వరం నాగా నిపేతుర్భువి వాజినః।
భగ్ననీడధ్వజచ్ఛత్రైః భూశ్చ కీర్ణాభవద్రథైః। 15

ఏనుగులు ప్రాణములన్నుబట్టి వికృతధ్వనులు గావించెను, గుఱ్ఱములునేలకొరిగెను, రథములపైకప్పులు ధ్వజములు ఛత్రములు ముక్కలుముక్కలై, రణభూమి యందంతటను చెల్లాచెదరుగా పడిపోయెను. (15)

స్రవతా రుధిరేణాథ స్రవంత్యో దర్శితాః పథి।
వివిధైశ్చ స్వనైర్లంకా ననాద వికృతం తదా। 16

సమరభూమియందంతటను శత్రుసైన్యముల రక్తము కాల్వలుగట్టెను, లంకయంతయు వివిధములైన వికారధ్వనులతో మార్మ్రోగెను. (16)

స తాన్ ప్రవృద్ధాన్ వినిహత్య రాక్షసాన్
మహాబలశ్చండపరాక్రమః కపిః।
యుయుత్సురన్యైః పునరేవ రాక్షసైః
తదేవ వీరోఽభిజగామ తోరణమ్। 17

మహాబలసంపన్నుడు, చండపరాక్రమశాలియైన హనుమంతుడు మహాయోధులైనరాక్షసులనందఱిని పరిమార్చి, ఇంకను ఇతర రాక్షసవీరులతో యుద్ధము చేయగోరి, మఱల అదే ముఖద్వారము పైకి చేరి, (శత్రు వీరులరాకకై) ఎదురుచూడసాగెను. (17)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే పంచచత్వారింశస్సర్గః (45)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదిఐదవసర్గము.

-- * * * --

46. నలుబదిఆఱవసర్గము

రావణుని ఐదుగురు సేనాపతుల సంహారము

హతాన్ మంత్రిసుతాన్ బుద్ధ్వా వానరేణ మహాత్మనా।
రావణస్సంవృతాకారః చకార మతిముత్తమామ్। 1

మొక్కవోనిపరాక్రమముగల కపీశ్వరునిచేతిలో మంత్రిపుత్రులైన ఏడుగురుయోధులును హతులైన విషయమును ఎఱింగిన రావణుడు తన దిగులును పైకి కనబడనీయక మేకపోతు గాంభీర్యముతో బాగుగా ఆలోచించెను. (1)

స విరూపాక్షయూపాక్షౌ దుర్ధరం చైవ రాక్షసమ్।
ప్రఘసం భాసకర్ణం చ పంచసేనాగ్రనాయకాన్॥ 2

సందిదేశ దశగ్రీవో వీరాన్ నయవిశారదాన్।
హనుమద్గ్రహణే వ్యగ్రాన్ వాయువేగసమాన్ యుధి॥ 3

యాత సేనాగ్రగాస్సర్వే మహాబలపరిగ్రహాః।
సవాజిరథమాతంగాః స కపిః శాస్యతామితి॥ 4

యత్తైశ్చ ఖలు భావ్యం స్యాత్ తమాసాద్య వనాలయమ్।
కర్మ చాపి సమాధేయం దేశకాలావిరోధినమ్॥ 5

న హ్యహం తం కపిం మన్యే కర్మణా ప్రతితర్కయన్।
సర్వథా తన్మహద్భూతం మహాబలపరిగ్రహమ్॥ 6

వానరోఽయమితి జ్ఞాత్వా న హి శుధ్యతి మే మనః।
నైవాహం తం కపిం మన్యే యథేయం ప్రస్తుతా కథా॥ 7

భవేదింద్రేణ వా సృష్టమ్ అస్మదర్థం తపోబలాత్।
స నాగయక్షగంధర్వా దేవాసురమహర్షయః॥ 8

యుష్మాభిస్సహితైస్సర్వైః మయా సహ వినిర్జితాః।
తైరవశ్యం విధాతవ్యం వ్యలీకం కించిదేవ నః॥ 9

యాత సేనాగ్రగాస్సర్వే మహాబలపరిగ్రహాః।
సవాజిరథమాతంగాః స కపిశ్శాస్యతామితి॥ 10

తదేవ నాత్ర సందేహః ప్రసహ్య పరిగృహ్యతామ్।
నావమాన్యో భవద్భిశ్చ హరిర్ధీరపరాక్రమః॥ 11

దృష్టా హి హరయః పూర్వం మయా విపులవిక్రమాః।
వాలీ చ సహసుగ్రీవో జాంబవాంశ్చ మహాబలః॥ 12

నీలస్సేనాపతిశ్చైవ యే చాన్యే ద్వివిదాదయః।
నైవం తేషాం గతి ర్భీమా న తేజో న పరాక్రమః॥ 13

న మతి ర్న బలోత్సాహౌ న రూపపరికల్పనమ్।
మహత్ సత్త్వమిదం జ్ఞేయం కపిరూపం వ్యవస్థితమ్॥ 14

ప్రయత్నం మహదాస్థాయ క్రియతామస్య నిగ్రహః।
కామం లోకాస్త్రయస్సేంద్రాః ససురాసురమానవాః॥ 15

పిమ్మట విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘసుడు, భాసకర్ణుడు అను ప్రముఖసేనానాయకులను ఆ దశకంఠుడు హనుమంతునితో యుద్ధమొనర్చుటకు ఆజ్ఞాపించెను. వారు మహావీరులు, రణనీతికోవిదులు, హనుమంతుని బంధించుటకై ఆరాటపడుచున్నవారు మఱియు వాయువేగముతో పోరుసల్పగలవారు. (2-3)

"ఓ సేనానాయకులారా! మీరందఱును రథగజతురగపదాతి దళములతోగూడిన మహా సైన్యమును వెంటనిడుకొని వెళ్లుడు. ఆ వానరుని పట్టుకొనుడు." అని రావణుడు వారిని ఆజ్ఞాపించెను. "ఆ వానరుని చేరువలో మిక్కిలిజాగరూకులై యుండుడు. దేశకాలములకు అనుకూలముగా ప్రవర్తింపుడు." (4-5)

'యుద్ధసామర్థ్యమునుబట్టి చూడగా అతడొక సామాన్య వానరుడు' అని నేననుకొనను. అతడు మిక్కిలి బలపరాక్రమములు గల ఒక మహాప్రాణియని తలంతును. (6)

అతనిని వానరమాత్రునిగా భావించుటకు నా మనస్సు సమ్మతించుటలేదు. ఇప్పటివఱకును జరిగిన సంఘటనలను బట్టి ఆయనను సామాన్యవానరునిగా నేను తలపోయను. (7)

మనలనురూపుమాపుటకై ఆ ఇంద్రుడే తన తపోబలముచే ఈమహాప్రాణిని సృష్టించి యుండవచ్చును. ఆ ఇంద్రుని, నాగ, యక్ష, గంధర్వులను, దేవతలను, అసురులను, మహర్షులను, మీ సహకారముతో నేను పెక్కుపర్యాయములు జయించియుంటిని. కనుక వారివలన మనకు ఎప్పుడైనను ఏదైననొక అపకారము జరుగుటతథ్యము- (8-9)

ఓ సేనాపతులారా! మీరందఱును చతురంగ బలములతో వెళ్లి, ఆ వానరుని బంధింపుడు.[1] (10)

ఇతడు ఆ ఇంద్రుడుపంపిన మహాభూతమే. ఇందు సందేహమునకు తావులేదు. బలప్రయోగముతోనైనను ఇతనిని బంధింపుడు. ఈ వానరుడు ధీరుడు, పరాక్రమవంతుడు. ఇతనిని ఏమాత్రము తక్కువగా పరిగణింపరాదు. (11)

నేను ఇదివరలో బలపరాక్రమసంపన్నులైన పెక్కుమంది వానరులను చూచియుంటిని. వాలి, సుగ్రీవుడు, మహాబలశాలియైన జాంబవంతుడు, సేనాపతియైన నీలుడు, ద్వివిదుడు మొదలగువారిని చూచితిని. వారిలో ఇట్టి భయంకరమైన గమనము, తేజస్సు, పరాక్రమము, బుద్ధిబలము, ఉత్సాహశక్తి, కామరూపధారణశక్తి నాకు కనబడలేదు. ఇతనిని వానర రూపముననున్న ఒకమహాప్రాణియని ఎఱుంగవలెను. (12-14)

గట్టిపూనికవహించి, ఇతనినిపట్టుకొనవలెను. ఇంద్రుడు, సురాసురులు, మానవులు-ఇంకను ముల్లోకములయందలి

1) (4వ శ్లోకము 10వ శ్లోకము ఒక్కటియే. కాని దీనిని పునరుక్తిగా భావింపరాదు. రావణుడు తన సైన్యములోని మహావీరులను హతమార్చిన హనుమంతునిపై మిక్కిలి క్రుద్ధుడై యుండెను. అతనిలోని ఆ క్రోధావేశము కొన్నికొన్ని మాటలను మఱిమఱల ఆ రావణునిచే పలికించినట్లు భావించుట సముచితము -

భవతామగ్రతః స్థాతుం న పర్యాప్తా రణాజిరే।
తథాపి తు నయజ్ఞేన జయ మాకాంక్షతా రణే।
ఆత్మా రక్ష్యః ప్రయత్నేన యుద్ధసిద్ధిర్హి చంచలా। 16

తే స్వామివచనం సర్వే ప్రతిగృహ్య మహౌజసః।
సముత్పేతు ర్మహావేగా హుతాశసమతేజసః। 17

రథైర్మత్తైశ్చ మాతంగైః వాజిభిశ్చ మహాజవైః।
శస్త్రైశ్చ వివిధైస్తీక్ష్ణైః సర్వైశ్చోపచితా బలైః। 18

తతస్తు దదృశుర్వీరా దీప్యమానం మహాకపిమ్।
రశ్మిమంతమివోద్యంతం స్వతేజోరశ్మిమాలినమ్। 19

తోరణస్థం మహోత్సాహం మహాసత్త్వం మహాబలమ్।
మహామతిం మహావేగం మహాకాయం మహాభుజమ్। 20

తం సమీక్ష్యైవ తే సర్వే దిక్షు సర్వాస్వవస్థితాః।
తైస్తైః ప్రహరణైర్భీమైః అభిపేతు స్తత స్తతః। 21

తస్య పంచాయసాస్తీక్ష్ణాః శితాః పీతముఖాః శరాః।
శిరస్యుత్పలపత్రాభా దుర్ధరేణ నిపాతితాః। 22

స తైః పంచభిరావిద్ధః శరైః శిరసి వానరః।
ఉత్పపాత నదన్ వ్యోమ్ని దిశో దశ వినాదయన్। 23

తతస్తు దుర్ధరో వీరః సరథస్సజ్యకార్ముకః।
కిరన్ శరశతైస్తీక్ష్ణైః అభిపేదే మహాబలః। 24

స కపిర్వారయామాస తం వ్యోమ్ని శరవర్షిణమ్।
వృష్టిమంతం పయోదాంతే పయోదమివ మారుతః। 25

అర్ద్యమానస్తతస్తేన దుర్ధరేణానిలాత్మజః।
చకార కదనం భూయో వ్యవర్ధత చ వేగవాన్। 26

స దూరం సహసోత్పత్య దుర్ధరస్య రథే హరిః।
నిపపాత మహావేగో విద్యుద్రాశిర్గిరావివ। 27

తత స్స మథితాష్టాశ్వం రథం భగ్నాక్షకూబరమ్।
విహాయ న్యపతద్భూమౌ దుర్ధరస్త్యక్తజీవితః। 28

వీరులెల్లరును సంగ్రామరంగమున మీ యెదుట ఏ మాత్రము నిలువజాలరు. ఐనప్పటికిని యుద్ధమున జయమును కాంక్షించు రణనీతిజ్ఞుడు తానెంతటివాడైనను ఆత్మరక్షణవిషయమున జాగరూకుడై యుండవలెను. విజయము ఎల్లప్పుడును ఒక్కరినే వరించుచుండునని చెప్పజాలముగదా! (15-16)

మిక్కిలి బలపరాక్రమములుగల ఆ రాక్షసవీరులందఱును తమప్రభువుయొక్క ఆజ్ఞను తలదాల్చి, అగ్నితుల్య తేజస్సులతో వెలుగొందుచు మహావేగముతో ముందునకు సాగిరి. (17)

వారు రథములు, మదగజములు, వేగముగాపోగిపోగల అశ్వములు, తీక్ష్ణములైన వివిధములగు అస్త్రములు మొదలగు బలములసమృద్ధితో ఒప్పుచుండిరి. (18)

అంతట ఆ వీరులు ఉదయభానునివలె తన దివ్యతేజః కిరణములచే వెలుగొందుచు వనముఖద్వారముపైనున్న హనుమంతునిగాంచిరి. గొప్పఉత్సాహశక్తిగలవాడు, మహాసత్త్వసంపన్నుడు, అద్భుతబలశాలి, చక్కని ప్రతిభావంతుడు, సాటిలేని వేగముగలవాడు, ఉన్నత విగ్రహము గలవాడు, దీర్ఘబాహువు ఐన ఆ వానరోత్తముని దర్శించినపిమ్మట రాక్షస వీరులందఱును అన్ని దిక్కుల యందు చుట్టుముట్టి నిలిచిరి. పిదపవారు ఆయా దిక్కులనుండి భయంకరములైన వివిధాయుధములతో హనుమంతునిపై విజృంభించిరి. (19-21)

పీతవర్ణములో తీక్ష్ణముగానున్న వాడియైన ఐదు ఇనుప బాణములను దుర్ధరుడనువాడు మారుతిశిరస్సుపై ప్రయోగించెను. ఆశరములు మారుతికి కలువరేకులవలెనుఖస్పర్శనేయిచ్చెను. (అవి ఆయనను ఏ మాత్రము బాధింపలేదు) (22)

ఆ ఐదుబాణములునువచ్చి తన శిరస్సునకుతాకగా, వెంటనే హనుమంతుడు దశదిశలు ప్రతిధ్వనించునట్లుగా గర్జించుచు ఆకసమునకుఎగిరెను. (23)

తదుపరి మహాబలశాలియు, వీరుడును. అగు దుర్ధరుడు తనరథముతోగూడ గగనమునకెగిరి, వింటినెక్కుపెట్టి, వాయుసుతునిపై వందలకొలది శరములను ప్రయోగించెను. (24)

శరదృతుప్రారంభకాలమున వర్షించుమేఘమును వాయువువలె, ఆకపివరుడు తనపై దుర్ధరుడు వర్షించుచున్న శరములను ఆకసమునందే చెల్లాచెదరు గావించెను. (25)

ఆ దుర్ధరుడు బాణపరంపరచే తనను పీడించుచుండగా మారుతి అతనితోపోరాటము సలుపుచునే వేగముగా తన శరీరమునుపెంచెను. (26)

పిమ్మట వానరోత్తముడు క్షణములో మిక్కిలి ఎత్తునకు ఎగిరి, పర్వతముపై పిడుగుపడినట్లు దుర్ధరుని రథముపై దూకెను. (27)

హనుమంతునిధాటికి ఆ దుర్ధరునిరథముయొక్క ఇరుసు, నొగలు భగ్నములైనవి, దానికి (రథమునకు) పూన్చిన ఎనిమిదిగుఱ్ఱములు నుగ్గునుగ్గైనవి. దుర్ధరుడు నేలపైబడి అసువులను కోల్పోయెను. (28)

తం విరూపాక్షయూపాక్షౌ దృష్ట్వా నిపతితం భువి।
సంజాతరోషౌ దుర్ధర్షౌ ఉత్పేతతురరిందమౌ। 29

స తాభ్యాం సహసోత్పత్య విష్ఠితో విమలేఽంబరే।
ముద్గరాభ్యాం మహాబాహుః వక్షస్యభిహతః కపిః। 30

తయోర్వేగవతోర్వేగం వినిహత్య మహాబలః।
నిపపాత పునర్భూమౌ సుపర్ణసమవిక్రమః। 31

స సాలవృక్షమాసాద్య తముత్పాట్య చ వానరః।
తావుభౌ రాక్షసౌ వీరౌ జఘాన పవనాత్మజః। 32

తతస్తాంస్త్రీన్ హతాన్ జ్ఞాత్వా వానరేణ తరస్వినా।
అభిపేదే మహావేగః ప్రసహ్య ప్రఘసో హరిమ్। 33

భాసకర్ణశ్చ సంక్రుద్ధః శూలమాదాయ వీర్యవాన్।
ఏకతః కపిశార్దూలం యశస్వినమవస్థితమ్। 34

పట్టిశేన శితాగ్రేణ ప్రఘసః ప్రత్యయోధయత్।
భాసకర్ణశ్చ శూలేన రాక్షసః కపిసత్తమమ్। 35

స తాభ్యాం విక్షతైర్గాత్రైః అసృగ్దిగ్ధతనూరుహః।
అభవద్వానరః క్రుద్ధో బాలసూర్యసమప్రభః। 36

సముత్పాట్య గిరేః శృంగం సమృగవ్యాలపాదపమ్।
జఘాన హనుమాన్ వీరో రాక్షసౌ కపికుంజరః।
గిరిశృంగసునిష్పిష్టౌ తిలశస్తౌ బభూవతుః। 37

తతస్తేష్వవసన్నేషు సేనాపతిషు పంచసు।
బలం తదవశేషం చ నాశయామాస వానరః। 38

అశ్వైరశ్వాన్ గజైర్నాగాన్ యోధైర్యోధాన్ రథై రథాన్।
స కపిర్నాశయామాస సహస్రాక్ష ఇవాసురాన్। 39

హతైర్నాగైశ్చ తురగైః భగ్నాక్షైశ్చ మహారథైః।
హతైశ్చ రాక్షసైర్భూమీ రుద్ధమార్గా సమంతతః। 40

శత్రువులను రూపుమాపగలవారును, ఎదిరింపరాని వారును, ఐన విరూపాక్షయూపాక్షులు ఆ విధముగా దుర్ధరుడు నేలపాలగుటఁజూచి, రోషావేశపూరితులై అంతరిక్షమునకెగిరిరి. (29)

అతివేగముగా ఆకాశమునకెగిరిన ఆ రాక్షసయోధులు ఇరువురును నిర్మలాకాశమున నిలిచియున్న మహాబాహువగు ఆ కపివరునియొక్క గుండెలపై తమ ముద్గరములతో మోదిరి. (30)

గొప్పబలశాలియు, వాయుసుతుడును ఐన హనుమంతుడు మిక్కిలి శక్తిశాలురైన ఆ యోధుల విజృంభణమును అరికట్టెను. పిమ్మట గరుత్మంతుడు క్షణములో ఒకసర్పమును తన్నుకొనిపోయినట్లు ఆ వానరోత్తముడు ఒక సాలవృక్షమును అతివేగముగా పెకలించుకొనిపోయి, దానితో ఆ ఇరువురు రాక్షసవీరులను హతమార్చెను. (31-32)

మిక్కిలిబలసంపన్నుడైన హనుమంతునిచేతిలో ఆ ముగ్గురు యోధులు, నిహతులైనట్లుఎఱింగి, మిక్కిలి శక్తిమంతుడైన ప్రఘసుడు గట్టిగావిజృంభించి, హనుమంతునిపై దాడికిదిగెను.(33)

ఆదేసమయమున పరాక్రమవంతుడైన భాసకర్ణుడును ఎంతయు క్రుద్ధుడై, వాసికెక్కిన మహావీరుడగుమారుతి మీదికి మఱియొకప్రక్కనుండి విజృంభించెను. (34)

ప్రఘసుడు మిక్కిలిపదనుగానున్న పట్టిసమును (అడ్డకత్తి)ని, భాసకర్ణుడు మొనదేలియున్న శూలమును హనుమంతునిపై విసరివేసిరి. (35)

ఆ ఇరువురురాక్షసయోధుల యొక్క యుధముల దెబ్బలకు గాయపడిన హనుమంతుని శరీరమంతయును రక్తసిక్తమయ్యెను, అంతట బాలసూర్యసమప్రభలతో భాసిల్లు ఆ వానరోత్తముడు మిక్కిలి క్రుద్ధుడాయెను. (36)

కపిశ్రేష్ఠుడు, వీరుడుఐన హనుమంతుడు మృగములతోను, సర్పములతోను, వృక్షములతోను కూడిన గిరిశిఖరమును పెకలించి, ప్రఘస భాసకర్ణులు అను ఆ ఇరువురు రాక్షసయోధులను చంపెను- గిరిశిఖరము క్రిందబడి నలిగిపోయిన వారిశరీరములు నువ్వుగింజలంతగా ముక్కలుముక్కలైపోయెను- (37)

హనుమంతుడు ఆ ఐదుగురు సేనాపతులను హతమార్చిన పిమ్మట మిగిలినసైన్యమును పూర్తిగా రూపుమాపెను. (38)

ఆ కపివరుడు అశ్వములతో అశ్వములను, ఏనుగులతో ఏనుగులను, రథములతో రథములను యోధులతో యోధులను 'ఢీ'కొట్టించి, దేవేంద్రుడు అసురులను వలె సంహరించెను. (39)

చచ్చిపడియున్న ఏనుగుల, గుఱ్ఱముల కళేబరములతోడను, ముక్కలు ముక్కలై చెల్లాచెదరుగా పడియున్న మహారథముల ఇరుసులతోడను, హతులైన రాక్షసుల శవములతోడను ఆ రణభూమియంతయు నిండిపోయి, దారులన్నియు మూతపడెను. (40)

తత: కపీస్తాన్ ధ్వజినీపతీన్ రణే
నిహత్య వీరాన్ సబలాన్సవాహనాన్ ।
తదేవ వీర: పరిగృహ్య తోరణం
కృతక్షణ: కాల ఇవ ప్రజాక్షయే ॥ 41

మహావీరుడైన ఆ హనుమంతుడు గొప్ప బలశాలురైన సేనాపతులను, వారివారి రథాశ్వగజవాహనములను, పదాతిదళములను సంగ్రామరంగమున పరిమార్చిన పిమ్మట వనముఖద్వారముమీదికిజేరి, ప్రళయకాలమున కబళించుటకు మృత్యుదేవతవలె అతడు శత్రుబలములకొఱకు ఎదురుచూచుచు ఉండెను. (41)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే షట్చత్వారింశస్సర్గ: (46)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదిఆఱవసర్గము.

— * * * —

47. నలుబదిఏడవసర్గము

అక్షకుమారుడు పరాక్రమించుట - మారుతి వానిని వధించుట

సేనాపతీన్ పంచ స తు ప్రమాపితాన్
హనూమతా సానుచరాన్ సవాహనాన్ ।
సమీక్ష్య రాజా సమరోద్ధతోన్ముఖం
కుమారమక్షం ప్రసమైక్షతాగ్రత: ॥ 1

దుర్ధరుడు మొదలగు ఐదుగురు సేనాపతులును, వారి అనుచరులును, వాహనములును హనుమంతునిచేతిలో మడిసినట్లు రావణుడు తెలిసికొనెను. అప్పుడు రణకండూతితో గర్వమున విఱ్ఱవీగుచు, సమరోత్సాహముతో ఎదురుగానున్న అక్షకుమారుని అతడు వీక్షించెను. (1)

స తస్య దృష్ట్యర్పణసంప్రచోదిత:
ప్రతాపవాన్ కాంచనచిత్రకార్ముక: ।
సముత్పపాతాథ సదస్యుదీరితో
ద్విజాతిముఖ్యైర్హవిషేవ పావక: ॥ 2

రావణునిదృష్టి తనపైబడగానే ఉత్సాహము ఇనుమడింపగా ప్రతాపశాలియు, చిత్రమైన బంగారు ధనుస్సును చేతధరించినవాడును ఐన అక్షకుమారుడు, సభలోనివారిచే ప్రోత్సహింపబడినవాడై, బ్రాహ్మణోత్తములచే అర్పింబడిన హవిస్సులతో ప్రజ్వలించుచున్న అగ్నివలె తటాలున లేచినిలబడెను. (2)

తతో మహాన్ బాలదివాకరప్రభం
ప్రతప్తజాంబూనదజాలసంతతమ్ ।
రథం సమాస్థాయ యయౌ స వీర్యవాన్
మహాహరిం తం ప్రతి నైరృతర్షభ: ॥ 3

అనంతరము మహావీరుడును, రాక్షసశ్రేష్ఠుడునుఐన ఆ అక్షకుమారుడు, ఉదయభానుని కాంతులతో వెలుగొందుచున్నదియు, మేలిమిబంగారుఅల్లికలతో విలసిల్లుచున్నదియు అగురథమును అధిరోహించి, వానరోత్తముడైన ఆ హనుమంతునితో యుద్ధమొనర్చుటకై బయలుదేరెను. (3)

తత స్తపస్సంగ్రహసంచయార్జితం
ప్రతప్తజాంబూనదజాలశోభితమ్ ।
పతాకినం రత్నవిభూషితధ్వజం
మనోజవాష్టాశ్వవరైస్సుయోజితమ్ ॥ 4

అక్షకుమారునికి ఆ రథము గొప్పతప:ఫలితముగా లభించినది, పుటముపెట్టిన బంగరుతెఱలతో శోభిల్లుచున్నది, రత్నములుపొదిగిన ధ్వజముతో, మనోహరమైన పతాకముతో దర్శనీయమైయున్నది, మనోవేగముతో పరుగెత్తగల ఎనిమిది ఉత్తమాశ్వములతో పూన్పబడియున్నది. (4)

సురాసురాధృష్య మసంగచారిణం
రవిప్రభం వ్యోమచరం సమాహితమ్ ।
సతూణమష్టాసినిబద్ధబంధురం
యథాక్రమావేశిత శక్తితోమరమ్ ॥ 5

ఇంకను ఆ రథము సురాసురులకును ఎదిరింపశక్యముగానిది, నిరాటంకముగా సాగిపోవునది, సూర్యకాంతులతో ఒప్పుచున్నది, అంతరిక్షమునసైతము సంచరింపగలది, సముచిత స్థానములయందు అమ్ములపొదులతో, ఎనిమిదికత్తులతో, శక్తితోమరములతో అలరారుచు, సర్వసన్నద్ధమైయున్నది. (5)

విరాజమానం ప్రతిపూర్ణవస్తునా
సహేమదామ్నా శశిసూర్యవర్చసా ।
దివాకరాభం రథమాస్థితస్తతః
స నిర్జగామామరతుల్యవిక్రమః । 6

స పూరయన్ ఖం చ మహీం చ సాచలాం
తురంగమాతంగమహారథస్వనైః ।
బలైస్సమేతైః సహి తోరణస్థితం
సమర్థమాసీనముపాగమత్ కపిమ్ । 7

స తం సమాసాద్య హరిం హరీక్షణో
యుగాంతకాలాగ్నిమివ ప్రజాక్షయే ।
అవస్థితం విస్మితజాతసంభ్రమః
సమైక్షతాక్షో బహుమానచక్షుషా । 8

స తస్య వేగం చ కపేర్మహాత్మనః
పరాక్రమం చారిషు పార్థివాత్మజః ।
విధారయన్ స్వం చ బలం మహాబలో
హిమక్షయే సూర్య ఇవాభివర్ధతే । 9

స జాతమన్యుః ప్రసమీక్ష్య విక్రమం
స్థిరం స్థితస్సంయతి దుర్నివారణమ్ ।
సమాహితాత్మా హనుమంతమాహవే
ప్రచోదయామాస శరై స్త్రిభి శ్శితైః । 10

తతః కపిం తం ప్రసమీక్ష్య గర్వితం
జితశ్రమం శత్రు పరాజయోర్జితమ్ ।
అవైక్షతాక్షస్సముదీర్ణమానసః
సబాణపాణిః ప్రగృహీతకార్ముకః । 11

స హేమనిష్కాంగదచారుకుండలః
సమాససాదాశుపరాక్రమః కపిమ్ ।
తయోర్బభూవాప్రతిమస్సమాగమః
సురాసురాణామపి సంభ్రమప్రదః । 12

రరాస భూమిర్న తతాప భానుమాన్
వవౌ న వాయుః ప్రచచాల చాచలః ।
కపేః కుమారస్య చ వీక్ష్య సంయుగం
ననాద చ ద్యౌ రుదధిశ్చ చుక్షుభే । 13

సమస్తయుద్ధోపకరణములతో, బంగారుమాలలతో సూర్యచంద్రకాంతులతో అరి విరాజిల్లుచున్నది. సూర్యరథ వేగముతో సాగివోగల ఆ రథమునందు అధిరోహించియున్న ఆ అక్షకుమారుడు దేవతలతో సమానమైన పరాక్రమము గలవాడై పురోగమించెను. (6)

హయ, గజ, మహారథముల సవ్వడులతో భూమ్యాకాశములను, పర్వతములను ప్రతిధ్వనింప జేయుచు, సకలబలములతో గూడిన ఆ అక్షకుమారుడు వనముఖద్వారముపై ఆసీనుడై యున్న యుద్ధవిద్యావిశారదుడగు హనుమంతుని సమీపించెను. (7)

సింహమువలె క్రూరమైనచూపులుగల ఆ అక్షకుమారుడు, ప్రజాక్షయకారకుడైన ప్రళయకాలాగ్నివలె ఒప్పుచున్న ఆ వానరోత్తముని సమీపించి, సంభ్రమాశ్చర్యములకు లోనైనవాడై, ఆయనను గర్వదృష్టితో జూచెను. (8)

మిక్కిలి బలముగలవాడైన ఆ రావణకుమారుడు, మహాశక్తిసంపన్నుడైన ఆవానరునియొక్క వేగమును శత్రువులవిషయమున బలపరాక్రమములను, తన బలమును తారతమ్యములతో నిర్ధారించుకొనెను. అంతట చలికాలము ముగిసినపిమ్మట సూర్యతాపమువలె అక్షకుమారునిలో రణోత్సాహము పెల్లుబికెను. (9)

ఆ అక్షకుమారుడు, యుద్ధమునఎదురులేని స్థిరమైన పరాక్రమముగల హనుమంతునిజూచి క్రుద్ధుడయ్యెను. క్రమముగ యుద్ధమున స్థిరముగానిలిచినవాడై ఏకాగ్ర చిత్తముతో అతడు వాడియైన మూడుబాణములను ప్రయోగించి, ఆ కపివరుని యుద్ధమునకు కవ్వించెను. (10)

శత్రువు ప్రయోగించినబాణములు హనుమంతునకు ఎట్టిశ్రమయు కలిగింపలేదు. 'శత్రువులను అవలీలగా ఓడింపగలను'- అనుధీమాతో ఆవానరుడు విజృంభించి యున్నాడని అక్షకుమారుడు బాగుగా తెలిసికొనెను. పిమ్మట అతడు బాణములను, ధనుస్సును చేతబట్టి తొణకని మనస్సుతోయుద్ధసన్నద్ధుడై ఎదురుచూడసాగెను. (11)

అతడు బంగారుపతకములతో, భుజకీర్తులతో, మనోహరమైన కుండలములతో శోభిల్లుచు తీవ్రమైన పరాక్రమముతో హనుమంతుని జేరెను. యుద్ధసందర్భముగా ఆయుభయులసమాగమము జరిగిన తీరు సాటిలేనిదిగా నుండెను. అది సురాసురులకును సంభ్రమాశ్చర్యములను గొల్పునదిగా నుండెను. (12)

హనుమంతుడు, అక్షకుమారుడు జరుపుచున్న ఘోరయుద్ధమునుజూచి, భూమిదద్దరిల్లెను. సూర్యుడు తాపమును ప్రసరింపజేయుట మానెను, వాయువువీచుట నిలిచెను. పర్వతము మిక్కిలిచలించెను. ఆకాశము ధ్వనించెను, సముద్రము క్షోభకులోనయ్యెను. (13)

తతస్స వీరస్సుముఖాన్ పతత్రిణః
సువర్ణపుంఖాన్ సవిషానివోరగాన్ ।
సమాధిసంయోగవిమోక్షతత్త్వవిత్
శరానథ త్రీన్ కపిమూర్ధ్న్యపాతయత్ ॥ 14

బాణములనువెక్కుపెట్టుటలోను, వాటినిగురితప్పకుండ ప్రయోగించుటలోను సమర్థుడైన ఆ అక్షకుమారుడు మొనదేలియున్నవియు, ఱెక్కలు గలవియు, బంగారుపిడులు గలవియు, విష సర్పములవలె ఒప్పుచున్నవియు, ఐన మూడు బాణములతో హనుమంతునిశిరస్సుపై కొట్టెను. (14)

స తైశ్శరైర్మూర్ధ్ని సమం నిపాతితైః
క్షరన్నసృగ్దిగ్ధవివృత్తలోచనః ।
నవోదితాదిత్యనిభశ్శరాంశుమాన్
వ్యరాజతాదిత్య ఇవాంశుమాలికః ॥ 15

ఒకేసారి మూడుబాణములువచ్చి శిరస్సుపై దెబ్బతీయుగా హనుమంతునితలనుండి రక్తధారలు స్రవించెను. అతడు రక్తములోతడిసిన గుండ్రని కనులుగలవాడై ఉదయించుచున్న సూర్యునివలె విరాజిల్లుచుండెను. ఆ మారుతి శరములనెడి కిరణములతోగూడి, ఆదిత్యునివలె విలసిల్లుచుండెను. (15)

తతః ప్లవంగాధిపమంత్రిసత్తమః
సమీక్ష్య తం రాజవరాత్మజం రణే ।
ఉదగ్రచిత్రాయుధ చిత్రకార్ముకం
జహర్ష చాపూర్యత చాహవోన్ముఖః ॥ 16

ఆ అక్షకుమారుడు చిత్రవిచిత్రములైన ఆయుధములతో, ధనుర్బాణములతో యుద్ధసన్నద్ధుడై కదనరంగమున నిలిచియుండెను. అతనినిజూచి, వానరరాజైన సుగ్రీవునకు మంత్రియగు హనుమంతుడు హర్షముతో పొంగిపోయెను. వెంటనే అతడు రణోత్సాహముతో తనశరీరమునుపెంచెను. (16)

స మందరాగ్రస్థ ఇవాంశుమాలికో
వివృద్ధకోపో బలవీర్యసంయుతః ।
కుమారమక్షం సబలం సవాహనం
దదాహ నేత్రాగ్నిమరీచిభి స్తదా ॥ 17

హనుమంతుడు మిక్కిలికోపోద్రిక్తుడై, బల పరాక్రమములను ప్రకటించుచు మందరగిరిపై కిరణపుంజములతో వెలుగొందుచున్న సూర్యునివలె ఒప్పుచుండెను. అప్పుడు అతడు తన నేత్రాగ్ని జ్వాలలచే, అక్షకుమారుని, అతనిబలములను, వాహనములను దహించివేసెను. (17)

తతస్స బాణాసనచిత్రకార్ముకః
శరప్రవర్షో యుధి రాక్షసాంబుదః ।
శరాన్ ముమోచాశు హరీశ్వరాచలే
బలాహకో వృష్టిమివాచలోత్తమే ॥ 18

పిమ్మట విల్లుఅనెడి ఇంద్రధనుస్సుగలిగి, బాణములనెడి వర్షముగలిగిన అక్షకుమారుడనెడి మేఘము యుద్ధరంగమున హనుమంతుడనెడి పర్వతముపై, మేఘము ఒక మహాగిరిపై వర్షధారలను కురిసినట్లు, శీఘ్రముగా బాణములను కురిపించెను. (18)

తతః కపిస్తం రణచండవిక్రమం
వివృద్ధతేజోబలవీర్యసంయుతమ్ ।
కుమారమక్షం ప్రసమీక్ష్య సంయుగే
ననాద హర్షాద్ఘనతుల్య విక్రమః ॥ 19

అప్పుడు మేఘముతో సమానమైన పరాక్రమముగల హనుమంతుడు రణమొనర్చుటయందు తీవ్ర పరాక్రమమును జూపువాడును, మిక్కిలి తేజోబలవీర్య సంపన్నుడునుఅగు అక్షకుమారుని సమరరంగమున జూచి, హర్షాతిరేకముతో మహాధ్వని గావించెను. (19)

స బాలభావాద్యుధి వీర్యదర్పితః
ప్రవృద్ధమన్యుః క్షతజోపమేక్షణః ।
సమాససాదాఽప్రతిమం కపిం రణే
గజో మహాకూపమివావృతం తృణైః ॥ 20

ఆ అక్షకుమారుడు మూర్ఖత్వముతో యుద్ధమున తానొకమహావీరుడనను గర్వముగలవాడై, పిచ్చి కోపముతో కన్నులెఱ్ఱజేయుచు, గడ్డిచేకప్పబడిన మహా కూపమునుజేరు ఒక యేనుగువలె, రణమున సాటిలేని వీరుడైనవానరోత్తముని జేరెను. (వేలకొలదిరాక్షసులను ఒంటరిగా హతమార్చిన హనుమంతునిపరాక్రమమును గుర్తెఱుంగక ఆయునను ఎదుర్కొనజూచుటయే మూర్ఖత్వము.) (20)

స తేన బాణైః ప్రసభం నిపాతితైః
చకార నాదం ఘననాదనిస్స్వనః ।
సముత్పపాతాశు నభస్స మారుతిః
భుజోరువిక్షేపణ ఘోరదర్శనః ॥ 21

ఆ అక్షకుమారుని బాణములు వేగముగావచ్చి తన మీదపడుటచే మారుతి విజృంభించి, మేఘమువలె గర్జించెను. పిమ్మట భుజములను, తొడలను చాచుచు అతడు భయంకరాకారముతో ఆకసమున మిక్కిలి ఎత్తునకెగిరెను. (21)

సముత్పతంతం సమభిద్రవద్బలీ
స రాక్షసానాం ప్రవరః ప్రతాపవాన్ ।
రథీ రథిశ్రేష్ఠతమః కిరన్ శరైః
పయోధరః శైలమివాశ్మవృష్టిభిః ॥ 22

స తాన్ శరాంస్తస్య హరిర్విమోక్షయన్
చచార వీరః పథి వాయుసేవితే ।
శరాంతరే మారుతవద్వినిష్పతన్
మనోజవ స్సంయతి చండవిక్రమః ॥ 23

త మాత్తబాణాసనమాహవోన్ముఖం
ఖమాస్తృణంతం విశిఖైశ్శరోత్తమైః ।
అవైక్షతాక్షం బహుమానచక్షుషా
జగామ చింతాం చ స మారుతాత్మజః ॥ 24

తతశ్శరైర్భిన్నభుజాంతరః కపిః
కుమారవీరేణ మహాత్మనా నదన్ ।
మహాభుజః కర్మవిశేషతత్త్వవిత్
విచింతయామాస రణే పరాక్రమమ్ ॥ 25

అబాలవద్బాలదివాకరప్రభః
కరోత్యయం కర్మ మహాన్ మహాబలః ।
న చాస్య సర్వాహవకర్మశోభినః
ప్రమాపణే మే మతిరత్ర జాయతే ॥ 26

అయం మహాత్మాచ మహాంశ్చ వీర్యతః
సమాహితశ్చాతిసహశ్చ సంయుగే ।
అసంశయం కర్మగుణోదయాదయం
సనాగయక్షై ర్మునిభిశ్చ పూజితః ॥ 27

పరాక్రమోత్సాహ వివృద్ధమానసః
సమీక్షతే మాం ప్రముఖాగ్రతః స్థితః ।
పరాక్రమో హ్యస్య మనాంసి కంపయేత్
సురాసురాణామపి శీఘ్రగామినః ॥ 28

న ఖల్వయం నాభిభవేదుపేక్షితః
పరాక్రమో హ్యస్య రణే వివర్ధతే ।
ప్రమాపణం త్వేవ మమాద్య రోచతే
న వర్ధమానోఽగ్నిరుపేక్షితుం క్షమః ॥ 29

మిక్కిలి బలముగలవాడును, రాక్షసులలో శ్రేష్ఠుడును, ప్రతాపశాలియు, రథమును అధిష్ఠించియున్నవాడును, రథికులలో దిట్టయైనవాడును అగు ఆ అక్షకుమారుడు మేఘము పర్వతముపై వడగండ్లను వర్షించినట్లు[1] ఆకాశమునకెగురుచున్న హనుమంతునిపై బాణములను చిమ్ముచు అతనిని వెంటాడెను. (22)

మహావేగముతో సంచరింపగలవాడును, యుద్ధమున తీవ్రముగా పరాక్రమించువాడును, మహావీరుడునుఅగు ఆమారుతి బాణముల మధ్య వాయువువలె అతిలాఘవముతో మిక్కిలివేగముగా తిరుగుచు, అతని బాణములకు చిక్కకుండ తప్పించుకొనుచు, ఆకాశమార్గమున సంచరించెను. (23)

విల్లెక్కుపెట్టి, రణోన్ముఖుడై, వివిధములగు వాడియైన బాణములతో ఆకాశమును కప్పివేయుచున్న ఆ అక్షకుమారుని హనుమంతుడు ఇంతటి పరాక్రమశాలియైన ఈ బాలుని వధించుట ఎట్లు? అని సానుభూతితో క్షణకాలముపాటు ఆలోచనలోపడెను.(24)

గొప్పవీరుడైన అక్షకుమారుని బాణములకు మహా బుజబలము గల ఆ కపివరుని వక్షఃస్థలము గాయపడెను. అప్పుడు సమయస్ఫూర్తితో కర్తవ్యమును నిర్ణయించుకొనగల మారుతి గట్టిగాఅఱచుచు ఆ రాక్షసయోధుని యుద్ధపటిమనుగూర్చి ఆలోచింపసాగెను. (25)

"బాలభానునివలె తేజరిల్లుచున్నవాడై మిక్కిలి బలశాలియైన ఈఅక్షకుమారుడు ఆరితేఱిన యువకునివలె యుద్ధమొనర్చుచున్నవాడు. వివిధములైన యుద్ధవిద్యలలో నేర్పరియైన ఇతనిని చంపుటకు నా మనస్సు అంగీకరించుట లేదు.[2] (26)

ఇతడు మిక్కిలిబుద్ధిశాలి, మహావీరుడు, ఏకాగ్రమనస్కుడు, యుద్ధశ్రమలకు తట్టుకొనగలవాడు. కార్యసామర్థ్యమునుబట్టి నిస్సంశయముగా నాగులు, యక్షులు, మునులు మొదలగు వారి ప్రశంసలకును పాత్రుడైయుండవచ్చును. (27)

ఈతనిమనస్సు పరాక్రమోత్సాహములతో ఉరకలు వేయుచున్నది. ఇతడు నాయెదుట నిర్భయముగా నిలిచి, నన్ను పరికించి చూచుచున్నాడు. మిక్కిలి శీఘ్రగమనముగల ఈతని పరాక్రమమునకు సురాసురులమనస్సులు సైతము కంపించును. (28)

ఇతనిని ఏవిధముగను ఉపేక్షింపదగదు. ఉపేక్షించినచో యుద్ధమున ఇతనిపరాక్రమము అవధులుదాటును. అప్పుడు అతడు నన్ను అవమానము పాలుచేయడనుమాట ఉండదు. అనగా అతడు నన్ను తప్పక ఓటమిపాలు చేయును. కావున ఇప్పుడితనిని చంపుటయే యుక్తమని నాకు తోచుచున్నది. ఎగసిపడుచున్న మంటలను ఆర్పివేయక ఉపేక్షించుట ఉచితము కాదుగదా!"(29)

1) పర్వతముపై పడిన వడగండ్లు నీరై జాఱిపోవును. అట్లే అక్షకుమారుని బాణములు వజ్రశరీరుడైన హనుమంతునిపై బడి కుంఠితములై నేలపాలాయెను.

2) ఒక మహావీరుడు శత్రుపక్షముననున్న ఒక వీరుని శ్లాఘించుట నిజముగా ఒక ఉదాత్తలక్షణము. ఒక వీరుడు శత్రుపక్ష మహావీరుని ప్రశంసలకు పాత్రుడగుటయు ఒక అదృష్టము.

ఇతి ప్రవేగం తు పరస్య తర్కయన్
స్వకర్మయోగం చ విధాయ వీర్యవాన్ ।
చకార వేగం తు మహాబలస్తదా
మతిం చ చక్రేఽస్య వధే మహాకపిః ॥ 30

ఈ విధముగా శత్రుబలములనుగూర్చి బాగుగా తర్కించినపిదప ఆ కపివరుడు అక్షకుమారుని వధించుటకే నిర్ణయించుకొనెను. అనంతరము మహాబలపరాక్రమశాలియైన హనుమంతుడు తాను అనుసరింపవలసిన యుద్ధక్రమమును ఆలోచించి, వేగముగా ముందునకుసాగెను. (30)

స తస్య తానష్టహయాన్ మహాజవాన్
సమాహితాన్ భారసహాన్ వివర్తనే ।
జఘాన వీరః పథి వాయుసేవితే
తలప్రహారైః పవనాత్మజః కపిః ॥ 31

మహావీరుడు, వాయుసుతుడు ఐన ఆ వానరోత్తముడు మిక్కిలివేగముగలవియు, ఏ మాత్రమూ ఏమఱుపాటు లేనివియు, శత్రువులకు చిక్కకుండ ఇటునటు వివిధములగు మార్గములయందును సంచరింపగలవియు, రథభారమును వహింపగలవియునైన అక్షకుమారుని ఎనిమిదిగుఱ్ఱములను తన అఱచేతిదెబ్బలతో ఆకాశమునందే చంపివేసెను.(31)

తతస్తలేనాభిహతో మహారథః
స తస్య పింగాధిపమంత్రినిర్జితః ।
ప్రభగ్ననీడః పరిముక్తకూబరః
పపాత భూమౌ హతవాజిరంబరాత్ ॥ 32

పిమ్మట సుగ్రీవసచివుడైన హనుమంతుడు బలిష్ఠమైన తన అఱచేతితో అక్షకుమారునిరథమును కొట్టెను. ఆ దెబ్బకు రథచక్రములు ముక్కలయ్యెను. నొగలు వేఱైపోయెను. గుఱ్ఱములును హతమై పోవుటచే ఆ రథము ఆకసమునుండి నేలపై గూలెను. (32)

స తం పరిత్యజ్య మహారథో రథం
సకార్ముకః ఖడ్గధరః ఖముత్పతన్ ।
తపోఽభియోగాదృషిరుగ్రవీర్యవాన్
విహాయ దేహం మరుతామివాలయమ్ ॥ 33

ఉగ్ర తపశ్శక్తిసంపన్నుడైనఋషి తనతపఃప్రభావమున భౌతికదేహమును వీడి స్వర్గమునకు వెళ్ళుచున్నట్లుగా ధనుస్సును, ఖడ్గమును ధరించియున్న ఆ అక్షకుమారుడు భగ్నమైనరథమును వీడి, అంతరిక్షమున కెగిరెను. (33)

తతః కపిస్తం విచరంతమంబరే
పతత్రిరాజానిలసిద్ధసేవితే ।
సమేత్య తం మారుతతుల్య విక్రమః
క్రమేణ జగ్రాహ స పాదయోర్దృఢమ్ ॥ 34

వాయువువలె మిక్కిలి పరాక్రమముగలవాడగు హనుమంతుడు, గరుత్మంతుడు, వాయువు, సిద్ధపురుషులు సంచరించునట్టి ఆకాశమునందు మసలుచున్న ఆ అక్షకుమారుని క్రమముగా సమీపించి, ఆతనికాళ్లను గట్టిగా చిక్కించుకొనెను. (34)

స తం సమావిధ్య సహస్రశః కపిః
మహోరగం గృహ్య ఇవాండజేశ్వరః ।
ముమోచ వేగాత్ పితృతుల్యవిక్రమో
మహీతలే సంయతి వానరోత్తమః ॥ 35

తనతండ్రియైన వాయుదేవునివలె మహాపరాక్రమశాలియైన హనుమంతుడు గరుత్మంతుడు మహాసర్పమును గ్రహించినట్లు, ఆ అక్షకుమారుని పట్టుకొని, పెక్కుమార్లు గిరగిర త్రిప్పి, యుద్ధరంగమున వేగముగా విసరి నేలకేసి కొట్టెను. (35)

స భగ్నబాహూరుకటీశిరోధరః
క్షరన్నసృఙ్నిర్మథితాస్థిలోచనః ।
స భగ్నసంధిః ప్రవికీర్ణబంధనో
హతః క్షితౌ వాయుసుతేన రాక్షసః ॥ 36

హనుమంతునిధాటికి అక్షకుమారుని యొక్క చేతులు, తొడలు, కటిప్రదేశము, కంఠము శిథిలములయ్యెను, రక్తములో తడిసి ఎముకలు, కన్నులు నుగ్గునుగ్గాయెను. కీళ్లన్నియు దెబ్బతినెను, నరములన్నియు తెగిపోయెను అంతట అతడు ప్రాణములను కోల్పోయి నేలకొరిగెను. (36)

మహాకపిర్భూమితలే నిపీడ్య తం
చకార రక్షోఽధిపతేర్మహద్భయమ్
మహర్షిభిశ్చక్రచరైర్మహావ్రతైః
సమేత్య భూతైశ్చ సయక్షపన్నగైః ।
సురైశ్చ సేంద్రైర్భృశజాతవిస్మయైః
హతేఽకుమారే స కపిర్నిరీక్షితః ॥ 37

ఆ వానరోత్తముడు అక్షకుమారుని నలిపి, అతనిని భూమిపై పడునట్లు చేసి, రాక్షసరాజైన రావణునకు మిక్కిలి భయమును కలిగించెను. హనుమంతుడు అక్షకుమారుని హతమార్చుచుండగా జ్యోతిశ్చక్రమున సంచరించుచు, వ్రతనియమములను పాటించు మహర్షులు, యక్షులు, నాగులు, ఇతర ప్రాణులు, ఇంద్రుడు మొదలగు దేవతలు, మిక్కిలి విస్మయముతో ఆయనను వీక్షించిరి. (37)

నిహత్య తం వజ్రిసుతోపమప్రభం
కుమారమక్షం క్షతజోపమేక్షణః ।
తదేవ వీరోఽభిజగామ తోరణం
కృతక్షణః కాల ఇవ ప్రజాక్షయే ॥ 38

ఎఱ్ఱబాఱినకన్నులుగలవాడైన మహావీరుడగు హనుమంతుడు ఇంద్రుని కుమారుడైన జయంతుని వలె రాజిల్లు ఆ అక్షకుమారుని పరిమార్చిన పిమ్మట, ఆ వనముఖ ద్వారము మీదికిచేరి, ప్రళయ కాలమున జీవులప్రాణములను కొనిపోవుటకు నిరీక్షించు మృత్యుదేవత (యముని)వలె ప్రతియోధులైన రాక్షసులకొఱకు అతడు ఎదురు చూచుచుండెను. (38)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే సప్తచత్వారింశస్సర్గః (47)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదిఏడవసర్గము.

— * * * —

48. నలుబదిఎనిమిదవసర్గము

ఇంద్రజిత్తుహనుమంతుల యుద్ధము - బ్రహ్మాస్త్రముచేత బంధింపబడి, హనుమంతుడు రావణుని సభలో ప్రవేశించుట

తతస్స రక్షోఽధిపతిర్మహాత్మా
హనూమతాఽక్షే నిహతే కుమారే ।
మనస్సమాధాయ తదేంద్రకల్పం
సమాదిదేశేంద్రజితం సరోషమ్ ॥ 1

హనుమంతునిచేతిలో అక్షకుమారుడు నిహతుడు కాగా మహావీరుడైన రాక్షసరాజగురావణుడు (లోలోపల ఆందోళనపడుచున్నను) మనస్సును కుదుటబఱచుకొని ధైర్యమువహించి, కుపితుడై దేవేంద్రునితోసమానమైన పరాక్రమముగల ఇంద్రజిత్తును యుద్ధమునకాదేశించుచు ఇట్లుపలికెను. (1)

త్వమస్త్రవిచ్ఛస్త్రవిదాం వరిష్ఠః
సురాసురాణామపి శోకదాతా ।
సురేషు సేంద్రేషు చ దృష్టకర్మా
పితామహారాధనసంచితాస్త్రః ॥ 2

"ఓ కుమారా! నీవు అస్త్రవేత్తలలో, శస్త్రములను ప్రయోగించువారిలో శ్రేష్ఠుడవు. సురాసురులుసైతము నీ పరాక్రమమునకు గడగడలాడుదురు. బ్రహ్మదేవునిగూర్చి తపమొనరించి, బ్రహ్మాస్త్రముమొదలగు పెక్కు అస్త్రములను సంపాదించినవాడవు, నీయుద్ధకౌశలమును ఇంద్రాది దేవతలుగూడ చవిచూచిరి. (2)

తవాస్త్రబలమాసాద్య నాసురా న మరుద్గణాః ।
న శేకుస్సమరే స్థాతుం సురేశ్వరసమాశ్రితాః ॥ 3

అసురులుగాని, ఇంద్రాదిదేవతలుగాని, మరుద్గణములుగాని, యుద్ధరంగమున నీ అస్త్రబలము ముందు నిలువజాలకపోయిరి. (3)

న కశ్చిత్ త్రిషు లోకేషు సంయుగే న గతశ్రమః ।
భుజవీర్యాభిగుప్తశ్చ తపసా చాభిరక్షితః ।
దేశకాల విభాగజ్ఞః త్వమేవ మతిసత్తమః ॥ 4

ముల్లోకములలోను కదనరంగమున నీచే పరాజితుడు కానివాడు ఎవ్వడునులేడు. నీ భుజబలపరాక్రమములే సర్వదా నీకు భద్రకవచములు, నీతపఃప్రభావమే నీకు సర్వరక్షకము. దేశకాలములననుసరించి, కర్తవ్యములను నిర్వహించుటలో నీవు నిరుపమానప్రజ్ఞాశాలివి, సమయస్ఫూర్తిగలవాడవు. (4)

న తేఽస్త్యశక్యం సమరేషు కర్మణా
న తేఽస్త్యకార్యం మతిపూర్వమంత్రణే ।
న సోఽస్తి కశ్చిత్ త్రిషు సంగ్రహేషు వై
న వేద యస్తేఽస్త్రబలం బలం చ తే ॥ 5

వివిధయుద్ధరీతులలో కుశలుడవైననీకు అసాధ్యమైన కార్యము ఏదియునులేదు. వివేకముతో ఆలోచించి, చేయదగిన కార్యములలో నీకుతెలియనిదిలేదు. నీ అస్త్రబలములను, శారీరకశక్తిని ఎఱుగనివాడు ముల్లోకములయందు ఎవ్వడును లేనేలేడు. (5)

మమానురూపం తపసో బలం చ తే
పరాక్రమశ్చాస్త్రబలం చ సంయుగే ।
న త్వాం సమాసాద్య రణావమర్దే
మనః శ్రమం గచ్ఛతి నిశ్చితార్థమ్ ॥ 6

నిహతాః కింకరాస్సర్వే జంబుమాలీ చ రాక్షసః ।
అమాత్యపుత్రా వీరాశ్చ పంచసేనాగ్రయాయినః ॥ 7

బలాని సుసమృద్ధాని సాశ్వనాగరథాని చ ।
సహోదరస్తే దయితః కుమారోఽక్షశ్చ సూదితః ।
న హి తేష్వేవ మే సారో యస్త్వయ్యరినిషూదన ॥ 8

ఇదం హి దృష్ట్వా నిహతం మహద్బలం
కపేః ప్రభావం చ పరాక్రమం చ ।
త్వమాత్మనశ్చాపి సమీక్ష్య సారం
కురుష్వ వేగం స్వబలానురూపమ్ ॥ 9

బలావమర్దస్త్వయి సన్నికృష్టే
యథా గతే శామ్యతి శాంతశత్రౌ ।
తథా సమీక్ష్యాత్మబలం పరం చ
సమారభస్వాస్త్రవిదాం వరిష్ఠ ॥ 10

న వీర సేనా గణశోచ్యవన్తి
న వజ్రమాదాయ విశాలసారమ్ ।
న మారుతస్యాస్య గతేః ప్రమాణం
న చాగ్నికల్పః కరణేన హంతుమ్ ॥ 11

తమేవ మర్థం ప్రసమీక్ష్య సమ్యక్
స్వకర్మసామ్యాద్ధి సమాహితాత్మా ।
స్మరంశ్చ దివ్యం ధనుషోఽస్త్రవీర్యం
వ్రజాఽక్షతం కర్మ సమారభస్వ ॥ 12

న ఖల్వియం మతిశ్శ్రేష్ఠా యత్త్వాం సంప్రేషయామ్యహమ్ ।
ఇయం చ రాజధర్మాణాం క్షత్రస్య చ మతిర్మతా ॥ 13

తపోబలమునందును, యుద్ధమున పరాక్రమించుటలోను, అస్త్రబలవిజృంభణమునందును, అన్నివిధముల నీవు నాతో సమానుడవు. యుద్ధసంఘర్షణ ఎదురైనప్పుడు నీవునిలబడిన పక్షమునకు జయము తథ్యము, నా మనస్సునకు ఆందోళన ఏమాత్రమూ కలుగదు. (6)

ఎనుబదివేలమంది కింకరులును, జంబుమాలియు, వీరులైన అమాత్యపుత్రులు ఏడుగురును, సేనానాయకులైదుగురును రణరంగమున మడిసిరి. అసంఖ్యాకముగానున్న అశ్వములు, గజములు, రథములు పదాతిబలములు కదనరంగమున ప్రాణములను కోల్పోయెను. నీ అనుంగుతమ్ముడైన అక్షకుమారుడు గూడ నిహతుడయ్యెను. అయితే ఓ అరిమర్దనా! నాకునీపై ఉన్నంత గట్టినమ్మకము వారిపైలేదు. (7-8)

ఆ వానరునిప్రశస్తమైనబుద్ధికౌశలమును, శారీరిక బలమును, ప్రభావమును, పరాక్రమమును దృష్టిలోనుంచుకొని, నీ బలపరాక్రములనుగూడ చూచుకొని, నీశక్తియుక్తులకు తగినట్లుగా విజృంభింపుము. (9)

అస్త్రవిదులలో శ్రేష్ఠుడా! నీనిరుపమాన బలపరాక్రమములను చూచిన వెంటనే శత్రువులు లొంగిపోవుదురు. అట్టి నీవు, ఆవానరుని సమీపించినప్పుడు నీ బలమును శత్రుబలమును సమీక్షించుకొని, మనసేనలు నశింపకుండునట్లుగా ప్రయత్నము చేయుము.(10)

ఓ వీరుడా! ఒకేప్రయత్నమున (ఒక్కదెబ్బతో) పెక్కుమందిని హతమార్చగల ఆ వానరునినుండి సేనలు మనలను రక్షింపజాలవు. (కనుక నీవుసేనలతో వెళ్లకుము.) తీక్ష్ణమైన వజ్రాయుధముగూడ ఆయన కడ కుంఠితమగును. కనుక ఆయనమీదికి వజ్రాయుధముతోగూడ వెళ్లవద్దు. అది ఆయనకడ పనిచేయదు- ఈవానరుని వేగము వాయువునకును లేదు. ఈతనిబలముముందు వాయుబలము సైతము దిగదుడుపే. అతడు అగ్నితుల్యుడు, అందఱిని కాల్చివేయగలడు. ముష్ట్యాది సాధనములతో అతనిని చంపుట అసాధ్యము- కనుక అట్టి ప్రయత్నము చేయకుము. (11)

నేను ఇంతకుముందు చెప్పినరీతిగా బాగుగా ఆలోచింపుము. నీ కార్యసాఫల్యమునకై (నీవు శత్రువును జయించుటకై) ఏకాగ్రచిత్తుడవై ధనుర్విద్యకు (ధనుస్సునకు) సంబంధించిన బ్రహ్మాస్త్రాదిబలమును జ్ఞప్తికి దెచ్చుకొనుచువెళ్లుము తిరుగులేని విధముగా (యుద్ధ) కార్యమునకుదిగుము- పితామహుడిచ్చిన ఆ బ్రహ్మాస్త్రమునే స్మరించుచువెళ్లుము- దానికితప్ప మఱి దేనికిని అతడు లొంగడు. (12)

బాలుడవైన నిన్ను యుద్ధమునకుపంపుట నాకు ఉచితముగా తోచుటలేదు. ఐనను క్షాత్రధర్మమును అనుసరించి ఇట్లు చేయుటయుక్తమే. ఏలనన సమర్థులైన యోధులుండగా రాజు స్వయముగావెళ్లుట రాజధర్మ విరుద్ధము. (13)

నానాశస్త్రైశ్చ సంగ్రామే వైశారద్యమరిందమ।
అవశ్యమేవ బోద్ధవ్యం కామ్యశ్చ విజయో రణే। 14

కదనరంగమున విజయకాంక్షకలిగియుండుట అవసరము. కనుక వివిధములగు అస్త్రప్రయోగముల యందు నేర్పు (ప్రహరణసామర్థ్యము) కలిగియుండ వలెను. జయార్థము అస్త్రములన్నియు స్మృతిలో ఉండవలెను. (14)

తతః పితు స్తద్వచనం నిశమ్య
ప్రదక్షిణం దక్షసుతప్రభావః ।
చకార భర్తారమదీనసత్త్వో
రణాయ వీరః ప్రతిపన్నబుద్ధిః । 15

దేవతలవలె దివ్యప్రభావము గలవాడు, వీరుడు, ఐన ఇంద్రజిత్తు తండ్రిపలికిన హితవచనములనువిని, కొండంత బలమునుపొందినవాడై, యుద్ధముచేయుటకే నిశ్చయించుకొని, ప్రభువైన రావణునకు ప్రదక్షిణ పూర్వకముగా నమస్కరించెను. (15)

తతస్తైః స్వగణైరిష్టైః ఇంద్రజిత్ప్రతిపూజితః।
యుద్ధోద్ధతః కృతోత్సాహః సంగ్రామం ప్రత్యపద్యత। 16

ఇంద్రజిత్తు తనకు అత్యంతప్రీతిపాత్రులైనవారిచేతను, తనవారిచేతను ప్రశంసలనందుకొని, రణోత్సాహముతో విఱ్ఱవీగుచు సమరభూమికివెళ్లుటకు ఉద్యుక్తుడాయెను. (16)

శ్రీమాన్ పద్మపలాశాక్షో రాక్షసాధిపతేస్సుతః।
నిర్జగామ మహాతేజాః సముద్ర ఇవ పర్వసు। 17

వైభవోపేతుడు, పద్మదళములవంటి నేత్రములు గలవాడు, రాక్షసప్రభువైన రావణునికుమారుడు, మహా తేజశ్శాలియుఅగు ఇంద్రజిత్తు, పర్వదినములలో సముద్రునివలె ఉప్పొంగుచు సంగ్రామమునకు బయలుదేరెను. (17)

స పక్షిరాజోపమతుల్యవేగైః
వ్యాలైశ్చతుర్భిస్సితతీక్ష్ణదంష్ట్రైః ।
రథం సమాయుక్తమసంగవేగం
సమారురోహేంద్రజిదింద్రకల్పః । 18

పరాక్రమమున ఇంద్రునితోసమానుడైన ఆ ఇంద్రజిత్తు నిరాఘాటముగా మిక్కిలివేగముతో సాగిపోగల రథమును అధిరోహించెను. దానికి గరుత్మంతునివలె మిక్కిలివేగము గలవి, తీక్ష్ణములైనతెల్లనికోరలుగలవి అగు నాలుగు సింహములతో పూన్చబడియుండెను. (18)

స రథీ ధన్వినాం శ్రేష్ఠః శస్త్రజ్ఞోఽస్త్రవిదాంవరః।
రథేనాభియయౌ క్షిప్రం హనుమాన్ యత్ర సోఽభవత్। 19

ధనుర్ధారులలో శ్రేష్ఠుడు, శస్త్రాస్త్రప్రయోగములలో ఆరితేరినవాడుఐన ఆ ఇంద్రజిత్తు హనుమంతుడున్న ప్రదేశమునకు రథముపై వేగముగా వెళ్లెను. (19)

స తస్య రథనిర్ఘోషం జ్యాస్వనం కార్ముకస్య చ।
నిశమ్య హరివీరోఽసౌ సంప్రహృష్టతరోఽభవత్। 20

వానరవీరుడైన హనుమంతుడు ఇంద్రజిత్తుయొక్క రథచక్రములసవ్వడులను, ధనుష్టంకారమును విని, (తనకుదీటైనవీరునితో యుద్ధముచేయుఅవకాశము లభించినదని) మిక్కిలి ఆనందభరితుడాయెను. (20)

సుమహచ్చాపమాదాయ శితశల్యాంశ్చ సాయకాన్।
హనుమంతమభిప్రేత్య జగామ రణపండితః। 21

రణవిద్యలలోకుశలుడైన ఇంద్రజిత్తు మిక్కిలి శక్తిమంతమైన ధనుస్సును, వాడియైనములుకులుగల బాణములనుచేతబట్టి హనుమంతుని ఎదుర్కొనుటకై వెళ్లెను. (21)

తస్మిం స్తతస్సంయతి జాతహర్షే
రణాయ నిర్గచ్ఛతి బాణపాణౌ ।
దిశశ్చ సర్వాః కలుషా బభూవుః
మృగాశ్చ రౌద్రా బహుధా వినేదుః । 22

పిమ్మట ఆ ఇంద్రజిత్తు రణోత్సాహభరితుడై బాణములనెక్కుపెట్టి, ముందునకుసాగుచుండగా పైకెగసిన దూళులతో దిశలన్నియు నిండిపోయెను. క్రూరమృగములు బహువిధములుగా అఱవసాగెను. (22)

సమాగతాస్తత్ర తు నాగయక్షా
మహర్షయశ్చక్రచరాశ్చ సిద్ధాః ।
నభస్సమావృత్య చ పక్షిసంఘా
వినేదురుచ్చైః పరమప్రహృష్టాః । 23

అంతట అక్కడికిచేరిన నాగులు, యక్షులు, మహర్షులు, జ్యోతిశ్చక్రమున సంచరించుసిద్ధులు, ఆకాశమునందంతటను వ్యాపించి, హర్షోల్లాసములను ప్రకటించిరి. కాకులు, గ్రద్దలు మొదలగు పక్షులు (తమ కాహారము లభించునను) సంతోషముతో బిగ్గరగా అరచినవి. (23)

ఆయాంతం సరథం దృష్ట్వా తూర్ణ మింద్రజితం కపిః।
వినవాద మహానాదం వ్యవర్ధత చ వేగవాన్। 24

రథముపై అతివేగముగా తనవైపునకు వచ్చుచున్న ఇంద్రజిత్తును గాంచి, హనుమంతుడు సింహనాదమొనర్చుచు, శత్రువునకు దడపుట్టునట్లు అతి శీఘ్రముగా తనశరీరమును పెంచెను. (24)

ఇంద్రజిత్తు రథం దివ్యమ్ ఆస్థితశ్చిత్రకార్ముకః।
ధనుర్విస్ఫారయామాస తటిదూర్జితనిస్స్వనమ్॥ 25

ఇంద్రజిత్తు దివ్యమైనరథముపై నిలకడగానున్నవాడై, చిత్రమైనవింటినిచేబూని, పిడుగుపాటుధ్వనితో భయంకరముగా ధనుష్టంకారమును గావించెను. (25)

తతస్సమేతా వతితీక్ష్ణవేగా
మహాబలౌ తౌ రణనిర్విశంకౌ।
కపిశ్చ రక్షోఽధిపతేశ్చ పుత్రః
సురాసురేంద్రావివ బద్ధవైరౌ॥ 26

మిక్కిలితీవ్రముగా విజృంభించినవారును, గొప్ప బలశాలురును, రణభయములేనివారునుఐన హనుమంతుడు, ఇంద్రజిత్తు ఇరువురును బద్ధశత్రువులైన దేవేంద్ర, రాక్షసేంద్రులవలె పరస్పరము యుద్ధమునకు తలపడిరి.(26)

స తస్య వీరస్య మహారథస్య
ధనుష్మత స్సంయతి సమ్మతస్య।
శరప్రవేగం వ్యహనత్ ప్రవృద్ధః
చచార మార్గే పితురప్రమేయః॥ 27

సాటిలేనివీరుడు, అత్యున్నతముగా తనశరీరమును పెంచినవాడుఅగు హనుమంతుడు, వీరుడును, మహారథుడును, ధనుర్ధారియు, యుద్ధమున వాసికెక్కినవాడును ఐన ఇంద్రజిత్తుయొక్క బాణములధాటిని వమ్ముచేసి, వాయు(ఆకాశ)మార్గమున సంచరింపసాగెను. (27)

తతశ్శరానాయతతీక్ష్ణశల్యాన్
సుపత్రిణః కాంచనచిత్రపుంఖాన్।
ముమోచ వీరః పరవీరహంతా
సుసన్నతాన్ వజ్రనిపాతవేగాన్॥ 28

శత్రువీరులనుహతమార్చుటలోఘటికుడైన ఇంద్రజిత్తు, పొడవైన వాడిములుకులుగలవియు, మంచి ఱెక్కలు గలవియు, చిత్రముగానున్న బంగారుపిడులు గలవియు, బాగుగావంగినవియు, వజ్రాయుధమువలె బలమైనవియు అగు బాణములను హనుమంతునిపై వేసెను. (28)

తతస్తు తత్స్యందననిస్స్వనం చ
మృదంగభేరీపటహస్వనం చ।
వికృష్యమాణస్య చ కార్ముకస్య
నిశమ్య ఘోషం పునరుత్పపాత॥ 29

అంతట ఆమారుతి ఇంద్రజిత్తుయొక్క రథచక్రధ్వనులను, మృదంగ, భేరీ, పటహాదివాద్యముల స్వనములను ఎక్కుపెట్టబడుచున్న వింటిధ్వనిని విని, మఱల గగనమునకు ఎగిరెను. (29)

శరాణామంతరేష్వాశు వ్యవర్తత మహాకపిః।
హరిస్తస్యాభిలక్ష్యస్య మోఘయన్ లక్ష్యసంగ్రహమ్॥ 30

గుఱిచూచికొట్టుటలోసమర్థుడైనఇంద్రజిత్తు యొక్క లక్ష్యమును వమ్ముచేయుచు ఆ వానరోత్తముడు బాణములకు చిక్కకుండా వాటిమధ్య తిరుగసాగెను. (30)

శరాణామగ్రతస్తస్య పునస్సమభివర్తత।
ప్రసార్య హస్తౌ హనుమాన్ ఉత్పపాతానిలాత్మజః॥ 31

వాయుసుతుడైనహనుమంతుడు ఆ ఇంద్రజిత్తు యొక్క బాణములకు ఎదురుగా నిలబడుచుండెడివాడు. ఇంద్రజిత్తు గుఱిచూచి, బాణములను ప్రయోగించునంతలో అతడు వెంటనే చేతులుచాచి దాగుడుమూతలాడువానివలె రివ్వున మఱలపైకి ఎగిరెడివాడు. (31)

తావుభౌ వేగసంపన్నౌ రణకర్మవిశారదౌ।
సర్వభూతమనోగ్రాహి చక్రతుర్యుద్ధముత్తమమ్॥ 32

మిక్కిలివేగముగా యుద్ధమొనర్చుటలోసమర్థులైన వారిద్దఱును సకలప్రాణులకు ఆశ్చర్యము గొల్పునట్లుగా మహాయుద్ధమొనర్చుచుండిరి. (32)

హనూమతో వేద న రాక్షసోఽంతరం
న మారుతిస్తస్య మహాత్మనోఽంతరమ్।
పరస్పరం నిర్విషహౌ బభూవతుః
సమేత్య తౌ దేవసమానవిక్రమౌ॥ 33

హనుమంతుని ఎట్లుజయింపవలెనో ఇంద్రజిత్తునకు తెలియకుండెను. ఇంద్రజిత్తును పడగొట్టుఉపాయము హనుమంతునకు తోచకుండెను. దేవతలతో సమానమైన పరాక్రమముగలవారిద్దఱును పోరుసల్పుచు ఒకరిని మఱియొకరు జయించుటకు అసాధ్యులుగానుండిరి. (33)

తతస్తు లక్ష్యే స విహన్యమానే
శరేష్వమోఘేషు చ సంపతత్సు।
జగామ చింతాం మహతీం మహాత్మా
సమాధిసంయోగసమాహితాత్మా॥ 34

బాణములను సంధించి ప్రయోగించుటలో ఏకాగ్రచిత్తుడైన ప్రతిభాశాలియగు ఆ ఇంద్రజిత్తు తన గుఱి వమ్మైపోవుచుండుట వలనను, అమోఘములైన శరములుగూడ గుఱితప్పి పడిపోవుచుండుటచేతను తీవ్ర విచారమునకు లోనయ్యెను. (34)

తతో మతిం రాక్షసరాజసూనుః
చకార తస్మిన్ హరివీరముఖ్యే ।
అవధ్యతాం తస్య కపేస్సమీక్ష్య
కథం నిగచ్ఛేదితి నిగ్రహార్థమ్ । 35

తతః పైతామహం వీరః సోఽస్త్రమస్త్రవిదాం వరః ।
సందధే సుమహాతేజాః తం హరిప్రవరం ప్రతి । 36

అవధ్యోఽయమితి జ్ఞాత్వా తమస్త్రేణాస్త్రతత్త్వవిత్ ।
నిజగ్రాహ మహాబాహుః మారుతాత్మజమింద్రజిత్ । 37

తేన బద్ధస్తతోఽస్త్రేణ రాక్షసేన స వానరః ।
అభవన్నిర్విచేష్టశ్చ పపాత చ మహీతలే । 38

తతోఽథ బుద్ధ్వా స తదస్త్రబంధం
ప్రభోః ప్రభావాత్ విగతాత్మవేగః ।
పితామహానుగ్రహమాత్మనశ్చ
విచింతయామాస హరిప్రవీరః । 39

తతస్స్వాయంభువైర్మంత్రైః బ్రహ్మాస్త్రమభిమంత్రితమ్ ।
హనుమాంశ్చింతయామాస వరదానం పితామహాత్ । 40

న మేఽస్త్రబంధస్య చ శక్తిరస్తి
విమోక్షణే లోకగురోః ప్రభావాత్ ।
ఇత్యేవ మత్వా విహితోఽస్త్రబంధో
మయాఽఽత్మయోనేరనువర్తితవ్యః । 41

స వీర్యమస్త్రస్య కపిర్విచార్య
పితామహానుగ్రహమాత్మనశ్చ ।
విమోక్షశక్తిం పరిచింతయిత్వా
పితామహాజ్ఞామనువర్తతే స్మ । 42

అస్త్రేణాపి హి బద్ధస్య భయం మమ న జాయతే ।
పితామహ మహేంద్రాభ్యాం రక్షితస్యానిలేన చ । 43

గ్రహణే చాపి రక్షోభిః మహాన్ మే గుణదర్శనః ।
రాక్షసేంద్రేణ సంవాదః తస్మాద్గృహ్ణంతు మాం పరే । 44

స నిశ్చితార్థః పరవీరహంతా
సమీక్ష్యకారీ వినివృత్తచేష్టః ।
పరైః ప్రసహ్యాభిగతైర్నిగృహ్య
ననాద తైస్తైః పరిభర్త్స్యమానః । 45

ఆ ఇంద్రజిత్తు హనుమంతునిచంపుట అసాధ్యమని తలంచెను. "అది సరే! కనీసము ఆ వానరప్రముఖుని బంధించుటకై అతనిని నిశ్చేష్టునిగాచేయుటకు ఉపాయమేమి?" అని అతడు బాగుగాఆలోచింపసాగెను. (35)

పిమ్మట అస్త్రవిదులలోప్రముఖుడు, వీరుడు, మహాతేజశ్శాలియునైన ఆ ఇంద్రజిత్తు ఆ వానరోత్తమునిపై బ్రహ్మాస్త్రమును సంధించెను. (36)

'ఈ మహావానరుని చంపుట అసాధ్యము'- అని తలచి, అస్త్రరహస్యములను ఎఱింగిన భుజబలశాలియగు ఇంద్రజిత్తు ఆ మారుతిని బ్రహ్మాస్త్రముచే బంధించెను. (37)

ఇంద్రజిత్తుప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకు కట్టుబడినవాడై, ఆ కపివరుడు నిశ్చేష్టుడై, భూమిపై పడిపోయెను. (38)

ఆ హనుమంతుడు తాను బ్రహ్మాస్త్రముచే బంధింపబడినట్లు తెలిసికొనెను. కాని బ్రహ్మదేవుని ప్రభావమున ఆ అస్త్రశక్తి క్షణకాలములో తొలగిపోయెను. అది ఆయనను ఏమాత్రమూ బాధింపలేదు. అప్పుడు అతడు తనను బ్రహ్మదేవుడు అనుగ్రహించెనని తలంచెను. (39)

'అది స్వాయంభువ (బ్రహ్మ) మంత్రములచే అభిమంత్రింపబడిన బ్రహ్మాస్త్రము'- అని యెఱింగి, బ్రహ్మ తనకు ప్రసాదించిన వరమును గుర్తునకు తెచ్చుకొనెను. (40)

"పితామహునిమహిమచే ప్రభావితమైన ఈ బ్రహ్మాస్త్రము నుండి తప్పించుకొనగలశక్తి నాకులేదు." అనితలంచి, ఇంద్రజిత్తు దానిని నాపై ప్రయోగించెను. సరే ఈ బ్రహ్మాస్త్రమునకు నేను కట్టుబడియుండుటయే యుక్తము. ఆవిధముగా నేను బ్రహ్మదేవుని గౌరవించినట్లగును." (41)

ఆహనుమంతుడు బ్రహ్మాస్త్రముయొక్క ప్రభావమును, తనపై పితామహునకుగల అనుగ్రహమును గుర్తునకు దెచ్చుకొనెను. బ్రహ్మాస్త్రమునుండి తప్పించుకొనగలశక్తి తనకు ఉన్నదని తెలిసియు, అతడు బ్రహ్మదేవునిఆజ్ఞను శిరసావహించెను. (42)

నేను బ్రహ్మాస్త్రముచే బంధింపబడినను, బ్రహ్మదేవుడు, దేవేంద్రుడు, వాయుదేవుడు నన్ను రక్షించుచున్నందున నేను భయపడవలసిన పనియేలేదు. (43)

రాక్షసులు నన్నుబంధించి (రావణునికడకు) తీసికొనివెళ్లినను నాకు లాభమేయగును. ఏలనన నేను స్వయముగా అక్కడ రావణునితో మాట్లాడవచ్చును. అందువలన శత్రువులు నన్ను తీసికొనివెళ్లుదురుగాక. (44)

శత్రువులను పరిమార్చగలవాడును, సదసద్విచక్షణతో దూరదృష్టిగలవాడునునైన హనుమంతుడు కృతనిశ్చయుడై, నిశ్చేష్టుడైయుండెను. అంతట శత్రువులు ఆయనమీదికి విజృంభించి, బలప్రయోగముతో బంధించి, భయపెట్టసాగిరి. అప్పుడు మారుతి బిగ్గరగా కేకవేసెను. (45)

తతస్తం రాక్షసా దృష్ట్వా నిర్విచేష్టమరిందమమ్।
బబంధుశ్శణవల్కైశ్చ ద్రుమచీరైశ్చ సంహతైః। 46

స రోచయామాస పరైశ్చ బంధనం
ప్రసహ్య వీరైరభిగర్హణం చ ।
కౌతూహలాన్మాం యది రాక్షసేంద్రో
ద్రష్టుం వ్యవస్యేదితి నిశ్చితార్థః। 47

స బద్ధస్తేన వల్కేన విముక్తోఽస్త్రేణ వీర్యవాన్।
అస్త్రబంధస్సచాన్యం హి న బంధమనువర్తతే। 48

అథేంద్రజిత్తు ద్రుమచీరబద్ధం
విచార్య వీరః కపిసత్తమం తమ్ ।
విముక్తమస్త్రేణ జగామ చింతాం
నాన్యేన బద్ధో హ్యనువర్తతేఽస్త్రమ్। 49

అహో మహత్కర్మ కృతం నిరర్థకం
న రాక్షసైర్మంత్రగతిర్విమృష్టా ।
పునశ్చ నాస్త్రే విహతేఽస్త్రమన్యత్
ప్రవర్తతే సంశయితాః స్మ సర్వే । 50

అస్త్రేణ హనుమాన్ ముక్తో నాత్మానమవబుధ్యత।
కృష్యమాణస్తు రక్షోభిః తైశ్చ బంధైర్నిపీడితః। 51

హన్యమానస్తతః క్రూరై రాక్షసైః కాష్ఠముష్టిభిః।
సమీపం రాక్షసేంద్రస్య ప్రాకృష్యత స వానరః। 52

అథేంద్రజిత్ తం ప్రసమీక్ష్య ముక్తమ్
అస్త్రేణ బద్ధం ద్రుమచీరసూత్రైః ।
వ్యదర్శయత్ తత్ర మహాబలం తం
హరిప్రవీరం సగణాయ రాజ్ఞే। 53

తం మత్తమివ మాతంగం బద్ధం కపివరోత్తమమ్।
రాక్షసా రాక్షసేంద్రాయ రావణాయ న్యవేదయన్। 54

కోఽయం కస్య కుతో వాత్ర కిం కార్యం కో వ్యపాశ్రయః।
ఇతి రాక్షసవీరాణాం తత్ర సంజజ్ఞిరే కథాః। 55

అనంతరము రాక్షసులు శత్రుసంహారకుడైన హనుమంతుడు నిశ్చేష్టుడైయుండుటచూచి, గట్టిగాపేనిన జనుపనారత్రాళ్లతోడను, వల్కములచేతను ఆయనను బంధించిరి. (46)

'ఒకవేళ రావణుడు నన్ను చూచుటకై కుతూహలపడుచు ఉన్నను ఉండవచ్చును'- అని నిశ్చయించుకొని, హనుమంతుడు తనను శత్రువీరులు బంధించుటను, నిందించుటనుగూడ ఇష్టముతో సహించెను. (47)

మహావీరుడైన హనుమంతుడు వల్కలములచే బంధింపబడినవెంటనే బ్రహ్మాస్త్రము అతనిని తనబంధమునుండి విముక్తుని గావించెను. ఏలనన తనచే బంధింపబడినవానిని ఇతరసాధనములచే మఱల బంధించినచో బ్రహ్మాస్త్రము అతనిని తనబంధమునుండి విడిచిపెట్టును. (48)

వల్కలములుమున్నగువానిచే బంధింపబడిన ఆ వానరోత్తముని బ్రహ్మాస్త్రము తనబంధమునుండి విముక్తుని జేయుటను గమనించి, వీరుడైన ఇంద్రజిత్తు ఇట్లుతలపోయ సాగెను. "ఇతరసాధనములచే బంధింపబడిన వానిని బ్రహ్మాస్త్రము తనబంధమునుండి విడిచిపెట్టును, అయ్యో! నా శక్తినంతయును ధారపోసి చేసిన ఈ ఘనకార్యము బూడిదలోపోసిన పన్నీరైనది గదా! బ్రహ్మాస్త్రమంత్రపద్ధతిని ఎఱుగక రాక్షసులు తెలివిమాలిన వారై ఇట్లుచేసిరి. బ్రహ్మాస్త్రమును ప్రయోగించినపిమ్మట మఱియొకఅస్త్రము ఏదియు పనిచేయదు. బ్రహ్మాస్త్రమును మఱల ప్రయోగింపవలను పడదు. అతడీబంధములను త్రెంచుకొనినచో మనందఱినీ ఇరుకున బెట్టవచ్చును. ఇనచో మన కర్తవ్యమేమి? ఇప్పుడు అతడు చేయజాలనిది ఏమిటి? గొప్పచిక్కేవచ్చిపడినది". (49-50)

హనుమంతుడు బ్రహ్మాస్త్రమునుండి తాను విముక్తుడైన విషయమును ఇతరులకు తెలియనీయలేదు. క్రూరులైనరాక్షసులు అతనిని బంధములతోకట్టి కట్టెలతో బాదుచు, పిడికిళ్లతో పొడుచుచు, రావణుని సమీపమునకు లాగికొనిపోయిరి. (రావణుని చూడవలెనను సంకల్పముతో ఈ రాక్షసులుపెట్టుబాధలను అన్నింటిని హనుమంతుడు బుద్ధిపూర్వకముగా ఓర్చుకొనెను.)(51-52)

అంతట బ్రహ్మాస్త్రమునుండి విముక్తుడై జనుపనారత్రాళ్ళ చేతను, వల్కములచేతను బంధితుడై యున్న మహావీరుడగు వానరోత్తముని ఇంద్రజిత్తు సభాస్థలికి తీసికొని వెళ్లి, పరివారములతోగూడియున్న రావణునకు జూపించెను. (53)

బంధింపబడిన మదపుటేనుగువలెనున్న హనుమంతుని గూర్చి రాక్షసులు "అశోకవనమును ధ్వంసమొనర్చిన వానరుడు ఇతడే" అని- తమ రాజైన రావణునకు నివేదించిరి. (54)

ఆ సభలోని రాక్షసవీరులు ఆ వానరునిజూచి, ఇతడు ఎవరు? ఎవరివాడు? ఎక్కడినుండివచ్చినాడు? ఇతడు వచ్చినపనియేమి? ఇతనికి ఆశ్రయమును ఇచ్చినదెవరు?" అని పరస్పరము చర్చించుకొనసాగిరి. (55)

హన్యతాం దహ్యతాం వాపి భక్ష్యతామితి చాపరే।
రాక్షసాః తత్ర సంక్రుద్ధాః పరస్పరమథాబ్రువన్। 56

అచట మిక్కిలిఆగ్రహముతోనున్న మఱికొందఱు రాక్షసులు "చంపుడు, కాల్చివేయుడు, భక్షింపుడు"- అని ఒకరితోనొకరు చెప్పుకొనసాగిరి. (56)

అతీత్య మార్గం సహసా మహాత్మా
స తత్ర రక్షోఽధిపపాదమూలే ।
దదర్శ రాజ్ఞః పరిచారవృద్ధాన్
గృహం మహారత్న విభూషితం చ। 57

మహాత్ముడైన హనుమంతుడు మార్గమునుదాటి, అమూల్యరత్నములతో అలంకృతమైయున్న రావణుని భవనమును, సభలో రావణునిపాదముల సమీపముననున్న అతని ముఖ్యసచివులను ఒక్కసారిగా పరికించుచు చూచెను. (57)

స దదర్శ మహాతేజా రావణః కపిసత్తమమ్।
రక్షోభిః వికృతాకారైః కృష్యమాణమితస్తతః। 58

మహాతేజశ్శాలియైన ఆ రావణుడు వికృతాకారులైన రాక్షసులచే ఇటునటు లాగబడుచున్న కపీశ్వరుని చూచెను. (58)

రాక్షసాధిపతిం చాపి దదర్శ కపిసత్తమః।
తేజోబలసమాయుక్తం తపంతమివ భాస్కరమ్। 59

తేజోబలసంపన్నుడై, సూర్యునివలెవిరాజిల్లుచున్న రాక్షసరాజును ఆకపిసత్తముడు చూచెను. (59)

సరోష సంవర్తిత తామ్రదృష్టిః
దశాననస్తం కపి మన్వవేక్ష్య ।
అథోపవిష్టాన్ కులశీలవృద్ధాన్
సమాదిశత్ తం ప్రతి మంత్రిముఖ్యాన్। 60

ఎఱ్ఱబాఱినకనులతో రోషముతోగ్రుడ్లుఱుముచు రావణుడు కపివరుని పరికించిచూచి, సభలో ఆసీనులైయున్న, కులశీలములుగలిగి అనుభవజ్ఞులైన, ప్రముఖులగు మంత్రులను 'అతనినిగూర్చి తెలిసికొనుడు'- అని ఆజ్ఞాపించెను. (60)

యథాక్రమం తైః స కపిర్విపృష్టః
కార్యార్థమర్థస్య చ మూలమాదౌ ।
నివేదయామాస హరీశ్వరస్య
దూతస్సకాశాదహమాగతోఽస్మి। 61

ఆ మంత్రివరులు 'వచ్చిన పనిని గూర్చియు, ఆకార్యహేతువు మొదలగు వానిని గూర్చియు' క్రమముగా ఆ కపివరుని ప్రశ్నించిరి. అంతట మారుతి 'నేను వానరప్రభువైన సుగ్రీవుడు పంపగా వచ్చిన దూతను'- అని తెలిపెను. (61)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే అష్టచత్వారింశస్సర్గః *(48)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదిఎనిమిదవసర్గము.

-- * * * --

49. నలుబదితొమ్మిదవసర్గము

రావణుని ఆకారమును జూచి, హనుమంతుడు ఆశ్చర్యపడుట-

తత స్స కర్మణా తస్య విస్మితో భీమవిక్రమః।
హనుమాన్ రోషతామ్రాక్షో రక్షోఽధిపమవైక్షత। 1

శత్రువులకు భయమునుగొలుపునట్టి పరాక్రమవంతుడైన ఆ హనుమంతుడు రావణుని కృత్యమునకు ఆశ్చర్యపడెను.[1] అతడు క్రోధముతో కన్నులెఱ్ఱజేసి,[2] ఆ రావణుని జూచెను. (1)

భ్రాజమానం మహార్హేణ కాంచనేన విరాజతా।
ముక్తా జాలావృతేనాథ మకుటేన మహాద్యుతిమ్। 2

రావణుడు ధరించిన కిరీటము మేలిమిబంగారముతో నిర్మింపబడి, మంచిముత్యములచే పొదుగబడి ధగధగలాడుచుండెను. అట్టి కిరీటద్యుతులతో అతడు విరాజిల్లుచుండెను. సానలుదీఱిన

1) రావణుడు ఇంద్రజిత్తు ద్వారా తనను బంధింపజేసి, సభకు రప్పించుకొనుటచే హనుమంతుడు విస్మయపడెను.
2) రావణుడు సీతాదేవిని అపహరించుకొని వచ్చినందులకును, అశోకవనమున ఆమెను బెదరింపినందులకును అతనిపై హనుమంతుడు కన్నులెఱ్ఱజేసి క్రుద్ధుడయ్యెను.

వజ్రసంయోగసంయుక్తైః మహార్హమణివిగ్రహైః।
హైమైరాభరణైశ్చిత్రైః మనసేవ ప్రకల్పితైః। 3

జాతివజ్రములతోడను, అమూల్యములైన మణులతోడను పొదిగబడి, సంకల్పమాత్రమున సిద్ధములై చిత్రవిచిత్రముగానున్న స్వర్ణాభరణములతో అతడు తేజరిల్లుచుండెను. వెలకట్టుటకు సాధ్యముగాని పట్టువస్త్రములను అతడు ధరించియుండెను. ఎఱ్ఱచందనపుపూతలతో, కస్తూరి మొదలగు ద్రవ్యములచే పంక్తులుదీఱి కుదురుకొనిన త్రిపుండ్రములతో వివిధములగు చిత్రములతో అనులిప్తుడై ప్రకాశించుచుండెను. (2-4)

మహార్హక్షౌమసంవీతం రక్తచందనరూషితమ్।
స్వనులిప్తం విచిత్రాభిః వివిధాభిశ్చ భక్తిభిః। 4

వివృతైర్దర్శనీయైశ్చ రక్తాక్షైః భీమదర్శనైః।
దీప్తతీక్ష్ణమహాదంష్ట్రైః ప్రలంబదశనచ్ఛదైః। 5

అతనికనులు విశాలములుగానుండుటచే దర్శనీయములై, ఎఱ్ఱబాఱియుండుటచే భయమును గొల్పుచును ఉండెను. దంతములు పదునుదేఱి ప్రకాశించుచుండెను, పెదవులు వ్రేలాడుచుండెను. మహాతేజశ్శాలియు వీరుడునునైన రావణుడు పదిశిరస్సులతో ఒప్పుచు, అనేకములైన క్రూరమృగములతో నిండిన శిఖరములుగల మందరపర్వతమువలె ఒప్పుచుండెను. (5-6)

శిరోభిర్దశభిర్వీరం భ్రాజమానం మహౌజసమ్।
నానావ్యాలసమాకీర్ణైః శిఖరైరివ మందరమ్। 6

నీలాంజనచయప్రఖ్యం హారేణోరసి రాజతా।
పూర్ణచంద్రాభవక్త్రేణ సబలాకమివాంబుదమ్। 7

అతడు కాటుకకొండవలె విలసిల్లుచు, వక్షఃస్థలమునందు మిలమిలలాడుచున్న హారములతో శోభిల్లుచుండెను. పూర్ణచంద్రునివలె ధగధగలాడుచున్న రత్నహారములతో విరాజిల్లుచు, పెద్దకొంగలతోగూడిన మేఘమువలె ఒప్పాఱుచుండెను. అతనిబాహువులు మేలిచందనములచే పూయబడి యుండెను. అవి జిలుగుపనితనముగల భుజకీర్తులతో, మెఱయుచున్న దండకడియములతో అలంకృతములై యుండెను. ఆ బాహువులు పరిపుష్టములై ఐదుపడగల సర్పములవలె అలరారుచుండెను.(7-8)

బాహుభిర్బద్ధకేయూరైః చందనోత్తమభూషితైః।
భ్రాజమానాంగదైః పీనైః పంచశీర్షైరివోరగైః। 8

మహతి స్ఫాటికే చిత్రే రత్నసంయోగసంస్కృతే।
ఉత్తమాస్తరణాస్తీర్ణే సూపవిష్టం వరాసనే। 9

అతనిపీఠము మేలైనస్ఫటికమణులతో చిత్రముగా నిర్మితమై యుండెను, అది రత్నములకూర్పుతో అలంకృతమైయుండెను, దానిపై శ్రేష్ఠమైన ఆస్తరణము (రత్నకంబళము) పఱవబడియుండెను, అట్టి ఉన్నత సింహాసనముపై అతడు సుఖాసీనుడైయుండెను. (9)

అలంకృతాభిరత్యర్థం ప్రమదాభిస్సమంతతః।
వాలవ్యజనహస్తాభిః ఆరాత్ సముపసేవితమ్। 10

చక్కగా అలంకరించుకొని, వింజామరలను చేబూనిన కాంతలు చుట్టును జేరి, సమీపమునుండి ఆరావణునకు సేవలనొనర్చుచుండిరి. (10)

దుర్ధరేణ ప్రహస్తేన మహాపార్శ్వేన రక్షసా।
మంత్రిభిర్మంత్రతత్త్వజ్ఞైః నికుంభేన చ మంత్రిణా। 11

సుఖోపవిష్టం రక్షోభిః చతుర్భిర్బలదర్పితైః।
కృత్స్నం పరివృతం లోకం చతుర్భిరివ సాగరైః। 12

మంత్రాంగతత్త్వమును బాగుగా ఎఱిగినవారును, బలదర్పితులునునైన దుర్ధరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు అను రాక్షసమంత్రులు అతని చుట్టును చేరియుండిరి. ఆ నలుగురు సచివులచే పరివృతుడై హాయిగా ఆసీనుడైయున్న రావణుడు నాలుగు సముద్రములచే పూర్తిగా ఆవరింపబడియున్న భూమండలమువలె ఒప్పాఱుచుండెను. (11-12)

మంత్రిభిర్మంత్రతత్త్వజ్ఞైః అన్యైశ్చ శుభబుద్ధిభిః।
అన్వాస్యమానం రక్షోభిః సురైరివ సురేశ్వరమ్। 13

మంత్రాంగమును నెఱపుటలో సమర్థులైనవారును, తనమేలుగోరువారునునైన మంత్రులతో సేవింపబడుచున్న రావణుడు దేవతలతో సేవలను అందుకొనుచున్న దేవేంద్రునివలె తేజరిల్లుచుండెను. (13)

అపశ్యద్రాక్షసపతిం హనుమానతితేజసమ్।
విష్ఠితం మేరుశిఖరే సతోయమివ తోయదమ్। 14

ఆ విధముగా మహావైభవోపేతుడై, మేరుశిఖరముపై నిలిచిన సజలమేఘమువలె తేజరిల్లుచున్న రాక్షసేంద్రుని హనుమంతుడు వీక్షించెను- (14)

స తైః సంపీడ్యమానోఽపి రక్షోభిర్భీమవిక్రమైః।
విస్మయం పరమం గత్వా రక్షోఽధిపమవైక్షత। 15

ఘోరపరాక్రమశాలురైన రాక్షసులు తనను మిక్కిలి పీడించుచున్నను ఆ మారుతి పరమాశ్చర్యముతో రావణుని జూచెను. (15)

భ్రాజమానం తతో దృష్ట్వా హనుమాన్ రాక్షసేశ్వరమ్।
మనసా చింతయామాస తేజసా తస్య మోహితః। 16

తేజోవిరాజమానుడైన రావణునిగాంచి, అతని తేజస్సునకు ఆకర్షితుడై, హనుమంతుడు అప్పుడు ఆలోచింపసాగెను. (16)

అహో రూపమహో ధైర్యమ్ అహో సత్త్వమహో ద్యుతిః।
అహో రాక్షసరాజస్య సర్వలక్షణయుక్తతా। 17

"అహో! రావణుని ఈ రూపము అత్యద్భుతము, ధైర్యము నిరుపమానము, సత్త్వము ప్రశంసార్హము, తేజస్సు అసదృశము. నిజముగా ఈ రాక్షసరాజు సర్వలక్షణశోభితుడు. (17)

యద్యధర్మో న బలవాన్ స్యాదయం రాక్షసేశ్వరః।
స్యాదయం సురలోకస్య సశక్రస్యాపి రక్షితా। 18

ప్రబలమైన ఇట్టి అధర్మమునకు ఒడిగట్టకున్నచో, ఈ రావణుడు దేవేంద్రునితోగూడిన సురలోకమునకు సైతము ప్రభువైయుండెడివాడు. (18)

అస్య క్రూరైః నృశంసైశ్చ కర్మభిర్లోకకుత్సితైః।
తేన బిభ్యతి ఖల్వస్మాత్ లోకాస్సామరదానవాః। 19

క్రూరములైన, హింసాత్మకములైన, లోకనింద్యములైన ఇతని అధర్మకృత్యముల కారణముగా సురాసురులతో గూడిన లోకములు అన్నియును ఇతనికి భయపడుచున్నవి. (19)

అయం హ్యుత్సహతే క్రుద్ధః కర్తు మేకార్ణవం జగత్।
ఇతి చింతాం బహువిధామ్ అకరోన్మతిమాన్ హరిః।
దృష్ట్వా రాక్షసరాజస్య ప్రభావమమితౌజసః। 20

ఇతడు క్రుద్ధుడైనచో సమస్తజగత్తును సముద్రమున ముంచి, ప్రళయమును సృష్టించుటకు సమర్థుడు గదా!" మిక్కిలి పరాక్రమశాలియైన రావణునిప్రభావమును గ్రహించి, ప్రతిభామూర్తియైన హనుమంతుడు ఇట్లు పెక్కు రీతుల చింతింపసాగెను. (20)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకోనపంచాశస్సర్గః (49)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది నలుబదితొమ్మిదవసర్గము.

-- * * * --

50. ఏబదియవసర్గము

రావణుడు ప్రహస్తుని చేత హనుమంతుని లంకా ప్రవేశమునకు కారణమడిగించుట, హనుమంతుడు తాను శ్రీరాముని దూతనని తెలుపుట

తముద్వీక్ష్య మహాబాహుః పింగాక్షం పురతః స్థితమ్।
కోపేన మహతావిష్టో రావణో లోకరావణః। 1

మహాబాహువు, లోకకంటకుడు ఐన రావణుడు తన ఎదుటనున్న ఆ వానరోత్తముని పరిశీలనగాజూచి, కోపోద్రిక్తుడాయెను. (1)

శంకాహతాత్మా దధ్యౌ స కపీంద్రం తేజసా వృతమ్।
కిమేష భగవాన్ నందీ భవేత్ సాక్షాదిహాగతః। 2

యేన శప్తోఽస్మి కైలాసే మయా సంచాలితే పురా।
సోఽయం వానరమూర్తిస్స్యాత్ కింస్విద్బాణోఽపి వాఽసురః। 3

మహాతేజస్సుతో ప్రకాశించుచున్న కపివరునిగాంచి, సంశయచిత్తుడై, అతడిట్లు ఆలోచింపసాగెను. "పూర్వము నేను కైలాసపర్వతమును కదిలించినప్పుడు కుపితుడై నన్ను శపించిన నందీశ్వరుడే ఈ రూపముతో ప్రత్యక్షముగా ఇచటికి వచ్చెనా ఏమి? కానిచో ఇతడు వానరరూపమున వచ్చిన ఆ బాణాసురుడై యుండవచ్చును -" (2-3)

స రాజా రోషతామ్రాక్షః ప్రహస్తం మంత్రిసత్తమమ్।
కాలయుక్తమువాచేదం వచో విపులమర్థవత్। 4

రోషముతో కన్నులెఱ్ఱజేసిన ఆ రావణుడు మంత్రిముఖ్యుడైన ప్రహస్తునివైపు చూచి, సందర్భోచితములగు అర్థవంతములైన మాటలను గంభీరముగా ఇట్లు పలికెను- (4)

దురాత్మా పృచ్ఛ్యతా మేష కుత: కిం వాస్య కారణమ్।
వనభంగే చ కోఽస్యార్థో రాక్షసీనాం చ తర్జనే। 5

మత్పురీమప్రధృష్యాం వా గమనే కిం ప్రయోజనమ్।
ఆయోధనే వా కిం కార్యం పృచ్ఛ్యతా మేష దుర్మతి:। 6

రావణస్య వచ: శ్రుత్వా ప్రహస్తో వాక్యమబ్రవీత్।
సమాశ్వసిహి భద్రం తే న భీ: కార్యా త్వయా కపే। 7

యది తావత్ త్వమింద్రేణ ప్రేషితో రావణాలయమ్।
తత్త్వమాఖ్యాహి మాభూత్ తే భయం వానర! మోక్ష్యసే। 8

యది వైశ్రవణస్య త్వం యమస్య వరుణస్య వా।
చారరూపమిదం కృత్వా ప్రవిష్టో న: పురీమిమామ్। 9

విష్ణునా ప్రేషితో వాపి దూతో విజయకాంక్షిణా।
న హి తే వానరం తేజో రూపమాత్రం తు వానరమ్। 10

తత్త్వత: కథయస్వాద్య తతో వానర మోక్ష్యసే।
అనృతం వదతశ్చాపి దుర్లభం తవ జీవితమ్। 11

అథవా యన్నిమిత్తస్తే ప్రవేశో రావణాలయే।
ఏవముక్తో హరిశ్రేష్ఠ: తదా రక్షోగణేశ్వరమ్। 12

అబ్రవీన్నాస్మి శక్రస్య యమస్య వరుణస్య వా।
ధనదేన న మే సఖ్యం విష్ణునా నాస్మి చోదిత:। 13

జాతిరేవ మమ త్వేషా వానరోఽహమిహాగత:।
దర్శనే రాక్షసేంద్రస్య దుర్లభే తదిదం మయా। 14

వనం రాక్షసరాజస్య దర్శనార్థే వినాశితమ్।
తతస్తే రాక్షసా: ప్రాప్తా బలినో యుద్ధకాంక్షిణ:। 15

రక్షణార్థం తు దేహస్య ప్రతియుద్ధా మయా రణే।
అస్త్రపాశై: న శక్యోఽహం బద్ధుం దేవాసురైరపి। 16

పితామహాదేవవరో మమాప్యేషోఽభ్యుపాగత:।
రాజానం ద్రష్టుకామేన మయాస్త్రమనువర్తితమ్। 17

విముక్తో హ్యహమస్త్రేణ రాక్షసైస్త్వభిపీడిత:।
కేనచిద్రాజకార్యేణ సంప్రాప్తోఽస్మి తవాంతికమ్। 18

"ఈ దుష్టుడు ఎచటినుండి వచ్చెను? ఇచ్చటికి వచ్చుటకు కారణమేమి? వనమును నాశమొనర్చుటవలనను, రాక్షసస్త్రీలను భయపెట్టుటలోను అతనికిగల ప్రయోజనమేమి?'- అని ఇతనిని అడుగుము. (5)

ఏ ప్రయోజనమును ఆశించి దుర్భేద్యమైన నా నగరమున ఇతడు ప్రవేశించెను? యుద్ధమొనర్చుటలో ఇతని ఉద్దేశ్యమేమి?- అని ఈ దుర్మతిని అడుగుము"-(6)

రావణుని ఆజ్ఞననుసరించి ప్రహస్తుడు ఇట్లనెను. "ఓ వానరా! ఊరడిల్లుము, నీవు భయపడవలసిన పనిలేదు. నీకు భద్రమగుగాక. దేవేంద్రుడే నిన్ను ఈ లంకానగరమునకు పంపియున్నచో తెలుపుము. నిర్భయముగా నుండుము. నిన్ను బంధవిముక్తుని చేయుదుము. (7-8)

గూఢచారిరూపమున నీవు మానగరమున ప్రవేశించితివి. నిన్ను ఇచటికి పంపినవాడు కుబేరుడా? యముడా? వరుణుడా? లేక విజయకాంక్షతో విష్ణువే నిన్ను దూతగా ఇచటకు పంపెనా? నీవు రూపమునమాత్రమే వానరుడవు, ఇట్టి అద్భుతమైన నీ తేజస్సు వానరమాత్రులకు ఉండదు. (9-10)

ఓ వానరా! నిజము నుడువుము. నీవు ఇప్పుడే బంధవిముక్తుడవు కాగలవు. అనృతమాడినచో నీప్రాణములు దక్కవు. (11)

అట్లుకానిచో నీవు ఈ రావణనగరము (లంక)లో ఎందులకు ప్రవేశించితివి?"- అని ప్రహస్తుడు అడుగగా అప్పుడు హనుమంతుడు రావణునితో ఇట్లు పలికెను. 'నేను ఇంద్రయమవరుణులలో ఎవ్వరిదూతనూ గాను, కుబేరుని మిత్రుడనూగాను, నేను విష్ణు దూతనూగాను (12-13)

నేను సహజముగనే వానరజాతివాడను. నాయంతట నేనే ఈ లంకకు వచ్చితిని. దుర్లభమైన (రావణ) దర్శనమునకై నేను ఇట్లు చేసితిని. (14)

నీ (రావణుని) దర్శనమునకే వనమును పాడుచేసితిని. అప్పుడు బలశాలురైన రాక్షసులు యుద్ధకాంక్షతో వచ్చిపడిరి. నా దేహరక్షణకొఱకు వారిని ఎదిరించి యుద్ధమొనర్చితిని. సురాసురులు సైతము అస్త్రములతో నన్ను బంధింపజాలరు. నీకుమారునకు బ్రహ్మాస్త్రమును అనుగ్రహించిన బ్రహ్మదేవుడే నాకును ఈ వరమును ఇచ్చెను. రాక్షసరాజైన నిన్ను చూచుకోరికతోడనే బుద్ధిపూర్వకముగా ఈ బ్రహ్మాస్త్రమునకు నేను కట్టుపడితిని. (15-17)

నేను బ్రహ్మాస్త్రబంధమునుండి పూర్తిగా విముక్తుడను. ఒకానొక రాజకార్యనిమిత్తమై నేను ఇచటికి వచ్చితిని. నిన్నుచూచుటకే ఈ రాక్షసులు పెట్టుచున్న బాధలను

దూతోఽహ మితి విజ్ఞేయో రాఘవస్యామితౌజసః।
శ్రూయతాం చాపి వచనం మమ పథ్యమిదం ప్రభో। 19

అన్నింటిని ఓర్చుకొనుచుంటిని. ఓ రాజా! మిక్కిలి పరాక్రమవంతుడైన శ్రీరామునిదూతగా నన్నెఱుంగుము. నీకు హితమును గూర్చు నా మాటలను శ్రద్ధగా వినుము- (18-19)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే పంచాశస్సర్గః (50)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదియవసర్గము.

— * * * —

51. ఏబదియొకటవసర్గము

హనుమంతుడు రావణునకు హితమునుపదేశించుట

తం సమీక్ష్య మహాసత్త్వం సత్త్వవాన్ హరిసత్తమః।
వాక్యమర్థవదవ్యగ్రః తమువాచ దశాననమ్। 1

మహాపరాక్రమశాలియైన హనుమంతుడు మిక్కిలి బలపరాక్రమములుగల ఆ రావణునిజూచి, ఎట్టి తత్తఱపాటును లేకుండ అర్థవంతములైన మాటలను అతనితో ఇట్లు పలికెను. (1)

అహం సుగ్రీవసందేశాత్ ఇహప్రాప్త స్తవాలయమ్।
రాక్షసేంద్ర హరీశస్త్వాం భ్రాతా కుశలమబ్రవీత్। 2

సుగ్రీవుని సందేశముతో నీ లంకానగరమునకు వచ్చితిని. సోదరునివలె[1] నీహితమునుగోరు వానరరాజైన ఆ సుగ్రీవుడు రాక్షసరాజువైన నీ క్షేమసమాచారములను అడిగెను. (2)

భ్రాతుః శృణు సమాదేశం సుగ్రీవస్య మహాత్మనః।
ధర్మార్థోపహితం వాక్యమ్ ఇహ చాముత్ర చ క్షమమ్। 3

మహాత్ముడు, నీకు సోదరతుల్యుడును అయిన సుగ్రీవుని సందేశమును వినుము. ఇది ధర్మార్థములతో గూడినది, ఇహపరలోకములయందు శ్రేయస్సును గూర్చునది- (3)

రాజా దశరథోనామ రథకుంజరవాజిమాన్।
పితేవ బంధుర్లోకస్య సురేశ్వరసమద్యుతిః। 4

దశరథుడను పేరుగల ఒక మహారాజు గలడు, అతడు రథాశ్వగజబలములుగలవాడు, లోకమునకు తండ్రి వంటివాడు, బంధువు, ఇంద్రునివలె మహాతేజశ్శాలి. (4)

జ్యేష్ఠ స్తస్య మహాబాహుః పుత్రః ప్రియకరః ప్రభుః।
పితుర్నిదేశాన్నిష్క్రాంతః ప్రవిష్టో దండకావనమ్। 5

లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చాపి భార్యయా।
రామో నామ మహాతేజా ధర్మ్యం పన్థానమాశ్రితః। 6

అతనిపెద్దకుమారునిపేరు శ్రీరాముడు, అతడు ఆజానుబాహువు, ఎల్లరకును ప్రియమును గూర్చువాడు, సర్వసమర్థుడు, మహాపరాక్రమోపేతుడు, ధర్మమార్గానువర్తనుడు. అట్టి శ్రీరాముడు తండ్రిఆజ్ఞానుసారము సోదరుడైన లక్ష్మణునితో, భార్యయైన సీతాదేవితో రాజ్యమును వీడి, దండకారణ్యమున ప్రవేశించెను. (5-6)

తస్య భార్యా వనే నష్టా సీతా పతిమనువ్రతా।
వైదేహస్య సుతా రాజ్ఞో జనకస్య మహాత్మనః। 7

ఆయన భార్యయైన సీతాదేవి మహాసాధ్వి, ఆమె మహాత్ముడు విదేహరాజును అయిన జనకుని కూతురు. ఆమె దండకారణ్యమునందు అపహరింపబడినది. (7)

స మార్గమాణ స్తాం దేవీం రాజపుత్రస్సహానుజః।
ఋష్యమూక మనుప్రాప్తః సుగ్రీవేణ సమాగతః। 8

ఆ రాజపుత్రుడు తమ్ముడైన లక్ష్మణస్వామితోగూడి ఆ సీతాదేవిని వెదకుచు ఋశ్యమూకపర్వతమునుజేరి, సుగ్రీవునితో గలిసెను. (8)

తస్య తేన ప్రతిజ్ఞాతం సీతాయాః పరిమార్గణమ్।
సుగ్రీవస్యాపి రామేణ హరిరాజ్యం నివేదితమ్। 9

సీతాదేవిని వెదకించుటకు సుగ్రీవుడును, వానరరాజ్యమునకు సుగ్రీవుని రాజుగాజేయుటకు శ్రీరాముడును ప్రతినలు పూనిరి. (9)

1) వాలికిని రావణునకును సఖ్యముగలదు. (ఉత్తరకాండము-34వ సర్గమున చూడదగును) వాలికి సోదరుడు అగుటవలన సుగ్రీవుడు రావణుని క్షేమసమాచారములను అడుగుట రాజమర్యాద.

తత స్తేన మృధే హత్వా రాజపుత్రేణ వాలినమ్।
సుగ్రీవః స్థాపితో రాజ్యే హర్యృక్షాణాం గణేశ్వరః। 10

త్వయా విజ్ఞాతపూర్వశ్చ వాలీ వానరపుంగవః।
రామేణ నిహతస్సంఖ్యే శరేణైకేన వానరః। 11

స సీతామార్గణే వ్యగ్రః సుగ్రీవస్సత్యసంగరః।
హరీన్సంప్రేషయామాస దిశస్సర్వా హరీశ్వరః। 12

తాం హరీణాం సహస్రాణి శతాని నియుతాని చ।
దిక్షు సర్వాసు మార్గంతే హ్యధశ్చోపరి చాంబరే। 13

వైనతేయసమాః కేచిత్ కేచిత్ తత్రానిలోపమాః।
అసంగగతయశ్శీఘ్రా హరివీరా మహాబలాః। 14

అహం తు హనుమాన్నామ మారుతస్యౌరసస్సుతః।
సీతాయాస్తు కృతే తూర్ణం శతయోజన మాయతమ్। 15

సముద్రం లంఘయిత్వైవ తాం దిదృక్షురిహాగతః।
భ్రమతా చ మయా దృష్టా గృహే తే జనకాత్మజా। 16

తద్భవాన్ దృష్టధర్మార్థః తపఃకృతపరిగ్రహః।
పరదారాన్ మహాప్రాజ్ఞ! నోపరోద్ధుం త్వమర్హసి। 17

న హి ధర్మవిరుద్ధేషు బహ్వపాయేషు కర్మసు।
మూలఘాతిషు సజ్జంతే బుద్ధిమంతో భవద్విధాః। 18

కశ్చ లక్ష్మణముక్తానాం రామకోపానువర్తినామ్।
శరాణామగ్రతః స్థాతుం శక్తో దేవాసురేష్వపి। 19

న చాపి త్రిషులోకేషు రాజన్ విద్యేత కశ్చన।
రాఘవస్య వ్యలీకం యః కృత్వా సుఖమవాప్నుయాత్। 20

తత్ త్రికాలహితం వాక్యం ధర్మ్యమర్థానుబంధి చ।
మన్యస్వ నరదేవాయ జానకీ ప్రతిదీయతామ్। 21

దృష్టా హీయం మయా దేవీ లబ్ధం యదిహ దుర్లభమ్।
ఉత్తరం కర్మ యచ్ఛేషంనిమిత్తం తత్ర రాఘవః। 22

పిదప రాజకుమారుడైన ఆ శ్రీరాముడు వాలిని యుద్ధము నందు హతమార్చెను. అతడు సుగ్రీవుని వానర భల్లూకములకు ప్రభువుగను, కిష్కింధకు రాజుగను జేసెను. (10)

వానరప్రముఖుడైన వాలి నీకు ఇంతకుముందే తెలియును. శ్రీరాముడు ఆ వానరప్రముఖుని ఒకే ఒక్క బాణముతో రణరంగమున పరిమార్చెను. (11)

సత్యసంధుడు, వానరరాజు ఐన ఆ సుగ్రీవుడు సీతాన్వేషణ తత్పరుడై అన్నిదిశలకును తనవానరులను పంపెను.(12)

లక్షలకొలదిగానున్న ఆ వానరులు సకలదిశలయందును భూమండలమునందును. పాతాళమునందును, ఆకాశము నందును ఆమెను వెదకుచున్నారు. (13)

వారిలో కొందఱు గరుత్మంతునివలె పరాక్రమశాలురు. మఱికొందఱు వాయువేగముతో సాగిపోగలవారు, మహా బలశౌర్యములు గల ఆ వానరవీరులు అడ్డులేని గమనము గలవారై ఎక్కడికైనను శీఘ్రముగా వెళ్ళగలరు. (14)

నా పేరు హనుమంతుడు, నేను వాయుదేవుని పుత్రుడను. సీతాదేవికొఱకై నూఱుయోజనముల పొడవుగల సముద్రమును లంఘించి, ఆమెజాడను తెలిసికొనుటకై తీవ్రవేగముతో ఈ లంకకు వచ్చితిని. ఆమెను అన్వేషించుచు, తిరుగుచున్న నాకు ఆమె ఇచట కనబడినది. (15-16)

ఓ మహాబుద్ధిమంతుడా! నీవు ధర్మార్థములను బాగుగా ఎఱిగినవాడవు, తీవ్రతపస్సులనొనర్చి, గొప్ప వరములను పొందినవాడవు. అట్టి నీవు పరసతులను బంధించుట తగదు.(17)

ధర్మశాస్త్రములకు విరుద్ధములైనవియు, మిక్కిలి అపాయకరములైనవియు, మూలమునకే విచ్ఛిత్తిని గూర్చునవియు అగు దుష్కృత్యములకు మీ వంటి బుద్ధిమంతులు పూనుకొనరు.(18)

క్రుద్ధులైన రామలక్ష్మణులు ప్రయోగించిన బాణములకు ఎదురుగా నిలబడుటకు దేవాసురులలో సైతము ఎవరికి శక్తిగలదు? (ఎవ్వరును నిలువజాలరు.) (19)

ఓ రాజా! ధర్మస్వరూపుడైన శ్రీరామునకు కీడుతలపెట్టిన వానికి ముల్లోకములయందును సుఖము సున్న. (20)

అందువలన సర్వకాలములయందును హితమును గూర్చునదియు, ధర్మబద్ధమైనదియు, అర్థవంతము (ప్రయోజనకారి) ఐనదియు అగు నామాటను ఆలకింపుము, సాక్షాత్తు పురుషోత్తముడైన శ్రీరామునకు జానకీదేవిని అప్పగింపుము.(21)

నేను సీతాదేవిని కనుగొంటిని, ఇతరవానరులకు అలభ్యమైన జానకీదేవి దర్శనము నాకు ఇచట లభించినది. ఇక తరువాత చేయవలసిన కార్యమును శ్రీరాముడే నిర్ణయించును. (22)

లక్షితేయం మయా సీతా తథా శోకపరాయణా।
గృహ్య యాం నాభిజానాసి పంచాస్యామివ పన్నగీమ్। 23

నేయం జరయితుం శక్యా సాసురైరమరైరపి।
విషసంసృష్టమత్యర్థం భుక్తమన్నమివౌజసా। 24

తపస్సంతాపలబ్ధస్తే యోఽయం ధర్మపరిగ్రహః।
న స నాశయితుం న్యాయ్య ఆత్మప్రాణపరిగ్రహః। 25

అవధ్యతాం తపోభిర్యాం భవాన్ సమనుపశ్యతి।
ఆత్మన స్సాసురైర్దేవైః హేతుస్తత్రాప్యయం మహాన్। 26

సుగ్రీవో నహి దేవోఽయం నాసురో న చ రాక్షసః।
న దానవో న గంధర్వో న యక్షో న చ పన్నగః। 27

మానుషో రాఘవో రాజన్ సుగ్రీవశ్చ హరీశ్వరః।
తస్మాత్ ప్రాణపరిత్రాణం కథం రాజన్ కరిష్యసి। 28

న తు ధర్మోపసంహారమ్ అధర్మఫలసంహితమ్।
తదేవ ఫలమన్వేతి ధర్మశ్చాధర్మనాశనః। 29

ప్రాప్తం ధర్మఫలం కృత్స్నం భవతా నాత్ర సంశయః।
ఫలమస్యాప్యధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే। 30

జనస్థానవధం బుద్ధ్వా బుద్ధ్వా వాలివధం తథా।
రామసుగ్రీవసఖ్యం చ బుద్ధ్యస్వ హిత మాత్మనః। 31

కామం ఖల్వహమప్యేకః సవాజిరథకుంజరామ్।
లంకాం నాశయితుం శక్తః తస్యైష తు న నిశ్చయః। 32

శ్రీరాముని స్మరించుచు ఇచట శోకాకులయైయున్న సీతాదేవిని నేను చూచితిని. నీవు అపహరించి, తీసికొని వచ్చిన సీతాదేవి నిన్ను, నీలంకను కాటువేయనున్న ఐదుపడగలఆడుసర్పమని ఎఱుంగకున్నావు. ఆమె నీపాలిటి మృత్యుదేవత సుమా! (23)

మిక్కిలి విషపూరితమైన అన్నమును భుజించి, ఎంతటి జఠరాగ్ని కలిగినవాడైనను దానిని జీర్ణించుకొనజాలడు. అట్లే ఎంతటి పరాక్రమవంతులైనను, ఆ సురాసురులు సైతము, సీతాదేవిని వశమొనర్చుకొనజాలరు. (24)

నీవు ధర్మమును ఆచరించుచు పెక్కుకష్టములను ఓర్చుకొని తపస్సుచేసితివి. తత్ఫలితముగా మరణములేని వరమును పొందితివి. అట్టి తపఃప్రభావమును చేతులార నాశనముచేసికొనుట యుక్తము కాదు. (25)

కఠినమైన తపశ్చర్యల ఫలితముగా నీవు దేవతలవలన గాని, అసురులవలన గాని మరణములేకుండ వరమును పొందితివి. ఐనను నీ మరణమునకు అనివార్యమైన గొప్ప హేతువులు గలవు. (26)

దేవతలు, అసురులు, రాక్షసులు, దానవులు, గంధర్వులు, యక్షులు, నాగులు మొదలగువారిలో సుగ్రీవుడు ఏ జాతికిని చెందినవాడు గాడు. శ్రీరాముడు మానవుడు, సుగ్రీవుడు కపీశ్వరుడు. (నీవు నరవానరులవలన మరణములేకుండునట్టి వరమును పొందలేదుగదా!) కనుక ఓ రాక్షసరాజా! నీ ప్రాణములను ఎట్లు కాపాడుకొనగలవు? (27-28)

ధర్మఫలము, అధర్మఫలము ఎప్పుడునూ కలిసియుండవు. ధర్మకార్యము శుభఫలమును, అధర్మకార్యము అశుభఫలములను ఇచ్చును. ధర్మకార్యాచరణమువలన అధర్మకార్యఫలము నశింపదు.[1] "అవశ్యమనుభోక్తవ్యమ్, కృతం కర్మ శుభాఽశుభమ్-" అనిగదా! ఆర్యోక్తి- (29)

నీవు ఆచరించిన ధర్మఫలము పూర్తిగా నీకు లభించినది. ఇందు ఏమాత్రము సందేహము లేదు. ఇప్పటి నీఅధర్మఫలమును శీఘ్రముగనే పొందగలవు. (30)

దండకారణ్యమునందలి ఖరదూషణాదులవధను, కిష్కింధ యందలి వాలివధను, రామసుగ్రీవులమైత్రీబంధమును జ్ఞప్తికి దెచ్చుకొని, నీహితమునుగూర్చి బాగుగా ఆలోచింపుకొనుము. (31)

హయ, రథ, గజ బలములతో గూడిన నీ లంకను సర్వనాశనము చేయుటకు నేనొక్కడనే చాలుదును సుమా! కాని అందులకు శ్రీరామునిఅనుమతి లేదు. (32)

1) జనులు పెక్కువిధముల పాపకార్యములను ఆచరించుచు ఆ పాపఫలములనుండి విముక్తిని ఆశించుచు కొన్ని దానధర్మములను చేయుచుందురు. కాని అట్లు జరుగదు. అనన్యభక్తితో భగవంతుని సేవించిన వారుమాత్రము పాపప్రవృత్తినుండి బయట పడుదురు.

రామేణ హి ప్రతిజ్ఞాతం హర్యృక్ష గణసన్నిధౌ।
ఉత్సాదనమమిత్రాణాం సీతా యైస్తు ప్రధర్షితా। 33

అపకుర్వన్హి రామస్య సాక్షాదపి పురందరః।
న సుఖం ప్రాప్నుయాదన్యః కింపునః త్వద్విధో జనః। 34

యాం సీతేత్యభిజానాసి యేయం తిష్ఠతి తే గృహే।
కాలరాత్రీతి తాం విద్ధి సర్వలంకావినాశినీమ్। 35

తదలం కాలపాశేన సీతావిగ్రహరూపిణా।
స్వయం స్కంధావసక్తేన క్షేమమాత్మని చింత్యతామ్। 36

సీతాయాస్తేజసా దగ్ధాం రామకోపప్రదీపితామ్।
దహ్యమానామిమాం పశ్య పురీం సాట్టప్రతోలికామ్। 37

స్వాని మిత్రాణిమంత్రీంశ్చ జ్ఞాతీన్ భ్రాతౄన్ సుతాన్ హితాన్।
భోగాన్దారాం శ్చ లంకాం చ మా వినాశ ముపానయ। 38

సత్యం రాక్షసరాజేంద్ర శృణుష్వ వచనం మమ।
రామదాసస్య దూతస్య వానరస్య విశేషతః। 39

సర్వాన్ లోకాన్ సుసంహృత్య సభూతాన్ సచరాచరాన్।
పునరేవ తథా స్రష్టుం శక్తో రామో మహాయశాః। 40

దేవాసురనరేంద్రేషు యక్షరక్షోగణేషు చ।
విద్యాధరేషు సర్వేషు గంధర్వేషూరగేషు చ। 41

సిద్ధేషు కిన్నరేంద్రేషు పతత్రిషు చ సర్వతః।
సర్వభూతేషు సర్వత్ర సర్వకాలేషు నాస్తి సః।
యో రామం ప్రతి యుధ్యేత విష్ణుతుల్యపరాక్రమమ్। 42

సర్వలోకేశ్వరస్యైవం కృత్వా విప్రియ మీదృశమ్।
రామస్య రాజసింహస్య దుర్లభం తవ జీవితమ్। 43

"సీతాదేవిని అవమానపఱచిన (అపహరించిన) శత్రువులను హతమార్చి తీఱుదును." అని శ్రీరాముడు భల్లూకవానరుల సమక్షమున ప్రతిన బూనియున్నాడు. (ఆ కార్యమును నేనుజేసినచో ఆస్వామిప్రతిజ్ఞ భంగమగును.) (33)

శ్రీరామునకు అపకారము చేయువాడు సాక్షాత్తు ఆ దేవేంద్రుడే ఐనను అతడు సుఖమును పొంద (జీవించియుండ) జాలడు. ఇంక నీవంటి సామాన్యుల విషయము చెప్పనేల? (34)

నీవు అపహరించుకొని వచ్చి, నీ లంకలో నిర్బంధించిన సీత సామాన్య స్త్రీయే యని తలంచుచున్నావు. కాని ఆమె నీలంకను సర్వనాశనమొనర్చెడి నీపాలిటి 'కాళరాత్రి'యని ఎఱుంగుము. (35)

సీతాదేవిస్వరూపముననున్న ప్రబలమైన కాలపాశమును నీవే స్వయముగా నీ మెడకు చుట్టుకొంటివి. (ఆమె తనకు తానుగా రాలేదు.) ఇక నీవు క్షేమముగా ఎట్లుందువు? ఆలోచింపుము. (36)

'ఎత్తైన బురుజులతో, విశాలమైన వీథులతో గూడియున్న ఈ లంకానగరము సీతాదేవితేజస్సుచే దగ్ధమైనది. శ్రీరాముని కోపజ్వాలలతో ఇంకను మండిపోవుచున్నది. అని యెఱుంగుము. మంటలలోనున్న నగరమును చూడుము. (ఇప్పటికైనను తెలివి తెచ్చుకొని, నిన్ను, నీలంకను కాపాడుకొనుము) (37)

ఆత్మీయులైన మిత్రులను, మంత్రులను, బంధువులను, సోదరులను, సుతులను, హితులను, భోగైశ్వర్యములను, భార్యలను వేయేల కడకు నీ బంగారులంకను నీవు చేతులార వినాశమునకు గురిచేయవద్దు. (38)

ఓ రాక్షసరాజా! నేను శ్రీరామునిబంటును, ఆయన శక్తితో నేను ఏమైనను చేయగలను, దూతను, నీకు హితోపదేశము చేయుట నావిధి. విశేషించి వానరుడను, శ్రీరాముడు మానవుడు. నీవు రాక్షసుడవు, కావున నేను మధ్యస్థుడను. (నాకు ఎట్టి పక్షపాతమూ లేదు) నా సత్యవచనమును ఆలకింపుము.(39)

మహాయశస్వియైన శ్రీరాముడు రుద్రునివలె సమస్త లోకములను సంహరింపగలడు. పంచభూతాత్మకములైన చరాచరములతోనిండినవాటినన్నింటిని మఱల అదే విధముగా క్షణకాలములో సృష్టింపగలడు. (40)

దేవతలలో, అసురులలో, నరేంద్రులలో, యక్షులలో, రాక్షసులలో, విద్యాధరులలో, సమస్తగంధర్వులలో, నాగులలో, సిద్ధులలో, కిన్నరులలో, పక్షులలో, సకల ప్రాణులలో ఎవ్వరును విష్ణుతుల్యపరాక్రముడైన శ్రీరాముని ఎదిరించి యుద్ధము చేయుటకు ఏవిధముగనైనను, ఎచ్చటనైనను, ఏ కాలమునందైనను సమర్థులుగారు. (41-42)

సకలలోకములకు ప్రభువు, రాజశ్రేష్ఠుడు ఐన శ్రీరామునియెడ ఈ విధముగా ఘోరమైన అపరాధము గావించి, ఇక నీవు జీవించియుండుట అసాధ్యము. (43)

దేవాశ్చ దైత్యాశ్చ నిశాచరేంద్ర
గంధర్వ విద్యాధర నాగయక్షాః ।
రామస్య లోకత్రయ నాయకస్య
స్థాతుం న శక్తాః సమరేషు సర్వే । 44

ఓ రాక్షసరాజా! దేవతలు, దైత్యులు, గంధర్వులు విద్యాధర, నాగ, యక్షులు మొదలైనవారు విడివిడిగాగాని, కలిసిగాని, ముల్లోకాధిపతియైన శ్రీరామునకు ఎదురుగా యుద్ధములయందు నిలువజాలరు- (44)

బ్రహ్మా స్వయంభూ శ్చతురాననో వా
రుద్రస్త్రినేత్ర స్త్రిపురాంతకో వా ।
ఇంద్రో మహేంద్ర స్సురనాయకో వా
త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్ । 45

సమరమున శ్రీరామునిచేతిలో చావుమూడినవానిని స్వయంభువు, చతుర్ముఖుడు ఐన బ్రహ్మగాని, త్రినేత్రుడు, త్రిపురాంతకుడు ఐన రుద్రుడుగాని, మహైశ్వర్యసంపన్నుడు, సురపతియు ఐన దేవేంద్రుడు గాని రక్షింపజాలరు. అనగా అట్టివానిని ఎవ్వడును రక్షింపలేడు. (45)

స సౌష్ఠవోపేతమదీనవాదినః
కపేర్నిశమ్యా ప్రతిమోఽప్రియం వచః ।
దశాననః కోపవివృత్తలోచనః
సమాదిశత్ తస్య వధం మహాకపేః । 46

నిర్భయముగా మాట్లాడుచున్న హనుమంతునియొక్క సహేతుకములైన, తనకు అప్రియములైన హిత[1] వచనములను సాటిలేనివాడగు ఆరావణుడు వినెను. పిమ్మట అతడు కోపముతో గుడ్లురుముచున్నవాడై ఆ వానరోత్తముని చంపుటకు ఆదేశించెను. (46)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకపంచాశస్సర్గః *(51)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదియొకటవసర్గము.

-- ✳ ✳ ✳ --

52. ఏబదిరెండవసర్గము

"దూతను వధింపదగదు"- అని విభీషణుడు రావణునకు తెలుపుట

తస్య తద్వచనం శ్రుత్వా వానరస్య మహాత్మనః ।
ఆజ్ఞాపయద్వధం తస్య రావణః క్రోధమూర్ఛితః । 1

వధే తస్య సమాజ్ఞప్తే రావణేన దురాత్మనా ।
నివేదితవతో దౌత్యం నానుమేనే విభీషణః । 2

మహాపరాక్రమశాలియైన ఆ హనుమంతుడు పలికిన హితోక్తులనువిని, క్రోధోద్రిక్తుడైన రావణుడు అతనిని సంహరింపుడని ఆజ్ఞాపించెను. దుష్టుడైన రావణుడు హనుమంతుని చంపుటకు ఆదేశించెను 'దూతగావచ్చినవానిని చంపుటకు విభీషణుడు అంగీకరింపలేదు. ఏలనన యజమాని మాటలను వినిపించుట దూతధర్మముగదా!(1-2)

తం రక్షోఽధిపతిం క్రుద్ధం తచ్చ కార్యముపస్థితమ్ ।
విదిత్వా చింతయామాస కార్యం కార్యవిధౌ స్థితః । 3

రాక్షసరాజైన రావణుడు క్రుద్ధుడై తలపెట్టిన కార్యమునెఱింగి, దానిని నివారించుటకై కార్యాకార్యవిచక్షణ గల విభీషణుడు 'ఇట్లు' ఆలోచింపసాగెను. (3)

నిశ్చితార్థస్తతస్సామ్నాఽఽ పూజ్య శత్రుజిదగ్రజమ్ ।
ఉవాచ హిత మత్యర్థం వాక్యం వాక్యవిశారదః । 4

అంతశ్శత్రువులను జయించినవాడు, మాట నేర్పుగలవాడు, కర్తవ్య-అకర్తవ్య నిశ్చయముగలవాడు ఐన విభీషణుడు వినమ్రుడై అగ్రజుని ప్రశంసించుచు మిక్కిలి హితకరములైన వచనములను సగౌరవముగా పలికెను- (4)

---

1) శ్లో॥ సులభాః పురుషా రాజన్ సతతం ప్రియవాదినః । అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥
ఓ రాజా! ముఖప్రీతికొఱకై ప్రియముగా మాట్లాడువారు లోకములో కొల్లలుగానుందురు. కాని అవి హితకరములేయైనను అప్రియవచనములను పలికెడివారుగాని, వినెడివారుగాని ఉండరు-
వాల్మీకిరామాయణము-అరణ్యాకాండము 37వ సర్గము- 2వ శ్లోకము,యుద్ధకాండము-16వ సర్గము, 21వ శ్లోకము

క్షమస్వ రోషం త్యజ రాక్షసేంద్ర
ప్రసీద మద్వాక్య మిదం శృణుష్వ ।
వధం న కుర్వంతి పరావరజ్ఞాః
దూతస్య సంతో వసుధాధిపేంద్రాః । 5

రాజధర్మవిరుద్ధం చ లోకవృత్తేశ్చ గర్హితమ్।
తవ చాసదృశం వీర కపేరస్య ప్రమాపణమ్। 6

"ఓ రాక్షసరాజా! క్షమింపుము, కోపమును వీడుము, ప్రసన్నుడవు కమ్ము. దయయుంచి నేను చెప్పబోవుచున్న వచనములను వినుము, ఉచితానుచితములను ఎఱిగిన, సజ్జనులగు రాజశ్రేష్ఠులు దూతను వధింపరు. ఓ మహావీర! ఈ దూతను చంపుట రాజధర్మమునకు విరుద్ధము, ఇది లోకమర్యాదయుగాదు, నింద్యము, పైగా ఇతడు వానరుడు. మీ వంటివానికి ఇది ఏ మాత్రము తగదు. (5-6)

ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ రాజధర్మవిశారదః।
పరావరజ్ఞో భూతానాం త్వమేవ పరమార్థవిత్। 7

గృహ్యంతే యది రోషేణ త్వాదృశోఽపి విపశ్చితః।
తత శ్శాస్త్ర విపశ్చిత్త్వం శ్రమ ఏవ హి కేవలమ్। 8

నీవు ధర్మమునెఱిగినవాడవు, కృతజ్ఞుడవు, రాజధర్మకోవిదుడవు, యుక్తాయుక్తములు తెలిసినవాడవు, ప్రాణికోటిలో మంచిచెడ్డలను బాగుగా తెలిసినవాడవు, పరమార్థము నెఱిగినవాడవు నీవే! నీ వంటి జ్ఞానులుగూడ రోషవశులైనచో, కష్టపడి శాస్త్రపాండిత్యమును సంపాదించుట కేవలము వృథాశ్రమయే- (7-8)

తస్మాత్ ప్రసీద శత్రుఘ్న రాక్షసేంద్ర! దురాసద।
యుక్తాయుక్తం వినిశ్చిత్య దూతదండో విధీయతామ్। 9

కావున ఓ అరిమర్దనా! ఎదిరింప శక్యముకానివాడా! రాక్షసరాజా! ప్రసన్నుడవగుము, ఉచితానుచితములను విచారించి, దూతకు తగిన శిక్షను విధింపుము." (9)

విభీషణవచః శ్రుత్వా రావణో రాక్షసేశ్వరః।
రోషేణ మహతావిష్టో వాక్యముత్తర మబ్రవీత్। 10

రాక్షసప్రభువైన రావణుడు విభీషణుని వచనములను విని, మిక్కిలి క్రోధవివశుడై ఇట్లు నుడివెను. (10)

న పాపానాం వధే పాపం విద్యతే శత్రుసూదన।
తస్మాదేనం వధిష్యామి వానరం పాపకారిణమ్। 11

"ఓ శత్రుమర్దనా! పాపులను వధించుట దోషము ఏమాత్రము గాదు. అందువలన పాపకృత్యములనొనర్చిన ఈ వానరుని తప్పక వధించెదను." (11)

అధర్మమూలం బహుదోషయుక్తమ్
అనార్యజుష్టం వచనం నిశమ్య ।
ఉవాచ వాక్యం పరమార్థతత్త్వం
విభీషణో బుద్ధిమతాం వరిష్ఠః । 12

అధర్మమునకు మూలమైనదియు, పెక్కుదోషములు గలదియు, సజ్జనులు సమ్మతింపనిదియునైన రావణుని వచనమును విని, బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన విభీషణుడు యథార్థముగా మిక్కిలి హితకరమైన వచనమును ఇట్లు పలికెను. (12)

ప్రసీద లంకేశ్వర రాక్షసేంద్ర
ధర్మార్థయుక్తం వచనం శృణుష్వ ।
దూతా న వధ్యాః సమయేషు రాజన్
సర్వేషు సర్వత్ర వదంతి సంతః । 13

"లంకాధిపతివైన ఓ రాక్షసరాజా! మన్నింపుము, ధర్మార్థ యుక్తమైన నావచనమును ఆలకింపుము- ఓ ప్రభూ! ఏ కాలములయందైనను, ఏదేశములయందైనను, ఎట్టిపరిస్థితులలోను దూతలను వధించుట తగదని సజ్జనులు పల్కెదరు.(13)

అసంశయం శత్రురయం ప్రవృద్ధః
కృతం హ్యనేనాప్రియమప్రమేయమ్ ।
న దూతవధ్యాం ప్రవదంతి సంతో
దూతస్య దృష్టా బహవో హి దండాః । 14

ఇతడు ప్రబలశత్రువే, అందుకు సందేహములేదు. ఇతడు (మనకు) చెప్పలేనంత అపకారమొనర్చినాడు. ఐనను దూతను వధింపరాదని సత్పురుషులు వచింతురు. దూతను దండించు పద్ధతులు ఇంకను పెక్కుగలవు.(14)

వైరూప్యమంగేషు కశాభిఘాతో
మౌండ్యం తథా లక్ష్మణసన్నిపాతః ।
ఏతాన్ హి దూతే ప్రవదంతి దండాన్
వధస్తు దూతస్య న నః శ్రుతోఽపి । 15

అంగములకు వికారరూపమును గూర్చుట, కొరడాతో దెబ్బలు కొట్టుట, శిరోముండనము గావించుట, శరీరముపై వాతలు వేయుట అనునవి దూతను దండించు పద్ధతులని ప్రాజ్ఞులు పేర్కొనిరి. దూతను వధించుటను గూర్చి (ఇంత వఱకు) మనము వినియేయుండలేదు. (15)

కథం చ ధర్మార్థ వినీతబుద్ధిః
పరావరప్రత్యయనిశ్చితార్థః ।
భవద్విధః కోపవశే హి తిష్ఠేత్
కోపం నియచ్ఛంతి హి సత్త్వవంతః । 16

నీవు బుద్ధిబలముచే ధర్మార్థములను బాగుగా ఎఱిగినవాడవు, యుక్తాయుక్తవిచక్షణతో తగిన నిర్ణయము చేయగలవాడవు, అట్టి ప్రాజ్ఞుడవైన నీవు కోపవశుడవైయుండుట యెట్లు? జ్ఞానులు కోపమును నిగ్రహింపుకొందురు. (16)

న ధర్మవాదే న చ లోకవృత్తే
న శాస్త్రబుద్ధిగ్రహణేషు చాపి ।
విద్యేత కశ్చిత్ తవ వీర తుల్యః
త్వం హ్యుత్తమ స్సర్వసురాసురాణామ్ । 17

పరాక్రమోత్సాహమనస్వినాం చ
సురాసురాణామపి దుర్జయేన ।
త్వయాఽప్రమేయేణ సురేంద్రసంఘాః
జితాశ్చ యుద్ధేష్వసకృన్నరేంద్రాః । 18

ఇత్థం విధస్యామరదైత్యశత్రోః
శూరస్య వీరస్య తవాజితస్య ।
కుర్వంతి వీరా మనసాప్యలీకం
ప్రాణైర్విముక్తా న తు భోః పురా తే । 19

న చాప్యస్య కపేర్ఘాతే కంచిత్ పశ్యామ్యహం గుణమ్ ।
తేష్వయం పాత్యతాం దండో యైరయం ప్రేషితః కపిః । 20

సాధుర్వా యదివాఽసాధుః పరై రేష సమర్పితః ।
బ్రువన్ పరార్థం పరవాన్ న దూతో వధమర్హతి । 21

అపిచాస్మిన్ హతే రాజన్ నాన్యం పశ్యామి ఖేచరమ్ ।
ఇహ యః పునరాగచ్ఛేత్ పరంపారం మహోదధేః । 22

తస్మాన్నాస్య వధే యత్నః కార్యః పరపురంజయ ।
భవాన్ సేంద్రేషు దేవేషు యత్నమాస్థాతు మర్హతి । 23

అస్మిన్ వినష్టే న హి దూత మన్యం
పశ్యామి యస్తౌ నరరాజపుత్రౌ ।
యుద్ధాయ యుద్ధప్రియ దుర్వినీతా
వుద్యోజయేద్దీర్ఘపథావరుద్ధౌ । 24

పరాక్రమోత్సాహమనస్వినాం చ
సురాసురాణామపి దుర్జయేన ।
త్వయా మనోనందన నైరృతానాం
యుద్ధాయతిర్నాశయితుం న యుక్తా । 25

హితాశ్చ శూరాశ్చ సమాహితాశ్చ
కులేషు జాతాశ్చ మహాగుణేషు ।
మనస్వినః శస్త్రభృతాం వరిష్ఠాః
కోట్యగ్రశస్తే సుభృతాశ్చ యోధాః । 26

ఓ వీరా! ధర్మశాస్త్రపరిజ్ఞానమునందును, లౌకికాచారముల యందును, శాస్త్రార్థములను గ్రహించుటలోను, ఇతరుల మనస్సులను అవగాహన చేసికొనుటలోను నీకు దీటైన వాడెవ్వడునులేడు. సురాసురులందఱిలోను నీవే శ్రేష్ఠుడవు. (17)

పరాక్రమము, ఉత్సాహశక్తి, మనోబలముగల దేవతలకును అసురులకును నీవు దుర్జయుడవు, అట్టి సాటిలేనిశక్తిగల నీచేతిలో దేవతలును, నరేంద్రులును పెక్కుపర్యాయములు యుద్ధమున పరాజితులైరి. (18)

ఇట్టిగుణములుగల నీవు అమరులకును, దైత్యులకును భీతిగొలుపువాడవు, శూరుడవు, వీరుడవు, అజేయుడవు, అట్టి నీకు ఎవ్వరును మనస్సునగూడ కీడు తలపెట్టరు. ఓ మహారాజా! పూర్వము నీకు హానిచేయ సంకల్పించిన వీరులెల్లరును వెంటనే అసువులను కోల్పోయినవారే. (19)

ఈ కపిని వధించుటవలన ఎట్టిప్రయోజనమూ నాకు కనబడుటలేదు. ఈ మరణదండనను ఈతనిని పంపిన వారికి విధింపవలెను. (20)

ఈవానరుడు మంచివాడైనను, చెడ్డవాడైనను శత్రువులచేత పంపబడినవాడు. ఇతడు అస్వతంత్రుడు, వారిమాటలను వినిపించుచున్నవాడుమాత్రమే. కనుక ఈ దూత వధార్హుడుగాడు. ఇంకను, ఓ రాక్షసప్రభూ! 'ఇతనిని చంపినచో మఱియొకడెవ్వడును ఆకాశమార్గమున ఈ మహోదధిని దాటి ఇచటికి రాగలవాడు ఉండడు'- అని నాకు తోచుచున్నది. (ఇతనిని ప్రాణములతో విడిచిపెట్టినచో ఇతడు రామలక్ష్మణుల కడకు వెళ్ళి, ఇచటి సమాచారమును అంతయును వారికి దెలుపును. అపుడు వారు ఇచటికి వత్తురు. ఆ పిమ్మట శత్రువులను తుదముట్టించుట సులభమగును.) ఓ శత్రుమర్దనా! అందువలన ఈతనిని వధించుప్రయత్నము చేయదగదు. నీవు ఈ ప్రయత్నమును ఇంద్రాది దేవతల విషయమున జరుపుట తగును. (ఈ చిన్నివానరునిపై నీపరాక్రమమును చూపుట ఎందుకు?) (21-23)

ఓయుద్ధప్రియా! బలగర్వితులైన ఆ రాజకుమారులు ఇప్పటికి మిక్కిలిదూరముగా (సుదీర్ఘమైన ఈ మహాసాగరమునకు ఆవలితీరమున) ఉన్నారు. ఇతనిని వధించినచో మఱియొక దూత ఉండడని నాకు తోచుచున్నది. (24)

రాక్షసుల (మనస్సుల)కు ఆనందమును కలిగించువాడా! నీవు సురాసురులకును అజేయుడవు. పరాక్రమము, ఉత్సాహము, మనోబలముగల రాక్షసులకు వచ్చిన ఈ యుద్ధావకాశమును నీవు చేతులార విడిచి పెట్టుట యుక్తముకాదు. (25)

నీకు హితులు, శూరులు, అతిజాగరూకులై యుద్ధసన్నద్ధులై యున్నవారు, సద్గుణవంశసంజాతులు, మనోబలముగలవారు, శస్త్రధారులలో శ్రేష్ఠులు, నీచే పోషింపబడుచున్నవారు ఐన కోట్లాది

తదేక దేశేన బలస్య తావత్
కేచిత్ తవాదేశకృతోఽభియాంతు ।
తౌ రాజపుత్రౌ వినిగృహ్య మూఢౌ
పరేషు తే భావయితుం ప్రభావమ్ ॥ 27

యోధులు నీకు తోడుగాగలరు- అట్టి నీసైన్యములో భాగమైన కొందఱు యోధులు నీ ఆజ్ఞానువర్తులై (వెళ్ళి) మూఢులైన ఆరాజపుత్రులను బందించెదరు. అప్పుడు నీ పరాక్రమము ఎంతటిదో నీ శత్రువులకు తెలిసివచ్చును." (26-27)

నిశాచరాణామధిపోఽనుజస్య
విభీషణస్యోత్తమవాక్యమిష్టమ్ ।
జగ్రాహ బుద్ధ్యా సురలోకశత్రుః
మహాబలో రాక్షసరాజముఖ్యః ॥ 28

రాక్షసులకు ప్రభువు, దేవతలకు శత్రువు, మహాబలశాలి, రాక్షసరాజులలో ప్రముఖుడు ఐన రావణుడు తమ్ముడైన విభీషణునిసూచనను ఉత్తమమైనదిగా భావించి, మనస్పూర్తిగా అంగీకరించెను. (28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ద్విపంచాశస్సర్గః *(52)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదిరెండవసర్గము.

— * * * —

53. ఏబదిమూడవసర్గము

రాక్షసులు హనుమంతునితోకకు నిప్పంటించి, నగరములో త్రిప్పుట

తస్య తద్వచనం శ్రుత్వా దశగ్రీవో మహాబలః ।
దేశకాలహితం వాక్యం భ్రాతురుత్తర మబ్రవీత్ ॥ 1

మహాబలశాలియైన రావణుడు దేశకాలములకు అనుగుణముగా తనతమ్ముడు పలికిన వచనములను విని, అతనితో ఇట్లు నుడివెను. (1)

సమ్యగుక్తం హి భవతా దూతవధ్యా విగర్హితా ।
అవశ్యంతు వధాదన్యః క్రియతామస్య నిగ్రహః ॥ 2

నీవు చెప్పినది యుక్తమే. దూతను వధించుట నిజముగా నింద్యమే. ఈ వానరుని వధించుటమాని వీనిని మఱియొక రీతిగానైనను శిక్షించియే తీరవలెను. (2)

కపీనాం కిల లాంగూలమ్ ఇష్టం భవతి భూషణమ్ ।
తదస్య దీప్యతాం శీఘ్రం తేన దగ్ధేన గచ్ఛతు ॥ 3

వానరులకు వాలముపై మక్కువ ఎక్కువ. అదియే వారికి అలంకారము. వెంటనే ఇతనివాలమునకు నిప్పు అంటించుడు. ఇతడు కాలినవాలముతో వెళ్ళిపోవును. (3)

తతః పశ్యంత్విమం దీనమ్ అంగవైరూప్యకర్శితమ్ ।
సమిత్రజ్ఞాతయస్సర్వే బాంధవాస్ససుహృజ్జనాః ॥ 4

తిరిగి వెళ్లిన పిమ్మట అంగవికారబాధచే దీనుడైయున్న ఇతనిని మిత్రులు, ఆప్తులు, బంధువులు, సుహృదులు మొదలగు వారందఱును చూచెదరు. (4)

ఆజ్ఞాపయద్రాక్షసేంద్రః పురం సర్వం సచత్వరమ్ ।
లాంగూలేన ప్రదీప్తేన రక్షోభిః పరిణీయతామ్ ॥ 5

'మండుచున్న తోకతో ఈ కోతిని కూడళ్లయందును, పురమునందంతటను త్రిప్పుడు'- అని రావణుడు రాక్షసులను ఆజ్ఞాపించెను. (5)

తస్య తద్వచనం శ్రుత్వా రాక్షసాః కోపకర్శితాః ।
వేష్టయంతిస్మ లాంగూలం జీర్ణైః కార్పాసకైః పటైః ॥ 6

రాక్షసులు ఆ రావణుని ఆదేశవచనమును విన్నంతనే కోపోద్రిక్తులై హనుమంతునివాలమునకు చినిగిపోయిన నూలువస్త్రములను, తక్కిన గుడ్డలను చుట్టిరి. (6)

సంవేష్ట్యమానే లాంగూలే వ్యవర్ధత మహాకపిః ।
శుష్కమింధనమాసాద్య వనేష్వివ హుతాశనః ॥ 7

ఆ వానరోత్తముడు తనవాలమునకు రాక్షసులు బట్టలను చుట్టునప్పుడు వనములలో మోడువారి, ఎండియున్నచెట్లకు అంటుకొనిన అగ్నివలె వృద్ధిచెందెను. (7)

తైలేన పరిషిచ్యాథ తేఽగ్నిం తత్రాభ్యపాతయన్।
లాంగూలేన ప్రదీప్తేన రాక్షసాంస్తానపాతయత్।
రోషామర్షపరీతాత్మా బాలసూర్యసమాననః। 8

ఆ రాక్షసులు ఆయన వాలమును నూనెతో తడిపి, దానికి నిప్పంటించిరి. వెంటనే ఆతడు రోషావేశముతో కోపోద్రిక్తుడై బాలసూర్యునివంటి ముఖకాంతులతో తేజరిల్లుచు మండుచున్న (తన) వాలముతో ఆ రాక్షసులను పాఱద్రోలెను. (8)

లాంగూలం సంప్రదీప్తంతు ద్రష్టుం తస్య హనూమతః।
సహస్త్రీబాలవృద్ధాశ్చ జగ్ముః ప్రీతా నిశాచరాః। 9

రాక్షసులెల్లరును అందుకు సంతోషించి, బాగుగా మండుచున్న ఆ హనుమంతునిలోకను వినోదముగా జూచుటకై స్త్రీలతో, బాలురతో, వృద్ధులతోగూడి అచటికి చేరిరి. (9)

స భూయ స్సంగతైః క్రూరై రాక్షసైర్హరిసత్తమః।
నిబద్ధః కృతవాన్ వీరః తత్కాలసదృశీం మతిమ్। 10

క్రూరులైన ఆ రాక్షసులందఱును కలిసి, ఆ వానరోత్తముని దృఢముగా బంధించిరి. ఆబంధములనుండి బయటపడగల సామర్థ్యమున్నను, అప్పుడా వీరుడు సమయస్ఫూర్తితో తగువిధముగా ఆలోచించి, ఆబంధములలోనే ఉండిపోయెను. (10)

కామం ఖలు న మే శక్తా నిబద్ధస్యాపి రాక్షసాః।
ఛిత్త్వా పాశాన్ సముత్పత్య హన్యా మహ మిమాన్ పునః। 11

"ఈ రాక్షసులు నన్ను బంధించినను వారేమియు చేయజాలరు. కావున నేను ఈ పాశములను త్రెంచుకొని ఆకసమున కెగిరి వీరిని చంపివేసెదను. (11)

యది భర్తుర్హితార్థాయ చరంతం భర్తృశాసనాత్।
బధ్నంత్యేతే దురాత్మానో నతు మే నిష్కృతిః కృతా। 12

నాస్వామియైన శ్రీరాముని కార్యసిద్ధికై ప్రయత్నించుచున్న నన్ను ఈ దుర్మార్గులు రావణుని ఆజ్ఞతో బంధించిరి. నేను వారికి కల్గించిన కష్టనష్టములముందు ఇది ఏమాత్రమూ లెక్కలోనికిరాదు. (12)

సర్వేషామేవ పర్యాప్తో రాక్షసానామహం యుధి। 13

కింతు రామస్య ప్రీత్యర్థం విషహిష్యేఽహ మీదృశమ్।
లంకా చారయితవ్యా వై పునరేవ భవేదితి। 14

యుద్ధమునందు రాక్షసులనందఱిని ఎదుర్కొనుటకు నేనొక్కడనే చాలుదును. శ్రీరామునిప్రీతికై ఈ బంధనమును నేను సహించెదను. ఈ నెపముతోనైనను లంకను పరిశీలించుచు మఱియొకసారి తిరిగి చూడనచ్చును. (13-14)

రాత్రౌ నహి సుదృష్టా మే దుర్గకర్మవిధానతః।
అవశ్యమేవ ద్రష్టవ్యా మయా లంకా నిశాక్షయే। 15

ఇంతకుముందు రాత్రివేళ దుర్గనిర్మాణవిధానమును (నగర రక్షణకై రహస్యములైన ఏర్పాట్లను) నేను సరిగా చూడలేదు. కనుక పగటిపూట ఈలంకను తప్పక పరిశీలించుచు చూడవలెను. (అందువలన ముమ్ముందు లంకలో ఎట్లు పోరాడవలెనో తెలియును.) (15)

కామం బద్ధస్య మే భూయః పుచ్ఛస్యోద్దీపనేన చ।
పీడాం కుర్వంతు రక్షాంసి న మేఽస్తి మనసశ్శ్రమః। 16

ఈ రాక్షసులు మఱల నన్ను బంధించి, నా వాలాగ్ని జ్వాలలతో తమ ఇష్టప్రకారము నన్ను బాధింతురుగాక, నా మనస్సునకు క్లేశము ఏమాత్రమూ కలుగదు- (16)

తతస్తే సంవృతాకారం సత్త్వవంతం మహాకపిమ్।
పరిగృహ్య యయుర్హృష్టా రాక్షసాః కపికుంజరమ్। 17

అనంతరము ఆ రాక్షసులు సంతోషించుచు మహాబలశాలియు, తనమనోభావములను బయటికి పొక్కనీయకుండ ఉన్నవాడును అగు ఆ కపిశ్రేష్ఠుని పట్టుకొనివెళ్లిరి. (17)

శంఖభేరీనినాదైస్తం ఘోషయంతః స్వకర్మభిః।
రాక్షసాః క్రూరకర్మాణః చారయంతిస్మ తాం పురీమ్। 18

క్రూరకర్ములైన ఆ రాక్షసులు శంఖనాదములతో భేరీధ్వనులతో తమభుజాస్ఫాలనములతో (జబ్బలను చఱచుచు) సింహగర్జనలతో ఆ లంకానగరమును ప్రతిధ్వనింపజేయుచు అంతటను ఆ హనుమంతుని త్రిప్పసాగిరి. (18)

అన్వీయమానో రక్షోభిః యయౌ సుఖ మరిందమః।
హనుమాంశ్చారయామాస రాక్షసానాం మహాపురీమ్। 19

శత్రుసూదనుడైన హనుమంతుడు రాక్షసులు తనవెంట నడుచుచుండగా హాయిగా తిరుగుచు రాక్షసుల పురమైనలంకను శోధింపసాగెను. (19)

అథాపశ్యద్విమానాని విచిత్రాణి మహాకపిః।
సంవృతాన్ భూమిభాగాంశ్చ సువిభక్తాంశ్చ చత్వరాన్॥ 20

అంతట ఆ వానరోత్తముడు విచిత్రములైన రాజ ప్రాసాదములను, గుప్తములైన భూగృహములను, బాగుగా తీర్చిదిద్దబడిన వీధులకూడళ్లను పరికించుచు చూచెను. (20)

వీథీశ్చ గృహసంబాధాః కపిః శృంగాటకాని చ।
తథా రథ్యోపరథ్యాశ్చ తథైవచ గృహాంతరాన్।
గృహాంశ్చ మేఘసంకాశాన్ దదర్శ పవనాత్మజః॥ 21

గృహములతో ఇరుకుగానున్న వీధులను, కూడళ్లను, విశాలమార్గములను, చిన్నచిన్న సందులను, రహస్యద్వారములుగల చిన్నగృహములను, ఆకాశమునంటుచున్న ఎత్తైనభవనములను ఆ మారుతి గాంచెను. (21)

చత్వరేషు చతుష్కేషు రాజమార్గే తథైవ చ।
ఘోషయంతి కపిం సర్వే చారఇత్యేవ రాక్షసాః॥ 22

రాక్షసులందఱును నాలుగువీధులకూడళ్లయందు, నాలుగుస్తంభముల మంటపములయందును, రాజమార్గమునందును 'ఈ వానరుడు గూఢచారి' (చూడండీ, చూడండి) అని చాటుచుండిరి. (22)

స్త్రీబాలవృద్ధా నిర్జగ్ముః తత్ర తత్ర కుతూహలాత్।
తం ప్రదీపితలాంగూలం హనుమన్తం దిదృక్షవః॥ 23

మంటలతోగూడియున్న వాలముగల ఆ హనుమంతుని చూడగోరినవారై ప్రతిగృహమునుండియు స్త్రీలు, బాలురు, వృద్ధులు కుతూహలముతో బయటికి వచ్చిరి. (23)

దీప్యమానే తతస్తస్య లాంగూలాగ్రే హనూమతః।
రాక్షస్య స్త్రై విరూపాక్ష్యః శంసుర్దేవ్యాస్తదప్రియమ్॥ 24

ఆ హనుమంతుని వాలాగ్రము మండుచుండగా వికృత నేత్రలైన రాక్షసస్త్రీలు ప్రియమైన ఆవిషయమును సీతాదేవితో ప్రస్తావించిరి. (24)

యస్త్వయా కృత సంవాదః సీతే తామ్రముఖః కపిః।
లాంగూలేన ప్రదీప్తేన స ఏష పరిణీయతే॥ 25

ఓ సీతా! ఇంతకుముందు ఎఱ్ఱనిముఖముగల ఒక వానరుడు నీతో మాట్లాడియున్నాడుగదా! అతని వాలమునకు నిప్పంటించి, రాక్షసులు అతనిని నగరమంతయు త్రిప్పుచున్నారు. (25)

శ్రుత్వా తద్వచనం క్రూరమ్ ఆత్మాపహరణోపమమ్।
వైదేహీ శోకసంతప్తా హుతాశనముపాగమత్॥ 26

ఆ రాక్షసస్త్రీలపలుకులు సీతాదేవిచెవులకు ములుకుల వలె గ్రుచ్చుకొనెను. అప్పుడు ఆమె తనను రావణుడు అపహరించిననాటి బాధకులోనై, విలవిలలాడుచు అగ్నిదేవుని ప్రార్థించెను. (26)

మంగలాభిముఖీ తస్య సా తదాసీన్మహాకపేః।
ఉపతస్థే విశాలాక్షీ ప్రయతా హవ్యవాహనమ్॥ 27

విశాలాక్షియు, సాధ్వియు ఐన సీతాదేవి హనుమంతుని క్షేమమును (శుభములను) గోరుచు అగ్నిదేవునకు ఇట్లు విన్నవించెను. (27)

యద్యస్తి పతి శుశ్రూషా యద్యస్తి చరితం తపః।
యది చాస్త్యేకపత్నీత్వం శీతో భవ హనూమతః॥ 28

నేను పతిసేవాపరాయణనే ఐనచో, తపమాచరించి యున్నచో, నేను నిష్కలంక పతివ్రతనైనచో ఓ అగ్నిదేవా! హనుమంతుని చల్లగాజూడుము. (28)

యది కించిదనుక్రోశః తస్యమయ్యస్తి ధీమతః।
యది వా భాగ్యశేషో మే శీతో భవ హనూమతః॥ 29

దేవా! నేను ఏమాత్రమైనను ధీమంతుడైన ఆ శ్రీరామ ప్రభువుయొక్క దయకు నోచుకొనియున్నచో, నాపుణ్యఫలము ఏకొంచెమైనను మిగిలియున్నచో మారుతిని చల్లగాచూడుము.(29)

యది మాం వృత్తసంపన్నాం తత్సమాగమలాలసామ్।
స విజానాతి ధర్మాత్మా శీతో భవ హనూమతః॥ 30

ధర్మాత్ముడైన నాస్వామి నన్ను సచ్ఛీలసంపన్నగా భావించినచో, తన సమాగమమునకై నేను వేయికన్నులతో ఎదురుచూచుచున్నట్లు ఎఱింగినచో, ఓ హవ్యవాహనా! వాయుసూనుని చల్లగాచూడుము. (30)

యది మాం తారయేదార్యః సుగ్రీవస్సత్యసంగరః।
అస్మాద్దుఃఖాంబుసంరోధాత్ శీతో భవ హనూమతః॥ 31

పూజ్యుడు, సత్యసంధుడుఐన సుగ్రీవుడు నన్ను ఈదుఃఖసముద్రమునుండి గట్టెక్కింపగలడేని ఓ వైశ్వానరా! ఆంజనేయుని చల్లగాజూడుము. (31)

తతస్తీక్ష్ణార్చిరవ్యగ్రః ప్రదక్షిణశిఖోఽనలః।
జజ్వాల మృగశాబాక్ష్యాః శంసన్నివ శివం కపేః। 32

హనుమజ్జనకశ్చాపి పుచ్ఛానలయుతోఽనిలః।
వవౌ స్వాస్థ్యకరో దేవ్యాః ప్రాలేయానిలశీతలః। 33

దహ్యమానే చ లాంగూలే చింతయామాస వానరః। 34

ప్రదీప్తోఽగ్ని రయం కస్మాత్ న మాం దహతి సర్వతః।
దృశ్యతే చ మహాజ్వాలః కరోతి న చ మే రుజమ్। 35

శిశిరస్యేవ సంపాతో లాంగూలాగ్రే ప్రతిష్ఠితః।
అథవా తదిదం వ్యక్తం యద్దృష్టం ప్లవతా మయా। 36

రామప్రభావా దాశ్చర్యం పర్వతస్సరితాంపతౌ।
యది తావత్ సముద్రస్య మైనాకస్య చ ధీమతః।
రామార్థం సంభ్రమస్తాదృక్ కిమగ్నిర్నకరిష్యతి। 37

సీతాయాశ్చానృశంస్యేన తేజసా రాఘవస్య చ।
పితుశ్చ మమ సఖ్యేన న మాం దహతి పావకః। 38

భూయస్సచింతయామాస ముహూర్తం కపికుంజరః। 39

కథమస్మద్విధస్యేహ బంధనం రాక్షసాధమైః।
ప్రతిక్రియాస్య యుక్తాస్యాత్ సతి మహ్యం పరాక్రమే। 40

తతశ్ఛిత్త్వా చ తాన్ పాశాన్ వేగవాన్ వై మహాకపిః।
ఉత్పపాతాథ వేగేన ననాద చ మహాకపిః। 41

పురద్వారం తతశ్శ్రీమాన్ శైలశృంగమివోన్నతమ్।
విభక్తరక్షస్సంబాధమ్ ఆససాదానిలాత్మజః। 42

స భూత్వా శైలసంకాశః క్షణేన పునరాత్మవాన్।
హ్రస్వతాం పరమాం ప్రాప్తో బంధనాన్యవశాతయత్। 43

విముక్తశ్చాభవత్ శ్రీమాన్ పునః పర్వతసన్నిభః।
వీక్షమాణశ్చ దదృశే పరిఘం తోరణాశ్రితమ్। 44

స తం గృహ్య మహాబాహుః కాలాయసపరిష్కృతమ్।
రక్షిణస్తాన్ పునస్సర్వాన్ సూదయామాస మారుతిః। 45

సీతాదేవి యొక్కప్రభావమున హనుమంతునకు క్షేమము కలుగును అని తెలుపుచున్నాడా? యనునట్లుగా తీక్ష్ణమైనఅగ్ని నెమ్మదిగా ప్రదక్షిణపూర్వకముగా ప్రజ్వలింపసాగెను.(32)

హనుమంతుని తండ్రియైన వాయుదేవుడుగూడ కపీశ్వరుని వాలాగ్నితోగూడియుండి, సీతాదేవి ప్రభావమున మారుతికి స్వస్థతచేకూరునట్లు మంచుగాలివలె చల్లగా వీచెను- (33)

వాలము దహింపబడుచుండగా వానరోత్తముడు ఇట్లు ఆలోచింపసాగెను.ప్రజ్వలించుచున్న ఈఅగ్ని నాశరీరమును ఏల కాల్చుటలేదు, మహాజ్వాలలతో కనబడుచున్న ఈఅగ్ని నన్నేమాత్రము బాధించుటలేదు- (34-35)

నావాలముచివర ఒక మంచురాశి పెట్టబడినట్లున్నది. లేదా దానికి కారణము ఇదియైయుండవచ్చును- నిన్న సముద్రముపై ఎగురుచున్నప్పుడు శ్రీరామునిపైగల ఆదరమువలన మైనాకపర్వతము నాకు సహాయపడుటకై సముద్రమునుండిపైకి వచ్చెను. ఇది ఒక ఆశ్చర్యకరమైన దృశ్యము. సముద్రమునకును, ధీమంతుడైన మైనాకునకును శ్రీరామునకు సహాయపడుటకై అంతగా తమకమున్నప్పుడు అగ్నిదేవుడుసైతము ఏల సహాయపడడు? (36-37)

సీతాదేవి కనికరమువలనను, శ్రీరాముని తేజః ప్రభావమునను ఇట్లు జరిగియుండవచ్చును, లేదా! నా తండ్రియైన వాయుదేవునకు మిత్రుడగుటవలన అగ్ని(దేవుడు) నన్ను దహింపకయుండవచ్చును. మఱల ఆ హనుమంతుడు ఒక క్షణకాలముపాటు ఆలోచనలో పడెను. (38-39)

ఈ రాక్షసాధములు రామబంటునైన నాయంతటివానిని బంధింపగల్గిరి? సరే! నేను పరాక్రమవంతుడనేయైనచో దీనికి ప్రతీకారమును చేసియేతీరవలెను. (40)

అంతట మహాబలశాలియైన హనుమంతుడు ఆ బంధములను ఛేదించుకొని వేగముగా ఆకసమునకెగిరి, పెద్దగాగర్జించెను. (41)

అప్పుడు సర్వశుభలక్షణసంపన్నుడైన హనుమంతుడు పర్వతశిఖరమువలె ఉన్నతమైనదియు, రాక్షససంచారము లేనిదియు అగు లంకానగరముఖద్వారము మీదికి ఎక్కెను. (42)

ప్రతిభాశాలియైన మారుతి పర్వతమంత ఎత్తునకు ఎదిగి, క్షణములో మఱల చిన్నరూపమును పొంది, ఆ బంధములను వదలించుకొనెను. (43)

ధీశాలియైన మారుతి బంధవిముక్తుడైనవెంటనే మఱల పర్వతసదృశుడై, అటునిటు పరికించిచూడగా ఆయనదృష్టి తోరణద్వారముమీదనున్న ఇనుపగుదియపై బడెను.(44)

మహాబాహువైన ఆమారుతి ఆ ఇనుపగుదియను దీసికొని, ఆ ద్వారరక్షకుల నందఱిని సంహరించెను.(45)

స తాన్నిహత్వా రణచండవిక్రమః
సమీక్షమాణః పునరేవ లంకామ్ ।
ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ
ప్రకాశతాదిత్యఇవార్చిమాలీ ॥ 46

యుద్ధమున వీరవిహారమొనర్చి, రాక్షసులను పరిమార్చిన హనుమంతుడు మఱల లంకను పరికించి చూడసాగెను. అప్పుడతడు బాగుగా మండుచున్న వాలాగ్ని జ్వాలలతోఒప్పుచు కిరణతేజఃపుంజములతో విలసిల్లుచున్న సూర్యునివలె తేజరిల్లెను. (46)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే త్రిపంచాశస్సర్గః (53)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందర కాండమునందు ఇది ఏబది మూడవ సర్గము.

— * * * —

54. ఏబదినాల్గవసర్గము

లంకా దహనము-రాక్షసుల విలాపము

వీక్షమాణస్తతో లంకాం కపిః కృతమనోరథః ।
వర్ధమానసముత్సాహః కార్యశేషమచింతయత్ ॥ 1

ఇంతవఱకును తనసంకల్పములను నెఱవేర్చుకొనిన హనుమంతుడు తదేకదృష్టితో లంకనుజూచుచు ఉప్పొంగుచున్న ఉత్సాహముతో అనంతరకర్తవ్యము (కార్యశేషము)ను గూర్చి ఆలోచింపసాగెను. (1)

కిన్ను ఖల్వవశిష్టం మే కర్తవ్యమిహ సాంప్రతమ్ ।
యదేషాం రక్షసాం భూయః సంతాపజననం భవేత్ ॥ 2

ఇప్పుడు నేను ఈరాక్షసులకు ఇంకను తీవ్రమనస్తాపము కల్గింపవలసియున్నది. అందులకై ఈ సమయమునకు తగినట్లుగా నేను చేయవలసిన కార్యమేమి మిగిలియున్నది? (2)

వనం తావత్ ప్రమథితం ప్రకృష్టా రాక్షసా హతాః ।
బలైకదేశః క్షపితః శేషం దుర్గవినాశనమ్ ॥ 3

అశోకవనమైతే ధ్వంసమైనది. ప్రముఖులైన రాక్షసులందఱును నిహతులైరి. సైన్యములో కొంత భాగము మట్టిగఱచినది. ఇంక లంకానగరమును నాశమొనర్చుటమాత్రము మిగిలియున్నది. (3)

దుర్గే వినాశితే కర్మ భవేత్ సుఖపరిశ్రమమ్ ।
అల్పయత్నేన కార్యేఽస్మిన్ మమ స్యాత్ సఫలశ్శ్రమః ॥ 4

దుర్గమును (లంకానగరమును) నశింపజేయుట పూర్తియైనచో నేను ఇంతవఱకును చేసినకార్యములు (సముద్రలంఘనము, సీతాదేవిని దర్శించుట, అశోకవనమును భంగపఱచుట, దౌత్యము మొదలగునవి) అనాయాసముగా నెఱవేఱినట్లే- స్వల్ప ప్రయత్నముతోడనే ఈ కార్యమునుగూడ పూర్తిచేసినచో నా శ్రమయంతయు ఫలించినట్లేయగును. (4)

యో హ్యయం మమ లాంగూలే దీప్యతే హవ్యవాహనః ।
అస్య సంతర్పణం న్యాయ్యం కర్తుమేభిర్గృహోత్తమైః ॥ 5

నా వాలమున ప్రజ్వలించుచున్న ఈ అగ్నిదేవునకు (నన్ను చల్లగాజూచి, నాకు తోడ్పడినందులకై కృతజ్ఞతగా) ఈ మహాభవనములను ఆహుతిగా సమర్పించుట న్యాయమగును. (5)

తతః ప్రదీప్తలాంగూలః సవిద్యుదివ తోయదః ।
భవనాగ్రేషు లంకాయా విచచార మహాకపిః ॥ 6

అనంతరము ఎగయుచున్న వాలాగ్నిజ్వాలలతోగూడిన హనుమంతుడు విద్యుత్కాంతులతో మెఱయుచున్న మేఘమువలె విలసిల్లుచు లంకానగరమునందలి భవనాగ్రములపై సంచరింపసాగెను- (6)

గృహాద్గృహం రాక్షసానామ్ ఉద్యానాని చ వానరః ।
వీక్షమాణో హ్యసంత్రస్తః ప్రాసాదాంశ్చ చచార సః ॥ 7

ఆ కపివరుడు నిర్భయముగా ఉద్యానవనములను, ప్రాసాదములనుచూచుచు, రాక్షసులయొక్క గృహములపై (ఒక గృహమునుండి మఱియొక గృహముపై) తిరుగసాగెను. (7)

అవప్లుత్య మహావేగః ప్రహస్తస్య నివేశనమ్ ।
అగ్నిం తత్ర స నిక్షిప్య శ్వసనేన సమో బలీ । 8

తతోఽన్యత్ పుప్లువే వేశ్మ మహాపార్శ్వస్య వీర్యవాన్ ।
ముమోచ హనుమానగ్నిం కాలానలశిఖోపమమ్ । 9

వజ్రదంష్ట్రస్య చ తథా పుప్లువే స మహాకపిః ।
శుకస్య చ మహాతేజాః సారణస్య చ ధీమతః । 10

తథాచేంద్రజితో వేశ్మ దదాహ హరియూథపః ।
జంబుమాలేస్సుమాలేశ్చ దదాహ భవనం తతః । 11

రశ్మికేతోశ్చ భవనం సూర్యశత్రోస్తథైవచ ।
హ్రస్వకర్ణస్య దంష్ట్రస్య రోమశస్య చ రక్షసః । 12

యుద్ధోన్మత్తస్య మత్తస్య ధ్వజగ్రీవస్య రక్షసః ।
విద్యుజ్జిహ్వస్య ఘోరస్య తథా హస్తిముఖస్య చ । 13

కరాలస్య పిశాచస్య శోణితాక్షస్య చైవ హి ।
కుంభకర్ణస్య భవనం మకరాక్షస్య చైవహి । 14

యజ్ఞశత్రోశ్చ భవనం బ్రహ్మశత్రో స్తథైవచ ।
నరాంతకస్య కుంభస్య నికుంభస్య దురాత్మనః । 15

వర్జయిత్వామహాతేజా విభీషణ గృహం ప్రతి ।
క్రమమాణః క్రమేణైవ దదాహ స మహాకపిః । 16

తేషుతేషు మహార్హేషు భవనేషు మహాయశాః ।
గృహేష్వృద్ధిమతామృద్ధిం దదాహ స మహాకపిః । 17

సర్వేషాం సమతిక్రమ్య రాక్షసేంద్రస్య వీర్యవాన్ ।
ఆససాదాథ లక్ష్మీవాన్ రావణస్య నివేశనమ్ । 18

తతస్తస్మిన్ గృహే ముఖ్యే నానారత్నవిభూషితే ।
మేరుమందరసంకాశే సర్వమంగళశోభితే । 19

ప్రదీప్తమగ్నిముత్సృజ్య లాంగూలాగ్రే ప్రతిష్ఠితమ్ ।
ననాద హనుమాన్ వీరో యుగాంతజలదో యథా । 20

మహాబలపరాక్రమశాలియై, వాయువేగముగల ఆ హనుమంతుడు మొదట ప్రహస్తునిఇంటిపై వాలి, దానికి నిప్పంటించెను. (ఈవిధముగా ప్రధానమంత్రి గృహముతో లంకానగర దహనకార్యక్రమమునకు 'బోణీ' గావించెను.) (8)

పిదప మహాశక్తిమంతుడైన మారుతి ఆ సమీపముననే గల మహాపార్శ్వునిభవనముమీదికి దూకి, దానిపై ప్రళయాగ్నితుల్యమైన అగ్నిజ్వాలలను ఉంచెను. (9)

అట్లే, మహాతేజశ్శాలియు, వానరోత్తముడునుఐన హనుమంతుడు వరుసగా వజ్రదంష్ట్రునిభవనము మీదను, ప్రజ్ఞాశాలియైన శుకునిహర్మ్యముపైనను, సారణుని గృహోపరిభాగముననను, ఇంద్రజిత్తు ప్రాసాదముపైనను వ్రాలి వాటినన్నింటిని దహించివేసెను. పిదప జంబుమాలి, సుమాలి అనువారి భవనములకును నిప్పంటించెను. (10-11)

మహాతేజశ్శాలియైన హనుమంతుడు క్రమముగా రశ్మికేతుడు, సూర్యశత్రువు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడైన మత్తుడు, ధ్వజగ్రీవుడు, విద్యుజ్జిహ్వుడు, ఘోరుడు, హస్తిముఖుడు, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు, కుంభకర్ణుడు, మకరాక్షుడు యజ్ఞశత్రువు, బ్రహ్మశత్రువు, నరాంతకుడు, కుంభుడు, నికుంభుడు, దురాత్ముడు మొదలగువారి గృహములను దహించివేసెను. కాని గొప్పకృతజ్ఞుడైన మారుతి విభీషణుని ప్రాసాదమును మాత్రము తాకనైనతాకలేదు. (ఏలనన విభీషణుడు రావణసభలో తనకు అండగానిలిచి, ధర్మవచనములను పలికెను.) (12-16)

వానికెక్కిన ఆ వానరోత్తముడు ఐశ్వర్యవంతులైన రాక్షసుల యొక్క భవనములయందును, అమూల్యములైన హర్మ్యముల యందునుగల మణులు, ప్రవాళములు మున్నగు సంపదలను బుగ్గిపాలుచేసెను. (మొదట అగ్ని వాయువులు రావణునకు భయపడి తమశక్తులను మందముగా ప్రదర్శించినను. పిమ్మట సీతాదేవి ప్రభావముచేతను, ఆంజనేయునివిజృంభణ కారణముననను ఒక్కసారిగా చెలరేగిరి.) (17)

సర్వశుభలక్షణసంపన్నుడైన మహావీరుడగు హనుమంతుడు అందరి గృహములను అగ్నికి ఆహుతి యొనర్చినపిమ్మట రాక్షసరాజైన రావణుని ప్రాసాదమునకు చేరెను. (18)

వీరుడగు హనుమంతుడు, మేరుమందర పర్వతములవలె మహోన్నతమైనదియు, సర్వవిధశుభలక్షణములతో విలసిల్లుచున్నదియు, నానావిధములగు రత్నములతో అలంకృతమైనదియు ఐన ఆ ముఖ్యప్రాసాదమునకు తన వాలాగ్రమున మండుచున్న అగ్నిని అంటించి, ప్రళయ కాలమేఘమువలె గర్జించెను. (19-20)

శ్వసనేన చ సంయోగాత్ అతివేగో మహాబలః।
కాలాగ్నిరివ జజ్వాల ప్రావర్ధత హుతాశనః। 21

ప్రదీప్తమగ్నిం పవనః తేషు వేశ్మస్వచాలయత్।
అభూచ్ఛ్వసనసంయోగాత్ అతివేగో హుతాశనః। 22

తాని కాంచనజాలాని ముక్తామణిమయాని చ।
భవనాన్యవశీర్యంత రత్నవంతిమహాంతి చ। 23

తాని భగ్నవిమానాని నిపేతుర్వసుధాతలే।
భవనానీవ సిద్ధానామ్ అంబరాత్ పుణ్యసంక్షయే। 24

సంజజ్ఞే తుముల శ్శబ్దో రాక్షసానాం ప్రధావతామ్।
స్వగృహస్య పరిత్రాణే భగ్నోత్సాహోర్జితశ్రియామ్।
నూన మేషో౽గ్నిరాయాతః కపిరూపేణ హా ఇతి। 25

క్రందంత్యస్సహసా పేతుః స్తనంధయధరాః స్త్రియః। 26

కాశ్చిదగ్నిపరీతేభ్యో హర్మ్యేభ్యో ముక్తమూర్ధజాః।
పతంత్యోరేజిరే౽భ్రేభ్యః సౌదామిన్య ఇవాంబరాత్। 27

వజ్రవిద్రుమవైడూర్య ముక్తారజతసంహతాన్।
విచిత్రాన్ భవనాన్ ధాతూన్ స్యందమానాన్దదర్శ సః। 28

నాగ్నిస్తృప్యతి కాష్ఠానాం తృణానాం హరియూథపః।
నాగ్నేర్నాపి విశస్తానాం రాక్షసానాం వసుంధరా। 29

క్వచిత్ కింశుకసంకాశాః క్వచిచ్ఛాల్మలిసన్నిభాః।
క్వచిత్ కుంకుమసంకాశాః శిఖావహ్నేశ్చకాశిరే। 30

హనూమతా వేగవతా వానరేణ మహాత్మనా।
లంకాపురం ప్రదగ్ధం తత్ రుద్రేణ త్రిపురం యథా। 31

తతస్తు లంకాపురపర్వతాగ్రే
సముత్థితో భీమపరాక్రమో౽గ్నిః।
ప్రసార్య చూడావలయం ప్రదీప్తో
హనూమతా వేగవతా విసృష్టః। 32

యుగాంత కాలానలతుల్యవేగః
సమారుతో౽గ్నిర్వవృధే దివస్పృక్।
విధూమరశ్మిర్భవనేషు సక్తో
రక్షశ్శరీరాజ్యసమర్పితార్చిః। 33

మహాబలశాలియైన అగ్ని(దేవుడు) వాయువు తోడగుటవలన మంటలు చెలరేగగా వృద్ధిపొంది, ప్రళయాగ్నివలె ప్రజ్వలించెను.(21)

అగ్ని తనకు వాయువు తోడగుటవలన మిక్కిలివేగము గలవాడై, మహాబలశాలియై ప్రళయకాలాగ్నివలె చెలరేగిన జ్వాలలతో వ్యాపించెను. (22)

బంగారుగవాక్షములతో ఒప్పుచున్నవియు, ముత్యములతోను, మణులతోడను, రత్నముల తోడను తేజరిల్లుచున్నవియునైన ఆ మహాభవనములు శిథిలములై కూలిపోయినవి. (23)

పుణ్యముక్షీణింపగా సిద్ధులభవనములన్నియును ఆకాశము నుండికూలి, ధరిత్రిపైబడినట్లు ఆ ప్రాసాదముల యొక్క పైకప్పులన్నియును నేలపాలయ్యెను. (24)

స్వగృహములను రక్షించుకొనుటకై పరుగులు దీయుచున్న వారును, ఉత్సాహమును, బలమును, సంపదలను కోల్పోయిన వారునునైన రాక్షసులు "అయ్యో! నిజముగా అగ్నిదేవుడు వానరుని రూపములో వచ్చినాడు"- అని గగ్గోలుపెట్టసాగిరి.(25)

కొంతమందిస్త్రీలు 'లబోదిబో'యనుచు చంటి పిల్లలను చంకనబెట్టుకొన్నవారై, విడివడిజారిపోయిన కొప్పులను సవరించుకొనకయే మంటలలో చిక్కుపడిన హర్మ్యములనుండి గబగబ దూకిరి. అప్పుడు వారు ఆకాశమునగల మేఘములనుండి క్రిందికిపడుచున్న మెఱపుతీగలవలె తేజరిల్లిరి. (26-27)

ఆహనుమంతుడు వజ్రములు, పగడములు, వైడూర్యములు, ముత్యములు వెండి మొదలగువానితో నిర్మింపబడిన చిత్ర విచిత్రములగు భవనములను, అగ్నితప్తములై కఱిగి స్రవించుచున్న బంగారు, వెండి ధాతువులనుచూచెను. (28)

అగ్ని కట్టెలతో, తృణములతో తృప్తిపడుటలేదు, ఎన్ని భవనములను దగ్ధమొనర్చినను హనుమంతునకు తృప్తికలుగుటలేదు, హనుమంతుని చేతిలో హతులైన రాక్షసశవములతో భూమికి తృప్తికలుగుటలేదు.(29)

అగ్నిజ్వాలలు కొన్నిచోట్ల మోదుగుపూవువలె ఎఱ్ఱరంగుతోను, మఱికొన్నిచోట్ల బూరుగుపూవువలె లేత గోధుమరంగుతోను, ఇంకనుకొన్నితావుల కుంకుమపూవురంగుతోను ప్రకాశించినవి.(30)

మహాత్ముడు, మహాబలపరాక్రమములుగలవాడునైన వానరోత్తముడగు హనుమంతునిచే ఆ లంకానగరము రుద్రునిచే త్రిపురములవలె దగ్ధమాయెను. (31)

మహాశక్తిశాలియైన హనుమంతుడు లంకానగర పర్వతాగ్రము నందు (త్రికూటపర్వతాగ్రముపై గల గృహములమీద) అగ్నిని ఉంచెను. అప్పుడు భీమపరాక్రముడైనఅగ్ని వలయాకారమున ప్రజ్వలించుచున్న మంటలతో ఆ భవనములయందు విజృంభించెను.(32)

వాయువుతోడైన ఆ అగ్ని పొగలేనిమంటలతో ఆ భవనముల యందు వ్యాపించెను. రాక్షసులశరీరములే ఆ అగ్నిజ్వాలలకు ఆహుతులయ్యెను. ఆకాశమునంటుచున్న మంటలతో ప్రళయకాలాగ్ని వలె అది మహాశక్తిగలదై వృద్ధిచెందెను. (33)

ఆదిత్యకోటీసదృశస్సుతేజా
లంకాం సమస్తాం పరివార్య తిష్ఠన్ ।
శబ్దైరనేకైరశనిప్రరూఢైః
భిందన్నివాండం ప్రబభౌ మహాగ్నిః ॥ 34

ఆ మహాగ్ని కోటిసూర్యులతోసమానమైన తేజస్సులతో పూర్తిగా లంకమట్టును వ్యాపించెను. ఆ అగ్ని భయంకరమైన 'పెటేల్‌పెటేల్' అను పెక్కుపిడుగుల శబ్దములతో బ్రహ్మాండమును బ్రద్దలొనర్చుచున్నట్లు విజృంభించెను. (34)

తత్రాంబరాదగ్నిరతిప్రవృద్ధో
రూక్షప్రభః కింశుకపుష్పచూడః ।
నిర్వాణధూమాకులరాజయశ్చ
నీలోత్పలాభాః ప్రచకాశిరేఽభ్రాః ॥ 35

తీవ్రమైనకాంతులతో, మోదుగపూవులవలె ఎఱ్ఱని అగ్నిజ్వాలలు ఆకాశపర్యంతము అత్యంతము పైకెగసెను. అప్పుడు దగ్ధములైన భవనములనుండి వెడలిన ధూమపంక్తులతో మంటలుచల్లారిన పిమ్మట ఏర్పడిన మేఘములు నల్లగలువలవలె ఒప్పుచు ప్రకాశించెను. (35)

వజ్రీ మహేంద్రస్త్రిదశేశ్వరో వా
సాక్షాద్యమో వా వరుణోఽనిలో వా ।
రుద్రోఽగ్నిరర్కో ధనదశ్చ సోమో
న వానరోఽయం స్వయమేవ కాలః ॥ 36

"ఆలోచించిచూడగా ఇతడు వానరమాత్రుడుగా అనిపించుట లేదు. ఇతడు దేవతలకు ప్రభువు, వజ్రాయుధమును ధరించినవాడు ఐన ఇంద్రుడైనను కావచ్చును. లేదా సాక్షాత్తుగా యముడో, వరుణుడో, వాయుదేవుడో ఐయుండవచ్చును. రుద్రుడైనను, అగ్నియైనను, కుబేరుడైనను, సూర్యుడైనను చంద్రుడైనను కావచ్చును. లేనిచో స్వయముగా ఆ (ప్రళయ) కాలపురుషుడే ఐయుండవచ్చును. (36)

కిం బ్రహ్మణస్సర్వపితామహస్య
సర్వస్య ధాతుశ్చతురాననస్య ।
ఇహాగతో వానరరూపధారీ
రక్షోపసంహారకరః ప్రకోపః ॥ 37

సమస్తజీవకోటిని సృష్టించువాడును, పోషించువాడును, ఐన చతుర్ముఖబ్రహ్మయొక్క అగ్రహావేశమే రాక్షస సంహారమునకై ఈ వానరరూపమునుదాల్చి ఇచటికి వచ్చినదా? (37)

కిం వైష్ణవం వా కపిరూపమేత్య
రక్షోవినాశాయ పరం సుతేజః ।
అనంతమవ్యక్తమచింత్యమేకం
స్వమాయయా సాంప్రతమాగతం వా ॥ 38

అనంతము, అవ్యక్తము, ఊహింపశక్యముగానిది, అఖండమైనది, సర్వోత్తమమైనదియగు ఆ విష్ణుమూర్తి యొక్క మహాతేజమే రాక్షసులను నిర్మూలించుటకై తనమాయాశక్తిచే వానరాకృతినిదాల్చి ఇప్పుడు ఇచటికి వచ్చినదా! ఏమి?"- (38)

ఇత్యేవమూచుర్బహవో విశిష్టా
రక్షోగణాస్తత్ర సమేత్య సర్వే ।
సప్రాణిసంఘాం సగృహాం సవృక్షాం
దగ్ధాం పురీం తాం సహసా సమీక్ష్య ॥ 39

ప్రాణిసంఘములతో, గృహములతో, వృక్షములతోగూడ క్షణములో దగ్ధమైన ఆ లంకానగరమునుజూచి, పెక్కుమందిరీశాలురు, రాక్షసులందఱును అచ్చటచ్చట గుమిగూడి పైవిధముగా అనుకొనిరి. (39)

తతస్తు లంకా సహసా ప్రదగ్ధా
సరాక్షసా సాశ్వరథా సనాగా ।
సపక్షిసంఘా సమృగా సవృక్షా
రురోద దీనా తుములం సశబ్దమ్ ॥ 40

పిమ్మట రాక్షసులు, రథాశ్వగజములు' పక్షుల గుంపులు, మృగములు మొదలగువానితోగూడిన లంకయంతయు పూర్తిగా దగ్ధమైపోగా మిగిలియున్న లంకావాసులెల్లరును దీనవదనములతో గగ్గోలుపెట్టుచు ఏడువసాగిరి. (40)

హా తాత హా పుత్రక కాంత! మిత్ర!
హా జీవితం భోగయుతం సుపుణ్యమ్ ।
రక్షోభిరేవం బహుధా బ్రువద్భిః
శబ్దః కృతో ఘోరతరస్సుభీమః ॥ 41

"అయ్యో! తండ్రీ! హా కుమారా! అయ్యో! నాథా! హా మిత్రమా! పుణ్యఫలమైన ఓ భోగమయజీవితమా!"అని విలవిలలాడుచు రాక్షసులు ఎల్లరును రోదింపసాగిరి. వారి విలాపధ్వనులు మిక్కిలిఘోరముగా భయంకరముగా నుండెను. (41)

హుతాశనజ్వాలసమావృతా సా
హతప్రవీరా పరివృత్తయోధా ।
హనూమతః క్రోధబలాభిభూతా
బభూవ శాపోపహతేవ లంకా ॥ 42

హనుమంతునిక్రోధప్రభావముచే లంక నిర్జీవమయ్యెను. దానిమట్టును అగ్నిజ్వాలలు ఆవరించెను. అందలి ప్రముఖవీరులెల్లరును హతులైరి, భటులెల్లరును పలాయనము చిత్తగించిరి. లంకానగరము శాపగ్రస్తమైన దానివలె ఉండెను. (42)

ససంభ్రమత్రస్తవిషణ్ణరాక్షసాం
సముజ్జ్వలజ్జ్వాలహుతాశనాంకితామ్ ।
దదర్శ లంకాం హనుమాన్ మహామనా
స్స్వయంభుకోపోపహతామివావనిమ్ ॥ 43

తత్తరపాటుతో భయవిషాదములతో గూడిన రాక్షసులు గలదియు, మహాగ్నియొక్క ఉత్తుంగజ్వాలలతో గూడినదియు, బ్రహ్మయొక్క కోపాహతికి గురియైన అవనివలె ఒప్పుచున్నదియునగు లంకానగరమును మహాత్ముడైన హనుమంతుడు వీక్షించెను. (43)

భంక్త్వా వనం పాదపరత్నసంకులం
హత్వా తు రక్షాంసి మహాంతి సంయుగే ।
దగ్ధ్వా పురీం తాం గృహరత్నమాలినీం
తస్థౌ హనూమాన్ పవనాత్మజః కపిః ॥ 44

వాయుసూనుడైన హనుమంతుడు శ్రేష్ఠములైన వృక్షములుగల అశోకవనమును భగ్నమొనర్చెను. రణరంగమున రాక్షస మహాయోధులను హతమార్చెను. వరుసలుదీరియున్న మేలైన భవనములుగల ఆ లంకాపురిని దగ్ధమొనర్చెను. సంకల్పించిన కార్యములు చక్కగాపూర్తియగుటవలన నిండుమనస్సుతో సంతసించెను. (44)

త్రికూటశృంగాగ్రతలే విచిత్రే
ప్రతిష్ఠితో వానరరాజసింహః ।
ప్రదీప్తలాంగూలకృతార్చిమాలీ
వ్యరాజతాదిత్య ఇవాంశుమాలీ ॥ 45

విచిత్రమైన త్రికూటపర్వతశిఖరాగ్రప్రదేశమున నిలిచియున్న వానరోత్తముడు వాలాగ్రమున ప్రదీప్తములైన అగ్నిజ్వాలామాలికలతో విలసిల్లుచు కిరణపుంజములతో ప్రకాశించుచున్న ఆదిత్యునివలె తేజరిల్లెను. (45)

సరాక్షసాంస్తాన్ సుబహూంశ్చ హత్వా
వనం చ భంక్త్వా బహుపాదపం తత్ ।
విసృజ్య రక్షోభవనేషు చాగ్నిం
జగామ రామం మనసా మహాత్మా ॥ 46

మహాత్ముడైనహనుమంతుడు గుంపులు గుంపులుగానున్న ఆ రాక్షసులను పరిమార్చి, బహువృక్షశోభితమైన ఆ వనమును ఛిన్నాభిన్నమొనర్చి, రాక్షసులభవనములను అగ్నికి ఆహుతిగావించి, రామధ్యాన నిమగ్నుడాయెను. (46)

తతస్తు తం వానరవీరముఖ్యం
మహాబలం మారుతతుల్యవేగమ్ ।
మహామతిం వాయుసుతం వరిష్ఠం
ప్రతుష్టువుర్దేవగణాశ్చ సర్వే ॥ 47

వానరవీరులలో ప్రముఖుడును, మహాబలశాలియు, వాయుతుల్య పరాక్రముడును, మిక్కిలిధీమంతుడును సర్వశ్రేష్ఠుడునునైన ఆ మారుతిని దేవతలందరును వేనోళ్ల ప్రస్తుతించిరి. (47)

భంక్త్వా వనం మహాతేజా హత్వా రక్షాంసి సంయుగే ।
దగ్ధ్వాలంకాపురీం రమ్యాం రరాజ స మహాకపిః ॥ 48

మహాతేజశ్శాలియైన ఆవానరోత్తముడు అశోకవనమును ధ్వంసమొనర్చి, రాక్షసులను సమర భూమికి బలిగావించి, రగరగలతో రమ్యమైన లంకానగరమును అగ్గిపాలుచేసి, విరాజిల్లెను. (48)

తత్ర దేవాస్సగంధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః ।
దృష్ట్వా లంకాం ప్రదగ్ధాం తాం విస్మయం పరమం గతాః ॥ 49

తం దృష్ట్వా వానరశ్రేష్ఠం హనుమంతం మహాకపిమ్ ।
కాలాగ్నిరితి సంచింత్య సర్వభూతాని తత్రసుః ॥ 50

అంతట దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు అగ్నిజ్వాలలలో దగ్ధమగుచున్న ఆలంకాపురినిజూచి, మిక్కిలి ఆశ్చర్యపడిరి. సకలప్రాణులు వానరోత్తముడైన ఆ హనుమంతుని జూచి ఆయనను ప్రళయకాలాగ్నిస్వరూపునిగా భావించి, భయభ్రాంతములయ్యెను. (49-50)

దేవాశ్చ సర్వే మునిపుంగవాశ్చ
గంధర్వవిద్యాధరనాగయక్షాః ।
భూతాని సర్వాణి మహాంతి తత్ర
జగ్ముః పరాం ప్రీతిమతుల్యరూపామ్ ॥ 51

సమస్తదేవతలును, మునీశ్వరులును, గంధర్వులును, విద్యాధరులును, నాగులును, యక్షులును, పరమ ప్రీతినొందిరి. ఆచటగల సకలప్రాణులును మహానందభరితములాయెను. (51)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే చతుఃపంచాశస్సర్గః *(54)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆది కావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదినాల్గవసర్గము.

— * * * —

వినండి వినండి 'తోకకథ'
రామబంటు 'హనుమయ్య కథ'



వినండి వినండి 'తోకకథ'
రామబంటు 'హనుమయ్య కథ'

అశోకవనమును ధ్వంసము చేసెను
రాక్షసయోధుల చంపి వేసెను
బ్రహ్మాస్త్రమునకు లొంగిపోయెను
రావణసభలో హితవు పలికెను॥ ॥ వినండి ॥

హనుమతోకకు నిప్పుపెట్టుటకు
రావణుడాజ్ఞాపించిన వెంటనే
రక్కసిమూకలు మారుతితోకకు
రకరకాల గుడ్డలను చుట్టిరి, ॥ వినండి ॥

తెల్లగుడ్డలు చుట్టిరీ, నల్లగుడ్డలు చుట్టిరీ,
పసుపుగుడ్డలు చుట్టిరీ, పట్టుగుడ్డలుచుట్టురీ,
నీలిగుడ్డలు చుట్టిరీ, నేతగుడ్డలు చుట్టిరీ,
పాతగుడ్డలు చుట్టిరీ ॥ కొత్తగుడ్డలు చుట్టిరీ ॥

॥ వినండి ॥

కుసుమ నూనెలూ పోసిరీ, ఆముదములో తడిపిరీ,
నువ్వునూనెలో ముంచిరీ, ఆవనూనెలో అద్దిరీ ॥ ॥ వినండి ॥

తోకకునిప్పంటించిరీ, లంకయంతటా త్రిప్పసాగిరీ
పకపక పకపక నవ్విరీ, తప్పెటతో చాటించిరీ ॥ ॥ వినండి ॥

మండుచున్న తోకతో మారుతిపైకెగిరెను,
లంకలోని బవనాలను కాల్చి కాల్చి వేసెను ॥ ॥ వినండి ॥

లంకలోని రక్కసులు, లబోదిబోమనుచునూ,
పిల్లలతో జెల్లలతో పిక్కబలము చూపిరీ ॥ ॥ వినండి ॥

జానకి ఆశీస్సులతో, అగ్ని అనుగ్రహముతో,
హనుమంతుడు సేమముగా తోకనుకాపాడుకొనియె ॥ ॥ వినండి ॥

55. ఏబదిఐదవసర్గము

సీతనుగూర్చి హనుమంతుడు చింతించుట.

లంకాం సమస్తాం సందీప్య లాంగూలాగ్నిం మహాబలః।
నిర్వాపయామాస తదా సముద్రే హరిసత్తమః॥ 1

సందీప్యమానాం విధ్వస్తాం త్రస్తరక్షోగణాం పురీమ్।
అవేక్ష్య హనుమాన్‌లంకాం చింతయామాస వానరః॥ 2

తస్యాభూత్సుమహాంస్త్రాసః కుత్సా చాత్మన్యజాయత।
లంకాం ప్రదహతా కర్మ కింస్విత్కృతమిదం మయా॥ 3

ధన్యాస్తే పురుషశ్రేష్ఠా యే బుద్ధ్యా కోపముత్థితమ్।
నిరుంధంతి మహాత్మానో దీప్తమగ్నిమివాంభసా॥ 4

క్రుద్ధః పాపం న కుర్యాత్ కః క్రుద్ధో హన్యాద్ గురూనపి।
క్రుద్ధః పరుషయా వాచా నరస్సాధూనధిక్షిపేత్॥ 5

వాచ్యావాచ్యం ప్రకుపితో న విజానాతి కర్హిచిత్।
నాకార్యమస్తి క్రుద్ధస్య నావాచ్యం విద్యతే క్వచిత్॥ 6

య స్సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి।
యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే॥ 7

ధిగస్తు మాం సుదుర్బుద్ధిం నిర్లజ్జం పాపకృత్తమమ్।
అచింతయిత్వా తాం సీతామ్ అగ్నిదం స్వామిఘాతుకమ్॥ 8

యది దగ్ధాత్వియం లంకా నూనమార్యాపి జానకీ।
దగ్ధా తేన మయా భర్తుః హతం కార్యమజానతా॥ 9

యదర్థమయమారంభః తత్కార్య మవసాదితమ్।
మయాహి దహతా లఙ్కాం న సీతా పరిరక్షితా॥ 10

మహాబలశాలియైనహనుమంతుడు లంకను పూర్తిగా దగ్ధమొనర్చినపిమ్మట వాలాగ్నిని సముద్రమునందు చల్లార్చెను. ఈవిధముగా బుద్ధిశాలియైన ఆంజనేయస్వామి రాక్షసులందఱికిని బుద్ధిచెప్పెను. (1)

లంకానగరము అగ్నిజ్వాలలకు భస్మమై పోవుచుండెను. అచటి రాక్షసులెల్లరును భయముతో వణకిపోవుచుండిరి. అట్టిలంకనుజూచిన పిమ్మట వానరోత్తముడైన హనుమంతుడు ఆలోచింపసాగెను. (2)

'అయ్యో! ఈ లంకను కాల్చివేసి, నేను ఎంతతప్పుపని చేసితిని?' అని మిక్కిలి బాధపడుచు మారుతి తనను తాను నిందించుకొనెను. (3)

మహాత్ములైన ధీరపురుషులు తమలో పెల్లుబికిన ఆగ్రహావేశములను, ఎగయుచున్నమంటలను నీటితో చల్లార్చినట్లు, నిశ్చయాత్మకబుద్ధితో నిగ్రహించుకొందురు. నిజముగా వారు ధన్యాత్ములు. కోపావేశమునకు లోనైనవాడు ఎట్టిపాపములకైనను ఒడిగట్టును, అతడు గురువులను హత్యచేయుటకైనను వెనుకాడడు, కన్నుమిన్నుగానక పరుషవచనములతో సజ్జనులనుసైతము నిందించును. కోపోద్రిక్తుడైనవాడు 'ఇది అనవచ్చును, ఇది అనగూడదు' అను విచక్షణను సైతము కోల్పోవును. అట్టివానికి చేయగూడని పనియుండదు, అనగూడనిమాట యుండదు. సర్పము జీర్ణమైనచర్మమును (కుబుసమును) విడుచునట్లు క్షణికోద్రేకములో వచ్చిన పిచ్చికోపమును సైతము ఓర్పుతో అణచుకొనినవాడే యథార్థముగా పురుషుడు.[1] (4-7)

ఛీ! నేనెంత బుద్ధిహీనుడను? ఎంత సిగ్గులేనివాడను? ఎంతటి మహాపాపిని? ముందువెనుకలాలోచింపక సీతాదేవిని అగ్నిపాలుచేసి, స్వామిద్రోహమునకు ఒడిగట్టితిని. ఈలంక పూర్తిగాదగ్ధమైయున్నచో పూజ్యురాలైన సీతాదేవియు నిశ్చయముగా దహింపబడియేయుండును. అజ్ఞానవశమున నేను చేసిన ఈపనివలన నాస్వామి కార్యమునకు భంగము వాటిల్లినది. (8-9)

నేను లంకకు నిప్పుపెట్టుటవలన సీతామాత రక్షణకును భంగము ఏర్పడినది. దానివలన నా లక్ష్యమే దెబ్బతినినది. నేనుచేసిన ప్రయత్నమంతయు బూడిదలోపోసిన పన్నీరైనది. ముఖ్యమైన సీతాన్వేషణ కార్యము నెరవేఱినది. ఇంక సీతాదేవి సందేశమును శ్రీరామునకు వినిపింపవలసినకార్యము మాత్రము

1) ఈ సందర్భమున వాల్మీకిమహర్షి హనుమంతునిద్వారా "కోపాతిరేకమునకు గుఱియైనవాడు ఎట్టిఅనర్థములకు పాల్పడుదురో తెల్పుచు, ఎవ్వరును కోపమునకు లోనుకారాదు." అని లోకమునకు ఒక చక్కనిసందేశమును ఇచ్చుచున్నాడు.

ఈషత్కార్య మిదం కార్యం కృతమాసీన్నసంశయః।
తస్య క్రోధాభిభూతేన మయా మూలక్షయః కృతః। 11

వినష్టా జానకీ నూనం న హ్యదగ్ధః ప్రదృశ్యతే।
లంకాయాం కశ్చిదుద్దేశః సర్వా భస్మీకృతా పురీ। 12

యది తద్విహతం కార్యం మమ ప్రజ్ఞావిపర్యయాత్।
ఇహైవ ప్రాణసన్న్యాసో మమాపి హ్యద్య రోచతే। 13

కిమగ్నౌ నిపతామ్యద్య ఆహోస్విద్బడబాముఖే।
శరీరమిహ సత్త్వానాం దద్మి సాగరవాసినామ్। 14

కథం హి జీవతా శక్యో మయా ద్రష్టుం హరీశ్వరః।
తౌ వా పురుషశార్దూలౌ కార్యసర్వస్వఘాతినా। 15

మయా ఖలు తదేవేదం రోషదోషాత్ ప్రదర్శితమ్।
ప్రథితం త్రిషు లోకేషు కపిత్వమనవస్థితమ్। 16

ధిగస్తు రాజసం భావమ్ అనీశమనవస్థితమ్।
ఈశ్వరేణాపి యద్రాగాత్ మయా సీతా న రక్షితా। 17

వినష్టాయాం తు సీతాయాం తావుభౌ వినశిష్యతః।
తయోర్వినాశే సుగ్రీవః సబంధుర్వినశిష్యతి। 18

ఏతదేవ వచశ్శ్రుత్వా భరతో భ్రాతృవత్సలః।
ధర్మాత్మా సహశత్రుఘ్నః కథం శక్ష్యతి జీవితుమ్। 19

ఇక్ష్వాకువంశే ధర్మిష్ఠే గతే నాశమసంశయమ్।
భవిష్యంతి ప్రజాస్సర్వాః శోకసంతాపపీడితాః। 20

తదహం భాగ్యరహితో లుప్తధర్మార్థసంగ్రహః।
రోషదోషపరీతాత్మా వ్యక్తం లోకవినాశనః। 21

ఇతి చింతయతస్తస్య నిమిత్తాన్యుపపేదిరే।
పూర్వమప్యుపలబ్ధాని సాక్షాత్ పునరచింతయత్। 22

అథవా చారుసర్వాంగీ రక్షితా స్వేన తేజసా।
న నశిష్యతి కల్యాణీ నాగ్నిరగ్నౌ ప్రవర్తతే। 23

మిగిలియున్నది. కాని క్రోధాంధుడనైన నేను మూలవిచ్ఛేదమునకే (సీతాదేవికి ప్రాణాపాయమేర్పడుటకు) కారకుడనైతిని. ఇందు సంశయములేదు. (10-11)

లంకాపురియంతయు భస్మమైనది. దగ్ధముగాని చోటిలేదు, కనుక సీతాదేవియు తప్పక మరణించియేయుండును. (12)

నాబుద్ధి వైపరీత్యమువలన నేను చేయవలసిన కార్యము భంగమైనచో (సీతాదేవి ప్రాణములకు ముప్పు ఏర్పడినచో) ఇచ్చటనే, ఇప్పుడే నా ప్రాణములను త్యజించుట యుక్తమగును. (13)

నేను ఏవిధముగా అసువులనుబాయుట యుక్తము? మంటలలో దూకుదునా? సముద్రమునందలి బడబాగ్నికి ఆహుతియగుదునా? లేక నాశరీరమును సాగరమునందలి జలజంతువులకు ఆహారముగా అర్పింతునా? (14)

కార్యమును పూర్తిగా భంగపఱచి, బ్రతికియున్న నేను వానరప్రభువైన సుగ్రీవునకును, మహాపురుషులైన రామలక్ష్మణులకును నాముఖమును ఎట్లు చూపగలను? 'వానరులబుద్ధి నిలకడలేనిది' అనుమాట ముల్లోకములలోను ప్రసిద్ధము. నా పిచ్చికోపమువలన వానర సహజలక్షణమైన బుద్ధిచాంచల్యమును ప్రదర్శించితిని గదా! (15-16)

ఛీ! రాజసభావము ఎంతచెడ్డది? ఇది అదుపులేనిది, చంచలమైనది. కార్యదక్షుడనైనను రజోగుణాత్మకమైన ఆగ్రహమువలన సీతాదేవిని రక్షింపలేకపోయితిని. (17)

సీతాదేవిప్రాణములకే ప్రమాదము ఏర్పడినచో ఆ రామలక్ష్మణులు ఇద్దఱును తమప్రాణములు త్యజింతురు. ఆ కారణముగా బంధువులతోగూడ సుగ్రీవుడు ప్రాణత్యాగముచేయును. (18)

ఈవార్తలు చెవికిచేరినంతనే భ్రాతృవత్సలుడును, ధర్మాత్ముడును ఐన భరతుడు, శత్రుఘ్నుడు జీవించియుండజాలరు. (19)

ఈవిధముగా ధర్మమునకు ఆలవాలమైన ఇక్ష్వాకువంశము నాశనమైనచో పిమ్మట ప్రజలెల్లరును శోక సంతాపములతో అలమటించుట తథ్యము. (20)

ఇంతమంది ఆత్మీయుల ప్రాణనష్టకష్టములకు కారకుడను అగుచున్నందున నిజముగా నేను దురదృష్టవంతుడను, ధర్మార్థఫలములను కోల్పోయితిని. రోషాతిరేకముచే దోషములలో కూరుకొనిపోయితిని. నిశ్చయముగా నేను లోకవినాశకుడను. కిష్కింధనుండి అయోధ్యవఱకుగల ప్రజలందఱికిని బాధగల్గించినవాడను. (21)

ఇట్టి విచికిత్సలోనున్న హనుమంతునకు ఇదివఱలోవలెనే ప్రత్యక్షముగా శుభశకునములు కన్పట్టెను. అందువలన మఱల ఆయన ఆలోచనలోపడెను. (22)

మంగళస్వరూపిణియు, సర్వాంగసుందరియునైన సీతాదేవిని ఆమె దివ్యతేజస్సే రక్షించును. అగ్నిని అగ్ని దహింపజాలదుగదా! కనుక ఆమె నశింపదు. (23)

నహి ధర్మాత్మనస్తస్య భార్యామమిత తేజసః।
స్వచారిత్రాభిగుప్తాం తాం స్ప్రష్టు మర్హతి పావకః। 24

సీతాదేవి ధర్మస్వరూపుడును, మిక్కిలితేజశ్శాలియు ఐన శ్రీరామునిభార్య. ఆమె పాతివ్రత్యమే భద్రకవచమై ఆమెను రక్షించును. అట్టి జానకీదేవిని అగ్ని తాకుటకుసైతము అశక్తుడు.[1] (24)

నూనం రామ ప్రభావేణ వైదేహ్యాస్సుకృతేన చ।
యన్మాం దహనకర్మాఽయం నాదహత్ హవ్యవాహనః। 25

ఈ జగత్తునందు దేనినైనను దహించివేయుగల అగ్ని కేవలము శ్రీరామునిప్రభావముచేతనే, సీతాదేవి పుణ్యపరిపాకము చేతనే నన్ను దహింపలేదు. ఇది ముమ్మాటికిని సత్యము. (25)

త్రయాణాం భరతాదీనాం భ్రాతౄణాం దేవతా చ యా।
రామస్య చ మనఃకాంతా సా కథం వినశిష్యతి। 26

భరతలక్ష్మణశత్రుఘ్నులకు సీతాదేవి పరమపూజ్యురాలు. శ్రీరామునకు ప్రాణేశ్వరి. అట్టి జానకీ దేవి అగ్నికి ఆహుతి యగుట అసంభవము. (26)

యద్వా దహనకర్మాఽయం సర్వత్ర ప్రభురవ్యయః।
న మే దహతి లాంగూలం కథమార్యాం ప్రధక్ష్యతి। 27

అంతేగాక ఈఅగ్ని అంతటను దహనస్వభావము గలిగి యుండువాడు, సర్వసమర్థుడు, నాశములేనివాడు. ఐనప్పటికిని నాతోకనే కాల్చలేదు. ఇక పూజ్యురాలైన సీతాదేవిని ఎట్లుదహించును?[2] (27)

పునశ్చాచింతయత్ తత్ర హనుమాన్విస్మితస్తదా।
హిరణ్యనాభస్య గిరేః జలమధ్యే ప్రదర్శనమ్। 28

సముద్రమును లంఘించునప్పుడు తనకు జలమధ్యమున కనవచ్చిన మైనాకపర్వతుని గుర్తునకు తెచ్చుకొని హనుమంతుడు విస్మితుడాయెను. రామకార్యసిద్ధికై సహాయపడుటకు మైనాకుడు ముందునకు వచ్చినపుడు అగ్ని ఎందులకు సహాయపడకుండును? (28)

తపసా సత్యవాక్యేన అనన్యత్వాచ్చ భర్తరి।
అపి సా నిర్దహేదగ్నిం న తామగ్నిః ప్రధక్ష్యతి। 29

తనతపోబలముచేతను, సత్యభాషణ ప్రభావమువలనను ఏకాగ్రతతో తన్మయత్వమున తనభర్తయగు శ్రీరాముని ధ్యానించునది అగుటచేతను సీతాదేవి అగ్నినే పూర్తిగా రూపుమాపగలదు. కనుక ఆమెను అగ్ని దహింపజాలదు. (29)

స తథా చింతయంస్తత్ర దేవ్యా ధర్మపరిగ్రహమ్।
శుశ్రావ హనుమాన్ వాక్యం చారణానాం మహాత్మనామ్। 30

అహో ఖలు కృతం కర్మ దుష్కరం హి హనూమతా।
అగ్నిం విసృజతాభీక్ష్ణం భీమం రాక్షసవేశ్మని। 31

ప్రపలాయిత రక్షఃస్త్రీబాలవృద్ధసమాకులా।
జనకోలాహలాధ్మాతా క్రందంతీవాద్రికందరే। 32

ఆవిధముగా సీతాదేవి ధర్మపరత్వమునుగూర్చి ఆలోచించుచున్న ఆహనుమంతుడు మహాత్ములైన చారణులు (ఆకాశమునుండి) పలుకుచున్న మాటలను వినెను. రాక్షసులకు రాజైన రావణుని ప్రాసాదమునకు (లంకానగరమునకు) భయంకరముగా నిప్పంటించి, దానిని పూర్తిగాదగ్ధమొనర్చిన హనుమంతుడు మిక్కిలి దుష్కరమైన కార్యమునే చేసెను. ఇది ఎంతయు ఆశ్చర్యకరము. రాక్షసులు, వారిస్త్రీలు, బాలురు (పిల్లలు) వృద్ధులు మొదలగువారు కోలాహలములతో అటునిటు పరుగులు దీయుచుండిరి. వారిఆక్రందనలు లంకయందంతటను ప్రతిధ్వనించుచుండెను. అప్పుడు లంకయే గుహలో దాగికొని ముఖము దాచుచేసికొని, ఏడ్చుచున్నదా? అనునట్లుండెను.(30-32)

దగ్ధేయం నగరీ సర్వా సాట్టప్రాకారతోరణా।
జానకీ నచ దగ్ధేతి విస్మయోఽద్భుత ఏవ నః। 33

కోటబురుజులతో, ప్రాకారములతో తోరణములతో కూడిన ఈలంకానగరమంతయు దగ్ధమైనది.సీతాదేవి మాత్రము దగ్ధము కాలేదు. ఇది అత్యద్భుతమై, ఆశ్చర్యమును గొలుపుచున్నది. (33)

1. యదాదిత్యగతంతేజో, జగద్భాసయతేఽ ఖిలమ్। యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్॥ (భగవద్గీత॥ 15/12)
సమస్తజగత్తును ప్రకాశింపజేయు సూర్యునితేజస్సూ, అట్లే చంద్రునితేజస్సూ, అగ్నితేజస్సూ (అగ్నిలోని దాహక శక్తియును) నా తేజస్సేయని యెఱుగుము. అగ్నిలోని దాహకశక్తి భగవత్స్వరూపము. కనుక శ్రీరాముని స్వరూపమేయైన అగ్ని రామపత్నియైన సీతాదేవిని ఎట్లు దహించును?

2. ప్రహ్లాదుడు హిరణ్యకశిపునితో పలుకుచున్న సందర్భము
రామనామజపతాం కుతోభయం, సర్వతాపశమనైకభేషజమ్।
పశ్యతాత! మమ గాత్రసన్నిధౌ, పావకోఽపి సలిలాయతే ఽధునా॥ విష్ణుపురాణము.
రామనామమునుజపించువారికి భయము ఏమాత్రము ఉండదు. ఇది సర్వవిధతాపములను హరించివేయు దివ్యౌషధము. తండ్రీ! ఇటుచూడుము. నా శరీరమునందు అగ్నిదేవుడుగూడ నీటివలె చల్లదనమును ప్రసాదించుచున్నాడు. అనుక్షణము శ్రీరామునినామమును స్మరించుచుండు వారికి అగ్నివలన ప్రమాదము ఎట్లు సంభవించును?

ఇతి శుశ్రావ హనుమాన్ వాచం తామమృతోపమామ్।
బభూవ చాస్య మనసః హర్షస్తత్కాలసంభవః। 34

స నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః।
ఋషివాక్యైశ్చ హనుమాన్ అభవత్ ప్రీతమానసః। 35

తతః కపిః ప్రాప్తమనోరథార్థః
తామక్షతాం రాజసుతాం విదిత్వా।
ప్రత్యక్షతస్తాం పునరేవ దృష్ట్వా
ప్రతిప్రయాణాయ మతిం చకార। 36

అమృతతుల్యములైన ఆ (చారణుల) వచనములను హనుమంతుడు వినెను. అంతట అతని మనస్సు వెంటనే పరమానంద భరితమాయెను. (34)

సఫలములైనశకునములచేతను, సీతాదేవి పాతివ్రత్యము, శ్రీరామునిప్రభావము మున్నగు గొప్ప గుణముల కారణముగను, చారణులమాటలవలనను, సీత క్షేమముగానున్నట్లు గ్రహించి, హనుమంతుడు సంతుష్టుడాయెను. (35)

అంతట మనోరథములీడేరినవాడైన హనుమంతుడు, సీతాదేవికి ఎట్టిప్రమాదమూ జరుగలేదని తెలిసికొని, స్వయముగా ఆమెను మఱల దర్శించిన పిమ్మట తిరుగు ప్రయాణముచేయుటకు నిశ్చయించుకొనెను. (36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే పంచపంచాశస్సర్గః (55)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదిఐదవసర్గము.

-- * * * --

56. ఏబదిఆఱవసర్గము

హనుమంతుడు మరల సీతను దర్శించుట, సముద్రమును లంఘించుట

తతస్తు శింశుపామూలే జానకీం పర్యవస్థితామ్।
అభివాద్యాబ్రవీద్దిష్ట్యా పశ్యామి త్వామిహాక్షతామ్। 1

తతస్తం ప్రస్థితం సీతా వీక్షమాణా పునః పునః।
భర్తృస్నేహాన్వితం వాక్యం హనుమంతమభాషత। 2

యది త్వం మన్యసే తాత వసైకాహమిహానఘ।
క్వచిత్ సుసంవృతే దేశే విశ్రాంతః శ్వో గమిష్యసి। 3

మమ చైవాల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్ తవ వానర।
శోకస్యాస్యాప్రమేయస్య ముహూర్తం స్యాదపి క్షయః। 4

గతే హి హరిశార్దూల పునః సంప్రాప్తయే త్వయి।
ప్రాణేష్వపి న విశ్వాసో మమ వానరపుంగవ। 5

అదర్శనం చ తే వీర భూయో మాం దారయిష్యతి।
దుఃఖాత్ దుఃఖతరం ప్రాప్తాం దుర్మనః శోకకర్శితామ్। 6

అయం చ వీర సందేహః తిష్ఠతీవ మమాగ్రతః।
సుమహాత్స్వ సహాయేషు హర్యృక్షేషు మహాబలః। 7

కథం ను ఖలు దుష్పారం సంతరిష్యంతి సాగరమ్।
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ। 8

పిమ్మట హనుమంతుడు అశోకవృక్షచ్ఛాయలో ఆసీనురాలై యున్నసీతాదేవికి పాదాభివందనమొనర్చి, "అమ్మా! దైవానుగ్రహముచే ఎట్టిఆపాయమునకును లోనుగాక సురక్షితముగానున్న నిన్ను చూడగల్గితిని" అని పలికెను. (1)

పిమ్మట సీతాదేవి తిరుగుప్రయాణమునకు సన్నద్ధుడైయున్న హనుమంతుని మాటిమాటికి వీక్షించుచు, తనకు భర్తపై గలప్రేమను ప్రకటించుచు ఇట్లు నుడివెను. (2)

ఓ పుణ్యపురుషుడా! నీకిష్టమైనచో ఇక్కడ మఱియొక దినము ఉండుము. సరియగు ఒక రహస్య ప్రదేశమున విశ్రాంతిగైకొని రేపు వెళ్లుదువుగాక. (3)

ఓ వానరోత్తమా! అల్పభాగ్యురాలనైన నా యొక్క ఈఅంతులేనిశోకము నీసాన్నిధ్యమువలన ఒక క్షణకాలము పాటైనను దూరమగును. (4)

ఓ వానరోత్తమా! నీవు శ్రీరామునికడకువెళ్ళి, మఱల ఇచటికి వచ్చువఱకు నాప్రాణములు నిలిచియుండునని నాకు నమ్మకములేదు. (5)

ఓ మహావీర! ఇప్పటికే మానసికముగా తట్టుకొనలేని శోకమునకు నేను గుఱియైతిని. నీవు కనబడకుండ వెళ్లినచో కలుగు దుఃఖము ఇంకను హృదయ విదారకముగా ఉండును.(6)

ఓవానరవీర! "అసంఖ్యాకములైన వానరభల్లూక సైన్యముల అండదండలున్న మాట వాస్తవమే. అది సరే! ఆ సైన్యములుగాని, రామలక్ష్మణులుగాని అపారమైన ఈ మహాసాగరమును దాటివచ్చుట ఎట్లు? ఈ ప్రబలమైన సందేహము నన్ను పీడకున్నది. (7-8)

త్రయాణామేవ భూతానాం సాగరస్యాపి లంఘనే।
శక్తిస్స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా। 9

తదత్ర కార్యనిర్బంధే సముత్పన్నే దురాసదే।
కిం పశ్యసి సమాధానం త్వం హి కార్యవిశారదః। 10

కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే।
పర్యాప్తః పరవీరఘ్న! యశస్యస్తే ఫలోదయః। 11

శరైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః।
మాం నయేద్యది కాకుత్స్థః తత్తస్య సదృశం భవేత్। 12

తద్యథా తస్య విక్రాంతమ్ అనురూపం మహాత్మనః।
భవత్యాహవశూరస్య తథా త్వముపపాదయ। 13

త దర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్।
నిశమ్య హనుమాంస్తస్యా వాక్యముత్తరమబ్రవీత్। 14

దేవి హర్యృక్షసైన్యానామ్ ఈశ్వరః ప్లవతాం వరః।
సుగ్రీవః సత్త్వసంపన్నః తవార్థే కృతనిశ్చయః। 15

స వానరసహస్రాణాం కోటీభిరభిసంవృతః।
క్షిప్రమేష్యతి వైదేహి సుగ్రీవః ప్లవగాధిపః। 16

తౌ చ వీరౌ నరవరౌ సహితౌ రామలక్ష్మణౌ।
ఆగమ్య నగరీం లంకాం సాయకైర్విధమిష్యతః। 17

సగణం రాక్షసం హత్వా న చిరాత్ రఘునందనః।
త్వామాదాయ వరారోహే స్వాం పురీం ప్రతియాస్యతి। 18

సమాశ్వసిహి భద్రం తే భవ త్వం కాలకాంక్షిణీ।
క్షిప్రం ద్రక్ష్యసి రామేణ నిహతం రావణం రణే। 19

నిహతే రాక్షసేంద్రే చ సపుత్రామాత్యబాంధవే।
త్వం సమేష్యసి రామేణ శశాంకేనేవ రోహిణీ। 20

క్షిప్రమేష్యతి కాకుత్స్థో హర్యృక్షప్రవరైర్వృతః।
యస్తే యుధి విజిత్యారీన్ శోకం వ్యపనయిష్యతి। 21

ఏవమాశ్వాస్య వైదేహీం హనుమాన్ మారుతాత్మజః।
గమనాయ మతిం కృత్వా వైదేహీమభ్యవాదయత్। 22

రాక్షసాన్ ప్రవరాన్ హత్వా నామ విశ్రావ్య చాత్మనః।
సమాశ్వాస్య చ వైదేహీం దర్శయిత్వా పరం బలమ్। 23

గరుత్మంతుడు, నీవు, వాయుదేవుడు- మహాబలశాలురైన ఈ ముగ్గురు మాత్రమే సాగరమును లంఘించుటకు సమర్థులు. (9)

కార్యసాఫల్యవిషయమున ఎదురగుచున్న ఈగొప్ప అడ్డంకిని తొలగించుటకు కార్యదక్షుడవైన నీవు ఏమి ఆలోచించుచున్నావు? ఇందులకు నీ సమాధానమేమి? (10)

శత్రువీరులను పరిమార్చుటలో సాటిలేనివాడా! ఈ కార్యమును (రాక్షసులను వధించుట, నన్ను నా భర్తకడకు చేర్చుట- అనుకార్యమును) పూర్తిగా నెఱవేర్చుటకు నిజముగా నీవొక్కడవే చాలుదువు. దీనివలన కీర్తి ప్రతిష్ఠలు నీకు దక్కును. రామునకుగాదు. (11)

అరివీరభయంకరుడైనరాముడు తనబాణములచే లంకను అల్లకల్లోలముగావించి, నన్ను తీసికొని వెళ్లినచో-అదియే ఆయన పరాక్రమమునకుదగును. (12)

రణధీరుడైన ఆ మహాత్మునిపరాక్రమమునకు తగిన రీతిగా కార్యవిధానమును నీవు ప్రతిపాదింపుము. (13)

సీతాదేవి నుడివిన అర్థవంతములైన, సహేతుకములైన వినమ్రవచనములనువిని హనుమంతుడు ఆమెకు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (14)

"ఓ సీతాదేవీ! భల్లూకవానరులసైన్యములకు ప్రభువు, కపీశ్వరుడు ఐన సుగ్రీవుడు మహాబలశాలి. నీ కార్యసిద్ధికై (నిన్ను రావణునిచెఱనుండి విడిపించి, శ్రీరాముని కడకు జేర్చుటకై) కృతనిశ్చయుడై యున్నాడు. (15)

ఓ వైదేహీ! కపివరుడైన ఆ సుగ్రీవుడు కోట్లకొలది వానరయోధులతోగూడి వెంటనే ఇచటికి రాగలడు. (16)

వీరులు, నరవరులుఐన ఆ రామలక్ష్మణులు ఇరువురునుగూడి ఇచటికివచ్చి, తమబాణములచే లంకానగరమును ధ్వంస మొనర్చెదరు. శ్రీరాముడు అతిత్వరలో ససరివారముగా రావణుని హతమార్చి, సీతోగూడి తననగరమైన అయోధ్యకు వెళ్లగలడు. అమ్మా! ఊరడిల్లుము. నీకు శుభముకలుగును. నీవు కొద్దికాలము వేచియుండుము. యుద్ధమున శ్రీరామునిచేతిలో రావణుడు హతమగుటను నీవు త్వరలోనే చూడగలవు. పుత్రులతోను, అమాత్యులతోను, బంధువులతోను రావణుడు నిహతుడుకాగా- రోహిణి చంద్రుని గలిసినట్లు నీవు శ్రీరాముని చేరగలవు. వానరభల్లూకములతోగూడి శ్రీరాముడు అతిత్వరలో ఇచటికి రాగలడు. అతడు యుద్ధమున శత్రువులను పరిమార్చి, నీ శోకమును తొలగింపగలడు." (17-21)

వాయుసుతుడైనహనుమంతుడు సీతాదేవిని ఇట్లు ఓదార్చి[1] తిరిగివెళ్లుటకు నిశ్చయించుకొనిన వాడై,ఆమెకు అభివాదమొనర్చెను. (22)

ఆ వానరోత్తముడు ప్రముఖులైన రాక్షసులను హతమార్చి, "నేను రామబంటును. నాపేరు హనుమంతుడు" అని ఎలుగెత్తిచాటి,

1) ఇక్కడ శోకాకులయైన సీతాదేవిని ఊరడించినట్లే, అక్కడ విరహాతురుడైన శ్రీరామునకును ఊరటగూర్చిన హనుమంతుడు ఎంతయో ధన్యాత్ముడు.

నగరీమాకులాం కృత్వా వంచయిత్వా చ రావణమ్।
దర్శయిత్వా బలం ఘోరం వైదేహీ మభివాద్య చ। 24

ప్రతిగంతుం మనశ్చక్రే పునర్మధ్యేన సాగరమ్।
తత స్స కపిశార్దూలః స్వామిసందర్శనోత్సుకః। 25

ఆరురోహ గిరిశ్రేష్ఠమ్ అరిష్టమరిమర్దనః।
తుంగపద్మకజుష్టాభిః నీలాభిర్వనరాజిభిః। 26

సోత్తరీయమివాంభోదైః శృంగాంతర విలంబిభిః।
బోధ్యమానమివ ప్రీత్యా దివాకరకరైశ్శుభైః। 27

ఉన్మిషంతమివోద్ధూతైః లోచనైరివ ధాతుభిః।
తోయౌఘనిస్స్వనైర్మంద్రైః ప్రాధీతమివ పర్వతమ్। 28

ప్రగీతమివ విస్పష్టైః నానాప్రస్రవణస్వనైః।
దేవదారుభిరత్యుచ్చైః ఊర్ధ్వబాహుమివ స్థితమ్। 29

ప్రపాతజలనిర్ఘోషైః ప్రాక్రుష్టమివ సర్వతః।
వేపమానమివ శ్యామైః కంపమానైశ్శరద్వనైః। 30

వేణుభిర్మారుతోద్ధూతైః కూజంతమివ కీచకైః।
నిశ్శ్వసంతమివామర్షాత్ ఘోరైరాశీవిషోత్తమైః। 31

నీహారకృతగంభీరైః ధ్యాయంతమివ గహ్వరైః।
మేఘపాదనిభైః పాదైః ప్రక్రాంతమివ సర్వతః। 32

జృంభమాణమివాకాశే శిఖరైరభ్రమాలిభిః।
కూటైశ్చ బహుధాకీర్ణైః శోభితం బహుకందరైః। 33

సాలతాలాశ్వకర్ణైశ్చ వంశైశ్చ బహుభిర్వృతమ్।
లతావితానైర్వితతైః పుష్పవద్భిరలంకృతమ్। 34

నానామృగగణాకీర్ణం ధాతునిష్యందభూషితమ్।
బహుప్రస్రవణోపేతం శిలాసంచయసంకటమ్। 35

మహర్షియక్షగంధర్వకిన్నరోరగసేవితమ్ ।
లతాపాదపసంఘాతం సింహాధ్యుషితకందరమ్। 36

వైదేహికి ఊరటను గూర్చెను. తన అమోఘమైనబలమును ప్రదర్శించెను. లంకానగరమును అల్లకల్లోలమొనర్చి, రావణుని మదమణచి, భయంకరమైన తనబలమును వారికి రుచిచూపెను. మరల వైదేహికిప్రణమిల్లి, శ్రీరాముని సందర్శించు కుతూహలముతో సాగరముమీదుగా మరలి పోవుటకు నిశ్చయించుకొనెను. (23-25)

శత్రుసూదనుడైనహనుమంతుడు 'అరిష్టము' అను పేరుగల ఒక మహాగిరిని అధిరోహించెను. ఆ పర్వతము ఎత్తైన 'పద్మక' వృక్షములుగల నల్లనివనపంక్తులతో గూడియుండెను. అందలి శిఖరములమధ్య వ్రేలాడుచున్నమేఘములచే అది ఉత్తరీయమును దాల్చినట్లుండెను. మంగళకరములైన సూర్యకిరణముల చేత ప్రేమతో మేల్కొలుపబడుచున్నట్లుండెను. ఆ పర్వతమునుండి వెలువడిన గైరికాదిధాతువులు దానికి కన్నులవలె విలసిల్లుచు తెఱచి చూచుచున్నట్లు ఉండెను. జలపాతముల మంద్రస్థాయి నిన్వదములచే అది వేదాధ్యయనము చేయుచున్నట్లుండెను. అత్యున్నతములైన దేవదారువృక్షములుగల ఆ శైలము చేతులు పైకెత్తి తపమొనర్చు మునివలెనుండెను. పలువైపులనుండి ప్రవహించు నిర్ఝరములఘోషలతో ఆ పర్వతము బిగ్గరగా అఱచు చున్నట్లుండెను. ఆ గిరి శ్యామవర్ణములు గలిగి కంపించుచున్న శరద్వనములతో వణకుచున్నట్లుండెను. గాలులతోనిండిన వెదుళ్లనిన్వదములచే అది వేణువులూదు చున్నట్లుండెను. భయంకరములైన విషసర్పములబుసలతో అది కోపాతిరేకముచే నిట్టూర్పులువిడుచుచున్నట్లుండెను.(26-31)

మంచుచేకప్పబడి గంభీరములైయున్నగుహలచే అది ఇంద్రియములను నిరోధించి, ధ్యానమగ్నుడైన మునివలెనుండెను. ప్రక్కనగల ప్రత్యంతపర్వతములు మేఘపాదములవలె నుండుటచే ఆ 'అరిష్ట'గిరి ముందునకు సాగుచున్నట్లుండెను. శిఖరములపై వరుసలుదీఱిన మేఘములతో అది ఆకాశమున ఆవులించుచున్నట్లుండెను. ఆ పర్వతము అనేకములైన శిఖరములతోను, గుహలతోను అలరారుచుండెను. అది అనేకములైన మద్దిచెట్లతోను, తాళవృక్షములతోను, అశ్వకర్ణ పాదపములతోను, వెదుళ్లతోను పరివృతమైయుండెను. పూవులతోనిండి, విస్తారములైన పొదరిండ్లతో అలంకృతమై యుండెను. (32-34)

ఆగిరి వివిధములగు మృగముల గుంపులతో, గైరికాది ధాతువుల స్రావములతో ఒప్పుచున్నది. పెక్కు సెలయేళ్లతో విలసిల్లుచున్నది. ఎగుడుదిగుడు బాళ్లతో, అప్పలతో సంచరించుటకు ప్రతికూలముగానున్నది. (35)

మహర్షులు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, నాగులు మున్నగువారిచే అది సేవింపబడుచుండెను. లతల, వృక్షముల సముదాయములతో అలరారుచుండెను. ఆ పర్వతగుహల యందు సింహములు నివసించుచుండెను. (36)

వ్యాఘ్రసంఘసమాకీర్ణం స్వాదుమూలఫలద్రుమమ్।
తమారురోహ హనుమాన్ పర్వతం పవనాత్మజః।
రామదర్శనశీఘ్రేణ ప్రహర్షేణాభిచోదితః। 37

తేన పాదతలాక్రాంతా రమ్యేషు గిరిసానుషు।
సఘోషాస్సమశీర్యంత శిలాశ్చూర్ణీకృతాస్తతః। 38

స తమారుహ్య శైలేంద్రం వ్యవర్ధత మహాకపిః।
దక్షిణాదుత్తరం పారం ప్రార్థయన్ లవణాంభసః। 39

అధిరుహ్య తతో వీరః పర్వతం పవనాత్మజః।
దదర్శ సాగరం భీమం మీనోరగనిషేవితమ్। 40

స మారుత ఇవాకాశం మారుతస్యాత్మసంభవః।
ప్రపేదే హరిశార్దూలో దక్షిణాదుత్తరాం దిశమ్। 41

స తదా పీడితస్తేన కపినా పర్వతోత్తమః। 42

రరాస సహ తైర్భూతైః ప్రవిశన్ వసుధాతలమ్।
కంపమానైశ్చ శిఖరైః పతద్భిరపి చ ద్రుమైః। 43

తస్యోరువేగోన్మథితాః పాదపాః పుష్పశాలినః।
నిపేతుర్భూతలే భగ్నాః శక్రాయుధహతా ఇవ। 44

కందరాంతరసంస్థానాం పీడితానాం మహౌజసామ్।
సింహానాం నినదో భీమో నభో భిందన్ స శుశ్రువే। 45

స్రస్తవ్యావిద్ధవసనా వ్యాకులీకృతభూషణాః।
విద్యాధర్యస్సముత్పేతుః సహసా ధరణీధరాత్। 46

అతిప్రమాణా బలినో దీప్తజిహ్వా మహావిషాః।
నిపీడితశిరోగ్రీవా వ్యవేష్టంత మహాహయః। 47

పెద్దపులులగుంపులచే అది వ్యాప్తమైయుండెను. రుచికరములైన మూలములతోడను, ఫల వృక్షములతోడను రాజిల్లుచుండెను. సీతాదర్శనశుభవార్తను, ఆమె సందేశమును రామునకు తెలుపవలెననుకుతూహలము తొందరపెట్టుచుండగా వాయుసూనుడైన హనుమంతుడు ఆ 'అరిష్ట'గిరిని అధిరోహించెను. (37)

పిమ్మట రమ్యములైన పర్వతశిఖరములపై ఆ మారుతి తనపాదములను మోపినంతనే అందలి గండశిలలు పెద్దగా పటపట ధ్వనులుచేయుచు నలిగి, పిండిపిండియై పోయెను. (38)

ఆ మహాకపి సముద్రముయొక్క దక్షిణతీరమునుండి ఉత్తరతీరమునకు వెళ్లదలచినవాడై, ఆ మహాగిరియొక్క పై భాగమునకెక్కి, తనశరీరమును పెంచెను. (39)

వీరుడైన ఆవాయునూనుడు పర్వతమును అధిరోహించిన పిమ్మట మీనములతోను, సర్పములతోను కూడిన భయంకరమైన సముద్రమును గాంచెను. (40)

వాయుసుతుడైన ఆకపివరుడు దక్షిణమునుండి ఉత్తరదిశగా ఆకాశమున వాయువేగముతో సాగిపోయెను. (41)

ఆ అరిష్టాద్రి హనుమంతుని పాదఘట్టనప్రభావమున అచటనున్నప్రాణులతోసహా భూమిలోనికి క్రుంగిపోసాగెను. అపుడు దానిశిఖరములన్నియు కంపించినవి, చెట్లన్నియు నేలగూలినవి, వీటన్నిటితోగూడి. ఆగిరి క్రుంగిపోవుచుండగా అందుండి ఒకమహాధ్వని వెలువడినది. (42-43)

హనుమంతునియొక్క బలమైన ఊరువులతాకిడికి నిలువలేక పూవులతో విలసిల్లుచున్న వృక్షములన్నియు పెల్లగిల్లినవై, వజ్రాయుధముచే కొట్టబడినవాటివలె ఛిన్నాభిన్నములై కూలిపోయినవి. (44)

హనుమంతుని పాదములత్రొక్కిడికి ఆ పర్వత గుహలన్నియు శిథిలములైనవి. అందువలన ఆ గుహలలో నివసించుచున్న మహాతేజస్సుగల సింహములన్నియును బాధలకులోనై భయంకరముగా గర్జించినవి, ఆగర్జనలు ఆకాశమును బ్రద్దలు చేయుచున్నట్లు వినబడెను. (45)

ఆగిరిపై హనుమంతునిపాదాహతిచే ఏర్పడిన సంక్షోభ కారణముగా అచటి విద్యాధరవనితలు మిక్కిలి భయపడిరి. అప్పుడు వారివస్త్రములు చెదరి జారిపోవుచుండెను. వారి ఆభరణములన్నియును అస్తవ్యస్తములాయెను. వెంటనే వారు భయముతో పైకెగిరిరి. (46)

మిక్కిలి పొడవైనవి, బలముగలవి, ప్రజ్వలించుచున్న నాలుకలుగలవి ఐన మహావిషసర్పములు మిక్కిలి పీడితములై మెడలు, పడగలు, ఎంతయు నలిగిపోగా భయముతోచుట్టలు చుట్టుకొనియుండెను. (47)

కిన్నరోరగగంధర్వయక్షవిద్యాధరాస్తథా।
పీడితం తం నగవరం త్యక్త్వా గగనమాస్థితాః। 48

అప్పుడు కిన్నరులు, నాగులు, గంధర్వులు, యక్షులు, విద్యాధరులు మొదలగువారు సంక్షోభమునకులోనైన ఆ అరిష్టగిరిని వీడి ఆకాశమునకుచేరిరి. (48)

స చ భూమిధరః శ్రీమాన్ బలినా తేన పీడితః।
సవృక్షశిఖరోదగ్రః ప్రవివేశ రసాతలమ్। 49

మహాబలశాలియైన హనుమంతుని పాదములధాటికి తట్టుకొనలేక ఆమహాపర్వతము వృక్షములతో, ఉన్నత శిఖరములతోగూడ పాతాళమునకు క్రుంగెను. (49)

దశయోజనవిస్తారః త్రింశద్యోజనముచ్ఛ్రితః।
ధరణ్యాం సమతాం యాతః స బభూవ ధరాధరః। 50

పదియోజనములవిస్తీర్ణము, ముప్పదియోజనముల ఎత్తుగల ఆ 'అరిష్ట' పర్వతము క్రుంగిపోయి, నేలతో సమానమాయెను. (50)

స లిలంఘయిషుర్భీమం సలీలం లవణార్ణవమ్।
కల్లోలాస్ఫాలవేలాంతమ్ ఉత్పపాత నభో హరిః। 51

తీరములను తనతరంగములచే చఱచుచు భయంకరముగా ఉన్న ఆ లవణసముద్రమును అవలీలగా దాటగోరినవాడై ఆవానరోత్తముడు ఆకసమునకు ఎగిరెను. (51)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే షట్పంచాశస్సర్గః (56)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదిఆఱవసర్గము.

— * * * —

57. ఏబదిఏడవసర్గము

హనుమంతుడు సముద్రమును దాటి, జాంబవంతుని, అంగదాదులను గలిసికొనుట

ఆప్లుత్య చ మహావేగః పక్షవానివ పర్వతః।
భుజంగయక్షగంధర్వప్రబుద్ధకమలోత్పలమ్ । 1

సచంద్రకుముదం రమ్యం సార్కకారండవం శుభమ్।
తిష్యశ్రవణకాదంబమ్ అభ్రశైవాలశాద్వలమ్। 2

పునర్వసుమహామీనం లోహితాంగమహాగ్రహమ్।
ఐరావతమహాద్వీపం స్వాతీహంసవిలోలితమ్। 3

వాతసంఘాతజాతోర్మి చంద్రాంశుశిశిరాంబుమత్।
హనుమాన్ మారుతగతిః మహానౌరివ సాగరమ్।
అపారమపరిశ్రాంతః పుప్లువే గగనార్ణవమ్। 4

మహాబలపరాక్రమములుగల హనుమంతుడు తెక్కలుగల పర్వతమువలె ఎగిరెను. వాయువేగముగల హనుమంతుడు ఒక మహానౌక సాగరమునుదాటినట్లు, అపారమైన గగనార్ణవమును అనాయాసముగా దాటెను. ఆ ఆకాశ సముద్రమున నాగులు, యక్షులు, గంధర్వులే వికసించిన కమలములు, ఉత్పలములు; చంద్రుడే రమ్యమైనతెల్లకలువ; సూర్యుడే శుభకరమైన జలకుక్కుటము (కన్నెలేడిపిట్ట); పుష్యమీ, శ్రవణా నక్షత్రములే కలహంసలు; మేఘములే పచ్చికబయళ్ల నాచులు; పునర్వసునక్షత్రమే ఒక మహామీనము; కుజగ్రహామే ఒక పెద్దమొసలి; ఐరావతమే ఒక మహాద్వీపము. ఇంకను ఆ గగనార్ణవము స్వాతీ నక్షత్రమనెడిహంసచే కదల్చబడుచుండెను; వాయుపరంపరలనెడి పిటితరంగములతో విలసిల్లుచుండెను. చంద్రకిరణము లనెడిచల్లని జలములతో రాజిల్లుచుండెను- అట్టి గగనార్ణవమును మారుతి దాటెను. (1-4)

గ్రసమాన ఇవాకాశం తారాధిపమివోల్లిఖన్।
హరన్నివ సనక్షత్రం గగనం సార్కమండలమ్। 5

మారుతస్యాత్మజః శ్రీమాన్ కపి ర్వ్యోమచరో మహాన్।
హనుమాన్ మేఘజాలాని వికర్షన్నివ గచ్ఛతి। 6

వాయుసూనుడును, శుభలక్షణసంపన్నుడును, వానరోత్తముడును ఐన హనుమంతుడు ఆకాశమును మ్రింగుచున్నవానివలెను, చంద్రుని ఒరిసికొనుచున్న వానిరీతిని, నక్షత్రసూర్యమండలములతో గూడిన అంతరిక్షమును హరించుచున్నవానివగిది, మేఘములను లాగుచున్నవానివలెను ఆకాశమార్గమున సంచరించుచు వెళ్లుచుండెను. (5-6)

పాండురారుణవర్ణాని నీలమాంజిష్ఠకాని చ।
హరితారుణవర్ణాని మహాభ్రాణి చకాశిరే॥ 7

ప్రవిశన్నభ్రజాలాని నిష్పతంశ్చ పునఃపునః।
ప్రచ్ఛన్నశ్చ ప్రకాశశ్చ చంద్రమా ఇవ లక్ష్యతే॥ 8

వివిధాభ్రఘనాపన్నగోచరో ధవళాంబరః।
దృశ్యాదృశ్యతనుర్వీరః తదా చంద్రాయతేఽంబరే॥ 9

తార్క్ష్యాయమాణో గగనే బభాసే వాయునందనః।
దారయన్ మేఘబృందాని నిష్పతంశ్చ పునఃపునః॥ 10

నదన్ నాదేన మహతా మేఘస్వనమహాస్వనః।
ప్రవరాన్ రాక్షసాన్ హత్వా నామవిశ్రావ్య చాత్మనః॥ 11

ఆకులాం నగరీం కృత్వా వ్యథయిత్వా చ రావణమ్।
అర్దయిత్వా బలం ఘోరం వైదేహీమభివాద్య చ।
ఆజగామ మహాతేజాః పునర్మధ్యేన సాగరమ్॥ 12

పర్వతేంద్రం సునాభంచ సముపస్పృశ్య వీర్యవాన్।
జ్యాముక్తఇవ నారాచో మహావేగోఽభ్యుపాగతః॥ 13

స కించిదనుసంప్రాప్తః సమాలోక్య మహాగిరిమ్।
మహేంద్ర మేఘసంకాశం ననాద హరిపుంగవః॥ 14

స పూరయామాస కపిః దిశో దశ సమంతతః।
నదన్ నాదేన మహతా మేఘస్వనమహాస్వనః॥ 15

స తం దేశమనుప్రాప్తః సుహృద్దర్శనలాలసః।
ననాద హరిశార్దూలో లాంగూలం చాప్యకంపయత్॥ 16

తస్య నానద్యమానస్య సుపర్ణచరితే పథి।
ఫలతీవాస్య ఘోషేణ గగనం సార్కమండలమ్॥ 17

యే తు తత్రోత్తరే తీరే సముద్రస్య మహాబలాః।
పూర్వం సంవిష్ఠితాశ్శూరా వాయుపుత్రం దిదృక్షవః॥ 18

ఆ గగనమునందలి మేఘములు తెలుపు, ఎఱుపు, నీలము, పసుపు, ఆకుపచ్చ, ముదురు ఎఱుపు రంగులతో విరాజిల్లుచుండెను. (7)

మాటిమాటికి మేఘములలో ప్రవేశించుచు బయటికి వచ్చుచున్న హనుమంతుడు మబ్బులచాటునదాగి, బయటికివచ్చుచున్న చంద్రునివలె తేజరిల్లుచుండెను.(8)

తెల్లనివస్త్రములనుధరించిన హనుమంతుడు దట్టముగా ఉన్న మేఘములసమీపమున సాగిపోవుచు ఆకసమున ఒక్కొక్కప్పుడు కనబడుచు, మఱియొకప్పుడు కనబడని చంద్రునివలె గోచరించుచుండెను. (9)

వాయునూనుడు పదేపదే మేఘసమూహములను జీల్చుచు, బయటికివచ్చుచు గరుత్మంతునివలె ఆకాశమున భాసించెను. (10)

మేఘగర్జనలవలె గంభీరనాదమునర్చుడి హనుమంతుడు మహాధ్వనిగావించి, ప్రముఖరాక్షసులను హతమొనర్చి, తన పేరును (నేను రామబంటును, నా పేరు హనుమంతుడు అని) చాటెను. (11)

మిక్కిలితేజశ్శాలియగు మారుతి లంకానగరమును అస్తవ్యస్తమొనర్చి, రావణునకు మనోవ్యథను గలిగించెను. ఘోరమైన రాక్షసబలములను చీల్చిచెండాడెను. పిమ్మట సీతాదేవికి పాదాభివందనముగావించి, మహాసముద్రము మీదుగా మఱల విచ్చేసెను. (12)

మహావీరుడును, గొప్పశక్తిశాలియునైన హనుమంతుడు మార్గమధ్యమున మైనాకమహాపర్వతమును స్పృశించి, వింటినారినుండి విడువబడిన బాణమువలె అతివేగముగా (ఉత్తరతీరమునకు) ఏతెంచెను. (13)

ఆవానరోత్తముడు మేఘసదృశమైన మహేంద్రపర్వతము సమీపించుచుండగా దానినిగాంచి మహాధ్వని యొనర్చెను.(14)

అప్పుడు హనుమంతుడు మేఘమువలె గంభీరనాదమొనర్చెను. అది దశదిశలయందంతటను నిండెను. (15)

ఆ కపివరుడు సముద్రముయొక్క ఆవలితీరమునకు జేరి, మిత్రులను దర్శించుటకై ఉబలాటపడుచున్నవాడై, సింహగర్జనచేయుచు[1] వాలమును అటునిటు త్రిప్పెను. గరుత్మంతుడు సంచరించునట్టి ఆ నభోమార్గమున గర్జనలు గావించుచున్న ఆ హనుమంతుని మహాధ్వనులకు సూర్యమండల సహితముగా ఆకాశము బ్రద్దలగుచున్నట్లు ఒప్పారెను. (16-17)

ఇంతకుముందు సముద్రముయొక్క ఉత్తరతీరమున చేరియున్న మహాబలశాలురైన అంగదాదివానరవీరులు వాయుపుత్రునిదర్శనమునకు ఎదురుతెన్నులు చూచుచుండిరి. అప్పుడు వారు పెనుగాలిచే కొట్టబడిన మేఘముయొక్క

1) రైలుబండి గమ్యస్థానమును చేరుటకు ముందుగా తన రాకను తెలుపుచు బిగ్గరగా కూతవేయును. మహేంద్ర గిరిపైనున్న అంగదాది వానరులకు తన ఆగమనమును సూచించుచు మారుతి సింహగర్జన గావించెను.

మహతో వాయునున్నన్య తోయదస్యేవ గర్జితమ్।
శుశ్రువుస్తే తదా ఘోషమ్ ఊరువేగం హనూమతః। 19

తే దీనమనస స్సర్వే శుశ్రువుః కాననౌకసః।
వానరేంద్రస్య నిర్ఘోషం పర్జన్యనినదోపమమ్। 20

నిశమ్య నదతో నాదం వానరాస్తే సమంతతః।
బభూవురుత్సుకాస్సర్వే సుహృద్దర్శనకాంక్షిణః। 21

జాంబవాన్ స హరిశ్రేష్ఠః ప్రీతిసంహృష్టమానసః।
ఉపామంత్ర్య హరీన్ సర్వాన్ ఇదం వచనమబ్రవీత్। 22

సర్వథా కృతకార్యోఽసౌ హనుమాన్ నాత్ర సంశయః।
నహ్యస్యాకృతకార్యస్య నాద ఏవంవిధో భవేత్। 23

తస్య బాహూరువేగం చ నినాదం చ మహాత్మనః।
నిశమ్య హరయో హృష్టాః సముత్పేతుస్తతస్తతః। 24

తే నగాగ్రాన్నగాగ్రాణి శిఖరాచ్ఛిఖరాణి చ।
ప్రహృష్టాస్సమపద్యంత హనుమంతం దిదృక్షవః। 25

తే ప్రీతాః పాదపాగ్రేషు గృహ్య శాఖాస్సునిష్ఠితాః।
వాసాంసీవ ప్రశాఖాశ్చ సమావిధ్యంత వానరాః। 26

గిరిగహ్వరసంలీనో యథా గర్జతి మారుతః।
ఏవం జగర్జ బలవాన్ హనుమాన్ మారుతాత్మజః। 27

తమభ్రఘనసంకాశమ్ ఆపతంతం మహాకపిమ్।
దృష్ట్వా తే వానరాస్సర్వే తస్థుః ప్రాంజలయస్తదా। 28

తతస్తు వేగవాంస్తస్య గిరేర్గిరినిభః కపిః।
నిపపాత మహేంద్రస్య శిఖరే పాదపాకులే। 29

హర్షేణాపూర్యమాణోఽసౌ రమ్యే పర్వతనిర్ఝరే।
ఛిన్నపక్ష ఇవాకాశాత్ పపాత ధరణీధరః। 30

తతస్తే ప్రీతమనసః సర్వే వానరపుంగవాః।
హనుమంతం మహాత్మానం పరివార్యోపతస్థిరే। 31

పరివార్య చ తే సర్వే పరాం ప్రీతి ముపాగతాః।
ప్రహృష్టవదనాస్సర్వే తమరోగముపాగతమ్। 32

గర్జనవలెనున్న హనుమంతుని మహానాదమును, ఆయనయొక్క ఊరువేగముచే ఏర్పడిన సవ్వడులను వినిరి. (18-19)

ఇంతవఱకును దీనమనస్కులైయున్న ఆ వానరులందఱును మేఘగర్జనసదృశమైన వానరోత్తముని యొక్క నిర్ఘోషమును వినిరి- మిత్రుడైన హనుమంతుని దర్శనమునకై తహతహపడుచున్న ఆ వానరులందఱును నలుదిక్కుల వ్యాపించిన హనుమంతుని సింహనాదమును విని, ఉత్సాహభరితులైరి. వానరనాయకుడైన జాంబవంతుడు సంతోషముతో పొంగిపోయినవాడై, వానరులనందఱిని దగ్గరకుపిలిచి, ఇట్లు నుడివెను. (20-22)

"ఈ హనుమంతుడు అన్నివిధములుగా కృతకృత్యుడై ఇచటకు వచ్చుచున్నాడు. అందుకు సందేహములేదు- వెళ్లిన కార్యము సఫలముకానిచో అతడు ఇట్లు మహానాదమొనర్పడు- (23)

మహాత్ముడైన ఆ హనుమంతుని బాహువేగమును, ఊరువేగమును గమనించి, మహాధ్వనిని విని, వానరులందఱును సంతోషముతో ఇటునటు గంతులు వేయసాగిరి. (24)

వారు సంతోషాతిరేకముతో హనుమంతుని జూచుటకు ఆరాటపడుచున్నవారై ఆ కొమ్మలనుండి ఈ కొమ్మలమీదికిని, ఆ శిఖరములనుండి ఈ శిఖరములమీదికిని ఎగురుచుండిరి. (25)

ఆ వానరులు సంతోషములో పొంగిపోయినవారై, చెట్లకొన కొమ్మలయందు శాఖలనుపట్టుకొని, దృఢముగా నిలిచి, చిన్నచిన్న కొమ్మలను బట్టలనువలె దులిపిరి. (కదల్చిరి) ఈవిధముగా వారు తమ సంతోషాతిరేకమును ప్రదర్శించిరి. (26)

పర్వతగుహలలో ప్రవేశించిన వాయువు ప్రతిధ్వనించిన రీతిగా బలశాలియైన వాయుసూనుడగు హనుమంతుడు గర్జించెను. (27)

మహామేఘసమానుడైన ఆ హనుమంతుడు భూమిపై దిగుచుండగాజూచి, ఆ వానరులందఱును అంజలి ఘటించి, స్వాగతముపలుకుచు ఆయనయెదుట నిలబడిరి. (28)

మిక్కిలిశక్తిమంతుడును, శైలసమానుడునుఅగు హనుమంతుడు వృక్షములతో ఆవరింపబడియున్న ఆ మహేంద్రగిరి శిఖరముపై అడుగిడెను. (29)

సంతోషములో ఉప్పొంగిపోవుచున్న ఈ హనుమంతుడు ఱెక్కలుతెగిన పర్వతమువలె ఒప్పుచు రమ్యమైన సెలయేటి తీరమున దిగెను- (30)

అప్పుడు పరమానందభరితులైన అంగదాది వానరోత్తములు అందఱును మహాత్ముడైన హనుమంతుని సమీపమున చుట్టునుజేరిరి. (31)

క్షేమముగా తిరిగివచ్చిన హనుమంతుని గాంచినసిమ్మట వారి ముఖములు ప్రసన్నములాయెను. అతని చుట్టుచేరిన వారందఱును ఎనలేని సంతోషమునకు లోనైరి. (32)

ఉపాయనాని చాదాయ మూలాని చ ఫలానిచ।
ప్రత్యర్చయన్ హరిశ్రేష్ఠం హరయో మారుతాత్మజమ్। 33

వినేదుర్ముదితాః కేచిత్ కేచిత్ కిలకిలాం స్తథా।
హృష్టాః పాదపశాఖాశ్చ ఆనిన్యుర్వానరర్షభాః। 34

హనుమాంస్తుగురూన్ వృద్ధాన్ జాంబవత్ప్రముఖాం స్తదా।
కుమారమంగదం చైవ సోఽవందత మహాకపిః। 35

స తాభ్యాం పూజితః పూజ్యః కపిభిశ్చ ప్రసాదితః।
దృష్టా సీతేతి విక్రాంతః సంక్షేపేణ న్యవేదయత్। 36

నిషసాద చ హస్తేన గృహీత్వా వాలినస్సుతమ్।
రమణీయే వనోద్దేశే మహేంద్రస్య గిరే స్తదా। 37

హనుమానబ్రవీత్ పృష్టః తదా తాన్ వానరర్షభాన్।
అశోకవనికాసంస్థా దృష్టా సా జనకాత్మజా। 38

రక్ష్యమాణా సుఘోరాభీ రాక్షసీభిరనిందితా।
ఏకవేణీధరా బాలా రామదర్శనలాలసా।
ఉపవాసపరిశ్రాంతా జటిలా మలినా కృశా। 39

తతో దృష్టేతి వచనం మహార్థమమృతోపమమ్।
నిశమ్యమారుతేస్సర్వే ముదితా వానరాభవన్। 40

క్ష్వేళంత్యన్యే నదంత్యన్యే గర్జంత్యన్యే మహాబలాః।
చక్రుః కిలకిలా మన్యే ప్రతిగర్జంతి చాపరే। 41

కేచిదుచ్ఛ్రితలాంగూలాః ప్రహృష్టాః కపికుంజరాః।
అంచితాయతదీర్ఘాణి లాంగూలాని ప్రవివ్యధుః। 42

అపరేచ హనూమంతం వానరా వారణోపమమ్।
ఆప్లుత్య గిరిశృంగేభ్యః సంస్పృశంతిస్మ హర్షితాః। 43

అంగదాదివానరులు కందమూలఫలములను తీసికొనివచ్చి, వాటిని కపివరుడైనహనుమంతునకు కానుకలుగా సమర్పించి, ఆయనను భక్తితో పూజించిరి. (33)

ముదితాంతరంగులైన ఆ వానరోత్తములలో కొందఱు గట్టిగా అఱచిరి. మఱికొందఱు కిలకిలారావములు గావించిరి. ఇంకను కొందఱు సంతోషమునుపట్టలేక చెట్లకొమ్మలను ఆసనములకై తీసికొనివచ్చిరి. (34)

వానరోత్తముడైన ఆ హనుమంతుడు గురువులకును, వృద్ధులైన జాంబవంతుడు మొదలగు ప్రముఖులకును, యువరాజైన అంగదునకును ప్రణమిల్లెను. (35)

పరాక్రమశాలియు, పూజ్యుడును ఐన హనుమంతుని అంగద జాంబవంతులు పూజించిరి. ఇతర వానరోత్తములు అందఱును సాదరముగా శ్లాఘించిరి. అప్పుడు మారుతి "కనుగొంటిని సీతమ్మను" (దృష్టా సీతా) అని సంక్షేపముగా నివేదించెను. (36)

అతడు వాలికుమారుడైన అంగదుని సాదరముగా దగ్గరకు దీసికొని, మహేంద్రగిరిపైగల రమణీయమైన వనప్రదేశమునందు ఉపవిష్టుడయ్యెను. (37)

వానరులందఱును 'విశేషములను వివరింపుము'- అని కోరగా హనుమంతుడిట్లు తెలిపెను. "ఆ జానకీదేవిని అశోకవనమునందు దర్శించితిని. పూజ్యురాలైన ఆ సీతామాతను భయంకరాకారములుగల రాక్షసస్త్రీలు కాపలాకాయుచున్నారు. ఆమె కేశములన్నియు ఒకే జడగా ఏర్పడియుండెను. ఆ అమాయకురాలు శ్రీరాముని దర్శనముకై తహతహపడుచున్నది. జటాధారిణియై మలిన వస్త్రయై ఉపవాసములచే కృశించియున్నది"- (38-39)

అంతట "కనుగొంటిని" అను అమృతతుల్యము, విశేషార్థదాయకము ఐన హనుమంతుని వచనమునువిని, **వానరులుఎల్లరును పరమానందమునొందిరి.** (40)

మహాబలశాలురైన ఆ వానరులలో కొందఱు సింహనాదము గావించిరి, మఱికొందఱు కేకలువేసిరి, ఇంకను కొందఱు, అంకెలు వేసిరి, మఱి కొందఱు కిలకిలారావములను గావించిరి, ఇంకనుకొందఱు ప్రతిగర్జనలనొనర్చిరి. కొందఱు తోకలనుపైకెత్తియుంచి, తమసంతోషములను ప్రకటించిరి. నిర్భరానందభరితులైన కపివరులు కొందఱు స్థూలమైన మిక్కిలిపొడవైనతమ వాలములను విలాసముగా నేలకేసి కొట్టిరి. (41-42)

మఱికొందఱువానరులు సంతోషపరవశులై, పర్వత శిఖరముల నుండి క్రిందికిదూకి, భద్రగజమువలె ఒప్పుచున్న మారుతిని కౌగిలించుకొనిరి. సీతను దర్శించి ఆ చల్లని వార్తను దీసికొనివచ్చిన హనుమంతుని ప్రశంసించుచు

ఉక్తవాక్యం హనూమంతమ్ అంగదస్తమథాబ్రవీత్।
సర్వేషాం హరివీరాణాం మధ్యే వచనముత్తమమ్। 44

సత్త్వే వీర్యే న తే కశ్చిత్ సమో వానర విద్యతే।
యదవప్లుత్య విస్తీర్ణం సాగరం పునరాగతః। 45

జీవితస్య ప్రదాతా నః త్వమేకో వానరోత్తమ।
త్వత్ప్రసాదాత్ సమేష్యామః సిద్ధార్థా రాఘవేణ హ। 46

అహో స్వామిని తే భక్తిః అహో వీర్యమహో ధృతిః। 47

దిష్ట్యా దృష్టా త్వయా దేవీ రామపత్నీ యశస్వినీ।
దిష్ట్యా త్యక్ష్యతి కాకుత్స్థః శోకం సీతావియోగజమ్। 48

తతోఽంగదం హనూమంతం జాంబవంతం చ వానరాః।
పరివార్య ప్రముదితా భేజిరే విపులాశ్శిలాః। 49

ఉపవిష్టా గిరేస్తస్య శిలాసు విపులాసు తే।
శ్రోతుకామా సముద్రస్య లంఘనం వానరోత్తమాః। 50

దర్శనం చాపి లంకాయాః సీతాయా రావణస్య చ।
తస్థుః ప్రాంజలయస్సర్వే హనుమద్వదనోన్ముఖాః। 51

తస్థౌ తత్రాంగద శ్శ్రీమాన్ వానరైర్బహుభి ర్వృతః।
ఉపాస్యమానో విబుధైః దివి దేవపతిర్యథా। 52

హనూమతా కీర్తిమతా యశస్వినా
తథాంగదేనాంగదనద్ధబాహునా ।
ముదా తదాధ్యాసితమున్నతం మహా
న్మహీధరాగ్రం జ్వలితం శ్రియాభవత్ । 53

అంగదుడు ఆ వానరవీరులందఱి సమక్షమున సాదరముగా ఇట్లనుడివెను. (43-44)

ఓ మారుతీ! బలపరాక్రమములయందు నీతో ఎవ్వరును సమానులు కాజాలరు. నీవు అపారమైన ఈ సాగరమును లంఘించి తిరిగివచ్చితివి. ఓ వానరోత్తమా! నిజముగా మాప్రాణములను కాపాడిన పుణ్యాత్ముడవు నీవేసుమా! నీ అనుగ్రహమువలననే కృతార్థులమై, మేమందఱము శ్రీరాముని చేరగలుగుచున్నాము. (45-46)

ఆహా! నీ స్వామిభక్తి అపూర్వమైనది. నీ పరాక్రమము, నీధైర్యసాహసములు కొనియాడదగినవి. సాధ్వీ శిరోమణియైన రామపత్నియగు సీతాదేవి జాడతెలియుట (కనబడుట) వాస్తవముగా మనఅదృష్టమే- ఇక జానకీదేవి యెడబాటువలన కలిగినశోకమును శ్రీరాముడు త్యజింపగలడు-అది మన భాగ్యఫలము. (47-48)

పిమ్మట వానరులు అంగద హనుమజ్జాంబవంతుల చుట్టునుజేరి, వారు మిక్కిలి సంతసించినవారై, పెద్దపెద్ద శిలలపై ఆసీనులైరి. హనుమంతుడు సముద్రమును లంఘించుట, లంకను గాలించుట, సీతాదేవినిదర్శించుట, రావణుని కలియుట మున్నగువిషయములను వినగోరినవారై, ఆ వానరోత్తములందఱును విపులములైన అనర్వతశిలలపై కూర్చుండిరి. వారు హనుమద్వచనములకై కుతూహలపడుచు చేతులు జోడించి, అచట ఏకాగ్రచిత్తులైయుండిరి. (49-51)

శుభలక్షణసంపన్నుడైన అంగదుడు తనచుట్టును చేరిన వానరులు తనను సేవించుచుండగా, స్వర్గమునందు దేవతలసేవలను అందుకొను దేవేంద్రునివలె అలరారెను.(52)

ధీశాలిగా వాసికెక్కినవాడును, మహాపరాక్రమ వంతుడుగా పేరుగాంచినవాడును ఐన హనుమంతుడును, భుజకీర్తులతో శోభిల్లుచున్న అంగదుడును, అధిష్ఠించి యుండగా సమున్నతమైన ఆ మహాగిరిశిఖరాగ్రము చక్కనిశోభలతో తేజరిల్లుచుండెను.(53)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే సప్తపంచాశస్సర్గః *(57)*

వాల్మీకి మహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదిఏడవసర్గము.

-- * * * --

58. ఏబదిఎనిమిదవసర్గము

హనుమంతుడు సీతాన్వేషణ వృత్తాంతమును వానరులకు తెల్పుట

తత స్తస్య గిరేః శృంగే మహేంద్రస్య మహాబలాః।
హనుమత్ప్రముఖాః ప్రీతిం హరయో జగ్ముదుత్తమామ్। 1

మహాబలశాలురైన హనుమదాది వానరప్రముఖులు అందఱును ఆ మహేంద్రగిరిశిఖరముపై కలిసికొని, మిక్కిలిసంతృప్తులైయుండిరి. (1)

ప్రీతిమత్సూపవిష్టేషు వానరేషు మహాత్మసు।
తం తతః ప్రీతిసంహృష్టః ప్రీతిమంతం మహాకపిమ్। 2

జాంబవాన్ కార్యవృత్తాంతమ్ అపృచ్ఛదనిలాత్మజమ్।
కథం దృష్టా త్వయా దేవీ కథం వా తత్ర వర్తతే। 3

తస్యాం వా స కథం వృత్తః క్రూరకర్మా దశాననః।
తత్త్వత స్సర్వ మేతన్నః ప్రబ్రూహి త్వం మహాకపే। 4

సమ్మార్గితా కథం దేవీ కించ సా ప్రత్యభాషత।
శ్రుతార్థాశ్చింతయిష్యామో భూయః కార్యవినిశ్చయమ్। 5

యశ్చార్థస్తత్ర వక్తవ్యో గతైరస్మాభి రాత్మవాన్।
రక్షితవ్యం చ యత్తత్ర తద్భవాన్ వ్యాకరోతు నః। 6

స నియుక్తస్తతస్తేన సంప్రహృష్టతనూరుహః।
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై ప్రత్యభాషత। 7

ప్రత్యక్షమేవ భవతాం మహేంద్రాగ్రాత్ ఖమాప్లుతః।
ఉదధేర్దక్షిణం పారం కాంక్షమాణస్సమాహితః। 8

గచ్ఛతశ్చ హి మే ఘోరం విఘ్నరూపమివాభవత్।
కాంచనం శిఖరం దివ్యం పశ్యామి సుమనోహరమ్। 9

స్థితం పంథాన మావృత్య మేనే విఘ్నం చ తం నగమ్।
ఉపసంగమ్య తం దివ్యం కాంచనం నగసత్తమమ్। 10

కృతా మే మనసా బుద్ధిః భేత్తవ్యోఽయం మయేతి చ।
ప్రహతం చ మయా తస్య లాంగూలేన మహాగిరేః। 11

శిఖరం సూర్యసంకాశం వ్యశీర్యత సహస్రధా।
వ్యవసాయం చ తం బుద్ధ్వా సహోవాచ మహాగిరిః। 12

పుత్రేతి మధురాం వాణీం మనః ప్రహ్లాదయన్నివ।
పితృవ్యం చాపి మాం విద్ధి సఖాయం మాతరిశ్వనః। 13

మైనాకమితి విఖ్యాతం నివసంతం మహోదధౌ।
పక్షవంతః పురా పుత్ర బభూవుః పర్వతోత్తమాః।
ఛందతః పృథివీం చేరుః బాధమానాస్సమంతతః। 14

శ్రుత్వా నగానాం చరితం మహేంద్రః పాకశాసనః।
చిచ్ఛేద భగవాన్ పక్షాన్ వజ్రేణైషాం సహస్రశః। 15

అహం తు మోక్షితస్తస్మాత్ తవ పిత్రా మహాత్మనా।
మారుతేన తదా వత్స ప్రక్షిప్తోఽస్మి మహార్ణవే। 16

మహాత్ములైన వానరులు సంతుష్టులై కూర్చొనియుండగా పరమానందభరితుడైయున్న జాంబవంతుడు సంతోష తరంగితుడు. కపిప్రవరుడు ఐన ఆ హనుమంతునితో సీతాదర్శనాది రామకార్య వృత్తాంతమునుగూర్చి ఇట్లు ప్రశ్నించెను. "సీతాదేవిని ఎట్లు కనుగొంటివి? ఆమె అచట ఎట్లున్నది? ఆసాధ్వియెడ క్రూరకర్ముడైనరావణుని ప్రవర్తన ఎట్టిది? ఓ మహాకపీశ్వరా! ఈ విషయములనన్నింటిని యథాతథముగ వివరింపుము'- (2-4)

సీతాదేవిజాడను ఎట్లుతెలిసికొంటివి? ఆమె ఇచ్చిన సందేశమేమి? విషయములనన్నింటిని తెలిసికొనినపిమ్మట కర్తవ్యమునుగూర్చి ఆలోచింతము. (5)

మనము శ్రీరామునిసన్నిధికివెళ్లి, అచ్చట ఆ ప్రభువునకు తెల్పదగిన విషయములను, దాచవలసిన విషయములను అన్నింటిని ప్రజ్ఞాశాలివైన నీవు స్పష్టముగా వివరింపుము. (6)

జాంబవంతుడు ఇట్లుఅర్థింపగా అప్పుడు హనుమంతుడు గగుర్పాటును పొందినవాడై, సీతాదేవికి మనస్సునందే ప్రణమిల్లి, జాంబవంతునకు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (7)

'నేను సముద్రముయొక్క దక్షిణతీరమునకు చేరగోరి, సన్నద్ధుడనై మహేంద్రగిరిపైనుండి ఆకాశమునకు ఎగురుటను మీరు స్వయముగా చూచియుంటిరిగదా! (8)

నేను వెళ్లుచుండుగా దారిలో నాకు ఒక మహా విఘ్నము వంటిది ఎదురయ్యెను. మిక్కిలిమనోహరమైన దివ్యమైన ఒక బంగారుశిఖరమును గాంచితిని. నా దారికి అడ్డముగా నిలిచియున్న ఆ గిరిని ఒకవిఘ్నముగా తలంచితిని. దివ్యమైన ఆ బంగారుకొండను సమీపించి, 'దీనిని బద్దలుకొట్టవలెను'- అని లోలోన భావించితిని. వెంటనే సూర్యసదృశమైన ఆ మహాగిరిశిఖరమును నా వాలముతోకొట్టితిని. అది క్రిందపడిపోయెను. ఆసాహసకార్యమును తెలిసికొని, ఆ మహాగిరి 'నాయనా!' 'కుమారా!' అని మనస్సునకు ఆహ్లాదకరముగా మధురవచనములను పలికెను- 'నేను వాయుదేవుని మిత్రుడను. నన్ను నీ పినతండ్రిగా భావింపుము. (9-13)

నా పేరు మైనాకుడు, నేను ఈ మహాసముద్రమున నివసించు చున్నాను. కుమారా! పూర్వము మహాపర్వతములకు రెక్కలు ఉండెడివి. అవి అందఱిని బాధించుచు భూమిపై స్వేచ్ఛగా సంచరించుచుండెను. (14)

ఈ పర్వతముల పోకడలనువిన్న దేవేంద్రుడు తనవజ్రాయుధముచే వాటిరెక్కలను ముక్కలు ముక్కలుగానించెను. ఓ బాలుడా! నీకు తండ్రియు, మహాత్ముడుఐన వాయుదేవుడు నన్ను మహా సముద్రమునకుచేర్చి, ఆ ప్రమాదమునుండి రక్షించెను. (15-16)

రామస్య చ మయా సాహ్యే వర్తితవ్యమరిందమ।
రామో ధర్మభృతాం శ్రేష్ఠో మహేంద్రసమవిక్రమః। 17

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య మైనాకస్య మహాత్మనః। 18

కార్య మావేద్య తు గిరేః ఉద్యతం చ మనో మమ।
తేన చాహమనుజ్ఞాతో మైనాకేన మహాత్మనా। 19

స చాప్యంతర్హితః శైలో మానుషేణ వపుష్మతా।
శరీరేణ మహాశైలః శైలేన చ మహోదధౌ। 20

ఉత్తమం జవమాస్థాయ శేషం పంథానమాస్థితః।
తతోఽహం సుచిరం కాలం వేగేనాభ్యగమం పథి। 21

తతః పశ్యామ్యహం దేవీం సురసాం నాగమాతరమ్।
సముద్రమధ్యే సా దేవీ వచనం మామభాషత। 22

మమ భక్షః ప్రదిష్టస్త్వమ్ అమరైర్హరిసత్తమ।
అతస్త్వాం భక్షయిష్యామి విహితస్త్వం చిరస్య మే। 23

ఏవముక్త స్సురసయా ప్రాంజలిః ప్రణతః స్థితః।
వివర్ణవదనో భూత్వా వాక్యం చేద ముదీరయమ్। 24

రామో దాశరథిః శ్రీమాన్ ప్రవిష్టో దండకావనమ్।
లక్ష్మణేన సహ భ్రాత్రా సీతయా చ పరంతపః। 25

తస్య సీతా హృతా భార్యా రావణేన దురాత్మనా।
తస్యాస్సకాశం దూతోఽహం గమిష్యే రామశాసనాత్। 26

కర్తుమర్హసి రామస్య సాహాయ్యం విషయే సతీ।
అథవా మైథిలీం దృష్ట్వా రామం చాక్లిష్టకారిణమ్। 27

ఆగమిష్యామి తే వక్త్రం సత్యం ప్రతిశృణోమి తే।
ఏవముక్తా మయా సా తు సురసా కామరూపిణీ। 28

అబ్రవీన్నాతివర్తేత కశ్చిదేష వరో మమ।
ఏవముక్తస్సురసయా దశయోజనమాయతః। 29

తతోఽర్ధగుణవిస్తారో బభూవాహం క్షణేన తు।
మత్ప్రమాణానురూపం చ వ్యాదితం తు ముఖం తయా। 30

తద్దృష్ట్వా వ్యాదితం చాస్యం హ్రస్వం హ్యకరవం వపుః।
తస్మిన్ ముహూర్తే చ పునః బభూవాంగుష్ఠమాత్రకః। 31

అభిపత్యాశు తద్వక్త్రం నిర్గతోఽహం తతః క్షణాత్।
అబ్రవీత్ సురసా దేవీ స్వేన రూపేణ మాం పునః। 32

శ్రీరాముడు ధర్మపరిరక్షకులలో శ్రేష్ఠుడు, దేవేంద్రునితో సమానమైన పరాక్రమశాలి. ఓ శత్రుసంహారకా! అట్టి శ్రీరామునకు సహాయపడుట నావిధి. (17)

మహాత్ముడైన ఆమైనాకుని ఈ వచనములనువిని, అతనికి నేను నిర్వహింపవలసిన రామకార్యమును దెలిపి, మహాకాయుడైన అతనిఅనుజ్ఞ బడసి, ముందునకు సాగుటకు ఉద్యుక్తుడను నైతిని. (18-19)

మైనాకుడు తనమానుషరూపమును ఉపసంహరించుకొని శైలరూపమున మహాసముద్ర గర్భమునకు జేరెను. (20)

పిదప నేను వేగమునుపుంజుకొని, ఆకాశమార్గమున శీఘ్రముగా ముందునకుసాగుచు, మిగిలిన ప్రయాణమును చాలతడవు కొనసాగించితిని. (21)

అంతటనేను 'సురస' అనుపేరుగల నాగమాతను సముద్ర మధ్యమునచూచితిని. ఆదేవి నాతో ఇట్లు పలికెను. (22)

ఓ వానరోత్తమా! దేవతలు నిన్ను నాకుఆహారముగా నిర్దేశించిరి. నీవు చాలాకాలమునకు నాకు లభించితివి. కనుక నిన్ను భక్షించెదను. (23)

సురస ఇట్లుపలుకగా నేను వివర్ణవదనుడనై, ఆమెకు అంజలిఘటించి, ప్రణమిల్లి ఇట్లునుడివితిని. (24)

శ్రీమంతుడు, అరిమర్దనుడు, దశరథునికుమారుడు ఐన శ్రీరాముడు సోదరుడైన లక్ష్మణునితోడను, తనధర్మపత్నియగు సీతాదేవితోడను దండకారణ్యమున ప్రవేశించెను. (25)

దుర్మార్గుడైన రావణుడు సీతాదేవిని అపహరించుకొని పోయెను. నేను శ్రీరామునిఆజ్ఞమేరకు దూతగా ఆమెకడకు వెళ్ళుచుంటిని. (26)

రామునిరాజ్యమున నివసించుచున్న నీవు ఆయనకు సహాయపడుట యుక్తము. సీతాదేవినిజూచి, ఆమె క్షేమసమాచారములను అసహాయశూరుడైన శ్రీరామునకు నివేదించి, నీకాహారమగుటకు తిరిగి ఇచటికి రాగలను. ఇదియే నా సత్యప్రతిజ్ఞ- అని కామరూపిణియగు ఆ సురసతో నేను వచించితిని. (27-28)

అంతట సురస, "ఎవ్వరును నన్ను తప్పించుకొని పోజాలరు, ఇది నాకొకవరము"- అని ఆమెపలుకగా పదియోజనముల పొడవుకున్న నేను నా దేహమును క్షణములో ఇంకను ఐదుయోజనములు పెంచితిని. నా శరీరప్రమాణమునకు తగినట్లుగా ఆమె తననోటిని తెఱచెను. (29-30)

ఆమె తననోటిని తెఱచుటను జూచి, నా శరీరమును సూక్ష్మమొనర్చితిని. ఆ క్షణముననే నేను అంగుష్ఠ మాత్రుడనైతిని. (31)

అతివేగముగా ఆమెనోటిలో ప్రవేశించి, తత్క్షణమే బయటికి వచ్చితిని. పిమ్మట సురసాదేవి దివ్యమైన తన స్వరూపమునుదాల్చి, మఱల నాతో ఇట్లనెను. (32)

అర్థసిద్ధ్యై హరిశ్రేష్ఠ గచ్ఛ సౌమ్య యథాసుఖమ్।
సమానయ చ వైదేహీం రాఘవేణ మహాత్మనా। 33

సుఖీ భవ మహాబాహో ప్రీతాఽస్మి తవ వానర।
తతోఽహం సాధు సాధ్వీతి[1] సర్వభూతైః ప్రశంసితః। 34

తతోఽన్తరిక్షం విపులం ప్లుతోఽహం గరుడో యథా।
ఛాయా మే నిగృహీతా చ న చ పశ్యామి కించన। 35

సోఽహం విగతవేగస్తు దిశో దశ విలోకయన్।
న కించిత్ తత్ర పశ్యామి యేన మేఽపహృతా గతిః। 36

తతో మే బుద్ధిరుత్పన్నా కిన్నామ గమనే మమ।
ఈదృశో విఘ్న ఉత్పన్నో రూపం యత్ర న దృశ్యతే। 37

అధోభాగేన మే దృష్టిః శోచతా పాతితా మయా।
తతోఽద్రాక్షమహం భీమాం రాక్షసీం సలిలేశయామ్। 38

ప్రహస్య చ మహానాదమ్ ఉక్తోఽహం భీమయా తయా।
అవస్థితమసంభ్రాంతమ్ ఇదం వాక్యమశోభనమ్। 39

క్వాసి గంతా మహాకాయ క్షుధితాయా మమేప్సితః।
భక్షః ప్రీణయ మే దేహం చిరమాహారవర్జితమ్। 40

బాఢమిత్యేవ తాం వాణీం ప్రత్యగృహ్ణామహం తతః।
ఆస్యప్రమాణాదధికం తస్యాఃకాయమపూరయమ్। 41

తస్యాశ్చాస్యం మహద్భీమం వర్ధతే మమ భక్షణే।
న చ మాం సాధు బుబుధే మమ వా నికృతం కృతమ్। 42

తతోఽహం విపులం రూపం సంక్షిప్య నిమిషాంతరాత్।
తస్యా హృదయమాదాయ ప్రపతామి నభః స్థలమ్। 43

సా విసృష్టభుజా భీమా పపాత లవణాంభసి।
మయా పర్వతసంకాశా నికృత్తహృదయా సతీ। 44

శృణోమి ఖగతానాం చ సిద్ధానాం చారణైస్సహ।
రాక్షసీ సింహికా భీమా క్షిప్రం హనుమతా హతా। 45

"ఓ వానరోత్తమా! సత్పురుషుడా! కార్యసిద్ధికై వెళ్లిరమ్ము. వైదేహిని మహాత్ముడైనశ్రీరామునితో చేర్పుము- (33)

ఓ మహాబాహూ! కపిసత్తమా! నీయెడ నేను సంతుష్టురాలనైతిని. సుఖీభవ" పిమ్మట ప్రాణులన్నియును 'బాగుబాగు' అని నన్ను ప్రశంసించినవి. (34)

అనంతరము విశాలమైన అంతరిక్షమునకు గరుడునివలె ఎగిరితిని. ఇంతలో నా నీడను ఎవరో గట్టిగా పట్టుకొనినట్లనిపించెను. నావేగము మాత్రముకుంటుపడెను. అన్నిదిశలను పరికించి చూచినను నాగమనమును అడ్డగించిన వారెవ్వరును నాకు అచట కన్పింపలేదు. (35-36)

'చూడగా ఇచ్చట ఎవ్వరును కన్పించుటలేదు. నా గమనమునకు ఇట్టి విఘ్నమేర్పడినది. కారణము ఏమై యుండును?' అను ఆలోచన నాకు కలిగెను? (37)

ఇట్లు ఆలోచించుచుండగా నాదృష్టి అధోభాగము వైపునకు మఱలెను. అప్పుడు సముద్రజలములయందున్న ఒక భయంకరరాక్షసి నా కంటబడెను. (38)

ఎట్టి తొట్రుపాటూలేకుండ దృఢముగానున్న నాతో ఆ ఘోర రాక్షసి వికటాట్టహాసముచేయుచు ఇట్లు కటువచనములను పలికెను. (39)

"ఓ మహాకాయుడా! ఎక్కడికేగుచున్నావు? రాక్షస జాతిదాననైన నాకు నీవు ఇష్టమైనఆహారము. చాలాకాలము నుండి ఆహారములేక నేను ఆకలితో అలమటించుచుంటిని. కనుక నీదేహమును నాకు ఆహారముగా సమర్పించి, నాఆకలినిదీర్చి నాకు సంతృప్తిని గూర్చుము. (40)

'సరే' యనుచు ఆమెమాటకు ఎదురుచెప్పక, ఆమె నోటి ప్రమాణముకంటె అధికముగా నేను నా శరీరమును పెంచితిని.(41)

నన్ను భక్షించుటకై ఆమెయు తనముఖమును భయంకరముగా పెద్దదిగాజేసెను. కామరూపుడనైన నన్ను గూర్చిగాని, నా ప్రతిక్రియనుగూర్చిగాని ఆమె యెఱుగదు. (42)

పిమ్మట నేను నామహాకాయమును సూక్ష్మముగాజేసి, మఱుక్షణముననే (ఆమెనోటిలో ప్రవేశించి) ఆమె గుండెను చీల్చుకొని వెంటనే ఆకాశమునకెగిరితిని. (43)

పర్వతసదృశమైన దేహముగల ఆమెయొక్క గుండెను నేను చీల్చివేసినప్పుడు భుజసంధులు శిథిలముకాగా భయంకరముగా నున్న ఆమెకళేబరము సముద్రజలములలో పడిపోయెను. (44)

హనుమంతుడు 'భయంకరాకారయైన 'సింహిక' యను రాక్షసిని హతమొనర్చెను'- అని ఖేచరులైన సిద్ధులు, చారణులు పలుకుచున్న వచనములు నా చెవులబడెను- (45)

1. సాధు+ఇతి = సాధ్వితి అనియేయుండవలెను, కానిఛందోభంగము కాకుండుటకై 'సాధ్వీతి' అని ప్రయోగించుట జరిగినది.

తాం హత్వా పునరేవాహం కృత్యమాత్యయికం స్మరన్।
గత్వా చాహం మహాధ్వానం పశ్యామి నగమండితమ్।
దక్షిణం తీరముదధేః లంకా యత్ర చ సా పురీ। 46

అస్తం దినకరే యాతే రక్షసాం నిలయం పురమ్।
ప్రవిష్టోఽహమవిజ్ఞాతో రక్షోభిర్భీమవిక్రమైః। 47

తత్ర ప్రవిశతశ్చాపి కల్పాంతఘనసన్నిభా।
అట్టహాసం విముంచంతీ నారీ కాప్యుత్థితా పురః। 48

జిఘాంసంతీం తతస్తాంతు జ్వలదగ్నిశిరోరుహామ్। 49

సవ్యముష్టిప్రహారేణ పరాజిత్య సుభైరవామ్।
ప్రదోషకాలే ప్రవిశం భీతయాఽహం తయోదితః। 50

అహం లంకాపురీ వీర నిర్జితా విక్రమేణ తే।
యస్మాత్ తస్మాద్విజేతాసి సర్వరక్షాంస్యశేషతః। 51

తత్రాహం సర్వరాత్రం తు విచిన్వన్ జనకాత్మజామ్।
రావణాంతఃపురగతో నచాపశ్యం సుమధ్యమామ్। 52

తత స్సీతా మపశ్యంస్తు రావణస్య నివేశనే।
శోకసాగరమాసాద్య న పారముపలక్షయే। 53

శోచతా చ మయా దృష్టం ప్రాకారేణ సమావృతమ్।
కాంచనేన వికృష్టేన గృహోపవనముత్తమమ్। 54

స ప్రాకారమవప్లుత్య పశ్యామి బహుపాదపమ్।
అశోకవనికామధ్యే శింశుపాపాదపో మహాన్। 55

త మారుహ్య చ పశ్యామి కాంచనం కదలీవనమ్।
అదూరే శింశుపావృక్షాత్ పశ్యామి వరవర్ణినీమ్। 56

శ్యామాం కమలపత్రాక్షీమ్ ఉపవాస కృశాననామ్।
తదేకవాససంవీతాం రజోధ్వస్తశిరోరుహామ్। 57

శోకసంతాపదీనాంగీం సీతాం భర్తృహితే స్థితామ్।
రాక్షసీభిర్విరూపాభిః క్రూరాభిరభిసంవృతామ్। 58

మాంసశోణితభక్షాభిః వ్యాఘ్రీభిర్హరిణీమివ।
సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః। 59

ఆ సింహికను చంపినపిమ్మట- ఛాయాగ్రహణము ద్వారా ఆమె నన్ను చంపుటకు చేసిన ప్రయత్నమును గూర్చి జ్ఞప్తికిదెచ్చుకొని, ఆకాశమార్గమున పురోగమించితిని. కొంతతడవునకు వృక్షములతో అలరారుచున్న సముద్రదక్షిణ తీరమును గాంచితిని. లంకానగరముగూడ ఆ తీరముననందే గలదు. (46)

సూర్యుడు అస్తమించుచుండగా, మిక్కిలి పరాక్రమశాలురైన రాక్షసుల కంటబడకుండ నిశాచరులకు నిలయమైన లంకను జేరితిని. (47)

నేను లంకలో ప్రవేశించబోవుచుండగా ప్రళయకాలమేఘ సదృశయైన ఒక స్త్రీ వికటాట్టహాసము చేయుచు నాయెదుట నిలబడెను. (48)

పెదప అగ్నిజ్వాలలవంటి కేశములుగల ఆ రాక్షసస్త్రీ నన్ను జంపుటకై నా మీద దాడిచేసెను. ఆ భయంకర రాక్షసిని ఎడమచేతితో ఒక చిన్నముష్టిఘాతముద్వారా పరాజితను గావించితిని. ప్రదోషకాలమునందు లంకలో ప్రవేశించుచున్న నన్ను జూచి భయపడి ఆమె నాతో ఇట్లు పలికెను.(49-50)

"ఓ మహావీరా! నేను లంకాపురాధిదేవతను. నీ పరాక్రమముచే అపజయముపాలైతిని. నన్ను ఓడించిన నీకు ఈ రాక్షసులు ఒక లెక్కగాదు. అందువలన ఈ రాక్షసులందఱును నీచేతిలో నిశ్శేషముగా ఓటమిని చవిచూచెదరు." (51)

జానకీదేవిజాడకై ఆ రాత్రియంతయు లంకానగరమును గాలించుచు క్రమముగా రావణాంతఃపురమున అడుగిడితిని. ఐనను ఆమె అచట కనబడలేదు. (52)

రావణునిమందిరమున సీతను గానక నేను అంతులేని శోకసాగరమున మునిగితిని. (53)

శోకమగ్నుడనైన నాకు విశాలమైన బంగారుప్రాకారము గల సర్వోత్తమమైన ఒక గృహోపవనము కనబడెను. (54)

అంతట నేను ఆ ప్రాకారమునుదాటి అనేక వృక్ష పంక్తులు గల అశోకవనమును చూచితిని. ఆ వనమధ్య భాగమున మిక్కిలి యెత్తైనదొక శింశుపా వృక్షము గలదు. ఆ చెట్టుపైకెక్కి బంగారు అరటి వనమును గాంచితిని ఆ శింశుపావృక్షసమీపమున బంగారుమేనిఛాయగల సీతాదేవిని కనుగొంటిని.(55-56)

ఆమె నడియౌవనముననుండెను. ఆమెకనులు తామర రేకులవలెఉండెను. ఉపవాసములచే ముఖము వాడియుండెను. ఒకే వస్త్రమును ధరించియున్న ఆమెకేశములు ధూళిధూసరితములైయుండెను. (57)

ఆమె శోకసంతాపములచే దీనవదనయైయుండెను. నిరంతరము పతిహితమునుగూర్చియే ఆలోచించుచుండెను. భయంకరరూపములుగలిగి, రక్తమాంసములను భక్షించునట్టి క్రూరరాక్షసస్త్రీలచే పరివృతయైయున్న సీతాదేవి ఆడుపులుల మధ్య చిక్కుపడియున్న లేడివలె ఉండెను. దుఃఖితయైయున్న ఆమెను రాక్షసస్త్రీలు మాటిమాటికిని భయపెట్టుచుండిరి. అట్టి సీతాదేవిని నేనచట చూచితిని (58-59)

ఏకవేణీధరా దీనా భర్తృచింతాపరాయణా।
భూమిశయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే। 60

రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా।
కథంచిన్మృగశాబాక్షీ తూర్ణమాసాదితా మయా। 61

తాం దృష్ట్వా తాదృశీం నారీం రామపత్నీం యశస్వినీమ్।
తత్రైవ శింశుపావృక్షే పశ్యన్నహమవస్థితః। 62

తతో హలహలాశబ్దం కాంచీనూపురమిశ్రితమ్।
శృణోమ్యధికగంభీరం రావణస్య నివేశనే। 63

తతోఽహం పరమోద్విగ్నః స్వం రూపం ప్రతిసంహరన్।
అహంతు శింశుపావృక్షే పక్షీవ గహనే స్థితః। 64

తతో రావణదారాశ్చ రావణశ్చ మహాబలః।
తం దేశం సమనుప్రాప్తా యత్ర సీతాభవత్ స్థితా। 65

తం దృష్ట్వాథ వరారోహా సీతా రక్షోగణేశ్వరమ్।
సంకుచ్యోరూ స్తనౌ పీనౌ బాహుభ్యాం పరిరభ్య చ। 66

విత్రస్తాం పరమోద్విగ్నాం వీక్షమాణాం తతస్తతః।
త్రాణం కించిదపశ్యంతీం వేపమానాం తపస్వినీమ్। 67

తా మువాచ దశగ్రీవః సీతాం పరమదుఃఖితామ్।
అవాక్శిరాః ప్రపతితో బహుమన్యస్వ మామితి। 68

యది చేత్ త్వంతు దర్పాన్మాం నాభినందసి గర్వితే।
ద్వౌ మాసావంతరం సీతే పాస్యామి రుధిరం తవ। 69

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య రావణస్య దురాత్మనః।
ఉవాచ పరమక్రుద్ధా సీతా వచనముత్తమమ్। 70

రాక్షసాధమ రామస్య భార్యామమితతేజసః।
ఇక్ష్వాకుకులనాథస్య స్నుషాం దశరథస్య చ। 71

అవాచ్యం వదతో జిహ్వా కథం న పతితా తవ।
కింస్విద్వీర్యం తవానార్య యో మాం భర్తు రసన్నిధౌ। 72

తైలసంస్కారమునకు నోచుకొనని ఆమెకేశములు ఒకే జడగా ఏర్పడియుండెను. నిరంతరము భర్తనే స్మరించుచుండెను. నేలపై కూర్చొనియుండెను. మంచుతాకిడికి పద్మమువలె ఆమె వివర్ణయైయుండెను. (60)

రావణుని ఏవగించుకొనుచున్నదై, ఆమె నిస్పృహతో తనతనువును త్యజించుటకు నిర్ణయించుకొనెను. ఎట్టకేలకు లేడివంటిచూపులుగల సీతాదేవిని నేను శ్రమముగా కనుగొంటిని. (61)

రామపత్నియు, వాసికెక్కినవనితయువైన ఆ సీతాదేవిని ఆస్థితిలోజూచి, నేనచటనే శింశుపావృక్షముపై కూర్చొనియుంటిని. (62)

అనంతరము రావణునిగృహమునుండి, ఒడ్డాణముల ధ్వనులు, కాలియందెలరవళులు కలిసిన గంభీరములైన గలగలధ్వనులు వినిపించెను. (63)

అంతట నేను మిక్కిలికలతచెందినవాడనై, నా రూపమును చిన్నదిగా జేసికొని, శింశుపావృక్షముపై ఆకులచాటుని పక్షివలె దాగియుంటిని. (64)

పిమ్మట మహాబలశాలియగు రావణుడు, అతని భార్యలు సీతాదేవియున్న ప్రదేశమునకు వచ్చిరి. (65)

సౌందర్యవతియైన సీతాదేవి రాక్షసప్రభునైన రావణుని గాంచిన వెంటనే ఊరువులను దగ్గరకు ముడుచుకొని, వక్షస్థలమును తనబాహువులతో కప్పుకొనెను. (66)

ఆమె దిగులుతో తత్తఱపడుచు అటునిటు చూచుచుండెను. వ్రతదీక్షలోనున్న ఆ దేవి ఏవిధమైన రక్షణయులేదని వణకుచుండెను. (67)

అంతట, మిక్కిలి దుఃఖితయైయున్న జానకీ దేవి ఎదుట దశకంఠుడు శిరస్సువంచి, నేలపైవ్రాలి, ఇట్లనెను. ఓ సీతా! నాప్రేమనుఆదరింపుము (ఇట్లుపలుకుచున్న రావణుని సీతాదేవి తిరస్కారభావముతోజూచెను. అప్పుడురావణుడు క్రుద్ధుడై) ఓ గర్విష్ఠురాలా! ఒకవేళ నీవు అహంకారముతో నన్ను ఆదరింపనిచో రెండుమాసముల తరువాత నీ రక్తమును త్రాగెదను." (68-69)

దుర్మార్గుడైన ఆ రావణుడు పలికిన ఈ మాటలను విని, సీతాదేవి మిక్కిలి క్రుద్ధురాలై, పాతివ్రత్యతేజస్సుతో గూడిన ఉత్తమవచనములను ఇట్లు నుడివెను. (70)

ఓ రాక్షసాధమా! నేను మిక్కిలితేజశ్శాలియైన శ్రీరాముని భార్యను. ఇక్ష్వాకువంశప్రభువైనదశరథునకు కోడలిని. (71)

అట్టి నన్ను దుర్భాషలాడుచున్న నీ నాలుక తెగి ఏలనేలపై బడుటలేదు? ఓరీ! దుష్టుడా! నా భర్త నా సమీపమున లేనప్పుడు ఆ మహామహునికన్నుగప్పి, దొంగవలె నన్ను అపహరించుకొనివచ్చిన నీ పరాక్రమము ఏపాటిది? నీవు ఏవిధముగను శ్రీరామునితో సమానుడవు కాజాలవు. నీవు

అపహృత్యాగతః పాప తేనాదృష్టో మహాత్మనా।
న త్వం రామస్య సదృశో దాస్యేఽప్యస్య న యుజ్యసే।
అజేయస్సత్యవాదీ చ రణశ్లాఘీ చ రాఘవః। 73

జానక్యా పరుషం వాక్య మేవముక్తో దశాననః।
జజ్వాల సహసా కోపాత్ చితాస్థ ఇవ పావకః। 74

వివృత్య నయనే క్రూరే ముష్టిముద్యమ్య దక్షిణమ్।
మైథిలీం హంతు మారబ్ధః స్త్రీభిర్హాహాకృతం తదా। 75

స్త్రీణాం మధ్యాత్ సముత్పత్య తస్య భార్యా దురాత్మనః। 76

వరా మందోదరీ నామ తయా స ప్రతిషేధితః।
ఉక్తశ్చ మధురాం వాణీం తయా స మదనార్దితః। 77

సీతయా తవ కిం కార్యం మహేంద్రసమవిక్రమ।
మయా సహ రమస్వార్య మద్విశిష్టా న జానకీ। 78

దేవగంధర్వకన్యాభిః యక్షకన్యాభిరేవ చ।
సార్ధం ప్రభో రమస్వేహ సీతయా కిం కరిష్యసి। 79

తత స్తాభిస్సమేతాభిః నారీభిస్స మహాబలః।
ప్రసాద్య సహసా నీతో భవనం స్వం నిశాచరః। 80

యాతే తస్మిన్ దశగ్రీవే రాక్షస్యో వికృతాననాః।
సీతాం నిర్భర్త్సయామాసు. వాక్యైః క్రూరైస్సుదారుణైః। 81

తృణవద్భాషితం తాసాం గణయామాస జానకీ।
గర్జితం చ తదా తాసాం సీతాం ప్రాప్య నిరర్థకమ్। 82

వృథా గర్జితనిశ్చేష్టా రాక్షస్యః పిశితాశనాః।
రావణాయ శశంసుస్తాః సీతాధ్యవసితం మహత్। 83

తతస్తాస్సహితాస్సర్వా విహతాశా నిరుద్యమాః।
పరిక్షిప్య సమంతాత్ తాం నిద్రావశ ముపాగతాః। 84

తాసు చైవ ప్రసుప్తాసు సీతా భర్తృహితే రతా।
విలప్య కరుణం దీనా ప్రశుశోచ సుదుఃఖితా। 85

తాసాం మధ్యాత్ సముత్థాయ త్రిజటా వాక్యమబ్రవీత్।
ఆత్మానం ఖాదత క్షిప్రం న సీతా వినశిష్యతి।
జనకస్యాత్మజా సాధ్వీ స్నుషా దశరథస్య చ। 86

స్వప్నో హ్యద్య మయాదృష్టో దారుణో రోమహర్షణః।
రక్షసాం చ వినాశాయ భర్తురస్యా జయాయ చ। 87

ఆయనకు దాసుడవగుటకును అనర్హుడవు. ఆ రఘువంశ ప్రభువు అజేయుడు, సత్య వాక్పరిపాలకుడు, యుద్ధమున సాటిలేనివీరుడు సమరమున ఎవ్వరిని విడిచిపెట్టడు. శత్రువులు సైతము ఆయనరణకౌశలమును మెచ్చుకొందురు."- (72-73)

సీతాదేవి పలికిన ఈ పరుషవచనములకు రావణుడు కోపముతో చితాగ్నివలె మండిపడెను. (74)

అంతట అతడు క్రూరముగా గ్రుడ్లుఱుముచు తన కుడిచేతిపిడికిలిని పైకెత్తి, మైథిలిని చంపుటకు ఉద్యుక్తుడాయెను. అప్పుడు అచటి స్త్రీలందఱును హాహాకారములొనర్చిరి.(75)

ఆ దుష్టుని భార్యయైనమండోదరి స్త్రీలమధ్యనుండి ముందునకు వచ్చెను. ఆమె అతని సమీపమునచేరి, ఆ కామాతురుని వారించుచు, మధురవచనములను ఇట్లు పలికెను. "పరాక్రమమున దేవేంద్రునివంటివాడా! సీతాదేవితో నీకేమి పని? ఆర్యా! నాతో రమింపుము. ఏ విధముగను 'సీత' నా కంటె అందగత్తెగాదు. (76-78)

ఓ ప్రభూ! దేవగంధర్వ యక్షకన్యలతో నీవు హాయిగా క్రీడింపుము. వీరు ఇందుండగా సీతకై ఏల ఆరాటపడెదవు? అనంతరము మండోదరితోసహా ఆ స్త్రీలందఱును మహా బలశాలియైన ఆ నిశాచరుని (రావణుని) ప్రసన్నునిగా జేసికొని, వెంటనే తమతో అతనిని ఆయనభవనమునకు దీసికొనివెళ్ళిరి. (79-80)

ఆ రావణుడు వెళ్ళిన పిమ్మట వికృతాననలైన రాక్షసస్త్రీలు అందఱును క్రూరములైన పరుష వచనములతో సీతాదేవిని మిక్కిలి భయపెట్టసాగిరి. (81)

సీతాదేవి వారిమాటలను గడ్డిపోచక్రింద పరిగణించెను. వారిగర్జనలన్నియును ఆమెయెడ ఏమాత్రము పనిచేయక పోయెను. (82)

పచ్చిమాంసమును భక్షించెడి ఆ రాక్షసస్త్రీలు తమగర్జనలు అన్నియు వృథాకాగా ఏమియు చేయజాలక సీతాదేవియొక్క దృఢనిర్ణయమును రావణునకు నివేదించిరి. పిదప ఆశలు వదలుకొని, చేష్టలుడిగినవారై, వారందఱును కలిసి, ఆమె చుట్టునుజేరి, నిద్రలో మునిగిరి. ఆ రాకాసిమూకలు గాఢనిద్రకు లోనుకాగా పతిహితమునే గోరునట్టి సీతాదేవి దీనురాలై, జాలి గొలుపునట్లు విలపించి, మిక్కిలి దుఃఖించుచు, కన్నీరు మున్నీరుగా శోకించెను. (83-85)

ఆ రక్కసిమూకల మధ్యనుండి 'త్రిజట' అనునామె వారితో ఇట్లనెను. "సీతాదేవి జనకమహారాజు కూతురు, దశరథుని కోడలు, ఆ మహాసాధ్విని చంపుటకు ఎట్టి వారికిని సాధ్యము గాదు. అంతగా అవసరమగుచో మీ ఆకలిని తీర్చుకొనుటకై మిమ్ములను మీరే భక్షింపుడు. (86)

ఈ రోజు నేనొక కలగంటిని. అది భయంకరమైనది, గగుర్పాటుగొల్పునది. అది రాక్షసుల వినాశమును, సీతాపతి యగు శ్రీరాముని జయమును సూచించుచున్నది. ఆ శ్రీరాముని

అల మస్మాత్ పరిత్రాతుం రాఘవాద్రాక్షసీగణమ్।
అభియాచామ వైదేహీమ్ ఏతద్ధి మమ రోచతే। 88

యస్యా హ్యేవంవిధస్స్వప్నో దుఃఖితాయాః ప్రదృశ్యతే।
సా దుఃఖైర్వివిధై ర్ముక్తా సుఖమాప్నోత్యనుత్తమమ్। 89

ప్రణిపాతప్రసన్నా హి మైథిలీ జనకాత్మజా।
అలమేషా పరిత్రాతుం రాక్షస్యో మహతో భయాత్। 90

తతస్సా హ్రీమతీ బాలా భర్తుర్విజయహర్షితా।
అవోచద్యది తత్ తథ్యం భవేయం శరణం హి వః। 91

తాం చాహం తాదృశీం దృష్ట్వా సీతాయా దారుణాం దశామ్।
చింతయామాస విక్రాంతో న చ మే నిర్వృతం మనః। 92

సంభాషణార్థంచ మయా జానక్యా శ్చింతితో విధిః।
ఇక్ష్వాకూణాం హి వంశస్తు తతో మమ పురస్కృతః। 93

శ్రుత్వా తు గదితాం వాచం రాజర్షిగణపూజితామ్।
ప్రత్యభాషత మాం దేవీ బాష్పైః పిహితలోచనా। 94

కస్త్వం కేన కథం చేహ ప్రాప్తో వానరపుంగవ। 95

కా చ రామేణ తే ప్రీతిః తన్మే శంసితు మర్హసి।
తస్యాస్తద్వచనం శ్రుత్వా హ్యహమప్యబ్రవం వచః। 96

దేవి రామస్య భర్తుస్తే సహాయో భీమవిక్రమః।
సుగ్రీవో నామ విక్రాంతో వానరేంద్రో మహాబలః। 97

తస్య మాం విద్ధి భృత్యం త్వం హనుమంతమిహాగతమ్।
భర్త్రాహం ప్రేషితస్తుభ్యం రామేణాక్లిష్టకర్మణా। 98

ఇదం చ పురుషవ్యాఘ్రః శ్రీమాన్ దాశరథి స్స్వయమ్।
అంగులీయమభిజ్ఞానమ్ అదాత్ తుభ్యం యశస్విని। 99

త దిచ్ఛామి త్వయాజ్ఞప్తం దేవి కిం కరవాణ్యహమ్।
రామలక్ష్మణయోః పార్శ్వం నయామి త్వాం కిముత్తరమ్। 100

ఏతచ్ఛ్రుత్వా విదిత్వా చ సీతా జనకనందినీ।
ఆహ రావణముత్సాద్య రాఘవో మాం నయత్వితి। 101

నుండి రాక్షసస్త్రీలను రక్షించుటకు ఈమెయే సమర్థురాలు, కనుక మనము ఈమెను వేడుకొనుటయే సముచితమని నాకనిపించుచున్నది. (87-88)

దుఃఖితులైన వారివిషయమున ఎవ్వరికైనను ఇట్టి కలవచ్చినచో ఆ దుఃఖితుల అవస్థలు దూరమగుటయేగాక వారికి మిక్కిలి ఉత్తమసుఖములు కలుగును. జనకుని కూతురైన మైథిలి నమస్కరించినంత మాత్రముననే ప్రసన్నురాలగును. ఈ మహాప్రమాదమునుండి మన రాక్షసస్త్రీలను రక్షించుటకు ఈమెయే అర్హురాలు." (89-90)

అనంతరము 'భర్తకు విజయము కలుగును' అను స్వప్నసూచనకు సంతసించినదై, ఆ సీతాదేవి బిడియ పడుచు ఇట్లుపలికెను. "అదియే తథ్యమగుచో మీకు నేను అభయమిత్తును." (91)

సీతాదేవియొక్క అట్టి ఆ దారుణదశనుచూచి, నేను పరాక్రమవంతుడనైనను మిక్కిలి దుఃఖాక్రాంతుడనైతిని. ఎంతగా ఆలోచించినను నామనస్సు ఊరట చెందలేదు. (92)

జానకీదేవితో మాట్లాడుటకు తగినఉపాయమును గూర్చి నేను ఆలోచించితిని. పిమ్మట ఇక్ష్వాకు వంశప్రభువుల ఔన్నత్యమునుగూర్చి వర్ణించితిని. రాజర్షిగణపరంపరను గూర్చి నేను నుడివిన ఆ పలుకులను ఆమె వినెను. నేత్రములు అశ్రుపూర్ణములుకాగా సీతాదేవి నాతో ఇట్లనెను. (93-94)

'ఓ వానరోత్తమా! నీవు ఎవరు? నిన్ను పంపినదెవరు? ఇచటికి ఎట్లువచ్చితివి? నీకు రామునితో మైత్రి ఎట్లు పొసగినది? మొదలగు విషయములను పూర్తిగా వివరింపుము'. అమె నుడివిన ఆ మాటలను విని, నేను ఆమెతో ఇట్లు వచించితిని. (95-96)

"ఓ దేవీ! సుగ్రీవుడను వానరప్రభువు నీ భర్తయైన శ్రీరామునకు సహాయకుడు, అతడు మహాబలపరాక్రమ సంపన్నుడు. (97)

నేను ఆ సుగ్రీవునకు భృత్యుడను. నా పేరు హనుమంతుడు. అసహాయశూరుడును, నీకు భర్తయు ఐన శ్రీరామచంద్ర ప్రభువు నిన్ను వెదకుటకై పంపగా నేను ఇచటికి వచ్చితిని.(98)

ఓ పూజ్యురాలా! పురుషోత్తముడు, శ్రీమంతుడుఐన శ్రీరాముడు 'ఆనవాలు'గా ఈ అంగుళీయకమును నీకిమ్మని స్వయముగా ఇచ్చెను. (99)

ఓ దేవీ! నేనేమి చేయవలయునో దయతో ఆజ్ఞాపింపుము. రామలక్ష్మణులసన్నిధికి నిన్ను చేర్చగలను. నీయాదేశమేమి?"(100)

జనకనందినియగు సీతాదేవి నా వచనములను విని, విషయమునుగ్రహించి, 'రాఘవుడు రావణుని సంహరించి, నన్ను తీసికొనివెళ్లుట యుక్తము'- అని పలికెను. (101)

ప్రణమ్య శిరసా దేవీమ్ అహమార్యామనిందితామ్।
రాఘవస్య మనోహ్లాదమ్ అభిజ్ఞానమయాచిషమ్। 102

అథ మామబ్రవీత్ సీతా గృహ్యతామయముత్తమః।
మణిర్యేన మహాబాహూ రామస్త్వాం బహుమన్యతే। 103

ఇత్యుక్త్వా తు వరారోహా మణిప్రవరమద్భుతమ్।
ప్రాయచ్ఛత్ పరమోద్విగ్నా వాచా మాం సందిదేశ హ। 104

తత స్తస్యైప్రణమ్యాహం రాజపుత్ర్యై సమాహితః।
ప్రదక్షిణం పరిక్రామమ్ ఇహాభ్యుద్గతమానసః। 105

ఉక్తోఽహం పున రేవేదం నిశ్చిత్య మనసా తయా।
హనుమన్ మమ వృత్తాంతం వక్తుమర్హసి రాఘవే। 106

యథా శ్రుత్వైవ నచిరాత్ తావుభౌ రామలక్ష్మణౌ।
సుగ్రీవసహితౌ వీరౌ ఉపేయాతాం తథా కురు। 107

యద్యన్యథా భవేదేతత్ ద్వౌమాసౌ జీవితం మమ।
న మాం ద్రక్ష్యతి కాకుత్స్థో మ్రియే సాహమనాథవత్। 108

తచ్ఛ్రుత్వా కరుణం వాక్యం క్రోధో మా మభ్యవర్తత।
ఉత్తరం చ మయా దృష్టం కార్యశేష మనంతరమ్। 109

తతోఽవర్ధత మే కాయః తదా పర్వతసన్నిభః।
యుద్ధకాంక్షీ వనం తచ్చ వినాశయితుమారభే। 110

తద్భగ్నం వనషండం తు భ్రాంతత్రస్తమృగద్విజమ్।
ప్రతిబుధ్య నిరీక్షంతే రాక్షస్యో వికృతాననాః। 111

మాం చ దృష్ట్వా వనే తస్మిన్ సమాగమ్య తతస్తతః।
తాస్సమభ్యాగతాః క్షిప్రం రావణాయాఽచచక్షిరే। 112

రాజన్ వన మిదం దుర్గం తవ భగ్నం దురాత్మనా।
వానరేణ హ్యవిజ్ఞాయ తవ వీర్యం మహాబల। 113

దుర్బుద్ధేస్తస్య రాజేంద్ర తవ విప్రియకారిణః।
వధ మాజ్ఞాపయ క్షిప్రం యథాసౌ విలయం వ్రజేత్। 114

పూజ్యురాలైనసీతాదేవికి సాష్టాంగదండ ప్రణామమాచరించి శ్రీరామునిమనస్సునకు ఆహ్లాదమును గూర్చెడి 'ఆనవాలు'ను ఇమ్మని అర్థించితిని. (102)

అంతట సీతాదేవి "సర్వోత్కృష్టమైన ఈ చూడామణిని గ్రహింపుము. దీనినిజూచి, ఆజానుబాహుడైన ఆ స్వామి నిన్ను సాదరముగా అభినందించును." అని నాతో నుడివెను. (103)

ఈ విధముగా పలికిన పిమ్మట 'సౌందర్యరాశి'యైన సీతాదేవి అత్యద్భుతమైన చూడామణిని నాకు ప్రసాదించి, రక్కసిమూకల భయమువలన కలతచెందిన మనస్సుతో కొన్ని సందేశవచనములను నుడివెను. (104)

పిదప జనకునిపుత్రికయైన సీతాదేవికి ప్రదక్షిణ పూర్వకముగా ప్రణమిల్లి, సావధానచిత్తుడనై ఇచ్చటికి బయలుదేఱుటకు సంసిద్ధుడనైతిని. (105)

ఆ దేవి లోలోన బాగుగా ఆలోచించి, నాతో మఱల ఇట్లుపలికెను. 'ఓమారుతీ! ఇచటి నా సంకట పరిస్థితినంతయును రాఘవునకు నివేదింపుము. (106)

మహావీరులైనరామలక్ష్మణులిరువురును సుగ్రీవ సహితులై త్వరలో ఇచ్చటికి వచ్చునట్లు చూడుము.(107)

నేను జీవించియుండునది రెండుమాసములుమాత్రమే. వెంటనే వారు ఇచ్చటికిరానిచో శ్రీరాముడు నన్ను చూడజాలడు. నేను ఈ రాక్షసులమధ్య దిక్కులేని దానివలె నా తనువును చాలింతును. (108)

జాలిగొలుపు ఆ దైన్యవచనములనువినగానే నాకు పట్టరానికోపము వచ్చెను. చేయవలసిన మిగిలిన కార్యముగూర్చి ఆలోచించితిని. (109)

పిమ్మట నా శరీరమును పర్వతమంతగా పెంచితిని. యుద్ధ కాంక్షతో ఆవనమును ధ్వంసము చేయనారంభించితిని. (110)

నేనావనమును భగ్నమొనర్చితిని. అచటి మృగములు పక్షులు అన్నియును భయభ్రాంతములై అఱవసాగినవి. ఇంతలో వికృతాననలైన రాక్షసస్త్రీలు మేలుకొని, ఈ అస్తవ్యస్తదృశ్యమును చూడసాగిరి. (111)

ఆ వనములో అక్కడక్కడనున్న రాక్షసస్త్రీలు ఒక్కుమ్మడిగావచ్చి నన్నుజూచి, వెంటనే రావణుని కడకు వెళ్లి, తొట్రుపడుచు ఆ విషయమును అతనికి నివేదించిరి. (112)

మహాబలశాలియైన ఓరాజా! దుష్టుడైన ఒక వానరుడు నీ పరాక్రమప్రభావమును ఎఱుంగక శత్రువులు అడుగిడరాని అశోకవనమును ధ్వంసమొనర్చెను. (113)

ఓ మహారాజా! నీకు అపకారమొనర్చిన దుర్మార్గుడగు ఆ వానరుని వధించుటకు మీ ఆజ్ఞయైనచో మఱుక్షణమే అతడు నేలపాలగును. (114)

తచ్ఛ్రుత్వా రాక్షసేంద్రేణ విసృష్టా భృశదుర్జయాః।
రాక్షసాః కింకరా నామ రావణస్య మనోఽనుగాః। 115

వనధ్వంసవార్తను వినిన పిమ్మట రావణుడు తనమనస్సు నెఱిగి ప్రవర్తించువారును, మిక్కిలి దుర్జయులునునగు 'కింకరులు' అను రాక్షసులను నా మీదికి (యుద్ధమునకు) పంపెను. (115)

తేషా మశీతిసాహస్రం శూలముద్గరపాణినామ్।
మయా తస్మిన్ వనోద్దేశే పరిఘేణ నిషూదితమ్। 116

శూలములను, ఇనుపగుదియలను చేతబట్టి యుద్ధమున నాతో తలపడుటకై ఎనుబదివేలమంది 'కింకరులు' అను రాక్షసులు ఆవనప్రదేశమునకు వచ్చిరి. వారినందఱిని ఇనుపగుదియతో హతమార్చితిని. (116)

తేషాం తు హతశేషా యే తే గత్వా లఘువిక్రమాః।
నిహతం చ మహత్ సైన్యం రావణాయాచచక్షిరే। 117

ఆ కింకరులలో చావగామిగిలిన అల్పపరాక్రమము గలవారు కొందఱు తిన్నగా రావణునికడకువెళ్లి "మనమహా సైన్యమంతయు మట్టిగలిసినది"- అని అతనికడ మొఱపెట్టుకొనిరి.(117)

తతో మే బుద్ధి రుత్పన్నా చైత్యప్రాసాదమాక్రమమ్।
తత్రస్థాన్ రాక్షసాన్ హత్వా శతం స్తంభేన వై పునః।
లలామభూతో లంకాయాః స వై విధ్వంసితో మయా। 118

తరువాత నాకు కలిగిన ఆలోచననుబట్టి, నేను ఒక చైత్యప్రాసాదమును ఆక్రమించితిని. అచ్చటనున్న నందమంది రాక్షసులను ఒక స్తంభముతో చంపితిని. లంకానగరమునకే అలంకారప్రాయమైన ఆ చైత్య ప్రాసాదమును పూర్తిగా ధ్వంసమొనర్చితిని. (118)

తతః ప్రహస్తస్య సుతం జంబుమాలినమాదిశత్।
రాక్షసై ర్బహుభిస్సార్ధం ఘోరరూపైర్భయానకైః। 119

పిదప రావణుడు ఘోరరూపములతో భయంకరముగా నున్న పెక్కుమందిరాక్షసులతోసహా ప్రహస్తునికుమారుడైన జంబుమాలిని నాపై యుద్ధమునకు పంపెను- (119)

తమహం బలసంపన్నం రాక్షసం రణకోవిదమ్।
పరిఘేణాతిఘోరేణ సూదయామి సహానుగమ్। 120

మహాబలశాలియు, రణకోవిదుడును ఐన ఆ జంబుమాలిని వానిఅనుచరులను భయంకరమైన పరిఘతో చావమోదితిని.(120)

తచ్ఛ్రుత్వా రాక్షసేంద్రస్తు మంత్రిపుత్రాన్ మహాబలాన్। 121

పదాతిబలసంపన్నాన్ ప్రేషయామాస రావణః।
పరిఘేణైవ తాన్ సర్వాన్ నయామి యమసాదనమ్। 122

అనుచరులతోగూడ జంబుమాలి మట్టిగలిసిన విషయమును విని, రావణుడు మహాబలశాలురైనమంత్రి పుత్రులను పదాతి బలములతోసహా వెంటనే సమరమునకు పంపెను. వారినందఱిని క్షణములో నా పరిఘతోడనే యమపురికి పంపితిని. (121-122)

మంత్రిపుత్రాన్ హతాన్ శ్రుత్వా సమరేఽలఘువిక్రమాన్।
పంచసేనాగ్రగాన్ శూరాన్ ప్రేషయామాస రావణః। 123

తానహం సహసైన్యాన్ వై సర్వానేవాభ్యసూదయమ్।
తతః పునర్దశగ్రీవః పుత్రమక్షం మహాబలమ్।
బహుభీ రాక్షసైస్సార్ధం ప్రేషయామాస రావణః। 124

మహాపరాక్రమవంతులైన మంత్రిపుత్రులు కదన రంగమున మడిసినవిషయమును ఎఱింగి, రావణుడు మహాశూరులైన ఐదుమందిసేనాధిపతులను సైన్యములతో పంపెను. నేను ఆ సేనానాయకులను, వారిసేనలను పూర్తిగా మట్టుపెట్టితిని. వెంటనే దశకంఠుడైన రావణుడు మిక్కిలి బలశాలియు, తనపుత్రుడును ఐన అక్షకుమారుని పెక్కుమంది రాక్షసులతోగూడ నాపై యుద్ధమునకు పంపించెను.(123-124)

తంతు మందోదరీపుత్రం కుమారం రణపండితమ్। 125

సహసా ఖం సముత్క్రాంతం పాదయో శ్చ గృహీతవాన్।
చర్మాసినం శతగుణం భ్రామయిత్వా వ్యపేషయమ్। 126

మండోదరీసుతుడును, రణశూరుడును ఐన ఆ అక్షకుమారుడు డాలును, ఖడ్గమును చేబూని ఆకాశమున కెగిరెను. వెంటనే నేను అతనిపాదములను చిక్కించుకొని వానిని వందలసార్లు త్రిప్పి రావణుని వైపు విసరివేసితిని. అతడు నేలకొరిగి పిండి పిండి ఆయెను. (125-126)

తమక్షమాగతం భగ్నం నిశమ్య స దశాననః।
తత ఇంద్రజితం నామ ద్వితీయం రావణస్సుతమ్।
వ్యాదిదేశ సుసంక్రుద్ధో బలినం యుద్ధదుర్మదమ్। 127

నా చేతిలో అక్షకుమారుడుగూడ హతుడైన విషయమును విని, దశకంఠుడైన రావణుడు మిక్కిలి క్రుద్ధుడై మహాబలశాలియు, యుద్ధోన్మత్తుడును ఐన 'ఇంద్రజిత్తు' అను మఱియొక కుమారుని (యుద్ధమునకు పంపబడిన కుమారులలో ఇతడు రెండవవాడు) నా మీదికి రణమొనర్చుటకు ఆజ్ఞాపించెను.(127)

త ద్వాప్యహం బలం సర్వం తం చ రాక్షసపుంగవమ్।
నష్టౌజసం రణే కృత్వా పరం హర్షముపాగమమ్॥ 128

మహతాపి మహాబాహుః ప్రత్యయేన మహాబలః॥ 129
ప్రేషితో రావణేనైవ సహవీరైర్మదోత్కటైః।
సోఽవిషహ్యం హి మాం బుద్ధ్వా స్వబలం చావమర్దితమ్॥ 130

బ్రాహ్మేణాస్త్రేణ స తు మాం ప్రాబధ్నాచ్చాతివేగితః।
రజ్జుభిశ్చాభిబధ్నంతి తతో మాం తత్ర రాక్షసాః॥ 131

రావణస్య సమీపం చ గృహీత్వా మాముపానయన్।
దృష్ట్వా సంభాషితశ్చాహం రావణేన దురాత్మనా॥ 132

పృష్టశ్చ లంకాగమనం రాక్షసానాం చ తం వధమ్।
తత్సర్వంచ మయా తత్ర సీతార్థమితిజల్పితమ్॥ 133

అస్యాః సందర్శనాకాంక్షీ ప్రాప్తస్త్వద్భవనం విభో।
మారుతస్యౌరసః పుత్రో వానరో హనుమానహమ్॥ 134

రామదూతం చ మాం విద్ధి సుగ్రీవసచివం కపిమ్।
సోఽహం దూత్యేన రామస్య త్వత్సకాశమిహాగతః॥ 135

శృణు చాపి సమాదేశం యదహం ప్రబ్రవీమి తే।
రాక్షసేశ హరీశస్త్వాం వాక్యమాహ సమాహితమ్॥ 136

సుగ్రీవశ్చ మహాతేజాః స త్వాం కౌశల మబ్రవీత్।
ధర్మార్థకామసహితం హితం పథ్య మువాచ చ॥ 137

వసతో ఋశ్యమూకే మే పర్వతే విపులద్రుమే।
రాఘవో రణవిక్రాంతో మిత్రత్వం సముపాగతః॥ 138

తేన మే కథితం రాజ్ఞా భార్యా మే రక్షసా హృతా।
తత్ర సాహాయ్య మస్మాకం కార్యం సర్వాత్మనా త్వయా॥ 139

మయా చ కథితం తస్మై వాలినశ్చ వధంప్రతి।
తత్ర సాహాయ్య హేతోర్మే సమయం కర్తు మర్హసి॥ 140

వాలినా హృతరాజ్యేన సుగ్రీవేణ మహాప్రభుః।
చక్రేఽగ్నిసాక్షికం సఖ్యం రాఘవ స్సహలక్ష్మణః॥ 141

తేన వాలినముత్పాట్య శరేణైకేన సంయుగే।
వానరాణాం మహారాజః కృతః సప్లవతాం ప్రభుః॥ 142

నేను రాక్షసప్రముఖుడైన ఆ ఇంద్రజిత్తును, అతని సమస్త బలములను రణరంగమున నిర్వీర్యమొనర్చి, ఎంతయు హర్షించితిని. (128)

రావణుడు గొప్పవిశ్వాసముతో పెక్కురి మదించిన వీరులతో సహ పంపిన మహాబలశాలియు, మహాబాహువు ఐన ఇంద్రజిత్తును అతనిబలములను నేను ఎంతయు దెబ్బతీసితిని. ఆ ఇంద్రజిత్తు నన్ను అజేయునిగా ఎటింగి, వెంటనే నన్ను బ్రహ్మాస్త్రముతో బంధించెను. అతని అనుచరులైన రాక్షసులు నన్ను త్రాళ్లతో కట్టివేసిరి. (129-131)

పిదప వారు నన్ను రావణునికడకు తీసికొనివెళ్లిరి. దుష్టుడైన రావణుడు నన్నుజూచి, నాతో సంభాషింప సాగెను. (132)

నా లంకాగమనమునకును, ఆరాక్షసులను వధించుటకును గల కారణములను అడిగెను. ఆ పనులనన్నింటిని సీతాదేవి నిమిత్తమై చేసితిని. ఓ రాజా! ఆమెను దర్శించుటకై వచ్చి, క్రమముగా నీ భవనమునకు చేరితిని.' నేను వాయుదేవుని సుతుడను, వానరుడను, నా పేరు హనుమంతుడు, నేను శ్రీరామునిబంటును, సుగ్రీవునిసచివుడను. రామునిదూతగా నేను నీ కడకు వచ్చితిని. (133-135)

ఓ రాక్షసరాజా! సుగ్రీవుడు నీ హితమునుగోరి, ఒక సందేశమును పంపెను. దానిని నీకు వినిపింతును. శ్రద్ధగా ఆలకింపుము. (136)

మహాతేజశ్శాలియైన సుగ్రీవుడు నీక్షేమసమాచారములను అడిగెను. నీకు హితకరమైన ధర్మమునూ, ధర్మబద్ధమైన అర్థకామములద్వారా నీకు మేలునూ, గూర్చునట్టి సందేశ వచనములను నీకై ఇట్లు నుడివెను. (137)

"దట్టమైన వృక్షములుగల ఋశ్యమూకపర్వతముపై నివసించుచున్న నాకు రణశూరుడైన శ్రీరామునితో అగ్ని సాక్షిగా మైత్రి ఏర్పడినది. (138)

ఆ రామచంద్రప్రభువు నాతో ఇట్లనెను 'నాభార్యను ఒకరాక్షసుడు అపహరించెను. ఆ విషయమున నీవు త్రికరణశుద్ధిగా మాకు సహాయపడవలెను. (139)

అంతట నేనును (వాలిచే పీడింపబడుచున్న విషయమును దెలిపి,) ఆ వాలిని వధింపవలసిన అవసరమును వివరించి, "ఓ ప్రభూ! వాలివధవిషయమున తప్పక సహాయపడుటకై ప్రతిజ్ఞాపూర్వకముగా నాకు వాగ్దానము చేయుడు" అని పలికితిని. (140)

లక్ష్మణునితోగూడియున్న శ్రీరామచంద్రప్రభువు వాలి వలన రాజ్యమును కోల్పోయిన సుగ్రీవునితో అగ్నిసాక్షిగా సఖ్యమును చేసెను. (141)

శ్రీరాముడు ఒకేఒక్క బాణముతో యుద్ధమున వాలిని సంహరించి, సుగ్రీవుని వానరులకు రాజుగా జేసెను. (142)

తస్య సాహాయ్యమస్మాభిః కార్యం సర్వాత్మనాత్విహ।
తేన ప్రస్థాపితస్తుభ్యం సమీపమిహ ధర్మతః। 143

ఇప్పుడు సర్వవిధముల ఆ ప్రభువునకు సహాయపడుట మావిధి. అందువలన సుగ్రీవుడు తన మిత్రధర్మము ననుసరించి, నన్ను నీ యొద్దకు పంపెను. (143)

క్షిప్రమానీయతాం సీతా దీయతాం రాఘవాయ చ।
యావన్న హరయో వీరా విధమంతి బలం తవ। 144

వీరులైన వానరులు మీబలములను రూపుమాపక ముందే వెంటనే సీతాదేవిని శ్రీరామునకు అప్పగింపుము. (144)

వానరాణాం ప్రభావో హి న కేన విదితః పురా।
దేవతానాం సకాశం చ యే గచ్ఛంతి నిమంత్రితాః। 145

వానరులయొక్క బలప్రభావములు ఇంతవఱకును ఎఱుగనివారెవరు? యుద్ధమున సహాయపడుటకై వారు ఆహూతులై దేవతలకడకుగూడ వెళ్లుచుందురు. (145)

ఇతి వానరరాజస్త్వామ్ ఆహేత్యభిహితో మయా।
మామైక్షత తతః క్రుద్ధః చక్షుషా ప్రదహన్నివ। 146

వానరరాజైన సుగ్రీవుడు ఈ సందేశమును నీకు పంపెను." అని నేను రావణునితో నుడివితిని. వెంటనే అతడు క్రుద్ధుడై తనచూపులతో నన్ను దహించి వేయుచున్నట్లుగా నా వైపు చూచెను. (146)

తేన వధ్యోఽహమాజ్ఞప్తో రక్షసా రౌద్రకర్మణా।
మత్ప్రభావమవిజ్ఞాయ రావణేన దురాత్మనా। 147

క్రూరకర్మలను ఆచరించువాడును, దుష్టుడును, ఐన రావణాసురుడు నా శక్తిసామర్థ్యములను దెలియక నన్ను చంపుటకై ఆజ్ఞాపించెను. (147)

తతో విభీషణో నామ తస్య భ్రాతా మహామతిః।
తేన రాక్షసరాజోఽసౌ యాచితో మమ కారణాత్। 148

పిమ్మట రావణునిసోదరుడు, బుద్ధిమంతుడు ఐన విభీషణుడు నావిషయమై అతనిని ఇట్లు అభ్యర్థించెను. (148)

నైవం రాక్షసశార్దూల త్యజ్యతామేష నిశ్చయః।
రాజశాస్త్రవ్యపేతో హి మార్గః సంసేవ్యతే త్వయా। 149

ఓ రాక్షసరాజా! ఇట్లుచేయుట తగదు. ఈ నిర్ణయమును మార్చుకొనుడు. మీఆజ్ఞ రాజధర్మమునకు విరుద్ధముగానున్నది. (149)

దూతవధ్యా న దృష్టా హి రాజశాస్త్రేషు రాక్షస।
దూతేన వేదితవ్యం చ యథార్థం హితవాదినా। 150

ఓ రాక్షసరాజా! రాజనీతిశాస్త్రములలో దూతవధ ఎచ్చటను పేర్కొనబడలేదు. ప్రభువుహితమును గోరెడి సరియైనదూత యథార్థమునే వచింపవలెను. ఆ దూత ద్వారా శత్రుపక్షము వారి అభిప్రాయములను తెలిసికొనవలెను. (150)

సుమహత్యపరాధేఽపి దూతస్యాతులవిక్రమ।
విరూపకరణం దృష్టం న వధోఽస్తీతి శాస్త్రతః। 151

ఓ సాటిలేని పరాక్రమముగలవాడా! 'దూత ఎంతటి అపరాధమొనర్చినను అతనిని వికృతరూపునిగా జేయవచ్చును గాని చంపరాదు-' అని శాస్త్రములు పేర్కొనుచున్నవి. (151)

విభీషణేనైవముక్తో రావణ స్సందిదేశ తాన్।
రాక్షసానేతదేవాస్య లాంగూలం దహ్యతా మితి। 152

విభీషణుడు ఇట్లుపలుకగా రావణుడు "అదిసరే, చాలా మంచిది, అట్లేకానిమ్ము. ఇతనివాలమునకు నిప్పంటించుడు" - అని ఆ రాక్షసులను ఆదేశించెను. (152)

తతస్తస్య వచశ్శ్రుత్వా మమ పుచ్ఛం సమంతతః।
వేష్టితం శణవల్కైశ్చ జీర్ణైః కార్పాసజైః పటైః। 153

రావణునిఆజ్ఞయైన వెంటనే రాక్షసులు జీర్ణమైన జనుపనారవస్త్రములను, నూలుగుడ్డలను నా వాలమునకు పూర్తిగా చుట్టిరి. (153)

రాక్షసాః సిద్ధసన్నాహాః తతస్తే చండవిక్రమాః।
తదాఽదహంత మే పుచ్ఛం నిఘ్నంతః కాష్ఠముష్టిభిః। 154

అనంతరము తీవ్రమైనపరాక్రమముగల ఆ రాక్షసులు అప్పుడు సర్వసన్నద్ధులై నా పుచ్ఛమునకు (తోకకు) నిప్పుపెట్టిరి, కఱ్ఱలతో, పిడికిళ్లతో మోదిరి. (154)

బద్ధస్య బహుభిః పాశైః యంత్రితస్య చ రాక్షసైః।
న మే పీడాఽభవత్కాచిత్ దిదృక్షోర్నగరీం దివా। 155

వారు పెక్కుత్రాళ్లతో బంధించి, నన్ను కదలకుండ జేసిరి. పగటివేళ నగరమును చూడవేడుకపడిన నాకు కొంచెముగూడ బాధకలుగలేదు. (155)

తతస్తే రాక్షసాశ్శూరా బద్ధం మామగ్నిసంవృతమ్।
అఘోషయన్ రాజమార్గే నగరద్వార మాగతాః। 156

అంతట బంధింపబడి, అగ్నిజ్వాలలమధ్య చిక్కుపడి యున్న నన్ను నగరద్వారముకడకు తీసికొనిపోయి, 'చూడుడు, చూడుడు ఈ కోతిని'- అని సంబరపడుచు నా విషయమును అందఱికిని చాటించిరి. (156)

తతోఽహం సుమహద్రూపం సంక్షిప్య పునరాత్మనః।
విమోచయిత్వా తం బంధం ప్రకృతిస్థః స్థితః పునః। 157

పిమ్మట నేను నా బృహద్రూపమును సూక్ష్మమొనర్చి, బంధములను విడిపించుకొంటిని, మిఱల యథాప్రకారము మునుపటివలెనే దేహమును పెంచితిని. (157)

ఆయసం పరిఘం గృహ్య తాని రక్షాంస్యసూదయమ్।
తతస్తన్నగరద్వారం వేగేనాప్లుతవానహమ్। 158

అచటనేయున్న ఇనుపగుదియను చేతబట్టి ఆ రాక్షసులను పరిమార్చితిని. పిదప వేగముగా ఆ నగర ద్వారము పైభాగమునకు ఎగిరితిని. (158)

పుచ్ఛేన చ ప్రదీప్తేన తాం పురీం సాట్టగోపురామ్।
దహామ్యహమసంభ్రాంతో యుగాంతాగ్ని రివ ప్రజాః। 159

వాలాగ్నిజ్వాలలతో బురుజులు, గోపురములుగల ఆలంకానగరమును ఎట్టి తొట్రుపాటులేకుండ, ప్రళయాగ్ని ప్రజలనువలె క్షణములో దహించివేసితిని. (159)

వినష్టా జానకీ వ్యక్తం న హ్యదగ్ధః ప్రదృశ్యతే।
లంకాయాం కశ్చిదుద్దేశః సర్వా భస్మీకృతా పురీ। 160

లంకానగరమునందు ప్రతిప్రదేశము బుగ్గియై పోయినది. దగ్ధముగాని ప్రదేశమే లేదు. కనుక సీతాదేవియు అగ్నికి ఆహుతియై యుండును- అని నాకు భయాందోళనలు కలిగెను. (160)

దహతా చ మయా లంకా దగ్ధా సీతా న సంశయః।
రామస్య హి మహత్కార్యం మయేదం వితథీకృతమ్। 161

నేను లంకను పూర్తిగా దగ్ధమొనర్చితిని. సీతాదేవియు దగ్ధమైయుండును. అందుకు సందేహములేదు- శ్రీరాముని ఈ మహత్కార్యము నాకారణముగా భగ్నమైనది. (161)

ఇతి శోకసమావిష్టః చింతామహముపాగతః।
అథాహం వాచమశ్రౌషం చారణానాం శుభాక్షరామ్। 162

ఈ విధముగా నేను శోకనిమగ్నుడనై చింతింపసాగితిని. ఇంతలో చారణులు పలికిన శుభ వచనములను నేనువింటిని. (162)

జానకీ న చ దగ్ధేతి విస్మయోదంతభాషితామ్।
తతో మే బుద్ధిరుత్పన్నా శ్రుత్వా తామద్భుతాం గిరమ్।
అదగ్ధా జానకీ త్యేవం నిమిత్తైశ్చోపలక్షితా। 163

'జానకీదేవి క్షేమముగా నున్నది' అను ఆశ్చర్యకరమైన అద్భుతావహమైన పలుకులను వింటిని, కనబడిన శకునములనుబట్టి 'జానకీదేవి దగ్ధముకాలేదు' అనియే నేనును అనుకొంటిని. (163)

దీప్యమానే తు లాంగూలే న మాం దహతి పావకః। 164

హృదయం చ ప్రహృష్టం మే వాతాస్సురభిగంధినః।
తైర్నిమిత్తైశ్చ దృష్టార్థైః కారణైశ్చ మహాగుణైః। 165

ఋషివాక్యైశ్చ సిద్ధార్థైః అభవం హృష్టమానసః।
పునర్దృష్ట్వా చ వైదేహీం విసృష్టశ్చ తయా పునః। 166

నా వాలమున మంటలు కొనసాగుచున్నను అగ్ని నన్ను దహింపలేదు. నా హృదయము సంతోషభరితమైయున్నది. వాయువులు సువాసనలు వెదజల్లుచున్నవి. ఇదివరలో కార్య సాఫల్యమును సూచించిన ఈ శకునములచేతను, సత్ఫలితములనిచ్చిన నేత్రస్ఫురణాదికారణముల చేతను, పొల్లుపోని ఋషులవచనములచేతను నా మనసు ఆనందమున ఓలలాడెను. మఱల సీతాదేవిని దర్శించి, ఆమెకడ సెలవుదీసికొంటిని. ఋషులవచనములు ఎప్పుడునూ వ్యర్థములు కావుగదా! (164-166)

తతః పర్వతమాసాద్య తత్రారిష్టమహం పునః।
ప్రతిప్లవనమారేభే యుష్మద్దర్శనకాంక్షయా। 167

వెంటనే లంకాసమీపమునగల అరిష్టపర్వతము మీదికిచేరితిని. మిమ్ముచూడవలెనను కుతూహలముతో సముద్రలంఘనమును ఆరంభించితిని. (167)

తతః పవనచంద్రార్కసిద్ధగంధర్వసేవితమ్।
పంథానమహమాక్రమ్య భవతో దృష్టవానిహ। 168

పిమ్మట వాయువు, సూర్యచంద్రులు, సిద్ధులు, గంధర్వులు సంచరించునట్టి గగనమార్గమున పయనించి, ఈ తీరమునకు చేరి మిమ్ములను దర్శించితిని. (168)

రాఘవస్య ప్రభావేణ భవతాం చైవ తేజసా।
సుగ్రీవస్య చ కార్యార్థం మయా సర్వ మనుష్ఠితమ్। 169

శ్రీరామచంద్రప్రభువుయొక్క ప్రభావముచేతను, మీఅనుగ్రహమువలనను, సుగ్రీవుడాజ్ఞాపించిన కార్యమును నెఱవేర్చుటకును ఈ పనులనన్నింటిని కావించితిని. (169)

ఏతత్ సర్వం మయా తత్ర యథావదుపపాదితమ్।
తత్ర యన్న కృతం శేషం తత్సర్వం క్రియతా మితి । 170

ఈ సమస్తకార్యములను అచట నేను యథోచితముగా ఆచరించితిని. ఇంకను మిగిలియున్నపనులను మనము చేయవలసియున్నది. (170)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే అష్టపంచాశస్సర్గః (58)

వాల్మీకివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదియెనిమిదవసర్గము.

— * * * —

59. ఏబదితొమ్మిదవసర్గము

హనుమంతుడు వానరులకు సీతయొక్క దురవస్థను తెలిపి, లంకపై దండెత్తుటకు వారిని పురికొల్పుట

ఏతదాఖ్యాయ తత్సర్వం హనుమాన్ మారుతాత్మజః।
భూయస్సముపచక్రామ వచనం వక్తుముత్తరమ్। 1

వాయుసుతుడైన హనుమంతుడు తాను బయలు దేరినది మొదలుకొని, తిరిగి ఇచటికి చేరువఱకు జరిగిన వృత్తాంతమునంతయును వివరించెను. ఇంకను చెప్పవలసిన విశేషములను ఇట్లు నుడువనారంభించెను. (1)

సఫలో రాఘవోద్యోగః సుగ్రీవస్య చ సంభ్రమః।
శీలమాసాద్య సీతాయా మమ చ ప్రవణం మనః। 2

"శ్రీరామునిప్రయత్నము సఫలమైనది. సుగ్రీవుని కార్యోత్సాహము ఫలించినది. రామసుగ్రీవులమైత్రి దృఢపడినది. సీతాదేవి యొక్క సౌశీల్య ప్రభావములకు నా మనస్సు భక్తిపరవశమైనది. (2)

ఆర్యాయాః సదృశం శీలం సీతాయాః ప్లవగర్షభాః।
తపసా ధారయేల్లోకాన్ క్రుద్ధా వా నిర్దహేదపి। 3

ఓ వానరోత్తములారా! సౌశీల్యపాతివ్రత్యముల విషయమున పూజ్యురాలైన సీతాదేవికి సీతాదేవియే సాటి. ఆమె తనతపశ్శక్తిచే సర్వలోకములభారమును మోయగలదు. కోపించినచో వాటినన్నింటిని దహించి వేయగలదు. (3)

సర్వథాతిప్రవృద్ధోఽసౌ రావణో రాక్షసాధిపః।
తస్య తాం స్పృశతో గాత్రం తపసా న వినాశితమ్। 4

రాక్షసరాజైన రావణుడును అన్ని విధములుగా గొప్పవాడు. తపోబలసంపన్నుడు. అతడు ఆమెను స్పృశించినను తన తపోబలముచేతనే నశింపలేదు. (4)

న తదగ్నిశిఖా కుర్యాత్ సంస్పృష్టా పాణినా సతీ।
జనకస్యాత్మజా కుర్యాత్ యత్క్రోధ కలుషీకృతా। 5

జనకాత్మజయైన సీతాదేవి కోపించినచో కేవలము తన కరస్పర్శచే దేనినైనను భస్మముచేయగలదు. ఆ విధముగా అగ్నిశిఖయు చేయజాలదు. (రావణుడు శ్రీరాముని చేతిలోనే చావవలసియున్నందున ఆమె అతనిని భస్మము చేయలేదు.) (5)

జాంబవత్ప్రముఖాన్ సర్వాన్ అనుజ్ఞాప్య మహాహరీన్।
అస్మిన్నేవం గతే కార్యే భవతాం చ నివేదితే।
న్యాయ్యం స్మ సహ వైదేహ్యా ద్రష్టుం తౌ పార్థివాత్మజౌ। 6

జాంబవంతుడు మొదలగు ప్రముఖవానరోత్తముల అందఱి అనుజ్ఞనుగైకొని, ఇప్పటివఱకు జరిగిన కార్యవిశేషములను మీకు వివరించియుంటిని. సీతామాతను దీసికొనివచ్చి, ఆమెతోగూడ మనము ఆ రామలక్ష్మణులను దర్శించుట యుక్తముగదా! (6)

అహ మేకోఽపి పర్యాప్తః సరాక్షసగణాం పురీమ్।
తాం లంకాం తరసా హంతుం రావణం చ మహాబలమ్। 7

ఆ లంకాపురిని, అందరి రాక్షసగణములను, మహాబలశాలియైనరావణుని చంపుటకు నేనొక్కడనే చాలుదును. (7)

కింపునస్సహితో వీరైః బలవద్భిః కృతాత్మభిః।
కృతాస్త్రైః ప్లవగైః శూరైః భవద్భిర్విజయైషిభిః। 8

వీరులును, మహాబలశాలురును, దృఢనిశ్చయము గలవారును అస్త్రవిద్యలలో ఆరితేఱినవారును, విజయమును కాంక్షించు వారునగు మీవంటి వానరవీరులు తోడుగానున్నచో ఇక చెప్పవలసినదేమి? (8)

అహంతు రావణం యుద్ధే ససైన్యం సపురస్సరమ్।
సహపుత్రం వధిష్యామి సహోదరయుతం యుధి। 9

బ్రాహ్మమైంద్రంచ రౌద్రంచ వాయవ్యం వారుణం తథా।
యది శక్రజితోఽస్త్రాణి దుర్నిరీక్ష్యాణి సంయుగే। 10

తాన్యహం విధమిష్యామి నిహనిష్యామి రాక్షసాన్।
భవతా మభ్యనుజ్ఞాతో విక్రమో మే రుణద్ధి తమ్। 11

మయాతులా విసృష్టాహి శైలవృష్టిర్నిరంతరా।
దేవానపి రణేహన్యాత్ కింపునస్తాన్ నిశాచరాన్। 12

సాగరోఽప్యతియాద్వేలాం మందరః ప్రచలేదపి।
న జాంబవంతం సమరే కంపయేదరివాహినీ। 13

సర్వరాక్షససంఘానాం రాక్షసా యేచ పూర్వకాః।
అలమేకో వినాశాయ వీరో వాలిసుతః కపిః। 14

పనసస్యోరువేగేన నీలస్య చ మహాత్మనః।
మందరోఽప్యవశీర్యేత కింపున ర్యుధి రాక్షసాః। 15

సదేవాసురయక్షేషు గంధర్వోరగపక్షిషు।
మైందస్య ప్రతియోద్ధారం శంసతద్ద్వివిదస్య వా। 16

అశ్విపుత్రౌ మహావేగౌ ఏతౌ ప్లవగసత్తమౌ।
ఏతయోః ప్రతియోద్ధారం న పశ్యామి రణాజిరే। 17

పితామహవరోత్సేకాత్ పరమం దర్ప మాస్థితౌ।
అమృతప్రాశినావేతౌ సర్వవానరసత్తమౌ। 18

అశ్వినోర్మాననార్థం హి సర్వలోకపితామహః।
సర్వావధ్యత్వమతులమ్ అనయోర్దత్తవాన్ పురా। 19

వరోత్సేకేన మత్తౌ చ ప్రమథ్య మహతీం చమూమ్।
సురాణామమృతం వీరౌ పీతవంతౌ ప్లవంగమౌ। 20

ఏతావేవ హి సంక్రుద్ధౌ సవాజిరథకుంజరామ్।
లంకాం నాశయితుం శక్తౌ సర్వే తిష్ఠంతు వానరాః। 21

రావణుని, అతనిసైన్యమును, భటులను, పుత్రులను సహోదరులను (అందఱిని) యుద్ధమున నేనొక్కడనే మట్టుపెట్టగలను. (9)

ఇంద్రజిత్తు యుద్ధమున బ్రహ్మాస్త్రము, ఐంద్రాస్త్రము, రౌద్రాస్త్రము, వాయవ్యాస్త్రము, వారుణాస్త్రము మొదలగు దుర్నిరీక్ష్యములైన అస్త్రములను ప్రయోగించినప్పటికిని వాటినన్నింటిని నేను వమ్ముచేయగలను. రాక్షసులను వధింపగలను. మీ అనుజ్ఞ ఐనచో అచటికి వెళ్లుటకు నా పరాక్రమము నన్ను తొందరపెట్టుచున్నది. మీ ఆజ్ఞ అగుటయే ఆలస్యము. (10-11)

నేను యుద్ధమున నిరంతరముగా ప్రయోగించెడి నిరుపమానమైన శైలవృష్టిచే దేవతలు సైతము హతులగుదురు. ఇంక రాక్షసులవిషయము చెప్పనేల? (12)

సముద్రము చెలియలికట్టనుదాటుట, మందరపర్వతము చలించుట ఒకవేళ సాధ్యము కావచ్చునేమోగాని, శత్రుసైన్యములు యుద్ధమున జాంబవంతుని ఎదుర్కొని నిలుచుటమాత్రము ఏవిధముగను సాధ్యముగాదు. (13)

సకలరాక్షసులును, అంతేగాదు వారి తాతముత్తాతలు వచ్చినను వారిముందుతరములవారు వచ్చినను, వారిని అందఱిని సైతము హతమార్చుటకు వాలిసుతుడైన మహావీరుడగు అంగదుడొక్కడే చాలును. (14)

వానరవీరుడైన పనసుడు, మహాప్రతాపశాలియైన నీలుడు తమబలపరాక్రమములచే మందరపర్వతమును సైతము నుగ్గునుగ్గుచేయగలరు. ఇంక వారికి రాక్షసులు ఒకలెక్కయా? (15)

దేవతలలో, అసురులలో, యక్షులలో, గంధర్వులలో నాగులలో, పక్షులలో ఎవ్వరైనను మైందుని, ద్వివిదుని యుద్ధములో ఎదుర్కొని నిలువగలవారు ఎవరో తెల్పుడు. అశ్వినీపుత్రులును, మహాబలశాలురును ఐన ఈ వానరోత్తములకు (మైంద, ద్వివిదులకు) రణరంగమున ప్రతియోధులెవ్వరును కానరారు. (16-17)

ఈ ఇద్దఱును బ్రహ్మదేవునివరమువలన రణోత్సాహులై యున్నారు. వీరు అమృతపానము చేసిరి, వానరులందఱిలోను శ్రేష్ఠులు, అశ్వినీదేవతల గౌరవార్థము బ్రహ్మదేవుడు వీరికి ఎవ్వరి వలనను మరణము లేకుండునట్లు పూర్వము అమోఘమైన వరములనిచ్చెను. (18-19)

వరము ప్రాప్తించుటచే కలిగినఉత్సాహముతో ఈ వానరోత్తములు దేవతలమహాసైన్యములనుగూడ జయించి, అమృతమును త్రాగిరి. (20)

వానరులందఱును ఉందురుగాక. వీరావేశముతో యుద్ధమునకుదిగినచో లంకను, అందలి రథాశ్వగజ బలములను రూపుమాపుటకు వీరు మాత్రమే చాలుదురు. (21)

మయైవ నిహతా లంకా దగ్ధా భస్మీకృతా పునః।
రాజమార్గేషు సర్వత్ర నామ విశ్రావితం మయా॥ 22

జయత్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః।
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః॥ 23

అహం కోసలరాజస్య దాసః పవనసంభవః।
హనుమా నితి సర్వత్ర నామ విశ్రావితం మయా॥ 24

అశోకవనికామధ్యే రావణస్య దురాత్మనః।
అధస్తాత్ శింశుపావృక్షే సాధ్వీ కరుణమాస్థితా॥ 25

రాక్షసీభిః పరివృతా శోకసంతాపకర్శితా।
మేఘలేఖాపరివృతా చంద్రలేఖేవ నిష్ప్రభా॥ 26

అచింతయంతీ వైదేహీ రావణం బలదర్పితమ్।
పతివ్రతా చ సుశ్రోణీ అవష్టబ్ధా చ జానకీ॥ 27

అనురక్తా హి వైదేహీ రామం సర్వాత్మనా శుభా।
అనన్యచిత్తా రామే చ పౌలోమీవ పురందరే॥ 28

తదేకవాససంవీతా రజోధ్వస్తా తథైవ చ।
శోకసంతాపదీనాంగీ సీతా భర్తృహితే రతా।
సా మయా రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః॥ 29

రాక్షసీభిర్విరూపాభిః దృష్టా హి ప్రమదావనే।
ఏకవేణీధరా దీనా భర్తృచింతాపరాయణా॥ 30

అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే।
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా॥ 31

కథంచిన్మృగశాబాక్షీ విశ్వాసముపపాదితా।
తత స్సంభాషితా చైవ సర్వమర్థం చ దర్శితా॥ 32

రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతి ముపాగతా।
నియతస్సముదాచారో భక్తిర్భర్తరి చోత్తమా॥ 33

యన్నహంతి దశగ్రీవం స మహాత్మా కృతాగసమ్।
నిమిత్తమాత్రం రామస్తు వధే తస్య భవిష్యతి॥ 34

నేనే లంకానగరమును ధ్వంసమొనర్చితిని, దానిని కాల్చి బుగ్గిచేసితిని. అంతట రాజమార్గముల యందన్నింటను నా స్వామిపేరు మాఱుమ్రోగినది. (22)

'నిరుపమానపరాక్రమశాలియైన శ్రీరామచంద్ర ప్రభువునకు జయము, మహాబలసంపన్నుడైన లక్ష్మణ స్వామికి జయము, శ్రీరామానుగ్రహమునకు పాత్రుడైన వానరరాజు సుగ్రీవునకు జయము, నేను వాయు సూనుడను, నా పేరు హనుమంతుడు, శ్రీరాముని బంటును' అని అంతటను చాటితిని. (23-24)

దుష్టుడైనరావణునియొక్క అశోకవనమునందు శింశుపా వృక్షచ్ఛాయలో సీతామహాసాధ్వి దైన్యముతో నుండెను. (25)

ఆమెచుట్టును రాక్షసస్త్రీలుచేరి, కాపలా కాయుచుండిరి. ఆమె శోకసంతప్తయై కృశించియుండెను. పూర్ణచంద్రశోభలు గలదేయైనను ఆమె మేఘములచే కప్పబడిన చంద్రరేఖవలె తేజోవిహీనయై యుండెను. (26)

బలగర్వితుడైనరావణుడు ఆమెను ఎంతగా నిర్బంధించినను సౌందర్యవతియు, పతివ్రతాలలామయు ఐన జానకీదేవి అతనిని ఏ మాత్రము లెక్క చేయుటలేదు. (27)

శుభలక్షణసంపన్నయైన సీతాదేవి త్రికరణశుద్ధిగా శ్రీరాముని యందే అనురక్తురాలైయున్నది. ఇంద్రునియందు శచీదేవివలె ఆమె రామునియందే మనస్సును నిల్పియున్నది. (28)

ఆ సీతాదేవి ఒంటివస్త్రమును ధరించి యుండెను, ఆమెశరీరము ధూళిచే మలినమైయుండెను. శోక సంతాపములచే ఆమె దీనయైయుండెను. సర్వదా పతిహితమునే కోరుకొను చుండెను. ఆమెకేశములు అన్నియు జడగట్టియుండెను. ఆమె అనుక్షణము తనభర్తనే ధ్యానించుచుండెను. ఆ అశోకవనమునందు రాక్షసస్త్రీలమధ్య ఉండగా ఆమెను నేను చూచితిని. వికృతాకారలైన ఆ రాక్షసస్త్రీలు ఆమెను మాటిమాటికిని భయపెట్టుచుండిరి. (29-30)

ఆమె నేలపై కూర్చొనియుండెను, ఆమెశరీరము మంచుపడిన పద్మమువలె వివర్ణమైయుండెను, ఆమె రావణునియెడ విముఖురాలై, తనువును త్యజించుటకు నిశ్చయించుకొనియుండెను. (31)

ఎట్టకేలకు ఆమెకు నాపైనమ్మకమును కలిగించితిని, ఆమెతో మాట్లాడితిని, విషయములన్నింటిని ఆమెకు తెలిపితిని. (32)

రామసుగ్రీవులమైత్రిని విని, ఆమె ఎంతయు సంతోషపడినది. ఆ సీతాదేవి ఆచరించిన పవిత్ర జీవనవిధానము, భర్తయందు ఆమెకుగల భక్తిప్రపత్తులు నిరుపమానములు. అపరాధియైన ఆ రావణుని అవియే చంపగలవు. ఆమె పాతివ్రత్యప్రభావమున అతడు ఇంతకు ముందే మృతప్రాయుడు, సీతానిమిత్తమై శ్రీరామునిచేతిలో అతడు మరణించును. (అప్పుడు అతనికి మోక్షము లభించును.) కావున అతడు మహాత్ముడు. (33-34)

సా ప్రకృత్యైవ తన్వంగీ తద్వియోగాచ్చ కర్శితా।
ప్రతిపత్పాఠశీలస్య విద్యేవ తనుతాం గతా। 35

సీతాదేవి సహజముగనే తన్వంగి (సన్నని శరీరము గలది) పైగా శ్రీరాముని ఎడబాటువలన ఆమె పాడ్యమినాడు వేదాధ్యయనముచేయువాని విద్యవలె సన్నగిల్లి[1] (కృశించి) యుండెను. (35)

ఏవ మాస్తే మహాభాగా సీతా శోకపరాయణా।
య దత్ర ప్రతికర్తవ్యం తత్సర్వ ముపపద్యతామ్। 36

పూజ్యురాలైన సీతాదేవి శోకాతురయై ఇట్లు దీనావస్థలో ఉన్నది. కనుక ఈ విషయమున మనము చేయవలసిన ప్రతిక్రియనుగూర్చి ఆలోచింపుడు- (36)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకోనషష్టితమస్సర్గః (59)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది ఏబదితొమ్మిదవసర్గము.

-- * * * --

60. అఱువదియవసర్గము

లంకను జయించి, సీతను గొనివచ్చెదనని అంగదుడు ఉత్సాహముతో పలుకుట, జాంబవంతుడు అతనిని వారించుట

తస్య తద్వచనం శ్రుత్వా వాలిసూనురభాషత।
అయుక్తం తు వినా దేవీం దృష్టవద్భిశ్చ వానరాః।
సమీపం గంతుమస్మాభీ రాఘవస్య మహాత్మనః। 1

హనుమంతునివచనములను వినిన పిమ్మట వాలిసూనుడైన అంగదుడు ఇట్లు పలికెను. "ఓ వానర వీరులారా! సీతాదేవి జాడతెలిసిన పిమ్మటగూడ ఆమె లేకుండ మనము మహాత్ముడైన శ్రీరామచంద్రుని సమీపమునకువెళ్లుట యుక్తముగాదు. (1)

వాయుసూనోర్బలేనైవ దగ్ధా లంకేతి నః శ్రుతమ్।
దృష్టా దేవీ న చానీతా ఇతి తత్ర నివేదితుమ్।
న యుక్తమివ పశ్యామి భవద్భిః ఖ్యాతపౌరుషైః। 2

హనుమంతుడు తనప్రతాపముచేతనే లంకను దగ్ధమొనర్చెనని మనము వింటిమి. 'సీతాదేవిని చూచితిమి, కాని వెంటనిడుకొని రాలేదు' అని శ్రీరామునకు నివేదించుట పరాక్రమవంతులుగా ప్రసిద్ధికెక్కిన మనవంటి వారికి తగదని నా అభిప్రాయము. (2)

న హి నః ప్లవనే కశ్చిత్ నాపి కశ్చిత్ పరాక్రమే।
తుల్యః సామరదైత్యేషు లోకేషు హరిసత్తమాః। 3

జిత్వా లంకాం సరక్షౌఘాం హత్వా తం రావణం రణే।
సీతామాదాయ గచ్ఛామః సిద్ధార్థా హృష్టమానసాః। 4

ఓ వానరోత్తములారా! ఆకాశమున ఎగురుట యందును, పరాక్రమమునందును ముల్లోకముల యందలి దేవతలలోగాని, దైత్యులలోగాని మనకు సాటిరాగలవారు లేరు. లంకలోని రాక్షసులనందఱిని జయించి, రణరంగమున ఆ రావణుని హతమార్చి, సీతాదేవిని గొనివచ్చి, కృతార్థులమై, హర్షోల్లాసములతో శ్రీరామచంద్రునికడకు చేరుదము. (3-4)

తేష్వేవం హతవీరేషు రాక్షసేషు హనూమతా।
కిమన్యదత్ర కర్తవ్యం గృహీత్వా యామ జానకీమ్। 5

హనుమంతుడు అచటి రాక్షసవీరులను అందఱిని ఇంతకుముందే పరిమార్చినాడు. ఇంక మనము చేయవలసినదేమున్నది? జానకీదేవిని తీసికొనివచ్చుటయే మిగిలియున్నది. (5)

రామలక్ష్మణయోర్మధ్యే న్యస్యామ జనకాత్మజామ్।
కిం వ్యలీకైస్తు తాన్ సర్వాన్ వానరాన్ వానరర్షభాన్। 6

వయమేవ హి గత్వా తాన్ హత్వా రాక్షసపుంగవాన్।
రాఘవం ద్రష్టుమర్హామః సుగ్రీవం సహలక్ష్మణమ్। 7

ఆ వానరులను, వానరప్రముఖులను అందఱిని కష్టపెట్టుట యెందులకు? మనమే (లంకకు) వెళ్లి, ఆ రాక్షసప్రముఖులను వధించివచ్చి, శ్రీరాముని, లక్ష్మణుని, సుగ్రీవుని దర్శించెదముగాక- జనకాత్మజను రామ లక్ష్మణులచెంతకు చేర్చెదముగాక. (6-7)

1) అష్టమి, చతుర్దశి, పూర్ణిమ అమావాస్య, పాడ్యమి దినములలో వేదాధ్యయనము చేయరాదు. ఈ సంప్రదాయమును ఉల్లంఘించి, వేదములను అధ్యయనము చేసినచో అది ముందునకు సాగదు- ఆ విద్య దినదినములకులోనై క్రమముగా అధ్యయనశీలమే కుంటుపడును.

తమేవం కృతసంకల్పం జాంబవాన్ హరిసత్తమః।
ఉవాచ పరమప్రీతో వాక్యమర్థవదర్థవిత్। 8

నైషా బుద్ధిర్మహాబుద్ధే యద్బ్రవీషి మహాకపే।
విచేతుం వయమాజ్ఞప్తా దక్షిణాం దిశముత్తమామ్। 9

నాదేశం కపిరాజేన నైవ రామేణ ధీమతా।
కథంచిన్నిర్జితాం సీతాం అస్మాభిర్నాభిరోచయేత్। 10

రాఘవో నృపశార్దూలః కులం వ్యపదిశన్ స్వకమ్।
ప్రతిజ్ఞాయ స్వయం రాజా సీతావిజయమగ్రతః। 11

సర్వేషాం కపిముఖ్యానాం కథం మిథ్యా కరిష్యతి।
విఫలం కర్మ చ కృతం భవేత్ తుష్టిర్న తస్య చ।
వృథా చ దర్శితం వీర్యం భవేద్వానరపుంగవాః। 12

తస్మాద్గచ్ఛామ వై సర్వే యత్ర రామః సలక్ష్మణః।
సుగ్రీవశ్చ మహాతేజాః కార్యస్యాస్య నివేదనే। 13

న తావదేషా మతిరక్షమానో
యథా భవాన్ పశ్యతి రాజపుత్ర।
యథా తు రామస్య మతిర్నివిష్టా
తథా భవాన్ పశ్యతు కార్యసిద్ధిమ్। 14

అట్లు సంకల్పించిన అంగదునితో కార్యసాధన విధానమును ఎఱిగిన భల్లూక ప్రముఖుడగుజాంబవంతుడు మిక్కిలి సంతసించినవాడై, ప్రయోజనకరమైనవచనములను ఇట్లు పలికెను. ప్రజ్ఞాశాలివైన ఓ అంగదా! నీవు చెప్పినమాట సముచితముగా కన్పట్టుటలేదు. వానరప్రభువైన సుగ్రీవుడు, ప్రతిభామూర్తియైనశ్రీరాముడు దక్షిణదిశ యందు సీతాదేవిని వెదకుటకై మనలను ఆజ్ఞాపించిరి. ఆమెను తీసికొనిరమ్మనలేదు. ఏవిధముగనైనను సీతాదేవిని మనము తీసికొనివెళ్లుట శ్రీరామునకు ఇష్టముగాకపోవచ్చును. (8-10)

శ్రీరాముడు రాజసింహుడు. అతడు తనపరాక్రమము చేతనే సీతాదేవిని తీసికొనివచ్చునుగాని ఇతరుల పరాక్రమముపై ఆధారపడడు. ఆ ప్రభువు వానరులందఱి సమక్షమున 'శత్రువును జయించి సీతను గొనివచ్చెదను'- అని తనవంశముపై ఒట్టుపెట్టుకొని ప్రతిజ్ఞ చేసియున్నాడు. ఆయన తనప్రతిజ్ఞా భంగమునకు ఎట్లు పాల్పడగలడు? మనము జానకిని తీసికొనివెళ్లినచో ఆయన చేసిన ప్రతిజ్ఞ విఫలమగును. అది ఆయనకు తృప్తినిగూర్చదు. ఓ వానరప్రముఖులారా! మన ప్రయత్నమంతయు వ్యర్థమగును. (11-12)

అందువలన మనమందఱము రామలక్ష్మణులు, మహాతేజశ్శాలియైనసుగ్రీవుడు ఉన్నచోటికివెళ్లి, ఇంతవఱకును జరిగిన విశేషములను వారికి నివేదింతము. (13)

ఓ రాజపుత్రా! అంగదా! నీవు చేసిన సూచనయు త్రోసిపుచ్చదగినదిగాదు. కాని శ్రీరాముని ఆలోచనను అనుసరించి, మనము కార్యసిద్ధికై పూనుకొనుట యుక్తము. సీతాదేవిజాడను తెలిసికొని వచ్చుటకే ప్రభువు మనలను ఆదేశించెను. ఆమెను తీసికొనివచ్చుటకు గాదు. (14)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే షష్టితమస్సర్గః *(60)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది అఱువదియవసర్గము

— ✻ ✻ ✻ —

61. అఱువదియొకటవసర్గము

వానరుల మధువన ప్రవేశము, వారి కేరింతలు

తతో జాంబవతో వాక్యమ్ అగృహ్ణంత వనౌకసః।
అంగదప్రముఖా వీరా హనుమాంశ్చ మహాకపిః। 1

ప్రీతిమంతస్తతస్సర్వే వాయుపుత్రపురస్సరాః।
మహేంద్రాద్రిం పరిత్యజ్య పుప్లువుః ప్లవగర్షభాః। 2

పిమ్మట అంగద ప్రముఖులైనవానరవీరులు, కపివరుడైన హనుమంతుడు జాంబవంతుని సూచనను ఆమోదించిరి.(1)

అనంతరము వానరోత్తములందఱును మిక్కిలి సంబరపడుచున్నవారై వాయుసూనుడైన హనుమంతుని ముందుంచుకొని, మహేంద్రగిరినినీడి పైకెగిరిరి. (2)

మేరుమందరసంకాశా మత్తా ఇవ మహాగజాః।
ఛాదయంత ఇవాకాశం మహాకాయా మహాబలాః। 3

సభాజ్యమానం భూతైస్తమ్ ఆత్మవంతం మహాబలమ్।
హనుమంతం మహావేగం వహంత ఇవ దృష్టిభిః। 4

రాఘవే చార్థనిర్వృత్తిం కర్తుం చ పరమం యశః।
సమాధాయ సమృద్ధార్థాః కర్మసిద్ధిభి రున్నతాః। 5

ప్రియాఖ్యానోన్ముఖాస్సర్వే సర్వే యుద్ధాభినందినః।
సర్వే రామప్రతీకారే నిశ్చితార్థా మనస్వినః। 6

ప్లవమానాః ఖమాప్లుత్య తతస్తే కాననౌకసః।
నందనోపమమాసేదుః వనం ద్రుమలతాయుతమ్। 7

యత్తన్మధువనం నామ సుగ్రీవస్యాభిరక్షితమ్।
అధృష్యం సర్వభూతానాం సర్వభూతమనోహరమ్। 8

యద్రక్షతి మహావీరః సదా దధిముఖః కపిః।
మాతులః కపిముఖ్యస్య సుగ్రీవస్య మహాత్మనః। 9

తే తద్వనముపాగమ్య బభూవుః పరమోత్కటాః।
వానరా వానరేంద్రస్య మనఃకాంతతమం మహత్। 10

తతస్తే వానరా హృష్టా దృష్ట్వా మధువనం మహత్।
కుమార మభ్యయాచంత మధూని మధుపింగలాః। 11

తతః కుమారస్తాన్ వృద్ధాన్ జాంబవత్ప్రముఖాన్ కపీన్।
అనుమాన్య దదౌ తేషాం నిసర్గం మధుభక్షణే। 12

తే నిసృష్టాః కుమారేణ ధీమతా వాలిసూనునా।
హరయస్సమపద్యంత ద్రుమాన్ మధుకరాకులాన్। 13

భక్షయంతస్సుగంధీని మూలాని చ ఫలానిచ।
జగ్ముః ప్రహర్షం తే సర్వే బభూవుశ్చ మదోత్కటాః। 14

మహాకాయులు, మహాబలసంపన్నులైన ఆ వానరులు మేరుమందరపర్వతములవలెను, మదించిన మహాగజములవలెను ఒప్పుచు ఆకాశమును కప్పివేయుచున్నట్లుండిరి. (3)

సకలప్రాణులచే గౌరవింపబడుచున్నవాడును, మిక్కిలి ప్రజ్ఞాశాలియు, ఎంతయుబలసంపన్నుడును, శీఘ్రముగా సాగిపోగలవాడును అగు ఆ హనుమంతుని వారు తమచూపులతో మోయుచున్నట్లు ఒప్పుచు తదేక దృష్టితో ఆయననే చూచుచుండిరి.[1] (4)

'సీతజాడతెలిసికొనుట'- అనుకార్యము సిద్ధించినందులకై గొప్పయశమునుపొంది, వానరులందఱును కృతార్థులై యుండిరి. కార్యసాఫల్య లాభములతో వారిమనస్సులు ఉత్సాహపూరితములయ్యెను. వారు ఈ సంతోషవార్తను శ్రీరామునకును, సుగ్రీవునకును తెల్పుటకు నిశ్చయించుకొని ముందునకు సాగుచుండిరి. రావణునితోయుద్ధము చేయుటకై అందఱును ఉబలాటపడుచుండిరి. సుగ్రీవుని రాజుగాచేసిన శ్రీరామునకు ప్రత్యుపకారముచేయుటకు వారు నిండుమనస్సుతో కటిబద్ధులైయుండిరి. (5-6)

అంతట ఆ వానరులు ఆకాశమార్గమున పురోగమించుచు సుసంపన్నమైనవృక్షములతోను, లతలతోను అలరారుచు నందనవనసదృశమైన మధువనమును చేరిరి. (7)

ఆ మధువనము సుగ్రీవునిరక్షణములో ఉండెను. అది సకల ప్రాణులకును ఆహ్లాదమును గూర్చునది. కాని సుగ్రీవుని భయముతో ఎవ్వరును దానివైపునకె చూడజాలరు. (8)

దధిముఖుడనువానరుడు మహాత్ముడైన వానరప్రభువగు సుగ్రీవునకు మేనమామ, ఆ మహావీరుడు ఆ వనమును నిరంతరము పరిరక్షించుచుండెను. (9)

వానరేంద్రుడైన సుగ్రీవునకు ఎంతయు మానసోల్లాసమును గూర్చు ఆ మహావనమును సమీపింపగానే ఆ వానరులందఱును మధుపానమునకై ఎంతో ఆరాటపడసాగిరి. (10)

పిదప తేనెవలె పింగలవర్ణముగల ఆ వానరులు ఆ గొప్పమధువనమునుగాంచి, సంతోషించి, మధువులను గ్రోలుటకై అంగదకుమారుని అభ్యర్థించిరి. (11)

పిదప యువరాజైన అంగదుడు ప్రముఖులైన జాంబవదాది వృద్ధవానరుల ఆమోదముతో మధుభక్షణమునకై వారికి అనుమతిని ఇచ్చెను. (12)

ధీశాలియు, వాలికుమారుడును ఐన అంగదుని అంగీకారమును పొందిన ఆ వానరులు తేనెపట్టులతో నిండిన చెట్లపైకెక్కిరి. (13)

వారందఱును కమ్మనిదుంపలను, మధురఫలములను భక్షించుచు అమితానందమును పొందిరి. మత్తులో మైమఱచిరి. (14)

1) హనుమంతుడు సముద్రమును లంఘించుటకు పూనుకొనకముందు వానరులు ప్రాయోపవేశమునకు సిద్ధపడి విషాదవదనులైయుండిరి. కాని నూఱు యోజనముల సముద్రము లంఘించుట, అభేద్యమైన లంకలో ప్రవేశించుట, పెక్కు సాహసములొనర్చి సీతమ్మను జూచుట, లంకను దహించుట మొదలగు ఘనకార్యములను సాధించుకొనివచ్చి మారుతి వారి అందఱి ప్రాణములను కాపాడెను. అందువలన వానరులందఱును హర్షోల్లసితులై, తెప్పవాల్చక పూజ్యభావముతో ఆ పావనినే చూచుచుండిరి.

తతశ్చానుమతాస్సర్వే సంప్రహృష్టా వనౌకసః।
ముదితాః ప్రేరితా శ్చాపి ప్రనృత్యంతోఽభవం స్తతః। 15

గాయంతి కేచిత్ ప్రణమంతి కేచిత్
నృత్యంతి కేచిత్ ప్రహసంతి కేచిత్ ।
పతంతి కేచిద్విచరంతి కేచిత్
ప్లవంతి కేచిత్ ప్రలపంతి కేచిత్ । 16

పరస్పరం కేచిదుపాశ్రయంతే
పరస్పరం కేచిదుపాక్రమంతే ।
పరస్పరం కేచిదుపబ్రువంతే
పరస్పరం కేచిదుపారమంతే । 17

ద్రుమాద్ద్రుమం కేచిదభిద్రవంతే,
క్షితౌ నగాగ్రాన్నిపతంతి కేచిత్ ।
మహీతలాత్ కేచిదుదీర్ణవేగా
మహాద్రుమాగ్రాణ్యభిసంపతంతి । 18

గాయంతమన్యః ప్రహసన్నుపైతి
హసంతమన్యః ప్రరుదన్నుపైతి ।
రుదంతమన్యః ప్రణుదన్నుపైతి
నుదంతమన్యః ప్రణుదన్నుపైతి । 19

సమాకులం తత్కపిసైన్యమాసీత్
మధుప్రపానోత్కటసత్త్వచేష్టమ్ ।
నచాత్ర కశ్చిన్నబభూవ మత్తో
నచాత్ర కశ్చిన్నబభూవ తృప్తః । 20

తతో వనం తత్పరిభక్ష్యమాణం
ద్రుమాంశ్చ విధ్వంసితపత్రపుష్పాన్ ।
సమీక్ష్య కోపాద్దధివక్త్రనామా
నివారయామాస కపిః కపీంస్తాన్ । 21

స తైః ప్రవృద్ధైః పరిభర్త్స్యమానో
వనస్య గోప్తా హరివీరవృద్ధః ।
చకార భూయో మతిముగ్రతేజా
వనస్య రక్షాం ప్రతి వానరేభ్యః । 22

ఉవాచ కాంశ్చిత్ పరుషాణి ధృష్టమ్
అసక్త మన్యాంశ్చ తలైర్జఘాన ।
సమేత్య కైశ్చిత్ కలహం చకార
తథైవ సామ్నోపజగామ కాంశ్చిత్ । 23

అంగదుని అనుమతిని పొందిన ఆ వానరులందఱును పరస్పర ప్రేరణలతో ఆనందమున ఓలలాడుచు నృత్యములు చేయసాగిరి. (15)

కొందఱు గానములు చేయుచుండిరి. కొందఱు చెట్లకొమ్మలకు తలక్రిందులుగా వ్రేలాడుచుండిరి. కొందఱు నృత్యములు చేయుచుండిరి. కొంతమంది పకపకనవ్వుచుండిరి. కొందఱు క్రిందబడుచుండిరి. కొందఱు అటునిటు తిరుగుచుండిరి. కొందఱు గంతులు వేయుచుండిరి. కొందఱు ప్రేలుచుండిరి.(16)

వారు ఒకరినొకరు ఆశ్రయించుచుండిరి, ఒకరి వీపులపైకి మఱియొకరు ఎక్కుచుండిరి. ఒండొరులు మాట్లాడుకొనుచుండిరి. పరస్పరము క్రీడలు సల్పుచుండిరి. (17)

కొందఱు ఒక చెట్టునుండి మఱియొక చెట్టునకు దూకుచుండిరి, కొందఱు వృక్షాగ్రభాగములనుండి నేలమీదికి దూకుచుండిరి. మఱికొందఱు భూమిపైనుండి చెట్లపైభాగములకు ఎగురుచుండిరి. (18)

గానముచేయుచున్నవానికడకు మఱియొకడు నవ్వుచుచేరెను ఆ నవ్వుచున్నవానియొద్దకు వేఱొకడు బోరునఏడ్చుచు వచ్చెను. ఇంకొకడు ఆ ఏడ్చుచున్న వానిని సమీపించి త్రోయుచుండెను. మఱియొకడు ఆ త్రోయుచున్నవానిపైబడి గట్టిగా అఱచెను. (19)

ఆ వానరులందఱును అతిగా మధుపానము చేయుటవలన వారిమనస్సులు అదుపుతప్పినవి. వారి వికారచేష్టలు వనమునందు అంతటను వ్యాపించెను. వారిలో మధుపానమత్తుడు కానివాడే లేడు, తృప్తిచెందిన వాడునులేడు. (20)

ఆ వానరులందఱును యథేచ్ఛగా ఆ మధువనమునందలి ఫలములను భక్షించుచు, మధువులను సేవించుచు, పత్రములతో, పుష్పములతో కలకలలాడుచున్న చెట్లను ధ్వంసము చేయుచుండగాజూచి, వనపాలకుడైన దధిముఖుడను వానరుడు మిక్కిలి కోపముతో వారిని వారింపసాగెను. (21)

వానరవీరులలో వృద్ధుడు, వనసంరక్షకుడు ఐన ఆ దధిముఖుని మాటలను లెక్కచేయక, ఆ వానరులు మితిమీఱిప్రవర్తించుచు అతనినే భయపెట్టసాగిరి. అప్పుడతడు కోపోద్రిక్తుడై వారినుండి వనమును కాపాడుటకై పునరాలోచన చేయసాగెను. (22)

ఆ వానరులను వారించుటకై అతడు కొందఱితో పరుషముగా మాట్లాడెను. వారెవ్వరను విషయమును పట్టించుకొనకయే కొందఱిని అరచేతులతో చఱచెను. మఱికొందఱిని సమీపించి, వారితోకలహించెను. అట్లే ఇంకను కొందఱిని సమీపించి సామోపాయముతో వారిని ప్రార్థించెను. (23)

స తైర్మదాత్ సంపరివార్య వాక్యైః
బలాచ్చ తేన ప్రతివార్యమాణైః ।
ప్రధర్షితస్త్యక్తభయైస్సమేత్య
ప్రకృష్యతే చాప్యనవేక్ష్య దోషమ్ ॥ 24

అతడు సామవచనములతో, ఆ వానరులను నివారింపసాగెను. అంతట మత్తిల్లియున్న ఆ కపివరులు ఎట్టి జంకుకొంకులునులేని వారై, దోషమనియు తలంపక బలప్రయోగముచేత అతనిచుట్టుముట్టి భయపెట్టుచు ఈడ్వసాగిరి. (24)

నఖైస్తుదంతో దశనైర్దశంతః
తలైశ్చ పాదైశ్చ సమాపయంతః ।
మదాత్ కపిం తం కపయస్సమగ్రా
మహావనం నిర్విషయం చ చక్రుః ॥ 25

మధుపానమత్తులైయున్న ఆ వానరులందఱును ఆ దధిముఖుని గోళ్లతోగీఱిరి, దంతములతోకొఱికిరి, చేతులతోకొట్టిరి, పాదములతోతన్నిరి, ఆ వనమునంతయును ధ్వంసమొనర్చిరి. (25)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ఏకషష్టితమస్సర్గః *(61)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు
ఇది అఱువదియొకటవసర్గము.

-- ❋ ❋ ❋ --

62. అఱువదిరెండవసర్గము

వానరులు మధువన రక్షకులను, దధిముఖుని పరాభవించుట, అతడు సేవకులతోడ సుగ్రీవుని కడకు వెడలుట

తానువాచ హరిశ్రేష్ఠో హనుమాన్ వానరర్షభః ।
అవ్యగ్రమనసో యూయం మధు సేవత వానరాః ।
అహమావారయిష్యామి యుష్మాకం పరిపంథినః ॥ 1

వానరోత్తముడైన హనుమంతుడు దధిముఖుని కారణముగా కలతచెందియున్న మనస్సులుగల వానరులతో ఇట్లనెను. "ఓ కపివరులారా! మీరు ప్రశాంతచిత్తులై మధువులను సేవింపుడు. మీకు అడ్డువచ్చువారిని నేను నివారించెదను"- (1)

శ్రుత్వా హనుమతో వాక్యం హరీణాం ప్రవరోఽంగదః ।
ప్రత్యువాచ ప్రసన్నాత్మా పిబంతు హరయో మధు ॥ 2

అవశ్యం కృతకార్యస్య వాక్యం హనుమతో మయా ।
అకార్యమపి కర్తవ్యం కిమంగ పునరీదృశమ్ ॥ 3

వానర ప్రముఖుడైన అంగదుడు హనుమంతుని వచనములనువిని, 'ఓవానరోత్తములారా! ప్రసన్నమనస్కులై మధువులను స్వీకరింపుడు. కృతకృత్యుడైవచ్చిన హనుమంతుని మాటను నేను అవశ్యము (విధిగా) పాటింపవలయును. అది అకార్యమైనను సరే! - ఇట్టి ఘనకార్య విషయమున ఇక చెప్పవలసిన దేమున్నది? అని అనెను. (2-3)

అంగదస్య ముఖాచ్ఛ్రుత్వా వచనం వానరర్షభాః ।
సాధుసాధ్వితి సంహృష్టా వానరాః ప్రత్యపూజయన్ ॥ 4

ఆ వానరవీరులు అంగదునినోటివెంటవచ్చిన మాటలనువిని 'బాగుబాగు' అనుచు మిక్కిలి సంతోషముతో అతనిని ప్రశంసించిరి. (4)

పూజయిత్వాంగదం సర్వే వానరా వానరర్షభమ్ ।
జగ్ముర్మధువనం యత్ర నదీవేగా ఇవ ద్రుతమ్ ॥ 5

వానరులందఱును కపివరుడైన అంగదుని అభినందించి, నదీప్రవాహమువలె వేగముగా మఱల మధువనమున ప్రవేశించిరి. (5)

తే ప్రవిష్టా మధువనం పాలానాక్రమ్య వీర్యతః ॥ 6

అతిసర్గాచ్చ పటవో దృష్ట్వా శ్రుత్వా చ మైథిలీమ్ ।
పపుస్సర్వే మధు తదా రసవత్ఫలమాదదుః ॥ 7

సీతాదేవిని చూచివచ్చినవార్తనువిని, అంగదుని ఆజ్ఞవలన నిర్భయులై, ఆ వానరులు మధువనమున ప్రవేశించిరి, పిమ్మట వనపాలకులమాటలను త్రోసిపుచ్చి, అందఱును మధువులను గ్రోలిరి, రసవంతములైన ఫలములను తృప్తిగా ఆరగించిరి. (6-7)

ఉత్పత్య చ తత స్సర్వే వనపాలాన్ సమాగతాన్ ।
తాడయంతిస్మ శతశః సక్తాన్ మధువనే తదా ॥ 8

అప్పుడు వనమునురక్షించుటకై ఆరాటముతో వందలకొలదిగా వచ్చిన వనపాలకులనందఱిని వారు మీదబడికొట్టిరి. (8)

మధూని ద్రోణమాత్రాణి బాహుభిః పరిగృహ్యతే।
పిబంతి సహితాస్సర్వే నిఘ్నంతిస్మ తథాఽపరే। 9

కేచిత్ పీత్వాఽపవిధ్యంతి మధూని మధుపింగలాః।
మధూచ్ఛిష్టేన కేచిచ్చ జఘ్నురన్యోన్యముత్కటాః। 10

అపరే వృక్షమూలేషు శాఖాం గృహ్యవ్యవస్థితాః।
అత్యర్థం చ మదగ్లానాః పర్ణాన్యాస్తీర్య శేరతే। 11

ఉన్మత్తభూతాః ప్లవగా మధుమత్తాశ్చ హృష్టవత్।
క్షిపంతి చ తదాన్యోఽన్యం స్ఖలంతి చ తథాపరే। 12

కేచిత్ క్ష్వేలాం ప్రకుర్వంతి కేచిత్ కూజంతి హృష్టవత్।
హరయో మధునా మత్తాః కేచిత్ సుప్తా మహీతలే। 13

కృత్వా కేచిత్హసంత్యన్యే కేచిత్ కుర్వంతి చేతరత్।
కృత్వా కేచిద్వదంత్యన్యే కేచిత్ కుర్వంతి చేతరత్। 14

యేఽప్యత్ర మధుపాలాస్స్యుః ప్రేష్యా దధిముఖస్య తు।
తేఽపి తైర్వానరైర్భీమైః ప్రతిషిద్ధా దిశో గతాః। 15

జానుభిస్తు ప్రకృష్టాశ్చ దేవమార్గం ప్రదర్శితాః।
అబ్రువన్ పరమోద్విగ్నా గత్వా దధిముఖం వచః। 16

హనూమతా దత్తవరైః హతం మధువనం బలాత్।
వయం చ జానుభిః కృష్టా దేవమార్గం చ దర్శితాః। 17

తతో దధిముఖః క్రుద్ధో వనపస్తత్ర వానరః।
హతం మధువనం శ్రుత్వా సాంత్వయామాస తాన్ హరీన్। 18

ఇహాగచ్ఛత గచ్ఛామో వానరాన్ బలదర్పితాన్।
బలేన వారయిష్యామో మధు భక్షయతో వయమ్। 19

శ్రుత్వా దధిముఖస్యేదం వచనం వానరర్షభాః।
పునర్వీరా మధువనం తేనైవ సహసా యయుః। 20

ఆ వానరులందఱునుగూడి, తమబాహువులతో ద్రోణముల (ద్రోణము = ఒక తూమెడు ద్రవపదార్థము పట్టెడికుండ) కొలది మధువులను గ్రహించి, త్రాగిరి, తమకు అడ్డువచ్చినవారిని చావగొట్టిరి. (9)

తేనెవలె పింగళవర్ణముగల కొందఱువానరులు కడుపునిండా మధువులనుగ్రోలి, మిగిలినవాటిని నేలపై ఒలకబోయుచుండిరి. మఱికొందఱు మధుపానమత్తులై, మధువులనుత్రాగగా మిగిలిన తేనెపట్టులతో ఒకరి నొకరు కొట్టుకొనుచుండిరి. (10)

కొందఱు కొమ్మలనుపట్టుకొని, చెట్లబోదెల సమీపమున కూర్చొనియుండిరి. మధువును అతిగా సేవించి మత్తులో ఉన్నవారు ఆకులను పఱచుకొని శయనించుచుండిరి. (11)

మధుపానమత్తులైన వానరులు కొందఱు పిచ్చి యెక్కిన వారివలె సంతోషముతో ఒకరినొకరు ఎత్తి నేలపై పడవేసి కొనుచుండిరి. మఱికొందఱు నడువలేక తడబడుచుండిరి. (12)

కొంతమంది సింహనాదములను చేయుచుండిరి, మఱికొందఱు సంతోషముతో పక్షులవలె కూయుచుండిరి, మధుపానముచే మత్తిల్లియున్న వానరులు కొందఱు నేలపై పరుండిరి. (13)

కొందఱు వికృతచేష్టలు చేయుచు నవ్వసాగిరి, మఱికొందఱు ఏడ్చుచున్నట్లు నటించుచుండిరి. కొందఱు చేయునది ఒకటి, చెప్పునది మఱియొకటి. మఱికొందఱు అల్లరిచిల్లరమాటలను నుడువుచుండిరి. (14)

దధిముఖుని అనుచరులైన వనపాలకులను ఆ వానరులు భయపెట్టి, బాధించుచుండగా వారు అచటి నుండి నలుదెసలకు పలాయనము చిత్తగించిరి. (15)

ఆ వానరులు వనరక్షకులను మోకాళ్లతోగ్రుమ్మి, నేలపై ఈడ్చుచు, ఆకాశమునకు విసరివేసిరి. అంతట వనపాలకులు కలతచెందినవారై, దధిముఖునికడకు వెళ్లి, ఇట్లు మొఱపెట్టుకొనిరి. (16)

హనుమంతునిఅనుమతినిపొందిన వానరులు తమఇష్టము వచ్చినట్లు మధువనమును ధ్వంసము గావించిరి. మమ్ము మోకాళ్లతో పొడుచుచు లాగిరి. మమ్ములను ఆకాశమునకు విసరివేసిరి. (17)

అంతట వనపాలకుడైన దధిముఖుడను వానరుడు మధువన ధ్వంసవార్తను విని, మిక్కిలి క్రుద్ధుడై ఆ దెబ్బలు తినివచ్చిన తన అనుచరకపులను ఓదార్చెను. (18)

"ఇటు రండు, బలగర్వితులైన ఆ వానరులకడకు వెళ్లుదము. మధువులను భక్షించుచున్న ఆ వానరులను మనము బలప్రయోగముతో నివారింతము. (19)

వీరులైన ఆ వానరపుంగవులు దధిముఖునిమాటలను విని, వెంటనే అతనితోగూడి వేగముగా మధువనమును చేరిరి. (20)

మధ్యే చైషాం దధిముఖః ప్రగృహ్య తరసా తరుమ్।
సమభ్యధావద్వేగేన తే చ సర్వే ప్లవంగమాః। 21

తే శిలాపాదపాంశ్చాపి పర్వతాంశ్చాపి వానరాః।
గృహీత్వాఽభ్యగమన్ క్రుద్ధా యత్ర తే కపికుంజరాః। 22

తే స్వామివచనం వీరా హృదయేష్వవసజ్య తత్।
త్వరయా హ్యభ్యధావంత సాలతాలశిలాయుధాః। 23

వృక్షస్థాంశ్చ తలస్థాంశ్చ వానరాన్ బలదర్పితాన్।
అభ్యక్రామంస్తతో వీరాః పాలాస్తత్ర సహస్రశః। 24

అథ దృష్ట్వా దధిముఖం క్రుద్ధం వానరపుంగవాః।
అభ్యధావంత వేగేన హనుమత్ప్రముఖాస్తదా। 25

తం సవృక్షం మహాబాహుమ్ ఆపతంతం మహాబలమ్।
ఆర్యకం ప్రాహరత్ తత్ర బాహుభ్యాం కుపితోఽంగదః। 26

మదాంధశ్చ న వేదైనమ్ ఆర్యకోఽయం మమేతి సః।
అథైనం నిష్పిపేషాశు వేగవద్వసుధాతలే। 27

స భగ్నబాహూరుభుజో విహ్వల శ్శోణితోక్షితః।
ముమోహ సహసా వీరో ముహూర్తం కపికుంజరః। 28

స సమాశ్వాస్య సహసా సంక్రుద్ధో రాజమాతులః।
వానరాన్ వారయామాస దండేన మధుమోహితాన్। 29

స కథంచిద్విముక్తస్తైః వానరైర్వానరర్షభః।
ఉవాచైకాంత మాశ్రిత్య భృత్యాన్ స్వాన్ సముపాగతాన్। 30

ఏతే తిష్ఠంతు గచ్ఛామో భర్తా నో యత్ర వానరః।
సుగ్రీవో విపులగ్రీవః సహ రామేణ తిష్ఠతి। 31

సర్వం చైవాంగదే దోషం శ్రావయిష్యామ పార్థివే।
అమర్షీ వచనం శ్రుత్వా ఘాతయిష్యతి వానరాన్। 32

ఇష్టం మధువనం హ్యేతత్ సుగ్రీవస్య మహాత్మనః।
పితృపైతామహం దివ్యం దేవైరపి దురాసదమ్। 33

వారిమధ్యనున్న దధిముఖుడు వెంటనే ఒకచెట్టును పెకలించితీసికొని, వేగముగా పరుగెత్తెను. అతని అనుచరులైన వారందఱును అతని వెంటపరుగిడిరి (21)

క్రుద్ధులైన ఆ వానరులు ఱాళ్లను, వృక్షములను, పర్వతములను గ్రహించి, అంగదాది వానరప్రముఖులున్న ప్రదేశమునకు బయలుదేఱిరి. (22)

వీరులైన ఆ వనపాలకులు తమనాయకుడైన దధిముఖుని మాటను తమహృదయములయందు నిలుపుకొని, త్వరత్వరగా మద్దిచెట్లను, తాళవృక్షములను, శిలలను ఆయుధములుగాగొని పరుగులుదీసిరి. (23)

అంతట వీరులైన వేలకొలది ఆవనపాలకులు, బలగర్వితులై, వృక్షములమీదను, నేలపైనను ఉన్న అంగదాది వానరులను చుట్టుముట్టిరి. (24)

పిమ్మట హనుమంతుడు మొదలగు వానరప్రముఖులు క్రుద్ధుడైయున్న దధిముఖునిజూచి, వెంటనే వానిని ఎదుర్కొనిరి.(25)

మహాబలశాలియు, మిక్కిలి బాహుపరాక్రమము గలవాడును ఐన దధిముఖుడు వృక్షమును దీసికొని వచ్చుచుండగా క్రుద్ధుడైన అంగదుడు పెద్దవాడైన అతనిని తనబాహువులతో కొట్టెను.(26)

ఆ అంగదుడు మత్తులోనుండినవాడై 'ఇతడు నాకు పూజ్యుడైన తాత'యని గుర్తింపక వెంటనే అతనిని నేలపై బడద్రోసి, క్రుమ్మెను. (27)

అంగదునిదెబ్బకు వానరవీరుడైన ఆ దధిముఖుని బాహువులు, ఊరువులు, భుజములు నుగ్గునుగ్గయ్యెను. అతనిదేహము పట్టుదప్పి, రక్తసిక్తమయ్యెను. వెంటనే అతడు ఒక క్షణకాలముపాటు మూర్ఛిల్లెను. (28)

సుగ్రీవుని మేనమామయైన ఆ దధిముఖుడు వెంటనే ఊరటచెంది, పిమ్మట క్రుద్ధుడై దండమునుచేతబట్టి, మధుపానమత్తులైన వానరులను నివారించెను. (29)

వానరోత్తముడైన ఆ దధిముఖుడు ఎట్టకేలకు ఆ అంగదాదులనుండి విముక్తుడై తనయొద్దకువచ్చిన అనుచరులతో ఏకాంతముగా ఇట్లు పలికెను. (30)

"వీరిని ఇట్లే ఉండనిండు, (ఇక వీరితో మనకు పనిలేదు) మనకు ప్రభువు, సముచితస్ఫూర్తిగలవాడు, కఠోరముగా శాసించువాడు, (సముచితముగా మాట్లాడువాడు) అగు సుగ్రీవుడు, శ్రీరాముని చెంతగలడు అచటికి వెళ్లుదము.(31)

మనమందఱము అచటికివెళ్లి, అంగదుని దోషములను అన్నింటిని మనప్రభువునకు నివేదింతము. మనమాటలను విని, అతడు క్రుద్ధుడై ఈ వానరులను శిక్షింపగలడు. (32)

ఈ మధువనము మహాత్ముడైన సుగ్రీవునకు ప్రాణప్రియమైనది. ఇది తండ్రితాతలనుండి ప్రాప్తించినది. దివ్యమైనది. దేవతలకుగూడ చొరరానిది. (33)

స వానరానిమాన్ సర్వాన్ మధులుబ్ధాన్ గతాయుషః।
ఘాతయిష్యతి దండేన సుగ్రీవస్ససుహృజ్జనాన్। 34

వధ్యా హ్యేతే దురాత్మానో నృపాజ్ఞాపరిభావినః।
అమర్షప్రభవో రోషః సఫలో నో భవిష్యతి। 35

ఏవముక్త్వా దధిముఖో వనపాలాన్మహాబలః।
జగామ సహసోత్పత్య వనపాలైస్సమన్వితః। 36

నిమేషాంతరమాత్రేణ స హి ప్రాప్తో వనాలయః।
సహస్రాంశుసుతో ధీమాన్ సుగ్రీవో యత్ర వానరః। 37

రామం చ లక్ష్మణం చైవ దృష్ట్వా సుగ్రీవమేవ చ।
సమప్రతిష్ఠాం జగతీమ్ ఆకాశాన్నిపపాత హ। 38

సన్నివర్త్య మహావీర్యః సర్వైస్తైః పరివారితః।
హరిర్దధిముఖః పాలైః పాలానాం పరమేశ్వరః। 39

స దీనవదనో భూత్వా కృత్వా శిరసి చాంజలిమ్।
సుగ్రీవస్య శుభౌ మూర్ధ్నా చరణౌ ప్రత్యపీడయత్। 40

మధుపానలోలురైన ఈ వానరులందఱికిని ఇక నూకలు చెల్లినట్లే, సుగ్రీవుడు వీరిని, వీరిమిత్రులందఱిని తగినరీతిగా దండించితీఱును. (34)

రాజాజ్ఞను ధిక్కరించినందులకు ఈ దురాత్ములు అందఱును వధార్హులే. (మరణశిక్షను పొందవలసినవారే) అప్పుడే దుస్సహమైన మన కోపము చల్లారును." (35)

మహాబలశాలియైన దధిముఖుడు ఆ వనరక్షకులతో ఇట్లు పలికి, వారితోగూడి, వెంటనే ఆకాశమునకు ఎగురుచు బయలుదేఱెను. (36)

అనుచరసహితుడై ఆ దధిముఖుడు సూర్యపుత్రుడును ధీశాలియు ఐన సుగ్రీవుడున్న వనమునకు ఒక్షణములోచేరెను. అతడాకాశమునుండియే రామలక్ష్మణులను, సుగ్రీవుని దర్శించి, ఒక సమతలప్రదేశమున అనుచరులతోగూడ క్రిందికిదిగెను.(37-38)

మహావీరుడును, వనపాలకులకునాయకుడును, అగు ఆ దధిముఖకపివరుడు తన అనుచరపాలకులతో పరివృతుడై భూమిమీదికి దిగినపిమ్మట దీనవదనముతో వినమ్రుడై చేతులు జోడించి, పవిత్రములైన సుగ్రీవుని పాదములకు ప్రణమిల్లెను. (39-40)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే ద్విషష్టితమస్సర్గః (62)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది అఱువదిరెండవసర్గము.

— * * * —

63. అఱువదిమూడవసర్గము

మధువనవిధ్వంస వార్తను విని, సుగ్రీవుడు హనుమదాదులవలన కార్యము సఫలమైనట్లు భావించుట

తతో మూర్ధ్నా నిపతితం వానరం వానరర్షభః।
దృష్ట్వైవోద్విగ్నహృదయో వాక్యమేత దువాచ హ। 1

ఉత్తిష్ఠోత్తిష్ఠ కస్మాత్ త్వం పాదయోః పతితో మమ।
అభయం తే ప్రదాస్యామి సర్వమేవాభిధీయతామ్। 2

కిం సంభ్రమాద్ధితం కృత్స్నం బ్రూహి యద్వక్తుమర్హసి।
కచ్చిన్మధువనే స్వస్తి శ్రోతుమిచ్ఛామి వానర। 3

స సమాశ్వాసితస్తేన సుగ్రీవేణ మహాత్మనా।
ఉత్థాయ స మహాప్రాజ్ఞో వాక్యం దధిముఖోఽబ్రవీత్। 4

వానరప్రభువైన సుగ్రీవుడు తనకు సాష్టాంగ ప్రణామములను ఆచరించుచున్న దధిముఖునిజూచి, ఆందోళనపడినవాడై ఈ విధముగా పలికెను. (1)

"లెమ్ము లెమ్ము, ఎందువలన నీవు నా పాదములపై బడితివి? నీకు అభయమునిచ్చుచున్నాను. విషయములనన్నింటిని విపులముగా దెలుపుము. (2)

ఓ దధిముఖుడా! ఎందులకు తత్తరపడుచుంటివి? నీవు చెప్పదలచుకొనిన హితవచనములను నుడువుము. 'మధువనము' భద్రముగనే యున్నదిగదా! వినగోరుచున్నాను, తెలుపుము." (3)

మహాత్ముడైన ఆ సుగ్రీవుడు దధిముఖుని ఓదార్చెను. మిక్కిలిబుద్ధిశాలియైన అతడు లేచినిలబడి ఇట్లనెను. (4)

నైవర్క్షరజసా రాజన్ న త్వయా నాఽపి వాలినా।
వనం నిసృష్టపూర్వం హి భక్షితం తచ్చ వానరైః। 5

"ఓ రాజా! నీ తండ్రియగు ఋక్షరజసుని కాలమునను, నీ అన్నయైన వాలిపాలనమునను, నీ ప్రభుత్వమునందును ఇంతవఱకు మధువనమును యథేచ్ఛగా భక్షించుటకు ఎవ్వరికిని అవకాశమే లేకుండెను. ఈనాడు వానరులు ఆ వనమునందలి ఫలాదులనుభక్షించి, దానిని భగ్నమొనర్చిరి. (5)

న్యవారయమహం సర్వాన్ సహైభిర్వనచారిభిః।
అచింతయిత్వా మాం హృష్టా భక్షయంతి పిబంతి చ। 6

నేనును, తోడి వనపాలకులును వారిని అడ్డుకొంటిమి. కాని వారు మమ్ములను లెక్కసేయక ఆనందముతో ఫలములను భక్షించుచు మధువులను సేవించుచున్నారు. (6)

ఏభిః ప్రధర్షితాశ్చైవ వానరా వనరక్షిభిః।
మధూన్యచింతయిత్వేమాన్ భక్షయంతి పిబంతి చ। 7

ఈ వనపాలకులు ఆ వానరులను మిక్కిలి భయపెట్టుచు వారించినను, వారు వీరినిలక్ష్యపెట్టక ఫలములను తినుచు మధువులను త్రాగుచునే యున్నారు. (7)

శిష్టమత్రాపవిధ్యంతి భక్షయంతి తథాపరే।
నివార్యమాణాస్తే సర్వే భ్రువౌ వై దర్శయంతి హి। 8

కొందఱువానరులు త్రాగగా మిగిలినమధువులను అచటనే పాఱబోయుచున్నారు. మఱికొందఱు భక్షించు చున్నారు. వారందఱును తమను నివారించుచున్న వారిని కనుబొమల నెగురవేయుచు హెచ్చరించుచున్నారు. (8)

ఇమే హి సంరబ్ధతరాః తథా తైస్సంప్రధర్షితాః।
వారయంతో వనాత్ తస్మాత్ క్రుద్ధై ర్వానరపుంగవైః। 9

ఈ వనపాలకులు సంభ్రమముతో 'ఈ వనమును విడిచివెళ్లుడు.' అని వారిని వారించుచుండగా ఆ వానరశ్రేష్ఠులు క్రుద్ధులై వీరినే చావగొట్టితఱిమివేసిరి. (9)

తత స్తైర్బహుభిర్వీరైః వానరైర్వానరర్షభ।
సంరక్తనయనైః క్రోధాత్ హరయః ప్రవిచాలితాః। 10

ఓ కపిరాజా! ఎఱ్ఱబడిన కన్నులు గల అంగదాదిప్రముఖ వానరవీరులలో పెక్కుమంది క్రోధావేశముతో కన్నులెఱ్ఱ జేసి, మనవనపాలకులను తఱిమికొట్టిరి. (10)

పాణిభిర్నిహతాః కేచిత్ కేచిజ్జానుభిరాహతాః।
ప్రకృష్టాశ్చ యథాకామం దేవమార్గం చ దర్శితాః। 11

ఆ వానరులలో కొంతమంది మనవారిని చేతులతో చఱచిరి. మఱికొంతమంది మోకాళ్లతోక్రుమ్మిరి. ఇష్టము వచ్చినట్లుగా లాగుచు చిత్తుగావించి, ఆకాశము (దేవమార్గము)ను జూపిరి. (11)

ఏవమేతే హతా శ్శూరాః త్వయి తిష్ఠతి భర్తరి।
కృత్స్నం మధువనం చైవ ప్రకామం తైః ప్రభక్ష్యతే। 12

నీవు రాజువై పరిపాలించుచుండగా వీరులైన మన వన రక్షకులను వారు హతమొనర్చిరి. మీదుమిక్కిలి వారు విశృంఖలముగా మధువనమును పూర్తిగా పాడుచేసిరి." (12)

ఏవం విజ్ఞాప్యమానం తం సుగ్రీవం వానరర్షభమ్।
అపృచ్ఛత్ తం మహాప్రాజ్ఞో లక్ష్మణః పరవీరహా। 13

ఈవిధముగా దధిముఖుడు సుగ్రీవునకు మొఱపెట్టు కొనుచుండగా, శత్రువీరులను తుదముట్టించుటలో సమర్థుడు, మహాధీశాలియునైన లక్ష్మణస్వామి ఆ వానరప్రభువును ఇట్లు ప్రశ్నించెను. (13)

కిమయం వానరో రాజన్ వనపః ప్రత్యుపస్థితః।
కంచార్థమభినిర్దిశ్య దుఃఖితో వాక్యమబ్రవీత్। 14

ఓ రాజా! వనపాలకుడైన ఈ వానరుడు ఇచ్చటికి వచ్చుటకు కారణమేమి? ఏల దుఃఖించు చున్నాడు? ఏ విషయమును గూర్చి మీకు నివేదించు కొనుచున్నాడు? (14)

ఏవముక్తస్తు సుగ్రీవో లక్ష్మణేన మహాత్మనా।
లక్ష్మణం ప్రత్యువాచేదం వాక్యం వాక్యవిశారదః। 15

మహాత్ముడైన లక్ష్మణుడు ఈవిధముగా ప్రశ్నింపగా మాటనేర్పరియైన సుగ్రీవుడు ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. (15)

ఆర్య లక్ష్మణ సంప్రాహ వీరో దధిముఖః కపిః।
అంగదప్రముఖైర్వీరైః భక్షితం మధు వానరైః। 16

పూజ్యుడవైన ఓ లక్ష్మణా! అంగదాది ప్రముఖ వానరవీరులు మధువనమున ఫలములను భక్షించి, మధువులనుగ్రోలి, ఆ వనమును భగ్నమొనర్చినారని దధిముఖుడను ఈ కపివీరుడు నివేదించుచున్నాడు. (16)

విచిత్య దక్షిణామాశాం ఆగతైర్హరిపుంగవైః।
నైషామకృతకృత్యానామ్ ఈదృశస్స్యాదుపక్రమః। 17

దక్షిణదిశయందు సీతాన్వేషణను ముగించుకొని వచ్చినవారు తమకార్యము సఫలముకానిచో ఇట్టి పనులకు పూనుకొనరు. (17)

వారయంతో భృశం ప్రాప్తాః పాలా జానుభిరాహతాః।
తథా। న గణితశ్చాయం కపిర్దధిముఖో బలీ। 18

పతిర్మమ వనస్యాయమ్ అస్మాభిః స్థాపితః స్వయమ్।
దృష్టా దేవీ న సందేహో న చాన్యేన హనూమతా। 19

నహ్యన్యస్సాధనే హేతుః కర్మణోఽస్య హనూమతః।
కార్యసిద్ధిర్మతిశ్చైవ తస్మిన్ వానరపుంగవే। 20

వ్యవసాయశ్చ వీర్యం చ శ్రుతం చాపి ప్రతిష్ఠితమ్।
జాంబవాన్ యత్ర నేతా స్యాత్ అంగదశ్చ మహాబలః। 21

హనుమాంశ్చాప్యధిష్ఠాతా న తస్య గతి రన్యథా।
అంగదప్రముఖైర్వీరైః హతం మధువనం కిల। 22

విచిత్య దక్షిణామాశామ్ ఆగతైర్హరిపుంగవైః।
ఆగతైశ్చాప్రధృష్యం తత్ హతం మధువనం కిల। 23

ధర్షితం చ వనం కృత్స్నమ్ ఉపయుక్తం తు వానరైః।
పాతితా వనపాలాస్తే తదా జానుభిరాహతాః। 24

ఏతదర్థమయం ప్రాప్తో వక్తుం మధురవాగిహ।
నామ్నా దధిముఖో నామ హరిః ప్రఖ్యాతవిక్రమః। 25

దృష్టా సీతా మహాబాహో సౌమిత్రే పశ్య తత్త్వతః।
అభిగమ్య తథా సర్వే పిబంతి మధు వానరాః। 26

నచాప్యదృష్ట్వా వైదేహీం విశ్రుతాః పురుషర్షభ।
వనం దత్తవరం దివ్యం ధర్షయేయుర్వనౌకసః। 27

తతః ప్రహృష్టో ధర్మాత్మా లక్ష్మణస్సహరాఘవః।
శ్రుత్వా కర్ణసుఖాం వాణీం సుగ్రీవవదనాచ్చ్యుతామ్। 28

ప్రాహృష్యత భృశం రామో లక్ష్మణశ్చ మహాబలః।
శ్రుత్వా దధిముఖస్యేదం సుగ్రీవస్తు ప్రహృష్య చ। 29

అంగదాదివానరులు తమను వారింపవచ్చిన వన పాలకులను తమమోకాళ్లతో బలముగాపొడిచిరి. మిక్కిలి బలశాలియైన ఈ దధిముఖవానరుని వనరక్షణ పాలకులకు నాయకునిగా నియమించితిమి. అట్టి ప్రముఖునిగూడ వారు లక్ష్యపెట్టలేదు-దీనినిబట్టి చూచినచో సీతాదేవి కనబడియేయుండును. అందులకు సందేహము లేదు. ఆ చూచినవాడుగూడ హనుమంతుడు తప్ప మఱియొకడు కాడు. (18-19)

ఆ హనుమంతునియందు కార్యసాధనకౌశలము, ప్రజ్ఞ, ప్రయత్నసామర్థ్యము, పరాక్రమము, శాస్త్రజ్ఞానము చక్కగా నెలకొనియున్నవి. కనుక ఈ కార్యమును సాధించినవాడు హనుమంతుడే. మఱియొకడు కానేకాడు. ప్రజ్ఞాశాలియైన జాంబవంతుడు, మహాబలశాలియైన అంగదుడు నాయకత్వము వహించినప్పుడు, హనుమంతుడు పర్యవేక్షకుడుగానున్నప్పుడు ఆ కార్యము తప్పక సఫలమయితీఱును. మఱియొకవిధముగా జరుగదు. అందువలననే (తమకార్యము ఫలించినందువలననే) ఆ సంతోషములో అంగదాదిప్రముఖవీరులు ఆ మధువనమును భగ్నముచేసి యుండవచ్చును. (20-22)

ఆ వానరోత్తములు సీతాదేవికొఱకై దక్షిణదిశను గాలించి వచ్చియుందురు. కృతార్థులై వచ్చియున్నందుననే ఇతరులు కన్నెత్తియైనను చూడజాలని ఆ మధువనమును వారు భగ్నమొనర్చియుందురు. ఆ కపివరులు ఆ వనమునందలి ఫలములను, మధువులను తనివిదీర ఆరగించి, దానిని పూర్తిగా ధ్వంసమొనర్చియుందురు. అంతేగాక వారు తమకు అడ్డుపడినవనపాలురను క్రిందపడద్రోసి, మోకాళ్లతో పొడిచియుందురు. ఇతడు 'దధిముఖుడు' అను ప్రముఖవానరుడు, వాసిగాంచిన పరాక్రమశాలి. ఇతడు వనభంగవిషయమును దెల్పు నెపముతో తనమృదుమధురవచనములతో ఈ శుభవార్తను దెల్పుటకే ఇక్కడికి వచ్చినాడు. (23-25)

ఓ మహాబాహూ! లక్ష్మణా! 'సీతాదేవికనబడినది' అనుట ముమ్మాటికి సత్యము. దీనిని పూర్తిగా నమ్ముము. అంగదాది వానరులందఱునువచ్చి, వనమున సంతోషముతో మధువులను గ్రోలుటయే ఇందులకు ప్రబలనిదర్శనము. (26)

ఓమహాపురుషా! సుప్రసిద్ధులైన హనుమదాది వానరులు సీతాదేవిని చూడకయున్నచో ఋక్షరజమునకు బ్రహ్మదేవుడు వరముగానిచ్చిన ఈ దివ్యవనమును వారు ఇట్లు ధ్వంసమొనర్చి యుండరు. (27)

సుగ్రీవునినోట వెలువడిన, వీనులవిందుగావించు ఈ వచనములనువిని, ధర్మాత్ములైనరామలక్ష్మణులు మహానంద భరితులైరి. (28)

దధిముఖుడు పలికినమాటలనువిని, రాముడును, లక్ష్మణుడును మిక్కిలిముదితులైరి. సుగ్రీవుడును హర్షించెను. (29)

వనపాలం పునర్వాక్యం సుగ్రీవః ప్రత్యభాషత।
ప్రీతోఽస్మి సోఽహం యద్భుక్తం వనం తైః కృతకర్మభిః। 30

మర్షితం మర్షణీయం చ చేష్టితం కృతకర్మణామ్।
గచ్ఛ శీఘ్రం మధువనం సంరక్షస్వ త్వమేవ హి।
శీఘ్రం ప్రేషయ సర్వాంస్తాన్ హనూమత్ప్రముఖాన్ కపీన్। 31

ఇచ్ఛామి శీఘ్రం హనుమత్ప్రధానాన్
శాఖామృగాంస్తాన్ మృగరాజదర్పాన్ ।
ద్రష్టుం కృతార్థాన్ సహ రాఘవాభ్యాం
శ్రోతుం చ సీతాధిగమే ప్రయత్నమ్ । 32

ప్రీతి స్ఫీతాక్షౌ సంప్రహృష్టౌ కుమారౌ
దృష్ట్వా సిద్ధార్థౌ వానరాణాం చ రాజా ।
అంగైస్సంహృష్టైః కర్మసిద్ధిం విదిత్వా
బాహ్వోః రాసన్నాం సోఽతిమాత్రం ననంద । 33

సుగ్రీవుడు "కృతార్థులైవచ్చిన ఆ వానరులు వనమునందలి ఫలములను, మధువులను సేవించుట నాకు సంతోషదాయకమే"- అని వనరక్షకుడైన దధిముఖునకు ప్రత్యుత్తరమిచ్చెను. మామా! ఈ శుభవార్తను తెల్పినందులకు నీయెడ ప్రసన్నుడనైతిని. కార్యమును సాధించుకొని వచ్చినందులకు వానరుల చర్య (మధువనమును ధ్వంసమొనర్చిన చర్య) సహింపదగినదే, వెంటనే మధువనమునకు వెళ్లుము, దానిని నీవే రక్షింపుము. హనుమదాదివానరప్రముఖులనందఱిని శీఘ్రముగా ఇచటికి పంపుము- (30-31)

సింహపరాక్రములైన హనుమదాదివానరులందఱును కృతార్థులైవచ్చేసిరి. వారినందఱిని జూచుటకును, వారినోట సీతాన్వేషణప్రయత్నవిశేషములను వినుటకును, నేను రామలక్ష్మణులును మిక్కిలి కుతూహలపడుచున్నాము.(32)

కార్యము సఫలమైనందున ప్రీతితోవిప్పారిన నేత్రములద్వారా తమసంతోషములను ప్రకటించుచున్న రాజకుమారులగు రామలక్ష్మణులను, వానరరాజైన సుగ్రీవుడు గాంచెను- తనకు శరీరమంతయు పులకితమగుటచే 'కార్యసిద్ధి' ఇక 'కరతలామలకము' అని భావించి, అతడు మహానందముతో పొంగిపోయెను. (33)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే త్రిషష్టితమస్సర్గః *(63)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది అఱువదిమూడవసర్గము.

-- * * * --

64. అఱువదినాల్గవసర్గము

సుగ్రీవుని సందేశము ప్రకారము అంగద హనుమదాదులు కిష్కింధకు వచ్చుట, హనుమంతుడు శ్రీరామునకు ప్రణమిల్లి, సీతా సందర్శన వార్తను తెలుపుట

సుగ్రీవేణైవ ముక్తస్తు హృష్టో దధిముఖః కపిః।
రాఘవం లక్ష్మణం చైవ సుగ్రీవం చాభ్యవాదయత్। 1

స ప్రణమ్య చ సుగ్రీవం రాఘవౌ చ మహాబలౌ,
వానరైస్సహితశ్శూరైః దివమేవోత్పపాత హ, 2

స యథైవాగతః పూర్వం తథైవ త్వరితం గతః,
నిపత్య గగనాద్భూమౌ తద్వనం ప్రవివేశ హ, 3

వానరుడైన దధిముఖుడు సుగ్రీవునిఅనుజ్ఞనుపొంది, సంతోషపడినవాడై, రామలక్ష్మణులకును, సుగ్రీవునకును నమస్కరించెను. (1)

రాజైనసుగ్రీవునకును, మహాబలశాలులైన రామలక్ష్మణులకును ప్రణమిల్లినపిమ్మట ఆ దధిముఖుడు శూరులైన వానరులతోగూడినవాడై ఆకాశమునకు ఎగిరెను. (2)

ఆ దధిముఖుడు సుగ్రీవాదులకడకు వచ్చినట్లుగనే తిరిగి వేగముగా పయనించి, ఆకసమునుండి భూతలమునకు దిగి, మధువనమున ప్రవేశించెను. (3)

స ప్రవిష్టో మధువనం దదర్శ హరియూథపాన్।
విమదానుత్థితాన్ సర్వాన్ మేహమానాన్ మధూదకమ్। 4

స తానుపాగమద్వీరో బద్ధ్వా కరపుటాంజలిమ్।
ఉవాచ వచనం శ్లక్ష్ణమ్ ఇదం హృష్టవదంగదమ్। 5

సౌమ్య రోషో న కర్తవ్యో యదేభిరభివారితః।
అజ్ఞానాద్రక్షిభిః క్రోధాత్ భవంతః ప్రతిషేధితాః। 6

శ్రాంతో దూరాదనుప్రాప్తో భక్షయస్వ స్వకం మధు।
యువరాజస్త్వమీశశ్చ వనస్యాస్య మహాబల। 7

మౌర్ఖ్యాత్ పూర్వం కృతో దోషః తం భవాన్ క్షంతు మర్హతి।
యథైవ హి పితా తేఽభూత్ పూర్వం హరిగణేశ్వరః। 8

తథా త్వమపి సుగ్రీవో నాన్యస్తు హరిసత్తమ।
ఆఖ్యాతం హి మయాగత్వా పితృవ్యస్య తవానఘ। 9

ఇహోపయానం సర్వేషామ్ ఏతేషాం వనచారిణామ్।
స త్వదాగమనం శ్రుత్వా సహైభిర్హరియూథపైః। 10

ప్రహృష్టో న తు రుష్టోఽసౌ వనం శ్రుత్వా ప్రధర్షితమ్।
ప్రహృష్టో మాం పితృవ్యస్తే సుగ్రీవో వానరేశ్వరః। 11

శీఘ్రం ప్రేషయ సర్వాం స్తాన్ ఇతిహోవాచ పార్థివః।
శ్రుత్వా దధిముఖస్యేదం వచనం శ్లక్ష్ణ మంగదః। 12

అబ్రవీత్ తాన్ హరిశ్రేష్ఠో వాక్యం వాక్యవిశారదః।
శంకే శ్రుతోఽయం వృత్తాంతో రామేణ హరియూథపాః। 13

అయం చ హర్షాదాఖ్యాతి తేన జానామి హేతునా।
తత్ క్షమం నేహ నః స్థాతుం కృతే కార్యే పరంతపాః। 14

పీత్వా మధు యథాకామం విశ్రాంతా వనచారిణః।
కిం శేషం గమనం తత్ర సుగ్రీవో యత్ర మే గురుః। 15

సర్వే యథా మాం వక్ష్యంతి సమేత్య హరియూథపాః।
తథాస్మి కర్తా కర్తవ్యే భవద్భిః పరవానహమ్। 16

అతడు ఆ వనమున ప్రవేశించినప్పుడు, వానరులకు మత్తుతొలిగియుండెను. వారు లేచి మధూదకములను (మూత్రరూపమున) విసర్జించుచుండిరి. అప్పుడు అతడు ఆ వానరులను అందఱినిచూచెను. (4)

వీరుడైనదధిముఖుడు ఆ వానరులసమీపమునకు చేరి, సంతోషముతో చేతులుజోడించి, అంగదునితో మృదుమధుర వచనములను ఇట్లు పలికెను. (5)

ఓ సౌమ్యుడా! వీరు మిమ్ముఁలను వారించినందులకు కోపపడవలదు. ఈ వనపాలకులు అజ్ఞానమువలన కోపముతో మీయందఱిని అడ్డుకొనిరి. (6)

ఓ బలశాలీ! నీవు యువరాజువు. ఈ మధువనమునకు అధిపతివి. మీరందఱును దూరమునుండి అలసిసొలసి వచ్చితిరి. ఈ ఫలములు, మధువులు అన్నియును మీవే. ఇష్టమువచ్చినట్లు భుజింపుడు. (7)

మూర్ఖత్వమువలన ఇంతకుముందు తప్పుచేసితిమి. యువరాజవైననీవు మా దోషములను మన్నింపుము. ఓ వానరోత్తమా! ఇదివరలో మీతండ్రివలె ఇప్పుడు నీవు, సుగ్రీవుడు ఈ వానర గణములకు ప్రభువులు- మఱి ఇతరులు కారు. ఓ పుణ్యపురుషా! మీ పినతండ్రియైన సుగ్రీవునికడకు వెళ్ళి, నీవును, ఈ వానరోత్తములందఱును ఇచ్చటికి వచ్చినట్లు ఆయనకు తెలిపితిని. ఈ వానరప్రముఖులతోగూడి నీవు ఇచ్చటికి వచ్చినవిషయమును విని, అతడెంతయు సంతసించెను. మధువనము ధ్వంసమైనవార్తను వినియు, వానరప్రభువు, మీ పినతండ్రియు ఐన సుగ్రీవుడు కోపగింపలేదు. మీదు మిక్కిలి సంతోషపడెను. (8-11)

ఆ ప్రభువు "వారినందఱిని వెంటనే ఇచటికి పంపుము" అని నన్ను ఆదేశించెను. దధిముఖుడు పలికిన ఈ మృదు వచనములను విని, మాట్లాడుటలోనేర్పరి, వానర ప్రముఖుడు ఐన అంగదుడు తన సహచరవానరులతో మృదుమధురముగా ఇట్లు పలికెను. "ఓ వానర యోధులారా! ఈ వృత్తాంతమును శ్రీరాముడుగూడ విని యుండునని భావింతును. (12-13)

ఏలనన దధిముఖుడు సంతోషముతో ఈ సందేశమును తెలుపుటనుబట్టి నేనట్లనుకొనుచున్నాను. ఓ వీరులారా! కార్యసిద్ధియైనపిమ్మట మనము ఇక్కడ ఒక్క క్షణముగూడ ఉండరాదు. (14)

వానరులందఱును ఇచ్ఛానుసారముగా మధువులను సేవించి, బడలికలను తీర్చుకొనియున్నారు. ఇంకను మనకిక్కడ పనియేమి? మన ప్రయాణములో ఇక సుగ్రీవుని యొద్దకు వెళ్ళుటయే మిగిలియున్నది. ఇంక మనప్రభువైన సుగ్రీవుడున్న ప్రదేశమునకు శీఘ్రముగా వెళ్ళుటయే మన కర్తవ్యము. (15)

ఓవానరయోధులారా! నేను మీఅధీనములోనున్నవాడను. మీరందఱునుకలిసి కర్తవ్యమును నిర్ణయింపుడు. మీరు చెప్పినప్రకారము దానిని నేను ఆచరింతును. (16)

నాజ్ఞాపయితు మీశో౽హం యువరాజో౽స్మి యద్యపి।
అయుక్తం కృతకర్మాణో యూయం ధర్షయితుం మయా। 17

బ్రువతశ్చాంగదస్యైవం శ్రుత్వా వచనముత్తమమ్।
ప్రహృష్టమనసో వాక్యమ్ ఇద మూచుర్వనౌకసః। 18

ఏవం వక్ష్యతి కో రాజన్ ప్రభుస్సన్ వానరర్షభ।
ఐశ్వర్యమదమత్తో హి సర్వో౽హమితి మన్యతే। 19

తవ చేదం ససదృశం వాక్యం నాన్యస్య కస్యచిత్।
సన్నతిర్హి తవాఖ్యాతి భవిష్యచ్ఛుభయోగ్యతామ్। 20

సర్వే వయమపి ప్రాప్తాః తత్ర గంతుం కృతక్షణాః।
స యత్ర హరివీరాణాం సుగ్రీవః పతిరవ్యయః। 21

త్వయా హ్యనుక్తైర్హరిభిః నైవ శక్యం పదాత్పదమ్।
క్వచిద్గంతుం హరిశ్రేష్ఠ బ్రూమస్సత్యమిదం తు తే। 22

ఏవం తు వదతాం తేషామ్ అంగదః ప్రత్యభాషత।
బాఢం గచ్ఛామ ఇత్యుక్త్వా ఖముత్పేతుర్మహాబలాః। 23

ఉత్పతంతమనూత్పేతుః సర్వే తే హరియూథపాః।
కృత్వాకాశం నిరాకాశం యంత్రోత్క్షిప్తా ఇవాచలాః। 24

అంగదం పురతః కృత్వా హనూమంతం చ వానరమ్।
తే౽౦బరం సహసోత్పత్య వేగవంతః ప్లవంగమాః।
వినదంతో మహానాదం ఘనా వాతేరితా యథా। 25

అంగదే సమనుప్రాప్తే సుగ్రీవో వానరాధిపః। 26

ఉవాచ శోకోపహతం రామం కమలలోచనమ్।
సమాశ్వసిహి భద్రం తే దృష్టా దేవీ న సంశయః। 27

నాగంతుమిహ శక్యం తైః అతీతే సమయే హి నః।
అంగదస్య ప్రహర్షాచ్చ జానామి శుభదర్శన। 28

న మత్సకాశ మాగచ్ఛేత్ కృత్యే హి వినిపాతితే।
యువరాజో మహాబాహుః ప్లవతాం ప్రవరో౽ంగదః। 29

నేను యువరాజునే ఐనప్పటికిని మిమ్ములను ఆజ్ఞాపింప గలవాడనుగాను, మీరు కార్యమును సఫలమొనర్చుకొని వచ్చినవారు. మిమ్ములను నేను శాసింపదగదు." (17)

అంగదుడు వచించిన ఈ మంచిమాటలనువిని, వానరులందఱును సంతుష్టులై ఇట్లనుడివిరి. (18)

వానరోత్తముడవైన ఓ యువరాజా! సామాన్యముగా ప్రభువైన వాడెవ్వడైనను ఐశ్వర్యమదమత్తుడై 'నేనే సర్వాధికారిని' అని తలంచునేగాని ఈ విధముగా వినమ్రతతో పలికెడివాడెవడు? (19)

ఇట్లనుడువుట నీకేతగును. ఇతరులకు ఇది అసాధ్యము. భవిష్యత్తులో నీకు కలుగనున్న మహాశుభములకు ఇది సూచకము. (20)

మీవెంటనున్న మేమందఱముగూడ శుభలక్షణ సంపన్నుడు, వానరయోధులకు సంతతప్రభువు ఐన సుగ్రీవునికడకు చేరుటకు వేచియున్నాము. (21)

ఓ వానరశ్రేష్ఠా! నీ అనుజ్ఞలేనిదే వానరులెవ్వరును ఒక్క అడుగుగూడ ముందుకువేయజాలరు. (మీ ఆజ్ఞను ఏమాత్రము అతిక్రమింపరు) సత్యమును పలుకుచున్నాము. (22)

ఆ వానరులందఱును ఇట్లుపలుకగా అంగదుడు 'సరే! వెళ్లుదము' అని ప్రత్యుత్తరమిచ్చెను. వెంటనే ఆ మహాబలశాలురు అందఱును ఒక్కుమ్మడిగా ఆకసమున కెగిరిరి. (23)

ఆ వానరయోధులందఱును ఎగురుచున్న అంగదుని అనుసరించుచు యంత్రములచే పైకివిసరబడిన పర్వతములవలె ఆకాశమున ఏమాత్రము ఎడములేకుండ వ్యాపించియుండిరి. అనగా ఆకాశమునందతటనువారే కనబడుచుండిరి. (24)

యువరాజైనఅంగదుడు, కపివరుడైనహనుమంతుడు ముందుకు సాగిపోవుచుండగా మిక్కిలివేగముగల ఆ వానరులు వారినిఅనుసరించుచు దివ్యమైన ఆకాశమునకెగిరి, వాయువుచే నెట్టబడుచున్నమేఘములవలె మహానాదముల నొనర్చుచు పురోగమించిరి. (25)

అంగదాదులు తమను సమీపించుచుండగాజూచి, వానరేంద్రుడైన సుగ్రీవుడు సీతావిరహకారణముగా మిక్కిలి దుఃఖమగ్నుడైయున్న శ్రీరామునితో ఇట్లనెను. "ఓరామా! సీతాదేవి కనబడినది, ఇందులకు సందేహము లేదు- ఊరడిల్లుము- నీకు భద్రమగును. చూడుము- ఇదిగో! అంగదాదులు రానేవచ్చినారు." (26-27)

ఓ శుభదర్శనా! అట్లుకానిచో గడువుమీఱిన పిమ్మట వారు ఇచ్చటికి వచ్చుట అసంభవము- అంగదుని అమితోత్సాహమునుబట్టి నేనిట్లు తలంచుచున్నాను. (28)

కార్యముసఫలముగానిచో, మహాబాహువు, వానర ప్రముఖుడు, యువరాజు ఐన అంగదుడు నా కడకు వచ్చి యుండెడివాడుగాడు. (29)

యద్యప్యకృతకృత్యానామ్ ఈదృశస్స్యాదుపక్రమః।
భవేత్ స దీనవదనో భ్రాంతవిప్లుతమానసః। 30

పితృపైతామహం చైతత్ పూర్వకైరభిరక్షితమ్।
న మే మధువనం హన్యాత్ అహృష్టః ప్లవగేశ్వరః। 31

కౌసల్యా సుప్రజా రామ సమాశ్వసిహి సువ్రత।
దృష్టా దేవీ న సందేహో నచాన్యేన హనూమతా। 32

న హ్యన్యః కర్మణో హేతుః సాధనేఽస్య హనూమతః।
హనూమతి హి సిద్ధి శ్చ మతి శ్చ మతిసత్తమ।
వ్యవసాయ శ్చ వీర్యం చ సూర్యే తేజ ఇవ ధ్రువమ్। 33

జాంబవాన్ యత్ర నేతా స్యాత్ అంగద శ్చ బలేశ్వరః।
హనుమాం శ్చాప్యధిష్ఠాతా న తస్య గతి రన్యథా। 34

మా భూశ్చింతాసమాయుక్తః సంప్రత్యమితవిక్రమ।
యదా హి దర్పితోదగ్రాః సంగతాః కాననౌకసః। 35

నైషామకృతకార్యాణామ్ ఈదృశః స్యాదుపక్రమః।
వనభంగేన జానామి మధూనాం భక్షణేన చ। 36

తతః కిలకిలాశబ్దం శుశ్రావాసన్నమంబరే। 37

హనుమత్కర్మదృప్తానాం నర్దతాం కాననౌకసామ్।
కిష్కింధాముపయాతానాం సిద్ధిం కథయతా మివ। 38

తతశ్శ్రుత్వా నినాదం తం కపీనాం కపిసత్తమః।
ఆయతాంచితలాంగూలః సోఽభవత్ హృష్టమానసః। 39

ఆజగ్ముస్తేఽపి హరయో రామదర్శనకాంక్షిణః।
అంగదం పురతః కృత్వా హనుమంతం చ వానరమ్। 40

తేఽంగదప్రముఖా వీరాః ప్రహృష్టా శ్చ ముదాన్వితాః।
నిపేతుర్హరిరాజస్య సమీపే రాఘవస్య చ। 41

ఒకవేళ వానరులు కార్యమునుసాధింపకయేవచ్చి మధువనమును భగ్నమొనర్చినచో అంగదుడు దీనవదనుడై, భ్రాంతిచే మనస్సుకలతచెందినవాడై యుండెడివాడు. (30)

ఈ మధువనము మా తాతముత్తాతలనుండి పూర్వులచే చక్కగా రక్షింపబడుచు వచ్చినది. అట్టి మధువనమును దుఃఖితుడైన అంగదుడు ధ్వంసముకానీయడు. (ఏలనన అంగదుడు బాధ్యతగల యువరాజు గదా!) (31)

కౌసల్యామాతకు ఆనందమునుగూర్చు ఓ రామా! నియమనిష్ఠలుగలవాడా! ఊరడిల్లుము. 'సీతాదేవి కనబడినది (దృష్టా దేవీ) సందేహములేదు. ఆమెను హనుమంతుడే దర్శించియుండును. (32)

ఓ ప్రజ్ఞాశాలీ! ఈ కార్యమును సఫలమొనర్చినది మఱెవ్వరోగాదు, హనుమంతుడేయైయుండును. ఏలనన సూర్యునియందుతేజస్సువలె సహజముగనే హనుమంతుని యందు కార్యదక్షత, ప్రజ్ఞ, ప్రయత్నశీలము, పరాక్రమము కొల్లలుగా గలవు. (33)

మహావీరుడైన జాంబవంతుడు, మిక్కిలిబలశాలియైన అంగదుడు నాయకత్వమువహించునప్పుడు, వాయుసూనుడైన హనుమంతుడు పర్యవేక్షించునప్పుడు ఏకార్యమైనను సఫలమైతీరును, కావున అమిత పరాక్రమశాలీ! ఓ రామా! ఇప్పుడు చింతను దరిజేరనీయకుము. వానరులు దర్పాతిశయముతో రానేవచ్చినారు. కార్యసాఫల్యముకానిచో వారు ఈ విధముగా ప్రవర్తింపరు- మధువనమునందు వారు యథేచ్ఛగా ఫలభక్షణము మధుసేవనము చేయుటనుబట్టియు, వనమును భంగపఱచుటనుబట్టియు నేను ఇట్లు ఊహించుచున్నాను. ఊహించుటయే కాదు. ఇది నాపరము విశ్వాసము." (34-36)

పిమ్మట హనుమంతుడుసాధించిన కార్యసాఫల్యమునకు గర్వించుచు గర్జించుచున్న వానరులు కిష్కిందను సమీపించుచు, తమకార్యసిద్ధినిగూర్చి ప్రకటించుచున్నారా? అనునట్లు ఆకాశమునందు కిలకిలా రావములను గావించిరి. అనంతరము వానరప్రభువైనసుగ్రీవుడు కపీశ్వరుల నినాదములనువిని, వాలమును నిటారుగా పైకెత్తి, తన పరమానందమును ప్రకటించెను.[1] (37-39)

ఆ కపులును వానరోత్తములైనఅంగదుని, హనుమంతుని ముందుంచుకొని శ్రీరాముని దర్శించు కాంక్షతో వచ్చివాలిరి. (40)

మహావీరులైన ఆ అంగదాదిప్రముఖులు మిక్కిలి ఆనందముతోపొంగిపోవుచు కపిరాజైనసుగ్రీవుడు, పురుషోత్తముడైన శ్రీరాముడు ఉన్న ప్రదేశమునదిగిరి. (41)

1) ఆకాశమున పయనించుచు గమ్యస్థానమును సమీపించిన విమానమును క్రిందికిదిగుటకు అనుమతించుచు విమానాశ్రయమున దీపకాంతులు ప్రదర్శింపబడును. రామసుగ్రీవుల సన్నిధికి చేరుటకై గగన మార్గమున వచ్చుచున్న హనుమదాది వానరులకు హర్షామోదములను దెల్పుచు సూర్యపుత్రుడైన సుగ్రీవుడు కాంతులను విరజిమ్ము తన వాలమును పైకెత్తెను.

హనుమాంశ్చ మహాబాహుః ప్రణమ్య శిరసా తతః।
నియతా మక్షతాం దేవీం రాఘవాయ న్యవేదయత్। 42

దృష్టా దేవీతి హనుమద్వదనాదమృతోపమమ్।
ఆకర్ణ్య వచనం రామో హర్షమాప సలక్ష్మణః। 43

మహాబాహువైన హనుమంతుడు సాష్టాంగనమస్కార మొనర్చి, 'సీతామహాసాధ్వి క్షేమముగా నున్నది' అని శ్రీరామునకు నివేదించెను. 'కనుగొంటిని సీతమ్మను' (దృష్టాదేవీ) అను అమృతతుల్యమైనవచనమును హనుమంతుని నోటవిని, రామలక్ష్మణులు మహదానంద భరితులైరి. (42-43)

నిశ్చితార్థస్తతస్తస్మిన్ సుగ్రీవం పవనాత్మజే।
లక్ష్మణః ప్రీతిమాన్ ప్రీతం బహుమానాదవైక్షత। 44

'హనుమంతుడే కార్యమునుసాధింపగలడు' అనువిశ్వాసము గలలక్ష్మణుడు సంతుష్టుడై, గౌరవాదరములనుగూర్చు తనచూపులతో ఆ సుగ్రీవుని సంతోషపెట్టెను.[1] (44)

ప్రీత్యా చ రమమాణోఽథ రాఘవః పరవీరహా।
బహుమానేన మహతా హనుమంతమవైక్షత। 45

శత్రువీరసంహారకుడైన శ్రీరాముడు సంతోషమున ఓలలాడుచు అత్యంతగౌరవభావముతో హనుమంతుని వీక్షించెను. (అప్పుడు హనుమంతుడు పొందిన బ్రహ్మానందమునకు అవధులు లేకుండెను.) (45)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే చతుష్షష్టితమస్సర్గః (64)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది అఱువదినాలుగవసర్గము.

--- * * * ---

65. అఱువదిఐదవసర్గము

హనుమంతుడు సీతాదేవి సమాచారమును శ్రీరామునకు తెలుపుట

తతః ప్రస్రవణం శైలం తే గత్వా చిత్రకాననమ్।
ప్రణమ్య శిరసా రామం లక్ష్మణం చ మహాబలమ్। 1

యువరాజం పురస్కృత్య సుగ్రీవమభివాద్య చ।
ప్రవృత్తిమథ సీతాయాః ప్రవక్తుముపచక్రముః। 2

అంతట ఆ వానరులందఱును యువరాజైనఅంగదుని నాయకత్వమున చిత్రములైన వనములుగల ప్రస్రవణ పర్వతమును జేరిరి. అచట వారు రామలక్ష్మణులకు సాష్టాంగముగా ప్రణమిల్లిరి. అనంతరము సుగ్రీవునకు నమస్కరించి, సీతాదేవివృత్తాంతమును దెలుపుటకు ఉపక్రమించిరి. (1-2)

రావణాంతఃపురే రోధం రాక్షసీభిశ్చ తర్జనమ్।
రామే సమనురాగం చ యశ్చాయం సమయః కృతః। 3

వేత దాఖ్యాంతి తే సర్వే హరయో రామసన్నిధౌ।
వైదేహీమక్షతాం శ్రుత్వా రామస్తూత్తర మబ్రవీత్। 4

రావణాంతఃపురమునందు సీతాదేవి నిర్బంధింపబడుట, రాక్షసస్త్రీలు ఆమెను భయపెట్టుచుండుట, రామునిపై ఆమెకుగల అనురాగము, రావణుడు ఆమెకు విధించిన గడువు మొదలగు విషయములను వానరులందఱును రామసన్నిధి యందు చెప్పదొడంగిరి. సీతాదేవి క్షేమముగానున్నట్లు దెలిసికొని, శ్రీరాముడిట్లు నుడివెను- (3-4)

క్వ సీతా వర్తతే దేవీ కథం చ మయి వర్తతే।
ఏత న్మే సర్వమాఖ్యాత వైదేహీం ప్రతి వానరాః। 5

ఓ వానరులారా! సీతాదేవి ఎచ్చటఉన్నది? నా విషయమున ఆమెఅభిప్రాయమేమి? ఆమెకు సంబంధించిన ఈ విషయములనన్నింటిని విపులముగా దెల్పుడు. (5)

రామస్య గదితం శ్రుత్వా హరయో రామసన్నిధౌ।
చోదయంతి హనూమంతం సీతావృత్తాంతకోవిదమ్। 6

వానరులు రాముడు పలికినమాటలనువిని, సీతాదేవి వృత్తాంతమును బాగుగా ఎఱిగిన హనుమంతునితో "నీవే వివరింపుము" అని శ్రీరాముని సన్నిధిలో ఆయనను ప్రోత్సహించిరి. (6)

1) రామకార్యార్థమై హనుమంతుని పంపినవాడు సుగ్రీవుడే. హనుమంతుడే ఈ కార్యమును సాధించెనని గట్టిగా నొక్కి చెప్పినవాడును సుగ్రీవుడే. కావున అతడు లక్ష్మణస్వామియొక్క గౌరవాదరములతోగూడినచూపులకు అర్హుడాయెను.

శ్రుత్వా తు వచనం తేషాం హనుమాన్ మారుతాత్మజః।
ప్రణమ్య శిరసా దేవ్యై సీతాయై తాం దిశం ప్రతి।
ఉవాచ వాక్యం వాక్యజ్ఞః సీతాయా దర్శనం యథా। 7

ఆ వానరులమాటలనువిని, వాయుసూనుడైన హనుమంతుడు ఆ దక్షిణదిక్కునకుమఱలి సీతాదేవికి వినయముతో ప్రణమిల్లెను. తదుపరి వాక్చతురుడైన ఆ మారుతి తాను సీతాదేవిని దర్శించినరీతిని తెలుపసాగెను. (7)

తం మణిం కాంచనం దివ్యం దీప్యమానం స్వతేజసా।
దత్త్వా రామాయ హనుమాన్ తతః ప్రాంజలిరబ్రవీత్। 8

(సీతాదేవి తనకు ఆనవాలుగా అనుగ్రహించినదియు) కాంచనమయము, తనతేజస్సులో దివ్యకాంతులను వెదజల్లుచున్నదియుగు ఆ చూడామణిని హనుమంతుడు శ్రీరామునకు సమర్పించెను. పిమ్మట అంజలిఘటించి, అతడు ఇట్లునుడివెను. (8)

సముద్రం లంఘయిత్వాహం శతయోజన మాయతమ్।
అగచ్ఛం జానకీం సీతాం మార్గమాణో దిదృక్షయా। 9

"నేను నూఱుయోజనముల పొడవుగల సముద్రమును లంఘించి, జనకునికూతురైనసీతాదేవిని చూడగోరినవాడనై ఆమెను వెదకుచువెళ్ళితిని. (9)

తత్ర లంకేతి నగరీ రావణస్య దురాత్మనః। 10

దక్షిణస్య సముద్రస్య తీరే వసతి దక్షిణే।
తత్ర దృష్టా మయా సీతా రావణాంతఃపురే సతీ। 11

దక్షిణసముద్రముయొక్క దక్షిణతీరమునందు దుర్మార్గుడైన రావణునియొక్క 'లంక' అను నగరము గలదు. అచట రావణాంతఃపురమున 'అశోక' వనమునందు నేను సీతాసాధ్విని జూచితిని. (10-11)

సన్న్యస్య త్వయి జీవంతీ రామా రామ మనోరథమ్।
దృష్టా మే రాక్షసీమధ్యే తర్జ్యమానా ముహుర్ముహుః। 12

రాక్షసీభిర్విరూపాభీ రక్షితా ప్రమదావనే।
దుఃఖమాసాద్యతే దేవీ తథాఽదుఃఖోచితా సతీ। 13

ఓ రామా! ఆ సాధ్వి తన ఆశలనన్నింటిని నీ మీదనే పెట్టుకొని జీవించుచున్నది. ఆమె చుట్టును రాక్షసస్త్రీలు చేరియుండిరి. వారు ఆమెను మాటిమాటికిని భయపెట్టుచుండగా నేను జూచితిని. వికృతాకారములుగల ఆరాక్షసస్త్రీలు ప్రమదావనమునందు ఆమెను కావలాకాయుచున్నారు. (కలలోగూడ) దుఃఖమను మాటనే ఎఱుగని ఆ సాధ్వి నేడు దుఃఖములకులోనైనది. (12-13)

రావణాంతఃపురే రుద్ధా రాక్షసీభిస్సురక్షితా।
ఏకవేణీధరా దీనా త్వయి చింతాపరాయణా। 14

రావణాంతఃపురమునందు (అశోకవనమునందు) ఆమె నిర్బంధములోనున్నది. రాక్షసస్త్రీలు ఆమెను పర్యవేక్షించుచున్నారు. ఆమెకేశములన్నియు ఒకేజడగా ఏర్పడియున్నవి. దీనురాలై యున్న ఆమె నిరంతరము నిన్నే చింతించుచున్నది. (14)

అధశ్శయ్యా వివర్ణాంగీ పద్మినీవ హిమాగమే।
రావణాద్వినివృత్తార్థా మర్తవ్యకృతనిశ్చయా। 15

ఆమె నేలపైపరుండియున్నది. మంచుదెబ్బకు గురియైన పద్మమువలె వన్నెదఱిగియున్నది. రావణుని ఏవగించుకొనుచున్నది, విరక్తికారణముగా తనువును త్యజింపవలెనని నిర్ణయించుకొనియున్నది- (15)

దేవీ కథంచిత్ కాకుత్స్థ త్వన్మనా మార్గితా మయా।
ఇక్ష్వాకువంశవిఖ్యాతిం శనైః కీర్తయతాఽనఘ। 16

కాకుత్స్థుడవగు ఓ రామా! నీపైననే మనస్సును నిలుపుకొని యున్న సీతాదేవిని అతికష్టముతో వెదకి కనుగొంటిని. ఓ పుణ్యపురుషా! నేను (అప్పుడు) ఇక్ష్వాకువంశ విఖ్యాతిని తిన్నగా క్రమముగా ప్రస్తుతించితిని. (16)

సా మయా నరశార్దూల విశ్వాసముపపాదితా।
తతస్సంభాషితా దేవీ సర్వమర్థం చ దర్శితా। 17

ఓ మహాపురుషా! ఆవిధముగా ఆమెకు నాపై విశ్వాసమును పాదుకొల్పితిని. అప్పుడు ఆ తల్లి నాతో సంభాషించినది. ఆమెకు నేను అన్నివిషయములను దెల్పితిని. (17)

రామసుగ్రీవసఖ్యం చ శ్రుత్వా ప్రీతిముపాగతా।
నియతస్సముదాచారో భక్తిశ్చాస్యాస్తథా త్వయి। 18

రామసుగ్రీవులమైత్రిని దెలిసికొని, ఆమె పరమప్రీతిని పొందినది, పాతివ్రత్యధర్మాచరణము, నీపైభక్తి ప్రపత్తులు ఆమెలో స్థిరముగానున్నవి. (18)

ఏవం మయా మహాభాగా దృష్టా జనకనందినీ।
ఉగ్రేణ తపసా యుక్తా త్వద్భక్త్యా పురుషర్షభ॥ 19

అభిజ్ఞానం చ మే దత్తం యథావృత్తం తవాంతికే।
చిత్రకూటే మహాప్రాజ్ఞ వాయసం ప్రతి రాఘవ॥ 20

విజ్ఞాప్యశ్చ నరవ్యాఘ్రో రామో వాయుసుత త్వయా।
అఖిలేనేహ యద్దృష్టమ్ ఇతి మామాహ జానకీ॥ 21

అయంచాస్మై ప్రదాతవ్యో యత్నాత్ సుపరిరక్షితః।
బ్రువతా వచనాన్యేవం సుగ్రీవస్యోపశృణ్వతః॥ 22

ఏష చూడామణిః శ్రీమాన్ మయా సుపరిరక్షితః।
మనశ్శిలాయాస్తిలకో గండపార్శ్వే నివేశితః॥ 23

ఏష నిర్యాతితః శ్రీమాన్ మయా తే వారిసంభవః।
ఏతం దృష్ట్వా ప్రమోదిష్యే వ్యసనే త్వా మివానఘ॥ 24

జీవితం ధారయిష్యామి మాసం దశరథాత్మజ।
ఊర్ధ్వం మాసాన్నజీవేయం రక్షసాం వశమాగతా॥ 25

ఇతి మామబ్రవీత్ సీతా కృశాంగీ ధర్మచారిణీ।
రావణాంతఃపురే రుద్ధా మృగీవోత్ఫుల్లలోచనా॥ 26

ఏతదేవ మయాఽఽఖ్యాతం సర్వం రాఘవ యద్యథా।
సర్వథా సాగరజలే సంతారః ప్రవిధీయతామ్॥ 27

తౌ జాతాశ్వాసౌ రాజపుత్రౌ విదిత్వా
తచ్చాభిజ్ఞానం రాఘవాయ ప్రదాయ ।
దేవ్యా చాఖ్యాతం సర్వమేవానుపూర్వ్యాత్
వాచా సంపూర్ణం వాయుపుత్రశ్శశంస ॥ 28

ఓ నరోత్తమా! పూజ్యురాలైన ఆ జనకునికూతురు తీవ్రముగా తపమాచరించుచు నీయందు భక్తి తత్పరురాలై యున్నది. ఈ విధముగానున్న ఆ సాధ్విని నేను వీక్షించితిని.(19)

మహాప్రాజ్ఞా! ఓ శ్రీరామా! చిత్రకూటపర్వతమునందు ఆమె నీప్రక్కనఉన్నప్పుడు జరిగిన కాకవృత్తాంతమును 'గుర్తు'గా నీకు తెల్పుటకై ఆమె నాకు వివరించినది. (20)

"ఓ మారుతీ! ఇక్కడనీవు చూచినదంతయును నరోత్తముడైనశ్రీరామునకు విన్నవింపుము."- అని జానకీదేవి నాతోనుడివినది. (21)

ఈ వచనములను అన్నింటిని సుగ్రీవునిసమక్షమున శ్రీరామునకు దెలుపుము. ఈ శిరోభూషణమును ఎంతో భద్రముగా కాపాడుకొనుచు వచ్చితిని. దీనిని శ్రీరామునకు సమర్పించి, ఇట్లు పలుకుము. (22)

"జాతిరత్నశోభితమువెదజల్లు ఈ చూడామణిని నేను జాగ్రత్తగా పరిరక్షించుకొనుచువచ్చితిని. మణిశిలల గంధమును (నీవు) నా చెక్కిలిపై తిలకముగా తీర్చిదిద్దితివి. (23)

జలములలో జన్మించి, కాంతులనుచిమ్ముచున్న ఈ చూడామణిని నేను నీకడకు పంపుచున్నాను. ఓ అనఘా! దుఃఖసమయమునందు దీనిని జూచుచు నిన్ను జూచినట్లు ఆనందించుచున్నాను. (24)

ఓ దాశరథీ! మాసముగడువు ముగియువఱకు నేను జీవించియుందును. రాక్షసులఅధీనములోనున్న నేను ఒక నెలపూర్తియైనపిమ్మట జీవించియుండను"- అని (25)

ధర్మచారిణియు, కృశాంగియు ఐన సీతాదేవి నాతో నుడివినది. ఆడులేడివలె విశాలనేత్రములు గల సీతాదేవి రావణాంతఃపురమున (అశోకవనమున) నిర్బంధములో నున్నది. (26)

ఓ రఘువంశోత్తమా! విషయములను అన్నింటిని యథాతథముగా విన్నవించితిని. సాగరమును దాటు ఉపాయమును గూర్చి ఆలోచింపవలెను." (27)

వాయుసూనుడైన హనుమంతుడు ఈ విధముగా తన మాటలద్వారా ఆరామలక్ష్మణులు ఊరటచెందినట్లు గ్రహించి, సీతాదేవి ఆనవాలుగా తనకిచ్చిన చూడామణిని శ్రీరామునకు సమర్పించెను. సీతాదేవిసందేశమును క్రమము తప్పకుండా సంపూర్ణముగా తెలియజేసెను. (28)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే పంచషష్టితమస్సర్గః *(65)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది అఱువదిఐదవసర్గము.

— * * * —

66. అఱువదిఆఱవసర్గము

చూడామణిని గాంచి, సీతాదేవి క్లేశములను విని, శ్రీరామచంద్రుడు పరితపించుట

ఏవముక్తో హనుమతా రామో దశరథాత్మజః।
తం మణిం హృదయే కృత్వా ప్రరురోద సలక్ష్మణః॥ 1

హనుమంతుడు ఈవిధముగా తెలిపినపిమ్మట దశరథునికుమారుడైన శ్రీరాముడు ఆ చూడామణిని తన హృదయమునకుహత్తుకొని, మిక్కిలి విలపించెను. లక్ష్మణుడును కంటతడిపెట్టెను. (1)

తం తు దృష్ట్వా మణిశ్రేష్ఠం రాఘవః శోకకర్శితః।
నేత్రాభ్యామశ్రుపూర్ణాభ్యాం సుగ్రీవమిదమబ్రవీత్॥ 2

శ్రీరాముడు ఉత్కృష్టమైన ఆ మణినిజూచి, శోకాకులుడై కన్నులనీరునిండగా సుగ్రీవునితో ఇట్లనెను. (2)

యథైవ ధేనుః స్రవతి స్నేహాద్వత్సస్య వత్సలా।
తథా మమాపి హృదయం మణిరత్నస్య దర్శనాత్॥ 3

లేగదూడపైగలవాత్సల్యముచే ధేనువు పాలను చేపునట్లు ఈ అమూల్యమైన చూడామణిని చూడగానే నా హృదయము ద్రవించుచున్నది. (3)

మణిరత్నమిదం దత్తం వైదేహ్యాః శ్వశురేణ మే।
వధూకాలే యథా బద్ధమ్ అధికం మూర్ధ్ని శోభతే॥ 4

మామయైన జనకమహారాజు వివాహసమయమున (ఆమె తల్లిద్వారా) నాతండ్రిసమక్షమున వైదేహికి కానుకగానిచ్చెను. దానిని ఆమె తనశిరస్సున ధరించినప్పుడు ఆమణిశోభలు ఇనుమడించెను. (4)

అయం హి జలసంభూతో మణిః సజ్జనపూజితః।
యజ్ఞే పరమతుష్టేన దత్తః శక్రేణ ధీమతా॥ 5

జలమునుండి ఆవిర్భవించిన ఈ మణి సజ్జనుల పూజలను అందుకొనినది. జనకుడుచేయు యజ్ఞమునకు ధీశాలియైన దేవేంద్రుడు సంతుష్టుడై దీనిని ఆ మహారాజునకు బహూకరించెను. (5)

ఇమం దృష్ట్వా మణిశ్రేష్ఠం యథా తాతస్య దర్శనమ్।
అద్యాస్మ్యవగతః సౌమ్య వైదేహస్య తథా విభోః॥ 6

సౌమ్యుడవైన ఓ సుగ్రీవా! నేను విశిష్టమైన, ఈ మణిని జూడగానే నేడు నాకు మాతండ్రియైన దశరథుని, మామయైన జనకుని దర్శించినట్లున్నది. (6)

అయం హి శోభతే తస్యాః ప్రియాయా మూర్ధ్ని మే మణిః।
అస్యాద్య దర్శనేనాహం ప్రాప్తాం తామివ చింతయే॥ 7

ఈ మణియే నాప్రియురాలైన సీతయొక్క శిరస్సునందు ఇంతవఱకు అలంకృతమగుచు శోభిల్లుచున్నది. నేడు దీనినిజూచి ఆమెను పొందినట్లు తలంచుచున్నాను. (7)

కిమాహ సీతా వైదేహీ బ్రూహి సౌమ్య పునఃపునః।
పిపాసుమివ తోయేన సించంతీ వాక్యవారిణా॥ 8

ఓ మారుతీ! సీతాదేవి పలికినమాటలను పదేపదే తెలుపుము. దప్పిగొన్నవానికి జలములవలె ఆ మధుర వచనములు నాకు హాయినిగూర్చును. (8)

ఇతస్తు కిం దుఃఖతరం యదిమం వారిసంభవమ్।
మణిం పశ్యామి సౌమిత్రే వైదేహీమాగతాం వినా॥ 9

ఓ లక్ష్మణా! వైదేహి ఇచటలేకుండా జల సంభవమైన ఈ చూడామణిని చూచుటవలన నా దుఃఖము ఇంకనుఅధికమగుచున్నది. (9)

చిరం జీవతి వైదేహీ యది మాసం ధరిష్యతి।
క్షణం సౌమ్య న జీవేయం వినా తామసితేక్షణామ్॥ 10

సౌమ్యుడవైన ఓ లక్ష్మణా! సీతాదేవి ఒకమాసము తన ప్రాణములను నిలుపుకొనియున్నచో ఆమె చిరకాలము జీవించినట్లేయని తలంపవచ్చును. కాని మనోహరమైన నల్లని చూపులుగల ఆ జానకి లేకుండా ఇంక ఒక్క క్షణకాలమైనను నేను జీవించియుండజాలను. (10)

నయ మామపి తం దేశం యత్ర దృష్టా మమ ప్రియా।
న తిష్ఠేయం క్షణమపి ప్రవృత్తి ముపలభ్య చ॥ 11

ఓ మారుతీ! నాకు అత్యంతప్రీతిపాత్రురాలైన సీతాదేవి యున్నప్రదేశమునకు నన్నును చేర్పుము. ఆమె ఉనికి తెలిసిన పిమ్మట ఒక్కక్షణముగూడ నేనిక్కడ ఉండలేకున్నాను. (11)

కథం సా మమ సుశ్రోణీ భీరుభీరుస్సతీ సదా।
భయావహానాం ఘోరాణాం మధ్యే తిష్ఠతి రక్షసామ్॥ 12

సుందరాంగియు, సహజముగా భయపడు స్వభావము గలదియు, సాధ్వియు అగు నాసీత భయంకరులైన ఘోరరాక్షసులమధ్య ఎట్లు ఉండగలుగుచున్నది? (12)

శారదస్తిమిరోన్ముక్తో నూనం చంద్ర ఇవాంబుదైః।
ఆవృతం వదనం తస్యా న విరాజతి రాక్షసైః॥ 13

చీకట్లనుండి బయటపడి మేఘములచే ఆచ్ఛాదితుడైన శరత్కాలచంద్రునివలె రాక్షసులచే ఆవరింపబడిన ఆమెముఖము ప్రకాశింపదు. ఇది నిశ్చయము. (13)

కిమాహ సీతా హనుమన్ తత్త్వతః కథయాద్య మే।
ఏతేన ఖలు జీవిష్యే భేషజేనాతురో యథా॥ 14

ఓ హనుమంతుడా! నా సీత ఇంకను ఏమనినదో దాచక ఇప్పుడు నుడువుము. ఔషధసేవనముచే రోగివలె ఆమె కమ్మనిమాటలచే నేను నా ప్రాణములను నిలుపుకొందును.(14)

మధురా మధురాలాపా కిమాహ మమ భామినీ।
మద్విహీనా వరారోహా హనుమన్ కథయస్వ మే।
దుఃఖాద్దుఃఖతరం ప్రాప్య కథం జీవతి జానకీ॥ 15

ఓ హనుమంతుడా! నాభార్య మధురస్వభావము గలది, మధురముగామాట్లాడునది, నా వియోగ దుఃఖమునునున్న ఆమె పలికిన మాటలనే నాకు యథాతథముగా వినిపింపుము. దుఃఖపరంపరనుపొంది జానకి ఎట్లు జీవించుచున్నది? (15)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే షట్షష్టితమస్సర్గః (66)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు

ఇది అఱువది ఆఱవసర్గము

— * * * —

67. అఱువదిఏడవసర్గము

హనుమంతుడు సీతా సందేశమును శ్రీరామచంద్రునకు వినిపించుట

ఏవ ముక్తస్తు హనుమాన్ రాఘవేణ మహాత్మనా।
సీతాయా భాషితం సర్వం న్యవేదయత రాఘవే॥ 1

మహానుభావుడైనశ్రీరాముడు ఇట్లుపలుకగా హనుమంతుడు సీతాదేవి నుడివిన వచనములనన్నింటిని ఆయనకు నివేదించెను. (1)

ఇదముక్తవతీ దేవీ జానకీ పురుషర్షభ।
పూర్వవృత్తమభిజ్ఞానం చిత్రకూటే యథాతథమ్॥ 2

ఓ పురుషోత్తమా! జానకీదేవి ఇదివరలో చిత్రకూటమున జరిగిన వృత్తాంతమును మీకు గుర్తుచేయుటకై యథాతథముగా తెలిపినది. (2)

సుఖసుప్తా త్వయా సార్ధం జానకీ పూర్వముత్థితా।
వాయసస్సహసోత్పత్య విదదార స్తనాంతరే॥ 3

నీతోగూడి హాయిగా నిద్రించుచున్న జానకి ముందుగా మేల్కొనెనట. ఇంతలో ఒక కాకి వేగముగా అచటికివచ్చి, ఆమె వక్షఃస్థలమును గాయపఱచెనట. (3)

పర్యాయేణ చ సుప్తస్త్వం దేవ్యంకే భరతాగ్రజ।
పునశ్చ కిల పక్షీ స దేవ్యా జనయతి వ్యథామ్॥ 4

ఓ భరతాగ్రజా! పిమ్మట నీవు ఆమెయొడిలో తలయుంచి, నిద్రించితివట. మఱల ఆపక్షి సీతాదేవిని బాధించెనట- (4)

పునఃపునరుపాగమ్య విదదార భృశం కిల।
తతస్త్వం బోధితస్తస్యాః శోణితేన సముత్థితః॥ 5

ఆ కాకి మాటిమాటికి సమీపమునకువచ్చి, ఆమెను మిక్కిలి గాయపఱచెనట, అప్పుడు ఆమె గాయములనుండి స్రవించినరక్తముచే తడిసి నీవు మేల్కొంటివట. (5)

వాయసేన చ తేనైవం సతతం బాధ్యమానయా।
బోధితః కిల దేవ్యా త్వం సుఖసుప్తః పరంతప। 6

తాం తు దృష్ట్వా మహాబాహో దారితాం చ స్తనాంతరే।
ఆశీవిష ఇవ క్రుద్ధో నిశ్శ్వసన్నభ్యభాషథాః। 7

నఖాగ్రైః కేన తే భీరు దారితం తు స్తనాంతరమ్।
కః క్రీడతి సరోషేణ పంచవక్త్రేణ భోగినా। 8

నిరీక్షమాణస్సహసా వాయసం సమవైక్షథాః।
నఖైస్సరుధిరైః తీక్ష్ణైః తామేవాభిముఖం స్థితమ్। 9

సుతః కిల స శక్రస్య వాయసః పతతాం వరః।
ధరాంతరచరశ్శీఘ్రం పవనస్య గతౌ సమః। 10

తతస్తస్మిన్ మహాబాహో కోపసంవర్తితేక్షణః।
వాయసే త్వం కృథాః క్రూరాం మతిం మతిమతాం వర। 11

స దర్భం సంస్తరాద్గృహ్య బ్రహ్మాస్త్రేణ హ్యయోజయః।
స దీప్తఇవ కాలాగ్నిః జజ్వాలాభిముఖః ఖగమ్। 12

క్షిప్తవాం స్త్వం ప్రదీప్తం హి దర్భం తం వాయసం ప్రతి।
తతస్తు వాయసం దీప్తః సదర్భోఽనుజగామ హ। 13

స పిత్రా చ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః।
త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య త్రాతారం నాధిగచ్ఛతి। 14

పునరేవాగతః త్రస్తః త్వత్సకాశమరిందమ।
త్వం తం నిపతితం భూమౌ శరణ్య శ్శరణాగతమ్।
వధార్హమపి కాకుత్స్థ కృపయా పర్యపాలయః। 15

మోఘమస్త్రం న శక్యంతు కర్తుమిత్యేవ రాఘవ।
భవాంస్తస్యాక్షి కాకస్య హినస్తిస్మ సదక్షిణమ్। 16

రామ త్వాం స నమస్కృత్య రాజ్ఞే దశరథాయ చ।
విసృష్టస్తు తదా కాకః ప్రతిపేదే స్వమాలయమ్। 17

ఏవమస్త్రవిదాం శ్రేష్ఠః సత్త్వవాన్ శీలవానపి।
కిమర్థ మస్త్రం రక్షస్సు న యోజయతి రాఘవః। 18

శత్రుసంహారకుడవైన ఓ రామా! ఆ వాయసముచే మాటిమాటికి బాధింపబడుచున్నసీతాదేవి సుఖముగా నిద్రించుచున్న నిన్ను మేల్కొలిపెనట. (6)

ఓ మహాబాహూ! వక్షఃస్థలమునందు గాయపడిన ఆమెను జూచినంతనే రెచ్చిపోయిన విషసర్పమువలె బుసలుకొట్టుచు నీవు ఇట్లు పలికితివట- (7)

"ఓ భయస్వభావురాలా! నీ వక్షఃస్థలమును గోళ్లతో గాయపఱచినదెవరు? కోపముతోఊగిపోవుచున్న విశాలమైన పడగగలసర్పముతో ఆడుకొనుచున్నది ఎవరు?" (8)

అటునిటు కలయజూచుచు రక్తసిక్తమైన వాడిగోళ్లతో ఆమెకు ఎదురుగానున్న ఒక కాకిని నీవు వీక్షించితివట. (9)

పక్షులలోశ్రేష్ఠమైనదియు, వాయువేగమున సంచరించునదియుఐన ఆ కాకము ఇంద్రుని కుమారుడట- అది మట్టియొక్క ప్రదేశమునకు వెళ్లెనట. (10)

ఓ మహాబాహూ! ప్రజ్ఞావంతులలో శ్రేష్ఠుడా! కోపముతో కన్నులెఱ్ఱజేయుచు ఆవాయసమును క్రూరముగా శిక్షింపదలచితివట. (11)

అట్టి నీవు ఆసనమునుండి ఒకదర్భను దీసికొని, దానిని మంత్రించి బ్రహ్మాస్త్రముగా ప్రయోగించితివట, ఆ అస్త్రము ప్రళయాగ్నివలె మంటలను వెలిగ్రక్కుచు కాకమునకు అభిముఖముగా ప్రజ్వలించెనట. (12)

నీవు ప్రజ్వలించుచున్న ఆ దర్భను (బ్రహ్మాస్త్రమును) వాయసముపై ప్రయోగించితివట- అప్పుడు ఆ దర్భ మంటలనుచిమ్ముచు ఆవాయసమును వెంబడించెనట.(13)

ఆ వాయసముయొక్క తండ్రియైనఇంద్రుడును, దేవతలును, మహర్షులును అతనిని ఆదుకొనలేదట. ఆ కాకము ముల్లోకములు తిరిగిచూచినను దానిని రక్షించువారు దొరకలేదట. (14)

ఓ శత్రుసంహారకా! ఆ వాయసము ప్రాణభీతితో తిరిగి తిరిగి కడకు నీ యొద్దకేవచ్చెనట. అనన్యశరణ్యుడవైన నిన్ను శరణుజొచ్చి, భూమిపైబడి, నీ ముందు మోకరిల్లెనట. కాకుత్స్థుడవైన ఓ రఘురామా! ఆ కాకము వధింపదగినదే ఐనప్పటికిని కనికరముతో దానిని నీవు రక్షించితివట. (15)

అమోఘమైన ఆ బ్రహ్మాస్త్రమును వ్యర్థముచేయుట అశక్యమనిభావించి, నీవు ఆకాకముయొక్క కుడికంటిని తొలగించితివట- (16)

ఓ రామా! ఆవాయసము నీకును, దశరథమహారాజునకును నమస్కరించి, నీయొద్ద సెలవుగైకొని, తననివాసమునకు చేరెను."-అట- (17)

"సీతాదేవి ఇంకను ఇట్లుపలికెను. అస్త్ర విద్యాకోవిదులలో శ్రేష్ఠుడు, బలశాలి, ఉత్తమశీల సంపన్నుడు ఐన శ్రీరాముడు రాక్షసులపై అస్త్రములను ఏల ప్రయోగించుటలేదు. (18)

న నాగా నాపి గంధర్వా నాసురా న మరుద్గణాః।
న చ సర్వే రణే శక్తా రామం ప్రతి సమాసితుమ్॥ 19

తస్య వీర్యవతః కశ్చిత్ యద్యస్తి మయి సంభ్రమః।
క్షిప్రం సునిశితైర్బాణైః హన్యతాం యుధి రావణః॥ 20

భ్రాతురాదేశమాదాయ లక్ష్మణో వా పరంతపః।
స కిమర్థం నరవరో న మాం రక్షతి రాఘవః॥ 21

శక్తౌ తౌ పురుషవ్యాఘ్రౌ వాయ్వగ్నిసమతేజసౌ।
సురాణామపి దుర్ధర్షౌ కిమర్థం మాముపేక్షతః॥ 22

మమైవ దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః।
సమర్థౌ సహితౌ యన్మాం నావేక్షేతే పరంతపౌ॥ 23

వైదేహ్యా వచనం శ్రుత్వా కరుణం సాశ్రుభాషితమ్।
పునరప్యహమార్యాం తామ్ ఇదం వచన మబ్రవమ్॥ 24

త్వచ్ఛోకవిముఖో రామో దేవి సత్యేన తే శపే॥ 25

రామే దుఃఖాభిభూతే తు లక్ష్మణః పరితప్యతే।
కథంచిద్భవతీ దృష్టా న కాలః పరిశోచితుమ్।
అస్మిన్ ముహూర్తే దుఃఖానామ్ అంతం ద్రక్ష్యసి భామిని॥ 26

తావుభౌ నరశార్దూలౌ రాజపుత్రావనిందితౌ।
త్వద్దర్శనకృతోత్సాహౌ లంకాం భస్మీకరిష్యతః॥ 27

హత్వా చ సమరే రౌద్రం రావణం సహబాంధవమ్।
రాఘవస్త్వాం వరారోహే స్వాం పురీం నయతే ధ్రువమ్॥ 28

యత్తు రామో విజానీయాత్ అభిజ్ఞానమనిందితే।
ప్రీతిసంజననం తస్య ప్రదాతుం త్వమిహార్హసి॥ 29

సాభివీక్ష్య దిశస్సర్వా వేణ్యుద్గ్రథనముత్తమమ్।
ముక్త్వా వస్త్రాద్దదౌ మహ్యం మణిమేతం మహాబల॥ 30

ప్రతిగృహ్య మణిం దివ్యం తవ హేతో రఘూద్వహ।
శిరసా తాం ప్రణమ్యార్యామ్ అహ మాగమనే త్వరే॥ 31

గమనే చ కృతోత్సాహమ్ అవేక్ష్య వరవర్ణినీ।
వివర్ధమానం చ హి మామ్ ఉవాచ జనకాత్మజా॥ 32

నాగులుగాని, గంధర్వులుగాని, అసురులుగాని, దేవగణములు గాని, వీరందఱునుకలిసిగాని రణ రంగమున శ్రీరాముని ఎదిరించినిలబడుటకు సమర్థులు గారు. (19)

మహాపరాక్రమశాలియైనశ్రీరామునకు నా విషయమున కొంచెమైనను కనికరమున్నచో వెంటనే వాడియైన బాణములతో యుద్ధమున రావణుని హతమొనర్పవలెను. (20)

అన్నఅనుజ్ఞనుబడసి శత్రుభయంకరుడు, నరోత్తముడు, రఘువంశజుడు ఐన లక్ష్మణుడైనను, నన్ను రక్షించుటకై ఏలవచ్చుట లేదు? మానవోత్తములైన ఆ ఇద్దఱును వాయుదేవుని వలె మహాబలసంపన్నులు, అగ్నిదేవునివలె మహాతేజశ్శాలురు, దేవతలకును అజేయులు, అట్టి మహావీరులు నన్నెందులకు ఉపేక్షించుచున్నారు. అరివీరభయంకరులైన ఆ ఇరువురును విడివిడిగానైనను ఎవరికివారు సర్వసమర్థులు. వారిరువురుకలిసి యుండియు నా విషయమును విస్మరించుటకు కారణము నా వలననే కొంచెముగనో గొప్పగనో దోషము వాటిల్లి యుండవచ్చును ఇందులకు సందేహము లేదు! (21-23)

వైదేహి కన్నీరుగార్చుచు పలికిన జాలిగొలుపు మాటలను విని, మఱల నేను పూజ్యురాలైన ఆమెతో ఇట్లు పలికితిని. (24)

ఓ దేవీ! నేను ఒట్టుపెట్టుకొని చెప్పుచున్నాను. శ్రీరాముడు నీకై శోకించుచు ఏమియుతోచని స్థితిలోనున్నాడు. అతడు దుఃఖమున మునిగియుండుటచే లక్ష్మణుడును పరితపించుచున్నాడు ఎట్టకేలకు నిన్ను చూడగలిగితిని. ఇది దుఃఖింపవలసిన సమయముగాదు. అమ్మా! అనతికాలములో ఈ దుఃఖములన్నియు నశించి పోవును. (25-26)

పూజ్యులు, రాజకుమారులు ఐన ఆ నరవరులిద్దఱును నీ దర్శనమునకై ఉత్సాహముతో తహతహపడుచున్నారు. వారు క్రూరుడైనరావణుని అతనిపరివారములను సమర భూమికి బలియిచ్చి, లంకను భస్మమొనర్పగలరు. తల్లీ! శ్రీరాముడు నిన్ను అయోధ్యానగరమునకు తీసికొనివెళ్లుట తథ్యము- (27-28)

పూజ్యురాలా! రాముడు వెంటనే గుర్తింపగల ఆనవాలును నాకు దయచేయుము. దానినిజూచి ఆ ప్రభువు మిక్కిలి ప్రీతిచెందును. (29)

మహాబలశాలివైన ఓరామా! ఆమె అన్నిదిక్కులను పరికించి చూచి, తన శిరోభూషణమైన, అమూల్యమగు ఈ చూడామణిని తనకొంగుముడినుండితీసి, నాకు ప్రసాదించెను. (30)

ఓ రఘురామా! నీ ఆనవాలుకొఱకై ఆ దివ్యమణిని గ్రహించి, పూజ్యురాలైన ఆదేవికి సాష్టాంగముగా నమస్కరించి, తిరుగుప్రయాణమునకై త్వరపడుచుంటిని. (31)

ఉత్సాహముతో తిరుగు ప్రయాణమునకు ఉన్ముఖుడనై శరీరమును పెంచుచున్న నన్ను జూచి, ఆ సీతాసాధ్వి ఇట్లు పలికెను. (32)

అశ్రుపూర్ణముఖీ దీనా బాష్పసంధిగ్ధభాషిణీ। 33

మమోత్పతనసంభ్రాంతా శోకవేగసమాహతా।
మామువాచ తత: సీతా సభాగ్యోఽసి మహాకపే। 34

యద్ద్రక్ష్యసి మహాబాహుం రామం కమలలోచనమ్।
లక్ష్మణం చ మహాబాహుం దేవరం మే యశస్వినమ్। 35

సీతయాప్యేవముక్తోఽహమ్ అబ్రువం మైథిలీం తథా।
పృష్ఠమారోహ మే దేవి క్షిప్రం జనకనందిని। 36

యావత్తే దర్శయామ్యద్య ససుగ్రీవం సలక్ష్మణమ్।
రాఘవం చ మహాభాగే భర్తారమసితేక్షణే। 37

సాఽబ్రవీన్మాం తతో దేవీ నైష ధర్మో మహాకపే।
యత్తే పృష్ఠం సిషేవేఽహం స్వవశా హరిపుంగవ। 38

పురా చ యదహం వీర స్పృష్టా గాత్రేషు రక్షసా।
తత్రాహం కిం కరిష్యామి కాలేనోపనిపీడితా। 39

గచ్ఛ త్వం కపిశార్దూల యత్ర తౌ నృపతే: సుతౌ।
ఇత్యేవం సా సమాభాష్య భూయ: సందేష్టుమాస్థితా। 40

హనుమన్ సింహసంకాశౌ ఉభౌ తౌ రామలక్ష్మణౌ।
సుగ్రీవం చ సహామాత్యం సర్వాన్ బ్రూయా హ్యనామయమ్। 41

యథా చ స మహాబాహు: మాం తారయతి రాఘవ:।
అస్మాద్దుఃఖాంబుసంరోధాత్ త్వం సమాధాతు మర్హసి। 42

ఇమం చ తీవ్రం మమ శోకవేగం
రక్షోభిరేభి: పరిభర్త్సనం చ ।
బ్రూయాస్తు రామస్య గతస్సమీపం
శివశ్చ తేఽధ్వాస్తు హరిప్రవీర । 43

ఏతత్తవార్యా నృప రాజసింహా
సీతా వచ: ప్రాహ విషాదపూర్వమ్ ।
ఏతచ్చ బుద్ధ్వా గదితం మయా త్వం
శ్రద్ధత్స్వ సీతాం కుశలాం సమగ్రామ్ । 44

ఆ సీతాదేవి నేను తిరిగివెళ్లిపోవుచున్నానని దిగులు చెందెను. ఆ దీనురాలిముఖము కన్నీటితోతడిసెను. డగ్గుత్తికతో ఆమెకు మాటలు తడబడెను. శోకాతిరేకముతో "ఓ మహాకపీ! కమలలోచనుడు, మహాబాహువు ఐన శ్రీరాముని, భుజబల సంపన్నుడు, వాసిగాంచినవాడు ఐన నామఱది లక్ష్మణుని, దర్శింపనున్న నీవు ఎంతో అదృష్టవంతుడవు." (33-35)

సీతాదేవి నాతో ఇట్లు నుడువగా నేను ఆమెతో ఈ రీతిగా వచించితిని. "ఓ జానకీదేవీ! నా వీపును అధిరోహింపుము. ఓ మహాత్మురాలా! అసితేక్షణా! నిన్ను శీఘ్రముగా గొనిపోయెదను. నీస్వామియైన శ్రీరామచంద్రుని, లక్ష్మణుని, సుగ్రీవుని నీవు నేడే దర్శింపగలవు. (36-37)

అంతట ఆదేవి నాతో ఇట్లనెను. ఓ వానరోత్తమా! నాయంతటనేను నీవీపుపైనెక్కుట ధర్మము గాదు. (38)

ఓ మహావీరా! కాలము ప్రతికూలించుటచే పీడితనైన నేను ఇదివరలో రాక్షసుడైన రావణునిచే తాకబడితిని. అట్టి దుస్థితిలో నిస్సహాయురాలనైన నేను ఏమి చేయగలను? (39)

'ఓ కపివరా! ఆ రాజకుమారులిరువురును ఉన్న ప్రదేశమునకు నీవు వెళ్లుము'- ఇట్లు ఉదాత్తముగా పలికి, మఱల ఆమె నాకు ఒక సందేశమును ఇయ్యసాగెను- (40)

'ఓ మారుతీ! సింహపరాక్రములైన ఆ రామలక్ష్మణుల క్షేమ సమాచారములను అడిగితిననుము. అట్లే సుగ్రీవుని యొక్క, అతని అమాత్యుల యొక్క, తదితరులందఱి యొక్క కుశలప్రస్తావ చేసితినని తెల్పుము. (41)

మహాబాహువైన శ్రీరాముడు నన్ను ఈ దుఃఖ సముద్రమునుండి గట్టెక్కించునట్లుగా చూడుము. (42)

ఓ వానర వీరుడా! నా ఈ తీరని దుఃఖాతిరేకస్థితిని, ఈ రాక్షసస్త్రీలు నన్ను భయపెట్టుచున్న విషయమును, నీవు శ్రీరామునికడకు చేరినవెంటనే తెలుపుము. నీ ప్రయాణము సుఖముగా సాగుగాక.' (43)

ఓ మహారాజా! పూజ్యురాలైన సీతాదేవి నీకొఱకై (నీకు తెల్పుటకై) ఈ వచనములను విషాదముతో తెల్పినది- నేను నుడివిన ఈ మాటలను దెలిసికొని, ఆమె భద్రముగానున్నట్లు భావింపుము (విశ్వసింపుము)- (44)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే సప్తషష్టితమస్సర్గ: (67)

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది అఱువదిఏడవసర్గము.

— * * * —

68. అఱువదిఎనిమిదవసర్గము

హనుమంతుడు శ్రీరామునకు సీతా సందేహమును దానిని తాను నివారించిన విధమును తెలుపుట

అథాహముత్తరం దేవ్యా పునరుక్తస్ససంభ్రమః।
తవ స్నేహాన్నరవ్యాఘ్ర సౌహార్దాదనుమాన్య వై। 1

ఏవం బహువిధం వాచ్యో రామో దాశరథిస్త్వయా।
యథా మామాప్నుయాచ్ఛీఘ్రం హత్వా రావణమాహవే। 2

యది వా మన్యసే వీర వసైకాహమరిందమ।
కస్మింశ్చిత్ సంవృతే దేశే విశ్రాంతశ్శ్వో గమిష్యసి। 3

మమ చాప్యల్పభాగ్యాయాః సాన్నిధ్యాత్ తవ వీర్యవన్।
అస్య శోకవిపాకస్య ముహూర్తం స్యాద్విమోక్షణమ్। 4

గతే హి త్వయి విక్రాంతే పునరాగమనాయ వై।
ప్రాణానామపి సందేహో మమ స్యాన్నాత్ర సంశయః। 5

తవాదర్శనజశ్శోకో భూయో మాం పరితాపయేత్।
దుఃఖాద్దుఃఖపరాభూతాం దుర్గతాం దుఃఖభాగినీమ్। 6

అయం చ వీర సందేహః తిష్ఠతీవ మమాగ్రతః।
సుమహాంస్త్వత్సహాయేషు హర్యృక్షేషు హరీశ్వర। 7

కథం ను ఖలు దుష్పారం తరిష్యంతి మహోదధిమ్।
తాని హర్యృక్షసైన్యాని తౌ వా నరవరాత్మజౌ। 8

త్రయాణామేవభూతానాం సాగరస్యాస్య లంఘనే।
శక్తిస్స్యాద్వైనతేయస్య తవ వా మారుతస్య వా। 9

తదస్మిన్ కార్యనిర్యోగే వీరైవం దురతిక్రమే।
కిం పశ్యసి సమాధానం బ్రూహి కార్యవిదాంవర। 10

కామమస్య త్వమేవైకః కార్యస్య పరిసాధనే।
పర్యాప్తః పరవీరఘ్న యశస్యస్తే బలోదయః। 11

హనుమంతుడు శ్రీరామునితో ఇంకను ఇట్లు పలికెను. ఓ నరేంద్రా! నీకు నాపై మిక్కిలిప్రేమాదరములు, సౌహార్దము ఉండుటవలన ఆ దేవియు నాతో సాదరముగా మఱల ఇట్లు పలికెను. (1)

ఓహనుమంతుడా! దశరథునికుమారుడైన శ్రీరాముడు యుద్ధమున రావణుని హతమార్చి, శీఘ్రముగా నన్ను గొనిపోవునట్లు ఆయనతో మఱీమఱీ చెప్పుము. (2)

ఓ మహావీరా! శత్రువులను పరిమార్చువాడా! నీకు సమ్మతమైనచో మఱియొకదినము ఇచట ఉండుము- ఏదైననొక రహస్యప్రదేశమున విశ్రాంతి దీసికొనుము- నీవు రేపు వెళ్లవచ్చును. (3)

ఓ పరాక్రమవంతుడా! నా సమీపమున నీవు ఉన్నచో మందభాగ్యురాలనైన నాయొక్క ఈ అంతులేనిశోకము ఒక్కక్షణకాలమువాటైనను దూరమగును. (4)

పరాక్రమవంతుడవైన నీవు వెళ్లిన పిమ్మట తిరిగి వచ్చునంతకు నాప్రాణములు నిలుచుటయు సందేహాస్పదమే. ఇందులకు సంశయములేదు. (5)

ఓ మహావీరా! నీవు ఇచటినుండివెళ్లినచో నీదర్శనభాగ్యము నాకు దూరమగును. అందువలన ఇప్పటి నాదుఃఖము ఇనుమడించి, అది ఇంకను నన్ను బాధించును. ఆ విధముగా నేను దుఃఖ పరంపరకులోనై ఇంకను దుఃస్థితుల పాలగుదును. (6)

ఓ కపివరా! నీవు సర్వసమర్థుడవే, నీ విషయమట్లుంచుము. నీ సహాయకులైన భల్లూకవానరుల విషయమున ఒక పెనుసందేహము నన్ను వేధించుచునే యున్నది- దాటశక్యముగాని ఈ మహోదధిని ఆ భల్లూక వానర సైనికులును, ఆ దశరథ రాజకుమారులిద్దరును ఎట్లు దాటిరాగలరు? (7-8)

ఈ మహాసాగరమును లంఘించుటకు మిగుల బలశాలురైన గరుత్మంతునకు, నీకు, ఆ వాయు దేవునకును, ఈ ముగ్గురికి మాత్రమే సాధ్యము- ఇతరులకు అది అసాధ్యము- (9)

కార్యసాధకులలో శ్రేష్ఠుడవైన ఓ మహావీరా! అందువలన ఇట్లు అతిక్రమింపశక్యముగాని ఈ సముద్రమును లంఘించు కార్యసాధన విషయమున ఏయుపాయమును ఆలోచించుచుంటివి? తెలుపుము- (10)

శత్రువీరులనుసంహరించు ఓ మారుతీ! ఈ కార్యమును సాధించుటకు సర్వసమర్థుడవైన నీవు ఒక్కడవేచాలుదువు. కాని ఈ బలప్రదర్శన వలన నీ కీర్తి ప్రతిష్ఠలే వెలుగును. నాకుగాని, శ్రీరామునకుగాని కలుగవు. (11)

బలైస్సమగ్రైః యది మాం హత్వా రావణమాహవే।
విజయీ స్వాం పురీం రామో నయేత్ తత్ స్యాద్యశస్కరమ్। 12

శ్రీరాముడు సమస్తబలములతో (ఇచటికివచ్చి) రణరంగమున రావణుని హతమొనర్చి, విజేతయై, అయోధ్యానగరమునకు నన్ను తీసికొనిపోయినచో అది ఆ ప్రభువునకును, నాకును యశస్కరము. (12)

యథాహం తస్య వీరస్య వనాదుపధినా హృతా।
రక్షసా తద్భయాదేవ తథా నార్హతి రాఘవః। 13

ఆ శ్రీరామునకు భయపడి రాక్షసుడైన రావణుడు వంచనతో నన్ను వనమునుండి అపహరించెను. ఇప్పుడు నీవు రావణుని కన్నుగప్పి, నన్ను తీసికొని పోవుటకు రాముడు ఇష్టపడడు. ఏలనన అతడు వీరుడు, నేనువీరపత్నిని. (13)

బలైస్తు సంకులాం కృత్వా లంకాం పరబలార్దనః।
మాం నయేద్యది కాకుత్స్థః తత్ తస్య సదృశం భవేత్। 14

శత్రుబలములను రూపుమాపగలశ్రీరాముడు తన బలములతో లంకను కల్లోలపఱచి, నన్ను స్వయముగా తీసికొనివెళ్ళుటయే ఆ మహావీరునకు తగును. (14)

తద్యథా తస్య విక్రాంతమ్ అనురూపం మహాత్మనః।
భవత్యాహవశూరస్య తథా త్వముపపాదయ। 15

రణవీరుడు, మహాత్ముడు ఐన శ్రీరాముని పరాక్రమమునకు తగినట్లు కార్యసాధనరీతిని నీవు రూపొందింపుము. (15)

తదర్థోపహితం వాక్యం ప్రశ్రితం హేతుసంహితమ్।
నిశమ్యాహం తతశ్శేషం వాక్యముత్తరమబ్రువమ్। 16

అర్థవంతములైనవియు, హేతుబద్ధములైనవియు, వినయములోగూడినవియు అగు ఆమెమాటలు విని పిమ్మట నేను వాటికి ఇట్లు ప్రత్యుత్తరము ఇచ్చితిని. (16)

దేవి హర్యృక్షసైన్యానామ్ ఈశ్వరః ప్లవతాం వరః।
సుగ్రీవస్సత్త్వసంపన్నః తవార్థే కృతనిశ్చయః। 17

అమ్మా! వానరభల్లూకసైన్యములకు ప్రభువు, కపిశ్రేష్ఠుడు, మహాబలశాలిఅగు సుగ్రీవుడు నిన్ను శ్రీరామునికడకు చేర్చుటకై దృఢముగా నిశ్చయించుకొని యున్నాడు. (17)

తస్య విక్రమసంపన్నాః సత్త్వవంతో మహాబలాః।
మనస్సంకల్పసంపాతా నిదేశే హరయః స్థితాః। 18

మహాపరాక్రమవంతులును, మిక్కిలిబలశాలురును, ఐన వానరులు సుగ్రీవునిఆజ్ఞకు బద్ధులైయున్నారు. ఆయన మనస్సులో సంకల్పము కలిగినమాత్రముననే వారు ఇచటికి వచ్చివాలుదురు (18)

యేషాం నోపరి నాధస్తాత్ న తిర్యక్ సజ్జతే గతిః।
న చ కర్మసు సీదంతి మహత్స్వమితతేజసః। 19

ఆ వానరులు ఆకాశమునగాని, పాతాళమునగాని, భూమిపై గాని నిరాటంకముగా సంచరింపగలరు. అమితతేజశ్శాలురైన ఆవానరులు ఎంతటి ఘనకార్యములనైనను అనాయాసముగా చేయగలరు. (19)

అసకృత్తైర్మహాభాగైః వానరైర్బలగర్వితైః।
ప్రదక్షిణీకృతా భూమిః వాయుమార్గానుసారిభిః। 20

మహాభాగ్యశాలురు మిక్కిలి బలశాలురు, వాయుమార్గమున సంచరింపగలవారు ఐన ఆ వానరులు పెక్కు పర్యాయములు భూమిని చుట్టివచ్చిరి. (20)

మద్విశిష్టాశ్చ తుల్యాశ్చ సంతి తత్ర వనౌకసః।
మత్తః ప్రత్యవరః కశ్చిత్ నాస్తి సుగ్రీవసన్నిధౌ। 21

సుగ్రీవునిసన్నిధియందున్న వానరులలో ఏవిధముగ జూచినను నా కంటె గొప్పవారును, నాతో సమానులును మాత్రమే గలరు. నాకంటె తక్కువవారు అచట లేనేలేరు. (21)

అహం తావదిహ ప్రాప్తః కిం పునస్తే మహాబలాః।
న హి ప్రకృష్టాః ప్రేష్యంతే ప్రేష్యంతే హీతరే జనాః। 22

(అల్పుడనైన) నేనే ఇచటికి రాగలిగినప్పుడు మహాబలశాలురైన తక్కినవారివిషయము చెప్పనేల? సాధారణముగా యజమానులు ఏ కార్యమునకైనను చిన్నవారినే పంపుదురు. గొప్ప (పెద్ద) వారిని పంపరుగదా! (22)

తదలం పరితాపేన దేవి మన్యుర్వ్యపైతు తే।
ఏకోత్పాతేన తే లంకామ్ ఏష్యంతి హరియూథపాః। 23

ఓ దేవీ! ఇక నీవు పరితపింపవలదు. విచారమును వీడుము. ఆ వానరులందఱును ఒక్కగంతులో వచ్చి లంకలో వాలగలరు. (23)

మమ పృష్ఠగతౌ తౌ చ చంద్రసూర్యావివోదితౌ।
త్వత్సకాశం మహాభాగే నృసింహావాగమిష్యతః। 24

విచిత్రమైనమనస్సుగల ఓ దేవీ! ఉదయించుచున్న సూర్యచంద్రులవలె తేజోమూర్తులును, నరేంద్రులును ఐన ఆ రామలక్ష్మణులు నా భుజములపైఎక్కి ఇచటికి రాగలరు. (24)

అరిఘ్నం సింహసంకాశం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్।
లక్ష్మణం చ ధనుష్పాణిం లంకాద్వారముపస్థితమ్। 25

శత్రుసూదనుడు, సింహపరాక్రముడు ఐన రామచంద్ర ప్రభువును, ధనుష్పాణియైనలక్ష్మణస్వామిని త్వరలో లంకాద్వారముకడ నీవు దర్శింపగలవు. (25)

నఖదంష్ట్రాయుధాన్ వీరాన్ సింహశార్దూలవిక్రమాన్।
వానరాన్ వారణేంద్రాభాన్ క్షిప్రం ద్రక్ష్యసి సంగతాన్। 26

నఖములు, దంతములు ఆయుధములుగాగలవారును, సింహములవలె, పులులవలె పరాక్రమించువారును, మహావీరులును, గజేంద్రులవలె బలశాలురును ఐన వానరులను త్వరలోనే నీవు ఇచట చూడగలవు. (26)

శైలాంబుదనికాశానాం లంకామలయసానుషు।
నర్దతాం కపిముఖ్యానామ్ అచిరాచ్ఛ్రోష్యసి స్వనమ్। 27

పర్వతములవలె, మేఘములవలెడున్నతులు, లంకా మలయపర్వతసానువులయందు గర్జించుచుండు వారునుఅగు వానరులయొక్కధ్వనులను నీవు శీఘ్రముగనే వినగలవు.(27)

నివృత్తవనవాసం చ త్వయా సార్ధమరిందమమ్।
అభిషిక్తమయోధ్యాయాం క్షిప్రం ద్రక్ష్యసి రాఘవమ్। 28

శత్రుమర్దనుడైన శ్రీరాముడు వనవాసము ముగిసిన పిమ్మట సీతోగూడి అయోధ్యయందు పట్టాభిషిక్తుడగుటను నీవు త్వరలోనే చూడగలవు. (28)

తతో మయా వాగ్భిరదీన భాషిణా
శివాభిరిష్టాభిరభిప్రసాదితా।
జగామ శాంతిం మమ మైథిలాత్మజా
తవాతిశోకేన తథాతిపీడితా। 29

నీ ఎడబాటువలనకలిగిన శోకముచేతను, రాక్షసులు ఎంతయు పీడించుటవలనను, మిక్కిలి పరితాపమునకులోనైన సీతాదేవికి ధైర్యమును గూర్చితిని. నాతల్లి మైథిలీదేవికి నేను నీ బలపరాక్రమములను గూర్చి తెలిపితిని. ఆమెకు తృప్తికరములైన, శుభసూచకములైన, వచనములతో ఆమెను ఓదార్చి, ప్రసన్నురాలిని గావించితిని. అప్పుడు ఆ తల్లి నాసమక్షముననే మనశ్శాంతిని పొందినది. (29)

ఇత్యార్షే శ్రీమద్రామాయణే వాల్మీకీయే ఆదికావ్యే సుందరకాండే అష్టషష్టితమస్సర్గః *(68)*

వాల్మీకిమహర్షివిరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి సుందరకాండమునందు ఇది అఱువదిఎనిమిదవసర్గము.

సుందరకాండము సమాప్తము

— * * * —

॥ శ్రీరామచంద్రాయ నమః ॥

శ్రీరామపట్టాభిషేకఘట్టము

(యుద్ధకాండము-131వ సర్గము – 59వ శ్లోకముతో ప్రారంభము)

తత స్స ప్రయతో వృద్ధో వసిష్ఠో బ్రాహ్మణైస్సహ।
రామం రత్నమయే పీఠే సహసీతం న్యవేశయత్। 1

వసిష్ఠో వామదేవశ్చ జాబాలిరథ కాశ్యపః।
కాత్యాయనస్సుయజ్ఞశ్చ గౌతమో విజయస్తథా। 2

అభ్యషించన్ నరవ్యాఘ్రం ప్రసన్నేన సుగంధినా।
సలిలేన సహస్రాక్షం వసవో వాసవం యథా। 3

ఋత్విగ్భిః బ్రాహ్మణైః పూర్వం కన్యాభిః మంత్రిభిస్తథా।
యోధై శ్చైవాభ్యషించంస్తే సంప్రహృష్టాః సనైగమైః। 4

సర్వౌషధిరసైర్దివ్యైః దైవతైర్నభసి స్థితైః।
చతుర్భిర్లోకపాలైశ్చ సర్వైర్దేవైశ్చ సంగతైః। 5

ఛత్రం తు తస్య జగ్రాహ శత్రుఘ్నః పాండురం శుభమ్।
శ్వేతం చ వాలవ్యజనం సుగ్రీవో వానరేశ్వరః।
అపరం చంద్రసంకాశం రాక్షసేంద్రో విభీషణః। 6

మాలాం జ్వలంతీం వపుషా కాంచనీం శతపుష్కరామ్।
రాఘవాయ దదౌ వాయుః వాసవేన ప్రచోదితః। 7

సర్వరత్నసమాయుక్తం మణిరత్నవిభూషితమ్।
ముక్తాహారం నరేంద్రాయ దదౌ శక్రప్రచోదితః। 8

ప్రజగుర్దేవగంధర్వాః ననృతుశ్చాప్సరోగణాః।
అభిషేకే తదర్హస్య తదా రామస్య ధీమతః। 9

అనంతరము మహర్షులలో శ్రేష్ఠుడు, వంశపురోహితుడు ఐన వసిష్ఠమహాముని ఋత్విజులైన బ్రాహ్మణులతోగూడి సీతాసహితుడైన శ్రీరామచంద్రుని రత్నసింహాసనముపై ఆసీనుని గావించెను. వసిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, విజయుడు మొదలగు మహర్షులు పురుషోత్తముడైన శ్రీరామచంద్రప్రభువును నిర్మలములైన సుగంధజలములతో, వసువులు దేవేంద్రునివలె అభిషేకించిరి. (1-3)

పిమ్మట ఋత్విజులైన బ్రాహ్మణులు, కన్యలు, మంత్రులు, యోధులు, పురప్రముఖులు మొదలగు వారితోగూడి, వసిష్ఠాదిమహర్షులు పరమసంతోషముతో ఆ ప్రభువునకు వేదమంత్రపూర్వకముగా అభిషేకము జరిపిరి. ఇంకను వారు ఆకాశమున నిలిచియున్న దేవతలు, గంధర్వులు, కిన్నరకింపురుషాదులచేతను, నలుగురు దిక్పాలురచేతను, అచటికి విచ్చేసిన తదితరదేవతలందరి చేతను వివిధములైన ఓషధిరసములతో సీతారాములను అభిషిక్తులను గావించిరి. (4-5)

శత్రుఘ్నుడు ఆ స్వామికి శుభప్రదమైన తెల్లని ఛత్రమును పట్టుకొనెను, వానరరాజైన సుగ్రీవుడు తెల్లని వింజామరలతో సేవించుచుండెను. రాక్షసేంద్రుడైన విభీషణుడు చంద్రకాంతులీను మఱియొక వింజామరతో వీచుచుండెను. (6)

పిమ్మట దేవేంద్రునిపనుపున వాయుదేవుడు సుందరమైన ఆకృతితో స్వయముగా వచ్చి, నూఱుపద్మములతోగూడి మెఱయుచున్న బంగారుమాలను, వివిధములగు రత్నములతో, మణులతో భాసిల్లుచున్న ముత్యాలహారమును ఆ ప్రభువునకు భక్తితో సమర్పించెను. (7-8)

ప్రజ్ఞాశాలియు, తన శుభలక్షణములచే పట్టాభిషేకమునకు అర్హుడునుఐన శ్రీరామచంద్రునియొక్క ఆ మహోత్సవసమయమున దేవతలు, గంధర్వులు గానముచేసిరి. అప్సరసలు నృత్యములను గావించిరి. ఆ శుభసమయమున భూమి

భూమిస్సస్యవతీచైవ ఫలవంతశ్చ పాదపాః।
గంధవంతి చ పుష్పాణి బభూవూ రాఘవోత్సవే। 10

సహస్రశతమశ్వానాం ధేనూనాం చ గవాం తథా।
దదౌ శతం వృషాన్ పూర్వం ద్విజేభ్యో మనుజర్షభః। 11

త్రింశత్కోటీర్హిరణ్యస్య బ్రాహ్మణేభ్యో దదౌ పునః।
నానాభరణవస్త్రాణి మహార్హాణి చ రాఘవః। 12

అర్కరశ్మిప్రతీకాశాం కాంచనీం మణివిగ్రహామ్।
సుగ్రీవాయ స్రజం దివ్యాం ప్రాయచ్ఛన్మనుజర్షభః। 13

వైడూర్యమణిచిత్రే చ వజ్రరత్నవిభూషితే।
వాలిపుత్రాయ ధృతిమాన్ అంగదాయాంగదే దదౌ। 14

మణిప్రవరజుష్టంచ ముక్తాహారమనుత్తమమ్।
సీతాయై ప్రదదౌ రామః చంద్రరశ్మిసమప్రభమ్। 15

అరజే వాససీ దివ్యే శుభాన్యాభరణాని చ।
అవేక్షమాణా వైదేహీ ప్రదదౌ వాయుసూనవే। 16

అవముచ్యాత్మనః కంఠాత్ హారం జనకనందినీ।
అవైక్షత హరీన్ సర్వాన్ భర్తారం చ ముహుర్ముహుః। 17

తామింగితజ్ఞస్సంప్రేక్ష్య బభాషే జనకాత్మజామ్।
ప్రదేహి సుభగే! హారం యస్య తుష్టాసి భామిని!।
పౌరుషం విక్రమో బుద్ధిః యస్మిన్నేతాని సర్వశః। 18

దదౌ సా వాయుపుత్రాయ తం హారమసితేక్షణా।
హనుమాంస్తేన హారేణ శుశుభే వానరర్షభః।
చంద్రాంశుచయగౌరేణ శ్వేతాభ్రేణ యథాఽచలః। 19

తతో ద్వివిదమైందాభ్యాం నీలాయ చ పరంతపః।
సర్వాన్ కామగుణాన్ వీక్ష్య ప్రదదౌ వసుధాధిపః। 20

పైరుపంటలతో కలకలలాడెను. చెట్లన్నియును పండ్లతో నిండి కనువిందుగావించుచుండెను. పుష్పములు సువాసనలను వెదజల్లుచుండెను. (9-10)

ఆ పురుషోత్తముడు ముందుగా లక్షలసంఖ్యలో గుఱ్ఱములను, పాడియావులను, గోవులను, వందలకొలది వృషభములను బ్రాహ్మణోత్తములకు దానముచేసెను. ఆ మహాత్ముడు ఇంకను ముప్పదికోట్ల బంగారునాణెములను, అమూల్యములైన వివిధములగు ఆభరణములను, వస్త్రములను ద్విజవరులకు పంచియిచ్చెను. (11-12)

ఆ ప్రభువు సుగ్రీవునకు మణులు పొదిగిన ఒక బంగారుహారమును బహూకరించెను. అది సూర్యకిరణములవలె జిగేలుమనుచు దివ్యకాంతులను విరజిమ్ముచుండెను. ఆ స్థితప్రజ్ఞుడు వజ్రములతో, రత్నములతో, వైడూర్యమణులతో చిత్రవిచిత్రముగా నిర్మితములైన రెండు భుజకీర్తులను వాలికుమారుడైన అంగదునకు బహుమతిగా ఇచ్చెను. (13-14)

ఇంకను ఆ స్వామి మేలైన మణులతోగూడిన ఒక ముత్యాలహారమును హనుమంతునకు బహూకరించుటకై సీతాదేవిచేతికిచ్చెను. ఉత్తమమైన ఆ ఆభరణము చంద్రుని కిరణములవలె మనోరంజకముగానుండెను. పిమ్మట ఆసీతామాత భర్తవైపు చూచుచు స్వచ్ఛములై, దివ్యములైన వస్త్రములను, చక్కని ఆభరణములను మారుతికి కానుకలుగా ఇచ్చెను. పిదప అజానకి తనమెడలోని కంఠాభరణమును దీసికొని, తనభర్తను, సమస్త వానరులను పదేపదే చూడసాగెను. ఆమెమనస్సులోని భావమును గ్రహించిన శ్రీరాముడు ఆమెతో "ఓ సుందరీ! సాటిలేని పౌరుషము, పరాక్రమము, ప్రతిభ మొదలగు లక్షణములను పూర్తిగా కలిగి, నీ ఆదరమునకు పాత్రుడైన ఉత్తమునకు ఈ హారమును బహూకరింపుము." అని పలికెను. అప్పుడు ఆ శుభాంగి ఆ హారమును వాయుసుతునకు ఇచ్చెను. కపివరుడైన ఆవాయుసూనుడు ఆ హారమును ధరించినంతనే చంద్రకిరణములు ప్రసరించినప్పుడు స్వచ్ఛమైన మేఘముతో గూడియున్న పర్వతమువలె విరాజిల్లెను. (15-19)

శత్రుసూదనుడైన శ్రీరామచంద్రప్రభువు మైందునకు, ద్వివిదునకు, నీలునకు, వారి అభిరుచులకు అనుగుణముగా కోరినవాటినన్నింటిని బహూకరించెను. వృద్ధులైన

సర్వవానరవృద్ధాశ్చ యే చాన్యే వానరేశ్వరాః।
వాసోభిర్భూషణైశ్చైవ యథార్హం ప్రతిపూజితాః। 21

విభీషణోఽథ సుగ్రీవో హనుమాన్ జాంబవాంస్తథా।
సర్వవానరముఖ్యాశ్చ రామేణాక్లిష్టకర్మణా। 22

యథార్హం పూజితాః సర్వైః కామై రత్నైశ్చ పుష్కలైః।
ప్రహృష్టమనసస్సర్వే జగ్మురేవ యథాగతమ్। 23

దృష్ట్వా సర్వే మహాత్మానం తతస్తే ప్లవగర్షభాః।
విసృష్టాః పార్థివేంద్రేణ కిష్కింధామభ్యుపాగమన్। 24

సుగ్రీవో వానరశ్రేష్ఠో దృష్ట్వా రామాభిషేచనమ్। 25

లబ్ధ్వా కులధనం రాజా లంకాం ప్రాయాద్విభీషణః। 26

సరాజ్యమఖిలం శాసన్ నిహతారిర్మహాయశాః।
రాఘవః పరమోదారః శశాస పరయా ముదా। 27

ఉవాచ లక్ష్మణం రామో ధర్మజ్ఞం ధర్మవత్సలః। 28

ఆతిష్ఠ ధర్మజ్ఞ! మయా సహేమాం
గాం పూర్వరాజాధ్యుషితాం బలేన।
తుల్యం మయా త్వం పితృభిః ధృతా యా
తాం యౌవరాజ్యే ధురముద్వహస్వ। 29

సర్వాత్మనా పర్యనునీయమానో
యదా న సౌమిత్రిరుపైతి యోగమ్।
నియుజ్యమానోఽపిచ యౌవరాజ్యే
తతోఽభ్యషించద్భరతం మహాత్మా। 30

పౌండరీకాశ్వమేధాభ్యాం వాజపేయేన చాఽసకృత్।
అన్యైశ్చ వివిధైర్యజ్ఞైః అయజత్ పార్థివర్షభః। 31

రాజ్యం దశసహస్రాణి ప్రాప్య వర్షాణి రాఘవః।
శతాశ్వమేధానాజహ్రే సదశ్వాన్ భూరిదక్షిణాన్। 32

వానరులనందఱిని, తదితరకపివరులను నూతనవస్త్రములతో, ఆభరణములతో తగినరీతిగా సత్కరించెను. ఎంతటి కార్యమునైనను సులభముగా నిర్వహింపగల శ్రీరాముడు విభీషణుని, సుగ్రీవుడు, హనుమంతుడు, జాంబవంతుడు మొదలగు వానరప్రముఖులను వస్త్రాభరణములతో పూజించెను. (20-22)

తాముకోరుకొనినరీతిగా పుష్కలముగా రత్నాభరణాదులచే తగినవిధముగా సత్కరింపబడిన ఆ వానరప్రముఖులు ఎల్లరును ప్రసన్నచిత్తులై, తమతమ స్థానములకు వెళ్లుటకు సిద్ధమైరి. అనంతరము ఆ కపివరులు అందఱును మహాత్ముడైన శ్రీరామునకు నమస్కరించి, ఆ ప్రభువు అనుమతితో కిష్కింధకు బయలుదేఱిరి. (23-24)

పిమ్మట వానరేంద్రుడైన సుగ్రీవుడు రామపట్టాభిషేకమును చూచి ఆనందించి, కిష్కింధకు చేరెను. పిదప రాక్షసరాజైన విభీషణుడు ఇక్ష్వాకుప్రభువులఇలవేల్పును (శ్రీరంగనాథస్వామి మూర్తిని) గ్రహించి లంకకు బయలుదేఱెను. (25-26)

దుష్టులను శిక్షించుచు మిగుల వాసిగాంచినవాడు, ఉదారస్వభావుడు ఐన రఘువరుడు సమస్తకోసలరాజ్యమును పరమసంతోషముతో పరిపాలింపసాగెను. ధర్మాత్ముడైన శ్రీరామచంద్రుడు ధర్మజ్ఞుడైన లక్ష్మణునితో ఇట్లనియెను.(27-28)

"ఓ ధర్మజ్ఞా! మనపూర్వులు (మన్వాదులు) తమ పరాక్రమముతో పరిపాలించిన ఈ సుసంపన్నరాజ్యమును నాతోగూడి పాలింపుము. నీవు నాతో సమానుడవు. మనతండ్రి, తాత ముత్తాతలు నిర్వహించిన ఈ రాజ్యమునకు యువరాజువై, దీని భారమును వహింపుము." (29)

'యువరాజపదవిని స్వీకరింపుము' అనుచు శ్రీరాముడు ఎంతగా నచ్చజెప్పుచున్నను లక్ష్మణుడు అందులకు ఏమాత్రము ఒప్పుకొనలేదు. పిదప ఆ ప్రభువు భరతుని యువరాజునుగా జేసెను. (30)

ఆ రాజశ్రేష్ఠుడు పౌండరీకము, అశ్వమేధము, వాజపేయము, ఇంకను తదితరములైన యజ్ఞములను తఱచుగా నిర్వహించుచువచ్చెను. ఆ రఘువరుడు పదివేలసంవత్సరములపాటు కోసలరాజ్యమును పరిపాలించెను. ఆ ప్రభువు మేలుజాతిఅశ్వములను, పుష్కలముగా దక్షిణలను ఒసంగి వందలకొలది అశ్వమేధయాగములను ఆచరించెను.(31-32)

ఆజానులంబబాహుశ్చ మహాస్కంధః ప్రతాపవాన్।
లక్ష్మణానుచరో రామః పృథివీమన్వపాలయత్। 33

రాఘవశ్చాపి ధర్మాత్మా ప్రాప్య రాజ్యమనుత్తమమ్।
ఈజే బహువిధైర్యజ్ఞైః ససుహృత్ జ్ఞాతిబాంధవః। 34

న పర్యదేవన్ విధవా న చ వ్యాలకృతం భయమ్।
న వ్యాధిజం భయం వాపి రామే రాజ్యం ప్రశాసతి। 35

నిర్దస్యురభవల్లోకో నాఽనర్థః కంచిదస్పృశత్।
నచస్మ వృద్ధా బాలానాం ప్రేతకార్యాణి కుర్వతే। 36

సర్వం ముదితమేవాసీత్ సర్వో ధర్మపరోఽభవత్।
రామమేవానుపశ్యంతో నాభ్యహింసన్ పరస్పరమ్। 37

ఆసన్ వర్షసహస్రాణి తథా పుత్రసహస్రిణః।
నిరామయా విశోకాశ్చ రామే రాజ్యం ప్రశాసతి। 38

రామో రామో రామ ఇతి ప్రజానామభవన్ కథాః।
రామభూతం జగదభూత్ రామే రాజ్యం ప్రశాసతి। 39

నిత్యపుష్పా నిత్యఫలాః తరవః స్కంధవిస్తృతాః।
కాలే వర్షీచ పర్జన్యః సుఖస్పర్శశ్చ మారుతః। 40

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యాః శూద్రా లోభవివర్జితాః।
స్వకర్మసు ప్రవర్తంతే తుష్టాః స్వైరేవ కర్మభిః। 41

ఆసన్ ప్రజాధర్మరతా రామే శాసతి నాఽనృతాః।
సర్వే లక్షణసంపన్నాః సర్వే ధర్మపరాయణాః। 42

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ।
భ్రాతృభిస్సహితః శ్రీమాన్ రామో రాజ్యమకారయత్। 43

ఆజానుబాహువు, ప్రతాపశాలియు, గొప్పభుజబలము గలవాడును ఐన రామచంద్రప్రభువు లక్ష్మణుని సహకారముతో భూమండలమును పాలించెను. ధర్మాత్ముడైన రఘువరుడు విశాలమైన కోసలరాజ్యమునకు ప్రభువై బంధుమిత్రులతోగూడి బహువిధములైన యజ్ఞములను నిర్వహించెను. (33-34)

శ్రీరాముడు రాజ్యపాలన చేయుచుండగా స్త్రీలకు వైధవ్యము లేకుండెను. ప్రజలకు క్రూరమృగములబాధ లేకుండెను. వారు రోగగ్రస్తులు గాకుండిరి. జనులకు దొంగల భయము లేకుండెను. ఎట్టి అనర్థములును సంభవింపకుండెను. పెద్దలు బ్రతికియుండగా వారిపిల్లలు మృత్యువుపాలు కాకుండిరి. రామరాజ్యములో ప్రజలెల్లరును ధర్మనిరతులై సంతోషముతో జీవించుచుండిరి. వారు ఆ ప్రభువునే ధ్యానించుచు పరస్పరవిరోధములు లేక ఆత్మీయతతో మెలగుచుండిరి. (35-37)

ఆ ప్రభువుయొక్క పరిపాలనలో ప్రజలందఱును దీర్ఘాయువులై (వేలకొలదిసంవత్సరములు జీవించుచు) సంతానసమృద్ధి గలిగియుండిరి. వారు శోకరహితులై ఆరోగ్యభాగ్యములతో వర్ధిల్లుచుండిరి. ఆ రఘువరుని రాజ్యమున ఎవరినోటవిన్నను (ప్రజలలో) రామనామము, రామునిగాథలే వినబడుచుండెను. జగమంతయు రామమయమై ఒప్పుచుండెను. (38-39)

వృక్షములన్నియును లావైన బోదెలతో విలసిల్లుచుండెను. అవి నిత్యము పుష్పించుచు, ఫలించుచు కనువిందు గావించుచుండెను. సకాలములో వానలు కురియుచుండెను. వాయువులు హాయినిగొల్పుచు వీచుచుండెను. (40)

బ్రాహ్మణులు మొదలగు అన్నివర్ణములవారును దురాశలేనివారై తమతమకర్మలయందే ప్రవర్తిల్లుచు సంతుష్టులై యుండిరి. రామరాజ్యమునందు ప్రజలందఱును శుభలక్షణములుగలవారు, ధర్మనిరతులు, సత్యమునే పలికెడివారు. స్వధర్మములను ఆచరించుటయందే ఆసక్తిగలవారు. (41-42)

శ్రీరామచంద్రప్రభువు తనసోదరులతోగూడి పదకొండువేలసంవత్సరములు కోసలరాజ్యమును పరిపాలించెను. (43)

ధర్మ్యం యశస్యమాయుష్యం రాజ్ఞాం చ విజయావహమ్।
ఆదికావ్యమిదం త్వార్షం పురా వాల్మీకినా కృతమ్। 44

యః పఠేచ్ఛృణుయాల్లోకే నరః పాపాద్విముచ్యతే।
పుత్రకామస్తు పుత్రాన్ వై ధనకామో ధనాని చ। 45

లభతే మనుజో లోకే శ్రుత్వా రామాభిషేచనమ్।
మహీం విజయతే రాజా రిపూంశ్చాప్యధితిష్ఠతి। 46

రాఘవేణ యథా మాతా సుమిత్రా లక్ష్మణేన చ।
భరతేనేవ కైకేయీ జీవపుత్రాస్తథా స్త్రియః। 47

శ్రుత్వా రామాయణమిదం దీర్ఘమాయుశ్చ విందతి।
రామస్య విజయం చైవ సర్వమక్లిష్టకర్మణః। 48

శృణోతి య ఇదం కావ్యమ్ ఆర్షం వాల్మీకినా కృతమ్।
శ్రద్దధానో జితక్రోధో దుర్గాణ్యతితరత్యసౌ। 49

సమాగమ్య ప్రవాసాంతే లభతే చాపి బాంధవైః।
ప్రార్థితాంశ్చ వరాన్ సర్వాన్ ప్రాప్నుయాదిహ రాఘవాత్। 50

శ్రవణేన సురాస్సర్వే ప్రీయంతే సంప్రశృణ్వతామ్।
వినాయకాశ్చ శామ్యంతి గృహే తిష్ఠంతి యస్య వై। 51

విజయేత మహీం రాజా ప్రవాసీ స్వస్తిమాన్ వ్రజేత్।
స్త్రియో రజస్వలాః శ్రుత్వా పుత్రాన్ సూయురనుత్తమాన్। 52

పూజయంశ్చ పఠంశ్చేమమ్ ఇతిహాసం పురాతనమ్।
సర్వపాపాత్ ప్రముచ్యేత దీర్ఘమాయురవాప్నుయాత్। 53

ప్రణమ్య శిరసా నిత్యం శ్రోతవ్యం క్షత్రియైర్ద్విజాత్।
ఐశ్వర్యం పుత్రలాభశ్చ భవిష్యతి న సంశయః। 54

వాల్మీకిమహర్షి రచించిన, ఆదికావ్యమగు ఈ శ్రీమద్రామాయణము శుభప్రదమైనది, ఆయురారోగ్యములను, కీర్తిప్రతిష్ఠలను పెంపొందించునది. ఇది రాజులకు విజయమును చేకూర్చునది. లోకమున ఈ కావ్యమును పఠించినవారు, వినినవారు (శ్రోతలు) సమస్తపాపముల నుండియు విముక్తులు అగుదురు. ఈ రామాభిషేక ఘట్టమును వినినవారికి సంతానము కలుగును. సంపదలు ప్రాప్తించును. రాజులు శత్రువులను జయించి, ఈ భూమండలమున వర్ధిల్లుదురు. (44-46)

ఈ కావ్యమును వినినస్త్రీలు శ్రీరాముని పుత్త్రునిగా పొందిన కౌసల్యవలెను, లక్ష్మణశత్రుఘ్నులను గనిన సుమిత్రవలెను, భరతునికారణమున కైకేయివలెను పుత్త్రులతో కలకాలము వర్ధిల్లుదురు. (47)

ఎంతటి కార్యమునైనను అవలీలగా సాధించునట్టి శ్రీరామునివిజయములను, ఆ ప్రభువువృత్తాంతమును తెలిపెడి రామాయణగాథను వినినవారు దీర్ఘాయువులగుదురు. వాల్మీకిమహర్షి విరచితమైన ఈ 'మహాకావ్యమును శ్రద్ధగా ఆలకించినవారు జితక్రోధులై దారిద్ర్యాదిదుఃఖములనుండి, విముక్తులగుదురు. దీర్ఘకాలము బంధువులకు దూరమైన వారు మరల వారిని కలిసికొందురు. శ్రీరామునిఅనుగ్రహమున వారికోరికలు అన్నియును నెఱవేఱును. (48-50)

రామాయణశ్రవణముచే దేవతలు ప్రసన్నులగుదురు. ఆ శ్రోతలయొక్క కుటుంబములకు దుష్టగ్రహబాధలు తొలగిపోవును. రాజ్యములను కోల్పోయిన భూపతులు రామాయణశ్రవణప్రభావమున శత్రువులను జయించి, తిరిగి తమ రాజ్యములను పొందుదురు. వారికి సకలశుభములు చేకూరును. స్త్రీలు గర్భవతులై ఉత్తములైన పుత్త్రులను బడయుదురు. (51-52)

ప్రాచీనమైన ఈ ఇతిహాసమును భక్తిశ్రద్ధలతో పూజించి, పఠించినవారియొక్క పాపములు పటాపంచలగును. వారికి దీర్ఘాయురారోగ్యములు ప్రాప్తించును. (53)

బ్రాహ్మణులకు శిరసా ప్రణమిల్లి, ఆద్విజోత్తములనుండి ఈ వృత్తాంతమును వినిన క్షత్రియులు ఐశ్వర్యములను, పుత్త్రులను పొందుదురు. ఇందు సందియము లేదు.(54)

రామాయణమిదం కృత్స్నం శృణ్వతః పఠతస్సదా।
ప్రీయతే సతతం రామః స హి విష్ణుస్సనాతనః। 55

శ్రీరాముడు సాక్షాత్తు సనాతనుడైన శ్రీమహావిష్ణువుయొక్క అవతారమే. కనుక రామాయణమును సంపూర్ణముగా వినిన వారికిని, పఠించిన వారికిని రామానుగ్రహము సిద్ధించును.(55)

ఆదిదేవో మహాబాహుః హరిర్నారాయణః ప్రభుః।
సాక్షాద్రామో రఘుశ్రేష్ఠః శేషో లక్ష్మణ ఉచ్యతే। 56

రఘువంశశిరోమణి, మహాబాహువు ఐన శ్రీరామచంద్ర ప్రభువు దేవాదిదేవుడైన శ్రీమన్నారాయణుడే. లక్ష్మణస్వామి ఆదిశేషునిఅవతారము. (56)

కుటుంబవృద్ధిం ధనధాన్యవృద్ధిం
స్త్రియశ్చ ముఖ్యా స్సుఖముత్తమం చ।
శ్రుత్వా శుభం కావ్య మిదం మహార్థం
ప్రాప్నోతి సర్వాం భువి చార్థసిద్ధిమ్। 57

ఈ రామాయణమహాకావ్యము సర్వశుభకరము, సమస్తప్రయోజనములను చేకూర్చును. దీనిశ్రవణమువలన కుటుంబవృద్ధియు, ధనధాన్యసమృద్ధియు కలుగును. ముఖ్యముగా స్త్రీలకు ఉత్తమమైన సుఖములు ప్రాప్తించును. (57)

ఆయుష్య మారోగ్యకరం యశస్యం
సౌభ్రాత్రకం బుద్ధికరం సుఖం చ।
శ్రోతవ్య మేతన్నియమేన సద్భిః
ఆఖ్యానమోజస్కరమృద్ధికామైః। 58

ఈ ఇతిహాసము ఆయురారోగ్యములను, కీర్తి ప్రతిష్ఠలను, సౌభ్రాతృత్వమును, బుద్ధికౌశలమును సుఖశాంతులను, తేజోవైభవములను ప్రసాదించును. కావున సమస్తసంపదలను అభిలషించెడి సత్పురుషులు నియమనిష్ఠలతో దీనిని శ్రవణము చేయవలెను. (58)

ఏవమేతత్ పురావృత్తమ్ ఆఖ్యానం భద్రమస్తు వః।
ప్రవ్యాహరత విస్రబ్ధం బలం విష్ణోః ప్రవర్ధతామ్। 59

దేవాశ్చ సర్వే తుష్యంతి శ్రవణాద్గ్రహణాత్ తథా।
రామాయణస్య శ్రవణాత్ తుష్యంతి పితరస్తథా। 60

భక్త్యా రామస్య యే చేమాం సంహితామ్ ఋషిణా కృతామ్।
లేఖయంతీహ చ నరాః తేషాం వాసః త్రివిష్టపే। 61

ప్రాచీనమైన ఈ రామోదంతము మీకు సర్వశుభములను చేకూర్చుగాక. మీపై శ్రీమన్నారాయణునిప్రభావము మిక్కిలి ప్రసరించుగాక. ఈ రామాయణమును తమకడ కలిగి యుండి ఇందలి దివ్య గాథలను వినినచో దేవతలును, పితృదేవతలును తృప్తిచెందుదురు. వాల్మీకి మహాముని రచించిన రామాయణసంహితను భక్తితో వ్రాసిన వారు తప్పక స్వర్గసుఖములను పొందుదురు. (59-61)

ఇది వాల్మీకిమహర్షి విరచితమై ఆదికావ్యమైన శ్రీమద్రామాయణమునందలి
యుద్ధకాండమునందు 'శ్రీరామపట్టాభిషేకము' అనెడి నూటముప్పదిఒకటవసర్గము.

* * *

కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్।
కరోమి యద్యత్ సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి॥

యదక్షరపదభ్రష్టం మాత్రాహీనం చ యద్భవేత్। తత్సర్వం క్షమ్యతాం దేవ శ్రీరాఘవ నమోఽస్తుతే॥

ఆత్మా త్వం క్షితిజా మతిః సహచరాః ప్రాణాః శరీరం గృహమ్
పూజా తే విషయోపభోగరచనా నిద్రా సమాధిస్థితిః।
సంచారః పదయోః ప్రదక్షిణవిధిః స్తోత్రాణి సర్వా గిరో
యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం రామాఽస్తు తే పూజనమ్॥